తాళ్ళపాక పద సాహిత్యం

అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం,

గుంటూరు

రేకు: 2001-01 సామంతం సం: 01-001 అధ్యాత్మ

పల్లవి: వలచి పైకొనఁగరాదు వలదని తొలఁగరాదు
కలికిమరుఁడు సేసినాజ్ఞ కడవఁగరాదురా

చ. 1: అంగడి కెత్తినట్టిదివ్వె లంగనముఖాంబుజములు
ముంగిటి పసిఁడికుంభములును ముద్దులకుచయుగంబులు
యెంగిలిసేసినట్టితేనె లితవులైన మెఱుఁగుమోవులు
లింగములేని దేహరములు లెక్కలేని ప్రియములు

చ. 2: కంచములోని వేఁడికూరలు గరువంబులుఁ బొలయలుకలు
యెంచఁగ నెండలోనీడలు యెడనెడకూటములు
తెంచఁగరాని వలెతాళ్ళు తెలివిపడనిలేఁతనవ్వులు
మంచితనములోని నొప్పులు మాటలలోనిమాటలు

చ. 3: నిప్పులమీఁద జల్లిననూనెలు నిగిడితనివిలేనియాసలు
దప్పికి నేయిదాగినట్లు తమకములోనితాలిమి
చెప్పఁగరానిమేలు గనుట శ్రీవేంకటపతిఁ గనుటలు
అప్పనికరుణగలిగి మనుట అబ్బురమైనసుఖములు

రేకు: 2001-02 దేసాక్షి సం: 01-002 వేంకటేశ్వరౌషధము

పల్లవి: వేదవేద్యులు వెదకేటిమందు
అదినంత్యములేని ఆమందు

చ. 1: అడవిమందులుఁ గషాయములు నెల్లవారు
కడగానక కొనఁగాను
తొడిఁబడ నొకమందు దొరకె మాకు భువి-
నడియాలమైనట్టి ఆమందు

చ. 2: లలితరసములుఁ దైలములు నెల్లవారు
కలకాలము గొనఁగాను
చెలువైన దొకమందు చేరె మాకు భువి-
నలవిమీఱినయట్టియామందు

చ. 3: కదిసినజన్మరోగముల నెల్లవారు
కదలలేక వుండఁగాను
అదన శ్రీతిరువేంకటాద్రిమీఁదిమందు
అదివో మాగురుఁడిచ్చె నామందు

రేకు: 2001-03 దేసాక్షి సం: 01-003 వైరాగ్య చింత

పల్లవి: హీనదశలఁబొంది యిట్ల నుండుటకంటె
నానావిధులను నున్ననాఁడే మేలు

చ. 1: అరుదైన క్రిమికీటకాదులందుఁ బుట్టి
పరిభవములనెల్లఁ బడితిఁ గాని
యిరవైనచింత నాఁడింతలేదు యీ-
నరజన్మముకంటె నాఁడే మేలు

చ. 2: తొలఁగక హేయజంతువులయందుఁ బుట్టి
పలువేదనలనెల్లఁ బడితిఁగాని
కలిమియు లేమియుఁ గాన నేఁ డెటిఁగి
నలఁగి తిరుగుకంటె నాఁడే మేలు

చ. 3: కూపనరకమున గుంగి వెనకకు నేఁ
బాపవిధులనెల్లఁ బడితిఁగాని
యేపునఁ దిరువేంకటేశ నా కిటువలె
నాపాలఁ గలిగినాఁడే మేలు

రేకు: 2001-04 సామంతం సం: 01-004 సంస్కృత కీర్తనలు

పల్లవి: ఏవం శ్రుతిమత మిదమేవ త-
ద్భావయితు మతఃపరం నాస్తి

చ. 1: అతుల జన్మభోగాసక్తానాం
హిత వైభవసుఖ మిదమేవ
సతతం శ్రీహరిసంకీర్తనం త-
ద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి

చ. 2: బహుళమరణపరిభవచిత్తా నా-
మిహపరసాధన మిదమేవ
అహిశయనమనోహరసేవా త-
ద్విహరణం వినా విధిరపి నాస్తి

చ. 3: సంసారదురితజాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర-
శంసైవా పశ్చా దిహ నాస్తి

రేకు: 2001-05 పాడి సం: 01-005 భక్తి

పల్లవి: వేదం బెవ్వని వెదకెడిని
ఆ దేవునిఁ గొనియాడుఁడీ

చ. 1: అలరిన చైతన్యాత్మకుఁడెవ్వఁడు
కలఁ డెవ్వఁ డెచటఁ గలఁడనిన
తలఁతు రెవ్వనినిఁ దనువియోగదశ
యిల నాతని భజియించుఁడీ

చ. 2: కడఁగి సకలరక్షకుఁడిం దెవ్వఁడు
వడి నింతయు నెవ్వనిమయము
పిడికిట తృప్తులు పితరులెవ్వనినిఁ
దడవిన, ఘనుఁడాతనిఁ గనుఁడీ

చ. 3: కదిసి సకలలోకంబులవారలు
యిదివో కొలిచెద రెవ్వనిని
త్రిదశవంద్యుఁడగు తిరువేంకటపతి
వెదకి వెదకి సేవించుఁడీ

రేకు: 2001-06 గుండక్రియ సం: 01-006 అధ్యాత్మ

పల్లవి: మానుషము గాదు మఱి దైవికము గాని
రానున్నా అది రాకుమన్నఁ బోదు

చ. 1: అనుభవనకుఁ బ్రాప్తమైనది
తనకుఁదానె వచ్చి తగిలికాని పోదు

చ. 2: తిరువేంకటగిరిదేవుని-
కరుణచేతఁ గాని కలుష మింతయుఁ బోదు

రేకు: 2002-01 శుద్ధవసంతం సం: 01-007 అధ్యాత్మ

పల్లవి: సదా సకలము సంపదలే
తుద దెలియఁగ వలెఁ దొలఁగఁగవలయు

చ. 1: అహర్నిశమును నాపదలే
సహించిన నవి సౌఖ్యములే
యిహమున నవి యిందఱికిని
మహిమ దెలియవలె మానఁగవలెను

చ. 2: దురంతము లివి దోషములే
పరంపర లివి బంధములు
విరసములౌ నరవిభవములౌ-
సిరులే మరులౌ చిరుసుఖ మవును

చ. 3: గతి యలమేల్ మంగ నాంచారికిఁ
బతియగువేంకటపతిఁ దలఁచి
రతు లెఱుఁగగవలె రవణము వలెను
హిత మెఱుఁగఁగవలె నిదె తనకు

రేకు: 2002-02 శుద్ధవసంతం సం: 01-008 నామ సంకీర్తన

పల్లవి: ఇందిరానామ మిందరికి
కుందనపుముద్ద వో గోవింద

చ. 1: అచ్చుతనామము అనంతనామము
ఇచ్చినసంపద లిందరికి
నచ్చినసిరులు నాలుకతుదలు
కొచ్చికొచ్చీ నోగోవిందా

చ. 2: వైకుంఠనామము వరదనామము
ఈకడనాకడ నిందరికి
వాకుఁదెరపులు వన్నెలు లోకాలఁ
గూకులు వత్తులు నోగోవిందా

చ. 3: పండరినామము పరమనామము
ఎండలువాపెడి దిందరికి
నిండునిధానమై నిలచినపేరు
కొండలకోనేటివోగోవిందా

రేకు: 2002-03 బౌళి సం: 01-009 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఎవ్వరిఁ గాదన్న నిది నిన్నుఁ గాదంట
యెవ్వరిఁ గొలిచిన నిది నీకొలువు

చ. 1: అవయవములలో నదిగా దిదిగా-
దవి మే లివి మే లన నేలా
భువియుఁ బాతాళము దివియు నందలిజంతు-
నివహ మింతయునూ నీదేహమేకాన

చ. 2: నీవు లేనిచోటు నిజముగఁ దెలిసిన
ఆవల నది గా దనవచ్చును
శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము
భావింప నీవే పరిపూర్ణుఁడవుగాన

రేకు: 2002-04 సామంతం సం: 01-010 వైష్ణవ భక్తి

పల్లవి: సహజ వైష్ణవాచార వర్తనుల-
సహవాసమె మాసంధ్య

చ. 1: అతిశయమగు శ్రీహరిసంకీర్తన
సతతంబును మాసంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురతమెఱసిన సంధ్య

చ. 2: పరమభాగవతపదసేవనమే
సరవి నెన్న మాసంధ్య
సిరివరుమహిమలు చెలువొందఁగ వే-
సరక వినుటె మాసంధ్య

చ. 3: మంతుకెక్క తిరుమంత్రపఠనమే
సంతతమును మాసంధ్య
కంతుగురుఁడు వేంకటగిరిరాయని-
సంతర్పణమే మాసంధ్య

రేకు: 2002-05 మాళవిశ్రీ సం: 01-011 భక్తి

పల్లవి: ఇందుకొరకె యిందరును నిట్లయిరి
కిందుపడి మఱికాని గెలుపెఱఁగరాదు

చ. 1: అటమటపువేడుకల నలయించి మఱికదా
ఘటియించుఁ బరము తటుకన దైవము
ఇటు సేయ నీశ్వరున కీసు గలదా? లేదు.
కుటిలమతిఁ గని కాని గుణిఁ గానరాదు

చ. 2: బెండుపడ నవగతులఁ బెనఁగించి మఱికదా
కొండనుచుఁ బర మొసంగును దైవము
బండుసేయఁగ హరికి బంతమా? యటుగాదు.
యెండదాఁకక నీడహిత వెఱఁగరాదు

చ. 3: మునుప వేల్పులకెల్ల మ్రొక్కించి మఱికదా
తనభ క్తి యొసఁగు నంతట దైవము
ఘనవేంకటేశునకు గపటమా? అటుగాదు.
తినక చేఁదునుఁ దీపు తెలియనేరాదు.

రేకు: 2002-06 ధన్నాసి సం: 01-012 వేంకటగానం

పల్లవి: సందడి విడువుము సాసముఖా
మంధరధరునకు మజ్జనవేళా

చ. 1: అమరాధిపు లిడుఁ డాలవట్టములు
కమలజ పట్టుము కాళాంజి
జమలిచామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు

చ. 2: అణిమాదిసిరులనలరెడు శేషుఁడ
మణిపాదుక లిడు మతి చెలఁగా
ప్రణుతింపు కదిసి భారతీరమణ
గుణాధిపు మరుగురు బలుమరును

చ. 3: వేదఘోషణము విడువక సేయుఁడు
ఆదిమునులు నిత్యాధికులు
శ్రీదేవుండగు శ్రీవేంకటపతి
ఆదరమున సిరు లందీ వాఁడె

రేకు: 2002-07 శంకరాభరణం సం: 01-013 నృసింహ

పల్లవి: మలసీఁ జూడరో మగ సింహము
అలని మీఱిన మాయల సింహము

చ. 1: అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళము మీఁది పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు
కదిసి కానఁగలేని ఘనసింహము

చ. 2: మెచ్చిమెచ్చి చూడరో మితిమీఱినయట్టి-
చిచ్చఱకంటితోడి జిగిసింహము
తచ్చినవారిధిలోన తరుణిఁ గౌఁగిటఁ జేర్చి
నచ్చినగోళ్ళ శ్రీనరసింహము

చ. 3: బింకమునఁ జూడరో పిరితియ్యక నేఁడు
అంకపుదనుజసంహారసింహము
వేంకటనగముపై వేదాచలముపై
కింక లేక వడిఁ బెరిగినసింహము

రేకు: 2003-01 కన్నడ గౌళ సం: 01-014 అధ్యాత్మ

పల్లవి: గాలినే పోయఁ గలకాలము

తాలిమికిఁ గొంతయుఁ బొద్దు లేదు

చ. 1: అడుసు చొరనే పట్టె నటునిటుఁ గాళ్ళు

గడుగుకొననే పట్టెఁ గలకాలము

ఒడలికి జీవుని కొడయఁడైనహరిఁ

దడవఁగా గొంతయుఁ బొద్దులేదు

చ. 2: కలఁచి చిందనే పట్టెఁ గడవ నించగఁ బట్టె

కలుషదేహపుబాదఁ గలకాలము

తలపోసి తనపాలిదైవమైనహరి

దలఁచఁగా గొంతయుఁ బొద్దులేదు

చ. 3: శిరసు ముడువఁబట్టె చిక్కుదియ్యఁగఁ బట్టె

గరిమలఁ గపటాలఁ గలకాలము

తిరువేంకటగిరి దేవుఁడైన హరి

దరిచేరాఁ గొంతయుఁ బొద్దు లేదు

రేకు: 2003-02 వరాళి సం: 01-015 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వారులేరూ హితవు చెప్పఁగ వట్టి-
నొవ్వులఁ బడి నేము నొగిలేమయ్యా

చ. 1: అడవిఁ బడినవాఁడు వెడలఁ జోటులేక
తొడరి కంపలకిందు దూరినట్లు
నడుమ దురితకాననములతరిఁ బడి
వెడలలేక నేము విసిగేమయ్యా

చ. 2: తెవులువడినవాఁడు తినఁబోయి మధురము
చవిగాక పులుసులు చవిగోరినట్లు
భవరోగములఁ బడి పరమామృతము నోరఁ
జవిగాక భవముల చవులాయనయ్యా

చ. 3: తనవారి విడిచి యితరమైనవారి-
వెనకఁ దిరిగి తా వెట్టైనట్లు
అనయము తిరువేంకటాధీశుఁ గొలువక
మనసులోని వాని మఱచేమయ్యా

రేకు: 2003-03 కాంబోధి సం: 01-016 తత్త్వములు

పల్లవి: దిబ్బలు వెట్టుచుఁ దేలిన దిదివో
ఉబ్బు నీటిపై నొక హంసా

చ. 1: అనువునఁ గమలవిహారమై నెలవై
వొనరి వున్నదిదె వొక హంసా
మనియెడి జీవుల మానసపరసుల-
వునికి నున్న దిదె వొక హంసా

చ. 2: పాలునీరు నేర్పరిచి పాలలో-
నోలనాడె నిదె వొక హంసా
పాలుపడిన యీ పరమహంసముల-
వోలి నున్నదిదె వొక హంసా

చ. 3: తడవి రోమరంధ్రంబుల గుడ్ల-
నుడుగక పొదిగీ నొక హంసా
కడువేడుక వేంకటగిరి మీఁదట-
నొడలు వెంచెనిదె యొక హంసా

రేకు: 2003-04 శ్రీరాగం సం: 01-017 శరణాగతి

పల్లవి: నీవేకానింక నే నన్య మెఱఁగ యే-
త్రోవ చూపి నాకుఁ దోడయ్యేదవయ్య

చ. 1: అపరాధనత కోట్లయినవి వొక్క-
నెపమున ననుఁ గావనేరవా
అపరిమితదురితా లైనవి యే-
ఉపమచేత నన్ను నుద్ధరించెదవయ్య

చ. 2: అతిశయముగఁ గర్మినైతిని నీ-
మతము నాకొకయింత మరపవా
ఇతర కర్మారంభహితుఁడను
గతి మోక్ష మెటువలెఁ గల్పించెదవయ్య

చ. 3: తిరువేంకటాచలాధీశ్వరా నీ-
శరణాగతులఁ బ్రోవఁజాలవా
పరమదయానందపరుఁడవు యే-
వెరవున భవములు వెడలఁ ద్రోచెదవయ్య

రేకు: 2003-05 గుండక్రియ సం: 01-018 తత్త్వములు

పల్లవి: తెలియఁ జీకటికి దీపమెత్తక పెద్ద-
వెలుఁగులోపలికి వెలుఁగేలా

చ. 1: అరయ నాపన్నుని కభయ మీవలెఁగాక
ఇరవైనసుఖిఁ గావనేలా
వఱితఁబోయెడివాని వడిఁ దీయవలెఁగాక
దరివానిఁ దివియంగఁ దానేలా

చ. 2: ఘనకర్మారంభునికట్లు విడవలెఁగాక
యెసి మునక్తునిఁ గావనేలా
అనయము దుర్బలుని కన్నమిడవలెఁగాక
తనసినవానికిఁ దానేలా

చ. 3: మితిలేనిపాపకర్మికిఁ దా వలెఁగాక
హితవెఱుఁగుపుణ్యుని కేలా
ధృతి హీనుఁ గృపఁ జూచి తిరువేంకటేశ్వరుఁడు
తతిఁ గావకుండినఁ దానేలా

రేకు: 2003-06 ముఖారి సం: 01-019 భక్తి

పల్లవి: చిత్తములో నిన్నుఁ జింతించనేరక
మత్తుఁడఁనై పులుమానిసినైతి

చ. 1: అరుత లింగము గట్టి యది నమ్మఁజాలక
పరువతమేఁగిన బత్తుడఁ నైతి
సరుస మేఁకపిల్లఁ జంకఁబెట్టుక నూఁత-
నరయు గొల్లనిరీతి నజ్ఞాని నైతి

చ. 2: ముడుపు కొంగునఁగట్టి మూలమూలలవెదకే-
వెడమతినై నే వెర్రుడ నైతి
విడువ కిక్కడ శ్రీవేంకటేశ్వరుఁ డుండ
పొడగానక మందబుద్ధి నేనైతి

రేకు: 2003-07 శ్రీరాగం సం: 01-020 భక్తి

పల్లవి: అన్నియును నతని కృత్యములే
యెన్నియైనానవు నతఁడేమి సేసినను

చ. 1: అణురేణు పరిపూర్ణుఁడవలి మోమైతేను
అణువౌను కమలభవాండమైన
ఫణిశయనుని కృపాపరిపూర్ణ మైతే
తృణమైన మేరువౌ స్థిరముగా నపుడే

చ. 2: పురుషోత్తముని భక్తి పొరపొచ్చ మైతే
ఎరవులౌ నిజసిరులు ఎన్నైనను
హరిమీఁది చింత పాయక నిజం బైతే
నిరతిఁ బట్టినవెల్లా నిధానములే

చ. 3: మదనగురుని సేవ మదికి వెగటైతేను
పదివేలు పుణ్యములు పాపంబులే
పదిలమై వేంకటపతి భక్తి గలిగితేను
తుదిపదంబునకెల్ల దొడవవు నపుడే

రేకు: 2004-01 శుద్ధవసంతం సం: 01-021 భక్తి

పల్లవి: దురితదేహులే తొల్లియును శ్రీ-
హరి భజించి నిత్యాధికులైరి

చ. 1: అనంతకోటి మహామునులు ఈ-
సనకాదులు నిశ్చలయశులు
ఇనశశినయనుని నితనిని మును
గని భజించి గత కల్మషులైరి

చ. 2: అతిశయమతులు మహామహులు సుఖ-
రతి విముఖులును చిరంతనులు
హిత విచారమతి నితనిని సం-
తతమును భజించి ధన్యులైరి

చ. 3: దేవతాధిపులు దివ్యులును కడుఁ-
బావనులును తగ బరహితులు
యీ వేంకటపతి నితనిని
సేవించి సుఖాంచితమతులైరి

రేకు: 2004-02 శ్రీరాగం సం: 01-022 ఆరగింపు

పల్లవి: ఇందిర వడ్డించ నింపుగను
చిందక యిట్లే భుజించవో స్వామి-

చ. 1: అక్కాళపాశాలు నప్పాలు వడలు
పెక్కైనసయిఁదంపుపేణులును
సక్కెరరాసులు సధ్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ

చ. 2: మీరినకెళంగు మిరియపుఁదాళింపుఁ -
గూరలు కమ్మనికూరలును
సారంపుఁబచ్చళ్ళు చవులుగ నిట్టే
కూరిమితోఁ జేకొనవో స్వామీ

చ. 3: పిండివంటలునుఁ బెరుగులుఁ బాలు
మెండైన పాశాలు మెచ్చి మెచ్చి
కొండలుపొడవు కోరి దివ్యాన్నాలు
వెండియు మెచ్చేవే వేంకటస్వామీ

రేకు: 2004-03 శ్రీరాగం సం: 01-023 తిరుపతి క్షేత్రం

పల్లవి: అదివో అల్లదివో హరివాసము
పదివేలుశేషుల పడగల మయము

చ. 1: అదె వేంకటాచల మఖిలవున్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు-
నదె చూడుఁడదె మొక్కుఁడానంద మయము

చ. 2: చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము

చ. 3: కైవల్యపదము వేంకటనగ మదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకలసంపద రూపమదివో
పావనములకెల్లఁ బావనమయము

రేకు: 2004-04 ఆహిరి సం: 01-024 అధ్యాత్మ

పల్లవి: వననిధిఁ గురిసిన వానలివి మతి-
పనిలేని పనుల భారములు

చ. 1: అడవుల వెన్నెల లారిడి బదుకులు
తడతాఁకుల పరితాఁపములు
వొడలొసఁగిన హరి నొల్లక యితరుల
బడి బడిఁ దిరిగిన బంధములు

చ. 2: కొండల నునుపులు కొనకొన మమతలు
అండలఁ కేగిన నదవదలు
పండిన పంటలు పరమాత్ము విడిచి
బండయి తిరిగిన బడలికలు

చ. 3: బచ్చన రూపులు పచ్చల కొలపులు
నిచ్చలనిచ్చల నెయ్యములు
రచ్చల వేంకటరమణునిఁ గొలువక
చచ్చియుఁ జావని జన్మములు

రేకు: 2004-05 శ్రీరాగం సం: 01-025 నామ సంకీర్తన

పల్లవి: నిత్యానంద ధరణీధర ధరారమణ
కాత్యాయనీ స్తోత్రకామ కమలాక్ష

చ. 1: అరవిందనాభ జగధాధార భవదూర
పురుషోత్తమ నమో భువనేశా
కరుణాసమగ్ర రాక్షసలోకసంహార-
కరణ కమలాదీశ కరిరాజవరద

చ. 2: భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగరనిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణనిజదేహ
భాగీరథీజనక పరమ పరమాత్మ

చ. 3: పావన పరాత్పర శుభప్రద పరాతీత
కైవల్యకాంత శృంగారరమణ
శ్రీవేంకటేశ దాక్షిణ్యగుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిరకృపాభరణ

రేకు: 2004-06 ముఖారి సం: 01-026 అధ్యాత్మ

పల్లవి: అనుమానపుబ్రదు కది రోఁతా తన
మనసెనయనికూటమి మరి రోఁతా

చ. 1: అపకీర్తులఁబడి ఆడికెలోనై
అపవాదియౌట అదిరోఁత
వుపమ గెలిచేనని వొరుఁ జెరుచుటలు
విపరీతపుగుణవిధ మొకరోఁతా

చ. 2: తనగుట్టెల్లా నెరిఁగినవారలముందట
తనయెమ్మెలు చెప్పుకొనుట రోఁత
వనితలముందట వదరుచు వదరుచు
కనుఁగవ గాననిగర్వము రోఁత

చ. 3: భువి హరి గతియని బుద్ధిఁదలంచని-
యవమానపుమన నది రోఁత
భవసంహరుఁడై పరగువేంకటపతి-
నవిరళముగఁ గొలువని దది రోఁత

రేకు: 2004-07 దేసాక్షి సం: 01-027 భక్తి

పల్లవి: నిన్నుఁ దలఁచి నీపేరు దలఁచి
నన్నుఁ కరుణించితే నెన్నికగాక

చ. 1: అధికునిఁ గాచు టేమరుదు నన్ను-
నధమునిఁ గాచుట యరుదుగాక నీకు
మదురమౌ టేమరుదు మధురమూ, చేఁదు
మధురమౌటే మహిలో నరుదుగాక

చ. 2: అనఘునిఁ గరుణింప నరుదుగాదు నీకు
ఘనపాపుని నన్నుఁ గాచు టరుదుగాక
కనకము గనకము గానేల, యినుము
కనకమవుటే కడు నరుదుగాక

చ. 3: నెలకొన్నభీతితో నిన్నుఁ జెనకితిఁగాక
తలకొన్నసుఖినైనఁ దలఁచనేల నిన్ను
యెలమితోఁ దిరువేంగళేఁశుడ నాపాలఁ
గలిగి నీకృప గలుగఁ జేతువుగాక

రేకు: 2004-08 పాడి సం: 01-028 వైరాగ్య చింత

పల్లవి: పాపపుణ్యములరూపము దేహ మిది దీని-
దీపనం బణఁగింపఁ దెరు వెందు లేదు

చ. 1: అతిశయంబైన దేహాభిమానము దీర
గతిఁగాని పుణ్యసంగతిఁ బొందరాదు
మతిలోనిదేహాభిమానంబు విడుచుటకు
రతి పరాఙ్ముఖుఁడు గాక రపణంబు లేదు

చ. 2: సరిలేనిమమకారజలధి దాఁటినఁగాని
అరుదైన నిజసౌఖ్య మది వొందరాదు
తిరువేంకటాచలాధిపునిఁ గొలిచినఁగాని
పరగుబ్రహ్మానందపరుఁడుఁ దాఁగాఁడు

రేకు: 2005-01 ఆహిరి సం: 01-029 అంత్యప్రాస

పల్లవి: పెంచఁబెంచ మీఁదఁ బెరిగేటిచెలిమి
ఇంచుకంత తాలిముల కెడలేనిచెలిమి

చ. 1: అంటుముట్టులేక మనసులంటుకొన్న చెలిమి
కంటఁగంట నవ్వించేఘనమైనచెలిమి
వెంటవెంటఁ దిరిగాడు వెట్టిగొన్న చెలిమి
యింటివారిచిత్తములకు నెడరైనచెలిమి

చ. 2: చెక్కుచెమట పెక్కు వలనే చిక్కనై నచెలిమి
యెక్కడౌటా తమ్ముఁదమ్ము నెఱఁగనీనిచెలిమి
చక్కఁదనమే చిక్క మేనుచిక్కినట్టిచెలిమి
లెక్కలేని యాసలెల్ల లేఁతలయినచెలిమి

చ. 3: అంకురించినట్టితలఁపు లధికమయినచెలిమి
లంకెలయినయాసలెల్లా లావుకొన్న చెలిమి
వేంకటాద్రివిభునిఁ గూడి వేడుకయినచెలిమి
పంకజాననలకెల్లఁ బాయరానిచెలిమి

రేకు: 2005-02 ఆహిరి సం: 01-030 వైరాగ్య చింత

పల్లవి: ఆలాగుపొందులును నటువంటికూటములు
యీలాగులౌట నేఁడిదె చూడనయితి

చ. 1: అడియాసచూపులకు నాసగించితిఁగాని
వెడమాయలని లోను వెదకలేనైతి
కడువేడుకలఁ దగిలి గాసిఁ బొందితిఁగాని
యెడలేనిపరితాప మెఱఁగలేనైతి

చ. 2: చిరునగవుమాటలకుఁ జిత్తగించితిఁగాని
తరితీపులని లోనుఁ దలఁపలేనైతి
వరుస మోహపుఁ బసలవలలఁ జిక్కితిఁగాని
గరువంపుఁ బొలయలుక గానలేనైతి

చ. 3: శ్రీవేంకటేశ్వరునిఁ జింత సేసితిఁగాని
దేవోత్తమునిలాగుఁ దెలియలేనైతి
యీవైభవముపై నిచ్చగించితిఁగాని
యీవైభవానంద మిది పొందనైతి

రేకు: 2005-03 గౌళ సం: 01-031 వైరాగ్య చింత

పల్లవి: ఎన్ని లేవు నా కిటువంటివి
కన్నులెదుట నిన్నుఁ గనుగొనలేనైతి

చ. 1: అరయ నేఁజేసిన యపరాధములు చూచి
కరుణించి వొకడైనాఁ గాచునా
కరచరణాదులు కలిగించిననిన్నుఁ
బరికించి నీసేవాపరుఁడ గాలేనైతి

చ. 2: యేతరినై నేనెఱిఁగి సేసినయట్టి-
పాతక మొకఁడైనా బాపునా
ఆతుమలోనుండి యలరి నీవొసఁగిన-
చేతనమున నిన్నుఁ జెలఁగి చేరనైతి

చ. 3: శ్రీవేంకటేశ నేఁ జేసిన యితరుల-
సేవ కొకఁడు దయసేయునా
నీవే యిచ్చినయట్టి నే నీశరీరముతోడ
నీవాఁడ ననుబుద్ధి నిలుపనేరనైతి

రేకు: 2005-03 గుండక్రియ సం: 01-032 గురు వందన, నృసింహ

పల్లవి: ఎంతటివారలు నెవ్వరును హరిఁ
జింతిచక నిశ్చింతులు గారు

చ. 1: అతిజితేంద్రియులు ననశనవ్రతులు-
నతుల తపోధనులగువారు
చతురానన గురుస్మరణము దొరకక
తతి నూరక పుణ్యతములుగారు

చ. 2: అనఘులు శాంతులు నధ్యాత్మతతులు-
ననుపమ పుణ్యులు యాజకులు
వనజోదరు ననవరతముఁ దలఁచక
వినుతి స్మృతికిని విభుదులుగారు

చ. 3: దురిత విదూరులు దుర్మతిహీనులు
నిరతానందులు నిత్యులును
తిరువేంకటగిరిదేవుని గొలువక
పరమార్గమునకు బ్రహ్మలు గారు

రేకు: 2005-04 సామంతం సం: 01-033 వైరాగ్య చింత

పల్లవి: పరమపాతకుఁడ భవబంధుఁడ శ్రీ -
హరి నినుఁ దలఁచ నే నరుహుఁడనా

చ. 1: అపవిత్రుఁడ నే నమంగళుఁడఁ గడు-
నపగతణ్యుఁడ నలసుఁడను
కపటకలుషపరికరహృదయుఁడ నే-
నపవర్గమునకు నరుహుఁడనా

చ. 2: అతిదుష్టుఁడ నే నధికదూషితుఁడ
హతవివేకమతి నదయుఁడను
పతిలేని రమాపతి మిముఁదలఁచలే
నతులగతికి నే నరుహుఁడనా

చ. 3: అనుపమవిషయపరాధీనుఁడ నే-
ననంతమోహభయాతురుఁడ
వినుతింపఁగ దిరువేంకటేశ ఘను-
లనఘులుగాక నే నరుహుఁడనా

రేకు: 2005-05 నాదరామక్రియ సం: 01-034 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నియుఁ గలుగు టేజన్మముననైనఁ
జెన్నలర హరిసేవ సిద్ధించుకొరకు

చ. 1: అరయ వేదాధ్యయన మది బ్రహ్మశుద్ధికొర-
కిరవైనశాస్త్రంబు లెరుకకొరకు
తరి యజ్ఞములు రుణోత్తారమయ్యెడికొరకు
సరిలేనిదానములు జన్మములకొరకు

చ. 2: మమకారదూరంబు మనసు గెలుచుటకొరకు
సమవివేకంబు శాంతములకొరకు
అమరశ్రీతిరువేంకటాద్రీశుమనసు నీ-
జముగెలుచు బ్రహ్మవిజ్ఞానంబుకొరకు

రేకు: 2005-06 సామంతం సం: 01-035 శరణాగతి

పల్లవి: ఏ నిన్ను దూరక నెవ్వరి దూరుదు నీ-
వాని నన్నొకయింత వదలక నను నేలవలదా

చ. 1: అపరాధిఁగనక నన్నరసి కావుమని
అపరిమితపుభయ మంది నీకు శరణంటిఁగాక
నెపములేక నన్ను నీకుఁ గావఁగ నేల
అపవర్గరూప దయాంబుధి తిరువేంకటాధిపా

చ. 2: ఘనపాపిఁ గనక నీకరుణ గోరి నీ-
వనవరతము నాయాతుమ విహరించుమంటిఁ గాక
యెనసి నన్నుఁ గాచు టేమి యరుదు నీకు-
ననఘుఁడ పరమతత్త్వానంద తిరువేంకటాధిప

రేకు: 2006-01 ధన్నాసి సం: 01-036 వైష్ణవ భక్తి

పల్లవి: వైష్ణవులుగానివార లెవ్వరు లేరు
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁ గాన

చ. 1: అంతయు విష్ణు మయం బట మరి దేవ-
తాంతరములు గలవననేలా
భ్రాంతిఁ బొంది యీ భావము భావించి-
నంతనే పుణ్యులవుట దప్పదుగాన

చ. 2: యెవ్వరిఁ గొలిచిన నేమిగొరఁత మరి
యెవ్వరిఁ దలచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరిరూపుగానివా-
రెవ్వరు లేరని యెరుకదోఁచినఁ జాలు

చ. 3: అతిచంచలంబైన యాతుమ గలిగించు-
కతమున బహుచిత్తగతులై
యితరులఁ గొలిచిన యెడయక యనాథ-
పతితిరువేంకటపతి చేకొనుఁగాక

రేకు: 2006-02 శ్రీరాగం సం: 01-037 భక్తి

పల్లవి: మనసిజ గురుఁడితఁడో మఱియుఁ గలఁడో వేద-
వినుతుఁ డీతఁడు గాక వేరొకఁడు గలఁడో

చ. 1: అందరికి నితఁడెపో అంతరాత్ముఁడనుచు-
నందు రితఁడో మఱియు నవల నొకఁడో
నందకధరుఁడు జగన్నాథుఁడచ్చుతుడు గో-
విందుఁ డీతఁడుగాక వేరొకఁడు గలఁడో

చ. 2: తనర నిందరికిఁ జైతన్యమొసఁగిన యాతఁ-
డొనర నితఁడో మఱియు నొకఁడు గలఁడో
దినకరశతతేజుఁడగు దేవదేవుడు, త-
ద్వినుతుఁ డితఁడుగాక వేఱొకఁడు గలఁడో

చ. 3: పంకజభవాదులకుఁ బరదైవ మీతఁడని
అంకింతురితఁడో అధికుఁడొకఁడో
శాంకరీస్తోత్రములు సతతమునుఁ గైకొనెడి-
వేంకటవిభుఁడో కాక వేరొకఁడు గలఁడో

రేకు: 2006-03 భూసాళం సం: 01-038 తిరుపతి క్షేత్రం

పల్లవి: ఇప్పుడిటు కలగంటి నెల్ల లోకములకు-
నప్పఁడగు తిరువేంకటాద్రీశుఁ గంటి

చ. 1: అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుఁగఁగఁ గంటి
చతురాస్యుఁ బొడగంటి చయ్యన మేలుకంటి

చ. 2: కనకరత్నకవాటకాంతు లిరుగడఁగంటి
ఘనమైన దీపసంఘములు గంటి
అనుపమమణిమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటి గక్కన మేలుకంటి

చ. 3: అరుదైన శంఖచక్రాదులిరుగడఁ గంటి
సరిలేని అభయహస్తము గంటిని
తిరు వేంకటాచలాధిపునిఁ జూడఁగఁ గంటి
హరిఁ గంటి గురుఁ గంటి నంతట మేలుకంటి

రేకు: 2006-04 బౌళి సం: 01-039 వైరాగ్య చింత

పల్లవి: తీపనుచు చేఁదు తెగఁదిని వెనకఁ బడరాని
ఆపదలచేతఁ బొరలాడేముగాన

చ. 1: అప్పుదీరినదాఁకా నలవోకకైనవా-
రెప్పుడునుఁ దమవార లేలౌదురు
అప్పటప్పటికిఁ బ్రియ మనుభవింపుచు మమత
చెప్పినటువలెఁ దాము సేయవలెఁ గాక

చ. 2: పొందైనవారమని పొద్దు వోకకుఁ దిరుగు-
యిందరునుఁ దమవార లేలౌదురు
కందువగు తమకార్యగతులు దీరినదాఁక
సందడింపుచుఁ బ్రియము జరపవలెఁ గాక

చ. 3: తెగని కర్మము దమ్ముఁ దిప్పుకొని తిరిగాడ
ఆగడుకోరిచి పెక్కులాడ నేమిటికి
తగవేంకటేశ్వరునిఁ దలఁచి యిన్నిటాఁ దాము
విగతభయులయి భ్రాంతి విడువవలెఁ గాక

రేకు: 2006-05 శ్రీరాగం సం: 01-040 యజ్ఞము

పల్లవి: అదిగాక నిజమతం బదిగాక యాజకం-
బదిగాక హృదయసుఖ మదిగాక పరము

ch. 1: అమలమగు విజ్ఞానమను మహాధ్వరమునకు-
నమరినది సంకల్పమను మహాపశువు
ప్రమదమను యూపగంబమున విశసింపించి
విమలేంద్రు యాహుతులు వేల్పంగవలదా

చ. 2: అరయ నిర్మమకార మాచార్యుఁడై చెలఁగ
వరుసతో ధర్మదేవత బ్రహ్మ గాఁగ
దొరకొన్న శమదమాదులు దానధైర్యభా-
స్వరగుణాదులు విప్రసమితి గావలదా

చ. 3: తిరువేంకటాచలాధిపునిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతని కృపాపరిపూర్ణ జలధిలో
నరుహులై యవభృథం బాడంగవలదా

రేకు: 2006-06 శంకరాభరణం సం: 01-041 అధ్యాత్మ

పల్లవి: తలపోఁత బాఁతె తలఁపులకుఁ దమ
కొలఁ దెఱిఁగనిమతి గోడాడఁగా

చ. 1: ఆపదలు బాఁతె అందరికినిఁ దమ-
చాపలపు సంపదలు సడిఁబెట్టఁగా
పాపములు బాఁతె ప్రాణులకును మతిఁ
బాపరానియాస దమ్ముఁ బాధించఁగా

చ. 2: జగడాలు బాఁతె జనులకునుఁ దమ-
పగలైనకోపాలు పై కొనఁగా
వగలు బాఁతె వలలఁ బెట్టెడి తమ్ముఁ
దగిలించు మమత వేదనము సేయఁగా

చ. 3: భయములు బాఁతె పరులకును తమ-
దయలేక అలయించు ధనముండఁగా
జయములు బాఁతె సతతమును యింత-
నయగారివేంకటనాథుఁ డుండఁగాను

రేకు: 2006-06 ధన్నాసి సం: 01-042 అధ్యాత్మ

పల్లవి: పుట్టగులమ్మీ భువిఁ గొనరో
జట్టికిని హింసలే మీ ధనము

చ. 1: ఆపద లంగడి నమ్మీఁ గొనరో
పాపాత్ములు పై పయిఁ బడకా
కైపులఁ బుణ్యులఁగని కోపించే-
చూపులు మీ కివి సులభపు ధనము

చ. 2: కడుఁగుంభీ పాతకంబులు గొనరో
బడిబడి నమ్మీఁ బాలిండ్ల
తొడరుఁ బరస్త్రీ ద్రోహపుధనములె
తడవుటె మీ కివి దాఁచిన ధనము

చ. 3: లంపుల చండాలత్వము గొనరో
గంపలనమ్మీఁ గలియుగము
రంపపు వేంకటరమణునికథ విన-
నింపగు వానికి నిదే ధనము

రేకు: 2006-07 లలిత సం: 01-043 అధ్యాత్మ

పల్లవి: అప్పుడువో నినుఁ గొలువఁగ నరుహము గలుగుట ప్రాణికి
కప్పినదియుఁ గప్పనిదియుఁ గనుఁగొనఁగలనాఁడు

చ. 1: ఆపదలకు సంపదలకు నడ్డముచెప్పినినాఁడు
పాపములకు పుణ్యములకుఁ బనిదొలఁగిననాఁడు
కోపములకు శాంతములకుఁ గూటమి మానిననాఁడు
లోపల వెలుపల తనమతిలోఁ దెలిసిననాఁడు

చ. 2: తనవారలఁ బెరవారలఁ దాఁ దెలిసిననాఁడు
మనసునఁ జైతన్యంబున మఱపందిననాఁడు
పనివడి తిరువేంకటగిరిపతి నీదాసులదాసులఁ
గనుఁగొని నీభావముగాఁ గనువిచ్చిననాఁడు

రేకు: 2006-07 సామంతం సం: 01-044 వేంకటగానం

పల్లవి: కొలువుఁడీ భక్తిఁ గొండలకోనేటి-
నిలయుని శ్రీనిధియైనవాని

చ. 1: ఆదిదేవుని నభవుని సామ-
వేదనాదవినోదుని నెర-
వాది జితప్రియ నిర్మలతత్త్వ-
వాదులజీవనమైనవాని

చ. 2: దేవదేవుఁడైన దివ్యుని సర్వ-
భావాతీతస్వభావుని
శ్రీవేంకటగిరి దేవుఁడైన పర-
దేవుని భూదేవ తత్పరుని

రేకు: 2007-01 లలిత సం: 01-045 అధ్యాత్మ

పల్లవి: మంచిదివో సంసారము మదమత్సరములు మానిన
కంచునుఁ బెంచును నొకసరిగాఁ దా చూచినను

చ. 1: ఆపదలకుమ సంపదలకు నభిమానింపక యుండిన
పాపముఁ బుణ్యము సంకల్పములని తెలిసినను
కోపము శాంతము తమతమగుణములుగా భావించిన
తాపము శైత్యమునకుఁ దాఁ దడఁబడకుండినను

చ. 2: వెలియును లోపలయును నొకవిధమై హృదయం బుండిన
పలుకునుఁ బంతము దా నొక భావన దోఁచినను
తలఁపునఁ దిరువేంకటగిరిదైవము నెలకొనియుండిన
సొలపక యిన్నిటికినఁ దా సోఁకోరుచెనైనా

రేకు: 2007-02 లలిత సం: 01-046 మంగళ హారతులు

పల్లవి: మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మకునకు ధర్మస్వరూపునకూ,జయజయ

చ. 1: ఆదికినినాద్యైన దేవున కచ్యుతున కంభోజనాభున-
కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని
వేదరక్షకునకును సంతతవేదమార్గవిహారునకు బలి-
భేదికిని సామాదిగానప్రియవిహారునకు

చ. 2: హరికిఁ బరమేశ్వరునకును శ్రీధరునకును గాలాంతకునకును
పరమపురుషోత్తమునకును బహుబంధదూరునకు
సురమునిస్తోత్రునకు దేవాసురగణశ్రేష్ఠునకు కరుణా-
కరునకునుఁ గాత్యాయనీ నుతకలితనామునకు

చ. 3: పంకజాసనవరదునకు భవపంకవిచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు నాశ్చర్యరూపునకు
వేంకటాచలవల్లభునకును విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభకుంకుమపంకలోలునకు

రేకు: 2007-03 సామంతం సం: 01-047 అధ్యాత్మ

పల్లవి: పాయని కర్మంబులె కడుబలవంతము లనినప్పుడె
కాయమునకు జీవునకునుఁ గర్తృత్వము లేదు

చ. 1: ఆతుమ కలవ్యాపకమని తలపోసినపిమ్మట
జాతియుఁ గులాభిమానముఁ జర్చింపనెరాదు
భూతవికారములన్నియుఁ బురుషోత్తముఁ డనినప్పుడు
పాతకముల పుణ్యంబులపని తనకే లేదు

చ. 2: పదిలంబుగ సర్వాత్మకభావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచినఁ మొక్కకపోరాదు
కదిసిన యిప్పటి సుఖములె కడుదుఃఖములని తెలిసిన
చెదరక సంసారమునకు జేసాఁపనెరాదు

చ. 3: పరిపూర్ణుఁడు తిరువేంకటపతియనఁగా వినినప్పుడు
యెరవుల హీనాధికములు యొగ్గులు మరి లేవు
పరమాత్ముండగు నీతని భక్తులందలఁచిన యప్పుడు
తిరముగ నీతనికంటెను దేవుఁడు మరి లేఁడు

రేకు: 2007-04 బౌళి సం: 01-048 అధ్యాత్మ

పల్లవి: ఏడ సుజ్ఞాన మేడ తెలివి నాకు
బూడిదిలో హోమమై పోయఁ గాలము

చ. 1: ఇదె మేలయ్యీడి నా కదె మేలయ్యీడి నని
కదిసిన యాసచేఁ గడవలేక
యెదురుచూచి చూచి యెలయించి యెలయించి
పొదచాటు మృగమై పోయఁ గాలము

చ. 2: ఇంతటఁ దీరెడి దుఃఖ మంతటఁ దీరెడినని
వింతవింత వగలచే వేఁగివేఁగి
చింతయు వేదనలఁ జిక్కువడుచు నగ్ని-
పొంతనున్న వెన్నయై పోయఁ గాలము

చ. 3: యిక్కడ సుఖము నా కక్కడ సుఖంబని
యెక్కడికైనా నూర కేఁగియేఁగి
గక్కన శ్రీతిరువేంకటపతిఁ గానక
పుక్కిటి పురాణమయి పోయఁ గాలము

రేకు: 2008-01 గుండక్రియ సం: 01-049 వైరాగ్య చింత

పల్లవి: కొనుట వెగ్గళము దాఁ దినుట యల్పము మీఁదు-
గనుట వినుట లేక దా కడచన్నుభవము

చ. 1: ఆపద వడ్డికినిచ్చి అనుభవింపఁబోయిన
యేపున నెవ్వరికి నిం దేమిగలదు
పాపపుపైరు విత్తినపండిన పంటలలోన
రూపింపఁగ నిందు రుచి యేమిగలదూ

చ. 2: ఘనుఁడైనతిరువేంకటనాథుఁ డిన్నిటికి-
యును భోక్తయుఁ గర్మియును నైనవాఁడు
పనిలేదు నిష్ఠూరపరుఁడు దానై వుండు
తనకుఁ దానె కర్త తనమౌటఁ గాన

రేకు: 2008-02 ఆహిరి సం: 01-050 వైరాగ్య చింత

పల్లవి: జీవాతుమై యుండు చిలుకా నీ-
వావలికి పరమాత్ముఁడై యుండు చిలుకా

చ. 1: ఆతుమపంజరములోన నయముననుండి నాచేతనేపెరిగిన చిలుకా
జాతిగాఁ గర్మపుసంకెళ్ళఁబడి కాలఁ జేతఁ బేదైతివే చిలుకా
భాతిగాఁ జదువులు పగలురేలును నా చేత నేరిచినట్టి చిలుకా
రీతిగా దేహంపురెక్కలచాటున నుండి సీతుకోరువలేని చిలుకా

చ. 2: బెదరి అయిదుగురికిని భీతిఁబొందుచుఁ గడుఁ జెదరఁగఁ జూతువే చిలుకా
అదయులయ్యిన శత్రులారుగురికిఁగాక అడిచిపడుదువే నీవు చిలుకా
వదల కిటు యాహారవాంచ నటు పదివేలు వదరులు వదరేటి చిలుకా
తుదలేని మమతలు తోరమ్ము సేసి నాతోఁగూడి మెలగిన చిలుకా

చ. 3: నీవన నెవ్వరు నేనన నెవ్వరు నీవే నేనై యుండుఁ జిలుకా
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి సేవించు కొని గట్టి చిలుకా
దైవమానుషములు తలఁపించి యెపుడు నా తలఁపునఁ బాయని చిలుకా
యేవియునునిజముగా వివియేఁటికని నాకు నెఱిఁగించి నటువంటి చిలుకా

రేకు: 2008-03 ముఖారి సం: 01-051 భక్తి

పల్లవి: నదు లొల్లవు నా స్నానము కడు-
సదరము నాకీ స్నానము

చ. 1: ఇరువంకల నీయేచినముద్రలు
ధరియించుటే నాస్నానము
ధరపై నీనిజదాసులదాసుల-
చరణధూళి నాస్నానము

చ. 2: తలఁపులోన నినుఁదలఁచినవారలఁ
దలఁచుటే నాస్నానము
వలనుగ నినుఁగనువారల శ్రీపాద-
జలములే నాస్నానము

చ. 3: పరమభాగవతపాదాంబుజముల-
దరుశనమే నాస్నానము
తిరువేంకటాగిరిదేవ నీకథా
స్మరణమే నాస్నానము

రేకు: 2008-04 శ్రీరాగం సం: 01-052 నామ సంకీర్తన

పల్లవి: చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు
చాలదా హితవైన చవులెల్ల నొసఁగ

చ. 1: ఇదియొకటి హరినామ మింతైనఁ జాలదా
చెదరకీ జన్మముల చెఱలు విడిపించ
మది నొకటె హరినామ మంత్రమది చాలఁదా
పదివేలు నరకకూపముల వెడిలించ

చ. 2: కలదొకటి హరినామ కనకాద్రి చాలదా
తొలఁగుమని దారిద్ర్యదోషంబు చెఱుచ
తెలివొకటి హరినామ దీపమది చాలదా
కలుషంపు కఠినచీఁకటి పారఁద్రోల

చ. 3: తగువేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ
సొగిసి యీ విభునిదాసుల కరుణ చాలదా
నగవుఁజూపులను నున్నతమెపుడుఁ జూప

రేకు: 2008-05 శ్రీరాగం సం: 01-053 సంస్కృత కీర్తనలు

పల్లవి: వందే వాసుదేవం
బృందారకాధీశ వందిత పదాబ్జం

చ. 1: ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ-
చందనాంకితల సచ్చారు దేహం
మందారమాలికా మకుటసంశోభితం
కందర్పజనక మరవిందనాభం

చ. 2: ధగధగిత కౌస్తుభాధరణ వక్షస్థలం
ఖగరాజవాహనం కమలనయనం
నిగమాదిసేవితం నిజరూపశేష ప-
న్నగరాజ శాయినం ఘన నివాసం

చ. 3: కరిపురనాథ సంరక్షణే తత్పరం
కరిరాజ వరదసంగత కరాబ్జం
సరసీరుహాననం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచలా దేవం భజే

రేకు: 2008-06 భూపాళం సం: 01-054 భక్తి

పల్లవి: నీ కథామృతము నా నిరతసేవన నాకు
చేకొనుట సకలసంసేవనం బటుగాన

చ. 1: ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు-
నిదియె వేదసంహితపాఠము
యిదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు-
నిదియె సంధ్య నాకిదియ జప మటుగాన

చ. 2: యిదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు-
నిదియె దుఃఖవిరహితమార్గము
యిదియె భవరోగహితభేషజము నాకు-
నిదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన

చ. 3: యిదియె దానఫల మీఁజాలినది నాకు
యిదియే తలఁపఁ బరహితకర్మము
యిదియె తిరువేంకటేశ నీసంస్మరణ-
మిదియె యిదియె ఇన్నియును నటుగాన

రేకు: 2009-01 సామంతం సం: 01-055 దశావతారములు

పల్లవి: ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినంతేకాని లేదు
తాముసేసినంత వట్టు తమకుఁ బోరాదు

చ. 1: ఇట్టునట్టు మిట్టిపడ్డ యించుకంతా లేదు, వీఁపు
బట్టగట్ట మోపు మోఁచి పాటువడ్డా లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొనినా లేదు
తెట్టఁదెరువున నోరుదెరచినా లేదు

చ. 2: అడిగి పరులబదు కాసపడ్డా లేదు, భీతి
విడిచి నెత్తుటఁదోగి వీరుఁడైనా లేదు
అడవులెల్లాఁ దిరిగి అలమటించిన లేదు
యిడుమపాటుకుఁ జొచ్చి యియ్యకొన్నా లేదు

చ. 3: వచ్చివచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చులగుఱ్ఱము నెక్కి మెరసినా లేదు
యెచ్చరికఁ దిరువేంకటేశుఁ గొలువక వుంటే
యిచ్చటనచ్చట సుఖ మించుకంతా లేదు

రేకు: 2009-02 ముఖారి సం: 01-056 అధ్యాత్మ

పల్లవి: నగుఁబాట్లఁ బడేనాజిహ్వ
పగటున నిదివో పావనమాయ

చ. 1: ఇల నిందరి నుతియించి పెంచువలె
నలినలియైనది నా జిహ్వ
నలినోదరుశ్రీనామము దలఁచిన-
ఫలమున కిదివో పావనమాయ

చ. 2: భ్రమఁబడి మాయపుపడఁతులతమ్మలు
నమలి చవులుగొనె నాజిహ్వ
అమరవంద్యుఁడగుహరి నుతియించఁగ
ప్రమదము చవిగొని పావనమాయ

చ. 3: నెలఁతలపలు యోనిద్రవనదులను
నలుగడ నీఁదెను నాజిహ్వ
అలసి వేంకటనగాధిపయనుచును
పలికినయంతనె పావనమాయ

రేకు: 2009-03 శ్రీరాగం, యేకతాళి సం: 01-057 కృష్ణ

పల్లవి: విడుమనవో రోలు విడుమనవో వేగ
విడుమనవో తల్లి వెఱచీ, నీబాలుడు

చ. 1: యెన్నఁడు గొల్లెతలయిండ్లు వేమారుఁ జొచ్చి
వెన్నలుఁ బాలును వెఱఁజఁడు
వన్నెలనీకోప మింత వద్దు నీకు నీయాన
కన్నుల నవ్వుల ముద్దుగారీ నీబాలుడు

చ. 2: సారెకు పెరుగులచాడెలూ నేఁడు మొదలూ
గోరయ్యై కోలలఁ బగుల మొత్తఁడు
కూరిమిలేక నీవు కోపగించఁగాఁ గన్నీరు
జోరుగా రాలఁగా నిన్నే చూచీ నీబాలుఁడు

చ. 3: చాలు నీకోప మిది సరిలేనిముద్దులివి
రోలనే యిట్లను విరుగఁద్రోయఁడు
మేలిమివేంకటపతి మేటినీకొమాఁరు డిదె
కేలెత్తి నీకు మ్రొక్కెడి నిదె బాలుఁడు

రేకు: 2009-04 భైరవి-రచ్చెతాళం సం: 01-058 కృష్ణ

పల్లవి: పట్టవసముగానిబాలుఁడా పెనుఁ-
బట్టపు బలువుఁడ బాలుఁడా

చ. 1: ఇరుగడ బహ్మయు నీశ్వరుఁడును నిన్ను
సరుస నుతింప జఠరమున
అరుదుగ నుండి ప్రియంబున వెడలిన-
పరమమూర్తివా బాలుఁడా

చ. 2: తల్లియుఁ దండ్రియుఁ దనియనిముదమున
వెల్లిగ లోలో వెఱవఁగను
కల్లనిదురతోఁ గనుమూసుక రే-
పల్లెలోఁ బెరిగిన బాలుఁడా

చ. 3: యేదెసఁ జూచిన నిందరి భయముల-
సేదలు దేఱఁగఁ జెలగుచును
వేదపల్లవపు వేంకటగిరిపై
పాదము మోపిన బాలుఁడా

రేకు: 2009-04 ఆహిరి సం: 01-059 వైష్ణవ భక్తి

పల్లవి: మదమత్సరము లేక మనసుపేదై పో
పదరినయాసలవాఁడువో వైష్ణవుఁడు

చ. 1: ఇట్టునట్టుఁ దిరిగాడి యేమైనా జెడనాడి
పెట్టరంటాఁ బోయరంటాఁ బెక్కులాడి
యెట్టివారినైనా దూరి యెవ్వరినైనఁ జేరి
వట్టియాసలఁ బడనివాఁడువో వైష్ణవుఁడు

చ. 2: గడనకొరకుఁ జిక్కి కాముకవిద్యలఁ జొక్కి
నిడివి నేమైనాఁ గని నిక్కి నిక్కి
వొడలిగుణముతోడ వుదుటువిద్యలఁ జాల
వడదాఁకి బడలనివాఁడువో వైష్ణవుఁడు

చ. 3: ఆవల వొరులఁ జెడనాడఁగ వినివిని
చేవమీరి యెవ్వరినిఁ జెడనాడక
కోవిదు శ్రీవేంకటేశుఁ గొలిచి పెద్దలకృప
వావివర్తనగలవాఁడువో వైష్ణవుఁడు

రేకు: 2009-05 సామంతం సం: 01-060 వేంకటగానం

పల్లవి: ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే
వేదవిరహితులకు వెఱితు మటుగాన

చ. 1: ఇరవుకొని రూపంబులిన్నిటానుఁ గలనిన్నుఁ
బరికించవలెఁగాని భజియింపరాదు
గరిమచెడి సత్సమాగంబు విడిచిన నీ_
స్మరణ విజ్ఞానవాసన గాదుగాన

చ. 2: యిహ దేవతాప్రభలనెల్ల వెలుఁగుట నీకు
సహజమనవలెఁగాని సరిఁ గొలువరాదు
అహిమాంశుకిరణంబు లన్నిచోట్లఁ బరగు
గ్రహియింపరా దవగ్రాహములు గాన

చ. 3: యింతయునుఁ దిరువేంకటేశ నీవునికిఁ దగఁ
జింతింపవలెఁగాని సేవింపరాదు
అంతయు ననరుహమును నరుహంబనఁగరాదు
అంతవానికిఁ బరుల కలవడదుగాన

రేకు: 2010-01 శంకరాభరణం సం: 01-061 వైరాగ్య చింత

పల్లవి: పదిలము కోట పగవారు
అదనఁ గాచుకొందు రాఱుగురు

చ. 1: ఇమ్మెఁ జెప్ప యిందరిచేత
తొమ్మిదినెల్లఁ దోఁగినది
కొమ్మతీరునఁ గుదురైనకోట
దొమ్మికాండ్లై దుగు రుందురు

చ. 2: వొంటికాఁడు రాజు వుడుగక తమలోన
వొంటనీనిమంత్రు లొక యిద్దరు
దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు-
బంటు లేడుగురు బలవంతులు

చ. 3: కలవు తొమ్మిది కనుమల తంత్రము
నిలుపఁగలిగినట్టినెరవాదులు
తెలిసి కొనేటితిమ్మినాయఁడు చొచ్చె
బలిసె యీకోట భయమేల

రేకు: 2010-02 సామంతం సం: 01-062 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఎంత చదివిన నేమి వినిన తన-
చింత యేల మాను సిరులేల కలుగు

చ. 1: ఇతర దూషణములు యెడసినఁగాక
అతికాముకుఁడుగాని యప్పుడు గాక
మతిచంచలము గొంత మానినఁగాక
గతి యేల కలుగు దుర్గతులేల మాను

చ. 2: పరధనములయాస పాసినఁగాక
అరిదినిందలులేనియప్పుడు గాక
విరసవర్తనము విడిచినఁగాక
పరమేల కలుగు నాపదలేల మాను

చ. 3: వేంకటపతి నాత్మ వెదకినఁగాక
కింక మనసునఁ దొలఁగినఁగాక
బొంకుమాట లెడసిపోయినఁగాక
శంకయాల మాను జయమేల కలుగు

రేకు: 2010-03 సామంతం సం: 01-063 వైరాగ్య చింత

పల్లవి: కాలవిశేషమో లోకముగతియో సన్మార్గంబుల_
కీలువదలె సౌజన్యము కిందయిపోయినది

చ. 1: ఇందెక్కడిసంసారం, బేదెసఁ జూచిన ధర్మము
కందయినది,విజ్ఞానము కడకుఁ దొలంగినది,
గొందులు దరిఁబడె, శాంతము కొంచెంబాయ,వివేకము
మందుకు వెదకినఁ గానము మంచితనంపుఁబనులు

చ. 2: మఱి యిఁక నేఁటివిచారము, మాలిన్యంబైపోయిన_
వెఱుకలు, సంతోషమునకు నెడమే లేదాయ,
కొఱమాలెను నిజమంతయు,కొండలకేఁగెను సత్యము,
మఱఁగైపోయను వినుకులు, మతిమాలెను తెలివి

చ. 3: తమకిఁక నెక్కడిబ్రదుకులు, తడఁబడె నాచారంబులు,
సమమైపోయిన వప్పుడె జాతివిడంబములు ,
తిమిరంబింతయుఁ బాపఁగఁ దిరువేంకటగిరిలక్ష్మీ-
రమణుఁడు గతిదప్పను కలరచనేమియు లేదు

రేకు: 2010-04 శ్రీరాగం సం: 01-064 అధ్యాత్మ

పల్లవి: ఈ విశ్వాసంబు యెవ్వరికిఁ దోఁప దిది
పావనుల హృదయమునఁ బ్రభవించుఁగాని

చ. 1: ఇమ్మయినపాపంబు లెన్నివలసినఁ బ్రాణి
సమ్మతంబున జేయఁ జాలుఁగా కేమి
కుమ్మరికి నొకయేఁడు గుదియ కొకనాఁడవును
నమ్మితలఁ చినవిష్ణునామంబుచేత

చ. 2: కొదలేనిదురితములు కొండలునుఁ గోట్లును
చెదర కెప్పుడుఁ బ్రాణి చేయుఁగా కేమి
పొదరి గొరియలలోన పులిచొచ్చినట్లౌను
హృదయంబు హరిమీఁద నుండినంతటను

చ. 3: సరిలేని దుష్కర్మసంఘములు రాసులై
పెరుగఁ జేయుచు ప్రాణి పెంచుఁగాకేమి?
బెరసి కొండలమీఁదఁ బిడుగువడ్డట్లౌను
తిరువేంకటాచలాధిపునిఁ దలఁచినను

రేకు: 2010-05 కన్నడ గౌళ సం: 01-065 వైరాగ్య చింత

పల్లవి: తనకర్మవశం బించుక,దైవకృతం బొకయించుక
మనసు వికారం బించుక,మానదు ప్రాణులకు

చ. 1: ఈదైన్యము లీహైన్యము లీచిత్తవికారంబులు
యీదురవస్థలు గతులును యీలంపటములును
యీదాహము లీదేహము లీయను బంధంబులు మరి
యీదేహముగలకాలము యెడయవు ప్రాణులకు

చ. 2: యీచూపులు యీతీపులు నీనగవులు నీతగవులు-
నీచొక్కులు నీపొక్కులు నీ వెడయలుకలును
యీచెలుములు నీబలువులు నీచనవులు నీఘనతలు-
నీచిత్తముగలకాలము యెడయవు ప్రాణులకు

చ. 3: యీవెరవులు నీయెరుకవులు యీతలఁపులు నీతెలువులు
దైవశిఖామణి తిరుమల దేవునిమన్ననలు
దైవికమున కిటువగనక తనతలఁ పగ్గలమైనను
దైవము తానౌ తానే దైవంబవుఁగాన

రేకు: 2010-06 శ్రీరాగం సం: 01-066 దశావతారములు

పల్లవి: ఈ పాదమేకదా యిలనెల్లఁ గొలిచినది

యీ పాదమే కదా ఇందిరా హస్తముల కితవైనది

చ. 1: ఈ పాదమేకదా ఇందరును మొక్కెడిది

యీ పాదమే కదా యీగగనగంగ పుట్టినది

యీ పాదమే కదా యెలమిఁ బెంపొందినది

యీ పాదమే కదా యిన్నిటాకి నెక్కుడైనది

చ. 2: యీ పాదమే కదా యిభరాజు దలఁచినది

యీ పాదమే కదా యింద్రాదులెల్ల వెదకినది

యీ పాదమే కదా యీబ్రహ్మ గడిగినది

యీ పాదమే కదా యెగసి బ్రహ్మాండమంటినది

చ. 3: యీ పాదమే కదా యిహపరము లొసగెడిది

యీ పాదమే కదా ఇల నహల్యకుఁ గోరికైనది

యీ పాదమే కదా యీక్షింప దుర్లభము

యీ పాదమే కదా యీవేంకటాద్రిపై నిరవైనది

రేకు: 2011-01 ఆహిరి సం: 01-067 జోల

పల్లవి: అలరఁ జంచలమైనఆత్మలందుండ నీయలవాటు సేసె నీవుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాసపవనమందుండ నీ భావంబు దెలిపె నీవుయ్యాల

చ. 1: ఉదయాస్త శైలంబు లొనరఁ గంభములైన వుడుమండలము మోఁచె నుయ్యాల
అదన నాకాశపద మడ్డదూలంబైన అఖిలంబునిండె నీవుయ్యాల
పదిలముగ వేదములు బంగారుచేరులై పట్ట వెరపై తోఁచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయె నుయ్యాల

చ. 2: మేలుకట్లయి మీకు మేఘమండలమెల్ల మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాల
నీలశైలమువంటి నీమేని కాంతికిని నిజమైన తొడవాయె నుయ్యాల
పాలిండ్లు గదలఁగా బయ్యదలు రాఁపాడ భామినులు వడినూఁచు నుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరగునోయని భీతి నొయ్యనొయ్యన వూఁచి రుయ్యాల

చ. 3: కమలకును భూసతికి కదలు కదలుకుమిమ్ముఁ గౌఁగిలింపఁగఁ జేసె నుయ్యాల
అమరాఁగనలకు నీ హావభావ విలాసమందంద చూపె నీవుయ్యాల
కమలాసనాదులకుఁ గన్నులకు పండుగై గణుతింప నరుదాయ నుయ్యాల
కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై వుండె నుయ్యాల

రేకు: 2011-02 నాట సం: 01-068 నృసింహ

పల్లవి: ఘోరవిదారణ నారసింహ నీ-
వీరూపముతో నెట్లుండితివో

చ. 1: ఉడికెడికోపపుటూర్పులఁ గొండలు
పొడివొడియై నభమునకెగయ
బెడిదపురవమున పిడుగులు దొరుగఁగ
యెడనెడ నీవపుడెట్లుండితివో

చ. 2: కాలానలములు గక్కుచు నయన-
జ్వాలల నిప్పులు చల్లుచును
భాలాక్షముతో బ్రహ్మాండకోట్ల-
కేలికవై నీవెట్లుండితివో

చ. 3: గుటగుటరవములు కుత్తికఁ గులుకుచు
గిటగిటఁ బండ్లు గీఁటుచును
తటతటఁ బెదవులు దవడలు వణఁకఁగ
ఇటువలె నీవపుడెట్లుందితివో

చ. 4: గోళ్ళమెఱుఁగుల కొంకులపెదపెద-
వేళ్ళ దిక్కులు వెదకుచును
నీళ్ళతీగెలు నిగుడఁగ నోర ను-
చ్చిళ్ళు గమ్మఁగ నెట్లుండితివో

చ. 5: హిరణ్యకశిపుని నేపడఁచి భయం-
కరరూపముతోఁ గడుమెరసి
తిరువేంకటాగిరిదేవుఁడ నీవిఁక
యిరవుకొన్ననాఁడెట్లుందితివో

రేకు: 2011-03 గౌళ సం: 01-069 హనుమ

పల్లవి: నేలమిన్ను నొక్కటైన నీబంటు వొక్క-
వేలనే యక్షునిఁ దెగవేసెఁగా నీ బంటు

చ. 1: ఉంగరమెగరవేసి యుదధిలోఁ బడకుండ
నింగికిఁ జెయిచాఁచె నీబంటు
చంగున జలధిదాఁటి జంబుమాలి నిలమీఁద
కుంగఁదొక్కి పదములఁ గుమ్మెఁగా నీబంటు

చ. 2: వెట్టగా రావణు రొమ్మువిరుగఁ జేతనే గుద్దె
నిట్టతాడువంటివాఁడు నీబంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగఁ దెచ్చె బాపురే నీబంటు

చ. 3: అలర నన్నియుఁ జేసి అజునిపట్టానకు
నిలుచున్నాఁ డదివో నీబంటు
బలువేంకటేశ ఈ పవననందనుఁడు
కలిగి లోకములెల్లఁ గాచెఁగా నీబంటు

రేకు: 2011-04 దేవగాంధారి సం: 01-070 అంత్యప్రాస

పల్లవి: తలఁచినవిన్నియుఁ దనకొరకేఁ వెలిఁ
దెలియుట దనలోఁ దెలియుట కొరకే

చ. 1: ఉదయమందుట భవముడుగుట కొరకే
చదువుట మేలువిచారించు కొరకే
బ్రదుకుట పురుషార్థపరుఁడౌట కొరకే
యెదిరిఁ గనుట తన్నెఱుఁగుట కొరకే

చ. 2: తగులుట విడివడఁదలఁచుట కొరకే
నొగులుట కర్మమనుభవించు కొరకే
చిగురౌట కొమ్మయి చెలఁగుట కొరకే
బెగడుట దురితము పెడఁబాయు కొరకే

చ. 3: యీవలఁ జేయుట ఆవలి కొరకే
ఆవలనుండుట యీవలఁ కొరకే
యీవలనావల నెనయఁ దిరుగుటెల్ల
శ్రీవేంకటేశ్వరుఁ జేరుట కొరకే

రేకు: 2011-05 కన్నడగౌళ సం: 01-071 ఉపమానములు

పల్లవి: ఎంతసేసినా నెడయకే పోయ
ముంతలోనినీట మునిఁగిలేచుట

చ. 1: ఉట్టిపై చెరలాట మూరఁబొత్తులకూడు
పట్టుచాలనికొమ్ము బహునాయకము
వెట్టిమోపరిలాగు వెట్టివోయినపోక
నట్టింటివైరంబు నగుఁబాటుబ్రదుకు

చ. 2: రాకపోకలచేత రాఁగిన పెనుఁబుండు
వాకులేనివరము వలవనివలుపు
యేకాలము వేంకటేశునికృపలేక
ఆకడీకడ నడయాడెడినడపు

రేకు: 2012-01 బౌళి సం: 01-072 వైరాగ్య చింత

పల్లవి: పరదేశిపట్టణమున పదుగురునేగురుఁ గూడుక
పరగఁగ వరి చెడ నూదర బలిసినయట్లాయ

చ. 1: ఊరేలేడియతఁ డలసత నూరకయుండఁగ నడుముల-
వారలు నిక్కపుగర్తలవలె నుండినగతిని
ధీరత చెడి తను జీవుఁడు దెలియఁగనేరక యుండిన
ధారుణిలోపల దొంగలధర్మాసనమాయ

చ. 2: వొడలంతంతకుఁ జిక్కఁగ నుబ్బినరోగము సుఖమున-
కెడమియ్యక నానాఁటికి నేఁచిన చందమున
తడఁబడువిజ్ఞానము గతిదప్పఁగ బలుపగుపట్నము
కడుఁజెడఁగా, మాలవాడ ఘనమైనట్లాయ

చ. 3: పొసఁగఁగ నిది గని యధికుడు పుక్కట కాండ్ల నందరిఁ
బసమారిచి మొదలికర్తఁ బాలించినగతిని
పసగలతిరువేంకటగిరిపతి నాదేహపుఁబురి నీ-
వసమై వెన్నకు బండ్లు వచ్చినయట్లాయ

రేకు: 2012-02 వరాళి సం: 01-073 వైరాగ్య చింత

పల్లవి: పోరొ పోరొ యమ్మలాల బొమ్మలాటవారము
యీరసాన మమ్ము నిట్టే యేమిసేసేరు

చ. 1: ఊరులేనిపాలమేర వొడలు మోచుకొని నేము
తేరదేహ మెక్కుకొని తిరిగేము
వారువీరనుచు వట్టివావులు సేసుక లేని-
పేరు పెట్టుకొని లోలోఁ బిరువీకులయ్యేము

చ. 2: బుద్ధిలేనిబుద్ధితోడ పొందు సేసుకొని వట్టి-
యెద్దుబండికంటి సంది నీఁగేము
నిద్దురలో తెలివంటా నీడలోని యెండంటా
వుద్దువుద్దులై లేనివొద్దిక నున్నారము

చ. 3: మాటులేనిమాటు దెచ్చి మరఁగు వెట్టుక వట్టి-
మేటానమేట్లవలె మెరసేము
గాటమైనతిరువేంకటగిరినిలయుని-
నాటకమే నిజమని నమ్మిక నున్నారము

రేకు: 2012-03 రామక్రియ సం: 01-074 దశావతారములు

పల్లవి: ఎవ్వఁడో కాని యెరఁగరాదు కడు-
దవ్వులనే వుండు తలఁపులోనుండు

చ. 1: ఎడయవు తనరెక్క లెగసిపోలేఁడు
కడు దాఁగుఁగాని దొంగయుఁ గాడు
వడిఁ గిందుపడును సేవకుఁడునుఁ గాఁడు
వెడఁగుగోళ్ళు వెంచు విటుఁడునుఁ గాఁడు

చ. 2: మిగులాఁబొట్టివాఁడు మింటికినిఁ బొడవు
జగడాలు తపసివేషములును
మగువకై పోరాడు మరి విరక్తుఁడును
తగుఁగాపుఁబనులు నెంతయుఁ దెల్లఁదనము

చ. 3: తరుణుల వలపించు తగిలి పై కొనఁడు
తురగముఁ దోలు రౌతునుఁ గాఁడు
తిరువేంకటాద్రిపైఁ దిరుగు నెప్పుడును
పరమమూర్తియై పరగు నీఘనుడు

రేకు: 2012-04 శ్రీరాగం సం: 01-075 వేంకటగానం

పల్లవి: నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సంస్తుత్యుఁడీ తిరువేంకటాద్రివిభుఁడు

చ. 1: ఏ మూర్తి లోకంబులెల్ల నేలెడునాతఁడేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాతఁ-
డేమూర్తి నిజమోక్షమియ్యఁ జాలెడునాతఁడేమూర్తి లోకైకహితుఁడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియునుఁగాఁడు యేమూర్తి త్రైమూర్తు లేకమైన
యాతఁడేమూర్తి సర్వాత్ముఁడేమూర్తి పరమాత్ముఁడామూర్తి తిరువేంకటాద్రివిభుఁడు

చ. 2: యేదేవుదేహమున నిన్నియును జన్మించెనే దేవుదేహమున నిన్నియును నణఁగె మరి
యేదేవువిగ్రహం బీసకల మింతయును యేదేవునేత్రంబు లినచంద్రులు
యేదేవుఁడీజీవులిన్నింటిలో నుండు నేదేవుచైతన్య మిన్నిటికి నాధార-
మేదేవుఁ డవ్యక్తుఁ డేదేవుఁ డద్వంద్వుఁడాదేవుఁ డీవేంకటాద్రివిభుఁడు

చ. 3: యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు యేవేల్పుపాదకేశాంతం బనంతంబు
యేవేల్పు నిశ్వాస మీమహామారుతము యేవేల్పునిజదాసు లీపుణ్యులు
యేవేల్పు సర్వేశుఁ డేవేల్పు పరమేశుఁడేవేల్పు భువనైకహితమనోభావకుఁడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము ఆవేల్పు తిరువేంకటాద్రివిభుఁడు

రేకు: 2012-05 దేసాక్షి సం: 01-076 వైరాగ్య చింత

పల్లవి: ఎంతైన దొలఁగవై తేదైన నామతికి
వింతచవిసేతుగా విషయబుద్ధి

చ. 1: ఎనసి జన్మముల నే నెట్ల నుండిన బోక
వెనకఁ దిరుగుదువు గా విషయబుద్ధి
అనువైనయనుభవన లనుభవించఁగఁ జేసి
వెనక మఱపింతుగా విషయబుద్ధి

చ. 2: కెఱలి కాంతలు నేనుఁ గినిసిననుఁ బొలయలుక
విఱిచి కలపుదువుగా విషయబుద్ధి
తఱితోడ వావివ ర్తనదలంచిననన్ను
వెఱపు దెలుపుదువుగా విషయబుద్ధి

చ. 3: యెడలేనియాపదల నెట్లువొరలిన నన్ను
విడిచిపోవైతిగా విషయబుద్ధి
సడిఁబెట్టి వేంకటస్వామికృపచే నిన్ను
విడిపించవలసెఁగా విషయబుద్ధి

రేకు: 2013-01 గుండక్రియ సం: 01-077 వైరాగ్య చింత

పల్లవి: ఏఁటి విజ్ఞాన మేఁటి చదువు
గూఁటఁబడి వెడలుగతిగురుతు గనలేఁడు

చ. 1: ఏడుమడుకలచర్మ మింతయునుఁ దూంట్లై
గాడఁబెట్టుచుఁజీము గారఁగాను
పాడైన యిందులో బ్రదుకుగోరీఁ బ్రాణి
వీడఁదన్ను కచనెడి వెరవు గనలేఁడు

చ. 2: కడుపునిండిన మహాకష్టంబు నలుగడల
వెడలుచును బెనుమురుకి వేయఁగాను
యిడుమఁ బొందుచు సుఖంబిందుకే వెదకీని
వొడలు మోవఁగ జీవుఁడోపననలేఁడు

చ. 3: పుదకమయమగుకన్ను లురికి యేమైనఁగని
మదవికారము మతికి మరుపఁగాను
యిది యెరిఁగి తిరువేంకటేశుఁగని జీవుఁడా-
సదమలానందంబు చవిగానలేఁడు

రేకు: 2013-02 ఆహిరి సం: 01-078 వైరాగ్య చింత

పల్లవి: అతిదుష్టుఁడ నే నలసుఁడను
యితర వివేకం బిఁకనేది

చ. 1: ఎక్కడ నెన్నిట యేని సేసితినొ
నిక్కపుఁదప్పులు నేరములు
గక్కన నిన్నిట కలిగిననీవే
దిక్కుఁగాక మరి దిక్కేది

చ. 2: ఘోరపుఁబాపము కోట్లసంఖ్యలు
చేరువ నివె నాచేసినవి
నీరసునకు నిటు నీకృప నాకిఁక
కూరిమి నా యెడ గుణమేది

చ. 3: యేఁటిఁగి చేసినది యెఱఁగక చేసిన
కొఱతలు నాయెడఁ గోటు లివే
వెఱపు దీర్చి శ్రీవేంకటేశ కావు
మఱవక నాగతి మరి యేది

రేకు: 2013-03 కన్నడగౌళ సం: 01-079 వైరాగ్య చింత

పల్లవి: దైవకృతంబట చేఁతట తనకర్మాధీనంబట
కావలసినసౌఖ్యంబులు గలుగ కమానీనా

చ. 1: ఎక్కడిదుఃఖపరంపర లెక్కడిసంసారంబులు
యెక్కడిజన్మము ప్రాణులకేలా కలిగినది
యెక్కడిమోహవిడంబన యెక్కడియాశాబద్ధము
యెక్కడికెక్కడ నిజమై యివి దానుండీనా

చ. 2: యీకాంతలు నీద్రవ్యము లీకన్నులవెడయాసలు
యీకోరికె లీతలఁపులు యిట్టే వుండీనా
యీకాయం బస్థిరమన కీదుర్దశలకు లోనై
యీకల్మషములఁ బొరలఁగ నివి గడతేరీనా

చ. 3: దేవశిఖామణి తిరుమల దేవుని కృపగల చిత్తము
పావనమై దురితంబులఁ బాయక మానీనా
ఆవిభుకరుణారసమున నతఁడే తను మన్నించిన
ఆవేడుక లీవేడుక లాసలు సేసీనా

రేకు: 2013-04 శంకరాభరణం సం: 01-080 దశావతారములు

పల్లవి: ఆదిమపూరుషుఁ డచ్యుతుఁడచలుఁడనంతుఁడమలుఁడు
ఆదేవుఁ డీతఁడేపోహరి వేంకటవిభుఁడు

చ. 1: ఏకార్ణవమై ఉదకములేచిన బ్రహ్మాండములోఁ
బైకొని యుండఁగ నొక వటపత్రములోపలను
చేకొని పవళింపుచు నొక శిశువై వడిఁదేలాడిన-
శ్రీకాంతుఁ డీతఁడేపో శ్రీవేంకటవిభుఁడు

చ. 2: అరుదుగ బలిమద మడఁపఁగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొక చరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁ డీతఁడేపో పతి శ్రీవేంకటవిభుఁడు

చ. 3: క్షీరపయోనిధి లోపల శేషుఁడు పర్యంకముగా
ధారుణియును సిరియునుఁ బాదము లొత్తఁగను
చేరువఁదను బ్రహ్మాదులు సేవింపఁగఁ జెలుఁవొందెడి
నారాయణుఁ డితఁడే వున్నత వేంకటవిభుఁడు

రేకు: 2013-05 దేసాళం సం: 01-081 వైరాగ్య చింత

పల్లవి: అప్పులవారే అందరును
కప్పఁగఁ దిప్పఁగఁ గర్తలు వేరీ

చ. 1: ఎక్కడ చూచిన నీ ప్రపంచమునఁ
జిక్కులు సిలుగులుఁ జింతలునే
దిక్కెవ్వరు యీ తీదీపులలో
దిక్కుముక్కులకు దేవుఁడేఁకాక

చ. 2: యేది దలంచిన నేకాలంబును
సూదులమూఁటల సుఖములివి
కాదన నౌననఁ గడ గనిపించఁగ
పోదికాఁడు తలఁపునఁ గలఁడొకఁడే

చ. 3: యెన్నఁడు వీడీ నెప్పుడు వాసీ
బన్నిన తమతమ బంధములు
వున్నతి సేయఁగ వొప్పులు నెరపఁగ
వెన్నుఁడు వేంకటవిభుఁడే కలఁడు

రేకు: 2013-06 శంకరాభరణం సం: 01-082 వైరాగ్య చింత

పల్లవి: పాపములే సంబళమెపుడూ యీ-

యాపదఁబడి నే నలసేనా

చ. 1: ఎన్నిపురాణము లెటువలె విన్నా

మన్న మనువు దిమ్మరితనమే

నన్ను నేనే కానఁగలేనట నా

విన్న వినుకులకు వెఱచేనా

చ. 2: యెందరు వెద్దల నెట్లఁ గొలిచినా

నిందల నామతి నిలిచీనా

కందువెఱఁగి చీకటికిఁ దొలఁగనట

అందపుఁబరమిఁక నందేనా

చ. 3: తిరువేంకటగిరిదేవుఁడే పరమని

దరి గని తెలివిఁక దాఁగీనా

తిరముగ నినుఁ జింతించినచింతే

నిరతము ముక్తికి నిధిగాదా

రేకు: 2014-01 ముఖారి సం: 01-083 వైరాగ్య చింత

పల్లవి: ఎందుఁ బొడమితిమో యెఱఁగము మా-
కందువ శ్రీహరికరుణేకాక

చ. 1: ఏఁటిజన్మమో యెఱఁగము పర-
మేఁటిదో నే మెఱఁగము
గాఁటపుకమలజుఁ గాఁచినయీ
నాఁటకుఁడే మానమ్మినవిభుఁడు

చ. 2: యెవ్వారు వేల్పులో యెఱఁగము సుర
లెవ్వరో నే మెఱఁగము
రవ్వగు శ్రీసతిరమణుఁడు మా-
కవ్వనజోదరుఁ డంతరియామి

చ. 3: యింకానేఁటిదో యెఱఁగము యీ -
యంకెలబాముల నలయము
జంకెల దనుజులఁ జదిపినతిరు-
వేంకటేశుఁడు మావిడువనివిభుఁడు

రేకు: 2014-02 రామక్రియ సం: 01-084 అధ్యాత్మ

పల్లవి: వెలయునిన్నియును వృథా వృథా
తలఁపున శ్రీహరిఁ దడసినను

చ. 1: ఎడయలేనిపుణ్యము లెన్నియైనా
విడువక సేయుట వృథా వృథా
బడిబడి నే శ్రీపతి నాత్మలోఁ
దడవక యితరము దడవినను

చ. 2: యెరవులతపముల నెంతైనా
విరవిరవీఁగుట వృథా వృథా
హరినచ్యుతుఁ బరమాత్మునిని
మరచి తలఁచక మఱచినను

చ. 3: దైవము నెఱఁగక తమకమున
వేవేలైన వృథా వృథా
శ్రీవేంకటగిరిచెలువునిని
సేవించక మతిఁ జెదరినను

రేకు: 2014-03 నాట సం: 01-085 నృసింహ

పల్లవి: ఇలయును నభమును నేకరూపమై
జలజల గోళ్ళు జళిపించితివి

చ. 1: ఎడసిన నలముక హిరణ్యకశిపునిఁ
దొడికపట్టి చేతుల బిగిసి
కెడపి తొడలపై గిరిగొన నదుముక
కడుపు చించి కహకహ నవ్వితివి

చ. 2: రొప్పుల నూర్పుల రొచ్చుల కసరులు
గుప్పుచు లాలలు గురియుచును
కప్పినబెబ్బులిక సరుహుంకృతుల
దెప్పరపసురల ధృతి యణఁచితివి

చ. 3: పెళ పెళనార్చుచుఁ బెడబొబ్బలిడుచు
థళథళ మెఋవఁగ దంతములు
ఫళఫళ వీరవిభవరసరుధిరము
గుళగుళ దిక్కుల గురియించితివి

చ. 4: చాతినుప్రేవులజన్నిదములతో
వాతెరసింహపువదనముతో
చేతులు వేయిటుఁ జెలగి దితిసుతుని
పోతర మణఁపుచు భువి మెరసితివి

చ. 5: ఆహోబలమున నతిరౌద్రముతో
మహామహిమల మలయుచును
తహతహ మెదుపు చుఁ దగువేంకటపతి
యిహముఁ బరముఁ మా కిపు డొసఁగితివి

రేకు: 2014-04 సామంతం సం: 01-086 వైరాగ్య చింత

పల్లవి: ఇతరము లిన్నియు నేమిటికి
మతిచంచలమే మానుట పరము

చ. 1: ఎక్కడిసురపుర మెక్కడివైభవ-
మెక్కడి విన్నియు నేమిటికి
యిక్కడనే పరహితమునుఁ బుణ్యము
గక్కునఁ జేయఁగఁ గల దిహపరము

చ. 2: యెవ్వరు చుట్టము లెవ్వరు బంధువు-
లెవ్వరిందరును నేమిటికి
రవ్వగులక్ష్మీ రమణునిఁ దలఁపుచు
యివ్వలఁ దాఁ సుఖియించుట పరము

చ. 3: యెందరు దైవము లెందరు వేల్పులు
యెంద రిందురును నేమిటికి
కందు వెఱిఁగి వేంకటగిరిరమణుని
చిందులేక కొలిచిన దిహపరము

రేకు: 2014-05 భూపాళం సం: 01-087 దశావతారములు

పల్లవి: పారితెంచి యెత్తి వేసి పారవెళ్లితిని (వి?)
నీరసపుటెద్దవైననీకు నే ముద్దా

చ. 1: ఎద్దవై నన్నేల తొక్కి యేమిగట్టుకొంటివి
వొద్దనైన వచ్చి వూరకుండవైతివి
వొద్దిక భూమెత్తిన యాయెద్దుకు నే ముద్దుగాక
నిద్దురచిత్తముతోడినీకు నే ముద్దా

చ. 2: కాఁపురపుఁ బాపపునాకర్మమును ధరించి
వీఁపువగులఁగ దాకి విఱ్ఱవీఁగితి
ఆఁపఁగ నెద్దేమెఱుంగు నడుకులచవి మూట-
మోపరివి నీకు నాముదము ముద్దా

చ. 3: మచ్చిరించి అల్లనాఁడు మాలవాఁడు కాలందన్ని
తెచ్చినయప్పటిధర్మ దేవతవు
యెచ్చరించి తిరువేంకటేశుదాసుఁడని నన్ను
మెచ్చి తాఁకితివి నామేను నీకు ముద్దా

రేకు: 2014-06 శ్రీరాగం సం: 01-088 వైరాగ్య చింత

పల్లవి: ఎందాఁక నేచిత్త మేతలఁపో
ముందుముందు వేసారితి మలిగి వేసరితి

చ. 1: ఏమిసేతు నేడచొత్తు నేమని బోధింతును
నామాఁట విన దిదే నావిహరము
యేమరినాఁ దలఁపించీ నేమైనా గడించీ
సాముసేసి వేసారితి జడిసి వేసారితితి

చ. 2: యేడ చుట్టా లేడ బంధు లేడ పొందు లెవ్వరూ
తోడైనవారుఁ గారు దొంగలుఁ గారు
కూడుచీరగానిచోటై కొరగానిపాటై
వాడివాడి వేసారితి వదిలి వేసారతి

చ. 3: యెందునున్నాఁ డేమిసేసీ నెక్కడ భోగించీని
విందులకువిందయినవేంకటేశుఁడు
యిందరిహృదయములో నిరవై యున్నాఁ డతఁడు
చెంది నన్నుఁ గాచుఁగాక చెనకి వేసారితి

రేకు: 2015-01 ఆహిరి సం: 01-089 వైరాగ్య చింత

పల్లవి: ఊరికిఁ బోయెడి వోతఁడ కడు-
చేరువతెరు వేగి చెలఁగుమీ

చ. 1: ఎడమతెరువువంక కేఁగిన దొంగలు
తొడిఁబడ గోకలు దోఁచేరు
కుడితెరువున కేఁగి కొట్టువడక మంచి-
నడిమితెరువుననే నడవుమీ

చ. 2: అడ్డపుఁ దెరువుల నటునిటుఁ జుట్టాలు
వెడ్డువెట్టుచు నిన్ను వేఁచేరు
గొడ్డేరేచిన్నదిడ్డితెరువు వోక
దొడ్డతెరువువంక తొలఁగుమీ

చ. 3: కొండతెరువు కేఁగి కొంచపుసుఖముల
బండై తిరుగుచు బడలేవు
అండనుండెడిపరమాత్ముని తిరుమల-
కొండతెరువు తేఁకువ నేఁగుమీ

రేకు: 2015-02 ఆహిరి సం: 01-090 వైరాగ్య చింత

పల్లవి: అక్కడ నాపాట్లువడి యిక్కడ నీపాటు పడి
కుక్కనోరికళాసమై కొల్లఁబోయ బతుకు

చ. 1: ఎండచేత నీడచేత నెల్లవాఁడు నిట్లానే
బండుబండై యెందుఁ గడపల గానక
వుండగిలి నరకాల నుడుకబోయెద మింక
వండఁ దరిగినకూరవలెనాయ బతుకు

చ. 2: పంచమహపాతకాలబారిఁ బడి భవములఁ
దెంచి తెంచి ముడివేయ దీదీపులై
పొంచినయాసలవెంటఁ బొరలఁబోయెద మింక
దంచనున్న రోలిపిండితలఁపాయ బతుకు

చ. 3: యీదచేత వానచేత నెల్లవాఁడు బాయని-
బాదచేత మేలెల్ల బట్టబయలై
గాదిలివేంకటపతిఁ గానఁగఁబోయెద మింక
బీదగరచినబూరెప్రియమాయ బ్రదుకు

రేకు: 2015-03 సామంతం సం: 01-091 వైష్ణవ భక్తి

పల్లవి: నాఁటికి నాఁడే నా చదువు
మాటలాడుచును మఱచేటి చదువు

చ. 1: ఎనయ నీతని నెఱుఁగుటకే పో
వెనకవారు చదివినచదువు
మనసున నీతని మఱచుటకే పో
పనివడి యిప్పటిప్రౌఢలచదువు

చ. 2: తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుతఁ గృతయుగాదులచదువు
కలిగినయీతనిఁ గాదననే పో
కలియుగంబులోఁ గలిగినచదువు

చ. 3: పరమని వేంకటపతిఁ గనుటకే పో
దొరలగు బ్రహ్మాదులచదువు
సిరుల నితని మఱచెడికొరకే పో
విరసపుజీవులవిద్యలచదువు

రేకు: 2015-04 నాట సం: 01-092 ఉత్సవ కీర్తనలు

పల్లవి: ఇటు గరుడని నీవెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె

చ. 1: ఎగసిన గరుడని యేపున 'ధా' యని
జిగిదొలఁక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమ సంఘములు
గగనము జగములు గడగడ వడఁకె

చ. 2: బిరుసుగ గరుడని పేరెము దోలుచు
బెరసి నీవు కోపించినను
సరుస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె

చ. 3: పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝుల్లనె రాక్షస సమితి నీ మహిమ
వెల్లి మునుఁగుదురు వేంకటరమణా

రేకు: 2015-05 నాదరామక్రియ సం: 01-093 భక్తి

పల్లవి: ఈ సురలీ మునులీ చరాచరములు
యీ సకలమంతయు నిది యెవ్వరు

చ. 1: ఎన్నిక నామము లిటు నీవైయుండఁగ
యిన్నినామముల వారిది యెవ్వరు
వున్నచోటనే నీవు వుండుచుండఁగ మరి
యిన్నిటాఁ దిరుగు వారిది యెవ్వరు

చ. 2: వొక్కరూపై నీవు వుండుచుండఁగ మరి
తక్కిన యీరూపములు తా మెవ్వరు
యిక్కడనక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ
మక్కువ నుండువారు మరి యెవ్వరు

చ. 3: శ్రీవేంకటాద్రిపై చెలఁగి నీవుండఁగా
దైవంబులనువారు తా మెవ్వరు
కావలిసినచోట కలిగి నీ వుండఁగ
యీవిశ్వపరిపూర్ణు లిది యెవ్వరు

రేకు: 2015-06 లలిత సం: 01-094 అధ్యాత్మ

పల్లవి: తాప లేక మేడ లెక్కఁదలఁచేము
యేపులేని చిత్తముతో యీహీహీ నేము

చ. 1: ఎఱుకమాలినబుద్ధి యెవ్వరైనాఁ బతులంటా
తెఱఁగెఱఁగక వీధిఁ దిరిగేము
పఱచైన జవరాలు పరులెల్లా మగలంటా
వొఱపు నిలిపిన ట్లోహోహో నేము

చ. 2: యిందరును హితులంటా యెందైనా సుఖమంటా
పొందలేనిబాధఁ బొరలేము
మందమతిఁవాడు యెండమావులు చెరువులంటా
అందునిందుఁ దిరిగిన ట్లాహాహా నేము

చ. 3: మేటివేంకటేశుఁ బాసి మీఁదమీఁద జపులంటా
నాటకపు తెరువుల నడిచేము
గూటిలో దవ్వులవాఁడు కొండలెల్ల నునుపంటా
యేటవెట్టి యేఁగిన ట్లీహీహీ నేము

రేకు: 2016-01 శ్రీరాగం సం: 01-095 వైరాగ్య చింత

పల్లవి: ఏది జూచినఁ దమకు యిన్నియును నిటువలెనె
వేదువిడిచిన కూడు వెదకినను లేదు

చ. 1: ఏకాంతసౌఖ్యంబు లెక్కడివి ప్రాణులకు
పైకొన్నదుఃఖముల పాలుపడెఁ గాక
యేకమగు పుణ్యంబు లేడాఁగల విందరికి
కైకొన్నదురితములు కలపాటిగాక

చ. 2: హితవైనమమకార మెందుఁగల దిందరికి
ప్రతిలేని విరహతాపము కొలఁదిగాక
మతిలోని వేడుకలు మరియేమి మనుజులకు
జితమైన దైవమిచ్చిన పాటిగాక

చ. 3: యిరవైవ దైవకృపయేల దొరుకునుఁ దమకు
పరిమైనకర్మంబు పరిపాటిగాక
యెరవైనపెనుబంధ మేల వీడెడు నాత్మఁ
దిరువేంకటేశుకృప తిరమైనఁ గాఁక

రేకు: 2016-02 బౌళి సం: 01-096 వైరాగ్య చింత

పల్లవి: చూడరెవ్వరు దీనిసోద్యంబు పరికించి
చూడఁజూడఁగఁ గాని సుఖమెఱఁగరాదు

చ. 1: ఎడతెగని మమత వేయఁగరాని పెనుమోపు
కడలేని యాస చీఁకటి దవ్వుకొనుట
నిడివైన కనుచూపు నీడనుండిన యెండ
వడిచెడని తమకంబు వట్టితాపంబు

చ. 2: బుద్ధిమానిన చింత పోనియూరికిఁ దెరువు
పొద్దువోవని వలపు పొట్టపొంకంబు
యెద్దుఁ బట్టిన సివం బెఱుకమాలిన ప్రియము
లొద్దిక విహారంబు లుబ్బుఁగవణంబు

చ. 3: తీపులోపలి తీపు తిరువేంకటేశ్వరుని-
చూపు దనుఁ బొడగనని చూపు లోచూపు ,
ఆపదలువాయు నెయ్యపుఁ దలఁపులీతలఁపు
రూపైన రుచిలోని రుచి వివేకంబు

రేకు: 2016-03 నాట సం: 01-097 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరెవ్వరివాఁడో యీ జీవుఁడు చూడ-
నెవ్వరికి నేమౌనో యీ జీవుఁడు

చ. 1: ఎందరికిఁ గొడుకుగాఁ డీజీవుఁడు వెనక
కెందరికిఁ దోఁబుట్టఁ డీజీవుఁడు
యెందరిని భ్రమయించఁ డీజీవుఁడు దుఃఖ-
మెందరికిఁ గావింపఁ డీజీవుఁడు

చ. 2: యెక్కడెక్కడఁ దిరుగఁ డీజీవుఁడు వెనక-
కెక్కడో తనజన్మ మీ జీవుఁడు
యెక్కడి చుట్టము దనకు నీ జీవుఁడు యొప్పు-
డెక్కడికి నేఁగునో యీ జీవుఁడు

చ. 3: ఎన్నఁడును జేటులేనీ జీవుఁడు వెనక-
కెన్నిదనువులు మోవఁడీ జీవుఁడు
యెన్నఁగల తిరువేంకటేశుమాయలఁ దగిలి
యెన్నిపదవులఁబొందఁ డీజీవుఁడు

రేకు: 2016-04 సామంతం సం: 01-098 వైరాగ్య చింత

పల్లవి: ఎంత చేసిన తనకేది తుద
చింత శ్రీహరిపైఁ జిక్కుటే చాలు

చ. 1: ఎడపక పుణ్యాలెన్ని చేసినాఁ
గడమే కాకిఁకఁ గడ యేది
తడఁబడ హరియే దైవమనుచును మది
విడువక వుండిన వెరవే చాలు

చ. 2: యెన్నితపము లివి యెట్లఁ జేసినా
అన్నువ కధికము కలవేది
వన్నెలఁ గలఁగక వనజాక్షునిపై
వున్న చిత్తమది వొక్కటే చాలు

చ. 3: యిందరివాదము లెట్ల గెలిచినా
కందే గాకిఁక గరిమేది
ఇందరినేలిన యీ వేంకటపతి
పొందగు మహిమల పొడవే చాలు

రేకు: 2016-05 నారణి సం: 01-099 వైరాగ్య చింత

పల్లవి: ఏణ నయనల చూపులెంత సొబగైయుండు
ప్రాణ సంకటములగు పనులు నట్లుండు

చ. 1: ఎడలేని పరితాప మేరీతిఁ దానుండు
అడియాస కోరికలు నటువలెనె యుండు
కడలేని దుఃఖసంగతి యెట్లుఁ దానుండు
అడరు సంసారంబు నట్లనే వుండు

చ. 2: చింతా పరంపరలఁ జిత్తమిది యెట్లుండు
వంతఁ దొలఁగన మోహవశము నట్లుండు
మంతనపుఁ బనులపయి మనసు మరియెట్లుండు
కంతుశరమార్గముల గతి యట్లనుండు

చ. 3: దేవుఁడొక్కఁడె యనెడి తెలివి దనకెట్లుండు
శ్రీవేంకటేశు కృపచేత లట్లుండు
భావగోచరమైన పరిణతది యెట్లుండు
కైవల్యసౌఖ్య సంగతులు నట్లుండు

రేకు: 2016-06 గీతం - నాట సం: 01-100 వేంకటగానం

పల్లవి: ఏదైవము శ్రీపాదన్నఖమునఁ బుట్టినగంగ
త్రిలోకపావనము చేయను త్రిపథగామిని ఆయను
యేదైవమునాభి నలినంబున జనియించిన అజుండు
అఖిలాండంబులు సృజియింప నధిపతి ఆయను

చ. 1: యేదైవమువురస్థలంబు దనకును మందిరమైన యిందిర
మాతయయ్యే యీజగంబుల కెల్లను
యేదైవము అవలోకన మింద్రాదిది విజగణంబుల
కెల్లప్పుడును సుఖంబు లాపాదించును

చ. 2: యేదైవము దేహవస్తువని అనిమిషులందరుఁ గూడి
శ్రీనారాయణ దేవుండని నమ్మి యుండుదురు
ఆదేవుఁడే సిరుల కనంతవరదుఁడు తిరువేంకట-
గిరినాథుఁడుభయ విభూతినాథుఁడే నానాథుఁడు

రేకు: 2017-01 ఆహిరి సం: 01-101 భక్తి

పల్లవి: ఏఁటికి దలఁకెద రిందరును
గాఁటపు సిరులివి కానరో ప్రజలు

చ. 1: ఎండలఁ బొరలక యేచిన చలిలో
నుండక చరిలోనుడుకక
అండనున్న హరి నాత్మఁదలఁచిన
పండిన పసిఁడే బ్రతుకరో ప్రజలు

చ. 2: అడవుల నలియక ఆకునలముఁదిని
కడుపులు గాలఁగఁ గరఁగక
బడి బడి లక్ష్మిపతికి దాసులై
పొడవగు పదవులఁ బొందరో ప్రజలు

చ. 3: పొక్కేటికాళ్ళ పుండ్లు రేఁగఁగ
దిక్కులనంతటఁ దిరుగక
గక్కన తిరువేంకటగిరిపతిఁ గని
వొక్క మనసుతో నుండరొ ప్రజలు

రేకు: 2017-02 బౌళి సం: 01-102 వైరాగ్య చింత

పల్లవి: ఏది తుద దీనికేది మొదలు
పాదుకొను హరి మాయఁ బరగు జీవునికి

చ. 1: ఎన్ని బాధలు దనకు నెన్ని లంపటములు
యెన్ని వేదనలు మరియెన్ని దుఃఖములు
యెన్ని పరితాపంబు లెన్నిదలపోఁతలు
యెన్ని చూచిన మరియు నెన్నైనఁ గలవు

చ. 2: యెన్ని కొలువులు దనకు నెన్ని యనుచరణలు
యెన్ని యాసలు మరియు నెన్ని మోహములు
యెన్ని గర్వములు దనకెన్ని దైన్యంబులివి
ఇన్నియునుఁ దలఁప మరి యెన్నైనఁ గలవు

చ. 3: యెన్నిటికిఁ జింతించు నెన్నిటికి హర్షించు
నెన్నిటికి నాసించు నెన్నిటికిఁ దిరుగు
యిన్నియును దిరు వేంకటేశులీలలు గాఁగ_
నెన్ని చూచినను దా నెవ్వఁడునుగాఁడు

రేకు: 2017-03 సామంతం సం: 01-103 అధ్యాత్మ

పల్లవి: చక్కఁదనములువారి సతులాల
యిక్కువ తెక్కువల మీ రేమిసేసే రిఁకను

చ. 1: ఒప్పుగా నరకము మాకు బళిచ్చి మనమెల్ల
కప్పము గొంటిరిగా యంగనలార
అప్పుడే గోవిందునికి ఆహి వెట్టితిఁ జిత్తము
యిప్పుడు యెమ్మెల మీ రేమి సేసేరిఁకను

చ. 2: పంచమహాపాతకాలబారిఁ దోసి మాసిగ్గులు
లంచము గొంటిరిగా నెలఁతలార
వంచనతోడుత హరివారమైతి మిఁక మీ
యుంచుకగుట్టుల మీరెందు చొచ్చే రిఁక

చ. 3: దొంగిలి మాగుట్టులెల్లా దోప వేసి మరుబారి
భంగ పెట్టితిరిగా వోభామలార
చెంగలించి వేంకటేశుసేవకుఁ జొచ్చితిమి
యెంగిలి మోవులును మీ రేడఁబడే రిఁకను

రేకు: 2017-04 బౌళి సం: 01-104 వైరాగ్య చింత

పల్లవి: ఎట్టుచేసినఁ జేసె నేమి సేయఁగవచ్చు
చుట్టపువిరోధంబు సునాస్తుచెలిమి

చ. 1: ఒడలిలోపలిరోగ మొనరఁ బరితాపంబు
కడుపులోపలిపుండు కడలేనియాస
తడిపాఁత మెడగోఁత తలఁపు విషయాసక్తి
గుడిమీఁదితరువు ఆలకులము ప్రాణలకు

చ. 2: నీడలోపల యెండ నెలకొన్న బంధంబు
గోడపై సున్నంబు కొదలేని యెఱుక
పాడూరిలో బ్రదుకు పాపకర్మపుబుద్ధి
తాడుపై తపసు తమధనము ప్రాణులకు

చ. 3: మంటఁజేసిన బొమ్మమనికి సంసారంబు
రెంటికినిగాని వీరిడికొలువు బ్రదుకు
యింటివేలుపు వేంకటేశుఁ గొలువక పరుల-
వెంటఁ దిరుగుట వోడ విడిచి వదరిడుట

రేకు: 2017-05 వరాళి సం: 01-105 దశావతారములు

పల్లవి: తలఁపు కామాతురత్వముమీఁదనలవడిన-
నిల నెట్టివారైన నేలాగు గారు

చ. 1: ఓలినిరువురుసతుల నాలింగనముసేయ
లోలుఁడటుగాన నాలుగుచేతులాయ
వేలసంఖ్యలు సతుల వేడుకల రమియింపఁ
బాలుపడెఁగాన రూపములు పెక్కాయ

చ. 2: పొలయలుకకూటముల భోగి దా నటుగాన
మలసి యొక్కొకవేళ మారుమొగమాయ
లలితలావణ్యలీలావిగ్రహముగాని
కొలఁది వెట్టఁగరానిగోళ్ళు నిడుపాయ

చ. 3: చిరభోగసౌఖ్యములఁ జెంద ననుభవిగాన
తిరువేంకటాచలాధీశ్వరుండాయ
పరగ సంసారసంపదకు బద్ధుఁడు గాన
అరుదుగా సకలాంతరాత్మకుండాయ

రేకు: 2017-06 లలిత సం: 01-106 వైరాగ్య చింత

పల్లవి: ఎక్కడి దురవస్థ లేఁటిదేహము లోనఁ
జిక్కి జీవుఁడు మోక్షసిరిఁ జెందలేఁడు

చ. 1: ఒడలు మంసపూర మొక పూఁటయిన మీఁదు
గడుగకున్నఁ గొరగాదు
కడలేనిమలమూత్రగర్హిత మిది, లోను
గడుగరాదు యెంతగడిగినఁ బోదు

చ. 2: అలర చిత్తము చూడ నతిచంచలము దీనఁ
గలసిన పెనుగాలి గనము
మెలుపులేనిచిచ్చు మీఁదమిక్కిలిఁ గొంత
నిలుపు లేదు పట్టి నిలుపఁగరాదు

చ. 3: తిరువేంకటాచలాధిపుఁడు నిత్యానంద-
కరుఁడు జీవునకు రక్షకుఁడు
కరుణించి యొకవేళఁ గాచినఁగాని మేను-
చొరకమానెడుబుద్ధి చోఁక దెవ్వరికి

రేకు: 2018-01 సాళంగం సం: 01-107 వైరాగ్య చింత

పల్లవి: పుట్టుమాలిన బరుబోఁకివి నన్నుఁ
దిట్టే వదేమోసి దిమ్మరిమాయ

చ. 1: ఒరపులాడక పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించే వేమోచి విష్ణుభక్తినంటా -
నెరఁగనటే నీయేతు లిన్నియును

చ. 2: వుదుటు చెల్లదు పోపో వోసి మాయ నా-
యెదుర మాఁటలు నీకు నిఁకనేలే,
వదరేపు హరిభక్తి వనిత, తెలియరు నే-
నిదురవుచ్చినవారు నీవు నా కెదురా

చ. 3: వొల్లవటే జీవ మోసిమాయ నీ
కల్లలిన్నియును లోక మెఱఁగును,
నల్లనివిభునిమన్ననభక్తినంటాఁ
జెల్లఁబో పాపపుచేఁదు మేయకువే

చ. 4: పూరకుండవుగా వోసిమాయ నిన్నుఁ
బేరఁ బిలువము గుంపెనలాడేవు,
నారాయణభక్తినాతి నన్నును నిన్నుఁ
గోరి యుందరు నెఱఁగుదు రేల పోవె

చ. 5: వోవపు ననుఁజూచి వోసిమాయ నా-
తోవ వచ్చినను నొత్తువు నీవు,
శ్రీ వేంకటగిరిదేవునిభక్తి నా -
హవళికే నిన్ను నలమి రిందరును

రేకు: 2018-02 గుజ్జరి సం: 01-108 వేంకటగానం

పల్లవి: నాపాలి ఘన నిధామవు నీవే నన్ను
నీ పాల నిడుకొంటి నీవే నీవే

చ. 1: ఒలిసి నన్నేలె దేవుఁడవు నీవే, యెందుఁ
దొలగని నిజబంధుఁడవు నీవే
పలుసుఖమిచ్చేసంపదవునీవే, యిట్టే
వెలయ నిన్నియును నీవే నీవే

చ. 2: పొదిగి పాయని యాప్తుఁడవు నీవే, నాకు
నదనఁ దోడగుదేహమవు నీవే
మదమువాపెడి నామతియు నీవే, నాకు
వెదక నన్నియును నీవే నీవే

చ. 3: యింకా లోకములకు నెప్పుడు నీవే, యీ
పంకజభవాదిదేవపతివి నీవే
అంకలి వాపఁగ సంతకు నీవే తిరు-
వేంకటేశ్వరుఁడవు నీవే నీవే

రేకు: 2018-03 వరాళి సం: 01-109 దశావతారములు

పల్లవి: పుడమినిందరి బుట్టి భూతము కడుఁ-
బొడవైన నల్లని భూతము

చ. 1: కినిసి వోడమింగెడి భూతము
పునుకవీఁపుపెద్ద భూతము
కనలి కలియు చీఁకటి భూతము
పొనుగుసోమపుమోము భూతము

చ. 2: చేటకాళ్ళా మించిన భూతము
పోటుదారల పెద్ద భూతము
గాఁటపుజడలబింకపు భూతము
జూటరి నల్లముసుఁగు భూతము

చ. 3: కెలసి బిత్తలేతిరిగేటి భూతము
పొలుపుదాంట్లపెద్ద భూతము
బలుపు వేంకటగిరిపయి భూతము
పులుగుమీఁది మహా భూతము

రేకు: 2018-04 సామంతం సం: 01-110 వేంకటగానం

పల్లవి: చాలదా మా జన్మము నీ-
పాలింటివారమై బ్రతుకఁగఁ గలిగె

చ. 1: కమలాసనాదులు గానని నీపై
మమకారము సేయ మార్గము గలిగె
అమరేంద్రాదుల కందరాని నీ-
కొమరైన నామము కొనియాడఁ గలిగె

చ. 2: సనకాదులును గానఁజాలని నిన్నుఁ
తనివోవ మతిలోనఁ దలపోయఁ గలిగె
ఘనమునీంద్రులకు నగమ్యమైవున్న-
నిను సంతతమును వర్ణింపఁగలిగె

చ. 3: పరమమై భవ్యమై పరిగిననీ-
యిరవిట్టిదని మాకు నెఱుఁగంగఁ గలిగె
తిరువేంకటాచలాధిప నిన్ను యీ-
ధరమీఁదఁ బలుమారు దరిసింపఁ గలిగె

రేకు: 2018-05 ఆహిరి సం: 01-111 కృష్ణ

పల్లవి: దిక్కిందరికినైన దేవుఁడు కడుఁ
దెక్కలికాఁడైన దేవుఁడు

చ. 1: కొత్తపెండ్లికూఁతుఁ గోరి చూడఁబోయి
యెత్తి తేరిమీఁద నిడుకొని
నెత్తికన్ను మానినవాని పెండ్లికి
దెత్తిగొన్న యట్టి దేవుఁడు

చ. 2: గొప్పయునపెద్దకొండమీఁద నుండి
దెప్పరమ్ముగా దిగఁబడి
కప్పి రెండుదునుకలు గూడినవాని
తిప్పుఁదీరులాడే దేవుఁడు

చ. 3: బెరసి మేనమామబిడ్డకునై పోయి
నిరతఁపుబీరాలు నెరపుచు
యిరవైనమాయపుటెద్దులఁ బొరిగొన్న-
తిరువేంకటగిరి దేవుఁడు

రేకు: 2018-06 శ్రీరాగం సం: 01-112 వైరాగ్య చింత

పల్లవి: ఏమి గలదిందు నెంత గాలంబైన
పామరపు భోగ మాపదవంటి దరయ

చ. 1: కొండవంటిది యాస, గోడ వంటిది తగులు
బెండువంటిది లోని పెద్దతనము
పుండువంటిది మేను, పోలించినను మేడి_
పండువంటిది సరసభావమింతియును

చ. 2: కంచువంటిది మనసు, కలిమిగలదింతియును
మంచువంటిది,రతి భ్రమతవంటిది
మించువంటిది రూపు, మెలింతియును ముట్టు
పెంచువంటిది,దీనిప్రియ మేమిభ్రాంతి

చ. 3: ఆఁకవంటిది జన్మ, మడవివంటిది చింత
పాఁకువంటిది కర్మ బంధమెల్ల
యేఁకటను దిరువేంకటేశుఁ దలచినకోర్కి
కాఁక సౌఖ్యములున్న గనివంటి దరయ

రేకు: 2019-01 ఆహిరి సం: 01-113 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నాళ్ళుదాఁకఁ దానిట్టె వుండుట బుద్ది
కన్న పోవుట పూర్వకర్మ శేషం

చ. 1: కలకాలమెల్ల దుఃఖ మెకాఁగఁ బ్రాణికిని
వలదా సుఖము గొంతవడియైనను
కలుషబుద్ధులఁ బ్రజ్ఞగల దింతయును మంటఁ
గలసిపోవుటే పూర్వకర్మ శేషం

చ. 2: జాలి తొల్లియుఁబడ్డజాలె నేఁడునుఁగాక
మేలు వొద్దా యేమిటినై నాను
తాలిమి లో హరిఁ దలఁచక యెఱుకెల్ల
గాలిఁబోవుట పూర్వకర్మశేషం

చ. 3: తరగని నరకబాధయు నేఁడునుగాక
దరి చేరవలదా యింతటనైనను
తిరువేంకటాద్రిపై దేవునిఁ గొలువక
గరిపడే భవమెల్ల కర్మశేషం

రేకు: 2019-02 గుజ్జరి సం: 01-114 వైరాగ్య చింత

పల్లవి: అప్పులేని సంసార మైనపాటే చాలు
తప్పులేనిజీత మొక్క తారమైనఁ జాలు

చ. 1: కంతలేని గుడిశొక్క గంపంతయినఁ జాలు
చింతలేని యంబలొక్క చారెఁడే చాలు
జంతగాని తరుణి యేజాతైన నదె చాలు
వింతలేని సంపదొక్క వీసమే చాలు

చ. 2: తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదె చాలు
ముట్టులేని కూడొక్క ముద్దెఁడే చాలు
గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైనఁ జాలు
వట్టి జాలిఁ బడకుంటే వచ్చినంతే చాలు

చ. 3: లంపటపడని మేలు లవలేశమే చాలు
రొంపి కంబమౌ కంటె రోయుటే చాలు
రంపపుఁ గోరిక కంటె రతి వేంకటపతి-
పంపున నాతనిఁ జేరే భవమే చాలు

రేకు: 2019-03 శ్రీరాగం సం: 01-115 అధ్యాత్మ

పల్లవి: కూడువండుట గంజికొరకా తనకు
వేడుకలుగల సుఖము వెదకుటకుఁగాక

చ. 1: కుప్ప నురుచుట కసవుకొరకా తనవు
గొప్పయవు టిది మదముకొరకా
వొప్పన వేడుకల నొరసి మనసు
నెప్పునకురాఁ దివియ నేరవలెఁ గాక

చ. 2: కొలుచు దంచుట పొట్టుకొరకా తాఁ
గులజుఁడ్డై మూఢుఁడౌ కొరకా
తలపోసి యున్నింటఁ దగిలి మీఁదు
తెలిసి సుఖదుఃఖములఁ దెలియవలెఁ గాక

చ. 3: కొండ దవ్వుట యెలుక కొరకా తాఁ
గొండ యెక్కుట దిగుటకొరకా
కొండలకోనేటిపతిఁ గొలిచి తనదు
నిండి నాపదలెల్ల నీఁగవలెఁ గాక

రేకు: 2019-04 శుద్ధవసంతం సం: 01-116 వేంకటగానం

పల్లవి: ఘనుఁ డీఁతఁడొకఁడు గలుగఁగఁగదా వేదములు
జననములుఁ గులము లాచారములుఁ గలిగె

చ. 1: కలుషభంజనుఁ డితఁడు గలుగఁగఁగదా జగతిఁ
గలిగె నిందరి జన్మగతులనెలవు
మలసి యుతఁడొకఁడు వొడమఁగఁగదా యిందరికి
నిలువ నీడలు గలిగె నిధినాథా□నములై

చ. 2: కమలాక్షుఁ డితఁడు గలుగఁగఁగదా దేవతలు
గమిగూడి రిందరును గండిగడచి
ప్రమదమున నితఁడు నిలుపఁగఁగదా సస్యములు
అమర ఫలియించె లోకానందమగుచు

చ. 3: గరిమె వేంకటవిభుఁడొకఁడు గలుగఁగఁగదా
ధరయు నభమును రసాతలము గలిగె
పరమాత్ముఁడితఁడు లోపల గలుగఁగాఁగదా
అరిది చవులును హితవు లన్నియునుఁ గలిగె

రేకు: 2019-05 భైరవి సం: 01-117 గురు వందన, నృసింహ

పల్లవి: చూడుఁ డిందరికి సులభుఁడు హరి-
తోడు నీడయగు దొరముని యితఁడు

చ. 1: కైవల్యమునకుఁ గనకపు తాపల-
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావనమొక రూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితఁడు

చ. 2: కాపాడఁగ లోకములకు సుజ్ఞాన-
దీపమై జగతికిఁ దేజమై
పాపాలడఁపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁడిదే యితఁడు

చ. 3: కరుణానిధి రంగపతికిఁ గాంచీ-
వరునకు వేంకటగిరి పతికి
నిరతి నహోబల నృకేసరికిఁ ద-
తృరుఁడగు శఠగోపముని యితఁడు

రేకు: 2019-06 సామంతం సం: 01-118 అధ్యాత్మ

పల్లవి: కలలోని సుఖమే కలియుగమా,వెన్న
కలిలో నెక్కడిదె కలియుగమా

చ. 1: కడిగడి గండమై కాలము గడపేవు
కడుగఁగడుగ రొంపి కలియుగమా
బడలికె వాపవు సరమేదో చూపవు
గడిచీటియును నీవు కలియుగమా

చ. 2: కరపేవు కఱతలే మఱపేవు మమతలే
కరకఱ విడువవు కలియుగమా
తెరచీర మఱఁగింతే తెరువేల మూసేవు
గరునేల దాఁటేవో కలియుగమా

చ. 3: కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు
కానీలే కానీలే కలియుగమా
పైనిదే వేంకటపతి దాసులుండఁగ
కానవా నీ విదేమి కలియుగమా

రేకు: 2020-01 ఆహిరి సం: 01-119 తిరుపతి క్షేత్రం

పల్లవి: తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచినలతల

చ. 1: కూరిమిమటములు గోపురంబులును
తేరుపడగెలే తెరువెల్లా
కోరినపండ్లు గురిసేటితరువులు
తోరములైనవెదురుజొంపములు

చ. 2: ఆటలుఁ దిరుపులు నందపుటురువులు
పాటలు వనవైభవమెల్లా
కూటువ నెమళ్ళ కోవిల గుంపుల
పేటలఁ దేటలపెనుఁగూటములు

చ. 3: వింజామరలును విసనకఱ్ఱలును
గొంజెగొడుగిలే కొండెల్లా
అంజనగిరిరాయఁడు వేంకటపతి
సంజీవని పరుషల కొదవఁగను

రేకు: 2020-02 మాళవి సం: 01-120 హనుమ

పల్లవి: బాపు దైవమా మా పాలిభవమా
తీపు రాకాసినెత్తురు దీం దోందోం దోందోం దోందోం

చ. 1: కాలనేమిపునుకిది కంచువలె లెస్స వాఁగీ
తాళమొత్తరే తత్త తత తత్తత్త
కాలమెల్ల మాభూతగణమెల్ల వీఁడె కాచె
నేలఁబడి నేఁడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం

చ. 2: పగగొని మానక పచ్చి నెత్తు రెప్పుడును
తెగి కొనుఁ దానె తిత్తి తిత్తి తిత్తితి
తగుమహోదరువీఁపు దణధణమని వాఁగీ
బిగీ □యుంచరే తోలు బింభిం బింభిం బింభింభిం

చ. 3: మురదనుజుని పెద్దమొదలియెముకఁ దీసి
తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు
తిరువేంకటగిరిదేవుఁడు గెలిచిన స-
మరముననుు మమ్మ మమ్మ మమ్మ మమ్మమ

రేకు: 2020-03 భూపాళం సం: 01-121 వేంకటగానం

పల్లవి: వాడె వేంకటేశుఁడనే వాఁడె వీఁడు
వాఁడి చుట్టుఁ గైదువ వలచేతివాఁడు

చ. 1: కారిమారసుతుని చక్కని మాటలకుఁ జొక్కి
చూరగా వేదాలగుట్టు చూపినవాఁడు
తీరని వేడుకతో తిరుమంగయాళువారి
ఆరడి ముచ్చిమి కూటి కాసపడ్డవాఁడు

చ. 2: పెరియాళువారి బిడ్డ పిసికి పైవేసిన
విరుల దండల మెడవేసినవాఁడు
తరుణి చేయి వేసిన దగ్గరి బుజము చూఁచి
పరవశమై చొక్కి పాయలేని వాఁడు

చ. 3: పామరులఁ దనమీద పాటలెల్లాఁ బాడుమంటా
భూమికెల్లా నోర నూరి పోసినవాఁడు
మామకూఁతురలమేలుమంగ నాచారియుఁ దాను
గీముగానే వేంకటగిరి నుండేవాఁడు

రేకు: 2020-04 ఆహిరి సం: 01-122 కృష్ణ

పల్లవి: అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె
వెంటఁబారనీదు నన్ను వెడమాయతురుము

చ. 1: కాఁగెడు పెరుగుచాడె కవ్వముతోఁ బొడిచి
లేఁగలఁ దోలుకొని అలిగిపోయీని
రాఁగతనమున వాఁడె రాతిరి నారగించఁడు
ఆఁగి నన్నుఁ గూడడిగె నయ్యో ఇందాఁకను

చ. 2: కొలఁదిగాని పెరుగు కొసరికొసరి పోరి
కలవూరుఁ గాయలెల్లఁ గలఁచిపెట్టె
పలుకఁడు చేతిచట్టి పారవేసి పోయీనదె
చెలఁగుచు మూఁటగట్టెఁ జెల్లఁబో యిందాఁకను

చ. 3: మట్టుపడ కిటు నూరుమారులైనా నారగించు
ఇట్టె యిందరిలోని నాన్నాళ్ళును
వెట్టికి నాకొరకుఁగా వేంకటేశుఁ డారగించె
యెట్టు నేఁ డాఁకట ధరియించెనో యిందాఁకను

రేకు: 2020-05 భూపాళం సం: 01-123 వైరాగ్య చింత

పల్లవి: ఏమో తెలిసెఁగాని యీజీవుఁడు
నేమంపు నెరవిద్య నేరఁడాయ

చ. 1: కపటాలె నేరిచెఁగానీ జీవుఁడు
యెపుడైనా నిజసుఖ మెఱఁగఁడాయ
కపురులే చవిగొనెఁగానీ జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ

చ. 2: కడలనే తిరిగీఁగానీ జీవుఁడు
నడుము మొదలుఁ జూచి నడవఁడాయ
కడుపుకూటికే పోయీఁగానీ జీవుఁడు
చెడని జీతముపొంతఁ జేరఁడాయ

చ. 3: కనియుఁ గానకపోయఁగానీ జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలనె చొక్కెఁగానీ జీవుఁడు
తనియ నిట్టే మంచిదరిఁ జేరఁడాయ

రేకు: 2020-06 సామంతం సం: 01-124 అధ్యాత్మ

పల్లవి: తనదీఁగాక యిందరిదీఁగాక
తనువెల్ల బయలై దరిచేరదు

చ. 1: కడుపూ నిండదు కన్నూఁ దనియదు
కడఁగి లోనియాఁకలియుఁ బోదు
సడిఁబడి కుడిచినకుడుపెల్ల నినుము
గుడిచిన నీరై కొల్లఁబోయె

చ. 2: చవియూఁ దీరదు చలమూఁ బాయదు
లవలేశమైన నొల్లకపోదు
చివచివ నోటికడవలోనినీరై
కవకవ నవియుచుఁ గారీని

చ. 3: అలపూఁ దోఁపదు అడవీ నెండదు
యెలయించు భంగమయునఁ బోదు
తెలసి వేంకటగిరిదేవునిఁ దలఁపించు
తలఁపైనఁ దనకు ముందర నబ్బదు

రేకు: 2021-01 ఆహిరి సం: 01-125 దశావతారములు

పల్లవి: పెక్కులంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వరులేరు యేమిసేతువయ్యా

చ. 1: కన్నుమూయఁ బొద్దులేదు, కాలు చాఁచ నిమ్ములేదు
మన్నుదవ్వి కిందనైన మనికి లేదు
మున్నిటివలెనే గోరుమోపనైనఁ జోటు లేదు
యిన్నిటా నిట్లానైతి వేమి సేతువయ్యా

చ. 2: అడుగిడఁగ నవ్వల లేదు, అండనైన నుండలేదు
పుడమిఁ గూడు గుడువనైనఁ బొద్దులేదు
వెడఁగుఁదనము విడువలేదు, వేదమైనఁ జదువలేదు
యెడపఁదడప నిట్ల నీకు నేమిసేతువయ్యా

చ. 3: పుప్పరములు మానియైన నుండలేదు లోకమందు
నిప్పుడైన నీవిహర మిట్ల నాయను
చెప్పనరుదు నీగుణాలు శ్రీవేంకటేశ యిట్ల-
నెప్పుడును ఘనుఁడ వరయ నేమిసేతువయ్యా

రేకు: 2021-02 శ్రీరాగం సం: 01-126 కృష్ణ

పల్లవి: ఇతఁడు చేసిననేఁత లెన్నిలేవిలమీఁద
యితఁడు జగదేకగర్వితుఁడౌనో కాఁడో

చ. 1: కుడువఁడా ప్రాణములుగొనుచుఁ బూతకిచన్ను
తుడువఁడా కపటదైత్యులనొసలి వ్రాలు
అడువఁడా నేలతో నలమి శకటాసురుని
వడువఁడా నెత్తురులు వసుధ కంసునివి

చ. 2: పెట్టఁడా దనుజారిబిరుదు లోకమునందు
కట్టఁడా బలిదైత్యు కర్మబంధముల
మెట్టఁడా కాళింగు మేటిశిరములు, నలియఁ-
గొట్టఁడా దానవులఁ గోటానఁగోట్ల

చ. 3: మరపఁడా పుట్టువులు మరణములుఁ బ్రాణులకు
పరపఁడా గంగఁ దనపాదకమలమున
చెరుపఁడా దురితములు శ్రీ వెంకటేశుఁడిదె
నెరపఁడా లోకములనిండఁ దనకీర్తి

రేకు: 2021-03 సామంతం సం: 01-127 వేంకటగానం

పల్లవి: ఆదిదేవుఁడై అందరిపాలిటి
కీ దేవుఁడై వచ్చె నితఁడు

చ. 1: కోరిన పరమ యోగుల చిత్తములలోన
యేరీతి నుండెనో యీతఁడు
చేరవచ్చిన యాశ్రితులనెల్లఁ బ్రోవ
యీరీతి నున్న వాఁడీతడు

చ. 2: కుటిల దానవుల కోటానఁగోట్ల
యెటువలెఁ ద్రుంచెనో యీతఁడు
ఘటియించి యిటువంటి కారుణ్యరూపుఁడై
యిటువలె నున్న వాఁడీతడు

చ. 3: తక్కక్క బ్రహ్మాండ తతులెల్ల మోచితా-
నెక్కడ నుండెనో యీతఁడు
దిక్కుల వెలసిన తిరువేంకటేశుఁడై
యిక్కడ నున్న వాఁడీతఁడు

రేకు: 2021-04 గుండక్రియ సం: 01-128 దశావతారములు

పల్లవి: తానే తెలియవలె తలఁచి దేహి తన్ను
మానుపువారలు మరి వేరీ

చ. 1: కడలేని భవసాగరము చొచ్చినతన్ను
వెడలించువారలు వేరీ
కడుబందములచేతఁ గట్టుపడినతన్ను
విడిపించువారలు వేరీ

చ. 2: కాఁగినినుము వంటికర్మపు తలమోపు -
వేఁగు దించేటివారు వేరీ
మూఁగిన మోహపుమూఁకలు తొడిఁబడ
వీఁగఁ దోలేటివారలు వేరీ

చ. 3: తిరువేంకటాచలాధిపునిఁ గొలుపుమని
వెరపు చెప్పేదువారు వేరీ
పరివోని దురితకూపములఁ బడకుమని
వెరపు చెప్పెడివారు వేరీ

రేకు: 2021-05 శ్రీరాగం సం: 01-129 అంత్యప్రాస

పల్లవి: బయలు వందిలి వెట్టి పరగఁ జిత్తముగలిగె
దయమాలి తిరుగ నాత్మజుఁ డొకఁడు గలిగె

చ. 1: కనుచూపువలన నుడుగనికోరికలు గలిగె
తనుకాంక్షవలనఁ బరితాపంబు గలిగె
అనుభవనవలన మోహంధకారము గలిగె
తనివి దీమివలన తలపోఁత గలిగె

చ. 2: అడియాసవలన పాయనిచలంబునుఁ గలిగె
కడుమమతవలన చీఁకటి దవ్వఁగలిగె
కడలేని తమకమునఁ గాఁతాళమునుఁ గలిగె
నడుమ నంతటికి మానసప్రేమ గలిగె

చ. 3: తరితీపు వలన చిత్తభ్రాంతి తగఁ గలిగె
విరహంబువలన పురవేదనలుఁ గలిగె
తిరువేంకటాచలాధిపుని కరుణామృతము
పరిపూర్ణమైన యాపద నీఁదఁ గలిగె

రేకు: 2021-06 కేదారగౌళ సం: 01-130 అధ్యాత్మ

పల్లవి: పరమాత్ముని నోరఁబాడుచును యిరు-
దరులు గూడఁగఁ దోసి దంచీ మాయ

చ. 1: కొలఁది బ్రహ్మాండపు కుందెనలోన
కులికి జీవులను కొలుచు నించి
కలికి దుర్మోహపు రోఁకలివేసి
తలంచి తనువులను దంచీ మాయ

చ. 2: తొంగలి రెప్పలు రాత్రులుఁ బగలును
సంగడి కనుఁగవ సరిఁ దిప్పుచు
చెంగలించి వెసఁ జేతులు విసరుచు
దంగుడు బియ్యముగా దంచీ మాయ

చ. 3: అనయముఁ దిరు వేంకటాధీశ్వరుని
పనుపడి తనలోఁ బాడుచును
వొనరి విన్నాణి జీవులనెడి బియ్యము
తనర నాతనికియ్య దంచీ మాయ

రేకు: 2022-01 నారణి సం: 01-131 అధ్యాత్మ

పల్లవి: పరగు బహుసజ్జన్మపరిపక్వ హృదయుఁడై
మరికదా వేదాంతమార్గంబు గనుట

చ. 1: కలుషహరమగువివేకమ్ము గలిగినయట్టి-
ఫలముగాదా కృపాపారీణుఁడౌట
తలపోసి సకలభూతదయా విశేషంబు
కలిగికాది గుణవికారంబు గనుట

చ. 2: యెదిరిఁ దనవలెనె తా నెఱఁగనేర్చినఫలము
అదిగదా ద్రవ్యమోహంబు గడచనుట
పదిలమగు నాశానుభవము పాపినయట్టి-
తుదగదా తాను సంతోషంబు గనుట

చ. 3: రతిపరాఙ్ముఖమహరాజ్యమబ్బినఫలము -
మతిగదా తాను కర్మత్యాగియౌట
తతితోడ ఫలపరిత్యాగి చిత్తవ్యాపి-
ధృతిగదా వేంకటాధిపు దాసుఁడౌట

రేకు: 2022-02 ముఖారి సం: 01-132 వేంకటేశ్వరౌషధము

పల్లవి: చలపాదిరోగ మీసంసారము నేఁడు
బలువైనమందు విష్ణుభక్తి జీవులకు

చ. 1: కీడౌట మది నెఱింగియు మోహ మెడల దిది
పాడైన విధికృతము బలవంతము
యీడనే ఇది మాన్ప హితవైన వజ్రాంగి
జోడువో హరిఁ దలంచుట జీవులకును

చ. 2: హేయమని తెలిసి తా నిచ్చగించీ యాత్మ
పాయ దీరతిసుఖము బలవంతము
మాయ నుగ్గులుసేయ మాధవునిదంచనపు-
రాయివో వైరాగ్యరచన జీవులకు

చ. 3: పాలయుదురితంపు రొంపులు దన్ను వడి ముంచ
పలుమారుజన్మ మీబలవంతము
నెలవుకొని సకలంబు నిర్మలముగాఁ గడుగు-
జలధివో వేంకటేశ్వరుఁడు జీవులకు

రేకు: 2022-03 వరాళి సం: 01-133 వేంకటగానం

పల్లవి: చూడఁజూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి
యీడులేని కన్నులవె యిన చంద్రులు

చ. 1: కంటిఁగంటి వాఁడెవాఁడె ఘనమైన ముత్యాల
కంటమాలలవే పదకములు నవె
మింటి పొడవైనట్టి మించుఁ గిరీటంబదె
జంటల వెలుఁగు శంఖచక్రా లవె

చ. 2: మొక్కుమొక్కు వాఁడెవాఁడె ముందరనే వున్నాఁడు
చెక్కులవే నగవుతో జిగిమో మదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె

చ. 3: ముంగైమురాలును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గులవన్నె పచ్చబట్టదె
యింగితమెరిఁగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటి నిధానమైన మూలభూతమదె

రేకు: 2022-04 ముఖారి సం: 01-134 అంత్యప్రాస

పల్లవి: ఎంతనేయఁగలేదు యిటువంటివిధి యభవు-
నంతవానిని భిక్షమడుగు కొనఁ జేసె

చ. 1: కోరి చంద్రునిఁ బట్టి గురుతల్ప గునిఁ జేసె
కూరిమలరఁగ నింద్రుఁ గోడిఁ జేసె
ఘోరకుడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె
వీరుఁడగునలుఁ బట్టి విద్రూపుఁ జేసె

చ. 2: అతివ నొడ్డుగఁ జూదమాడ ధర్మజుఁ జేసె
సతి నమ్ముకొన హరిశ్చంద్రుఁ జేసె
కుతిలపడ శూద్రకుని గొట్టెముచ్చుగఁ జేసె
మతిమాలి కురురాజు మడుఁగుచొరఁ జేసె

చ. 3: పడనిపాట్ల బరచి బ్రహ్మతల వోఁజేసె
తొడరి కాలునికాలు దునియఁ జేసె
ఆడర నీవిధికి విధియగు వేంకటేశుకృప
పడయకుండఁగ భంగపడకపోరాదు

రేకు: 2022-05 కాంబోది సం: 01-135 అంత్యప్రాస

పల్లవి: ఏఁటిసుఖము మరి యేఁటిసుఖము నొక-
మాటమాత్రమున నటమటమైన సుఖము

చ. 1: కొనసాగుదురితములె కూడైన సుఖము
తనువిచారములలో దాకొన్న సుఖము
పనిలేనియాసలకుఁ బట్టయిన సుఖము
వెనుకముందరఁ జూడ వెరగైన సుఖము

చ. 2: నిందలకులోనైన నీరసపు సుఖము
బొందికిని లంచంబుపుణికేటి సుఖము
కిందుపడి పరులముంగిలి గాచుసుఖము
పందివలె తనుఁదానె బ్రదికేటి సుఖము

చ. 3: ధృతిమాలి యిందరికి దీనుఁగడు సుఖము
మతిమాలి భంగములు మఱపించు సుఖము
పతివేంకటేశుకృప పడసినది సుఖము
యితరంబులన్నియును నీపాటి సుఖము

రేకు: 2022-06 శ్రీరాగం సం: 01-136 వైరాగ్య చింత

పల్లవి: దేహము దా నస్థిరమట దేహి చిరంతనుఁడౌనట
దేహపు మోహపు నేఁతలు తీరుట లెన్నఁడొకో

చ. 1: కన్నులఁబుట్టినకాంక్షలు కప్పికదా దుర్బోధల
కన్నులు మనసునుఁ దనియక గాసిఁబడిరి జనులు
తన్నిక నెరుఁగుట లెన్నఁడు తలఁపులు దొలఁగుట లెన్నఁడు
తిన్నని పరవశములచేఁ దిరుగుట లెన్నఁడొకో

చ. 2: సిగ్గులు దొలఁగనియాశలఁ జిక్కికదా దుర్మానపు-
సిగ్గుల యెగ్గులచేతను చిక్కువడిరి జనులు
సిగ్గులు దొలఁగుట యెన్నఁడు చిత్తము లోనౌటెన్నఁడు
తగ్గుల మొగ్గుల నేఁతలు తలఁగుట లెన్నఁడొకో

చ. 3: మనసు బుట్టిన యాతఁడు మనసునఁ బెనగొని తిరుగఁగ
మనసే తానగు దైవము మరచిరి యుందరును
అనయము తిరువేంకటపతి యాత్మఁదలఁచి సుఖింపుచు
ఘనమగు పరమానందము కలుగుట లెన్నఁడొకో

రేకు: 2023-01 ధన్నాశి సం: 01-137 సంస్కృత కీర్తనలు

పల్లవి: భావయామి గోపాలబాలం మన-
స్సేవితం తత్పదం చింతయేయం సదా

చ. 1: కటిఘటిత మేఖలా ఖచిత మణిఘంటికా-
పటల నినదేన విభ్రాజమానం
కుటిల పదఘటిత సంకుల శింజితే నతం
చటుల నటనా సముజ్జ్వల విలాసం

చ. 2: నిరత కర కలిత నవనీతం బ్రహ్మాది-
సుర నికర భావనా శోభితపదం
తిరు వేంకటాచల స్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం

రేకు: 2023-02 ధన్నాశి సం: 01-138 ఆరగింపు

పల్లవి: పంకజాక్షులు సొలసిపలికి నగఁగా
నింకా నారగించు మిట్టనే ఆయ్యా

చ. 1: కలవంటకములు పులుఁగములు దుగ్ధాన్నములు
పలుదెరఁగులై న అప్పములగములు
నెలకొన్న నేతులును నిరతంపు చక్కెరలు
గెలుకొట్టుచును నారగించవయ్యా

చ. 2: పెక్కువగుసైఁ దంపుపిండి వంటల మీఁద
పిక్కటిలు మెఱుఁగు బొడి బెల్లములును
వొక్కటిగఁ గలపుకొని వొలుపుఁబప్పులతోడ
కిక్కిరియ నిటు లారగించవయ్యా

చ. 3: కడుమధురమైన మీఁగడ పెరుగులను మంచి-
అడియాల పూరుఁగాయల రుచులతో
బడిబడిగ నవకంపుఁ బళ్లెరంబులతోడ
కడునారగించు వేంకటగిరీంద్రా

రేకు: 2023-03 భూపాళం సం: 01-139 మేలుకొలుపులు

పల్లవి: భోగి శయనమును బుసకొట్టెడిని
యోగనిద్ర పాయును మేల్కొనవే

చ. 1: కన్నులు దెరవక కమలభాంధవుఁడు
వెన్నెల రేణువు వెలయ దిదే
అన్నున మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీవిటు మేలుకొనవే

చ. 2: తెల్లనికన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్నవివే
కల్లనిదుర నినుఁ గవియఁగ నియ్యక
మెల్లనాయ నిటు మేలుకొనవే

చ. 3: తెరవగు రెప్పలఁ దెల్లవారవలె
తెరవక చీఁకటి దీరదిదే
తెరఁగు వేంకటాధిప నీవెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే

రేకు: 2023-04 శ్రీరాగం సం: 01-140 దశావతారములు

పల్లవి: ఏది చూచిననుఁ గడు నిటువంటి సోద్యములే
మేదినికిఁ గిందుపడి మిన్నందనేలా

చ. 1: కరిరాజుగాంచినకరుణానిధివి నీవు
అరిది నరసింహరూపైతివేలా
పురగేంద్రశయనమున నుండి నీవును సదా
గరుడవాహనుఁడవై గమనించనేలా

చ. 2: పురుషోత్తమఖ్యాతిఁ బొదలి యమృతము వంప
తరుణివై వుండ నిటు దైన్యమేలా
శరణాగతులకు రక్షకుఁడవై పాము నీ_
చరణములకిందైన చలముకొననేలా

చ. 3: దేవతాధిపుఁడవై దీపించి యింద్రునకు
భావింప తమ్ముఁడనఁ బరగితేలా
శ్రీవేంకటాచలస్థిరుఁడవై లోకముల_
జీవకోట్ల లోనఁ జిక్కువడనేలా

రేకు: 2023-05 మలహరిసం: 01-141 దశావతారములు

పల్లవి: కోరుదు నామది ననిశముగుణాధరు నిర్గుణుఁ గృష్ణుని
నారాయణు విశ్వంభరు నవనీతాహారు

చ. 1: కుండలిమణిమయభూషణు కువలయదళవర్ణాంగుని-
నండజపతివాహనుని నగణితభవహరుని
మండనచోరకదమనుని మాలాలంకృతవక్షుని
నిండుకృపాంబుధిచంద్రుని నిత్యానందునిని

చ. 2: అగమపుంజపదార్థుని ఆపత్సుఖసంభూతుని
నాగేంద్రాయతతల్పుని నానాకల్పునిని
సాగబ్రహ్మమయాఖ్యుని సంతతగానవిలోలుని
వాగీశ్వరసంస్తోత్రుని వైకుంఠోత్తముని

చ. 3: కుంకుమవసంతకాముని గోపాంగనకుచలిప్తుని
శంకరసతిమణినుతుని సర్వాత్ముని సముని
శంకనినాదమృదంగుని చక్రాయుధవేదీప్తుని
వేంకటగిరినిజవాసుని విభవసదాయినిని

రేకు: 2023-06 సామంతం సం: 01-142 అధ్యాత్మ

పల్లవి: అటు గుడువు మనస నీ వన్నిలాగులఁ బొరలి

ఇటు గలిగె నీకు నైహితవిచారములు

చ. 1: కోరికలకునుఁ గలిగె ఘెరపరితాపంబు

కూరిమికిఁ గలిగె ననుకూలదుఃఖములు

తారతమ్యములేనితలపోఁతలకుఁ గలిగె

భారమైనట్టి లంపటమనెడి మోపు

చ. 2: తనువునకుఁ గలిగె సంతతమైన తిమ్మటలు

మనువునకుఁ గలిగె నామని వికారములు

పనిలేని సంసారబంధంబునకుఁ గలిగె

ఘనమైన దురిత సంగతి తోడిచెలిమి

చ. 3: దేహికినిఁ గలిగె నింద్రియములను బోధింప

దేహంబునకుఁ గలిగె తెగనిసంశయము

దేహత్మకుండయిన తిరువేంకటేశునకు

దేహిదేహాంతరస్థితిఁ జూడఁగలిగె

రేకు: 2024-01 వరాళి సం: 01-143 అధ్యాత్మ

పల్లవి: ఆపదల సంపదల నలయు టేమిట మాను
రూపింప నిన్నిటను రోసిననుఁ గాక

చ. 1: కడలేనిదేహరోగంబు లేమిట మాను
జడనువిడిపించునౌషధసేవఁగాక
విడవ కడియాస తను వేఁచు టేమిట మాను
వొడలికలగుణమెల్ల నుడిగిననుఁగాక

చ. 2: దురితసంగ్రహమైన దుఃఖ మేమిట మాను
సరిలేని సౌఖ్యంబు చవిగొన్నఁగాక
కరుకైన మోహంధకార మేమిట మాను
ఆరిది తేజోమార్గ మలవడినఁగాక

చ. 3: చావులోఁ బెనగొన్నజన్మ మేమిట మాను
యీవలావలి కర్మ మెడసినఁ గాక
భావింప నరుదైనబంధ మేమిట మాను
శ్రీ వేంకటేశ్వరుని సేవచేఁ గాక

రేకు: 2024-02 సామంతం సం: 01-144 వైష్ణవ భక్తి

పల్లవి: సులభమా మనుజులకు హరిభక్తి
వలనొంది మరికదా వైష్ణవుఁడౌట

చ. 1: కొదలేని తపములు కోటానఁగోటులు
నదన నాచరించి యటమీఁద
పదిలమైన కర్మబంధము లన్నియు
వదలించు కొనికదా వైష్ణవుఁడౌట

చ. 2: తనివోని యాగతంత్రములు లక్షలసంఖ్య
అనఘుఁడై చేసినయట మీద
జననములన్నిట జనియించి పరమపా-
వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట

చ. 3: తిరిగితిరిగి పెక్కు తీర్థములన్నియు-
నరలేక సేవించినట మీఁద
తిరువేంకటాచలాధిపుఁడైన కరిరాజ
వరదుని కృపఁగదా వైష్ణవుఁడౌట

రేకు: 2024-03 ఆహిరి సం: 01-145 అధ్యాత్మ

పల్లవి: ఏల సమకొను సుకృత మెల్ల వారికి మహ -
మాలిన్యమున నాత్మ మాసినది గాన

చ. 1: కలికాలదోషంబు కడవరానిది గాన
తలఁపుదురితముల కాధారంబు గాన
బలుపూర్వకర్మములు పట్టరానివి గాన
మలమూత్రజన్మంబు మదకరము గాన

చ. 2: రాఁపైనగుణవికారములు బహళము గాన
ఆఁపరానివి యింద్రియంబు లటుగాన
దాఁపరంబగుమమత దయదలంపదు గాన
కాఁపురముచే నా కప్పుకొనుఁ గాన

చ. 3: హృదయంబు చంచలం బిరవుగానదు గాన
చదువు బహుమార్గములఁ జాటు నటుగాన
యెదురనుండెడు వేంకటేశ్వరునినిజమైన-
పదముపై కోరికలు పైకొనవు గాన

రేకు: 2024-04 శ్రీరాగం సం: 01-146 వైరాగ్య చింత

పల్లవి: వలపులధికము సేయు వైభవములు

తలఁపు లధికము సేయుఁ దలపోఁతలు

చ. 1: కోపమధికము సేయుఁ గోరికలు

తాప మధికము సేయు దమకంబులు

కోపంబుఁ దాపంబుఁ గూడ నధికము సేయు

యేపయిన మోహముల నేమందమే

చ. 2: మచ్చికధికము సేయు మన్ననలు

యిచ్చ లధికము సేయు నీరసములు

మచ్చికలు నిచ్చలును మగుడ నధికము సేయు-

నెచ్చరిక కూటముల నేమందమే

చ. 3: అందమధికము సేయుఁ నైక్యములు

పొందులధికము సేయుఁ బొలయలుకలు

అందములుఁ బొందులును నలరనధికముసేయు-

నెందు నరుఁదగు వేంకటేశు కృపలు

రేకు: 2024-05 వరాళి సం: 01-147 వైరాగ్య చింత

పల్లవి: చిత్త మతిచంచలము చేఁత బలవంతంబు
తిత్తిలో జీవుఁ డిటు దిరిగాడుఁ గాక

చ. 1: కదిసి జీవుఁడు పుట్టఁగాఁ బుట్టినటువంటి
మొదలుఁ దుదయును లేని మోహపాశములు
వదలు టెటువలెఁ దారు వదలించు టెటువలెను
పదిలముగ వీనిచేఁ బడి పొరలుఁ గాక

చ. 2: కడలేని జన్మసంగ్రహములై యెన్నఁడును
గడుగ వసములు గాని కర్మవంకములు
విడుచు టెటువలెఁ దారు విడిపించు టెటువలెను
విడువనివిలాపమున వేఁగుటలు గాక

చ. 3: యిందులోపల జీవుఁ డెన్నఁడే నొకమాటు
కందు వెఱిఁగి వివేకగతులభాగ్యమున
అందముగఁ దిరువేంకటాద్రీశు సేవించి
అందరాని సుఖంబు లందుఁ గాక

రేకు: 2024-06 ధన్నాశి సం: 01-148 వేంకటగానం

పల్లవి: ఉప్పవడము గాకున్న రిందరు
యెప్పుడు రేయి నీకెప్పుడు పగలు

చ. 1: కన్నుల చంద్రుఁడును కమలమిత్రుఁడును
వున్నతి నివి నీకుండఁగను
వెన్నెలయెండలు వెలయఁగ మేల్కొను-
టెన్నఁడు నిద్దర యెన్నఁడు నీకు

చ. 2: కందువ సతికనుఁగలువలు ముఖార-
విందము నిదివో వికసించె
ముందర నిద్దుర మొలవదు చూచిన
విందగునీతెలివికిఁ దుద యేది

చ. 3: తమము రాజసము తగుసాత్వికమును-
నమరిన నీమాయారతులు
కమలాధిప వేంకటగిరీశ నిన్ను
ప్రమదము మఱపునుఁ బైకొనుటెట్లా

రేకు: 2025-01 దేసాక్షి సం: 01-149 అధ్యాత్మ

పల్లవి: ఒప్పులై నొప్పులై వుండుఁగాన
అప్పటప్పటికిఁ జూడ నదియేకా నిజము

చ. 1: కన్నుల కిన్నియుఁజూడ కలలై వలలై
పున్నతాలు నడ్డాలై వుండుఁగాన
చిన్న చిన్న చిటిపాటి చిమ్ముదొమ్ముదిమ్ములవి
వున్నవన్నియుఁ జూడ నొకటేకా నిజము

చ. 2: సారేకు నోరికిఁ జూడ చవులై నవ్వులై
పూరటమాటలై వుండుఁగాన
తారుమారు తాఁకు సోఁకు తప్పుదోఁపు లిన్నియు
వోరపారులేనివెల్ల వొక్కటెకా నిజము

చ. 3: మేనికి నిన్నియుఁ జూడ మృదువై పొదువై
పూని సంపదలై వుండుఁగాన
తేనై తీపై తిరువేంకటేశ నిన్ను
కానవచ్చినదే వొక్క టేకా నిజము

రేకు: 2025-02 శంకరాభరణం సం: 01-150 వైరాగ్య చింత

పల్లవి: పనిలేని ధనవాంఛఁ బడిపొరలిన నిట్టి -
కనుమాయలే కాక కడ నేమిగలదు

చ. 1: కనుచూపు కాఁకలఁ గలయుట వెడయాస -
లనుభవింపుటగాక యందేమిగలదు
తనువల్లి సోఁకులఁ దగులుట మమతల -
నెనయఁ గోరుటగాక యిందేమిగలదు

చ. 2: యెలమి నధర మాను టెరిఁగి యెంగిలి నోర
నలముకొనుట గాక యందేమిగలదు
పలులంపటములచేఁ బడుట దుఃఖంబులు
తలఁజుట్టుటే కాక తన కేమికలదు

చ. 3: శ్రీ వేంకటాద్రీశుఁ జేరనిపనులెల్ల -
నేపగింతలే కాక యిందేమిగలదు
ఆవల సురతభోగ మనుభవింపఁబోయి
రావలయుటగాక రచనేమిగలదు

రేకు: 2025-03 సామంతం సం: 01-151 వేంకటగానం

పల్లవి: కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు వాఁడు
కొండలంత వరములు గుప్పెడు వాఁడు

చ. 1: కుమ్మరదాసుఁడైన కురువరతినంబి
ఇమ్మన్నవరములెల్ల నిచ్చినవాఁడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మనచోటికి వచ్చి నమ్మినవాఁడు

చ. 2: అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్నుమోఁచినవాఁడు
మచ్చిక దొలఁకఁ దిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు

చ. 3: కంచిలోన నుండఁ దిరుకచ్చినంబిమీఁదఁ గరు-
ణించి తనయెడకు రప్పించినవాఁడు
యెంచ నెక్కుడైనవేంకటేశుఁడు మనలకు
మంచివాఁడై కరుణఁ బాలించినవాఁడు

రేకు: 2025-04 గుండక్రియ సం: 01-152 అధ్యాత్మ

పల్లవి: కడుఁ జంచలములు కడునధ్రువములు
కడు నల్పములని కాదందురు

చ. 1: కర్మభోధ వికారంబులు
ధర్మతంత్ర సంధానములు
దుర్మదైక సందోహములు
కర్మదూరు లివి గాదందురు

చ. 2: పరమభాగవత భవ్యమతులు
పరమభోధ సంభావకులు
తిరువేంకటగిరిదేవు సేవకులు
కరుణాధికు లివి గాదందురు

రేకు: 2025-05 గుండక్రియ సం: 01-153 వైరాగ్య చింత

పల్లవి: పోయం గాలము వృథయ్యై పుట్టిన మొదలుం గటకట
నీయెడ నామది నిజమై నిటుచుట యెన్నఁ డొకో

చ. 1: కుడిచిన నాఁకలి దీరదు కడువఁగఁ గుడువఁగఁ బైపై
కడుఁబొదలెడు దీపన మిది గడచుట యిఁక నెట్లు
కుడువక మానుట యెన్నడు కోరికదీరుట యెన్నడు
తడయక నీరూపము నేఁ దలఁచుట లెన్నఁడొకో

చ. 2: జీవుఁడుపుట్టిన మొదలునుఁ జేతికి నూఱట చాలక
యేవిధమున భుజియించిన నెడయదు దీపనము
శ్రీవేంకటపతి నా కిఁక శ్రీకరుణామృత మియ్యక
పావనమందదు నామది పాలించంద గదా

రేకు: 2025-06 లలిత సం: 01-154 అధ్యాత్మ

పల్లవి: అతిశయమగు సౌఖ్య మనుభవింపుమన్న
హితవు చేకొననొల్ల రిందరు

చ. 1: కడలేని విజ్ఞానగతికిఁ దోడుగారు
యెడపుల వారలె యిందరు
అడరిన మోక్షసహాయు లెవ్వరు లేరు
యిడుమ పాట్లవారె యిందరు

చ. 2: తిరమైన పుణ్యము బోదించేవారు లేరు
యెరపులవారే యిందరు
తిరువేంకటాచలాధిపుని మీఁది చిత్త
మిరవు నేయకపోయి రిందరు

రేకు: 2025-07 మాళవి సం: 01-155 సంస్కృత కీర్తనలు

పల్లవి: శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణా
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు

చ. 1: కమలాసతీ ముఖకమల కమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమన శ్రీ-
కమలనాభ నీపదకమలమే శరణు

చ. 2: పరమయోగిజనభాగధేయ శ్రీ-
పరమపూరుషా పరాత్పరా
పరమాతుమ పరమాణురూప శ్రీ-
తిరువేంకటగిరిదేవ శరణు

రేకు: 2026-01 లలిత సం: 01-156 వైరాగ్య చింత

పల్లవి: ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు
యెనసి ముందర సాగ దేఁటి బ్రదుకు

చ. 1: కడలేనియాసచే కరఁగికరఁగి చిత్త-
మెడమవంకకు వచ్చె నేఁటి బ్రదుకు
పొడవైన మమతతోఁ బొదలఁ బొదల మాన-
మిడుమపాట్లఁ బడె నేఁటి బ్రదుకు

చ. 2: తెగుదెంపులేనిభ్రాంతికిఁ జిక్కి యాచార-
మెరసి గొందులు దూరె నేఁటి బ్రదుకు
పగగొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన-
మిగురువెట్టక మానె నేఁటి బ్రదుకు

చ. 3: భావింప రోఁతలోఁ బడి పొరలెడిసౌఖ్య -
మేపగింపఁడు జీవుఁ డేఁటి బ్రదుకు
శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటె కాని
యేవంక సుఖము లే దేఁటి బ్రదుకు

రేకు: 2026-02 శ్రీరాగం సం: 01-157 వైరాగ్య చింత

పల్లవి: చావుతో సరియైన సౌఖ్యంబులోఁ దగిలి
వేవేలు దురితముల వేగించు టొండె

చ. 1: కనుఁగొనల నిరుమేను గాఁడిపారుట లొండె
చనుఁగొండలను మహచరులఁ బడు టొండె
తనివోని సురతములఁ దగిలి మునుఁగుట యొండె
ఘనమోహబంధములఁ గట్టువడు టొండె

చ. 2: మొనసి యాశాపాశములయురులఁ బడు టొండె
కనలి పొలయలుకచేఁ గాఁగు టది యొండె
మనసు కాఁతాళమును మల్లువెనఁగుట లొండె
పనిలేని మదనాగ్నిఁ బడి పొరలు టొండె

చ. 3: తడసి మమతల నిరంతర దైన్యమది యొండె
నడుమనే కన్నుగానక తిరుగు టొండె
యెడప కీతిరువేంకటేశుఁ దలఁపఁగలేక
పడని పాట్లనెల్లఁ బడి వేఁగు టొండె

రేకు: 2026-03 ముఖారి సం: 01-158 శరణాగతి

పల్లవి: ఆఁకటివేళల నలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కు మఱిలేదు

చ. 1: కొఱమాలి వున్నవేళ కులము చెడినవేళ
చెఱవొడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మఱిలేదు తెరఁగు

చ. 2: ఆపద వచ్చినవేళ యారడిఁబడినవేళ
పాపపు వేళల భయపడినవేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపుదాఁకాఁ బొరలిన మరిలేదు తెఱఁగు

చ. 3: సంకెళఁ బెట్టినవేళ చంపఁ బిలిచిన వేళ
అంకిలిగా నప్పులవారాఁగిన వేళ
వేంకటేశునామమే విడిపించ గతిగాక
మంకుబుద్ధిఁ బొరలిన మరిలేదు తెఱఁగు

రేకు: 2026-04 ముఖారి సం: 01-159 వైరాగ్య చింత

పల్లవి: మోసమున మాయావిమోహితుఁడై పోయి
కాసు సేయని పనికి గాసిఁబడెఁ బ్రాణి

చ. 1: కన్నులనియెడి మహకల్పభూజము లివి
తన్నుఁ బుణ్యానిఁ జేయఁ దగిలి వచ్చినవి
వున్నతోన్నతబుద్ధి నొనగూర్ప కది దేహి
కన్న చోటికిఁ బఱపి గాసిఁబడెఁ బ్రాణి

చ. 2: చిత్తమనియెడి మహచింతామణి దనకు
తొత్తువలె వలసి తనుఁ దోడుతేఁగలది
హత్తించి హరిమీఁద నలరింప కది వృథా
తిత్తిలో సుఖమునకు తిరిగె నీప్రాణి

చ. 3: కామతత్వంబనెడి కామధేనువు దనకు
వేమారుఁ గోరికల వెల్లిగొలిపెడిది
యీమేను తిరువేంకటేశుఁ జేరకపోయి
కామాంధుఁడై మిగుల గతిమాలెఁ బ్రాణి

రేకు: 2026-05 దేసాక్షి సం: 01-160 అధ్యాత్మ

పల్లవి: కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు తాఁకైనఁ గనుఁడీ

చ. 1: కాకివోటు జముచేత కందుకుందు మరుచేత
మాకాపని గారు మనుజులాల
పోకుమని యాఁపరాదు పొమ్మని చెప్పఁగరాదు
మీకుమీకే చూచుకొండు మీరే కనుఁడు

చ. 2: గాములిల్లు పుట్టమీఁది కప్పు తోలు పై కప్పు
నేమా యెఱఁగము నిపుణులాల
పామునోరికడి మీప్రాణపుటూరుపు గాలి
జాము జాము మేలుఁగీడు చక్కఁజేయఁ గనుఁడు

చ. 3: రచ్చమాని చింతకిందు రాఁపులకూటమిపొందు
ముచ్చో చిచ్చో మూఢులాల
యెచ్చరికతోడ వేంకటేశుదాసులఁ గూడి
పచ్చిగచ్చు మేనితోడ భయమెల్ల బాయుఁడు

రేకు: 2026-06 నాట సం: 01-161 వైరాగ్య చింత

పల్లవి: మందులేదు దీనికి మంత్ర మేమియులేదు
మందుమంత్రము దనమతిలోనే కలదు

చ. 1: కదలకుండఁగఁ దన్నుఁ గట్టివేసినఁ, గట్టు
వదలించకొనఁ గొంత వలదా
వదలించఁబోయిన వడిగొని పైపైనే
కదియుఁగాని తన్ను వదల దేమియును

చ. 2: మనసు లోపలనుండి మరి మీఁదఁ దానుండి
యెనసిన తిరువేంకటేశుని
తనరిన తలఁపునఁ దలఁప దుష్కృతములు
తనకుఁదానే వీడుఁ దలఁకవలదుగాన

రేకు: 2027-01 ఆహిరి సం: 01-162 వైష్ణవ భక్తి

పల్లవి: ఏమి నెఱఁగనిమమ్ము నెక్కువనేసి
పామరుల దొడ్డఁజేసె భాష్యకారులు

చ. 1: గతచన్నవేదాలు కమలజునకు నిచ్చి
అతనికరుణచేత నన్నియుఁ గని
గతిలేకపోయునక లియుగమున వచ్చి
ప్రతిపాలించఁగలిగె భాష్యకారులు

చ. 2: లోకమెల్ల వెల్లిఁబోఁగా లోననే సురలఁ గాచి
ఆకుమీఁదఁ దేలిన యతనికృప
కాకరిమతములెల్ల గాలిఁబుచ్చి పర మిట్టే
పై కొనఁగఁ గరుణించె భాష్యకారులు

చ. 3: పంకజపుఁ జేయి చాఁచి పాదపుఁబరమిచ్చిన-
వేంకటేశుకృపతోడ వెలయఁ దానే
తెంకినే వొడయవరై తిరుమంత్రద్వయాన
పంకమెల్లఁ బోఁగడిగె భాష్యకారులు

రేకు: 2027-02 కన్నడగౌళ సం: 01-163 వైరాగ్య చింత

పల్లవి: ఆటవారిఁ గూడితౌరా ఆటవారిఁగూడిఅన్నిచోట్ల బొమ్మ-
లాట లాడించ నధికుండైతివి

చ. 1: గురుతరమగు పెద్దకొట్టాములోపల
తిరుమైన పెనుమాయఁ దెరగట్టి
అరయ నజ్ఞానము లవి యడ్డముగఁ జేసి
పరగ సుజ్ఞానదీపములు ముట్టించి

చ. 2: తోలుబొమ్మల దొరకొని గడియించి
గాలిచేత వానిఁ గదలించి
తూలేటి రసములు తొమ్మిది గడియించి
నాలుగు ముఖముల నలువున నాడించ

చ. 3: నిన్నేమెత్తురుగాని నీకేమి నీలేరు
మన్నించుదాతలు మరిలేరు
యెన్నఁగఁ దిరువేంకటేశ్వర నీదాసు -
లున్నతులై నిన్ను నుబ్బించి పొగడఁగ

రేకు: 2027-03 సామంతం సం: 01-164 సంస్కృత కీర్తనలు

పల్లవి: బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్తువంతి భక్తా సులభ ఇతి

చ. 1: గదంతికిల సాంఖ్యాస్త్వాం పురుషం
పదవాక్య జాః పదమితిచ
విదంతి త్వా వేదాంతిన-
స్సదా బ్రహ్మ లసత్పదమితిచ

చ. 2: జపంతి మీమాంసకా స్త్వాం చ
విపులకర్మణో విభవ ఇతి
లపంతి నయసకలా స్సతతం
కృపాళుకుర్తా కేవలమితిచ

చ. 3: భణంతి వేంకటపతే మునయో-
హ్యణిమాదిప్రద మతులమితి
గుణవంతం నిర్గుణం పునరితి
గృణంతి సర్వే కేవలమితిచ

రేకు: 2027-04 సామంతం సం: 01-165 సంస్కృత కీర్తనలు

పల్లవి: సతతం శ్రీశం
హితం పరాత్పర మీడే

చ. 1: గదాధరం మేఘగంభీరని-
నదం పరమోన్నతశుభదం
మృదుతరగమనం మేదినీధరం
హృదయనిలయ మహ మీడే

చ. 2: నందకధరం జనార్ధనం గో-
విందం చారుముకుందం
నందగోప వరనందన కందం
యిందుర వినయన మీడే

చ. 3: గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరిదేవ మతులం మ-
హిరమణం స్థిర మీడే

రేకు: 2027-05 ఆహిరి సం: 01-166 కృష్ణ

పల్లవి: ఇన్ని లాగులచేతు లివియపో కడు-
నెన్నిక కెక్కినచేతు లివియపో

చ. 1: గునియుచుఁ దనునెత్తుకొమ్మని తల్లిపై-
నెనయఁ జాఁచినచేతు లివియపో
కినిసి గొవర్ధనగిరి వెల్లగించిన-
యునుమువంటి చేతు లివియపో

చ. 2: పిసికి పూతకిచన్ను బిగియించిపట్టిన-
యిసుమంతలు చేతు లివియపో
పసులఁ గాచుచు గొల్లపడుచుల యమునలో
యిసుక చల్లినచేతు లివియపో

చ. 3: పరమచైతన్యమై ప్రాణుల కెల్లను
యెరవులిచ్చినచేతు లివియపో
తిరువేంకటగిరి దేవుఁడై ముక్తికి-
నిరవు చూపెడుచేతు లివియపో

రేకు: 2027-06 సాళంగనాట సం: 01-167 అధ్యాత్మ

పల్లవి: వాసివంతు విడిచినవాఁడే; యోగి యీ-
అసలెల్లా విడిచిన అతఁడే యోగి

చ. 1: గద్దించి పారెడుతురగమువంటి మనసు
వద్దని మరలించినవాఁడే యోగి
వొద్దనే కొండలవంటి వున్నత దేహగుణాలు
దిద్ది మట్టుపెట్టువాఁడే ధీరుఁడైన యోగి

చ. 2: ముంచుకొన్న యింద్రియపు మోహజలధిలోన
వంచన మునుఁగనట్టివాఁడే యోగి
పొంచి పుణ్యపాపములు పొట్టువంటి కర్మములు
దంచి పారఁజల్లువాఁడే తత్త్వమైన యోగి

చ. 3: వెగటుకామాదుల వెళ్ళఁగొట్టి శాంతుఁడై
వగలుడిగినయట్టివాఁడే యోగి
నిగిడి శ్రీవేంకటేపతి నిజదాసుఁడై భక్తిఁ
దగిలి నిలుపువాఁడే ధన్యుఁడైన యోగి

రేకు: 2027-07 గుండక్రియ సం: 01-168 వైరాగ్య చింత

పల్లవి: తుదిలేనిబంధము తోడునీడై నేను
వదలినా నన్ను వదల దేమినేతు

చ. 1: గులిమికొలుచు దీరఁగుడువ నియ్యక కొత్త -
కొలుచు మీఁదమీఁదఁ గొలవఁగా
కలసిన కర్మపుఁగలిమిచేతఁ దృష్ణ
వెలితిగాక యిల్లువెడల దేమినేతు

చ. 2: అన్నియు నొకమాటే యనుభవింపఁగఁ జేసి
కొన్ని వెచ్చము లొనఁగూడించి
యిన్నిటాఁ దిరువేంకటేశ నిర్మలునిఁగా
నన్నుఁజేసి నీవు నాకుఁ గలుగవయ్య

రేకు: 2028-01 సాళంగం సం: 01-169 వైరాగ్య చింత

పల్లవి: తొలుఁబాపపుణ్యాలతోడఁ బుట్టితినట
బలువైనభవములఁ బడలేనా

చ. 1: గాముల యింటనే కాఁపనయితినట
పాముపుట్ట నుండియైన బతుకలేనా
గోమున హేయపుఁగుండకూడు నించితినట
గామిడి నేగారేతిత్తిఁగా నోపనా

చ. 2: కట్టైనగుణములచే కట్టువడితినట
చుట్టపుబంధాలరొచ్చుకు నోపనా
దట్టపుటాసల నేఁదాల్చితినట నా-
వెట్టకాయము మోపవెఱచేనా

చ. 3: నిగిడినలోపల నీ వుండుదుట
పగవారికి నేఁ బగిలేనా
తగువేంకటేశ నీదయవాఁడనట యీ-
వగల నిన్నిఁట గెలువఁగలేనా

రేకు: 2028-02 శ్రీరాగం సం: 01-170 వేంకటగానం

పల్లవి: ఈతఁడఖిలంబునకు నీశ్వరుఁడై సకల-

భూతములలోనఁ దాఁబొదలు వాఁడితఁడు

చ. 1: గోపాంగనల మెఱుఁగు గుబ్బచన్నులమీఁద

చూపట్టుకమ్మఁ గస్తూరిపూఁత యితఁడు

తాపసోత్తముల చింతాసౌధములలోన

దీపించు సుజ్ఞానదీప మితఁడు

చ. 2: జలధికన్యాపాంగ లలితేక్షణములలో

కలసి వెలుఁగుచు నున్న కజ్జలం బితఁడు

జలజాసనుని వదన జలదిమద్యము నందు

అలర వెలువడిన పరమామృతం బితఁడు

చ. 3: పరివోని సురత సంపదల నింపులచేత

వరవధూతతికి పరమమైన యితఁడు

తిరువేంకటాచలధిపుఁడు దానె యుండి

పరిపాలనము సేయ భారకుండితఁడు

రేకు: 2028-03 సామంతం సం: 01-171 కృష్ణ

పల్లవి: ఎన్నఁగలుగు భూతకోటి నెల్లఁ జేసినట్టిచేత
నిన్నుఁ జేసుకొనుటగాక నీకుఁ నీకుఁ దొలఁగవచ్చునా

చ. 1: గుట్టుచెరిచి లోకమెల్ల ఘోరసంసారమందు
కట్టివేసినట్టి పాపకర్మ మేల తీరును
పట్టితెచ్చి నిన్ను రోలఁగట్టివేసి లోకమెఱఁగ
రట్టుసేసుఁగాక నిన్ను రాజనన్న విడుచునా

చ. 2: మిఱ్ఱుపల్లములకుఁ దెచ్చి మెరసి భూతజాలములకుఁ
దొఱ్ఱుపెసలు గొలచినట్టి దోసమేల పాయును
అఱ్ఱుసాఁచి గోపసతుల నలమి వెంటవెంటఁదిరుగ
వెఱ్ఱిఁ జేయుఁగాక నీవు విభుఁడనన్న విడుచునా

చ. 3: పరులఇంటి కేఁగి పరులపరుల వేఁడఁజేసినట్టి -
యెరుకమాలినట్టి చేఁత లేల నిన్ను విడుచును
వెరపుమిగిలి వేంకటాద్రివిభుఁడ ననుచు జనులచేత-
నరులుగొనఁగఁ జేయుఁగాక ఆస నిన్ను విడుచునా

రేకు: 2028-04 బౌళి సం: 01-172 వేంకటగానం

పల్లవి: ఏమివలసిన నిచ్చు నెప్పుడైననే
యేమరిక కొలిచిన నీతఁడే దైవము

చ. 1: ఘనముగా నిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై
తనుఁగొలువుమని చిత్తములిచ్చుఁ గరుణించి
వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము

చ. 2: మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు
కుచ్చితములేని కొడుకుల నిచ్చును
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు
నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము

చ. 3: పంతమాడి కొలిచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు
యెంతటి పదవులైన నిట్టె యిచ్చు
వింతవింత విభవాల వేంకటేశుఁడిదె మా-
యంతరంగముననుండే అరచేతిదైవము

రేకు: 2028-05 పాడి సం: 01-173 వైరాగ్య చింత

పల్లవి: వెట్టిమోపువంటిమేను విడనాడి వీఁ
డిట్టె దాఁటిపోయె నెటువంటిజాణే

చ. 1: ఘెరమైనఆసల నెడికూఁకటవేరు దవ్వి -
పారవేసి యిడుమలఁ బడనొల్లక
యీరసపుసంసార మింగలము దగిలించి
యేరు దాఁటిపోయె నెటువంటి జాణే

చ. 2: కన్నవారిఁ దన్నుఁ బ్రేమ నన్నవారి దిగనాడి
వున్నతమైనచోట నుండఁబోయి
తన్నుఁదా వేంకటపతిదాసులఁజేరి వాఁడు
యెన్నఁడుఁ దిరిగిరాఁడే యెటువంటిజాణే

రేకు: 2028-06 లలిత సం: 01-174 వైరాగ్య చింత

పల్లవి: వలవని మోహావస్థలఁ బొరలెడి -
మలినం బెన్నఁడు మానును -

చ. 1: ఘోరదురితవికారంబుల
కారణ మెన్నఁడు దీరును
వైరముగొని తనువదలనిబంధపు -
భారం బెన్నఁడు వాయును

చ. 2: జడమగుజిహ్వాచాపల్యముగల -
వెడమతి యెన్నండు వీడును
చెడనిజీవునకు శ్రీవేంకటపతి-
కడుచూ పెన్నఁడు గటుగును

రేకు: 2028-07 లలిత సం: 01-175 అధ్యాత్మ

పల్లవి: ఆశాబద్ధుఁడనై యలసి నిన్నుఁ గడు
గాసిఁ బెట్టినవాఁడఁ గాను

చ. 1: ఘనకర్మపరుఁడనై కర్మరూపునిఁ జేయ
నిను దూరి భారము నీకుఁ గట్టినవాఁడఁ గాను
పనిలేని దుఃఖలంపటుఁడనై దుఃఖము
గనుపించకుమని కడువేఁడినవాఁడఁ గాను

చ. 2: శ్రీవేంకటగిరి దేవేశ నాకిది
గావలె ననువాఁడఁ గాను
కావలసినయవి గదిసిననవి నాకు
గావను మనుజుండఁగాను

రేకు: 2029-01 శ్రీరాగం సం: 01-176 వైరాగ్య చింత

పల్లవి: కోరికె దీరుట యెన్నఁడు గుణమును నవగుణమునుఁ జెడి
వూరక యీమది నీపై నుండుట యెన్నఁడొకో

చ. 1: చిత్తం బాఁకలి దీరదు, చింత దలంపునఁ బాయదు
యెత్తిన పరితాపమునకు నేదీ మితిమేర
హత్తిన పుణ్యము బాపము నప్పటి సుఖముల కొరకే
వత్తికి నూనెఁకు గొలఁదై వడిఁ జనె దివసములు

చ. 2: జీవుఁడె పరతంత్రుఁడుగన చింతింపఁడు నిన్నెప్పుడు
చావునుఁ బుట్టుగు సహజము శరీరధారులకు
శ్రీవనితాహృదయేశ్వర శ్రీవేంకటగిరివల్లభ
పావనమతిమై ప్రాణులు బ్రదుకుట యెన్నఁడొకో

రేకు: 2029-02 కాంబోదిసం: 01-177 వైరాగ్య చింత

పల్లవి: గడ్డపార మింగితే నాఁకలి దీరీనా యీ-
వొడ్డినభవము దన్ను వోడ కమ్ముఁగాక

చ. 1: చించుక మిన్నులఁ బారేచింకలను బండిఁ గట్టి
వంచుకొనేమన్న నవి వసమయ్యీనా
యెంచరాని యింద్రియము లెవ్వరికి నేల చిక్కు
పొంచి పొంచి వలపులు బొండఁబెట్టుఁగాక

చ. 2: మంటమండేయగ్గి దెచ్చి మసిపాఁత మూఁటగట్టి
యింటిలోన దాఁచుకొన్న నితవయ్యీనా
దంటమమకార మిట్టే తన్నునేల సాగనిచ్చు
బంటుఁజేసి ఆసలనే పారఁదోసుఁగాక

చ. 3: పట్టరాని విషములపాముఁ దెచ్చి తలకిందఁ
బెట్టుకొన్నా నది మందపిలి వుండీనా
వెట్టసంసార మిది వేంకటేశుఁ గొలువని-
వట్టిమనుజుల పెడవాడఁబెట్టుఁగాక

రేకు: 2029-03 కన్నడగౌళ సం: 01-178 వైరాగ్య చింత

పల్లవి: కటకటా దేహంబు గాసిఁబెట్టఁగ వలనె
నిటువంటి దెసలచే నిట్లుండవలనె

చ. 1: చంపనొల్లక కదా సంసారమనియెడి-
గంపమోఁపు గడించె కర్మసంగ్రహము
లంపటము విరియించ లావుచాలక తుదిని
దింప నొకకొంతైన తెగుదెంపులేదు

చ. 2: మనుపనోపకకదా మాయవిలంబమున
కనుమూసి కాంక్ష మఱి కట్టె దైవంబు
దినభోగములు విడువఁ దెఱఁ గేమిటను లేక
తనివిఁబొందించ నెంతయు వసముగాదు

చ. 3: తెలుపనోపకకదా తిరువేంకటేశ్వరుఁడు
వెలలేనివేదనల వేఁచెఁ బ్రాణులను
బలిమి నజ్ఞానంబుఁ బాయలే కితనినే
తలఁచి భవబంధముల దాఁటంగరాదు

రేకు: 2029-04 సామంతం సం: 01-179 వైరాగ్య చింత

పల్లవి: అయ్యోపోయఁ బ్రాయముఁ గాలము
ముయ్యంచు మనసున నే మోహమతినైతి

చ. 1: చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁ జెలులు
వట్టి యాసలఁ బెట్టువారే కాక
నెట్టుకొని వీరు గడు నిజమనుచు హరి నాత్మఁ
బెట్టనేరక వృథా పిరివీకులైతి

చ. 2: తగుబంధులా తనకుఁ దల్లులునుఁ దండ్రులును
వగలఁ బెట్టుచుఁ దిరుగువారే కాక
మిగుల వీరలపొందు మేలనుచు హరినాత్మఁ
దగిలించ లేక చింతాపరుఁడనైతి

చ. 3: అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతువాసికిఁ బెనఁగువారే కాక
అంతరాత్ముఁడు శ్రీవేంకటాద్రీశుఁ గొలువ కిటు
సంత కూటముల యలజడికి లోనైతి

రేకు: 2029-05 లలిత సం: 01-180 వైరాగ్య చింత

పల్లవి: మనసున నెప్పుడు మానదిది
దిన బాధెటువలె దీటీనో

చ. 1: చిత్త వికారము జీవుల పాపము
తత్తరపరచక తడయ దిది
కత్తులభొనీ కాయపు వయసున-
నెత్తినమదమున కేదిగతో

చ. 2: అసలుఁగంబ మీయాశాదోషము
విసిగిన నూరక విడువ దిది
వసులమూఁట మోవఁగఁ బడవేయఁగ
వసము గాని దెటువలెనౌనో

చ. 3: పాము చెలిమి రంపపుసంసారము
గాములమోఁచిన గంప యిది
కామించుచు వేంకటపతిఁ దలఁపక
యేమరివుండిన నేమౌనో

రేకు: 2029-06 ధన్నాశి సం: 01-181 వైరాగ్య చింత

పల్లవి: ఎంత విభవము గలిగె నంతయును నాపదని
చింతించినది గదా చెడనిజీవనము

చ. 1: చలముఁ గోపంబుఁ దనుఁ జంపేటిపగతులని
తెలిసినది యదిగదా తెలివి
తలకొన్నపరనింద తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా తుదగన్నఫలము

చ. 2: మెఱయు విషయములే తనమెడనున్నవురులుగా
యెఱిఁగినది యదిగదా యెరుక
పఱివోనియాస దనుఁ బట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా విజ్ఞానమహిమ

చ. 3: యెనలేని తిరువేంకటేశుఁడే దైవమని
వినఁగలిగినదిగదా వినికి
అనయంబు నతని సేవానందపరులయి
మనఁగలిగినదిగదా మనుజులకు మనికి

రేకు: 1930-01 ఆహిరి సం: 01-182 వైరాగ్య చింత

పల్లవి: చెల్లుఁగా కిటు నీకే చింతింపఁగా పూరి -
పుల్ల మేరువుసేయ భూమిలో నిపుడు

చ. 1: చెలఁగి నే మునుసేసినచేఁత లుండఁగా
మలసి నేఁ దిరుగుతిమ్మట లుండఁగా
తొలఁగఁదోసి తప్పుడుతోడనే లోహంబు
వెలయ బంగారుగావించినగతిని

చ. 2: బిగిసి నామైనున్న పెనుకట్లుండఁగా
జగడగాండ్లు పగచాటఁగను
జిగిగలచేఁతిముసిఁడికాయయగునన్ను
మొగిఁ గల్పకము ఫలముగఁ జేయవసమా

చ. 3: పొదిలిన యింద్రియంబులు వెంట రాఁగా
మదివికారము నే మరుగఁగానే
వదలకు వేంకటేశ్వర నన్ను నిదే నీ -
పదపంకజములు చేర్పఁగ నిది వసమా

రేకు: 1930-02 పాడి సం: 01-183 ఉత్సవ కీర్తనలు

పల్లవి: చక్రమా హరి చక్రమా
వక్రమైన దనుజుల వక్కలించవో

చ. 1: చుట్టి చుట్టి పాతాళము చొచ్చి హిరణ్యాక్షుని-
చట్టలు చీరిన వో చక్రమా
పట్టిన శ్రీహరి చేతఁ బాయక యీ జగములు
వొట్టుకొని కావగదవో వో చక్రమా

చ. 2: పానుకొని దనుజుల బలుకిరీటమణుల
సానలఁ దీరిన వో చక్రమా
నానాజీవముల ప్రాణములుగాచి ధర్మ-
మూని నిలుపఁగదవో వో చక్రమా

చ. 3: వెఱచి బ్రహ్మాదులు వేదమంత్రముల నీ
వుఱుట్లు గొనియాడేరో చక్రమా
అఱిముఱిఁ దిరు వేంకటాద్రీశు వీధుల
వొఱవుల మెఱయుదువో వో చక్రమా

రేకు: 1930-03 వరాళి సం: 01-184 వైరాగ్య చింత

పల్లవి: పట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు
బట్టబయలు యీసంసారంబని గుట్టుదెలియలేవు ప్రాణీ

చ. 1: చాల నమ్మి యీ సంసారమునకు సోలిసోలి తిరిగేవు
బాలయవ్వనప్రౌఢల భ్రమఁబడి లోలుఁడవై తిరిగేవు
మేలుదెలియ కతికాముకుండవై మీఁదెఱఁగక తిరిగేవు
మాలెమీఁద పరు వెందాఁకా నీమచ్చిక విడువఁగ లేవు

చ. 2: మానితముగ దురన్నపానముల మత్తుఁడవై వుండేవు
నానావిధములదుష్కర్మంబులు నానాటికి నాటించేవు
మేనిలోని యేగురు నార్గురును మిత్రులనుచు నమ్మేవు
ఆనందంబున నాకర్మమునకు అధిపతులని తెలియఁగలేవు

చ. 3: పామరివై దుర్వ్యాపారమునకుపలుమారునుఁ బొయ్యేవు
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామమనుచు నుండేవు
ప్రేమముతో హరిదాసులపై సంప్రీతి నిలుపఁగాలేవు
తామసమతివయి వేంకటనాథునితత్వ మెఱఁగఁగాలేవు

రేకు: 1930-04 శ్రీరాగం సం: 01-185 వైరాగ్య చింత

పల్లవి: ఈభవనమునకుఁ జూడ నేది గడపల తనదు-

ప్రాభవం బెడలించి బాధఁ బెట్టించె

చ. 1: చెప్పించెఁ బ్రియము వలసినవారలకునెల్ల

రప్పించె నెన్నఁడును రానిచోట్లకును

వొప్పించె నాసలకు వోరంత ప్రొద్దునను

తప్పించె కోరికల తిరిగి నలుగడల

చ. 2: పుట్టించె హేయంపుభోగయోనులనెల్ల

కట్టించె సంసారకలితబంధముల

పెట్టించె ఆసలను పెడకొడములఁ దన్ను

తిట్టించె నిజద్రవ్యదీనకుల చేత

చ. 3: బెదరించె దేహంబు పెనువేదనలచేత

చెదరించె శాంతంబు చెలఁగి చలమునను

విదళించె భవనములను వేంకటేశ్వరుఁ గొలిచి

పదిలించె నతనికృప పరమసౌఖ్యములు

రేకు: 1930-05 భైరవి సం: 01-186 వైరాగ్య చింత

పల్లవి: ఎంతపాపకర్మమాయ యెంతవింతచింతలాయ
వింతవారితోడిపొందు వేసటాయ దైవమా

చ. 1: చూడఁజూడఁ గొత్తలాయ చుట్టమొకఁడు లేఁడాయ
వీడుఁబట్టు ఆలుచాయ వేడుక లుడివోయను
జోడుజోడు గూడదాయ చొక్కుఁదనము మానదాయ
యేడకేడ తలపోఁత యెంతసేసె దైవమా

చ. 2: నీరులేనియేఱు దాఁటనేర దెంతేలోఁతాయ
మేరవెళ్ల నీఁదఁడాయ మేఁటిఁ జేరఁడాయను
తోరమైన ఆస లుబ్బి తోవ గానిపించదాయ
కోరి రాకపోకచేత కొల్లఁబోయఁ గాలము

చ. 3: తల్లి దండ్రి దాత గురువు తానెయైననాచారి
వల్లభుండు నాకు మేలువంటిదాయ జన్మము
కల్లగాదు వేంకటేశుఘనుని పాదసేవ నాకు
మొల్ల మాయ నామనసు మోదమాయ దైవమా

రేకు: 1930-06 రామక్రియ సం: 01-187 వైరాగ్య చింత

పల్లవి: కుడుచుఁగాక తనకొలఁదిగాని మేలు
దడవీనా నోరు తగినయెంతయును

చ. 1: చంపవచ్చిన కర్మసంగ్రహంబగు బుద్ది
గంప గమ్మక తన్ను గాచీనా
పంపుడుదయ్యమై బాధఁ బెట్టెడుయాస
కొంపలోన నుండనీఁగోరీనా

చ. 2: శ్రీవేంకటగిరి శ్రీనాథుఁ డిందరిఁ
గావఁబ్రోవఁగ నున్నఘనుఁడు
దేవోత్తముని నాత్మఁ దెలియ కితరములయిన-
త్రోవ లెన్నిన మేలు దొరకీనా

రేకు: 1931-01 ఆహిరి సం: 01-188 వైరాగ్య చింత

పల్లవి: పారకుమీ వోమనసా పంతము విడువకు మీమనసా

పారిన నీవే బడగయ్యేదవు చేరువ నాఁడే చెప్పనె మనసా

చ. 1: చింతించకుమీ శివునివైరిచే చిక్కువడకుమీ వోమనసా

కంతువారకము వయసుఁ బ్రాయములు కావటికుండలు వోమనసా

యెంతే మేలుఁగీ డేకాలము ఎప్పుడు నుండదు వోమనసా

సంతరించుకో వానిని మనసున సంతోషముగా వోమనసా

చ. 2: యెన్నికలే తలపోయకుమీ యేమరకుండుమి వోమనసా

కన్న విన్న వారిలో నెప్పుడు కాకుపడకుమీ వోమనసా

పున్నమమాసలు పుడమిలో బదుకులు పోయివచ్చేవి వోమనసా

మిన్నో నేలనిమన్న దినములో మీఁదుచూడకుమి వోమనసా

చ. 3: కన్నులసంగాతము సేయకుమీ కళవళించకుమి వోమనసా

వన్నెలమాటలు చెవులఁబెట్టక వాసివిడువకుమి వోమనసా

మున్నిఁటిసురలు బ్రహ్మదులకై నను ముక్తి సాధనము వోమనసా

వెన్నుని వేంకటగిరిఁ దలఁచుము వేసారకుమీ వోమనసా

రేకు: 1931-02 ముఖారి సం: 01-189 వైరాగ్య చింత

పల్లవి: ఏల పొరలేవులేవే యింతలోనిపనికి
మాలయింటితోలుకప్పుమాయ లిటువంటివి

చ. 1: చిక్కులతమకముల చీఁకటిగప్పిననాఁడు
యెక్కువ వాసనలౌ హేయపుమేను
వెక్కసపు ప్రియమది విరిగితే రోఁతలౌ
లక్కపూఁతకపురు లీలాగు లిటువంటివి

చ. 2: మించినచిత్తములో మేలుగలిగిననాఁడు
యెంచరానిచవులౌ నెంగలిమోవి
పెంచుకంటే కష్టమౌ ప్రియముదీరిననాఁడు
చంచలపు చిత్తములచంద మిటువంటిది

చ. 3: వెల్లి గొనుసురతపువేళ మరపులయింపు
కొల్లలాడుటౌ కొనగోరితాఁకులు
నల్లితిండౌ మరి మీఁద మరగితే రోఁతలౌ
వుల్లమిచ్చే వేంకటేశువొద్ది కిటువంటిది

రేకు: 1931-03 ముఖారి సం: 01-190 వైరాగ్య చింత

పల్లవి: ఎట్టు దరించీ నిదె యీజీవుఁడు
బట్టబయలుగాఁ బరచీ నొకటి

చ. 1: చెడనిమట్టిలోఁ జేసినముద్దే
నడుమ ముంచుకొన్నది వొకటి
తడియనినీరై తడివొడమింపుచు
వడిసీని వేపుర వడితో నొకటి

చ. 2: పాయనితనుదీపనములుగా నటు
చేయుచు మది వేఁచీ నొకటి
కాయపుచుట్టరికమ్ములు చేయుచు
రేయుఁబగలు విహరించీ నొకటి

చ. 3: యిన్నియుఁదానే యేచి కపటములు
పన్నీ నిదె లోపల నొకటి
వెన్నెలచూపుల వేంకటేశ నిను
యెన్నికతోఁ గడు నెదిరీ నొకటి

రేకు: 1931-04 ముఖారి సం: 01-191 దశావతారములు

పల్లవి: బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దానె నీపాదము

చ. 1: చెలఁగి వసుధ గొలిచిన నీపాదము
బలి తల మోపిన పాదము
తలఁకక గగనము దన్నిన పాదము
బలరిపుఁ గాచిన పాదము

చ. 2: కామినిపాపము గడిగిన పాదము
పాముతల నిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపుఁ పాదము

చ. 3: పరమయోగులకుఁ బరిపరి విధముల
పరమొసఁగెడి నీపాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన-
పరమపదము నీపాదము

రేకు: 1931-05 సామంతం సం: 01-192 వేంకటగానం

పల్లవి: తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము తన
లోనc బెట్టుకొని మాకు లోనైనవాcడు

చ. 1: చదవించి, కూడవెట్టి, జారకుండ నిల్లుగట్టి
బెదురులేని బుద్ది పిన్ననాcడే చెప్పి
యెదరి నడిగి, ద్రవ్యమిది గొమ్మనుచు నిచ్చి
పదిలమై తమ్ముc బాలించువాcడు

చ. 2: మోహవియోగమ్ముు, మొహానురాగమ్ముు
దేహవిబాగంబు దెలిపిని కలికి
ఐహికమున వేంకటాధీశుcడై సర్వ
దేహరక్షకుcడై తిరుగుచున్నాcడు

రేకు: 1931-06 బౌళి సం: 01-193 వైరాగ్య చింత

పల్లవి: చెదఱక వెలుఁగే చేను మేయఁగఁజొచ్చె
ఆదలించి తగదు నీ కనువారు వేరీ

చ. 1: చిత్త మింద్రియములచేఁ జిక్కి , కడు మద-
మెత్తిన వద్దన నిఁక వేరీ
హత్తినమనసు మోహాదులతోఁ గూడి
తత్తరించిన మాన్పఁదగువారు వేరీ

చ. 2: జీవుఁడిన్నిటికిఁ దాఁ జిక్కి పోయినత్రోవఁ
బోవఁజొచ్చిన బుద్ధిపాల మేది
శ్రీవేంకటేశుని చింతాపరతఁ గాని
కావఁగ నాత్మకు గతి దానేది

రేకు: 1931-07 కన్నడగౌళ సం: 01-194 గురు వందన, నృసింహ

పల్లవి: పోయఁ గాలం బడవికిఁ గాయు వెన్నెలకరణిని

శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు మాయఁబడి చెడక

చ. 1: చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను

చిత్తజగురునిఁ దలఁచుఁడీ చిత్తజుఁ జొరనీక

చ. 2: బూరుగుమాఁకునఁ జెందినకీరముచందమున

ఆరయ నిష్ఫలమగు మరి యన్యులఁ జేరినను

చ. 3: కూరిమి మాతిరువేంకటగిరి గురుశ్రీ పాదములు

చేరినవారికి భవములు చెంద వెపుడు నటుగాన

రేకు: 1932-01 పాడి సం: 01-195 వైరాగ్య చింత

పల్లవి: ఏఁటికి నెవ్వరిపొందు యిస్సిరో చీచీ
నాటకములాల చీచీ నమ్మితిఁగా మిమ్మును

చ. 1: జవ్వనమదము చీచీ చక్కఁదనమరో చీచీ
రవ్వైనరాజసగర్వమరో చీచీ
కొవ్వినమదము చీచీ కూరిమియాసరో చీచీ
నవ్వులదేహము చీచీ నమ్మితిఁగా మిమ్మును

చ. 2: ముచ్చటమమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ
బచ్చురపణములోనిబచ్చన చీచీ
తెచ్చుకోలుతాలిములదిట్టతనమరో చీచీ
పుచ్చినపోకరో చీచీ పోయఁగా మీకాలము

చ. 3: సిరులచీఁకటి చీచీ సిలుగుసంపద చీచీ
వరవిభవమ చీచీ వాసిరో చీచీ
కరుణించెఁ దిరువేంకటగిరిపతి నన్ను
విరసవర్తన చీచీ వీడెఁగా మీభారము

రేకు: 1932-02 సామంతం సం: 01-196 భగవద్గీత కీర్తనలు

పల్లవి: మనుజుఁడైపుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖమందనేలా

చ. 1: జుట్టెఁడు గడుపుకై చొరనిచోట్లు చొచ్చి
పట్టెఁడుగూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి
వట్టిలంపటము వదలనేరఁడుగాన

చ. 2: అందరిలోఁ బుట్టి అందరిలోఁ బెరి-
గందరి రూపము లటు దానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి
అందరానిపదమందె నటుగాన

రేకు: 1932-03 నాట సం: 01-197 అధ్యాత్మ

పల్లవి: లంకెలూడుటే లాభము యీ-
కింకరులను నలఁగెడికంటెను

చ. 1: జంపులఁ జంపక సరుగనఁబాసేటి-
లంపటమేపో లాభము
కంపుమోపుతోఁ గనలి శరీరపు-
కొంపలోన వేఁగుట కంటెను

చ. 2: యీవలనావల నేచేటిల యాసల-
లావు దిగుటెపో లాభము
యేవగింతలకు నిరవగు నరకపు-
కోవులఁబడి మునుఁగుటకంటెను

చ. 3: తివిరి వేంకటాధిపుదాసులకృప-
లవలేశమెపో లాభము
చవులని నోరికి సకలము దిని తిని
భవకూపంబులఁ బడుకంటెను

రేకు: 1932-04 నాట సం: 01-198 అధ్యాత్మ

పల్లవి: తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు
మనసు చంచలబుద్ధి మానీనా

చ. 1: జడ్డుమానవుఁడు చదువఁజదువ నాస
వడ్డివారుఁగాక వదలీనా
గుడ్డికుక్క సంతకుఁబోయి తిరిగిన
దుడ్డుపెట్లే కాక దొరకీనా

చ. 2: దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము తెలిసీనా
శ్రీవేంకటేశ్వరుసేవాపరుఁడుగాక
పావనమతియై పరగీనా

రేకు: 1932-05 భైరవి సం: 01-199 అధ్యాత్మ

పల్లవి: సడిబెట్టెఁగటకటా సంసారము చూడ-
జడధి లోపలి యీఁత సంసారము

చ. 1: జమునోరిలో బ్రదుకు సంసారము చూడ
చమురు దీసిన దివ్వె సంసారము
సమయించుఁ బెనుదెవులు సంసారము చూడ
సమరంబులో నునికి సంసారము

చ. 2: సందిగట్టినతాడు సంసారము చూడ
సందికంతలతోవ సంసారము
చుందురునిజీవనము సంసారము చూడ
చంద మేవలెనుండు సంసారము

చ. 3: చలువలోపలివేఁడి సంసారము చూడ
జలపూఁతబంగారు సంసారము
యిలలోనఁ దిరువేంకటేశ నీదాసులకు
చలువలకుఁ గడుఁజలువ సంసారము

రేకు: 1932-06 ధన్నాశి సం: 01-200 వేంకటగానం

పల్లవి: సామాన్యమా పూర్వ సంగ్రహంబగు ఫలము
నేమమునఁ బెనగొనియె నేఁడు నీవనక

చ. 1: జగతిఁ బ్రాణులకెల్ల సంసారబంధంబు
తగుల బంధించు దురితంపుఁ గర్మమున
మగుడ మారుకుమారు మగువ నీవురముపై
తెగికట్టి రెవ్వరో దేవుండవనక

చ. 2: పనిలేక జీవులను భవసాగరంబులో
మునుఁగ లేవఁగఁ జేయు మోహదోషమున
పనిపూని జలధిలోఁబండఁబెట్టిరి నిన్ను
వెనకెవ్వరో మొదలివేలుపనక

చ. 3: వుండనియ్యక జీవనోపాయమున మమ్ము
కొండలను గొబల తతిగొని తిప్పుఫలము
కొండలను నెలకొన్న కోనేటిపతివనఁగ
నుండవలసెను నీకు నోపలేననక

రేకు: 1932-07 దేవగాంధారి సం: 01-201 అధ్యాత్మ

పల్లవి: ఎందరివెంట నెట్లఁ దిరుగవచ్చు
కందువెఱిఁగి చీఁకటిదవ్వుకొనుఁగాక

చ. 1: తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలినయట్టిదేహి
కొలఁదిమీరినదేవకోట్లు దనలోన
కలవాని నొక్కనినే కొలుచుఁగాక

చ. 2: కాలీచపడఁగ నెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టిప్రాణి
మేలిమిజగములు మేనిలోఁ గలవాఁడు
పాలిటివాఁడై ప్రణుతికెక్కుఁగాక

చ. 3: నూరేండ్ల నెందరి నుతియింపఁ గలవాఁడు
చేరఁదావులేనిజీవి
శ్రీరమణీశుఁడు శ్రీవేంకటేశుని
కోరికెఁ దలఁచి నుతి కొల్ల గొనుటగాక

రేకు: 1933-01 శ్రీరాగం సం: 01-202 భక్తి

పల్లవి: వెన్నపట్టుక నేయి వెదకనేలా మరియు
నెన్ని వలసిన దమయేలిటివే కావా

చ. 1: తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు
కలుగుటే కలుగువలెఁగాక
వలనైన భోగములు వైభవంబులు మరియు
కలవెల్ల తమయెదుటఁ గలిగినవె కావా

చ. 2: పదిలముగ హరినామపఠన మంత్రము నోరు
కదియుటే కలుగవలెఁగాక
తుదలేని సంపదలు తొలగని ముదంబులును
కదలకెప్పుడుఁ దమకు గలిగినవె కావా

చ. 3: యించుకైనను వేంకటేశు గిరిశిఖరంబు
కాంచుటే కలుగవలెఁగాక
అంచితంబైన నిత్యానంద పదవులను
మించి తమయెదుటఁ బ్రభవించినవె కావా

రేకు: 1933-02 ముఖారి సం: 01-203 అధ్యాత్మ

పల్లవి: పసలేని యీబ్రదుకు
అసలు చొచ్చి చొచ్చి అలసినట్టాయె

చ. 1: తొల్లిటిజన్మాదులఁ గాని నరరూపు
పల్లించుకొన్న యీబ్రదుకు
కల్లసుఖములచే కనలి కమ్మర
ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్టాయ

చ. 2: బూటకములనెల్లఁ బొరలి సంసారంపు-
పాటు దెచ్చినయీబ్రదుకు
నీటుగ నెద్దు దన్నినని గుఱ్ఱము -
చాటు కేఁగినయట్టిచందమాయె

చ. 3: పగగొన్న పొగ కోపక మంటఁ బడిపడి
పగలు రేలైనయీబ్రదుకు
తగువేంకటేశ్వరుఁ దలఁచి నేల నుండి
యెగసి మేడమీఁది కేఁగినట్లాయె

రేకు: 1933-03 ముఖారి సం: 01-204 వైరాగ్య చింత

పల్లవి: ఎంతమానుమన్నఁ జింతలేల మానునే
పంతపుమనసు హరిపై నుంటేఁగాక

చ. 1: తీరని బంధాలు నేఁడే తెగుమంటే నేల తెగు
భారపుమమతఁ బెడఁబాసినఁగాక
వూరటగా మమత నేనొల్లనంటే నేల మాను
వోరువుతో లంపటము లొల్లకుంటేఁగాక

చ. 2: వేఁకపుఁగోపము నేఁడే విడుమంటే నేల విడు
తోఁకచిచ్చయినయాసఁ దుంచినఁగాక
ఆఁకట నానేల మాను అన్నిటాను యిందరికి
మాఁకుపడి తత్తరము మఱచుంటేఁగాక

చ. 3: పెట్టనిది దైవ మిట్టే పెట్టుమంటే నేల పెట్టు
యిట్టే వేంకటపతి యిచ్చినఁగాక
యిట్టునట్టు నీతఁడు దా నిందరికి నేల యిచ్చు
వొట్టినవిరక్తి నేమి నొల్లకుంటేఁగాక

రేకు: 1933-04 సామంతం సం: 01-205 భక్తి

పల్లవి: చాలదా హరిసంకీర్తనంగల-

మే లిది దీననే మెరసిరి ఘనులు

చ. 1: తలఁప వేదాశాస్త్రములు గానక

అలరుచు వాల్మీకాదులు

తలకొని హరిమంత్రమే దగఁ బేర్కొని

అలవిమీరఁ గడు నధికములైరి

చ. 2: యితరదైవముల నెఱఁగనేరక

ప్రతిలేనిమహిమఁ బార్వతి

మతిఁ దలఁపుచు హరిమంత్రమె పేర్కొని

సతతము హరులో సగమై నిలిచె

చ. 3: చదువులుఁ బలుమరుఁ జదువనోపక

అదివో నారదాదులు

పదిలపువేంకటపతిహరినామమే

వదల కిదియ జీవనమై మనిరి

రేకు: 1933-05 సామంతం సం: 01-206 అధ్యాత్మ

పల్లవి: పోయఁబోయఁ గాలమెల్ల పూఁటవూఁటకు
చేయి నోరు నోడాయ చెల్లఁబో యీరోఁతలు

చ. 1: తిప్పన తొప్పన కేతు దేవన బావన గనున్న
పప్పన బొప్పనగారి బాడిపాడి
కుప్పలుఁదెప్పలు నైనకోరికెలు మతిలోన
యెప్పుడుఁ బాయకపోయ నెన్ని లేవు రోఁతలు

చ. 2: కాచన పోచన మాచు కల్లప బొల్లప మల్లు
బాచన దేచనగారిఁ బాడిపాడి
యేచినపరసుఖము నిహమును లేకపోయ
చీచీ విరిగితిమి చెప్పనేల రోఁతలు

చ. 3: బుక్కన తిక్కన చెల్లు బూమన కామన పేరి-
బక్కల నిందరి నోరఁ బాడిపాడి
యెక్కువైన తిరువేంకటేశునిఁ దలఁచలేక
కుక్కకాటుఁ జెప్పుటాటై కూడె నిన్ని రోఁతలు

రేకు: 1933-06 సాళంగనాట సం: 01-207 నిష్యక్సేన

పల్లవి: పటుశిష్టప్రతిపాలకుఁడ వనఁగ
ఘటన నఖిలమును గాతువుగా

చ. 1: తత్తుమురుగ దైత్యుల దనుజుల నవి
మొత్తి మోఁది చలమునఁ జెలగి
జొత్తుపాపలుగ సారిది విరోధుల-
నెత్తురు వడుతువు నీవేకా

చ. 2: తళతళమెఱుచుసుదర్శనాయుధం-
బలరుచు నొకచే నమరఁగను
బలుదైత్యులదొబ్బలుఁ బేగులు నని
నిలువునఁ జెండుదు నీవేకా

చ. 3: దిట్టవు సూత్రవతీపతి వసురలఁ
జట్టలు చీరఁగఁ జతురుఁడవు
రట్టడి వేంకటరమణుని వాకిటి-
పట్టపు సేనాపతిపటకా

రేకు: 1934-01 దేసాక్షి సం: 01-208 అధ్యాత్మ

పల్లవి: పోయఁ బోయఁ గాలమెల్ల గాలమెల్ల పూఁట పూఁటకు
రోయనిరోఁతలు చూచి రుచి చూరఁబోయ

చ. 1: తాడిమానెక్కేటివాని తడయక పట్టిపట్టి
తోడఁదోడ నెందాఁకాఁ దోయవచ్చును
కాడువడ్డ చిత్తమిది కలకాలము నిట్టే
ఆడికెలకులోనై తనియక పోయ

చ. 2: మన్నుదినియేటిదూడ మానుమంటా మొత్తిమొత్తి
కన్నిగట్టి యెందాఁకఁ గాయవచ్చును
సన్నపుటాసలమీఁదిచరిఁబడ్డదేహమిది
కన్నపుఁగత్తులచూపు కట్టరాకపోయ

చ. 3: హేయము దొక్కకుమన్న యేచి తినేననేవాఁడు
చాయకు రాకున్న నేమిసేయవచ్చును
మాయలవేంకటపతి మచ్చుచల్ల నాయాత్మ
పాయక యాతనిఁజేరి భయమెల్లఁ బోయ

రేకు: 1934-02 మాళవిగౌళ సం: 01-209 అధ్యాత్మ

పల్లవి: పాపమెరంగనిబ్రహ్మఁడు యెందుఁ
జూపరానిచోట చూపీనయ్యా

చ. 1: తనివోక జీవముతలకాయ నంజూడు
పనివడి తిని తిన్న బ్రాహ్మఁడు
యెనసి యెదిరిఁ దన్ను నెఱఁగక విభుఁడై
ఘనవంశము మంటఁ గలపీనయ్యా

చ. 2: యెవ్వారు నెఱఁగనియెముకలయింటిలో
పవ్వళింపుచునున్న బ్రహ్మఁడు
జవ్వనమదమున జడినేటికోమలిఁ
బువ్వులతోఁటలోఁ బొదిగీనయ్యా

చ. 3: చెలఁగి కన్నెరికము చెడనిపడుచుఁ దెచ్చి
పలువేదనలఁబెట్టే బ్రహ్మఁడు,
తెలిసి వేంకటాధిపునిదాసుఁడై
పులుగు పంజారాన బొదిగీనయ్యా

రేకు: 1934-03 శంకరాభరణం సం: 01-210 అధ్యాత్మ

పల్లవి: ఇన్నిచేతలును దేవుఁడిచ్చినవే
వున్నవారియీవులెల్ల నొద్దికయ్యీనా

చ. 1: తెగనియాపదలకు దేవుఁడే కలఁడుగాక
పగలుడుపఁ బరులవస మయ్యీనా
నొగిలి యితరలకు నోళ్ళుదెరచిన
నగుఁబాటేకాక మానఁగఁబొయ్యీనా

చ. 2: అగ్గలపుదురితాలు హరియే మానుపుఁగాక
బగ్గన నొక్కరు వచ్చి పాపఁబొయ్యేరా
తగ్గుముగ్గులైనవేళ తలఁచినవారెల్ల
సిగ్గుఁబాటేకాక తమ్ముఁ జేరవచ్చేరా

చ. 3: యెట్టు నేసినను వేంకటేశుఁడే నేరుచుఁగాక
కట్టఁగడవారెల్లఁ గరుణించేరా
యిట్టే యేమడిగిన నీతఁడే యొసఁగుఁగాక
పుట్టిపడి యెవ్వరైనా నూరడించేరా

రేకు: 1934-04 ఆహిరి సం: 01-211 కృష్ణ

పల్లవి: ఎటువంటిరౌద్రమో యెటువంటికోపమో
తటతట నిరువంక దాఁటీ వీఁడే

చ. 1: తోరంపుఁ బెనుచేతుల మల్లచఱచి
దారుణలీలఁ బెదవు లవుడుకఱచి
కారించి చాణూరుఁ గడుభంగపఱచి
వీరుఁడై యెముకలు విఱచీ వీఁడే

చ. 2: పిడుగడచినయట్టు పెడచేత నడిచి -
పడనీక పురములోపలఁ జొరఁబొడిచి
తొడిచి చాణూరు నెత్తుక దయవిడిచి
వడివెట్టి నెత్తురు వడిచీ వీఁడే

చ. 3: బుసకొట్టుచును వూరుపులఁ జెమరించి
మసిగాఁగ బెదపెదమల్లుల దంచీ-
నెసఁగి శ్రీతిరువేంకటేశుఁడై మించి
ముసిముసినవ్వుల ముంచీ వీఁడే

రేకు: 1934-05 ఆహిరి సం: 01-212 అధ్యాత్మ

పల్లవి: ఆసమీఁద విసుపౌ దాఁక యీ
గాసిఁ బరచుతన కపటమే సుఖము

చ. 1: తిరమగుఁ కర్మము దెగుదాఁక తన-
గరిమ సుఖము పొగడునందాఁక
పరమార్గం బగపడుదాఁక తన-
పరితాపపు లంపటమే సుఖము

చ. 2: కాయము గడపల గనుదాఁక యీ
మాయ దన్ను వెడమరుదాఁక
రాయడి మదము గరఁగుదాఁక యీ-
రోయఁదగిన తనరూపమే సుఖము

చ. 3: లంకెలఁ బొరలి నలఁగుదాఁక యీ
యంకెల భవము లెరవౌదాఁక
వేంకటపతిఁ దడవిన దాఁక యీ
కింకురువాణపు గెలుపే సుఖము

రేకు: 1934-06 సాళంగం సం: 01-213 అధ్యాత్మ

పల్లవి: తన కర్మమెంత చేఁతయు నంతే
గొనకొన్న పనియంత కూలీనంతే

చ. 1: తలఁపులో హరి నెంత దలఁచె నేఁడే వాని
కలిమియు సుఖమును గల దంతే
తులఁదూఁచఁ బైఁడెంత తూఁకము నంతే
నెలకొన్నపిండెంత నిప్పటీ నంతే

చ. 2: సిరివరుపూజెంత సేసె నేఁడే వాని-
దరియును దాపు నెంతయు నంతే
పురిగొన్న యీవెంత పొగడూ నంతే
నరపతిచనవెంత నగవూ నంతే

చ. 3: శ్రీవేంకటపతి చింత యంత నేఁడే
భావపరవశము పలుకూ నంతే
దైవము కృప యంత తానూ నంతే
యేవంక జయమెంత యిరవూ నంతే

రేకు: 1935-01 బౌళి సం: 01-214 భక్తి

పల్లవి: ఎండగాని నీడగాని యేమైనఁగాని
కొండలరాయఁడే మా కుల దైవము

చ. 1: తేలుగాని పాముగాని దేవపట్టయినఁగాని
గాలిగాని ధూళిగాని కాని యేమైనా
కాలకూటవిషమైన గక్కున మింగిన నాటి
నీలవర్ణుఁడే మానిజ దైవము

చ. 2: చీమగాని దోమ గాని చెలఁది యేమైనఁగాని
గాముగాని నాముగాని కాని యేమైనా
పాములన్నిమింగే బలుతేజిపైనున్న
ధూమకేతువే మాకు దొర దైవము

చ. 3: పిల్లిగాని నల్లిగాని పిన్న యెలుకైనఁగాని
కల్లగాని పొల్లగాని కాని యేమైనా
బల్లిదుఁడై వేంకటాద్రిపైనున్నయాతఁడే మ-
మ్మెల్లకాలమును నేలేయింటి దైవము

రేకు: 1935-02 ఆహిరి సం: 01-215 వైరాగ్య చింత

పల్లవి: ఇందునందుఁ దిరుగుచు నెవ్వరివాఁడవుగాక
బందెపసురమవైతి బాపు జీవుఁడా

చ. 1: తోలుబొక్కలోనఁ జొచ్చి తూలేటిఁయాకలిచేత
పాలుమాలి యిందరికి బంటుబంటవై
యేలినవానిఁ గానక యేచినయాసల వెంట
కూలికిఁబో దొరకొంటి కూళజీవుఁడా

చ. 2: తీఁటమేనిలోనఁ జొచ్చి దిమ్మరిదొంగలచేత
మూఁటగట్టించుక నీవు మూలదొరవై
గాఁటపువిభునిచేతిఘనత కోరికలకు
వేఁటకుక్కవైతివి వెట్టిజీవుఁడా

చ. 3: చీమలింటిలోనఁ జొచ్చి చిక్కువడి అందరిలో
దోమకరకుట్లకు తోడిదొంగవై
యేమరి వేంకటవిభు నెఱఁగక జాడుఁజొప్ప
నాము మేయ దొరకొంటి నాలిజీవుఁడా

రేకు: 1935-03 శ్రీరాగం సం: 01-216 వైరాగ్య చింత

పల్లవి: వేదనఁ బొరలే వెరవేలా
యీదయ విధి దన కీయదా

చ. 1: తత్తరపాట్ల తనువికారములఁ
జిత్తము దెంచే చెలువేలా
బత్తితో దాఁచిన పరధనంబుంగొని
సత్తయి వుండుట చాలదా

చ. 2: యెక్కువతమకపుటింతులఁ బొందక
పక్కుచువాడేవయసేలా
మొక్కుచు దాఁచిన మూలధనము గన-
నెక్కువ దైవం బియ్యదా

చ. 3: సేఁతలఁ బొరలెడి చిక్కులఁ గెరలెడి-.
రోఁతల యీనేరుపులేలా
బాఁతిగ వేంకటపతిరతిఁ జిత్తపు-
టూఁతలఁ గోరిక లూనవా

రేకు: 1935-04 ముఖారి సం: 01-217 అధ్యాత్మ

పల్లవి: వెరపులు నొరపులు వృథా వృథా
ధరపై మరయంతయును వృథా

చ. 1: తడయక చేసినదానంబులు వృథ
యెడనెడ నెఱిఁగిన యెఱుక వృథా
వొడలిలోనిహరి నొనరఁగ మతిలోఁ
దడవనిజీవమె తనకు వృథా

చ. 2: జగమునఁ బడిసినసంతానము వృథ
తగిలి గడించినధనము వృథ
జగదేకవిభుని సకలాత్ముని హరిఁ
దెగి కొలువనిబుద్ధియును వృథా

చ. 3: పనివడికూడిన పరిణామము వృథ
వొనరఁగనుందినవునికి వృథా
ఘనుఁడుగు తిరువేంకటగిరి హరిఁగని
మననేరని జన్మములు వృథా

రేకు: 1935-05 ఆహిరి సం: 01-218 వైరాగ్య చింత

పల్లవి: ఏమి గలిగెను మా కిందువలన
వేమారుఁ బొరలితిమి వెట్టిగొన్నట్లు

చ. 1: తటతటన నీటిమీఁదట నాలజాలంబు-
లిటునటుఁ జరించవా యీఁది యీఁది
అటువలెనెపో తమకమంది సంసారంపు-
ఘటనకై తిరిగితిమి కడ గానలేక

చ. 2: దట్టముగఁ బారావతముల మిన్నుల మోవ
కొట్టఁగొన కెక్కవా కూడి కూడి
వట్టియాసలనే యిటువలెనేపో యిన్నాళ్ళు
బట్ట బయ లీఁదితిమి పనిలేనిపాట

చ. 3: బెరసి కుమ్మరపురువు పేఁడలోపలనెల్ల
పొరలదా పలుమారుఁ బోయిపోయి
వరుస జన్మముల నటువలెనె పొరలితిమి
తిరువేంకటాచలాధిపుఁ దలఁచలేక

రేకు: 1935-06 ఆహిరి సం: 01-219 అధ్యాత్మ

పల్లవి: హరినెఱఁగనిపుణ్య మంటేరుగాన
దురితాలే దురితాలే దురితాలే సుండీ

చ. 1: దొడ్డపుణ్యములు సేసి తుదలేనిసంపదలు
అడ్డగించుకొని రాసులగుగురుతు
జడ్డులేనిహరికథ చవిలేకుండిన నిట్టే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండీ

చ. 2: వలేనని మేలేల్ల వడిఁజేసి కైవల్య-
మలమి చేతికిలోననగు గురుతు
తలఁపు వైష్ణవభక్తిఁ దగులకుండిన నంతా
అలయికే అలయికే అలయికే సుండీ

చ. 3: తిరమైన తీర్థాలు దిరిగి యందరిలోన
ధరఁ బుణ్యుఁడవుట యంతకు గురుతు
తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా
విరసాలే విరసాలే విరసాలే సుండీ

రేకు: 1936-01 పాడి సం: 01-220 వైరాగ్య చింత

పల్లవి: ఏడ వలపేడ మచ్చిక ఏడ సుద్దులు
ఆడుకొన్న మాటలెల్లా నవి నిజాలా

చ. 1: తొలుకారు మెఱుపులు తోచి పోవుఁగాక
నెలకొని మింట నవి నిలిచీనా
పొలఁతుల వలపులు పొలసిపోవుఁగాక
కలకాలం బవి కడతేరీనా

చ. 2: యెండమావులు చూడ నేరులై పారుఁగాక
అండకుఁబోవ దాహ మణఁగీనా
నిండినట్టి మోహము నెలఁతల మదిఁ జూడ
వుండినట్టేవుండుఁగాక వూఁతయ్యీనా

చ. 3: కలలోనిసిరులెల్ల కనుకూర్కు లేకాక
మెలఁకువఁ జూడ నవి మెరసీనా
అలివేణులమేలు ఆసపాటేకాక
తలఁపు వేంకటపతిఁ దగిలీనా

రేకు: 1936-02 ఆహిరి సం: 01-221 అధ్యాత్మ

పల్లవి: ఏమి సేయఁగవచ్చు నీశ్వరాధీనంబు
తామసపుబుద్ధి కంతలు దూరవలసె

చ. 1: తెగి దురాపేక్షఁబడ తివియ గతిలేదుగన
పగగొన్న వగలకూపములఁ బడవలసె
తగుమోహసలిలంబు దాఁట మతి లేదుగన
మగుడఁబడి భవముతో మల్లాడవలసె

చ. 2: పాపకర్మములఁ జంపఁగ శక్తిలేదుగన
కోపబుద్ధులచేత కొరమాలవలసె
రూపములఁ బొడగాంచి రోయఁదరిలేదుగన
తాపములచేఁ బొరలి తగులుగావలసె

చ. 3: తిరువేంకటాచలాధిపుఁగొలువలేదుగన
గరిమెచెడి విషయకింకరుఁడు గావలసె
పరతత్వమూర్తిఁ దలఁపఁగఁ బ్రొద్దులేదుగన
దొరతనం బుడిగి యాతురుఁడు గావలసె

రేకు: 1936-03 వరాళి సం: 01-222 వైరాగ్య చింత

పల్లవి: తనవారని యాస దగిలి భ్రమయనేల
తనువుఁ బ్రాణునికంటె తగులేది

చ. 1: తనువుఁ బ్రాణుడు రెండు తగిలి గర్భమునందు
వొసర నేకమై యుదయించి
దినములు చెల్లిన తివిరి యాప్రాణుఁడు
తనువువిడిచిపోయ దయలేక

చ. 2: ప్రాణికై దేహము పాపపుణ్యముసేయు
ప్రాణి వెంటనె బొంది పాశుండదు
ప్రాణి యచ్చటనైన బాధలఁ బడకుండ
ప్రాణి రక్షించు బొందిబడి దాఁ బోయనా

చ. 3: యెరవుల దేహలివి నిజమని నమ్మి
యెరిఁగీనెఱుఁగలే రిది యాలా
అరయఁ బరమునకు నాది పురుషుఁడై
పరగుశ్రీ వేంకటపతి గలిగుండఁగా

రేకు: 1936-04 సామంతం సం: 01-223 అధ్యాత్మ

పల్లవి: సకల భూతదయ చాలఁగ గలుగుట
ప్రకటించి దేహ సంభవమైన ఫలము

చ. 1: తలకొన్నఫలవాంఛఁ దగులకుండఁగఁ జిత్త-
మలవరించుట కర్మియైనఫలము
పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి
గలుగుట హరికృపగలిగినఫలము

చ. 2: యెప్పుడుఁ దిరివేంకటేశు సేవకుఁడౌట
తప్పక జీవుఁడు దానైనఫలము
కప్పినసౌఖ్యదుఃకర్మములు సమముగా
నొప్పుట విజ్ఞానమొదవినఫలము

రేకు: 1936-05 వరాళి సం: 01-224 అధ్యాత్మ

పల్లవి: అన్నలంటాఁ దమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
వన్నెల నప్పులుగొన్నవారువో వీరు

చ. 1: తెగనీక అప్పులెల్లాఁ దీసితీసి | వారు
తగిలినఁ బెట్టలేక దాఁగి దాఁగి
వెగటునఁ బారిపోఁగా వెంట వెంట | పెక్కు
పగల నప్పులుగొన్న వారువో వీరు

చ. 2: సేయరానిపనులెల్లఁ జేసిచేసి | తవ-
రాయడికి లోలోనే రాసిరాసి
కాయములోఁచొచ్చిచొచ్చి కాఁచికాఁచి | మున్ను
వ్రాయనిపత్రాల కాఁగేవారువో వీరు

చ. 3: దొరయై యప్పులవారిఁ దోసితోసి | యీ-
పరిభవములనెల్లఁ బాసిపాసి
సిరులవేంకటపతిఁ జేరిచేరి | యిట్టి ...
వరుసనే గెలిచినవారువో వీరు

రేకు: 1936-06 కన్నడగౌళ సం: 01-225 వైరాగ్య చింత

పల్లవి: ఏది కడ దీని కేది మొదలు | వట్టి ...
వేదనలు తన్ను విడుచు టెన్నఁడు

చ. 1: తొడరినహృదయమే తోడిదొంగయ్యై
వడిగొని తన్ను వలఁబెట్టఁగాను
కడఁగి కర్మములఁ గడచు టెన్నడు
నిడినిబంధముల నీఁగు టెన్నఁడు

చ. 2: తతిగొన్న తలఁపులే దైవయోగమ్మై
మతినుండి తన్ను మరిగించఁగాను
ప్రతిలేని యాపదఁ బాయు టెన్నఁడు
ధృతిమాలిన యాస దీరు టెన్నఁడు

చ. 3: పొదలిన మమతయే భూతమ్మై తన్నుఁ
బొదిగొని బుద్ధి బోధించఁగాను
కదిసి వేంకటపతిఁ గనుట యెన్నఁడు
తుదలేనిభవములఁ దొలఁగు టెన్నఁడు

రేకు: 1936-07 శుద్ధవసంతం సం: 01-226 భగవద్గీత కీర్తనలు

పల్లవి: కడలుడిపి నీరాడఁగాఁ దలఁచువారలకు
కడలేని మనసునకుఁ గడమ యెక్కడిది

చ. 1: దాహమణఁగినవెనుక తత్వమెరిఁగెదనన్న
దాహమేలణఁగు తా తత్వ మే మెరుఁగు
దేహంబుగలయన్ని దినములకుఁ బదార్థ-
మోహమేలుడుగు దా ముదమేల కలుగు

చ. 2: ముంద రెరిఁగిన వెనుక మొదలు మరచెదనన్న
ముంద రేమెరుఁగుఁ దా మొదలేల మరచు
అందముగఁ దిరువేంకటాద్రీశు మన్ననల
కందువెరిఁగినమేలు కలనైన లేదు

రేకు: 1937-01 మలహరిసం: 01-227 తిరుపతి క్షేత్రం

పల్లవి: అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము
లందు వెలుగొందీ ప్రభ మీరఁగాను

చ. 1: తగ నూటయిరువై యెనిమిది తిరుపతుల గల
స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును
నధికమై చెలువొందఁగాను

చ. 2: మిగుల నున్నతములగు మేడలును మాడుగులు
మితిలేని దివ్య తపసులున్న గృహములును
వొగి నొరగుఁ బెరుమాళ్ళ వునికి పట్టయివెలయు
దిగువ తిరుపతి గడవఁగాను

చ. 3: పొదలి యరయోజనము పొడవుననుఁ బొలుపొంది
పదినొండు యోజనంబుల పరపుననుఁ బరగి
చెదరకే వంక చూచిన మహాభూజములు
సింహశార్దూలములును

చ. 4: కదిసి సురవరలు కిన్నరులు కింపురుషులును.....
గరుడ గంధర్వ యక్షులును విద్యాధరులు
విదితమై విహరించు విశ్రాంతదేశముల
వేడుకలు దైవారగాను

చ. 5: యెక్కువల కెక్కువై యెసఁగి వెలసిన పెద్ద-
యెక్కు డతిశయముగా నెక్కి నంతటిమీఁద
అక్కజంబైన పల్లవరాయని మటము
అలయేట్లపేడ గడవ
చక్కనేఁగుచు నవ్వచరిఁ గడచి హరిఁ దలఁచి
మ్రొక్కుచును మోకాళ్ళముడుగు గడచిన మీఁద-
నక్కడక్కడ వేంకటాద్రీశు సంపదలు
అంతంతఁ గానరాఁగాను

చ. 6: బుగులుకొను పరిమళంబుల పూవుఁదోఁటలును
పొందైన నానావిధంబుల వనంబులును
నిగిడి కిక్కిరిసి పండిన మహావృక్షముల-
నీడలను నిలిచి నిలిచి
గగనంబు దాఁకి శృంగార రసభరితమై -

కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలు గల నగరు
సరుగననుఁ గానరాఁగాను

చ. 7: ప్రాకటంబైన పాపవినాశనములోని
భరితమగు దురితములు పగిలి పారుచునుండ
ఆకాశగంగ తోయములు సోఁకిన భవము
లంతంత వీఁడి పారఁగను
యీకడనుఁ గోనేట యతులుఁ బాశుపతుల్ మును-
లెన్న నగ్గలమైవున్న వైష్ణవులలో
యేకమై తిరువేంకటాద్రీశుఁడాదరిని
యేప్రొద్దు విహరించఁగాను

రేకు: 1937-02 ముఖారి సం: 01-228 భక్తి

పల్లవి: సిరి దొలంకెడి పగలు చీఁక టా యితఁడేమి
యిరవు దెలిసియుఁ దెలియనియ్యఁడటుగాన

చ. 1: తలపోయ హరినీలదర్పణంబో ఇతఁడు
వెలుఁగుచున్నాడు బహువిభవములతోడ
కలగుణం బటువలెనె కాఁబోలు లోకంబు
గలదెల్ల వెలిలోనఁ గనిపించుఁ గాన

చ. 2: మేరమీరిననీలమేఘమో యితఁడేమి
భూరిసంపదలతోఁ బొలయుచున్నాడు
కారుణ్యనిధియట్ల కాఁబోలు ప్రాణులకు
కోరికలు దలఁపులోఁ గురియు నటుగాన

చ. 3: తనివోనిఆకాశతత్త్వమో యితఁడేమి
అనఘుఁడీ తిరువేంకటాద్రి వల్లభుఁడు
ఘనమూర్తి అటువలెనె కాఁబోలు సకలంబు
తనయందె యణఁగి యుద్భవమందుఁగాన

రేకు: 1937-03 ఆహిరి సం: 01-229 అధ్యాత్మ

పల్లవి: తనవారలు పెరవారలుఁ దానని యెడివాఁ డెవ్వఁడు
తనుగుణముల దిగవిడిచినధన్యుం డాతఁడెపో

చ. 1: తెగఁబడి మదనసముద్రము దేహముతోడనె దాఁటిన
విగతభయుం డతఁ డెవ్వఁడు వీరుం డెవ్వఁడొకో
పగగొని పంచేంద్రియముల ప్రాణముతోడనె బతికి
జగదేకప్రీతుండగుచతురుం డాతఁడెపో

చ. 2: యేచినపరితాపాగ్నుల నేమియు నొవ్వక వెడలిన
ధీచతురుం డతఁడెవ్వఁడు ధీరుం డెవ్వఁడొకో
చూచిన మోహపుఁజూపులఁ జూరుచూండ్ల కెడమియ్యని
రాచటికపు నెరజాణఁడు రసికుం డాతఁడెపో

చ. 3: చాపుకు సరియగు ద్రవ్యవిచారపు తుగులులఁ బాసిన
పావనుఁ డెవ్వఁడు బహుజనబాంధవుఁ డెవ్వఁడొకో
శ్రీవేంకటగిరినాథుని చిత్తములోపల నిలిపిన -
దేవసమానుఁడు నాతఁడె ధీరుఁడు నాతఁడెపో

రేకు: 1937-04 దేవగాంధారి సం: 01-230 అధ్యాత్మ

పల్లవి: చెప్పుడుమాటలే చెప్పకొనుటగాక
చెప్పినట్లఁ దాము నేయ రెవ్వరును

చ. 1: దొడ్డయినశరీరదోషమైనయట్టి
జడ్డు దొలఁగవేయఁజాల రెవ్వరును
గడ్డబడి యీఁతకాండ్లౌటగాని
వొడ్డునడుమ నీఁద నోపరెవ్వరును

చ. 2: శ్రీవేంకటేశుపైఁ జిత్త మర్పణ నేసి
యీవిధు లన్నియు నెడయ రెవ్వరును
చావుఁ బుట్టగులేని జన్మముగలసర్వ.-
దేవతామూర్తులై తిరుగ రెవ్వరును

రేకు: 1938-01 దేసాక్షి సం: 01-231 అధ్యాత్మ

పల్లవి: వేసరితిఁమెట్ల నీవెంటఁ దిరిగి
గాసిఁబెట్టక మమ్ముఁ గావరాదా

చ. 1: తీసితివి కోరికల తెగనీక పంచలకు
తోసితివి యింటింటఁ దోయఁదోయ
చేసితివి నీచేఁత చెల్లె నిఁకనైనను
ఆస నీపొందొల్ల మంపరాదా

చ. 2: కట్టితివి కర్మముల కడదాఁక నాపదలఁ
బెట్టితివి దుఃఖములఁ బెనచిపెనచి
పట్టితివి చలము మము పాయనని యాస నీ-
విట్టైన గొంతసుఖ మియ్యరాదా

చ. 3: కఱపితివి పాపములే కడఁగి నానావిధుల
నెఱపితివి దుర్దశలే నేర్పుమెరసి
తెఱఁ గొసంగియును శ్రీతిరువేంకటేశ్వరుని-
నెఱిఁగియును నెఱఁగలే మింక నేతెరువో

రేకు: 1938-02 సామంతం సం: 01-232 అధ్యాత్మ

పల్లవి: నీవనఁగ నొకచోట నిలిచివుండుటలేదు
నీవనుచుఁ గనుఁగొన్న నిజమెల్ల నీవే

చ. 1: తనయాత్మవలెనె భూతములయాతుమలెల్ల -
ననయంబుఁ గనుఁగొన్నయతఁడే నీవు
తనుఁగన్న తల్లిఁగా తగనితరకాంతలను
ఆనఘుఁడై మదిఁజూచునతఁడే నీవు

చ. 2: సతతసత్యవ్రతాచారసంపన్నుఁడై
ఆతిశయంబుగ మెలఁగునతఁడే నీవు
ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు-
హతకాముకుఁడైనయతఁడే నీవు

చ. 3: మోదమున సుఖదుఃఖములు నొక్కరీతిగా
నాదరింపుచునున్న యతఁడే నీవు
వేదోక్తమతియైన వేంకటాచలనాథ
ఆదియును నంత్యంబు నంతయును నీవే

రేకు: 1938-03 ముఖారి సం: 01-233 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరికైనను యీవ్రాఁత నను
నవ్వులు సేసెఁబో నావ్రాఁత

చ. 1: తొలిజన్మంబున దోషకారియై
నలుగడఁ దిప్పెను నావ్రాఁత
యిల దుర్గణముల కీజన్మంబున -
నలఁకువ నేనెఁబో నావ్రాఁత

చ. 2: పురుషునిఁజే శల్పుని ననిపించుట
నరజన్మమునకు నావ్రాఁత
తరుచయ్యినపాతక మరుపెట్టుక
నరకము చూపెఁబో నావ్రాఁత

చ. 3: పామజీతనమున బహువేదనలను
నామన సెనసెఁబో నావ్రాఁత
కామితఫలు వేంకటపతినిఁ గొలిచి
నామతి దెలిపెఁబో నావ్రాఁత

రేకు: 1938-04 ఆహిరి సం: 01-234 వైరాగ్య చింత

పల్లవి: కూడులేక యాఁటికిఁ గూరఁ దిన్నట్లు
ఆడనీడ మోవిచిగురాకు దినేరయ్య

చ. 1: దుండగపుఁ బగవారు దోఁచఁగానే తమకాన
కొండలెక్కినట్లు సిగ్గు గొల్లఁబోఁగాను
దండువెళ్లేమదనునిదాడికి సతులచన్ను-
గొండలెక్కి సారెసారె గోడనేరయ్య

చ. 2: పొదిగొన్న యలపుతోఁ బొదలుతీగెలక్రింద
తుదలేనిభయముతోఁ దూరినట్లు
మృదువైనతరుణుల మెఱుఁగుబాహులతల.-
పొదలెల్లఁ దూరితూరి పుంగుడయ్యేరయ్య

చ. 3: వలసగంపలమోపువలె లంపటము మోఁచి
తలఁకుచుఁ బారలేక దాఁగినయట్లు
యిల వేంకటేశ నిన్నెఱఁగ కింద్రియముల
తలవరులిండ్లనే దాఁగేరయ్య

రేకు: 1938-05 శ్రీరాగం సం: 01-235 అధ్యాత్మ

పల్లవి: వెఱితు వెఱితు నిండువేడుకపడ నిట్టి-
కుఱుచబుద్ధుల నెట్టు గూడుదునయ్య

చ. 1: దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాఁడు
ద్రోహిగాక నేఁడు దొరయట
ఆహికముగ నిట్టి అధమవ్రిత్తికి నే
సాహమున నెట్టు చాలుదునయ్య

చ. 2: తోడఁబుట్టినవాని తొడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడుగాక సుకృతియట
పాడైనయిటువంటిపాపబుద్ధులుసేసి
నీడ నిలువ నెట్టు నేరుతునయ్య

చ. 3: కొడుకు నున్నతమతిఁ గోరి చంపెడువాఁడు
కడుఁబాతకుఁడుగాక ఘనుఁడట
కడలేనియటువంటికలుషవ్రిత్తికి నాత్మ
వొడఁబరపఁగ నెట్లోపుదునయ్య

చ. 4: తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడుగాక
యెల్లవారల కెల్ల నెక్కుడట
కల్లరియనుచు లోకము రోయుపని యిది
చెల్లఁబోనే నేనేమి సేయుదునయ్య

చ. 5: యింటివేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట-
వెంటఁదిప్పేడువాఁడు విభుఁడట
దంటనై యాతనిదాసానుదాసినై
వొంటినుండెద నేమి నొల్లనోయయ్య

రేకు: 1938-06 దేవగాంధారి సం: 01-236 అధ్యాత్మ

పల్లవి: ఏమిఫలము దా నిన్నియునుఁ దెలిసినను
సాముసేసిన ఫలము జయశీలుఁడౌట గాక

చ. 1: తానుగలిగిన ఫలము దయ సేయఁగలుగుట
మేనుగలిగిన ఫలము మేలెల్ల గనుట
మానుషముగల ఫలము మంచివాఁడౌట తనుఁ
దానె తెలిసినఫలము తత్వపరుఁడౌట గాక

చ. 2: పదిలమగు కులము గల ఫలము తాఁజదువుట
చదివినఫలం బర్థసారంబు గనుట
పొదలి శాస్త్రర్థంబు పొడగన్న ఫలము మతి
దలఁకకిటు వేంకటేశుదాఁడౌట గాక

రేకు: 1939-01 శంకరాభరణం సం: 01-237 వేంకటేశ్వరౌషధము

పల్లవి: కొనరో కొనరో మీరు కూరిమిమందు
వునికిమనికి కెల్ల నొక్కటే మందు

చ. 1: ధ్రువుఁడు గొనినమందు తొల్లియుఁ బ్రహ్లాదుఁడు
చవిగాఁ గొనినమందు చల్లనిమందు
భవరోగములు వీడిపారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన నిచ్చలమైనమందు

చ. 2: నిలచి నారదుఁడు గొనినమందు జనకుఁడు
గెలుపుతోఁ గొని బ్రదికిన యామందు
మొలచి నాలుగుయుగములరాజులు ఘనులు
కలకాలముగొని కడగన్నమందు

చ. 3: అజునకుఁ బరమాయువై యొసగినమందు
నిజమై లోకములెల్ల నిండినమందు
త్రిజగములు నెఱఁగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటిదరినున్నమందు

రేకు: 1939-02 సామంతం సం: 01-238 వైరాగ్య చింత

పల్లవి: పాయపుమదముల బంధమా మము
జీయని యిఁకఁ గృపసేయఁగదో

చ. 1: ధనధాన్యములై తనులంపటమై
పనిగొంటివి నను బంధమా
దినదినంబు ననుతీదీపులఁ బెను-
గనివైతివి యిఁక గావఁగదో

చ. 2: సతులై సుతులై చలమై కులమై
పతివైతివి వోబంధమా
రతిఁ బెరరేఁపుల రంతులయేఁపుల
గతిమాలితి విఁక గావఁగదో

చ. 3: పంటై పాఁడై బలుసంపదలై
బంటుగ నేలితి బంధమా
కంటి మిదివో వేంకటగిరిపై మా-
వెంటరాక తెగి విడువఁగదో

రేకు: 1939-03 సామంతం సం: 01-239 వైరాగ్య చింత

పల్లవి: కటకటా యిటుచేసెఁ గర్మబాధ
యెటువంటివారికిని నెడయ దీబాధ

చ. 1: దినదినముఁ బ్రాణులకు దీపనముచే బాధ
తనుపోషణములు కందర్పబాధ
మనసుశాంతికి సదా మమకారములబాధ
తనివోనికోర్కులకు దైవగతిబాధ

చ. 2: వెడయాసచూపులకు వేడుకలచే బాధ
కడువేడ్కలకు వియోగములబాధ
తొడవైనయెఱుకలకు దురితబుద్ధులబాధ
జడియుఁబరచింతలకు సంసారబాధ

చ. 3: ఆరిది నిశ్చయమతికి ననుమానములబాధ
సరిలేని జీవులకు జన్మబాధ
తిరువేంకటాచలాధిపునిఁ గని మని కొలుచు-
వెరవుచేతనె కాని వీడ దీబాధ

రేకు: 1939-04 శ్రీరాగం సం: 01-240 ఉపమానములు

పల్లవి: ముచ్చుఁగన్న తల్లి చేరి మూలకు నొదిగినట్టు
తెచ్చిన సంబళ మెల్లఁ దీరుఁబో లోలోనె

చ. 1: దప్పముచెడినవాని తరుణి కాఁగిటఁ జేరి
అప్పటప్పటికి నుస్సు రనినయట్టు
వొప్పయిన హరిభక్తి వొల్లనివాని యింటి-
కుప్పలైన సంపదలు కుళ్లుఁబో లోలోనె

చ. 2: ఆఁకలి చెడినవాని అన్నము కంచములోన
వోఁకిలింపుచు నేల నొలికినట్టు
తేఁకువైన హరిభక్తి తెరువుగానని వాని-
వేఁకపు సిరులు కొంపవెళ్లుఁబో లోలోనె

చ. 3: వొడలుమాసినవాని వొనరుఁజుట్టములెల్ల
బడిబడినే వుండి పాసినయట్టు
యెడయక తిరువేంకటేశుఁ దలఁచనివాని-
ఆడరుబుద్ధులు పగలౌఁబో లోలోనె

రేకు: 1939-05 శ్రీరాగం సం: 01-241 అధ్యాత్మ

పల్లవి: అంగడి నెవ్వరు నంటకురో యీ -
దొంగలఁ గూడిన ద్రోహులను

చ. 1: దోసము దోసము తొలరో శ్రీహరి -
దాసానదాసుల దగ్గరక
ఆసలనాసల హరినెఱఁగక చెడి
వీసర పోయిన వెఱ్ఱులను

చ. 2: పాపము పాపము పాయరో కర్మపుఁ-
దాపపువారము దగ్గరక
చేపట్టి వేదపు శ్రీహరికథలు
యేపొద్దు వినని హీనులము

చ. 3: పంకము పంకము పైకొనిరాకురో
కొంకుఁగొసరులకూళలము
వేంకటగిరిపై విభునిపుణ్యకథ
లంకెల వినని యన్యులము

రేకు: 1939-06 బౌళి-జంపెతాళం సం: 01-242 ఉపమానములు

పల్లవి: సొగియునా మఱియు ముచ్చుకుఁ బండువెన్నెలలు
పగవానివలెనె లోపల దాఁగుఁగాక

చ. 1: దక్కునా పేదకును తరముగానిధనంబు
చిక్కి యెవ్వరికై నఁ జేరుఁగాక
వెక్కసంబైన గోవిందునిఁ దలఁపు బుద్ధి
తక్కిన పరులకెల్లఁ దలఁపేల కలుగు

చ. 2: అరగునా దుర్బలున కరుదైన యన్నంబు
కరుచబుద్ధులను నరమిగొనుఁగాక
తొరలునా హరివినుతి దుష్టునకు నది నోరఁ
దొరలెనా యతనినే దూషించుఁగాక

చ. 3: చెల్లునా యమృతంబు సేవించ నధమునకు
వొల్లనని నేలపై నొలుకుఁగాక
వెల్లి గొనుమందునకు వేంకటేశుస్మరణ
చల్లనౌనా మనసు శరియించుఁగాక

రేకు: 1940-01 సామంతం సం: 01-243 అధ్యాత్మ

పల్లవి: నిగమనిగమాంత వర్ణిత మనోహర రూప
నగరాజధరుఁడ శ్రీనారాయణా

చ. 1: దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యం బియ్య-
నోపకకదా నన్ను నొడఁబరుపుచు
పైపైనె సంసారబంధములఁ గట్టేవు
నాపలుకు చెల్లునా నారయణా

చ. 2: చీకాకు పడిన నాచిత్తశాంతము సేయ-
లేకకా నీవు బహులీల నన్ను
కాకుసేసెదవు బహుకర్మములఁ బడువారు
నాకొలఁదివారలా నారాయణా

చ. 3: వివిదనిర్బంధముల వెడలఁద్రోయక నన్ను
భవసాగరములఁ దడఁబడఁ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా

రేకు: 1940-02 కాంబోది సం: 01-244 అంత్యప్రాస

పల్లవి: తెల్లవారనియ్యరో తెరువు యీ-

పల్లదపుదొంగలెల్లఁ బారాడుతెరువు

చ. 1: దొంతరపూవులతోఁట తూరుపుఁ దెరువు

చింతపూవుఁ దేనెలచెమ్మ తెరువు

సంతులేని సతియింటిచాయ తెరువు

యింతలోనె చలిఁబడి యెండదాఁకే తెరువు

చ. 2: పాముపుట్ట గొంటిమీఁది పడుమటితెరువు

చీమకదొంతరలోనిచిన్న తెరువు

గాములుగాచుక యుండే గాలి తెరువు

యేమిటా నెక్కడవుత నెరఁగనితెరువు

చ. 3: అన్ని దిక్కులునుఁ దానేయైవున్న తెరువు

పన్నీటి కాలువలబాట తెరువు

కన్నుల వేంకటపతిఁ గన్న తెరువు

మిన్నునేలఁగూడినమీఁది తెరవు

రేకు: 1940-03 శ్రీరాగం సం: 01-245 నామ సంకీర్తన

పల్లవి: నమో నారాయణాయ నమః
సమధికానందాయ సర్వేశ్వరాయ

చ. 1: ధరణీసతీఘనస్తనశైలపరిరంభ-
పరిమళశ్రమజలప్రమదాయ
సరసిజనివాసినీసరసప్రణామయుత-
చరణాయ తే నమో సకలాత్మకాయ

చ. 2: సత్యభామాముఖాంచనపత్రవల్లికా-
నిత్యరచనక్రియానిపుణాయ
కాత్యాయనీస్తోత్రకామాయ తే నమో
ప్రత్యక్షనిజపరబ్రహ్మరూపాయ

చ. 3: దేవతాధిపమకుటదివ్యరత్నాంశుసం-
భావితామలపాదపంకజాయ
కైవల్యకామినీకాంతాయ తే నమో
శ్రీవేంకటాచల శ్రీనివాసాయ

రేకు: 1940-04 సామంతం సం: 01-246 అధ్యాత్మ

పల్లవి: పాపినైననాపాలఁ గలిగి తోవ
చూపుమన్న నెందుఁ జూపరు

చ. 1: ధృతిదూలి జగమెల్లఁ దిరిగి వేసరితి
యితరాలయముల కేఁగియేఁగి వేసరితి
గతమాలి పరులపైఁ గనలి వేసరితి
మతిమాలి కులవిద్య మాని వేసరితి

చ. 2: విసిగి యాచారంబు విడిచి వేసరితి
పసచెడి ప్రియములు పలికి వేసరితి
కొసరి ద్రవ్యముపైఁ గోరి వేసరితి
కసుగంది లోలోనె కాఁగి వేసరితి

చ. 3: కోవిదులగువారిఁ గొలిచి వేసరితి
దైవములందరిఁ దడవి వేసరితి
శ్రీవేంకటేశునిసేవ మాని వట్టి-
సేవలన్నియు నేఁ జేసి వేసరితి

రేకు: 1940-05 శ్రీరాగం సం: 01-247 వైరాగ్య చింత

పల్లవి: సకలశాస్త్రజ్ఞానసంపన్నుఁడట చిత్త-
మొకటికినిఁ జొరదు విధియోగమౌఁగాదో

చ. 1: దొరతనంబట కలిమి దోడుగాదట మంచి-
తరుణులట మోహమట దైన్యంబట
విరహమట దారిద్ర్యవివశుఁడౌనట చూడ
నరయ నిది కర్మఫలమౌనో కాదో

చ. 2: రాజసన్మానమట రవణహీనత్వమట
తేజమట నలువంకఁ దిరిపెంబట
వాజివాహనములట వాఁడి లేదట తొంటి-
పూజఫలమిది వెలితిభోగమౌఁగాదో

చ. 3: యిలయెల్ల నేలునట ఇంట లేదట మిగుల
బలిమిగలదట సదా పరిభవమట
చెలువలర వేడుకల శ్రీవేంకటేశ్వరుని
గొలువనేరనివెనకఁ గొరఁతలౌఁగాదో

రేకు: 1940-06 ముఖారి సం: 01-248 వైరాగ్య చింత

పల్లవి: సారిది సంసారంబు సుఖమా యిందరికి

వెరవెఱంగక వగల వేఁగేరు గాక

చ. 1: దేహములు దలఁప సుస్థిరములా ప్రాణులకు-

నూహింప లోభ మట్లుండుఁ గాక

మోహంబుచే వెనకముందెఱుఁగలేక తమ-

దేహసుఖములు మరిగి తిరిగేరుగాక

చ. 2: నెలకొన్నద్రవ్యములు నిలుచునా యెవ్వరికి

అలవి నిలుపఁగరాని యాస గాక

బలువైన వట్టి విభ్రాంతిచే దగులువడి

తెలిసియును దెలియ కిటు తిరిగేరు గాక

చ. 3: నెఱయువిభవములెల్ల నిజములా యిందరికి

కొఱమాలినట్టి తమగుణముగాక

యెఱుకతోఁ దిరువేంకటేశుఁ గొలువఁగలేక

తెఱఁగుమాలిన బుద్ధిఁ దిరిగేరుగాక

రేకు: 1941-01 ఆహరి సం: 01-249 అంత్యప్రాస

పల్లవి: కాక మరి యింతేల కలుగుఁ దమకేతముకు
చేకొన్న కోరికలు చేరు నందాఁకా

చ. 1: దొరతనములన్నియును దొరసి నందాఁకా
నెరతనములన్నియును నెరపి నందాఁకా
గరగరికలన్నియును కలసి నందాఁకా
విరసంబులన్నియును విసుగు నందాఁకా

చ. 2: యెడమాటలన్నియును యెరసి నందాఁకా
అడియాసకోరికలు అదుకు నందాఁకా
జడిగొన్నగుక్కిళ్లు చవిగొన్నయందాఁక
వొడ లోముటలు మోహ ముడుగు నందాఁకా

చ. 3: యీ వెల్లఁ దమయాత్మ యిచ్చగించినదాఁక
శ్రీవేంకటేశుకృప చేరు నందాఁక
లోవెలుతున్నియును లోఁగొన్నయందాఁక
వేవేగ బంధములు వీడు నందాఁకా

రేకు: 1941-02 వరాళి సం: 01-250 అధ్యాత్మ

పల్లవి: ఏమి నేయువార మింకను
ఆమని చేలపచ్చులాయ బ్రదుకు

చ. 1: దీపనమనియెడి తీరని యాస
రేపుమాపుఁ బెడరేఁచఁగా
తోపునేయఁగరాక దురితపుతరవుల -
కాపదలకు లోనాయ బ్రదుకు

చ. 2: వేడుకనెడి పెద్దవిడువనితరవు
వోడ కెపుడు వొద్దనుండఁగా
జోడు విడువరాక చులుకఁదనంబున-
కాడికెలకు లోనాయ బ్రదుకు

చ. 3: మమకారమనియెడిమాయతరవు
తిమిర మెక్కించుక తియ్యఁగా
విమలమూరితియైన వేంకటగిరిపతి
అమరఁ జేరక యరవాయ బ్రదుకు

రేకు: 1941-03 ముఖారి సం: 01-251 అధ్యాత్మ

పల్లవి: కడునడసు చొరనేల కాళ్ళు గడుగఁగనేల
కడలేని జన్మసాగర మీఁదనేల

చ. 1: దురితంబునకు నెల్లదొడవు మమకారంబు_
లరిదిమమతలకుఁ దొడ వడియాసలు
గురుతయిన యాసలకుఁ గోరికలు జీవనము
పరగ నిన్నిటికి లంపటమె కారణము

చ. 2: తుదలేని లంపటము దుఃఖహేతువు దుఃఖ_
ముదుటయిన తాపమున కుండఁగఁ జోటు
పదిలమగు తాపంబు ప్రాణసంకటము లీ-
మదము పెంపునకుఁ దనమనసు కారణము

చ. 3: వెలయఁ దనమనసునకు వేంకటేశుఁడు గర్త
బలిసి యాతనిఁ దలఁచుపనికిఁ దాఁ గర్త
తలకొన్న తలఁపు లివి దైవమానుషముగాఁ
దలఁచి యాత్మేశ్వరునిఁ దలఁపంగ వలదా

రేకు: 1941-04 శ్రీరాగం సం: 01-252 వేంకటగానం

పల్లవి: ఇతరులకు నిను నెరుగతరమా సతత సత్యవ్రతులు
సంపూర్ణమోహవిరహితు లెఱుగుదురు నినునిందిరారమణా

చ. 1: నారీకటాక్షపటు నారాచభయరహిత-
శూరులెఱుఁగుదురు నినుఁ చూచేటి చూపు
ఘోరసంసార సంకులపరిచ్ఛేదులగు-
ధీరులెఱుఁగుదురు నీదివ్యవిగ్రహము

చ. 2: రాగభోగవిదూర రంజితాత్ములు మహా-
భాగు లెరుఁగుదురు నినుఁ బ్రణుతించువిధము
ఆగమోక్త ప్రకారాభిగమ్యులు మహా-
యోగులెఱుఁగుదురు నీవుండేటివునికి

చ. 3: పరమభాగవత పదపద్మసేవానిజా-
భరణులెఱుఁగుదురు నీ పలికేటిపలుకు
పరగు నిత్యానంద పరిపూర్ణ మానస-
స్థిరు లెఱుఁగుదురు నినుఁ దిరువేంకటేశ

రేకు: 1941-05 శంకరాభరణం సం: 01-253 వేంకటగానం

పల్లవి: ఎరుఁగుదు రిందరు నెఱిఁగీనెఱఁగరు
హరి దానే నిజపరమాతుమని

చ. 1: నలినాసనుఁ డెఱుఁగు నారదుఁ డెఱుఁగు
కొలఁది శివుఁ డెఱుఁగు గుహుఁ డెఱుఁగు
యిల గపిలుఁ డెఱుఁగు నింతా మను వెఱుఁగు
తలఁప విష్ణుఁడే పరతత్త్వమని

చ. 2: బెరసి ప్రహ్లాదుఁడు భీష్ముఁడు జనకుఁడు
గురుతుక బలియు శుకుఁడుఁ గాలుఁడు
వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ
హరి యితఁడే పరమాత్ముఁడని

చ. 3: తెలియదగిన దిది తెలియరాని దిది
తెలిసినాను మదిఁ దెలియ దిది
యిల నిందరుఁ దెలిసి రిదే పరమమని
కలవెల్లఁ దెలిపె వేంకటరాయుఁడు

రేకు: 1941-06 దేవగాంధారి సం: 01-254 అధ్యాత్మ

పల్లవి: లేదు బహువిద్యామహాసుఖము తమ-
కీడు తమకర్మ మేమి సేయఁగవచ్చు

చ. 1: నానావిధులఁ బొరలి నరుఁడు దానై వివిధ-
మైనకర్మములే అనుభవించి
లేనిలపంటములకు లోనై దురితా-
దీనులై క్రమ్మరఁ దిరిగిపోవుటేకాని

చ. 2: పరగ నిన్నిటఁ బొడమి బ్రహ్మణుఁడై
సరిలేని వేదశాస్త్రములు చదివి
అరుదయినకాంక్షచే నతిపాపపరులై
వెరవునఁ బొడవెక్కి విరుగఁబడుటేకాని

చ. 3: చేరనిపదార్థములే చేరఁగోరుటగాని
చేరువనే యామేలు సిద్ధింపదు
ధీరులై తమలోనఁ దిరువేంకటేశ్వరునిఁ
గోరి యిటు భజియింపఁగూడు టెన్నఁడుగాన

రేకు: 1942-01 లలిత సం: 01-255 నిష్వక్సేన

పల్లవి: నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీ విభుప్రతినిధివి సేన మొదలారి

చ. 1: నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ-
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి

చ. 2: పసిఁడి బద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులువంపే దీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ-
సిసువులఁగా నేలిన సేనమొదలారి

చ. 3: దొరలై నయసురుల తుత్తుమురు సేసి జగ-
మిరవుగా నేలితి వేకరాజ్యమై
పరగుసూత్రవతీ పతివై వేంకటవిభు-
సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి

రేకు: 1942-02 పాడి సం: 01-256 కృష్ణ

పల్లవి: బాలులతో వీధులలోఁ బారాడువాఁడు
కోలలెత్తుక వుట్లు గొట్టీఁ జూండీ

చ. 1: నారికడపువక్కలు నానిన సనగలు
చారపప్పుఁ దేనెలు చక్కెరలును
పేరిననేతులు నానబియ్యాలు నుట్ల నవే
చేరి యశోదబిడ్డకు జెప్పేరు సుండీ

చ. 2: చక్కిలాలు నడుకులు సనిగెపప్పులును
చెక్కిన మెత్తనితూఁట చెఱకులును
పెక్కువగా నుట్లలో బిందెల నించిన వవే
చక్కనెశోదబిడ్డకుఁ జాటేరు సుండీ

చ. 3: నవ్వులుఁ జిటిబెల్లాలు నున్ననిచిమ్మిలులు
నవ్వుటిడియునుఁ జిన్ని నురుగులును
యెవ్వారు వేంకటపతి కెఱుగించ నారగించి
కివ్వకివ్వ నవ్వ నణఁకించీ జూండీ

రేకు: 1942-03 కన్నడగౌళ సం: 01-257 వైరాగ్య చింత

పల్లవి: పుండు జీవుల కెల్లఁ బుట్టక మానదు
పుండు మాన మందు వొయ్యఁగదయ్య

చ. 1: నెత్తురు నెమ్ములు నిండినపుంటికి
తిత్తిలో సోదించనేరా
నిత్తెమూ వేనీళ్లఁ గడిగినాను
మత్తిలి వుబ్బు మానదేలయ్యా

చ. 2: చల్లఁగూడు వెట్టి చల్లఁగా పొత్తు
లెల్లఁ బెట్టి బిగియించఁగాను
కల్లగాదు చీము గారు తొమ్మిదిగండ్ల
పిల్లలాఁ జాలఁ బెట్టెఁగదయ్యా

చ. 3: ఆదినుండి పాకమైనది యెవ్వ-
రేదిరో మొక మేరుపడదు
ఆదరించి వేంకటాధిప నీవింక
సోదించి మానఁజూడఁగదయ్యా

రేకు: 1942-04 సామంతం సం: 01-258 కృష్ణ

పల్లవి: భావమునఁ బరబ్రహ్మ మిదె
కైవసమై మాకడ చూడ

చ. 1: నీలమేఘ ముపనిషదర్థం బదె
పాలుదొంగిలెడిబాలులలో
చాలు నదియ మాజన్మరోగముల-
చీల దివియ మముఁ జెలగించ

చ. 2: తనియని వేదాంతరహస్యంబదె
వొనర గోపికలవుట్లపై
పనుపడి సకలాపజ్జాలంబుల-
పనులు దీర్చ మముఁ బాలించ

చ. 3: భయములేని పెనుఁబరమపదం బదె
జయమగు వేంకటశైలముపై
పయిపడు దురితపుఁబౌఁజుల నుక్కున
లయము సేయ మము లాలించ

రేకు: 1942-05 సామంతం సం: 01-259 నృసింహ

పల్లవి: నగధర నందగోప నరసింహ వో
నగజవరద శ్రీ నారసింహ

చ. 1: నరసింహ పరంజోతి నరసింహా వీర-
నరసింహ లక్ష్మీనారసింహా
నరసఖ బహుముఖ నారసింహా వో-
నరకాంతక జేజే నారసింహా

చ. 2: నమో నమో పుండరీకనారసింహ వో-
నమితసురాసురనారసింహా
నమకచమకహిత నారసింహ వో
నముచిసూదనవంద్య నారసింహా

చ. 3: నవరసాలంకార నారసింహా వో-
నవనీతచోర శ్రీనారసింహా
నవగుణివేంకటానారసింహా వో-
నవమూర్తి మండేము నారసింహ

రేకు: 1942-06 పాడి సం: 01-260 అధ్యాత్మ

పల్లవి: కడగనుటే సౌఖ్యముగాక యీ-
తడతాఁకుల నెందరు చనరిట్లా

చ. 1: నిలిచినదొకటే నిజమని తెలిసిన-
తెలివే ఘన మింతియకాకా
కలకాలము చీఁకటి దవ్వుకొనెడి-
వలలభ్రమల నెవ్వరు వడ రిట్లా

చ. 2: పరహిత మిదియే పరమని తెలిసిన
పరిపక్వమె సంపదగాకా
దురితవిధుల గొందుల సందులఁ బడి
ధరలోపల నెందరు చనరిట్లా

చ. 3: ఘనుఁడీ తిరువేంకటపతి యని కని
కొనకెక్కుట తేఁకువగాకా
పనిమాలిన యీపలులంపటముల
తనువు వేఁచు టెంతటిపని యిట్లా

రేకు: 1943-01 ధన్నాశి సం: 01-261 కృష్ణ

పల్లవి: ఆదిమునుల సిద్ధాంజనము
యేదెసఁ జూచిన నిదివో వీఁడే

చ. 1: నగిన సెలవి�ఁ బడు నాలుగుజగములు
మొగమునఁ జూపే మోహనము
నిగిడి యశోదకు నిధానంబై
పొగడొందీ గృహమున నిదె వీఁడే

చ. 2: కనుదెరచిన నలుగడ నమృతము లటు
అనువునఁ గురసీ నపారము
వనితలు నందవ్రజమునఁ జెలఁగఁగ
మనికికి నిరవై మలసీ వీఁడే

చ. 3: పరమునకునుఁ దాఁ బరమై వెలసిన-
పరిపూర్ణ పరాత్పరుఁడు
సరుస రుక్మిణికి సత్యభామకును
వరుఁడగు వేంకటవరదుఁడు వీఁడే

రేకు: 1943-02 సామంతం సం: 01-262 భక్తి

పల్లవి: నారాయణ నీనామము బుద్ధిఁ
జేరినాఁ జాలు సిరులేమి బాఁతి

చ. 1: ననుపైన శ్రీవిష్ణునామము పేరు-
కొనఁగానే తేఁకువ మీరఁగా
ఘనమైన పుణ్యాలు గలుగఁగా తమ-
కనయముఁ బరమది యేమిబాఁతి

చ. 2: నలువైన శ్రీహరినామము మతిఁ-
దలఁచిననాబంధము లూడఁగా
యెలమి దీనిఁ బఠియించినా యీ-
కలుషములేల కలుగు నెవ్వరికి

చ. 3: వేంకటపతి నామవిభవము కర్మ
పంకములెల్లఁ బరిమార్పఁగా
బింకమై తలఁపెడి ప్రియులకుఁ యెందు-
నింక నీ సుఖమిది యేమిబ్రాఁతి

రేకు: 1943-03 ఆహిరి సం: 01-263 వైరాగ్య చింత

పల్లవి: మోహము విడుచుటే మోక్షమది
దేహ మెఱుఁగుటే తెలివీనదే

చ. 1: ననిచిన తనజన్మముఁ గర్మముఁ దన-
పనియు నెఱుగుటే పరమ మది
తనకు విధినిషేధములుఁ బుణ్యముల-
ఘనత యెఱుగుటే కలిమి యది

చ. 2: తఱిఁదఱిఁ బ్రేమపుతల్లిదండ్రులను
యెఱఁ గనిదే కులహీన తది
చఱులఁ బొరలి యాచారధర్మములు
మఱచినదే తనమలిన మది

చ. 3: కమ్మరఁ గమ్మరఁ గామభోగములు
నమ్మి తిరుగుటే నరక మది
నెమ్మది వేంకటనిలయునిదాసుల-
సొమ్మయి నిలుచుట సుకృత మది

రేకు: 1943-04 ముఖారి సం: 01-264 సంస్కృత కీర్తనలు

పల్లవి: శ్రీశో యంసుస్థిరో యం
కౌశికమఖరక్షకోయం

చ. 1: నిగమనిధినిర్మలోయం
జగన్మోహనసతీపతి-
విగతభయోయం విజయసఖోయం
భృగుమునినా సంప్రీతోయం

చ. 2: సకలపతి శ్శాశ్వతోయం
శుకముఖమునిజనసులభోయం
ప్రకటబహళశోభనాధికోయం
వికచరుక్మిణీవీక్షణోయం

చ. 3: సరసోయం పరిసరప్రియోయం
తిరువేంకటాధిపోయం
చిరంతనోయం చిదాత్మకోయం
శరణాగతవత్సలోయం

రేకు: 1943-05 శుద్ధవసంతం సం: 01-265 సంస్కృత కీర్తనలు

పల్లవి: కిం కరిష్యామి కిం కరోమి బహుళ-
శంకాసమాధానజాడ్యం వహామి

చ. 1: నారాయణం జగన్నాథం త్రిలోకైక-
పారాయణం భక్తపావనం
దూరీకరోమ్యహం దురితదూరేణ సం-
సారసాగరమగ్నచంచలత్వేన

చ. 2: తిరువేంకటచలాధీశ్వరం కరిరాజ-
వరదం శరణాగతవత్సలం
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణభవదేహాభిమానం వహామి

రేకు: 1943-06 శ్రీరాగం సం: 01-266 వేంకటగానం

పల్లవి: ఆపన్నులపాలి దైవమాతఁడే గతిఁదక్క
యే పొద్దును భజియించఁగ నితరుఁడు మరి కలఁడా

చ. 1: నిరుపాధిక నిజబంధుఁడు నిరతి శయానందుఁడు
కరి వరదుఁ డితఁడే గాక ఘనుఁడధికుఁడు గలఁడా

చ. 2: సంతత గుణ సంపన్నుఁడు సాధులకుఁ బ్రసన్నుఁడు
అంతర్యామితఁడే కాక అధికుఁడు మరి కలఁడా

చ. 3: పరమాత్ముఁడు పరమపురుషుఁడు పరికింపఁగఁ గృపాలుఁడు
తిరువేంకట విభుఁడే కాక దేవుఁడు మరి కలఁడా

రేకు: 1943-07 కురంజి సం: 01-267 నామ సంకీర్తన

పల్లవి: మందరధర మధుసూదన
నందగోపనందనా

చ. 1: నరసింహ గోవింద నవనీతానంద
హరిముకుంద నయనారవింద
కరివరద గరుడగమనరూప
గురుచాపా యదుకులదీపా

చ. 2: భవదూర భయహర పరిపూర్ణామృత
భవనపాలన సురపాలన
భువనభూషణ పరపురుష పురాతన
నవభోగా కరుణాయోగా

చ. 3: పంకజాసననుత భవ్యనిర్మలపాద-
పంకజ పరమ పరాత్పర
వేంకటశైలనివేశ శు-
భంకరా క్షేమంకరా

రేకు: 1944-01 లలిత సం: 01-268 వైరాగ్య చింత

పల్లవి: ఈ దేహవికారమునకు నేదియుఁ గడపల గానము
మోదమెరంగని మోహము ముందర గననీదు

చ. 1: నిత్యానిత్యవివేకము నీరసునకు నొనగూడదు
సత్యాలాపవిచారము జరగదు లోభికిని
హత్యావిరహితకర్మము అంటదు క్రూరాత్మునకును
ప్రత్యక్షంబగుపాపము పాయదు కష్టునకు

చ. 2: సతతానందవికాసము సంధించదు తామసునకు
గతకల్మషభావము దొరకదు వ్యసనికిని
జితకాముఁడు దా నవుటకు సిద్ధింపదు దుష్కర్మికి
అతులితగంభీరగుణం బలవడ దధమునకు

చ. 3: శ్రీవేంకటగిరివల్లభు సేవా తాత్పరభావము -
ద్రోవ మహలంపటులకు తోఁపదు తలఁపునకు
దేవోత్తముఁగడు నీతని దివ్యామృతమగు నామము
సేవింపఁగ నితరులకును చిత్తం బొడఁబడదు

రేకు: 1944-02 శుద్ధవసంతం సం: 01-269 నామ సంకీర్తన

పల్లవి: నమో నారాయణాయ నారాయణాయ సగుణబ్రహ్మణే
సర్వపారాయణాయ శోభనమూర్తయే నమో

చ. 1: నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యాధి-
పత్యాయ మునిగణ ప్రత్యయాయ
సత్యయ పత్యక్షాయ సన్మానససాం-
గత్యాయ జగదవనకృత్యాయ తేనమో

చ. 2: అక్రమోద్ధతబాహువిక్రమాతిక్రాంత
శుక్రశిష్యోన్మ్యాలనక్రమాయ
శక్రాదిగీర్వాణవక్రభయభంగని-
ర్వక్రాయ నిహతారిచక్రాయ తేనమో

చ. 3: అక్షరాయాతినిరపేక్షాయ పుండరీ-
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణవిజ్ఞానదక్షయోగీంద్రసం-
రక్షానుకంపాకటాక్షాయ తేనమో

చ. 4: కరిరాజవరదాయ కౌస్తుభాభరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందుకోటీరతరుణీ మనస్తోత్ర-
పరితోషచిత్తాయ పరమాయ తే నమో

చ. 5: పాత్రదానోత్సవప్రథిత వేంకటరాయ
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిరగాత్రాయ రవిచంద్ర-
నేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో నారయణాయ

రేకు: 1944-03 కన్నడగౌళ సం: 01-270 వైరాగ్య చింత

పల్లవి: నీమహత్త్వంబు లోనికిఁ వెలుపలికిఁ గప్పి
కామింప నిట్టిదని కానరా దటుగాన

చ. 1: నిండి యిన్నిటిలోన నీవు గలవని భ్రాంతి-
నుండుదువుగాని నీ వొకటియునుఁ గావు
దండిగలగిరి ప్రతిధ్వని దోచుఁగాని యది
కొండలోపల లేదు కొండయునుఁ గాదు

చ. 2: బలసి యిన్నిటిలోపలనుఁ జైతన్యమై
మెలఁగుదువుగాని యేమిట నీవు లేవు
పలుదెరఁగులైన దర్పణమునందొక నీడ
వొలయుఁగా కందు దలపోయు నది లేదు

చ. 3: పుడుగ కన్నిటిలోన నుండుటయు లేదు నీ-
వుడివోయి యందుండ కుండుటయు లేదు
చెడనితేజముగాన శ్రీవేంకటేశ నీ-
పొడవు పరిపర్ణమై పొలుపొందుఁగాన

రేకు: 1944-04 మాళవి సం: 01-271 శరణాగతి

పల్లవి: అది నాయపరాధ మిది నాయపరాధ

మదియు నిదియు నాయపరాధము

చ. 1: నెరయ రూపములెల్ల నీరూపమేకా

నరయని యది నాయపరాధము

పరిపూర్ణుఁడగు నిన్నుఁ బరిచ్ఛిన్నునిఁగా-

నరయుట యది నాయపరాధము

చ. 2: జీవాత్మునిఁగాఁ జింతింపఁ దలఁచుట

యావంక నది నాయపరాధము

సేవించి నిను నాత్మఁ జింతింపకుండుట

ఆవల నిది నాయపరాధము

చ. 3: యీడెరఁగక వేంకటేశుఁడ నినుఁ గొని-

యాడుట యది నాయపరాధము

యేడఁ జూచిన నాయెదుర నుండఁగ నిన్ను

నాడ నీడ వెదకుటపరాధము

రేకు: 1944-05 కన్నడగౌళ సం: 01-272 వేంకటగానం

పల్లవి: సతతవిరక్తుఁడు సంసారి గాఁడు
రతిసమ్మదుఁడు విరక్తుఁడు నితఁడె

చ. 1: నిత్యుఁడైనవాఁడు నిఖిలలోకములఁ-
బ్రత్యక్షవిభవ సంపన్నుఁడు గాఁడు
నిత్యుఁడు నితఁడే నిరుపమానుఁడైన
ప్రత్యక్షవిభవ సంపన్నుఁ డితఁడె

చ. 2: యోగియైనవాఁడు వొనర నేకాలము
భోగియై భోగిపై భోగింపలేఁడు
యోగియు నితఁడే వుడుగక భోగిపై
భోగించునటువంటి పురుషుండు నితఁడె

చ. 3: దేవుఁడైనవాఁడుఁ దెలుప లోకముల
దేవతారాధ్యుఁడై దీపింపలేఁడు
దేవుఁడు నితఁడే దివిజవంద్యుఁడైన
శ్రీవేంకటగిరిదేవుండితఁడె

రేకు: 1945-01 వరాళి సం: 01-273 వైరాగ్య చింత

పల్లవి: ఎచ్చోటి కేఁగిన యెప్పుడూఁ దమలోని -
మచ్చిక పెనుఁదెవులు మానకపోయె

చ. 1: పాయపు సతులగుబ్బల పెదపొట్లాల
కాయము వడి నొత్తి కాఁచఁగను
రాయిడిచే ఘనమాయఁగాని లోని-
మాయపు పెనుఁదెవులు మానకపోయె

చ. 2: అతివల మోహపుటధరామృతములు
యితవుగ నోరి కందియ్యఁగను
అదిమోహమే ఘనమాయఁగాని లోని-
మతకరిపెనుఁదెవులు మానకపాయె

చ. 3: తరుణుల మేనిమెత్తనిపరపులమీఁద-
నిరవుగ నిటు సుఖియించఁగను
తిరువేంకటాచలాధీశుకృపచేఁగాని
మరుచేతి పెనుఁదెవులు మానకపోయె

రేకు: 1945-02 మలహరిసం: 01-274 శరణాగతి

పల్లవి: పండియుఁ బండదు చిత్తము పరిభవ యెడయదు కాంక్షల
యెండలనే కాఁగితి మిఁక నేలాగోకాని

చ. 1: పదిగోట్లుజన్మంబులఁ బాయనికర్మపుఁ బాట్లు
వదలక వొక నిమిషములో వడిఁదీరుచు నితఁడు
చెదరని నిజదాసులకును శ్రీహరి, మా కిపుడంతక
హృదయము నిలువదు చంచల మేలాగోకాని

చ. 2: కూపపు బహునరకంబుల కోట్లసంఖ్యలఁ బొరలేటి-
పాపము లొకనిమిషయములోఁ బాపఁగఁగలఁ డితఁడు
కాపాడఁగఁ దలచిన యీకమలాపతి, నే మీతని-
యేపునఁ గని మననే మిఁక నేలాగోకాని

చ. 3: జడిగొని యెన్నఁడు బాయనిసంసారపుబంధంబుల
విడుమని వొకనిమిషములో విడిపించును యితఁడు
కడుఁగొలిచినవారికి వేంకటపతి, నే మీతని-
నెడయక కొలువఁగలేమిఁక నేలాగోకాని

రేకు: 1945-03 వరాళి సం: 01-275 అధ్యాత్మ

పల్లవి: వాడల వాడల వెంట వాఁడివో వాఁడివో
నీడనుండి చీరలమ్మే నేఁతఁబేహారి

చ. 1: పంచభూతములనెడి పలువన్నె నూలు
చంచలపుగంజి వోసి చరిసేసి
కొంచెపు కండెల నూలి గుణముల నేసి
మంచిమంచి చీరలమ్మే మారు బేహారి

చ. 2: మటుమాయములఁ దన మగువ పసిఁడి నీరు
చిటిపొటి యలుకలఁ జిలికించఁగా
కుటిలంపుఁ జేఁతలు కుచ్చులుగాఁ గట్టి
పటవాళి చీరలమ్మే బలుబేహారి

చ. 3: మచ్చిక కర్మమనేటి మైల సంతలోన
వెచ్చపు కర్మధనము వెలువచేసి
పచ్చడాలుగాఁ గుట్టి బలువేంకటపతి
ఇచ్చకొలఁదుల నమ్మే ఇంటిబేహారి

రేకు: 1945-04 సామంతం సం: 01-276 అధ్యాత్మ

పల్లవి: తొక్కనిచోట్లు దొక్కెడిమనసు
యెక్కడ గతిలే దింకనో తెరువు

చ. 1: పాపము వాయదు పై పై మనసున
కోపము దీరదు కొంతైనా
దీపన బాధయుఁ దీర దిన్నియును
యేపునఁ బెనఁగొనె నింకనో తెరువు

చ. 2: యెవ్వనమదమును నెడయదు కోరికె
కొవ్వును నణఁగదు కొంతైనా
రవ్వగు మమకారముఁ బెడఁబాయదు
యెవ్విధియును లేదింకవో తెరువు

చ. 3: వెఱపును విడువదు వెడమాయలఁబడి
కొఱఁతయుఁ దీరదు కొంతైనా
తెఱఁ గొసఁగేటి శ్రీతిరువేంకటపతి -
నెఱిఁగీ నెఱఁగలే మిఁకనో తెరువు

రేకు: 1945-05 సాళంగనాట సం: 01-277 దశావతారములు

పల్లవి: ఎట్టివారికినెల్ల నిట్టికర్మములు మా-
యెట్టివారికి నింక నేది తోవయ్య

చ. 1: పాముఁజంపిన యట్టిపాతకమునఁ బెద్ద -
పాముమీఁద నీకుఁ బవళించవలసె
కోమలిఁ జంపిన కోఱతవల్ల నొక్క-
కోమలి నెదఁ బెట్టుకొని యుండవలసె

చ. 2: బండి విఱిచినట్టి పాతకమునఁ బెద్ద
బండిబోయుఁడవై పనిసేయవలనె
కొండవెఱికి నట్టిగుణమునఁ దిరుమల-
కొండమీఁద నీకుఁ గూచుండవలసె

రేకు: 1945-06 ముఖారి సం: 01-278 దశావతారములు

పల్లవి: అన్ని చోట్లఁ బరమాత్మ నీవు
యిన్నిరూపుల భ్రమయింతువుగా

చ. 1: పాలజలనిధినుండి బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁ బ్రయాగ నుండి
భూలోకనిధివై పురుషోత్తమాన నుండి
వేలసంఖ్యలరూపై విచ్చేతుగా

చ. 2: వుత్తర మధురలో నయోధ్య లోపలినుండి
సత్తైన నందవ్రజాన నుండి
చిత్తగించి పంచవటి సింహాద్రిలోననుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను

చ. 3: కైవల్యముననుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీవేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా

రేకు: 1945-06 సామంతం సం: 01-279 హనుమ

పల్లవి: మాయపుదనుజులమదవైరి కపి-
రాయఁడు వీఁడివో రామునిబంటు

చ. 1: పెట్టిన జంగయు పెంపుమిగుల మొలఁ
గట్టినకానెయు గర్వమున
నిట్టనిలిచి పూనినచేత నడిమి-
దిట్ట వీఁడువో దేవునిబంటు

చ. 2: నవ్వుచు లంకానగరపుదనుజుల-
కొవ్వణఁచినకపికుంజరుఁడు
మువ్వురువేల్పుల మొదలి భూతియగు-
రవ్వగు సీతారమణునిబంటు

చ. 3: పంకజసంభవుపట్టముగట్టను
వుంకించిన తనవొడయనిచే
పొంకపుకలశాపురహనుమంతుఁడు
వేంకటరమణుని వేడుకబంటు

రేకు: 1946-01 శంకరాభరణం సం: 01-280 అధ్యాత్మ

పల్లవి: పరుసము సోఁకియు బ్రదుకవద్దా
తిరిగి కర్మము లింక తీదీపులా

చ. 1: పడిగాలువడియున్న ప్రాణచారముల-
పడఁతుల నధములఁ బాలించితి
యిడుమలఁ బెడఁబాప నింకనేల తెగి కొంక
గడిచీటిచ్చియు నింకఁ గడ మున్నదా

చ. 2: మితిలేనిధనములు మెరసి కానుకగొని
అతిపుణ్యాలిందరి నలరించితి
ధృతిహీనులకునెల్ల దిక్కయి కాతువుగాక
వ్రతముచెల్లిన నింక వట్టఁగట్లా

చ. 3: పాలించి నావిన్నపమున వేంకటరాయ
లాభించితివి నే నీలలనఁగానా
యీలాగుననె లోకమింతాఁ గాతువుగాక
పాలుదాగినమీఁదఁ బైకుడుపులా

రేకు: 1946-02 శ్రీరాగం సం: 01-281 నృసింహ

పల్లవి: భాలనేత్రానల ప్రబల విద్యుల్లతా-
కేలీ విహార లక్ష్మీనరసింహా

చ. 1: ప్రళయమారుత ఘెరభస్త్రికా పూత్కార
లలితనిశ్వాసడోలారచనయా
కులశైలకుంభినీకుముదహితరవిగగన-
చలనవిధినిపుణ నిశ్చల నారసింహా

చ. 2: వివరఘనవదనదుర్వీహసననిష్ఠ్యూత -
లవదివ్య వరుషలాలాఘటనయా
వివిధజంతువ్రాతభువన మగ్నీకరణ
నవనవప్రియ గుణార్ణవ నారసింహా

చ. 3: దారుణోజ్జ్వలధగద్ధగితదంష్ట్రానలవి
కారస్ఫులింగసంగక్రీడయా
వైరిదానవఘోరవంశభస్మీకరణ -
కారణ ప్రకటవేంకట నారసింహా

రేకు: 1946-03 కన్నడగౌళ సం: 01-282 ఉపమానములు

పల్లవి: ఇంత సేసెఁబో దైవ మింతలోననే అయ్యో
సంతపాకలంజఁ దెచ్చి సన్యాసిఁ జేసె

చ. 1: పరిగెలేరేటివానిఁ బట్టపురాజుఁగా
నిరతభోగము లిచ్చి నిలిపినట్లు
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు
అరయ నిత్తడిఁ దెచ్చి యపరంజిఁ జేసె

చ. 2: కుక్కలవండుకతినే కులహీనునిఁ దెచ్చి
వెక్కసఁబాఁపనిఁ గావించినయట్లు
దిక్కులెఱఁగఁగఁ గష్టదేహిని నన్నుఁ దెచ్చి
గక్కనఁ దెలుకపిండి కస్తూరి సేనె

చ. 3: చెడుగైనదోమఁ దెచ్చి సింహపుఁగొదమఁగా
బెడిదంపుఁ బ్రేమతోడఁ బెంచినయట్లు
కడునధముని వేంకటపతి నను నిటు
చిడిపిరాయి దెచ్చి చింతామణి సేనె

రేకు: 1946-04 నాట సం: 01-283 వైరాగ్య చింత

పల్లవి: మాన(డెన్నడు శరీరి దు-
ర్మానబోధుతుడుగాన

చ. 1: పంచభూతవికారంబులు
పంచేంద్రియములూ
పంచమహపాతకములకును
పంచివేసినవిగాన

చ. 2: త్రైగుణ్యవికారంబులు
త్రైగుణ్యపు(దనువులు
శ్రీగురు(డగుశ్రీవేంకటపత-
భోగయోగ్యములుగాన

రేకు: 1946-05 శ్రీరాగం సం: 01-284 అంత్యప్రాస

పల్లవి: ఎన్ని భాధలఁబెట్టి యేఁచెదవు నీవింక నెంతకాలముదాఁకఁ గర్మమా
మన్నించుమనుచు నీ మఱఁగు జొచ్చితిమి మామాటాలకించవో కర్మమా

చ. 1: ప్రతిలేని దురితములపాలు సేయక నన్నుఁబాలించవైతి వో కర్మమా
తతితోడ నాత్మపరితాపంబుతోడుతను తగులేల సేసి తోకర్మమా
జితకాలములకుఁగాని చేతికిని లోనయి చిక్క వేకాలంబు కర్మమా
మతిహీనులైనట్టిమాకు నొకపరిపాటిమార్గంబు చూపవో కర్మమా

చ. 2: ఆసలనియెడితాళ్ళ నంటగట్టుక విధికి నప్పగించితివిగదె కర్మమా
వాసి విడిచితిమి నీవారమైతిమి మమ్ము వన్నె చెడనీకు వో కర్మమా
కాసుకనుఁ గొరగాని గతిలేని పనికిఁగా కాలుఁదనీవేల కర్మమా
వోసరించొకమారు వొయ్యనే వొకరీతి నొల్లనని తలఁగుమీకర్మమా

చ.3: తిరువేంకటాచలాధిపునిమాయలచేతదెసలఁదిరిగినయట్టికర్మమా
హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా
వరుస నేనుగమీఁదవాని సున్నంబడుగవచ్చునా నీకిట్లఁ గర్మమా
పరమపురుషోత్తముని భ్రమతఁబడి నీవిట్ల బట్టబయలైతిగా కర్మమా

రేకు: 1946-06 దేవగాంధారి సం: 01-285 అధ్యాత్మ

పల్లవి: ఇన్ని నేఁతలకు నిది యొకటే
కన్నా మన సిది కానదు గాని

చ. 1: పాతకకోట్లు భవములు భస్మీ-
భూతముసేయఁగఁ బొడవొకటే
శ్రీతరుణీపతిచింత, నిజముగా
యేతరి చిత్తం బెఱఁగదుగాని

చ. 2: మరణభయంబులు మదములు మలినీ-
కరణము సేయఁగఁగల దొకటే
హరినామామృత , మందుమీఁది రతి
నిరతము నా కిది నిలువదుగాని

చ. 3: కుతిలములును దుర్గుణములునుఁ దృణీ -
కృతములు సేయఁగ గురుతొకటే
పరియగువేంకటపతి సేవారతి,
గతియని మతి గని కానదుగాని

రేకు: 1947-01 ముఖారి సం: 01-286 అధ్యాత్మ

పల్లవి: ఏమీ నెఱఁగనినా కేడపుణ్యము
తామసుండఁజుమ్మీ ముందరునున్నదైవమా

చ. 1: పాతకపుఁజేతులనే పట్టి నిన్నుఁ బూజించు-
ఘాఁతుకుఁడ నాకు నెక్కడి పుణ్యము
చేతనముఁ బోదిసేయుచిత్తము నీదేకాన
రాతిబొమ్మఁజుమ్మీ భారము నీది దైవమా

చ. 2: పూనినయెంగిలినోర నొప్పగునిన్నుఁ బొగడు-
హీనజంతువునకు నా కేఁటిపుణ్యము
తేనెవూసి నీ విట్లాఁ దిప్పఁగానే తిరిగేటి-
మానిబొమ్మఁజుమ్మీ నామతిలోనిదైవమా

చ. 3: జాలిఁబడి సంసారజలధిలో మునిఁగేటి
కూళఁడ నాకేఁటితేఁకువపుణ్యము
పాలువోసిపెంచిననాపాలి వేంకటేశనే
తోలిబొమ్మఁజుమ్మీ కాతువుగాని దైవమా

రేకు: 1947-02 దేవగాంధారి సం: 01-287 అధ్యాత్మ

పల్లవి: భారమైన వేపమాను పాలువోసి పెంచినాను
తీరని చేఁదేకాక తియ్యనుండీనా

చ. 1: పాయఁదీసి కుక్కతోఁక బద్దలువెట్టి బిగిసి
చాయ కెంత గట్టిగాను చక్కనుండీనా
కాయపు వికారమిది కలకాలముఁ జెప్పినా
పోయిన పోకలేకాక బుద్ధి వినీనా

చ. 2: ముంచి ముంచి నీటిలోన మూల నానఁ బెట్టుకొన్నా
మించిన గొడ్డలి నేఁడు మెత్తనయ్యీనా
పంచమహాపాతకాల బారిఁబడ్డ చిత్తమిది
దంచిదంచి చెప్పినాను తాఁకి వంగీనా

చ. 3: కూరిమితోఁ దేలుఁదెచ్చి కోకలోన బెట్టుకొన్నా
సారెసారెఁ గుట్టుగాక చక్కనుండీనా
వేరులేని మహిమల వేంకటవిభుని కృప
ఘోరమైన ఆస మేలుకోర సోఁకీనా

రేకు: 1947-03 భూపాళం సం: 01-288 భక్తి

పల్లవి: ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా
శ్రీకాంతు భజియించు సేవకులకు

చ. 1: పాతాళమడ్డమా బలిమథను దాసులకు
భూతలం బడ్డమా పుణ్యులకును
సేతు కైలాసములు చిరభూములిన్నియును
పై త్రోవలట పరమ భాగవతులకును

చ. 2: అమరావతమడ్డమా హరి దాసులకు మహా
తిమిరంబులడ్డమా దివ్యులకును
కమలాసనుని లోకంబదియు నడ్డమా
విమలాత్ములై వెలుఁగు విష్ణు దాసులకు

చ. 3: పరమపద మడ్డమా బ్రహ్మాండధరుఁడైన
ధర వేంకటేశ్వరుని దాసులకును
యిరవైన లోకముల నిన్నిటా భోగించి
వరుసలను విహరించు వరవైష్ణవులకు

రేకు: 1947-04 దేవగాంధారి సం: 01-289 నామ సంకీర్తన

పల్లవి: ఆదిదేవ పరమాతుమా
వేద వేదాంతవేద్య నమో నమో

చ. 1: పరాత్పరా భక్తభవభంజనా
చరాచర లోకజనక నమోనమో

చ. 2: గదాధరా వేంకటగిరి నిలయా
సదానంద ప్రసన్న నమో నమో

రేకు: 1947-05 భైరవి సం: 01-290 భక్తి

పల్లవి: హరిఁ గొలిచియు మరీ నపరములా
తిరముగ నతనినే తెలియుటగాకా

చ. 1: పంకజనాభునిపాదములు దలఁచి
యింకా మరి యొకయితరములా
అంకెల నతనినే అతనిదాసులనే
కొంకక నిజముగఁ గొలుచుటగాకే

చ. 2: పన్నగశయనునిబంట్లకు బంటై
కొన్నిటిపై మరి కోరికెలా
యిన్ని కోరికలు యిదియే తనకని
కొన్నది కోలై కోరుటగాకా

చ. 3: వీనుల వేంకటవిభునామామృత -
మూనిన మతి మరియును రుచులా
తేనెలుగారెడితీపు లతనిమతి
నానారుచులై నానుచుటగాకా

రేకు: 1947-06 లలిత సం: 01-291 అధ్యాత్మ

పల్లవి: దైవమా పరదైవమా
యేవగింతలు నాకు నెట్టు దెచ్చేవో

చ. 1: పాపకర్మునిఁ దెచ్చి పరమియ్యఁదలఁచిన
మేపులకే పోక మెయుకొనీనా
తీపులు రూపులుఁ దివిరి నా వెనువెంట-
నేపొద్దు నీ వేఁడఁ దెచ్చేవో

చ. 2: అధమాధమునిఁ దెచ్చి యధికుని జేసెనంటే
విధినిషేధములు వివరించునా
నిధినిధానములు నిచ్చనిచ్చలుఁ బెక్కు-
విధముల నెటువటె వెదచల్లెదవో

చ. 3: అతికష్టుఁడగునాకు నలవిగానియీా-
మత మొఁసగిన నేను మరిగేనా
ప్రతిలేని వేంకటపతి నీదునామా-
మృత మిచ్చి నను నీవే మెరయింతుగాక

రేకు: 1947-07 భూపాళం సం: 01-292 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఏ కులజుఁడేమి యెవ్వఁడైననేమి
ఆకడ నాతడె హరి నెఱిగిన వాఁడు

చ. 1: పరగినసత్యసంపన్నుఁడైనవాఁడే
పరనిందసేయఁ దత్పరుఁడుగాని వాఁడు
అరుదైన భూతదయానిధియగువాఁడే
పరులుదానేయని భావించు వాఁడు

చ. 2: నిర్మలుఁడై యాత్మనియతి గలుగువాఁడే
ధర్మతత్పరబుద్ధిఁ దగిలిన వాఁడు
కర్మమార్గములు గడవనివాఁడే
మర్మమై హరిభక్తి మఱవని వాఁడు

చ. 3: జగతిపై హితముగాఁ జరియించు వాఁడే
పగలేక మతిలోన బ్రతికిన వాఁడు
తెగి సకలము నాత్మ దెలిసివాఁడే
తగిలి వేంకటేశుదాసుఁడయిన వాఁడు

రేకు: 1948-01 ముఖారి సం: 01-293 వేంకటగానం

పల్లవి: సేవింతురా యితనిఁ జెలఁగి పరు లిట్లనే
కావించె మమ్ము నెక్కడి దైవమితఁడు

చ. 1: పాలచవి యితఁడెఱుఁగు పాలఁబవళించ గో-
పాలుఁడని నేమితని భజియించఁగా
పాలుపడి తల్లి చనుఁబాలు సహితంబు నే-
కాలమునుఁ బాపె నెక్కడి దైవమితఁడు

చ. 2: పుట్టిపఁ దానె మఱి పురుషోత్తముఁడు మంచి-
పుట్టు వొగీననుచుఁ బూజించఁగా
పట్టుకొని మముఁ దెచ్చి బలిమిఁ బుట్టువులెల్లఁ
గట్టిపెట్టించె నెక్కడి దైవమితఁడు

చ. 3: కర్మకర్తారుఁడని కడలేనిపుణ్యముల ...
కర్మఫలములు దనకుఁ గైకొలుపఁగా
కర్మగతిఁ దెచ్చి వేంకటవిభుఁడు మావు భయ.....
కర్మములఁ జెరిచె నెక్కడి దైవమితఁడు

రేకు: 1948-02 ముఖారి సం: 01-294 దశావతారములు

పల్లవి: అరిది నేఁతలే చేసి తల్లాడ నిల్లాడ
సరిలేక వుండితివి జలరాశికాడ

చ. 1: పొలియఁ బీర్చితి వొకతిఁ బురిఁటి మంచముకాడ
నలఁచితి వొకని గగనంబుకాడ
బలిమిఁ దన్నితి వొకని బండిపోతులకాడఁ
దులిమితివి యేడుగురఁ దోలి మందకాడ

చ. 2: తడవి మోదితి వొకని తాటిమాఁకులకాడ...
నడిచితివి వొకనిఁ బేయలకాడను
పిడిచివేసితి వొకని బృందావనముకాడ
వొడిసితివి వొకని నావులమందకాడ

చ. 3: పటపటన దిక్కులు పగుల బగతులఁ దునిమి
నటియించితివి మామనగరికాడ
కుటిలబహుదైత్యాంతకుఁడవు వేంకటరాయ
పుటమెగసితి జగంబులయింటికాడ

రేకు: 1948-03 పాడి సం: 01-295 కృష్ణ

పల్లవి: బలువగుఁ దనరూపము చూపె
కలదింతయుఁ దనఘన తెలిఁగించెన్

చ. 1: పాండవరక్షణపరుఁడై నరునకు
నండనే తెలిపె మహమహిమ
దండి విడిచి తనదయతో నర్జునుఁ-
డుండఁగ మగటిమి నొడఁబడఁ బలికె

చ. 2: మగుడఁగ కులధర్మములుఁ బుణ్యములు
తెగి పార్థున కుపదేశించె
నగుచు నతనితో నానాగతులను
నిగమమునియమమునిజ మెరిఁగించెన్

చ. 3: వెరపుమిగుల నావిజయునిమనుమని
పరీక్షిత్తుఁ దగఁ బ్రదికించె
తిరువేంకటగిరిదేవుఁడు దానై
గరిమల బారతకథ గలిగించెన్

రేకు: 1948-04 సామంతం సం: 01-296 వైరాగ్య చింత

పల్లవి: బలువగుకర్మము లివివో జీవులప్రారబ్ధంబులు సంచితంబులును
బలిసి తీర వివి పెరుగనేకాని బ్రహ్మలబహుకల్పంబులదాఁక

చ. 1: పాయనిజన్మంబులకర్మంబులు పాయక జీవుల ప్రారబ్ధములై
యేయెడఁజూచిన నెదిటికొలుచులై యిచ్చల నిటు భజియించఁగను
కాయపుఁ బెడతటిగండఁడు విధి, దనుఁగడ తేర్చిన తనకడకర్మములు
పోయి సంచితంబులఁ గలసిన, నవి పొదలుచుఁ గొండలపాడవై పెరుగు

చ. 2: పొదలి సంచితంబులు వడిఁబెరుగును పొలియును జీవునిపుణ్యముఁ జాలక
యెదిగినపుణ్యం బిగురును కాఁగినయినుముమీఁదిజలములవలెను
పదిలములై కడుఁబాపకర్మములే బరువై పరగఁగఁ బ్రాణికి నెన్నఁడు
తుదయు మొదలు నెందును లేక, వడిఁ దొలఁగక భవములతొడవై తిరుగు

చ. 3: తలఁపులో నవయఁదలఁచినజంతువు, కలుషహరుఁడు వేంకటగిరిపతి దను
దలఁచుభాగ్య మాత్మకు నొసగినఁ, జిత్తము పరిపక్వంబై యెపుడు
జలజోదరుదలఁచఁగఁబ్రారబ్దంబులు సంచితంబులుఁ బొలిసి పుణ్యులై
చెలువగునిత్యానందపదంబునఁ జెలఁగి సుఖించగఁ జేరుదు రపుడు

రేకు: 1948-04 భైరవి సం: 01-297 వైరాగ్య చింత

పల్లవి: చాల నొవ్వి నేయునట్టిజన్మమేమి మరణమేమి
మాలుగలపి దొరతనంబు మాన్పు టింత చాలదా

చ. 1: పుడమిఁ బాపకర్మమేమి పుణ్యకర్మమేమి తనకు
కడపరానిబంధములకుఁ గారణంబులైనవి
యెడపకున్న పసిఁడిఁసంకెలేమి యినుపసంకెలేమి
మెడకుఁ దగిలియుండి యెపుడు మీఁదుచూడరానివి

చ. 2: చలముకొన్న ఆపదేమి సంపదేమి యెపుడుఁ దనకు
అలమిపట్టి దుఃఖములకు నప్పగించినట్టిది
యెలమిఁ బసిఁడిగుదియయేమి యినుపగుదియయేమి తనకు
ములుగ ములుగఁ దొలితొలి మోఁదు టింత చాలదా

చ. 3: కర్మియైనయేమి వికృతకర్మియైననేమి దనకు
కర్మఫలముమీఁదకాంక్ష గలుగు టింత చాలదా
మర్మ మెరిఁగి వేంకటేశుమహిమలనుచుఁ దెలిసినట్టి
నిర్మలాత్ము కిహముఁ బరము నేఁడు గలిగెఁ జాలదా

రేకు: 1949-01 కన్నడగౌళ సం: 01-298 అధ్యాత్మ

పల్లవి: కాలాంతకుఁడనువేఁటకాఁ డెప్పుడుఁ దిరిగాడును
కాలంబనియెడితీవ్రపుగాలివెర వెరిఁగి

చ. 1: పరమపదంబు చేనికి పసిగొనునర మృగములకు నును
తరమిడి, సంసారపుటోఁదములనె యొఁగించి,
పురవడిఁ జేసినకర్మపుటరులు దరిద్రంబనువల
వొరపుగ మాయనుపోగులు వొకవెరవున వేసీ

చ. 2: కదుముకవచ్చేటిబలురోగపుఁగుక్కల నుసికొలిపి,
వదలక ముదిసినముదిమే వాకట్టుగఁ గట్టి.
పొదలుచు మృత్యువు పందివోటై నల్లెట నాడఁగ.
పదిలముగా గింకరులనుచొప్పరులఁ బరవిడిచీ

చ. 3: ఆవోఁదంబులఁ జిక్కక, ఆవురులనుఁ దెగనురికి,
ఆవేఁటకాండ్ల నదలించాచేనే చొచ్చి ,
పావనమతిఁ బొరెవొడిచి పరమానందముఁ బొందుచు
శ్రీ వేంకటపతి మనమునఁ జింతించీ నరమృగము

రేకు: 1949-02 భూపాళం సం: 01-299 వైరాగ్య చింత

పల్లవి: ఏలవచ్చీ యేలపోయీ నెందుండీఁ బ్రాణి
తోలుతి త్తిలోనఁ జొచ్చి దుంక దూరనా

చ. 1: పుట్టులేక నరకాలపుంగుడై తా నుండక యీ-
పుట్టుగున కేల వచ్చీ పోయీఁ బ్రాణి
పుట్టుచునే కన్న వారిఁ బుట్టినవారి నాసలఁ
బెట్టిపట్టి దుఃఖములఁ బెడరేఁచనా

చ. 2: భూతమై యడవిలోఁ బొక్కుచుఁ దా నుండక యీ-
బూతుజన్మమేల మోఁచెఁ బుచ్చిన ప్రాణి
రాతిరిఁబగలు ఘోరపుఁబాటు వడిపడి
పాతకాలు చేసి యమబాధఁబడనా

చ. 3: కీటమై వేంకటగిరి కిందనైన నుండక యీ-
చేటువాటుకేల నోఁచె చెల్లఁబో ప్రాణి
గాటమైనసంపదల కడలేనిపుణ్యాల-
కోటికిఁ బడగెత్తక కొంచెపడనా

రేకు: 1949-03 నాట సం: 01-300 వైరాగ్య చింత

పల్లవి: అయ్యా మానువఁగదవయ్య మనుజుఁడు తన-
కయ్యపుఁగంగఁ గానఁడు

చ. 1: పాపపుణ్యలంపటుఁడైనా దష్ట-
రూపుడూ జన్మరోగి యటుగాన
పైపైనే ద్రవ్యతాపజ్వరము పుట్టి
యేపొద్దు వొడలెరఁగఁడు

చ. 2: నరకభవనపరిణతుఁడైనా కర్మ
పురుషుఁడు హేయభోగి యటుగాన
దురితపుణ్యత్రిదోషజ్వరము పట్టి
అరవెరమాట లాడీని

చ. 3: దేహమోహస్థిరుఁడైనా ని-
ర్వాహుఁడు తర్కవాది యటుగాన
శ్రీహరి వేంకటశ్రీకాంతునిఁ గని
వూహలఁ జేరనొల్లఁడు

రేకు: 1949-04 నాట సం: 01-301 అధ్యాత్మ

పల్లవి: ఏదియునులేని దేఁటిజన్మము
వేదాంతవిద్యావివేకి గావలెను

చ. 1: పరమమూ ర్తిధ్యానపరుఁడు గావలె నొండె
పరమానందసంపద లొందవలెను
పరమార్థముగ నాత్మభావింపవలె నొండె
పరమే తానై పరగుండవలెను

చ. 2: వేదశాస్త్రార్థకోవిదుఁడు గావలె నొండె
వేదాంతవిదుల సేవించవలెను
కాదనక పుణ్యసత్కర్మి గావలె నొండె
మోదమున హరిభక్తి మొగి నుండవలెను

చ. 3: సతతభూదదయావిచారి గావలె నొండె
జితమైనయింద్రియస్థిరుఁడు గావలెను
అతిశయంబగు వేంకటాద్రీశుసేవకులె
గతియనుచు తనబుద్ధిఁ గలిగుండవలెను

రేకు: 1949-05 గుండక్రియ సం: 01-302 అధ్యాత్మ

పల్లవి: కడుపెంత తాఁ గుడుచు కడుపెంత దీనికై
పడనిపాట్ల నెల్లఁబడి పొరలనేలా

చ. 1: పరులమనసునకు నాపదలు గలుగఁగఁజేయఁ
బరితాపకరమైనబ్రదుకేలా
సొరిది నితరుల మేలుచూచి సైఁపఁగలేక
తిరుగుచుండేటి కష్ట దేహమిదియేలా

చ. 2: యెదిరి కెప్పుడుఁ జేయుహితమెల్లఁ దనదనుచు
చదివిచెప్పనియట్టి చదువేలా
పొదిగొన్నయాసలోఁ బుంగుడై సతతంబు
సదమదంబై పడయుచవులు దనకేలా

చ. 3: శ్రీవేంకటేశ్వరుని సేవారతికిఁగాక
జీవనభ్రాంతిఁ బడుసిరులేలా
దేవోత్తముని నాత్మఁ దెలియనొల్లక పెక్కు_
త్రోవ లేఁగిన దేహి దొరతనంబేలా

రేకు: 1949-06 సామంతం సం: 01-303 అధ్యాత్మ

పల్లవి: ఘనమనోరాజ్యసంగతి చెలఁగినఁగాని
జనుల కెప్పుడు నాత్మసౌఖ్యంబు లేదు

చ. 1: ప్రతిలేనిధైర్యంబు పదిలపరచినఁ గాని
మతిలోనిపగవారిమద మణఁపరాదు
మితిలేనిశాంతమనుమేఁటికైదువఁ గాని
క్రితకంబువిషయముల గెలుపెరఁగరాదు

చ. 2: సొరిది నిర్మోహమనుజోడు దొడిగినఁ గాని
వెరపుడిగి మమతచే వెళ్లఁబడరాదు
యిరవైన విజ్ఞానపింట నుండినఁ గాని
అరసి జగమెల్ల తానై యేలరాదు

చ. 3: యిన్నియునుఁ దిరువేంకటేశుఁ డిచ్చినఁ గాని
తన్నుఁదానెరిఁగి యాతనిఁగొలువరాదు
కన్నులను వెలి లోను గలయఁజూచిన గాని
సన్నంబుఘనమనెడిజాడ గనరాదు

రేకు: 1950-01 ముఖారి సం: 01-304 అధ్యాత్మ

పల్లవి: ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా
మఱచినమేనితో మరి యటేఁగీనా

చ. 1: పటువైభవములఁ బరగేటినాఁడే
తటుకున శ్రీహరిఁ దలఁచఁడటా
కుటిలదేహియై కుత్తికఁ బ్రాణము
తటతటన దరఁగఁ దలఁచీనా

చ. 2: ఆలుబిడ్డలతో మహసుఖ మందుచు
తాలిమితో హరిఁ దలఁచఁడటా
వాలిన కాలుని వసమైనప్పుడు
దాలు వెండఁగాఁ దలఁచీనా

చ. 3: కొఱఁతలేక తేఁకువఁ దా నుండేటి-
తఱి వేంకటపతిఁ దలఁచఁడటా
మఱులు దేహియై మఱచివున్నయడ
తఱచుటూరుపులఁ దలఁచీనా

రేకు: 1950-02 సామంతం సం: 01-305 వైరాగ్య చింత

పల్లవి: కాలము కాలము గాదు కపటాలే తలచాయ
చాలునింక దీనితోడిజాలి మానరే

చ. 1: పిన్ననాట నుండి తనపెంచిన యీదేహము
మున్నిటివలెగాదు ముదిసీని
యెన్నికదినాలచేత నెప్పుడేడఁ బడునో
కన్నవారిచేతికి గక్కున నియ్యరే

చ. 2: తోలునెముకలచేత దొడ్డైన యీదేహము
గాలిచేత దాలిమీఁదఁ గాగీని
కీలుగీలు యెప్పుడేడ కింద వీడిపడునో
మేలుఁగీడు లేనిచోట మేఁటిఁజేసి పెట్టరే

చ. 3: కింకపుకిసరుచేత కీడైన దేహము
వంకవంకతెరవుల వడీసీని
యింక నీవిధిచేత నెప్పుడేడఁ బడునో
వేంకటేశుఁజేరఁ బడవేయఁగదరే

రేకు: 1950-03 బౌళి సం: 01-306 అధ్యాత్మ

పల్లవి: ఇటువలెనేపో సకలము యించుకగన భావించిన
అటమటములసంతోషము ఆసలు సేయుటలు

చ. 1: పగగొనితిరిగేటిజన్మపుబాధలు తనకే కాలము
తగుసుఖ మెక్కడ నున్నది తడతాఁకులే కాక
పొగలోపల సేక గాసిన భగభగఁ గన్నుల నీళ్లు
నిడిగినదుఃఖమే కాకిటు నిజసౌఖ్యము గలదా

చ. 2: పొలసిన మాయపురూపులు పొలఁతుల మచ్చిక మాటలు
తలఁచిన తనకేమున్నది తలఁపోఁతలేకాక
బలువునఁ బారఁగ మోహపుపాశము తన మెడఁ దగిలిన
తలకిందుగఁ బడుటెల్లను తనకిది ప్రియమౌనా

చ. 3: చేతిపదార్థము దలఁచక చేరువనుండినవారల-
చేతిపదార్థము గోరిన చేతికి లోనౌనా
ఆతుమఁగల వేంకటపతి నాత్మఁ దలఁచి సుఖింపక
యేతరి సుఖములఁ దిరిగిన నింపులు దనకౌనా

రేకు: 1950-04 కాంబోదిసం: 01-307 అధ్యాత్మ

పల్లవి: శమము చాలనియట్టి జన్మం బిదేమిటికి
దమము చాలనియట్టితగు లిదేమిటికి

చ. 1: పగయునుంబోలె నాపై సేయునడియాస
తగిలి యేపనేకాని దయ గొంత లేదు
జగడముంబోలె నలసతిలేనిమమత దను
తెగి వేంచనేకాని తీరుగడ లేదు

చ. 2: ఋణమునుంబోలె తీరియుందీరనది కర్మ
గణనగలకాలంబు కడ మొదలు లేదు
వ్రణమునుంబోలె విడవక రాంగ దేహజపు-
గుణము సౌఖ్యము తెరువు గొంతయును లేదు

చ. 3: నీతియుంబోలెఁ బ్రాణికి వేంకటేశుకృప
చేతికి నిధానంబు చేరినట్లాయ
భూతములంబోలె తలంపున కితరసంస్మరణ-
భీతిపుట్టించి యప్రియభావమాయ

రేకు: 1950-05 శ్రీరాగం సం: 01-308 వైరాగ్య చింత

పల్లవి: ఇదివో సంసారమెంత సుఖమో కాని
తుదలేని దుఃఖమను తొడవు గడియించె

చ. 1: పంచేద్రియంబులను పాతకులు దనుఁదెచ్చి
కొంచెపు సుఖంబునకుఁ గూర్పఁగాను
మించి కామంబనేడిమేఁటి తనయుండు జని-
యించి దురితధనమెల్ల గడియించె

చ. 2: పాయమనియెడి మహపాతకుఁడు తనుఁ దెచ్చి
మాయంపు సుఖమునకు మరుపఁగాను
సోయగపు మోహమను సుతుఁడేచి గుణమెల్లఁ
బోయి యీనరకమనుపురము గడియించె

చ. 3: అతియుండగువేంకటాద్రీశుఁడను మహ-
హితుఁడు చిత్తములోన నెనయఁగాను
మతిలోపల విరక్తిమగువ జనియించి య-
ప్రతియయి మోక్షసంపదలు గడియించె

రేకు: 1950-06 బౌళి సం: 01-309 అధ్యాత్మ

పల్లవి: చిత్తమో కర్మమో జీవుఁడో దేవుఁడో
ఒొత్తిన యీచేఁత లొకరివి గావు

చ. 1: పదిలమైన మోహపాశంబులు దెచ్చి
మెదలకుండఁగ నాకు మెడఁజుట్టి
యెదిరివారు నవ్వ నింటింటఁ దిరిగించి
తుదలేని యాసల దుఃఖాతురునిఁ జేసె

చ. 2: కొలఁదిమీఱ జన్మకోట్లఁ బెనగొని
తొలఁగని నాలోని దురితము
తొలఁగింప నాలుక తుదకు నీపేరిచ్చి
తెలుపు మింతియ చాలుఁ దిరువేంకటేశా

రేకు: 1961-01 ఛాయనాట సం: 01-310 వైరాగ్య చింత

పల్లవి: తలఁప వెనక నుయ్యి తగరు ముందట దీనఁ
దొలఁగ నాకుఁ దెరువు దోఁపఁ దేమిసేతు

చ. 1: మమకార విముక్తి మార్గదూరము నీపై
మమతసేయక నాకు మనరాదు
మమత మేలో నిర్మమత మేలో దీని-
క్రమమున క్రమము నేఁ గాన నేమి సేతు

చ. 2: కర్మమార్గము జన్మగతికిఁ జేరువ ని-
ష్కర్మము పాతకమునకుఁ దొడవు
కర్మిగావలెనో నిష్కర్మి గావలెనో యీ-
మర్మంపు మదము మాన దేమిసేతు

చ. 3: శరణాగత రక్షకుడవైనయట్టి
తిరువేంకటగిరిదేవుఁడా
పరిపూర్ణుఁడవో నీవు పరిచ్ఛిన్నుఁడవో ని-
న్నరసి భజింపలేనైతి నేమిసేతు

రేకు: 1961-02 మలహరిసం: 01-311 కృష్ణ

పల్లవి: పాలదొంగవద్దవచ్చి పాడేరు తమ-
పాలిటిదైవమని బ్రహ్మాదులు

చ. 1: రోలఁ గటిపైంచుక పెద్దరోలలుగా వాపోవు
బాలునిముందర వచ్చి పాడేరు
ఆలకించి వినుమని యంబరభాగమునందు
నాలుగుదిక్కులనుండి నారదాదులు

చ. 2: నోరునిండా జోల్లుగార నూఁగి ధూళిమేనితో
పారేటిబిడ్డని వద్దఁ బాడేరు
వేరులేని వేదములు వెంటవెంటఁ జదువుచుఁ
జేరిచేరి యింతనంత శేషా[illegible]దులు

చ. 3: ముద్దులు మోమునఁగార మూలల మూలలదాఁగే-
బద్దులబాలునివద్దఁ బాడేరు
అద్దివో శ్రీతిరువేంకటాద్రీశుఁ డితఁడని
చద్దికి మేఁడికి వచ్చి సనకాదులు

రేకు: 1961-03 ధన్నాశి సం: 01-312 నామ సంకీర్తన

పల్లవి: నంద నందన వేణునాద వినోదము
కుంద కుంద దంతహాస గోవర్ధనధరా

చ. 1: రామ రామగోవింద రవిచంద్రలోచన
కామ కామకలుష వికారవిదూరా
ధామ ధామవిభవత్ర్పతాపరూప దనుజని-
ర్ధ్దామధామ కరణచతుర భవభంజనా

చ. 2: కమల కమలవాస కమలారమణ దేవో-
త్తమ తమో గుణసతతవిదూర
ప్రమదత్ర్పమదానుభవభావకరణ
సుముఖ సుధానంద శుభరంజనా

చ. 3: పరమ పరాత్పర పరమేశ్వరా
వరద వరదామల వాసుదేవ
చిరచిర ఘననగ శ్రీవేంకటేశ్వర
నర హరినామ పన్నగశయనా

రేకు: 1961-04 కన్నడగౌళ సం: 01-313 వైరాగ్య చింత

పల్లవి: వెలికి వెళ్ళఁడు చలికి వెరవఁడు
పులికి నులికి నులికీనయ్యా

చ. 1: రోగియై తా రుచులఁ బాయఁడు
భోగియై రతిపొందల్లఁడు
వేగి మిగిలిన వెడచీఁకటినీరు
తాగీఁ దాగీఁ దాగీనయ్యా

చ. 2: తొడికీఁ దొడుకఁడు వుడికి నుడుకఁడు
కడికీఁ గసరఁడు కడుఁజేరఁడు
మడికి గుడికి మానిన మమతలఁ
బుడికీఁ బుడికీఁ బుడికీనయ్యా

చ. 3: నిండీ నిండఁడు నెరసీ నెరయఁడు
పండీఁ బండఁడు బయలీఁతలా
అండనె తిరువేంకటాధిపుఁ దలఁపుచు
నుండీ నుండీ నుండీనయ్యా

రేకు: 1961-05 ధన్నాశి సం: 01-314 రామ

పల్లవి: దేవ దేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం

చ. 1: రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండ రాజదీక్షా గురుం
రాజీవలోచనం రామచంద్రం

చ. 2: నీల జీమూత సన్నిభ శరీరం ఘనవి
శాల వక్షం విమల జలజనాభం
తాలాహి నగహరం ధర్మ సంస్థాపనం
భూల లనాధిపం భోగిశయనం

చ. 3: పంకజాసన వినుత పరమ నారాయణం
శంకరార్జిత జనక చాప దళనం
లంకా విశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం

రేకు: 1961-06 ఆహిరి సం: 01-315 వైరాగ్య చింత

పల్లవి: ఎడమపురివెట్టె పరహితవివేకము, లోన
గుడుసువడెఁ జదువు, మెరుఁగులువారెఁ జలము

చ. 1: లంప మేయఁగఁదొణఁగె లలితంపుమతి లోనె,
తెంపు దిగవిడిచె యెడ తెగనిమానంబు,
చంప దొరకొనియె వేటలేని తమకంబు,
యింపు ఘనమాయ నే నిఁకనేమి సేతు

చ. 2: బయలువందిలివెట్టు పనిలేనిలంపటము,
దయ విడువఁదొడఁగె చిత్తములోనికాంక్ష,
పయికొన్న మోహంబు పడనిపాట్లఁ బరచె,
లయమాయ శాంతి మెల్లనె తీరె నెరుక

చ. 3: చావుఁబుట్టువు మఱచె సంసారబంధబు,
దైవమును విడిచె యాతరికంపుఁబ్రియము
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తరంజకుఁడు యిఁకఁ
గావలసినది యతనికరుణ ప్రాణులకు

రేకు: 1962-01 శ్రీరాగం సం: 01-316 వైరాగ్య చింత

పల్లవి: ఎంతగాలమొకదా యీ దేహధారణము
చింతాపరంపరలఁ జిక్కువడవలనె

చ. 1: పడిగొన్న మోహంబువలలఁ దగులైకదా
కడలేని గర్భనరకము లీఁదవలనె
నడిమిసుఖములచేత ననుపుసేయఁగఁగదా
తొడరి హేయపుదిడ్డిఁ దూరాడవలనె

చ. 2: పాపపుంజములచేఁ బట్టువడఁగాఁగదా
ఆపదల తోడిదేహము మోవవలనె
చూపులకులోనైన సుఖము గానక కదా
దీపనభ్రాంతిచేఁ దిరిగాడవలనె

చ. 3: హితుఁడైన తిరువేంకటేశుఁ గొలువకకదా
పత్రిలేని నరకకూపమునఁ బడవలనె
అతనికరుణారసంబబ్బ కుండఁగఁగదా
బతిమాలి నలుగడలఁ బారాడవలనె

రేకు: 1962-02 నాట సం: 01-317

పల్లవి: తెలిసినఁ దెలియుఁడు తెలియనివారలు
తొలఁగుఁడు బ్రహ్మదులె యెరుఁగుదురు

చ. 1: వరదుఁ డఖిలదేవలతకు వంద్యుఁడు
గరదుఁడసురలకుఁ గంటకుఁడు
పరమాత్ముఁడంబుజ భవశివాదులకుఁ
బరులకెల్ల మువ్వరలో నొకఁడు

చ. 2: దేవుఁడు సనకాదిమునులకునుఁ, బర-
దైవ మఖిలవేదములకును,
కైవల్యమొసఁగుఘననిధి, విధికిమ-
హవిధి, జడులకు యాదవకులుఁడు

చ. 3: ఆద్యుఁడచలుఁడు మహభూత మితఁడ-
భేధ్యుఁడ సాధ్యుఁడు భీకరుఁడు
సద్య: ఫలదుఁడు సకలమునులకును
వేద్యుఁడితఁడె పో వేంకటవిభుఁడు

రేకు: 1962-03 సామంతం సం: 01-318 అధ్యాత్మ

పల్లవి: ఎక్కువ కులజుఁడైన హీన కులజుఁడైన
నిక్కమెరిఁగిన మహా నిత్యుఁడే ఘనుఁడు

చ. 1: వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి
యాచరించని సోమయాజికంటె
యేదియునులేని కులహీనుఁడైనను విష్ణు_
పాదములు సేవించు భక్తుఁడే ఘనుడు

చ. 2: పరమగువేదాంతపఠన దొరికియు సదా
హరిభక్తిలేని సన్యాసికంటె
సరవి మాలిన యంత్యజాతికులజుఁడైన_
నరసి విష్ణునివెదకు నాతఁడే ఘనుఁడు

చ. 3: వినియుఁ జదివియును శ్రీ విభునిదాసుఁడుగాక
తనువు వేఁపుచునుండుతపసికంటె
యెనలేని శ్రీవేంకటేశుప్రసాదాన్న_
మనుభవించినయాతఁ డప్పుడే ఘనుడు

రేకు: 1962-04 శ్రీరాగం సం: 01-319 అధ్యాత్మ

పల్లవి: కనుఁగొనఁగ జీవుఁ డెరఁగఁడుగాక యెరిఁగినను

ఆనవరతవిభవంబు లప్పుడే రావా

చ. 1: విసుగ కెవ్వరినైన వేఁడనేర్చన నోరు

దెసలకును బలుమారుఁ దెరచు నోరు

వసుధాకళత్రుఁ దడవదుగాక తడవినను

యెసఁగఁ గోరికలు తన కిప్పుడే రావా

చ. 2: ముదమంది యెవ్వరికి మ్రొక్కనేర్చిన చేయి

పొదిగి యధముల నడుగఁబూను చేయి

ఆదన హరిఁ బూజసేయదుగాక సేసినను

యెదురెదురఁ గోరికలు యిప్పుడే రావా

చ. 3: తడయకేమిటికైనఁ దమకమందెడి మనసు

ఆడరి యేమిటికైన నలయు మనసు

వడి వేంకటేశుఁ గొలువదుగాక కొలిచినను

బడిబడినె చెడనిసంపద లిట్లు రావా

రేకు: 1962-05 ముఖారి సం: 01-320

పల్లవి: జనులు నమరులును జయలిడఁగా
ఘనుఁడదె పుయ్యాలగంభముకాడ

చ. 1: వదలక వలసినవారికి వరములు
యెదురెదురై తానిచ్చుచును
నిదురలేక పెనునిధినిధానమై
కదలఁ డదే గరుడగంభముకాడ

చ. 2: కోరినవారికి కోరినవరములు
వోరంతప్రొద్దు నొసఁగుచును
చేరువయై కృపసేసీ నిదివో
కూరిముల పడిమిగోపురమాడ

చ. 3: పడి వేంకటపతి వరములరాయఁడు
నుడుగఁగాళ్ళుఁగన్నులు సుతుల
బడిబడి నొసఁగుచు బ్రాణచారులకు
కడిమి నీడ దిరుగని చింతాడ

రేకు: 1962-06 బౌళి సం: 01-321 వైరాగ్య చింత

పల్లవి: కొండ దవ్వుట యెలుక గోరిపట్టుట దీన
బండాయ సంసారబంధము

చ. 1: వెలయఁ జిత్తంబునకు వేరుపురువై బుద్ధిఁ
గలఁగించె మోహవికారము
కలకాలమునకు లింగము మీఁది యెలుకయై
తలకొనియె నాత్మ పరితాపము

చ. 2: అరయఁ జంచలముచే నాలజాలంబువలెఁ
దిరుగదొరకొనియెఁ దనదేహము
తిరువేంకటాచలాధిపుని మన్ననఁగాని
పరిపాటిఁ బడదు తనభావము

రేకు: 1963-01 భైరవి సం: 01-322 కృష్ణ

పల్లవి: వీఁడివో యిదె వింతదొంగ
వేఁడిపాలు వెన్న వెరఁజినదొంగ

చ. 1: వెలయ నీటఁ జొప్పువేనేటి దొంగ
తలగాననీక దాఁగు దొంగ
తలఁకక నేలదవ్వేటిదొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి దొంగ

చ. 2: అడుగుకింద లోకమడఁచేటి దొంగ
అడరి తల్లికినైన నలుగుదొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలికానెతో నుండు దొంగ

చ. 3: మోస మింతుఁల జేయుముని ముచ్చుదొంగ
రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరిమీఁద
మూసినముత్యమై ముదమందు దొంగ

రేకు: 1963-02 శ్రీరాగం సం: 01-323 కృష్ణ

పల్లవి: త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథా

చ. 1: వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత-
కౌశేయవసన జగన్నాథా

చ. 2: బలభద్రానుజ పరమపురుష దుగ్ధ-
జలధినిహార కుంజరవరద
సులభ సుభద్రాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా

చ. 3: వటపత్రశయన భువనపాలన జంతు
ఘటకారకరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం-
కటగిరినిలయ జగన్నాథా

రేకు: 1963-03 కాంబోది సం: 01-324 దశావతారములు

పల్లవి: ఆదిదేవుఁడనఁగ మొదలు నవతరించి జలది సొచ్చి
వేదములును శాస్త్రములును వెదకి తెచ్చె నీతఁడు

చ. 1: వాలి తిరుగునట్టి దైత్యవరుల మోహవతులనెల్ల
మూలమూలఁ ద్రోసి ముసుఁగుపాలు సేసె నీతఁడు
వేలంఖ్యలైనసతుల వేడుకలలరఁజేసి వొంటి
నాలిమగనిరీతిఁ గూడి యనభవించె నీతఁడు

చ. 2: కడుపులోని జగములెల్లఁ గదలకుండఁ బాఁపరేని-
పడుక నొక్కమనసుతోడఁ బవ్వళించె నీతఁడు
అడుగుకింద లోకమెల్ల నడఁచఁదలఁచి గుఱుతుమీర
పొడవు వెరిగి మిన్నుజలము పొడిచి తెచ్చె నీతఁడు

చ. 3: కోడెవయసునాఁడు మంచి గోపసతుల మనములెల్ల
ఆడి కెలకు నోప కొల్లలాడి బ్రదికె నీతఁడు
వేడుకలర వేంకటాద్రి వెలసి భూతకోటి దన్నుఁ
జూడుఁడనుచు మోక్షపదము చూరవిడిచె నీతఁడు

రేకు: 1963-04 ముఖారి సం: 01-325 సంస్కృత కీర్తనలు

పల్లవి: మాదృశానాం భవామయ దేహినాం
యీదృశం జ్ఞానమితి యేపి న వదంతి

చ. 1: వాచామ గోచరం వాంఛాసర్వత్ర
నీచ కృత్యైరేవ నిబిడీకృతా
కేచిదపి వా విష్ణుకీర్తనం ప్రీత్యా
సూచయంతో వాశ్రోతుం న సంతి

చ. 2: కుటిల దుర్బోధనం కూహకం సర్వత్ర
విట విడంబన మేవ వేద్మ్యధీతం
పటు విమల మార్గ సంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే న సంతి

చ. 3: దురిత మిదమేవ జంతూనాం సర్వత్ర
విరస కృత్యైరేవ విశదీకృతం
పరమాత్మానాం భవ్య వేంకటానామ-
గిరివరం భజయితుం కేవా న సంతి

రేకు: 1963-05 శ్రీరాగం సం: 01-326 భక్తి

పల్లవి: కాకున్న సంసారగతులేల
లోకకంటకములగు లోభంబులేల

చ. 1: వినికిగనవలసినను విష్ణుకీర్తన చెవికి
వినికిచేసిన నదియె వేదాంతబోధ
మనికిగనవలసినను మధువైరిపై భక్తి
వునికి ప్రాణులకు బ్రహ్మోపదేశంబు

చ. 2: చదువు గనవలసినను శౌరినామము దిరుగఁ
జదువుటే సకలశాస్త్రముల సమ్మతము
నిదుర గనవలసినను నీరజాక్షునికిఁ దన-
హృదయసమర్పణ సేయుటిది యోగనిదుర

చ. 3: ఆస వలసిన వేంకటాధీశ్వరుని కృపకు-
నాససేయుటే పరమానందసుఖము
వాసి గనవలసినను వైష్ణవాగారంబు
వాసి సేయుట తనకు వైభవస్ఫురణ

రేకు: 1963-06 దేశి సం: 01-327 అధ్యాత్మ

పల్లవి: జీవుఁ డెంతటివాఁడు చిత్త మెంతటిది తన
దైవికము గడవ నెంతటివాఁడు దాను

చ. 1: విడిచిపోవని యాస విజ్ఞానవాసనలఁ
గడచి మున్నాడె నెక్కడివివేకములు
వుడుగనియ్యనిమోహ ముబ్బి పరమార్థముల
మెడవట్టి నూకె నేమిటికింక నెరుక

చ. 2: పాయనియ్యనిమహాబంధ మధ్యాత్మతో
రాయడికిఁ దొడఁగె సైరణలేల కలుగు
మాయనియ్యనికోపమహిమ కరుణామతిని
వాయెత్తనియ్య దెవ్వరికిఁ జెప్పుదము

చ. 3: సరిలేనియాత్మచంచల మంతరాత్మకుని-
నెరఁగనియ్యదు దనకు నేఁట్టిపరిణతలు
తిరువేంకటాచలాధిపునిమన్ననఁగాని
వెరసి యున్నటి గెలువ వెరవు మఱిలేదు

రేకు: 1964-01 వరాళి సం: 01-328 వైరాగ్య చింత

పల్లవి: ఏమి గలదిందు నెంత పెనగినఁ వృథా
కాముకపు మనసునకు కడ మొదలు లేదు

చ. 1: వత్తిలోపలి నూనె వంటిది జీవనము
విత్తుమీదటి పొల్లు విధము దేహంబు
బత్తిసేయుట యేమి పాసిపోవుట యేమి
పొత్తుల సుఖంబులకు పొరలుటలుగాక

చ. 2: ఆకాశ పాకాశ మరుదైన కూటంబు
లోకరంజకము తమలోనిసమ్మతము
చాకిమణుఁగుల జాడ చంచలపు సంపదలు
చేకొనిననేమి యివి చెదిరిననునేమి

చ. 3: గాదెఁబోసినకొలుచుకర్మి సంసారంబు
వేదు విడువనికూడు వెడమాయబదుకు
వేదనల నెడతెగుట వేంకటేశ్వరు కృపా-
మోదంబు వడసినను మోక్షంబు గనుట

రేకు: 1964-02 శ్రీరాగం సం: 01-329 అధ్యాత్మ

పల్లవి: కొంచెమును ఘనముఁ గనుఁగొననేల హరిఁదలఁచు
పంచమహాపాతకుఁడే బ్రహ్మణోత్తముఁడు

చ. 1: వేదములుచదివియును విముఖుఁడై హరికథల
నాదరించనిసోమయాజికంటె
యేదియునులేనికులహీనుఁడైనను విష్ణు
పాదసేవకుఁడువో బ్రహ్మణోత్తముఁడు

చ. 2: పరమమగువేదాంతపఠన దొరకియు సదా
హరిఁదలఁచలేని సన్న్యాసికంటె
మరిగి పసురముఁదినెడిమాలయైనను వాఁడె
పరమాత్ముఁ గొలిచినను బ్రహ్మణోత్తముఁడు

చ. 3: వినియుఁ జదివియు రమావిభునిఁ దలఁపక వృథా
తనువు వేఁపుచుఁ దిరుగతపసికంటె
చనవుగల వేంకటేశ్వరుదాసులకు వెంటఁ
బనిదిరుగునధముఁడే బ్రహ్మణోత్తముఁడు

రేకు: 1964-03 బౌళి సం: 01-330 అధ్యాత్మ

పల్లవి: తెలిసియు నత్యంతదీనుఁడై తన్నుఁ
దెలియఁగఁగోరేటి తెలివే పో తెలివి

చ. 1: వలచినసతి దన్ను వడిఁ గాలఁదన్నిన
అలరి యెట్లా నుబ్బు నటువలెనే
తలఁక కెవ్వరు గాలఁదన్నినా మతిలోన
అలుగక ముదమందునదివో తెలివి

చ. 2: అరిది మోహపు వనిత ఆలిపైఁ దిట్టిన...
నరవిరై చొక్కినయుటవలెనే
పరులు దన్ను వెలుపల నిట్లఁ బలికిన
ఆరలేక రతిఁ జొక్కునదివో తెలివి

చ. 3: తనివోక ప్రియకాంత తమ్ములపురస మాన....
ననయమును నటు గోరునటువలెనే
తనర వేంకటపతిదాసుల ప్రసాదంబు
ఆనిశము ను గొనఁగోరునదివో తెలివి

రేకు: 1964-04 గుండక్రియ సం: 01-331 ఉపమానములు

పల్లవి: పొరాక పోయి తలఁపుననున్న దైవంబుఁ
జేరనొల్లక పరులఁజేరఁదిరగెదము

చ. 1: వడిఁబారు పెనుమృగము వలలలోపలఁ దగులు
వడి వెడల గతిలేక వడఁకుచున్నట్లు
చెడనికర్మములలోఁ జిక్కి భవములబాధఁ
బడియెదముగాక యేపనికిఁ దిరిగెదము

చ. 2: నీరులోపలిమీను నిగిడి యామిషముకై
కోరి గాలము మ్రింగి కూలబఁడినట్లు
జారిపోయిననేల సంసారసౌఖ్యవి-
కారంపుమోహములఁ గట్టువడియెదము

చ. 3: శ్రీవేంకటేశు నాశ్రితలోకరక్షకుని
భావింప దేవతాపతియైనవాని
సేవించుభావంబు చిత్తమొడఁబడక నే-
మీవలావలిపనుల నిట్లఁ దిరిగెదము

రేకు: 1964-05 శ్రీరాగం సం: 01-332 దశావతారములు

పల్లవి: సకలసందేహమై జరగుచున్నది యెకటి
ప్రకటింప జీవమో బ్రహ్మమో కాని

చ. 1: వసుదేవుజఠరమనువననిధికిఁ జంద్రుఁడై
అసమానగతిఁ బొడమినాఁ డీతఁడు
వసుధఁ జంద్రుఁడు నీలవర్ణుఁ డేఁటికినాయ
కసరెత్తి నసుఁగందు గలయఁగొనుఁబోలు

చ. 2: ఇనవంశమున లోకహితకల్పభూజమై
ఆనఘుఁడై జనియించినాఁ డీతఁడు
ననుపై నసురతరువు నల్లనేఁటికినాయ
పెనుఁగొమ్మలో చేఁగ పెరిగిరాఁబోలు

చ. 3: తిరువేంకటాద్రిపైఁ దెలియఁ జింతామణై
అరిదివలెఁ బొడచూపినాఁ డీతఁడు
గరిమె నది యిపుడు చీఁకటివర్ణమేలాయ
హరినీలమణులప్రభ లలమికొనఁబోలు

రేకు: 1964-06 ముఖారి సం: 01-333

పల్లవి: చిరంతనుఁడు శ్రీవరుఁడు
పరమం భవ్యం పావనం

చ. 1: వేదమయుఁడు కోవిదుఁడమలుఁడు పరుఁ-
డాది పురుషుఁడు మహామహుఁడు
యేదెస నేమని యేది దలఁచిన స-
ఖేద మవాద మఖిల సమ్మతం

చ. 2: నిఖిలనిలయుఁడు మునివరదుఁడధికుఁడు
మఖముఖ శుకాభిమతరతుఁడు
శిఖరం శివం సుశీలన మతిశయ-
ముఖరం ముఖ్యం మూలమిదం

చ. 3: అనేకప్రదుఁ డనాది నిధనుఁడు
ఘనుఁడీ తిరువేంకటవిభుఁడు
దినం దినం సముదిత రవికోటి భ-
జనం సిద్ధాంజనం ధనం

రేకు: 1965-01 సామంతం సం: 01-334 దశావతారములు

పల్లవి: ఇందరికి నభయంబు లిచ్చుఁ జేయి
కందువగు మంచి బంగారు చేయి

చ. 1: వెలలేనివేదములు వెదకితెచ్చిన చేయి
చిలుకుగుబ్బలికిందఁ జేర్చు చేయి
కలికియగు భూకాంతఁ గాఁగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళవాఁడి చేయి

చ. 2: తనివోక బలిచేత దానమడిగిన చేయి
వొనరంగ భూదానమొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకుఁ దెచ్చిన చేయి
యెనయ నాఁగేలు ధరియించు చేయి

చ. 3: పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుఁ బరపెడిదొడ్డ చేయి
తిరువేంకటాచలధీశుఁడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్లఁదెలిపెడి చేయి

రేకు: 1965-02 పాడి సం: 01-335 గురు వందన, నృసింహ

పల్లవి: అందరిబ్రదుకులు నాతనివే
కందువెల్ల శ్రీకాంతునిదే

చ. 1: వేమరుఁ జదివెడి విప్రుల వేదము
సోముకవైరి యశోవిభవం
శ్రీమించున మరల జీవనమెల్ల సు-
ధామథనునిసంతత కరుణే

చ. 2: హితవగు నిలలో నీసుఖమెల్లను
దితి సుతదమనుఁడు దెచ్చినదే
తతి తల్లి దండ్రి తానై కాచిన
రతి ప్రహ్లాదవరదుని కృపే

చ. 3: ఆలరినయమరేంద్రాదుల బ్రదుకులు
బలిబంధనుకృపఁ బరగినవే
బలసి మునుల యాపదలు వాపుటకు
బలునృపభంజను పరిణతలే

చ. 4: పూని యనాథుల పొందుగఁ గాచిన-
జానకీవిభుని సరసతలే
నానాభూభరణంబులు నందుని-
సూనుఁడు చేసినసుకృతములే

చ. 5: తలకొని ధర్మము తానై నిలుపుట
కలుషవిదూరునిగర్వములే
నిలిచి లోకములు నిలిపినఘనుఁడగు.-
కలియుగమున వేంకటపతివే

రేకు: 1965-03 కన్నడగౌళ సం: 01-336 అధ్యాత్మ

పల్లవి: పాయక మతినుండి పరగ మేలుఁగీడును
సేయించి కర్మిఁ దాఁ జేయు టెవ్వరిది

చ. 1: వెలయఁ జరాచర విఁభుడైన విభునాత్మఁ
దలఁచుఁగాక ప్రాణి దానేమి సేయు
తెలిపి నిర్మలభక్తి దీపించి తనుఁజేరఁ
గొలిపించు కొనలేమి కొరత యెవ్వరిది

చ. 2: కొందరు సుఖులై కొదలేక మెలఁగఁగ
కొందరి దుఃఖపు కొరత యెవ్వరిది
అందరి మతి వేంకటాద్రివల్లభ నీవు
చెంది కర్మములఁ జేయుచేఁత యెవ్వరిది

రేకు: 1965-04 ఆహిరి సం: 01-337 అంత్యప్రాస

పల్లవి: ఎండలోనినీడ యీమనసు
పండు గాయసేయఁబనిలేదు మనసు

చ. 1: వానచేతకములవలెనాయ మనసు
గోనెఁబట్టినబంకగుణమాయ మనసు
మానఁజిక్కినకోలమతమాయ మనసు
తేనెలోపలియీఁగ తెఱఁగాయ మనసు

చ. 2: గడిరాజుబదుకాయ కడలేని మనసు
నడివీది పెసరాయ నయమైన మనసు
గడకుఁగట్టినపాఁతగతి దోఁచె మనసు
అడుసులోపలికంబమై తోఁచె మనసు

చ. 3: తెరవుచూపినజాడఁ దిరుగు నీమనసు
మరుగఁజేసినచోట మరుగు నీ మనసు
తిరువేంకటేశుపైఁ దిరమైన మనసు
సిరిగలిగినచోటఁ జేరు నీమనసు

రేకు: 1965-05 భూపాళం సం: 01-338 భక్తి

పల్లవి: అలర నుతించరో హరిని
యెలయించి మిము భ్రమయించీనిఁ గాలము

చ. 1: సేయరో మనుజులార చింత హరినిఁకనైన
రోయరో మీభుజియించు రుచులమీఁద
కాయ మస్థిరము యీకలి మధ్రువము చాలఁ
బోయఁబో యెందుకుఁగాకపోయఁ గాలము

చ. 2: మెచ్చరో మనుజులార మీరే హరికథలు
పుచ్చరో మీమదిలోని పొరలెల్లాను
కొచ్చరో మనుజులార కోరికలెల్లను మీకు-
నిచ్చీని శుభములు యివి యెల్లకాలము

చ. 3: కనరో వేంకటపతిఁ గన్నులుదనియఁగా
వినరో యీతనిస్తుతి వీనులు నిండ
మనరో శ్రీహరిచేతిమన్ననలు మీరు
తనమీఁదిమది బుద్ధి దాఁచీనిఁ గాలము

రేకు: 1965-06 ధన్నాశి సం: 01-339 అధ్యాత్మ

పల్లవి: చదివెబో ప్రాణి సకలము యీా-
చదువుమీఁది విద్య చదువఁడాయఁగాని

చ. 1: సిరులు చంచలమని చేతలధ్రువమని
పరగుసంసారము బయలని
తొరలిన సుఖమెల్ల దుఃఖమూలమని
యెరిఁగి లోభమువీడ నెరఁగఁడాయఁగాని

చ. 2: తలకొన్న ధర్మమే తలమీఁది మోఁపని
వలసినొల్లమి దైవవశమని
కలిమియు లేమియుఁ గడవఁగ రాదని
తెలిసి లోభము వీడఁ దెలియఁడాయఁగాని

చ. 3: యేచిన పరహితమెంతయుఁ దమ దని
వాచవులిన్ని నెవ్వగలని
యీచందమున వేంకటేశుచేతలని
చూచి లోభమువీడఁ జూడడాయఁగాని

రేకు: 1966-01 శుద్ధవసంతం సం: 01-340 వైరాగ్య చింత

పల్లవి: ఎందుఁ జూచినఁ దనకు నిన్నియును నిట్లనే
కందులేనిసుఖము కలనైన లేదు

చ. 1: సిరులు గలిగిన ఫలము చింతఁ బొరలనె కాని
సొలది సంతోష మించుకయ్యైన లేదు
తరుణి గల ఫలము వేదనలఁ బొరలుటె కాని
నెరసులేని సుఖము నిమిషంబు లేదు

చ. 2: తనువుగల ఫలము పాతకము సేయనె కాని
అనువైన పుణ్యంబు అది యింత లేదు
మనసుగల ఫలము దుర్మతిఁబొందనే కాని
ఘనమనోజ్ఞాన సంగతి గొంత లేదు

చ. 3: చదువుగలిగిన ఫలము సంశయంబే కాని
సదమల జ్ఞాననిశ్చయ మింత లేదు
యిది యెరిఁగి తిరువేంకటేశ్వరునిఁ గొలిచినను
బ్రదుకు గలుగును భవము ప్రాణులకు లేదు

రేకు: 1966-02 ఆహిరి సం: 01-341 శరణాగతి

పల్లవి: సతతము నేఁ జేయు ననాచారములకుఁ గడ యెక్కడ
మతి ననుఁగని కావుము రామా రామా రామా

చ. 1: నేసిననాబ్రహ్మహత్యలు శిశుహత్యలు గోహత్యలు
ఆసలనెన్నో యెన్నో ఆయాజాడలను
యీసున నేనిపు డెరిఁగియు నెరఁగక సేసేదురితపు-
రాసులకును గడలే దిదె రామా రామా రామా

చ. 2: నమలెడి నావాచవులకు నానావిధభక్షణములు
కమిలిన దుర్గంధపు శాకమ్ములు దొమ్ములును
జముబాధల నరకంబుల సారేకు నన్నెటువలె శ్రీ ...
రమణుఁడ ననుఁగాచే విటు రామా రామా రామా

చ. 3: కపటపునాధనవాంఛలు కలకాలముఁ బరకాంతలఁ
జపలపుదలఁపుల నేఁతల సంఖ్యము లరయఁగను
యెపుడును నిటువలెనుండెడుహీనుని నన్నెటు గాచెదో
రపమున శ్రీ వేంకటగిరి రామా రామా రామా

రేకు: 1966-03 కన్నడగౌళ సం: 01-342 సంస్కృత కీర్తనలు

పల్లవి: కరుణానిధిం గధాదరం
శరణాగతవత్సలం భజే

చ. 1: శుకవరదం కౌస్తుభాభరణం
ఆకారణప్రియ మనేకదం
సకలరక్షకం జయాధికం సే -
వకపాలకమేవం భజే

చ. 2: వురగశయనం మహోజ్జ్వలం తం
గరుడారూఢం కమనీయం
పరమపదేశం పరమం భవ్యం
హరిం ధనుజభయదం భజే

చ. 3: లంకాహరణం లక్ష్మీరమణం
పంకజ సంభవ భవప్రియం
వేంకటేశం వేదనిలయం శు...
భాంకం లోకమయం భజే

రేకు: 1966-04 సామంతం సం: 01-343 నామ సంకీర్తన

పల్లవి: చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడఁగించు సంకీర్తనం

చ. 1: సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణఁగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతముఁ దలచుఁడీ సంకీర్తనం

చ. 2: సామజముఁ గాంచినది సంకీర్తనం
సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్య మిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం

చ. 3: జముబారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యములిచ్చు సంకీర్తనం
శమదమాదులఁ జేయు సంకీర్తనం

చ. 4: జలజాసనునినోరి సంకీర్తనం
చలిగొండసుతదలఁచు సంకీర్తనం
చలువ గడు నాలుకకు సంకీర్తనం
చలపట్టి తలఁచుఁడీ సంకీర్తనం

చ. 5: సరవి సంపదలిచ్చు సంకీర్తనం
సరిలేని దిదియపో సంకీర్తనం
సరుస వేంకటవిభుని సంకీర్తనం
సరుగనను దలఁచుఁడీ సంకీర్తనం

రేకు: 1966-05 శుద్ధవసంతం సం: 01-344 ఇతర దేవతలు

పల్లవి: ఎదుటినిధానమ వెటుచూచిన నీ-
వదె వేంకటగిరియనంతుఁడా

చ. 1: సొగిసి భాద్రపదశుద్ధచతుర్దశి
తగువేడుక నిందరు గొలువ
పగటుసంపదలు బహుళ మొసఁగు నీ-
వగు వేంకటగిరియనంతుఁడా

చ. 2: తొలుత సుశీలకు దుశ్శీలవలన
వెలయ సంపదల విముఖుఁడవై
వలెనని కొలిచిన వడిఁ గాచినమా-
యల వేంకటగిరియనంతుఁడా

చ. 3: కరుణఁ గాచితివి కౌండిన్యుని మును
పరగినవృద్ధబ్రహ్మఁడవై
దొరవులు మావులు ధ్రువముగఁ గాచిన-
హరి వేంకటగిరియనంతుఁడా

రేకు: 1966-06 శుద్ధవసంతం సం: 01-345 అధ్యాత్మ

పల్లవి: ఏమి వొరలేరు యేమి మరలేదు
యీ మాయలంపటం బీఁదమోఁదనేకాని

చ. 1: సతులుగలమేలు దా సడిఁబొరలనేకాని
సతమైన సౌఖ్యస్వస్థానంబు లేదు
హితులు గలమేలు తా నిడుమఁబొరలనె కాని
హితవివేకము నరుల కెంతైన లేదు

చ. 2: తనువు లెత్తినమేలు తగులాయమేకాని
కనుఁగొనఁగ యోగభోగము గొంత లేదు
ఘనము గలమేలు తా గర్వాంధమేకాని
ఘనుఁడైన శ్రీనాథుఁ గనుగొనగ లేదు

చ. 3: చింతగలిగిన మేలు చివుకఁబట్టనెకాని
చింత వేంకటవిభునిఁ జింతించ లేదు
సంతు గలిగిన మేలు సంసారమే కాని
సంతతముఁ జెడని సద్గతిఁ జేర లేదు

రేకు: 1967-01 ఆహిరి సం: 01-346 ఉత్సవ కీర్తనలు

పల్లవి: నానాదిక్కుల నరులెల్లా
వానలలోననే వత్తురు గదలి

చ. 1: సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు
హితులు గొలువఁగా నిందరును
శతసహస్రయోజనవాసులు సు-
వ్రతములతోడనె వత్తురు గదలి

చ. 2: ముడుపులు జాళెలు మొగిఁదల మూఁటలు
కడలేనిధనముఁ గాంతలును
కడుమంచిమణులు కరులుఁ దురగములు
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి

చ. 3: మగుటవర్ధనులు మండలేశ్వరులు
జగదేకపతులుఁ జతురులును
తగువేంకటపతి దరుశింపఁగ బహు-
వగలసంపదల వత్తురు గదలి

రేకు: 1967-02 నాట సం: 01-347 వైరాగ్య చింత

పల్లవి: ఎంత బోధించి యేమి సేసినఁ దన-
దొంతికర్మములు తొలఁగీనా

చ. 1: సతతదురాచారజడునకుఁ బుణ్యసం
గతి దలపోసినఁ గలిగీనా
అతిపాపకర్మబోధకుఁడై వెలయుదుష్ట
మతిఁ దలపోసిన మరి కలిగీనా

చ. 2: బహుజీవహింసాపరుఁడైనవానికి
యిహపరములు దైవ మిచ్చీనా
విహితకర్మములువిడిచినవానికి
సహజాచారము జరిగీనా

చ. 3: దేవదూషకుఁడై తిరిగేటివానికి
దేవతాంతరము దెలిసీనా
శ్రీవేంకటేశ్వరుఁ జింతిపకుండిన
పాపనమతుఁడై బ్రతికీనా

రేకు: 1967-03 శ్రీరాగం సం: 01-348 అంత్యప్రాస

పల్లవి: ఏఁటి బ్రదుకు యేఁటి బ్రదుకు వొక్క
మాటలోనే యటమటమైన బ్రదుకు

చ. 1: సంతకూటములే చవులయిన బ్రతుకు
దొంతిభయములతోడి బ్రదుకు
ముంతనీళ్ళనే మునిఁగేటి బ్రదుకు
వంతఁ బొరలి కడవరంలేని బ్రదుకు

చ. 2: మనసుచంచలమే మనువయిన బ్రదుకు
దినదినగండాలఁ దీరు బ్రదుకు
తనియ కాసలనె తగిలేటి బ్రదుకు
వెనకముందర చూడ వెరపయిన బ్రదుకు

చ. 3: తెగి చేఁదె తీపయి తినియేటి బ్రదుకు
పగవారిపంచలపాలైన బ్రదుకు
తగువేంకటేశ్వరుఁ దలఁచని బ్రదుకు
పొగకు నోపక మంటఁ బొగిలేటి బ్రదుకు

రేకు: 1967-04 లలిత సం: 01-349 భక్తి

పల్లవి: సకలసంగ్రహము సకలసంచయము
అకృతకృత మిది హరినామం

చ. 1: సకలవేదశాస్త్రములసార మిది
సకలమంత్రరాజంబు నిది
సకల పురాణరసముల మధుర మిది
ఆకుటిలపావనం హరినామం

చ. 2: సకలతత్వసంశయఖండన మిది
సకలకర్మనిశ్చయము నిది
సకలవిధిరహస్యప్రధాన మిది
అకారణహితం హరినామం

చ. 3: సకలదేవతాస్వామిప్రియం బిది
సకలలోకరక్షణము నిది
ప్రకటం వేంకటపతి నామాంకిత-
మకించనధనం హరినామం

రేకు: 1967-05 పాడి సం: 01-350 వైరాగ్య చింత

పల్లవి: కటకటా జీవుఁడా కాలముదోలుకరాఁగ
సటవటలనే పొద్దు జరుపే వుగా

చ. 1: సమత నన్నియును జదివి కడపటను
కుమతివై అందరిఁ గొలిచే వుగా
తమిగొని ప్రేమ నెంతయును గంగకుఁబోయి
తమకింది నూతినీరు దాగే వుగా

చ. 2: తనువుఁ బ్రాయము నమ్మి దానధర్మము మాని
చెనటివై కర్మాలు సేసే వుగా
వొనరఁగ మీఁదనొడ్డిన మొగులు నమ్మి
దొనలనీళ్ళు వెళ్ళఁదోసే వుగా

చ. 3: యెలమితోఁ దిరువేంకటేశుఁ గొలువలేక
పొలము రాజులవెంటఁ బొయ్యే వుగా
చిలుకకువలె బుద్ధిచెప్పనఁ గానలేక
పలుమారుకే తోఁజుఁ బాడే వుగా

రేకు: 1967-06 సామంతం సం: 01-351 దశావతారములు

పల్లవి: అందరి కాధారమైనఆదిపురుషుఁ డీతఁడు
విందై మున్నారగించె విదురునికడ నీతఁడు

చ. 1: సనకాదులు గొనియాడెడి సర్వాత్మకుఁ డీతఁడు
వనజ భవాదులకును దైవంబైనతఁ డీతఁడు
యినమండలమునఁ జెలఁగేటిహితవైభవుఁ డీతఁడు
మునువుట్టిన దేవతలకు మూలభూతి యీతఁడు

చ. 2: సిరులొసఁగి యశోదయింట శిశువైనతఁ డీతఁడు
ధరనావులమందలలో తగఁ జరించె నీతఁడు
సరసతలను గొల్లెతలకుఁ జనవులొసఁగె నీతఁడు
ఆరసి కుచేలునియడుకు లారగించె నీతఁడు

చ. 3: పంకజభవునకును బ్రహ్మపద మొసఁగెను యీతఁడు
సంకీర్తన లాద్యులచే జట్టిగొనియె నీతఁడు
తెంకిగ నేకాలముఁ బరదేవుఁడయిన యీతఁడు
వేంకటగిరిమీఁద బ్రభల వెలసినఘనుఁ డీతఁడు

రేకు: 1968-01 నాట సం: 01-352 వైరాగ్య చింత

పల్లవి: కాయము జీవుఁడుగలనాఁడే తెలియవలె
యీయత్నములు దనకెన్నఁడు

చ. 1: సతతము సంసారజడుఁడు దానట యాత్మ-
హితవు దెలుసుకాల మెన్నఁడు
రతిసరసముల పూరకే ప్రాయ మెడలంగ
యితరసుఖము దన కెన్నఁడు

చ. 2: యెడపక ద్రవ్యమెహితుఁడై తిరుగఁ దన.-
యిడుమపాటు మాను టెన్నఁడు
కడలేనిపాలయలుకలచేతఁ దనదేహ-
మిడియఁగ నిజసుఖ మెన్నఁడు

చ. 3: శ్రీవేంకటేశునిఁ జేరి తక్కినసుఖ-
మేవగించుకాల మెన్నఁడు
శ్రీవల్లభునికృప సిరిగాఁ దలఁచి జీవుఁ -
డీవైభవముఁ గాంచు టెన్నఁడు

రేకు: 1968-02 సామంతం సం: 01-353 అధ్యాత్మ

పల్లవి: అతఁడే సకలవ్యాపకుఁడతఁడే యాతురబంధువుఁ -
డతఁడు దలఁపుల ముంగిట నబ్బుట యెన్నఁడొకో

చ. 1: సారేకు సంసారంబను జలనిధు లీఁదుచు నలసిన-
వారికి నొకదరిదాపగు వాఁ డిఁక నెవ్వఁడొకో
పేరిన యజ్ఞానంబను పెనుఁజీఁకటి తనుఁగప్పిన
చేరువవెలుఁగై తోఁపెడిచెలి యికఁ నెవ్వఁడొకో

చ. 2: దురితపుకాననములలో త్రోవటు దప్పినవారికి
తెరు విదె కొమ్మని చూపెడిదేవుఁడి దెవ్వఁడొకో
పెరిగిన యాశాపాశము పెడగేలుగఁ దనుఁగట్టిన
వెరవకుమని విడిపించేటి విభుఁడిఁక నెవ్వఁడొకో

చ. 3: తగిలిన యాపదలనియెడి దావానలముల చుట్టిన
బెగడకుమని వడినార్పెడి బిరుదిఁక నెవ్వఁడొకో
తెగువయుఁ దెంపును గలిగిన తిరువేంకట విభుఁడొక్కఁడే
సొగిసి తలంచినవారికి సురతరువగువాఁడు

రేకు: 1968-03 ముఖారి సం: 01-354 నామ సంకీర్తన

పల్లవి: ఎక్కడనున్నా నీతఁడు
దిక్కయి మాదెసఁ దిరిగీఁగాక

చ. 1: సరసుఁడు చతురుఁడు జగదేకగురుఁడు
పరమాత్మ డఖిల బంధువుఁడు
హరి లోకోత్తరుఁ డతఁడే నామతి
సిరితోఁ బాయక చెలఁగీఁగాక

చ. 2: ఉన్నతోన్నతుఁ డుజ్జ్వలుఁ డధికుఁడు
పన్నగశయనుఁడు భవహరుఁడు
యిన్నిటఁగ లిగిన యిందిరారమణుఁడు
మన్ననతో మము మనిపీఁగాక

చ. 3: మమతల నలమేల్మంగకు సంతత -
రమణుఁడు వేంకటరాయఁడు
జమళిసంపదల సరసవిభవముల
తమకంబున మముఁదనిపీఁగాక

రేకు: 1968-04 కన్నడగౌళ సం: 01-355 అధ్యాత్మ

పల్లవి: విశ్వప్రకాశునకు వెలిఁయేడ లో నేడ
శాశ్వతున కూహింప జన్మమిఁక నేడ

చ. 1: సర్వపరిపూర్ణునకు సంచారమిఁక నేడ
నిర్వాణమూర్తికిని నిలయమిఁక నేడ
పుర్వీధరునకుఁ గాలూఁదనొక చోటేడ
పార్వతీ స్తుత్యునకు భావమిఁక నేడ

చ. 2: నానాప్రభావునకు నడుమేడ మొదలేడ
ఆనన సహస్రునకు నవ్వలివ లేడ
మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞాన స్వరూపునకుఁ గాన విననేడ

చ. 3: పరమ యోగీంద్రునకు పరులేడ తా నేడ
దురితదూరునకు సంస్తుతి నింద లేడ
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహ మేడ
హరికి నారాయణున కవుఁగాము లేడ

రేకు: 1968-05 వసంతం సం: 01-356 దశావతారములు

పల్లవి: తలఁపులోపలి తలఁపు దైవమితఁడు
పలుమారుఁ బదియునుఁ బదియైన తలఁపు

చ. 1: సవతైనచదువులు సరుగఁ దెచ్చిన తలఁపు
రవళిఁ దరిగుబ్బలివి రంజిల్లు తలఁపు
కవగూడఁ గోరి భూకాంతముంగిట తలఁపు
తివిరి దూషకు గోళ్ళఁ దెగటార్చు తలఁపు

చ. 2: గొడగువట్టినవానిఁ గోరి యడిగిన తలఁపు
తడఁబడక విప్రులకు దానమిడు తలఁపు
వొడిసి జలనిధినిఁ గడగూర్చితెచ్చినతలఁపు
జడియక హలాయుధము జళిపించు తలఁపు

చ. 3: వలపించి పురసతులవ్రతము చెరిచిన తలఁపు
కలికితనములు చూపఁగలిగున్న తలఁపు
యిల వేంకటాద్రిపై నిరవుకొన్న తలఁపు
కలుషహరమై మోక్షగతిచూపు తలఁపు

రేకు: 1968-06 పాడి సం: 01-357 సంస్కృత కీర్తనలు

పల్లవి: అస్మదాదీనాం అన్యేషాం
తస్మికా తస్మికా తత్రచ పునశ్చ

చ. 1: సతతాధ్యయననిష్ఠాపరాణాం దృఢ-
ప్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా జగత్యాం పర-
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ

చ. 2: మోహినామత్యంతముష్కరాణాం గుణ-
గ్రాహిణాం భవనైకకఠినానాం
దేహసంక్షాళన విదేశకోవా దా
శ్రీహరిస్మరణవిశేష: పునశ్చ

చ. 3: కింకుర్వాణదుఃఖితజీవినాం
పంకిలమనోభయభ్రాంతానాం
శంకాం నిరురుతి స్సరసా కా, శ్రీ-
వేంకటాచలపతేర్వినుతి: పునశ్చ

రేకు: 1969-01 సామంతం సం: 01-358 శరణాగతి

పల్లవి: దొరుకునా యితని కృప తుదిపదంబు
అరిది విభవము లొల్లమనినాఁ బొదలు

చ. 1: సొంపలర నితఁడు కృపఁజూచు టరుదని కాక
యింపు సామాన్యమా యితని కరుణ
లంపటము ఘనమైన లక్ష్మీకటాక్షములు
సంపదలు తోడనే చల్లు వెదలాడు

చ. 2: తగ నితనిపై భక్తి తగులు టరుదని కాక
నగుట సామాన్యమా ననచి యితఁడు
జగదేక హితములుగ సరసతలు సౌఖ్యములు
దిగులువాయఁగ నితడు దిప్పుదీరాడు

చ. 3: తిరువేంకటాద్రి సిద్ధించు టరుదని కాక
మరుగఁ దను నిచ్చునా మరియొకరిని
యిరవైన భోగములు యిష్టసామ్రాజ్యములు
విరివిగొని యితని దయ వెంటనే తిరుగు

రేకు: 1969-02 ఆహిరి సం: 01-359 అధ్యాత్మ శృంగారము

పల్లవి: చెలి నేఁడు తానేమి సేయునమ్మ చెలి యేమిసేయు నీ-
చెలు లేమి సేయుదురు చెలువైన విభుమేనిచెలు వింత సేయఁగా

చ. 1: సతి నేఁడు బంగారుచవికెలోఁ జిత్రంపు-
గతు లెంత చూపినఁ గడకంటఁ జూడదు
అతనిఁజూచినమంచియబ్బురపుఁజూపులు
అతనివెంటనే పోయ నటుగాఁబోలును

చ. 2: తేనియలూరేటి మంచి తియ్యనిమాటలు మంత్ర-
గానములుగా వినుపించి కడువేసరితిమి
వానిమాటలు విన్నవలనైన ముదమున
వీనులు ముద్రించిన విధముగాఁబోలును

చ. 3: నిచ్చళపుమోమున నెయ్యము దైలువారె
బచ్చనచేతలు గుబ్బలపై నిండనొప్పెను
అచ్చపువేడుక వేంకటాద్రీశుఁ డీరేయి
నెచ్చెలికి నిచ్చినట్టినేరుపు గాఁబోలును

రేకు: 1969-03 సామంత సం: 01-360 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఇత్తడి బంగారుసేయ నింతకు నేరుతునంటా
కొత్తసేఁతలెల్ల దొరకొంటిగా నీవు

చ. 1: హీనులైనవారు నిన్ను నేచి కొలిచిన ఘన-
మైన పదవులఁ బెట్టేయెటువలెనే
మానక యెవ్వతెనైన మచ్చికఁ దగిలి నాతో .....
నానిపట్టి సరివేసే వద్దిరా నీవూ

చ. 2: కడుఁబాతకులు నిన్నుఁ గదిసి కొలిచేరంటా-
నడరి పుణ్యులఁజేయునటువలెనే
కడఁగి యెవ్వతెనైన గాజు మాణికము సేసి
వడి నన్నుఁ గెరలించవద్దురా నీవూ

చ. 3: దిందుపడ మాయసేసి దేవుఁడ నేఁగానంటా....
నందరి భ్రమలఁ బెట్టునటువలెనే
అందమైనన తిరువేంకటాద్రీశ నీప్రేమ
చెంది నన్నుఁ గూడి దాఁచజెల్లునా నీవూ

రేకు: 1969-04 బౌళి సం: 01-361 వైరాగ్య చింత

పల్లవి: ఎక్కడ చొచ్చుడి దీభవమేదియుఁ గడపల గానము
పుక్కునఁ బరితాపానల మూదక మండెడివి

చ. 1: హృదయవికారము మాన్పఁగ నేతెరఁగును సమకూడదు
మదనానందము చెరుపఁగ మందేమియు లేదు
పొదలినదేహగుణంబులఁ బోనడువఁగ గతి గానము
బ్రదికించినకోరికెలకుఁ బ్రాయము దిరిగినది

చ. 2: కమలినయజ్ఞానం బిది కన్నులముందరఁ గానదు
తిమిరము పొదిగొని చూడ్కికి దెరువేమియు లేదు
తెమలనియాశాపాశము తెంపఁగ సత్త్వము చాలదు
మమకారము వెడలింపఁగ మతి యెప్పుడు లేదు

చ. 3: దురితంబులు పుణ్యంబులు తొడిఁబడ నాత్మనుఁ బెనగొని
జరగఁగ శరీరధారికి సత్కర్మము లేదు
తిరువేంకటగిరిపతియగు దేవశిఖామణిపాదము
శరణని బ్రదుకుటదప్పను సన్మార్గము లేదు

రేకు: 1969-05 గుండక్రియ సం: 01-362 భక్తి

పల్లవి: ప్రాణులనేరమి గాదిది బహుజన్మపరంపరచే
ప్రాణులు సేసిన తమతమ పాపఫలము గాని

చ. 1: హరి సకలవ్యాపకుఁడని అందరుఁ జెప్పఁగ నెరిఁగియు
పరదైవంబులఁ గొలువకపాయరు మానవులు
నరపతి భూమేలఁగ భూవరు భజియింపఁగనొల్లక
పరిసరవర్తులబెంబడిఁ బనిసేసినయట్లు

చ. 2: పొందుకు తమతమ సేసినపూజలు మ్రొక్కులు గైకొను
అందముగాఁ బురుషోత్తముఁ డాతఁడే కలఁడనియు
అందరు నెరిఁగియు యితరులఁ జెందుదురున్నత శైలము
నందక చేరునతరువుల నందుకొనినయట్లు

చ. 3: శ్రీ వేంకటపతి యొక్కఁడె చెప్పఁగ జగములకెల్లను
దైవము నాతుమలోపలిధనమనఁగా వినియు
సేవింపరు పామరు లీదేవుని మధురంబొల్లక
వావిరిఁ బులుసులు చేఁదులు వలెనని కొనునట్లు

రేకు: 1969-06 ధన్నాశి సం: 01-363 భక్తి

పల్లవి: ఘోరదురితములచే గుణవికారములచే
నీరీతిఁబడునాకు నేది దెరువు

చ. 1: హరి జగన్నాథు లోకరాధ్యు-
నెరఁగనేరనివాని కేది దెరువు
పరమపురుషుని జగద్భరితు నంతర్వ్యాప్తి-
నిరవుకొలుపనివాని కేది దెరువు

చ. 2: శ్రీ వేంకటేశుఁ దలఁచినవెనక సకలంబు ....
సేవగింపనివారి కేది దెరువు
దేవోత్తముని మహిమ దెలిసితెలియఁగలేని-
యీవివేకంబునకు నేది దెరువు

రేకు: 1970-01 ఆహిరి సం: 01-364 భక్తి

పల్లవి: ఏపనులు సేసినా నిటువలెనేపో
యీపనికిఁ జొరనిపని యేటిలోఁపైరు

చ. 1: హరికథలమీఁదిప్రియమబ్బు నా తొంటితమ....
పరిపక్వమగుఁ దప: ఫలముగాక
గరిమె నివిలేకున్నఁ గలకాలములుఁ జేయు
నిరతంపుఁదపమెల్ల నీటిలో వ్రాఁత

చ. 2: నారాయణునిభక్తి ననిచెనా ధనమెల్లఁ
బారఁజల్లిన దానఫల మదియపో
కోరి యివి లేకున్న కోటిదానములైన
పేరుకొని వరతఁగలపినచింతపండు

చ. 3: పదల కిటు వేంకటేశ్వరుఁడే దైవంబనుచుఁ
జదువఁగలిగిన మంచిచదు వదియపో
పదిలముగ నీవిధము పట్టియ్యకుండినను
చదువు లసురలు మున్ను చదివేటిచదువు

రేకు: 1970-02 శ్రీరాగం సం: 01-365 భక్తి

పల్లవి: అణురేణు పరిపూర్ణుఁడైన శ్రీవల్లభుని
బ్రణుతించువారువో బ్రాహ్మలు

చ. 1: హరి నామములనె సంధ్యాది విధులొనరించు
పరిపూర్ణమతులు వో బ్రాహ్మలు
హరి మంత్ర వేద పారాయణులు హరి భక్తి
పరులైన వారువో బ్రాహ్మలు

చ. 2: యేమి చూచినను హరి యిన్నిటాఁ గలఁడనుచు
భావించువారువో బ్రాహ్మలు
దేవకీనందనుఁడె దేవుఁడని మతిఁదెలియు
పావనులు వారువో బ్రాహ్మలు

చ. 3: ఆదినారాయణుని ననయంబుఁ దమయాత్మఁ
బాదుకొలిపిన వారు బ్రాహ్మలు
వేద రక్షకుఁడైన వేంకట గిరీశ్వరుని
పాద సేవకులవో బ్రాహ్మలు

రేకు: 1970-03 దేసాక్షి సం: 01-366 హనుమ

పల్లవి: సీతాశోక విఘాతక
పాతాళ లంకాపతివిభాళా

చ. 1: హనుమంతరాయ అంజనీతనయ వో-
వనధిలంఘనగాత్ర వాయుపుత్రా
యినకులాధిపనిజహిత జగన్నుత-
వనజోదరసేవక సత్త్వధనికా

చ. 2: ప్రళయాంతకరూప బలదీప రవిఫల-
గిళనప్రతాప సుగ్రీవప్రియా
కుళకదానవసంకులవిదారణ
భళిభళి జగత్ప్రతిబలుబంటా

చ. 3: పంకజాసనుదివ్యపదవైభవ వో-
లంకిణీ ప్రాణ విలంఘన
వేంకటేశ్వరు సేవావీర మహాధీర
కింకరరాయ సుఖీభవా

రేకు: 1970-04 శ్రీరాగం సం: 01-367 భక్తి

పల్లవి: ఇన్ని జన్మము లేఁటికి హరిదాసు-
లున్న వూరఁ దా నుండినఁ జాలు

చ. 1: హరిభక్తుల యింటియన్నము గొనువారి-
వరువుడై వుండవలెనన్నఁ జాలు
పరిమభాగవత భవనంబులఁ జెడ్డ
పురువు దానయి పొడమినఁ జాలు

చ. 2: వాసుదేవుని భక్తవరులదాసులు మున్ను-
రోసినయెంగిలి రుచిగొన్నఁ జాలు
శ్రీ సతీశునిఁ దలఁచినవారి దాసాన-
దాఁసుడై వుండఁదలఁచినఁ జాలు

చ. 3: శ్రీ వేంకటేశుఁ జూచినవారిశ్రీ పాద-
సేవకుఁడై యుండఁజేరినఁ జాలు
యీవిభుదాసుల హితుల పాదధూళి-
పావనమై సోఁకి బ్రదికినఁ జాలు

రేకు: 1970-05 ముఖారి సం: 01-368 ఉత్సవ కీర్తనలు

పల్లవి: భోగీంద్రులును మీరుఁబోయి రండు
వేగిన మీఁదటి విభవాలకు

చ. 1: హరుఁడ పోయిరా అజుఁడ నీవును బోయి
తిరిగిరా మీఁదటి తిరుణాళ్ళకు
సురలు మునులును భూసురులుఁబోయి రండు
అరవిరి నిన్నాళ్ళు నలసితిరి

చ. 2: జముఁడ పోయిరా శశియు నీవును బోయి
సుముఖుఁడవై రా సురలఁ గూడి
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయి రండు
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి

చ. 3: నారద సనకసనందనాదులు
భూరి విభవములఁ బోయిరండు
దూరముగాఁ బోకిట్టే తొరలి వేంకటగిరిఁ
జేరి నన్నిట్లనే సేవించుఁడీ

రేకు: 1970-06 సామంతం సం: 01-369 అధ్యాత్మ

పల్లవి: అతనికెట్ల సతమైతినో కడు-
హితవో పొందులహితవో యెఱఁగ

చ. 1: హృదయము తలఁపున నిరవయినఁగదా
పదిలమౌను లోపలిమాట
వెదకినచిత్తము వెర వెఱఁగదు నే -
నెదిరి నెఱఁగ నే నేమియు నెఱఁగ

చ. 2: కాలూఁద మనసు గలిగికదా నా-
తాలిమి మతిలోఁ దగులౌట
మేలిమిపతిలో మెలఁగుటేదో నే -
నేలో నే నిపుడెక్కడో యెఱఁగ

చ. 3: నేఁడని రేపని నే నెఱిఁగికదా
పోఁడిమి మతిలో పొలుపౌట
వాఁడే వేంకటేశ్వరుఁడు రాఁగలిగె
ఆఁడుజన్మమేనౌటిది యెఱుఁగ

రేకు: 1978-01 శ్రీరాగం సం: 01-370 శరణాగతి

పల్లవి: ఎట్టు వేగించె దిందుకేగురే సితరకాండ్లు
వెట్టివేమి సేయుమంటా వెన్నడించే రిపుడు

చ. 1: వొంటికాలఁ గుంటికుంటి వూరిబందెలకుఁ జిక్కి
పంటదాఁకా దున్నె నొక్కపసురము
గంటుగంటులాక లొత్తి కల్లల నడిమిపంట
కుంటివాఁడు గావలుండి కుప్ప లేరుపరచె

చ. 2: కలది కుక్కిమంచము కన్నవారెల్లాఁ బండేరు
తలెతో దొగ్గినంబలి దావకూళ్ళు
వెలిఁగంతల కొంపలు వీడుఁబట్లు చూపేరు
తలవరులెందు లోనాఁ దప్పు వెదకేరు

చ. 3: వొళ్ళుచెడ్డవాఁ డొకఁడు వుభయమార్గము గొని
కల్లదొరపుట్టుబడి కడుఁగట్టీని
చల్లనిశ్రీవేంకటేశ సకలలోకపతివి
యిల్లిదె నీశరణంటి మిందరిని గావవే

రేకు: 1978-02 లలిత సం: 01-371 అధ్యాత్మ

పల్లవి: తప్పదు తప్పదు దైవము కృపయిది
ముప్పిరి నింతా ముకుందుఁడే

చ. 1: వెక్కసపుమతి వెలుతురుదీరిన-
నెక్కడ చూచిన నీశ్వరుఁడే
గుక్కక యాసలు గోసివేసినను
నిక్క మడుగడుగు నిధానమే

చ. 2: పొంచి శరీరపుభోగము లుడిగిన
చుంచుఁబావములు సుకృతములే
దంచెడివిషయపుతగులమిఁ బాసిన
యెంచిచూచినను యీహమే పరము

చ. 3: శ్రీవేంకటపతిసేవే కలిగిన
వేవేలువగలు వేడుకలే
చేవదీరె సందియము లేదిదే
భావము నమ్మిన ప్రసన్నులకును

రేకు: 1978-03 బౌళి సం: 01-372 శరణాగతి

పల్లవి: దేవ నీవిచ్చేయందుకు దీనికిఁగా నింతయేల
యేవేళ మాయెరుకలు యెందుకుఁ గొలువును

చ. 1: యెవ్వరివసములు బుద్దెరిఁగినడచేమన
యివ్వల నారాయణ నీవియ్యక లేదు
దవ్వు చేరువ మనసు తనయిచ్చయితేఁ గనక
రవ్వగ మృగాదులెల్ల రాజ్యమేలనేరవా

చ. 2: సారేకు నిన్నుఁదలపించ జంతువులవసమా
కేరి నీవు జిహ్వఁ బరికించఁగాఁగాక
యీరీతి లోకమెల్లాఁ దమయిచ్చకొలఁదులనయితే
దూరానఁ గొక్కెరలు చదవవా వేదాలు

చ. 3: యిందరిపాపపుణ్యాలు యిన్నియు నీచేఁతలే
కుందవ స్వతంత్రులు గారు గాన
చందపు శ్రీవేంకటేశ శరణంటి నిదె నీకు
చెంది నీవే కాతుగాక చేఁతలూను వలెనా

రేకు: 1978-04 సామంతం సం: 01-373 వైష్ణవ భక్తి

పల్లవి: పరుసమొక్కటేకాదా పయిఁడిగాఁ జేసేది
అరయ లోహమెట్టున్నా నందుకేమి

చ. 1: వనజనాభువిభక్తి వదలకుండినఁ జాలు
మనసు యెందు దిరిగినా మరియేమి
మొనసి ముద్రలు భుజముల నుండితేఁ జాలు
తనవెంతహేయమైనా దానికేమి

చ. 2: శ్రీకాంతునామము జిహ్వఁ దగిలితే జాలు
యేకులజుఁడైనాను హీనమేమి
సాకారుఁడైనహరి శరణుచొచ్చినఁ జాలు
చేకొని పాపము లెన్ని చేసిననేమి

చ. 3: జీవుఁడెట్టున్ననేమి జీవునిలో యంతరాత్మ
శ్రీవేంకటేశున కాచింతయేమి
యేవలవఁ బరమైన యిహమైన మాకుఁ జాలు
కైవశమాయ నతఁడు కడమలింకేమి

రేకు: 1978-05 భూపాళం సం: 01-374 మేలుకొలుపులు

పల్లవి: మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా

చ. 1: ఆవులు పేయలకుఁగా నఱచీఁబిదుకవలె
గోవిందుఁడ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలి పడుఁచు లాటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా

చ. 2: వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
గూడియున్నా రిదే మేలుకొనయ్యా
తోడనే యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
యీడకుఁ దెచ్చిపెట్టె నిఁక మేలుకోవయ్యా

చ. 3: పిలిచీ నందగోపుఁడు పేరుకొని యదె కన్నుఁ
గొలుకులు నిచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రిమీఁది బాలకృష్ణ
యిల మామాటలు వింటి విఁక మేలుకోవయ్యా

రేకు: 1978-06 పాడి సం: 01-375 వైష్ణవ భక్తి

పల్లవి: ఇందునుండ మీ కెడ లేదు
సందడి నేయక చనరో మీరు

చ. 1: నాలుక శ్రీహరినామం బున్నది
తూలుచుఁ బారరొ దురితములు
చాలి భజంబున చక్రం బున్నది
తాలిమి భవబంధము లటు దలరో

చ. 2: అంతర్యామై హరి వున్నాఁ డిదె
చింతలు వాయరొ చిత్తమున
వింతలఁ జెవులను విష్ణుకథ లివిగొ
పొంతఁ గర్మములు పోరో మీరు

చ. 3: కాపయి శ్రీవేంకటపతిపే రిదె
నాపై నున్నది నయమునను
కోపపుకామాదిగుణములాల మీ-
రేపున కడఁగడ నెందైన బోరో

రేకు: 1979-01 రామక్రియ సం: 01-376 వైరాగ్య చింత

పల్లవి: నీయాజ్ఞ దలమోచి నీ దేహధారి నైతి
యీయెడ గోవిందుఁడ నే నీడేరేదెట్లో

చ. 1: తనువు వేసరినాను తలఁపు వేసరదు
ధనముగడించెడితరితీపున
చెనకి మగఁడు విడిచిన మామ విడువని-
పనియాయ హరి నాబదుకుజాడ యెట్లో

చ. 2: పాయము ముదిసిననాను భావము ముదియదు
వేయైనా సంసారవిషయాలను
వోయయ్య కలివోసినావుట్లదిక్కు చూచేది
మాయదాయ నిఁక నామనసుజాడెట్లో

చ. 3: కడలేనినావిధులు కన్నులారఁ జూచి నీవు
నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితి
నొడుగులు దప్పినాను నోముఫలము దప్పని-
అడియాల మబ్బె నాకు నానతిచ్చి తెట్లో

రేకు: 1979-02 భూపాళం సం: 01-377 మేలుకొలుపులు

పల్లవి: మేదిని జీవులఁగావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా

చ. 1: తగుగోపికల కన్నుఁదామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుఁడ మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే తిమిరము విరియఁగ
నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా

చ. 2: ఘనదురితపు నల్లఁగలువలు వికసించె
మినుకు శశివర్ణుఁడ మేలుకోవయ్యా
పనివడి వేదాలనే పక్షులెల్లాఁ బలుకఁగ
జనక యాశ్రితపారిజాత మేలుకోవయ్యా

చ. 3: వరలక్ష్మికుచచక్రవాకము లొండొంటి రాయ
మెరయు దోషరహిత మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ నేఁడు మేలుకోవయ్యా

రేకు: 1979-03 లలిత సం: 01-378 అంత్యప్రాస

పల్లవి: ఆతుమ సంతసపెట్టుటది యెఱుక, తా-
నేతెరవు నొల్లకుండు టిదియే యెఱుక

చ. 1: ముంచినబంధములలో ముణుఁగుడువడక తా-
నంచల విడఁదన్ను టది యెఱుక
చంచలపువిషయాల సగ్గుడుముగ్గుడుగాక
యెంచిఁ హరిఁదలపోయు టిదియే యెఱుక

చ. 2: పాయనియర్థములకు బంటుబంటై తిరుగక
ఆయతమ్మై మోసపోని దది యెఱుక
పాయపుఁగామినులతోఁ బలుమారుఁ జేయుపొందు
హేయమనితలపోయు టిదియే యెఱుక

చ. 3: ధరమీఁదఁగల ప్రాణితతుల నొప్పించక
ఆరయఁగ సముఁడగు టది యెఱుక
గరిమల శ్రీవేంకటపతిదాసుఁడై
యిరవొంద సుఖించు టిదియే యెఱుక

రేకు: 1979-04 రామక్రియ సం: 01-379 అధ్యాత్మ

పల్లవి: ఇందిరా నాయక యిదివో మాపాటు
చెంది నీవే గతి చేకొనవయ్యా

చ. 1: తీసీఁ గోరికతీదీపు లొకవంక
లాసీ సంసారలంపటము
మూసీఁ గర్మము మునుకొని పరచింత
సేసేదేమిఁకఁ జెప్పే దేమి

చ. 2: వంచీ నాసలు వలసినచోటికి
పొంచీ దుర్గుణబోగములు
ముంచీ యౌవనమోహాంధకారము
యెంచేదేమి సోదించేదేమి

చ. 3: యెటిఁగీఁ జిత్తము యించుకించుక నిన్ను
మఱవనినీపైభక్తి మతినుండఁగా
నెటి శ్రీవేంకటపతి నీవే కాతువుగాక
వెఱచి నేఁజేసే విన్నపమేమి

రేకు: 1979-05 రామక్రియ సం: 01-380 నామ సంకీర్తన

పల్లవి: నారాయణాయ నమో నమో నానాత్మనే నమోనమో
యీరచనలనే యెవ్వరు దలఁచిన యిహపర మంత్రములిందరికి

చ. 1: గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో యనుచు
యీవరుసలనే యెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి

చ. 2: దామోదరాయ నమో నమో ధరణీశాయ నమోనమో
శ్రీమహిళాపతయే నమో శిష్ట రక్షిణే నమో నమో
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో
యీమేరలనే యెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి

చ. 3: పరిపూర్ణాయ నమో నమో ప్రణవగ్రాయ నమోనమో
చిరంతన శ్రీ వేంకటనాయక శేషశాయినే నమోనమో
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో
యిరవుగ నీగతి నెవ్వరు దలఁచిన యిహపరమంత్రము లిందరికి

రేకు: 1979-06 లలిత సం: 01-381 శరణాగతి

పల్లవి: అంతర్యామీ అలసితి సొలసితి
యింతట నీ శరణిదె చొచ్చితిని

చ. 1: కోరిన కోర్కులు కోయని కట్లు
తీరవు నీవవి తెంచక
భారపుఁ బగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోనీవు నీవు వద్దనక

చ. 2: జనుల సంగములఁ జక్కరోగములు
నిను విడువవు నీవు విడిపించక
వినయపు దైన్యము విడువని కర్మము
చనదిది నీవిటు సంతపరచక

చ. 3: మదిలో చింతలు మయిలలు మణుఁగులు
వదలవు నీవవి వద్దనక
యెదుటనేఁ శ్రీవేంకటేశ్వర నీవదె
అదనఁ గాచితివి అట్టిట్టనక

రేకు: 1980-01 ఆహిరి సం: 01-382 వైరాగ్య చింత

పల్లవి: దేవ నీమాయతిమిర మెట్టిదో నా-
భావము చూచి గొబ్బునఁ గానవే

చ. 1: వెడదుఃఖమపుడెల్లా వేరుచుండుదుఁగాని
తడవి విరతిఁబొంది తలఁగలేను
ఆడియాసలఁ దిరిగి అలుయుచుండుదుఁగాని
మడి దొసకుల నివి మానలేను

చ. 2: హేయము స్త్రీసుఖమని యెఱుఁగుచుండుదుఁగాని
పాయపుమదముచేతఁ బాయలేను
పాయనిపాపాలు చూచి భయమందుచుందుఁగాని
వోయయ్య యివి సేయకుండలేను

చ. 3: కలకాల మిన్నియును గందు విందుఁగాని మఱి
యెలమి నొక్కటనైన యెచ్చరలేను
బలిమి శ్రీవేంకటేశ బంధముక్తునిఁజేసి
తలఁపులో నెలకొని దయఁజూడవయ్యా

రేకు: 1980-02 పాడి సం: 01-383 శరణాగతి

పల్లవి: అభయమభయమో హరి నీకు
విభుఁడ వింతటికి వెర వింక నేది

చ. 1: జడిగొని మదిలో శాంతము నిలువదు
కడుఁగడు దుస్సంగతి వలన
యిడుమలేని సుఖ మించుక గానము
అడియాసల నా యలమటవలన

చ. 2: తలఁపులోన నీతత్త్వము నిలువదు
పలు లంపటముల భ్రమవలన
కలిగిన విజ్ఞాన గతియును దాఁగెను
వెలి విషయపు పిరివీకుల వలన

చ. 3: పక్కనఁ బాపపు బంధము లూడెను
చిక్కక నినుఁ దలఁచిన వలన
చిక్కులు వాసెను శ్రీవేంకటపతి
నిక్కము నా కిదె నీకృప వలన

రేకు: 1980-03 బౌళి సం: 01-384 శరణాగతి

పల్లవి: కొందరి కివి సమ్మతియైతే కొందరి కవి గావు
యిందరిలోపల నీవెడమాయలు యేగతిఁ దెలిసే నేనయ్యా

చ. 1: దూరము కర్మమునకు జ్ఞానము తోడనే వొండకటికిని
దూరము పరమునకు బ్రపంచము తొలుత విరుద్ధంబు;
దూరము విరతికి సంసారము; తుదమొదలే లేదు;
యీరీతుల నీ వెడమాయలు యేగతిఁ దెలిసెద నేనయ్యా

చ. 2: కూడదు దేహమునకు నాత్మకు గోత్రవిరోధం; బెన్నఁడును
కూడదు కోపమునకు శాంతము గుణావగుణములను;
కూడదు బంధమునకు మోక్షము కోరికలే కట్లుగాన;
యేడ గొలఁదిగా శ్రీహరిమాయలు యేగతిఁ దెలిసెద నేనయ్యా

చ. 3: శ్రీ వేంకటపతి నన్నీ గతిఁ జిక్కించితి వీజగమునను;
భావింపఁగరాదు నీమహిమ బహుముఖములయర్థముగాన;
యేవిధమును నేఁటికి నాకిఁక యెందెందని తగిలెద నేను
దైవికమగు నీదాసానుదాస్యము దక్కినదే నాకు

రేకు: 1980-04 పాడి సం: 01-385 భగవద్గీత కీర్తనలు

పల్లవి: అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీరఘురామా

చ. 1: కులమును నీవే గోవిందుఁడా నా-
కలిమియు నీవే కరుణానిధీ,
తలఁపును నీవే ధరణీధరా ,నా-
నెలవును నీవే నీరజనాభా

చ. 2: తనువును నీవే దామోదరా, నా-
మనికియు నీవే మధుసూధనా
వినికియు నీవే విట్ఠలుఁడా,నా-
వెనకముందు నీవే విష్ణుదేవుఁడా

చ. 3: పుట్టుగు నీవే పురుషోత్తమా కొన
నట్ట నడుము నీవే నారాయణా,
యిట్టె శ్రీవేంకటేశ్వరుఁడా నాకు
నెట్టన గతి యింక నీవే నీవే

రేకు: 1980-05 బౌళి సం: 01-386 వైష్ణవ భక్తి

పల్లవి: అన్నిటా నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను
యెన్నఁగ నీవొక్కఁడవే గతియని యెంచికొలుచుటే ప్రపన్నసంగతి

చ. 1: యేకాంతంబున నుండినపతిని యెనసిరమించుటే సతిధర్మంబు
లోకమురచ్చలోనుండినపతి లోఁగొని పైకొని రానట్లు
యీ కొలఁదులనే సర్వదేవతలయిన్ని రూపులై నీ వున్నప్పుడు
కై కొని నిను బహుముఖములఁగొలుచుట గాదు పతివ్రత వ్రత ధర్మంబు

చ. 2: పూనిన బ్రాహ్మణుల లోపలనే నినుఁ బూజించుట వేదోక్తధర్మము
శ్వానకుక్కుటాదులోపల నిను సరిఁ బూజించఁగరానట్లు,
యీనియమములనె ప్రాకృతజనులను యీశ్వర నీశరణాగత జనులను
కానక, వొక్కట సరిగాఁజూచుట కాదఁ వివేకధర్మంబు

చ. 3: శ్రీ వేంకటపతిగురువనుమతినే నేవే నాకును శిష్యధర్మము
ఆవలనీవల నితరమార్గములు యాత్మలోన రుచిగానట్లు
భావింపఁగ సకలప్రపంచమును బ్రహ్మం సత్యజ్ఞానమనంతము
కైవశమై యిన్నిటా వెనుతగులు కాదవివేకధర్మంబు

రేకు: 1980-06 ఆహిరి సం: 01-387 అధ్యాత్మ

పల్లవి: కోరు వంచరో కోటారు
ఆరసి మనసా అంతరాత్మకు

చ. 1: కొండలపొడవులు కోరికకుప్పలు
పండినపంటలు భవము లివి
నిండినరాసులు నిజకర్మంబులు
అండనె యివె మాయారంభములు

చ. 2: వెలిధాన్యంబులు విషయపురాసులు
పొలివారేటివూరుపుగములు
కలుషపుమదమున కావుగప్పినవి
అలవిమీర మాయారంభములు

చ. 3: బడి నింద్రియములబంతులు నురిపి
కడురతుల దండగట్టలతో
యెడనెడ శ్రీవేంకటేశుమహిమ లవే
ఆడియాలపుమాయారంభములు

రేకు: 1981-01 దేసాళం సం: 01-388 అధ్యాత్మ

పల్లవి: వీనిఁ జూచియైన నేము విరతిఁబొందగలేము
పూని మాబ్రదు కిందుఁబోలదాయఁగా

చ. 1: పరుల వేడఁగబోవు పరనిందకుఁ జొరవు
పరపురుషా□ర్థమే ఫలవృక్షతతులెల్ల
నరులమై ఘనులమై నానాబుద్ధు లెఱిఁగి
పొరి మాబ్రదుకు లిందుఁబోలదాయఁగా

చ. 2: కామక్రోధాదులు లేవు కామతత్వ మెఱఁగవు
కామించినట్లవు నెక్కడనైనా శిల లివి
దీమసము గలిగియుఁ దెలివి గలిగియును
భూమిలో మాబ్రదు కిందుఁబోలదాయఁగా

చ. 3: వొకరిఁ గొలువఁబోవు వొకపంట సేయఁబోవు
వొకమానిగడు చేరివుండు పక్షు లాడనాడ
వొక శ్రీ వేంకటపతి నమ్మియుండలేము
మొకెమో మాబ్రదు కిందుఁబోలదాయఁగా

రేకు: 1981-02 సాళంగం సం: 01-389 వైరాగ్య చింత

పల్లవి: పనిమాలినట్టి వట్టి పటుదుగాక మాకు
ననిచి యిదియు నొక్కనగుబాట్లా

చ. 1: కన్నవారినెల్లా వేడేకష్టమే దక్కుటగాక
పన్ని దైవమియ్యనిది పరులిచ్చేరా
యెన్నికతో దేహమిచ్చె నిహమెల్లా జెందనిచ్చె
వున్నవారింతటి పని కోపగలరా

చ. 2: బడలి తానెందైనా బడ్డపాటే దక్కెగాక
కడగి రానిది దే నొక్క రివసమా
కడుపులో నుండగానే కలవి నుదుట వ్రాసె
తడవి దైవముచేత దాట వసమా

చ. 3: దెప్పరపు సంపదకు దిమ్మటలే దక్కెగాక
యెప్పుడూ శ్రీవేంకటేశుడీక మానీనా
చప్పుడుగా నతనికే శరణన్న జాలుగాక
తప్పులును వొప్పులు నాతనివే కావా

రేకు: 1981-03 దేసాళం సం: 01-390 వైష్ణవ భక్తి

పల్లవి: పరులసేవలు చేసి బ్రదికేరటా
సిరివరుదాసులు సిరులందు టరుదా

చ. 1: కోరి వొక నరునిఁ గొలిచిన వారలు
దీరులై సలిగెలఁ దిరిగేరట
కూరిమి బ్రహ్మాండ కోటులేలెడివాని-
వార లింతటఁ జనవరులౌ టరుదా

చ. 2: చేకొన్న తుమ్మిద చేపడ్డ కీటము -
లాకడఁ దుమ్మిదలయ్యీనట
శ్రీకాంతుని పాదసేవకులగు వార -
లేకులజు లయినా నెక్కుడౌ టరుదా

చ. 3: ధరణీశు నాజ్ఞల తమదేశములందు
సిరులనాణెపు ముద్ర చెల్లీనట
తిరువేంకటాద్రి శ్రీదేవుని ముద్రలు
ధరియింపఁగా నింతటఁ జెల్లు టరుదా

రేకు: 1981-04 గుజ్జరి సం: 01-391

పల్లవి: ఇటుగన సకలోపాయము లుడిగిన యీశ్వరుఁడే రక్షకుఁడు
తటుకున స్వతంత్రముడిగిన యాత్మకు తగునిశ్చింతమే పరసుఖము

చ. 1: ఆఁకటి కడుగని శిశువుకుఁ దల్లి యడిచి పాలు ద్రాగించినరీతి,
యీకడఁ గోరికలుడిగిన యోగికి నీశ్వరుఁడే రక్షకుఁడు
చేకొని బుద్దెఱిఁగిన బిడ్డలపైఁ జింతింపరు తొల్లిటివలెఁ దల్లులు
యీకొలఁదులనే స్వయత్న దేహుల కీశ్వరుఁడును వాత్సల్యము వదలు

చ. 2: తతిఁ గరిరాజుఁ గాచినయట్లు ద్రౌపదిమానము గాచినయట్లు,
హితమతి స్వతంత్రముడిగిన యోగికి యీశ్వరుఁడే రక్షకుఁడు
అతనుఁడు భస్మంబయ్యిననాఁడు అజునిశిరంబటు ద్రుంచిననాఁడు
చతురుఁడుదా నడ్డము రాఁడాయను స్వతంత్రముడుగని జీవులుగాన

చ. 3: దిక్కని యనిశముఁ జిత్తములోనఁ జింతించేటి శరణాగతజనులకు,
యిక్కడనక్కడ శ్రీ వేంకటగిరియీశ్వరుఁడే రక్షకుఁడు
మక్కువతోఁ దనయంతర్యామిని మఱచినస్వామి ద్రోహులకెల్లా
అక్కరతోఁ బుట్టుగులే భోగ్యం బహంకారము విడువరుగాన

రేకు: 1981-05 వసంతం సం: 01-392 రామ

పల్లవి: రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరత శత్రుఘుల తోడ జయమందు దశరథ రాఘవా

చ. 1: శిరసు కూఁకటుల రాఘవా చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నావయసునఁ దాటకిఁ జంపిన కౌసల్యానందన రాఘవా
అరిది యజ్ఞముగాచు రాఘవా అట్టె హరువిల్లు విఱిచిన రాఘవా
సిరులతో జనకుని యింటను జానకిఁ జెలఁగి పెండ్లాడిన రాఘవా

చ. 2: మలయు నయోధ్యా రాఘవా మాయామృగాంతక రాఘవా
చెలఁగి చుప్పనాతి గర్వ మడఁచి దైత్యసేనలఁ జంపిన రాఘవా
సొలసి వాలిఁజంపి రాఘవా దండి సుగ్రీవునేలిన రాఘవా
జలధి బంధించిన రాఘవా లంక సంహరించిన రాఘవా

చ. 3: దేవతలు చూడ రాఘవా నీవు దేవేంద్రు రథమెక్కి రాఘవా
రావణాదులనుఁ జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయ పట్టమేలి రాఘవా
శ్రీవేంకటగిరిమీఁద నభయము చేరి మాకిచ్చిన రాఘవ

రేకు: 1982-01 దేవగాంధారి సం: 01-393 భక్తి

పల్లవి: విధి నిషేధము లకు వెఱవఁగఁ బనిలేదు
మధుసూదన నీమన్నన దాసుడైతే

చ. 1: విడువరానిధర్మ విధుల పురుషులను
విడిచి గోపికలు విచ్చనవిడి
బడి నిన్ను దగులుటే పరమధర్మ మాయ
యెడయునితర ధర్మాలిక నేటికయ్యా

చ. 2: మానరాని కర్మమార్గము లటు మాని
పూనినయతులే పూజ్యులట
నీనారాయణనియతే ధర్మమాయ
యీనిజ మొకటియు నెఱగఁగవలయు

చ. 3: యిన్నిట శ్రీవేంకటేశ నీదాసుఁడై
వున్న విచారాల నొదుగనేలా
నిన్ను గూర్చినట్టి నిజభ క్తి గలదని
తిన్ననై తెలిపేటి తెలివే కలది

రేకు: 1982-02 రామక్రియ సం: 01-394 దశావతారములు

పల్లవి: సులభుఁడు మధుసూదనుఁడు మన-
మెలమి నమ్మిన నిట్టే సుండీ

చ. 1: పడుచు మాటన కా ప్రహ్లాదునెదుట
పొడచూపె నాదిపురుషుఁడు
అడవి దేహనక అదంతిమొఱకును
తడవి కాచిన దైవము సుండీ

చ. 2: ఆడుమాటలనక అంతలో ద్రౌపదిని
వాడిమి గాచిన వరదుఁడు
పోఁడిమిఁ బేదనక పొందిన కుచేలుని
వీఁడె సంపదిచ్చె విష్ణుఁడు సుండీ

చ. 3: వీరువారన కిదె వేఁడిన వరములు
సారెకు నిచ్చిన సర్వేశుఁడు
మేరతో లోకముల మెఱసె నిప్పుడును
యీరీతి శ్రీవేంకటేశుఁడే సుండీ

రేకు: 1982-03 ధన్నాసి సం: 01-395 గురు వందన

పల్లవి: కింకదీర 'నదైవం కేశవాత్పర' మని
ఉంకువైవనాలో నీవుపమ లివే

చ. 1: కంటి నీవొక్కఁడవే లోకములకు దైవమని
వొంటి మఱి నిన్నుఁ బోల నొకరిఁ గాన
వింటి నీవే ఘనమని వేదాంతమందు నీ-
కంటె నితరము విన గరుణానిధీ

చ. 2: తోఁచె నాకు నీసేవే తుదిపదమని మఱి
తోఁచ దీబుద్ధికి; సరితూఁగ దెందును
పూఁచి నాగురుఁడు నిన్నే బోధించేగాని మఱి
దాఁచఁడాయ నీమహిమ ధరణీధరా

చ. 3: సమ్మతించె నామతి జవియైనా కథలె
సమ్మతించ దెక్కడో రచ్చల సుద్దులు
నమ్మిక శ్రీవేంకటేశ నంటున నీపాదాలే
నమ్మితి నేమియు నమ్మ నారాయణా

రేకు: 1982-04 రామక్రియ సం: 01-396 అధ్యాత్మ

పల్లవి: ఓహో ఢేంఢేం వొగి బ్రహ్మమిదియని
సాహసమున శృతి చాటెడిని

చ. 1: పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుఁడును అపరము జీవుఁడు
తిరమైన ప్రకృతియె దేహము

చ. 2: జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
పూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మ జ్ఞేయము పరమాత్మ
జ్ఞాన గమ్యమే సాధించు మనసు

చ. 3: క్షరము నక్షరమును సాక్షి పురుషుఁడని
సరవిఁ దెలియుటే సాత్వికము
క్షరము ప్రపంచ మక్షరము కూటస్థుఁడు
సిరి పురుషోత్తముఁడే శ్రీవేంకటేశుఁడు

రేకు: 1982-05 శంకరాభరణం సం: 01-397 వైరాగ్య చింత

పల్లవి: ఛీఛీ నరుల దేటిజీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక

చ. 1: అడవిలో మృగజాతియైనఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువఁగవచ్చునా
వుడివోని పక్షియై వుండనై నావచ్చుఁ గాక
విడువ కెవ్వరినైనా వేఁడవచ్చునా

చ. 2: పసురమై వెదలేనిపాటు వడవచ్చుఁ గాక
కసివో నొరుల బొగడగావచ్చునా
వుసురుమానై పుట్టివుండనై నవచ్చుగాక
విసువక వీరివారి వేసరించవచ్చునా

చ. 3: యెమ్మెల బుణ్యాలు సేసి యిల యేలవచ్చుఁగాక
కమ్మి హరిదాసుఁడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీచిత్తమే కాక
దొమ్ములకర్మము లివి తోయవచ్చునా

రేకు: 1982-06 గుజ్జరి సం: 01-398 భక్తి

పల్లవి: ఇంతే మఱేమిలేదు యిందుమీఁదను
దొంతులకర్మాలు దుమ్ముదూరుపెత్తుట

చ. 1: పుల్లములో నుండి దేహ మొగి రక్షించేహరి-
నొల్లకున్న తన్నుఁ దా నొల్లకుండుట
బల్లిదుఁ డాతని మాని పరుల వేఁడేదెల్లా
పొల్లకట్టు దంచిదంచి పోగు సేసుకొనుట

చ. 2: యెయ్యెడాఁ బుణ్యఫలము లేమి గలిగిన హరి-
కియ్యకున్న నది దైవమియ్యకుండుట
చెయ్యార నాతని కొప్పు సేయని భోగములెల్లా
చయ్యన జెఱకుఁ బిప్పి చవిగొనుట

చ. 3: శ్రీకాంతుడై నట్టి శ్రీవేంకటేశ్వరుని
జేకొంటే సిరులెల్లా జేకొనుట
మేకుల శ్రీహరినామమే నోర నుడుగట
కైకొన్న యమృతపుగందు వగుట

రేకు: 1983-01 ఆహిరి సం: 01-399 దశావతారములు

పల్లవి: ఇతరధర్మము లందు నిందు గలదా
మతిఁ దలపఁ బరము నీమతముననే కలిగె

చ. 1: విదురునకుఁ బరలోకవిధి చేసెనట తొల్లి
అదె ధర్మసుతుఁడు వర్ణాశ్రమంబులు విడిచి
కదిసి నీదాసుఁడై న కతముననే కాదె యీ-
యెదురనే తుదిపదం బిహముననే కలిగె

చ. 2: అంటరాని గద్దకుల మంటి జటాయువుకు నీ
వంటి పరలోకకృత్యములు సేసితివి మును
వెంట నీ కైంకర్యవిధి కలిమినేకాదె
వొంటి నీహస్తమున నోగ్యమై నిలిచె

చ. 3: యిరవైన శబరిరుచులివియె నైవేద్యమై
పరగెనట శేషమును బహునిషేధములనక
ధర దదీయప్రసాదపు విశేషమేకాదె
సిరుల శ్రీవేంకటేశ చెల్లుబడులాయ

రేకు: 1983-02 సాళంగనాట సం: 01-400 దశావతారములు

పల్లవి: దేవదేవుడెక్కె నదె దివ్యరథము
మావంటి వారికెల్ల మనో రథము

చ. 1: జగతి బాలులకై జలధులు వేరఁ జేసి
పగటునఁ దోలెనదె పైఁడి రథము
మిగులఁగఁ గోపగించి మెరయురావణమీఁద
తెగి యెక్కి తోలేనదె దేవేంద్రర థము

చ. 2: దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకుఁ
బక్కన మరలిచెఁ బుష్పక రథము
నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కి తోలె
వెక్కసపు రెక్కలతో విష్ణు రథము

చ. 3: బలిమి రుక్మిణి దెచ్చి పరులగెలిచి యెక్కె
అలయేఁగు బెండ్లికల్యాణ రథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
కలకాలమును నేగె ఘనమైన రథము

రేకు: 1983-03 కాంబోదిసం: 01-401 వైరాగ్య చింత

పల్లవి: ఏమిసేతు దేవదేవ యింతయును నీమాయ
కామినులఁ జూచిచూచి కామించె భవము

చ. 1: చంచలపుఁగనుదోయి సతులబారికిఁ జిక్కి
చంచల మందెను నాదిచ్చరి మనసు
కంచుఁ గుత్తికలవారి గానములఁ జొక్కి చొక్కి
కంచుఁబెంచు నాయఁబో నాకడలేని గుణము

చ. 2: తీపులమాటల మించి తెఱవలభ్రమఁ దరి
తీపుల పాలాయఁబో నాతెలివెల్లాను
పూఁపల నవ్వుల తోడి పొలఁతులఁ జూచిచూచి
పూఁపలుఁ బిందెలునై పొల్లువోయఁ దపము

చ. 3: కూటమి సతులపొందు కోరి కోరి కూడికూడి
కూటువ నావిర తెందో కొల్లఁబోయను
నీటున శ్రీవేంకటేశ నినుఁగని యింతలోనె
జూటరినై యింతలోనె సుజ్ఞానినైతి

రేకు: 1983-04 గుండక్రియ సం: 01-402 వైష్ణవ భక్తి

పల్లవి: మరిగి వీరిపో మాదైవంబులు
కెరలిన హరి సంకీర్తనపరులు

చ. 1: వినియెడి వీనుల విష్ణుకథలకే
పనిగొందురు మాప్రపన్నులు
కనియెడి కన్నులు కమలాక్షునియం
దనువుపరతు రటు హరిసేవకులు

చ. 2: పలికెడిపలుకులు పరమాత్మునికై
యలవరతురు శరణాగతులు
తలఁచేటి తలఁపులు ధరణీధరుపై
తలకొలుపుదు రాతదియ్యులు

చ. 3: కరముల శ్రీపతికైంకర్యములే
మురియుచుఁ జేతురు ముముక్షులు
యిరవుగ శ్రీవేంకటేశ్వరు మతమే
సిరుల నమ్మదురు శ్రీవైష్ణవులు

రేకు: 1983-05 బౌళి సం: 01-403 శరణాగతి

పల్లవి: ఏమీ నడుగనొల్ల హెచ్చుకొందు లనొల్ల
కామించి నీవిచ్చితివి కైవల్యపదము

చ. 1: పుట్టుగులకు వెఱవ భువిలోన హరి నీకు_
నట్టె నీదాసుఁడ నేనైతేఁ జాలు
వెట్టికి నే జాతియైన వెఱవ నీనామములు
వొట్టి నా నాలికమీఁద నుంటేఁజాలు

చ. 2: దురితాలకు వెఱవఁ దుద వేయైనా హరి నీ_
కరుణఁ గైంకర్యము గలిగితేఁ జాలు
నిరతి నింద్రియాలకు నే వెఱవ నీ వాత్మఁ
బెరరేఁపకుఁడవై పెరిగితేఁ జాలు

చ. 3: యేలోకమైనా వెఱవ యెప్పుడూ శ్రీవేంకటేశ
పాలించి నీకృప నాపైఁ బారితేఁ జాలు
కాలమెట్టయినా వెఱవ కర్మ మెట్టయినా వెఱవ
యేలిన నీదాసులు నన్నియ్యకొంటేఁ జాలును

రేకు: 1983-06 భూపాళం సం: 01-404 భక్తి

పల్లవి: కనియు గానని మనసు కడమగాక
యెనలేని హరిమహిమ కిది గుఱుతుగాదా

చ. 1: కనుకలిగి హరిగొలిచి ఘనులైరిగాక మును
మనుజులే కారా మహరుషులును
మనసులో నిపుడైన మరిగి కొలిచినవారు
ఘనులౌట కిదియ నిక్కపు గుఱుతుగాదా

చ. 2: భావించి హరిఁగొలిచి పదవులందిరిగాక
జీవులే కారా దేవతలును
కావించి కొలిచినను ఘనపదవు లేమరుదు
యేవలన నిందిరికి నిది గుఱుతుగాదా

చ. 3: పన్ని హరిఁగొలిచి నేర్పరులైరి గాక ధర-
నున్నవారే కారా యోగివరులు
యెన్నికల శ్రీవేంకటేశు నమ్మినవార
లిన్నియునుఁ జేకొనుట కిది గుఱుతుగాదా

రేకు: 1984-01 మలహరిసం: 01-405 వైష్ణవ భక్తి

పల్లవి: వలెనను వారిదె వైష్ణవము యిది
వలపుఁ దేనెవో వైష్ణవము

చ. 1: కోరిక లుడుగుచు గుటి నిన్నిటిపై
వైరాగ్యమెపో వైష్ణవము
సారెకుఁ గోపముఁ జలమునుఁ దనలో
వారించుటవో వైష్ణవము

చ. 2: నుడిగొను దేహపు సుఖదుఃఖములో
వడిఁ జొరనిదెపో వైష్ణవము
ముడివడి యింద్రియముల కింకరుఁడై
వడఁబడనిదెపో వైష్ణవము

చ. 3: పుదుటునఁ దన సకలొపాయంబులు
వదలుటపో నిజవైష్ణవము
యెదుటను శ్రీవేంకటేశ్వరు నామము
వదనము చేర్చుట వైష్ణవము

రేకు: 1984-02 పాడి సం: 01-406 అధ్యాత్మ

పల్లవి: శ్రీహరి సేసిన చిప్పాలివి యీ
మోహము విడుచుట మోక్షమది

చ. 1: మలినంబేది మణుఁగననేది
కలుషపుమలముల కాయమిది
కలిగిన దేది కడు లేందేది
చలనపు మాయల జన్మ మిది

చ. 2: తనిసిన దేది తనియనిదేది
దినదిన మాఁకలి దీరదిది
కొన యిందేది గుటి మొదలేది
పనిగొను కర్మపు బంధ మది

చ. 3: నిండినదేది నిండనిదేది
కొండల పాడవుల కోరికది
అండనె శ్రీవేంకటాధిపు శరణని
వుండుటె యిహపరయోగ మది

రేకు: 1984-03 సాళంగనాట సం: 01-407 నామ సంకీర్తన

పల్లవి: దైవమా నీకు వెలితా తలఁపువెలితేకాక
వేవేలుకర్మాల వేసారఁగ వలసె

చ. 1: హరి యంటే బాపేటి అన్ని పాపాలు సేసిన
పొరి నందుపై నమ్మిక పుట్టదుగాక
నరసింహ యంటే వచ్చే నానాపుణ్యాలకు
తిరముగా ఋణములు దీర్చుకొనఁగలవా

చ. 2: దేవ జగన్నాథ యంటే తెగనిజన్మము లేవి
కైవశము నామనసు గాదుగాక
గోవింద యనియంటేఁ గూడని పదవు లేవి
కావిరిఁ గాల మూరకె గడుపేము నేము

చ. 3: వేదనారాయణమంటే వీడేటిబంధములు
ఆదిగా మూఁడులోకాలనైనా నున్నదా
శ్రీదేవిపతి యైన శ్రీవేంకటేశ్వరుఁడా
యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాక

రేకు: 1984-04 గుజ్జరి సం: 01-408 గురు వందన, నృసింహ

పల్లవి: ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము
లొక్కట గెలిచితి మోహో నేము

చ. 1: ప్రపన్నులెదుటను బడినయాతుమకు
చపలత మరి నాశము లేదు
ఉపమల గురుకృప నొనరిన మనసుకు
రపముల మఱి నేరములే లేవు

చ. 2: ఘనతర ద్వయాధికారగు దేహికి
మినుకుల భవభయమే లేదు
చనవుల హరిలాంఛన కాయమునకు
వెనుకొను కర్మపువెట్టియు లేదు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జేరినధర్మికి
ఆవల మఱి మాయలు లేవు
కైవశమాయను కైవల్యపదమునుఁ
జావుముదిమితో సడ్డే లేదు

రేకు: 1984-05 లలిత సం: 01-409 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను
సర్వాపరాధినైతి చాలుఁజాలునయ్యా

చ. 1: వూరకున్న జీవునికి వొక్కొక్క స్వతంత్ర మిచ్చి
కోరేటి యపరాధాలు కొన్ని వేసి
నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటా
దూరవేసే వింతేకాక దోష మెవ్వరిదయ్యా

చ. 2: మనసు చూడవలసి మాయలు నీవే కప్పి
జనులకు విషయాలు చవులు చూపి
కనుఁగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి
ఘనము సేసే విందు గర్త లెవ్వరయ్యా

చ. 3: వున్నారు ప్రాణులెల్లా నొక్కనీ గర్భములోనే
కన్న కన్న భ్రమతలే కల్పించి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
నిన్ను నన్ను నెంచుకొంటే నీకే తెలుసునయ్యా

రేకు: 1984-06 రామక్రియ సం: 01-410 అంత్యప్రాస

పల్లవి: భక్తి కొలఁది వాఁడే పరమాత్ముఁడు
భుక్తి ముక్తిఁ దానే యిచ్చు భువిఁ బరమాత్ముఁడు

చ. 1: పట్టినవారిచే బిడ్డ పరమాత్ముఁడు
బట్టబయటి ధనము పరమాత్ముఁడు
పట్టుపగటి వెలుఁగు పరమాత్ముఁడు
యెట్టనెదుటనే వున్నాఁడిదె పరమాత్ముఁడు

చ. 2: పచ్చిపాలలోని వెన్న పరమాత్ముఁడు
బచ్చిన వాసిన రూపు పరమాత్ముఁడు
బచ్చు చేతి వొరగల్లు పరమాత్ముఁడు
యిచ్చకొలఁది వాడువో యీ పరమాత్ముఁడు

చ. 3: పలుకుల లోని తేట పరమాత్ముఁడు
ఫలియించు నిందరికిఁ బరమాత్ముఁడు
బలిమి శ్రీవేంకటాద్రి పరమాత్ముఁడు
యెలమి జీవుల ప్రాణ మీ పరమాత్ముఁడు

రేకు: 1985-01 దేవగాంధారి సం: 01-411 అధ్యాత్మ

పల్లవి: మిక్కిలిపుణ్యులు హరి మీదాసులే హరి
తక్కినవారు మీకృప దప్పినవారు హరి

చ. 1: వున్నతపు సంపదల నోలలాడేయట్టివాఁడు
మున్నిటిజన్మాన నీకు మొక్కినవాఁడు హరి
పన్ని పడనిపాట్లఁ బరులఁ గొలిచేవాఁడు
వున్నతి మిము సేవించనొల్లనివాఁడు హరి

చ. 2: పూని దేవేంద్రాదులై పొడవుకెక్కినవారు
శ్రీనాథ మిమ్ముఁనే పూజించినవారు హరి
నానానరకముల నలఁగుచుండేవారు
నానాఁడే నీమహిమ నమ్మనివారు హరి

చ. 3: పావనులై నిజభక్తిఁ బ్రపన్నులయ్యినవారు
శ్రీవేంకటేశ మిమ్ముఁ జేరినవారె హరి
వేవేలు దేవతలవెంట దగిలేటివాఁడు
కావించి మిమ్మెఱఁగనికర్మి యాతఁడే హరి

రేకు: 1985-02 ముఖారి సం: 01-412 భక్తి

పల్లవి: చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ నింతే
అప్పటి నపరాధమూ ఆదరించవలదా

చ. 1: నియ్యాజ్ఞ దేహము నే మోఁచితి నింతే
యియ్యెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వెయ్యవేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వొయయ్య కొంతైనా వూరడించవలదా

చ. 2: నీవు సేసే కర్మము నేఁ జేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవరమై వెంటవెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంతవడైనా దప్పిదీర్చవలదా

చ. 3: మతిలో శ్రీవేంకటేశ మనికైనవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్యా
యితవై పనిసేసేటి యింటపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డువెట్టఁదగదా

రేకు: 1985-03 బౌళి సం: 01-413 అధ్యాత్మ

పల్లవి: వెట్టివాఁడు వెట్టిగాఁడు విష్ణుని దాస్యము లేక
విట్టువీఁగే యహంకారి వెట్టివాఁడు

చ. 1: నాలుకపై శ్రీహరినామ మిట్టే వుండఁగాను
జోలితో మఱచిననీచుఁడే వెట్టివాఁడు
అలరియీజగమెల్లా హరిరూపై వుండఁగాను
వాలి తలపోయలేనివాఁడు వెట్టివాఁడు

చ. 2: కూరిమి బ్రహ్మాండాలు కుక్షినున్న హరికంటే
కోరి వేరె కలఁడనేకుమతి వెట్టివాఁడు
చేరి తనయాత్మలోన శ్రీరమణుఁడుండఁగాను
దూరమై తిరుగువాఁడే దొడ్డవెట్టివాఁడు

చ. 3: సారపు శ్రీవేంకటేశు శరణాగతి వుండఁగా
సారెఁ గర్మములంటెడి జడుడు వెట్టివాఁడు
చేరువ నాతని ముద్ర చెల్లుబడి నుండఁగా
మోరతోపైవున్నవాఁడే ముందు వెట్టివాఁడు

రేకు: 1985-04 మాళవి సం: 01-414 వైష్ణవ భక్తి

పల్లవి: నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరల శరణని బ్రదుకరో సాటికిఁ బెనఁగక జడులాల

చ. 1: సకలోపాయశూన్యులు సమ్యగ్జ్ఞానపూర్ణులు
అకలంకులు శంఖచక్రలాంఛను లన్నిట బూజ్యులు వైష్ణవులు
వొకటీ గోరరు వొరుల గొలువరు వొల్లరు బ్రహ్మాదిపట్టములు
అకటా వీరలసరియనఁ బాపం బారుమతంబులపూఁతకోకల

చ. 2: మంత్రాంతరసాధనాంతరంబులు మానినపుణ్యులు విరక్తులు
యంత్రపుమాయలఁ బొరలుపరులకు యెంతైనా మొక్కరు వైష్ణవులు
తంత్రపుకామక్రోధవిదూరులు తమనిజధర్మము వదలరు
జంత్రపుసంసారులతో వీరల సరియని యెంచఁగఁ బాపమయ్య

చ. 3: తప్పరు తమపట్టినవ్రత మెప్పుడు దైవ మొక్కడేఁ గతియనుచు
వొప్పుగుతమపాతివ్రత్యంబున నుందురు సుఖమున వైష్ణవులు
కప్పిన శ్రీవేంకటపతిదాసులు కర్మవిదూరులు సాత్వికులు
చెప్పకుఁడితరుల సరిగా వీరికి సేవించఁగ నే ధన్యుఁడనైతి

రేకు: 1985-05 లలిత సం: 01-415 వేంకటగానం

పల్లవి: మా కెల్ల ' రాజానుమతో ధర్మ' యిది నీ
యీకడఁ గలుగుట కేమరుదు

చ. 1: అలగరుడగమన మహిశయనంబును
కలిసి నీయందె కలిగెనటా
పొలసినపాపముఁ బుణ్యము నరులకు
యెలమి గలుగుటకు నేమరుదు

చ. 2: యిదె నీడకన్ను యెండకన్ను మరి
కదిసి నీయందె కలిగెనట
సదరపునరులకు జననమరణములు
యెదురనె కలుగుట కేమరుదు

చ. 3: శ్రీకాంత ఒకదెస భూకాంత ఒకదెస కదెన
కైకొని నీకిటు గలిగెనట
యీకడ శ్రీవేంకటేశ యిహపరము
యేకమై మా కగు టేమరుదు

రేకు: 1985-06 భైరవి సం: 01-416 అంత్యప్రాస

పల్లవి: తెలియరాదు మాయదేహమా మమ్ము
పలువికారాలఁబెట్టి పనిగొన్న దేహమా

చ. 1: దినమొక్క వయసెక్కే దేహమా సారె
పెనుమదము గురిసే బెండు దేహమా
దినదిన రుచిగోరే దేహమా నన్ను
ఘనమోహపాశాలఁ గట్టెఁగదె దేహమా

చ. 2: తెలివినిద్రలుగల దేహమా నీ-
పాలము పంచభూతాలపొత్తు దేహమా
తిలకించి పాపపుణ్యాల దేహమా
బలువుగలదాఁకా బదుకవో దేహమా

చ. 3: తీరని సంసారపు దేహమా ఇట్టె
పూరట లేనిభోగాల వోదేహమా
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలిచితి నిఁక నాకు
కారణజన్మమవై కలిగినదేహమా

రేకు: 1986-01 లలిత సం: 01-417 అధ్యాత్మ

పల్లవి: తహతహ లిన్నిటికి తానే మూలము గాన
సహజాన నూరకున్న సంతతము సుఖము

చ. 1: భారమైన పదివేలు పనులు గడించుకొంటే
సారెసారె నలయించకపోవు
తీరనియాసోదము దేహములో నించుకొంటే
వూరూరఁ దిప్పితిప్పి వొరయక మానవు

చ. 2: వుండివుండి కిందుమీఁదు వుపమఁ జింతించుకొంటే
వుండుఁబో మంచముకింద నొకనూయి
కొండంతదొరతనము కోరి మీఁద వేసుకొంటే
నండనే యాబహురూప మాడకపోదు

చ. 3: మనసురానివైన మంచివి చేసుకొంటే
తినఁదిన వేమైన దీపవును
తనిసి శ్రీవేంకటేశు దాసానదాసుఁడైతే
యెనయుచు నేపని కెదురే లేదు

రేకు: 1986-02 సాళంగనాట సం: 01-418 శరణాగతి

పల్లవి: ఇదియే మర్మము హరి యిందుఁగాని లోనుగాడు
పదపడి జీవులాల బదుకరో

చ. 1: హరి గానలేరు మీరు అరసెందువెదకినా
హరిదాసు లెఱుఁగుదు రడుగరో
గరిమెఁ బ్రత్యక్షము గాఁడు దేవుఁ డెవ్వరికి
ధరఁ బ్రత్యక్షము హరిదాసుల గొలువరో

చ. 2: చేత ముట్టి గోవిందుని శిరసు పూజించలేరు
చేతులార ప్రపన్నులసేవ సేయరో
జాతిగాఁగ విష్ణునిప్రసాద మేడ దొరకీని
ఆతల వారి బ్రసాద మడుగరో

చ. 3: అంతరంగమున నున్నాఁడందురు విష్ణుడు గాని
అంతటా నున్నారు వైష్ణవాధికులు
చెంతల దదియ్యుల చేతియనుజ్ఞ వడసి
సంతతం శ్రీవేంకటేశు శరణము చొరరో

రేకు: 1986-03 దేసాక్షి సం: 01-419 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరివాఁడో యీదేహి
యివ్వలనవ్వల నీదేహి

చ. 1: కామించు నూరకే కలవియు లేనివి
యేమి గట్టుకొనె నీదేహి
వాములాయ నిరువదియొక వావులు
యేమని తెలిసెనో యీదేహి

చ. 2: కందువ నిజములు గల్లలు నడిపీ
యెందుకు నెక్కెనో యీ దేహి
ముందర నున్నవి మొగిఁ దనపాట్లు
యిందే భ్రమసీ నీదేహి

చ. 3: పంచేంద్రియముల పాలాయ జన్మము
యించుక యెఱఁగఁడు యీదేహి
అంచెల శ్రీవేంకటాధీశ నీకృప
వంచఁగ గెలిచెను వడి నీదేహి

రేకు: 1986-04 రామక్రియ సం: 01-420 అంత్యప్రాస

పల్లవి: ఎంతవిచారించుకొన్నా నిదియే తత్త్వము హరి
వంతుకు నీకృపగలవాఁడే యెఱుఁగు హరి

చ. 1: నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్నునొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మొక్కి బదికిరి హరి
వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి

చ. 2: యేపున నీపేరిటివాఁడిన్నిటా ధన్యుఁడు హరి
నీపేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడే హరి
కేపుల నిన్నుఁ నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్ను దిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి

చ. 3: యిట్టె నీవిచ్చినవర మెన్నఁడు జెడదు హరి
గట్టిగా నీవియ్యనివి కపటములే హరి
అట్టె శ్రీవేంకటేశ నీ వంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న వొచ్చము దేహికి హరి

రేకు: 1986-05 మాళవి సం: 01-421 నృసింహ

పల్లవి: నగుమొగముతోడి వో నరకేసరి
నగరూప గరుడాద్రి నరకేసరి

చ. 1: అమితదానవహరణ ఆదినరకేసరి
నమితబ్రహ్మాదిసుర నరకేసరి
కమలాగ్రవామాంక కనకనరకేసరి
నమోనమో పరమేశ నరకేసరి

చ. 2: రవిచంద్రశిఖనేత్ర రౌద్రనరకేసరి
నవనారసింహ నమో నరకేసరి
భవనాశినీతీరభవ్య నరకేసరి
నవరసాలంకార నరకేసరి

చ. 3: శరణాగతత్రాణ సౌమ్య నరకేసరి
నరకమోచననామ నరకేసరి
హరి నమో శ్రీవేంకటాద్రి నరకేసరి
నరసింహ జయ జయతు నరకేసరి

రేకు: 1986-06 లలిత సం: 01-422 వేంకటగానం

పల్లవి: వాడె వేంకటాద్రిమీద వరదైవము
పోఁడిమితోఁ బొడచూపెఁ బొడవైన దైవము

చ. 1: వొక్కొక్క రోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
పిక్కటిల్ల వెలుఁగొందే పెను దైవము
పక్కనను తనలోని పదునాలుగు లోకాలు
తొక్కి పాదానఁ గొలచే దొడ్డ దైవము

చ. 2: వేద శాస్త్రాలు నుతించి వేసరి కానఁగలేని
మోదపు పెక్కుగుణాల మూలదైవము
పోది దేవతలనెల్లఁ బుట్టించ రక్షించ
ఆదికారణంబైన అజుఁగన్న దైవము

చ. 3: సరుస శంఖచక్రాలు సరిఁబట్టి యసురల
తరగి పడవేసిన దండి దయివమూ
సిరి పురమున నించి శ్రీవేంకటేశుండయి
శరణాగతులఁగాచే సతమయిన దయివము

రేకు: 1987-01 రామక్రియ సం: 01-423 వైష్ణవ భక్తి

పల్లవి: సులభమా యిందరికి జూడ సులభముగాక
కలిగె మీకృప నాకుఁ గమలారమణా

చ. 1: సతతదయాచారసంపన్నుఁడై మఱికదా
అతిశయవైష్ణవాన కరుహుఁడౌట
వ్రతోపవాసతీర్థవరసిద్ధుఁడైకదా
మితిమీరి నరహరి మీదాసుఁడౌట

చ. 2: సకలయజ్ఞఫలము సత్యము ఫలముగదా
ప్రకటించి విష్ణునామపాఠకుఁడౌట
అకలంకమతితోడ నాజన్మశుద్ధుఁడైకదా
అకుటిలమగుమీచక్రాంకితుఁడౌట

చ. 3: కెరలి సదాచార్యకృప గలిగినగదా
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ గనుట
మరిగి మీపై భక్తి మఱి ముదిరినఁ గదా
అరయ మీకే శరణాగతుఁడౌట

రేకు: 1987-02 శంకరాభరణం సం: 01-424 ఉత్సవ కీర్తనలు

పల్లవి: అదె వాఁడె యిదె వీఁడె అందు నిందు నేఁగీని
వెదకివెదకి తిరువీధులందు దేవుఁడు

చ. 1: అలసూర్యవీధి నేఁగీ నాదిత్యునితేరిమీద
కలికికమలానందకరుఁడుగాన
తలపోసి అదియును దవ్వు చుట్టటికమని
యిలఁ దేరిమీఁద నేఁగీ నిందిరావిభుఁడు

చ. 2: చక్క సోమవీధి నేఁగీ జందురునితేరిమీఁద
యెక్కువైన కువలయహితఁడుగాక
చుక్కలు మోచిన దవ్వుచుట్టరిక మిదియని
యిక్కువతో వీధి నేఁగీ నెన్నికైన దేవుఁడు

చ. 3: యింతులమనోవీధి నేఁగీ మరుతేరిమీఁద-
నంతటా రతిప్రియుఁ డటుగాన
రంతుల నదియుఁ గానరానిచుట్టరికమని
వింతరీతి నేఁగీ శ్రీవేంకటాద్రిదేవుఁడు

రేకు: 1987-03 బౌళి సం: 01-425 వేంకటగానం

పల్లవి: శ్రీవేంకటేశుఁడు శ్రీపతియు నితఁడే
పావనపు వైకుంఠ పతియును నితఁడే

చ. 1: భగవతములోఁ జెప్పె బలరాముతీర్థయాత్ర
నాగమోక్తమైనదైవమాతఁ డితడే
బాగుగా బ్రహ్మాండపురాణపద్ధతియాతఁ డితఁడే
యోగమై వామనపురాణోక్తదైవ మీతఁడే

చ. 2: వెలయ సప్తరుషులు వెదకి ప్రదక్షిణము
లలరఁ జేసినదేవుఁడాఁతఁ డీతఁడే
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి
కలిమి దపముసేసి కన్నదేవు డీతఁడే

చ. 3: యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్వమీతఁడు
చక్క నారదాదులసంకీర్తనకుఁ జొక్కి
నిక్కినశ్రీవేంకటాద్రి నిలయుఁడు నీతఁడే

రేకు: 1987-04 బౌళి సం: 01-426 ఉపమానములు

పల్లవి: పట్టినచోనే వెదకి భావించవలెఁగాని
గట్టిగా నంతర్యామి కరుణించును

చ. 1: యింటిలోనిచీఁకటే యిట్టే తప్పకచూచితే
వెంటనే కొంతవడికి వెలుఁగిచ్చును
అంటి కానరానితనయాతుమ తప్పకచూచు-
కొంటేఁ దనయాతుమయు గొబ్బునఁ గాన్పించును

చ. 2: మించి కఠినపురాతిమీఁదఁ గడవ వెట్టితే
అంచెలఁ దానే కుదురై నయట్టు
పొంచి హరినామమే యేపొద్దు నాలికతుదను
యెంచి తలఁచఁదలచ నిరవౌ సుజ్ఞానము

చ. 3: వొక్కొక్కయడుగే వొగి ముందరఁ బెట్టితే
యెక్కువై కొండైనా నెక్కఁ గొనకు
యిక్కువ శ్రీవేంకటేశు నిటు దినదినమును
పక్కనఁ గొలిచితే బ్రహ్మపట్ట మెక్కును

రేకు: 1987-05 సాళంగనాట సం: 01-427 అధ్యాత్మ

పల్లవి: నా తప్పు లోఁ గొనవే నన్నుఁ గావవే దేవ
చేతలిన్నీ జేసి నిన్నుఁజేరి శరణంటిని

చ. 1: అందరిలో నంతర్యామివై నీవుండఁగాను
యిందరిఁ బనులుగొంటి నిన్నాళ్ళును
సందడించి యిన్నిటా నీచైతన్యమై యుండఁగాను
వందులేక నేఁ గొన్నివాహనా లెక్కితివి

చ. 2: లోకపరిపూర్ణుఁడవై లోనా వెలి నుండఁగాను
చేకొని పూవులుఁ బండ్లుఁ జిదిమితిని
కైకొని యీమాయలు నీకల్పితమై వుండఁగాను
చౌకలేక నేవేరే సంకల్పించితిని

చ. 3: యెక్కడచూచిన నీవే యేలికెవై వుండఁగాను
యిక్కడాఁ దొత్తుల బంట్ల నేలితి నేను
చక్కని శ్రీవేంకటేశ సర్వాపరాధి నేను
మెక్కితి నన్ను రక్షించు ముందెఱఁగ నేను

రేకు: 1987-06 నాట సం: 01-428 నృసింహ, సంస్కృత కీర్తనలు

పల్లవి: పరిపూర్ణ గరుడాద్రి పంచాననం
పరమంసేవే పంచాననం

చ. 1: క్రూరదంష్ట్రాగ్నికణఘోర పంచాననం
పారీణచక్రధర పంచాననం
వీర పంచాననం విజయ పంచాననం
భారభూభారహర పంచాననం

చ. 2: దివిజపంచాననం తీవ్రనఖకాననం
భవనాశినీతీర పంచాననం
కువలయాకాశసంఘోష పంచాననం
పవిశబ్దదంతరవ పంచాననం

చ. 3: శ్రీవేంకటాఖ్యఘనశిఖరి పంచాననం
పావనం పంచముఖ పంచాననం
సేవిత ప్రహ్లాదసిద్ధి పంచాననం
భావితం శ్రీయుక్త పంచాననం

రేకు: 1988-01 బౌళి సం: 01-429 దశావతారములు

పల్లవి: వివేకమెఱఁగనివెఱ్ఱులముగాక నేము

దివారాత్రము నిన్నే ద్రిష్టించవలదా

చ. 1: మానివోడ నమ్మి నొక్కమనుజుఁడు వార్ధి దాఁటి

నానార్థములు గూర్చి నటించఁగాను

దానవారికృప నమ్మి తగినసంసారవార్ధి-

లోను చొచ్చి దాఁటి గెల్వ లోకులకుఁ జెల్లదా

చ. 2: జుట్టెఁడుయినుము నమ్మి సారిది నొక్కఁడు భూమిఁ

గట్టిడిభయములెల్లఁ గడవఁగాను

నెట్టనఁ జక్రాయుధుని నిజనామ మిటు నమ్మి

తట్టి భవభయములు తరి దాఁటఁజెల్లదా

చ. 3: వేలెఁడుదీపము నమ్మి వెడఁగుఁజీఁకటిఁ బాసి

పోలిమి నొక్కనరుఁడు పొదలఁగాను

ఆలించి శ్రీవేంకటేశుఁ డాత్మలో వెలుఁగగాను

మేలి మాతనిఁ గొలిచి మెరయంగవలదా

రేకు: 1988-02 గుండక్రియ సం: 01-430 ఉపమానములు

పల్లవి: ఏమియుఁ జేయఁగవద్దు యింతలోనె మోక్షము
దీమపువిజ్ఞానమే దివ్వెత్తు ఫలము

చ. 1: పాపచింత మదిలోన బారకుండా నిలిపితే
చేపట్టి దానములెల్లా జేసినంత ఫలము
కోపానలములోన కోరికలు వేల్చితేనే
యేపున యజ్ఞాలు సేసి యేచినంత ఫలము

చ. 2: కనకముపై కాదని పోదొబ్బితేనే
తనకు వేవేలు ఘోరతపముల ఫలము
వనితలమోహములవలఁ బడకుండితేనే
దినము గోటితీర్థాలు దిరిగినఫలము

చ. 3: శ్రీవేంకటేశ్వరు జేరి కొలుచుటే
ధావతిలేని యట్టితనజన్మ ఫలము
భావించి యాచార్యపాదపద్మమూలమే
సావధానమున సర్వశాస్త్రార్థఫలము

రేకు: 1988-03 మలహరిసం: 01-431 అధ్యాత్మ

పల్లవి: సహజాచారములెల్లా సర్వేశ్వరునియాజ్ఞే
అహమించి నమ్మకుండు టదియే పాషండము

చ. 1: నిద్దిరించువానిచేతి నిమ్మవంటివలెనే
చద్దికర్మములు తానే జారితే జారె
పొద్దువొద్దు తనలోన భోగకాంక్ష లుండఁగాను
అద్దలించి కర్మ మొల్లననుటే పాషండము

చ. 2: కలగన్నవాడు మేలుకనినటువలెనే
తలగి ప్రపంచ మెందో దాఁగితే దాగె
యిల నీదేహము మోఁచి యింతా గల్లలనుచు
పలికి తప్పనడచే భావమే పాషండము

చ. 3: ధర నద్దము చూచేటి తనరూపమువలె
గరిమతో దనయాత్మ కంటేఁ గనె
సరుస శ్రీవేంకటేశుసాకార మటు గని
కరఁగి భజించలేని కష్టమే పాషండము

రేకు: 1988-04 సామంతం సం: 01-432 శరణాగతి

పల్లవి: తెలియక వూరక తిరిగేము
చలమరి కగునా సంతతసుఖము

చ. 1: హేయము కడుపున నిడుకొని యింకా
చీ' యనని మాకు సిగ్గేది
పాయము పిడికిటఁ బట్టుచునుండేటి
కాయధారులకుఁ గలదా విరతి

చ. 2: అంగనల రతుల యాసలనీఁదేటి
యెంగిలిమనుజుల కగ్గేది
ముంగిట నార్గురుముచ్చులఁ గూడిన
దొంగగురుని కిందుల నిజమేది

చ. 3: జననమరణములు సరి గని కానని
మనుజాధమునకు మహిమేది
యెనగొని శ్రీవేంకటేశు శరణ మిటు
గని మనకుండిన గతి యిఁక నేది

రేకు: 1988-05 లలిత సం: 01-433 శరణాగతి

పల్లవి: హరి నీయనుమతో అది నాకర్మమో
పరమే యిహమై భ్రమయించీని

చ. 1: కలుగుదు శాంతము కటకట బుద్ధికి
చలమున నింతాఁ జదివినను
నిలువదు చిత్తము నీపై చింతకు
పలుసంపదలను బరగినను

చ. 2: తగులదు వైరాగ్యధన మాత్మకును
వొగి నుపవాసము లుండినను
అగపడదు ముక్తి అసలనాసల
జగమింతా సంచరించినను

చ. 3: విడువదు జన్మము వివేకముననే
జడిసి స్వతంత్రము జరపినను
యెడయక శ్రీవేంకటేశ్వర నీవే
బడిఁగాచితి విదె బ్రదికితి నేను

రేకు: 1988-06 సామంతం సం: 01-434 అధ్యాత్మ

పల్లవి: ఇందిరాధిపుని సేవ యేమరకుండుటగాక
బొందితోడిజీవులకు బుద్దు లేఁటిబుద్దులు

చ. 1: రేయెల్లా మింగిమింగి రేపే వెళ్లనుమియు
బాయట నిద్రాదేవి పలుమారును
చాయలకు నిచ్చనిచ్చా జచ్చిచచ్చి పొడమేటి-
మాయజీవులకునెల్లా మని కేఁటిమనికి

చ. 2: కనురెప్ప మూసితేనే కడు సిష్టే చీఁకటౌను
కనురెప్ప దెరచితే క్రమ్మర బుట్టు
ఘనమై నిమిషమందే కలిమి లేమియుఁ దోఁచె
యెనయుజీవుల కింక యెఱు కేఁటియెఱుక

చ. 3: వొప్పగుఁ బ్రాణము లవి వూరుపుగాలివెంట
యెప్పుడు లోనివెలికి నెడతాఁకును
అప్పుఁడు శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డందరికి
తప్పక యాతఁడే కాచు తలఁపేఁటి తలఁపు

రేకు: 1989-01 మలహరిసం: 01-435 వైరాగ్య చింత

పల్లవి: దేహ యీతగవు దీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా

చ. 1: తనువున బొడమినతతి నింద్రియములు
పొనిగి యెక్కడికిఁ బోవునయా
పెనఁగి తల్లికడ బిడ్డలు భువిలో
యెనగొని యెక్కడి కేఁగుదురయ్యా

చ. 2: పొదుగుచు మనమున బొడమినయాసలు
అదన నెక్కడికి నరుగునయా
వొదుగుచు జలములనుండు మత్స్యములు
పదపడి యేగతి బాసీనయ్యా

చ. 3: లలి నొకటొకటికి లంకెలు నివే
అలరుచు నేమని యందునయా
బలు శ్రీవేంకటపతి నాయాత్మనుఁ
గలిగితి వెక్కడి కలుషములయ్యా

రేకు: 1989-02 నాట సం: 01-436 నృసింహ

పల్లవి: నిక్కించీ గర్ణములు మానిసిమెకము
నిక్కపుఁ గరుణతో మానిసిమెకము

చ. 1: కొండ తనకు గద్దెగా గోరి కూచుండిన దదే
నిండురాజసమున మానిసిమెకము
గండుమీరి దానవునికండలు చెక్కుచు నూర్పు
నిండించీ నాకసము మానిసిమెకము

చ. 2: కరములు వేయింటాఁ గైకొని యాయుధములు
నిరతి జళిపించీ మానిసిమెకము
సురలను నసురల జూచిచూచి మెచ్చిమెచ్చి
నెరపీని నవ్వులు మానిసిమెకము

చ. 3: యెక్కించి తొడమీఁద నిందిరతో మేలమాడీ
నిక్కపుగాఁగిటను మానిసిమెకము
అక్కడ శ్రీవేంకటాద్రి నహోబలమునందు
నెక్కొని మమ్మేలెను మానిసిమెకము

రేకు: 1989-03 శుద్ధవసంతం సం: 01-437 అధ్యాత్మ

పల్లవి: అంతరంగమెల్లా శ్రీహరి కొప్పించకుండితే
వింతవింతవిధముల వీడునా బంధములు

చ. 1: మనుజుఁడై ఫలమేది మఱి జ్ఞానియౌదాఁక
తనువెత్తి ఫలమేది దయగలుగుదాఁక
ధనికుఁడై ఫలమేది ధర్మము సేయుదాఁకా
పనిమాలి ముదిసితే పాసెనా భవము

చ. 2: చదివియు ఫలమేది శాంతముగలుగుదాఁకా
పెదవెత్తి ఫలమేది ప్రియమాడుదాఁకను
మదిగల్గి ఫలమేది మాధవుఁ దలఁచుదాఁకా
యెదుట తారాజై తే నేలెనా పరము

చ. 3: పావనుఁడై ఫలమేది భక్తిగలిగినదాఁకా
జీవించేటిఫలమేది చింతదీరుదాఁకను
వేవేల ఫలమేది శ్రీవేంకటేశుఁ గన్నదాఁకా
భావించి తా దేవుఁడై తేఁ బ్రత్యక్షమవునా

రేకు: 1989-04 సామంతం సం: 01-438 వేంకటేశ్వరౌషధము

పల్లవి: ఆపద్బంధుఁడు హరి మాకుఁ గలఁడు
దూపలి తలఁచినా దోషహరము

చ. 1: గరుడనినెక్కినఘనరేవంతుఁడు
గరుడ కేతనముగలరథుఁడు
గరుడఁడే తనకును గరియగుబాణము
గరిమె నీతఁడేపో ఘనగారుడము

చ. 2: పాముపరపుపై బండినసిద్ధుడు
పాముపాశముల పరిహరము
పామున నమృతముఁ పడఁదచ్చినతఁడు
వేమరు నీతఁడే విషహరము

చ. 3: కమలాక్షుఁ డీతఁడు కమలనాభుఁడును
కమలాదేవికిఁ గైవశము
అమరిన శ్రీవేంకటాధిపు డితఁడే
మమతల మాకిదే మంత్రౌషధము

రేకు: 1989-05 లలిత సం: 01-439 శరణాగతి

పల్లవి: ఇరవగువారికి యిహపర మిదియే
హరిసేవే సర్వాత్మలకు

చ. 1: దురితమోచనము దుఃఖపరిహరము
హరినామమెపో ఆత్మలకు
పరమపదంబును భవనిరుహరణము
పరమాత్ముచింతే ప్రపన్నులకు

చ. 2: సారము ధనములు సంతోషకరములు
శౌరికథలు సంసారులకు
కోరినకోర్కియు కొంగుబంగరువు
సారె విష్ణుదాస్యము లోకులకు

చ. 3: యిచ్చయగుసుఖము యిరవగుపట్టము
అచ్చుతుకృప మోక్షార్థులకు
అచ్చపు శ్రీవేంకటాధిపు శరణము
రచ్చల మాపాలిరాజ్యపు సుగతి

రేకు: 1989-06 బౌళి సం: 01-440 అధ్యాత్మ

పల్లవి: పెరుగఁబెరుగఁ బెద్దలుగాఁగా పెనువెట్టి వట్టుబుద్ధెఱిఁగితే
మరులు మఱచితేనే యిన్నిటి గెలిచే మర్మము సుండీ జ్ఞానులకు

చ. 1: జననమందినయప్పుడు దేహి సన్యాసికంటే నిరాభారి
తనరఁ గొపీన కటిసూత్రముల తగులములేనిది గంబరి
తనుఁదా నెఱఁగడుయెదిరినెఱఁగఁడు తత్వధ్యానాలయనిర్మలచిత్తుఁడు
పెనఁగేకోరిక యించుకంత లేదు పేరులేనివాడు వీడువోయమ్మా

చ. 2: నిద్దురవొయ్యేటి యప్పుడుదేహి నిత్యవిరక్తునివంటిఘనుఁడు
బుద్ధి సంసారముపై నించుకా లేదు భోగమేమీ నొల్లఁడు
వొద్దనే యేపనులకుఁ జేయఁబోఁడు వున్నలంపటాల కేమియుఁ జొరఁడు
కొద్దిలేనియాస యెందువోయనొకో కోపమేమి లేదు వీఁడివో యమ్మా

చ. 3: హరి శరణన్న యప్పుడు దేహి అమరులకంటే కడునధికుఁడు
పరమునిహము నఱచేతిదే ప్రయాస మించుక లేదు
దురితము లేదు దుఃఖములు లేవు తోడనే వైకుంఠ మెదురుగా వచ్చు
గరిమ శ్రీవేంకటేశుఁడు వీఁడివో కానరైరిగా యిన్నాళ్లమ్మా

రేకు: 1990-01 సాళంగం సం: 01-441 భక్తి

పల్లవి: ఉన్నవిచారములేల వోవో సంసారులాల
యిన్నిటి కితఁడే రక్ష యిదే మీకు మనరో

చ. 1: తక్కక బ్రహ్మఁగన్న తండ్రిఁ గొలిచి మీరు
యెక్కువ సంతతిగల్గి యీడేరరో
అక్కున లక్ష్మీనారాయణులఁ దలఁచి మీరు
చొక్కి మీమీదంపతులు సుఖమున నుండరో

చ. 2: భవరోగవైద్యుని పాదములు సేవించి
భువి రోగములఁ బాసి పొదలరో
తవిలి పదిదిక్కులు తానైన వానిఁ
గవిసి పొగడి దిక్కు గలిగి బ్రదుకరో

చ. 3: తల్లిదండ్రి నీతఁడే తగఁ జుట్ట మీతఁడే
యెల్లగాఁ బుట్టించి పెంచేయేలి కీతఁడే
చల్లగా శ్రీవేంకటేశు శరణంటి మిదె మేము
కొల్లగా మీరెల్లా మమ్ము గుటిగా వర్ధిల్లరో

రేకు: 1990-02 మలహరిసం: 01-442 వైష్ణవ భక్తి

పల్లవి: కలిగినది యొక్కటే కమలాపతిసేవ
తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికేను

చ. 1: హరియే పరతత్వ మతఁడొక్కఁడే గతి
ధరలోన దేవతలెందరైనాఁ గలుగనీ
మురహరనామము ముంచి యొక్కటే యొక్కుడు
యిరవైనమంత్రము లెన్నియైనా నుండనీ

చ. 2: గోవిందుదాసులే పెక్కువఘను లిందరిలో
వేవేలు పెద్ద లటు వేలసంఖ్య లుండనీ
కైవసపువిష్ణుకైంకర్యమే సాధనము
యీవలనావల పుణ్య మెంతైనాఁ గలుగనీ

చ. 3: పట్టినశ్రీవేంకటేశుభక్తి యొక్కటే ఘనము
యిట్టే శాస్త్రజ్ఞాన మెట్లున్నాను
వొట్టిన యాతని ముద్ర లొక్కటికి మూలము
యెట్టిలాంఛనము లిల నెన్నియైనా నుండనీ

రేకు: 1990-03 సామంతం సం: 01-443 నృసింహ

పల్లవి: కంటి నిదే యర్థము ఘనశాస్త్రములు దవ్వి
నంటున నిందుకంటెను నాణె మెందూ లేదు

చ. 1: మేఁటివైరాగ్యముకంటే మిక్కిలి లాభము లేదు
గాఁటపువిజ్ఞానముకంటే సుఖము లేదు
మీఁటైనగురువుకంటే మీఁద రక్షకుఁడు లేఁడు
బాటసంసారముకంటే పగ లేదు

చ. 2: పరపీడ సేయుకంటే పాపము మరెందు లేదు
పరోపకారముకంటే బహుపుణ్యము లేదు
నిరతశాంతముకంటే నిజధర్మ మెందు లేదు
హరిదాసుడౌకంటే నట గతి లేదు

చ. 3: కర్మసంగము మానుకంటే దేజము లేదు
అర్మిలిఁ గోరికమానేయంతకంటే బుద్ధి లేదు
ధర్మపుశ్రీవేంకటేశుఁ దగిలి శరణుచొచ్చి
నిర్మలాన నుండుకంటే నిశ్చయము లేదు

రేకు: 1990-04 గుజ్జరి సం: 01-444 వైష్ణవ భక్తి

పల్లవి: ఆతనినే నే కొలిచి నే నందితిఁ బో నిజసుఖము
శ్రీతరుణీపతి మాయాధవుఁడు సృష్టియింతయును హరిమూలము

చ. 1: కోరుదుమా దుఃఖములు కోర కేతెంచు తముఁదామే
ఆరీతులనే సుఖములు యేతెంచు నందును విచారమంతేల
సారేకు దైవాధీనములివి రెండు స్వయత్నములుగా వెవ్వరికి
కోరేటి దొకటే హరిశరణాగతి గోవిందుఁడే యింతకు మూలము

చ. 2: కమ్మంటిమా ప్రపంచము గలిగీ స్వభావము అందుకది
యిమ్ముల మోక్షము యీరీతులనే యీశ్వరుఁడిచ్చిన యిది గలుగు
కమ్మి అంతర్యామికల్పితంబు లివి కాదననవుననరాదెవ్వరికి
సమ్మతించి ఆసపడియెడి దొకటే సర్వలోకపతి నిజదాస్యము

చ. 3: సరి నెఱఁగుదుమా పోయినజన్మము సారేకు నేమేమిచేసితిమా
యిరవుగ నట్లా మీదఁటిజన్మముయెఱుకలు మఱపులు యిఁకనేలా
నిరతమై శ్రీవేంకటేశుఁడు తనయిచ్చ నిర్మించిన దిదియీదేహము
గరిమెల నాతనికైంకర్యమెపో కలకాలము మాకు కాణాచి

రేకు: 1990-05 గుజ్జరి సం: 01-445 అధ్యాత్మ

పల్లవి: దైవమ నీవే గతి మాతప్పులు పనిలేదు
శ్రీవల్లభుడవు నీవే చేకొని కావఁగదే

చ. 1: జనని నీమాయా జనకుఁడవు నీవు
జనులము నేమిందర మొకసంతతిబిడ్డలము
వొనరెడి దినభోగములు వూరేటిచనుబాలు
మునుకొను మానడవళ్లివి ముద్దులు మీ కివివో

చ. 2: ధర బశుపక్షిమృగాదులు తగ తోఁబుట్టుగులు
వురుటగు మాదేహంబులు వుయ్యలతొట్టెలలు
మరిగినసంసారము బొమ్మరిండ్లయాట లివి
నిరతి మాయజ్ఞానంబు నీకు నవ్వులయ్యా

చ. 3: చావులుఁ బుట్టుగు లాడెడిసరి దాగిలిముచ్చిములు
భావపుటారంభంబులు బాలలీలగతులు
కైవశమందఁగ శ్రీవేంకటపతి నీదాస్యం బిది
మావంటివారికెల్లను నీమన్ననలాలనలు

రేకు: 1990-06 పాడి సం: 01-446 గురు వందన, నృసింహ

పల్లవి: మఱియు మఱియు నివె మాపనులు
మెఱసితి మిందే మిక్కిలిని

చ. 1: నారాయణునకు నమస్కారము
ధారుణీపతికిని దండము
శ్రీరమణునకును జేరి శరణ్యము
వారిధిశాయికి వరుస జోహారు

చ. 2: రామకృష్ణులకు రచనలబంటను
దామోదరునకు దాసుఁడను
వామనమూర్తికి వాకిటిగొల్లను
సోమర్కనేత్రునిసారిదిలెంకను

చ. 3: గోవిందునికే కొలువులు సేతుము
దేవొ త్తముబడిఁ దిరుగుదుము
భావజగురునకు పంపునడతుము
శ్రీ వేంకటపతి సేవింతుము

రేకు: 1991-01 శ్రీరాగం సం: 01-447 ఉపమానములు

పల్లవి: తప్పుఁ దోయవే దైవశిఖామణి
యిప్పుడు నీకృప నెనసితి నేను

చ. 1: అనలముఁ బొడగని యటునిటు మిడుతలు
కినిసి యందు మగ్గినయట్లు
అనువగువిజ్ఞాన మాత్మ వెలుఁగఁగ
మొనసి యింద్రియములు మూఁగీ నాకు

చ. 2: అటిముటేఁ గమలము లటు వికసించిన
మెటిసి తుమ్మిదలు మించుగతి
తటి నాహృదయము తగవికసించిన
తటిమీ నజ్ఞానతమ మది నాకు

చ. 3: యీరీతి శ్రీవేంకటేశ్వర యిన్నియు
నూరకే యుండఁగా నొదిఁగియుండె
నేరిచి నీభక్తి నిలుపఁగ మదిలో
చేర గతిలేక చిమిడీ నదివో

రేకు: 1991-02 రామక్రియ సం: 01-448 మంగళ హారతులు

పల్లవి: మరలి మరలి జయమంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము

చ. 1: కమలారమణికి గమలాక్షునకును
మమతల జయజయమంగళము
అమరజననికిని అమరవంద్యునకు
సుముహర్తముతో శుభమంగళము

చ. 2: జలధికన్యకును జలధిశాయికిని
మలయుచును శుభంమంగళము
కలిమికాంత కాకలికివిభునికిని
సుళువులయారతి శుభమంగళము

చ. 3: చిత్త జాతల్లికి శ్రీవేంకటపతికి
మత్తిల్లినజయం మంగళము
యిత్తలనత్తల యిరువురకాఁగిటి
జొత్తులరతులకు శుభమంగళము

రేకు: 1991-03 మాళవిగౌళ సం: 01-449 అధ్యాత్మ

పల్లవి: చదువులోనే హరిని జట్టిగొనవలెఁగాక
మదముగప్పినమీద మగుడ నది గలదా

చ. 1: జడమతికి సహజమే సంసాయాతన యిది
కడు నిందులోఁ బరము గడియించవలెఁగాక
తొడరి గాలప్పుడు తూర్పెత్తక తాను
విడిచి మఱచిన వెనక వెదకితేఁ గలదా

చ. 2: భవబంధునకు విధిపాపపుణ్యపులంకె
తివిరి యిందునే తెలివి తెలుసుకోవలెఁగాక
అవల వెన్నెలోనె అల్లు నేరేళ్లింతే
నివిరి నిన్నటివునికి నేఁటికిఁ గలదా

చ. 3: దేహధారికిఁ గలదే తెగనియింద్రియబాధ
సాహసంబున భక్తి సాధించవలెఁగాక
యీహలను శ్రీవేంకటేశుదాసులవలన
వూహించి గతిగానక వొదిఁగితేఁ గలదా

రేకు: 1991-04 లలిత సం: 01-450 వైరాగ్య చింత

పల్లవి: కలది గలట్టే కర్మఫలంబులు
నిలిపతిమా నేము నిమ్మకు బులుసు

చ. 1: యెంత సేసినా యిహమున జీవికి
చెంత నజుఁడు వ్రాసిన కొలఁదే
వంతల ముంటికి వాఁడి వెట్టితిమా
కొంతతీపు చెఱకుకుఁ జల్లితిమా

చ. 2: ఘనముగ బుద్ధులు గఱపిన దేహికి
మును నోఁచిన నోముఫలంటే
నినుపుఁ దెంకాయకు నీరు నించితిమా
వొనర వేమునఁ జేఁదు నిచితిమా

చ. 3: యిరవుగ శ్రీవేంకటేశుఁడే ప్రాణికి
కెరలి భాగ్య మొసఁగినయంతే
మరువమునకు బరిమళము సేసితిమా
పెరిగేటి యడవులు పెంచితిమా

రేకు: 1991-05 లలిత సం: 01-451 వైరాగ్య చింత

పల్లవి: వెలుపలెల్ల తనలోనుగాక తను విడువదువెడమాయా
నలువున యోగీంద్రులెల్ల మునునడచినమార్గంబు

చ. 1: జీవము నిర్జీవముగాక సిద్ధించదు పరము
వావులెల్ల నొకవావిగాక మఱీ వదలదు ప్రపంచము
భావంబెల్ల నభావముగాక పాయదు కర్మంబు
దైవజ్ఞులు మును నడచి రిదియపో తప్పనిమార్గంబు

చ. 2: మాటలెల్లఁ గడమాటలుగాక మాయదు మలినంబు
కూటంబులు కాలకూటంబుగాక కొనకెక్కదు భవము
చాటుఁదృష్ణ లగచాటునఁబడక చాలదు సౌఖ్యంబు
తేటగా మును పెద్ద లివియపో తేర్చినమార్గంబు

చ. 3: గుణములెల్ల నిర్గుణముగాక తలకూడదు శాంతంబు
అనువున కనువై అంతయుఁ దాగాక ఆనందము లేదు
ప్రణుతింపఁగ శ్రీవేంకటరమణుని బహుళమహిమెల్లా
గణనకెక్కఁగా పురాతనులు మును కడకట్టినమతము

రేకు: 1991-06 గౌళ సం: 01-452 వైరాగ్య చింత

పల్లవి: రెండుమూలికలు రేయిఁబగలు నున్నవి
అండదేహమం దొకటి అతుమలో నొకటి

చ. 1: యిదివో రసబద్ధము యింద్రియములు మేనిలో
పదిలముగా నిలిపి బంధించుట
అదివో వేధాముఖ, మంతరంగపుమనసు
చెదరకుండాఁ జొనిపి శ్రీహరిఁదలఁచుట

చ. 2: తారవిద్య గంటిమి తగిలి నాసాగ్రమందు
మేరతో ద్రిష్టినిలిపి మేలుఁబొందుట
చేరువ సువర్ణవిద్య, చిత్తములోఁ బ్రణవము
ధీరత నాదము సేసిఁ దేవునిఁ బొగడుట

చ. 3: పుటజయమాయ నిట్టె పుణ్యపాపము లందులో
కుటిలపుఁగోరికల కొన దుంచుట
యిటులనే శ్రీవేంకటేశుఁ డిందిరయును
అటు ప్రకృతిపురుషులనుటొరవచ్చుట

రేకు: 1992-01 నాట సం: 01-453 నృసింహ

పల్లవి: నవనారసింహ నమో నమో
భవనాశితీర యహోబలనారసింహ

చ. 1: సతతప్రతాపరౌద్రజ్వాలానారసింహ
వితతవీరసింహవిదారాణా
అతిశయకరుణ యోగానంద నరసింహ
మతి శాంతపు కానుగుమాని నారసింహ

చ. 2: మరలి బీభత్సపుమట్టెమళ్ల నరసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నరసింహ
సిరుల నద్భుతపు లక్ష్మీ నారసింహ

చ. 3: వదనభయానకపు వరాహ నరసింహ
చెదరని వైభవాల శ్రీనరసింహ
అదన శ్రీవేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలురూపముల బహునారసింహ

రేకు: 1992-02 శంకరాభరణం సం: 01-454 దశావతారములు

పల్లవి: అంగనలాల మనచే నాడించుకొనెఁగాని
సంగతెఱిఁగిన నెరజాణఁ డితఁడే

చ. 1: వొడలులేనివాని కొక్కఁడే తండ్రాయఁగాని
తడయక పురుషోత్తముఁ డితఁడే
బడబాగ్ని జలధికిఁ బాయకల్లుఁడాయఁగాని
వెడలించె నమృతము విష్ణుఁ డితడే

చ. 2: పులిగూడుదిన్న వానిపొం దొక్కటే సేసెఁగాని
నలువంక లక్ష్మీనాథుఁ డితఁడే
చలికిఁ గోవరివానిసరుస బావాయఁగాని
పలుదేవతలకెల్ల ప్రాణబంధుఁ డితఁడే

చ. 3: యెక్కడో గొల్లసతుల కింటిమగఁడాయఁగాని
తక్కక వెదకే పరతత్వ మితఁడే
మిక్కిలి శ్రీవేంకటాద్రిమీఁద మమ్ము నేలెఁగాని
తక్కక వేదము చెప్పే దైవమీతఁడే

రేకు: 1992-03 లలిత సం: 01-455 వేంకటగానం

పల్లవి: నీ వేలికవు మాకు నీదాసులము నేము
ఆవల నితరుల నే మడుగఁబొయ్యేమా

చ. 1: పసురమై వుండి యిచ్చీఁ బక్కన గామధేనువు
యెసఁగి మ్రానై వుండి యిచ్చీఁ గల్పవృక్షము
వెస రాయైవుండి యిచ్చీ వేడుకఁ జింతామణి
మసలనిశ్రీపతివి మాకు నిచ్చే దరుదా

చ. 2: గాలి యావటించి యిచ్చీఁ గారుమేఘము మింట
వీలి జీర్ణమై యిచ్చీ విక్రమార్కునిబొంత
కాలినపెంచై వుండి కప్పెర దివ్యాన్నమిచ్చీ
మైలలేనిశ్రీపతివి మాకు నిచ్చు టరుదా

చ. 3: అండనే కామధేనువ వాశ్రితచింతామణివి
పైండినకల్పకమవు భక్తులకెల్లా
నిండిన శ్రీవేంకటేశ నీవు మమ్ము నేలితివి
దండిగా నమ్మితే నీవు దయఁజూచు టరుదా

రేకు: 1992-04 ముఖారి సం: 01-456 అధ్యాత్మ

పల్లవి: అక్కరకొదగనియట్టియర్థము
లెక్క లెన్నియైనా నేమి లేకున్న నేమిరే

చ. 1: దండితోఁ దనకుఁ గాని ధరణిశు రాజ్యంబు
యెండెనేమి యది పండెనేమిరే
బెండుపడఁ గేశవునిఁ బేరుకొననినాలికె
వుండెనేమి వుండకుండెనేమిరే

చ. 2: యెదిరిఁ దన్నుఁ గానని యెడపుల గుడ్డికన్ను
మొదలఁ దెఱచెనేమి మూసెనేమిరే
వెదకి శ్రీపతిసేవ వేడుకఁ జేయనివాఁడు
చదివెనేమి చదువు చాలించెనేమిరే

చ. 3: ఆవల నెవ్వరులేనిఆడవిలోనివెన్నెల
కావిరిఁ గాసెనేమి కాయకున్న నేమిరే
శ్రీవేంకటేశ్వరుఁ జేరనిధర్మములెల్ల
తోవల నుండెనేమి తొలఁగెనేమిరే

రేకు: 1992-05 లలిత సం: 01-457 అంత్యప్రాస

పల్లవి: పట్టినదెల్లా బ్రహ్మము
దట్టపుజడునికి దైవంబేలా

చ. 1: ఘనయాచకునకు కనకమే బ్రహ్మము
తనువే బ్రహ్మము తరువలికి
యెనయఁ గాముకున కింతులే బ్రహ్మము
తనలో వెలిఁగేటి తత్వం బేలా

చ. 2: ఆకటివారికి నన్నమే బ్రహ్మము
లోకమే బ్రహ్మము లోలునికి
కైకొని కర్మికి కాలమే బ్రహ్మము
శ్రీకాంతునిపై జింతది యేలా

చ. 3: భువి సంసారికి పుత్రులె బ్రహ్మము
నవ మిందరి కిది నడచేది
యివలను శ్రీవేంకటేశు దాసులకు
భవ మతనికృపే బ్రహ్మము

రేకు: 1992-06 గుండక్రియ సం: 01-458 అధ్యాత్మ

పల్లవి: రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్నచోటఁ దానుండ దదివో

చ. 1: వొకరి రాజుఁజేసు నొకరి బంటుగఁ జేసు
వొకరి కన్నెకల వేరొకరికి నమ్మించు
వొకచోటనున్న ధాన్య మొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము

చ. 2: కొందరిజాళెలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరికి పుణ్యులఁజేసుఁ గొందరి పాపులఁజేసు
కొందరికొందరిలోన కొట్లాట వెట్టించు
పందెమాడినటువలెఁ బచరించు పసిఁడీ

చ. 3: నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశు తరుణియై తా నుండు
తెగనిమాయై యుండు దిక్కు దెసయై యుండు
నగుతా మాపాల నుండి నటియించు బసిఁడీ

రేకు: 1993-01 గుండక్రియ సం: 01-459 వైరాగ్య చింత

పల్లవి: నే నేమి సేయుదును నీవు నాలోపలనుండి
శ్రీనాథుడవు నీచేత లింతేకాక

చ. 1: తనువేమిసేయును తనువులోపలనున్న-
చెనఁటియింద్రియములచేతఁలుగాక
మనసేమిసేయును మనసులోపలనున్న-
నినుపుఁ గోర్కులు చేసే నేరములుగాక

చ. 2: జీవుఁడేమి సేయును జీవునిఁ బొదుగుకున్న
భావపుప్రకృతి చేసేపాపముగాక
చేవదేరఁ బుట్టు వేమిసేయు ముంచుకొన్నట్టి-
దైవపుమాయలోనిధర్మ మింతేకాక

చ. 3: కాలమేమిసేయును గక్కన శ్రీవేంకటేశుఁ -
డేలి మన్నించేమన్నన యిదియేకాక
యేల యేల దూర నింక నెవ్వరు నేమిసేతురు
మేలిమి నినుఁ దలఁచి మెచ్చుటేకాక

రేకు: 1993-02 బౌళి సం: 01-460 దశావతారములు

పల్లవి: పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువ కిందరిఁ గాచు వెడబోయ నాయఁడు

చ. 1: పొలసి మీసాల పెద్దబోయ నాయఁడు
మలిగి వీఁపునఁ గట్టేమంకుబోయ నాయఁడు
పొలమురాజై తిరిగేబోయ నాయఁడు
వెలయ మోటుననుండేవేఁటబోయ నాయఁడు

చ. 2: పొట్టిపొట్టియడుగులబోయ నాయఁడు యెందు
బుట్టుపగసాధించేబోయ నాయఁడు
బొట్టులమెకమునేసేబోయ నాయఁడు
పట్టపునెమలిచుంగబలుబోయ నాయఁడు

చ. 3: పొంచి శిగ్గెగ్గెఱగనిబోయ నాయఁడు
మించి రాలమీఁదదాఁటేమొండుబోయ నాయఁడు
అంచెల శ్రీవేంకటేశుడనేబోయ నాయఁడు
పంచఁ గాలవేలములబలుబోయ నాయఁడు

రేకు: 1993-03 ముఖారి సం: 01-461 నామ సంకీర్తన

పల్లవి: వెడమంత్ర మిఁకనేల వేరువెల్లంకులు నేల
పుడమిధరుఁడు మాఁకు భువనౌషధము

చ. 1: హరి యచ్యుతాయంటే నణఁగుఁ బాపములు
నరసింహ యనియంటే నాఁటినదుఃఖములు మాను
పురుషోత్తమాయంటేఁ బుండ్లు బూచులు మాను
పరమౌషధ మీతఁడే పాటింప మాకు

చ. 2: వాసుదేవ యనియంటే వదలు బంధములెల్లా
వాసికి గృష్ణాయంటే వంతలరోగాలు మాను
శ్రీసతీశ యనియంటే చింతలిన్నియును మాను
గాసిదీర నితడేపో ఘనదివ్యౌషధము

చ. 3: గోవిందా యనియంటేఁ గూడును సంపదలు
యీవల మాధవయంటే నిహముఁ బరముఁ జేరు
దేవ నారాయణయంటే దేహము సుఖియై యుండు
శ్రీవేంకటేశుఁడే మాకు సిద్ధౌషధము

రేకు: 1993-04 రామక్రియ సం: 01-462 అంత్యప్రాస

పల్లవి: మహి నింతటివారువో మనవారు
బహుమహిమలవారు ప్రపన్నులు

చ. 1: జయమంది జననపుజరామరణముల-
భయములేనివారు ప్రపన్నులు
క్రియలెల్ల నుడిగి మూఁగినకర్మపుటడవి
బయలుచేసినవారు ప్రపన్నులు

చ. 2: ధీరులై మాయంధకారంబు నెదిరించి
పారఁదోలినవారు ప్రపన్నులు
సారమయ్యినసంసారసాగరము
పారముగన్నవారు ప్రపన్నులు

చ. 3: అండ నిన్నిటాయఁ దనిసి యాసలెల్లాఁ దెగఁగోసి
పండినమనసువారు ప్రపన్నులు
దండిగా శ్రీవేంకటేశుదాసులై పరముతోవ
బండిబాట చేసినారు ప్రపన్నులు

రేకు: 1993-05 దేవగాంధారి సం: 01-463 వైష్ణవ భక్తి

పల్లవి: సర్వజ్ఞత్వము వెదకగనొల్లను సందేహింపగనొల్లను
సర్వజ్ఞుండును నాచార్యుండే సర్వశేషమే నాజీవనము

చ. 1: యెఱఁగఁగనొల్లము విజ్ఞానపుగతి యెఱుకలు నే మిటుసోదించి
యెఱిఁగి యితరులను బోధించెదమను యీపెద్దరికము నొల్లము
యెఱిఁగేటివాడును యాచార్యుండే యెఱుకయుసర్వేశ్వరుఁడే
యెఱుకయు మఱపును మానివుండుటే యిదియేపో మావిజ్ఞానము

చ. 2: చదువఁగనొల్లము సకలశాస్త్రములు సారెకుసారెకు సోదించి
చదివి పరులతో యుక్తివాదములు జగడము గెలువగనొల్లము
చదివేటివాఁడును నాచార్యుండే చదువును నాయంతర్యామే
చదువుకుఁ జదువమికియు దొలఁగుటే నానాసాత్వికభావమే నాతెలివి

చ. 3: అన్నిటికిని నే నధికారిననెడియహంకారము నొల్లను
కన్నులజూచుచు నందరితో నేఁ గాదని తొలఁగానొల్లను
మన్నన శ్రీవేంకటేశ్వరుకరుణను మాయాచార్యుఁడే అధికారి
వున్నరీతినే అస్తినాస్తులకు నూరకుండుటే నాతలఁపు

రేకు: 1993-06 బౌళి సం: 01-464 వైరాగ్య చింత

పల్లవి: ఇందిరానాథుఁ డిన్నిటి కీతఁ డింతే
బందెలకర్మములాల పట్టుకురో మమ్మును

చ. 1: యెఱిఁగిసేసినవెల్లా నీతనిమహిమలే
యెఱఁగక చేసినది యీతనిమాయే
తెఱఁగొప్ప రెంటికిని తెడ్డువంటివాఁడ నింతే
పఱచుఁగర్మములాల పట్టకురో మమ్మును

చ. 2: కాయములోపలివాఁడు ఘనుఁ డొక్కఁ డితఁడే
కాయ మీతనిప్రకృతికల్పిత మింతే
తోయరాక రెంటికిని తోడునీడైతి నింతే
బాయటికర్మములాల పట్టకురో మమ్మును

చ. 3: యేలినవాఁడు శ్రీవేంకటేశుఁ డితఁ డొక్కఁడింతే
యేలికసానై పెంచేది యీతనిసతే
సోలి నే వీరిఁ గొలిచేతసూత్రపుబొమ్మ నింతే
పాలుపుగర్మములాల పట్టకురో మమ్మును

రేకు: 1994-01 కన్నడగౌళ సం: 01-465 వైరాగ్య చింత

పల్లవి: బోధకు లెవ్వరు లేక భోగినైతిని
శ్రీధరుఁడే మాకు దిక్కు చింతింప నిఁకను

చ. 1: పట్టి దిగంబరినై పాలే యాహారముచేసి
తొట్టినపంచేంద్రియములతోప విడిచి
పుట్టితి సన్యాసినై బుద్దెఱిఁగినెఱఁగక
అట్టె నడుమ సంసారినైతి నేనూ

చ. 2: గచ్చుల నన్నీ మఱచి గాలే ఆవటించుకొని
అచ్చపుఁబరమయేకాంతసమాధి
నిచ్చలు నిద్రాభ్యాసనిర్మలయోగినైతి
కచ్చుపెట్టి మేలుకొని ఘనకర్మినైతి

చ. 3: భావము పారవిడిచి బ్రహ్మాండమెల్ల నిండి
వేవేలు గోరికల వేడుకతోడ
జీవన్ముక్తుఁడనైతి శ్రీవేంకటేశ్వరుఁ జేరి
ధావతు లిన్నియు మాని తన్మయుఁడనైతి

రేకు: 1994-02 భైరవి సం: 01-466 శరణాగతి

పల్లవి: మొదలుండఁ గొనలకు మోచి నీళ్ళువోయనేల
యెదలో నీవుండగా నితరములేలా

చ. 1: నిగమమార్గముననే నడచేనంటే
నిగమములెల్లను నీమహిమే
జగములోకులఁ జూచి జరగెదనంటే
జగములు నీమాయజనకములు

చ. 2: మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండేనంటే
మనసుకోరికలు నీమతకాలు
తనువు నింద్రియములు తగ గెలిచేనంటే
తనువు నింద్రియములు దైవమ నీమహిమ

చ. 3: యింతలోనిపనికిఁగా యిందు నందుఁ జొరనేల
చెంత నిండుచెరువుండ చెలమలేలా
పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి
సంతకూటాలధర్మపుసంగతి నాకేలా

రేకు: 1994-03 బౌళి సం: 01-467 వైరాగ్య చింత

పల్లవి: ఛీఛీ వోబదుకా సిగ్గులేనిబదుకా
వాచవికి బతిమాలి వడఁ బడ్డబదుకా

చ. 1: ఆసలకుఁ జోటు గడ్డు అంతరంగాన నెంతైన
వీసమంతాఁ జోటు లేదు విరతికీని
యీసున సంసారమున కెందరైనాఁ గలరు
వోసరించి మోక్షమియ్య నొకరు లేరు

చ. 2: భోగించ వేళ గడ్డు పొద్దువొడపుఁగుంకును
వేగమే హరిఁదలచ వేళలేదు
వోగులలంపటమున కోపి కెంతైనాఁ గద్దు
యోగపుసత్కర్మాన కొకయింత లేదు

చ. 3: యెదుట ప్రపంచాన కెఱు కెంతైనాఁ గద్దు
యిదివో యాత్మజ్ఞాన మించుకా లేదు
మది శ్రీవేంకటేశుఁడు మమ్ము నిట్టె కాచెఁగాని
ఎదరి నానేరములు పాప మఱి లేరు

రేకు: 1994-04 దేసాక్షి సం: 01-468 వేంకటేశ్వరౌషధము

పల్లవి: సకలజీవులకెల్ల సంజీవి యీమందు
వెకలులై యిందరు సేవించరో యీమందు

చ. 1: మూఁడులోకము లొక్కట ముంచి పెరిగినది
పోఁడిమి నల్లవికాంతిఁ బొదలినది
పేఁడుక కొమ్ములు నాల్గు పెనచి చేయివారినది
నాఁడే శేషగిరిమీద నాఁటుకొన్నమందు

చ. 2: పడిగెలు వేయింటిపాము గాచుకున్నది
కడువేదశాస్త్రముల గబ్బు వేసేది
యెడయక వొకకాంత యెక్కువ వుండినది
కడలేనియంజనాద్రిగారుడపుమందు

చ. 3: బలుశంఖుజక్రములబదనికె లున్నది
తలఁచినవారికెల్లఁ దత్వమైనది
అలరినబ్రహ్మరుద్రాదులఁ బుట్టించినది
వెలుఁగుతోడుత శ్రీవేంకటాద్రిమందు

రేకు: 1994-05 గుండక్రియ సం: 01-469 వైరాగ్య చింత

పల్లవి: ముందటిజన్మములెల్లా ముంచెఁ బారుబడివడ్డి
యెందు చొచ్చినానుఁ బోనియ్య దీరుణము

చ. 1: నుదుట వ్రాసినవ్రాలు నూరేండ్లపత్రము
పొదలు నాకర్మమే పూఁటకాఁపు
వెదకి సంసారము వెంటఁ బైతరవు
యిది యెందుచొచ్చినాఁ బోనియ్య దీరుణము

చ. 2: పుట్టినప్పుడే తనువు భోగ్యమై నిలిచెను
జట్టిఁ గామినులపొందు సరియాఁకలు
నెట్టన యాహరములు నిచ్చినిచ్చ లంచాలు
దిట్టనై యెందు చొచ్చినాఁ దీర దీరుణము

చ. 3: యెక్కువైనశ్రీవేంకటేశుమఱఁగు చొచ్చి
తెక్కుతోడ సలిగెల దిరుగఁగను
అక్కరతో నప్పులెల్లా నవి మాకుఁ దామచ్చి
చిక్కి యెందు చొచ్చినాఁ జేరు నీరుణము

రేకు: 1994-06 దేసాళం సం: 01-470 ఉపమానములు

పల్లవి: అన్నిటికి గారణము హరియే ప్రపన్నులకు
పన్నినలోకులకెల్ల ప్రకృతి కారణము

చ. 1: తలఁపు గారణము తత్త్వవేత్తలకును
చలము గారణము సంసారులకును
ఫలము గారణము పరమవేదాంతులకు
కలిమి గారణము కర్మ్మలకును

చ. 2: తనయాత్మ గారణము తగినసుజ్ఞానులకు
తనువే కారణము తగ జంతువులకు
ఘనము క్తి గారణము కడగన్నవారికెల్లా
కనకమే కారణము కమ్మినబంధులకు

చ. 3: దేవుఁడు గారణము తెలిసినవారికెల్లా
జీవుడు గారణము చిల్లరమనుజులకు
దేవుడు వేరే కాఁడు దిక్కు శ్రీవేంకటేశుఁడే
పావన మాతనికృప పరమకారణము

రేకు: 1995-01 లలిత సం: 01-471 అంత్యప్రాస

పల్లవి: ఎక్కెఁగా రాఁగా రాఁగా యిందాఁకాఁ దగులు
యిక్కువ శ్రీహరిమాయ నింకనెంతో తగులు

చ. 1: తెగనికర్మమునకు దేహము దగులు
తగినదేహమునకు తరుణితో తగులు
సొగిసి యారెంటికి సుతు లొక్కతగులు
అగడాయఁ గనకము అన్నిటితో తగులు

చ. 2: యింతటిసంసారికి యిల్లొక్కతగులు
బంతికి నందు గలిగె పాఁడిపంట తగులు
చెంత నీలంపటానకు క్షేత్రము తగులు
సంతగూడేదాసదాసీజనులెల్లా దగులు

చ. 3: మొదల జీవుం డొక్కఁడే మోపులాయఁ దగులు
వదలనిబంధములు వడ్డివారెఁ దగులు
వుదుటిహముఁ బరము నొక్కయందె తగులు
అదె శ్రీవేంకటపతి యంతరాత్మ తగులు

రేకు: 1995-02 గుండక్రియ సం: 01-472 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరివాఁడో యెఱఁగరాదు
అవ్వలివ్వలిజీవుఁ డాటలో పతిమే

చ. 1: ధర జనించకతొలుత తనుఁ గానరాదు
మరణమందినవెనక మఱి కానరాదు
పురువడిదేహముతో నుండినయన్నాళ్లే
మరలుజీవునిబదుకు మాయవో చూడ

చ. 2: యిహములో భోగించు నిందుఁ గొన్నాళ్లు
మహిమ పరలోకమున మలయుఁ గొన్నాళ్లు
తహతహలఁ గర్మబంధములఁ దగిలినయపుడే
అహహ దేహికిఁ బదుచులాటవో బదుకు

చ. 3: సంతానరూపమై సాగు ముందరికి
కొంత వెనకటిఫలము గుడువఁ దాఁ దిరుగు
యింతటికి శ్రీవేంకటేశుఁడ డంతర్యామి
బంతి నితనిఁ గన్నదుకువో బదుకు

రేకు: 1995-03 శంకరాభరణం సం: 01-473 దశావతారములు

పల్లవి: ఎంత భక్తవత్సలుఁడ విట్టుండవలదా
వింతలు నీసుద్దులెల్లా వినఁబోతే నిట్టివే

చ. 1: యిల నసురారియనేయీబిరుదు చెల్లె నీకు
బలివిభీషణాదులపాలికే చెల్లదు
కెలసి అవులే నీవు గెలుతు వెందరినైనా
తలచి చూడ నీదాసుల కోడుదువు

చ. 2: యిందరిపాలిటికిని యీశ్వరుఁడ వేలికవు
పందవై యర్జునుబండిబంట వైతివి
వందనకు నౌలే దేవతలకే దొరవు
అందపునీదాసులకు నన్నిటా దాసుఁడవు

చ. 3: కడుపులో లోకముకన్న తండ్రి విన్నిటాను
కొడుకవు దేవకికిఁ గోరినంతనే
తడవితే వేదములు తగిలేబ్రహ్మమవు
విదువనిమాకైతే శ్రీవేంకటాద్రిపతివి

రేకు: 1995-04 సాళంగనాట సం: 01-474 రామ

పల్లవి: రాముఁడిదే లోకాభిరాముఁ డితఁడు
గోమున పరశురాముకోప మార్చెనటరే

చ. 1: యీతఁడా తాటకిఁ జించె యీపిన్నవాఁడా
ఆతల సుబాహుఁ గొట్టి యజ్ఞముఁ గాచె
చేతనే యీకొమరుఁడా శివునివిల్లు విఱిచె
సీతకమ్మఁ బెండ్లాడె చెప్పఁ గొత్త గదవె

చ. 2: మనకౌసల్యకొడుకా మాయమృగము నేసె
దనుజుల విరాధుని తానే చెఱిచె
తనుమాడె నేఁడుదాళ్లు తోడనే వాలి నడఁచె
యినకులుఁ డితఁడా యెంతకొత్త చూడరే

చ. 3: యీవయసుతానే యాయెక్కువజలధి గట్టి
రావణు జంపి సీత మరలఁ దెచ్చెను
శ్రీవేంకటేశుఁ డితఁడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేఁడు కంటి మిట్టె కదరే

రేకు: 1995-05 లలిత సం: 01-475 అధ్యాత్మ

పల్లవి: ఏమి సేసినా నీరుణ మెట్టు వాసును
కామితఫలద వోకరుణానిధి

చ. 1: చేరి కర్మములు నన్ను చెఱవట్టుకుండగాను
పేరువాడి వచ్చి విడిపించుకొంటివి
సారె తగవట్టై కాదా శక్తిగలవారెల్లా
నారయ దీనులఁ గంటే నడ్డమై కాతురు

చ. 2: అరులు పంచేంద్రియము లందు నిందుదియ్యఁగాను
వెరవుతోడ వెనక వేసుకొంటివి
పరగ నట్టేకాదా బలువులైనవారు
అరయఁ బేదలకైన ఆపద మానుతురు

చ. 3: పలుజన్మములే నన్ను పరి అరికట్టుకోఁగా
తొలగదోసి నాకు దోడైతివి
యెలమి శ్రీవేంకటేశ యిల శూరులైనవారు
బలుభయ మిందరికిఁ బాపుచుందురు

రేకు: 1995-06 ముఖారి సం: 01-476 ఉపమానములు

పల్లవి: దైవము పుట్టించినట్టి తన సహజమే కాక
కోవిదునికైనా జాలిగుణ మేల విడుచు

చ. 1: ఆరయఁ బంచదార నద్దుక తినఁబోతే
చేరరాని ముష్టిగింజ చేఁదేల మాను
సారమైన చదువులు సారె సారెఁ జదివినా
గోరపు దుష్టునికి కోపమేల మాను

చ. 2: నిప్పు దెచ్చి వొడిలోన నియమానఁ బెట్టుకొంటే
యెప్పుడును రాఁజుఁగాక యిది యేల మాను
ముప్పిరిఁ బాతకుఁడైన మూఢుఁడెన్ని యాచారాలు
తప్ప కెంతసేసినాను దయ యేల కలుగు

చ. 3: యింటిలోనఁ గొక్కు దెచ్చి యిరవుగఁ బెట్టుకొంటే
దంటయై గోడలు వడఁదవ్వ కేలమాను
గొంటరై శ్రీవేంకటేశుఁ గొలువకుండినవాఁడు
తొంటి సంసారవుఁగాక దొర యేఁటి కౌను

రేకు: 1996-01 నాట సం: 01-477 రామ

పల్లవి: ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని
విందువలె నొంటిమెట్ట వీరరఘురాముని

చ. 1: యెందు చొచ్చె బ్రహ్మవర మిల రావణుతలలు
కందువ రాఘవుఁడు ఖండించునాఁడు
ముందట జలధి యేమూల చొచ్చెఁ గొండలచే
గొందింబడఁ గట్టివేసి కోపగించేనాడు

చ. 2: యేడనుండె మహిమలు యిందరి కితఁడు వచ్చి
వేడుకతో హరివిల్లు విఱిచేనాఁడు
వోడక యింద్రాదు లెందు నొదిగి రీతనిబంటు
కూడ బట్టి సంజీవికొండ దెచ్చేనాఁడు

చ. 3: జముఁ డెక్కడికిఁ బోయ సరయువులో మోక్ష-
మమర జీవుల కిచ్చె నల్లనాఁడు
తెమలి వానరులై యీదేవతలే బంట్లైరి
తిమిరి శ్రీవేంకటపతికి నేఁడు నాఁడు

రేకు: 1996-02 శంకరాభరణం సం: 01-478 గోవిందరాజు

పల్లవి: ఆలవటపత్రశాయివైనరూప మిట్టిదని
కొలువై పొడచుపేవా గోవిందరాజా

చ. 1: పడఁతులిద్దరిమీద బాదములు చాఁచుకొని
వొడికపు రాజసాన నొత్తగిలి
కడలేని జనాభికమలమున బ్రహ్మను
కొడుకుఁగా గంటి విదె గోవిందరాజా

చ. 2: సిరులసొమ్ములతోడ శేషునిపైఁ బవళించి
సొరిది దాసులఁ గృపఁ జూచుకొంటాను
పరగుదైత్యులమీఁద పాముविషములే నీవు
కురియించితివిగా గోవిందరాజా

చ. 3: శంకుఁజక్రములతోడఁ జాఁచినకరముతోడ
అంకెల శిరసు కింది హస్తముతోడ
తెంకిన శ్రీవేంకటాద్రి దిగువతిరుపతిలో
కొంకక వరములిచ్చే గోవిందరాజా

రేకు: 1996-03 ముఖారి సం: 01-479 వైష్ణవ భక్తి

పల్లవి: కంటే సులభ మిది కానక యుంటే దుర్లభ:
మింటిలోననే వున్న దిహముఁ బరమును

చ. 1: హరిదాసులు మెట్టినక్కడే పరమపద-
మరయ నిందుకంటె నవల లేదు
తిరమై వీరి పాదతీర్థమే విరజానది
సొరిది నన్ని చోట్లు చూచినట్టే వున్నది

చ. 2: మిచ్చక వైష్ణవుల మాటలెల్లా వేదములు
యిచ్చల నిందుకంటే నింక లేదు
అచ్చట వీరిపస్రాద మమృతపానములు
అచ్చమై తెలిసేవారి కఱచేత నున్నది

చ. 3: చెలఁగి ప్రపన్నుల సేవే విజ్ఞానము
ఫల మిందుకంటే మఱి పైపై లేదు
తలఁప శ్రీవేంకటేశుదాసులే యాతనిరూపు-
లెలమి నెదుట నున్నా రెఱిఁగినవారికి

రేకు: 1996-04 బౌళి సం: 01-480 దశావతారములు

పల్లవి: అరుదరుదు నీమాయ హరి హరీ

అరసి తెలియరాదు హరిహరీ

చ. 1: అనంతబ్రహ్మాండము లవె రోమకూపముల

అనంతములై వున్నవి హరిహరీ

పొనిగి కుంగినవొక్క భూమి నీ వెత్తితిది యే-

మని నుతింతు నిన్ను హరి హరీ

చ. 2: పొదిగి బ్రహ్మాదులు నీబొడ్డును నేకాలము

అదివో పుట్టుచున్నారు హరిహరీ

పొదలి యీజీవులను పుట్టించే యీసామర్థ్యము

అదన నేమనిచెప్పే హరి హరీ

చ. 3: పావనవైకుంఠము నీపాదమూల మందున్నది

ఆవహించేభక్తిచేత హరి హరీ

శ్రీవేంకటాద్రిమీఁద చేరి నీ విట్టె వుండఁగా-

నావల వెదకనేల హరిహరీ

రేకు: 1996-05 శ్రీరాగం సం: 01-481 నామ సంకీర్తన

పల్లవి: జడమతిరహం కర్మజంతురేకోహం
జడధినిలయాయ నమో సారసాక్షాయ

చ. 1: పరమపురుషాయ నిజభక్తిజనసులభాయ
దురితదూరాయ సింధరహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో

చ. 2: నగసముద్ధరణాయ నందగోపసుతాయ
జగదంతిరాత్మాయ సగుణాయ
మృగనరాంగాయ నిర్మితభవాండాయ ప-
న్నగరాజశయనాయ నమో నమో

చ. 3: దేవదేవేశాయ దివ్యచరితాయ బహు-
భావనాతీతాయ పరమాయ
శ్రీవేంకటేశాయ జితదైత్యనికరాయ
భూవల్లభాయ నమో పూర్ణకామాయ

రేకు: 1996-06 మలహరిసం: 01-482 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడు పక్వము గా దిదె యింద్రియభోగంబులచే
సన్నము దొడ్డును దోఁచీ సంసారఫలంబు

చ. 1: తిత్తితో నూరేండ్లకును దేహము పండఁగఁ బండఁగ
చిత్తం బెన్నఁడు పండక చిక్కెను కసుఁగాయై
పొత్తుల పుణ్యముఁ బాపము పులుసును తీపై రసమున
సత్తు నసత్తును దోఁచీ సంసారఫలంబు

చ. 2: వెదవడి పుత్రులుపౌత్రులే విత్తులు లోలో మొలచియు
పొది గర్మపుపూ మారదు పూపిందెయిన దిదే
తుదనిదె సుఖమునుదుఃఖముతోలునుగింజయి ముదురుక
చదురము వలయము తోఁచీ సంసారిఫలంబు

చ. 3: వినుకలిచదువుల సదలో వేమరు మాఁగఁగ బెట్టిన
ఘనకర్మపుటొ గరుడుగదు కమ్మర పులిగాయై
మనుమని శ్రీవేంకటేశుకు మహినాచార్యుఁడు కానుక
చనవున నియ్యఁగ వెలసెను సంసారఫలంబు

రేకు: 1997-01 లలిత సం: 01-483 వైరాగ్య చింత

పల్లవి: అమ్మెడి దొకటి అసిమలోదొకటి
బిమ్మిటి నిందేటి పెద్దలమయ్యా

చ. 1: సంగము మానక శాంతియుఁ గలుగదు
సంగలంపటము సంసారము
యెంగిలిదేహం బింతకు మూలము
బెంగల మిందేఁటి పెద్దలమయ్యా

చ. 2: కోరికె లుడుగక కోపం బుడుగదు
కోరకుండ దిక్కువ మనసు
క్రూరత్వమునకు కుదువ యీబ్రదుకు
పేరడి నేమిటి పెద్దలమయ్యా

చ. 3: ఫలము లందితే బంధము వీడదు
ఫలముతో తగులు ప్రపంచము
యిలలో శ్రీవేంకటేశు దాసులము
పిలువఁగ నేమిటి పెద్దలమయ్యా

రేకు: 1997-02 లలిత సం: 01-484 అంత్యప్రాస

పల్లవి: అటువంటివాఁడువో హరిదాసుఁడు
అటమటాలు విడిచి నాతఁడే సుఖి

చ. 1: తిట్టేటిమాటలును దీవించేమాటలును
అట్టే సరెని తలఁచి నాతఁడే సుఖి
పట్టి చంపేవేళను పట్టము గట్టే వేళ
అట్టు నిట్టు చలించనిల యాతడే సుఖి

చ. 2: చేరి పంచదారిడినఁ జేదు దెచ్చి పెట్టినాను
అరగించి తనివొందే యతఁడే సుఖి
తేరకాండ్లఁ జూచిన తెగరాని చుట్టముల
నారయ సరిగాఁజూచే యాతడే సుఖి

చ. 3: పొంది పుణ్యము వచ్చి పొరిఁ బాపము వచ్చిన-
నందలి ఫలమొల్లని యాతడే సుఖి
విందుగా శ్రీవేంకటాద్రి విభునిదాసులఁ జేరి
అందరానిపద మందననాతఁడే సుఖి

రేకు: 1997-03 గుండక్రియ సం: 01-485 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరు గుర్తులు గారు యిందిరానాథుఁడే కర్త
నివ్వటి ల్లాతనివారై నేమము దప్పకురో

చ. 1: కర్మమే కర్తయైతే కడకు మోక్షము లేదు
అర్మిలి జీవుఁడు గర్తయైతేఁ బుట్టుగే లేదు
మర్మపుమాయ గర్తఅయితే మరి విజ్ఞానమే లేదు
నిర్మితము హరి దింతే నిజమిదెఱఁగరో

చ. 2: ప్రపంచమే కర్తయైతే పాపపుణ్యములు లేవు
వుపమ మనసు గర్తైఉంటే నాచార మే లేదు
కపటపు దేహములే కర్తలయితే చావు లేదు
నెపము శ్రీహరి దింతే నేరిచి బ్రదుకరో

చ. 3: పలుశ్రుతులు గర్తలై పరగితే మేర లేదు
అల బట్టబయలు గర్తైతే నాధారము లేదు
యెలమి నిందరికి గర్త యిదివో శ్రీవేంకటాద్రి
నిలయపుహరి యింతే నేఁడే కొలువరో

రేకు: 1997-04 బౌళి సం: 01-486 అధ్యాత్మ

పల్లవి: ఇరవైనయట్టుండు యెఱఁగనీ దీమాయ
తెరమఱఁగు మెకమువలె తిరుగు నీబ్రదుకు

చ. 1: అనిశమును దేహమును కన్న పానము లిడిన
యినుము గుడిచిననీరు యెందుకెక్కినదో
గొనకొన్న మానినుల కూటముల సుఖము లివి
మనసుదాటినపాలు మట్టులేదెపుడు

చ. 2: వొడలఁబెట్టినసొమ్ము లొగిఁ దనకుఁ గానరా-
వడవిఁ గాసినవెన్నె లది కన్నులకును
పుడివోనిపరిమళము లొకనిమిషమాత్రమే
బెడిదంపుభ్రమతోడిపెనుగాలిమూఁట

చ. 3: చద్దిసంసారమున సరుస సుఖదుఃఖములు
యెద్దుయెనుపోతునై యేకంబు గాదు
వొద్దికై శ్రీవేంకటోత్తముఁడు యింతలో
అద్దంపునీడవలె నాత్మ బొడచూపె

రేకు: 1997-05 భైరవి సం: 01-487 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీవేమి సేతువయ్య నీవు దయానిధి వందువు
భావించలేనివారిపాప మింతేకాని

చ. 1: పరమపద మొసఁగి పాపమడంచేనని
చరమశ్లోకమునందు చాటితివి తొలుతనె
నిరతిని భూమిలోన నీవల్లఁ దప్పు లేదు
పరగ నమ్మనివారిపాప మింతేకాని

చ. 2: నీపాదములకు నాకు నెయ్యమైన లంకెని
యేపున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత
దాపుగా నీవల్ల నింకఁ దప్పు లేదు యెంచిచూచి
పైపై నమ్మనివారిపాప మింతే కాని

చ. 3: బంతిఁ బురాణములను భక్తసులభుఁడ నని
అంతరాత్మ వీమాట అడితివి తొలుతనే
ఇంతట శ్రీవేంకటేశ యేమిసేతువయ్య నీవు
పంతాన నమ్మనివారిపాప మింతేకాని

రేకు: 1997-06 బౌళి సం: 01-488 వైరాగ్య చింత

పల్లవి: కాయమనేవూరికి గంతలు తొమ్మిదియాయ
పాయక తిరిగాడేరు పాపపుతలారులు

చ. 1: కాముఁడనియెడిరాజు గద్దెమీఁద నుండఁగాను
దీము గోపపుప్రధాని దిక్కు లేలీని
కోమలపుజ్ఞానమెల్లాఁ గొల్లఁబోయ నాడనాడ
గామిడులై రింద్రియపుఁగాపులెల్లా నిదివో

చ. 2: చిత్తమనేదళవాయి చింతలనేపౌఁజు వెట్టి
యిత్తలవిషయములు యెన్నికిచ్చిరి
తుత్తుము రైకోరికెల దొండెము రేఁగఁగఁజొచ్చె
జొత్తుల వెరగుపడిచూచీఁ బుట్టుగులు

చ. 3: బలుసంసారమనేటిభండారము ఘనమాయ
కలదీగె జవ్వనపుకై జీతము
యిలలో శ్రీవేంకటేశుఁడింతలో జీవుఁడనేటి
బలువుని రాజుఁజేసి పాలించె నన్నును

రేకు: 1998-01 సాళంగనాట సం: 01-489 వైరాగ్య చింత

పల్లవి: అట్టివేళఁ గలఁగనీ దదివో వివేకము
మట్టుపడితే శాంతము మఱి యేలా

చ. 1: జడధులు వొంగినట్టు సందడించు నింద్రియములు
వొడలిలో జీవునికి నొక్కొక్కవేళ
బడబాగ్ని రేగినట్టు పైకొనీ ముంగోపము
పుడికించు మనసెల్ల నొక్కొక్కవేళా

చ. 2: ఆరయ గొండయెత్తినట్టు వేఁగౌ సంసారము
పూరక కలిమిలేము లొక్కొక్కవేళ
మేరలేని చీకటియై మించును దుఃఖములెల్లా
పూరట లేనికర్మికి నొక్కొక్కవేళా

చ. 3: పెనుగాలి వీచినట్టు పెక్కుకోరికెలు ముంచు
వొనర నజ్ఞానికి నొక్కొక్కవేళ
యెనయఁగ శ్రీవేంకటేశుదాసుడైనదాఁకా
పునికిఁ బాయ విన్నియు నొక్కొక్కవేళా

రేకు: 1998-02 శంకరాభరణం సం: 01-490 భక్తి

పల్లవి: నెరవాది సాహసులు నిత్యశూరులు
దురితవిదూరులు ధ్రువాదులు

చ. 1: తక్కక శ్రీహరిభక్తితాపలు సేసి యెక్కిరి
చక్కఁగా వైకుంఠము సనకాదులు
వొక్కట విష్ణుకథలు వోడసేసుక దాఁటిరి
పెక్కుసంసారజలధి భీష్మాదులు

చ. 2: కడువిరక్తియనేటికత్తులనే నరకిరి
నడుమ భవపాశముల నారదాదులు
బడినే హరిదాసులపొఁజుల గూడుకొనిరి
నుడివడ కిహమందే శుకాదులు

చ. 3: పరమశాంతములనే పట్టపేనుగులమీద
వరుసల నేఁగేరు వ్యాసాదులు
సిరుల శ్రీవేంకటేశుఁ జేరి సుఖముఁ బొందిరి
బెరసి దాస్యమున విభీషణాదులు

రేకు: 1998-03 గుజ్జరి సం: 01-491 వైరాగ్య చింత

పల్లవి: సంసారినై ననాకు సహజమే
కంసారి నే నిందుకెల్లా గాదని వగవను

చ. 1: నరుఁడనైననాకు నానాసుఖదుఃఖములు
సరి ననుభవించేది సహజమే
హరిని శరణాగతులైనమీఁద బరాభవ-
మరయ నిన్నంటునని అందుకే లోఁగేను

చ. 2: పుట్టిననాకు గర్మపు పొంగుకు లోనైనవాఁడ
జట్టిగాఁ గట్టువడుట సహజమే
యిట్టే నీవారికి మోక్షమిత్తునన్న నీమాట
పట్టు వోయీనోయని పంకించే నే నిపుడు

చ. 3: మాయకులోనైననాకు మత్తుఁడనై యిన్నాళ్లు
చాయకు రానిదెల్లా సహజమే
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
మోయరానినేను నీకు మోపని వీఁగేను

రేకు: 1998-04 సామంతం సం: 01-492 వైరాగ్య చింత

పల్లవి: ఇహమునుఁ బరమును యిందే వున్నవి
వహికెక్కఁ దెలియువారలు లేరు

చ. 1: చట్టువంటి దీచంచలపు మనసు
కొట్టులఁబడేది గుటిగాదు
దిట్ట వొరులు బోధించినఁ గరఁగదు
పట్టఁబోయితే పసలేదు

చ. 2: చిగురువంటి దీజీవశరీరము
తగుళ్లు పెక్కులు తతి లేదు
తెగనిలంపటమే దినమునుఁ బెనచును
మొగము గల దిదే మొనయును లేదు

చ. 3: గనివంటిది యీఘనసంసారము
తనిసితన్పినాఁ దగ లేదు
ఘనుడఁగు శ్రీవేంకటపతి గావఁగ
కొనమొద లేర్పడె కొంకే లేదు

రేకు: 1998-05 సాళంగం సం: 01-493 అంత్యప్రాస

పల్లవి: నేరిచిబ్రదికేవారు నీదాసులు
నేరమిఁ బాసినవారు నీదాసులు

చ. 1: కామముఁ గ్రోధము రెంటీఁ గాదని విడిచి మంచి-
నేమము వట్టినవారే నీదాసులు
దోమటి బాపపుణ్యాలఁ దుంచివేసి చూడగాఁనే
నీమాయ గెలిచినారు నీదాసులు

చ. 2: కిక్కిరించిన యాసలఁ గిందవేసి మోక్షము
నిక్కి నిక్కి చూచేవారు నీదాసులు
వెక్కసపు భక్తితోడ వెఱపు మఱపు లేక
నెక్కొన్న మహిమవారు నీదాసులు

చ. 3: అట్టె వేదశాస్త్రముల అర్థము దేటపఱచి
నెట్టుకొని మించినారు నీదాసులు
యిట్టె శ్రీవేంకటేశ యితరమార్గములెల్లా
నెట్టువడఁ దోసినారు నీదాసులు

రేకు: 1998-06 ముఖారి సం: 01-494 ఉపమానములు

పల్లవి: ఇందిరాపతిమాయలు యింతులు సుండీ
మందలించి హరి గొల్చి మనుదురుగాని

చ. 1: అతివలచూపులే ఆయాలు దాఁకీఁ జుండీ
జితమైనపులకల జిల్లులౌఁజుండీ
రతిపరవశములు రాఁగినమూర్ఛలు సుండీ
మతిలోఁ దప్పించుక మనుదురుగాని

చ. 2: మెఱయించేచన్నులే మించుఁబెట్లుగుండ్లు సుండీ
మెఱుఁగువమోవులే మచ్చు మేపులు సుండీ
మఱి మంచిమాటలు మాయపుటురులు సుండీ
మఱవక తప్పించుక మనుదురుగాని

చ. 3: బలుసంసారపుపొందు పాముతోడిపొత్తు సుండీ
వెలలేనివలపులు విషము సుండీ
యెలమితో శ్రీవేంకటేశ్వరుమఱఁగు చొచ్చి
మలయుచు సొలయుచు మనుదుచుగాని

రేకు: 1999-01 శ్రీరాగం సం: 01-495 వైరాగ్య చింత

పల్లవి: తెలిసిన బ్రహ్మోపదేశ మిదే
సులభ మనుమ నిదే చూచీఁగాక

చ. 1: పుట్టించినహరి పూరి మేపునా
గట్టిగా రక్షించుఁగా కతఁడు
కట్టడిజీవుడు కానక నోళ్లు
తెట్టఁదెరువునకు తెఱచీఁ గాక

చ. 2: అంతరాత్మ తనునట్టే మఱచేనా
చింత లో బెరరేఁచీఁగాక
పంతపు జీవుఁడు భ్రమసి సందుసుడి
దొంతులు దొబ్బుచుఁ దూరీఁగాక

చ. 3: నొసల వ్రాసినవి నోమించుఁగా కతఁ-
డెసగిన శ్రీవేంకటేశ్వరుఁడు
విసుగక జీవుడు వీరిఁడిమాయల
నరురసురయి తా నలసీఁగాక

రేకు: 1999-02 బౌళి సం: 01-496 అధ్యాత్మ

పల్లవి: కనినవాఁడాఁ గాను కాననివాఁడాఁ గాను
పొనిఁగి వొరులకైతే బోధించే నేను

చ. 1: ధరణిఁ గర్మము గొంత తగినజ్ఞానము గొంత
సరికి సరే కాని నిశ్చయము లేదు
వొరిమె యెంచిచూచితే నొకటివాఁడాఁగాను
సరవి దెలియ కేమో చదివేము నేము

చ. 2: యీతల నిహము గొంత యింతలోఁ బరము గొంత
చేతులు రెండు చాఁచే చిక్కుట లేదు
యీ తెరువులో నొకటి నేరుపరచుకోలేను
కాతరాన కతలెల్లా గఱచితి నేను

చ. 3: దైవిక మొకకొంత తగుమానుషము గొంత
చేవలుచిగురువలెఁ జేసేను
యీవల శ్రీవేంకటేశుఁ డిది చూచి నన్నుఁ గాచె
భావించలేక యిన్నాళ్ళు భ్రమసితి నేను

రేకు: 1999-03 సాళంగనాట సం: 01-497 అధ్యాత్మ

పల్లవి: ముంచినవేడుకతోడ మొక్కుటగాక
కంచములోపలికూడు కాలఁదన్న నేఁటికి

చ. 1: వేదార్థములు నీవేవిహరించినసుద్ధులే
కాదని అవునని కొన్ని వాదములేల
యేది నీవు సేసినాను యిన్నియును నియ్యకోలే
సోదించనేఁటికి యందు సొట్టు లెంచఁనేటికి

చ. 2: కర్మము లిన్నియును నీకైంకర్యసాధనాలే
అర్మిలిఁ దారతమ్యము లడుగనేల
నిర్మితము నీ దింతే నెరసు లెంచంగనేల
ధర్మమందు నింక గజదంతపరీక్షేఁటికి

చ. 3: భక్తియింతా నొక ఘంటాపథము నీశావలే
యుక్తిఁ బాత్రాపాత్రములు యూహించనేల
ము క్తికి శ్రీవేంకటేశ మూలము నీపాదములు
సక్తులయి నమ్ముటగాక చలపదమేఁటికి

రేకు: 1999-04 దేసాక్షి సం: 01-498 అధ్యాత్మ

పల్లవి: అంచితపుణ్యులకై తే హరి దైవ మవుఁగాక
పంచమహపాతకులభ్రమ వాప వశమా

చ. 1: కాననియజ్ఞానులకు కర్మమే దైవము
ఆనినబద్ధులకు దేహమే దైవము
మాపననికాముకులకు మగువలే దైవము
పానిపట్టి వారివారిభ్రమ మాన్పవశమా

చ. 2: యేమీ నెఱఁగనివారి కింద్రియములు దైవము
దోమటిసంసారి కూరదొర దైవము
తామసుల కెల్లాను ధనమే దైవము
పామరుల బట్టినట్టి భ్రమఁ బాపవశమా

చ. 3: ధర నహంకారులకు తాఁదానే దైవము
దరిద్రుఁడైనవారికి దాత దైవము
యిరవై మాకు శ్రీవేంకటేశుడే దైవము
పరులముంచినయట్టి భ్రమఁ బాపవశవమా

రేకు: 1999-05 మలహరిసం: 01-499 శరణాగతి

పల్లవి: ఎట్టయినా జేయుము యిఁక నీచిత్తము
కిట్టిననీ సంకీర్తనపరుఁడ

చ. 1: కొందరు జ్ఞానులు కొందరు భక్తులు
కొందరు వైరాగ్యకోవిదులు
యిందరిలో నే నెవ్వఁడఁ గా నిదె
సందడి హరి నీశరణాగతుఁడ

చ. 2: జపితలు గొందరు శాస్త్రులు గొందరు
ప్రపత్తిఁ గొందరు బలువులు
వుపమించఁగ ని న్నొకఁడా గా నిందు
కపురుల నీడింగరీఁడ నేను

చ. 3: ఆచార్యపురుషులు అవ్వలఁ గొందరు
యేచినసమయులై యేర్పడిరి
కాచేటి శ్రీవేంకటపతి నే నైతే
తాచి నీదాసులదాసుఁడను

రేకు: 1999-06 రామక్రియ సం: 01-500 వైరాగ్య చింత

పల్లవి: ఒక్కఁడే అంతర్యామి వుపకారి చేపట్టు
తక్కినవి యిన్నియును తలఁపు రేఁచెడిని

చ. 1: యెఱుఁగుమీ జీవుఁడా యింద్రియాలు సొమ్ము గావు
గుఱియై మాయలలోనఁ గూడించే వింతె
మఱవకు జీవుడా మనసు చుట్టము గాదు
తెఱఁగొప్ప ఆసలానే తిప్పెడి దింతె

చ. 2: తెలుకో జీవుఁడా దేహమును నమ్మరాదు
వలసితే నుండుఁ బోవు వన్నెవంటిది
తలఁచుకో జీవుడా ధనము దనిచ్చ గాదు
పలులంపటములచేఁ బరచెడి దింతె

చ. 3: సమ్మతించు జీవుడా సంసార మొకజాడ గాదు
బిమ్మటి పొద్దొకజాడ పెనచు నింతె
యిమ్ముల శ్రీవేంకటేశ డితనిమూలమే యింత
నెమ్మిఁ దానే గతియంటే నిత్యమవు నింతే

రేకు: 0100-01 శంకరాభరణం సం: 01-501 శరణాగతి

పల్లవి: శతాపరాధములు సహస్రదండన లేదు
గతి నీవని వుండగ కావకుండరాదు

చ. 1: తలచి నీకు మొక్కఁగా దయఁజూడకుండరాదు
కొలిచి బంటనఁగా కోపించరాదు
నిలిచి భయస్తుఁడనై నీయెదుట దైన్యమే
పలుకఁగఁ గావకుండఁ బాడిగాదు నీకు

చ. 2: శరణు చొరఁగ నీకు సారె నాజ్ఞ వెట్టరాదు
సరిఁ బూరి గరవఁగ చంపరాదు
అరయ జగద్ద్రోహినౌదు నైనా నీనామము
గరిమె నుచ్చరించఁగఁ గరఁగక పోదు

చ. 3: దిక్కు నీవని నమ్మఁగా దిగవిడువఁగరాదు
యెక్కువ నీలెంకఁగాఁగా యేమనరాదు
తక్కక శ్రీవేంకటేశ తప్పులెల్లాఁ జేసి వచ్చి
యిక్కడ నీదాసినైతి నింకఁదోయరాదు

రేకు: 0100-02 పాడి సం: 01-502 భక్తి

పల్లవి: ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి

చ. 1: ముంచిననారాయణమూర్తులే యీజగమెల్ల
అంచితనామములే యీయక్షరాలెల్లా
పంచుకొన్న శ్రీహరిప్రసాద మీరుచులెల్లా
తెంచివేసి మేలు దాఁ దెలిసేటివారికి

చ. 2: చేరి పారేటినదులు శ్రీపాదతీర్థమే
భారపుయీ భూమెత నీపాదరేణువే
సారపుఁగర్మములు కేశవుని కైంకర్యములే
ధీరులై వివేకించి తెలిసేటివారికి

చ. 3: చిత్తములో భావమెల్లా శ్రీవేంకటేశుఁడే
హత్తినప్రకృతి యెల్లా నాతనిమాయే
మత్తిలి యీతనికంటే మరి లే దితరములు
తి త్తిదేహపుబ్రదుకు తెలిసేటివారికి

రేకు: 0100-03 లలిత సం: 01-503 కృష్ణ

పల్లవి: ఏల మోసపోయిరొకో యెంచి కాలపువారు
బాలకృష్ణునిబంట్లై బ్రదుకవద్దా

చ. 1: పసులఁగాచేవాని బ్రహ్మ నుతించెనంటేను
దెసల దేవుఁడేయని తెలియవద్దా
సిసువు గోవర్ధనాద్రి చేతఁ బట్టి యెత్తెనంటే
కొస రీతనిపాదాలే కొలువవద్దా

చ. 2: నరునికి విశ్వరూపున్నతిఁ జూపెనంటేను
నరహరి యితఁడని నమ్మవద్దా
పరగఁ జక్రముచేత భానుని నడఁకెనంటే
సొరి దీతని శరణుచొరవద్దా

చ. 3: అందరుసురలలోన నగ్రపూజ గొన్నప్పుడే
చెంది యీతనికృపకుఁ జేరవద్దా
అంది శ్రీవేంకటేశుఁ డట్టె ద్రిష్టదైవమంటే
విందులఁ బరులసేవ విడువవద్దా

రేకు: 0100-04 శుద్ధవసంతం సం: 01-504 అధ్యాత్మ

పల్లవి: ఇంతటిదైవమవు మాకు నిటు నీవు గలుగఁగ
యెంతవారమో భాగ్య మేమిచెప్పే దిఁకను

చ. 1: తలకొని వొకకొంతధనము గనినవాఁడు
వెలలేనిగర్వముతో విఱ్ఱవీఁగీని
బలువుతో వొకరాజుఁ బట్టి కొలిచినవాఁడు
సలిగెతో నాకెవ్వరురి యనీని

చ. 2: వింతగా నొకపరుసవేది చేతఁగలవాఁడు
యెంతవారిఁ గైకోఁడు యెక్కువడంటాను
పొంత నొకమంత్రము పంపుసేయించుకొనేవాఁడు
అంతటికి గురుఁడంటానని మురిసీని

చ. 3: యెగువ నొకదుర్గము నెక్కుక యేలేవాఁడు
పగవారిఁ గైకొనక బలువయ్యీని
అగపడి శ్రీవేంకటాద్రిమీఁదనున్న నిన్నుఁ
దగ నమ్మినట్టివాఁడ ధన్యుఁడ నేను

రేకు: 0100-05 బౌళి సం: 01-505 వైరాగ్య చింత

పల్లవి: సుఖమును దుఃఖమును జోడుకోడెలు

అఖిలముఁ గన్నవాడు అడ్డమాడ రెపుడు

చ. 1: యెందాఁకా సంసార యెనసి తాఁ జేసెను

అందాఁక లంపటము లవి వోవు

కందువ జీవుఁడు భూమిఁ గాయ మెన్నాళ్ళు మోఁచె

అందుకొన్నతనలోనియాసలూఁ బోవు

చ. 2: అప్పటిఁ దనకు లోలో ఆఁక లెంతగలిగినా

తప్పక అందుకుఁ దగ దాహముఁ బోదు

అప్పు దనమీఁద మోచి అదె యెన్నాళ్లు వుండె

ముప్పిరి వడ్డివారక మూలనుండినాఁ బోదు

చ. 3: దైవముపై భక్తిలేక తనకు నెన్నాళ్లుండే

దావతి కర్మపుపాటు తనకుఁ బోదు

శ్రీవేంకటేశ్వరునిసేవ దన కెప్పు డబ్బె

వోవరి నందలిమేలు వొల్లనన్నాఁ బోదు

రేకు: 0100-06 సాళంగం సం: 01-506 అధ్యాత్మ

పల్లవి: మొఱవెట్టెదము మీకు మొగసాలవాకిటను
మఱఁగుచొచ్చితి మీకు మముఁ గావరో

చ. 1: యేపున మనసనియేటిమా పెంపుడు లేడు
పాపమనేయడవిఁ బడినది
రావున హరికింకరపు వేఁకకాండ్లాల
పైపైని మా కింక బట్టియ్యరో

చ. 2: అంచెల మా విజ్ఞానమనెడి కామధేనువు
పంచేంద్రియపు రొంపిఁ బడినది
మించి వైకుంఠన కేఁగేమేటి తెరువరులాల
దించక యెత్తెత్తి వెళ్లఁదియ్యరో

చ. 3: అండనే మోహందకారమనెడి మాదిగ్గజము
దండి మీదయనేటివోఁ దానఁ బడెను
నిండి శ్రీవేంకటేశుఁడ నేటిమావటీనిచేత
గండికర్మపుకంభానఁ గట్టించరో

రేకు: 0101-01 కాంబోది సం: 02-001 అధ్యాత్మ

పల్లవి: విచారించు హరి నావిన్నప మవధరించు

పచారమే నాది గాని పనులెల్లా నీవే

చ. 1: తనువు నాదెందుఁ గాని తనువులో నింద్రియములు

అనిశము నాచెప్పినట్టు సేయవు

మనసు నాదెందుఁ గాని మర్మము నాయిచ్చరాదు

పనివడి దూరు నాది పరులదే భోగము

చ. 2: అలరి నానిద్దుర నాదెందుఁ గాని సుఖమెల్ల

కలలోని కాపిరాలకతల పాలె

తెలివి నాదెందుఁ గాని దినాలు కాలము సొమ్ము

యెలమిఁ బేరు నాది యెవ్వరిదో బలువు

చ. 3: కర్మము నాదెందుఁ గాని కర్మములో ఫలమెల్ల

అర్మిలి నాజన్మముల ఆధీనమె

ధర్మపు శ్రీవేంకటేశ దయానిధివి నీవు

నిర్మితము నీదింతే నేరుపు నీమాయది

రేకు: 0101-02 ఆహిరి సం: 02-002 అధ్యాత్మ

పల్లవి: విడువరా దెంతైనా వెట్టివాఁడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును

చ. 1: జ్ఞానము నే నెఱఁగ నజ్ఞానముఁ నే నెఱఁగను
మానను విషయములు మరిగెంతైనా
నీనామము నొడిగి నాదాసుఁడ ననుకొందు
దీనికే వహించుకొని తిద్దుకో నన్నును

చ. 2: అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకటసంసారముపై పాటు మానను
వొకపనివాఁడనై వూని ముద్రధారినై తి
మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును

చ. 3: వెనకఁ గానను ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మొక్కేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కని పోవిడువరాదు కరుణించు నన్నును

రేకు: 0101-03 సాళంగనాట సం: 02-003 అంత్యప్రాస

పల్లవి: దొరకె మాపాలికిఁ గందువయర్థము
దరిదాపై యుండిన తత్త్వార్థము

చ. 1: తిరముగ నల్లదీవిఁ దెచ్చిన యర్థమిదివో
విరజవోడరేవున వెళ్లినర్థము
పరమభాగవతులు పాఁతినర్థమిదివో
పురుషోత్తముఁడనేటి పురుషార్థము

చ. 2: చందపువేదముల(లు ?) శాసనము వేసినర్థము
ముందు సుముద్రల కెల్లా మొదలర్థము
అందరి యాత్మలనేటి అంగళ్లలోనియర్థము
యెందు సహస్రనామపు టెన్నికర్థము

చ. 3: కొలచి బ్రహ్మాండముల కొప్పెరలో నర్థము
యిల నిహపరముల కెక్కినర్థము
యెలమి హీనునినై న యెక్కుడుసేసే యర్థము
అలరి శ్రీవేంకటేశుఁడై న యర్థము

భైరవి సం: 02-004 అధ్యాత్మ

పల్లవి: దైవమా నీమాయ తలమొ లెఱఁగనీదు
కావరపు విషయాల కట్లు వదలవు

చ. 1: గక్కునఁ బెరిగివచ్చి కాలము మీఁదమీఁద
వొక్కనాఁటి కొక్కనాఁటి కొత్తుకొత్తుక
నిక్కి తుమ్మిదలవంటి నెరులెల్లాఁ దెల్లనాయ
కక్కరమాయ మేను కాంక్షలూ నుడుగవు

చ. 2: చిన్ననాఁడు మోహించిన చెలులు నేఁ జూడఁగానే
పన్నిన వయసు మీరి ప్రౌఢలైరి
వన్నెకుఁ బెట్టిన సొమ్ము వడి రాసి యెత్తుదీసె
మున్నిటివే వెనకాయ ముచ్చటాఁ దొలఁగదు

చ. 3: సిగ్గులెల్లాఁ బెడఁబాసె చేరి యవ్వరు నవ్వినా
యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్ను నేలుకొని
దగ్గరి నాలోనుండఁగా తలపూఁ గైవాలదు

రేకు: 0101-05 ముఖారి సం: 02-005 అధ్యాత్మ

పల్లవి: పులుగు చెప్పెడినదె పొంచి మాగురుఁడు నీకు
తలఁచుకో నేఁడు నీవు దాఁచినర్థము

చ. 1: యిలమీఁద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపు దొంగలవద్ద నున్నాఁడ
వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే

చ. 2: చేరి తమవూరివారి చెఱవట్టుకొని పోతే
కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు
వూరక నీకుక్షిలోనవున్న నన్ను నీమాయ
వీరానఁ జెఱవట్టెను విడిపించుకొనవే

చ. 3: బడిదప్పి తిరిగేటి పడుచుల తమవారు
తడయక తెచ్చుక ఆదరించినట్టు
వెడబుద్ధిఁ దిరిగేను వెట్టిని శ్రీవేంకటేశ
విడువక అజ్ఞాని నన్ను విడుపించుకొనవే

రేకు: 0101-06 ఆహిరి సం: 02-006 వైరాగ్య చింత

పల్లవి: ఇందులో మొదలికర్త యెవ్వఁడు లేఁడు గాఁబోలు
ముందు కరివరదుఁడే ముఖ్యుఁడు గాఁబోలు

చ. 1: ఆడితిఁబో బహురూపా లన్నియోనులఁ బుట్టి
తోడనె బ్రహ్మాదులనే దొరలెదుటా
జాడలు మెచ్చాలేరు చాలునన్నవారులేరు
వేడుక నడవిఁగాసే వెన్నెలాయ బ్రదుకు

చ. 2: అన్నికర్మములుఁ జేసి ఆటలో బ్రాహ్మణుఁడనైతిఁ-
నన్ని వేదములనేటి యంగడివీధి
నన్నుఁ జూచేవారు లేరు నవ్వేటివారు లేరు
వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు

చ. 3: సంసారపునాటకసాలలో ప్రతిమనైతి
కంసారి శ్రీవేంకటపతి మాయలోన
యింస లిన్నియుఁ దేరె నిందరుఁ జుట్టములైరి
హంసచేతి పాలునీరునట్లాయ బ్రదుకు

రేకు: 0102-01 లలిత సం: 02-007 అధ్యాత్మ

పల్లవి: ఒల్లఁడు గాక దేహి వుద్యోగించఁడు గాక
కొల్లలైన మేలు తనగుణములో నున్నది

చ. 1: తలఁచుకొంటేఁ జాలు దైవమేమి దవ్వా
నిలుచుక తనలోనే నిండుకున్నాఁడు
చలపట్టితేఁ జాలు సర్గమేమి బాఁతా
చలివేఁడి నాలికపై సత్యములో నున్నాఁడు

చ. 2: ఆయమెఱఁగితేఁ జాలు నాయుష్యము గరవా
కాయపుటూపిరిలోనే గని వున్నది
చేయఁబోతే పుణ్యుడుగా జీవునికిఁ దడవా
చేయారఁ గర్మము తనచేతిలోనే వున్నది

చ. 3: మొక్క నేరిచితేఁ జాలు మోక్షమేమి లేదో
యెక్కువ శ్రీవేంకటేశుఁ డిదె వున్నాఁడు
దక్కఁగొంటేఁ జాలు పెద్దతనమేమి యరుదా
తక్కక శాంతముతోడి దయలోన నున్నది

రేకు: 0102-02 సామంతం సం: 02-008 రామ

పల్లవి: నూఁతులు దవ్వఁగఁబోతే బేతాళములు వుట్టె
కాఁతాళపు లోకులాల కంటిరా యీసుద్దులు

చ. 1: మీఱిన పుత్రకామేష్టి మించి లంకకుఁ బైవచ్చె
ఆఱడి రామావతార మసురబాధ
తూఱి సీతపెండ్లి హరుదొడ్డ వింటిపండుగాయ
పాఱి పాఱి నమ్మ నెటువలెవచ్చు వీరిని

చ. 2: చూడ కేకయరాజ్యము చుప్పనాతిపాపమాయ
వేడుక మాయమృగము వేఁటాయను
వాడికె సుగ్రీవుమేలు వాలికి గండాన వచ్చె
యీడుగాని రాచపుట్టు యెట్టు నమ్మవచ్చును

చ. 3: వుమ్మడిఁ గోఁతులకూట ముదధికిఁ గట్లు వచ్చె
తమ్మునిబుద్ధి రావణుతల వోయను
పమ్మి శ్రీవేంకటేశుని పట్టానకే యింతానాయ
యిమ్ముల నిట్టిదేవరనెట్టు నమ్మవచ్చును

రేకు: 0102-03 సాళంగనాట సం: 02-009 నృసింహ, మాయ

పల్లవి: అన్నిటి కెక్కుడు యీవి హరియిచ్చేది
మన్నించు నాతనికంటే మఱి లేరు దొరలు

చ. 1: తగు బ్రహ్మలోకముదాఁకా నెక్కిచూచిన
మగుడఁ బుట్టే లోకాలే మనుజులకు
తెగి యిచ్చే యింద్రాదిదేవతల వరములు
యెగువదిగువలను యీసందివే

చ. 2: మాయలోనఁ బుట్టేది మాయలోనఁ బెరిగేది
కాయదారులకు నెల్లాఁ గలిగినదే
సేయరాని పుణ్యమెల్లాఁ జేసి గడించుకోనేది
చాయల బహురూపపుసంసారమే

చ. 3: చెడని వైకుంఠ మిచ్చుఁ జేటులేని వర మిచ్చు
వెడమాయఁ బెడబాపు విష్ణుఁ డీతఁడే
యెడయెక శ్రీవేంకటేశుఁడై వున్నాఁడు వీఁడే
జడియ కితఁడే కాచు శరణంటేఁ జాలును

రేకు: 0102-04 మలహరిసం: 02-010 భక్తి

పల్లవి: అతిసులభం బిది యందరిపాలికి
గతియిది శ్రీపతి కైంకర్యంబు

చ. 1: పాలసముద్రము బలిమిఁ దచ్చికొని-
రాలరిదేవత లమృతమును
నాలుక నిదె హరినామపుటమృతము
యేల కానరో యిహపరసుఖము

చ. 2: అడరి బాఁతిపడి యవని దేవతలు
బడివాయరు యజ్ఞభాగాలకు
విడువక చేతిలో విష్ణుప్రసాదము
కడిగడియైనది కానరు గాని

చ. 3: యెక్కుదురు దిగుదు రేడులోకములు
పక్కనఁ దపముల బడలుచును
చిక్కినాఁడు మతి శ్రీవేంకటేశ్వరుఁ -
డిక్కడి తుదిపద మెఱఁగరు గాని

రేకు: 0102-05 సామంతం సం: 02-011 అధ్యాత్మ

పల్లవి: ఏమి సేయుదు నింక నిందిరాధీశ్వరుఁడా
నీమఱఁగు చొచ్చితిని నెరవేర్తు గాక

చ. 1: కడివోని జవ్వనము కలిమిలేమెఱుఁగునా
బడినుండి మిగుల రుణపరచుఁ గాక
అడియాసలెల్లాఁ బుణ్యముఁ బాప మెఱుఁగునా
వెడగుఁ దనలో దయ విడిపించుఁ గాక

చ. 2: వలపు వెఱ పెఱుఁగునా వాఁడిమొనలకునైన
బలిమిఁ దూరించఁ జలపట్టుఁ గాక
చలనమందిన మనసు జాతి నీతెఱుఁగునా
కలిసి హేయమున కొడిగట్టించుఁ గాక

చ. 3: యెలమి రతిపరవశము యెగ్గుసిగ్గెఱుఁగునా
బలిమిఁ దిట్లకు నొడఁబఱచుఁ గాక
యిలలోన శ్రీవేంకటేశ నీమాయ లివి
తలఁగించి యేలితివి దయసేతు గాక

రేకు: 0102-06 భైరవి సం: 02-012 వైరాగ్య చింత

పల్లవి: అయ్యో మాయలఁ బొంది అందునిందు నున్నవారు
యియ్యగొనఁ గర్తలుగా రెఱఁగరు జడులు

చ. 1: చుక్కలై యుండినవారు సురలై యుండినవారు
యిక్కడనుండి పోయిన యీజీవులే
దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు
యెుక్కుడైన హరి నాత్మ నెఱఁగరు జడులు

చ. 2: పాతాళవాసులను పలులోకవాసులును
యీతరవాత నుండిన యీ జీవులే
కాతరాన వారిపుణ్యకతలే వినేరు గాని
యీతల శ్రీహరికత లెఱఁగరు జడులు

చ. 3: యిరవెఱిఁగిన ముక్తు లెఱఁగని బద్ధులు
యిరవై మనలోనున్న యీజీవులే
సిరుల మించినవాఁడు శ్రీవేంకటేశ్వరుఁడే
శరణాగతులు దక్క చక్కఁ గారు జడులు

రేకు: 0103-01 శుద్ధవసంతం సం: 02-013 అధ్యాత్మ

పల్లవి: చీ చీ వివేకమా చిత్తపు వికారమా
యేచి హరిఁ గొలువక హీనుఁడాయ జీవుఁడు

చ. 1: బతికేనంటాఁ బోయి పయిఁడి వుచ్చుక తన-
పతి యవసరములఁ బ్రాణమిచ్చీని
బతు కందులోన నేది పసిఁడి యెక్కడ నుండు
గతి హరిఁ గొలువక కట్టువడె జీవుఁడు

చ. 2: దొడ్డవాఁడనయ్యేనని దొరలఁ గొలిచి వారి-
కడ్డము నిడుపు మొక్కు నతిదీనుఁడై
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాఁడు
వొడ్డి హరిఁ గొలువక వోడుపడె జీవుఁడు

చ. 3: చావనేల నోవనేల సారెఁ గిందుపడనేల
యీవల శ్రీవేంకటేశుఁడింట నున్నాఁడు
దేవుఁ డాతఁడే నేఁడు తెలిసి కొలిచేఁ గాని
భావించ కిన్నాళ్ళుదాఁకా భ్రమఁబడె జీవుఁడు

రేకు: 0103-02 రామక్రియ సం: 02-014 కృష్ణ

పల్లవి: అనుచు నిద్దరునాడే రమడలవలెనే
మొనసి యివెల్లాఁ జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు

చ. 1: రాముఁడ పండ్లు నాకు రండు వెట్టరా
యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు
ప్రేమపుతమ్ముఁడఁ గాన పిన్ననే నీకు
యీమాట మఱవకు యిందిరాకృష్ణుఁడా

చ. 2: యెక్కిన వుట్టిపై నన్ను నెక్కించరా వోరి
వుక్కునఁ బడేవు రాకు వద్దురా నీవు
పక్కున మొక్కేరా నీపయిఁడికాళ్ళకు వోరి
అక్కతోఁ జెప్పేఁ గాని అందుకొనే రారా

చ. 3: యెవ్వరు వొడవో సరి నిటు నిలుతమురా వోరి
నివ్వటిల్ల నీవింత నిక్కవొద్దురా
రవ్వల శ్రీవేంకటాద్రిరాయఁడనేరా అయితే-
యివ్వల నీకంటేఁ బెద్ద యిది నీ వెఱఁగవా

రేకు: 0103-03 ధన్నాసి సం: 02-015 అధ్యాత్మ

పల్లవి: పెట్టినవీ వెఱుఁగుదు పెనుదిక్కు
జట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి

చ. 1: కర్మమూలమైనట్టి కాయము మోచి నేను
కర్మము విడువఁబోతే కడుసంగతా
మర్మ మెఱిఁగిన నీవే మాయలఁ గట్టుండఁగాను
పేర్మి నే విడువఁబోతే బిగియదా కట్టు

చ. 2: బంధమూలమైనట్టి ప్రపంచమందునుండి
బంధముఁ బాసేనంటేఁ బాసునా అది
అంధకారమైనట్టి అజ్ఞానానఁ దోసితివి
అంధకారమున వెలుఁ గరసితేఁ గలదా

చ. 3: నిచ్చలు నీసంసారపు నీరధిలోన మునిఁగి
చొచ్చి వెళ్లి చేరేనంటేఁ జోటు గలదా
యిచ్చట శ్రీవేంకటేశ యిహమందే పరమిచ్చి
అచ్చు మోపి యేలఁగా నే నన్నియుఁ దెలిసితి

రేకు: 0103-04 ముఖారి సం: 02-016 వైరాగ్య చింత

పల్లవి: వెనకేదో ముందరేదో వెఱ్ఱి నేను నా-
మనసు మరులు దేర మందేదొకో

చ. 1: చేరి మీఁదటిజన్మము సిరులకు నోమేఁ గాని
యే రూపై పుట్టుదునో యెఱఁగ నేను
కోరి నిద్రించఁ బరచుకొన నుద్యోగింతుఁ గాని
సారె లేతునో లేవనో జాడ దెలియ నేను

చ. 2: తెల్లవారినప్పుడెల్లా తెలిసితిననేఁ గాని
కల్లయేదో నిజమేదో కాన నేను
వల్ల చూచి కామినుల వలపించేఁ గాని
మొల్లమై నామేను ముదిసిన దెరఁగ

చ. 3: పాపాలు చేసి మఱచి బ్రదుకుచున్నాఁడఁ గాని
వైపుగఁ జిత్రగుప్తుడు వ్రాయు టెఱఁగ
యేపున శ్రీవేంకటేశు నెక్కడో వెతకేఁ గాని
నాపాలిదైవమని నన్నుఁ గాచు టెఱఁగ

రేకు: 0103-05 మలహరిసం: 02-017 అధ్యాత్మ

పల్లవి: అంతరుమాలినయట్టి అధములాల
పొంత సంతకూటమి పొరిచూపు గాదా

చ. 1: కనక మిత్తడితోడ కలయ సరిదూఁచితే
అనువవునా అది దోషమవుఁ గాక
ఘనుఁడైన హరితోఁ గడుహీనదేవతల
ననిచి సరివెట్టితే నయమవునా భువిని

చ. 2: పట్టభద్రుఁడు గూర్చుండే బలుసింహాసనముపై
వెట్టిబంటుఁ బెట్టేవారు వెఱ్ఱులేకారా
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతలఁ
బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా

చ. 3: కొంచక సింహముండేటి గుహ నుండవచ్చునా
పొంచి నక్కలకెల్ల బొక్కలే కాక
అంచెల శ్రీవేంకటేశుఁ డాత్మలోనే వుండఁగాను
కొంచపుదైవాల పలువంచలనే కాక

రేకు: 0103-06 దేవగాంధారి సం: 02-018 వేంకటగానం

పల్లవి: కల్లమాడ దొడ్డముద్ర కటకటా
చెల్లుబడి కల్లలు చెప్పేరు లోకులు

చ. 1: యిప్పుడేలే బ్రహ్మదేవుఁడిట్టే వుండఁగ మీఁదటి-
వొప్పగు బ్రహ్మపట్టము వొకరికి వెచ్చపెట్టి
అప్పటి మూఁడుమూర్తులయందులో నీతని సరి-
చెప్పఁబొయ్యే రీమాట చెల్లునా లోకులకు

చ. 2: కైలాసము రుద్రుఁడుగల బ్రహ్మాండకోట్లు
పోలించి విష్ణుఁడు కడుపున నించుకుండఁగాను
చాలి మూఁడుమూర్తులలో సరి యీతఁ డంటాను
కూళలై యాడేరు గాక కూడునా లోకులకు

చ. 3: ఘనుఁ డీతనిపాదము గడిగె బ్రహ్మదేవుఁడు
మునుముట్టి శిరసున మోఁచె శివుఁడు
వొనర మూఁడుమూర్తులం దొకఁడు శ్రీవేంకటేశుఁ-
డనుమాట యిది తగవునా లోకులకు

రేకు: 0104-01 పాడి సం: 02-019 భగవద్గీత కీర్తనలు

పల్లవి: తెలిసితే మోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బదుకు ఘనునికిని

చ. 1: అనయము సుఖమేడ దవల దుఃఖమేడది
తనువుపై నాసలేని తత్త్వమతికి
పొనిఁగితేఁ బాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమొల్లని యోగికిని

చ. 2: తగిన యమృతమేది తలఁపఁగ విషమేది
తెగి నిరాహారియైన ధీరునికిని
పగవారనఁగ వేరి బంధులనఁగ వేరీ
వెగటు ప్రపంచమెల్ల విడిచే వివేకికి

చ. 3: వేవేలువిధులందు వెఱపేది మఱపేది
దైవము నమ్మినయట్టి ధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
యీవలేది యావలేది యితనిదాసునికి

రేకు: 0104-02 భైరవి సం: 02-020 వైరాగ్య చింత

పల్లవి: నీదాస్యమొక్కటే నిలిచి నమ్మఁగలది
శ్రీదేవుఁడవు నీచిత్తము నాభాగ్యము

చ. 1: అనుష్ఠానములు గతియని నమ్మి చేసితినా
తనువిధి మలమూత్రములప్రోగు
జనులలో నుత్తమపుజన్మమే నమ్మితినా
వొనరఁ గర్మమనే వోఁదానఁ బడినది

చ. 2: చదువుల శాస్త్రముల జాడలు నమ్మితినా
పొదలిన మతముల పోరాట మది
మదిమది నుండిన నామనసే నమ్మితినా
అదియును నింద్రియాల కమ్ముడువోయినది

చ. 3: పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా
పాత్రమగు రుణానుబంధము లవి
చిత్రముగ నన్నుఁ గావు శ్రీవేంకటేశ నీవే
పత్రపుష్పమాత్రమే నాభక్తియెల్లా నీకు

రేకు: 0104-03 మలహరిసం: 02-021 అంత్యప్రాస

పల్లవి: కంచూఁ గాదు పెంచూఁ గాదు కడుఁబెలుచు మనసు
యెంచరాదు పంచరాదు యెట్టిదో యీమనసు

చ. 1: పట్టఁ బసలేదు చూడ బయలుగాదీమనసు
నెట్టనఁ బారుచునుండు నీరూఁ గాదీమనసు
చుట్టిచుట్టి పాయకుండుఁ జుట్టమూఁ గాదీమనసు
యెట్టనెదుటనే వుండు నేఁటిదో యీమనసు

చ. 2: రుచు లెల్లాఁ గానుపించు రూపు లేదు మనసు
పచరించు నాసలెల్లాఁ బసిఁడి గాదీమనసు
యెచటాఁ గరఁగదు రాయీఁ గాదు మనసు
యిచటా నచటాఁ దానే యేఁటిదో యీమనసు

చ. 3: తప్పక నాలోనుండు దైవముఁ గాదు మనసు
కప్పిమూఁటగరాట్టదు గాలీఁ గాదు మనసు
చెప్పరానిమహిమలశ్రీవేంకటేశుఁ దలఁచి
యిప్పుడిన్నిటా గెలిచె నేఁటిదో యీమనసు

రేకు: 0104-04 గుజ్జరి సం: 02-022 ఉపమానములు

పల్లవి: కలదిదివో సుఖము గలిగినను గర్భము నిలువక మానునా
మలసి కామ్యకర్మములకుఁజొచ్చిన మగుడఁ బుట్టువులు మానునా

చ. 1: పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులు గట్టిన నలబ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మిన నరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము వదలు

చ. 2: అలరిన సంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపుచు నొకయిఱ్ఱిఁ బెంచినంతనే తనకును నారూపు దగిలె
ములుగుచు లంపటములు దెగ విడిచి మోక్షము వెదకెడి నరుఁడు
వలవని దుస్సంగతులు పెంచినను వాసన లంటక మానునా

చ. 3: అటుగన తాఁ బట్టిన వ్రత ముండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోరుఁడైనట్లు
తటుకన శ్రీవేంకటపతి నొక్కని దాస్యము భజియించిన నరుఁడు
ఘటనల నాతని కైంకర్యములకు కడుఁబాత్రుఁడు గాక మానునా

రేకు: 0104-05 శ్రీరాగం సం: 02-023 అధ్యాత్మ

పల్లవి: చెల్లఁబో యీజీవు లిలఁ జేసిన పాప మెంతో
వుల్లమున నున్న హరి వూరికే దవ్వాయ

చ. 1: కన్నచోటనే హరి కలఁడన్నవారికి
విన్నచోటనే విష్ణుడు వివేకులకు
వున్నతిఁ గొలువలేక వొద్దనుండఁగాఁ గొందరు
మిన్నుమీఁద వెదకేరు మితిమీఱఁ జదివి

చ. 2: పట్టినదే బ్రహ్మము పరమార్థవేత్తలకు
తిట్టులోనా దైవము దివ్యులకును
ముట్టి చేత మొక్కలేరు ముందటనే వుండఁగాను
బట్టబయలు పాకేరు బహుకర్మవిదుల

చ. 3: ఊపిరిలో దేవుఁడున్నాఁడు యోగీంద్రులకు
దాపున నున్నాఁడు హరిదాసులకును
యేపున శ్రీవేంకటేశు నేచి శరణనలేక
చాపలాన వెదకేరు సకలదేవతల

రేకు: 0104-06 లలిత సం: 02-024 అన్నమయ్య స్తుతి

పల్లవి: శరణంటి మాతని సమ్మంధమునఁ జేసి
మరిగించి మము నేలి మన్నించవే

చ. 1: సకలవేదములు సంకీర్తనలు చేసి
ప్రకటించి నినుఁ బాడి పావనుఁడైనఁ-
అకలంకుఁడు తాళ్లపాకన్నమాచార్యుల
వెకలియై యేలిన శ్రీవేంకటనిలయ

చ. 2: నారదాది సనకసనందనాదులవలె
పేరుపడి నిన్నుఁ బాడి పెద్దలైనట్టి
ఆరీతిఁ దాళ్లపాకన్నమాచార్యుల
చేరి యేలినయట్టి శ్రీవేంకటనిలయ

చ. 3: సామవేదసామగాన సప్తస్వరములను
బాముతో నీసతి నిన్నుఁ బాడినయట్టి
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకటనిలయా

రేకు: 0105-01 వరాళి సం: 02-025 అధ్యాత్మ

పల్లవి: అదివో నిత్యశూ (సూ?)రులు అచ్యుత నీదాసులు
యెదురులేనివారు యేకాంగవీరులు

చ. 1: రచ్చల సంసారమనే రణరంగములోన
తచ్చి కామక్రోధాల తలలు గొట్టి
అచ్చపు తిరుమంత్రపు టారుపుబొబ్బలతోడ
యిచ్చలనే తిరిగేరు యేకాంగవీరులు

చ. 2: మొరసి పట్టుగులనే ముచ్చుఁబౌఁజుల కురికి
తెరలి నడుములకుఁ దెగవేసి
పొరిఁ గర్మముఁ బొడిచి పోటుగంటులఁ దూరి
యెరగొని తిరిగేరు యేకాంగవీరులు

చ. 3: వొడ్డిన దేహములనే వూళ్లలోపల చొచ్చి
చెడ్డ యహంకారమను చెఱలువట్టి
అడ్డమై శ్రీవేంకటేశు నండనుండి లోకులనే-
యెడ్డల జూచి నవ్వేరు యేకాంగవీరులు

రేకు: 0105-02 సాళంగం సం: 02-026 వైరాగ్య చింత

పల్లవి: జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాల
నానావిధాల నివి నమ్మేరు సుండి

చ. 1: అలరి యింతుల యధరామృతము లివియెల్ల
కాలకూటవిషముల కరణి సుండి
శీలముతో వీరల చెట్టలు వట్టుటలెల్లా
బాలనాగాలఁ దొడికి పట్టుట సుండి

చ. 2: కాంతలు నవ్వుచునైనాఁ గన్నులఁ జూచిన చూపు
పంతమున నలుగుల పాఁతర సుండి
బంతుల నెదుటనున్న పడఁతుల చన్ను లివి
కంతల నొడ్డిన బడిగండ్లు సుండి

చ. 3: జవ్వనపుఁ గామినుల సరసపు మాటలెల్లా
మవ్వమైనయట్టి చొక్కు మంత్రాలు సుండి
యివ్వలను శ్రీవేంకటేశ్వరుదాసుల కివి
చివ్వనఁ జెప్పినట్టు చేసేవి సుండి

రేకు: 0105-03 కాంబోదిసం: 02-027 వైరాగ్య చింత

పల్లవి: సంతలే చొచ్చితిఁగాని సరకుఁ గానసైతి
యింతట శ్రీహరి నీవే యిటు దయఁజూడవే

చ. 1: కాంత చనుఁగొండలు కడకు నెక్కితిఁ గాని
యెంతైనా నా మోక్షపుమెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనే అడవి చొచ్చితిఁ గాని
సంతతహరిభక్తనే సంజీవి గానసైతి

చ. 2: తెగి సంసారజలధిఁ దిరుగులాడితిఁ గాని
అగడై వైరాగ్యరత్న మది దేనైతి
పొగరు జన్మాల రణభూములు చొచ్చితిఁగాని
పగటుఁ గామాదుల పగ సాధించనైతి

చ. 3: తనువనియెడి కల్పతరువు యెక్కితిఁ గాని
కొన విజ్ఞానఫలము గోయలేనైతి
ఘనుఁడ శ్రీవేంకటేశ కమ్మర నీకృపచేతఁ
దనిసి యేవిధులనుఁ దట్టువడనైతి

రేకు: 0105-04 సాళంగనాట సం: 02-028 అధ్యాత్మ

పల్లవి: నాకు నందు కేమివోదు నన్ను నీ వేమిచూచేవు
నీకరుణ గలిగితే నించి చూపవయ్యా

చ. 1: ఘోరమైన దేహపు దుర్గుణ మేమిగలిగిన
ఆరసిఁ బ్రకృతిఁబోయి అడుగవయ్యా
నేరని నాజన్మముతో నేరుపేమి గల్లా నన్ను
ధారుణిఁ బుట్టించిన విధాత నడుగవయ్యా

చ. 2: పంచేంద్రియములలోని పాప మేమి గలిగినా
అంచెలఁ గామునిఁబోయి అడుగవయ్యా
ముంచిన నాకర్మములో మోసమేమి గలిగినా
మంచితనానఁ జేయించే మాయ నడుగవయ్యా

చ. 3: అన్నిటా నావెనకటి అపరాధమేమి గల్లా
మన్నించి నాగురుఁ జూచి మానవయ్యా
మిన్నక శ్రీవేంకటేశ మీఁదిపనులేమి గల్లా
నిన్నుఁ జూచుకొని నన్ను నీవే యేలవయ్యా

రేకు: 0105-05 దేసాక్షి సం: 02-029 అధ్యాత్మ

పల్లవి: మఱి హరిదాసుఁడై మాయలఁ జిక్కువడితే
వెఱపించఁబోయి తానే వెఱచినట్లవును

చ. 1: శూరుఁడైనవాఁ డేడఁజొచ్చిన నడ్డము లేదు
ఆరీతి జ్ఞానికి విధు లడ్డము లేవు
కారణాన నప్పటినీఁ గలిగెనా నది మరి
తేరిన నీళ్ల వందు దేరినట్లవును

చ. 2: సిరులరాజై తే నేమిసేసిన నేరమి లేదు
పరమాధికారియైతేఁ బాపము లేదు
అరసి తనకుఁదానే అనుమానించుకొనెనా
తెరువే పోఁ సుంకరిఁ దెలిపినట్లవును

చ. 3: భూమెల్ల మేసినా నాఁబోతుకు బందె లేదు
నేమపుఁ బ్రపన్నునికి నింద లేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మమంటితే జంటీఁగ కతవును

రేకు: 0105-06 ముఖారి సం: 02-030 అధ్యాత్మ

పల్లవి: నేమే బ్రహ్మమనుకో నేరము నేము-
కామించిన స్వతంత్రము గడు లేదుగాన

చ. 1: క్షణములోపలనె సర్వజీవావస్థలూను
గణుతించేవాఁ డొకఁడు గలఁడు వేరే
అణుమహత్త్వములందు నంతర్యామైనవాని
ప్రణుతించి దాసులమై బ్రదికేముగాని

చ. 2: పనిగొని యేలుటకు బ్రహ్మాది దేవతలఁ
గనిపించేవాఁ డొకఁడు గలఁడు వేరే
ననిచి సిరుల లక్ష్మీనాథుఁడైనవాని-
పనులవారము నేము బ్రదికేముగాని

చ. 3: సతతరక్షకుఁడయి శంఖచక్రధరుఁడయి
గతి శ్రీవేంకటపతి గలఁడు వేరే
అతనిమఱఁగు చొచ్చి యానందపరవశానఁ
బ్రతిలేక యిందరిలో బ్రదికేము గాని

రేకు: 0106-01 శంకరాభరణం సం: 02-031 దశావతారములు

పల్లవి: ఇందుకేపో వెరగయ్యీ నేమందును
కుందులేని నీమహిమ కొనియాడఁగలనా

చ. 1: అటు దేవతల కెల్ల నమృతమిచ్చిన నీవు
యిటు వెన్నదొంగిలుట కేమందును
పటుగతి బలీంద్రుని బంధించినట్టి నీవు
సట రోలఁ గట్టువడ్డ చందాన కేమందును

చ. 2: కలిగి యాకరిరాజుఁ గరుణఁ గాచిన నీవు
యిల నావులఁ గాచుట కేమందును
తలఁప బ్రహ్మాదిదేవతలకుఁ జిక్కని నీవు
చెలుల కాఁగిళ్లకుఁ జిక్కితి వేమందును

చ. 3: భావించ నన్నింటకంటేఁ బరమమూ ర్తివి నీవు
యీవల బాలుఁడవై తి వేమందును
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని
శ్రీవేంకటాద్రి నిలిచితి వేమందును

రేకు: 0106-02 పాడి సం: 02-032 దశావతారములు

పల్లవి: వెన్నలు దొంగిలునాటి వెట్టివా నీవు
విన్నకన్నజాడ గాదు వెట్టివా నీవు

చ. 1: చేరి నిన్నునొల్లనట్టిజీవుల నీవుదరాన
వీరుఁడవై మోఁచేవు వెట్టివా నీవు
నారపేరు నుడిగితే నా పేరంటాఁ దగిలేవు
వీరానఁ జుట్టమవై వెట్టివా నీవు

చ. 2: బంటులైనవారికిఁ బరతంత్రుఁడవై యీ-
వెంటవెంట దిరిగేవు వెట్టివా నీవు
అంటే ననరాదు రెండుఅడుకులకే చొచ్చేవు
వింటే మాకు నవ్వువచ్చీ వెట్టివా నీవు

చ. 3: పావనులయి లోకమెల్లా బదుకుమంటాఁ బేళ్లు
వేవేలు వెట్టుకొంటివి వెట్టివా నీవు
శ్రీవేంకటేశుఁడవై చెంది వరము లిచ్చేవు
వేవేగ నెవ్వరికైనా వెట్టివా నీవు

రేకు: 0106-03 రామక్రియ సం: 02-033 అధ్యాత్మ

పల్లవి: అయ్యో వారిభాగ్య మంతేకాక
నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు

చ. 1: దేవుఁడు వెల్లవిరై దిక్కులెల్లా నిండుండఁగా
సోవల నాస్తికునకు శూన్యమై తోఁచు
యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా
కావరపు జీవునకు గతుగతుకే

చ. 2: హరి శరణంటేఁ గాచే అట్టియుపాయమే వుండఁగ
విరసానకుఁ గర్మమే వెగ్గళమాయ
పరగ నరులకెల్లాఁ బట్టపగలై యుండఁగా
అరయఁ గొన్ని జంతుల కంధకారమాయను

చ. 3: యిక్కడ శ్రీవేంకటేశుఁ డెదుటనే వుండఁగాను
అక్కటా మూఢున కెందు ననుమానమే
మక్కువ నింతా నమృతమయమైనఁ గోడికి
తెక్కులఁ దవ్వఁ బొయ్యేది తిప్పపెంటలే

రేకు: 0106-04 లలిత సం: 02-034 అంత్యప్రాస

పల్లవి: కరుణించు మిఁకనైన కాఁపురమా
కరికరిఁ బెట్టుకుమీ కాఁపురమా

చ. 1: కలలోని సుఖమైన కాఁపురమా
కలుషమే చవియైన కాఁపురమా
కలను బేహారపు కాఁపురమా
కలఁడు మా కిదే హరి కాఁపురమా

చ. 2: గంట వేఁటలో తగులు కాఁపురమా
కంట వత్తివెట్టి కాచే కాఁపురమా
గంటుగిందుగాఁ బొరలే కాఁపురమా
కంటిమి శ్రీపతికృప కాఁపురమా

చ. 3: కావిరి వెట్టి చేరాయి కాఁపురమా
కావలసినట్లయ్యే కాఁపురమా
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్ను నన్ను నొక్క-
కైవశము సేసెఁగదో కాఁపురమా

రేకు: 0106-05 పాడి సం: 02-035 అధ్యాత్మ

పల్లవి: వేసరకు వీఁడేల యనకుము విడువ నిన్నిఁక శరణు చొచ్చితి
నీసరెవ్వరు లేరు వెదకిన నిండుబండికిఁ జేటవేఁ గా

చ. 1: మీరు నాకుఁ గలరు నేనేమి సేసినఁ గాతురనియెడి-
ధీరతను జము సరకు గొనకే తివిరిఁ సేసితిఁ బాపము
వోరసేయుచు నెంతలేదని వూరకే మీరుంటిరేనియు
వారికినిఁ గొరగాను నే నెవ్వరిని నెఱఁగను మిమ్మేకాని

చ. 2: మిమ్ముఁ గొలిచిన గర్వమున నేమీఁ జేయక కాలమందే
నమ్మి కర్మములెల్ల మానితి నాకు నాకే వేసరి
దొమ్మి కోపక మీకు నాకును దూరమనుచుఁ బరాకుచేసిన
యిమ్ములను నన్నవియు రోసును యేల నాకవి నీవేకాక

చ. 3: నీకు మొక్కిన మందెమేళము నే నొక కొండ సేసుక
లోకముల దేవతలకెల్లను లోను వెలిగానైతి
యీాకడను శ్రీవేంకటేశుఁడ యిప్పుడిటు ననుఁ గరుణఁజూచితి
చేకొనుచు వారె మెత్తురు చెలఁగి నీకింకరుఁడననుచు

రేకు: 0106-06 వరాళి సం: 02-036 అధ్యాత్మ

పల్లవి: ఏమందురు యీమాటకు నిందరూ నిన్ను
నీమాయ యెంతైనా నిన్ను మించవచ్చునా

చ. 1: నేను నిన్నుఁ గొలిచితిని నీవు నన్ను నేలితివి
పాని పంచేంద్రియాలేల పనిగొనీని
కానిలేని బంట్లఁ దేరకాండ్లు వెట్టిగొనఁగ
దానికి నీ కూరకుండ ధర్మమా సర్వేశ్వరా

చ. 2: పుట్టించినాఁడవు నీవు పుట్టినవాఁడను నేను
పట్టి కర్మమేల నన్ను బాధపెట్టీని
వొట్టినసొమ్ముకు వేరొకరు చేయిచాఁచితే
తట్టి నీవు వహించుకోఁదగదా సర్వేశ్వరా

చ. 3: యెదుట నీవు గలవు యిహములో నేఁ గలను
చెదరిన చిత్తమేల చిమ్మిరేఁచీని
అదన శ్రీవేంకటేశ అరితేరినట్టినన్ను
వదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా

రేకు: 0107-01 సాళంగనాట సం: 02-037 ఉపమానములు

పల్లవి: ఆమీఁది నిజసుఖ మరయలేము
పామరపు చాయలకే భ్రమసితిమయ్యా

చ. 1: మనసునఁ బాలు దాగి మదియించి వున్నట్టు
ననిచి గిలిగింతకు నవ్వినయట్టు
యెనసి సంసారసుఖ మిది నిజము సేసుక
తనివొంది యిందులోనే తడఁబడేమయ్యా

చ. 2: బొమ్మలాట నిజమంటాఁ బూఁచి చూచి మెచ్చినట్టు
తెమ్మగా శివమాడి తా దేవరైనట్టు
కిమ్ముల యీజన్మనందు కిందుమీఁదు నేఱక
పమ్మి భోగములనే తెప్పలఁ దేలేమయ్యా

చ. 3: బాలులు యిసుకగుళ్లు పఁస గట్టు కాడినట్టు
వీలి వెట్టివాఁడు గంతువేసినయట్టు
మేలిమి శ్రీవేంకటేశ మిమ్ముఁ గొలువక నేము
కాల మూరకే యిన్నాళ్ళు గడపితిమయ్యా

రేకు: 0107-02 దేసాక్షి సం: 02-038 అధ్యాత్మ

పల్లవి: దేవ నీదయ యెంతునో దివ్యసులభ మెంతునో
కావించి గంటగటుక(???) కాచుకుండే విదివో

చ. 1: వెదక నావసమా వేగుదాఁకా నిన్ను నేను
కదిసి నీమూరితి కాన వసమా
యెదుట శంఖుచక్రాల యెట్టిదైవమ నేనని
పొదుగుచు నీకు నీవే పొడచూపేవు గాక

చ. 2: పొగడ నావసమా పురుణించి నీగుణాలు
తగుల నావసమా నీతలఁపెఱిఁగి
నిగడి వేదశాస్త్రాల నిన్ను నీవే చెప్పుకొని
పగటు మాయజ్ఞానము పాపేవింతే కాక

చ. 3: కొలువ నావసమా గుఱుతెఱిఁగి నీవెంట
చెలఁగి నాచేతులఁ బూజించ వసమా
నిలిచి శ్రీవేంకటేశ నీవే నాయదలో నుండి
మలసి పెరరేఁపుచు మన్నించేవు గాక

రేకు: 0107-03 కన్నడగౌళ సం: 02-039 వైరాగ్య చింత

పల్లవి: నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించకపో దంతర్యామి

చ. 1: సొమ్ము వో వేసినవాఁడు చుట్టిచుట్టి వీధులెల్లా
కమ్ముక వెదకీనట కన్నదాఁకాను
నమ్మిన అజ్ఞానములో నన్నుఁ బడవేసుకొని
అమ్మరో వూరకుందురా అంతర్యామి

చ. 2: వోడ బేరమాడేవాఁడు వొకదరి చేరిచి
కూడిన యర్థము గాచుకొనీనట
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరిచేర్చి
వోడక కాచుకోరాదా వో యంతర్యామి

చ. 3: చేరి పుప్పమ్మేవాఁడు చిట్లు వేఁ గనఁడట
వూరకే శ్రీవేంకటేశ వోపికతోడ
ఆరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నాభార-
మేరీతినైన మోపు మిఁక సంతర్యామి

రేకు: 0107-04 భూపాళం సం: 02-040 వైరాగ్య చింత

పల్లవి: హరివారమైతిమి మ మ్మపుఁగాదనఁగరాదు
తరముగా దిఁకను మాతప్పులు లోఁగొనరో

చ. 1: వెన్నడించి సూడువట్టే విష్ణుమాయ నీకు నేము
యిన్నిటాఁ బంతమిచ్చేము యింకఁ గావరో
నన్నల వెట్టిగొనేటి సంసారబంధము నీకు
మున్నె కిందుపడితిమి ముంచి దయఁజూడవో

చ. 2: ఆడించేటి కామక్రోధాది జూజరులాల
వోడితిమి మీకుఁ దొల్లె వొరయకురో
వీడని కర్మము నీకు వెఱచి పూరి గఱచే-
మీడనే ధర్మదార మా కిఁకనైనాఁ బట్టవో

చ. 3: దక్కఁగొన్న మాలోని తనుభోగములాల
మొక్కితిమి మాకుఁ గొంత మొగమోడరో
యెక్కువ శ్రీవేంకటేశు డేలే మాజన్మములాల
గక్కన వేఁడుకొంటిమి కపటాలు మానరో

రేకు: 0107-05 బౌళి సం: 02-041 అంత్యప్రాస

పల్లవి: అతిసులభం బిదె శ్రీపతిశరణము అందుకు నారదాదుల సాక్షి
ప్రతిలే దిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి

చ. 1: వేసరకుమీ జీవుఁడా వెదకివెదకి దైవమును
ఆసపాటుగా హరి యున్నాఁడిదె అందుకుఁ బ్రహ్లాదుఁడే సాక్షి
మోసపోకుమీ జన్మమా ముంచిన యనుమానములను
సేసినభక్తికిఁ జేటు లేదు యీసేఁతకెల్ల ధ్రువుఁడే సాక్షి

చ. 2: తమకించకుమీ దేహమా తగుసుఖదుఃఖంబుల నలసి
అమితము నరహరికరుణ నమ్మితే నందుకు నర్జునుఁడే సాక్షి
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబులు యీఁదీఁది
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుఁడే సాక్షి

చ. 3: మరిగివుండుమీ వోజిహ్వా మరి శ్రీవేంకటపతినుతులు
అరయఁగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులే సాక్షి
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపుమాయలకును లోఁగి
సరిలే దితనిపాదసేవకును సనకాదులబ్రదుకే సాక్షి

రేకు: 0107-06 లలిత సం: 02-042 వైరాగ్య చింత

పల్లవి: తుద సమస్తమును దుర్లభమే
అదె సులభుఁడు మాహరి యొకఁడే

చ. 1: సురలును నరులును సొంపగు సిరులును
వొరసిన నిన్నియు నుపాధులే
నిరుపాధికుఁడును నిజకరుణానిధి
అరయఁగ నిదె మాహరి యొకఁడే

చ. 2: అందరియీవులు నఖిలకర్మములు
అందఁగరాని ప్రయాసములే
యిందిరారమణి నేచిన సేవిది
చెందరు సుజనులు చెప్పంగలదె

చ. 3: యితరోపాయము లేవి చూచినా
శ్రుతివిరహితములు శూన్యములే
రతి శ్రీవేంకటరమణునిమతి యిది
హితపరిపూర్ణం బిది యొకటే

రేకు: 0108-01 లలిత సం: 02-043 భక్తి

పల్లవి: ఎవ్వరిభాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరువకు తానే గురుతు

చ. 1: పరమమంగళము భగవన్నామము
సురులకు నరులకు శుభకరము
యిరవుగ నెఱిఁగిన యెదుటనె వున్నది
వరుసల మఱచినవారికి మాయ

చ. 2: వేదాంతసారము విష్ణుభక్తి యిది
ఆదిమునుల మత మయినది
సాదించువారికి సర్వసాధనము
కాదని తొలఁగిన గడుశూన్యంబు

చ. 3: చేతినిధానము శ్రీవేంకటపతి
యేతలఁ జూచిన నిందరికి
నీతియు నిదియే నిజసేవకులకు
పాతకులకు నది భవసాగరము

రేకు: 0108-02 ధన్నాసి సం: 02-044 హరిదాసులు

పల్లవి: హరిదాసులతోడ నల్పులు సరెనరాదు
గురుఁడు శిష్యుడుననే గుటి దప్పుఁగానా

చ. 1: కోరి ముత్యపుఁజిప్పలఁ గురిసిన వానయు
సారెఁ బెంకులలో వాన సరియౌనా
శ్రీరమణుఁ డిన్నిటానుఁ జేరియుంటేనుండెఁ గాక
సారెకుఁ బాత్రాపాత్రసంగతింతా లేదా

చ. 2: మలయాద్రి మాఁకులును మహిమీఁది మాఁకులును
చలమున నెంచిచూడ సరియౌనా
అలరి దేవుఁడు అంతర్యామియైతేనాయఁ గాక
తెలియఁగ క్షేత్రవాసి దిక్కులందు లేదా

చ. 3: అమరుల జన్మములు నసురల జన్మములు
జమళిఁ బుట్టినంతలో సరియౌనా
అమరి శ్రీవేంకటేశుఁ డాతుమైతేనాయఁ గాక
తమితో నధికారిభేదములు లేవా

రేకు: 0108-03 దేసాళం సం: 02-045 వైరాగ్య చింత

పల్లవి: నే నననఁగా నెంతవాఁడ నెయ్యపుజీవులలోన
యీనెపాన రక్షించీ నీశ్వరుఁడే కాక

చ. 1: యెవ్వరు బుద్ధిచెప్పిరి యిలపైఁ జీమలకెల్లా
నెవ్వగఁ బుట్టల గొల్చు నించుకొమ్మని
అవ్వల సంసారభ్రాంతి అనాదినుండియు లోలోఁ
దవ్వించి తలకెత్తే యంతర్యామేకాక

చ. 2: చెట్టుల కెవ్వరు బుద్ధిచేప్పేరు తతికాలానఁ
బుట్టి కాచి పూచి నిండాఁ బొదలుమని
గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని
తిట్టపెట్టి రచించిన దేవుఁ డింతేకాక

చ. 3: బుద్దు లెవ్వరు చెప్పిరి పుట్టినట్టి మెకాలకు
తిద్ది చన్నుదాగి పూరి దినుమని
పొద్దువొద్దులోన నుండి భోగములు మఱపిన-
నిద్దపు శ్రీవేంకటాద్రినిలయుండే కాక

రేకు: 0108-04 రామక్రియ సం: 02-046 వైరాగ్య చింత

పల్లవి: తెలిసినవాఁడాఁ గాను తెలియనివాఁడాఁ గాను
యిల నొకమాట నీ కెత్తిచ్చితిఁగాని

చ. 1: పుట్టించేవాఁడవు నీవే బుద్ధిచ్చేవాఁడవు నీవే
యెట్టున్నా నపరాధా లేవి మాకు
అట్టూ నన్నవారముగా మనఁగా నీచి త్తమెట్టో
కిట్టి వొకమాట మడిగితి నింతేకాని

చ. 2: మనసులోపల నీవే మరి వెలుపల నీవే
యెనసి అపరాధాలు యేవి మాకు
నిను నొఁగాదనలేము నీ సరివారముఁ గాము
అనవలసినమాట అంటి మింతే కాని

చ. 3: అంతరాత్మవును నీవే అన్నిటాఁ గావఁగ నీవే
యెంతైనా నపరాధా లేవి మాకు
వింత లేక శ్రీవేంకటవిభుఁడ నీబంట నింతే
వంతుకు నేనొకమాట వాకుచ్చితిఁగాని

రేకు: 0108-05 సాళంగనాట సం: 02-047 దశావతారములు

పల్లవి: నీయంతటివా రెవ్వరు నీకు నెదురేది యెందు
చాయల నీసుద్ది విని శరణంటి నేను

చ. 1: కావలనంటేఁ దొల్లి కంభము చించుకవెళ్లి
కైవశమై ప్రహ్లాదుఁ గావవా నీవు
తేవలనంటే బ్రహ్మదేవునికి వేదములు
సోవల సముద్రమయిన చొచ్చి తేవా నీవు

చ. 2: పట్టియెత్తవలెనంటేఁ బాతాళానఁ బడ్డ కొండ
తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు
మట్టుపెట్టవలెనంటే మరి భూమి చాపగాఁగ
చుట్టుకపోతేఁ దెచ్చి సొంపుగ నిలుపవా

చ. 3: పక్షపాతమయ్యేనంటేఁ బాండవుల గెలుపించి
యీక్షితి యేలించి చనవియ్యవా నీవు
రక్షించేనంటేఁ గాతరాన శ్రీవేంకటాద్రిఁ బ్ర-
త్యక్షమై మావంటివారిఁ దగఁ గరుణించవా

రేకు: 0108-06 సామంతం సం: 02-048 కృష్ణ

పల్లవి: అందరివలెనే వున్నాఁ డాతడాఁ వీఁడు
యిందుముఖులఁ గూడినాఁ డీతఁడానాఁడు

చ. 1: యిందరూ నేఁటేఁట జేసే యింద్రయాగపు ముద్దలు
అందుకొని యారగించినాతఁడా వీఁడు
చెంది మునులసతుల సతఁ దెప్పించుక మంచి-
విందు లారగించినాఁడు వీఁ డానాఁడు

చ. 2: తొలుత బ్రహ్మ దాఁచిన దూడలకు బాలులకు
అలరి మారు గడించినాతఁడా వీఁడు
నిలుచుం డేడుదినాలు నెమ్మది వేలఁ గొండెత్తి
యిల నావులఁ గాచినాఁ డీతఁ డానాఁడు

చ. 3: బాలుఁడై పూతనాదుల బలురక్కసులఁ జంపి
ఆలరి యాటలాడిన యాతఁడా వీఁడు
యీలీల శ్రీవేంకటాద్రి యెక్కినాఁడు తొలుతే
యేలెను బ్రహ్మాదుల నీతఁ డానాఁడు

రేకు: 0109-01 దేసాక్షి సం: 02-049 అధ్యాత్మ

పల్లవి: ఏపీ నుపాయాలుగావు యెక్కువ భక్తేకాని
దావతిఁ బడక యిది దక్కితే సులభము

చ. 1: ముంటిపై సుఖమందుట ముక్కున నూరుపువట్టి
దంటవాయువు గెలువఁ దలచేదెల్లా
వెంటిక వట్టుకపోయి వెఁస గొండ వాఁకుట
వెంటఁ గర్మమార్గమున విష్ణుని సాధించుట

చ. 2: యేనుగుతోఁ బెనఁగుట యిల నిరాహారియై
కానని పంచేంద్రియాలఁ గట్టఁబోవుట
నానించినుపగుగెళ్ళు నములుట బలిమిని
ధ్యానించి మనఁసుఁబట్టి దైవము సాధించుట

చ. 3: దప్పికి నెండమావులు దాగ దగ్గరఁబోవుట
తప్పుఁ జదువులలోఁ దత్త్వము నెంచుట
పిప్పి చవి యడుగుట పెక్కు దైవాలఁ గొలిచి
కప్పిన శ్రీవేంకటేశుకరుణ సాధించుట

రేకు: 0109-02 శంకరాభారణం సం: 02-050 వేంకటగానం

పల్లవి: అప్పఁడు దైవాలరాయఁ డాదిమూల మీతఁడు
యిప్పుడిట్టిమహిమల నెక్కుడాయ నీతఁడు

చ. 1: చేకొని తొలితొలుతే చేసిన పన్నీరుకాపు
జోకఁ గాలువలై సారిది జార
సైకపునీలాద్రినుండి జలజల బారేటి-
రేకల సెలయేరులరీతి నున్న దిదివో

చ. 2: తెప్పలుగా గుప్పినట్టి తెల్లని కప్పురకాపు
చిప్పిలుచు వెన్నెలలై చిందఁగాను
పుప్పొడిఁదోఁగిన కల్పభూజము నిలుచున్న-
చొప్పున నున్నాఁడిదివో సొంపులు మీరుచును

చ. 3: పొందుగ నంతటిమీఁదఁ బూసిన పునుగుకాపు
కందువ మాణిక్యముల గనియైనట్టు
అంది శ్రీవేంకటేశ్వరు కదె యలమేలుమంగ
చెంది యరతఁ గట్టఁగా శ్రీవిభుఁడై నిలిచె

రేకు: 0109-03 మలహరిసం: 02-051 శరణాగతి

పల్లవి: ఏమి సేసే మీఁక నేము యెంతని దాఁచుకొందుము
నీమహిమ యింతంతననేరము నేమయ్యా

చ. 1: అంది నిన్ను నొకమాటు హరి యని నుడిగితే
పొందిన పాతకమెల్లాఁ బొలిసిపోయ
మందలించి మఱి యొకమాటు నుడిగిన ఫల-
మందు నీ కప్పగించితి మదిగోవయ్యా

చ. 2: యిట్టె మీకు రెండుచేతులెత్తొకమాటు మొక్కితే
గట్టిగా నిహపరాలు గలిగె మాకు
దట్టముగ సాష్టాంగదండము వెట్టిన ఫల-
మట్టె నీమీఁద నున్నది అదిగోవయ్యా

చ. 3: సరుగ నీకొకమాటు శరణన్నమాత్రమున
సిరులఁ బుణ్యుఁడనైతి శ్రీవేంకటేశ
ధరలోన నే నీకు దాసుఁడనైన ఫల-
మరయ నీమీఁద నున్న దదిగోవయ్యా

రేకు: 0109-04 సాళంగం సం: 02-052 వైష్ణవ భక్తి

పల్లవి: ఎక్కడిమతము లింక నేమి సోదించేము నేము
తక్కక శ్రీపతి నీవే దయఁజూతు గాక

చ. 1: కాదనఁగ నెట్టువచ్చు కన్నులెదిటి లోకము
లేదనఁగ నెట్టువచ్చు లీలకర్మము
నీదాసుఁడ ననుచు నీమరఁగు చొచ్చుకొంటే
యేదెసనైనాఁ బెట్టి యీడేరింతు గాక

చ. 2: తోయ నెట్టువచ్చు మించి తొలఁకేటి నీమాయ
పాయ నెట్టువచ్చుఁ యీభవబంధాలు
చేయార నిన్నుఁ బూజించి చేరి నీముద్రలు మోఁచి
యీయెడ నుండఁగా నీవే యీడేరింతు గాక

చ. 3: తెలియఁగ నెట్టువచ్చు ద్రిష్టమైన నీమహిమ
తలచఁగ నెట్టువచ్చు తగు నీరూపు
నెలవై శ్రీవేంకటేశ నీవు గలవనుండఁగా
యిలఁమీద మమ్మునీవే యీడేరింతు గాక

రేకు: 0109-05 శుద్ధవసంతం సం: 02-053 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పురుషోత్తముఁడ నీవు పురుషాధముఁడ నేను
ధరలో నాయందు మంచితన మేది

చ. 1: అనంతాపరాధములు అటు నేము సేసేవి
అనంతమయిన దయ అది నీది
నిను నెఱఁగకుండేటి నీచగుణము నాది
నను నెడయకుండే గుణము నీది

చ. 2: సకలయాచకమే సరుస నాకుఁ బని
సకలరక్షకత్వము సరి నీపని
ప్రకటించి నిన్ను దూరేపలుకే నాకెప్పుడూను
వెకలివై ననుఁ గాచేవిధము నీది

చ. 3: నేరమింతయును నాది నేరుపింతయును నీది
సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు
యీరీతి శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి
ధారుణిలో నిండెను ప్రతాపము నీది

రేకు: 0109-06 గుండక్రియ సం: 02-054 అధ్యాత్మ

పల్లవి: నారాయ ణాచ్యుతానంత గోవిందా
నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు

చ. 1: నిగమాంతవిదులై తే నిన్నెఱుఁగుదురు గాక
మృగసమానులకేల మీమీఁది భక్తి
వెగటుగాఁ గృపతోడ విశ్వరూపు చూపినాను
పగటు దుర్యోధనుఁడు బహురూప మనఁడా

చ. 2: చిరపుణ్యులైతే మీ సేవలు సేతురు గాక
దురితచిత్తులకు మీత్రోవ యేఁటికి
గరిమఁ బ్రత్యక్షమై కంబములోఁ గలిగినా
హిరణ్యకశిపుఁడు మిమ్మెంచి శరణనెనా

చ. 3: దేవతలయితే మిమ్ముఁ దెలియనేర్తురు గాక
యేవల నసురులు మిమ్మెటెఁగేరా
శ్రీవేంకటాద్రిమీఁద సిరితో నీ వుండఁగాను
కేవల సంసారు లెటెఁగెయును మఱవరా

రేకు: 0110-01 శంకరాభరణం సం: 02-055 వైరాగ్య చింత

పల్లవి: లేదు భయము మఱి కాదు భవము
ఆదియు నంత్యముఁ దెలిసిన హరియాజ్ఞే కాన

చ. 1: తలఁపులు గడుగక వొడ లటు తాఁ గడిగిన నేమి
వెలుపలి కాంక్షలు పుడుగక విధులుడిగిన నేమి
అలరుచు శ్రీహరిదాస్యము ఆతుమఁ గలిగిన యాతఁడు
చెలఁగుచు పనులైనా సేసిన మరి యేమి

చ. 2: పొంచినకోపము విడువక భోగము విడిచిననేమి
పంచేంద్రియములు ముదియక పై ముదిసిన నేమి
నించిన దైవము నమ్మిన నిర్భరుఁడయిన యాతఁడు
యెంచుక యేవర్గంబుల నెట్టుండిన నేమి

చ. 3: వేగమె లోపల గడువక వెలి గడిగిన నేమి
యోగము దెలియక పలుచదువులు దెలిసిన నేమి
యీగతి శ్రీవేంకటపతి నెఱిఁగి సుఖించేటి యాతఁడు
జాగుల ప్రపంచమందును సతమైనా నేమి

రేకు: 0110-02 గుండక్రియ సం: 02-056 అధ్యాత్మ

పల్లవి: హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని
తరఁగు మొరఁగులను దాఁటలే రెవ్వరును

చ. 1: నిండుఁ జింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండి పుణ్యపాపాలే దరులు
కొండలవంటి కరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును

చ. 2: ఆపదలు సంపదలు అందులోని మకరాలు
కాఁపురపు లంపటాలే కైయొత్తులు
చాపలపు గుణములే సరిఁజొచ్చే యేరులు
దాపుదండ చేకొని దాఁటలే రెవ్వరును

చ. 3: నెలవై పుబ్బుసగ్గులే నిచ్చలుఁబోటునుఁ బాటు
బలువైన యాశే బడబాగ్ని
యెలమి శ్రీవేంకటేశుహితులకే కాల్నడ
తలఁచి యితరులెల్ల దాఁటలే రెవ్వరును

రేకు: 0110-03 గౌళ సం: 02-057 దశావతారములు

పల్లవి: ఈతనిఁ గొలిచితేనే యిన్ని గొలలునుఁ దీరు
చేతనఁ బెట్టు పుణ్యాలు చేరువనే కలుగు

చ. 1: పట్టి కాళింగునిఁ దోలి పాముకొల దీర్చినాఁడు
బట్టబాయిటనే రేపల్లెవారికి
అట్టె పూతనఁ జంపి ఆఁడుఁగొల దీర్చినాఁడు
గట్టిగాఁ గృష్ణుఁడు లోకమువారికెల్లను

చ. 2: బలురావణుఁ జంపి బాఁపనకొల దీర్చినాఁడు
యిలమీఁదఁ గలిగిన ఋషులకెల్లా
కొలఁది మీరినయట్టి కోఁతికొల దీర్చినాడు
సొలసి రాఘవుఁ డదె సుగ్రీవునికిని

చ. 3: వొలిసి పురాలు చొచ్చి పూరఁగొల దీర్చినాఁడు
అల తనదాసులైన అమరులకు
సిలుగుఁగొలలు దీర్చి సేన వరా లిచ్చినాఁడు
చెలఁగి పరుషలకు శ్రీవేంకటేశుఁడు

రేకు: 0110-04 శ్రీరాగం సం: 02-058 వైరాగ్య చింత

పల్లవి: వివేకించ వేళ లేదు విజ్ఞానమార్గమందు
భవసంపదల పెద్దపౌజు చూచీ జీవుఁడు

చ. 1: చిత్తమనియెడి మహాసింహాసనం బెక్కి
హత్తి బహుపరాకాయ నదె జీవుఁడు
గుత్తపు దేహమనేటి కొలువుకూటములోన
జొత్తుఁ బ్రకృతినాట్యము చూచీని జీవుఁడు

చ. 2: పంచేంద్రియములనే బలుతేజీలపై నెక్కి
అంచల వయ్యాళి దోలీనదె జీవుఁడు
ముంచిన కర్మములనే ముద్రల పెట్టెలు దెచ్చి
సంచముగా లెక్కవెట్టి సరిదాఁచీ జీవుఁడు

చ. 3: యిచ్చఁ గామక్రోధాలనే హితమంత్రులునుఁ దారు
తచ్చి తలపోసుకొనీఁ దగ జీవుఁడు
అచ్చపు శ్రీవేంకటేశుఁ డంతరాత్మయై యుండఁగా
పచ్చిగా నాతనిఁ జూచి భ్రమసీని జీవుఁడు

రేకు: 0110-05 సామంతం సం: 02-059 అధ్యాత్మ

పల్లవి: చెల్లఁబో తియ్యనినోరఁ జేఁదేఁటికి యీ-
పల్లదపుఁ గోరికలపాలు సేయవలెనా

చ. 1: ఆసలకు నాదేహ మమ్ముకొంటి వింటింట
దాసునిఁగా నాపాలిదైవమా నీవు
పోసరించి భూమిలోనఁ బుట్టించి రక్షించి
యీసులేక భంగపెట్టు టిది గొంత వలెనా

చ. 2: పామరపు టింద్రియాలబారిఁ దోసితివి నన్ను
దామెనకట్టుగాఁ గట్టి తత్త్వమా నీవు
దోమటి నామతిలోనఁ దోడునీడవై యుండి
పామేటి సుఖములనే భ్రమయించవలెనా

చ. 3: గక్కన నింతట నన్నుఁ గరుణించితివి నేఁడు
మొక్కితి శ్రీవేంకటాద్రిమూలమా నీకు
దిక్కుదెసవై నాకు దేవుఁడవై యేలికవు
చొక్కి నామనసింత సోదించవలెనా

రేకు: 0110-06 భూపాళం సం: 02-060 దశావతారములు

పల్లవి: చూపఁ జెప్పగల భక్త సుజనుఁడవు మాకు
దాపైన హరి యిట్టె తప్పెఁ దారెననక

చ. 1: కోరి పాండవులయింటఁ గూర లారగించినట్టు
సారవు శబరివిందు చవిగొన్నట్టు
వూరకే మాయింట నీవు వొదవినపాటి నీ-
వారగించవయ్య చవు లౌఁగాములెంచక

చ. 2: తొల్లియు రేపల్లె గొల్లదోమటి దొడికినట్టు
తల్లి అనసూయ పాలఁ దనిసినట్టు
చిల్లరైన మాయింటఁ జేసిన పా టారగించు
చల్లతోడి బోనమైన చాలుఁ జాలదనక

చ. 3: అంకెల శ్రీవేంకటాద్రి నారగించినయట్టు
కొంకులేక సిరితోడఁ గోనేటిరాయ
లెంకనయిన నాయింటిలేశమైన నారగించు
అంకించి నీనాలోని అంతరము లెంచకా

రేకు: 0111-01 లలిత సం: 02-061 శరణాగతి

పల్లవి: ఏగతి నుద్ధరించేవో యింతటిమీఁదట మమ్ము
భోగపుఁ గోరికలచే బొలిసెఁబో పనులు

చ. 1: పరగి నాలుకసొంపు పరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁ బాపముల వినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటి కులాచారములు

చ. 2: మొక్కలానఁ బరధనమునకుఁ జాఁచి చాఁచి
యెక్కువఁ జేతుల మహిమెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటిముందరి పుణ్యములు

చ. 3: యెప్పుడు నీచుల ఇండ్ల కెడతాఁకి పాదములు
తప్పని తపములెల్లాఁ దలఁగిపోయ
యిప్పుడే శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁ జేసినట్టి నేరమెల్లా నడఁగె

రేకు: 0111-02 ముఖారి సం: 02-062 వైష్ణవ భక్తి

పల్లవి: పాప మెఱఁగను పుణ్యఫల మెఱఁగను
యేపనులు నీకు సెల విన్నియునుఁ గావా

చ. 1: మునుప నీవిషయముల ముద్ర మానుసులఁగా-
నునిచితివి నామీఁద నొకటొకటినే
అనిశంబు నవి చెప్పినట్లఁ జేయకయున్న
ఘనుఁడ నీయాజ్ఞ నేఁ గడచుటే కాదా

చ. 2: కలిమిగల యింద్రియపుఁ గాఁపులుండిన పూరు
యెలమి నా కొసఁగితివి యేలుమనుచు
అలసి వీరల నేను నాదరించక కినిసి
తొలఁగఁద్రోచిన నదియు ద్రోహమే కాదా

చ. 3: కుటలములఁ బెడఁబాపి కోరిన చనవులెల్ల
ఘటనఁ జెల్లించితివి ఘనుఁడ నేను
అటుగనక శ్రీవేంకటాద్రీశ నీదాసి-
నెటుచేసినా నీకు నితవేకాదా

రేకు: 0111-03 శుద్ధవసంతం సం: 02-063 ఉపమానములు

పల్లవి: చిక్కువడ్డపనికిఁ జేసినదే చేఁత

లెక్కలేని యప్పునకు లేమే కలిమి

చ. 1: తగవులేమి కెదిరిధనమే తనసొమ్ము

జగడగానికి విరసమే కూడు

తెగుదెంపులేమికి దీనగతే దిక్కు

బిగువుఁగూటికి వట్టిబీరమే తగవు

చ. 2: పతిలేనిభూమికి బలవంతుఁడే రాజు

గతిలేనికూటికిఁ గన్నదే కూడు

సతిలేనివానికి జరగినదే యాలు

కుతదీరుటకు రచ్చకొట్టమే యిల్లు

చ. 3: యెదురులేమికిఁ దమకేదైనఁ దలఁ పిది

మదమత్తునకుఁ దనమఱుపే మాట

తుదిపదమునకుఁ జేదొడైన(???) విభవము

పదిలపు శ్రీవేంకటపతియే యెఱుక

రేకు: 0111-04 శ్రీరాగం సం: 02-064 వైరాగ్య చింత

పల్లవి: అన్నిటికి నొడయఁడవై న శ్రీపతివి నీవు
యెన్నరాదు మాబలఁగఁ మెంచుకో మాపాఁజు

చ. 1: జ్ఞానంద్రియము లైదు శరీరిలోపల
ఆనక కర్మేంద్రియము లైదు
తానకపు కామక్రోధాల వర్గము లారు
యీనెలవు పంచభూతా లెంచు మాపాఁజు

చ. 2: తప్పనిగుణాలు మూఁడు తనువికారము లారు
అప్పటి మనోబుద్ధ్యహంకారాలు
వుప్పతిల్లు విషయము లుడివోని వొకఅయిదు
యిప్పటి మించేకోపము యెంచుకో మాపాఁజు

చ. 3: ఆఁకలిదప్పియును మానావమానములను
సోఁకిన శీతోష్ణాలు సుఖదుఃఖాలు
మూఁకగమికాఁడ నేను మొక్కెద శ్రీవేంకటేశ
యేఁకటారఁ గడపేవా నెంచుకో మాపాఁజు

రేకు: 0111-05 లలిత సం: 02-065 కృష్ణ

పల్లవి: ఈడనుండె నిందాఁకా నింటి ముంగిట
ఆడ నెందుఁ బోఁడుగద అప్పుడే యీకృష్ణుఁడుఁ

చ. 1: యేడ పూతకిఁ జంపె నింతపిన్నవాఁడంటా
ఆడుకొనేరదే వీథి నందరుఁ గూడి
వేడుకతో మనగోవిందుఁడు గాఁడుగదా
చూడరమ్మ వీఁడు గడు చుల్లరీఁడు పాపఁడు

చ. 2: మరలి యప్పటివాఁడె మద్దులు విఱిచెనంటా
పరువులు వెట్టేరు పడఁతులెల్లా
కరికరించఁగ రోలఁ గట్టితే నప్పుడు మా-
హరి గాఁడుగదా ఆడనున్న బిడ్డఁడు

చ. 3: వింతగాఁగ నొకబండ విఱిచె నప్పటినంటా
రంతు సేసేరదివో రచ్చలు నిండి
అంత యీశ్రీవేంకటేశుఁడై న మనకృష్ణుఁడట
యింతేకాక యెవ్వరున్నా రిటువంటి పాపఁడు

రేకు: 0111-06 పాడి సం: 02-066 అంత్యప్రాస

పల్లవి: విభుఁడ వింతటికి వెరవుతో నను(గావు
అభయహస్తముతోడి ఆదిమూలమా

చ. 1: పలులంపటాలచేతఁ బాటుపడి పాటుపడి
అలసితిఁ గావవే వో ఆదిమూలమా
చలమరి యితరసంసారభ్రాంతిఁ జిక్కితి న-
న్నలరించి కావవే వో ఆదిమూలమా

చ. 2: యెంతకైన నాసలచే యేఁగేఁగి వేసరితి-
నంత కోపఁ గావవే వో ఆదిమూలమా
సంతల చుట్టరికాల జడిసితి నీకఁ గావు
అంతరాత్మ నాపాలి ఆదిమూలమా

చ. 3: రంటదెప్పు టింద్రియాల రవ్వైతిఁ గావవే వో-
అంటిన శ్రీవేంకటాద్రి ఆదిమూలమా
గెంటక ముమ్మాటికని నీకే శర-
ణంటిఁ గావవే వో ఆదిమూలమా

రేకు: 0112-01 శ్రీరాగం సం: 02-067 అద్వైతము

పల్లవి: ఏఁటిమాట లివి విన నింపయ్యీనా మది-
నేఁటవెట్టి దాసుఁడౌ టిదిసరియా

చ. 1: జీవుఁడే దేవుఁడని చెప్పుదురు గొందరు
దైవముచేఁతలెల్లాఁ దమ కున్నవా
ఆవలఁ గొందరు కర్మ మది బ్రహ్మ మందురు
రావణాదు లవి సేసి రతికెక్కిరా

చ. 2: మిగులఁ గొందర దైవమే లేదనెందురు
తగ నీప్రపంచమెల్లాఁ దనచేఁతలా
గగన మతఁడు నిరాకార మందురు గొంద-
రెగువఁ బురుషసూక్త మెఱఁగరా తాము

చ. 3: యెనిమిది గుణములే యితని వందురు గొంద-
రనయము మిగిలిన వవి దమవా
యెనయఁగ శ్రీవేంకటేశ్వరుదాసులై
మనుట నిత్యముగాక మరి యేమినేలా

రేకు: 0112-02 రామక్రియ సం: 02-068 భక్తి

పల్లవి: అన్నిటా శ్రీహరిదాసుఁడగు వానికి
కొన్ని దైవములఁ గొలువఁగఁ దగునా

చ. 1: విహితకర్మముసేసి వెదకేటి హరి నిట్టె
సహజమై కొలచేటి సరసునికి
గహనపుఁ గర్మాలు కడమలైన నేమి
మహిఁ గనక్రాదికి మరి పైఁడి వలెనా

చ. 2: పలుదానములకెల్ల బలమైన హరి నిట్టె
బలుపుగ జేకొన్న భక్తునికిని
నెలకొని యాతఁ డన్నియునుఁ జేసినవాఁడె
తెలిసి సూర్యునిఁ జూడ దీపాలు వలెనా

చ. 3: వేదవేద్యుఁడు శ్రీవేంకటపతినామ-
మాదిగాఁ బఠియించే యధికునికి
ఆదైన చదువులు అఱచేతి వతనికి
మేదినిఁ దిరుగాడ మెట్లు వలెనా

రేకు: 0112-03 మలహరిసం: 02-069 వైరాగ్య చింత

పల్లవి: ఈహీ శ్రీహరిఁ గంటే యింత లేదుగా వట్టి-
దాహపుటాసల వెట్టి దవ్వు టింతేకాకా

చ. 1: పలుమారు నిందరిని భంగపడి వేఁడేది
యిలపై దేహము వెంచేయిందు కింతేకా
కలికికాంతలచూపు ఘాతలకు భ్రమసేది
చెలఁగి మైమఱచేటి చేఁత కింతేకా

చ. 2: పక్కన జన్మాలనెల్లాఁ బాటువడేదెల్లాను
యెక్కడోసంసారాన కిందు కింతేకా
వొక్కరిఁ గొలిచి తిట్టు కొడిగట్టేదెల్లాను
చక్కుముక్కు నాలికపై చవి కింతేకా

చ. 3: గారవాన ధనములు గడియించేదెల్లాను
ఆరయ నాదని వీఁగేయందు కింతేకా
చేరి శ్రీవేంకటపతి సేవకుఁ జొరనిదెల్లా
భారపుఁ గర్మపుబాధఁ బట్టువడికా

రేకు: 0112-04 బౌళి సం: 02-070 భక్తి

పల్లవి: ఎంత బాప నా సోద మింత గలదా
అంతయు నీమహిమే హరిభట్లూ

చ. 1: సూరిభట్లొకవంక చొరనిచోట్లు చొచ్చి
వారబియ్య మెత్తియెత్తి పడదాఁకి
నీరువట్టుగొని భూమి నీళ్లెల్లా వారవట్టీ
కేరికేరి నగవయ్య క్రిష్ణభట్లూ

చ. 2: దేవరొజ్జ లొకవంక దిక్కులలోఁ బొలగూడు
దీవెనతో నారగించి తీపుమరిగి
యీవలఁ బెట్టినవారికేమైనా నొసఁగీని
వేవేలు మాయల విష్ణుభట్లూ

చ. 3: సోమయాదు లొకవంక సారిది సురలకెల్లా
నామనితో విందువెట్టీ ననుదినము
హోమపు విప్రులసొమ్ము లొడిసి తాఁ బుచ్చుకొని
వేమరు శ్రీవేంకటాద్రి వెన్నుభట్లూ

రేకు: 0112-05 గుండక్రియ సం: 02-071 వైరాగ్య చింత

పల్లవి: అటుగన నే రోయఁగఁ దగవా
నటనల శ్రీహరి నటమింతే

చ. 1: చిడుముడి మూఁగిన జీవులలోపల
కడఁగి నే నొక్కఁడ నింతే
విడువక పక్షులు వృక్షము లిలపై
వెడఁగు భోగములు వెదకీనా

చ. 2: తనువుల మోచిన తగుప్రాణులలోఁ
గనుఁగొన నొకమశకమ నింతే
మునుకొని కీటకములుఁ జీమలు నిల
చెనకి దొరతనము సేసీనా

చ. 3: శ్రీవేంకటపతిసేవవారిలో
సోవల నొకదాసుఁడ నేను
భావించి సురలు బ్రహ్మాదు లతని-
దైవపు మాయలు దాఁటేరా

రేకు: 0112-06 రామక్రియ సం: 02-072 అద్వైతము

పల్లవి: సేయనివాఁ డెవ్వఁడు చేరి చిల్లరదోషాలు
యేయెడ జీవులజాడ లీశ్వరకల్పితమే

చ. 1: దేవుని నమ్మినయట్టి దేహియట యాతనికి
యీపల నెంతటిపాపమేమి సేసును
భావించి యన్ని నేరాలు పరిహరించు నతఁడే
ఆవటించు సూర్యునికి నంధకార మెదురా

చ. 2: పూజింపించుకొనేవాఁడు భువనరక్షకుఁడట
తేజముతో దురితాలు తెంచఁగలేఁడా
రాజు సేసిన యాణాజ్ఞ రాజుకంటే నెక్కుడా
వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు

చ. 3: చేతనాత్మకుఁడట శ్రీవేంకటేశ్వరుఁడు
జాతిలేని జీవునికి స్వతంత్ర మేది
కాతరపు జన్మానకుఁ గార్యకారణ మేది
యేతున గరుడనికి నెదురా పాములు

రేకు: 0113-01 మాళవి సం: 02-073 నామ సంకీర్తన

పల్లవి: ధ్రువవరదా సంస్తుతవరదా
నవమైన యార్తుని నన్నుఁ గావవే

చ. 1: కరిరాజవరదా కాకాసురవరదా
శరణాగతవిభీషణ వరదా
సిరుల వేదాలు నిన్నుఁ జెప్పగా వినిని
మరిగి మఱఁగుచొచ్చే మమ్ముఁ గావవే

చ. 2: అక్రూరవరదా అంబరీషవరదా
శక్రాది దివిజనిచయవరదా
విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు
చక్రధర శరణంటి సరిఁగావవే

చ. 3: ద్రౌపదీవరదా తగ నర్జునవరదా
శ్రీపతీ ప్రహ్లాదశిశువరదా
యేపున శ్రీవేంకటాద్రి నిటు నేను నాగురుఁడు
చూపఁగా గొలిచే నచ్చుగఁ గావవే

రేకు: 0113-02 గుండక్రియ సం: 02-074 శరణాగతి

పల్లవి: నమ్మిన దొకటే నాకు నీశరణము
యెమ్మెల సంసార మింతే యిందేమిగలదు

చ. 1: యేఁటికర్మము నా కేఁటిధర్మము
యేఁటిదో నేఁ జేయఁగా నీ కేమి గూడెను
నాఁటకపు తొంటివారు నడిచిన మార్గమని
యీఁటుకుఁ జేసేఁగాక యిందేమి గలదు

చ. 2: యేడతపము నా కేడజపము నే
వాడికఁ జేయఁగ నీకు వచ్చినదేమి
బెడిదపుఁ బెద్దలెల్లాఁ బెట్టిన తిట్టములంటా
యీడుకుఁ జేసేఁగాక యిందేమి గలదు

చ. 3: యెక్కడిపుణ్యము నా కెక్కడిభోగములు
యిక్కువ నన్నిట్లఁ జేసి యేమిగంటివి
నిక్కపు శ్రీవేంకటేశ నిన్నుఁ గనుటగాక
యెక్కడి కెక్కడిమాయ లిందేమి గలదు

రేకు: 0113-03 బౌళి సం: 02-075 అధ్యాత్మ

పల్లవి: అన్నియును హరి సేసే యటమటాలే యివి
పన్నిన సుజ్ఞానికి బయలై తోఁచు

చ. 1: తిరుపై యవ్వలవ్వలఁ దిరుగుచుండేటివేళఁ
దిరిగినట్లనుండు దిక్కులెల్లాను
సిరుల సంసారభ్రమఁ జిక్కిన జీవునికిని
పరగ నైహికమే పరమై తోఁచు

చ. 2: సొగసి యద్దమునీడ చూచినవేళఁ దనకు
మగుడ వేఱొకరూపు మతిఁ దోఁచును
తగిలి యిట్లానేపో తనుఁదా నెఱఁగకున్న
నిగిడిన పుట్టువులు నిజమై తోఁచు

చ. 3: కదిసిన సకలాంధకార మంతటాఁ గప్పి
వుదయమైతే నన్నీ నొదిగినట్టు
హృదయపు శ్రీవేంకటేశుఁడు వెల్లవిరైతే
మదిలో నజ్ఞానము మాయమై తోఁచు

రేకు: 0113-04 లలిత సం: 02-076 వైరాగ్య చింత

పల్లవి: అవి యటు భావించినట్లాను
కవగొని యిందుకుఁ గలఁగరు ఘనులు

చ. 1: అరయఁగ నేఁబదియక్షరములె పో
ధరలోపల నిందాస్తుతులు
సరిఁ బురాణములు శాస్త్రవేదములు
యిరవుగ నిన్నియు నిందే పొడమె

చ. 2: వొక్క దేహమున నున్నయంగములు
పెక్కువిధములై బెరసినవి
చిక్కులఁ గొన్నిటి సిగ్గుల దాఁతురు
యెక్కువ యతులకు నిన్నియు సమము

చ. 3: అంతరాత్మలో నంతర్యామై
బంతులఁ దిరిగేటి బంధువులు
చింతింప నతఁడే శ్రీవేంకటేశ్వరుఁ-
డింతకుఁ గర్తని యెంతురు బుధులు

రేకు: 0113-05 మాళవి సం: 02-077 శరణాగతి

పల్లవి: బలువుఁడు హరిఁ జేపట్టితిని
తలఁచినదెల్లా దక్కెను నాకు

చ. 1: దురితధ్వంసుఁడు దుఃఖవిదారుఁడు
అరిభయంకరుఁ డచ్యుతుఁడు
సిరివరుఁ డితనినిఁ జేకొని కొలిచిన
పరమసుఖమెపో భయ మెక్కడిది

చ. 2: దానవాంతకుఁడు దైవశిఖామణి
మానరక్షకుఁడు మాధవుఁడు
నానాముఖముల నాపాలఁ గలఁడు
యేనెపముల నా కెదురే లేదు

చ. 3: అనయము నిర్మలుఁ డఖిలానందుఁడు
ఘనుఁ డీశ్రీవేంకటవిభుఁడు
కనుకొని మము నిటు గాచుక తిరిగీ
యెనయఁగ నేలికె యితఁడే మాకు

రేకు: 0113-06 దేవగాంధారి సం: 02-078 వైరాగ్య చింత

పల్లవి: మేలు లేదు తీలు లేదు మించినదే హరిమాయ
కాలమందే హరిఁ గంటి కైవల్య మొకటే

చ. 1: సురలును జీవులె నసురలును జీవులె
ధర నిందుఁ బ్రకృతిభేదమే కాని
సురలకు స్వర్గ మసురలకు నరకము
పరగ నీరెంటిగతి పాపపణ్యములే

చ. 2: పొలఁతులు జీవులే పురుషులు జీవులే
తలఁప భావభేదములే కాని
బలిమి స్వతంత్రముఁ బరతంత్ర మొకరికి
యెలమి విందులోఁ జెల్లే హీనాధికములే

చ. 3: రాజులును జీవులే రాసిబంట్లు జీవులే
వోజతో సంపద చెల్లేదొకటే వేరు
సాజపు శ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి
బాఁజుఁ గర్మ మొండొకటి బంధమోక్షములు

రేకు: 0114-01 సాళంగనాట సం: 02-079 నిష్వక్సేన

పల్లవి: అదెవచ్చె నిదివచ్చె నచ్యుతు సేనాపతి
పదిదిక్కులకు నిట్టె పారరో యసురలు ॥ పల్లవి॥

చ. 1: గరుడధ్వజంబదె ఘన శంఖరవమదె
సరుసనే విష్ణుదేవుచక్రమదె
మురవైరి పంపులవె ముందరిసేనలవె
పరచి గగ్గుల కాడై పారరో దానవులు

చ. 2: తెల్లని గొడుగులవె దేవదుంధుబులునవె
యెల్ల దేవతల రథాలింతటానవె
కెల్లురేఁగీ నిక్కి హరికీర్తి భుజములవె
పల్లపు పాతాళానఁ బడరో దనుజులు

చ. 3: వెండిపైఁడి గుదెలవె వెంజామరలవె
మెండగు కైవారాలు మించినవవె
దండి శ్రీవేంకటపతి దాడిముట్టెనదె యిదె
బండుబండై జజ్జరించి పారరో దైతేయులు

రేకు: 0114-02 లలిత సం: 02-080 వైరాగ్య చింత

పల్లవి: అయ్యో నేనేకా అన్నిటికంటెఁ దీలు
గయ్యాళినై వ్రిథా గర్వింతుఁగాని

చ. 1: తడిపివుదికినట్టి ధౌతవస్త్రములు నా-
యొడలు మోఁచినమీఁద యోగ్యము గావు
వుడివోక వనములో వొప్పైనవిరులు నే-
ముడిచి వేసినంతనే ముట్టరాదాయను

చ. 2: వెక్కసపు రచనల వేవేలు రుచులు నా
వొక్కనాలుకంటితేనే యోగ్యముగావు
పక్కన దేవార్హపుఁ బరిమళ గంధములు నా-
ముక్కుసోఁకినంతలోన ముట్టరాదాయను

చ. 3: గగనాననుండి వచ్చేగంగాజలములైన
వొగి నాగోరంటితేనే యోగ్యము గావు
నగు శ్రీవేంకటపతి నన్నే రక్షించినదాఁక
మొగడై యెరుక తుదిముట్టరాదాయను

రేకు: 0114-03 నాట సం: 02-081 సంస్కృత కీర్తనలు

పల్లవి: మర్ద మర్ద మమభంధాని
దుర్దాంత మహాదురితాని

చ. 1: చక్రాయుధ రవిశత తేజోఽ౦చిత
సక్రోధసహస్ర ప్రముఖా
విక్రమక్రమా విస్ఫులింగకణ
నక్రహరణ హరినవ్యకరాంకా

చ. 2: కలితసుదర్శన కఠినవిదారణ
కులిశకోటిభవ ఘోషణా
ప్రళయానలసంభ్రమవిభ్రమకర
రళితదైత్యగళరక్తవికీరణా

చ. 3: హితకర శ్రీవేంకటేశప్రయుక్త
సతతపరాక్రమజయంకర
చతురోఽ హంతే శరణం గతోఽ స్మి
యితరాన్ విభజ్య యిహ మాం రక్ష

రేకు: 0114-04 మాళవిగౌళ సం: 02-082 భక్తి

పల్లవి: నిత్య పూజలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి

చ. 1: తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొను చూపులే ఘనదీపము లట
తనలోపలి యంతర్యామికిని

చ. 2: పలుకే మంత్రమట పాదైన నాలికే
కలకలమను పిడిఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలఁపులోపలనున్న దైవమునకు

చ. 3: గమనచేష్టలే యంగరంగగతియట
తమిగల జీవుఁడే దాసుఁడట
అమరిన పూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీవేంకటరాయనికిని

రేకు: 0114-05 ముఖారి సం: 02-083 నామ సంకీర్తన

పల్లవి: కిన్నజానేఽ హం కేశవాత్పర మహో
సన్నుతాకర మమాచరణాయ తస్మై

చ. 1: వేదాంతవేద్యాయ విశ్వరూపాయ నమో
ఆదిమధ్యాంతరహితాధికాయ
భేదాయ పునరప్యభేదాయ నమో నమో
నాదప్రియాయ మమ నాథాయ తస్మై

చ. 2: పరమపురుషాయ భవబంధహరణాయ నమో
నిరుపమానందాయ నిత్యాయ
దురితదూరాయ కలిదోషవిధ్వస్తాయ
హరియచ్యుతాయ మమ ఆత్మాయ తస్మై

చ. 3: కాలాత్మకాయ నిజకరుణాకరాయ నమో
శ్రీలలామాకుచాశ్రితగుణాయ
హేలాంక శ్రీవేంకటేశాయ నమో నమో
పాలితాఖిల మమాభరణాయ తస్మై

రేకు: 0114-06 కాంబోదిసం: 02-084 వైరాగ్య చింత

పల్లవి: చెల్ల నెక్కికొంటివిగా జీవుఁడ యీబలుకోటా
బల్లి దుఁడ నీకు నేఁడు పట్టమాయఁ గోటా

చ. 1: తొమ్మిది గవనులైన దొడ్డతోలుఁ గోటా
కొమ్ముల చవుల మూల కొత్తళాల కోటా
వమ్ములేని మెడవంపు వంకదార కోటా
పమ్మి పగవారినెల్లా పట్టుకొన్న కోటా

చ. 2: తలవాకిలి దంతపుతలుపుల కోటా
తలిరుఁ జేతుల పెద్దదంతెనాల కోటా
వెలియాసలనే దండువిడిసిన కోటా
గులుగై యింద్రియములు కొల్ల గొన్న కోటా

చ. 3: నడచప్పరములనే నలువైన కోటా
జడిసిన చెవుల మించు సవరణ కోటా
పడనిపాట్లఁ బడి ఫలియించెఁ గోటా
యెడమిచ్చి శ్రీవేంకటేశుఁ డేలేఁ గోటా

రేకు: 0115-01 శంకరాభారణం సం: 02-085 నామ సంకీర్తన

పల్లవి: నాటికి నాఁడు గొ త్త నేటికి నేఁడు గొత్త
నాటకపు దైవమవు నమో నమో

చ. 1: సిరుల రుక్మాంగదుచేతి కత్తిధారఁ దొల్లి
వరస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీకృపకలిమి నట్లనే అరులచే
కరిఖడ్గధార నాకుఁ గలువదండాయ

చ. 2: మునుప హరిశ్చంద్రు మొనకత్తిధారఁ దొల్లి
పొనిఁగి చంద్రమతికిఁ బూవుదండాయ
వనజాక్ష నీకృపను వరశత్రులెత్తి నట్టి-
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ

చ. 3: చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ

రేకు: 0115-02 సాళంగనాట సం: 02-086 భక్తి

పల్లవి: కంటిమి రెంటికి భూమి గలుగు దృష్టాంతము
గొంటరి రావణునందు గుహునియందు

చ. 1: నీదాస్యముగల నీచజన్మమైన మేలు
యేదియు నెఱఁగనట్టి యెక్కువ జన్మానకంటే
వాదపుగర్వము లేదు వట్టియాచారము లేదు
సాదించి నైచ్యానుసంధానమే కాని

చ. 2: మిమ్ముఁ దలపుచుఁ జేయు మృగయానయైన మేలు
సొమ్ముపోక మీకుఁగాని సుకృతము సేయుకంటె
దిమ్మరిజన్మము లేదు తెగనికోరిక లేదు
పమ్మి నీపైఁ బెట్టినట్టి భారమేకాని

చ. 3: దిక్కులు సాధించుకంటె తెలిసి శ్రీవేంకటేశు-
దిక్కు నీనామమే కా సాధించుటే మేలు
యెక్కువ తక్కువ లేదు యెఱు కెఱఁగమి లేదు
చక్కజాడతో నీకు శరణంటేఁగాని

రేకు: 0115-03 లలిత సం: 02-087 వైరాగ్య చింత

పల్లవి: కామధేనువై కలిగె నీధరణి
వాములు వలసినవారికి విధులు

చ. 1: అందరు జీవులే ఆయాకర్మముఁ
బొందిబుద్ధు లెప్పుడు వేరు
కొందరు స్వర్గము గోరి సుఖింతురు
కొందరు నరకానఁ గూలుదురు

చ. 2: దేవుఁ డిందరికి దిక్కై యుండును
భావాభావమే బహువిధము
దేవత లమృతాధీనమై మనిరి
తోవనె దనుజులు దురిత మందిరి

చ. 3: పుట్టు గందరికి పొంచి కలిగినదె
దట్టపుమనసులే తమకొలఁది
యిట్టే శ్రీవేంకటేశుఁడు సేసిన
యట్లౌ నాతఁడు అదివో యెదుట

రేకు: 0115-04 గుండక్రియ సం: 02-088 శరణాగతి

పల్లవి: ఏ పురాణముల నెంత వెదకినా
శ్రీపతిదాసులు చెడరెన్నఁడును

చ. 1: హరివిరహితములు అవి గొన్నాళ్ళకు
విరసంబులు మరి విఫలములు
నరహరిఁ గొలిచిటు నమ్మిన వరములు
నిరతము లెన్నఁడు నెలవులు చెడవు

చ. 2: కమలాక్షుని మతిఁగానని చదువులు
కుమతంబులు బహుకుపథములు
జమళి నచ్యుతుని సమారాధనలు
విమలములే కాని వితథముగావు

చ. 3: శ్రీవల్లభుగతిఁ జేరని పదవులు
దావతులు కపటధర్మములు
శ్రీవేంకటపతి సేవించు సేవలు
పావనము లధికభాగ్యపు సిరులు

రేకు: 0115-05 ముఖారి సం: 02-089 హరిదాసులు

పల్లవి: ఏలోకమందున్నా నేమి లేదు
తాలిమి నందుకుఁదగ్గ దావతే కాని

చ. 1: సురల కసురలకు సూడునుఁ బాడునే కాని
పొరసి సుఖించఁగఁ బొద్దు లేదు
ధరలో ఋషులకు తపము సేయనే కాని
మరిగి భోగించఁగ మరి పొద్దు లేదు

చ. 2: గక్కన సిద్ధులకైనా గంతయు బొంతయే కాని
చిక్కి పరుసము గలిగి సెలవు లేదు
రెక్కలుగల పక్షికి రేసుతిమ్మటలే కాని
చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు

చ. 3: సకల జంతువులకు జన్మాదులే కాని
అకటా నిత్యానంద మందలేదు
వెకలి శ్రీవేంకటేశువిష్ణుదాసులకే మంచి-
సుకములెల్లాఁ గలవు సుడివడలేదు

రేకు: 0115-06 దేవగాంధారి సం: 02-090 శరణాగతి

పల్లవి: అన్నియునుఁ దనఆచార్యాధీనము
చెన్నుమీఱ హరిపాదసేవ చేయు మనసా

చ. 1: దైవమూఁ గొంచము గాఁడు తానూ గొంచము గాఁడు
భావించి కొలచేవారి పరిపాటి
చేవలఁ బత్తిముదుగు చేనిముదుగూ లేదు
వావిరిఁ బోఁగెత్తేటి వారివారి నేరుపు

చ. 2: కాలము కడమలేదు కర్మము కడమ లేదు
కేలి విశ్వాసము గలిగిన పాటి
వ్రాలకు ముదిమీ లేదు వక్కణ ముదిమీ లేదు
పోలించేటి విద్వాంసుల బుద్ధిలోని నేరుపు

చ. 3: జ్ఞానానకుఁ దప్పులేదు జన్మానకుఁ దప్పులేదు
నానాటికి వివేకించి నడచేపాటి
పానిపట్టి శ్రీవేంకటపతి యింతకు మూలము
ఆనుక యీతని శరణనేవారి నేరుపు

రేకు: 0116-01 సాళంగనాట సం: 02-091 నృసింహ

పల్లవి: విటిగిరి దానవవీరు లదె
అటిముటి దేవత లాడేరదె

చ. 1: పరగుకంభ మదె పగిలె పగిలె నదె
హరినరసింహంబాయ నదె
గరుడధ్వజ మదె ఘనచక్రం బదె
మొరసేటి శంకపుమ్రోత లవె

చ. 2: వెడలె వెడలె నదె వెనుకొని హిరణ్యుఁ
దొడికిపట్టె నదె తొడమీఁద
విడువక చించిన వేయిచేతులవె
కడపమీఁదనే కదలఁడదె

చ. 3: అదె వామాంకంబందు లక్ష్మి యదె
కదిసి శాంతమదే కరుణ యదె
వుదుటున ప్రహ్లాదు నూరడించె నదె
యిదె శ్రీవేంకటమెక్కె నదె

రేకు: 0116-02 సామంతం సం: 02-092 వైరాగ్య చింత

పల్లవి: ఇద్దరు దేహసమ్మంధ మిదివో మాయ
గద్దించి యాడవుండునో కడసారీ తాను

చ. 1: తోడఁబుట్టిన మమత తొడఁగి కొన్నాళ్లకు
వాడికె పుత్రులమీఁదవలె నుండదు
వేడుక వారెవ్వరో వీరెవ్వరో కాని
కూడపెట్టీ వీరికే కొట్లాడీ వారికే

చ. 2: తల్లిమీఁదఁ గలభక్తి తనకే కొన్నాళ్లకు
యిల్లాలుమీఁదవలె నింత వుండదు
వెల్లవిరి నది యెంత విచారించ నిది యంత
యిల్లుముంగి లొక్కరిది యెరవు వొక్కరిది

చ. 3: నీతితో శ్రీవేంకటేశు నిత్యసేవ కొన్నాళ్ల-
కీతల సంసారమంత యితవు గాదు
ఆతఁడెట్టు యివియెట్టు అందరూ నెఱిఁగినదే
చేతు లొకటిమీఁదట చిత్త మొకయందు

రేకు: 0116-03 నాట సం: 02-093 నృసింహ

పల్లవి: దేవశిఖామణి దివిజులు వొగడఁగ
వేవేలు గతులు వెలసీ వాఁడే

చ. 1: వీదుల వీదుల వెసఁ దురగముపై
భేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు
మోదముతోడుత మోహనమూరితి
యే దెసచూచిన నేఁగీ వాఁడే

చ. 2: కన్నులు దిప్పుచు కర్ణములు గదల
సన్నల రాగెకు చౌకళింపుచును
అన్నిటఁ దేజి యాడఁగ దేవుఁడు
తిన్నఁగ వాగేలు దిప్పీ వాఁడే

చ. 3: వలగొనఁ దిరుగుచు వాలము విసరుచు
నిలిచి గుజ్జు మటు నేర్పులు చూపఁగ
బలుశ్రీవేంకటపతి యహోబలపుఁ
బొలమున సారెకుఁ బొదలీ వాఁడే

రేకు: 0116-04 రామక్రియ సం: 02-094 శరణాగతి

పల్లవి: ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు
గొందినున్న మానుషము కొలువ దెంతైనా

చ. 1: తనంతఁ దా నూరకున్న దైవమే తోడౌను
కినిసి తాఁ బదిరితే కిందుమీఁదౌను
తనుఁ దానే చేరె హరి దధివిభాండకునకు
కొనకెక్కఁ బోయి నీవి కొంచపడెఁ దొల్లి

చ. 2: వొక్కటివాఁడు దానైతే వున్నచోనే మేలు చేరు
పెక్కుబుద్ధులఁ బోతేను పిరివీకొను
పక్కన నంబరీషుఁడు పట్టిన వ్రతాన గెల్చె
దిక్కులెల్లా దుర్వాసు తిరిగి బడలెను

చ. 3: శ్రీవేంకటేశ్వరు చేతిలోవీ జగములు
భావించిఁ యాతడు నడపక మానఁడు
వావిరి నిదెఱఁగక వట్టియలమటఁ బడి
జీవులేల బడలేరు చింత లిట్టె పాయరో

రేకు: 0116-05 శ్రీరాగం సం: 02-095 అధ్యాత్మ

పల్లవి: ఎంత వాటువడె నీశ్వరుఁడు
జంతువుల కేది సతమోకాని

చ. 1: వోముచు లోలో నొకదేహమునకె
యేమి రచించెను యీశ్వరుఁడు
కామించి మోక్షసుఖమునకునైతే
వోమిన స్రిష్టులు వొకటిఁ గావు

చ. 2: భోగించ బుట్టిన భూతకోట్లను
యేగతి మోఁచీ నీశ్వరుఁడు
చేగదేర తనసేవకుఁ జొచ్చిన-
యోగము సులభం బొకటొకటికిని

చ. 3: పన్నిన జగములు ప్రాణాధారము
యెన్నిట నున్నాఁ డీశ్వరుఁడు
కన్నుల శ్రీవేంకటపతియని కని
వున్నవేళ తమ వునికే సుఖము

రేకు: 0116-06 దేసాక్షి సం: 02-096 ఉపమానములు

పల్లవి: నమ్మలేము కానలేము నరులాల మనమింతే
సమ్మతించి యేలేవాఁడు సర్వేశుఁడే సుండీ

చ. 1: కంటికిఁ గంటిరెప్ప కాచుకవుండినయట్టు
వొంటి దేహమెల్లా జీవొడ్డుకొన్నట్టు
అంటుక దేహి నేపొద్దు అంతరాత్మయై వుండీ
జంటయై కాచుకున్నాఁడు సర్వేశుఁడే సుండీ

చ. 2: చీఁకటి నోటికిఁ గడి చేయే కొంటవచ్చినట్టు
ఆఁకటికి గుక్కిళ్లు ఆసయినట్టు
వీఁకల జంతువులకు వెలుపల లోననుండి
సాఁకుచునున్నాఁ డిదివో సర్వేశుఁడే సుండీ

చ. 3: తమదేహ మెంతైనా తానే యింపయి మోచినట్టు
తెమలి ప్రాణ మిన్నిటాఁ దీపయినట్టు
అమరిన భోగమోక్షా లడిగినవారి కిచ్చీ
సముఁడు శ్రీవేంకటాద్రి సర్వేశుఁడే సుండీ

రేకు: 0117-01 రామక్రియ సం: 02-097 అంత్యప్రాస

పల్లవి: ఇట్టిజీవుల కింక నేది వాటి
దట్టమై దేవుఁడ నీవే దయఁజూతుగాకా

చ. 1: తనజన్మవిదు(ధు)లనుఁ దలఁచు నొక్కొకవేళ
వొనర మఱచునట్టె వొక్కొకవేళ
వినుఁ బురాణకథలు వివరించి యొకవేళ
పెనచి సందేహములె పెంచు నొకవేళ

చ. 2: విసిగి సంసారమందు విరతుఁడౌ నొకవేళ
వొఁసగి యందె మత్తుఁడౌ నొకవేళ
పసిగొని యింద్రియాల బంటై వుండు నొకవేళ
ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ

చ. 3: కోరి తపములు చేసి గుణియౌ తా నొకవేళ
వూరకే అలసి వుండు నొక్కవేళ
యీరీతి శ్రీవేంకటేశ యెదలో నీవుండఁగాను
బీరాన నీకే మొఱవెట్టు నొకవేళ

రేకు: 0117-02 సామంతం సం: 02-098 వేంకటగానం

పల్లవి: ఎంత చదివి చూచిన నీతఁడే ఘనము గాక
యింతయు నేలేటి దైవ మిఁక వేరే కలరా

చ. 1: మొదల జగములకు మూలమైనవాఁడు
తుదఁ బ్రళయమునాఁడు తోఁచేవాఁడు
కదిసి నడుమ నిండి కలిగివుండెడివాఁడు
మదనగురుఁడే కాక మఱి వేరే కలరా

చ. 2: పరమాణువైనవాఁడు బ్రహ్మాండమైనవాఁడు
సురలకు నరులకుఁ జోటయినవాఁడు
పరమైనవాఁడు ప్రపంచమైనవాఁడు
హరి యొక్కఁడే కాక అవ్వలనుఁ గలరా

చ. 3: పుట్టుగులయినవాఁడు భోగమోక్షాలైనవాఁడు
యెట్టనెదుర లోనను యిన్నిటివాఁడు
గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి-
పట్టపుదేవుఁడే కాక పరు లిఁకఁ గలరా

రేకు: 0117-03 పాడి సం: 02-099 అధ్యాత్మ

పల్లవి: భోగసహాయులె పొరుగెల్లా

ఆగమవిదు(ధు) లును ననంతములు

చ. 1: కులమునఁ జుట్టాలు కోటాఁనగోట్లు

కలిమిలేమి కొక్కఁడనే గుఱి

పలులంపటముల ప్రజలే యిందరు

నిలిచిన చోటికి నే నొక్కఁడనే

చ. 2: చెట్టడిచిన నిదె చేటఁడు పండ్లు

గుట్టు దెలుసుకొన గురి నేను

వొట్టుక సంసార మూరల్లా నిదె

పుట్టినప్పటికి భువి నొక్కఁడనే

చ. 3: చనవుమనవులకు జగమెల్లా నిదె

కొనకు మొదలికిని గురి నేను

యెనయుచు శ్రీవేంకటేశుఁ డేలెఁ గన

నినుపుగమికాఁడ నే నొక్కఁడనే

రేకు: 0117-04 శ్రీరాగం సం: 02-100 అన్నమయ్య స్తుతి, గురు వందన

పల్లవి: హరి యవతారమీతడు అన్నమయ్య
అరయ మా గురుడీతఁ డన్నమయ్య

చ. 1: వైకుంఠనాథుని వద్ద వడిఁ బాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య
ఆకశపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాడు
ఆకడీకడఁ దాళ్ళపాక అన్నమయ్య

చ. 2: క్షీరాబ్ధిశాయి నిట్టే సేవింపుచు నున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండల తేజమువద్ద నున్నవాఁడు
ఆరీతులఁ దాళ్ళపాక అన్నమయ్య

చ. 3: యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశు పాదములందె వున్నవాఁడు
ఆ(హా?)వభావమై తాళ్ళపాక అన్నమయ్య

రేకు: 0117-05 మలహరిసం: 02-101 శరణాగతి

పల్లవి: కోరి మాభుజముల డాగులు మోచుకున్నారము
ధారుణిలోపల మమ్ము దయఁజూచుఁ గాక

చ. 1: సతతము హరిచేతి శంఖచక్రములే
గతియై మాపాలనుండి కాచుఁ గాక
అతిరయమైనట్టిఅచ్యుతుని ఆయుధాలే
హితవుగ మమ్ము నిట్టె యేలుఁ గాక

చ. 2: కమలాపతిచేతుల గదాపద్మములు
మమకారముతో మము మన్నించుఁ గాక
సమరవిజయమైన శార్ఙ్గాదిశరములు
తమితోడ మాకు దాపుదండై వుండుఁ గాక

చ. 3: ముంచి శ్రీవేంకటేశుఁడు మొలఁగట్టిన కఠారు
అంచెల మాకెల్ల రక్షై అమరుఁ గాక
అంచ నీతని కైదువులమరిన హస్తములు
పంచల మాకిట్టే వజ్రపంజరా లవుఁ గాక

రేకు: 0117-06 లలిత సం: 02-102 వేంకటగానం

పల్లవి: ఎన్నఁడొకో బుద్ధెరిఁగి యీడేరేది జంతువుల
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి

చ. 1: కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది
వేవేలు పాతకాలెల్ల విదళించుమనుచు

చ. 2: చింతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టె బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి
దొంతులైన భవముల తుద గనుమనుచు

చ. 3: అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి
బందె దీర నీకు మ్రొక్కి బ్రదుకుమని
అందపు శ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ-
వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు

రేకు: 0118-01 దేసాళం సం: 02-103 ఉపమానములు

పల్లవి: జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు
కావక పోరాదు మాకుఁ గల యంతర్యామివి

చ. 1: పైపై నెదురుకట్లఁ బంచదార వుండఁగాను
చేపట్టి యడిగి తెచ్చి చేఁదు దిన్నట్లు
పూపలైన చేతిలోనే పుణ్యములు వుండఁగాను
పాపములు చవియంటాఁ బట్టబొయ్యీ జీవుఁడు

చ. 2: యింటిలోనే నవరత్నా లెన్నియైనా నుండఁగాను
కంటగించి గాజుఁబూస గట్టుకొన్నట్లు
వెంటనే హరినామాలు వేయివేలై వుండఁగా
జంట నితరమంత్రాలు జపియించీ జీవుఁడు

చ. 3: చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండఁగాను
వేసరక వెలయాలి వెతకినట్లు
మేసుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండఁగా
వాసిఁ బరులఁ గొలువనే వడిఁ గోరీ జీవుఁడు

రేకు: 0118-02 గౌళ సం: 02-104 వైరాగ్య చింత

పల్లవి: ఊరకే దొరుకునా వున్నతోన్నతసుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట

చ. 1: తలఁపులోపలి చింత దాఁటినప్పుడు గదా
అలరి దైవంబు ప్రత్యక్షమౌట
కలుషంపు దుర్మదము గడచినప్పుడు గదా
తలకొన్న మోక్షంబు తనకుఁ జేపడుట

చ. 2: కర్మంబు కసటు వోఁ గడగినప్పుడు గదా
నిర్మలజ్ఞానంబు నెరవేరుట
మర్మంబు శ్రీహరి నీమఱఁగు జొచ్చినఁ గదా
కూర్మిఁ దన జన్మమెక్కుడు కెక్కుడౌట

చ. 3: తన శాంతమాత్మలోఁ దగిలినప్పుడు గదా
పనిగొన్న తన చదువు ఫలియించుట
యెనలేని శ్రీవేంకటేశ్వరుని దాస్యంబు
తనకు నబ్బినఁ గదా దరిచేరి మనుట

రేకు: 0118-03 భైరవి సం: 02-105 వైరాగ్య చింత

పల్లవి: ఏమిసేతు దైవమా యెన్నఁడు గరుణించేవో
దామెన సంసారములోఁ దట్టువడీ మనసు

చ. 1: యెక్కడి పగయొకో ఇంద్రియాలు నన్నుఁబట్టి
చక్కుముక్కు సేసి యెంచి సాధించీని
గుక్కక యేమిసేసిన కొలయొకో వెంటవెంట
వెక్కసపు పుట్టువులై వెనుతగిలీని

చ. 2: యెన్నాళ్లపాపమొకో యెడతెగక నాలోన
వున్నతపుఁ గోపమై వుమ్మగిలీని
తిన్ననై యెవ్వరిచేతితిట్టు దాఁకినవిధమో
విన్ననై విజ్ఞానమెల్లా వీటఁబోయఁ దుదిని

చ. 3: యే వేళ గుణమో యెడతెగని కర్మాలు
రావిమాని జిగురై వూరక యంటీని
శ్రీవేంకటేశుఁడ నీవు చి త్తములోపల నుండి
కావఁగఁగదా నీవే గతి యనవలసె

రేకు: 0118-04 ముఖారి సం: 02-106 అధ్యాత్మ

పల్లవి: నిరుహేతుక దయానిధివి నీవు
కరుణించు నీకు నొక్కటి విన్నపము

చ. 1: దేవా నీమహిమ తెలియ నెవ్వరివశ-
మీవల నీవే గతెను టింతేకాక
భావించలేరు నిన్ను బ్రహ్మాదులు సహితము
నీవేడ నేనేడ నే నొక జంతువను

చ. 2: చిత్తా హరి నాదిక్కు చేకొని యవలోకించవే
యిత్తల సంసారవార్ధి యీఁదుచున్నాఁడ
హత్తి చూచేవారేకాని అడ్డగించేవారు లేరు
పొత్తుల నాధర్మము పుణ్యము నీచేతిది

చ. 3: అవధారు శ్రీవేంకటాధీశ నాజన్మము
కవిసి యింద్రియములఁ గట్టువడ్డాఁడ
జవళి నీపాదములే శరణము చొచ్చినాఁడ
తవిలి నీచిత్తమింతే తరవాత నిఁకను

రేకు: 0118-05 బౌళి సం: 02-107 దశావతారములు

పల్లవి: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి విజయముఁ బొంది
దేవతలు చూడ దశదిక్కులకు నేసెను

చ. 1: అరికమ్ము వేసెనట్టె అల్లనరకాసురుపై
మేరమీరి రావణునిమీఁద నేసెను
సారపుజలధిమీఁద జలములింకఁగ నేసె
దారి దప్పకుండ నేడుదాళ్లు దెగనేసె

చ. 2: పగదీర మింటిమీఁది బాణునిమీఁద నేసె
మిగుల మెరసి మాయమృగము నేసె
జగములో రాక్షసుల సంహరముగ నేసె
నిగిడి రక్తగుండాలు నిండ నేసెను

చ. 3: ఖరదూషణాదుల కడిఖండలుగ నేసె
సరుసఁ గుంభకర్ణునిఁ జావనేసెను
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
గరుడనిమీఁద నెక్కి కంటువాయ నేసెను

రేకు: 0118-06 బౌళి సం: 02-108 నిష్వక్సేన

పల్లవి: ఆర్పులు బొబ్బలె నవె వినుఁడు
యేర్పడ నసురల నిటువలె గెలిచే

చ. 1: కూలిన తలలును గుఱ్ఱపు డొక్కలు
నేలపైఁ బారిన నెత్తురులు
వోలిఁ జూడుఁ డిదె వుద్ధగళలీ రణ-
కేలిని విష్వక్సేనుఁడు గెలిచె

చ. 2: పడిన రథంబులు బాహుదండములు
కెడసిన గజములు గొడగులును
అడియాలము లివె అక్కడ నిక్కడ
చిదుముడి విష్వక్సేనుఁడు గెలిచె

చ. 3: పగుల పగుల వృషభాసురునిఁ జంపె
పగ నీఁగె అతని బలములతో
అగపడి శ్రీవేంకటాధిపు పంపున
జిగిగల విష్వక్సేనుఁడు గెలిచె

రేకు: 0119-01 లలిత సం: 02-109 శరణాగతి

పల్లవి: సకల బలంబులు నీవే సర్వేశ్వర నాకు
అకలంకంబగు సుఖమే అన్నిట నిదే నాకు

చ. 1: పొందుగఁ జక్రాంకితమే బుజబలమిదె నాకు
అందిన హరి నీచింతే ఆత్మబలము నాకు
సందడిఁ బేరుబలము కేశవనామము నాకు
యిందును నందును భవభయ మిఁక లేదిదే నాకు

చ. 2: అంగపుఁ దిరుమణు లివి పంచాంగబలము నాకు
సంగతి నీపై పాటలె స్వరబలిమిదే నాకు
రంగుగ నీగుణరాసులే రాసిబలము నాకు
యింగితముగ నిహపరముల కెదురేదిదే నాకు

చ. 3: కనుఁగొను నీవిగ్రహమే గ్రహబలిమిదె నాకు
విను నీదాసుల సేవే వెనుబలిమిదె నాకు
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు
ఘనమే చెప్పఁగ నింతటఁ గలిగెబో యిదే నాకు

రేకు: 0119-02 సాళంగనాట సం: 02-110 తేరు

పల్లవి: ఇదివో వీథివీథుల నీతని తేరు
యెదుట శ్రీవేంకటాద్రిని తేరు

చ. 1: చట్టువడఁ దోలె నాఁడు సముద్రాలపైఁ దేరు
ఘొట్టుగాఁ దోలెను పౌండ్రకునిపైఁ దేరు
జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు
కొట్టి తోలె హంసడిచుకులపై(???) తేరు (డిభక డిచికుఁడు - హంసుని సోదరుఁడు)

చ. 2: ఘోరమై కుంగఁగఁ దోలె కులగిరులపైఁ దేరు
కౌరవసేనపై దోలె గక్కనఁ దేరు
కోరి మధురమీఁద నక్రూరుఁ గూడ తోలెఁ దేరు
ఆరసి సంధిమాటలు ఆడఁ దోలెఁ దేరు

చ. 3: తచ్చి శిశుపాలాది దైత్యులపైఁ దోలెఁ దేరు
పెచ్చుగాఁ దోలె రుక్మిణి పెండ్లి తేరు
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చెచ్చెరఁ దోలె దిక్కుల సింగారపుఁ దేరు

రేకు: 0119-03 పాడి సం: 02-111 వేంకటగానం

పల్లవి: అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు
నినుఁ గొల్చితిఁ గావవే నీరజాక్షుఁడా

చ. 1: అదివో కోనేటిలోన నదివో సర్వ తీర్థములు
అదివో పైఁడిమేడల హరినగరు
పొదలి పరుషలెల్లా పొదిగి సేవించేరు
యిదివో వరములిచ్చె నిందిరానాథుఁడు

చ. 2: అదివో వేదఘోషము అదివో సురలమూఁక
అదివో విశ్వరూపము అద్భుతమందె
గుదిగొనెఁ బుణ్యములు కోట్ల సంఖ్యలు చేరె
యిదివో దయదలఁచె నీశ్వరేశ్వరుఁడు

చ. 3: అదివో శ్రీవేంకటేశుఁ డక్కున నలమేల్మంగ
అదివో నిత్యశూరులు ఆళువారలు
నిదుల శేషాచలము నిక్కి పైపైఁ బొడచూపె
యిదివో కొలువున్నాఁడు హృదయాంతరాత్ముఁడు

రేకు: 0119-04 నాట సం: 02-112 నృసింహ

పల్లవి: అహోబలేశ్వరుఁ డరికులదమనుఁడు
మహామహిమలను మలసీ వాఁడే

చ. 1: కదలుఁ గన్నులును కరాళవదనము
గుదిగొను భయదపుఁ గోరలును
అదరు మీసములు నలరఁగ నవ్వుచు
పుదుటు తోడఁ గొలువున్నాఁడు వాఁడె

చ. 2: అతిసిత నఖములు ననంత భుజములు
వితతపరాక్రమ వేషమును
అతులదీర్ఘజిహ్వయుఁ గడు మెరయఁగ
మితిలేని కరుణ మెరసీ వాఁడే

చ. 3: సందడి సొమ్ములు శంఖచక్రములు
పొందుగ దివిజులు పొగడగను
యిందిరఁ దొడపై నిడి శ్రీవేంకట-
మందు నిందు గడుఁ నలరీ వాడే

రేకు: 0119-05 సాళంగనాట సం: 02-113 నృసింహ

పల్లవి: సిరిఁ దొడపై నిడి శ్రీనరసింహుఁడు
యిరవుగ వరములనిచ్చీని వాడే

చ. 1: ఘనమగు కోరలు కరాళవదనము
చెనకుచు గొడసెటి జిహ్వయును
నినిపుఁ గటమరలు నిటలలోచనము
నొనరఁగ గొలువై యున్నాఁడు వాఁడే

చ. 2: చటులచక్రకరంబును శార్ఙ్గరంబును
అటు వరదాభయహస్తములు
పటుతరయోగపు పట్టబంధమును
కటితటి జెలఁగఁగఁ గడఁగీ వాఁడే

చ. 3: పరపగు శేషుని పడగల నీడల
అరుదగు రవిచంద్రాంకముల
సిరులగద్దెపై శ్రీవేంకటేశుడు
పరిపూర్ణుఁడై పరగీ వాఁడే

రేకు: 0119-06 శ్రీరాగం సం: 02-114 శరణాగతి

పల్లవి: నిర్మలులు వీరు నిత్యసుఖులు
కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు

చ. 1: పరమజ్ఞానసంపన్నులగువారికిని
అరుదుగా దిచటి మహదైశ్వర్యము
హరికృపాధనము చేనబ్బిన మహాత్ములకు
సరకుగాకుండు పంచల నిధానములు

చ. 2: బలిమిని వేదాంతపట్టభద్రులకు నిల
బలురాజ్యపదవు లిరుగడబంట్లు
లలిమీరి హరిచక్రలాంఛనపు శూరులకు
యెలమి విజయములెల్ల నింటిలో నుండు

చ. 3: యీవలను శ్రీవేంకటేశు శరణాగతుల-
కావటించిన పుణ్య మడుపుగాదు
దైవజ్ఞులయిన యాధర్మస్వరూపులకు
వేవేలు భోగములు వెనుతగులుచుండు

రేకు: 0120-01 శంకరాభరణం సం: 02-115 వైరాగ్య చింత

పల్లవి: చీచీ వో జీవుఁడా చింతించుకో జీవుఁడా
ఆచందాన కీచందము అరుహమా జీవుఁడా

చ. 1: వుత్తముఁడయిన హరి వుండేటి యాతుమలోన
తత్తరపుఁ గాంతలను తలపోసేదా
వొత్తి నారాయణనామ ముచ్చరించే నోరను
రుత్త యధరపుఁదోలు రుచిగొనేదా

చ. 2: పొందుగాఁ గోవిందునిఁ బూజించేటి చేతులను
సందడిఁ జన్నులమీఁద జాఁచబొయ్యేదా
కందువ దేవునిరూపు కనుఁగొనే చూపులు
ముందరి మర్మపుటంగములమీఁదఁ బెట్టేదా

చ. 3: వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను
ఆవటించి యాడసుద్దులాలకించేదా
శ్రీవేంకటేశ్వరుని సేవించే యీజీవనము
భావించక విషయాల పాలు సేసేదా

రేకు: 0120-02 దేసాక్షి సం: 02-116 వేంకటగానం

పల్లవి: ఇంతదేవుఁ డింక వేఁడీ యెంచి చూపుఁడా
చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో

చ. 1: వేసితే వేయురూపులు విశ్వరూప మితఁడు
శ్రీసతీశుఁ డిందరిలో శ్రీమంతుఁడు
భాసురపు భూమి మోచే బలవంతుఁ డిన్నిటాను
దాసులైతే మన్నించు నీదైవముఁ గొలువరో

చ. 2: గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాఁడు
అట్టె దేవతల మొర లాలించేవాఁడు
చిట్టకపు దానవుల చించి చెండాడేటివాఁడు
ఇట్టే శరణంటేఁ గాచు నీతనిఁ గొలువరో

చ. 3: కాలముఁ గర్మము మాయ గల్పించినయట్టివాఁడు
ఆలించి సర్వజీవుల అంతర్యామి
వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాఁడు
యేలీలఁ గొల్చిన మెచ్చు నీవిభుఁగొలువరో

రేకు: 0120-03 భూపాళం సం: 02-117 అధ్యాత్మ

పల్లవి: అప్పుడు చూచేదివో అధికుల నధముల
తప్పక యెచ్చరి యిదే తలఁచవో మనసా

చ. 1: కొండలవంటి పనులు కోరి ముంచుకుంటే నూర-
కుండి కైకొననివాఁడే యోగీంద్రుఁడు
నిండిన కోపములకు నెపముల గలిగితే
దండితోఁ గలఁగని యాతఁడే ధీరుఁడు

చ. 2: సూదులవంటి మాటలు సొరిదిఁ జెవి సోఁకితే
వాదులు వెట్టుకొననివాఁడే దేవుఁడు
పొదుకొన్న సంసారబంధము నోరూరించితే
ఆదిగొని మత్తుఁడు గానెట్టివాఁడే పుణ్యుఁడు

చ. 3: గాలాలవంటి యాసలు కడుఁ దగిలి తీసితే
తాలిమితోఁ గదలనాతఁడే ఘనుఁడు
మేలిమి శ్రీవేంకటేశుమీఁద భారము వేసుక
వీలక తనలో విఙ్ఞువీఁగువాఁడే నిత్యుఁడు

రేకు: 0120-04 మలహరిసం: 02-118 వైరాగ్య చింత

పల్లవి: కొనమొద లేదో గుఱిగాన రొరులు
మునుకొను సంసారమోహాంధమందు

చ. 1: తలఁచును బ్రహ్మాండతతులకు నవ్వల
తలఁచేటి జీవుఁడు తా నణువు
అలరిన యాసల ననలునుఁ గొనలును
వెలసీ సంసారవృక్షములోన

చ. 2: పుట్టునుఁ బొదలును భువి బహురూపుల
పుట్టేటి యాతఁడు పొరి నొకఁడే
వొట్టుక యీఁదును వుభయకర్మముల
చట్టెడు సంసారసాగరములను

చ. 3: తగులు నన్నిటా తనుభోగంబుల
తగిలేటి పురుషుఁడు తా ఘనుఁడు
నిగిడి శ్రీవేంకటనిలయుఁడు గతైతే
అగపడ సంసారానందమందు

రేకు: 0120-05 ఆహిరి సం: 02-119 అధ్యాత్మ

పల్లవి: కలిదోషములాల కడు నేల మీరేరు
యిలధరుఁ డుండగాను యిఁకనేఁటి సుద్దులు

చ. 1: జగములేలెడువాఁడు సర్వాంతరాత్ముఁడు
జిగి నింక నీకేబుద్ధి చెప్పనోపఁడా
నిగిడి పుట్టించేటివాఁడు నిండుక వుండేటివాఁడు
తెగని కర్మములెల్ల తిద్దకేల మానును

చ. 2: దనుజులఁ గొట్టేవాఁడు ధర్మము నిలిపేవాఁడు
పనిగొన్న దురితాలు పాపనేరఁడా
కొనమొదలైనవాఁడు గురి దానైనవాడు
వునికి మనికి సేయకూరకుండీనా

చ. 3: స్వతంత్రుడైనవాఁడు స్వామియైనవాఁడు
గతియై దాసులనెల్లఁ గానకుండీనా
యితఁడే శ్రీవేంకటేశుఁ డిందిరాపతైనవాఁడు
సతతము మాకు నిట్టే సంపద లొసఁగఁడా

రేకు: 0120-06 దేసాళం సం: 02-120 అద్వైతము

పల్లవి: వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసిరా

చ. 1: అరయ జీవులకెల్లా నభేదమైతే
గురుఁడు శిష్యులు లేఁడు కూడ దర్థము
సారిది నాతుమలోన సోహంభావనయైతే
సరి మునుల దేవపూజలు చెల్లవు

చ. 2: సహజలీలావిభూతి సర్వము మిథ్య యైతే
బహుయాగాది కర్మాల పస లేదు
మహిలోని జననాలు మరణాలు మాయమైతే
విహితాచారాలు సేయ విధే లేదు

చ. 3: ఘటన బ్రహ్మము నిరాకార మైతేఁ బఠియింప
యిటు పురుషసూక్తాదు లివి మరేల
అటు శ్రీవేంకటేశుదాస్యము లేక బిగిసితే
సటలాడుకొనేడి రాక్షసమత మవును

రేకు: 0131-01 పాడి సం: 02-121 అద్వైతము

పల్లవి: ఇదివో సుజ్ఞానము 'సూత్రే మణిగణా యివ' గాన
మది నితరమే లేదు మాయల 'యద్భావం తద్భవతి'

చ. 1: యెదుటఁగను యీజగము యీది నీవన వెఱతును
అది వీపరీతజ్ఞానము 'యద్దృష్టం తన్నష్టము' గాన
పొదులుచుండేటి యీజగము పొసఁగ నీవు గావన వెఱతు
యిది విపరీతజ్ఞానము 'సదసచ్చాహం' బంటివి గాన

చ. 2: నిండిన యీజీవులు నీవేయన వెఱతును
దండనే బద్ధులు వీరు 'ద్వాసుపర్ణ' వున్నది గాన
మెండగు యీజీవులను మీరు గారన వెఱతును
వుండెడి వీరలు నిత్యులు వొగి 'నహమాదిశ్చమధ్యము' గాన

చ. 3: యిది మునుపె నీచిక్కు యిందుకు ద్రిష్టం బొక్కటె
తుదఁ దొల్లె నీదాసులు గలరు తుదఁ దొల్లియే నీవుఁ గలవు
వెదకు మా శ్రీవేంకటపతి నిను సేవించఁగ నిను సేవించఁగను
అదన నిన్నంటినవారల నీయంతలు సేతువుగాన

రేకు: 0131-02 ముఖారి సం: 02-122 శరణాగతి

పల్లవి: ఏ దుపాయము యే నిన్నుఁ జేరుటకు
ఆదినంత్యములేని అచ్యుతమూరితివి

చ. 1: వెలయ నీగుణములు వినుతించేనంటే
తెలియ నీవు గుణాతీతుఁడవు
చెలరేఁగి నిను మతిఁ జింతించేనంటే
మలసి నీ వచింత్య మహిముఁడవు

చ. 2: పొదిగి చేతుల నిన్నుఁ బూజించేనంటే
కదిసి నీవు విశ్వకాయుఁడవు
అదన నేమైన సమర్పించేనంటే
సదరమై అవాప్త సకలకాముఁడవు

చ. 3: కన్నుల చేత నిన్నుఁ గనుఁగొనేనంటే
సన్నిధి దొరక నగోచరుఁడవు
యిన్నిటాను శ్రీవేంకటేశ నీవు గలవని
వన్నెల శరణనే వాక్యమే చాలు

రేకు: 0131-03 పాడి సం: 02-123 అధ్యాత్మ

పల్లవి: వేఱొక భావనలేల వీనితోఁ బెనఁగనేల
తూఱినందే హరిగూర్చి తుదగంట గాక

చ. 1: చూచే కన్నుల నేమిఁ జూడకుండవచ్చునా
చూచినందెల్లా హరిఁ జూచుట గాక
వేచిన వీనుల నేమీ వినకుండవచ్చునా
కాచి యవే హరికథగా వింట గాక

చ. 2: కోరేటి చవుల జిహ్వ గోరకుండవచ్చునా
కోరిన చవుల హరిఁ గూర్చుట గాక
ఆరీతి బారే మనసు అడఁచఁగవచ్చునా
ఆరితేరి అన్నిటాను హరిఁ గంట గాక

చ. 3: వొడలు మోచిన దేహి వోమకుండవచ్చునా
వోడలు శ్రీహరిదనే వోముట గాక
బడినే శ్రీవేంకటేశుఁ బాసివుండవచ్చునా
యెడయ కందె సుఖియించుట గాక

రేకు: 0131-04 గౌళ సం: 02-124 అద్వైతము

పల్లవి: ఏడనుందురో తాము యెన్నికెపొంజులు దాఁటి-
రాడకాడే పొడచూపే రాహా మేలు

చ. 1: యెలమి స్వప్నమనే యెడపుఁ జావడిలో
వొలసి జీవుఁడు కొలువున్నపుడు
వెలినున్న చైతన్యవిధుల దొరలచేతి-
యలబలము గాన మాహా మేలు

చ. 2: ఉప్పడమయి దేహమనే వూరఁ బెద్దచావడి
ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు
చప్పుడుతో నింద్రియవిషయపరివారము
అప్పుడు పారాడుదురు ఆహా మేలు

చ. 3: అక్కడ నిద్దురలనే అంతఃపురాల కేఁగి
వుక్కున భోగాన నాత్మ వున్నపుడు
యెక్కువ శ్రీవేంకటేశ యెవ్వరూ నాడకుఁ బోరు
అక్కడా నీవే వుందు వాహా మేలు

రేకు: 0131-05 బౌళి సం: 02-125 అంత్యప్రాస

పల్లవి: నానావర్గముల నాఁటుకొను నొకయోగి
మానిమీఁది తపసి సామన్యుఁ డాయోగి

చ. 1: పున్నమనమాసఁ గూడఁ బొదిగీ నొక్కొకయోగి
కన్నులచూపులు సరిగాఁ దూఁచు నొకయోగి
మిన్నునూయి చేఁతాటఁ జేఁది మెచ్చు మింగు నొకయోగి
వెన్న సన్నముగ నూరి వీఁగు నొకయోగి

చ. 2: గాలి ముడియగఁ గట్టి కలుగుడిగట్టు యోగి
నాలిమింటివిత్తు వెట్టి నగు నొకయోగి
మూలనిధానము గని ముందు గానఁ డొకయోగి
నేల దలకిందు సేసి నిక్కు నొకయోగి

చ. 3: గతజలములకెల్లఁ గట్టగట్టు నొకయోగి
తతిఁ బూవులమాటల దడిగట్టు యోగి
యితవైన శ్రీవేంకటేశుని మఱఁగు చొచ్చి
గతిగనే నాతఁ డొక్కడే యోగి

రేకు: 0131-06 ముఖారి సం: 02-126 అధ్యాత్మ

పల్లవి: హరియే సకలక్రియలై తృప్తి యిచ్చుఁగాక
యెరవులవారి చేఁతలెందాఁకా వచ్చీని

చ. 1: నరులకు నరులే పరలోకక్రియలు
సిరిమోహాచారాలఁ జేతురు గాక
తరుపాషాణపశుతతుల కెవ్వరు సేసే-
రరయఁగ భ్రమ గాక అవి పస్తులున్నవా

చ. 2: కొడుకులుగలవారు కోరి పితృముఖమున
కుడుపులు దమవారిఁ గూర్చి పెట్టఁగా
అడరి శ్రీహరియే అన్నియుఁ దాఁ జేకొని
తడవి వారిఁ గొంత దయఁజూచుఁ గాక

చ. 3: తారేడ వారేడ దైవము శ్రీవేంకటేశుఁ-
డారయ నంతరాత్ముఁ డని తెలిసి
ధారతో యాతనియాజ్ఞఁ దప్ప కాదివసాన
చేరువఁ జేసేవెల్లాఁ జేయుఁడీ యాతనికి

రేకు: 0132-01 గుండక్రియ సం: 02-127 అధ్యాత్మ

పల్లవి: హరిహరి నీమాయాజగమిది అండనే చూచుచు నవ్వుచును
అరసి యందులో నిను భావించేటి ఆత్మభావమిది యెన్నఁడొకో

చ. 1: సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి
సకలేంద్రయముల జాలటు మాని సకలవిషయముల రహితుఁడై
సకలముఁ దనవలె భావించి సర్వాంతరాత్మవు నినుఁ దెలిసి
అకలంకంబున నుండెడి భావంబది యిఁక నెన్నఁడొకో

చ. 2: ఘనమగు కోర్కులఁ జాలించి ఘనకోపంబు నివారించి
ఘనకాముకత్వముల నటు దనిసి ఘనమగు నాసలఁ దొలఁగించి
ఘనముఁ గొంచముల నినుఁ దలఁచి ఘనాఘనుఁడవు నీవనుచు
అనుమానము లటు సుఖియించే దది యిఁక నెన్న డొకో

చ. 3: పరచింతలలోఁ దడఁబడక పరమార్గంబుల కగపడక
పరహింసలకును యెన్నఁడు జొరక పరదూషణలకు నెడగిలిసి
పరదేవుఁడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు
అరమరపుల నేఁ జొక్కితి తనిసేదది యిఁక నెన్నఁడొకో

రేకు: 0132-02 బౌళి సం: 02-128 వైరాగ్య చింత

పల్లవి: ఏది వలసె నీవది సేయు యిందులోన నో జీవాత్మ
పాదగు మనలో నంతరాత్మయై పరగిన శ్రీహరి పనుపునను

చ. 1: మనవంటి జీవులే మహిలోన నొక కొన్ని
శునకములై కుక్కుటములై సూకరములు నైనవి
దినదినముఁ గర్మపాశములఁ దిరిగెడి దుర్దశ లటుచూడు
సనకాదులై కొందరు జీవులు శౌరిదాసులై రటుచూడు

చ. 2: కన్నులుఁ గాళ్ళు మనవలెఁ దనువులు గైకొని కొందరు నరులు
పన్నిన తొత్తులు బంట్లునై మనపనులు సేయుచునున్నారు
యెన్నఁగ శ్రీహరి నెఱఁగక యిడుములఁ బొరలెడి దది చూడు
మున్నె హరిదాసులై నారదముఖ్యులు గెలిచిన దది చూడు

చ. 3: యింతగాలమును యీపుట్టుగులనె యిటువలెఁ బొరలితి మిన్నాళ్ళు
యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి యీ జన్మంబున మము నేలె
వింతల బొరలిన నరకకూపముల వెనకటి దైన్యములటు చూడు
సంతసమున ముందరిమోక్షము సర్వానందంబది చూడు

రేకు: 0132-03 శంకరాభరణం సం: 02-129 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీవు సర్వసముడవు నీవు దేవదేవుఁడవు
ఈవల నాగుణదోషాలెంచ నీఁక నేలా

చ. 1: పూవులపైఁ గాసీఁ బొరి ముండ్లపైఁ గాసీని
ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా
పావనుల నటు గాచి పాపపుంజమైన నన్నుఁ
గావఁగా నీకృపకునుఁ గడమయ్యీనా

చ. 2: గోపుమీఁద విసరీఁ గుక్కమీఁద విసరీని
పావనపు గాలికిని పాపమంటీనా
దేవతల రక్షించి దీనుఁడనైన నాకుఁ
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా

చ. 3: కులజుని యింటనుండీ కులహీనుని యింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేఁడు గావవే

రేకు: 0132-04 సామంతం సం: 02-130 వైరాగ్య చింత

పల్లవి: నెప్పున ధర్మపుణ్యము నీచేతి దింతే
యెప్పుడు గాచినఁ గావు మింతా నీచిత్తము

చ. 1: యేవల నరుఁడు లేక యెద్దే తా దున్నునా
నీవు సేయించక వేరే నేఁ బుణ్యము సేసేనా
దేవుఁడ సూర్యుఁడు రాక తెల్లవారునా రేయి
వేవేగ నీకృపఁగాక విజ్ఞానినౌదునా

చ. 2: కుమ్మరవాఁడు లేకే కుండ రాఁ బుట్టునా
నెమ్మి నీవు పుట్టించక నేనే పుట్టితినా
వమ్ముల రాట్నము నిలువక గుండ్రలు నిల్చునా
పమ్మి నీయప్పణ లేక భవములు మానునా

చ. 3: మక్కువ మగఁడులేని మనువు గలుగునా
లెక్కించి యంతర్యామివి లేని నే నున్నాఁడనా
చక్కఁగ శ్రీవేంకటేశ శరణనే బుద్ధి నాకు
తక్కక నీవియ్యకుంటే దాసుడ నే నౌదునా

రేకు: 0132-05 లలిత సం: 02-131 శరణాగతి

పల్లవి: ఇహమేకాని యిఁకఁ బరమేకాని
బహుళమ్మై హరి నీపై భక్తే చాలు

చ. 1: యెందు జనించిన నేమి యెచ్చోట నున్న నేమి
కందువ నీదాస్యము గలిగితేఁ జాలు
అంది స్వర్గమేకాని అల నరకమేకాని
అందపు నీనామము నా కబ్బుటేచాలు

చ. 2: దొరయైనఁ జాలు గడుఁ దుచ్ఛపు బంటైనఁ జాలు
కరఁగి నిన్నుఁ దలఁచఁగలితేఁ జాలు
పరులు మెచ్చిన మేలు పమ్మి దూషించిన మేలు
హరి నీసేవాపరుఁడౌటే చాలు

చ. 3: యిలఁ జదువులు రానీ యిటు రాక మాననీ
తలఁపు నీపాదముల తగులే చాలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చలపట్టి నాకు నీశరణమే చాలు

రేకు: 0133-01 మలహరిసం: 02-132 శరణాగతి

పల్లవి: సర్వోపాయముల జగతి నాకితఁడే
పుర్వీధరుఁడు పురుషోత్తముం డితఁడే

చ. 1: సకలగంగాది తీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరణి జలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయనశాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చుటఁ జాతుపడి కైంకర్య మిదియే

చ. 2: ఉపవాసతపములివి యితని ప్రసాదంబులొగి భుజింపుటే నాదు దినదినంబు
జపరహస్యోపదేశంబు లితనిపాదజలంబులు శరణనేటి సేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషుల దర్శనము నాకు నొగి నిచటి బహువృక్షదర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రవణంబు లిచ్చోటి యెన్నఁగల బహుపక్షికలకలంబు

చ. 3: తలఁపుగల యోగంబులందు శ్రీవైష్ణవులఁ దగులు సంవాససహయోగంబు
వెలయ నిండుమహోత్సవంబులిన్నియు నితనివిభవంబులెసఁగు తిరునాళ్ళు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింతయు నాకు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి
అలరు నాసంపదలు యితని పట్టపురాణి అలమేలుమంగ కడకంటిచూపు

రేకు: 0133-02 శ్రీరాగం సం: 02-133 వైరాగ్య చింత

పల్లవి: ఇంతయు నీమాయమయ మేగతిఁ దెలియఁగ వచ్చును
దొంతిఁబెట్టిన కుండలు తొడరిన జన్మములు

చ. 1: కలలోపలి సంభోగము ఘనమగు సంపద లిన్నియు
వలలోపలి నిడిపరులు వన్నెల విభవములు
తలఁపునఁ గలిగియు నిందునే తగులకపో దెవ్వరికిని
తెలిసినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు

చ. 2: అద్దములోపలి నీడలు అందరి దేహపురూపులు
చద్దికి వండిన వంటలు జంటఁగర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి నజ్ఞానాంబుధిలో-
నద్దిన దిది దెలియఁగరా దంబుదముల మెఱుఁగు

చ. 3: మనసునఁ దాగినపా లివి మదిఁగల కోరిక లిన్నియు
యినుమున నిగిరిననీళ్లు యిల నాహారములు
పనివడి శ్రీవేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని విడిచిన మనుజుల కాయపు మర్మములు

రేకు: 0133-03 లలిత సం: 02-134 భక్తి

పల్లవి: షోడశకళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి

చ. 1: అలరు విశ్వాత్మకున కావాహన మిదె పర్వ-
నిలయున కాసనము నెమ్మి నిదె
అల గంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జన మిదె

చ. 2: వర పీతాంబరునకు వస్త్రాలంకార మిదె
సరి శ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిర మిదె కోటిసూర్యతేజునకు దీపము(???)

చ. 3: అమృతమథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము
అమరిన శ్రీవేంకటాద్రిమీఁది దేవునికి
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో

రేకు: 0133-04 మాళవిగౌళ సం: 02-135 అధ్యాత్మ

పల్లవి: ఏమీ నెఱఁగనినాఁడు యిటు నిన్నుఁ గొలిచేనా
నీమాయ దెలుపఁగా నినుననేఁ గాకా

చ. 1: పసురముగఁ జేసితే బడి నిన్నుఁ దలఁచేనా
వెస రాయిఁ జేసితే వెదికి నిన్నెఱిఁగేనా
పొఁసగ మానుగ నన్నుఁ బుట్టించితేఁ బొగడేనా
ముసిపి నరుఁ జేయఁగా మొరయిడేఁ గాక

చ. 2: మొగి మృగముఁ జేసితే మొక్కనెఱిఁగెనా
తగఁ బక్షి జేసితేఁ దరిఁ బూజ సేసేనా
జిగి నితరజంతువుగఁ జేసితేఁ దగిలేనా
అగపడి వివేకిఁ జేయఁగననేఁ గాక

చ. 3: యింత కధికారిఁ జేసి యీప్రపంచజ్ఞాన-
మింత యొసఁగితివి మరఁ గిఁకనేలా
చింత లిన్నియుఁ దీర శ్రీవేంకటేశ నను
సంతతము నేలఁగా శరణనేఁ గాక

రేకు: 0133-05 శుద్ధవసంతం సం: 02-136 అధ్యాత్మ

పల్లవి: పరమాత్ముఁ డొక్కఁడే పరమపావనుఁడు గన
పరిపూర్ణుఁడనెడి యీభావమే చాలు

చ. 1: హేయ మిందే దుపాధేయ మిందేది
బాయిటనే హరి సర్వపరిపూర్ణుఁడు
నేయునెడ గుణభావజీవకల్పనము లివి
రోయఁజూచినఁ దనదు కాయమే రోఁత

చ. 2: జాతి యిందే దంత్యజాతి యిందేది
జాతులన్నిటా నాత్మ సర్వేశుఁడు
ఆతలను అంటుముట్టనెడి భావనలెల్ల
బాఁతిపడి యెఱఁగనోపని వెలితే తనది

చ. 3: తెలివిగలదాఁకాఁ దెగని మఱఁగు లివి
తెలిసినంతటిమీఁదఁ దీరు సంశయము
యిలలోన శ్రీవేంకటేశ్వరుని కరుణచే
వెలసి యీాజ్ఞానంబు విడువకు మనసా

రేకు: 0134-01 రామక్రియ సం: 02-137 వైరాగ్య చింత

పల్లవి: వెలుపల మఱవక లోపల లేదు వెలుపలఁ గలిగిన లోపల మఱచు
చలమును నిదియే ఘడియ ఘడియకును సాధించిన సుఖమటు దోఁచు

చ. 1: వెలుపలి వెలుఁగే చూడఁగ లోపలి వెడ చీఁకటి గాననియట్లు
అలరి ప్రపంచజ్ఞానికిఁదనలో నాత్మజ్ఞానము గనరాదు
పలుమరు చీఁకటి చూడఁగఁ జూడఁగ బయలే వెలుఁగై తోఁచినయట్లు
అలయక తనలోచూపు చూచినను అంతరంగమున హరిఁ గనును

చ. 2: జాగరమే కడుఁ జేయఁగఁ జేయఁగ సతతము నిద్దుర రానట్లు
చేగల నింద్రియములలోఁ దిరిగిన చిత్తవికారము లయపడదు
యీగతి నిద్దురవోఁగాఁ బోఁగా నిలలో సుద్దులు యెఱఁగనియట్టు
యోగపు టేకాంతంబును దన మనసాగి మరవఁగ మరవఁగ హరిఁ గనును

చ. 3: దేహపు టాకాశపు నిట్టూర్పులు బాహిరపు బయట నడగినయట్లు
ఆహా జీవుని జననమరణములు అందే పొడముచు నందడఁగు
వూహల శ్రీవేంకటపతి వాయువు కొగి నాకాశము వొక్క సూత్రము
ఆహా ప్రాణాపానవాయువులు ఆతుమ నిలుపుటే హరిఁ గనుట

రేకు: 0134-02 గుజ్జరి సం: 02-138 వైరాగ్య చింత

పల్లవి: ఇందరిలో నే మెందుఁబోలుదుము యిందరిఁ బోలిన జీవులమే
కందువ వీరలఁ దలఁచి చిత్తమిది కలఁగెడి దైవమ కావఁగదే

చ. 1: యెందరొకో జరాదుఃఖము లేచి యనుభవించేటివారు
యెందరొకో దరిద్రదుఃఖము లెసఁగి యలమటించేటివారు
యెందరొకో బంధనతాడనహీనదెసల నుండెడివారు
యెందరొకో దాసదాస్యవిధి నెడయరాక చెఱలయినవారు

చ. 2: యెందరొకో మరణదెసలచే నిల సంయోగవియోగదుఃఖితులు
యెందరొకో జన్మరోగముల నెక్కువ భయమందేటివారు
యెందరొకో రాజుల చోరుల హింసలకు లోన యినవారు
యెందరొకో పొడమిన జీవుల కెక్కడ నెక్కడ నేపాటో

చ. 3: యెందరొకో యీదుఃఖనివృత్తికి యెడసి మిమ్ముఁ గొలిచినవారు
యెందరొకో సంపదలకు లోనై యేతాయాతనఁ బడువారు
యెందరొకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి
యిందును నందును సుఖులై లోకుల నిందరిఁ జూచుచు నవ్వెడివారు

రేకు: 0134-03 గుండక్రియ సం: 02-139 అధ్యాత్మ

పల్లవి: నిన్నూ నన్నూనెంచుకోని నేరమి గాక
పన్నిన సూర్యునికాంతి ప్రతిసూర్యుడౌనా

చ. 1: జలధిలోపలి మీను జలధి దా నౌనా
జలములాధారమైన జంతువు గాక
నెలవై నీలోనివాడఁ నీవే నే నౌదునా
పొలసి నీయ్యాధరువుబొమ్మ నింతే కాక

చ. 2: రాజువద్దనున్న బంటు రాజే తా నౌనా
రాజసపు చనవరి రచనే కాక
సాజమై నిన్నుఁ గొలిచి సరిగద్దె నుందునా
వోజతో నిన్ను సేవించి వుందునింతే కాక

చ. 3: ము త్తెపుఁజిప్పల నీరు మున్నీటివలె నుండునా
ముత్తెములై బలిసి లో మొనపుఁ గాక
నిత్తెపు శ్రీవేంకటేశ నీశరణాగతులము
మొత్తపు లోకుల మాముక్తులము గాక

రేకు: 0134-04 మాళవి సం: 02-140 ఉపమానములు

పల్లవి: ఇందుకుఁ జింతించనేల యీశ్వరుని మాయ లివి
యెందుకు మూలము హరి యీతనిఁ జింతించరే

చ. 1: అల నారికడపుఁ గాయకు నీరు వచ్చినయట్టు
తలఁచి రాఁగల మేలు తన్నుఁ దానే వచ్చురే
లలి నేనుగుదిన్న వెలఁగపంటి బేసము-
వలెనే పోఁగలవెల్ల వడిఁ దానే పోవురే

చ. 2: నిండిన యద్దములోన నీడ వొడచూపినట్టు
దండియైన పుట్టుగులు తన్నుఁ దానే వచ్చురే
పండిన పండ్లు తొడమఁబాసి వూడినయట్టు
అండనే మరణములు అందరికి సరిరే

చ. 3: పెనురాతిపై గడవ పెట్టగాఁ గుదురై నట్టు
తనుఁదానే చింతింపఁ దలఁపు నిలుచురే
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గని శరణన్నఁ జాలు
వెనక పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే

రేకు: 0134-05 పాడి సం: 02-141 వైరాగ్య చింత

పల్లవి: చూచే చూపొకటి సూటిగుఱి యొకటి
తాచి రెండు నొకటైతే దైవమే సుండీ

చ. 1: యేనుగఁ దలఁచితే యేనుగై పొడచూపు
మాను దలఁచిన నట్టే మానై పొడచూపు
పూని పెద్దకొండ దలపోయఁ గొండై పొడచూపు
తానే మనోగోచరుఁడు దైవమే సుండీ

చ. 2: బట్టబయలు దలఁచ బయలై పొడచూపు
అట్టె యంబుధి దలఁచ నంబుధియై పొడచూపు
పట్టణము దలఁచిన పట్టణమై పొడచూపు
తట్టి మనోగోచరుఁడు దైవమే సుండీ

చ. 3: శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతి దలఁచితేను
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతై పొడచూపు
భావమే జీవాత్మ ప్రత్యక్షము పరమాత్మ
తావు మనోగోచరుఁడు దైవమే సుండీ

రేకు: 0135-01 శ్రీరాగం సం: 02-142 వేంకటగానం

పల్లవి: బిరుదులన్నియు నీవే బిరుదు లోకములెల్ల
అరయ నీపాదమందె అణఁగుండెఁ గాన

చ. 1: బహుదేవతాసార్వభౌమ బిరుదు నీకే
సహజము నీవు భూసతిపతివి గాన
వహి దేవతాచక్రవర్తి బిరుదు నీకే
విహితము చక్రము చే వెలసేవు గాన

చ. 2: పెను దేవశిఖామణి బిరుదు నీకే చెల్లు
ఘన కౌస్తుభమణి గలవాఁడవు గాన
మును దేవదేవోత్తముఁడను బిరుదు నీకే
ననిచెఁ బురుషోత్తమనాముఁడవు గాన

చ. 3: వొట్టుకొని దేవరాహుత్తరాయ బిరుదు నీదే
కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివి గాన
తిట్టమై శ్రీవేంకటేశదేవ సింహమవు నీవే
అట్టె నారసింహుఁడవై అమరితి గాన

రేకు: 0135-02 లలిత సం: 02-143 దశావతారములు

పల్లవి: ఎందు నీకు బ్రియమో యీ తెప్పతిరుణాళ్ళు
దిందువడె సిరులతో తెప్పతిరుణాళ్ళు

చ. 1: పాలజలనిధిలోఁ బవ్వళించ పాముతెప్పఁ
దేలుచున్న దది దెప్పదిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకుమీఁద
తేలుచున్నదది తెప్పతిరుణాళ్ళు

చ. 2: అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము
తెమలఁ దేలించు తెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగునంగపుపడిగెమీఁద
తిమిరి తొక్కిన తెప్పతిరుణాళ్ళు

చ. 3: అప్పుడు పదారువేలు అంగనల చెమటల-
తెప్పలఁ దేలిన తెప్పతిరుణాళ్ళు
వొప్పుగ శ్రీవేంకటాద్రి నున్నతిఁ గోనేటిలోన
తెప్పిరిల్లె నేఁట నేఁట తెప్పతిరుణాళ్ళు

రేకు: 0135-03 లలిత సం: 02-144 భక్తి

పల్లవి: తలగరో లోకులు తడవకరో మమ్ము
కలిగినదిది మా కాఁపురము

చ. 1: నరహరికీర్తన నానిన జిహ్వ
వొరుల నుతింపఁగ నోపదు జిహ్వ
మురహరు పదములు మొక్కిన శిరము
పరుల వందనకుఁ బరగదు శిరము

చ. 2: శ్రీపతినే పూజించిన కరములు
చోపి యాచనకుఁ జొరవు కరములు
యేపున హరికడ కేఁగిన కాళ్ళు
పాపుల యిండ్లకుఁ బారవు కాళ్ళు

చ. 3: శ్రీవేంకటపతిఁ జింతించు మనసు
దావతి నితరముఁ దలఁచదు మనసు
దేవుఁడతని యాధీనపు తనువు
తేవల నితరాధీనము గాదు

రేకు: 0135-04 రామక్రియ సం: 02-145 వైరాగ్య చింత

పల్లవి: ఏల మమ్ము గాసిసేసే రింకా మీరు
కాలముతో నిలిచేను కైవల్యపదవి

చ. 1: పాపములు హరినామపఠనచేఁ బాపుకొంటి
కైపుగఁ జిత్రగుప్తుఁ డాకవిలె గట్టు
కోపులఁ బుణ్యములెల్ల గోవిందుని కిచ్చితిమి
పూఁపల స్వర్గము త్రోవ భుజవేయరో

చ. 2: అతుమలో నజ్ఞాన మాచార్యుఁడే పాపె
ఆతల జన్మాల వాకిలటు ముయ్యరో
చేత హరిదాస్యమున జీవన్ముక్తుఁడనైతి
జాతి యధర్మములాల సంబంధము విడరో

చ. 3: పరమాత్ము చింతచేత బదుకు నిశ్చయమాయ
ధరఁ గైవసము గావో తగుచిత్తమా
యిరవైన శ్రీవేంకటేశుఁ డేలుకొనె మమ్ము
పరదేవతలు మాకుఁ బనిలేదు మీరు

రేకు: 0135-05 భైరవి సం: 02-146 భగవద్గీత కీర్తనలు

పల్లవి: మఱియెందూ గతిలేదు మనుప నీవే దిక్కు
జఱిసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు

చ. 1: భవసాగరంబులోఁబడి మునిఁగిన నాకు
తివిరి నీనామమను తేపయే దిక్కు
చివికి కర్మంబనెడి చిచ్చు చొచ్చిన నాకు
జవళి నాచార్యు కృపాజలధియే దిక్కు

చ. 2: ఘనమోహపాశముల గాలిఁ బొయ్యెడి నాకు
కొనల నీ పాదచింతకొమ్మయే దిక్కు
కనలి మనసనెడి యాకాసమునను్న నాకు
కనుఁగొనఁగ నీదాస్యగరుడఁడే దిక్కు

చ. 3: మరిగి సంసారమనెడి మంటికిందటి నాకు
ధర భక్తియను బిలద్వారమే దిక్కు
యిరవైన శ్రీవేంకటేశ యిన్నిటా నాకు-
నరుదైన నీవంతరాత్మవే దిక్కు

రేకు: 0135-06 రామక్రియ సం: 02-147 వైరాగ్య చింత

పల్లవి: శ్రీపతి నీయాజ్ఞ సేసెద మిదివో
పూఁపల మాయలఁ బొరలఁగనేలా

చ. 1: కాయము సుఖదుఃఖములకు మూలము
పాయము యింద్రియపరవశము
ఆయము రెంటికి నన్నపానములు
మోయని మోఁపిది ములుగఁగనేలా

చ. 2: తలఁపు పుణ్యపాతకముల మూలము
కలిగిన పుట్టువు కర్మగతి
ఫల మిది రెంటికి బలుసంసారము
కలిగిన వెట్టికి కాదననేలా

చ. 3: జీవుఁ డింతటా సృష్టికి మూలము
భావము బ్రకృతికిఁ బ్రపంచము
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర
నీ వంతరాత్మవు నెమకఁగనేలా

రేకు: 0136-01 ధన్నాసి సం: 02-148 గురు వందన, నృసింహ

పల్లవి: జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము

నానార్థములు నిన్నే నడపె మాగురుఁడు

చ. 1: అలరి దేహమనేటి యాగశాలలోన

బలువై యజ్ఞానపు పశువు బంధించి

కలసి వైరాగ్యపు కత్తులఁ గోసి కోసి

వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు

చ. 2: మొక్కుచు వైష్ణవులనే మునిసభ గూడపెట్టి

చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానము నించి

చక్కఁగా సంకీర్తనసామగానము చేసి

యిక్కువతో యజ్ఞము సేయించెఁబో మాగురుఁడు

చ. 3: తదియ్యగురుప్రసాదపు పురోడాశ మిచ్చి

కొదదీర ద్వయమను కుండంబులు వెట్టి

యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షముచేసె

యెదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుడు

రేకు: 0136-02 శ్రీరాగం సం: 02-149 వేంకటగానం

పల్లవి: లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ
యేవేళ నీవినోదాన కేదాయ నేమి

చ. 1: పాలజలధివంటిది పవ్వళించు నామనసు
గాలిపూర్పులే కడళ్లు కలదు లోఁతు
చాలఁగ దొల్లి నీవు సముద్రశాయివట
యీలీల నీవినోదాన కేదాయ నేమి

చ. 2: నిక్కపుభూమివంటిది నెలవుకో నామనసు
పెక్కులిన్నియుఁ గలవు పెరుగుచుండు
పుక్కటఁ దొల్లియు నీవు భూసతిమగఁడవట
యెక్కువ నీవినోదాన కేదాయ నేమి

చ. 3: నిండుఁగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి
వుండుచోటనేవుండు నొక్కచోటను
కొండలరాయఁడవట కోరికె శ్రీవేంకటేశ
అండ నీవినోదాన కేదియాయ నేమి

రేకు: 0136-03 రామక్రియ సం: 02-150 వైరాగ్య చింత

పల్లవి: మెచ్చు; మెచ్చుకుంటే మాను; మించి నే నాడకమాన
అచ్చపు నీసూత్రధారి నవధారు దేవ

చ. 1: వొక్కఁడ నే జీవుఁడను వోహో హరీ
పెక్కు బహురూపాలే పెంచి యాడితి
తక్కిన యింద్రియములే తగుమేళము
అక్కజపు విద్యవాఁడ నవధారు దేవ

చ. 2: సూటి నించుకంతవాఁడఁ జూడవే హరీ
వీటి సంసారపుబారి విద్య లాడితి
పాటి నాకర్మమే క్రియాభాషాంగము
ఆటవాఁడ నింతే నేను అవధారు దేవ

చ. 3: చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేఁడు
మేరతో భక్తనే మోకుమీఁద నాడేను
యీరానిపదవులు యిచ్చితి నాకు
ఆరితేరి గెలిచితి నవధారు దేవ

రేకు: 0136-04 శ్రీరాగం సం: 02-151 అన్నమయ్య స్తుతి

పల్లవి: దినము ద్వాదశి నేఁడు తీర్థదివసము నీకు
జనకుఁడ అన్నమాచార్యుఁడ విచ్చేయవే

చ. 1: అనంతగరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుఁడైన దైవశిఖామణితోడ
వెనుకొని యారగించ విచ్చేయవే

చ. 2: వైకుంఠాన నుండి యాళువారలలోపల నుండి
లోకపు నిత్యముక్తులలోన నుండి
శ్రీకాంతతోడనున్న శ్రీవేంకటేశుఁ గూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే

చ. 3: సంకీర్తనముతోడ సనకాదులెల్లఁ బాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమినుండి
లంకె శ్రీవేంకటగిరి లక్ష్మివిభుఁడు నీవు-
నంకెల మాయింటి విందు లారగించవే

రేకు: 0136-05 మాళవి సం: 02-152 వైరాగ్య చింత

పల్లవి: గుఱ్ఱాలఁ గట్టని తేరు కొంక కెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీని వేడుకతో జీవుఁడు

చ. 1: సరి పిఱుఁదే రెండు జంటబండికండ్లు
సరవితోఁ బాదాలు చాఁపునొగలు
గరిమఁజూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు

చ. 2: పంచమహాభూతములు పంచవన్నెకోకలు
పంచల చేతులు రెండు బలుటెక్కెలు
మించైన శిరసే మీదనున్న శిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుఁడు

చ. 3: పాపపుణ్యములు రెండు పక్కనున్నచీలలు
తోపుల యన్నపానాలు దొబ్బుఁదెడ్లు
యేపున శ్రీవేంకటేశుఁ డెక్కి వీథుల నేఁగఁగ
కాపాడి నరరథము గడపీఁబో జీవుఁడు

రేకు: 0136-06 సాళంగం సం: 02-153 అంత్యప్రాస

పల్లవి: ఉన్న మంత్రా లిందు సరా వొగి విచారించుకొంటే
విన్నకన్నవారికెల్ల విష్ణునామమంత్రము

చ. 1: పరగఁ బుచ్చకాయలఁ బరసిపోదు మంత్రము
గరిమ ముట్టంటులేని ఘనమంత్రము
వరుస నెవ్వరువిన్నా వాఁడిచెడని మంత్రము
అరయ నిదొక్కటేపో హరినామమంత్రము

చ. 2: యేజాతినోరికైన నెంగిలిలేని మంత్రము
వోజదప్పితేఁ జెడకవుండే మంత్రము
తేజాన నొకరికిస్తేఁ దీరిపోని మంత్రము
సాజమైన దిదేపో సత్యమైన మంత్రము

చ. 3: యిహముఁ బరముఁ దానే యియ్యఁజాలిన మంత్రము
సహజమై వేదాలసార మంత్రము
బహునారదాదులెల్ల పాటపాడిన మంత్రము
విహితమయిన శ్రీవేంకటేశు మంత్రము

రేకు: 0137-01 సాళంగనాట సం: 02-154 నృసింహ

పల్లవి: అనుచు దేవగంధర్వాదులు పలికేరు
కనకకశిపు నీవు ఖండించే వేళను

చ. 1: నరసింహ నరసింహ ననుఁగావు ననుఁగావు
హరి హరి నాకు నాకు నభయమీవే
కరిరక్ష కరిరక్ష గతమైరి దనుజులు
సురనాథ సురనాథ చూడు మమ్ముఁ గృపను

చ. 2: దేవదేవ వాసుదేవ దిక్కు నీవే మాకు మాకు
శ్రీవక్ష శ్రీవక్ష సేవకులము
భూవనితనాథ నాథ పొడమె నీప్రతాపము
పావన పావన మమ్ముఁ బాలించవే

చ. 3: జయ జయ గోవింద శరణుచొచ్చేము నీకు
భయహర భయహర పాప మడఁగె
దయతో శ్రీవేంకటేశ తగిలి కాచితి మమ్ము
దయఁజూడు దయఁజూడు దాసులము నేము

రేకు: 0137-02 లలిత సం: 02-155 వైరాగ్య చింత

పల్లవి: కటకటా కర్మమా కాలములో మర్మమా
మటమాయైపోతివంటా మది నమ్మివుంటిఁగా

చ. 1: పాపబుద్ధి యాడనుండె పాయము రానినాఁడు
కోప మేడనుండె గర్భగోళమున నున్ననాఁడు
దీపన మేడనుండె దేహధారి గానినాఁడు
యేపున భూమిఁ బుట్టితే నేడనుండి వచ్చెనో

చ. 2: నగుసంసార మెందుండె నరకాన నుండునాఁడు
తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె
వొగి లోభ మేడనుండె వొంటినున్నవాఁడు
వెగటై నేఁడెట్టు నన్ను వెదకి పైకొనెనో

చ. 3: బహుబంధా లేడనుండె ప్రళయకాలమునాఁడు
మహిఁ గోరికెలెందుండె మతి మఱచిననాఁడు
యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేఁడు
విహితమై మాకు నెట్టు వెఱచెనో తాము

రేకు: 0137-03 సామంతం సం: 02-156 దశావతారములు

పల్లవి: హరి నీ ప్రతాపమున కడ్డమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా

చ. 1: నీవు నీళ్ళు నములితే నిండెను వేదములు
యీవలఁ దలెత్తితేనే యింద్రపదవులు మించె
మోవ మూఁతి గిరిపితే మూఁడులోకాలు నిలిచె
మోవిఁ బార నవ్వితేనే ముగిసి రసురలు

చ. 2: గోర గీరితే నీరై కొండలెల్లఁ దెగఁబారె
మారుకొంటే బయటనే మడుగులై నిలిచె
చేరి యడుగువెట్టితే శిలకుఁ బ్రాణము వచ్చె
కూరిమిఁ గావలెనంటే కొండ గొడగాయను

చ. 3: కొంగుజారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి గమనించితేనే కలిదోషములు మానె
రంగుగ నీశరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే

రేకు: 0137-04 దేసాక్షి సం: 02-157 వైరాగ్య చింత

పల్లవి: మాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా

చ. 1: చాలునంటే యించుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్లఁ జాలదు
వీలిన యీయాసా వెర్రివాని చేతిరాయి
చాలు నింక హరి నిట్టె శరణను జీవుఁడా

చ. 2: పాఱకున్న పశుబాలై బడలదు మనసు
పాఱితే జవ్వనమునఁ బట్టరాదు
మీఱిన నీరుకొద్ది దామెర యింతె యెంచి చూడ
జాఱవిడిచి దేవుని శరణను జీవుఁడా

చ. 3: సేయకున్నఁ గర్మము శ్రీపతిసేవనే వుండు
సేయఁబోతేఁ గాలమెల్లా సేనాసేన
వోయయ్య యిది యెల్లా వుమినాఁకే చవుతాలు
చాయల శ్రీవేంకటేశు శరణను జీవుఁడా

రేకు: 0137-05 ధన్నాసి సం: 02-158 వైరాగ్య చింత

పల్లవి: దైవమా నీవే మమ్ము దయదలఁచుట గాక
చేవల నీసేఁతలెల్ల చెల్లును లోకానను

చ. 1: తీపు నంజేవేళ నట్టె తేటఁ బులుసింపౌను
పైపైఁ బుణ్యమయితేఁ బాపమింపౌను
వోపి జంతువుల కివి వొకటొకటికి లంకె
చేపట్టి పాపము లెట్టు సేయకుండవచ్చును

చ. 2: కడుఁ జలువై తేను గక్కన వేఁడింపౌను
చెడని విరతివేళ సిరులింపౌను
వొడలు మోచినవారి కొకటికటికి లంకె
తొడరు భోగాలు మాని తోయ నెట్టువచ్చును

చ. 3: యివియు నీమాయే యిన్నియు నీయాజ్ఞలే
జవళిఁ బ్రాణులకెల్ల సమ్మతైనవి
యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
తవిలి నీవే గతి దాఁగ నెట్టువచ్చును

రేకు: 0137-06 శంకరాభరణం సం: 02-159 గురు వందన, భగవద్గీత కీర్తనలు

పల్లవి: వట్టిలంపటాలఁ బడి వడఁ బొరలుటకంటే
వొట్టిన విరతి నూరకుండుటే సుఖము

చ. 1: పాపము మానినయట్టి బదుకొక్కటె సుఖము
కోపము విడిచినట్టి గుణమొక్కటి సుఖము
చేపట్టి గురుబుద్ధి సేసేటిదే సుఖము తీ-
దీపులఁ బడనియట్టి దినమే సుఖము

చ. 2: మహిఁ జంచలములేని మనసొక్కటి సుఖము
సహజాచారముతోడి జన్మమొక్కటి సుఖము
యిహపరసాధనపు యెన్నికొక్కటి సుఖము
బహుళపు టాసకంటె పరిపాటి సుఖము

చ. 3: పరులఁ బీడించితేని పసిఁడొక్కటి సుఖము
గరిమ నిజముతోడఁగల మాటలే సుఖము
ధరలో శ్రీవేంకటేశు దాసానుదాఁడయి
సరవితో నడచేటి శాంతమే సుఖము

రేకు: 0138-01 దేసాళం సం: 02-160 దశావతారములు

పల్లవి: వారిదేపో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి
భారతరామాయణాలై పరగె నీకథలు

చ. 1: భువిమీఁద రావణుఁడు పుట్టగాఁగా రాముఁడవై
తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు
అవతార మందితే నిన్నందరునుఁ జూతురు

చ. 2: రమణఁ గంసాది యసురలు లూటి సేయఁగాఁగా
తమిఁ గృష్ణావతార మిందరి కైతివి
గములై యంతటివారు గలిగితేఁగా నీవు నేఁడు
అమర జనించి మాటలాడుదు విందరితో

చ. 3: యెంత వుపకారియో హిరణ్యకశిపుఁడు
చెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను
యింతట శ్రీవేంకటేశ యిన్ని రూపులును నీవే
పంతాన నీశరణని బ్రదికితి మిదివో

రేకు: 0138-02 సామంతం సం: 02-161 భక్తి

పల్లవి: ఊరకైతే నిన్నుఁ గాన మొకకారణానఁ గాని
పూరిజీవులము, నీవు పురుషోత్తముఁడవు

చ. 1: అసురలు భువిఁ బుట్టుటది వుపకారమే
అసురలు బాధింతు రమరులను
పొసఁగ వారికిఁగాను పూనుకవచ్చి నీవు
వసుధ జనించితేను వడి నిన్నుఁ గందుము

చ. 2: అడరి ధర్మము చెడి యధర్మమైనా మేలు
వెడఁగు మునులు విన్నవింతురు నీకు
తడవి ధర్మము నిల్ప ధరణిఁ బుట్టుదు నీవు
బడి నిన్ను సేవించి బ్రదుకుదు మపుడే

చ. 3: నీకంటే మాకుఁ జూడ నీదాసులే మేలు
పైకొని వారున్నచోటఁ బాయకుందువు
చేకొని శ్రీవేంకటేశ చెప్పఁగానే వారిచేత
నీకథలు విని విని నే మీడేరితిమి

రేకు: 0138-03 సాళంగనాట సం: 02-162 దశావతారములు

పల్లవి: పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి
నోరు మూసుకున్నఁ బోదు నున్నని నీసుద్దులు

చ. 1: వేసులు మాకుఁ జెప్పె విన భారతముగాఁగ
మోస నీపాలముచ్చిమి మొదలుగాను
రాసికెక్క శుకుఁడు రవ్వగాఁ బొగడఁ జొచ్చె
ఆసలఁ బరకాంతల నంటిన నీసుద్దులు

చ. 2: రంతున వాల్మీకి చెప్పె రామాయణము గాను
సంతగాఁ దాటకాదులఁ జంపినదెల్లా
అంతకముందె నారదుఁడవి దండెమీటి చెప్పె
యింతటా వేఁటాడి జీవహింసలు సేసినది

చ. 3: వేడుక నజుఁడు చెప్పె వేదముగా నీవు దొల్లి
వోడక మీనై కొన్నాళ్లుండితివంటా
తోడనే సప్తరుషులు తొల్లియునుఁ జెప్పిరదె
యీడనే శ్రీవేంకటాద్రి నిరవైతి వనుచు

రేకు: 0138-04 గుండక్రియ సం: 02-163 వైరాగ్య చింత

పల్లవి: దేహ మిది యొకటే దేవుఁడ నీవొకఁడవే
యీహల రెంట దెప్పర మిదివో మాబదుకు

చ. 1: రాతి రొక్కలోకము రవ్వపడెఁ గలలోన
ఘాతలఁ బగలొక్కలోకము వేగితే
యీతల రెప్పలే మరఁ గిందుకు నందుకుఁ జూడ
యేతుల రెంట దెప్పర మిదివో మాబదుకు

చ. 2: సతి కాఁగిలొకటే జవ్వనపుఁగాఁక రేఁచు
సుత కాఁగిలొక వేరేసుఖమై తోఁచు
మతిలోని మరఁ గింతే మగువలే యిద్దరును
ఇతవై రెంట దెప్పర మిదివో మాబదుకు

చ. 3: దైవమా నిన్నాతుమలోఁ దలఁచి యానందింతు
పూవుల నిన్నుఁ బూజింతు పొంచి వెలిని
శ్రీవేంకటేశ నీసేవలోని మరఁ గింతే
యీవల రెంట దెప్పర మిదివో మాబదుకు

రేకు: 0138-05 రామక్రియ సం: 02-164 అంత్యప్రాస

పల్లవి: చాటెదనిదియే సత్యము సుండో
చేటులేదీతని సేవించినను

చ. 1: హరినొల్లని వారసురలు సుండో
సుర లీతని దాసులు సుండో
పరమాత్ముఁడితఁడె ప్రాణము సుండో
మరుగక మఱచిన మఱి లేదిఁకను

చ. 2: వేదరక్షకుఁడు విష్ణుఁడు సుండో
సోదించె శుకుఁడచ్చుగ సుండో
ఆదిబ్రహ్మగన్నాఁడతఁడు సుండో
యేదెస వెదికిన నితఁడే ఘనుఁడు

చ. 3: యిహపర మొసఁగను యీతఁడె సుండో
వహి నుతించెఁ బార్వతి సుండో
రహస్యమిదివో రహి శ్రీవేంక
మహీధరంబున మనికై నిలిచె

రేకు: 0138-06 కేదారగౌళ సం: 02-165 కృష్ణ

పల్లవి: మీరు సాక్షి మీరు సాక్షి మే మేమీ ననలేము
చేరి చూడరమ్మ వీని చెల్లుబడి యమ్మా

చ. 1: పిన్నవాఁడు నిద్ర వోఁగ పెనచి కూఁకటతోడ
పన్ని లేఁగతోఁకఁగూడ బంధించి కట్టె
వున్నతిఁ దొలఁగ వాని వొళ్లెల్లా దోఁగిపోయ
కన్నెలార యీకృష్ణుఁ గంటిరటరమ్మా

చ. 2: లేఁగల నన్నిటి నేము లేవక తొల్లె విడిచె
మూఁగి ఆవులుఁబేయలు మొగిఁ గలయ
అఁగి పట్టఁబోతేను అప్పుడే తా గడె వెట్టి
రాఁగతనాన నున్నాఁడు రాచబలువమ్మా

చ. 3: వారము నేసేమనుచు వడి నింటివార మెల్లా
కూరలు పాశాలు దొంతిఁ గూడఁబెట్టితే
ఆరగించ వేలుపుల అలికి పూసి కుడిపీ
కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుఁ డమ్మా

రేకు: 0139-01 భూపాళం సం: 02-166 కృష్ణ

పల్లవి: ఇదివో మాయింట నేఁడు యింతసేసెఁ గృష్ణుఁడు
అదివో మాయింటాను అంతసేసెఁ గృష్ణుడు

చ. 1: గంట వాఁగకుండా నిండఁ గసపు దురిగి మా-
యింటివారు నిద్దిరించ నిల్లుచొచ్చెను
అంటివచ్చి వొకదూడ ఆపూరి మేసితేను
గంట గణగణ వాఁగె గక్కన మేల్కంటిమి

చ. 2: వొక్కరోలు దాపు వెట్టి వుట్టియెక్కి అందుమీఁది-
చక్కెరల్లా మెసఁగి మాచంటివానిని
వుక్కఁ బట్టి వుట్టిమీఁద నునిచి రోలు దీసె
చొక్కి తా నెందున్నాఁడో చొప్పు ఇదే కంటిమి

చ. 3: ఆవుల వెళ్ళవిడిచె నవి నేఁ దోలి తేఁబోతే
నీవల దూడలఁ దెచ్చి యింటిలోఁ గట్టె
దావతి నింతా వెదకి తలుపు దెరచితేను
శ్రీవేంకటేశుని మాయఁ జిక్కి లోన నున్నవి

రేకు: 0139-02 దేసాక్షి సం: 02-167 కృష్ణ

పల్లవి: అనరాదు వినరాదు ఆతనిమాయలు నేఁడు
దినదిన క్రొత్తలాయ ద్రిష్టమిదే మాకు

చ. 1: ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్లనోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పగాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయెనమ్మా

చ. 2: తీఁటతీగెలు సొమ్మంటా దేహమునిండా గట్టె
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోఁగా
పాటించి యీసుద్ది విని పారితెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా

చ. 3: కాకిజున్ను జున్నులంటా గంపెఁడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవఁగా
ఆకడ శ్రీవేంకటేశుఁడా బాలుల కంటినీరు
జోకగ ముత్యాలు సేసెఁ జూడఁగానే నేము

రేకు: 0139-03 దేసాక్షి సం: 02-168 అధ్యాత్మ

పల్లవి: నిజము దెలియని మానేరమే కాక
భజన నీవు చేపట్టినందుఁ గడమా

చ. 1: అంచలఁ బరుసము లోహపుఁ గాళికలనెల్ల
యెంచినా పసిఁడి గావించుఁ గాక
నించిన నిన్నాతుమఁ జింతించువారి పాతకాలు
మించనిచ్చేవా మేలే మెరయింతుగాక

చ. 2: నలువంకరకిరణాలు మేలుగీడని
తలఁగీనా యిన్నిటిలోఁ దానే కాక
యిల నీదాసుఁడు జాతి నెవ్వఁడైనా నీకృపఁ
జెలఁగి పావనుఁ జేసి చేకొనుఁ గాక

చ. 3: పూనిన దిక్కులగాలి పొందుగ నీడాడని
మానీనా లోకమెల్లా మలయుఁగాక
మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే-
దేనెలవైనా నీకిరవేకాదా

రేకు: 0139-04 భైరవి సం: 02-169 వైష్ణవ భక్తి

పల్లవి: నీవు జగన్నాథుఁడవు నే నొకజీవుఁడ నింతే
నీవలె ననుభవించ నే నెంతవాఁడను

చ. 1: వైకుంఠపదమేడ వడిఁ గోర నెంతవాఁడ
యీకడ నీదాసుఁడనౌ టిది చాలదా
చేకొని నీసాకారచింత యేడ నేనేడ
పైకొని నీడాగు మోచి బ్రదికితిఁ జాలదా

చ. 2: సొంపుల నీయానందసుఖ మేడ నేనేడ
పంపు శ్రీవైష్ణవసల్లాపన చాలదా
నింపుల విజ్ఞాన మేడ నే దెలియ నెంతవాఁడ
యింపుగా నీకథ వినుటిదియే చాలదా

చ. 3: కై వల్యమందు నీతో కాణాచి యాడ నాకు
శ్రీవేంకటాద్రిమీఁది సేవ చాలదా
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చిన విజ్ఞానమున
భావించి నిన్నుఁ బొగడే భాగ్యమే చాలదా

రేకు: 0139-05 మలహరిసం: 02-170 వైష్ణవ భక్తి

పల్లవి: అన్నిటాను హరిదాసు లధికులు
కన్నులవంటివారు కమలజాదులకు

చ. 1: అందరును సమమైతే నరుహానరుహము లేదా
అందరిలో హరియైతే నౌఁ గాక
బొందితో విప్రుని దెచ్చి పూజించినట్టు వేరే
పొందుగాని శునకముఁ బూజించఁదగునా

చ. 2: అన్నిమతములు సరియైతేను వాసి లేదా
చెన్నగుఁ బురాణాలు చెప్పుఁ గాక
యెన్నఁగ సొర్ణాటంక మింతటానుఁ జెల్లినట్లు
సన్నపుఁ దోలుబిళ్లలు సరిగాఁ జెల్లునా

చ. 3: గక్కునఁ బైరువిత్తఁగా గాదము మొలచినట్టు
చిక్కిన కర్మములెల్లాఁ జెలఁగెఁ గాక
తక్కక శ్రీవేంకటేశుదాస్య మెక్కుడైనట్టు
యెక్కడా మోక్షోపాయ మిఁకఁ జెప్ప నున్నదా

రేకు: 0139-06 ముఖారి సం: 02-171 శరణాగతి

పల్లవి: ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱిలేదు
కదిసి నీబంటనంటే కాతువు నన్నును

చ. 1: నేరచి నడచేనంటే నేఁ గాను స్వతంత్రుడను
నేరమి చేసేనంటే నిండును దూరు
యీరెంటికిఁ గాక నేను యిట్టె నీకు శరణంటే
గారవించి వహించుక కాతువు నన్నును

చ. 2: వొక్కచో నర్థ మర్జించుకుండితే జన్మాలు పెక్కు
యెక్కేనంటే మోక్షము యేడో యెఱఁగ
యెక్కడి సుద్దులునేల యిచ్చట నీనామము
గక్కనఁ బేర్కొంటేఁ దయఁ గాతువుగా నన్నును

చ. 3: తపసినయ్యేనంటేఁ జిత్తము కైవశము గాదు
చపలసంసారినైతే శాంతి యుండదు
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి
కపటము మానితేను కాతువు నన్నును

రేకు: 0140-01 శంకరాభరణం సం: 02-172 అధ్యాత్మ

పల్లవి: ఆహా యేమి చెప్పేది హరి నీమాయ
మోహములే చిగిరించీ మొదల జవ్వనము

చ. 1: యెంచఁగ భూమి యొక్కటే యేలినరాజు లెందరో
పొంచి వారివెంటవెంటఁ బోవదాయను
అంచల సూర్యచంద్రులనే గడెకుడుకల
ముంచి కొలచి పోసీని మునుకొని కాలము

చ. 2: దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో
కైవశమై యేలఁగ నొక్కరిదీ గాదు
ఆవటించి పంచభూతాలనేటి శాఖలు వెళ్లి
సావధానానఁ బెరిగీ సంసారవృక్షము

చ. 3: యిచ్చట నీ వొక్కఁడవే యిటు నీదాసు లెందరో
తచ్చి యెంత సేవించినాఁ దనివిలేదు
నిచ్చలు శ్రీవేంకటేశ నిదానము నీభక్తి
యెచ్చినాఁడ వింతటా నీడేరీ జన్మము

రేకు: 0140-02 ముఖారి సం: 02-173 వేంకటగానం

పల్లవి: ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను
వారివారి పాలికి వరదుఁడవౌదువు

చ. 1: చేరికొల్చినవారికిఁ జేపట్టుఁ గుంచమవు
కోరి నుతించినవారికి కొంగుపైఁడివి
మేరతోఁ దలఁచువారి మేటినిధానమవు
సారపు వివేకులకు సచ్చిదానందుఁడవు

చ. 2: కావలెననేవారికి కామధేనువవు మరి
సేవసేసేవారికి చింతామణివి
నీవే గతెన్నవారికి నిఖిల రక్షకుఁడవు
వావిరి శరణువేఁడేవారి భాగ్యరాశివి

చ. 3: నిన్నుఁ బూజించేవారి నిజపరతత్త్వమవు
ఇన్నిటా నీదాసులకు నేలికెవు
యెన్నఁగ శ్రీవేంకటేశ యిహపరములకును
పన్ని కాచుకున్నవారి ఫలదాయకుఁడవు

రేకు: 0140-03 వరాళి సం: 02-174 అధ్యాత్మ

పల్లవి: ఇతరుల దూరనేల యెవ్వరూ నేమి సేతురు
మతి వారూఁ దమవంటి మనుజులే కాక

చ. 1: చేరి మేలుసేయఁ గీడుసేయ నెవ్వరు గర్తలు
ధారుణిలో నరులకు దైవమే కాక
సారెఁ దనవెంటవెంటఁ జనుదెంచేవారెవ్వరు
బోరునఁ జేసిన పాపపుణ్యాలే కాక

చ. 2: తొడఁగి పొగడించాను దూషించా ముఖ్యులెవ్వరు
గుడికొన్న తనలోని గుణాలే కాక
కడుఁగీర్తి నపకీర్తి గట్టెడివారెవ్వరు
నడచేటి తనవర్తనములే కాక

చ. 3: ఘనబంధమోక్షాలకుఁ గారణ మిఁక నెవ్వరు
ననిచిన జ్ఞానాజ్ఞానములే కాక
తనకు శ్రీవేంకటేశుఁ దలపించేవా రెవ్వరు
కొనమొద లెటిఁగిన గురుఁడే కాక

రేకు: 0140-04 దేసాళం సం: 02-175 అధ్యాత్మ

పల్లవి: అక్కటా నే నిర్మలుఁడనయ్యే దెఁక నెన్నఁడో
చక్క నన్ను దిద్దుకోనే సర్వేశ్వరా

చ. 1: నేనే మంచివాఁడనై తే నిండుకోదా జ్ఞానము
కానీలే యింకా నేమేమి గడమో కాక
ఆనుక సుకృతినైతే నలవడదా విర క్తి
కానరాని తప్పు లెన్నిగలవో కాక

చ. 2: నామనసే చక్కనైతే నాకుఁ బ్రత్యక్షము గావా
చేముంచి నేరమేమి సేసితినో కాక
ఆముక మోక్షాధికారినైతే నెదురుగా రాదా
కామితార్థాలు భోగించఁ గలుగఁబోలుఁ గాక

చ. 3: ఔలే నామేను పవిత్రమైతే సేవ గొనవా
యేలాగున్నదో నీచిత్త మెఱఁగఁ గాక
యీలీల శ్రీవేంకటేశ యెదుటనే వున్నాఁడవు
యేలుకొని చేపట్టి యీడేర్చవు గాక

రేకు: 0140-05 శ్రీరాగం సం: 02-176 వైరాగ్య చింత

పల్లవి: చొచ్చితి నీకు శరణు సుద్దు లికనేఁటికి
కచ్చుపెట్టెవ్వరివల్లాఁ గలిగేదేమీ

చ. 1: పుట్టుక మునుపెఱఁగ పుట్టుగు మీఁదెఱఁగను
యిట్టె యప్పటి యెఱుక యేడ కెక్కీని
పట్టె మదనుభూతము పరసిపోయను బుద్ధి
వట్టి పెద్దతనాలను వచ్చేదేమీ

చ. 2: రానివి రప్పించఁగ నేరను వచ్చే వాఁప నేర
తానకపు నాస్వతంత్ర మెందాఁకా వచ్చును
అనుకున్నది ముదిమి అట్టె జారె శాంతము
నే నెంత విఱ్ఱవీఁగినా నిండేదేమీ

చ. 3: యిప్పుడు నే నెవ్వఁడనో యెక్కడ నీ వున్నాఁడవో
కప్పిన నావుపాయాలే కార్యమిచ్చీని
నెప్పున శ్రీవేంకటేశ నీయెదుటఁబడ్డ పని
తప్పక యీడేర్తు గాక తలపోసేదేమీ

రేకు: 0140-06 కన్నడగౌళ సం: 02-177 శరణాగతి

పల్లవి: చేసిన నావిన్నపము చిత్తానఁ బెట్టుకొమ్మీ
వేసరించి యిప్పుడే నే వేఁడుకొంటిఁ జుమ్మీ

చ. 1: ముందె నాపుణ్యఫలములు నీ కిచ్చితినంటి
కందువఁ గోరనని సంకల్పించితిని
యిందు మఱచి తప్పినా యిన్ని నీకె సెలవు
నిందవేసి నన్ను నిఁక నేరము లెంచకుమీ

చ. 2: నిన్నేకాని యితరుల నేఁ గొలువనొల్ల నంటి
వున్నతిఁ బరద్రవ్యా లొల్లనంటి
అన్నిటా నేనే మఱి యప్పటిమాటే యంచు
సన్నల నన్నందుకు నొచ్చమని దూరకుమీ

చ. 3: నానా వుపాయాల నాఁడే శరణంటి
పూని నీసాకారమునేఁ బొడగంటిని
నేను మత్తుఁడనై వున్నా నీవే తలఁచి తెలుపుకో
కోనేటి శ్రీవేంకటేశ కొసరించుకోకుమీ

రేకు: 0141-01 శుద్ధవసంతం సం: 02-178 రామ

పల్లవి: దీనరక్షకుఁ డఖిలవినుతుఁడు దేవదేవుఁడు రాముఁడు
జానకీపతిఁ గొలువుఁడీ ఘనసమరవిజయుఁడు రాముఁడు

చ. 1: హరుని తారకబ్రహ్మమంత్రమై యమరిన యర్థము రాముఁడు
సురలఁ గాచి యసురల నడఁచిన సూర్యకులజుఁడు రాముఁడు
సరయువందును ముక్తిచూరలు జనుల కొసఁగెను రాముఁడు
హరియె యీతఁడు హరివించుల కాదిపురుషుఁడు రాముఁడు

చ. 2: మునులరుషులకు నభయమొసఁగిన మూలమూరితి రాముఁడు
మనసులోపలఁ బరమయోగులు మరుగుతేజము రాముఁడు
పనిచి మీఁదటి బ్రహ్మపట్టము బంటు కొసఁగెను రాముఁడు
మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముఁడు

చ. 3: బలిమి మించిన దైవికముతో భక్తసులభుఁడు రాముఁడు
నిలిచి తనసరిలేని వేలుపు నిగమవంద్యుఁడు రాముఁడు
మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీఁది దేవుఁడు రాముఁడు
వెలసె వావిలిపాటి లోపలి వీరవిజయుఁడు రాముఁడు

రేకు: 0141-02 బౌళి సం: 02-179 అధ్యాత్మ

పల్లవి: తెలిసినమాటలు నీసముఖంబున దీకొని ని న్నడుగకపోదు
సులభుఁడ వన్నిట ప్రాణనాథుఁడవు చొప్పుగ నానతి యియ్యఁ గదే

చ. 1: నీవే బలవంతుఁడవో నీకంటేఁ గర్మము బలువో
కైపసముగ నే నెంచిచూచితే కర్మముకంటె బలువుఁడవు
భూపలయంబుల ప్రారబ్ధంబులు భోగించవలెనని యంటివా
వావిరి నిట్టైతే నీదేవత్వమునకు వెలితిగదే

చ. 2: ఐనాఁగాని లోకములోపల నది నీ యాజ్ఞని తలఁచితిమా
నేను నీశరణుచొచ్చిన మీఁదట నీవే పరిహరించఁగవలదా
కానిపించు నాకిఁక నొకబుద్ధి కర్మముపై నెప మటువేసి
పూనుచుఁ గాలక్షేపంబునకై భువిని వినోదము గాఁబోలు

చ. 3: యెందాఁకా జీవులతోడుత నీ వేలాటంబులు జరపెదవు
అందరికిని నీవే తలిదండ్రివి అయి రక్షింపుచునున్నాఁడవు
కందువ దెలిసెను శ్రీవేంకటేశ్వర కర్త వెట్టు చేసిన మేలు
చందమాయ నిది దగవౌ నీకును సంతోషించితి మిటు నేము

రేకు: 0141-03 వరాళి సం: 02-180 వైరాగ్య చింత

పల్లవి: ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ
కామించి బ్రహ్మాదులనుఁ గప్పీ నీమాయ

చ. 1: బచ్చెనరూపుల పెక్కు పడెచ్చుల వేసినట్లు
నిచ్చల నినుచున్నది నీమాయ
తచ్చి వారివారిరతి తమతమకే తెలియ
పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ

చ. 2: మఱి తొలునాటి భోగాలు మరునాటికి నింతగా
నెఱవుగాఁ దమకించీ నీమాయ
విఱచరాని దుఃఖము వెస నిద్రవోయితేనే
మఱపించి నవ్వించీ మహిలో నీమాయ

చ. 3: పట్టరాని జవ్వనము పరసిపోతే ముదిమి
నెట్టుకొల్పి వుబ్బఁడచీ నీమాయ
గట్టిగా శ్రీవేంకటేశ ఘనుఁడవైన నీదాసుల
పట్టకుండాఁ జేయుము బలిసె నీమాయ

రేకు: 0141-04 నాట సం: 02-181 వైరాగ్య చింత

పల్లవి: ఎంత కఠినమో హృదయ మిది
చెంత జాతఁజేసిరి గాఁబోలు

చ. 1: అమరఁ బురాణములందు నరకముల-
క్రమములు చదివియుఁ గలంగవు
యమకింకరఘోరాకృతు లటు విని
భ్రమసి యించుకా భయపడ నేను

చ. 2: మనుజుల దారుణమహితకర్మముల-
అనుభవములు గని యలయను
వొనర మహోగ్ర యహోరాత్రంబులు
చనుచుండంగా జడియను నేను

చ. 3: కలుషరౌద్రదుఃఖముల కించుకా
కలఁగను చీరికిఁ గైకొనను
యెలమిని శ్రీవేంకటేశుఁడ నాపాలఁ
గలిగి కాచితివి గాసిల నేను

రేకు: 0141-04 రామక్రియ సం: 02-182 అంత్యప్రాస

పల్లవి: పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు
యీటువెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు

చ. 1: సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు
గరిమ నీకృప నిన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోడఁ దపము సేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు

చ. 2: వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షము గను
యెక్కడా నీకల్పన కేమి సేయవచ్చును

చ. 3: భావించనటుగాన ఫలమెల్లా నీమూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁ గద్దు
జీవులు నిన్నెఱఁగక చీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు

రేకు: 0142-01 రామక్రియ సం: 02-183 అధ్యాత్మ

పల్లవి: అందుకల్లా లోనుగాన అట్టె యెచ్చరికెతోడ
పొందుగా హరిఁ దలఁచే పురుషుడే ఘనుఁడు

చ. 1: చలములు పుట్టించ సారె మచ్చరము రేఁచ
కలుగు నానావిధ కారణములు
తలఁపులు భ్రమయించ తగువేడ్క లొనరించ
పలుమా రెదుట నిల్చు బహురూపాలు

చ. 2: తగవులు దిద్దించ తగ నలమటఁ బెట్ట
తగులు ననేకబంధములెల్లాను
పగ సాధింపించ నప్పటి నుపాయాలు నేర్ప
నిగిడివచ్చు ననేకనెపములెల్లాను

చ. 3: తేరకే మేనలయించ దేశమెల్లా నావటించ
వూరకే తోఁచు ననేకవుద్యోగాలు
కోరి శ్రీవేంకటేశ్వరుఁ గొలిచి నిశ్చింతుఁ డైతే
ఆరయ మతిలో నిండు నానందాలు

రేకు: 0142-02 మాళవిగౌళ సం: 02-184 వైరాగ్య చింత

పల్లవి: నేరఁగల దొక్కటె నిశ్చలబ్రహ్మవిద్య
వారివారి యంతర్యామే వచ్చి పెరరేఁచీని

చ. 1: వొక్కరు నేర్పఁగవద్దు వొగి సంసారధర్మము
దిక్కై పుట్టించిన ప్రకృతియ నేర్పీని
గుక్కక జంతులు చన్నుగుడుప నేరుపవద్దు
చక్కగా ననాదివాసనలే నేర్పీని

చ. 2: అంచ నెవ్వరు నిద్రవొమ్మని బుద్ధి చెప్పవద్దు
మించి వారి తమోగుణమే కప్పీని
కొంచక భజియించుమని కోరి యచ్చరించవద్దు
పెంచిన తనఁయాకలే పిలిచి తెచ్చీని

చ. 3: అట్టె పనిపాటల అలవాటు చూపవద్దు
యెట్టైనా తనజాతే సేయిపించీని
వొట్టుక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు కోనేటిదండ
పట్టి కొలిచినవారే భాగ్యవంతు లిలను

రేకు: 0142-03 శంకరాభరణం సం: 02-185 వైరాగ్య చింత

పల్లవి: అది నేనెఱిగనా అంతలో భ్రమతుఁ గాక
మదనజనక నాకు మంచి బుద్ధియియ్యవే

చ. 1: యెంత లోకానుభవము అంతయు వ్రిథా నష్టి
కొంతైనా బ్రహ్మచింత కోటిలాభము
వింతైన జనులతోడి వినోదము నిష్ఫలము
చెంత సజ్జనసంగతి చేరిన యాదాయము

చ. 2: నానాదేశవార్తలు నడుమఁ జింతామూలము
పూనిన పురాణగోష్ఠి పుణ్యమూలము
ఆనిన కృషివాణిజ్యాలన్నియుఁ దీరనివెట్టి
మానని యాచారమాత్మకుఁ బడ్డపాటు

చ. 3: పలు చుట్టరికములు బట్టబయలు తగుళ్ళు
చెలఁగు నాచార్యసేవ జీవన్ముక్తి
బలిమి శ్రీవేంకటేశ పరగ రెండువిధాలు
నిలుకడయిన వాఁడవు నీవే యిన్నిటికి

రేకు: 0142-04 దేవగాంధారి సం: 02-186 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఒక్కఁడే మోక్షకర్త వొక్కటే శరణాగతి
దిక్కని హరిఁ గొల్చి బదికిరి తొంటివారు

చ. 1: నానా దేవతలున్నారు నానా లోకములున్నవి
నానా వ్రతాలున్నవి నడచేటివి
జ్ఞానికిఁ గామ్యకర్మాలు జరపి పొందేదేమి
ఆనుకొన్న వేదోక్తాలైనానాయఁ గాక

చ. 2: వొక్కండు దప్పికి ద్రావు వొక్కడు కడవ నించు
నొక్కఁ డీఁదులాడు మడుగొక్కటి యందే
చక్క జ్ఞానియైనవాఁడు సారార్థము వేదమందు
తక్కక చేకొనుఁ గాక తలకెత్తుకొనునా

చ. 3: యిది భగవద్గీతార్థమిది యర్జునునితోను
యెదుటనే వుపదేశమిచ్చెఁ గృష్ణుఁడు
వెదకి వినరో శ్రీవేంకటేశు దాసులాల
బ్రదుకుఁ ద్రోవ మనకు పాటించి చేకొనరో

రేకు: 0142-05 భైరవి సం: 02-187 అధ్యాత్మ

పల్లవి: నను(c జూచి హరి నీవు నవ్వకుండేవా
పనిమాలెంత బయలుపాఁకీ నామనసు

ච. 1: మనసుకు గోచరమా మాటలకు గోచరమా
కనుఁగొన వసమా నీఘనరూపము
నిను వెదకుచున్నాఁడ నీవెక్కడ నే నెక్కడ
జనుఁడ నింతె యెంత సాహసము నాది

ච. 2: వున్నచో టెఱుఁగుదునా వోయీ అంటేఁ బలికేవా
యెన్ని తెలియఁ దరమా యిట్టి నీమాయ
అన్నిటా నీకొలువుసేయఁ గడఁగుచున్నవాఁడ
యెన్నటిపొందు నీవు నాకెంత దిట్టతనమో

ච. 3: వాకిలి గానవచ్చునా వంచించి చొరవచ్చునా
రాకపోక కబ్బునా పరమపదము
శ్రీకాంతుఁడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె
కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో

రేకు: 0142-06 లలిత సం: 02-188 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నటికి జీవుఁడిఁక నీడేరేది
పన్నుకొనేటి చింతలే బలిసీఁ గాని

చ. 1: కలరు వివేకులు కలదిటు ధర్మము
కలఁడు దైవము నేఁడు గావలెనంటే
వలవని సందేహాన వట్టిజాలిఁ బొరలేటి-
తలపోఁత లేమిటికో తడఁబడీఁ గాని

చ. 2: వున్నవి వేదశాస్త్రాలు వున్నది విశ్వాసము
వున్నవాఁ డాచార్యుఁడు వుపదేశించ
తన్నుఁ దానే మోసపోయి తత్త్వము నిశ్చయించక
మిన్నక చంచలమేలో మెరసీఁ గాని

చ. 3: యివిగో పుణ్యనిధులు యిదిగో సంకీర్తన
వివరింప వీఁడిగో శ్రీవేంకటేశుఁడు
భవములచే భ్రమసి బహుసంగతులచేత
యివల నామనసిప్పు డెటిఁగీఁ గాని

రేకు: 0143-01 గుజ్జరి సం: 02-189 వైరాగ్య చింత

పల్లవి: అన్నియు నడుగవే నేనే మఱచితి నవి హరి నీకే తెలిసినవి
మన్నించి నా కీజన్మ మొసఁగితివి మర్మగాఁడు మన్మథుఁడొకఁడు

చ. 1: పలుజన్మంబులు నేఁ ద్రాగిన చనుఁబాలు గొలిచితే నెన్నెనో
తలిదండ్రులు మరియెందరో తా మెక్కడ నున్నారో
తిలకింపఁగ నాహారంబునకును తెగినకొలుచు లవి యెన్నెన్నో
యిలపై నే బ్రదికినకాలము యెంతని వ్రాసెనో చిత్రగుప్తుఁడు

చ. 2: చినుఁగఁగఁ జినుఁగఁగఁ గట్టుకోకలకుఁ జెల్లినపత్తి దా నదియంతో
కనక మెంతో నాకాభరణములై కాయంబులతో నొరసినది
పెనఁగీ రమించిన కామినీమణుల పేరు లెన్నియో తొల్లిటివి
ఘనముగ నను నిటు భోగించఁజేసిన కర్మమే యెఱుఁగు నివియెల్లా

చ. 3: గరిమల నే గడియించినయిండ్లుఁ గాణాచిచోట్లు యేడేడో
పొరలిన యిడుమలు యెందుకెక్కెనో పొదలితి భువిపై నిన్నాళ్లు
అరయఁగ నందరి కంతర్యామిని అఖిలకారణంబును నీవే
నిరతపు శ్రీవేంకటేశ్వర దయగల నీచిత్త మెటువలెఁ దలచీనో

రేకు: 0143-02 మలహరిసం: 02-190 వైరాగ్య చింత

పల్లవి: దైవమా నీపెరరేపణ లివి తప్పక వున్నవి జీవులకు
భావించి కాదని దొబ్బి దీకొనఁగ బ్రహ్మాదులకైనను వసమా

చ. 1: యెక్కడ సిద్ధించు బ్రహ్మచర్యము యెదుటనే కాంతలఁ జూచినవేళను
చక్కఁగా మనోవ్యభిచారంబునఁ జలియించుం గాక
చిక్కునే విరతి ధనధాన్యంబులు చేతికి లోనయినఁ జూచి
వొక్కటియై తా నండే మగ్నమునొందించుం గాక

చ. 2: కలుగునే తనివి బహుపదార్థములు గక్కన నంగళ్లనుఁ జూచి
కొలఁదిమీఱఁ గడుతరితీపులతో కోరుచు నోరూరుం గాక
వలనుగ సమాధి యెటువలె దొరకొను వాజవారణంబులఁ జూచి
యెలమితోడ ముంగిళ్లనెల్లఁ జరియింపించుఁ గాక

చ. 3: యేరీతి నెలకొను నీమీఁదితలఁపు యిహలోకపుసౌఖ్యము చూచి
భారపు లంపటములు పై దగిలించి పనులకుఁ బురికొలుపుఁ గాక
ధారుణి నే నివి గెలుచుట యెన్నఁడు తగ శ్రీవేంకటనాయక నీవే
గారవించి రక్షింపుము నీ కిది కడునుపకారంబౌఁ గాక

రేకు: 0143-03 ఆహిరి సం: 02-191 శరణాగతి

పల్లవి: ఎంత మహిమో నీది యెవ్వరి కలవిగాదు
చింతించితే దాసులకుఁ జేపట్టుఁ గుంచమవు

చ. 1: వూరకే నిన్నెవ్వరికి యుక్తుల సాధింపరాదు
సారెకుఁ దర్కవాదాల సాధింపరాదు
ఆరసి వెదకి ఉపాయముల సాధింపరాదు
భారములేనియట్టి భ క్తసాధ్యుఁడవు

చ. 2: మిక్కుటపు సామర్థ్యాన మెరసి తెలియరాదు
ధిక్కరించి నేర్పులఁ దెలియరాదు
వెక్కసాన భూముల వెదకి తెలియరాదు
మొక్కి నీకు శరణంటే ముందర నిలుతువు

చ. 3: చెలరేఁగి తపములు చేసినా నెఱఁగరాదు
యిల నెన్ని చదివినా నెఱఁగరాదు
నెలవై శ్రీవేంకటేశ నీదాసానుదాసులఁ
గొలిచితేఁ జాలు గక్కునఁ గృపసేతువు

రేకు: 0143-04 కన్నడగౌళ సం: 02-192 శరణాగతి

పల్లవి: నీవు నన్ను రక్షించితే నింద నీపై బడదు
భావించి నన్నెట్టయినా బ్రదికించుకొనవే

చ. 1: సంతతము నన్నెంచితే సర్వాపరాధి నేను
యెంత నే వేమిచేసినా నంత కర్ముఁడ
అంతటి లోకజననియైన లక్ష్మిఁ జూచి కాని
అంతరాత్మ నిన్నుఁ జూచియైనా మన్నిఁ చవే

చ. 2: కలవెన్నైనాఁ దప్పులు కనఁగొన నావల్ల
చెలఁగి యందుకుఁ బ్రాయశ్చిత్తము లేదు
లలి నాభుజము చక్రలాంఛనము చూచి కాని
అల నానోరిమంత్రమైనాఁ జూచి యేలుమీ

చ. 3: మతి నిన్నెఱిఁగేనంటే మదోన్మత్తుఁడ నేను
గతి యేది నాకు శ్రీవేంకటగిరినాయక
సతతము నీబిరుదు సారెకుఁ జూచి కాని
ప్రతిలేని నీదయయైనా భావించి చేకొనవే

రేకు: 0143-05 దేసాళం సం: 02-193 వైరాగ్య చింత

పల్లవి: ఇందరి బ్రదుకులును యీశ్వరుని చేతి దే
యెందూ సుజ్ఞానులునిన్నే యెఱిఁగి కొలిచిరి

చ. 1: నినుఁ గనుఁగొనలేక నీచేఁత దెలియక
మనుజులదృష్టమని మది నెంతురు
అనిశము నీసృష్టి యిట్లని నిశ్చయించరాక
తనరఁ గొందరు తమతమ కర్మ మందురు

చ. 2: మహి నీలీల లెంచక మహిమలు దెలియక
బహుగతి జగత్తు స్వభావ మందురు
నిహితమై నీ వింతటా నిండుకుండుట చూడక
తహతహఁ గొందరు యింతా మిథ్య యందురు

చ. 3: భావములోన నిన్ను భావించ వసముగాక
ఆవల నిరాకారమని యందురు
శ్రీవేంకటేశ నీవు చేరి యెదుట నుండఁగా
దేవుఁడు మనవాఁడుగా తెలిసితి మందురు

రేకు: 0144-01 సాళంగనాట సం: 02-194 వేంకటగానం

పల్లవి: ఏమని తలఁచవచ్చు నిటువంటి నీచి త్తము
దీమసాన నీభావము తెలియ దెవ్వరికి

చ. 1: రవిచంద్రగ్రహ తారకములకుఁ దెరువు
వివరించనున్నదా నీవే యాధారముగాక
పవనునికి భువికి పదునాల్గులోకముల-
కవల వేరొకచోట నాధార మున్నదా

చ. 2: తిలకింపఁ గులాచలదిగ్గజశేషాదులకు
నిలువఁ జోటున్నదా నీవే యాధారము గాక
నలుదిక్కులకు గగనమునకు మేఘాలకు
కలది నీయాధారమే కాక వేర పున్నదా

చ. 3: అనంతబ్రహ్మాండముల కట్టే నీరూపములకు
వెనకముందున్నదా నీవే యాధారముగాక
వినుతి కెక్కిన శ్రీవేంకటేశ నీకు నీవే
మనికైన యాధారము మఱి యెంచ నున్నదా

రేకు: 0144-02 పాడి సం: 02-195 వైష్ణవ భక్తి

పల్లవి: విష్ణుఁడే యింతానని భావించుటే బుద్ధి
వైష్ణవుఁడై యాచార్యసేవ సేయుటే బుద్ధి

చ. 1: కొండవంటి తనలోని కోపము రేఁగవచ్చితే
దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి
మెండుగా బరకాంతలమీఁది తమి వుట్టితేను
అండుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి

చ. 2: అట్టె యెవ్వరయినా గృహారామాదులపై నాస
పుట్టించితేఁ వానివెంటఁ బోనిదే బుద్ధి
చుట్టపు సమ్మంధాన సోఁకితే పరబాధలు
చుట్టుకోక లోనుగాక జునుఁగుటే బుద్ధి

చ. 3: తప్పదింతా దైవికమే తనవద్ద నున్నవారిఁ
దప్పులు పట్టనిదే తగిన బుద్ధి
యెప్పుడూ శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
చొప్పెత్తి యాతని మూర్తి చూచుటే బుద్ధి

రేకు: 0144-03 కన్నడగౌళ సం: 02-196 శరణాగతి

పల్లవి: సకలమైనవారికి సహజ మిది
అకటా యెట్టు గల్పించి ఆడించేవు దేవుఁడా

చ. 1: తనియ కొరుల చక్కఁదనమే చూచుఁ గాని
తనభావము తనకుఁ దలఁపు గాదు
చొనిపి యౌవ్వనపుసుద్దులే చెప్పు గాని
పొనిఁగి తనవయసు పోవుట దెలియదు

చ. 2: దారుణపాషాణబుద్ధులు దైవముపై బెట్టుఁ గాని
యీరీతినే తనదేహ మెంచుకొనఁడు
వూరిలోని మాటలెల్లా వుగ్గడించఁబోవుఁ గాని
కారణపు తన జన్మకథలు దడవఁడు

చ. 3: వేడుకతో నిక్షేపాలు వెదకఁగోరుఁ గాని
ఆడనే ఆత్మనిక్షేప మది వొల్లఁడు
వీడక శ్రీవేంకటేశ వెలయ నీదాసులకు
తోడఁదోడఁ దెలుపుచు తోడయి రక్షింతువు

రేకు: 0144-04 భైరవి సం: 02-197 గురు వందన

పల్లవి: ఇంతకంటే నే మున్నది యెంత దలపోసినాను
చింతదీర నీసేవ సేయుటే కలది

చ. 1: ఉపకారముగ దేహమొసఁగితి విటు నాకు
ఉపమించి నేఁజేసే ప్రత్యుపకార మిఁక నేది
యెపుడూ నీధర్మమున నిటు నీరుణస్థుఁడనై
ప్రపన్నుఁడనై నేను బ్రదుకుటే కలది

చ. 2: వేవేగ వెట్టి జేయక వివేకిఁ జేసితివి
యీవికి నే మారుకు మా రిచ్చే దెక్కడ నున్నది
యీవల నీకుఁ గీర్తిగా నిట్టే నీయాధీనుఁడనై
భావించి భయము లేక బ్రదుకుటే కలది

చ. 3: జడులలోఁ గూర్చక యాచార్యునిలోఁ గూర్చితివి
నడపేటి నీసరవికి నాసరివి యేమున్నది
యెడయక శ్రీవేంకటేశ నీకు బంటనై
బడివాయ కిట్లా నే బ్రదుకుటే కలది

రేకు: 0144-05 ముఖారి సం: 02-198 వైరాగ్య చింత

పల్లవి: వెలుపల వెదకితే వెస నాత్మఁ గనునా
పలుమారు నిదే యభ్యాసము గావలెను

చ. 1: యిన్ని చింతలు మఱచి యింద్రియాలఁ గుదియించి
పన్నివుండిన హృదయపద్మమందును
యెన్న నంగుష్ఠమాత్రపు టీశ్వరుపాదాల క్రింద
తన్ను నణుమాత్రముగఁ దలఁచఁగవలెను

చ. 2: పలుదేహపుఁ గాళ్లఁ బరువులు వారక
బలుదేహపు టింటిలోపల చొచ్చి
చలివేఁడిఁ బొరలక సర్వేశుపాదాల క్రింద
తలకొన్న తన్నుఁ దానె తలఁచఁగవలెను

చ. 3: కైకొన్న భక్తితో నిక్కపు శరణాగతితో
చేకొని విన్నపములు చేసుకొంటాను
యేకాంతాన శ్రీవేంకటేశ్వరు పాదాల క్రింద
దాకొని తన్నుఁ దానే తలఁచఁగవలెను

రేకు: 0144-06 శ్రీరాగం సం: 02-199 వైరాగ్య చింత

పల్లవి: ఇంతేకాని తెలిసితే నెవ్వరూఁ గర్తలు గారు
బంతినే వీని కెప్పుడుఁ బ్రకృతి గారణము

చ. 1: యివిగో గుణాలు మూఁడే యింద్రియాలఁ గూడుకొని
భువిఁ బ్రాణులనెల్లాను పూఁచి పనులుగొనేవి
కవిసి కర్మములై ఘనలోకాలఁ దిప్పేవి
ఆవలఁ బుట్టుగులకు నప్పటిఁ దెచ్చేవి

చ. 2: పంచభూతా లివియే పరగ జీవులకెల్లా
దించరాక యెప్పుడును దేహాలయ్యేవి
అంచెలఁ గంచములోఁ బదార్థములై వుండినవి
తెంచరాని పాశములై తీపులఁ బెట్టేవి

చ. 3: మనసొక్కటే జంతుల మర్మములు రేఁచేది
తనుభోగములలోనఁ దనివిచ్చేది
అనయము శ్రీవేంకటాధిప నీ మహి మిది
నినుఁ గొల్చిన దాసుల నెరవేర్చేది

రేకు: 0145-01 దేసాళం సం: 02-200 వైరాగ్య చింత

పల్లవి: భావించలే రెవ్వరును బయలువాఁకేరు గాని
నీవే గుఱుతు మాకు నీరజనాభా

చ. 1: కైవల్య మెట్టుండునో నిక్కపు జ్ఞాన మెట్టుండునో
దైవిక మెట్టుండునో తలఁచరాదు
జీవన మెట్లనుండునో చిత్త మేరీతి నుండునో
ఆవిధ మెవ్వరి కిట్టట్టనఁగరాదు

చ. 2: వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో
ఆది నంత మెట్టుండునో అరయరాదు
భేదమనే దెట్టుండునో అభేదమది యెట్టుండునో
సోదించి యెవ్వరికిని చూడఁగరాదు

చ. 3: ఫల మెట్లానుండునో భ క్తి యెట్లానుండునో
తెలివి యెట్టుండునో సాధించఁగరాదు
యిలపై శ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి
నిలుకడై వున్నారము నీకృప యిఁకను

రేకు: 0145-02 గౌళ సం: 02-201 శరణాగతి

పల్లవి: ఒడఁబరుచుకొంటివి వుపేంద్ర నిన్ను నిపుడె
చిడిముడి నీసేవకే సెలవు చేసుకొమ్మీ

చ. 1: కన్నుల నేఁ జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే
విన్నవినుకులెల్లా విష్ణుఁడ నీకథలే
తిన్నని నామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే
అన్నిటా నాభావము సమర్పణము నీకును

చ. 2: అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే
గుట్టున నాసేఁతలెల్లా గోవింద నీకైంకర్యాలే
ముట్టి నేభజించినవి ముకుంద నీప్రసాదాలే
నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి

చ. 3: యిల నేఁ బండఁబడేవి యీశ్వర నీకు మొక్కులే
తలఁచే నాతలఁపెల్లా దామోదర నీధ్యానమె
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి

రేకు: 0145-03 కన్నడగౌళ సం: 02-202

పల్లవి: నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని
వున్నవాఁడ నిఁక వేరే ఉపాయ మేమిటికి

చ. 1: గతియై రక్షింతువో కాక రక్షించవోయని
మతిలోని సంశయము మఱి విడిచి
యితరులచే ముందర నిఁక నెట్టైదునోయని
వెతతోడఁ దలఁచేటి వెఱపెల్లా విడిచి

చ. 2: తిరమైన నీమహిమ తెలిసేవాఁడననే-
గరువముతోడి వుద్యోగము విడిచి
వెరవున నీరూప వెదకి కానలేననే-
గరిమ నలపు నాస్తికత్వమును విడిచి

చ. 3: ధ్రువమైన నాచేఁతకు తోడు దెచ్చుకొనేననే
అవల నన్యులమీఁది యాస విడిచి
వివరిం చలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తవిలితి నాపుణ్యమంతయు నీకు విడిచి

రేకు: 0145-04 లలిత సం: 02-203 అధ్యాత్మ

పల్లవి: భ్రమయక వుండేదే పరమార్థము
నెమకితే నన్నిటాను నీవే వుండుదువు

చ. 1: వసుధలోఁ బురుషుల వనితల రూపులు
వెస మాయయంత్రపు వెరబొమ్మలు
ముసరి యెండొంటికి మోహించే మోహములు
అసురుసురయ్యే ఇంద్రియావేశములు

చ. 2: తగిన తమలో చక్కఁదనాలు వయసులు
పగటు రక్తమాంసాల పరిపూర్ణలు
జిగి నిందుకుఁగాఁ బుట్టే చిత్తవికారములు
నిగుడుచు బయలువన్నినయట్టి వురులు

చ. 3: లలి మీరి యన్యోన్యవిలాసములు భోగములు
వలవని మొయిలులేని వానజల్లు
యెలమి శ్రీవేంకటేశ యివెల్లా నీదాసులకుఁ
దెలిపి బ్రహ్మానందము తిరముగా నిత్తువు

రేకు: 0145-05 పాడి సం: 02-204 అంత్యప్రాస

పల్లవి: దైవము తోడిదే తన తగులు
జీవుడిఁది యెఱిఁగితే చిక్కనీదు తగులు

చ. 1: కన్నులఁ జూచినంతనే కలుగును దగులు
మిన్నక మాటలాడితే మిగులాఁ దగులు
పన్నుగా నవ్వితేను పాదుకొనుఁ దగులు
యెన్నైనా నూరకుండితే నేమీ లేదు తగులు

చ. 2: వీనులొగ్గి వినఁబోతే విశ్వమెల్లాఁ దగులు
ఆనుక సహవాసాన నంటుకొనుఁ దగులు
పూని లోకుల పొందుల పాదిగొను తగులు
మోనాన నూరకుండితే మొగియదు తగులు

చ. 3: కరుణించి యేమిచ్చినా గట్టియవునుఁ దగులు
దొరతనాన మించితే తొడరును తగులు
ధరణి శ్రీవేంకటేశుఁ దలఁచి యేకాంతాన-
నిరవై వూరకుండితే నెనయదు తగులు

రేకు: 0145-06 సామంతం సం: 02-205 వైరాగ్య చింత

పల్లవి: ఇందరూ జీవులే యెంచి చూచితే-
నందులో భావము లవియే వేరు

చ. 1: అంతటఁ జూచిన యాహారనిద్రలు
జంతురాసులకు సహజములు
సంతోషంబును సాత్వికగుణమును
శాంతచిత్తులకు సహజములు

చ. 2: మనసునఁగల కామక్రోధంబులు
జననశీలులకు సహజములు
వినయంబును ఘనవిజ్ఞానము స-
జ్జనుల కెపుడును సహజములు

చ. 3: విడువని యాసలు వేవేలు చింతలు
జడులకు నం(నెం ?) దును సహజములు
బడి శ్రీవేంకటపతి కొలువుఁ దపము
జడియని దాసుల సహజములు

రేకు: 0146-01 శంకరాభరణం సం: 02-206 శరణాగతి

పల్లవి: కలది యీమూర్తివల్ల గతి గనవలెను
యిల నిందు నమ్మకుంటే యెందు మరి లేదు

చ. 1: కంటిమా బ్రహ్మమును వేంకటపతిఁ గనినట్టు
కంటిమా అవతారాలు కతలె కాక
కంటిమా హృదయములోఁ గలిగిన దైవమును
కంటిమా వైకుంఠముకడవారైనాను

చ. 2: తెలిసీనా జ్ఞానము యీదేవుని మహిమవలె
తెలిసీనా వేదాలు సందేహమే కాక
తెలిసీనా మాయ యిది యెంత చదివినా
తెలిసీనా ముందరితెరువు వెదకితే

చ. 3: చిక్కీనా మనసు యీశ్రీవేంకటేశ్వరువలె
చిక్కీనా ధ్యానము వట్టిచింతలేకాక
చిక్కీనా అనాదినుండి చిగిరించీ కాలము
చిక్కీనా పెద్దలు చెప్పే జితమైన శాంతి

రేకు: 0146-02 నాట సం: 02-207 హనుమ

పల్లవి: అందరిలోనా నెక్కుడు హనుమంతుఁడు
కందువ మతంగగిరి కాడి హనుమంతుఁడు

చ. 1: కనకకుండలాలతో కొపీనముతోడ
జనియించినాఁడు యీ హనుమంతుఁడు
ఘన ప్రతాపముతోడ కఠినహస్తాలతోడ
పెనుతోఁక యెత్తినాఁడు పెద్ద హనుమంతుఁడు

చ. 2: తివిరి జలధి దాఁటి దీపించి లంకయెల్లా
అవల యివల సేసె హనుమంతుఁడు
వివరించి సీతకు విశ్వరూపము చూపుతా
ధ్రువమండలము మోచె దొడ్డ హనుమంతుఁడు

చ. 3: తిరమైన మహిమతో దివ్యతేజముతోడ
అరసి దాసులఁ గాచీ హనుమంతుఁడు
పరగ శ్రీవేంకటేశు బంటై సేవింపుచు
వరములిచ్చీఁ బొడవాటి హనుమంతుఁడు

రేకు: 0146-03 సాళంగనాట సం: 02-208 రామ

పల్లవి: ఈతఁడు తారక బ్రహ్మమితఁడు మాదేవుఁడు
కౌతుకానఁ జెప్పే వినఁగదరే వో జనులు

చ. 1: రాముఁడు యిందీవరశ్యాముఁడు నానాసార్వ-
భౌముఁడు షోడశకళాసోముఁడు
దోమటిరాక్షసులను తుత్తుమురు సేసినాఁడు
కామితఫలములిచ్చి కాచినాఁడు సురల

చ. 2: పూర్ణుఁడు నీలమేఘవర్ణుఁడు దానమున వి-
స్తీర్ణుఁడు వాహనసువర్ణుఁడు
అర్ణవము దాఁటి రావణాదుల గెలిచినాఁడు
నిర్ణయించి చెప్పరాదు నేఁడీతని మహిమ

చ. 3: వరుఁడు సీతకు పరాత్పరుఁడు కోదండదీక్షా-
గురుఁడు దివ్యామోఘశరుఁ డితఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నెలవై యుండేటివాఁడు
సరి భరతలక్షణశత్రుఘ్న సహితుఁడు

రేకు: 0146-04 శ్రీరాగం సం: 02-209 వైష్ణవ భక్తి

పల్లవి: ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్చగించువాఁడే ఘనుఁడు
వదలకురో హరిదాసుల మతమిది వర్ణించెద నోవివేకులాలా

చ. 1: దేవుఁడు గలఁడని మదిలోఁ దెలియుటే జన్మఫలంబు
తావుగ నాతని నెప్పుడుఁ దలఁచుటే తనభాగ్యము
శ్రీవైష్ణవధర్మము దప్పక చెలఁగుటయే వైభవము
దేవతాంతరంబులన్నియు మానినదియే సుకృతంబు

చ. 2: కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము
చేముంచి పాపము సేయక మానుటే చెప్పఁగ లాభము
నేమముతోడుత విరక్తుఁడగుటే నిర్మలానందము
వేమరు నాచార్యసేవ సేయుటే విచారింపఁగ దాఁచిన ధనము

చ. 3: ప్రకృతివికారములకుఁ జొరకుండుటే పరమమైన సాత్వికము
సకలబంధములఁ బెడఁ బాసినదే సామ్రాజ్యపదము
ప్రకటింపఁగ నలమేలుమంగకును పతియగు శ్రీవేంకటవిభుని
అకలంకుఁడై కొలిచియుండుటే యనంతమహిమాతిశయంబు

రేకు: 0146-05 కేదారగౌళ సం: 02-210 శరణాగతి

పల్లవి: ఇదియే ఉపాయ మిఁక నాకు నిందులకంటే మఱి లేదు
మది నితని దాసుఁడనై మహిమలతోఁ గడుమెఱసేఁ గాక

చ. 1: కడచితినా నాజన్మములు గక్కన మానిసినైనంతనే
విడిచితినా పాపము సేయక వేవేలుచదివినయంతనే
అడఁచితినా సంసారవారధి అఖిలదేవతలఁ గొలిచినయంతనే
బడిబడి హరినామము నుతించి నేఁ బావనమయ్యేఁ గాక

చ. 2: గెలిచితినా యీమాయను నేఁ గెరలి తపంబులు నేసినంతనే
తలఁగితినా నరకములు చొరక ధరయెల్లా నేలినంతనే
తెలిసితినా తత్త్వరహస్యము తిరముగ కులజుఁడనయినంతనే
యిలలో శ్రీపతి శరణుచొచ్చి నేనిన్నిటఁ బుణ్యుఁడనయ్యేఁ గాక

చ. 3: పదలితినా నాదుర్గుణములు వరుసతోఁ జుట్టాలు గలిగినంతనే
వెదకితినా ముక్తిమార్గమును విద్య లెఱిఁగి నేర్చినంతనే
యిదివో శ్రీవేంకటేశుఁడు నాకును యేలికయ్యై మన్నించఁగను
పదిలముగా నాతనిసేవచేసి పరమానందుఁడనయ్యేఁ గాక

రేకు: 0147-01 సామంతం సం: 02-211 శరణాగతి

పల్లవి: ఎట్టు దోయవచ్చు విని నెంతటివారికై నాను
పట్టి నీకు శరణంటే బ్రదికింతువు గాక

చ. 1: మాలతనమువంటిది మతిఁదగులుఁ గామము
అలరి ముట్టువంటిది అంటుఁగ్రోధము
కేలి నొదిగించు నెంగిలివంటిది లోభము
వాలాయించి నెందుండై నా వచ్చును లోకులకు

చ. 2: చుట్టి మద్యమువంటిది చొక్కించు మోహము
వట్టి మాంసమువంటిది వయోమదము
పుట్టిన భ్రమవంటిది పొదిగిన మచ్చరము
పుట్టిపడి నోరూరించు నూరకే ప్రాణులను

చ. 3: గోడమఱుగు వంటిది గుట్టుతోడి సంసారము
వీడని కట్టువంటిది వేడుకయాస
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నీదాసుల
జాడదప్పనియ్యవు యీచందము జీవులది

రేకు: 0147-02 వరాళి సం: 02-212 శరణాగతి

పల్లవి: మహినుద్యోగి గావలె మనుజుఁడైనవాఁడు
సహజివలె నుండేమీ సాధింపలేడు

చ. 1: వెదకి తలచుకొంటే విష్ణుఁడు గానవచ్చు
చెదరి మఱచితే సృష్టి చీఁకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టి రావచ్చు
నిదిరించితేఁ గాలము నిమిషమై తోఁచు

చ. 2: వేడుకతోఁ జదివితే వేదశాస్త్రసంపన్నుఁడౌ
జాడతో నూరకుండితే జడుఁడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుఁడౌ
కూడక సోమరియైతే గుణహీనుఁడౌను

చ. 3: మురహరుఁ గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెఱఁగకుండితే వీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుఁడు రక్షించును
పరగ సంశయించితే పాషండుఁడౌను

రేకు: 0147-03 కేదారగౌళ సం: 02-213 అధ్యాత్మ

పల్లవి: తనలోనుండిన హరి దాఁ గొలువఁడీ దేహి
యెనలేక శరణంటే నితఁడే రక్షించును

చ. 1: కోరి ముదిమి మానుపుకొనే యాస మందులంటా
పూరకే చేఁదులు దిన నొడఁబడును
ఆరూఢి మంత్రసిద్ధుఁడనయ్యేననే యాసలను
ఘోరపుఁబాట్లకు గక్కున నొడఁబడును

చ. 2: యిట్టె యక్షిణిఁ బంపు సేయించుకొనే యాసలను
వొట్టి జీవహింసలకు నొడఁబడును
దిట్టతనముఁ దా నదృశ్యము సాధించే యాస
జట్టిగ భూతాలఁ బూజించఁగ నొడఁబడును

చ. 3: చాపలపు సిరులకై శక్తిఁ గొలిచే యాసను
వోపి నిందలకు నెల్లా నొడఁబడును
యేపున శ్రీవేంకటేశుఁ డేలి చేపట్టినదాఁకా
ఆఁపరాని యాస నెందుకైనా నొడఁబడును

రేకు: 0147-04 ధన్నాసి సం: 02-214 ఉపమానములు

పల్లవి: దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే
సేవసేయకుండినా రక్షించ నీకు భారము

చ. 1: ఆడివచ్చిన బిడ్డని నపరాధిఁ జేసి తల్లి
వోడక యన్నము పెట్టకుండవచ్చునా
వేడుకకాఁడు చిల్కకు వింతమాటలెల్లా నేర్పి
ఆడినట్టే యాడితేను అదలించవచ్చునా

చ. 2: చిక్కినావు తొడుకుమేసి వచ్చేనంటా గొల్లఁడు
దుక్కక కావక పోఁదోలవచ్చునా
యెక్కే గుఱ్ఱము గోళిగె నెనసి పైకొంటే రౌతు
తక్కక దానిఁ జీకటితప్పు గొనవచ్చునా

చ. 3: పతిఁ బెండ్లాడిన యాలు పక్కనుండి నిద్రించితే
కొతికి కాలానుభాగి గొనవచ్చునా ?
తతి నేఁపనికి రాక తామసుఁడై వుండినా
గతియై శ్రీవేంకటేశ కావకుండవచ్చునా

రేకు: 0147-05 రామక్రియ సం: 02-215 శరణాగతి

పల్లవి: ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు వేసితి
తటుకన నీవనే నిధానము చేకొంటివి

చ. 1: కామించితి నాత్మ నిన్నుఁ గలసి భోగించుటకు
వేమరుఁ గ్రోధించితి నీవిరోధులపై
నేమమున లోభించితి నీమంత్రమన్యుల కియ్య
ఆముకొని మోహించితి హరి నీరూపునకు

చ. 2: యెఱుకతో మదించితి యిట్టే నీదాస్యమున
మఱి నిన్నొల్లని చదువు మచ్చరించితి
తఱిఁ జలపట్టితి నీతప్పని భ క్తియందు
వెఱవక నిన్నొల్లని విధుల నిందించితి

చ. 3: కల కర్మములెల్లా నీకైంకర్యములందు వెట్టితి
బలు మమకారము నీపైఁ జేర్చితిఁ
యెలిమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
నిలిచిన కాలమెల్లా నీసేవే చేసితి

రేకు: 0147-06 మాళవి సం: 02-216 హనుమ

పల్లవి: కలశాపురముకాడఁ గాచుకున్నాఁడు
వలసిన వరాలిచ్చీ వాయునందనుఁడు

చ. 1: మాయాబిలము చొచ్చి మగుడి యంబుధిలోని-
చాయాగ్రహముఁ జంపి చయ్యన దాఁటి
ఆయెడ లంకిణిఁ గొట్టి యంతలో జానకిఁగని
వాయువేగాన వచ్చిన వాయునందనుఁడు

చ. 2: కడలిదరినుండిన కపులతోఁ గూడికొని
వడదీరఁగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతాపరిణామ మెల్లాఁ జెప్పి
వడిగలవాఁడితఁడు వాయునందనుఁడు

చ. 3: రావణాదిరాక్షసుల రామునిచే సాధించి
ఆవిభుని సీతఁ గూర్చి అయోధ్య నుంచె
శ్రీవేంకటేశుఁ గొల్చి శిష్టరక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు

రేకు: 0148-01 బౌళిరామక్రియ సం: 02-217 కృష్ణ

పల్లవి: వసుధఁ జూడ బిన్నవానివలె నున్నవాఁడు
వెస నన్నివిద్యలాను వెలసె విట్ఠలుఁడు

చ. 1: పరగ నేడు నూటడెబ్బదియేడుగురిచేత-
నిరవై పాడించుకొన్నాఁడీ విట్ఠలుఁడు
సరుస నైదులక్షలిండ్ల జవ్వనపు గొల్లెతల
మరిగించుకొన్నవాఁడు మరి యీ విట్ఠలుఁడు

చ. 2: బత్తితోడ తనమీఁది పాటలు వాడితేను
యిత్తల మోమై తిరిగె నీ విఠలుడు
హత్తి తన్నొల్లకపోఁగా నందరి మేడ దేవళ్ళ
యెత్తి పాదాలందు జూపె నితఁడే విట్ఠలుఁడు

చ. 3: గట్టిగాఁ బుండరీకుఁడు కడువేడుకఁ బెట్టిన-
యిట్టిక పీఁటపై నున్నాఁడీ విఠలుడు
అట్టితానే శ్రీవేంకటాద్రిఁ బాండురంగమున
యెట్టుగొల్చినా వరములిచ్చీ విట్ఠలుఁడు

రేకు: 0148-02 మాళవి సం: 02-218 హనుమ

పల్లవి: ఇతఁడు రామునిబంటు యితని కెవ్వ రెదురు

చతురత మెరసె నిచ్చట హనుమంతుఁడు

చ. 1: అకాస (శ?) మంతయు నిండి యవ్వలికిఁ దోఁక చాఁచి

పైకొని పాతాళానఁ బాదాలు మోపి

కైకొని దశదిక్కులు కరములఁ గబళించి

సాకారము చూపినాఁ డిచ్చట హనుమంతుఁడు

చ. 2: కొంచక సురలు రోమకూపముల విహరించ

ముంచి ధ్రువమండలము మొగమై యుండ

యెంచఁగ లోకములెల్లా యెడనెడ సందులుగా

చంచుల మెరసినాఁ డిచ్చట హనుమంతుఁడు

చ. 3: గరిమ రవిచంద్రులు కర్ణకుండలములుగా

ధరణి మేరువు కటితటము గాఁగా

ఇరవుగా శ్రీవేంకటేశుని సేవకుఁడై

బెరసె నిచ్చట నిదె పెద్ద హనుమంతుఁడు

రేకు: 0148-03 పాడి సం: 02-219 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య-
ధాముడు రణరంగభీముఁడు వాఁడె

చ. 1: వరుఁడు సీతకు ఫలాధరుఁడు మహోగ్రపు-
శరుఁడు రాక్షససంహరుడు వాఁడే
స్థిరుఁడు సర్వగుణాకరుఁడు కోదండదీక్షా-
గురుఁడు సేవకశుభకరుఁడు వాఁడే

చ. 2: ధీరుఁడు లోకైకవీరుఁడు సకలా-
ధారుఁడు భవబంధదూరుఁడు వాఁడే
శూరుఁడు ధర్మవిచారుఁడు రఘువంశ-
సారుఁడు బ్రహ్మసాకారుఁడు వాఁడే

చ. 3: బలుఁడు యిన్నిటా రవికులుఁడు భావించ ని-
ర్మలుఁడు నిశ్చలుఁ డవికలుఁడు వాఁడే
వెలసి శ్రీవేంకటాద్రి విజనగరములోన
తలకొనెఁ బుణ్యపాదతలుఁడు వాఁడే

రేకు: 0148-04 సాళంగనాట సం: 02-220 రామ

పల్లవి: శరణు శరణు విభీషణవరదా
శరధిబంధన రామ సర్వగుణస్తోమ

చ. 1: మారీచసుబాహుమదమర్దన తాటకాహర
క్రూరేంద్రజిత్తులగుండుగండా
దారుణకుంభకర్ణ దనుజ శిరచ్ఛేదక
వీరప్రతాప రామ విజయాభిరామ

చ. 2: వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక
లాలితవానరబల లంకాపహార
పాలితసవనాహల్యాపాపవిమోచక
పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ

చ. 3: శంకరచాపభంజక జానకీమనోహర
పంకజాక్ష సాకేతపట్టాణాధీశ
అంకితబిరుద శ్రీవేంకటాద్రినివాస
ఓంకారరూప రామ పురుసత్యకామ

రేకు: 0148-05 రామక్రియ సం: 02-221 దశావతారములు

పల్లవి: శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
యే విధాన దలచినా యిన్నిటికిఁ దగును

చ. 1: కరిరాజుఁ గాచిన చక్రమువట్టిన హస్తము
కరితుండమని చెప్పఁగా నమరును
వరములిచ్చేయట్టి వరదహస్తము కల్ప-
తరుశాకయని పోల్పఁదగు నీకును

చ. 2: జలధిఁ బుట్టిన పాంచజన్యహస్తము నీకు
జలధితరఁగయని చాటవచ్చును
బలుకాళింగుని తోఁకపట్టిన కటిహస్తము
పొలుపై ఫణీంద్రుడని పొగడఁగఁదగును

చ. 3: నలినహస్తంబుల నడుమనున్న నీయుర-
మలమేలుమంగ కిరవఁదగును
బలు శ్రీవేంకటగిరిపై నెలకొన్న నిన్ను-
నలసి శ్రీవేంకటేశుఁ డనదగును ॥ శ్రీవేం

రేకు: 0148-06 దేసాళం సం: 02-222 గురు వందన, నృసింహ

పల్లవి: పంట వండుకొనేవారిభాగ్యము లిటమీఁద-
నంటిముట్టి వెదకితే నాతుమ లోనున్నది

చ. 1: వేదములలో మొలచె వేదాంతాలఁ గొనసాగె
గాదిలి శ్రీహరిభక్తికల్పలత
పోదియెక్కె వై రాగ్యబోధలచేఁ బలుమారు
పాదుకొని వేరువారె పంచసంస్కారాలను

చ. 2: అల్లుకొనె మునులలో నంటెనుఁ బురాణాల
చెల్లుబడి శాస్త్రాలఁ జిగిరించెను
చల్లఁగాఁ బూవులు వూచె సత్కర్మవిదులను
మెల్లనే నీడలు నిండె మించి సుజ్ఞానమున

చ. 3: పరమయోగములఁ బూపలుఁ బిందెలు వుట్టె
పరగె సురలనే పందిటియందు
యిరవై శ్రీవేంకటేశుఁ డిందుకు ఫలమైనాఁడు
గురుసేవలను దొరకును వివేకులకు

రేకు: 0149-01 శంకరాభరణం సం: 02-223 హనుమ

పల్లవి: మతంగపర్వతమాడ మాల్యవంతము నీడ
అతిశయిల్లిన పెద్ద హనుమంతుఁడితఁడా

చ. 1: యీతఁడా రామునిబంటు యీతఁడా వాయుసుతుఁడు
ఆతతబలాఢ్యుఁడందు రాతఁడితఁడా
సీతను వెదకివచ్చి చెప్పిన యాతఁడితఁడా
ఘాతల లంకలోని రాక్షసవైరి యితఁడా

చ. 2: అంజనాసుతుఁ డితఁడా అక్షమర్దనుఁ డితఁడా
సంజీవనికొండ దెచ్చె సారె నితఁడా
భంజించెఁ గాలనేమిని పంతమున నితఁడా
రంజితప్రతాప కపిరాజసఖుఁ డితఁడా

చ. 3: చిరజీవి యీతఁడా జితేంద్రియుఁ డితఁడా
సురల కుపకారపుచుట్ట మీతఁడా
నిరతి శ్రీవేంకటాద్రిని విజనగరములో-
నరిది వరములిచ్చీ నందరికి నితఁడా

రేకు: 0149-02 కాంబోదిసం: 02-224 శరణాగతి

పల్లవి: ఏమని విన్నవింతు నిదివో నా భాగ్యము
కామించి మీ శరణంటిఁ గమలారమణా

చ. 1: కలది యందరికైతేఁ గర్మఫలము
కెలన నాకైతే నీకృపాఫలము
అల సురలకు మథితామృతము
నెలకొన్న నాకైతే నీనామామృతము

చ. 2: సకలాత్మల బ్రదుకు సంసారమూలము
ప్రకటించ నాకైతే నీ పాదమూలము
వెకలి లోకులరతి వీథివీథిని నా-
త్రికరణరతి నీదివ్యభావవీథిని

చ. 3: రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు
సంగతి నాకు నీ భక్తజనులయందు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
చెంగట నా ధ్యానము నీ శ్రీమూర్తియందు

రేకు: 0149-03 పాడి సం: 02-225 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇహపరసాధన మీ తలఁపు
సహజజ్ఞానికి సతమీ తలఁపు

చ. 1: సిరులు ముంగిటను జిగిఁ దడఁబడఁగా
హరిని మఱువనిది యది దలఁపు
సరిఁ గాంతలెదుట సందడిగొనఁగా
తిరమయి భ్రమయనిదే తలఁపు

చ. 2: వొడలి వయోమద ముప్పతిల్లినను
అడఁచి మెలుగుట యది దలఁపు
కడఁగుచు సుఖదుఃఖములు ముంచినను
జడియని నామస్మరణమే తలఁపు

చ. 3: మతి సంసారపుమాయ గప్పినను
అతికాంక్షఁ జొరనిదది తలఁపు
గతియై శ్రీవేంకటపతి గాచిన
సతతము నితనిశరణమే తలఁపు

రేకు: 0149-04 శంకరాభరణం సం: 02-226 రామ

పల్లవి: శరణన్న విభీషణుఁ గరుణఁ గాచినవాఁడు
పరికింపఁ దారకబ్రహ్మమా యీరాముఁడు

చ. 1: ఆలికై విల్లువిఱిచి వాలికై యమ్మువేసిన-
వాలుమగఁటిమిగలవాఁడా వీఁడు
జాలను జలధిగట్టి కేలను మోక్షమిచ్చి
యేలేను జటాయువును యీతఁడా రాముఁడు

చ. 2: మింటికట్లు దెగనేసి యంటి పగసాధించి
దంటరాకుమారుఁడు తా నీశూరుఁడా
బంటుగా వాయుజు నేలి నంటు సుగ్రీవుతోఁ జేసి
కంటకరావణవైరి ఘనుఁడా యీరాముఁడు

చ. 3: రాకాసుల మర్దించి కాకాసురు నటు గాచి
మైకొన్న జానకీరమణుఁ డితఁడా
యీకడ శ్రీవేంకటాద్రి నిరవై తాను నున్నాఁడు
దీకొన్న ప్రతాపపుఁ దేవుఁడా యీరాముఁడు

రేకు: 0149-05 సాళంగనాట సం: 02-227 తేరు

పల్లవి: మిన్నునేలా నొక్కటైన మేటితేరు
కన్నులపండువయిన శ్రీకాంతునితేరు

చ. 1: జలధులమీఁదను చక్కఁగా నేఁగెను తేరు
బలిమిఁ గులాద్రుల పైఁ బారెను తేరు
పెలుచు లంకముంగిట పేరెలువారెను తేరు
చెలఁగె దిగ్విజయపు శ్రీహరితేరు

చ. 2: రమణఁ గుండిననగరము చుట్టుకొన్న తేరు
తిమురుచు రుకుమిణిఁ దెచ్చిన తేరు
సమరములో జరాసంధునిఁ దోలిన తేరు
అమరుల వెనుబలమగు శౌరితేరు

చ. 3: వొట్టి సృగాలవాసుదేవుని భంగించిన తేరు
బెట్టుపౌండ్రకునిపై దాడివెట్టిన తీరు
అట్టె శ్రీవేంకటుఁడు డలమేలుమంగఁ గూడి
పట్టమేలుచు నెక్కిన పరమాత్ము తేరు

రేకు: 0149-06 సాళంగనాట సం: 02-228 నృసింహ

పల్లవి: సింగారాల మించీ నరసింహదేవుఁడు
చెంగటనున్నాఁడు నరసింహదేవుఁడు

చ. 1: సురలు జయవెట్ట నసురలెల్ల మొరవెట్ట
సిరితో మెలఁగీ నరసింహదేవుఁడు
ధరణి వంపెట్ట బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట
శిరసెత్తె నవి నరసింహదేవుఁడు

చ. 2: కాంచనదైత్యుఁడు దొరకాలువనెత్తురు వార
చించెను గోళ్ళ నరసింహదేవుఁడు
పంచలఁ బంతాలు మీరి భవనాళియేరు వార
చెంచతలఁ గోరీ నరసింహదేవుఁడు

చ. 3: బలిమి పైపైనెక్క ప్రహ్లాదుఁ డట్టె మొక్క
చిలికీఁ గరుణ నరసింహదేవుడు
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీఁద
చెలువమే చూపీ నరసింహదేవుఁడు

రేకు: 0150-01 నాట సం: 02-229 దశావతారములు

పల్లవి: దానవారితోడి పగ ధరించరాదు మీకు
కానుకిచ్చి శరణని కప్పము లియ్యరో

చ. 1: భ్రమసి వార్ధిఁబడ్డాను పాతాళము దూరినాను
సమయించక మానఁడు శత్రులార
రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న
తమిఁ జంపక మానఁడు దై తేయులాల

చ. 2: రాసి మిన్నులో దాఁగిన రాచమూకలలోనున్న
కోసివేసీఁ దల లరి కుమతులాల
ఆసఁ ద్రికూటమెక్కినా ఆచక్రవాళమంటినా
తోసి సాధించకపోఁడు దుర్మతులాల

చ. 3: సతుల మాఁటుననున్నా సరి నెందెందు వోయినా
రతి మెట్టక మానఁడు రాకాసులాల
యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులేదితనికి
గతియని మొక్కరో వో కపటులాల

రేకు: 0150-02 సాళంగం సం: 02-230 అంత్యప్రాస

పల్లవి: భోగించఁ బుట్టిన సొమ్ము పొంచి పరానకేలోపు
శ్రీగురుఁడ నీవే దయసేతువు గాని

చ. 1: యీరెండుచేతులే యిన్ని పాపాలకు నోపు
పూరకే పుణ్యము సేయనోపవు గాని
మారుకొ నీరెండుగాళ్లే మాపుదాఁకాఁ జుట్టనోపు
యేరీతి దేవ నీగుడి కేఁగ నలసుఁ గాని

చ. 2: కన్ను లివి రెండే మిన్నుగలంతాఁ జూడనోపు
ఉన్నతి నాసాగ్రదృష్టి కోపవు గాని
అన్నిటా రెండుపెదవు లధరామృతాన కోపు
సన్నల మోక్షముత్రోవ జపించవు గాని

చ. 3: యీవీనులు రెండే విశ్వమంతా నాలించనోపు
వోవల శాస్త్రాలకైతే నోపవు గాని
శ్రీవేంకటేశ నీవే చిత్తాన జ్ఞానమిచ్చితే
భావించి జీవుఁడిన్నిటా బ్రదుకనోపుఁ గాని

రేకు: 0150-03 ముఖారి సం: 02-231 ఉపమానములు

పల్లవి: పరము నిహము పంటవండినయట్టు
యిరవుగాఁ దానే యెట్టయెదుట నున్నాఁడు

చ. 1: ముంచిన మహిమలెల్లా మూర్తివంతమైనట్టు
కాంచిన వరములు సాకారమైననట్టు
అంచు శృంగారరసాన కంగములు వచ్చినట్టు
యెంచఁగ శ్రీవేంకటేశు డెదుర నున్నాఁడు

చ. 2: చెలఁగి అకాశానకు చైతన్యము వచ్చినట్టు
అల దయాసింధువు ప్రత్యక్షమైనట్టు
మొలచి సుజ్ఞానము మోసులెత్తి వుండినట్టు
యెలమి శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు

చ. 3: పరగ నానందము ప్రతిబింబించినయట్టు
సురలభాగ్యము పొడచూపినట్టు
వురుటై యలమేల్మంగ నురమున నించుకొని
యిరవై శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు

రేకు: 0150-04 భైరవి సం: 02-232 అధ్యాత్మ

పల్లవి: పరమాత్ముఁడు సర్వపరిపూర్ణుఁడు
సురలకు నరులకు చోటయి యున్నాఁడు

చ. 1: కన్నులఁ గంటానే కడు మాటలాడుతానే
తన్నుఁగానివానివలె దాఁగియున్నాఁడు
అన్నియు వింటానే అట్టే వాసన గొంటానే
వన్నెలనూనె కుంచమువలె నున్నాడు

చ. 2: తనువులు మోచియు తలఁపులు దెలిసియు
యెనసియు నెనయక యిట్లున్నాఁడు
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై
మొనసి పూసలదారమువలె నున్నాఁడు

చ. 3: వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై
పూవులు వాసనవలె బొంచియున్నాఁడు
భావించ నిరాకారమై పట్టితే సాకారమై
శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతై యున్నాఁడు

రేకు: 0150-05 హిందోళవసంతం సం: 02-233 భగవద్గీత కీర్తనలు

పల్లవి: మూఁడే మాటలు మూఁడుమూండ్లు తొమ్మిది
వేడుకొని చదువరో వేదాంతరహస్యము

చ. 1: జీవస్వరూపము చింతించి యంతటాను
దేవుని వైభవము తెలిసి
భావించి ప్రకృతిసంపద యిది యెఱుఁగుటే
వేవేలువిధముల వేదాంతరహస్యము

చ. 2: తనలోని జ్ఞానము తప్పకుండాఁ దలపోసి
పనితోడ నందువల్ల భక్తినిలిపి
మనికిగా వైరాగ్యము మఱవకుండుటే
వినవలసినయట్టి వేదాంతరహస్యము

చ. 3: వేడుకతో నాచార్యవిశ్వాసము గలిగి
జాడల శరణాగతి సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁగొలిచి దాసుఁడౌటే
వీడని బ్రహ్మానంద వేదాంతరహస్యము

రేకు: 0150-06 సామంతం సం: 02-234 గురు వందన, నృసింహ

పల్లవి: ఇట్లానే యోగలక్ష్య మెఱుఁగుకొంటే ఫలించు
యెట్టయినా గురువాక్య మేమరకుఁడీ

చ. 1: కాంతఁ దలచుకొంటేనే కామోద్రేకము పుట్టు
యింతలోఁ గూడెనా యేడకేడ సూత్రము
చింతకాయతొక్కు చూచితేనే నోరూరు
యెంతకెంతదవ్వు యేడకేడ సూత్రము

చ. 2: వీనుల మంచిమాటలు వింటేనే సంతోష ముబ్బు
యేనిజము గనె నేడకేడ సూత్రము
ఆనించితే నాలుకనే ఆరురుచులుఁ దెలిసీ
యీనెపమున నేడకేడ సూత్రము

చ. 3: ముక్కుకొనఁ బ్రాణ ముండి ముందువెనుకకు వచ్చి
యెక్కడ మోచున్న దేడకేడ సూత్రము
చిక్కి శ్రీవేంకటేశుఁడు జీవుల కంతర్యామి
యిక్కు వెఱఁగితే నీడ కిదే సూత్రము

రేకు: 0151-01 దేసాక్షి సం: 02-235 ఉపమానములు

పల్లవి: ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముగ నితని శరణంటే సర్వఫలప్రద మిందరికి

చ. 1: హరిఁ గొలువని కొలువులు మఱి యడవిఁగాసిన వెన్నెలలు
గరిమల నచ్చుతు వినని కథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁ గాని తపంబులు పాతాళముల నిధానములు
మరుగురునికిఁ గాని పూవులపూజలు మగఁడులేని సింగారములు

చ. 2: వైకుంఠుని నుతియించని వినుతులు వననిధిఁ గురిసిన వానలు
ఆ కమలోదరుఁ గోరనికోరికె లందని మానిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయని భక్తులు చెంబుమీఁది కనకపుఁబూఁత
దాకొని విష్ణుని తెలియని తెలువులు తగ నేటినడిమి పైరులు

చ. 3: వావిరిఁ గేశవునొల్లని బదుకులు వరతఁ గలపు చింతపండు
గోవిందుని కటు మొక్కని మొక్కులు గోడలేని పెనుచిత్రములు
భావించి మాధవుపై లేనితలఁపులు పలు మేఘముల వికారములు
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు

రేకు: 0151-02 గుజ్జరి సం: 02-236 భగవద్గీత కీర్తనలు

పల్లవి: త్రికరణశుద్ధిగా చేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును
వొకటి కోటిగుణితంబగు మార్గములుండఁగ బ్రయాసపడనేలా

చ. 1: తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి
కనకబిందు యమునా గయాది ముఖ్యక్షేత్రంబుల సంతతమున్
దినకరసోమగ్రహణకాలముల తీర్థాచరణలు సేసిన ఫలములు
తనుఁ దానే సిద్ధించును వూరకే దవ్వులు దిరుగఁగ మఱి యేలా

చ. 2: హరియను రెండక్షరములు నుడివిన నఖిలవేదములు మంత్రములు
గరిమ ధర్మశాస్త్రపురాణాదులు క్రమమునఁ జదివిన పుణ్యములు
పరమ తపోయోగంబులు మొదలగు బహుసాధనముల సారంబు
పరిపక్వంబై ఫలియించంగా బట్టబయలు వెదకఁగనేలా

చ. 3: మొదల శ్రీవేంకటపతికినిఁ జేయెత్తి మొక్కిన మాత్రములోపలనే
పదిలపు షోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును
వదలక సాగంబులుగాఁ జేసినవాఁడే కాఁడా పలుమారు
మదిమదినుండే కాయక్లేశము మాఁటికి మాఁటికి దనకేలా

రేకు: 0151-03 ముఖారి సం: 02-237 వైష్ణవ భక్తి

పల్లవి: ఆతఁడే యజమానుఁడు ఆదినారాయణుఁడు
ఆతని బంట్లము మాకు నన్నిటా నిశ్చింతము

చ. 1: యేలికెగల బంటుకు యెక్కడిది విచారము
పాలించే మగఁడుగల పడఁతి కేడ చింత
కోలుముందై తండ్రిగల కొడుకు కేది తొడుసు
యీలీల హరిదాసుని కెక్కడికోరికెలు

చ. 2: బలుదుర్గము వానికి భయ మేమిటా లేదు
కలిమిగలవానికి కడమ లేదు
యిల క్షేత్రవంతునికి నెందూ దరిద్రము లేదు
అల శ్రీపతిబంట్లకు నలమట లేదు

చ. 3: పట్టిన ముద్రుంగరపుప్రధాని కెదురు లేదు
కుట్టి చాతనికివారికిఁ గొంకు లేదు
నెట్టిన శ్రీవేంకటాద్రినిలయు సేవకులము
గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతఁడే

రేకు: 0151-04 గుండక్రియ సం: 02-238 అధ్యాత్మ

పల్లవి: మనసులో మర్మమై మరలఁ బారుచునుండు
పొనుఁగువడ్డ మదము పోవఁగనీదు

చ. 1: తింటేనే విషమెక్కు దిష్టముగ విషలత
కంటేనే వలపెక్కుఁ గాంతలను
అంటిముట్టి కాఁగిట నలముకొంటేఁ గనక
మంటఁ గలసిన భ్రమ మానలేదు

చ. 2: మెట్టితేనే కఱచును మెలుపుతోడుతఁ బాము
పట్టితే విడువనీదు పచ్చనిపైఁడి
దట్టమై మేన సొమ్ములు తగుటుకొంటేఁ గనక
తొట్టి వెల్లిఁ బోయినాస తొలఁగనీదు

చ. 3: ఆహారము వెట్టితేను అట్టె విడుచు భూతము
ఆహారానకుఁ బోదెక్కు నట్టే ప్రాయము
యీహల శ్రీవేంకటేశుఁ డిట్టే కరుణించితేను
సాహాయమై వచ్చుఁ దానే సత్వగుణజ్ఞానము

రేకు: 0151-05 సాళంగనాట సం: 02-239 తేరు

పల్లవి: దిక్కులు సాధించఁబూని దేవదుంధుభులు మ్రోయ
యెక్కువ శ్రీవేంకటేశుఁ డెక్కెఁ దేరు

చ. 1: పన్నిద్దరు సూరియుల బండికండ్లతేరు
సన్నుతి శేషాదిదేవాసనపుఁ దేరు
కన్నులపండుగైన గరుడధ్వజపుఁ దేరు
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు

చ. 2: మించు నానా మేఘముల మేలుకట్ల తేరు
చుంచులనక్షత్రాల కుచ్చుల తేరు
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టి తేరు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తీరు

చ. 3: అట్టె కిం దేడులోకము లంతరువులైన తేరు
నట్టనడుమను బ్రహ్మాండపు తేరు
దిట్ట యలమేల్మంగతోఁ దిరమై వుండేటి తేరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డెక్కె నిదె తేరు

రేకు: 0152-01 శుద్ధవసంతం సం: 02-240 మాయ

పల్లవి: మాయ కిదె సహజము మాయను గెలువరాదు
మాయానాథుఁ గొలిచితే మన్నించు నాతఁడే

చ. 1: చేతికి లోనైనట్టుండు సృష్టిలోని వేడుకలు
పోతరించి పట్టఁబోతేఁ బోవు నట్టటే
ఆతుమలో వేసరి అలసి వూరకుండితే
వైతాళపు నీడవలె వచ్చు వెంటవెంటను

చ. 2: తీపువలెనే వుండు దిష్టపుఁ బదార్థాలు
మేపుగొంటే మీసాలమీఁది తేనౌను
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను
మూపునఁ గట్టిన చద్ది మోఁపించును

చ. 3: తలఁపులోనే వుండు తనలోని యంతరాత్మ
తెలుపుకోఁబోతే పెక్కుదేవతలౌను
చలపట్టి యీతనినే శరణని కొలిచితే
యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడై రక్షించును

రేకు: 0152-02 మంగళకౌశిక సం: 02-241 అధ్యాత్మ

పల్లవి: దేవుఁడొక్కఁడే గురి దెలిసినవారికి

యీవలావల చూచినా నిఁకలేదు తెఱఁగు

చ. 1: కోపము మానితేనే కోటిజపాలు సేయుట

పాపము సేయకుంటేనే బలుతపము

లోపల తానూరకుంటే లోకమెల్లాఁ జరించుట

మాపుదాఁకా వెదకినా మఱిలేదు తెఱఁగు

చ. 2: పరకాంత నంటకుంటె బలుపుణ్యాలు సేయుట

సొరిది నాసమానుటే సోమపానము

సరిమోనాన నుండుటే సన్యాసము చేకొనుట

యిరవైతే నంతకంటే నిఁకలేదు తెఱఁగు

చ. 3: పలు సుఖదుఃఖములఁ బాసి వుండుటే మోక్షము

అల చంచలము మానుటది యోగము

యిలపై శ్రీవేంకటేశుఁ డిచ్చిన సుజ్ఞానమిది

యెలమి బుద్ధిఁ బోల నిఁకలేదు తెఱఁగు

రేకు: 0152-03 సౌరాష్ట్రం సం: 02-242 అధ్యాత్మ

పల్లవి: తలఁచుకో వో మనస తగిన ద్రిష్టము లివి
వెలలేక తెచ్చేటి వివేకము లోధనము

చ. 1: గాలిఁబోయేఁ మాటలు లోకములోని సుద్దులెల్లా
గాలిఁ బో వెన్నఁడును శ్రీకాంతునుతులు
జాలిఁబడే సేఁతలుసంసారభోగములెల్లా
జాలిలేనివి విష్ణుని సంతతపుపూజలు

చ. 2: మాయమౌ గొన్నాళ్లకు మానుషకృత్యములెల్లా
మాయముగానివి దైవికమహిమలెల్లా
కాయకములే తమ కల్పితము లన్నియును
కాయకము గాక నిల్చుఁ గమలాక్షు మన్నన

చ. 3: పుడివోవు రాఁగారాఁగా నున్నతకర్మఫలాలు
పుడివోదు దేవునిపై నొనరు భక్తి
జడియ నితరులిచ్చేసకల వరములును
జడియదు శ్రీవేంకటేశ్వరుఁడిచ్చే వరము

రేకు: 0152-04 సాళంగనాట సం: 02-243 నృసింహ

పల్లవి: అహోబలేశ్వరునకు నాదిమూర్తికి
విహారమే పంతము వీరసింహమునకు

చ. 1: చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు
దిక్కులు చేతు లెండలు దివ్యాయుధాలు
మిక్కుటపు వేదములు మించుఁగొస వెంట్రుకలు
రక్కసులఁ జెండే విదారణసింహమునకు

చ. 2: శై లములే పాదములు జానువులే లోకములు
కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు
చాలుకొన్న మేఘములు సకలదివ్యాంబరాలు
పాలించే ప్రతాపపుసింహమునకు

చ. 3: అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుఁదు
వంతఁ గృపారసము వార్ధులెల్లాను
యింతటా శ్రీవేంకటాద్రి యిరవు మహాగుహ
రంతు లురుములు ఘోరరౌద్రసింహమునకు

రేకు: 0152-05 పాడి సం: 02-244 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఈ రూపమై వున్నాఁడు యీతఁడే పరబ్రహ్మము
శ్రీరమాదేవితోడ శ్రీవేంకటేశుఁడు

చ. 1: పొదలి మాయాదేవిపట్టిన సముద్రము
అదె పంచభూతాలుండే అశ్వత్థము
గుదికొన్న బ్రహ్మాండాల గుడ్లఁ బెట్టే హంస
సదరపుబ్రహ్మలకు జలజమూలకందము

చ. 2: అనంతవేదాలుండేటి అక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము
కనలు దానవమత్తగజసంహారసింహము
మొనసి సంసారభారము దాల్చేవృషభము

చ. 3: సతతము జీవులకు చైతన్యసూత్రము
అతిశయభక్తుల జ్ఞానామృతము
వ్రతమై శ్రీవేంకటాద్రి వరముల చింతామణి
తతిగొన్న మోక్షపు తత్త్వరహస్యము

రేకు: 0152-06 నాట సం: 02-245 శరణాగతి

పల్లవి: విఱిగి పారెడియట్టి వీరిడి యో రిపులాల
తఱి శరణుచొరరో దండాలు వెట్టరో

చ. 1: వీఁడె వచ్చెఁ గృష్ణుఁడిదె వేయరో కైదువులు
కాఁగినపోట్లు రాఁగీ కదియకురో
పోఁడిమితో భీతివాయ పూరి నోళ్లఁ గరవరో
ఆఁడువార మనుకోరో ఆతఁడు దడవఁడు

చ. 2: గోవిందుఁడు దాడివచ్చె గుసుకుచుఁ బారరో
కావు మని మెడలఁ బాగలు వేయరో
వేవేగ బిడ్డలఁ బేర్లు విభునికిఁ బెట్టరో
వో వో యెంగిలికిఁ జేతు లొగ్గరో రక్షించీని

చ. 3: మొత్తీ శ్రీవేంకటేశుఁడు మూలలకు దాఁగరో
వొత్తిలి పంతములిచ్చి మీ రోడఁగదరో
హత్తి మీతలలు విరియఁగఁ బోసుకొనరో
బొత్తుగా మిమ్ము గెలిచెఁ బొగడరో మెచ్చీని

రేకు: 0153-01 నాట సం: 02-246 హరిదాసులు

పల్లవి: పొరి నీకును విజిగిపోయిన దానవులు
బిరుదులుడిగి వోడబేహారులైరి

చ. 1: మకుటాలు దీసి జటామకుటాలు గట్టుకొని
వెకలి రిపులు మునివేషులైరి
మొకములను సోమపు మొకములు వెట్టుకొని
అకటా కొందరు రిపు లాటవారైరి

చ. 2: పేరులు విడిచి సంకుఁబేరులు మెడ వేసుక
సారెకుఁ గొందరు శివసత్తులైరి
బీరపుసాములు మాని పెద్దగడసాము నేర్చి
తోరపుఁ బగతులెల్లా దొమ్మరులైరి

చ. 3: నాదించ వెఱచి సింగినాదా లూదుకొంటాను
సోదించేరటాఁ గొందరు జోగులైరి
యీ దెస శ్రీవేంకటేశ యిన్నియు మాని కొందరు
దాదాత నీశరణని దాసరులైరి

రేకు: 0153-02 కాంబోదిసం: 02-247 వైరాగ్య చింత

పల్లవి: ఐనట్టయ్యీఁ గాక హరికల్పితము లివి
మానేటి వేఁటివో మానని వేవో

చ. 1: వొక్కరు తలఁచినట్టు వొకరి తలఁపు రాదు
పక్కన నందరికి బహుభావాలు
అక్కట మొద లొకటి అనలుఁ గొనలు వేరు
యెక్కడని తగిలేది యేమిసేసేది

చ. 2: పొరుగువాని చేఁత ఆపొరుగువాఁడు మెచ్చఁడు
నరుల కర్మములు నానావిధాలు
గరిమ నన్నమొక్కటే కడుపుతనివి వేరు
కరుణించౌనన నేవి కావన నేవి

చ. 3: కడఁగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు
బెడఁగు జీవుల పొందు పెక్కురీతులు
కడు శ్రీవేంకటేశుఁ డొక్కఁడు జగత్తులు వేరు
వొడిఁగట్టుకొనే దేది వొల్లనే దేది

రేకు: 0153-03 నాట సం: 02-248 నృసింహ

పల్లవి: నిండె నిన్నిచోటులను నీమహిమలే
అండనే మొక్కేము నీకు నాదినారసింహా

చ. 1: కూరిమి యిందిరమీఁద కోపము అసురమీఁద
తారుకాణ నవ్వు దేవతలమీఁదను
ఆరీతి నీకొలు విట్టే అహోబలముమీఁద
నారుకొనె నీనేరుపు నారసింహా

చ. 2: కరుణ ప్రహ్లాదమీఁద గన్నులు దిక్కుల మీఁద
సరిచేతులు పేగుల జంధ్యాలమీఁద
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీఁద
తిరమాయ నీకోరిక దివ్యనారసింహా

చ. 3: శాంతము లోకముమీఁద శౌర్యము శత్రులమీఁద
కాంతులెల్లా తనదివ్యకాయముమీఁద
చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీఁద
సంతతమై నీకుఁ జెల్లె జయనారసింహా

రేకు: 0153-04 సాళంగనాట సం: 02-249 హనుమ

పల్లవి: అన్నిటా నీ పెంపు వింత హనుమంత నీ-
వున్న చోటు నిశ్చింతమో హనుమంత

చ. 1: రాముని సేనలఁగాచి రావణు గర్వమడఁచి
ఆముకొన్న బలవంత హనుమంతా
గోమున జలధి దాఁటి కొండతో సంజీవి దెచ్చి
ధీమంతుడఁవైతివింత దివ్య హనుమంత

చ. 2: చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోఁచె
అక్కజపు నీ రూపంత హనుమంత
చొక్కమై మీరుండఁగాను సుగ్రీవాదులకెల్లా
అక్కర లేదించుకంతా హనుమంతా

చ. 3: జంగచాఁచి చేయెత్తి సరిఁ బిడికిలించుక
అంగము నిక్కించితెంత హనుమంత
రంగగు శ్రీవేంకటాద్రి రాముని దేవి కిచ్చితి-
వంగులియ్యక మొక్కంత హనుమంతా

రేకు: 0153-05 రామక్రియ సం: 02-250 నృసింహ, హనుమ

పల్లవి: మగటిమిగల హనుమంతరాయ
దిగువపట్టణములోని దేవ హనుమంత

చ. 1: చక్కఁగాఁ దోఁక చాఁచి జంగవెట్టి చేచాఁచి
అక్కజపు ప్రతాపపు హనుమంతుఁడా
రక్కసులఁ దునుమాడి రాముని దేవులకు
దిక్కై వుంగరమిచ్చిన దేవ హనుమంత

చ. 2: కీలుగంటు వేసుకొని కెరలి పిడికిలించి
ఆలకించేవు దిక్కులు హనుమంతుఁడా
నేలకు మింటికి మేను నిండఁ బెరిగి యక్షుని
తీలు పడఁగొట్టినట్టి దేవ హనుమంతుఁడా

చ. 3: తమితోడ దాసులను తప్పక కాచేనని
అమర నభయమిచ్చిన హనుమంతుఁడా
జమళి శ్రీవేంకటేశు సరస వూడిగానకు
తిమురుచు నుండేయట్టి దేవ హనుమంతా

రేకు: 0153-06 శ్రీరాగం సం: 02-251 వైరాగ్య చింత

పల్లవి: ఏమి చెప్పేదిది యీశ్వరమాయలు
దీము ప్రతిమకును త్రిజగము గలిగె

చ. 1: మలమూత్రంబుల మాంసపుముద్దకు
కులగోత్రంబుల గుటి గలిగె
తొలులు తొమ్మిదగు తోలుఁదిత్తికిని
పిలువఁగఁ బేరును బెంపునుఁ గలిగె

చ. 2: నెత్తురునెమ్ముల నీరుబుగ్గకును
హత్తిన కర్మము లటు గలగె
కొత్తవెంట్రుకల గుబురుల గంతికి
పొత్తుల సంసారభోగము గలిగె

చ. 3: నానాముఖముల నరముల పిడుచకు
పూనిన సిగ్గులు భువిఁ గలిగె
ఆనుక శ్రీవేంకటాధిపుఁ డేలఁగ
దీనికిఁ బ్రాణము తిరముగఁ గలిగె

రేకు: 0154-01 బౌళి సం: 02-252 అద్వైతము

పల్లవి: పురుషుండని శృతి వొగడీనట ఆ పురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి నివి వింటే నసంబద్ధములు

చ. 1: మొగమున బ్రహ్మలు మొలచిరట ఆ మూరితి అవయవరహితుఁడట
తగు బాహువులను రాజులట ఆ తత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆ బ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతని రూపము లేదట

చ. 2: తన వందనమునుఁ గలదట దైవము తనుఁ జూడఁ గన్నులు లేవట
తన విన్నపమునుఁ జేయునట ఆతనికిని వీనులు లేవట
తన యిచ్చినదే నైవేద్యంబట దైవము నోరే లేదట
తన యిచ్చేటి ధూపంబును గలదట దైవము ముక్కును లేదట

చ. 3: అంతాఁ దానే దైవమటా యజ్ఞము లొరులకుఁ జేయుటట
సంతతమునుఁ దా స్వతంత్రుఁడటా జపముల వరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపు శ్రీవేంకటపతిమాయలు పచారించిన వివియట

రేకు: 0154-02 శంకరాభరణం సం: 02-253 అద్వైతము

పల్లవి: ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీనయ్యలాల

చ. 1: పాప మొక్కడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున నొకరిపుణ్య మిందరికి రావలదా
కోపంచి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁడొక్కఁడైతే సురలిందరుఁ గావలదా

చ. 2: వొకఁ డపవిత్రుఁ డైతే నొగి నిందరుఁ గావలదా
వొకఁడు శుచై వుండితే వోడ కిందరుఁ గావలదా
వొకని రతిసుఖమంటి యిందరును వొనరఁ బొందవలదా
వొకని దుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా

చ. 3: ఆకడ నొకఁడు ముక్తుఁడయితే నందరునుఁ గావలదా
దీకొని యొకఁడు బంధుఁడయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి-
లోకపు మునులనుఁ దెలుసుకోవలదా

రేకు: 0154-03 శంకరాభరణం సం: 02-254 గురు వందన, నృసింహ

పల్లవి: దేవుఁడుగలవారికి దిగులుఁ జింతయు లేదు
శ్రీవిభుఁడే అన్నిటా రక్షించుఁ గనక

చ. 1: యేలికగల బంటుకు యేవిచారము లేదు
వోలి మగఁడుగలాలికి వొప్పమి లేదు
పోలిమిఁ దండ్రిగల పుత్రుని కంగద లేదు
మేలుగాఁ బండిన భూమికిఁ గరవు లేదు

చ. 2: బలముగల రాజుకు భయమేమియు లేదు
కలిమిగలవాని కక్కర లేదు
యిల నాచారవంతుని కేపాపమును లేదు
తలఁపు బుణ్యముగల ఆతనికిఁ జేటు లేదు

చ. 3: గురువుగలవానికిఁ గొఱంత యేమియు లేదు
పరముగలవానికి భ్రాంతులు లేవు
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు
అరయ దాసులము మా కడ్డాఁకే లేదు

రేకు: 0154-04 కేదారగౌళ సం: 02-255 శరణాగతి

పల్లవి: కమలారమణ నీకల్పితపుమానిసిని
తమితోడ నాదిక్కు దయఁ జూడవే

చ. 1: ఆరీతి బ్రాహ్మణుఁడ ననుటేకాని దేహము
కోరి యాచారమునకుఁ గొలుపదు
పేరు వైష్ణవుఁడననే పెద్దరికమే కాని
సారమైన మనసులో జ్ఞానమే లేదు

చ. 2: చదివితిననియెడి చలపాద మింతే కాని
అదన నందులోని అర్థ మెఱఁగ
పదిరిసంసారమనే బహురూపమే కాని
చతురుఁదనాన నందు సమర్థుఁడఁ గాను

చ. 3: దేవ మీభక్తుఁడననే తేజ మొకటె కాని
చేవమీర నినుఁ బూజించ నేరను
శ్రీవేంకటేశ నీచేతిలోనివాఁడ నేను
భావించి మఱి యేపాపము నెఱఁగను

రేకు: 0154-05 కాంబోది సం: 02-256 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నాళ్లు నందునందు నేమి గంటివి
అన్నిటా శరణు చొచ్చి హరి నిన్నుఁ గంటిని

చ. 1: అంగనల పసఁజిక్కి అలయికలే కంటి
బంగారువెంటఁ దగిలి భ్రమ గంటిని
ముంగిటిక్షేత్రాలంటి ముంచి వెట్టిసేయఁ గంటి
అంగపు నన్నే చూచి అంతరాత్మఁ గంటి

చ. 2: చుట్టాలఁ జేరి చూచి సుద్దులవావులు గంటి
మట్టులేని వయసుతో మదము గంటి
వట్టికామములుసేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణాయని భక్తి నిన్నుఁ గంటిని

చ. 3: వింతచదువులవల్ల వేవేలుమతాలు గంటి
సంతకర్మములవల్ల సాము గంటిని
యింతట శ్రీవేంకటేశ యిటు నాజీవభావము
చింతించి అందులోన నీ శ్రీపాదాలు గంటి

రేకు: 0155-01 సామంతం సం: 02-257 వైష్ణవ భక్తి

పల్లవి: సారిది మమ్మిట దయఁజూతువు గాకా
వెరసి మరి యొక్కడా నేమి విన్నవించే మీకను

చ. 1: తలఁచితి నీరూపము తగిలితి నీపాదాలు
కలసితి నీదాసుల గమిలోనను
చలివాసె భవములు సడిదీరెఁ గర్మములు
యెలమి నీమహిమలు యేమి చెప్పే మీకను

చ. 2: నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి
చేముట్టి పూజించితి శ్రీయంగాలు
తామసములెల్లా నూడె తతివచ్చె సాత్వికము
గోమున మరేమి నిన్ను కొసరే మీకను

చ. 3: తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి
విరవైన నీకథలు వీనుల వింటి
పరగ శ్రీవేంకటేశ పరము నిహముఁ గంటి
అరసి యితర మేమి ఆశపడే మీకను

రేకు: 0155-02 వరాళి సం: 02-258 శరణాగతి

పల్లవి: శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు
పైపై నీశరణమే పరమపదంబు

చ. 1: పరమాత్మునిపై నాత్మ ప్రవేశింపఁజేయుటే
పరికింపఁ బరకాయప్రవేశము
గరిమ నాహృదయాకాశమునఁ దలఁచుటే
గిరపై యబ్బినయట్టి ఖేచరత్వము

చ. 2: మంచి పరమహంసనామము ప్రాణులచే వింట
చంచుల వినేటి దూరశ్రవణము
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట
యెంచఁగ దూరగమన మింటిలో నౌట

చ. 3: సావధానమె లోచూపు సర్వథా నిన్నుఁ జూచుట
తావులనే అనిమిషత్వము చేరుట
శ్రీవేంకటేశ్వర నీసేవకుఁడై నిలుచుటే
వేవేలు తత్త్వజ్ఞానవిధుల నిలుచుట

రేకు: 0155-03 దేసాళం సం: 02-259 అధ్యాత్మ

పల్లవి: అంతరంగములో నున్న హరియే గతిగాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును

చ. 1: పుట్టించిన కర్మమే పోషించకుండునట
బెట్టుగా మనసే మఱపించునట
పట్టైన మేనే ఆసల బతిమాలింపించునట
చుట్టములెవ్వరు యెంచి చూచినఁ బ్రాణికిని

చ. 2: పక్కన విత్తినభూమి పంట వండకుండునట
యెక్కడా మాయే భ్రమయింపించునట
అక్కరతోఁ జేసిన పుణ్యమే కట్టివేసునట
దిక్కు దెస యెవ్వరు యీ దేహిఁ గరుణించను

చ. 3: ఆసలఁ బెట్టే పాయమే అటమటమౌనట
సేసే సంసారమే జ్ఞానిఁ జేయునట
వేసరక యింతకూ శ్రీవేంకటేశు డేలికట
మోసపుచ్చేవారెవ్వరు ముదమే జీవునికి

రేకు: 0155-04 దేసాళం సం: 02-260 గురు వందన

పల్లవి: ధరణి నెంద రెన్నితపములు చేసినాను
హరికృపగలవాఁడే అన్నిటాఁ బూజ్యుఁడు

చ. 1: మితిలేని విత్తు లెన్ని మేదినిపైఁ జల్లినాను
తతితో విత్తినవే తగఁ బండును
యితరకాంతలు మఱి యెందరు గలిగినాను
పతి మన్నించినదే పట్టపుదేవులు

చ. 2: పాలుపడి నరు లెన్నిపాట్లఁ బడి కొలిచినా-
నేలికె చేపట్టనవాఁడె యెక్కుడుబంటు
మూల నెంతధనమున్నా ముంచి దానధర్మములు
తాలిమితో నిచ్చినదే దాఁపురమై నిల్చును

చ. 3: యెన్నికెకుఁ గొడుకులు యెందరు గలిగినాను
యిన్నిటా ధర్మపరుఁడే యీడేరును
వున్నతిఁ జదువులెన్ని వుండినా శ్రీవేంకటేశు
సన్నుతించిన మంత్రమే సతమై ఫలించును

రేకు: 0155-05 దేవగాంధారి సం: 02-261 అధ్యాత్మ

పల్లవి: అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్నిన మాయలో వారు బయలు వాఁకేరు

చ. 1: ప్రకృతిబోనుల లోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాల సంది జన్మములవారు
వెకలి సంసారాలకే వేడుకపడేవారు

చ. 2: కామునియేట్ల దిగఁగారేటి దేహులు
దోమటి తమబదుకే దొడ్డదనేరు
పామిడి కోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తలమనేరు

చ. 3: యితరలోకాలనెడి యేఁతపుమెట్ల ప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర
మతకాన నున్నవారు మారు మలసేరు

రేకు: 0155-06 దేసాక్షి సం: 02-262 వేంకటగానం

పల్లవి: ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా
వింతలై న నీమూర్తి వెసఁ దెలిసేమా

చ. 1: లోకములో సముద్రములోఁతు చెప్పఁగరాదట
ఆకాశ మింతంతని యనరాదట
మేకొని భూరేణువులు మితి వెట్టఁగరాదట
శ్రీకాంతుఁడ నీమహిమ చెప్ప చూపవశమా

చ. 2: అల గాలి దెచ్చి ముడియగాఁ గట్టఁగరాదట
వెలయఁ గాలము గంటు వేయరాదట
కలయ నలుదిక్కులకడ గానఁగరాదట
జలజాక్ష నీరూపు తలపోయఁగలనా

చ. 3: కేవలమైన నీమాయ గెలువనేరాదట
భావించి మనఁసు జక్కఁ బట్టరాదట
దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కొల్వవశమా

రేకు: 0156-01 శంకరాభరణం సం: 02-263 శరణాగతి

పల్లవి: నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాఁడను
యేచి నీవు రక్షించేదే యెక్కుడుపుణ్య మింతే

చ. 1: పాటించి నీభావము పట్టవశమా తలఁచి
మేటి నామనసు నీకు మీఁదెత్తు టింతే
నూటికైన నీనామము నుడుగఁగ వశమా
మాటలు నీసెలవుగా నుట్టుపెట్టుటింతే

చ. 2: వేవేలైన నీకథలు వినఁగ నాతరమా
సోవగా వీనులు తావు చూపుట యింతే
దేవ నీసాకారము ద్రిష్టించ నావశమా
పావనముగా నందులోఁ బనిగొను టింతే

చ. 3: గట్టిగా నిన్నుఁ బూజించఁ గమ్మటి నావశమా
నెట్టిన నామేను నీకు నేమించు టింతే
పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
జట్టిగొనుకొరకు నీశరణను టింతే

రేకు: 0156-02 గౌళ సం: 02-264 హరిదాసులు

పల్లవి: నమ్మవలెఁగాని యెన్నఁడు సందేహము లేక
యిమ్ముల దేవుఁడు వరమిచ్చు టేమరుదు

చ. 1: మగనిపై బత్తిసేసి మంచిలోకా లెక్కేరట
తగుదండకోల వట్టి తత్త్వగతి గనేరట
పగటున నొకవేరు వట్టి పాముఁ బట్టేరట
తగిలి హరిదాసులు ధన్యు లౌ టేమరుదు

చ. 2: యేలికెకు ధనమిచ్చి హితభోగా లందేరట
కేలఁ గత్తివూని పగ గెల్చేరట
గాలి లోలోఁ బూరించి ఘనసిద్ధు లయ్యేరట
యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు

చ. 3: దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యేరట
మొక్కి విప్రుల నర్చించి ముంచి సిరు లందేరట
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరుఁ
జక్కనఁ గొల్చిన దాసులు జ్ఞాను లౌ టేమరుదు

రేకు: 0156-03 ముఖారి సం: 02-265 శరణాగతి

పల్లవి: నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి
యీకడ లాలించితే మే మిటు నిన్ను గొలుతుము

చ. 1: మాటలకు లోఁగాని బ్రహ్మమనంటా దాఁచి దాఁచి
మాటాడకుండేవు సుమ్మీ మాతో నీవు
నీటున మనసులో నిలుపరానివాఁడనంటా
పాటించి మాకుఁ బొడచూపకుంటే గతి యేది

చ. 2: శ్రుతులకుఁ బట్టరాని చోద్యపు బ్రహ్మమనంటా
మతకానఁ జిక్కక మానేవు సుమ్మీ
పతివి నీ గంభీరము బయటఁబడీ నంటా
అతిగోప్యాన ని న్నది యెట్టెఱిఁగేము

చ. 3: మాయవన్నుకొనిన వుమ్మడిబ్రహ్మమనంటా
యేయడనైననా భ్రమయించేవు మీ్మ
పాయపు టలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ

రేకు: 0156-04 దేసాక్షి సం: 02-266 అద్వైతము

పల్లవి: కోటానఁ గోట్లాయ కోరికెలు జన్మములు
కూటువ గూడి రాట్నపుగుండ్ర లైనారయ్యా

చ. 1: మిన్ను పైనున్న జీవులు మన్నుపైఁ బ్రవేశించి
అన్నద్వారమున దేహము మోఁచి
మున్నిటి దానఫలా లిమ్ముల భుజించి యప్పటి
తిన్నని కర్మములు గాదెలఁ బోసేరయ్యా

చ. 2: యిరవు మఱచి మఱి యెరవులకాఁపిరేల
సురలు నరులమంటాఁ జొక్కిచొక్కి
సొరిది లోకములెల్లాఁ జొచ్చి కాలగతులను
పొరి నాయుష్యము గొల్చిపోయుచున్నారయ్యా

చ. 3: దండగాఁగఁ దిరుమలకొండయెక్కి సుజ్ఞానులు
పండిన మనసుతోడ బత్తినేసి
అండనే శ్రీవేంకటేశు నలమేల్మంగనుఁ గొల్చి
నిండునిధానములై నిల్చినారయ్యా

రేకు: 0156-05 భూపాళం సం: 02-267 అధ్యాత్మ

పల్లవి: మొదలనే యెచ్చరికెతో మోసపోక యేపొద్దూ
వెదకి హరికథలే వినుచుండవలయు

చ. 1: వెలఁదుల సుద్దులు వీనులను వింటేను
పెలుచుఁజూపులఁ జూడఁ బ్రేమ పుట్టించు
మలసి యాచూపులు మనసునఁ దగిలించు
తలఁపు మాటాలాడఁ దమిరేఁచును

చ. 2: మగువలతోడుత మాటలాడ దొరకొంటే
నగినగి సంసారాలనంటు గల్పించు
తగిలిన నవ్వులు తనువులు సోఁకింపించు
మిగులాఁ దనుసోకులే మించి వలపించును

చ. 3: సతులతో మోహము సంపదలు పోరించు
అతిసంపదలు దేహి నజ్ఞానిఁ జేయు
తతి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడే
గతియని కొలిచితే ఘనునిఁగా జేయును

రేకు: 0156-06 ముఖారి సం: 02-268 వైరాగ్య చింత

పల్లవి: ఇందువల్ల నేమిగద్దు యినుపగుగ్గిళ్లింతే
యిందిరారమణు సేవే యిరవైన పదవి

చ. 1: సతులతో నవ్వులు చందమామగుటుకలు
మతితలపోఁత లెండమావులనీళ్ళు
రతులతో మాటలు రావిమానిపువ్వులు
తతి విరహపుకాఁక తాటిమావినీడ

చ. 2: లలనల జవ్వనాలు లక్కపూసకపురులు
నెలకొని సేసే బత్తి నీటిపై వ్రాఁత
చెలువపు వినయాలు చేమకూరశైత్యాలు
కొలఁదిలేని ననుపు గోడమీఁది సున్నము

చ. 3: పడఁతుల వేడుకలు పచ్చివడఁగండ్ల గుళ్లు
కడుమోవితీపు చింతకాయకజ్జము
బడి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరుఁ-
డడరించిన మాయలు అద్దములో నీడలు

రేకు: 0157-01 బౌళి సం: 02-269 అధ్యాత్మ

పల్లవి: సత్యము సేయఁగవచ్చును సర్వేశ్వర యీమాటకు
నిత్యము నీవే యెఱుఁగుదు నేనేమి నెఱఁగఁ జుమీ

చ. 1: సులభుఁడవౌదువు వొకమరి చూడఁగ దుర్లభుఁడవౌదువు
తలఁపింతువు మఱపింతువు తగఁ బ్రాణములోనుండి
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు
వెలయఁగ నీవే వెలిగా వేరొకటి నేఁ జేయఁ జుమీ

చ. 2: వొనరఁగఁబూజలు గొందువు వొక్కొకపరిమానుదు వటు
కను మూయింతువు నిదురలఁ గడు మేల్కొలుపుదువు
ఘనముగ నజ్ఞానిఁ జేతువు కరుణతో జ్ఞానిఁ జేతువు
ననుఁ బుట్టించితి నీవే నా కాపని గాదు సుమీ

చ. 3: నాలో నుందువు వొకపరి నగి శ్రీవేంకటగిరి నుందువు
పాలింతువు లాలింతువు భవ మీడేరింతువు
పోలింప సంసారిఁ జేతువు భువి నీదాసునిఁ జేతువు
కాలముఁ గర్మము నీవే కపటము నే నేరఁ జుమీ

రేకు: 0157-02 రామక్రియ సం: 02-270 అద్వైతము

పల్లవి: వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ల
ధీరతతో నేది మేలో తెలుసుకోరో

చ. 1: అట్టే కొందరు మతము లన్నియు నేకమని
పట్టవర్ధనము నెత్తిఁ బెట్టి చూపిరి
జట్టిఁ గొందరు జీవులు జంగమే లింగముగాని-
పుట్టుగెల్లా భస్మమని పూసుక చూపిరి

చ. 2: కొంద రేమియును లేదు కొట్టఁగొన లయమని
అంది వట్టి లలాటశూన్యము చూపిరి
కందువఁ గొందరు లక్ష్మీకాంతుఁ డంతరాత్మయని
ముందే నామము శ్రీచూర్ణమునుఁ బెట్టి చూపిరి

చ. 3: చెలఁగి దిష్ట మిపుడు శ్రీవేంకటేశుఁడు
అలమేలుమంగపతియై యున్నవాఁడు
యిలవీర నీదాసుల కిట్టి భాగ్యరేఖలు
వలసినవారికెల్లా వ్రాసినాఁడితఁడు

రేకు: 0157-03 లలిత సం: 02-271 వైరాగ్య చింత

పల్లవి: విచార మెన్నఁడు లేదు వీరిడి జీవులకును
పచారించేరు బ్రదుకు బ్రహ్మనాటనుండియు

చ. 1: పొద్దువొడచుటయును పొరిఁ గూఁగుటయె కాని
అద్దుకొని మిగులఁగ నందేమి లేదు
వొద్దికఁ బుట్టుటయును పుడుగఁ జూచుటె కాని
కొద్దితోడఁ గాలమేమి గురియై నిలువదు

చ. 2: అన్నము భుజించేదియు నాఁకలి గొనేదెకాని
యెన్నికకుఁ జెప్పిచూప నేదియు లేదు
ఇన్నిటఁ దిరిగాడేది ఇంటికి వచ్చేదే కాని
పన్ని తననిలుకడ భావించ లేదు

చ. 3: జవ్వనము మోఁచేదియు సరి ముదుసేదే కాని
తవ్వి కట్టుకొనే దేది దాఁచే దేది
నవ్వుతా నలమేల్మంగనాయక శ్రీవేంకటేశ
రవ్వల నీ వేలికవు రక్షించు మిఁకను

రేకు: 0157-04 శంకరాభరణం సం: 02-272 భక్తి

పల్లవి: ఇంతకంటె నేమిసేసే మిదే మా మానసపూజ
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుఁడవు

చ. 1: అంతర్యామివైన మీకు నావాహనమదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపుఁకోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలముచల్లే మీకుఁ బాద్యము

చ. 2: జలధు లన్నియును నాచమనియ్యము మీకు
అల యా వరుణజల మిదియే స్నానము
వలనుగా మీమహిమలే వస్త్రాభరణములు
అల వేదములే మీకు యజ్ఞోపవీతము

చ. 3: ఇరవుగఁ గుబ్జ తొల్లిచ్చినదే మీకు గంధము
ధర మాలాకారుని పూదండలే మీకు పువ్వులు
ఉరుగతి మౌనుల హోమమే మీకు ధూపము
తిరమైన మీకు రవితేజమే దీపము

చ. 4: నానామృతములే మీకు నైవేద్యతాంబులములు
పూనిన భక్తి షోడశోచారములు
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తానకపు జపములే తగ మీకు నుతులు

రేకు: 0157-05 శ్రీరాగం సం: 02-273 రామ

పల్లవి: రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ

చ. 1: దశరథతనూజాయ తాటకదమనాయ
కుశికసంభవయజ్ఞగోపనాయ
పశుపతిమహాధనుర్భంజనాయ నమో
విశదభార్గవరామవిజయకరణాయ

చ. 2: భరితధర్మాయ శూర్పణఖాంగహరణాయ
ఖరదూషణాది రిపుఖండనాయ
తరణిసంభవసైన్యదక్షకాయ నమో
నిరుపమమహావారినిధిబంధనాయ

చ. 3: హతరావణాయ సంయమినాథవరదాయ
అతులితాయోధ్యాపురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో
వితతవావిలిపాటి వీరరామాయ

రేకు: 0157-06 లలిత సం: 02-274 వైరాగ్య చింత

పల్లవి: భోగము నేను నీకు భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును

చ. 1: చక్కని జన్మపు సంసారవృక్షమునకు
పక్కున(వ) ఫలము నీవు భావించగా
మక్కువఁ గర్మమనేటి మత్తగజమునకును
యెక్కిన మావటీఁడవు యెంచఁగ నీవు

చ. 2: నెట్టన దేహమనేటి నిర్మలరాజ్యమునకు
పట్టమేలుచుండిన భూపతివి నీవే
దిట్టమైన చిత్తమనే తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు

చ. 3: సంతతమైన భక్తిచంద్రోదయమునకు
రంతులఁ జెలఁగు సముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనే మేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁజూచినను

రేకు: 0157-06 సాళంగనాట సం: 02-275 రామ

పల్లవి: కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసురవరద జయ పరిపూర్ణరామ

చ. 1: మునుప దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి

చ. 2: సుప్పనాతి శిక్షించి సారిది రుషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయమృగము సోదించి హరియించి
కప్పి హనుమంతు బంటుఁగా నేలుకొంటివి

చ. 3: సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి
చెలఁగితి వయోధ్యలో శ్రీవేంకటేశుఁడా

రేకు: 0158-01 గౌళ సం: 02-276 వైరాగ్య చింత

పల్లవి: గట్టిగాఁ దెలుకొంటే కన్నదే కంటి గురుమ (తు ?)
దట్టమైన సుజ్ఞానము తనలోనే వున్నది

చ. 1: బయలే పంటలు వండె బయలే పాఁడి విదికె
బయలు ప్రపంచమై భ్రమయించెను
బయటనే ప్రకృతియు బయటనే జీవులు
బయటనే బ్రహ్మము పరిపూర్ణమాయె

చ. 2: ఆకసము చూలాయ నాకసము రూపులాయ-
నాకసము సంసారమై యలవడెను
ఆకసాన దివియును నాకసాన లోకములు
ఆకసాన శ్రీహరి యవతారమందెను

చ. 3: అంతరంగమే భోగము అంతరంగమే యోగము
అంతరంగమే అన్నిటి కావాసమయ్యే
అంతరంగాన శ్రీవేంకటాధిపుఁ డున్నవాఁడు
అంతరంగాన మోక్షము అతఁడే యొసఁగెను

రేకు: 0158-02 గౌళ సం: 02-277 దశావతారములు

పల్లవి: ఆతురబందుగుఁడవు హరినారాయణ కృష్ణ
మా తలఁపెఱిఁగి నీవే మన్నించితి విపుడు

చ. 1: గురుకుమారులఁ దెచ్చుకొని రక్షించినయట్లు
ధరలో గజరాజు నుద్ధరించినట్లు
గరిమఁ జెరలుమాన్పి కాంతలఁ బెండ్లాడినట్లు
సిరులతో మముఁ దెచ్చి సేవలు గైకొంటివి

చ. 2: నేరుపుననే రుకుమిణిదేవిఁ దెచ్చినయట్లు
ధీరత మునిపుత్రులఁ దెచ్చినయట్లు
భారమైన యహల్యశాపము మానిపినయట్లు
గారవించి మము నేఁడు కరుణఁ జూచితివి

చ. 3: లంక సాధించి సీతను లలిఁ జేకొనినయట్లు
తెంకికి ననిరుద్ధునిఁ దెచ్చినయట్లు
అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని
పొంకముగ మాపాలిటఁ బొసఁగి యేలితివి

రేకు: 0158-03 శంకరాభరణం సం: 02-278 నృసింహ

పల్లవి: వేదములు నుతింపఁగ వేడుకలు దైవారఁగ
ఆదరించీ దాసుల మోహననారసింహుఁడు

చ. 1: నెఱులజడలతోడ నిక్కుఁ గర్ణములతోడ
కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ
వుఱక సిరిఁ దొడపై నుంచక సింహాసనాన
మెఱసీఁ బ్రతాపములు మేటినారసింహుఁడు

చ. 2: నిడుపమీసాలతోడ నిట్టూరుపులతోడ
మిడుగుడ్లతోఁ దెల్లనిమేనితోడ
వొడలసొమ్ములు వెట్టి వొడ్డోలగమై వుండి
కడు మంచివరాలిచ్చీ ఘననారసింహుఁడు

చ. 3: చిలుకుగోళ్ల తోడ సెలవినవ్వులతోడ
బలు జిహ్వతోడ యోగపట్టెము తోడ
అలరి శ్రీవేంకటాద్రి నహోబలగిరిని
అల ప్రహ్లాదునిఁ గాచె నాదినారసింహుఁడు

రేకు: 0158-04 శ్రీరాగం సం: 02-279 వేంకటగానం

పల్లవి: సకలలోకనాథుఁడు జనార్దనుఁ డితఁడు
శుకయోగివంద్యుని సుజ్ఞాన మెంత

చ. 1: మరుని తండ్రికిని మఱి చక్కఁదనమెంత
సిరిమగని భాగ్యము చెప్పనెంత
పురుషోత్తము ఘనత పొగడఁగ నిఁక నెంత
గరిమ జలధిశాయి గంభీర మెంత

చ. 2: వేవేలు ముఖాలవాని నిగ్రహము చెప్ప నెంత
భూవల్లభుని వోరుపు పోలించ నెంత
వావిరి బ్రహ్మతండ్రికి వర్ణింప రాజస మెంత
యేవల్లఁ జక్రాయుధుని కెదురెంచ నెంత

చ. 3: అమితవరదునికి ఔదార్యగుణ మెంత
విమతాసురవైరివిక్రమ మెంత
మమతల నలమేలుమంగపతి సొబ గెంత
అమర శ్రీవేంకటేశు ఆధిక్య మెంత

రేకు: 0158-05 సామంతం సం: 02-280 కృష్ణ

పల్లవి: కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీమహిమలే పరబ్రహ్మము

చ. 1: అకాశమువంటి మేన నమరేమూ ర్తివి గాన
అకాశనదియే నీకు నభిషేకము
మేకొని నీవే నిండుమేఘవర్ణుఁడవు గాన
నీకు మేఘపుష్పాలే పన్నీరుకాపు

చ. 2: చంద్రుడు నీమనసులో జనించె నటుగాన
చంద్రికలు కప్రకాపై సరి నిండెను
ఇంద్రనీలపుగనుల యిలధరుఁబడవు గాన
తంద్రలేని యీపె చూపే తట్టు పునుఁగాయను

చ. 3: లక్ష్మీపతివిగాన లాగుల నీవురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీతాళి
సూక్ష్మమై శ్రీవేంకటేశ చుక్కలపాడవు గాఁగ
పక్ష్మనక్షత్రములే యాభరణహారములు

రేకు: 0159-01 పాడి సం: 02-281 వైరాగ్య చింత

పల్లవి: చంచలపడఁగవద్దు సారె సారెఁ గోరవద్దు
పొంచుకున్న దైవమే బుద్ధులు నేర్పిరి

చ. 1: లోకరక్షకుఁడు నాలోననే వున్నాఁడిదే
నాకు నభయములిచ్చి నన్నుఁ గాచును
శ్రీకాంతుఁడీతఁడే నాచిత్తములో మలసీని
దాకొని శుభములెల్లాఁ దానే వొసఁగును

చ. 2: పరమపురుషుడు నాప్రాణనాథుఁడైనాఁడు
పరగ నాపాలివాఁడై బ్రదికించును
ధరణీశుఁ డీతఁడే నాదాపుదండై కడఁగీని
నిరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు

చ. 3: శ్రీవేంకటేశుఁడు నాజిహ్వఁ దగిలి వున్నాఁడు
పావనునిఁ జేసి నాకు ఫల మిచ్చును
గోవిందుఁ డీస్వామి నన్నుఁ గొలిపించుకొన్నవాఁడు
యీవల నావల నాకు నిహపరా లిచ్చును

రేకు: 0159-01 రామక్రియ సం: 02-282 శరణాగతి

పల్లవి: నెట్టన శ్రీసతిమగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైన దేవునికి శరణు

చ. 1: చెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై వుండేయాతనికి శరణు
తెలివై మఱపై దేహాలలో సూత్రమై
వలనై రక్షించేయట్టివానికి శరణు

చ. 2: చక్కఁగా వేదములకు సకలశాస్త్రములకు
నెక్కొని గుఱుతైనవానికి శరణు
దిక్కుదెసయి స్వతంత్రుఁడయి తేరిన ఆదిమూలమై
అక్కజపు మహిమల యాతనికి శరణు

చ. 3: యిరవుగఁ గరుణించి యిహపరాలొసగేటి-
నిరతి శ్రీవేంకటేశునికి శరణు
గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము-
లెరవులేక యిచ్చేటి యీతనికి శరణు

రేకు: 0159-02 మాళవి సం: 02-283 దశావతారములు

పల్లవి: పురుషులకు పురుషుఁడవు పురుషోత్తమా
పురుఁడు లే దిఁక నీకుఁ బురుషోత్తమా

చ. 1: పొలసులాడకు నీవు పురుషోత్తమా
బులిసి లోఁగఁగనేల పురుషోత్తమా
పొలమురాజవు నీవు పురుషోత్తమా నీ
పొలఁకు వదే కంబమునఁ బురుషోత్తమా

చ. 2: పొడవులకుఁ బొడవైన పురుషోత్తమా బిరుదు
పుడిసిళ్లఁ జల్లితివి పురుషోత్తమా
పుడికి సతిఁ గైకొంటి పురుషోత్తమా
పొడమెఁ జీఁకటితప్పు పురుషోత్తమా

చ. 3: బూటకపుబుద్ధిగల పురుషోత్తమా
పోటి గుఱ్ఱపుఁ బసల పురుషోత్తమా
మేటి శ్రీవేంకటముమీఁద నొసఁగే విదివో
పూటవూఁటవరాలు పురుషోత్తమా

రేకు: 0159-03 సామంతం (02-261, except rAga!!) సం: 02-284 అధ్యాత్మ

పల్లవి: అన్నిటికి మూలమని హరి నెంచరు
పన్నిన మాయలో వారు బయలు వాఁకేరు

చ. 1: ప్రకృతిబోనుల లోపలఁ జిక్కి జీవులు
అకట చక్కనివార మనుకొనేరు
సకలపుణ్యపాపాల సంది జన్మములవారు
వెకలి సంసారాలకే వేడుకపడేవారు

చ. 2: కామునియేట్ల దిగఁగారేటి దేహులు
దోమటి తమబదుకే దొడ్డదనేరు
పామిడి కోరికలకు బంట్లైనవారలు
గామిడితనాలఁ దామే కర్తలమనేరు

చ. 3: యితరలోకాలనెడి యేఁతపుమెట్ల ప్రాణులు
కతల మోక్షమార్గము గంటిమనేరు
తతి నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర
మతకాన నున్నవారు మారు మలసేరు

రేకు: 0159-04 వరాళి సం: 02-285 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఏఁటి జాణతనమే యేమే నీవు
కోటియైనా యాఁటది కక్కూరితికిఁ జొచ్చునా

చ. 1: వరుసకువచ్చి యావనిత గాచుకుండఁగా
యెరవులసన్నఁ బతినేల పిల్చేవే
తెరమఱంగున నొక్కెతకు మీఁదెత్తిన మోవి
యిరవుగ నీకది యెంగిలిగాదా

చ. 2: పొంధైనయాపె యింటిలో బోనము వెట్టుకుండఁగా
విందు నీవేల చెప్పేవే విభునికిని
అందాకె మనసు పెట్టినటువంటి కాఁగిలి-
కిందటనే వాఁడి మిగిలినది గాకా

చ. 3: సేసవెట్టిన మగువ చెఱఁగువట్టుకుండఁగా
ఆసతో నీవెట్టు గూడి యలరితివే
యీసరినే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వోసరించితే బువ్వము వూరఁబొత్తుగాదా

రేకు: 0159-04 ముఖారి సం: 02-286 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఇంతిజవ్వనవనాన నిన్నియు నెలకొనెను
వంతులవాసులతోడ వలరాచపౌఁజులు

చ. 1: కుతిలాలు మాని సరిఁ గూచున్నవి చూడవే
సతి యురముమీఁదట చక్రవాకాలు
గతిగూడ గుంపుగట్టి కాఁపురము సేసీనవే
మితిమీరి శిరసుపై మేఁటితుమ్మిదలు

చ. 2: కలికితనాలతోఁడ గడు మించీఁగదవే
జలజాక్షివమోమునసే చకోరములు
పలుకులలోననే పాదుకొనె నిపు డిట్టె
చెలరేఁగి మోవిమీఁద చిలుకమొత్తములు

చ. 3: తగు శ్రీవేంకటేశ్వరుదండ నిల్చీఁ జూడవే
మగువ నడపులనే మంచిహంసలు
మిగుల రతివేళను మెరసీఁ దా మిన్నిటాను
పగటుఁ గుత్తికలోన పావురములు

రేకు: 0160-01 భైరవి సం: 02-287 భక్తి

పల్లవి: ఎవ్వరినేర్పులు జెప్ప నిందు నేది
రవ్వ సేయక జీవుల రక్షించవయ్యా

చ. 1: తలపోసి తలపోసి ధ్యానముసేతురు నిన్ను
యెలమి నింతని నిశ్చయింపలేరు
పలుమారు నీగుణాలు పైకొని నుతింతురు
కొలఁదివెట్టుచు మీగుఱుతు లెంచలేరు

చ. 2: పొదిగి పొదిగి నిన్నుఁ బూజలెల్లాఁ జేతురు
యెదుట నీశ్రీమూర్తి యెఱఁగలేరు
వెదకి వెదకి సారె విందురు నీకతలెల్లా
పదిలపు నీభ క్తి పట్టఁగలేరు

చ. 3: నిక్కి నిక్కి చేతులెత్తి నీకు మొక్కుదురుగాని
మక్కువ నీమహిమ నమ్మఁగలేరు
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నీకరుణచేత
తక్కక నిన్ను సేవించి తనియలేరు

రేకు: 0160-02 మాళవిగౌళ సం: 02-288 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నిటికిఁ బ్రేరకుఁడు యీశ్వరుఁడింతే
పన్ని యీతనిఁ దెలిసి బ్రదుకుటే జ్ఞానము

చ. 1: మనసునఁ బుట్టిన మంకుఁ గామక్రోధాలు
పనిలేవు తనకంటేఁ బాప మంటదు
పనివి తొడమ నూడి పండు తీఁగె నంటదు
జనులకెల్లాఁ బ్రకృతిసహజ మింతే

చ. 2: చేతులారఁ జేసేటి చేకొన్న కర్మానకు
ఘాతలఁ గర్తఁ గానంటే కట్టువడఁడు
ఆతల నబక ముంచినట్టి వేఁడి చెయ్యంటదు
జాతి దేహము మోఁచిన సహజ మింతే

చ. 3: వాకున నాడినయట్టి వట్టి పల్లదాలనెల్లా
దాకొని పొరయనంటే తప్పులే లేవు
పైకొని శ్రీవేంకటేశుబంటుకు వళకు లేదు
సైకమైన హరిభక్తి సహజ మింతే

రేకు: 0160-03 సాళంగనాట సం: 02-289 నృసింహ

పల్లవి: జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాదవరద

చ. 1: మిహిరశశినయన మృగనరవేష
బహిరంతస్స్థలపరిపూర్ణ
అహినాయకసింహాసనరాజిత
బహుళగుణగుణ ప్రహ్లాదవరద

చ. 2: చటులపరాక్రమ సమఘనవిరహిత
నిటలనేత్ర మౌనిప్రణుత
కుటిలదైత్యతతికుక్షివిదారణ
పటువజ్రనఖ ప్రహ్లాదవరద

చ. 3: శ్రీవనితాసంశ్రిత వామాంక
భావజకోటిప్రతిమాన
శ్రీవేంకటగిరిశిఖరనివాస
పావనచరిత ప్రహ్లాదవరద

రేకు: 0160-04 సామంతం సం: 02-290 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఎంత వలచితివయ్యా యింతికి
చెంతనుంటే లేఁతనవ్వే నేసపాలుగావా

చ. 1: చెలి నీపైఁ జిగురాకు చిదిమివేసితేను
వలరాజడిదమని వంచించితివి
వెలయఁగ విరహపువేళ వాఁడెక్కుఁగాక
మెలుపునఁ గదిసితే మెత్తనేకాదా

చ. 2: బిసరుహాక్షి పుప్పొడి ప్రేమ నీపైఁ జల్లితేను
వసంతుని చొక్కనుచు వసివాడేవు
వెసఁ దెరమరఁగైతే వేగమే నామెక్కుఁగాక
రసికత నొద్దనుంటే రజమే కాదా

చ. 3: అలమేలుమంగ సురటట్టే నీపై విసరితే
మలయానిలు వేడంటా మాటువెట్టేవు
తలఁచి శ్రీవేంకటేశ దవ్వైతే వేఁడెక్కుఁగాక
చలపట్టి కూడితివి చల్లనేకాదా

రేకు: 0160-05 శ్రీరాగం సం: 02-291 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఎంతలేదు నీబత్తి యెరఁగరా యిందరును
దొంతిఁబెట్టేవు ప్రియాలు దొరకుదాఁకాను

చ. 1: పొరుగాపెపై వలపు పూనేవు నామీఁద
వరుసల వద్ది కాపె వచ్చుదాఁకాను
సరుస నావంక నీవు చక్కఁ జూచే వప్పటిని
అరసి యవ్వలిపొందు అదనౌదాఁకాను

చ. 2: కడవారిపొందు నాతోఁ గసి వుచ్చుకొనే విట్టే
అడరి వారితో మాఁట లందుదాఁకాను
నడుమ నవ్వులెల్లాను నవ్వేవు యీవేళను
పుడివోనియట్టి కాఁగి లొనరుదాఁకాను

చ. 3: పోరచి వనితమారు పొదిగేవు నన్ను నిట్టే
చేరి యాపె నిన్నుఁ గూడి చెలఁగుదాఁకా
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోరికె లన్నియునుఁ జేకూరుదాఁకాను

రేకు: 0160-06 శుద్ధవసంతం సం: 02-292 అధ్యాత్మ

పల్లవి: ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు
జవళి నెంచిచూచితే సరిబేసివంటివి

చ. 1: అంగనల చూపులు ఆరతులవంటివి
కుంగక నీవు కొలువై కూచున్న వేళ
చెంగట లేఁతనవ్వులు సేసపాలవంటివి
కొంగులు వట్టుచు నీవు కొసరేటివేళ

చ. 2: కాంతల పలుకులెల్లా కప్పురాలవంటివి
అంతలో నీవు సరసాలాడేటివేళ
బంతిమోవుల యీవులు పాలకూళ్లవంటివి
మంతనాననుండి నీవు మన్నించేవేళను

చ. 3: వెలఁదుల కాఁగిళ్లు విడిదిండ్లవంటివి
చలముల నీ రతులు సలిపేవేళ
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తలఁపులవంటివన్నీ తమకపువేళను

రేకు: 0161-01 లలిత సం: 02-293 గురు వందన, నృసింహ

పల్లవి: ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన నెఱఁగనీదు
అట్టె మాగురు ననుమతినే ప్రత్యక్షమవై తివిగాని

చ. 1: కరుణాకరా మిమ్మునుఁ గని తెలియఁగలేను
ధర మీమహిమలు వినివిని తగ నరుదందుదును
నరహరి నీవు నాలో నుండఁగ నమ్మక పురాణకథలందు
అరయఁగ మీచరితలుచెప్పఁగ నాసతోడ మిముఁ దలంతును

చ. 2: జగదీశా మీనామంబులు జపించ నలయుదును
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదకుదు నింతటను
నగధర మీపై భక్తి సేయఁగ మనంబున వొడఁబడను
పగటున మీరిచ్చు వరములకొరకే పలుమారు మీకుమొక్కుకొందును

చ. 3: శ్రీవేంకటేశా నీమూరితి చింతించి చేపట్టఁగలేను
దేవుఁడ వనియెడు విశ్వాసమునకే తిరముగఁ గొలిచెదను
శ్రీవనితాధిపవేదాలు మిమ్మునుఁ జెప్పఁగానే తర్కింపుదును
వేవేలు పరుషలు సేవింపఁగ నీవే కర్తవని నిశ్చయింతును

రేకు: 0161-02 లలిత సం: 02-294 వైరాగ్య చింత

పల్లవి: అతని నడుగవో చిత్రగుప్త నాయందలి యొూగాము లన్నియును
అతఁడే మీ కుత్తరము చెప్పెడిని యన్నిటికిని మముఁ దడవకుమీ

చ. 1: కరచరణాదులు నాకుఁ గల్పించిన యతఁడే
గరిమల నా వుభయకర్మసంఘములకుఁ దాఁ గర్తా
సరుగఁ బ్రాణము లొసఁగి చైతన్య మతఁడే
పరగఁగ నాయపరాధంబులు పరిహరించఁ గర్తా

చ. 2: రమణతో ననుఁ బుట్టించి రక్షించే యతఁడే
అమరఁగ నన్ను వహించుక నా వళుకంతయుఁ దీర్చఁగఁ దాఁ గర్తా
ప్రమదమున నాయంతరాత్మయై పొదుకొన్నయతఁడే
మమతల మీలోకము చొరకుండా మాటలాడుకొనఁ దానే కర్తా

చ. 3: యెప్పుడుఁ బాయక దాసునిఁగా నేలుకొన్న యతఁడే
తప్పక యిహముఁ బరమునిచ్చి వొరులు దడవకుండఁ జేయగఁ గర్తా
చెప్పఁగ నాపాలి దేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే
అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నటు మముఁ గావఁగఁ దానే కర్త

రేకు: 0161-03 లలిత సం: 02-295 శరణాగతి

పల్లవి: అవధారు పరాకుసేయకు మపరాధముగా నెంచకు
వివరింపఁగ నీవే గతి విష్ణుఁడ మన్నించఁగదే

చ. 1: నాకునాకే నీసన్నిధానము గల్పించుకొని
చేకొని విన్నపములెల్లాఁ జేయుచున్నాఁడను
కాకుసేసి నన్ను వీఁ డెంత గట్టువాయ యనక
శ్రీకాంతా నీ వింతట నుందువు చిత్తగించి వినవే

చ. 2: చూచిచూచి నీమూరితి నాసొమ్ముగఁ జేసుకొని
చేచేత నాలో ధ్యానము సేయుచున్నాఁడను
కాచుకొని వీనికి నాకూఁ గారణ మేమనక
యేచోటా నీరూపమే హరి యెదలోనుండఁ గదే

చ. 3: కోరికోరి నేనూరక నీకొలువు గడించుకొని
చేరి నీవూడిగములు సేయుచున్నాఁడను
యీరీతులు శ్రీవేంకటేశ్వర యివి యేఁటిసలిగె లనక
నారాయణ సర్వేశ్వరుఁడవు నన్ను నేలఁ గదవే

రేకు: 0161-04 లలిత సం: 02-296 శరణాగతి

పల్లవి: ఎట్టు సేయఁగలవాఁడవో యిఁక నీచేతిది నావునికి
నెట్టన నీదాసుడనై తిని నీచిత్తం బిఁకను

చ. 1: సారెకుఁ గొలువుసేతు చనవులు నీ విత్తువో యనుచు
నేరకున్నాఁ బాడుదును నీవు మెత్తువనుచు
వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలంతువో యనుచు
చేరి వాకిలి గాచుకుండుదు చిత్తము రావలెననుచు

చ. 2: కమ్మటి నిచ్చకములు నెరపుదు కైవసము గావలె ననుచు
వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగమోడుదు వనుచు
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరములెంచక కాతువని
నమ్మి నిన్ను నేఁ బూజింతు నను నీ వీడేరింతువని

చ. 3: ఆసతో నిను భావింతు అన్నిట నన్నేలుదు వనుచు
వేసరక నీమంత్రము నడుగుదు వేగమే వరమొసఁగుదు వనుచు
రాసికి నెక్కఁగ శ్రీవేంకటేశా రక్షించితి విప్పుడు నన్ను
వాసితోడ నే నిన్నుఁ దగులుదును వదలక నాపాలఁ గలవనుచు

రేకు: 0162-01 గౌళ సం: 02-297 దశావతారములు

పల్లవి: ఇటులైతేఁ బుణ్యము నీకు యిది వుపకారంబౌను
తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును

చ. 1: సురాసురగంధర్వయక్షులు మిమ్ముఁ దెలియఁగలేరు
పరాశరాదులు మీరూపు భావించఁగలేరు
నరు లెరుఁగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుఁడవై
కరీంద్రుఁ గాచినయటువలెఁ గాతువు గాక

చ. 2: సనాతనబహువేదశాస్త్రంబులు మిమ్ముఁ నుతింపలేవు
అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించఁగలేవు
తనూధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను
వినోదముగఁ గాచినయటువలె వెసఁ గాతువు గాక

చ. 3: రమాసతి నీళామహిరాములు మీతలఁ పెఱుంగరు
సమేతులైన శేషాదులు మీజాడ మీరలేరు
తమోమయు లిందరును ధరణిధర శ్రీవేంకటేశ
నమోనమో యని మొక్కంగాఁ ననుఁగాతువు గాక

రేకు: 0162-02 సామంతం సం: 02-298 వేంకటగానం

పల్లవి: సరిగాఁడు వీఁడనవలదు జగమున రాజు వలసినది దేవులు
యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట

చ. 1: జగదేకబంధుఁడవట సకలజీవులకును గుఱుతుగ
మొగము చూపవయ్యా మీకు మొక్కెద నిదె నేను
తగులైన చుట్టరికము దాఁచఁగ నీఁకనేలా
తెగరాని మమకారము తెలుపఁగవలెఁ గాని

చ. 2: యితవైన ప్రాణమవట యీచరాచరములకు అభయము
సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను
మతిఁ బాయని కూటంబులు మానుప మరి యాలా
జతనంబునఁ జాలాఁ బ్రియములు జరపఁగవలెఁ గాని

చ. 3: నెలవైన యేలికెవట నీదాసులకెల్లా వేళలు
దెలియఁజెప్పవయ్యా మిమ్మును తిరముగఁ గొలిచెదను
బలువయిన శ్రీవేంకటేశ పరాకు లీఁకనేలా
చెలరేఁగి నీసులభత్వమే చెల్లించవలెఁ గాని

రేకు: 0162-03 సామంతం సం: 02-299 వైష్ణవ భక్తి

పల్లవి: ఎదురుమాటలాడితి నీకు యీతప్పులు లోఁగొను నీవు
పదరఁగఁ దగదు నీకు పంతములిచ్చితిఁ గావఁ గదే

చ. 1: మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనక వేసుకో శరణు చొచ్చితిని విడువకు నన్ననుచు
ననుఁ జూచి 'దేహి' యంటే 'నాస్తి' యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడుదాతవు నీవు

చ. 2: వెదకి నిను వేఁడుకొంటిని విచ్చేసితివి మాయింటికి
వదలఁదగదు నీభక్తి యొసఁగు నీవాఁడను పాయకుమనుచు
పదిలంబుగ మొక్కిన చేతులు బలిమిఁ గోయరాదు
యిదివో బంటను నేను యేలినవాఁడవు నీవు

చ. 3: మురిగి నీముద్రలు మోచితిని మన్నించితివిటు నను నీవు
కరుణతోడ నాయపరాధంబులు కడపు కావుమనుచు
యిరవై నీపేరు వెట్టితే నియ్యకొనక పోరాదు
నరమాత్రుఁడ నే శ్రీవేంకటేశ నాయకుఁడవు నీవు

రేకు: 0162-04 సామంతం సం: 02-300 వైరాగ్య చింత

పల్లవి: ఏది గతి నే నొక్కఁడనే యెందరి కోపుదును
నీదయతో మన్నించఁగదవే నీరజనాభా

చ. 1: మోహాంధకారము యెక్కడచూచిన ముంచుకవున్నది
దేహాభిమానము అందుకుఁ దోడు దీకొనివచ్చీని
సాహసభూతము ఘనహింసలకే చాఁపించీఁ జేయి
దాహపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని

చ. 2: కోపాగ్నికణములు సారెకుఁ జుట్టుక గుబ్బతిలఁ దొడఁగె
పైపై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని
చాపల గర్వము యెవ్వరినైన సాధింపించీని
తీపుల ధనములు మీఁదిమీఁదనే తీదీపులు రేఁచీని

చ. 3: భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని
వేవేలు సంపద లెందుచూచినా వేడుకసేసీని
శ్రీవేంకటేశ యలమేల్మంగను చేకొను దేవుఁడా
యీవేళను నన్నేలితివి నిన్నియు తగ వసమయ్యీని

రేకు: 0163-01 సామంతం సం: 02-301 వేంకటగానం

పల్లవి: ఆనతియ్యఁగదవే అందుకే కాచుకున్నాఁడను
పూనుక నీవెంత నేర్పరివైనా భువి మనసుపేదను నేను

చ. 1: కొలిచేమనే బంట్లు నీకుఁ గోటానఁగోట్లు గలరు నిన్నుఁ
దెలిసేమనే జ్ఞానులు తెందేపలున్నారు
తలఁచి వరములడిగేవారలు తలవెంట్రుకలందరు వారె
యిల సందడిలో నాకొలువు యెటువలె నెక్కీనో

చ. 2: పనులకుఁ బాల్పడినవారు బ్రహ్మాదిదేవతలట
వినుతులు సేయఁ దొడంగినవె వేదరాసులట
మునుకొని ధ్యానించువారు మునులెందరైనాఁ గలరట
వినయపు నామనవి సనవులకు వేళ లెపుడు గలిగీనో

చ. 3: వున్నతితోడుత నిన్ను మోఁచుటకు వున్నారు గరుఁడఁడు శేషుఁడు నీకు
అన్నిటాను నీకాఁగిటిలోపల నలరీ నలమేల్మంగ
యెన్నఁగ శ్రీవేంకటేశా నన్నును యేలితి వింతటిలోనే
పన్నిన నా మొక్కులు నీ కేబాగులఁ జేరినో

రేకు: 0163-03 సామంతం సం: 02-302 శరణాగతి

పల్లవి: ఇప్పుడే నే నొడఁబడ మరవఁగఁ దగదు జెప్పితి యెల్లనాఁడు
నెప్పున నే నెంతకల్లరినైనా నీదాసుఁడనని యందురుగా

చ. 1: మఱతునో తలఁతునో నిన్ను మాఁటల నేతప్పు గలుగునో
యెఱఁగక నీదాసులఁజూచి యేమని పలుకుదునో
నెఱసిన నాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని
మఱి నామీఁదట నేరము లెంచక మాధవ నన్నిటు రక్షించవే

చ. 2: అలతునో సొలతునో నే నీయందు భక్తి సేతునో సేయనో
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో
తలఁచేటి నామనసే నీకును ధనముగాఁ గప్పము వెట్టితిని
పలుమరు నన్నును తగవుకుఁ దియ్యక పరమాత్మా ననుఁ గావఁగదే

చ. 3: నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము లేమేమి మానితినో
నీరూపము నే సేవించి యెక్కడ నే ననుమానించితినో
మేరతోడ మావారు చెప్పఁగా మిమ్మింతట నే నమ్మితిని
వారిఁ జూచైన శ్రీవేంకటేశా వరదుఁడవై మము మన్నించఁ గదవే

రేకు: 0163-04 ముఖారి సం: 02-303 వేంకటగానం

పల్లవి: సర్వేశ్వరా నీతో సరి యెవ్వరు
పూర్వపువారు చెప్పఁగాఁ బూఁచి కొలిచేఁ గాని

చ. 1: చేరి వేదములు నిన్నుఁ జెప్పఁగా వినుటే కాని
నీరూపము దర్శించేవార లెవ్వరు
ధారుణిలో నీయవతారాలే చూచుట
ధీరత నీమహిమలు తెలిసేవా రెవ్వరు

చ. 2: భూమివారిఁ జూచి నిన్నుఁ బూజలు సేయుట గాని
కామించి నీతో మాటాడే ఘను లెవ్వరు
దీమసాన నీ దాసుల ద్రిష్ట మెరుగుట గాని
యీమేర నీ దైవిక మెరిగే వా రెవ్వరు

చ. 3: వరములు నీ వియ్యఁగా వచ్చి సేవించుట గాని
కెరలి నీమూర్తి వెదకేవా రెవ్వరు
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌట గాని
అరసి నిన్ను సుద్దులడిగేవా రెవ్వరు

రేకు: 0163-05 ముఖారి సం: 02-304 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇట్టి నా వెట్టితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁజూడవే

చ. 1: పాటించి నాలో నుండి పలికింతువు నీవు
మాటలాడ నేరుతునంటా మరి నే నహంకరింతును
నీటున లోకములెల్లా నీవే యేలుచుండఁగాను
గాఁటాన దొరనంటా గర్వింతు నేను

చ. 2: నెమ్మదిఁ బ్రజలనెల్లా నీవే పుట్టించఁగాను
కమ్మి నేనే బిడ్డలఁ గంటినంటా సంతసింతును
సమ్మతి నీవే సర్వసంపదలు నొసఁగఁగాను
యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు

చ. 3: మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యఁగాను
యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును
వున్నతి శ్రీవేంకటేశ నన్ను నేమి చూచేవు
అన్నిటా నాయాచార్యు విన్నపమే వినవే

రేకు: 0163-06 ముఖారి సం: 02-305 వేంకటగానం

పల్లవి: ఇటు నిను దెలియఁగ ఎంతటివారము
తటుకున నాసలఁ దగులుట గాక

చ. 1: నానామూర్తులు నగధర నీరూపు
యే నెలవుల నిన్నెటువలెఁ దలఁచుట
పూని నీ భావము పొందుగాఁ జెప్పఁగా
వీనులు చల్లఁగా వినుటే కాక

చ. 2: పెక్కు నామములు బిరుదు లనంతము-
లెక్కడ గొలదిగ నెన్నెని పొగడుట
యిక్కువ సేసుక యిందులో నొకటి
పక్కన నొకమరి పలుకుట గాక

చ. 3: వేవేలు గలవు నీ విహార భూములు
యేవిధమున నెందెందని తిరుగుట
శ్రీవేంకటేశా నీ శృంగారమెల్లను
సేవించి ముదమునఁ జెలఁగుట గాక

రేకు: 0164-01 ముఖారి సం: 02-306 శరణాగతి

పల్లవి: ఎవ్వరికి యెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు
అవ్వలనివ్వల నీ వనాథనాథుఁడవు

చ. 1: కాయకము లందురునుఁ గార్యవశపరులే
పాయని నీ వకారణబంధుఁడవు
దాయగాం డ్లెవ్వరినైనాఁ దప్పించుకొనేవారే
బాయటనున్నా నీవాపన్నశరణ్యుఁడవు

చ. 2: అట్టె లోకమువారు అర్థకామపరులే
జట్టిగొని నీవైతే సర్వదాతవు
పొట్టఁబొరుగుచుట్టాలు భోజనసహాయులే
నెట్టన నీవైతే మాకు నిర్వాహకుఁడవు

చ. 3: అంతటా వారికివారు ఆత్మపోషకులే
రంతుల నీవైతే నానారక్షకుఁడవు
సంతతము శ్రీవేంకటేశా మమ్ము నేలితివి
పంతమున నీవు భక్తపరిపాలకుఁడవు

రేకు: 0164-02 ముఖారి సం: 02-307 గురు వందన, నృసింహ

పల్లవి: దేవ నీవు గల్పించిన తెరువు లివి
నీవారైన వారి నేరుపులివి

చ. 1: పరమశాంతునకుఁ బాపము రాదు
విరతిగలవానికి వెరపు లేదు
గురుసేవారతునకుఁ గోపము రాదు
ధర సత్యవిదునకుఁ దప్పు లేదు

చ. 2: పుట్టు బ్రహ్మచారికి బుద్ధి చెడదు
అట్టె ఆసలేనివారికి అలపు లేదు
తొట్టిన సుజ్ఞానికి దుఃఖములేదు
గట్టియైన మౌనికి కలహమే లేదు

చ. 3: సమచిత్తునకును చంచలము గాదు
విమలాచారునకు వెలితి లేదు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులై కొల్చి
భ్రమయనివారికి భారము లేదు

రేకు: 0164-03 శ్రీరాగం సం: 02-308 దశావతారములు

పల్లవి: వారివారి కర్మములే వారిఁ జుట్టుకొనఁగాను
యీరీతి నీవే వారియెఱుక మాల్పితివి

చ. 1: హిరణ్యకశిపుపాటు యెఱుఁగఁడా రావణుఁడు
ధరలో హరికిఁ బగై తానూఁ బొలిసె
విరసపు కంసుగతి వినఁడా దుర్యోధనుఁడు
సరుగఁ దానూఁ బగై సమసినాఁడు

చ. 2: తెగి మురాసురుజాడ తెలియఁడా నరకుఁడు
మొగిసి పోటుకుఁ బోయి మొక్కపోయను
సొగిసి సోముకుదెస చూడరా దానవులెల్లా
మగిడి మగడి పోరి మడిసిరి గాక

చ. 3: బలివోయిన తెరువు బాణుఁడు విచారించఁడా
బలిమిఁ దొడరి భంగపడెఁ గాక
యెలమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు
యెలమి నిప్పటివార నెఱఁగరే కాక

రేకు: 0164-04 శ్రీరాగం సం: 02-309 శరణాగతి

పల్లవి: హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము
విరివైన నీసుద్దులు వింటిమయ్యా

చ. 1: నెమ్మదిని నీవనేటి నిధానము గన్నవారు
కిమ్ముల సంపన్నుల సుఖింతురయ్యా
కమ్మటి నీభక్తియనే కామధేను వున్నవారు
వుమ్మడి నచ్చికము లేకుందరయ్యా

చ. 2: చేరి నీపై చింతయనే చింతామణిగలవారు
కోరినట్టల్లా బదుకుదురయ్యా
సారపు నీకృపాపారిజాత మబ్బినవారు
బోరన సంతోసాలఁ బొదలుదురయ్యా

చ. 3: హత్తి నీనామమనే అమృతముగలవారు
నిత్తెమైన పదవుల నిలుతురయ్యా
యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సత్తుగా నీవారు నాకుఁ జనవిత్తురయ్యా

రేకు: 0164-05 శ్రీరాగం సం: 02-310 అధ్యాత్మ

పల్లవి: దైవమా నీ వొక్కఁడవే దక్కిన ధనము గాక
యీవలానావలా మఱి యెంచ నేమున్నది

చ. 1: పుట్టినవారికెల్లా పొత్తుల దీజగము
మెట్టికూచుండే యరఁగు మేదినియల్లా
బట్టబయటి భోగాలు బంతికూటిబోజనాలు
పట్టి తమపని యేరుపరచ నేమున్నది

చ. 2: పంచుకొన్నభాగాలు పంచమహాభూతాలు
పంచేంద్రియములే పరివారాలు
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి
తెంచి యెచ్చుకుందు లిందుఁ దెలుప నేమున్నది

చ. 3: మనోవికారాలు మానుషపు టెఱుకలు
వినోదమాత్రాలు వేడుకలెల్లా
యెనలేని శ్రీవేంకటేశ నీమహిమ లివి
వెనకా ముందరా విన్నవించ నేమున్నది

రేకు: 0164-06 శ్రీరాగం సం: 02-311 శరణాగతి

పల్లవి: ఇట్టివాఁడవు సులభమెట్లా నైతివోకాక
అట్టి నీదయ దలఁచి అరుదయ్యీ నాకు

చ. 1: యేమేమి చదువవలె నెందరి నడుగవలె
ఆముక నిన్నుఁ దెలిసే యందుకొరకు
భూమిలోన నెంతేసి పుణ్యములు సేయవలె
కామించి నీపై భక్తి గలిగేటికొరకు

చ. 2: యెన్నిజన్మా లెత్తవలె నెందెందు వెదకవలె
కన్నుల నీసాకారము గనేకొరకు
వున్నతి నెంతగాలము వొగ్గి కాచుకుండవలె
విన్నవించి నీసేవ వేఁడుకొనేకొరకు

చ. 3: యేదేది యెఱఁగవలె యెట్లభ్యసించవలె
నీదాసుఁ డనిపించుకొనేటికొరకు
సాదరాన శ్రీవేంకటేశ్వర నన్ను మన్నించితి-
వేదెసఁ బొగడవలె యింత సేసేకొరకు

రేకు: 0165-01 శ్రీరాగం సం: 02-312 శరణాగతి

పల్లవి: చెప్పితేఁ బాసునందురు చేసిన దోసములెల్లా
వొప్పుగొని మన్నించ నుచితమౌ నీకు

చ. 1: క్షమియించుకొనవే సర్వాపరాధములు
క్రమ మెఱఁగ కేమేమి గావించితినో
రమణతో సర్వలోకరక్షకుఁడవట నీవు
తమితోడ నన్నుఁ గావఁ దగవౌను నీకు

చ. 2: పరిహరించఁగదవే బహునరకబాధలు
గరిమల నెటువలెఁ గాచుకున్నవో
అరుదుగా సురల మొరాలించితివట తొల్లి
ధర నన్ను వహించుకోఁ దగవౌను నీకు

చ. 3: వెనుకొని యడ్డము రావే శ్రీవేంకటేశ్వర
అనుభవించే కర్మము లవేమున్నవో
పనివడి భక్తపరిపాలకుఁడవట నీకు
తనుభోగాలు భోగించఁ దగవౌను నీవు

రేకు: 0165-02 నాదరామక్రియ సం: 02-313 శరణాగతి

పల్లవి: అతఁడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు
చతురుఁడితఁడే రక్షించఁగలవాఁడు శరణని బ్రదుకవో వో మనసా

చ. 1: మరుతండ్రిఁ జూచిన మంచికన్నులను మరొకరిఁ జూచిన నింపౌనా
సిరువరు నామమునొడిగిన నోరను చిక్కిన పేరులు యితవౌనా
పరమాత్ముఁ దలచిన మనసులోపలను పరులఁ దలఁచితే నొడంబడునా
కరుణానిధి పుణ్యకథలువినిన చెవుల కడలసుద్దులు విన సమ్మతించునా

చ. 2: నరహరిఁ బూజించినయట్టి కరములు నరుల సేవసేయ నరుహములా
మురహరు శరణని మొక్కిన శిరసున మూఢులకు మొక్క నుచితములా
హరిమందిరమున కరిగెడు పదములు అధములిండ్ల కేఁగఁగ నలవడునా
పురుషోత్తము లాంఛనము మోచిన మేను భువి హీనవృత్తికిఁ బొసఁగీనా

చ. 3: గోవిందుఁడే దిక్కై వుండు ఘనులకు కొలిపీనా దేవతాంతరంబులు
భూవల్లభుదెసఁ బుట్టిన జ్ఞానము పొంది వేరొకట నిలిచీనా
శ్రీవేంకటపతిపై నిడిన భక్తి చెలులపై నునుపఁగఁ దగవవునా
దేవకినందనుఁ డితనిదాసులఁ దెలియఁగ జడులకుఁ దరమయ్యీనా

రేకు: 0165-03 నాదరామక్రియ సం: 02-314 వేంకటగానం

పల్లవి: ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినాఁ దానే
యెదిటి బ్రహ్మాండము యిమ్ము చాల దిందకు

చ. 1: పనిగొంటే భువిలో నేఁబదియే అక్షరములు
కొనాడితే నీగుణాలు కోటానఁగోటి
యెనసి పదునాలుగే యెడమైన లోకములు
అనిశము నీవియైతే ననంతమహిమలు

చ. 2: మించి నిండుకొంటే నెనిమిదియే దిక్కులు
అంచల నీకతలైతే ననేకములు
యెంచి చూచితేఁ గలవి పంచమహాభూతాలే
ముంచిన నీమాయ తుదమొదలే లేదు

చ. 3: వుపమించి తెలిసితే నొక్కటే జగము
అపురూపపు నీసృష్టి అతిఘనము
అపరిమితపు జీవు లణువత్తులైనాను
యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు

రేకు: 0165-04 నాదరామక్రియ సం: 02-315 దశావతారములు

పల్లవి: ఎంతకత నడిపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా

చ. 1: కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచేకొరకై తే నీచే చక్ర-
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా

చ. 2: చేకొని వానరులఁగాఁ జేయనేల దేవతల
జోకతో లంకాపురి చుట్టుకోనేల
కాకాసురు వేసిన కసవే రావణుమీఁద-
నాకడఁ జంపువెట్టితే నప్పుడే సమయఁడా

చ. 3: గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడసితే తానే పొలియఁడా

రేకు: 0165-05 నాదరామక్రియ సం: 02-316 వేంకటగానం

పల్లవి: పరులకైతే నిదే పాపము గాదా
పురిగొని నీవంకఁ బుణ్యమాయఁ గాక

చ. 1: పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధించఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు

చ. 2: నారాయణుఁడ నీవు నడిపినదే తగవు
ఆరూఢి నీ వౌన్ననదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు

చ. 3: శ్రీవేంకటేశ నీవు చేసినదే నీతి
చేవతో నీ వొడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు

రేకు: 0166-01 నాదరామక్రియ సం: 02-317 వైష్ణవ భక్తి

పల్లవి: ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు

చ. 1: భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము

చ. 2: దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతులపొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము

చ. 3: ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛ తోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము

రేకు: 0166-02 రామక్రియ సం: 02-318 అధ్యాత్మ

పల్లవి: జతనము జతనము సర్వేశు నగరిది
బతుకుఁదోవ యిదె బడకరము

చ. 1: హృదయములోపల నీశ్వరుఁడున్నాఁడు
పదిలము మనసా బడకరము
తుద నల కామాదులఁ జొర నియ్యక
పదరక కావుము బడకరము

చ. 2: యెంచుకొనినిదే యేలిక మిము నిఁక
పంచభూతములాల బడకరము
మించిన పురి తొమ్మిదివాకిళ్లను
పంచుక వున్నారు బడకరము

చ. 3: నడుమ నడుమఁ బ్రాణములాలా మీరు
బడివాయకుండరో బడకరము
యెడయక శ్రీవేంకటేశ్వరునకు మీరు
బడలక కొలువరో బడకరము

రేకు: 0166-03 భైరవి సం: 02-319 వేంకటగానం

పల్లవి: ఆతఁడే విష్ణుం డఖిలము నడపెడి
యీతల నెవ్వరి కేఁటికిఁ జింతా

చ. 1: పుట్టించఁ బెంచఁగ పొడవెక్కించ దేహుల
గట్టిగా మాఁటలాడించఁ గదలించ
పట్టి వాన గురియించ పైరులు మొలపించ
తిట్ట పెట్ట నొకానొకదేవుఁడు గలఁడు

చ. 2: అన్నపానము లొఁగ నాపదలు గడపఁగ
పన్ని మాయలు భువిఁ బచరించ
విన్నపాలు సురలవి విని యందరి రక్షింప
వున్నతోన్నతుఁడై వొకానొకకర్త గలఁడు

చ. 3: కాల మక్షయము సేయ కర్మము ఫలించఁజేయ
తాళుకొని మరపించఁ దలఁపించ
పాలుపడి శ్రీవేంకటపతియై వేదాలుచేప్పే-
యేలిక యొకానొక యీశ్వరుఁడు గలఁడు

రేకు: 0166-04 భైరవి సం: 02-320 శరణాగతి

పల్లవి: హరి హరి జగమెఋంగ నీవాతుమలోనే వున్నాఁడవు
సురలఁ గాచుటయు నసురల నడఁచుట చొప్పడియున్నది నీగురుతు

చ. 1: వేదార్థము దప్పందెలిసిన విద్వాంసునివంటిది
పాదుగఁ జదువక తర్కించఁబోవు పాండిత్యమువంటిది
మేదిని నడవులఁ దెరువుదప్పి మరి మెలఁగేటి తెరువరివంటిది
ఆదిమూర్తి నీశరణుచొచ్చి నిను నారాధించనివాని బదుకు

చ. 2: వట్టిజోలితో నూరక దేవరలేని పూజవంటిది
వొట్టుక ఫలములులేని పంటలకు వొడిగట్టేయటువంటిది
నెట్టనఁ గర్ణదారుండులేని జలనిధినడిమియోడవంటిది
బట్టబయటనే పరమేశ్వర నీపై భక్తిలేనివాని బదుకు

చ. 3: పొందుగ ధర్మముబోధించెడి సత్పురుషులులేని సభవంటిది
చెంది శ్రీవేంకటేశ్వర నీమహిమలు చెప్పని కథవంటిది
సందడి నన్నియుఁ జేసి దక్షిణలు చాలని యజ్ఞము వంటిది
యిందిరారమణ నీవెక్కుడనుచు నిన్నిటఁ దెలియనివాని బదుకు

రేకు: 0166-05 భైరవి సం: 02-321 దశావతారములు

పల్లవి: అరుదు నీచెరిత్రము హరి నే నిదియే తలఁచుకొని
శరణంటిఁ గావు మిదియ విన్నపము సరిలేరు నీకు

చ. 1: పరగ నీయకారణబంధుత్వ మహల్యయందుఁ గంటిమి
కరియందు నార్తరక్షకత్వము మెరయఁగఁ గంటిమి
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము గంటిమి
శరణంటెఁ గాచుట ధర విభీషణునందుఁ గంటిమి

చ. 2: మును భక్తవత్సలత్వము నీకు శబరియందుఁ గంటిమి
అనాథనాథుడవు నీ వగుట గ్రీవునందుఁ గంటిమి
పెనఁగి నిరుహేతుకప్రేమ పరీక్షితునందుఁ గంటిమి
నినుఁ గింకరాధీనుఁడని ప్రహ్లాదునియందేఁ గంటిమి

చ. 3: గోవర్ధనమందు సర్వజీవదయాపరత్వము గంటిమి
భావించి సాందీపునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవ శ్రీవేంకటేశ్వర నీవు ద్రిష్టవరదుఁడవగుట
తావైన నీకొనేటిదండ నొసఁగేయందే కంటిమి

రేకు: 0167-01 భైరవి సం: 02-322 శరణాగతి

పల్లవి: ఎంతపుణ్యమో యిటు మాకుఁ గలిగె
చెంతనే నీకృప సిద్ధించఁబోలు

చ. 1: శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణఁగెను భయ ముడిగె
తీపుగఁ దులసితీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ

చ. 2: గోవింద మిముఁ గనుఁగొంటి మిప్పుడే
పావనమైతిమి బ్రతికితిమి
తావుల మీపాదములకు మొక్కితి
వేవేలుఁ గలిగెను వేడుకలాయ

చ. 3: శ్రీవేంకటేశ్వర సేవించితి మిము
దావతి దీరెను తనిసితిమి
వావిరి ముమ్మారు వలగొని వచ్చితి
నీవారమైతివి నిలిచితి మిపుడు

రేకు: 0167-02 మలహరిసం: 02-323 శరణాగతి

పల్లవి: అనంతాపరాధి నేను అటుగాన శరణంటిని
యెనలేని గుణాలు యేమిచూచేనయ్యా

చ. 1: దగ్గరి కొలుతు నాతరతమ్య మెంచుకోను
సిగ్గువడ నిట్టే నిన్నుఁ జేరి పాడుదు
వొగ్గి విన్నపాలు సేతు వుబ్బునఁ జిత్త మెరఁగ
యెగ్గు లెంచితే నావల్ల నెన్ని లేవయ్యా

చ. 2: పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలఁచను
సాదించి కొలువవత్తు సత్వ చూడను
యేదేసనైననా నుతింతు యెంగిలినోరని మాన
పాదుగా విచారించితే బలుమూఢుఁడనయ్యా

చ. 3: మంచముపైఁ దలపోతు మందెమేళమనియన
కంచముకూడర్పింతుఁ గాదననేర
యెంచఁగ శ్రీవేంకటేశ యిన్నిటా నీబంట నైతి
పంచలఁ జూచితే నీపాలివాఁడనయ్యా

రేకు: 0167-03 మలహరిసం: 02-324 వేంకటగానం

పల్లవి: అన్నిటా నీవే వుందునందువుగా
యిన్ని నీవు పుట్టించిన విని నీసొమ్ములే

చ. 1: నిలిచిన రూపులెల్లా నీగుళ్లుగాఁ దలఁతు
మెలఁగేటి చైతన్యము మిమ్ముగాఁ దలఁతు
యిలలోని ధ్వనులు నీపలుకులుగాఁ దలఁతు
సకల పంచభూతా లుపకరణాలుగాఁ దలఁతు

చ. 2: నారుకొన్న పంటలు నీనైవేద్యాలుగాఁ దలఁతు
నీరెల్లా నీతీర్థమని నెమ్మిఁదలఁతు
ధారుణి భోగాలు పూజాద్రవ్యాలుగాఁ దలఁతు
నేరిచిన పనులెల్లా నీలీలలుగాఁ దలఁతును

చ. 3: కాలత్రయము నీగతులుగానే తలఁతు
చాలి సురల నీయనుచరులఁగానే తలఁతు
నాలోని శ్రీవేంకటేశ నాతండ్రివని తలఁతు
తాలిమి నీదేవులను తల్లియని తలఁతును

రేకు: 0167-04 మలహరిసం: 02-325 వేంకటగానం

పల్లవి: అందుకేపో నీపై నాసపుట్టి కొలిచేది
మందలించితి నిఁక మరి నీచిత్తము

చ. 1: యిందరుఁ జెప్పఁగా వింటి యెవ్వరికైనా విష్ణుఁడే
కందువ మోక్ష మియ్యఁ గర్త యనఁగా
ముందే వింటి నారదుఁడు ముంచి నిన్నుఁ బాడఁగా
పొందుగ లోకములోనఁ బూజ్యుఁడాయననుఁచు

చ. 2: అప్పటి వింటి లోకములన్నిటికి హరియే
కప్పి రక్షకత్వానకుఁ గర్త యనఁగా
యిప్పుడే వింటి ధ్రువుఁడు యిటు నిన్ను నుతించే
వుప్పతిల్లి పట్ట మేలుచున్నాఁడనుచును

చ. 3: యిదె వింటి శ్రీవేంకటేశ బ్రహ్మకుఁ దండ్రివై
కదిసి పుట్టించఁ బెంచఁ గర్త వనుచు
వదలక వింటి నీకు వాల్మీకి కావ్యము చెప్పి
చెదర కాద్యులలోఁ బ్రసిద్ధుఁ డాయననుచు

రేకు: 0167-05 భూపాళం సం: 02-326 నామ సంకీర్తన

పల్లవి: అపరాధిని నేనైనాను
కృపగలవారికిఁ గపటములేదు

చ. 1: సనాతనా అచ్యుతా సర్వేశ్వరా
అనాది కారణ అనంతా
జనార్దనా అచల సకల లోకేశ్వరా
నిను మరచియున్నాఁడ ననుఁ దెలుపవయా

చ. 2: పురాణపురుషా పురుషోత్తమా
చరాచరాత్మక జగదీశా
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా
యిరవు నీవే యట యెఱిఁగించఁగదే

చ. 3: దేవోత్తమా శశిదినకరనయనా
పావనచరితా పరమాత్మా
శ్రీవేంకటేశా జీవాంతరంగా
సేవకుఁడను బుద్ధి చెప్పఁగవలయు

రేకు: 0167-06 భూపాళం సం: 02-327 శరణాగతి

పల్లవి: చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు
యెప్పుడును జింతించేనిదే పనై నేను

చ. 1: పొలసి నీరూప మెట్టు పొడచూపేవో
యెలమి నాభాగ్య మిఁక నెట్టున్నదో
అలరి నా కేబుద్ధి ఆనతిచ్చేవో
కలిగిన నీమాయ యేగతిఁ గడచేనో

చ. 2: వరుస నా కెట్లాఁ గైవసమయ్యేనో
యిరవై నాజన్మఫల మెట్టున్నదో
పరగ నామతి నెట్టు పాయకుండేవో
కరుణానిధివి నిన్నే కరణి మెప్పించేనో

చ. 3: పనివడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా-
మనసు చంచల మెట్టు మట్టుపడీనో
యెనలేని నాతలఁపు యెఱిఁగి శ్రీవేంకటేశ
నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో

రేకు: 0168-01 భూపాళం సం: 02-328 అధ్యాత్మ

పల్లవి: ఇవి సేయఁగ నే నలసుఁడ యెటువలె మోక్షం బడిగెదెను
వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁ గాక

చ. 1: జపయజ్ఞదానకర్మంబులు యెంచఁగ జిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
అపరిమిత దేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాది నియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు

చ. 2: రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలిన పంచేంద్రియనిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళ ధర్మార్థకామంబులు మఱి యైశ్వర్యములకు మూలములు
అవల గ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము

చ. 3: పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికిని సంసారభోగము
హరి నరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడి దాతవు
సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు వేకాలమును మమ్మును

రేకు: 0168-02 ధన్నాసి సం: 02-329 శరణాగతి

పల్లవి: నీవే మాకు దిక్కు నిన్నే తలఁతుము
కావు మా నేరమెంచక కరుణానిధీ

చ. 1: నెట్టన సూర్యులోని నెలకొన్న తేజమా
గట్టిగాఁ జంద్రునిలోని కాంతిపుంజమా
పుట్టిరక్షించే యజ్ఞపురుషుని ప్రకాశమా
వొట్టుక దేవతలలోనుండిన శక్తీ

చ. 2: సిరులుమించిన యట్టిజీవులలో ప్రాణమా
గరిమ వేదములలోఁ గల యర్థమా
పరమపదమునందుఁ బాదుకొన్న బ్రహ్మమా
చరాచరములలో సర్వాధారమా

చ. 3: జగములో వెలిసేటిసంసారసుఖమా
నిగిడినమంత్రముల నిజమహిమా
మిగుల శ్రీవేంకటాద్రిమీఁదనున్నదైవమా
ముగురువేల్పులలోని మూలకందమా

రేకు: 0168-03 ధన్నాసి సం: 02-330 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీ వెంత నే నెంత నేఁడు నాయగ్గలి కెంత
దేవ నీదాసులఁ జూచితేనే నిన్నుఁ గనుట

చ. 1: వొక్కొక్క రోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు
ఉక్కుమీరి ధరించుక ఉన్నాఁడవట
నిక్కిన నీరూప మెంతో నిన్నుఁ గనుఁగొను టెట్టు
అక్కజపు వేదముల కగోచరుఁడవు

చ. 2: యెన్నో శిరసులట యెన్నో పాదములట
యెన్నరాని చేతులట యిట్టి నీమూర్తి
కన్నులఁ జూచుట యెట్టు కడగురు తందు కేది
అన్నిటా మునీంద్రులకు నచింత్యుఁడవు

చ. 3: కోటిసూర్యు లొక్కమాటే కూడ నుదయించినట్టు
గాటపు నీతిరుమేనికాంతులట
మేటివి శ్రీవేంకటేశ మిమ్ము ద్రిష్టించుట యెట్లు
పోటిదేవతలకెల్లాఁ బొడవైనవాఁడవు

రేకు: 0168-04 ధన్నాసి సం: 02-331 అధ్యాత్మ

పల్లవి: నారాయణ నీపంపో నాభాగ్యమో ఇది
పేరుకొని పిలువని పేరంటమై వున్నది

చ. 1: పుడిగినాఁ గామాదు లొక్కొక్కవ్యాజాన వచ్చి
నుడిసి నడుముచొచ్చు చుట్టాలవలె
తడవకున్నాఁ గర్మాలు తమ్ముఁ దామె సేయించీ
బడిబడిఁ దిరుగును బంట్లవలె

చ. 2: చూడకున్నా దుర్గుణాలు సొంట్లు సోదించవచ్చీ
వాడవాడలఁ దలవరులవలె
యేడ నున్నా లంపటాలు యెదుటనే పొలసీని
జోడువాయనీక తోడునీడలవలె

చ. 3: తలఁచకున్నా భోగాలు తనుపుతోఁ బెనఁగీని
చెలరేఁగి గరిడిలో జెట్లవలె
బలిమి శ్రీవేంకటేశ భావములో నీమూరితి
నిలుపవే యెందుకైనా నిగిడీ నామనసు

రేకు: 0168-05 దేవగాంధారి సం: 02-332 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పసులఁ గాచుట యెట్టు బండిబో యిఁడవౌటెట్టు
వెస నిన్నుఁ దలఁచితే వెరగయ్యీ నాకు

చ. 1: వరుస నంతరియామిత్వము నవతారములు
పరగ మూఁడుమూర్తుల ప్రభావము
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై
తిరమైన యాదిదేవదేవుఁడవు నీవు

చ. 2: అనిశము జీవులకు నణువుకు మహత్తుకు
వెనుకొన్న మాయకు విరాట్టుకు
పొనుఁగని మహిమల పొడవుకుఁ బొడవైన
దినకరకోటికోటితేజమవు నీవు

చ. 3: సర్వశాస్త్రములలో సనకాదులలో
పర్విన గరుడానంతప్రముఖులలో
సర్వదా మెలఁగుచు జనవరదుఁడవై
పుర్వి శ్రీవేంకటాద్రినున్న దేవుఁడవు

రేకు: 0169-01 దేవగాంధారి సం: 02-333 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఏపొద్దూ నీచేఁతలెల్లా యెదుటనే కానవచ్చీ
వీఁపు గానరాఁగా దాఁగే విద్య నీదిగాక

చ. 1: పుట్టిన మెకానకుఁ బూరి మేయ నేరిపిరా
అట్టె పిల్లలఁ బెట్ట నటు నేర్పిరా
చుట్టి నీళ్లున్నచోటు సోదించ నేరిపిరా
మట్టులేని దింతా నీమాయ యింతేకాక

చ. 2: తీవెలకుఁ జుట్టి చుట్టి దిక్కులఁ బాఁక నేరిపిరా
తావులఁ దతికాలానఁ బూవ నేరిపిరా
వేవేలు పక్కొమ్మలు వెసఁ బెట్ట నేరిపిరా
యేవలఁ జూచినా నీమహిమ లింతేగాక

చ. 3: కోరి పక్షులు కొరులు గూండ్లువెట్ట నేరిపిరా
సారె జాతియ్యాహారాలచవి నేర్పిరా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నియు లోకములోన
చేరి నీవు సేసిన సృష్టి యింతే కాక

రేకు: 0169-02 దేవగాంధారి సం: 02-334 వైష్ణవ భక్తి

పల్లవి: ఇంతకంటే మరిలేదు యెవ్వరికి నుపాయము
యెంతైనా నిదియు నీ విచ్చితేనే కలుగు

 చ. 1: హరి నీచిత్తము వట్టేయందుకు నుపాయము
ధర నిన్ను బోధించే నీదాసులమాఁటే
దురతములన్నిటిని తొలగించే వుపాయము
నిరంతరమును నీనామజపమే

 చ. 2: దండితోడ నీమాయ దాఁటేయందు కుపాయము
నిండు నిధానమైన నీపైభక్తే
అండనున్న కామాదుల నణచుట కుపాయము
కొండవంటి నీమూర్తిఁ గోరి శరణనుటే

 చ. 3: పుట్టుగులు గెలిచి నిన్ను బొందుట కుపాయము
అట్టె నీరూపమైన ఆచార్యుడే
యిట్టె శ్రీవేంకటేశ యిన్నిటికి నుపాయము
మట్టులేని రామానుజమతము చేకొనుటే

రేకు: 0169-03 దేవగాంధారి సం: 02-335 భగవద్గీత కీర్తనలు

పల్లవి: తెలియరాదు నీమాయ తెరమరఁగు పెక్కు-
వలలఁ జిక్కక నిన్నే కొలువఁగవలయు

చ. 1: చూడఁగ నీజగత్తుకు సూత్రధారివి నీవు
జోడై నీసూత్రాన నాడుచును సర్వంబునున్నది
యేడఁ జూచిన నీవుందు వెవ్వరికిఁ గానరావు
వోడక స్వతంత్ర మొకరిపై వేతువు

చ. 2: మఱపించాఁ దలఁపించా మర్మజ్ఞుఁడవు నీవు
గుణియై నీసంకల్పము కొలఁదే యీజీవులెల్లా
మఱి నీ వీశ్వరుఁడవు మాఁటలకుఁ జిక్కవు
కఱకరి నితరులఁ గర్తలఁగాఁ జేతువు

చ. 3: అందరిమొర లాలించి అట్టె రక్షింతువు నీవు
కందువ శ్రీవేంకటేశ కానవచ్చె నీమహిమ
చెంది వరము లిత్తువు చేతికి సులభుఁడవు
సందడి నెవ్వరినైనా సరిగా మన్నింతువు

రేకు: 0169-04 ధన్నాసి సం: 02-336 శరణాగతి

పల్లవి: నీవే దయదలఁచుక నెమ్మి రక్షించుట గాక
యీవలఁ గొలిచేనంటే యీడ్డైనవాఁడనా

చ. 1: పరగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే
హరి నీకు నెదురుమాఁటాడేవాఁడనా
గరిమ సువస్తువులు కానుక ఇచ్చేనంటే
సరుస నీకన్నా నేను సంపన్నుఁడనా

చ. 2: మెలఁగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే
జలజాక్ష నే నీతో సరివాఁడనా
బలువైనా నీపరమపదము గోరేనంటే
వలనైన నీతోడివంతువాఁడనా

చ. 3: తాలిమితో నాలో నిన్ను ధ్యానము సేసేకంటే
పాలఁసుడ నేను నీపాటివాఁడనా
యేలితివి శ్రీవేంకటేశ నన్నుఁ గృపతోడ
యీలీల నీమహిమలు యెరిఁగేటివాఁడనా

రేకు: 0169-05 దేవగాంధారి సం: 02-337 శరణాగతి

పల్లవి: చిత్తానఁ బెట్టకు మీమాఁట శ్రీరమణ మరవకు
హత్తి నిన్నే మెరుఁగుదు నజ్ఞాని నేను

చ. 1: నెలకొని నాలోన నీవున్నాఁడవు గనక
తలఁచకున్నా నిన్నుఁ దలఁచిన వాఁడనే
యెలమి నందరి నీవే యేలినవాఁడవు గనక
కొలువకున్నా నిన్నుఁ గొలిచినవాఁడనే

చ. 2: నెక్కొని ఆకసమెల్లా నీపాదమే కనక
మొక్కకున్నా నేను నీకు మొక్కినవాఁడనే
నిక్కి నానాక్షరములు నీపేరులే కనక
పెక్కులుగాఁ బిలువకున్నాఁ బిలిచినవాఁడనే

చ. 3: వోజ నారుగమలాల నున్నాఁడవు గనక
పూజించకున్నా నిన్నుఁ బూజించినవాఁడనే
తేజపు శ్రీవేంకటేశ దేవ నీవే గతిగాన
సాజాన నే మఱచినా శరణన్న వాఁడనే

రేకు: 0169-06 గుండక్రియ సం: 02-338 భక్తి

పల్లవి: దాఁచుకో నీపాదాలకుఁ దగ నేఁ జేసిన పూజలివి
పూఁచి నీకీరితి రూపపుష్పము లివియయ్యా

చ. 1: వొక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచివుండనీ
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము
దిక్కై నన్నేలితివిఁక నవి తీరని నా ధనమయ్యా

చ. 2: నా నాలికపైనుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్నుఁ బొగడించితివి
వేనామాల వెన్నుఁడా వినుతించ నెంతవాఁడ
కానిమ్మని నాకీ పుణ్యము గట్టితి వింతేయయ్యా

చ. 3: యీమాఁట గర్వముగాదు నీమహిమే కొనియాడితిఁ గాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాఁడఁ గాఁను
నేమానఁ బాడేవాఁడను నేరములెంచకుమీ
శ్రీమాధవ నే నీ దాసుఁడ శ్రీవేంకటేశుఁడవయ్యా

రేకు: 0170-01 గుండక్రియ సం: 02-339 గురు వందన

పల్లవి: హరి గోవిందా హరి గోవిందా - ఆనంద మానంద మాతుమకును
గురూపదేశాన వెదకఁగా వెదకఁగా - గరిమ నీయర్థము కంటి మోయయ్యా

చ. 1: హరి నన్యధర్మములు మానుమంటివి - శరణు నీకుఁ జొరుమంటివి
దురితము లణఁచేనంటివి - పరగ మోక్షం బిచ్చేనంటివి
హరి నీవచనము అమోఘము - నరులము నే మిది నమ్మితిమి
పరమపద మిప్పుడే కలిగేను- ధర నొక్కమనసుతో నున్నారమయ్యా

చ. 2: యెందు నీవే గతి యనుమంటివి - యేచి యొక్కమాఁటే చాలునంటివి
యిందరి కభయ మిత్తునంటివి - యిది నీకెపుడు వ్రతమంటివి
కందువ నీబిరుదు సత్యము - కానిమ్మని నేము చేపట్టితిమి
అంది నీవే మాకు దిక్కైతివి - అన్నిటా సంతోసాన నున్నారమయ్యా

చ. 3: ఆస మానినవాఁడెక్కు డంటివి- ఆతనివెంటఁ దిరిగేనంటివి
భాసురపాదరేణువు నే నంటివి- పావన మయ్యేనని యంటివి
మోసలేనిది నీసంకల్పము -మొక్కే మిందులకు శ్రీవేంకటేశా
ఆసపడ నితరుల నాకు నీవే యాస - యని నీదాసులమై యున్నారమయ్యా

రేకు: 0170-02 గుండక్రియ సం: 02-340 శరణాగతి

పల్లవి: ఇదివో నాసంపదా ఆస్తియుఁ బాస్తి నీవు ఇతరంబులు నాకుఁ బనిలేదు
పదిలంబుగ నాబ్రతుకెల్లా నీవే పాలించఁగదే నారాయణా

చ. 1: ఉపమల నే నార్జించిన ఉన్నతధనంబు నీవు
తపము సేయఁగాఁ గలిగెడు తత్ఫలంబు నీవు
జపములవలనఁ గలిగెడు నా తేజః ప్రభావమును నీవు
కపురుల దానధర్మాన పరోపకారంబులఁ బొందెడు మేలు నీవు

చ. 2: పరము నాకు నీవు పరాత్పరమును నీవు
గరిమల నిలలోపలి యనంతభోగంబులు నీవు
గరుడోరగామరసిద్ధసాధ్యగంధర్వ పదములు నీవు
సురమునిపితృపూజావేదపాఠ సుకృతంబులు నీవు

చ. 3: నాలుగాశ్రమంబులు నానావిధ్యలు నీవు
తాలిమి నాపంచవింశతితత్వంబులు నీవు
ఈలీల శ్రీవేంకటేశ్వరా యిన్నియు నీవు నా కని యెరిఁగితి
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు

రేకు: 0170-03 శుద్ధవసంతం సం: 02-341 శరణాగతి

పల్లవి: అందుకే సుమ్మీ నేఁజేసే ఆచారాలు దైవమా
నిందవాయ నామనసు నీపై నిలుపవే

చ. 1: బట్టబయటఁ దోలితేను బందె మేయుఁ బసురము
పట్టి మేపితేను తనపనులు సేయు
ఇట్టె వదిలితేను యెందైనాఁ బారు మనసు
కట్టుక నే మఁస్తుఁడైతే కైవసమై యుండును

చ. 2: బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు
యెడయక కూడుకొంటే హితు లౌదురు
విడిచితే నిటులానే కడకుఁ బారు మనసు
వొడలిలో నణఁచితే వొద్దికై వుండును

చ. 3: చే వదలితే పెంచిన చిలుకైనా మేడ లెక్కు
రావించి గూఁటఁ బెట్టితే రామా యనును
భావించకుండితే యిట్టె పారు నెందైనా మనసు
శ్రీవేంకటేశుఁ గొల్చితే చేతఁ జిక్కి వుండును

రేకు: 0170-04 బౌళి సం: 02-342 భక్తి

పల్లవి: జపములుఁ దపములుసంధ్యాదివిధులకు
నెపము నామీఁద నింతే నీకే సెలవు

చ. 1: ఫలము నినుఁ గోరని పంతమువాఁడాఁ గాను
వలెననడుగ నెంతవాఁడను నేను
చెలఁగి నీవు కర్మము సేయించఁగాఁ జేసేటి-
వెలలేక తెచ్చుకొన్న వెట్టివాఁడ నేను

చ. 2: ఆస మానితిననేటి యహంకారి నేఁ గాను
వాసికి నీతోఁ బెనఁగేవాఁడనా నేను
వేసరకుండాఁ గట్లు విడిపించి యేలుకోఁగా
దాసుఁడనై బదికేటి ధర్మపువాఁడ నేను

చ. 3: జ్ఞానినైతిననే గర్వాచారపువాఁడాఁ గాను
కానక నీపై మోపుగట్ట నోపను
ఆనుక శ్రీవేంకటేశ ఆతుమ నీవుండఁగాను
మోనాన నీకు మొక్కేటి మునివాఁడ నేను

రేకు: 0170-05 హిందొళ వసంతంసం: 02-343 ఉపమానములు

పల్లవి: అందరి రక్షించే దేవుఁ డాదరించీ జీవులను
పొందుగా యీమేలెరిఁగి పొగడరో లోకులు

చ. 1: వనము వెట్టినవాఁడు వాఁడకుండా నీరు వోసి
పెనచి కలుపు దీసి పెంచినయట్లు
పనివడి గొల్లవాఁడు పచ్చికపట్టునఁ బసుల
తనియఁగ నిల్పి నిల్పి తానే మేపినట్లు

చ. 2: కన్నతల్లి బిడ్డలకు కానుక వెన్నయుఁ బాలు-
నన్నము నిడి రక్షించినటువలెను
యెన్నఁగ బంట్లనేలే యేలిక జీతాలు వెట్టి
మన్నించి కాచుకొని మనిపినయట్లు

చ. 3: వసుధ వైద్యుఁడైనవాడు మందుమాకు లిచ్చి
పొసఁగ దేహధారులఁ బోషించినట్లు
యెసఁగ శ్రీవేంకటేశుఁ డితఁడే విశ్వకుటింబి
పసగా వరము లిచ్చి భావించీనట్లు

రేకు: 0171-01 ధన్నాసి సం: 02-344 అధ్యాత్మ

పల్లవి: ఎఱఁగక వేసారు నిల జీవుఁడు
మెఱసి నిండుకున్నాఁడు మేఁటి యీదేవుఁడు

చ. 1: వూరకే పరాకైనట్లుండును దేవుఁడు
నారుకొన మతిలోఁ దనపైనే చింత
గారవాన మరి పలుకనియట్టే వుండును
యీరీతి మాటాడించేవాఁ డిన్నిటా నితఁడే

చ. 2: యెందు లేనియట్టే వుండు నెంచి చూచితే దేవుఁడు
చెంది లోకశరీరియై చెలరేఁగీని
అందరాక యెక్కడాను అడఁగినట్లనే యుండు
యిందరిఁ బోషించేవాఁడు యెప్పుడూ నితఁడే

చ. 3: చేరి లోనుగానెట్టుండు శ్రీవేంకటేశదేవుఁడు
కోరినవరము లిచ్చు గురుతుగాను
వారక యలమేల్మంగ వల్లభుఁ డిట్టిదేవుఁడు
యీరూపుతో నుండు నిందరిలో నితఁడే

రేకు: 0171-02 నాట సం: 02-345 వైష్ణవ భక్తి

పల్లవి: విష్ణుఁడొక్కఁడే విశ్వాత్మకుఁడు
వైష్ణవమే సర్వంబును

చ. 1: పరమేష్ఠి సేయు బ్రహ్మాండసృష్టియు
హరునిలోని సంహారశక్తి
పరగఁగ నింద్రుని పరిపాలనమును
అరసిచూడ శ్రీహరి మహిమ

చ. 2: యిలఁ బంచభూతములలో గుణములు
అల నవగ్రహ విహారములు
తలకొను కాలత్రయ ధర్మంబును
అలరఁగ నారాయణుని మహిమలే

చ. 3: అంతటఁగల మాయా విలాసములు
పొంతఁ బరమపద భోగములు
మంతుకు నెక్కిన మరి సమస్తమును
యింతయు శ్రీవేంకటేశు మహిమలే

రేకు: 0171-03 గుజ్జరి సం: 02-346 అధ్యాత్మ

పల్లవి: ఒకటి కొకటి లంకై వూరకైనాఁ బెనగొను
అకటా యెవ్వరు దాఁటేరయ్య నీమాయలు

చ. 1: తనయెదుటివెల్లాను తలఁపులోఁ బారును
మనసులోపలివెల్లా మర్మము లంటు
ఘనమర్మములు రేఁగి కాయమెల్లాఁ గరఁగించు
తనువుసౌఖ్య మవ్వలి తనువున నంటును

చ. 2: అవ్వలిదేహభోగము లట్టే కర్మములౌను
మువ్వంకఁ గర్మాలు లోకములై చెందును
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు
తెవ్వనికాలము నిద్రాఁ దెలివినై ముంచును

చ. 3: వెస నాతెలివి యొకవేళ నిన్నెఱఁగించు
వసమై ఆయెఱుకకు వచ్చి మెత్తువు
యెసగి నీవు మెచ్చితే యిహపరము లిత్తువు
మిసిమి శ్రీవేంకటేశ మెరయు నీయీవి

రేకు: 0171-04 సాళంగనాట సం: 02-347 హనుమ

పల్లవి: శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా

చ. 1: హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస

చ. 2: రవితనయసచివ రావణవనాపహర
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువనపూర్ణదేహ బుద్ధివిశారద
జవసత్త్వవేగ కలశాపురనివాస

చ. 3: సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవేంకటేశుకరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస

రేకు: 0171-05 బౌళిరామక్రియ సం: 02-348 నృసింహ

పల్లవి: నమో నమో లక్ష్మీనరసింహా
నమో నమో సుగ్రీవనరసింహా

చ. 1: వరద సులభ భక్త వత్సల నరసింహా
నరమృగవేష శ్రీనరసింహా
పరమపురుష సర్వపరిపూర్ణ నరసింహా
గిరిగుహావాస సుగ్రీవనరసింహా

చ. 2: భయహర ప్రహ్లాదపాలన నరసింహా
నయనత్రయారవింద నరసింహా
జయ జయ సురమునిసంస్తుత నరసింహా
క్రియాకలాప సుగ్రీవనరసింహా

చ. 3: అతికృపానిలయ మోహనరూప నరసింహా
నత పితామహముఖ్య నరసింహా
సతత శ్రీవేంకటేశ్వర దివ్యనరసింహా
కితవారిభంజన సుగ్రీవనరసింహా

రేకు: 0171-06 భైరవి సం: 02-349 అధ్యాత్మ

పల్లవి: చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు
యిత్తల మానేరములు యెన్ని లేవయ్యా

చ. 1: అంగము యేడుజానలు ఆస కొండలపొడవు
యెంగిలిమేను ఆచార మెంతైనాఁ గద్దు
జంగి లింతే సంసారము సాధించేది లోకమెల్లా
అంగడిఁ బడి జీవుని కలపు లేదయ్యా

చ. 2: మఱి నల్లేఁడు నాలికె మాటలు గంపెఁడేసి
యెఱుక గొంచె మజ్ఞాన మెంచఁగరాదు
గుఱిలేనిది బదుకు కొలఁది లేదు భోగము
వెఱవని జీవునికి వేసట లేదయ్యా

చ. 3: పట్టరానిది మనసు బయలు పందిలి చేఁత
చుట్టుకొన్నది కర్మము వట్టిది గుట్టు
యిట్టె యలమేలుమంగ నేలె శ్రీవేంకటేశుఁడు
నెట్టన నీబంటుజీవునికి మితిలేదయ్యా

రేకు: 0172-01 ప్రతాపనాట సం: 02-350 హనుమ

పల్లవి: ఏమని నుతించవచ్చు నితనిరూపము
భీమవిక్రముఁ డితఁడు పెద్ద హనుమంతుడు

చ. 1: వొక్కజంగఁ చాఁచినాఁడు వొగిఁ దూర్పుఁబడమర
తక్కక భుజా లుబ్బించె దక్షిణోత్తరాలు నిండ
మిక్కిలి బ్రహ్మలోకము మీరను శిరసెత్తెను
పిక్కటిల్లు మహిమతోఁ బెద్ద హనుమంతుఁడు

చ. 2: వేడుక వాల మాకాశవీథితోఁ బెనచినాఁడు
యేడుజలధులు చేసె నదె మోకాళ్లబంటి
వోడక పిడికిలించి వుగ్రదైత్యుల తలలు
బేడలుగాఁ జేసినాఁడు పెద్ద హనుమంతుఁడు

చ. 3: జళిపించి వలకేలు సకలము మెచ్చ నెత్తె
కులగిరులు తనతొడలసందినే యడఁచె
బలువుఁడు శ్రీవేంకటపతిబంటు మతంగాద్రి-
బిలమువాత నున్నాఁడు పెద్దహనుమంతుఁడు

రేకు: 0172-02 దేసాళం సం: 02-351 శరణాగతి

పల్లవి: పనిగొన నేరిచితే పాపమే పుణ్యమౌను
నిను(గొలిచేయట్టి నీసేవకులకు

చ. 1: మనసు చంచలమైనా మరి నిన్ను(దల(చితే
జనులకు నిహపరసాధనమౌను
తనువు హేయమైనా తగ నిన్ను(గొలిచితే
పనివడి యంతలోనే పవిత్రమౌను

చ. 2: కర్మము బంధకమైనా కమ్మి నీసొమ్ముచేసితే-
నర్మిలి మోక్షమియ్య నాధారమౌను
మర్మము కోరికయైనా మహి నీభక్తికెక్కితే
ధర్మములకు(బరమధర్మము దానౌను

చ. 3: జగమెల్ల మాయయైనా సరి నీకే శరణంటే
పగటున నదే తపఃఫలమౌను
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
మిగులా నిహమైనా మించి పరమౌను

రేకు: 0172-03 లలిత సం: 02-352 వైష్ణవ భక్తి

పల్లవి: మనసు నమ్మనేర్చితే మనుజుఁడే దేవుఁడౌను
తనలోనే వున్నవాఁడు తావుకొని దైవము

చ. 1: మగనిపై బత్తిచేసి మగువ యొక్కరితె
తెగి పరలోకము సాధించీనట
వొగి వీరవైష్ణవుఁడై వున్నవాఁడు హరిఁ గొల్చి
అగపడి ఘనమోక్షమంద నోపఁడా

చ. 2: యేలికకై పగవారి నెదిరించి బంటొకఁడు
మేలైన పదవులంది మెరసీనట
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలుచేసి
కాలమందే యందరిలో ఘనుఁడు గానోపఁడా

చ. 3: పరమపురుషార్థపుపని చేసి యొకరుఁడు
అరిది నధికపుణ్యుఁ డయ్యీనట
నిరతి శ్రీవేంకటేశ నిన్నుఁ బూజించి దాసుఁడు
పరము నిహముఁ జెంది బ్రదుకఁగ నోపఁడా

రేకు: 0172-04 దేసాక్షి సం: 02-353 అధ్యాత్మ

పల్లవి: సోదించి చూడఁబోతే చూచి మఱపు
వో దేవదేవ మించె నోహో నీమాయ

చ. 1: వొక్కటే పదార్థము వూరివారెల్లాఁ జూచితే
గుక్కిళ్లు మింగించి యాసకొలుపుచుండు
మక్కళిం చెందరిలోని మనసులు వేరు వేరో
వొక్కటో యేమనవచ్చు నోహో నీమాయ

చ. 2: ధరలో బిడ్డ వొక్కటి తల్లిదండ్రులిద్దరు
తొరలింపు వేడుకలై తోఁచుచుండు
పెరిగేటి పుట్టుగులు భేదమో అభేదమో
వొరుల కేమనవచ్చు నోహో నీమాయ

చ. 3: కోరే మోక్ష మొక్కటే కొలచే దిద్దరినట
చేరే ని న్నలమేల్మంగ శ్రీవేంకటేశ
మీరిద్దరు నేకమౌ మీభావాలే వింతలో
వూరకే యేమనవచ్చు నోహో నీమాయ

రేకు: 0172-05 దేసాళం సం: 02-354 వైష్ణవ భక్తి

పల్లవి: ఎన్నిపాట్లఁ బడ్డాను యెవ్వరికిఁ జెప్పినాను
పన్ని నీముద్రలఁగాక పాపము వోయినా

చ. 1: కందువ నీపాదాలపైఁ గట్టిపెట్టినఁ గాక
సందులుదూరే మనసు చక్కనుండీనా
నిందలేక యేపొద్దు నిన్నే కొలిచినఁ గాక
తుందుడుకు నీమాయ తొలఁగిపోయీనా

చ. 2: వుడివోని రుచులు నీకొప్పగించినఁ గాక
బడిఁ బంచేంద్రియములు పాయనిచ్చీనా
జడియక నే నీకు శరణుచొచ్చినఁ గాక
వొడలిలో కామక్రోధా లుడిగిపోయీనా

చ. 3: నిక్కపు నాకర్మములు నీకొరకునైనఁ గాక
యిక్కడ నేఁ జేసేటి హింస మానీనా
పక్కన నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
అక్కర నీకు మొక్కక అజ్ఞానము వోయీనా

రేకు: 0172-06 నాట సం: 02-355 నృసింహ

పల్లవి: వాఁడె వో ప్రహ్లాదవరదుఁడు
వాఁడె వో భక్తవత్సలుఁడు

చ. 1: కోర దవడలతోడ కోటి సూర్యతేజముతో
హారకేయూరాది భూషణాంబరాలతో
చేరి బ్రహ్మాదులెల్లాను సేవలు సేయఁగాను
మేర మీరిన శిరుల మేడలో నున్నాఁడు

చ. 2: తెల్లని మేనితోడ తీగెనవ్వులతోడ
చల్లని గంధముల వాసనలతోడ
పెల్లుగా నారదాదులు పేరుకొని నుతించఁగా
వెల్లవిరిఁ గొలువై వేడుక నున్నాడు

చ. 3: సంకుఁజక్రముల తోడ జంట పూదండలతోడ
పొంకపు నానావిధ భోగములతో
అంకపు శ్రీవేంకటాద్రి నహోబలమునందు
అంకెలనే పొద్దూ నెలవై తానున్నాఁడు

రేకు: 0173-01 మలహరిసం: 02-356 వైరాగ్య చింత

పల్లవి: ఎఱిఁగినవారికి హింస లిన్నియు మాని
మఱి సత్యమాడితేను మాధవుఁడే దిక్కు

చ. 1: కలుగుఁ గారణములు కామక్రోధములు రేఁగ
వెలసిన మాయవికార మది
కలఁగఁగ వలనదు కర్త లెవ్వరుఁ గారు
తెలిసి వోరుచుకొంటే దేవుఁడే దిక్కు

చ. 2: పదార్థా లెదుట నిలుచుఁ బంచేంద్రియాలు రేఁగ
వెదచల్లేటి మాయావికార మది
పదరి పైకొనవద్దు పట్టితేఁ బసలేదు
చెదరక వోరిచితే శ్రీపతే దిక్కు

చ. 3: సిరులు తానే వచ్చే చిత్తాన నాసలు రేఁగ
విరసపు మాయావికారమది
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు
శరణంటే నితని చరణాలే దిక్కు

రేకు: 0173-02 ధన్నాసి సం: 02-357 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము
ప్రకటించి వొకటి చేపట్టరో వివేకులు

చ. 1: తనుఁ దలచుకొంటేను తక్కిన దేహభోగాలు
పనికిరావు అవి ప్రకృతి గాన
ఘనమైన లోకభోగములతో లోలుఁడైతే
తనుఁ గానరాదు జీవతత్వము గాన

చ. 2: దైవము నెఱిఁగితేను తన కామ్యకర్యములు
భావించి మఱవవలె బంధాలు గాన
కావించేటి తన కామ్యకర్మాలఁ గట్టువడితే
దైవము లోను గాఁడు స్వతంత్రుఁడు గాన

చ. 3: పరిమోక్షము గోరితే స్వర్గము తెరువు గాదు
అరయ స్వర్గము తెరు వల మోక్షానకు
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని
శరణాగతియె సర్వసాధనము గాన

రేకు: 0173-03 లలిత సం: 02-358 అధ్యాత్మ

పల్లవి: హరిహరి నీమహిమ లనంతములు
విరతి జీవులకెల్ల నేరుపులై వున్నవి

చ. 1: యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి
అందరికిఁ దమతమదై వుండును
కందువ నెవ్వరెవ్వరి కాణాచి యైనదో భూమి
సందడించీఁ బంటలను సకలసస్యములు

చ. 2: చుట్టుక యం(యెం)దరికిని సొమ్మయినదో కాలము
అట్టె అందరి ఆయుష్యమై యున్నది
గట్టిగా నెవ్వరెవ్వరి కంచము కూడో యీమాయ
దట్టపు సంసారముల ధర్మములై యున్నవి

చ. 3: ముంచి యం(యెం)దరికై నాను మోపులై వుండీ కర్మము
పంచు కందరికిఁ దమ పనిపాటలై
పంచుక శ్రీవేంకటేశ వారివారి బ్రదుకులు
నించి నీవే యైతివి నిధినిధానమవై

రేకు: 0173-04 భూపాళం సం: 02-359 భక్తి

పల్లవి: పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమారునుఁ బాడి

చ. 1: హరినామములే పాడి అతని పట్టపురాణి
ఇరవై మించినయట్టి యిందిరఁ బాడి
సరి నిరువంకలాను శంఖచక్రములఁ బాడి
వరద కటిహస్తాలు వరుసతోఁ బాడి

చ. 2: ఆదిపురుషునిఁ బాడి అట్టె భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపు బ్రహ్మాండాలు మోచే వుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి

చ. 3: శ్రీవేంకటేశుఁ బాడి శిరసు తులసిఁ బాడి
శ్రీవత్సముతోడురముఁ జెలగి పాడి
లావుల మకరకుండలాల కర్ణములు పాడి
ఆవటించి యీతని సర్వాంగములుఁ బాడి

రేకు: 0173-05 దేసాక్షి సం: 02-360 అధ్యాత్మ

పల్లవి: నీవు వెట్టినట్టి చిక్కు నీవే తెలుపవలె
నావశమా తెలియ నారాయణా

చ. 1: నీటిలోన నొకబుగ్గ నిమిషములోనఁ బుట్టి
కోటిసేసినట్లుండుఁ గొంతవడి
పాటించి యందే యడఁగెఁ బ్రకృతియో బ్రహ్మమో
యేఁటిదో వీని యర్థ మెరిఁగించవయ్య

చ. 2: ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయ విసరు లోలోనె
మైకొని యందే యడఁగె మాయయో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్య

చ. 3: భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవేంకటేశ
వాములై వెలయు నేసేవారికి
ఆముక యందే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెరిఁగించవయ్య

రేకు: 0173-06 నాట సం: 02-361 నృసింహ

పల్లవి: ఎత్తుకొన్న బహురూప మిఁక మరి మానరాదు
చిత్తగించి మన్నించు శ్రీనరసింహా

చ. 1: పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి
గట్టిగా కనకదైత్యు ఖండించితివి
యిట్టి నీచేఁతలు విని యిందరుఁ గొల్చేరు నిన్ను
కట్టుకొంటి వింతపని ఘననారసింహా

చ. 2: దేవతల మొరాలించి దీకొంటి వింతపనికి
చేవ నభయము లిచ్చి చేయె త్తితివి
దేవుఁడ వని యెఱిఁగి త్రిజగాలు మొక్కె నీకు
నీవల్లనే వచ్చె నిది నిత్యనారసింహా

చ. 3: భూకాంతవిన్నపము పొంచి విని గురైతివి
శ్రీకాంత తొడమీఁదఁ జేకొంటివి
మీకును శ్రీవేంకటాద్రిమీఁదనే శరణంటిమి
దాకొనె మీమహిమలు దండినారసింహా

రేకు: 0174-01 లలిత సం: 02-362 హరిదాసులు

పల్లవి: ఆతనిమూలమే జగమంతా నిది
ఆతుమలో హరి కీలుఅయివుండుఁ గాని

చ. 1: మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము
వచ్చినట్టె వచ్చితేను వలపే చవి
యెచ్చుకుందు లేకున్న నెక్కడైనా సుఖమే
యిచ్చకుఁడై హరి తన కియ్యవలెఁ గాని

చ. 2: నెట్టుకొని నడచితే నిజమే మూలధనము
పట్టినదే వ్రతమైతే భవమే మేలు
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము
యిట్టి హరి దనకు నియ్యవలెఁ గాని

చ. 3: చెప్పినట్లు సేసితేను చేరి దేహమే చుట్టము
తప్పులు లేనిదియైతే ధర్మమే సొమ్ము
చొప్పున హరిదాసులు సోదించి చూచిన దిది
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డియ్యవలెఁ గాని

రేకు: 0174-02 సాళంగనాట సం: 02-363 నృసింహ

పల్లవి: దిక్కు నీవే జీవులకు దేవసింహమా
తెక్కుల గద్దియమీఁది దేవసింహమా

చ. 1: సురలెల్లాఁ గొలువఁగ సూర్యచంద్రులకన్నుల
తిరమైన మహిమల దేవసింహమా
నిరతిఁ బ్రహ్లాదుఁడు నీయెదుట నిలిచితే
తెరదీసితి మాయకు దేవసింహమా

చ. 2: భుజము లుప్పొంగఁగాను పూఁచిన శంఖుఁజక్రాల
త్రిజగముల నేలేటి దేవసింహమా
గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి-
ద్విజమునిసంఘముల దేవసింహమా

చ. 3: ముప్పిరిదాసులకెల్లా ముందు ముందే యొసగేటి-
తిప్పరాని వరముల దేవసింహమా
చిప్పల నహోబలాన శ్రీవేంకటాద్రిమీఁద
తెప్పల దేలేటియట్టి దేవసింహమా

రేకు: 0174-03 బౌళి సం: 02-364 గోవిందరాజు

పల్లవి: కన్నులపండుగలాయ కమ్మి సేవించేవారికి
సన్నల నీదాసులము సంతసించేము

చ. 1: పడఁతు లిద్దరు నీపాదములు వొత్తఁగాను
కొడుకు బ్రహ్మదేవుఁడు కొలువఁగాను
కడుపులో లోకములు కడు జయవెట్టఁగాను
గుడిగొనె నీబ్రదుకు గోవిందరాజా

చ. 2: మెత్తఁగా శేషుఁడు నీకు మించుఁబరపై వుండగా
జొత్తు మధుకైటభులు సుక్కి వోడఁగా
హత్తి దేవతలు నిన్ను నందరుఁ బూజించఁగాను
కొత్తలాయ నీబ్రదుకు గోవిందరాజా

చ. 3: పరగి నీముందరను పంచబేరము లుండఁగా
గరిమఁ జక్రము నీకుఁ గాపై వుండఁగా
తిరమై శ్రీవేంకటాద్రి తిరుపతిలోపలను
గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా

రేకు: 0174-04 శ్రీరాగం సం: 02-365 గురు వందన, నృసింహ

పల్లవి: కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద
మూశిన ము త్తెమువలె మొక్కేము నీకు

చ. 1: నెమ్మిఁ జక్రాయుధుఁడవు నీవు గల వటు గాన
పమ్మి మాకు నెన్నఁడును భయమే లేదు
యిమ్ముల లక్ష్మిపతివి యేలిక వైతివి గన
సమ్మతి మాకు సర్వసంపదలు గలవు

చ. 2: పుట్టించినవాఁడవు భూధవుఁడ వటు గన
దట్టముగ నెంచగఁ బదస్థుఁడ నేను
తొట్టి కరిరాజవరదుఁడ నీవే దిక్కు గన
గట్టిగా నాకోరిక లిక్కడ ఫలియించెను

చ. 3: గురుపవు గొల్లలకు గోవింధరాజవు గన
నిరంతరమునుఁ బాఁడి నిండెను మాకు
చిరంతనదేవుఁడవు శ్రీవేంకటేశ్వర వీవు
పరము నిహము మాకు బలువుగాఁ గలిగె

రేకు: 0174-05 గౌళ సం: 02-366 తేరు

పల్లవి: హరియు సిరియు నేఁగే రదివో తేరు
పరంజ్యోతి స్వరూపపు పైఁడికుండ తేరు

చ. 1: గరుడధ్వజపుఁ దేరు కనకమయపుఁ దేరు
సురలు బొమ్మలైనారు చుట్లఁ దేరు
మెరుఁగుల మేఘముల మించుఁ గొఱిఁగెల తేరు
సిరుల ధ్రువలోకపు శిఖరపుఁ దేరు

చ. 2: బలుకుల పర్వతాలె బండికండ్లైన తేరు
నలుదిక్కు లంచుల వున్నతపుఁ దేరు
కొలదిఁలేని చుక్కలకుచ్చుల ముత్తేల తేరు
మెలుపు నాకాశగంగ మేలుకట్ల తేరు

చ. 3: మునులనే వుత్తమాశ్వములఁగాఁ గట్టిన తేరు
ఘనమహిమలనే సింగారపుఁ దేరు
యెనసి శ్రీవేంకటేశుఁ డెపుఁడూ నలమేల్మంగ
దినదినభోగములఁ దిరమైన తేరు

రేకు: 0174-06 బౌళి సం: 02-367 శరణాగతి

పల్లవి: పరమపురుష నిరుపమాన శరణు శరణు రే యేయేయే ఇందిరా నిజమందిరా

కమలనాభ కమలనయన కమలచరణు రే

అమిత సురమునినాథయూధపనాయకా వరదాయకా

చ. 1: చతురమూరితి చతురబాహుశంఖచక్రధరా

అతిశయ శ్రీవేంకటాధిప అంజనాకృతిరంజనా

రేకు: 0174-07 మాళవి సం: 02-368 సంస్కృత కీర్తనలు

పల్లవి: హా సమీచీనమపహసంతే

దాసై ప్రకాశితం దరిదంతు లోకే

చ. 1: ద్వారకాపట్టణే త్వం పురా చ స్వయదీక్షితస్తూ స్త్రియః

కేశముష్టిః కథం సారస కురువంతి సరసవేళాయాం

చ. 2: వరశిశోరక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారి అథోచే స్తదేతి

గోపతరుణయః కిమితి వా తద్వసతి త్వం

చ. 3: తత్తబృందావనే త్వం పురా చ శ్రియౌ వేంకటాద్రౌ ఇదం

నివ్విభాసి ఇదం చిత్తమిత్యమరాశ్చ ది సేవంతి సర్వే

రేకు: 0175-01 దేవగాంధారి సం: 02-369 భక్తి

పల్లవి: సదానందము సర్వేశ్వర నీ-
పదారవిందముపై భక్తి

చ. 1: నయనానందము నరులకు సురులకు
జయమగు హరి నీసాకారము
నయమగు శ్రవణానందము వినినను
క్రియగలిగిన నీకీర్తనము

చ. 2: చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁ గొను నీపస్రాదము
నలుగడ దేహానందము బుధులకు
బలు నీపాదప్రణామమములు

చ. 3: ధరఁ బరమానందము నీదాస్యము
గరిమల శ్రీవేంకటవిభుఁడా
నరహరి నిత్యానందము నినుఁ దగ-
నరవిరిఁ జేయు సమారాధనము

రేకు: 0175-02 సామంతం సం: 02-370 అంత్యప్రాస

పల్లవి: ఆరసి వేరొకచో ముక్తడుగఁగవలదు
సారపు లౌకికవిమోచనమే ముక్తి

చ. 1: మొగిఁ బుణ్యపాపవిముక్తియే ముక్తి
వెగటుఁ బ్రపంచపువిముక్తే ముక్తి
తగులు సంసారబంధవిముక్తే ముక్తి
జగములోఁ గలుగు యాశాముక్తే ముక్తి

చ. 2: కామక్రోధాదిసంగ విముక్తే ముక్తి
వేమారు రుచులపై విముక్తే ముక్తి
నాముల దేహభిమానపు ముక్తే ముక్తి
పామెడి కోరికలసంపద ముక్తే ముక్తి

చ. 3: ముందువెనకల కర్మమోచనమే ముక్తి
అంది సుఖదుఃఖభయ ముక్తే ముక్తి
కందువ శ్రీవేంకటేశుఁ గని యందే శరణని
విందుల నితరసేవావిముక్తే ముక్తి

రేకు: 0175-03 సాళంగనాట సం: 02-371

పల్లవి: ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచిచూచినా
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు

చ. 1: విశ్వరూపబ్రహ్మము విరాట్టయిన బ్రహ్మము
ఐశ్వర్యస్వరా ట్టాసామ్రాట్టయిన బ్రహ్మము
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైన బ్రహ్మము
యీశ్వరుఁడై మహరాట్టై యిందరిలో బ్రహ్మము

చ. 2: సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపు టనలుని భాస్వత్తేజము
కార్యపు టవతారాలఁ గనుఁగొనే తేజము
వీర్యపుటెజ్ఞభాగాల విష్ణునామ తేజము

చ. 3: పరమపురుషమూర్తి ప్రకృతియైన మూర్తి
గరిమతో మహదహంకార మూరితి
ధరఁ బంచతన్మాత్రలు తత్త్వములైన మూరితి
గరుడానంత సేనేశకర్తయైన మూరితి

చ. 4: భాగవతపు దైవము భారతములో దైవము
సాగిన పురాణవేదశాస్త్ర దైవము
పొగులైన బ్రహ్మలను బొడ్డునఁ గన్న దైవము
శ్రీగలిగి భూపతైన శ్రీవేంకటదైవము

రేకు: 0175-04 దేసాళం సం: 02-372 గురు వందన, నృసింహ

పల్లవి: గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యీతఁడే చూపె ఘనగురుదైవము

చ. 1: యీతనికరుణనేకా యిల వైష్ణవులమైతి-
మీతనివల్లనే కంటి మీతిరుమణి
యీతఁడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరిమంత్ర-
మీతఁడే రామానుజులు యిహపరదైవము

చ. 2: వెలయించె నీతఁడేకా వేదపు రహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము

చ. 3: నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే
నయమై శ్రీవేంకటేశు నగ మెక్కేవాకిటను
దయఁజూచీ మమ్ము నిట్టే తల్లితండ్రి దైవము

రేకు: 0175-05 నాదరామక్రియ సం: 02-373 అంత్యప్రాస

పల్లవి: నేనేమెరిఁగి సేసేనో నీకుఁ దిరువారాధన
ఆని మున్నిటి బ్రహ్మరుద్రాదులు సేయఁగలేరు

చ. 1: అనుగు నీరూప మింతంతనెరిఁగి సేసేనో
పునికై నీ వొక్కచోనే వుండేదెరిఁగి సేసేనో
తనిసి నీకు నొక్కమంత్రమునెరిగిఁ సేసేనో
కనరాని నీమహిమే కడయెరిఁగి సేసేనో

చ. 2: మరిగి నీకు నొక్కనామమునెరిఁగి సేసేనో
అరసి యించుకేకాలమనెరిఁగి సేసేనో
నిరతి నీకేమి లేవని యెరిగి సేసేనో
బెరసి నన్ను గొంత మెప్పించనెరిగి సేసేనో

చ. 3: తెలిసి నీకు నొక్కమూర్తియనెఱిఁగి సేసేనో
అలమిన నీమాయఁ గొంతనెరిఁగి సేసేనో
అలమేల్మంగకుఁ బతియగు శ్రీవేంకటేశుఁడ
వొలసి నీ కుపమింప నొక్క టెరిఁగి సేసేనో

రేకు: 0175-06 వరాళి సం: 02-374 దశావతారములు

పల్లవి: డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥ పల్లవి॥

మీనకూర్మ వరాహ మృగపతి అవతారా

దానవారే గుణశౌ రే ధరణిధర మరుజనక

చ. 1: వామన రామ రామ వరకృష్ణ అవతార

శ్యామలాంగా రంగ రంగా సామజవరద మురహరణ

చ. 2: దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా

శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరికూటనిలయ

రేకు: 0176-01 బౌళి సం: 02-375 కృష్ణ

పల్లవి: జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటు నాసోదంబు ఇది నీవెలితో నావెలితో

చ. 1: యెన్నిమారులు సేవించినఁ గన్నులూ దనియవు
విన్న నీకథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయుఁ దవియదు
విన్న కన్నది గాదు ఇది నావెలితో నీవెలితో

చ. 2: కడఁగి నీప్రసాదమే కొని కాయమూఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములుసేసి పాదములు నివిఁ దనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురునూఁ దనియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నావెలితో నీవెలితో

చ. 3: చెలఁగి నిను నేఁ బూజించి చేతులూఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చి త్తమూఁ దనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర అత్మ నను మోహించఁజేసితి
వెలయ నిన్నియుఁ దేరే ము నీవెలితో నావెలితో

రేకు: 0176-02 దేవగాంధారి సం: 02-376 శరణాగతి

పల్లవి: అందుకే నేఁ జింతించెదను అచ్యుత నీశరణాగతుఁడ
సందడి నాభవ మిందువల్లనే నఫలంబాయనయ్యా

చ. 1: వొకనీనామము వొగిఁ దలంచిన
అకలంకంబగు నాపాపంబులు అన్నియుఁ బారణే సేసే
అకటా తక్కిన అనంతనామములు
వొకట నుపవాసములున్నవోయయ్యా

చ. 2: పరి నీపాదము లవి రెండే
పరమును విహమును నా కొసఁగెను పయిపైఁ గృపతోడ
ధర నీయనంతకరములు తా మేమి-
సిరు లిత్త మనుచు చెలఁగీనయ్యా

చ. 3: ఇల నీదాస్యం బిది యొకటే
సిలుగుల భవముల జిలుగు మాన్పె నదె చిత్తము తహ దీర
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ విదె
తలఁపునఁ బాయక దక్కితివయ్యా

రేకు: 0176-03 మాళవి సం: 02-377 నామ సంకీర్తన

పల్లవి: దేవ నమో దేవా
పావనగుణగణభావా

చ. 1: జగదాకారచతుర్భుజ
గగననీలమేఘశ్యామ
నిగమపాదయుగ నీరజనాభ
అగణితలావణ్యాననా

చ. 2: ఘనవేదాంతైగణన వుదార
కనకశంఖచక్రకరాంకా
దినమణిశశాంకదివ్యవిలోచన
అనుపమరవిబింబాధరా

చ. 3: భావజకంజభవజనక
శ్రీవనితాహృదయేశ
శ్రీవేంకటగిరిశిఖరవిహార
పావనగుణగణభావా

రేకు: 0176-04 బౌళి సం: 02-378 అంత్యప్రాస

పల్లవి: దేహంబొకటే దేహియు నొకఁడే
దాహంబెంతటఁ దనియునో తలఁపు

చ. 1: వినుకలి వెంట వెడలీఁ దలఁపు
కనుకలి వెంటఁ గదలీఁ దలఁపు
కొననాలుక మదిఁ గూడీఁ దలఁపు
తునిగిన యెన్నెన్ని తునకలో తలఁపు

చ. 2: నయమగు చోటను నవ్వీఁ దలఁపు
భయమగు చోటను బడలీఁ దలఁపు
లయమై నిద్రల లవమౌఁ దలఁపు
క్రియ నెందరి పంగెనయో తలఁపు

చ. 3: భావించిన గతిఁ బారీఁ దలఁపు
వేవేలు గతుల వెలసీఁ దలఁపు
శ్రీవేంకటపతి చిత్తము లోపల
నీవే తెలుపఁగ నినుఁగనె తలఁపు

రేకు: 0176-05 సాళంగనాట సం: 02-379 నృసింహ

పల్లవి: మొక్కరె మొక్కరే మీరు ముందు ముందే జయ లిడి
దక్కి శ్రీవేంకటేశుఁడే తానైన దేవునికి

చ. 1: కరములు వే యవే కరములును భయం-
కరనఖాయుధములు కడాఁలే వనే
సిరి దొడపై నదె సింహపునెమ్మో మదే
నరరూపు సగమదె నరసింహునికి

చ. 2: వంకరకోరలవె వజ్రపు దంతము లవె
సంకునుఁజక్రము నిరువంకలా నవె
జంకెల నేత్రము లవె జడలు మూఁపున నవె
అంకె నభయహస్తము అదె నరహరికి

చ. 3: నిక్కినకర్ణము లవె నీలిమచ్ఛవుర మదె
చుక్కల మొలపూసల నొక్కరూ పదె
తొక్కినపాపము లవె తోడనే శ్రీవేంకటాద్రి
పక్కెర నరసింహపు ప్రళయసింహునికి

రేకు: 0176-06 బౌళి సం: 02-380 వైరాగ్య చింత

పల్లవి: తొల్లి యెట్టుండునో తాను తుద నెట్టుండునో తాను
యిల్లిదె నట్టనడుమ నింతేసి మెరసీ

చ. 1: పుట్టినప్పుడే దేహి బుద్ధులేమీ నెఱఁగఁడు
యిట్టె లోకులఁ జూచి యింత నేరిచె
ముట్టుకొన్న యింద్రియాల ముదిసి ముదిసి రాఁగా
తట్టువడి తనమేను తానే మరచె

చ. 2: మనుజుఁడైనప్పుడే తా మాటలేమి నెరఁగఁడు
జనులాడుకొనఁగానె సంగడి నేర్చె
దినదినభోగాల దృష్టాంతములెల్ల
అనుభవనై(???) తన కడియాలమాయ

చ. 3: తచ్చి తాఁ గలప్పుడే దైవము నెఱఁగఁడు
నిచ్చ నాచార్యునివల్ల నేఁ డెఱిఁగె
అచ్చపు శ్రీవేంకటేశుఁ డంతర్యామై యుండి
యిచ్చఁ గరుణించఁగాను యెక్కుడాయఁ దాను

రేకు: 0177-01 గుజ్జరి సం: 02-381 భగవద్గీత కీర్తనలు

పల్లవి: జగమంతా నీమయము సర్వం విష్ణుమయంబు గాన ॥ పల్లవి॥
యెనయుచు నేఁగర్మమార్గముల నితరదేవతల భజియించెదను
అని యపరాధం బెంచకుమీ అన్యము నీకంటె మరి లేదు
పనివడి "మత్తఃపరతరం" బని పలికితి విన్నియు నీ యాజ్ఞలు

చ. 1: దేవ నావుదరపోషణకు తివిరి హింస చేసెదను
నీ విది నావల నెంచకుమీ నీవే అఖండ చేతన్యుఁడవు
దేవ మిము "నై తేన వినా తృణాగ్రమపి" యని శ్రుతి వొగడెడిని

చ. 2: భువిలో నాకట పూర్వకర్మమట పొఁగదునే నీసరణి నీయడను
అవి నా కేమియుఁ బనిలేవు అంతరియామివి నీవు
అవలను "త్వమేవ శరణం గతి" యనుటది నమ్మితి శ్రీవేంకటనిలయా

రేకు: 0177-01 గుజ్జరి సం: 02-382 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఆర్తుఁడ నేను నీకడ్డ మెందును లేదు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే

చ. 1: సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుఁడవు
సర్వసర్వంసహాచక్రవర్తి
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే

చ. 2: పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవు
పరమ పరానంద పరమపురుషా
కరిరాజవరదా కారుణ్యనిలయా
శరణాగతుఁడ నన్ను సరిఁగావవే

చ. 3: అణువులోపలి నీవు ఆదిమహత్తును నీవు
ప్రణుత శ్రీవేంకటప్రచురనిలయా
అణిమాదివిభవా ఆద్యంతరహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు

రేకు: 0177-02 లలిత సం: 02-383 భగవద్గీత కీర్తనలు

పల్లవి: విజాతులన్నియు వృథా వృథా
అజామిళాదుల కది యేజాతి

చ. 1: జాతిభేదములు శరీరగుణములు
జాతి శరీరము సరిఁ దోడనె చెడు
ఆతుమ పరిశుద్ధంబెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపు దాస్యంబిది యొక్కటెపో సుజాతి

చ. 2: హరి యిందరిలో నంతరాత్ముఁడిదె
ధరణి జాతిభేదము లెంచిన
పరమయోగులీ భావ మష్టమదము భవవికారమని మానిరి
ధరణిలోనఁ బరతత్త్వజ్ఞానము ధర్మమూలమే సుజాతి

చ. 3: లౌకిక వైదిక లంపటులకు నివి
కైకొను నవశ్యకర్తవ్యంబులు
శ్రీకాంతుండు శ్రీవేంకటపతి సేసిన సంపాదమిందరికి
మేకొని యిన్నియు మీరినవారికి మీనామమే సుజాతి

రేకు: 0177-03 గుజ్జరి సం: 02-384 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఉపకారి దేవుఁడు అపకారి గాఁడు

చ. 1: దేహం బొసఁగెను దేవుఁడు తనుఁ దెలియఁగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముఁడు మరి దేహచైతన్యుఁడా దాను
దేహి యేలోకంబున కేఁగిన దేవుఁడు దా వెంటనే యేఁగును
దేహి కోరినట్టే కమ్మర దేవుఁ డనుమతి ఇచ్చీఁ గాన

చ. 2: చేయుటకును చేయకమానుటకును జీవుఁడు స్వతంత్రుఁడా యంటేను
కాయపుసుఖములు గోరఁగ గర్తట కడగనుటకుఁ గర్త గాఁడా
యీయెడ నాయెడ నంతర్యామే యిన్నిటికినిఁ బ్రేరకుఁడింతే
దాయక పాయక తనతలఁపుకొలఁది దైవమే సృజియించీఁ గాన

చ. 3: ఇవి యెరిఁగి చిత్తమా నీ వితనందే అభిరతి సేయుము
సదయుఁడు మనశ్రీవేంకటగిరి సర్వేశ్వరుఁడు సత్యుఁడు
మొదలనే యీయర్థము కిరీటితో మొగి నానతి ఇచ్చినాఁడు
అదే "నమోఽ హం సర్వభూతేషు" అని గీతలలో నున్నది గాన

రేకు: 0177-04 బౌళి సం: 02-385 భగవద్గీత కీర్తనలు

పల్లవి: తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన

చ. 1: బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటె పర
పరబ్రహ్మమొకటే పరబ్రహ్మమొక్కటే
కందువగు హీనాధికములిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ

చ. 2: నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
ఛండాలుడుండేటి సరిభూమి యొకటే

చ. 3: అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే
ఘనకీటపశువులకు కామసుఖ మొకటే
దిన మహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుఁబేదకును వొక్కటే అవియు

చ. 4: కొరలి శిష్టాన్నములు గొను నాఁకలొకటే
తిరుగు దుష్టాన్నములు దిను నాఁకలొకటే
పరగ దుర్గంధములపై వయువు నొకటే
వరుసఁ బరిమళముపై వాయువు నొకటే

చ. 5: కడగి యేనుఁగుమీఁదఁ గాయు యెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయు నెండొకతే
కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే

రేకు: 0178-01 బౌళి సం: 02-386 అధ్యాత్మ

పల్లవి: మచ్చికఁ బ్రపంచపుమరుపే బ్రహ్మానంద-
మిచ్చల తానే గురి ఇన్నిటికి నాత్మ

చ. 1: లోచూపే వెలిఁబడి లోకమయి తోఁచీని
ఆచూపే మరలితే నది మోక్షము
యేచి రెంటికి నెడమధ్య మీమేను
తాచి వొకఁడే గురి తానాయ నాత్మ

చ. 2: మన సొక్కచోట నుండి మాయలై తోఁచీని
మనసు తనందుంటే మహి యోగ్యము
వెనకమునుపులకు వీడుఁబట్టు జననము
కొనమొదలునుఁ దానే గురియాయ నాత్మ

చ. 3: బయలు దునిసి బహుభానులై తోఁచీని
బయ లొక్కట యఖండపరిపూర్ణము
నయమై శ్రీవేంకటనాథు కరుణచేత
జయమై తానున్నచోనే సతమాయ నాత్మ

రేకు: 0178-02 బౌళి సం: 02-387 కృష్ణ

పల్లవి: నందగోపనందనుడే నాఁటి బాలుడు
ఇందు నేఁడే రేపల్లె నేచి పెరిగేను

చ. 1: పువ్వువంటి మఱ్ఱియాకుపాత్తిఁ బవళించనేర్చె
యెవ్వఁడోకాని తొల్లె యీబాలుఁడు
మువ్వంకవేదములను ముద్దుమాఁట లాడనేర్చె
యెవ్వరూఁ గొంత నేర్పనేఁటికే వీనికి

చ. 2: తప్పుటడుగు లిడఁగనేర్చె ధరణియందు నాకసమున-
నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీఁ జెంద్రునందు పగలు
గొప్పసూర్యునందు నింకఁ గొత్త నేర్పనేఁటికే

చ. 3: మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించనేర్చె-
నంచితముగ శ్రీవేంకటాద్రిమీఁదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కాఁగిలించనేర్చె
దించరాని వురముమీఁద దివ్యకాంతను

రేకు: 0178-03 లలిత సం: 02-388 వైరాగ్య చింత

పల్లవి: అంతరాత్మ హరి గలఁడంతే చాలు
యెంతకెంత చింతించనేలా వెరవ

చ. 1: వెనక జన్మపు గతి వివరించి నే నెరగ
అనుగు మీఁదటి జన్మమది యెఱఁగ
ననిచి యీ జన్మము నానాఁట దెలిసేము
యెనసి యీ భవములకేలా వెఱవ

చ. 2: నిన్నటి దినము కత నిమిషమై తోఁచీని
కన్నుల రేపటి చేఁత కానఁగరాదు
పన్ని నేఁటి దినము మున్ను నోఁచినట్లే
యెన్నఁగ నెందుకునైనానేలావెఱవ

చ. 3: పరము నిహము నేఁ బైకొన నా యిచ్చగాదు
హరి శ్రీవేంకటపతి యఖిలకర్త
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది
యిరవైతి నింకా నాకేలా వెఱవ

రేకు: 0178-04 గుండక్రియ సం: 02-389 వైరాగ్య చింత

పల్లవి: అదియేల తా మాను మాయందు నిష్ఠూరమే కాక
చెదరి విత్తొకటియుఁ జెట్టొకటి యౌనా

చ. 1: కడుఁ బుణ్యపాపాలు గలిగిన జన్మము
చెడుఁ బుణ్యపాపాలు సేయకుండీనా
పుడమిలో ముష్టిమానఁ బొడమిన శాఖలు
బడి ముష్టిపండ్లై పండకుండీనా

చ. 2: పంచేంద్రియాలఁ బుట్టి పరగిన యీమేను
పంచేంద్రియాలమీఁది భ్రమ మానీనా
పొంచి హేయములోనఁ బుట్టిన కీటములెల్ల
కొంచి హేయమే చవిగొనకుండీనా

చ. 3: శ్రీవేంకటేశ నీవుచేసిన యీమాయలు
నీవల్ల మానుఁ గాక నేఁ గర్తనా
దైవమవై నాలోనఁ దగిలి నాదుర్గుణాలు
వేవేగ మానుపఁగ వెతదీరెఁ గాక

రేకు: 0178-05 శ్రీరాగం సం: 02-390 శరణాగతి

పల్లవి: అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు
పోల్ప నెంతపనికిఁ బూనితినయ్యా

చ. 1: నీపదధ్యానములోనే నిండెను నామనసెల్ల
యేపున నీసాకార మేమిట భావింతునయ్య
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ నిదె
ఆపి నే నీయంగకాంతు ల వేమిట జూతునయ్య

చ. 2: నాలుక నీకడలేని నామములే నుడిగివి
మేలిమి నీగుణము లేమిటఁ బొగడుదునయ్య
గాలివంటివీనులు నీకథలఁ దనిసెనయ్య
యీలీల నీయనంతమహిమ యెందు విందునయ్య

చ. 3: నీకు శరణని యిట్టె నే ధన్యుఁడనైతి
యీకడ నీసేవ సేసి యేమి గట్టుకొందునయ్య
శ్రీకాంతుఁడవైన శ్రీవేంకటేశ నీకు
పూఁకొన నాజన్మఫల మొకమొక్కు చాలునయ్య

రేకు: 0178-06 బౌళి సం: 02-391 నామ సంకీర్తన

పల్లవి: గరుడగమన గరుడధ్వజ
నరహరి నమో నమో నమో

చ. 1: కమలాపతి కమలనాభా
కమలజ జన్మకారణిక
కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో

చ. 2: జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య జంతుకల
జలధిజామాత జలధిగంభీర
హలధర నమో హరి నమో

చ. 3: ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనాఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాధిప తేహం
అనుపమ నమో హరి నమో

రేకు: 0179-01 సాళంగనాట సం: 02-392 అంత్యప్రాస

పల్లవి: జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువుఁడీతఁడు
భావములోపలి పెరరేపకుఁడై భక్తి చేకొనును యీతఁడు

చ. 1: పరమున నిహమున వెంటవెంటనే పాయని బంధువుఁడీతఁడు
ధరఁ దనుఁదలచిన మారుకు మారై తా రక్షించును యీతఁడు
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
వురుగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు

చ. 2: వడిఁ గలకాలము యిరువదియొక్కటవావుల బంధువుఁడీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యిన్నిటఁ బనులకు నొదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తుఁడీతఁడు
పొడలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతడు

చ. 3: ఘననిధినిక్షేపములిచ్చేటి వుపకారపుబంధువుఁ డీతఁడు
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతఁడు
ననిచిన శ్రీవేంకటేశ్వరుఁడై యిటు నాపాలఁగలుగు నీతఁడు
పనివడి అరులను సూడువట్టి కడుఁ బగసాధించును యీతఁడు

రేకు: 0179-02 బౌళి సం: 02-393 వేంకటగానం

పల్లవి: ఎంత మాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరములెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు

చ. 1: కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులును శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు

చ. 2: సరి నెన్నుదురు(???) శాక్తేయులు శక్తి రూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలఁపుల కొలఁదుల భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచినవారికి నల్పంబవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు

చ. 3: నీవలనఁ గొరతే లేదు మరి నీరుకొలఁది తామెరవు
ఆవల భాగీరథి దరిబావుల ఆజలమే వూరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మముఁ జేకొనివున్న దైవమని
యీవల నే నీ శరణనియెదను యిదియే పరతత్త్వము నాకు

రేకు: 0179-03 సాళంగం సం: 02-394 అధ్యాత్మ

పల్లవి: నీవే మూలమువో నేరిచిన పెద్దలకు
దేవుఁడు నీయందులోనే తిరమాయ నిదివో

చ. 1: బాపురే వో దేహమా బాపురే వో నీవు
వోపి నేఁ బెట్టినకొద్ది నుందువుగా
రూపు నీవు గలిగితే రుచులెల్లఁ గానఁ గద్దు
చాపలాన ధర్మములు సాధింపఁగలదు

చ. 2: మెచ్చితి నోమనసా మెచ్చితివో నీవూ నా-
యిచ్చకొలది నెందైనా నేఁగుదువు గా
అచ్చపు నీకతమున నవుఁగాము లెంచఁ గద్దు
పచ్చిగా యేమూర్తినైనా భావించఁగలదు

చ. 3: మేలు మేలు నాలికె మేలు మేలు నీవు
వోలి యేమాటకునైనా నొనరుదుగా
చాలి నీవు మెలఁగంగ చదువు చదువఁ గద్దు
పోలించి శ్రీవేంకటేశుఁ బొగడఁగఁగలదు

రేకు: 0179-04 లలిత సం: 02-395 శరణాగతి

పల్లవి: హరి నీవే బుద్ధి చెప్పి యాదరించు నామనసు
హరి నీవే నాయంతర్యామివి గాన

చ. 1: వసముగాని కరివంటిది నామనసు
యెసగి సారెకు మదియించీఁ గాన
పొసఁగఁ బాదరసముఁబోలిన నామనసు
అసము దించక సదా అల్లాడీఁ గాన

చ. 2: వడి నడవుల చింకవంటిది నామనసు
బడిబడిఁ బట్టబట్ట బారీఁ గాన
కడఁగి విసరు పెనుగాలివంటిది మనసు
విడువక కన్నచోట విహరించీఁ గాన

చ. 3: వరుస నిండుజలధివంటిది నామనసు
వొరసి సర్వము లోనై వుండీఁ గాన
గరిమ శ్రీవేంకటేశ కావవే నామనసు
సరి నీయానతి నీకే శరణనీఁ గాక

రేకు: 0179-05 బౌళి సం: 02-396 శరణాగతి

పల్లవి: జలజనాభ హరి జయ జయ
యిల మానేరము లెంచకువయ్యా

చ. 1: బహుముఖముల నీప్రపంచము
సహజగుణంబుల చంచలము
మహిమల నీ విది మరి దిగవిడువవు
విహరణ జీవులు విడువఁగఁగలరా

చ. 2: పలునటనల యీప్రకృతి యిది
తెలియఁగఁ గడునింద్రియవశము
కలిసి నీ వందే కాఁపురము
మలినపు జీవులు మానఁగఁగలరా

చ. 3: యిరవుగ శ్రీవేంకటేశుఁడ నీమాయ
మరలుచ నీవే సమర్థుఁడవు
శరణనుటకే నే శక్తుఁడను
పరు లెవ్వరైనాఁ బాపఁగఁగలరా

రేకు: 0180-01 సామంతం సం: 02-397 అంత్యప్రాస

పల్లవి: ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు
పొందుల శ్రీహరితోడిపొత్తుల మాబదుకు

చ. 1: బడబాగ్ని ఆఁకటిబారిఁబడ్డ బ్రదుకు
పడఁతులకూటములఁ బడ్డ బదుకు
వొడలి తోలినెమ్ముల వొడగట్టే బదుకు
బడిఁ బుణ్యపాపాలపై తరవు బదుకు

చ. 2: నాలుక గడచితేను నరకపు బదుకు
మూలమలమూత్రాల మూటగట్టే బదుకు
కాలము నడిసి పూర్పుగాలిఁబుచ్చే బదుకు
పాలుమాలే యింద్రియాల పంగెమాయె బదుకు

చ. 3: ఇంపు సుఖదుఃఖాల యెండనీడ బదుకు
మంపుఁ గామక్రోధాలమాటు బదుకు
జంపుల శ్రీవేంకటేశుశరణు చొరఁగ నేఁడు
సొంపు లిన్నిటా నాకు సుఖమాయ బదుకు

రేకు: 0180-02 రేవగుప్తి సం: 02-398 అంత్యప్రాస

పల్లవి: నీ వెరఁగనిది లేదు నీయాజ్ఞ మోచితి నింతే
నీవాఁడ నింతె హరి నే ననఁ జోటేది

చ. 1: కన్నుల కెంధైనఁ జూపుకలది భావము
యెన్నఁగ నాయందుఁ బాప మెంచఁ జోటేది
విన్ననై చెవుల కింపు వినుట స్వభావము
పన్నిన కర్మాలు నన్నుఁ బైకొనఁ జోటేది

చ. 2: నాలికకుఁ జవియైతే నమలుటే సహజము
నాలి అభోజ్యపునింద నాకుఁ బనేమి
మూల వాసనగొనేది ముక్కుకు సహజము
జోలిబంధములు నన్నుఁ జుట్టఁగఁ జోటేది

చ. 3: కాయము కాయముపొంతఁ గరఁగుటే ఆగుణము
సేయని చేఁతలు నాపైఁ జెప్పఁ జోటేది
యీయెడ శ్రీవేంకటేశ యిన్నిటిలో నన్నుఁ బెట్టి
పాయక నాలో నుందువు పట్టఁగఁ జోటేది

రేకు: 0180-03 లలిత సం: 02-399 వైష్ణవ భక్తి

పల్లవి: ఇదివో వున్నార మింతట నంతట
వెదకి కదియకుమీ విష్ణుని మాయ

చ. 1: హరిదాసులము హరికింకరులము
కరివరదుని డింగరులము
యిరవెఱిఁగితినినక యెఁఱుగననక
సరి మాగురుతిది సర్వేశు మాయ

చ. 2: హితులము శరణాగతులము కేశవ-
వ్రతులము వైష్ణవమతులము
గతి నినుఁ బాసితి కడు నీఁక మామీఁద
తతి దయమరవకు దైవము మాయ

చ. 3: శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి
భావింప నితని పరికరము
యీవలనావల నిహపరములకును
తోవ దొలఁగుమీ తొలిఁదొలి మాయ

రేకు: 0180-04 రామక్రియ సం: 02-400 శరణాగతి

పల్లవి: ఇంతకంటేఁ దగుబంధు లింక నున్నారా
యెంత సేసినా నీకు నెదురాడేనా

చ. 1: కోపగించి చంకబిడ్డఁ గోరీ తల్లి డించితేను
పైపైనే పడుఁగాక పాసిపొయ్యీనా
వోపక నానేరముల కొగి నీవు వేసరితే
నీపాదాలే గతిగాక నే మానేనా

చ. 2: చదివించే అయ్యఁగారు జంకించి చూచితేను
వొదిగి చదువుఁగాక వోపననీనా
యెదుటి గుణములకు నెంత నీవు దొబ్బినాను
యిదె నీకే మొక్కుదుఁగా కింక మానేనా

చ. 3: చెక్కు మీటి పాలు పెంచినదాది వోయఁగాను
గక్కన మింగుటగాక కాదనీనా
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించఁగ
నిక్కి నే మెరతుఁగాక నే మానేనా

రేకు: 0180-05 మంగళకౌశిక సం: 02-401 సంస్కృత కీర్తనలు

పల్లవి: తే శరణ మహం తే శరణ మహం
శైశవకృష్ణ తే శరణం గతోఽ స్మి

చ. 1: దశవిధావతార ధర్మరక్షకమూర్తి
దశమస్తకాసురదశన
దశదిశాపరిపూర్ణ తపనీయస్వరూప
దశావరణ లోకతత్వాతీత

చ. 2: సహస్రలోచన సంతతవినుత
సహస్రముఖశేషశయనా
సహస్రకరకోటిసంపూర్ణతేజా
సహస్రారదివ్యచక్రాయుధా

చ. 3: అనంతచరణ సర్వాధారాధేయ
అనంతకరదివ్యాయుధా
అనంతనిజకల్యాణగుణార్ణవ
అనంత శ్రీవేంకటాద్రినివాసా

రేకు: 0180-06 శంకరాభరణం సం: 02-402 అధ్యాత్మ

పల్లవి: అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు
అదే జననకారణ మాకాశపదము

చ. 1: మంచిమాఁటలైనాఁ గానిమాటలైన నొకచోట
ముంచిముంచి యాకాశముననే యణఁగును
యెంచరాని నిట్టూర్పు లెన్ని వొడమినాను
అంచల నణఁగిపోవు నాకాశమును

చ. 2: చూపులెంత దవ్వైనా సూర్యచంద్రులఁ దాఁకి
ఆపొంతనే యణఁగు నాకాశమునను
రూపుల మైనీడలును రుచులఁ గాలత్రయము
పైపైనే యణఁగును బహిరాకాశమున

చ. 3: యిలఁ జీఁకటి వెలుఁగు యెండ నహోరాత్రాలఁ
గలసి మెలఁగు నాకాశతత్త్వమున
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా-
లలరి వెలుఁగుచుండు నంతరాకాశమున

రేకు: 0181-01 తెలుగు కాంబోది సం: 02-403 భగవద్గీత కీర్తనలు

పల్లవి: చూచి మోహించకుందురా సురలైన నరులైన
తాచి నీవు ముందరఁ బ్రత్యక్షమైనను

చ. 1: భాగీరథి పుట్టిన పాదపద్మములు
భోగపు మరుని జన్మభూమి నీ తొడలు
యోగపు నవబ్రహ్మలుండిన నీ నాభి
సాగరకన్యక లక్ష్మి సతమైన పురము

చ. 2: అందరి రక్షించేటి అభయహస్తము
కంద నసురులఁ జంపే గదాహస్తము
సందడి లోకముల యాజ్ఞాచక్రహస్తము
చెంది ధ్రువు నుతియించఁ జేయు శంఖహస్తము

చ. 3: సకల వేదములుండే చక్కని నీ మోము
వొకటై తులసిదేవి వుండేటి శిరసు
ప్రకటపు మహిమలఁ బాయని నీ రూపము
వెకలి శ్రీవేంకటాద్రి విభుఁడ నీ భావము

రేకు: 0181-02 లలిత సం: 02-404 భగవద్గీత కీర్తనలు

పల్లవి: వాదులేల చదువులు వారు చెప్పినవే కావా
వాదులేల మీమాట వారికంటే నెక్కుడా

చ. 1: నాలుగువేదాల బ్రహ్మ నలి నెవ్వనిసుతుఁడు
వాలిన పురాణాలవ్యాసుఁ డెవ్వనిదాఁసుడు
లీల రామాయణపు వాల్మీకివసిష్ఠులు
ఆలకిం చెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుఁడు

చ. 2: భారత మెవ్వనికథ భాగవతము చెప్పిన-
ధీరుఁడైన శుకుఁడు యేదేవుని కింకరుఁడు
సారపుశాస్త్రాలు చూచి సన్యసించి నుడిగేటి-
నారాయణనామపు నాథుఁడే పో దేవుఁ డు

చ. 3: విష్ణునాజ్ఞయని చెప్పే విధిసంకల్ప మేడది
విష్ణుమాయయని చెప్పే విశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ " మనే వేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రివిభుఁడే ఆదేవుఁడు

రేకు: 0181-03 నాట సం: 02-405 వేంకటగానం

పల్లవి: ఇతని కితఁడేకాక యితరులు సరియా
మితి లోకా లితని మేనిలోనే కావా

చ. 1: కమలనాభుని భయంకరకోపముతోడ
రమణ వేరొకరివరంబులు సరియా
తమితోడఁ దల దుంచి తగినవరము లిచ్చె
అమరఁగ నరకాసురాదులకు నితఁడు

చ. 2: కరివరదుని పేరుగలసిన తిట్లతో
పరదేవతల మంత్రపఠనలు సరియా
నిరతి శిశుపాలుని నిందకు శిక్షించి
పరలోక మిచ్చినట్టి భావము వినరా

చ. 3: చలిమి శ్రీవేంకటేశు శరణాగతితోడ
బలిమి మించిన బ్రహ్మపట్టము సరియా
వొలిసిన ధ్రువునకు వున్నతలోక మిచ్చె
అల బ్రహ్మలోకమున కదె మీఁ దెఱఁగరా

రేకు: 0181-04 పాడి సం: 02-406 భగవద్గీత కీర్తనలు

పల్లవి: గొరబై మొద లుండఁగఁ గొనలకు నీరేల
దొరదైవ మితఁడే తుదఁగల ఫలము

చ. 1: క్రతువులు హరియే కర్మము హరియే
పితరులకు హరియే పెనుఁదృప్తి
సతతమంత్రముల సారము హరియే
యితనిసేవే పో యిన్నిటి ఫలము

చ. 2: అనలము హరియే ఆహుతి హరియే
జననీజనకుల సరవి హరే
పనివడి వేదముఁ బ్రణవము హరియే
యెనసితని పూజ యిన్నిట ఫలము

చ. 3: యేలికె హరియే యిరవును హరియే
వాలాయము సర్వము హరియే
కాలము శ్రీవేంకటగిరి హరియే
నేల నీతని శరణే సఫలంబు

రేకు: 0181-05 లలిత సం: 02-407 అధ్యాత్మ

పల్లవి: దొంతివిషయములాల దొరలాల
చెంత మీఁదటి బుద్ధి చెప్పరో మాకు

చ. 1: దురితంబు లొకకొన్ని దుర్గుణము లొకకొన్ని
మరుగుటలు గొన్ని మర్మములు గొన్ని
ధర నెరుక లొకకొన్ని తగ నెరఁగములు గొన్ని
యిరవు మనపంట లివి యెందు వోయుదమో

చ. 2: ఆస లొకకొన్ని మిథ్యాచారములు గొన్ని
వాసు లొకకొన్ని గర్వములు గొన్ని
రేసు లొకకొన్ని మీరినరుచులు నొకకొన్ని
యీసునఁ గడించితిమి యిముడఁ జోటేదో

చ. 3: వైరాగ్యములు గొన్ని వరభక్తు లొకకొన్ని
నేరుపులు గొన్ని యిన్నియునుఁ గలిగి
యీరీతి శ్రీవేంకటేశుగతి చేరితిమి
మేర మిము మీరితిమి మీకు గతి యేదో

రేకు: 0181-06 శుద్ధవసంతం సం: 02-408 శరణాగతి

పల్లవి: ఏవుపాయములు మాకిఁకఁ బనికిరావు
నీవే హరి కావవే నిరుహేతుకమున

చ. 1: యివల నింద్రియజయం బేడ నే నేడ
భువి నింద్రియములతోఁ బుట్టే నీతనువు
అవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెమే యెపుడు

చ. 2: యెలమిఁ గర్మవిముక్తి యేడ నే నేడ
తెలియంగఁ గర్మాధీన మీబ్రదుకు
కుళకమగు సాత్త్వికపుగుణ మేడ నే నేడ
కలియుగం బిది యిందుఁ గలవాఁడ నేను

చ. 3: తనివోని ఘోరతప మేడ నే నేడ
అనిశంబు నీకు శరణాగతుఁడను
యెనలేని శ్రీవేంకటేశ్వరుఁడ నీబిరుదు
కనుఁగొనఁగ శరణాగతపారిజాతం

రేకు: 0182-01 సామంతం సం: 02-409 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సమబుద్ధే యిందరికి సర్వవేదసారము
సముఁడిందరికి హరి సాధన మోయయ్యా

చ. 1: చీమకుఁ దనజన్మము చేరి సుఖమై తోఁచు
దోమకుఁ దనజన్మము దొడ్డసుఖము
ఆమనియోఁగకు సుఖ మాజన్మమై తోఁచు
యేమిటా నెక్కువసుఖ మెవ్వరి కేదయ్యా

చ. 2: జంతురాసులకు నెల్లా జననము లొక్కటే
అంతటాను మరణము లవియొక్కటే
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే
ఇంతటా నిందుకంటే నెవ్వ రేమి గట్టిరయ్యా

చ. 3: ఇందులోన నెవ్వరైనానేమి శ్రీవేంకటపతి-
నందముగాఁ దలఁచిన దది సుఖము
యెందుఁ జూచిన నీతఁ డిందరిలో నంతరాత్మ
చందముగా నెవ్వరికి స్వతంత్ర మేదయ్యా

రేకు: 0182-02 బౌళి సం: 02-410 అధ్యాత్మ

పల్లవి: కరుణానిధివి గాన కాచితేనేమో కాని
సరికి బేసికి నిన్ను జరయఁ జోటున్నదా

చ. 1: కాయములోపలి నిన్నుఁ గని మని కొలువక
ఆయపుఁగర్మమె బ్రహ్మ మని వుంటిని
చీయని నాచేఁతకు నే సిగ్గువడుండుట గాక
ఆయమేమైనా నిన్ను నడుగఁ జోటున్నదా

చ. 2: సకలచైతన్యుఁడవై సరి నాలో నుండఁగాను
వికటపు విషయాలవెంటఁ బారితి
వొకరు రక్షించఁగా వేరొకరిపాలైన నాకు
తుకతుకలేకాక దూరఁగఁ జోటున్నదా

చ. 3: పట్టి శ్రీవేంకటగిరిఁ బ్రత్యక్షమై యుండఁగాను
ఇటు నటుపై వైకుంఠ మేల కోరేను
దిట్టనై నానేరమి నే తెలిసి నవ్వుట యింతే
ఇట్టె నీచిత్తము గాక యెంచఁగఁ జోటున్నదా

రేకు: 0182-03 శంకరాభరణం సం: 02-411 అధ్యాత్మ

పల్లవి: ఇన్నిటా నొరయక యెఱు కేది
వెన్నుని కృపఁగా వెలసేది

చ. 1: కోపము మతిలోఁ గుందినపుడువో
పాపము లన్నియుఁ బాసేది
తీపుల యాసలు దీరినపుడువో
తాపత్రయములు దలఁగేది

చ. 2: ఘనకర్మంబులు గడచినపుడువో
వెనుకొను భవములు విడిచేది
మునుకొని యింద్రియములు వీడినఁబో
పనివడి విరక్తి బలిసేది

చ. 3: ఆఁకటిరుచు లివి యణఁగినపుడువో
చేకొని సుఖమునుఁ జెందేది
యీకడ శ్రీవేంకటేశ్వరు శరణము
పైకొనిననుఁబో బదికేది

రేకు: 0182-03 సాళంగనాట సం: 02-412 శరణాగతి

పల్లవి: సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రులు పూజించే యీసాకారమె ప్రమాణము

చ. 1: సగుణంబని నినుఁ గొందరు సరి నిర్గుణమని కొందరు
వగలఁ బెక్కుగతిఁ జదివిన కొలఁదుల వారికి వారే వాదింతురు
అగణితస్వతంత్రుఁడవు గాన అల వాల్మీకి ఇట్టిట్టనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి ఇచ్చుటే ప్రమాణము

చ. 2: సోహం బని కొందరు "దాసోహం" బని కొందరు
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు
దేహధారియై "దాసోహం" బని తేరి శుకుఁడు మీలోఁ గలసె
సోహపుభావన సర్వజగత్తులఁ జూపినదే ప్రమాణము

చ. 3: ఆరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మములనైనాను
యీరీతుల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగు భక్తు లిందరును నానాగతు లరసి చూచి
సారపు శ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము

రేకు: 0182-04 లలిత సం: 02-413 వైరాగ్య చింత

పల్లవి: ఇల జాణతనము లిన్నిటికిఁ గలదు
తలఁపే కుఱ్ఱై తగిలీఁ గాని

చ. 1: మఱవదు దేహము మహిఁ దన గుణములు
గుఱి నాహారము గొనునెపుడు
మఱవ నింద్రియములు మర్మస్థలములు
మఱచితి నిను నేమరులో కాని

చ. 2: చెదరదు కర్మము సేసినంతయును
పొదిగి జీవమును భోగించును
చెదరదు సంసారశీతలబంధము
మదిఁ జెదరెడి నామరులేకాని

చ. 3: తొలఁగవు మాయలు తొడరి ప్రపంచము
కలవలెఁ బెనగొని కదిసీని
బలు శ్రీవేంకటపతికృపచే నాకు
తొలఁగె భవము లెటు దూరీనో మరులు

రేకు: 0182-05 మాళవి సం: 02-414 శరణాగతి

పల్లవి: హరి నెఱఁగని జన్మ మది యేలా ఆ-
సరుస నాతఁడులేని చదువేలా

చ. 1: దయదొలఁగినయట్టి తపమేలా
భయములేనియట్టి భక్తేలా
ప్రియముమానినయట్టి పెనఁగేలా మంచి-
క్రియావిరుద్ధపు కీర్తనలేలా

చ. 2: ఫలములేనియట్టి పనులేలా కడుఁ
గలిమిలేనియట్టి గర్వమేలా
బలిమిలేనియట్టిపంతామేలా శౌరి-
దలఁచలేని యట్టితనువది యేలా

చ. 3: తన కమరని దొరతనమేలా
చనవులేనియట్టి సలిగె యేలా
యెనలేని శ్రీవేంకటేశ్వరుని శరణని
మనఁగలిగినమీఁద మరి చింతలేలా

రేకు: 0183-01 లలిత సం: 02-415 అద్వైతము

పల్లవి: దోమటి నింతెరఁగరా తొల్లిటివారు
వామదేవవసిష్ఠవ్యాసాదులు

చ. 1: తానే దైవమైతే తపమేల జపమేల
పూని సారెఁ బూజించే పూజలేల
కూను వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను

చ. 2: తగఁ దా స్వతంత్రుఁడై తే దరిద్రదుఃఖములేల
నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
నగుఁబాటులైన జననమరణములేల
ముగురువేల్పులదండ మొనచూపరాదా

చ. 3: శ్రీవేంకటేశుఁడే శేఖరపు దైవమని
సావధానుఁ డితనికి శరణుచొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాసి
తావుల నాతనికృప దండ చేరరాదా

రేకు: 0183-02 గుండక్రియ సం: 02-416 శరణాగతి

పల్లవి: అవియు నాకుఁ బ్రథమాచార్యులు
తవిలి యీనెపము మిముఁ దలఁపించుఁగాన

చ. 1: ధనవాంఛ మతిలోనఁ దగిలినప్పటివేళ
దనుజారి మీమీఁద దలఁపు గలుగు
పొనిగి భయదుఃఖములఁ బొరలినప్పటివేళ
పనివూని మీమీఁది భక్తి గలుగు

చ. 2: చెలఁగి పాపములు మించినవేళ హరి మీ-
నలువు నామోచ్చారణంబు గలుగు
బలిమి భవరోగముల బడలినప్పటివేళ
వలుమారు మీసంప్రార్థనలు గలుగు

చ. 3: ఇన్నిటాఁ దొలఁగి మిము నెరిఁగి కొలిచినవేళ
మన్ననల పరిణామంబు గలుగు
వున్నతపు శ్రీవేంకటోత్తముఁడ మిము నెదుటఁ
గన్న యీవేళ సౌఖ్యంబులే కలుగు

రేకు: 0183-03 లలిత సం: 02-417 వైష్ణవ భక్తి

పల్లవి: ఈతని మరచివుంటి మిన్నాళ్లును
యీతల నేఁడెచ్చరించె నీతఁడే పో విష్ణుఁడు

చ. 1: తల్లియై పోషించు తండ్రియై రక్షించు
పుల్లపు బంధువుఁడై వొడ లరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్లవిధబంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు

చ. 2: యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధి చెప్పు
చాలుమానిసియై యంచలఁ దిరుగు
బాలుఁడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు
యీలాగుల బంధుఁ డీతఁడే పో విష్ణుఁడు

చ. 3: దేవుఁడై పూజగొను ద్రిష్టిగోచరమై
శ్రీవేంకటాద్రిమీఁద సిరు లొసగు
తావై యెడమిచ్చు తలఁపై ఫలమిచ్చు
యీవల నావల బంధుఁడీతఁడేపో విష్ణుఁడు

రేకు: 0183-04 లలిత సం: 02-418 అధ్యాత్మ

పల్లవి: వీదిలోన నదేకదే విష్ణుపదము
ఆదెసనే పాయకుండు నాధిమూలము

చ. 1: చూచేటి చూపులకును సూటియైన మొదలేదో
యేచి వినుకలిమర్మ మెందు దాఁకీనో
వాచవిచవులు చూచే వంటశాల చోటేదో
ఆచాయనే వుండు నాదిమూలము

చ. 2: పూఁప తలపోఁతలకు పుట్టినయి ల్లది యేదో
పైపై నూర్పులు నిలువఁగఁ జోటేదో
మాపులు నిద్రించువేళ మరచేటి చోటేదో
ఆపొరుగుననే వుండు నాదిమూలము

చ. 3: నేరిచిన విద్యలెల్లా నించి దాఁచేచోటేదో
కోరని యానందముకొన యేదో
ఆరయ శ్రీవేంకటేశుఁ డాడనే పాయక వుండు
ఆరితేరి నాతఁడీతఁ డాదిమూలము

రేకు: 0183-05 బౌళి సం: 02-419 భగవద్గీత కీర్తనలు

పల్లవి: దేహి నిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నా మనసా యిది మరవకుమీ

చ. 1: గుదిఁ బాతచీర మాని కొత్తచీర గట్టినట్టు
ముదిమేను మాని దేహి మొగిఁ గొత్తమేను మోచు
అదనఁ జంపఁగ లేవు ఆయుధము లీతనిఁ
గదిసి యగ్నియు నీరు గాలియుఁ జంపఁగలేవు

చ. 2: యీతఁడు నరకువడఁ డీతఁ డగ్నిఁ గాలఁడు
యీతఁడు నీట మునుఁగఁ డీతఁడు గాలిఁబోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁ డేమిటను
యీతల ననాది యీతఁ డిరవు గదలఁడు

చ. 3: చేరి కానరానివాఁడు చింతించరానివాఁడు
భారపు వికారాలఁ బాసినవాఁడీ యాత్మ
ఆరయ శ్రీవేంకటేశు నాధీన మీతఁడని
సారము దెలియుటే సత్యం జ్ఞానము

రేకు: 0183-06 బౌళి సం: 02-420 గురు వందన, శరణాగతి

పల్లవి: హరి సేవొకటే యనంతము
గురుబోధలకును కొలఁదే లేదు

చ. 1: తలఁచిన కొలఁదే తనలో భావము
నిలిపిన కొలఁదే నేమము
పలికిన కొలఁదే పరమగు సత్యము
యిల నెవ్వరికిని యెక్కుడు లేదు

చ. 2: జరిపిన కొలఁదే సకలాచారము
నెరపిన కొలఁదే నిజకీర్తి
తిరము సేయుకొలఁదే ధర్మంబును
యిరవుగ నందుకు నెక్కుడు లేదు

చ. 3: సేసినకొలఁదే చేకొను కర్మము
రోసిన కొలఁదే రుచివిరతి
ఆసల శ్రీవేంకటాధిపు శరణను
దాసుడే యెక్కుడు తప్పే లేదు

రేకు: 0184-01 లలిత సం: 02-421 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇది యరుదను నొకఁడిది యరుదని చెప్పు
యిది యరుదని విను నెవ్వఁడూ నెఱఁగఁడు

చ. 1: పుట్టినవానికినెల్లా భువి మరణము నిత్య-
మట్టే చచ్చినవారి కవ్వల జననము
పుట్టిననాఁడై తేను పొడగానరాదు మేను
కొట్టఁగొనఁ గానరాదు కొన్నాళ్లే కాని

చ. 2: జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తమధర్మములఁ బాయరాదు
సావధాన మిదియే సంసారయోగము

చ. 3: చి త్తమా నీలోపలను శ్రీవేంకటేశ్వరుఁడు
పొత్తునఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది
ఇత్తలాదైన గుణము యిది మఱవకుమీ

రేకు: 0184-02 ముఖారి సం: 02-422 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నాకు నీవు గలవు హరి నాలోపలనుండి
పైకొని యిన్నియు బదుకనీవయ్యా

చ. 1: పసిగొని రుణానుబంధము కొలఁదే
పసులునుఁ బడతులు బహుసుతులు
వసముగావు తమవంతులు దీరిన
పసగా నవియే బదుకనీవయ్యా

చ. 2: పెనగొని భటులకుఁ బెట్టిన కొలఁదియు
పనులునుఁ గీర్తులు పంతములు
అనువులు దప్పును అవి గడమైతే
పనివడి యివియే బదుకనీవయ్యా

చ. 3: కడుసంపదలును కాలము కొలఁదే
బడిబడిఁ జవులై ఫలియించు
యెడపక శ్రీవేంకటేశుఁ డిచ్చె నివే
పడసితి మివియును బదుకనీవయ్యా

రేకు: 0184-03 సామంతం సం: 02-423 శరణాగతి

పల్లవి: నారాయణాచ్యుతానంత గోవింద హరి
సారముగ నీకు నే శరణంటినే

చ. 1: చలవయును వేఁడియును సటలసంసారంబు
తొలఁకు సుఖ మొకవేళ దుఃఖ మొకవేళ
ఫలము లివె యీరెండుఁ బాపములు పుణ్యములు
పులుసుఁ దీపునుఁ గలపి భుజియించినట్లు

చ. 2: పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు
తగుమేను పొడచూపు తనుఁ దానె తొలఁగు
నగియించు నొకవేళ నలఁగించు నొకవేళ
వొగరుఁ గారపువిడె మబ్బించినట్లు

చ. 3: ఇహముఁ బరమునుపలెనె యెదిటికల్లయు నిజము
విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని
సహజ శ్రీవేంకటేశ్వర నన్నుఁ గరుణించి
బహువిధంబుల నన్నుఁ బాలించవే

రేకు: 0184-04 గుండక్రియ సం: 02-424 వైరాగ్య చింత

పల్లవి: కలుగుట గలిగిననాఁడే నే ఘనపాపములకు దొలంగీనా
యెలమి నే నిపుడే యెరిఁగితిని యిన్నాళ్లీమతిలేదు

చ. 1: జనియించిన నే నిటకమునుపు సకలయోనిగతజన్మములు
కనుఁగొని యవె నే సారెకుఁ బలుమారు ఘనవర్ణాశ్రమధర్మములు
అనుభవించినవే సకలార్థంబులు అయిహికవిషయము లన్నియును
మనసున వాకున శ్రీహరి నొకని నే మఱచియుఁ దలఁచుట లేదు

చ. 2: తిరిగినవే నే నాసలకొరకును దిక్కు లన్నియును నేను
యిరవుగ తొల్లియు నెఱిఁగినవే యీసంసారపుసుఖము లివి
పొరలినవే నేఁ గామినీజనుల పొందుల సుఖముల భోగములు
యెరవులదొకటే శ్రీహరిదాస్యం బిది గతియని యెరుఁగుటలేదు

చ. 3: గడియించినవే నేఁ బూర్వకాలమున ఘనమగు సంపద లిన్నియును
నొడిగినవే నే శబ్దజాలములు నోరఁ గొలఁదు లివి యిన్నియును
తలఁబడి నే నిటు సకలోపాయపు ధర్మము లిన్నియుఁ జూచితివి
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణం బిటువలెఁ జేరుటలేదు

రేకు: 0184-05 లలిత సం: 02-425 శరణాగతి

పల్లవి: నీ వొక్కడవే నాకుఁ జాలు నీరజాక్ష నారాయణ

నీవే నాకు గతియని తెలిసితి నెక్కొని యితరము వృథా వృథా

చ. 1: మీ నామోచ్చారణమే మెరసిన దుఃఖనివారణము

మీ నామోచ్చారణమే మెలఁగు శుభకరము

నానావేదశాస్త్రములు నవపురాణేతిహాసములు

మీ నామములోనే వున్నవి మిగిలిన విన్నియు వృథా వృథా

చ. 2: నీ పాదమూలము నింగియు భువియు రసాతలము

నీ పాదమూలము నిఖిలజీవపరిణామములు

దీపించిన చరాచరంబులు దివ్యులు మునులును సర్వమును

నీ పాదమూలమే మరి నెరి నితరంబులు వృథా వృథా

చ. 3: దేవ మీతిరుమేను దిక్కును బ్రహ్మాండాధారము

దేవ మీతిరుమే నుత్పత్తిస్థితిలయములకును ఆకరము

శ్రీవేంకటపతి నాభావము చిత్తము నీకే సమర్పణ

దేవ మీశరణము చొచ్చితి దిక్కులన్నియును వృథా వృథా

రేకు: 0185-01 గుండక్రియ సం: 02-426 తిరుపతి క్షేత్రం

పల్లవి: దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా

చ. 1: ధర్మార్థకామ మోక్షతతులు నీ సోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదె నీ దరులు
నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా

చ. 2: తగిన గంగాది తీర్థములు నీ కడళ్ళు
జగతి దేవతలు నీ జలజంతులు
గగనపుఁ బుణ్యలోకాలు నీదరి మేడలు
మొగి నీ చుట్టు మాఁకులు మునులోయమ్మా

చ. 3: వైకుంఠనగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ జీవభావము
యేకడను శ్రీవేంకటేశుఁడే నీ వునికి
దీకొని నీ తీర్థమాడితిమి కావవమ్మా

రేకు: 0185-02 కాంబోదిసం: 02-427 అద్వైతము

పల్లవి: నన్నెరఁగలేనయ్యో నాయంతర్యామై
వున్నతపు హరి నాలో నున్నాఁడట

చ. 1: యిల నేడుజానల మేనిందులోనివాఁడ నింతే
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపొయ్యీని
కలువరేకులంతేసి కన్నులవాఁడ వింతే
సొలసి చూపాకాశమే చూరగొనీని

చ. 2: వెడ వెంట్రుక దూరేటి వీనులవాఁడ నింతే
కడలేని శబ్దము లొక్కట వినేను
నడుమ నే నల్లేఁడంత నాలికెవాఁడ నింతె
పుడివోని సుద్దు లెల్లా నుగ్గడించేను

చ. 3: లచ్చనఁ బదారంగుళాల ప్రాణ మింతే
కుచ్చి కాలపుదినాలు గొలచీని
కొచ్చిన శ్రీవేంకటేశు కొలువుదుబంట నింతే
పచ్చి యింద్రియాల కెల్లాఁ బంపు సేసేను

రేకు: 0185-03 సామంతం సం: 02-428 వైరాగ్య చింత

పల్లవి: నిక్కమైన నాలోని నెలవు గానలేను
దిక్కు నీవే హరి నాతెలి వేఁటితెలివి

చ. 1: నీటిలో మునిఁగి వచ్చి నిర్మలుఁడ ననుకొందు
గాఁటమై యావేగి లేచి కానందును
తేటల ఆ దేహమే దిష్టము ఆనేనే
పాటిలేని భావపు నాబదు కేఁటిబదుకు

చ. 2: యెన్న నొక బంటు నేలి యేలికే నే ననుకొందు
పన్ని నే నొకరిఁ గొల్చి బంట నందును
మున్నిటి నామనసె మొదలి నాపుట్టుగే
యిన్ని వికారాల నాయెరు కేఁటియెరుక

చ. 3: కాంచనము చేతనుంటే కలవాఁడ ననుకొందు
పెంచి యొకవేళ నేఁ బేద నందును
కంచుమాయఁ బొరలఁగాఁ గాచితి శ్రీవేంకటేశ
కొంచిన యిన్నాళ్లు నాగుణ మేఁటిగుణము

రేకు: 0185-04 మాళవి సం: 02-429 కృష్ణ

పల్లవి: అరు దరుదు నీమహి మతిమానుషము చూడ
పురుషోత్తమను దివ్యపుర జగన్నాథా

చ. 1: పసులఁ గాచే దేడ బ్రహ్మ నుతియించు టేడ
సిసువౌ టేడ నాలుగుచేత లేడ
కొసరి వేలనే యేడ కొండగొడగెత్తు టేడ
వసమా నిన్నుఁ బొగడ వరజగన్నాథా

చ. 2: జనవేష మేడ పారిజాతము దెచ్చిన దేడ
తనివెన్న ముచ్చి మేడ దైవికమేడ
పని బండిబోయిఁడేడ బాణుని నరకు టేడ
వినఁ గత నీమహిమ విష్ణు జగన్నాథా

చ. 3: కమ్మి రోలఁ గట్టు టేడ గరుడవాహన మేడ
దొమ్మి భద్రసుభద్రుల తోఁబుట్టు వేడ
చిమ్ముల నిలగిరిని (?) శ్రీవేంకటాద్రిమీఁద-
నుమ్మడి నిరవుకొంటివో జగన్నాథా

రేకు: 0185-05 మాళవిగౌళ సం: 02-430 శరణాగతి

పల్లవి: కలియుగ మెటులైనాఁ గలదుగా నీకరుణ
జలజాక్ష హరి హరి సర్వేశ్వరా

చ. 1: పాపమెంత గలిగినఁ బరిహరించేయందుకు
నాపాలఁ గలదుగా నీనామము
కోపమెంత గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు
చేపట్టి కలవుగా నాచిత్తములో నీవు

చ. 2: ధర నింద్రియా లెంత తరముకాడిన నన్ను
సరిఁ గావఁగద్దుగా నీ శరణాగతి
గరిమఁ గర్మబంధాలు గట్టిన తాళ్ళు వూడించ
నిరతిఁ గలదు గా నీ భక్తి నాకు

చ. 3: హితమైన యిహపరా లిష్టమైనవెల్లా నియ్య
సతమై కలదుగా నీసంకీర్తన
తతి శ్రీవేంకటేశ నాతపము ఫలియింపించ
గతి గలదుగా నీకమలాదేవి

రేకు: 0185-06 గుండక్రియ సం: 02-431 నామ సంకీర్తన

పల్లవి: జయమంగళము నీకు సర్వేశ్వరా

జయమంగళము నీకు జలజవాసినికి

చ. 1: శరణాగతపారిజాతమా

పొరి నసురలపాలి భూతమా

అరుదయిన సృష్టికి నాదిమూలమా వో-

హరి నమో పరమపుటాలవాలమా

చ. 2: సకలదేవతాచక్రవర్తి

వెకలివై నిండిన విశ్వమూర్తి

అకలంకమైన దయానిధి

వికచముఖ నమో విధికి విధి

చ. 3: కొలచినవారల కొంగుపైఁడి

ములిగినవారికి మొనవాఁడి

కలిగిన శ్రీవేంకటరాయా

మలసి దాసులమైన మాకు విధేయా

రేకు: 0186-01 దేవగాంధారి సం: 02-432 భగవద్గీత కీర్తనలు

పల్లవి: అణురేణు పరిపూర్ణమైన రూపము
అణిమాది సిరి యంజనాద్రిమీఁది రూపము

చ. 1: వేదాంతవేత్తలెల్లా వెదకేటి రూపము
ఆదినంత్యములేని యారూపము
పాదుగ యోగీంద్రులు భావించు రూపము
యీదెస నిదివో కోనేటిదరి రూపము

చ. 2: పాలజలనిధిలోనఁ బవళించే రూపము
కాలపు సూర్యచంద్రాగ్నిగల రూపము
మేలిమి వైకుంఠాన మెరసిన రూపము
కీలైనదిదే శేషగిరిమీఁది రూపము

చ. 3: ముంచిన బ్రహ్మాదులకు మూలమైన రూపము
కొంచని మఱ్ఱాకుమీఁది కొన రూపము
మంచి పరబ్రహ్మమై మమ్మునేలిన రూపము
యెంచఁగ శ్రీవేంకటాద్రినిదే రూపము

రేకు: 0186-02 గుండక్రియ సం: 02-433 శరణాగతి

పల్లవి: నేనేమిఁ జేయఁగలేను నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నే నధికుఁడ విన్నిటా నీవు

చ. 1: దండము వెట్టుట నాది తప్పు లోఁగొనుట నీది
నిండి నీవెప్పుడు దయానిధివి గాన
అండఁ బేరుకొంట నాది అందుకు నూఁకొంట నీది
దండియైన దేవదేవో త్తముఁడవు గాన

చ. 2: శరణు చొచ్చుట నాది సరుగఁ గాచుట నీది
పరమ పురుష శ్రీపతివి నీవు
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది
పొరి నీవు భక్తసులభుఁడ వటుగాన

చ. 3: దాసుఁడననుట నాది తప్పక యేలుట నీది
ఆసదీర్చే వరదుఁడ వటుగాన
నీసేవ యొక్కటి నాది నిచ్చలుఁ గైకొంట నీది
యీసులేని శ్రీవేంకటేశుఁడవు గాన

రేకు: 0186-03 బౌళి సం: 02-434 శరణాగతి

పల్లవి: ఎట్టైనాఁ గావకపోదు యే నెంత సేసినాను
యిట్టే నీకు శరణంటి నిదియే తెరఁగు

చ. 1: చేకొని నే మొక్కఁగాను చేతులు గోయఁగరాదు
ఆకడఁ దప్పుకుఁ దగినాజ్ఞ మానరాదు
కైకొని యపరాధాలే కావించితి నెన్నైనా
యీాకడ నీశరణంటి నిఁకనో తెరఁగు

చ. 2: చిక్కి దైన్యపడఁగాను చెలఁగి ఖండించరాదు
చక్కఁగా నాద్రోహాలు సైరించరాదు
అక్కడఁ జూచిన శరణాగతబిరుదు నీకు
యిక్కడ నీశరణంటి నిఁకనో తెరఁగు

చ. 3: సేవసేయుచుండఁగాను జీతము మానుపరాదు
యీావిధి నాన దోసితే నిందుకోరాదు
దేవుఁడ నిన్నుఁ గొలిచి తెగి కర్మా లుడిగితి
యీావల శ్రీవేంకటేశ ఇఁకనో తెరఁగు

రేకు: 0186-04 గుండక్రియ సం: 02-435 అధ్యాత్మ

పల్లవి: ధరలో "నెద్భావం తద్భవ"తనెఁ గాన
హరిమయమే జగమంతాను

చ. 1: మహి నెదిటివారందు మలినము దలఁచిన
తహతహ మనసే తా మలినము
వహి నెదిటందు భావనము భావించిన
బహువిధములఁ దానూ భావనమే

చ. 2: యెక్కువ నెదిటిపాపా లెంచి నిందించేటి-
నిక్కపునాలుక తానే నిందితము
వొక్కటై యెదిటిపుణ్యా లుగ్గడించి ఘనమంటే
దక్కిన పుణ్యపు జిహ్వ తానూ ఘనమే

చ. 3: సారె శ్రీవేంకటపతి సగుణము దలఁచిన
సారపు జీవుఁడు దాను సగుణమే
నేరుపుల నాతని నిర్గుణము దలఁచిన
తారతమ్యములులేని తానూ నిర్గుణమే

రేకు: 0186-05 భూపాళం సం: 02-436

పల్లవి: ఎందాఁక నిద్ర నీకిదె తెల్లవారెఁ గదె
యిందిరారమణ నీవిటు మేలుకొనవే

చ. 1: కమలనాభుఁడ నీకు గంగాదినదులెల్ల-
నమర మొకమజ్జనం బాయితము సేసె
తమితోడఁ గనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే

చ. 2: హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతమగు వాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాయిత్తపడి సందడించేరు

చ. 3: కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీచేలాగు కదివో
యీమహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించి యన్నియునుఁ గైకొంటివిపుడు

రేకు: 0186-06 సాళంగనాట సం: 02-437

పల్లవి: రామా రామభద్ర రవివంశరాఘవ
యేమి యరుదిది నీకింతటివానికిని

చ. 1: నాఁడు రావణు తలలు నఱకిన లావరివి
నేఁడు నాపాపములు ఖండించరాదా
వాఁడిప్రతాపముతోఁడ వారిధిగట్టిన నాటి-
వాఁడవిట్టె నామనోవార్ధిఁ గట్టరాదా

చ. 2: తనిసి కుంభకర్ణాది దైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువరాదా
యెనసి హరుని విల్లు యెక్కుపెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా

చ. 3: సరుస విభీషణుఁడు శరణంటేఁ గాచితివి
గరిమ నే శరణంటిఁ గావరాదా
తొరలి శ్రీవేంకటేశ దొడ్డుగొంచ మెంచనేల
యిరవై లోకహితానకేదైనా నేమీ

రేకు: 0187-01 లలిత సం: 02-438 కృష్ణ

పల్లవి: అని యానతిచ్చె గృష్ణుఁ డర్జునునితో
విని యాతని భజించు వివేకమా

చ. 1: భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల
దీమసాననే మోచేటి దేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటి దేవుఁడ నేను

చ. 2: దీపనాగ్నినై జీవదేహముల యన్నములు
తీపుల నరగించేటి దేవుడ నేను
యేపున నిందరిలోని హృదయములోన నుందు
దీపింతుఁ దలఁపు మరపై దేవుఁడ నేను

చ. 3: వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచేతా
ఆది నేనెరఁగఁదగిన యాదేవుఁడను
శ్రీదేవితోఁగూడి శ్రీవేంకటాద్రి మీఁద
పాదైన దేవుఁడను భావించ నేను

రేకు: 0187-02 గుండక్రియ సం: 02-439 అధ్యాత్మ

పల్లవి: తలఁపులో కొట్టగొన దైవమే వున్నాఁడు
తలఁచిన రూపులెల్లా తా నయ్యీనయ్యా

చ. 1: కలలో ప్రపంచము కంటి నే నొకటి
వెలినున్న ప్రపంచవిధివలెనే
కలనున్నవాఁడ నేనే వెలి నన్నువాఁడ నేనే
తెలి(య?) మాబతుకు రెంట దెప్పరములయ్యా

చ. 2: దేహమీఁడ నుండఁగానే దిక్కులకేఁగీ మనసు
దేహముతో దిక్కులెల్లాఁ దిరిగినట్టే
దేహములోవాఁడ నేనే దేహముపై వాఁడ నేనే
వోహో మాజన్మములో నొకటి రెండయ్యా

చ. 3: కన్నులెదుట శ్రీవేంకటపతిఁ గొలిచెద
కన్నుమూసి యాతనినే కమ్మర భావించెదను
కన్నులోపల నేనే కన్నులవెలిని నేనే
వున్నతి నీరెండును వొక్కటాయనయ్యా

రేకు: 0187-03 శ్రీరాగం సం: 02-440 అధ్యాత్మ

పల్లవి: చాలునిదే నావిరతి సకలసామ్రాజ్యము
నాలోని పని యెంతైనా నాకుఁ గలదు

చ. 1: వడఁబడి పరులిండ్లవాకిలి గాచే నేను
వడి నాలో హరియున్న వాకిలి గాచేను
బడి నొకరిఁ గొలిచి బహురాజ్యమేలే నేను
యెడ నామనోరాజ్యమింతా నేలేను

చ. 2: చేరి యొరులకుఁ బనిసేసి యలసే నేను
సారె నాయోగాభ్యాసాన నలసేను
అరసి నే నడుగఁగ నన్యులిచ్చేయీవులు
తారి పూర్వకర్మాదిదైవమే యిచ్చీని

చ. 3: అందు సంతోషమే ఫల మిందు సంతోషమే ఫల-
మందును మాయాకల్పిత మిందును మాయే
అందు నిందు శ్రీవేంకటాధీశుఁడే కర్త
అందైతేఁ బరతంత్రుఁడిందు నే స్వతంత్రుఁడ

రేకు: 0187-04 సామంతం సం: 02-441 అధ్యాత్మ

పల్లవి: నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్య
దాసుఁడ నేనింతే దైవమవు నీవు

చ. 1: లోకము లేలుదువట లోకము లోపలి నేను
పైకొని నీవేలినట్టి బంటనే సుమ్మీ
ఆకడ నావుఁ గొంటే నావువెంట దూడయును
జోకలఁ గొన్నట్టివారి సొమ్మే కాదా

చ. 2: చేరి నన్ను నీవే పుట్టించితివట నేఁ జేసే-
మేరతోఁ బుణ్యపాపాలు మీవే సుమ్మీ
ఆరుగ విత్తినవాఁడు ఆరుగలోపలి కంది
ఆరితేరి పండితేను ఆతనిదే కాదా

చ. 3: శ్రీవేంకటేశ నీవు జీవాంతరాత్మవట
కావించి నాపాలఁ గలవే సుమ్మీ
కైవసమై చందురుఁడు కలువలజాతికెల్ల
భావింప సర్వవిధబంధువే కాఁడా

రేకు: 0187-05 బౌళిరామక్రియ సం: 02-442 అంత్యప్రాస

పల్లవి: అన్నిటికి హరి యంతర్యామి మూలము
విన్నకన్న గతులెల్లా వృథా మూలము

చ. 1: లాలిత వైరాగ్యమూలము మోక్షము
ఆలరిసంసారమూల మతిబంధము
మేలిమిశాంతిమూలమే సుఖము
వీలి క్రోధమూలమే వెడదుఃఖము

చ. 2: కైకొను భవములే కర్మమూలము
శ్రీకాంతుపై భక్తి చిన్మూలము
పైకొన్న ధ్యానమెల్ల భావమూలము
దీకొని లంపటములు దేహమూలము

చ. 3: అరుదై సుజ్ఞాన మాచార్యమూలము
ధరణి జగత్తెల్లా ధనమూలము
పరము శ్రీవేంకటపతి మూలము
హరి నాతని శరణాగతి మూలము

రేకు: 0187-06 దేవగాంధారి సం: 02-443 అధ్యాత్మ

పల్లవి: వానికి ముదుల యిచ్చి వద్దని మానుపవే
శ్రీనారాయణ వీనిచేత నే వేసరితి

చ. 1: నీకల్పితములే యీనిఖిలేంద్రియములు
యీకడ నీయింద్రియాల నెట్టు గెలువఁగవచ్చు
నీకడ నిన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వానిఁ
బైకొని చోఁపుటగాక బలిమా రాచాజ్ఞతో

చ. 2: నీపంపునఁ గప్పిన నిజమైన మాయ యిది
మాపాటివారెల్లా మహి నెట్టు దాఁటవచ్చు
మీపాదాలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని
పైపైఁ దోయుటగాక బలిమా రాచాజ్ఞతో

చ. 3: శ్రీవేంకటేశ నీచిక్కులే యీపుట్టుగులు
నీవు సేసే చేఁతలకు నే నెట్టు దొలఁగవచ్చు
నీవొద్ద శరణంటి నీయానతినే వాని
భావించి తోసితిఁగాక బలిమా రాచాజ్ఞతో

రేకు: 0188-01 గుండక్రియ సం: 02-444 శరణాగతి

పల్లవి: నీవే సేసిన చేఁత నీవే చేకొనుటింతే
యీవల నీసొమ్ము నీకే ఇయ్య సిగ్గయ్యీనయ్యా

చ. 1: అలుబిడ్డలఁ గని యటు దనమగనికి
సీలాన సమర్పణ సేయవలెనటవయ్యా
తాలిమిఁ బుణ్యాలు సేసి దైవమా నే నీకు
యేలీల సమర్పించే నిందుకే నవ్వు వచ్చీనయ్యా

చ. 2: అంకెలఁ గన్నకొడు కటు దమతండ్రికిని
తెంకి నే నీవాఁడ నని తెలుపఁగవలెనటవయ్యా
లంకె నాలోపలనున్నలక్ష్మీశ నే నీకు
పొంకపు నీబంట నన్నఁ బునరుక్తయ్యీనయ్యా

చ. 3: తననీడ యద్దములోఁ దానే యటు చూచి
పనివడి వూరకే భ్రమయవలెనటయ్యా
అనుగు శ్రీవేంకటేశ ఆతుమలోనున్న నిన్ను
గని మని శరణంటిఁ గడఁ బూజించనేలయ్యా

రేకు: 0188-02 బౌళి సం: 02-445 అధ్యాత్మ

పల్లవి: అనలము సూర్యుఁడు నన్నిటందు వెలసిన (నా?)
ఘనపవిత్రమైనట్టు ఘనుఁడే పో జ్ఞాని

చ. 1: కాంచనము అంటువడినఁ గలదా అందు నింద్యము
పెంచు ముట్టంటువడినఁ బెక్కువ దూష్యము గాక
అంచల సుజ్ఞానిఁ బాపమంటునా తాఁ జేసినాను
పంచల నజ్ఞానినైతేఁ బైకొనిఁ గాక

చ. 2: యెఱుకగల నాలిక నింతైనా జిడ్డంటునా
యెఱుకలేనిచేత నింతా జిడ్డంటుఁ గాక
కఱితలయోగిని కర్మములివంటునా
చుఱచుఱ జడునైతేఁ జుట్టుకొనుఁ గాక

చ. 3: తామెరపాకుల నీరు తగ నందు నంటునా
ఆమేర నెందైనాను నంటుఁ గాక
యీమేర శ్రీవేంకటేశుని దాసుఁడు భూమిఁ
గామించి తా నుండినానుఁ గడు మాయలంటునా

రేకు: 0188-03 చాయానాట సం: 02-446 దశావతారములు

పల్లవి: కమ్మంటేఁ గావా కాఁగల వన్నియు
చిమ్ముల మాయలు సేయఁగనేలా

చ. 1: సరసిజాక్ష నీసంకల్పమాత్రము
అరుదగు ఘనబ్రహ్మాండ మిది
అరయఁగ ధరలో నల్పపుఁ బనులకు
హరి యవతారం బందితివేలా

చ. 2: సతత సురాసుర జననమరణములు
మతి నీహుంకారమాత్రములు
గతియై యమృతము గల్పించుకొరకును
తతి ఘోరజలధి దచ్చితివేలా

చ. 3: యి వైకుంఠము యీశేషగిరే
మహి నీ దర్శనమాత్ర మిది
విహరింపఁగ శ్రీవేంకటేశ యిటు
బహులోకపుకల్పన లవి యేలా

రేకు: 0188-04 సామంతం సం: 02-447 దశావతారములు

పల్లవి: రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన
యేచి నీకు శరణంటి నిది మానుపవే

చ. 1: కడు నహంకరించినను తొల్లి ఘనుడు నారదమౌని
బెడిదపుటింతిఁ జేసి నీమాయ ఆతని బిడ్డలఁ గనిపించెను
అడరి నే ననఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁగలనా
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁ జేయవే

చ. 2: మహి మిమ్ము మోచేనని మున్ను మదించిన గరుడనిని
సహజపు నీ హస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ
బహుముఖముల నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ
అహిశయనుఁడ నే నీశరణంటివి అది నన్ను దగ్గరకుండఁ జేయవే

చ. 3: సారపు శ్రీవేంకటేశ స్వతంత్రుఁడవు నీవు
గారవపు మాయ నీదే కమ్మి నే నీవాఁడనే
మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ
బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ

రేకు: 0188-05 మాళవి గౌళ సం: 02-448 కృష్ణ

పల్లవి: ఎందుకు విచ్చేయనేల ఇన్నియు నాలోనివే
అంది యివే చేకొనవే ఆరడి నీకేల

చ. 1: కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియమైతే
కాముకత్వము నాయందుఁ గలదెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే
నాముల క్రోధ మిదివో నాలో నున్నది

చ. 2: లోకుల చీరలీకుండే లోభమే ప్రియమైతే
యీకడ లోభము నాలో హెచ్చినదిదే
మాకులు మద్దులు దొబ్బేమదమే ప్రియమైతే
చేకొను మదము నాలో సేనాసేన

చ. 3: మఱి శిశుపాలునిపై మచ్చరమే ప్రియమైతే
మెఱయు మత్సర మిదే మించీ నాలో
తఱి శ్రీవేంకటపతి దాసులపై మోహము
నెఱి నీకుఁ బ్రియమైతే నేనేకానా

రేకు: 0188-06 శంకరాభరణం సం: 02-449

పల్లవి: కానవచ్చె నిందులోన కారుణ్యనరసింహా
తానకమై నీకంటే దాస్యమే పో ఘనము

చ. 1: యెనసి ప్రహ్లాదుఁడు యెక్కడఁ జూపునోయని
ననిచి లోకమెల్ల నరసింహగర్భములై
పనివూని వుంటి వటు భక్తపరతంత్రుఁడవై
తనిసి నీ వధికమో దాసులే యధికమో

చ. 2: మక్కువ బ్రహ్మాదులు మానుపరాని కోపము
ఇక్కువై ప్రహ్లాదుఁడు యెదుట నిలిచితేను
తక్కక మానితి వట్టే దాసుని యాధీనమై
నిక్కి నీకింకరుఁడే నీకంటే బలువుఁడు

చ. 3: ఆరసి కమ్మర ప్రహ్లాదవరదుఁడని
పేరువెట్టుకొంటి విట్టే బెరసి శ్రీవేంకటేశ
సారె నీశరణాగతిజనుని కాధీనమైతి-
వీరీతి నీదాసునికే యిదివో మొక్కేము

రేకు: 0189-01 ధన్నాసి సం: 02-450 శరణాగతి

పల్లవి: అటుగాన మోసపోక హరి నీకే అన్నియును
ఘటియించుటే యెక్కుడు కమలారమణ

చ. 1: నిన్నుఁజూడని కన్నులు నీచువలకన్నులు
చిన్ని నీకథవినని చెవులు రాట్నపుఁ జెవులు
వున్నతి నీకడకు రాకున్న కాళ్లు మరగాళ్లు
సన్నుతిసేయని జిహ్వ హరి నుపజిహ్వ

చ. 2: చేరి నిన్నుఁ బూజించని చేయి దంతెనపుఁజేయి
తారి నీకు మొక్కనట్టి తలయే పెడతల
సారె నీముద్రలేని భుజములు బుద్భుజములు
తేరి నీదాస్యములేని దేహము సందేహము

చ. 3: వనమాలలున్న గ్రీవము కంబుగ్రీవము
ఘన మిది దెలియుటే కైవల్యము
యెనయ శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
అనుమానమెల్లఁ బాసె నన్నిటా నాకును

రేకు: 0189-02 సామంతం సం: 02-451 కృష్ణ

పల్లవి: అందుకుఁగాదు నేఁ గొల్చు టామీఁదిపని కింతే
ఇందు నందు నీవే కర్త విందిరారమణ

చ. 1: ఇంచుకంత వేలఁ గొండ యెత్తిన దేవుఁడవు
ముంచి నాసంసారభారము మోవలేవా
అంచల దేవతలకు నమృతమిచ్చిన నీవు
కంచాన నన్నమువెట్టి కాచుట నన్నెంత

చ. 2: వడి ద్రౌపది కక్షయ వలువలిచ్చిన నీవు
బెడఁగు నాకుఁ గట్నె(ట్టని?) చ్చి పెంచుటెంత
జడసి యింద్రాదులకు సంపదిచ్చినట్టి నీవు
కడు నాకు నైహికభోగము లిచ్చు టెంత

చ. 3: పొసఁగ లోకములెల్లఁ బూర్ణుఁడవైన నీవు
పుసురై నాలోన (నే?) నీవు వుండుటెంత
వసుధ శ్రీవేంకటేశ వరములిచ్చే నీకు
దెస నాకోరికెలెల్లాఁ దీర్చుటెంత

రేకు: 0189-03 గుజ్జరి సం: 02-452 అధ్యాత్మ

పల్లవి: అందాఁకాఁ దాఁదానే అంత కెక్కుఁడు గాఁడు
ముందు వెన కెంచేనా ముఖ్యుఁడే యతఁడు

చ. 1: చిత్త మంతర్ముఖము సేసుకొన నేర్చెనా
అత్తల నతఁడు యోగియనఁబడును
సత్తసత్తనెడి సువిచారంబు గలిగెనా
వుత్తమవివేకియని వూహింపఁబడును

చ. 2: భావము నభావమును పరికించి తెలిసెనా
కైవల్యనిలయుఁడని కానఁబడును
దైవంబుఁ దన్ను మతిఁ దలపోయ నేర్చెనా
జీవన్ముక్తుఁడని చెప్పఁబడు నతఁడు

చ. 3: అడరి వైరాగ్యధన మార్జించనోపెనా
దిడువై జితేంద్రియస్థిరుఁడాతఁడు
జడియు శ్రీవేంకటేశ్వరుదాసుఁ డాయనా
బడిబడిఁ దుదఁ బరబ్రహ్మమే యతఁడు

రేకు: 0189-04 మలహరిసం: 02-453 నామ సంకీర్తన

పల్లవి: పరమపురుష హరి పరమ పరాత్పర
పరరిపుభంజన పరిపూర్ణ నమో

చ. 1: కమలాపతి కమలనాభ కమలాసనవంద్య
కమలహితానంతకోటిఘనసముదయతేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
కమలషట్కయోగీశ్వరహృదయం తేహం నమో నమో(?)

చ. 2: జలనిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
జలధియంతరవిహార మచ్చకచ్చపయవతారా
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తకగమన
జలనిధికారుణ్య నమో తేహం జలనిధిగంభీర నమో నమో

చ. 3: నగధర నగరిపువందిత నగచరయూథపనాథా
నగపారిజాతహర సారసపన్నగపతిరాజశయన(?)
నగకులవిజయ శ్రీవేంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా తేహం సర్వేశ్వర నారాయణ నమో నమో

రేకు: 0189-05 పాడి సం: 02-454 అధ్యాత్మ

పల్లవి: అట్టయితే నాయంతర్యామివేలైతివయ్యా
మట్టుమీఱి ముక్తియాస మాననటవయ్యా

చ. 1: పాలుఁతులు లేరా భూమి భోగించే నే లేనా
కలకాల మింద్రియాల కాణాచి లేవో
తొలి యీసంసారము లేదో నాకాంక్షలు లేవో
యెలమి నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా

చ. 2: ధరలోఁ బసిఁడి లేదా తగిలి నాయాస లేదా
సిరుల యజ్ఞానపుచీఁకటి లేదా
అరయఁ జవులు లేవా అందుకో నాలికె లేదా
యిరవై నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా

చ. 3: అట్టే సర్వాపరాధి నపరాధా లెంచనేల
గట్టిరాళ్లలో మలిగండ్లేరనేల
నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ జూచి కావకుంటే
ఇట్టే నిన్నుఁ గొలుచు టిందుకటవయ్యా

రేకు: 0189-06 బౌళి సం: 02-455 ఉపమానములు

పల్లవి: మరిగితి నేమి సేతు మగిడి నేనెందు వోదు
సరుస దైవమ నీకే శరణు చొచ్చేను

చ. 1: తల్లి గోపించి మొత్తినఁ దనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
వెల్లవిరై హరి నీవు విషయాలఁ జిక్కించితే
ఇల్లిదే నిన్నుఁ దలఁచి ఇటు దూరే నేను

చ. 2: కన్నతండ్రి బాలునిఁ జంకంబెట్టి దించితేను
కొన్నేసి విలుచు ముద్దుగునిసినట్టు
వున్నతి నాలోనుండి వూరకే మాయ నాపై
బన్నితే నిన్నే సొలసి పగటులాడేను

చ. 3: దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే నీ బంట నే నింతే
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడనయిన నేను చెలఁగి మొక్కేను

రేకు: 0190-01 లలిత సం: 02-456 వేంకటగానం

పల్లవి: ఎట్టు వలసినఁ జేయు మిన్నియు నీచిత్తమె
నెట్టన(నె?) నొకఁడనా నీవే యింతాను

చ. 1: వేవేలు నీకు విన్నవించేదేమి తొల్లే
సావధానముగ సర్వసాక్షివి నీవు
ఆవల నాకిటు సేయుమని చెప్పేదేమి నేను
దైవికమైనట్టి స్వతంత్రుఁడవు నీవు

చ. 2: తగిలి నిన్ను నాలో ధ్యానించేదేమి తొల్లె
జగతి నీవు పూర్ణచైతన్యుఁడవు
జిగి నీనామము నోరఁ జిక్కించి నుడిగేదేమి
మగుడి శబ్దాక్షరమంత్రరూపుఁడవు

చ. 3: చేవమీర సిరులఁ బూజించేదేమి నిన్ను
శ్రీవేంకటేశ నీవు శ్రీపతివి
దేవదేవ నిన్ను నీవే తేఁకువెల్లా నెంచుకొని
కావుము నీవొక్కఁడవే కరుణానిధివి

రేకు: 0190-02 బౌళి సం: 02-457 అంత్యప్రాస

పల్లవి: ఈతనిమూలమెపో యిలఁగల ధనములు
యీతఁడు మాకు గలఁడు యెంత లేదు ధనము

చ. 1: విరతి మాధనము విజ్ఞానమే ధనము
మరిగిన తత్వమే మా ధనము
పరము మా ధనము భక్తే మా ధనము మా-
కరిరాజవరదుఁడే కైవల్యధనము

చ. 2: శాంతమే మా ధనము సంకీర్తనే ధనము
యెంతైనా నిశ్చింతమే ఇహధనము
అంతరాత్మే మా ధనము హరిదాస్యమే ధనము
యింతటా లక్ష్మికాంతుఁ డింటిమూలధనము

చ. 3: ఆనందమే ధనము ఆచార్యుఁడే ధనము
నానాటఁ బరిపూర్ణమే ధనము
ధ్యానమే మా ధనము దయే మా ధనము
పానిన శ్రీవేంకటాద్రిపతియే మా ధనము

రేకు: 0190-03 బౌళి సం: 02-458 అంత్యప్రాస

పల్లవి: నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు
కామించి హరి నీ వొక్కఁడవే నిజము

చ. 1: చచ్చేటి దొకమాయ హరిఁ బుట్టేదొకమాయ
మచ్చుమేపులసిరులు మాయలో మాయ
వచ్చేటి దొకమాయ వచ్చిపోయ్యే దొకమాయ
కచ్చుపెట్టి హరి నీ వొక్కఁడవే నిజము

చ. 2: పొద్దువొడచేది మాయ పొద్దుగుంకే దొకమాయ
నిద్దురయు మేల్కనేది నిండుమాయ
వొద్దనే సుఖము మాయ వొగి దుఃఖ మొకమాయ
గద్దరి శ్రీహరి నీ వొక్కఁడవే నిజము

చ. 3: కూడేటి దొకమాయ కూడి పాసే దొకమాయ
యేడ నేర్చితి శ్రీవేంకటేశుఁడ నీవు
వేడుక నీశరణంటి విడిపించు మీమాయ
వోడక వెదకితి నీ వొక్కఁడవే నిజము

రేకు: 0190-04 దేసాళం సం: 02-459 వేంకటగానం

పల్లవి: తిరుమలగిరిరాయ దేవరాహుత్తరాయ
సురత బిన్నాణరాయ సుగుణ కోనేటిరాయ

చ. 1: సిరుల సింగారరాయ చెలువపు తిమ్మరాయ
సరస వైభవరాయ సకలవినోదరాయ
వర వసంతములరాయ వనితల విటరాయ
గురుతైన తేగరాయ కొండల కోనేటిరాయ

చ. 2: గొల్లెతల వుద్దండరాయ గోపాలకృష్ణరాయ
చల్లు వెదజాణరాయ చల్లఁ బరిమళరాయ
చెల్లుబడి దర్మరాయ చెప్పరాని వలరాయ
కొల్లలైన భోగరాయ కొండల కోనేటిరాయ

చ. 3: సామసంగీతరాయ సర్వమోహనరాయ
ధామవైకుంఠరాయ దైత్యవిభాళరాయ
కామించి నిన్నుఁ గోరితే గరుణించితివి నన్ను
శ్రీమంతుఁడ నీకు జయ శ్రీవేంకటరాయ

రేకు: 0190-05 బౌళి సం: 02-460 అధ్యాత్మ

పల్లవి: అన్నిటా శాంతుఁడైతే హరిదాసుఁడు దానే
సన్నుతిఁ దానేపో సర్వదేవమయుఁడు

చ. 1: అత్తల మనసు యింద్రియాధీనమైతేను
చిత్తజుఁడనెడివాఁడు జీవుఁడు దానే
కొత్తగాఁ దనమనసే కోపాన కాధీనమైతే
తత్తరపు రుద్రుఁడునుఁ దానే తానే

చ. 2: భావము వుద్యోగముల ప్రపంచాధీనమైతే
జీవుఁడు బ్రహ్మాంశమై చెలఁగుఁ దానే
కావిరి రేయిఁబగలు కన్నుల కాధీనమైతే
ఆవలఁ జంద్రసూర్యాత్మకుఁడు దానే

చ. 3: కోరికఁ దనబ్రదుకు గురువాక్యాధీనమైతే
మోరతోపులేని నిత్యముక్తుఁడు దానే
ఆరయ శ్రీవేంకటేశుఁ డాతుమ ఆధీనమైతే
ధారుణిలో దివ్యయోగి తానే తానే

రేకు: 0190-06 సాళంగనాట సం: 02-461 శరణాగతి

పల్లవి: ఇహమెట్టో పరమెట్టో ఇఁక నాకు
సహజమై హరియే శరణము నాకు

చ. 1: చిత్తమిది యొకటే చింత వేవేల సంఖ్య
పొత్తుల హరిఁ దలఁచఁ బొద్దులేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు
తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు

చ. 2: చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిఁ బూజించ నిచ్చ లేదు
జాతి నాలిక వొకటే చవులు కోటానఁగోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు

చ. 3: వీనులివి రెండే వినికి కొలదిఁలేదు
పూని హరిభక్తి విన బుద్ధిలేదు
యీనటన శ్రీవేంకటేశుఁడిటు చూచినను
తానే యేలె నిఁకఁ దడఁబాటు లేదు

రేకు: 0191-01 రామక్రియ సం: 02-462 రామ

పల్లవి: వినవమ్మ జానకి నీవిభుఁ డింతసేసినాఁడు
యెనసి యీరఘుశ్రీరాముఁ డికఁ నేమి సేసునో

చ. 1: వానరులదండు గూడి వారధి కొండలఁ గట్టె
ఆని లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటమెక్కె గొడగు లన్నియుఁ జెక్కె
యే నెపాన రఘురాముఁ డిఁక నేమి సేసునో

చ. 2: కోరి ఇంద్రజిత్తుఁ జంపె కుంభకర్ణు నిర్జించె
ఘోరదానవులనెల్ల కూలఁగుమ్మెను
మారణహోమము సేసె మతకమింతాఁ జెరిచె
యీరసాన రఘురాముఁ డిఁక నేమి సేసునో

చ. 3: లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె
చేవల నోసీత నిన్నుఁ జేకొనెను
భావించి శ్రీవేంకటాద్రిఁ బట్టము దాఁ గట్టుకొనె
యీవలనావల నాతఁ డిఁక నేమి సేసునో

రేకు: 0191-02 శంకరాభరణం సం: 02-463 నృసింహ

పల్లవి: ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ దెలుపరో గురువులాల

చ. 1: తనువూ హరియే తలఁపూ హరియే
వినికి మనికియును విష్ణుఁడే
కనుఁగొను చూపులు కమలనాభుఁడే
యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో

చ. 2: లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నుండువాఁడనో

చ. 3: వెనకను కృష్ణుఁడే వెస ముం దచ్యుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగు నాస్వతంత్ర మది యేడనున్నదో

రేకు: 0191-03 లలిత సం: 02-464 సంస్కృత కీర్తనలు

పల్లవి: కలిగె మాకు నిది కైవల్యం
కలకాలము హరికథాశ్రవణం

చ. 1: అచింత్య మద్భుత మానందం
ప్రచురం దివ్యం పావనం
సుచరిత్రం శ్రుతిశోభితం
అచలంబిదివో హరికీర్తనం

చ. 2: నిరతం నిత్యం నిఖిల శుభకరం
దురితం హర భవదూరం
పరమ మంగళం భావాతీతం
కరివరదం నిజ కైంకర్యం

చ. 3: సులభం సుకరం శోకనాశనం
ఫలదం లలితం భయహరణం
కలితం శ్రీవేంకటపతిశరణం
జలజోదరనిచ్చ స్తోత్రం

రేకు: 0191-04 బౌళి సం: 02-465 అధ్యాత్మ

పల్లవి: ఎఱుఁగుటకంటే నెఱఁగమే మేలు
మఱి తెలివికంటే మఱపే శుభము

చ. 1: లంపటా లెఱఁగము లవలవ లెఱఁగము
పంపుల బాల్యమే పరిణామము
యింపులు నెఱఁగము యెగ్గులు నెఱఁగము
జంపుల నిదురే సకలసౌఖ్యము

చ. 2: ఆస లివెఱఁగము అలమట లెఱఁగము
మూసిన గర్భమే మును సుఖము
వాసులు నెఱఁగము వంతులు నెఱఁగము
వేసట పుట్టని విధమే సుఖము

చ. 3: పాపము లెఱఁగము బంధము లెఱఁగము
శ్రీపతి దాస్యమే శేఖరము
యేపున శ్రీవేంకటేశ్వరు శరణమే
తీపులు మఱపేటి దివ్యానందము

రేకు: 0191-05 లలిత సం: 02-466 నామ సంకీర్తన

పల్లవి: కలిగె నిదె నాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది

చ. 1: జయ పురుషోత్తమ జయ పీతాంబర
జయ జయ కరుణాజలనిధి
దయ యెఱంగ నే ధర్మము నెఱంగ నా-
క్రియ యిది నీ దివ్యకీర్తనమే

చ. 2: శరణము గోవింద శరణము కేశవ
శరణు శరణు శ్రీజనార్దన
పరమ మెఱంగను భక్తి యెఱఁగను
నిరతము నాగతి నీ దాస్యమే

చ. 3: నమో నారాయణ నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా
అమిత శ్రీవేంకటాధిప యిదె నా
క్రమమెల్లను నీకయింకర్యమే

రేకు: 0191-06 శంకరాభరణం సం: 02-467 అధ్యాత్మ

పల్లవి: హరియు నొక్కఁడే గురి ఆత్మలో నొక్కటే గురి
విరివి నెంత చదివినా వేరుగాఁ బొయ్యీనా

చ. 1: అందరిచూపులు నొక్కటైనందుకు గురి
యెందూఁ గొండ కొండేకాక యితరముగాఁ జూచేరా
అందరిరుచులు నొక్క టైనందుకు గురి
చెంది తీపు తీపే కాక చేఁదుగాఁ జేకొనేరా

చ. 2: వొప్పుగా నందరివూర్పు లొక్కటైనందుకు గురి
కప్పుర మదేకాక కస్తూరిగా మూఁకొనేరా
యెప్పుడూ నిందరి వినికేకమైనందుకు గురి
తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా

చ. 3: యీరీతి నిందరిచిత్త మేకమైనందుకు గురి
మేరతో సూర్యోదయము మించి రేతిరయ్యీనా
తేరి శ్రీవేంకటపతి దేవుఁడైనందుకు గురి
కోరినవారి వరాలే కొంగుపైఁడి గాదా

రేకు: 0192-01 బౌళి సం: 02-468 గురు వందన, నృసింహ

పల్లవి: నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే
నిరతి నాకొరకే పో నిను సేవించేది

చ. 1: ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని
బందుకట్టుదు దుఃఖములఁ బాపుదువని
యిందలి యాసలనేపో యేచిన నాభయభక్తి
యెందును నావల్ల నీకు నించుకంతా లేదు

చ. 2: జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి
వెనకటి నీకథలు వినివిని
వినుపై యీయాసనేపో విన్ను సారెఁ బొగడేది
వొనర నీయాసేపో వుపకారగురువు

చ. 3: లోకులు గొలువఁగాను లోన నీవు వుండఁగాను
దీకొని గురుఁడు బోధించఁగాను
కైకొని శ్రీవేంకటేశ కరుణించగా నీవు
దాకొని యీయాసకే నీదాసినై కొలిచితి

రేకు: 0192-02 సాళంగం సం: 02-469 భక్తి

పల్లవి: నానాభక్తులివి నరుల మార్గములు
యే నెపాననైనా నాతఁ డియ్యకొను భక్తి

చ. 1: హరిఁకిఁగా వాదించు టది ఉన్మాదభక్తి
పరులఁ గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మఁ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి

చ. 2: అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి
ఆతని దాసుల సేవే అదియే తురీయభక్తి
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి
అతఁడే గతని వుండుటది వైరాగ్యభక్తి

చ. 3: అట్టె స్వతంత్రుఁడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మలభక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి

రేకు: 0192-03 సాళంగనాట సం: 02-470 దశావతారములు

పల్లవి: కంటిరా వింటిరా కమలనాథుని శక్తి
వొంటి నితని శరణ మొకటే వుపాయము

చ. 1: యీతని నాభిఁ బొడమె యెక్కువైన బ్రహ్మయు
యీతఁడే రక్షించినాఁడు యింద్రాదుల
యీతఁడాకుమీఁదఁ దేలె నేకార్ణవమునాఁడు
యీతఁడే పో హరి మనకిందరికి దైవము

చ. 2: యీతఁడే యసురబాధ లిన్నియుఁ బరిహరించె-
నీతని మూఁడడుగులే యీ లోకాలు
యీతఁడే మూలమంటే నేతెంచి కరిఁ గాచె
నీతనికంటే వేల్పు లిఁక మరి కలరా

చ. 3: యీతఁడే వైకుంఠనాథుఁ డీతఁడే రమానాథుఁ-
డీతఁడే వేదోక్తదైవ మిన్నిటాఁ దానె
యీతఁడే అంతర్యామి యీ చరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁ డిహపరధనము

రేకు: 0192-04 సామంతం సం: 02-471 నృసింహ

పల్లవి: సింగారమూరితివి చిత్తజగురుడఁవు
సంగతిఁ జూచేరు మిమ్ము సాసముఖా

చ. 1: పూవులతెప్పలమీఁద పొలఁతులు నీవు నెక్కి
పూవులాకసము మోపఁ బూచి చల్లుచు
దేవదుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సాసముఖా

చ. 2: అంగరంగవైభవాల నమరకామినులాడ
నింగినుండి దేవతలు నిన్నుఁ జూడఁగా
సంగీతతాళవాద్య చతురతలు మెరయ
సంగడిఁ దేలేటి మీకు సాసముఖా

చ. 3: పరగఁ గోనేటిలోన పసిడి మేడనుండి
అరిది నిందిరయు నీవారగించి
గరిమ శ్రీవేంకటేశ కనులపండువ గాఁగ
సరవి నోలాడు మీకు సాసముఖా

రేకు: 0192-05 శంకరాభరణం సం: 02-472 అధ్యాత్మ

పల్లవి: పట్టలేని మన భ్రమగాక
నెట్టనఁ దాఁ గరుణించని వాఁడా

చ. 1: హితప్రవర్తకుఁ డీశ్వరుఁడు
తతి నంతరాత్మ తాఁ గాన
రతి నాతని దూరఁగనేలా
గతియని తలఁచిన కావనివాఁడా

చ. 2: తెగని బంధువుఁడు దేవుఁడు
బగివాయఁ డిహముఁ బరమునను
అగపడి సందేహములేలా
తగ నమ్మిన దయదలఁచనివాఁడా

చ. 3: హృదయము శ్రీవేంకటేశ్వరుఁడు
మెదలనే ఆనందమూర్తిగన
కదిసి వెలిని వెదకఁగనేలా
యెదురఁ గనిన వరమియ్యనివాఁడా

రేకు: 0192-06 గుండక్రియ సం: 02-473 అధ్యాత్మ

పల్లవి: తానే తెలియుఁ గాక తలఁచఁగ నెట్టువచ్చు
నానాగతుల తన నాటకపుమాయ

చ. 1: అట్టె యేఁబదియైన యక్షరాలలోనట
తిట్టులట వొకకొన్ని దీవెనలటా
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని
యిట్టివి చిక్కులు భూమి నిఁకనెన్ని గలవో

చ. 2: కదిసిన యఱువదిగడియలలోనట
పొదలు నడకలట భోగములటా
నిదురట వొకకొంత నేరుపులు కొన్నియట
యెదుట చూడఁగఁ జూడ నిఁక నెన్ని గలవో

చ. 3: రేపగలు కన్నులివి రెంటిలోనేయట
దైవము జీవులలోనే తానకమట
శ్రీవేంకటాద్రిమీఁద జెలఁగి యా(గెనా?)తఁడే యట
యేవంక నీచేఁతలు యిఁక నెన్నిగలవో

రేకు: 0193-01 దేసాళం సం: 02-474 శరణాగతి

పల్లవి: ఇంతటఁ బో కానవచ్చు నెక్కువ తక్కువలెల్ల
దొంతి ఇంద్రియాలకెల్లఁ దొలఁగి వుంటేను

చ. 1: మాటలాడవచ్చుఁ గాని మనసులు పట్టరాదు
చాటువకెక్కినయట్టి సతులఁ గంటే
కోటి చదువఁగవచ్చు కోపము నిలుపరాదు
జూటరై వొకఁడు దన్ను సోఁకనాడితేను

చ. 2: అందరి దూషించవచ్చు నాసలు మానఁగరాదు
కందువైన మించుల బంగారు గంటే
అందాల మొక్కఁగవచ్చు హరిభక్తి సేయరాదు
పొందుల సంసారపు భోగము గంటేను

చ. 3: మొదలఁ బుట్టగవచ్చు మోక్షముఁ బొందఁగరాదు
పొదిగి పుణ్యరాసుల భోగము గంటే
యెదుట శ్రీవేంకటేశ ఇదివో నీశరణంటే
కదిసితి నిట్టే పో నీకరుణ గంటేను

రేకు: 0193-02 లలిత సం: 02-475 శరణాగతి

పల్లవి: అంతర్యామీ అలసితి సొలసితి
యింతట నీ శరణిదె చొచ్చితిని

చ. 1: కోరిన కోర్కులు కోయని కట్లు
తీరవు నీవవి తెంచకా
భారపుఁ బగ్గాలు పాపపుణ్యములు
నేరుపులఁ బోవు నీవు వద్దనకా

చ. 2: జనుల సంగములఁ జక్కరోగములు
విను విడువవు నీవు విడిపించకా
వినయపు దైన్యము విడువని కర్మము
చనదిది నీవిటు సంతపరచకా

చ. 3: మదిలో చింతలు మయిలలు మణుఁగులు
వదలవు నీవని వద్దనకా
యెదుటనేఁ శ్రీవేంకటేశ్వర నీవదె
అదనఁ గాచితివి అట్టిట్టనకా

రేకు: 0193-03 మలహరిసం: 02-476 వైరాగ్య చింత

పల్లవి: మగఁడు విడిచినా మామ విడువనియట్టు
నెగడిన వేమిసేయు నేనే రోయఁ గాని

చ. 1: నరకము నను రోసి సురలోకాన విడిచె
నిరయముతోవ రోసి నేనే విడువఁ గాని
పరగి యోనులు రోసి బట్టబాయిట వేసే
సొరిది యోనుల రోసి చొరక నే మానఁ గాని

చ. 2: పాపము రోసి నన్ను ప్రపంచాన విడిచె
పాపము సేయక రోసి పట్టకుండఁ గాని నేను
యేపున దేహము రోసి యింద్రలోకాన విడిచె
కైపువేసి రోయక నేఁగాయము మోచితిఁ గాని

చ. 3: మాయలెల్ల నన్ను రోసి మనసులోన విడిచె
మాయల నే విడువక మగుడఁ దగిలేఁ గాని
నాయల(?) నేమి విడిచినాను శ్రీవేంకటేశ
పాయక నన్నేలితి నీభాగ్యము విడువఁ గాని

రేకు: 0193-04 ధన్నాసి సం: 02-477 అధ్యాత్మ

పల్లవి: ఒక్కమనసున నే నుండేఁగాక
యెక్కడిపనులు దానే యెఱఁగఁడా

చ. 1: బలుదేహ మిచ్చువాఁడు ప్రాణము వోసినవాఁడు
తలఁపొసగినవాఁడు దైవమేకాఁడా
వెలుపలి లంపటాలు వేవేలు గడించి తాను
మలసి ఇంతలో నన్ను మఱచీనా

చ. 2: జగము లేలేటివాఁడు సంసారిఁ జేసినవాఁడు
తగులై యుండినవాఁడు తానేకాఁడా
బెగడకుండ దినాలు పెరుగఁజేసేటివాఁడు
తగినట్టు నడపించఁ దా నేరఁడా

చ. 3: మొదలై యుండేటివాఁడు ముందరఁ దుదయ్యేవాఁడు
యెదలోవాఁడు శ్రీవేంకటేశుఁడే కాఁడా
చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాఁడు
పొదిగి నాదాపుదండై భోగించఁడా

రేకు: 0193-05 సాళంగనాట సం: 02-478

పల్లవి: దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించ నింతటిలో భూభారమెల్ల నణఁగె

చ. 1: నేఁడు కృష్ణుఁడు జనించె నేఁడే శ్రీజయంతి
నేఁడే రేపల్లెలోన నెలవైనాఁడు
వేఁడుక యశోదకు బిడ్డఁడైనాఁడిదె నేఁడే
పోఁడిమి జాతకర్మ మొప్పుగనాయ నేఁడు

చ. 2: ఇప్పుడిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము
ఇప్పుడు తొట్టెల నిడి రింతులెల్లాను
చెప్పరాని బాలలీల సేయఁగలదెల్లాఁ జేసి
కప్పెను విష్ణుమాయలు గక్కన నేఁడిపుడు

చ. 3: ఇదివో వసుదేవుని ఇంటిచెరలెల్లఁ బాసె
ఇదివో దేవకితప మిట్టె ఫలించె
చెదరక తా నిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె
యెద నలమేలుమంగ యెక్కివున్న దిదివో

రేకు: 0193-06 బౌళి సం: 02-479 అధ్యాత్మ, వైరాగ్య చింత

పల్లవి: హితవే సేసుఁ గాకాతఁడేల మానును
మితి నాతని దూరక మెచ్చవలెఁ గాక

చ. 1: ఆగమభోగములకు హరి నాలో నున్నవాఁడు
చేగదేర నాకు మేలే చింతించుఁ గాక
సాగిన ప్రపంచములో సంసారిఁ జేసినవాఁడు
యే గతి రక్షించఁ దానే ఇన్నిటికొఁ గాక

చ. 2: భూమిమీఁద దేహమిచ్చి పుట్టించినట్టివాఁడు
ప్రేమతో నన్నపానాలు పెట్టుఁ గాక
ఆమని పంచేంద్రియాల నటు పెడరేఁచేవాఁడు
నేమపు బుత్రదారలై నిండుకుండు గాక

చ. 3: ఇహపరములకుఁ దా నిరవైనట్టివాఁడు
సహజాన నన్నియును జరపుఁ గాక
వహి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాఁడు
మహిమతో మమ్మునేలి మన్నించుఁ గాక

రేకు: 0194-01 కన్నడగౌళ సం: 02-480 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వరి నేమనఁగల నెంతబలువుఁడ నేను
నవ్వుచు నీవే యిఁక నన్ను మన్నించవయ్యా

చ. 1: కామక్రోధములకు కాణాచికాఁపను
ఆమని యింద్రియముల కడిబంటను
దీమనపు టాసలకు తీరని లగ్గస్థుఁడను (?)
యీ మరఁగువాఁడ నిన్ను నెట్టు గొలిచేనయ్యా

చ. 2: పాయని సంసారానకు బడివనివాఁడను
కాయపుభోగాల వూడిగపువాఁడను
పాయపు మదములకు పంగెమైనవాఁడను (?)
యీయెడ నీవాఁడ నని యెట్టు గొలిచేనయ్యా

చ. 3: సరిఁ గర్మములకెల్ల చనవరి బొడుకను
పొరలే జన్మముల యప్పులవాఁడను
అరయ శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
యిరవై ఇట్టుండకున్న నెట్టు గొలిచేనయ్యా

రేకు: 0194-02 దేసాక్షి సం: 02-481 అధ్యాత్మ

పల్లవి: ఎఱుఁగువా రెరుఁగుదు రీయర్థము
యెఱఁగనివారి కిది యెఱఁగనియ్యదు

చ. 1: మొదలఁ గలుగువాఁడే ముందరనుఁ గలవాఁడు
అదన నాతఁడే పరమాత్ముఁడు
యెదుటఁ గలిగినదే ఇన్నిటాఁ గలిగినది
పదపడి యిదియే ప్రపంచము

చ. 2: చెడనిదానికి మరి చేటెన్నఁడును లేదు
జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము
వుడివోఁ గల దెన్నఁడు వుడివోఁ గలిగినదీ
కడగడనే తిరుగు కర్మమార్గము

చ. 3: యెంచి తొల్లి నడిచేవే ఇపుడును నడచేవి
మంచి శ్రీవేంకటేశ్వరు మహిమ లివి
అంచ నిపుడు గానని వల్లనాఁడుఁ గాననివే
మంచువంటి విషయపు మాయావాదములు

రేకు: 0194-03 లలిత సం: 02-482 వైష్ణవ భక్తి

పల్లవి: కేశవదాసినైతి గెలిచితి నన్నిటాను
యీ శరీరపు నేరా లిఁకనేలా వెదక

చ. 1: నిచ్చలుఁ గోరికలియ్య నీనామమే చాలు
తెచ్చి పునీతుఁ జేయ నీతీర్థమే చాలు
పచ్చిపాపా లణఁచ నీప్రసాదమే చాలు
యెచ్చుకొందు వుపాయాలు ఇఁకనేల వెదక

చ. 2: ఘనునిఁ జేయఁగను నీకైంకర్యమే చాలు
మొనసి రక్షించను నీముద్రలే చాలు
మనిపి కావఁగఁ దిరుమణిలాంఛనమే చాలు
యెనసెను దిక్కుదెస ఇఁకనేల వెదక

చ. 3: నెలవైన సుఖమియ్య నీధ్యానమే చాలు
అల దాపుదండకు నీయర్చనే చాలు
యిలపై శ్రీవేంకటేశ యిన్నిటా మాకుఁ గలవు
యెలమి నితరములు యిఁకనేల వెదక

రేకు: 0194-04 దేసాళం సం: 02-483 నృసింహ

పల్లవి: కైవల్యమునకంటే కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడ నీవు మాకుఁ జిక్కేమర్మ మిదివో

చ. 1: చేపట్టి నీశిరసు పూజించే అహమికకంటే
నీపాదాలు పూజించే నేను మొక్కుడు
మాపుదాఁకా నినుఁగొల్చి మందెమేళమౌకంటే
దాపగు నీదాసుల శేషత్వ మెక్కుడు

చ. 2: హరి నీపస్రాదజీవినై గర్వించుటకంటే
నరయ నీదాసులలెంకౌ టెక్కుడు
వెరవున నీచెవిలో విన్నపాలు సేయుకంటే
ధర నీవూడిగకాండ్లఁ దలఁపించు టెక్కుడు

చ. 3: జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే
అట్టె నీనామఫలమందు టెక్కుడు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే
తిట్టపు మాగురు నుపదేశ మెక్కుడు

రేకు: 0194-05 శ్రీరాగం సం: 02-484 శరణాగతి

పల్లవి: నావల్ల నీ కేమున్నది నారాయణ నీవు నన్ను
కావించి రక్షించే వుపకార మింతే కాక

చ. 1: సొమ్ము దినఁబుట్టినట్టి సోమరిబం టేలికకు
ఇమ్ముల నందుకుఁ బ్రతి యేమి సేసీని
చిమ్ముచు నాతఁడు నేమించిన పనివాటలలో
వుమ్మడిఁ జేసేటి వట్టివూడిగాలే కాక

చ. 2: ఆసపడి వచ్చినట్టి అతిథి బలురాజుకు
రాసిసేసి యేమిచ్చిన రతికెక్కీని
బేసబెల్లితనమున ప్రియాన నిచ్చకమాడి
మూసి దైన్యపుఁ జేతుల మొక్కు లింతే కాక

చ. 3: శరణాగతుఁడ నీకెచ్చట శ్రీవేంకటేశుఁడ
దొరనై యేమిట సరిఁదూఁగఁగలను
ధరలోన నీవు దయదలఁచి నన్నేలుకోఁగా
పరగు నీమఱఁగున బదుకుదుఁ గాక

రేకు: 0194-06 రామక్రియ సం: 02-485 వైష్ణవ భక్తి

పల్లవి: అదె శిరశ్చక్రము లేనట్టి దేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో

చ. 1: ఆనాయుధో సో అసురా అదేవా యని
వినోదముగ ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాది ప్రమాణ మందే తెలియరో

చ. 2: యెచ్చ యింద్రే యని "యచ్చ సూర్యే" యని
అచ్చుగ తుద కెక్కె(క్క?) నదే పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందుని ముద్రాధారణకు
అచ్చమయిన ప్రమాణ మందే తెలియరో

చ. 3: మును "నేమినా తప్తముద్రాం ధారయే" త్తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవిరి సేసీని
మొనసి శ్రీవేంకటేశు ముద్రాధారణకు
అనువుగఁ బ్రమాణ మందే తెలియరో

రేకు: 0195-01 పాడి సం: 02-486 అంత్యప్రాస

పల్లవి: ఇట్టి బ్రాహ్మణ్య మెక్కుడు యిన్నిటిలోన
దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము

చ. 1: హరిఁ గొలిచేవారి కమరు బ్రాహ్మణ్యము
పరమవైష్ణవమే పో బ్రాహ్మణ్యము
హరిణోర్ధ్వపుండ్రదేహులౌటే బ్రాహ్మణ్యము
తిరుమంత్రవిధులదే తేఁకువ బ్రాహ్మణ్యము

చ. 2: సతమై చక్రాంకితుల చరితే బ్రాహ్మణ్యము
పతి శరణాగతియే బ్రాహ్మణ్యము
వెతలేని వీరలసాత్వికమే బ్రాహ్మణ్యము
తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము

చ. 3: అంచఁ బరమభాగవతాధీనము బ్రాహ్మణ్యము
పంచసంస్కారాదులదే బ్రాహ్మణ్యము
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డితఁడేఁ బ్రాహ్మణ్యుఁడు
ముంచి యీతనివారౌటే మొదలి బ్రాహ్మణ్యము

రేకు: 0195-02 మాళవిగౌళ సం: 02-487 దశావతారములు

పల్లవి: వీదులవీదులనెల్లా విష్ణుఁడు సంచరించీని
పోది మాని కన్నగతై పొండు మీరసులలు

చ. 1: తేరుమీఁద నెక్కి నేఁడు దేవోత్తముఁడు వాఁడె
సారమైన శంఖచక్రశార్ఙ్గాయుధము లవే
కారుకమ్మి నాకాసాన గరుడధ్వజం బదే
పారరో దానవులాల పంతములు విడిచి

చ. 2: దండవెట్టె నల్లవాఁడే దైవాలరాయుఁడు
దండి నెట్టెపుఁజూట్ల తపారపు చుంగు లవే
కొండవంటి రథ మదె కొన పైఁడికుండలవే
గుండుగూలి విరుగరో గొబ్బున దైతేయులు

చ. 3: విజయశంఖము వట్టె వీఁడె శ్రీవేంకటేశుఁడు
భజన నలమేల్మంగ పలుమారు మెచ్చీనదె
త్రిజగాన నాతనిఁ జేరినదాసు లిదె వీరె
గజబెజ లిఁక నుడుగరో రాక్షసులు

రేకు: 0195-03 లలిత సం: 02-488 శరణాగతి

పల్లవి: కామధేనువిదె కల్పవృక్షమిదే
ప్రామాణ్యముగల ప్రపన్నులకు

చ. 1: హరినామజపమే ఆభరణంబులు
పరమాత్ముని నుతి పరిమళము
ధరణిధరు పాదసేవే భోగము
పరమంబెరఁగిన ప్రపన్నులకు

చ. 2: దేవుని ధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభు భక్తే జీవనము
ఆ విష్ణుకైంకర్యమే సంసారము
పావనులగు యీప్రపన్నులకు

చ. 3: యేపున శ్రీవేంకటేశుఁడే సర్వము
దాపై యితని వందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు
పైపయి గెలిచిన ప్రపన్నులకు

రేకు: 0195-04 మాళవిగౌళ సం: 02-489 అధ్యాత్మ

పల్లవి: నీచిత్త మిందరినేరుపు నేరమి
తోఁచి కాచి యిటు తుద కీడేర్చె

చ. 1: దేవతలపాలు తీరని పుణ్యము
ఆవలఁ బాపం బసురలది
భావింప మనుజులపాలివి రెండును
శ్రీవల్లభ నీనేసిన మాయ

చ. 2: వేదశాస్త్రములు విజ్ఞానమూలము
ఆది నసత్యము లజ్ఞానమూలము
సాదింప రెండును జగత్తుమూలము
భేదించి యివి నీపెరరేపణలు

చ. 3: కావింపఁ గర్మము కాయము చేతిది
భావము చేతిది పరమము
తావుల రెండునుఁ దప్పని ప్రకృతివి
శ్రీవేంకటేశ్వర చేఁతలు నీవి

రేకు: 0195-05 దేవగాంధారి సం: 02-490 వైరాగ్య చింత

పల్లవి: అడ్డము చెప్పగరాదు అవుఁగాదనఁగరాదు
వొడ్డిన దనుభవించే దొపిక జీవులది

చ. 1: యీరికలెత్తె జన్మము లిన్ని జంతువులయందు
కోరికల గొనసాగెఁ గోటానఁగోటి
నారుకొనె సంపదలు నానారూపములై
తీరదేమిటా నీచిక్కు దేవుఁడు వెట్టినది

చ. 2: అల్లుకొనెఁ గర్మములు అక్కడికి నిక్కడికి
వెల్లవిరాయను మాయ వెనకా ముందు
కెల్లురేఁగె దేహమందే కిమ్ముల చుట్టరికాలు
పొల్లువో దెన్నఁడు భూమి పుట్టగాఁ బుట్టినది

చ. 3: పండెను సంసారము ఫలమైన నానాఁటికి
నిండెను నాలికకు నెమ్మదిఁ జవులు
అండనే శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండి
వండ వండనట్లుగ (?) వన్నె కెక్కించినది

రేకు: 0195-06 శంకరాభరణం సం: 02-491 దశావతారములు

పల్లవి: ఎంతకెంత యిది యేమని పొగడుట
యింత సేయ నీకు నెదురా వీరు

చ. 1: పిడుగులఁ బోలెడి పెను నీ నఖములఁ
కెడయక హిరణ్యుఁ డెట్లుండెనో
పుడికెటి చక్రాయుధము వేఁడికిని
జడియక మకరెటు వహించెనో

చ. 2: శరపరంపరల శిరములు నఱకఁగ
యెరగొని రావణుఁ డేమనెనో
పరియలు వారఁగ బ్రహ్మాండభాండము
ఉరుశంఖరవం బోర్చుట యెట్లో

చ. 3: గాఁటపు నిష్ఠురగదాహతికి మధు-
కైటభుల తలల కత లెట్లో
యీటున శ్రీవేంకటేశ నీకృపను
పాటించి దాసులు బ్రదుకుట యెట్లో

రేకు: 0196-01 దేవగాంధారి సం: 02-492 శరణాగతి

పల్లవి: నీయంత నీవే యెరిఁగి నిచ్చ నన్నుఁ గాతు గాక
మాయలలోఁ బొరలే దిమ్మరివాఁడ నేను

చ. 1: నీ సరివాఁడనా నిన్ను దూరేవాఁడనా
దాఁసుడనై కొలిచిన తనుధారిని
వేసరించ నోపుదునా వెరపించఁగలనా
మాసిన పాపాలలోని మైల సోఁకినాఁడను

చ. 2: విన్నవించేవాఁడనా వీడుజోడువాఁడనా
అన్నిటా శరణుచొచ్చినట్టి జీవిని
యెన్నిటి కుత్తరమిచ్చే యేపని సేసి మెప్పించే
మున్నిటి కర్మములకు ముంగిట నున్నాఁడను

చ. 3: యెదురాడేవాఁడనా యెలయించేవాఁడనా
సదరాన నీకు మొక్కేజంతువ నేను
ఇదివో శ్రీవేంకటేశ యెరుక నీ వొసగఁగా
పొదిగి నీమహిమలు పొగడుచున్నాఁడను

రేకు: 0196-02 సాళంగనాట సం: 02-493 అధ్యాత్మ

పల్లవి: ఇచ్చినవాఁడు హరి పుచ్చుకొన్నవాఁడ నేను
చెచ్చెరఁ దగవు లింకఁ జెప్పఁగదరో

చ. 1: నిలిచినది జగము నిండినది భోగము
కలిగె జీవుల కొక్కకాణాచి
వలయశాసనాలు వడి నాల్గు వేదములు
చలపట్టి జాణలు చదువుకోరో

చ. 2: పారినవి మనసులు పట్టినది జననము
పోరు దీరెఁ గర్మముల పొలమేర
కోరికలె సాక్షులు గుట్టలు త్రిగుణములు
వూరుఁ బేరుఁ దెలుసుక వొడఁబడరో

చ. 3: దక్కినది ధర్మము తప్పనిది భాగ్యము
లెక్కించ నుదుటివ్రాలె లిఖితములు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటికి మూలము
చిక్కులు వాపె నితని సేవించరో

రేకు: 0196-03 రామక్రియ సం: 02-494 అన్నమయ్య స్తుతి

పల్లవి: వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడు కల్లంగరాదా

చ. 1: ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యముకాదు
కుడిచివేసిన పుల్లె కుడువఁగాఁ గాదు
బడినొకరు చెప్పినఁ బ్రతి చెప్పఁబోతేను
అడరి శ్రీహరి కది అరుహముగాదు

చ. 2: గంపెఁ డుముక దినఁగా నొక్క వరిగింజ
తెంపునఁ గలసితే తెలియనెట్టు వచ్చు
జంపులఁ బలవరించఁగ నొక మంచిమాట
ఇంపైతే హరి యందుకిచ్చునా వరము

చ. 3: వుమిసిన తమ్మలో నొకకొంత కప్రము
సమకూర్చి చవిగొని చప్పరించనేల
అమరఁగ ఛాయాపహారము సేసుక
తమమాట గూర్చితే దైవము నగఁడా

చ. 4: చిబికివేసిన గింజ చేతఁ బట్టఁగనేల
గబుక కెంగిలిబూరె గడుగఁగ మరి యేల
తొబుక కవిత్వాల దోషాలఁ బొరలితే
దిబుకార నవ్వఁడా దేవుఁడైనాను

చ. 5: మించుచద్దికూటి మీఁద నుమిసినట్టు
మంచి దొకటి చెప్పి మరిచెప్పనేరక
కంచుఁ బెంచు నొక్కగతి నదికితే ముట్టు-
పెంచువలెనే చూచు పెరుమాళ్లు వాని

చ. 6: పుచ్చినట్టి పండుబూఁజి లోననే వుండు
బచ్చన కవితలు బాఁతిగావు యెందు
ముచ్చుఁ గన్నతల్లి మూల కొదిగినట్టు
ముచ్చిమి నుతులేల మొక్కరో హరికి

చ. 7: వుల్లిదిన్న కోమ టూరకవున్నట్టు
జల్లెడ నావాలు జారిపోయినట్టు
కల్లలు చెప్పి యాకథ కుత్తరము లీక
మెల్లనే వుండితే మెచ్చునా దైవము

చ. 8: నేతి బీరకాయ నేయి అందులేదు

రాతివీరునికి బీరము ఇంచుకా లేదు
ఘాత బూరుగుఁబండు కడుపులోన దూది
యేతుల నుడుగులు యెక్కునా హరికి

చ. 9: ఇరుగువా రెరఁగరు పొరుగువా రెరఁగరు
గొరబైన మాటలు గొణఁగుచు నుందురు
పరులఁ గాదందురు బాఁతిగారు తాము
విరసు లట్టివారి విడుచు దేవుఁడు

చ. 10: యెన్నఁగ శ్రీవేంకటేశుఁ దాళ్లపాక
అన్నమాచార్యులు అఖిలదిక్కులు మెచ్చ-
నున్నతితో బాడిరొకఁ డెవ్వఁడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి

రేకు: 0196-04 లలిత సం: 02-495 వైష్ణవ భక్తి

పల్లవి: చిరకాలధర్మములు చివుకు దవ్వఁగఁబోతే
హరిమఱుఁగు చొచ్చితి మాతఁడే రక్షించెను

చ. 1: భువిఁ దొల్లి లేరా పుణ్యము సేసినవారు
జవళిశాస్త్రములెల్లాఁ జదివినవారు లేరా
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా
యివల నే మివి సేసి యెవ్వరిఁ బోలేము

చ. 2: తగఁ దొల్లి వినమా తపము సేసినవారి
జిగి నన్నియజ్ఞములు సేసినవారి వినమా
మిగులా సిద్ధివడసి మించినవారి వినమా
యెగువ నే మింతకంటే యెక్కుడు సేసేమా

చ. 3: పెక్కుమతములు చూచి బెండుపడ్డవారు లేరా
పక్కన నన్నివిద్యలాఁ బరగినవారు లేరా
వొక్కఁడే శ్రీవేంకటేశుఁ డుల్లములో నుండఁగాను
యెక్కుడితనిఁ గొలువ కెవ్వరిఁ బోలేము

రేకు: 0197-01 శంకరాభరణం సం: 02-496 నృసింహ

పల్లవి: చేపట్టి మమ్ముఁ గావు శ్రీనరసింహా నీ-
శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా

చ. 1: చెలఁగు వేయిచేతుల శ్రీనరసింహా
చిలకేటి నగవుల శ్రీనరసింహా
సిలుగులేని మంచిశ్రీనరసింహా నీ-
చెలిఁ దొడెక్కించుకొన్న శ్రీనరసింహా

చ. 2: క్షీరసముద్రమువంటి శ్రీనరసింహా దైత్యుఁ
జీరిన వజ్రపుగోళ్ల శ్రీనరసింహా
చేరి ప్రహ్లాదునిమెచ్చే శ్రీనరసింహా నుతిం-
చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా

చ. 3: శ్రీవనితతో మెలపు(గు?) శ్రీనరసింహా
చేవదేరే నీమహిమ శ్రీనరసింహా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీనరసింహా సర్వ-
జీవదయాపరుఁడవో శ్రీనరసింహా

రేకు: 0197-02 సాళంగనాట సం: 02-497 రామ

పల్లవి: నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడు గాక
ధరణిఁ గిరితికెక్కె దశరథసుతుఁడు

చ. 1: యీతఁడాతాటకిఁ జంపె నీమారీచసుబాహుల-
నీతఁడా మదమణఁచె నిందరుఁ జూడ
యేతులకు హరువిల్లు యీతఁడా విరిచి యట్టె
సీతఁ బెండ్లియాడెను యీచిన్నరాముఁడా

చ. 2: చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యులఁ జంపి
అప్పుడిట్టె వాలి నేసినాతఁ డీతఁడా
గుప్పించి కోఁతుల నేలి కొండల జలధి గట్టి
కప్పి లంక సాధించె నీకౌసల్యనందనుడా

చ. 3: రావణాదులనుఁ జంపి రక్షించి విభీషణుని
భావిం చయోధ్య నీతఁడు పట్టమేలెను
శ్రీవేంకటేశుఁ డితఁడే సృష్టి రక్షించె నితఁడే
యీవల మాపాలనున్న యీరామచంద్రుఁడా

రేకు: 0197-03 పాడి సం: 02-498 వేంకటగానం

పల్లవి: అదివో చూడరో అందరు మ్రొక్కరో
గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని

చ. 1: రవిమండలమున రంజిల్లు తేజము
దివిఁ జంద్రునిలో తేజము
భువి ననలంబునఁ బొడమిన తేజము
వివిధంబులైన విశ్వతేజము

చ. 2: క్షీరాంబుధిలోఁ జెలఁగు సాకారము
సారె వైకుంఠపు సాకారము
యీరీతి యోగీంద్రులెంచు సాకారము
సారెకు జగముల సాకారము

చ. 3: పాలసిన యాగంబులలో ఫలమును
పలు తపములలో ఫలమును
తలఁచిన తలఁపుల దానఫలంబును
బలిమి శ్రీవేంకటపతియే ఫలము

రేకు: 0197-04 రామక్రియ సం: 02-499 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఆతనిఁబో పొగడేము ఆతని శరణంటిమి
ఆతఁడే సర్వజీవుల అంతర్యామి

చ. 1: పెక్కు బ్రహ్మాండకోట్లు పెక్కు బ్రహ్మకోట్లు
పెక్కు రుద్రకోట్లును పెక్కు యింద్రులు
వొక్కొక్క రోమకూపాల నొగి నించుకుండునట్టి
వొక్కఁడే విష్ణుఁడు వీఁడే వున్నతోన్నతుఁడు

చ. 2: అనంత సూర్యచంద్రులు అనంత వాయువులును
అనంత నక్షత్రము లనంత మేరువులు
కొనలు సాగీ నన్నిటి కూటువఁ గూడుకొన్నట్టి
అనంతుఁడొక్కఁడే మించీ నాదిమూరితి

చ. 3: అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు
అసంఖ్యశక్తులు వరాలసంఖ్యములు
పొసఁగ నిన్నిటిఁ దానే పుట్టించి రక్షించినట్టి
అసంఖ్యాతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు

రేకు: 0197-05 దేసాళం సం: 02-500 శరణాగతి

పల్లవి: నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము
దైవమవై నీ వుండఁగ తగ మాదే బ్రదుకు

చ. 1: కోరి వొకరాతివీరుఁ గొల్చి బతికీ నొకఁడు
పైరు వొక్కచెట్టువెట్టి బతికేననీ నొకఁడు
కూరిమిఁ బాము చేఁబట్టుకొని బతికీ నొకఁడు
శ్రీరమణుని దాసుల చేతిదేపో భాగ్యము

చ. 2: ఇసుమంత మన్ను వట్టి యేచి బతికీ నొకఁడు
పసురము నింటఁ గట్టి బతికేననీ నొకఁడు
పసగా వేలె డినుము పట్టి బతికీ నొకఁడు
వసుధేశ నీవు గలవారి కేమి గడమ

చ. 3: ఆకునలముఁ గసవునంటి బతికీ నొకఁడు
లోకులు పెక్కుపాయాల లోలులై బతికే రదే
యీకడ శ్రీవేంకటేశ ఇవెల్లా నీమహిమలే
చేకొని నీమరఁగు చొచ్చినవారే ఘనులు

రేకు: 0197-06 సామంతం సం: 02-501 అధ్యాత్మ

పల్లవి: బయలుమొరంగగు పరమమాయ ఇది
నయమున లోనై వడతురు గాని

చ. 1: కలఁడు హరి యొకఁడు కావ జగములకు
కలిగినతఁడు లేక మానఁడు
తెలిసి ఇందరికిఁ దేరిన యర్థమే
మలసి యప్పటి మరతురు గాని

చ. 2: పుట్టినదెల్లా భోగముకొరకే
పుట్టిన భోగము పో దెపుడు
పట్టి యీమాఁటలే పలుకుదు రిందరు
మట్టులేక ఇది మరతురు గాని

చ. 3: కర్మము శ్రీవేంకటపతి కార్యము
కర్మము దేహికిఁ గాణాచి
ధర్మ మీదేవుని దాస్యం బందురు
మర్మము లోకులు మరతురు గాని

రేకు: 0198-01 శ్రీరాగం సం: 02-502 శరణాగతి

పల్లవి: ఎఱిఁగితి నమ్మితి నితఁడు దయానిధి
మఱఁగులు మొరఁగులు మరి యిఁక లేవు

చ. 1: వేదోద్ధరణుఁడు విశ్వరక్షకుఁడు
ఆదిమూర్తి శ్రీఅచ్యుతుఁడు
సోదించి కొలిచితి సుముఖుఁడై మమ్మేలె
యేదెస మాపాల నితఁడే కలఁడు

చ. 2: పరమపురుషుఁ డాపన్నివారకుఁడు
హరి శాంతుఁడు నారాయణుఁడు
శరణంటి మితఁడు చేకొని కాచెను
తరవాతిపనులఁ దప్పఁడితఁడు

చ. 3: హృదయాంతరంగుఁడు యీశ్వరేశ్వరుఁడు
ఇదివో శ్రీవేంకటేశ్వరుఁడు
వెదికితి మీతఁడు విడువఁడు మమ్మిఁక
తుదకును మొదలికి దొరికినవాఁడు

రేకు: 0198-02 మాళవిగౌళ సం: 02-503 దశావతారములు

పల్లవి: ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్టబాయిటనే నీవు పదిరూపు లైతివి

చ. 1: చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి

చ. 2: అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీఁగితి
బెడిదపు లంక విభీషణు నేలించితివి
అడరి పాండవులదిక్కై నిలిచితివి

చ. 3: త్రిపుర కాంతలగుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికిరూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు నుతులకు నిరవైతివి

రేకు: 0198-03 శంకరాభరణం సం: 02-504 అధ్యాత్మ

పల్లవి: ఇతని ప్రసాదమే యిన్నియును
గతి యితనిదే కన కాదనరాదు

చ. 1: కాయములో నొకఘనసంసారము
ప్రాయంబులతోఁ బ్రబలీని
ఆయ మందుకును హరి దానేయ్యై
దాయక పాయక తగిలున్నాఁడు

చ. 2: వొనరిన కలలో నొకసంసారము
మనసుతోడనే మలసీని
ననిచి యందుకును నారాయణుఁడై
కొనమొదలై తా గురియైనాడు

చ. 3: పుడిబడి కోర్కుల నొకసంసారము
బడిబడి యాసలఁ బరగీని
విడువక యిది శ్రీవేంకటేశ్వరుఁడే
తొడిఁబడఁ గల్పించి ధ్రువమయినాఁడు

రేకు: 0198-04 ముఖారి సం: 02-505 అధ్యాత్మ

పల్లవి: ఊరకే కలుగునా వున్నతపు మోక్షము
శ్రీరమణు కృపచేతఁ జేరు మోక్షము

చ. 1: కలుషముఁ బెడఁబాసి కర్మగండము గడచి
మలసి నప్పుడుగా మరి మోక్షము
చలనమించుక లేక సంసారవారధి దాఁటి
నిలిచినప్పుడుగా నిజమోక్షము

చ. 2: పంచేంద్రియాల మీరి భక్తి హరిమీఁద బెట్టి
మంచివాఁడైనప్పుడుగా మరి మోక్షము
అంచల యాసలు మాని ఆచార్యసేవ చేసి
మించినప్పుడుగా ఆమీఁది మోక్షము

చ. 3: శాంతమే కూడుగానుండి సమచిత్తమునఁ బొంది
మంతుకెక్కినప్పుడుగా మరి మోక్షము
అంతట శ్రీవేంకటేశుఁ డాదరించి మన్నించితే
నంతరంగమున నున్న దనాది మోక్షము

రేకు: 0198-05 వరాళి సం: 02-506 గురు వందన

పల్లవి: వెదకనేఁటికి నేయి వెన్న చేతఁ బట్టుకొని
మొదలఁ గలిగితేనే ముందరాఁ గలుగుట

చ. 1: తన పూర్వభావము తలఁచి మరవకుంటే
పనివడి తనపుణ్యఫల మబ్బుట
మనవార్తి నానాఁటిమాయ చూపెట్టకుండితే
జనించిన తనకు విజ్ఞానసిద్ధి యగుట

చ. 2: పుట్టినయప్పటి తనభోగముఁ దలఁచుకొంటే
కొట్టఁగొన తనకోర్కి కొనసాగుట
నట్టనడిమి జగమునటనఁ దెలుసుకొంటే
గుట్టుతోడి గురుబోధ గురుతు చేచిక్కుట

చ. 3: జీవకళ నంటినట్టి చిక్కు విదిలించుకొంటే
దేవుఁడు తనచేఁ జిక్కి తిరమౌట
శ్రీవేంకటేశుఁ డీతనిఁ జేరి శరణంటేను
ఆవల నీవలఁ దాను అన్నిటా గెలుచుట

రేకు: 0198-06 పాడి సం: 02-507 శరణాగతి

పల్లవి: హరి నారాయణ కృష్ణ అదివో మావిన్నపము
తరవాతి మాట నీవే తలఁచుకోవయ్యా

చ. 1: నడిఁబడ్డ తలఁపు చక్కఁగాక వుండినాను
వొడయఁడవు నీకృప వొగిఁ జక్కనే
గుడిగొన్న యేరెంత కొంకరవంకరలైనా
పుడమికి లోఁగొనకపోవునటవయ్యా

చ. 2: కాయకపు నాభక్తి కడుఁ గొంచమైనాను
ఆయపు నీవరములు అతిఘనమే
యేయెడ గుడి గొంచమయిన గుడిలో దేవుని-
కాయెడ మహిమ ఘనమందురు గదవయ్యా

చ. 3: శ్రీవేంకటేశ నిన్ను జింతించక నే నుండినా
జీవాంతరాత్ముఁడవై చేకొంటి నీవే
ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా
ఆవేళ సూత్రధారుఁ డాడించుఁ గదవయ్యా

రేకు: 0199-01 నాట సం: 02-508 నృసింహ

పల్లవి: ఇదె వీఁడె కంటిమమ్మ యేతులవాఁడు
కదలే సూర్యచంద్రుల కన్నులవాఁడు

చ. 1: సెలవి నవ్వులవాఁడు చేకత్తిగోళ్లవాఁడు
పలుపేగుల జంధ్యాల పంతాలవాఁడు
యెలమిఁ జెలిఁదొడపై నిడుకొన్నట్టివాఁడు
చెలఁగిన ఘననారసింహుఁడటే వీఁడు

చ. 2: కొండగద్దెమీఁదివాఁడు గొప్పకిరీటమువాఁడు
దిండుపైఁడిచీరకాశ(సె?) తెక్కులవాఁడు
రెండురూపులొకటైన రీతుల మాయలవాఁడు
అండఁ బ్రహ్లాదవరదుఁ డాతఁడటే వీఁడు

చ. 3: భవనాసి పొంతవాఁడు భావించఁ దెల్లనివాఁడు
ఇవల శ్రీవేంకటాద్రి నిరవైనాఁడు
జవళిపంతాలవాఁడు శంఖుచక్రములవాఁడు
తివిరిన అహోబలదేవుఁడటే వీఁడు

రేకు: 0199-02 బౌళి సం: 02-509 కృష్ణ

పల్లవి: పరమ పురుషుఁడీ బాలుఁడట

హర విరుంచులు మొక్కేరదివో వాకిటను

చ. 1: దేవుఁడితఁడు సర్వదేవతల కొడయఁడు

వేవేలు వేదములచే వేద్యుఁడితఁడు

దేవకీదేవికి వసుదేవునికిఁ గొడుకాయ

యీవిధము నోఁచిరి వీరెంత భాగ్యవంతులో

చ. 2: అంతటాఁ దానున్నవాఁడు అరయ స్వతంత్రుఁడు

అంతయు నాదియులేని ఆదిమూరితి

వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి

దొంతరకొడుకైనాఁడు తొల్లి వీరే పుణ్యులో

చ. 3: ఇందిరావల్లభుఁడు ఇహపరనాయకుఁడు

కందువ శ్రీవేంకటాద్రిఁ గాపున్నవాఁడు

మందగొల్లెతలకెల్ల మరఁది దానైనాఁడు

ఇందరు నిందరే వీరి కెన్నటి సంబంధమో

రేకు: 0199-03 లలిత సం: 02-510 కృష్ణ

పల్లవి: ఎన్నఁడు గలుగు మరి యీభాగ్యము
సన్నిధాయ నితనికి శరణనరే

చ. 1: అదె చంద్రుఁ డుదయించె నచ్యుతుఁడు జనియించె
అదనఁ గంసునిజన్మ మస్తమించెను
పొదలిరి దివిజులు పొలిసిరి రాక్షసులు
సదర మీ శిశువుకు శరణనరే

చ. 2: పాండవకులము హెచ్చె బాలకృష్ణుఁడిదె వచ్చె
చండి దుర్యోధనుమూఁక జల్లన విచ్చె
దండి గోకులము నిండె ద్రౌపది తపము పండె
చండప్రతాపున కిట్టె శరణనరే

చ. 3: రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుఁడు డాసె
గోపికల మనసుల కొఱత వాసె
కోపుల ధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేఁటి కితని శరణనరే

రేకు: 0199-04 ముఖారి సం: 02-511 వైష్ణవ భక్తి

పల్లవి: అతఁడే గతియని యంటే నన్నిటా మాన్యుఁడు
ఇతరాలు మానఁగానే యీతనికే శలవు

చ. 1: శ్రీరమణుని నిత్యసేవకులకుఁ దొల్లె
వేరులేని కర్మముల వెట్టి మాన్యము
ఆరీతి నితనిభక్తులైన చనవరులకు
ఆరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు

చ. 2: తక్కక యితనిముద్ర ధరించిన దాసులకు
చొక్కుల భవబంధాల సుంక మాన్యము
లెక్కించ నితనికైన లెంకలకు బొడుకల-
కొక్కట విధినిషేధా లూహింపలేవు

చ. 3: సరుస శ్రీవేంకటేశు శరణాగతులకును
పరగ మాయల దొడ్డిబందె మాన్యము
పరమమైన యితని పళ్లెముకూటివారికి
ధరలో నేమిటివంకాఁ దప్పులే లేవు

రేకు: 0199-05 సామంతం సం: 02-512 శరణాగతి

పల్లవి: నీ చేతలోవారము నీవారము
యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము

చ. 1: ఇన్నిటాఁ బూర్ణుఁడవు నీ వెరఁగని యర్థమేది
విన్నపము నేఁ జేసే విధమేది
మన్నించిన నీమన్ననే మహిమలో మాబ్రదుకెల్ల
వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము

చ. 2: ఘనదేవుఁడవు నీకుఁ గడమలు మరియేవి
గొనకొని నే నిన్నుఁ గొసరేదేమి
పొనుగక యేలితివి పుట్టిన మాపుట్టుగెల్ల
ననిచి నిన్ను నమ్మిన నమ్మికే మావ్రతము

చ. 3: శ్రీవేంకటేశుఁడ నీవు చి త్తగించనిది యేది
భావించి నేఁ బొందని భాగ్య మేది
యేవల మాపరభారా లింతయు నీకెక్కినది
ఆవటించి నే నీశరణన్నదే మావ్రతము

రేకు: 0199-06 దేసాక్షి సం: 02-513 వైరాగ్య చింత

పల్లవి: కనియుండి భ్రమసితిఁ గట్టా నేను
యెనలేక గురియైతి నిట్టే నేను

చ. 1: తోలునెముకలు గట్టి దొరనంటా మురిసేను
అలుబిడ్డల మరఁగు ఆహా నేను
గాలి యాటించుకొని కాలములు గడపేను
వోలిఁ బుణ్యపాపమందు వోహో నేను

చ. 2: మంటివంక బదుకుతా మదియించి మురిసేను
ఇంటిముంగిటనే వుండి యీహీ నేను
వొంటివాఁడనై వుండి వూరఁగలవెల్లాఁ గోరే
వొంటిన యాసల తోడ నూహూ నేను

చ. 3: నూలికోకఁ గట్టువడి నున్ననై నే మురిసేను
యీలాగు నాబదుకెల్ల యేహే నేను
పాలించి శ్రీవేంకటాద్రిపతి నాకుఁ గలుగఁగ
ఆలరినై గెలిచితి హైహై నేను

రేకు: 0200-01 మాళవిగౌళ సం: 02-514 శరణాగతి

పల్లవి: నీవు సర్వగుణసంపన్నుఁడవు నే నొకదుర్గుణిని
మానవు నన్నొక యెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా

చ. 1: యేలినవాఁడవు నీవు ఇటు నేఁ గొలిచినవాఁడ
పోలింపఁగ నీవే దేవుఁడవు భువి నే నొకజీవుఁడను
పాలించేవాఁడవు నీవు బ్రదికేవాఁడను నేను
తాలిమి నన్నొక సరిచేసుక నను(దప్పులెంచనేలా అయ్యా

చ. 2: అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు జిగి నేఁ బరతంత్రుఁడను
ఇంత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు నే నిర్దయుఁడను
చెంతల నన్నొక మొనసేసుక నాచేఁత లెంచనేలా అయ్యా

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను ఇటు నేను
అవలనీవల దాతవు నీవు యాచకుఁడను నేను
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవశమగు నను ప్రతివెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా

రేకు: 0200-02 నాట సం: 02-515 ఉత్సవ కీర్తనలు

పల్లవి: వెడలె వెడలె నదె వీధులవీధుల
తొడికి దైత్యులనుఁ దుంచఁగను

చ. 1: కోటిసూర్యలోకకూటువ గూడుక
చాటువ మెరసేటి చక్రము
గాఁటపు వేవేలు కాలరుద్రులటు
నీటునఁ దొలఁకేటి నిబిడచక్రము

చ. 2: ప్రళయకాలముల బడబాగ్నలొలుకు-
చలమరి ప్రతాపచక్రము
కలకలరవముల కాలభైరవులు
కలసి మెలంగేటి గండచక్రము

చ. 3: యమసహస్రము లనంత మేకమై
సమరము గెలిచేటి చక్రము
అమరుచు శ్రీవేంకటాధిపు కరమునఁ
దెమలకయుండేటి దివ్యచక్రము

రేకు: 0200-03 బౌళి సం: 02-516 ఉత్సవ కీర్తనలు

పల్లవి: మొక్కెద మిదివో మూఁడుమూర్తులును
వొక్కరూపమై వొనరెఁ జక్రము

చ. 1: చెండిన రావణు శిరోమాలికల
దండల పూజల తఱచుగను
మెండుగఁ గంసుని మెదడు గంధముగ
నిండ నలఁదుకొని నిలిచెఁ జక్రము

చ. 2: చించి హిరణ్యకసిపు పెనురక్తపు-
అంచనర్ఘ్య పాద్యమ్ములను
పంచజన ఘనకపాలపు టెముకను-
పంచవాద్యములఁ బరగు చక్రము

చ. 3: బలు మధుకైటభ ప్రాణవాయువుల
అలరిన నైవేద్యంబులను
యెలిమిని శ్రీవేంకటేశు హస్తముల
వెలసి నిలచె నిదె విజయచక్రము

రేకు: 0200-04 సాళంగం సం: 02-517 అధ్యాత్మ

పల్లవి: చేకొంటి నిహమే చేరిన పరమని
కైకొని నీవిందు కలవే కాన

చ. 1: జగమునఁ గలిగిన సకలభోగములు
తగిన నీప్రసాదములే యివి
అడపడు నేఁబదియక్షరపంక్తులు
నిగమగోచరపు నీమంత్రములే

చ. 2: పొదిగొని సంసారపుత్రదార లిల
వదలని నీదాసవర్గములే
చెదరక యేపొద్దుఁ జేయు నాపనులు
కదిసిన నియ్యాజ్ఞాకైంకర్యములే

చ. 3: నలుగడ మించిన నాజన్మాదులు
పలుమరు లిటు నీపంపు లివి
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ విఁక
వలసినప్పుడీ వరములు నాకు

రేకు: 0200-05 లలిత సం: 02-518 మాయ

పల్లవి: కానవచ్చీఁ గానరావు కమలాక్ష నీమాయ
తానే వెంటవెంటఁ దగిలీ నిదివో

చ. 1: తొల్లి నీవు గలవు తోడనే నేఁను గలను
యెల్లగా నీప్రపంచము యింతాఁ గలదు
కొల్ల యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్లు
చల్లని నేనొకఁడనే జన్మములే వేరు

చ. 2: వేదములు నాటివే వినుకులు నాటివే
ఆదినుండి చదివే నదియే నేను
వేదతో వెన్నవట్టి నేయి వెదకఁబోయినయట్లు
దాదాత నాతెలివి యితరుల నడిగేను

చ. 3: వైకుంతమూ నున్నది వరములు నున్నవి
యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను
కైకొని పువ్వు ముదిరి గక్కనఁ బిందెయైనట్లు
నీకు శరణనఁగాను నే నేడేరితిని

రేకు: 0200-06 దేసాళం సం: 02-519 శరణాగతి

పల్లవి: కడనుండి చూచే నీకుఁ గనికరమైతేఁ గన
బడి నన్నుఁ గావు నీతో బలిమేలే

చ. 1: వొడలు మోచినయది యొకయపరాధము
అడరి సంసారినౌటె యపరాధము
బడి నిని పఱచిన పాట్లఁ బడకపోడు (దు?)
యెడనీకు మొరవెట్ట నిఁకఁ జోటేదయ్యా

చ. 2: అన్నపానములు గొన్న దది యొక్కనేరమి
వున్నతి సంపదఁ బొందు టొకనేరమి
యిన్నియు ననుభవించి యిఁక నొల్లనంటేఁ బోదు
విన్నపాలు సేసి నీతో విసుగఁ జోటేది

చ. 3: మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల
అదనఁ గర్మాధికారనౌ టొకకల్ల
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గాచితివి
తుద కెక్కితిమి యింకఁ దొలఁగఁగవలెనా

రేకు: 0201-01 మాళవి సం: 03-001 శరణాగతి

పల్లవి: ఇట్టి ప్రతాపము గల యీతని దాసుల నెల్ల
కట్టునా కర్మములెల్ల గాలిఁ బోవుఁ గాక

చ. 1: యెలమిఁ జక్రాయుధున కెదురా దానవులు
తొలఁగ కెందుచొచ్చినఁ దుండించుఁ గాక
ఇల గరుడధ్వజు పై నెక్కునా విషములు
కలఁగి నీరై పారి గాలిఁ బోవుఁ గాక

చ. 2: గోవర్ధనధరునిపై కొలుపునా మాయలు
వేవేలు దునుకలై విరుగుఁగాక
కేవలుఁ డచ్యుతునొద్దఁ గీడు చూపఁగలవా
కావరమై తాఁ దానె గాలిఁ బోవుఁ గాక

చ. 3: వీరనారసింహునకు వెరపులు గలవా
దూరాన గగ్గులకాడై తొలఁగుఁ గాక
కోరి యీ శ్రీవేంకటేశుఁ గొలిచితి మిదివో
కారుకొన్న పగలెల్ల గాలిఁ బోవుఁ గాక

రేకు: 0201-02 బౌళి సం: 03-002 అధ్యాత్మ

పల్లవి: ఏది నిజంబని యెటువలె నమ్ముదు
పోదితోడ నను బోధింపవే

చ. 1: సత్తు నసత్తని సర్వము నీవని
చిత్తగించి శ్రుతి చె ప్పెడిని
వుత్తమమధ్యమ మొగిఁ గలదని మరి
యిత్తల శాస్త్రము లేర్పరచీని

చ. 2: నానారూపులు నరహరి నీవని
పూనిన విధు లిటు పొగడెడిని
మానక హేయము మరి వుపాధే(దే?)యము
కానవచ్చి యిలఁ గలిగియున్నవి

చ. 3: భావాభావము పరమము నీ వని
దైవజ్ఞులు నినుఁ దలఁచెదరు
శ్రీవేంకటగిరిఁ జెలఁగిన నీవే
తావుగ మదిలోఁ దగిలితివి

రేకు: 0201-03 సాళంగనాట సం: 03-003 నామ సంకీర్తన

పల్లవి: గెలిచితి భవములు గెలిచితి లోకము
యెలమి నీ దాసుల కెదురింక నేది

చ. 1: జయ జయ నరసింహా జయ పుండరీకాక్ష
జయ జయ మురహర జయ ముకుంద
భయహరణము మాకుఁ బాపనాశనము
క్రియతోడి నీ సంకీర్తన గలిగె

చ. 2: నమో నమో దేవ నమో నాగపర్యంక
నమో వేదమూ ర్తి నారాయణా
తిమిరి మమ్ముఁ గావఁగ దిక్కయి మాకు నిలువ
జమళి భుజముల శంకుఁజక్రములు గలిగె

చ. 3: రక్ష రక్ష పరమాత్మ రక్ష శ్రీవేంకటపతి
రక్ష రక్ష కమలారమణ పతి
అక్షయ సుఖమియ్యఁగల న(వ?)టు దాపుదండగా
పక్షివాహనుఁడ నీభ క్తి మాకుఁ గలిగె

రేకు: 0201-04 దేసాళం సం: 03-004 కృష్ణ

పల్లవి: ఎక్కడ చూచిన వీరే యింటింటి ముంగిటను
పెక్కుచేతలు సేసేరు పిలువరే బాలుల

చ. 1: పిన్నవాఁడు కృష్ణుడు పెద్దవాడు రాముఁడు
వన్నె నిద్దరమడలవలె నున్నారు
వెన్నలు దొంగిలుదురు వీఁడు వాఁడు నొక్కటే
పన్నుగడై వచ్చినారు పట్టరే యీ బాలుల

చ. 2: నల్లనివాఁడు కృష్ణుడు తెల్లనివాఁడు రాముఁడు
అల్లదివో జోడుకోడెలై వున్నారు
వెల్లవిరై తిరిగేరు వేరు లే దిద్దరికిని
పెల్లుగ యశోదవద్దఁ బెట్టరె యీబాలుల

చ. 3: రోలఁ జిక్కె నొకఁడు రోకలి పట్టె నొకఁడు
పోలిక సరిబేసికిఁ బొంచి వున్నారు
మేలిమి శ్రీవేంకటాద్రి మించిరి తానే తానై
ఆలించి నె(యె?)వ్వరి నేమి ననకురే బాలుల

రేకు: 0201-05 నాట సం: 03-005 వైష్ణవ భక్తి

పల్లవి: దాసోహమను బుద్ధిఁ దలచరు దానవులు
యీసులకే పెనఁగేరు యిప్పుడూఁ గొందరు

చ. 1: హరిచక్రము దూషించే యట్టివారే యసురలు
అరయఁ దామే దైవమన్నవారు నసురలే
ధర నరకాసురుడు తానె దైవమని చెడె
యిరవై యిది మానరు యిప్పుడూఁ గొందరు

చ. 2: పురుషోత్తముని పూజ పొంతఁ బోరు అసురలు
సరవి విష్ణుని జపించనివారు నసురలే
హిరణ్యకశిపుఁడును యీతని నొల్లక చెడె
ఇరవై యీతని నొల్ల రిప్పుడూఁ గొందరు

చ. 3: సురలును మునులును శుకాది యోగులును
పరమము శ్రీవేంకటపతి యనుచు
శరణని బ్రదికేరు సరి నేఁడు వైష్ణవులు
యెరపరికానఁ బొయ్యే రిప్పుడూఁ గొందరు

రేకు: 0201-06 బౌళి సం: 03-006 శరణాగతి

పల్లవి: వెఱ్ఱివాఁడ వెఱ్ఱివాఁడ వినియుఁ గనియుఁ మరి
వెఱ్ఱి దెలిసి రోఁకలి వేరె చుట్టేఁ గాక

చ. 1: పుట్టించిన వాడవట పూఁచి నన్నుఁ బెంచలేవా
కట్టఁగడ నమ్మని నాకడమే కాక
వొట్టి నాలో నుందువట వొగిఁ బాపము నాకేది
గట్టిగాఁ బుణ్యము వేరే కట్టుకొనేఁ గాక

చ. 2: యేడనైనా నీవే యట యెదుట నుండఁగలేవా
వేడ(డె?) వెఱ్ఱి యేడనై నా వెదకేఁ గాక
ఆడినదెల్లా నీవట అందులోఁ దప్పులన్నవా
వీడు పడ్డ తలఁపుతో వెరచేఁ గాక

చ. 3: భావించితే మెత్తువట పరము నీ వియ్యలేవా
నీవాఁడనని నా నేరమే కాక
శ్రీవేంకటేశుఁడ నేను చేరి నీకు శరణంటి
దేవుఁడవై కావఁగా నే దిద్దుకొనేఁ గాక

రేకు: 0202-01 ఆహిరి సం: 03-007 అధ్యాత్మ

పల్లవి: పూచిన యీ దేహము పువ్వుగాని పిందెగాని
చేచేత నెవ్వరికిఁ జెప్పనోపఁ బ్రియము

చ. 1: పుట్టించిన దైవము పూరి మేపునా మమ్ముఁ
బట్టిన పూర్వకర్మము పాసిపొయ్యీనా
మెట్టిన సంసారము మెదిగిన పాటే చాలు
తొట్టి కన్నవారినెల్ల దూర నోప మిందుకు

చ. 2: నొసలఁ వ్రాసిన వ్రాలు నుసిగితే మానీనా
కొసరి జగము నాకే కొత్తలయ్యీనా
వుసురుతోడి సుఖము వుండిన పాటే చాలు
కొసరి జన్మములింకాఁ గోరనోప నేను

చ. 3: యేలినవాఁడు శ్రీహరి యేమి సేసినా మేలె
వేళతో నాతఁడే శ్రీవేంకటేశుఁడు
పాలించె నాతఁడు మమ్ము పదివేలులాగులను
యీలాగులనే సుఖిఇం(???)చేము నేము

రేకు: 0202-02 ధన్నాసి సం: 03-008 గురు వందన, నృసింహ

పల్లవి: పుట్టినట్టె వున్నవాఁడ పోలేదు రాలేదు
ఇట్టె నీ దాసుఁడ నైతి యెంగిలెల్లఁ బాసె

చ. 1: వెలినున్న జగమెల్ల విష్ణుఁడ నీ మహిమే
అలరి నాలోన నీవే అంతరాత్మవు
తెలిసి నేనున్నచోటే దివ్యవైకుంఠము
వెలలేని నరకముల వెరపెల్లఁ దీరె

చ. 2: తనువుతో నుండేది నీ తలఁచిన తలఁపేనా
మనుపు సంసారము నీమాయ చేతిదే
పనులనా కర్మము నీ పంచినట్టి పనుపే
మనసు లోపలి యనుమానమెల్లఁ బాసె

చ. 3: తెరమరుగు దినాలు దేవుఁడ నీ కల్పితమే
సొరిది యీ సురలెల్ల చుట్టాలే నాకు
నిరతి శ్రీవేంకటేశ నీమరఁగు చొచ్చి నేఁడు
గురుని యానతిచేతఁ గొంకులెల్లా బాసె

రేకు: 0202-03 వరాళి సం: 03-009 వైరాగ్య చింత

పల్లవి: ఐనదయ్యీఁ గానిదెల్లా నటు గాకుండితే మానీ
మానుపరాదివి హరి మాయామహిమలు

చ. 1: పుట్టేటివెన్ని లేవు పోయేటివెన్ని లేవు
వెట్టి దేహాలు మోచిన వెడజీవులు
గట్టిగాఁ దెలుసుకొంటే కలలోనివంటి దింతే
పట్టి ఇందుకుఁగా నేల బడలేమో నేము

చ. 2: కడచినవెన్ని లేవు కాచుకున్నవెన్ని లేవు
సుడిగొన్న తనలోని సుఖదుఃఖాలు
యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే
కడనుండి నేమేల కరఁగేమో నేము

చ. 3: కోరినవియెన్ని లేవు కోరఁగలవెన్ని లేవు
తీరని సంపదలతో తెందేపలు
ధారుణి శ్రీవేంకటేశు దాసులమై యిన్నియును
చేరి కైకొంటిమి యేమి సేసేమో నేము

రేకు: 0202-04 సాళంగం సం: 03-010 భక్తి

పల్లవి: భక్తసులభుఁడును పరతంత్రుఁడు హరి
యుక్తిసాధ్య మిదె యొకరికీఁ గాఁడు

చ. 1: నినుపగు లోకముల నిండిన విష్ణుఁడు
మనుజుఁడ నాలో మనికియయ్యె
మునుకొని వేదముల ముడిగిన మంత్రము
కొననాలికలలోఁ గుదురై నిలిచె

చ. 2: యెలమి దేవతల నేలిన దేవుఁడు
నలుగడఁ నధముని నను నేలె
బలుపగు లక్ష్మీపతి యగు శ్రీహరి
యిల మా యింటను యిదివో నిలిచె

చ. 3: పొడవుకుఁ బొడవగు పురుషోత్తముఁడిదె
బుడిబుడి మా చేతఁ బూజ గొనె
విడువ కిదివో శ్రీవేంకటేశ్వరుఁడు
బడి వాయఁడు మా పాలిట నిలిచి

రేకు: 0202-05 లలిత సం: 03-011 అధ్యాత్మ

పల్లవి: జ్ఞానినైనా నీకుఁ బో దజ్ఞానినైనా నీకు బోదు
నేను చేసిన నేరమి నీకే సెలవయ్యా

చ. 1: గరిమ మా పుట్టుగు నీ గర్భవాసములోనే
అరయ మా మోక్షము నీ యరచేతిదే
వెరపు లెంచుకోఁబోతే వేరే మాకు గతి లేదు
నిరతి మా బదుకులు నీకు సెలవయ్యా

చ. 2: నిండిన మా కోరికలు నీ పెర రేఁపులే
వుండఁ జోటు నీకు నా వుల్లములోనే
చండి పెట్టి మాకైతే స్వతంత్ర మించుకా లేదు
నిండిన మా చేఁతలెల్లా నీకే సెలవయ్యా

చ. 3: యిదె మా సంసారములు యిట్టె నీ కల్పితములు
తుదమొదలును నీవే తోడునీడవు
యెదుట శ్రీవేంకటేశ యేలిన వాఁడవు నీవే
నిదుర మా దినములు నీకే సెలవయ్యా

రేకు: 0202-06 సాళంగనాట సం: 03-012 వైష్ణవ భక్తి

పల్లవి: ఎక్కడి నరకములు యెక్కడి మృత్యువు మాకు
దక్కి నీ దివ్యనామామృతము చూరగొంటిమి

చ. 1: తమితో శ్రీపతి నీ దాసులఁ జేరినప్పుడే
యమకింకర భయము లణఁగిపోయ
జమళి నీ యాయుధలాంఛనము మోచినప్పుడే
అమరఁ గాలదండము లవియెల్లఁ బొలిసె

చ. 2: మును నీ నగరిత్రోవ మొగమైన యప్పుడే
ఘనయామ్య మార్గము గట్టు వడియ
వొనర నీ తిరుపతి నొకరాత్రి వున్నపుడే
కనలు కాలసూత్రాది ఘాతలెల్లఁ బూడె

చ. 3: యెడరై నీ మంత్రజప మెంచుకొన్న యపుడే
కడుఁ జిత్రగుప్తుని లెక్కలు గడచె
వడిగా శ్రీవేంకటేశ్వర మీ శరణనఁగా
అడరి వైకుంఠము మాయరచేత నిలిచె

రేకు: 0203-01 సామంతం సం: 03-013 గురు వందన

పల్లవి: పురుషుల నీ గతి బోధించి బోధించి
సురతసమాధియందుఁ జొక్కించే రదివో

చ. 1: కొంకక సతుల నేటి గురువు లందరికి
కంకిగా మర్మాలు సోఁకఁగ హర్షించి
లంకెలను బంచాంగుళహస్త మస్తకమున
వుంకువఁ దమ యంగము వుపదేశించేరు

చ. 2: మదనమంత్రములెల్ల మరి చెవిలోనఁ జెప్పి
మొదల నఖాంకురపుముద్రలు వెట్టి
పది మారులుఁ దమ్ములప్రసాదములు వెట్టి
పుదుట సంసారబ్రహ్మ ముపదేశించేరు

చ. 3: బడలించి అనంగపర వస్తువును జూపి
కడపట విరక్తిఁ గడు బోధించి
తడవి శ్రీవేంకటేశు దాసులఁ దప్పించి
వుడివోని జీవులకు నుపదేశించేరు

రేకు: 0203-02 గుజ్జరి సం: 03-014 అధ్యాత్మ

పల్లవి: ఇంతేపో వారివారి హీనాధికము లెల్ల
పంతాన తామేపాటి భాగ్యమునా పాటే

చ. 1: అందరిలో దేవుఁడుండు అందధికులు గొందరు
కొందరు హీనులై కుందుదురింతే
చెంది వీచే గాలొకటే చేనిపంటా నొకటే
పొంది గట్టి కొలుచుండి పొల్లు కడఁబడును

చ. 2: పుట్టు గందరి కొకటే భూమిలో యేలికలును
వెట్టిబంట్లుఁ గొందరై వీఁగుదురింతే
చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టలై మేలొకటికి తీలొకటి కాయ

చ. 3: కోరి శ్రీవేంకటపతి కుక్షిలోనే లోకములు
ఆరయఁ గిందెదుమీఁదెడ్డై వున్నవింతే
యీరీతి నితని దాసు లెక్కిరి పొడవులకు
తారి కిందికి దిగిరి దానవులై కొందరు

రేకు: 0203-03 లలిత సం: 03-015 అధ్యాత్మ

పల్లవి: అన్నిటా నా పాలిటికి హరి యాతఁడే కలఁడు
యెన్నికగాఁదుదిపద మెక్కితిమి మేలు

చ. 1: కొందరు జీవులు నన్నుఁ గోపగించినా మేలు
చెంది కొందరట్టె సంతసించినా మేలు
నిందించి కొందరు నన్ను నేఁడే రోసినా మేలు
పొందుగ కొందరు నన్నుఁ బొగడినా మేలు

చ. 2: కోరి నన్నుఁ బెద్దసేసి కొందరు మొక్కినా మేలు
వేరే హీనుఁడని భావించినా మేలు
కూరిమిఁ గొందరు నన్నుఁ గూడుకుండినా మేలు
మేరతో విడిచి నన్ను మెచ్చకున్నా మేలు

చ. 3: యిప్పటికిఁ గల పాటి యెంత పేదయినా మేలు
వుప్పతిల్లు సంపద నాకుండినా మేలు
యెప్పుడు శ్రీవేంకటేశు కే నిచ్చిన జన్మమిది
తప్పు లే దాతనితోడి తగులమే మేలు

రేకు: 0203-04 ధన్నాసి సం: 03-016 అధ్యాత్మ

పల్లవి: ఊరకే నీ శరణని వుండుటే నా పనిఁ గాక
యీ రీతి నా వుపాయము లేడ కెక్కీనయ్యా

చ. 1: ముందే అంతర్యామివై మొగి నాలో నుండఁగాను
చెంది నిన్ను లేనివానిఁ జేసుక నామనసులో
గొంది నీయాకారముగా కొంత నే భావించుకొంటా
ఇందుఁ గల్పితధ్యానము లెట్టు చేసేనయ్యా

చ. 2: కన్నులఁ జూచినందెల్ల కమ్మి నీవై యుండఁగాను
అన్నిటాఁ బ్రత్యక్షమందు అభావన చేసుకొని
విన్ననై తెలియలేక వేరే యెందొ వెదకుచు
పన్నిన ప్రయాసాలఁ బడనేటికయ్యా

చ. 3: శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతివై కొలువుండి
ఆవటించి తలఁపులో నచ్చొత్తి నట్టుండఁగాను
దేవుఁ డెట్టివాఁడంటా తెగని చదువులందు
సోవలుగా నింకనేమి సోదించేనయ్యా

రేకు: 0203-05 రామక్రియ సం: 03-017 కృష్ణ

పల్లవి: భూమిలోనఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిదివో
నేమపు కృష్ణజయంతి నేఁడే యమ్మా

చ. 1: కావిరి బ్రహ్మాండము కడుపులో నున్నవాని
దేవకి గర్భమున నద్దిర మోచెను
దేవతలెల్ల వెదకి తెలిసి కాననివాని
యీవల వసుదేవుఁడు యెట్టు గనెనమ్మా

చ. 2: పొడవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు
అడరి తొట్టెల బాలుఁడాయనమ్మ
వుడగక యజ్ఞ భాగ మొగి నారగించేవాఁడు
కొడుకై తల్లి చన్ను గుడిచీనమ్మా

చ. 3: పాలజలధి యల్లుండె(డై?) పాయకుండే యీతనికి
పాలవుట్ల పండుగ బాఁతే(తా?)యనటే
ఆలరి శ్రీవేంకటాద్రి నాటలాడనే మరిగి
పేలరియై కడు పెచ్చువెరిగీనమ్మా

రేకు: 0203-06 లలిత సం: 03-018 వేంకటగానం

పల్లవి: అందాఁకా నమ్మలేక అనుమానపడు దేహి
అంది నీ సొమ్ము గనక అదియుఁ దీరుతువు

చ. 1: నీదాసుఁడన నేటి నిజబుద్ధి గలిగితే
ఆ దెస నప్పుడే పుణ్యుఁడాయ నతఁడు
వేద(దు?)తో నొక్కొక్కవేళ వెలుతులు గలిగితే
నీదయవెట్టి వెనక నీవే తీరుతువు

చ. 2: తొలుత నీ శరణము దొరకుటొకటే కాని
చెలఁగి యా జీవునికిఁ జేటు లేదు
కలఁగి నడుమంత్రాన గతిదప్ప నడచిన
నెలకొని వంకలొత్త నీవే నేరుతువు

చ. 3: నీవల్లఁ గొరత లేదు నీ పేరు నొడిగితే
శ్రీవేంకటేశ యిటె చేరి కాతువు
భావించలేకుండఁగాను భారము నీ దంటేఁ జాలు
నీవారి రక్షించ నీవే దిక్కొదువు

రేకు: 0204-01 లలిత సం: 03-019 శరణాగతి

పల్లవి: కడు నజ్ఞానపు కరవుకాలమిదె
వెడలదొబ్బి మా వెరపు దీర్చవే

చ. 1: పాపపు పసురము బందెలు మేయఁగ
పోపుల పుణ్యము పాలివోయ
శ్రీపతి నీకే చేయి చాఁచెదము
యేపున మమ్మిఁక నీడేర్చవే

చ. 2: యిలఁ గలియుగమను యెండలు గాయఁగ
చెలఁగి ధర్మమను చెరు వింకె
పొలసి మీ కృపాంబుధి చేరితి మిదె
తెలిసి నాదాహము తీర్చవే

చ. 3: పడిగొని మనసిజవాయువు విసరఁగ
పొడవగు నెఱుకలు పుట మెగసె
బడి శ్రీవేంకటపతి నీ శరణము
విడువక చొచ్చితి వెసఁ గావఁగదే

రేకు: 0204-02 గుజ్జరి సం: 03-020 శరణాగతి

పల్లవి: భావించి నేరనైతి పశుబుద్ధి నైతిని
యీవల నా యపచార మిది గావవయ్యా

చ. 1: హరి నీవు ప్రపంచమందుఁ బుట్టించితి మమ్ము
పరము నే సాధించేది బలుద్రోహమవుఁ గాదో
సిరుల నేలేటివాఁడు చెప్పినట్టు సేయక
విరసాలు బంట్లకు వేరే సేయఁ దగునా

చ. 2: పంచేంద్రియములు నాపైఁ బంపువెట్టితివి నీవు
యెంచి వాని నే దండించేదిది నేరమౌఁ గాదో
పెంచేటి తల్లిదండ్రులు ప్రియమై వడ్డించఁగాను
కంచము కాలఁ దన్న సంగతి యాబిడ్డలకు

చ. 3: మిక్కిలి సంసారము మెడఁగట్టితివి నాకు
అక్కర నే వేసారేది అపరాధమవుఁ గాదో
దిక్కుల శ్రీవేంకటాద్రి దేవుఁడ నీవియ్యఁగాను
యెక్కడో జీవుఁడ నేను యెదురాడఁ దగునా

రేకు: 0204-03 రామక్రియ సం: 03-021 కళ్యాణ కీర్తనలు

పల్లవి: గరుడధ్వజం బెక్కె కమలాక్షు పెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బైపై సేవించను

చ. 1: పాడిరి సోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులై న అచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభుని పెండ్లికిని

చ. 2: కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని

చ. 3: వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసిరదే తలఁబ్రాలు పుణ్యసతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి

రేకు: 0204-04 గుండక్రియ సం: 03-022 అధ్యాత్మ

పల్లవి: ఇతర చింత లిఁక నేమిటికి
అతఁడే గతియై అరసేటివాఁడు

చ. 1: కర్మమూలమే కాయము నిజ-
ధర్మమూలమే తన యాత్మ
అర్మిలి రెంటికి హరియొకఁడే
మర్మ మీతఁడే మనిపేటివాఁడు

చ. 2: బహుభోగమయము ప్రపంచము
నిహితజ్ఞానము నిజముక్తి
ఇహపరములకును యీశ్వరుఁడే
సహజపుఁ గర్తై జరపేటివాఁడు

చ. 3: అతిదుఃఖకరము లాసలు
సతత సుఖకరము సమవిరతి
గతి యలమేల్మంగతో శ్రీవేంకట
పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు

రేకు: 0204-05 శంకరాభరణం సం: 03-023 వైష్ణవ భక్తి

పల్లవి: అచ్చుత మిమ్ముఁ దలఁచే యంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్యఁగా

చ. 1: మిమ్ము నెఱిఁగిన యట్టి మీ దాసుల నెఱిఁగే
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీ సేవ సేసుకుండేటి వైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు

చ. 2: నిరతి నీకు మొ క్కే నీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుబూజించే ప్రపన్నులఁ బూజించే
సరిలేని భాగ్యము చాలదా నాకు

చ. 3: అంది నీకు భక్తులైన యల మహానుభావుల
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడు నీ బంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదా నాకు

రేకు: 0204-06 బౌళి సం: 03-024 నామ సంకీర్తన

పల్లవి: నవనీత చోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో

చ. 1: హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నరనారాయణరూప నమో నమో

చ. 2: నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక-
నగరాధినాయక నమో నమో

చ. 3: వై కుంఠరుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర
నాకజనన(???)నుత నమో నమో

రేకు: 0205-01 శంకరాభరణం సం: 03-025 అధ్యాత్మ

పల్లవి: అతఁడే సకలము అని భావింపుచు
నీతితో నడవక నిలుకడ యేది

చ. 1: యెందునుఁ జూచిన యీశ్వరుఁ డుండఁగ
విందుల మనసుకు వెలితేది
సందడించే హరిచైతన్య మిదివో
కందువలిఁక వెదకఁగ నేది

చ. 2: అంతరాత్ముఁడై హరి పొడచూపఁగ
పంతపు కర్మపు భయమేది
సంతత మాతఁడే స్వతంత్రుఁ డిదివో
కొంతగొంత మరి కోరెడి దేది

చ. 3: శ్రీవేంకటపతి జీవుని నేలఁగ
యీవల సందేహ మిఁక నేది
భావం బీతఁడు ప్రపంచ మీతఁడు
వేవేలుగ మరి వెదకెడి దేది

రేకు: 0205-02 సాళంగనాట సం: 03-026 వైష్ణవ భక్తి

పల్లవి: అద్దిరా వోయయ్య నేనంతవాఁడనా! వొక-
కొద్ది నీ దాసుల సేవ కోరఁగలఁ గాక

చ. 1: హరి నీమాయలకు నే నడ్డము చెప్పేవాఁడనా
అరిదైన దదియు రాచాజ్ఞ గనక
పరమపదాన కాసపడుటయు ద్రోహము
సొరిది నీ భండారము సొమ్ము గనక

చ. 2: పంచేంద్రియముల నేఁ బారఁదోలేవాఁడనా
ముంచి నీవు వెట్టినట్టి ముద్ర కర్తలు
అంచల నా విజ్ఞాన మది దలఁచవచ్చునా
నించి నీవు పాఁతినట్టి నిధాన మది

చ. 3: వొట్టి సంసారపుమోపు వోపనేవాఁడనా
వెట్టి మమ్ముఁ జేయించేటి వేడుక నీది
గట్టిగా శ్రీవేంకటేశ కదిసి నీ శరణంటి
అట్టుగ నేఁ జెప్పేనా మిఱఁగ నీ రహస్యము

రేకు: 0205-03 రామక్రియ సం: 03-027 అంత్యప్రాస

పల్లవి: ఇచ్చులోఁ గోరేవల్లా ఇచ్చే ధనము
అచ్చుతనామమె పో అధికపు ధనము

చ. 1: నారదాదులు వొగడే నాలుకపయి ధనము
సారపు వేదములలో చాటే ధనము
కూరిమి మునులు దాఁచుకొన్నట్టి ధనము
నారాయణ నామమిదే నమ్మినట్టి ధనము

చ. 2: పరమపదవికి సంబళ మైన ధనము
యిరవై భక్తులకెల్లా నింటి ధనము
పరగ నంతరంగాన పాఁతినట్టి ధనము
హరినామ మిదియ పో అరచేతి ధనము

చ. 3: పొంచి శివుఁడు కాశిలో బోధించే ధనము
ముంచిన ఆచార్యుల మూలధనము
పంచి శ్రీవేంకటపతి పాలించే ధనము
నించి విష్ణునామ మదే నిత్యమైన ధనము

రేకు: 0205-04 శ్రీరాగం సం: 03-028 శరణాగతి

పల్లవి: ఇతనికంటె ఘను లిఁక లేరు
యితర దేవతల యిందరిలోన

చ. 1: భూపతి యీతఁడె పొదిగి కొలువరో
శ్రీపతి యీతఁడే చేకొనరో
యేపున బలువుఁడు నీతఁడే చేరరో
పైపై వేంకటపతి యైనాఁడు

చ. 2: మరుగురుఁడితఁడే మతి నమ్మఁగదరో
పరమాత్ముఁ డితఁడె భావించరో
కరివరదుఁ డితఁడె గతియని తలఁచరో
పరగ శ్రీవేంకటపతి యైనాఁడు

చ. 3: తల్లియు నితఁడే తండ్రియు నితఁడే
వెల్లవిరై యిఁక విడువకురో
చల్లగా నితని శరణని బ్రతుకరో
అల్ల శ్రీవేంకటహరి యయినాఁడు

రేకు: 0205-05 లలిత సం: 03-029 అధ్యాత్మ

పల్లవి: చూడ వేడుకలు సొరిది నీ మాయలు
తోడనే హరిహరి దొరసీనిదివో

చ. 1: పుట్టేటి జీవులు పొదలేటి జీవులు
జట్టి గొని రిదియే జగమెల్లా
కట్టిడి కర్మము కాయజు మర్మము
నెట్టుకొన్న దిదె నిఖిలంబెల్లా

చ. 2: ములిగేటి ధనములు మోచేటి ధనములు
కలిమి మెరసె లోకంబెల్లా
పొలసి వేగుటలు పొద్దు గుంకుటలు
కలిగిన విదివో కాలంబెల్లా

చ. 3: తగిలేటి పురుషులు తమకపు కాంతలు
బగి వాయనిదీ బదుకెల్లా
అగపడి శ్రీవేంకటాధిప నీ కృపఁ
దెగని జీవనము దినదిన మెల్లా

రేకు: 0205-06 దేవగాంధారి సం: 03-030 ఉపమానములు

పల్లవి: ఎన్నఁడొకో నేఁ దెలిసి యెక్కుడయి బ్రదికేది
పన్నిన నా గుణమెల్లా భ్రమత పాలాయ

చ. 1: ధనమద మిదె నన్ను దైవము నెఱఁగనీదు
తనుమద మెంతయిన తపముఁ జేయనీదు
ఘనసంసారమదము కలుషముఁ బాయనీదు
మనెడి నా మనువెల్ల మదము పాలాయ

చ. 2: పొంచి కామాంధకారము పుణ్యము గానఁగనీదు
కంచపు జన్మపుచిక్కు గతి చూపదు
పెంచి యజ్ఞానతమము పెద్దల నెరఁగనీదు
చించరాని నా బుద్ధి చీఁకటి పాలాయ

చ. 3: శ్రీవేంకటేశ్వరు మాయ చిత్తముఁ దేరనీదు
యేవంకా నీతఁడే గతి యిన్నిటా మాకు
యే వుపాయమును లేక యీతని మఱఁగు చొచ్చి
దేవుఁ డంతర్యామియని తేజముఁ బొందితిమి

రేకు: 0206-01 సాళంగనాట సం: 03-031 రామ

పల్లవి: అని రావణుతల లట్టలుఁ బొందించి
చెనకి భూతములు చెప్పె బుద్ధి

చ. 1: కట్టిరి జలనిధి కపిసేన లవిగో
చుట్టు లంక కంచుల విడిసె
కొట్టిరి దానవకోట్ల తలలదే
కట్టిడి రావణగతియో నీకు

చ. 2: యెక్కిరి కోటలు యిందరు నొకపరి
చిక్కిరి కలిగిన చెరయెల్ల
పక్కన సీతకుఁ బరిణామమాయ
నిక్కె(క్క?)ము రావణ నీకో బ్రదుకు

చ. 3: పరగ విభీషణుఁ బట్టము గట్టెను
తొరలి లంకకును తొలుఁదొలుతే
గరిమెల శ్రీవేంకటగిరిరాముఁడు
మెరసెను రావణ మేలాయఁ బనులు

రేకు: 0206-02 దేవగాంధారి సం: 03-032 అధ్యాత్మ

పల్లవి: దైవము నీవే యిఁక దరి చేరుతువుఁ గాక
జీవుల వసము గాదు చిక్కిరి లో లోననే

చ. 1: పుట్టుట సహజ మిది పొదలే జీవుల కెల్ల
గట్టిగా జగమునందు కలకాలము
నట్టేటి వరదవలె నానాటి నీ మాయ
కొట్టుక పారఁగఁజొచ్చె కూడిన విజ్ఞానము

చ. 2: పాపమే సహజము బద్ధసంసారుల కెల్ల
కాఁపురపు విధులలో కలకాలము
తేపలేని సముద్రము తెరఁగున కర్మమెల్లా
మాపురేపు ముంచఁజొచ్చె మతిలోని ధైర్యము

చ. 3: లంపటమే సహజము లలి దేహధారులకు
గంపమోపుకోరికెల కలకాలము
యింపుల శ్రీవేంకటేశ ఇదె నీ దాసులని
పంపుసేసి బ్రదికించె ప్రపన్నసుగతి

రేకు: 0206-03 గుండక్రియ సం: 03-033 అద్వైతము

పల్లవి: ఇట్టి నాస్తికుల మాట యేమని నమ్మెడి దీఁక
పట్టి సములమంటానే భక్తుల దూషింతురు

చ. 1: వేదములు చదువుతా విశ్వమెల్లాఁ గల్లనేరు
ఆ దెస తాము పుట్టుండి అదియును మాయనేరు
పాదగు విష్ణుడుండఁగ బయలు తత్త్వమనేరు
లేదు జీవత్వమంటా లేమలఁ బొందుదురు

చ. 2: తిరమై తమఇండ్ల దేవపూజలు సేసేరు
ధరలోన తముఁ దామే దైవమనేరు
అరయఁ గర్మమె బ్రహ్మమని యాచరించేరు
సరి నదే కాదని సన్యసించేరు

చ. 3: అందుక పురుషసూక్త మర్థముఁ జెప్పుదురు
కందువ నప్పటి నిరాకార మందురు
యిందులో శ్రీవేంకటేశ యిటె నీ దాసులుఁ గాక
మందపు రాక్షసులాడే మతము నడతురు

రేకు: 0206-04 వసంతవరాళి సం: 03-034 వైష్ణవ భక్తి

పల్లవి: ఇహముఁ బరముఁ జిక్కె నీతని వంక
అహిశయనుని దాసులంతవారు వేరీ

చ. 1: సిరి కలిగినవారు చింతలిన్నిటనుఁ బాసి
నిరతపు వర్గ(గర్వ?)ముతో నిక్కేరటా
సిరికి మగఁడయిన శ్రీపతి యేలి మ-
మ్మరయుచునున్నాఁడు మా యంతవారు వేరీ

చ. 2: బలవంతుఁడైనవాఁడు భయము లిన్నిటఁ బాసి
గెలిచి పేరు వాడుచుఁ గెరలీనటా
బలదేవుఁడైన శ్రీపతి మా యింటిలోన
అలరి వున్నాఁడు మా యంతవారు వేరీ

చ. 3: భూము లేలేటివాఁడు భోగములతోఁ దనిసి
కామించి యానందమునఁ గరఁగీనటా
సేమముతో భూపతైన శ్రీవేంకటేశుఁడు మాకు
ఆముకొనివుండఁగా మాయంతవారు వేరీ

రేకు: 0206-05 మాళవిగౌళ సం: 03-035 వేంకటగానం

పల్లవి: అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె
కన్నుల వేడుకకు కడయేది యిఁకను

చ. 1: కామధేనువు గలి(గి?)తే గర్వించు నొక్కరుఁడు
భూమి యేలితే నొకఁడు పొదలుచుండు
కామించి నిధి గంటె కళలమించు నొకఁడు
శ్రీమంతుఁడగు హరి చిక్కె మాకు నిదివో

చ. 2: పరుసవేదిగలి(గి?)తే పంతములాడు నొకఁడు
ధరఁ జింతామణబ్బితే దాఁటు నొకఁడు
సురలోక మబ్బితేను చొక్కుచునుండు నొకఁడు
పరమాత్ముఁడే మా పాలఁ జిక్కెనిదివో

చ. 3: అమృతపానము సేసి యానందించు నొకఁడు
భ్రమను దేహసిద్ధిఁ బరగొకఁడు
తమి శ్రీవేంకటేశుఁడే దాఁచిన ధనమై మాకు
అమరి నా మతిఁ జిక్కె నద్దములే దిదివో

రేకు: 0206-06 దేవగాంధారి సం: 03-036 కృష్ణ

పల్లవి: పట్టరో వీదులఁ బరువులువెట్టి
పుట్టుగులతో హరి పొలసీ వీఁడే

చ. 1: వేవేలు నేరాలు వెదకేటి దేవుఁడు
ఆవులఁ గాచీ నలవాఁడే
పోవుగ బ్రాహ్మలఁ బుట్టించు దేవుఁడు
సోవల యశోదసుతుఁడట వీఁడే

చ. 2: ఘనయజ్ఞములకుఁ గర్తగు దేవుఁడు
కినిసి వెన్న దొంగిలె వీఁడే
మునుల చి త్తముల మూలపుదేవుఁడు
యెనసీ గొల్లెతల యింటింట వీఁడే

చ. 3: నుడిగి నారదుఁడు నుతించు దేవుఁడు
బడి రోలఁ గట్టువడె వీఁడే
వుడినోని వరము లొసఁగెడు దేవుఁడు
కడఁగిన శ్రీవేంకటగిరి వీఁడే

రేకు: 0207-01 భైరవి సం: 03-037 వైరాగ్య చింత

పల్లవి: వెట్టివారిఁ దెలుపుట వేవేలు సుకృతము
ముట్టుఁబాల మంకే కాని ముందు గాన దైవమా

చ. 1: ఇంతక తొల్లిటిజన్మ మెటువంటిదో యెరఁగ
పొంతనే ఇటమీఁదటి పుట్టు వెరఁగ
అంతరానఁ బెరిగే కాయమే నాకు సుఖమై
సంతసాన మురిసేను సంసారమందును

చ. 2: వొడలి లోపలి హేయ మొకఇంతాఁ దలఁచను
బడి నెదిటి దేహాల పచ్చి దలఁచ
సుడిసి పై పచారాలే చూచి సురతసుఖాన
పడఁతులఁ బొందిపొంది పరిణామించేను

చ. 3: పాపమూలమున వచ్చే బలునరకము లెంచ
యేపునఁ బుణ్యపుబుదద్ధి ఇంచుకా నెంచ
దీపనపు జంతువునుఁ దెచ్చి పావనుఁ జేసితి
చేపట్టి నన్ను రక్షించు శ్రీవేంకటేశుఁడా

రేకు: 0207-02 సామంతం సం: 03-038 అధ్యాత్మ

పల్లవి: ఎందరితోఁ బెనఁగేను యెక్కడని పొరలేను
కందర్పజనక నీవే గతిఁ గాక మాకు

చ. 1: నిక్కి నా బలవంతాన నే నే గెలిచేనంటే-
నొక్కపంచేంద్రియముల కోపఁగలనా
తక్కిన సంసారవార్ధి దాఁటఁగలనో మరి
దిక్కుల కర్మబంధము తెంచివేయఁగలనో

చ. 2: పన్నుకొన్న పాయమున పరము సాధించేనంటే
యెన్న నీ మాయ కుత్తర మియ్యఁగలనా
వన్నెల నా మనసే పంచుకోఁగలనో మరి
కన్నట్టి యీ ప్రపంచమే కడవఁగఁ గలనో

చ. 3: పుల్లములో నిన్ను ధ్యాన మొగి నేఁ జేసేనంటే
తొల్లిటి యజ్ఞానము తోయఁగలనా
ఇల్లి దే శ్రీవేంకటేశ యెదుటనే నీకు మొక్కి
బల్లిదుఁడ నౌదుఁగాక పంద నేఁ గాఁగలనా

రేకు: 0207-03 ఆహిరి సం: 03-039 వైరాగ్య చింత

పల్లవి: అయ్యో నా నేరమికే అట్టే యేమని వగతు
ముయ్యంచు చంచలాన మోసపోతిఁ గాక

చ. 1: కాననా నావంటివారే కారా యీ జంతువులు
నానాయోనులఁ బుట్టి నడచేవారు
మానక నా గర్వమున మదాంధమున ముందు
గానక భయపడిన కర్మ నింతేకాక

చ. 2: చదువనా నేఁ దొల్లి జన్మజన్మాంతరముల
ఇది పుణ్య మిది పాప మింతంతని
వదలక నా భోగవాంఛలే పెంచిపెంచి
తుద కెక్క వెదకని దుష్టుఁడ నేను

చ. 3: వినవా నేఁ బురాణాల వెనకటివారినెల్ల
మనెడి భాగవతుల మహిమ లెల్లా
యెనయుచు శ్రీవేంకటేశు కృపచేత నేడు
ఘనుఁడ నయితిఁ గాక కష్టుఁడఁ గానా

రేకు: 0207-04 సాళంగనాట సం: 03-040 అద్వైతము

పల్లవి: తాము స్వతంత్రులు గారు 'దాసోహము' ననలేరు
పామరపుదేహులకు పట్టరాదు గర్వము

చ. 1: పరగు బ్రహ్మాదులు బ్రహ్మమే తా మనలేరు
హరికే మొరవెట్టేరు ఆపదైతేను
ధరలో మనుజులింతే తామే దయివమనేరు
పొరిఁ దాము చచ్చి పుట్టే పొద్దెరఁగరు

చ. 2: పండిన వ్యాసాదులు ప్రపంచము కల్లనరు
కొండలుగాఁ బురాణాలఁ గొనియాడేరు
అండనే తిరిపెములై అందరి నడిగి తా-
ముండుండి లేదనుకొనే రొప్పదన్నా మానరు

చ. 3: సనకాది యోగులు శౌరిభక్తి సేసేరు దు-
ర్జనులు భక్తి వొల్లరు జ్ఞానులమంటా
నినుపయి శ్రీవేంకటేశ నినుఁ జేరి మొక్కుతానే
అనిశము నిరాకారమనేరు యీ ద్రోహులు

రేకు: 0207-05 శంకరాభరణం సం: 03-041 వైరాగ్య చింత

పల్లవి: ఎట్టు మోసపోతి నేను యివియెల్ల నిజమని
నెట్టన హరినే నమ్మ నేరనయితిఁగా

చ. 1: దేహమిది నాదని తెలిసి నమ్మివుండితే
ఆహా నే నొల్లనన్నా నట్టే ముదిసె
వూహల నా భోగ మెల్లా వొళ్లఁబ ట్టేనంటా నుంటే
దాహముతోడ నినుముదాగిన నీరాయఁగా

చ. 2: మనసు నాదని నమ్మి మదిమది నే పెంచితి-
ననుఁగుఁ బంచేంద్రియములందుఁ గూడెనా (ను?)
యెనసి ప్రాణ వాయువులివి సొమ్మని నమ్మితి
మొనసి లోను వెలినై ముక్కువాత నున్నవి

చ. 3: ఇందుకొరకె నేను ఇన్నాళ్లు పాటుపడితి
ముందు వెనకెంచక నే మూఢుఁడ నైతి
అంది శ్రీవేంకటేశ్వరుఁడంతటా నుండి నా-
చందము చూచి కావఁగ జన్మమే యీడేరె

రేకు: 0207-06 నాట సం: 03-042 శరణాగతి

పల్లవి: ఎందరైనఁ గలరు నీ కింద్రచంద్రాదిసురలు
అందులో నే నెవ్వఁడ నీ వాదరించే దెట్టో

చ. 1: పెక్కు బ్రహ్మాండములు నీ పెనురోమకూపములఁ
గిక్కిరిశున్న వందొక కీటమ నేను
చక్కఁగా జీవరాసుల సందడిఁ బడున్నవాఁడ
ఇక్కువ నన్నుఁ దలఁచి యెట్టు మన్నించేవో

చ. 2: కోటులైన వేదములు కొనాడీ నిన్నందులో నా-
నోటి విన్నపము లొక్క నువ్వుగింజంతే
మాటలు నేరక కొఱవలి వాకిట నుండ
బాటగా నీదయ నాపైఁ బారుటెట్టో

చ. 3: అచ్చపు నీదాసులు అనంతము వారలకు
రిచ్చల నేనొక పాద రేణువ నింతే
ఇచ్చగించి శ్రీవేంకటేశ నిన్నుఁ దలఁచుక
మచ్చికఁ గాచితి నన్ను మఱవనిదెట్టో

రేకు: 0208-01 ముఖారి సం: 03-043 అధ్యాత్మ

పల్లవి: పుట్టించేవాఁడవు నీవే పోరులు వెట్టేవు నీవే
యెట్టు నేరుచుకొంటివిది నీ వినోదమా

చ. 1: కొందరు దేవతలును కొందరు రాక్షసులును
ఇందరి కంతర్యామి వెప్పుడు నీవు
అంది కోప మొకరిపై అట్టే ప్రసాద మొకరి
కిందులోనే పక్షపాతమిది నీకే తగును

చ. 2: నరకమనుచుఁ గొంత నగి స్వర్గమని కొంత
నిరతి గురిసేసేవు నీకుక్షిలోనే
ధరఁ జీఁకటొకవంక తగ వెన్నెలొకవంక
నెరపేవు నీ మాయ నీకే తెలును

చ. 3: దాసపరిపాలనము తగు దుష్టశిక్షణము
వాసిఁ గైకొంటివి నీకు వశమై రెండు
దోసము నీవల్ల లేదు తొలుతే శ్రీవేంకటేశ
సేసినవారి పుణ్యమే చిత్తానఁ బెట్టితివి

రేకు: 0208-02 దేవగాంధారి సం: 03-044 నామ సంకీర్తన

పల్లవి: ఇతర దేవతల కిది గలదా
ప్రతి వేరీ నీ ప్రభావమునకు

చ. 1: రతిరాజజనక రవిచంద్రనయన
అతిశయ శ్రీవత్సాంకుఁడవు
పతగేంద్రగమన పద్మావతీపతి
మతి నినుఁ దలఁచిన మనోహరము

చ. 2: ఘనకిరీటధర కనకాంబర పా-
వనక్షీరాంబుధివాసుడవు
వనజచక్రధర వసుధావల్లభ
నినుఁ బేరుకొనిన నిర్మలము

చ. 3: దేవపితామహ త్రివిక్రమ హరి
జీవాంతరాత్మక చిన్మయుఁడా
శ్రీవేంకటేశ్వర శ్రీకర గుణనిధి
నీవార మనుటే నిజసుఖము

రేకు: 0208-03 మాళవిగౌళ సం: 03-045 శరణాగతి

పల్లవి: ఎట్టు వలసినాఁ జేయు మేఁటి విన్నపము లిఁక
కట్టుకో పుణ్యమైనాఁ గాక మరేమైనాను

చ. 1: నన్ను నెంచి కాచేనంటేనా యవగుణి నేను
నిన్ను నెంచి కాచేనంటే నీవు లక్ష్మీపతివి
యిన్నిటా నాకంటే హీనుఁడిఁక మరెవ్వఁడూ లేఁడు
వున్నతి నీకంటే ఘనులొకరూ లేరు

చ. 2: నిలువెల్లా నెంచుకొంటే నివ్వరిముల్లంత లేను
బలువుఁడ నీవైతే బ్రహ్మాండము
యెలమి నే నుపకార మెవ్వరికిఁ జేయలేను
మెలఁగి నీవే తృణము మేరువు సేయుదువు

చ. 3: భావించ నీ వేలికవు బంటుమాత్రమింతే నేను
నీవు సర్వాంతరాత్మవు నే నొకఁడను
సావధానమున నేను సర్వభక్షకుఁడ నింతే
శ్రీవేంకటేశ నీవు జీవరక్షకుఁడవు

రేకు: 0208-04 శంకరాభరణం సం: 03-046 వైరాగ్య చింత

పల్లవి: వేవేలు బంధములు విడువ ముడువఁబట్టె
దైవమా నిన్నెట్టు తగిలేమయ్యా

చ. 1: పారీ ముందటి భవపాశములు
తీరీఁ దొల్లిటితిత్తిలో పుణ్యము
పూరీఁ గోరిక లొకటొకటే
యేరీతి సుజ్ఞాన మెరిఁగేనయ్యా

చ. 2: పట్టీ నాకొంగు పంచేంద్రియములు
తొట్టీ బాపము తోడుతనే
పెట్టీ భ్రమలఁ బెరిగి నీమాయలు
అట్టే మోక్ష మెన్నఁ డందేమయ్యా

చ. 3: విందై యిహము వెనకకుఁ దీసీ
అందీ వై రాగ్య మరచేతికి
కందువ శ్రీవేంకటపతి యీరెండు
బొందించితి వేది భోగింతునయ్యా

రేకు: 0208-05 కన్నడగౌళ సం: 03-047 వైరాగ్య చింత

పల్లవి: ఎట్టు గెలుతుఁ బంచేంద్రియముల నేఁ
బట్టరాని ఘనబలవంతములు

చ. 1: కడు నిసుమంతలు కన్నుల చూపులు
ముడుఁగక మిన్నులు ముట్టెడిని
విడువక సూక్ష్మపువీనులు యివిగో
బడిబడి నాదబ్రహ్మము మోచె

చ. 2: అదె తిలపుష్పంబంత నాసికము
కదిసి గాలి ముడెగట్టెడని
పొదిగె నల్లెఁడే పొంచుక నాలికె
మెదలుచు సర్వము మింగెడిని

చ. 3: బచ్చెన దేహపు పైపార సుఖమే
యిచ్చఁ బ్రపంచం బీనెడిని
చెచ్చెర మనసిది శ్రీవేంకటేశ్వరుఁ
దచ్చి తలఁచఁగా దరి చేరెడిని

రేకు: 0208-06 బౌళిరామక్రియ సం: 03-048 శరణాగతి

పల్లవి: నేనొక్కఁడ లేకుండితే నీ కృపకుఁ బాత్రమేది
పూని నా వల్లనే కీర్తిఁ బొందేవు నీవు

చ. 1: అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను
ప్రతిలేని ఘనగర్వపర్వతమను
తతిఁ బంచేంద్రియముల ధనవంతుఁడను నేను
వెతకి నావంటివాని విడువఁగఁ జెల్లునా

చ. 2: మహిలో సంసారపుసామ్రాజ్యమేలేవాఁడ నేను
యిహమునఁ గర్మ వహికెక్కితి నేను
బహుయోనికూపసంపదఁ దేలేవాఁడ నేను
వహించుక నావంటివానిఁ దేనోపేవా

చ. 3: భావించి నావంటి నీచుఁ బట్టి కాచినప్పుడుగా
యేవంక నీకీర్తి గడునెంతురు భువి
నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు
శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు

రేకు: 0209-01 దేసాక్షి సం: 03-049 భక్తి

పల్లవి: నీవే నేరవుగాని నిన్నుఁ బండించేము నేము
దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు

చ. 1: వట్టి భక్తి నీ మీఁద వళుకువేసి నిన్నుఁ
బట్టి తెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని
పట్టెడు దులసి నీపాదములపై బెట్టి
జట్టిగొనిరి మోక్షము జాణలు నీదాసులు

చ. 2: నీవు నిర్మించినవే నీకే సమర్పణసేసి
సోవల నీకృపయెల్లఁ జూరగొంటిమి
భావించొకమొక్కు మొక్కిభారము నీపై వేసిరి
పావనపు నీదాసులే పంతపు చతురులు

చ. 3: చెరువుల నీళ్లుదెచ్చి చేరఁ(రె?)డు నీపైఁ జల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీవేంకటేశ యిటువంటి విద్యలనే
దరిచేరి మించిరి నీదాసులే పో ఘనులు

రేకు: 0209-02 దేసాళం సం: 03-050 అధ్యాత్మ

పల్లవి: ఎన్నఁడు దీరీ నీ తెందేపలు
పన్నిన జీవుల బంధములు

చ. 1: భారపుఁ జిత్తము ప్రవాహరూపము
పూరెటి మదములు పూటెత్తె
తీర వింద్రియపు దేహభ్రాంతులు
కోరేటి కోర్కులఁ గొండలు వెరిగె

చ. 2: ఉడికేటి పాపము లుగ్రనరకములు
తొడికేటి కర్మము తోడంటు
విడువవు భవములు వెంటవెంటనే
చిడుముడిఁ జిత్తము చీఁకటి వడెను

చ. 3: రపణపు భవములు రాట్నపుగుండ్రలు
చపలపు బుద్ధులు జలనిధులు
ఇపుడిదె శ్రీవేంకటేశుఁడ నీవే
కపటము వాయఁగఁ గరుణించితివి

రేకు: 0209-03 ముఖారి సం: 03-051 శరణాగతి

పల్లవి: నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు
దైవమా సిగ్గువడక తగిలేనేఁ గాకా

చ. 1: చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మా సేవలు నీకు నేడకువచ్చు
పొంది వసిష్ఠాదు లట్టే పూజలు సేయఁగాను
సందడి మాపూజలు సరకా నీకు

చ. 2: సనకాదియోగులు సారె నిన్నుఁ దలఁచఁగా
యెనసి మాతలఁపు నీ కేడకెక్కును
నునుపుగా శేషాదులు నుతులు నిన్నుఁ జేయఁగా
పనివడి మా నుతులు బాఁతేయనా నీకు

చ. 3: కిట్టి నారదాదులు నీకింకరులై వుండఁగాను
యిట్టె నీదాసుఁడ ననుటెంత కెంత
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు
పట్టి నీదాసుల బంటుబంట నయ్యేనికను

రేకు: 0209-04 లలిత సం: 03-052 అద్వైతము

పల్లవి: అయ్యో వికల్పవాదులంతటా సిగ్గువడరు
యియ్యెడ నెట్టుగలిగె నీ యసురమతము

చ. 1: నీ ముద్రలూ నొల్లరు నీదాసోహము నొల్లరు
కామించి నీ మీఁది భక్తి కడు నొల్లరు
నామమంత్రము నొల్ల రనామయుండ వనెందురు
తాము వైష్ణవుల మంటాఁ దర్కింతురు

చ. 2: పైతృకవేళ నీపస్రాదమూ నొల్లరు
ఘాతల నూర్ధ్వపుండ్రము గాదందురు
జాతర దైవాల నిన్ను సరిగాఁ బూజింతురు
ఆతల వైష్ణవులు దామనుకొందురు

చ. 3: శ్రీవైష్ణవులఁ గంటేఁ జేతులెత్తి మొక్కరు
భావింతురు పగవారిఁబలెఁ గన్నట్టు
ఆవల వైకుంఠమూ ననిత్యమందురు
కావించి వైష్ణవులము కామా నేమందురు

చ. 4: వరుస రావణాదుల వలె నెజ్ఞాలు సేతురు
సరుస నట్టే వేదమూఁ జదువుదురు
నిరతి శ్రీవేంకటేశ నీ మహిమ లెరఁగక
అరిది వైష్ణవులమే యని యాడుకొందురు

రేకు: 0209-05 గుండక్రియ సం: 03-053 అద్వైతము

పల్లవి: నీయంతవారు గారు నిండుసామర్థ్యము లేదు
యీ యహంకారపు ముక్తి యీడేరీనా తమకు

చ. 1: నీ సేవలే సేసి నీ కృప రక్షించఁగాను
ఆసలఁ బొందే ముక్తి అది చాలక
నీ సరివారలై నీవే తామనుకొని
యీసులఁ బొందే ముక్తి యీడేరీనా తమకు

చ. 2: పొంచిన రాక్షసులెల్ల పూర్వదేవతలమంటా
యెంచుక పట్టిన మదమీ గర్వము
అంచెలఁ గర్మమే సేసే రాయాదేవతలఁ గూర్చి
ఇంచుకంతలోనే ముక్తి యీడేరీనా తమకు

చ. 3: హరిలాంఛనపు భక్తి కందుకు నొడఁబడరు
సరిరోగికిఁ బథ్యము చవిగానట్టు
గరిమ శ్రీవేంకటేశుఁ గని మననివారికి
యెరవులనే ముక్తి యీడేరీనా తమకు

రేకు: 0209-06 బౌళి సం: 03-054 ఉపమానములు

పల్లవి: వట్టిమోపు మోయనేల వడిఁ ములుగఁగనేల
పట్టిన నేమముతోడ బ్రదుకఁగ వలదా

చ. 1: తల్లిదండ్రి గలవారు తమ లేములెఱఁగక
చెల్లపిళ్లలై యాటలఁ జెందినయట్టు
వుల్లములో హరి నమ్మి వుండిన ప్రపన్నులెల్ల
పల్లదాన నిర్భరులై బ్రతుకఁగ వలదా

చ. 2: మగఁడు గల సతులు మంచి ముత్తైదువలై
యెగువ నితరమార్గా లెరఁగనట్టు
నగుతా లక్ష్మీపతి నమ్మిన ప్రపన్నులెల్ల
పగటుఁ గర్మము మాని బ్రదుకఁగ వలదా

చ. 3: యేలికె నమ్మినబం టేరికిఁ బ్రియము చెప్ప-
కోలిఁ బతివాకిలి గాచుండినయట్టు
తాలిమి శ్రీవేంకటేశు దాసులైన ప్రపన్నులు
పాలించినాతని నమ్మి బ్రతుకఁగ వలదా

రేకు: 0210-01 భూపాళం సం: 03-055 శరణాగతి

పల్లవి: నీ యాధీనములింతే నిఖిల ప్రపంచమును
మాయాకృతము నీవు మానుమంటే మానదా

చ. 1: నీకు నరుహంబైన నిండిన యీ మనసు
కాకువిషయాల పాలుగా నరుహమా
చేకొని నీవు పెరరేఁచిన యీ చైతన్యము
పైకొని అకర్మముల పాలు సేయఁదగునా

చ. 2: అంచల నీ వంతర్యామివైన యీ దేహము
పంచేంద్రియముల కొప్పన సేతురా
యెంచఁగ నీకుక్షిలోన నెత్తిన యీ జన్మము
కొంచెపు భోగములకు గురి సేయవలెనా

చ. 3: శ్రీవేంకటేశ నీకుఁ జిక్కిన యీ దాస్యము
యీవల సంసారమున కియ్యవలెనా
దేవుఁడవు నీవేయని తెలిపితివిదే మాకు
జీవులము మమ్మునిఁక చిమ్మిరేఁచ నేఁటికి

రేకు: 0210-02 సాళంగనాట సం: 03-056 వైష్ణవ భక్తి

పల్లవి: ఈమాట విని నిన్ను నిందుకే నవ్వితి నేను
నేమమెంత నేమెంత నీ కరుణ యెంత

చ. 1: సకలకర్మము చేత సాధ్యముగాని నీవు
వొక ఇంచుకంత భక్తి కొగి లోనైతి
ప్రకటించి బహువేదపఠనఁ జిక్కని నీవు
మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి

చ. 2: కోటిదానములచేత కోరి లోనుగాని నీవు
పాటించి శరణంటేనే పట్టి లోనైతి
మేటి వుగ్రతపముల మెచ్చి కైకొనని నీవు
గాటపుదాసులై తేనే కైకొని మన్నించితి

చ. 3: పెక్కుతీర్థములాడిన బేధించరాని నీవు
చొక్కి నీముద్రవారికి సులభుఁడవు
గక్కన దేవతలకుఁ గానరాని నీవు మాకు
నిక్కడ శ్రీవేంకటాద్రి నిరవైతివి

రేకు: 0210-03 లలిత సం: 03-057 శరణాగతి

పల్లవి: వేఱొకచోట లేఁడు వీఁడివో హరి
వీటిడియ్యై చేరువనే వీఁడివో హరి

చ. 1: మునుకొని వెదకితే ముక్కునూర్పు గాలికొన
వెనవెనకఁ దిరిగీ వీఁడివో హరి
పెనఁగి వెదకఁబోతే పెడచెవుల మంత్రమై
వినవచ్చీ మాటలలో వీఁడివో హరి

చ. 2: సోదించి వెదకితేను చూపులకొనలనే
వీదుల నెందు చూచినా వీఁడివో హరి
అదిగొని వెదకితే నట్టే నాలికకొన
వేదమై నిలిచినాఁడు వీఁడివో హరి

చ. 3: తెలిసి వెదకఁబోతే దేహపు టంతరాత్మయై
వెలుపలా లోపలాను వీఁడివో హరి
చెలఁగి శ్రీవేంకటాద్రిఁ జేకొని మమ్ము రక్షించ
వెలసె నిందరుఁ జూడ వీఁడివో హరి

రేకు: 0210-04 బౌళి సం: 03-058 అధ్యాత్మ

పల్లవి: బోధింపరే యెరిఁగిన బుధులాల పెద్దలాల
శ్రీధరుని మాయలలోఁ జిక్కితిమి నేము

చ. 1: దైవమును నొల్లము ధర్మమును నొల్లము
దావతి సంసారముతో తగులే కాని
భావపు భవబంధాల భయమూ నెరఁగము
వేవేలు విధులే కాని వేగిలేచి నేము

చ. 2: ముందు విచారించము మొదల విచారించము
పొందేటి సతులతోడి భోగమేకాని
చెందిన మనసులోని చింతలను బాయము
మందపు మదమేకాని మాపుదాఁకా నేము

చ. 3: పరమూఁ దడవము భక్తీఁ దడవము
అరిది ధనముమీఁది ఆసలే కాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డేలుకొనెఁ దానే నన్ను
నిరతి నెరఁగనైతి నే నించుకంతాను

రేకు: 0210-05 శ్రీరాగం సం: 03-059 అంత్యప్రాస

పల్లవి: మఱి యే పురుషార్థము మావంక లేదు మీకు
అఱువడము మా కెంత అత్తువో నీవు

చ. 1: హరి నీవు నాకు నంతర్యామివైన ఫలము
తిరిగినందే మా వెంటఁ దిరిగెదవు
ఇరవుగ నీవు మాకు నేలికవైన ఫలము
గరిమె మా పాపమెల్లఁ గట్టుకొంటివి

చ. 2: భువిలోన నీవు నన్నుఁ బుట్టించిన ఫలము
ఇవల రక్షించే తొడుసిదొకటాయ
తివిరి నన్ను నీకుక్షిఁ దెచ్చిడుకొన్నఫలము
జవళి నా నేరములు చక్కఁబెట్టఁబడెను

చ. 3: గారవాన నన్ను వెనక వేసుకొన్న ఫలము
చేరి నన్ను బుణ్యునిఁగాఁ జేయవలసె
ఆరసి నాకుఁ బ్రత్యక్షమైన ఫలమున నన్ను
యీరీతి శ్రీవేంకటేశ ఇముడుకోఁబడెను

రేకు: 0210-06 ఆహిరి సం: 03-060 అధ్యాత్మ

పల్లవి: ఏ నోరువెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుఁ దలఁచినది నిమిషమూ లేదు

చ. 1: పాయమెల్ల సంసారముపాలే పడితిఁ గాని
చేయార నీసేవ నేఁ జేసుట లేదు
కాయమెల్ల కాంతలకే కడుశేషమాయఁగాని
నీ యవసరములందు నే నొదుగలేదు

చ. 2: చిత్తము ఆసల పాలే సేసి బదికితిఁ గాని
హత్తి నిన్ను ధ్యానము సేయఁగలేదు
సత్తెపు నా నాలుకెల్ల చవుల కమ్మితిఁ గాని
మత్తిలి నీ కీర్తనము మరపుటా లేదు

చ. 3: పుట్టుగెల్లా నజ్ఞానముపొంతనే వుంటిఁ గాని
వొట్టి నీవిజ్ఞానము నొల్లనైతిని
యెట్టు నన్ను మన్నించితి విందుకే పో వెరగయ్యీ
నెట్టన శ్రీవేంకటేశ నిన్నడుగా లేదు

రేకు: 0211-01 దేసాళం సం: 03-061 శరణాగతి

పల్లవి: తన సామ్మీడేరించక తా మానీనా
పెనఁగుచు నే మూరకే బిగిసేముఁ గాక

చ. 1: భూమితోఁ బ్రపంచ మెల్లఁ బుట్టించిన దేవుఁడు
ఆ మీఁది పారుపత్యాన కందుకోఁడా
నామమాత్ర జీవులము నడుమంతరాల వచ్చి
నేము గర్తల మనుచు నిక్కేముఁ గాక

చ. 2: యెనలేక యెదిరికి ఇనుమడిచేవారికి
తన తగర మడువఁ దడవయ్యీనా
గునిసి సంసారపు కొండనే మోచేనంటా
తినికేమిదియు వట్టి దీమసముఁ గాక

చ. 3: చిత్తములో నున్నట్టి శ్రీవేంకటేశ్వరుఁడు
మత్తిల్లి ననుఁ గావక మానఁబొయ్యీనా
కొత్తగా నీతని నేఁడు కొలిచేమనుచు నేము
తత్తరపు స్వతంత్రానఁ దగిలేముఁ గాక

రేకు: 0211-02 ముఖారి సం: 03-062 వేంకటగానం

పల్లవి: తాము స్వతంత్రులు గారు తమయంతను
ఆమీఁదటి గురి అది నీవు

చ. 1: యెలమి స్వర్గమేలేటి ఇంద్రునికినైనాను
అలమి కోరేటి ఫలమది నీవు
బలిమిఁ గైలాసమేలే పతి రుద్రునికినైనా
నిలుకడైన పదము నీ పదము

చ. 2: యెక్కుడు సత్యలోకము యేలే బ్రహ్మకునైనా
ఇక్కువఁ జేరేచోటు యెందును నీవు
వెక్కసపుఁ బుణ్యముల వేదములకైనాను
అక్కరతో ముఖ్యమైన అర్థమెల్లా నీవు

చ. 3: నాఁడు నాఁడే ముక్తులైన నారదశుకాదులకు
నేఁడును విహరించే నెలవు నీవు
పోఁడిమి శ్రీవేంకటేశ పోలించ నెవ్వరూ లేరు
మూడులోకముల నీవే మూలము నీవే

రేకు: 0211-03 గౌళ సం: 03-063 గురు వందన, నృసింహ

పల్లవి: చింతలు రేఁచకు మమ్ము చిత్తమా నీవు
పంతముతో మముఁగూడి బతుకుమీ నీవు

చ. 1: తల్లి శ్రీమహాలక్ష్మి తండ్రి వాసుదేవుఁడు
ఇల్లు మాకు బ్రహ్మాండమింతా నిదె
బల్లిదపు హరిభక్తి పాఁడీఁబంటా నాకు
వొల్లము కర్మఫలము లొకటి నేము

చ. 2: జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు సొమ్ము
వూనిన వైరాగ్యమే వుంబళి మాకు
ఆనిన గురుసేవలు ఆఁడుబిడ్డలు నాకు
మేనితోనే తగులాయ మేలు మాకుఁ జేరెను

చ. 3: యేలికె శ్రీవేంకటేశుఁడింటి దేవపూజ మాకు
పాలు గల బంధువులు ప్రపన్నులు
కీలు మాకు నీతని సంకీర్తన మోక్షమునకు
యేలా ఇంకా మాకు నేమిటితో గొడవ

రేకు: 0211-04 ఆహిరి సం: 03-064 అధ్యాత్మ

పల్లవి: ఎక్కడ నున్నారో సురలెవ్వరు భూమికి దిక్కో
తొక్కులఁబడె జీవుఁడు దుండగీల చేతను

చ. 1: ఆసలనియెడి వెట్టియంగడి వెంటాఁ దిప్పె
దోసిలొగ్గించె దైన్యము దొరలెదుట
యీసుల నాఁకటి(లి?) విషమేమైనాఁ దినిపించె
గాసిఁబడె జీవుఁడిదె కన్నవారి చేతను

చ. 2: కడుఁ గోపపు భూతము కాయమెల్లా మఱపించె
వడి నజ్ఞానపు టేరు వరతఁగొట్టె
నడుమఁ బాపపుచొక్కు నరకపుగుంటఁ దోసె
గడుసాయ జీవుఁడిదె కన్నవారి చేతను

చ. 3: భవము సంసారపు బందెలదొడ్డిఁ బెట్టించె
తగి(వి?)లింద్రియపు తాళ్లు దామెనఁ గట్టె
యివల శ్రీవేంకటేశుఁ డింతలో దిక్కయి కాచె
కవడు వాసె జీవుఁడు కన్నవారి చేతను

రేకు: 0211-05 సాళంగనాట సం: 03-065 అద్వైతము

పల్లవి: ఏ దెస మోక్షము లేదు యెవ్వరికి ననేరు మీ-
వేదాంత శ్రవణము వెట్టికిఁ జేసేరా

చ. 1: అంతా బ్రహ్మమైతే నాతుమా వొక్కటియైతే
చింతింప గురుఁడు లేఁడు శిష్యుడూ లేఁడు
బంతినే ముక్తుఁడూ లేఁడు బద్ధుఁడూ లేఁడిట్లయితే
వంతుల సత్కర్మమెల్ల వఱితపాలాయఁబో

చ. 2: యిహమెల్లాఁ గల్లనేరు యేఁటికిఁ బుట్టినవారు
సహజమే యిదనేరు చావనేఁటికి
మహి మీకు బోధించిన మహాత్ము శంకరాచార్యుఁ-
డహరహ మేమైయున్నా నాతనికేది గతి (?)

చ. 3: కొందరికి సుఖమిది కొందరికి దుఃఖమిది
యిందుఁ జిక్కి బ్రహ్మమునకీ ఘోరమేలా
అందిన శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డొక్కఁడింతే
మందలించి కొలువరు మంటికా మీ జ్ఞానము

రేకు: 0211-06 పాడి సం: 03-066 శరణాగతి

పల్లవి: వాఁడివో వీఁడివో హరి వలసినవారికెల్లా
మూఁడు లోకముల మరి మొరఁగఁ జోటేది

చ. 1: బహిరంతరాన హరి ప్రత్యక్షమై యుండఁగాను
సహజానఁ బ్రత్యక్ష విచారమేల
ఇహములోఁ గలవెల్లా యీతని లీలై యుండఁగా
విహరించే లీల వేరే వెదకనేలా

చ. 2: మనికై యన్నిటానుండి మాటలాడుచుండఁగాను
వెనక హరి మాటలు వేరేవున్నవా
కనుచూపతఁ డంతటా కలగొనఁ జూడఁగాను
చనవిచ్చి కృపాదృష్టి చల్లుమననేలా

చ. 3: నెలవై యాతఁ డిన్నిటా నిండుకొనియుండఁగాను
అలరి వేరే వచ్చీనననేలా
యెలమి శ్రీవేంకటేశు యిచ్చకొలఁదే యింతా
పలుమారు నిట్టట్టని భావించఁ దగునా

రేకు: 0212-01 లలిత సం: 03-067 అధ్యాత్మ

పల్లవి: చెలఁగి నా కిందుకే చింతయ్యీని
తెలిసినదాఁకా నిది ద్రిష్టమయ్యీనా

చ. 1: హరి పుట్టించిన దేహి హరినే కొలువక
నరులఁ గొలుచుట అన్యాయమయ్యా
గరిమ నేరు గుడిచి కాలువఁ బొగడఁబోతే
యెరవెరవే కాక యితవయ్యీనా

చ. 2: దేవుఁ డిచ్చినట్టి బుద్ధి దేవుని పయిఁ బెట్టక
భావ మింద్రియాల కియ్యఁ బాపమయ్యా
జీవిత మొకరి సొమ్ము జీవించి యొకరి వెంట
ఆవలఁ బరువులిడు టందమయ్యీనా

చ. 3: అరిది శ్రీవేంకటేశుఁ డంతరాత్మయి వుండఁగాను
శరణనకుండు టనాచారమయ్యా
ధరఁ దన యింటఁ గోటిధన మట్టే వుండఁగాను
మరలి తిరియఁబోతే మట్టుపడీనా

రేకు: 0212-02 పాడి సం: 03-068 అద్వైతము

పల్లవి: కాకుంటే యీ శూన్యవాద కఠినచిత్తుల చేత
పైకొని వివేకులకు బ్రదుకఁగ వచ్చునా

చ. 1: అల్లనాఁడు నిరాకార మనెడి మాటలచేత
వెల్లిఁబోయ లోకములో విజ్ఞానమెల్లా
కల్లని మీ త్రివిక్రమాకారము చూపి మీరు
చెల్లఁ బెట్టితిరి వేదశిఖలందు మరియు

చ. 2: ఆలకించి యహంబ్రహ్మ మనెడి బుద్ధుల చేత
గాలిఁ బోయ భక్తి యల్లా కాలమందే
యేలి ప్రహ్లాదునికిఁగా హిరణ్యకశిపు నొద్ద
యేలికబంటువరుస లిందె చూపితిరి

చ. 3: అంతా నొక్కటియనే అధర్మవిధులచేత
గుంతఁబడెఁ బుణ్యమెల్లాఁ గొల్లఁబోయి
ఇంతట శ్రీవేంకటేశ యెక్కుడు నేనని కొండ
వింతగాఁగఁ బొడవెక్కి విజ్ఞపీఁగితివి

రేకు: 0212-03 శుద్ధవసంతం సం: 03-069 శరణాగతి

పల్లవి: చేకొనువారికి చేరువిదే పైకొను జీవుల భాగ్యమిదే
యే కడఁ జూచిన యితరము లేదు

చ. 1: తలఁపులోన నంతర్యామిదివో
తెలిసి చూచితే ద్రిష్టంబు
చలమునఁ దన మతి సందేహించిన
కలఁగి మూఁడులోకంబుల లేఁడు

చ. 2: వెసఁ గను దెఱచిన విశ్వాత్మకుఁడిదె
దెసల నింతటా ద్రిష్టంబు
పసిగొని తనుఁ బాపములు భ్రమించిన
కసరి సృష్టి చీఁకటిపడునపుడే

చ. 3: చేరి కొలిచితే శ్రీవేంకటపతి
సారె బ్రతుకునకు శాసనము
పైరగు తనలో భక్తి వదిలితే
కూరిమి తెర మఱఁగునకును మఱఁగు

రేకు: 0212-04 వరాళి సం: 03-070 శరణాగతి

పల్లవి: పెంచి తమ పెట్టుఁజెట్టు పెరికివేయ రెవ్వరు
మంచివాఁడఁ గాకున్న మన్నించకుండేవా

చ. 1: తెరువు దప్పి యడవిఁ దిరిగేటివారిఁ దెచ్చి
తెరువునఁ బెట్టుదురు తెలిసినవారలు
నరుఁడనై నేరక నడిచేటి నన్ను నీవు
మరిగించి కావక మానవచ్చునా

చ. 2: దిక్కుమాలినట్టివారిఁ దెచ్చి దయగలవారు
దిక్కయి కాతురు వారి దిగఁదోయరు
తక్కక మాయలోఁ బడి దరిదాపు లేని నన్ను
వెక్కసాన రక్షించక విడిచేవా నీవు

చ. 3: ఆవల భయపడ్డవా రంగడిఁ బడితే దొర-
లోపల విచారించి వూరడింతు రంతలోనే
శ్రీవేంకటేశ నీవు సృష్టికల్లా నేలికవు
వేవేలు మా మొర నీవు విచారించకుండేవా

రేకు: 0212-05 సామంతం సం: 03-071 ఉపమానములు

పల్లవి: ఎన్నఁడు మంచివాఁడ నయ్యేను నేను
నన్ను నీవే మన్నించి నడుపవే దయివమా

చ. 1: వేపమానికిని చేఁదు విడువక వుండేది
యే పొద్దు సహజమే యెంతైనాను
పాపపుణ్యలంపటానఁ బరగి వుండేటి నేను
చాపలదుర్గుణినౌట సహజమే

చ. 2: పాముకు విషమెప్పుడు పండ్లఁ బెట్టుకుండేది
భూమిలో సహజమే పొరి నెంతైనా
కామక్రోధుఁడ నాకుఁ గరుణ యించుక లేక
సామజపు దుర్మదము సహజమే

చ. 3: అటుగాన శ్రీవేంకటాధిప నాకిఁక వేరే
తటుకన నేఁడు శాంతము వచ్చీనా
ఘటన నీ కృపయందు గలిగిన మేలు నాపై
తటుకన ముంచి నన్ను దరి చేర్పవే

రేకు: 0212-06 గుజ్జరి సం: 03-072 శరణాగతి

పల్లవి: వెట్టి మానుప రెవ్వరు వేఁదురు నాయంత విడువదు
ముట్టిఁబాలలోఁ బుట్టిన ముంచిన వెట్టయ్యా

చ. 1: జగములు రక్షించఁ బాల్పడి సర్వేశ్వరుఁడే వుండఁగ
అగణితుఁ డాతనిశక్తి యల్పముగాఁ దెలిసి
జిగి నా సంసారరక్షణ సేసెదనంచునుఁ దిరిగెద
నగుఁబాట్ల యల్పుఁడ నే నావెట్టిదేయయ్యా

చ. 2: అంతర్యామై దేవుఁడు అటు సుఖదుఃఖము లొసఁగఁగ
అంతయు మనుజులు సేసేరని నేఁ దిరిగితిని
బంతినే నావంటి జీవులబడిఁ దిరిగాడుచుఁ గర్మపు-
దొంతులఁ జిక్కిననా వెట్టితోడనే యిదేయయ్యా

చ. 3: శ్రీవేంకటపతి యెదుటనే చేకొని వరము లొసఁగఁగ
దావతిపడి యితరుల నేఁ దగులుచు నడిగితిని
యీ వేళనే నా గురుఁడును యీ దైవము నిటు చూపఁగ
తోవెరిఁగిటు నే బతికితి తొల్లెల్ల వెట్టినయ్యా

రేకు: 0213-01 దేసాక్షి సం: 03-073 అధ్యాత్మ

పల్లవి: ఇతనికంటే నుపాయ మిఁక లేదు
మతిలోన నున్నవాఁడు మర్మమిదే సుండీ

చ. 1: ఇన్ని లోకసుఖములు ఇంద్రియప్రీతులే
తన్నుఁ గనిన తల్లిదండ్రి తనుపోషకులే
కన్ను లెదిటిధనాలు కారణార్థములే
వున్నతి నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు

చ. 2: కల దేవత లిందరు కర్మఫలదాతలే
లలి విద్యలెల్ల ఖ్యాతిలాభపూజల కొరకే
పలుమంత్రము లెల్లను బ్రహ్మలోక మీసందివె
వొలిసి ఇష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు

చ. 3: అనుదిన రాజ సేవ లల్పార్థ హేతులే
కొనఁ గల్పవృక్షమైనఁ గోరిన విచ్చేటిదే
ఘన శ్రీవేంకటేశుఁడు కల్పించె జీవునిఁ గావ-
నొనర నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు

రేకు: 0213-02 బౌళి సం: 03-074 శరణాగతి

పల్లవి: నన్ను నెవ్వరు గాచేరు నాఁటి పగెంతురుఁ గాక
నిన్న నేఁడీ రోఁతలై తే నీతి యౌనా నాకును

చ. 1: దేవుఁడ నేనే యంటా తిరిగే నాస్తికుఁడనా
దేవతలకు మొక్కఁబోతే నిఁక నగరా
కావించి యింద్రియములే గతెని యిన్నాళ్లు నుండి
ఆవల జితేంద్రియుఁడనంటే నవి నగవా

చ. 2: కర్మము దొల్లి సేయక కడుదూరమై ఇఁక నా-
కర్మము సేయఁగఁబోతే కర్మమే నగదా
దుర్మతి సంపారినై(???) తొయ్యలులకు మోహించి
అర్మిలి దూషించితేను అట్టె వారు నగరా

చ. 3: నేనే స్వతంత్రుఁడనంటా నిండుదానాలెల్ల మాని
పూని యిఁకఁ జేయఁబోతే పాంచి యవి నగవా
నేనిన్నిటా సిగ్గుపడి నీ మరఁగు చొచ్చితిని
ఆనుకొని శ్రీవేంకటాధిపుఁడ కావవే

రేకు: 0213-03 సామంతం సం: 03-075 అధ్యాత్మ

పల్లవి: పరుసము సోఁకక పసిఁడౌనా
పురుషోత్తముఁడే బుద్ధిచ్చుఁ గాక

చ. 1: భువి భోగములకుఁ బుట్టిన దేహము
వివరపు మోక్షము వెదకీనా
యివల సకలమును యేలేటి దేవుఁడు
తవిలి రక్షింపుట ధర్మముఁ గాక

చ. 2: బెరసి యాసలనే పెరిగేటి దేహము
ధరఁ గొంతయినాఁ దనిసీనా
అరుదుగ నంతర్యామగు దేవుఁడు
పొరిఁ బెర రేచుటే పొందౌఁ గాక

చ. 3: ఘనమగు సంసారకారణ జీవుఁడు
తన సుజ్ఞానముఁ దలఁచీనా
వెనక మునుప శ్రీవేంకటపతియే
కనుఁగొని మమ్మిటు కాచుటఁ గాక

రేకు: 0213-04 లలిత సం: 03-076 దశావతారములు

పల్లవి: నీమహి మది యెంత నీవు చేసే చేఁతలెంత
దీమసపు నీ మాయలు తెలియరాదయ్యా

చ. 1: నీ పాదతీర్థము నెత్తి మోచె నొకఁడు
పూఁపకొడుకై యొకఁడు బొడ్డునఁ బుట్టె
యేపున నింతటివారి కెక్కుడైన దైవమవు
మోపుచు ధర్మరాజుకు మొక్కుటెట్టయ్యా

చ. 2: నీ లీల జగమెల్లా నిండి యున్నదొకవంకఁ
నోలి నీలో లోకాలున్నవొకవంక
యే లీలఁ జూచినాను యింతటి దైవమవు
బాలుఁడవై రేపల్లెలోఁ బారాడితివెట్టయ్యా

చ. 3: శ్రీసతికి మగఁడవు భూసతికి మగఁడవు
యీ సరుస శ్రీవేంకటేశుఁడవు
రాసి కెక్కి నీవింతటి రాజసపు దైవమవు
దాసులము మా కెట్ల దక్కితివయ్యా

రేకు: 0213-05 ఆహిరి సం: 03-077 అధ్యాత్మ

పల్లవి: కలకాల మిట్లాయఁ గాఁపుర మెల్లా
అల దైవమెందున్నాఁడో ఆలకించఁడుగా

చ. 1: తనకే సంతసమైతే తన భాగ్యము వొగడు
తనకుఁ జింత పుట్టితే దైవము దూరు
మనుజుని గుణమెల్లా మాపుదాఁకా నిట్లానె
ఘనదైవ మెందున్నాఁడో కరుణఁ జూడఁడుగా

చ. 2: విరివిఁ బాపాలు సేసేవేళ నాదాయము లెంచు
నరకమఁది పుణ్యము నాఁడు వెదకు
తిరమైన జీవుని తెలివెలా నీ లాగె
ధర దైవమెందున్నాఁడో దయఁ జూడఁడుగా

చ. 3: వేళతో నిద్దిరింపుచు విరక్తునివలె నుండు
మేలుకొన్నవేళ నన్ని మెడఁ బూనును
యీలీల దేహిగుణము యెంచి శ్రీవేంకటేశుఁడు
యేలీ దైవమెందున్నాఁడో యిట్టే మన్నించఁడుగా

రేకు: 0213-06 శంకరాభరణం సం: 03-078 అధ్యాత్మ

పల్లవి: ఉన్నచోనే మూఁడులోకా లూహించి చూచితే నీవే
కన్నచోటనే వెదకి కానఁడింతేకాక

చ. 1: యెక్కడ వొయ్యెడి జీవుఁ డేది వైకుంఠము
యిక్కడ హరి యున్నాఁడు హృదయమందె
ముక్కున నూరుపు మోచి ముంచి పుణ్యపాపాల
కక్కసానఁ జిక్కి తమ్ముఁ గానఁడింతేకాక

చ. 2: యేమి విచారించీ దేహి యెందు దేవుని వెదకీ
కామించి యాతఁ డిన్నిటాఁ గలిగుండఁగా
దోమటి సంసారపు దొంతికర్మములఁ జిక్కి
కాముకుఁడై కిందుమీఁదు గానఁడింతేకాక

చ. 3: యే విధులు తాఁ జేసీ యెవ్వరి నాడఁగఁబోయీ
శ్రీవేంకటేశ్వరు సేవచేత నుండఁగా
భావ మాతఁడుగాను బ్రతికె నిదివో నేఁడు
కావరాన నిన్నాళ్లు కానఁడింతేకాక

రేకు: 0214-01 ధన్నాసి సం: 03-079 వైరాగ్య చింత

పల్లవి: కటకటా యేమిటాను కడవర గానఁడిదే
నిటలపు వ్రాఁత యెట్టో నిజము దెలియదు

చ. 1: బాదల సంసారము పరవంజుకొని తొల్లి
యేది నమ్మి పాటువడె నీ జీవుఁడు
గాదెల కొలుచుగాఁగఁ గట్టుకొని కర్మములు
యేదెస చొచ్చీనో కాని యీ ప్రాణి

చ. 2: కాఁపురమై తమ తల్లి కడుపున వచ్చి పుట్టె
యే పని గలిగెనో యీ దేహి
కాపాడీ నిక్షేపాలు కడునాసతోఁ బాఁతి
యే పదవిఁ దానుండునో యీ జంతువు

చ. 3: దవ్వుల యమబాదలు దలఁచి వెరపఁడిదె
యెవ్వరి సలిగెనమ్మో యీ జీవి
రవ్వగా శ్రీవేంకటాద్రిరాయఁడు మన్నించఁగాను
యివ్వల బతికెఁగాక యెవ్వఁడోయి తాను

రేకు: 0214-02 కాంబోది సం: 03-080 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వరు దిక్కింక నాకు నేది బుద్ధి
యివ్వల విచారించవే ఇందిరారమణా

చ. 1: వెంటఁబెట్టి కామక్రోధవితతులు చుట్టి నన్ను
తొంటి మీ సేవకు నన్ను దూరము సేసె
కంటకపుటింద్రియాలు కడు హితశత్రులై
అంటిన మోక్షముత్రోవ నంటకుండాఁ జేసెను

చ. 2: తిప్పితిప్పి నాయాసలు తెగి వైష్ణవధర్మానఁ
దెప్పలఁ దేలకుండాను తీదీపు సేసె
వొప్పగు సంసారమిది వున్నతి నాచార్యసేవ
చొప్పు మాపి పుణ్యానకుఁ జొరకుండాఁ జేసెను

చ. 3: మచ్చరపు దేహమిది మనసిట్టే పండనీక
తచ్చి యజ్ఞానమునకుఁ దావుసేసె
ఇచ్చల శ్రీవేంకటేశ ఇంతలో నన్ను నేలఁగ
నిచ్చలు నీకృపే నన్ను నిర్మలము సేసెను

రేకు: 0214-03 దేసాళం సం: 03-081 శరణాగతి

పల్లవి: అనంతమహిముఁడవు అనంతశ క్తివి నీవు
యెనలేని దైవమా నిన్నేమని నుతింతును

చ. 1: అన్నిలోకములు నీయందు నున్నవందురు నీ-
వున్నలోక మిట్టిదని వూహించరాదు
యెన్న నీవు రక్షకుఁడ విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి నేనెవ్వరి నందును

చ. 2: తల్లివి దండ్రివి నీవు తగు బ్రహ్మాదులకు
యెల్లగా నీతల్లిదండ్రు లెవ్వరందును
యిల్లిదె వరములు నీ విత్తు విందరికిని
చెల్లఁబో నీకొకదాత చెప్పఁగఁ జోటేది

చ. 3: జీవుల కేలికవు శ్రీవేంకటేశుఁడవు నీ-
వేవలఁ జూచిన నీ కే యేలికే లేఁడు
వేవేలు మునులును వెదకేరు నిన్నును
నీవెవ్వరి వెదకేవు నిర్మలమూరితివి

రేకు: 0214-04 శ్రీరాగం సం: 03-082 శరణాగతి

పల్లవి: పాటించి నమ్మినవారి భాగ్యము గాదా
కోటిసుద్దులేల యిదె కోరి చేకొనేది

చ. 1: స్వామిద్రోహియైన చండి రావణాసురుఁడు
కామించి శరణంటేను కాచేనంటివి
యేమని నీదయ యెంతు నెంతని నీమహిమెంతు
ఆమాటకు సరియౌ నఖిలవేదములు

చ. 2: దావతి సీతాద్రోహము దలఁచి కాకాసురుఁడు
కావుమని శరణంటేఁ గాచితివి
ఆవల నీపని యెట్టు అట్టే నీమన్నన యెట్టు
యీవల నీశరణనే ఇందుసరే తపము

చ. 3: చిక్కులిన్నీ నీఁకనేల చేరి యేపాటివాఁడైన
గక్కన నీశరణంటేఁ గాతువు నీవు
అక్కరతో నిన్ను శరణంటిమి శ్రీవేంకటేశ
యెక్కువ నీ బిరుదుకు యీడా పుణ్యములు

రేకు: 0214-05 పాడి సం: 03-083 వైరాగ్య చింత

పల్లవి: నేఁడు దప్పించుకొంటేను నేరుపున్నదా
పేడుక(???) భోగించు తానే పెనఁగఁ జోటున్నదా

చ. 1: తనువు మోచిననాఁడే తప్పులెల్లాఁ జేసితిని
వెనక మంచితనాలు వెదకనేది
ననిచి సంసారినైననాఁడే నిష్టూరాన కెల్ల
మునుప నే గురియైతి మొరఁగఁ జోటున్నదా

చ. 2: సిరులు చేకొన్ననాఁడడే సిలుగెల్లా గట్టుకొంటి
తరవాతి పనులింకఁ దడవనేల
నరలోకము చొచ్చిననాఁడే పుణ్యపాపముల-
పొరుగుకు వచ్చితిని బుద్ధులింక నేల

చ. 3: వూపిరి మోచిననాఁడే వొట్టికొంటి నాసలెల్లా
మాపుదాఁకా వేసరిన మానఁబొయ్యీనా
యేపున శ్రీవేంకటేశుఁడింతలో నన్నుఁ గావఁగా
పైపై గెలిచితిఁగాక పంతమాడఁగలనా

రేకు: 0214-06 దేసాళం సం: 03-084 వైరాగ్య చింత

పల్లవి: ఇన్ని దేహములఁ బుట్టి యేమి గంటిమి
వున్నతపు హరిదాస్య మొక్కటే కాక

చ. 1: హీనజంతువైననాఁడు యేనుగై పుట్టిననాఁడు
ఆనంద మొక్కటే అంగాలే వేరు
యీ నేటి యజ్ఞానము యీ జీవుల కొక్కలాగే
జ్ఞానమే యెక్కుడుఁ గాక సరిలేని దొకటే

చ. 2: నరలోకభోగానకు నరకానుభవానకు
సరేకాని మిగులదు చనెఁ దొల్లె (?)
గరిమ నేర్పడ నందు ఘనమేమి కొంచమేమి
హరిదాసుఁడై బ్రదుకుటదియే లాభము

చ. 3: బాలుఁడైన యప్పుడూను పండి ముదిసినప్పుడు
కాల మొక్కటే బుద్ధి కడు లేదు
ఆలకించి శ్రీవేంకటాధిపతి సేవించి
యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము

రేకు: 0215-01 గుజ్జరి సం: 03-085 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడు మానవు యీ దుర్గుణములు యేది అవుషధము యిందుకును
కన్నులఁ జూచుచుఁ జెవుల వినుచు నేఁగనియు వినియునిదె కష్టుఁడనయ్యా నేను

చ. 1: హృదయము లోపల దేవుఁడుండఁగా నెఱఁగక భ్రమయుచుఁ గన్నచోటనే
వెదకియుఁ గానక అనుమానించేటి వేఁదురనయ్యా నేను
చెదరిన జననము దుఃఖరూపమని చెప్పగ విని యది సుఖమని కోరుచు
మది దీపము వట్టుక నూతఁబడిన మత్తునివలెనయ్యా నేను

చ. 2: పరమగురువులదె భక్తిమార్గమిటు ప్రాణులకెల్లనుఁ బెట్టి వుండఁగా
విరసపు టింద్రియమార్గములఁ దిరుగు వీరిడినయ్యా నేను
దరి చేర్పఁగ హరినామము గలిగియు దైన్యము నొందితి సంసారములో
పరుసము చేతఁబట్టుక తిరిసేటి భ్రాంతునివలెనయ్యా నేను

చ. 3: శ్రీవేంకటపతి యెదుట నుండఁగా సేవింపఁగ సంసారములోపల
దావతిఁ బొరలుచు వేపరుచుండేటి తగని జడుడనయ్యా నేను
కైవశమై యీ దేవుఁడే యిటు ననుఁ గరుణింపుచు రక్షింపుచునుండఁగ
పూవునుఁ బరిమళమును వలనే నే పొదలుచునుండెదనయ్యా నేను

రేకు: 0215-02 దేవగాంధారి సం: 03-086 వైరాగ్య చింత

పల్లవి: ఎంతగాలమునకైనా యీ యర్థమే కలది
యింతటిలోననే హరి నెరఁగఁగవలయు

చ. 1: యెంచి నూరేండ్లమీఁద యెప్పుడో మరణము
ముంచి యిట్టే మోఁచినదె మురికిడొక్క
యించుకంత యిందుకుఁ గానేల కోరెమో సుఖము
కాంచన మెవ్వరికిఁగా గడియించేమో

చ. 2: కలిగిన దినములు కాఁపురానకే సెలవు
తలఁపెల్ల నాసలకంతటుఁ గొలఁది (?)
ఫల మిందు నేమిగద్దో ప్రాణి ఇందేమిటివాఁడో
తెలిసి పాపఁగలేము తీరని యీ చిక్కు

చ. 3: సేసిన కర్మము లెల్లా చెప్పరాని మోపులాయ
రాసికెక్కె యింద్రియాల పరమాయను
వేసరి యిన్నిటికి శ్రీవేంకటేశుఁ గొలిచితి
మాసినదే మణుఁగాయ మాకు నేది జన్మము

రేకు: 0215-03 సాళంగనాట సం: 03-087 అధ్యాత్మ

పల్లవి: ఇన్నియు ముగిసెను ఇటు నీలోననె
పన్ని పరులఁ జెప్పఁగఁ జోటేది

చ. 1: కుందని నీరోమకూపంబులలో
గొందుల బ్రహ్మాండకోట్లట
యెందరు బ్రహ్మలో యెంత ప్రపంచమో
యిందుఁ బరులమని యెంచఁగనేది

చ. 2: నీ కొనచూపున నెఱిఁ గోటిసూర్య-
లేకమగుచు నుదయింతురటా
నీ కాయమెంతో నీ వునికేదో
నీకంటెఁ బరులని నిక్కఁగనేది

చ. 3: జీవకోటి నీ చిన్నిమాయలో
ప్రోవులగుచు నటు పొడమెనటా
శ్రీవేంకటేశ్వర చెప్పఁగ నీవెంతో
ఆవలఁ బరులకు నాధిక్యమేది

రేకు: 0215-04 బౌళి సం: 03-088 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడు నే నిఁక బుద్ధెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలెడిది
విన్నప మిదియే నీకే భారము వీని గెలువ నా వసమౌనా

చ. 1: తగిలెడి నీ నయనేంద్రియములు తగఁ జూచినయందెల్లను
తగిలెడి నీ శ్రవణేంద్రియములు తగిన లోకవార్తలకెల్లా
మగుడఁగ నేరవు జన్మజన్మముల మనసు వీనికే సహాయము
తెగ వెన్నటికిని యింద్రియసంపద తీగెలు సాగుచు నొకటొకటి

చ. 2: యెక్కుడిని నానాఁటికి మదమెంతైనా నజ్ఞానమున
యెక్కుడి నీసంసారమే హరి యెదుటనే మత్తాయి గొన్నట్లు
చిక్కడెంతయిన మోక్షమార్గమున జీవుఁడిందుకే లోలుఁడు
దిక్కమెకమువలెఁ గిందికి మీఁదికిఁ దిప్పెడిఁ గర్మము దేహమును

చ. 3: మెఱయుచుఁ బెరిగెడి నీయాసలు గడు మీఁదమీఁద లంపటమగుచు
మఱియునుఁ బెరిగెడి పుణ్యపాపములు మలసిరాసులై పెక్కగుచు
యెఱఁగను శ్రీవేంకటేశ్వర యెంతో ఇఁక నా లోపలి దుర్గణములు
మఱఁగుచొచ్చితిని నేనిన్నాళ్లకు మరి నాభాగ్యము నీచిత్తము

రేకు: 0215-05 సామంతం సం: 03-089 అధ్యాత్మ

పల్లవి: దేవా నీమాయ తెలియనలవి గాదు
భావభేదముల భ్రమసితిని

చ. 1: జననం బొకటే జంతుకుల మొకటే
తనువికారములే తగఁ బెక్కు
దినములు నివియే తివిరి లోకమిదె
పనులే వేరయి పరగీని

చ. 2: మాఁటలు నొకటే మనసులు నొకటే
కోటులసంఖ్యలు గుణము లివి
కూటము లిట్లనె గురిఁ గాముఁ డొకఁడె
మేటి వలపులకె మేరలే లేవు

చ. 3: జ్ఞాన మొకటే యజ్ఞానము నొకటే
నానామతములు నడచీని
ఆనుక శ్రీవేంకటాధిప నీకృప
తానే మమ్మిటు తగఁ గాచీని

రేకు: 0217-01 దేసాక్షి సం: 03-090 కృష్ణ

పల్లవి: కన్నవిన్నవారెల్లా కాకు సేయరా
వున్నతుఁడవైన నీకీ వొచ్చములేలయ్యా

చ. 1: దేవతలఁ గాచినట్టి దేవుఁడ నీకుఁ బసుల
నీవలఁ గాచితివనే హీనమేలా
కావించి పాలజలధిఁ గాఁపురముండినయట్టి-
నీవు పాలదొంగవనే నింద నీకేలయ్యా

చ. 2: కాలమందు బలి దైత్యుఁ గట్టివేసినట్టి నీకు
రోలఁ గట్టువడినట్టి రోఁత నీ కేల
పోలించి లోకాలకెల్ల పొడవైన దేవుఁడవు
బాలుఁడవై రేపల్లెలోఁ బారాడనేలయ్యా

చ. 3: పాముమీఁదఁ బవ్వళించి పాయకుండినట్టి నీకు
పాముతల దొక్కినట్టి పగలేలా
కామించి శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీవు
భూమి మాయలణఁచి నేర్పుల మాయలేలయ్యా

రేకు: 0217-02 వరాళి సం: 03-091 అధ్యాత్మ

పల్లవి: చేసినట్టే సేసుఁ గాక చింత మాకేలా
వాసీవంతూ నతనిదే వట్టి జాలి యేలా

చ. 1: కర్మమూలమైనవి యీ కాయపువ ర్తనలెల్లా
ధర్మమూలమైనది యీ దైవికము
మర్మమైన వాఁడొక్కఁడే మనసులోనున్న హరి
నిర్మిత మాతనిదింతే నేర నేనెంతవాఁడ

చ. 2: ధనమూలమైనది యీ తగిన ప్రపంచమెల్లా
తనువు మూలమైనది యీ తపసులెల్లా
ననిచి యీ రెంటికిని నారాయణుఁడే కర్త
కొనమొద లాతనిదే కొసరు మాకేల

చ. 3: భోగమూలమైనది యీ పొందైన సంసారము
యోగమూలము విరతి కొక్కటైనది
యీ గతి శ్రీవేంకటేశుఁ డెట్టు వలసినఁ జేసు
బాగులుగా నీతని శ్రీపాదమే మా దిక్కు

రేకు: 0217-03 పాడి సం: 03-092 వేంకటగానం

పల్లవి: ఎదురేది యెంచి చూడ నితని ప్రతాపానకు
పదిదిక్కులను భంగపడిరి దానవులు

చ. 1: యెక్కువగా వినోదాన కితఁడు తేరెక్కితేను
యెక్కిరి దైత్యులు కొఱ్ఱు లిందరుఁ గూడి
చక్కఁగా నితఁడు చేత చక్రమెత్తిన మాత్రాన
దిక్కులఁ బరువెత్తిరి దిమ్మరిఅసురలు

చ. 2: దట్టమై యీతని భేరిఁ దగ నాదు పుట్టితేను
పుట్టె నుత్పాతాలు వైరిపురములందు
అట్టె గరుడధ్వజ మటు మిన్నుముట్టితేను
కిట్టి దనుజుల కపకీర్తి తుదముట్టేను

చ. 3: అలమేలుమంగవిభుఁడటు వీధులేఁగితేను
ఖలు లేఁగిరి యమునికట్టెదిరికి
యెలమి శ్రీవేంకటేశుఁ డేపుమీరఁ జొచ్చితేను
ములిగి దైత్యసతులు మూలమూల చొచ్చిరి

రేకు: 0217-04 సాళంగనాట సం: 03-093 తేరు

పల్లవి: కన్నులపండుగ లాయఁ గడపరాయని తేరు
మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు

చ. 1: కదలెఁ గదలెనదె గరుడధ్వజుని తేరు
పొదిగి దేవదుందుభులు మ్రోయఁగా
పదివేలు సూర్యబింబము లుదయించినట్లు
పొదలి మెరుపు వచ్చి పొడచూపినట్లు

చ. 2: వచ్చెవచ్చె నంత నింత వాసుదేవుని తేరు
అచ్చుగ దేవకామిను లాడిపాడఁగా
ముచ్చటతో గరుడఁడు ముందట నిలిచినట్టు
మెచ్చుల మెరుఁగులతో మేఘము వాలినట్టు

చ. 3: తిరిగెఁ దిరిగెనదె దేవదేవో త్తము తేరు
వరుస దేవతలెల్ల జయవెట్టగా
విరివిఁ గడపలో శ్రీవేంకటేశుఁడు తేరుపై
నిరవాయ సింహాసన మిదేయన్నట్లు

రేకు: 0217-05 బౌళి సం: 03-094 రామ

పల్లవి: రామా దయాపరసీమా అయోధ్యపుర
ధామా మావంటివారి తప్పులు లోఁగొనవే

చ. 1: అపరాధియైనట్టి యాతని తమ్మునినే
కృపఁ జూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్ముమొన దారకుఁ జిక్కినవాని
నెపానఁ గాచి నిడిచి నీ వాదరించితివి

చ. 2: సేయరాని ద్రోహము సేసిన పక్షికి నీవు
పాయక అప్పటి నభయ మిచ్చితి
చాయ సేసుకొని వుండి స్వామిద్రోహిఁ జెప్పనట్టి-
తోయపుటేటెని మంచితోవనే పెట్టితివి (?)

చ. 3: నేరము లెంచవు నీవు నీదయే చూపుదుగాని
బీరపు శరణాగతబిరుద(వు?) నీవు
చేరి నేఁడు నిలుచుండి శ్రీవేంకటాద్రిమీఁదఁ
గోరిన వరములెల్లా కొల్ల లొసఁగితివి

రేకు: 0217-06 ఆహిరి సం: 03-095 వైష్ణవ భక్తి

పల్లవి: ఎట్టయినాఁ జేసుకో ఇఁక నీ చిత్తము నన్ను
పట్టిచ్చె మా గురుఁడు నీ పాదాలు విడువను

చ. 1: పోఁడిమి నా నామములు పొద్దువొద్దు నుడిగీని
వీఁడేమడుగునోయని వెఱవకుమీ
నాఁడే నా యాచార్యుఁడు నాకు నన్నీ యిచ్చినాఁడు
నేఁడిదేలంటే నతని నేమము నే మానను

చ. 2: ప్రేమతో వీఁడు నన్నింటఁ బెట్టుక పూజించీని
యేమి గారణమోయని యెంచుకోకుమీ
కామించి యాచార్యుఁడే కారణము నీకు నాకు
యీ మరులేలంటే నాతఁడిచ్చిన సొమ్మే నేను

చ. 3: పలుమారు వీఁడు నాపై బత్తిచేసీ నేఁటికని
వెలయ శ్రీవేంకటేశ వేసరకుమీ
యెలమి నాచార్యుఁడిదే పని చేసినాఁడు
నిలిచెఁ గలకాలము నీకు నాకుఁ బోదు

రేకు: 0218-01 గుండక్రియ సం: 03-096 అధ్యాత్మ

పల్లవి: వివరము మాలినట్టి వెట్టిదేహి తొల్లి
జవకట్టినంతే కాక చండ పొరనేఁటికే

చ. 1: మనసంతే మంగళము మరి యెంత పొరలినా
తనువు కొలఁదియే సత్వములెల్లాను
తన కలిమెంచుకోక తగని మురిపెముల
పెనఁగఁబోతే తీపు పిప్పిలోనఁ గలదా

చ. 2: చెంది విత్తిన కొలఁదే చేరి మొలచేటి పైరు
అంది ఆఁకటి కొలఁదే ఆహారమెల్ల
ముందువెనక చూడక మొక్కలపు పరువేల
అందని మానిపంటికి నాసపడవచ్చునా

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన కొలఁదియే మేలు
భావించ నాతఁడిచ్చేది భాగ్యమెల్లాను
వేవేలు మొక్కులేల వెస నానాఁటికి నెల్ల
తోవగాని తోవఁ బోతే తుదకెక్కఁగలదా

రేకు: 0218-02 సామంతం సం: 03-097 శరణాగతి

పల్లవి: ఈ తగవే నాకు నీకు నెంచి చూచితే
కాతరపు జీవులకుఁ గలదా వివేకము

చ. 1: భారము నీది గనక పలుమారుఁ బాపములే
చేరి మొక్కలాన నేఁ జేసితిని
పేరడిఁ దల్లిదండ్రులు బిడ్డ లేమి సేసినాను
వోరుచుక ముద్దు సేసుకుందురు లోకమున

చ. 2: కావ నీవు గలవని కడదాఁకా నేరములే
వేవేలు సేసితిని వెఱవక
భావించుక యింటిదొర పసురము దెంచుకొని
యేవిధిఁ బైరుమేసినా నెగ్గుసేయఁ డతఁడు

చ. 3: పుట్టించేవాఁడవు నీవు పొదలేవారము నేము
యెట్టుండినా నీకుఁ బోదు యెన్నటికిని
వొట్టుక శ్రీవేంకటేశ వోడఁగట్టిన దూలము
అటునిట్టు బొరలినా నండవాయ దెపుడు

రేకు: 0218-03 లలిత సం: 03-098 అధ్యాత్మ

పల్లవి: ఏఁటి నేను యేఁటి బుద్ధి యెక్కడి మాయ
వీటిఁ బొయ్యే వెట్టిఁ గాను వివేకిఁ గాను

చ. 1: ఆరసి కర్మము సేసి అవి(ది?) నన్నుఁ బొదిగితే
దూరుదుఁ గర్మము గొంది దూరుచు నేను
నేరక లంపటములు నేనే కొన్నిగట్టుకొని
పేరడిఁ బరులనందుఁ బెట్టరంటాను

చ. 2: యెక్కుడు నా దోషములు యెన్నైనా వుండఁగాను
వొక్కరి పాపము లెంతు వూరకే నేను
తిక్కవట్టి నాకు నాకే దేవతలకెల్లా మొక్కి
వొక్కరివాఁడఁ గాకుందు వుస్సురనుకొంటాను

చ. 3: విరతిఁ బొందుదుఁ గొంత వేరే సంసారముఁ జేతు
యెరవులవాఁడనే యెప్పుడు నేను
అరిది శ్రీవేంకటేశుఁ డంతలో నన్ను నేలఁగా
దొరనైతి నధముఁడఁ దొల్లే నేను

రేకు: 0218-04 భైరవి సం: 03-099 వైరాగ్య చింత

పల్లవి: ఆతఁడు భక్తసులభుఁ డచ్యుతుఁడు
రాతిగుండెవాఁడుగాఁడు రంతు మానుఁ డీఁకను

చ. 1: జీవుఁడా వేసరకు చిత్తమా జడియకు
దైవము గరుణించఁ దడవు గాదు
తోవ చూపె మనకు తొల్లే ఆచార్యుఁడు
కావలసినట్లయ్యీఁ గలఁగకుఁ డీఁకను

చ. 2: కాలమా వేగిరంచకు కర్మమా నన్నుమీరకు
పాలించ దైవానకు నే భార మిఁకను
ఆలించి తిరుమంత్రమే ఆతని నన్నుఁ గూరిచె
వేళగాని అందాఁకా వేసరకుఁ డీఁకను

చ. 3: వెఱవకు దేహమా వేసరకు ధ్యానమా
యెఱిఁగి శ్రీవేంకటేశుఁ డెడసిపోఁడు
తఱి నిహపరము లితనిదాసు లిచ్చిరి
గుఱియైతి నిన్నిటికిఁ గొంకకుఁడీ ఇఁకను

రేకు: 0218-05 సాళంగం సం: 03-100 శరణాగతి

పల్లవి: పలువిచారములేల పరమాత్మ నీవు నాకు
గలవు కలవు వున్నకడమ లేమిటికి

చ. 1: నీ పాదముల చింత నిబిడమైతేఁ జాలు
యే పాతకములైన నేమి సేసును
యేపార నీ భక్తి ఇంత గలిగినఁ జాలు
పైపై సిరు లచ్చుటఁ బాదుకొని నిలుచు

చ. 2: సారిది నీ శరణము చొచ్చితినంటేఁ జాలు
కరుణించి యప్పుడట్టే కాతువు నీవు
సరుస నీముద్రలు భుజములనుంటేఁ జాలు
అరుదుగాఁ జేతనుండు అఖిలలోకములు

చ. 3: నేరక వేసినఁ జాలు నీ మీఁద నొకపువ్వు
కోరిన కోరికలెల్లఁ గొనసాగును
మేరతో శ్రీవేంకటేశ మిమ్ముఁ గొలిచితి నేను
యేరీతి నుండినఁ గాని యిన్నిటా ఘనుఁడను

రేకు: 0218-06 బౌళి సం: 03-101 శరణాగతి

పల్లవి: ఇందుకంటే మరి యిఁకలేదు హితోపదేశము వో మనసా
అంది సర్వసంపన్నుఁడు దేవుఁడు ఆతని కంటే నేరుతుమా

చ. 1: కల దొకఁటే ధర్మము కల్పాంతమునకు నిలిచినది
తలఁకక మీ శరణు చొచ్చి మీ దాసుడ ననెడి దొకమాఁట
వలవని జోలే యింతాను వడి నిదిఁ గాక యేమిసేసినను
సులభ మిందునే తొల్లిటి వారలు చూరలుగొనిరదే మోక్షంబు

చ. 2: మొదలొకటే యిన్నిటికి ముందర వెనకా వచ్చేది
వొదుగుచు గోవిందుని దాసులకు నొక్కమాటే మొక్కినఁ జాలు
తుద కెక్కనివే యితరములు దొరకొని మరేమి సేసినను
బదికి లిరిందునే పరమవైష్ణవులు పలు చదువులలో వినరాదా

చ. 3: తగులొకటే విడువరానిది తతి నెన్నటికినిఁ జెడనిది
వొగి శ్రీవేంకటపతి నామజపము వొకమాటే అబ్బినఁ జాలు
నగుబాటే యింతాను నానాఁటి కేమేమి సేసినను
తగు నీ బుద్ధుల నడచిరి మున్నిటి దైవజ్ఞులు పూర్వాచార్యులును

రేకు: 0219-01 దేసాక్షి సం: 03-102 వేంకటగానం

పల్లవి: ఏ లోకమున లేఁడు యింతటి దైవము మరి
జోలిఁ దవ్వితవ్వి యెంత సోదించినాను

చ. 1: మంచిరూపున నెంచితే మరుని గన్నతండ్రి
ఇంచుకంత సరిలేదు ఇతనికిని
మించు సంపదలనైతే మేటిలక్ష్మీకాంతుఁడు
పొంచి యీతనికి నీడు పుట్టుఁడించఁగలరా

చ. 2: తగఁ బ్రతాపమునను దానవాంతకుఁ డితఁడు
తగుల నీతని మారుదైవాలు లేరు
పొగరు మగతనానఁ బురుషోత్తముఁ డితఁడు
వెగటై యీతనిపాటి వెదకిన లేరు

చ. 3: పట్టి మొదలెంచితేను బ్రహ్మఁ గన్నతండ్రితఁడు
మట్టున నింతటివారు మరి వేరి
ఇట్టే శ్రీవేంకటేశుఁడీగికి వరదుఁడు ట్ట
కొట్టఁగొన నితరుల గురిసేయఁగలరా

రేకు: 0219-02 బౌళి సం: 03-103 శరణాగతి

పల్లవి: అవాప్తసకలకాముఁ డనుమాట నీకుఁ జెల్లె
వివేకించఁ బురుషార్థవిధి మా యందేది

చ. 1: మరిగి నీపై భక్తి మాకుఁ గలుగుటెల్లాను
అరసి నీవు రక్షించే ఆసకొరకే
హరి నీవు భక్తవాత్సల్యము మాపై జేయుటెల్ల
ఇరవైన నీకు నిరుహేతుకమే

చ. 2: కొసరుచు నిన్ను నేము కొలిచినదెల్లాను
వెస మా భారము నీపై వేయుకొరకే
వసముగా నీవు నన్ను వలెనని యేలుటెల్ల
యిసుమంతైన నిరుహేతుకమే

చ. 3: శ్రీవేంకటేశ్వర నీకుఁ జేయెత్తి మొక్కుటయెల్ల
నీవే మావాఁడవై మన్నించుకొరకే
ఆవటించి అంతర్యామివై నీవుండుటయెల్ల
యేవలఁ జూచిన నిరుహేతుకమే

రేకు: 0219-03 బౌళి సం: 03-104 అధ్యాత్మ

పల్లవి: మఱచిన వెఱచిన మఱి లేదు
యెఱిఁగిన సులభుఁడు యీ హరి యొక్కఁడే

చ. 1: అతుమ తొల్లొటిదే అంతరాత్మ తొల్లిటిదే
నీతితో యీదేహములే నిత్యకొత్తలు
యీతల నేర్పరులకు నిందే యిహపరములు
చేతిలో నున్నవి యిది చింతించరో జనులు

చ. 2: కాలము నెందూఁ బోదు కర్మము నెందూఁ బోదు
జాలిఁబడ్డ మనసే సావివోయను
పోలింప వివేకులకు పుణ్యమునుఁ బాపమును
వేళవేళనే వున్నవి వెదకరో జనులు

చ. 3: ఆఁకలినిఁ దీరదు అన్నమునుఁ దీరదు
తేఁకువ తన ధైర్యమే తీరెఁగాని
తాఁకక శ్రీవేంకటేశుదాసులై తేఁ జాలుఁగాని
కాఁక దీరు నిందరికిఁ గనుకోరో జనులు

రేకు: 0219-04 రామక్రియ సం: 03-105 అధ్యాత్మ

పల్లవి: చవులకుఁ జవి సంసారము
భవము నానాఁటికి పచ్చిదే

చ. 1: దైవికము మా స్వతంత్రముతోఁ గూడె
సావివోదెన్నఁడు సంసారము
పూవుపిందెవలెఁ బొడమివున్నవి
యేవల యీరెండు నేకమే

చ. 2: పాపముఁ బుణ్యము పైపైఁ గూడుకొని
చాపకింది నీరు సంసారము
రేపుమాపు వలె రెట్టించి వున్నవి
యేపొద్దు నీ రెండు నేకమే

చ. 3: మాయ గొంత నిజమార్గమునుఁ గొంత
చాయ దప్ప దిదేసంసారము
చేయిచ్చి వున్నాఁడు శ్రీవేంకటేశుఁడు
యీయెడ నీరెండు నేకమే

రేకు: 0219-05 దేవగాంధారి సం: 03-106 అధ్యాత్మ

పల్లవి: ఒరసి చూడఁగబోతే నొకటి నిజములేదు
పొరల మేను ధరించి పొరలఁగఁ బట్టెను

చ. 1: పాతకములట కొన్ని బలుపుణ్యాలట కొన్ని
యీతల స్వర్గనరకాలిచ్చేవట
యేతుల నందుఁ గొన్నాళ్లు యిందుఁ గొన్నాళ్లు
పోతరించి కాతరించి పొరలనే పట్టెను

చ. 2: పొలఁతులట కొందరు పురుషులట కొందరు
వెలుఁగును జీఁకట్లు విహారమట
కలవరింతలు గొంత ఘనసంసారము గొంత
పొలసి జీవులు రెంటాఁ బొరలఁగఁ బట్టెను

చ. 3: వొక్కవంక జ్ఞానమట వొక్కవంకఁ గర్మమట
మొక్కి ఇహపరాలకు మూలమిదట
తక్కక శ్రీవేంకటేశుదాసులై గెలిచిరట
పుక్కట నిన్నాళ్లు రెంటాఁ బొరలఁగఁ బట్టెను

రేకు: 0219-06 భూపాళం సం: 03-107 ఉపమానములు

పల్లవి: మదించిన యేనుగను మావటీఁడు దిద్దినట్టు
త్రిదశవంద్యుఁడ నీవే తిప్పఁగదే మనసు

చ. 1: నేరమి సేసినవాఁడు నిక్కపుటేలికఁగని
తారితారి యిందునందు దాఁగినయట్టు
తీరని పంచేంద్రియాల దిమ్మరియై తిరిగాడి
కోరి నీపై భక్తియంటే కొలుపదు మనసు

చ. 2: పగసేసుకొన్నవాఁడు బలు మందసములోన
వెగటు జాగరముల వేగించినట్టు
మిగుల వేదమార్గము మీరి పాపమునఁ జిక్కి
జిగి నిన్నుఁ జేరుమంటే జింతించీ మనసు

చ. 3: నిరుఁబేదయైనవాఁడు నిధానము పొడగని
గరిమ భ్రమసి యట్టే కాచుకున్నట్టు
యిరవై శ్రీవేంకటేశ యిట్టే నిన్నుఁ బొడగని
వెరవున నీగుణాలు వెదకీని మనసు

రేకు: 0220-01 గుజ్జరి సం: 03-108 శరణాగతి

పల్లవి: అయ్యో సదా మత్తుఁడను హరి నీ దాసులు నన్ను
ఇయ్యెడనే దయఁజూచి యీడేర్చిరిఁ గాక

చ. 1: తెగక కన్నులుమూసి దేహము మఱచేవాఁడ
నిగిడి దేవుఁడవని నిన్నెరిఁగేనా
తగఁ బసిఁడి చూచి నే ధర్మము మరచేవాఁడ
జగతి విజ్ఞానము సరవెరిఁగేనా

చ. 2: వలచి సతులనేటి వలలఁ బడేటివాఁడ
మలసి తప్పించుక నీ మాయ దాఁటేనా
వెలయ నన్నీఁ జదివి వివేకమొల్లనివాఁడ
చలివాసి నీభక్తి చవిగొనేనా

చ. 3: మించు సంసారము చొచ్చి మీఁదు దెలియనివాఁడ-
నంచ నీ వంతర్యామివని మొక్కేనా
యెంచక శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
మంచిదాయ నిఁక నిది మానబొయ్యేనా

రేకు: 0220-02 గుండక్రియ సం: 03-109 అధ్యాత్మ

పల్లవి: గోవింద హరిగోవింద గునిసి యాడుదం బిటురారో
ఆవటించి మనమెట్టు గడచెదము ఆశ్చరియంబిది హరిమాయా

చ. 1: కర్మానుగుణము కాలము
ధర్మానుగుణము దైవము
మర్మము రెంటికి మనుజుఁడు
అర్మిలిఁ బొదిగీ హరిమాయా

చ. 2: అజ్ఞానహేతువు లాసలు
విజ్ఞానహేతువు విరతొకటి
తజ్ఞులు రెంటిఁ దగిలిరి (?)
జిజ్ఞాను(సు?) గప్పెను శ్రీహరిమాయా

చ. 3: సకలకారణము సంసారము
ప్రకటకారణము ప్రపంచము (?)
అకటా శ్రీవేంకటాద్రీశుదాసులు
వొకరిఁ దడవదువో హరిమాయా

రేకు: 0220-03 శంకరాభరణం సం: 03-110 వైరాగ్య చింత

పల్లవి: ఉడివోని సంసారాన నున్నారము నట్ట-
నడుమాయ నవ్వులకు నాబ్రతుకు

చ. 1: పుట్టని జన్మము లేదు పొందని భోగము లేదు
నెట్టన మాయలఁ జిక్కి నేఁ దొల్లి
కొట్టఁగొన కెక్కలేదు కోరి మొదలను లేదు
నట్టనడుమ నున్నది నాబ్రదుకు

చ. 2: చొరని లోకము లేదు చూడని విద్యలు లేదు
నిరతి మాయలఁ జిక్కి నేఁ దొల్లి
దరి చేరుటా లేదు తగులు లేదు నానాఁడు
నరకమే కురిసీని నాబ్రదుకు

చ. 3: చేయని కర్మము లేదు చెందని ఫలము లేదు
నీయిచ్చ మాయలఁ జిక్కి నేఁ దొల్లి
యీయెడ శ్రీవేంకటేశ యిట్టె నీవు నన్నేలఁగా
నాయిచ్చ సఫలమాయ నాబ్రదుకు

రేకు: 0220-04 గుండక్రియ సం: 03-111 అధ్యాత్మ

పల్లవి: ఒక్కటి తరువాత వేరొకటై కాచుకుండు
చక్క దెరనాటకము సంగతి సంసారము

చ. 1: వొండె నాపద దీరితే నొండె సంపదైనా వచ్చు
అండ నెన్నఁడుఁ దీరదు హరిఁ దలఁచ
తండోపతండములై తలమోపులు పనులు
చండిపెట్టి పనిగొను సంసారము

చ. 2: పాప మొల్లనంటేను బలుపుణ్యమై తగులు
యేపొద్దుఁ దీరదు హరి నిటు దలఁచ
వోపనన్నాఁ బోనీదు వూరకైనఁ బనిగొను
చాపకింది నీరువలె సంసారము

చ. 3: పగలెల్లా నలసితే పైకొను రాతిరి నిద్ర
అగపడ దెప్పుడును హరిఁ దలఁచ
తగిలి శ్రీవేంకటాద్రి దైవమే పొడచూపఁగా
జగడము సంతమాయ సంసారము

రేకు: 0220-05 ముఖారి సం: 03-112 కృష్ణ

పల్లవి: ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు
వేడుక సంతసములు వెల్లవిరియాయను

చ. 1: కమలనాభుడు పుట్టె గంసుని మదమణఁచ
తిమిరి దేవకిదేవి దేహమందును
అమరులకు మునుల కభయమిచ్చె నితఁడు
కొమరె గొల్లతలపై గోరికలు నిలిపె

చ. 2: రేయిఁ బగలుగఁ జేసి రేపల్లెఁ బెరుగఁజొచ్చె
ఆయెడ నావులఁ గాచె నాదిమూలము
యీయెడ లోకాలు చూపె నిట్టే తనకడుపులో
మాయ సేసి యిందరిలో మనుజుఁడై నిలిచె

చ. 3: బాలలీలలు నటించి బహుదైవికము మించె
పాలువెన్నలు దొంగిలెఁ బరమమూ ర్తి
తాళి భూభార మణఁచె ధర్మము పరిపాలించె
మేలిమి శ్రీవేంకటాద్రిమీఁద నిట్టె నిలిచె

రేకు: 0220-06 ధన్నాసి సం: 03-113 కృష్ణ

పల్లవి: అంతవాని కింతసేయ నమరునటే
వింతలు యీసుద్దులకే వెరగయ్యీ మాకు

చ. 1: కదిసి బ్రహ్మాండములు గర్భములోనున్నదేవుఁ-
డిదె దేవకి గర్భాన నెట్టు పుట్టెనే
అదె మఱ్ఱాకుమీఁదట నటు పవ్వళించువాఁడు
యెదుట యశోదచేత నెట్టు వినోదించీనే

చ. 2: అడుగులుమూఁట లోకాలటు గొలచినవాఁడు
బడిబడి రేపల్లెఁ బారాడీని
అడరి యజ్ఞభాగము లారగించే దేవుఁడు
సడితో వెన్న ముచ్చిలి చవిగొనీనిదివో

చ. 3: వేదపల్లవములందు విహరించే దేవుఁడు
సాదుగొల్లెతల రతిసంగడిఁ జిక్కె
మోదపు వైకుంఠాన ముదమందే కృష్ణుడు
యీదెస శ్రీవేంకటాద్రి నిరవాయ నిదివో

రేకు: 0221-01 లలిత సం: 03-114 కృష్ణ

పల్లవి: చూడ నరుదాయనమ్మ సారిది నందరికిని
వేడుకతో వచ్చి సేవించేరు బ్రహ్మాదులు

చ. 1: కోరి చంద్రుఁడుదయించ గోకులచంద్రుడు పుట్టె-
నేరీతి నీతఁడు నాతఁ డేమౌదురో
వారిధి కొడుకతఁడు వారిధి యల్లుఁ డీతఁడు
యీరీతి నీతఁడాతని కేలికాయఁ గాని

చ. 2: నల్లని వాఁడీతఁడాయ తెల్లని వాఁడతఁడాయ
యెల్లవారికిఁ జూడ వీరేమౌదురో
అల్లాతఁడే యమృతము అమృతనాథుఁడితఁడు
చల్లనైన హరితోడ సరిగాఁడుఁ గాని

చ. 3: ఆతఁడు పూర్వాద్రిమీఁద నమరెఁ నిందరుఁ జూడ
నీతఁడు శ్రీవేంకటాద్రి నిరవైనాఁడు
యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్యమెప్పు డీతఁడు సింగారవిభుఁడుగాని

రేకు: 0221-02 దేసాక్షి సం: 03-115 అధ్యాత్మ

పల్లవి: దేవత లెందున్నవారో దిష్ట మెవ్వరిఁ గానము
యీవలఁ దామే కలితే నేమని రావలదా

చ. 1: పరమేదో ఇహమేదో బదికే జీవులకెల్ల
నరకపు దేహాలలో నానుచున్నారు
అరసి పుట్టించినట్టి అజుఁ డెందు దాఁగినాఁడో
సరిగాన మెవ్వరిఁ గొసరేమంటేను

చ. 2: యేమి గలి గేమి సెలవెన్నటికో తమమేలు
యీ మేరఁ బ్రాణులు మాయ నీఁదుచున్నారు
భూమికి దిక్కైనవారు పొడచూపి కావవద్దా
దీముగా నిలువలేరు తెలిసేమంటేను

చ. 3: తుదయేడ మొదలేడ తొంగి చూచేవారెవ్వరు
అదె సంసారానఁ బ్రాణులాడుచున్నారు
ఇదె శ్రీవేంకటేశ్వరుఁ డింతలో విచ్చేసి కాచె
యెదుట రక్షకుఁడైతే నిట్టుండవలదా

రేకు: 0221-03 సామంతం సం: 03-116 అధ్యాత్మ

పల్లవి: నీవు దేవుఁడవు నే నొక జీవుఁడ
యీ విధి నిద్దరి కెంతంతరువు

చ. 1: పొడమిన జగములు పుట్టెడి జగములు
గుడిగొనె మీ రోమకూపముల
యెడయక నీరూప మేమని ధ్యానింతు
అడరి మీవాఁడ నేననుటే కాక

చ. 2: మునుపటి బ్రహ్మలు ముందరి బ్రహ్మలు
మొనసి మీ నాభిని మొలచేరు
ఘనుఁడవు నిన్నేగతి నేఁ దెలిసెద
అనువుగ మిము శరణనుటే కాక

చ. 3: సహజానందము సంసారానంద-
మిహముఁ బరముగా నిచ్చేవు
అహిపతి శ్రీవేంకటాధిప నీకృప
మహిలో సేవించి మనుటే కాక

రేకు: 0221-04 ధన్నాసి సం: 03-117 శరణాగతి

పల్లవి: శరణాగత వజ్రపంజరుఁ డీతఁడు చక్రధరుఁ డసురసంహారుఁడు
వెరవుతోడఁ దను శరణనువారి వెనుబల మీతఁడే రక్షకుఁడు

చ. 1: హరినామోచ్చారణఁ దెగనికర్మ మవల వేరొకటున్నదా
అరసి యెందు నమ్మిక చాలక ప్రాయశ్చిత్తంబులు చెప్పుదురు
ధర నెరఁగనివారేమనినాఁ దామసులగొడవ యేమిటికి
హరిహరి యంటే దురితము లణఁగెను అతఁడే మాకిఁక రక్షకుఁడు

చ. 2: శ్రీపతి దిక్కయి కావఁగ మరియునుఁ జేరని సంపద లిఁకనేవి
చాపలబుద్ధుల (లు?) నది నమ్మక విచ్చనవిడి నోములు చెప్పుదురు
తీపులు పుట్టించి యెవ్వరేమనినఁ దెలిపి వాదడువ నేమిటికి
శ్రీపతిఁ గొలిచితి చేరె సంపదలు జిగి నితఁడే మా రక్షకుఁడు

చ. 3: అంతరాత్మ శ్రీవేంకటేశ్వరుఁడు అన్యము భజించఁ జో టేది
యింతట నమ్మక దేవతాంతరము లేఁటేఁటివో మరి చెప్పుదురు
యెంతలేదు ప్రాకృతజనముల భ్రమ యెవ్వరిఁ గాదన నేమిటికి
యింతకు శ్రీవేంకటేశుదాసులము యీతఁడే మాకిఁక రక్షకుఁడు

రేకు: 0221-05 లలిత సం: 03-118 శరణాగతి

పల్లవి: వెదకినఁ దెలియదు వెనక ముందరలు
పదమున నిలుపవె పరమాత్మా

చ. 1: కోరిక లూరక కొనలు సాగఁగా
బారలు చాఁచీఁ బ్రపంచము
యీరీతి జీవులు ఇలఁ బొడమఁ బొడమ
దూరంబాయను తొలుతటి రాక

చ. 2: కాయపు మదములు కప్పఁగఁ గప్పఁగ
ఆయము లంటీనదె మాయ
పాయక ఇందే పనుపడి పనుపడి
చాయలు మరచిరి జంతువులు

చ. 3: బలుశరణాగతి ప్రాణులు దలఁచఁగ
నెలవున నిలిపెను నీకరుణ
ఇలపై శ్రీవేంకటేశ్వర యిహ పర-
మలవడి దొరకెను అరచేతికిని

రేకు: 0221-06 బౌళి సం: 03-119 శరణాగతి

పల్లవి: కనకము కనకమే కడు నినుమినుమే
వెనక సరిదూఁగితే వెలువకురాదు

చ. 1: హరిఁ గొలిచినవారి కమరు నన్నిసుఖాలు
గరిమతో వారల భాగ్యమే భాగ్యము
తెరమరఁగుల కర్మదేహులెల్ల వీరితోడ
పురుఁడు వెట్టుకోఁబోతే పోలికలు రావు

చ. 2: భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు
చేగదేర వారలు సేసినదే చేఁత
తీగెసంసారమత్తులు తెలియక వీరివలె
వేగినంతా నయ్యేమంటే వెరవులఁ బడవు (?)

చ. 3: శ్రీవేంకటేశుదాసులు చేసినదెల్లా సృష్టి
యేవంకా ధ్రువపట్టమే ఇటు వారికి
కావరపు మనుజులు గతిగనేమని వారి-
తోవల నడవఁబోతేఁ దూగదు తమకును

రేకు: 0222-01 సామంతం సం: 03-120 అధ్యాత్మ

పల్లవి: ఇందునే వున్నది యెఱుకయు మఱపును
చందమిదివో ఇకఁ జదివెడిదేది

చ. 1: అంది కర్మముల ననుభవింపుచును
ముందర మరి సుఖములు గోరు
కందువ నీదేహి కనియుం గానఁడు
దిందుపడ (?) నొరులు తెలిపెడిదేది

చ. 2: వొకచేత హేయ ముడుగక కడుగును
వొకచేత భుజించు నొగి రుచులు
అకటా దృష్టం బరచేనుండఁగ
సకలము నుపదేశము లేక నేవి

చ. 3: మలయు భోగములు మాయలని యెరుఁగు
నిలిచిన మోక్షపునిజ మెరుఁగు
యిలపై శ్రీవేంకటేశుఁడు గలఁడిదె
బలిమి గలిగెనికఁ బదరెడిదేది

రేకు: 0222-02 లలిత సం: 03-121 శరణాగతి

పల్లవి: పురుషోత్తముఁడ నీవే పుణ్యము గట్టుక నన్ను
దరిచేర్చి రక్షించి దయఁ జూడఁగదవే

చ. 1: ధరలో యాచకునకు ధర్మాధర్మము లేదు
సిరులఁ గాముకునికి సిగ్గులేదు
పరమపాతకునకు భయమించుకాలేదు
విరసపు నాకై తే వివేకమే లేదు

చ. 2: మించిన కృతఘ్నునికి మేలెన్నఁడును లేదు
చంచలచిత్తునకు నిశ్చయమే లేదు
అంచల నాస్తికునకు నాచారమే లేదు
కొంచని మూర్ఖుఁడ నాకు గుణమే లేదు

చ. 3: మదించిన సంసారికి మరి తనివే లేదు
పొదిగొన మూర్ఖునకు బుద్ధే లేదు
అదన శ్రీవేంకటేశ అలమేల్మంగ దాసుఁడ-
నిదివో చనవరి నాకెదురే లేదు

రేకు: 0222-03 సాళంగనాట సం: 03-122 కళ్యాణ కీర్తనలు

పల్లవి: తిరువీధు లేఁగీని దేవతలు జయవెట్ట
హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున

చ. 1: కనకపుఁ గొండ వంటి ఘనమైన రథముపై
దనుజమర్దనుఁడెక్కె దరుణులతో
వినువీధిఁ బడెగె(డగ?)లు వేవేలు కుచ్చులతోడఁ
బెనగొనఁగఁ గదలె భేరులు మ్రోయఁగను

చ. 2: వరుసఁ జంద్రసూర్యులవంటి బండికండ్లతోడ
గరుడధ్వజుఁ డొరసెఁ గడుదిక్కులు
పరగు వేదరాసులే పగ్గాలు వట్టితియ్యఁగ
సరుగ దుష్టులఁ గొట్టి జయము చేకొనెను

చ. 3: ఆటలుఁ బాటలు వింటా నలమేల్మంగయుఁ దాను
యీటున శ్రీవేంకటేశుఁ డెదురులేక
వాటపు సింగారముతో వాకిటవచ్చి నిలిచీ
కోటానఁగోటి వరాలు కొమ్మని ఇచ్చుచును

రేకు: 0222-04 వరాళి సం: 03-123 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నిటికి నీశ్వరేచ్ఛ యింతేకాక
తన్నుఁదానే హరి గాచు దాసుఁడైతేఁ జాలు

చ. 1: ప్రకృతిఁ బుట్టిన దేహి ప్రకృత(తి?) గుణమే కాని
వికృతి బోధించబోతే విషమింతే కాదా
వొకవిత్తు వెట్టితే వేరొకటేల మొలచును
ప్రకటమైన వట్టిప్రయాసమే కాక

చ. 2: పాపానఁ బుట్టిన మేను పాపమే సేయించుఁ గాక
యేపునఁ బుణ్యముతోవ యేల పట్టును
వేపచేఁదు వండితేను వెస నేల బెల్లమవును
పైపై బలిమి సేసే భ్రమ యింతే కాక

చ. 3: ప్రపంచమైన పుట్టుగు ప్రపంచమునకే కాక
వుపమించ మోక్షమున కొడఁబడునా
ప్రపన్నుఁడైనవేళ భాగ్యాన శ్రీవేంకటేశుఁ-
డపుడు దయఁజూడఁగ నధికుఁడౌఁ గాక

రేకు: 0222-05 సాళంగం సం: 03-124 అధ్యాత్మ

పల్లవి: ఎక్కడి సుద్ది యీ భ్రమనేల పడేరు
అక్కటా వోదేహులాల హరినే తలంచరో

చ. 1: బలుదేవతలకునుఁ బాయదట వ్యామోహము
యిలపై నరులము నేమెంతకెంత
కలదట మునులకుఁ గడ(డు?) రాగద్వేషాలు
చలనచిత్తులము మా జాడ యిఁక నేది

చ. 2: పరగఁ దొల్లిటివారు పంచేంద్రియబద్ధులట
నెరవుగా ముక్తులమా నేఁటివారము
అరిదిఁ బ్రపంచము మాయామయమట నేము
దురితవర్తనులము తొలఁగేమా

చ. 3: ఘన సిద్ధగంధర్వులు కడ గానలేరట
దినమత్తులము మా తెలివేఁటిది
యెనలేని శ్రీవేంకటేశ్వరు శరణుచొచ్చి
మనువార మింతేకాక మరి గతియేది

రేకు: 0222-06 దేసాళం సం: 03-125 వేంకటగానం

పల్లవి: దేవదుందుభులతోడ తేటతెల్లమైనాఁడు
సేవించరో యిదే వీఁడే సింగారదేవుఁడు

చ. 1: బంగారుమేడలలోనఁ బన్నీట మజ్జనమాడి
అంగము తడి యొత్తఁగా నదే దేవుఁడు
ముంగిటఁ బులుకడిగిన ముత్యమువలె నున్నాఁడు
కుంగని రాజసముతో కొండవంటి దేవుఁడు

చ. 2: కాంతులు మించిన మాణికపుదోరణముకింద
అంతటఁ గప్పురముచాతు కదే దేవుఁడు
పొంతల నమృతమే పోగైనట్టున్నవాఁడు
సంతతము సంపదల సరిలేని దేవుఁడు

చ. 3: తట్టు పుణుఁగు నించుక దండిసొమ్ములెల్లాఁ బెట్టి
అట్టెలమేల్మంగ నరుతఁ గట్టి
నెట్టన నమ్మినవారి నిధానమై వున్నవాఁడు
పట్టపు శ్రీవేంకటాద్రిపతియైన దేవుఁడు

రేకు: 0223-01 సామంతం సం: 03-126 అధ్యాత్మ

పల్లవి: ఒడఁబడఁ గదవో వో మనసా
పెడరేఁచి యతఁడే పెనఁగీఁ గాక

చ. 1: అంతయుఁ జూచిన హరి సంకల్పమే
చింతలు సిలుగులు జీవులవి
భ్రాంతిపట్టి యిఁకఁ బదరఁగ నేఁటికి
చెంత నతఁడు దయసేసీఁ గాక

చ. 2: ఘన విశ్వకుటుంబిని (?) కమలాక్షుఁడే
జననమం (మా?)త్రములే జంతులవి
గొనకొని యిందుకుఁ గోరిక లేఁటికి
వొనరించి యతఁడె వొసగీఁగాక

చ. 3: సిరు లందించఁగ శ్రీవేంకటేశుఁడు
పరగు భోగములె ప్రాణులవి
మరుగక యీమేలు మఱవఁగ నేఁటికి
గరిమ నీతఁ డెపుడు గలిగీఁగాక

రేకు: 0223-02 దేవగాంధారి సం: 03-127 అన్నమయ్య స్తుతి

పల్లవి: అటిముటిఁ జూడఁబోతే నజ్ఞాని నేను
మఱఁగు చొచ్చితి మీకు మహిలో నారాయణా

చ. 1: నిన్ను ధ్యానము సేసీని నిచ్చనిచ్చఁ దాళ్లపాక-
అన్నమయ్యఁగా రెదుట నదిగోవయ్య
పన్ని యాతనినే చూచి పాతకులమైన మమ్ము
మన్నించవయ్య వో మధుసూదనా

చ. 2: సంకీర్తనలు సేసీ సారెఁ దాళ్లపాకన్నయ్య
అంకెల నీసన్నిధినే అదిగోవయ్య
అంకించి నే వారివాఁడనని దుష్టుడనైనా నా-
సంకె దీరఁ గావవయ్య సర్వేశ్వరా

చ. 3: పాదాలం దున్నాఁడు దాళ్లపాకన్నమయ్య మీకు
ఆదరాన ముక్తుఁడై అదిగోవయ్య
యీదెస శ్రీవేంకటేశ యీసమ్మంధాననే నన్ను
నీదయపెట్టి రక్షించు నెమ్మది భూరమణా

రేకు: 0223-03 సాళంగనాట సం: 03-128 శరణాగతి

పల్లవి: తప్పదు యీయర్థము ధరణిలోన
వొప్పుగ యేకచిత్తాన నుండవచ్చు నీకను

చ. 1: కాకాసురు దోషము కడకుఁ బరిహరించి
చేకొంటివి శరణంటే చేరి మగుడ
యీకడ మా నేరములు యింతకంటే నెక్కుడా
నీకే నే శరణంటి నీవు మమ్ముఁ గాతువు

చ. 2: అమ్ముగ వేసినవాఁడు అట్టె దండము వెట్టితే
నిమ్ముల నిహపరము లిచ్చితివి
యెమ్మెల మావంకనైతే నింతేసిచేఁతలు లేవు
నెమ్మి నీకే మొక్కితిమి నీవే మమ్ముఁ గాతువు

చ. 3: పరులఁ గొలిచి వచ్చి ప్రాణాచారాలు పడితే
సిరుల వరాలిచ్చేవు శ్రీవేంకటేశా
వొరులఁ గొలువము నే మొగి నీ పాదాలే నమ్మి
నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముఁ గాతువు

రేకు: 0223-04 కాంబోదిసం: 03-129 అధ్యాత్మ

పల్లవి: ఏడ పెద్దల మెట్టితిమో మరి
తోడనే నవ్వేము దొరకొని మమ్మును

చ. 1: పంచేంద్రియములఁ బట్టగ లేమట
యెంచఁగ వివేక మెన్నటికి
అంచెల మమతల నణఁచఁగలేమట
పొంచిన బుద్ధులు భువి నెన్నటికి

చ. 2: వెడవెడ నాసలు విడువఁగ లేమట
యెడయని ధైర్యం బెన్నటికి
తొడుసగు బంధముఁ దుంచఁగ లేమట
బెడిదపు తనలో బిరుదెన్నటికి

చ. 3: కామక్రోధములఁ గడవఁగ లేమట
యీమానుషములు యెన్నటికి
కామించ శ్రీవేంకటపతి గలఁడట
నేమపుతపముల నే మెన్నటికి

రేకు: 0223-05 లలిత సం: 03-130 అధ్యాత్మ

పల్లవి: ఇదిగాన తన ధర్మ మించుకా వదలరాదు
పుదుటున హరివారై వుండవలెఁగాని

చ. 1: జాతిచండాలము దీరు జన్మాంతరములను
యేతులఁ గర్మచండాల మెన్నఁడూ బోదు
యీతల స్వర్గము చొరనియ్యకుండఁగాఁ ద్రిశంకుఁ-
డాతలఁ దాఁ బ్రతి స్వర్గమందు నున్నాఁ డదివో

చ. 2: ఆస్తికులయినవారు అట్టె రామునిఁ గూడిరి
నాస్తికు లసురకుఁ బ్రాణము లిచ్చిరి
ఆస్తికనాస్తికుఁడై తా నం దెవ్వరివాఁడూఁ గాక
కస్తిఁబడి వాలి వృథాకలహానఁ బొలిసె

చ. 3: యింక నొక్కటి గలదు యెదుటనే వుపాయము
అంకెల శ్రీవేంకటేశుఁడందే వున్నాఁడు
సంకెదీర నీతనికి శరణుచొచ్చి వరాలు
పొంకముగాఁ జేకొనేరు భూ జనులు నేఁడును

రేకు: 0223-06 శంకరాభరణం సం: 03-131 నామ సంకీర్తన

పల్లవి: నలినాక్ష నీకు నమస్కరించిన-
ఫలము వొగడ నీఁక బ్రహ్మకు వశమా

చ. 1: పూర్వదోషములఁ బోఁదోలి మఱియు
సర్వాపచారము క్షమియించి
గర్వీత మదముల కసటు వాపి నను
నిర్వహించె నిదె నీనామము

చ. 2: నేఁడునుఁ జేసిన నేరము లణఁచి
వేఁడి కర్మముల విడిపించి
వాఁడి దుఃఖముల పడిఁ బరిహరించె
నాఁ డెఱఁగఁగ నీ నామము

చ. 3: పుమ్మడి సుఖముల నొనరించీ మాకు
సమ్మతి శుభములు జయమొసఁగీ
యిమ్ముల శ్రీవేంకటేశ్వర యిదివో
నెమ్మది రక్షించె నీనామము

రేకు: 0224-01 దేసాక్షి సం: 03-132 పోలికలు

పల్లవి: జాలి మోహినీగజము సంసారమిది
లోలుఁడఁ గాకపోదు లోకము సహజము (?)

చ. 1: నేరమెల్లా జీవునిది నేరుపెల్లా దేవునిది
దారదప్పి విఱ్ఱవీఁగఁ దనకేల
కారణ మాతఁడు దాఁ గార్యమాత్ర మింతే
శూరుఁడై రెంటాఁ జొరక చూచుటే సుఖము

చ. 2: ప్రకృతి కాతుమ దాను పరమాత్ముఁ డాతఁడు
తకపికలై మురియఁ దనకేల
సకలము నాతఁడు సత్తామాత్రము దాను
వొకటీఁ గోరక వూరకుండుటే సుఖము

చ. 3: సేవించఁ దనకుఁ గద్దు శ్రీవేంకటేశుఁ డాతఁడు
దావతిఁ గర్మపుఁబాటు తనకేల
శ్రీవిభుఁ డాతఁడు దాను చేతన మాత్ర మింతే
కేవల మాతనివాఁడై గెలుచుటే సుఖము

రేకు: 0224-02 నాట సం: 03-133 రామ

పల్లవి: బాపుబాపు రాఘవ నీ ప్రతాపమేమని చెప్ప
పైపై నీపేరు విని పారేరు రాకాసులు

చ. 1: వాలినెత్తురు నీటను వాఁడి పదనిచ్చినమ్ము
కూలిచె నొక్కమాటునఁ గుంభకర్ణుని
యీలకొని మాయామృగ మెమ్ముల నొరసినమ్ము
రాలించె నుత్తరగోపురముపై గొడగులు

చ. 2: తొడికి మింటి తాపలు తుంచి దూప దాఁకినమ్ము
జడధి మరుదేశాల జల మింకించె
యెడయక కౌశికుని యజ్ఞము గాచినమ్ము
అడరి రావణుని పూర్ణాహుతిగఁ జేసెను

చ. 3: బెరసి యే పొద్దును నీ పిడికిటిలోనియమ్ము
సురల భయముఁ బాపి సూటికెక్కెను
ఇరవై శ్రీవేంకటాద్రి నిటు రామచంద్రుఁడవై
పరగఁగ నీయమ్ము పగయెల్ల నీఁగెను

రేకు: 0224-03 లలిత సం: 03-134 శరణాగతి

పల్లవి: పలుమారు వాదమేల పంతమేమి వచ్చె నీకు
చలమో ఫలమో సాధించుకోరయ్యా

చ. 1: ధరమీఁదఁ జేయఁబోతే తగు పుణ్యములు లేవా
హరిదాసుఁడయ్యే పుణ్యమందుటఁ గాక
సురలు బ్రహ్మాదులును చూడఁగా నే పొడవున
తిరమై యున్నారో తెలుసుకోరయ్యా

చ. 2: మాపుదాఁకా సలిగెలు మహిమలు లేవా
శ్రీపతిదాసులై యంత చెల్లదుఁ గాక
చేపడిన మాత్రమున చేటులేని పదవుల
యేపున నెవ్వరున్నారో యెరుఁగరయ్యా

చ. 3: యేవలఁ గొలువఁబోతే నెందరు దైవాలు లేరు
శ్రీవేంకటేశువలె రక్షించరుఁ గాక
కోవరమై యేఁటనేఁటాఁ గోరి వరములకుఁగా
కావించి పరుష వచ్చేకత చూచుకోరయ్యా

రేకు: 0224-04 శుద్ధవసంతం సం: 03-135 అధ్యాత్మ

పల్లవి: నగుఁబాట్లకు లోనై నడచుఁగాక
అగపడి పరసుఖమందఁబోయీనా

చ. 1: కడిగేది వొకచేత కష్టమే దినదినము
కుడిచేది వొకచేతఁ గోరినవెల్లా
యెడయక తన సిగ్గు యెరఁగని యీ దేహి
అడరి హరిమహిమల వెరిఁగీనా

చ. 2: వొద్దనుండి రాతిరెల్లా వొడలేమి నెరఁగఁడు
పొద్దు వొడచినమీఁద భోగమే కోరు
కొద్దిమాలినట్టి తనఘోరము విచారించఁడు
సుద్దులైన హరిభక్తి సోదించీనా

చ. 3: అనుభవించేది నిచ్చా నంగనల మాంసమే
అనిశము సేయఁబొయ్యే వాచారములే
తనివోక మనసులో తనవెట్టి గానఁడు
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గానబొయ్యీనా

రేకు: 0224-05 దేవగాంధారి సం: 03-136 పోలికలు

పల్లవి: ధర్మాధర్మము లాల దైవము లాల
నిర్మిత మాతఁడే కాని నే నేమీ నెఱఁగ

చ. 1: పుట్టించేటివాఁడు హరి పుట్టెడివాఁడ నేను
నెట్టన నున్న పనులు నే నెఱఁగ
వెట్టివాఁడ నేనింతే విష్ణుఁడు నా కేలికె
చుట్టిన నడుమంత్రాల సుద్దులూ నెఱఁగ

చ. 2: లోకము దేవునిమాయ లోనైనవాఁడ నేను
చేకొని కర్మములలో చేఁతలెరఁగ
సాకిరి మాత్రము నేను సర్వజ్ఞుఁడాతఁడు
దాకొని నేఁ దలఁచేటి తలఁపూ నెఱఁగ

చ. 3: అంతరాత్మ యాతఁడు ఆతనిబంట జీవుఁడ
పంతాన నాలోపలి భావ మెరఁగ
యింతయు శ్రీవేంకటేశుఁ డిటువంటివాఁడ నేను
చెంతల నానందమిది చెప్పనేమీ నెఱఁగ

రేకు: 0224-06 శంకరాభరణం సం: 03-137 శరణాగతి

పల్లవి: పట్టి పిసుక నిఁక బనిలేదు
గుట్టు దెలిసితే గులగులలు

చ. 1: ఆలకించితే నంతా హేయమె
సోలి భోగములు సుజ్ఞానికి
మేలు దెలుసుకొని మెచ్చెదమంటే
నాలికెఁ గడచితే నరకములు

చ. 2: యెంచి చూచితే నింతా నెరవె
పొంచి ప్రపంచము పుణ్యునికి
దించక తిరిగే తిమ్మటలన్నియు
అంచల వెఱ్ఱుల అలమటలు

చ. 3: పట్టినదెల్లా బ్రహ్మానందమె
గట్టిగ శరణాగతునికిని
యిట్టె శ్రీవేంకటేశు కరుణ నిఁక
పుట్టినప్పుడే భోగ్యములు

రేకు: 0225-01 రామక్రియ సం: 03-138 హనుమ

పల్లవి: అన్నిటా నేరుపరి హనుమంతుఁడు
పిన్ననాఁడే రవినంటె పెద్ద హనుమంతుఁడు

చ. 1: ముట్టిన ప్రతాపపు రాముని సేనలలోన
అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుఁడు
చుట్టి రానుండినయట్టి సుగ్రీవు ప్రధానులలో
గట్టియైన లావరి చొక్కపు హనుమంతుఁడు

చ. 2: వదలక కూడినట్టి వనచర బలములో-
నదె యేకాంగవీరుఁడు హనుమంతుఁడు
చెదరక కుంభకర్ణు చేతి శూలమందరిలో
సదరాన విరిచె భీషణ హనుమంతుఁడు

చ. 3: త్రిజగముల లోపల దేవతాసంఘములోన
అజుని పట్టాన నిల్చె హనుమంతుఁడు
విజయనగరాన శ్రీవేంకటేశు సేవకుఁడై
భుజబలుఁడై యున్నాఁ డిప్పుడు హనుమంతుఁడు

రేకు: 0225-02 గౌళ సం: 03-139 అధ్యాత్మ

పల్లవి: వివరించుకోనివారి వెఱ్ఱితనమింతే కాక
తవిలి రెంటికి గురి తామే కారా

చ. 1: కడుఁ బాపకర్మానకుఁ గలిగినట్టి బలిమి
నడుమఁ బుణ్యకర్మమునకు లేదా
అడరి నరలోకమందు గలిగిన విధి
కడు మంచి స్వర్గలోకమునకు లేదా

చ. 2: తప్పక బంధములను తగిలించే కోరికె
ముప్పిరిఁ గొనేటి మోక్షమునకు లేదా
కప్పి యట్టె కల్లలాడఁగలిగిన నాలికె
దప్పిదీర శ్రీహరిఁ దలఁచఁగ లేదా

చ. 3: పంచుకొన్న విషయాలబారిఁ జిక్కే జీవుఁడు
అంచెల వైరాగ్యమునందు లేఁడా
పంచల నరుల వెంటఁ బారాడించే మనసు
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిపించలేదా

రేకు: 0225-03 దేసాక్షి సం: 03-140 వేంకటగానం

పల్లవి: తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడూఁ దలఁచు
కలసిన బంధువుడు కమలారమణుఁడే

చ. 1: ఆతుమలోననే వుండు అన్నిటాఁ బాయనివాఁడు
యీతల నాతలఁ దానే యేమైనా నిచ్చు
చేతిలోఁ జేసే కర్మాలు చెడనియ్యఁ డెన్నఁడును
ఆతుర బంధువుఁడు హరి యొక్కఁడే

చ. 2: నిచ్చలు విందులు వెట్టు నెలఁతల నొడఁగూర్చు
యిచ్చెరిఁగి కప్ప గోకలెందైనాఁ దెచ్చు
మెచ్చు నేమిటికినైనా యిచ్చినవి గైకొను
ముచ్చటైన బంధువుఁడు ముకుందుఁడే

చ. 3: తోడునీడై వచ్చు మరి దొరతనము సేయించు
పాడితోఁ బంచేంద్రియాలఁ బంపు సేయించు
మేడెపు సంసారములో మించిన నిద్ర దెలుపు
వేడుక బంధువుఁడు శ్రీవేంకటేశుఁడే

రేకు: 0225-04 వసంతవరాళి సం: 03-141 శరణాగతి

పల్లవి: నారాయణుఁ డీతఁడు నరులాల
మీరు శరణనరో మిమ్ముఁ గాచీని

చ. 1: తలఁచిన చోటను తానే వున్నాఁడు
వలెననువారి కైవసమెపుడు
కొలచెను మూఁడడుగుల జగమెల్లాను
కొలిచినవారిఁ జేకొనకుండునా

చ. 2: యెక్కడఁ బిలి(చి)నా నేమని పలికి
మొక్కిన మన్నించు మునుముగను
రక్కసుల నణఁచి రక్షించు జగములు
దిక్కని నమ్మినఁ దిరముగా నేలఁడా

చ. 3: చూచిన యందెల్ల చూపును రూపము
వోచికఁ (?) బొగడిన వుండు నోటను
యేచిన శ్రీవేంకటేశుఁడే యితఁడట
చేచేతఁ బూజింప సేవలు గొనఁడా

రేకు: 0225-05 సాళంగనాట సం: 03-142 కృష్ణ

పల్లవి: కొమ్మలు చూడరే గోవిందుఁడు
కుమ్మరించీ ముద్దు గోవిందుఁడు

చ. 1: దిట్ట బాలులతోఁ దిరిగి వీధుల
గొట్టీ నుట్లు గోవిందుఁడు
పట్టిన కోలలు పైపైఁ జాఁపుచు
కుట్టీఁ దూంట్లుగా గోవిందుఁడు

చ. 2: నిలువుఁగాశతో నిడిగూఁతలతో
కొలకొలమని గోవిందుఁడు
వలసిన పాలు వారలు వట్టుచు
కులికి నవ్వీ గోవిందుఁడు

చ. 3: బారలు చాఁపుచుఁ బట్టగ నింతులఁ
గూరిమిఁ గూడీ గోవిందుఁడు
చేరి జవ్వనుల శ్రీవేంకటాద్రిపై
గోరఁ జెనకీ గోవిందుఁడు

రేకు: 0225-06 సాళంగనాట సం: 03-143 హనుమ

పల్లవి: అంజనాతనయుఁడైన హనుమంతుఁడు
రంజితపు మతంగపర్వత హనుమంతుఁడు

చ. 1: రాకాసునెల్లాఁ గొట్టి రావణుని భంగపెట్టి
ఆకాసము మోచెనదే హనుమంతుఁడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పి
భీకర ప్రతాపపు పెద్ద హనుమంతుఁడు

చ. 2: రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాఁడు హనుమంతుఁడు
స్వామికార్యమునకే సరిఁ బేరువడ్డవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁ బెద్ద హనుమంతుఁడు

చ. 3: ఉదయాస్తశైలముల కొక్కజంగగాఁ జాఁచి
అదె సూర్యుతోఁ జదివె హనుమంతుఁడు
యెదుట శ్రీవేంకటేశు కిష్టుఁడై రామజపానఁ
బెదవులు గదలించీఁ బెద్ద హనుమంతుఁడు

రేకు: 0226-01 సాళంగనాట సం: 03-144 హనుమ

పల్లవి: అవధారు దేవ హరికులరామ
వివిధమై నీబంటు వెలయుచున్నాఁడు

చ. 1: అదె కలశాపురము హనుమంత రాయఁడు
కదనములోన రక్కసులఁ గొట్టి
యెదుట నిందరిలోన నేకాంగవీరుఁడై
కొదలేక ప్రతాపించి కొలువై వున్నాఁడు

చ. 2: చల్లని వనాలనీడ సాగుడుఁ గొండలోన
వల్లెగా వేసుకొన్న వాలముతోడ
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని
కొల్లున మంటపములోఁ గొలువై వున్నాఁడు

చ. 3: పెక్కు పండ్లగొలలు పిడికిటఁ బట్టుకొని
చక్కఁగాఁ బెరిగి పెద్దజంగ చాఁచి
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైన సర్వేశ
గుక్కక నీపై భక్తిఁ గొలువై వున్నాఁడు

రేకు: 0226-02 మాళవిగౌళ సం: 03-145 తేరు

పల్లవి: రెక్కలకొండవలె మీరిన బ్రహ్మాండమువలె
వెక్కసమైన తేరుపై వెలసీని దేవుఁడు

చ. 1: బిఱబిఱఁ దిరిగేటి పెనుబండికండ్లతో
గుఱుతైన పడగెల గుంపులతో
తఱితో ధరణి గ్రక్కదలఁ గదలెను తేరు
మెఱసీ వీధివీధుల మేఁటియైన దేవుఁడు

చ. 2: ధగధగమను నాయుధపు మెరుఁగులతోడ
జిగిమించుఁ బగ్గముల చేరులతో
పగటు రాకాసులపైఁ బారీనదె తేరు
నిగిడి నలుదిక్కుల నీటు చూపీ దేవుఁడు

చ. 3: ఘణఘణ మనియెడి గంటల రవముతోడ
ప్రణుతి నలమేల్మంగ పంతాలతోడ
రణములు గెలిచి మరలెనదే తిరుతేరు
గణుతికెక్కెను శ్రీవేంకటగిరిదేవుఁడు

రేకు: 0226-03 దేసాళం సం: 03-146 అధ్యాత్మ

పల్లవి: ఇందిరయుఁ దానుఁ గూడి యిట్టె వరాలొసఁగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీ నిదివో

చ. 1: వేదములే గుఱ్ఱములు విష్ణుని రథమునకు
వాదపు శాస్త్రములే తీవ్రపుఁ బగ్గాలు
పాదగు పంచభూతాలే పరగు బండికండ్లు
ఆదిగొని మనోవీధులందు నేఁగీ నిదివో

చ. 2: జీవులెల్లా సారథులు శ్రీవిభుని తేరునకు
కావించుఁ నెజ్జాలు పడిగల గుంపులు
భావించఁ దన ప్రకృతి పట్టపుసింహాసనము
వేవేలు సంపదలతో వెలసీ నేఁడిదివో

చ. 3: చందురుఁడు రవియును సరుస బైఁడికుండలు
చెందిన పుణ్యములెల్ల సింగారాలు
అందపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో

రేకు: 0226-04 ఆహిరి సం: 03-147 పొలికలు

పల్లవి: విన్నపము లేమి సేసే వేగినంతాను

మన్నించి రక్షించే నీ మహిమలే ఘనము

చ. 1: నీవంక నేరమి గద్దా నేనే అపరాధిని

దేవ నే జడుఁడఁగాన తెలుసుకోను

వావాత మీగురుఁ డాడేవాక్యము నీయాధీనము

పావనమైన నీపలుకెల్లా సత్యము

చ. 2: మంచితనమల్లా నీదె మాయదారివాఁడ నేను

చంచలుఁడఁ గనక వివా(చా?)రించుకోను

అంచల నీదాసుని ఆనతి యమోఘము

యెంచ నీవిచ్చిన వరమెం(మిం?)దుకంటే బలువు

చ. 3: కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది

నరుఁడఁ గనక అట్టె యరసుకోను

పరగ మా జనకుని ప్రతిజ్ఞయు నీపంపు

నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము

రేకు: 0226-05 రామక్రియ సం: 03-148 హనుమ

పల్లవి: మొక్కరయ్య అన్నిటికి మూల మీతఁడు
చుక్కలు మొలపూసలై సొంపుమీరీ నితఁడు

చ. 1: అదె కలశాపుర హనుమంతుఁడు
వుదయార్కు ఫలమని వొగ్గుచున్నాఁడు
వుదుటు బాలక్రీడ నుబ్బుచున్నాఁడు
మదించి రామునిబంటై మలయుచున్నాఁడు

చ. 2: జలనిధి కొకజంగ చాఁచుకున్నాఁడు
యిలఁ బ్రతాపమునఁ జేయెత్తుకున్నాఁడు
బలువాల మల్లార్చి పట్టుకున్నాఁడు
వెలయఁగఁ గేలుగంటు వేసుకున్నాఁడు

చ. 3: సరుగ లంకారాజ్యము సాధించినాఁడు
అరిది సీతకు సేమ మందించినాఁడు
నిరతి శ్రీవేంకటాద్రినిలయునికి
పరగిన సేవలనుఁ బ్రబలుచున్నాఁడు

రేకు: 0226-06 శంకరాభరణం సం: 03-149

పల్లవి: అక్కలాల చూడుఁడందరును
నిక్కి వారవట్టీ నేఁడు గృష్ణుఁడు

చ. 1: ఆనవాలవుట్టి అడుకులవుట్టి
పానకపుటుట్టి బలిమినే
ఆనుక కోలల నందియంది కొట్టి
తేనెవుట్టి (?) గొట్టీ దేవకీసుతుఁడు

చ. 2: పెరుగువుట్టి మంచి పేరిన నేతివుట్టి
సరివెన్నవుట్టి చక్కెరవుట్టి
వెరవుతోఁ గొట్టి వెస బాలులతో
పొరుగువుట్టి (?) గొట్టీ పొంచి రాముఁడు

చ. 3: మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు
చొక్కి శ్రీవేంకటేశుఁడు వీధుల
నిక్కి వుట్లెల్లా నిండాఁ గొట్టి వుట్టి(?)-
చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు

రేకు: 0227-01 దేసాళం సం: 03-150 కృష్ణ

పల్లవి: పచ్చిదేరుచు నుట్ల పండుగాయను
గచ్చులకు గొల్లెతలు కాఁగిలించి పట్టగా

చ. 1: పీతాంబరముమీఁద పెద్ద కిరీటముమీఁద
నేతిపాలచార లెల్ల నిండె నదివో
జాతి గొల్లెతల వుట్లు సారెఁ గోలలెత్తి కొట్టి
చేతులు చాఁచారగించి చిమ్మి రేఁగఁగాను

చ. 2: సొరిది సొమ్ములమీఁద సోయగపుచెక్కులపై
పెరుగులు మీఁగడలు పేరుకొనెను
అరుదుగ వీధులను అందరి వుట్లు గొట్టి
దొరతనములతోడ దొమ్మి సేయఁగాను

చ. 3: పూని శ్రీవేంకటేశుపై పొందెలమేలుమంగపై
తేనెలునుఁ జక్కెరలుఁ దెట్టెగట్టెను
నానావిధములను నడుమ నుట్లు గొట్టి
ఆనందాన నారగించి అలరుచుండఁగను

రేకు: 0227-02 ధన్నాసి సం: 03-151 నృసింహ

పల్లవి: వీఁడె వీఁడె కూచున్నాఁడు వేడుకతో గద్దెమీఁద
వాఁడి ప్రతాపము తోడి వరదానసింహము

చ. 1: అరయఁ బ్రహ్లాదుని ఆపదోద్ధారసింహము
గిరిపై యిందిరకును క్రీడాసింహము
నిరతి సురల భయనివారణసింహము
సరి హిరణ్యకసిపు సంహారసింహము

చ. 2: ఇట్టె విశ్వమునకు నేలికైన సింహము
గట్టిగ శరణాగతులఁ గాచే సింహము
దిట్టయై వేదాలలోని తెరవేఁటసింహము
నెట్టుకొనిన దురితనివారణసింహము

చ. 3: అంచల మూఁడుమూర్తుల కాధారమైన సింహము
పంచల మునుల భాగ్యఫలసింహము
పొంచి శ్రీవేంకటాద్రికి భూషణమైన సింహము
చెంచుల అహోబలపు శ్రీనారసింహము

రేకు: 0227-03 లలిత సం: 03-152 అధ్యాత్మ

పల్లవి: సర్వసులభుఁ డితఁడు సర్వేశ్వరుఁడు
గర్వముఁ బాసితేను కానవచ్చు నితని

చ. 1: చింతలెల్లా నుడిగితే శ్రీపతి యందేవుండు
మంతనాన నుండితేను మరి నాతఁడే
పంతపు వుబ్బు మానితే పరమాత్ముఁడు దోడౌను
వింతలు దలఁచకుంటే విశ్వరూపమే

చ. 2: వెడకర్మాలు దోసితే విష్ణుని సాన్నిధ్యమబ్బు
కడునాస లొల్లకుంటే కలఁడాతఁడు
వొడ లోముకొనకుంటే వుపేంద్రుఁడు రక్షించు
పొడిఁబడకుంటేనే పూర్ణభావ మలరు

చ. 3: ఇతర మెరఁగకుంటే నిందిరానాథుఁడు మెచ్చు
సతిబారిఁ బడకుంటే జంటౌ నాతఁడు
హితవులు గోరకుంటే నెదుటఁ శ్రీపతి నిల్చు
జితేంద్రియవ్రతమందే శ్రీవేంకటేశుఁడు

రేకు: 0227-04 నాట సం: 03-153 నృసింహ

పల్లవి: నానాటికిఁ బెరిగీని నరసింహము
ఆనుక వరములిచ్చీ నౌభళపుసింహము

చ. 1: వేఁడి ప్రతాపముతోడ విభవాలు మెరయుచు
మూఁడుమూర్తు లొక్కటైన ముఖ్యసింహము
వాఁడివాఁడి కోరలతో వడి నసురఁ జక్కాడి
తీఁడేటి మీసాలతోడి దేవదేవసింహము

చ. 2: సరుస శంఖచక్రాది సకలాయుధాలు వట్టి
పరబ్రహ్మమే తానైన పటుసింహము
వరుసఁ గొలువులు దేవతలెల్లాఁ జేయఁగాను
తిరమైన కృపతోడి దివ్యసింహము

చ. 3: కేలి సింహాసనముపై కిరీటము ధరియించి
చాలు వేయిచేతుల కాంచనసింహము
పాలించి ప్రహ్లాదుని భక్తుల పాలిటి కిలు-
వేలుపై శ్రీసతితో శ్రీవేంకటాద్రి సింహము

రేకు: 0227-05 మాళవి సం: 03-154 నృసింహ

పల్లవి: ఎందుఁ జూచినా నీవే ఇదివో నీ ప్రతాపము
నందకధరుఁడ నీకు నమో నారసింహా

చ. 1: అచ్చలపు బ్రహ్మాండమది నీకుఁ బెద్దగుహ
చెచ్చెర నహోబలాద్రి సింహాసనము
అచ్చటఁ గనకదైత్యుఁ డాహారపుమెగము
విచ్చనవిడిఁ జెలఁగు విజయనారసింహా

చ. 2: జలధు లేడును నీకు జలకపు మడుగులు
అలరి భూమెల్లా విహారదేశము
కెలన రేలుఁబగళ్లు కిందిమీఁది రెప్పలు
వెలయఁగ విహరించు విజయనారసింహా

చ. 3: చక్కటి శ్రీమహాదేవి జంటైన ఆడుసింహము
నిక్కపు దేవతలెల్లా నీ పిల్లలు
యెక్కువై శ్రీవేంకటాద్రి నిన్నిటా భోగించేవు
వెక్కసమై మమ్మేలుకో విజయనారసింహా

రేకు: 0227-06 శ్రీరాగం సం: 03-155 రామ

పల్లవి: శరణు వేఁడెద యజ్ఞసంభవ రామ
అరసి రక్షించు మమ్ము నయోధ్యారామా

చ. 1: ధారుణిలో దశరథతనయ రామ
చేరిన యహల్యను రక్షించిన రామ
వారిధిబంధన కపివల్లభ రామ
తారకబ్రహ్మమైన సీతాపతి రామ

చ. 2: ఆదిత్యకులాంబుధిమృగాంక రామ! హర-
కోదండ భంజనము చేకొనిన రామ
వేదశాస్త్రపురాణాదివినుత రామ
ఆదిగొన్నతాటకాసంహార రామా

చ. 3: రావణుని భంజించిన రాఘవ రామ
వావిరి విభీషణవరద రామా
సేవ నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడవై
యీవల దాసులనెల్లా నేలినట్టి రామా

రేకు: 0228-01 సామంతం సం: 03-156 వైరాగ్య చింత

పల్లవి: ముందరఁ గలదని మోసపోతి నిదె
యిందునే తుదిపద మెక్కితినా

చ. 1: కాయము మోచితి ఘడన గడించితి
చేయారఁబుణ్యము సేసితినా
పాయము గైకొంటి పలు రుచులెరిఁగితి
రోయఁదగిన విల రోసితినా

చ. 2: నిదుర మేల్కనితి నిక్కల గంటిని
హృదయపు విజ్ఞాన మెఱిఁగితినా
చదువులు చదివితి జపములు సేసితి
మది చంచలములు మానితినా

చ. 3: అందరిఁ గొలిచితి నన్నియుఁ జూచితి
నెందునైన మేలెఱిఁగితినా
కందువ శ్రీవేంకటపతి నీవే
చెంది కాచితివి చెదరితినా

రేకు: 0228-02 శంకరాభరణం సం: 03-157 రామ

పల్లవి: సీతారమణ వో శ్రీరామచంద్ర దా-
దాత లక్ష్మణుఁడదే తగు రామచంద్ర

చ. 1: చెలువపు సింగారాల శ్రీరామచంద్ర నీ-
సెలవుల నవ్వుగారీ శ్రీరామచంద్ర
చెలఁగీ చెక్కులఁ గళ శ్రీరామచంద్ర
మొలచె మోహనము నీ మోమున రామచంద్ర

చ. 2: చిక్కని మురిపెముల శ్రీరామచంద్ర
చిక్కులేదు పెద్దకొప్పు శ్రీరామచంద్ర
చిక్కె నీచే మదనుఁడు శ్రీరామచంద్ర
చొక్కపు నున్నని మేనిసొంపు రామచంద్ర

చ. 3: చేవదేరిన సిగ్గుల శ్రీరామచంద్ర
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామచంద్ర
యీవల దాసరిపల్లె నిరవుకొని మీ-
సేవకుల మమ్మునేలే శ్రీరామచంద్ర

రేకు: 0228-03 దేవగాంధారి సం: 03-158 వైరాగ్య చింత

పల్లవి: ఎందునైనా మీరఁబోతే నెవ్వరికి జవిగాదు
యిందరిలోఁ దన కొలఁ దెంచుకొనవలెను

చ. 1: మంచితనమే వలె మాటలాడే యప్పుడెల్లా
కొంచికొంచి యుండవలె కోపపువేళ
వంచన యెప్పుడూ వలె వరుస ఘనులఁ గంటే
చంచలము మానవలె సతతము దేహికి

చ. 2: భ్రమయకుండఁగ వలె పడఁతులఁ గంటేను
తమకించకుండవలె తన్నుఁ దిట్టితే
సుముఖుఁడై యుండవలె చూచినవారికి నెల్ల
అమరి యుండఁగవలె నన్నిటాను దేహికి

చ. 3: కైవశమై యుండవలె ఘనపుణ్యములకెల్ల
దైవము నమ్మఁగవలె తనువెత్తితే
యీవల శ్రీవేంకటేశుఁడితనికే శరణని
భావించి బ్రతుకవలె పనివడి దేహికి

రేకు: 0228-04 మలహరిసం: 03-159 శరణాగతి

పల్లవి: సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే
పుర్విలోన నేమెంచే వుపమ లేమున్నవి

చ. 1: వెలయ నేమిటికైనా వెరవకుండేనంటే
యెలమి ధైర్యము నీవియ్యక లేదు
బలిమి చూపెద నేపట్టునసైనా నంటే
చెలఁగి నీవే లోని చేతనాత్మకుఁడవు

చ. 2: జగములోపల నేనెచ్చరికై వుండేనంటే
అగపడి బుద్ధి నీవియ్యక లేదు
పగటు సంసారము భ్రమ విడిచేనంటే
మగటిమిగల నీవు మాయానాథుఁడవు

చ. 3: కేవల మీ పుట్టుగును గెలిచి వుండేనంటే
ఆవేళ నీవు ముక్తియ్యక లేదు
శ్రీవేంకటేశ్వర నీకు చేకానుకిచ్చేనంటే
లావుసంపదల నీవు లక్ష్మీనాథుఁడవు

రేకు: 0228-05 భైరవి సం: 03-160 శరణాగతి

పల్లవి: ఆతఁడే యిన్నియు నిచ్చు నడిగినవల్లాను
చేతిలోనే వుండఁగాను చింతించరు హరిని

చ. 1: వలెనంటే సంపదలు వట్టి యలమటఁబెట్టు
అలసి వోపనంటేను అండనే వుండు
తలఁచి యిందరు నీతరితీపులఁ జిక్కి
తలఁచ రెందును బరతత్త్వమైన హరిని

చ. 2: ఆసపడితే నింతులు అన్నిటాను బిగుతురు
వాసితో నుంటేనే తామే వత్తు రొద్దికి
పోసరించి యిందరు నీ పొందుల భ్రమలఁ బడి
పాసి వున్నారదే తమ పతియైన హరిని

చ. 3: గట్టిగా రాతిరెల్లాను కలయైయుండు జగము
పట్టపగలైతే తమ పాల నుండును
బట్టబయలు పందిలి పెట్టేరుగాని చే-
పట్టరు శ్రీవేంకటాద్రిపైనున్న హరిని

రేకు: 0228-06 సాళంగనాట సం: 03-161 కృష్ణ

పల్లవి: పైకొని చూడరో వుట్ల పండుగ నేఁడు
ఆకడ గొల్లెతలకు నానందము నేఁడు

చ. 1: ఆదికాలమునఁ గృష్ణు డవతరించినయట్టి-
ఆదట శ్రావణ బహుళాష్టమాయను
దాదాత రోహిణినక్షత్రము గూడె నడురేయి
సాదించ లోకులకెల్లా జయంతియాయను

చ. 2: వసుదేవునిని దేవకిని మన్నించి కృష్ణుఁ-
డెసఁగి రేపల్లెకు నేతెంచుటాయను
కొసరి యశోదా నందగోపులకుఁ బుత్రోత్సవ-
మసమున నిచ్చి మించె నన్నిటా మేలాయను

చ. 3: తొట్టిన రాకాసులతోడఁ గూడ భువిమీఁద
నట్టె కంసుని మదము హతమాయను
రట్టడి శ్రీవేంకటేశుఁ డిట్టె వీధుల నెల్ల
జట్టిగా మెరసే యట్టి సంభ్రమములాయను

రేకు: 0229-01 దేవగాంధారి సం: 03-162 కృష్ణ

పల్లవి: ఒకరి కొకరు వొడ్డు దప్పులనే
పకపక నవ్వు పచరించేరు

చ. 1: కొట్టీ నుట్లదె గోవిందుఁ డంతలో
తిట్టేరు గోపసతీమణులు
పట్టీ జన్నులట్టే పైపై గోవిందుఁడు
మెట్టెల పాదాల మెట్టే రింతులు

చ. 2: వారవట్టీఁ బాలు వంచి గోవిందుఁడు
గోర గీరే రదే గొల్లెతలు
చీర లంటీనట్టె చెంది గోవిందుఁడు
మేరతోఁ గొప్పు వంచి మించే రింతులు

చ. 3: కెలసి వెన్నారగించీ గోవిందుఁడు
తొలఁగఁ దోసేరు దొడ్డవారు
కలసెను శ్రీవేంకటాద్రి గోవిందుఁడు
అలమేరు మరి నంగనలు

రేకు: 0229-02 శంకరాభరణం సం: 03-163 ఉత్సవ కీర్తనలు

పల్లవి: మదనజనకునికి మజ్జనవేళ
పదివేలు భోగములు పరగీనదె

చ. 1: వున్నతి వేద ఘోషాల నుర్వీధరుని మీఁద
పన్నీటి కాలువలు పారీనదె
మున్నిటి మునుల హస్తములఁ గప్పురపుధూళి
కన్నులపండుగగాఁ గప్పీనదె

చ. 2: సేసలుగా నలువంక శ్రీసతి విభునిమీఁద
వాసన తట్టుపుణుఁగు వడిసీనదె
భాసురపుఁ జంద్రగావిపట్టుదట్టి కాంతలెల్లా
ఆసల మొలఁ గట్టగా నమరీనదె

చ. 3: చెలరేఁగి సొమ్ములెల్లా శ్రీవేంకటేశ్వరు మేన
నెలకొని కాంతులతో నిండీనదె
అలమేలుమంగ వురమందు నెలకొని యట్టె
సలిగె గృపారసము చల్లీనదె

రేకు: 0229-03 సాళంగనాట సం: 03-164 ఉత్సవ కీర్తనలు

పల్లవి: భీకరపు చక్రమదె పిడుగులు రాలీనదె
పైకొని నిలువరాదు పారరో దిక్కులకు

చ. 1: బండికండ్లరవమదే బంగారుమెఱుఁగులవే
కొండవంటి రథమదె గొడగులవే
మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే
బండుబండై యసురలు పారరో దిక్కులకు

చ. 2: గరుడధ్వజమదే ఘంటారవములవే
సొరిది ముత్యాలకుచ్చులు నవే
బిరుదుశంఖముమ్రోఁత బెరయించీ దేవుఁడదే
పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు

చ. 3: ముంగిట బలములవే మొరసీ భేరులవే
సంగతిఁ బ్రతాపమదే సాకారమదే
కుంగ కలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడు
భంగపెట్టీ దైతేయులు పారరో దిక్కులకు

రేకు: 0229-04 శ్రీరాగం సం: 03-165 వేంకటగానం

పల్లవి: భావించరే చెలులాల పరమాత్మని
చేవదేరి చిగురులో చేఁగయ్యై యుండెను

చ. 1: మలసి పన్నీట హరి మజ్జనమాడేవేళ
కలశాబ్ధిఁ దేలే మాణికమువలె నుండెను
అలరి కప్పుర కాపు అవధరించేటి వేళ
మొలచిన వెన్నెల మొలకయ్యై యుండెను

చ. 2: అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటి వేళ
యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను
మించిన హారములెల్ల మేన నించుకొన్న వేళ
మంచిమంచి నక్షత్ర మండలమై యుండెను

చ. 3: పున్నతి నలమేల్మంగ నురమున నుంచు వేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను
వన్నె శ్రీవేంకటేశుఁడు వరములిచ్చేటి వేళ
తిన్ననై యందరి భాగ్యదేవతయ్యై యుండెను

రేకు: 0229-05 సామంతం సం: 03-166 కృష్ణ

పల్లవి: చెప్పరాని మహిమల శ్రీదేవుఁడితఁడు
కప్పి కన్నుల పండుగగాఁ జూడరో

చ. 1: అద్దుచుఁ గప్పురధూళి యట్టే మేన నలఁదఁగా
వొద్దిక దేవునిభావ మూహించితేను
మద్దులు విరిచినట్టి మంచి బాలకృష్ణునికి
మద్దులకాంతి మేన మలసినటుండె

చ. 2: అమరఁ దట్టుపుణుఁగు అవధరించఁగాను
తమితోఁ బోలికెల్లఁ దచ్చిచూడఁగా
యమునానది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానది నలుపు అంటిన యట్టుండె

చ. 3: అంగముల శ్రీవేంకటాధిపున కింతటాను
సింగారించి సొమ్ములెల్లఁ జెలరేఁగఁగా
బంగారపు టలమేలుమంగ నురాన నుంచఁగా
బంగారము మేననెల్లాఁ బరగినట్టుండె

రేకు: 0229-06 పాడి సం: 03-167 శరణాగతి

పల్లవి: నేరనైతి నింతేకాక నే నిన్నాళ్లు
యే రీతి విచారించినా నిదివో నిశ్చయము

చ. 1: నాకుఁగా వేరొకరు విన్నపము సేసేరా నీకు
వాకుచ్చి నేనే ఆడవలెఁ గాక
యీకడ నాకంటే హీనునిఁక నీవు గా(౦)చేవా
శ్రీకాంతుఁడ యిఁక నీ చిత్తమింతే కాక

చ. 2: నీవల్ల బతుకలేక నేనొకరి వేఁడేనా
వావిరి నిన్నే కొసరవలెఁ గాక
నీ వితరణగుణము నీలోనే దాఁచుకొనేవా
సోవ నావంటివారికిఁ జూపవలెఁ గాక

చ. 3: తల్లికి లేని ముద్దు దాదికిఁ గలదా మరి
చెల్లుబడి నీవే దయ సేయుటఁ గాక
తొల్లె శ్రీవేంకటేశ్వర తూరి నాలో నున్నాఁడవు
చల్లఁగా నీ చనవిచ్చి జరుపుటఁ గాక

రేకు: 0230-01 లలిత సం: 03-168 వైరాగ్య చింత

పల్లవి: ఎట్టున్నదో నీచిత్త మెదురాడ నే వెఱతు
గట్టిగా హరి నీమాయ కడవఁగరాదు

చ. 1: నిచ్చ పతితులఁ జూచి నేను సంసారినై యుందు
అచ్చపు సన్యాసులఁ జూచటువలె నయ్యేనందు
హెచ్చి మోచి వచ్చితేను యెక్కడిగొడవ యందు
ఇచ్చట నిశ్చలబుద్ధి యెందూ నేఁగానను

చ. 2: కర్ములఁ జూచొకవేళ కర్మము నేఁ జేయఁబోదు
మర్మపు జ్ఞానులఁ జూచి మంచిదందును
అర్మిలి రెండూఁ జూచి అంతలో సందేహింతు
నిర్మలమయిన బుద్ధి నే నెందుఁ గానను

చ. 3: వారఁణాసి వోఁజూచి వారివెంటఁ దగులుదు
తేరి కొంత దవ్వు వోయి తిరుగుదును
నేరిచి శ్రీవేంకటేశ నీవే నన్ను గాచితివి
యీ రీతి దేరిన బుద్ధి యెందూ నే గానను

రేకు: 0230-02 లలిత సం: 03-169 శరణాగతి

పల్లవి: శ్రీపతి యీతఁడుండగాఁ జిక్కినవారి నమ్ముట
తీపని మీసాలమీఁది తేనె నాకుట సుండీ

చ. 1: తలఁచినంతటిలోనె దైవ మెదుటఁ గలఁడు
కొలువనేరనియట్టి కొరతే కాని
ఇల నరులఁ గొలుచు టెందో కోకలు వేసి
బలుకొక్కెరలవెంటఁ బారాడుట సుండీ

చ. 2: శరణన్నమాత్రమున సకలవరము లిచ్చు
నిరతి మరచినట్టి నేరమే కాని
పోరి నితరోపాయానఁ బొరలుట గాజుఁబూస
గరిమ మాణికమంటాఁ గట్టుకొంట సుండీ

చ. 3: చేత మొక్కితేఁ జాలు శ్రీవేంకటేశుఁడు గాచు
కాతరాన సేవించని కడమే కాని
యీతల నిది మాని మరెన్నిపుణ్యాలు సేసినా
రీతి నడవిఁగాసిన రిత్తవెన్నెల సుండీ

రేకు: 0230-03 బౌళి సం: 03-170 వైరాగ్య చింత

పల్లవి: కొలఁది పుణ్యపాపాలే కొంగు రొక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ వేగిరమే రారో

చ. 1: జననాలు మరణాలు సంసారభోగములును
అనిశము భూమి మీఁద నగ్గువలు
కొనేవారుఁ దినేవారు కూడికూడి మూఁకలై
దినసంత లెక్కనిదే దేహులాల రారో

చ. 2: అంగనల వలపుల అంగళ్లు వెట్టిరదే
చెంగట వయసులనే చింతల కింద
సంగతిఁ గాయమనే సంచుల నించుకొందము
చెంగి పోరాదు మనకు జీవులాల రారో

చ. 3: లంపటాలు సంపదలు లలి నంబారాసులాయ
ఇంపుల ముంచి తలల కెత్తుకోరో
దింపక ఇందులోననే తిరిగి శ్రీవేంకటేశు-
పంపున లాభము చేరె ప్రాణులాల రారో

రేకు: 0230-04 ముఖారి సం: 03-171 శరణాగతి

పల్లవి: దైవమా వో దైవమా నన్ను దయఁజూడఁ దగదా
నే వెట్టివాఁడనైతే నీవు వెట్టివా

చ. 1: చవిగొంటి నెత్తురెల్లా చన్నుఁబాలనుచు నేను
భువిఁ దొల్లే నోచితి పుట్టేనంటాను
యివల గడుపులోన హేయమౌతాఁ గూడవుతా
నివిరి నన్నెరఁగను నిన్నెరిఁగేనా

చ. 2: మొగిఁ జావుకు వెరతు ముందర గాన నేను
వెగటు లంపటమైతే వేసరుకొందు
వగపును నగవును పడి నొక్క మొకమందే
తగులైనవాఁడ నీపై తలఁపు నాకున్నదా

చ. 3: మతి భ్రమసితిఁ గొంత మన్ను నాకు రాజ్యమని
సతులంటా సుతులంటా సంసారినైతి
గతియై శ్రీవేంకటేశ కాచితి వింతటిలోనే
యితరుఁడ నింతే నీకు నేమి బాఁతి నేను

రేకు: 0230-05 లలిత సం: 03-172 శరణాగతి

పల్లవి: హరి నిను నెరఁగని యలమటలింతే శాయ
శరణంటి నిదె నీకే సర్వేశ కావవే

చ. 1: చొచ్చితి స్వర్గము దొల్లి సుకృతములెల్లాఁ జేసి
ఇచ్చఁ గొలిచితి సుర లిందరిని
గచ్చులఁ బుణ్యము దీరఁ గమ్మటి జన్మములకే
వచ్చితి పురుషార్థము వడి నెందూ గానను

చ. 2: వెదకితి భూములెల్ల విశ్వకర్తెవ్వడో యంటా
చదివితిఁ బుస్తకాలు సారెసారెకు
తుద ననుమానమున దొమ్మి నీకలు దెల్లఁగా
ముదిసితి నింతేకాని ముందరేమీఁ గానను

చ. 3: చింతలెల్ల నుడిగితి శ్రీవేంకటేశ్వర నిన్ను
వింత లేక శరణని వెలసితిని
చెంతల నిన్నాళ్లదాఁకా చిక్కి కర్మముల వట్టి
గంతులు వేసితిఁగాని కడ గాననైతిని

రేకు: 0230-06 మాళవిగౌళ సం: 03-173 శరణాగతి

పల్లవి: నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి
యీ కరుణకే మొక్కితి నిందిరారమణా

చ. 1: కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి
అమితదుర్గుణరాసి నన్నిటా నేను
అమరఁగ స్వతంత్రుఁడ వటు నిన్ను నెంచితేను
తమి నించుకంతా స్వతంత్రుఁడ నేఁ గాను

చ. 2: దేవ నీవైతే సర్వదేవరక్షకుఁడవు నే
జీవుఁడ నింద్రియాలఁ బెంచేవాఁడను
ఆవల బ్రహ్మాండాల కన్నిటాఁ బొడవు నీవు
భావించ నేనణువై పరగేటివాఁడను

చ. 3: నానార్థసంపన్నుఁడవు నావల్ల నేమి గంటివి
ఆనుక నా యంతర్యామివై పాయవు
శ్రీనిధివి నీవైతే శ్రీవేంకటాద్రిపతివి
దీనుఁడ నొకఁడ నేను ద్రిష్టించి కాచితివి

రేకు: 0231-01 ధన్నాసి సం: 03-174 అధ్యాత్మ

పల్లవి: వెట్టి దెలిసి రోఁకలి వెసఁ జుట్టుకొన్నట్టు
యిట్టి దీముభోగముల నెనసేము

చ. 1: మురికిదేహము మోచి మూలల సిగ్గుపడక
పొరిఁ బరిమళములు పూసేము
పరగ పునుకతల పావనము సేసేమంటా
నిరతితోడ దినము నీట ముంచేము

చ. 2: పుక్కట పంచేంద్రియపు పుట్టు వుట్టి యందరిలో
మొక్కించుక దొరలమై మురిసేము
అక్కర నజ్ఞానమనే అంధకారమున నుండి
దిక్కుల నెదిరివారిఁ దెలిపేము

చ. 3: దినసంసారమే మాకు దేవుఁడని కొలుచుక
వెనుకొని ఘనము క్తి వెదకేము
యెనలేక శ్రీవేంకటేశ మమ్ముఁ గావఁగాను
తనిసి తొల్లిటిపాటు దలఁచేము

రేకు: 0231-02 రామక్రియ సం: 03-175 శరణాగతి

పల్లవి: ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు
కొంకి తెంచి ముడిగొంటే కుఱుచే కాదా

చ. 1: పైకొని నీదాసులు బ్రహ్మాదులఁ గొల్వమని
లోకులఁ గొల్చితే వారు లోలో నవ్వరా
కోక చాకియింట వేసి కొక్కెరాలవెంటఁ బోతే
ఆకడ పురుషార్థము నందీనా జీవుఁడు

చ. 2: వుమ్మడిఁ గర్మఫలము వొల్లమని పసిఁడికి
నమ్మిక చేయి చాఁచితే నవ్వదా అది
కమ్మి శిరసుండఁగా మోకాల సేస వెట్టఁబోతే
సమ్మతి నిందరిలోన జాణౌనా జీవుఁడు

చ. 3: సారెకు మాయాప్రపంచమునకు లోనుఁ గాక
నారులకు లోనై తే నవ్వరా వారు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నీశరణని
కూరవండి కసవేరిఁ గోరీనా జీవుఁడు

రేకు: 0231-03 బౌళి సం: 03-176 శరణాగతి

పల్లవి: అమ్మే దొకటియును అసిమ లోనిదొకటి
ఇమ్ముల మాగుణములు యెంచఁ జోటేదయ్యా

చ. 1: యెప్పుడు నేము చూచిన నింద్రియకింకరులము
ఇప్పుడు నీకింకరుల మెట్టయ్యేమో
తప్పక ధనమునకు దాస్యము నేము సేసేము
చెప్పి నీదాసులమన సిగ్గుగాదా మాకు

చ. 2: పడఁతుల కెప్పుడును పరతంత్రులము నేము
వడి నీ పరతంత్రభావము మాకేది
నడుమ రుచులకే నాలుక అమ్ముడువోయ
యెడయేది నిన్ను నుతిఇంచేఅందుకును

చ. 3: తనువులంపటానకు తగ మీఁదెత్తితిమిదె
వొనరి నీవూడిగాన కొదిగేదెట్టు
ననిచి శ్రీవేంకటేశ నాఁడే నీకు శరణంటి
వెనక ముందెంచక నీవే కావవయ్యా

రేకు: 0231-04 దేసాక్షి సం: 03-177 వైరాగ్య చింత

పల్లవి: వెఱ్ఱి దెలిసి మరియు వేఁదురు దవ్వేము నేము
ముఱ్ఱుఁబాల మంకువాఁడ మూలమా శరణు

చ. 1: తోలు నెముకలు ముట్టి దోసమంటాఁ దీర్ఘమాడి
తోలు నెముకల మేనితోడ నున్నాఁడ
వాలిన జీవహింస వద్దని చైతన్యముతో
తేలించి శాకపాకాల దిగమింగేము

చ. 2: బూతునఁ బుట్టినందుకు పుణ్యములెల్లాఁ జేసి
బూతుల సంసారమే భోగించేము
పాతకములెల్లాఁ బోను బహుదానము లొసఁగి
ఆతల నొరులఁ బోయి అడిగేము నేము

చ. 3: కర్మము లన్నియుఁ దోసి ఘనము క్తిఁబొందేనంటా
కర్మాచ.లే కడుఁ జేసేము
నిర్మించి శ్రీవేంకటేశ నేరాలు నన్ను నెంచక
ధర్మము దలఁచి నీవే దయఁ జూడవే

రేకు: 0231-05 దేసాళం సం: 03-178 కృష్ణ

పల్లవి: ఏమనఁగ వచ్చునమ్మ ఇటువంటి వారిఁ జూచి
కామించి గోపికలెల్లాఁ గాచుకున్నా రదివో

చ. 1: రోలఁ గట్టుపడ్డవాఁడు రోఁకలి పట్టినవాఁడు
వేళలేదు వెన్నలెల్ల వెరఁజాడేరు
వేలఁ గొండెత్తినవాఁడు వేరే యేరుసేసేవాఁడు
బాలులవలెనే వీధిఁ బారాడేరు వారివో

చ. 2: కాటుకమైచాయవాఁడు కప్పురపువన్నెవాఁడు
కూటము గూడుక జోడుకోడెలైనారు
నీటుఁ బైఁడికోకవాఁడు నీలికాశతోడివాఁడు
తేటలై దూడలఁ గాచి తిరిగేరు వారివో

చ. 3: చేరి చీరలిచ్చువాఁడు చెలిఁ గుంగించినవాఁడు
ధీరులై రేపల్లెలోనఁ దిరిగేరదే
యీ రీతి శ్రీవేంకటాద్రి నిద్దరును నేకరూపై
కోరినవారి వరాలు కొల్లలిచ్చే రదివో

రేకు: 0231-06 పాడి సం: 03-179 కృష్ణ

పల్లవి: చేరి యందెలమోతతో చెన్నకేశవా
యీరీతి మాఁడుపూరిలో నిట్లాడేవా

చ. 1: మున్ను యశోద వద్దను ముద్దు గునిశాడితివి
పన్ని రేపల్లె వీధులఁ బారాడితివి
పిన్నవై గోపాలులతోఁ బిల్లదీపులాడితివి
యెన్నిక మాఁడుపూరిలో యిట్లాడేవా

చ. 2: కాళింగు పడిగెలపై కడు నాట్యమాడితివి
కేలి యమునలో రాసక్రీడలాడితి
చేలలంటి గోపికల చెట్టాపట్టాలాడితివి
యీలీల మాఁడుపూరిలో యిట్లాడేవా

చ. 3: తగు విభాండకునితో దాఁగిలిముచ్చలాడితి
అగడుగా బండివిరిచాటలాడితి
వొగి శ్రీవేంకటగిరి నుండి వచ్చి మాఁడుపూర-
నెగసెగసి గతుల కిటులాడేవా (?)

రేకు: 0232-01 లలిత సం: 03-180 శరణాగతి

పల్లవి: వెన్న చేతఁబట్టి నేయి వెదకనేలా
యిన్నిటా నెంచి చూచితే నిదియే వివేకము

చ. 1: నీ దాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె
వేదతో వేరొక చోట వెదకనేలా
ఆదిగొని వారిరూపు లవియే నీరూపులు
పోది నిన్ను మదిఁ దలపోయనేలా

చ. 2: వారలతోడి మాటలు వడి వేదాంతపఠన
సారె వట్టిచదువులు చదువనేల
చేరి వారికరుణే నీ చేపట్టిన మన్ననలు
కోరి యింతకంటే మిమ్ముఁ గొసరనేలా

చ. 3: నావిన్నపము నిదె నారదశుకాదులును
యీవిధముననే ఆనతిచ్చినారు
శ్రీవేంకటేశ నీవు చేపట్టిన దాసులకు
కైవశమౌ యీబుద్ధి కడమేలా

రేకు: 0232-02 దేవగాంధారి సం: 03-181 శరణాగతి

పల్లవి: హీనుఁడైన నన్నుఁ దెచ్చి యింతగా మన్నించితివి
దానవారి నీవు సేసే తగవిట్టిదయ్యా

చ. 1: విరతి బొందినయట్టి విమలచిత్తుఁడఁ గాను
ధరణి నెక్కుడయిన తపసిఁ గాను
అరుదుగ గెంటులేని ఆచారవంతుఁడఁ గాను
హరి నీకరుణ నాపై నంటుటెట్లయ్యా

చ. 2: చేముంచి యిందరిలోన జితేంద్రియుఁడఁ గాను
భూమెల్లా దానమిచ్చిన పుణ్యుఁడఁ గాను
దోమటికర్మాలు సేసి తుదకెక్కేవాఁడఁ గాను
యేమిటికిఁ గాచితివో యిది సోద్యమయ్యా

చ. 3: వివరించి తెలిసిన విజ్ఞాని తొలుతఁ గాను
తవిలి నీ భక్తిగల ధన్యుఁడఁ గాను
భవసాగరములోని ప్రాణిమాత్ర మింతే నేను
యివల శ్రీవేంకటేశ యెట్టేలితివయ్యా

రేకు: 0232-03 మంగళకౌశిక సం: 03-182 శరణాగతి

పల్లవి: ఇదె నీ కన్నుల యెదిటికి వచ్చితి
కదియుచు నెట్టయినఁ గావకపోదు

చ. 1: పరమపురుష నీ భక్తి దొరకకే
యిరవగు జన్మము లెత్తితిని
హరి నీ కరుణకు నరుహము లేకే
దురితవిదుల సందులఁ బడితి

చ. 2: జగతీశ్వర నీశరణము లేకే
వొగి సంసారపువురిఁ బడితి
భగవంతుఁడ నీ పదములు గనకే
తెగని పాపముల తీదీపు లైతి

చ. 3: గోవిందుఁడ నినుఁ గొలువఁగ నేరకే
ధావతి యాసలఁ దగిలితిని
శ్రీవేంకటేశ్వర చేరి నీవు నా-
దైవమవుగాఁగ ధన్యుఁడ నయితి

రేకు: 0232-04 దేసాళం సం: 03-183 గురు వందన

పల్లవి: ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మాయాచార్యుఁ
డీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి

చ. 1: అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి-
పదములుసేసి పాడి పావనము సేసెను

చ. 2: అలరుచుఁ దాళ్లపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీవేంకటనిధియే తానై
కలిదోషములు వాప ఘనపురాణములెల్ల
పలుకుల నించినించి పాడినాఁడు హరిని

చ. 3: అంగవించెఁ దాళ్లపాక అన్నమాచార్యులు
బంగారు శ్రీవేంకటేశు పాదములందు
రంగుమీర శ్రీవేంకట రమణుని యలమేలు-
మంగను యిద్దరిఁ బాడి మమ్ము గరుణించెను

రేకు: 0232-05 లలిత సం: 03-184 దశావతారములు

పల్లవి: నేఁడు నీ మహిమ నెరపడి సమయము
వాఁడి మెరసి యిటు వరదుఁడ రావే

చ. 1: అల చక్రపాణివై యసురల తల-
లిలఁ గూల్చిన జగదీశ్వరుఁడ
చలమున హిరణ్యుఁ జక్కాడి యిటు భూ-
వలయము నిలిపిన వరాహమా

చ. 2: పంచల నీదాసు బఱచిన కశిపునిఁ
జించిన శ్రీనరసింహమా
యెంచి విభీషణు కిటు లంక యొసగి
కొంచని ప్రతాప కోదండరామా

చ. 3: నరకాసురు నటు నఱికి కామినుల
సిరులఁ జెఱగొన్న శ్రీకృష్ణ
పొరిఁబొరి బలిచే భూదాన మడిగి
సిరి నిటు గూడిన శ్రీవేంకటేశా

రేకు: 0232-06 శంకరాభరణం సం: 03-185 అధ్యాత్మ

పల్లవి: కని గుడ్డును నదె విని చెవుడును నిదె
ననిచి జగత్తు నడచీనదివో

చ. 1: వుదయాస్తమయము లొకదినమునసే
యెదుటనె వున్నవి యెంచినను
యిదివో జీవులు యెంచక తమతమ-
బ్రదుకులు సతమని భ్రమసెదరు

చ. 2: వెలుఁగును జీఁకటి వెసఁ గనుఁగొనలనె
నిలిచీ నూరక నిమిషములో
కలవలెనుండిన గతి సంసారము
బలువుగ సతమని భ్రమసెదరు

చ. 3: కాంతలుఁ బురుషులు కాయ మొక్కటనె
పొంతనే పుట్టుచుఁ బొదలెదరు
యింతయు శ్రీవేంకటేశ్వరు మహిమలఁ
పంతము దెలియక భ్రమసెదరు

రేకు: 0233-01 రామక్రియ సం: 03-186 దశావతారములు

పల్లవి: ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లేక
త్రిదశవంద్యుఁడు హరిఁ దేరి చూడఁగలరా

చ. 1: ఘాత మీస మదరితే గగ్గులకాడవుదురు
యీతఁడు దలచూపితే నెదిరించ రరులు
ఆతురాన గొరిశరాయడికి నోపఁగలేరు
చేతిగోరు మీటితేనే ఛిన్నభిన్న మవుదురు

చ. 2: పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురుగుండాల పాలౌదురు
తూపు చేత నంటితేనే తుత్తుమురై పారుదురు
రాపునీలికాశ గంటే రణభీతి గొందురు

చ. 3: మంతన మీతఁ డాడితే మానము గోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁ గూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁ డెక్కడఁ జూచినఁ దానే
వింత ప్రతాపముతోడ విఱ్ఱవీఁగీ నిదివో

రేకు: 0233-02 వరాళి సం: 03-187 భక్తి

పల్లవి: కలిమి గలిగియు నధమగతి యదేల
బలిమి గలిగియు లోఁగి బతిమాలనేల

చ. 1: ఇలువేలుపొకఁడు హరి ఇంటనే వుండఁగా
పలు వేలుపులతోడి భ్రమతలేల
మెలఁగి సూర్యుఁ డొక్కఁడు మిక్కిలిని వెలుఁగఁగా
వెల లేని దీపములు వేయి నేమిటికి

చ. 2: హరిభక్తి యొక్కటే ఆత్మలో నుండగా
పరయుక్తు లెంచేటి పనులేల
సిరులఁ జింతామణటు చేతిలో నుండఁగా
సరి గాజుఁబూస మెచ్చఁగ నదేమిటికి

చ. 3: నాలుకను మంచి హరినామ మొకటుండగా
గాలిఁ బోయెటి వూరగాథ లేల
యీలీల శ్రీవేంకటేశుఁ డెదుటనె వుండగా
మూలలకుఁ జేచాఁచి మొక్క నిఁకనేలా

రేకు: 0233-03 గుండక్రియ సం: 03-188 శరణాగతి

పల్లవి: నీవే యెఱఁగి సేయు నీ చిత్తము వచ్చినట్టు
తావులఁ గొసరేనన్నా తనివోదు నాకు

చ. 1: హరి నిన్ను నమ్మితి నే నననెట్టు వచ్చు నాకు
ఇరవైన బుద్ధి నా ఇచ్చగాదు
వెరవున నొకటి నే విన్నవించెదనంటేను
సరి నీవు వెలిగాను స్వతంత్రుఁడఁ గాను

చ. 2: యిట్టె నీపై భారము నే నెట్టు వేయఁగవచ్చు
పట్టి నీకుఁ బురుషార్థపరుఁడఁ గాను
గుట్టుతోడ నే నిన్నుఁ గొలువఁగఁ గొలువఁగ
యెట్టైనాఁ గానిమ్ము యెరఁగ నెవ్వరిని

చ. 3: యింతటి దైవమవు ని న్నిఁక నెందు వెదకేను
చెంత శరణాగతుల చేతివాఁడవు
వింతగాదు నీకును శ్రీవేంకటేశ నాకును
అంతర్యామివి నీయానతిలో వాఁడను

రేకు: 0233-04 బౌళి సం: 03-189 శరణాగతి

పల్లవి: ఇట్టి యవివేకబుద్ధి యే పనికి వచ్చునిఁక
జట్టిగొని నాగుణము చక్కఁజేయఁ గదవే

చ. 1: హరి నీయిచ్చఁ బ్రపంచమంతా నీవు నడపఁగ
అరసి నీశక్తి దెలియక నమ్మక
వెర వెరఁగనియట్టి వెట్టివాఁడ నే నొక్క-
దొరనంటాఁ బనుల కుద్యోగించేను

చ. 2: అంతరాత్మవై నీవు అన్నియుఁ బెర రేఁచఁగ
బంతినే నీ మహిమెల్లా భావించక
చెంత నీసంసారము సేసేవాఁడ నే నంటా
దొంతుల కోరికలతోఁ దూరిపారేను

చ. 3: ఆదినుండి స్వతంత్రుఁడవై యేలినట్టి నిన్ను
సోదించి శరణు నాఁడే చొరఁగలేక
యీదెస శ్రీవేంకటేశ యిప్పుడు నీదాఁసుడనై
నీ దయ కలిమితోడ నేఁడు మొక్కేను

రేకు: 0233-05 లలిత సం: 03-190 ఉపమానములు

పల్లవి: ఓపితేఁ దానే తగిలి వోపకున్నఁ దానే మాని
మాపురేపు నలయించే మాయ మాకేలా

చ. 1: చింతాయకుఁడగు(?) హరి చిత్తములో నుండఁగాను
వింతవింత విచారాల వెఱ్ఱి మాకేలా
చెంతల పరుసవేది చేతిలోనే వుండఁగాను
దొంతరవిద్యలతోడి దోవ మాకేలా

చ. 2: తోడునీడై యచ్యుతుఁడు తొలఁగక వుండఁగాను
జాడ దప్పి తిరిగేటి జాలి మా కేలా
యేడనో కోకలు వేసి యేమియు నెరఁగలేక
వేడుకతో కొక్కెరాలవెంట మాకేలా

చ. 3: వెల్లవిరై యెదుట శ్రీవేంకటేశుఁ డుండఁగాను
బల్లిదుఁ డీతనిఁ బాసి భ్రమ మాకేలా
యెల్ల ధాన్యములు మా యింటిలో నుండఁగాను
పొల్లి కట్టు దంచేమని బుద్ధి మాకేలా

రేకు: 0233-06 గుజ్జరి సం: 03-191 వైష్ణవ భక్తి

పల్లవి: మాకేమి నీకరుణ మహాప్రసాదమనేము
నీకు నీదాసుల చేతినింద బెట్టుగాదా

చ. 1: పమ్మి మిమ్ముఁ గొలిచినబంట్లఁ బరులు దమ
సొమ్మనుచుఁ దియ్యగాఁ జూచేదా
వుమ్మడి నీవిందుకెల్లా నూరకున్నఁగన మిమ్ము
నమ్ముమన్న వేదాలయానతి కొంచెపడదా

చ. 2: నీముద్ర మోచినవారి నీచులు దడవఁగాను
యీమేర నడ్డమురాక యిట్లుండేదా
వోమక నీవీవేళ నూరకున్న నల్లనాఁటి-
సామజముఁ గాచినది సందేహించఁబడదా

చ. 3: మీరు మన్నించినవారు మీవాకిలి గావ కేడో-
వారి వాకిలి గావఁగా వద్దనరాదా
నేరిచి శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గావకున్న
ధారుణి మీ దయే మిమ్ముఁ దప్పులెంచుకొనదా

రేకు: 0234-01 సాళంగనాట సం: 03-192 అన్నమయ్య స్తుతి

పల్లవి: నేనింత సేసినయట్టి నేరమి మరవవయ్య
ఆనుకొని తాళ్లపాక అన్నమయ్యఁ జూచి

చ. 1: నావొళ్లి యపరాధా లెన్నక నిన్ను సారెసారె
వేవేలు దూరితి విచారించక
కావించి కన్నులలోని కళంకు దెలియలేక
ఆవలఁ జందురు నలుపణఁకించినట్లు

చ. 2: పాయక నేఁ జేసినట్టి పాపము లెంచుకొనక
ఆయాలు మోవనాడితి నదివో నిన్ను
మాయల నాదేహమిది మలినమే తలఁచక
చాయ లేదని యద్దము సారెఁ దోమినట్లు

చ. 3: మదమత్సరాలు నాలో మానకిట్టే వుండఁగాను
అదియే నీచేఁతంటా నాడుకొందును
యెదలో శ్రీవేంకటేశ యిరవై నీ వుండఁగాను
వెదకి వెదకి నీకే వెట్టిగొన్నయట్లు

రేకు: 0234-02 లలిత సం: 03-193 కృష్ణ

పల్లవి: ఆదివిష్ణు వీతఁడే యటరమ్మా
ఆదిగొని భూభార మణఁచీనోయమ్మా

చ. 1: చందురునుదయవేళ సవరేతిరికాడ
కందువ దేవకి బిడ్డఁ గనెనమ్మా
పొందుగ బ్రహ్మాదులు పురుఁటింటి వాకిటను
చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా

చ. 2: వసుదేవుని యెదుట వైకుంఠనాథుఁడు
సిసువై యవతరించి చెలఁగీనమ్మా
ముసిముసి నవ్వులతో మునులకు ఋషులకు
యిసుమంత వాఁడభయమిచ్చీనమ్మా

చ. 3: కన్న తల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి
అన్నిటా రాకాసిమూఁక లణఁచీనమ్మా
వున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మీదేవితోడ
పన్ని నిచ్చకల్యాణాలఁ బరగీనమ్మా

రేకు: 0234-03 సామంతం సం: 03-194 కళ్యాణ కీర్తనలు

పల్లవి: పసిఁడి యక్షంత లివె పట్టరో వేగమే రారో
దెసలఁ బేరటాండ్లు దేవుని పెండ్లికిని

చ. 1: శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
దైవికపుఁ బెండ్లిముహూర్తము నేఁడు
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజంబెక్కె
దేవతలు రారో దేవుని పెండ్లికిని

చ. 2: కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
పందిలిలోపలఁ దలఁబ్రాలు నేఁడు
గందమూ విడెమిచ్చేరు కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో హరి పెండ్లికిని

చ. 3: అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
మొదలి తిరుణాళ్లకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరములివె
కదలి రారో పరుష ఘనుల పెండ్లికిని

రేకు: 0234-04 బౌళి సం: 03-195 దశావతారములు

పల్లవి: ఇందుకే కాలమందే యీతని శరణంటిమి
ముందుముందే దయఁజూచి మొగిఁ గాచుఁగాక

చ. 1: పుడమి గుంగిన నెత్తె పురుషోత్తముఁ డితఁడు
యెడసి కొండ గుంగితే నెత్తె నితఁడు
అడరి సంసారవార్ధి నడఁగిన దాసులను
యిడుములఁ బొందకుండా యెత్తి కాచుఁగాక

చ. 2: పట్టి ప్రహ్లాదు బాధలు పాపిన దేవుఁ డితఁడు
రెట్టిగా వేదము లుద్ధరించె నితఁడు
వట్టి దుష్టులలో సహవాసమైతే దాసులను
దిట్టయై వెళ్లఁదీసి తా దిక్కై కాచుఁగాక

చ. 3: లంకలో సీతఁ దెచ్చిన లావరి తానే యితఁడు
మంకు అహల్యశాపము మాన్పె నితఁడు
అంకెల శ్రీవేంకటేశుఁ డతిభీతిఁ బాపి మమ్ము
గొంకక తన దాసులఁ గూడి కాచుఁగాక

రేకు: 0234-05 దేసాళం సం: 03-196 అధ్యాత్మ

పల్లవి: ఓడవిడిచి వదర పూరకేల పట్టేవు
గోడ గడుగ నడుసే కురిసీనో మనసా

చ. 1: చిత్తము లోపలనున్న చింతామణి యీహరి
యిత్తలఁ గోరినవెల్లా నియ్యఁగాను
తత్తరించి తలఁచక దవ్వువోయి పరులకు
దెత్తివై యేల నోళ్లు దెరిచేవో మనసా

చ. 2: కన్ను లెదుటనే హరి కల్పవృక్షమై యుండి
మన్నించి లోకమెరఁగ మనుపఁగాను
యెన్ని వలసిన మరి యీతనినే యడుగక
కన్నవారి నేలడుగఁ గటకటా మనసా

చ. 3: శ్రీవేంకటేశుఁడే మనచేతి పరుసమై యుండి
తావున నిహపరాలు తానియ్యఁగాను
భావించి మొక్కక వేరే బద్ధులైన జీవులను
దావతిపడుచు నేల తగిలేవో మనసా

రేకు: 0234-06 లలిత సం: 03-197 అధ్యాత్మ

పల్లవి: మంగళసూత్ర మొక్కటే మగనాలికిఁ గట్టేది
అంగవించే మీఁదిపన్నులన్నియు విభునివే

చ. 1: తలఁపు లోపల నిన్నుఁ దలఁచినానుఁ గలవు
తలఁచకున్నా నంతరాత్మవై కలవు
పలుపూజ లిఁకనేల భక్తిసేయనేల నీవు
గలవని నమ్మేదొక్కటే బుద్ధిఁ గాకా

చ. 2: మొక్కినా రక్షింతువు మొక్కకున్నా జగములో
యిక్కువతో రక్షింతువు యెపుడు నీవు
పెక్కు విన్నపాలేల పిలిచి యలయనేల
తక్కక నమ్మేటిది నీదాస్య మొక్కటే

చ. 3: కడు సుజ్ఞానినైనా నీగర్భవాసమే వునికి
వెడ నజ్ఞానినైనాను విడిదక్కడే
బడినే శ్రీవేంకటేశ పలునా వుద్యోగాలేల
నిడివి నిన్ను నుతించే నేమమే నాది

రేకు: 0235-01 సామంతం సం: 03-198 శరణాగతి

పల్లవి: ఏడ ధర్మ మేడ కర్మ మిన్నియు నీ సేవేకాక
యీడనే యిందుకు సాక్షి ఇట్టే నిలిపితివి

చ. 1: తెగువసేసి నీకుఁ దెచ్చిరి బోనములు
మగండ్లమాటదోసి మౌనిసతులు
తగ నిన్నుఁ జేపట్టుటే ధర్మముగా నిలిపి
జగ మెరఁగఁగ వేదసమ్మతి సేసితివి

చ. 2: బల్లిదాన నిన్నుఁ బొందే బలుసాహసము సేసి
తల్లిదండ్రిమాట దోసి తానే రుక్మిణి
యెల్లగా నీకు మోహించు టెక్కుడుతగవు సేసి
వెల్లవిరి నాపె నీవు వీధుల నేఁగితివి

చ. 3: శ్రీవేంకటేశ నిన్ను సేవించవచ్చితేఁ జాలు
భావించి రక్షింతువు నీపరుషలను
యీవల నీకు మొక్కుటే యిన్ని పుణ్యములూ జేసి(?)
కావించి హీనుల మమ్ము ఘనులఁ జేసితివి

రేకు: 0235-02 లలిత సం: 03-199 నామ సంకీర్తన

పల్లవి: నమో నారాయణ నా విన్నప మిదివో
సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే

చ. 1: మనసు నీ యాధీనము మాటలు నీ వాడేటివే
తనువు నీపుట్టించిన ధన మిది
మును నీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే

చ. 2: భోగములెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి
యీగతి నాబతుకు నీ విరవైనది
చేగదేర నీవు నన్నుఁ జేసిన మానిసి నింతే
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే

చ. 3: వెలి నీవే లో నీవే వేడుక లెల్లా నీవే
కలకాలమును నీకరుణే నాకు
యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే

రేకు: 0235-03 ఆహిరి సం: 03-200 శరణాగతి

పల్లవి: ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను
నీమరఁగు చొచ్చితిఁగా నీచిత్త మిఁకను

చ. 1: పుట్టినవాఁడను నేను భోగించేవాఁడను నేను
గట్టిగా నిప్పుడు నాకుఁ గర్తవు నీవు
పట్టరాదు జవ్వనము పాయరాదు సంసారము
యిట్టి వెల్ల నీమాయ యేమీ ననరాదు

చ. 2: కడుఁగాంక్షలు నాసొమ్ము కర్మములు నాసొమ్ము
నడమ నంతర్యామివి నాకు నీవు
వుడివోవు కోరికలు వొదుగదు కోపము
కడదాఁకా నీమహిమ కాదనరాదు

చ. 3: భావించలేనివాఁడను ప్రకృతిలోనివాఁడను
శ్రీవేంకటేశ దయ సేసితివి నీవు
తోవదప్పదు జ్ఞానము తొలఁగదు వివేకము
దేవుఁడవు నీమర్మము తెలియఁగరాదు

రేకు: 0235-04 కాంబోదిసం: 03-201 శరణాగతి

పల్లవి: ఏమి సేయఁగలవార మెందుకు నౌదుము నేము
శ్రీమాధవ నీవే దయఁ జిత్తగించు మమ్మును

చ. 1: వేసరక పుణ్యాలు గావించేదే యరుదుగాని
సేసేనంటే పాపములు చేతిలోనివే
గాసిలక చూచితేఁ జీఁకటైనా వెలుఁగౌఁగాని
వీసమంత మఱచినా వెలుఁగైనాఁ జీఁకటే

చ. 2: తెలివితో మోక్షము సాధించేదే యెక్కుడుగాని
అలయించే లోకములెన్నైనా గలవు
తలఁచితే నీరూపము తానే యెదుటనుండు
యిలఁ బరాకై వుండితే నెచ్చోటాఁ జిక్కదు

చ. 3: యీవల నీ దాఁసుడయ్యేది ఘనముగాని
దావతి రాజసాలంతటా నున్నవి
శ్రీవేంకటేశ్వర నీ సేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు

రేకు: 0235-05 నాట సం: 03-202 వేంకటగానం

పల్లవి: కాదనేటి వారెవ్వరు కడలనుండి
సేద దేరిచి నీవేమి సేసినానుఁ జెల్లును

చ. 1: తక్కక బ్రహ్మాది దేవతలకు నాయకుఁడవు
మక్కువ శ్రీసతికి మగఁడవు
చక్కనివాఁడవు మరి చంద్రసూర్యనేత్రుఁడవు
వుక్కు మీరి నీ వెట్లానుండినా నమరును

చ. 2: కామునిఁ గన్నతండ్రివి కడుఁ జక్కఁదనమున
ఆముకొన్నయట్టి చక్రాయుధుఁడవు
కామించి యెందుఁ జూచినా గరుడవాహనుఁడవు
వేమరు నీవెటువలె వెలసినా నమరును

చ. 3: అందరి లోపలనుండే అంతర్యామివి నీవు
చందమైన పరబ్రహ్మస్వరూపుఁడవు
యెందును శ్రీవేంకటాద్రి నిరవైనవాఁడవు
అంది మమ్ము నేలితేను అన్నిటా నమరును

రేకు: 0235-06 లలిత సం: 03-203 అధ్యాత్మ

పల్లవి: తెగక పరమునకుఁ దెరువులేదు
పగయెల్లా విడువక భవమూఁ బోదు

చ. 1: కన్నుల యెదుటనున్న కాంచనముపై మమత
వున్నంతదడవు మోక్ష మొనగూడదు
అన్నముతోడి రుచుల యలమట గలదాఁకా
పన్నిన సుజ్ఞానము పదిలము గాదు

చ. 2: పక్కనున్న కాంతల భ్రమగల కాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపు సంసారవిధి నున్నంతదడవు
నిక్కి పరమధర్మము నిలుకడ గాదు

చ. 3: చిత్తము లోపలి పలుచింతలు మానినదాఁకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశుఁ డేలిన దాసులకైతే
హత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు

రేకు: 0236-01 వరాళి సం: 03-204 అధ్యాత్మ

పల్లవి: ఎన్నఁడు వివేకించే దీడేరె దెన్నఁడు
యెన్నిలేవు జీవిపాట్లేమి చెప్పే దిఁకను

చ. 1: నరజన్మమునఁ బుట్టి నానాభోగాలు మరిగి
హరి నెరఁగక మత్తుఁడై వుండును
సురలోకము చొచ్చి సుకృతి ఫలములంది
గరిమ విజ్ఞానమార్గము విచారించఁడు

చ. 2: పెక్కుగాలము బ్రతికి పెనుఁగోరికలే కోరి
అక్కడ విష్ణుఁ గొల్వక అలసుఁడౌను
మిక్కిలిఁ దపముచేసి మించైనఘనత కెక్కి
తక్కక పరమమైన తత్త్వము దెలియఁడు

చ. 3: వేవేలుబుద్ధులు నేర్చి వేడుక సంసారియై
శ్రీవేంకటేశుఁ జెందక చింతఁ గుందును
దైవ మాతఁడే దయదలఁచి మన్నించుఁగాని
భావించి తనంతనైతే భవములఁ బాయఁడు

రేకు: 0236-02 దేసాక్షి సం: 03-205 శరణాగతి

పల్లవి: నీవొక్కఁడవే యిత్తువు నిన్నుఁ గొల్చినవారికి
శ్రీవల్లభుఁడవు రక్షించవే నారాయణా

చ. 1: పెక్కుజీవులు భువినిఁ బెరిగేరు మోక్షము
వొక్కరునుఁ దెచ్చి యియ్యనోప రెవ్వరు
అక్కజపుధనరాసు లంగళ్లలోనున్నవి
గక్కనఁ గొనేమంటే మోక్షము గొనరాదు

చ. 2: వున్నవి పుణ్యకర్మాలు వొడ్డి యందే మోక్షము
మిన్నక యెక్కేమంటే మెట్లు గావు
యెన్నఁగ సంసారధర్మ మిదివో మోక్షము చూప
చన్నమన్నవారికెల్లా సాధనము గాదు

చ. 3: పదునాల్గులోకములు పన్నివున్నవి మోక్షము
తుదకెక్కించ నవైనాఁ దోడుగావు
యిదివో శ్రీవేంకటేశ యిహపరము లొసఁగి
హృదయములో నున్నాఁడ వింకనేల చింత

రేకు: 0236-03 ఆహిరి సం: 03-206 అధ్యాత్మ

పల్లవి: అక్కటా నీమాయ కగపడె జీవుఁడు
యెక్కువతక్కువ లివి యేమీఁ దలపోయఁడు

చ. 1: గొందినున్న స్వర్గము గోరి పుణ్యము సేయును
యెందో తన వ్రాఁతఫల మెరఁగడు
సందడించి మరునాఁటి చవులకే కూడపెట్టు
పొంది మింగిన కళ్ళపులుసర మెంచఁడు

చ. 2: అప్పటి దేహసమ్మంధపాలికే మనసు పెట్టు
తప్పిపోయినవారలఁ దగులఁడు
కప్పుకొనే కోకలకే కడఁగి చేతులు చాఁచు
చిప్పిలఁ దొల్లి చించివేసినవెన్నో యెంచఁడు

చ. 3: యెదిటిగృహారామాలివే తనకాణాచను
చెదరి కలలోనివి చేపట్టడు
వెదకు వైకుంఠపు విష్ణుమూ ర్తిఁ గనేనని
హృదయములో శ్రీవేంకటేశుఁ జూడనెంచఁడు

రేకు: 0236-04 దేవగాంధారి సం: 03-207 శరణాగతి

పల్లవి: నీవే నన్ను దయఁ గావు నీవు స్వతంత్రుఁడవు
జీవుఁడ నింతే నేను శ్రీమన్నారాయణా

చ. 1: నిను నామనసుఁ గొని నేఁ దలఁచేనంటినా
మన ప్రకృతిఁ బుట్టె మరి నిన్నెట్టు దలఁచీ
తనువుఁ గొని నీసేవ తగిలి సేసేనంటినా
తనువు కర్మాధీనము తగిలీనా నిన్నును

చ. 2: గరిమ నర్థమిచ్చి నీగతి గనేనంటినా
హిరణ్య మజ్ఞానమూల మెట్టు నీకు నియ్యనిచ్చీ
సిరుల నాజన్మము నీసెలవు సేసేనంటినా
సరిఁ బుట్టుగు సంసారసాధ్యము నిన్నంటీనా

చ. 3: యిలఁ బుణ్యఫలము నీకిచ్చి మెప్పించేనంటినా
ఫలము బంధమూల మేర్పడనియ్యనిచ్చీనా
నిలిచి శ్రీవేంకటేశ నే నీశరణు చొచ్చితి
యెలమి నీకరుణ నన్నేడయనిచ్చీనా

రేకు: 0236-05 సామంతం సం: 03-208 శరణాగతి

పల్లవి: మాయామయములివి మాయకు నీ వేలికవు
చాయకుఁ దెచ్చేనంటే స్వతంత్రుఁడ నయ్యేనా

చ. 1: తెగని కోరిక తానే తీఁగెవలె నల్లుకోఁగా
తగదని మానుప నా తరమయ్యీనా
వగలఁ గోపము పాముపలె నాలుక చాఁచఁగ
పగటు తోడఁ దొడికి పట్టఁగ నేరుతునా

చ. 2: వయసు తానే మేఘమువలె సోన గురియఁగా
జయించి నే దాని నణఁచఁగ నోపేనా
లయించక లోభము జలఁగవలెఁ బీరుచఁగా
నియమించి మట్టుపెట్ట నేఁడు నాకు వసమా

చ. 3: యేపున గర్వము దానే యేనుగవలె మీరఁగా
చేపట్టి చిక్కించుకో నాచేత లోనౌనా
యేపొద్దు శ్రీవేంకటేశ యివి వాని స్వభావాలు
కాపాడవే నన్ను నే నెక్కఁడా నీ దాఁసుడను

రేకు: 0236-06 సామంతం సం: 03-209 శరణాగతి

పల్లవి: చిత్తగించవే దేవ శ్రీపతి నావిన్నపము
హత్తి నీదాఁసుడనైతి నపరాధాలున్నవా

చ. 1: జగములు నడచేటి సహజ మింతే కాక
వెగటు నాచేఁతలు వేరే వున్నవా
జిగిఁ గర్మమిలఁ జేయించే కాఁపురమే కాక
నిగిడి నావల్ల వేరే నేర్పు నేరాలున్నవా

చ. 2: పంచ మహాభూతాల స్వభావము లింతే కాక
అంచెల నాకు వేరే జన్మాదులున్నవా
కొంచక పనిగొనేటి గుణత్రయమింతే కాక
పంచివేయ నాకు వేరే పాపపుణ్యాలున్నవా

చ. 3: సరిఁ గౌమారయవ్వనజరాల చందాలే కాక
గరిమ నాకు వేరే వికారాలున్నవా
యిరవై శ్రీవేంకటేశ యింతా నీకల్పితమే
కరుణించు మీయాత్మ కౌఁగాము లిఁక నున్నవా

రేకు: 0237-01 ధన్నాసి సం: 03-210 అధ్యాత్మ

పల్లవి: ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు
పదిలానఁ గొలువఁగా ప్రత్యక్షమయ్యీవు

చ. 1: యెదలో నుండుదువని యిన్ని వేదాలు చెప్పఁగా
వెదకి ధ్యానము సేతు వెస గనుఁగొంట లేదు
చెదర కందే మరి జీవుఁడు న్నాఁ డందురు
పదిలముగాఁ జూతు భావించరాదు

చ. 2: అంతటా నుందువని ప్రహ్లాదుఁడు చెప్పెననఁగా
చింతించి పట్టఁదలఁతు చేతికిఁ జిక్కుట లేదు
సంతత జ్ఞానాన నీ సాకారమున్నదందురు
మంతనానఁ బిల్తు నొకమాట వినఁబడదు

చ. 3: రవిలో నుందువని సురలు నిన్నుఁ గొలువఁగా
తవిలి పూజించేనంటే దగ్గరి వచ్చుట లేదు
యివల శ్రీవేంకటాద్రి నిరవై నీవున్నాఁడవు
తివిరి సేవించితిమి ద్రిష్టమాయ మాకు

రేకు: 0237-02 దేసాక్షి సం: 03-211 అధ్యాత్మ

పల్లవి: ఇట్టె జ్ఞానమాత్రమున నెవ్వరైనా ముక్తులే

పుట్టుగులు మరి లేవు పొందుదురు మోక్షము

చ. 1: అతిసూక్ష్మ మీయాత్మ అందులో హరి యున్నాఁడు

కతలే వినుటగాని కానరాదు

క్షితి దేహాలు ప్రకృతిఁ జెందిన వికారములు

మతి నిది దెలియుటే మహిత సుజ్ఞానము

చ. 2: లోకము శ్రీపతియాజ్ఞలో తత్త్వా లిరువదినాల్గు

కైకొని సేఁతలు సేసేఁ గర్తలు లేరు

సాకిరింతే జీవుఁడు స్వతంత్రుఁడు దేవుఁడు

యీకొలఁది గని సుఖియించుటే సుజ్ఞానము

చ. 3: కాలము దైవము సృష్టి కలి మన్యుల భాగ్యము (?)

వాలాయించి యెవ్వరికి వచింపరాదు

యీలీలలు శ్రీవేంకటేశునివి ఆచార్యుఁడు

తాలిమిఁ జెప్పగా విని తలఁచుటే సుజ్ఞానము

రేకు: 0237-03 భూపాళం సం: 03-212 అధ్యాత్మ

పల్లవి: పరమయోగీశ్వరుల పద్ధతి యిది
ధరణిలో వివేకులు దలపోసుకొనుట

చ. 1: మొదల నాత్మజ్ఞానము దెలిసి పిమ్మట
హృదయములోని హరి నెరుఁగుట
పుదుటైన యింద్రియాల నొడిసి పంచుకొనుట
గుదిగొన్నతనలో కోరికె లుడుగుట

చ. 2: తన పుణ్యఫలములు దైవము కొసగుట
పనివడి యతనిపై భక్తిచేసుట
తనివితో నిరంతర ధ్యానయోగపరుఁడౌట
మనసులోఁ బ్రకృతిసమ్మంధము మరచుట

చ. 3: నడుమ నడుమ విజ్ఞానపు కథలు వినుట
చిడుముడి నాచార్యసేవసేయుట
యెడయక శ్రీవేంకటేశుపై భారమువేసి
కడు వైష్ణవుల కృప గలిగి సుఖించుట

రేకు: 0237-04 శుద్ధవసంతం సం: 03-213 అధ్యాత్మ

పల్లవి: లే దందువల్లఁ దెలివి యెన్నటికిని
నీదయ నాపై నించినఁ గాని

చ. 1: అరయఁగఁ బ్రపంచ మలవడినటువలె
అరుదగు వై రాగ్య మలవడదు
తరుణులరతి మతిఁ దలఁచినయటువలె
ధర నీ సాకారము దలఁచదు మనసు

చ. 2: గొనకొన్న యర్థము గోరినయటువలె
కొనయగు మోక్షము గోరదు
తనుభోగములకుఁ దగిలినయటువలె
తనిసి నీకథలకుఁ దనియదు మనసు

చ. 3: చలమును బాపము చవియైనటువలె
సలలితపుణ్యము చవిగాదు
సులభ శ్రీవేంకటేశుఁడ నీమహిమిది
గలిగితివి నాకుఁ గలఁగదు మనసు

రేకు: 0237-05 ముఖారి సం: 03-214 అధ్యాత్మ

పల్లవి: పామరుల కెంతైనా ఫలియించనేరదు
శ్రీమాధవ నీవు దయసేసితే నీడేరును

చ. 1: అన్నిటా దైవముఁ దమ్ము నందరు నెరుఁగుదురు
యెన్నుక వావివర్తన లెరుఁగుదురు
పన్ని జననమరణభయము లెరుఁగుదురు
వన్నెల నెరిఁగెరిఁగి వలలఁ జిక్కుదురు

చ. 2: విందురు పురాణాలు విందు రుపదేశాలు
విందురు తొల్లిటివారి విచారాలు
విందురు స్వర్గనరకవిభవము లన్నియును
మందలించి వినివిని మాయకు లోనౌదురు

చ. 3: నడతు రాచారమున నానాదానాలుఁ జేతురు
విడువక తీర్థయాత్ర వెసఁ జేతురు
యెడయక శ్రీవేంకటేశ నీవుండఁగఁ దప-
మడవులఁ జేసిచేసి అలయుచుండుదురు

రేకు: 0237-06 నాగవరాళి సం: 03-215 అధ్యాత్మ

పల్లవి: ఎట్టు వేగించీ జీవుఁ డిన్నిటిలోనా చే-
పట్టి రక్షింతువుఁ గాక పరమేశ్వరా

చ. 1: బల్లిదుఁడై వైరాగ్యాన పదార్థము లన్నియును
వొల్లనంటేనే నోరూరించును
వొల్లనే కావలెనని వొడిసి పట్టఁజూచితే-
నల్లంతనుండి యాసల నలయించును

చ. 2: యించుక మొదలువెట్టు యిచ్ఛాద్వేషాలు ముందు
మించు రాఁగా రాఁగాఁ బెట్టిమీఁదఁ గప్పును
పొంచి యంతలోఁ దెలిసి పొంగణఁగి వుండితేను
వంచించొక్క కారణాన వచ్చి ప్రవేశించును

చ. 3: వేసరి యడవినున్నా వెంటనే సుఖదుఃఖాలు
పాసిపోక కొంత యనుభవింపించును
రోసి పాయలే రెవ్వరు రుచులయ్యే తోఁచు నివి
శ్రీసతీశ కనుఁగొను శ్రీవేంకటేశ్వరా

రేకు: 0238-01 కన్నడగౌళ సం: 03-216 అధ్యాత్మ

పల్లవి: ఏమిసేతు నాభాగ్య మిట్లున్నది
నేమమేమీ నెరఁగను నీవే గతి యిఁకను

చ. 1: అగపడి నిరంతర మలవాటైన జగత్తు
మొగమునఁ గట్టినట్టు మొగి మరవనీదు
తగిలి నిన్నెటువలె ధ్యానము సేతు నేను
అగడు సేసి సహాయముగాదు మనసు

చ. 2: విడువక యెల్లప్పుడూ విడిదలైన దేహము
మెడఁ గట్టినట్టున్నది మెలఁగీ నురులదు
వొడయఁడ నీవూడిగె మొదిగి నేనెట్టు సేతు
అడరి కప్పిన నీ మాయాఁ దోడుగాదు

చ. 3: వొద్దనే పెక్కుగాలము పూనిన పురాకృతము
చద్దిమూఁటై యనుభవించఁగఁ జేసీ మానదు
అద్దుక శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
వొద్దికతో రక్షించు నావోజాఁ దోడుగాదు

రేకు: 0238-02 రామక్రియ సం: 03-217 అధ్యాత్మ

పల్లవి: ఏలికె విందరికి యీ దేహభూమి నీది
మేలు అన్ని మట్టుపెట్టి మించరాదా జీవుఁడ

చ. 1: వెలిఁబడ్డ యింద్రియాల వెలయ లోనికిఁ బిల్చి
కొలువులు సేయించుకొనరాదా
కలఁచెడి లోలోని కామాదిశత్రువుల
బెళకనీకడ్డపెట్టింపించరాదా జీవుఁడ

చ. 2: అట్టే పరువుదోలిన ఆసలనే గుఱ్ఱముల
గట్టిగ లోలాయమునఁ గట్టుకోరాదా
వొట్టి యెదుట పోఁజులై వుండిన భోగములను
ముట్టి యంతర్యామికిచ్చి మొక్కరాదా జీవుఁడ

చ. 3: పంపువెట్టి దండంపిన బలు నీ వుద్యోగాల-
గుంప గూర్చి ముక్తి చూరగొనరాదా
ఇంపుల శ్రీవేంకటేశుఁడితఁడే సర్వకర్త
సొంపుగ భావించి చక్కఁజూడరాదా జీవుఁడ

రేకు: 0238-03 ధన్నాసి సం: 03-218 అధ్యాత్మ

పల్లవి: తప్పించుకోరా దీఁక దైవమే గతి
యెప్పుడు నుద్ధరించేవా రెవ్వరును లేరు

చ. 1: మలసి దేహానందమే మరిగిన యాత్మకు
తొలుత బ్రహ్మానందము దొరకదు
అలవాటై క్షుద్రభోగాలందుఁ జిక్కిన యాత్మకు
బలిమి విరతిఁ బొంద బలపడదు

చ. 2: సర్వదా బ్రహ్మాండములోఁ జరియించే యాత్మకు
నిర్వహించి వెడలఁగ నేరుపు లేదు
పుర్వి లోపలి చింతలుడుగని యాత్మకు
నిర్వికారభావము నెలకొనదు

చ. 3: విరసవర్తనలనే వెలసేటి యాత్మకు
పరగఁ బేదలమీఁది భక్తి పుట్టదు
ధరలో శ్రీవేంకటేశుదాసుఁడుగాని యాత్మకు
వెర పేమిటా లేదు వెదకి చూచినను

రేకు: 0238-04 సాళంగనాట సం: 03-219 శరణాగతి

పల్లవి: నీవారైనవారికి నీపై భక్తేకాక
భావించ నేరక వట్టిభ్రమఁ బడవలెనా

చ. 1: కరుణానిధి నీవు గలిగివుండఁగాను
తిరుమంత్రమే నాకు దిక్కయివుండఁగా
వరుస నాచార్యుఁడు వహించుక వుండఁగాను
పరగఁ దపము చేసి బడలఁగవలెనా

చ. 2: కమలాక్ష నీముద్రలే కాచుక నాకుండఁగాను
అమరి దాస్యము కాణాచై వుండఁగా
తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా

చ. 3: శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా
ఆవటించి నుతి వుపాయమై వుండఁగా
తావులనే శరణనే ధర్మము రక్షించఁగాను
వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా

రేకు: 0238-05 ముఖారి సం: 03-220 ఉపమానములు

పల్లవి: పరమాత్మ నిన్ను గొల్చి బ్రదికేము
విరసపు జాలిఁ జిక్కి వెతఁబడనోపము

చ. 1: మగఁడు విడిచినా మామ విడువనియట్లు
నగి నామనసు రోసినా లోకులు మానరు
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు
మొగమోటలను నేను మోసపోవనోపను

చ. 2: పొసఁగ దేవుఁడిచ్చినా పూజరి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసరేరు కోరిక దీర్చుమనేరు
పసలేని పనులకు బడల నేనోపను

చ. 3: నుడుగులు దప్పినా నోముఫల మిచ్చినట్లు
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు
తడవేరు తగిలేరు తామే శ్రీవేంకటేశ
బుడిబుడి సంగాతాలఁ బొరల నేనోపను

రేకు: 0238-06 భైరవి సం: 03-221 వైరాగ్య చింత

పల్లవి: కరుణానిధి నీవే కనుఁగొంచునున్నాఁడవు
యిరవై నాలో నున్నాఁడ వేది గతి యిఁకను

చ. 1: పేరుచున్నవి నాలోనఁ బెక్కు వికారములు
పూరుచున్నవెన్నైనా వూహలెల్లాను
చేరుచున్నవొక్కొక్కటే సేనాసేనకోరికలు
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యిఁకను

చ. 2: పట్టుచున్నవి నానాప్రకృతుల వోజలు
పుట్టుచున్నవి యనేకభోగేచ్ఛలు
చుట్టుకొనుచున్నవి సులభపు వేడుకలు
యిట్టివి నానడతలు యేది గతి యిఁకను

చ. 3: సందడింపుచున్నవి సారెకు నా మమతలు
ముందువెనకై వున్నవి మోహాలెల్లా
చెందె నీపై భక్తి నేఁడు శ్రీవేంకటేశ్వర
యెందునూ నీవే కాక యేది గతి యిఁకను

రేకు: 0239-01 బౌళి సం: 03-222 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీవొక్కఁడవే సర్వాధారము నిన్నేయెరిఁగిననన్నియు నెఱుఁగుట
భావించి యింతయుఁ దెలియఁగ వలసిన బ్రహ్మవేత్తలకు నిది దెరువు

చ. 1: నీయందె బ్రహ్మయు రుద్రుఁడు నింద్రుఁడు నీయందె దిక్పాలకులు
నీయందె మనువులు వసువులు రుషులు నీయందె విశ్వాఖ్యదేవతలు
నీయందె వురగులు యక్షరాక్షసులు నీయందె గరుఁడగంధర్వులు
నీయందె పితరలు సిద్ధసాధ్యులు నీయందె ద్వాదశాదిత్యులు

చ. 2: నీవలననె కిన్నరకింపురుషులు నీవలననె విద్యాధరులు
నీవలననె యచ్చరలు చారణులు నీవలననె నక్షత్రములు
నీవలననె గ్రహములు చంద్రుఁడును నీవలన(నె?) నభోంతరిక్షములు
నీవలననె జలధులు పవమానుఁడు నీవలననె గిరులును భూమియును

చ. 3: నీలోననె నదులును నగ్నియు నీలోననె సచరాచరములును
నీలోననె వేదశాస్త్రము మొదలుగ నిఖిలశబ్దమయము
నీలోననె అన్నియు నిన్నర్చించిన నిఖిలతృప్తికరము
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిది మతము

రేకు: 0239-02 మలహరిసం: 03-223 అధ్యాత్మ

పల్లవి: దేహము సమ్మంధము యివి దేహికిఁ బనిలేదు
వూహించ నేర్చినవారలే వోరుచుకుందురయ్యా

చ. 1: విడువవు శీతోష్ణంబులు విడువవు సుఖదుఃఖంబులు
వెడవెడ మరణభయంబులు విడిచినయందాఁకా
పుడుగవు కాంక్షలు మమతలు నుద్యోగంబులు చింతలు
పొడవగు విరక్తి తనలోఁ బొడమినయందాఁకా

చ. 2: మానదు చిత్తవికారము మానదు దుర్గణదోషము
మానదు భోగము లన్నియు మానినయందాఁకా
పోనీదు సేసిన దురితము పోనీదు వ్రాఁతఫలంబును
పూనిన తన యజ్ఞానము పోయినయందాఁకా

చ. 3: తెగవటు భవబంధంబులు తెగ వెడయని గర్వంబులు
నిగిడిన యీ యీత్మజ్ఞానము నీవిచ్చినయందాఁకా
జగదేకవిభుఁడ శ్రీవేంకటేశ్వర సర్వము నీయానతికొలఁదే
తగులుచుండు నివినిశ్చలముగ నీదాస్యము గలిగినయందాఁకా

రేకు: 0239-03 దేవగాంధారి సం: 03-224 ఉపమానములు

పల్లవి: చూడవే గోవింద సొద్యము లిన్నియు
యేడాఁ గర్తపు యిన్నిట నాకు

చ. 1: చీరినఁ దునుఁగక చేసిన దురితము
నారవలెనే కడు నారటిలీ
కారుకొని తలఁపు కలఁకగుణంబుల
వారక పెనునదివలెఁ బారీని

చ. 2: యెట్టఁగాఁ గ్రూరత్వ మెప్పుడుఁ గొలిమిలో
కట్టువలెనే కడుఁగాఁగీని
వొట్టియై ప్రకృతి వొరసి వేఁటలో
యిట్టివలెనే యెలయించీని

చ. 3: వీడక నీమూర్తి వెంటవెంటనే
తోడునీడయై తొరలీని
యీడనే శ్రీవేంకటేశ నీ మహిమ
వాడని వనములవలెఁ జిగిరించీని

రేకు: 0239-04 ముఖారి సం: 03-225 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వరి వసము గెల్వ నింతా నీనిమయమే
యివ్వల నీవు గాచితేనేమోకాని

చ. 1: వొక్కలోభము నెంచితే వొగి లోకమెల్లాఁ దానే
యెక్కడ చూచినాఁ దానే యీదీపనము
వెక్కసమైనది తానే వేగిలేచి సేసేపని
తక్కక యిన్నిటా నెట్టు తప్పించుకోవచ్చును

చ. 2: పలుమారు వచ్చీఁదానే పనిలేని పరాకు
వళచుకొన్నది తానే వట్టిభీతి
నిలుచుకున్నది తానే నిలువుననే సిగ్గు
మెలుపున నెటువలె మెదలఁగవచ్చును

చ. 3: కనుగొంటే నెందూఁ దానే కార్పణ్యము దైన్యము
అనిశము మించీఁ దానే యాచకత్వము
నను నేలకొంటి విదే నమ్మితి శ్రీవేంకటేశ
జనుఁడను యివి నేను సాధించుటెట్టు

రేకు: 0239-05 మాళవిగౌళ సం: 03-226 వేంకటగానం

పల్లవి: ఇంద రెరిఁగినపని కిఁకఁ దప్పించుకోరాదు
పొందుగాని మాయలఁ బొరలఁగ నేఁటికి

చ. 1: గతియై బ్రహ్మాండాలు కల్పించ నేరిచి
సుతులై బ్రహ్మాదులు చూపట్టఁగా
క్షితి వేదశాస్త్రాలచేతఁ బొగడించుకొంటా
నితరు లెరఁగకుండా నింత దాఁగనేఁటికి

చ. 2: వున్నత పరమపద మొసఁగ నీవు గర్తవై
అన్నిటా లక్ష్మీనాథుఁడవనఁ బెంపొంది
పన్నుక యిన్నివిద్యలాఁ బ్రసిద్ధుఁడై వుండి
కన్నులకుఁ బ్రత్యక్షముఁ గాకుండ నేఁటికి

చ. 3: సురల యాపదలెల్లా సులభాననె తీర్చి
పరగ ధర్మములెల్లాఁ బరిపాలించి
పరుషలకు వరాలు పలుమారుఁ గృపచేసి
మరిగి శ్రీవేంకటేశ మాటాడ వదేఁటికి

రేకు: 0240-01 సామంతం సం: 03-227 శరణాగతి

పల్లవి: ధర నీవే తల్లియును దండ్రియువై యుండఁగాను
యిరవుగ నెవ్వరూ వహించుకోనేమిటికి

చ. 1: పుట్టిన జీవులు తొల్లి భువిపై ననేకులు
అట్టె వారి చరితలు ననేకములు
వట్టిజాలిఁ దమతమవారలంటాఁ దలఁచుక
బట్టబయలే నానాభావాలఁ బొందుదురు

చ. 2: సరవి నందరుఁ జేసే సంసారములు పెక్కు
సిరులవారి గుణాలు చేష్టలు పెక్కు
అరసి తమవారితో నవి యెల్లాఁ జెప్పుకొంటా
దరినుండే వగరించి తమకింపుచుందురు

చ. 3: వడినెన్నైనాఁ గలవు వావు లెంచి చూచుకొంటే
గడియించే పదార్థాలు కలవెన్నైనా
యెడయక శ్రీవేంకటేశ నీదయ గలి(గి?)తే
జడియక నీదాసులు సంతసమందుదురు

రేకు: 0240-02 దేసాక్షి సం: 03-228 శరణాగతి

పల్లవి: నారాయణ నీదాసుల నడకలివి
ధారుణి నిదేపనై తగులఁగవలెను

చ. 1: ఆతుమలో హరిమీఁది ఆందోళమే వలె
చేతికి లోఁగాకుంటేను చింతించవలె
ఆతనిఁ జూచేయందుకు నాసలఁ బొరలవలె
రీతినివెప్పుడు విచారించుకొనవలెను

చ. 2: నీలవర్ణు కథలకు నివ్వెరగు నొందవలె
ఆలకించి యందు భ్రమయఁగవలెను
తాలిమితో మహిమలు దలపోసుకొనవలె
వేళవేళ ధ్యానించి వెదకఁగవలెను

చ. 3: చేరి శ్రీవేంకటేశు సేవించుకుండఁగవలె
గారవాన సదా మరుగఁగవలెను
ఆరసి పెద్దలనన్నీ నడుగుచుండఁగవలె
నోరునిండా నేపొద్దూ నుతియించవలెను

రేకు: 0240-03 ముఖారి సం: 03-229 శరణాగతి

పల్లవి: జగములేలేవాఁడవు జనార్దనుఁడవు
తగ నీవారమై(మే?) నేము ధర నెట్టుండినాను

చ. 1: గతి నీవు మతి నీవు కాణాచిచోటు నీవు
సతమై యన్నిటికిని సాక్షిని నీవు
చతురత వలసితే జరతుము కొలుతుము
తతి నేము సేసిన తప్పులు లోఁగొనవే

చ. 2: తల్లియుఁ దండ్రివి నీవు దాత దైవమవు నీవు
యెల్ల వారికిఁ బరము నిహము నీవు
మల్లడి నొక్కొకవేళ మఱతుము తలఁతుము
చల్లఁగా మా నేరములు సైరించుకొనవే

చ. 3: దరి నీవు దాపు నీవు దయామూర్తివి నీవు
పరగ శ్రీవేంకటేశ పతివి నీవు
విరివిగా నేమైనా వేఁడుదుము నుతింతుము
శరణు చొచ్చితిమిఁక క్షమియించుకొనవే

రేకు: 0240-04 పాడి సం: 03-230 ఉపమానములు

పల్లవి: ఏకాలము నామనే(???) యెరిఁగిన దాసులకు
దాకొని శ్రీహరి భక్తిధారణ గలిగితేను

చ. 1: తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ బొల్లువోదు
బడినే శ్రీహరిభక్తి పంట పండితే
వుడివోదేకాలము వొకతతి రావద్దు (?)
చెడని శ్రీహరిభక్తి చెట్టుకట్టితేను

చ. 2: వలువ దీసితేఁ బోదు వాడుకొంటే వెల్తి గాదు
కొలచి శ్రీహరిభక్తి కుప్ప చేసితే
యెలుకకుఁ దినరాదు యెన్నాళ్లున్నాఁ జివుకదు
తలఁచి హరిభక్తి చిత్తపుగాదెఁ బెట్టితే

చ. 3: కఱవుకుఁ లోఁగాదు సుంకరవాని కబ్బదు
యెఱుకతో హరిభక్తి యిల్లు నిండితే
నెఱవై శ్రీవేంకటేశ నీకృపగలవారికి
గుఱిగాఁగ హరిభక్తి కూడపెట్టుకొంటేను

రేకు: 0240-05 దేసాళం సం: 03-231 భగవద్గీత కీర్తనలు

పల్లవి: విశ్వరూప నీ మూర్తి వివేకించలేను నేను
శాశ్వతుఁడ నీవున్నచందమేమీ నెఱఁగ

చ. 1: నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట
దొబ్బుకొంటాఁ దిరిగేము తోవల నిన్ను
వుబ్బి సముద్రమువలెనున్న నీ ప్రకృతియందు
గబ్బినై యీఁదుచున్నాఁడఁ గలఁగకుమీ

చ. 2: కడయు మొదలులేని కాలము నీతనువట
నడుమ నందుతోనే పెనఁగుచున్నాఁడ
అడరి నీ సొమ్ములైన ఆత్మలలో నొకఁడనై
చిడుముడినున్నవాఁడ చిక్కువఱచకుమీ

చ. 3: పరమున నిహమునఁ బ్రబలియున్నాఁడవట
గరిమ సోదించేము కమ్మటి నిన్ను
ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము
శరణు చొచ్చితిమిఁక చనవిచ్చి కావుమీ

రేకు: 0240-06 నాట సం: 03-232 హనుమ

పల్లవి: కొలిచినవారికిఁ గొమ్మని వరములిచ్చీ
వెలయఁ గలశాపుర వీధి హనుమంతుఁడు

చ. 1: బెట్టుగా నొకచేతఁ జూపెడి తన ప్రతాపము
పట్టుకున్నాఁ డొకచేతఁ బండ్లగొల
మెట్టుకొన్నవి రాకాసిమెదడుతోడి తలలు
రట్టడి కలశాపుర దిట్ట హనుమంతుడు

చ. 2: చెచ్చెర వీనుల నాలించేది సురల నుతులు
కొచ్చికొచ్చి తోఁకఁ జుట్టుకొన్నది నింగి
తచ్చి చూచేది కన్నుల దాసులమీఁది కరుణ
రచ్చకెక్కెఁ గలశాపురము హనుమంతుఁడు

చ. 3: వసుధ మతిలోనిది స్వామికార్యవిశ్వాసము
వెసఁ దన పనైనది విష్ణుభక్తి
పసగా శ్రీవేంకటేశ బలు నీ బంట్లలోన
రసికుఁడు కలశాపురము హనుమంతుఁడు

రేకు: 0241-01 రామక్రియ సం: 03-233 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడు
ఆముక విజనగరమందు నున్నవాఁడు

చ. 1: చక్కఁదనములవాఁడు జానకీవల్లభుఁడు
గక్కన శబరిపూజ గైకొన్నవాఁడు
వెక్కసమైన పైడివిల్లునమ్ములవాఁడు
రక్కసులవైరి దశరథనందనుండు

చ. 2: శరధి గట్టినవాఁడు చాయ నల్లనివాఁడు
యిరవై సుగ్రీవాదుల నేలినవాఁడు
సరి భరతశత్రుఘ్నసౌమిత్రి సేవితుఁడు
అరిది మునుల కభయమిచ్చినవాఁడు

చ. 3: అట్టె కౌసల్యాత్మజుఁడు అయోధ్యాపతైనవాఁడు
వొట్టి తారకబ్రహ్మమై వుండేటివాఁడు
గుట్టుతో వరములిచ్చేకోనేటిదండవాఁడు
పట్టపు శ్రీవేంకటాద్రిఁ బరగినవాఁడు

రేకు: 0241-02 సాళంగనాట సం: 03-234 నృసింహ

పల్లవి: కంటిరా వో జనులాల కరుణానిధి యితఁడు
జంట లక్ష్మీదేవితోడ సరుస నున్నాఁడు

చ. 1: వాఁడివో ప్రతాపసుగ్రీవ నరసింహు డట్టె
మూఁడుమూర్తు లొకరూపై మించివున్నాఁడు
వేఁడి రక్కసులనెల్ల విదళించి వేసినాఁడు
పోఁడిమి సురలఁ గాచీ భువనాధీశుఁడు

చ. 2: ఇరవైన రవిచంద్రు లితని కన్ను లివిగో
ధరణి ననంతవేదము లూర్పులు
అరుదై చెలఁగె బ్రహ్మాండ మీతని నెలవు
నిరతి సనకాదులు నిత్యసేవకులు

చ. 3: ఘన మైన శంఖుచక్రములతో మెరసీని
మనిపె ప్రహ్లాదుని మన్నించె నిదె
యెనలేని శ్రీవేంకటేశుఁడై వున్నవాఁడు
అనిశము సకలాంతరాత్మ తానైనాఁడు

రేకు: 0241-03 ముఖారి సం: 03-235 కృష్ణ

పల్లవి: ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుఁడు
నవకపు సెలవుల నవ్వుచున్నాఁడు

చ. 1: అచ్చపు బాలుఁడై శకటాసురు మర్దించినాఁడు
కుచ్చి కాఁగిళ్ల నింతులఁ గూడినాఁడు
మచ్చిక దోఁగెడు తాను మద్దులు విరిచినాఁడు
పిచ్చిలఁ బూతకి చన్ను పీరిచినాఁడు

చ. 2: పిన్ననాఁడే కోడెలతోఁ బెనఁగి గెలిచినాఁడు
యెన్నికగా వేలఁ గొండ యెత్తినాఁడు
నెన్నడిని కొండపాము వెస రెండు సేసినాఁడు
పన్ని కంసుని మదము భంజించినాఁడు

చ. 3: పొంచి పెద్దవాఁడై భూభారము దించినాఁడు
అంచెఁ బాండవులకు దిక్కైనవాఁడు
మించి శ్రీవేంకటగిరిమీఁద నిదె వున్నవాఁడు
వంచించక దాసులకు వరాలిచ్చేవాఁడు

రేకు: 0241-04 ఆహిరినాట సం: 03-236 నృసింహ

పల్లవి: అరుదరుదీగతి యహోబలేశ్వర
పొరిఁబొరి దాసులు పొగడుట యెట్టు

చ. 1: యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని
అదె ప్రహ్లాదుఁడు బంటగుటెట్లు
కదిసిన రుద్రుని గర్వ మడఁచితివి
గుదిగొని దివిజులు కొలుచుట యెట్టు

చ. 2: ఘనసింహాకృతి గైకొనివుంటివి
యెనయఁగఁ గరిఁ గాచిన దెట్లు
పనివడి కంబము వగుల వెడలితివి
మనుజులు పూజించి మరుగుట యెట్లు

చ. 3: సరవితో వీరరసమున మించితివి
అరయఁగ శృంగారివౌటెట్టు
సిరిపుర మెక్కెను శ్రీవేంకటాద్రిని
యిరవుగ నీ తొడ యెక్కుట యెట్టు

రేకు: 0241-05 దేసాళం సం: 03-237 అంత్యప్రాస

పల్లవి: నిండు కంతటా నున్నది నీమాయ
వొండొకరు జనులకు నుపదేశించనేలా

చ. 1: నేరకుంటే సంసారము నేరుపును నీమాయ
చేరకుంటే గడులోను చేసుకొను నీమాయ
వూరకొడఁబడకుంటే వొడఁబరచు నీమాయ
పోరి బిడ్డలకు తండ్రి బుద్ధి చెప్పవలెనా

చ. 2: నాలికె కారురుచులు నలిఁ దెలుపు నీమాయ
బేలుఁడై విరక్తుఁడై భిక్ష మెత్తించు నీమాయ
పాలుమాలేమంకునైనా పనిసేయించు నీమాయ
రేలుఁబగళ్లొకరు ప్రేరేఁపుచుండవలెనా

చ. 3: చొక్కించి నోరుఁ జేతికి సూటి చూపు నీమాయ
పెక్కులాగుల నన్నిటాఁ బెనగించు నీమాయ
వెక్కసపలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తక్కక నీమహిమిది తలపించవలెనా

రేకు: 0241-06 లలిత సం: 03-238 అంత్యప్రాస

పల్లవి: మనుజు లూరకే తాము మరఁగులంటా నుందురు
యెనసి దేవుఁడు సేసే నిందరికి మాయ

చ. 1: వినికందరి కొక్కటే వివరములే వేరు
కనుచూపులు నొక్కటే కాంక్షలే వేరు
మనసూ నొక్కటే లోనిమర్మములే వేరు
తనివియు నొక్కటే తనువులే వేరు

చ. 2: లోకమును నొక్కటే లోనువెలుపల వేరు
వాకు లొక్కటే భాషలవరుసే వేరు
జోక నాహార మొక్కటే సొరిది రుచులే వేరు
కైకొన్నరతి యొక్కటే కందువలే వేరు

చ. 3: పరిమళ మొక్కటే భాగించుకొనుటే వేరు
యిరవైన దొక్కటే యింపులే వేరు
అరిది శ్రీవేంకటేశ అన్నిటా నీదాఁసుడు(ల?)
శరణాగతి యొక్కటే జాతులే వేరు

రేకు: 0242-01 సాళంగనాట సం: 03-239 నృసింహ

పల్లవి: శరణని బ్రదుకరో జనులాల
గరిమ మెరసె నిదె కనకసింహము

చ. 1: అహరహమునుఁ బ్రహ్లాదుఁడు దొరకొని
బహువిధముల హరిమహిమలు వొగడఁగ
కహకహ హిరణ్యకసిపుఁడు నగి హరి
సహజ మేదియని చఱచెఁ గంభము

చ. 2: అటమరి పెటపెటమని బేంట్లెగసి
చిటచిటరవములఁ జిరుతపొగ లెగసి
తటతట మనుచును తరలి వ్రయ్యలై
పటపటమనుచును పగిలెఁ గంభము

చ. 3: బెడిదపు చూపుల మిడుఁగురు లెగయఁగ
పుడమి యదర నూర్పులు చెలఁగ
గడగడ వడఁకి దిక్తటము లల్లాడఁగ
వెడలెఁ గంభమున విజయసింహము

చ. 4: నగవుల సుడివడె నభోంతరంబులు
పొగ లెగసెను పెనుబొమముళ్ళ
పగటు నార్పులను పగిలెనుఁ గొండలు
వెగటుగ వెడలెను వీరసింహము

చ. 5: తెఱచిన నోరఁ బ్రతిధ్వను లెసగఁగ
కఱకుగతుల చుక్కలు చెదర
నెఱి హుంకృతులను నిఖిలము బెదరఁగ
వెఱచఱవఁ గెరలె విమలసింహము

చ. 6: పటువిహారముల బ్రహ్మాండ మగల
గుటగుటరవళి నాకులు వొగడ
నిటలనేత్రమున నెఱమంట లడర
పటుగతి మెరసెను భయదసింహము

చ. 7: పెదపెదకోఱల పిడుగులు రాలఁగ
తుదనఖముల నెత్తురు దొరుగ
గుదిగొను కసరుల కులగిరు లూఁటాడ
వుదయించె నదివో వుగ్రసింహము

చ. 8: అట్టహాసమున నసురలు వారఁగ

ముట్టి వాయువులు మొగతిరుగ
దట్టములై జలధరములు ముసరఁగ
దిట్టయై వెడలె ధీరసింహము

చ. 9: జలధులు గలఁగెను జడిసె లోకములు
తలఁకె సప్తపాతాళములు
పులికిపడఁ దొడఁగె నూర్ధ్వలోకములు
కొలువున నిలిచెను ఘోరసింహము

చ. 10: అచ్చట హిరణ్యు నదరంటఁబట్టి
యిచ్చలఁ దొడపై నిడి చించి
కుచ్చి వాని పేగులు జంద్యములుగ
విచ్చి వేసుకొనె విష్ణుసింహము

చ. 11: పొగడిరి దివిజులు భువనములు వెలసె
పగయుడిగి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు
మిగులశాంతమున మించె శ్రీవేంకట-
నగమున నహోబలనారసింహము

రేకు: 0242-02 బౌళి సం: 03-240 వేంకటగానం

పల్లవి: దేవా నీవే యిన్ని చందముల తిరముగ మహోపకారి వైతివి
యేవలనైనా నీవేకాక భువి నింతటివారలు యిఁకఁ గలరా

చ. 1: జనులకు నీవే వొక్కొకచోటను శాస్త్రార్థములై కడఁగుదువు
తనియక నీవే మరి వారికి బోధకులఁ గొందరినిఁ గల్పింతువు
మనసులో నంతలో వొడఁబడికె చేసి మలయుచు నీవే నిలుతువు
కనుఁగొన నీవే సుజ్ఞానమార్గము కైవసముగాఁ దెలుపుదువు

చ. 2: కడఁగి యప్పటి నివే యజ్ఞాదికర్మఫలములై వుండుదువు
తడయక నీవే తిరుపతుల దేవతామూర్తులై పొడచూపుదువు
యెడయక నీవే తపోమహిమలై యెదుటనే తార్కాణ లౌదువు
వొడలై నీవే యిహపరములకును వొడిగట్టి సాధింపింతువు

చ. 3: ఆవేళ నీవే తత్త్వనిర్ణయము నాధారమునై యేర్పరతువు
నీవే కమ్మటి ఆచారవిధులకు నియమములెల్లా నేర్పుదువు
భావింప నీవే అలమేల్మంగకుఁ బతివై శ్రీవేంకటేశ రక్షింతువు
జీవుల కంతర్యామివై నీవే శిష్టులఁ బరిపాలింతువు

రేకు: 0242-03 ధన్నాసి సం: 03-241 వైష్ణవ భక్తి

పల్లవి: విచారించుకోరో యిది వి???కులాల మెండు-
పచారాలు చూచి మీరు భ్రమయకురో

చ. 1: భావింప నారదునికి బ్రహ్మపట్ట మరుదా
వేవేలైనాఁ గొంచెమని విడిచెఁగాక
దేవతలు తన్నుఁ జూచి దిగ్గన లేచి మొక్కేటి-
ఆవైభవపు పదమందెఁ గాక

చ. 2: మిక్కిలి జ్ఞానము గల్గి మించి తమ నేరుపెల్లా
చిక్కి సంసారము పాలు సేయవలెనా
యెక్కువ హరిదాసుఁడై యిట్లానే వైకుంఠ-
మెక్కెడితోవ సాధించేదిది మేలుఁ గాక

చ. 3: మూలమని నుడిగితే ముంచి యెవ్వఁడు గాచెను
పోలించ నెవ్వని నాభిఁ బుట్టె లోకాలు
చాలి యెవ్వనికుక్షి నీజగము లున్నవి మరి
కాలమందే ఆదేవునిఁ గానవలెఁ గాక

చ. 4: యిదియే శ్రీవైష్ణవులు యిలఁ బూర్వాచార్యులు
వెదకి చదివి కన్నవివరమెల్లా
తుదమొద లెరఁగని దుష్టులకతలు మాని
పదిలమై యిట్టే నమ్మి బ్రదుకుటఁ గాక

చ. 5: సంకుఁజక్రములు మాని సమానభోగముతోడ
అంకెల శ్రీవేంకటేశునండ నుండరో
పొంకపుబుద్ధు లిమ్మని పొంచి గాయత్రి జపించి
ఇంక బ్రహ్మవేత్త లెంచేదిందుకే కాక

రేకు: 0243-01 శంకరాభరణం సం: 03-242 నృసింహ

పల్లవి: కలిగిన మీఁదాఁ గడమేలా

పలులంపటములఁ బడుటే కాక

చ. 1: దురిత మణఁగె నిటు తుదకెక్కె సుఖము

హరి యొక్కఁడె గతియన్నపుడే

పొరి నిఁకఁ జేసెటి పుణ్యములెల్లా

వరుసతోడ నెవ్వరికో కాని

చ. 2: సార మెరిఁగె తనజన్మము గెలిచెను

శ్రీరమణునిఁ దలఁచినయపుడే

సైరణతో నిఁకఁ జదివేటి చదువు

మేరమీఁద నేమిటికో కాని

చ. 3: శ్రీవేంకటపతి చిత్తాన నిలిచెను

కావించి గురునిఁ గన్నపుడే

భావించి యితరప్రార్థన లన్నియు

యీవలావలను యెందుకో కాని

రేకు: 0243-02 వసంతవరాళి సం: 03-243 అధ్యాత్మ

పల్లవి: వట్టి స్వతంత్ర మిందు లేదు వావాద మిందు లేదు
గుట్టు దెలియక లోలో గునిసేరు వీరివో

చ. 1: నేరిచి బ్రదుకువారు నేరక వీఁగేటివారు
యేరీతిఁ జూచినాను యెవ్వరు లేరు
తీరుగాఁ దమలోనుండే దేవుఁడు పెరరేఁచఁగా
మేరతోనే జీవులెల్లా మెరసేరు వీరివో

చ. 2: కొందరు గొప్పజీవులు కొందరు చిన్నజీవులు
యెందుఁ జూచినా భూమి నెవ్వరు లేరు
బొందులే వేరువేరుగాఁ బుట్టించె దేవుఁడే
అందాలు సేయఁగ లోకు లమరేరు వీరివో

చ. 3: అసుర కాణాచివారు అమర కాణాచివారు
యెసఁగ విచారించుకో నెవ్వరు లేరు
వెస శ్రీవేంకటేశుఁడు వినోదించినయట్టు
వసుధ మీఁదటఁ గానవచ్చేరు వీరివో

రేకు: 0243-03 కన్నడగౌళ సం: 03-244 అధ్యాత్మ

పల్లవి: సరవులు దెలియఁగఁ జనుఁ గాకా
పరమార్థములో భంగము గలదా

చ. 1: హరి స్వతంత్రుఁడట హరిసంకల్పము
విరసంబౌనా విశ్వమున
సరవిఁ బ్రపంచపు సకలమతంబులు
వరుస నెంచఁ గొదువలు మఱి కలవా

చ. 2: యితఁడు పూర్ణుఁడట యితని విహారము
వెతకఁగవలెనా వేమరును
కతకరచిన యీకన్ను లెదిటివే
మతిఁ దోఁచీనిఁక మఱఁగులు గలవా

చ. 3: అంతరాత్మయట అతని వేరే
చింతించవలెనా సిలుగులను
చెంతనే యిదివో శ్రీవేంకటేశుఁడు
యెంత దెలిసినా యితరము గలదా

రేకు: 0243-04 దేసాళం సం: 03-245 దశావతారములు

పల్లవి: అచ్చుతు కృపాలబ్ధ మదియుఁగాక
మచ్చిక నాతఁడు సేసే మతకముఁ గాక

చ. 1: నానాపాట్లఁ బడె నాఁడు కరి మకరిచే
హీనదెస ప్రహ్లాదుడు హిరణ్యుచేఁ బాటువడె
పానిపట్టి హరి యది పరిహరించనివాఁడా
ఆనుక హరిదాసుల కంతటనే భంగమా

చ. 2: తగిలి భీష్ముడు శరతల్పమందు నుండఁడా
అగడై విభీషణుఁడు అన్నచేఁ దన్నువడఁడా
పగపాడే చూచుచుండ భాగవతులను హరి (?)
తగినపుణ్యుల నిందు తప్పు లెంచవచ్చునా

చ. 3: మంతనాన నారదుఁడు మాయలకుఁ లోనుగాఁడా
చెంతల నర్జుననకు చేతులు దెగిపడవా
ఇంతలో శ్రీవేంకటేశుఁడిట్టె వీని మన్నించఁడా
ఇంతటి మహానుభావు లిందుకు జడుతురా

రేకు: 0243-05 దేసాక్షి సం: 03-246 శరణాగతి

పల్లవి: పుట్టుగు నీయాధీనమే భోగము నీయాధీనమే
అట్టే యీభావనకు నరుదయ్యీ నాకు

చ. 1: కాననట్టుండవచ్చు నీకల్పిత సుఖదుఃఖాలు
మేను మోచి మీయాజ్ఞ మీరవచ్చునా
నానాజీవులు పడే నాలిఘోరములు చూచి
దీనికెంత వగతువో దేవ నీ చిత్తానను

చ. 2: తొట్టిన పాపపుణ్యాలు తొల్లె నీపంపులే
పుట్టిన మీ మాయలెల్లాఁ బో దొబ్బేమా
వొట్టుకొన్నజీవులు వొరలుచుండఁగఁ జూచి
యెట్టు నీవోరిచేవో యీవేదన కిపుడు

చ. 3: చెచ్చెర యీజన్మములు శ్రీవేంకటేశ్వర నీవే
యిచ్చినవి నీతోడ నెదురాడేమా
నిచ్చలు మావంటివారి నేరుపు నేరాలు చూచి
వచ్చి నే శరణనఁగా వహించుకోవలసె

రేకు: 0243-06 దేవగాంధారి సం: 03-247 గురు వందన, నృసింహ

పల్లవి: అంతటిదైవమ వటుగాఁగా
చెంత నిన్నుఁ గూర్చినదే ఘనము

చ. 1: వెరవునఁ బంచమవేద సారములు
సిరుల నిను నుతించిన నుతులు
సరవితోడి బహుశాస్త్రసంతతులు
నిరతిఁ జెప్పెడిని నీకథలు

చ. 2: కొంగుపైడియగు గురుమంత్రంబులు
సంగడి వైష్ణవసంభాషలు
నింగికి భూమికి నిజపురాణములు
సంగతిగల నీ సంకీర్తనలు

చ. 3: పూనిన విధుల మహోపనిషత్తులు
నానాగతి నీనామములు
వీనులకును శ్రీవేంకటేశ మీ-
జ్ఞానార్థములు మిముఁ జదువు చదువులు

రేకు: 0244-01 భైరవి సం: 03-248 నామ సంకీర్తన

పల్లవి: ఏపాటి గలవాఁడ నిదివో నేను
నాపాటు చూచి హరి నన్నుఁ గావఁగదవే

చ. 1: నిలువు నూరు వండీని(?) నిచ్చలు నీదేహమైతే
వొలిసీ దుఃఖములకు నోరువ లేదు
కులము గోటిసేసును గుంపుల జన్మాదులైతే
అలరి వొరులఁబోయి అడిగేదే యెపుడు

చ. 2: పట్టితే పసిఁడి రాలీ బచ్చన సంసారము
గుట్టుదెలియఁ బ్రాణము కూటిచేతిది
పుట్టిపడీ మానుషము వొకనాటి కొకనాఁడు
పట్టికాంతలయెదుట భంగపడే మిదివో

చ. 3: చేరి చెట్టడిచితేను చేటఁడు చుట్టరికాలు
యీరీతి నిన్నాళ్లదాఁకా నెందుండిరో
ఆరిచితే మూరెఁడెక్కీనదే నామకీర్తనము
కూరిమి శ్రీవేంకటేశ కొన నాలికకును

రేకు: 0244-02 వరాళి సం: 03-249 శరణాగతి

పల్లవి: దైవమా నీచేతిదే మాధర్మపుణ్యము
పూవువంటి కడు లేఁతబుద్ధివారము

చ. 1: యేమిటివారము నేము యిదివో మాకర్మ మెంత
భూమి నీవు పుట్టించఁగఁ బుట్టితిమి
నేమముతో నడచేటి నేరుపేది మావల్ల
దీముతో మోచిన తోలుదేహులము

చ. 2: యెక్కడ మాకిఁక గతి యెరిఁగే దెన్నఁడు నేము
చిక్కినట్టి నీ చేతిలో జీవులము
తక్కక నీ మాయలెల్లఁ దాఁటఁగలమా మేము
మొక్కలపుటజ్ఞానపు ముగ్ధలము

చ. 3: యేది తుద మొదలు మాకిఁక నిందులో నీవే
ఆదిమూర్తి నీకు శరణాగతులము
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీదయ గలుగఁగాను నీ వారము

రేకు: 0244-03 బౌళి సం: 03-250 శరణాగతి

పల్లవి: శరణు నేఁ జొచ్చినది సరి నీవు మన్నించేది
యిరవైన గురుతుగా కిందుఁ గూడపెట్టేవా

చ. 1: యెంగిలినోరు వెట్టుక యే మాటలాడినాను
సంగతిగా నవి నేఁడు సత్యమయ్యీనా
అంగనల మోహము నాయంతరంగానఁ బెట్టుక
ముంగిటి ఆచారాలు ముఖ్యమయ్యీనా

చ. 2: ఆసలు మెడఁగట్టుక అన్ని యుఁ జదివినాను
దోసములెల్లా మాని దొరనయ్యేనా
రోసాలు మదిఁబెట్టుక రోఁతమేను గడిగితే
వేసాలయ్యే తోఁచుఁగాక వేరే పుణ్యమున్నదా

చ. 3: ఘనసంసారము మోచి కర్మమెంత సేసినాను
తను దా జన్మించినట్టి తప్పు దీరీనా
యెనలేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
తనిసితి నిఁక నేను తమకించేనా

రేకు: 0244-04 సాళంగనాట సం: 03-251 శరణాగతి

పల్లవి: ఇంకనేల నాకు వెరపింతమాట గలిగియు
సంకెలెల్లఁ బాసె నాస్వతంత్రము లొక్కటే

చ. 1: నేనెంత పాపబుద్ధినై నేరమెంత సేసినాను
కానీలే నన్నెలేవాఁడు కావఁగలఁడు
ఆనతిచ్చెఁ దొల్లె యాతఁ డదె చరమార్థమందు
మేనిదోసమెల్లఁ బాపి మేలొసఁగేననుచు

చ. 2: మట్టులేకతనినెంత మరచి నే వుండినాను
పుట్టించిన దేవుఁడే ప్రోవఁగలఁడు
గుట్టుచూపె తొల్లె తన గుణము పాండవులందు
గట్టిగాఁ దనవారైతే కాచుకుందుననుచు

చ. 3: తప్ప నే నడచినాను తగిలి శ్రీవేంకటేశుఁ-
డొప్పులు సేసి రక్షించ నొద్దఁగలఁడు
చెప్పనేల గోపికలు సేసిన దోసాలు దొల్లి
కప్పుక పుణ్యాలు సేసె ఘనుఁడఁ దాననుచు

రేకు: 0244-05 భూపాళం సం: 03-252 శరణాగతి

పల్లవి: నిత్యానందులము నిర్మలులమిదే నేము
సత్యముగ మమ్మాతఁడు సరిఁ బుట్టించఁగను

చ. 1: యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును
వొక్కట నంతర్యామై వున్నాఁడదె
ఇక్కడ నాతనిగుణా లెన్నేసి చదివే మిఁక
పక్కన తన దాసుల భక్తికి సులభుఁడు

చ. 2: యేమేమి వేఁడుకొనేము యిటమీఁద నాతని
నామములు నాలికపై నటించీనదే
నేమమున నింకా నెట్టు నిచ్చలు భుజించేమో
కామించి సంసారపు కైంకర్య మాతనిదే

చ. 3: ధ్యాన మేమని సేసేము తలఁచినందెల్లాను
పూని శ్రీవేంకటేశుఁడే వుండఁగాను
నానాఁట నిఁక నేమి నమ్మితి మనేదేమి
పేని మమ్ముఁ దన కుక్షిఁబెట్టి పెంచఁగాను

రేకు: 0244-06 మాళవిగౌళ సం: 03-253 కృష్ణ

పల్లవి: ఏమని చెప్పగవచ్చు నీసంతోషపుసుద్ది
నామము శ్రీకృష్ణుఁడట నారాయణునికి

చ. 1: జనని దేవకిదేవి జనకుఁడు వసుదేవుఁ-
డనఘుడైనయట్టి ఆదిమూర్తికి
ఘనలోకరక్షణ కంసుమామ గండమును
తనకుఁ గారణమట దైవశిఖామణికి

చ. 2: పుట్టినది మధుర పెంపుడుఁజోటు రేపల్లె
వొట్టిన మాయల పురుషోత్తమునికి
పట్టిన పాండవపక్షపాతము కౌరవవైర-
మిట్టి వ్రాతఫలమట యీశ్వరేశ్వరునికి

చ. 3: గోవులఁ గాచేదియు గొల్లెతలఁ బొందేదియు
ఆవేళ గుణము యీ యచ్యుతునికి
శ్రావణబహుళాష్టమి చంద్రోదయము రోహిణి
కావింప జన్మమిదివో శ్రీవేంకటపతికి

రేకు: 0245-01 గుజ్జరి సం: 03-254 అధ్యాత్మ

పల్లవి: వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణు డొకఁడేకాక
అనుమానములన్నియు నుడిగితిని అలసితి నిఁక నేను

చ. 1: పట్టిన చలము మానదు ప్రకృతి స్వతంత్రమున
పెట్టేడి మాయలనే కమ్మర పెట్టదు వివేకము
పుట్టితి నిన్నాళ్లాయను పొదలితి బుద్ధెరిఁగి
దిట్టనై అదికాదని తోసేటి దీమనమూ లేదు

చ. 2: తగిలెడి అనుబంధము మానదు తలఁపను నొకవంక
తెగనియ్యదు కర్మము లేమిటిని తెగించుఁ బుణ్యముల
నగుచునే ముదిమికి లోనైతి నానాఁటికి నేను
మగటిమి నే దాని నణఁచను మరిగెడిదేకాని

చ. 3: చేసిన అలవాటు మానఁడు జీవుఁడు తనగుణము
వేసరదు అనుభవించుటకు వేసరు ముక్తికిని
దాసునిఁగా శ్రీవేంకటేశుఁడు దయఁజూచెను నను నీవేళ
మోసములన్నియును దేరెను మునుపు వెనక యేదో

రేకు: 0245-02 సామంతం సం: 03-255 వేంకటగానం

పల్లవి: హరియే యెరుఁగును అందరి బ్రతుకులు
యిరవై యీతని యెరుఁగుటే మేలు

చ. 1: వెనకటి బ్రహ్మలు వేవేల సంఖ్యలు
యెనసి బ్రహ్మాండము లేలిరట
పెనగొని వారల పేరులు మరచిరి
మనుజకీటముల మరెవ్వఁ డెరుఁగు

చ. 2: ఆసఁ దొల్లి మును లనంతకోట్లు
చేసిరి తపములు సేనలుగా
యే సిరులందిరి యెరఁగ రెవ్వరును
వేసపు నరులకు విధి యేదో

చ. 3: కల వనేకములు కర్మమార్గములు
పలుదేవత లిటు పాటించిరి
బలిమి శ్రీవేంకటపతికి మొర ఇడి
వెలసిరి తుదనిదే వెరవిందరికి

రేకు: 0245-03 పాడి సం: 03-256 అధ్యాత్మ

పల్లవి: వారివారి సహజపు వరుస లివి

కారణము తొల్లే హరికల్పితమిది

చ. 1: వేరే విరుద్ధము లేదు వివేకించి చూచితేను

శూరుఁడై వుండిన మహాసుజ్ఞానికి

యేరీతిఁ జూచినాను యేకసమ్మతి లేదు

సారము దెలియరాని సంసారికి

చ. 2: సకలభావములును చక్కనయ్యే తోఁచివుండు

ప్రకటించి నేరిచిన ప్రౌఢలకును

అకటా జగడములే అన్నిటా వెంటనే వచ్చు

వికలులైన మూఢవిచారులకు

చ. 3: సేయఁగల కర్మమెల్లా సేసి తొల్లె ఫలించెను

దాయిదండగల హరిదాసులకును

రాయడిఁ బుణ్యపాపాలు రారాఁపులై యుండు

యేయెడ శ్రీవేంకటేశు నెరఁగనివారికి

రేకు: 0245-04 బౌళి సం: 03-257 అధ్యాత్మ

పల్లవి: కమ్మరను జీవునికిని ఇది కారణ మేమియు లేదట
ఇమ్ముల రాజూ నెరఁగని వెట్టెట యెవ్వరికెక్కును నారాయణా

చ. 1: యిలలో జీవునివిషయభోగమున నెందునుఁ బొరయనివాఁడవట
చలమా యేల పుట్టించితివీ సంసారవారిధిని
కలకాలము నీగర్భగోళమునఁ గాఁపురముండఁగ నిటు చేసి
ఫలమేమి గట్టుకొంటివి భావము దెలుపవే నారాయణా

చ. 2: నడపెడి యీ జగములన్నియును నటనలునీవట తొలుతనే
యెడయక యిందే వినోదించెదవు యెడ్డతనంబా నీకేమి
జడియక నీవే సేసిన చేఁతలు సర్వమును నిలుపఁగవలదా
కడుగఁగనేఁటికి నెంగిలిబూరెట కడవేయనేల (?) నారాయణా

చ. 3: పరగిన యీ కర్మమార్గములు బంధహేతువని చెప్పితివి
యిరవుగను వేదమార్గములు నేలా కాచుక తిరిగెదవు
గరిమల శ్రీవేంకటేశ్వర యిచ్చాకల్పితములు యిన్నియు నీకు
హరినెరిగించితివిఁక నీచిత్తము సర్వేశ్వర వో నారాయణా

రేకు: 0245-05 పాడి సం: 03-258 కృష్ణ

పల్లవి: శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాఁడు

చ. 1: హరి కృష్ణావతారమందినయంతలోనే
పరమ మునులకెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి
సిరుల మించినయట్టి శ్రీజయంతినాఁడు

చ. 2: గోవిందుఁడు వసుదేవుకొడుకైన యప్పుడే
గోవులు రంకెలువేసె గొల్లపల్లెను
నోవితోడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె
చేవలు మీరినయట్టి శ్రీజయంతినాఁడు

చ. 3: నారాయణుఁడు భువి నరుఁడు దాఁ గాఁగానే
మేరఁ బాండవు లెచ్చిరి మేనవావిని
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుఁడు
చేరువనే మెరయఁగ శ్రీజయంతినాఁడు

రేకు: 0245-06 సామంతం సం: 03-259 నామ సంకీర్తన

పల్లవి: ఇంతకంటె ఘన మిఁక లేదు
సంతతసౌఖ్యము జనార్దనుఁడే

చ. 1: భయనివారణము పరమాత్ముని నుతి
జయకారణ మీశ్వరచింత
అయుతపుణ్యఫల మచ్యుతునిసేవ
క్రియతో నిజ మెరిఁగినవారికిని

చ. 2: కర్మహరము శ్రీకాంతు దరిశనము
ధర్మరాసి మాధవుశరణు
అర్మిలి సంపద లనంతుని తగులు
నిర్మలముగఁ బూనిన దాసులకు

చ. 3: ఆగమోక్తమీ హరికైంకర్యము
భోగము విష్ణునిపూజ యిది
యోగము శ్రీవేంకటోత్తముని కొలువు
బాగులు నేర్చిన ప్రపన్నులకును

రేకు: 0246-01 దేసాక్షి సం: 03-260 శరణాగతి

పల్లవి: ఎటువంటి వెట్టినో యేమని విన్నివింతును
ఘటనలు నావంటా గర్వింతునయ్యా

చ. 1: తలఁచే తలఁపు నీది తనువు నీ విచ్చినది
నిలిచిన జగమెల్లా నీ మయము
వలవంత నే నిందులో వట్టియహంకారినై
తెలియక నేనేయంటాఁ దిరిగేనయ్యా

చ. 2: సేసేచేఁత నీయాజ్ఞ చిత్తమెల్లా నీయిచ్చ
రాసుల కర్మములు నీరపములివి
ఆసపడి నే నిందులో అన్నియు నావనుచును
పోసరించి మాయలలోఁ బొరలెదనయ్యా

చ. 3: ఇహము నీవినోదమే యెన్నఁ బరము నీసొమ్మే
సహజము నీకు మాలో చైతన్యాలు
మహిలో శ్రీవేంకటేశ మరి నీదాఁసుడనైతి
బహుభక్తి నీమీఁదఁ బచరించేనయ్యా

రేకు: 0246-02 లలిత సం: 03-261 భక్తి

పల్లవి: ఇందరు నెఱుఁగుదు రీయర్థయే భువి
కందువఁ దగులుట కర్మము కొలఁది

చ. 1: ఆదికి ననాది హరిదాస్యంబిది
వేదాంతంబుల వెలసినది
సోదించి కనిరి శుకనారదాదులు
పాదుగఁ నిఁకఁ దమ భాగ్యముకొలఁది

చ. 2: అతిరహస్యమిది అచ్యుతుపై భక్తి
ప్రతిలేని పరమపావనము
చతురులై తెలిసిరి సనకాది మునులు
తతి దొరకుట సుకృతఫలము కొలఁది

చ. 3: పరము శ్రీవేంకటపతి సంకీర్తన
సారిది గురుఁడొసఁగు సూక్ష్మమిది
చిరపుణ్యులు మును చేకొన్న నిజమిది
మరిగి మనుట తమ మనసుల కొలఁది

రేకు: 0246-03 హిందోళవసంతం సం: 03-262 శరణాగతి

పల్లవి: ఎన్నికై శ్రీవేంకటేశుఁ డితడు గలుగఁగానె
అన్నిటా నందరిలోని అజ్ఞానాలుఁ బాసెను

చ. 1: సకలశాస్త్రములందు సందేహమే కాని
వొకరు దైవమహిమ కొడఁబడరు
అకటా బాస చేసినయందుకైనా నమ్మరు
వికలచిత్తులెల్లాను విష్ణుదాస్యమునకు

చ. 2: గక్కనఁ గర్మము చేసి కడు నలయుటే కాని
వొక్కమాటు హరిఁ బాడ నొడఁబడరు
తక్కక పెద్దలుగాఁగ తల వణఁకుటే కాని
పుక్కటికాండ్లు హరిఁ బూజించనేరరు

చ. 3: చిత్తములో వివేకించి చింతఁ బొరలుటే కాని
వొత్తి హరిపై భార మొప్పగించరు
హత్తిన శ్రీవేంకటేశుఁ డటె దయ దలఁచఁగా
మత్తిలి ప్రపన్నులెల్లా మరేమిటాఁ దప్పరు

రేకు: 0246-04 దేసాళం సం: 03-263 అధ్యాత్మ

పల్లవి: వానివాని సహజము వద్దననేల
యీనేటి ప్రపంచ మది యేమి సేయఁగలదు

చ. 1: హరి పుట్టించినయట్టి ఆయాప్రకృతులను
విరసాలఁ దిప్పెమంటే వేరొకటౌనా
పరమజ్ఞాన మొక్కటే పాటించితేఁ జాలు
యెరవుల పుణ్య పాపాలేమి సేయఁగలవు

చ. 2: బలువుగ విష్ణు మాయఁ బ్రబలే సంసారమును
చలమున దిద్దఁబోతేఁ జక్కనౌనా
తెలివితో హరిభ క్తి తెగక వుండితేఁ జాలు
యిలపైఁ బంచేంద్రియములేమి సేయఁగలవు

చ. 3: శ్రీవేంకటేశుఁ డాత్మఁ జేకొని వుండినది
భావించకున్న నాతఁడు బడివాసీనా
సావధానాన నీతని శరణనుకొంటేఁ జాలు
యే విధులు భవములునేమి సేయఁగలవు

రేకు: 0246-05 రామక్రియ సం: 03-264 దశావతారములు

పల్లవి: నారాయణుఁడే సర్వనాయకుఁడు
వేరే దురాశలు వెదకఁ జోటేదయ్యా

చ. 1: ఆకస మొకపాదము అట్టె భూమొక పాదము
పైకొని యొకపాదము పాతాళము
యేకమైనాఁ డేడనున్నా యిందులో వారే జీవులు
ఆకడఁ బరులఁ గొల్చేమనఁ జోటేదయ్యా

చ. 2: కడుపులో జగములు కాయ మిన్నిటాధారము
యెడగలచోటనెల్లా యీతని మాయే
కడుఁబోరా దీతఁడే కారణ మందరికి
తడవి మరుపాయాలఁ దగులఁ జోటేదయ్యా

చ. 3: చేతన్య మీతనిది సృష్టి యీతనిఘటన
ఆతుమ శ్రీవేంకటేశుఁ డంతర్యామి
రాతిరిఁబగలుఁ దానే రక్షకుఁడు మనలకు
పోతరించి ఇఁక మెచ్చి పొగడఁ జోటేదయ్యా

రేకు: 0246-06 ఆహిరి సం: 03-265 వైరాగ్య చింత

పల్లవి: ఇంక నా దైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని
సంకె దీరఁ బులిసితి సర్వేశ్వరా

చ. 1: తపము సేసి నీ మాయ దాఁటేననుచుఁ బెనఁగి
అపుడే యలసితిని అదివో నేను
కృపఁ జూచి నీ వింక గెలిపించేదెట్టోకాని
వుపమల సరివోరి వోడితి నే వానికి

చ. 2: పంచేంద్రియములను పారఁదోలేనని చూచి
వంచఁగ సత్వలేక వసమైతిని
అంచె నాపాటు చూచి నీవడ్డమౌటెప్పుడోకాని
దించని బీరములాడి దిగితి నే వానికి

చ. 3: మోహాంధకారముపై మొనచూపేనని పోయి
సాహసము లేక నే జడిసితిని
వూహల శ్రీవేంకటేశ వున్నతి నన్నేలితివి
బాహుబలమున తుదిపదమయితి వానికి

రేకు: 0247-01 దేసాక్షి సం: 03-266 దశావతారములు

పల్లవి: నీదాసుల భంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా

చ. 1: పాలసముద్రముమీఁదఁ బవ్వళించినట్టి నీకు
బేలలై సురలు మొరవెట్టినయట్టు
వేళతో మా మనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా

చ. 2: ద్వారకానగరములో తగ నెత్తమాడే నీకు
బీరాన ద్రౌపది మొరవెట్టినయట్టు
ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి
యే రీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా

చ. 3: యెనసి వైకుంఠములో నిందిరఁ గూడున్న నీకు
పెనఁగి గజము మొరవెట్టినయట్టు
చనవుతో మా కోరికె సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా

రేకు: 0247-02 సామంతం సం: 03-267 శ్రీహరి పరివారము

పల్లవి: దాసవర్గముల కెల్లా దరిదాపు మీరె కాన
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును

చ. 1: సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా
శ్రీనాథునికి నేము సేసే విన్నపము
ఆనుక భాష్యకారులు అట్టే మీరుఁ జేయరాదా
మానక విన్నపము మా మనవి చనవులు

చ. 2: వేయినోళ్ల భోగి నీవు విన్నపము సేయరాదా
వేయేసి మా విన్నపాలు విష్ణునికిని
ఆయితమై గరుడఁడ అట్టే మీరుఁ జేయరాదా
యేయెడ విన్నపము మా కేమి వలసినాను

చ. 3: దేవులమ్మ యిందిర మాదిక్కై విన్నవించరాదా
శ్రీవేంకటపతికి చిత్తమందను
ఆవేళ శేషాచలమ అట్టే మీరుఁ జేయరాదా
యీవేళ మా విన్నపము లీడేరె నీఁకను

రేకు: 0247-03 లలిత సం: 03-268 అధ్యాత్మ

పల్లవి: ఒక్కఁడే యీ జీవుఁడు వొడలు మోపనినాఁడు
యెక్కడి కెక్కడి మాయ యేమి గట్టుకొనెనో

చ. 1: పొంచి గర్భమున మాసు పొదిగి వుండిననాఁడు
యెంచుకొని ముచ్చటాడ నెవ్వరున్నారు
అంచలఁ బరఁదు(?) కొనెయట్టి సంసారమిదియు
అంచుమోచి తానెందు అణఁగుండెనో

చ. 2: నిచ్చనిచ్చ రాతిరులు నిద్దురవోయేవేళ
యిచ్చలఁ దాఁ జేసే పనులేమున్నవి
కచ్చుపట్టి తన మేనఁ గాచుకున్నకర్మములు
యెచ్చుకుందుల నాచోట నెందు వోయనో

చ. 3: బుద్ధెరఁగక బాలుఁడై పొత్తులలోనున్నపుడు
కొద్దిలేక తా నెవ్వరి గురుతెరుఁగు
అద్దుక శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండి
తిద్దుక రాఁగానే కాక తెలివెందు నున్నదో

రేకు: 0247-04 కన్నడగౌళ సం: 03-269 శరణాగతి

పల్లవి: ఈయపరాధములు సహించవయ్యా
పాయక మమ్ము రక్షించేపని నీదే కాదా

చ. 1: ఆకడ నీకడ మాలో నంతర్యామివి నీవు
నీకుఁ జేసే విన్నపాలు నీవెరఁగవా
పైకొని వోరువలేక పదరితి మింతేకాక
రాకపోక నీవు మమ్ము రక్షించకుండేవా

చ. 2: ఱట్టు కెక్కి దాసుల మఱవక రక్షించే నీవు
గుట్టుతో మమ్ము వహించుకొనకుండేవా
పట్టలేక వేగిరించి పైపై దూరితిమిఁ గాక
ఇట్టే మాకీ సిరులు నీవిచ్చినవే యెపుడు

చ. 3: యిదె శ్రీవేంకటేశ మమ్మేలినవాఁడవు నీవు
వదలకుండ నీవు నావాఁడవే కావా
అదన మన్నించఁగానే ఆసఁజే చాఁచితిఁగాక
చెదరక నాఁడే నాకుఁ జేతిలోనివాఁడవు

రేకు: 0247-05 నారాయణి సం: 03-270 అంత్యప్రాస

పల్లవి: ఇందాఁకా వచ్చెఁ జేఁతలు యిఁకనో బుద్ధి
యెందుకు నీవే కర్తవు యిఁకనో బుద్ధి

చ. 1: పుట్టితి నీయాజ్ఞను భుజించితిఁ గర్మమెల్లా
ఇట్టె జీవుఁడ నాకు నిఁకనో బుద్ధి
కట్టుకొంటి సంసారము కలిగెఁ బంచేంద్రియాలు
యెట్టనెదిటి పనుల కిఁకనో బుద్ధి

చ. 2: వున్నాఁడ నీమాయలోనె వొట్టుకొంటి ఆసలెల్లా
యెన్నికె యీప్రాణికి నిఁకనో బుద్ధి
పన్నుకొంటి సంపదలు పంచభూతాల లోనైతి
యిన్నిటా నీపంపుననే యిఁకనో బుద్ధి

చ. 3: భూమిపై నన్నేలితివి భోగములకు గురైతి
యేమనేవు యీదేహి కిఁకనో బుద్ధి
శ్రీమంతుఁడ విన్నిటాను శ్రీవేంకటేశ్వర నీవు
యీమహిమలెల్లా నీవే యిఁకనో బుద్ధి

రేకు: 0247-06 పాడి సం: 03-271 దశావతారములు

పల్లవి: ఈతఁడు బలువుఁడౌట కివియే సాక్షి
యీతఁడు బ్రహ్మమౌట కీతఁడే సాక్షి

చ. 1: అమరుల మొరాలించి అసుర బాధలు మాన్పె
అమరుల కెక్కుడౌట కదియే సాక్షి
అమృతము పంచిపెట్టి యాదిలక్ష్మిఁ గైకొనె
అమృతమథనమే అన్నిటికి సాక్షి

చ. 2: యిందరుండే బ్రహ్మాండాలు యిదె కుక్షి నించుకొనె
యిందరి కెక్కుడగుట కిదియే సాక్షి
కందువ వరములిచ్చు కడ నెన్నఁడు జెడవు
కందువ పురాణాలలో కథలే సాక్షి

చ. 3: ఆది బ్రహ్మఁ బుట్టించె మఱ్ఱాకుమీఁదఁ దుదఁ దేలె
ఆదినంత్య మీతఁడౌట కదివో సాక్షి
పాదుగా శ్రీవేంకటాద్రిపై మహిమ వెదచల్లె
పాదుకొన్నయీతని శ్రీపాదములే సాక్షి

రేకు: 0248-01 ధన్నాసి సం: 03-272 భక్తి

పల్లవి: అంతరాత్మ నీ యాధీన మింతయు
చింతలు సిలుగులు జీవులకెల్లా

చ. 1: చిత్తంబనియెడి సింహాసనమది
పుత్తమ పురుష నీవుండెడిది
హత్తి యింద్రియములందుఁ బ్రధానులు
ప్రత్తెక్ష రాజ్యము ప్రకృతియుఁ గలిగె

చ. 2: కన్నులుఁ జెవులును ఘ్రాణము నాలికె
వన్నెమేను నీ వాహములు
పన్నిన కోర్కులు భండారంబులు
సన్నుతి సంసారసంపద గలిగె

చ. 3: పుట్టిన పుట్టుగు భోగపుకొటారు
పట్టము కర్మానుబంధంబు
గట్టిగ శ్రీవేంకటపతి వేలిక-
విట్టి నీ మహిమ లిన్నిటఁ గలిగె

రేకు: 0248-02 ముఖారి సం: 03-273 వైరాగ్య చింత

పల్లవి: మొదలే తెలియవలె మోసపోక మానవలె
పదిలపు యోగికైనా బ్రహ్మకైనాను

చ. 1: అలుగులపైఁ బడితే నాయాలు దాఁకకుండునా
కలికి సతుల చూపు కాఁడకుండునా
యిలఁ దోఁడుదొక్కితేను యెండించకుండునా(?)
చెలుల యిండ్లకుఁ బోతే చిక్కించకుండురా

చ. 2: చిచ్చు గాఁగిలించుకొంటే చిమిడించకుండునా
గచ్చుఁ బరస్త్రీలపొందు కాఁచకుండునా
తచ్చి విషము మింగితే తలకెక్కకుండునా
పచ్చి సతులవలపు భ్రమయించకుండునా

చ. 3: తెగి సముద్రము చొచ్చితే లోఁబడకుండునా
మొగి నింతులమాటలు ముంచకుండునా
తగు శ్రీవేంకటేశ్వరుదాఁసుడై గెలిచితేనే
పగటున నివియెల్లా బంపుసేయకుండునా

రేకు: 0248-03 నాట సం: 03-274 ఉత్సవ కీర్తనలు

పల్లవి: వీదివీది వాఁడేవాఁడే వీఁడేవీఁడే చెలఁగీని
ఆదిదేవుఁడు శ్రీవేంకటాద్రిమీఁదటను

చ. 1: గరుడధ్వజంబదె ఘనవిష్ణురథమదె
సరి శంఖచక్రములు శార్ఙ్గమునదె
హరి యందుమీఁదటను ఆయిత్తమై యున్నాఁడదె
అరులనెల్ల గెలిచి అమరులఁ గావను

చ. 2: సారథి యల్లవాఁడె చాలి రణభేరి యదె
ఆరయ నిరుమేలా బ్రహ్మాదులు వారే
పేరుకొన్న వేదముల బిరుదుపద్యములవె
శ్రీరమణుఁడు మెరసె చిక్కులు వాపఁగను

చ. 3: ఆటలుఁబాటలు నవె అచ్చరలేమలు వారె
చాటువ నలమేల్మంగ సంగడి నదె
యీటులేని శ్రీవేంకటేశుఁ డేఁగీ నల్లవాఁడె
కోటానఁగోటి దాసులకోరిక లీడేర్చను

రేకు: 0248-04 భైరవి సం: 03-275 శరణాగతి

పల్లవి: జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు
యీవల ధర్మపుణ్యములివివో నీచేతివి

చ. 1: పుట్టినయట్టి దోషాలు పురుషోత్తమా నీవు
పట్టి తెంచివేయక పాయనేరవు
గట్టిగా సంసారములోఁ గలిగిన లంపటాలు
ముట్టి నీ వల్లనేకాని మోయరావు

చ. 2: పంచభూత వికారాలు పరమాత్ముఁడా నీవే
కొంచక నీయాజ్ఞఁగాని కొద్ది నుండవు
అంచెల జగములోని ఆయా సహజములు
వంచుక నీవల్లఁగాని వైపుగావు

చ. 3: చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె
హత్తించి చూపినఁగాని యంకెకురాదు
సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె
నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను

రేకు: 0248-05 లలిత సం: 03-276 మనసా

పల్లవి: వెఱవకు మనసా విష్ణుని యభయము
నెఱవుగ నెదుటనె నిలిచినది

చ. 1: శ్రీపతి కరుణే జీవరాసులకు
దాపును దండై తగిలినది
పైపై దేవుని బలుసంకల్పమే
చేపట్టి రక్షించఁ జెలఁగేది

చ. 2: నలినోదరు నిజనామాంకితమే
యిలపై దాసుల నేలేది
కలిభంజను శంఖచక్రలాంఛన-
మలవడి శుభముల నందించేది

చ. 3: శ్రీవేంకటపతి సేసిన చేఁతలే
వేవేలు విధుల వెలసేది
భూవిభుఁ డీతఁడు పూఁచినమహిమలే
కైవశమై మముఁ గాచేవి

రేకు: 0248-06 బౌళి సం: 03-277 కృష్ణ

పల్లవి: కనియుఁ గానరు నీమహిమ కౌరవకంస జరాసంధాదులు
మనుజులు దనుజులఁ జంపిరనఁగ విని మరి నీశరణము చొరవలదా

చ. 1: పుక్కిటనే లోకములు చూపితి పూతకి చన్నటు దాగితివి
పక్కననే బండి దన్ని విరిచితివి బాలులు సేసేటి పనులివియా
అక్కరతో తృణావర్తు నణఁచితివి ఆఁబోతుల కీటణఁచితివి
చిక్కించి యనలము చేత మింగితి శిశువులు సేసేటి పనులివియా

చ. 2: తొడిఁబడ మద్దులుభువిపై గూలఁగదొబ్బియఘాసురుఁ జంపితివి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పడుచులు సేసేటి పనులివియా
అడరి బ్రహ్మమాయకుఁ బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగఁ గొట్టితి పిన్నలు సేసేటి పనులివియా

చ. 3: కాళింగుని మద మణఁచి దవ్వుగా కడగడలకుఁ బోఁజోఁపితివి
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గోవాళు సేసేటి పనులివియా
యీలీల శ్రీవేంకటాద్రిమీఁదనే యిందరికిని పొడచూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటి పనులివియా

రేకు: 0249-01 దేవగాంధారి సం: 03-278 అధ్యాత్మ

పల్లవి: ఎదుటనే వున్నవి యిన్నియును
యిది కైవసమగు టెన్నఁడో కాని

చ. 1: ఆకసమొకటే అల భూమొకటే
లోకములు పెక్కు లోలోనే
శ్రీకాంతుఁ డదివో చిత్తములోననె
యేకచిత్తమగు టెన్నఁడోకాని

చ. 2: యిరవగు కాలం బెప్పటి సహజమె
అరుదగు దినములు అనంతము
పరమాత్ముఁడు లోపల వెలుపల నిదె
యెరవుమాని చేరు టెన్నఁడోకాని

చ. 3: భావించఁగ నొకబ్రహ్మాండంబే
జీవరాసులే సేసలివే
శ్రీవేంకటేశుఁడు సృష్టించినవాఁడు
యీవిధిఁ గని మను టెన్నఁడో కాని

రేకు: 0249-02 ముఖారి సం: 03-279 భక్తి

పల్లవి: సులభపు మార్గములు చుట్టిరానే వుండఁగాను
బలు ప్రయాసపు కర్మబద్ధులైరి జీవులు

చ. 1: శ్రీపతిభక్తియనేటి చింతామణి వుండఁగాను
యేపున మోసపొయ్యేరు యేలో జీవులు
చేపట్టి నామాంకితపు సిద్ధరసము గలిగి
కోపుల నుడిగి పనిగొనరేలో జీవులు

చ. 2: అక్కడనే శరణాగతనే వోడ వుండఁగాను
యెక్కి భవవార్ధి దాఁటరేలో జీవులు
తక్కక దాస్యమనేటి ధనము దమకుండఁగా
లెక్కించి కూడపెట్టుకోలేరు యేలో జీవులు

చ. 3: అటె శ్రీవేంకటేశుఁ డంతరాత్మై వుండఁగాను
పట్టి కొలువరేలో పైపై జీవులు
పట్టపు హరిదాసులు ప్రత్యక్షమై వుండఁగాను
యిట్టే వారికృప చేరుటెన్నఁడో యీజీవులు

రేకు: 0249-03 శంకరాభరణం సం: 03-280 విష్ణు కీర్తనం

పల్లవి: ఆడరో పాడరో ఆనందించరో
వేడుక మొక్కరో విజ్ఞానులు

చ. 1: హరి రక్షకుఁడై యందరి కుండఁగ
పరగఁగ బదికేరు బ్రహ్మాదులు
గరిమ నతఁడే చక్రము చేఁబట్టగ
సురిగి పారిరదెం చూడుఁడు సురలు

చ. 2: పదిలపు విష్ణుడె ప్రాణమై యుండఁగ
యిదివో మెలఁగేరు యీజీవులు
మొదలను యితఁడే మూలమై యుండఁగ
పొదలె నీతని పంపున లోకములు

చ. 3: శ్రీవేంకటాద్రిని శ్రీపతి యుండఁగ
తావుల నిలిచెను ధర్మములు
యీవల నితఁడే యిచ్చేటి వరముల
పావనులైరిదే ప్రపన్నులు

రేకు: 0249-04 మాళవి సం: 03-281 దశావతారములు

పల్లవి: అందరికి సులభుఁడై అంతరాత్మ యున్నవాఁడు
యిందునే శేషగిరిని యిరవై విష్ణుఁడు

చ. 1: యోగీశ్వరుల మతినుండేటి దేవుఁడు క్షీర-
సాగరశాయియైన సర్వేశుఁడు
భాగవతాధీనుఁడై న పరమపురుషుఁడు
ఆగమోక్తవిధులందు నలరిన నిత్యుఁడు

చ. 2: వైకుంఠమందునున్న వనజనాభుఁడు పర-
మాకారమందునున్న ఆదిమూరితి
ఆకడ సూర్యకోట్లందునున్న పరంజ్యోతి
దాకొన బ్రహ్మాండాలు ధరించిన బ్రహ్మము

చ. 3: నిండువిశ్వరూపమై నిలిచిన మాధవుఁడు
దండి వేదాంతములు వెదకే ధనము
పండిన కర్మఫలము పాలికివచ్చిన రాసి
అండనే శ్రీవేంకటేశుఁడైన లోకబంధుఁడు

రేకు: 0249-05 సాళంగనాట సం: 03-282 శ్రీహరి పరివారము

పల్లవి: నమో నమో దానవవినాశ చక్రమా
సమరవిజయమైన సర్వేశు చక్రమా

చ. 1: అట్టే పదారుభుజాల నమరిన చక్రమా
పట్టినాయుధముల బలుచక్రమా
నెట్టన మూఁడుగన్నుల నిలిచిన చక్రమా
ఱట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా

చ. 2: ఆరయ నారుగోణాల నమరిన చక్రమా
ధారలు వేయిటితోడి తగు చక్రమా
ఆరక మీఁదికి వెళ్లే అగ్నిశిఖల చక్రమా
గారవాన నీ దాసులఁ గావవే చక్రమా

చ. 3: రవిచంద్రకోటితేజరాసియైన చక్రమా
దివిజసేవితమైన దివ్య చక్రమా
తవిలి శ్రీవేంకటేశు దక్షిణకర చక్రమా
యివల నీదాసులము యేలుకోవే చక్రమా

రేకు: 0249-06 వరాళి సం: 03-283 వైరాగ్య చింత

పల్లవి: హరిహరి నాబదుకు ఆశ్చర్యమాయ నాకు
శరణంటి నిన్నిటికి సెలవుగా నీకును

చ. 1: వున్నతి జలధిఁ గల వుప్పెల్లాఁ దింటిఁగాని
యెన్నిక సుజ్ఞానమింతా నేఱఁగనైతి
దిన్నగా భూమి వేరుగ దేహములెత్తితిఁగాని
పన్నిన నాభోగకాంక్షఁ బాయఁగలేనైతిని

చ. 2: నాలికఁ బేలితిఁ గాని నానాభాషలెల్లా
తాలిమి హరినామము దడవనైతి
నాలిసంసారము బ్రహ్మనాఁటనుండిఁ జేసేఁగాని
మేలిమి మోక్షముతోవ మెలఁగఁగనైతిని

చ. 3: వూరకే దినదినాల యుగాలు దొబ్బితిఁగాని
నేరిచి వివేకము నిలుపనైతి
మేరతో శ్రీవేంకటేశ మీరే దయఁజూడఁగాను
దారదప్ప కిట్టే మీదాఁసుడ నైతిని

రేకు: 0250-01 సామవరాళి సం: 03-284 వైష్ణవ భక్తి

పల్లవి: దైవమా నీ వెలితేది తమ వెలితేకాని
జీవుల(లు?) పట్టిన కొల్ల చేతిలోనే వున్నది

చ. 1: నిండినవి జగముల నీ నామము లనంతము-
లండఁ దలఁచేవార భాగ్యమే కాని
పండియున్నదిదె దేవభక్తి యెందు చూచినాను
దండితోడఁ బనిగొనే తమ నేర్పేకాని

చ. 2: మనసులలో నున్నది మరి నీపై జ్ఞానము
వొనరఁ దెలిసేవారి వోపికేకాని
ఘనమైన మున్నిటి నీ కథలెల్లా నున్నవి
విన నేరిచినవారి వివేకమే కాని

చ. 3: శ్రీవేంకటేశ మీ ముద్ర చెల్లుబడై వున్నది
వేవేగ ధరించేవారి వేడుకే కాని
తావుకొని చేరువ నీదాస్యమిట్టే వున్నది
భావించి నమ్మేటివారి పని యింతే కాని

రేకు: 0250-02 దేవగాంధారి సం: 03-285 విష్ణు కీర్తనం

పల్లవి: ఎన్నఁడొకో బుద్ధెరిఁగి యీడేరేది జంతువులు
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి

చ. 1: కావించి నీ పాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీ ప్రసాదతులసి నారువోశున్నది
వేవేలు పాతకాలెల్ల విదలించుమనుచు

చ. 2: చెంతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టె బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి
దొంతులైన భవముల తుద గనుమనుచు

చ. 3: అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి
బందెదీర నీకు మొక్కి బ్రదుకుమని
అందపు శ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ-
వెందు చూచిన విజ్ఞానమింద కొండో యనుచు

రేకు: 0250-03 బౌళి సం: 03-286 విష్ణు కీర్తనం

పల్లవి: మమ్ముఁ జూడ నేమున్నది మావంకనీకే లాభము
కమ్ముక దయదలఁచి కరుణింతుఁ గాక

చ. 1: శ్రీకాంతుఁడ నీపాదసేవకులయినవారు
పాకశాసనాదులను బ్రహ్మాదులు
పైకొని నరుఁడ నేను బంటఁగాఁగ నెంతవాఁడ
కైకొని నీపుణ్యానకుఁ గాచుటింతే కాక

చ. 2: నారాయణుఁడ నిన్ను నమ్మినట్టి దాసులు
నారదాది సనకసనందనాదులు
వీరిలో నేనెంతవాఁడ వికటపుజీవుఁడను
యీరీతి నీమూఁకఁ గూడ నేలుటింతే కాక

చ. 3: శ్రీవేంకటేశ నీపైచేరి భక్తిసేసేవారు
కావించి యనంతముఖ్య గరుడాదులు
దేవ నేనొక్క నీచుఁడ దీనరక్షకుఁడవు నీ-
వీవిధమెంచుక మమ్ము నీడేరింతుఁ గాక

రేకు: 0250-04 దేసాళం సం: 03-287 దశావతారములు

పల్లవి: కాదన్నవారికి వారికర్మమే సాక్షి
యేదెస చూచిన మాకు నీతఁడే సాక్షి

చ. 1: వేదాలు సత్యమౌటకు విష్ణుఁడు మత్స్యరూపమై
ఆదటఁ దెచ్చి నిలిపెనది సాక్షి
ఆదిఁ గర్మములు సత్యమౌటకు బ్రహ్మయఁగాన
పోదితో నీతఁడు యజ్ఞ భోక్తౌటే సాక్షి

చ. 2: అదె బ్రహ్మము సాకారమౌటకు పురుషసూక్తఁ
మెదుట విశ్వరూపము యిది సాక్షి
మొదలనుండి ప్రపంచమును తథ్యమగుటకు
పొదిగొన్న యాగములే భువిలో సాక్షి

చ. 3: బెరసి జీవేశ్వరుల భేదము గలుగుటకు
పొరి బ్రహ్మాదుల హరిపూజలే సాక్షి
యిరవై దాస్యాన మోక్షమిచ్చు నీతఁడనుటకు
వరమిచ్చే శ్రీవేంకటేశ్వరుఁడే సాక్షి

రేకు: 0250-05 దేసాక్షి సం: 03-288 వైరాగ్య చింత

పల్లవి: దాఁటలేను యీమాయ దైవమా నేను
నీటునఁ జేసేవాఁడవు నీవె నీవెకా

చ. 1: యీ మురికి దేహమేకా యెంతగాలమైన నేను
వోముకొంటా భువిమీఁద నుండఁగోరేది
దోమటినింద్రియాలేకా తోడునీడయై నన్ను
వేమరు భోగించఁజేసి వెనుబలమైనవి

చ. 2: పొంచిన నా కర్మమేకా పుట్టించి పుట్టించి
పంచల సంసారము పాలు సేసేది
అంచెల నీ చిత్తమేకా ఆసలాసలనుఁ దిప్పి
చంచుల నా కేపొద్దు చనవరియయ్యేది

చ. 3: చుట్టుకొన్న సంపదేకా సూటియైన నాఁటికి
జట్టిగొని లోలోనే చవి సేసేది
అట్టె శ్రీవేంకటేశ అంతరంగాన నీవెకా
పట్టుఁగొమ్మవై యుండఁగ బదికేది నేను

రేకు: 0250-06 శంకరాభరణం సం: 03-289 నామ సంకీర్తన

పల్లవి: ఇతరము లేదిఁక నెంచి చూచితేఁ
బ్రతివచ్చు నితఁడు ప్రత్యక్షమై

చ. 1: సకలలోకములు చర్చించి వెదకిన
వొకఁడేపో పురుషోత్తముఁడు
ప్రకటము బహురూపములయి నాతఁడు
అకుటిలమహిమల యనంతుఁడే

చ. 2: పర్వివ జీవుల భావించి చూచిన
సర్వాంతరాత్ముఁడు సర్వేశుఁడే
పుర్విని వెలుపలనుండిన యాతఁడు
నిర్వహించె నీ నీరజాక్షుఁడే

చ. 3: చన్నకాలమున మన్నకాలమున
నున్నవాఁడు యీవు పేంద్రుఁడే
కన్నులెదుట నిఁకఁ గల కాలంబును
అన్నిటా శ్రీవేంకటాధీశుఁడే

రేకు: 0251-01 ముఖారి సం: 03-290 వైరాగ్య చింత

పల్లవి: హేయము తన వాసనలేల మానును
చీ యన్న మానదిదే చెప్పరాని మాయ

చ. 1: జంగిలిమనుజునకు సరుఁస బాపమే చవి
అంగవించపలదంటే నగ్గలమౌను
ముంగిట నిల్లాలుండఁగ ముట్టగోరుఁ బరస్త్రీల
యెంగిలి కీరెండు సరే యిదివో మాయ

చ. 2: పరగిన జీవునికి పంచేంద్రియాలే సుఖము
ధర నెంత గాలమైన తనివి లేదు
సిరులు దనకుండినాఁ జేయిచాఁచుఁ బరులకు
యిరువు లెరఁగరాదు యిదివో మాయ

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యాత్మలో నుండఁగ
భావించు నితని కృప ఫలించునాఁడు
పూవువంటి సంసారము పొదుగుక వుండఁగాను
ఆవటించుఁ బుణ్యఫలాలదివో మాయ

రేకు: 0251-02 రామక్రియ సం: 03-291 వైష్ణవ భక్తి

పల్లవి: ఆతఁడు సేసే చేఁత లన్యులు సేయఁగలరా
జాతుల మనుజులెల్లా సతమయ్యేరా

చ. 1: దిక్కులేనివారికెల్లా దేవుఁ డొక్కఁడే దిక్కు
చిక్కినవారికినెల్లా శ్రీపతే గతి
తక్కిన అనాథులకు దైవమే రక్షకుఁడు
యెక్కడా నాతఁ డుండఁగా నేఁటి కిఁక చింత

చ. 2: బలిమి లేనివారికి పరమాత్ముఁడే బలిమి
కలిమి చాలనివారి కలిమి హరె
యిల నేరనివారికి నిందిరానాథుఁడే నేర్పు
వెలసీతనికే విన్నవించుటింతే కాక

చ. 3: పొందులేనివారికెల్లాఁ బురుషోత్తముఁడే పొందు
విందును వేడుకయు శ్రీవేంకటేశుఁడే
యెందరెందరుండినాను యీతఁడు గలఁడు మాకు
సందడి నాతఁడే అన్ని చక్కఁబెట్టీఁ బనులు

రేకు: 0251-03 సామంతం సం: 03-292 విష్ణు కీర్తనం

పల్లవి: ధ్రువ విభీషణాదులు సాక్షి
వివరపు జీవులు వెదకేదిది

చ. 1: దేవేంద్ర సంపద దిక్కుల కెక్కుడు
కావిరినది యొక కాలముది
తావున శ్రీహరిదాసుల సంపద
తేవల నెన్నఁడుఁ దీరనిది

చ. 2: బలువుగ నడచేటి బ్రహ్మపట్టమును
తొలు బ్రహ్మాండము తోడిది
జలజాక్షుని నిజశరణాగతి యిది
కలకాలమునకుఁ గాణాచి

చ. 3: వైకుంఠమున కివ్వలిలోకంబులు
రాకలపోకల రచనలవి
యీాకడ శ్రీవేంకటేశ్వరు సన్నిధి
పైకొని దొరకిన బ్రదికేదిది

రేకు: 0251-04 వరాళి సం: 03-293 అధ్యాత్మ

పల్లవి: బయలీఁ దించీ నదివో ప్రాణులను హరిమాయ
క్రియ దెలుసుకొనేటి కీలింతే కాని

చ. 1: పెక్కుపరుషులలోన బెరశొకసతి యుంటే
యిక్కువై యందే నాఁటు నిందరిచూపు
దక్కి యందరి కాఁగిళ్ల తరుణి యుండుట లేదు
గక్కన వట్టియాసలఁ గరఁగుటే కాని

చ. 2: చింతకాయ కజ్జాయము చేరి యిసుమంతవుంటే
అంతటనే నోరూరు నందరికిని
పొంతనే నాలుకలకు పులుసై యుండుటే లేదు
కొంత భావించి మింగేటి గుటుకలే కాని

చ. 3: శ్రీవేంకటేశుతేరు దీసేటి మనుజులెల్లాను
సేవగా నేమే తీసితిమందురు
ఆవల నాతఁడే తమ అంతరాత్మయైయుండి
కావించుట యెరఁగరు గర్వములే కాని

రేకు: 0251-05 పూర్వగౌళ సం: 03-294 విష్ణు కీర్తనం

పల్లవి: ఏమని చెప్పేనో కాక యిలఁగల శాస్త్రాలు
కామించి వాదించేవారి కడ మేదో

చ. 1: అంచెల జగములకు హరియే ఆధారము
యెంచఁగ నాధారము యితని కేదో
పొంచిన వేదార్థముల పురుషార్థ మీతఁడు
నించిన యర్థము యీతనికి నేదో

చ. 2: పొందిన ప్రాణులకెల్లా పుట్టుగైనాఁ డితఁడు
యెందును తనకుఁ బుట్టుగేఁక నేడో
చందపుఁ గర్మములకు సాధన మీదేవుఁడు
మందలించ సాధనము మరి తనకేదో

చ. 3: కలయన్ని మాయలకుఁ గారణ మీ మూరితి
తలపఁగ కారణము తనకేదో
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే సర్వసాక్షి
మలసి యీతని కిఁక మరి సాక్షి యేదో

రేకు: 0251-06 సామంతం సం: 03-295 అధ్యాత్మ శృంగారము

పల్లవి: ఎక్కడఁ గడచేరీ నరులు
తక్కులఁ బెట్టేరు తరుణులు భువిని

చ. 1: కన్నుల చూపులు గాలపు చిలుకులు
వెన్నెలనవ్వులే వెలితెరలు
మిన్నక పురుషామృగముల వేఁటలు
పన్నుక యాడేరు పడఁతులు భువిని

చ. 2: ముంచిన మాఁటలే మోహనఘంటలు
మంచియధరములే మచ్చులవి
మించిన పురుషామృగముల వేఁటలు
అంచెల నాడేరు అతివలు భువిని

చ. 3: కట్టువగట్లు కందువ కుచములు
పట్టు శ్రీవేంకటపతి మాయ
మెట్టుగ పురుషామృగముల వేఁటలు
నెట్టన నాడేరు నెలఁతలు భువిని

రేకు: 0252-01 మలహరిసం: 03-296 అధ్యాత్మ

పల్లవి: ఇన్నిటి మూలం బీశ్వరుఁ డాతని-
మన్నన కొలఁదినె మలయుటఁ గాక

చ. 1: మాయామయమై మనియెడి జగమిది
చాయల నిందు నిజము గలదా
కాయము సుఖదుఃఖములకుఁ బొత్తిది
రేయిఁబగలు నొకరీతే కలదా

చ. 2: దైవాధీనము తగు సంసారము
వావిరి జీవుల వసమవునా
ధావతి మనసిది తన కర్మమూలము
వేవేలై నా విడువఁగ వశమా

చ. 3: పంచేంద్రియములఁ బరగేటి బ్రదుకిది
చంచలంబు నిశ్చలమవునా
యెంచఁగ శ్రీవేంకటేశ్వరు కృపతో
సంచయమయితే సతమవుఁగాక

రేకు: 0252-02 ధన్నాసి సం: 03-297 నామ సంకీర్తన

పల్లవి: ఎందుకుఁ బనిగొందము యేమి సేతమివి యెల్లా
చెందిన మాకిఁక బుద్ధి చెప్పవే నారాయణా

చ. 1: హరినామ మొకటనే అణఁగెఁ బాపములు
వొరసి యన్నినామము లూరకున్నవి
సిరులిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామములెల్లా పెట్టెలలో నున్నవి

చ. 2: గోవిందనామ మొకటే కూడపోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా
శ్రీవిష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావైయున్న నామములు తమకించీ నీవికి

చ. 3: ఇత్తల కేశవునామ మియ్యఁగలవెల్లా నిచ్చె
పొత్తుల నామములెల్లాఁ బొంచుకున్నవి
చిత్తమున నిన్నుఁ జూపె శ్రీవేంకటేశ నామమే
హత్తిన నామములెల్లా నందులోనే వున్నవి

రేకు: 0252-03 భూపాళం సం: 03-298 ఆరగింపు

పల్లవి: వేఁకునఁ దిరుపళచ్చి విష్ణునికిఁ జేయరో
ఆఁకటి కొదగినట్టి ఆరగింపులు

చ. 1: అతి బ్రహ్మాండాలు గుక్షి నటు ధరించినయట్టి-
అతనికిఁ జేయరో ఆరగింపులు
ప్రతిలేని క్షీరాబ్ధిఁ బవళించి లేచినట్టి-
చతురునికిఁ జేయరో చవి నారగింపులు

చ. 2: యేడుదినములదాఁకా నెత్తెను గోవర్ధనము
ఆడివచ్చే బాలునికి నారగింపులు
మేడెపు గోపికలతో మిక్కిలిఁ బెనఁగినట్టి-
వేడుకకానికిఁ దేరో విందు లారగింపులు

చ. 3: పట్టపుదేవుళ్లుఁ దాను బంతి సాగి వున్నవాఁడు
అట్టె సేయరో పులుఁగ మారగింపులు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁ డారగించీని
మట్టులేక వడ్డించరో మంచి యారగింపులు

రేకు: 0252-04 దేసాక్షి సం: 03-299 ఆరగింపు

పల్లవి: ఏ పొద్దు చూచిన దేవుఁ డిటానే యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెను

చ. 1: మేరుమందరాలవలె మెరయు నిడ్డెనలు
సూరియచంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు
ఆరనిరాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసి వోసినట్లుండెను

చ. 2: పలు జలధులవంటి పైఁడివెండిగిన్నెలు
వెలిఁగొండలంతలేసి వెన్నముద్దలు
బలసిన చిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరు వెన్నెలరస మందిచ్చినట్లుండెను

చ. 3: పండిన పంటలవంటి పచ్చళ్ళుఁ గూరలును
వండి యలమేలుమంగ వడ్డించఁగా
అండనే శ్రీవేంకటేశుఁ డారగించీ మిగులఁగ
దండిగా దాసులకెల్లా దాఁచినట్లుండెను

రేకు: 0252-05 గుండక్రియ సం: 03-300 నృసింహ, రామ

పల్లవి: జయ జయ రామా సమరవిజయరామా
భయహర నిజభక్తపారీణ రామా

చ. 1: జలధి బంధించిన సౌమిత్రిరామా
సెలవిల్లు విరచిన సీతారామా
అల సుగ్రీవు నేలిన అయోధ్యరామా
కలిగి యజ్ఞము గాచే కౌసల్యరామా

చ. 2: అరి రావణాంతక ఆదిత్యకుల రామా
గురుమౌనులనుఁ గాచే కోదండరామా
ధర నహల్య పాలిటి దశరథరామా
హరురాణి నుతుల లోకాభిరామా

చ. 3: అతి ప్రతాపముల మాయామృగాంతక రామా
సుతకుశలవప్రియ సుగుణరామా
వితత మహిమల శ్రీవేంకటాద్రిరామా
మతిలోనఁ బాయని మనువంశరామా

రేకు: 0252-06 సాళంగనాట సం: 03-301 హనుమ

పల్లవి: మొక్కరో మొక్కరో వాఁడె ముందరనిలుచున్నాఁడు
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు

చ. 1: పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుఁడు
పట్టేను యెడమచేతి బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాశితలలు
కొట్టేననుచు నెత్తె గొప్ప వలకేలు

చ. 2: వంచెను శిరసుమీఁద వాలుగాఁ దన తోఁక
పెంచెను మిన్నులుమోవ పెనుదేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవడల
కాంచనపు పుట్టుకాశ కడు బిగిఇంచెను

చ. 3: పెనచి తొడలుదాఁక పెద్ద పదకము వేసె
తనువుపై వేలాడే దండల తోడ
అనయము శ్రీవేంకటాద్రిదేవుని బంటు
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను

రేకు: 0253-01 గుండక్రియ సం: 03-302 హనుమ

పల్లవి: ఘనుఁడాతఁడా యితఁడు కలశాపురము కాడ
హనుమంతుఁ డితఁడా అంజనాతనయుఁడు

చ. 1: పెడచేత లోచేత బెరసి కొందరిఁ గొట్టె
అడరి దానవుల హనుమంతుఁడు
బెడిదంపుఁ బెనుదోఁక బిరబిరఁ దిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు

చ. 2: దాకాల మోఁకాలఁ దాటించెఁ గొందరి
ఆకాశవీధినుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడఁదాఁకెఁ గొందరి
ఆకడ జలధిలోని హనుమంతుఁడు

చ. 3: అరుపుల నూరుపుల నందరిఁ బారఁగఁ దోలె
ఔరా సంజీవికొండ హనుమంతుఁడు
మేరతో శ్రీవేంకటాద్రిమీఁది దేవుని బంటు
ఆరితేరిన బిరుదు హనుమంతుఁడు

రేకు: 0253-02 బౌళి సం: 03-303 అధ్యాత్మ, గురు వందన

పల్లవి: హరి దగ్గరనే వున్నాఁ డందాఁకాఁ బారనీదు
కురచలోనే మగుడు గోవిందు మాయ

చ. 1: చెనకి పంచేంద్రియపు చెరువు లైదింటికి
మనసనెడి దొకటి మహా ప్రవాహము
దినముఁ బారుచునుండు దిగువకు వెళ్లలేదు
తనలోనే తానిగురు దైవమాయ

చ. 2: తూలని పంచభూతాల తోఁట లైదింటికి
కాలమనియెడి దొక్కకాలువ వారుచునుండు
నేలాఁ దడియదు నీరూఁ దివియదు
తోలుఁదిత్తికే కొలఁది దొరకొన్న మాయ

చ. 3: ముట్టి పంచప్రాణముల మొలక లైదింటికి
పుట్టుగులనియేటి యేరు పొదలి పారుచునుండు
చెట్టుచెట్టుకే కొలఁది శ్రీవేంకటేశ్వరుఁడు
నట్టనడుమ నున్నాఁడు నాననీదు మాయ

రేకు: 0253-03 పాడి సం: 03-304 రామ

పల్లవి: రామభద్ర రఘువీర రవివంశతిలక నీ-
నామమే కామధేనువు నమో నమో

చ. 1: కౌసల్యానందవర్ధన ఘన దశరథసుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క(క్కు?)కోదండరచన విద్యాగురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా

చ. 2: మారీచసుబాహుమర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్యరత్నాకర కాకాసురవరద
సారెకు వేదవిదులు జయ వెట్టేరయ్యా

చ. 3: సీతారమణ రాజ శేఖరశిరోమణి
భూతలపు టయోధ్యాపురనిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవ
ఘాత నీ ప్రతాపమెల్లాఁ గడు నిండెనయ్యా

రేకు: 0253-04 బౌళి సం: 03-305 అధ్యాత్మ

పల్లవి: ఎట్టు వలసినాఁ జేయు మేమీ ననసేరమయ్య
వొట్టిన నామనసు నీకొప్పన సుమ్మయ్యా

చ. 1: అదిగో శ్రీహరి నీ వంపిన యింద్రియాలకు
చెదరక నేము పంపు సేతుమయ్యా
వెదకి యాసలకెల్లా వెట్టియుఁ జేతుమయ్య
మదిమది నే నీ మాయకు లోనయ్యా

చ. 2: దేవ నీవిచ్చినయట్టి దేహపుటూరిలోన
చేవమీరఁ గాఁపురము సేసేమయ్య
ఆవల నీ కర్మముల కప్పనము నత్తుమయ్య
ఆవటించి కామాదుల కాన మీరమయ్యా

చ. 3: నిన్నుఁ దలచుటకంటే నీవుచెప్పిన పనులే
యెన్నికఁ జేసినదే యెక్కుడయ్యా
అన్నిటా శ్రీవేంకటేశ ఆత్మలో నున్నాఁడవు
విన్నపములేల యిది విడువమయ్యా

రేకు: 0253-05 గుజ్జరి సం: 03-306 వైరాగ్య చింత

పల్లవి: ఇతని మఱచితిమి యెదుటనే యుండఁగ యిన్నాళ్లును నే మెరఁగక
ప్రతిలేదితనికి జీవకోట్లకుఁ బ్రాణబంధుఁ డితఁడు

చ. 1: ముందు నేను ఘనగర్భనరకమున మునిఁగియున్ననాఁడు
బొందితోడనే సుఖదుఃఖంబులఁ బొరయు తోడునీడితఁడు
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడఁ దా వెనువెంటనే
చందపు నాయాతుమలోఁ బాయని సర్వాత్మకుఁ డితడే

చ. 2: ఆని పట్టి నేఁ బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు
మానుపనొల్లఁడు తాఁ బెరరేచును మతి కనుకూలం బితఁడు
నానావిధులనుఁ బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు
తానును ఆపరిణామంబులకు తగులైవుండును యీతఁడు

చ. 3: తలఁచిన దగ్గరుఁ దడవక యుండిన దవ్వయివుండు నితఁడు
కలసి మెలసి ఇహపరము లొసంగఁగఁ గాచుకవుండును యీతఁడు
మెలఁగుచు సాకారముతో నున్నాఁడు మేటిశ్రీవేంకటపతి యీతఁడు
వలసిన వావులరూపులు దాల్చినవాఁ డొకఁడేపో యీతఁడు

రేకు: 0253-06 గుండక్రియ సం: 03-307 విష్ణు కీర్తనం

పల్లవి: కడనుండి రావు కానివి నైనవి
పుడుగని దయ నీ దొకటే కలది

చ. 1: హరి నీ చక్రంబంటిన యపుడే
సారిది నసురలే సురలైరి
నిరతపు చీఁకటినిండిన మింటను
వెరవున రవిచే వెలుఁగైనట్లు

చ. 2: తతి నీ నామము దలఁచినవారిఁ
అతిపాపమె పుణ్యంబాయ
గతియై పరుసముఁ గదిసిన లోహమె
ప్రతిలేక ధరణిఁ బసిఁడియైనట్లు

చ. 3: కొంకక నిను నిటు గొలిచిన మనుజులె
అంకెల శుకాదులైనారు
యింకను శ్రీవేంకటేశ నీజగము (?)-
సంకల్పమే మోక్షంబై నిలిచె

రేకు: 0254-01 లలిత సం: 03-308 అధ్యాత్మ

పల్లవి: ఇవ్వల వెదకితేనే యేమి లేదు
అవ్వలికి దాఁటి మీరు అందుకోరో శుభము

చ. 1: కనురెప్పల తుదలఁ గట్టువడెఁ గాలము
ఘనమై చేతులతుదఁ గర్మమున్నది
మనసు కొట్టఁగొనన్ మరి దైవమున్నాఁడు
చెనకి యిఁక నెన్నఁడు సేయరో పుణ్యములు

చ. 2: కనకము దాఁటితేనే ఘన సుఖమున్నది
వెనక చీఁకటికొన వెలుఁగున్నది
వనితల అవ్వలనే వరవిజ్ఞాన మున్నది
పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు

చ. 3: కాయము కొట్టఁగొనన్ ఘన వైకుంఠమున్నది
బాయట శ్రీవేంకటపతి వున్నాఁడు
మాయలకొనలనెల్లా మనము నున్నారము
పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు

రేకు: 0254-02 దేసాళం సం: 03-309 శరణాగతి

పల్లవి: ఇంతగా మన్నించి నన్ను నేలుకొంటి విలలోన
వింతగా నెవ్వరినిఁక వేఁడఁబొయ్యేనయ్యా

చ. 1: కలవారిలోన నీవు గలవాఁడవని నేను
కలసి లేనివారిలో కర్మములేనివాఁడను
బలువులలో నీ దాస్యబలవంతుఁడ నేను
యెలమి మాకిఁకఁ జూడనేమి గడమయ్యా

చ. 2: నెమ్మది లోనివారిలో నీకుక్షి లోపలివాఁడ
నమ్మని వెలివారిలో నాస్తికుల వెలివాఁడ
పమ్మి పదస్థులలోన పరమపదమువాఁడ
ఇమ్మని నిన్నడిగేది ఇఁక నేఁటిదయ్యా

చ. 3: ధర్మపువారిలో నీ దయాధర్మపువాఁడ
మర్మపువారిలో నీమాయలమర్మమువాఁడ
అర్మిలి శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
నిర్మించినవాఁడ నేను నెలకొంటినయ్యా

రేకు: 0254-03 గుండక్రియ సం: 03-310 గురు వందన, నృసింహ

పల్లవి: అందాఁకా వైష్ణవ మటకటకే
నిందకుఁ బాసిన నిర్మలుఁ డగును

చ. 1: పాపపురాసులు పరిహరమైతే
దీపించు హరిభక్తి వొడమును
చేపట్టి పుణ్యము చేరువలయితే
శ్రీపతిదాసుల సేవే దొరకు

చ. 2: కొట్టఁగొనకు మతి గోరి పారితే
జట్టిగ హరికథ చవిగలుగు
పట్టిన జన్మము పావనమైతే
మట్టులేని తిరుమంత్రము దొరకు

చ. 3: గురుకటాక్ష మొకకొంత సోఁకితే
శరణాగతి నిశ్చల మవును
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితే
పరమపదమునకుఁ బాత్రుండవును

రేకు: 0254-04 ఆహిరి సం: 03-311 గురు వందన, శరణాగతి

పల్లవి: సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను నీ-
గా(కా?)యగంటివాఁడ నేను గతిచూపవయ్యా

చ. 1: శరణాగతులఁ గూడి జ్ఞానము దొంగిలినాఁడ
అరిది నీ కర్మపుటానాజ్ఞలు మీరినవాఁడ
సరిఁ బ్రపంచకులముజాడ వాసినవాఁడ
ధరణి నీతప్పులకు దండన యేదయ్యా

చ. 2: బహుసంసారములెల్లఁ బంచలఁ దోసినవాఁడ
సహజపింద్రియముల జారినవాఁడ
మహి నాపుట్టుగులకే మరి బొమ్మఁబెట్టినాఁడ
విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా

చ. 3: గురుమంత్రమునకుఁ గొండెము చెప్పినవాఁడ
పరకాంతఁగూడే లోకభయము మానినవాఁడ
సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ నిన్ను
మరిగి శరణంటిని మన్నించవయ్యా

రేకు: 0254-05 గుండక్రియ సం: 03-312 విష్ణు కీర్తనం

పల్లవి: ఇదిగా దదిగా దిన్నియు నింతే
పదిఁబది హరి నీపదమే నిజము

చ. 1: సురలును నసురలు చూపట్టు రాజులు
అరసి కనక(ఁగ?) గతమగువారె
సిరుల వీరిఁ గొలిచెదమంటే మఱి
కెరలి పరుల రక్షింపఁగఁగలరా

చ. 2: పదునాలుగవది బ్రహ్మలోకమును
కదిసి నీరుమునుకల పాలము
చెదరక యిఁకఁ దముఁ జేరినవారల
వుదుటున నిముడుక వుండఁగఁగలరా (దా?)

చ. 3: అచ్చుతుఁడవు నీయచ్యుతపద మది
యిచ్చట శ్రీవేంకటేశుఁడవు
చొచ్చిరి నీశరణు శుకసనకాదులు
మచ్చిక నిదిగని మరిగితిమయ్యా

రేకు: 0254-06 వరాళి సం: 03-313 వైరాగ్య చింత

పల్లవి: పెట్టిన దైవ మెరుఁగు బీరకాయలోని చిక్కు
దిట్ట కూళప్రాణులమై తిరుగుతఁ గాకా

చ. 1: కాయము మోచి పుట్టి కర్మమున కొడిగట్టి
రోయఁబోతే మేనిలోని రోఁత వోయీనా
పాయపువలఁ దగిలి పాపపుణ్యములఁ జిక్కి
తీయఁబోతే వచ్చునా తెగరాని బంధము

చ. 2: జగములోఁ గటువడి సంసారదుఃఖమంది
నగఁబోతేఁ గొంతైనా నవ్వు వచ్చీనా
చిగురుటాసఁ దగిలి చింతాజలధిఁ బడి
యెగదిగఁ జూడఁబోతే యెందుకు నెక్కినది

చ. 3: పరమాత్ము మతిఁ గని భవములెల్లఁ గడచి
ధరణి మాయలతోడి తగులున్నదా
సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ్వరుని
మరిగి కొల్చిన మాకు మరి చింతలేలా

రేకు: 0255-01 లలిత సం: 03-314 కృష్ణ

పల్లవి: ఏల వెట్టిసేయించే విందున నీకేమివచ్చె
కాలముఁ గర్మముచేతఁ గప్పేవు లోకులను

చ. 1: బద్దుల మాటలాడి భ్రమయించి రేపల్లెలో
ముద్దులు చూప వెన్నలు ముచ్చిలినట్టు
కొద్దిమాలిన కర్మము కొంత మాకు గడియించి
వద్ద నిన్నుఁ గానివాని(?) వలె దాఁగవలెనా

చ. 2: మఱి పాండవులకు నెమ్మది వావులటు చెప్పి
మొఱఁగి యిందరిలోన మొక్కినయట్టు
కుఱకుఱ దైవాలఁ గొందరను గడియించి
యెఱిఁగి నెఱఁగనట్టే యేమి సేసేవయ్యా

చ. 3: వరమడుగఁగఁ బోయి వడి ఘంటాకర్ణునికి
యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు
తిరమై శ్రీవేంకటాద్రిఁ దిరువారాధన గొని
వరుస నీదాసులకు వరమిచ్చేవయ్యా

రేకు: 0255-02 ధన్నాసి సం: 03-315 నామ సంకీర్తన

పల్లవి: తగు మునులు ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మము దెగదా

చ. 1: ధరణీధర మందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁగాచితి కాకముఁ గాచితి నీ-
కరుణకుఁ బాత్రము గలదిదియా

చ. 2: భవహర మురహర భక్తపాపహర
భువనభారహర పురహరా
కవిసిన పురుతను గద్దను మెచ్చితి-
వివల నీదయకు నివియా గురుతు

చ. 3: శ్రీవేంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవుల నేలితి కోఁతుల నేలితి
పావనపుఁ గృపకుఁ బాత్రము లివియా

రేకు: 0255-03 శంకరాభరణం సం: 03-316 కృష్ణ

పల్లవి: ఎవ్వరుఁ గాననివాఁడు యశోద గనెనట్టె
పవ్వళించే బ్రహ్మతండ్రి బాలుఁడయ్యె నట్టె

చ. 1: ఘనయోగీంద్రుల మతిఁ గట్టువడనట్టివాఁడు
పనిలేక రోలఁ గట్టువడినాఁడట్టె
తనియ సురలకు పాదము చూపనట్టివాఁడు
మొనసి బండిమీఁద మోపినాఁ డట్టె

చ. 2: అమృతము చేతఁ దచ్చి అందరికిచ్చినవాఁడు
తమితో వెన్న దొంగిలెఁ దానె యట్టె
గుమురై దేవదానవకోటికిఁ జిక్కనివాఁడు
భ్రమసి గోపికల పాలఁ జిక్కినాఁ డట్టె

చ. 3: యిందుఁ గలఁ డిందులేఁడనెంచి చూపరానివాఁడు
అందమై రేపల్లెవాడ నాడీనట్టె
అంది కృష్ణావతారమయినట్టి దేవుఁడే
యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచెనట్టె

రేకు: 0255-04 రామక్రియ సం: 03-317 వైరాగ్య చింత

పల్లవి: పెరిగి పెద్దఁ గాను మరి పిన్నవాఁడఁ గాను
యిరవుగ నే బుద్ధెరిఁగెడి దెపుడు

చ. 1: కంకిగ బహునరకంబులు చొచ్చితి-
నింకా భయమది యెరఁగను
జంకెనలనే పలుచదువులు చదివితి
మంకుఁదనం బిది మానదు

చ. 2: తియ్యక కడుఁ బెనుదేహాలు మోచితి-
నయ్యో యింకా నలయను
నెయ్యపు హేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గాఁ బడను

చ. 3: ధర్మము సేసితి దానము లొసఁగితి
కర్మములింకాఁ గడవను
అర్మిలి శ్రీవేంకటాధిప నీకృప
నిర్మలమైతిని నే నిపుడు

రేకు: 0255-05 బౌళి సం: 03-318 అధ్యాత్మ

పల్లవి: కన్నదేఁటిదో విన్నదేఁటిదో కాఁగలదిఁక నేదో
నన్నుం గానను నిన్నుం గానను నడుము బట్టబయలు

చ. 1: నీమాయమహిమో నే నేరని కడమో
భూమిలోన నీవున్నాఁడవు నా పుట్టుగులుఁ గలవు
యేమి గాఁగలనో యింకా మీఁదట నిటకతొల్లి యేమైతినో
సోమార్కుల వుదయాస్తమయంబులు చూచుచునున్నాఁడను నేను

చ. 2: జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో
నీనామంబులు అనంతకోట్లు నిలుకడగాఁ గాను
కానఁగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో
కానరాని యీ ముక్కున నూర్పులు కాలముఁ గొలచేటి కుంచములు

చ. 3: నీకు నీవే నను దయ దలఁచితివో నేనాచార్యునినమ్మితినో
కైకొని నాయంతర్యామివి నినుఁ గంటినిపుడే నేను
శ్రీకాంతుఁడవో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు

రేకు: 0255-06 దేసాక్షి సం: 03-319 కృష్ణ

పల్లవి: కానరు నాలుగు కరములవానిని
శ్రీనాథుండని చేరఁగవలదా

చ. 1: ఘనచక్రముతో గరుడనినెక్కుక
కినిసి మెరయు నలకృష్ణునిని
ఘనులై ఇప్పటికాలపు మనుజులు
మునుప విష్ణుఁడని మొక్కఁగవలదా

చ. 2: పలుదేవతలకు భయములు మాన్పుచు
అల విశ్వరూపమైనపుడు
చలము మాని యచ్చటికౌరవులును
తెలిసి దేవుఁడని కొలువఁగవలదా

చ. 3: చెప్పిన యితఁడే శ్రీవేంకటమున
యెప్పుడు వరములు ఇయ్యఁగను
తప్పక యీతని దాసులవలెనే
యిప్పటివారలె యెరఁగఁగవలదా

రేకు: 0256-01 బౌళి సం: 03-320 భక్తి

పల్లవి: నిండుమనసే నీ పూజ
అండఁ గోరకుండుటదియు నీపూజ

చ. 1: యిందు హరి గలఁడందు లేఁడనేటి-
నిందకుఁ బాయుటే నీపూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే-
అందదుకు మానుటదియే నీపూజ

చ. 2: తిట్టులు గొన్నని దీవెనె గొంతని
నెట్టుకోనిదే నీపూజ
పెట్టిన బంగారుపెంకును నినుమును
అట్టే సరి యనుటదియు నీపూజ

చ. 3: సర్వము నీవని స్వతంత్రముడిగి
నిర్వహించుటే నీపూజ
పర్వి శ్రీవేంకటపతి నీదాసుల-
పూర్వమనియెడి బుద్ధి నీ పూజ

రేకు: 0256-02 రామక్రియ సం: 03-321 విష్ణు కీర్తనం

పల్లవి: పలుదెరువులు నీకుఁ బాటించఁజెల్లును
వొలిసి మీదాసులవుటొక్కటే మాతెరువు

చ. 1: హరి నీకు జీవరాసులందరును సరియే
సురల కెక్కుడు నీవు చూడ మాకైతే
యిరవులు గలవు నీ కెక్కడ చూచినను
అరిది నీ శ్రీపాదాలందె మాయిరవు

చ. 2: నందగోపాదులకెల్ల నందనుఁడవు నీవు
యిందరికిఁ దండ్రివి మా కిటు నీవైతే
అందిన శబరివిందు అఖిలభాగ్యము నీకు
చిందిన నీ పస్రాదమే సిరులిచ్చె మాకును

చ. 3: అచ్చుగ మునులు రు(ఋ?)షులందరును నీబంట్లే
తచ్చిన యేలికలు నీదాసులు మాకు
యిచ్చల శ్రీవేంకటేశ యిహపరమెల్లా నీవు
చొచ్చితిమి నీమరఁగు సూదివెంట దారమై

రేకు: 0256-03 శుద్ధవసంతం సం: 03-322 భక్తి

పల్లవి: భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తి చూచిన నిజంబొక్కటే లేదు

చ. 1: కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమే రేఁచు
తలఁపెంత పెంచినాఁ దగిలించు కోరికలు
యెలమి విజ్ఞానంబు యేమిటా లేదు

చ. 2: ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ జక్కందనంబు మోహములు రేఁచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బైపై మదము
యెనయఁగఁ బరమపద మించుకయు లేదు

చ. 3: తరుణు లెందరుఅయిన తాపములు సమకూడు
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లిఁకలేవు

రేకు: 0256-04 లలిత సం: 03-323 వైరాగ్య చింత

పల్లవి: ఇంతగాలమాయ నన్ను యేమీ నన్నవారు లేరు
చింత సంసారపుమాయఁ జిక్కించనే కాని

చ. 1: యెందరు బ్రహ్మలో నన్నుయిటు పుట్టించినవారు
యెందరు యములో హరియించినవారు
యిందుకు నందుకేకాని యిల నేఁ జేసిన పాప-
మంది వహించుక కాచినట్టివారు లేరు

చ. 2: తల్లిదండ్రులెందరో తనువు వెంచినవారు
కొల్లగా సతులెందరో కూడినవారు
చిల్లర పనికే కాని చేరఁబిలిచి వైకుంఠ-
ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు

చ. 3: కాలమును వీటిఁబోయె కర్మమునుఁ దెగదాయ
మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను
అలించి శ్రీవేంకటేశ అంతరాత్మవై నన్ను-
నేలితివి యింతపని కెవ్వరును లేరు

రేకు: 0256-05 సాళంగనాట సం: 03-324 వైరాగ్య చింత

పల్లవి: పంచేంద్రియములనే పట్టణ స్వాములాల
తెంచి బేరమాడుకొని దించరో బరవు

చ. 1: తగిన సంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపు టోడబేహారివాఁడ
జగతిఁ బుణ్యపాపపు సరకులు దెచ్చినాఁడ
దిగిితి బూతురేవునఁ దీరుచరో సుంకము

చ. 2: అడరి గుణత్రయములనేటి తెడ్డుల చేత
నడుమ నిన్నాళ్ళదాఁకా నడపినాడ
కడుఁజంచలములనే గాలిచాప లెత్తినాఁడ
వెడమాయపు సరకు వెలకియ్యరో

చ. 3: ఆతుమయనేటి కంభ మంతరాత్మఁ డెక్కియుండి
నీతితో మమ్ముఁగాచుక నిలుచున్నాఁడు
ఆతఁడే శ్రీవేంకటేశుఁ డటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణ మియ్యరో

రేకు: 0256-06 పాడి సం: 03-325 వైరాగ్య చింత

పల్లవి: ఏడే జేనలు యీదేహంబును
యేడా నీఁకమరి యెరఁగము నేము

చ. 1: నిండును జలధులు నిమిషమాత్రమున
నిండియు నిండదు నెఱి మనసు
పండును భువిఁగల పంటలన్నియును
పండదు నాలోఁ బాపపు మనసు

చ. 2: పట్టవచ్చు నల పారేటి పామును
పట్టరాదు నాపాయము
అట్టే ఆరును అనలము నీటను
యెట్టైన నారదు యీకోపంబు

చ. 3: కానవచ్చు నదె ఘనపాతాళము
కానరాదు నాకాలము
శ్రీనగవిహార శ్రీవేంకటేశ్వర
సోనలఁ బుట్టిన సుద్దులు నివిగో

రేకు: 0257-01 సాళంగనాట సం: 03-326 కృష్ణ

పల్లవి: ఎక్కడిది వివేకమెంతవారికినియిన్నియునీమాయఁదోయకలేదు
పక్కన అజ్ఞానపుజీవుల యీపాప మిట్లనే వుండఁగను

చ. 1: విచ్చనవిడి నటు కౌరవులెదుటను విశ్వరూపు చూపినయపుడు
యిచ్చల నిను నమ్మఁగలేకేకా యింద్రజాలమనిరి
తచ్చన నిప్పటి నాస్తికజనులును తగు నీ సాకారము చూచి
నిచ్చలుఁ గల్లని నిరాకారము నిజమని తర్కించక మానుదురా

చ. 2: గరుడవాహనము శంఖచక్రములు కనియుండియు ద్వాపరజనులు
ధరలో నిను హరిమూర్తని తెలియక తమయాదవుఁడొకఁ డితఁడనిరి
సరుస దేవతాంతరములఁ గొలిచేటి చంచలచిత్తులు ఇఁక నిన్నే
పరదైవం బననేరరు సరిగా బ్రహ్మాదులలో నొకఁడవందురు

చ. 3: యెఱిఁగిన దాసులు యెఱుఁగుదురు నీ వెక్కుడనుచు యేకాలమును
యెఱఁగని పామరు లెఱఁగరు నిను మతినెంతైనా నాఁడు నేఁడును
తఱితో శ్రీవేంకటేశ్వర నినుఁ గని తగు శరణాగతులున్నట్లు
మఱుఁగుననుండిన ప్రాకృతులకు నీమహిమలుగానఁగఁదరమవునా

రేకు: 0257-02 లలిత సం: 03-327 వైరాగ్య చింత

పల్లవి: పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ గాననైతి
యెట్టు గాచేవయ్య నన్ను యిందిరానాథా

చ. 1: కామినులఁ జూచిచూచి కన్నులఁ గొంతపాపము
వేమరు నిందలు విని వీనులఁ గొంతపాపము
నాముపారఁ గల్లలాడి నాలికఁ గొంతపాపము
గోమునఁ బాపము మేనఁ గుప్పలాయ నివిగో

చ. 2: కానిచోట్లకు నేఁగి కాఁగిళ్ళఁ గొంతపాపము
సేన దానాలందుకొని చేతులఁ గొంతపాపము
మానని కోపమే పెంచి మతిఁ గొంతపాపము
పూని పాపములే నాలోఁ బోగులాయ నివిగో

చ. 3: చేసినట్టివాఁడఁగాన చెప్ప నీకుఁ జోటులేదు
దాఁసుడ నే నైతిఁ గొన దయ దలఁచితివయ్య
యీసరవులెల్లఁ జూచి యేమని నుతింతు నిన్ను
ఆసల శ్రీవేంకటేశ ఆయఁబోయఁ బనులు

రేకు: 0257-03 వరాళి సం: 03-328 వైరాగ్య చింత

పల్లవి: కలిమిలేములెల్లా కాలము స్వభావము
తలఁపులో జ్ఞానము దక్కెడి దొకటే

చ. 1: పుట్టుగులు జీవునికి పూఁచిన స్వభావము
వొట్టి యిదె సారెసారె వోమనేలా
పట్టి నానాఁటి బ్రదుకు ప్రపంచము స్వభావము
కొట్టగొన హరిముక్తి గోరెటిదొకటే

చ. 2: మక్కువ సంసారము మాయలస్వభావము
చిక్కి కన్నవారికెల్లా మొక్కుకోనేలా
తక్కక రక్షించేది దైవము స్వభావము
నిక్కపు వై రాగ్యము నిలుచుట వొకటే

చ. 3: కప్పిన భోగములెల్లా కర్మము స్వభావము
తప్పక ప్రియము చెప్పే దైన్యమేలా
యెప్పుడు శ్రీవేంకటేశ యెదలో నాకుఁ గలవు
చప్పుడుసేయక నీకు శరణనే దొకటే

రేకు: 0257-04 కన్నడగౌళ సం: 03-329 వైరాగ్య చింత

పల్లవి: ఏమి సేయఁగల యెంతాశకుఁడను
తామసపు మనసు తనియదు నాకు

చ. 1: యిలలోపల నూరేండ్లబ్రదుకే
కలవుద్యోగము కల్పాంతంబులు
నిలిచినవాఁడను నేనొక్కఁడనే
పలుసంసారము బండ్లకొలఁది

చ. 2: ఆరయఁ బట్టెడు అన్నమువాఁడను
కోరిన కోర్కులు కోటానఁగోట్లు
నారవంటిదే నల్లెఁడు నాలుక
తీరవు రుచులివె తెప్పలకొలఁది

చ. 3: నిరతరతిసుఖము నిమిషములోనిదే
విరహపు వెదలు వేవేలు
యిరవుగ శ్రీవేంకటేశ నీమఱఁగు
చొరఁగా నాకివి సులభములాయ

రేకు: 0257-05 లలిత సం: 03-330 శరణాగతి

పల్లవి: ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరివీకులై
నవ్వుచు నీ శరణంటి నన్నుఁ గావవయ్యా

చ. 1: తగఁ బంచేంద్రియములు తమవాఁడననేరు
పగఁ దల్లిదండ్రి తమవాఁడననేరు
చిగురుఁగర్మాలు తమసీమవాఁడననేరు
తెగదీ తగవు నీవే తిద్దవయ్యా

చ. 2: కొందరు నరకమందు కొంతవళకు వేసేరు
కొందరు స్వర్గమువారు కొంతవళకు వేసేరు
యిందుకు నందుకుఁ బోనీ రిహలోకమందువారు
దిందుపడని వళకు తీరుచవయ్యా

చ. 3: కాంతలు తమవాఁడంటాఁ గనుచూపులఁ గట్టేరు
చెంతలఁ గాంచనములు చేయివట్టుకొనె నన్ను
ఇంతటా శ్రీవేంకటేశ యెదలోనున్నాఁడవు
వంతుకీ తగవు నీవే వహించుకోవయ్యా

రేకు: 0258-01 సామంతం సం: 03-331 వైరాగ్య చింత

పల్లవి: ఇంకనైన హరిఁ జేరు యింతే చాలు
సంకెలెల్లాఁ బెడఁబాపి చక్కఁజేసీ నతఁడే

చ. 1: యెఱఁగక పుట్టితివి యిన్నియోనులందుఁ దొల్లి
తఱినాఁటి కాయఁబోయ దానికేమి
నెఱి నఱకములో నాని తివియుఁ గొన్నాళ్ళు
తఱవాయి దెలుసుకో దానికేమి

చ. 2: పాపపుణ్యములుసేసి పరులఁగొలిచి తొల్లి
తాపములఁ బొందితివి దానికేమి
వూపసంసారము నమ్మి పుంగుఁడై యిన్నాళ్ళుదాఁకా
దాపులేక బ్రతికితి దానికేమి

చ. 3: జగములో వారిఁ జూచి సారెసారె నాసలనే
దగదొట్టె నీకుఁ దొల్లి దానికేమి
జిగి శ్రీవేంకటపతి చిత్తములో నున్నవాఁడు
తగవెంచుకో జీవుఁడ దానికేమి

రేకు: 0258-02 ముఖారి సం: 03-332 నామ సంకీర్తన

పల్లవి: గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవల నీవల నోరఁ గుమ్మలుగ నాడుద మీతనిఁ బాడుదము

చ. 1: సత్యము సత్యము సకలసురలలో
నిత్యుఁడు శ్రీహరి నిర్మలుఁడు
ప్రత్యక్షమిదే ప్రాణుల లోపల
అత్యంతము శరణనరో యితని

చ. 2: చాటెడి చాటెడి సకలవేదములు
పాటించిన హరి పరమమని
కూటస్థుఁ డితఁడు గోపవధూపతి
కోటికి యీతనిఁ గొలువరో జనులు

చ. 3: నిలుచున్నాఁ డిదె నేఁడును నెదుటను
కలిగిన శ్రీవేంకటవిభుఁడు
వలసినవారికి వరదుఁ డీతఁడు
కలఁడు గలఁ డితనిఁ గని మనరో

రేకు: 0258-03 దేసాక్షి సం: 03-333 మనసా

పల్లవి: ఒక్కఁ డెవ్వఁడో వుర్వికి దైవము
యెక్కువ నాతని నెరఁగవో మనసా

చ. 1: వొట్టిన జీవుల కొక బ్రహ్మ గలఁడు
పట్టిన విప్రులు బ్రహ్మలమందురు
నట్టనడుమవారే నవబ్రహ్మలు
జట్టిగ బ్రహ్మల సంతాయ జగము

చ. 2: కైలాసంబునఁ గలఁ డొక రుద్రుఁడు
తాలిమి నేకాదశరుద్రులు మరి
కాలరుద్రుఁడును కడపట నదివో
చాలిన రుద్రుల సంతాయ జగము

చ. 3: అవతారంబున నలరిన విష్ణువు
అవలవిష్ణుమయమనియెడి విష్ణువు
భువి శ్రీవేంకటమున నున్నాఁ డిదె
జవళి వరంబుల సంతాయ జగము

రేకు: 0258-04 దేవగాంధారి సం: 03-334 వైరాగ్య చింత

పల్లవి: ఇంకనైనా రోయరాదా యీపాటివార మింతే
మంకుఁదనమేల మామాట వినరాదా

చ. 1: తోలుబొంత గట్టుకొన్నదొర నింతే నన్ను నీవు
కూళసంసారమా యేల కొసరేవు
యీలకొన్న యెముకల ఇంటిలో కాఁపుర మింతే
యేల మాయ వెంటఁబెట్టే వేమి గద్దు నీకును

చ. 2: పంచభూతపు చుట్టాల బదుకులోవాఁడ నింతే
యెంచ కింద్రియయాచకు లేల వచ్చేరు
కంచపు గాలావటించే కలిమిలోవార మింతే
చంచలపుటాసలు చేయి చాఁచనేఁటికి

చ. 3: నెత్తురుజలదుర్గాన నిలిచినవాఁడ నింతే
జొత్తుఁబాపములు యేల చోటడిగేరు
హత్తిన శ్రీవేంకటేశుఁడాత్మలోన నున్నవాఁడు
మత్తపుటజ్ఞానమా మమ్మేమి చూచేవు

రేకు: 0258-05 మలహరిసం: 03-335 విష్ణు కీర్తనం

పల్లవి: తమ యెఱుక తమకుఁ దగినంతే
నెమకిన మాకును నీకృప యింతే

చ. 1: పొఁగ నీ నాభినిఁ బుట్టిన బ్రహ్మలు
యెసఁగిన నీ పూర్వ మెఱిఁగేరా
వెస నీ ముఖమున వెడలిన వేదము
దెల నీమహిమ తెలియఁగఁగలదా

చ. 2: నగుచు నీమాయల నడచే జగములు
సొగసి నీ మూరితి చూపెడినా
తగ నినుఁ గానఁగ తపించు మునులును
పొగరుల మము నిఁక బోధించేరా

చ. 3: అంతేసివారల కటువలె నుండఁగ
వింతజీవులకు వివేక మెట్లొకో
యింతట శ్రీవేంకటేశ నీవే మము
చెంతఁజేరి దయసేయఁగదే

రేకు: 0258-06 శంకరాభరణం సం: 03-336 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడు దెలిసే మెచ్చరికెపుడో
ఇన్నియుఁ గన్నవె యెఱిఁగీ నెఱఁగ

చ. 1: నిన్నటియాఁకలి నేఁడూ నున్నది
కన్నదినంబే కడచనెను
పన్ని నిదుర మాపటికి నున్నదదె
యెన్నఁగ రాతిరి యెందో పోయ

చ. 2: కాయపు సుఖములు గంపల నున్నవి
పాయమే కైవాలి పండెనదే
యీయెడ సంసార మింటనే వున్నది
చేయును నోరును చెనటై నిలిచె

చ. 3: విడువని జన్మములు వెంటనే వచ్చీ
తడవేటి మోక్షము దవ్వాయ
యెడపక శ్రీవేంకటేశ నీ మఱఁగు
బడిఁ జొచ్చితి నా భారము నీది

రేకు: 0259-01 ముఖారి సం: 03-337 విష్ణు కీర్తనం

పల్లవి: పుణ్యమున నన్నుఁగాచి పురుషార్థివౌదుఁ గాక
గణ్యమా నే నీకు నాకత యెంతవున్నది

చ. 1: వెలయ నిన్నుఁబొగడే వేదము లనంతములు
యెలమి నిన్నుఁ బొగడ నెంతవాఁడను
యిల నిన్నుఁ బూజించేరు ఋషులు కోటానఁగోటి
అలరి నిన్నుఁ బూజించేయంతవాఁడనా

చ. 2: శరణు నీకుఁ జొచ్చిన జంతువు లనంతములు
వరుస నే నందులో నెవ్వరిఁ బోలుదు
సొరిది నిన్నుఁ గొలిచే సురలు సేనా సేన
పరగ నేఁ గొలిచేటి పని నీకు నెంత

చ. 3: కాల మెంతైనాఁ గద్దు కర్మములు వేవేలు
ఆలించ నందులో నే నణుమాత్రము
తాలిమి శ్రీవేంకటేశ దయాధర్మము నీది
పాలించవే నీవు నన్నుఁ బలుకు లేమిటికి

రేకు: 0259-02 లలిత సం: 03-338 వైరాగ్య చింత

పల్లవి: నాలో నున్నాఁడవు నన్నుఁ గావ(క) నీకుఁబోదు
యీలీలఁ బట్టుచీరెరవిచ్చిన వానివలె

చ. 1: చుట్టుకొంటిఁ గర్మములు సొరిదిఁ బసిరికాయ
నట్టనడిమి పురువునడకవలె
వట్టిజాలిఁ దిరిగితి వడిఁ బంచేంద్రియముల
పట్టిన నీటిలో జలభ్రమణమువలెను

చ. 2: ధరలోనఁ బుట్టి పుట్టి తగ వచ్చినందే వచ్చి
వరుస రాట్నపుగుండ్రవలె నైతిని
అరసి నే నంటుకొంటి అంగనల పొందులను
చొరఁబారి వేలుకాడే సూదిరాతివలెను

చ. 3: అంతటను స్వర్గనరకాదిలోకాలు మెట్టితి
బంతిగట్టి నురిపెడి పసురమునై
చెంతల శ్రీవేంకటేశ చేరితి నీవద్ద నేఁడు
వంతుకుఁ గామధేనువు వద్ది దూడవలెను

రేకు: 0259-03 సామంతం సం: 03-339 వైరాగ్య చింత

పల్లవి: జననమరణములు జంతురాసులకు
వెనకముందరను విడువని కొలలు

చ. 1: తలఁచినచోటను తగుదేహములై
పొలసిపోయినాఁ బోనీవు
వెలుపల లోపల వెలయ భోగములు
కలలోపలివలెఁ గన్నది తెలివి

చ. 2: పూచినచోటుల పుత్రమిత్రులై
కాఁచి కరఁచినాఁ గరఁగవివి
తూఁచిన నిరుదెస దుఃఖసుఖంబులు
వూఁచి విడుచుటే వోపిన తెలివి

చ. 3: అనాది వాసనలంటిన జిగురులు
మనోగుణములై మానవివి
వినోదములు శ్రీవేంకటేశుకని
కనే వుపాయము కందువ తెలవి

రేకు: 0259-04 ధన్నాసి సం: 03-340 వైరాగ్య చింత

పల్లవి: అక్కడ నెక్కడి నరకము ఆ మాటే కల్లా
దిక్కుల నిదె ఇన్నియుఁ దీరుచుకొంటిమయ్యా

చ. 1: తనువిది మలమూత్రంబుల దాకొనియుండిన పట్ణము
దినదినమును వుచ్ఛిష్టపుదిడ్లఁ దూరెదము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడిగుంతలు
మనిమని నరకము చొచ్చిన మనుజుల మిదె నేము

చ. 2: మదనజలంబుల కాలువ మాపెద్దల పూర్వంబులు
పొదలిన పుత్రుల యిసిళ్లపుట్టలు వెట్టెదము
యెదుటనె సంసారంబులు యెడయని కారాగృహములు
మదిమది నరకము చవిగొను మనుజుల మిదె నేము

చ. 3: పుట్టినదే నగ్నత్వము బూతో బండో యెరఁగము
చిట్టంట్లవాచవులగు జీవుల మ్రింగెదము
నెట్టన శ్రీవేంకటేశ్వర నీతోఁ గూడఁగ జగములు
మట్టినచోటే మట్టే మనుజుల మిదె నేము

రేకు: 0259-05 దేసాక్షి సం: 03-341 వైరాగ్య చింత

పల్లవి: తప్పులు వొప్పులు దేహి తన మూలమే
రెప్పలతుద నివిగో రేపులు మాపులును

చ. 1: తనలోని పాపములే తగిలి యెదిటివారి-
నినుపు నేరములై నిందింపించు
మనసులో పుణ్యములే మహిఁ గన్నవారిమీఁద
పొనుఁగని నేరుపులై పొగడింపించును

చ. 2: తొల్లిటి మరణములు తోడనే పుట్టినపుడే
యెల్లవారుఁ జూడఁగాను యేడుపించును
పెల్లురేఁగి తాఁజేసే పెనుఁ గర్మబంధములే
మెల్లనే నానాఁటికి మేను గొప్పచేసును

చ. 3: సావిఁ దన నడకలే స్వర్గనరకములై
జీవులకు మాయగప్పి చిక్కింపించు
శ్రీవేంకటేశ్వరు సేవ చేతిలోని మోక్షమై
కేవలపు ప్రపంచము గెలుపించును

రేకు: 0259-06 శ్రీరాగం సం: 03-342 గురు వందన, నృసింహ

పల్లవి: నడుమ రెంటికిని నా మేను
వడఁబడె యెందలివాఁడనొ నేను

చ. 1: కంటిమి జగమిది కన్నుల యెదుటను
అంటి యిదియు నిజమనరాదు
వింటిమి స్వర్గము వేరే కలదని
కంటగించి అది గాదనరాదు

చ. 2: కట్టుకొంటి మిదె ఘనసంసారము
గట్టిగ నిఁకఁ దొలఁగఁగరాదు
పట్టుకొంటి మిదె పాపపుణ్యములు
తెట్టదెరువునవె దించాలేము

చ. 3: నగితి నొకసెలవి నానాఁటి బదుకు
మొగి నొకచే నిను మొక్కితిని
అగపడె శ్రీవేంకటాధిప నీకృప
నిగుడి గురుచే నినుఁ గనఁగలిగె

రేకు: 0260-01 భూపాళం సం: 03-343 వైరాగ్య చింత

పల్లవి: వెట్టి దెలిసి జగము వెస రోఁకలి చుట్టేను
వొట్టి దేవతల వరాలొగి నెందు కెక్కునో

చ. 1: తగిలి సంపదలచేఁ దనిసినవారు లేరు
అగపడి దైవమానుషాలందును
వొగరు సంసారభార మోపనన్నవారు లేరు
వగవఁగఁ జదువు లెవ్వరికిఁ జెప్పెనో

చ. 2: జడిసి ఆయుష్యము చాలునన్నవారు లేరు
పొడమేటి పదునాల్గుభువనాలందు
తడవి తనముదిమి తా రోసేవాఁడు లేఁడు
యెడయని తపముల యెవ్వరి దెచ్చెనో (?)

చ. 3: నడుమనే తిరిగాడీ నానాధర్మములు
పడనిపాట్ల నేము పడఁగాను
తడవి శ్రీవేంకటేశుదాసులు మమ్ముఁ గాచిరి
బడిబడి నిత్యకర్మఫలము లెన్నటికో

రేకు: 0260-02 రాయగౌళ సం: 03-344 శరణాగతి

పల్లవి: ఇంతగాలమాయను యేడనున్నారో వీరు
వింతలై యడవిఁ గా సే వెన్నెలాయ బ్రదుకు

చ. 1: యేలేవారి దూరితి యెడరు పుట్టినవేళ
కాలమును దూరితిని కలఁగేవేళ
తాలిమిలేని వేళ తగుఁగర్మము దూరితి
యేలాగని కాచేవారి నెవ్వరిఁ గానము

చ. 2: దైవమును దూరితి తమకించినట్టివేళ
కావించి నన్నే దూరితిఁ గాఁగినవేళ
సోవగాఁ గోపపు వేళ చుట్టాల దూరితిమి
యీవలఁ దోడైనవారి నెవ్వరిఁ గానము

చ. 3: పుట్టుగు దూరితిమి పోరానియట్టివేళ
కట్టఁగడ నెందువంకఁ గానమైతిమి
జట్టి శ్రీవేంకటేశుఁడు శరణంటేనే కాచె
యిట్టె యింతటివారు యెవ్వరును లేరు

రేకు: 0260-03 నాట సం: 03-345 అద్వైతము

పల్లవి: తల మొలా నొక్కసరా తను వొక్కటౌఁగాక
కొలఁది యెరిఁగతనిఁ గొలువరో మీరు

చ. 1: బొడ్డున బ్రహ్మఁ గనిన పురాణపురుషుఁడే
దొడ్డుఁ గాక ఆతని తోడివాఁడ(డా?)
వొడ్డిన కైలాసమే లేవు మాపతిఁ గడుపులో
వెడ్డువెట్టి పెంచేవాఁడు వీరితోవాఁడా

చ. 2: చక్కని కన్నుల సూర్యచంద్రులుగాఁ గలవాఁడు
యెక్కుడుగా కిందరిలో నీడువెట్టేదా
అక్కర యీా దేవతల కాపద మానిపేవాఁడు
వెక్కసమే కాక యెంచ వీరిలోనే వొకఁడా

చ. 3: అందరు నీతనియందే అయితే నౌదురుఁ గాక
యెందును శ్రీపతి తోడియీాడువారా
కందువ శ్రీవేంకటాద్రి ఘనవరము లొసఁగె
దిందుపడ్డ లోకులకు ద్రిష్టమిదే కాదా

రేకు: 0260-04 పాడి సం: 03-346 అధ్యాత్మ

పల్లవి: ఏమి చెప్పెడినో శాస్త్రరహస్యము యేమిచెప్పెడినొ వేదములు
తామసమై బహునాయకమాయను తత్త్వ మెఱంగఁగఁ దరమేదయ్యా

చ. 1: కొన్నిజంతువులు రోసినహేయము కొన్నిజంతువుల కమృతము
కొన్నిజంతువుల దివములే రాత్రులు కొన్నిజంతువులకు
అన్నియు నిట్లనె వొక్కటొక్కటికి అన్యోన్య విరుద్ధములు
పన్నిన జీవుల కేకసమ్మతము భావించఁగ మరి ఇఁక నేదయ్యా

చ. 2: కొందరు విడిచిన సంసారము మరికొందరికి నది భోగ్యంబు
కొందరి వునుకులు వూర్ధ్వలోకములు కొందరివునుకులు పాతాళంబు
అందరు నందరె వారివారి రుచు లివిగాదిది(వి?) యనరాదు
కందువ జీవులు విచారించేటి కార్యాకార్యము లిఁకనేదయ్యా

చ. 3: కొంతభూమి నటు చీఁకటినిండినఁ గొంతభూమి వెన్నెల గాయు
కొంతట సురలును కొంతట నసురలు కోరికై కొనిరి జగమెల్లా
ఇంతట శ్రీవేంకటేశ్వర నీవే యిందరి యంతర్యామివి
చింతలు వాయవు యెవ్వరిమనసునఁ జేరి నీకు శరణంటేఁ గాని

రేకు: 0260-05 సామంతం సం: 03-347 మాయ

పల్లవి: అణుమాత్రపు దేహినంతే నేను
మిణిఁగెద లేచెద ముందర గానను

చ. 1: తగు సంసారపు తరఁగలు నీమాయ
నిగమముల యడవి నీమాయ
పగలునిద్రలు వుచ్చే భవములు నీమాయ
గగనపు నీమాయఁ గడవఁగ వశమా

చ. 2: బయలువందిలి కర్మబంధములు నీమాయ
నియమపుఁ బెనుగాలి నీమాయ
క్రియ నిసుకపాఁతర కెల్లొత్తు నీమాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా

చ. 3: కులధనములతోఁ జిగురుఁగండె నీమాయ
నిలువు నివురగాయ (?) నీమాయ
యెలమితో శ్రీవేంకటేశ నీకు శరణని
గెలుచుటఁ గాక యిది గెలువఁగ వశమా

రేకు: 0260-06 బౌళి సం: 03-348 శరణాగతి

పల్లవి: ఎన్నఁడుఁ దీరవు యీ పనులు
పన్నిన నీ మాయ బహుళంబాయ

చ. 1: పెక్కు మతంబుల పెద్దలు నడచిరి
వొక్క సమ్మతై వొడఁబడరు
పెక్కుదేవతలు పేరు వాడెదరు
తక్కక ఘనులము తామేయనుచు

చ. 2: పలికెటి చదువులు బహుమార్గంబులు
కలసి యేకవాక్యత గాదు
చ(ఛ?)లవాదంబులు జనులును మానరు
పలు తర్కంబులె పచరించేరు

చ. 3: శరణాగతులకు శ్రీవేంకటేశ్వర
తిరముగ నీవే తీర్చితివి
పరమవైష్ణవులు పట్టిరి వ్రతము
యిరవుగ నాచార్యు లెరుఁగుదురు

రేకు: 0261-01 బౌళి సం: 03-349 అధ్యాత్మ

పల్లవి: ఇంతలోనే యెచ్చరేది ఇంతలో మోసపోయేది
చెంత వలసినట్లు జేసుకొంట(?) దేహికి

చ. 1: నిమిషములోనిది నింగిఁ దిరిగాడేది
జమళిలోను వెలికి సరిదూఁగేది
సమతైవుంటేనుండు చాలించిపోతేఁ బోవు
భ్రమవంటిది ప్రాణము పట్టరాదు దేహికి

చ. 2: నీరు బుగ్గవంటిది నిచ్చ కొత్తలైనది
పోరచి పంచభూతాల పొరుగైనది
తీరితేనే తీరును తీరకుండితే నిలుచు
నారువంటిది మేను నమ్మరాదు దేహికి

చ. 3: రేపుమాపులైనది రెండు మొకాలైనది
పైపై శ్రీవేంకటేశు భారమైనది
రూపై దగ్గరియుండు రుచులై యెదుటనుండు
తీపువంటిది కాలము తెగదెందు దేహికి

రేకు: 0261-02 దేవగాంధారి సం: 03-350 అద్వైతము

పల్లవి: పాపము పాపము ప్రజలా లా
పైపై నిటువలెఁ బలుకకురో

చ. 1: హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును
హరితో సరి వీరనుటెట్లూ
పొరిఁ గొండలందుఁ బుట్టిన శిలలివి
వరుసఁ బెట్టితే సరియౌనా

చ. 2: యిందిరాధిపుని విలఁగల సిరులివి
అంది మరొకరివి అనుటెట్లు
కొందరము యేరుగుడిచి కాలువలఁ
బొంది పొగడితేఁ బొసఁగీనా

చ. 3: శ్రీవేంకటపతి సేవకులకు సరి
ఆవల మరి కలరనుటెట్లు
కావించిన యల కామధేనువుల-
కేవి యూరఁబసు లీడవునా

రేకు: 0261-03 గుజ్జరి సం: 03-351 దశావతారములు

పల్లవి: చెప్పఁగా నెఱఁగరా చేరి వేదవ్యాసులు
తప్పక చేతులెత్తి దైవ మితఁడన్నది

చ. 1: యిరవుగా నెఱఁగరా యెల్ల దేవతలలో
పొరిఁ గృష్ణుఁడు అగ్రపూజ గొన్నది
తిరమై తెలియరా యీ దేవుని పాదపూజ
హరుని శిరసుమీఁద నమరి వుండినది

చ. 2: యింకా నెఱఁగరా యితని రామమంత్రము
తెంకినుండి హరుఁ డుపదేశించేది
పొంకమిదెరఁగరా భువిమీఁద శరభము-
మంకుదన మెల్లఁ దీర మానిపివేసినది

చ. 3: చూచియు నెఱఁగరా సారిది శ్రీవేంకటాద్రి-
నేచిన వరములెల్లా నియ్యఁగాను
కాచే దెఱఁగరా ఘనుడితఁ డెవ్వరైనా
చేచేత శరణంటేఁ జేకొనే బిరుదు

రేకు: 0261-04 వసంతవరాళి సం: 03-352 వైరాగ్య చింత

పల్లవి: పెఱుగఁగఁ బెఱుగఁగఁ బెద్దలమైతిమి నేము
కలకలలే కాని కడగంట లేదు

చ. 1: హరి నిన్ను భుజియించి చాలునన్న యన్నమే
అరిది నేఁడప్పటిని నాస రేఁచీని
ధరలో రాతిరి గూడి తనిసిన సతులే
పరగ నప్పటిని విభ్రాంతి రేఁచీని

చ. 2: మాయఁ గట్టి విడిచిన మలినపుఁ గోకలు
యీయెడ నుదికితేనే యిచ్చ రేఁచీని
కాయముపై మోఁచి పెట్టెఁ గట్టివేసిన సొమ్ములు
మాయలై దినదినము మమత రేఁచీని

చ. 3: నీవు వట్టిన చలమో నేము సేసినట్టి తప్పో
శ్రీవేంకటేశ్వరుఁడ చిక్కితి మిందు
మోవరాని మోపయి ములుగనియ్యదు మమ్ము
చేవ సంసారముపైఁ జిమ్మి రేఁచీని

రేకు: 0261-05 బౌళి సం: 03-353 రామ

పల్లవి: ఇంకానేలా తర్కవాదములు యిన్నియు నిందునే ముగిసెను
యింకానేలా కొందరు మోక్షం బెవ్వరికిని లేదనుమాటా

చ. 1: సరయువు పొంతను సకల జీవులకు
సిరుల మోక్షమిచ్చితివని విన్నపుడే
మరలుచు నాయనుమానము వాసెను
ధర నీవొకఁడవే దైవమవని కంటినయ్యా

చ. 2: తగిన లంకవొద్దను రాక్షసులను
తెగనడిచి ముక్తితెరువు చూపినపుడే
వగలఁ బెక్కుదేవతల వరంబులు
జగతి నీపగకు సరిగావయ్యా

చ. 3: యేమని చెప్పుదునిట్టి నీ మహిమ
వేమరుఁ బురాణవిధి విన్నపుడు
శ్రీమంతుఁడవు శ్రీవేంకటేశ్వర
కామింప నీకంటే ఘనము లేదుగదవోఅయ్యా

రేకు: 0261-06 సామంతం సం: 03-354 వైరాగ్య చింత

పల్లవి: అన్నియుఁ జదివితిఁగా ఆహా నేను
నున్ననిమాటల నోరు నుడిగెడిదేదో

చ. 1: వొద్దనుండే నాజన్మమోహో మరచితిఁగా
చద్దిపంటి మాతల్లిచన్ను మఱచితిఁగా
ముద్దుతోఁ బొరలే మలమూత్రము మఱచితిఁగా
యెద్దువంటివాఁడ నేను యెఱిఁగేటిదేదో

చ. 2: యిప్పటిచవి రేపటికెంచి తనియలేఁగా
తప్పక కాంతలఁ జూచి తలఁపు దనియలేఁగా
ముప్పిరిఁ బెక్కుగాలము ముదిసీఁ దనియలేఁగా
పిప్పివంటివాఁడ నేను పెనఁగేటిదేదో

చ. 3: యేడదో యీదేహమౌత యేనేమి నెఱఁగఁగా
కూడిన మనువెక్కడొ గురుతూ నెఱఁగఁగా
యీడనే శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గాచెఁగా
నీడవంటివాఁడ నేను నేరుపింకనేదో

రేకు: 0262-01 దేవగాంధారి సం: 03-355 విష్ణు కీర్తనం

పల్లవి: వినరో భాగ్యము విష్ణుకథ
వెను బలమిదివో విష్ణుకథ

చ. 1: ఆదినుండి సంధ్యాది విధులలో
వేదంబయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీదివీధులనే విష్ణుకథ

చ. 2: వదలక వేద వ్యాసులు నుడిగిన-
విదిత పావనము విష్ణుకథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకిన చోటనే విష్ణుకథ

చ. 3: గొల్లెతలు చల్ల గొనకొని చిలుకఁగ
వెల్లవిరియాయ విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లిగొలిపె నీ విష్ణుకథ

రేకు: 0262-02 సాళంగనాట సం: 03-356 నామ సంకీర్తన

పల్లవి: భవరోగవైద్యుఁడవు పాటించ నీవొకఁడవే
నవనీతచోర నీకు నమో నమో

చ. 1: అతివలనెడి సర్పా లధరాలు గఱచిన
తతి మదనవిషాలు తలకెక్కెను
మితిలేని రతులఁ దిమ్మరివట్టె దేహాలు
మతిమఱచె నిందుకు మందేదొకో

చ. 2: పొలఁతులనెడి మహాభూతాలు సోఁకిన
తలమొలలు విడి బిత్తలై యున్నారు
అలరు చెనకులచే నంగములు జీరలాయ
మలసి యిందుకు నిఁక మంత్రమేదొకో

చ. 3: తరుణుల కాఁగిలనే తాపజ్వరాలు పట్టి
కరఁగి మేనెల్ల దిగఁ గారఁజొచ్చెను
నిరతి శ్రీవేంకటేశ నీవే లోకులకు దిక్కు
అరుదు సుఖాననుండే యంత్రమేదొకో

రేకు: 0262-03 సామంతం సం: 03-357 వైరాగ్య చింత

పల్లవి: కలిగిననాఁడే చుట్టరికంబులఁ దిరుగు నివి
నలుగడ నివి సతమని మతి నమ్ముట పాపమయా

చ. 1: దేహము తోడనె పెరుగును తీరనియీఇంద్రియములు
దేహము తోడనె ముదియును తేటతెల్లమిగను
ఆ పుట్టినినాఁడును అంతము నొందిననాఁడును
శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ వివి

చ. 2: తెలిశున్నపడే తగులును తియ్యని యీ సంసారము
తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో
మలయక నిద్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు
చలమరి జీవుని తోడుత సమ్మతమే లేదు

చ. 3: కన్నులు దెరచిన యప్పుడే కాన్పించును యీలోకము
కన్నులు మూసినయప్పుడె కడగడఁ దా నణగు
అన్నిట శ్రీవేంకటేశ్వరుఁ డాత్మను వెలిఁగెడివేళను
వున్నతి జీవులఁ దగులవు వొదుగుచుఁ దిరుగు నివి

రేకు: 0262-04 దేసాళం సం: 03-358 విష్ణు కీర్తనం

పల్లవి: ఆతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు
ఆతని మానుటలెల్లా నవిధిపూర్వకము

చ. 1: యెవ్వని పేరఁ బిలుతు రిలఁ బుట్టిన జీవుల
నవ్వుచు మాసనక్షత్రనామములను
అవ్వల నెవ్వని కేశవాదినామములే
రవ్వగా నాచమనాలు రచియింతురు

చ. 2: అచ్చ మే దేవుని నారాయణనామమే గతి
చచ్చేటివారికి సన్యాసమువారికి
ఇచ్చ నెవ్వరిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము

చ. 3: నారదుఁడు దలఁచేటి నామమది యెవ్వనిది
గౌరి నుడిగేటి నామకథ యేడది
తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరినామము
యీ రీతి శ్రీవేంకటాద్రి నెవ్వఁడిచ్చీ వరము

రేకు: 0262-05 దేవగాంధారి సం: 03-359 గురు వందన, నృసింహ

పల్లవి: పంటల భాగ్యులు వీరా బహు వ్యవసాయులు
అంటిముట్టి యిట్లఁ గాపాడుదురు ఘనులు

చ. 1: పొత్తుల పాపమనేటి పోడు నఱికివేసి
చిత్తమనియెడు చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచివాన పదనున
విత్తుదురు హరిభక్తి వివేకులు

చ. 2: కామక్రోధాదులనే కలుపు దవ్వివేసి
వేమరు వైరాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువులువేసి
వోముచున్నారు జ్ఞానపుఁ బై రుద్యోగజనులు

చ. 3: యెందు చూచిన శ్రీవేంకటేశుఁ డున్నాఁడనియెడి-
అందిన చేని పంట లనుభవించి
సందడించి తమవంటి శరణాగతులుఁ దాము
గొంది నిముడుకొందురు గురుకృప జనులు

రేకు: 0262-06 శంకరాభరణం సం: 03-360 వైష్ణవ భక్తి

పల్లవి: మానుప వశమా మాయ లివిన్నియు
శ్రీనాథుఁడు మును సేసినవే

చ. 1: రాతిరి చీఁకటి రతిఁ బగలు వెలుఁగు
ఘాతల నెప్పుడు గలదిదియే
యీతల జ్ఞానుల కిల నజ్ఞానుల-
జాతివైరములు సహజములే

చ. 2: అసురలకు సురల కనాది నుండియు
అసమున వైరంబది గలదే
యెసగి వైష్ణవుల కిలఁ బ్రాకృతులకు
పొసఁగని వాదము భువిఁ గలదె

చ. 3: యిహమునుఁ బరమును యీలంకెలతో
విహితము చెప్పెడి వేదములే
అహిపతి శ్రీవేంకటాధిపు మతమిది
నిహితం బెఱిఁగిన నిశ్చలమే

రేకు: 0263-01 సామంతం సం: 03-361 వైరాగ్య చింత

పల్లవి: ఎక్కడనున్నాఁ బోదు యేతులైనఁ బోనీదు
వొక్కటి కొక్క బంధము వూహింప నెక్కుడు

చ. 1: బుడిబుడి మాయలఁ బొరలేటి దేహికి
కడవరాని బంధము కాంతలు
యెడపడ కందుకంటే నెక్కుడైన బంధము
కడునాసఁ బొరలించు కనకము

చ. 2: బాలులకు వృద్ధులకు పాయపు వివేకులకు
తేలించే బంధములు దినరుచులు
మూలనున్నాఁ బోనీదు ముంగిటనే వేసేది
వేళ గాచిన బంధము విద్యాగర్వము

చ. 3: పాయ దేజంతువులైనాఁ బశుపక్షులకునైనా
బాయటి గీముల కట్టుఁబాటు బంధము
యేయెడ శ్రీవేంకటేశ ఇంక నీదాసులకైతే
చాయై చెప్పినట్టు సేసు సకలబంధములు

రేకు: 0263-02 మలహరిసం: 03-362 శరణాగతి

పల్లవి: దైవమా యేమి సేతు తలఁప నీవే దిక్కు
భావించి చదువఁబోయి పశుబుద్ధినైతి

చ. 1: కననా సంసారము కడలేని భారమౌట
కనినాఁ దొలఁగరాదు కాలురులు
విననా యీ దేహము విరసపు హేయమౌట
వినినా జిగురుఁ గండె విడిపించరాదు

చ. 2: తెలియనా ఇంద్రియాలు ద్రిష్టపు విరోధమౌట
తెలిసినాఁ బోఁగువలెఁ దెంచరాదు
పలుకనా పాపములు పాయని బంధములని
పలికినాఁ గొన్న వెట్టి పట్టితోయరాదు

చ. 3: యెఱఁగనా యీలోకమిది మాయమయమని
యెఱిఁగినాఁ బడ్డవోఁద మెక్కరాదు
మెఱయ శ్రీవేంకటేశ మేనిలోననే వుండి
మఱియును నన్నునేల మన్నన సేసితివి

రేకు: 0263-03 పాడి సం: 03-363 వైరాగ్య చింత

పల్లవి: మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి
కొంచెము(మొ?) దొడ్డో సరికోరి ఇందుకందుకు

చ. 1: చేసేటి పుణ్యములకు చెందేటి పాపములకు
యీసుల సరికి సరి ఇందుకిందుకు
వాసులఁ బుట్టుగులకు వడి మరణాలకును
ఆసల సరికి సరి అందుకందుకు

చ. 2: దినదిన సుఖాలకు తీదీపు దుఃఖములకు
యెనసి సరికి సరి ఇందుకిందుకు
అనుఁగుఁ బున్నమలకు అమాస చీఁకట్లకు
అనయము సరికి సరందుకందుకు

చ. 3: శ్రీవేంకటేశ యిట్టే జీవులకు నేది గతి
యేవి చూచిన సరికి సరిందుకిందుకు
వేవేగ నీ శరణని వెలసి బ్రతికితిమి
యే వల్లలేదు సరి యెందుకం (కెం?)దుకు

రేకు: 0263-04 సాళంగనాట సం: 03-364 దశావతారములు

పల్లవి: హరి యిచ్చిన వరము లటువలెఁ గావుగా
తిరమై వివేకులెల్లాఁ దెలిసేటి దిదియే

చ. 1: శిరసులు తుంచితుంచి చిచ్చులోన వేలిచి
వరములు వడసె రావణుఁ డెన్నైనా
నిరతి రాముని చేత నిమిషములోననే
వరములన్నియు నెందో వరతిపాలాయ

చ. 2: వీరఘోరతపముల వెలయ బాణాసురుఁడు
కోరి చేకొన్నవరాలు కోటానఁగోటి
వూరకే కృష్ణునిచేత నొక యిసుమంతలోనే
తోరమైన వరములు తుత్తునియలాయ

చ. 3: పట్టిజాలిఁ బొరలక వరుస విభీషణుఁడు
జట్టిగ రఘుపతికి శరణనెను
నెట్టన నాతనిఁ గాచె నేఁడూ నున్నాఁడదె
యిట్టే శ్రీవేంకటాద్రి నిచ్చి వరములు

రేకు: 0263-05 మాళవి సం: 03-365 ఉత్సవ కీర్తనలు

పల్లవి: వీఁడు గదే శేషుఁడు శ్రీవేంకటాద్రి శేషుఁడు
వేఁడుక గరుడనితోఁబెన్నుద్దైన శేషుఁడు

చ. 1: వేయిపడిగెలతోడ వెలసిన శేషుఁడు
చాయమేని తళుకు వజ్రాల శేషుఁడు
మాయని శిరసులపై మాణికాల శేషుఁడు
యే యెడ హరికి నీడై యేఁగేటి శేషుఁడు

చ. 2: పట్టపు వాహనమైన బంగారు శేషుఁడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుఁడు
నట్టుకొన్న రెండువేలునాలుకల శేషుఁడు
నెట్టన హరిఁబొగడ నేరుపరి శేషుఁడు

చ. 3: కదిసి పనులకె ల్లఁ గాచుకున్న శేషుఁడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుఁడు
అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
పదరక యేపొద్దూ పానుపైన శేషుఁడు

రేకు: 0263-06 శ్రీరాగం సం: 03-366 వైరాగ్య చింత

పల్లవి: ఎక్కడి విరతి మాకు నిహమెల్లాఁ దగులు
మక్కళించి మక్కళించి మాయకింతాఁ దగులు

చ. 1: పుట్టినప్పుడే పాపపుణ్యములు దగులు
అట్టై దేహమున కన్నమూఁ దగులు
గట్టిగా నీరెండూనై తే కర్మమూఁ దగులు
యెట్టునుఁ బోరాదు మాయకింతాఁ దగులు

చ. 2: మనికి సంసారియైతే మమతలుఁ దగులు
పెనగఁగఁ బెనగఁగా బిడ్డలూఁ దగులు
అనువై యీలంపటాన కాసలెల్లాఁ దగులు
మన సొక్కటొక్కటై మాయకింతాఁ దగులు

చ. 3: అరయ శ్రీవేంకటాశుఁ డాత్మలోనే తగులు
శరణన్నవారికి విజ్ఞానము దగులు
గరిమ నిందువల్లనే ఘన మోక్షమూఁ దగులు
మరిగినప్పుడే సుమ్మీ మాయకింతాఁ దగులు

రేకు: 0264-01 శుద్ధవసంతం సం: 03-367 ఉపమానములు

పల్లవి: కడనుండే విజ్ఞానికిఁ గా దిటువలెను
వొడలి రోఁతలు చూచి వూరకైనా నవ్వును

చ. 1: ఆఱడిఁ బాము గరచినట్టివాఁడు దినఁబోతే
జాఱని వేప చేఁదైనాఁ జప్పనై తోఁచు
వీటిడై సంసారపువిష మెక్కినవానికి
చూఱలై హేయకాంతలు సుఖములై తోఁచును

చ. 2: చెంగట వెఱ్ఱివానికి చేసిన చేఁతలెల్ల
తొంగలించి వివేకాలై తోఁచినట్లు
మింగుచుఁ గర్మపు నాము మేసిన సంసారికి
అంగడి కర్మమే బ్రహ్మమై తోఁచును

చ. 3: జగమిది యొక్కటే చవులు వేరేవేరే
మొగి నెఱుకమఱపు ముడిచున్నది
పగటు శ్రీవేంకటేశుఁ బట్టి కొలువనివాఁడు
తెగని మాయలలోనఁ దేలాడవలసె

రేకు: 0264-02 బౌళి సం: 03-368 శరణాగతి

పల్లవి: నరహరి నీ దయమీఁదట నా చేతలు గొన్నా
శరణాగతియును జీవుని స్వతంత్రము రెండా

చ. 1: మొఱయుచు నరకపు వాకిలి మూసిరిహరినీదాసులు
తెఱచిరి వైకుంఠపురము తెరువుల వాకిళ్ళు
నుఱిపిరి పాపములన్నియు నుగ్గుగ నిటు తూర్పెత్తిరి
వెఱవము వెఱవము కర్మపువిధులిఁక మాకేలా

చ. 2: పాపిరి నా యజ్ఞానము పరమాత్ముఁడ నీదాసులు
చూపిరి నిను నామతిలో సులభముగా నాకు
రేపిరి నీపై భక్తిని రేయినిఁ బగలును నాలో
వోపము వోపము తపములు వూరకె ఇఁక నేలా

చ. 3: దిద్దిరి నీ ధర్మమునకు దేవా శ్రీవేంకటేశ్వర
అద్దిరి నీదాసులు నీయానందములోన
ఇద్దరి నీనా పొందులు యేర్పరచిటువలెఁ గూర్చిరి
వొద్దిక నొద్దిక నాకిఁక నుద్యోగములేలా

రేకు: 0264-03 ముఖారి సం: 03-369 అంత్యప్రాస

పల్లవి: ఎంత విచారించుకొన్నా నిదియే తత్త్వము హరి
వంతుకు నీకృపగలవాఁడే యెరుఁగు హరి

చ. 1: నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్ను నొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మ్రొక్కి బ్రదికిరి హరి
వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి

చ. 2: యేపున నీ పేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి
నీ పేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడు హరి
కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁదిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి

చ. 3: యిట్టే నీవిచ్చిన వరమెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగ నీవియ్యనివి కపటములే హరి
అట్టె శ్రీవేంకటేశుఁడ వంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న వొచ్చెము దేహికి హరి

రేకు: 0264-04 సామంతం సం: 03-370 దశావతారములు

పల్లవి: ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటి కాధారము దానె

చ. 1: మది జలధుల నొక దైవము వెదకిన మత్స్యావతారం బితఁడు
అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీవిష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదఱక కొండల గుహల వెదకితే శ్రీనరసింహం బున్నాఁడు

చ. 2: తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁ డొకఁడై నాఁడు
తలఁపున శివుఁడునుఁ బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు
కెలఁకుల నావులమందల వెదకిన కృష్ణుఁడు రాముఁడునైనారు

చ. 3: పొంచి యసురకాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాఁడు
మించిన కాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యవతారము
అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుక ఇహమునఁ బరమున వెదకిన యీతఁడే శ్రీవేంకటవిభుఁడు

రేకు: 0264-05 లలిత సం: 03-371 విష్ణు కీర్తనం

పల్లవి: చాలుఁజాలు నీ హరియేమాకును సకలక్రియలకు నాయకుఁడు
నాలుక తుదనే యీతఁడుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము

చ. 1: యేలినవాఁడట లక్ష్మీవిభుఁడట యేమిటనుఁ గొరత మాకిఁకను
నాలోనున్నాఁడు బ్రహ్మతండ్రియట నాకాయుష్యము బాఁతా
పాలజలధిపై దేవుని వారము పాఁడి మాకు నిఁక నేమరుదు
ఆలింపఁగ నేమింతటివారము అన్యులకిఁకఁ జేయి చాఁచేమా

చ. 2: భూకాంతాపతికింకరులము యీభూములిన్నియునుమాసొమ్మే
పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి
యీాకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశములేదు
యేకొఱఁతని ఇఁక నాసపడుచు నేమెవ్వరికి నోళ్లు దెరచెదము

చ. 3: శ్రీవైకుంఠుని దాసులమట యరచేతిది మోక్షము మా కిదివో
పావనగంగాజనకుని బంట్లము పాపములన్నిటఁ బాసితిమి
శ్రీవేంకటపతి వరములియ్యఁగా జిక్కిన వెలుతులు మాకేవి
యీా వైభవములఁ దనిసిన మాకును ఇతరులఁ దగిలెడిదిఁక నేది

రేకు: 0265-01 లలిత సం: 03-372 అధ్యాత్మ

పల్లవి: ధరఁ గడపట నేజంతువుకైనా తన జన్మమే సుఖమై తోఁచు
హరి గలఁడని తా నమ్మివుండఁగా నతఁడిచ్చే సుఖ మొల్లరు

చ. 1: మొదలఁ గొందరికి స్వర్గలోకమే మోక్షసుఖంబని తోఁచును
అదె కొందరికి దేవత్వమే బ్రహ్మానందంబై తోఁచును
పుదుటునఁ గొందరికి సంసారమే వున్నతసుఖమై తోఁచును
తుద నా మీఁదటి హరిదాస్యసుఖము ధ్రువపట్టంబని కానరు

చ. 2: సొరిదిఁ గొందరటు శూన్యతత్త్వమేసుఖమనిమాఁటలనందురు
యిరవెరఁగనివారికి ధనధాన్యము లెక్కువ సుఖమై తోఁచును
నిరతిఁ గొందరికి చిరజీవులౌటే నిత్యసుఖంబని తోఁచును
వరుసల శ్రీపతిపై భారంబిదె వైరాగ్యపుసుఖ మెఱఁగరు

చ. 3: యెక్కడ చూచిన మాయలసుఖములు యెన్నైనాఁ గలవెప్పుడును
చొక్కపు శ్రీవేంకటపతి తోడుట సుఖియించేటి సుఖ మొల్లరు
యిక్కడ నక్కడ నీతని దాసులే యేచి సుఖింతురు నిజసుఖము
కిక్కిరిసిన యజ్ఞానాంధకారులు కిందును మీఁదును నెరఁగరు

రేకు: 0265-02 మలహరిసం: 03-373 శరణాగతి

పల్లవి: నీకెటు వలసె నటుసేయి నీచిత్తము నా భాగ్యము
యేకడనైనా లక్ష్మీకాంతుఁడ ఇదియే పో నా విన్నపము

చ. 1: నాగుణములే యెంచితినా నరక కూపములు చాలవు
ఆగతినే నాకర్మములూ అనుభవించి తీర్చేనంటే
నీ గుణములే యెంచితివా నిఖిలసంపదలు చాలవు
యీగి ననుఁ గరుణించి యెపుడు నీవిచ్చేనంటేను

చ. 2: నాపాపములే లెక్కించితినా నదులయిసుకలునుఁ జాలవు
యేపున నెంతైనాఁ గలదు అది యెన్నఁడు దీరును దేవా
చేపట్టి నీవు రక్షించిన యాజీవుల నెంచితివా తొల్లి
చూపట్టెడి యీయాకసంబు పై చుక్కలకంటే ఘనము

చ. 3: మఱి నాసుద్దులు యెంచఁగ నెంచఁగ మంచముకిందే నూయి
గుఱి నీకథలివి వినఁబోతే నివే కొండలుఁ గోటానఁగోట్లు
నెఱవుగ శ్రీవేంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని
తఱి దరిచేర్పఁగఁ గూడువెట్టఁగా దైవమ నీకే భారము

రేకు: 0265-03 లలిత సం: 03-374 అంత్యప్రాస

పల్లవి: అరసి నన్నుఁ గాచినాతనికి శరణు
పరము నిహమునేలే పతికిని శరణు

చ. 1: వేదములు దెచ్చినట్టి విభునికి శరణు
ఆదిమూలమంటే వచ్చినతనికి శరణు
యేదెసాఁ దానై యున్నయీతనికి శరణు
శ్రీదేవిమగఁడైన శ్రీపతికి శరణు

చ. 2: అందరికిఁ బ్రాణమైన అతనికి శరణు
ముందు మూఁడుమూర్తులమూర్తికి శరణు
దిందుపడి దేవతల దేవునికి శరణు
అంది మిన్నునేల నేకమైనతనికి శరణు

చ. 3: తానేఁ చేతన్యమైన దైవానకు శరణు
నానాబ్రహ్మాండాలనాథునికి శరణు
ఆనుక శ్రీవేంకటాద్రియందునుండి వరములు
దీనుల కిందరికిచ్చే దేవునికి శరణు

రేకు: 0265-04 మంగళకౌశిక సం: 03-375 శరణాగతి

పల్లవి: ఇది నమ్మలేఁడు పుణ్యాలేమేమో చేసీ దేహి
పొదలి యిందువంకనే పొడవెక్కలేఁడా

చ. 1: మంచి మందుగొన్నవాఁడు మహామహారోగముల
అంచెలఁ బాసి సుఖియయ్యీనటా
అంచితపు హరినామమనే మందుగొన్నవాఁడు
పొంచి పాపరోగములఁ బోఁదోలలేఁడా

చ. 2: జోడు దొడిగినవాఁడు చొక్కపు టలుగులకు
వోడక రణజయము నొందీనటా
వాడక హరిదాస్యపు వజ్రపంజరపువాఁడు
వీడ జన్మపుటమ్ములు విదలించలేఁడా

చ. 3: వైపగుఁ గాణాచిగలవాఁడు దరిద్రముఁ బాసి
పైపై సంపదలతో బ్రదికీనటా
దాపై శ్రీవేంకటేశు పాదములందుఁ గాణాచి
యేపొద్దూఁ గలుగువాఁడు యెక్కువగా లేఁడా

రేకు: 0265-05 గుండక్రియ సం: 03-376 వైరాగ్య చింత

పల్లవి: ఎక్కడి వుద్యోగాలు నేడకెక్కు జీవునికి
నిక్కిచూచి హరి గరుణించిన దాఁకాను

చ. 1: తనిసినవారు లేరు తగ నింద్రియభోగాలు
పెనఁగఁ బెనఁగఁ బైపై బెరుగుఁ గాని
మనసులోనికి రాదు మాటలలోని విరతి
తునిగినట్లనుండు దొరకుదాఁకాను

చ. 2: విడిచినవారు లేరు విషయాలు సంపదలు
వుడుగక కోరఁగోర నొదగుఁగాని
పుడిమి విన్నట్టుండదు పుస్తకాలలో చదువు
నడుమంత్రములనుండు నానినదాఁకాను

చ. 3: తెలిసినవారు లేరు దేవుని నాతుమలోన
పలు లంపటాలఁ బడి భ్రమనుఁ గాని
యెలమి శ్రీవేంకటేశుఁ డేమిటా మెచ్చఁడు తన్నుఁ
దలఁచి భక్తితోడ దగ్గరుదాఁకాను

రేకు: 0266-01 పాడి సం: 03-377 శరణాగతి

పల్లవి: సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి
ప్రకటమ్మై మాకు నబ్బె బదికించు నిదియె

చ. 1: మనసులో పాపబుద్ధి మరి యెంతదలఁచినా
నినుఁ దలఁచినంతనే నీరౌను
కనుఁగొన్నపాపములు కడలేనివైనాను
ఘనుఁడ నిన్నుఁజూచితే కడకుఁ దొలఁగును

చ. 2: చేతనంటి పాతకాలు సేవగా నేఁ జేసినాను
ఆతల నీకుమొక్కితే నన్నియుఁ బాయు
ఘాతలఁ జెవుల వినఁగా నంటిన పాపము
నీతితో నీ కథ వింటే నిమిషానఁ బాయును

చ. 3: కాయమునఁ జేసేటి కర్మపుఁ బాపములెల్ల
కాయపు నీ ముద్రలచే గక్కన వీడు
యేయెడ శ్రీవేంకటేశ యేయేపాతకమైనా
ఆయమైన నీశరణాగతిచే నణఁగు

రేకు: 0266-02 లలిత సం: 03-378 వైరాగ్య చింత

పల్లవి: రెప్పల మరఁగదె రేపును మాపును
యిప్పుడే తోఁచీనిదివో కీలు

చ. 1: మనసున నున్నవి మాయలన్నియును
మనసు మరచితే మాయలు మరచును
పనివడి మనసునుఁ బారఁగవిడిచిన
కనుఁగొన మాయలు కడలే వివిగో

చ. 2: దేహమున నున్నది తెగని లంపటము
దేహ మఱఁచితేఁ దెగును లంపటము
వూహల దేహమే వోమగఁ దొడఁగిన
మోహపు మాయలు మోపుల కొలఁది

చ. 3: ఆతుమ నున్నాఁడు అంతరాత్మకుఁడు
ఆతుమ మరచిన నాతఁడు మరచును
యీతఁడె శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చేచేతనే సుఖములు సేనాసేన

రేకు: 0266-03 మాళవి సం: 03-379 వైరాగ్య చింత

పల్లవి: అన్నియు నాయందే కంటి నన్నిటివాఁడా నేనే
మున్నె నా భావముతో ముడిచివేసినది

చ. 1: చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి
ములిగి ముక్తిదలఁచి ముక్తుఁడనైతి
పలుమతాలు దలఁచి పాషండబుద్ధినైతి
చెలఁగి శ్రీపతిఁ దలఁచి వైష్ణవుఁడనైతి

చ. 2: పొసఁగఁ బుణ్యము సేసి పుణ్యాత్ముఁడనైతి
పసలఁ బాపముచేసి పాపకర్ముఁడనైతి
వెస బ్రహ్మచారినైతి వేరె యాచారమున
ముసిపి మరొకాచారమున సన్యాసినైతి

చ. 3: వొగి నొడ్డెభాషలాఁడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగువాడనైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీదాసుడనై దాసరి నేనైతి

రేకు: 0266-04 సాళంగనాట సం: 03-380 కృష్ణ

పల్లవి: ఇహపరములు గొన నీ దేవుఁడే
సహజ మిన్నిటాను సర్వేశుఁడే

చ. 1: తలఁచి చూచినాను తనలోనే మఱచిన (నా?)
తలఁపుల కొనవాఁడు దైవ మొకఁడే
పలికి చూచినాను పలుకక మానినాను
పలుకుల కొనవాఁడు పరమాత్ముఁడే

చ. 2: కనుఁగొని చూచినాను కనురెప్ప మూసినాను
కనుచూపు కొనవాఁడు కమలాక్షుఁడే
విని యాలకించినాను వినకట్టె మానినాను
వినుకుల కొననెల్లా విష్ణుఁడొక్కఁడే

చ. 3: మేలుకొని వుండినాను మించి నిద్దిరించినాను
కాలము కొనలవాఁడు ఘనుఁడీ హరే
యీలాగు శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
కీలు విచారించితే కృష్ణుఁ డితఁడే

రేకు: 0266-05 ధన్నాసి సం: 03-381 శరణాగతి

పల్లవి: నేనేమి బాఁతి నీకు నీరుణము పాపలేను
నానావిధముల నీవే నన్నుఁ బాయవుగా

చ. 1: మతిలో చీఁకటి మాన్ప మాణిక్యదీపమవై
సతమై నాలికె పైకి చవి దేనెయై
కతలై నన్నుఁ జొక్కించఁ గర్ణామృతమవయి
గతియైతివిగా నాకుఁ గమలారమణా

చ. 2: చేరి నా కన్నులెదుట శృంగారరసమవై
ఆరసి రక్షించఁ బితురార్జితమవై
సారపు టిహపరాలు సంసారసుఖమవై
యీరీతిఁ బెంచితిగా నా కిందిరారమణా

చ. 3: తనువిచ్చి జీవునికిఁ దల్లి వి తండ్రివినై
ధనమవై దాతవు దైవమవునై
అనుఁగు శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవై
నను మన్నించితివిగా నారాయణా

రేకు: 0266-06 శంకరాభరణం సం: 03-382 అధ్యాత్మ

పల్లవి: ముగియదు కాలము ముందరికి కింకాఁ
దెగని ప్రవాహము దినదిన మిదిగో

చ. 1: పొంకపు హరిచేఁ బొడమిన జగమిది
యింకాఁ బొడమీనివి గొన్ని
కంకిగఁ జెరువులు కాల్వలు నంటా
అంకెల నిర్మితమయ్యీ నివిగో

చ. 2: దేహము భోగించి దించిన విషయము-
లీహల మీఁదెత్తె నివి గొన్ని
ఆహారములై అన్యస్త్రీలై
వూహలనే నోరూరించీ నివిగో

చ. 3: మనసునఁ దలఁచిన మాయలు కమ్మర-
నినుమడించె మతి నివి గొన్ని
కనుఁగొని శ్రీవేంకటపతిదాసులు
పెనఁగి పెంచఁగాఁ బెరిగీనిదిగో

రేకు: 0267-01 లలిత సం: 03-383 అద్వైతము

పల్లవి: పెద్ద తెరువుండఁగాను పెడగంతలు దీసుక
పొద్దువోక యడవులఁ బుంగుడయ్యేరు

చ. 1: తొల్లిటి పెద్దలెంచిరి దొడ్డవాఁడు హరియంటా
అల్లదె భారత రామాయణ భాగవతములు
ఇల్లిదె నేఁటి పెద్దలు యెవ్వరో దైవములంటా
వెల్లవిరిగా నింకా వెదకేరు

చ. 2: దేవలోకమువారు దేవుఁడు శ్రీపతియని
భావించి మొరవెట్టి బ్రదికిరి
యీవల నిప్పటివారు ఇందరికి మొరవెట్టి
కావిరి నెవ్వరివారుఁ గాక వున్నారు

చ. 3: నానాభూములవారు నమ్మి శ్రీవేంకటపతిఁ
గానవచ్చి యేఁటనేఁట ఘనులయ్యేరు
యీనిజ మిక్కడివారు యిన్నియుఁ దెలిశుండియు
మానక చలాలఁబోయి మాయలఁ బొందేరు

రేకు: 0267-02 లలిత సం: 03-384 వైష్ణవ భక్తి

పల్లవి: నాకేల విచారము నాకేల యాచారము
సాకిరైనవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు

చ. 1: ప్రపంచ మధీనము పాలుపడ్డ దేహమిది
ప్రపంచముతోడి పాటు పరగీని
యెపుడూ నీయాతుమ యీశ్వరాధీనము
అపు డాతఁ డెట్టునిచె నట్టె అయ్యీని

చ. 2: కర్మాన కధీనము కలిములు లేములు
కర్మమెట్టు గల్పించెఁ గలిగీని
అర్మిలి నాయాచార్యు నధీనము మోక్షము
ధర్మ మతని కృపను తానే వచ్చీని

చ. 3: చిత్తమున కధీనము చిల్లరయింద్రియములు
చిత్తము చిక్కినప్పుడు చిక్కీనవి
హత్తి శ్రీవేంకటేశుదాస్య మధీనము జన్మము
పొత్తుల నందుకు నది పూఁచినట్టయ్యీని

రేకు: 0267-03 మాళవి సం: 03-385 ఉపమానములు

పల్లవి: ఏఁటి పరిణామము మమ్మేల యడిగేరయ్యా
గాఁటపుహరి యొక్కఁడే గతి మా కిఁకనయ్యా

చ. 1: మరుగుచు శ్రీహరి మాయలోఁ జిక్కినయట్టు
గరిమలఁ గులకాంతకాఁగిటఁ జిక్కితిమయ్యా
తిరముగఁ గాలములు దిగమింగినయట్టు
సొరిది చవులు మింగుచు నున్నారమయ్యా

చ. 2: జననిగర్భములోన చక్కఁగా మునిఁగినట్టు
మునుకొని నిద్దురల మునిఁగి వున్నారమయ్యా
చనవునఁ గర్మమనే జలధిలో నున్నట్టు
ధనధాన్యాల నడుమఁ దగిలి వున్నారమయ్యా

చ. 3: పేదవాఁడు నిధిగని పెక్కువ బతికినట్టు
గాదిలి శ్రీవేంకటేశుఁ గని చెలఁగితిమయ్యా
యీదెస మొక్కే దైవ మెదురుగావచ్చినట్టు
ఆ దేవుఁడే మాకు నంతరాత్మఁ డాయనయ్యా

రేకు: 0267-04 బౌళి సం: 03-386 ఉపమానములు

పల్లవి: సొసముఖా నడె సొసముఖా

ఆసల పరివారము అవధారు దేవా

చ. 1: మత్తిలి జీవుఁడ నేటిమహిమ గలుగు రాజు

చిత్తమనియెడి పెద్ద సింహాసనం బెక్కి

బత్తితోఁ బంచేంద్రియపు పరివారము గొలువ

చిత్తజు పారుపత్యము సేసీనిదివో

చ. 2: కడు మదించి నహంకారమనే యేనుగపై

యెడనెడ నెక్కి తోలీనిదె జీవుఁడను రాజు

బడిబడిఁ గర్మముల పౌఁజులు దీర్చరో

వెడమాయ పట్టణపు వీధుల నేఁగీని

చ. 3: మించిన సంసారమనే మేడలో నేకాంతమున

పొంచి జీవుఁడనే రాజు భోగము భోగించఁగా

అంచెల శ్రీవేంకటేశుఁడనే దేవుఁడు వచ్చి

మంచితనమునఁ దానె మన్నించె నదివో

రేకు: 0267-05 ముఖారి సం: 03-387 వైరాగ్య చింత

పల్లవి: నీకు నీ సహజమిది నాకు నా సహజమిది
యేకడా నీవే నిరుహేతుక బంధుఁడవు

చ. 1: నే నిన్నుఁ దలఁచినా నెఱి నిన్ను మఱచినా
పూని నా యంతరాత్మవై వుండకపోవు
పూని నిన్నుఁ బూజించినాఁ బూజించకుండినాను
కానీలే యీశ్వరుఁడవుఁ గాక మానవు

చ. 2: యిట్టె నే నడిగినా నేమీ నడుగకుండినా
జట్టిగా నీవు రక్షించక మానవు
తొట్టి నిన్ను దగ్గరినా దూరమున నుండినాను
పుట్టించి నీ గర్భములోఁ బొదలించకుండవు

చ. 3: భావించి నీకు మొక్కినాఁ బరాకై మానినా-
నేవి చూచినా నీవై యిఁకఁ బాయవు
శ్రీవేంకటేశుఁడ నీవే చింతాయకుఁడవు
కావించేటి నా వుద్యోగములేమి బాఁతి

రేకు: 0267-06 రామక్రియ సం: 03-388 ఉపమానములు

పల్లవి: కాంతల మానమనేటి కరవట్నాలకు దిగె
మంతనాన జీవుఁడనే మంచిమరకాఁడు

చ. 1: అరిది సంసారమనే యంబుధిలోనఁ దిరిగి
పురుగతి దేహపుటోడమీఁద
సరిఁ బాపపుణ్యముల సరకులు నించుకొని
దరి చేరె జీవుఁడనే తలమరకాఁడు

చ. 2: కడలేని నిట్టూర్పుగాలి విసరఁగాను
జడియుఁ గోరికలనే చాపలెత్తి
అడిబరవుగ మాయ అందునిండా నించుకొని
యెడతాఁకె జీవుఁడనే యీమరకాఁడు

చ. 3: అలర శ్రీవేంకటేశుఁడని యేటిమాలిమి
నలుదిక్కులకు నోడ నడపఁగాను
ములిగె ధర్మార్థకామమోక్షధనము గడించి
పలుమాఱు జీవుఁడనే బలుమరకాఁడు

రేకు: 0268-01 లలిత సం: 03-389 శరణాగతి

పల్లవి: చంకగుదియ యిదే శరణార్తి నే నిదే
తెంకి నా భావము దేవుఁడే యెరుఁగు

చ. 1: కోరెడి చిత్తము కోరక మానదు
వైరాగ్యము నే వదలను
యీరీతి దినములు యిట్లనే కడచీ
తేరిన పను లిఁక దేవుఁడే యెరుఁగు

చ. 2: తగు సంసారము తనువునఁ బెనఁగీ
వెగటై మోక్షము వెదకేను
పగటున రెంటాఁ బరగిన జీవుఁడు
తెగువలుఁ దగులమి దేవుఁడే యెరుఁగు

చ. 3: పంచేంద్రియములు పారీ నిక్కడ
పెంచఁ బెద్దనై పెరిగేను
అంచెల శ్రీవేంకటాధిపుఁ గొలిచితి
దించని యీమాయ దేవుఁడే యెరుఁగు

రేకు: 0268-02 లలిత సం: 03-390 శరణాగతి

పల్లవి: ఆడుతాఁ బాడుతా నీతో నట్టే ముద్దుగునుసుతా
వోడక నీదండ చేరి వున్నారమయ్యా

చ. 1: ఆసఁ దల్లిదండ్రిమోము అట్టె చూచి శిశువులు
యే సుఖదుఃఖములుఁ దా మెరఁగనట్టు
వాసుల శ్రీపతి మిమ్ము వడి నాత్మఁ దలఁచుక
యీసుల పుణ్యపాపము లెఱఁగమయ్యా

చ. 2: యేలినవారు వెట్టగా నేపునఁ దొత్తులు బంట్లు
ఆలకించి పరుల బోయడుగనట్టు
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా
యేలని యేమియుఁ గోర నెరఁగమయ్యా

చ. 3: చేతఁ జిక్కి నిధానము చేరి యింటఁగలవాఁడు
యేతులఁ గలిమిలేము లెరఁగనట్టు
ఆతుమలో శ్రీవేంకటాధిప నీ వుండఁగాను
యీతల నే వెలుతులు నెరఁగమయ్యా

రేకు: 0268-03 బౌళి సం: 03-391 మనసా

పల్లవి: బాపురే వోప్రాణి బాపురె వోమనసా
వోపనస వెందుకైనా నొడఁబడేవు

చ. 1: మురికి దేహమొకటి మోచుక నీ వప్పటిని
మురికి దేహసతుల మోవఁగోరే వప్పటిని
కరకు హేయము గొంత కడుపున నించుకొని
తిరిగి హేయమేకాను(?) తినఁబోయే వప్పటి

చ. 2: పసిఁడి కమ్ముడువోయి పరులఁగొలిచి మరిఁ
బసిఁడి సొమ్మంటాఁ బైఁ బెట్టఁ గోరేవు
పిసరుఁ బాపపుణ్యాలఁ బెడఁగేలు గట్టించుక
విసువక అవియే కావించఁబోయే వప్పటి

చ. 3: పంచభూతములచేతఁ బట్టువడి కమ్మరాను
పంచభూతాల దేహుల బంధులంటాఁ దగిలేవు
అంచెల శ్రీవేంకటేశుఁ డాతుమలో నున్నవాఁడు
యెంచుక తెలిసియును ఇట్టె మరచే వప్పటి

రేకు: 0268-04 భూపాళం సం: 03-392 అధ్యాత్మ

పల్లవి: నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగా దేవియును
ధారుణి లోపలఁ బుట్టించితివి తరువాతి పనులు నీకే సెలవు

చ. 1: శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లే
యేపున విషయములందులోఁ దగిలి యేమయిన నీకే సెలవు
చూపరఁ బసురము తొరలు వోయినను సొమ్ముగలుగువాఁడే పరవంజుక
పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారముగాన

చ. 2: యీడులేక శ్రీహరి నీవుండెడి యీ దేహపు నీపరికరమూఁ
బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడిఁ దిప్పెడి నీకే సెలవు
వోడక యధికులు తమ దాసులు మరివొకరిపంపు లటు సేయఁగను
చూడరు తమబలములనే విడిపించుక తామే రక్షింతురు గాని

చ. 3: శ్రీవేంకటపతి నీవే నన్నిటు సృష్టించిన జీవుఁడనింతే
కావిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు
ధావతిఁ దలిదండ్రులు తమ బిడ్డల తనువులఁ బంకము లంటినను
యేవిధముల నీరార్చి పెంతు రటు ఇన్నిట నీవే గతినాకు

రేకు: 0268-05 ధన్నాసి సం: 03-393 వైష్ణవ భక్తి

పల్లవి: అందితినిఁ బొందితి నీయం దఖిలభోగములు
కందర్పజనక నాకుఁ గలిగెతి విన్నిటా

చ. 1: ఘనకుండలములు నీ కథలు నాచెవులకు
ననుపైన రుచులు నీ నామములు నాలుకకు
అనువై నీకు మొక్కఁగ నంటిన నొసలిమన్ను
పనివడి నీకు పట్టబద్ధ(ంధ?)ము

చ. 2: మంచి నిర్మాల్యపుదండ మంగళసూత్రము నాకు
కాంచనపురాసి నీ చక్కని రూపు నామతికి
పంచామృతములు నీ పాదతీర్థము మేనికి
పంచినముద్ర లదే వజ్రాంగిజోడు

చ. 3: సకలబంధులు నీ దాసానదాసులే నాకు
అకలంక జన్మఫల మన్నిటా నీకృప నాకు
ప్రకటపు శ్రీవేంకటపతివి నాయాతుమలో
మొకరివై యుండి నన్ను మోహించఁజేసితివి

రేకు: 0268-06 భూపాళం సం: 03-394 అధ్యాత్మ

పల్లవి: పాపముఁ బుణ్యముఁ బరకట నున్నది
చేపట్టుము నీ చేతిదీ ప్రాణి

చ. 1: నాలుక కొనలనె నానుచునున్నది
గాలపు నిజమునుఁ గల్లయును
వాలుచును తాసువలె నున్నదిదె
తాలిమి ధర్మాధర్మములు

చ. 2: చేతుల కొనలను చేఁతై యున్నది
జాతిగ నరకము స్వర్గమును
ఆతల వేదోక్తమైన కర్మములు
దాతనె పిడికిటఁ దగిలెను వెదకు(?)

చ. 3: మనసు కొట్టఁగొన మాయయు నున్నది
వెనక శ్రీవేంకటవిభుఁడు నదే
తనరిన యాతని దాస్యము నున్నది
విని చేకొందువు వెదకవో నీవు

రేకు: 0269-01 లలిత సం: 03-395 భక్తి

పల్లవి: తప్పు దీయర్థమొకటి దాఁచిన ధనము సుండీ
విప్పరాదు చెప్పరాదు వేదమందు నున్నది

చ. 1: హరిభక్తి గలిగిన యతనికి మోక్షము
పొరుగున నున్నట్టు పొసఁగినది
దరిశనభక్తి చేఁ దనరినవారికి
యిరవైన మోక్షము యెదిటిది

చ. 2: మక్కువ భాగవతాభిమానము గలవారి-
కక్కరలేని మోక్ష మరచేతిది
నిక్కి యాచార్యాభిమాననిరతులైనవారికి
తక్కక మోక్షమింతాఁ దనలోనిది

చ. 3: యెంత విచారించుకొన్నా నేనేమి చదివినా-
నెంతవారికైనా మోక్ష మిందులోనిది
వింతగా శ్రీవేంకటవిభుని సంకీర్తన-
వంతులకు మోక్షము వదనములోనిది

రేకు: 0269-02 మలహరిసం: 03-396 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వరిదూరఁగఁ జోటు లేదు మరియేమనఁగలదిదివో తగవు
యివ్వల నందరి బడిబడిఁ దిరిగే యీకర్మముదే నేరమి

చ. 1: నీ దాసులకును నేరమి లేదు నీవే గతియని వుండఁగను
ఆదినుండి నీకును నేరమి లేదఖిలానకుఁ గర్తవుగాన
పాదుపడక నడుమనుఁ దిరిగాడెడి ప్రపంచముదే నేరమి
యేదెస నొకచో నిజమేరుపడక యిటువలెఁ దిరిగాడెడిఁ గాన

చ. 2: పాపము లేదిదె యజ్ఞానులకును భావమెరంగని పశువులు గాన
మోపై సుజ్ఞానులకునుఁ బాపము మోవదు నినుఁ గొలిచిరి గాన
చాపలముగ నమ్మించి చెరుచు పలుచదువులదే యీ పాతకము
పైపై నొకయర్థ మేరుపరచక భ్రమయఁగ వాదము వెట్టెడిఁ గాన

చ. 3: యీలోకులకును అధర్మము లే దిన్నియు నీచేఁతలే కాన
మూలనున్నముక్తులకు నధర్మము మొదల లేదు నీ కృప గనక
కాలము గడపుచు నీవు రచించిన కపటపు మాయదే అధర్మము
అలరి శ్రీవేంకటేశ్వర య(యె?)క్కడనడ్డము తానేవచ్చీఁ గాన

రేకు: 0269-03 బౌళి సం: 03-397 అధ్యాత్మ

పల్లవి: ఇదె చిక్కితివిఁక నెందు వోయెదవు
వుదిరి తొలఁగరాదోహో నీవు

చ. 1: జీవుల లోపలఁ జెలఁగేటి మూర్తివి
దేవతలకు పరదేవుఁడవు
కైవల్యమునకుఁ గలుగు బ్రహ్మమవు
ఆవలి పరమున కర్థమవు

చ. 2: ఘనకర్మమునకుఁ గలిగిన ఫలమవు
మనసు లోనికిని మాయవు
తనియని చదువుకు దాఁచిన ధనమవు
మునుప జగములకు మూలమవు

చ. 3: వలసినవారికి వర్ణించు రూపవు(???)
సులభులకు సంసారసుఖమవు
అలరిన దాసులమగు మాకైతే
కలిగిన శ్రీవేంకటపతివి

రేకు: 0269-04 భూపాళం సం: 03-398 వైరాగ్య చింత

పల్లవి: తెలిసియుఁ దెలియను తెగదీ చిక్కేమిటాను
కలకాల మిందుననే గరివడె బ్రదుకు

చ. 1: దేహముపై రోఁత తెలుసుకొనేటి వేళ
ఆహా యిదే హేయమై తోఁచును
మోహించి విషయాల మునిఁగిన వేళ నిదే
యీహల నంతటిలోనే ఇతవులై వుండును

చ. 2: చదివి నేఁ బురాణాలు సారెకు వినేటి వేళ
అదివో విరతి ఘనమై వుండును
కదిసి సంసార సుఖకాంక్షలఁ బొందేటి వేళ
మది నన్నియు మరచి మద మెక్కి వుండును

చ. 3: యెక్కడిది వివేక మెవ్వరు గెలిచినారు
చక్కఁ బొడవెక్కించు చరిఁ దోసును
దిక్కు నీవే శ్రీవేంకటదేవుఁడ నీ శరణంటే
యెక్కువ బ్రదుకుఁదోవ యిదియే కలది

రేకు: 0269-05 దేసాక్షి సం: 03-399 శరణాగతి

పల్లవి: అల్లనాఁడే యిదెరఁగ మైతిమి గాని
యిల్లిదె దేవుని కృప యీడ నున్నది సుండి

చ. 1: చేరువవో మోక్షము శ్రీహరిభక్తికిని
ధారుణిఁ గర్మమునకే దవ్వుగాని
యీరీతి నింద్రియముల నించుకంతే దాఁటిన
దూరముగాదు జ్ఞానపుతోవ వున్నది సుండి

చ. 2: ధరఁ జేతిది వైకుంఠ మతని దాస్యమునకు
పరధర్మముల కగపడదు గాని
అరుదైన యాసల ఆయము వొడిచితేనే
అరసి యాకంతగుండా నందవచ్చుఁ జుండి

చ. 3: తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి
శిలుగుఁ బుణ్యములకుఁ జిక్కదుగాని
తెలిసి శ్రీవేంకటేశు తిరుమంత్రము నాలికెఁ
బలికినాడనే దివ్యపద మబ్బుఁ జుండి

రేకు: 0269-06 సామంతం సం: 03-400 అంత్యప్రాస

పల్లవి: మూఁడుమూర్తులనైన ముంచుకొను నీవలపు
వేఁడి విరహములోనె వేఁచు నీవలపు

చ. 1: పాప మెరఁగదు వలపు భయ మెరంగదు వలపు
రూపెరంగదు మతికి రుచి సేయు వలపు
పూపవయసున పండు వొడమించు నీవలపు
తీపులకుఁ గడుదీపు దినదినము వలపు

చ. 2: సిగ్గెరంగదు వలపు శిర కెక్కును వలపు
వొగ్గించు నన్నిటికి వొడిగట్టు వలపు
బగ్గనను నటు గుండె పగిలించు నీవలపు
అగ్గలపజాణలకు నాయ మీవలపు

చ. 3: తెగువ దెచ్చును వలపు తేలించు నీవలపు
యిగిరించి కలిమిలే మెఱఁగ దీవలపు
వగల శ్రీవేంకటేశ్వరు మాయ లీవలపు
తగులు విరికాని (?) వలెఁ దగిలించు వలపు

రేకు: 0270-01 దేసాళం సం: 03-401 గురు వందన, నృసింహ

పల్లవి: ఎదురు లేక చరింతురెట్టైనా శ్రీవైష్ణవులు
మదించి నేనుగులకు మట్టు మేర వున్నదా

చ. 1: భాగీరథిలోనఁ బాపమున్నదా పుణ్య-
భోగపు వేదములలో బొంకులున్నవా
సాగరపుటమృతపు చవిలోఁ జేఁదున్నదా
ఆగతి హరిదాసుల కపరాధ మున్నదా

చ. 2: ఆకసములోన నెరుసందునున్నదా భూమిఁ
జేకొని రవియెదుటఁ జీఁకటున్నదా
యీకడఁ గామధేనువు కియ్యరానివున్నవా
కైకొన్న ప్రపన్నులను గరిసించ నున్నదా

చ. 3: హరినామమంత్రములో నొఁగాము లున్నవా
గురుకృప గలిగియుఁ గొరతున్నదా
సరవి శ్రీవేంకటేశు శరణన్నవారికి
విరసంబు లందులో వెదకఁగఁ గలదా

రేకు: 0270-02 రామక్రియ సం: 03-402 కృష్ణ

పల్లవి: వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండ విహరించే దేవుఁడు

చ. 1: కొండ గొడగుగ నెత్తి గోవులఁ గాచె నాఁడు
కొండవంటి దానవునిఁ గోరి చించెను
కొండ శ్రీవేంకటమెక్కి కొలువున్నాఁ డప్పటిని
కొండవంటి దేవుఁ డిదే కోనేటికటుతను

చ. 2: మాఁకుల మద్దులు దొబ్బి మరి కల్పభూజమనే-
మాఁకు వెరికి తెచ్చెను మహిమీఁదికి
మాఁకుమీఁద నెక్కి గొల్ల మగువల చీరలిచ్చి
మాఁకుల కోనేటిదండ మరిగినాఁ డిదివో

చ. 3: శేషుని పడగెనీడఁ జేరి యశోద యింటికి
శేషజాతి కాళింగుఁ జిక్కించి కాచె
శేషాచలమనేటి శ్రీవేంకటాద్రిపై
శేషమై కోనేటిదండఁ జెలఁగీని దేవుఁడు

రేకు: 0270-03 సామంతం సం: 03-403 శరణాగతి

పల్లవి: కడుపు నిండె నీకఁ గడమేది మును
తడవిన యపుడే నే ధన్యుఁడనైతి

చ. 1: హరిహరి యని నే నన్ననాఁడె నా-
పరగిన జన్మము ఫలియించె
కెరలి మీఁద మిక్కిలి నీసేవలు
వరుస జలధిలో వానలు

చ. 2: ముందర నీకును మొక్కినయపుడే
అందితిఁ దుదిపదమగు సుఖము
పొందుగ మీఁదటి వేవేలు సేవలు
యెందును శ్రీమంతు కిచ్చిన సిరులు

చ. 3: శ్రీవేంకటపతి శరణనినపుడే
దైవము నాపాల దక్కితివి
చేవలఁ గమ్మర సేవించు సేవలు
వేవేలు పూజల వేడుకలు

రేకు: 0270-04 దేవగాంధారి సం: 03-404 మనసా

పల్లవి: మాయలఁ బొరలఁగనేఁటికి మనసా కలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతుఁ డీతనిఁ దలఁచవుగా

చ. 1: మన్నునఁ బుట్టిన కాయము మన్నుననణఁగేటి దింతే
మిన్నుల మీఁదికిఁ బోవదు మెరయుచు నెంతైనా
అన్నిట నీ జీవునికిని అంతర్యామీ దేవుఁడు
యెన్నఁడుఁ బాయని బంధువుఁ డీతనిఁ దలఁచవుగా

చ. 2: ధరపైఁ బుట్టిన దేహము ధరపైఁ బుట్టి(ట్టు?)న దింతే
పరమానందము గోరదు పైపై నెంతయినా
గరిమల నీ జీవునికిని గతియగు దేవుం డీతఁడు
నిరతపు సుఖములె యొసఁగును నీవిటు దలఁచవుగా

చ. 3: శ్రీవేంకటపతి సొమ్ములు చేరెడి దాతని నింతే
ఆవల నితరుల నంటవు ఆతుమ లన్నియును
యేవిధముల నీ జీవుని కేలికె యీదేవుండే
పావనముగ బ్రదికించెను పయికొని తలఁచవుగా

రేకు: 0270-05 మాళవిగౌళ సం: 03-405 శరణాగతి

పల్లవి: రుచులు నే నిటు గొనని వేడవి రోఁతలయ్యెడిఁగాక నేఁడు
వచనముల హరి నీకు శరణని వసుధఁ బావనమైతిఁ గాక

చ. 1: నేను సేయని పాపమేడది నిఖిలలోకములందును
నేను చొరని నరకమేడది నెఱయ దుర్గతుల
నేను పొడమని యోనులేడవి నిఖిలజంతువులందును
పూని హరి నిను శరణుచొరఁగాఁ బుణ్యుఁగాఁ జేసితివిఁ గాక

చ. 2: నిరతి నాడని కల్లలేడవి నేను నాలుక తుదలయందును
పొరలి నడపని కర్మమేడది భువి ననాచారములలో
తిరిగి తిరిగి నీచులిండ్లను తిరియనర్థము లింకనేడవి
గరిమ హరి నే నిన్ను శరణనఁగాను ఘనుఁ జేసితివిఁ గాక

చ. 3: తలఁప నజ్ఞానములు నపరాధములు నాయెడ లేనివేడవి
యెలిమి నన్నిట్లేలఁ దగునా యేలితివిఁ గాక
నిలిచి శ్రీవేంకటగిరీశ్వర నీకు శరణనుమాత్ర మింతే
కలసి నాయెడనేమి గంటివి కాచితివి భువనములలోను

రేకు: 0271-01 సామంతం సం: 03-406 శరణాగతి

పల్లవి: ఎవ్వరి దూరఁగనేల యేమీ ననఁగనేల
నవ్వుచు హరికి మొక్కి నడచుటఁ గాక

చ. 1: కోపమే యెక్కుడు సేసు కొందరి గుణములోన
పాపమే యెక్కుడు సేసు పరులఁ గొందరికి
దీపన మెక్కుడు సేసు దేహములఁ గొందరికి
శ్రీపతి ఆనాజ్ఞ లివి చెల్లీ లోకానను

చ. 2: కొందరి నసురలఁగా గుట్టుతోడ నటు సేసు
కొందరి దేవతలఁగా కోరి తానే యిటు సేసు
కొందరి మనుజులఁగా కూటపు జీవులఁ జేసు
విందువలె హరిమాయ వెలసి లోకానను

చ. 3: వరుస నెరిఁగి నడవ నెవ్వరి కిచ్చగాదు
సరిని వనాది నుండే సహజమే కలది
చిరపుణ్యు లిన్నిటిలో శ్రీవేంకటేశుఁ గని
శరణనఁగా సుఖము జరగీ లోకానను

రేకు: 0271-02 గుండక్రియ సం: 03-407 శరణాగతి

పల్లవి: పొదలఁ బొదలఁగఁ దనువు పుణ్యపాపముపొత్తు

వదల వదలఁగ మనవద్దనే నిలుచు

చ. 1: పెరుగు నింద్రియసుఖము పెంచఁగాఁ బెంచఁగా

ధరఁ బెరుగుఁ గోరికలు తలఁచఁ దలఁచ

కెరలు లంపటము మిక్కిలి కూర్చుఁ(ర్చఁ?) గూర్చఁగా

మరలింప మరలింప మనసులో నణఁగు

చ. 2: కలుగు పనులే మైనఁ గడుఁ జేయఁ జేయఁగా

మలసి కలుగును రుచులు మరుగ మరుగ

బలియు నజ్ఞానంబు భ్రమయఁగా భ్రమయఁగా

నిలువ నిలువఁగ మనసు నిశ్చలం బవును

చ. 3: నెగడు గుణములు పెక్కు నించఁగా నించఁగా

మిగుల(లు?) సంసారంబు మెలఁగ మెలఁగ

తగిలి శ్రీవేంకటేశు దగ్గరి కొలువఁగఁ గొలువ

పొగడఁ బొగడఁగ నతఁడు పొంతనే నిలుచు

రేకు: 0271-03 ధన్నాసి సం: 03-408 వైరాగ్య చింత

పల్లవి: నీ వెటుసేసిన నిజభోగ్యంబౌ
చేవలఁ గైకొని చెలఁగుటఁ గాక

చ. 1: దేవ నీ యానతిఁ దిరిగేటి చి త్తము
నావద్ద నిలుపఁగ నా వసమా
యీవల నీవే యిచ్చిన పుట్టుగు
యేవిధిఁ దిప్పిన యిఁక మాన వశమా

చ. 2: వామన నీ పంపు వచ్చిన ప్రకృతిదే
నా మాఁట వినుమన నా వసమా
శ్రీమంతుఁడ నీచేఁత దేహమిది
దోమటి గుడువక తోయఁగ వశమా

చ. 3: నగధర నీ విటు నడపేటి కర్మము
నగినగి తోయఁగ నా వసమా
తగు శ్రీవేంకటదైవమ నాపాలఁ
దగిలితి వితరముఁ దలఁచఁగ వశమా

రేకు: 0271-04 భైరవి సం: 03-409 తిరుపతి క్షేత్రం

పల్లవి: విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో
శాశ్వతులమైతి మింక జయము మా జన్మము

చ. 1: కొండవంటి హరిరూపు గురుతైన తిరుమల
పండిన వృక్షములే కల్పతరువులు
నిండిన మృగాదులెల్ల నిత్యముక్త జనములు
మెండుగఁ బ్రత్యక్షమాయ మేలువో నా జన్మము

చ. 2: మేడవంటి హరిరూపు మించైన పైఁడి గోపుర-
మాడనే వాలిన పక్షు లమరులు
వాడలఁ గోనేటిచుట్ల వైకుంఠనగరము
యీడ మాకుఁ బొడచూపె ఇహమేపో పరము

చ. 3: కోటి మదనులవంటి గుడిలో చక్కని మూర్తి
యీటు లేని శ్రీవేంకటేశుఁడితఁడు
వాఁటపు సొమ్ములు ముద్ర వక్షపు టలమేల్మంగ
కూటువై నన్నేలితి యెక్కువవో నాతపము

రేకు: 0271-05 ఆహిరి సం: 03-410 శరణాగతి

పల్లవి: నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య
పైకొని శ్రీహరి నీవే పరిహరించవే

చ. 1: విజ్ఞానములు గొన్ని విందు నే నూరకే
సుజ్ఞానములు గొన్ని చూతు నే నేపొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞాహీనుఁడ నెంత పాపకర్మమో

చ. 2: సుకృతము లొకమరి సొరిది నే బోధింతు
ప్రకృతి యొక్కొక వేళ భావింతు నాత్మలో
అకృతములే నే ననిశముఁ జేసేది
వికృతాచారుఁడ నింకా వికార మెంతో

చ. 3: ధర్మమార్గముఁ గొంత తలఁపున నెరిఁగితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరిఁగితి
నిర్మించి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
మర్మ మెరిఁగితి నెట్ల మన్ననఁ గాచితివో

రేకు: 0271-06 రామక్రియ సం: 03-411 విష్ణు కీర్తనం

పల్లవి: ఇంతటి దైవము లేఁడు యెందుఁ జెప్పి చూపఁగ
వంతులకుఁ గొలిచేటివారి భాగ్య మిఁకను

చ. 1: గక్కన మన్మథునిఁ గన్నతండ్రి గనక
యెక్కువ చక్కఁదనాల కితఁడే దొడ్డ
నిక్కపు సూర్యచంద్రాగ్నినేత్రుఁడు గనక
దిక్కులఁ గాంతుల నీ దేవుఁడే దొడ్డ

చ. 2: అంచెల లక్ష్మికి మగఁడై నాఁడు గనక
యెంచ రాని సంపదల కితఁడే దొడ్డ
పంచినచోటఁ జక్రము పంపు చేసీఁ గనక
మించిన ప్రతాపాన మిక్కిలిని దొడ్డ

చ. 3: దైవికపుఁ బురుషోత్తముఁ డితఁడు గనక
దేవతల కెల్లా నీ దేవుఁడే దొడ్డ
వావాత శ్రీవేంకటాద్రి వరములిచ్చీఁ గనక
యేవల దాతలలోన నితఁడే దొడ్డ

రేకు: 0272-01 దేసాక్షి సం: 03-412 వైష్ణవ భక్తి

పల్లవి: కలవి రెండే భూమి కామనిధానంబులు
జలజాక్షుఁడు నతని శరణాగతియును

చ. 1: నరులు లేరా భూమి నానాదిక్కులలోన
హరిదాసుఁడొక్కఁడే యరుదుఁ గాక
సురలు లేరా మింట సోదించ ఘనుఁ డొక్కఁడే
పరమపదమేలు శ్రీపతియే కాక

చ. 2: మాటలు లేవా భూమి మంత్రము లెంచి చూడఁగ
తేటల హరినామమే తేఁకువఁ గాక
కోటిపూజ లిల లేవా కుమతులు సేసేవి
పాటల ప్రపన్నుని భక్తి దొడ్డుఁ గాక

చ. 3: విహితసుఖము లేదా విశ్వములో భోగించ
సహజమోక్షసుఖమే సారముఁ గాక
యిహమున శ్రీవేంకటేశుఁ డిందరికి లేఁడా
మహి శ్రీవైష్ణవులకే మనికాయఁ గాక

రేకు: 0272-02 ముఖారి సం: 03-413 వైష్ణవ భక్తి

పల్లవి: విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁడని
వైష్ణవు లానతియ్యఁగా వట్టి చదువులేల

చ. 1: వెన్న చేతఁబట్టి నేయి వెదకఁగ నిఁకనేల
నిన్ను లోన నించుకొని నిజమేదో యననేల
వున్నతి దీపమువట్టి వొగి నూతఁబడనేల
పన్ని నీ దాస్యము గల్గ బహుకర్మమేల

చ. 2: చాలాధనము గల్గి సంతలఁ దిరియనేల
నాలుక నీ పేరు గల్గ నానాజపములేల
కాలము నేరు గుడిచి కాలువ వొగడనేల
పాలించ నీ వుండఁగాను పరచింతలేల

చ. 3: మిన్ను చూచేయందుకుఁగా మిక్కిలి తోదోపు లేల
అన్నిటా నీవుండఁగాను అడుగనేల
యెన్నఁగ శ్రీవేంకటేశ యిందరి నేలేవు నీవే
నిన్నే కొలుచుటఁ గాక నీటుగర్వాలేల

రేకు: 0272-03 వరాళి సం: 03-414 అంత్యప్రాస

పల్లవి: చంచలము మానితేను సంసారమే సుఖము
పొంచి హరిదాసుఁడైతే భూమెల్లా సుఖము

చ. 1: వొరుల వేఁడకవుంటే వున్నచోనే సుఖము
పరనింద విడిచితే భావమెల్లా సుఖము
సరవిఁ గోపించకుంటే జన్మ మెల్లా సుఖమే
హరిఁ గొలిచినవారి కన్నిటాను సుఖమే

చ. 2: కాని పని సేయకుంటే కాయమే సుఖము
మౌనమున నుండితేను మరులైనా సుఖము
దీనత విడిచితేను దినములెల్లా సుఖము
ఆని హరిఁ దలఁచితే నంతటా సుఖమే

చ. 3: చలము విడిచితేను సంతతము సుఖము
యిల నాసలుడిగితే నిహమెల్లా సుఖమే
తలఁగి శ్రీవేంకటేశు దాసులైనవారు వీని
గెలిచి నటించఁగాను కిందా మీఁదా సుఖమే

రేకు: 0272-04 దేసాళం సం: 03-415 అధ్యాత్మ

పల్లవి: వెదకవో చిత్తమా వివేకించి నీవు
అదనఁ దదియ్యసేవ అంతకంటే మేలు

చ. 1: చూపులెన్నైనాఁ గలవు సూర్యమండలముదాఁకా
చూపులు శ్రీహరిరూపు చూడ దొరకదు గాని
తీపులెన్నైనాఁ గలవు తినఁ దిన నాలికెకు
తీపు శ్రీహరిప్రసాదతీర్థమని కోరదు

చ. 2: మాటలెన్నైనాఁ గలవు మరిగితే లోకమందు
మాటలు శ్రీహరినామము మరపఁగ వలె
తేటలెన్నైనాఁ గలవు తీరని చదువులందు
తేటగా రామానుజులు తేరిచె వేదములలో

చ. 3: చేఁతలెన్నైనాఁ గలవు సేసేమంటే భూమి
చేఁతల శ్రీవేంకటేశు సేవ సేయవలెను
వ్రాఁతలెన్నైనాఁ గలవు వనజభవుని ముద్ర-
వ్రాఁతలు చక్రాంకితాలె వహికెక్కే ముద్రలు

రేకు: 0272-05 లలిత సం: 03-416 విష్ణు కీర్తనం

పల్లవి: బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో
విహగగమన నాకు వెరగయ్యీ నిందుకే

చ. 1: పుట్టేటి జంతువులు భువనములెల్లా నిండె
ఇట్టి బ్రహ్మాండకోట్లు ఇన్నియు నీ మేన నిండె
ఇట్టె ఇందరి రక్షించే యితవైన విధమేదో
వొట్టుగ కాఁపురము నీ వుండఁగఁ జోటేదో

చ. 2: చిన్నిచిన్ని దేవతల చేఁతల ముద్దులు నిండె
కన్నుల నీకివి చూచి కడు సంతసాలు నిండె
మన్ననలు వీరికిచ్చి మలసేటి విధ మేదో
వున్నతి నీ చింతదీరి వుండుటెఁక నెన్నఁడో

చ. 3: నీ దేవియైన లక్ష్మి నిచ్చ సంపదలు నిండె
ఆదియై శ్రీవేంకటేశ ఆకె నీ వురాన నిండె
పోదియై నీవివియెల్లా భోగించేదేపొద్దో
నీదాసులము నేము నినుఁ జింతించితిమి

రేకు: 0272-06 లలిత సం: 03-417 శరణాగతి

పల్లవి: నిలిచినచోటనెల్లా నిధాన మీతఁడు
యిల వెఱవ వెఱవ నేమిటికి నిఁకను

చ. 1: హరి నాకుఁ గలఁడుగా అన్నిటిఁ బరిహరించ
నిరతి గర్మములెంత నిండుకుండినా
దరిదాపు ఇతఁడేకా తగ వెనుక వేసుకో
విరవిరఁ బాపాలు నా వెంటఁ బడినాను

చ. 2: గోవిందుఁడు గలఁడుగా కొంకు దీర్చి నను గావ
కావరపు భవములు గదిమినాను
దేవుఁడితఁ డున్నాఁడుగా దిక్కుదెసై నిలుపఁగా
భావపు సంసారవార్ధి పైకొని ముంచినను

చ. 3: శ్రీవేంకటేశుఁడే చిత్తగించి నన్నేలెఁగా
వావాత నింద్రియాలు వళకాడినా
యీవల నావల నితఁ డిహపరా లిచ్చెఁగా
వావిరి నే దాస్యగర్వముతో నుండినను

రేకు: 0273-01 బౌళి సం: 03-418 కృష్ణ

పల్లవి: దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు
యీవల నీ బంట నాకు నెదురింక నేది

చ. 1: కామధేనువుఁ బిదుకఁగల కోరికెలివెల్ల
కామధేనువులు పెక్కుగాచే కృష్ణుఁడవట
కామించి నీ బంటనట కమ్మి నిన్నుఁ దలఁచితి-
నేమి మాకుఁ గడమయ్య యిందిరారమణా

చ. 2: యెంచఁ గల్పవృక్షమును యిచ్చు సిరులెల్లాను
నించి కల్పవృక్షముల నీడల కృష్ణుఁడవట
అంచెల నీ బంటనట ఆత్మలో నిన్ను నమ్మితి
వంచించఁ గడమ యేది వసుధాధీశ

చ. 3: తగ నొక్క చింతామణి తలఁచినట్లఁ జేసు
మిగులఁ గౌస్తుభమణి మించిన కృష్ణుఁడవట
పగటు శ్రీవేంకటేశ భక్తుఁడ నీకట నేను
జగములో గొఱతేది జగదేకవిభుఁడా

రేకు: 0273-02 సాళంగం సం: 03-419 రామ

పల్లవి: కొలిచినవారల కొంగు పైఁడితఁడు
బలిమిఁ దారకబ్రహ్మ మీతఁడు

చ. 1: యినవంశాంబుధి నెగసిన తేజము
ఘనయజ్ఞంబులఁ గల ఫలము
మనుజరూపమున మనియెడి బ్రహ్మము
నినుపుల రఘుకులనిధాన మితఁడు

చ. 2: పరమాన్నము లోపలి సారపుఁజవి
పరగిన దివిజుల భయహరము
మరిగిన సీతామంగళసూత్రము
ధరలో రామావతారం బితఁడు

చ. 3: చకిత దానవుల సంహారచక్రము
సకల వనచరుల జయకరము
వికసితమగు శ్రీవేంకటనిలయము
ప్రకటిత దశరథభాగ్యం బితఁడు

రేకు: 0273-03 బౌళిరామక్రియ సం: 03-420 నృసింహ

పల్లవి: అభయదాయకుఁడ వదె నీవే గతి
యిభరక్షక నను నిపుడు గావవే

చ. 1: భయహర దై తేయభంజన కేశవ
జయ జయ నృసింహ సర్వేశ్వరా
నియతము మా కిదె నీ పాదములే గతి
క్రియగా మమ్మేలి కింక లుడుపవే

చ. 2: బంధవిమోచన పాపవినాశన
సింధురవర దాశ్రితరక్ష
కంధరవర్ణుఁడ గతి నీ నామమె
అంధకారముల నణఁచి మనుపవే

చ. 3: దైవశిఖామణి తత చక్రాయుధ
శ్రీవేంకటగిరి శ్రీరమణా
సావధాన నీ శరణ్యమే గతి
వేవేలకు నావిన్నప మిదియే

రేకు: 0273-04 శంకరాభరణం సం: 03-421 హనుమ

పల్లవి: శరణు కపీశ్వర శరణం బనిలజ
సరవి నెంచ నీ సరి యిcక వేరీ

చ. 1: పుట్టినవాcడే భువనము లెరcగcగ
పట్టితి సూర్యునిc బండనుచు
ముట్టిన చుక్కలు మోవcగc బెరిగితి
విట్టిప్రతాపివి యెదురేదయ్యా

చ. 2: అంపిన యప్పుడె యంబుధి దాcటితి-
వింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపునుc బేర్కొన వశమా

చ. 3: బెదరక నేcడే శ్రీవేంకటగిరిc
గదిసి రాముకృప గైకొంటి
వదలక నీ కృపవాcడనైతినిదె
యెదుటనే కాచితివిcకc గడమేమీ

రేకు: 0273-05 నారాయణి సం: 03-422 శరణాగతి

పల్లవి: దేవ నీ పక్షపాతమో తిరిగే లోకుల వెల్తో
శ్రీవిభుఁడ నీవే కాదా చిత్తములోనయ్యా

చ. 1: దివములు సరియే దినరాత్రులును సరే
యివల సుఖదుఃఖాలు హెచ్చుకుందులేలయ్యా
భవములు సరియే ప్రాణములు సరియే
భువిఁ బుణ్యపాపముల భోగము వేరేలయ్యా

చ. 2: వినికిందరి కొకటే విషయాలు నొకరీతే
మునిఁగేటి జాతిభేదము లివేలయ్యా
అనయముఁ జూపొక్కటే ఆఁకలియు నొకటే
పెనఁగేటి గుణముల పెక్కుఁజాడ లేలయ్యా

చ. 3: అంతరాత్మ నీ వొక్కఁడ వన్నిటా శ్రీవేంకటేశ
చింతలు వేవేలైన సిలుగేలయ్యా
యింత సేసీ నీ మాయ లిందుకే నీ శరణంటే
కాంతుఁడ న న్నిందుకే కాచితివి నేఁడయ్యా

రేకు: 0273-06 మంగళకౌశిక సం: 03-423 శరణాగతి

పల్లవి: నేమెంత మూఢులమైనా నీలవర్ణుఁ డంతరాత్మ
మా మనసు వెలితేల మంచిదౌఁ గాక

చ. 1: దైవము కృప గలితే తన కర్మా లడ్డమా
ఆవేళ ఘనపుణ్యుఁడౌఁ గాక
గోవిందుఁడు మన్నించితేఁ గొంచము దొడ్డున్నదా
కోవరపు సిరులంది కొన కెక్కుఁగాక

చ. 2: పరమాత్ముఁ డేలుకొంటే బంధములు గలవా
తెరదీసినట్లానె తెగుఁ గాక
హరి విజ్ఞానమిచ్చితే నడ్డము మాయలుండునా
తొరలి జీవుఁడు మాయఁ దొలఁగుఁ గాక

చ. 3: శ్రీవేంకటేశ్వరు రూపు చిత్తములోఁ జిక్కితేను
చావుఁబుట్టుగు లున్నవా జయమౌఁ గాక
కైవల్య మీతఁ డిచ్చితేఁ గడమలు గలవా
కేవలపు జగమెల్లా గెలుపించుఁ గాక

రేకు: 0274-01 మంగళకౌశిక సం: 03-424 మాయ

పల్లవి: విడువవో మాయా విష్ణువధీనము
వొడలిది నీ కెందు నునికే లేదు

చ. 1: శ్రీపతినామము చేకొనే నాలుక
యే పాపములకు నెడలేదు
దాపగు గోవిందుఁ దలఁచిన మనసిది
కోపముల కిరవుకొన నెడలేదు

చ. 2: నెలవుగ హరికథ నిండెను వీనుల
కలిదోషము లిక్కడ లేవు
అలరిన జన్మం బచ్యుతు శరణని
నిలిచె దుఃఖముల నివారణము

చ. 3: శ్రీవేంకటపతిఁ జేరె నాత్మ యిది
భావవికారము పని లేదు
దైవాధీనము తత్త్వవిచారము
వేవేలు కర్మపువిధులే లేవు

రేకు: 0274-02 లలిత సం: 03-425 అంత్యప్రాస

పల్లవి: ఇన్నిటా శ్రీహరిభక్తి యిది లాభము
పన్నిన తపముచేత బడలుటే లాభము

చ. 1: యెనయఁ గర్మదేహ మిదెన్ని పాట్లు వచ్చినా
ననుభవించి తీరుచు టది లాభము
తన పాపవర్తన యితరు లెంత నిందించినా
ననుమానించక పడుటది లాభము

చ. 2: తగు సంసారజీవుఁడు తన్నెంత వేసరించినా
నగి రుణము దీర్చుట నానాలాభము
చిగురువంటి చిత్తము చేరి యెందు దిప్పినాను
తగిలి యలయుటే దక్కినట్టి లాభము

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు జీవములో నుండఁగాను
యేవేళ నెట్లయినా నివి లాభము
పావనమైనట్టి యాత్మభావమెంత మఱచినా
ఆవల నానందించుటది లాభము

రేకు: 0274-03 లలిత సం: 03-426 అధ్యాత్మ

పల్లవి: మనసొకటి కోరికలు మాలు గలపుచు(?)నుండు
తనిసితే నదియ పరతత్త్వమై నిలుచు

చ. 1: కన్నులనియెడి పాపకర్మంబు లివి రెండు
పన్ని తామెన్నింటి పైపైనఁ బారు
మున్నె యివి హరిపాదముల మీఁద నిలిపినను
అన్ని పుణ్యంబులను అందునే కలుగు

చ. 2: వీనులనియెడి మహావెడఘోర నరకములు
అన్ని పరనిందలే ఆలింపుచుండు
నానాట యిందులో నారాయణుని కథలు
వూని నించిన పుణ్యభోగములే యొసఁగు

చ. 3: నాలుకనియెడి గుహను నాచుఁబామది యొకటి
గాలి అమృతపు విషము గ్రక్కుచుండు
యీ లీల శ్రీవేంకటేశు నామామృతము
సోలి నించవే ఆత్మ శుభములే కలుగు

రేకు: 0274-04 కేదారగౌళ సం: 03-427 నామ సంకీర్తన

పల్లవి: ఎన్ని చందముల నెట్టైన నుతింతు
కన్నుల నిన్నే కనుఁగొంటిఁ గాన

చ. 1: గోవిందాయని కొలిచిన నిన్నే
శ్రీవల్లభుఁడని చింతింతును
భూవిభుఁడవు యిది పునరుక్తనకుమీ
దైవ మొకఁడవే ధరణికిఁ గాన

చ. 2: పరమాత్ముఁడవని భక్తి సేసి నిను
నరహరివని ధ్యానము సేతు
సరవులఁ జర్విత చర్వణమనకుమీ
అరయఁగఁ గురి యంతరాత్మవు గాన

చ. 3: సరుగ శ్రీవేంకటేశ్వర నీదాస్యము
మరిగితె నదె ముమ్మాఁటికిని
తిరిగినయందె తిరిగెదననకుమీ
యిరవుగ నితరం బిఁకలేదు గాన

రేకు: 0274-05 గుజ్జరి సం: 03-428 వైరాగ్య చింత

పల్లవి: దేవ నీవేకాల మెట్టు దిప్పినాఁ దిరుగుట గా-
కీవలఁ బెద్దరికము యెక్కడిదో తనకు

చ. 1: దొరకొని జీవుఁడు దుఃఖముల కోపఁడు
నరకములోనఁ దననాఁటి పాటెంచఁడు గాని
సిరుల కొరకుఁగాఁ జిందువందయ్యీఁ బ్రాణి
పురువై పుట్టినపుడే బుద్ధులెందు వోయనో

చ. 2: పొల్లువోకి మేను నేఁడు భోగించకుండలేదు
తల్లికడుపులోనుండి తానేమి భోగించెనో
యిల్లు ముంగి లాసపడీ నిప్పుడే యీగుణము
తొల్లి జనించనినాఁడు తొలఁగి యెందుండెనో

చ. 3: గుక్కక మనసు నేఁడు కోరక వుండఁగలేదు
తక్కి బ్రహ్మప్రళయానఁ దా నెట్లుండెనో
నిక్కి శ్రీవేంకటేశ్వర నీమరఁగు నేఁ జొచ్చితి
యెక్కువఁ దానిటమీఁద నెందుకు దాఁగీనో

రేకు: 0274-06 కన్నడగౌళ సం: 03-429 విష్ణు కీర్తనం

పల్లవి: నడపే వేఁటికి నాటకము
అడరి నిజముగా నానతి యీవే

చ. 1: విశ్వమూర్తి కొక విన్నపము
శాశ్వతములాయ జగములివి
యీశ్వరేశ్వరున కింకొక విన్నపము
ఐశ్వర్యమోక్షం బాత్మలకేది

చ. 2: రమాధిపతి కొక రహస్యము
సమానుఁడవు నీవు సర్వమున
క్రమాన నిఁక నొక రహస్యము
సమోహి (?) నరకము స్వర్గము నేలా

చ. 3: హరి నే నొకమాఁ టడిగెదను
నిరంతరాత్మవు నీవుగదే
యిరవుగ శ్రీవేంకటేశ నే నడిగెద
విరసము లేదిఁక విచార మేలా

రేకు: 0275-01 శంకరాభరణం సం: 03-430 వైరాగ్య చింత

పల్లవి: చానిపి లోపలఁ జవిగలదా! యివి
మానిపి నీ గతి మరపుదుఁ గాకా

చ. 1: చంచలపు గుణముల జడిసిన జీవుఁడు
మంచి గుణంబుల మలసీనా
అంచెల హరి నీ వంతర్యామివి
నించి నీ గుణమే నెరవుదుఁ గాకా

చ. 2: బూతుల యెంగిలిఁ బుట్టిన దేహము
బాఁతిగ శుచియై పరగీనా
చైతన్య మందులో శ్రీపతివి నీవు
నీ తత్త్వ ఫలమే నెరపుదుఁ గాకా

చ. 3: లలి సుఖదుఃఖపు లంకె కాఁపురము
మెలుపున సాజాన మెలఁగీనా
యిలపై శ్రీవేంకటేశ్వర నీవిది
కలిగించితి విఁకఁ గాతుపుఁ గాకా

రేకు: 0275-02 లలిత సం: 03-431 అద్వైతము

పల్లవి: అన్నిటికి నారదాదు లదివో సాక్షి
యిన్నిటా మాకుఁ గలిగె నేమైనాఁ గాని

చ. 1: భూమిలోన నెన్నియైనా పుణ్యములు గలవు
కామింప నాచారాలు కల వెన్నైనా
సామజవరదు నొక్కసారె దలఁచినందుకు
యేమియును సరిగావు యెట్టయినాఁ గాని

చ. 2: వుత్తమలోకసుఖము లొగి నెన్నైనాఁ గలవు
యిత్తల సిరులు గల విల నెన్నైనా
చిత్తజగురుని నటు సేవించే పుణ్యమువలె
నిత్తెము గావు గాని నిచ్చలు నెంతైనను

చ. 3: కలవు మతాలు గొన్ని కలవు ముక్తులు గొన్ని
కలవు మాయలు పెక్కు గల్పించేవి
తలఁచి శ్రీవేంకటేశు దాసుఁడైన భాగ్య మిది
గలిగె నిట్టే మాకుఁ గాణాచి గాని

రేకు: 0275-03 లలిత సం: 03-432 దశావతారములు

పల్లవి: రామకృష్ణ నీవు నందే రాజ్య మేలుచుండుదువు
యేమి సేసే విక్కడ నీ యిరవుకే పదవే

చ. 1: లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
అంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
వేంకటాద్రి పొంతనుండ వేగ మమ్ము నంపవే

చ. 2: ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁ గపుల నిండ్ల కంపినట్టు
వొనర గోపికలొద్ది కుద్ధవుని నంపినట్టు
ననువు శేషాద్రినుండ నన్ను పంపవే

చ. 3: పెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనే ముందరఁ గంత కంపినయట్టు
వెండియు శ్రీవేంకటేశ వేఁట వచ్చి మరలితి-
వుండ (డు?)చోట నుండి నన్ను వూడిగాన కంపవే

రేకు: 0275-04 రామక్రియ సం: 03-433 దశావతారములు

పల్లవి: విచ్చేయవయ్యా వేంకటాచలముపొంత-
కచ్చుగా నేమున్నచోటి కచ్యుతనారాయణా

చ. 1: అల్లనాఁడు లంక సాధించందరును బొగడఁగ
మల్లడి నయోధ్యకు మరలినట్లు
యెల్లగాఁ గైలాసయాత్ర కేఁగి కమ్మర మరలి
వెల్లవిరి ద్వారకకు విచ్చేసినట్లు

చ. 2: యెన్నికతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరలినట్లు
అన్నిచోట్లా నుండి అల్లిరము లారగించ
వెన్నుఁడవై వేడుకతో విచ్చేసినట్లు

చ. 3: వహికెక్కఁ ద్రిపురాల వనితల బోధించి
మహి నిందిర వొద్దికి మరలినట్లు
విహగగమన శ్రీవేంకటేశ మముఁ గావ
విహితమై నామతిలో విచ్చేసినట్లు

రేకు: 0275-05 బౌళి సం: 03-434 దశావతారములు

పల్లవి: మా దురితములు వాపి మమ్ముఁ గాచుటరుదా
శ్రీదేవీరమణుఁడ శ్రీవేంకటేశ

చ. 1: అంబరీషుఁ బైకొన్న ఆపదలన్నియుఁ బాపి
బెంబడిఁ గాచె నీచే పెనుచక్రము
అంబరాననున్న ధ్రువు నజ్ఞానమెల్లఁ బాపె
పంబి నీ చేతనుండిన పాంచజన్యము

చ. 2: పక్కన జరాసంధు బలమెల్ల నుగ్గాడి
నిక్కము మధురనిల్పె నీచే గద
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరిచేటి నీఖడ్గము

చ. 3: వెడ రావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిదుముడి పడక నీచే శార్ఙ్గము
యెడమీక శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గాచె
బడిబడి నీనామపఠన నేఁడిదిగో

రేకు: 0275-06 దేవగాంధారి సం: 03-435 శరణాగతి

పల్లవి: తప్పు లెంచ కిఁక దరి చేర్చవయ్యా
చెప్పనేల నీ చిత్తమయ్యా

చ. 1: కలిదోషహరణ కర్మవిదారణ
సులభపు నీ దాసులమయ్యా
కలిగిన శరణాగత వజ్రపంజర
వలనగు నీ మరఁగువారమయ్యా

చ. 2: దురితనివారణ దుఃఖవిమోచన
దొరకొని నీ భక్తులమయ్యా
కరిరాజవరద కరుణాసముద్ర
సరి నిను నమ్మిన జంతులమయ్యా

చ. 3: శ్రీకాంతప్రియ శ్రీవేంకటేశ్వర
కై కొన్న నీ కింకరులమయ్యా
మాకేల యితరపు మతదై న్యంబులు
పైకొనఁ బోఁజేసి పాలించవయ్యా

రేకు: 0276-01 రామక్రియ సం: 03-436 వైరాగ్య చింత

పల్లవి: ఎంత గాలమైనాను హెచ్చీ నాసలు శ్రీ-
కాంతుఁడ వింతటనై నాఁ గరుణించరాదా

చ. 1: పచ్చితనానఁ దిరిగి పండవద్దా చిత్తము
గచ్చులఁ దాఁ గసుఁగాయే కలకాలము
చచ్చి చచ్చి పుట్టి పుట్టి జారవద్దా కర్మము
కొచ్చి కొచ్చి సేసి సేసి గోరపడీఁ గాక

చ. 2: రోఁత గడుపున నించి రోయవద్దా దేహము
కూఁతలతో రుచులెల్లాఁ గోరీఁగాక
చేఁతలు యీగుణమైన సిగ్గుపడవలదా
బాఁతిపడి విషయాలఁ బరచయ్యీఁ గాక

చ. 3: నానాఁడే విరతిఁబొంది నవ్వు నవ్వవలదా
మానక యీ జీవుఁ డనుమానించీఁ గాక
మోనాన శ్రీవేంకటేశ మొక్కి నీదాసుడఁ గాఁగా
అనిన విన్నియుఁ బరిహరమయ్యీఁ గాక

రేకు: 0276-02 లలిత సం: 03-437 ఉపమానములు

పల్లవి: సొమ్ము గలవాఁడు తన సొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీ సొమ్మను నేను కాపాడవే హరి

చ. 1: పసుర మడవిఁ బడ్డ పసురము గలవాఁడు
దెసలు వెద కింటికిఁ దెచ్చు కొన్నట్టు
వసగా నాసల లోన వడిఁబడ్డ నా మనసు
యెసగ మళ్లించవే నన్నేలిన గోవిందుఁడా

చ. 2: గొందిఁ బంట సేయువాఁడు కొలుచులు పరకళ్లఁ
జిందకుండా గాదెఁ బోసి చేరి కాచీని
కందువ మమ్ముఁ బుట్టించి కన్నవారి వాకిళ్లఁ
జెంది కావనియ్యకువే జీవునిలో దేవుఁడా

చ. 3: కడుపులోని శిశువు కన్నతల్లి(ఁ?) దన్నితేను
బెడగు లెంచక కని పెంచీనటా
యెడమీక శ్రీవేంకటేశ నీకుక్షిలో నేను
తడవి తప్పుసేసినా దయఁ గావవే

రేకు: 0276-03 ధన్నాసి సం: 03-438 నామ సంకీర్తన

పల్లవి: మెచ్చుల దంపతులార మీరే గతి
మెచ్చితి నిన్నిట మిమ్ము మెరసె మీచేతలు

చ. 1: తమ్మిలోని మగువా వో ధరణీధరుఁడా
మిమ్ము నే నమ్మితి నాకు మీరే గతి
నెమ్మది నో యిందిరా నీరజలోచనుఁడా
కమ్మి యే పొద్దును మీరే కలరు నాపాలను

చ. 2: పాలజలధి కూఁతుర భక్త వత్సలుఁడ హరి
మేలిచ్చి రక్షించ నాకు మీరే గతి
కేలి నో శ్రీమహాలక్ష్మి కేశవదయానిధి
తాలిమి మీరే నాకు దాపు దండ యెపుడు

చ. 3: చెన్నగు రమాకాంత చెందిన వో మాధవ
మిన్నక యేపొద్దు నాకు మీరే గతి
చిన్ని యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడా
యెన్నికె కెక్కించి నన్ను నేలుకొంటి రిదిగో

రేకు: 0276-04 శంకరాభరణం సం: 03-439 అధ్యాత్మ

పల్లవి: దైవంబవు కర్తవు నీవే హరి
యీవల నావల నెవ్వఁడనయ్యా

చ. 1: తలఁచిన తలఁపులు దైవయోగములు
కలిగిన చేఁతలు కర్మములు
వెలసిన దేహము విషయాధీనము
యిలనౌఁ గాదన నెవ్వఁడనయ్యా

చ. 2: జిగి నింద్రియములు చిత్తపు మూలము
తగులమి (ము?) మాయకుఁ దనుగుణము
జగతిఁ బ్రాణములు సంసారబంధము
యెగదిగ నాడఁగ నెవ్వఁడనయ్యా

చ. 3: శ్రీతరుణీశ్వర శ్రీవేంకటపతి
ఆతుమ యిది నీయధీనము
యీతల నీవిఁక నెట్టైనఁ జేయుము
యే తలపోఁతకు నెవ్వఁడనయ్యా

రేకు: 0276-05 దేసాక్షి సం: 03-440 మనసా

పల్లవి: ఎన్నఁ డీఁక యేది గొలఁదిపాటు
వున్నతపు మాయలకే వొడిగట్టవలసె

చ. 1: చీ చీ మనసా చీ మనసా
కాచేటి పూచేటి వో ఘనజన్మమా
నీచు యెండమావులెల్లా నీళ్లంటా నమ్మినట్టు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె

చ. 2: కట్టా జీవుఁడా కటకటా జీవుఁడా
తొట్టిన పంచభూతాలతోడి దేహమా
వెట్టిఁ జెఱకుపోలికి వెదురు నమలినట్టు
కట్టిన యీ కనకమే బ్రహ్మమనవలెసె

చ. 3: బాపు బాపు దైవమా భావపు శ్రీవేంకటేశ
చూపుల నాయాతుమలో సుజ్ఞానమా
దోపుచుఁ బూవులవల్ల తుంగ దల కెక్కినట్టు
దాపగు నాలికె నిన్నుఁ దలఁచఁగవలసె

రేకు: 0276-06 దేవగాంధారి సం: 03-441 శరణాగతి

పల్లవి: పొందినవెల్లా భోగ్యములే
అందరిలో నీక ననుమానమేలా

చ. 1: హరి నీ సంకల్ప మన్నిట నుండఁగ
గరిమల మా సంకల్పము లేఁటికి
దురితము లణఁచీ దొర నీ నామము
సొరిది విధికిఁగా సుడివడనేలా

చ. 2: జిగి నీ ధ్యానము చింతలు మాన్పఁగ
వెగటున మా కిఁక వెడ చింతేఁటికి
తగు నీ తత్త్వము తపఃఫల మొసఁగ
అగడుఁ గోరికల ఆసలిఁ కేలా

చ. 3: కమ్మి నీ శరణుగతి యిటు చూపఁగ
కమ్మర నుద్యోగము మాకేఁటికి
యిమ్ముల శ్రీవేంకటేశ్వర మా పాల
నెమ్మదిగలవిఁక నే నాడనేలా

రేకు: 0277-01 రామక్రియ సం: 03-442 అధ్యాత్మ

పల్లవి: రాతిరిఁ బగలనేటి రెంటి నడుమనుఁ జిక్కి
వూఁత గాన వెళ్లనీరో వో యాసలాల

చ. 1: దైవ మెప్పుడు గలఁడు తలఁచఁగలేము గాని
కైవసమై జీవుఁడుండు కానరాదు గాని
పూవు పిందెవంటి పాపపుణ్యములఁ జిక్కినాఁడ
తోవచూపరో మాకు తొలుజన్మములాల

చ. 2: లోకము మాయామయమై లోనుఁ గాకుండుఁ గాని
జోక పరమాత్మలోనే సోదించము గాని
కైకొని మూసితెరచే కనురెప్పలనుఁ జిక్కి
వాకిలిఁ గనేఁ జూపరో వద్దనున్న కాలమా (?)

చ. 3: రూపము విజ్ఞానమే రూఢి కెక్కనైతిఁ గాని
కాపు శ్రీవేంకటేశుఁడే గతి గంటిఁ గాని
యీవారి నేనై తే నిహపరాలకుఁ జిక్కి
పైపూఁత లేమి గానఁ బాలించవో గురుఁడా

రేకు: 0277-02 సామంతం సం: 03-443 శరణాగతి

పల్లవి: ఇంతటఁ గావఁగదే ఇందిరానాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు

చ. 1: దించని పంచభూతాల దేహము మోచితిఁ గాన
నించిన యజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ బట్టువడ్డవాఁడఁ గాన
యెంచరాని పాపములే ఇన్నియు జేసితిని

చ. 2: మిన్నువంటి జఠరాగ్ని మింగివున్నవాఁడఁ గాన
కన్నవెల్లా వేఁడి వేఁడి కష్టపడితి
పన్నిన సంసారపు భ్రమ బడ్డవాఁడఁ గాన
అన్నిటా దేవతలకు సరిగాఁపనైతి

చ. 3: ఆతుమలో నీ వుండే భాగ్యము గలవాఁడఁ గాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాఁడఁ గాన
బాతితో సర్వము నీ కొప్పనము సేసితిని

రేకు: 0277-03 లలిత సం: 03-444 శరణాగతి

పల్లవి: తనిసితి మిన్నిటి తగులేలో
మినుకుల దినముల మెచ్చేమయ్యా

చ. 1: మనసూ రోసితి మరులూఁ బాసితి
తనువేలో పైతరవాయ
వెనకాఁ దెలిసితి మునుపూఁ జూచితి
నను నేనే యిఁక నవ్వేమయ్యా

చ. 2: మాయల వెడలితి మమతల బడలితి
పాయంబేలో పదరీని
దాయల గెలిచితి ధర్మముఁ బిలిచితి
పోయిన జన్మముఁ బొగడేమయ్యా

చ. 3: శరణఁ జొచ్చితి జయముల హెచ్చితి
దురితములెందో తొలఁగీని
గరిమల శ్రీవేంకటపతిఁ గొలిచితి
తరతర మిందే దక్కితిమయ్యా

రేకు: 0277-04 శ్రీరాగం సం: 03-445 శరణాగతి

పల్లవి: నీవు నట్ల నేరుపు నేరమి నేఁడు నా యెడకుఁ జూడకుమీ
సేవలయెడ తృణము మేరువుగఁ జేసుకోఁగలవు నీమహిమలను

చ. 1: తప్పు లెరంగము వొప్పు లెరంగము దైవమనేనిను నుతియించేదా
నెప్పున వేదము సకలశబ్దము నీవేయని చాటఁగ వినుచు
ఇప్పుడు ద్రిష్టాంత మొకటి చెప్పెద నిందుకు సముద్రుఁ డిటు తనలో
చిప్పలు గుల్లలు బహురత్నంబులు చేకొని గర్భీకరించుఁ గదా

చ. 2: కర్మ మెరంగ నకర్మ మెరంగను కరుణానిధి నినుఁ బూజించేదా
నిర్మల వేదము చైతన్యంబిది నీవేయని చాటఁగ వినుచు
అర్మిలి ద్రిష్టాంత మిందుకు నొకటె అన్నియు గర్భీకరించుకొని
ధర్మాధర్మపు మనుజులనెల్లాఁ దగ నీ భూకాంత మోచుఁ గదా

చ. 3: జ్ఞాన మెరఁగ నజ్ఞాన మెరఁగను సారెకు నిను నేఁ దలఁచేదా
ఆనిన వేదము శ్రీవేంకటేశ్వర అంతరాత్మ నినుఁ జాటఁగను
పూని ద్రిష్టాంతము మీ కిటు సరిగాఁ బోలుపరా దిఁకనైనాను
తానే సూర్యుఁడు రాత్రి గల బయట తన గుణము వేగి నెరపుఁ గదా

రేకు: 0277-05 లలిత సం: 03-446 శరణాగతి

పల్లవి: కలదందే పో సర్వముఁ గలదు కామితార్థమునుఁ గలదు
కలదు గలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు

చ. 1: ఆకాశంబున మోక్షము వెదకిన నందులోపలా లేదు
పైకొని తానెంత వెదకి చూచినా పాతాళంబున లేదు
యీకడ ధరలో మూలమూలలను యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతిఁ జింతించి యాసలఁ జిక్కక తొలఁగిన నందే కలదు

చ. 2: కోటిజన్మములు యెత్తిన ముక్తికి కొనమొదలేమియుఁ గనరాదు
వాటపు సంసారములోఁ గర్మపువార్ధి యీఁదినాఁ గనరాదు
కూటువతో స్వర్గాది లోకములఁ గోరి వెదకినాఁ గనరాదు
గాఁటపు కేశవభక్తి గలిగితే కైవల్యము మతిఁ గానఁగవచ్చు

చ. 3: సకలశాస్త్రములు చదివినాఁ బరము చక్కటి మార్గము దొరకదు
వికటపు పలువేల్పుల నెందరిఁ గడువెదకి కొలిచినా దొరకదు
అకలంకుఁడు శ్రీవేంకటగిరిపతి అంతరంగమున నున్నాఁడనుచును
ప్రకటముగా గురుఁ డానతి ఇచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు

రేకు: 0278-01 సామంతం సం: 03-447 దశావతారములు

పల్లవి: సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకుని భక్తి గలిగితే మేలు

చ. 1: వినయపు మాటల విద్య సాధించితే మేలు
తనిసి యప్పులలోన దాఁగకుంటే మేలు
మునుపనే భూమి దన్ను మోచి దించకుంటే మేలు
వెనుకొన్న కోపము విడిచితే మేలు

చ. 2: కోరి వొకరి నడిగి కొంచపడకుంటే మేలు
సారె సారె జీవులను చంపకుంటే మేలు
భారపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్ల కొడిగట్టకుంటే మేలు

చ. 3: పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీవేంకటాద్రివిభునిఁ గొల్చి
యిరవై నిశ్చింతుఁడైతే నిన్నిటాను మేలు

రేకు: 0278-02 లలిత సం: 03-448 విష్ణు కీర్తనం

పల్లవి: భగవద్విభవపు ప్రత్యక్షం బిది
జిగి నిందొకటియుఁ జేయఁగఁ గలమా

చ. 1: దైవికమెపో తతియగు వానలు
తావగు మొలకలు దైవికమే
కావిరినివెల్లాఁ గంటా వింటా
దైవమునేలో తలఁచము మనము

చ. 2: జననమరణములు హరి దైవికమే
తనుపోషణములు దైవికమే
యెనసి యివెల్లా నెఱిఁగియు మరిగియు
కొన దైవమునేలో కొలువము మనము

చ. 3: యిహపరంబులును యివి దైవికమే
తహతహ లుడుపఁగ దైవికమే
అహిపతి శ్రీవేంకటాధిపు కృపచే
మహిమ గంటిమిఁక మఱవము మనము

రేకు: 0278-03 బౌళి సం: 03-449 వైష్ణవ భక్తి

పల్లవి: నన్నెంచఁ బనిలేదు నిన్నెంచుటే కాని
మన్నించు హరి నీ మఱఁగు చొచ్చితిని

చ. 1: రాజుఁ బెండ్లాడిన యట్టి రమణి యేజాతైనా
పూజితమై యిన్నిటాను భోగించినట్టు
సాజాన నే నెంత సకలహీనుఁడనైనా
వోజతో నిన్నుఁ గొలిచి వున్నతుఁడనైతిని

చ. 2: వేల ముద్దుటంగరము వేడుకనిడి ప్రధాని
కేలెత్తి యిందరిచే మొక్కించుకొన్నట్టు
నేలనే నీ ముద్ర మోచి నే నేఁటివాఁడనైనా
పేలరి జగములోనఁ బెద్దనైతి నిదివో

చ. 3: తల్లిదండ్రి గలవాఁడు తప్పులేమైనాఁ జేసి
తల్లితో ముద్దుగునిసి తప్పించినట్టు
చల్లని శ్రీవేంకటేశ సరవి నీ కృపవల్ల
కెల్లున నిన్ను నుతించి గెలిచితి నిదివో

రేకు: 0278-04 శుద్ధవసంతం సం: 03-450 వైష్ణవ భక్తి

పల్లవి: ఎందు వెదకనేల యే ప్రయాసాలు నేల
యిందే వున్నది బ్రదు కిహపరములకు

చ. 1: ముక్కోటి తీర్థములు ముకుందుదాసుల-
వొక్కపాదాంగుటమున నొలికీనిదే
మిక్కిలి జపతపాలు మించిన ప్రపన్నుల-
చిక్కని కృపాకటాక్షసీమ నున్నదిదివో

చ. 2: చేసేటి పుణ్యఫలాలు శ్రీవైష్ణవులచేత
రాసులై యిరుదెసల రాలీనివే
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల-
భాసురపుఁ బెదవులఁ బాఁతి పైపై నున్నది

చ. 3: సకలదేవతలచే సాధించే వరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవేంకటాద్రివిభుని మహిమలెల్లా
ప్రకటించి వీరి సల్లాపాన నున్నదిదివో

రేకు: 0278-05 సాళంగం సం: 03-451 శరణాగతి

పల్లవి: నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపుదయ
జోక నురుత మెచ్చిన సులభుఁడవేకా

చ. 1: నేరములు దొలఁగించ నెలవులు గలిగించ
గారవించ హరి నీవే కలవు నాకు
నార పేరఁ బిలిచితే నారాయణ యనెనంటా
చేరి కాచినటువంటి శ్రీపతివిగా

చ. 2: దురితము లణఁగించ దుఃఖములు పెడఁబాప
గరిమఁ గేశవ నీవే కలవు నాకు
మరమరా యంటేను మరి రామ యనెనంటా
తిరముగఁ గాచి నట్టి దేవుఁడవుగా

చ. 3: వినుతులు చేకొని వేడుకతో నన్నుఁ గావ
ఘనుఁడ శ్రీవేంకటేశ కలవు నాకు
మనసునఁ దలఁచితే మాటలఁ బిలిచెనంటా
తనిసి కంభాన వెళ్లే దైవమవుగా

రేకు: 0278-06 గుండక్రియ సం: 03-452 వైష్ణవ భక్తి

పల్లవి: ఏ పాటి తన కర్మ మాపాటి కాపాటె
శ్రీపతిదాసుఁ డయితే చిహ్న లిటువలెఁ బో

చ. 1: అందరిని నిర్మలులే యని తలఁచిన తన-
నింద లేని మనసే నిర్మలము
మందలించి లోకులతో మంచి మాఁట లాడితేను
బందెలేని తన నోరే భావించ మంచిది

చ. 2: అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన-
యంతరంగమున నుండు నీ దేవుఁడే
చింతించి యీ జగము చేకొని పావనమంటే
పంతపు తన దేహముఁ బరమపావనమే

చ. 3: పుట్టితేఁ దన పాలికిఁ బుట్టే నీ ప్రపంచము
దట్టమైన పుట్టెల్లఁ దనతోడిదే
యిట్టే శ్రీవేంకటేశుఁ డిచ్చినాఁడీ గుణము
పట్టమై నావద్దనుండు పరమవిజ్ఞానము

రేకు: 0279-01 రామక్రియ సం: 03-453 విష్ణు కీర్తనం

పల్లవి: బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే
తలఁ చాతనికి మొక్కఁ దగులింతే నేము

చ. 1: దైవమే భారకుఁడు ధరణి రక్షించుటకు
భావింప నరులచేత పనిలేదు
శ్రీవల్లభుఁ డతఁడు నేసినట్టల్లా నవును
వావాత ననుభవించేవారమింతే నేము

చ. 2: హరియే స్వతంత్రుఁడు అన్నిపనులుగాఁ జేయ
పరుల వుద్యోగాలు పనిలేవు
సురనాథుఁ డాతఁడు చూచినట్టల్లా నవును
వరుసతోఁ దిరిగాడేవారమింతే నేము

చ. 3: సకలేశుఁడే కర్త జగములు గాచుటకు
ప్రకటించ నేర్పులు పనిలేవు
వొకట శ్రీవేంకటేశుఁ డొనరించినట్లవును
సుకియించి పొగడేటి సుద్దులింతే నేము

రేకు: 0279-02 బౌళి సం: 03-454 అధ్యాత్మ

పల్లవి: వద్దిక నోపము వట్టి స్వతంత్రము
వొద్దిక శాంతితో నుండేమయ్యా

చ. 1: నడవక మానవు నానాజగములు
కడఁగిన హరిసంకల్పానను
వుడుగ కిందు నా వుద్యోగమేఁటిది
నడుమనే కనుఁగొని నవ్వేమయ్యా

చ. 2: కలుగక మానదు కాఁగల భోగము
కలిమిఁ బురాకృత కర్మమిది
అలసి యిందు నా యాస లేమిటికి
కలిగిన పాటే కానీవయ్యా

చ. 3: తగులక మానదు తన సంసారము
వెగటగు మాయావిలాసము
అగపడి శ్రీవేంకటాధిపు కృపచే
తగిన పాటినే తనిసేమయ్యా

రేకు: 0279-03 దేవగాంధారి సం: 03-455 శరణాగతి

పల్లవి: ఒక్కమాటు శరణుని వుండేనింతే కాక
పెక్కు విధముల నెట్టు పెనఁగేనయ్యా

చ. 1: నాలికె వొక్కటే నీ నామము లనంతము
పోలించి నే నిన్నెట్టు పొగడేదయ్యా
వోలి నాకన్నులు రెండే వొగి నీ మూర్తులు పెక్కు
సోలి నే నిన్నెటువలెఁ జూచెదనయ్యా

చ. 2: వట్ట నా చేతులు రెండే పదములు నీకుఁ బెక్కు
వొట్టి నిన్నుఁ బూజించ నోపికేదయ్యా
గట్టి నాచెవు లిసుమంత కథలు నీకవియెన్నో
పట్టపు నేనెట్టు విని భజియించేనయ్యా

చ. 3: యేమిటాఁ జిక్కవు నీవు యింత దేవుఁడవుగాన
కామించి నీడాగు మోచి గతిగ నేను
యీ మేర శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గావు
దీమసాన నిఁక వేరేతెరువు లేదయ్యా

రేకు: 0279-04 సామంతం సం: 03-456 భక్తి

పల్లవి: గరిమల నెరఁగరుఁ గాక మానవులు
సిరులఁ దియ్యని నోరఁ జేఁదు మేసేదా

చ. 1: హరినారాయణ యనియెడి నోరను
ధర నితరుల పేళ్లు దడవుటెట్లు
సరవితో వేదములు చదివేటి నోరను
పరులమీఁది పదాలు పాడేదా

చ. 2: మునుప శ్రీపతికి మ్రొక్కిన చేతుల
అనరుహులకు దండమనుట యెట్లు
మునుకొని పూవులు ముడిచిన సిరసున
కనలి కట్టెలు మోచి కాకయ్యేదా

చ. 3: బలిమి శ్రీవేంకటపతిఁ గొలిచినవారు
తెలియ కల్పులఁ గొల్పి తిరుగుటెట్లు
జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగ
వలవని జోలితో వదరు వట్టేదా

రేకు: 0279-05 బౌళి సం: 03-457 శరణాగతి

పల్లవి: వేళ లేదు జాడ లేదు వీని తోడిదే పాటు
కూళఁడనై తిరిగేను గుణమేది నాకు

చ. 1: వేగిరించి పెరరేఁచి వేసరించీఁ బనులు
సాగి ముందరఁ బొలసి చలపట్టీ సిరులు
జాగు సేసి వచ్చి వచ్చి చవి చూపీఁ బాయము
యేగతి నిన్నుఁ దలఁతు నేది బుద్ధి నాకు

చ. 2: తన్నుఁదానే వచ్చి వచ్చి తగిలీ లంపటము
వున్నతి భోగముల నోరూరించీ సుఖము
కన్నచోనే యెలయించి కదిమీ సంసారము
యెన్నఁడు నిన్నుఁ దలఁతు నెఱుకేది నాకు

చ. 3: తాలిమితో మీఁద మీఁదఁ దరవయ్యీఁ గర్మము
నాలితోడ సన్నసేసి నవ్వు నవ్వీ మర్మము
యేలితివి శ్రీవేంకటేశ్వరుఁడ నన్ను నీవు
సీలాన నీ వాఁడనైతిఁ జెప్పనేది నాకు

రేకు: 0279-06 లలిత సం: 03-458 అధ్యాత్మ

పల్లవి: అంతర్యామీ వో అంతర్యామీ
బంతి నాకేమిగల్లా నా పాలివాఁడవు గావా

చ. 1: దొంతులై అన్ని యోనులాఁ దొల్లి నేఁ బుట్టేటినాఁడే
అంతరాత్మవైనవాఁడ వటు నీవేకా
ఇంతట విడిచేవా నన్నింద్రియాలఁ గట్టివేసి
పొంతఁ జూచేవిటు నాకుఁ బొత్తులకాఁపవుగా

చ. 2: తొడరి స్వర్గనరక దుఃఖసుఖములనాఁడు
అడరి కర్మసాక్షివటు నీవేకా
విడువ వెప్పుడు నన్ను విషయాలఁ జిక్కినాఁడ
కడ నూరకుండనేల కన్నవాఁడవు గావా

చ. 3: నీ చేతఁగానిది లేదు నీవు నాకుఁ బ్రాణమవు
కాచుటకు నీకంటే నొక్కరు వచ్చేరా
చేచేత శ్రీవేంకటేశ చేరి నీకు శరణంటి
యేచి నన్ను మన్నించితివిది నీ తేజముగాదా

రేకు: 0280-01 సాళంగనాట సం: 03-459 అధ్యాత్మ

పల్లవి: తీరుచు నతఁడే దినకర్మంబది
నూరిటి రుణ మొక నూలిపోఁగునా

చ. 1: తొల్లిటి కర్మము దోడఁ గుడుచుటకె
తెల్లమి జీవుఁడు దేహము మోచుట
వొల్లనన్నఁ బోదున్నంత గాలము
మల్లాడి హరినే మఱవఁగ వలదు

చ. 2: కోరిన కోర్కికి గురియగు నందుకె
సారపు సంసారసంగమిది
నేరిచి బ్రదికేటి నెపమునఁ బోదది
కూరిమి హరినే కొలువఁగవలయు

చ. 3: తెంచని యాసలఁ దిప్పుటకే పో
పంచేంద్రియముల పంతమిది
చించినఁ బోదిది శ్రీవేంకటపతి
నించి మనసులో నించగవలయు

రేకు: 0280-02 లలిత సం: 03-460 వైష్ణవ భక్తి

పల్లవి: ఎక్కడి పుట్టుగ లిఁక నెక్కడి మరణములు
మిక్కిలి నీ ముద్రలు నా మేనను న్న వివిగో

చ. 1: కెరల పాపములకుఁ గెరల కర్మములకు
హరి నీ నామము నోరనంటితేఁ జాలు
నరకములేమి సేసు నా నేరమేమిసేసు
నిరతి నా మతిలోన నీ వుండఁగాను

చ. 2: చిక్క నింద్రియములకు చిక్కను బంధములకు
చొక్కి హరి నీ మఱఁగు చొచ్చితిఁ జాలు
మొక్కనేలే యెవ్వరికి మొరవెట్ట నేమిటికి
నిక్కపు మా యిలువేల్పు నీవై వుండఁగా

చ. 3: దగ్గరవు మాయలింక దగ్గరవు దుర్గుణాలు
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు గల్గఁగా
యెగ్గులేదు తగ్గులేదు యిఁక నీదాసులలోన
వుగ్గువలె నీప్రసాద మూనినది వొడల

రేకు: 0280-03 దేసాళం సం: 03-461 జోల

పల్లవి: జోజో యని మీరు జోల వాడరో

సాజపు జయంతి నేడే సఫల మిందరికి

చ. 1: అదె చంద్రోదయమాయ హరి యవతారమందె

మొదల జాతకర్మములు సేయరో

అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి

కదిసి యిట్టె నామకరణముఁ జేయరో

చ. 2: కాయము దేవకికిచ్చి గక్కన వాసుదేవుని-

కీయరో గంధాక్షత లిటు విడేలు

కాయకపు గాడిదెకు కవణము వెట్టి మరి

వీయపు చుట్టాలెల్ల వీడు వెట్టరో

చ. 3: షోడశోపచారములఁ జొక్కించి శ్రీవేంకటేశుఁ

బాడరో ధర్మము నిల్పె భార మణఁచె

వోడించెఁ గౌరవదానవులఁ గంసాదులఁ జంపె

ఆడనే పాండవులఁ గాచెనని యర్ఘ్యమియ్యరో

రేకు: 0280-04 సాళంగం సం: 03-462 వైష్ణవ భక్తి

పల్లవి: చరమార్థమందు నీవు చాటితివి గాన
ఇరవిది నమ్మితి నా కెదురెందు లేదు

చ. 1: పతికిఁ జనవరైన ప్రాణధారి లెంకలకు
తతినేమి సేసినాను తప్పులేదు
సతతము హరి నీ శరణాగతుఁడ నాకు (గాన?)
అతిపాపము సేసిన అది నాకు లేదు

చ. 2: పారుచు నగరి డాగు పసుర మెవ్వరిచేని-
పైరు మేసినా నందు బందె లేదు
సారె నీ ముద్రలు మోచి సంసారవిషయాల
యేరీతిఁ బొరలినా యెగ్గే లేదు

చ. 3: ధర్మానఁ గొని తెచ్చిన దాసులకు పూర వెట్టి-
అర్మిలిఁ జేయఁగఁ బని అంతలేదు
నిర్మల శ్రీవేంకటేశ నీ కరుణగల నాకు
కర్మ లోపమైనాను కడమే లేదు

రేకు: 0280-05 పాడి సం: 03-463 మాయ

పల్లవి: నీ మాయ లింతేకాక నీరజ నాభుఁడ! యివి
నా మది నిజమనెట్టు నమ్మేదయ్యా

చ. 1: బాలుఁడనై నేఁ జన్నుఁబాలు దాగేనాఁడు
వోలి ననుష్ఠానము లెందుండెనయ్యా
చాలి యానేనె బ్రహ్మచారి నయిన మీఁద
వాలి యవె యెందుండి వచ్చెనయ్యా

చ. 2: నేను దినదినమును నిద్దురవోయే వేళ
పూని నిత్యకర్మము లెందుండెనయ్యా
జ్ఞానముతో మేలుకొని సంసారినైన వేళ
ఆనుకొని యెందుండి అంటుకొనెనయ్యా

చ. 3: యేడ కర్మ మేడ ధర్మ మింతలో సన్యాసైతే
వేడుక కివియెల్లా నీ విలాసాలు
జాడ నీ మనసు వస్తే సరుగఁ గరుణింతువు
వోడక శ్రీవేంకటేశ వున్న సుద్దులేటికి

రేకు: 0280-06 రామక్రియ సం: 03-464 శరణాగతి

పల్లవి: హరిహరియని వెరగందుటఁ గాక
సిరివర మాకు బుద్ధి చెప్పఁగదవయ్యా

చ. 1: పాపపుకొంపలో వారు పంచమహాపాతకులు
కాపులకు పదుగురు కర్త లందుకు
తాపి కాండ్లారుగురు ధర్మాసనమువారు
చాపలమే పనులెట్టు జరగీనయ్యా

చ. 2: పలుకంతల చేను బండ వెవసాయము
బలిమిఁ దొక్కీఁ గుంటిపసురము
తలవరులు ముగురు తగువాదు లేఁబైయారు
సొలసి ఆనాజ్ఞ కిదుఁ జోటేదయ్యా

చ. 3: బూతాల పొంగటికే పొడమిన పంటలెల్లా
కోఁతవేఁత చూచుకొని కోరు కొటారు
యీతల శ్రీవేంకటేశ యిన్ని విచారించి నీ-
చేఁతే నిలిపితి విఁకఁ జెప్పేదేఁటిదయ్యా

రేకు: 0281-01 శుద్ధవసంతం సం: 03-465 శరణాగతి

పల్లవి: ఏమి సేయుదును నా కేది బుద్ధి యంతర్యామి
యీమతులఁ జిక్కి నీచిత్తమునకు నెట్టుండునోయని చింతయ్యెడిని

చ. 1: కులగోత్రంబులు గుణశీలంబులు
తెలియఁగ గర్వోద్రేకములు
కలసి మెలఁగినఁ గలుగదు జ్ఞానము
తొలఁగిన లోకద్రోహంబు

చ. 2: మఱియు గృహారామక్షేత్రంబులు
జఱిగొను మాయాజనకములు
మఱవఁగ నివియే మదకారణములు
విఱిగిన సంసారవిరుద్ధము (?)

చ. 3: అనుపమ వ్రతకర్మానుష్ఠానము-
లెనలేని బంధహేతువులు
తనిసితి నింక నీదాస్యంబే గతి
ఘనుఁడవు శ్రీవేంకటనాథా

రేకు: 0281-02 బౌళి సం: 03-466 వైష్ణవ భక్తి

పల్లవి: పారవేసిన పుల్లాకు బండికల్లై మించినట్లు
కోరి నీ ముద్రలు మోచి కొండగొంటి నిదివో

చ. 1: మూఁడుగుణములలోన మునిఁగేటివాఁడఁగాన
పోఁడిమి నాకొక బుద్ధి పుట్టదెందును
నేఁడు నీ శరణమనే నిశ్చయ మిచ్చితి గాన
వాఁడిమి నిన్నిటా నేఁ బావనమైతి నిదివో

చ. 2: పంచభూతాల తనువు పాటించి మోచితిఁగాన
పంచేంద్రియ వికారాలు పాయవు నాకు
యెంచఁగ నీదాస్యము నా కినామిచ్చితిగాన
పంచల నా పుట్టుగు సఫలమాయ నిదివో

చ. 3: తగిలి ఇన్నిటికి స్వతంత్రుఁడ నేఁ గాను గాన
జిగి నిన్ను నెరిఁగి పూజించలేను
నగుతా శ్రీవేంకటేశ నాలో నుండుదుగాన
పగటున నిన్ను నమ్మి బ్రదికితి నిదివో

రేకు: 0281-03 బౌళి సం: 03-467 అన్నమయ్య స్తుతి

పల్లవి: పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండు వేళల రాగాలను

చ. 1: తనువే వొళవు తలయే దండెకాయ
ఘనమై వూర్పులు రెండు కట్టిన తాళ్ళు
మనసే నీబద్దితాడు మరి గుణాలె జీవాళి
మొనసిన పుట్టుగే మూలమైన కరడి

చ. 2: పాపపుణ్యా లిరువంక పైఁడివెండియనుసులు
పైపైఁ గుత్తికె మేటిపై చనిగె
కోపుల నాలికెలోనఁ గుచ్చికట్టినట్టి తాడు
చూపరాని సంసారమే సూత్రపు గణికె

చ. 3: జీవునికిని దండె సేసినవాఁడవు నీవు
వావాతి మాటలే నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరా లిచ్చితివి మెచ్చితివి
శ్రీవేంకటేశ నీవే చేకొన్నదాతవు

రేకు: 0281-04 సాళంగనాట సం: 03-468 మాయ

పల్లవి: తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత
మానవుల లంపటాలు మరి చెప్పఁగలదా

చ. 1: చెలఁగి నేలఁ బారేటి చీమ సయితమును
కలసి వూరకే పారుఁ గమ్మర నెందో మరలు
తలమోఁచి కాఁపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము దనకిఁక నెంతగలదో

చ. 2: యేడో బాయిటఁ బారే యీఁగ సయితమును
వాడుదేర నడవుల వాలి వాలి
కూడపెట్టు దేనెలు గొందులఁ బిల్లలఁ బెట్టు
యేడకేడ సంసార మిఁక నెంతగలదో

చ. 3: హెచ్చి గిజిగాండ్లు సయిత మెంతో గూఁడు వెట్టు
తెచ్చి మిణుఁగురుఁబురువు దీపము వెట్టు
తచ్చి శ్రీవేంకటేశ నీ దాసులు చూచి నగుదు-
రిచ్చలఁ దాని సంసార మిఁక నెంత గలదో

రేకు: 0281-05 దేవగాంధారి సం: 03-469 శరణాగతి

పల్లవి: చెలఁగి యధర్మము పుట్టింప నీకేల సృష్టింపఁగ మరి నీకేల
పులులను లేళ్ల నొక్కకదుపుగా పులుమేపుదురటే మాధవుఁడా

చ. 1: గొనకొని పాషండుల దుర్భాషల క్రోధము సహింపరాదు
దనుజుల పుట్టువు వారలనుచు నిజతత్త్వజ్ఞానము నీ వియ్యపు
అనిశముఁ జూచిన వారికి మాకును అంతర్యామివి నీవు
పెనఁచి చీఁకటియు వెలుఁగును నొకచోఁ బెంచెదవేలే ముకుందుఁడా

చ. 2: ఖలుల తామసపు దేవతార్చనలు కనుఁగొనియవి యోర్వఁగరాదు
నెలకొని వారలు నరకవాసులని నీ మీఁది భక్తియు నీ వియ్యపు
పొలుపుగ నిందరిలోపలఁ గ్రమ్మరఁ బూజ గొనేటివాఁడవు నీవే
చలమునఁ బుణ్యము పాపము నొకచో సరిచేతురటవే గోవిందుఁడా

చ. 3: సతతము నీ దాస్యద్రోహులతో సహయోగంబును సహింపదు
క్షితిలో నీ వటువంటివారలను సృజింప కేర్పడ మానవు
హితవుగ శ్రీవేంకటేశ్వర నీవే యిహపరములకుఁ గర్తవు
గతి నీ శరణాగతియని నమ్మినఁ గలవిందరికిని నారాయణా

రేకు: 0282-01 లలిత సం: 03-470 విష్ణు కీర్తనం

పల్లవి: అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ-
డతనికంటే మరి యధికులు వేరయ్యా

చ. 1: కమలవాసిని లక్ష్మి కలదా యెవ్వరి కైనాఁ
గమలనాభునికి నొక్కని కే కాక
కమలజుఁడైన బ్రహ్మ కలఁడా యెవ్వని నాభి-
నమరవంద్యుఁడు మా హరికే కాక

చ. 2: అందరు నుండెడి భూమి యన్యులకుఁ గలదా
అందపు గోవిందునికే ఆలాయఁగాక
చెందిన భాగీరథి శ్రీపాదాలఁ గలదా
మందరధరుఁడయిన మాధవునికిఁ గాక

చ. 3: నిచ్చలు నభయమిచ్చేనేరుపు యెందుఁ గలదా
అచ్చుగ నారాయణునియందే కాక
రచ్చల శరణాగత రక్షణ మెందుఁ గలదా
తచ్చిన శ్రీవేంకటాద్రిదైవానకే కాక

రేకు: 0282-02 రామక్రియ సం: 03-471 తిరుపతి క్షేత్రం

పల్లవి: కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ

చ. 1: వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీదేవుఁడుండేటి శేషాద్రి యీకొండ

చ. 2: సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్విఁ దపసులే తరువులై నిలిచిన కొండ
పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ

చ. 3: వరములు కొటారుగా వక్కణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపుఁ గొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైన దిదివో శ్రీవేంకటపుఁ గొండ

రేకు: 0282-03 సామంతం సం: 03-472 దశావతారములు

పల్లవి: విజయపుటమ్ము వేసె వేంకటేశుఁడు
విజయుని సఖుఁడు యీా వేదమూరితి

చ. 1: పాఱితెంచి దశకంఠు పదిశిరసులమీఁద
ఆఱికినమ్ము వేసె నాదిదేవుఁడు
ఆఱడి సేనల తోడ నంబుధి మీఁద వేసె
వేఱొకయమ్ము దొడిగి విష్ణుదేవుఁడు

చ. 2: చాలుగ నేడుదాళ్లు సర్వము నొక్కటిగాఁగ
ఆలములో నమ్మువేసె నఖిలేశుఁడు
ఆలించి రుక్మిణిఁ బెండ్లి యాడునాఁడు వైరులపై
జాలి(?)యమ్ము వేసెను విజయకృష్ణుఁడు

చ. 3: భజన నిందిరఁగూడి పంతమున నమ్మువేసె
విజయదశమిని శ్రీవేంకటేశుఁడు
సుజనుల దేవతల సారిది నిందరిఁ గాచు
విజయము చేకొనె విష్ణుదేవుఁడు

రేకు: 0282-04 లలిత సం: 03-473 అన్నమయ్య స్తుతి

పల్లవి: నీదాఁకా వలెనా నిచ్చలు నారాయణా
ఆది నీ దాసుఁడే చాలు నందరి రక్షించను

చ. 1: నీ పాదమూలమున నిలిచిన జలమును
మోపుగా మోచె రుద్రుఁడు ముందు ముందే
కాపాడు నీ నామమునఁ గలిగిన మహిమచే
పైపై మునులు యిహపరములు గనిరి

చ. 2: పండేటి పాలవెల్లి నీ ప్రసాదమునఁ గాదె
దండిగా దేవతలెల్ల ధన్యులైరి
అండనే నీసాకార మాతుమఁ దలఁచి కాదె
నిండిన యోగీంద్రులు నిత్యముక్తులైరి

చ. 3: చేరి నీవిహారమైన శ్రీవేంకటాద్రిఁ గాదె
కోరి నరులు వరాలు కొల్లగొనిరి
ఆరీతిఁ దాళ్లపాక అన్నమయ్య ఘనుఁడాయ
వారివారమై నేము వహికినెక్కితిమి

రేకు: 0282-05 శుద్ధవసంతం సం: 03-474 దేవుడు-జీవుడు

పల్లవి: దీనుఁడ నేను దేవుఁడవు నీవు
నీ నిజమహిమే నెరపుటఁ గాకా

చ. 1: మతి జనన మెఱఁగ మరణం బెఱఁగను
యితవుగ నిను నిఁక నెరిఁగేనా
క్షితిఁ బుట్టించిన శ్రీపతివి నీవే
తతి నాపై దయ దలఁతువుఁ గాకా

చ. 2: తలఁచఁ బాపమని తలఁచఁ బుణ్యమని
తలఁపున ఇఁక నినుఁ దలఁచేనా
అలరిన నాలో యంతర్యామివి
కలుష మెడయ ననుఁ గాతువుఁ గాకా

చ. 3: తడవ నాహేయము తడవ నామలినము
తడయక నీ మేలు దడవేనా
విడువలేని శ్రీవేంకటవిభుఁడవు
కడదాఁకా నిఁకఁ గాతువుఁ గాకా

రేకు: 0282-06 మాళవి సం: 03-475 గురు వందన, నృసింహ

పల్లవి: నారాయణాచ్యుతానంత నిన్నొకచోట
గోరి వెదకనేల వీరివల్లఁ గంటిఁబో

చ. 1: సొలసి నీ రూపము శ్రుతులలోఁ జెప్పుఁ గాని
బలిమి నాచార్యుఁడైతేఁ బ్రత్యక్షము
పలికి నీ తీర్థము భావనలందే కాని
అల నీ దాసుల తీర్థ మరచేత నిదివో

చ. 2: నీ యానతు లెన్నఁడు నేము దెలియము గాని
మా యాచార్యునిమాట మంత్రరాజము
కాయములో నీ వుండేది కడు మఱఁగులు గాని
యీయెడ నీ పరికర మిన్నిటా నున్నదివో

చ. 3: అరిది నీవందన మొకర్చావతారానఁ గాని
గురుపరంపరనై తేఁ గోట్లాయఁ బో
హరి నిన్ను శ్రీవేంకటాద్రినే చూచితిఁ గాని
పరమున నిహమునఁ బంచి చూపె నతఁడు

రేకు: 0283-01 దేసాళం సం: 03-476 అధ్యాత్మ

పల్లవి: నేరుపు నతఁడే నేరమి నతఁడే
భారమెల్ల నాతఁడే పని లేదు మాకు

చ. 1: దేవుఁడట యంతరాత్మ దేహమెంచి చూచితేను
పోవుల కర్మాలు సేయఁ బుట్టినదట
జీవుఁ డేఁటివాఁ డిందు శ్రీపతియానాజ్ఞఁ గాక
భావించఁ బాపపుణ్యాలు పనిలేదు మాకు

చ. 2: హరి లోకాలేలునట అతని మాయకు లోనై
నరుల జీవనములు నడచీనట
వెరవులు మాకేల విష్ణుఁడే యింతాఁ గాక
పరచు విచారాలు పనిలేదు మాకు

చ. 3: వేడుక నాలుకను శ్రీవేంకటేశు నామమట
పాడితో నాతనికి నే బంటనట
తోడునీడ యాతఁడే తోవ చూప నాతఁడే
పాడయిన కోరికలు పనిలేదు మాకు

రేకు: 0283-02 శంకరాభరణం సం: 03-477 నామ సంకీర్తన

పల్లవి: మునుల తపము నదె మూలభూతి యదె
వనజాక్షుఁడే గతి వలసినను

చ. 1: నరహరి నామము నాలుక నుండఁగ
పర మొకరి నడుగఁ బనియేల
చిరపుణ్యము నదె జీవరక్ష యదె
సరుగఁ గాచు నొకసారె నుడిగినా

చ. 2: మనసులోననే మాధవుఁ డుండఁగ
వెనుకొని యొకచో వెదకఁగనేఁటికి
కొనకుఁగొన యదే కోరెడి దదియే
తనుఁ దా రక్షించుఁ దలఁచినను

చ. 3: శ్రీవేంకటపతి చేరువ నుండఁగ
భావ కర్మముల భ్రమయఁగనేఁటికి
దేవుఁడు నతఁడే తెరువూ నదియే
కావలెనంటేఁ గావకపోఁడు

రేకు: 0283-03 వరాళి సం: 03-478 వైరాగ్య చింత

పల్లవి: విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా
యెత్తిన శ్రీహరి నీవే యీడేర్చవయ్యా

చ. 1: పాపపుణ్యదేహికి బంధములే సహజము
యేపునఁ గాదని తోయ నెట్టువచ్చును
పూపవంటి మనసుకు భోగములే సహజము
తేపగా విరతి యెందుఁ దెచ్చుకొనేమయ్యా

చ. 2: మాయల జన్మమునకు మమతలే సహజము
యేయెడఁ జొరక మాననెట్టువచ్చును
కాయవంటి గుణానకు కర్మమే సహజము
చాయల నే మెటువలె శాంతిఁ బొందేమయ్యా

చ. 3: తప్పని జ్ఞానమునకు దైవమే సహజము
యెప్పుడు స్వతంత్రుఁడుగా నెట్టువచ్చును
నెప్పున శ్రీవేంకటేశ నీ మహిమే ఇంతాను
చెప్పఁజూపఁ జోటులేదు చేరివుండేమయ్యా

రేకు: 0283-04 మాళవిగౌళ సం: 03-479 దశావతారములు

పల్లవి: ధరలో నా జన్మమే తనువు నదియె
యిరవై నీ దాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే

చ. 1: అల రావణుని తమ్ముఁ డసురనరభోజనుఁ-
డలరి తొల్లెల్లా నీ వాఁడైన మీఁదను
కులజుఁడు పుణ్యుఁడు గుణనిధి యిందరునుఁ
దలఁప యోగ్యుఁడు నట దాస్యమహి మెట్టిదో

చ. 2: జాతిబోయ పాతకుఁడు సత్యతపుఁడట తొల్లి
నీతి నరణియ నేటి నీ దాసుఁ జేరి
ఆతల బ్రహ్మఋషాయ నష్టాక్షర మంత్రాన
చేతల నీ దాసుల సేవాఫల మెట్టిదో

చ. 3: నానాజంతువులందు నవభక్తి గలిగితే
హీనాధిక్యము లేక యేచి కాతువు
శ్రీనాథ కాచితివి శ్రీవేంకటేశ మమ్ము
నేనూ ధన్యుఁడనైతి నీమహిమ యెట్టిదో

రేకు: 0283-05 శంకరాభరణం సం: 03-480 విష్ణు కీర్తనం

పల్లవి: తెలిసినవారికి దేవుఁ డితఁడే
వలవని దుష్టుల వాదము లేలా

చ. 1: పురుషుల లోపలఁ బురుషోత్తముఁడు
నరులలోన నరనారాయణుఁడు
పరదైవములకుఁ బరమేశ్వరుఁడు
వరుస మూఢుల కెవ్వరో యితఁడు

చ. 2: పలు బ్రహ్మలకును పరబ్రహ్మము
మలయు నీశులకు మహేశుఁ డితఁడు
ఇల నాత్మలలో నిటు పరమాత్ముఁడు
ఖలుల కెట్లుండునో కానము యితఁడు

చ. 3: వేదంబులలో వేదాంతవేద్యుఁడు
సోదించ కరిఁ గాచుచో నాదిమూలము
యీదెస శ్రీవేంకటేశుఁ డిందరికి
గాదిలి మతులనుఁ గైకొనఁ డితఁడు

రేకు: 0283-06 లలిత సం: 03-481 శరణాగతి

పల్లవి: సంసారికిఁ గల సహజమిది మతిఁ
గంసారి మనకుఁ గలఁ డటుగాన

చ. 1: చేతులు చాఁచుచు సేయఁగఁ దొడఁగిన
ఘాతల నిన్నిఁ గర్మములే
వాతులు మోవఁగవలెనని వెదకిన
పూఁతల నిన్నియు భోగములే

చ. 2: వొగి లంపటముల కోపిక గలిగిన
జగమింతాఁ బో సంపదలు
జిగిఁ జిత్తములోఁ జింతించి చూచిన
సగుణంబింతా సంతోషములు

చ. 3: యేచిన శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చూచినవెల్లా సులభములే
తాచి యీతనికె దాసులమయితిమి
కాచె నతఁడు మముఁ గడమలు లేవు

రేకు: 0284-01 శ్రీరాగం సం: 03-482 శరణాగతి

పల్లవి: కొలిచినవారి పాలి కొల్లలివివో
 యిల నిట్టి దైవమవు యిఁక వేరేకలరా

చ. 1: యెట్టైన నభయహస్త మెత్తుక కాచుకున్నాఁడ-
వట్టె దాసులఁ గాచేనంటా నీవు
తొట్టిన పాపాలు పోఁదోలు నీ నామమంత్రాలు
జట్టిగా లోకాల వెదచల్లినాఁడవు

చ. 2: తలఁచినవారికెల్లా ధనధాన్యా లిత్తునంటా
వొలసి శ్రీసతి మోచుకున్నాఁడవు
యిలఁ బావనులఁగా నిందరిఁ జేసేనంటా
నెలమిఁ బాదతీర్థ మేరు చేసినాఁడవు

చ. 3: పుట్టించ జీవులను భువనము లోపల
గట్టిగ బ్రహ్మను నాభిఁ గన్నాఁడవు
అట్టుగఁ బాలుపడి చుట్టి రక్షకత్వానికే
యిట్టే శ్రీవేంకటాద్రి యెక్కినాఁడవు

రేకు: 0284-02 భైరవి సం: 03-483 మాయ

పల్లవి: కాను స్వతంత్రుఁడననఁ గాదని తలఁగ లేను
నేను నీ కింకరుఁడ నీ రచనలే

చ. 1: యెంతైనాఁ దీరదిదే యెందుచూచిన పనులు
అంతటాను నీమాయ అలయించగా
దొంతులగుఁ గర్మములు తోడనే తిరిగీని
సంతకూటపు బ్రతుకు సటలఁబెట్టీని

చ. 2: మాన వింద్రియము లివి మతిలోనఁ బెరరేఁచు
నానాగము(తు?)లఁ బ్రకృతి నటియించఁగా
పూని పురాకృతములు పోనీక తిరిగీని
సానఁ బట్టిన వయసు సటలఁబెట్టీని

చ. 3: తరవులనే పెట్టీని తతిలేని యాసలివి
నిరతంపు జన్మములు నిడుసాగఁగా
వరుస శ్రీవేంకటేశ్వర నీవు నన్నేలి
కరుణించఁగా భక్తి ఘనత మీరీని

రేకు: 0284-03 భూపాళం సం: 03-484 ధనుర్మాసం

పల్లవి: ఏమి నిద్దిరించేవు యెందాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లఁ గాచుకున్నా రిదివో

చ. 1: పులుఁగాలుఁ బచ్చళ్ళు బోనము వెట్టినదిదే
వెలయు ధనుర్మాస వేళయు నిదే
బలసి సంకీర్తనపరులు పాడేరిదే
జలజాక్షుఁడ లేచి జలక మాడవయ్యా

చ. 2: తోడనే గంధాక్షతలు ధూపదీపా లివిగో
కూడిన విప్రుల వేద ఘోషణ లివే
వాడుదేరఁ బూజించవలెఁ గమ్మఁబువ్వులివె
వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా

చ. 3: చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాము డిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవేంకటాధిప మా చరపిదే
యెదుట నిన్నటిమాపే యియ్యకొంటివయ్యా

రేకు: 0284-04 శుద్ధవసంతం సం: 03-485 కృష్ణ

పల్లవి: చేరి యశోదకు శిశు వితఁడు
ధారుణి బ్రహ్మకు దండ్రియు నితఁడు

చ. 1: సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదచల్లెడు లక్ష్మణుఁడు
నిలిచిన నిలువున నిఖిలదేవతల
కలిగించు సురలగనివో యితఁడు

చ. 2: మాటలాడినను మరి యజాండములు
కోటులు వొడమేటి గుణ రాశి
నీటగు నూర్పుల నిఖిలవేదములు
చాటువ నూ రేటి సముద్ర మితఁడు

చ. 3: ముంగిటఁ బొలసిన మోహన మాత్మలఁ
బొంగించే ఘనపురుషుఁడు
సంగతి మా వంటి శరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపుఁ డితఁడు

రేకు: 0284-05 సాళంగం సం: 03-486 వైష్ణవ భక్తి

పల్లవి: జీవన్ముక్తులము శ్రీపతి దాసులము
భావించవో మమ్మును ప్రపంచపు మాయా

చ. 1: యివల దానధర్మము లేమిఁ జేయుట లేదు
తవిలిన పాతకాలు దైవమే వహించుకొనె
భువిలోన నా కిఁక బుట్టఁబని లేదు లేదు
భవరోగవైద్యుఁడు శ్రీపతి గలఁడు గాన

చ. 2: యెలమి స్వర్గాది లోకాలేమీఁ గోరుట లేదు
కల వైకుంఠము హరి కాలమునాఁడే యిచ్చె
తొలుత నాకుఁ జావుల తోడి సడ్డ వద్దు వద్దు
బలువైన యచ్యుతుని బంట్లము గాన

చ. 3: పూపసుఖమూ నొల్లము పొంచి దుఃఖమూ నొల్లము
చేపట్టి బ్రహ్మానందము శ్రీవేంకటేశుఁ డిచ్చెను
దూపయు నాఁకటికిఁగా తోదోపు మా కిఁక వద్దు
కాఁ పమృతమథనుఁడు గలఁ డిట్టే కాన

రేకు: 0284-06 పాడి సం: 03-487 శరణాగతి

పల్లవి: కాఁపులము నేము కర్తవు నీవు

దాపుదండై మము నిట్టే దయఁజూడవయ్యా

చ. 1: నెట్టన నైదుగురికి నేము డాగువెట్టేము

చుట్టి చుట్టి వీడుఁ బట్టుచూపి వున్నది

అట్టె కర్మములకు సరిగోరు వెట్టేము

నట్టుకొట్టి(ట్టే?) జీవులకు నరకములేలయ్యా

చ. 2: మించిన యాసలకిదే మేరలెల్లాఁ బెట్టేము

పొంచి మమతలలోఁ గాఁపుర మున్నారం(ము?)

పంచేంద్రియములకే పైరులు సేసితిమి

అంచెలఁ బ్రాణులకిఁక నానాజ్ఞలేలయ్యా

చ. 3: కూరిమి విషయముల కొట్నాలు దంచేము

చేరి నీవు చెప్పినట్టే సేసేము

యీరీతి శ్రీవేంకటేశ యిటు నీకే దాసులము

ఆరూఢిగా మన్నించితివంతే చాలు నౌనయ్యా

రేకు: 0285-01 మలహరిసం: 03-488 గురు వందన

పల్లవి: సకలముఁ జదివిన శాస్త్రము లెటేఁగిన
శుకధ్రువాదు లిటు చూపినది

చ. 1: భవభవములకును ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం జెప్పుడు నొకటే
కవిసిన నీ మాయఁ గడిచినది

చ. 2: మతము మతమునకు మార్గము వేరే
అతిసంశయములు అవి వేరే
గతి నీ శరణము గలిగిన దొకటే
యితవగు మోక్షం బిచ్చేది

చ. 3: జాతి జాతి యాచారము వేరే
ఆతల మోక్షంబది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవేంకటేశ్వర
చేత మాగురుఁడు చెప్పినది

రేకు: 0285-02 ముఖారి సం: 03-489 నామ సంకీర్తన

పల్లవి: తొల్లిటివారికంటే దొడ్డ నేను పాతకాన
బల్లిదుఁడ వగుటకుఁ బ్రతాపమిదివో

చ. 1: నరహరి యచ్యుత వో నారాయణా
గురుఁడు నిన్నుఁ గొండించెఁ (?) గోరి నే వింటి
గరిమ నొక్కతప్పున కాకికిఁ బరమిచ్చితి
సిరులఁ బెక్కుతప్పులు సేసితి నేమిచ్చేవే

చ. 2: మందరధరుఁడ వో మధుసూదనా
అందరు నిన్నొకమాఁట ఆడఁగా వింటి
నింద కొకటి బొంకితే నీవు ధర్మజుఁ గూడితి
వంది పెక్కుబొంకుల నాయందుఁ గూటమెంతో

చ. 3: శ్రీవేంకటేశ్వర శ్రీసతీమనోహర
సేవ నీదాసులే నిన్ను చేతఁ జూపేరు
మోవ నొక్క శునకము మొర యాలించితివట
వేవేలు జన్మాలెత్తితి యీవిధ మెట్లాలించేవో

రేకు: 0285-03 వరాళి సం: 03-490 వైష్ణవ భక్తి

పల్లవి: ఇదె చాలదా మమ్ము నీడేర్చను
అదన నెవ్వఁ డెరుఁగు నటమీఁది పనులు

చ. 1: ఇట్టె పంచసంస్కారా లెచ్చోట నుండినాను
పట్టైనవారే మాకుఁ బ్రమాణము
మట్టుగ నీరూపనామము లెందు నుండినాను
కట్టఁగడవారైన ఘనపుణ్యులు

చ. 2: పలుక వైష్ణవవేషభాష లెందు నుండినాను
వలనుగ మాకు సహవాసయోగ్యులే
తలకొన్న దాసానుదాస్య మెందు నుండినాను
అల కర్మదూరులైన నంతరంగులు

చ. 3: యెక్కువ సంకీర్తన మెచ్చోట నుండినాను
అక్కడ పరమపద మది భాగ్యము
చక్కఁగ వేదశాస్త్రసమ్మతము నిదియే
పక్కన శ్రీవేంకటేశు పరమార్థము నిదే

రేకు: 0285-04 రామక్రియ సం: 03-491 విష్ణు కీర్తనం

పల్లవి: అన్నిటి మూలం బతఁడు
వెన్నుని కంటెను వేల్పులు లేరు

చ. 1: పంచభూతముల ప్రపంచ మూలము
ముంచిన బ్రహ్మకు మూలము
పొంచిన జీవుల పుట్టుగు మూలము
యెంచఁగ దైవము యితఁడే కాఁడా

చ. 2: వెనుకొని పొగడేటి వేదాల మూలము
మునుల తపములకు మూలము
ఘనయజ్ఞాదుల కర్మపు మూలము
యెనలేని దైవ మితఁడే కాఁడా

చ. 3: అగపడి సురలకు నమృత మూలము
ముగురు మూర్తులకు మూలము
నగు శ్రీవేంకటనాథుఁడే మూలము
యెగువ లోకపతి యితఁడే కాఁడా

రేకు: 0285-05 లలిత సం: 03-492 రామ

పల్లవి: అవధారు రఘుపతి యందరినిఁ జిత్తగించు
యివల నిండెఁ గొలువిదె నడె సముఖా

చ. 1: రామ రాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమ నారదుఁడు వాడీఁ బెక్కు రంభాదు లాడేరు
మోమెత్తి కపులెల్లా మొక్కేరదివో

చ. 2: యినవంశకులజాత ఇక్ష్వాకుతిలకా
ఘనదశరథసుత కౌశికప్రియ
మునులు దీవించేరు ముందట భరతుఁ డదె
వెనక లక్ష్మణుఁడు సేవించీ వింజామర

చ. 3: కందువఁ గౌసల్యాగర్భరత్నాకర
చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాసా
సందడిఁ గుశలవులు చదివేరు వొకవంక
చెంది నీ రాజసము చెప్పరాదు రామా

రేకు: 0285-06 దేసాళం సం: 03-493 దశావతారములు

పల్లవి: అక్కటా రావణు బ్రహ్మహత్య నీకు నేడది
పుక్కిటి పురాణలింగపూజ నీకు నేడది

చ. 1: గురుహత్య బ్రహ్మహత్యఁ గూడీ ద్రోణాచార్యు వంక
హరి నీ కృప నర్జును కవిలేవాయ
యెరవుగాఁ గల్లలాడి యేచిన ధర్మజునకు
పరగ నీ యనుమతిఁ బాపము లేదాయను

చ. 2: అదివో రుద్రుని బ్రహ్మహత్య వాయఁ గాసి యిచ్చి
పొదలిననీ వతనిఁ బూజింతువా
అదనఁ బార్వతిదేవి కాతఁడే నీ మంత్రమిచ్చె
వదరు మాటల మాయావచనాలేమిటికి

చ. 3: తగిలి నీ నామమే తారకబ్రహ్మమై
జగము వారి పాపాలు సంతతముఁ బాపఁగాను
మిగుల శ్రీవేంకటేశ మీకు నేడ పాతకాలు
నగుఁబాటు లింతేకాక నానాదేశముల

రేకు: 0286-01 సామంతం సం: 03-494 అధ్యాత్మ

పల్లవి: నారాయణుఁడ నీ నామము మంత్రించి వేసి
పారేటి యీ జంతువుల భ్రమ విడిపించవే

చ. 1: మదనభూతము సోఁకి మగువలుఁ బురుషులు
అదన విరిదలలై యంగమొలలై
పెదవి నెత్తురు వీర్చి పెనుగోళ్ళఁ జించుకొంటా
కొదలు కుత్తికలనుఁ గూసేరు జీవులు

చ. 2: పంచభూతములు సోఁకి భ్రమసి యజ్ఞానులై
పొంచి హేయములు మన్నుఁ బూసుకొంటాను
అంచెల వీడెపురస మందునిందు గురియుచు
యెంచి ధనముపిశాచాలిట్లైరి జీవులు

చ. 3: తమితోడ మాయాభూతము సోఁకి బహుజాతి-
యెముకలుఁ దోలు నరా లిరవుచేసి
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ జేర కెక్కడైన
తముఁ దా మెరఁగరింతటాఁ జూడు జీవులు

రేకు: 0286-02 వసంతం సం: 03-495 వైరాగ్య చింత

పల్లవి: నీ శరణమే గతి నే నితర మెరఁగ

పాశబంధముల పనులేలయ్యా

చ. 1: పూఁచిన తొలుకర్మంబులు భోగించక పోవు

చాఁచుకున్నయీ శరీరగుణములు చాలునన్నఁ బోవు

రేఁచిన జననమరణములు రెంటికిఁ దీసీని

మోఁచివచ్చితే విజ్ఞాన మెరఁగఁగ మొదలికిఁ గొనకును యెడ యేదయ్యా

చ. 2: కోరిన నా కోరికలు కొనసాగక పోవు

బారిఁ బడుచు కాలము దా బడిఁ దగులక పోదు

మేరతో పంచేంద్రియములు మెడచుట్టక పోవు

యే రీతుల సంసారము గెలువఁగ నెదురుబడిని బలిమిఁకనేదయ్యా

చ. 3: మనసును వాకునుఁ జేఁతయు మానుమన్నఁ బోవు

తనువులోన నా యంతర్యామివి తలఁచక ఇఁకఁ బోదు

ఘనుఁడవు శ్రీవేంకటపతి నన్నుఁ గావక ఇఁకఁ బోదు

కనికానని యజ్ఞాన జంతువను కడమలెంచ నీఁకఁ గొలదేదయ్యా

రేకు: 0286-03 ముఖారి సం: 03-496 వైరాగ్య చింత

పల్లవి: కడవ రాదు హరి ఘనమాయ! తెగి
విడువఁగరాదు వేసరరాదు

చ. 1: చూపుల యెదిటికి సొద్యంబైనది
పాపపుణ్యముల ప్రపంచము
తీపులు పుట్టించు దినదిన రుచులై
పూపల సంసారభోగములు

చ. 2: మనసు లోపలికి మర్మంబైనది
జననమరణముల శరీరము
వెనవెనకఁ దిరుగు వెడ లంపటమై
కనకపుటాసల కర్మములు

చ. 3: తగు మోక్షమునకుఁ దాపయైన దిదె
నగి హరిఁ దలఁచిన నాలుకిది
వెగటు దీరె శ్రీవేంకటపతియై
యగపడె నిపుడు పురాకృతము

రేకు: 0286-04 రామక్రియ సం: 03-497 శరణాగతి

పల్లవి: పంచేంద్రియములాల పంచభూతములాల
అంచెలఁ దొమ్మి సేయకురో మీరు

చ. 1: కొందరికి మంచివాఁడ కొందరికిఁ గానివాఁడ
నిందకుఁ గీర్తికిఁ బొత్తు నే నొకఁడనే
అంది నిద్దిరించువాఁడ నటు మేలుకొనువాఁడ
బొందితో నెఱుక మఱపులకు నొక్కఁడనే

చ. 2: దైవము నిర్మించినది ధరణిఁ బొడమినది
యీవలావలికిఁ బొత్తు యీ దేహమే
వేవేలు పుణ్యములకు వెలయుఁ బాపములకు
యీవల రెంటికి గురి ఇదివో నా మనసు

చ. 3: తుంచి సగమటు వోవు తోడనే సగము వచ్చు
పంచి లోనికి వెలికిఁ బ్రాణమొక్కటే
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మంచివాయఁ బనులెల్లా మమ్ముఁ గాచె నితఁడు

రేకు: 0286-05 భైరవి సం: 03-498 శరణాగతి

పల్లవి: అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు
యెటు సేసినాఁ జెల్లె నికనేల మాటలు

చ. 1: ఏది పుణ్యమో నాకు నేది పాపమో కాని
శ్రీదేవుఁడవు నీవే సేయించేవు
సేదదేర నా మీఁదఁ జిత్రగుప్తుఁ డేల వా(వ్రా?)సీ
మేదిని స్వతంత్ర మేది మెరయ నీబంటను

చ. 2: పుట్టినట్టి తెరువేదో పోయేటి జాడ యేదో
పుట్టించితి నీవే పురుషోత్తమ
వెట్టి సంసారబంధాలు వెంటవెంట నేలవచ్చీ
ఇట్టే యెవ్వరివాఁడ నిందులోన నేను

చ. 3: చిత్త మెటువంటిదో జీవుఁ డెటు వంటి వాఁడో
హత్తిన శ్రీవేంకటేశ అంతరాత్మవు
యెత్తిన మదము నిన్ను నేల కాననియ్యదాయ
నిత్తెము తొల్లే నేను నీవాఁడఁగాన

రేకు: 0286-06 పాడి సం: 03-499 రామ

పల్లవి: సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా

చ. 1: చెలిమి సుగ్రీవుతోడఁ జేసిన రామ తొల్లి
శిలనుఁ బడఁతిఁ గావించిన రామా
చెలరేఁగిన వానరసేనల రామా
శిలుగు మాయామృగముఁ జించిన రామా

చ. 2: తరణివంశ తాటకాంతక రామా
నరనాథ కౌసల్యానందన రామా
సిరులఁ బెండ్లాడిన సీతారామా
గరిమతో సేతువు గట్టిన రామా

చ. 3: రావణాది దనుజహరణ రామా
కావించి విభీషణునిఁ గాచిన రామా
దీవెన లయోధ్యలోఁ బెందిన రామా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామా

రేకు: 0287-01 సాళంగనాట సం: 03-500 హనుమ

పల్లవి: అదివో నీప్రతాపము హనుమంతా
యెదురులేదు నీకు నెక్కడా హనుమంతా

చ. 1: యెత్తిననీ కుడిహస్త మిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీ యెడమ చేతి పిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా

చ. 2: నలియఁ దొక్కిన నీ వున్నతపుఁ బాదముకింద-
నలమటించే రరులు హనుమంతా
చలపట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలుదానవులు భంగపడిరి హనుమంతా

చ. 3: వడి నీవు మీఁదికి వాలమల్లార్చిన
అడఁగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవేంకటేశుపంపున నీవు గెల్వఁగ
బెడిదమై పొగడేరు పెద్ద హనుమంతా

రేకు: 0287-02 మాళవి సం: 03-501 వేంకటగానం

పల్లవి: దిక్కులెల్లా సాధించి దేవదుందుభులు మ్రోయ-
నెక్కడ చూచినఁ దానే యేఁగీ సేవించరో

చ. 1: అదివో శ్రీహరి తేరు అదె గరుడధ్వజము
కదలేటి ఘనతురంగము లవిగో
పొదలుఁ బూదండలవే పూచి వాఁగే ఘంటలవే
యెదుటఁ దిరువీధుల నేఁగీ సేవించరో

చ. 2: వారె అచ్చరలేమలు వారె మునులు రుషులు
వారక కొలిచే దేవతలు వారే
వీరె యనంతగరుడవిష్వక్సేనాదులు
యీ రీతిఁ బ్రతాపాన నేఁగీ సేవించరో

చ. 3: వీఁడె శ్రీవేంకటేశుఁడు వీఁ డలమేల్మంగపతి
వీఁడె శంఖచక్రాదుల వెలసినాఁడు
పోఁడిమి వరములిచ్చీఁ బొసఁగ దాసులకెల్లా
యేఁడేఁడు దప్పకుండాను యేఁగి సేవించరో

రేకు: 0287-03 బౌళి సం: 03-502 నృసింహ

పల్లవి: ఆనందనిలయ ప్రహ్లాదవరదా
భానుశశినేత్ర జయ ప్రహ్లాదవరదా

చ. 1: పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా
హరి యచ్యుతానంత ప్రహ్లాదవరదా
పరిపూర్ణ గోవింద ప్రహ్లాదవరదా
భరిత కల్యాణగుణ ప్రహ్లాదవరదా

చ. 2: భవరోగసంహరణ ప్రహ్లాదవరదా
అవిరళ కేశవ ప్రహ్లాదవరదా
పవమాననుతకీర్తి ప్రహ్లాదవరదా
భవపితామహవంద్య ప్రహ్లాదవరదా

చ. 3: బలయుక్త నరసింహ ప్రహ్లాదవరదా
లలిత శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదా
ఫలితకరుణారస ప్రహ్లాదవరదా
బలివంశకారణ ప్రహ్లాదవరదా

రేకు: 0287-04 రామక్రియ సం: 03-503 హనుమ

పల్లవి: పంతగాఁడు మిక్కిలి బంటతనమునను
అంతటాఁ గలశాపుర హనుమంతరాయఁడు

చ. 1: నీరధి చంగన దాఁటి నెట్టన లంకచొచ్చి
శ్రీరాము నుంగరము సీతకిచ్చి
మేరమీరి యక్షుఁ గొట్టి మేటి వనము వెఱికె
ఆరయఁ గలశాపుర హనుమంతరాయఁడు

చ. 2: ఘాతతో లంక గాలిచి గక్కన లంకిణిఁ జంపి
యీతలికి మగుడఁ దా నేతెంచి
సీతాశిరోమణి శ్రీరామునకు నిచ్చె
ఆతఁడే కలశాపుర హనుమంతరాయఁడు

చ. 3: అల రావణుని గెల్చి అయోధ్యాపురికి వచ్చి
బలురాముని సీతతోఁ బట్టముగట్టి
నిలిచె శ్రీవేంకటాద్రినిలయుని యెదుటను
అలరెఁ గలశాపుర హనుమంతరాయఁడు

రేకు: 0287-05 ముఖారి సం: 03-504 నృసింహ

పల్లవి: అవధారు సకలలోకైకనాథ
సువర్ణరూపమైన సుగ్రీవ నారసింహా

చ. 1: అరుదుగ మీరు సింహాసనముపై నుండఁగ
యిరుగడ సేవించేరు ఇంద్రాదులు
పరగ నెట్టనెదుట ప్రహ్లాదుఁ డున్నవాఁడు
సొరిదినే చిత్తగించు సుగ్రీవ నారసింహా

చ. 2: చాపలపు హిరణ్యుని సమయించి వున్నమీకు
చేపట్టి మొక్కేరు వశిష్ఠాదులు
యే పొద్దు మీ తొడమీఁద నిందిర గాచుకున్నది
చూపులఁ గరుణ నించు సుగ్రీవ నారసింహా

చ. 3: లలితముగ నీవు జగములు రక్షించఁగా
వలనుగఁ బొగడేరు వ్యాసాదులు
యెలమి శ్రీవేంకటేశ ఇందునందు నెలకొని
సులభమూర్తివైతివి సుగ్రీవ నారసింహా

రేకు: 0287-06 శ్రీరాగం సం: 03-505 రామ

పల్లవి: శరణు శరణు రామచంద్ర నరేంద్రా
సరి మమ్ముఁ గావు రామచంద్ర నరేంద్రా

చ. 1: ఘన దశరథునకుఁ గౌసల్యాదేవికిని
జననమందిన రామచంద్ర నరేంద్రా
కనలి తాటకిఁ జంపి కౌశికు జన్నము గాచి
చనవు లిచ్చిన రామచంద్ర నరేంద్రా

చ. 2: అరిది సీతఁ బెండ్లాడి అభయ మందరి కిచ్చి
శరధిఁ గట్టిన రామచంద్ర నరేంద్రా
అరసి రావణుఁ జంపి అయోధ్యానగర మేలి
సరవి నేలిన రామచంద్ర నరేంద్రా

చ. 3: పన్నుగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు-
సన్నిధి నిల్చిన రామచంద్ర నరేంద్రా
అన్నిటా లక్ష్మణభరతాంజనేయశత్రుఘ్నుల-
సన్నుతి కెక్కిన రామచంద్ర నరేంద్రా

రేకు: 0288-01 నాట సం: 03-506 నృసింహ

పల్లవి: కంభమున వెడలి ఘన నరసింహము
కుంభిని హిరణ్యుఁ గూలిచెను

చ. 1: తొడికి దైత్యుఁ దన తొడపైకిఁ దిగిచి
కడుపు చించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడఁ దగిలించుక మెరసీ వాఁడే

చ. 2: పెదవులు చింపుచు పెనుగోళ్ల నదిమి
పుదుటుఁ బునుక గొరికుమియుచును
సదరపు గుండెలు చప్పరింపుచును
మెదడు గందముగ మెత్తీ వాఁడే

చ. 3: దేవతల భయము దీర్చి యంకమున
శ్రీవనితనుఁ గృప సేయుచును
పావనపు టహోబలగిరి దైవము
శ్రీవేంకటగిరిఁ జెలఁగీ వాఁడే

రేకు: 0288-02 సాళంగనాట సం: 03-507 నృసింహ

పల్లవి: ఆదిమపురుషుడు అహోబలమునను
వేదాద్రిగుహలో వెలసీ వాఁడే

చ. 1: వుదయించె నదిగో వుక్కుఁ గంభమున
చెదరక శ్రీనరసింహుడు
కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు-
నెదుట గద్దెపై నిరవై నిలిచె

చ. 2: పొడచూపె నదిగో భువి దేవతలకు
చిడుముడి శ్రీనరసింహుఁడు
అడర నందరికి నభయం బొసగుచు
నిడుకొనెఁ దొడపై నిందిరను

చ. 3: సేవలు గొనె నదె చెలఁగి సురలచే
శ్రీవేంకటనరసింహుడు
దైవమై మమ్మేలి దాసుల రక్షించె
తావుకొనఁగ నిటు దయతోఁ జూచి

రేకు: 0288-03 దేవగాంధారి సం: 03-508 వేంకటగానం

పల్లవి: ఏమని నుతింతు నేను యిందిరానాయక నీవు
కామించి కోరినవారి కల్పలతవు

చ. 1: నెట్టనఁ దలఁచేవారి నిండు నిధానమవు
పట్టినవారి చేతి బంగారమవు
చుట్టరికమెంచేవారి చోటికిఁ దల్లిదండ్రివి
ముట్టి కొలిచినవారి ముంజీతమవు

చ. 2: సేవ చేసినవారికి చేతిలో మాణికమవు
భావించువారికి పరబ్రహ్మమవు
కావలెనన్నవారికి ఘన మనోరథమవు
వావిరిఁ బూజించువారి వజ్రపంజరమవు

చ. 3: బత్తి సేసినవారికి భవరోగ వైద్యుఁడవు
హత్తి నుతించినవారి యానందమవు
పొత్తుల అలమేల్మంగ బువ్వపు శ్రీవేంకటేశ
ఇత్తల మా పాలిటికి నిహపరదాతవు

రేకు: 0288-04 దేసాళం సం: 03-509 కృష్ణ

పల్లవి: సురలు సంతోషించి రసురలెల్లా నడఁగిరి
తొరలి దిక్కుల దేవదుందుభులు మొరసె

చ. 1: కఁడగి వసుదేవుని కాంత దేవకిదేవికి
పుడివోని వేడుకఁ జంద్రోదయవేళ
కొడుకై జన్మించినాఁడు కూరిమి శ్రీకృష్ణుఁడు
నడురేయి నిదే శ్రావణబహుళాష్టమిని

చ. 2: రేపల్లె కెముున దాఁటి రేతిరే తెచ్చి తండ్రి
పాపని యశోదవద్దఁ బండఁగఁ బెట్టి
ఆపొద్దే మధురలోని కాఁడుఁబాపఁ దెచ్చుకొనె
కోపగించి కంసుని మార్కొనె నందనందని

చ. 3: పురుఁడు వెళ్లెను మరి పుణ్యావాజన సేసిరి
మురిపేన గొల్లెతలు ముద్దాడిరి
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగపతై
యిరవై కొల్చినవారి నిందరి రక్షించెను

రేకు: 0288-05 బౌళి సం: 03-510 తేరు

పల్లవి: దేవదుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరి తేరు యేఁగీ వీధులను

చ. 1: గరుడధ్వజముతోడ కనకపు గుజ్జులతో
పరపై యష్టదిక్కుల బండికండ్లతో
నిరతితో పట్టుమాలి నిడుపపగ్గాలతోడ
యిరవై శ్రీపతి తేరు యేఁగీ వీధులను

చ. 2: పచ్చల ప్రతిమలతో పగడపు నొగలతో
హెచ్చిన వైడూర్యపు టిరుసులతో
కుచ్చుల ముత్యాలతో గుంపుఁ బైఁడికుండలతో
యిచ్చల భూధవు తేరు యేఁగీ వీధులను

చ. 3: మంచి నీలాల గద్దెతో మణిదర్పణాలతోడ
పొంచిన సింగారాలతో పూదండలతో
అంచె శ్రీవేంకటేశుతో నలమేలుమంగతోడ
యెంచఁగ దేవుని తేరు యేఁగీ వీధులను

రేకు: 0288-06 పాడి సం: 03-511 విష్ణు కీర్తనం

పల్లవి: సేవించి చేకొన్నవారి చేతి భాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను

చ. 1: గరుడగంభము కాడ కడుఁ బ్రాణాచారులకు
పరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
తిరమై కోనేటి చెంతఁ దీర్థఫలములెల్ల
పరుషల కొఁగీని పరమాత్ముఁడు

చ. 2: సేన మొదలారి వద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించీని నారాయణుఁడు
కానుక పైఁడిగాదెల కాఁడఁ దన నిజరూపు
అనుక పొడచూపీని అఖిలేశుఁడు

చ. 3: సన్నిధి గర్భగృహాన చనవిచ్చి మాటలాడి
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు
యెన్నికఁ బాదాలవద్ద యిహముఁ బరముఁ జూపీ
మన్ననల అలమేలుమంగవిభుఁడు

రేకు: 0289-01 సాళంగనాట సం: 03-512 తేరు

పల్లవి: చూడరో చూడరో నేఁడు సురలార నరులార
దాడివోయి దనుజుల దండించి తా వచ్చె

చ. 1: వాయు వేగమున వచ్చె వనజాక్షు నరదము
వేయిసూర్యుల ప్రతాపవిభవముతో
చాయల చక్రవాళాద్రి సముద్రాలు దాఁటి వచ్చె
ఆయితమై పైఁడిటెక్కే లవే కానవచ్చె

చ. 2: మునుకొని మనో వేగమున వచ్చె హరితేరు
తనరారు కోటిచంద్రప్రభలతో
వెనుకొని దిక్కులెల్లా విజయము సేసి వచ్చె
కనకాచలముతో గక్కన సరివచ్చె

చ. 3: గరుడవేగాన శ్రీవేంకటేశు రథము వచ్చె
మరగిన యల మేలుమంగసిరితో
ధరలోన వీధులేఁగి తన నెలవుకు వచ్చె
పరగ హరిదాసుల పంతములు వచ్చె

రేకు: 0289-02 సామంతం సం: 03-513 నృసింహ

పల్లవి: నానాభరణముల నరసింహా

పూనిన ప్రతాపముల నరసింహా

చ. 1: నగవుల నెమ్మోము నరసింహా

పొగరుమించు టూర్పుల నరసింహా

నగముమీఁది ఘన నరసింహా

తగుకాంతుల యందపు నరసింహా

చ. 2: నలిననేత్ర శ్రీనరసింహా

పొలుపొందు నఖంబుల నరసింహా

నలుదెసల మెఱయు నరసింహా

వెలయు మూఁడుగన్నుల నరసింహా

చ. 3: నమిత సురాసుర నరసింహా

కమనియ్యగుణాకర నరసింహా

నమోస్తు తే శుభ నరసింహా

కమలాంక శ్రీవేంకటనరసింహా

రేకు: 0289-03 శంకరాభరణం సం: 03-514 నృసింహ

పల్లవి: నమితదేవం భజే నారసింహం
సుముఖకరుణేక్షణం సులభ నరసింహం

చ. 1: విజయ నరసింహం వీర నరసింహం
భుజబలపరాక్రమస్ఫుట నృసింహం
రజనీచరవిదళనవిరాజిత నృసింహం
సుజనరక్షక మహాశూర నరసింహం

చ. 2: దారుణనృసింహం ప్రతాప నరసింహం
చారుకల్యాణ నిశ్చల నృసింహం
ధీరచిత్తావాస దివ్య నరసింహం
సారయోగానందచతుర నరసింహం

చ. 3: విమల నరసింహం విక్రమ నృసింహం
కమనియ్యగుణగణాకర నృసింహం
అమితసుశ్రీవేంకటాద్రి నరసింహం
రమణియ్యభూషాభిరామ నరసింహం

రేకు: 0289-04 వరాళి సం: 03-515 దేవుడు-జీవుడు

పల్లవి: దేవుఁడవు నీవు జీవులు నీ బంట్లు
చేవదేరి నీ సేఁతే శేఖరమై నిలిచె

చ. 1: చేరి నేరమి సేసేది జీవునికి స్వభావము
నేరిచి రక్షించేది నీ స్వభావము
ధారుణి లోపల మరి తప్పులెంచఁ జోటేది
మేర మీరి నీ మహిమే మిక్కుటమై నిలిచె

చ. 2: మత్తుఁడై వుండేదే మనుజుని స్వభావము
నిత్తెపుజ్ఞాన మిచ్చేది నీ స్వభావము
వొత్తి గుణావగుణాలు వొరయఁగఁ జోటేది
సత్తుగా నీ కరుణే సతమయి నిలిచె

చ. 3: చెలఁగి నీ శరణు చొచ్చేదే నా స్వభావము
నెలవై యేలుకొనేది నీ స్వభావము
మలసి శ్రీవేంకటేశ మనసు సోదించ నేది
చలిమి బలిమిని నీస్వతంత్రమే నిలిచె

రేకు: 0289-05 సాళంగనాట సం: 03-516 రామ

పల్లవి: సీతాసమేత రామ శ్రీరామ

రాతి నాతిఁ జేసిన శ్రీరామ రామ

చ. 1: ఆదిత్యకులమునందు నవతరించిన రామ

కోదండభంజన రఘుకుల రామ

ఆదరించి విశ్వామిత్రుయాగము గాచిన రామ

వేదవేదాంతములలో వెలసిన రామ

చ. 2: బలిమి సుగ్రీవుని పాలి నిధానమ రామ

యిల మునుల కభయమిచ్చిన రామ

జలధి నమ్ముమొనను సాధించిన రామ

అలరు రావణదర్పహరణ రామ

చ. 3: లాలించి విభీషణుని లంక యేలించిన రామ

చాలి శరణాగతరక్షక రామ

మేలిమి శ్రీవేంకటాద్రిమీఁద వెలసిన రామ

తాలిమితో వెలయు ప్రతాపపు రామ

రేకు: 0289-06 దేసాళం సం: 03-517 దశావతారములు

పల్లవి: కోనేటి దరులఁ గనుఁగొనరో మూఁడుదేరులు
నానాదేవతలార నరులార మీరు

చ. 1: తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుఁ డు
వేంకటేశుఁ డెక్కె నదె వేరొక్క తేరు
లంకెలై శ్రీభూసతులు లలి నొక్క తేరెక్కిరి
కొంకక వీధుల నడగొండలో యనఁగను

చ. 2: యిరవై శ్రీకృష్ణునిది యిదె వానరధ్వజము
గరుడధ్వజము శ్రీవేంకటపతిది
కరిలాంఛన ధ్వజము కమలకు మేదినికి
అలరి చూపట్టెను బ్రహ్మాండాల వలెను

చ. 3: చెలఁగి చెఱకువిల్లు చేతఁబట్టె శ్రీకృష్ణుఁడు
బలు శ్రీవేంకటేశుఁడు పట్టెఁ జక్రము
అలమేలుమంగ భూమి యంబుజాలు చేఁబట్టిరి
కలసి మెలసేరు బంగారుమేడ లనఁగ

రేకు: 0290-01 నాట సం: 03-518 నృసింహ

పల్లవి: దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ
కేరలీఁ బంతముల సుగ్రీవ నారసింహము

చ. 1: నిక్కిన కర్ణములతో నిట్టచూపు గుడ్లతో
మిక్కుటమైన పెద్దమీసాలతోడ
వెక్కసపు నోరితోడ వెలయు బుగ్గలతోడ
క్రిక్కిరిసీ నవ్వుల సుగ్రీవ నారసింహము

చ. 2: చల్లు నూరుపులతోడ సంకుఁజక్రములతోడ
మొల్లమైన సహస్రకరములతోడ
తెల్లని మేనితోడ దిండైన పిరుఁదుతోడ
కెల్లు రేఁగేఁ గరుణ సుగ్రీవ నారసింహము

చ. 3: విరుల పాదాలతోడ వెలయు సొమ్ములతోడ
తిరమైన కోటిసూర్యతేజముతోడ
విరుల దండలతోడ వేడుక శ్రీవేంకట-
గిరిమీఁద వెలసె సుగ్రీవ నారసింహము

రేకు: 0290-02 బౌళి సం: 03-519 హనుమ

పల్లవి: వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
పేఁడుకొన్న ప్రతాపానఁ బెద్ద హనుమంతుఁడు

చ. 1: ఇదె పుట్టు గోపీనము హేమ కుండలములతో-
నుదయించినాఁ డితఁ డుర్వీమీఁదను
పదరి బాలార్కుని పండనుచుఁ బట్టినాఁడు
వదలక దేవతల వర మందినాఁడు

చ. 2: నులిచి తా వాలము మిన్నులు మోవఁ జూఁచినాఁడు
జలధి దాఁటఁగ జంగ చాఁచినాఁడు
ఇల నసురలమీఁద వలచెయ్యెత్తినవాఁడు
నిలువెల్ల సాహసమై నిండుకొనున్నాఁడు

చ. 3: పెక్కు పండ్ల గొలలు పిడికిలించినవాఁడు
మిక్కిలి లంక సాధించి మించినవాఁడు
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంటైనవాఁడు
తక్కక లోకములెల్లా దయఁ గాచేవాఁడు

రేకు: 0290-03 సామంతం సం: 03-520 నృసింహ

పల్లవి: అనిశముఁ దలఁచరో అహోబలం
అనంతఫలదం బహోబలం

చ. 1: హరినిజనిలయం బహోబలం
హరవిరించినుత మహోబలం
అరుణమణిశిఖర మహోబలం
అరిదైత్యహరణ మహోబలం

చ. 2: అతిశయశుభదం బహోబలం
అతులమనోహర మహోబలం
హతదురితచయం బహోబలం
యతిమతసిద్ధం బహోబలం

చ. 3: అగు శ్రీవేంకట మహోబలం
అగమ్య మసురల కహోబలం
అగపడుఁ బుణ్యుల కహోబలం
అగకులరాజం బహోబలం

రేకు: 0290-04 పాడి సం: 03-521 హనుమ

పల్లవి: కలశాపురము కాడ గంధపు మాకుల నీడ-
నలరేవు మేలు మేలు హనుమంతరాయ

చ. 1: సంజీవికొండ దెచ్చి సౌమిత్రి బ్రతికించితి
భంజించితి వసురుల బలువిడిని
కంజాప్తకుల రాఘవుని మెప్పించితివి
అంజనీతనయ వో హనుమంతరాయ

చ. 2: లంక సాధించితివి నీ లావులెల్లాఁ జూపితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి
అంకెలెల్లాఁ నీకుఁ జెల్లె హనుమంతరాయ

చ. 3: దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరు బంట వైతివి
అక్కజపు మహిమల హనుమంతరాయ

రేకు: 0290-05 రామక్రియ సం: 03-522 హనుమ

పల్లవి: అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత-
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి

చ. 1: అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజదూతవైతి గురు హనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి

చ. 2: అంజనీదేవికుమార హనుమంతుఁడ
కంజాప్తఫలహస్త ఘన హనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజిత వానరకులరక్షకుఁడ వైతివి

చ. 3: అట లంక సాధించిన హనుమంతుఁడ
చటుల సత్త్వసమేత జయ హనుమంతుఁడ
ఘటన నలమేల్మంగకాంతు శ్రీవేంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్చితివి

రేకు: 0290-06 గౌళ సం: 03-523 దశావతారములు

పల్లవి: త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు
అజుని జనకుఁడైన ఆదినారాయణుఁడు

చ. 1: గరుడని మీఁదనెక్కి ఘనచక్రము చేఁబట్టి
పరమపదాన నుండి పరతెంచి
మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు
అరుదైన ప్రతాపపు ఆదినారాయణుఁడు

చ. 2: కనకాంబరము గట్టి కౌస్తుభము మెడఁ బెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండఁగా
పనివూని జయముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు

చ. 3: త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్ల
ముదమున దాసులెల్లా మొక్కఁగాను
వదల కెల్లవారికి వరములిచ్చీవాఁడే
అదె శ్రీవేంకటవిభుఁ డాదినారాయణుఁడు

రేకు: 0291-01 దేసాక్షి సం: 03-524 అధ్యాత్మ

పల్లవి: ఇది యెరిఁగినవారె యెంచఁగ నీ దాసులు
వెదకి తెలుసుకొంటే వేదాంతాల నున్నవి

చ. 1: పట్టితే నీ స్వరూపము బయలు లోపల నిండి
అట్టే సర్వశక్తితో సాకారముతో
యెట్టు దలఁచినాఁ జిత్తాయిత్తమై వున్నాఁడవు
వొట్టి ప్రకృతిపురుషు లొగి నీ దేహములు

చ. 2: అనంతమైన ప్రకృతి అఖిలవికారములై
పనివడి నీ మాయయై ప్రపంచమై
వొసరి జడమై యుండ నొకచో దివ్యమై యుండు
నినుపై ఇహపరాలు నీయైశ్వర్యములు

చ. 3: జీవుఁ డణువు జ్ఞానము చింతించగా విభువు
యీ విధము నానాజీవులివె నీ యందె
శ్రీవేంకటేశుఁడ నీవే చేకొన్నచైతన్యమవు
కావింపఁ గర్మభక్తులే కారణఫలములు

రేకు: 0291-02 పాడి సం: 03-525 జోల

పల్లవి: కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో

చ. 1: యీ పొద్దుకుఁ బోయిరారో ఇంద్రాది దేవతలు
శ్రీపతి పవ్వళించెను శేషునిమీఁద
తీపులఁ బ్రసాదమీరో దేవమునులకు నెల్ల
వైపుగఁ దెల్లవారఁగ వత్తురుగాని

చ. 2: పాళెలపట్టుకుఁ బోరో బ్రహ్మరుద్రాదు లిందరు
పాలసముద్రాన హరి పవ్వళించెను
వేళగాదు లోనికిట్టె విచ్చేసె హరి ద్వార-
పాలకులు వాకిళ్ళఁ బదిలము సుండో

చ. 3: గీత మొయ్యనే పాడరో కిన్నర కింపురుషులు
యీతల శ్రీవేంకటేశుఁ డెక్కెను మేడ
ఘాత నెడనెడ నూడిగకాండ్లు నిలువరో
రాతిరెప్పుడైనా మిమ్ము రమ్మనునో యతఁడు

రేకు: 0291-03 లలిత సం: 03-526 నామ సంకీర్తన

పల్లవి: ఇతరుల నడుగము యితఁడే మా దాత
యితని యీవి వొరు లియ్యఁగఁ గలరా

చ. 1: దేవ దేవుఁ డాదిమపురుషుఁడు హరి
శ్రీవత్సాంకుఁడు చిన్మయుఁడు
యీవల నావల యిలువేలుపతఁడు
భావజగురుఁడు మా పాలిటివాఁడు

చ. 2: జగదేకగురుఁడు శాశ్వతుఁ డచ్యుతుఁ-
డగజకు వరదుఁడు అనంతుఁడు
తగి మము నేలిన దైవము యేలిక
నిగమమూర్తి మా నిజబంధువుఁడు

చ. 3: కలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
అలరిన శ్రీవేంకటాధిపుఁడు
చలిమి బలిమి మా జననియు జనకుఁడు
అలమి యితఁడు మాయంతర్యామి

రేకు: 0291-04 భైరవి సం: 03-527 నామ సంకీర్తన

పల్లవి: శ్రీహరి నిత్యశేషగిరీశ
మోహనాకార ముకుంద నమో శ్రీహరి

చ. 1: దేవకీసుత దేవ వామన
గోవిందా గోపగోపీనాథా! శ్రీహరి
గోవర్ధనధర గోకులపాలక
దేవేశాధిక తే నమో నమో

చ. 2: సామజాన (వ?)న సారంగ(శార్ఙ్గ?)పాణి
వామనా కృష్ణ వాసుదేవా! శ్రీహరి
రామనామ నారాయణ విష్ణో
దామోదర శ్రీధర నమో నమో

చ. 3: పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి! శ్రీహరి
చిరంతనాచ్యుత శ్రీవేంకటేశ
నరమృగ తే నమో నమో

రేకు: 0291-05 దేవగాంధారి సం: 03-528 శరణాగతి

పల్లవి: వేసరితేనే లేదు విచారించితేఁ గద్దు
మూసినదిదే కీలు ముంచి వివేకులకు

చ. 1: యెవ్వరు మనసులోన నిందిరేశుఁ దలఁచిన
అవ్వలఁ బాయక వుండు నదియే వైకుంతము
దవ్వులకు నేఁగవద్దు తపము జపము వద్దు
యివ్వలనిదే కీలు యెరిఁగినవారికి

చ. 2: నాలుక నెవ్వరైనాను నారాయణుఁ బొగడిన
చాలి యాతఁ డాడనుండు జగములూ నుండును
కాలమూ నడుగవద్దు కర్మమూ నడుగవద్దు
పోలింపనిదే కీలు పుణ్యమానసులకు

చ. 3: శ్రీవేంకటేశ్వరునిఁ జేరి యెవ్వరు నమ్మినా
కైవసమై యాతఁ డింటఁ గాచుకుండును
సావధానములు వద్దు శరణంటేనే చాలు
భావింపనిదే కీలు పరమయోగులకు

రేకు: 0291-06 శంకరాభరణం సం: 03-529 విష్ణు కీర్తనం

పల్లవి: దనుజులు గనిరి తత్త్వమిది
వనజాక్షుని కృప వసించనేలా

చ. 1: హరి పరమాత్ముఁ డనాదిపురుషుఁడు
సురలకు నరులకు సులభుఁడు
హరి కోపముతో నన్యులవరములు
సరిగా వెంచఁగ జగములలోన

చ. 2: వేదాంతవిదుఁడు విష్ణుఁడు కృష్ణుఁడు
శ్రీదేవికిఁ బతిశేఖరుఁడు
పోదిఁ బరస్తుతి పుణ్యముకంటే
పాదుగ హరిఁ దిట్టే పాపము మేలు

చ. 3: నారాయణుఁ డున్నతుఁ డచ్యుతుఁ డుప-
కారుఁడు శ్రీవేంకటవిభుఁడు
చేరి యీతఁడే శిక్షించ రక్షించ
వూరదయివములు వొగి నితనిసరా

రేకు: 0292-01 మలహరిసం: 03-530 కృష్ణ

పల్లవి: విశ్వమెల్ల నీ విరాడ్రూపము
శాశ్వతహరి నీ శరణులము

చ. 1: కన్నులఁ సూర్యుఁడు కమలాప్తుఁడు నీ-
పన్నిన మోమున బ్రాహ్మణులు
వున్నతి వైశ్యులు వూరువు లందును
యెన్నఁగ శూద్రులు యిదె పాదముల

చ. 2: యింద్రాది దేవతలీశాన బ్రహ్మము-
నీంద్రు లంగములు నెసఁగిరదే
సాంద్ర లోకములు జఠరంబున నవె
రుంద్ర తేజ మదె రోమముల

చ. 3: కాలముఁ గర్మముఁ గైవల్యంబును
ఆలోను వెలియునది నీవు
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర
కోలు ముందు నినుఁ గొలిచితిమయ్య

రేకు: 0292-02 దేవగాంధారి సం: 03-531 వైష్ణవ భక్తి

పల్లవి: కలదు తిరుమంత్రము కల దిహముఁ బరము
కలిమి గలుగు మాకుఁ గడమే లేదు

చ. 1: కమలాక్ష నీవు మాకుఁ గలిగియుండఁగ భూమి
నమరలేని దొకటి నవ్వల లేదు
నెమకి నాలుకమీఁద నీ నామము మెలఁగఁగ
తమితోఁ బరుల వేఁడఁ దాఁ జోటులేదు

చ. 2: శౌరి నీ చక్రము నాభుజముమీఁద నుండఁగాను
యీారసపుఁబగ లేదు యెదురూ లేదు
చేరువ నీసేవ నాచేతులపై నుండఁగాను
తీరని కర్మపువెట్టి దినమూ లేదు

చ. 3: అచ్చుత నీపై భక్తి యాతుమలో నుండఁగాను
రచ్చలఁ బుట్టిన యపరాధమూ లేదు
నిచ్చలు శ్రీవేంకటేశ నీ శరణాగతుండఁగా
విచ్చిన విడే కాని విచారమే లేదు

రేకు: 0292-03 దేసాక్షి సం: 03-532 శరణాగతి

పల్లవి: దేవుఁ డొక్కఁడే మాకు దిక్కుగాని
కావ నెవ్వరును లేరు కతలింతే కాని

చ. 1: పచ్చివొళ్లు మోచితిమి పాపమెల్లాఁ జేసితిమి
హెచ్చిన మీఁదటి సుద్దు లేఁటివో కాని
రచ్చలఁబడె మా గుట్టు రమణుల చేఁత బెట్టు
అచ్చమై యిందుకుఁ బరిహరమేదో కాని

చ. 2: గాలిమూఁటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటివారమయ్యేమో కాని
మైల గొంత మనసూ మఱుఁగు గొంతానాయ
తాలిమి నా విధి యేమి దలఁచీనో కాని

చ. 3: మాయలఁ బొరలితిమి మరచితి మింతలోనే
చాయల శ్రీవేంకటేశు శరణంటిమి
రోయఁజొచ్చె జగమెల్లా రుచియాయ వైరాగ్య-
మాయము నాలోపలి అంతరాత్మేకాని

రేకు: 0292-04 వసంతవరాళి సం: 03-533 వేంకటగానం

పల్లవి: అతని నమ్మలే రల్పమతులు భువి
నతఁ డాద్యుఁడు పరమాత్ముఁడు

చ. 1: సకలలోకపతి సర్వేశ్వరుఁడట
వొకఁడిఁక దొర మరి వున్నాఁడా
ప్రకటించఁగ శ్రీపతియే దాతట
వెకలి నియ్యఁగొన వేరే కలరా

చ. 2: దివిజవందితుఁడు దిక్కుల హరియట
యివల మొక్క సురలిఁక వేరీ
కవ నంతర్యామి కరుణాకరుఁడట
వివిధభంగులను వెదకఁగనేలా

చ. 3: వేదాంగుఁడు శ్రీవేంకటపతి యట
ఆదిమతము లిఁక నరసేదా
యేదెస నెవ్వరి కెప్పుడుఁ గలఁ డితఁ-
డీదేవుఁడె మన కిహపర మొసఁగ

రేకు: 0292-05 సాళంగనాట సం: 03-534 శరణాగతి

పల్లవి: ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు
సకలము హరియని సరిఁదోఁచీని

చ. 1: అంతరాత్మ శ్రీహరి యతఁ డొకఁడే
జంతుపులన్నియు సమములే
బంతులఁ బాత్రాపాత్రము వెదకిన
అంతట హరి దాస్యమేపో ఘనము

చ. 2: జగమును నొకటే చైతన్య మొకటే
తగిన పంచభూతము లొకటే
నగుతా నెదిరిని నన్నును నెంచిన
మొగి నాపై హరి ముద్రలె ఘనము

చ. 3: కారు స్వతంత్రులు కడపట నొకరును
యీరీతి నౌఁగాము లిఁక నేలా
శ్రీరమణీపతి శ్రీవేంకటేశుఁడే
కారణము శరణాగతియే ఘనము

రేకు: 0292-06 సాళంగనాట సం: 03-535 దశావతారములు

పల్లవి: వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడైన విష్ణుని నెఱఁగరా

చ. 1: తోలె నదె గరుడనిఁ దొడఁగి బాణునిమీఁద
వాలెను కంసునిమీఁద వడి నెగసి
కేలుచాఁచి చక్రమునఁ గెడపె శిశుపాలుని
వేలుపులరాయఁడైన విష్ణుని నెఱఁగరా

చ. 2: తొక్కెను బలీంద్రునిఁ దొల్లి పాతాళానఁ గుంగ
మొక్కలాన జలధమ్ముమొనకుఁ దెచ్చె
పక్కన బ్రహ్మాండము పగులించెఁ బెనువేల
వెక్కసపుదైవమైన విష్ణుని నెఱఁగరా

చ. 3: భేదించె రావణాది భీకరదైత్యుల నెల్ల
నాదించె శంఖమున నున్నతజయము
సేదదేర నిపుడును శ్రీవేంకటాద్రిమీఁద
వీదివీది మెరసేటి విష్ణుని నెఱఁగరా

రేకు: 0293-01 లలిత సం: 03-536 విష్ణు కీర్తనం

పల్లవి: ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేఱు గుడిచి కాలువ పొగడుట

చ. 1: హరిపాదముననే యడఁగె లోకములెల్ల
హరినాభినే పొడమి రదివో బ్రహ్మాదులు
హరినామము వేదాల కాదియు నంత్యమునాయ
హరిదాసులే వశిష్ఠాదు లిందరును

చ. 2: విష్ణుఁడే యమృత మిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె
విష్ణువాజ్ఞ నడచేది విశ్వ మింతాను
విష్ణుచక్రమున దైత్యవీరులెల్లా నడఁగిరి
విష్ణువు ముఖమునందే విప్రులు జనించిరి

చ. 3: పరమపు శ్రీపతివే భారతరామాయణాలు
పరమాత్ముఁ డితఁడే పలుజీవుల యందెల్లా
పరము చేచేతఁ జూపె పట్టి శ్రీవేంకటేశుఁడు
పరమానంద మొసఁగు భక్తులకు నితఁడు

రేకు: 0293-02 శుద్ధవసంతం సం: 03-537 శరణాగతి

పల్లవి: నిండిన జగములెల్లా నీయాధీనము
బందు జన్మములవాఁడ భయమేమీ నెరఁగ

చ. 1: పాతకపు దేహమిది ప్రకృతి యాధీనము
ఆతుమ శ్రీహరి నీయాధీనము
యీతల నాతల నేనెవ్వరి నేమనలేను
చేతనుఁడ నింతే నేను చిక్కిన వేమెఱఁగ

చ. 2: వెలయు నా కర్మము నీ వేదశాస్త్రాధీనము
నిలిచిన జ్ఞానమెల్లా నీయాధీనము
తలఁచి యెవ్వరి నేఁ దగుఁ దగదనలేను
కొలఁది జీవుఁడనింతే కొనమొద లెఱఁగ

చ. 3: అక్కడ నా మనసిక నాచార్యాధీనము
నిక్కపు నామోక్షము నీయాధీనము
యెక్కువ శ్రీవేంకటేశ యెవ్వరి నేమనలేను
పక్కన నీ బంటనింతే పరచింత లెఱఁగ

రేకు: 0293-03 రామక్రియ సం: 03-538 వైరాగ్య చింత

పల్లవి: ఏమి సేయఁగలఁడు తానీ జగమెల్లాను
కోమలపు దేహి కొక్కకోకే కలది

చ. 1: మించిన కోరికలివి మిన్నుల పొడవులు
కొంచపు దేహము దనకొలఁది గాదు
యెంచరాని సిరు లవి యెన్ని గలిగినా
కంచములోని కూడే కలిగినది

చ. 2: గోరపడి గడించేవి కోట్ల కొలఁదులు
తారితూరి నోటికిఁ దగ్గంత గాదు
యేరుపరచి యింతుల నెందరిఁ బెండ్లాడినాను
కూరిమి సతి యొకతె కూటమికిఁ గలది

చ. 3: తలఁచి మొక్కే సురలు తలవెంట్రుకలందరు
యిలఁ దన బతుకెంతో యెరఁగరాదు
చెలఁగి రక్షించేవాఁడు శ్రీవేంకటేశుఁ డొకఁడే
కల డంతరంగమునఁ గైవల్యమే కలది

రేకు: 0293-04 లలిత సం: 03-539 వైష్ణవ భక్తి

పల్లవి: వీరు వారనేటివింతేల
శ్రీరమణుని కృప సిద్ధముఁ గాక

చ. 1: యెక్కడి పాపము యెక్కడి పుణ్యము
దక్కిన శ్రీపతిదాసునికి
పక్కన లోహముఁ బరుసము దాఁకిన
యెక్కువనంతా హేమమే కాదా

చ. 2: యేది హీనము యేది యధికము
పాదుగ నడచు ప్రపన్నునికి
మేదినీశుఁ డేమెలుఁతఁ బెండ్లాడిన
సాదించ నేలికసానే కాదా

చ. 3: యేడ నింద లీఁక నేడ సంస్తుతులు
జాడల శ్రీవైష్ణవునికిని
యీడనే శ్రీవేంకటేశుఁ డాత్మయట
యీడులేని యతఁ డెక్కుడే కాదా

రేకు: 0293-05 రామక్రియ సం: 03-540 మాయ

పల్లవి: నేనా గెలువలేను నీమాయ
శ్రీనాథ నీవు సేసే చేఁతలే నీమాయ

చ. 1: తమకము గడు రేఁచు తలఁపు ఉబ్బూఁతలూఁచు
నిమిష మూరకుండదు నీమాయ
తిమిరము బుద్ధిఁ గప్పు తెలివల వెంటఁ దిప్పు
అమరి తోడునీడ ఆయఁబో నీమాయ

చ. 2: పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులుసేసు
నిట్టి(ట్ట?) పిడిఁ బోనీదు నీమాయ
కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు
మట్టులే దింతింతని మరియు నీమాయ

చ. 3: పలు లంపటాల ముంచు భావజుచే భ్రమయించు
నిలిచిన చోటనెల్లా నీమాయ
యెలమి శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
మలసి సొలసి నన్ను మన్నించె నీమాయ

రేకు: 0293-06 సామవరాళి సం: 03-541 అధ్యాత్మ

పల్లవి: తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే
మనసులోనే కలుగు మహామహిమ

చ. 1: కనురెప్ప మూసితేనే కడ దాఁగె జగమెల్ల
కనుదెరచినంతనే కలిగెఁ దాను
ననిచివుండుట లేదు నమ్మకపోవుట లేదు
తనతోడిదే యిన్నిఁ దాఁ గలితేఁ గలవు

చ. 2: కడుపు నిండినంతనే కైపాయ రుచులెల్లా
బెడిదపు టాఁకలైతేఁ బ్రియమాయను
యెడనెడఁ జేఁదు గాదు యింతలోనే తీపు గాదు
వొడలితోడివే యివి వుండినట్టే వుండును

చ. 3: అద్దములోఁ దననీడ అంతటా మెరసినట్లు
పొద్దువొద్దు తనతోనే భోగాలెల్లా
అద్దిన శ్రీవేంకటేశుఁ డంతరాత్మయైనవాఁడు
కొద్ది లేదాతనిమాయ కొనసాగుచుండును

రేకు: 0294-01 శంకరాభరణం సం: 03-542 విష్ణు కీర్తనం

పల్లవి: చవిచేసుక యిటు జరగెదము

జవదాటకురో సంసారులార

చ. 1: యేదిచూచినా నెరవెరవే

పోదిఁ గూడఁగా పొదపింతే

ఆదికినాది హరి యొకఁడే

పాదుగఁ బుట్టెడి భవములె వేరు

చ. 2: కలుములు లేములు కతలింతే

నిలుకడ గలచో నిజమౌను

యిలయును జగమును యిదే యిదే

తెలిసి చూడఁగా దినములే ఘనము

చ. 3: చెంతల నిందరు జీవులే

బంతులఁ బుణ్యముఁ బాపమునే

యింతట శ్రీవేంకటేశ్వరుఁడే

కాంతలుఁ బురుషుల గతులై నిలిచె

రేకు: 0294-02 భూపాళం సం: 03-543 మేలుకొలుపులు

పల్లవి: హరికృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నా మోము తప్పకిటు చూడు

చ. 1: మేలుకొను నాయన్న మెల్లనే నీ తోడి
బాలులదె పిలిచేరు బడి నాడను
చాలునిఁక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు-
వేళాయ నాతండ్రి వేగ లేవే

చ. 2: కనుదెరవు నా తండ్రి కమలాప్తుఁ డుదయించె
వనిత మొకమజ్జనము వడిఁ దెచ్చెను
మొనసి మీ తండ్రి యిదె ముద్దాడఁ జెలఁగీని
దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే

చ. 3: లేవె నా తండ్రి నీ లీలలటు వొగడేరు
శ్రీవేంకటాద్రిపతి శ్రీరమణుఁడా
దేవతలు మునులుఁ జెందిన నారదాదులు
ఆవలనుఁ బాడేరు ఆకసమునందు

రేకు: 0294-03 లలిత సం: 03-544 విష్ణు కీర్తనం

పల్లవి: విశ్వాత్మ నీ కంటె వేరేమియునుఁ గాన
ఐశ్వర్యమెల్ల నీ యతివ చందములే

చ. 1: కలవు మతములు పెక్కు కర్మభేదములగుచు
కలవెల్ల నీయందె కల్పితములే
కలరు దేవతలు బహుగతుల మహిమల మెరయు
అలరి వారెల్ల నీ యంగభేదములే

చ. 2: ఘనమంత్రములు పెక్కు గలవు వరముల నొసఁగు
ననిచి యవియెల్ల నీ నామంబులే
పెనగొన్న జంతువులు పెక్కులెన్నే గలవు
పనిగొన్న నీ దాసపరికరములే

చ. 3: యెందును దగులువడ కేకరూపని నిన్ను
కందువఁ గొలుచువాఁడే ఘనపుణ్యుఁడు
అందపు శ్రీవేంకటాద్రీశ అన్నిటా-
నందినపొందినవెల్లా హరి నీయనుమతే

రేకు: 0294-04 సామంతం సం: 03-545 అంత్యప్రాస

పల్లవి: ఇహపరములకును యిది సుఖము
సహజావస్థే జరగేటి సుఖము

చ. 1: శ్రీరమణుఁడే చింతాయకుఁడని
పూరక వుండుట వొక సుఖము
కోరకుండఁగా గూడిన యర్థము
ఆరయఁ గైకొను టది సుఖము

చ. 2: వసముగాని పని వడిఁ దలకెత్తుక
అసురుసురుగాని దది సుఖము
యెసరెత్తుక లేళ్లేవని తోలక
పసఁ దనవిధిఁ గల పాటే సుఖము

చ. 3: పెక్కు చంచలము పెనచుక తిరుగక
వొక్క సుఖంబౌ టురుసుఖము
యెక్కువ శ్రీవేంకటేశ్వరు శరణని
నిక్కితిమిదె మా నిజమే సుఖము

రేకు: 0294-05 లలిత సం: 03-546 విష్ణు కీర్తనం

పల్లవి: వింటిమి నీ కతలు కంటిమి నీమాయలు
బంటుల మచ్యుత నీ పాలివారమయ్యా

చ. 1: కలిగిరి నీవల్లనే కడఁగి బ్రహ్మాదులు
నిలిచిరి సురలెల్లా నీవల్లనే
తెలిసిరి మునులెల్లా దేవుఁడవు నీవేయని
చలపట్టి హరి నీకు శరణనేమయ్యా

చ. 2: నుతియించీ వేదములు నోరార నీ మహిమ
గతియాయ వైకుంఠమే ఘనులకెల్లా
ప్రతిలేని నీ రూపే భావించేరు యోగీంద్రులు
తతితో శ్రీపతి నీకే దాసులమయ్యా

చ. 3: అదె నీ చక్రముచేత నడఁగి రసురలెల్లా
బదికిరి విప్రులు నీపాద సేవను
పొదలి శ్రీవేంకటేశ పొంది నీ కరుణ చేత
మొదల వెనక నీకే మొక్కేమయ్యా

రేకు: 0294-06 గుండక్రియ సం: 03-547 శరణాగతి

పల్లవి: ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి
తొట్టిన నా బ్రదుకుకుఁ దుదయు లేదు

చ. 1: నాని యీజన్మమెత్తి నాటివెల్లా మఱచితి
పూని యేమిటా విరతి పుట్టనేరదు
కానను ముందర వచ్చే ఘనకర్మపాశములు
పానిపట్టి(?)యించుకంతా భయమూలేదు

చ. 2: పంచేంద్రియములఁ జిక్కి భావమెల్లాఁ జిక్కువడె
అంచెల మోక్షముతోవ అరయలేను
యెంచి నాదేహములోని హేయమును సొత్మించె
చంచలపు దుర్గుణాలు చక్కనైనాఁ గావు

చ. 3: నగు సంపదల చేత నన్ను నేనే మరచితి
తెగువది వివేకించఁ దీరదెప్పుడు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
జగమెల్లా నెరఁగ నే సాత్వికుఁడనైతి

రేకు: 0295-01 తెలుగు కాంభోధి సం: 03-548 గురు వందన, నృసింహ

పల్లవి: ఇందునే తుదిపద మెక్కి రిందరును
మందరధర నీ మహిమిదివో

చ. 1: మరిగిన పుణ్యుల మతిలో కోరిక
పరమపు హరి నీ పాదములు
గరిమ గోపికలు గావలెనన్నది
హరి నీ సంభోగ మదియెపో

చ. 2: పొంచి వేదములు పొగడెడి యర్థము
అంచెల గుణకథ లవి నీవి
పంచి యజ్ఞముల ఫలమై యున్నవి
నించి దేవ నీ నిజపూజలెపో

చ. 3: కై వల్యమునకుఁ గడుఁ దెరువై నది
ఆవల నీ శరణాగతియే
శ్రీవేంకటేశ్వర చెప్పె మా గురుడు
మావద్ద నిదె నీ మంత్రమెపో

రేకు: 0295-02 సామంతం సం: 03-549 అధ్యాత్మ

పల్లవి: గోవిందుదాసులమై కొన కెక్కుదుముఁ గాక
వేవేలు విధుల నమ్మి వెతఁబడఁగలమా

చ. 1: మనసు లోపలి మామర్మము దెలియలేము
ఘనుఁడైన హరి నెట్టు గానఁగలము
తనువుతో భోగాలు తగులు వీడగలేము
వెనక కర్మపాశాలు వీడించుకోఁగలమా

చ. 2: వడిఁ బెట్టే యింద్రియాల వద్దని మానుపలేము
తొడరి సంసారము తోయఁగలమా
బడిబడి నానాటి బతుకు చెప్పుకోలేము
పొడలేటి యితరుల బోధించఁగలమా

చ. 3: కొంకక ఆడిన మాట గురుతు వెట్టఁగలేము
లంకె వేదవాక్యము దలఁచఁగలమా
యింకా శ్రీవేంకటేశుఁ డితఁడే మా దేవుఁడని
సంకెలేకుందుముఁ గాక జాలిఁబడఁగలమా

రేకు: 0295-03 బౌళి సం: 03-550 అద్వైతము

పల్లవి: పుట్టుగులు నొక్కటే పుణ్యపాపములే వేరు
యెట్టుసేసినాఁ జేసే నేమి సేయవచ్చును

చ. 1: పగలే రేయి యీబడిఁ గొన్నిజీవులకు
వొగి నా రేయి పగలౌ నొకరికిని
తగుదైవ మొకఁడే తమ మతములే వేరు
పగటుల విష్ణుమాయ భ్రమయించీ నిదివో

చ. 2: నిలువెల్లాఁ జేఁదే నెరిఁ గొన్నివృక్షములు
కలదెల్లఁ దీపే కమ్మరఁ గొన్ని
తలఁపును నొకటే తత్త్వములే వేరువేరు
చెలరేఁగి విష్ణుమాయ చిక్కువెట్టీ నిదివో

చ. 3: ఇహమే పరము యెరిఁగితేఁ గొందరికి
మహిఁ బరమే ఇహము మరొకరికి
వహితో శ్రీవేంకటేశు వలెనని కొలిచితే
సహజపు విష్ణుమాయ జారిపోవునపుడే

రేకు: 0295-04 కన్నడగౌళ సం: 03-551 మాయ

పల్లవి: దైవమా నీవే యిందు దయ దలఁచుటఁ గాక
తోవనున్న జీవులెట్లు తోసేరు నీమాయ

చ. 1: పలుచవులందునెల్ల ప్రాణమే మిక్కిలి చవి
బలిమి తీపులలోనఁ బ్రాణమే తీపు
యిలపైఁ బూజ్యులలోన నింతులే కడుఁబూజ్యులు
తలఁచి జీవులు యెట్టు దాఁటేరు నీమాయ

చ. 2: తగు చుట్టరికాలలో ధనమే చుట్టరికము
జగతిఁ గట్టని కట్టు సంసారము
వగలైన గుణాలలో వైరమే నిజగుణము
జిగిఁ బ్రాణులెట్లు గెలిచేరు నీమాయ

చ. 3: తమలో నెవ్వరికైనా తమ జాతి తమ నేర్పు
తమకు నెక్కుడై తోఁచు తక్కువనరు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులకే కాని
భ్రమసిన జీవులెల్లాఁ బాయరు నీమాయ

రేకు: 0295-05 లలిత సం: 03-552 విష్ణు కీర్తనం

పల్లవి: తెలిసినవారి కింతా దేవుఁడై యుండు
కలఁడన్నచోట హరి గలఁ డటుగాన

చ. 1: అందునిందుఁ బోయి శ్రీహరిని వెదకనేల
బొందితోడి రూపులెల్లాఁ బొరి నతఁడే
కొందరిలోనుండి ఇచ్చుఁ గోరినట్టి యీవులెల్ల
కొందరిలో మాటలాడుఁ గొందరిలో నగును

చ. 2: లోన వెలిఁ జూచి పరలోకము వెదకనేల
యేనెలవైన వైకుంఠ మెదుట నదె
పూని వొకచోట నెండ పొడచూపు నక్కడనే
నానిన వెన్నెల గాసు నానారీతులౌను

చ. 3: చొక్కిచొక్కి యానందసుఖము వెదకనేల
మక్కువఁ దా శాంతుఁడైతే మతిలో నదె
యెక్కువతో శ్రీవేంకటేశ్వరు దాఁసుడ నైతి
వొక్కఁడే మాకిన్నిటికిఁ నొడయఁడై నిలిచె

రేకు: 0295-06 బౌళి సం: 03-553 శరణాగతి

పల్లవి: ఇంక మా బోంట్ల కేది విధో
కింకరులమనియెడి గెలుపే కాక

చ. 1: యెవ్వరు గడచిరి యింతక తొలుతను
నివ్వటిల్లు హరి నీమాయ
నవ్వుచు నీ శరణాగతి నమ్మిన
మువ్వంక శుకాదిమునులే కాక

చ. 2: కన్నవారెవ్వరు ఘన వైకుంఠము
వున్నతమగు నీ వురుమహిమ
మున్ను నిపుడు నీ ముద్రలు మోఁచిన
అన్నిటా ఘనసనకాదులుఁ గాక

చ. 3: తెలియువారెవ్వరు దివ్యజ్ఞానము
చలనముగాఁ జెప్పు శాస్త్రములు
యిలలో శ్రీవేంకటేశ నీవారై
చెలఁగిరి శేషాదిజీవులుఁ గాక

రేకు: 0296-01 సాళంగనాట సం: 03-554 విష్ణు కీర్తనం

పల్లవి: ఎందరు గలిగిన నితని లోనే
ముందు వెనకలను ముఖ్యం బితఁడే

చ. 1: భవ విదూరుఁ డాపద్బంధుఁడు హరి
వివరించి కొలువ వేల్పితఁడు
కవతో లక్ష్మీకాంతుఁ డితఁడు
రవిశశినేత్రుఁడు రక్షకుఁడు

చ. 2: కలిదోషహరుఁడు కారుణ్యనిలయుఁడు
వలెననువారికి వరదుఁడు
తలఁపు లోనఁ గల తత్త్వం బితఁడు
సులభుఁ డితఁ డరసి చూచినను

చ. 3: శ్రీవేంకటేశుఁడు చిత్తజగురుఁడు
యేవలఁ జూచిన నితఁడే
గోవిందుఁ డితనిఁ గొలిచితి మిదివో
తోవయుఁ గంటిమి తుదకెక్కితిమి

రేకు: 0296-02 శుద్ధవసంతం సం: 03-555 మాయ

పల్లవి: కనుఁగొననిది హరి కల్పితము
తనకు నిందులోఁ దగినంతే

చ. 1: నానాభేదములు నరుల గుణంబులు
నానారుచులివి నవపదార్థములు
ఔననేదేది యటు గాదనేదేది
వానివాని విధి వలసినయట్టు

చ. 2: నడచుఁ బ్రపంచము నడుపే విధముల
నడచు మాయ లెన్నఁగరావు
విడిచేటివేఁటివి విడువనివేఁటివి
పడఁగఁబడఁగ నవి పరచినయట్లు

చ. 3: తెగని కర్మములు దేహధర్మములు
తెగని యాసలివె దినదినము
తగు శ్రీవేంకటదైవము దాసులు
నగుదు రిన్నిటిని నటనలు చూచి

రేకు: 0296-03 వరాళి సం: 03-556 అధ్యాత్మ

పల్లవి: అరిగాఁపులము నేము అంతర్యామివి నీకు (వు?)
యిరవై నీ చెప్పినట్టు యేమి సేతుమయ్యా

చ. 1: గాలి ముడి గట్టినట్టు కాయము మోచితిమి
కాలము గొలచితిమి కనురెప్పల
జాలి రొప్పితిమి వట్టి సటలనే యేపొద్దు
యేల మెచ్చవింకాను యేమి సేతుమయ్యా

చ. 2: చుక్కలు లెక్కించినట్టు చూడఁగ మా జన్మములు
వుక్కునఁ గర్మములకు నొడిగట్టితి (మి?)
తెక్కులను వెంటవెంటఁ దిరిగేము బంట్లమై
యెక్కువాయ వెట్టి మాకు నేమి సేతుమయ్యా

చ. 3: పాలు వొంగినటువలెఁ బాయము మోచితిమి
నాలుక కెక్కినవెల్లా నమలితిమి
యీలీల శ్రీవేంకటేశ ఇంత సేసితివి
యేలినవాఁడవు ఇంకా నేమిసేతుమయ్యా

రేకు: 0296-04 శంకరాభరణం సం: 03-557 అధ్యాత్మ

పల్లవి: మిగిలిన దేమిఁకమీఁదట దేహికి
అగపడు నొక పడెఁ డన్నంబు

చ. 1: రతిఁ బగటి వెలుఁగు రాత్రిచీఁకటికి
సతము గాదు అది సరికి సరి
అతిభోగములకు నార్జించుటకును
చతురపు సంపద సరికి సరి

చ. 2: అలయ పథ్యమున కౌషధము గొనుట
చలువకు వేఁడికి సరికి సరి
నిలిచిన పుణ్యము నిండుఁబాపములు
జలువు వెలువులకు సరికి సరి

చ. 3: మహి మరణములకు మరి పుట్టుగులకు
సహజ మందరికి సరికి సరి
యిహమున శ్రీవేంకటేశ్వరుఁ డాత్మకు
సహకారి యతఁడు సరికి సరి

రేకు: 0296-05 మాళవి సం: 03-558 విష్ణు కీర్తనం

పల్లవి: తెలుపఁగ రాదిది దేవుని మాయలు
ఫల మెఱఁగరు యీ పట్టినవెట్టి

చ. 1: పుట్టిరి దివిజులు పురుషోత్తమునం-
దట్టే యణఁగిరి యతనందు
యిట్టే యీతని యిందరితో సరి-
వెట్టి కొలుచుటే పెనువెట్టి

చ. వుపమించి తెలిసితే నొక్కటే జగము
అపురూపపు నీసృష్టి అతిఘనము
అపరిమితపు జీవు లణువత్రులైనాను
యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు

రేకు: 0165-04 నాదరామక్రియ సం: 02-315 దశావతారములు

పల్లవి: ఎంతకత నడిపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా

చ. 1: కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచేకొరకై తే నీచే చక్ర-
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా

చ. 2: చేకొని వానరులఁగాఁ జేయనేల దేవతల
జోకతో లంకాపురి చుట్టుకోనేల
కాకాసురు వేసిన కసవే రావణుమీఁద-
నాకడఁ జంపువెట్టితే నప్పుడే సమయఁడా

చ. 3: గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడసితే తానే పొలియఁడా

రేకు: 0165-05 నాదరామక్రియ సం: 02-316 వేంకటగానం

పల్లవి: పరులకైతే నిదే పాపము గాదా
పురిగొని నీవంకఁ బుణ్యమాయఁ గాక

చ. 1: పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధించఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు

చ. 2: నారాయణుఁడ నీవు నడిపినదే తగవు
ఆరూఢి నీ వౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు

చ. 3: శ్రీవేంకటేశ నీవు చేసినదే నీతి
చేవతో నీ వొడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు

రేకు: 0166-01 నాదరామక్రియ సం: 02-317 వైష్ణవ భక్తి

పల్లవి: ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు

చ. 1: భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము

చ. 2: దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతులపొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము

చ. 3: ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛ తోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము

రేకు: 0166-02 రామక్రియ సం: 02-318 అధ్యాత్మ

పల్లవి: జతనము జతనము సర్వేశు నగరిది
బతుకుఁదోవ యిదె బడకరము

చ. 1: హృదయములోపల నీశ్వరుఁడున్నాఁడు
పదిలము మనసా బడకరము
తుద నల కామాదులఁ జొర నియ్యక
పదరక కావుము బడకరము

చ. 2: యెంచుకొనినిదే యేలిక మిము నిఁక
పంచభూతములాల బడకరము
మించిన పురి తొమ్మిదివాకిళ్లనుఁటికి
దైవమొక్కఁడే తగిలిన గుఱుతు

చ. 3: కాయపు గుణములు కలిగినవే భువి-
నీ యెడ జీవుఁడు యిటు గలఁడే
ఆయమిందుఁ గా దవునన నెవ్వరు
కాయజగురుఁ డొక్కఁడే ప్రేరకుఁడు

చ. 4: అంతరంగమే యాత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడమాయ
చింతించి రక్షించ శ్రీవేంకటేశుఁడు
మంతుకెక్కె నిఁక మతకములేల

రేకు: 0297-04 సాళంగం సం: 03-563 విష్ణు కీర్తనం

పల్లవి: ఒక్కఁడే దైవం బున్నతుఁ డీతఁడు
తక్కిన తలఁపులు తప్పుఁదెరువులు

చ. 1: పురుషుల కెల్లాఁ బురుషోత్తముఁడు
సురేంద్రాదులకు సురేంద్రుఁడు
హరునికి నజునికి నవ్వలిమూరితి
హరి ఇతఁడే పరమాత్ముఁడు

చ. 2: వేదాంతంబుల వేద్యుఁ డీతఁడు
ఆదికినాదియు నన నితఁడే
మేదిని నరులకు మేదినీశ్వరుఁడు
యేదెసఁ జూచిన నీశ్వరుఁ డితఁడే

చ. 3: యెక్కువల కెల్ల నెక్కువ యీతఁడు
మక్కువ మరునికి మరుఁ డితఁడు
యిక్కడ శ్రీవేంకటేశుఁడై మిగుల
పక్కన నిదివో ప్రత్యక్ష మితఁడు

రేకు: 0297-05 శ్రీరాగం సం: 03-564 విష్ణు కీర్తనం

పల్లవి: ఓహో నిలిచిన దొకటిదియే
శ్రీహరి సాకారచింతనము

చ. 1: పంచమవేదపు పద్మాక్షునామము
అంచెఁ బాపహర మౌషధము
పంచలఁ బీతాంబరు శరణాగతి
ముంచిన యజ్ఞానమునకు దీపము

చ. 2: విందులకుడుపులు విష్ణుకీర్తనము
చందపు వైకుంఠ(ము?) సంబళము
పొందుగ నచ్యుతుఁ బూజించు పూజలు
కిందటఁ గొనకెక్కెడి నిచ్చెనలు

చ. 3: కట్టిన ముడుపగు ఘన కృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము
యిట్టే శ్రీవేంకటేశ్వరు కృప యిది
పట్టినవారికి బలువగు కొమ్ము(మ్మ?)

రేకు: 0297-06 శంకరాభరణం సం: 03-565 మాయ

పల్లవి: వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియుఁ దీర్చదు యిది నీమాయ

చ. 1: నీ వల్ల బ్రదికిరి నిండు దేవతలు
నీవల్ల నసురలు నెటిఁ జెడిరి
ఆవల నిందరి కాత్మవు నీవే
చేవదేరె నీ చిక్కులే భువిని

చ. 2: నెమ్మిఁ బాండవుల నీవారంటివి
కమ్మర విడిచితి కౌరవుల
యిమ్ముల నీవావి యిద్దరికొకటే
తెమ్మలాయ నీ తీరని చిక్కు

చ. 3: జగమున నీదే స్వతంత్రమెల్లా
నెగడిన జీవులు నీవారు
తగు శ్రీవేంకటదయివమ యిన్నియు
తెగి నీదాసులు తెలిసిన చిక్కు

రేకు: 0298-01 దేవగాంధారి సం: 03-566 వైరాగ్య చింత

పల్లవి: మాయామోహము మాన దిది
శ్రీయచ్యుత నీ చిత్తమే కలది

చ. 1: యెంత వెలుఁగునకు నంతే చీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధ మపథ్యమును సరి
వింతే మిగిలెను వేసటే కలది

చ. 2: చేసిన కూలికి జీతమునకు సరి
పూసిన కర్మభోగము సరి
వాసుల జన్మము వడి మరణము సరి
ఆసల మిగిలిన దలపే కలది

చ. 3: మొలచిన దేహము ముదియుటకును సరి
దలఁచిన దైవము తనలోను
యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ-
గలిగిన మాకెల్ల ఘనతే కలది

రేకు: 0298-02 సాళంగనాట సం: 03-567 నృసింహ

పల్లవి: చేకొని కొలువరో శ్రీనరసింహము
శ్రీకరమగు నిదె శ్రీనరసింహము

చ. 1: వెడలేటి వూర్పుల వేఁడిమి చల్లీ
చిడుముడి కోపపు శ్రీనరసింహము
గడగడ వడఁకేటి గండస్థలములు
జెడలు గదలిచీ శ్రీనరసింహము

చ. 2: వంకరగోళ్ల వైపులు వెదకీ
చింకచూపులను శ్రీనరసింహము
హుంకారంబుల నుదధులు గలఁచీ-
నంకెల శ్రీపతియగు నర సింహము

చ. 3: వదనము దిప్పుచు వడి నసురమేను
చిద్రుపలు చేసెను శ్రీనరసింహము
అదివో శ్రీవేంకటాద్రి యెక్కి యిటు
చెదరక నిలిచెను శ్రీనరసింహము

రేకు: 0298-03 వరాళి సం: 03-568 ఉపమానములు

పల్లవి: అతనిలోనే యణఁగె నన్నియును
కతలెన్నైనాఁ గలవు కమలాక్షుఁ గనరో

చ. 1: యిసుక లెక్కవెట్టితే నెంతైనాఁ గలదు
అసముదించని పుణ్యా లటువంటివే
వసగాని పెక్కు దేవతలఁ గొలుచుకంటే
సుసరాన హరివారై సుఖియించరో

చ. 2: గోడ గడుగఁగఁ బోతేఁ గొనదాఁకా రొంపే
ఆడుకోలు తర్కవాదా లటువంటివే
వాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివారై యీడేరరో

చ. 3: మనసునఁ బాలు దాగితే మట్టు లేదు మేర లేదు
అనుగు సంసారభోగా లటువంటివే
దినదిన తపములఁ దీదీపులవుకంటే
తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో

రేకు: 0298-04 సౌరాష్ట్రం సం: 03-569 విష్ణు కీర్తనం

పల్లవి: మరల విచారించితే మంచము కిందే నుయ్యి
శిరుల హరివారైరి శివాదులు

చ. 1: ఆడేటి మాటలకెల్ల నాది సంతము లేదు
వీడని కర్మములకు విధి లేదు
తాడుపడ్డ మనసుకు దైవము విష్ణుఁడేయని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు

చ. 2: పుట్టిపడే జన్మముల కూరట యెందూ లేదు
కట్టడి ఇంద్రియాలకు గతి లేదు
తట్టువడ్డ జీవునికి దైవము శ్రీహరియని
యిట్టె మొర యిడిరి యింద్రాదులు

చ. 3: కప్పిన యీ మాయలకు కడవ రెందూ లేదు
తిప్పని హరిభ క్తికిఁ దిరుగు లేదు
వొప్పుగా శ్రీవేంకటేశుఁ డొక్కఁడే దైవమని
చొప్పువట్టి కొలిచిరి శుకాదులు

రేకు: 0298-05 సామవరాళి సం: 03-570 మాయ

పల్లవి: ఏ వల్ల నౌఁగాము లేఁక నేవి అన్నియు నీలోనే
శ్రీవల్లభుఁడ నిన్నుఁ జేఁటితిమి నేము

చ. 1: సగుణనిర్గుణములును సావయవనిరవయవ-
మగుఁ దర్కవాదకలహములు ఘనము
జగములో చదువులును సంశయంబే కాని
తెగనీదు నీ మాయ తెలియ వసమా

చ. 2: వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత
పోది మతములవారి పోరు ఘనము
పొదైన మునిరుషులు బహుముఖములే కాని
సోదించి వొకమాట చూపంగ లేరు

చ. 3: వెస గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక
వసగావు రెంటి బలవంతములును
వసుధ శ్రీవేంకటేశ్వర నీవు గావు మిఁక
ముఁసుగు వెట్టినవాదు ముగియదెంతైనా

రేకు: 0298-06 బౌళి సం: 03-571 వేంకటగానం

పల్లవి: సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ నా-
పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి

చ. 1: వేగిలేచి నేఁ జేసేవెడచేఁత నీ చేఁతే
ఆగడపు మాటాడిన నది నీ మాటే
ఆగము భోగములు నా యన్నపానాదులు మరి
శ్రీగురుఁడ నాలోని చింతయు నీ చింతే

చ. 2: కోపము శాంతములును గుణావగుణము నా-
రూపును నీ సాకారరూపమే
పాపపుణ్యములు నా ప్రాణవాయువులును
శ్రీపతి నా సంసారసేవయు నీసేవే

చ. 3: ఉదయాస్తమపు దినా లున్నాఁడ నీ దినములే(?)
యెదురు నేను నీ వాఁడ నింతా నీదె
అదివో శ్రీవేంకటేశ అంతరియామివి నీవే
నిదుర మేల్కొనుటయు నీమహిమే

రేకు: 0299-01 శంకరాభరణం సం: 03-572 శరణాగతి

పల్లవి: తన చిత్తము కొలఁది తమకించ నీఁకనేల
మనసు వచ్చినప్పుడే మన్నించీఁ గాక

చ. 1: కొండలందు నదులందుఁ గోరి యాకసాన భువి
నిండియున్నాఁడు తొలుతే నీలవర్ణుఁడు
అండనే నా యందు లోకులందు నుండుటరుదా
గండికాఁడై తన మాయ గాననీఁడుఁ గాక

చ. 2: గాలియై పంచమ(?) వాద్యగతులై శబ్దములై
ఆలకించి పలికీని యాదిమూరితి
నాలుక కొననే వుండి నానాభాష లాడీని
కాలముతో నెదిరికిఁ గాననీఁడుఁ గాక

చ. 3: వేదమందు శాస్త్రమందు వేవేలు వాదములందు
పాదుకొని బోధించీఁ బరమాత్ముఁడు
యీదెసనే శ్రీవేంకటేశుఁడై పొడచూపె
గాదిలి తన దాసులఁ గరుణించీఁ గాక

రేకు: 0299-02 లలిత సం: 03-573 శరణాగతి

పల్లవి: శ్రీపతి యొకఁడే శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది

చ. 1: ఆసలు మిగులా నాతుమ నున్నవి
యీసు లేని సుఖ మెక్కడిది
చేసిన పాపము చేతుల నున్నది
మోసపోని గతి ముందర నేది

చ. 2: కోపము గొందుల గుణముల నున్నది
యేపున నిజసుఖ మిఁక నేది
దీపనాగ్నితోఁ దిరిగెటి దేహము
పైపై విరతికిఁ బట్టేది

చ. 3: పంచేంద్రియముల పాలిటి బదు కిది
యించుక నిలుకడ కెడ యేది
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుఁ డొకడే
పంచిన విధులను పాలించుఁ గాక

రేకు: 0299-03 మాళవిగౌళ సం: 03-574 నామ సంకీర్తన

పల్లవి: నారాయణ నీ నామమహిమలకు
గోరఁ బోవుటకు గొడ్డలి దగునా

చ. 1: హరియని నొడిగిన నణఁగేటి పాపము
సిరుల నేను నుతిసేయఁగఁగలనా
పరగిన పిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకొని పూరకె తొడిగినయట్లు

చ. 2: అచ్చుత యనఁగా నందెటి సంపద
యిచ్చల నెంచిన నిలఁగలవా
కొచ్చికొచ్చి యొక కొండంత కనకము
వెచ్చపుఁ బోఁకకు వెల యిడినట్లు

చ. 3: యెదుటనే శ్రీవేంకటేశ్వర యనఁగాఁ
బొదిగెటి తపముల పుణ్యము గలదా
కదిసి సముద్రము గడచి వోడలోఁ
జిదిసి యినుము దెచ్చినయట్లు

రేకు: 0299-04 లలిత సం: 03-575 శరణాగతి

పల్లవి: నీవెటు దలఁచిన నిఖిలము నట్టొ
యేవల స్వతంత్ర మింతా నీది

చ. 1: యేఁటి పురాకృత మెక్కడి కర్మము
దాఁటక హరి నీ దయ గలిగితే
నీటున నిన్నియు నీ కల్పితములు
పాటించి నీవే పాపఁగలేవా

చ. 2: యెక్కడి జన్మము లెక్కడి మరణము-
లొక్కఁడవె నీవు వొద్దంటే
యెక్కువ నిందరి నేలెటివాఁడవు
యిక్కడఁ గొలిచితి మితరము లేలా

చ. 3: యేది పాపము యేది పుణ్యము
పోదిగ నీవే పొమ్మంటే
చేదో డిందుకు శ్రీవేంకటేశ్వర
ఆదె నిను శరణంటిమి గొంత

రేకు: 0299-05 ముఖారి సం: 03-576 వైరాగ్య చింత

పల్లవి: నానాఁటి బదుకు నాఁటకము
కానక కన్నది కైవల్యము

చ. 1: పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాఁటకము
యెట్టనెదుటఁ గలదీ ప్రపంచమును
కట్టఁగడపటిది కైవల్యము

చ. 2: కుడిచే దన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాఁటకము
వొడిఁ గట్టుకొనిన వుభయకర్మములు
గడి దాఁటినపుడే కైవల్యము

చ. 3: తెగదు పాపమును తీరదు పుణ్యము
నగినగి కాలము నాఁటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుఁ డేలిక
గగనము మీఁదిది కైవల్యము

రేకు: 0299-06 సాళంగనాట సం: 03-577 కృష్ణ

పల్లవి: ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీఁడు
తిద్దరాని మహిమల దేవకిసుతుఁడు

చ. 1: అంతనింత గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూఁడులోకాల గరుడపచ్చఁబూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుఁడు

చ. 2: రతికేలి రుక్మిణికి రంగు మోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ముఁ గాచేటి కమలాక్షుఁడు

చ. 3: కాళింగుని తలల పైఁ గప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రి యింద్రనీలము
పాలజలనిధిలోనఁ బాయని దివ్యరత్నము
బాలుని వలెఁ దిరిగీఁ బద్మనాభుఁడు

రేకు: 0300-01 దేసాక్షి సం: 03-578 అధ్యాత్మ

పల్లవి: ఇందరు నెఱిఁగినదీ బదుకు
పొందినదాఁకా భోగించవలయు

చ. 1: పొట్టఁ బొరుగులివె పుణ్యపాపములు
నట్టనడుమనే నా బదుకు
వెట్టిమోపువో వెడ సంసారము
ముట్టినదాఁకా మోవఁగవలెను

చ. 2: తోడునీడ యిది తొలఁగని జన్మము
యేడకుఁ బోరాదు యీ బదుకు
వీడని కట్లు వెడవెడ యాసలు
వూడినదాఁకా నుండఁగవలెను

చ. 3: చేతిలో ధనము శ్రీవేంకటపతి
యీతని తోడిదె యీబదుకు
ఆతుమలోనే యల వైకుంఠము
ధాతు మాతుగని తలఁచఁగవలెను

రేకు: 0300-02 లలిత సం: 03-579 విష్ణు కీర్తనం

పల్లవి: నీవే యంతర్యామివి నీ వున్నదే వైకుంఠము
ఆవలఁ బరమపదమన నింకాఁ గలదా

చ. 1: యిందరు జంతువులు నీ విచ్చిన రూపులు మోచి
బొందితో నీకే నెలవై పుట్టినారు
కందువ నీ ప్రపంచపు కైంకర్యములు సేసి
అందిరి జీవన్ముక్తు లదివో చాలదా

చ. 2: యేలిక వంచిన పనే యింద్రియభోగములెల్ల
తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు
కాలము నిన్నుఁ బాయరు గర్భగోళమం దున్నారు
యీ లోకమే సాలోక్యమిది యింత చాలదా

చ. 3: జ్ఞానము నజ్ఞానమేది స్వామికార్యములోన
మానక నీ పనులలో మత్తులైనారు
శ్రీనాథుఁడవు నీవే శ్రీవేంకటేశ్వర
నీ నాటకములోనే నిత్యులైరి చాలదా

రేకు: 0300-03 ధన్నాసి సం: 03-580 శరణాగతి

పల్లవి: పరిణామమే మాకుఁ బతివి నీవు గలుగ
శరణాగతే మాకు సకలరక్షయ్యా

చ. 1: నుదుట వ్రాసిన వ్రాఁత నూఁటికి నీ తిరుమణి
యెదురేది మాకు నేఁడు యేఁడులోకాల
పెదవి మీఁదటి తేనె పేరుకొనే నీ జపము
అదన మాకు నదివో అక్కరలేదయ్యా

చ. 2: చేతికి వచ్చిన సొమ్ము చేరె నీ శంఖుచక్రాలు
ఘాతల మా కిఁక నేది గడమ లేదు
నీతితో వెనుబలము నీ దాసుల సేవ
రాతిరిఁబగలు నిదె రాజుల మోయయ్యా

చ. 3: తొల్లిఁటి పుణ్యఫలముతోడనే నీ సంకీర్తన
తల్లిదండ్రి నీవు నీ తరుణియును
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నియుఁ గలిగె మాకు
చల్లఁగా బ్రతికితిమి జయ మందవయ్యా

రేకు: 0300-04 పాడి సం: 03-581 శరణాగతి

పల్లవి: ఇందులోన నే నెవ్వరిఁబోలుదు
అంది నీవాఁడ నే ననుకొంటిఁ జుమ్మీ

చ. 1: జలజనాభ నీ శరణనువారలు
అల నారదసనకాదులు
కెలన మరియు నీ కింకరవర్తులు
తెలిసిన బ్రహ్మాదిదేవతలు

చ. 2: నోరార హరి నిను నుతించువారలు
చేరువ నుండేటి శేషాదులు
ధారుణిలో నీదాసాన(ను?)దాసులు
మారుతిముఖ్యులు మహామహులు

చ. 3: బడి నీచే ముక్తి వడసినవారలు
సుడిగొను మునిజన శుకాదులు
కడఁగిన శ్రీవేంకటపతి నీవే
తడవి నన్ను దయదలఁచుమీ

రేకు: 0300-05 శుద్ధవసంతం సం: 03-582 అధ్యాత్మ

పల్లవి: అక్షయంబగు మోక్ష మందుటే తగుఁగాక
భక్షించు పండ్లకు బ్రాణ మీఁదగునా

చ. 1: కొండంత పసిఁడి కలగూరకె వెల యిడిన-
నిండిన వివేకులకు నేరమిది గాదా
దండమిడి హరి నిన్ను దలఁచిన ఫలంబెల్ల-
నండ పాపము వాపు మనుట కిది దగునా

చ. 2: గుఱుతు గల రత్నంబు గుగ్గిళ్లు గొనఁగ వెల-
పఱచుటే తన బుద్ధి పాడౌట గాదా
అఱిముఱి హరి నిన్నునర్చించు ఫలమెల్ల
కఱకుఁ దన దేహభోగముల కనఁదగునా

చ. 3: కామ ధేనువు దెచ్చి కాసుకె వెలకొసగ
కామించి నధికులకు కడుఁ గొరత గాదా
శ్రీమంతుఁడై నట్టి శ్రీవేంకటేశ నిను
సేమమునఁ గొలిచి తుచ్ఛెము లడుగఁదగునా

రేకు: 0300-06 దేసాళం సం: 03-583 అధ్యాత్మ

పల్లవి: ఎవ్వరము నేమి సేసేమేమి గడమలు నీకు
రవ్వగా శరణంటే రక్షించుటింతే

చ. 1: అందరుఁ జేసిన కర్మములవి నీకు జీవనమై
అంది జీవించేవంటే నదియూఁ గాదు
కొందరు సురల(లు?)తోడై కూడి రాఁగా నసురల-
యిందరి గెలిచేవంటే నిదియూఁ గాదు

చ. 2: వొకచోటఁ గలవు వేరొక చోట లేవంటే-
నకటా యెంచి చూచిన నదియూఁ గాదు
మొకమిచ్చి వొక గుణమునఁ దిరిగేవంటే
సకలగుణుఁడ వాజాడయుఁ గాదు

చ. 3: కపట మిదనరాదు కడునవు ననరాదు
వుపమించరాదు వొల్లకుండఁగరాదు
యెపుడును శ్రీవేంకటేశ నీ చిత్తమింతే
విపరీతములు లేవు వెలితీ లేదు

రేకు: 0301-01 రామక్రియ సం: 04-001 కృష్ణ

పల్లవి: ఎక్కడికంసుడు యిఁక నెక్కడిభూభారము
చిక్కువాప జనియించె శ్రీకృష్ణుఁడు

చ. 1: అదివో చంద్రోదయ మదివో రోహిణిపొద్దు
అదన శ్రీకృష్ణుఁడందె నవతారము
గదయు శంఖచక్రాలు గల నాలుగుచేతుల
నెదిరించి యున్నాఁడు ఇదివో బాలుఁడు

చ. 2: వసుదేవుఁడల్ల వాఁడే వరుస దేవకి యదే
కొసరే బ్రహ్మాదుల కొండాట మదే
పొసఁగఁ బొత్తులమీదఁ బురుఁటింటి లోపల
శిసువై మహిమ చూపె శ్రీకృష్ణుఁడు

చ. 3: పరంజ్యోతిరూప మిదె పాండవుల బ్రదికించె
అరిది కౌరవులసంహారమూ నిదె
హరికర్థ్యము లీరో జయంతి పండుగ సేయరో
కెరలి శ్రీవేంకటాద్రి కృష్ణుఁడితఁడు

రేకు: 0301-02 దేసాళం సం: 04-002 అధ్యాత్మ

పల్లవి: నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించఁ జెయ్యేగ్గేఁగాని

చ. 1: సేయరాని పాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో నింద్రియకింకరుఁడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను

చ. 2: వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి
యేగతిఁ గొసరి నీపై నేఁట వేసేము
అగడపు బంగారుకాతుమనే నమ్ముకొని
భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము

చ. 3: కలుపుట్టుగుబదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేఁడెట్టు నీవార మయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమిసేసి నీకెట్టు భారము వేసేము

రేకు: 0301-03 శంకరాభరణం సం: 04-003 శరణాగతి

పల్లవి: అచ్చుతు శరణమే అన్నిటికిని గురి
హెచ్చుకుందు మరి యెంచఁగనేది

చ. 1: యోనిజనకమగు యొడ లిది
యేనెల వైనా నేఁటి కులము
తానును మలమూత్రపుఁ జెలమ
నానాచారము నడచీనా

చ. 2: పాపపుణ్యముల బదుకిది
యేపొద్దు మోక్షం బెటువలె దొరకు
దీపనబాధల దినములివి
చూపట్టి వెదకఁగ సుఖ మిందేది

చ. 3: మరిగినతెరువల మనసుయిది
సరవినెన్న విజ్ఞానంబేది
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁడే
వెరవని కంటే వెలితిఁక నేది

రేకు: 0301-04 బౌళి సం: 04-004 అధ్యాత్మ

పల్లవి: నిజమో కల్లో నిమిషములోననె
భజించు వారల భాగ్యము కొలఁది

చ. 1: వొకఁడు కనుదెరచి వున్నది జగమను
వొకఁడు కన్నుమూశొగి లేదనును
సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును
వెకలినరులు భావించినకొలఁది

చ. 2: కడుపు నిండొకఁడు లోకము దనిసె నసును
కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు
తడవిన నిట్లనే దైవమిందరికి
వెడగునరులు భావించిన కొలఁది

చ. 3: ముదిసి యొకఁడనును మోక్షము చేర్వని
తుదఁ బుట్టొకఁడది దూరమనును
యెదుటనే శ్రీవేంకటేశ్వరుఁ డిట్లనే
వెదకి నరులు భావించిన కొలఁది

రేకు: 0301-05 వసంతవరాళి సం: 04-005 అంత్యప్రాస

పల్లవి: ఏమందు మిందుకు నెఱిఁగినదే తొల్లి
శ్రీమాధవుఁడ నీవు సేసినదే తొల్లి

చ. 1: వొక మానఁ జేఁదూ వొక మానఁ దీపూ
కకిపికలై రెండూ గలవే తొల్లి
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము
సకలానఁ గలుగుట సహజమే తొల్లి

చ. 2: పగలు వెలుఁగు పైపై రాత్రి చీఁకటి
నిగిడి లోకములను నిజమే తొల్లి
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకుఁ గీడు
తగిలి నోసలివ్రాఁత తప్పదిది తొల్లి

చ. 3: వెన్నెలలు చంద్రునందు వెడ యెండసూర్యునందు
కన్నుల లోకమువారు గన్నదే తొల్లి
యెన్నఁగ శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవు
వున్నవారు నీకింద నున్నవారు తొల్లి

రేకు: 0301-06 లలిత సం: 04-006 కృష్ణ

పల్లవి: ఆతఁ డితఁడా వెన్న లంతట దొంగలినాఁడు
యేతులకు మద్దులు రెండిలఁ దోసినాఁడు

చ. 1: యీతఁడా దేవకిగన్నయింద్రనీలమాణికము
పూతకిచన్ను దాగి పొదలినాఁడు
యీతఁడా వసుదేవుని యింటిలో నిధానము
చేతనే కంసునిఁ బుట్టచెండు సేసినాఁడు

చ. 2: మేటియైన గొంతిదేవి మేనల్లుఁ డీతఁడా
కోటికిఁ బడెగెగాను కొండ యెత్తెను
పాటించి పెంచే యశోదపాలి భాగ్య మీాఁతఁడా
వాటమై గొల్లెతలను వలపించినాఁడు

చ. 3: ముగురువేలుపులకు మూలభూతి యీాతఁడా
జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను
మిగుల శ్రీవేంకటాద్రిమీఁది దైవమితఁడా
తగి రామకృష్ణావతార మందె నిప్పుడు

రేకు: 0302-01 లలిత సం: 04-007 గురు వందన, నృసింహ

పల్లవి: పనిగొను వారల భాగ్యమిది
వెనక ముందరికి వివేక మొకటే

చ. 1: బలు పుణ్యములకుఁ బాపములకు గురి
కలియుగ మొకటే కలది
చెలఁగి సేయటకు సేయించుటకును
తలఁపూ నొకటే తనలోఁ గలది

చ. 2: మోదపు భోగము మోక్షమునకు గురి
యీదేహ మొకటే యెత్తినది
గోదిలి కడుఁ గుంగుటకు నెక్కుటకు
యీదెస విజ్ఞానమిదియే కలది

చ. 3: ఆర్మిలి దుఃఖము నతిసుఖములకు గురి
కర్మం బొకటే కలది
కూర్మి శ్రీవేంకట గురుదైవముఁ గను-
ధర్మమున కతని దాస్యమే కలది

రేకు: 0302-02 మంగళకౌశిక సం: 04-008 విష్ణు కీర్తనం

పల్లవి: ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు
చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని

చ. 1: నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని
నీ నామము వినక నెరవేరె నొకఁడు
పూని నిన్ను నుతియించి భోగియాయ నొకఁడు
మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకఁడు

చ. 2: మతిలో నిన్నుదలఁచి మహిమందె నొకయోగి
తతి నిన్ను దలఁచకే తగిలె నిన్నొకఁడు
అతిభక్తిఁ బని సేసి అధికుఁడాయ నొకఁడు
సతతము బనిగొని సఖుఁడాయ నొకఁడు

చ. 3: కాఁగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు
ఆఁగి నిన్ను వెంటఁదిప్పి ఆవులు మేలందెను
దాఁగక శ్రీవేంకటేశ దగ్గరైన దవ్వయిన
మాఁగి నిన్ను దలపోసే మనసే గుఱుతు

రేకు: 0302-03 ముఖారి సం: 04-009 వైష్ణవ భక్తి

పల్లవి: గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు
పరమపద మొక్కటే ఫలమింతే కాక

చ. 1: పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు
దాఁప నవి నిమిషమాత్రములే కాక
లోపలేడ వెలియాడ లోకులకింతే కాక
మోపినదంతా యేకముఖమే కాక

చ. 2: రాతిరేది పగలేది రమించు సాత్వికులకు
యీతల నింతా వెలుఁగింతే కాక
ఘాతలఁ గర్మాకర్మగతులు యీసంది వింతే
పోతరించి యెక్కనెక్కఁ బోడవే కాక

చ. 3: చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని
వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు
జంతువుల పురుఁడులు జడులకింతేకాక
వింతవింత సుద్దులేల విభవమే కాక

రేకు: 0302-04 గుండక్రియ సం: 04-010 అధ్యాత్మ

పల్లవి: అనాది జీవుఁడన్నియుఁ గన్నవే
వినోదమిందలి విరతే వలయు

చ. 1: వెలిఁ దోఁచిన యీ విశ్వంబెల్లా
కలసిన మనోగతములివి
పలు విషయేంద్రియ భావములెల్లా
వెలయుఁదా ననుభవించినవే

చ. 2: సహజపు వర్ణాశ్రమము లివెల్లా
యిహమునఁ దాధరియించినవే
బహువేదశాస్త్రపఠన లివెల్లా
వహి కెక్కఁగఁదా పఠియించినవే

చ. 3: దినదిన సంసార తిమిరం బెల్లా
ఘనముగఁ దను మున్ను గప్పినవే
అనయము శ్రీవేంకటాధిపుఁ డాత్మకు
ననిచి తొల్లి కల నాయకుఁడే

రేకు: 0302-05 సామంతం సం: 04-011 విష్ణు కీర్తనం

పల్లవి: ఇతర మేదియు లేదు యెఱఁగ మింతేకాని
రతికెక్కేపనులెల్లా రామచంద్రుఁడే పో

చ. 1: ధనమై చేరేవాఁడు దైవమై కాచే వాఁడు
మనసులోదలఁచేటి మాధవుఁడే
మునుకొన్న గ్రామములై ముందర నుండే వాఁడు
కొననాలుక మీఁదటి గోవిందుఁడే పో

చ. 2: తల్లియై పెంచేవాఁడు తండ్రియై పుట్టించే వాఁడు
వెల్లవిరిఁ దాఁగొలిచే విష్ణుమూరితి
ఇల్లాలై సుఖమిచ్చి యెంచఁ బుత్రులైన వాఁడు
చెల్లుబడిఁ దామొక్కేటి చేతిపై శ్రీహరియే

చ. 3: దేహమై వుండేటివాఁడు దినభోగమైన వాఁడు
యీహల శ్రీవేంకటేశుఁడితఁ డొక్కఁడే
మోహాచారమైన వాఁడు మోక్షమై నిలిచే వాఁడు
సాహసించి నమ్మఁగల సర్వేశుఁడితడే

రేకు: 0302-06 భవుళి సం: 04-012 వైరాగ్య చింత

పల్లవి: విడిచితి మనరాదు అవి మరి విడువమవఁగరాదు
అడరిన శ్రీహరి అనుమతికొలఁదే

చ. 1: పెంచినఁ బెరుగును పెను యింద్రియములు
కొంచము సేసినఁ గుందును
పంచిన దిందును పాపముఁ బుణ్యము
యెంచఁగ నీశ్వరుఁడిచ్చిన కొలఁదే

చ. 2: తెలిసినఁ దేటగు తిరమగు మనసిది
కలఁచిన లోలోఁగలఁగును
తొలఁచిన దిందునె దుఃఖము సుఖమును
యిల నంతర్యామిచ్చిన కొలఁదే

చ. 3: చేసినఁ జెలఁగును చేఁతల కర్మము
పాసినఁ బాయును బంధముతో
ఆసల శ్రీవేంకటాధీశుఁడిందుకు
యీసరి గర్తతఁడిచ్చిన కొలఁదే

రేకు: 0303-01 శంకరాభరణం సం: 04-013 విష్ణు కీర్తనం

పల్లవి: అతఁడేమి సేసినా మాకదే గురి
మతిలో నాతఁడుండఁగా మాయలు మాకేఁటికి

చ. 1: ఆసలకెల్లా గురి హరి యొక్కఁడేకాని
వేసరక కన్నవారి వేఁడనోపను
చేసేటిసేఁతకు గురి శ్రీవిభుఁడే కాని
వాసి దప్పి హీనుల సేవలు సేయ నోపము

చ. 2: ముచ్చటకెల్లా గురి మురహరుఁడే కాని
చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్పనోపము
నిచ్చలు మాబ్రదుకెల్లా నీలవర్ణునికే కాని
రచ్చల దుష్టులతోడిరాఁపులకు నోపము

చ. 3: పరము నిహమునకు పరమాత్ముఁడే గురి
పరులకధీనమైన బాఁతి యేఁటికి
సిరులకెల్లా గురి శ్రీవేంకటేశుఁడేకాని
అరపిరికితనపుటలమట లేదు

రేకు: 0303-02 దేశాక్షి సం: 04-014 శరణాగతి

పల్లవి: ఎన్నఁడుఁ జెడనియీవు లిచ్చిని మాధవుఁడు
పన్నినయాస లితనిపైపై నిలుపవో

చ. 1: కొననాలుకా హరిగుణములే నుడుగవో
మనసా అతని దివ్యమహిమెంచవో
తనువా శ్రీపతితీర్థ దాహమే కోరవో
యెనలేని అడియాస లేఁటికి నీ కిఁకను

చ. 2: వీనులాలా యేపొద్దు విష్ణుకథలే వినరో
ఆనిన చేతులితని కంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షుఁ జూడరో
యీనేటి పాపాలబారి నేల పడేవిఁకను

చ. 3: నలిఁ బాదాలాల హరినగరికే నడవరో
కలభక్తి యాతనిపై ఘటియించవో
చలమా శ్రీవేంకటేశు సంగతినే వుండవో
యెలయింపుఁ గోరికల కేల పారే విఁకను

రేకు: 0303-03 సామంతం సం: 04-015 శరణాగతి

పల్లవి: కొసరి కొసరి యిఁకఁ గోరఁగనేఁటికి
అసురవైరి శరణనుటే చాలు

చ. 1: సంతతభోగము జననబంధములు
జంతురాసులకు సహజము
వంతురక్షకత్వము కరుణ భువి
నంతర్యామికి నది సహజము

చ. 2: కలకాలంబును గామముఁ గ్రోధము
చలమును బ్రాణుల సహజము
సులభత్వంబును సారిది వదాన్యత
అల లక్ష్మిపతికది సహజము

చ. 3: పుడుగనికర్మము లొడలోముటలును
జడులము మాకిది సహజము
యెడయక శ్రీవేంకటేశ నీకు మము
నడరి కాచుటే అది సహజము

రేకు: 0303-04 శుద్ధవసంతం సం: 04-016 శరణాగతి

పల్లవి: ఇహపరసాధన మిది యొకటే
సహజపుమురారిసంకీర్తన నొకటే

చ. 1: భవసాగరములఁ బాపెడిది తేప
భువి నజ్ఞానముపులివాకట్టిది
జవళి నాశాపాశములకుఁ గొడువలి
నవనీతచోరునామం బొకటే

చ. 2: చింతాతిమిరముఁ జెరిచేటి సూర్యుఁడు
అంతట దరిద్రహతపు నిధానము
వింతమరణభయ వినాశమంత్రము
మంతుకు హరినామంబిది యొకటే

చ. 3: మించు దుఃఖములమృత సంజీవని
అంచలఁ బంచేద్రియములు కంకుశము
యెంచగఁ శ్రీవేంకటేశు దాసులకు
బంచిన పాళ్లఁ బరగినదొకటే

రేకు: 0303-05 సాళంగనాట సం: 04-017 దశావతారములు

పల్లవి: ఏమని పొగడుదు నిట్టి నీగుణము
యీ మహిమకుఁ బ్రతి యితరులు గలరా

చ. 1: నిండెను జగముల నీ ప్రతాపములు
చెండిన బాణునిచేతులతో
కొండలంతలై కుప్పలువడియెను
వండఁదరగు రావణుతలలయి

చ. 2: పూడెను జలధులు పారిఁ గోపించిన
తోడ బ్రహ్మాండము తూఁటాయ
చూడఁ బాతాళము చొచ్చె బలీంద్రుఁడు
కూడిన కౌరవకులములు నడఁగె

చ. 3: యెత్తితివి జగము లీరేడు నొకపరి
యిత్తల నభయం బిచ్చితివి
హత్తిన శ్రీవేంకటాధిప నీకృప
నిత్తెమాయ నీనిజదాసులకు

రేకు: 0303-06 దేపాళం సం: 04-018 శరణాగతి

పల్లవి: నీకు నీవే వలసితే నీవు నన్నుఁ గాచుకొమ్ము
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్యా

చ. 1: పాపమూల మటు తొల్లి పైకొన్న దేహము
పాపము సేయకుండితే పక్కున నేల మాను
కోపమే కూడుగఁ గుడిచిన యీబుద్ధి
కోపము విడువుమంటే గుణమేల మాను

చ. 2: అప్పు దీర్చ వచ్చినట్టి ఆయపు సంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేమిటికి మాను
తప్పు వేయవచ్చి నన్నుఁ దగిలె నీ కర్మములు
తప్పులు వేయక సారెఁ దా మేల మాను

చ. 3: పంచమహాపాతకాలే పట్టుకొనే యింద్రియాలు
పంచమహాపాతాకాలే బారిఁ దోయ కేల మాను
అంచెల శ్రీవేంకటేశ ఆత్మలో నీవుండఁగాను
పొంచి నీ కరుణ నన్నుఁ బొదుగ కేల మాను

రేకు: 0304-01 లలిత సం: 04-019 గురు వందన, నృసింహ

పల్లవి: భావించు వారలపాలి భాగ్య మితఁ
డా వలనీ వల నంతర్యామి

చ. 1: యీశ్వరేశ్వరుఁడు యితఁడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు
విశ్వాత్మకుఁడీ వివిధ జీవులకు
ఐశ్వర్యము మా యంతర్యామి

చ. 2: నిత్యుఁడితఁ డొకఁడె నెరిఁ గాలములకు
సత్యం బితఁడు చదువులకు
ప్రత్యక్షం బిదె భక్తకోటికిని
అత్యంతము మా యంతర్యామి

చ. 3: గుణి నిర్గుణితఁడు గురుముని జనులకు
ప్రణవము వేదాంతపంక్తులకు
ప్రణుతి శ్రీవేంకటపతి లోకులకితఁ
డణురేణు పూర్ణుఁడంతర్యామి

రేకు: 0304-02 సాళంగనాట సం: 04-020 కృష్ణ

పల్లవి: జగములెల్లా నీడేరె జయ వెట్టి రిందరును
తగ నేఁడు కృష్ణావతారమాయ నిదివో

చ. 1: అచ్చితుఁడు జనించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టుపడిరి
పచ్చిగాను లోకులాల పండుగ సేయరో నేఁడు
అచ్చపుఁ గృష్ణావతారమాయ నిదివో

చ. 2: గోవిందుఁడు జనియించె గోకులష్టమిదే నేఁడు
కావరపు కంసుని గర్వమణఁగె
భావించి ప్రజలాల పారణ సేయరో నేఁడు
ఆవేళఁ గృష్ణావతారమాయ నిదివో

చ. 3: అనంతుఁడు శ్రీవేంకటాద్రీశుఁడు జనియించె
ఘనశిశుపాలాదులు గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతుకరో
అనుగుఁ గృష్ణావతారమాయ నిదివో

రేకు: 0304-03 మాళవి సం: 04-021 విష్ణు కీర్తనం

పల్లవి: పారిరి దానవులెల్లా పంచబంగాళమైరి
తూరిరి గొందులెల్లాను తుత్తుమురై విరిగి

చ. 1: గరుడధ్వజునిదండు గదలె రాకాసులపై
అరదము దోలవో చయ్యన దారకా
ధరయెల్లఁ గుమ్మెలై పాతాళ మదే కానవచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేఁగను

చ. 2: దనుజాంతకుని సేన దగ్గరి నడవఁజొచ్చె
చొనిపి రోప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి పగ్గములు బిగించవో పయిపైన

చ. 3: శ్రీవేంకటేశుబలము చిమ్మిరేఁగి మించఁజొచ్చె
సేవించలమేల్మంగను సేనాపతీ
దేవతలు మొక్కి రదే దిక్కులు సాధ్యములాయ
తావుకు మరలించవో తానకముగాను

రేకు: 0304-04 లలిత సం: 04-022 శరణాగతి

పల్లవి: ఘనుఁడాతఁడే మముఁ గాచుఁగాక హరి
అనిశము నే మిఁక నతనికె శరణు

చ. 1: యెవ్వనినాభిని యీ బ్రహ్మాదులు
యెవ్వఁడు రక్షకుఁ డిన్నిటికి
యెవ్వనిమూలము యీ సచరాచర-
మవ్వలనివ్వల నతనికే శరణు

చ. 2: పురుషోత్తముఁడని పొగడి రెవ్వరిని
కరి నెవ్వఁడు గక్కనఁ గాచె
ధర యెవ్వఁడెత్త దనుజులఁ బొరిగెను
అరుదుగ మే మిఁక నతనికె శరణు

చ. 3: శ్రీపతి యెవ్వనిఁ జేరి పురమునను
భాసిల్లె నెవ్వఁడు పరమంబై
దాసుల కొరకై తగు శ్రీవేంకట
మాస చూపె నితఁ డతనికె శరణు

రేకు: 0304-05 మంగళకౌశిక సం: 04-023 శరణాగతి

పల్లవి: ఔలే నే నొకపనికి నవుదు నీకును
కూళలలో నెంచి చూడ గురి యవుదును

చ. 1: పసురము వంటివాఁడ పాపపుబందెలు దెత్తు
శిసువు వంటివాఁడ సిగ్గు నెగ్గు నెరఁగ
వసుధలో రాయి వంటివాఁడను దయదలఁచ
యెసఁగ నన్నేరీతి నీ వేలితివి దైవమా

చ. 2: మాఁకువంటివాఁడ నే మతి లేదు; పుచ్చిన-
పోఁక వంటివాఁడ నెప్పుడు కొరగాను
రోఁకలి వంటివాఁడ రోటిలోనిపొట్లకు
యేఁకట నన్నెటువలె నేలితివి దైవమా

చ. 3: పాముపంటివాఁడనే పట్టినవారిఁ గరతు
గాముపంటివాఁడ లోకమువారిఁ బీడింతు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను బంటంటా-
నేమిటికిఁ గృపతోడ నేలితివి దైవమా

రేకు: 0304-06 వరాళి సం: 04-024 వైరాగ్య చింత

పల్లవి: దేహముతోడిది లంకె తీరదిది హరిమాయ
సాహసపు జీవులకు సహజమెప్పుడును

చ. 1: నెట్టనఁ బెక్కిండ్లవిందు నిండుకొన్నయాఁకలి
వొట్టి నిచ్చకల్యాణి కామోద్రేకము
కట్టినవోడదూలము కాయపుసంసారము
దట్టమైన ప్రాణులకుఁ దనివేడదయ్యా

చ. 2: పొద్దొకబై రూపము పొదలేటి యీవయసు
తిద్దుబడి గుబ్బము హత్తినగుణము
వొద్దనుండినట్టి నీడ వుడివోనియట్టి నిద్ర
అద్దుకొని వుండుఁగాక అదియేల మానును

చ. 3: పచ్చిగరికెకాలము ప్రపంచములో బ్రదుకు
తచ్చి చూచెటి సూత్రము తన జ్ఞానము
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాత్మలో నిధానము
యిచ్చ నెరుఁగుకొంటేనే యిహమే పరము

రేకు: 0305-01 రామక్రియ సం: 04-025 అంత్యప్రాస

పల్లవి: భావించరో వేదములు పలికేటి వునికి
జీవులు బ్రహ్మానందముఁ జెందేటి వునికి

చ. 1: నిచ్చలు నిద్దురలకు నెలవైన వునికి
యిచ్చలఁ గలలు గన నిరవైన వునికి
కుచ్చిన నిట్టూర్పులకొన దాఁకే వునికి
తచ్చిన మాటలధ్వని దాఁకేటి వునికి

చ. 2: మునుకొన్న చూపులకు మొదలైన వునికి
అనిశము కతలెల్ల నాలకించే వునికి
వెనుకొన్న చవులెల్లా వెలవెట్టే వునికి
గునిసి మేల్కనుటకు గురియైన వునికి

చ. 3: వావిరి నింద్రియపరవశమందే వునికి
కైవశమై పదియారుకళలుండే వునికి
చావకుండా నమృతము జాలువారే వునికి
శ్రీవేంకటేశుపాదాలు చింతించే వునికి

రేకు: 0305-02 దేవగాంధారి సం: 04-026 కళ్యాణ కీర్తనలు

పల్లవి: అమరాంగన లదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు

చ. 1: గరుడవాహనుఁడు కనకరథముపై
యిరువుగ వీధుల నేఁగీని
సురలును మునులును సొంపుగ మోఁకులు
తెరలిచి తెరలిచి తీసేరు

చ. 2: యిలధరుఁడదివో యింద్రరథముపై
కెలయుచు దిక్కులు గెలిచీని
బలు శేషాదులు బ్రహ్మశివాదులు
చెలఁగి సేవలటు సేసేరు

చ. 3: అలమేల్మంగతో నటు శ్రీవేంకట
నిలయుఁ డరదమున నెగడీని
నలుగడ ముక్తులు నారాదాదులును
పొలుపు మిగులఁ గడుఁ బొగడేరు

రేకు: 0305-03 దేపాళం సం: 04-027 కృష్ణ

పల్లవి: అడుకులు చక్కిలాలు ఆనవాలు నురుగులు
వడపప్పు మొదలుగా వాముల కొలఁదులు

చ. 1: దేవకి కొడుకుఁగన్న దినమిది శ్రీజయంతి
భావించ మన కన్నులపండుగులాయ
దేవునిఁ బూజించితిమి తేరో నైవేద్యాలు
కైవసమై కృష్ణునికి గంపల కొలఁదులు

చ. 2: వసుదేవుఁ డెత్తెను శ్రావణబహుళాష్టమిని
పసగాఁ దొట్లే నూఁచి పాడఁగలిగె
సిసువితనికి మొక్కి చేసేము జాగరాలు
కొసరరో వరములు కోట్ల కొలఁదులు

చ. 3: బలభద్రుతమ్ముఁ డాయ పతి యలమేల్మంగకు
నెలమితో మనకెల్ల నేలికాయ
తలఁచి శ్రీవేంకటాద్రిఁ దానే యవతారమందె
అల సంతోషమందరో అబ్బినకొలఁదులు

రేకు: 0305-04 ముఖారి సం: 04-028 గురు వందన, నృసింహ

పల్లవి: ఏ బలిమి నమ్మి వెరపెరఁగరు దేహులాల
గాబువలెఁ బెరిగేరు కాలము మీఁచుట్టమా

చ. 1: చెలరేఁగి దానములు సేసినట్టి బలిమో
అలరి కర్మము సేసినట్టి బలమో
చలపట్టి తపము లాచరించిన బలిమో
కొలఁదిలేక సురలఁ గొలిచిన బలిమో

చ. 2: ధీరత సుజ్ఞానము దెలిసిన బలిమో
కోరక విరక్తి గైకొన్నబలిమో
శూరత లోకానకెల్లఁ జుట్టమైన బలివమో
వూరకే బ్రహ్మకల్పము లుండేటట్టి బలిమో

చ. 3: పరగ శ్రీపతినామపఠనము బలిమో
హరిదాసుల శరణన్నట్టి బలిమో
సిరుల శ్రీవేంకటేశు సేవచేసిన బలిమో
గురుభక్తితోడ నెక్కువయ్యైన బలిమో

రేకు: 0305-05 నారాయణి సం: 04-029 భగవద్గీత కీర్తనలు

పల్లవి: అనాది జగమున కౌభళము
అనేకాద్భుతం బౌభళము

చ. 1: హరినివాస మీ యౌభళము
అరిది పరమపద మౌభళము
అరిదైత్యాంతక మౌభళము
హరముఖసేవిత మౌభళము

చ. 2: అమలరమాకర మౌభళము
అమితమునీంద్రం బౌభళము
అమరవందితం బౌభళము
అమరెఁ బుణ్యముల నౌభళము

చ. 3: అగరాజంబీ యౌభళము
అగణితతీర్థం బౌభళము
తగు శ్రీవేంకటధామవిహారం-
బగు శుభాంచితం బౌభళము

రేకు: 0305-06 మాళవిగౌళ సం: 04-030 భగవద్గీత కీర్తనలు

పల్లవి: విచారించుకొనేవారి వివేకాల కొలఁదులు
పచారించి వున్నవెల్ల భావనమాత్రములు

చ. 1: జగములన్ని నీశరీరమేకనక
తగు వైకుంఠాలే వుండేతావు లెల్లాను
పొగరు స్వర్గ నరకభూములనే లోకాలెల్ల
పగటున తమలోని భావనమాత్రములు

చ. 2: అన్ని పదార్థాలు నీయందే పుట్టివచ్చేఁగాన
తిన్నని నీప్రసాదాలే దినభోగాలు
వన్నెల నిష్ఠానిష్ఠ వస్తుభేదము లెల్లాను
పన్నుకొన్న యటువంటి భావనమాత్రములు

చ. 3: అంతరాత్మవు శ్రీవేంకటాధిప నీవేకాన
చెంతల నీ కైంకర్యాలే చేఁతలెల్లాను
వింతలైన సంసార విహారములెల్లాను
బంతినే నానావిధ భావనమాత్రములు

రేకు: 0306-01 భౌళి సం: 04-031 తేరు

పల్లవి: ఎత్తరే ఆరతులు యియ్యరేకానుకలు
యిత్తల నేఁగివచ్చిని యిందిరానాథుఁడు

చ. 1: గరుడధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదములచేరుల తేరు
సురలు మునులుఁ బట్టి సొంపుతోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగివచ్చీ నిందిరానాథుఁడు

చ. 2: జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మూవరుస నిత్యులును ముక్తులును గొలువఁగా
యీవల నేఁగివచ్చీ నిందిరానాథుఁడు

చ. 3: పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రి మీఁదటి తేరు
కొంచక యలమేల్మంగఁ గూడి వచ్చీ నదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుఁడు

రేకు: 0306-02 నాట సం: 04-032 నృసింహ

పల్లవి: కదిరి నృసింహుఁడు కంభమున వెడలె
విదితముగా సేవించరొ మునులు

చ. 1: ఫాలలోచనము భయదోగ్రముఖము
జ్వాలామయ కేసరములును
కాల రౌద్ర సంఘటిత దంతములు
హేలాగతి ధరియించుక నిలిచె

చ. 2: ముడివడు బొమ్మలు ముంచిన వూర్పులు
గడగడ నదరెటి కటములును
నిడుద నాలికెయు నిక్కుఁ గర్ణములు-
నడియాలపు రూపై తా వెలసె

చ. 3: సకలాయుధములు సహస్ర భుజములు
వికట నఖంబులు వెస బూని
వెకలి యగుచు శ్రీ వేంకటేశ్వరుఁడె
ప్రకటపు దుష్టుల భంజించె నిదివో

రేకు: 0306-03 దేసాళం సం: 04-033 వైష్ణవ భక్తి

పల్లవి: చదివి బతుకరో సర్వ జనులు మీరు
కదిసి నారాయణాష్టాక్షర మిదియే

చ. 1: సాదించి మున్ను శుకుఁడు చదివినట్టి చదువు
వేద వ్యాసులు చదివినచ దువు
అది కాలపు వైష్ణవులందరి నోటి చదువు
గాదిలి నారాయణాష్టాక్షర మిదియే

చ. 2: సతతము మునులెల్ల చదివినట్టి చదువు
వెత దీర బ్రహ్మ చదివినచదువు
జతనమై ప్రహ్లాదుఁడు చదివి నట్టి చదువు
గతిగా నారాయణాష్టాక్షర మిదియే

చ. 3: చలపట్టి దేవతలు చదివినట్టి చదువు
వెలయ విప్రులు చదివేటి చదువు
పలుమారు శ్రీ వేంకటపతినామమై భువిఁ
గలుగు నారాయణాష్టాక్షర మిదియే

రేకు: 0306-04 భైరవి సం: 04-034 భగవద్గీత కీర్తనలు

పల్లవి: శరణ మాతనికే సర్వభావాల
యిరవై మమ్ము రక్షించ నీశ్వరుఁడే యెఱుఁగు

చ. 1: వచ్చిన త్రోవెఱఁగము వడిఁ బూర్వకాలమందు
చొచ్చేటి త్రోవెఱఁగము సోదించి మీఁద
కుచ్చిన కర్మములతో గుదియై వేలుకాడేము
హెచ్చి మా బ్రదుకుఁదోవ యీశ్వరుఁడే యెరుఁగు

చ. 2: నన్ను నేనే యెఱఁగను నానాచందములను
అన్నిటా నాలోనున్న హరిఁ గానను
కన్నులఁ జూచుచు మంచి కాయములో నున్నవాఁడ
యెన్నఁగ నాజ్ఞానము యీశ్వరుఁడే యెరుఁగు

చ. 3: మొదలు దెలియను ముంచి కొన దెలియను
చదువుచు నున్నవాఁడ సర్వవేదాలు
హృదయములోనుండి యిటు నన్ను గావఁగ
యిదివో శ్రీవేంకటాద్రి యీశ్వరుఁడే యెఱుఁగు

రేకు: 0306-05 పాడి సం: 04-035 తేరు

పల్లవి: అప్పుడైనహరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు

చ. 1: సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపైఁ బరపెఁదేరు
తిమురుచు రుక్మకుపైఁ దిరుగఁ దోలెఁ దేరు
ప్రమదాన సృగాలునిపైఁ దోలెఁ దేరు

చ. 2: కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁ దేరు
బమ్మరపో దంతవక్త్రుపైఁ దోలెఁ దేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాఁ దోలినతేరు
దొమ్మి రుక్మిణిపెండ్లికిఁ దోలినట్టితేరు

చ. 3: మీఁటి హంసడిచికులమీఁదఁ దోలినట్టితేరు
తూఁటి సంధిమాటలకుఁ దోలినతేరు
అఱిడి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చూఱలుగొన నెక్కెను శోభనపుతేరు

రేకు: 0306-06 గౌళ సం: 04-036 నృసింహ

పల్లవి: మొదలివేల్ప మా మొఱ యాలించవె
యెదుటఁ గావు మము నిదివో దేవా

చ. 1: ధరపైఁ దపసుల తపములు చెరిచెను
నిరతపుణ్యముల నీరుసేసె నదె
పరకామినులను భంగ పెట్టె నదె
హిరణ్యకశిపుఁ డిదివో దేవా

చ. 2: మునులజడ లవిగో మోఁపులుకొలఁదులు
ఇనచంద్రాదుల నెక్కువగెలిచెను
చనవరి యింద్రుని స్వర్గము చేకొనె
యెనగొని హిరణ్యుఁ డిదివో దేవా

చ. 3: పలుదిక్పాలులఁ బారఁగఁ దోలెను
బలిమినే ప్రహ్లాదుఁ బరచీని
యెలమిని శ్రీవేంకటేశ నీవలన
యిలఁ గశిపుఁడు చెడె నిదివో దేవా

రేకు: 0307-01 సామంతం సం: 04-037 వైరాగ్య చింత

పల్లవి: మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే
తాలిమితో ఫలియించు తలఁపూ నొకటే

చ. 1: ఆఁకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోకఁ బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికిఁ బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకుఁ బుణ్యమైనా బంధకమే

చ. 2: యెందు నెండఁబడ్డఁ గాని ఇంపునీడఁ గోరఁడు
కందువ సంసారియైనఁ గాని మోక్షము గోరఁడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువబద్ధున కదే కట్టినట్టి కట్లు

చ. 3: కలయఁ జీఁకటియైతేఁగాని దీప మిడుకోఁడు
ఇల నజ్ఞుఁడైనఁగాని యెరుక వెదకఁడు
తలఁచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే
బలిమిఁ జంచలునికి బహుళ దుఃఖములే

రేకు: 0307-02 లలిత సం: 04-038 నామ సంకీర్తన

పల్లవి: ఇదియే సులభం బిందరికి
కదియఁగ వసమా కరుణనే కాక

చ. 1: నగధరుండు పన్నగశయనుడు భూ-
గగనాంతరిక్షగాత్రుడు
అగణితుఁడితని నరసి తెలియఁగాఁ
దగు నా కనెడిది దాస్యమే కాక

చ. 2: కమలజజనకుఁడు కామునిజనకుఁడు
కమలాసతిపతి ఘనగుణుఁడు
విమలుఁడీహరి వెదకి కానఁగను
అమరునా శరణాగతిఁగాక

చ. 3: దేవుఁడు త్రిగుణాతీతుఁ డనంతుఁడు
కైవల్యమొసఁగుఘనుఁడు
శ్రీవేంకటపతి జీవాంతరాత్ముఁడు
భావించవసమా భక్తిన కాక

రేకు: 0307-03 ధన్నాసి సం: 04-039 శరణాగతి

పల్లవి: హరి నీవు మాలోన నడఁగు టరదుగాక
శరణని నీకు నే జయ మందుటరుదా

చ. 1: పాపపుణ్యలంపటమైనది మేను
కూపపు యోనులఁ గుంగేటిది మేను
దీపనాగ్నిగల దిష్టము యీమేను
మోపు మోచిన నేము ములిగేది యరుదా

చ. 2: పొలసి పొద్దొకచాయఁ బొరలేటిమనసు
కొలఁదిలేని యాసఁ గుదురైన మనసు
మలిసి సంసారమే మరిగిన మనసు
కలనేము, తిమ్మటలు గైకొనేది యరుదా

చ. 3: పెనచి యింద్రియములఁ బేఁడినభవము
పనివడి చింతలకే పాలైనభవము
యెనలేని శ్రీవేంకటేశ నీకే శరణని
మనెఁ గాన యిఁక మీఁద మంచిదౌటరుదా

రేకు: 0307-04 గుండక్రియ సం: 04-040 వైష్ణవ భక్తి

పల్లవి: కోటికిఁ బడగయెత్తి కొంకనేల
యీటులేని పదమెక్కి యిఁకనేల చింత

చ. 1: పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలఁ జిన్నకోపీనము
పట్టినది శ్రీహరిపాదపద్మ మూలము
యెట్టయినా మాకు మేలే యిఁకనేల చింత

చ. 2: చిక్కి నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
తొక్కినది భవముల తుదిపదము
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుఁగ
యెక్కువ కెక్కువే కాక యిఁక నేల చింత

చ. 3: చిత్తములోనిండినది శ్రీపతిరూపము
హత్తినది వైరాగ్య మాత్మధనము
యెత్తలఁజూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుఁ-
డెత్తి మముఁ గావఁగాను యిఁక నేల చింత

రేకు: 0307-05 దేవగాంధారి సం: 04-041 శరణాగతి

పల్లవి: ఒహో వొడలుమాని వోపికె గడుమేలు
యిహల నీవుపకారమేమని నుతింతు

చ. 1: పుట్టినచోటంటినా అది భూతములనెలవు
నెట్టన మూసిన మేను నిఖిల హేయమయము
యిట్టి నా యాతుమలోన హరి యెట్టుంటివి నీవు
అట్టె నీచేఁతలు దలఁచి అరుదయ్యీ నాకు

చ. 2: మించుల మనసంటిమా అది మిగులఁ జంచలంబు
పంచల నా సంపదలు పాపపుణ్య విధులు
యెంచఁగా యిటువంటి నన్ను యెట్టు ధరియించితి
నించిన నీ చేఁతలు విని నివ్వెరగయ్యీని

చ. 3: పాయ మిది యంటిమా పంచేంద్రియముల వశము
ఆయము నాకంటిమా అది అయిదుభూతముల మొరఁగు
యీయెడ శ్రీవేంకటేశ యీడా యెట్టేలితి నన్ను
మాయల నీశరణంబిందుకే మనసయ్యీ నాకు

రేకు: 0307-06 శుద్ధవసంతం సం: 04-042 అంత్యప్రాస

పల్లవి: విత్తొకటి వెట్టఁగా వేరొకటి మొలచునా
యెత్తి హరి నీవు నను నీడేర్తుగాక

చ. 1: మోహబాంధవములకు మూలంబు తనువు
వూహాపోహలకు వునికి యీ తనువు
దాహమున కాఁకటికి తగులు యీ తనువు
యీహీ వైరాగ్య మిందెట్టు గలుగు

చ. 2: పంచేంద్రియములకు పాదు యీ తనువు
చంచలపుటాసలకు జంట యీ తనువు
అంచె దుర్గుణములకు నాకరము తనువు
యెంచి చూడ వివేక మిందెట్టు నిలుచు

చ. 3: యీహలోకసుఖములకు హేతువీ తనువు
బహుపుణ్యపాపాలకు ఫలము యీ తనువు
యిహమునకు శ్రీవేంకటేశ నీదాస్యమున
విహరించెఁ దనువు యిఁక వెఱపేల కలుగు

రేకు: 0308-01 లలిత సం: 04-043 శరణాగతి

పల్లవి: హీనాధికము లింక నేడ నున్నవో కాని
ఆనిన దాస్యము పొత్తు అందరికి నొకటే

చ. 1: నానావర్ణములవారు నరహరిఁ దలఁచేటి-
ఆనామమంత్రజప మది యొకటే
పూని యాతనిఁ గొలిచి భువి నేజాతైనాను
మోనమునఁ బొందేటిమోక్షమూ నొకటే

చ. 2: వెనకకు ముందరికి విష్ణుకింకరులకెల్ల
పనివడి కైకొనేటి భక్తి యొక్కటే
పునికి నాదేవుఁడు వొకఁడే అంతర్యామి
మనెడి వైష్ణవకుల మతమెల్లా నొకటే

చ. 3: భేదాభేదము లేదు పెక్కు మరఁగులు లేవు
ఆదినంత్యములను ముక్తాత్మ లొక్కటే
శ్రీదేవుఁడై నట్టి శ్రీవేంకటేశ్వరుని-
యాదరానఁ బొందు శరణాగతియు నొకటే

రేకు: 0308-02 గౌళ సం: 04-044 శరణాగతి

పల్లవి: హరి నీవాఁడనే కానా ఆదికాలమున నేను
గరిమ నీమాయలోనే కలగంటిఁగాక

చ. 1: యీమేనే కాదా హేయమెల్లా మోచినది
ఆమీఁదఁ బుణ్యతీర్థము లాడీఁగాక
కామించి యీరెంటి సంగాతంబు నేఁజేసి
గామిడినై యెందువాఁడాఁ గానైతిఁగాక

చ. 2: చిత్తమిదే కాదా చింతించెఁ బాపాలు దొల్లి
పొత్తుల పుణ్యాలు దలపోసీఁగాక
రిత్తకు రిత్తయి యీరెంటి నడుమను జిక్కి
కత్తరపు రొంపి లోని కంబ మైతిఁగాక

చ. 3: యీ నాలుకే కాదా యిందరినిఁ బొగడేది
తానకపు వేదములు తడవీఁగాక
పూనిన శ్రీవేంకటేశ వొంటి నీకు శరణని
తోనే యీ రెండుఁ గడచి తుద కెక్కేఁగాక

రేకు: 0308-03 వరాళి సం: 04-045 భగవద్గీత కీర్తనలు

పల్లవి: యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాదిఫలరూప మిటు నీవై వుండవే

చ. 1: పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతిఁ బ్రాణప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ముఁగాచెడికొరకు
హరి నీమూర్తి ప్రాణ మావహించవే

చ. 2: జగతికి నీపాదజలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేఁడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేకమందవే

చ. 3: వేదములు దెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేదమంత్రముల పూజావిధి సేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁ గాచుటకు
వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే

రేకు: 0308-04 సౌరాష్ట్రం సం: 04-046 విష్ణు కీర్తనం

పల్లవి: నేము సేసేయందు మారు నీవే చేకొంటివి
నేమపు నాపూజలెల్లా నీకు నెక్కెనయ్యా

చ. 1: పాలజలనిధిలోనఁ బవ్వళించినది యేపో
వాలిన నీకు జలాధివాసము
కోలు ముంద్దై బ్రహ్మయజ్ఞ కుండములాహుతి గొని
వోలినుండే అది నీకు హోమము

చ. 2: ఆడన `నాపోనారామణుఁడ` వయిన నీకు
ఆదియపో మంత్రకలశాభిషేకము
మొదల నంతర్యామిమూర్తివయిన నీకు
పదవిమీర నదియే ప్రాణప్రతిష్ఠ

చ. 3: అక్కున శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వొక్కటై వుండినదే నిత్యోత్సవము
లెక్కలేని వరములు లీలతో మా కిచ్చితివి
యిక్కడ నేపొద్దు మాయింట నుండవయ్య

రేకు: 0308-05 శ్రీరాగం సం: 04-047 అంత్యప్రాస

పల్లవి: ఎందుఁ గాఁపురము సేతు నేది నిజ మేది గల్ల
ముందర నొక్కదినమే మూఁడు గాలములు

చ. 1: తనుభోగముల నివే తగ నొక లోకము
మనసులో తలపోఁత మరి యొక్క లోకము
యెనసిన కలలోని దిది యొక్క లోకము
మునుపు వెనకలివే మూఁడు లోకములు

చ. 2: పంచభూతముల చేతిబంధ మొక్క దేహము
యెంచఁగ నూరుపుగాలి యిది యొక్క దేహము
కొంచక త్రిగుణములగురి సూక్ష్మ దేహము
ముంచె నిదె వొకటిలో మూఁడు దేహములు

చ. 3: జీవునిలోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు
తావై వెలినున్నవాఁడు తా నొక్కఁడే
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగినాతఁ డీతడే
మూవంకల మముఁ గాచె మొక్కితి మాతనికి

రేకు: 0308-06 లలిత సం: 04-048 అంత్యప్రాస

పల్లవి: బ్రహ్మాదులకు నిదే పరచింత
బ్రహ్మఁ గన్న తండ్రియైన పరమాత్మ చింత

చ. 1: మూఁడు లోకములకెల్లా మొదలి చింత
మేడెపుఁ గర్మములకు మీఁది చింత
తోడ జనించిననాటి తొల్లిటి చింత
వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత

చ. 2: అంగములోవెదకేటి యానంద చింత
నింగివలెఁ బొడచూపే నిర్మల చింత
కుంగేటి భోగములకుఁ గొనచింత
వుంగిటఁగలిగె మాకు నోహో యీచింత

చ. 3: కింది మీఁదు నేకమైన కేవలచింత
సందు లేక నిజమైన సహజ చింత
కందువ శ్రీవేంకటేశుఁ గన్నచింత
యిందునే మాకుఁ గలిగె నితఁడే చింత

రేకు: 0309-01 ముఖారి సం: 04-049 శరణాగతి

పల్లవి: ఆదిమూలమే మాకు నంగరక్ష
శ్రీదేవుఁడే మాకు జీవరక్ష

చ. 1: భూమిదేవిపతి యైన పురుషోత్తముఁడె మాకు
భూమిపై నేడ నుండినా భూమిరక్ష
ఆమని జలధిశాయి అయిన దేవుఁడే మాకు
సామీప్యమందున్న జలరక్ష

చ. 2: మ్రోయుచు నగ్నిలో యజ్ఞమూర్తియైన దేవుఁడే
ఆయములు దాఁకకుండా నగ్నిరక్ష
వాయుసుతు నేలినట్టి వనజనాభుఁడే మాకు
వాయువందుఁ గందకుండా వాయురక్ష

చ. 3: పాదమాకసమునకుఁ బారఁజాఁచే విష్ణువే
గాదిలియై మాకు నాకాశరక్ష
సాదించి శ్రీవేంకటాద్రి సర్వేశ్వరుఁడే మాకు
సాదరము మీరినట్టి సర్వరక్షా

రేకు: 0309-02 దేశాక్షి సం: 04-050 శరణాగతి

పల్లవి: ఎంచి సేయుపను లిఁక లేవు

కొంచక యాతనిఁ గొలుచుటే కలది

చ. 1: తప్పదు కర్మము తా నెందున్నా

చెప్పఁగ దీనికిఁ జింతేలా

అప్పుడు తొల్లే అనుమతించె నివి

తప్పక యాతనిఁ దలఁచుటే కలది

చ. 2: ఆయము నన్నము నందొక లంకె

వేయుట దీనికి వెతలేలా

కాయములో హరి గలఁడంతరాత్మ

యీయెడఁ దను నుతియించుటే కలది

చ. 3: వెలిని లోన శ్రీవేంకటేశుఁడే

తెలియని మతి నందియమేలా

యిలలో మనముల నేలె నాతఁడే

సలిగె మనకతని శరణమే కలది

రేకు: 0309-03 దేవగాంధారి సం: 04-051 దశావతారములు

పల్లవి: అన్నివిధములుఁ దానై యాతుమలో మరి వీఁడే
పన్నిన యీ పరమాత్మభావనే మా బ్రదుకు

చ. 1: గోపాలకృష్ణునిచూపే కోరిన పనులపాఁడి
గోపికావల్లభుకృపే కూర్మివనిత
శ్రీపతిదయే మాకుఁజేరే ధనధాన్యములు
చేపట్టిన బ్రహ్మతండ్రిచిత్తమే మాపుత్రులు

చ. 2: జలధిశాయికరుణే సర్వరత్నములసొమ్ము
అల పీతాంబరువాత్సల్యమే వస్త్రములు
మలయు గరుడధ్వజుమన్ననే వాహనములు
యిల నచ్యుతనామమే యిదే మాకాయుష్యము

చ. 3: అమృతమథను మహిమదె మా గాదెల కొల్చు
విమతదైత్యారి యావేశమే భయహరము
అమర శ్రీవేంకటేశు నడుగులే మాకు నిండ్లు
తమితో నాతనిదేవే తల్లియుఁ దండ్రియును

రేకు: 0309-04 సామంతం సం: 04-052 దశావతారములు

పల్లవి: తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపాలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము

చ. 1: నిండినట్టి మడుగుల నీరువంక పాలము
కొండలు మోఁచినపెద్ద గొబ్బురపుఁబొలము
అండనే పాలము రాజులుండేటి పాలము
చెండివేసి మాకులెల్లా సెలగినపాలము

చ. 2: అసపడి వరదానమడిగిన పాలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైనపాలము
రాసికెక్కేమునులకు రచ్చైన పాలము
వేసరక నాఁగేట వేగిలైన పాలము

చ. 3: మంచి గురుతైన రావిమానిచేని పాలము
వంచిన గుఱ్ఱముఁ దోలే వయ్యాళి పాలము
యెంచఁగ శ్రీవేంకటేశు నిరవైన పాలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటి పాలము

రేకు: 0309-05 గుండక్రియ సం: 04-053 వైరాగ్య చింత

పల్లవి: నే నేమి సేయుదును నిన్నుఁ బో వివేకము
శ్రీనాథుమహిమలు చిమ్మి రేఁచఁగాను

చ. 1: జీవుఁడేమి సేయును; చిత్తము వసముగాక
యీవల నావలఁ బరువెత్తఁ గాను
చేవల నాచిత్తమేమి సేయు; నందులోన నున్న-
శ్రీవల్లభభునిమాయ చిమ్మిరేఁచఁగాను

చ. 2: దేహ మేమిసేయును ; దేహము లోపల నున్న-
దాహపుటాసలు వెట్టి దవ్వఁగాను
యీహల నాయాసలును యేమిసేయు; నన్నిటికి
శ్రీహరి యానాజ్ఞ లిటు చిమ్మిరేఁచఁగాను

చ. 3: పుట్టు గేమిసేయును ; పురాకృతము వెంటఁ
గట్టిన బంధములై కలఁచఁగాను
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గొలువఁగా నన్నతఁడు
మట్టుమీరఁ బదవిచ్చి మన్నించఁగాను

రేకు: 0309-06 లలిత సం: 04-054 దశావతారములు

పల్లవి: సిరిమగఁడే మొగసిరి రక్ష
మరుగురుఁడే మా మర్మపు రక్ష

చ. 1: పులుగు నెక్కినవాఁడే పులుగుదోషపు రక్ష
బలు బాలుఁడైనవాఁడే బాలగ్రహ రక్ష
మొలచి పిన్నై మిన్నుముట్టఁబెరిగినవాఁడే
తొలఁగఁ దోసేటి ముట్టుదోషపు రక్ష

చ. 2: బూతకిఁ జంపినవాఁడే బూతకి వాకట్టు రక్ష
పాతాళానఁ గూర్మమైనపతి గుంతదోష రక్ష
ఘాతఁగరుణాకరుఁడై కరుణా ధృష్టివాఁడే
మా తరతరము ద్రిష్టిమంత్రపు రక్ష

చ. 3: పాముపైఁ బండేటివాఁడే పాములవాకట్టు రక్ష
సేమపు సర్వజీవాత్మ జీవ రక్ష
నేమపు శ్రీవేంకటాద్రి నిలయుఁడై యున్నవాఁడే
యేమిటాను మా పురుఁటియింటి రక్ష

రేకు: 0310-01 మాళవిగౌళ సం: 04-055 తేరు

పల్లవి: నానావర్ణముల నడగొండవలెను
దానవారి తేరదె తగ తిరువీధుల

చ. 1: కదలె కదలె నదె గరుడధ్వజునితేరు
అదె మిన్నుమోచిన నీలాద్రివలెను
యెదిరె నెదిరె నదె యిందిరాధిపుని తేరు
కదిసి చుక్కలు మోచే కనకాద్రివలెను

చ. 2: తిరిగె తిరిగె నదె దేవుదేవునితేరు
అరుదైన ఘనమందరాద్రివలెను
పరువులిడీ నదె పట్టపు శ్రీపతితేరు
విరివి గైలాసపు వెండికొండవలెను

చ. 3: దగ్గరె దగ్గరె నదె దైవశిఖామణితేరు
అగ్గలపు శ్రీవేంకటాద్రివలెను
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
తగ్గులేని మొత్తపు దొంతరకొండవలెను

రేకు: 0310-02 శ్రీరాగం సం: 04-056 వైష్ణవ భక్తి

పల్లవి: కాకున్న మాపాటు కడమున్నదా
నీకృపవంకనే నిలిచితిఁగాక

చ. 1: యీ నాలికేకాదా యిందరి నిందించినది
శ్రీనిధి నిన్నుఁ బొగడి చెలఁగెఁ గాక
నానాపాపములు విన్న నా వీనులే కావా
దానవారి నీ కథల ధన్యమాయఁగాక

చ. 2: యీ మేనేకాదా హేయపుటింతులఁ గూడె
నీముద్రలు ధరియించి నిక్కెఁగాక
యీ మనసేకాదా యిన్నిటిపైఁ బారినది
కామించి నిన్నుఁ దలఁచి కట్టువడెఁ గాక

చ. 3: యీ పుట్టుగేకాదా హీనాధికములఁ బొందె
వోపి నీ దాస్యము చేరి వొప్పెఁగాక
యేపున శ్రీవేంకటేశ యిన్నినేరములు నాకుఁ
బాపఁగా నే నిన్ను నమ్మి బ్రదికితిఁగాక

రేకు: 0310-03 దేసాళం సం: 04-057 శరణాగతి

పల్లవి: నేనే పో ఘనుఁడను నీకంటెను
దానవారి నీవు నాకు దైవమవు గాన

చ. 1: నేరుపున నాకైతే నీ దిక్కు గలదుగాని
చేరి నీ కావల దిక్కు చెప్పి చూపఁగలదా
అరయ నీవైతే నాకు నాధారము గలవు గా
నూరకే నీకాధారము వున్నదా యెక్కడను

చ. 2: నిన్నుఁ గొల్చిన సలిగె నేఁడు నాఁకు గద్దుగాని
సన్నుతి నీకు నొకరి సలిగున్నదా
పెన్నిధి నిన్నుఁ దలఁచే పేరు నాకుఁ గద్దుగాని
వున్నదా నీకుఁ దలఁచ నొకరి పేరైనను

చ. 3: యీవులెల్లా నాకైతే నియ్యఁగలవు గాక
ఆవల నీకీవులియ్య నన్యులున్నారా
శ్రీవేంకటేశ నాకు జీవాంతరాత్మవు నీవు
భావించ నంతరాత్మ యప్పటి నీకు నున్నదా

రేకు: 0310-04 గుండక్రియ సం: 04-058 వైరాగ్య చింత

పల్లవి: కాయము నాదే ఆట కర్తను నే నట నా-
చాయకవి రావు నన్నే జరసీఁగాని

చ. 1: తలఁచినట్టుండదు తలఁపు నాదైనాను
కులికి నన్నే పనిగొనీఁగాని
నిలిపిన యట్టుండవు నేఁడు నా మాటలే నాకు
పొలసి నన్నే కడు బొంకించీఁగాని

చ. 2: కలిమి లేమెరఁగదు కాయము నాదైనాను
కొలఁదికి నేమైనాఁ గోరీఁగాని
యిల నాయంకెకు రావు యింద్రియములు నావైనా
కలసి నామర్మములే కాఁడిపారీఁగాని

చ. 3: పంపు నాకుఁ జేయదు భవమిది నాదైనా
తెంపున కర్మవీధులఁ దిప్పీఁ గాని
యింపుల శ్రీవేంకటేశ యిది యరాజికమాయ
పంపున నీకిదె మొఱ ప్రతిపాలించఁగదే

రేకు: 0310-05 గుండక్రియ సం: 04-059 శరణాగతి

పల్లవి: అతఁడు లక్ష్మీకాంతుఁ డన్నియు నొసఁగుఁగాక
యితరుల వేఁడుకొంటే నేమి గలదు

చ. 1: మోదముతో నొకమాని మొదలఁ బోసిన నీరు
పాదుకొని కొనకెక్కి ఫలించుఁగాక
ఆదిమూలమగుహరి నాతుమ సేవించక
యే దైవములఁగన్నా నేమి సెలవు

చ. 2: తల్లి భుజించినవెల్లా తగు గర్భము శిశువు-
కెల్లగాఁగఁ బరిణామ మిచ్చుఁగాక
వుల్లము లోపలి హరి కొసగని పూజలెల్లా
వెల్లిఁ జింతపంటివలె వృథా వృథా

చ. 3: వోలి నెంత జారిపడ్డా నూరకే యెవ్వరికైనా
నేలే యాధారమై నిలుచుఁగాక
తాలిమి శ్రీవేంకటేశుఁదలఁచక తలఁచినా
పాలించ నాతఁడేకాక పరులకు వశమా

రేకు: 0310-06 బౌళి సం: 04-060 అధ్యాత్మ

పల్లవి: గోనెలె కొత్తలు కోడెలెప్పటివి
నానిన లోహము నయమయ్యీనా

చ. 1: మున్నిటి జగమే మున్నిటి లోకమే
యెన్నఁగ బుట్టు గులివె వేరు
నన్ను నెవ్వ రున్నతి బోధించిన
నిన్న నేటనే నేనెఱిఁగేనా

చ. 2: చిత్తము నాఁటిదే చింతలు నాఁటివే
యిత్తల భోగములివె వేరు
సత్తగు శాస్త్రము చాయ చూపినా
కొత్తగ నేనిఁక గుణినయ్యేనా

చ. 3: జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడే
యీవల భావనలివె వేరు
ధావతి కర్మము తప్ప దీసినా
దైవము గావక తలఁగీనా

రేకు: 0311-01 శుద్ధవసంతం సం: 04-061 శరణాగతి

పల్లవి: ఊలు దింటా మలిగండ్లాఊడి రాసిగా నేరేము
తేలుచు శ్రీహరి నీవే దిక్కొటగాక

చ. 1: ఆసలేల మాను(దన ఆ(కలి లో నుండ(గాను
బేసబెల్లి దేహముతో(బెరుగు(గాక
గాసి బంధమేల(మాను(గాము(డు లో నుండ(గాను
వేసట సంసారమై వెన్నడించు(గాక

చ. 2: ధావతులే(టికి మాను(దనుభోగాలుండ(గాను
మోవరాని చింతలతో ములుగు(గాక
కావరములేల మాను కంతల మేనుండ(గాను
తోవ చేసుకొని వెళ్ల(దోయుచుండు(గాక

చ. 3: వొక్కచిత్తమేలయౌను వూర్పుగాలి విసర(గా
చిక్కి గుణత్రయముచే(జెదరు(గాక
నిక్కి శ్రీవేంకటపతి నీకు నేనే శరణంటి
గక్కన నీజీవమును గరుణింతుగాక

రేకు: 0311-02 మాళవిగౌళ సం: 04-062 విష్ణు కీర్తనం

పల్లవి: పొందగు "నాత్మాపుత్రనామ "మను-
చందపువేదమె సరి నిలిపితివి

చ. 1: పుత్రుఁడు మరుఁడట పుత్రుఁడు బ్రహ్మట నీ-
పుత్రపౌత్రులే భువినెల్లా
పుత్రకామేష్టిని బొడమితి దశరథ-
పుత్రుఁడవై యిది పొగడఁగ నరులు

చ. 2: మనుమఁడు రుద్రుఁడు మనుమఁడు వశిష్టు
మనుమని మనుమలే మహి యెల్లా
మనుమఁడవై యదితిమాన్య గర్భమున
జననమందితివి జగమున కరుదు

చ. 3: యిదె నీగోత్రం బీచరాచరం-
బెదుట మెరసె నిదె యిహమెల్లా
కదిసిటు శ్రీవేంకట గోత్రంబున
నుదయించి మెరసితో హరి నీవు

రేకు: 0311-03 శుద్ధవసంతం సం: 04-063 అధ్యాత్మ

పల్లవి: ఏమి సేయువాఁ డ నివి విరసమొకటొకటి
తామసంబొకవంక తత్వమొకవంక

చ. 1: యితరోపాయరాహిత్యుండు గాఁడేని
అతిశయంబగు మోక్ష మది యబ్బదు
సతతోద్యోగానుచరితుండు గాఁడేని
వితతసంసారసుఖవిధి నడవదు

చ. 2: వివిధేంద్రియ విషయ విముఖుఁడు గాఁడేని
యివల వైష్ణవధర్మమిది యబ్బదు
అవిరళంబగు దేహానుపరణములేక
భవమాత్రమున సుకృతఫల మబ్బదు

చ. 3: పరమానందంసంపన్నుండు గాఁడేని
చరమవిజ్ఞాన నిశ్చలుఁడు గాఁడు
యిరవయిన శ్రీవేంకటేశ యిటువలె నీవు
కరుణించకున్న దుర్గతులచే భ్రమసీ

రేకు: 0311-04 ముఖారి సం: 04-064 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నియుఁ జదువనేల యింతా వెదకనేల
కన్ను దెరచుటొకటి కనుమూయుటొకటే

చ. 1: వలెననే దొకమాఁట వలదనే దొకమాఁట
సిలుగులీ రెంటికిని చిత్తమే గురి
వలెనంటే బంధము వలదంటే మోక్షము
తెలిసే విజ్ఞానులకు తెరువిది యొకటే

చ. 2: పుట్టెడిదొకటే పోయెడిదొకటే
తిట్టమై యీ రెంటికిని దేహమే గురి
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము
వొట్టిన విజ్ఞానులకు నుపమిది యొకటే

చ. 3: పరమమనేదొక్కటే ప్రపంచమొక్కటే
సిరుల నీ రెంటికిని జీవుఁడే గురి
యిరవై శ్రీవేంకటేశుఁ డిహపరములకర్త
శరణాగతులకెల్ల సతమీతఁ డొకఁడే

రేకు: 0311-05 దేసాళం సం: 04-065 శరణాగతి

పల్లవి: తక్కిన చదువులొల్ల తప్ప నొల్లా
చక్కఁగ శ్రీహరి నీశరణే చాలు

చ. 1: మోపులు మోవఁగనొల్ల ములుగఁగ నేనొల్ల
తీపు నంజనొల్ల చేఁదు దినఁగనొల్ల
పాపపుణ్యాలవి యొల్ల భవమునఁ బుట్టనొల్ల
శ్రీపతినే నిరతము చింతించుటే చాలు

చ. 2: వడిగాఁ బరువులొల్ల వగిరింపనేనొల్ల
వెడఁగుఁజీఁకటి యొల్ల వెలుఁగూనొల్ల
యిడుమల వేఁడనొల్ల యెక్కువ భోగములొల్ల
తడయక హరి నీదాస్యమే చాలు

చ. 3: అట్టె పథ్యములొల్ల అవుషధము గొనొల్ల
మట్టులేని మణుఁగొల్ల మైల గానొల్ల
యిట్టె శ్రీవేంకటేశుఁ నిరవుగ సేవించి
చుట్టుకొన్న యానందసుఖమే చాలు

రేకు: 0311-06 రామక్రియ సం: 04-066 వైరాగ్య చింత

పల్లవి: ముందే తొలగవలె మోసపోక సంగమెల్ల
కందువఁ బోయిననీళ్లు కట్ట గట్టవచ్చునా

చ. 1: అనలముఁబొడగంటే నండనున్నమిడుతలు
పనిలేకున్నా నందుఁ బడకుండీనా
పొనిఁగి చెలులఁగంటే పురుషుల చూపులెల్లా -
ననిశము నందుమీఁద నంటఁబారకుండునా

చ. 2: గాలపుటెఱ్ఱులఁగంటే కమ్మి నీటిలో మీలు
జాలి నాపసలఁ జిక్కి చావకుండీనా
అలరిబంగారుగంటే నందరిమనసులూను
పోలిమి నాపసఁ జిక్కి పుంగుడు గాకుండునా

చ. 3: చేరి ముత్యపుఁజిప్పల చినుకులునినిచితే
మేరతేటముత్యములై మించకుండీనా
ధారుణి శ్రీవేంకటేశుదాసులసంగతి నుంటే
పోరచి నే జీవులైనఁ బుణ్యులుగాకుందురా

రేకు: 0312-01 దేశాక్షి సం: 04-067 అంత్యప్రాస

పల్లవి: నిరంతరంబును నీమాయే పరం-
పరములాయ పాపవే నీమాయ

చ. 1: మును తల్లిగర్భమున ముంచెను నీమాయ
వెనక జనించినట్టే వెలసె నీమాయ
అనుగు కౌమార బాల్య యవ్వనములు నీమాయ
జనులకు దాఁటరానిజలధి నీమాయ

చ. 2: ఆస నీమాయ అంగము నీమాయ
యీసునఁ గామక్రోధము లివి నీమాయ
వాసుల సంసారమున వలఁబెట్టీ నీమాయ
గాసిఁబడి యిఁక నెట్టు గడచే నీమాయ

చ. 3: యెదురెల్ల నీమాయ యిహమెల్ల నీమాయ
పొదలి స్వర్గ నరక భోగము నీమాయ
అదన శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవె
యిదె నీకే శరణంటి నిఁకనేల మాయ

రేకు: 0312-02 లలిత సం: 04-068 శరణాగతి

పల్లవి: ఏతపములు నేల యేదానములు నేల
శ్రీతరుణీపతినిత్యసేవే జన్మఫలము

చ. 1: దేహపుటింద్రియముల దేహమందే యణఁచుటే
దేహముతోనే తాను దేవుఁడౌట
సోహలను వెలిఁ జూచేచూపు లోను చూచుటే
ఆహా దేవతలఁ దనందే తాఁ గనుట

చ. 2: వెలి నిట్టూరుపుగాలి వెళ్ళకుండా నాఁగుటే
కులికి తపోధనము గూడపెట్టుట
తలఁపు తనందే తగ లయము సేయుట
లలిఁ బాపబంధముల లయము సేయుట

చ. 3: వెనక సంసారమందు విషయ విముక్తుఁడౌటే
మునుపనే తా జీవన్ముక్తుఁడౌట
పనివి శ్రీవేంకటేశుపదములు శరణంటే
అనువైన దివ్యపదమప్పుడే తా నందుట

రేకు: 0312-03 గుండక్రియ సం: 04-069 శరణాగతి

పల్లవి: పంతపుటాసలు బండ్ల రాఁగా

దొంతుల యలమటఁ దొలఁగేనా

చ. 1: మును దీపనాగ్ని మోఁచిన దేహిని

అనిశముఁ గ్రోధాగ్ని నణఁచేనా

మనసిజుకతమున మహి జన్మించితి

విను మరునాజ్ఞకు వెలి యయ్యేనా

చ. 2: సటలోభపు సంసారము చొచ్చితి

ఘటన విడుము డిఁకఁ గలిగీనా

నటించు చపలపు నాలుక గల నే

మటమాయపు చవి మానేనా

చ. 3: పాపపుణ్యముల భవముల జీవిని

తోపడ కర్మము దొబ్బేనా

యేపున శ్రీవేంకటేశ్వరు శరణమే

పైపయి భజించి బ్రదికితిఁగాక

రేకు: 0312-04 బౌళి సం: 04-070 వైరాగ్య చింత

పల్లవి: తెలియుట యెన్నఁడు దేహి తనంతట
తెలియఁగ హరి నీదిక్కే కలది

చ. 1: రాపుగ రేపేమూత్రపురీషంబులు
ఆపై నాఁకటి యలమటలు
కైపుగ నింతటఁ గామవికారము
మాపు నిద్దురలమంపులె కలది

చ. 2: కొన్నాళ్లు బాల్యము కొన్నాళ్లు కౌమార
మన్నిటఁ గొన్నాళ్లు యౌవ్వనము
పన్నిన ముదిమియుఁ బైపైఁ గొన్నాళ్లు
వున్నతి నంతట నుడుగుట కలది

చ. 3: జంతువులకు యీసరవులు నీవే
పొంతలఁ గల్పించి పొదిపితివి
యింతట శ్రీవేంకటేశ్వర నీకృప
చింతించి కావవే చేకొని నన్ను

రేకు: 0312-05 బౌళిరామక్రియ సం: 04-071 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇదివో శ్రుతిమూల మెదుటనే వున్నది
సదరముగా హరి చాటీ నదివో

చ. 1: యెనసి పుణ్యముసేసి యే లోకమెక్కిన
మనికై భూమియందు మగుడఁ బొడముటే
పొనిగి "యా బ్రహ్మభువనా లోకాః
పునరావృత్తి " యనెఁ బురుషోత్తముఁడు

చ. 2: తటుకున శ్రీహరి తన్నునే కొలిచిన
పటుగతితో మోక్షపదము సులభమనె
ఘటన "మాముపేత్యతు కౌంతేయ " మహిని
నటనఁ "బునర్జన్మ న విద్యతే "

చ. 3: యిన్నిటా శ్రీవేంకటేశ్వరు సేవె
పన్నినగతి నిహపరసాధన మదే
మన్నించి యాతఁడే " మన్మనా భవ " యని
అన్నిటా నందరి కానతిచ్చెఁగాన

రేకు: 0312-06 ధన్నాసి సం: 04-072 వైరాగ్య చింత

పల్లవి: అందులకు నందులకు హరిసేసినలంకే
కందువసంసారమందే కలదు మోక్షము గాన

చ. 1: దేహ మోన్నాళ్లు దిరిగె భూమిమీఁద
దాహపులంపటములతగు లన్నాళ్లు
వూహించి విసుగవద్దు వొల్లనన్నఁ బోవవి
శ్రీహరి నందే తలఁచి చెలఁగఁగవలెఁగాన

చ. 2: దీపనమోన్నాళ్లు మేనఁ దిరమై మెలఁగుచుండు
తాపపుటాసల మీఁదితగు లన్నాళ్లు
పైపైఁ గోపించరాదు పాయుమన్నఁ బాయ వవి
శ్రీపతి నందే తలఁచి చెలఁగఁగవలెగాన

చ. 3: యెఱుక యెన్నాళ్లు మతి నెనసి పాయకయుండె
తఱిమేయింద్రియములతగు లన్నాళ్లే
వొఱలి బంధించవద్దు వున్నతి శ్రీవేంకటేశు-
మఱఁగు చొచ్చి మఱచి మట్టుపడవలెఁగాన

రేకు: 0313-01 పాడి సం: 04-073 అధ్యాత్మ

పల్లవి: తొల్లి కలవే ఇవియు తొల్లి తానుఁ గలఁడే
కల్లయునుఁ గాదు ఇది కడు నిజము గాదు

చ. 1: కనుదెరచినంతనే కలుగు నీ జగము
కనుమూసినంతనే కడుశూన్యమౌను
కనురెప్ప మరఁగుననె కలిమియును లేమియును
తన మనోభావనలఁ దగిలి తోఁచీని

చ. 2: తలఁచినంతనె యెంతదవ్వయినఁ గాన్పించు
తలఁపు మరచినమతికి దట్టమౌఁ దమము
పొలసి మతిమరఁగుననె పుట్టుటలుఁ బోవుటలు
పలు చంచల వికారభావ మీ గుణము

చ. 3: ముందు దాఁగలిగితే మూఁడు లోకములుఁ గల-
వెందుఁ దా లేకుంటే నేమియును లేదు
అంది శ్రీవేంకటేశుఁ డాత్మలోననె వీఁడె
కందువల నితనిసంకల్ప మీపనులు

రేకు: 0313-02 శ్రీరాగం సం: 04-074 భగవద్గీత కీర్తనలు

పల్లవి: చదివితిఁ దొల్లి కొంతచదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను యెంతైనా నయ్యో

చ. 1: వొరుల దూషింతుఁగాని వొకమారైన నా-
దురితకర్మములను దూషించను
పరుల నవ్వుదుఁగాని పలుయోని కూపముల
నరకపు నామేను నవ్వుకోను

చ. 2: లోకులఁ గోపింతుఁగాని లోని కామాదులనేటి-
కాకరి శత్రులమీఁదఁ గడుఁ గోపించ
ఆకడ బుద్దులు చెప్పి అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ దెలుసుకోలేను

చ. 3: యితరుల దుర్గణము లెంచి యెంచి రోతుఁగాని
మతిలో నా యాసలు మానలేను
గతిగా శ్రీవేంకటేశుఁ గని బ్రదికితిఁగాని
తతి నిన్నాళ్లదాఁకా దలపోయ లేను

రేకు: 0313-03 బౌళి సం: 04-075 అధ్యాత్మ

పల్లవి: ఉన్నదిందునే వొక్క విచారము
కన్నది గానుపు ఘనపుణ్యులకు

చ. 1: అగపడి పవిత్ర మపవిత్రంబును
జగమొక్కటనే జరగెడిని
పగటున నిది నా భావవికారమొ
జగదీశ్వరుని రచన నేరుపులో

చ. 2: అలరిన జ్ఞానము నజ్ఞానంబును
తలఁ పొక్కటనే తగిలెడిని
చలమున నిది నా సహజపు గుణమో
పెలుచగు శ్రీహరి పెరిరేపనలే

చ. 3: దాహపు నాలో ధర్మ మధర్మము
దేహ మొక్కటనె తిరిగెడిని
శ్రీహరి నాయాత్మ చేరిన ఫలమో
యీహల శ్రీవేంకటేశ్వరు కరుణో

రేకు: 0313-04 గుజ్జరి సం: 04-076 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇహమే పరము మరి యింతా నీ మయముగాన
సహజపుసంసారమే మోక్షము సరుసవిరక్తికి నెడమేదయ్యా

చ. 1: నీయందే బ్రహ్మ మరి నీయందే రుద్రుఁడు
నీయందే సచరాచరమును నీయందే యీజగము
చాయలనే యెడనెడ నే నేమిచూచినా సర్వము నీధ్యానమేకాక
యీయెడ నీయర్థములో నితరంబిది యౌఁగాదన నెడమేదయ్యా

చ. 2: నీ చేఁతలే రాత్రులుఁబగళ్లు నీ చేతఁలే కాలత్రయము
నీ చేఁతలే సర్వజంతువుల నిశ్చల చైతన్యములు
చేచేత నే చేసినవెల్లా శ్రీపతి నీయాజ్ఞావిధులే
యేచాయలఁ బుణ్యాపాపములకును యెంచఁగఁ బంచఁగ నెడమేదయ్యా

చ. 3: నీశరణా గతి యొక్కటి గలిగిన నిజము గల్లలకు వెలుపేలా
ఆశల నీవంతర్యామివిగన అందిన దేహమె వైకుంఠము
రాసికి నెక్కిన శ్రీవేంకటగిరిరమణుఁడ నీ వుపదేశమిది
యీశ పరాత్పర తనిసితి మిందే యిఁక నొకటి గోర నెడమేదయ్యా

రేకు: 0313-05 శుద్ధవసంతం సం: 04-077 శరణాగతి

పల్లవి: హరి “సర్వపాపేభ్యో ఆహం త్వా “ యనె
గరిమ నా వాక్యమే ప్రమాణమైనట్టిగతి యొక్కటే నాకు

చ. 1: యిన్ని జన్మములఁ బుట్టి యేఁ జేసినపాపములు యిఁక
నన్నిజన్మములఁ బుట్టి అట్టె పుణ్యములు సేసి అవి పాపుకోఁగలనా
పన్నినదొంతులపైఁ బడ నొక్క గుదియపెట్టు
వున్నతి మోఁదినయట్టు హరిశరణాగతి యదియొక్కటే నాకు

చ. 2: యింతగాల మింద్రియముల నిట్టె సాఁగినతలఁపు యిఁక
నంతగాలము చిత్త మాఁగి నే నది దిప్పుకోఁ గలనా
చెంతఁ బంటెఁడుపాలలో నొక చల్లబొట్టు చేమిరివెట్టినట్టు
అంతటికిని శ్రీహరి శరణాగతి యది యొక్కటే నాకు

చ. 3: పలు శాస్త్రములు చూచి బహుదేవతలఁ గొలిచి పఱచైన యీదేహము
పలుసందేహములను వచ్చినతెరువునను పాపుకో నేఁ గలనా
యిల నంధకారపుటింటిలో నొకదీప మెత్తి మెఱసినట్టు
వొలసి శ్రీవేంకటపతి శరణాగతి వొకటే గతి నాకు

రేకు: 0314-01 లలిత సం: 04-078 ఇతర దేవతలు

పల్లవి: నిత్యసుఖానంద మిదె నీ దాస్యము
సత్యములేని సుఖాలు చాలుఁ జాలు నయ్యా

చ. 1: కన్ను చూపుల సుఖము కడు నీచక్కనిరూపె
యెన్నఁగ వీనులసుఖమిదె నీపేరు
పన్ని నాలుకసుఖము పాదపు నీతులసి
వున్న సుఖముల తెరు వొడఁబడమయ్యా

చ. 2: తనువుతోడిసుఖము తగు నీకైంకర్యము
మనసులోసుఖము నీ మంచిధ్యానము
పనివి యూర్పుసుఖము పాదపద్మమువాసన
యెనయని పెరసుఖ మేమి సేసేనయ్యా

చ. 3: పుట్టుగు కెల్లసుఖము పొల్లులేనినీభక్తి
తొట్టి కాళ్లసుఖము పాతురలాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలి చెన్నుఁడవై
వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా

రేకు: 0314-02 మంగళకౌశిక సం: 04-079 గురు వందన, నృసింహ

పల్లవి: జీవములు దవ్వవోయ చీమలునుఁ బుట్టచొచ్చె
వేవేలయిన నిది విడువనయ్యా

చ. 1: చింతలన్నియుఁ బాసె చిత్తమింతట రోసె
యెంత లే దీయాసలు యిఁకనేలయ్యా
అంతలో గురునిగంటి హరికే శరణంటి
దొంతులభవములాల తొలఁగరో

చ. 2: గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె
యెక్కడి పలురుచులు యిఁకనేలయ్యా
చిక్కె విజ్ఞానము నేఁడె జిహ్వ నారాయణుఁగూడె
వుక్కునఁ బాపములాల వుడుగరో

చ. 3: జీవుఁడు పాపనమాయ దేవుఁడే జీవనమాయ
యీవలి యావని కర్మమిఁక నేలయ్యా
శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను
భావపుబంధములాల పారరో

రేకు: 0314-03 తోడి సం: 04-080 ఉపమానములు

పల్లవి: ఇంతే యింతే యాంకా నెంత చూచినా
చింతలఁ జిగురులెక్కి చేఁగదేరినట్లు

చ. 1: వుల్లములో నెంచనెంచ నుద్యోగములే పెక్కు
పొల్లకట్టు దంచదంచఁ బోగులైనట్టు
బల్లిదుని హరినాత్మ భావించుటొకటే
ముల్ల ముంటఁ దీసి సుఖమున నుండినట్లు

చ. 2: అనిన సంసారమున నలయికలే పెక్కు
చానిపిఁ జవి వేఁడితేఁ జప్పనైనట్టు
పూని హరిఁ జేతులారాఁ బూజించుటొకటే
నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు

చ. 3: వెనకఁ దలఁచుకొంటే విజ్ఞానములే పెక్కు
తినఁ దిన వేమేల్లాఁ దీపైనట్టు
చనవై శ్రీవేంకటేశు శరణను టొక్కటే
పనివడి చెఱకునఁ బండువండినట్లు

రేకు: 0314-04 నారాయణి సం: 04-081 శరణాగతి

పల్లవి: హరిశరణాగతి యాతుమది
సరుస నిదియపో సతమయ్యెడిది

చ. 1: దినదినరుచులివి దేహమువి
చెనకేటికోరిక చిత్తముది
యెనసేటికాంతలు యింద్రియంబులవి
పనివి యాత్మకివి పనిలేదయ్యా

చ. 2: పదరేటికోపము పాపముది
అదనఁ గాలములు అనాదివి
నిదుర తమోగుణ నిలయముది
యెదుట నాత్మకివి యెరవెరవయ్యా

చ. 3: కాయపు జననము కర్మముది
మాయలంపటము మమతలది
యేయెడ శ్రీవేంకటేశుఁ డితనికృప
పాయనియాత్మకుఁ బ్రమాణమయ్యా

రేకు: 0314-05 దేశాక్షి సం: 04-082 గురు వందన, నృసింహ

పల్లవి: ఎదిరికి మాకును యెక్కుడుతక్కువ లివి
పదిలపుజ్ఞానముచేఁ బవిత్ర మాయ

చ. 1: మహిఁ బొడమినవెల్లా మంచివే యందులోఁ
దహతహ దేహమే తగనిది
యిహములో తృణములుయెండినా యోగ్యములాయ
బహి నిర్జీవపు మేను పనికిరాదాయ

చ. 2: పుడమిఁ జల్లినవెల్ల పురుషార్థపదములే
కడుపున నిడుకొంటేఁ గానివి
గుడికొని యితరపు గోమయమే శుద్ధి యాయ
అడరి మానుషధర్మ మతి హేయ మాయ

చ. 3: హరిసేవ గురుసేన నాత్మజ్ఞానమున కెక్కె
పొరలింపుఁగర్మమే పుణ్యమంటెకే
అరిది శ్రీవేంకటేశుడంతరాత్మకుఁ డితని
శరణనుటే సర్వసాధన మాయ

రేకు: 0314-06 దేసాళం సం: 04-083 వైరాగ్య చింత

పల్లవి: గుల్ల గుల్లే రాయి రాయే గురి యెంతవేసినాను
అల్లనాఁడే అడియాస లవియేల విడుతు

చ. 1: మహిలోన రోగములు మాన మందు గద్దుగాక
సహజగుణము మాన్పఁజాలుమందు గలదా
బహుబంధములు నీవే పాపితే నేమోకాని
అహరహమును నేనే అవియేల విడుతు

చ. 2: తనరూపమద్దములో తగఁ జూడవచ్చుఁగాక
మనసు దా నద్దములో మరి చూడవచ్చునా
దినచంచలము నీవే తీర్చితేనేమో కాని
అనుఁగు సంశయము నేనదియేల విడుతు

చ. 3: నాలుకచే రుచులెల్ల నంజి చూడవచ్చుఁగాక
జాలిఁబడ్డ కన్నులచేఁ జవి గానవచ్చుఁగాక
యేలి శ్రీవేంకటేశ నీవిట్టే కాతువుగాక
వేళ జీవుఁడను నా విధమేల విడుతు

రేకు: 0315-01 సామంతం సం: 04-084 శరణాగతి

పల్లవి: పట్టినవ్రతమే పంతము హరితో
గుట్టున శరణని కొంకఁగఁదగవా

చ. 1: అవ్వల రోసినయన్నము గుడిచిన
నెవ్వరు నవ్వరు యిఁకనేలా
రవ్వగ నొల్లక రాజసము విడిచి
దవ్వులఁ జేకొనఁదగవా మనకు

చ. 2: విడిచినభూతము వెస మరలించిన
యెడయని యేహిత విఁకనేలా
యిడుమలఁ బిలుచుచు నిచ్చిన నొల్లక
అడుగఁ బోయితే నమరునె మనకు

చ. 3: శ్రీవేంకటపతి సేవ వారమై
యీవిధిఁ బరులసే విఁకనేలా
కైవస మీతఁడు కంటి మితనికృప
యీవల నావల నెదురా మనకు

రేకు: 0315-02 సాళంగనాట సం: 04-085 హనుమ

పల్లవి: ఎక్కడ నెదురు లేక యీరేడులోకములందు
వొక్కఁడే నిలిచెనమ్మ వుగ్రహనుమంతుఁడు

చ. 1: పెట్టినజంగదండ పిడికిటి మొలచేయి
అట్టె వలచేయెత్తిన యాయితము
తొట్టిన పెంజమటలు తోడనె బుసకొట్టులు
వుట్టిపడీఁ జూడరమ్మ వుగ్రహనుమంతుడు

చ. 2: నిక్కినకర్ణములు నింగిమోఁచినబొమ్మలు
చక్కశిరసుపైఁ బారఁజూచిన తోఁక
చుక్కలు మొలపూసలు సూదుల వాఁడి రోమాలు
వుక్కుమీరెఁ జూడరమ్మ వుగ్రహనుమంతుడు

చ. 3: పుట్టుఁగౌపీనము మహద్భుత యజ్ఞోపవీతము
గుట్టుచూపని కనకకుండలములు
పట్టపు శ్రీవేంకటేశు బంటయి ప్రతాపమెల్ల
వొట్టీ విజయనగరపు వుగ్రహనుమంతుడు

రేకు: 0315-03 శంకరాభరణం సం: 04-086 వైష్ణవ భక్తి

పల్లవి: పరమవైష్ణవుల భాగ్యంబిదివో
నిరతి వారలకే నే మొక్కెదను

చ. 1: తలఁచ రొకప్పుడు ధరణి భోగములు
తలఁచ రితరమతదైవముల
తలఁతు రొకటి హరిదాసులదాస్యము
తలఁపు మోక్షములతగులమిగాన

చ. 2: కోరరు బ్రహ్మాదిగురుతరపదములు
కోరరు మేరువుకొనసుఖము
కోరుదురు తదియ్య కోట్ల సంగము
కోరిక భక్తితోఁ గూఁడీగాన

చ. 3: వొల్లరు కర్మము లొల్లరు పుణ్యము
లొల్లరహంకార మొకపరియు
వుల్లము శ్రీవేంకటోత్తము శరణని
యెల్లందుఁ దుదిపద మొక్కిరిగాన

రేకు: 0315-04 ముఖారి సం: 04-087 నామ సంకీర్తన

పల్లవి: ఇందులోనఁగల సుఖమింతే చాలు మాకు
నిందు వెలియైన సిరులేమియు నొల్లము

చ. 1: ఆదిదేవు నచ్యుతు సర్వాంతరాత్మకుని
వేదవేద్యుఁ గమలాక్షు విశ్వపూర్ణుని
శ్రీదేవు హరి నాశ్రిత పారిజాతుని
అదిగొని శరణంటి మన్యము నేమొల్లము

చ. 2: పరమాత్ముఁ బరిపూర్ణు భవరోగవైద్యుని
మురహరు గోవిందు ముకుందుని
హరిఁ బుండరీకాక్షు ననంతు నభవుని
పరగ నుతించితిమి పరుల నేమొల్లము

చ. 3: అనుపమ గుణదేహు నణురేణు పరిపూర్ణు
ఘనుఁ జిరంతనుని కలిభంజను
దనుజాంతకుని సర్వధరు శ్రీవేంకటపతిఁ
గని కొలిచితిమి యేగతులు నేమొల్లము

రేకు: 0315-05 వరాళి సం: 04-088 శరణాగతి

పల్లవి: హరికే మొఱవెట్టు టంతేకాక
గరిమ వేరోకటను గతి గానవచ్చునా

చ. 1: పాపపుణ్యాలంపటాలఁ బరగిన జీవునికి-
నోపననవచ్చునా వొడలి మోపు
కోపపు శాంతము చేతఁ గొట్టువడ్డప్రాణికి
తాపపు కర్మపువెట్టి తప్పించుకోవచ్చునా

చ. 2: ఆఁకటి నీరువట్టుల కగపడ్డదేహికి
తోఁకసంసారపుటాజ్ఞ తోయవచ్చునా
సోఁకుసుఖదుఃఖములఁ జొచ్చినజంతువునకు
మూఁకల లోకపులగ్గములఁ బాయవచ్చునా

చ. 3: సారె రాత్రిఁ బగటాను చచ్చిపుట్టేజంతువుకు
భారపుటాసల లోనఁ బాయవచ్చునా
యీరీతి శ్రీవేంకటేశు నిటు శరణన్నఁగాక
ధారుణిఁ బంచబాణము దప్పుకొనవచ్చునా

రేకు: 0315-06 బౌళి సం: 04-089 కృష్ణ

పల్లవి: అడ్డములేనినాలిక నాడుదురుగాక భూమి
దొడ్డవాఁడేమి సేసినా దోస మందు నేది

చ. 1: ఆతుమలో మదనుఁడవయ్యే వాఁడవు నీవే
ఆతల నాలిమగఁడువనే వారలు నీవే
ఘాతల పరాంగనఁ గలసితివని నిన్ను
తోతో మునుల కిఁక దూరఁ జోటేదయ్యా

చ. 2: దేహము లోపలనున్న దీపనాగ్నియు నీవే
దాహము నాఁకలి నీవే తగురుచులెల్ల నీవే
ఆహా శబరియెంగి లారగించి తనుమాట
సోహల నిందించి నవ్వఁ జోటిందు నేది

చ. 3: పుట్టుగు లోపలనున్న భోగము లన్నియు నీవే
ఇట్టే ఆచారములు హీనాధికములు నీవే
గుట్టున శ్రీవేంకటేశ గొల్లఁడవై పుట్టినందు-
కుట్టిపడి యెవ్వరికి నూహించఁజోటేది

రేకు: 0316-01 గుజ్జరి సం: 04-090 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సర్వం విష్ణుమయం బను భావము సత్యం బిన్నిటను
సర్వేశ్వరుఁడే పొందేటి వస్తువు శరణాగతి యే వుపాయము

చ. 1: తానని యెడి బుద్ధి దైవంబందు నునిచి
తానే తనమతి మరచిన సుఖ తత్వానందమిది
మేనని యెడి బుద్ధి యీ మేదిని ప్రకృతి యందు
ఆనింపుచుఁ దా మమతలు విడిచిన నాత్మజ్ఞానంబు

చ. 2: పొరలి జగమనే బుద్ధి మాయపై నునిచి
పరగిన యింద్రియముల గెలిచినదే పరమపు యోగంబు
పొరిఁ గర్మపు బుద్ధి పుట్టువుపై నునిచి
వెరపునఁ బాపము బుణ్యము విడుచుట వివేకమగు దుదిపదము

చ. 3: వెలి దోచిన బుద్ధి వేగమే లోనునిచి
చలమున చంచల ముడిగి యుండుటే సమాధి లక్షణము
పలు భావపు బుద్ధి భక్తి వొకట నునిచి
యెలమి శ్రీ వేంకటపతి గలయుటే యిది తుర్యావస్థ

రేకు: 0316-02 లలిత సం: 04-091 అధ్యాత్మ

పల్లవి: తలఁపులోని వెలితే దైవము వెలితౌ
కలగిన ఇదియే కారణము

చ. 1: యెదిటి యాసలకు నెడిసి తొలఁగుటే
తుద నరకములకుఁ దొలఁగుట
వదలక ఇంద్రియవర్గము గెలుచుటే
పదపడి తనపాపముల గెలుచుట

చ. 2: మగటిమి సంసారమాయ దాఁటుటే
తగుభవవారిధి దాఁటుట
జగములోపలను శాంతిగలుగుటే
అగణిత మోక్షమునందుఁ బొందుట

చ. 3: మహి ఇంతా హరిమయముగఁ గనుటే
విహితపు జ్ఞానము వెసఁ గనుట
ఇహమున శ్రీవేంకటేశు శరణనుటే
సహజపు జన్మము సఫలం బనుట

రేకు: 0316-03 రామక్రియ సం: 04-092 వైరాగ్య చింత

పల్లవి: మరుగుచుఁ జేసీ మానదుద్యోగము
నరహరి నీ కృపే నాగతి గలదు

చ. 1: అనుపమ మైన భయంబున నరకము
వినియెదఁగాని వెరచి విడువను
మనియెడి జీవుల మరణ భవంబులు
కనియెదఁగాని కలంగదు మనసు

చ. 2: రాసుల మలమూత్రపు సోదనలిటు
సేసీఁగాని చీ యనదు తనువు
ఆసల నర్థపుటార్జన యలపుల
వేసరదుఁగాని విరతి నిలుపను

చ. 3: నిరతముఁ దలపఁగ నిదురయుఁ దెలివియు
తొరలీఁగాని తారలనీదు గుణము
యిరవగు శ్రీవేంకటేశ్వర నీవే
పరమాత్మవు ననుఁ బాలించఁగదే

రేకు: 0316-04 సాళంగనాట సం: 04-093 భగవద్గీత కీర్తనలు

పల్లవి: వెలినుండు లోనుండు విశ్వమింతటనుండు
జలజాక్షు శరణమే సాధనము సుండీ

చ. 1: మిక్కిలిఁ జేసే పాపమే మీఁద నరకమై తోఁచు
నిక్కి తానే అద్దములో నీడైనట్లు
వొక్కట మొదలులేక వుంటేఁ గొనాలేదు
గుక్కకిహపరములు కోరినంతే సుండీ

చ. 2: మహిఁ దొల్లి చూచినూరే మతిలోన దోఁచిని
గహనపు కాఁపురమే కలయైనట్లు
సహజమై పుట్టులేక చావులేదెవ్వరికి
విహిత సుఖ దుఃఖములు వేఁడినంతే సుండీ

చ. 3: యెండగాసే బయటనే యెక్కువ వెన్నెలగాసీ
దిండురేయిఁ బగలొక్క దినమైనట్లు
నిండు జీవుఁడు లేకుంటే నిక్కపు దేవుఁడు లేఁడు
అండ శ్రీవేంకటేశుఁడే అంతరాత్మ సుండీ

రేకు: 0316-05 పాడి సం: 04-094 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పుట్టుభోగులము నేము భువి హరి దాసులము
నట్ట నడమి దొరలు నాకియ్యవలెనా

చ. 1: పల్లకీలు నందలాలు పడివాగెతేజీలు
వెల్లవిరి మహలక్ష్మివిలాసములు
తల్లి యాకె మనినే దైవమని కొలిచేము
వొల్లఁగే మాకేసిరులు వొరు లియ్యవలెనా

చ. 2: గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామిని యాకెమగని ప్రాణధారి లెంకలము
వోమి మాకాతఁడే యిచ్చీ వొరులియ్యవలెనా

చ. 3: పసగల పదవులు బ్రహ్మనిర్మితములు
వెస బ్రహ్మతండ్రి శ్రీ వేంకటేశుఁడు
యెసఁగి యాతఁడే మమ్ము నేలి ఇన్నియు నిచ్చె
వొసగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా

రేకు: 0316-06 రామక్రియ సం: 04-095 వైరాగ్య చింత

పల్లవి: దైవమ నీవే దయదలఁచుట గా
కావలఁ బ్రాణికి యాసే దయ్యా

చ. 1: ఆస వొకటి యెంతయినాఁ దనియదు
వాసి యొకటి తనవంతులు మానదు
యీసొకటి శాంతమెరఁగని దిదె
మోసపుదేహికి ముక్తి యే దయ్యా

చ. 2: పాపమొకటి భవబంధముఁ బాపదు
దీపమొక్కటి ధీరత యొల్లదు
చూపొక టింద్రియసుఖముల గెలువదు
యేపునఁ బ్రాణికి యెఱికే దయ్యో

చ. 3: పాయమొకటి చాపలములు మానదు
కాయమొకటి తనకర్మము విడువదు
యీయెడ శ్రీవేంకటేశ్వర నీసేవ
సేయని యాత్మకు సెలవే దయ్యా

రేకు: 0317-01 మలహరిసం: 04-096 నృసింహ

పల్లవి: కటకట యీమాయ గడచుట యెట్లో
ఘటనల హరికృప గలిగినఁగాక

చ. 1: యిరవగుజీవుల కెంతగలిగినా
పరధనకాంతలే బలుప్రియము
ధరఁ గర్మాపుఁజేతలలోనెల్లా
సొరదిఁ బాపమే సులభము

చ. 2: నానారుచులు యనంతము గలిగిన
కానిపదార్థమె కడుఁ దీపు
పానిన చదువుల పఠన లుండగా
మానని దుర్భాషమాఁటలే హితవు

చ. 3: యెదలో శ్రీవేంకటేశ్వరుఁడుండఁగ
సదరపు దివిజులు చవులయిరి
అదనను శ్రీగురుయానతి గలుగఁగ
పొదిగొని యివి తలపోయఁగ వలెసె

రేకు: 0317-02 దేవగాంధారి సం: 04-097 నామ సంకీర్తన

పల్లవి: ఆహా నమో నమో ఆదిపురుష నీకు
యీహల నేనెంతవాఁడ నెట్టు గాచితివి

చ. 1: లోకాలోకములు లోన నించుకొన్న నీవు
యీకడ నాత్మలోన నెట్టణఁగితి
ఆకడ వేదములకు నగోచరమైన నీవు
వాకుచే నీనామములఁ వడి నెట్టణఁగితి

చ. 2: అన్నిటా బ్రహ్మాదుల యజ్ఞభోక్తవైన నీవు
అన్నపానములివి యెట్టారగించితి
సన్నుతి పూర్ణుఁడవై జనియించిన నీవు
వున్నతి నాపుట్టుగులో వాకచో నెట్టుంటివి

చ. 3: దేవతలచే పూజ తివిరి కొనిన నీవు
యీవల నాచే పూజ యెట్టు గొంటివి
శ్రీవేంకటాద్రి మీఁద సిరితోఁ గూడిన నీవు
యీవిధి నాయింట నీవు యెట్టు నిలచితివి

రేకు: 0317-03 బౌళి సం: 04-098 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నీవే నీదాసులని నినుగంటిఁ గంటిని
ఆవలనీవే అంతర్యామివి గాన

చ. 1: నీదాసుల శిరసులే నీదివ్యశిరసులు
నీదాసులపాదములే నీదివ్యపాదములు
నీదాసులకన్నులే నీదివ్యనేత్రములు
నీదాసులరూపమే నీవిశ్వరూపము

చ. 2: నీకింకరులగుణాలే నీదివ్యగుణములు
నీకింకరులున్నచోటే నీకు నిత్యవైకుంఠము
నీకింకరుల సేవే నీవు మెచ్చునిజసేవ
నీకింకరుల కూటమే నీకు సర్వాంగములు

చ. 3: యిందరిలో శ్రీవేంకటేశ నీవే పో యంటే
అంది తల్లిముట్టే యుంటే నంటవచ్చునా
యెందు నజ్ఞానపు ముట్టు యెడసినాత్మలుగాన
నిందలేని నీదాసులే నీవని సేవింతును

రేకు: 0317-04 ధన్నాసి సం: 04-099 అధ్యాత్మ

పల్లవి: ఆయంబిది తెలియంగల దీయాత్మజ్ఞానంబు
మాయలు యీకాలము కర్మము మాధవునాధీనము

చ. 1: దేహమునకు నీడ తిరిగినయటువలెనే
శ్రీహరికి కళావిధమై జీవుఁడటు దిరుగు
దేహమునకుఁ గల చైతన్యము తెగి నీడకులేదు
శ్రీహరికిని గల స్వతంత్రము జీవునికిలేదు

చ. 2: కలలోపలఁ గల సుఖము ఘనసంతోషము కొరకే
యిల లోపలఁ గలిగిన సుఖము ఇది సంతోషము కొరకే
కలలోపలి విజీవుని సంకల్పన లిన్నియును
ఇల లోపలి ప్రపంచ మింతయు నీశ్వరుసంకల్పము

చ. 3: చెదరిని బాహ్యపునిషయములు జీవునిపాలిటివి
పదిలంబగు అంతరంగమే పరమపువైకుంఠము
అదనెరిఁగి కాలగాలమున ఆతుమ శ్రీవేంకటపతికి
పొదిగియాతనికి శరణనికొలిచిన పొందగుముక్తికియిదిగేలు

రేకు: 0317-05 పాడి సం: 04-100 నామ సంకీర్తన

పల్లవి: పాప పుణ్యముల పక్వమిదెరఁగను
నాపాలిటి హరి నమో నమో

చ. 1: మానసవాచక మరి కర్మంబుల
తానకముగ నీదాసుఁడను
పూని త్రిసంధ్యల భోగభోగ్యముల
నానాగతులను నమోనమో

చ. 2: వలనుగ జాగ్రస్వప్నసుషుప్తుల
యిలలో నీకేమి హితభటుఁడ
వెలుపల లోపల వేళావేళల
నలినాక్ష నీకే నమోనమో

చ. 3: పుట్టుకతొలుతను పుట్టినమీఁదట
అట్టె నీశరణాగతుఁడ
గట్టిగ శ్రీవేంకటపతి నీకృప
నట్టనడుమైతి నమోనమో

రేకు: 0317-06 రామక్రియ సం: 04-101 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇందరిపై భిన్నభక్తులేఁటికి మాకిఁక
అందరిలో అంతరాత్మ యాతని రూపే

చ. 1: తల్లియై యుండేవాఁడు తగ నితనిరూపే
యెల్లగాఁ దండ్రైనవాఁడు నితనిరూపే
యిల్లాలై సుఖమిచ్చు నితనిమహిమరూపే
వెల్లవిరిఁ దనము లీవిష్ణునిరూపే

చ. 2: గ్రామదేశకులములు ఘనుఁడితనిరూపే
కామించునర్థ మీతఁడై కలుగు నీరూపే
దీమపాన నిహపరద్రిష్టము లితనిరూపే
యేమేర దాతయు దైవ మీతనిరూపే

చ. 3: కాలము నితనిరూపే కర్మము నితనిరూపే
యేలి యాచార్యుఁడు చెప్పే దితనిరూపే
శ్రీలలనాపతి శ్రీవేంకటేశ్వరుఁడే
పాలించఁగాఁ గంటి నే నీపరమాత్మురూపే

రేకు: 0318-01 గుండక్రియ సం: 04-102 శరణాగతి

పల్లవి: ఏపను లెవ్వరికిఁగల దెంత యంతేకాని
శ్రీపతియాజ్ఞలు మీఁఱగ చింతింపఁగఁ దరమా

చ. 1: సులభంబున సుఖియించుటఁబోలదు సొంపుగ భిక్షాన్నముతోడ
పలు లంపటములఁబడి ఘడియించేటి బహుధన మిగదియేల
తొలుతే జంతువులను వ్రాసెను తొడఁగి నుదిట బ్రహ్మ
కలది దైవికములఁ గడచెదమని కడుబడలెదరేలో నరులు

చ. 2: పాపము సేయక మానుటఁ బోలదుపరమశాంతితోను
కోపము మానక బహుపుణ్యంబులు కోట్లు చేసినను
దీపింపఁగ వేదశాస్త్రములు తెలిపెడి యర్థ మిదే
కైపుగ నిది దెలియక జీవులు కడుబడలెదరేలో నరులు

చ. 3: సహజము జగమున యీపనులెల్లను జరగుచు నుండుట స్వభావము
గహనము ప్రాణులకే పనులను ననఁ గాదన కర్తన్య మింతేది
యిహమేల శ్రీవేంకటేశ్వరు నమ్మిన యీతనిశ రణాగతులు
మహిలోఁజూతురు నవ్వుదు రిటునలె మానరేటికో నరులు

రేకు: 0318-02 భవుళి సం: 04-103 విష్ణు కీర్తనం

పల్లవి: నీకంటే నితరము మరి లేదు నేనెవ్వరితో భాషింతు
యేకో నారాయణుఁడవు నీవని యెన్నుచు నున్నవి వేదములు

చ. 1: యెక్కడచూచిన నీరూపంబులే యెవ్వరిఁజూచినఁ దోఁచిని
వెక్కసముగ నీమహిమ యనంతము విశ్వాత్మకుఁడవుగాన
నిక్కి యెవ్వరిని బేర్కొని పిలిచిన నీనామములై తోఁచీని
వక్కణించఁగా సకలశబ్దములవాచ్యుఁడవటు గాన

చ. 2: యేపనిచేసిన నీపనులే అవి యివ్వలనవ్వలఁ దోఁచీని
పాపపుణ్యమని తోఁచదు నీవే పరచైతన్యమవటు గాన
దాపుగ మతిలోనేమి దలఁచినా ధాన్యము నీదైతోఁచీని
లోపల వెలుపల నిండుక వుండెది లోకపూర్ణుఁడవు గాన

చ. 3: యీ యర్థమునకు నేననువాఁడను యెక్కడ నున్నాఁడ నీలోనే
కాయధారినై యేర్పడి నీలోఁగాక చరించితి యిన్నాళ్లు
యీ యపరాధము యెంచకుమీ నను యిందునె పో నీశరణంటి
పాయక నిన్నిఁక శ్రీవేంకటపతి పరబ్రహమవుఅటు గాన

రేకు: 0318-03 సామంతం సం: 04-104 శరణాగతి

పల్లవి: అచ్చుతుడనియెడి నామముగలిగినయట్టి నీవేకాక
కుచ్చి నీకు నేశరణని కొలిచితి గురుతుగఁ గావఁగదే

చ. 1: అణురూపగుమశకములోపల నణఁగిన నీకంటే
గుణించి యెంచి చూచినను కొంచె మింకనేది
ప్రణుతింపంగ బ్రహ్మండకోట్లు భరియించునీకంటే
గణనకు నెక్కుడు నీవేకాక ఘన మిఁకనేది

చ. 2 దాకొని జగములు పుట్టించు బ్రహ్మకు తండ్రివి నీవే
కైకొని చదువులఁ దెలిసిచూడ రక్షకులిఁక మరి వేరి
యేకోదకముగ వటపత్రమున యీఁదేటినీకంటే
దీకొనిపలికిన కాలంబుల కొనదేవుఁడు మరివేఁడీ

చ. 3: శ్రీవేంకటమున వరములొసఁగేటి శ్రీపతి నీకంటే
తావుఁన గన్నులఁజూడఁగ బ్రత్యక్షదైవము మరివేఁడి
వేవేలకు వైకుంఠవిభుఁడవై వెలిసిన నీకంటే
భావించి చూచిన నంతరంగమునఁ బరోక్షదైవముమరివేఁడీ

రేకు: 0318-04 దేవగాంధారి సం: 04-105

పల్లవి: హరి నే నిన్నిందులకుఁగా దర్చించి కోరెడిది
గరిమల నాయంతరంగమున నినుఁ గానఁగ నడిగెదను

చ. 1: మునుపే యీజగమెల్లా నీవు మెలవఁగ బెట్టినది
వెనుకొని నేను నీవాఁడనే యని విన్నవించనేల
నినుపై యీజీవరాసులన్నియు నీరక్షణలోనివి
కనుఁగొని నన్నునురక్షించుమని మరి కమ్మరఁజెప్పఁగనేల

చ. 2: యిహమునఁగర్మాధీనంబయి సిరులియ్యఁగ నినునింకా
మహిలో నివి యవి నాకు నిమ్మనుచు మరి యడుఁగనేల
సహజపుఁ దల్లియుఁదండ్రియు బంధులు సంతతి నీవై యుండఁగను
విహితముగా నిను నక్కడ నిక్కడ వెదకఁగ మరి యేల

చ. 3: శ్రీవేంకటపతి వరము లొసంగుచు చేరువ నీవై యుండఁగను
ఆవల నీవల నితరదేవతల యాసలఁ బడనేల
దైవశిఖామణి వాదిమూరితివి తగిన స్వతంత్రుఁడవు
యేవిధులు నేనెఱఁగను నీవే యింతాఁ జూమ్మీదాఁచఁగనేల

రేకు: 0319-01 సామంతం సం: 04-106 శరణాగతి

పల్లవి: పరమాత్మ నాజాడ భావించ నిట్టిది, నీవు
నిరుహేతుకాన నాకు నీవు బుద్దియ్యఁగదె

చ. 1: అపరాధములు పెక్కు లటు నాయందున్నఁగాని
వుపమఁ బుణ్యముత్రోవ లూహించలేను
విపరీత పాపములు వేవేలు సేసినఁగాని
చపలగర్వము మాని శరణనలేను

చ. 2: పలులంపటాలఁ బడి బడలినఁగాని, నాకు
పలవి నిన్నుఁ దలఁచేభక్తి లేదు
పులుసు నంజినఁగాని భూమిలో మిక్కిలి తీపు
తలపోయ నోటికి నితవు గానరాదు

చ. 3: వేవేలు నేరాలు సేసి వెరపు పుట్టినఁగాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జేరదు మతి
వావిరి లోకపుమాయవలలఁ జిక్కినఁగాని
వేవేగ వెడలి ముక్తి వెదకఁడు జీవుడు

రేకు: 0319-02 గుజ్జరి సం: 04-107 శరణాగతి

పల్లవి: శ్రీపతి నీ సేవ చిత్తము గోరదు
పాపముల వెంటనే పారీ నయ్యా

చ. 1: తెగనికర్మము దేహములు గోరు
పగలయీపేఁగ ప్రణాలు గోరు
నగుచుఁ దొల్లింటి నా పూర్వకర్మములు
పొగరుభోగములే పొందించె నయ్యా

చ. 2: సాకిరివయసు సంసారము గోరు
చీకురువాయులు జీడిమాను గోరు
దీకొని నాతోడి తీరనింద్రియములు
కైకొని మర్మములు గలఁచీ నయ్యా

చ. 3: వేదవిజ్ఞానము విరతియే కోరు
నీదాసుఁడైతేనే నీశరణు గోరు
యీదెస శ్రీవేంకటేశ నీవు నాలో
పాదైయుండి నన్ను బ్రదికించే నయ్యా

రేకు: 0319-03 లలిత సం: 04-108 అధ్యాత్మ

పల్లవి: అతనిభజియించరో ఆతుమలాల శ్రీ-
పతి యితనికరుణే ఫలమింతేకాని

చ. 1: సంగమే భంగమే సుండి సకలవిరక్తులాల
వెంగలివిషయములే విషము సుండీ
అంగపుబందువులెల్ల అంటుబంధములు సుండీ
సంగతి హరి యొక్కఁడే సతమింతేకాని

చ. 2: మోహమే దాహముసుండి మోక్షోపాయకులాల
సాహస సంసారమే నిస్సారము సుండి
దేహము గొన్నాళ్ళకు సందేహమై తోఁచు సుండి
శ్రీహరి సేవొక్కటే వచ్చినదింతేకాని

చ. 3: కోపమే తాపముసుండి కోరని సాత్వికులాల
రూపులేని భోగమెల్ల రుణము సుండి
కైపుసేసి యన్నిటాను గడిచిశ్రీవేంకటేశు-
నొపి శరణని మనేదక్కటే సుండి

రేకు: 0319-04 మాళవి సం: 04-109 దశావతారములు

పల్లవి: ఆతఁడోపో మాయేలిక ఆతఁడే జగన్మూల-
మాతఁడే శ్రీవేంకటాద్రి యందు మీఁది దైవము

చ. 1: కమలవాసిని యైన కాంతఁ బెండ్లాడినాఁడు
కమలములో బిడ్డఁ గన్నవాఁడు
కమలాప్తునిలోనఁ గలిగి మెరయువాఁడు
కమలనాభుఁడేపో కలుగు మాదైవము

చ. 2: జలధి బంధించి లంక సంహరించినవాఁడు
జలధిచొచ్చినదైత్యుఁజంపినవాఁడు
జలధిసుతునకు వరుస బావైనవాఁడు
జలధి శయనుఁడేపో చక్కని మాదైవము

చ. 3: కొండ గొడుగుగనెత్తి గోపులఁగాచినవాఁడు
కొండవంటి రాకాసిఁ గొట్టినవాఁడు
కొండలకు నెక్కుడైన గురుతు శ్రీవేంకటాద్రి-
కొండరూపు దానేపో కోరిన మాదైవము

రేకు: 0319-05 నాట సం: 04-110 కృష్ణ

పల్లవి: వొద్దునీవు నాకెదురా వోరి కంసుఁడా
కొద్దిగాదు పెనఁగఁగ గోవిందుతోఁ గంసుఁడా

చ. 1: పెరిగీ రేపల్లె నదె బిరుదునీవైరి వాఁడే
వొరసి నన్నేలపట్టే వోరికంసుఁడా
విరసాన వెరవను విష్ణుమాయను నీ-
గొరబైనవెడబుద్ది గొలుపద వోరా

చ. 2: వెదకీ నీవైరి వాఁడె వీరదానవులనదె
పుదుటు నాతోనేల వోరికంసుఁడా
చిదుమనా నిన్నిపుడే సెలవీఁడుగా కతఁడు
పెదవుల చేటింతే పేదవానికోపము

చ. 3: వెన్నలుఁ బాలారగించి వెసఁవాడె సత్వగూడ-
నున్నవాఁడు, నిన్నుగెల్వ నోరి కంసుఁడా
వెన్నుఁడు శ్రీవేంకటాద్రి విభుఁడు లోకులఁగాచె-
నన్నిటాఁ గృష్ణావతార మందఁబట్టి నేఁడు

రేకు: 0319-06 సామంతం సం: 04-111 గురు వందన, నృసింహ

పల్లవి: ఈతఁడే ద్రిష్టవరము లియ్యఁగాఁ గాఁక
ఆతలీతలీ సుద్దులవి నమ్మఁగలమా

చ. 1: హరి రూపెరుఁగుదుమా అరసి ఇంతకతొల్లి
సొరది శ్రీవేంకటేశుఁ జూచి కాక
గురుమంత్రము నేర్తుమా గోవిందుఁడితని నామ
మురుటై లోకాలనెల్ల నుండఁగా గాక

చ. 2: వైకుంఠ మెరుఁగుదుమా వర్ణించి ఇంతకతొల్లి
దీకొని శ్రీవేంకటాద్రిఁ దిరిగి కాక
యేకడ దేవతల నేమెందునైనాఁ గంటిమా
చేకొని హరిదాసులఁ జేరి మొక్కే కాక

చ. 3: పుట్టు నేఁ గంటినా పొంచి శ్రీవేంకటపతి
వొట్టి నాయంతరాత్మై యుండఁగాఁగాక
కొట్టఁగొనపర మేడ కొంచెపు దేహి నేనేడ
అట్టె యాతనికి శరణని కొలిచి కాక

రేకు: 0320-01 శుద్ధవసంతం సం: 04-112 శరణాగతి

పల్లవి: హరి నీవే సకలలోకారాధ్యుడఁవు గాక
ధర నీకు శరణంటే తలఁపిదే చాలును

చ. 1: కింది నేఁజేసినయట్టికీడు నీవు వాపఁగాను
అందుమీఁదు నడిగేదా అది చాలక
పొంది పుట్టించేట్టి బ్రహ్మపుత్రుఁడు నీకైవుండఁగ
ఇందరిఁగొలిచేదా యెంత కూళతనము

చ. 2: దీకొని నాలో నీవు దిక్కై వుండగాను
నాకొక స్వతంత్రమా నాఁడు చాలక
కైకొని లోకములు నీకడుపులో నుండఁగాను
నీ కంటేఁ బరులున్నారా నేరమింతే కాక

చ. 3: ఇహపరముసిరులు ఇన్నియు నీవియ్యఁగాను
సహజాన నుండవొద్దా చాలదా యింత
విహితమైన శ్రీవేంకటేశ వోక్కండవే
బహళమై వుండఁగాను బంటనంటగాక

రేకు: 0320-02 గుండక్రియ సం: 04-113 శరణాగతి

పల్లవి: జ్ఞానము నెఱఁగము అజ్ఞానము నెఱఁగము
శ్రీనాయకుఁడ నీసేవకుఁడ నేను

చ. 1: అరుతఁ గట్టినతాళి యవె వనమాలికలు
సరుస మోఁచిన డాగు శంఖచక్రములు
వరుస నొసల గురివ్రాసినది తిరుమణి
ఇర వెరిఁగితి మిఁక నెపుడైనఁ గావుము

చ. 2: పళ్ళెము ప్రసాద మింతే పసగా నారుచు లివె
పిల్లు నేఁ బొగడేవి నీబిరుదులు
యెల్లపుడుఁ బూజించేది ఇది నీరూపుపతిమ
కల్లలే దిందుల నీవు గన్నదింతే కానుపు

చ. 3: నిక్కము నేఁ జొచ్చినది నీలెంకతనము
చక్కనాజీవనము నీశరణాగతి
యెక్కువ శ్రీవేంకటేశ యెదలో నున్నాఁడ నిదె
చిక్కిన దేమియులేదు చిత్తమింతే ఇఁకను

రేకు: 0320-03 సాళంగనాట సం: 04-114 శరణాగతి

పల్లవి: నిన్ను నీవే తెలుసుకో నిరుహేతుకబంధుఁడ -
వన్నిటాఁ బరతంత్రుఁడ నంతేపో నేను

చ. 1: యేమి గూడీ నీఁ గర్మ మిలపైఁ జేయఁగ నీకు
యేమి మానె వేఁగర్మ మిటు మానఁగ
భూమినీనాటక మేల పూర్ణ కాముఁడవు నీవు
కామించి కాతువుగాక కరుణానిలయ

చ. 2: యెంత గూడపెట్టితి నే నిలమీఁదఁ బుట్టఁగాను
యెంత నష్టినే జనించ కిట్టుండగా
వింతగుయీా యుక్తులెల్ల వృథావాదము లింతే
సంతతము ననుఁ గావు సర్వేశ్వరా

చ. 3: యెవ్వరు విన్నవించేరు ఇటు నాదెస నీకు
యెవ్వరు వద్దనేరు నీ విలఁ గావఁగా
రవ్వల శ్రీవేంకటేశ రక్షింతువుగాక
అవ్వల విప్వల శరణాగతరక్షకుఁడా

రేకు: 0320-04 బౌళి సం: 04-115 గురు వందన, నృసింహ

పల్లవి: కనియెడి దిదియే వినియెడి దిదియే కడలఁ జదివెడిదిదియపో
నినుపు నీరై సర్వజగముల నిలిచె శ్రీహరిమాయ

చ. 1: తలఁపు నొక్కటే తాను నొక్కఁడే దైవ మొక్కఁడే పో
కలిసి పెక్కుముఖంబులై లోకంబు దోఁచెనేని
తెలియఁ జిల్లుల కడవ లోపలి దీపమువలెనే
అలరి వెలిఁగెడి చూడఁజూడఁగ హరిప్రపంచపుమాయ

చ. 2: దేహ మొక్కటే జీవుఁ డొక్కఁడే దినము నొక్కటేపో
మోహ జాగ్రత్స్వప్ననిద్రలు మొనపె భేదములై
వూహఁ బెక్కులయద్దముల చంద్రోదయమువలెను
సాహసంబున భ్రమలఁబెట్టెడి చదల నిదె హరిమాయ

చ. 3: గురువు నొక్కఁడే మంత్ర మొక్కటే కొలువు నొక్కటేపో
అరయ భక్తియ వేరు వేరై యలరుచున్న దిదే
గరిమ శ్రీవేంకటగిరీశ్వరు కల్పితమువలెనే
వెరసి వారికి వారికే ఇది వింతవో హరిమాయ

రేకు: 0320-05 పాడి సం: 04-116 మనసా

పల్లవి: సచరాచర మిదె సర్వేశ్వరుఁడే
పచరించి యీతని భావింపు మనసా

చ. 1: కదలెటి దంతయు కమలారమణుని-
సదరపు సత్యపు చైతన్యమే
నిదిరించెటి యీనిశ్చేష్టజగమును
వుదుటున నాతఁడు వుండేసహజమే

చ. 2: కలిగివుండినదె కల దింతయు హరి-
నలుగడఁ బరిపూర్ణపుగుణమే
మలల్సి లేనిదియు మహిమల నాతని-
నిలుకడగలిగిన నిర్గుణమే

చ. 3: జీవరాసులగు సృష్టియింతయును
శ్రీవేంకటపతి చిత్తంబే
కైవల్యమె లోకపు టిహముఁ బరము
భావించ నేర్చిన పరమవిదులకు

రేకు: 0320-06 సామంతం సం: 04-117 గురు వందన, నృసింహ

పల్లవి: అందుల కిదె ప్రతియౌషధము
ఇందిరాపతికి నెక్కినచింత

చ. 1: పంచబాణములబాసట మంటిన-
చంచలమౌ నిశ్చలమనసు
పంచబాణగురుపాదము దలఁచిన
కంచుఁజంచలము గక్కన మాను

చ. 2: కనకపుటాసలగరళం బంటిన
ననిచినవిజ్ఞానము చెదరు
కనకగర్భు నటు గన్నతండ్రిపై
మనసిడితే నిర్మలమౌ గుణము

చ. 3: మునుకొని మొదలను మొలచిన ససికిని
పనివడి కొననే ఫలియించు
అనయము శ్రీవేంకటాధిపుకృపగల -
జనుని కిహపరము సఫలంబు

రేకు: 0321-01 సాళంగం సం: 04-118 శరణాగతి

పల్లవి: వెన్న చేతఁబట్టి నేయి వెదకినట్టు
యెన్నఁగ నీవుండఁగాను యెక్కడో చూచేను

చ. 1: కన్నులు మిన్నులు దాఁకీ కాయ మీడ వున్నఁగానే
తిన్నని వీనులు మెట్టీ దిక్కులనెల్ల
యిన్నిటి కొడయఁడవై యిందిరేశ నీవు నాలో
నున్నరూపు గానలేను వూహించి ఇపుడు

చ. 2: కాయము పాయము గీరీ కాల మీడ నుండఁగానే
ఆయపు మనసు ముంచీ నన్నిటియందు
యేయెడ నాలోనున్న యీశ్వర నీ నిలయము
పాయకుండఁ గోరలేను పాయము నాకెట్టిదో

చ. 3: ఇహమే పరము గోరీ యీడ నిట్టె వుండఁగాను
మహిలో శ్రీవేంకటేశ మహిమెట్టిదో
అహరహమును నీ వంతర్యామివై
సహజమై యుండఁ గంటి చాలు నిఁక నాకు

రేకు: 0321-02 లలిత సం: 04-119 శరణాగతి

పల్లవి: నేఁడుగాక దొరనైతి నేను నారాయణుఁ గొల్చి
పోఁడిమి నాచార్యుని బోధవంకను

చ. 1: దీనవృత్తి నేఁ దిరుగని చోటేది
నానాచంచలము నామనసు
పూని నేఁగొనని భువిలోని రుచు లేవి
హీనజన్మము లెత్తిన దీమేను

చ. 2: చేరి నేఁజేచేతఁ జేయనిపాప మేది
ధారుణి మోపైన సంసారమునను
ఆరయ మున్ను నేనాడని కల్లలేవి
సారెకు నుదురుపోషణమునకు

చ. 3: సూటిదప్పక నేఁ జూడని చూపేది
చేటులేని చిరకాల జీవుఁడనే
చాటువ శ్రీవేంకటేశు శరణు చొరకతొల్లి
బూటకము లెన్ని లేవు పొలయదు కాలము

రేకు: 0321-03 దేసాళం సం: 04-120 శరణాగతి

పల్లవి: అన్నిటా నిట్టే కాని యగపడదు
అన్నమదమున జిత్త మగపడదు

చ. 1: సొలసి సంసారములో సుఖముఁ బొందేనంటే
అలమటలేకాని యగపడదు
పలుచదువులవంకఁ బరము గనేనంటే
అల సంశమోకాని యగపడదు

చ. 2: వెడదేహము మోఁచి విరతిఁ బొందేనంటే
అడియాసలేకాని యగపడదు
సడిఁ గోపమే యుండఁగ శాంతిఁ బొందేనంటే
అడవిఁ బడుటేకాని యగపడదు

చ. 3: నేరిచి నీ మాయలోన నిజభక్తి గనేనంటే
అరీతి నాఁడేకాని యగపడదు
మేరతో శ్రీవేంకటేశ మించి నీకే శరణంటే
ఆరి తేరి కర్మబంధ మగపడదు

రేకు: 0321-04 బౌళి సం: 04-121 శరణాగతి

పల్లవి: చదివి చదివి వట్టిజాలిఁబడు టింతేకాక
యెదుట నిన్ను గానఁగ నితరులవశమా

చ. 1: ఆకాశముపొడవు ఆకాశమే యెరుఁగు
ఆకడ జలధిలోఁతు ఆ జలధే యెరుఁగు
శ్రీకాంతుఁడ నీ ఘనము చేరి నీవే యెరుఁగుదు-
నీకడ నింతంతన నితరుల వశమా

చ. 2: నదులయిసుకలెల్ల నదులే యెరుఁగును
కదలి గాలియిరవు గాలికే తెలుసు
అదన నాత్మగుణము లంతరాత్మ నీవెరుగు-
దిదియదియనిచెప్ప నితరులవశమా

చ. 3: శ్రీవేంకటేశ యిన్నిచింతలకు మొదలు
యీ నీ శరణంటే యిటు నీవే యెరిగింతు
దైవమా నీ కల్పనలు తగ నీవే యెరుఁగుదు-
వీవల నొఁగాదన నితరుల వశమా

రేకు: 0321-05 శ్రీరాగం సం: 04-122 వైష్ణవ భక్తి

పల్లవి: ప్రత్యక్షమే మాకుఁ బ్రమాణము
సత్యరూప జోలిదవ్వి జాలిఁబడ నోపము

చ. 1: కన్న వారెవ్వరు నిన్ను కన్నుల యెదుటను
పన్ని నీదాసులు చూచే భావమువలె
విన్న వారెవ్వరు నీవిభవపు మాటలు
అన్నిటా నాచార్యుని యానతివలె

చ. 2: తొడఁగి నీ ప్రసాదము దొరకని వారెవ్వరు
జడియు నీ దాసుల ప్రసాదమువలె
కడు నీ పాదతీర్థము కడగన్నవారెవ్వరు
బడిబడి నీ భక్తపాదజలమువలె

చ. 3: యేచి పరంధామమున కేఁగిన వారెవ్వరు
చాచిన నీ దాసుల సన్నిధివలె
చాచితి శ్రీవేంకటేశ సొంపుల నీ మహిమెల్ల
తాచిన నీ దాసానుదాసులయందే

రేకు: 0321-06 దేవగాంధారి సం: 04-123 శరణాగతి

పల్లవి: తెలిసినవారెల్లా దేవునిఁ జేరి బదికి-
రిల నిదెరఁగనిది యేఁటిదోకాక

చ. 1: కరుణానిలయుఁడట కరుణకు వెలితా
వెరవుతో నేఁగొల్వని వెలితి గాక
నరహరి ఇతఁడట నరులఁ గాచుటరుదా
శరణనని వెలితి జనములది గాక

చ. 2: వెస లక్ష్మీపతియట వితరణము లేదా
పసఁదన్నే కోరని మాపాపము గాక
యెసఁగు భక్తవత్సలుఁడింట వెంట నుండఁడా
ససువై మొక్కని వెల్తి జగములది గాక

చ. 3: శ్రీవేంకటేశుఁడచిత్తములో లేఁడా
భావించి నమ్మినది మాభాగ్యముగాక
వావాత నింతటివాఁడు వరములీలేఁడా
వోవలఁ గొలగొనే దేవోటి కింతే కాక

రేకు: 0322-01 నారాయణి సం: 04-124 శరణాగతి

పల్లవి: అన్నిటి పై నున్నట్లు హరిపై నుండదు మతి
కన్నులఁ బ్రహ్మదువలె కనుఁగొను టరుదా

చ. 1: పులుగు నర్చించొకఁడు పూఁచెనాగతమెరిగి
వెలసి ఘనుఁడనంటా విఙ్ఞవీఁగీని
జలజాక్షుపాదములు సారె నర్చించేటివారు
ఇలలోనఁ బరమార్థ మెరుఁగుటయరుదా

చ. 2: మానివోడ నమ్మొకఁడు మహాజలధి దాఁటి
నానార్థములు గూర్చి నటియించీని
శ్రీనాథుపాదములు చేకోనినమ్మినవాఁడు
పూని భవవార్థి దాఁటి పుణ్యమందు టరుదా

చ. 3: దీపమువట్టి యొకఁడు తెగనిచీఁకటిఁ బాసి
చూపులనిన్నిటిఁ గని సుఖమందీని
చేపట్టి పరంజ్యోతి శ్రీవేంకటేశుభక్తుఁ-
డోపి ముక్తి కడగని వున్నతుఁడౌ టరుదా

రేకు: 0322-02 గుండక్రియ సం: 04-125 విష్ణు కీర్తనం

పల్లవి: హరి పరతత్వంబగుటకు గురి యిది
నరుల మితఁడే యని నమ్మితిమిదివో

చ. 1: కవగూడిన భూకాంతుఁ దలఁచిపో
దివి వెలుఁగందిరి దేవతలు
జవమున రఘుపతి శరణని మని రిదె
భువి విభీషణాది పుణ్యులు

చ. 2: శ్రీతరుణీపతి సేవనే చెలఁగిరి
పాతాళాధిపబలిముఖులు
భాతిగా వైకుంఠభక్తినే బ్రదికిరి
ఘాతల ననంత గరుడాదులు

చ. 3: శ్రీవేంకటపతి చింతనే పొదలిరి
సోవ ముక్తిగల శుకాదులు
వావిరి నీతని వరముల వెలసెను
తోవలఁ బరుష సందోహములు

రేకు: 0322-03 లలిత సం: 04-126 శరణాగతి

పల్లవి: కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన
దేవ నీ బంట్లము మా తెరువేఁటి తెరువు

చ. 1: బండుబండై వూరఁగల పనులెల్లాఁ జేసేము
యెండాతా నీడౌతా నెఱఁగము
కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు
బెండువంటి వారము మా బిగు వేఁటిబిగువు

చ. 2: దీనుఁడనై యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము
కాని దెందో మంచి దెందో కానము
శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండఁగాను
మానువంటి వారము మా మనసేటి మనసు

చ. 3: బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా
యెందుకాతా నేడకౌతా నెఱఁగము
యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే
చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత

రేకు: 0322-04 పాడి సం: 04-127 మాయ

పల్లవి: కామధేనువు దేవకల్పితము భువిలోన
వోముచును భోగించ యుక్తివలెఁ గాని

చ. 1: తలఁచినట్లనౌ దైవము వ్రాసిన వ్రాఁత
పలికినట్లనౌ పలుమంత్ర జపములు
నిలిపినట్లనౌ నిర్మల చిత్తము కీలు
నెలవునఁ బనిగొన నేర్పువలెఁ గాని

చ. 2: యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము
కమ్మన్నట్లనౌ ఘనతపముల శక్తి
తెమ్మనినయట్లఁ దెచ్చు ద్రిష్ఠము యక్షిణీవిద్య
చిమ్ములను దనకంత చింతవలెఁగాని

చ. 3: వునిచినట్లనుండు నొక్కడే దేహగుణము
యెనలేని శ్రీవేంకటేశ్వరుమాయ లివి
పెనచిన యిహమేపో బీజము వుద్యోగులకు
తనివి నలమేల్మంగదయ వలెఁగాని

రేకు: 0322-08 శ్రీరాగం సం: 04-128 వైష్ణవ భక్తి

పల్లవి: గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁగాని
యీవల సంసారమైన యిది ధ్రువపట్టమే

చ. 1: తలఁపు లోపల నీవు దగ్గరితేనే చాలు
కలలోని కాపుఁరముఁ గైవల్యమే
బెళకు నాలుకకు నీపేరు వచ్చితేఁజాలు
పలికిన వన్నియు పరమవేదములే

చ. 2: తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు
పడుచుల బొమ్మరిండ్లు బ్రహ్మలోకమే
కడలేని నీభక్తి గలిగితేనే చాలు
కడజన్మమయినా నిక్కపు విప్రకులమే

చ. 3: కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు
పాయపు రతిసుఖము పరతత్త్వమే
యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే

రేకు: 0322-06 సామంతం సం: 04-129 వైరాగ్య చింత

పల్లవి: దినమట రాతిరట తీరుచున్నదా
కవగూడఁ బాయఁ గాక కాణాచి వున్నదా

చ. 1: మానుష జన్మమట మలమూత్రదేహమట
సోనల హేయమేకాక శుద్ధి వున్నదా
మానని కోరికలట మాయల సంసారమట
దీనవృత్తేకాక యిందుఁ దేజమున్నదా

చ. 2: చంచలపుఁ జిత్తమట సకలేంద్రియములట
పొంచిన పాపమేకాక పుణ్యమున్నదా
సంచితపుఁ గర్మమట జనన లయములట
ముంచిన తీదీపేకాక మోదమున్నదా

చ. 3: శ్రీవేంకటేశుఁడట జీవుఁడనేనట యిందు
దైవపుదాస్యమే కా కితరమున్నదా
యీవల నావలన ట యిహముఁ బరమునట
కైవశము లాయఁగాక కడమున్నదా

రేకు: 0323-01 భూపాళం సం: 04-130 మేలుకొలుపులు

పల్లవి: రాతిరెల్ల సతులతో రతుల నలసెనేమో

రీతిగాదు హరి నెచ్చరికె సేయరే

చ. 1: పైపై బొద్దువొడచి పంకజములు విరిసె

గోప గోవిందుని మేలుకొన మనరే

దీపములు దెల్లఁబారె తిమిరమింతయు జారె

శ్రీపురుషోత్తమునిఁ జేయంటి లెమ్మనరే

చ. 2: కలువలు ముకుళించీ కలవింక లెలుగించీ

నెలఁతలు దేవదేవు నిద్ర దెల్పరే

జలనిధి పొంగణగె చాయలచుక్కలు మాసె

వలరాచగురు నుప్పవడము గమ్మనరే

చ. 3: జీవులు మేలుకొనిరి చెంగలించె దరువులు

భావించి యచ్యుతునిట్టె పలికించరే

కావిరింతయు విరిసె కడు సంధ్యకు బొద్దాయ

శ్రీవేంకటేశుని విచ్చేయ మనరే

రేకు: 0323-02 బౌళి సం: 04-131 మాయ

పల్లవి: పుట్టెడి దింతా బూటకంబులే
గట్టిమాయ హరిఁ గానఁగ నీదు

చ. 1: ముక్కున నున్నది ముందటఁ బ్రాణము
యెక్కడ నమ్మేదిఁకఁ దనువు
చుక్కలు మోఁచీఁ జూపులెదుటనే
నెక్కొను మతికిని నిలుకడ యేది

చ. 2: నాలుక నున్నవి నానారుచులును
వేళావేళకు వెరవేది
తోలున నున్నది దొరకొని బ్రతుకిది
కాలంబెటువలెఁ గడపేది

చ. 3: ఆతుమనున్నది యఖిలజ్ఞానము
ఘాతల నెటువలెఁ గనియేది
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
యాతనిఁగొలిచితి మడ్డంబేది

రేకు: 0323-03 సాళంగనాట సం: 04-132 వైష్ణవ భక్తి

పల్లవి: ఉమ్మడికర్మములాల వుండఁ జోటు మీకు లేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివి లేనిచోటికి

చ. 1: పెట్టినది నుదుటను పెరుమాళ్ళ లాంఛనము
దట్టమై భుజములందు దైవశిఖామణిముద్ర
నెట్టన నాలుకమీఁద నీలవర్ణునామమిదె
అట్టె హరిదాసులకంటునా పాపములు

చ. 2: మనసునఁ దలచేది మాధవుని పాదములు
దినముఁ గడుపునించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసిపద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు

చ. 3: సంతతముఁ జేసేది సదాచార్యసేవ
అంతరంగమున శరణాగతులసంగ మిదే
యింతటాను శ్రీవేంకటేశుఁడు మమ్మేలినాఁడు
అంతటా హరిదాసుల నందునా అజ్ఞానము

రేకు: 0323-04 శ్రీరాగం సం: 04-133 విష్ణు కీర్తనం

పల్లవి: ఇలువేల్పితఁడే ఇందరికిని మరి
పలు వేల్పులతో పని యిఁకనేలా

చ. 1: కమలారమణుని కరుణేకాదా
అమరులు గొనియెడి యమృతము
అమితపు శ్రీహరి యాధారముగాదా
నెమకేటి ప్రాణులు నిలిచినభూమి

చ. 2: దనుజాంతకు బొడ్డుతామెర కాదా
జననకారణము సర్వమునకు
మనికై హరిసతి మహిమే కాదా
నినుపై భువిలో నిండినసిరులు

చ. 3: యితనికొడుకు రచనింతాఁగాదా
సతుల పతుల సంసారరతి
గతి శ్రీవేంకటపతిలోకమె పు-
న్నతి వైకుంఠపు నగరపు ముక్తి

రేకు: 0323-05 భవుళి సం: 04-134 మాయ

పల్లవి: పురుషుఁడే యధముఁడు పొంచి యెందు దగులక
పురుషోత్తమునికంటే పుణ్యుఁడవు నపుడే

చ. 1: పురుషజంతువులెల్ల పొంచి యాఁడుజంతువుల
తరవాయి గొని వెంటఁ దగులుఁగాని
ధర నాఁడు జంతువులు తగ పురుషజంతువుల
యిరవు వెదకఁజోవు యిది యెట్టిమాయో

చ. 2: సారెకు నర్థమునకు జనులెల్ల దాసులై
కోరి వెదకుచు దిరుగుదురు గాని
చేరువ యర్థములెల్ల జీవులకు దాసులై
యీరీతి వెదకవు యిది యెట్టిమాయో

చ. 3: లోకమునడవ డిది లోనుగాక యిందుకెల్లా
యేకచిత్తమున నుంటే యెక్కుడుగాని
దాకొని శ్రీవేంకటేశు దాసుఁడైన వానికిని
యేకముగఁ బంపుసేసు నేమిమాయోకాని

రేకు: 0323-06 మలహరిసం: 04-135 వైరాగ్య చింత

పల్లవి: మఱి విచారించఁబోతే మంచముకిందే నూయి
మెఱయఁగ హరిఁ గెల్చి మించరో ప్రజలు

చ. 1: యేల మాను దేహమెప్పటి తనగుణము
యేల మాను మనసెడలేనియాసలు
ఊలు దింటా మలిగండ్లేఱఁగనేల హరి మన-
పాలఁ బెట్టుక కొలచి బ్రతుకరో ప్రజలు

చ. 2: పొమ్మంటేనేలపోవు పూర్వకర్మములు
పొమ్మంటేనేలపోవు పొంచిన యింద్రియములు
కుమ్మరావమునఁ జెంబు కోరి వెదకనేల
పమ్మిని శ్రీపతిఁ గొల్చి బదుకరో ప్రజలు

చ. 3: భోగించకేల పోవుఁ బుట్టిన జన్మఫలము
లోఁగుచుఁ బిండికూరలోన నలుపెంచనేల
వేగిరమేఁటికి శ్రీవేంకటేశుమాయ లివి
బాగుగ నాతనిఁగొల్చి బ్రదుకరో ప్రజలు

రేకు: 0324-01 భవుళి సం: 04-136 శరణాగతి

పల్లవి: కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతి నీవే కావఁగదవయ్యా

చ. 1: పుడమిఁ బుట్టితిమి బుద్ది నెరిఁగితిమి
కడుపే చెరువవుత గానమయ్యా
వొడలు మోఁచితిమి వున్నతిఁ బెరగితిమి
వెడఁ జిల్లులఁ గారేది విడిపించ లేవయ్యా

చ. 2: నిన్న నిద్రించితిమి నేఁడే మేలుకొంటిమి
తిన్న వెల్లఁ దీరినటే తెలియమయ్యా
కన్నులఁ జూచితిమి కమ్మర మూసితిమి
వున్నచే నుండదు మతి పూరట లేదయ్యా

చ. 3: సరిఁ జదివితిమి శాస్త్రముఁ జూచితిమి
గురుఁడే రక్షకుడౌత గురుతౌనయ్యా
నిరతి శ్రీవేంకటేశ నిన్నే నమ్మితిమి
పరదైవములతోడిపని మాకు లేదయ్యా

రేకు: 0324-02 దేశాక్షి సం: 04-137 వైష్ణవ భక్తి, నృసింహ

పల్లవి: ఇందే వున్నది కానమెందో వెదకితిమి
కందర్పగురుభక్తి గంటిమి నే మిదివో

చ. 1: కోటికోటి వేదముల కొన యర్థము
సాటి వేదముల లోని సకలార్థము
సూటిగా గురుఁడు మాకుఁ జూపినర్థము
గాటపు మనసు దవ్వి కనుగొంటి మిదివో

చ. 2: పరమయోగీంద్రులు పట్టీన యర్థము
సురలు మునులు నెంచి చూచి నర్థము
సరి మూఁడులోకములఁ జూటి నర్థము
గరిమ నీదేహమెత్తి కంటిమి మే మిదివో

చ. 3: పలుశరణాగతుల పాలి యర్థము
మలయుచుండేటి తిరుమంత్రార్థము
నిలచి శ్రీవేంకటాద్రి నిండినర్థము
కలసి విజ్ఞానవీధిఁ గనుఁగొంటిమయ్యా

రేకు: 0324-03 ధన్నాసి సం: 04-138 శరణాగతి

పల్లవి: తొల్లిటివారు వెట్టినతోవ యిది
బల్లిదులై యిందునే బదుకుటే మేలు

చ. 1: కలఁడు సర్వేశ్వరుఁడొక్కఁడు దిక్కందరికిని
సులభుఁడు శరణము చొచ్చితేఁ గాచు నతఁడు
బలుతపములు చేసి పాట్లఁ బడ నోప మని
బలువుఁడాతని నమ్మి బ్రదుకుటే మేలు

చ. 2: వున్నాఁడు మనసులోనే వొక్కచో వెదకవద్దు
ఇన్నిటాఁ దలఁచుకొంటే నిచ్చు నిహముఁ బరము
కన్నచోట్ల వెదకి కడు నలయనోపము
పన్నుగ నితనిఁ గొల్చి బ్రదుకుటే మేలు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిలుచున్నవాఁడు
సేవించిన యంతలోనే చేకొని యేలు నీతఁడు
దేవతలఁ బ్రార్థించి తెలియఁగ నేరము
భావించితని నుతించి బ్రదుకుటే మేలు

రేకు: 0324-04 సాళంగనాట సం: 04-139 కృష్ణ

పల్లవి: శ్రావణ బహుళాష్టమి జయంతి నేఁడు
సేవించరో నరులాల శ్రీకృష్ణుఁడితఁడు

చ. 1: భావింప వసుదేవుని పాలిటి భాగ్యదేవత
దేవకి గనినయట్టి దివ్యరత్నము
చేవమీర సురల రక్షించే కల్పతరువు
యీవేళ జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు

చ. 2: హర విరంచాదులకు నాదిమూల కారణము
పరమమునుల తపఃఫల సారము
గరుడోరగేంద్రులకుఁ గలిగిన నిధానము
యిరవుగా నుదయించెనిదె కృష్ణుఁడు

చ. 3: బలుయోగీశ్వరుల బ్రహ్మానందము
చెలఁగు భాగవతుల చింతామణి
అలమేల్మంగకు బతియట్టి శ్రీవేంకటాద్రి-
నిలపై జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు

రేకు: 0324-05 రామక్రియ సం: 04-140 నృసింహ

పల్లవి: వెలసె నహోబలాన విదారణసింహము
సురల నరుల దయజూచీని వీఁడివో

చ. 1: సరి వలకేలను చక్రము పీటఁగాఁ బెట్టీ
గరిమ నొకచేత శంఖము వట్టి
హిరణ్యకలిపుని నిరుచాతులాఁ జించి
అరిదిఁ బేగులు జందేలవే వేసుకొనెను

చ. 2: ఘనమైన కోరలతో కహకహ నవ్వుకొంటా
దనుజు ముంద రొకచేతనుఁ బట్టి
పెనఁగకుండా రొమ్ము పెడచేతుల నడిచి
నినువు వంకరగోళ్ళ నెత్తురు చిమ్మీని

చ. 3: అంతటఁ బ్రహ్లాదుని నటు దయఁజూచి లక్ష్మీ
కాంతఁ దొడపై నిడుక కడు శాంతుఁడై
చింత దీర గరుడాద్రి శ్రీవేంకటాద్రిని
పంతము మెరసి నిల్చి ప్రతాపించీనీ

రేకు: 0324-06 శంకరాభరణం సం: 04-141 హనుమ

పల్లవి: ఆతడా యీతఁడు పెద్దహనుమంతుఁడు
చేతులారా నక్షునిఁ జెండివేసినాఁడట

చ. 1: తొలుత రాముని గాంచి తోడనే సుగ్రీవుని
కొలువఁ బెట్టి యాతనికొమ్మ నిప్పించి
జలనిధి దాఁటి లంక సాధించి చొచ్చి సీతకు-
నలర నుంగర మిచ్చె నతిసాహసమున

చ. 2: సీతాదేవి యానవాలు శ్రీరామునికి నిచ్చి
నీతి విభీషణుని మన్నించఁజేసి
చేతులనే పోట్లాడి చెండివేసి రాక్షసుల
ఘాతల సంజీవికొండ గక్కనఁ దాఁ దెచ్చెను

చ. 3: గక్కన రావణుఁ గొట్టి కాంతను రాముని గూర్చి
అక్కడ నయోధ్యఁ బట్ట మటుగట్టి
నిక్కి కలశాపురిని నిండి శ్రీవేంకటాద్రిని
వుక్కమీరి హరిఁగొల్చి వున్నాఁడు వేడుకల

రేకు: 0325-01 వరాళి సం: 04-142 శరణాగతి

పల్లవి: ఎవ్వరివాఁడాఁగాను యేమందు నిందుకు
నవ్వుచు నాలోని హరి నన్నుఁ గావవే

చ. 1: కోపులరాజులనెల్ల కొలిచి కొన్నాళ్ళు మేను
చూపుడుఁబూఁట వెట్టితి సొగసి నేను
యేపున సంసారమున ఇదిగాక కమ్మటాను
దాపుగ తొర్లుఁబూఁట తగిలించుకొంటిని

చ. 2: మొదలఁ గర్మములకు మోసపోయి యీ బ్రదుకు
కుదువపెట్టితి నే గురి గానక
వెదకి కామునికి విషయములకు నే
అదివో నావయసెల్ల నాహివెట్టితిని

చ. 3: ఇప్పుడే శ్రీవేంకటేశ యీడేర్చి నామనసు
కప్పినగురుఁడు నీకు క్రయమిచ్చెను
వొప్పించి రిందరు బలువుఁడు చేపట్టెనుచు
అప్పులెల్లఁబాసి నీసొమ్మైతినేనయ్యా

రేకు: 0325-02 దేసాళం సం: 04-143 శరణాగతి

పల్లవి: వాసుదేవ నీవు నెలవరివి మగుడునేల
యీసరి నీవద్దనుండే యెట్టైనఁ జేయవయ్యా

చ. 1: మాయదెచ్చి నాబదుకు మనుజలోకాన వేసె
కాయము సంసార వార్ధిగడ్డపై వేసె
పాయపు నాతమకము భామలవలల వేసె
చాయ నేనుండి వచ్చినడ జాడెఱఁగనయ్యా

చ. 2: ఘనమైనయింద్రియాలు కర్మములవాత వేసె
మనసు సంసదయామనిలో వేసె
పనులెల్ల లంపటాల పయిఁ బక్కలా వేసె
కొనకెక్కె నేనె నాగురుతు గాననయ్యా

చ. 3: అంచెల నాదినములు ఆఁకటి బారి వేసె
ముంచిన నాగుణములు మోహములు వేసె
యొంచఁగ శ్రీవేంకటేశ యెందెం దున్నాఁడనో
పొంచి నీకు శరణంటి బోధించవయ్యా

రేకు: 0325-03 బౌళి సం: 04-144 రామ

పల్లవి: నమో నమో దశరథనందన రామ
కమనియ్య యాగభాగకర్త రామ

చ. 1: కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకరగుణోన్నత శ్రీరామ
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ
భీకరతాటకాంతకబిరుద రామ

చ. 2: వారిధిబంధన రామ వాలిహరణ రామ
చారుహరకోదండభంజన రామ
ధారుణీజపతి రామదశకంఠహర రామ
సారవిభీషణాభీషేచన రామ

చ. 3: అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ సర్వజ్ఞ రామ
విమల రామ శ్రీవేంకటగిరి రామ
రమణ శరణాగతరక్షక రామ

రేకు: 0325-04 సాళంగనాట సం: 04-145 హనుమ

పల్లవి: హరికి లంకిణీహంత కంతర మిట్టున్నది
కరుణ నింత మన్నించె కమలావిభుఁడు

చ. 1: విశ్వరూపు చూపినాడు విష్ణుఁడు దొల్లి యట్టె
విశ్వరూపాంజనేయుఁడు వీఁడె చూపెను
శాశ్వతుఁడై యున్నవాఁడు సర్వేశ్వరుఁడు వీఁడే
శాశ్వతుఁడై యున్నవాఁడు జగములో నీతఁడు

చ. 2: ప్రాణవాయుసంబంధి పరమాత్మఁడు అట్టె
ప్రాణవాయుసుతుఁడు పవనజుఁడు
రాణింప రవివంశుఁడు రామచంద్రుడు తాను
నాణెపు రవిసుతుని నమ్మిన ప్రధాని

చ. 3: దేవహితార్థముసేసఁ ద్రివిక్రముఁడు అట్టె
దేవహితార్థమే జలధిలంఘనుఁడు
శ్రీవేంకటేశుఁడు చిన్మయమూర్తి తాను
కోవిదుఁడు జ్ఞానమూర్తి గొప్పహనుమంతుఁడు

రేకు: 0325-05 పాడి సం: 04-146 నృసింహ

పల్లవి: సుగ్రీవ నారసింహుని జూడరో వాఁడె
అగ్రపూజ గొన్నవాఁడు ఆది సింహము

చ. 1: దేవతలు జయవెట్టి దివినుండి పొగడఁగ
దేవులతోఁ గూడున్నాఁడు దివ్య సింహము
భావింప నెట్టనెదుట ప్రహ్లాదుఁడుండఁగాను
వేవేలు నవ్వులు నవ్వీ విజయ సింహము

చ. 2: అసురలను గెలిచి అదె సింహాసనముపై
వెసఁగొలువున్నాడు వీర సింహము
పసిడివర్ణముతోడ బహుదివ్యాయుధాలతో
దెసల వెలుగొందీని ధీర సింహము

చ. 3: నానాభరణాలు వెట్టి నమ్మినదాసులనెల్ల
ఆనుకొని రక్షించీఁ బ్రత్యక్ష సింహము
పూని శ్రీవేంకటాద్రిని బుధులెల్లాఁ గొలువఁగా
నానావరము లొసఁగీ మానవ సింహము

రేకు: 0325-06 శ్రీరాగం సం: 04-147 రామ

పల్లవి: రామచంద్రుఁ డితఁడు రఘు వీరుఁడు
కామిత ఫలము లియ్యఁ గలెగె నిందరికి

చ. 1: గౌతము భార్య పాలిటి కామధేనువు వితఁడు
ఘాతలఁ గౌశికు పాలి కల్పవృక్షము
సీతాదేవి పాలిటి చింతామణీతఁడు
యీతఁడు దాసుల పాలి యిహ పర దైవము

చ. 2: పరగ సుగ్రీవు పాలి పరమ బంధుఁడీతఁడు
సరి హనుమంతు పాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము
గరిమ జనకు పాలి ఘన పారిజతము

చ. 3: తలఁప శబరి పాలి తత్వపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలఁడన్నవారి పాలి కన్ను లెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటేద్రి విభుఁడీతడు

రేకు: 0326-01 గుండుక్రియ సం: 04-148 మాయ

పల్లవి: కైకొంటే కాక కమలనాభునియాజ్ఞ
పైకొని ఇన్నిటాను బాసివుండ ఇనేది

చ. 1: హరినిర్మితములే అఖిలప్రపంచము
తొరలి యేమిటి నిందు దూషించేది
ధరణిధరునికి దాసులే జీవులెల్లా
గరిమ నెవ్వరి నిందుఁ గాదనేది

చ. 2: వాసుదేవు కల్పితమే వరసంసార బంధము
దోసమంటా యెందెందు దొలఁగేది
శ్రీసతీశు రచనలే చేకొన్న రుచులెల్ల
యీసుతోడ నిందుమీఁద నెట్టురోసేది

చ. 3: గోవిందుమాయలే కూడినట్టి పనులెల్ల
వేవేలై యిందునెట్టు వేసరేది
శ్రీవేంకటేశుఁడే చిత్తములో ధ్యానమెల్లా
పావనమైతిమి యిఁక బరచింత యేది

రేకు: 0326-02 లలిత సం: 04-149 విష్ణు కీర్తనం

పల్లవి: విష్ణుదేవు పాదములే విద్యాబుద్ధీ మాకు
వైష్ణవులమైతి మింక వదలవో కర్మమా

చ. 1: గోవిందుని పాదములే కోరి యిహపరములు
శ్రీవిభుని పాదములే చేరు వేదశాస్త్రములు
దేవదేవు పాదములే దిక్కును దెసయు మాకు
భావములో నిలిపితిఁ బాయరో పాపములు

చ. 2: హరి పాదములే మాకు నన్నపాన భోగములు
పరమాత్ము పాదములే పాఁడీ బంటా మాకు
మురహరు పాదములే ముందరవెనకా మాకు
శరణంటి మెండైనాఁ జనరో దుఃఖములు

చ. 3: అనంతుని పాదములే ఆయుష్య భౌష్యములు
దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు
యెనలేని శ్రీవేంకటేశుడితని పాదాలే
మనసున గొలిచితి మానరో భవములు

రేకు: 0326-03 దేశాక్షి సం: 04-150 గురు వందన, నృసింహ

పల్లవి: ఇందుకేది వుపాయ మోయీశ్వర నీకే తెలుసు
మందలించ నశక్తుఁడ మరి నీదాసుఁడను

చ. 1: ధీరుఁడనై ధరలోన దేహము నే మోచితి
కోరి పుణ్యపాపాలకు గురియు నైతి
వూరట యేమిటా లేదు వోపనని మానరాదు
తీరదు భోగించక దినదినకర్మము

చ. 2: గరిమ సంసారినైతి కంటిఁ బెక్కుసుతులను
యిరవుగఁ గట్టుకొంటి నీలంపటాలు
వెర వేమీ నెరఁగను విడువ వెంతైనాను
హరిహరి రాచినా సమయపు బలుకాంక్షలు

చ. 3: అట్టె గురుముఖమైతి నాతుమలో నినుఁ గంటి
జట్టిగొని నీపాదాలే శరణంటిని
గట్టిగా నలమేల్మంగకాంతుఁడ శ్రీవేంకటేశ
యిట్టె నిన్నెరఁగలేని దిన్నాళ్ళు నానేరమి

రేకు: 0326-04 ధన్నాసి సం: 04-151 వేంకటగానం

పల్లవి: దేవుదేవుఁ డితడే దివ్యమూరితి
యేవలఁ జూచినఁ దానే యీరూపై వున్నాఁడు

చ. 1: వేంకటాచలము మీఁది విశ్వరూప విశేషము
అంకెల ననంతావతారాలైన విశేషము
లంకె సింగారాది సర్వాలంకార విశేషము
యింకనిమహిమలతో నీరూపై వున్నాఁడు

చ. 2: అందరిలో నంతర్యామియైన విశేషము
కందర్పుఁబుట్టించిన ఘన విశేషము
ముందు జగముసృష్టించి మూలమైన విశేషము
యిందరితోఁ గూడుకొని యీరూపై వున్నాఁడు

చ. 3: పరము యోగీంద్రులెల్ల భావించిన విశేషము
అరుదైన వేదవేదాంతార్థ విశేషము
పరగ నలమేల్మంగపతియై శ్రీవేంకటేశుఁ-
డిరవై దాసులఁ గావ నీరూపై వున్నాఁడు

రేకు: 0326-05 వరాళి సం: 04-152 వేంకటగానం

పల్లవి: మఱి తను భోగములు మాయా విలాసములు
యెఱిఁగి నట్లనుండు మఱపించుఁ దలఁపు

చ. 1: అనిశము నీకొలువు అది యొకటే నిజము
నినుఁదలఁచుటొకటే నిజము
పనివడి నీదాసుఁడై బ్రదుకుటొకటే నిజ-
మొనర నిన్ను నుతించేదొక్కటే నిజము

చ. 2: పరగ నీమీఁదఁజేయు భక్తియే నిలిచినది
నిరతపువైరాగ్యమే నిలిచినది
శరణని నీకుమొక్కే జ్ఞానమే నిలిచినది
అరసి నిన్నుఁబూజించినదే నిలిచినది

చ. 3: చదివి నిన్ను వెదకి సాధించుటే ఫలము
అదన నీకృపాపాత్రుఁడౌటే ఫలము
యెదుట నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
యెదలోన నీధ్యాన మిన్నిటికి ఫలము

రేకు: 0326-06 సామంతం సం: 04-153 వేంకటగానం

పల్లవి: ఏది మాకు గతియిక నీశ్వరేశ్వరా
యీదెస మము గరుణ నీడేర్చవయ్యా

చ. 1: పొంచిమున్ను భోగించిన భోగములు దలఁచి
అంచెల నాలుబిడ్డల నటు దలఁచి
కంచపుటాహారములు కన్నవెల్లాను దలఁచి
యెంచి నిన్నుఁ దలఁచక యిట్లున్నారమయ్యా

చ. 2: కన్నులఁజూచినందెల్లా కడునాసలఁ దగిలి
విన్న వినుకులకెల్లా వేడ్కఁదగిలి
పన్నిన సుఖములకుఁ బైకొని వెనుతగిలి
వున్నతి నిన్నుఁ దగులుకున్నారమయ్యా

చ. 3: చెంది గృహారామ క్షేత్రములు మరిగి
పొందగు సంసారమిప్పుడు మరిగి
అందపు శ్రీ వేంకటేశ అలమేల్మంగపతివి
కందువ మరిగీ మరుగకున్నారమయ్యా

రేకు: 0327-01 దేశాక్షి సం: 04-154 అధ్యాత్మ

పల్లవి: ఇన్నిటికి మూలము యెప్పుడు నీవే
పన్ని మామీఁద నేరాలు పచరించకువయ్యా

చ. 1: కోటానఁగోటులు మదిఁ గోరికలు
చీటికి మాటికి నివే చిగిరించీని
వాటమై యెవ్వరికిని వసముగావు
పాటించి వీటిని వొప్పనగొనవయ్యా

చ. 2: లక్షోపలక్షలు కర్మలంపటములు
అక్షయపు తీగెలై అల్లుకొనీని
వీక్షించ నెన్నేఁ గలవు వింతవింతలు
రక్షించ నిన్నిటికి భారము నీదేయయ్యా

చ. 3: నానాముఖములు పుణ్యములెల్లాను
తానక భోగములై తగిలించీని
మానుపరా దలమేలుమంగపతివి
శ్రీనాథ శ్రీవేంకటేశ చిత్తగించవయ్యా

రేకు: 0327-02 మాళవి సం: 04-155 హనుమ

పల్లవి: అందరికి నెక్కుడైన హనుమంతుఁడు
అందుకొనె సూర్యుఫలమని హనుమంతుఁడు

చ. 1: బల్లిదుఁడై లంక చొచ్చి బలురాకాసులఁ గొట్టి
హల్ల కల్లోలముచేసె హనుమంతుఁడు
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీతకిచ్చె
అల్లదె నిలుచున్నాఁడు హనుమంతుఁడు

చ. 2: దాకొని యాకె ముందర తన గుఱుతెరుఁగించి
ఆకారమటు చూపె హనుమంతుఁడు
చేకొని శిరోమణి చేతఁబట్టి జలనిధి
ఆకసాన దాఁటివచ్చె హనుమంతుఁడు

చ. 3: కొంకకిట్టె సంజీవికొండ దెచ్చి రిపులకు
నంకకాఁడై నిలిచెను హనుమంతుఁడు
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాఁడు
అంకెఁగలశాపుర హనుమంతుఁడు

రేకు: 0327-03 పాడి సం: 04-156 రామ

పల్లవి: రామా దశరథరామా నిజ సత్య-
కామా నమో నమో కాకుత్థ్సరామ

చ. 1: కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమ పురుష సీతాపతిరామ
శరధి బంధన రామ సవన రక్షక రామ
గురుతర రవివంశ కోదండ రామ

చ. 2: దనుజహరణ రామ దశరథసుత రామ
వినుతామర స్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణరామ
అనిలజప్రియ రామ అయోధ్యరామ

చ. 3: సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుషరావణభయంకర రామ
విలసితరఘురామ వేదగోచర రామ
కలితప్రతాప శ్రీవేంకటగిరిరామ

రేకు: 0327-04 ముఖారి సం: 04-157 నృసింహ

పల్లవి: సేవించరో జనులాల చిత్తజగురుఁ డీతఁడు
కేవలదయానిధి సుగ్రీవనారసింహుఁడు

చ. 1: వేయిచేతులతోడ వెన్నెలనవ్వులతోడ
చాయలు దేరేటి శంఖచక్రాలతోడ
అయితమై వున్నవాఁడు అదె సింహాసనముపై
శ్రీయుతుఁడై యెదుట సుగ్రీవనారసింహుఁడు

చ. 2: కుంకుమగోళ్ల తోడ కోరదౌడలతోడ
అంకెలరవిచంద్రనయనములతో
తెంకి నసురలఁ గొట్టి దేవతలకందరికి
కింకలెల్లాఁ బాపెను సుగ్రీవనారసింహుఁడు

చ. 3: బిరుదు పెండేలతోడ పీతాంబరముతోడ
సరిఁ గిరీటాదిభూషణములతో
సిరులకెల్లా నెలవై చెలఁగి శ్రీవేంకటాద్రి-
గిరిమీఁద వెలసెను సుగ్రీవనారసింహుఁడు

రేకు: 0327-05 నాట సం: 04-158 హనుమ

పల్లవి: ఎక్కుడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నావాఁడు
పిక్కటిల్లి సంతోసానఁ బెద్దహనుమంతుఁడు

చ. 1: తూరుపుఁ బడుమరాను దొడ్డగా జంగ చాఁచి
సారెకుఁ నర్కునివద్దఁ జదివీ వాఁడే
ధీరతతోఁ దనమేను దిక్కులెల్లాఁ బిక్కటిల్ల
బీరముచూపీ వాఁడె పెద్దహనుమంతుఁడు

చ. 2: మిన్ను నేల నేకముగా మించినవాల మెత్తి
సన్నుతిగా వలకేల చాఁచినవాఁడు
పన్నుగడై రాఘవునిబంట్లలోపలనెల్లా
పెన్నిధియై యున్నవాఁడు పెద్దహనుమంతుఁడు

చ. 3: మరిగి రేయుఁబగలు మతంగపర్వతమాడ
బిరుదులతోడను బెరసీ వాఁడే
యిరవై శ్రీవేంకటేశుహితుఁడై యెప్పుడుఁ బెచ్చు-
పెరుగుచు నున్నవాఁడు పెద్దహనుమంతుఁడు

రేకు: 0327-06 బౌళి సం: 04-159 రామ

పల్లవి: ఇతఁడు తారకబ్రహ్మ మీతఁడు సర్వేశ్వరుడు
రతికెక్కఁ గొలిచిన రక్షించు నితఁడు

చ. 1: తరణివంశజుడై తాటకను హరియించి
అరుదుగ విశ్వామిత్రుయాగము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లియాడి
పరశురాముని నిజబలిమి చేకొనెను

చ. 2: మునులకభయమిచ్చి మొగి నసురలఁ ద్రుంచి
ఘనమైన మాయామృగముఁ జంపి
కినిసి వాలిఁ గొట్టి సుగ్రీవునిఁ బట్టముగట్టి
వనధి బంధించి లంక వడిఁ జుట్టుముట్టెను

చ. 3: బలురావణునిఁ జంపి పుష్పకముపైఁ దాఁ జేకొని
లలి విభీషణునకు లంక ఇచ్చి
చెలఁగి యయోధ్య యేలి శ్రీవేంకటాద్రిమీఁద
వెలయ రాముఁడు దానై విశ్వమెల్లా నేలెను

రేకు: 0328-01 రామక్రియ సం: 04-160 కృష్ణ

పల్లవి: అడర శ్రావణబహుళాష్టమి నేఁ డితఁడు
నడురేయి జనియించినాఁడు చూడఁగదరే

చ. 1: గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు
పంతపుపాండవులకు బావమరఁది
వంతుతో వసుదేవదేవకులకుమారుఁడు
ఇంతటికృష్ణుఁడు జనియించినాఁడుగదరే

చ. 2: బలరామునితమ్ముఁడు పంచసాయకునితండ్రి
మలసి మేటైనయభిమన్యునిమామ
లలి సాత్యకిసుభద్రలకుఁ దోఁబుట్టినయన్న
ఇలపైఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే

చ. 3: సూరసేనుమనుమఁ డచ్చుగ ననిరుద్ధుతాత
పౌరవయాదవలోకబాంధవుఁడు
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్మంగకుఁ బతి
యీరీతిఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే

రేకు: 0328-02 లలిత సం: 04-161 కృష్ణ

పల్లవి: చూడవమ్మ కృష్ణుఁడు నీ సుతుఁడోయమ్మ
ఆడీ వీధుల వెంట యశోదమ్మా

చ. 1: కోలలు చాఁచీ వుట్లు గొట్టఁగా బాలుఁ బెరుగు
కాలువలు గట్టి పారెఁ గదవమ్మా
మేలములాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మ యశోదమ్మా

చ. 2: చక్కిలాల కుండలెల్లా చలాన దొండ్లు వొడిచి
దిక్కన దోఁటికోలలఁ దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాత వేసితే
అక్కడ జోరునఁ గారె యశోదమ్మా

చ. 3: అల్లంత నుండి తన కందరాని తెంకాయలు
వల్లె తాళ్ళు వేసి వంచీనమ్మా
బల్లిదుఁడలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అల్లిబిల్లై యున్నాఁడమ్మ యశోదమ్మా

రేకు: 0328-03 గౌళ సం: 04-162 నృసింహ

పల్లవి: ఎంచి చూచితే నితని కెవ్వ రెదురు
కొంచ(డేమిటికి వీ(డె ఘోర నారసింహు(డు

చ. 1: గక్కన నహోబలాన కంబములోన వెడలి
వుక్కుమీరి హిరణ్యుని నొడిసిపట్టి
చెక్కలువార గోళ్ల(జించి చెండాడినయట్టి-
వెక్కసీ(డు వీ(డివో వీర నారసింహు(డు

చ. 2: భవనాసి యేటిదండ(బాదుకొని కూచుండి
జవళి దైత్యుపేగులు జందేలు వేసి
భువియుదివియు నొక్కపాడవుతో నిండుకొని
తివురుచున్నా(డు వీ(డె దివ్య నారసింహు(డు

చ. 3: కదిసి శ్రీసతి గూడి గద్దెమీ(ద(గూచుండి
యెదుట(బ్రహ్లాదు(డు చేయెత్తి మొక్క(గా
అదన శ్రీవేంకటాద్రి నందరికి వరాలిచ్చి
సదరమైనా(డు వీ(డె శాంత నారసింహు(డు

రేకు: 0328-04 ధన్నాసి సం: 04-163 నృసింహ

పల్లవి: కొలువైతా నల్లవాఁడె కూచున్నాఁడు గద్దెమీఁద
బలవంతుఁ డితఁడు ప్రహ్లాదవరదుఁడు

చ. 1: చిడుముడిగోళ్లతోడ సింహపుమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
కడలేనినవ్వుతోడ కదురాజసముతోడ
అడరించీఁ బంతము ప్రహ్లాదవరదుఁడు

చ. 2: సంకుఁజక్రములతోడ చాయలమేనితోడ
సంకెదేర్చేయభయహస్తముతోడ
బింకపుమీసాలతోడ పెనువదనముతోడ
అంకె వరములిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 3: వనితకౌఁగిటతోడ వామకరముతోడ
నసుపైన తమలోనానందముతోడ
యెనయుచు శ్రీవేంకటేశుఁడై యీడా నాడా
అనిశము వెలసెఁ బ్రహ్లాదవరదుఁడు

రేకు: 0328-05 లలిత సం: 04-164 నృసింహ

పల్లవి: జూటుఁదనాలవాఁడవు సుగ్రీవనారసింహ
పాటించి నిన్ను నేము పంగించేవారమా

చ. 1: మొగము సింహపురూపు మొగి మై మానిసిరూపు
జిగిఁ దొడమీఁదట శ్రీమహాలక్ష్మి
తగు నీకు నిటువంటి తగవులెల్లాఁ జెల్లు
యెగ సక్కేలాడ మాకు నేలయ్య నిన్నును

చ. 2: కట్టినది పైఁడికాశ కంబములోన వునికి
నెట్టుకొన్ననవ్వులు నీలోనివే
యిట్టివల్లా నీకమరు యెన్నిలేవు నీచేఁతలు
అట్టిట్టని నిన్ను మాకు నడుగనేమిటికి

చ. 3: అమరుల కేలికవు అసురలకు వైరవి
రమణఁ బ్రహ్లాదునకు రక్షకుఁడవు
కొమరై శ్రీవేంకటాద్రిఁ గొత్తలు నీగుణములు
సముకానఁ బలుమారు సంతోసించే మిఁకను

రేకు: 0328-06 లలిత సం: 04-165 వేంకటగానం

పల్లవి: మతంగపర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీవేంకటేశ్వరుడున్నవాఁడు

చ. 1: కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి
తలచిఁనవారినెల్లా ధన్యులఁజేసి
పొలుపుమిగుల మంచిపువ్వుల తోఁటలనీడ
విలసిల్లీనదివో శ్రీవేంకటేశ్వరుఁడు

చ. 2: శరణన్నవారికి చనవిచ్చి రక్షించి
గరిమఁ బూజించువారిఁ గరుణఁ జూచి
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు
విరివిగొన్నాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు

చ. 3: తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి
కని నుతించేవారికిఁ గామధేనువై
కనకమయములైన ఘనమైనమేడలలో
వినుతికెక్కెను శ్రీవేంకటేశ్వరుఁడు

రేకు: 0329-01 రామక్రియ సం: 04-166 జానపదము

పల్లవి: లెండో లెండో మాటాలించరో మీరు
కొండలరాయనినే పేర్కొన్న దిదె జాలి

చ. 1: మితిమీరెఁ జీకట్లు మేటితలవరులాల
జతనము జతనము జాలో జాలి
యితవరులాల వాయించే వాద్యాలకంటె-
నతిఘోషములతోడ ననరో జాలి

చ. 2: గాములువారెడిపొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమనపు పారివార దీవెపంజులు చేఁబట్టి
యేమరక వమీలో మీరు యియ్యరో జాలి

చ. 3: కారుకమ్మె నడురేయి గడచెఁ గట్టికవార
సారెసారెఁ బలుకరో జాలో జాలి
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టె మేలుకొన్నాఁడు
గారవాన నిఁక మానఁ గదరో జాలి

రేకు: 0329-02 వరాళి సం: 04-167 హనుమ

పల్లవి: పదియారు వన్నెల బంగారుకాంతుల తోడ
పొదలిన కలశాపుర హనుమంతుఁడు

చ. 1: యెడమచేతఁ బట్టె నిదివో పండ్లగొల
కుడిచేత రాకాసిగుంపుల గొట్టె
తొడిఁబడ నూరుపులతోఁ దూరుపుమొగమైనాఁడు
పొడవైన కలశాపుర హనుమంతుఁడు

చ. 2: తొక్కి యక్షకుమారునిఁ దుంచి యడగాళ సంది
నిక్కించెను తోఁక యెత్తి నింగి మోవను
చుక్కలు మోవఁ బెరిగి సుతు వద్ద వేదాలు
పుక్కిటఁ బెట్టెఁ గలశాపుర హనుమంతుఁడు

చ. 3: గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో
పట్టపు శ్రీవేంకటేశుబంటు తానాయ
అట్టె వాయువుకును అంజనిదేవికిని
పుట్టినాడు కలశాపుర హనుమంతుఁడు

రేకు: 0329-03 శ్రీరాగం సం: 04-168 ఇతర దేవతలు

పల్లవి: నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకు మరి యిన్నిటాఁ బ్రసన్నుడు

చ. 1: కమలావరుడు శ్రీకర మదనగురుఁడు
సమర దానవకుల సంహారుఁడు
విమల గుణాకరుఁడు విజయచక్రధరుఁడు
కమనియ్య భక్తజన కరుణాకరుఁడు

చ. 2: వేదాంతవేద్యుఁడు విశ్వహితాపాద్యుఁడు
ఆదియునంత్యములేని యనవద్యుఁడు
సాదితయోగిహృద్యుఁడు శమితోగ్రచైద్యుఁడు
సోదించి చూచితేను సురలకు నాద్యుఁడు

చ. 3: కామితఫల శక్తుఁడు ఘనమహిమ యుక్తుఁడు
ఆముకొన్న లోకరక్షణ సక్తుఁడు
నేమాన శ్రీవేంకటాద్రి నిలిచి మమ్మేలినాఁడు
కోమలుఁడు వీఁడిగో గోపకాస రక్తుఁడు

రేకు: 0329-04 పాడి సం: 04-169 రామ

పల్లవి: రాముఁడు రాఘవుఁడు రవికులుఁ డితఁడు
భూమిజకుఁ బతియైన పురుషనిధానము

చ. 1: అరయఁ బుత్రకామేష్టియందుఁ బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము
సురల రక్షింపఁగ నసురల శిక్షింపఁగ
తిరమై యుదయించిన దివ్యతేజము

చ. 2: చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మనులెల్ల వెదకి కనేయట్టి-
కాంతులఁ జెన్నుమీరిన కైవల్యపదము

చ. 3: వేదవేదాంతములందు విజ్ఞానశాస్త్రములందు
పాదుకొనఁ బలికేటి పరమార్థము
పోదితో శ్రీవేంకటాద్రిఁ బొంచి విజనగరాన
ఆదికి నవాదియైన అర్చావతారము

రేకు: 0329-05 కన్నడగౌళ సం: 04-170 రామ

పల్లవి: శరణు శరణు దేవ సర్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యనందన

చ. 1: వారిధిబంధన రావణ శిరశ్ఛేదక
మారీచను బాహుబలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజ సంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ

చ. 2: సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనానాయక
వివిధ సప్తతాల విధ్వంసన చతుర
భువనేశ సాకేతపురవాస రామ

చ. 3: హరచాపహర అహల్యాశాప విమోచక
ఖరశర వాలినిగ్రహ బిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్తరక్షక
ధరణిజా సమేత దశరథరామా

రేకు: 0329-06 శంకరాభరణం సం: 04-171 ఇతర దేవతలు

పల్లవి: వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా

చ. 1: పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాల వయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయలెల్లా యివె విఠలేశ్వరా

చ. 2: వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విఠలేశ్వరా
చన్ను దాగి రాకాసిపీఁచము హరించితివి
యెన్నికకెక్కె నీబిరు దిటు విఠలేశ్వరా

చ. 3: గొల్లెతలఁగూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విఠలేశ్వరా
బల్లిదవు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా

రేకు: 0330-01 దేవక్రియసం: 04-172 కృష్ణ

పల్లవి: విచ్చనవిడినీ యాడీ వీఁడె కృష్ణుఁడు
వొొచ్చములేనివాఁడు వుద్దగిరికృష్ణుఁడు

చ. 1: గల్లుగల్లుమనఁగాను గజ్జలు నందెలతోడ
బిల్లఁగోట్లాడీని పిన్నకృష్ణుఁడు
కెల్లురేఁగి వీధులనుఁ గేరి పుట్టచెండులాడీ
బల్లిదుఁడు గదవమ్మ బాలకృష్ణుఁడు

చ. 2: తమితోడ గోపాలులు తానుఁ గూడి ముంగిటను
సముద్రబిల్లలాడీ సాధుకృష్ణుఁడు
చెమటలుగార సిరసింగనవత్తి యాడీ
గుమితాన వీఁడే యమ్మా గోపాలకృష్ణుఁడు

చ. 3: వుదుటునఁ బారి పారి వుడ్డగచ్చకాయలాడీ
ముదముదొొలఁకఁగాను ముద్దుకృష్ణుఁడు
అదివో శ్రీవేంకటేశుఁ డాటలెల్లాఁ దానే యాడీ
పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుఁడు

రేకు: 0330-02 మేఘరంజి సం: 04-173 శరణాగతి

పల్లవి: వట్టిజాలిఁ బడవలదిఁకను
గట్టి విచారముగల వారికిని

చ. 1: దేవుఁడు సులభుఁడు తెలియఁగనేర్చిన
వేవేలు లాభము విరతి
భావించు జ్ఞానమె పాదైన సౌఖ్యము
తావగు శాంతమె ధనధాన్యములు

చ. 2: గురుఁడె సాధనము కోరి వెదకినను
పరగు నాచారమె బ్రదుకెల్లా
శరణాగతియె సామ్రాజ్యపదవి
ధర జితేంద్రియత్వమె వైభవము

చ. 3: తననిజభ క్తియె దండయు దాపును
మనసు నిలుపుటే మరి శుభము
యెనయఁగ శ్రీవేంకటేశుమహిమ లివి
కని మని యండుటె ఘనవివేకము

రేకు: 0330-03 కురంజి సం: 04-174 భక్తి

పల్లవి: చేపట్టుఁ గుంచము శ్రీవిభుఁడు
వై పెరిఁగి పొగడవలెఁ గాక

చ. 1: మనసులోనిహరి మరవక తలఁచిన
యెనయ నిహపరము లేమరుదు
పెనగొన నాతనిపేరు నుడిగినను
తనకు మహానందము లేమరుదు

చ. 2: పుట్టించినాతని పొసఁగఁగ గొలిచిన
యిట్టె వివేకం బేమరుదు
చుట్టి యతనిదాసులకుమొక్కినను
పుట్టగు గెలుచుట భువి నేమరుదు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జేరి భజించిన
యేవేళ సాత్త్విక మేమరుదు
భావించి యాతనిపై భక్తి నిలిపినను
కైవశముగఁ దనుఁ గను టేమరుదు

రేకు: 0330-04 జౌళిరామక్రియ సం: 04-175 నృసింహ

పల్లవి: ఎంత పరాక్రమము యీసింహము
చెంతనే దివిజులు సేవించేరు

చ. 1: కొండమీఁదఁ గూచుండి దైత్యుమై
చెండివేసె నీ సింహము
నిండునగవుతో నెలఁత దనతొడపై
నుండఁగ నెరసీ నుదుటుఁదనమున

చ. 2: తటుకనఁ బ్రహ్లాదుఘటనచేఁ గంభము
చిటిలి వెడలె నీ సింహము
చటులకరంబులఁ గుటిలదానవుని
బటుగతిఁ బట్టెను పశుబంధముగా

చ. 3: పగయెల్ల నడఁచి జగములేలుచును
జిగిమించిన నరసింహము
నిగిడి శ్రీవేంకటనిధి యహోబలము
తగు నివాసముగఁ దనరీ నిదివో

రేకు: 0330-05 నాదరామక్రియ సం: 04-176 దేవుడు-జీవుడు

పల్లవి: కొసరనేల నాగుణము లివి
రసికత నీవిన్నిటా రక్షించుకొనుమీ

చ. 1: నేరమి నాది నేరుపు నీదే
దూరు నాది బంధుఁడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమీ

చ. 2: నేను యాచకుఁడ నీవేదాతవు
దీనుఁడ నేఁ బరదేవుఁడవు
జ్ఞానరహితుఁడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిఁక నను(జేరి కావుమీ

చ. 3: అరయ నే జీవుఁడ నంతర్యామివి
యిరవుగ దాసుఁడ నేలికవు
చిరజీవిని నే శ్రీవేంకటపతివి
వరదుఁడ ననుఁ జేవదలకుమీ

రేకు: 0330-06 హిందోళవసంతం సం: 04-177 వేంకటగానం

పల్లవి: ఎన్నిమహిమలవాఁడె యీదేవుఁడు
కన్నులపండువులెల్లాఁ గదిసినట్టుండెను

చ. 1: పోలింప కర్ప్పూరకాపు పురుషోత్తమునికి
యేలీల నుండెనని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవళింపగా మేన
మేలిమిమీఁగఁడంటిన మెలుపుతో నుండెను

చ. 2: తట్టుపునుఁగు కాపు దైవశిఖామణికి
యెట్టుండెనని మరి నెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టె రాత్రులు మేననంటి నట్టుండెను

చ. 3: అలమేలుమంగతోడ నట్టె సొమ్ము ధరించఁగ
యెలమి శ్రీవేంకటేశునెంచి చూచితే
కలిమిగలయీకాంతకాఁగిటఁ బెనఁగఁగాను
నిలువెల్లా సిరులై నిండినట్టుండెను

రేకు: 0331-01 ఆందోళి సం: 04-178 తేరు

పల్లవి: కన్నులపండుగలాయఁ గన్నవారి కిందరికి
వెన్నుఁడేఁగీ నిల్లిదివో వీధుల వీధులను

చ. 1: అదె యెక్కెఁ దిరుతేరు అసురలు బెదరఁగ
త్రిదశులు చెలఁగఁగ దేవదేవుఁడు
కదలె బండికండ్లు ఘనమైన మ్రోఁతతోడ
వెదచల్లుఁ గాంతులతో వీధుల వీధులను

చ. 2: తోలి యాడీఁ దిరుతేరు దుష్టులెల్ల నణఁగఁగ
చాలుకొని శిష్టులెల్ల జయవెట్టఁగ
గాలికిఁ బడగలెల్లాఁ గడు నల్లాడఁగఁ జొచ్చె
వేలేటి పువుదండలతో వీధుల వీధులను

చ. 3: తాపు చేరెఁ దిరుతేరు ధర్మములు నిలువఁగ
యీవల నలమేల్మంగ ఇచ్చగించఁగా
శ్రీవేంకటేశ్వరుఁడు శింగారాలు మెరసెను
వేవేలు విధముల వీధుల వీధులను

రేకు: 0331-02 భల్లాటి సం: 04-179 కృష్ణ

పల్లవి: జగతిలో మనకెల్ల జయంతి నేఁడు
పగటున నందరికి పండుగ నేఁడు

చ. 1: అదివో శ్రావణ బహుళాష్టమి నేఁడు
పొదిగొన్న రోహిణి సంపూర్ణము నేఁడు
కదిసి యర్ధమరేత్రికాడ నేఁడు
ఉదయించెఁ గృష్ణుఁడు చంద్రోదయాన నేఁడు

చ. 2: వసుదేవదేవకుల వరము నేఁడు
పసగా ఫలియించె రేపల్లెలో నేఁడు
కొసరి యశోదనందగోపుఁడు నేఁడు - యీ
సిసువును సుతుఁడంటాఁ జెలఁగిరి నేఁడు

చ. 3: హరిమాయ కంసుమద మడఁచె నేఁడు
పొరుగిరుగులవా రుప్పొంగిరి నేఁడు
సిరి నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడై నిల్చె
అరుదుగా గొల్లెతలు ఆడుకొనేరు నేఁడు

రేకు: 0331-03 ఆహిరి సం: 04-180 కృష్ణ

పల్లవి: కొలిచితే రక్షించే గోవిందుఁడితఁడు
యిలకు లక్ష్మికి మగఁడీ గోవిందుఁడితఁడు

చ. 1: గోవర్ధనమెత్తినట్టి గోవిందుఁడితఁడు
వేవేలుగొల్లెతల గోవిందుఁడితఁడు
కోవిదుఁడై ఆలఁగాచే గోవిందుఁడితఁడు
ఆవలఁగంసుఁజంపిన ఆగోవిందుఁడితఁడు

చ. 2: క్రూరకాళింగమర్దన గోవిందుఁడితఁడు
వీరచక్రాయుధపు గోవిందుఁ డితఁడు
కోరి సముద్రాలు దాఁటే గోవిందుఁడితఁడు
ఆరీతి బాలురఁ దెచ్చేయా గోవిందుఁడితఁడు

చ. 3: కుందనపుకాశతోడి గోవిందుఁడితఁడు
విందుల రేపల్లె గోవిందుఁడితఁడు
పొంది శ్రీవేంకటాద్రిపై పొసఁగఁ దిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుఁడితఁడు

రేకు: 0331-04 కాశి సం: 04-181 వేంకటగానం

పల్లవి: కొండంతపొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు

చ. 1: పాతాళవాసులైన బలురక్కసుల మీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధిచొచ్చినట్టి దానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున

చ. 2: ఆకాశము దూరినట్టి యదటు దైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి

చ. 3: ధరమీఁదఁ గలిగిన దనుజకోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పారఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరముకొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి

రేకు: 0331-05 వరాళి సం: 04-182 నృసింహ

పల్లవి: నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె
నవమైన శ్రీకదిరి నరసింహము

చ. 1: నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె
నగుచున్న జ్వాలానరసింహము
నగముపై యోగానందనరసింహము వీఁడె
మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము

చ. 2: నాఁటుకొన్న భార్గవూటునరసింహము వీఁడె
నాఁటకపు మట్టెమళ్లనరసింహము
నాఁటి యీ కానుగమానినరసింహము వీఁడె
మేఁటి వరాహపు లక్ష్మీనారసింహము

చ. 3: పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన
నలిరేఁగిన ప్రహ్లాదనరసింహము
చెలఁగి కదిరిలోన శ్రీవేంకటాద్రిమీఁద
మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము

రేకు: 0331-06 శంకరాభరణం సం: 04-183 వేంకటగానం

పల్లవి: కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు
తెలియ నీతఁడే సుండీ దేవదేవోత్తముఁడు

చ. 1: పుడిమికాధారము పురుషోత్తముఁడె
కుడిచి కట్టెడివారు కోటానఁగోటి
విడువుఁ డేటికి బారవేసినగుంటికినెల్ల
వొడయ డీతఁడే సుండీ వున్నతోన్నతుఁడు

చ. 2: అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడే
సములై జీవించువారు సతానసంఖ్య
భ్రమయకుఁ డెండమావిబయళ్లు చెరువులంటా
అమర నీతఁడే సుండీ హరి వాసుదేవుఁడు

చ. 3: చెలువుఁ డీతఁడె సుండీ శ్రీవేంకటేశుఁడె
పలుకుఁ బంతాలవారు పదివేగురు
తలఁచకుఁ డీదోమ దంతితోను సరిగా
జలజనాభుఁడే సుండీ సకలలోకేశుఁడు

రేకు: 0332-01 వసంతంసం: 04-184 వైరాగ్య చింత

పల్లవి: రంటదెప్పరపురచన మా బదుకు
జంటల శ్రీపతిశరణమే నిజము

చ. 1: కన్నులయెదుటను గలిగిన జగమే
మిన్నక మనసున మెరసేది
తిన్నఁగ రేయి నిద్రించినవాఁడనే
యెన్నఁగ రేపే యెరిఁగినవాఁడ

చ. 2: బాయట నూరక పారెటిగాలే
కాయములోపలఁ గలిగేది
పోయిన జన్మపుఁబొరుగులవాఁడనే
యీయెడ నిటు జనియించితిఁగాని

చ. 3: పుడమివెలు పలను బుట్టినరుచులే
కడుపులోపలను గరఁగేది
కడఁగి శ్రీవేంకటపతి నాలోననే
యెడయఁడు యతనినే యిటు గొలిచితిని

రేకు: 0332-02 సాళంగనాట సం: 04-185 గురు వందన

పల్లవి: వైష్ణవులసొమ్ము నేను వారు నీసొమ్ములింతే
విష్ణుఁడ నీవెట్లైన వివరించుకోవయ్యా

చ. 1: నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన-
తఱి నీదాసులకే నే దాసుఁడగాక
గుఱుతెరుఁగుదునా నేఁ గోరి యింతకతొల్లి
గుఱుతు చూపిన మాగురువునేకాక

చ. 2: ముంచి నీకు మొక్కేఁగాక ముందే నీశరణులు
పెంచి పాదాలు నా నెత్తిఁబెట్టిరయ్య
పొంచి నీవేడ నేనేడ బుజముల ముద్రవెట్టి
సంచితమై సేసినట్టిసంబంధమేకాక

చ. 3: శ్రీవేంకటేశ నీసేవే సేసేఁగాక నే డీ-
సేవకుఁ దెచ్చెను వారిసేవేకాదా
భావమొక్కటిగా నాకుఁ బట్టిచ్చిరి నిన్ను వారు
ఆవలీవలికిఁ బరమార్థమేకాక

రేకు: 0332-03 రామక్రియ సం: 04-186 ఉపమానములు

పల్లవి: విత్తొకటి వెట్టఁగాను వేరొకటి మొలచీనా
హత్తి దేహగుణములు ఆతుమకయ్యీనా

చ. 1: చెంది చేఁదుదిన్ననోరు చేఁదేయయివుండుఁగాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంసారికి బలు లంపటాలేకాక
అందు హరిఁజేరి సుఖ మందఁ దీరీనా

చ. 2: యెంగిలిఁ బుట్టినమేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనమ సేసుకోనీనా
ముంగిటిదేహికిఁ గర్మములు ముంచుకొనుఁగాక
రంగుగ శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా

చ. 3: చేతికి వచ్చినసొమ్ము చేరిదాఁచుకొనుగాక
యేతులఁ దా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవేంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నాదా

రేకు: 0332-04 మలహరిసం: 04-187 భక్తి

పల్లవి: అందుకు హరికథ యనుతీర్థంబున
నింద వాసె నిఁక నిర్మలమైతి

చ. 1: కంతునిముట్టంటు గలసె మదిలో
యెంతట శుద్ధౌనో యెరఁగమిఁక
సంతత సంసార జలధుల మునిఁగెద
పొంతగర్మము పోదింకాను

చ. 2: మాయపు టాసల మాలు గలసె మది
యేయెడ శుద్ధౌనో యెరఁగమిఁక
ఆయపుభవములయనలము చొచ్చితి
పోయినఁగర్మము పోదింకాను

చ. 3: చక్కఁగఁ గలిదోసము గలసెను మది
నెక్కడ వోయెనో యెరఁగమిఁక
దక్కి శ్రీవేంకటదైవముఁ గొలిచితి
పుక్కట గర్వము పోదింకాను

రేకు: 0332-05 దేశాక్షి సం: 04-188 అధ్యాత్మ

పల్లవి: కర్మమూలము జగము గాదనివిడువక
మర్మపుమోక్షము లేదు మానలేరో గర్వము

చ. 1: సకలకర్మాలు మాని సన్యాసి యైతేను
వొకట వెలితిలేనివున్నతుఁడట
ముకెమై వుభయకర్మములు బంధహేతువని
ప్రకటించి వేదాంతపఠనమే యెక్కుడు

చ. 2: బహురూపములు మరచి బ్రహ్మ నిష్ఠుఁడైనయోగి
యిహపరముల కతఁడెక్కుడట
విహితకర్మము దక్క వీరఘోరకర్మములు
సహజపాతకమనేశాస్త్రాలే యెక్కుడు

చ. 3: సంతతకర్మములెల్ల సంసారమూలములు
అంతట నిస్సంగుడైతే నధికుఁడట
చింతించి చింతించి శ్రీవేంకటేశ్వరు
వంతుకుఁజెప్పన హరివాక్యమే యెక్కుడు

రేకు: 0332-06 దేవగాంధారి సం: 04-189 శరణాగతి

పల్లవి: పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు దానే
యిట్టె శ్రీహరి నన్నే ట్టీడేరించీనో

చ. 1: యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని
యించుకవడిలోనే మోహింతు నందుకు
కంచువంటి దీమనసు కటకటా యేది వాటి
చంచలుఁడ హరి నన్నేసంగతి సేసీనో

చ. 2: తలఁతు నేనొకవేళ దైవము గనేనని
కలిమి నంతటిలోనె కడు మరతు
చలపట్టె నిదివో నాజన్మములకేది వాటి
కలుషచిత్తుఁడ నన్నేకందువఁ బెట్టీనో

చ. 3: జ్ఞానినౌదు నొకవేళ సరిఁ గర్మినౌదును
మానువంటిదీగుణము మరేది వాటి
కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మానిసి నింతే యెట్టు మన్నించీనో

రేకు: 0333-01 గుండక్రియ సం: 04-190 మనసా

పల్లవి: అన్నియు నాలో నుండఁగ నవ్వల నేమి చూచేము
యెన్నఁడు గాననిమాయ యెరఁగవో మనసా

చ. 1: యీడనే సంసార మిదె యింద్రజాలమై యుండఁగ
యేడకైనాఁ జూడఁ బోయే మింద్రజాలము
పాడితో నా పట్టుగులే బహురూపాలై యుండఁగ
వేడుకయ్యీ బహురూపవిద్యలు చూడఁగను

చ. 2: నటన దినదినము నాటకమై యుండఁగాను
సటవట నాటకాలు సారెఁ జూచేము
ఘటన మాయలెదుటఁ గనుకట్టై వుండఁగాను
అటమటపువిద్యలు అన్నియుఁ జూచేము

చ. 3: పాపపుణ్యములు రెండు బారివిద్య లుండఁగాను
కోపుల నాటలవారిఁ గోరి చూచేము
యేపున శ్రీవేంకటేశు డిటు మమ్ము భ్రమపాపె
నాపనులు నేనే చూచి నవ్వులు నవ్వేను

రేకు: 0335-02 గుజ్జరి సం: 04-191 శరణాగతి

పల్లవి: ఇతరోపాయములెల్ల యీసందివే
అతిశయపదమైతే హరిదాస్యఫలమే

చ. 1: కర్మము సేయ నేరరా కడఁగి సన్యాసులు
కర్మము విడిచి మోక్షముఁ బొందిరి
ధర్మమెరఁగనివారా తత్వపుయోగీంద్రులు సర్వ-
ధర్మము విడిచి హరిఁ దమలోనే కనిరి

చ. 2: దానాలు సేయనేరరా తగిలి యోగీంద్రు లన్ని
మాని హరిజపమే నెమ్మడిఁ జేసిరి
నానావిధు లెరఁగరా నాఁడు విభీషణాదులు
శ్రీనాథు శరణని చిరదేహులైరి

చ. 3: సతతసంగములెల్ల జన్మబంధహేతువని
మతిమంతులైనవారు మానిరిగాక
హితవైన శ్రీవేంకటేశ్వరుని శరణని
బ్రతుకరా యిందు నందుఁబ్రపన్నులెల్లను

రేకు: 0333-03 సౌరాష్ట్రం సం: 04-192 అన్నమయ్య స్తుతి

పల్లవి: హరియవతారమె ఆతఁడితఁడు
పరమ సంకీర్తనఫలములో నిలిపె

చ. 1: వున్నాఁడు వైకుంఠమున నున్నాఁడు యాచార్యునొద్ద
వున్నతోన్నతమహిమ నన్నమయ్య
వున్నవి సంకీర్తనాలు వొట్టుక లోకములందు
పన్నిన నారదాదులు పైపైఁ బాడఁగను

చ. 2: చరియించు నొకవేళ సనకాదిమునులలో
హరిఁ బాడుఁ దాళ్ళపాకఅన్నమయ్య
తిరమై యాళువారల తేజము దానైయుండు
గరుడానంతముఖ్య ఘనులంగడిని

చ. 3: శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతికొలువునందు
ఆవహించెఁ దాళ్ళపాకఅన్నమయ్య
దేవతలు మునులును దేవుఁడని జయవెట్టఁ
గోవిదుఁడై తిరిగాడీఁ గోనేటిదండను

రేకు: 0333-04 రామక్రియ సం: 04-193 మాయ

పల్లవి: ఉండినట్టే వుండును వుండకున్న మానును
అండనే శ్రీహరిమాయ నమరినలోకము

చ. 1: యేదైనా మంచిదే యెట్టయినా మంచిదే
సేద దేరినట్టి పూర్ణచిత్తునకును
కాదు గూడదనరాదు కలస్వభావమునకు
ఆదినుండి హరిమాయ నత్తినడి లోకము

చ. 2: యెండైనా మంచిదే యెంతనీడైనా మంచిదే
పండినజ్ఞానభక్తుల ప్రసన్నులకు
నిండె నిండదనరాదు నిచ్చనిచ్చఁబ్రకృతికి
కొండవంటిహరిమాయ గురియైనలోకము

చ. 3: పాపమైన మంచిదే బలుపుణ్యమైన మంచిదే
శ్రీపతిని శరణన్నజీవునికిని
వోప నోపన రాదు వొద్దిక శ్రీవేంకటేశు
చేపట్టినమాయలోనఁ జిక్కినది లోకము

రేకు: 0333-05 శంకరాభరణం సం: 04-194 శరణాగతి

పల్లవి: నీకే నే శరణు నీవు నన్నుఁ గరుణించు
యీకడ నాకడ దిక్కు యెవ్వరున్నా రికను

చ. 1: కన్నులఁ జంద్రసూర్యులుగలవేలుపవు నీవు
పన్నినలక్ష్మిభూమిపతివి నీవు
అన్నిటా బ్రహ్మకుఁ దండ్రియైన యాదివేలుపవు
యెన్నఁగ నీకంటే ఘన మెవ్వరున్నా రికను

చ. 2: దేవతలందరు నీ తిరుమేనైనమూర్తి
ఆవలఁ బాదాన లోక మణఁచితివి
నీవొక్కఁడవే నిలిచిన దేవుఁడవు
యేవేళ నీకంటే నెక్కుడెవ్వరున్నా రికను

చ. 3: అరసి జీవులకెల్ల నంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముఁడవు భువనరక్షకుఁడవు
యిరవైననీవేకాక యెవ్వరున్నా రికను

రేకు: 0333-06 శుద్ధవసంతం సం: 04-195 శరణాగతి

పల్లవి: కటకటా యీ ప్రాణి గతిగనుట యెన్నఁడో
అటు నావశము గాదు హరి నీచేఁ గాని

చ. 1: పాపము నెరుఁగుదు బంధము నెరుఁగుదు
మాపుదాకా నివి నేను మానలేఁగాని
కోపము దుర్గుణమని కొంత గొంత యెరుఁగుదు
తీపుల యాసలఁ బడి తిప్పలేఁగాని

చ. 2: చూతును దుఃఖాలవారిఁ జూతును బుట్టేవారి
యీతల నాకు వెరపు యించుక లేదు
గాతల నామనసెల్లఁ గల్పించినట్లవును
చేతనైనా చెప్పినట్టు సేయలేఁగాని

చ. 3: నావంకఁ గడమ గాఁక నా గురుఁడు తొల్లె నన్ను
శ్రీవేంకటేశుఁడ నీచేతికిచ్చెను
దైవమొక్కఁడవే నీ దాసానుదాసుఁడనైతి
యేవిధులు నే నెరఁగ నిటు నిన్నేకాని

రేకు: 0334-01 సామంతం సం: 04-196 శరణాగతి

పల్లవి: ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె వున్నదిదె చెప్పరాని ఫలము

చ. 1: కోపము విడిచితేనె పాపము దానే పోవు
దీపింప సుజ్ఞానముతెరు విదివో
లోపల మనిలుఁడై లోకముమెచ్చుకొరకు
పైపైఁగడిగితేను పావనుఁడౌనా

చ. 2: ముందరికోరిక వోతే ముంచిన బంధాలు వీడు
కందువ నాస మానితే కైవల్యము
బొందిలోన నొకటియు భూమిలోన నొకటియు
చిందు వందు చిత్తమైతే చేరునా వైకుంఠము

చ. 3: కాంతల పొందొల్లకుంటే ఘనదుఃఖమే లేదు
అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁడు
అంతట మాటలె యాడి హరి శరణనకుంటే
దొంతినున్నభవములు తొలఁగునా వివేకికి

రేకు: 0334-02 లలిత సం: 04-197 అధ్యాత్మ

పల్లవి: ఎప్పుడూను నడచేవె యేకాలమైనాను
కప్పి నిష్ఠూరమేల కట్టేరయ్యా

చ. 1: శ్రీపతి యాణాజ్ఞచేతఁ జిక్కనది జగము
యేపున మా యాణాజ్ఞ లేఁటివయ్య
కోపగించుకొనుటింతే కొంకక లోకాలు నేము
మాపుదాఁకా మానుమంటే మానఁబొయ్యీనా

చ. 2: నరహరి రక్షణమే నడచీని లోకము
యిరవై నేము రక్షించే దేఁటిదయ్య
పొరలే గర్వ మింతె బూతులసంసారము
మరలి నేమూరకుంటే మానఁబొయ్యీనా

చ. 3: సృష్టికిఁ గుర్తైనవాఁడు శ్రీవేంకటేశుఁ డింతే
యిష్టానిష్టము మాకు నేఁటిదయ్య
నష్టి లేదు నడచేది నడవక మానరాదు
తష్టి గట్టుకొంటిఁగాక తా మానఁబొయ్యీనా

రేకు: 0334-03 బౌళి సం: 04-198 వైష్ణవ భక్తి

పల్లవి: ఇంత లేకుంటే నది యెక్కడి సుజ్ఞానము
దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా

చ. 1: యెదిటి వారెరిఁగితే యేమీ ననక మరి
చెదరకుండుటే పో శ్రీవైష్ణవం
కదిసినకాంతలను కనకము వొడగంటే
పదరకుండుటే పో పరమసాత్వికము

చ. 2: క్రియయెరఁగనివారు కీడు సేసితేఁ దాను
దయఁ జూచుటే హరిదాస్యఫలము
రయమునఁ దామసము రాజసము గలిగితే
భయపడి తొలఁగుటే ప్రసన్నగుణము

చ. 3: వొరసి యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన
నిరతితొ వీఁగనిదే నిచ్చలబుద్ది
యిరవై శ్రీవేంకటేశ్వరుదాసులఁ గని
శరణని మొక్కుటే సర్వజ్ఞగుణము

రేకు: 0334-04 మలహరిసం: 04-199 హరిదాసులు

పల్లవి: పరమోపకారులు ప్రత్యక్షదైవములు
హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము

చ. 1: పాపుదురు లోకములో పాపపంకమెల్లాను
దీపించ శ్రీపాదతీర్థమున
వోపుదురు హీనుల వున్నతులఁగాఁ జేయ
చేపట్టి కన్నులెదుటిసేవామాత్రమున

చ. 2: చెఱుతు రజ్ఞానమెల్లా జనులు తమ్ముఁజేరిన
మఱియుఁ దమప్రసాదమహిమవల్ల
తెఱచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా
మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున

చ. 3: చెల్లఁబెట్టుదు రెందైనా చిల్లరకులమువారి
తెల్లమిగా మంత్రోపదేశమున
యిల్లిదె శ్రీ వేంకటేశ యెక్కుడుసేసిరి మమ్ము
సల్లాపనల తమసహవాసములను

రేకు: 0334-05 ధన్నాసి సం: 04-200 శరణాగతి

పల్లవి: నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు
శ్రీకాంతుడవు నాకు సిద్ధించుకొరకు

చ. 1: జలధివంటిది సుమీ చంచలపు నామనసు
కల వింద్రియముల నేటిజలచరములు
వొలసి భక్తెనెడి వోడ యెక్కితి నేను
జలశాయి నీవ నేటిసరకు దెచ్చుటకు

చ. 2: కొండవంటిది సుమీ కొనకెక్కు నామనసు
వుండుఁ గామాదులను వురుమృగములు
వుండి నీశరణమను వూఁత గొని యెక్కితిని
కొండలప్ప నీవనేటి కొనఫలముకొరకు

చ. 3: టీవులను ధరణివంటిది సుమీ నామనసు
నీవె శ్రీవేంకటేశ నిక్షేపము
వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి
భూవిభుఁడ నీవనేటి పురుషార్థము

రేకు: 0334-06 కాంభోది సం: 04-201 గురు వందన, నృసింహ

పల్లవి: అంతటనే వచ్చి కాచు నాపద్బంధుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడనంటేఁ జాలు

చ. 1: బంతిఁగట్టి నురిపేటి పసురము లెడ నెడఁ
బొంత నొక్కొక్క గవుక పుచ్చుకొన్నట్టు
చెంతల సంసారము సేయు నరుఁడందులోనె
కొంత గొంత హరి నాత్మఁ గొలుచుటే చాలు

చ. 2: వరుసఁ జేఁదు దినేవాడు యెడ నెడఁ గొంత
సరవితోడుతఁ దీపు చవిగొన్నట్టు
దురితవిధులు సేసి దుఃఖించు మానవుఁడు
తరవాత హరిపేరు దలఁచుటే చాలు

చ. 3: కడుఁ బేదైనవాఁడు కాలకర్మవశమున
అడుగులోనే నిధాన మటు గన్నట్టు
యెడసి శ్రీవేంకటేశు నెరఁగక గురునాజ్ఞ
పొడగన్నవానిభక్తి పొడముటే చాలు

రేకు: 0335-01 నాగవరాళి సం: 04-202 అధ్యాత్మ

పల్లవి: దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే
వావిరి నౌఁగాదన నవ్వల నిఁక నెవ్వరో

చ. 1: యెంచఁగ నీదేహమిది యింద్రియాదులకుఁ జరఁ
వంచనతో విడిపించువారలెవ్వరో
పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల
యించుకంత దయఁజూడ నిఁక నెవ్వరో

చ. 2: పోరచి నామన సిది పుణ్యపాపాలకుఁ జర
మారుకొని విడిపించ మరి యెవ్వరో
తీరని నాజన్మ మిది దినభోగాలకుఁ జర
యీరీతి విడిపించ నిఁక నెవ్వరో

చ. 3: ఆతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర
ఆతల నెవ్వరికైనా నరుహమౌనా
యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక
ఘాతల నీదాసులకు గతి యెవ్వరో

రేకు: 0335-02 నారాయణి సం: 04-203 అధ్యాత్మ

పల్లవి: ఏలికవు నీవట యింకా దైన్యమేల
తాలిమి నీచేఁతలకుఁ దగవు గాదనరా

చ. 1: ఘనకర్మానుభవమే కావలె నొండె నాకు
వనజాక్ష నీసేవే వలె నొండె
కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల
ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మీ

చ. 2: పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె
తూకొని నీనామముచేఁ దుంచుట యొండె
సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల
మేకొని యీవట వింటే మెత్తురా నిన్నును

చ. 3: యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె
సరస రెండును నైన సంగతౌనా
గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
సరిబేసి జంటమాట జరపకు మిఁకను

రేకు: 0335-03 బలహంస సం: 04-204 వైరాగ్య చింత

పల్లవి: ఏమి సేతు నిందుకు మందేమైనఁ బోయ రాదా
సామజగురుఁడ నీతో సంగమొల్ల దేఁటికే

చ. 1: మాయలసంసారము మరిగిన కర్మము
ఈయెడ నిను మరుగ దేఁటికో హరి
కాయజకేలిపైఁ దమిగలిగిన మనసు
కాయజుతండ్రి నీపైఁ గలుగ దిదేఁటికే

చ. 2: నాటకపుఁగనకము నమ్మినట్టిబదుకు
యేఁటికి నీభక్తి నమ్మదేలే హరి
గూఁటఁబడే పదవులు గోరేటిజీవుఁడు
కూటువైననిజముక్తి గోరడిఁది యేఁటికే

చ. 3: పాపపుణ్యములకె పాలుపడ్డ నేను
యేపున నీపాలఁ జిక్క నేలకో హరి
శ్రీపతివి నాలోని శ్రీవేంకటేశుఁడ
నీపేరివాఁడ నాకు నిండుమాయ లేఁటికే

రేకు: 0335-04 దేసాళం సం: 04-205 వేంకటగానం

పల్లవి: తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక
యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు

చ. 1: యీ సంసారమునకు యితఁడె దిక్కు నేఁ-
జేసేటిచేఁతలకెల్ల శ్రీపతే లోను
పాసిపోఁడెప్పుడు నన్ను బంధువుఁడితఁడే నాకు
దాసుఁడైనవాఁడు హరిఁ దగదు దూరఁగను

చ. 2: చావుఁబుట్టుగులవేళ సతము నీతఁడే
సావి భోగములకు నిచ్చకుఁడీతఁడే
భావములోపల నుండుప్రాణ మీతఁడే నాకు
దైవము దూరగనేల తనకేమి వచ్చినా

చ. 3: తలఁపులోపలికి యీదైవమే తోడు
యిలఁ గలిమిలేములు కీతఁడే తోడు
పలుకులోపల నుండుభాగ్య మీతఁడె నాకు
కొలిచి శ్రీవేంకటేశుఁ గొసరఁగనేఁటికి

రేకు: 0335-05 సౌరాష్ట్రం సం: 04-206 విష్ణు కీర్తనం

పల్లవి: విడువ విడువ నింక విష్ణుఁడ నీపాదములు
కడఁగి సంసారవార్ధి కడుముంచుకొనిన

చ. 1: పరమాత్మ నీవెందో పరాకైయున్నాను
పరగ నన్నింద్రియాలు పరచినాను
ధరణిపైఁ జెలరేఁగి తనువు వేసరినాను
దురితాలు నలువంకఁ దొడికి తీసినను

చ. 2: పుట్టుగు లిట్టె రానీ భువి లేక మాననీ
వట్టి ముదిమైన రానీ వయసే రానీ
చుట్టుకొన్నబంధములు చూడనీ వీడనీ
నెట్టుకొన్నయంతరాత్మ నీకు నాకుఁ బోదు

చ. 3: యీదేహమే యయిన ఇఁక నొకటైనాను
కాదు గూడదని ముక్తి కడకేఁగినా
శ్రీదేవుఁడవైన శ్రీవేంకటేశ నీకు
సోదించి నీశరణమె చొచ్చితి నే నిఁకను

రేకు: 0335-06 భంగాళం సం: 04-207 శరణాగతి

పల్లవి: చెప్పినంతపని నేఁ జేయగలవాఁడ నింతే
అప్పటి నపరాధమూ ఆదరించవలదా

చ. 1: నీయాజ్ఞ దేహము నే మోచితినింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వోయయ్య కొంతైన వూరడించవలదా

చ. 2: నీవు సేసేకర్మము నేఁజేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవరమై వెంట వెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంత వడైనా దప్పిదీర్చవలదా

చ. 3: మతిలో శ్రీవేంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్య
యితవై పనిసేసేటి యింటి పసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డు వెట్టఁదగదా

రేకు: 0336-01 నాదరామక్రియ సం: 04-208 వైరాగ్య చింత

పల్లవి: ఏమని విన్నవించేను యెన్నెని కాచేవు నీవు
శ్రీమాధవుడ నీకుఁ జేతికి లోనయ్య

చ. 1: పుట్టినదె వొకతప్పు భువిమీఁద నటమీఁద
నెట్టన సంసారినౌటే నిజము రెండోతప్పు
రట్టుకెక్కి దొరనౌటే నెట్టన మూఁడోతప్పు
యిట్టె కావు కావకుండు మిదివో నాతప్పు

చ. 2: అన్నపానములు గోరినదియే మొదలి బందె
యెన్నఁగఁ గాంతలఁ గూడుటిదివో రాతిటిబందె
కన్నవారి వేఁడేది కడతొడుకుబందె
కొన్నిట నేమి గొనేవు కొనవయ్య బందె

చ. 3: కొనఁ బుణ్యపాపాలే గొడియకట్లు రెండు
కొనిరి నీదాసులే కోరిన తప్పుదండము
వినవయ్య యిదివో శ్రీ వేంకటేశ నామనవి
మనుఁగాఁపుఁ జేసితివి మన్నించవయ్య

రేకు: 0336-02 కేదారగౌళ సం: 04-209 వైరాగ్య చింత

పల్లవి: ఇందిరానాథుఁడవు యిందరికి నేలికవు
చిందరవందరలైన చింతలు మరేలా

చ. 1: వుండుమంటే నుండవీ వూరకే బ్రహ్మాండాలు
నిండుమంటే నిండినవి నీరధులెల్లా
మెండగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె
వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా

చ. 2: పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచినదేవతలెల్ల
అట్టే యణఁగిరిగా అసురలెల్ల
పట్టిన నీచల మిదె బహళస్వతంత్ర మిదె
వెట్టిదైవాలపనులు వేరే మరేలా

చ. 3: కమ్మంటే నాయను కైవల్యపదవులు
రమ్మంటే వచ్చె వేదరాసులెల్లను
కమ్మిన శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీకు
యిమ్ముల నీమహి మిదె యితరములేలా

రేకు: 0336-03 బౌళిరామక్రియ సం: 04-210 విష్ణు కీర్తనం

పల్లవి: పలికేటివేదమె ప్రమాణము
తలఁచిన వారికి తత్వము సుండీ

చ. 1: నరహరి యజాండనాయకుడు
సురలితనినే సంస్తుతించిరి
పురుషోత్తముఁ డిదె భూమికి - యీ
హరిఁ గొలువనివా రసురలు సుండీ

చ. 2: కమలారమణుఁడె ఘనుఁడు
అమరులె మ్రొక్కుదు రాతనికి
విమతులఁ దునిమె విష్ణుఁడు
తమిఁ బూజించక తగు గతి లేదు

చ. 3: భావజజనకుఁడు బ్రహ్మము
సోవగఁ గొలిచిరి శుకాదులు
శ్రీవేంకటపతిచెలువుఁడు
దైవశిఖామణిఁ దలఁచరో బుధులు

రేకు: 0336-04 పళవంజరం సం: 04-211 నామ సంకీర్తన

పల్లవి: ఒక్కమాఁటలోనివే వొగి బంధమోక్షాలు
చిక్కినందాఁకా దేహి చింతఁ బొందీఁగాని

చ. 1: హరి యని నుడిగి రెండక్షరాలఁ బాపేటి-
దురితాలు భూవిలోనఁ దొల్లె లేవు
పురిగొని యందుమీఁద పొంచి విశ్వాసములేక
పెరగఁగఁ బెరుగఁగ పెచ్చు రేఁగీఁగాని

చ. 2: మతిలో గోవింద యన్న మాత్రమున నంటేటి
అతిపుణ్యాలిలమీద నన్ని గలవా
కతగా నట్టె మహిమగానలేక వుండగాను
బతిమాలఁగానే యింత బయలాయఁగాని

చ. 3: శ్రీవేంకటేశ నిన్ను సేవించితే నిచ్చేటి-
యేవల వరాలు లెక్క నెంచవసమా
భావించి తెలిసి చేపట్టెడి యరుదింత
దైవము నా కియ్యఁగాను దక్కె నింతేకాని

రేకు: 0336-05 కన్నడగౌళ సం: 04-212 గురు వందన, నృసింహ

పల్లవి: తలరో లోకాంతపరులు తడవము పుణ్యపాపమును
వలె నని శ్రీవైష్ణవులకు వందనమే సేసెడివాఁడ

చ. 1: తపసిఁ గాను ధర్మిఁ గాను
కృపగల శ్రీపతి కింకరుఁడ
జపితఁ గాను శాస్త్రిఁగాను
వుపదేశపు గురువూళిగకాఁడ

చ. 2: భయము లేదు భక్తి లేదు
జయభాగవతుల దయవాఁడ
ప్రియము న్నెరఁగను పెరిమ న్నెరఁగను
ద్వయాధికారముఁ దగిలినవాఁడ

చ. 3: జ్ఞానము లేదు మోనము లేదు
పూని శ్రీవేంకట పురుషుఁడిదె
నానాటఁ దెలిపి నను మన్నించెను
సానఁదేరి తన శరణమువాఁడ

రేకు: 0336-06 సామంతం సం: 04-213 శరణాగతి

పల్లవి: చలువకు వేఁడికి సరికి సరి
కలదిఁక హరి నీ కరుణే మాకు

చ. 1: కాయము గలిగినఁ గలుగుఁ దోడనే
పాయపుమదములు పైపైనే
రోయదు తనుఁ గని రుచులే వెదకును
యేయెడ హరి నిను నెరుఁగుట యెపుడో

చ. 2: కడుపు నిండితే ఘనమై నిండును
బడిఁ బంచేంద్రియపదిలములు
విడువ వాసలును వెలయు బంధములు
కడగని మోక్షము గైకొనుటెపుడో

చ. 3: పెక్కులు చదివిన పెనఁగుఁ దోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా-
నిక్కపు వేల్పువు నీచిత్త మిఁకను

రేకు: 0337-01 హిందోళవసంతం సం: 04-214 శరణాగతి

పల్లవి: దైవమొకఁడే మాతలఁపు నొకటే
పావనమైతిమి పదరేమా

చ. 1: హరి యెటు దలఁచిన నటయీని
పరుగుఁ గోరికల పనులేలా
ధర నభయ మొసఁగు దైవముబంట్లము
మరలి యితరులకు మఱి వెరచేమా

చ. 2: పురుషోత్తమానతిఁ బుట్టినవారము
అరిదిసిరులకై యలపేలా
సరి లక్ష్మీపతి శరణాగతులము
అరయఁగ నితరుల నడిగేమా

చ. 3: శ్రీవేంకటపతిచేఁత జీవులము
దావతి నితరము తగులేలా
వావిరిని కరివరదుని వారము
తావున బందాలఁ దగిలేమా

రేకు: 0337-02 నాగవరాళి సం: 04-215 శరణాగతి

పల్లవి: చాలుఁ జాలు నీసటలఁ బొరలితిమి
వాలి కొంత వెరవకుమనలేవు

చ. 1: కలవు లోకముల ఘనమంత్రంబులు
అలరి ముక్తి యియ్యఁగలేవు
సులభానఁ గలరు సారిది దేవతలు
వలగొను పాపము వారించలేరు

చ. 2: వున్నవి పుణ్యము లూరకె యివిగో
పన్నిన హరిఁ జూపఁగలేవు
సన్నితి నున్నవి సకళశాస్త్రములు
కొన్నైన భవములకొన గన నీవు

చ. 3: ధరలో సేనలు ధనధాన్యంబులు
పరమజ్ఞానవిభవ మిదు
అరుదుగ శ్రీవేంకటాధిపుఁడే మము
యిరవై కావఁగ యీడేరితిమి

రేకు: 0337-03 శోకవరాళి సం: 04-216 మనసా

పల్లవి: విడువుము మనసా వీరిడిచేఁతలు
తడయక శ్రీహరిఁ దలఁచవొ యిఁకను

చ. 1: నానాఁడే యెనఁబది నాలుగులక్షలు
యోనుల వెడలితి నొక్కఁడనే
ఆనిన భోగములందలివే పో
కానము యిఁకనేమి గడియించేము

చ. 2: నలుగడ నటు పదునాల్గు లోకములు
వెలయఁ జొచ్చితిని వెడలితిని
కలిగినదేదో కలుగనిదేదో
తెలియ దేమిటికిఁ దిరిగేవమో

చ. 3: భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము
కవిసి యాఫలము గైకొంటిని
యివల శ్రీవేంకటేశుఁడింతలో
తవిలి యేలఁగా ధన్యుఁడనైతి

రేకు: 0337-04 గుండక్రియ సం: 04-217 దశావతారములు

పల్లవి: ఇరవుగా నిన్నెరిఁగిరి యిదివో నీదాసులు
పరదైవములమీఁద నొల వేయనేల పనిలేవు నీమాయలు కరుణానిధీ

చ. 1: ముంచెను నీపాదములు మూఁడులోకములయందును
యెంచెను నీ వేయినామాలు యిలలో వేదవ్యాసుఁడు
చంచులఁ దలఁచిరి నిన్ను మున్నే సనకాదియోగీంద్రులు
పొంచి యింకా నీకు దాఁగఁ జోటు లేదు యిందు బొడచూపవే యింకవెడమాయలేలా

చ. 2: కొనెను నీపాదతీర్థము బ్రహ్మ కోరి నీపాదము గడిగి
వినుతించె నీమహిమ తొల్లె వేయినోళ్లుగల శేషుఁడు
అనిరి నిన్నెక్కుడనుచు మొదల శుకాది మునీంద్రులెల్లా
పొనిగి నీవు మాయ సేయఁ జోటు లేదు మమ్ము పొసఁగి యేలుకోవె పురుషోత్తముఁడా

చ. 3: యెక్కెను ధ్రువుఁడు పట్టము యిదివో నిన్నుఁ గొలిచి
చిక్కెను నీశరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను
గక్కన శ్రీవేంకటేశుఁడా యిట్టె కాచితివి మాటకే మమ్ము
యిక్కడ నీమాయసేయఁ జోటులేదు నిన్నునెరిఁగిరి నీదాసులిందిరారమణా

రేకు: 0337-05 హిజ్జిజ్జి సం: 04-218 అధ్యాత్మ

పల్లవి: పాపముఁ బుణ్యము పరగ నొకట నదె
వోపినవారలు వొడిఁగట్టెడిది

చ. 1: నాలుకతుదనే నానారుచులును
నాలుకవే హరినామమును
పోలింప నొక్కటి భోగమూలము
మూల నొకటది మోక్షమూలము

చ. 2: మనసున నదివో మగువలమోహము
అనుగుమనసుననె హరిచింత
పనివడి యొక్కటె ప్రపంచమార్గము
కొన నొకటే వైకుంఠమార్గము

చ. 3: వెలుఁగుఁ జీఁకటియు వెస నొకనాఁడే
కలిగె నట్ల నివి కలిగినవి
యిలలో శ్రీవేంకటేశు మా యొకటి
తలఁప నొక టతనిదాసులసుగతి

రేకు: 0337-06 సౌరాష్ట్రం సం: 04-219 నృసింహ, హరిదాసులు

పల్లవి: హరిదాసులే మాకు నడ్డమై కాతురుగాక
శరణంటి వారికి నే సకలోపాయములు

చ. 1: పెరుగఁబెరుఁగఁగానే పెద్దలాయ నింద్రియాలు
యిరవైనమాబుద్ధు లిందుగొల్పీనా
తిరిగితిరిగి మాకు ద్రిష్టమాయ జన్మములు
దురితాలుఁ బుణ్యాలుఁ దోసేమా యిఁకను

చ. 2: కూడఁగూడ నానాఁటఁ గొనకెక్కెఁ గోరికలు
వీడనిబంధము లన్నీ విడిచీనా
పాడితో నీడా నాడఁ బ్రాణములుఁ దీపులాయ
యేడనున్ననేము నేమే యెరిఁగేమా యిఁకను

చ. 3: చింతించఁ జింతించఁ జేతికి వచ్చె మనసు
అంతలో శ్రీవేంకటేశుఁ డంది కాచెను
దొంతులై తిరుమంత్రము తోడనే నాలుక నంటె
మంతనాన గురుసేవ మరచేమా యిఁకను

రేకు: 0338-01 బౌళిరామక్రియ సం: 04-220 అధ్యాత్మ

పల్లవి: కైకొన్నకొలఁది కర్మము
వాకుచ్చి తనతోనే వగవఁగనేలా

చ. 1: తలఁచినకొలఁదేదైవము తన-
కలపుకోలుకొలఁదే కడసరులు
బలువుకొలఁదియే పంతము
తొలఁగర యితరుల దూరఁగనేలా

చ. 2: మచ్చిక నొడివినంతే మంత్రము
అచ్చపుభక్తి కొలఁదే యాచార్యుఁడు
నిచ్చలుఁ గోరినయంతే నిజమైనలోకము
పచ్చివెచ్చిచదువుల భ్రమయఁగనేలా

చ. 3: నెమ్మది జాతెంతే నియమము
సమ్మతించినంతే సంతోసము
యిమ్ముల శ్రీవేంకటేశుఁడిచ్చినంతే యిహపర-
మెమ్మెల కిది మరచి యేమరఁగనేలో

రేకు: 0338-02 వరాళి సం: 04-221 వైరాగ్య చింత

పల్లవి: ఇన్నిజన్మము లెత్తిన యిందుకా నేము
పన్నిన సంసారములబంధమే మిగిలెను

చ. 1: తీరెఁ దీరె అన్నములు దినదినకోరికలు
కోరఁబోతే యాసలెల్ల కోటానఁగోటి
సారెఁ గొన్నరుచులెల్ల చవితో మేనిలో లేవు
ఆరితేరిబతుకఁగా నాసలే మిగిలెను

చ. 2: పోయఁబోయ స్వర్గాదిభోగములు వెనకకే
సేయఁబోతే పుణ్యములు సేనాసేన
ఆయమంటి వెతకితే నాతుమలోనా లేవు
కాయముతో వెంట వెంట కర్మమే మిగిలెను

చ. 3: అందెనందె మోక్షము హరిదాసులవల్లను
ముందు వెనకెంచితేను మూలమే హరి
గొందిఁ జిక్కె నరకాలు కోపముఁ బాపముఁబాసె
యిందు నందు శ్రీవేంకటేశుఁడే మిగిలెను

రేకు: 0338-03 బౌళి సం: 04-222 నృసింహ, హరిదాసులు

పల్లవి: ఏమిటికిఁక నితరపుణ్యములు
తాము దామె హరి దాసుఁడ నేను

చ. 1: దురితములు హరి తొల్లే తను
శరణన్నపుడె చాలించినాఁడు
నరకములు మరినాఁడే
తిరుమంత్రముచేఁ దీరిచినాఁడు

చ. 2: పుట్టుగులు హరి భువి మునుపే
గట్టిముద్రలనే కడపినవాఁడు
నట్టుకొను అజ్ఞానము వెనకకే
పట్టి గురునిచేఁ బాపినవాఁడు

చ. 3: యిహపరము లివియును నపుడే
సహజధర్మమున జరపినవాఁడు
విహితముగా శ్రీవేంకటపతి నను
బహుదాసులలోఁ బాలించినాఁడు

రేకు: 0338-04 ఆహిరి సం: 04-223 అధ్యాత్మ

పల్లవి: ఆపదలులేని సుఖ మదియెపో విరతి
వోపితేనే కైకొంట వొల్లకుంటే మానుట

చ. 1: అలిగించు మలిగించు నంతలోనే భ్రమయించు
కొలఁది సంసారపుగుణ మిది
మలసి రాలుదింటా మలిగండ్లననేల
వొలిసితేఁ గైకొంట వొల్లకుంటే మానుట

చ. 2: ఆపపెట్టు మోసపెట్టు నంతలోనే వాసిపెట్టు
గాసిల నీసిరులకు గల దిది
వేసరి చానిపిఁ జవి వెదక నదిఁకనేల
పూసివాసిఁ గైకొంట వొల్లకుంటే మానుట

చ. 3: మరపించుఁ దలపించు మరి యేమైనాఁ జేసు
మరియును దనకర్మమహిమిది
గురిగా శ్రీవేంకటేశుఁ గొలిచినవారి కిది
వురుకైనఁ గైకొంట వొల్లకుంటే మానుట

రేకు: 0338-05 సాళంగనాట సం: 04-224 శరణాగతి

పల్లవి: నీటముంచు పాలముంచు నీచిత్త మిఁకను
చాటితి నీకృప గురి సంసారమునకు

చ. 1: హరి నీవే గురి నాయాతుమలోపలికి
అరిది శంఖచక్రాలే యంగపుగురి
పరమపదమే గురి పట్టినవ్రతమునకు
తిరుమంత్రమే గురి దిష్టపునాలికకు

చ. 2: గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు
తావుల నాభక్తికి నీదాసులే గురి
ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి
దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు

చ. 3: నగుశ్రీపతి గురి నన్ను రక్షించుటకును
తగుసంకీర్తన గురి తపమునకు
తెగనిజ్ఞానమునకు తిరుమణులే గురి
మిగుల శ్రీవేంకటేశ మించి నీవే గురి

రేకు: 0338-06 లలిత సం: 04-225 గురు వందన, నృసింహ

పల్లవి: బంటుకు బంటవుదురా పాపముగాక నీ-
బంటుకు బంట్లమై బదికేము నేము

చ. 1: పాతాళమునను్న బలివాకిలి గాచేవు
దూతవై పాండవుల పొందున నుంటివి
యీతల యేలిక బంటు యీవరుస దప్పె నిఁక
చేతనే నిన్నుఁగొలువఁ జింతయ్యీ నిందుకే

చ. 2: పాండవులదూతవై పనిసేసితివి వారు
అండ నీదూతలయ్యేది అమరుఁగాక
నిండి గురు దైవమనే నియమము దప్పె నిదే
మెండు నీదాసులకెల్ల మేర మితి యేదయ్యా

చ. 3: పరగ నౌలే నీవు భక్తవత్సలుండ వౌదు
తిరమై యెరఁగకాడితిమి యిందాఁకాను
అరుదైన శ్రీవేంకటాద్రీశుఁడవు నీకు
సిరులనే శరణంటిఁ జేసినట్టు సేయవే

రేకు: 0339-01 మాళవశ్రీ సం: 04-226 విష్ణు కీర్తనం

పల్లవి: వేగిరించనేల విష్ణుఁడే యింతకుఁ గర్త
బాగుగా నాతనియిచ్చఁ బరగుటేకాక

చ. 1: తలపోఁతలేల దైవము గలుగఁగాను
చెలఁగి యాతఁడే యిన్నీఁ జేసీఁగాక
యిల నేఁడె పుట్టెనా యింకాఁ గలది గాదా
పలులోకాలు నడప భారము దేవునిదే

చ. 2: చింత లికనేలా శ్రీపతి గలుగఁగాను
మంతుకుఁ బుట్టించి తానే మనుపుఁగాక
వింతా యీ దేహము వేరా యీ యింద్రియాలు
యింతట బ్రహ్మాండనాథుఁ డిందరికి నొకఁడే

చ. 3: సిలుఁగు గోరికలేల శ్రీవేంకటేశ్వరుఁడు
కలఁ డాతఁడే మనలఁ గాచీఁగాక
వెలసి యాతనిమాయే విశ్వమింతా నిండినది
తెలిపి రక్షించుటకు దిక్కు దెస యితఁడే

రేకు: 0339-02 వరాళి సం: 04-227 వైరాగ్య చింత

పల్లవి: అటు గొన్నాళ్లందాఁక యిటు గొన్నాళ్లిందాఁక
కటకటా శునకపు గతి యాయఁ గావవే

చ. 1: పసిమిఁ బాపమనేటి బందెలు మేసితిని
కసరి దేహపు కట్టుగాడి నుంటిని
కొసరి కర్మపుమెడగుదియ మోఁచితిని
పసురమువంటివాఁడఁ బాలించవే

చ. 2: పంచేంద్రియములనే బాడిగె మోఁచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి
పంచల నాసలచేత బందమ వెట్టించుకొంటి
ముంచినగుబ్బమువంటి మూఢుఁడఁ గావవే

చ. 3: మరిగి `యజ్ఞాన'మనేమద మెత్తి తిరిగితి
`మరుఁ 'డనే మావటీని మాయఁ జిక్కితి
గరిమ శ్రీవేంకటేశ కరిఁ గాచితివిగాన
కరి నైతి నన్ను నీవు కరుణించవే

రేకు: 0339-03 దేసి సం: 04-228 మనసా

పల్లవి: లోకమింతా నిండె లోచూపు వెలిచూపు
శ్రీకాంతుఁడై తోఁచె చిక్కినవి యాలా

చ. 1: సకలజీవులలోన సర్వేశ్వరుఁడు వాఁడె
వొకరి నొఁగాదన నోపను నేను
అకట యాతనిచేఁతే అందరునుఁ జేసేవారే
వికటాలెందుకు నాడ వెరపయ్యీ నాకు

చ. 2: భువియందు దీని యందు పురుషోత్తముఁడు వాఁడె
వివరించ మేలు గీడు వెదక నే నోప
చెవి విన్న మాటలెల్ల శ్రీపతియై తోఁచీని
ఇవల కల్లనిజాలు యెంచఁజాల నేను

చ. 3: పగటందు రేయందు పరమాత్ముఁడు వీఁడె
తగిలి పాసే నన్న తలఁపునోప
జిగి మించ నాలోన శ్రీవేంకటేశుఁడే
బగివాయఁ డెన్నఁడును బదుకవో మనసా

రేకు: 0339-04 లలిత సం: 04-229 నామ సంకీర్తన

పల్లవి: వర్ణాశ్రమములాల వడిఁ జిత్రగుప్తులాల
వర్ణించి మమ్మిఁకఁ దడవకురో మీరు

చ. 1: చదువులు దెచ్చినట్టి సర్వేశుఁ గొలిచితి
చదువు నామారతఁడు చదివీఁ బోరో
అదన యోగీంద్రవంద్యుఁడైన కృష్ణుఁ గొలిచితి
చదల నాయోగములు సాదించు నతఁడే

చ. 2: కూరిమి యజ్ఞకర్తైనగోవిందుఁ దలఁచితి
చేరి నామారతఁ డవి సేసీఁ బోరో
ఆరయ విజ్ఞానమూర్తియైన హరి శరణంటి
పూరకె నాకాతఁడవి వుత్తరువిచ్చీని

చ. 3: దేవతాశిఖామణియైన దేవునిఁ బూజించితిని
దేవఋషిఋణములు తీరిచీఁబోరో
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
చేవఁ బాపాలెల్లఁ బాసె సెలవిచ్చెఁ జేతలు

రేకు: 0339-05 దేశాక్షి సం: 04-230 నామ సంకీర్తన

పల్లవి: ఊరకే నోరుమూసుక వొంటి నీకు మొక్కేమయ్య్య
చేరి నారాయణ నీవు చేసినట్టు సేయవే

చ. 1: హరినామముఁ దలఁచి అణఁచేనంటేనయ్య్య
సరి నా పాతకములు చాల వందుకు
నరహరినామ మెంచి నాకుఁ గూడపెట్టేనంటే
అరుదైన పుణ్యములు అన్నిలేవు భూమిని

చ. 2: రామనామము నొడిగి రవ్వల బోఁజోఁపే నంటే
తామసపునరకాలు దగ్గరవందు
వామననామమెంచి వరస్వర్గ మెక్కేనంటే
యేమిటా నాకడ వారికెడచా దదియు

చ. 3: గోవిందనామముచేతఁ గుదించే భవములంటే
పావనమాయను నీభక్తివల్లను
శ్రీవేంకటేశ నేను చేకొని నీశరణంటి
యేవిధులు నెరఁగను యిదివో నీచిత్తము

రేకు: 0339-06 బౌళిరామక్రియ సం: 04-231 వైష్ణవ భక్తి

పల్లవి: జ్ఞానంబొకటే జగమున కధికం మరి
నానావిధములు నటనలు

చ. 1: బహుదానఫలము పడయుటకంటే
యిహమున వైరాగ్య మెక్కుడు
సహజకర్మములు శతములకంటే
అహిశయనుని భక్తధికము

చ. 2: ధరఁ దపములనంతంబులకంటే
గరిమల శాంతము ఘనము
విరసాచారము వేవేలకంటే
హరినామపఠన మధికము

చ. 3: ఆవల వ్రతములు అన్నిటికంటే
శ్రీవైష్ణవమే శేఖరము
శ్రీవేంకటేశ్వరుచేఁతలె యివిగన
సేవ యిదొకటే చింతింప ఘనము

రేకు: 0340-01 మంగళకౌశిక సం: 04-232 భక్తి

పల్లవి: మమ్ముఁజూడనేల నీమహిమే చూతువుగాక
వుమ్మడిఁ బరుస మంటే దొక్కమాఁటేకాదా

చ. 1: పెక్కుమారులు నిన్నుఁ బేరుకొని జపించఁగ
మక్కళించి నీకుఁ గొంత మహిమెక్కీనా
వొక్కమారు జపించి నే నూరకుండినంతలోనే
తక్కక నీమహిమలోఁ దరగి పోయీనా

చ. 2: తగిలి నేఁ గాలమెల్ల ధ్యానము సేయఁగ నీకు
జిగి నీమేనికిఁ గింత చేవ యెక్కీనా
అగపడి యొకవేళ నటు దలఁచి మానితే
చిగురై యంతటిలోనె చిక్కి వాడీనా

చ. 3: యిన్ని యాల శ్రీవేంకటేశ మాయింటిలోననే
వున్నతి నీవారమని వుంటేఁ జాలు
సన్నము దొడ్డెంచనేల సరివలసీచోట
అన్నియు నిత్యమింతే యలమట కోపము

రేకు: 0340-02 మాళవి సం: 04-233 అంత్యప్రాస

పల్లవి: ఇదిగో రూపై తోఁచీ యిందరియెదుట నివి
మదిఁ జేపట్టేదిలేక మానెఁగాని

చ. 1: కోపమై పొడచూపుఁ గొంత పాపము
దీపమై పొడచూపు దేహ పాపము
మాపులు నిద్దురై చూపు మరికొంత పాపము
కైపుగాఁ బరుల నింద కడమ పాపము

చ. 2: శాంతమే పుణ్యము సత్యదయే పుణ్యము
అంతటాను హరిభక్తి యది పుణ్యము
చింతించ వైరాగ్యమే చేతిలోని పుణ్యము
మంతనపుజ్ఞానమే మహిఁగల పుణ్యము

చ. 3: హరినామమే ముక్తి యరసి కైకొంటేను
ధర నాతనిదాస్యమే తగిన ముక్తి
సొరిది శ్రీవేంకటేశుఁడే పరతత్త్వము
యిరవై కొలుచుటే యిహ నిత్యముక్తి

రేకు: 0340-03 పాడి సం: 04-234 కృష్ణ

పల్లవి: అనుచుఁ బొగడఁ జొచ్చెరదె బ్రహ్మాదులు మింట
మొనసి యీ బాలునికే మొక్కేము నేము

చ. 1: వున్నతపు లోకములు వుదరాన నున్నవాఁడు
అన్నువ నీ దేవకిగర్భమందు వుట్టెను
మన్నించి యోగీంద్రులమదిలోనుండెడువాఁడు
పన్నిన పొత్తులలోన బాలుఁడై వున్నాఁడు

చ. 2: పాలజలధిలోన పాయనిగోవిందుఁడు
పాలు వెన్న లారగించె పైఁడికోరను
వోలిఁ దన విష్ణుమాయ నోలలాడినట్టివాఁడు
చాలి మంత్రసానులచే జలకమాడీని

చ. 3: ముగురువేల్పులకు మూలమైన యట్టివాఁడు
తగుబలభద్రునికి తమ్ముఁడాయను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లెనుండి
యెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీఁడే

రేకు: 0340-04 శుద్ధవంతం సం: 04-235 భక్తి

పల్లవి: హరిపూజే బ్రహ్మాండ మవ్వలి కవ్వలగాని
యెరవెల్లా నాసందికీసందివే

చ. 1: తపములు జపములు దానధర్మములెల్ల
యెపుడును బ్రహ్మలోక మీసందివే
విపరీతభోగాలు వెలలేనిపుణ్యాలు
కపురులు స్వర్గలోకముకాడివే

చ. 2: వట్టి సటరాజసాలు వర్ణాశ్రమములును
పుట్టుగులిన్నియును యీభూమిమీఁదివే
చుట్టపు సంబంధాలు జోలి వావివర్తనలు
దిట్టతనములెల్ల యీదేహముతోడివే

చ. 3: పూఁటపూఁటకోరికలు పొరలేవుపాయాలు
మాఁటలుఁదేటలునెల్ల మతిలోనివే
గాఁటపు శ్రీవేంకటేశుగని కొలిచినఁజాలు
నాఁటకపు మతములు నవ్వులలోనివే

రేకు: 0340-05 హిందోళం సం: 04-236 నామ సంకీర్తన

పల్లవి: ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు

చ. 1: నగధర నందగోప నరసింహ వామన
జగదేకపతియనే జపము మాది
తగు హరిడింగరీఁడ దాసుఁడ బంటననేటి-
మిగులఁ బెద్దతనము మించేది మాకు

చ. 2: హరి పుండరీకాక్ష ఆదినారాయణయనేటి-
ధర నామమంత్రములే ధనము మాకు
సరుస శంఖచక్రాలు సర్వేశుదాసుల సేవె
మరిగినదె మామతమును మనికె

చ. 3: శ్రీవేంకటేశయని శేషగిరివేదాద్రి
భావించి కొలుచుటే మాబ్రదుకెల్లను
కైవల్యమిదియె కంటి మిట్టి మంచిత్రోవ
పావనమైతిమి మమ్ముఁ బాలించె నితఁడు

రేకు: 0340-06 శంకరాభరణం సం: 04-237 కృష్ణ

పల్లవి: ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ
గాఁటపు దేవతలెల్లఁ గాచుకున్నా రితని

చ. 1: చెక్కుమీఁటి పాలువోయి చేరి నోరు దెరచితే
పక్కననుఁ బొడచూపె బ్రహ్మాండాలు
అక్కున నలముకొంటే నంగజతాపము మోఁచె
మక్కువకు వెరతుము మాయపు బాలునికి

చ. 2: పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగుదోఁచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకొన్న వేకమై యెవ్వరికి వసగాఁడు
హత్తిచూడ వెరతు మీ యారడిబాలునికి

చ. 3: తేటి వీనితోడిముద్దు దేవలోకము పనులు
మీటి యేవి చూచినాను మితిలేనివి
ఆటిడిగొల్లెతలము అట్టె కూడి యాడితిమి
వేటు సేయ వెరతు శ్రీవేంకటాద్రిబాలుని

రేకు: 0341-01 భూపాళం సం: 04-238 విష్ణు కీర్తనం

పల్లవి: కన్నవారివద్ద నెల్లఁగావంగ నేమిగద్దు
యిన్నిటికి నియ్యఁగొన నీతఁడే స్వతంత్రుఁడు

చ. 1: పరమేష్ఠిగన్నతండ్రిఁ బాటించి కొలువరో
అరుదై లోకాలకెల్ల నతఁడే తండ్రి
సిరిమగఁడైనవానిఁ జేపట్టి తలఁచరో
సిరులిచ్చేమేఁటిదాత సృష్టికెల్ల నతఁడే

చ. 2: అంబరీషుఁ గావఁ జక్రమంపినవానిఁ జేరరో
అంబుజభవాండాన కతఁడే రక్ష
పంబిన భూకాంతపతిఁ బాయక సేవించరో
పుంబళ్ళు వూళ్ళు నిచ్చేవున్నతుఁడు నతఁడే

చ. 3: మూలమంటేఁ గరిఁగాచేముఖ్యునికి మొక్కరో
మూలధనమైయుండీ ముందర నిట్టె
యీలీలఁ జిత్తజుతండ్రి నెదలోనఁ గొలువరో
పాలించ శ్రీవేంకటాద్రిపతియాయ నితఁడే

రేకు: 0341-02 లలిత సం: 04-239 విష్ణు కీర్తనం

పల్లవి: తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని
యెల్లసందేహాలు బాసె నిఁకనేల చింత

చ. 1: నారదుఁడు సోదించి నారాయణు నెరిఁగె
సారెకు శివుఁ డెరిఁగె చాటె రాముని
చేరి సోదించెఁ బార్వతి శ్రీరామచంద్రుని
యేరీతుల సోదించేము యింతకంటె నేము

చ. 2: వేదవ్యాసులు దెలిసే వెదకి విష్ణునిఁ జెప్పె
సాదించితని యోగిసనకాదులు
యీదెస శుకాదులెల్ల నెరిఁగిరి మాధవుని
కాదని వీరికంటె గతి గానఁగలమా

చ. 3: పెక్కుగాలము చదివి పెక్కేండ్లుబదికి
పెక్కు రుషులిందుననె పెద్దలైరి
దక్కఁగ శ్రీవేంకటేశు ధనముగాఁ జూపి రిదె
తక్కక కొలిచితిమి దైవమని కంటిమి

రేకు: 0341-03 కాశి సం: 04-240 విష్ణు కీర్తనం

పల్లవి: నీవంటిదైవాలు వేరీ నిఖిలలోకములందు
యీవల నావల నెందు నెంచి చూడ మాకును

చ. 1: తగిలి నీమోముచక్కఁదన మెంచి చూచితిమా
తగిన మరునిఁగన్న తండ్రివి నీవు
అగపడ్డనీగుణము లవి యెంచిచూచితిమా
నిగిడి కల్యాణగుణనిధివనీ శ్రుతులు

చ. 2: గుట్టు నీపెద్దతనము కులమెంచిచూచితిమా
అట్టె బ్రహ్మకులము నీయందుఁ బుట్టెను
దట్టపు నీపనులవర్తన మెంచి చూచితిమా
ముట్టి సర్వరక్షకత్వమున వెలసితివి

చ. 3: బెడిదమైననీబిరు దెంచిచూచితిమా
వడి శరణాగతవత్సలుఁడవు
కడఁగి శ్రీవేంకటేశ కంటిమి నీమహిమలు
బడి నిన్నే సేవించి బ్రదికితి మిదివో

రేకు: 0341-04 మంగళకౌశి (క) సం: 04-241 శరణాగతి

పల్లవి: నీవనేనమ్మినయట్టినీవారము
వేవేలువిధాలఁ జేసే విన్నపమిదయ్యా

చ. 1: పండెనుమాకర్మములు పాలు గోరు గొనవయ్య
అండనె నామతిలోని అంతర్యామి
నిండెనునాకోరికలు నినుపువారిధులై
వెండిబంగారాలతోడ విఱివీఁగవయ్యా

చ. 2: మలసె మాపుట్టుగులు మారుమూలసరకులై
కలసుంకము దీరుచు కరుణాకర
వెలసె సంసారాలు వెక్కసపుఁ బౌఁజులై
తొలఁగక యిటు నీవు తోడుచూడవయ్యా

చ. 3: కూడెను మానుతులనే గోకులపుఁ గదుపులు
యీడుగాఁ బుల్లరి గొని యేలవయ్యా
వోడక శ్రీవేంకటేశ వొప్పగించితిమి నీకు
వేడుకలు దైవార విహరించవయ్యా

రేకు: 0341-05 నాగవరాళి సం: 04-242 వైరాగ్య చింత

పల్లవి: వెగ్గల మింతా వృథా వృథా
తగ్గి పరులతో దైన్యములేలా

చ. 1: పెంచఁగబెంచఁగఁ బెరగీ నాసలు
తుంచఁగఁదుంచఁగఁ దొలఁగు నవి
కంచముకూడును కట్టినకోకయు
వంచనమేనికి వలసినదింతే

చ. 2: తడవఁగఁదడవఁగఁ దగిలీబంధము
విడుఁవగఁ విడువఁగ వీడునవి (ది?)
గుడిశలోన నొకకుక్కి మంచమున
వొడలు సగమునను వుండెడిదింతే

చ. 3: మరవఁగమరవఁగ మాయలే యింతా
మురహరుఁదలచితే మోక్షము
నిరతి శ్రీవేంకటనిలయుఁడే కాయపు-
గరిమెల నిలిచిన కాణా చింతే

రేకు: 0341-06 శుద్ధవసంతం సం: 04-243 విష్ణు కీర్తనం

పల్లవి: హరి నీవు లేవా అన్నిచోట్లను తొల్లి
అరయ నీదాసులే యరు దింతేకాక

చ. 1: కంటిమినీదాసులను కన్నులపండుగగాను
కొంటిమి పాదతీర్థము కొల్లలుగాను
వింటిమి నీనామములను వీనులపండుగగాను
అంటిన మోక్షముత్రోవ అడుగనేమిటికి

చ. 2: నుతించి మాటాడితిమి నోరార నీదాసులను
మతిఁజొక్కితిమి దాస్యమహిమచేత
మతిగంటిమి వారిసంగతి కూటములవల్ల
వెతకి విజ్ఞానము వేఁడనేమిటికి

చ. 3: మొక్కితిఁ జాగిల నీమోహపు దాసులకును
యెక్కితిఁ బరమపదమిహమందునే
తక్కక మన్నించిరి నీదాసులె నన్నన్నిటాను
గక్కన శ్రీవేంకటేశ కడమ లేమిటికి

రేకు: 0342-01 సాళంగం సం: 04-244 శరణాగతి

పల్లవి: హరివల్ల కడమలే దంతనంత నున్నవాఁడు
గరిమఁ గాననివారికల్ల యింతే సుండీ

చ. 1: లోనఁ హరిఁ దలచితే లోపలందె పొడచూపు
పూని వెలిఁ దలచితే భూమినల్లాఁ బొడచూపు
తానే యిందరిలోన దైవమయి వున్నవాఁడు
కానకవుండినవారికల్ల యింతే సుండీ

చ. 2: పట్టి విచారించుకొంటేఁ బ్రాణముతోఁ బొడచూపు
జట్టిఁదనదండనల్లా సంసారమై చూపు
పట్టపగలై వున్నాఁడు బాయట నెందు చూచిన
గట్టిగా గాననివారికల్ల యింతే సుండీ

చ. 3: శరణుచొచ్చితేనె చేతిలోనే వున్నవాఁడు
పరమభాగవతులపలుకులో నున్నవాఁడు
యిరవుగ శ్రీవేంకటేశుఁడెదుటనే వున్నాఁ డతని-
కరుణ గాననివారికల్ల యింతే సుండీ

రేకు: 0342-02 ఆహిరి సం: 04-245 వైష్ణవ భక్తి

పల్లవి: మాకు నేమీఁ బనిగాదు మరి యేమిగలిగినా
శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల

చ. 1: ధరణీశుపనులకుఁ దగు బందె లేదట
హరిదాసులకుఁ బాపమంటునా మరి
సరిఁ జక్రపుడాగు లిచ్చుటఁ జూచుకోరో మీరు
అరసి మీఁదటిమాట లాతని నడుగరో

చ. 2: లావరిమన్ననపాత్రులకు వెట్టి లేదట
కావింప వైష్ణవులకుఁ గర్మమున్నదా
దేవునిలాంచన మిదె తిరుమణి చూచుకోరో
ఆవల నేమిగల్లాను ఆతని నడుగరో

చ. 3: సతి రాణివాసమైతే జాతికులమెంచరట
హితశరణాగతులకేది జాతి
తతి శ్రీవేంకటపతిదాస్య మిది చూచుకోరో
యితవై మరేమిగల్లా నీతని నడుగరో

రేకు: 0342-03 లలిత సం: 04-246 శరణాగతి

పల్లవి: ఎంచి చూచితే మాకు నిందే నిత్యసుఖము
కొంచి యనుమానమైతే కొనదాఁకా లేదు

చ. 1: హరి నీగర్భములోన నంగమయి వున్నారము
యిరవై వేరేమోక్ష మెంచ నున్నదా
నిరతిఁ జూచినవెల్లా నీరూపులే మాకు
ధరలోన నింతకంటె ధ్యానమున్నదా

చ. 2: అంతరాత్మవైన నిన్నే యాతుమకు నిచ్చితిని
యింతకంటె నే నడిగేది యిఁకనున్నదా
పొంతనే భూకాంత పుట్టిన నెలవు మాకు
యింతకంటె తల్లిదండ్రు లిఁకనున్నారా

చ. 3: పొరి నెరుకే జ్ఞానము పొంచి మరపే సమాధి
సొరిది నేఁడింతకంటే సుఖమున్నదా
గరిమ శ్రీవేంకటేశ కల్పితమింతా నీదె
శరణంటే యింకా విచారమున్నదా

రేకు: 0342-04 శుద్ధవంతం సం: 04-247 వైరాగ్య చింత

పల్లవి: దైవమా నీచేఁతలు తప్పదు మా రోఁతలు
యేవలఁ జూచిన బాయ దేమందమయ్యా

చ. 1: కాయములో హేయమదె కమ్మఁబూఁత మీఁద నదె
రోయదు చిత్తమునకు రుచియే తోఁచీ
మాయలనే పారలేది మాఁటలనే విసిగేది
యేయెడఁ గనీ గాన మేమందమయ్యా

చ. 2: పుట్టుగది యెంగిలి పూఁచిన దాచారము
గుట్టు చెడదందునాను గుణమే తోఁచీ
వట్టియాసఁ బొరలేది వంతఁ బడి తిరిగేది
యెట్టు వేగించఁగవచ్చు నేమందమయ్యా

చ. 3: నిక్కిచూచితే నెరుక నిద్దిరించితే మరపు
మక్కళించినబదుకు మంచిదై తోఁచీ
మిక్కిలి శ్రీవేంకటేశ మీకు నేను శరణంటే
యెక్కువాయ నాపదవి యేమందమయ్యా

రేకు: 0342-05 శ్రీరాగం సం: 04-248 మాయ

పల్లవి: అటమీఁదిపనులకు హరి నీవే కలవు
సటలైన నిజమైనా జరపేముగాక

చ. 1: పరమాత్మ నీమాయఁ బాయగ నే నెంతవాఁడ
దొరయైతే రాజాజ్ఞ దోయవచ్చునా
తొరలిన యింద్రియాలఁ దోసిపోవ నెట్టువచ్చు
సిరుల నేలికపంపు సేయు టింతేకాక

చ. 2: శ్రీపతి యీసంసారము సేయకుండ నెంతవాఁడ
మాపుదాఁకా రాచవెట్టి మానవచ్చునా
పాపపుణ్యము లొల్లక పరగ నాకెట్టు వచ్చు
తేపఁ దల్లి వుగ్గువెట్టఁ దినకుండవచ్చునా

చ. 3: దేవ నీవిచ్చినమేను తెగి రోయ నెంతవాఁడ
కావించి రాచయీవికిఁ గడమున్నదా
శ్రీవేంకటేశ నీచిత్తములోవాఁడ నింతే
యేవిధిఁ బెట్టినా నేనియ్యకొంటగాక

రేకు: 0342-06 భైరవి సం: 04-249 కృష్ణ

పల్లవి: అనుచు మునులు ఋషు లంతనింత నాడఁగాను
వినియు విననియట్టె వీడె యాడీఁగాని

చ. 1: ముకుందుఁ డితఁడు మురహరుఁ డితఁడు
అకటా నందునికొడుకాయఁగాని
శకుంతగమనుఁ డితడు సర్వేశుఁ డితఁడు
వెకలి రేపల్లెవీధి విహరించీఁగాని

చ. 2: వేదమూరితి ఇతఁడు విష్ణుదేవుఁ డితఁడు
కాదనలేక పసులఁ గాచీఁగాని
ఆదిమూల మితఁడు యమరవంద్యుఁ డితఁడు
గాదిలిచేఁతల రోలఁ గట్టువడెఁగాని

చ. 3: పరమాత్ముఁ డితఁడే బాలుఁడై వున్నాఁడుగాని
హరి యీతఁడే వెన్నముచ్చాయఁగాని
పరగ శ్రీవేంకటాద్రిపతియును నీతఁడె
తిరమై గొల్లెతలచేఁ దిట్టువడీఁగాని

రేకు: 0343-01 మలహరిసం: 04-250 భక్తి

పల్లవి: మానరో వో లోకులాల మాకు మీకు నేమి దోడు
నాఁటికిఁక మీకు నవ్వుఁబాటు నేము

చ. 1: యిరవై నానోటికి యెన్నెన్ని చదివిన
హరియనేయంతరుచి అందు లేదు
గరిమ నెన్నిరూపులు కన్నుల నేఁ జూచినాను
పురుషోత్తముఁ జూచినపూర్తి యందు లేదు

చ. 2: యెచ్చోట నుండినాను యిందిరేశుమందిరము
చొచ్చి యుండేసుఖ మంత చొప్పడ దందు
కచ్చుపెట్టి వీనులకుఁ గతలెన్ని విన్నాను
అచ్చుతుకీర్తన వినేయందు సరి రాదు

చ. 3: కైపుగాఁగ కన్నవారికాళ్ళకు మొక్కినాను
శ్రీపతికిమొక్కినంత సెలవు గాదు
యేపున శ్రీవేంకటేశు నిటులఁ బూజించినట్టు
మాపుదాఁకా నితరుల మనసురాదు

రేకు: 0343-02 దేవగాంధారి సం: 04-251 విష్ణు కీర్తనం

పల్లవి: పట్టిన ముట్టనుండరు పదరుదు రంతలోనే
యెట్టనెదుటిమిమ్ము నెరిఁగీ నెరఁగరు

చ. 1: గుక్కక మూఁడులోకాలు గొలిచితివని నీకు
మొక్కుదురు; పరులకు మొక్కకుండరు
అక్కరదీర శ్రీపతివని నిన్ను వేఁడుదురు
వెక్కసపుఁ దైవాల వేఁడుకోక మానరు

చ. 2: కందువ బ్రహ్మగన్నట్టి ఘనుఁడవు నీవార-
మందురు; పరులవారమనకుండరు
అంది వేదాలు దెచ్చేయాతఁడవు నీవే యని
యెందు నెంచి, పరులను యెంచకుండరు

చ. 3: యిత్తల నారదాదుల కేలికని నీమరఁగు
చొత్తురు; పరులమాఁటు చొర కుండరు
అత్తిన శ్రీవేంకటేశ యన్నియు నీమాయలింతే
యెత్తిన వెఱ్ఱులు లోకులిట్టే భ్రమతురు

రేకు: 0343-03 లలిత సం: 04-252 శరణాగతి

పల్లవి: ఇంక నేమిసేసేము యిన్నిటాఁ దనిసితిమి
సంకెలెల్లాఁ దీరెఁ దీరె చాలుఁజాలుఁ గర్మము

చ. 1: కోరి పుణ్యము లేమైనాఁ గొన్ని సేసేమంటిమా
కోరిక లిచ్చేటి హరి కూడి మాలోనున్నాఁడు
చేరఁ జోటువెదకి పొంచి తిరిగేమంటిమా
చేరేటివైకుంఠపతి చేతిలో నున్నాఁడు

చ. 2: భవహరముగ వేదపఠన సేసేమంటే
భవహరమగుహరిపాటలు నోట నున్నవి
తవిలి సంపదలకై దానమిచ్చేమంటిమా
భువిలోన శ్రీపతి మాపూజలో నున్నాఁడు

చ. 3: యిహసుఖములకుఁగా యిందరి వేఁడేమంటే
యిహమిచ్చేశ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు
సహజమయినయట్టిసర్వేశఁ డీతడే
మహిమలన్నియుఁ దానె మాకు నిచ్చినాఁడు

రేకు: 0343-04 ధన్నాసి సం: 04-253 మాయ

పల్లవి: నీవే దయసేసి నేఁడు మమ్ముఁ గాతుగాక
శ్రీవల్లభుఁడ నీకు సేవ సేసే వారమా

చ. 1: యిదిపుణ్య మిది పాప మెట్టని తెలిసేమయ్య
అదన నన్నపు నామే యన్నువట్టెను
యిదెదైవ మిదెగురుఁ డెట్టని యెరిఁగేమయ్య
మొదల నానాయోనిముట్టంటువారము

చ. 2: ఆచారమేది యిఁక ననాచారమేదయ్య
కాచినయాఁకటికరిగాపులము
యేచినబంద మిది మోక్ష మిది యనలేమయ్య
పూచినపంచేంద్రియాలపొరుగైతి మిదివో

చ. 3: ముంద రిది వెన కిది ముట్టి యేమనెంచేమయ్య
కందువసంసారపుగర్వ మెక్కెను
అందపు శ్రీవేంకటేశ యన్నియు నీమాయ లివి
పొంది నీకొప్పనసేసి భోగించేమయ్య

రేకు: 0343-05 పళవంజరం సం: 04-254 మాయ

పల్లవి: హరినే యడుగరో ఆమాఁట
సరుగ నిందరికి సర్వేశ్వరుఁడు

చ. 1: కామముఁ గ్రోధము కాయపు గుణములు
నేమపుటాత్మకు నిందేది
గామిడి మాయే కర్త యిందుకును
సోమరి మమ్మంటఁ జోటేది

చ. 2: పాపముఁ బుణ్యము భావవికారము
పైపై నాత్మకుఁ బనిలేదు
శ్రీపతి పంపిటు సేసితి మింతే
తాప మమ్ముఁ దగులఁ దగవేది

చ. 3: కాయముఁ బ్రాయము కర్మపు గుణములు
సేయని యాత్మకు సెలవేది
యేయెడ శ్రీవేంకటేశునాజ్ఞలివి
చాయల నితనికి శరణంటిమి

రేకు: 0343-06 నాదరామక్రియ సం: 04-255 దశావతారములు

పల్లవి: కలఁడా యింతటి దాత కమలనాభుఁడేకాక
కలఁడన్న వారిపాలఁ గలిగిన దైవము

చ. 1: యిచ్చెను సంపద లితఁడింద్రాదులకునెల్ల
యిచ్చెను శుకాదుల కిహపరాలు
యిచ్చెను వాయుజునికి యిటమీఁద బ్రహ్మపట్ట-
మిచ్చుల ఘంటాకర్ణుని కిచ్చెఁ గుబేరత్వము

చ. 2: కట్టెను ధ్రువపట్టము కమలజుకంటే మీఁద
కట్టె విభీషణుకు లంకారాజ్యము
కట్టియిచ్చె నజునికి గతచన్నవేదాలు
కట్టెను శ్రీసతిచేత గంకణసూత్రములు

చ. 3: పెట్టెను దేవతలకు పేరినమృతపువిందు
వెట్టెను భక్తవత్సలబిరు దితఁడు
యిట్టె శ్రీవేంకటాద్రి నిందరికిఁ బొడచూపి
పెట్టెఁ దనపస్రాదము పృథివి జీవులకు

రేకు: 0344-01 దేసాళం సం: 04-256 నామ సంకీర్తన

పల్లవి: ఎదురేది యింక మాకు యెందు చూచినను నీ-
పదము లివి రెండు సంపదలు సౌఖ్యములు

చ. 1: గోపికానాథ గోవర్ధనధరా
శ్రీపుండరీకాక్ష జితమన్మథా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీపాదములే మాకు నిధినిధానములు

చ. 2: పురుషోత్తమా హరీ భువనపరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుందరక్షకా
ధరణి నీపాదములె తల్లియును దండ్రి

చ. 3: దేవకీనందనా దేవేంద్రవందితా
కైవల్యనిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావ నీపాదములె గతి యిహముఁ బరము

రేకు: 0344-02 గౌళ సం: 04-257 మాయ

పల్లవి: బాపురే నీమాయ భమ్రయించీ జీవులకు
దాపున నున్నదేకాని దవ్వులకుఁ జొరదు

చ. 1: మోక్షమురుచి గానదు ముందర నుండఁగాను
సాక్షియై జగమిది చవి చూపఁగా
దీక్షకుఁ జొరదు మరి దేవ నీపై భక్తి లేదు
దక్షులై యాలుబిడ్డలు దండనుండఁగాను

చ. 2: జ్ఞానమితవు గాదు సంగడి నుండదుగాన
నానాయోనులమేను ననిచుండఁగా
ఆనకమై వైరాగ్యమంట దలవాటులేక
కానఁబడ కర్మములు గాసిఁ బెట్టఁగాను

చ. 3: మంచిదని నీ తిరుమంత్రము దలఁచుకోదు
పంచేంద్రియములాత్మ బలిశుండఁగా
యెంచుకొని శ్రీవేంకటేశ నీకే శరణని
అంచల నీదాసులైతే నన్నిటా గెలిచిరి

రేకు: 0344-03 పళవంజరం సం: 04-258 కృష్ణ

పల్లవి: వెఱపించబోయి తానె వెఱచెఁ దల్లి యశోద
మఱచి యీబాలు నెట్టు మానిసెంటా నుండెనో

చ. 1: వెంట రాకుమని కృష్ణు వెరపించి యశోద
వొంటి మందలో గొంగ వున్నాఁడనె
అంటి గొంగ యెందునున్నాఁడని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను

చ. 2: చందమామఁ బాడి తల్లి సరిఁ బొత్తుకు రమ్మంటే
చందురుఁ జూచి కృష్ణుఁడు సన్నసేసెను
ముందరఁ జంద్రుఁడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యంటినో యని ముంచి వెరగందెను

చ. 3: పాలార్చి తొట్టెలలోఁ బండఁబెట్టి యశోద
నీలవర్ణుఁ దొంగిచూచె నిద్దురో యని
వోలి శంఖచక్రాలతో నురము శ్రీసతితోడ
యీలీల శ్రీవేంకటేశుఁడై యున్నాఁడు

రేకు: 0344-04 గుజ్జరి సం: 04-259 వైష్ణవ భక్తి

పల్లవి: ఏమన వచ్చును చెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు గొన్ని
శ్రీమాధవ నీ చిత్తము కొలఁదిఁక చెప్పెడిదేఁటికి జీవులకు

చ. 1: కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు మిముఁ దలఁచనివారిది నేరమి
కలుషమెడలి సూర్యోదయమైనా కానవుకొన్నిజంతువులు
తెలిసినవారలు కందురు యీతెరఁగలు రెంటికి దినమొకటే

చ. 2: శరణాగతరక్షణచతుర సర్వాంతరాత్మక యచ్యుత
సరి నిన్నుఁ గొలిచినవారిది పుణ్యము చలమున మానుటే పాపము
సరుగనఁ గాచేటి చల్లని చంద్రుఁడు జారచోరులకుఁ గడు వేఁడి
అరయఁగఁ గలువలకును హితుఁడు అందుకు నిందుకు గురి యితఁడే

చ. 3: శ్రీవేంకటగిరినిలయ శ్రీసతీశ పురుషోత్తమ
మివొద్దనుండితే వైకుంఠము మిమ్ము నెడసితే నరకము
భావములోపల నీవే వుండఁగ భక్తి లేదు కొందరికైతే
శ్రీవైష్ణవులకు నిత్యము యీ చింతలు రెంటికి నీ మహిమే

రేకు: 0344-05 దేసి సం: 04-260 గురు వందన, వైష్ణవ భక్తి

పల్లవి: అజ్ఞానులకివి యరుహము లింతే
సుజ్ఞానులకివి చొరనేలయ్యా

చ. 1: దైవమునమ్మినదాసులకు
కావింపఁగ మరి కర్మము లేదు
దావతిజలనిధి దాఁటినవారికి
వోవల మరియును వోడేలయ్య

చ. 2: గురుకృప గలిగిన గుణనిధికి
అరయఁ బాపపుణ్యము మరి లేదు
విరసపుఁ జీఁకటి వెడలినవారికి
పరగ మరియు దీపంబేలయ్య

చ. 3: జగములెరుఁగు వైష్ణవులకును
తగిలేటి యపరాధంబులు లేవు
అగపడి శ్రీవేంకటాధిపుఁ గొలిచితే
యెగువ దిగువ మాకెదురేదయ్య

రేకు: 0344-06 బౌళి సం: 04-261 వేంకటగానం

పల్లవి: హరి సర్వాత్మకు డాదిమపురుషుఁడు
పొరి నెరుఁగువారి పుణ్యముగాన

చ. 1: నాలుకకొననే నారాయణుఁడిదె
వైళము దలఁచనివారిదె పాపము
నేలయు మిన్నును నిజవైకుంఠము
పోలించి చూడని పురుషుల వెలితి

చ. 2: మనసులోననే మాధవుఁడున్నాఁడు
కనుఁగొనని వారికడ మింతే
తనువే విష్ణుని తత్వసాధనము
వొనరఁగ శ్రీపతి యున్నాఁడుగాన

చ. 3: చేరువ నిదివో శ్రీవేంకటపతి
ధారుణిఁ గొలిచేటి దాసులభాగ్యము
కారణ మితఁడే కలిగినదైవము
కోరినవారల కొంగులపసిఁడి

రేకు: 0345-01 మేఘరంజి సం: 04-262 దశావతారములు

పల్లవి: అని బ్రహ్మాదులెంచేరు హరిబాలలీలలు
వెనక శుకాదులచే వింటిమి నేమిదివో

చ. 1: పొత్తులలోఁ బవ్వళించె పురుషోత్తముఁడు దొల్లి
హత్తి మఱ్ఱాకుపైఁ బండినటువలెనె
వొత్తగిలి బోరగిలి వుండఁజొచ్చెఁ గృష్ణుఁడు
తత్తరానఁ గూర్మావతారమైన గతిని

చ. 2: తప్పుటడుగులు వెట్టె తగఁ ద్రివిక్రముఁడై
గొప్పపాదాలను భూమి గొలచినట్టు
అప్పుడే కొదలు మాఁటలాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
తప్ప నసుర సతులఁ దగఁ బోధించినట్లు

చ. 3: అచ్చపు రేపల్లెలోన నాడఁజొచ్చెఁ గృష్ణుఁడు
మెచ్చుల వైకుంఠాన మెరసినట్లు
నిచ్చలు శ్రీవేంకటాద్రినిలయుఁడై యున్నవాఁడు
అచ్చుగ జీవులలోన నాతుమైనయట్లు

రేకు: 0345-02 గుండక్రియ సం: 04-263 నృసింహ

పల్లవి: నరరూప ప్రహ్లాదనరసింహా
అవిరళతేజ ప్రహ్లాదనరసింహా

చ. 1: పగరపై కోపము బంటుఁజూచి మరచితి
నగుమొగము ప్రహ్లాదనరసింహా
యెగువ నీకోపమున కితఁడె మాఁటుమందు
అగపడె మాకును ప్రహ్లాదనరసింహా

చ. 2: అంటముట్టరానికోప మంగనఁ జూచిమానితి
నఁటుచెల్లుఁ బ్రహ్లాదనరసింహా
జంట నీ బుద్ది తిప్ప సతియె యంకుశము
అంటు వాయమిఁకను ప్రహ్లాదనరసింహా

చ. 3: ధర మొరవెట్ట దేవతలే మొక్కితే మానితి
గరుడాద్రిఁ బ్రహ్లాదనరసింహా
యిరవై శ్రీవేంకటాద్రి నిందు నందు నీదె సుద్ది
అరసితి మిదివో ప్రహ్లాదనరసింహా

రేకు: 0345-03 లలిత సం: 04-264 వైరాగ్య చింత

పల్లవి: ఏదాయ నేమి హరి యిచ్చినజన్మమే చాలు
ఆదినారాయణుఁడే యఖిలరక్షకుడు

చ. 1: శునకముబతుకును సుఖమయ్యే తోఁచుఁగాని
తన కది హీనమని తలఁచుకోదు
మనసొడఁబడితేను మంచిదేమి కానిదేమి
తనువులో నంతరాత్మ దైవమౌట దప్పదు

చ. 2: పురువుకుండేనెలవు భవనేశ్వరమై తోఁచు
పెరచోటి గుంతయైన ప్రియమైయుండు
యిరవై వుండితేఁజాలు యెగువేమి దిగువేమి
వరుస లోకములు "సర్వం విష్ణుమయ"ము

చ. 3: అచ్చమైన జ్ఞానికి నంతా వైకుంఠమే
చెచ్చెరఁ దనతిమ్మటే జీవన్ముక్తి
కచ్చుపట్టి శ్రీ వేంకటపతిదాసుఁడైతే
హెచ్చుకుందేమిలేదు యేలినవాఁడితఁడే

రేకు: 0345-04 ఆహిరి సం: 04-265 శరణాగతి

పల్లవి: ఎందరి వెంటల నేఁగేము
చందపు హరి నీ శరణనియెదము

చ. 1: పెంచినఁబెరుఁగును పెక్కుబంధములు
తుంచినఁదునుఁగును దుఃఖములు
యెంచఁగనేటికి యింద్రియమహిమలు
చుంచుల హరి నీ సూత్రములివియే

చ. 2: పఱపినఁ బారును బహుళపుటాసలు
తఱపినఁ దరగును తన మదము
వెఱవఁగనేఁటికి వెడకర్మములకు
కఱకులహరి నీ కల్పితమివియే

చ. 3: చేసినఁ జెలఁగును జిగి సంసారము
మూసిన ముణుఁగును మోహములు
యీసులఁ శ్రీవేంకటేశ్వర యివి నీ-
దాసులఁ దడవవు తగు నీమహిమ

రేకు: 0345-05 పాడి సం: 04-266 శరణాగతి

పల్లవి: కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ
యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి

చ. 1: మనసులోనికి గురి మాధవ నీ పాదాలు
తనువుపై గురి నీ సుదర్శనము
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు
పను లెన్నిగలిగినఁ బట్టకు నా నేరమి

చ. 2: చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు
నీతి నా నాలికగురి నీ నామము
కాతరపునుదుటికిఁ గల తిరుమణి గురి
పాతకపు నావలనఁ బట్టకుమీ నేరము

చ. 3: యిహపరాలకు గురి యీా నీ శరణాగతి
సహజ మాత్మకు గురి సంతతభక్తి
మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి
బహువిధముల నింకఁ బట్టకుమీ నేరమి

రేకు: 0345-06 నాదరామక్రియ సం: 04-267 అధ్యాత్మ

పల్లవి: దైవము దూరcగనేల తమనేర్పు నేర మింతే
యీవలc దమకర్మము లెంచరు మనుజులు

చ. 1: మొల్లమి గాలియెకటే ముంచి తూరుపెత్తుచోట
పొల్లకట్టు కడcబడె పోగుపడె గట్టివెల్లా
వుల్లములో శ్రీహరి ఒకcడై వుండునతని-
నొల్లరైరి యసురలు వొలిసిరి సురలు

చ. 2: మించిన జల్లి యొకటె మీcదనుండు దొడ్డవెల్ల
చంచుల సన్నములెల్లా సందులc గారు
యెంచcగ హరి యొకcడే యెరcగక కొందరైతే
కొంచమై రీతనిc గొల్చి కొందరైతె ఘనులు

చ. 3: కోవిలలుc గాకులును కోరి యొక్కరీతి నుండు
యీవల వసంతవేళ నేరుపడును
శ్రీవేంకటేశ్వరునిసేవకులు మనుజుల-
భావ మొకరీతి నుండు ఫలములే వేరు

రేకు: 0346-01 సాళంగనాట సం: 04-268 శరణాగతి

పల్లవి: అలబ్రహ్మాదుల కణఁగ దిది
గెలువఁగ వశమా కేశవ మాకు

చ. 1: పాపము మనసునఁ బారకమానదు
కోపము మానఁగఁగూడదు
యేపున దేహం బెన్నాళ్లు మోఁచెను
తీపుల యిది యా దేహపుగుణము

చ. 2: ఆఁకలిదీరదు యటు నానాఁటికి
కాఁకలు మానవు కాంత లేక
మాఁకువంటి జన్మము గలకాలము
చీఁకటి దేహపు చిత్తపుగుణము

చ. 3: నీవు వొసఁగినదె నిర్మలదేహము
నీవె నా నేర్పునేరములు
శ్రీవేంకటేశుఁడ జిగి నీ శరణని
దీవెనఁ బొందితి దేహపుగుణము

రేకు: 0346-02 కేదారగౌళ సం: 04-269 అద్వైతము

పల్లవి: మీ మతము పరిభాష మీవల్లనే పుట్టెఁగాక
యేమునులైనాఁ దొల్లి యెంచిరా యీమాఁట

చ. 1: ముడిగి నాలుగు సూత్రములె మీ వివరణము
కడమ వ్యాససూత్రాలు కల్లలా యేమి
కడు ముఖ్యము మహావాక్యమే చాలుననెను
అడరి వసిష్ఠాదు లాడిరా యీమాఁట

చ. 2: తానె బ్రహ్మమనంటె తగ జీవన్ముక్తినేరు
పూని లోకులెల్లా ముక్తిఁ బొందవలెఁగా
పాని కర్మానుభవాలు బాధితాను వృత్తనేరు
వీనుల సర్వపురాణాలు వింటిమా యీమాఁట

చ. 3: పైకొని బ్రహ్మజ్ఞానము భక్తిరూపము గాదని
చేకొని కొచ్చెదరట్టె శ్రీవేంకటేశు
దీకొనుచుఁ జేసేరు దేవపూజాది యజ్ఞాలు
యేకాత్మవాదులాల యితవా యీమాట-

రేకు: 0346-03 శంకరాభరణం సం: 04-270 అద్వైతము

పల్లవి: చెప్పఁబోతే యీ యర్థము చిత్తము వొడఁబడదు
తప్పులు వెదకకురో తత్వజ్ఞులాల

చ. 1: చెలఁగి మిథ్య యంటాఁ జేసేయజ్ఞాలు ఫలించునా
యిల శూన్యోపాసకుల కేడ దేవుఁడు
లలి మాయా శబళితులకు మోక్ష మెక్కడిది
నలి నభేదవాది కానందానుభవ మేది

చ. 2: హరి శరణుచొరనియట్టివారికి దిక్కేది
గురుఁడు వేరే లేఁడట కోరి వుపదేశమేది
వెరసి శిఖాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరగ భక్తి లేదట భవమేట్టు గడచె

చ. 3: శ్రీవేంకటేశుముద్ర ధరించక వైకుంఠమేది
యీ విభుపేరు జపించకెట్టు పాపా లుత్తరించు
వేవేగ దాసుఁడుగాక వెట్టికేల కరుణించు
సేవించినఁగాక సర్వచింతలేల యుడుగు

రేకు: 0346-04 శ్రీరాగం సం: 04-271 నృసింహ

పల్లవి: అహోబలేశ్వరుఁ డఖిలవందితుఁడు
మహి నితనిఁ గొలిచి మనుఁ డిఁక జనులు

చ. 1: మూఁడుమూర్తులకు మూలం బీతఁడు
వేఁడిప్రతాపపు విభుఁ డీతఁడు
వాఁడిచక్రాయుధవరధుఁ డీతఁడు
పోఁడిమిఁ బురాణపురుషుఁ డీతఁడు

చ. 2: అసురలకెల్లఁ గాలాంతకుఁ డీతఁడు
వసుధ దివ్యసింహం బితఁడు
విసువని యేకాంగవీరుఁ డీతఁడు
దెసలఁ బరాత్పరతేజం బితఁడు

చ. 3: నిగిడి శ్రీవేంకటనిలయుఁ డీతఁడు
బగివాయనిశ్రీపతి యితఁడు
సొగిసి దాసులకు సులభుఁ డీతఁడు
తగు నిహపరములదాతయు నీతఁడు

రేకు: 0346-05 మాళవి సం: 04-272 హనుమ

పల్లవి: అంజినీదేవికొడుకు హనుమంతుఁడు
సంజీవినిదెచ్చినాఁడు సారె హనుమంతుఁడు

చ. 1: కలశాపురముకాడ కదలీవనాల నీడ
అలవాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండలకోన లందలిగుహలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు

చ. 2: పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురలనెల్లఁ గొట్టీ హనుమంతుఁడు
వసుధ బ్రతాపించి వడిఁ దోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు

చ. 3: వుద్దవిడి లంకచొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవేంకటేశు కటుబంటై వరమిచ్చి
కొద్ది మీర సంతోసాలే గుప్పీ హనుమంతుఁడు

రేకు: 0346-06 వరాళి సం: 04-273 హనుమ

పల్లవి: పంతగాఁడు మిక్కిలి నీ పవనజుఁడు

రంతుకెక్కె మతంగపర్వతపవనజుఁడు

చ. 1: వాలాయమై యెంతభాగ్యవంతుఁడో దేవతలచే

బాలుఁడై వరములందెఁ బవనజుఁడు

పాలజలనిధి దాఁటి పరగ సంజీవి దెచ్చి

యేలికముందరఁ బెట్టె యీ పవనుజుఁడు

చ. 2: సొంటులు సోదించితెచ్చి సుగ్రీవు రాఘవునికి

బంటుగాఁగఁ బొందుసేసెఁ బవనజుఁడు

వొంటినే రామునిముద్ర వొసఁగి సీతముందర

మింటిపొడవై పెరిగె మేఁటి పవనజుఁడు

చ. 3: కిట్టి శ్రీవేంకటేశ్వరుకృపచే ముందరిబ్రహ్మ-

పట్ట మేలనున్నవాఁడు పవనజుఁడు

చుట్టి చుట్టి తనకు దాసులయినవారికి

గట్టి వరములిచ్చె నీ ఘనపవనజుఁడు

రేకు: 0347-01 శ్రీరాగం సం: 04-274 రామ

పల్లవి: ఏడకేడ నీచెరిత లేమని పొగడవచ్చు
యీడులేనిమహిమలయినవంశరామా

చ. 1: పరమాన్నములోఁబుట్టి పక్కనఁ దాటకిఁ జంపి
సరుస విశ్వామిత్రుయజ్ఞము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీతఁ బెండ్లాడి
పరశురామునిచేత బలము చేకొంటివి

చ. 2: వైపుగాఁ సుగ్రీవుఁ గూడి వాలి నొక్కకోల నేసి
యేపున జలధి గట్టి యెసగితివి
దీపించు రావణుఁ జంపి దివిజులను మన్నించి
యేపుగా విభీషణుని రాజ్య మేలించితివి

చ. 3: సీతతోఁ బుష్పకమెక్కి జిగి నయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టము గట్టుకొంటివి
యీతల శ్రీవేంకటాద్రి నిటు విజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి

రేకు: 0347-02 ఆహిరి సం: 04-275 నృసింహ

పల్లవి: సులభుఁ డీతఁ డిదివో సుగ్రీవనారసింహుడు
చెలఁగి మొక్కులు మొక్కి సేవించరో

చ. 1: నవ్వులమోమువాఁడు నానామహిమలవాఁడు
రవ్వలుగా దేవతల రక్షించేవాఁడు
పువ్విళ్ళూర కంభములో నుదయించినవాఁడు
నివ్వటిల్లు ప్రతాపాన నెగడినవాఁడు

చ. 2: హేమపుచాయలవాఁడు యెదుటఁగొల్వున్నవాఁడు
కోమలిఁ దొడపై నిడుకొన్నవాఁడు
కోమలపుమేనివాఁడు గొప్పకిరీటమువాఁడు
చేముంచి హిరణ్యదైత్యుఁ జించినవాఁడు

చ. 3: వాలుకగోళ్లవాఁడు వాఁడికోరలవాఁడు
మేలిమికరుణతోడ మించినవాఁడు
వోలిఁ దుంగభద్రకాడనుండి శ్రీవేంకటాద్రిని
లీలతోఁ బ్రహ్లాదుని కేలికెయ్యైనవాఁడు

రేకు: 0347-03 చాయ సం: 04-276 రామ

పల్లవి: శరణు శరణు నీకు జగదేకవందిత
కరుణతో మమ్ము నేలు కౌసల్యనందన

చ. 1: ఘనరణరంగవిక్రమ దశరథపుత్ర
వినుతామనస్తోమ వీరరాఘవ
మునులును రుషులును ముదమునొందిరి నీవు
జననమందినందుకు జానకీరమణ

చ. 2: సులభ లక్ష్మణాగ్రజ సూర్యవంశతిలక
జలధిబంధన విభీషణవరద
తలఁకి యసురలు పాతాళము చొచ్చిరి నీవు
విలువిద్య నేర్చితేనే విజయరామ

చ. 3: రావణాంతక సర్వరక్షక నిర్మలభక్త-
పావన దివ్యసాకేతపట్టణవాస
వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నినుఁ జూచి శ్రీవేంకటేశ

రేకు: 0347-04 నాట సం: 04-277 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడందరికి రక్షకుఁడీతనిఁ దెలిసి కొలువరో
కామితఫలదుఁడు చరాచరములకుఁ గర్తయైనసర్వేశ్వరుడితఁడు

చ. 1: తలఁప దశరథుని తనయుఁడట తానెతారకబ్రహ్మమట
వెలయ మానుషపు వేషమట వెగటుగ హరువిల్లు విరిచెనట
అలరఁగ తానొక రాజట పాదాన నహల్యశాపము మాన్చెనట
సొలవక దైవికమానుషలీలలు చూపుచు మెరసీఁ జూఁడరోయితఁడు

చ. 2: జగతి వసిష్ఠునిశిష్యుఁడట జటాయువుకు మోక్ష మిచ్చెనట
అగచరులే తనసేనలట అంబుధి కొండలఁగట్టెనట
మగువకొరకుఁగానట కమలాసను మనుమనిఁ రావణుఁ జంపెనట
తగ లౌకికి వైదికములునొక్కట తానొనరించీఁ జూడరో యితఁడు

చ. 3: వెస నమరుల వరమడిగెనట విభీషణపట్టము గట్టెనట
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకుఁ గొలువిచ్చెనట
పొసగ శ్రీవేంకటగిరి నివాసమట భువనము లుదరంబున ధరించెనట
సుసరపుసూక్ష్మాధికములు తనందుఁ జూపుచునున్నాఁడు చూడరో యితఁడు

రేకు: 0347-05 గౌళ సం: 04-278 హనుమ

పల్లవి: అఱిముఱి హనుమంతుఁ డట్టిబంటు
వెఱపు లేని రఘువీరునికి బంటు

చ. 1: యేలికను దైవముఁగా నెంచి కొల్చేవాఁడే బంటు
తాలిమిగలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుకవుండేటి వెరవరే బంటు

చ. 2: తను మనోవంచనలెంతటా లేనివాఁడే బంటు
ధనముపట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురు మాటాడనివాఁడే బంటు
అనిమొనఁ దిరుగనియతఁడే బంటు

చ. 3: చెప్పినట్లనే నడచినయాతఁడే బంటు
తప్పులేక హితుఁడైనాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుఁడే బంటు

చ. 4: అక్కర గలిగి కడు నాప్తుఁడైనవాఁడే బంటు
యెక్కడా విడిచిపోనియిష్టుఁడే బంటు
తక్కక రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తిగలవాఁడే బంటు

చ. 5: కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరనియాతఁడే బంటు
నానాగతి శ్రీవేంకటోన్నతుఁడైనయతనికి
తా నిన్నిటా దాసుఁడైనధన్యుఁడే బంటు

రేకు: 0348-01 దేవక్రియసం: 04-279 రామ

పల్లవి: ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడే మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు

చ. 1: విడిసెఁ గపిబలము వెస సముద్రము దరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని

చ. 2: చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలుగాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
మెచ్చిరందరు సీతాసమేతుఁడాయ నితఁడు

చ. 3: మగుడెఁ బుష్పకముపై మహిమ నీతనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చె నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు

రేకు: 0348-02 మేఘరంజి సం: 04-280 రామ

పల్లవి: ఇందులోనే కానవచ్చె నిన్నిటా నీ మహిమలు
చెంది నీవే దిక్కు మాకు సీతాపతిరామా

చ. 1: దేవ నీకు వలసితే తృణము బ్రహ్మాస్త్రమాయ
భావించితే రాతికిఁ బ్రాణము వచ్చె
కావలసి యేసితే నాకాశముకట్లు దెగె
దైవమవంటే నీవే దశరథరామా

చ. 2: కూరుచుక యేలితేను కోఁతులు రాజ్యముసేసె
కోరితేనే నీటిపైఁ గొండలు దేలె
సారెఁ గదలివచ్చె నీ సన్నల సంజీవికొండ
యేరీతి నీసరి వేరీ యినకులరామా

చ. 3: సూటి నీవు దలఁచితే సురలు పంపుసేసిరి
చాటితేనే నీపేరు జపమాయను
ఆటల నీకతలెల్లా నాచంద్రార్కమై నిలిచె
గాటపు సిరుల శ్రీవేంకటగిరిరామా

రేకు: 0348-03 దేసి సం: 04-281 రామ

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ ప్రతాపము
రామ రామభద్ర సీతారమణ సర్వేశ

చ. 1: వెరవున హరువిల్లు విరుఁగఁ దీసిననాఁడే
అరయ విరిగె వీపు లసురలకు
వరుస వనవాసపువ్రతము వట్టినపుడె
పరులమతుల భీతి వట్టె రఘురామ

చ. 2: వచ్చి నీవు దండకావనము చొచ్చిననాఁడే
చొచ్చిరి పాతాళ మసురలెల్లాను
ముచ్చటాడి చుప్పనాతిముక్కు గోసిననాఁడే
కొచ్చి దైత్యు లాసదెగఁ గోసిరి శ్రీరామ

చ. 3: అడరి మారీచుపై నమ్ము విడిచిననాఁడే
విడిచిరి దానవులు వేడుకలెల్లాను
బడి విభీషణునిఁ జేపట్టితే రక్కసులెల్లా
చిడిసి మల్లెవట్టిరి శ్రీవేంకటరామ

రేకు: 0348-04 ముఖారి సం: 04-282 ఇతర దేవతలు

పల్లవి: కొలువరో మొక్కరో కోరి తలఁచరో
చెలఁగి మనల రక్షించీని వీఁడె

చ. 1: పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు
వేయినామములవెన్నుఁడు
పాయకకొల్చిన భక్తప్రసన్నుఁడు
యీయెడనే వరములు యిచ్చీని వీఁడే

చ. 2: పరిపూర్ణుఁడు మహానుభావుఁడు
తిరమగు దేవాధిదేవుఁడు
పరమానందస్వభావుఁడు
గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె

చ. 3: తెలియుఁ డీతఁడె దేవాగ్రగణ్యుఁడు
వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు
అలరఁగ శ్రీవేంకటాచలేశపుణ్యుఁడు
నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె

రేకు: 0348-05 సామంతం సం: 04-283 రామ

పల్లవి: రామునికి శరణంటె రక్షించీ బ్రదుకరో
యేమిటికి విచారాలు యిఁక దైత్యులాల

చ. 1: చలమునఁ దాటికిఁ జదిపిన బాణము
లలి మారీచసుబాహులపై బాణము
మెలఁగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో యసురలు

చ. 2: మాయామృగముమీఁద మరి వేసిన బాణము
చేయి చాఁచి వాలి నేసిన బాణము
తోయధిమీఁద నటు తొడిగిన బాణము
చాయలు దేరుచున్నది చనరో దైతేయులు

చ. 3: తగఁ గుంభకర్ణునితల ద్రుంచిన బాణము
జిగి రావణుఁ బరిమార్చిన బాణము
మిగుల శ్రీవేంకటేశు మేఁటిపాదలో నున్నది
పగ సాధించీ నిఁకఁ బారరో రాకాసులు

రేకు: 0348-06 నాదరామక్రియ సం: 04-284 వైరాగ్య చింత

పల్లవి: అప్పటి సుఖమేకాని యటమీఁదెంచు కొనఁడు
ఉప్పతిల్లు జీవుని వుద్యోగా లిట్టివి

చ. 1: తనుభోగపురతులు దలపోయుచుండుఁగాని
తన నరకకూపాలు దలపోయఁడు
కనకభూషణములు గని వెరగందుఁగాని
ఘనకర్మబంధాలకుఁ గడు వెరగందఁడు

చ. 2: యీకడాకడఁదాఁ జేసేటియెమ్మెలే యెంచుఁగాని
పైకొని కూడేటిపాపము లెంచఁడు
దీకొని జగములోని ద్రిష్టములే చూచుఁగాని
భీకరపు జన్మముల పిరివీకు చూడఁడు

చ. 3: వింతవింత మాటలవేడుకలే వినుఁగాని
అంతటఁ దాఁ బడేపాట్లవి వినఁడు
ఇంతటా శ్రీవేంకటేశుఁడేలఁగా నెరిఁగెఁగాని
యెంతచెప్పినాను బుద్ధి యిన్నాళ్ళు నెరఁగఁడు

రేకు: 0349-01 గుండక్రియ సం: 04-285 నృసింహ

పల్లవి: జగతి వైశాఖశుద్ధచతుర్దశి మందవార-
మగణితముగఁ గూడె నదె స్వాతియోగము

చ. 1: పక్కన నుక్కుఁగంభము పగిలించుక వెడలి
తొక్కి హిరణ్యకసిపుఁ దొడికిపట్టి
చక్కఁగాఁ గడపమీఁద సంధ్యాకాలమున
వక్కలు సేసె నురవడి నరసింహుఁడు

చ. 2: పిప్పిగాఁగఁ జప్పరించి పేగులు జందేలు వేసి
తొప్పఁదోఁగుచు నెత్తురు దోసిటఁ జల్లె
రొప్పుచుఁ గోపముతోఁ గేరుచుఁ బకపకనవ్వి
తప్పక చూచె వాని నుదగ్రనరసింహుఁడు

చ. 3: యెదుటఁ బ్రహ్లాదుఁ జూచి యిందిరఁ దొడపై నుంచె
అదన నందరికి నభయమిచ్చె
కదసి శ్రీవేంకటాద్రిగద్దెమీఁదఁ గూచుండె
వెదచల్లెఁ గృపయెల్ల వీరనరసింహుఁడు

రేకు: 0349-02 సౌరాష్ట్రం సం: 04-286 ఉత్సవ కీర్తనలు

పల్లవి: వీధులవీధుల విభుఁడేఁగీ నిదె
మోదముతోడుత మొక్కరొ జనులు

చ. 1: గరుడధ్వజ మదె కనకరథం బదె
అరదముపై హరి యలవాఁడె
యిరుదెసల నున్నారు యిందిరయు భువియు
పరఁగ బగ్గములు పట్టరో జనులు

చ. 2: ఆడే రదివో యచ్చరలెల్లను
పాడేరు గంధర్వపతులెల్లా
వేడుకతో వీఁడె విష్వక్సేనుఁడు
కూడి యిందరునుఁ జూడరో జనులు

చ. 3: శ్రీవేంకటపతిశిఖరముచాయదె
భావింప బహువైభవము లవే
గోవిందనామపుఘోషణ లిడుచును
దైవం బితఁడని తలఁచరో జనులు

రేకు: 0349-03 మాళవశ్రీ సం: 04-287 కృష్ణ

పల్లవి: శ్రావణబహుళాష్టమి సవరేత్రికాడను
శ్రీవిభుఁడుదయించెఁ జెలులాల వినరే

చ. 1: అసురల శిక్షించ నమరుల రక్షించ
వసుధ భారమెల్లా నివారింపను
వసుదేవునికిని దేవకీదేవికిని
అసదృశమగు కృష్ణుఁ డవతారమందెను

చ. 2: గోపకలమన్నించ గొల్లలనెల్లాఁ గావఁగ
దాపై మునులనెల్లా దయసేయను
దీపించ నందునికి దేవియైన యశోదకు
యేపున సుతుఁడై కృష్ణుఁ డిన్నిటాఁ బెరిగెను

చ. 3: పాండవుల మనుపఁగ పదారువేలఁ బెండ్లాడఁగ
నిండి శ్రీవేంకటాద్రిపై నిలుచుండఁగా
అండ నలమేల్మంగ నక్కునఁ గాఁగలించఁగ
దండియైయుండఁ గృష్ణుఁడు తగ నుతికెక్కెను

రేకు: 0349-04 వసంతం సం: 04-288 కృష్ణ

పల్లవి: కోలలెత్తుకొని గోపాలులునుఁ దాను
యీలీల సోదించె యీతఁడే కదవే

చ. 1: జన్నెవట్టి పుట్టి జక్కఁగఁ బెట్టిన
వెన్నదిన్నవాఁడు వీఁడు గదె
పన్నారుదొంతులపాలుఁబెరగులు
యిన్ని నారగించె యీతఁడు గదవె

చ. 2: మెఱసి యట్టుగమీఁదిచక్కిలాలు
వెఱఁజి కైకొనె వీఁడె కదె
కఱమి కటిమి నమలు గంపల నురుగులు
యెటిఁగి దొంగిలె యీతఁడే కదవె

చ. 3: శ్రీవేంకటాద్రి దాఁచిన తేనెలెల్లా
వేవేగ సాధించె వీఁడే కదె
కావించెల మేలుమంగపతెయి మమ్మేలె
యేవంకఁ జూచినా యీతఁడే కదవే

రేకు: 0349-05 శుద్ధవసంతం సం: 04-289 కృష్ణ

పల్లవి: ఈడ నిందరికి నేలికై వున్నాఁడు
వాడలరేపల్లెవాఁడా వీఁడు

చ. 1: భారపువుట్ల పాలుఁబెరుగులు
వారలు వట్టినవాఁడా వీఁడు
కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలుదీసిన శిశువా వీఁడు

చ. 2: ఆవులఁ బేయల నందరియిండ్ల
వావిరిఁ గాచినవాఁడా వీఁడు
వావు లొక్కటిగా వనితలఁ గూడి
వేవేలునేర్చినవిటుఁడా వీఁడు

చ. 3: అరుదై శ్రీవేంకటాద్రిమీఁదనుండి
వరములిచ్చేటివాఁడా వీఁడు
మరిగెలమేల్మంగతో మమ్మేలె
సరసుఁడై వుండేజాణా వీఁడు

రేకు: 0349-06 శంకరాభరణం సం: 04-290 అద్వైతము

పల్లవి: ధర్మమునకే మము దయఁ గావవే యిఁక
నిర్మలుఁడవు నిను నే మెరిఁగేమా

చ. 1: కాయధారులము కర్మలోలులము
మాయ కగపడినమనుజాలము
పాయపుమదమున భ్రమసే మా మనసు
నీయెడఁ దగులై నిలిచీనా

చ. 2: చాపల్యగుణము జడులమన్నిటాను
పాపపుణ్యసంబద్ధులము
పైపైఁగోర్కుల ప్రబలేమాబ్రదుకు
యేపనులకు నీకెక్కీనా

చ. 3: అతిప్రాకృతులము అహంకారులము
సతతంబునుఁ జంచలులము
హితవుగ శ్రీవేంకటేశ యేలితివి
తతితో నీభక్తి తగ మరచేమా

రేకు: 0350-01 భంగాళం సం: 04-291 విష్ణు కీర్తనం

పల్లవి: భావించి తెలుసుకొంటే భాగ్యఫలము
ఆవలీవలిఫలము లంగజజనకుఁడే

చ. 1: దానములలో ఫలము తపములలో ఫలము
మోనములలో ఫలము ముకుందుఁడే
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము
నానాఫలములును నారాయణుఁడే

చ. 2: వినుతులలో ఫలము వేదములలో ఫలము
మనసులోని ఫలము మాధవుఁడే
దినములలో ఫలము తీర్థయాత్రల ఫలము
ఘనపుణ్యముల ఫలము కరుణాకరుఁడే

చ. 3: సతతయోగ ఫలము చదువులలో ఫలము
అతిశయోన్నత ఫలము యచ్యుతుఁడే
యతులలోని ఫలము జితకామిత ఫలము
క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుఁడే

రేకు: 0350-02 మధ్యమావతి సం: 04-292 నృసింహ

పల్లవి: చిత్తజగురుఁడ వో శ్రీ నరసింహా
బత్తిసేసేరు మునులు పరికించవయ్యా

చ. 1: సకలదేవతలును జయవెట్టుచున్నారు
చకితులై దానవులు సమసి రదె
అకలంకయగు లక్ష్మి యటు నీ తొడపై నెక్కె
ప్రకటమైన నీ కోపము మానవయ్యా

చ. 2: తుంబురునారదాదులు దొరకొని పాడేరు
అంబుజాసనుఁ డభయమడిగీ నదె
అంబరవీధి నాడేరు యచ్చరలందరుఁ గూడి
శంబరరిపుజనక శాంతము చూపవయ్యా

చ. 3: హత్తి కొలిచే రదె యక్షులును గంధర్వులు
చిత్తగించు పొగడేరు సిద్ధసాధ్యులు
సత్తుగా నీ దాసులము శరణు చొచ్చితి మిదె
యిత్తల శ్రీవేంకటేశ యేలుకొనవయ్యా

రేకు: 0350-03 నారాయణి సం: 04-293 మాయ

పల్లవి: హరి హరి నీ మాయామహిమ
సరవి దెలియ నను(గరుణించ(గదే

చ. 1: తల(తును నా పాలిదైవమవని నిను
తల(తును తల్లివి(దండ్రివని
మలసి యంతలో మఱతును తెలుతును
కలవలె నున్నది కడ గనరాదు

చ. 2: మొక్కుదు నొకపరి మొగి నేలికవని
మొక్కుదు నీ వాదిమూలమని
వుక్కున గర్వించి యుబ్బుదు సగ్గుదు
కక్కసమైనది కడ గనరాదు

చ. 3: చూతును నీమూర్తి సులభు(డవనుచును
చూతు జగములకు సోద్యమని
యీతల శ్రీవేంకటేశ నన్నేలితివి
కౌతుకమొదవెను కడ గనరాదు

రేకు: 0350-04 నాగవరాళి సం: 04-294 శరణాగతి

పల్లవి: దైవము నెరఁగము తత్త్వముఁ దలఁచము
చేవై హరి రక్షించీ నిదివో

చ. 1: పాపముఁ బుణ్యముఁ బైకొను దేహము
కోపము శాంతపుగుణములది
వోపికవోపము లుదుటు చూపెడిది
చేపట్టుక యిటు చెలఁగే మిదివో

చ. 2: వెలికిని లోనికి విడిసేటిప్రాణము
చలువలు వేండ్లు చల్లెడిది
తెలివికి నిదురకుఁ దేపై యున్నది
బలిమిఁ జేపట్టుక బ్రదికే మిదివో

చ. 3: పరమును నిహమునుఁ బట్టినజీవుఁడ
పొరుగుకు నింటికిఁ బొత్తైతి
గరిమల శ్రీవేంకటపతి శరణని
నిరతపు మహిమల నెగడే మిదివో

రేకు: 0350-05 శోకవరాళి సం: 04-295 రామ

పల్లవి: ఓవో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో

చ. 1: జగములో రాముఁడై జనియించె విష్ణుఁడదె
అగపడి లక్ష్మి సీతయై పుట్టెను
తగు శేష చక్ర శంఖ దైవసాధనములెల్ల
జిగి లక్ష్మణభరతాంచితశత్రుఘ్నులైరి

చ. 2: సురలు వానరులైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగిఁ రుద్రుఁడే హనుమంతుఁడాయను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి

చ. 3: కట్టిరి సేతువపుడె ఘనులెల్ల దాఁటిరి
ముట్టిరి లంకానగరము నీదళము
యిట్టె శ్రీవేంకటేశుఁ డితఁడై రావణుఁ జంపె
వొట్టుక వరము లిచ్చీ నొనర దాసులకు

రేకు: 0350-06 బౌళి సం: 04-296 వైరాగ్య చింత

పల్లవి: జీవుఁడూ నొక్కటే చిత్తమూ నొక్కటే
వేవేలు మాయలచే వెలయుఁ గొన్నాళ్లు

చ. 1: వొక్కటే దేహము వూరకే బాల్యావస్థ
యెక్కడౌతా నెరఁగడు యిటు గొన్నాళ్లు
చక్కఁగ నంతటిలోనె జవ్వనసాయమునాఁడు
మిక్కిలి పోకలఁ బోయి మెరయుఁ గొన్నాళ్లు

చ. 2: ఆఁకలీ నొక్కటె యటు జనించిననాఁడు
వోఁకరెన్నఁడో దాఁగి వుండుఁ గొన్నాళ్లు
కాఁకల నంతటిలోనె కమ్మరఁ బుట్టినప్పుడే
వేఁకమై పలురుచులు వెదకుఁ గొన్నాళ్లు

చ. 3: దేవుఁడూ నొక్కఁడే తెలియుదాఁకాఁ బెక్కు-
దేవతలై భ్రమయించు దేహము గొన్నాళ్లు
చేవమీర నంతలోనె శ్రీవేంకటేశుఁడై
సేవ గొని సుజ్ఞానిఁ జేసుఁ గొన్నాళ్లు

రేకు: 0351-01 శ్రీరాగం సం: 04-297 వేంకటగానం

పల్లవి: చేరి కొల్వరో యాతఁడు శ్రీదేవుఁడు
యీరీతి శ్రీవేంకటాద్రి నిరవైన దేవుఁడు

చ. 1: అలమేలుమంగ నురమందిడుకొన్నదేవుఁడు
చెలఁగి శంఖచక్రాలచేతి దేవుఁడు
కలవరదహస్తముఁ గటిహస్తపు దేవుఁడు
మలసీ శ్రీవత్సవనమాలికల దేవుఁడు

చ. 2: ఘనమకరకుండలకర్ణముల దేవుఁడు
కనకపీతాంబర శృంగార దేవుఁడు
ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్నదేవుఁడు
జనించెఁ బాదాల గంగ సంగతైన దేవుఁడు

చ. 3: కోటిమన్మథాకార సంకులమైన దేవుఁడు
జూటపుఁగిరీటపు మించుల దేవుఁడు
వాటపుసొమ్ములతోడి వసుధాపతిదేవుఁడు
యీటులేని శ్రీవేంకటేశుఁడైన దేవుఁడు

రేకు: 0351-02 పళవంజరం సం: 04-298 కృష్ణ

పల్లవి: ఇతఁడొకఁడే సర్వేశ్వరుఁడు
సితకమలాక్షుఁడు శ్రీవేంకటేశుఁడు

చ. 1: పరమయోగులకు భావనిధానము
అరయనింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కాఁగిటిసౌఖ్యము
సిరలొసఁగేటియీ శ్రీవేంకటేశుఁడు

చ. 2: కలిగి యశోదకు కన్నమాణికము
తలఁచినకరికిని తగుదిక్కు
అలద్రౌపదికిని యాపద్బంధుడు
చెలరేఁగినయీ శ్రీవేంకటేశుఁడు

చ. 3: తగిలినమునులకు తపములసత్ఫలము
ముగురువేలుపులకు మూలము
వొగి నలమేల్మంగకొనరిన పతితఁడు
జిగిమించినయీ శ్రీవేంకటేశుఁడు

రేకు: 0351-03 వసంతంసం: 04-299 తేరు

పల్లవి: నిండెను లోకములెల్ల నెరి నితనికరుణ
పండి రాసులాయఁ గీర్తిప్రతాపములెల్లను

చ. 1: గరుడవేగమునఁ గదలె విజయరథ-
మిరవై యందు దేవుడేఁగుచుండఁగా
సారిదిఁ బట్టుకుచ్చులు చుక్కలతో సందడించ
గరిమఁ బైఁడికుండలు గగనముదాఁకను

చ. 2: అనిలవేగమున నదెవెడలె రథము
ఆనిమిషులు పగ్గములందుకొనఁగా
తనుఁదానె ఘనశంఖధ్వనులు దిక్కులనిండ
సునిసి చక్రము దనుజుల సాధింపఁగను

చ. 3: వెలయ మనోవేగాన వేంచేసీ మగిడి రథ-
మెలమిఁ దమదాసులు యేచి పొగడ
అలమేలుమంగ దనకటు విడెమియ్యఁగాను
బలిమి శ్రీవేంకటాద్రిపతి మించీనిందును

రేకు: 0351-04 బౌళిరామక్రియ సం: 04-300 రామ

పల్లవి: దేవతలఁగాచిన దేవుఁ డితఁడు
వేవులు ప్రతాపముల వీరరాముఁడితఁడు

చ. 1: రావణుఁజంపి పుష్పకరథ మెక్కి సీతతోడ
ఠావుగా నయోధ్యను పట్టముగట్టుక
వావిరి సుగ్రీవాదివానరకోట్లు గొలువ
చేవమీరి పొగడొందు శ్రీరాముఁ డితఁడు

చ. 2: వసుధ యింతయునేలి వసిష్ఠాదులు వొగడ
యెసగ నశ్వమేధాలెల్లాఁ జేసి
పొసఁగఁ గుశలవుల పుత్రులఁగా నటుగాంచి
రసికత మించు దశరథరాముఁ డితఁడు

చ. 3: అలర రుద్రునెదుటనటు విశ్వరూపు చూపి
లలి బ్రహ్మవట్ట మనిలజుని కిచ్చి
యిల శ్రీవేంకటాద్రినిరవై నిలిచినాఁడు
చలము సాధించిన జయరాముఁ డితఁడు

రేకు: 0351-05 మాళవశ్రీ సం: 04-301 రామ

పల్లవి: నమో నమో దశరథనందన మమ్ముర్రక్షించు
కమనీయ శరణాగతవజ్రపంజరా

చ. 1: కోదండదీక్షాగరుఁడ రామచంద్ర
ఆదిత్యకుల దివ్యాస్త్రవేది
సోదించుమారీచునితలగుండుగండ
ఆదినారాయణ యసురభంజనా

చ. 2: ఖరదూషణ శిరఃఖండన ప్రతాప
శరధిబంధన విభీషణవరదా
అరయ విశ్వామిత్రయాగసంరక్షణ
ధరలోన రావణదర్పాపహరణ

చ. 3: పొలుపొంద నయోధ్యపుర వరాధీశ్వర
గెలుపుమీరిన జానకీరమణ
అలఘుసుగ్రీవాంగదాది కపిసేవిత
సలలిత శ్రీవేంకటశైలనివాసా

రేకు: 0351-06 కేదారగౌళ సం: 04-302 శరణాగతి

పల్లవి: నిలచినవాఁడవు నీవేకాక దైవమా
నెలవై ప్రకృతి నేను నీలోనిసొమ్ములము

చ. 1: తఱి నిరువదేను తత్త్వములుండఁగాను
యెఱఁగని యజ్ఞానానకెవ్వరు గురి
నెఱిఁ జైతన్యమెల్లా నీసొమ్మై వుండఁగాను
యెఱుకవొక్కటేకాక యెవ్వరున్నా రీడను

చ. 2: దినలెక్క లూరుపులు తెచ్చి తెచ్చి వొప్పించఁగ
యెనలేని జన్మములకెవ్వరు గురి
వునికై బ్రహ్మాండము వొళ్ళునీకై వుండఁగాను
యేనసే ఆనందమేకా కెవ్వరున్నా రీడను

చ. 3: అచ్చపు సుముద్రవంటాత్మ లణువైయుండగా
యిచ్చఁ గామక్రోధాల కెవ్వరు గురి
నిచ్చలు శ్రీవేంకటేశ నీవేలికవై యుండఁగా
హేచ్చేటిదాస్యమేకాక యెవ్వరున్నా రీడను

రేకు: 0352-01 భూపాళం సం: 04-303 వైరాగ్య చింత

పల్లవి: తెలియఁడుగాక ద్రిష్టము జీవుఁడు
సులభమిదివో యిచ్చోటనే పరము

చ. 1: మనసునఁ దలచిన మర్మములు గరఁగి
చొనుపుచు నింద్రియసుఖ మిచ్చు
అనువుగ నిటువలె హరిఁదలపోసిన
తనకు బ్రహ్మానందము సమకొనదా

చ. 2: మాటలాడినను మరిగి మానవులు
యీటున మెచ్చిత్తురేమైనను
నాఁట నిట్ల హరినామము నొడివిన
గాఁటపువరములు కలుగునె కాదా

చ. 3: చేసినపుణ్యము చేతఁజుట్టుకొని
రాసి వెనుతగిలి రక్షించు
వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని
ఆసల కైంకర్యము ఫలించును

రేకు: 0352-02 వసంతం సం: 04-304 కృష్ణ

పల్లవి: తల్లియాపె కృష్ణునికిఁ దండ్రి యీతఁడు
చల్లఁగా లోకములెల్లా సంతోసమందెను

చ. 1: అరుదై శ్రావణబహుళాష్టమినాటిరాత్రి
తిరువవతారమందెను కృష్ణుఁడు
యిరవై దేవకిదేవి యెత్తేకొని వసుదేవు -
కరములందుఁ బెట్టితే కడుసంతోసించెను

చ. 2: తక్కక యమునానది దాఁటతఁడు రేపల్లెలో
పక్కన యశోదాదేవిపక్కఁ బెట్టెను
యెక్కువనాపె కృష్ణునినెత్తుక నందగోపుని
గక్కన వినిపంచితే కడుసంతోసించెను

చ. 3: మరిగి పెద్దై కృష్ణుఁడు మధురలోఁ గంసుఁజంపి
బెరసి యలమేల్మంగఁ బెండ్లాడి
తిరమై శ్రీవేంకటాద్రిని దేవకీదేవియు
ఇరవై తే వసుదేవుఁ డేఁచి సంతోసించెను

రేకు: 0352-03 హిందోళం సం: 04-305 శరణాగతి

పల్లవి: కరుణానిధివి గట్టుకో యేపుణ్యమైన
శరణాగత వజ్రపంజరుఁడవు నీవు

చ. 1: మన్నించేనంటే నిన్ను మానిపేవా రెవ్వరు
పన్ని కోపగించితే నీపట్టుకెదు రెవ్వరు
చెన్నుమీర నీపెట్టుజెట్లే జీవులెల్లాను
వన్నెగా నీసొమ్ము నీవువలసినట్టు సేయి

చ. 2: కాచేనంటే నిన్నుఁ గాదనేవా రెవ్వరు
ఏచి యాజ్ఞవెట్టేనంటే యిదేలనేవా రెవ్వరు
లాచి పెంపుడుగుబ్బలు లలినీజీవులెల్లాను
చేచేత నీదాసులను సేసినట్టుసేయి

చ. 3: పరమిచ్చేనంటే నడ్డపడేవా రెవ్వరు
సరి నిహమిచ్చేనంటే సాధించేవా రెవ్వరు
సిరుల శ్రీవేంకటేశ చేతిలోవారము నీకు
హరి నీపాంతవారమెట్టైనా దయసేయి

రేకు: 0352-04 భైరవి సం: 04-306 దశావతారములు

పల్లవి: ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు
చేత చక్రమెత్తినాఁడు శ్రీవేంకటేశుఁడు

చ. 1: జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు
చలమునఁ బాతాళము సాధించినాఁడు
బలుభూమిదూరి వొక్కకొలికికిఁ దెచ్చినాఁడు
నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు

చ. 2: చేరి బ్రహ్మాండము తూఁటుసేసి చూచినాఁడు
వీరుఁడై రాచమూఁకల వెదకినాఁడు
ఘోరపుత్రికూటాదికొండలు జయించినాఁడు
వారించి చక్రవాళపర్వతము దాఁటినాడు

చ. 3: మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు
చుట్టువేడెమున యింతా సోదించినాఁడు
యిట్టె శ్రీవేంకటాద్రినిరవై యెక్కినవాఁడు
రట్టుగాఁ దనదాసులనిట్టె రక్షించినాఁడు

రేకు: 0352-05 వరాళి సం: 04-307 మాయ

పల్లవి: జీవుఁ డించుకంత చేఁత సముద్రమంత
చేవెక్కి పలుమారుఁ జిగిరించీ మాయ

చ. 1: కోపములైతేను కోటానఁగోట్లు
దీపనములైతేను దినకొత్తలు
చాపలబుద్ధులు సమయని రాసులు
రాపాడీఁ గడవఁగరాదు వోమాయ

చ. 2: కోరికలైతేను కొండలపాడవులు
తీరనిమోహాలు తెందేపలు
వూరేటిచెలమలు వుడివోనిపంటలు
యీరీతినే యెలయించీని మాయ

చ. 3: మునుకొన్నమదములు మోపులకొలఁదులు
పెనఁగినలోభాలు పెనువాములు
నినుపై శ్రీవేంకటేశ నీదాసులనంటదు
యెనసి పరులనైతే యీఁదించీ మాయ

రేకు: 0352-06 కాంబోధి సం: 04-308 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడొకో నే నీచెరఁ దగులక
అన్నిటా శ్రీపతికాధీనమౌట

చ. 1: దేహాధీనము తిరిగేటి జీవులు
దేహము యర్థాధీనము
మోహాధీనము ముంచినయర్థము
ఆహా యిది పుణ్యాధీనము

చ. 2: సతతముఁ బురుషుఁడు సతులయాధీనము
అతివలు వయసుకు నధీనము
గతియగు వయసులు కాలాధీనము
అతిశయమిది మాయాధీనము

చ. 3: దైవాధీనము తగినజగ మిది
దేవుఁడు మోక్షాధీనము
చేవల మోక్షము శ్రీవేంకటపతి -
సేవాధీనము సిలుగే లేదు

రేకు: 0353-01 భల్లాటి సం: 04-309 నృసింహ

పల్లవి: పెదయౌబళపుఁగొండఁ బెరిగినిదే
వదలకకొలిచితే వరములిచ్చీని

చ. 1: పదివేలశిరసుల బలునరసింహము
గుదిగొన్నచేతుల గురుతైనది
ఎదుటఁ బాదాలుఁ గన్నులెన్నైనఁ గలిగినది
యిది బ్రహ్మాండపుగుహ నిరవైనది

చ. 2: ఘనశంఖచక్రాదుల కైదువలతోనున్నది
మొనసి రాకాసిమెకములఁ గొట్టేది
కనకపుదైత్యుని కడుపుచించినది
తనునమ్మిన ప్రహ్లాదుదాపును దండైనది

చ. 3: శ్రీవనితఁ దొడమీఁదఁ జేకొని నిలిపినది
దేవతలు గొలువ గద్దెపై నున్నది
శ్రీవేంకటాద్రియందుఁ జెలఁగి భోగించేది
భావించి చూచితేను పరబ్రహ్మమైనది

రేకు: 0353-02 ముఖారి సం: 04-310 నృసింహ

పల్లవి: నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభములొసఁగెను

చ. 1: సందించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార -
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁ జించెఁ గనక కశిపుని

చ. 2: నరమృగరూపము నానాహస్తముల
అరిది శంఖచక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచిరక్షించి నిలిచె
గురుతర బ్రహ్మాండ గుహలోనను

చ. 3: కాంచనపు గద్దె మీఁద గక్కనఁ గొలువై యుండి
మించుగ నిందిరఁ దొడమీఁద బెట్టుక
అంచె శ్రీవేంకటగిరి నాదిమపురుషుండై
వంచనసేయక మంచివరాలిచ్చీనదివో

రేకు: 0353-03 సామంతం సం: 04-311 వేంకటగానం

పల్లవి: దైవమొక్కఁడే సంతత భజనీయుఁడు
భావము సమబుద్ధిఁ బాయఁగఁదగదు

చ. 1: హరియే సకలాంతరాత్మకుఁ డటుగాన
తిరమై యొకరి నిందింపఁదగదు
అరయఁగ లోకములనిత్య మటుగాన
మరిగి కొందరిమీఁది మమతయు వలదు

చ. 2: బహుకల్పితములెల్లఁ బ్రకృతిమూలమే కాన
గహనపుఁదన వుద్యోగము వలదు
సహజవిహారుఁడు సర్వేశ్వరుఁడుగాన
వహిఁ దానేవచ్చినవి వలదనఁదగదు

చ. 3: తపములు జపములు దాస్యమూలమె కాన
వుపమల సందేహమొగి వలదు
యెపుడును శ్రీవేంకటేశ్వరు సేవించి
చపలచిత్తమువారి సంగమిఁక వలదు

రేకు: 0353-04 లలిత సం: 04-312 శరణాగతి

పల్లవి: ఏగతి నుద్ధరించేవో యింతటిమీదట మమ్ము
భోగపుఁగోరికలచేఁ బొలిసెఁ బో పతులు

చ. 1: పరగి నాలుకసొంపు పరసిపోయ
పరులనే నుతియించి పలుమారును
విరసపుఁబాపములవినికిచే వీనులెల్లాఁ
గొరమాలె మాకు నేఁటి కులాచారము

చ. 2: మొక్కలాన పరధనమునకుఁ జాఁచిచాఁచి
ఎక్కువఁజేతులమహి మెందో పోయ
తక్కక పరస్త్రీలఁ దలఁచి మనసు బుద్ధి
ముక్కపోయ మాకు నేఁటి ముందటిపుణ్యాలు

చ. 3: యెప్పుడు నీచులయిండ్లకెడతాఁకి పాదములు
తప్పనితపములెల్లఁ దలఁగిపోయె
యిప్పుడె శ్రీవేంకటేశ యిటునిన్నుఁ గొలువఁగా
నెప్పున నేఁజేసినట్టి నేరమెల్లా నణఁగె

రేకు: 0353-05 సాళంగనాట సం: 04-313 సంస్కృత కీర్తనలు

పల్లవి: అయమేవ అయమేవ ఆదిపురుషో

జయకరం తమహం శరణం భజామి

చ. 1: అయమేవ ఖలు పురా అవనీధరస్తు సో

ప్యయమేవ వట దళాగ్రాధి శయనః

అయమేవ దశవిధైరవతారరూపైశ్చ

నయమార్గ భువి రక్షణం కరోతి

చ. 2: అయమేవ సతతం శ్రియః పతిర్దేవేషు

అయమేవ దుష్ట దైత్యాంతకస్తు

అయమేవ సకల భూతాంతరేష్వాక్రమ్య

ప్రియ భక్త పోషణం ప్రీత్యా తోతి

చ. 3: అయమేవ శ్రీ వేంకటాద్రౌ విరాజతే

అయమేవ వరదోపి యాచకానాం

అయమేవ వేద వేదాంతైశ్చ సూచితో

వ్యయమేవ వైకుంఠాధీశ్వరస్తు

రేకు: 0353-06 సామంతం సం: 04-314 నామ సంకీర్తన

పల్లవి: ఇన్నిటా నింతటా నిరవొకటే
వెన్నునినామమే వేదంబాయ

చ. 1: నలినదళాక్షునినామకీర్తనము
కలిగి లోకమునఁ గలదొకటే
యిల నిదియే భజియింపఁగఁ బుణ్యులు
చెలఁగి తలఁప సంజీవని యాయ

చ. 2: కోరిక నచ్యుత గోవిందాయని
ధీరులు దలఁపఁగఁ దెరువొకటే
ఘోరదురితహర గోవర్ధనధర
నారాయణ యని నమ్మఁగఁగలిగె

చ. 3: తిరువేంకటగిరి దేవుని నామము
ధరఁదలపగ నాధారమిదే
గరుడధ్వజుని సుఖప్రదనామము
నరులకెల్లఁ బ్రాణము దానాయ

రేకు: 0354-01 రామక్రియ సం: 04-315 వైరాగ్య చింత

పల్లవి: ఎందరు సతులో యెందరు సుతులో
యిందునందు నెట్లెరిఁగే నేను

చ. 1: మలయుచు నాయభివనములని నే
కెలననిపుడు వెదకేనంటే
పలుయోనులలో పలమారుఁబొడమిన
చలమరి నాతొలుజన్మంబులను

చ. 2: గరిమెలఁ బాణిగ్రహణము నేసిన
సిరులచెలులఁ గలసేనంటే
తరుణుల గురుతులు తలఁపున మరచితి
పరగిన బహుకల్పంబులయందు

చ. 3: శ్రీ వేంకటగిరి చెలువుని యాజ్ఞల
భావించియె కరిఁ బైకొంటి
తావులఁజూడగ తగిలికోర్కుల
భావరతుల బెంబడి మనసందు

రేకు: 0354-02 గుండక్రియ సం: 04-316 మాయ

పల్లవి: కటకట హరిమాయాకల్పనెట్టిదో
తటుకునఁ బారవేసేతలఁపెందు లేదు

చ. 1: అనంతకోటియుగాదులనుండియు
తనివోక విషయాలఁ దగిలుండినా
దినమొక్కొక్కరుచియై తీపులై పండీఁగాని
వెనుకొన్న యాత్మకు వెగ టెందు లేదు

చ. 2: కడలేక నాలుకకుఁ గన్నయాహారములెల్ల
వోడలిలోఁ బూఁటవూఁట వొట్టుకొనినా
సడిఁ బైపై వింతవింతచవులే వెదకుఁగాని
విడువని యాత్మకు వెగ టెందు లేదు

చ. 3: కలకాలముననుండి కాపురపు లంపటాలె
కలిమితో మెడఁగుచ్చి కట్టుకొనినా
యెలమితో శ్రీవేంకటేశ్వరునాజ్ఞల -
నలవాటైన యాత్మకలపే లేదు

రేకు: 0354-03 లలిత సం: 04-317 మనసా

పల్లవి: నటనల భ్రమయకు నామనసా
ఘటియించుహరియే కలవాఁడు

చ. 1: ముంచిన జగమిది మోహినీగజము
పొంచినయాస పుట్టించే దిది
వంచనల నిజమువలెనే వుండును
మంచులు మాయలే మారునాఁడు

చ. 2: సరిసంసారము సంతలకూటమి
సొరిదిఁ బచారము చూపే దిది
గరిమ నెప్పుడుఁ గలకలమనుచుండును
మరులగువిధమే మాపటికి

చ. 3: కందువదేహము గాని ముదియదిది
అందినబహురూప మాడేదిది
యెందును శ్రీవేంకటేశ్వరుఁడుండును
డిందుపడఁగనిదె తెరమరఁగు

రేకు: 0354-04 గుండక్రియ సం: 04-318 అధ్యాత్మ

పల్లవి: “నిశ్చింతం పరమం సుఖ”మనుమాటేనిజమునిజముతెలియరుగాని
ఆశ్చర్యంబిది పరమయోగులకు ననుభవులకు దృష్టాంతము సుండీ

చ. 1: కరచరణాదులుగలచైతన్యము గక్కునఁ బానుపుపైనుండి
సరుగన సడిలిన నిద్రామందము సమకూడీ నరులకటువలెనే
పరమాత్మునిపై సకలోద్యోగ వుపాయంబులు దా దిగవిడిచి
ధరఁ దానుండిన బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ

చ. 2: వున్నతిఁ దానొక దేశములోపలనుండి క్రితముచూచిన నవియెల్లా
అన్ని దేశములు నటుదలపోసిన యంతకుగోచరమైనట్లు
యెన్నగఁబూర్వజ్ఞానంబున సర్వేశ్వరుఁడగు హరిఁదలఁచినను
సన్నిధియగు సుజ్ఞానానందము సత్యము సత్యంబది సుండీ

చ. 3: ననిచిన ప్రపంచకత్పములలో నానావిధముల జంతువులు
తనుఁదాఁజూడగరానిరూపు లద్దములోపలఁ గన్నట్లు
ఘనుడగు శ్రీవేంకటపతిరూపము గక్కన నెదుటనె సేవించి
అనయము తనుఁదా సంతసించుటే యాత్మానందంబిది సుండీ

రేకు: 0354-05 సాళంగనాట సం: 04-319 శరణాగతి

పల్లవి: ఒసఁగితివిన్నియు నొకమాఁటే
వెస నీకఁ జేసే విన్నపమేది

చ. 1: నారాయణ నీనామము దలఁచిన -
నీరానివరములిచ్చితివి
చేరి నిన్ను నిటు సేవించిననీకఁ
గోరి పడయ నీకఁ గోరికలేవి

చ. 2: హరి నీకొకమరి యటు శరణంటే
గరిమల నన్నిటు గాచితివి
నిరతముగా నీక నిను నుతియింపుచు
అరగొరతనివి నిను నడిగేదేదో

చ. 3: శ్రీవేంకటేశ్వర చేయెత్తిమొక్కిన
భావమే నీవై పరగితివి
యీవరుసల నీవింతటిదాతవు
ఆవలనినుఁ గొనియాడెడిదేమి

రేకు: 0354-06 భౌళి సం: 04-320 తేరు

పల్లవి: దేవదేవోత్తముని తిరుతేరు
దేవతలు గొలువఁగా తిరుతేరు

చ. 1: తిరువీధులేగీని తిరుతేరు
తిరుపుగొన్నట్లాను తిరుతేరు
తెరలించె దనుజులఁ దిరుతేరు
తిరిగె దిక్కులనెల్ల తిరుతేరు

చ. 2: ధిక్కిరించీ మోతలఁ దిరుతేరు
దిక్కరికుంభా లదరఁ దిరుతేరు
తిక్కుముత్తేలకుచ్చుల తిరుతేరు
తెక్కులఁబ్రతాపించీఁ దిరుతేరు

చ. 3: తీరిచెఁ గలకలెల్లఁ దిరుతేరు
ధీర గరుడవాహపుఁ దిరుతేరు
చేరి యలమేలుమంగతో శ్రీవేంకటేశ్వరుని -
తీరున నెలకొన్నట్టి తిరుతేరు

రేకు: 0355-01 సాళంగం సం: 04-321 నామ సంకీర్తన

పల్లవి: మాధవ భూధవ మదనజనక
సాధురక్షణచతుర శరణు శరణు

చ. 1: నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ -
నారసింహా కృష్ణ నాగశయన
వారాహ వామన వాసుదేవ మురారి
శౌరి జయజయతు శరణు శరణు

చ. 2: పుండరీకేక్షణ భువనపూర్ణగుణ
అండజగమన నిత్య హరి ముకుంద
పండరిరమణ రామ బలరామ పరమపురుష
చండభార్గవరామ శరణు శరణు

చ. 3: దేవ దేవోత్తమ దివ్యావతార నిజ -
భావ భావనాతీత పద్మనాభ
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ
సావయవసారూప్య శరణు శరణు

రేకు: 0355-02 లలిత సం: 04-322 మనసా

పల్లవి: దొరకినయప్పుడే తుదగాక
మరుగకుమెన్నఁడు మరి మనసా

చ. 1: తనుభోగంబులఁ దనిపినపిమ్మట
వెనుకొని హరిఁ దడవేనంటే
దినమునుఁ దను నింద్రియములచల మిది
తనియుట యెన్నఁడు దగు మనసా

చ. 2: తిరమగునాల దీరినపిమ్మట
తెరలి విరతిఁ బొందే నంటే
మరలని యాశామయ మీచిత్తము
విరతి యెన్నఁడిఁక వెడ మనసా

చ. 3: ముదిసినపిమ్మట మొగి శ్రీవేంకట -
సదయుఁ గొలుతు నిచ్చలునంటే
హృదయము శ్రీవేంకటేశునినెల విది
యిదిగనుటెన్నఁడు యీమహి మనసా

రేకు: 0355-03 లలిత సం: 04-323 శరణాగతి

పల్లవి: తెలిసియుఁ దెలియదు దేరిన చిత్తము
నలినాక్ష గోవింద ననుఁగావవయ్యా

చ. 1: యేఁకట నినుగొలిచి యితరుల వేఁడనేల
వేఁకపుటాసల నాలోవెలితిగాక
చీఁకటివాసినమీఁద చీఁదరగొనఁగనేల
మాఁకువంటివెడబుద్ధి మాన దిదేమయ్యా

చ. 2: పొంచి నీదాసుఁడనై యల్పుల వేఁడఁబోనేల
చంచలగుణములనాజాలిగాక
అంచలఁ దెరువుకని యడవిఁబడఁగనేలా
యించుకంత యేవపుట్ట దేమిపాపమయ్యా

చ. 3: మతిలో నీవుండఁగాను మాయలఁ బొరలనేలా
వెతకి తెలియని నావేదురుగాక
గతియై శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను
తతి నాతపమనేఁడు దరిచేరెనయ్యా

రేకు: 0355-04 గుండక్రియ సం: 04-324 వేంకటగానం

పల్లవి: తెలియనివారికిఁ దెరమరుఁగు

తెలిసినవారికి దిష్టంబిదియే

చ. 1: కన్నులయెదుటనుఁ గాంచినజగ మిది

పన్నిన ప్రకృతియు బ్రహ్మమునే

యిన్నిట నుండఁగ నిదిగాదని హరిఁ

గన్న చోట వెదకఁగఁబోనేలా

చ. 2: అగపడి యిరువదియైదై జీవునిఁ

దగిలినవెల్లాఁ దత్వములే

నగవుల నిదియును నమ్మఁగఁ జాలక

పగటునఁ దమలో భమ్రయఁగ నేలా

చ. 3: అంతరంగుఁడును సర్వావతారము

నింతయు శ్రీవేంకటేశ్వరుఁడే

చెంతల నీతనిసేవకులకు మరి

దొంతికర్మములతోడ సిఁకనేలా

రేకు: 0355-05 వరాళి సం: 04-325 వైరాగ్య చింత

పల్లవి: ఏలొకో కర్మమా యిందుకుఁ బాలైతిని
పొలుపడిన యీ జలభ్రమణమువలెను

చ. 1: ధరలోఁ బుట్టినప్పుడే తలఁచ నీ యాత్మ
మరుగఁడు పరమైతే మరచీఁగాని
అరిది దుర్భాషల నలవడ్డనాలికె
హరినామములయందు నలవడదు

చ. 2: జవకట్టి పూర్వవాసనల సంసారమే
చవియే తాఁగాని ముక్తి చవిగాదు
భువిఁగల విషయాలఁ బుంగుడయ్యీఁగాని మతి
వివరించి దైవమును వెదకలేదు

చ. 3: శ్రీవేంకటేశుకృపచేత నింతేకాని
వావాత నివి గైవశము గావు
భావమిప్పుడితని పాదాలు చేరికాని
యేవుపమలనుఁ గాన మిన్నాళ్లును

రేకు: 0355-06 ముఖారి సం: 04-326 వైరాగ్య చింత

పల్లవి: చవి నోరి కేడఁ దెత్తు సంప దేడఁదెత్తు వీని
సవరించుటే నాసంప దిదిగాదా

చ. 1: పచ్చడా లెక్కడఁ దెత్తు పట్టుచీర లేడఁ దెత్తు
వెచ్చనిండ్లేడఁ దెత్తు వెంట వెంటను
తెచ్చిన యీపచ్చడము దేహమిది వెంటవెంట
వచ్చీఁగాక తన్నుఁదానె వద్దనఁగవచ్చునా

చ. 2: దొరతన మేడఁ దెత్తు దొడ్డసొమ్ము లేడఁ దెత్తు
యెరవులసిరుల నేనేడఁ దెత్తు
వెరవున నేనెవ్వరిని వేసరించఁజాలక
దరిచేరుటే దొరతనమిదిగాదా

చ. 3: తోడఁబుట్టువుల నేడఁ దోడితెత్తుఁ జుట్టాల -
నేడఁ దెత్తు సుతులపొందేడఁ దెత్తును
వేడుకైనపొందు శ్రీవేంకటేశుఁ దలఁచుటే
ఈడులేనిబంధుకోటి ఈతఁడెకాఁడా

రేకు: 0356-01 శ్రీరాగం సం: 04-327 హనుమ

పల్లవి: ఓ పవనాత్మజ వో ఘనుఁడ
బాపుబాపనఁగఁ బరగితిగా

చ. 1: వో హనుమంతుడ వుదయాచలని -
ర్వాహక నిజసర్వ ప్రబల -
దేహము మోఁచిన తెగువకు నిటువలె
సాహసమిటువలెఁ జాటితిగా

చ. 2: వో రవిగ్రహణ వో దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపువినతాతనయాదులు
గారవింప నిటు గలిగితిగా

చ. 3: వో దశముఖహర వో వేంకటపతి -
పాదసరోరుహపాలకుఁడా
యీ దేహముతో నిన్నిలోకములు
నీదేహమెక్క నిలిచితిగా

రేకు: 0356-02 ముఖారి సం: 04-328 మనసా

పల్లవి: దిక్కులేనివారు నీవే దిక్కని కొలువఁగా
అక్కరకితఁడు దైవమందురువో నిన్నును

చ. 1: పాలుపడి నిన్నుఁజేరి పట్టి కొలిచినవారి
జాలిపాటు తొలఁగించి జడనువాపి
మూలఁబడనీక తెచ్చి ముద్దుసేసికావఁగాను
మేలెరుఁగుబుధులెల్ల మెత్తురువో నిన్నును

చ. 2: కొండలుఁ గోట్లునైన కోరికలు గలవారి -
యండనే కోరికలిచ్చి యాదరించగా
నిండినదాసులకెల్ల నీవే దైవ మవని
కొండమీఁదనుండినఁ బైకొందురువో నిన్నును

చ. 3: యేకమైనమనసుతో నెవ్వరు దలచినాను
చేకొని కరుణఁ గృపసేయఁగాను
యేకాలము శ్రీవేంకటేశుఁడు మాదైవమని
లోకమెల్లఁ దామే కొలుతురువో నిన్నును

రేకు: 0356-03 వరాళి సం: 04-329 శరణాగతి

పల్లవి: ఏదియుఁగానఁడు నేది గాదందు
ఆదిపురుష నీదాస్యమే చాలనాకు

చ. 1: గరిమఁ గొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి
సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణమవట తగిలి కొందరికి

చ. 2: వొకటఁ గళాపూర్తి నొనరియుందువట
వొకట నిష్కళుఁడవై వుడివోవట
వొకచో జీవుల నీకొరయ భేదమట
వొకచో నె భేదమట వున్నారట నీకు

చ. 3: అదన నిందరిలోన నంతరాత్ముఁడవట
యెదుట శ్రీవేంకటేశుఁడవట
యిదియిది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలే కనుఁగొంటగాక

రేకు: 0356-04 లలిత సం: 04-330 నామ సంకీర్తన

పల్లవి: మాధవ కేశవ మధుసూదన విష్ణు
శ్రీధరా పదనభం చింతమియూయం

చ. 1: వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో

చ. 2: పురుషోత్తమ పుండరీకాక్ష దివ్య
హరి సంకర్షణ యధోక్షజ
నరసింహ హృషీ కేవ నగధర త్రివిక్రమ
శరణాగతరక్ష జయజయ సేవే

చ. 3: మహితజనార్దన మత్స్య కూర్మ వరాహ
సహజభార్గవ బుద్ధ జయతురగ కల్కి
విహితవిజ్ఞాన శ్రీవేంకటేశ శుభకరం
అహమీ తహతద దాస్యమనిశం భజామి

రేకు: 0356-05 గుండక్రియ సం: 04-331 కృష్ణ

పల్లవి: అందిచూడఁగ నీకు నవతారమొకటే
యెందువాఁడవై తివి యేఁటిదయ్యా

చ. 1: నవనీతచోరా నాగపర్యంకా
సవనరక్షక హరీ చక్రాయుధా
అవల దేవకిపట్టివని యశోదకు నిన్ను
నివలఁ గొడుకవనేదిది యేఁటిదయ్యా

చ. 2: పట్టపు శ్రీరమణా భవరోగవైద్య
జట్టిమాయలతోడిశౌరి కృష్ణ
పుట్టినచో టొకటి పొదలెడిచో టొకటి
యెట్టని నమ్మవచ్చు నిది యేఁటిదయ్యా

చ. 3: వేదాంతనిలయా వివిధాచరణా
ఆదిదేవ శ్రీవేంకటాచలేశ
సోదించి తలఁచినచోట నీ వుండుదువట
యేదెస నీ మహిమే యిదేఁటిదయ్యా

రేకు: 0356-06 గుండక్రియ సం: 04-332 వైరాగ్య చింత

పల్లవి: తలపోఁత చిత్తమునఁ దరిగానక బుద్ధి
గలఁగెఁ గావనో మమ్ముఁ గర్మమా

చ. 1: పాపజాతిమేనితోడఁ బడ్డపాటే చాలదా
ఆపదలకేల లోనాయ నిప్పుడు
దీపమైనహరిభక్తి దెలిసియింతటనైనఁ
గాపాడి పరమీవో కర్మమా

చ. 2: చెప్పరానిసుఖములు చెప్పి చెప్పి కని కని
చప్పుడుగా లోకమునఁ జాటి చాటి
దెప్పరపుభవములఁ దిప్పుదీరైతి మిదె
కప్పుకొని కావఁగదో కర్మమా

చ. 3: వేడుకలిన్నియు శ్రీవేంకటాద్రిరాయఁడే
కూడిన మాదైవమని కొనియాడి
యేడఁజూచిననుఁ బుణ్య మెక్కుడాయనని నమ్మి
గాడలెల్లాఁ బాసితిమి కర్మమా

రేకు: 0357-01 సామంతం సం: 04-333 నామ సంకీర్తన

పల్లవి: సర్వేశ్వరుఁడే శరణ్యము
నిర్వాహకుఁ డిన్నిటఁగాన

చ. 1: బలుదేవతలకు బ్రహ్మాదులకును
జలజనాభుఁడే శరణ్యము
అలరిన బ్రహ్మాండ మవిసిననాఁడును
నిలిపె నాతడిన్నిటిఁగాన

చ. 2: అనేకవిధముల నిఖిలజీవులకు
జనార్దనుఁడే శరణ్యము
అనాథనాథుఁ డంతరాత్మకుఁడు
అనాదిపతి యితఁ డటుగాన

చ. 3: తగునిశ్చలులగు తనదాసులకును
జగదేకపతే శరణ్యము
చిగురుఁజేవయగుశ్రీవేంకటేశుఁడు
అగువరములొసఁగు నటుగాన

రేకు: 0357-02 లలిత సం: 04-334 నామ సంకీర్తన

పల్లవి: సోదించిరిదియె సురలును మునులును
ఆదికి ననాది హరినామం

చ. 1: అరిది వేదశాస్త్రార్థసంగ్రహము
అరయఁగ నొకటే హరినామం
దురితహరము భవదుఃఖనాశనము
అరిభయంకరము హరినామం

చ. 2: సకలపుణ్యఫలసారవిహారము
అకలంకము హరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది హరినామం

చ. 3: కందువ సదరము కైవల్యపదము
అందరికిదియే హరినామం
యెందును శ్రీవేంకటేశ్వరు కరుణకు -
నందుకోలైన హరినామం

రేకు: 0357-03 సాళంగనాట సం: 04-335 అంత్యప్రాస

పల్లవి: ఇన్నిటికి నోపునా యీ మనసు నన్ను
మన్నించి నీమనసు మరిగించు మనసు

చ. 1: పొలఁతులకాఁకనే పుటమెక్కె మనసు
చలివేఁడిజవ్వనమునందిఁ జిక్కె మనసు
వలరాజుతూపునంజు వడినెక్కె మనసు
మలసి రతిసుఖాలమరపాయ మనసు

చ. 2: పచ్చనికనకముపై భ్రమఁబడె మనసు
చిచ్చువంటివిషయాల శివమెత్తె మనసు
వొచ్చెపుఁ బాపాలకెల్లా నొడిగట్టె మనసు
బచ్చన చెంచెలములఁ బాటిచెడె మనసు

చ. 3: కోరి యంతలో గురుఁడు గూఁటవేసె మనసు
వోరుపుతో నీపాలి కొప్పగించె మనసు
ఈరీతి శ్రీవేంకటేశుఁడ నామనసు
తోరపు విజ్ఞానము తుదకెక్కె మనసు

రేకు: 0357-04 రామక్రియ సం: 04-336 దశావతారములు

పల్లవి: నమ్మితే నితఁడే మన్ననఁ గాచు
యిమ్ముల ధ్రువుని బట్టమేలించినట్లు

చ. 1: తీరని కర్మములైన దీరుఁబో శ్రీహరిపాద -
మేరీతిఁ గొలిచినా నెవ్వరికిని
చేరరాని యడవిలో శిలలై పడియున్న
భారపుటహల్యశాపము దేరినట్లు

చ. 2: కలుగనిసిరులెల్లఁ గలుగుఁబో శ్రీహరి
గొలిచినవారికిఁ గోరినట్లే
అలనాఁడు దరిద్రుఁడైన కుచేలుని
బలుసంపదలఁ దెచ్చి బతికించినట్లు

చ. 3: చూడఁగా మూఢులకైన సులభుఁడై నిలుచుఁబో
వేడుకతోఁ బాడితే శ్రీవేంకటేశుఁడు
యీగనే మాబోంట్లకు నిరవై కోనేటిదండ
మేడెపువరములెల్ల మెచ్చి యిచ్చినట్లు

రేకు: 0357-05 లలిత సం: 04-337 అంత్యప్రాస

పల్లవి: దేవునిమరవకు మంతే మాట చిత్తమా
దీవెనై కలఁడు మాకు దేవుఁడు

చ. 1: అరుదగుజీవుని బ్రహ్మాండగోళములోన
తెరఁగై పుట్టించువాఁడు దేవుఁడు
అరసి కమ్మరవచ్చి యన్నపానాదులు వెట్టి
తిరుగ రక్షించువాఁడు దేవుఁడు

చ. 2: బలుసంసారములోన భ్రమసియుండిన మాకుఁ
దెలిపి చెప్పినవాఁడు దేవుఁడు
తెలియనికర్మములు తెగనిబంధాలు వాపి
తిలకించి కాచువాఁడు దేవుఁడు

చ. 3: తల్లియుఁ దండ్రియునై దాతయై కలఁడు మాకు
తెల్లమి శ్రీవేంకటాద్రిదేవుఁడు
మల్లాడి తనదాసులమతిలోఁ దా నుదయించి
తెల్లవారించేవాఁడు దేవుఁడు

రేకు: 0357-06 ముఖారి సం: 04-338 శరణాగతి

పల్లవి: ఆలించు పాలించు ఆదిమపురుష క్షమ
జాలిదీర నీకే శరణుచొచ్చితిమి

చ. 1: గతి నీవే మతి నీవే కర్తవు భర్తవు నీవే
పతియు నీవే యేపట్టునా మాకు
యితరము లెవ్వరున్నా రెంచిచూడ నిన్నుఁబోల
చతురుఁడ నిన్ననే శరణుచొచ్చితిమి

చ. 2: జననీజనకులు శరణము నీవే
వునికి మనికి నీవే వుపము నీవే
మనసిచ్చి నీవే నన్ను మన్నించుకొంటేనే
చనవి మనవి నీకే శరణుచొచ్చితిమి

చ. 3: లోకసాక్షివి నీవే లోకబంధుఁడవు నీవే
యీకడ శ్రీవేంకటేశ యిదివో నీవె
నీకంటె మరిలేరు నిఖిలమింతయుఁ గావ
సాకారరూప నీకే శరణుచొచ్చితిమి

రేకు: 0358-01 గుండక్రియ సం: 04-339 వైరాగ్య చింత

పల్లవి: నాఁటకమింతా నవ్వులకే
పూఁటకుబూఁటకుఁ బొల్లైపోవు

చ. 1: కోటివిద్యలునుఁ గూటికొఱకె పో
చాటువ మెలఁగేటి శరీరికి
తేటల నాఁకలిదీరినపిమ్మట
పాటుకుఁ బాటే బయలైపోవు

చ. 2: మెఱసేటిదెల్లా మెలుఁతలకొరకే
చెఱలదేహములజీవునికి
అఱమరపుల సుఖమందినపిమ్మట
మొఱఁగుకుమొఱఁగే మొయిలై పోవు

చ. 3: అన్ని చదువులును నాతనికొరకే
నన్నెరిఁగిన సుజ్ఞానికిని
యిన్నిట శ్రీవేంకటేశుదాసునికి
వెన్నెలమాయలు విడివడిపోవు

రేకు: 0358-02 గుండక్రియ సం: 04-340 శరణాగతి

పల్లవి: ఎన్నిటికెన్నిటికని యెక్కడఁ దగిలెదము
మన్నించు దేవ మాకుఁజాలు

చ. 1: ముఖరమై మాఁకులకు మొదలఁబోసిననీరు
శిఖలకుఁ దనువెక్కి చిగిరించినయట్లు
నిఖిలప్రయోజనాలు నీమూలమేకాన
మఖపతి మీసేవే మాకుఁజాలు

చ. 2: వరుసలనిన్నిటా వన్నె బంగారమే
పరపరివిధముల పలుసొమ్ములైనట్లు
నిరతిఁ గర్మఫలాలు నీమూలమేకాన
మరుగురుఁడవు నీవే మాకుఁజాలు

చ. 3: వెలయ శ్రీవేంకటేశ వివిధజంతువులకు
అలవిలేనిభూమే యధారమైనట్లు
నెలవు దేవతలకు నీవేలికవుగాన
మలసి నీశరణమే మాకుఁజాలు

రేకు: 0358-03 రామక్రియ సం: 04-341 మాయ

పల్లవి: మాయలో మోహమున మరచితివిదే హరి
వేయింటికి వింటే వివేకమా

చ. 1: అంతటికినొడయఁడు అఖిలజీవులలోన
అంతర్యామి శ్రీహరియట
యింతటిలో నీకు హితబంధువులు వేరి
వింతవారెవ్వరు నీకు వివేకమా

చ. 2: అరయ నక్షరవాచి యతఁడట యిలలోనఁ
బరమమంత్రాలెపో పలుకులెల్ల
నిరతపునుతి యేది నిందయేది యిందులోన
వెరవెరఁగవుగాక వివేకమా

చ. 3: మొదలను నడుమను ముగిసినర్థములందు
యెదుటను శ్రీవేంకటేశుఁడట
యిది యది యననేల యిచ్ఛాద్వేషమేల
వెదకుము సమబుద్ధి వివేకమా

రేకు: 0358-04 రామక్రియ సం: 04-342 జానపదము

పల్లవి: సందెకాడఁ బుట్టినట్టి చాయలపంట యెంత -
చందమాయఁ జూడరమ్మ చందమామపంట

చ. 1: మునుపఁ బాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుఁగొనచూపులపంట
వినువీధినెగడినవెన్నెలలపంట

చ. 2: వలరాజుపంపున వలపువిత్తినపంట
చలువై పున్నమనాఁటి జాజరపంట
కలిమికామినితోడ కారుకమ్మినపంట
మలయుచుఁ దమలోనిమచ్చిమానిపంట

చ. 3: విరహులగుండెలకు వెక్కసమైనపంట
పరగ చుక్కలరాసిభాగ్యముపంట
అరుదై తూరుపుఁగొండ నారఁగ బండినపంట
యిరవై శ్రీవేంకటేశునింటిలోనిపంట

రేకు: 0358-05 ఆహిరి సం: 04-343 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఎన్నఁడు విజ్ఞానమిఁక నాకు
విన్నపమిదె శ్రీవేంకటనాథా

చ. 1: పాసినఁ బాయపు బంధములు
ఆస దేహమున్నన్నాళ్ళు
కోసినఁ దొలఁగవు కోరికలు
గాసిలి చిత్తముగలిగినన్నాళ్ళు

చ. 2: కొచ్చినఁ గొరయవు కోపములు
గచ్చులగుణములుగలనాళ్ళు
తచ్చినఁ దలఁగవు తహతహలు
రచ్చల విషయపురతులన్నాళ్ళు

చ. 3: వొకటికొకటికిని వొడఁబడవు
అకట శ్రీవేంకటాధిపుఁడ
సకలము నీవే శరణంటే యిఁక
వికటములణఁగెను వేడుకనాళ్ళు

రేకు: 0358-06 బౌళి సం: 04-344 వైరాగ్య చింత

పల్లవి: ఎంత వెట్టిఁ గొండదవ్వి యెలుకఁ బట్టెద నేను
పంతపు శ్రీహరి నాభ్రమ వాపవే

చ. 1: పడనిపాట్లఁ బెక్కుపనులఁ దిరుగుటెల్ల
కుడిచేపట్టెఁడు గూటికొర కింతే కా
కడదాఁకాఁ జెలులతోఁ గాఁపురము సేయుటెల్ల
వొడలు మరచియుండే వొక్క నిమిషానికా

చ. 2: ఘనమైన గృహములు గట్టుకొనుటెల్లాను
తనువు మోచేయంతటికే కా
తనివోని మతిలోని తలపోఁత లెల్లాను
యెనసిన బదుకు తా నెంచుటకే కా

చ. 3: యింతలోని పనియని యెరఁగని చేతఁలెల్లా
సంతకూటముల యీసంసారానకా
చెంతలశ్రీవేంకటేశ చేరి నీకే శరణంటే
యింతక మున్నిటినేర మేమనేవో కా

రేకు: 0359-01 లలిత సం: 04-345 శరణాగతి

పల్లవి: నీవే కాచుటగాక నేరుపు నాయందేది
చేవల వేఁపమాను చేఁదు మానీనా

చ. 1: వొరసి దుర్గుణములనుమానిన నాచిత్తము
మరలి మంచిగుణాన ముట్టుపడీనా
హరి నిన్నుఁ దలఁచక యడవిఁబడిన మరి (తి?)
దరిచేరి నిన్ను మతిఁ దలఁచఁబోయీనా

చ. 2: పొలుమాలి యింద్రియాల బారిఁబడ్డ పుట్టువిది
ఆలరి వైరాగ్యసుఖ మందఁబోయీనా
నీలవర్ణ నినుమాని నిత్యసంసారైన నేను
కాలమందే నిన్నెరఁగఁ గలనా నేను

చ. 3: గరిమ సుజ్ఞానము గలిగిన సాత్విక -
మరయ వేరొకచోట వణఁగీనా
యిరవై శ్రీవేంకటేశుఁడ నీకరుణబ్బె
శరణాగతుఁడ నాకు స్వతంత్రమా

రేకు: 0359-02 ముఖారి సం: 04-346 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఇందుకు విరహితములిన్నియు సజ్ఞానమని
చందమున గీతలందుఁ జాటీనిదివో

చ. 1: మానావమానములు మాని డంబు విడుచుట
పూని హింసకుఁ జొరక యోరుపు గలుగుటయు
ఆని మతిఁ గరఁగుట యాచార్యోపాసన
తానెప్పుడు శుచియౌట తప్పని విజ్ఞానము

చ. 2: అంచల సుస్థిరబుద్ధి యాత్మవినిగ్రహము
అంచితవిషయనిరహంకారాలు
ముంచినజన్మదుఃఖములు దలపోయుట
కంచపుసంసారము గడుచుటే జ్ఞానము

చ. 3: అరిమిత్రసమబుద్ధి యనన్యభక్తియు
సరినేకాంతమును సజ్జనసంగ విముక్తి
ధర నధ్యాత్మజ్ఞానతత్వము దెలియుట
గరిమలందుట శ్రీవేంకటపతి జ్ఞానము

రేకు: 0359-03 లలిత సం: 04-347 దశావతారములు

పల్లవి: ధ్రువవరదునివలె తుదకెక్కుఁగాక మరి
యివల గర్మఫలంబు లేవైన సతమా

చ. 1: కరి రాజ వరదునకు కడఁగి శరణంటేను
కరిఁగాచినట్లనే కాఁచుగాక
పరదైవముల కెంత భంగపడి మొక్కినా
అరసి రావణు కొసంగి నట్లనే కాదా

చ. 2: శ్రీపతినే అడిగినను జిగి నజామిళువలె
చేపట్టి సిరుల రక్షించుఁగాక
ఆపోక కౌరవుఁడు హరిపరాఙ్ముఖుఁడైన
పైపైనే సంపదలు పార్థుచేఁ బడవా

చ. 3: శ్రీవేంకటేశుఁడిచ్చేయీవరంబులే
వోవలను ద్రిష్టమై యుండుఁగాక
భావించ నితరములు పరలోకములయందు
కైవశంబగు ననే కథల వలెఁగాదా

రేకు: 0359-04 బౌళి సం: 04-348 మాయ

పల్లవి: ఏమిసేయుదు నింతయు నీ మాయ
సామజవరద నా చందమిది

చ. 1: జలము లోపలనున్నచందురు నీడవలె
నలుగడలఁ గదలీ నా మనసు
పెలుచు మేఘములు గప్పిన సూర్యునివలె
వెలుఁగదు నాలోని విజ్ఞానము

చ. 2: కడఁగి యాకసమున గాలి యణఁగినట్లు
వడిఁగానరాదు నా వైరాగ్యము
ముడిగి ముత్తెపుఁ జిప్పముత్యము విధంబున
జడిసీ నాలోని సాత్వికము

చ. 3: యిప్పుడిట్టె శ్రీ వేంకటేశ నీ కృపవలె
వుప్పతిల్లె నిజభక్తి యొక్కటై నీపై
కప్పిన నీ సేవవలెఁ గన్న నిధానమువలె
అప్పసమై నిలిచె బ్రహ్మానందము

రేకు: 0359-05 బౌళిరామక్రియ సం: 04-349 శరణాగతి

పల్లవి: ఎన్నఁడు నేఁగందు నిందు నిందిరాపతి నీవే
కన్ను లెదుటనుండి కరుణింతుగాక

చ. 1: పొడమినయట్టె నిన్ను పొంచికొలిచేనంటే
కడు నాకప్పుడు వివేకము చాలదు
అడరి యంతటిమీఁదనైనాఁ దెలియఁబోతే
వడి జవ్వన మదము వశమిందుగాదు

చ. 2: వెనక నేఁ బ్రౌడనై విరతిఁ బొందేనంటే
ధనవాంచ నేమియుఁ దడవనీదు
తనువు ముదిసి నీకుఁ దపముసేసేనంటే
వోసర నేమిటికి వోపికలేదు

చ. 3: శ్రీ వేంకటేశ యీ సిలుగులఁబెట్టనేల
కైవశమై నీవు గలిగుండఁగా
నీవే కృపసేసి నేఁడిటుగావకున్న
పావనమైన యీ పదవెందుఁగద్దు

రేకు: 0359-06 సామంతం సం: 04-350 దశావతారములు

పల్లవి: ఇందరిగాచిన నీవు యిట్టే నీవు నాకు
కందువ నిధానమవై కలవుగా నీవు

చ. 1: అరసి ధ్రువుని గాచినట్టి నీవు
కరుణతోఁ బ్రహ్లాదుఁ గాచిన నీవు
కరిరాజు శరణంటేఁ గాచిన నీవు
కరతలామలకమై కలవుగా నీవు

చ. 2: గట్టిగా విభీషణుఁగాచిన నీవు
అట్టె ద్రౌపదిఁ గాచినప్పటి నీవు
చెట్టవట్టి బలిఁగాచిన నీవు నాకు
కట్టిన ముడుపవై కలవుగా నీవు

చ. 3: కమ్మర సుగ్రీవునిఁ గాచిన నీవు నేఁడు
కిమ్ముల లోకములు రక్షించే నీవు
నెమ్మది శ్రీ వేంకట నిలయ నీవు మాకు
కమ్ముకొని దాపుదండై కలవుగా నీవు

రేకు: 0360-01 లలిత సం: 04-351 వైరాగ్య చింత

పల్లవి: దైవమే నేరుచుఁగాక తగిలించ విడిపించ
యీవల సంసారికి నేమిసేయ వచ్చును

చ. 1: ఆస యెచ్చోట నుండు నక్కడ దైన్యము నుండు
వాసులన్నీ నెందు నుండు వన్నెలు నందుండు
వేసట యెక్కడ నుండు వీతరాగ మాడనుండు
యీసుల నీలంకెవాప నెవ్వరికిఁ దరము

చ. 2: అతికోప మేడనుండు నజ్ఞాన మాడనుండు
మతిఁ బంత మెందుండు మత్సర మందుండు
మతకము లేడనుండు మాయలును నందు నుండు
యితరు లెవ్వరు నిందు కేమనఁగలరు

చ. 3: తనభక్తి యెందుండు తపమును నందుండు
మనసెందు నుండు దీమసమును నందుండు
తనివి యెుక్కడ నుండు తగు సుఖ మందుండు
తనర శ్రీ వేంకటేశు దైవికము లివియే

రేకు: 0360-02 ముఖారి సం: 04-352 దశావతారములు

పల్లవి: వింతనా నేఁ దనకు వేసాలవాఁడు
కంతునికి గురుఁ డనగలిగినవాఁడు

చ. 1: జడిగొని మొదలఁ దా జలసూత్రపువాఁడు
వెడమాయలుగ బారి విద్యలవాఁడు
కడుసోద్యములనే కర్మపుఁ జేఁతలవాఁడు
అడరి కంభపుసూత్ర మాడెడివాఁడు

చ. 2: యిలనుండి మిన్ను ముట్టే యింద్రజాలములవాఁడు
తల ద్రుంచి బ్రదికించుతక్కులవాఁడు
తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు
కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు

చ. 3: మగువల భ్రమ యించే మౌన వ్రతముల వాఁడు
వెగటై రాయి గంతులు వేయించేవాఁడు
చిగిరించే వరముల శ్రీ వేంకటాద్రివాఁడు
బగివాయ కిట మమ్ముఁ బాలించేవాఁడు

రేకు: 0360-03 ముఖారి సం: 04-353 భగవద్గీత కీర్తనలు

పల్లవి: నగవులు నిజమని నమ్మేదా
వొగి నడియాసలు వొద్దనవే

చ. 1: తొల్లిటికర్మము దొంతుల నుండఁగ
చెల్లబో యిఁకఁజేసేదా
యెల్లలోకములు యేలేటి దేవుఁడ
వొల్లనొల్ల నిఁక నొద్దనవే

చ. 2: పోయినజన్మము పొరుగులనుండఁగ
చీయనక యిందుఁ జెలఁగేదా
వేయినామములవెన్నుఁడ మాయలు
వోయయ్య యిఁకనొద్దనవే

చ. 3: నలి నీనామము నాలికనుండఁగ
తలకొని యితరముఁ దడవేదా
బలు శ్రీవేంకటపతి నిన్నుఁగొలిచి
వొలుకుఁ జెంచలములొద్దనవే

రేకు: 0360-04 మంగళకౌశిక సం: 04-354 శరణాగతి

పల్లవి: భారకుఁ డతఁడే బంధువుఁ డతడే
చేరితి మతనినే చెంచెలమేలా

చ. 1: చెనకునాయుధము చేతఁ గలిగితే
ఘననిర్భయుఁడై కడఁగీనట్ల
అనంతాయుధుఁ డాతుమనుండఁగ
వెనుకొని యెందుకు వెఱవఁగనేలా

చ. 2: భువి నొకరాజునుఁ బొందుగఁ గొలిచిన
యివల నచ్చికం బెరఁగఁడట
భువనరక్షకుఁడె పాదిగొని యేలఁగ
వివరించి యొరుల వేఁడఁగనేలా

చ. 3: తోప విధానము దొరకినయప్పుడే
యేవిధములు మరి యెంచఁడట
శ్రీ వేంకటపతి చేకొని కావఁగ
భావన నితరోపాయములేలా

రేకు: 0360-05 సామంతం సం: 04-355 ఇతర దేవతలు

పల్లవి: తానే తానే యిందరి గురుఁడు
సానఁ బట్టిన భోగి జ్ఞాన యోగి

చ. 1: అపరిమితములైన యజ్ఞాలు వడిఁ జేయఁ
బ్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మ యోగి

చ. 2: అన్ని చేఁతలును బ్రహ్మార్పణవిధిఁ జేయ
మన్నించు బుద్ధులను మరుగఁజెప్పి
వున్నతపదమున కొనరఁగఁ గరుణించ
పన్నగ శయనుఁడే బ్రహ్మ యోగి

చ. 3: తనరఁగఁ గపిలుఁడై దత్తాత్రేయుఁడై
ఘనమైన మహిమ శ్రీ వేంకటరాయఁడై
వొనరఁగ సంసారయోగము గృపసేయు
అనిమిషగతుల నభ్యాస యోగి

రేకు: 0360-06 కన్నడగౌళ సం: 04-356 భగవద్గీత కీర్తనలు

పల్లవి: పరమాత్ముఁడవు నీవు పరంజ్యోతివి నీవే
యిరవుగఁ గంటి వింటి నిదివో నిరూపము

చ. 1: పెక్కురోమకూపముల పెనుబ్రహ్మాండాలు మోచే
వెక్కసపు నీకుఁ ద్రివిక్రమాకృతి యేమి
అక్కడ వేదశ్రుతి 'యత్యతిష్ఠద శాంగుల'
మెక్కువయని పొగడీ నిదివో నిరూపము

చ. 2: వెడక జీవులలోనే వేవేలు రూపుల నీకు
యెదిటి దశావతారాలేమి యరుదు
అదె 'విశ్వతోముఖ యనంతమూర్తి'వని
యిదె శ్రుతి వొగడీని యిదివో నిరూపము

చ. 3: దిందుపడి సురలు నీతిరుమేనఁ బొడమఁగ
యిందరు నీవేయవుట యేమి యరుదు
యెందును శ్రీ వేంకటేశ 'యేకో నారాయణ'
యిందులో శ్రుతి చాటీ నిదివో నిరూపము

రేకు: 0361-01 రామక్రియ సం: 04-357 రామ

పల్లవి: భళి భళి రామా పంతపు రామా నీ -
బలిమి కెదురు లేరు భయహర రామా

చ. 1: విలువిద్య రామా వీరవిక్రమ రామా
తలకొన్న తాటకాంతక రామా
కొలయై ఖరుని తలగుండుగండ రామా
చలమరి సమరపు జయరామ రామా

చ. 2: రవికుల రామా రావణాంతక రామ
రవిసుతముఖ కపిరాజ రామ
సవరఁగాఁ గొండలచే జలధిగట్టిన రామ
జవసత్త్వసంపన్న జానకీరామా

చ. 3: కౌసల్యరామా కరుణానిధి రామ
భూసురవరద సంభూతరామా
వేసాలఁ బొరలే శ్రీ వేంకటాద్రి రామ
దాసులమమ్ముఁ గావఁదలకొన్న రామా

రేకు: 0361-02 లలిత సం: 04-358 వేంకటేశ్వరౌషధము

పల్లవి: అన్నిటికి నిది పరమౌషధము
వెన్నుని నామమే విమలౌషధము

చ. 1: చిత్తశాంతికిని శ్రీ పతి నామమె
హత్తిననిజ దివ్యౌషధము
మొత్తపు బంధవిమోచనంబునకు
చిత్తజ గురుఁడే సిద్ధౌషధము

చ. 2: పరిపరి విధముల భవ రోగములకు
హరిపాద జలమె యౌషధము
దురితకర్మములఁ దొలఁగించుటకును
మురహర పూజే ముఖ్యౌషధము

చ. 3: యిల నిహపరముల నిందిరావిభుని -
నలరి భజింపుటె యౌషధము
కలిగిన శ్రీ వేంకటపతి శరణమే
నిలిచిన మాకిది నిత్యౌషధము

రేకు: 0361-03 సామంతం సం: 04-359 వేంకటగానం

పల్లవి: ఎల్లలోకములవారి కేలిక దానే
కొల్లగా వరములిచ్చే గురుతైన దైవము

చ. 1: కొండల కోనల లోన కోనేటి సరిదండ
మెండైన బంగారు మేడలలోన
నిండు జవ్వనము తోడి నెలంత కౌఁగిటలోన
వుండి జగమెల్ల నేలీ నుద్దండ దైవము

చ. 2: నాలుగు చేతుల తోడ నవ్వుల మోముతోడ
సోలి సంకుఁజక్రముల సొంపుతోడ
నేలమిన్నునొకటై నిలుచున్న రూపుతోడ
పాలుపడి మెరసీని ప్రత్యక్ష దైవము

చ. 3: సంపదలు కడుమించి చవులతో నారగించి
జొంపపు విరుల పూజ సొంపుమించి
యింపుల శ్రీవేంకటాద్రి నిరవై వున్నాఁడు వీఁడె
పంపుడు దేవతలతోఁ బ్రతిలేని దైవము

రేకు: 0361-04 లలిత సం: 04-360 శరణాగతి

పల్లవి: బల్లిదులు నీకంటెఁ బరులున్నారా నన్నుఁ
దొల్లిటిబారి నింకఁ దోయకు మోయయ్య్య

చ. 1: చిక్కుల భవములఁ జెరఁజిక్కి వోపలేక
నిక్కి నీమరఁగు చొచ్చి నిలిచితిని
అక్కజమై యల్లనాఁడే అప్పులకర్మములెట్ల
ఇక్కడనె చుట్టుముట్టీ నేమిసేతునయ్యా

చ. 2: లచ్చి సంసారమునకు లగ్గమచ్చి తీరలేక
యిచ్చట నిన్నుఁగొలిచి యెక్కువై తిని
పొచ్చముల నల్లనాఁటిపూఁట దీరదని కొన్ని
బచ్చన బంధాలు వచ్చెఁ బాఁపగదవయ్య

చ. 3: అంచల నింద్రియముల కరివెట్టి పెట్టలేక
ముంచి నీ పాదాలకు మొరవెట్టితి
పొంచిన శ్రీవేంకటేశ భువన రక్షకుఁడవు
పంచల నున్నాఁడ నన్నుఁ బాలించవయ్యా

రేకు: 0361-05 పాడి సం: 04-361 వైరాగ్య చింత

పల్లవి: కలకాలము నిట్టేకాఁపురపు బదుకాయ
యిలదైవమా నాకెన్నఁడో నిశ్చయము

చ. 1: గుట్టుతో వైరాగ్యమే కోరుదు నే నొకవేళ
అట్టున సంసారపుటాఁఅడి గోరుదు
ముట్టుపడి యొకచోట మనసెందు నిలువదు
యిట్టె చెంచెలుఁడ నాకు నెన్నఁడో నిశ్చయము

చ. 2: కొంతవడి నే సత్త్వగుణమందు నెలకొందు
అంతలో రాజస గుణినై యుందును
చెంత దామసగుణము చేకొందు నొకవేళ
యింత పలువంచలు నా కెన్నఁడో నిశ్చయము

చ. 3: వివరించి యొకవేళ వివేకివలె నుందు
ఆవల మూఢుఁడనపుదు నంతటిలోనే
తవిలి శ్రీ వేంకటేశ తగ నిన్ను దలఁచంగ
యవలఁ దొల్తేయాయ నెన్నఁడో నిశ్చయము

రేకు: 0361-06 బౌళి సం: 04-362 వైరాగ్య చింత

పల్లవి: మానదు మతిమఱపునుఁ దెలివియు
యేనింక దైవమ యేమిసేయుదును

చ. 1: సకల పురాణాలు శాస్త్రాలు విని విని
వొక వేళ సుజ్ఞాన మొదవును
వికటమై యంతలో విషయసుఖము గని
ఆకట కమ్మర బుద్ధి నవే కతలు

చ. 2: పలు దుఃఖముల బాధఁబడు వారిఁ బొడగని
పలికి సంసారముపై రోసును
నలవంక సిరులలో నటియించువారిఁ జూచి
తలఁచి యాసలవెంటాఁ దగులు నంతటను

చ. 3: యెడప కలమేల్మంగ యీ రీతి నిన్ననే
బడి బడి యలసి తిట్టె పైపై నింక
చిదుముడి నీ మీఁద శ్రీ వేంకటేశ్వర
తడవి యిట్లదయ దలఁచ కుండినను

రేకు: 0362-01 లలిత సం: 04-363 అంత్యప్రాస

పల్లవి: హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
పరగ నీ దాసుఁడే పరతత్త్వవేది

చ. 1: పొలసి మశకమందుఁ బొడమేటి జీవుని
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపోయీనీ
నిలువెంత నీఁటెంత నీమాయ లివి భువి
బలిమిఁ దెలియువాఁడె పరతత్త్వవేది

చ. 2: తగిలి చూచిన నాత్మఁ దనుఁ గానరాదుగాని
జగమెల్ల దానైతే సరి గనీని
చిగురెంత చేగెంత శ్రీపతి యిందులో నీ -
పగటు దెలియువాఁడే పరతత్త్వవేది

చ. 3: యేవంకఁ దనబుద్ధి యెక్కడనుండునోకాని
శ్రీ వేంకటేశ నిన్నుఁ జింతించీని
పూవెంత ఫలమెంత పురుషోత్తముఁడ నీ -
భావమెరుఁగువాఁడె పరతత్త్వవేది

రేకు: 0362-02 సామంతం సం: 04-364 దశావతారములు

పల్లవి: అల్లదెకో విజయధ్వజము జగ -
మెల్లఁ జేకొనియె నీతఁడు

చ. 1: తొక్కనిచోట్లు దొక్కెటి తురగపు
రెక్కలమీఁదటి రేవంతుఁడు
చక్కుగ నసురల సంహరించి యిదె
దిక్కులు గెలిచెను దేవదేవుడు

చ. 2: వోడక శంఖము నొగి చక్రముతో
సూడుకుఁ దిరిగేటి శూరుఁడు
యీడనుండి సురలిందరిఁ గాచెను
మేడెపు మన లక్ష్మీ విభుఁడు

చ. 3: శరణన వారలఁ జయ్యన గాచిన
శరణాగత రక్షణ ఘనుఁడు
తిరమై యింతకు దిక్కై నిలిచెను
గరిమెల శ్రీ వేంకట విభుఁడు

రేకు: 0362-03 రామక్రియ సం: 04-365 కృష్ణ

పల్లవి: ఎక్కడ నీ వుద్యోగ మెటు విచ్చేసేవయ్యా
యిక్కువ నీమహిమకు నెవ్వ రెదురయ్యా

చ. 1: పల్లించి గరుడనిపై నీ వుబ్బునెక్క
అల్లనాఁడె పారిజాత మడవికెక్కె
పల్లదపురుద్రుఁడును బాణునివాకిలి దొక్కె
చుల్లరి రాక్షసమూఁక సురసుర సుక్కె

చ. 2: గరుడినిపై నీవు కడుఁబేరెములవార
ధరజలధరుల నమృతములు దేరె
నిరతిఁ గంసాదులనెత్తురు టేరులు వారె
పరులు నీకెదిరిన పగయెల్ల దీరె

చ. 3: బంగారు గరుడనిపై నీవు వీదులేఁగ
చెంగట శ్రీ వేంకటేశ సిరులుమూఁగె
సంగతి నలమేల్మంగ సంతసాన విఱవీగె
పొంగారు దేవదుందుభులు పై పై వాఁగె

రేకు: 0362-04 వరాళి సం: 04-366 భగవద్గీత కీర్తనలు

పల్లవి: సమమతినని నీవే చాటుదువు
రమణ నేరుపు నేరము లెవ్వరిని

చ. 1: రావణాదులైన రాక్షసమితిలో
నీవే, దేవతలలో నీవేకావా
భావింప నసురలు పగ నీకు నేలైరి
యీవల సురులెల్ల హితులైరి

చ. 2: సకల జంతువులకుఁ జైతన్యుఁడవు నీవే
వొకరు నీకుపరాక మొనరించేరా
అకట కొందరిఁ బాపాత్ములఁగాఁ జేసి
వెకలిఁ గొందరిఁ బుణ్యవిధులఁ జేసితివి

చ. 3: అటుగాన ఇట్టాయ నట్టాయనననేల
యిటు నీచిత్తముకొలఁ దింతేకాక
గటియించి శ్రీవేంకటపతి నీదాసు
లిటువలె ఘనులై రిదివో నీకృపను

రేకు: 0362-05 ఆహిరి సం: 04-367 నామ సంకీర్తన

పల్లవి: నే నవగుణి నైన నీకుఁ బోదు భువి
లోన భక్తవత్సలుఁడ వటు గాన

చ. 1: పరమ పురుషా భవరోగ వైద్య
ధరణీధర మాధవ కేశవా
అరిది సంసారాన నలసితి నినుఁగను -
తెరు వేదొ వెర వేదొ తెలియ నే నిపుడు

చ. 2: భువనాతీతా పుండరీకేక్షణ
నవనీతప్రియ నారసింహా
యివల నాయపరాధ మెంతైనఁ గలదు నా
వివరము చింతించి వెసఁ గావరాదా

చ. 3: అగుణాసగుణా యాద్యంతరహితా
అగణిత శ్రీ వేంకటాద్రినాథ
నిగమగోచర నేను నీయాధీనమ నింతే
నగుఁబాటు గాకుండ ననుఁగావుమిపుడు

రేకు: 0362-06 కన్నడగౌళ సం: 04-368 మాయ

పల్లవి: తల లేదు తోఁక లేదు దైవమా నమాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము

చ. 1: తను వేఁటిదో యీ తలపోఁత లేఁటివో
యెనయు సంసార సుఖ మిది యేఁటిదో
వెనక ముం దేఁటిదో వివేక మెరఁగక
దినదినమును నేమో తిరిగేము నేము

చ. 2: పుట్టు గిది యెక్కడో పోయేటి దెక్కడో
ఇట్టె యీ సిరులెల్లా నెక్కడెక్కడో
మట్టులేని హరి నిర్మాణ చక్రములోన
దిట్టలమై యేమేమో తిరిగేము నేము

చ. 3: నేరు పేదో నేర మేదో నిలిచిన దొకటేదో
వూరకే నీ దాసులమై వున్నారము
చేరి నన్నేలినయిట్టె శ్రీవేంకటేశ్వర
గారవించి కరుణించి కావఁగదవే

రేకు: 0363-01 మాళవి సం: 04-369 వైష్ణవ భక్తి

పల్లవి: ఇదియే వేదాంత మిందుకంటె లేదు
యిదియే శ్రీ వేంకటేశుని మతము

చ. 1: విరతియే లాభము విరతియే సౌఖ్యము
విరతియే పో విజ్ఞానము
విరతిచే ఘనులైరి వినకవారెల్ల
విరతిఁబొందకున్న వీడదు భవము

చ. 2: చిత్తమే పాపము చిత్తమే పుణ్యము
చిత్తమే మోక్షసిద్ధియును
చిత్తమువలనే శ్రీ హరి నిలుచును
చిత్త శాంతి లేక చేరదు పరము

చ. 3: యెంత చదివినా యెంత వెదికినా
యింతకంటె మరి యిఁకలేదు
యింతకంటె శ్రీ వేంకటేశుదాసులౌట
యెంతవారికైన యిదియే తెరువు

రేకు: 0363-02 గుండక్రియ సం: 04-370 వైరాగ్య చింత

పల్లవి: జీవుఁడు నిత్యుఁడు యీ చింత లెట్టు దొరకెనో
భావించ నిది యేఁటి ప్రచారమో

చ. 1: తనువు మోచితినంటా తరుణుల పొందులంటా
దినదిన రుచులంటాఁ దిరిగేము
మొనసి సంసారమే మోహినీగజమై
వెనకఁ దలఁచ మేటి వికారమో

చ. 2: కడుపు నిండినదంటాఁ గమ్మర నాఁకలియంటా
వెడఁగు భోగములంటా వెదకేము
పుడివోని యాసలే వుబ్బుఁగవణములై
విడువదు మతి కేటివిచారమో

చ. 3: దివము రాతిరి యంటా తెలివంటా నిదురంటా
భువిఁ గాఁపురములంటాఁ బొరలేము
ఇవల శ్రీ వేంకటేశ యింతలో నీ దాసినని
వివరము గంటి నెట్టి వివేకము

రేకు: 0363-03 వళవశ్రీ సం: 04-371 వైరాగ్య చింత

పల్లవి: ఇందుకుఁగా నా యెరఁగమి నేమని దూరుదును
అందియు నిను నేఁదెలియక అయ్యో నేనిపుడు

చ. 1: ఆతుమలోననుండి యఖిలోపాయములు
చేతనునకు నీవే చింతించఁగాను
కాతురపడి నేను కర్తననుచుఁ బనులు
యీతలఁ జెప్పఁగఁబూనే నిస్సిరో

చ. 2: తను విటు నీ వొసఁగి తగు భాగ్యము నీవై
అనువుగ జీవుని నీయటు నీవేలఁగను
తనియక నే వొరులు దాతలనుచుఁ బోయి
కనుఁగొని వేడఁగఁ దొడఁగేఁ గటకటా

చ. 3: శ్రీవేంకటాద్రిపై నుండి చేరి కన్ను లెదుటను
సేవగొని యిట్టే కృపసేయఁగాను
సోవలఁ గన్నవారెల్లాఁ జుట్టములంటా నేను
జీవులతోఁ బొందుసేసేఁ జెల్లఁబో

రేకు: 0363-04 సామంతం సం: 04-372 నృసింహ

పల్లవి: ఇట్టిదివో హరికృప యెంచినను
గట్టిగా నాహరి కృపే కలదువో మాకు

చ. 1: బలుహిరణ్యాక్షుఁడు ప్రహ్లాదునిబట్టి
జలధి వేసిన నీరుచట్టై తేలె
కలుషించి కమ్మరాను కడునగ్నిఁ దోసిన
నిలువెల్లఁ జల్లనినీరై తొలఁకె

చ. 2: దిట్టయై యేనుగులచే దీకొలిపిన వాఁటి
నట్టె కొమ్ములు తమురైపోయను
పట్టియెత్తి రాలమీఁద బలుమారు వేసిన
బట్టబయలే దూదిపానుపులై నిలిచె

చ. 3: కడసారెఁ గంభములోఁ గలఁడంటేఁ గలిగి
చిడుముడి రక్కసులఁ జీరివేసె
జడియు శ్రీ వేంకటాచల నారసింహుఁడై
పొడచూపి మాకు దిక్కై పొదలించె నేఁడు

రేకు: 0363-05 శ్రీరాగం సం: 04-373 శరణాగతి

పల్లవి: అది బ్రహ్మాండఁ బిది పిండాండం -
బుదుటు జీవులము వున్నార మిదివో

చ. 1: వుదయాస్తమయము లొనరినవలెనే
నిదురలు మేల్కను నియమములు
కదిసి త్రిసంధ్యాకాలంబులవలె
గుదిగొను దేహికి గుణత్రయములు

చ. 2: పుడమి నస్యములు పొదలినవలెనే
వొడలిరోగము లున్న వివే
వుడుగని వెలుపటి వుద్యోగమువలె
కొడిసాగేటి మితి కోరికలు

చ. 3: వెలుపలఁగల శ్రీ వేంకట విభుఁడే
కలఁ డాతుమలో ఘనుఁ డితఁడే
చలమున నీతని శరణాగతియే
ఫలమును భాగ్యము బహుసంపదలు

రేకు: 0363-06 గుజ్జరి సం: 04-374 మాయ

పల్లవి: ఏమిసేయవచ్చు హరియెలయించే మాయ లివి
వేమరు నాతనిఁ గొల్చి వీడుకొంటగాక

చ. 1: పాయమే పరచైతేఁ బట్టఁగ నెట్లవచ్చు
రోయుదాఁకా నందులోఁ దిరుగుటగాక
కాయపువోడ తప్పుగాలి విసరినవేళ
పోయినట్టే పోనిచ్చి పొనుఁగుటగాక

చ. 2: మనసే మలినమైతే మఱుఁగెట్టు సేయవచ్చు
వొనర విరతిదాఁక నోర్చుటగాక
తన యంతరంగపుటద్దము మాసితే నది
మినుకు విజ్ఞానాన మెరుఁగిచ్చుటగాక

చ. 3: మెచ్చునాలుకఁదీపు మింగ కెట్టుమానవచ్చు
కొచ్చి కొచ్చి సారె రుచిగొనుటగాక
నచ్చుల శ్రీ వేంకటేశు నామము నోరనుంటే
పచ్చి తనభాగ్యమంటా బ్రదుకుటగాక

రేకు: 0364-01 లలిత సం: 04-375 నృసింహ

పల్లవి: ఆడరమ్మ పాడరమ్మ అంగనలు చూడరమ్మ
వేడుకఁ బరుషలెల్ల వీధినుండరమ్మా

చ. 1: అల్లదివో వోఁగునూఁతులౌభళేశుపెద్దకోవ
వెల్లి పలనీటిజాలు వెడలేసోన
చల్లనిమాఁకులనీడ సంగడిమేడలవాడ
యెల్లగాఁగ నరసింహుఁడేగీ నింతితోడను

చ. 2: సింగారపుమండపాల సింహాలమునిమంద-
లంగపు తెల్ల గోపుర మదె మిన్నంద
చెంగట నాడు వార్లు చేరి పన్నిద్దరుఁగొల్వ
సంగతిఁ దాఁగొలువిచ్చీ జయనరసింహము

చ. 3: కందువ శ్రీ వేంకటేశు కల్యాణములవేది
అందమై భూములకెల్లా నాదికి నాది
మందల పాలకొండమలకు నట్టనడుమ
విందగు దాసులతోడ విహరించీ దేవుఁడు

రేకు: 0364-02 లలిత సం: 04-376 శరణాగతి

పల్లవి: ఇతరమెరఁగ గతి యిదియె శరణ్యము
సతతపూర్ణునికి శరణ్యము

చ. 1: సర్వలోకముల సాక్షైకాచిన -
సర్వేశ్వరునకు శరణ్యము
పుర్వికి మింటికి నొక్కటఁ బెరిగిన -
సార్వభౌమునకు శరణ్యము

చ. 2: శ్రీకాంత నురముచెంగట నిలిపిన -
సాకారునకును శరణ్యము
పైకొని వెలిఁగేటి పరంజోతియై -
సౌకుమారునకు శరణ్యము

చ. 3: తగనిహపరములు దాసుల కొసఁగేటి
జగదీశ్వరునకు శరణ్యము
నగు శ్రీ వేంకటనాథుఁడ నీకును
సగుణమూర్తి యిదె శరణ్యము

రేకు: 0364-03 దేవగాంధారి సం: 04-377 వైరాగ్య చింత

పల్లవి: ఏదైన దేవుఁడు ప్రాణికియ్యక లేదు
పొదుగ నాతనిమీఁది భక్తే సాధనము

చ. 1: దేహమునకు ఫలము తెగని యాలుబిడ్డలు
దేహాంతరాత్మకును దేవుఁడొకఁడే ఫలము
దేహమే బంధకము దేవుఁడింతే మోక్షము
వూహల రెంటికి మనసొక్కటే సాధనము

చ. 2: పుట్టినందుకు ఫలము పొందగు భోగములే
పుట్టుగే గెలుచుటకు భువి జ్ఞానమే ఫలము
పుట్టుటకు గర్మము పోవుటే యకర్మము
వెట్టే యీ రెంటికిని విరతే సాధనము

చ. 3: చింతించుటకు ఫలము సిరులెల్లఁ జేకొనుటె
చింత వీడుటకు ఫలము శ్రీ వేంకటేశు సేవే
చింతలే దుఃఖములు నిశ్చింతములే సుఖములు
కొంత దాఁచనేల శ్రీ గురుఁడే సాధనము

రేకు: 0364-04 ధన్నాసి సం: 04-378 శరణాగతి

పల్లవి: శరణాగత వజ్రపంజర బిరు దది నీది
కరుణానిధివై కావవే నేఁడు

చ. 1: ప్రళయకాలమునాఁడు బ్రహ్మాండకోట్లు
సొలవక నీకుక్షి చొచ్చినట్టు
చెలఁగి నీమరఁగున శ్రీ వేంకటాద్రిమీఁద
యిల నరలోకమెల్ల నెక్కెఁ గావవే

చ. 2: అసురబాధకుఁగా నఖిలదేవతలును
కొసరుచు మొరవెట్టగూడినట్టు
ముసరి కోనేటిదండ మూఁకలు మూఁకలుగట్టి
విసిగి ప్రాణులు విన్నవించేరు గావవే

చ. 3: జీవులఁ బుట్టించునాఁడు చేరి యా యా నెలవుల
నీవలన జనులెల్ల నిలిచినట్టు
శ్రీ వేంకటేశ నిన్నుఁ జేరినట్టివారి నెల్ల
తావుల నిలిపి యిట్టే దయఁగావవే

రేకు: 0364-05 నారాయణి సం: 04-379 నామ సంకీర్తన

పల్లవి: కావఁగ నీకే పోదు కరుణానిధివిగాన
భావించి నీవని తుదపదమే యెక్కితిమి

చ. 1: కరి రాజ వరద నీకడనున్నవారికి
కరిరాజభయము లెక్కడాఁ బొందవు
సిరుల నీయర్థమే చింతించి చింతించి
నరలోకమెల్ల నీనగమె యెక్కితిమి

చ. 2: కాళింగమర్దన నిన్నుఁగని మనువారికి
కాళింగభయములెక్కడా లేవు
తాలిమితో నిదియే తలపోసి తలపోసి
కేలి మనుజులము నీగిరియె యెక్కితిమి

చ. 3: కందువ శ్రీ వేంకట కటకేశ నీవద్ద -
నెందుఁ గటకేశభయమిఁక లేదు
యిందుకే పో జగమెల్లా నిటు శరణని మూల
కందువ నీదండ శ్రీ వేంకటమె యెక్కితిమి

రేకు: 0364-06 దేశాక్షి సం: 04-380 శరణాగతి

పల్లవి: అతఁడే రక్షకుఁ డందరి కతఁడే

పతి యుండఁగ భయపడఁ జోటేది

చ. 1: అనంతకరము లనంతాయుధము-

లనంతుడు ధరించెలరఁగను

కనుఁగొని శరణాగతులకు మనకును

పనివడి యిఁక భయపడఁజోటేది

చ. 2: ధరణి నభయహస్తముతో నెప్పుడు

హరి రక్షకుఁడై యలరఁగను

నరహరికరుణే నమ్మినవారికి

పరఁదున నిఁక భయపడఁజోటేది

చ. 3: శ్రీ వేంకటమున జీవులఁ గాచుచు

నావల నీవల నలరఁగను

దైవ శిఖామణి దాపగు మాకును

భావింపఁగ భయపడఁజోటేది

రేకు: 0365-01 హిందోళం సం: 04-381 వైరాగ్య చింత

పల్లవి: కరుణించవే నిజగతి బోధించవే
హరి నిన్ను గొలువక యలసీఁ బ్రాణి

చ. 1: కలలో నింతులఁ గలసినట్లనే
వెలిఁ గాంతలతోడి వేడుకలు
లలి నిందుకుఁగా లంపటములఁబడి
పలుమారు నూరక బడలీఁ బ్రాణి

చ. 2: నిన్నటి యాహార నిజరుచివలెనే
అన్నువ నిప్పటి యాహారము
యెన్న నిందుకే యిడుమలఁ బొరలుచు
కన్న గతులఁ గడుఁ గలఁగీఁ బ్రాణి

చ. 3: పరుసముసోఁకినబంగారమువలె
పరమభాగవతపట్టములు
అరయఁగ శ్రీ వేంకటాధిప నీకృప
యిరవుగఁ గని తుదకెక్కీఁబ్రాణి

రేకు: 0365-02 మంగళకౌశిక సం: 04-382 శరణాగతి

పల్లవి: ముట్టితేనే మూయ్యెఁ బట్టితేనే పంతమయీా
ఇట్టె మమ్ముఁగావవే యిందిరారమణ

చ. 1: తీరుగాఁ బుణ్యముసేసితే జన్మబంధమై
తోరపు నాపాపములైతే దుఃఖమైని
వూరకుంటే నీప్రపంచ ముల్లంఘించినట్లై
యేరీతి నడచువార మిందిరారమణ

చ. 2: అంకె దయఁ దలఁచితే నన్నిటికిఁ దగులై
కొంకక కోపంచితేనే క్రూరమ్మైని
మంకున నూరకవుంటే మదోన్మత్తుఁడై
యింకనేమి సేయువార మిందిరారమణ

చ. 3: యిన్ని చిక్కులునేల యిట్టె శ్రీ వేంకటేశ
మిన్నక నీశరణంటే మేలైని
వెన్నెల నీయర్థమే వేదశాస్త్రసమ్మతై
యెన్న నీవే సేయువాఁడ విందిరారమణ

రేకు: 0365-03 శంకరాభరణం సం: 04-383 వైరాగ్య చింత

పల్లవి: ఎప్పు డేబుద్ధి పుట్టునో యెరఁగరాదు
దెప్పరపు మా బ్రదుకు దేవునికే సెలవు

చ. 1: యేడనుండి పుట్టితిమో యింతక తొల్లి యింక -
నేడకు బోయెదమో యిటమీఁదను
వీడని మాయంతరాత్మ విష్ణుఁడు మా -
జాడ జన్మమతనికే సమర్పణము

చ. 2: గతచన్న పితరు లక్కడ నెవ్వరో
హితవై యిప్పటి పుత్రు లిదియెవ్వరో
మతి మాజీవనమెల్ల మాధవుఁడు
అతనికే మాభోగాలన్నియు సమర్పణము

చ. 3: తొడికి స్వర్గాదులు తొల్లియాడవో యీా -
నడచే ప్రపంచము నాకేడదో
కడఁగి శ్రీ వేంకటేశు గతియే మాది
అడఁగు మా పుణ్యాపాపా లతని కర్పణము

రేకు: 0365-04 మలహరిసం: 04-384 నామ సంకీర్తన

పల్లవి: ఇదియే సాధనమిహపరములకును
పదిలము మాపాలి పరమవునామం

చ. 1: కలి దోష హరము కైవల్యకరము
అలరిన మా శ్రీ హరి నామం
సులభము సౌఖ్యము శోభన తిలకము
పలుమారును శ్రీ పతి నామం

చ. 2: పాప నాశనము బంధ విమోక్షము
పైపై నిది భూపతి నామం
స్థాపితధన మిది సర్వరక్షకము
దాపి రమిది మాధవ నామం

చ. 3: నేమము దీమము నిత్యకర్మమిది
దోమటి గోవిందుని నామం
హేమము శరణము యిన్నిట మాకును
యే మేర శ్రీ వేంకటేశ్వరు నామం

రేకు: 0365-05 పాడి సం: 04-385 వైష్ణవ భక్తి

పల్లవి: నమ్మిన దిదివో నాపితురార్జిత
మిమ్మహిఁ జూడరో యిది మీదిగాదు

చ. 1: నలినదళాక్షుని నామాంకితమే
నిలువున బాఁతిన నిధానము
కలకాలమిదే గాదెల కొలుచులు
నలుగడ నివియే నాలుక రుచులు

చ. 2: శ్రీ పతి రూపమే చింతించు తలపే
పై పై మాయింటి భాగ్యములు
పూఁపలమిత్రులుఁబుత్రాదు లిది
వైపగు మాకిదె వ్యవసాయములు

చ. 3: శ్రీ వేంకటపతి సేవిది యొకటే
భావించు నాయుష్యభౌష్యములు
కైవల్యపద మిదె కాయజసుఖమిదె
సావధానముల సంసార మిది

రేకు: 0365-06 భైరవి సం: 04-386 వేంకటగానం

పల్లవి: సందడి సొమ్ముల తోడి సాకారమిదె వీడె
యిందరు వర్ణించరే యీ రూపము

చ. 1: చుక్కలతో నాకాశము సూటై నిలువఁబోలు
నిక్కి రత్నాలజలధినీటు గాఁబోలు
మిక్కిలి నానావర్ణ మేఘపంక్తి గాఁబోలు
యిక్కడనే నిలుచున్న దీరూపము

చ. 2: నించిన పంచవన్నెల నీలగిరి గాఁబోలు
అంచల సంధ్యాకాల మది గాఁబోలు
చించ కాతని మెరుఁగుల చీఁకటిది గాఁబోలు
యెంచఁగ నలవిగాదు యీ రూపము

చ. 3: పున్నమ సమాసయు పోగై నిలువఁబోలు
వున్నతి యోగీంద్రుల యూహ గాఁబోలు
పన్నిన బ్రహ్మాండాల భరణిది గాఁబోలు
యిన్నిట శ్రీ వేంకటేశు యీ రూపము

రేకు: 0366-01 ముఖారి సం: 04-387 దశావతారములు

పల్లవి: అతఁడే యెక్కుడుదైవ మందరికంటే
తతినింకాఁ జెప్పిచూప దైవాలు గలవా

చ. 1: జలధి దచ్చేనాఁడు సకల దేవత లుండ
యెలమి నేదేవుఁ జేరె నిందిరాదేవి
అల గజేంద్రుఁడు మూలమని మొరవెట్టునాఁడు
వెలయ నే దేవుఁడు విచ్చేసి కాచెను

చ. 2: పుడమి గొలుచునాఁడు పొడవైన దేవతలు
కెడసి యెవ్వ రడుగు కింద దాఁగిరి
కడలేని జగములు గల్పించే బ్రహ్మదేవుఁ -
డడరి యే దేవు నాభియందుఁ బుట్టెను

చ. 3: యెంచి నాఁడు దేవతల నింద్రియాల జొక్కించే -
పంచబాణుఁ డేదేవునిపట్టి, యిపుడు
కొంచక శ్రీ వేంకటాద్రిఁ గోరిన వరము లిచ్చి
అంచల లోకములేలీ నండ నే దేవుఁడు

రేకు: 0366-02 లలిత సం: 04-388 నామ సంకీర్తన

పల్లవి: నారాయణ నీ నామమె గతి యిఁక
కోరికలు నాకుఁ గొనసాగుటకు

చ. 1: పైపై ముందట భవ జలధి
దాపు వెనకఁ జింతా జలధి
చాపలము నడుమ సంసార జలధి
తేప యేది యివి తెగనీఁదుటకు

చ. 2: పండె నెడమఁ బాపపు రాశి
అండఁ గుడిని పుణ్యపురాశి
కొండను నడుమఁ ద్రిగుణరాశి - యివి
నిండఁ గుడుచుటకు నిలుకడ యేది

చ. 3: కింది లోకములు కీడునరకములు
అందేటి స్వర్గాలవె మీఁద
చెంది యంతరాత్మ శ్రీ వేంకటేశ నీ -
యందె పరమపద మవల మరేది

రేకు: 0366-03 కాంబోది సం: 04-389 మనసా

పల్లవి: కర్మ మెంత మర్మ మెంత కలిగిన కాలమందు
ధర్మ మిది యేమరక తలఁచవో మనసా

చ. 1: చెలువల పొంతనుంటే చిత్తమే చెదురుఁగాని
కలుగనేర దెంతైనా ఘన విరతి
పులుక కగ్గి పొంతనుంటేఁ గాఁకలేకాక
చలువ గలుగునా సంసారులకును

చ. 2: బంగారువోడ గంటేఁ బట్టనాస పుట్టుఁగాని
సంగతి విజ్ఞానపు జాడకు రాదు
వెంగలి యభిని దింటే వెఱి వెఱాటాడుఁగాక
అంగవించునా వివేక మప్పుడే లోకులకు

చ. 3: శ్రీ వేంకటేశు భక్తి చేరితే సౌఖ్యముగాని
ఆవల నంటవు పాపా లతి దుఃఖాలు
చేవ నమృతము గొంటే చిరజీవియగుఁగాని
చావులేదు నోవులేదు సర్వజ్ఞులకును

రేకు: 0366-04 సామంతం సం: 04-390 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఒకరిబుద్ధులు వేరొకరి పనికిరావు
అకలంకుఁ డింతటికి నంతర్యామి

చ. 1: పొడమించు నాతఁడే పొదలించు నాతఁడే
నొడిగించు నాతఁడే నోరఁగొలఁది
గడియించు నాతఁడే కడలేని సిరులెల్ల
అడియాలమగులోని యంతర్యామి

చ. 2: మతి యిచ్చు నాతఁడే మరపించు నాతఁడే
గతియౌ నాతఁడే కరుణానిధి
వెతమాన్పు నాతఁడే వెలయించు నాతఁడే
అతిశయమగులోని యంతర్యామి

చ. 3: యిహమిచ్చు నాతఁడే యెదురెదురనే వచ్చి
సహజపుఁ బరమిచ్చు సరి నాతఁడే
విహగ గమనుఁడు శ్రీ వేంకటేశుఁ డితఁడే
అహరహమాదరించు నంతర్యామి

రేకు: 0366-05 రామక్రియ సం: 04-391 కృష్ణ

పల్లవి: కేవల కృష్ణావతార కేశవా
దేవ దేవ లోకనాథ దివ్య దేహ కేశవా

చ. 1: కిరణార్క కోటి తేజ కేశవా
హరి లక్ష్మీ నాయక యాది కేశవ
గిరి రాజసుత నుత కేశవ నమో
శరధి గంభీర శాయి జయ జయ కేశవా

చ. 2: కేకిపింఛావతంస కేశవ
శ్రీ కర గుణాభి రామ చెన్న కేశవ
కేక వాహన వరద కేశవ
పాక శాసన వంద్య భళి భళి కేశవా

చ. 3: కింకర బ్రహ్మాది గణ కేశవ నా -
మాంకిత శ్రీ వేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ -
శంకా హరణ నమో జగదేక కేశవా

రేకు: 0366-06 ముఖారి సం: 04-392 నామ సంకీర్తన

పల్లవి: ఒలపక్షము లేనొక్క దేవుఁడవు
నలినాక్ష హరీ నమో నమో

చ. 1: నేరిచిన నే నేరకుండిన నీ
కారుణ్య మొక్కటే కలది
పారి ఘంటాకర్ణుభ క్తికి సరిగా
చేరి శుకాదులఁ జేకొంటిగాన

చ. 2: సాదనైన నేఁ జలమతినైనా నీ
పాదమొక్కటేఁ నే బట్టినది
పొద్దైన వసిష్ఠు భక్తికి సరిగా
మేదిని వాల్మీకి మెచ్చితి గాన

చ. 3: యేమిటా శ్రీ వేంకటేశ యెంతైన నీ
నామమొక్కటే నే నమ్మినది
సామజము భక్తి సరిగా నీవును
ప్రేమతోఁ బ్రహ్లాదుఁ బెంచితిగాన

రేకు: 0367-01 బౌళి సం: 04-393 దశావతారములు

పల్లవి: ఓహో యెంతటివాఁడే వొద్దనున్నవాఁడే హరి
సాహసపు గుణముల చతురుఁడా యితఁడు

చ. 1: జలధిలోఁ బవళించి జలనిధి బంధించి
జల నిధి కన్యకను సరిఁ బెండ్లాడి
జలనిధిలో నీఁది జలనిధి మథియించి
జలధి వెరించిన చలమరా యితఁడు

చ. 2: ధరణికిఁ బతియై ధరణి గ్రుంగిన నెత్తి
ధరణికూఁతురుఁ దానె తగఁ బెండ్లాడి
ధరణిఁ బాదము మోపి ధరణి భారము దించి
ధరణీ ధరుఁడైన దైవమా ఇతఁడు

చ. 3: కొండ గొడుగుగ నెత్తి కొండఁ దూఁటువడ నేసి
కొండకిందఁ గుదురై కూచుండి
కొండపై శ్రీ వేంకటాద్రి కోనేటిరాయఁడై
కొండ వంటి దేవుఁడైన కోవిదుఁడా ఇతఁడు

రేకు: 0367-02 శుద్ధవసంతం సం: 04-394 వైరాగ్య చింత

పల్లవి: ఏమని చెప్పెద నిటమీఁద హరీ
శ్రీ మంతుఁడ నిను(జేరితి మిదివో

చ. 1: వినుచున్నారము వెనకటిపాట్లు
కనుచున్నారము కలఁగేటివారల
దిన దిన భావము తెలిసీఁ దెలియదు
మనసున భయ మిసుమంతయు లేదు

చ. 2: భువి నెరుఁగుదు మిదె పుట్టెడి దెసలను
తవిలి మరణములు దలఁచెద మట్లనె
వివరపు టాసలు విడిచీ విడువవు
నవమగు విరక్తి నాఁటదు వోయె

చ. 3: చదివెద మిదివో సకల శాస్త్రములు
వెదకెద మిదె శ్రీ వేంకటేశ నిను
మదిలోనుండగఁ మరచివుంటి మిదె
యెదుటఁగంటి మిఁక యేలాపనులు

రేకు: 0367-03 లలిత సం: 04-395 శరణాగతి

పల్లవి: ఆచార విచారా లవియు నే నెరఁగ
వాచామ గోచరపు వరదుఁడ నీవు

చ. 1: తపమొక్కటే నాకుఁ దగు నీ శరణనుట
జపమొక్కటే నిన్ను సారెకు నుతించుట
వుపమొక్కటే నీవె వున్నతుఁడవంట
విపరీత విజ్ఞాన విధులేమి నెరఁగ

చ. 2: కర్మమొక్కటే నీ కైంకర్యగతి నాకు
ధర్మమొక్కటే నీ దాసాను దాస్యము
మర్మమొక్కటే నా మతి నిన్నుఁ దలఁచుట
అర్మిలి నింతకంటే నవల నే నెరఁగ

చ. 3: బలిమియొక్కటే నాకు భక్తి నీపైఁ గలుగుట
కలిమి యొక్కటే నీవు గలవని నమ్ముట
యెలమితో శ్రీ వేంకటేశ నీవు గతిదక్క
పలుబుద్దులు నేఁబొరలు భావనలేనెరఁగ

రేకు: 0367-04 లలిత సం: 04-396 శరణాగతి

పల్లవి: పనిలే దేమియు నాకు పంపుడు నీబంట నింతే
యెనపిన తెడ్డు చౌ లెరుఁగునటవయ్యా

చ. 1: మనసు నీ విచ్చితివి మాఁటలు నీ విచ్చితివి
తనువు నీ విచ్చితివి యంతర్యామీ
చెనసి నీదువల్లఁ జేసేకర్మపు బంట
నినుపుఁగణఁజాల నించుకొనవయ్యా

చ. 2: సత్తున నీ విచ్చితివి చలము నీ విచ్చితివి
తత్తర మిచ్చితివి యంతర్యామి
యిత్తల నావల నీవు యెందుకైనఁ బెరరేఁచి
యెత్తుక యేమైన గడియించుకొనవయ్యా

చ. 3: మాయలు నీ విచ్చితివి మదము నీ విచ్చితివి
ఆయపు శ్రీ వేంకటాద్రి యంతర్యామి
యేయెడ నేఁ జేసేటి యిన్నెపరాధాలు
వేయయిన నీ వెనక వేసుకొనవయ్యా

రేకు: 0367-05 బౌళి సం: 04-397 శరణాగతి

పల్లవి: నిచ్చలూ లోకము చూచి నివ్వెరగయ్యీ నాకు
చెచ్చెర శ్రీ హరి నీ చిత్తము నాభాగ్యము

చ. 1: జీవ మతిసూక్ష్మము చిత్తము చంచలము
భావము నిరాకారము భవమెల్ల నెయ్యము
యే విధులఁ బొరలెనో యిది నాబ్రదుకు
దేవుఁడ నీచిత్తము నాతేఁకువైన భాగ్యము

చ. 2: వూరుపెల్ల గాలి నా వుపమెల్ల మాయ
కూరిమెల్ల మొరఁగు నా గుణము విచారము
నేరుపేదో నేరమేదో నిజము దెలియదు
శ్రీ రమణుఁడవు నీ చిత్తము నా భాగ్యము

చ. 3: కాలము పారేటిదాడి కాయము తూంట్లబొంత
ఆలరి శ్రీ వేంకటేశ యది నీచేఁత
యేలాగు లెరఁగను యిటు నీ శరణనుటే
శీలము నాకు నీ చిత్తము నా భాగ్యము

రేకు: 0367-06 పాడి సం: 04-398 విష్ణు కీర్తనం

పల్లవి: అమ్మే దొకటియును యసిమలోదొకటి యని
కమ్ముకొని నీయందే కలిగె నీమాఁట

చ. 1: సరవితో నిను నుపనిషద్వాక్యములయందు
పురుషోత్తముడవనుచుఁ బొగడఁగాను
అరిది నారాయణివియ్యె యమృత మొసఁగుచో
అరయ శ్రుతిదె విరోధంబాయ నీమాఁట

చ. 2: తలపోయ ధర్మసంస్థాపనుఁడవని నిన్ను
చెలరేఁగి శాస్త్రములు చెప్పఁగాను
తలఁక కిటు గోప పరదారగమనము నీవు
యిలఁ జేయ శాస్త్రవిరహితమాయ నీమాఁట

చ. 3: వైకుంఠపతి వనుచు వడిఁ బురాణములెల్ల
యేకమొకటే వశియించఁగాను
యీకడ శ్రీ వేంకటేశ్వరుఁడవైతి విదె
చేకొలఁది నిటు నీకె చెల్లు నీమాఁట

రేకు: 0368-01 గుజ్జరి సం: 04-399 శరణాగతి

పల్లవి: ఇతరములన్నియునడుమంత్రములే యెంచిచూచినను యింతాను
హితవగుబందుగుఁ డీశ్వరుఁడొకఁడే యితని మరవకుమీ జీవాత్మా

చ. 1: భవకూపంబుల బడలెడినాఁడు పాయనిబంధువుఁడితఁడొకఁడే
దివిస్వర్గంబునఁ దేలెడినాఁడు తిరుగఁబాయకెపు డితఁడొకఁడే
నవనరకంబుల నలఁగెడినాఁడు నటనలఁ బాయఁ డితఁడొకఁడే
యివలనవలహృదయేశుఁడు విష్ణుఁడుయీతనిమరవకుమీ జీవాత్మా

చ. 2: పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయనిబందుగుఁ డితఁడొకఁడే
విశదపు దుఃఖపువేళలనైనా విడువనిబంధువుఁ డితఁడొకఁడే
శిశువైనప్పుడు వృద్ధైనప్పుడు చిత్తపుబందుగుఁ డితఁడొకఁడే
దశావతారపు విష్ణుఁడొకఁడే యితఁడని తలఁచుమీ జీవాత్మా

చ. 3: భావజకేలిని఼ జొక్కినప్పుడును ప్రాణబంధువుఁ డితఁడొకఁడే
యీవల నావల నిహపరములలో నిన్నిటిబంధువుఁ డితఁడొకఁడే
దైవము దానని శరణనియెడు నను దగ్గరికాచెను యితఁడొకఁడే
శ్రీవేంకటగిరి నాయకుఁ డితఁడే చేరి భజించుము జీవాత్మా

రేకు: 0368-02 తెలుగుగాంబోది సం: 04-400

పల్లవి: తెగఁగోయుటకు హరి దివ్య నామ కీర్తనము
వెగటు నాయుధ మిది విడువకుమీ మనసా

చ. 1: భవపాశములచేతఁ బట్టువడ్డదేహికి
యివలఁ గర్మపాశాలు యివియుఁ గొన్నే
తవిలె నాశాపాశతతులవి యొకకొన్ని
కవగూడఁ దవిలెను కామపాశములు

చ. 2: పమ్మి లోక పురుణాను బంధవు జీవికి
యిమ్ముల సంసార బంధా లివియుఁ గొన్నే
కమ్మరఁ బుణ్య పాప కలుష బంధాలు గొన్ని
సమ్మతించ భోగములే సకల బంధములు

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నవాఁడు
జీవుఁడు నాతనిలోనే చేకొని పాయఁడు వీఁడె
భావించి కొలిచిన పాయును మాయలన్ని
దేవుఁ డితనినమ్మిన తీరుఁబో దుఃఖములు

రేకు: 0368-03 గుండక్రియ సం: 04-401 శరణాగతి

పల్లవి: హరి నీకే శరణని గెలుచుటగాక
యిరవుగ నెరఁగఁగ నెవ్వరి తరము

చ. 1: తను వికారములు తరవులు వెట్టిన
కొనయెరుకైనా కొరతవడు
మనసు వికారము మమతలఁ దగిలిన
యెనసి యెదురుపడ నెవ్వరి తరము

చ. 2: కంతు వికారము కన్నులఁగప్పిన
పంతపు విరతియు బయలౌను
చింతాలహరులు చీఁదర రేఁగిన
యింతయు వీడ్కొన వెవ్వరితరము

చ. 3: అతిగుణవికార మాసలఁ బెట్టిన
సతతయోగములు జడనుపడు
మతి శ్రీ వేంకటపతి నిన్నుఁ గొలిచిన
యితరము దగ్గర నెవ్వరితరము

రేకు: 0368-04 మాళవిగౌళ సం: 04-402 శరణాగతి

పల్లవి: నారాయణ నిను నమ్మిన నాకును
మేరతో నీపాదమే గతి గలిగె

చ. 1: చింతా జలధులఁ జిక్కిన దాఁటించ-
నంతట నీ పాద మదె తేప
కాంతల మోహపు కట్లు దెంచఁగ
పంతపు నీ పాద పరశువు గలిగె

చ. 2: అతిదురితపంక మందినఁ గడుగఁగ
మితి నీ పాదమే మిన్నేరు
రతిఁ గర్మజ్ఞులు రాఁజిన నార్చఁగ
వ్రతము నీపాదమే వానయ్యె నిలిచె

చ. 3: జిగి నజ్ఞానపు చీఁకటి వాయఁగ
తగు నీ పాదము దయపు రవి
నగు శ్రీ వేంకటనాథ నన్నేలఁగ
మిగులఁగ నీ పాదమే శరణంబు

రేకు: 0368-05 మలహరిసం: 04-403 శరణాగతి

పల్లవి: శరణంబితఁడే సకలము నాకును
వెరవున మనసా వెతకవో యితని

చ. 1: అభయం బొసఁగేటియతఁ డెవ్వఁడు మును
యిభరక్షకుఁడతఁ డెవ్వడు
వుభయ విభూతుల కొడయం డెవ్వఁడు
ప్రభువతఁడే నా పాలి దేవుఁడు

చ. 2: శరణాగతులకు సరి దా పెవ్వఁడు
యిరువుగ శ్రీ పతి యెవ్వఁడు
అరి దుష్టదైత్యహంతకుఁ డెవ్వడు
పరమును నతఁడే నాపాలి దేవుఁడు

చ. 3: ఆది శంఖ చక్రాయధుఁ డెవ్వఁడు
యే దెసఁ బూర్ణు డెవ్వఁడు
వేదమయుఁడు శ్రీ వేంకటపతియై
పాదాయ నిదె నాపాలిదేవుఁడు

రేకు: 0369-01 గుండక్రియ సం: 04-404 మాయ

పల్లవి: ఎఱఁగఁడు పరసుఖ మీశ్వర నీమాయ
నెఱి విచారముల నెగడిన దాఁక

చ. 1: అతిహేయములో నడరు వరాహము
అతిహేయము సుఖమని తలఁచు
మతి సంసారంబే మరగిన యాతుమ
పతిలేని దిదే పరమని తెలియు

చ. 2: పొరి విషయములోనఁ బొడమిన కీటము
అరిది విషమ తీపని తినును
పరగ యోని సంభవమగు దేహాతుమ
పెరిగి యందుకే ప్రియపడును

చ. 3: యింతేసి నిన్నియు నెరఁగిన యీయాతుమ
అంతరాత్మ నీవని తలఁచి
యింతట శ్రీ వేంకటేశ్వర నిన్నే
రంతుల శరణనె రక్షించవే

రేకు: 0369-02 భూపాళం సం: 04-405 నామ సంకీర్తన

పల్లవి: ఇవియే పో ప్రద్యుమ్న యిహ పర సాధనము
భవ జలధుల తేప పరమయోగులకు

చ. 1: వామన గోవింద విష్ణు వాసుదేవ హరి కృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా
నీమహిమ గానలేము నిన్నెంచఁగలేము నీ -
నామజపమే చాలు నాలుక సులభము

చ. 2: అనిరుద్ధ పురుషోత్తమాధోక్షజ ఉపేంద్ర
జనార్ధన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగ లేము నిన్నుఁ దెలియఁగ లేము
నునుపై నీనామమే నోటికి సులభము

చ. 3: నారాయణ పద్మనాభ హృషీకేశ
నారసింహ మధుసూదన త్రివిక్రమ
నీరూపు భావించలేము నిక్కపు శ్రీ వేంకటేశ
ఆరయ నీనామజప మన్నిటా సులభము

రేకు: 0369-03 లలిత సం: 04-406 శరణాగతి

పల్లవి: కన్ను లెదుటిదే ఘన వైకుంఠము
వెన్నుని గొలిచిన విజ్ఞానికిని

చ. 1: తలఁచినదెల్లాఁ దత్వ రహస్యమే
తెలిసిన యోగికి దినదినము
పలికినవెల్లా పరమ మంత్రములె
ఫలియించిన హరి భక్తునికి

చ. 2: పట్టినదెల్లా బ్రహ్మాత్మకమే
పుట్టుగు గెలిచిన పుణ్యునికి
మెట్టినదెల్లా మిన్నేటినిధులే
అట్టడితెగువ మెఱయు వానికిని

చ. 3: వినినవియల్లా వేదాంతములే
ఘనుఁడగు శరణాగతునికిని
యెనసిన శ్రీ వేంకటేశుఁడే యింతా
కొనకెక్కిన నిజ కోవిదునికిని

రేకు: 0369-04 సామంతం సం: 04-407 మాయ

పల్లవి: బాపు బాపు దేవుఁడా పంతపు వోమనసా
వోపెఁగా యిందుకు జీవుఁ డోహో నామాయ

చ. 1: నిన్నటిదినము నేఁడు నిజమో కల్లో
కన్నులఁ గన్నట్లాయఁ గానఁగరాదు
యెన్నఁగ రేపటిదిన మేమో యెట్లో
వున్నట్టు దెలియఁగరాదు వోహో నీమాయ

చ. 2: బాలఁనాటి పుట్టుగిది భ్రమయో నిజమో
గాలినె కాలముఁ బోయ కతలాయను
యీలీల మీఁదిమరణ మేమో యెట్టో
వోలిఁ దెలియఁగరాదు వోహో నీమాయ

చ. 3: నెక్కుఁ మింగినకడి నిజమో కల్లో
గక్కున రుచియుఁ దోచె కానఁగరాదు
యెక్కువ శ్రీ వేంకటేశ యిన్నియు నీదాసుఁడైతే
వొక్కటఁ గానఁగవచ్చు నోహో నీమాయ

రేకు: 0369-05 గుండక్రియ సం: 04-408 అంత్యప్రాస

పల్లవి: వెరగుతో మరచితే వెనక లేదు
కరి వరదుఁడే తక్క గతి యొండు లేఁడు

చ. 1: ఆస విడిచినఁగాని యధిక సుఖము లేదు
యీసు విడిచినఁగాని యిహము లేదు
వాసి విడిచినఁ గాని వైపగు విరతి లేదు
వాసు దేవ భక్తిఁగాని వరముక్తి లేదు

చ. 2: చలము మానినఁగాని సాత్వికగుణము లేదు
పలుశంక వోకకాని ఫలము లేదు
సిలుగింద్రియాల గెలిచినఁగాని త్రోవ లేదు
జలజాక్షుచింతఁగాని సమబుద్ధిలేదు

చ. 3: దైవము కరుణనెకాని తగువిజ్ఞానము లేదు
భావించి చూచినఁగాని బలిమి లేదు
యీవల శ్రీ వేంకటేశుఁ డితడె దైవ మితని
సేవించినంతఁగాని సిద్ధి మరి లేదు

రేకు: 0369-06 భైరవి సం: 04-409 మనసా

పల్లవి: హరినామము కడు నానందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా

చ. 1: నలినాక్షుని శ్రీ నామము
కలి దోష హరము కైవల్యము
ఫలసారము బహుబంధ మోచనము
తలఁచవో తలఁచవో తలఁచవో మనసా

చ. 2: నగధరు నామము నరక హరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా

చ. 3: కడఁగి శ్రీ వేంకటపతి నామము
బడిబడినే సంవత్కారము
అడియాలంబిల నతి సుఖ మూలము
తడవవో తడవవో తడవవో మనసా

రేకు: 0370-01 దేవగాంధారి సం: 04-410 శరణాగతి

పల్లవి: ఇందుకు ధ్రువాదు లిటు సాక్షి
చెంది నమ్మవో జీవుఁడ నీవు

చ. 1: కొండలవంటివి ఘోరపాపములు
ఖండించును హరి ఘన నామ జపము
నిండించును మతి నిత్యానందము
పండించునపుడె పరమపదంబు

చ. 2: జలధులవంటివి జననబంధములు
తొలఁగించును హరితూరిన భక్తిది
వెలిఁగించును ఘన విజ్ఞానంబులు
చెలఁగించును బహు సిరిసంపదలు

చ. 3: తోవరాని బహుదుఃఖము లణఁచును
శ్రీ వేంకటపతిఁ జేరిన శరణము
పావనంబుగాఁ బచరించు గుణము
కైవశమగు లోకములెల్లాను

రేకు: 0370-02 భూపాళం సం: 04-411 శరణాగతి

పల్లవి: చిక్కవద్దు చొక్కవద్దు సిలుగుఁ బ్రపంచముల
తక్కిన భోగములెల్లా దైవమే యెరుఁగు

చ. 1: అంతరంగమునఁ దాను హరిఁ దలఁచినఁ జాలు
అంతటి మీఁదటి పనులాతఁ డెరుగు
పంతమున నాతనిపై భారము వేసినఁ జాలు
వింత వుద్యోగములు గోవిందుఁడే యెరుఁగు

చ. 2: చేకొని యాతనిరూపు సేవించినఁ జాలు
ఆకడి యీకడి కర్మా లాతఁ డెరుఁగు
తేఁకువ నచ్యుతభక్తి తిరమయ్యినఁ జాలు
దీకొని పరము చూప దేవుఁడే యెరుఁగు

చ. 3: సాధించి మాధవుని శరణుచొచ్చినఁ జాలు
ఆదియు నంత్యములెల్లా నాతఁ డెరుఁగు
పోదియై శ్రీ వేంకటేశుఁ బూజించినఁ జాలు
పాదుకొని రక్షించఁ బరమాత్ముఁ డెరుఁగు

రేకు: 0370-03 లలిత సం: 04-412 మనసా

పల్లవి: మఱచితిమంటే మరిలేదు
తఱితోఁ దలఁచవో దైవపు మనసా

చ. 1: పుట్టుచు నున్నది పోవుచు నున్నది
పట్టపు జీవుల ప్రపంచము
నట్టనడుమనే నరహరినామము
గుట్టున దలఁచవో గొనకొని మనసా

చ. 2: పొద్దు వొడుచునదె పొద్దు గుంకునదె
తిద్దిన జగముల దినదినము
అద్దపు నీడల యంతర్యామిని
వొద్దనె తలఁచెనొనరవొ మనసా

చ. 3: లోపల వెలుపల లోఁగొనివున్నది
శ్రీపతి మహిమల సృష్టియిదే
యేపున శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడే
దాపని నమ్ముచుఁ దలఁచవో మనసా

రేకు: 0370-04 సామంతం సం: 04-413 హనుమ

పల్లవి: చెల్లె నీచేఁతలు నీకే చేరి మేడెగుడిదిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతురాయ

చ. 1: జంగ చాఁచినట్టి నీ సంగడి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁజేర్చినచేయి
అంగమాయ నీ సొబగు హనుమంతరాయ

చ. 2: పెరిగినవాలము పెద్దైన పిరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారు కాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీవునికి హనుమంతరాయ

చ. 3: స్వామి కార్యపుఁ జింత జానికి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామ నామ జపముతో రతి శ్రీ వేంకటపతి-
కా మేటి బంటవైతివి హనుమంతరాయ

రేకు: 0370-05 లలిత సం: 04-414 గురు వందన, నృసింహ

పల్లవి: నేనై విడువవద్దు తానై తగులవద్దు
తానే తానై వుంటేఁ దగులెల్ల నూడు

చ. 1: పొద్దు వొద్దు హరిఁ దలఁపున దలపోయఁగ
వొద్దికైన పలుచేత లున్న వెల్లా మరచును
నిద్దిరించువాని చేత నిమ్మ పంటివలెనే
బుద్ధితోఁ గర్మములు గొబ్బున జారిపోవును

చ. 2: పలుమారు గురుసేవఁ బరగఁగా బరగఁగా
చలివాసి యాత్మవిజ్ఞానముఁ బొడచూపు
కలగన్నవాఁడు మేలుకనిన కలవలెనే
పలుసంసారములెల్ల భావనలై యుండును

చ. 3: పక్కన శ్రీ వేంకటేశుపై భక్తి వొడమఁగా
అక్కజపు టిహపరా లరచేతివి యౌను
చొక్కపు పరుసమంటి సొంపుగానిలోహము
నిక్కఁ బైఁడైనట్టు నెరుసెల్లఁ దొలఁగును

రేకు: 0370-06 శంకరాభరణం సం: 04-415 నృసింహ

పల్లవి: పరగీనదివో గద్దెపై సింహము వాఁడె
పరమైన యౌభళ నారసింహము

చ. 1: తెల్లని మేని సింహము దేవ సింహము
మెల్లని చిరునవ్వుల మేటిసింహము
చల్లేటియూరుపులతో జయసింహము వాఁడె
బల్లిదుఁడై వెలసే యౌభళ నారసింహము

చ. 2: నిలుచున్నసింహము నిత్యసింహము
అలరుఁ గొండలమీఁది యాదిసింహము
వెలుపలి కడపపై వీరసింహము
పలుకుఁ బంతము (ల) యౌభళనారసింహము

చ. 3: పుట్టుజడలసింహము పూర్ణసింహము
అట్టడి యార్పుల యాఁఅడిసింహము
జట్టి గొన్న దాసులకు శాంత సింహము
పట్టపు శ్రీ వేంకటయౌభళ నారసింహము

రేకు: 0371-01 బౌళి సం: 04-416 శరణాగతి

పల్లవి: అడియ నడియనయ్యు యఖిలలోకైకనాథ
తడతాఁకులతాపత్రయము మానుపుటకు

చ. 1: శరణు శరణు వోసర్వేశ్వర నీకు
మరణభయములెల్ల మానుపుటకొఱకు
మొరయొ మొరయొ నీకు ముకుంద మాధవ
దురితములిన్నియుఁ దొలఁగించుటకు

చ. 2: దండము దండము నీకు దైవశిఖామణి
పండియుఁ బండని మతి పాకముసేయు కొరకు
అండనే దాస్యము దాస్యము నీకు నేనైతి
నిండు నీకరుణ నాపై నించేటి కొరకు

చ. 3: అభయ మభయము శ్రీయాదినారాయణ
వుభయకర్మము నాకు నూడుచుట కొరకు
విభుఁడ శ్రీ వేంకటేశ వినుతి సేసెద నిన్ను
శుభములన్నియు మాకుఁ జూపేటి కొరకు

రేకు: 0371-02 గుండక్రియ సం: 04-417 అధ్యాత్మ

పల్లవి: నీచమైననావల్ల నెరవై దైవమా
చీ చీ యిన్నివిధులఁ జిక్కువడె బదుకు

చ. 1: యెదుటివేమైనఁ గోరు నింతలోనే మనసు
అది సంభవించకున్న నలమటపడుఁ దాను
కదిసి చేకూరితేను ఘనమై హర్షించు
వెద నీరువంక తుంగ విధమాయ మనసు

చ. 2: యెక్కడికైన నేఁగు నెరఁగక తనువు
అక్కడ దుర్లభమైతే నంతలో వేసారు
దక్కి యందే సుఖమైతేఁ దానే విఱ్ఱవీఁగు
గక్కున రొంపలోని కంభమాయఁ దనువు

చ. 3: యెందుకైన సమ్మతించు నిరవైన జీవుఁడు
చెందిన పసిఁడికి చెలులకే మత్తుఁడౌను
కందువ శ్రీ వేంకటేశ కరుణించవయ్య యింక
పొంది పూటచెలమాయఁ బుట్టుగుల సివము

రేకు: 0371-03 లలిత సం: 04-418 శరణాగతి

పల్లవి: హరి నీమయమే అంతాను
అరసి నీకు శరణనియెద నేను

చ. 1: యెదుట నెవ్వరిఁక నేమాటాడిన
అది నీ ఘన నామాంకితమే
అదివో సకల శబ్దాఖ్యుఁడవని నిన్ను
పొదలి చదువులు పొగడీఁగాన

చ. 2: యెవ్వరిఁ బొడగని యెక్కడనుండిన
నివ్వటిల్ల నది నీ రూపే
నెవ్వదీర నిదె నిను విశ్వరూపుఁ
డెవ్వల నని శ్రుతులెంచీఁ గాన

చ. 3: భావన యిది నీ బ్రహ్మాత్మకమే
శ్రీ వేంకటేశ నాచింత యిదే
ఆవల నిను సర్వాంతర్యామిని
దేవ శాస్త్రములు తెలిపీఁ గాన

రేకు: 0371-04 బౌళిరామక్రియ సం: 04-419 శరణాగతి

పల్లవి: కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁ బాడెద నేను

చ. 1: నీ పాద తీర్థము నీరజ భవుని
పై పై కమండల పానీయము
చేపట్టి శంభుని చిరు జడలలో
దీపించు గంగా తీర్థరాజము

చ. 2: ఘన నీ నామమె గౌరి నాలికపై
పనిగొన్న మంత్రపాఠము
అనుఁగువాణికి నాదిచదువులఁ
ఔనఁచే మొదలి బీజాక్షరము

చ. 3: శ్రీ వేంకటేశ్వర చేరి నీ దాసుల
సేవ నా పాలిఁటి జీవనము
ఆవిటించి శరణాగతులకును
త్రోవయైన దిదె దోషహరము

రేకు: 0371-05 కన్నడగౌళ సం: 04-420 దశావతారములు

పల్లవి: ధరలోను జనహితము నానా భక్తరక్షణము నడపఁ గదయ్యా

చ. 1: హరీ నీకు నాగపాశబంధనమది నీమహిమకు నటు వెలితా
తరవాతను రావణాది యసురల తలలు నరకుట ప్రతాపముగాదా

చ. 2: ముసు నీపై నొక భూతము నడచిన మొగి నీమహిమకు నది వెలితా
ఘనహుంకారము మాత్రమున డచినందు నే కడకుఁ దరముట ప్రతాపముగాదా

చ. 3: కలియుగమున శ్రీవేంకటగిరిపైఁ గదిసిన నీమహిమకు వెలితా
కలిమల మథనుఁడ కల్క్యవతారము గయికొనుటచటఁ బ్రతాపముగాదా

రేకు: 0371-06 దేవగాంధారి సం: 04-421 అంత్యప్రాస

పల్లవి: హరి నీకేనే రుణ మత్తుఁగాక తగవైతే
వొరిమ నొకరియ్యఁగ నొకరికి దిద్దుటా

చ. 1: మొలచు జననలోకమునకు నుదుట వ్రాసే
బలుఁడ నీచే నేఁ బత్రసాల మందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు రుణము
యిల నత్తునట యివి యేనాటి రుణము

చ. 2: యేయెడ నేమిసేసి యేలోకమందున్నా
పాయని నీవే నాకు ప్రాణబంధుఁడవైతి
కాయపుఁ జుట్టరికాలు ఘన కరుణానుబంధ
మీయెడఁ గలిగెనట యేనాటి రుణము

చ. 3: శ్రీవేంకటేశ నీవీ చిక్కులఁబెట్టి నాకు
కావిరిఁ గర్మాలు మెడఁ గట్టితివిగా
సోవల నీ శరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాఁటి రుణము

రేకు: 0372-01 శ్రీరాగం సం: 04-422 నామ సంకీర్తన

పల్లవి: విన్నప మిదే నీకు వేవేలు విధముల
నన్నుఁ గావవే హరి నమో నమో

చ. 1: నీగుణము నేనెరిఁగి నిన్నుఁ గొలువనేర
నాగుణము నీవెరిఁగి నన్ను నేలుకొనవయ్య
సాగరము నీవు దచ్చి సతిఁ దెచ్చుకొన్నట్టు
నాగశయనుఁడ హరి నమో నమో

చ. 2: నీవున్నచో టెరిఁగి నిన్నుఁ దలఁచనేర
నావున్నచో టెరుఁగుదు నన్ను నీవు దలఁచవే
కోవిదుఁడ నారఁ బేరుకొన్నవానిఁగాచినట్టు
నావొడయ హరిహరి నమో నమో

చ. 3: మనసులో నున్న నిన్ను మరవకుండ నేర
మనసులోని నీవే నామరపు దెలుపవయ్య
పనివడి యహల్యఁ బాదమునఁ గాచినట్టు
ననిచి శ్రీ వేంకటేశ నమో నమో

రేకు: 0372-02 సామంతం సం: 04-423 శరణాగతి

పల్లవి: ఇన్నివిధాలు యిఁకనేల ప్ర -
పన్నుఁడై మీఁద బహువిధులేలా

చ. 1: సతతభూతదయ సత్యవాక్యము గలితే
కుతిలపు ధర్మాలగొడవలేలా
ప్రతిలేనివిజ్ఞానభావశుద్ధి గలిగితే
మతకపుఁ గర్మాలు మరియేలా

చ. 2: పొందుగ నిన్నిటను సమబుద్ధి నిలిచితేను
సందడిలోఁ దీర్థాచరణలేలా
నిందమాని యాసమాని నిర్మలచిత్తులయితే
వందడైన వుపవాస వ్రతము లేలా

చ. 3: శ్రీ వేంకటపతి చింతనము గలిగితే
పావనపు శాస్త్రాల పఠనలేలా
ఆవల నీతని దాసులందుఁ బ్రేమ గలిగితే
కావరపుటితర సంగతులేలా

రేకు: 0372-03 లలిత సం: 04-424 సంస్కృత కీర్తనలు

పల్లవి: తథాకురుష్వ ముదా మామద్యేవ
అధోక్షజస్తే అనుదాసోహం

చ. 1: తవాస్మి శరణం దహరాహం
భవదురితాని భంజ మమ
భువి కృతం చ యా పురా ప్రతిజ్ఞాం
జవన దదామి సర్వేభ్య ఇతి

చ. 2: వ్రజామి శరణం వరద తవాహం
త్యజితానుబంధ దర్మ మమ
భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యామీతి

చ. 3: చింతితం మయా శ్రీ వేంకటేశ
కింతు త్వం మయి కృపాంకురు
తంతుహి పురాకృతం ప్రతిజ్ఞాం
అంతగతిం నయామీతి మహి

రేకు: 0372-04 భూపాళం సం: 04-425 నామ సంకీర్తన

పల్లవి: నీనామమే మాకు నిధియు నిధానము
నీనామమె యాత్మనిధానాంజనము

చ. 1: నమో నమో కేశవ నమో నారాయణ
నమో నమో మాధవ నమో గోవింద
నమో నమో విష్ణు నమో మధుసూదన
నమో త్రివిక్రమ నమో వామనా

చ. 2: నమో నమో శ్రీధర నమో హృషీకేశ
నమో పద్మనాభ నమో దామోదర
నమో సంకర్షణ నమో వాసుదేవ
నమో ప్రద్యుమ్నతే నమో యనిరుద్ధా

చ. 3: నమో పురుషోత్తమ నమో యధోక్షజ
నమో నారసింహ నమో యచ్యుత
నమో జనార్దన నమో ఉపేంద్ర
నమో శ్రీవేంకటేశ నమో శ్రీకృష్ణా

రేకు: 0372-05 రామక్రియ సం: 04-426 అంత్యప్రాస

పల్లవి: ఎంతలేదు చిత్తమా యీఁతలేల మోఁతలేల
వంతులకుఁ బారనేల వగరించనేలా

చ. 1: దక్కనివి గోరనేల తట్టుముట్టు పడనేల
చిక్కినంతకే సంతసించరాదా
ఒక్కమాఁటే వుప్పుదిని వుపతాప మందనేల
చక్కఁజూడఁ దగినంతే చవిగొనరాదా

చ. 2: పారి పారి వేఁడనేల బడలిక పడనేల
మీరి దైవమిచ్చినంతే మెచ్చరాదా
వీరిడై పొడవెక్కి విరుగఁబడఁగనేల
చేరి యందినంతకే చేచాఁచరాదా

చ. 3: జీవులఁ గొలువనేల సిలుగులఁ బడనేల
శ్రీవేంకటేశుఁ డాత్మఁ జిక్కివుండఁగా
దావతి పడఁగనేల దప్పులం బొరలనేల
కైవశమైనందుకే గతిగూడరాదా

రేకు: 0372-06 వరాళి సం: 04-427 రామ

పల్లవి: శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే
దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే

చ. 1: పదునాలుగేండ్లును బాసి నీ కెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి
కదిసి నీ శరణంటే కరి రాజు నెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి

చ. 2: ప్రక్కన నహల్య శాప విమోచనముగాఁగ
అక్కర తోడుతను బ్రత్యక్షమైతివి
చక్కఁగాఁ దపము సేసే శబరియెదుట నీవు
అక్కడ నాఁ డందునుఁ బ్రత్యక్షమైతివి

చ. 3: భావించినట్టు మతిఁ బరమ యోగులకెల్ల
తావుకొని నిచ్చలుఁ బ్రత్యక్షమైతివి
శ్రీ వేంకటేశ నిన్నుఁ జింతించు మాబోంట్లకు
దైవమవై యిప్పుడే ప్రత్యక్షమైతివి

రేకు: 0373-01 రామక్రియ సం: 04-428 వైరాగ్య చింత

పల్లవి: తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ

చ. 1: తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశమె ట్టోరిచెనో
కట కటా యిట్లాయఁ గలి కాల మహిమ

చ. 2: అంగలాచే కామినుల యంగ భంగపు దోఁపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టుచూచెనో
పొంగు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయఁ కలికాలమహిమ

చ. 3: అరుదు గోహత్యలు సేయఁగ దూడ లంగలావ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధన చూరకెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాలమహిమ

చ. 4: దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలి కాలమహిమ

చ. 5: నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలే కలికాలమహిమ

చ. 6: వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దుఃఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుఁబాపాలు నిండెఁ గలికాలమహిమ

చ. 7: తలలు వట్టీడువఁగా తల్లులు బిడ్డలవేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కలుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ

చ. 8: దీనత లోఁబడి గుండెదిగు లసురుసురులు

వానినెట్లు లోఁగొనో వాయుదేవుఁడు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ

చ. 9: పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ

రేకు: 0373-02 లలిత సం: 04-429 వైష్ణవ భక్తి

పల్లవి: నీవు నాసొమ్మువు నేను నీసొమ్ము

యీవల నీవెపుడు మాయింటనుండఁ దగవా

చ. 1: హరి నీరూపము నాకు నాచార్యుఁడు మున్నె

కెరలి నాపాల నప్పగించినాఁడు

నరహరి నిను నే నన్యాయమునఁ దెలియను

పొరఁబడి నీ కెందుఁ బోఁదగునా

చ. 2: జనని నీదేవి లక్ష్మి జనకుఁడవు నీవె

తనువులు నాత్మబాంధవము నీవె

అనయము నేనెంత యపరాధినైనాను

పనివడి నీవు నన్నుఁ బాయఁదగునా

చ. 3: బహువేదములు నిన్ను భక్తవత్సలుఁడవని

సహజబిరుదు భువిఁ జాటీని

యిహమునఁ శ్రీ వేంకటేశ యిది దలఁచైన

విహితమై నాకడకు విచ్చేయవే

రేకు: 0373-03 బౌళి సం: 04-430 భక్తి

పల్లవి: ఇందిరారమణుఁ దెచ్చి యియ్యరో మాకిటువలె
పొంది యీతనిఁ బూజించ బొద్దాయనిపుడు

చ. 1: ధారుణి మైరావణు దండించి రాముఁదెచ్చి
నేరుపుమించిన యంజనీతనయా
ఘోరనాగపాశములఁ గొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా

చ. 2: నానాదేవతలకు నరసింహుఁ గంభములో
పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడై కృష్ణమహిమల విశ్వరూపు
పూని బండినుంచుకొన్న పొటుబంట యర్జునా

చ. 3: శ్రీ వల్లభునకు నశేషకైంకర్యముల
శ్రీ వేంకటాద్రి వైన శేషమూరితీ
కైవసమైన యట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టె తెచ్చి మాకు నియ్యరే

రేకు: 0373-04 తోడి సం: 04-431 భక్తి

పల్లవి: స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే -
నతికమై యాడినట్లు ఆడఁబోయేవా

చ. 1: యెంత నీ మనసును యెట్టుండె నట్లనే
అంతయుఁ జేయవయ్య మాకదే చాలు
అంతకంటే నెక్కుడు నేమంటిమివో యటమీఁదఁ
జెంతల మా చెప్పినట్టు సేయఁబోయేవా

చ. 2: కమ్మి నీవు మునుప సంకల్పించినట్లనే
కిమ్ముల నా రీతిఁ జిత్తగించవయ్య
అమ్మరో నేమందుకుఁ గాదనినను నీవు
సమ్మతించి మాతలఁపు సాగనిచ్చేవా

చ. 3: పొంచిదేహమున మమ్ముఁ బుట్టించినట్లనే
పెంచి నీపై భక్తిమాకుఁ బెనచవయ్య
నించిన శ్రీవేంకటేశ నేనే పదరితిఁగాక
మంచితనములు నీవు మానఁబోయేవా

రేకు: 0374-01 సామంతం సం: 04-432 గురు వందన, నృసింహ

పల్లవి: వెనకముందరికిఁ బెద్దలకెల్లను వివరపుసమ్మతి యీ వెరవు
వెనుకొని తనగురునాథుని యనుమతి వేదొక్తంబగు నీ తెరువు

చ. 1: కనకాసక్తుఁడు గాకుండుట మది కైవల్యమునకు నొకతెరువు
వనితల భ్రమలను వలలఁ దగులని మది వైకుంఠమునకు నొకతెరువు
మునుకొపముఁ బెడఁబాసిన మతి మోక్షంబునకును నొకతెరువు
యెనసి యిందుప హరిఁదలఁచినమతి యిన్నిటికెక్కుడు యీ తెరువు

చ. 2: నిరతి విషయముల నణఁచిన దృఢమతి నిశ్శ్రేయమున కొకతెరువు
విరతితోడ నెలవై నమతి విభవపుఁ బరమున కొకతెరువు
వెరపున నిందరిమీఁదటిసమమతి విష్ణులోకమున కొకతెరువు
యిరవెరిఁ గంతట హరి నమ్మినమతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు

చ. 3: పన్నినకోరిక తెగఁగోసినమతి పరమపదమునకు నొకతెరువు
వున్న విచారములుడిగించినమతి వున్నతపదమున కొకతెరువు
సన్నుతి భగవద్దాసుల దాస్యమె చలమతి ముక్తికి నొకెతెరువు
యిన్నిట శ్రీవేంకటపతిశరణమె హితమతి నెక్కుడు యీ తెరువు

రేకు: 0374-02 గుజ్జరి సం: 04-433 మాయ

పల్లవి: కూడుదు రూరకె వొకచో గుమి విత్తురు వేరొకచో
యేడకో తెరువులు నడతురు యేఁటిదో హరిమాయ

చ. 1: కొందరు జీవులు పురుషులు కొందరు కాంతలు
కొందరు గొందరు నానాకువలయజంతువులు
యిందరుఁగూడుక భువిలో నేమోయేమో చేసెద -
రెందును నేమియుఁ గానరు యిట్టిది హరిమాయ

చ. 2: జననంబులు మరణంబులు జమునుదయాస్త మయంబులు
జనులివిగనుచునె కనకము సరినార్జింపుదురు
పొనుగుచు నిలిచినదేదో పోయినదేదో కానము
యెనగొని వెరగయ్యీనిదె యిట్టిది హరిమాయ

చ. 3: జీవులకీ బ్రహ్మాండము చీమలపుట్ట విధంబున
కావరమిటు గప్పున్నది కాలత్రయములను
తావుల శ్రీవేంకటపతి దాసులు చొరకిటు నవ్వఁగ
యీవల నావలఁ బొదిగీ నిట్టిది హరిమాయ

రేకు: 0374-03 శోకవరాళి సం: 04-434 గురు వందన, నృసింహ

పల్లవి: నడవరో జడియక నవ్యమార్గ మిది
మడుఁగిది వైష్ణవమార్గ మిది

చ. 1: ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది
జనకాదులు నిశ్చలమార్గ మిది
సనత్కుమాఁరుడుజరపుమార్గ మిది
మనువుల వైష్ణవమార్గ మిది

చ. 2: నలుగడ వసిష్ఠు నడుచు మార్గమిది
యిల వేదవ్యాసుల మార్గం బిది
బలిమిగలుగు ధ్రువ పట్టపు మార్గము
మలసిన వైష్ణవ మార్గ మిది

చ. 3: పరమమార్గం బిదె ప్రపంచమార్గము
గురుమార్గం బిదె గోప్య మిదే
గరిమెల శ్రీ వేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గ మిదే

రేకు: 0374-04 ముఖారి సం: 04-435 అధ్యాత్మ

పల్లవి: సమ్మతించి కనుకొండ సరుస నిశ్చలబుద్ధి
యెమ్మె నెంత బోధించినా నెక్కుడేల కలుగు

చ. 1: తలఁపులో కొలఁది దైవము, తనవల్ల
గల విరతికొలఁది ఘనసుఖము
తెలిసిన కొలఁదే తేటల విజ్ఞాన, మందు -
నెలమి నెవ్వరికైన నెక్కుడేల కలుగు

చ. 2: తపము కొలఁదియే తరువాతి ఫలమును
వుపమ కొలఁదియే యోగమును
ప్రపత్తి కొలఁదియే భాగవత భక్తియును
యెపుడు నెవ్వరికైనా నెక్కుడేల కలుగు

చ. 3: చెంది చేసిన కొలఁదే శ్రీ వేంకటేశు సేవ
అంది పొందిన కొలఁదే యానందము
కందువ నీతని కృప గల కొలఁదే యింతాను
యెందును దక్కిన వారి కెక్కుడేల కలుగు

రేకు: 0374-05 బౌళి సం: 04-436 నామ సంకీర్తన

పల్లవి: వెదకిన నిదియే వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు

చ. 1: మునుకొని అవయవములు యెన్నైనా
పనివడి శిరసే ప్రధానము
యెనలేని సురలు యెందరు గలిగిన
మునుపటి హరియే మూలంబు

చ. 2: మోవని యింద్రియములు యెన్నైనా
భావపు మనసే ప్రధానము
యీవల మతములు యెన్ని గలిగినా
మూవురలో హరి మూలంబు

చ. 3: యెరవగు గుణములు యెన్ని గలిగినా
పరమ జ్ఞానము ప్రధానము
యిరవుగ శ్రీ వేంకటేశ్వరు నామమే
సరవి మంత్రముల సారంబు

రేకు: 0375-01 బౌళి సం: 04-437 వైరాగ్య చింత

పల్లవి: ఎప్పటిజీవుఁడే యెప్పటిజగమే యెంతగాలమును నీరీతే
కప్పుకవచ్చితి వనాదినుండియు కర్మమ యింకా వేసరవా

చ. 1: మఱచితివా తొలుజన్మంబుల మరణకాలములదుఃఖపుబాట్లు
మఱచితివా యమకింకరులయి మర్దించిన బహుతాడనలు
మఱచితివా నరకకూపముల మాఁటికి మాఁటికిఁ బరచిన బాధలు
మఱియును సుఖమని భవమే కోరెదు మనసా ముందరగానవుగా

చ. 2: తలఁచవుగా జననకాలమునఁదనువిదియే యిటుపుట్టిన రోఁతలు
తలఁచవుగా బాల్యంబునఁ దల్లితండ్రుల శిక్షలు వ్యాధులును
తలఁచవుగా సంసారమునకును దైన్యంబును యాచించెటి యలమట
తలఁపుననిదియే వలెనని వోమెదు తనువా యింకా రోయవుగా

చ. 3: కంటివిగా మలమూత్రాదుల కడుగఁగఁ దీరని దినదినగండము
కంటివిగా కనురెప్పలనే కాలముగడచేటికడత్రోవ
కంటివిగా శ్రీవేంకటపతి కరుణచేత నీ వివేకభావము
అంటి యిటువలెనె సార్వకాలమును అంతరాత్మ నినుఁదలఁచగా

రేకు: 0375-02 లలిత సం: 04-438 గురు వందన, నృసింహ

పల్లవి: అన్నిమంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశు మంత్రము

చ. 1: నారదుండు జపియించె నారాయణ మంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహ మంత్రము
కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము
వేరె నాకుఁగలిగె వేంకటేశు మంత్రము

చ. 2: రంగగు వాసుదేవ మంత్రము ధ్రువుఁడు జపించె
నంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడును
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకు నబ్బె వేంకటేశు మంత్రము

చ. 3: యిన్ని మంత్రములకెల్ల యిందిరా నాథుఁడే గురి
పన్నినదిదియే పర బ్రహ్మమంత్రము
నన్నుఁ గావఁ కలిగెఁబో నాకు గురుఁడియ్యఁగాను
వెన్నెలవంటిది శ్రీ వేంకటేశు మంత్రము

రేకు: 0375-03 వరాళి సం: 04-439 వైరాగ్య చింత

పల్లవి: హరిఁ గొలిచినఁగాని ఆపద లణఁగవని
యెరఁగక పొరలితి మిందేమి నిజము

చ. 1: పుట్టిన దేహమొకటి పొందిన వికారాలఁ
బట్టైన జీవుఁడొకఁడు ప్రాణములేడు
కట్టిడి చిత్తమొకటి కరణములైతేఁ బది
యిట్టిదివో మాజన్మ మిందేది నిజము

చ. 2: మొదలి ప్రకృతొకటి ముంచిన గుణాలు మూఁడు
కదియు మోహ మొకటి కర్మాలు పెక్కు
పొదలుఁగర్మ మొకటి భోగా లనంతములు
యిదివో మా జన్మ మెంచ మిందేది నిజము

చ. 3: అంతరాత్మ శ్రీ వేంకటాద్రీశుఁ డొక్కఁడే
చింతించ జీవులైతే సేనాసేన
అంతలో నీతని శరణని బ్రతికితిఁగాక
యెంతలేదు మాజన్మ మిందేది నిజము

రేకు: 0375-04 ముఖారి సం: 04-440 శరణాగతి

పల్లవి: ఇదివో తెరమఱఁ గిహ పరములకును
వెదకి కన్నమీఁదఁ విచారమేలా

చ. 1: హరికుక్షిగతమే యఖిలలోకములెల్ల
నరకము స్వర్గమన్న నయమెంచనేలా
యిరవై యుండినచోనే యిటు హరిదాసుఁడైతే
పరమ పదము నదే భ్రమయఁగనేలా

చ. 2: అందిరి లోపల హరి యంతరాత్ముఁడై యుండ
యిందును నరసురలని యెంచఁగనేలా
అందిన మనసులో హరి భక్తి గలిగిన-
నందునే మోక్షము దప్ప దనుమానమేలా

చ. 3: ఘటన శ్రీ వేంకటేశుక ల్పితమై జన్మములు
యిటు సుఖదుఃఖములు యెంచుకొంటేలా
సటలేక యాతని శరణము చొచ్చితేనే
పటు జీవన్ముక్తి యదే పలు మాటలేలా

రేకు: 0375-05 దేశి సం: 04-441 విష్ణు కీర్తనం

పల్లవి: హరి నీవే సర్వాత్మకుఁడవు
యిరవగు భావన యియ్యఁగదే

చ. 1: చూడక మానవు చూచేటి కన్నులు
యేడనేవైనా యితరములు
నీడల నింతా నీ రూపములని
యీడువడని తెలి వియ్యఁగదే

చ. 2: పారక మానదు పాపపు మన సిది
యీరసములతో నెందైనా
నీరజాక్ష యిది నీమయమేయని
యీరీతుల తలఁ పియ్యఁ గదే

చ. 3: కలుగక మానవు కాయపు సుఖములు
యిల లోపలఁ గల వెన్నైనా
అలరిన శ్రీ వేంకటాధిప నీకే
యిలనర్పితమను యిహ మియ్యఁగదే

రేకు: 0376-01 లలిత సం: 04-442 శరణాగతి

పల్లవి: అతఁడేయెరుఁగును మముఁబుట్టించిన యంతరాత్మయగు నీశ్వరుఁడు
అతికీ నతుకదు చిత్తశాంతి యిదె ఆత్మవిహారం బిఁక నేదో

చ. 1: కనుచున్నారముసూర్యచంద్రులకుఘనవుదయాస్తమయములు
వినుచున్నారము తొల్లిటి వారల విశ్వములోపలికథలెల్లా
మనుచున్నారము నానాఁటికి మాయలసంసారములోన
తనిసీఁదనియము తెలిసీఁదెలియము తరువాతి పనులిఁక నేవో

చ. 2: తిరిగెద మిదివో ఆసలనాసల దిక్కుల నర్థార్జన కొరకు
పొరలెద మిదివో పుణ్యాపాపములభోగములందే మత్తులమై
పెరిగెద మిదివో చచ్చెడి పుట్టెడి భీతిగలుగు దేహములోనే
విరసము లెరఁగము మరచీ మరవము వెనకటికాలము విధియేదో

చ. 3: అట్టైనారము హరినుతిచే నాఁటిడి గురువనుమతిని
పట్టినారమిదె భక్తిమార్గమిదె బలువగు విజ్ఞానముచేత
గట్టిగ శ్రీవేంకటపతి శరణని కంటి మిదివో మోక్షము తెరువు
ముట్టిముట్టము పట్టీపట్టము ముందటి కైంకర్యంబేదో

రేకు: 0376-02 మాళవిగౌళ సం: 04-443 హనుమ

పల్లవి: ఇతఁడే యతఁడు గాఁబో లేలిక బంటును నైరి
మితిలేని రాఘవుఁడు మేఁటి హనుమంతుఁడు

చ. 1: జలధి బంధించి దాఁటె చలపట్టి రాఘవుఁడు
అలరి వూరకే దాఁటె హనుమంతుఁడు
అలుకతో రావణుని యద టణఁచె నతఁడు
తలఁచి మైరావణుని దండించె నితఁడు

చ. 2: కొండ వెల్లగించెఁ దొల్లి గోవర్ధనుఁ డతఁడు
కొండతో సంజీవియెత్తెఁ గోరి యితఁడు
గుండు గరఁచె నహల్యకొరకు సీతాపతి
గుండు గరఁగఁగఁ బాడె కోరి యితఁడు

చ. 3: అంజనా చలముమీఁద నతఁడు శ్రీ వేంకటేశుఁ
డంజనీ తనయుఁ డాయ ననిలజుఁడు
కంజాప్తకులరామఘనుఁడు దానును దయా -
పుంజమాయ మంగాబుధి హనుమంతుడు

రేకు: 0376-03 సామంతం సం: 04-444 హనుమ

పల్లవి: మంగాంబుధి హనుమంతుని శరణ
మంగవించితిమి హనుమంతా

చ. 1: బాలార్కబింబము ఫల మని పట్టిన
ఆలరి చేఁతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలిఁజేకొనిన వో హనుమంతా

చ. 2: జలధిదాఁటి నీ సత్వము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమిఁ బెరిగితివి భళీ హనుమంతా

చ. 3: పాతాళము లోపలి మైరావణు -
నాతలఁ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి-
నీతలఁ గొలిచే హిత హనుమంతా

రేకు: 0376-04 శంకరాభరణం సం: 04-445 శరణాగతి

పల్లవి: కదిసి యాతఁడు మమ్ముఁగాచుఁగాక
అదె యాతనికె శరణంటే నంటి నేను

చ. 1: యెవ్వని వుదరమున నిన్నిలోకములుండు
యెవ్వని పాదము మోచె నిల యలను
యెవ్వఁడు రక్షకుఁ డాయ నీ జంతుకోట్లకు
అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు

చ. 2: సభలో ద్రౌపదిఁ గాచె సర్వేశుఁ డెవ్వఁడు
అభయహస్త మొసంగె నాతఁ డెవ్వఁడు
ఇభవరదుఁ డెవ్వఁడు యీతనికే వొడిగట్టి
అభినవముగ శరణంటే నంటి నిప్పుడు

చ. 3: శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు
అరిది యజునితండ్రి యాతఁ డెవ్వఁడు
యిరవై శ్రీ వేంకటాద్రి యెక్కి నాతఁ డితఁడే
ఆరసి యితనికే శరణంటే నంటి నిప్పుడు

రేకు: 0376-05 భైరవి సం: 04-446 అంత్యప్రాస

పల్లవి: అనాది విషయ విహారము గన ఆతుమ
అనేకమై వీఁగె నందుకే యీ యాతుమ

చ. 1: అన్నిట కర్మపుఁబంక మంటిన దీయాతుమ
మున్ను కోప దుర్గంధములఁ బాఁగె నీ యాత్మ
పన్ని భవముల తుప్పు పట్టిన దీయాతుమ
యెన్నఁడు సుజ్ఞాన మింక నెరిఁగీనో యాత్మ

చ. 2: చెంచెలపుఁ దిప్ప పెంటఁ జివికిన దీయాత్మ
పంచలయాసల నురిఁబడిన దీయాత్మ
కంచపు భోగపుఁగాఁక గరివడీ నీయాత్మ
యెంచి విజ్ఞానమెన్నఁ డెరిఁగీనో యాత్మ

చ. 3: యెలమితో శ్రీ వేంకటేశు కృప నీ యాత్మ
తెలిసి యించుకించుక తేటపడె నాత్మ
అలరి యాచార్యుని అధీనమైనాత్మ
మలసి యజ్ఞానమెట్టు మరచెనో యాత్మ

రేకు: 0377-01 లలిత సం: 04-447 శరణాగతి

పల్లవి: నిఖిలమింతయు మేలు నేనే తీలు

మఖరక్షకుఁడ నన్ను మన్నించవే

చ. 1: నిండును జలనిధులైనా నెటి నేటిమొత్తములచే

నిండదు నామనసైతే నిచ్చా యాసల

పండును లోకములోని బహువృక్షతతులైనాఁ

బండదు నామనసైతే బహువిషయముల

చ. 2: తనియుఁ బసురమైన ధరణిఁ గసవు మేసి

తనియదు నామనసు ధనకాంక్షల

వొనరఁ గారుచిచ్చైనా నొకవేళ శాంతిఁబొందు

పొనిగి యే పొద్దు శాంతిఁబొందదు నామనసు

చ. 3: లోకములోఁ గఠినపు లోహమైనాఁ గరఁగును

కై కొని నామతి గరఁగదు భ్రమసి

యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను

నీకే శరణంటి నెమ్మదిఁ గావఁగదే

రేకు: 0377-02 గుండక్రియ సం: 04-448 ఉపమానములు

పల్లవి: సిబ్బితి పడఁగనేల చింతలఁ బొరలనేల
గొబ్బున మొదలి నీరు కొనకెక్కదా

చ. 1: నెలవై తత్వార్థము నే నెరఁగకుండినాను
తలఁపులోపలివాఁడు తా నెరుఁగుఁగా
అలసి దేహమున నే నశుచినై యుండినాను
యిల నాయంతరియామి యెప్పుడూ శుచేకా

చ. 2: తిరమై నేను దివ్యదేశముల నుండకున్న
ధర నాలోఁ బరమాత్మ తానుండుఁగా
నిరతి గుణముల నే నీచుఁడనైనాను
అరయ నాపాలిహరి యధికుఁడేకా

చ. 3: వొగి నేఁ బరత్రంత్రుఁడనై వుండినాను నాలోన
తగిన స్వతంత్రుఁడు తాఁ గలఁడు గా
వెగటై నే నుండినా శ్రీ వేంకటేశుఁ డెదుటనే
వగలెల్లఁ దీర్చి కైవశమాయగా

రేకు: 0377-03 భైరవి సం: 04-449 మాయ

పల్లవి: ఒక్కటికొక జీవి యోగములు
యిక్కడ మాబుద్ధు లెక్కడఁ గొలుపు

చ. 1: పాయపు మతిలో బలువగు నాసలు
కాయము భువిలోఁ గలదాఁకా
ఆయము సంసార మందుకు మూలము
యేయుపాములు యెక్కడఁ గొలుపు

చ. 2: మానదు కోపము మతి చెంచెలమును
కాని కర్మ మిది గలదాఁకా
ఆనిన మనసే యందుకు మూలము
యే నేరుపు లీక నెక్కడఁ గొలుపు

చ. 3: అందదు మోక్షం బవ్వల నివ్వలఁ
గందువ నిను మతి గనుదాఁకా
అందితి శ్రీ వేంకటాధిప నీ కృప
యెందలి మాయలు యెక్కడఁ గొలుపు

రేకు: 0377-04 గుజ్జరి సం: 04-450 శరణాగతి

పల్లవి: హరిహరి నిను సకలాంతర్యామివి ఆత్మఁదలఁచుటేయోగంబు
శరణాగతరక్షామణి నిన్నే శరణని యెడిదే తుదిపదము

చ. 1: నీయందే యీసచరాచరమును నీవే చరాచరమందు నిత్యమును
పాయక వుండుట గని తలపోయుట పరమార్థంబుల సారంబు
కాయము జీవుఁడు నీయధీనమై కలుగఁగఁ బ్రకృతియుఁ బురుషునిఁగానిటు
మాయల ముంతువు మాయకుఁ జొరవని మతిఁ దలపోయుట సుజ్ఞానంబు

చ. 2: తనలోఁ బరతత్త్వపు నీవును తా నీపరతత్త్వములోపలఁగా
మనసునఁ దలఁచుట వేదాంతంబుల మంతనముల సన్మార్గంబు
ఘనమునకును మరి ఘనమై యందే కడుసూక్ష్మమునకుఁ గడు సూక్ష్మంబై
యెనసిన పూసలలోదార మవని యెన్నుటె పరమరహస్యంబు

చ. 3: ఆతుమలోపల ఘనవైకుంఠము ఆతుము నీ వైకుంఠములోపల
యీతల నాతల సరిగాఁదెలియుట యిదియే బ్రహ్మానందంబు
శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నీ భజియించెద
దాతపు దైవమవై ననుఁగావుము తలఁచెద మిదియే తత్త్వంబు

రేకు: 0377-05 గౌళ సం: 04-451

పల్లవి: వలసిన వారికి వై పులివి
చలమున మానుటే జయమర్మం

చ. 1: తనలోనే పో దైవము
ఘనమే యణువై కనినది
కనవలె నీతని గనుటకు
మనసు లయమౌటే మర్మం

చ. 2: భావములోనే పరమము
తావై తలఁపే తగిలినది
కైవశమై యిది గలుగుటకు
కేవల శాంతం కృతమర్మం

చ. 3: హృదయములోనే యింతాను
తుదిపదమై మదిఁ దోఁచీని
యెదుటనే శ్రీవేంకటేశ్వరుని
కదిసి భుజించుటే ఘనమర్మం

రేకు: 0377-06 బౌళి సం: 04-452 రామ

పల్లవి: రామ మిందీవరశ్యామం పరాత్పర -
ధామం సుర సార్వభౌమం భజే

చ. 1: సీతా వనితా సమేతం
పీత వానర బల వ్రాతం
పూత కౌసల్యా సంజాతం
వీత భీత మౌని విద్యోతం

చ. 2: వీరం రణరంగధీరం
సార ధర్మకులోద్ధారం
క్రూరదానవ సంహారం
శూరాధారాచార సుగుణోదారం

చ. 3: పావనం భక్త సేవనం
దైవిక విహగవధావనం
రావణానుజ సంజీవనం
శ్రీ వేంకట పరిచితభావనం

రేకు: 0378-01 ముఖారి సం: 04-453 దేవుడు-జీవుడు

పల్లవి: పట్టినవ్రతము నీవే పరిపాలింతువుగాక
బట్టబయలింతే నేను బలిమున్నదా

చ. 1: దేవ నీవు మనసు సోదించఁగా నే ధీరుఁడనై
ఆవలఁ జలించకుండే యంతవాఁడనా
పూవు వంటి చిత్త మింతే పొల్లువంటికాయ మింతే
భావించ నిందులఁ బస వున్నదా

చ. 2: అంతరాత్మవై నీవు యటు మరఁగులుసేయ-
నంతనె నినుఁ దెలిసే యంతవాఁడనా
గంతివంటిగుణ మింతే గాలివంటిప్రాణ మింతే
యింతరట్టుసేయ నిందు నెడమున్నదా

చ. 3: మచ్చిక శ్రీ వేంకటేశ మాట నీవై యుండఁగాను
అచ్చపు నిన్ను నుతించే యంతవాఁడనా
గచ్చువంటియిహ మింతే గనివంటి పర మింతే
ముచ్చట కిందుకుఁ దుద మొద లున్నదా

రేకు: 0378-02 పాడి సం: 04-454 దశావతారములు

పల్లవి: నరసింహ రామకృష్ణ నమో శ్రీ వేంకటేశ
సరుగ నాశత్రుల సంహరించవే

చ. 1: బావ తిట్లకు శిశుపాలునిఁ జంపిన-
యేవ కోపకాఁడవు నేఁ డెందు వోతివి
నీవాఁడనని నన్ను నిందించి శత్రువును
చావఁగొట్టి వానినిట్టే సంహరించవే

చ. 2: దాసుని భంగించేటి తరిఁ గస్యఁపుఁ జంపిన
యీసు కోపకాఁడ విపు డెందువోతివి
మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే
సాసించి శత్రువును సంహరింపవే

చ. 3: కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్దఁజంపిన
యెల్లగాఁగఁ గోపకాఁడ వెందువోతివి
యిల్లిదె శ్రీ వేంకటేశ యీా నీ మీఁదిపాటలు
జల్లన దూషించు శత్రువు సంహరింపవే

రేకు: 0378-03 వరాళి సం: 04-455 అంత్యప్రాస

పల్లవి: ఎరిఁగీ నెరఁగదు యేమి సేతు మతి
హరిదాస్యం బదియే సుఖము

చ. 1: వెతలఁబొరలే ఘన విభవముకంటే
అతి పేదరిక మది సుఖము
గతి నెరవుల సింగారము కంటెను
సత మగు తన నిచ్చలమే సుఖము

చ. 2: పలుబాములఁబడు పగలిటికంటే
తెలిసి నిద్రించు రాతిరి సుఖము
అలమట గడించు నమృతముకంటే
కలపాటి తనకు గంజే సుఖము

చ. 3: పరపీడలొసఁగు భవమునకంటే
ధరఁ బొడమని చందము సుఖము
గరిమల శ్రీ వేంకటపతి నీకే
శరణని యెడి నాజన్మమే సుఖము

రేకు: 0378-04 బౌళి సం: 04-456 అంత్యప్రాస

పల్లవి: పుట్టఁగా బుట్టిన నాభోగపుటాస
పట్టి యేమిగట్టుకొంటి బదుకవో యాసా

చ. 1: వూరు దిప్పినట్టి యాస వుగముదిప్పిన యాస
చేరవచ్చి దైన్యమందించిన యాస
భారపెట్టి దేహమెల్లా బడిలించిన యాస
పారి మమ్మేఁచితి వింత బదుకవో యాసా

చ. 2: నాలుక రుచుల యాస నాతులకాఁకల యాస
కాలకాసుకైన బొంకు గరుపే యాస
వోలిఁ బుణ్య తపమెల్ల వొరులకమ్మించు నాస
పాలుమాలించితి వింక బదుకవో యాసా

చ. 3: కిందుపరచేటి యాస గేలిసేయించేటి యాస
పొందియట్టే సంతసానఁ బొదిపే యాస
కందువ శ్రీ వేంకటేశుఁ గని శరణంటి నేను
పందతనమొల్ల నింక బదుకవో యాసా

రేకు: 0378-05 సామంతం సం: 04-457 భగవద్గీత కీర్తనలు

పల్లవి: ఆ రూపమునకే హరి నేను మొక్కెదను
చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి

చ. 1: ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు
సోలి నగ్నియును సూర్యచంద్రులును
నీలో నుండఁగ నెరిఁ గనెఁ గిరీటి
మూల భూతి వగు మూర్తివి గాన

చ. 2: అనంత శిరసుల ననంత పదముల-
ననంత నయనము లనంత కరముల
ఘన నీ రూపము గనుఁగొనెఁ గిరీటి
అనంత మూరితి వన్నిటఁ గాన

చ. 3: జగము లిన్నియును సకల మున్నీంద్రులు -
నగు శ్రీ వేంకటనాథుఁడ నిన్నే
పొగడఁగఁ గిరీటి పొడగనె నీ రూపు
అగణిత మహిముఁడ వన్నిటఁగాన

రేకు: 0378-06 రామక్రియ సం: 04-458 హనుమ

పల్లవి: ఆంజనేయ యనిలజ హనుమంత నీ -
రంజకపుఁ జేఁతలు సురల కెంచ వసమా

చ. 1: తేరిమీఁద నీ రూపు దెచ్చిపెట్టి యర్జునుఁడు
కౌరవుల గెలిచె నంగర భూమిని
సారెకు భీముఁడు పురుషామృగముఁ దెచ్చుచోట
నీరోమములు గావా నిఖిల కారణము

చ. 2: నీమూలమునఁగాదె నెలవై సుగ్రీవుఁడు
రామునిఁ గొలిచి కపిరాజాయను
రాముఁడు నీవంకనే పో రమణి సీతాదేవిఁ
బ్రేమముతో మగుడను బెండ్లాడెను

చ. 3: బలుదైత్యులను దుంచ బంటతనము మించ
కలకాలమును నెంచఁగలిగితిగా
అల శ్రీ వేంకటపతి యండనే మంగాఁబుధి -
నిలయపు హనుమంత నెగడితిగా

రేకు: 0379-01 శంకరాభరణం సం: 04-459 హనుమ

పల్లవి: ఏలవయ్య లోకమెల్ల యిట్టె రాము దీవెనచే
నీలవర్ణ హనుమంత నీవు మాకు రక్ష

చ. 1: మొదల నింద్రుఁడు నీ మోమునకెల్లా రక్ష
యిదె నీ శిరసునకు నినుఁడు రక్ష
కదిసి నీ కన్నులకు గ్రహతారకాలు రక్ష
చెదరని మేనికెల్ల శ్రీ రామరక్ష

చ. 2: పిరుఁదు వాలమునకు బెడిదపు శక్తి రక్ష
గరుడఁడు నీకరయుగముల రక్ష
గరిమ నీకుక్షికి కరివరదుఁడు రక్ష
సిరుల నీ మహిమకు శ్రీ రామ రక్ష

చ. 3: పడి నీ పాదములకు వాయుదేవుఁడు రక్ష
తొడలకు వరుణుఁడు తొడగు రక్ష
విడువని మతికిని వేద రాసులే రక్ష
చెడని నీ యాయువుకు శ్రీరామరక్ష

చ. 4: నలువ నీగళ రక్ష నాలుక కుర్వర రక్ష
అలర నీసంధులకు హరుఁడు రక్ష
పలు నీరోమములకు బహుదేవతలు రక్ష
చెలఁగు నీచేఁతలకు శ్రీ రామరక్ష

చ. 5: అంగవు నీతేజమున కగ్నిదేవుఁడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీ సతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీ కేకాలము
చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీ రామరక్ష

రేకు: 0379-02 బౌళి సం: 04-460 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నఁడొకో సుజ్ఞానము యీ యాత్మకు
కన్ను లేదిటివి చూచి కాలము నిట్టాయను

చ. 1: హేయములో సుఖము యెంగిలిలో సుఖము
కాయము నమ్మికదా కష్టపడెను
పాయములో చవులు పాపములో చవులు
మాయలు నమ్మికదా మనసూనిట్టాయను

చ. 2: కల్లలోని బదుకు కాసు వీసపు బదుకు
కల్లరి ప్రాణాలు నమ్మి కట్టుపడెను
యెల్లి నేఁటి తలఁపు యింద్రియాల తలఁపు
కొల్ల సంసారముఁగూడి గుణమునిట్టాయను

చ. 3: అంగడిఁబెట్టే సిరులు యలయింపులో సిరులు
దొంగజీవుఁడు యిట్లానే తొట్రుపడెను
అంగపు శ్రీవేంకటేశుఁడంతలో మన్నించఁగాను
ముంగిలెల్లా మోక్షమాయ ముచ్చటే యిట్టాయెను

రేకు: 0379-03 లలిత సం: 04-461 భక్తి

పల్లవి: ఏమిటివాఁడఁ గాను యిఁకనేను నా -
సామపుఁ గర్మము నీకే సమర్పయామి

చ. 1: తలఁపులోపలనున్న తత్వము యిట్టె
వెలినుండే నాపాలి విష్ణుమూర్తీ
పలుకు లోపల నుండే పరమాత్ముఁడా నా
చలమరి మతి నీకే సమర్పయామి

చ. 2: పుట్టుగులిచ్చినయట్టి పురుషోత్తమా తుద -
ముట్టించు మోక్షపుమురమర్దనా
గుట్టుతో నిహముచూపే గోవిందుఁడా నా
జట్టి చైతన్యము నీకే సమర్పయామి

చ. 3: అరిదిభోగములిచ్చేయంతరాత్ముఁడా నాకు
శరణమైనయట్టి సర్వేశ్వరా !
వెరసి నన్నేలిన శ్రీ వేంకటేశుఁడా నా
సరవులన్నియు నీకే సమర్పయామి

రేకు: 0379-04 పాడి సం: 04-462 హనుమ

పల్లవి: ఒక్కఁడే యేకాంగవీరుఁ డుర్వికి దైవమౌనా
యెక్కడా హనుమంతుని కెదురా లోకము

చ. 1: ముందట నేలేపట్టమునకు బ్రహ్మయినాఁడు
అందరు దైత్యులఁ జంపి హరి పేరైనాఁడు
అంది రుద్రవీర్యము దానై హరుఁడైనాఁడు
యెందు నీ హనుమంతుని కెదురా లోకము

చ. 2: చుక్కలు మోవఁ బెరిగి సూర్యుఁడు దానైనాఁడు
చిక్కుఁ బాతాళము దూరి శేషుఁడైనాఁడు
గక్కన వాయుజుఁడై జగత్ప్రాణుఁడై నాఁడు
యెక్కువ హనుమంతుని కెదురా లోకము

చ. 3: జలధిఁ బుటమెగసి చంద్రుఁడు దానైనాఁడు
చెలఁగి మేరువుపొంత సింహమైనాఁడు
బలిమి శ్రీ వేంకటేశు బంటై మంగాంబుధి -
నిల యీ హనుమంతుని కెదురా లోకము

రేకు: 0379-05 దేశాక్షి సం: 04-463 నామ సంకీర్తన

పల్లవి: ఏమరక తలఁచరో యిదే చాలు
కామించినవి యెల్లఁ గక్కుననే కలుగు

చ. 1: దురితములెల్లఁ దీరు దుఃఖములెల్ల నణఁగు
హరియని వొకమాఁటు అన్నాఁజాలు
సురలు పూజింతురు సిరులెల్లఁ జేరును
మరుగురునామ మటు పరుకొన్నఁ జాలు

చ. 2: భవములిన్నియుఁ బాయు పరము నిహముఁజేరు
అవల నారాయణయన్నాఁ జాలు
భువి యెల్లాఁ దానేలు పుణ్యములిన్నియుఁజేరు
తవిలి గోవిందు నాత్మఁదలఁచినఁ జాలు

చ. 3: ఆనందము గలుగు నజ్ఞానమెల్లఁ బాయు
ఆనుక శ్రీ వేంకటేశ యన్నాఁ జాలు
యీ నెపాన నారదాదు లిందరు నిందుకు సాక్షి
దానవారి మంత్రజప తపమే చాలు

రేకు: 0380-01 బౌళి సం: 04-464 మాయ

పల్లవి: ఎందును బోరాదీ సంసారము
కందువ నీ మాయ గడవఁగ వశమా

చ. 1: కలిమే చిత్త వికార హేతు విది
అలర లేమి దైన్య హేతువు
పలు లంపటములు బంధ హేతువులు
తలఁగిన నడవదు తనుపోషణము

చ. 2: మదవికార మిదె మహిత యౌవనము
తుద వార్ధకమే దురంతము
యిదె యర్థార్జన యాతాయాతన
అదియు మానితే నాఁకలి ఘనము

చ. 3: యెన్ని గడియించే వెన్నిట ముంచే -
విన్నిట శ్రీ వేంకటేశ్వరుఁడ
అన్నిట నంతర్యామివి నీవే
కన్ను దనియ ననుఁ గావఁగదే

రేకు: 0380-02 దేవగాంధారి సం: 04-465 మేలుకొలుపులు

పల్లవి: వారిధి శయన వో వటపత్ర పరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే

చ. 1: ఘన యోగి హృదయపు కమలాలు వికసించె
వొనర విజ్ఞాన సూర్యోదయమాయ
మును జీవ పరమాత్మముల జక్కవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే

చ. 2: కలుషముల నేటి చీఁకట్లెల్లఁ బెడఁబాసె
నలువంక వేద కీరనాదము మ్రోసె
అలరి యితర ధర్మాల నేటి చుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతి మోము చూడవే

చ. 3: కపట రాక్షస నేత్ర కలు హారములు మోడ్చె
యిపుడే సుకర్మముల యెండలు గాసె
అపురూప శ్రీ వేంకటాద్రీశ మేలుకొని
నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁ గావనవే

రేకు: 0380-03 శుద్ధవసంతం సం: 04-466 నృసింహ

పల్లవి: చేకొన్న భక్తుల పాలి చింతామణి
సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుడు

చ. 1: వాఁడిగోళ్లచేత వడి హిరణ్యునిఁ జంపి
వేడుక నెత్తురు లెల్ల వెదచల్లుచు
పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె
మూఁడు మూర్తులకును మూల మీతఁడు

చ. 2: కొండమీఁదఁ గూచుండి కోప ముపసంహరించి
అండనున్నదేవతల కభయమిచ్చి
మెండుగ సులభుఁడై మెరయుచు నున్నవాఁడు
దండి జగముల కెల్ల దైవ మీతఁడు

చ. 3: వేవేలు చేతులను వెస నాయుధాలు వట్టి
చేవ మీరి ప్రతాపాన సిరులు మించి
యీవల నహోబలాన నిరవై యున్నవాఁడు
శ్రీ వేంకటాద్రి మీఁది సిద్ధమూర్తి యీతఁడు

రేకు: 0380-04 సామంతం సం: 04-467 హనుమ

పల్లవి: కలశాపురముకాడ కందువ సేసుకొని
అలరుచు నున్నపాఁడు హనుమంత రాయుఁడు

చ. 1: సహజాన నొక జంగ చాఁచి సముద్రము దాఁటె
మహిమ మీరఁగ హనుమంతురాయఁడు
యిహమున రాము బంటై యిప్పుడూ నున్నవాఁడు
అహరహరమును దొడ్డ హనుమంత రాయఁడు

చ. 2: నిండు నిధానపు లంక నిమిషాన నీరుసేసె
మండిత మూరితి హనుమంత రాయఁడు
దండితో మగిడివచ్చి తగ సీత శిరోమణి
అండ రఘుపతి కిచ్చె హనుమంతరాయఁడు

చ. 3: వదలని ప్రతాపాన వాయుదేవు సుతుఁడై
మదియించినాఁడు హనుమంత రాయఁడు
చెదరక యే పొద్దు శ్రీ వేంకటేశు వాకిట-
నదివో కాచుకున్నాఁడు హనుమంత రాయఁడు

రేకు: 0380-05 లలిత సం: 04-468 కృష్ణ

పల్లవి: వేవేల చందాలవాఁడు విఠలేశుఁడు
భావించ నలవిగాని పరమాత్ముఁ డితఁడు

చ. 1: సతతము రుక్మిణీ సత్యభామల నడుమ
రతికెక్కిన సింగారరాయఁ డితఁడు
చతురత సనకాది సంయమీంద్రులమతి-
నతిశయిల్లేటి పరమానంద మితఁడు

చ. 2: దేవతల కెల్లాను దిక్కు దెసై వెలుఁగొంది
తావుకొన్న యట్టి యాధార మీతఁడు
మూవంక గొల్లెతలు మున్ను సేసిన తపము
కైవశమై ఫలించిన ఘన భాగ్య మితఁడు

చ. 3: వరముతో యశోద వసు దేవాదులకు
పరగిన కన్నులపండు గీతఁడు
పిరులు మించినయట్టి శ్రీ వేంకటాద్రిమీఁది-
నిరతి దాసుల పాలి నిధాన మితఁడు

రేకు: 0380-06 తోడి సం: 04-469 నృసింహ

పల్లవి: సుగ్రీవ నారసింహ సులభుఁడ వందరికి -
నగ్రేసరుఁడ నీ వవధారు దేవా

చ. 1: సనకాదు లొకవంక జయవెట్టుచున్నారు
యెనసి సురలు చేతులెత్తి మొక్కేరు
ముని లిరుమేలానుండి మునుకొని నుతించేరు
అనుపమాలంకార అవధారు దేవా

చ. 2: గంగాది నదు లెల్లఁ గడిగీ నీ పాదములు
పొంగుచు సప్త రుషులు పూజించేరు
సంగతి వాయుదేఁడు సరినాల వట్టమిడీ
అంగజ కోటి రూప యవధారు దేవా

చ. 3: పరగ నారదాదులు పాడేరు నీ చరితలు
పరమ యోగీంద్రులు భావించేరు
సిరులు మించిన యట్టి శ్రీ వేంకటాద్రిమీఁద-
నరుదుగ నున్నాఁడవు అవధారు దేవా

రేకు: 0381-01 మాళవి సం: 04-470 హనుమ

పల్లవి: అరుదీ కపీంద్రుని యధిక ప్రతాపము
సురలకు నరుల కీ సుద్దు లెందుఁ గలవా

చ. 1: వుదయాచలము మీఁది నొక్కజంగ చాఁచుకొని
వుదుటున నపరాద్రి నొక్కజంగ చాఁచుకొని
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకొంటా
పెదవులెత్తి చదివెఁ బెద్ద హనుమంతుఁడు

చ. 2: వొక్క మొలగంట చంద్రు డొక్క మొలగంట రవి
చుక్కలు మొలపూసలై చూపట్టఁగా
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము
పిక్కటిల్లఁ బెరిగెను పెద్ద హనుమంతుఁడు

చ. 3: పడికిలించిన చేత బిరుదుల పండ్ల గొల
తడయక కుడి చేత దశ దిక్కుల
జడియక శ్రీ వేంకటేశ్వరునిమన్ననబంటు
బెడిదపు మహిమల పెద్ద హనుమంతుఁడు

రేకు: 0381-02 బౌళి సం: 04-471 రామ

పల్లవి: నమో నమో రఘు కుల నాయక దివజ వంద్య
నమో నమో శంకర నగజనుతా

చ. 1: విహిత ధర్మపాలక వీర దశరథ రామ
గహనవాసినీ తాటకా మర్దన
అహల్యా శాపమోచన అసుర కుల భంజన
సహజ విశ్వామిత్ర సవన రక్షకా

చ. 2: హరి కోదండహర సీతాంగనా వల్లభ
ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణి తనూజాది తరుచర పాలక
శరధి లంఘన కృత సౌమిత్రి సమేతా

చ. 3: బిరుద రావణ శిరో భేదక విభీషణ-
వరద సాకేత పుర వాస రాఘవ
నిరుపమ శ్రీ వేంకటనిలయ విజనగర
పురవరవిహార పుండరీకాక్షా

రేకు: 0381-03 సాళంగనాట సం: 04-472 రామ

పల్లవి: చిత్తా అవధారు జియ్య పరా కెచ్చరికె
హత్తి కానుక లిచ్చేరు అదె రాజరాజులు

చ. 1: రామ రఘు కుల వీర రాజీవ లోచన
కోమల శ్యామల వర్ణ కొలువు వేళ
వామ దేవాది మునులు వారె, సుగ్రీవుఁడు వాఁడె
వేమారును వానర వీరులు మొక్కేరు

చ. 2: దేవ సీతాస మేత ధీర లోక నాయక
భావించ నవధరించు పొఁజువేళ
పావని యల్లవాఁడె భల్లూకపతి వీఁడె
సేవించీని భరతునిఁ జేకొను శత్రుఘ్నుని

చ. 3: శ్రీమదయోధ్యా విహార శ్రీ వేంకటనివాస
సామజ వాజి రథాల సందడివేళ
సౌమిత్రి యీవంక విభీషణుఁడు నావలివంక
నీ మహిమలెల్లా మెచ్చి నీకు విన్నవించేరు

రేకు: 0381-04 గుజ్జరి సం: 04-473 మాయ

పల్లవి: హేయ మేమీలేదు జగమింతా రుచికరమే
మాయావికార మిది మనసెట్టి రోసును

చ. 1: కాయధారణము లింపు కాంతలభోగము లింపు
ఆయతమై వారివారి యాహారా లింపు
సోయగపుఁ గన్నులను చూచేటి వేడుక లింపు
చాయ మనసాడఁబడి సమ్మతించితేను

చ. 2: పలుకులెల్లా నింపు భావములెల్లా నింపు
చెలరేఁగి తమ తమ చేఁత లింపు
జలమల సంగతుల సహజము లవి యింపు
వొలిసి తమ మనసాడఁబడి తేను

చ. 3: తగిన జన్మము లింపు తమ చక్కఁదనా లింపు
జగతి వారికి వారి జాతు లింపు
నిగిడి శ్రీ వేంకటేశ నీ మహిమలే యివి
వొగరు లేక మనసాడఁబడి వుంటేను

రేకు: 0381-05 సామంతం సం: 04-474 శరణాగతి

పల్లవి: ఎందలివారమో నేము యెఱఁగ వసముగాదు
సందడి విష్ణునకే శరణు చొచ్చెదము

చ. 1: తెర దీసినట్టుండు తెలిసితే జ్ఞానము
మరుగక మఱచితే మరఁగై తోఁచు
పురియై తగులుఁ గర్మ మూడిచితే నూడును
యిరవైన హరి మాయలెల ఇంపు చున్నవి

చ. 2: కడుఁ బుణ్య వశమై కాచుకుండు స్వర్గము
నడుమఁ బాపమూలము నరకము
తడవితే నంటును దాఁటేదే నేరుపు
యెడయ కచ్యుతు మాయలెల ఇంపు చున్నవి

చ. 3: పట్టితేఁ దన మనసు పరమాత్మఁ గనిపించు
చుట్టుకొంటే బంధమై సూదు సాధించు
ఒట్టి శ్రీ వేంకటేశ్వరుఁ డోపి మమ్మునేలెఁ గాని
ఇట్టె యా దేవుని మాయలెల ఇంచును

రేకు: 0381-06 ధన్నాసి సం: 04-475 వేంకటగానం

పల్లవి: పరమ వివేకులాల బంధువులాల
తెరదీసి మాకు నిది తెలుపరో

చ. 1: యేడు జానల మేనిలో నిందిరా నాథుఁ డున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో
పూడిచి వున్నది మతిఁ బొందుగ వైకుంఠము
చూడరో ధ్యానము సేసి సోదించరో

చ. 2: కొడిదేఁడు బయలిలో గోవిందుని నెలవఁట
చిడిముడి తో నిట్టే చేరి పట్టరో
అడఁచి దాఁచివున్నది అందే బ్రహ్మానందము
విడువరో యీ ముడియ వెలయఁ జేపట్టరో

చ. 3: పూని నల్లేఁడు నాలికలో నుండు శ్రీ వేంకటేశుఁ -
డానుకొని బత్తి తోడ నటు నిల్పరో
నానఁబెట్టివున్నది నామ కీర్తనములందు
తానకముగా నేపొద్దూఁ దలఁచుకోరో

రేకు: 0382-01 సాళంగనాట సం: 04-476 వైష్ణవ భక్తి

పల్లవి: నీగురుతులు చూచుకో నీబిరుదు లెంచుకో
యీగతిని కలబంట నిఁకనన్నుఁ గావవే

చ. 1: కానిలే నేనెంత కఠినచిత్తుఁడనైన
నానొసల నివే పట్టెనామములు
మేను తోలునెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మితులసి పూసల పేరులు

చ. 2: భ్రమసి నేఁజేసినవి పాపకర్మములైనాను
జమళి భుజాల నివే శంఖచక్రాలు
అమరఁ దఱచుగా నే నాడేవి కల్లలైనా
తమిఁ బాడీ నాలిక నీతగు సంకీర్తనలు

చ. 3: తలఁచితే నావోజ తామస గుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీవేంకటేశ అన్నిటనే దుష్టనైనా
తలకొనె నా యందు దాసరి తనములు

రేకు: 0382-02 మాళవి సం: 04-477 రామ

పల్లవి: చెప్పితే నాశ్చర్యము సేసినచేఁత లితఁడు
ముప్పిరి మనుజ వేషమునఁ బుట్టె నీతఁడు

చ. 1: రాముఁ డుదయించె దశరథునికిఁ దమ్ములతో
గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞము గాచె హరుని విల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లి యాడెను

చ. 2: మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యా సుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁ బట్టము గట్టెను

చ. 3: సీతాదేవితో నయోధ్య సింహాసనంబెక్కె
పోతరించి కుశలవపుత్రు లఁగాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీ వేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాఁచెను

రేకు: 0382-03 లలిత సం: 04-478 శరణాగతి

పల్లవి: ఏదైనా సుఖమే యిన్నిటా నీవు గలవు
కాదుగూడదని నిన్నుఁ గక్కసించనేఁటికి

చ. 1: యిహపరములలో నీ వెందు నన్నుఁ బెట్టినాను
నిహితమై రెంటిలోనా నీవు గలవు
వహి కెక్క నేలినవాఁడెక్కడ నుండుమన్నా
తహతహఁ గొలువుకుత్తరువే బంటుకుమ

చ. 2: పాప పుణ్యములలో నేపని నన్నుఁ జేయించినా
కాపాడి రెండు నీవు కల్పించినవే
యేపున మగఁడైన వాఁ డేమి సేయించినాను
దాపగుఁ బతివ్రతా ధర్మమే యాలికిని

చ. 3: కల్ల నిజములలో నొక్కటి నన్ను నాడించినా
చెల్లించ రెంటికి నీవే శ్రీ వేంకటేశా
తల్లిదండ్రులే బాస దగ నాడ నేర్పినాను
తెల్లమిగ నాడేది తేకువే బిడ్డనికి

రేకు: 0382-04 వరాళి సం: 04-479 భక్తి

పల్లవి: శ్రీ సతీశ బహుజీవ చైతన్యుఁడవు నీవు
చేసే నా చేఁతలెల్లా నీసేవలె సుమ్మీ

చ. 1: ఆనుక జగద్రూపుఁడవని నిన్నందురుగాని
నేనిట్టే చూచిన వెల్లా నీ రూపులే
నా నా శబ్దవాచ్యుఁడ వెన్నఁగ నీ వటుగాన
వీనుల విన్నవల్లా నీ విష్ణు కథలే

చ. 2: అట్టే విశ్వభుజుఁడవైతివి తొల్లే కనక
నెట్టన నా రుచులెల్లా నీ ప్రసాదాలే
గుట్టుతో సర్వ వ్యాపకుఁడవు నీ వటుగాన
ముట్టిన నాతను భోగములు నీకే సెలవు

చ. 3: ప్రక్కన జీవుల కెల్ల ప్రాణమవు నీవే కాన
ముక్కున నాయాఘ్రాణములెల్లా నీవే
నెక్కొని శ్రీ వేంకటేశ నీవే లోకకుటుంబివి
తక్కక నా సంసారధర్మమెల్లా నీవే

రేకు: 0382-05 లలిత సం: 04-480 వైరాగ్య చింత

పల్లవి: బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుఁగాని
యెడయని చుట్టరికా లెవ్వరికీ లేవు

చ. 1: వన్నె సతుల రూపులు వారివద్దనే వుండఁగా
కన్నులఁ జూచే వారికి కళరేఁగును
యెన్నిక వారి గుణాలు యెడ మాటలాడఁగాను
విన్నవారికి నూరకే వేడుకలు పుట్టును

చ. 2: అంతా నింతాఁ గమ్మవిరు లంగళ్లలో నుండఁగాను
సంత వార లూరకే వాసన గొందురు
బంతి వారి కంచాలలో పలు రుచు లుండఁగాను
వింత వారలందుకుఁగా వెస నోరూరుదురు

చ. 3: వెరవిడి దేహాలు వేరే వేరే వుండఁగాను
సురతాన సోఁకితేనే చొక్కుదురు
ఇరవై శ్రీ వేంకటేశుఁ డిన్నిటికి సూత్రధారి
సరి నితని దాసులు జడియ రిందుకును

రేకు: 0382-06 కన్నడగౌళ సం: 04-481 వైరాగ్య చింత

పల్లవి: పట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము
నెట్టుకొని వివేకింప నేరవలెఁగాని

చ. 1: కట్టుకొంటే నెంతైనాఁ గలదు సంసారము
పట్టి చేసితేఁ గలవు పనులెన్నైనా
చుట్టుకొంటే నూరఁగల చుట్టరికముఁగలదు
అట్టె మోక్షము గడించే దరు దింతేకాని

చ. 2: చేసేనంటేఁ గలవు సేనా సేన పనులు
లాసి తగిలించు కొంటే లంపటా లంటు
ఆసలు పెంచ జూచితే నంత కంతకుఁ బెరుగు
వేసిరి శాంతిఁబొందుటే వేడు కింతేఁకాని

చ. 3: పనిగొంటేఁ బెనుగొనుఁ బంచేంద్రియంబులు
వెనుకొంటేఁ జిమ్మిరేఁచు వేడుకలు
తనిసి శ్రీ వేంకటేశు దసానుదాసుఁడై
కొన కెక్కఁగ నాతనిఁ గొలువవలెఁగాని

రేకు: 0383-01 రామక్రియ సం: 04-482 విష్ణు కీర్తనం

పల్లవి: ఏమని పొగడవచ్చు నీతని ప్రభావము
వేమరు నో పుణ్యులాల వినరో యీ కతలు

చ. 1: అనంత సూర్య తేజుఁడట కాంతి చెప్ప నెంత
దనుజాంతకుఁడట ప్రతాప మెంత
మనసిజ గురుఁడట మరి చక్కఁదన మెంత
వనజజుఁగనినట్టి వాఁడట ఘన తెంత

చ. 2: గంగా జనకుఁడట కడుఁ జెప్పే పుణ్య మెంత
చెంగట భూ కాంతుఁడట సింగార మెంత
రంగగు లక్ష్మీశుఁడట రాజసము లెంచ నెంత
అంగవించు సర్వేశుఁడట సంప దెంత

చ. 3: మాయానాథుఁడట మహిమ వచించు టెంత
యేయెడఁ దా విష్ణుఁడట యిర వెంత
పాయక శ్రీ వేంకటాద్రిపతియై వరములచ్చే
వేయి రూపులవాఁడట విస్తార మెంత

రేకు: 0383-02 గౌళ సం: 04-483 హనుమ

పల్లవి: తలఁచరో జనులు యీతని పుణ్య నామములు
సులభమున నే సర్వశుభములు గలుగు

చ. 1: హనుమంతుడు వాయుజుఁ డంజనా తనయుఁడు
వనధి లంఘన శీల వైభవుఁడు
దనుజాంతకుఁడు సంజీవనీ శైల సాధకుఁడు
ఘనుఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 2: లంకా సాధకుఁడు లక్ష్మణ ప్రబోధకుఁడు
శంకలేని సుగ్రీవ సచివుఁడు
పొంకపు రాముని బంటు భూమిజసంతోష దూత
తెంకినే కలశాపుర దేవ హనుమంతుడు

చ. 3: చటులార్జున సఖుఁడు జాతరూప వర్ణుఁడు
ఇటమీఁద బ్రహ్మ పట్ట మేలేటి వాఁడు
నటన శ్రీ వేంకటేశు నమ్మిన సేవకుఁడు
పటు కలశాపుర ప్రాంత హనుమంతుఁడు

రేకు: 0383-03 లలిత సం: 04-484 శరణాగతి

పల్లవి: ఇన్నిళ్ళు నెఱఁగక యిందులోనే వోలాడితి
మన్నించఁగా నీవల్లనే మరిగితి నిన్నును

చ. 1: ముందు నేఁజేసినకర్మములు దోలుకరాఁగాను
అంది మరఁగుఁ జొచ్చితి నందుకే నీకు
కందువఁ బంచేంద్రియాలు కదిమి పై కొనఁగాను
చందములన్నిటా నీకు శరణంటిని

చ. 2: వెనకటి సంసారము విడువక వుండఁగాను
వినయాన నీడాగు వేసుకొంటిని
ఘనమైన జన్మములు కాణాచియై తగులఁగ
మొనసి నీ పాదాలకు మొక్కితి నేను

చ. 3: జీవుల సంగాతాలు చిమ్మి రేఁచి యంటుకోఁగా
భావించి నీ మీఁదటిబత్తి వట్టితి
శ్రీ వేంకటేశుఁడవు నీదేవు లలమేలుమంగ
నీవు నాకు బుద్ధియ్యఁగా నిన్నే పాడితిని

రేకు: 0383-04 దేవగాంధారి సం: 04-485 రామ

పల్లవి: ఎంతని నుతియింతు రామరామ యిట్టినీప్రతాపమురామరామ
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ

చ. 1: బలుసంజీవనికొండరామరామ బంటుచేఁ దెప్పించితివిరామరామ
కొలఁదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ
వెలయ నెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ
పెలుచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ

చ. 2: శరణంటే విభీషణుని రామరామ చయ్యనఁగాచితివటరామరామ
బిరుదులరావణుని రామరామ పీఁచమడఁచితివట రామరామ
ధరలోఁ జక్రవాళము రామరామ దాఁటి వచ్చితివఁట రామరామ
సురలు నుతించిరట రామరామ నీచొప్పు యిక నదియెంతో రామరామ

చ. 3: సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులుఁ దమ్ములట రామరామ
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ
శ్రీమంతుఁడ వన్నిటాను రామరామ శ్రీవేంకటగిరిమీఁది రామరామ
కామితఫలదుఁడవు రామరామ కౌసల్యానందనుఁడవు రామరామ

రేకు: 0383-05 లలిత సం: 04-486 హనుమ

పల్లవి: బిరుదు బంటితఁడు పెద్ద హనుమంతుడు
సిరులతో రామునికి సీతాదేవికిని

చ. 1: మూఁడులోకములుఁ దుదముట్టఁ బెరిగినవాఁడు
వాఁడె హనుమంత దేవరఁ జూడరో
పోఁడిమి దైత్యుల గెల్చి పూఁచి చేయెత్తుకున్నాఁడు
వాఁడి ప్రతాపముతోడ వాయుజుఁడు

చ. 2: ధ్రువమండలము మోవఁ దోఁక యెత్తుకున్నవాఁడు
సవరనై పెనుజంగ చాఁచుకున్నాఁడు
భువిఁ గవచ కుండలంబులతోఁ బుట్టినవాఁడు
వివరించ నేకాంత వీరుఁడైనవాఁడు

చ. 3: పెనచి పండ్లగొల పిడికిలించుకున్నాఁడు
ఘనుఁ డిన్నిటా స్వామి కార్యపరుఁడు
వినయపు శ్రీ వేంకటవిభునికి హితవరి
యెనసి మొక్కఁగదరో యెదుట నున్నాఁడు

రేకు: 0384-01 దేవగాంధారి సం: 04-487 గురు వందన, నృసింహ

పల్లవి: నమ్మితిఁజుమ్మీ వోమనసా నాకే హితవయి మెలంగుమీ
ముమ్మాటికి నేఁ జెప్పితిఁజుమ్మీ మురహరునామమే జపంచుమీ

చ. 1: తలఁచకుమీ యితరధర్మములు తత్త్వజ్ఞానము మఱవకుమీ
కలఁగకుమీ యేపనికైనను కడుశాంతంబుననుండుమీ
వలవకుమీ వనితలకెప్పుడు వైరాగ్యంబున నుండుమీ
కొలువకుమీ యితరదైవములు గోవిందునినే భజించుమీ

చ. 2: కోరకుమీ దేహభోగములు గొనకొని తపమే చేకొనుమీ
మీరకుమీ గురువులయానతి మెఱయఁ బురాణములే వినుమీ
చేరకుమీ దుర్జనసంగతి జితేంద్రియుఁడవై నిలువుమీ
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ

చ. 3: వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుఁడవగుమీ
మఱవకుమీ యలమేల్మంగకుమగఁడగుశ్రీవేంకటపతిని
కెఱలకుమీ మాయారతులను కేవలసాత్త్వికుఁడవుగమ్మీ
తొఱలకుమీ నేరములను సింధురక్షకునినే సేవించుమీ

రేకు: 0384-02 సాళంగనాట సం: 04-488 నృసింహ

పల్లవి: దాసుల పాలిటి నిధానమై వున్నాఁ డదిగో
ఆసాబాసా నితఁడే అహోబలేశుఁడు

చ. 1: నగె నదె వాఁడిగో నారసింహదేవుఁడు
పగదీర హిరణ్యాక్షుఁ బట్టి చించి
మృగరూపై గద్దెమీఁద మెఱసీవాఁ డదిగో
అగవూఁ దగవెఱిఁగి యహోబలేశుఁడు

చ. 2: తేరిచూచీ నదిగో దేవాదిదేవుఁడు
ఘోరపు నెత్తురు గోళ్ళఁ గురియఁగాను
నేరుపుతోఁ బేగుల జన్నిదాలవాఁ డదిగో
ఆరితేరి కొలువున్నాఁ డహోబలేశుఁడు

చ. 3: కరుణించీవాఁ డదిగో కమలాపతి దేవుఁడు
సురలు గొలువఁగాను సొంపుతోడను
యిరవై లోకములెల్లా నేలుచున్నాఁ డదిగో
హరి శ్రీవేంకటాద్రియహోబలేశుఁడు

రేకు: 0384-03 సామంతం సం: 04-489 నృసింహ

పల్లవి: సముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాదవరదా

చ. 1: తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి యిందిరాదేవి
బడిఁ జెలులు సోబానఁ బాడేరు
నడుమ వీణె వాఇంచీ నారదుఁ డల్లవాఁడె
అడరి చిత్తగించు ప్రహ్లాదవరదా

చ. 2: గరుడోరగాదు లూడిగములు నీకుఁ జేసేరు
యిరుమేలాఁ గొలిచేరు యింద్రాదులు
పరమేష్టి యొకవంక పనులు విన్నవించీ
అరసి చిత్తగించు ప్రహ్లాదవరదా

చ. 3: పాదిగొని మిమ్మునిట్టే పూజించేరు మునులెల్లా
కదిసి పాడేరు నిన్ను గంధర్వులు
ముదమున నహోబలమునను శ్రీ వేంకటాద్రి -
నదె చిత్తగించుము ప్రహ్లాదవరదా

రేకు: 0384-04 మాళవిగౌళ సం: 04-490 హనుమ

పల్లవి: అవధారు చిత్తగించు హనుమంతుఁడు వీఁడె
భువిలోన గలశాపుర హనుమంతుఁడు

చ. 1: రామ నీ సేవకుఁ డిదె రణరంగ ధీరుఁడు
ఆముకొన్న సత్వగల హనుమంతుఁడు
దీమసాన లంక సాధించి వుంగరము దెచ్చె
కామిత ఫలదుఁడు యీ ఘన హనుమంతుఁడు

చ. 2: జానకీరమణ సప్తజలధులు లంఘించి
ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుఁడు
పూని చుక్కలెల్లా మొలపూసలుఁగాఁగఁబెరిగి
భాను కోటి కాంతితోఁ జొప్పడు హనుమంతుఁడు

చ. 3: యినవంశ శ్రీ వేంకటేశ నీ కరుణతోడ
అనుపమ జయశాలి హనుమంతుఁడు
పనిపూని ఇటమీఁది బ్రహ్మపట్టమునకు నీ -
యనుమతిఁ గాచుకున్నా డదె హనుమంతుఁడు

రేకు: 0384-05 పాడి సం: 04-491 రామ

పల్లవి: దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీ రఘురామా

చ. 1: రవికులాంబుధిసోమ రామ లక్ష్మణాగ్రజ
భువి భరత శత్రుఘ్నపూర్వజ
సవనపాలక కౌసల్యానందవర్ధన
ధవళాబ్జనయన సీతారమణా

చ. 2: దనుజ సంహారక దశరథ నందన
జనక భూపాలక జామాత
వినమిత సుగ్రీవ విభీషణసమేత
మునిజన వినుత సుముఖ సుచరిత్రా

చ. 3: అనిలజవరద యహల్యా శాప మోచన
సనకాది సేవిత చరణాంబుజ
ఘనతర శ్రీ వేంకటగిరి నివాస
అనుపమోదార విహార గంభీరా

రేకు: 0385-01 రామక్రియ సం: 04-492 నృసింహ

పల్లవి: కొలువరో మొక్కరో కోరినవరము లిచ్చీ
సులభుఁ డిన్నిటా వీఁడె సుగ్రీవ నరహరి

చ. 1: కంబములోనఁ బుట్టి కనకదైత్యునిఁ గొట్టి
అంబరపు దేవతల కభయ మిచ్చి
పంబి సిరిఁ దన తొడపైఁ బెట్టుక మాటలాడీ
అంబుజాక్షుఁ డైనట్టి యాదమ నరహరి

చ. 2: నానా భూషణము లున్నతి తోడ నిడుకొని
పూనికతో ప్రహ్లాదుని బుజ్జగించి
మానవులకెల్లను మన్నన చాలా నొసఁగి
ఆనందముతో నున్నాఁడుఁ అదిగో నరహరి

చ. 3: మిక్కిలి ప్రతాపముతో మించిన కాంతులతోడ
అక్కజపు మహిమల నలరుచును
తక్కక శ్రీ వేంకటాద్రిఁ దాపుకొని వరాలిచ్చీ
చక్కఁదనముల కెల్లాఁజక్కని నరహరి

రేకు: 0385-02 సాళంగనాట సం: 04-493 హనుమ

పల్లవి: ఈతని దెంతప్రతాప మీతని దెంతవుదుట
యీతఁడు రామునిబంటు యీతని సేవించరో

చ. 1: వుదయాస్త నగముల కొకజంగ చాఁచినాఁడు
చదివె రవితో సర్వ శాస్త్రములు
తుద బ్రహ్మాండము మోవఁ దోఁక మీఁది కెత్తినాఁడు
పెద పెద కోరల పెను హనుమంతుఁడు

చ. 2: కుడిచేత దనుజులఁ గొట్టి నూఁకించినాఁడు
యెడమచేఁ బండ్లగొల పిడికిలించె
వుడుమండలము మోవ నున్నతిఁ బెరిగినాఁడు
బెడితపు మేనితోడఁ బెనుహనుమంతుఁడు

చ. 3: పుట్టుఁ గవచ కుండలంబులతోడ నున్నవాఁడు
గట్టి బ్రహ్మపట్టానకుఁ గాచుకున్నాఁడు
ఇట్టే శ్రీ వేంకటేశు నెదుటఁ బనులు సేసీ
బెట్టిదపు సంతోసానఁ బెనుహనుమంతుఁడు

రేకు: 0385-03 లలిత సం: 04-494 రామ

పల్లవి: నమో నమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత అసద్విఖ్యాతకీర్తే

చ. 1: రామ రఘువర సిత రాజీవ లోచన
భూమిజా రమణ త్రిభువన విజయ
కోమలాంగ శ్యామ కోవిద రణరంగ
భీమ విక్రమ సత్యబిరుద ప్రవీణ

చ. 2: దళిత దైతేయ కోదండ దీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణ రక్షక
కలిత దశరథ తనయ కౌసల్యానంద
సులభ వానర ముఖ్య సుగ్రీవ వరద

చ. 3: చారులక్ష్మణ భరత శత్రఘ్నపూర్వజ
తారక బ్రహ్మ నిత్య స్వరూప
ధీర శ్రీ వేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేత పుర నివాసా

రేకు: 0385-04 నాట సం: 04-495 నృసింహ

పల్లవి: ఎక్కడఁ జొచ్చెదరింక రక్కసులు
చిక్కి చెడుఁడు నరసింహునిచేత

చ. 1: పుడుగని కోపపుటుగ్రపుఁ జూపుల
మిడుగురు లెగయఁగ మిన్నంది
పిడుగుల మ్రోతలఁ బెళపెళ నార్చుచు
వెడలెఁ గంభమున వీరసింహుఁడు

చ. 2: కాలాగ్ని కీలలు గక్కెడి చక్రము
కేలఁ బూని కుల గిరు లదర
భాల లోచనము ప్రకటింపుచు లయ -
కాలుఁడై వెలసెఁ గడిఁది సింహుఁడు

చ. 3: కుటిల నఖంబుల ఘోరాకారత
తొట తొట నెత్తురు దొరుగఁగను
చటుల దానవులఁ జదుపుచు శ్రీవేం-
కటమున నిలిచె సాకారసింహుఁడు

రేకు: 0385-05 గుజ్జరి సం: 04-496 మనసా

పల్లవి: కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు వీఁడే
నిండుకున్నాఁడు తలఁచు నెమ్మదినో మనసా

చ. 1: నన్నుఁ బుట్టించే దేవుఁడు నాలోనున్నాఁడు దేవుఁడు
కన్నచోటులనే వుండే కాచే దేవుఁడు
వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు
యెన్నని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు

చ. 2: సిరులిచ్చిన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు
గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు
మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు
ఇరవై మాయింటనున్నాఁడీ దేవుఁడు

చ. 3: దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు
రూపు చూపె నిదివో బోరున దేవుఁడు
శ్రీ పతియైన దేవుఁడు శ్రీ వేంకటాద్రి దేవుఁడు
చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు

రేకు: 0385-06 సామంతం సం: 04-497 నృసింహ

పల్లవి: ఔనయ్య జాణఁడవు ప్రహ్లాదవరదా
ఆసలు వెట్టకుము ప్రహ్లాదవరదా

చ. 1: వేసరక శ్రీ సతితో వేడుక నవ్వులు నవ్వి
ఆసలు చూపేవు ప్రహ్లాదవరదా
సేసవెట్టిన చేతుల చెఱఁగువట్టి తీసేవు
ఆ సుద్దులే చెప్పేను ప్రహ్లాదవరదా

చ. 2: నంటునఁ దొడమీఁదను నలినాక్షి నెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరదా
గెంటక యేపొద్దును కేలుగేలుఁ గీలించుక
అంటువాయ వదివో ప్రహ్లాదవరదా

చ. 3: కందువతోఁ గాఁగిలించి కైవసము సేసుకొంటి -
నందముగ నీకెను ప్రహ్లాదవరదా
పొంది శ్రీవేంకటమున పొంచి యౌభళములోనా
అంది వరాలిచ్చేవు ప్రహ్లాదవరదా

రేకు: 0386-01 రామక్రియ సం: 04-498 కృష్ణ

పల్లవి: కంటిఁగంటి వీఁడివో కని కృతార్థుఁడనైతి
వింటి నిందరిచేతా నీ విట్ఠలేశు సుద్దులు

చ. 1: యీతఁడా గోవర్ధనమెత్తిన పసిబాలుఁడు
కాతరీఁ డీతఁడా గోపికా వల్లభుఁడు
పూతన నీతఁడా పట్టి పొరిగొన్నయట్టివాఁడు
చేత గచ్చకాయలాడీ శ్రీ విట్ఠలేశుఁడు

చ. 2: యీ దేవుఁడా కుచేలుని కిష్ట సంపదిచ్చినాఁడు
పోదిగొని యీ దేవుఁడా భూభార మడఁచినాఁడు
వేదమయుఁ డీ దేవుఁడా విశ్వరూపు చూపినాఁడు
సేదదేరీ మహిమల శ్రీ విట్ఠలేశుఁడు

చ. 3: యీ మూరితా పాండురంగ మిరవై వుండినవాఁడు
కామించీ మూరితి శ్రీ వేంకటగిరి నున్నవాఁడు
దోమటి నీమూరితే యాధ్యులుపాట మెచ్చినాఁడు
క్షేమముతో వరాలిచ్చీ శ్రీ విట్ఠలేశుఁడు

రేకు: 0386-02 నాట సం: 04-499 హనుమ

పల్లవి: సరిలే రితనికి సాహస విక్రముఁ డీతఁ -
డరయ కలశాపుర హనుమంతుఁడు

చ. 1: వుదధి లఘించినాఁడు వుబ్బున మైనాకముచే
పొదలి నట్ట నడుమఁ బూజ గొన్నాఁడు
సదరాననే లంక సాధించి వచ్చినాఁడు
అదివో కలశాపుర హనుమంతుఁడు

చ. 2: సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు
భంజించి వానరుల బదికించినాఁడు
అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యేపనుల-
నంజఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 3: బలు రాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు
ఇల రామునికిఁ గడు హితుఁడైనాఁడు
చెలఁగి శ్రీ వేంకటేశు సేవ సేయుచున్నవాఁడు
అలరి కలశాపుర హనుమంతుఁడు

రేకు: 0386-03 సాళంగనాట సం: 04-500 నృసింహ

పల్లవి: సేవించరో జనులాల చేతులెత్తి మొక్కరో
వావిరిఁ బ్రహ్లాదునికి వరదుఁడు వీఁడే

చ. 1: జగన్నాథుఁడు వీఁడే సర్వరక్షకుఁడు వీఁడే
నిగమవేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే
సగుణవంతుఁడు వీఁడే సర్వకాముఁడు వీఁడే
నగు మొగము సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

చ. 2: మరు జనకుఁడు వీఁడే మహిమాధికుఁడు వీఁడే
పరగ శ్రీ లక్ష్మీపతి వీఁడే
సురల కేలికె వీఁడే శుభ మూరితి వీఁడే
నరసఖుఁడ సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

చ. 3: భువనాధిపతి వీఁడే పురుషోత్తముఁడు వీఁడే
వివిధ ప్రతాప కోవిదుఁడు వీఁడే
ఇవల శ్రీ వేంకటాద్రి నిరవైనతఁడు వీఁడే
నవమూర్తి సుగ్రీవ నరసింహుఁడు వీఁడే

రేకు: 0386-04 బౌళి సం: 04-501 హనుమ

పల్లవి: ఎంతని పొగడవచ్చు నితని ప్రతాపము
పంతము లెల్లా మెరసి ప్రతాపించీ వాఁడే

చ. 1: చేతులనే పెరికి సంజీవి కొండ దెచ్చినాఁడు
ఆతఁడువో తొల్లి పెద్ద హనుమంతుఁడు
ఘాతలఁ దానొక్కఁడే లంక సాధించి వార్ధి దాఁటి
యీతలకి వచ్చినాఁడు ఇదివో వాఁడే

చ. 2: ముదమున బ్రహ్మ లోకము దాఁకాఁ బెరిగినాఁడు
అదివో ఇప్పుడు పెద్ద హనుమంతుఁడు
వదలక తోఁక చక్రవాళ పర్వతము వెంటా
పుదుటునఁ జుట్టుకొని వున్నాఁడు వాఁడే

చ. 3: మెల్లనే జంగ చాఁచి మెడ నిక్కించుకొన్నాఁడు
అల్లదివో మించే పెద్ద హనుమంతుఁడు
వెల్లవిరైనాఁడు శ్రీ వేంకటేశ్వరుని బంటై
చల్లఁగా లోకములేలీ సంతతము వాఁడే

రేకు: 0386-05 పాడి సం: 04-502 రామ

పల్లవి: ఎంత ప్రతాపము వాఁడు యెంతటి నేరుపరి
యెంతని పొగడవచ్చు నీ రాముని

చ. 1: వాలి నొక్క కోలనేసి వారిధి గట్టిన వాఁడు
తాలిమితో సుగ్రీవుని లాలించినాఁడు
పాలించి విభీషణునిఁ బట్టము గట్టిన వాఁడు
యేలుమని లంక కెల్లా నీ రాముఁడు

చ. 2: కుచ్చి పర మొండెముగా కుంభ కర్ణుఁ గొట్టినాఁడు
హెచ్చి రాకాసులఁ జంపె నీ రాముఁడు
తచ్చి రావణాసురుని తలలు చెండాడినాఁడు
ఇచ్చ కొలఁదుల నిట్టె యీ రాముఁడు

చ. 3: సీత తో విమాన మెక్కి చేరి యయోధ్యకు వచ్చి
యీతలఁ బట్ట మేలినాఁ డీ రాముఁడు
శ్రీ తరుణితోఁగూడి శ్రీ వేంకటేశుఁడైనాఁడు
యీతఁడే దరసించరో యీరాముఁడు

రేకు: 0386-06 లలిత సం: 04-503 రామ

పల్లవి: సర్వరక్షకుఁడైన సర్వేశుఁడేకాక
పుర్విమీఁద నందరిలో నొక్కఁడా రాముఁడు

చ. 1: కొండ పొడవులైన ఘోర వానర బలము
గుండుగా వారిధి దండఁ గూడఁబెట్టి
నిండు జెలనిధి గట్టి నిగిడి లంక సాధించె
అండనే రాముఁడు నరుఁ డనవచ్చునా

చ. 2: అన్నిటా దేవతలకు నసాధ్యమైన రావణు -
నెన్నికగాఁ బుత్ర మిత్ర హితుల తోడ
పన్నుకొని శస్త్రాస్త్ర పంక్తులనే ఖండించె
సన్నుతి నిట్టే రాముని జనుఁడన వచ్చునా

చ. 3: చలపట్టి లంక విభీషణునికిఁ బాలించి
బలువుగ సీతఁగూడి పట్టమేలి
యిలలో శ్రీ వేంకటాద్రి నిరవై లోకము గాచీ
నలువంక రాముఁడు నరుఁడనవచ్చునా

రేకు: 0387-01 లలిత సం: 04-504

పల్లవి: కంటిమి నే˜ డిదె గరుడా చలపతి
యింటి వేలుపగు యీశ్వరు˜ డితఁడు

చ. 1: శ్రీ నరసింహుఁడు చిన్మయ కాంతుఁడు
దానవాంతకుఁడు దయానిధి
నానా మహిమల నమ్మిన వారిని
పూనుక కాచే పోషకు˜ డితఁడు

చ. 2: దేవాది దేవుఁడు దినకర తేజుఁడు
జీవాంత రంగుఁడు శ్రీ విభుఁడు
దైవ శిఖామణి తలఁచినవారిని
సేవలు గొని కాచే విభుఁడితఁడు

చ. 3: పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుఁడు
కరుణానిధి బుధ కల్పకము
పరగు శ్రీ వేంకటపతి తన దాసుల-
నరుదుగ˜ గాచే యనంతు˜ డితఁడు

రేకు: 0387-02 రామక్రియ సం: 04-505 నృసింహ

పల్లవి: అల్లవాఁడే గద్దె మీఁద నౌభళపు గుహలోన
యెల్లవారిఁ గరుణతో నేలుకొన్నాఁడు

చ. 1: వుక్కుఁగంభములోఁ బుట్టి వుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందలవట్టి
గక్కనఁ గడుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంధ్యాలుగా వేసుకొన్నాఁడు

చ. 2: కోరలు దీఁడుకొంటాను ఘోర నారసింహుఁడు
సారె సారె నెత్తురులు చల్లుకొంటాను
వీరులైన దానవుల వెదకి వెదకి కొట్టి
గోరి కొనఁ గండలెల్లాఁ గోయుచున్నాఁడు

చ. 3: విచ్చిన విడిని శ్రీ వేంకటనారసింహుఁడు
పచ్చిదేర నట్టే పకపక నవ్వి
కచ్చు పెట్టి దేవతలఁగాచి యభియమిచ్చి
పెచ్చు రేఁగి సంతోసానఁ బెరుగుచున్నాఁడు

రేకు: 0387-03 మాళవిగౌళ సం: 04-506 హనుమ

పల్లవి: ఎంతని పొగడవచ్చు నీతని సేవించరో
పొంతనిదే కలశాపుర హనుమంతుఁడు

చ. 1: పిడికిటఁ బట్టినవి పెద్దపండుల గొలలు
అడరి యెత్తినది మహావాలము
గుడిగొన రాకాసులఁ గొట్టినది వలకేలు
పొడచూపీఁ గలశాపుర హనుమంతుఁడు

చ. 2: సందడి సమరానకు చాఁచినది పెనుజంగ
అందముగ నిక్కించినదదే వురము
కుందక వీర రసమే కురిసేటిది మొగము
పొందగువాఁడు కలశాపుర హనుమంతుఁడు

చ. 3: వుదుటన మెలఁగేవి వొద్దికైన పాదాలు
త్రిదశుల మెప్పించేది దివ్యరూపము
అదె శ్రీ వేంకటేశు బంటయి నిలుచున్నాఁడు
వొదలుచుఁ గళశాపుర హనుమంతుఁడు

రేకు: 0387-04 శంకరాభరణం సం: 04-507 కృష్ణ

పల్లవి: ఎంత భాగ్యవంతులమో యీతనిఁ బొడగంటిమి
చెంతనుండి మమ్మునేలే శ్రీ విఠ్ఠలేశుఁడు

చ. 1: తుంగభద్రా తటమున తొంటి పర బ్రహ్మము
అంగవించి సాకారమై వున్నాఁడు
సంగతితో రుక్మిణియు సత్యభామల నడుమ
చెంగలించీ మహిమల శ్రీ విఠ్ఠలేశుఁడు

చ. 2: అందపుఁ బైఁడిమేడలో నాదిమూర్తియైన దేవుఁ -
డందరికిఁ బ్రత్యక్షమై యున్నాఁడు
సందడించి గోపికా జనముల తోడుత
చెంది వున్నాఁడిదివో శ్రీ విఠ్ఠలేశుఁడు

చ. 3: వెలసి వనాల లోన వేద వేద్యుఁడైన హరి
అలరి కృష్ణావతారమై యున్నాఁడు
యెలమి శ్రీ వేంకటేశుఁ డితఁడే పదారువేల
చెలులతోఁ గూడినాఁడు శ్రీ విఠ్ఠలేశుఁడు

రేకు: 0387-05 నాట సం: 04-508 నృసింహ

పల్లవి: ఇట్టి సుద్దులితనివి ఇదివో కొలువున్నాఁడు
నట్టనడుమ నీ సుగ్రీవ నారసింహుఁడు

చ. 1: పగలూ రాతిరీఁ గాని పటు సంధ్యా కాలమందు
మొగిఁ బచ్చి వెచ్చిగాని మొనగోళ్ళచే
గగనమూ నేలాఁ గాని గనమైన తొడమీఁద
నగుతా హిరణ్యుఁ గొట్టె నరసింహ దేవుఁడు

చ. 2: వెలుపలా లోనాఁ గాని వెడఁగుగడపమీఁద
తలి తండ్రి గాని యట్టి తావునఁ బుట్టి
మొలచి చిగిరించని ముదురుఁగోరలతోడ
నలి హిరణ్యు జంకించె నరసింహ దేవుఁడు

చ. 3: మానిసీ మెకమూఁగాని మంచి యాకారముతోడ
పూని యిల్లూఁ బందిలీఁ గాని గుహలో
ఆనుక హిరణ్యుని నడఁచీ శ్రీ వేంకటాద్రి
నానా దిక్కుల నేలిన నరసింహ దేవుఁడు

రేకు: 0387-06 బౌళి సం: 04-509 హనుమ

పల్లవి: అదె చూడరయ్యా పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్యా

చ. 1: వుదయాస్త శైలములు వొక జంగగాఁ జాఁచె
అదివో ధ్రువ మండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము ద్రిప్పుచు
యెదుట నీతని మహి మేమని చెప్పేమయ్యా

చ. 2: దండిగా బ్రహ్మాండముదాఁకఁ దోఁక మీఁదికెత్తె
మెండగు దిక్కులు నిండ మేను వెంచెను
గుండుగూడ రాకాసులఁ గొట్టఁగఁ జేతులు చాఁచె
అండనీతని ప్రతాప మరుదరుదయ్యా

చ. 3: దిక్కులు పిక్కటిలఁగ దేహరోమములు వెంచె
పక్కన లోకములకుఁ బ్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీ వేంకటేశు హితవరిబంటాయ
మిక్కిలి నీతనిలావు మేలు మేలయ్యా

రేకు: 0388-01 రామక్రియ సం: 04-510 నృసింహ

పల్లవి: నరులాల మునులాల నానా దేవతలాల
పరబ్రహ్మ మీతఁడే ప్రత్యక్షమై వున్నాఁడు

చ. 1: భావించి చూడరో వీఁడె ప్రహ్లాద వరదుఁడు
సేవించరో తొడమీఁది శ్రీ సతిని
వావిరి నుతించరో వరశంఖచక్రాలవె
కోవిదుఁడు గద్దెమీఁదఁ గొలువై వున్నాఁడు

చ. 2: చెలఁగి మొక్కరో వీఁడె శ్రీ నరసింహ దేవుఁడు
తెలియరో యీతని తేజోరూపము
అలరి పూజించరో అనంతహస్తము లవె
కొలఁది మీరి విష్ణుఁడు కొలువై వున్నాఁడు

చ. 3: యిదె శరణనరో హిరణ్యదైత్యహరుని
అదన జపించరో యీ హరినామము
యెదుట శ్రీ వేంకటాద్రిని యహోబలమునందు
కొదలే కాదిమూరితి కొలువై వున్నాఁడు

రేకు: 0388-02 పాడి సం: 04-511 నృసింహ

పల్లవి: ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు
చెంత రమాదేవిఁగూడె శ్రీ నరసింహుఁడు

చ. 1: సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా
సారిది మోములు తోఁగి చూచుకొంటాను
విరులచెండులఁగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీ నరసింహుఁడు

చ. 2: భవనాశి లోని నీరు పైఁ జల్లులాడుకొంటాను
నవకపు సిరులను నవ్వుకొంటాను
జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను
చివన నిందిరనంటె శ్రీ నరసింహుఁడు

చ. 3: వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా
ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా
ఆముక శ్రీ వేంకటాద్రి నౌభళాన నిలిచిరి
శ్రీ మహాలక్ష్మి తోడ శ్రీ నరసింహుఁడు

రేకు: 0388-03 బౌళి సం: 04-512 నృసింహ

పల్లవి: సులభుఁడై వున్నాఁడు సుగ్రీవ నారసింహుఁడు
నెలకొన్నదాసులకు నిధానము వీఁడే

చ. 1: తుంగభద్రా తటమున తొడపై నిందిర తోడ
సింగారించుకొన్నవేల్పుసింహము వీఁడే
సంగతిగా దేవతలు జయవెట్టి కొలువఁగా
చెంగటనే మహిమలఁ జెలరేఁగీ వీఁడే

చ. 2: చలువ బండలమీఁద చక్కని కొండల దండ
అలరీని వీరనరహరి వీఁడె
వెలయు శంఖచక్రాల వేవేలు హస్తములతో
బలవంతుఁడై వున్నాఁడు పంతముతో వీఁడే

చ. 3: పువ్వులతోఁటలనీడ భువనేశ్వరములోన
జవ్వనపు మనుజ కేసరి వీఁడె
ఇవ్వల శ్రీ వేంకటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వుమోముతోడ భువనము లేలీ వీఁడే

రేకు: 0388-04 నాట సం: 04-513 నృసింహ

పల్లవి: వినరయ్య నరసింహ విజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును

చ. 1: మొదలఁ గొలువుకూటమున నుండి కశిపుఁడు
చదివించెఁ బ్రహ్లాదుని శాస్త్రములు
అదన నాతఁడు నారాయణుఁడే దైవమనె
అదరిపడి దైత్యుఁడు ఆతనిఁ జూపుమనె

చ. 2: అంతటఁ బ్రహ్లాదుఁడు 'అన్నిటానున్నాఁ'డనియె
పంతమున దానవుఁడు బాలునిఁ జూచి
యెంతయుఁ గడఁకతోడ 'ఇందులోఁ జూపు'మని
చెంతనున్న కంబము చేతఁగొని వేసె

చ. 3: అటమీఁదట బ్రహ్మాండం బదరుచు
కుటిల భయంకర ఘోషముతో
చిట చిట చిటమని పెట పెట పెటమని
పటపట మనుచును బగిలెఁ గంబము

చ. 4: కులగిరు లదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తల్లడిలి
కలఁగెను జగములు కంపించె జగములు
ప్రళయ కాలగతిఁ బాటిల్లె నపుడు

చ. 5: ఘననారసింహుఁ డదె కంబము నందు వెడలె
కనుపట్టె నదిగో చక్ర జ్వాలలు
మునుకొని వెడలెఁ గార్ముకముక్త శరములు
కనకకశిపునకుఁ గలఁగె గుండియలు

చ. 6: అడరె నద్దేవుని కోపాగ్నులు బెడిదపు -
మిడుఁగురుల తోడుత మిన్నులుముట్టి
పిడుగులురాలేటి భీకర నఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె

చ. 7: తొడికి పట్టి విష్ణుడు తొడమీఁద నిడుకొని
కడుపు చించెను వాని గర్వమడఁగ
వెడలెఁ జిల్లున వాని వేఁడి నెత్తురు నింగికి
పొడి వొడియాయ శత్రు భూషణము లెల్లను

చ. 8: నెళ నెళన విరిచె నిక్క వాని యెముకలు

పెళ పెళ నారిచి పెచ్చు వెరిగె హరి
జళిపించి పేగులు జంద్యాలుగా వేసుకొనె
తళుకుఁ గోరలు తళ తళమని మెరిచె
చ. 9: పెటలించి నరములు పెరికి కుప్పలువేసి
గుటగుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కలు వారఁజెండి
కుటిల దానవుఁ జూచి 'ఖో' యని యార్చెను
చ. 10: తెంచి శిరోజములు దిక్కులకు వాని -
పంచ ప్రాణములు గొనెఁ బరమాత్ముఁడు
అంచెల నీ రీతిని ప్రహ్లాదుని పగ నీఁగె
మించి దేవతలు మితిమీఱి జయవెట్టిరి
చ. 11: అప్పు డిందిరాదేవి యంకమునఁ గూచుండె వొప్పుగ శాంతమందె నహోబలేశుఁడు
తప్పక కోనేటిదండఁ దానై యిందును నందు చిప్పిల వరములిచ్చీ శ్రీ వేంకటేశుఁడు

రేకు: 0389-01 మాళవిగౌళ సం: 04-514 రామ

పల్లవి: అదె లంక సాధించె నవని భారము దించె
విదితమై ప్రతాపము వెలయించె నితఁడు

చ. 1: రవి వంశ తిలకుఁడు రాముఁ డితఁడు
భువిఁ బుట్టె దశరథ పుత్రుఁ డితఁడు
భవుఁడెంచెఁ దారక బ్రహ్మ మీతఁడు
పవనజు కిచ్చినాఁడు బ్రహ్మపట్ట మీతఁడు

చ. 2: బలువుఁడు సీతాపతి యితఁడు
తలకొన్న వాలి మర్దనుఁ డితఁడు
విలసిల్లె నేకాంగ వీరుఁ డితఁడు
చలమరి కోదండ దీక్షా గురుఁ డితఁడు

చ. 3: శరణాగత వజ్రపంజరుఁ డితఁడు
సరిలేని యసుర భంజకుఁ డితఁడు
వరదుఁడు శ్రీ వేంకటేశ్వరుఁ డితఁడు
అరయ విజయనగరాధీశుఁ డీతఁడు

రేకు: 0389-02 రామక్రియ సం: 04-515 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁడు వీఁడిగో
వేమారు మొక్కుచు సేవించరో జనులు

చ. 1: చెలువపు రూపమున జితకాముఁడు
మలసీ బిరుదున సమర భీముఁడు
పొలుపైన సాకేతపుర ధాముఁడు
యిలలోఁ బ్రజలకెల్లా హితధాముఁడు

చ. 2: ఘనకాంతుల నీల మేఘ శ్యాముఁడు
అనిశము నుతుల సహస్ర నాముఁడు
కనుపట్టు కపి నాయక స్తోముఁడు
తనునెంచితే దేవతా సార్వభౌముఁడు

చ. 3: సిరుల మించిన తులసీ దాముఁడు
కరుణానిధియైన భక్త ప్రేముఁడు
పురుతర మహిమల నుద్దాముఁడు
గరిమల శ్రీ వేంకటగిరి గ్రాముఁడు

రేకు: 0389-03 సామంతం సం: 04-516 అధ్యాత్మ

పల్లవి: అదిగాన నీతి శాంతాలన్నిటకిఁ గారణము
పదిలమై వివేకించి బ్రదుకఁగ వలయు

చ. 1: తఱచు మాఁటలాడితే తప్పులెన్నైనాఁ దొరలు
పఱచై తిరిగితేను పాప మంటును
మెఱసి తిరిగాడితే మిక్కిలి దూరు ముట్టు
యెఱకగలవాఁ డిందు నేమఱ డెప్పుడును

చ. 2: కన్నవెల్లాఁ జూచితే కడునాస లుప్పతిలు
కన్నెలు పెక్కుగూడితే కరఁగు మేను
సన్నలు సారెకునైతే చవుకౌ దొరతనము
యిన్నిట నేర్పరైనవాఁ డేమఱఁ డెప్పుడును

చ. 3: మట్టుమీరి నవ్వితే మచ్చరా లూరకే పుట్టు
గుట్టులేక నడచితేఁ గొంచపడును
నెట్టినె శ్రీ వేంకటేశ నీకు శరణుచొచ్చి
యిట్టె నీ దాసుఁడైనవాఁ డేమరఁ డెప్పుడును

రేకు: 0389-04 సాళంగనాట సం: 04-517 రామ

పల్లవి: జయము మనది వనచరులాల
రయమున దర్మదారలు తుత్తుతూ

చ. 1: రక్కసుల మీఁద రాముఁడలిగె నలు-
దిక్కుల నడవుఁడు తిడిం తిడిం
యెక్కుఁడు సేనలు యిటు మొరయింపుఁడు
ఢక్కా నినదము ఢమఢమఢమం

చ. 2: కుటిలదానవులఁ గొట్టుఁడు కోటలు
తటుకున దాఁటుఁడు ధణం ధణం
పటుగతినార్చుచు పట్టుఁడు లగ్గలు
పెటులు చూఁడఁ డదె పెట పెట పెటల్

చ. 3: గుట్టున నుండక కూలె రావణుఁడు
పట్టుఁడు సంకులు భం భం భం
యిట్టె శ్రీ వేంకటేశుఁడు గెలిచెను
దిట్టలై యాడుఁడు ధిం ధిం ధిం

రేకు: 0389-05 శంకరాభరణం సం: 04-518 రామ

పల్లవి: వినుఁ డిదె రఘుపతి విజయములు
పనుపడి రాక్షస బాధ లుడిగెను

చ. 1: కులగిరు లదరెను కుంభిని వడఁకెను
యిల రాముఁడు రథమెక్కినను
కలఁగె వారిధులు కంపించె జగములు
బలు విలునమ్ములు వట్టినను

చ. 2: పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె
తొడిఁబడి బాణము దొడిగినను
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు
యెడపక రావణు నేసినను

చ. 3: చుక్కలు డుల్లెను స్రుక్కె భూతములు
తొక్కి యసుర తల దుంచినను
గక్కన శ్రీ వేంకటగిరి నిలువఁగ
అక్కజమగు శుభ మందరి కొదవె

రేకు: 0389-06 బౌళిరామక్రియ సం: 04-519 రామ

పల్లవి: ఇతఁడే పరబ్రహ్మ మిదియే రామకథ
శత కోటి విస్తరము సర్వ పుణ్య ఫలము

చ. 1: ధరలో రాముఁడు పుట్టె ధరణిజఁ బెండ్లాడె
అరణ్య వాసుల కెల్లా నభయమిచ్చె
సొరిది ముక్కుఁ జెవులు చుప్పనాతిని గోసె
ఖర దూషణులను ఖండించి వేసె

చ. 2: కినసి వాలిఁ జంపి కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె వానరులతో
కనలి రావణ కుంభ కర్ణాదులను జంపి
వనితఁ జేకొని మళ్ళి వచ్చె నయోధ్యకును

చ. 3: సౌమిత్రియు భరతుఁడు శత్రుఘ్నుఁడుఁ గొలువఁగ
భూమి యేలె కుశలవ పుత్రలఁ గాంచె
శ్రీ మంతుఁడై నిలిచె శ్రీ వేంకటాద్రిమీఁద
కామించి విభీషణ లంకకుఁ బట్టము గట్టె

రేకు: 0390-01 మాళవిగౌళ సం: 04-520 రామ

పల్లవి: రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను
భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను

చ. 1: తటుకన మారీచు తలపైఁ బోయఁ గర్మము
కుటిల శూర్పనఖ ముక్కునఁ బండెను
పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు
మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను

చ. 2: తరగె రావణు పూర్వతపములయాయుష్యము
ఖర దూషణాదులకు కాలము దీరె
గరిమ లంకకు నవగ్రహములు భేదించె
సిరుల నింద్రజిత్తాకు చినిఁగె నంతటను

చ. 3: పారిఁ గుంభకర్ణునికి పుట్టిన దినము వచ్చె
మరలి గండము దాఁకె మండోదరికి
పరగె నయోధ్యకు భాగ్యములు ఫలియించె
చిరమై శ్రీ వేంకటేశుచేఁతలెల్లా దక్కెను

రేకు: 0390-02 సాళంగనాట సం: 04-521 నృసింహ

పల్లవి: జయము జయము ఇక జనులాల
భయములు వాసెను బ్రదికితి మిపుడు

చ. 1: ఘన నరసింహుఁడు కంభమున వెడలె
దనుఁజులు నమసిరి ధర వెలసె
పొనిఁగె నధర్మము భూభారమడఁగె
మునుల తపము లిమ్ముల నీడేరె

చ. 2: గరిమతో విష్ణుఁడు గద్దెపై నిలిచె
హిరణ్య కశిపుని నేపడఁచె
అరసి ప్రహ్లాదుని నన్నిటా మన్నించె
హరుఁడును బ్రహ్మయు నదె కొలిచేరు

చ. 3: అహోబలేశుఁడు సిరి నంకమున ధరించె
బహుగతి శుభములు పాటిల్లె
యిహపరము లొసఁగె నిందును నందును
విహరించెను శ్రీవేంకటగిరిని

రేకు: 0390-03 రామక్రియ సం: 04-522 నృసింహ

పల్లవి: గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగీఁ జూడరో చింతామణి యీపె

చ. 1: పాల జలధిఁ బుట్టిన పద్మాలయ యీపె
లాలిత శ్రీ నరసింహులక్ష్మి యీపె
మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీ లీల లోకములేలే యిందిర యీపె

చ. 2: ఘన సంపద లొసఁగు కమలాకాంత యీపె
మనసిజుఁ గనిన రమాసతి యీపె
అనిశముఁ బాయని మహా హరి ప్రియ యీపె
ధన ధాన్య రూపపు శ్రీ తరుణి యీపె

చ. 3: రచ్చల వెలసినట్టి రమా వనిత యీపె
మచ్చిక గలయలమేల్‌మంగ యీపె
యిచ్చట వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చలుఁ దావు కొనిన నిధాన మీపె

రేకు: 0390-04 సామంతం సం: 04-523 రామ

పల్లవి: సమసె రావణుఁడు సమరములోపల
అమరులు కడు ముదమందిరి మెరసి

చ. 1: బెరగిరి రాముని శరముల కసురలు
సురిగిరి పోట్లచురుకునను
తొరిగిరి నెత్తుటఁ దునియలు సేసిన
తిరిగిరి తరుమఁగ దిక్కులకు

చ. 2: కూలిరి భల్లూకుల ఘోషములకు
వాలిరి వాయుజవాలహతి
వీలిరి యంగదు వివిధనాదముల
తూలిరి సుగ్రీవు దోర్బలమునను

చ. 3: దాఁగిరి లక్ష్మణు దాకకు నులుకుచు
వీఁగిరి వనచర వితతికిని
పాఁగి శ్రీ వేంకటపతి కృపా రసమునఁ
దోఁగిరి జనులు సంతోసంబునను

రేకు: 0390-05 శంకరాభరణం సం: 04-524 నృసింహ

పల్లవి: ఆదిమూర్తి యీతఁడు ప్రహ్లాద వరదుఁడు
యేదెసఁ జూచినాఁ దానె యీతఁడిది దేవుఁడు

చ. 1: నవ్వుల మోము తోడ నరసింహ రూపు తోడ
జవ్వని తొడ మీఁదట సరస మాడ
పువ్వుల దండలు యిరు బుజాలపై వేసుకొని
వువ్విళ్ళూరఁ గొలువై వున్నాఁడు దేవుఁడు

చ. 2: సంకుఁ జక్రములతోడ జమళి కోరల తోడ
అంకెలఁ గటియభయహస్తా లెత్తి
కంకణాలహారాలతో ఘన కిరీటము వెట్టి
పొంకమైన ప్రతాపానఁ బొదిలీ నీ దేవుఁడు

చ. 3: నానా దేవతల తోడ నారదాదుల తోడ
గానములు వినుకొంటా గద్దెపై నుండి
ఆనుక శ్రీ వేంకటాద్రి నహో బలము నందు
తానకమై వరాలిచ్చీ దాసులకు దేవుఁడు

రేకు: 0390-06 బౌళిరామక్రియ సం: 04-525 హనుమ

పల్లవి: వీఁడివో కలశాపుర వీరహనుమంతుడు
వాఁడిమి మెరసినట్టి వజ్రపాణి యితఁడు

చ. 1: చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు
తల కొన్న రాముని ప్రతాపపువాఁడు
యెలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు
కలగుండు వడ లంకc గాలిచినవాఁడు

చ. 2: మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు
గగనము మోచిన కాయమువాఁడు
మొగి సూర్యునిచే శాస్త్రములు చదివినవాఁడు
పగటున మీఁది బ్రహ్మ పట్టమేలే వాఁడు

చ. 3: యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు
చెప్పఁగొత్తైనమహిమ జెన్నొందువాఁడు
ముప్పిరి శ్రీ వేంకటేశు మూల బలమైన వాఁడు
వొప్పగు వరా లిందరి కొసగేటివాఁడు

రేకు: 0391-01 రామక్రియ సం: 04-526 కృష్ణ

పల్లవి: వీఁడివో కొలువున్నాఁడు విఠ్ఠలేశుఁడు
మూఁడు మూర్తుల తేజపు మూల మీతఁడు

చ. 1: పంతముతో పాండవపక్షపాతి యీతఁడు
వింతలేని విదురునివిందు యీతఁడు
మంతు కెక్కిన ద్రౌపదీ మాన రక్షకుఁడీతఁడు
చెంతనే వుద్ధపు పాలి చింతామణి యీతఁడు

చ. 2: మంద గొల్లెత లకెల్లా మంగళసూత్ర మీతఁడు
కందువ నక్రూరుని భాగ్యం బీతఁడు
నంద గోప యశోదల నవ నిధాన మీతఁడు
అందపు రుక్మిణీ మనోహరుఁ డీతఁడు

చ. 3: దేవకీ వసుదేవుల దివ్యపద వీతఁడు
భావింప నందరి పర బ్రహ్మ మీతఁడు
కైవశమై దాసులకు కల్ప వృక్ష మీతఁడు
శ్రీ వేంకటాద్రి మీఁదిశ్రీ పతి యీతఁడు

రేకు: 0391-02 లలిత సం: 04-527 నృసింహ

పల్లవి: ఈతని మహిమలు యెంతని చెప్పెద
చేతులమొక్కెదఁ జెలఁగుచు నేను

చ. 1: శ్రీ నరసింహుడు చిన్మయమూరితి
నానావిధకరనఖరుఁడు
దారుణ దైత్య విదారుఁడు విష్ణుఁడు
తానకమగు మా దైవంబితఁడు

చ. 2: అహోబలేశుఁడు ఆదిమ పురుషుఁడు
బహు దేవతా సార్వభౌముఁడు
సహజానందుఁడు సర్వ రక్షకుఁడు
యిహ పరము లోసఁగు యేలిక యితఁడు

చ. 3: కేవలుఁడగు సుగ్రీవ నృసింహుఁడు
భావించ సుజన పాలకుఁడు
శ్రీ వేంకటేశుఁడు చిత్తజ జనకుఁడు
వేవేలకు నిలువేలుపు యితఁడు

రేకు: 0391-03 సాళంగనాట సం: 04-528 హనుమ

పల్లవి: పెరిగినాఁడు చూడరో పెద్ద హనుమంతుఁడు
పరగి నానా విద్యల బలవంతుఁడు

చ. 1: రక్కసుల పాలికి రణరంగ శూరుఁడు
వెక్కసపు యేకాంగ వీరుఁడు
దిక్కులకు సంజీవి దెచ్చిన ధీరుఁడు
అక్కజమైనట్టి యాకారుఁడు

చ. 2: లలి మీరిన యట్టి లావుల భీముఁడు
బలు కపికుల సార్వభౌముఁడు
నెలకొన్న లంకానిర్ధూమధాముఁడు
తలంపున రామునాత్మారాముఁడు

చ. 3: దేవకార్యముల దిక్కు వరేణ్యుఁడు
భావింపఁగఁ దపః ఫల పుణ్యుఁడు
శ్రీ వేంకటేశ్వరు సేవాగ్రగణ్యుఁడు
సావధానుఁడు సర్వ శరణ్యుఁడు

రేకు: 0391-04 దేసాక్షి సం: 04-529 కృష్ణ

పల్లవి: వెన్న ముద్ద కృష్ణుఁడు వేవేల చేఁతల వాఁడు
పిన్నవాఁడై వున్నవాఁడు బిరుదైన బాలుఁడు

చ. 1: బాలెంత చన్ను గుడిచి బండి విరుగఁగఁ దన్ని
గాలి రక్కసుని ములుగఁగ మోఁది
రోలఁగట్టువడి యట్టె రూఢిగా మద్దిమాఁకులఁ
గూల దొబ్బె తొల్లి వీఁడె గుట్టు తోడి బాలుఁడు

చ. 2: కొండ గొడుగుగఁ బట్టి గోకులమునెల్లఁ గాచి
మెండగు గొల్లెతలతో మేల మాడి
అండనే నోరు దెరచి యశోదకు లోకములు
దండిగాఁ జూపె నితఁడె దంటయైన బాలుఁడు

చ. 3: పరమేష్ఠికి మారొడ్డి పసి బాలకులఁ దెచ్చి
ధరఁ బదారు వేలు కాంతలఁబెండ్లాడి
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి
సిరితో వెలసె నిదే చెలువపు బాలుఁడు

రేకు: 0391-05 నాట సం: 04-530 రామ

పల్లవి: అదె వచ్చె రాఘవుఁ డాతని దాటి ముట్టె
యెదిరించరాదు మీకు నేది దెరు విపుడు

చ. 1: భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు
అవల మీకు దిక్కేది యసురలాల
తివిరి మిమ్ము వెదకె దివ్య బాణాలాతనివి
రవళి నెందు చొచ్చేరు రాకాసులాల

చ. 2: చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట
తల చూపరాదు మీకే దైత్యులాల
వలగొని దేవతలు వానరులై వచ్చిరట
నిలువరా దిఁక మీకు నిశాచరులాల

చ. 3: రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక
దావతిఁ బారరో మీరు దానవులాల
యీ వేళ శ్రీ వేంకటేశుఁడితడే విభీషణుని
లావున శరణనరో లంకావాసులాల

రేకు: 0391-06 గుజ్జరి సం: 04-531 దేవుడు-జీవుడు

పల్లవి: ఏలికె చెప్పినపని కెదురాడేనా
నీలీల లివియని నిండుకుండే నేను

చ. 1: నీవు నాలోనున్నాఁడవు నే నున్నాఁడ సముఖాన
కావరపుటింద్రియాలు కాకు సేసీని
దేవర నీయప్పణో తెలియనానతీ నాకు
ఆవిధమైతేనే అపరాధము లేదు

చ. 2: జగదీశుడవు నీవు శరణాగతుఁడ నేను
జిగిఁ గామ క్రోధాలేల చిమ్మిరేఁచీని
నగుతా నప్పగించేవో నాకది గాదన రాదు
తగునిట్లానే యైతే తప్పులేదు మాకును

చ. 3: పుట్టించేవాఁడవు నీవు పుట్టుగులు నాసొమ్ము
చుట్టి సుఖదుఃఖా లేల సూడువట్టీని
నెట్టన శ్రీవేంకటేశ నీనటనో మంచిదాయ
యిట్టయితే మావంక నిఁక నేరమి లేదు

రేకు: 9004-01 ఆహిరి సం: 04-532 ఇతర దేవతలు

పల్లవి: తొల్లియును మజ్జాకు తొట్టెలనె యూఁగెఁగన
చెల్లుబడినూఁగీని శ్రీరంగశిశువు

చ. 1: కలికి కావేరి తరగల బాహులతలనే
తలఁగకిటు రంగమధ్యపు తొట్టెల
పలుమారుఁదనునూఁచి పాడఁగానూఁగీని
చిలుపాల సెలవితో శ్రీ రంగ శిశువు

చ. 2: అదివొ కమలజుని తిరువారాధనంబనఁగ
అదనఁ గమలభవాండమనుతొట్టెల
ఉదధులు తరంగములనూఁచఁగా మాఁగీని
చెదరని సిరులతోడ శ్రీ రంగశిశువు

చ. 3: వేదములె చేరులై వెలయంగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీ దేవితోఁగూడి శ్రీ వేంకటేశుఁడై
సేద దేరెడి వాఁడె శ్రీ రంగశిశువు

రేకు: 9013-01 శ్రీరాగం సం: 04-533 నృసింహ

పల్లవి: వెరపు దెలుపునీ వేగిరిమే నీ
వెఱిఁగియు నెఱఁగక యేమంటివో

చ. 1: గోరపురుధిరము గురియు గోళ్ళ నీ
తోరమైన యా తొడమీఁద
గోరంటగోళ్ళ కోమలి నిలువఁగ
ఈరసమందక యేమంటివో

చ. 2: నెత్తురుఁ బెదవుల నీ మొకమలరఁగ
బిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరిగమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటినో

చ. 3: ఆననరౌద్రము నట్టహాసమును
పూనిన నినుఁగని బొమముడితో
లేనగవుల నదలింపెడి సిరితో
హీనాధికముల నేమంటివో

చ. 4: పెద పెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగు జారుసతి
యెదురెదురను నీవేమంటివో

చ. 5: చింప నెరుల నీ శిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతివై
లంపటమందుచు లక్ష్మీసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో

రేకు: 9016-01 రామక్రియ సం: 04-534 అధ్యాత్మ

పల్లవి: అందరి వసమా హరి నెరుఁగ
కందువగ నొకఁడుగాని యెరఁగఁడు

చ. 1: లలితపు పది గోట్ల నొకఁడుగాని
కలుగఁడు శ్రీ హరిఁ గని మనఁగ
ఒలిసి తెలియు పుణ్యుల కోట్లలో
ఇలనొకఁడుగాని యెరఁగడు హరిని

చ. 2: శ్రుతి చదివిన భూసుర కోట్లలో
గతియును హరినె యొకానొకఁడు
అతి ఘనులట్టి మహాత్మ కోటిలో
తతి నొకఁడుగాని తలఁచఁడు హరిని

చ. 3: తుది కెక్కిన నిత్యుల కోట్లలో
పొదుగు నొకఁడు తలపున హరిని
గుదిగొను హరి భక్తుల కోట్లలో
వెదకు నొకఁడు శ్రీ వేంకటపతిని

రేకు: 9016-02 ఆహిరి సం: 04-535 వైరాగ్య చింత

పల్లవి: మాయల కగపడి మతిగెడి ప్రాణులు
రోయఁ దలఁచియును రోయఁగలేరు

చ. 1: మిస మిస మెరువఁగ మెల్లన చేరిరి
ముసిఁడిమాని ఫలములు చూచి
రసమని సంసారపు బాలికులిదె
విసిగి చేఁదుగని విరుగఁగలేరు

చ. 2: బలు విష మొలికెడి పాముఁ బట్టుకొని
అలరుచు నలుగడ నాడేరు
పొలసి యాసలూర్పులు నిగుడించఁగ
తెలిసియు నింకాఁ దెలియఁగలేరు

చ. 3: తేనెదెచ్చి కత్తికి దారఁ బెట్టి (న)
నానా విధముల నాఁకేరు
దీన తలఁణఁపెడి తిరు వేంకటపతి
చేని పంటలకుఁ జెయి చాఁచలేదు

రేకు: 9016-03 బౌళి సం: 04-536 నామ సంకీర్తన

పల్లవి: కందర్పజనక గరుడగమన
నందగోపాత్మజ నమో నమో

చ. 1: వారిధి శయన వామన శ్రీధర
నారసింహ కృష్ణ నమో నమో
నీరజ నాభ నిగమ గోచర
నారాయణ హరి నమో నమో

చ. 2: పరమ పురుషా భవ విమోచన
వరద వసుధావధూవర
కరుణా కాంతా కాళిందీ రమణ
నరసఖ శౌరీ నమో నమో

చ. 3: దానవ దమన దామోదర శశి
భాను నయన బల భద్రానుజ
దీన రక్షక శ్రీ తిరు వేంకటేశ
నానా గుణమయ నమో నమో

రేకు: 9018-01 ఆహరి సం: 04-537 వైరాగ్య చింత

పల్లవి: ఏమి దిరిగేమెంద్దైనను ఊర
కోమితిమి దేహమోహోబదుకు

చ. 1: బ్రహ్మ కల్పము దాఁక బ్రదికేమో, కాక
బ్రహ్మానందంబుఁ బడసేమా
బ్రహ్మ మీ దేహలంపట మనుచు పరం
బ్రహ్మంబు వదలితిమి బాపు బ్రదుకు

చ. 2: ఒడిలితో నిట్టనే వుండేమా, కాక
చెడని పుణ్యములెల్లఁ జేసేమా
యెడయకమరపదం బేలేమా, వృథా
చెడిపోయె దినములిస్సీ బదుకా

చ. 3: ఆపదలు లేని సుఖమందేమా, కాక
పాపంబు లేని మతిఁ బరగేమా
ఏపు మీరిని వేంకటేశ్వరునిఁ గొలువ
నోపకిట్టైతిమయ్యో బదుకా

రేకు: 9019-01 శ్రీరాగం సం: 04-538 వేంకటగానం

పల్లవి: కప్పురమునకుఁ గప్పురమై

చిప్పిలుఁదావి మించె నితఁడు

చ. 1: బంగారమునకు బంగారమై

శృంగార మమరె శ్రీ హరికి

అంగమయిన మొల పీతాంబరంబున

కొంగు బంగారై కూడె నితఁడు

చ. 2: తట్టు పుణుఁగునకుఁ దట్టు పుణుఁగయి

ఘట్టిమేన మించెఁగా యితఁడు

నెట్టన నొసల నిండిన కస్తురి

బొట్టు చెమటతోఁ బొలెనికతఁడు

చ. 3: పన్నీట పాదాన పన్నీరే తానయి

యిన్నిట శ్రీ వేంకటేశుఁడిదే

ఉన్నతి జలధి నుదయమున

కన్నియ కౌఁగిట ఘనుఁడితఁడు

రేకు: 9020-01 లలిత (అవతారాలు) సం: 04-539 దశావతారములు

పల్లవి: అరుదైన భవదూరుఁడగు నీతఁడు
అరిది భవములందునతఁడు వో యితఁడు

చ. 1: కొడుకుటెక్కెమురూపు కోరి కైకొని పెద్ద
కొడుకు కొరకుఁగా గోరపడి
కొడుకువైరి భక్తిఁ గూడిన యాతని
నడవిలోఁ జంపిన యతఁడు వో యితఁడు

చ. 2: ఆలి తమ్ముని రాక కలరి మెచ్చెడిచోట
ఆలుఁ దానును నుండి యందులోన
ఆలిచంటికింద నడ్డమువడుకున్న
ఆలవాలమువంటి అతఁడు వో యితఁడు

చ. 3: సవతి తమ్ముఁడు గోవుఁ జంపఁ బట్టుక పోయి
సవతి తమ్మునియింట సడిఁబెట్టఁగా
సవతులేనిపంటఁ జప్పరించివేసి
అవల యివల సేసి నతఁడు వో యితఁడు

చ. 4: తొడ జనించిన యింతి దొరకొనాపద సేయ
దొలఁగి తోలాడెడి దొడ్డవాని
తొడమీఁద నిడి వానికడుపులో తొడవులే
యడియాలమగు మేని యతఁడు వో యితఁడు

చ. 5: పదము దానొసఁగుచుఁ బదమడుగగఁ బోయి
పదము పదము మోవఁ బరగఁ జేసి
పదముననె దివ్యపదమిచ్చి మనుమని
నదిమి కాచినయట్టి అతఁడు వో యితఁడు

చ. 6: అత్తకొడుకుపేరి యాతనిఁ దనకూర్మి
యత్తయింటిలోన నధికుఁ జేసి
మత్తిల్లు తనతోడ మలసిన యాతని
నత్తలిత్తల సేసినతఁడు వో యితఁడు

చ. 7: పాముతోడుతఁ బోరి పంతముగొనువాని
పాముకుఁ బ్రాణమై పరగువాని
ప్రేమపుఁ దనయుని బిరుదుగా నేలిన
ఆమాటనిజముల అతఁడు వో యితఁడు

చ. 8: ఎత్తుక వురవడినేఁగెడి దనుజుని

యెత్తుకలుగు మద మిగుర మోఁది
మత్తిల్లు చదువుల మౌనిఁ జం......................................
అత్తలేని యల్లుఁడతఁడు వో యితఁడు
చ. 9: బిగిసి మేఁకమెడ పిసికెడి మాటలు
పగలుగాఁగ రేయివగలు సేసి
జగములోన నెల్ల జాటుచుఁ బెద్దల
అగడుసేయఁ బుట్టినతఁడు వో యితఁడు
చ. 10: మెట్టనిచోట్ల మెట్టుచుఁ బరువులు
పెట్టెడిరాయ...................................
కట్టెడికాలము కడపట నదయుల(?)
నట్టలాడించిన అతఁడు వో యితఁడు
చ. 11: తలఁకకిన్నియుఁ జేసి తనుఁగాని యాతని
వలెనె నేఁడు వచ్చి వసుధలోన
వెలుఁగొంది వేంకటవిభుఁడై వెలసిన
యలవిగాని విభుఁడతఁడు వో యితఁడు

రేకు: 9022-01 శ్రీరాగం సం: 04-540 విష్ణు కీర్తనం

పల్లవి: చండ ప్రచండాది జయ విజయులన్
అండఁ బూజించి హరి కటుగదా పూజ

చ. 1: కూర్మ భూమ్యాదులను గోరికఁ బ్రతిష్ఠించి
ధర్మముఖ్యంబుల నధర్మాదులన్
కర్మగతిఁ జామర గ్రాహిణులఁ బూజించి
మర్మంబుగా హరికి మరికదా పూజ

చ. 2: గరుడ సేనేశులను ఘనుని శేషుని మరియు
వరమతులఁ బాదసంహినులను
కరమొప్ప శంఖచక్రగదాసి శార్ఙ్ణముల
అరసి పూజించి హరికిన పుడుగా పూజ

చ. 3: నవకిరీటమును గుండలహార కౌస్తుభము
లవిరళపుఁ బీతాంబరాదులలర
వివిధగతిఁ బూజించి వేంకటేశ్వరు పూజ
యివదఁ దళిగలు పెట్టుఁడిదిగదా పూజ

రేకు: 9022-02 ధన్నాసి సం: 04-541 వైరాగ్య చింత

పల్లవి: కాయముల కాణాచి కాఁపులము
చాయల మా సుఖము జయమేఁటిదయ్యా

చ. 1: పంచ మహా పాతకాల బైరు విత్తి దేహాల
కంచపుఁ గొలుచులుగా గాదెలఁబోసి
చంచలాలు జవ్వనాలు చవులైన కూరలుగా
నించి భుజియించే మానిజమేఁటిదయ్యా

చ. 2: ఉడివోని లంపటాన నూళ్ళుఁ బల్లెలు నెక్కి
యిడుమల మమతల నిండ్లు గట్టి
గొడవలానాసల కూరిమి సంపదల
పొడవైన మామతి పొందేఁటిదయ్యా

చ. 3: పనిలేని మమతల్ల పాపములు బందాలు
గొనకొని ధనములు గూడపెట్టి
కని నేఁడు తిరు వేంకటపతి కృపతోడ
తనియని మాతోడి తగువేఁటిదయ్యా

రేకు: 9022-03 లలిత సం: 04-542 విష్ణు కీర్తనం

పల్లవి: ఇటువలెనె పో యింకా మాకు
వటపత్రశాయి మమ్ము వదలీనా

చ. 1: యన్నఁడు దెల్లవారెనో యాడఁ బొద్దు పొడచెనో
యన్నట్లనుండితి మహర్నిశము
యన్నిటాఁ గడమలేక యెక్కడ నెదురులేక
పన్నగ శయనుని కృపనేకాదా

చ. 2: ఏడ వోవువ్యాధులెటు వచ్చి నిలిచెనో
కూడిన యాలరులెల్ల కొండలవలె
నీడలే నిలువులెల్ల నెలవులై యున్నచోట
యీడులేనివివి హరి యీవులేకావా

చ. 3: ఎవ్వరిచేత దాఁచితిమెచ్చట నిధానములు
ఇవ్వలా మాతలఁచిన యిన్నియు నబ్బె
రవ్వగు వెంకటగిరిరాయఁడు మాతలఁపులో
పువ్వక కాచి పండిన భోగమేకాదా

రేకు: 9022-04 ముఖారి సం: 04-543 వేంకటగానం

పల్లవి: ఎన్నటి కెవ్వరికితఁడే
అన్నిటానున్న అధికుఁడు

చ. 1: ఆతుమ కంతర్యామీ స్వామీ
యేతరినైనా నితఁడే
పాతక శూరుఁడు పారశరీరుఁడు
పూతన ప్రాణ ఘాతకుఁడు

చ. 2: అక్కర దీరచ నందాఁ జెందా
యెక్కడనైనా నితఁడే
పుక్కిటి లోకాలు పొందుగా నించి మా
దిక్కైనా పరదేవుఁడు

చ. 3: నేరమి నేరుపు నించాఁ బెంచా
నేరీతినైనా నితఁడే
కారుణ్యానిధి వేంకట విభుఁడు మా
చేరువై యున్న చెలువుఁడు

రేకు: 9028-01 భూపాళం సం: 04-544 వైరాగ్య చింత

పల్లవి: ఏమో తెలిసెఁ గాని యీ జీవుఁడు
నేమపు నెరవిద్య నేరఁడాయ

చ. 1: కపటాలే నేరిచెఁ గాని జీవుఁడు
ఎపుడైన నిజ సుఖం బెరఁగఁడాయ
కపురులే చవిగొనెఁ గాని జీవుఁడు
అపరిమితామృత మానఁడాయ

చ. 2: కడలేక తిరిగీఁ గాని జీవుఁడీ
నడుమ మొదలు చూచి నడవఁడాయ
కడుపుకూటికిఁ బోయీఁ గాని జీవుఁడీ
చెడని జీతముపొంతఁ జేరఁడాయ

చ. 3: కనియుఁ గానక పోయెఁ గాని జీవుఁడు
దినము వేంకటపతిఁ దెలియఁడాయ
కనుమాయలకె చొక్కెఁ గాని జీవుఁడు
తనియ నిట్టేమంచి దరిఁ జేరడాయ

రేకు: 9028-02 సామంతం సం: 04-545 అద్వైతము

పల్లవి: ఏమనవచ్చును గొందరికింపౌఁ బులుసులుఁదీపులు
సోమరితనమున నిన్నిటఁ జొరదీ నా తలఁపు

చ. 1: పదిలంబుగ సర్వాత్మక భావము దలఁచినపిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు
వదలక యిన్నిటను శ్రీవల్లభుఁడున్నాఁడుండిన
హృదయము చంచలమిన్నిట నెనయదు నామనసు

చ. 2: ఎక్కడఁ జూచినఁ బ్రాణులకిన్నియు నాచారములే
చిక్కక యిన్నియుఁగైకొని చేయక పోరాదు
మక్కువ నిన్నియు శ్రీ హరి మతములె కానీ అయినా
ఒక్కటియే చాలును నాకొడఁబడవితరములు

చ. 3: ఏరీతులనటు చూచిన నిందరు బలుదైవములే
కూరిమినందరినటువలెఁ గొలువకపోరాదు
ధారుణి వేంకటపతిచేఁతలు ఇవియైనాఁగాని
కోరిక నా కితఁడే మరి కొరకొరలిన్నియును

రేకు: 9028-03 ఆహిరి సం: 04-546 శరణాగతి

పల్లవి: ఓపనయ్య వోపనయ్య
వోపనయ్య యీ వొప్పులే తప్పులు

చ. 1: ఎక్కడికి నెక్కడ యెక్కువే యెరవు
తక్కులే యీ మొక్కులు తక్కువే దారణ

చ. 2: ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తప్పులే యీ రవ్వలు చివ్వలే సిగ్గులు

చ. 3: బొంకులే పొందులు కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీజంకెలే జంపులు

రేకు: 9029-01 సామంతం సం: 04-547 వేంకటగానం

పల్లవి: పాడైన యెరుకతో బంధమోక్షములొక్క
గాడిఁగట్టుట తెలివిగానకేకాదా

చ. 1: భావించి నినుఁ బరబ్రహ్మమని వేదములు
వేవేలు విధుల మొరవెట్టఁగాను
కేవలపు నిన్ను దక్కిన దైవములఁ గూర్చి
సేవింపుటిది తప్పు సేయుటేకాదా

చ. 2: సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా
త్పరుఁడవని నలుగడలఁ బలుకఁగాను
వరుసతోఁ బెక్కు దైవములు సంగడి నిన్ను
తొరలఁ గొలుచుట మహా ద్రోహమేకాదా

చ. 3: ఎందుఁ జూచిన పురాణేతిహాసములు నీ
చందమే యధికమని చాటఁగాను
చందర్ప జనక వేంకటగిరి స్వామి నీ
కందు వెఱఁగనిది యజ్ఞానమేకాదా

రేకు: 9029-02 సామంతం సం: 04-548 వైరాగ్య చింత

పల్లవి: కొంచపడితినొక కొన్నాళ్ళు
ఇంచుకించుకిపుడెరిఁగితి నేను

చ. 1: ముట్టుపాఁతవలె మురిగిన దేహము
గుట్టున దాఁచితిఁ గొన్నాళ్ళు
ఇట్టే సుఖమని యిన్నిటి యోనుల
ఒట్టుక కాఁపురముండితి నేను

చ. 2: మురికి కడువలే ముంచిన హేయము
కురిసితి నేనొక కొన్నాళ్ళు
తెరపి లేక యీ దేహమురోఁతల
మొరఁగి దాఁచితిని మూలల నేను

చ. 3: విప్పుచు ముడుచుచు వెంట్రుకతుట్టెల
కొప్పులె పెట్టితి గొన్నాళ్ళు
అప్ప వేంకటనగాధిప మీకృప
యిప్పుడు వెలసితి నిదివో నేఁడు

రేకు: 9029-03 నాట సం: 04-549 వైరాగ్య చింత

పల్లవి: తనకేఁటి యేతులిందరిలోన
పెనఁగుచు నూరక బిగిసీఁగాక

చ. 1: మరచెనా తనపాటు మాలజీవుఁడు దొల్లి
కొరమాలి బహుయోనికూపముల
పొరలి హేయములోనె పుంగుడువడి వచ్చి
మొరఁగి తా దొరనంట మురిసీఁగాక

చ. 2: పాసెనా తనపాటు పాపదేహి తా
గాసిఁ బడిన భంగములెల్ల
చేసిన తనతొంటి చేఁతలన్నియును
మాసెననుచు నిట్టె మలసీఁగాక

చ. 3: విడిచెనా తన పాపవిధులు ప్రాణుఁడు మున్ను
అడరి మానుష రూప మైనంతనే
చెడక వేంకటపతి సేవించి సకలము
కడుగుకొనెడి బుద్ధి కనవలెఁగాక

రేకు: 9029-04 రామక్రియ సం: 04-550 వైరాగ్య చింత

పల్లవి: అంటుకోకురో యమ్మలాలా యీ
మంటవడ్డ కోరికల మాఁటు వారము

చ. 1: మాసిన యాసలనెడి మాలెత వెంట వెంటనే
పాసి వుండలేక బాధఁబడ్డవారము
బేన బెల్లి యెంగిలైన పదవినంజుడు నోరఁ
దీసి తీసి సారె సారెఁ దిన్నవారము

చ. 2: ఇట్టు నట్టు ముట్టరాని హేయమైన తోలుఁదోలు
కుట్టి కుట్టి సిగ్గులమ్ముకొన్నవారము
ముట్టు సేయుచోటనే మూలమూల సారె సారెఁ
బుట్టి పుట్టి యాపదలఁ బొందువారము

చ. 3: చంపి చంపి జీవులనే చవులంటఁ జెడ్డతోలుఁ
గొంపలోనఁ దెచ్చి పెట్టుకొన్నవారము
ఇంపుల నిప్పుడు వేంకటేశుఁజేరి భవముల
చింపి యింటి హరిభక్తి చరవారము

రేకు: 9030-01 దేవగాంధారి సం: 04-551 కృష్ణ

పల్లవి: ఇట్టి ముద్దులాఁడి బాలుఁడేడ వాఁడు - వాని
బట్టి తెచ్చి పొట్టనిండఁ బాలుపోయరే

చ. 1: గామిడై పారితెంచి కాఁగెడి వెన్నలలోన
చేమ పూవు కడియాల చేయిపెట్టి
చీమ గుట్టెనని తన చెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయే వాని వెద్దు వెట్టరే

చ. 2: ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగఁ బెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే

చ. 3: ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోని
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పఁడైన వేంకటాద్రి అసవాలకుఁడు గాన
తప్పకుండఁబెట్టె వాని తలకెత్తరే

రేకు: 9030-02 భూపాలం సం: 04-552 మేలుకొలుపులు

పల్లవి: మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన

చ. 1: లేదు వేదవిధి లేశమును
మేదిని భరమై మించినది
పాదుపడదు చూపరకు భువి
గాదిలి సుతుపై గనలె జనకుఁడు

చ. 2: కనకము చవి చెడెఁ గడుఁగడును
ఘననృపబాధలు గదిమినవి
దనుజుల కతివలు దలఁకెదరు
ఎనయ బలాధికులెవ్వరు లేరు

చ. 3: అసుర సతుల పుణ్యము ఘనము
కస మసఁగెడి కలికాలమహిమ
పసగల వేంకటపతి యిఁకను
వసుధలోని నెవ్వగలుడుపఁగను

రేకు: 9034-01 సామంతం సం: 04-553 అధ్యాత్మ

పల్లవి: లోకములోపల లూటిబెట్టి - ఇది
కైకొని హరి యెరఁగవుగా నీవు

చ. 1: ములుగుచు వెనకయు ముందరయును నొచ్చి
పలుమారుఁ గుంటెడి పసురము
నెలకొని వెదకేము నిన్నమాపటినుండి
నలిననాభుఁడ కానవుగా నీవు

చ. 2: భంగించి తొల్లియు బలుమారు గొనిపోయి
దొంగలు విడిచిన తురగము
ముంగిటలేదు యేమూల నొదిగినదో
అంగజపతి అరయవుగా నీవు

చ. 3: కొంకక యడవి మాఁకులుఁ గంపలు మేసి
బింక మెడలి పారు పెనుమృగము
వేంకటపతి దీని వెదకి కానలేము
సంకె వాయఁ దేర్చవుగా నీవు

రేకు: 9035-01 భూపాళం సం: 04-554 వేంకటగానం

పల్లవి: అన్నివిభవముల అతఁడితఁడు
కన్నులు వేవేలుగల ఘనుడితఁడు

చ. 1: వేదాంతకోట్ల విభుఁ డితఁడు
నాదబ్రహ్మపు నడుమితఁడు
ఆది నంత్యములకు నరుదితఁడు
శ్రీ దేవుఁడు సరసిజ నాభుఁడితఁడు

చ. 2: భవములణఁచు యదుపతి యితఁడు
భువనములిన్నిటికిఁ బొడవితఁడు
దివికి దివమైన తిరమితఁడు
పవనసుతు నేలినపతి యితఁడు

చ. 3: గరుడని మీఁదటి ఘనుఁడితఁడు
సిరులిందరికి నిచ్చే చెలువితఁడు
తిరువేంకటనగము దేవుఁడితఁడు
పరమపదమునకుఁ బ్రభుఁడితఁడు

రేకు: 9035-02 బౌళిరామక్రియ సం: 04-555 అంత్యప్రాస

పల్లవి: అదరీ బెదరీ నంతనంత
అదవదలై మాయామృగము

చ. 1: పొలసీ మలసీఁ బొదలీఁ గదలీ
నెలసీఁ బలుమారు నెలవులను
కలసీ మృగములఁ గ్రమ్మర బెదరీ
అలసీనటు మాయామృగము

చ. 2: దాఁగీ లోఁగీఁ దటుకన వెనుకకు
వీఁగీ నేఁగీ విసవిసనై
రేఁగీగతి వచరింపుచుఁ జూపుల
నాఁగీనదె మాయామృగము

చ. 3: వెంకటగిరి రఘువీర నీముందర
కొంకీఁ గొసరీఁ గొనగొనల
జంకెల బాణాసన బౌణంబున
సంకెలఁ బడె మాయామృగము

రేకు: 9037-01 సామంతం సం: 04-556 శరణాగతి

పల్లవి: ధనముగని మరికదా ధనికుఁడౌట - మొదల
తనుఁ దానెఱుఁగలేని తలుపేఁటి తలఁపు

చ. 1: మచ్చికల నినుఁగొలిచి మరికదా సుఖులౌట
యెచ్చోట నేవేల్పులెవ్వరైన
అచ్చుపడ నటువంటి హరి నిన్నుఁ గొలిచి నీ
మెచ్చువడయఁగలేని మేలేఁటి మేలు

చ. 2: కందువగ నినుఁ గొలువఁగనికదా ఘనులౌట
యెందునరుదగు వేల్పులెందరైన
అందముగ పరదైవమని నిన్నుఁ గనలేక
గొందిఁబడి పొరలేటి కూడేఁటి కూడు

చ. 3: వేరక నినుఁగొలిచి వేంకటనగేశ నీ
దాసులై మరికదా ధన్యులౌట
వాసి వట్టముకొరకు వదలి దినములచేతఁ
బాసి పోయినవెనక పరమేడ పరము

రేకు: 9042-01 ఆహిరి సం: 04-557 అధ్యాత్మ

పల్లవి: ఇట్టి సంసారికేదియు లేదాఁయ
తట్టువడుటేకాని దరిచేరలేదు

చ. 1: ములిగి భారపుమోపు మోఁచేటివాఁడు
అలసి దించుకొను నాడాడను
అలరు సంసారికి నదియు లేదాయ
తొలఁగని భారమెందును దించలేదు

చ. 2: తడవి వేఁపచేఁదు త్రావెడివాఁడు
ఎడయెడఁ దినుఁ దీపేమైనను
అడరు సంసారికి నదియు లేదాయ
కడుఁ జేఁదెకాని యెక్కడఁ దీపులేదు

చ. 3: దొరకొని హేయమే తోఁడేటివాఁడు
పరితవించును మేనఁ బరిమళము
అరిది సంసారికి నదియు లేదాయ
ఇరవు వేంకటపతి నెఱుఁగలేఁడు

రేకు: 9046-01 ఆహిరి సం: 04-558 వైరాగ్య చింత

పల్లవి: చాలదా నా సంసారము
గాలియుయ్యేలలఁ దొలఁగక యూఁగవలసె

చ. 1: పాపపుణ్యములనెడి బల్లిదుల వెంటనే
దీపించు బంటనై తిరిగి తిరిగి
పైపైనె దేహంపుఁ బల్లెలొసఁగిన నరక
కూపముల మడి దున్నుకొని బ్రదుకవలసె

చ. 2: చిత్తమను విభుఁజేరి చెలఁగి విషయంబులకు
కొత్తగమికాఁడనై కొలిచి కొలిచి
హత్తుకొని మోహంబులను ప్రధానుల యెదుట
గత్తంపు మొగసాలఁ గలదించవలసె

చ. 3: గాటంపు దురితములకై జీతగాఁడనై
చేటైన కోరికలఁ జేరిచేరి
ఈటాడఁ దిరు వేంకటేశుఁ గనకిన్నాళ్ళు
కోటకొమ్మలకెగసి గుంపించవలసె

రేకు: 9047-01 శోకవరాళి సం: 04-559 వేంకటగానం

పల్లవి: వేంకటగిరి గోవిందుఁడా

యింకా నొకరో యిద్దరొ మీరు

చ. 1: పచ్చలు దాచిన బాహుపురులతో

అచ్చపుఁ గరముల అందముతో

అచ్చలు నిచ్చలు నలను (రు?) దురిదివో

నిచ్చలు నీవో నీవో కాని

చ. 2: నిలుచుండుటయును నెరిఁ బవళింపుచు

నలరుటయును మీరటు నిటును

జలజాక్షులు దొడ చరచఁగ నొరపుల

వెలయగ నిద్రో విభవమిదో

చ. 3: తిరు వేంకటగిరి దిగువ తిరుపతిని

పరమానందపు బహుసిరులు

అరుదుగఁ బొందుచు అధికములందుచు

ఉదగశయనుఁడవొ వొడయఁడవో

రేకు: 9047-02 సామంతం సం: 04-560 వైరాగ్య చింత

పల్లవి: ఏమిసేయవచ్చుఁ గర్మమిచ్చినంత కాని లేదు
తాముసేసినంత వట్టు తమకుఁ బోరాదు

చ. 1: ఇట్టు నట్టు మిట్టిపడ్డ నించుకంతా లేదు - వీఁపు
పట్టగట్ట మోఁపు మోఁచి పాటువడ్డ లేదు
తట్టువడ లోకమెల్ల దవ్వుకొన్న లేదు
తెట్ట తెరువున నోరుదెరచిన లేదు

చ. 2: అడిగిపరుల బతుకాసపడ్డ లేదు - భీతి
విడిచి నెత్తుటఁ దోఁగి వీరుఁడైన లేదు
అడవులెల్లఁ దిరిగి అలమటించిన లేదు
ఇడుమపాటుఁజొచ్చి యియ్యకొన్న లేదు

చ. 3: వచ్చి వచ్చి వనితల వలపించుకొన్న లేదు
మెచ్చుల గుఱ్ఱమునెక్కి మేటియైన లేదు
ఎచ్చరకఁ దిరువేంకటేశుఁ గొలువకుంటే
ఇచ్చటచ్చట సుఖమించుకంత లేదు

రేకు: 9047-03 కాంబోదిసం: 04-561 జోల

పల్లవి: వాగె బలువు దైవపురాయా - నీ
రాగె జతనము పరాకెచ్చరికె

చ. 1: మించులఁ దురగము మిన్నులు మోపఁగ
నంచలఁ గురుచల నాడఁగను
కంచు మించుగా గక్కనఁ దోలితి
పంచాస్త్రగురుఁడ పాదెచ్చరికె

చ. 2: పెక్కువతేజిటు పేరెమువారఁగ
తొక్కనిచోట్లు దొక్కఁగను
చుక్కలు మోపఁగ సొంపుగఁ దోలితి
తొక్కుల దేవరదేవెచ్చరికె

చ. 3: అంకవన్నె పాదాబ్జము పదిలము
వేంకటేశ తిరువీధులను
సంకెలేక శ్రీసతితోఁ జెలఁగెడి
లంకెల జాఁగు భళా యెచ్చరికె

రేకు: 9049-01 కాంబోదిసం: 04-562 ఉపమానములు

పల్లవి: తల్లిఁ బాసి బిడ్డలెల్లఁ దల్లడించినట్టు నా
పల్లదా లెవ్వరి పాలయ్యీనో తాము

చ. 1: మేదరింటి లంజవోయి మేదినీశుఁ దగులఁగ
గోదిలి కువిటులెల్లఁ గుల్లినయట్టు
ఆదిగొని నేఁబోయి హరిఁ గొలువఁగ నా
గాదిలి కర్మములేడఁ గంటివో తాము

చ. 2: కాఁపుటూరి మంగలోజు గడిమీఁది రాజుగాఁగ
కాఁపులెల్లాఁ బనిమాసి కందినయట్టు
ఆఁపలేక నేఁబోయి హరిఁ గొలువఁగ నా
పాపము లెవ్వరి పంచపాలయ్యీనో తాము

చ. 3: ఒట్టిన మోఁపులు మోవనోపక పూరువిడిచి
వెట్టివాఁడు పారిపోఁగా వెదకినట్టు
ఇట్టె నేను శ్రీవేంకటేశుఁ గొలువఁగ నా
చుట్టము లిందరు నేడఁ జొచ్చేరో తాము

రేకు: 9049-02 పాడి సం: 04-563 నామ సంకీర్తన

పల్లవి: నారాయణతే నమో నమో
నారద సన్నుత నమో నమో

చ. 1: మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ
పరమ పురుష భవ బంధ విమోచన
నర మృ గశరీర నమో నమో

చ. 2: జలధి శయన రవిచంద్ర విలోచన
జలరుహభవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో

చ. 3: ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహన రూప
వేదోద్ధర శ్రీ వేంకటనాయక
నాదప్రియ తే నమో నమో

రేకు: 9050-01 శ్రీరాగం సం: 04-564 నామ సంకీర్తన

పల్లవి: త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా

చ. 1: వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీ సతీశ సరసిజ నేత్ర
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయవసన జగన్నాథా

చ. 2: బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలి దోష హరణ జగన్నాథా

చ. 3: వటపత్ర శయన భువనపాలన జంతు
ఘటకార కరుణ శృంగారాధిప
పటుతర నిత్య వైభవ రాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా

రేకు: 9050-02 పళమంజరి సం: 04-565 జోల

పల్లవి: పాలజలనిధిలోఁ బాయని
నీలవర్ణుఁడవట నీవా యిపుడు

చ. 1: వెదచల్లుమణుల వేయిపడగలను
చెదరని మెరుఁగుల శేషునిపై
మృదువుఁ బరపుగా మెల్లనె పొరలుచు
నిదురవోదువట నీవా యిపుడు

చ. 2: పరమ మునీంద్రులుఁ బద్మభవాదులు
ఇరువంకల నుతియించఁగను
అరవిరిమోమున నల్లన నవ్వెడి
నిరతమూర్తివట నీవా యిపుడు

చ. 3: పగటున సిరియునుఁ బరగిన ధరణియు
బిగియుచు నడుగులు పిసుకఁగను
తగు వేంకటగిరిఁ దనరుచు జెలఁగెడి
నిగమమూర్తివట నీవా యిపుడు

రేకు: 9053-01 సామంతం సం: 04-566 వైరాగ్య చింత

పల్లవి: సంతత దుఃఖపు జడులాల శ్రీ
కాంతుని మరవక కనరాదా

చ. 1: మలజలధులఁ బలుమరుఁ దేలుచుఁ గడు
దలఁకుచు నొరలుఁ బాతకులార
నలువున శ్రీహరి నామామృతమే
కొలఁది మీరఁ బేర్కొనరాదా

చ. 2: భవ పంకము లోపలఁ బడి ముణుఁగుచు
చవి దలఁచెడి దుర్జనులాల
భవరోగములకుఁ బండితుఁడవు మా
ధవుని నాత్మఁ జెందగఁరాదా

చ. 3: కడుఘోరపు మార్గంబున నలయుచు
వడినేఁగెడి తెరువరులాల
చెడని పదవొసఁగు శ్రీవేంకటపతిఁ
దడవి సుఖముల జెందఁగరాదా

రేకు: 9054-01 సామంతం సం: 04-567 కృష్ణ

పల్లవి: బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డఁ గన్నట్టివాడుఁ పిన్నవాడు

చ. 1: బిరుసైన దొకకొండ పెనుబాముతోఁ జుట్టి
బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు

చ. 2: బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోగూడ
పెడచేతనే వేసెఁ బిన్నవాఁడు
పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపె పిన్నవాఁడు

చ. 3: ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై
పెక్కురూపములైన పిన్నవాఁడు
ఇక్కడఁ దిరువేంకటేశుఁడై జగమెల్ల
పిక్కిటిల్లినవాడు పిన్నవాఁడు

రేకు: 9056-01 నాట సం: 04-568 సంస్కృత కీర్తనలు

పల్లవి: ఆది పురుషా అఖిలాంతరంగా
భూ దేవతా రమణ భోగీంద్ర శయనా

చ. 1: భవపాథోనిధి బాడబానల
భవజీమూత ప్రభంజనా
భవ పర్వత ప్రళయ భయద నిర్ఘాత దు
ర్భవ కాలకూటభవ బహువిశ్వరూప

చ. 2: భవఘోరతిమిరదుర్భవకాలమార్తాండ
భవభద్ర మాతంగ పంచానన
భవ కమలభవ మాధవరూప శేషాద్రి
భవన వేంకటనాథ భవరోగవైద్య

రేకు: 9058-01 సాళంగం సం: 04-569 దశావతారములు

పల్లవి: నీవు తురగముమీఁద నేర్పు మెరయ
వేవేలు రూపులై వెదచల్లితపుడు

చ. 1: పదిలముగ నిరువంకఁ బసిడి పింజల యంప
పొదల తరకసములొరపులు నెరపఁగా
గదయు శంఖంబు చక్రము ధనుః ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైనవపుడు

చ. 2: సొరిది శేషుని పెద్దచుట్టు పెనుఁగేవడము
సిరి దొలఁక నొకచేతఁ జిత్తగించి
దురమునకుఁ దొడవైన ధూమకేతువు చేత
ఇరవైనబల్లెమై యేచెనందవుడు

చ. 3: కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిఁట నిన్నుఁ దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువుమని
మెరుఁగుఁగుచకుంభముల మిసిమితో నపుడు

రేకు: 9058-02 మలహరిసం: 04-570 జోల

పల్లవి: నిద్దిరించీఁ బాలజలనిధివలెనే
ఒద్దిక శ్రీ రమణునికి నొత్తరే పాదములు

చ. 1: వేఁగుదాఁక జిత్తగించి విద్దెలెల్లనాదరించి
బాగుగాఁ గృపారసము పంచి పంచి
యేగతిఁ బవళించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని నూఁచరే వుయ్యాలను

చ. 2: వాలుగన్నుల రెప్పల వడదాఁకి తను తావి
చాలుకొన నూర్పుకలు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత
కాలము కన్నుల దిప్పీఁ గప్పరే దోమతెర

చ. 3: సరగున యోగనిద్ర చాలించి లోకమెల్ల
కరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁడాయె మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు

రేకు: 9066-01 శంకరాభరణం సం: 04-571 దశావతారములు

పల్లవి: దురితమృత్యువట దొంగలట
సిరివరుఁడట దయసేసీనా

చ. 1: మలయుచునె చేరిన మధుకైటభులను
సెల నెత్తురు వడిచినయట్ల
ఖలులఁ బిడిచి రక్తము వడిఁగ్రోలక
విలయాంతకుఁడట విడిచీనా

చ. 2: కారించి కనక కసిపుని నఖములఁ
జీరి కడుపు చించిన యతఁడు
ఈరసపసురల యెముకలు విరువక
వీరసింహుఁడట విడిచీనా

చ. 3: చెనకి దశముఖుని చేతులుఁ దలలును
చినికండలు గోసిన యతఁడు
ఘనుఁడట తిరువేంకటపతి దుష్టులు
తనువులఁ జెండక తడసీనా

రేకు: 9066-02 శ్రీరాగం సం: 04-572 ఇతర దేవతలు

పల్లవి: ఒక్కఁడవె లోకానకొడయడఁవు నీవె
దిక్కుగా నెవ్వరులేరు తిమ్మినాయఁడా

చ. 1: బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా
దొడ్డగాఁ బండఁగఁ జూచి దోసకారి మొండిదొర
దిడ్డిఁదీసి కొంటఁబోయ తిమ్మినాయఁడా

చ. 2: పాలకొల్ని చందిరెడ్డి పంటసేయఁ బొద్దులేక
గాలివీటి కాపుఁరానఁ గసుగందఁగా
కోలుపుచు దినమూ నీకొండమీఁది నాయకులు
తీలుపరచేరుగదే తిమ్మినాయఁడా

చ. 3: కామకొల్ని మారిరెడ్డి కనుచూపువారినెల్ల
కోమలపు చెలుపలు గోరు మొత్తఁగా
ప్రేమముతోఁ గేదారి పెరిగి పండిన పంట
తేమ రేఁగి ఊటువట్టె తిమ్మినాయఁడా

చ. 4: గుండుఁగంటి దేవిరెడ్డి కొలిచిన వండిపెట్టు
కుండఁ గాపరింటనింట కూడుమోయఁగా
పండిన బండ్లఁగొట్టి పంటలెల్ల నానాఁటి
తిండికొక్క కొలఁదాయ తిమ్మినాయఁడా

చ. 5: వెలిగొండ కాపిరెడ్డి వేఁకపు జీవనమెల్ల
తలమోఁచి తిరిపెమై తల్లడించఁగా
తెలిసి యాతనితో నొక్కటిగాఁగ నీగుట్టు
తెలిసె వేంకటగిరి తిమ్మినాయఁడా

రేకు: 9069-01 కన్నడగౌళ సం: 04-573 సంస్కృత కీర్తనలు

పల్లవి: త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన

చ. 1: కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమథన

చ. 2: మయా వా తవ మధురగతి
భయాదిక విభ్రాంతోహం
తయా విమలం దాతవ్యా
దయా సతతం ధరణీరమణ

చ. 3: ఘనం వా మమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనాద్భున వేంకటగిరిరమణ

రేకు: 9074-01 లలిత సం: 04-574 అధ్యాత్మ

పల్లవి: భవములు వీడఁగఁ బాలించి
చవి మరపెను మోక్షము తెరువు

చ. 1: కర్మకోట్లకు గడిచీటిచ్చెను
నిర్మలమతులకు నేఁడిపుడే
ధర్మమార్గమునఁ దడవి నడచుటకు
నర్మిలిఁ బుణ్యములందుటకు

చ. 2: ముంజేతద్దము మూలదాముగా
సంజీవని సరసత నొసఁగె
గొంజ సుకృతములు కుమ్మరించి హరి
రంజించెను సర్వజనులకు

చ. 3: పట్టముగట్టెను ప్రాణులకెల్లను
గట్టిగఁ దిరు వేంకట విభుఁడు
ఒట్టిన యాపదలూడఁదోలి జను
లిట్టే నిజసుఖమిచ్చుటకు

రేకు: 9074-02 ఆహిరి సం: 04-575 నామ సంకీర్తన

పల్లవి: నన్నునింత సేయుకంటె నవ్వులున్నవా పంట
మన్నుపైఁడిముద్దగాఁగ మన్నుపూసె నితఁడు

చ. 1: పంచమహాపాతకులఁ బరమపావనులఁగా
వించఁ బూనె నిందుకంటె విద్యలున్నవా
ఇంచుకంత హరినామమింతలోననె ముట్టు
పెంచు దెచ్చి మాణికపుబిల్ల సేసె నితఁడు

చ. 2: మాలవాని కష్టవిద్య మందవెట్టి బ్రహ్మవిద్య
పాలుసేసె నిందుకంటె బ్రతుకున్నదా
నాలుకందునున్న విష్ణునామమంత్రము చెప్పు
తోలుబిల్ల మాడకంటె దొడ్డసేసె నన్నును

చ. 3: కుక్క దెచ్చి గంగిగోవు కొదమగాఁగ భూమిలోన
ఒక్కమాట యింతసేయ నోపవచ్చునా
దిక్కులందు వేంకటేశు దివ్యనామము రోఁత
కక్కుఁగూటి నమృతజలధిఁ గావించె నన్నును

రేకు: 9074-03 భూపాళం సం: 04-576 ధనుర్మాసం

పల్లవి: ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయమలర భజింపరో మీ రిటు ధనుర్మాసముల విధులన్

చ. 1: వేగ నాలుగు ఘడియలనఁగా వేదవేద్యులు లేచి సరగున
నాగమోక్తవిధులను తమదేహానుగుణములుగా
వేగమున సంధ్యాదులొగిఁ గావించి విమలాంభోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడపక ధనుర్మాసముల విధులనె ఘనులు

చ. 2: పరగు చీనాంబరములను నతి పరిమళమ్ముల బుష్పముల కడు
వెరవుగా వేంకటపతి వేద్యసంగతుల అరుదుగా
ధూపముల బహుదీ పాదులను తాంబాలవిధులను
పరగఁ బూజింపుఁడు సమస్త ప్రభు ధ్రనుర్మాసమున విధుల ఘనులు

రేకు: 9074-04 మేచబౌళి సం: 04-577 కృష్ణ

పల్లవి: అచ్చపు రాల యమునలోపల
ఇచ్చగించి భుజియించితి కృష్ణ

చ. 1: ఊరుఁగాయలును నొద్దిక చద్దులు
నారగింపుచు నందరిలో
సారె బాలుల సరసాలతోడ
కోరి చవులు గొంటివి కృష్ణా

చ. 2: ఆకసంబున కాపుర ముఖ్యులు
నాకలోకపు నాందులును
కైకొని యజ్ఞకర్త యాతఁడని
జోకఁ గొనియాడఁ జొక్కితి కృష్ణా

చ. 3: పేయలు లేవు పిలువుఁడనుచు
కోయని నోరఁ గూఁతలను
మాయల బ్రహ్మము మతము మెచ్చుచు
చేయని మాయలు సేసితి కృష్ణా

రేకు: 9075-01 -- సం: 04-578 కృష్ణ

పల్లవి: ఈతఁడే హరుఁడు యీతఁడే యజుఁడు
ఈతనికి నీచేతలెంత ఘనమటుగాన

చ. 1: కడుఁ బెక్కు బ్రహ్మాండకటకములు సుడివడిన
కడుపలో నిడుకొన్న ఘనుఁడు
వెడలి పూతకిచంటివిషము దాఁగినయంత
వడిఁ దనకు నేమాయ వట్టిబూమెలు గాక

చ. 2: ఎల్లజలధులు మిగిలి యేకమై పబ్బినపు
డుల్లసిల్లుచు నీతఁడుండు
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి
బల్లిదుఁడవని నిన్నుఁ బరిణమింతురుగాన

చ. 3: తిరువేంకటేశ్వరుఁడు దేవదేవోత్తముఁడు
పరిపూర్ణుఁ డచ్యుతుఁ డభవుఁడు
శరణాగతుల రక్షసేయు వాడను మాఁటి
గురుతుగాఁ దలపోసి కొనియాడఁగా వలసె

రేకు: 9075-02 -- సం: 04-579 వైష్ణవ భక్తి

పల్లవి: నీ కథామృతము నా నిరత సేవన నాకు
చేకొనుట సకల సుఖ సేవనంబటుగాన

చ. 1: ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహుశాస్త్రమెల్లఁ జదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన

చ. 2: ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహితమార్గము
ఇదియె బహులోకహితభేషజము నాకు
ఇదియె వుపనిషద్వాక్యపద్ధతిగాన

చ. 3: ఇదియె దానఫలమియ్యఁ జాలును నాకు
ఇదియె తపవిరహిత కర్మము
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటుగాన

రేకు: 9079-01 దేశాక్షి సం: 04-580 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరుగల రెవ్వరికి
ఇవ్వల నవ్వల నితఁడేకాక

చ. 1: ముద్ద సేసినటు మొదలఁ గడుపులోఁ
బెద్దగాఁ దాఁ బెరుగునాఁడు
ఒద్దనెవ్వరుండిరొకరైనా
ఒద్దికైన బంధుఁడొకఁడేకాక

చ. 2: వరతఁ బోవునట్టి వడిసంసారపు
తెరలఁ దగిలి తాఁ దిరుగునాఁడు
వెరవకుమని భావించువారెవరు
తరితోడ నీతఁడె కాచుఁగాక

చ. 3: ఉడుకఁ బెట్టినట్టి వుడివోయిన నరకాల
నుడుకుచుఁ దానుండునాడు
తడవువారెవ్వరంతటఁ దన్ను
కడవేగ వేంకటపతిగాక

రేకు: 9080-01 ముఖారి సం: 04-581 వైరాగ్య చింత

పల్లవి: కనుఁగాక పుణ్యాలు కడఁబడెనా
తనువు లేదో చేతనము లేదో

చ. 1: మోసపోతిననేల మురుగ వగవనేల
చేసుఁగాక పుణ్యాలు చీమ దుమ్మెనా
దాసుఁడుఁగా దా లేఁడొ తలఁప శ్రీహరి లేఁడొ
వీసమంతగాలమైన విధిలేదో

చ. 2: తల్లడించి పడనేల దైవము దూరనేల
చెల్లఁబో నేఁడే పండి పొల్లవోయెనా
ఉల్లములో హరి లేఁడో ఒద్దికతోఁ దా లేఁడో
కొల్లలాడఁ బుణ్యములకోరిక లేదో

చ. 3: చచ్చి చచ్చి పుట్టనేల జముబారిఁ బడనేల
నొచ్చి నొచ్చి మరుచేత నొగులనేల
యిచ్చలేదొ తిరువేంకటేశుఁడొద్దనె లేఁడో
నిచ్చ నిచ్చఁ దనకింత నేరుపు లేదో

రేకు: 9080-02 పాడి సం: 04-582 పోలికలు

పల్లవి: కలుషపు చీకటి గలుగఁగను
వెలుగు లోకముల వెలసిన యట్లు

చ. 1: మునుకొని పాతకములు గలుగఁగఁబో
జనులకుఁ బుణ్యము చవులాయ
ఇనుము గలుగఁగా ఇందరి యెదిటికి
కనకము ప్రమోదకరమైనట్లు

చ. 2: జగములోపల విషముగ గలుగఁ బో
మిగులఁగ నమృతము మేలాయ
వగపు గలుగఁగా వడి సంతోషం
బగపడుటిందరి కబ్బురమాయ

చ. 3: బహుదైవంబుల ప్రపంచవిదులఁ బో
మహిమల శ్రీహరి మనసాయ
విహగ గమనుఁడగు వేంకటేశ్వరుడు
ఇహమియ్యఁగఁ బరమిచ్చినట్లు

రేకు: 9080-03 -- సం: 04-583 వైరాగ్య చింత

పల్లవి: ఓపనయ్యు వోపనయ్యు
ఓపనయ్యు యీా యొప్పులే తప్పులు

చ. 1: ఎక్కడికి నెక్కడ - యెక్కువే యెరవు
తక్కులే యీా మొక్కులు - తక్కువే దారణ

చ. 2: ఎవ్వరికి నెవ్వరో నవ్వులే నొవ్వులు
తవ్వలే యీారవ్వలు - చివ్వలే సిగ్గులు

చ. 3: బొంకులే పొందులు - కింకలే గిరులు
వేంకటవిభుఁడ నీ - జంకెలే జంపులు

రేకు: 9082-01 శంకరాభరణం సం: 04-584 వైరాగ్య చింత

పల్లవి: అధమునికి నను విధాయకులు విధియించరో
విధిలోనఁ గొంత దుర్విధి నెరపినాఁడ

చ. 1: పాతకుని పాపాలు పరిహరింపించరో
భూతంబులాల తోఁబుట్టులాల
యేతులకు హరి దలఁచి యిటువంటి యీ మేన
బూతుఁజేతలనె వొరపులు నెరపినాఁడ

చ. 2: పాపకర్మునికి భృగుపతనంబు చూపరో
తాపత్రయములాల తమ్ములాల
దీపించు హరి దలఁచి ధృతిలేక మరి మనో
వ్యాపారములు గొన్ని వడిఁ దలఁచినాఁడ

చ. 3: చంచలున కేది నిశ్చయవిధి విధించరో
పంచేంద్రియములాల బంధులాల
ఎంచనరుదగు వేంకటేశ్వరుఁ బొగడునోర
కాంచి యితరుల నాలికకుఁ జేర్చినాఁడ

రేకు: 9082-02 లలిత సం: 04-585 అధ్యాత్మ

పల్లవి: హితమిదియే కాకిఁక లేదు - మా
గతిఁ జెరి నీకృపె కలదిది యెల్లా

చ. 1: పాతకకోట్లం బాయునుపాయం
బేతరిఁ జూచిన నిఁక లేదు
చైతన్యాత్మక సకలేశ్వర నీ
చేతిదె ప్రాణుల జీవనమెల్లా

చ. 2: భవబంధంబులఁ బాయునుపాయం
బివల నవల మారికిఁక లేదు
ధ్రువవరదుఁడ కౌస్తుభధర నీకృప
చవిచేతివె మా సంపద లెల్ల

చ. 3: పరమ పదం బగపడు విభవము నీ
కరుణే కానిఁకఁ గడలేదు
తిరు వేంకటగిరి దేవుఁడ నీకే
భరము జంతువుల పనులివి యెల్లా

రేకు: 9082-03 గుండక్రియ సం: 04-586 వైరాగ్య చింత

పల్లవి: పాయమంట ముదిమంటా బహురూపము-యిఁక
నేయెడఁ గాచెదు మము నిందిరారమణ

చ. 1: అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
పన్నుకొని తిరిగేరు బహురూపాలు
ఎన్నిక దినములలో నెవ్వరికి నేమేమి గల
రిన్నిటికి నీవె నాకు నిందిరారమణ

చ. 2: చుట్టమంటా పక్కమంటా సుఖమంటా దుఃఖమంటా
పట్టులేక తెచ్చుకొన్న బహురూపము
వట్టివెతలఁ బడి వాడుదేరేము
ఎట్టు సేసినను జేయుమిందిరారమణ

చ. 3: తల్లులంటాఁ దండ్రులంటా తప్పులంటా నొప్పులంటా
బల్లిదులఁ జేయలేని బహురూపాలు
వెల్లిగొన్న కృపతోడి వేంకటేశుఁడ నాకు
నెల్లనాఁడు నీవే కలవిందిరారమణ

రేకు: 9084-01 దేవగాంధారి సం: 04-587 వైరాగ్య చింత

పల్లవి: ఈజీవునకు నేది గడపల తనకు
నేజాతియును లేక యిట్లున్నవాఁడు

చ. 1: బహుదేహ కవచములఁ బారవేసినవాఁడు
బహుస్వతంత్రముల నాపద నొందినాఁడు
బహుకాలముల మింగి పరవశంబైనాఁడు
బహుయోనికూపములఁ బడి వెడలినాఁడు

చ. 2: పెక్కుబాసలు నేర్చి పెంపు మిగిలినవాఁడు
పెక్కు నామములచే బిలువఁబడినాఁడు
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ
పెక్కులాగులఁ బెనఁగి బెండుపడినాఁడు

చ. 3: ఉండనెన్నఁడుఁ దనకు ఊరటెన్నఁడు లేక
యెండలకు నీడలకు యెడతాఁకినాఁడు
కొండలలో నెలకొన్న కోనేటిరాయని
యండ చేరెదననుచు నాసపడినాఁడు

రేకు: 9084-02 వరాళి సం: 04-588 వేంకటగానం

పల్లవి: దిక్కులేకపోయే నిట్టే దినదినము
వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వఁడో

చ. 1: గుత్తముగ నెల్లవారు కుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టుకొని బయటవేసిన
మెత్తనిదంటాఁ బట్టు మింగె నెవ్వఁడో

చ. 2: బంతిగాఁగ నెల్లవాఁరు పండేటిమంచము
గుంతలో విరుగఁదోసె గూళఁడెవ్వఁడో
దొంతుల కడవలోన తొరలి దాఁచిన పెద్ద
పొంతకూటికుండఁ గొంటఁ బోయెనెవ్వఁడో

చ. 3: సారిది సంతలలోని సుద్దులెల్ల విని విని
విరసములెల్లఁ బాపే విభుఁడెవ్వఁడో
తిరువేంకటగిరి దేవుఁడై యిందరికిఁ
గరుణ లోకము గాచే ఘనుఁడెవ్వఁడో

రేకు: 9084-03 దేశాక్షి సం: 04-589 వేంకటగానం

పల్లవి: కంటి నఖిలాండ కర్త నధికుని గంటి

కంటి నఘములు వీడుకొంటి - నిజమూర్తిఁ గంటి

చ. 1: మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి

బహువిభవముల మంటపములు గంటి

సహజ నవ రత్న కాంచన వేదికలు గంటి

రహి వహించిన గోపురంబులవె కంటి

చ. 2: పావనంబైన పాప వినాశనము గంటి

కైవశంబగు గగన గంగ గంటి

దైవికపుఁ బుణ్య తీర్థములెల్లఁ బొడగంటి

కోవిదులు గొనియాడు కోనేరిఁ గంటి

చ. 3: పరమ యోగీంద్రులకు భావగోచరమైన

సరిలేని పాదాంబుజములు గంటి

తిరమైన గిరి చూపు దివ్యహస్తము గంటి

తిరు వేంకటాచలాధిపుఁ జూడఁగంటి

రేకు: 9086-01 దేసాళం సం: 04-590 వైరాగ్య చింత

పల్లవి: ఎన్నాళ్ళున్నా నిట్టె కదా
విన్నని వెరగులె వేఁడుకలాయ

చ. 1: భువి నెట్టుల్లాఁ బోయేదే కా
చవులకుఁ జవియగు శరీరము
ధ్రువమని యీా సుఖదుఃఖ రోగములు
భవముల కిదియే బందములాయ

చ. 2: ఎంత వొరలినా నిదే తాఁగద
కంతల కంతల కాయమిది
బొంత దగులుచుక పొరలఁగఁ బొరలఁగ
సంతకూటములె సరములాయ

చ. 3: కైపుసేసినా ఘనమౌనే కా
పాపముఁ బుణ్యముఁ బైపైనే
యీా పుట్టుగునకు ఈ వెంకటపతి
దీపించఁగఁ బెనుఁదెరువొకటాయ

రేకు: 9086-02 ఆహరి సం: 04-591 వైష్ణవ భక్తి

పల్లవి: కలియుగంబునకుఁ గలదిదియే
వెలసిన పంచమవేదమె కలిగె

చ. 1: బోధల హరినుతి పాడమెను శూద్ర
స్సాధని కలిదోషము మాన్ప
రాధా మాధవ రచన సకలజన
సాధువేదమే జగమునఁ గలిగె

చ. 2: పరమగు వేదము బహుళము చదివియు
హరి నెరిఁగిన వారరుదనుచు
తిరువాముడియై దివ్యమంత్రమై
వెలసిన పంచమ వేదమె కలిగె

చ. 3: బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకె దీరదెచ్చట ననుచు
సంకీర్తనమే సకలలోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె

రేకు: 9087-01 శ్రీరాగం సం: 04-592 వేంకటగానం

పల్లవి: కత్తరాలు చిమ్ముచుండెఁ గదలుచుండె
చిత్తజ జనకుఁడైన శ్రీ మూరితి

చ. 1: కన్నులఁ జొక్కుచునుండె కంపితము మీఁటుచుండె
సన్నపు సొలపు నిగ్గు సళుపుచుండె
అన్నువ నడిమి యింతి నక్కున నొత్తుచునుండె
ఉన్నతిఁ గోనేటిదరినున్న మూరితి

చ. 2: మేసులు ముట్టుచునుండె మేడమీఁద నిలుచుండె
కీసిన గోక గిలిగింపుచునుండె
నేసకొప్పురమణికి చెక్కులు నొక్కుచునుండె
తీసిన లంఘితముల దివ్యమూరితి

చ. 3: కిలకిల నవ్వుచుండె కిన్నెర వట్టుచునుండె
పలుమెరుఁగులు దోఁప బాడుచుండె
అలమేలుమంగమీఁద నలరి యొరగి యుండె
వెలయ వేంకటగిరి వేదమూరితి

రేకు: 9105-01 ముఖారి సం: 04-593 వైష్ణవ భక్తి

పల్లవి: మొక్కరో మీరు మోసపోక - మీకు
దిక్కుదెసైన ఆదిదేవునికి

చ. 1: మారుచేతులీయవద్దు మారుగాళ్ళీయవద్దు
బీరాన గుండెలు గోసి పెట్టవద్దు
గోరపడి చిచ్చులోన కొండాలు చొఱవద్దు
ఊరకే మీవారమని వున్నఁ జాలు

చ. 2: సిడిదలలియ్యవద్దు జీవాలఁ జంపవద్దు
బడి బడి పగ్గాలఁ బారవద్దు
సిడిమీఁద బిత్తరప బిమ్ములు చిమ్మఁగవద్దు
కడనుం.............................. దారి గన్నఁ జాలు

చ. 3: బగ్గన యెక్కడ డొక్కపడునో యేమరవద్దు
బగ్గివడ్డ యమబాధఁ బడవద్దు
ఎగ్గు సిగ్గులేక వేంకటేశుని దాసులఁజేరి
అగ్గలపు పాదరేణువైనఁ జాలు

రేకు: 9106-01 శ్రీరాగం సం: 04-594 వైరాగ్య చింత

పల్లవి: ఎవ్వరిఁ దలఁపఁడు ఎవ్వరి నొల్లఁడు
నవ్వుల తెరువులె నడచీఁ బ్రాణి

చ. 1: కలుషముఁ బుణ్యము కర్మపుఁ జేనను
వెలయఁగ జీవుఁడు విత్తుచును
కలిగిన సుఖదుఃఖములను గాదెల
కొలుచులు నించుక కుడిచీఁ బ్రాణి

చ. 2: చెడని ప్రపంచము శెశెదిదిలో
నిడుపు గురుచలుగ నేసినది
వడి దేహములను వన్నెల వన్నెల
గడనల చీరలె కట్టీఁ బ్రాణి

చ. 3: కూరిమిఁ గామక్రోధాదులు మతి
చూరలఁ గొనియెడి చుట్టములే
గారవముల వేంకటపతిఁ గొలువక
చేరి కాఁపురము సేసీఁ బ్రాణి

రేకు: 9108-01 ధన్నాసి సం: 04-595 విష్ణు కీర్తనం

పల్లవి: ఏలయ్యు పరమాత్మ యేలికవు మాకునై నాలినే పెట్టితివి నాడూను
కాలునికి మమ్ము సరిగాఁపులే కమ్మనుచు నేలనే తిప్పేవు నేఁడూను

చ. 1: భారమగు నీటిలోఁ బవళించి నీ వాది నారాయణుఁడవైతి నాఁడూను
పైరుగా నిందరిని ప్రకృతి లోపలఁదెచ్చి నారుగాఁ బోసితివి నాఁడూను
నారు పేరిడి తండ్రి నందనుని బిలవఁ గరుణారసము నించితివి నాఁడూను
చేరి కడు మమ్ము రక్షింపనోపక వట్టి నేరములె యెన్నేవు నేఁడూను

చ. 2: దట్టముగఁ జొచ్చి యిందరిదేహములలోన నట్టనడుమెక్కితివి నాఁడూను
అట్టలుగ బ్రహ్మాండమవియించి జంతువుల నట్టేట ముంచితివి నాఁడూను
ఒట్టి యిందరికి సరయూదరిని మోక్షంబు నట్టు కొట్టితి గొంత నాఁడూను
పొట్ట పొరుగునఁ దెచ్చి భూతముల మెడగట్టి నిట్టి పిడినేచేవు నేఁడూను

చ. 3: పొలువుగా మమ్మిట్లఁ బుట్టించుకొరకునే నలిన నాభుఁడవైతి నాఁడూను
పలువేలుపులకెల్ల పదవులిన్నియు నొసగి నలుగడల నునిచితివి నాఁడూను
చలముకొని దానవులఁ జక్కాడి దేవతల నలఁకువలు దీర్చితివి నాఁడూను
చెలఁగి యిందరిఁగావ శ్రీ వేంకటాద్రిపై నెలకొనిటు నిలిచితివి నేఁడూను

రేకు: 9108-02 సామంతం సం: 04-596 వైరాగ్య చింత

పల్లవి: గద్దరి జీవుఁడు కామధేనువు మాని
యెద్దుఁ బిదుకఁ జొచ్చె నేది దెరఁగు

చ. 1: మటమాయములఁ దనమనసె చంచలమంది
ఇటునటుఁ దిరిగిన నేది దెరఁగు
కటకట వూరేలు కర్తే దొంగలఁగూడి
యెటువలెఁ జేసిన నేదిదెరఁగు

చ. 2: కల్లలాడఁగఁ జొచ్చెఁ గలుషపుమతి సత్య
మిల్లు వెడలగొట్టె నేదిదెరఁగు
చెల్లఁబో నోరే చేఁదుమేయఁగఁ జొచ్చె
నెల్లవారికి నింక నేదిదెరఁగు

చ. 3: తియ్యని వెంకటాధిపుఁ బాసి పరసేవ
కియ్యకొనెడిఁ జిత్తమేది దెరఁగు
అయ్యొ చక్కనిపతి నాలు విడిచిపోయి
యెయ్యెడఁ దిరిగిన నేదిదెరఁగు

రేకు: 9108-03 భూపాళం సం: 04-597 నామ సంకీర్తన

పల్లవి: నందకధర నందగోపనందన
కందర్పజనక కరుణాత్మ

చ. 1: ముకుంద కేశవ మురహర
సకలాధిప పరమేశ్వర దేవేశ
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకటవిభవ నమో పరమాత్మ

చ. 2: ధ్రువ పాంచాలీ స్తుతివత్సల మా
ధవ మధుసూదన ధరణిధరా
భువనత్రయ పరిపోషణ తత్పర
నవనీతప్రియ నాదాత్మ

చ. 3: శ్రీమన్ వేంకటశిఖరనివాస మ
హమహిమన్ నిఖిలాండపతే
కామితఫలభోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మన్

రేకు: 9111-01 ముఖారి సం: 04-598 హనుమ

పల్లవి: నెరబిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగనమదివో నీ బంటు

చ. 1: ముంచిన చుక్కలు మొలపూసలుగాఁ
బెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవఁగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు

చ. 2: గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు

చ. 3: ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
కమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు

రేకు: 9116-01 ముఖారి సం: 04-599 గురు వందన, నృసింహ

పల్లవి: నేర్పుకంటెఁ బెన్నిధి గద్దా
ఓర్పుకంటె సుఖమొకటిఁక గద్దా

చ. 1: కరుణకు నెక్కుడు గతి యిఁకఁ గద్దా
సరసతకెక్కుడు సరి గద్దా
గురుమతిఁ జత్తము కూరిమి నిలిపిన
వెరవుకంటె విధమిక గద్దా

చ. 2: కలిమి కంటెఁ జీఁకటి మరి కద్దా
బలిమికంటె నాపద గద్దా
గెలుప (గఁ) దెలిసి లంకించిన మతితోఁ
జెలఁగుకంటె నిజసిరి యిఁకఁ గద్దా

చ. 3: పోయముకంటె నపాయము గద్దా
కాయపు రోఁతకుఁ గడ గద్దా
పాయక వేంకటపతి కృప గోరిన
యీయభిమతమున కెదురిఁకఁ గద్దా

రేకు: 9116-02 సామంతం సం: 04-600 వేంకటగానం

పల్లవి: మునుకలుగఁ బిలిచీ మూఁడు లోకాలు
ధనము బందెలచేతఁ దగనందుకొనుచు

చ. 1: పరుసవారిఁ బిలువ బడిబడిఁ బారితెంచి
ఒరసు దైవాల మిండఁడూళ్ళ వెంట
సిరసు పంచెముపాగఁ జెరిగిన చుంగులతో
గరుసుమీరిన యీవిఁ గప్పములు గొనుచు

చ. 2: లాట భోట కుకుర మరాట దేశాల ఘనుల
కూటువలు గూడించి కోట్లసంఖ్య
పేటలుఁ బేటలు పెనుఁగూటములుగాఁ దెచ్చి
చాటువైన వరములు చల్లువెదలాడుచు

చ. 3: గక్కన నెదురువచ్చి కనిపించుకొను వాఁడె
వెక్కసపు మహిమల వేంకటేశుఁడు
పక్కల వనములెల్లఁ బసిఁడిగాదెల నించి
మొక్కులు గైకొని వరములు గోకొండనుచు

రేకు: 9116-03 శ్రీరాగం సం: 04-601 విష్ణు కీర్తనం

పల్లవి: ఇందిరకు నురము మీఁదిచ్చిన నాఁడు
విందువలె హరి యిందు విచ్చేసె నాఁడు

చ. 1: పరమపదమునందు బహుదివ్యవరణాలు
హరి గరిమలు పొలువలరు నాఁడు
గరుడఁడు నసంతుఁడుఁ గదిసి సేనేశుఁడు
హరి నిత్యసేవకులై రిందు నాఁడు

చ. 2: పాల జలధిలోనఁ బవళించి హరి వచ్చి
భూ లోకమింతయుఁ జూచి పొగడునాఁడు
పాలించి నేలయు మిన్ను బహు దివ్య దేశాలు
గాలించి కోనేటిదరి గైగొంట నాఁడు

చ. 3: నరసురోరగులెల్ల నలుపంకఁ గొలువంగ
పురవైన వేడుకలఁ బొదలునాఁడు
విరజానదియుఁ దాను వేంకటపతి వచ్చి
పరమపద మిదని పాలించె నాఁడు

రేకు: 9116-04 దేవగాంధారి సం: 04-602 అంత్యప్రాస

పల్లవి: కలిగినమతి వృథ గాకుండా
అలరుటె పుణ్యంబగు ఫలము

చ. 1: ఒనరిన యీ భవము సురనకుండ
ఘనుఁడీ జీవుఁడు గలఫము
తనువు మోచి చైతన్యాత్ముని మతిఁ
గనుటె వివేకముగల ఫలము

చ. 2: చేసిన పుణ్యము చెడిపోకుండ
శ్రీ సంపద మెరసిన ఫలము
ఈసుల రేసుల యితర దూషణలఁ
బాసుటె అపురూపపు ఫలము

చ. 3: హరిఁ గొలిచియు మిథ్య గాకుండ
విరసముడిగి చదివిన ఫలము
తిరు వేంకటగిరి దేవుని సరిగా
పరులఁ గొలువనిదె బహు ఫలము

రేకు: 9117-01 పాడి సం: 04-603 సంస్కృత కీర్తనలు

పల్లవి: పృథుల హేమ కౌపీనధరః
ప్రథితవటుర్మే బలం పాతు

చ. 1: సూపాసక్తః శుచి స్సులభః
కోప విదూరః కులాధికః
పాప భంజనః పరాత్పరోయం
గోపాలో మే గుణం పాతు

చ. 2: తరుణః ఛత్రీ దండకమండలు
ధరః పవిత్రీ దయాపరః
సురాణాం సంస్తుతి మనోహరః
స్థిరస్సుధీర్మే ధృతిం పాతు

చ. 3: త్రి విక్రమః శ్రీ తిరు వేంకట గిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమల మసృణ కబళప్రియో మే
దివా నిశాయాం ధియం పాతు

రేకు: 9117-02 కేదారగౌళ సం: 04-604 మనసా

పల్లవి: నారాయణుని శ్రీ నామమిది
కోరినవిచ్చీఁ గోవో మనసా

చ. 1: శుక వరదుని సొంపుగఁ దలఁచుటె
సకల భవ విజయము
అకలంకము మహా భయ హరణ
మొకటి నొకటి వోహో మనసా

చ. 2: పక్షిగమన శుభము దలఁచుటే
అభయభోగ విహారమ్ము
వక్షపు లక్ష్మీవరుసే సిరులు
లక్షలు గోట్లొల్లవొ మనసా

చ. 3: ఇంకా నీతలఁపులెన్ని గలిగిన
వేంకటాధిపు సేవించఁగదో
అంకెలకిన్నియునైన యీా
మంకపు గాక నమ్మవో మనసా

రేకు: 9117-03 శ్రీరాగం సం: 04-605 తిరుపతి క్షేత్రం

పల్లవి: పొల్లమెల్లఁ దిరిగిన బోడెద్దు
గరిమెలో తో నెవ్వరికి దగ్గరి రాని యెద్దు

చ. 1: పురములు సాధించ బూనినప్పుడు భూమి
భరమెత్తి నిలచిన బండెద్దు
పరివోని మందల పసులఁ బోఁదోలి శ్రీ
వరుఁడై రోలఁ గట్టువడినెద్దు

చ. 2: ఒడలెత్తి నాలుగుయుగముల బడిఁ
బడి ధర్మదేవతై పరగినెద్దు
తడవి దేవరలను దామెర లను గట్టఁ
గడఁగి మానిసిరూపు కపిలెద్దు

చ. 3: గోవైన భూదేవి గూరిమిఁ జేకొని
లావైన వృషభాచలపు టెద్దు
మోపఁగ వేదాలు మొల్లమై సిరితోడ
శ్రీ వేంకటాద్రి మించిన మాయలెద్దు

రేకు: 9117-04 లలిత సం: 04-606 దేవుడు-జీవుడు

పల్లవి: అన్నిటాఁ దాము నతిశయులే
యెన్నఁగ నధికులె యెసఁగఁగను

చ. 1: పరంపరలగు భవములఁ బొడమియు
చిరంతనుసే జీవులిదే
ధురంధరులే దురిత సుకృతముల
జరామరణ విశారదులే

చ. 2: సదా బహుల విషయమత్తులయ్యు
మదాతురులే మనుజులిదే
ముదాసక్తులే మోహవిదూరులే
చిదానందులే చిరయశులే

చ. 3: భృశం సుఖులే పుణ్యులందరు
సుశాంతాత్మలే శుభమతులే
విశారదులే వేంకటరమణుని
వశంవదులే వరిష్ఠులే

రేకు: 9117-05 రామక్రియ సం: 04-607 కృష్ణ

పల్లవి: ఓయమ్మ యెట్టుసేసె నొకటొకటే
మాయలెల్లఁ జేసినాఁడు మరియింకనెట్టో

చ. 1: చన్నుదాగి పూతనను సగ్గుడుగాఁ జప్పరించె
మిన్నుదాఁకె సుడిగాలి మెడ దొక్కెను
వెన్న ముచ్చిరిం చి గొల్లవెలఁదులనెల్ల మెచ్చి
పిన్ననాఁడె యింతసేసెఁ బెద్దయైన నెట్టో

చ. 2: మద్దిమాఁకులు విరిచె మామయింటికేఁగి పెద్ద
యెద్దులఁ బీఁచమణఁచె నేమి చెప్పరు
చద్దికూటి ముద్దలోనె జలజాసనుని మాయ
వద్దనక పతిసేసె వాఁడివో నేడెట్టో

చ. 3: కొండవంటి పామునోరు కొచ్చి కొచ్చి చంపి చంపి
మెండుకొని వుక్కణంచె మేనమామను
కొండల వేంకటపతి కోనేటిరాయఁడు
నిండు కృప మముఁ గాచేనేరుపిఁక నెట్టో

రేకు: 9121-01 ఆహిరి సం: 04-608 అంత్యప్రాస

పల్లవి: కటకటా మీరితివి కలికాలమా - పుణ్య
ఘటన గరవై పోయెఁ గలికాలమా

చ. 1: భూసురుల కామినులు బోయల నామి కులఁ
జేసుకొని యీాండ్లై చిచ్చురికిరి
యీాసునను నీవలన నెక్కువకులములెల్ల
కాసు సేయకపోయె గలికాలమా

చ. 2: అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి
వన్నె సెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితిని యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా

చ. 3: అరుదగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు
దొరలకమ్ముడు వోయి తొత్తులైరి
చిరకాల సుకృ.త్తమునఁ గొంతైన
కరుణ మార్పితివిగా కలికాలమా

చ. 4: కోవిదుల మను దొరల కులరాణి వాసములు
త్రోవలనె లంజలై తుదిమీరిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబు
గావు వట్టితివిగా కలికాలమా

చ. 5: పట్టభద్రుల నతులు పలుమారు నింద
................రిపెంబులై దీనులైరి
దిట్టైనఁ దిరువేంకటేశుదాసులు నిన్నుఁ
గట్టవేతురు సుమీ కలికాలమా

రేకు: 0001-1 శ్రీరాగం సం: 05-001

పల్లవి: ఏ వూరికేవూరు యెక్కడికి నెక్కడ
నీవు మాకు నిఁకనేల నిజమైనాఁ జెప్పరా

చ. 1: ఆద్దమరాతిరిదాఁకా నందునిందు నుండివచ్చి
వద్దువోరా నీకునింత వలసినొల్లములు
నిద్దుర గంటికి లేక నీకునుండ వారమా
వొద్దిక చాలని వారముండినా నుండితిమి

చ. 2: వేఁకమైన పరితాప వేదనఁ బొరలలేక
కాఁక పుట్టి తిరిగేవు కన్నుగానలేక
యేఁకట దీర నీకు నెందరు గలరని
వోఁకల పులుసు కలువులఁ బుచ్చవలెనా

చ. 3: అందఁగాఁడ తిరువేంకటాద్రీశ పెక్కిండ్ల-
విందవై నీవొకతెపై వెచ్చఁదన మున్నాదా
మందెమేళము నీతో మాటలాడితిమి గాక
కందువ మన్నన చాలు కలకాల మెల్లను

రేకు: 0001-2 భైరవి సం: 05-002

పల్లవి: గందము వూసేవేలే కమ్మని మేన యీ-
గందము నీమేనితావికంటె నెక్కుడా

చ. 1: అద్దము చూచేవేలే అప్పటపట్టికిని
అద్దము నీ మోముకంటె నపురూపమా
ఒద్దిక తామరవిరినొత్తేవు కన్నులు నీ-
గద్దరికన్నులకంటె కమలము ఘనమా

చ. 2: బంగారు వెట్టేవేలే పడఁతి నీ మెయినిండా
బంగారు నీతనుకాంతి ప్రతివచ్చీనా
ఉంగరాలేఁటికినే వొడికిపువేళ్ళ
వెంగలిమణులు నీ వేలిగోరఁబోలునా

చ. 3: సవర మేఁటికినే జడియు నీ నెరులకు
సవరము నీకొప్పుసరి వచ్చీనా
యివలఁ జవుల నీకునేలే వెంకటపతి -
సవరని కెమ్మో విచవికంటేనా

రేకు: 0001-3 ఆహిరి సం: 05-003

పల్లవి: దంటమాటలనె నన్నుఁదాఁకనాడేవు వోరి
జుంటితేనె తీపులెల్లఁ జూరలాడేవా

చ. 1: అత్తయింటికోడల నన్నుమ్మమీఁద నేరా నీ-
తొత్తుఁ దిట్టినట్టె తిట్ల దొరకొంటివి
మెత్తనైతే దిగఁబడి మేరమీరి యింతలోనే
ఒత్తుక వచ్చేవు చక్కనుండ నేరవా

చ. 2: పంతపు మగఁడు గల పడఁతి నన్ను నేరా నీవు
కొంతైనా వెఱపులేక గోరనంటేవు
ఇంతలోనే వేలువెట్టి యిమ్ముగైకొని వలపు
దొంతులు వేరిచేవు బడుకనియ్యవా

చ. 3: ఊరివారి యింతి నన్ను వుద్దండపుఁ దుటారాలఁ
బేరుకుచ్చి సోలయుచుఁ బిసాళించేవు
గారవించి తిరువేంకటరాయ నీవు నన్ను
యేరా నాగుట్టంతయు బాయిట వేసేవా

రేకు: 0001-4 ఆహిరి సం: 05-004

పల్లవి: సంగతెఱిగవు చీ జాణనందువు
మంగలాన జాజులు వేమారు వేఁచేవు

చ. 1: అంగన వొకతె నీకు ఆకు మడి చియ్యఁగా
బంగారుతూఁగు మంచముపై నీవుండి
వుంగరాల వేళ్ళతో నువిదమొలనూళ్ళ
చెంగటఁ జాచిన ఆచేత నన్నంటేవు

చ. 2: పడఁతి వొక్కతె నీకు పాదములొత్తఁగను
బడలి కప్పురశయ్యపై నీవుండి
కడుఁ దమకమున నెక్కడో మోవఁ జాఁచిన
పడిగపుఁ బాదాలు నాపైఁ బారఁజాఁచేవు

చ. 3: ఇచ్చల నొక్కతె గుబ్బలెదురు చూపఁగను
పచ్చలు దాచిన మేడపై నీవుండి
వెచ్చని మేనితోఁ గూడి వేంకటేఁశుడ నీ
వెచ్చపుఁ గౌఁగిట నన్ను వేసాలఁ బెట్టేవు

రేకు: 0001-5 కాంబోది సం:05-005

పల్లవి: రాకుంటే మానుఁగాక రంతులేఁటికే
వేఁకపు గుబ్బలాండ్ల విటుఁడాఁతఁడు

చ. 1: అంపిన కప్పురమొల్ల నంటేఁ దాననుఁ గాక
వంపు మోముతోడ నీకు వాడనేఁటికే
చెంపల లప్పులు నిండఁ జెరిగిన కప్పురపు -
గంపకొప్పుల సతుల ఘనుఁడాతడు

చ. 2: ఒద్దికగాకక్కడనే వుంటే దానుండుఁ గాక
ముద్దుమోము వంచి నీకు మొక్కనేఁటికే
చద్దికి వేఁడికి మంచిచక్క సతుల మోవి
పొద్దునొద్దుకారగించే భోగి యాతఁడు

చ. 3: అబ్బురపు వేంకటేశుఁడైతే దానవుఁ గాక
గబ్బి చూపులెల్లా నీకై గప్పనేఁటికే
జొబ్బిలేటి జవ్వాదిసోనల పన్నీట నన్ను
గుబ్బలంటి సరసానఁ గూడెనాతఁడు

రేకు: 0002-1 శ్రీరాగం సం: 05-006

పల్లవి: తగిలిన మునులే యాతనిఁ గందురంటా
మగువ యెవ్వరితోడ మాటాడదిపుడు

చ. 1: అతులనిరాహారులతనికిఁ బ్రియులంటా
అతివ నిన్నటినుండి యారగించదు
తతి నడవులనుండే తపసులే యతనికి
హితులంటా వనములో నెడయదీతరుణి

చ. 2: తలకొన్న యతనిపై తలపే పరమంటా
చెలియ చెక్కిటనున్న చెయి దియ్యదు
వలనైన యతఁడు దేవతల కొడయఁడంటా
కలికి రేయిఁబగలు కనుముయ్యదిపుడు

చ. 3: అడరి జలములోన నతఁడుండునంటా
వడియుఁ జెమట దుడువదు మేనను
కడు మంచియతఁడు వేంకటగిరిభుఁడంటా
పడఁతి యాతనినె గుబ్బలనొత్తీ నిపుడు

రేకు: 0002-2 ముఖారి సం: 05-007

పల్లవి: ఏఁటికి విచ్చేసితివో యెట్టుదెలుసు మాతో
మాటలాడఁగా నీకు మాటవచ్చీఁ జుమ్మీ

చ. 1: అప్పన గొంటివో లేదొ ఆకెచేత నేఁడైనా
ఇప్పుడే మాయింటిదాఁక నేఁగేనంటా
యిప్పటి యీతమకాన యింతలోని పనికిఁగా
చెప్పక వచ్చిననాకె చేరనీదు సుమ్మీ

చ. 2: అనుచరించితో లేదో ఆకెనో ముందరనైనా
వెనక నాతోడ నవ్వేవు గాని
ఘనుఁడు వూరకే నన్నుఁ గదిసేవు కడుఁబై-
కొనఁగ నాకె విన్న కోపగించుఁ జుమ్మీ

చ. 3: ఆరగించితో లేదో ఆకెపొత్తుననే యింత
గారవము లేక మోము కళదేరదు
చేరి కూడితివి నన్ను శ్రీ వేంకటేశుఁడ యింత-
యీరసాన నాకె విన్న యేమనునో సుమ్మీ

రేకు: 0002-3 ఆహిరి సం: 05-008

పల్లవి: కోపములిద్దరిలో గోరగించీఁ జూడరే
పైపైనె జవరాలు పంపెడి నింతులను

చ. 1: అమ్మ విలువఁగనంపె నాతని రమ్మనరే
దిమ్మరై వీదులవెంట దిరిగీనని
కమ్మరఁ గమ్మరనేల కలహమిద్దరిలో
దుమ్ములుగాఁ గస్తూరి ధూళి లేచె మేనులు

చ. 2: దేవులమ్మ నిలిచీన దేవుని రమ్మనరే
ఆవలనెవ్వతెకు లోనాయెనో యని
తావుల బుగులడిచి తను వెల్లానిదివో
లావాయ జగడాలు లలనకుఁ దనకు

చ. 3: లకిమమ్మ కేమైనా లంచము లిమ్మనరో
శుకవాణి తలపు మూసుక తియ్యదు
వెకలియై సతిఁగూడె వేంకటేశ్వరుఁడు
ఒకరొకరికి లోలో నొద్దికలు ఘనము

రేకు: 0002-4 ముఖారి సం: 05-009

పల్లవి: ఆతఁడే యెఱఁగడా ఆకెలాగు
రాతి గుండెతోడఁ దా రాకుంటే మాననీ

చ. 1: అద్దో నేమెందాఁకానైనాఁ గాచుకుండలేము
వొద్దనే యెంతవడైనా నోసి రావే
అద్దికపువారము నేమమ్మ గడుఁ గోపగించీ
వొద్దువోయ రాకుంటేఁ బోనీవే తాను

చ. 2: అంతేవో మదిరాక్షి యాడ మాకెదురు చూచీ
ఏంతైనా గద్దుపని యీడనేలోసి
వొంత నూడిగము సేసే పొద్దాయ దేవులకు
కాంతుఁడు మీఁదటియెత్తు గననీవే తాను

చ. 3: మేలే వేంకటపతి మెల్లనే విచ్చేసినాఁడు
వేళమె అక్కకు విన్నవింతమోసి
అలకించి వుండుదము అందరము వాకిటను
లోలోఁ దానాకెఁ గూడి లోలుఁడాయఁ దాను

రేకు: 0002-5 ఆహిరి సం: 05-010

పల్లవి: ఇంత మమ్మిట్లా నెలయించకురా నీ
పంతములన్నియు బార బట్టింతునోరి

చ. 1: అతిరాజసపు మాటలాడకురా యే-
కతమైన నాచేతఁ గడు నొత్తువోరి
ఇతరులవలె నన్ను నెంచకురా నీఁ
మతి చొచ్చి నీమేను మఱపింతునోరి

చ. 2: చెలఁగుచు గుంపెనలు సేయకురా నీ-
సిలుగు మాటల నిన్నుఁ జిక్కింతునోరి
చలివలపులు మాపైఁ జల్లకురా యీ-
కులుకు గోళ్ళ నిన్ను గుంపింతు -నోరి

చ. 3: జంకెనచూపులఁ బగ చాటకురా నే-
నింక నిన్నుఁ బోనియ్య నెంతైన నోరి
లంకెల నీ పొందులు దలఁచకురా తిరు-
వెంకటేశ నానేరుపు వెచ్చింతునోరి

రేకు: 0002-6 సామంతం సం: 05-011

పల్లవి: ఇచ్చకాలు నాకు నీకు నిఁక నేలరా నీ-
యచ్చపుఁ గోరిక నాతో నానతీరా వోరి

చ. 1: అమ్మితి నామేను నీకు నప్పుడె వోరి చూపుఁ-
జిమ్ముల నేఁచకేమైనాఁ జిత్తగించరా
అమ్మకచెల్ల నే నీకు నడ్డమా వోరి యింపు
గుమ్మరింపుచు నాగుట్టు కొల్లగొంటివోరి

చ. 2: జట్టి గొంటివిదె నన్ను జాలదా వోరి యీ-
చిట్టుంట్ల నీవేఁచక చిత్తగించరా
ఎట్టైనా నేనీకింత యెదురా వోరి నీ-
పట్టిన చలమే చెల్లె బాపురా వోరి

చ. 3: వేసాల వేంకటగిరివిభుఁడా నేఁడోరి నీ-
సేసిన మన్ననలిట్టె చిత్తగించరా
వాసన కస్తూరిమేని వన్నెకాఁడ నీ-
యాసల మేకులే దక్కెనద్దిరా వోరి

రేకు: 0003-1 శ్రీరాగం సం: 05-012

పల్లవి: మగువ పూర్పులనైన మనుఁగా చలిగాలి
నిగుడుఁగా జగమెల్ల నిండఁ దనరూపు

చ. 1: అతివవదనము వాడ నలరి చందురుఁడైన
బ్రతుకుఁగా వొకకొంత బయలుమెరసి
సతి యెలుఁగు రాయ విరసపు బికావళియైన
తతిఁ జెలఁగుఁగా నేడు తమకెదురు లేక

చ. 2: తెఱవ వేనలి చెదర తేఁటి మొత్తములైన
మెఱయుఁగా వొకకొంత మేలుగలిగి
ఒఱగి యలసతతోడ నువిద కనుమోడ్పుగా
నెఱిఁ గలువలలరుఁగా నేఁటిమాపైన

చ. 3: తరుణి దేహము నాటి దర్పకుని శరమైన
పరిమళము నిండుగా బహువిధమున
కరిగమననిపుడు వేంకటవిభుఁడు కౌగిటను
కరుణించ లతలైనఁ గాంచుఁగా తెలివి

రేకు: 0003-2 సామంతం సం: 05-013

పల్లవి: ఎట్టు వోరిచెనో కాని యింత దడవు- అప్పు-
డట్టు నిట్టుఁ దల్లడించె నతఁడంతలోననే

చ. 1: అంటఁగాక వున్నదానవని యెఱుగక యాతఁ-
డింటికిట్టె రాఁగా నీవు నెదురువోయి
వొంటకున్నరీతి దవ్వులనున్న నినుఁ జూచి
అంటఁజేరి చిన్వఁబోయె నతఁడంతలోననే

చ. 2: వేడుక నాతఁడు రాఁగా వెనకవెనకకుఁ బోయి
తోడనే సిగ్గును నవ్వుఁ దొలఁకఁగాను
వీడి వీడని కొప్పు విసరుచుఁ దలయూఁచ-
నాడనే మూర్చవోయె నతఁడంత లోననే

చ. 3: చయ్యనఁ బన్నీటి మజ్జనమాడి నీవు నేఁడు
ఉయ్యాలమంచముమీఁద నుండఁగాను
నెయ్యపు వేంకటపతి నినుఁగూడి పరవశ-
మయ్యీనబ్బురముగ నతఁడంతలోననే

రేకు: 0003-3 రామక్రియ సం: 05-014

పల్లవి: రాగఁదే చూతఁడిదె రసికుఁడగు కెలవాడిఁ
కౌఁగిటి రమణితోడ కనకగిరి వాని

చ. 1: అదిగదె వసంతంబులాడీఁ గూడి
కదలుఁగనుఁ గవల చక్కని సతులతో
వెదకి పై కుంకుములు వేసీ రాసి
వుదుటుచనుదోయిపై నొదిగి వొదిగి

చ. 2: కడుఁ బేర్చి నేతికడవల గుబ్బెతలఁ జేరి
అడుగడుగునకు నాటలాడి
నడిమి సన్నపుసిరుల నగవు రెప్పల గరుల
తొడికి చెనకినదివొ దొరదైవము

చ. 3: దప్పి దేరంగ సైఁదపుగుడుములును వడలుఁ
బప్పులునుఁ బన్నీటి పానకములు
అప్పఁడగు కెలవాడి అదె కనకరాయఁడై
కప్పురము చల్లి చక్కని సతులపైని

రేకు: 0003-4 భైరవి సం: 05-015

పల్లవి: సిన్న వాఁడవని నమ్మ సెల్లదు నిన్ను
సిన్నెన యాటదెల్ల సిక్కుసీరై పోయను

చ. 1: అవుర బాలకిసునరాయఁడ నీవు సంటిపాలు
నవులంటా నెత్తురెల్ల సప్పరించఁగా
కవకవ నవ్వినవ్వి కన్నులు దేలగిలఁగ
సవరన్ని యాటదెల్ల నప్పుసారై పోయను

చ. 2: రారా గోపాలకిసునరాయ నీవదె గొల్ల-
వారి మగువల సూపు వల్లె వేయఁగా
సూరఁబోయే రేపల్లె సొక్కని గుబ్బెతల-
సేరలంతల కన్నుల సిన్ని సిన్ని సిగ్గులు

చ. 3: కిన్నెర వెంకటగిరి కిసునరాయఁడ నీవు
వన్నెలుగ వీది వీది వాయించఁగా
మిన్నుదాఁకి లోకానకు మేఁటియైన లకిమమ్మ
నిన్ను సేరి సరుగన నిలుసుండే సొక్కెను

రేకు: 0003-5 కాంబోది సం: 05-016

పల్లవి: పొద్దు వొద్దుకును వలపుల నేఁచేవు వద్దు
బుద్ధిగాదు నీకు నేఁప భువనమోహినిని

చ. 1: అప్పుడు మా విన్నపము లాలకించఁ బొద్దులేక
యిప్పుడు విచ్చేసినాఁడవిఁక నైనాను
చెప్పరాని విన్నియును చిత్తగించి చూతు గాని
చప్పర మంచములోని చక్కని కోమలిని

చ. 2: అలసి మాతోడ మాటలానతియ్య వేళగాక
యెలయించ వచ్చినాఁడ వింతలోననే
సొలపు మాటలు గావు చూడు నీవే మేడమీఁద
చెలులపైనొరగిని జిగి గుబ్బలాఁడిని

చ. 3: వేఁగెడి రమణిఁ జూచి వేగినంతకు రావైతి
మాఁగెఁగా యింతట నీ మనసైనాను
వేఁగు వచ్చెనా నీకు వేంకటేశ కృపఁజూడు
కాఁగిట నవధరించు కన్నుల కలికిని

రేకు: 0003-6 ముఖారి సం: 05-017

పల్లవి: ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
యిదిగాక వైభవంబిఁక నొకటి కలదా

చ. 1: అతివ జన్మము సఫలమై పరమయోగివలె-
నితర మోహాపేక్షలిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండె

చ. 2: తరుణి హృదయము కృతార్థతఁ బొంది విభుమీఁది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ

చ. 3: శ్రీవేంకటేశ్వరుని జింతించి పరతత్వ-
భావంబు నిజముగా బట్టెఁ జెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ

రేకు: 0004-1 వసంతం సం: 05-018

పల్లవి: శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి

చ. 1: అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతోఁ జెరలుదెచ్చిన సతుల
పరువపు వయసుల బదారువేలను
సొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి

చ. 2: చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవగళించి
విందువలెనె తా విచ్చేసి రుకుమిణి
సందడిఁ బెండ్లాడిన సరసునికి

చ. 3: దేవదానవులు ధీరతను
దావతిపడి వార్ధి దరువఁగను
శ్రీ వనితామణిఁ జెలగి పెండ్లాడిన
శ్రీ వేంకటగిరి శ్రీ నిధికి

రేకు: 0004-2 పాడి సం: 05-019

పల్లవి: దేవరచిత్తం దివ్యనిధి
దేవనిర్మిత విధీ యవధానం

చ. 1: అతివలు నాట్యంబాడెదమని వు-
న్నతి మెఱయుచు నున్నారిదివో
ప్రతినలతో రంభయు మేనకయును
ధృతి కరుణాంబుది ధీయవధానం

చ. 2: గానవిద్య తమకంబున వినుమని
కానుకలివె సురకాంతలవి
కానుపించుకో గంధర్వసతులను
ధీనుత పంపు ధీ యవధానం

చ. 3: పరియంకంబునఁ బవళించెదవో
సిరుల విభవముల జెలఁగెదవో
తిరువేంకటగిరి దేవ యన్నిటా
తిరమందితి విటు ధీయవధానం

రేకు: 0004-3 శంకరాభరణం సం: 05-020

పల్లవి: ఇంతే విన్నపమింతేలా నీ-
పంతము చేకొంటి పాలించు

చ. 1: అలయు సొలయునతివ లోలోనే
చెలిపై నొరగు చెక్కు నొక్కు
పులకించు నించు వొలఁతి చెమట
చిలికించు గోరఁజిత్తగించు

చ. 2: చెలుల మొరఁగు చింతచే గరఁగు
పలుకఁ దలఁచు బడలును
పిలుచు నిన్ను నీపేరుకొనుచును
తొలఁకు కన్నీరు దుడుచును

చ. 3: చనుఁగవ చూచు సారె నీసేఁతలు
తనలోనే మెచ్చి తనరును
అనయము వేంకటాధీశ యీ యింతిఁ
జెనకి కౌఁగిటఁ జేకొంటివి

రేకు: 0004-4 ముఖారి సం: 05-021

పల్లవి: కలలోనె యిరువురము నలిగి వేగ
కలయనుచు దెలిసి నినుఁ గౌఁగిలించితిరా

చ. 1: అలుగుదురెఁ బతులనఁగా వినఁగ
నలవాటు లేక నే నలుగుచుండుదురా
అలిగితట వురక నీవంత నాతోను మరి
నలుగులౌనట పూవులంతలోపలనే

చ. 2: చందురుఁడె సూర్యుఁడై జరగ మిగుల
కెందమ్ములవుర నాకెంగేలుదోయి
గందమే తోఁచెనట కస్తూరియనఁగ నా-
చందమపుడొకలాగు చందమవునటరా

చ. 3: విటవరుఁడ కోనేటివిభుఁడ నీ
వెటు దొలంగిన దేహమెట్టు నిలుపుదురా
యిటువలెనె మనలోన నెలమి మరచి
తటుకననుఁ గలయనుచు తలఁకి తెలిసితిరా

రేకు: 0004-5 నాదరామక్రియ సం: 05-022

పల్లవి: సకలం హేఖి జానామి తత్
ప్రకటవిలాసం పరమం ధధసే

చ. 1: అలికమృగమదమయ మషీకలనో
జ్జ్వలతాం హేసిఖి జానామి
లలితం తవ పల్లవిత మనసి ని-
శ్చలతర మేఘశ్యామం ధధసే

చ. 2: చారుకపోల స్థల కరాంచిత వి-
చారం హేఖి జానామి
నారాయణ మహినాయకశయనం
శ్రీరమణం తవ చిత్తే ధధసే

చ. 3: ఘనకుచశైలాగ్రస్థిత విధుమణి-
జననం హేఖి జానామి
కనదురసా వేంకటగిరి పతే-
ర్వినుత భోగసుఖ విభవం ధధసే

రేకు: 0004-6 భైరవి సం: 05-023

పల్లవి: వనితభాగ్యంబు దేవరచిత్తము మాకు
బనిగాదు యింక నీ పాదంబులాన

చ. 1: అడబాలసతి బోనమారగించు మటంచు
బడి బడిని కడు విన్నపము సేయఁగా
ఉడుగని పరాకుతో నుండి నెచ్చెలి మీఁద
బడలి వొరగినది నీ పాదంబులాన

చ. 2: అడపంబుపతి వీడెమవధరింపుమటంచు
అడరి కప్పురపుఁ బలుకందీయఁగా
కడకంటఁ జూడదిదె కాఁతాళమో మరపొ
పడఁతి యిప్పుడు నీ పాదంబులాన

చ. 3: ఆలవట్టము విసరు అతివలను వలదనదు
పాలిండ్లపై కొంగు పచరించదు
యేలాగవునొ వేంకటేశ నీవిపుడిట్టె
పాలించకున్న నీ పాదంబులాన

రేకు: 0004-7 శంకరాభరణం సం: 05-024

పల్లవి: అలరులు గురియఁగ నాడెనదే
అలకలఁ గులుకుల నలమేల్ మంగ

చ. 1: అరవిరి సొబగుల నతివలు మెచ్చఁగ
అరతెర మరఁగున నాడెనదే
వరుస పూర్వదువాళపు తిరుపుల
హరిఁగరగింపుచు నలమేల్ మంగ

చ. 2: మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాఁటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిట్టు చిమ్ముచు నలమేల్ మంగ

చ. 3: చిందుల పాటల శిరి పొలయాటల
అందెల మోఁతల నాడెనదే
కందువ తిరువేంకటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల నలమేల్ మంగ

రేకు: 0004-8 దేశి సం: 05-025

పల్లవి: వలపారగించవమ్మ వనిత నీ-
యలుక చిత్తమున కాఁకలి సేసినది

చ. 1: అడియాసలనె పక్వమైన సోయగపు-
వెడయలుకల మంచి వేఁడి వేఁడి రుచులు
ఎడసేసి తాలిమి నెడయించి పైపైనె
పొడమిన తమకంపు బోనము వెట్టినది

చ. 2: ఆమంచి మధురంపు అధరామృతముల
వేమారుఁ దావులు చల్లు వెన్నెలబయటను
కొమలపుఁ దరితీపు కోరికఁ గుమ్మరించి
భామకు పూబానుపు పళ్ళెము వెట్టినది

చ. 3: కన్నుల కాంక్షలనెడి కళవళములు దీరె
సన్నపు నవ్వులనెడి చనవగ్గలించెను
అన్నువపు మరపు నీ కంతవింతఁ గలిగె నేఁ-
డిన్నియును దిరువేంకటేశుని మన్ననలు

రేకు: 0005-1 శ్రీరాగం సం: 05-026

పల్లవి: అప్పటి యెండ చెమటలట్టే వుండీనా
నెప్పు దప్ప బొంకేవు నే నెఱుంగనా

చ. 1: ఆవులఁ గాచిన నాటి యడవికంపల జీర-
లావల నేఁడు మాయక అట్టే వుండీనా
యేవంక నెవ్వతో నిన్ను నెనసి చేసిన చేఁత
నీ వెంత మొఱఁగిన నే నెఱంగనా

చ. 2: వెన్నలు ముచ్చిలునాఁడు వేడి పాలారగించిన
అన్నువ నీమోవిపొక్కులట్టే వుండీనా
వన్నెకాడ యెవ్వతెకో వలలఁ జిక్కిన నీ-
నిన్న మొన్నటి సుద్దులు నే నెఱంగనా

చ. 3: రంగుగ మధురలోని రమణి మెత్తిన నాటి-
అంగడి గందపుఁ బూఁతలట్టే వుండీనా
చెంగట మొఱగి కలసితివి వేంకటరాయ
నింగి మోచిన చేఁతలు నే నెఱంగనా

రేకు: 0005-2 శంకరాభరణం సం: 05-027

పల్లవి: పోనీ పోనీలే నీ పొందులేఁటికి నీ-
యాననము చెమరించె నయ్యా నీ యలుకా

చ. 1: ఆన వెట్టఁగా విచ్చే సేవమ్మపాదాల మీఁదనే
కానీ కానీలే యెక్కడికో నీవు
మానవతితో బింకాలు మానవా యింకాను నీ-
మేనెల్లా బడలెను యేమిటికి నీ యలుక

చ. 2: బంగారు దుప్పటికొంగు పట్టఁగానే పెనఁగేవు
అంగడి వీధిలో నవులే నీవు
రంగైన సతికోపమెరఁగవా యింకాను నీ-
తొంగలి రెప్పల నీటఁ దోఁచీలే నీ యలుక

చ. 3: తెరవ నిన్నరగంటఁ దిట్టఁగానే బిగిసేవు
మఱపుఁ దెలివితో మఱియు నీవు
కరఁగి కూడితివి వేంకటగిరి మీఁద నున్న-
నెరజాణ విట్టలుఁడ నేఁడుగా నీ యలుక

రేకు: 0005-3 ముఖారి సం: 05-028

పల్లవి: ఎక్కడ నున్నదో చిత్తమేమి దలఁచెనో యింతి
చెక్కులెల్లాఁ జెమరించీఁ జెప్పరమ్మా చెలులు

చ. 1: ఆతని సుద్దులు చెప్పే అతివలే చుట్టాలు
అతనిని వద్దనిన వారందరుఁ బగ
రాతిరెల్లా నిద్దు రెరఁగదు పాదములొత్తి
చేతులెల్లఁ బొక్కెనేమి సేతమమ్మా చెలులు

చ. 2: నవ్వులు చెక్కులకు గన్నపుగండిదొంగలాయ
నొవ్వులాయ జూపులు కన్నుల మీఁదికి
దవ్వులాయఁ బయ్యెద గందపు గుబ్బల మీఁదికి
యెవ్వరి నొల్లదు యిఁకనేఁటికమ్మా చెలులు

చ. 3: చిత్తమెల్లా దక్కఁగొనె సిగ్గులు ముంగిట వేసె
వత్తివలె దేహమెల్లా వాడఁబారెను
కత్తిఁ గోసినట్లు వేంకటపతి ఘాతలకు
జొత్తు పాపవలె నాయఁ జూడరమ్మా చెలులు

రేకు: 0005-4 శ్రీరాగం సం: 05-029

పల్లవి: చెల్లువంటా వచ్చి వచ్చి చెట్టవట్టేవు
తొల్లియు నెందరినిట్టే దొమ్ములఁ బెట్టితివో

చ. 1: ఆఁపరాని తమకాన నాసచేసేఁ గాక యింత-
మాఁపు దాఁకా నీ తోడి మాటలేలరా
దాఁపరాని మదనముద్రలు మేననవె నీకు
నేఁపుచు భ్రమలఁ బెట్టి యెవ్వతె సేసినవో

చ. 2: ఉండలేక నీ వద్దనే వుసురంటిఁ గాక యింత-
బండు బండు సేసిన యీప్రాణమేలరా
పుండుగాఁగఁ జిత్తమెల్లాఁ బొక్కఁ జేసితివి నా-
యండనుండే యెవ్వతెకు నమ్ముడు వోయితివో

చ. 3: తనివోక నేనింత దగ్గరనిచ్చితిఁ గాక
చనువున నిన్ను జేయి చాఁచనిత్తునా
ఘనుఁడ వేంకటరాయ కమ్మని యీ విరులు
మునుపనెవ్వతో నీపై ముడిచి వేసినవో

రేకు: 0005-5 రామక్రియ సం: 05-030

పల్లవి: మీలో మీలో మేలే పెంచిన-
తాలిమి కూటమి దలచినను

చ. 1: ఆరడిఁ బెట్టిన అలుకలు ముట్టిన-
కూరిమి మచ్చిక గూరిచిన
బీరాన మీలో ప్రేమమే పెంచిన-
నేరుపు మీలో నించినను

చ. 2: చనవులిచ్చినఁ జదురులెచ్చిన-
కొనచూపులు లోఁగొచ్చినను
అనుగు మోహములచ్చినఁ దెచ్చిన-
వినికి మనికి వెచ్చినను

చ. 3: ప్రియములింపులు బిరుదుకెక్కిన -
నయము మీలో నాఁటినను
జయమై వేంకటాచల రమణుఁడ
ప్రియురాలు మీలో బెరసెను

రేకు: 0005-6 సామంతం సం: 05-031

పల్లవి: పొదలిన వీడెపు బుక్కిళ్ళో తమ
చొదుకుల చెమటల చొక్కిళ్ళో

చ. 1: ఆముకొనిన యధరామృతవేళల
మోముల మోముల మొక్కిళ్ళో
కామినుల మకరికా పత్రమ్ముల
చీమక దొంతర చెక్కిళ్ళో

చ. 2: కయ్యపుఁ గౌఁగిఁట గలికి రచనలను
నెయ్యపుఁ బులకల నిక్కిళ్ళో
ముయ్యని మోహపు ముచ్చట మురిపెపు-
తొయ్యలిపాదపుఁ దొక్కిళ్ళో

చ. 3: మొలకలేనగవు మోముల గోళ్ళ
నులిమేటి వదనపు నుక్కిళ్ళో
అలమేల్ మంగకు నా వేంకటపతి
తలపు లొసంగిన దక్కిళ్ళో

రేకు: 0006-1 ఆహిరి సం: 05-032

పల్లవి: ఆఁపరాని వలపాయ నమ్మలాలా - యింతి
యేఁపులకు లోనైతిమిఁక నేమిసేతమే

చ. 1: ఆరగించుమనఁ గదరమ్మలాలా -అయ్యో
నీరు వుక్కలించదిదె నిన్నటనుండి
ఆరినది బోనమెలా నమ్మలాలా-అయ్యో
శ్రీరమణుఁడింతట విచ్చేయఁడేమిసేతమే

చ. 2: అద్దమరాతీరి వోమ నమ్మలాలా -అయ్యో
నిద్దుర గంటఁబెట్టదు నిన్నటనుండి
అద్దపుఁ జెక్కులు వాడె నమ్మలాలా -అయ్యో
యిద్దరికోపము దీరదిఁక నేమిసేతమే

చ. 3: అలయికే ఘనమాయనమ్మ లాలా -దీని
నిలుప వశముగాదు నిన్నటనుండి
అలమివేంకటవిభుఁడమ్మలాలా - దీని-
నెలయించి కూడకున్న నిఁకనేమి సేతమే

రేకు: 0006-2 సామంతం సం: 05-033

పల్లవి: ఎక్కడికినెక్కడ యేడకునేడ నే-
నొక్కతెనాతనికటరో సతులు

చ. 1: ఆయఁబోయ నాఁడె నాకు నాతనికి నేమివోదు
రాయిడి యీచేఁతలకు రాయఁడితఁడు
పాయమెల్లా జట్టిగొనె పచ్చిగా నన్నింత సేసెఁ
నోయమ్మ తడవకురో యీరోఁతలు

చ. 2: చెప్పకు చెప్పకు నాకు సిగ్గయ్యీనికనేల
నొప్పి సేసె నాతఁడింత నొచ్చితి నేను
కప్పినఁ బోవు సేఁతలు కాలినపుండ్లలోన-
నుప్పులు చల్లక తలరో సతులు

చ. 3: చాలుఁ జాలు నేల నాఁడే చవిగొన్న కూరలకు
మేలుఁ గీడుఁ గొనియాడ మీఁద మీఁదను
జాలిఁబెట్టి వేంకటేశ్వరుఁడు నన్నిదె రతి-
నోలలాడించెను చూడరో పొందులు

రేకు: 0006-3 వరాళి సం: 05-034

పల్లవి: తలఁచి వేరొకటాడఁ దడఁబడీని
మలసిన నీ కేల నోర మాట వెళ్ళీనే

చ. 1: ఇంచుకంత నెరసున్నానేఁచిన రెప్పలవెంట
నించి నించి కన్నులలో నీళ్ళుగారీని
యెంచరాని నీకన్నులెదుట నాతఁడుండఁగాను
యెంచిన నిదుర నీకు నేల వచ్చీనే

చ. 2: ఎక్కువభారము మేననించుకంత దోఁచినాను
తక్కరి యీ దేహమెల్లాఁ దల్లడించీనే
మక్కువ నీ విభుఁడు నీమతినిండి వుండఁగాను
వెక్కసాన నేరీతి వేగించేవే

చ. 3: వెలయగఁ గోపమొకవీసమంత దోఁచినాను
కలిగిన ముదమెల్లా గాలిఁబోయీని
కలిసితినిదె వేంకటపతి నాతని-
నెలయింత తమకాన నేడ దాఁగేవే

రేకు: 0006-4 దేశి సం: 05-035

పల్లవి: లేఁతచిగురిదె పవ్వళించవయ్య కానికె
బాఁతిగాఁ గమ్మనితావిఁ బాయక మీఁదైనది

చ. 1: ఇంపుల వెలఁగపండ్లిందవయ్య కానికె
గుంపుఁ దేకుటాకు మరఁగున నున్నవి
కెంపుమోవిపండు చిత్తగించవయ్య కానికె
దింపని తేనెలపెరతీపులసోఁకినది

చ. 2: పంచల వాఁడమ్ములివె పటవయ్య కానికె
పొంచి తొంగలిగరుల పొది నున్నవి
కొంచెపు వెన్నెలలివె కోవయ్య కానికె
మంచిమొల్ల మొగుడల మాఁటునాఁ బాయనివి

చ. 3: ఇప్పుడె వేంకటేశ నీకెక్కఁగా నాకానికె
చిప్పిలుఁబన్నీటినిండుఁ జెలమైనది
దప్పిదేరేమాటలతో దక్కెఁగా నాకానికె
కొప్పునెరుల విరులకుమ్మరింతలైనది

రేకు: 0006-5 హిజ్జిజి సం: 05-036

పల్లవి: కటకటా యిట్లాయఁగా పనులు చెలిపలుకు
కిటుకుఁగీరములు మును కిందుపడి గెలిచె

చ. 1: ఇంతిముఖచందురుఁడు నీకుముదబాంధవుఁడు
నింతచలమునఁ బోరిరిన్నాళ్ళును
కాంతుఁడవు నీవలుగఁగాఁ జెలికి నీ విరహ-
సంతాపములు రేఁచి జలజారి గెలిచె

చ. 2: వనజాక్షిచూపులును వలరాజుతూపులును
యెనయకే జగడించె నిన్నాళ్ళును
కినిసి నీవీయతివకెలనఁ దిరుఁగఁగ విరుల-
ననలె కడువాండ్లై నలుగడల గెలిచె

చ. 3: లతలు పూవులతొవిలంచములు చెలిమేన
యితవుగా వడినొసఁగె నిన్నాళ్ళును
సతిగెలిచె వేంకటేశ్వర నీ కరుణనిపుడు
ధృతిఁబూని జవరాలు తిరుఁగఁ దా గెలిచె

రేకు: 0006-6 సామంతం సం: 05-037

పల్లవి: చెదరి తిట్టు పుణుఁగు చెక్కులఁ గరిగి జార
సుదతి నెచ్చెలి మీఁద సోలగిలినది వో

చ. 1: ఇంతివీఁపు నిమ్మపంట నేమరించి తాఁకవేసి
మంతన మెవ్వరితోనో మాటలాడేవు
అంతలోనే కళదాఁకి అకె మేను జల్లనఁగ
చింతతోనే మోమువంచి సిగ్గువడినదివో

చ. 2: పొలతిఁగుబ్బలు నొవ్వఁబూవులచెండున వేసి
కలికతనమున మరలి చూచేవు
కలకంటి యింతలోనే కంతునిబాణమునవి
పలుకనేరక మానుపడి వున్నదదివో

చ. 3: పొక్కిడిచెలిఁ బన్నీటి పొట్లానఁ దాఁకవేసి
తక్కరి నవ్వులతోడఁ దలవంచేవు
గక్కన నేఁడతివ వేంకటరాయ నినుఁగూడి
వెక్కసపు మఱపతో వెరగందినదివో

రేకు: 0007-1 మంగళకౌశిక సం: 05-038

పల్లవి: తన్నుఁ బాసి నేనింత దంటనట యీ
వెన్నెలబాయిట రేయి వేగుఁటింతి చాలదా

చ. 1: ఇంటికి రాకుమని నేనంటినట చూడవే
అంటఁగాక వున్న దాన నంటినో యేమో
కంటికి నిద్దురరాక కాఁకలనే పొద్దువోక
వొంటి నేఁ బానుపున రేయుంటి నింత చాలదా

చ. 2: అప్పటి దగ్గరి నే రానై తినట చూడవే
కొప్పు జారి సిగ్గుతోడఁ గొంకితి నేమో
చిప్పల రెప్పల జంకించితినట చూడవే
చెప్పరాని మాట నీతో జెప్పుటింత చాలదా

చ. 3: ఊరకే మాటాడక నే నుంటినట చూడవే
ఆరడి పరవశాన నైతినో యేమో
గోరికొనఁ దనుఁ దక్క గొంటినట చూడవే
యేర వేంకటేశ నాతోనింత నీకుఁ జాలదా

రేకు: 0007-2 శుద్ధవసంతం -రచ్చెతాళం సం: 05-039

పల్లవి: ప్రలపనవచనైః ఫలమిహకిం
చల చల కుడ్యక్షాళనయా కిం

చ. 1: ఇతర వధూమోహితం త్వాం ప్రతి
హితవచనై రీహితు మిహ కిం
సతతం తవానుసరణమిదం మమ
గతజల సేతూకరణ మిదానీం

చ. 2: వికలవినయ దుర్విటం త్వాం ప్రతి
సుకుమారార్ద్రస్తుత్యా కిం
ప్రకటబహల కోపనం మమతే
సకల చర్విత చర్వణమేవ

చ. 3: శిరసా నతసుస్థిరం త్వాం ప్రతి
విరసాలాపన విధినా కిం
తిరువేంకటగిరి దేవ త్వదీయ-
విరహవిలపనం వృథాచరణం

రేకు: 0007-3 వరాళి సం: 05-040

పల్లవి: ఆఁగఁ జేసు నా చూపులటు వోవయ్యా
మూఁగిన నా వలపుల మూలకు రానేలా

చ. 1: ఇమ్ముల నొల్లని వారమేల నీకు నామేని-
అమ్ముల పులకలొత్తీ నటు వోవయ్యా
కమ్మవిలుతునిచేతఁ గాఁగెడి నన్నోరసేవు
నెమ్మది నుండి యుండి నీకు నొవ్వనేలా

చ. 2: ఇతవు గాని వారమేల నీకు నామేని-
ఆతితాపమంటుఁ జేసు నటు వోవయ్యా
రతిరాజుచేత నారడిఁబడ్డ ననుఁ జేరి
జతనాన వుండివుండి జాలిఁబొంద నేల

చ. 3: ఇంతటి నీ కౌగిటికి నేల నేము మాకోప-
మంతరమెఱఁగనేరదటు వోవయ్యా
వంతగాఁడ వెంకటపతి నీవు ననుఁ గూడి
చింతతోడఁ బొరలుచు సిలుగంద నేలా

రేకు: 0007-4 శ్రీరాగం సం: 05-041

పల్లవి: ఎన్నఁడునుఁ గోపగించవిందుముఖి నీవిట్లా
విన్నవి వదనమెల్లా వింతలాయ నిపుడు

చ. 1: ఇంతలోని పనికిఁగా నెంత చేసినాఁడవు
కాంత నిన్నటినుండి కనుమూయదాయను
బంతికూటి సతులెల్లా బలుమారు నేఁపగా
చింతతోఁ బళ్ళెము మీఁద జెయి చాఁచదాయెను

చ. 2: ఏమిసేయఁబోయి నీవుయేమి సేసినాఁడవు
సాముకు విచ్చేయదు జవరాలు నేఁడు
దోమతెర మంచముపై తురుము వీడఁగను
తామసించి లేవదిదె తల నొచ్చీనసుచు

చ. 3: ఎవ్వరిని దూరవచ్చు నెవ్వరున్నారిఁకను
పువ్వు సజ్జమీఁదఁ గాఁగె పొలఁతికి దేహము
రవ్వగ వేంకటగిరి రమణ నీ కౌఁగిటఁ
బవ్వళించి యింతలోనె పరవశమందెను

రేకు: 0007-5 ముఖారి సం: 05-042

పల్లవి: మతికంటె వెలినున్న మంట మేలు
చతురులౌట కంటె జడుటౌట మేలు

చ. 1: ఇంటిలోననె వుండి హితవరులై యుండు-
కంటెఁ బగయై యుండు కసరు మేలు
అంటుకొని మరుఁడొంటి అతివనేఁ పుటకంటె
పుంటినొవ్వల విరుల పోట్లె మేలు

చ. 2: తల్లివలె దానుండి తాపమవుటకంటె
అల్లంతనుండి కీడౌట మేలు
వెల్లిగొని నిటపర్పు వేడి చల్లెడికంటె
పల్లదపు చలిగాలి బాదలే మేలు

చ. 3: అలయించి దొరకెడి అమృతపానముకంటె
అలమి పైకొనెడి చేఁదైన మేలు
కలయక కలయు వేంకటశై లపతికంటె
తలపోఁత వేదనల తమకమే మేలు

రేకు: 0007-6 సామంతం సం: 05-043

పల్లవి: అప్పుడే నే నీకు మోహపుటాలనై తినా
కప్పకు నీ చేఁత లంతకంటెఁబో నేను

చ. 1: ఇంచుకంత పనికైన నిల్లుచొరనీక నిన్ను
లంచములడుగను నే లకిమమ్మనా
వంచనల నీకు నిట్టె వలలఁ జిక్కితిఁ గాక
కంచుఁ బదనునకంత కంటెఁబో నేను

చ. 2: సొలపు మాటల నిట్టే చూపులనె జంకించి
చలము సాదించ నీ సత్యభామనా
వలచి నేనిదె నీకు వసమై చిక్కితిఁగాక
కలికి చేఁతలనంత కంటెఁబో నేను

చ. 3: రేపు మాపు గోరఁ దమ్మి రేకులనే లేఖవ్రాసి
రూపు నీకు జెప్పిపంప రుకిమిణినా
తీపుల నిన్నుఁ గూడి తిరువేంకటేశ విరిఁ
గైపు సేయఁగాని అంతకంటెఁబో నేను

రేకు: 0008-1 భైరవి సం: 05-044

పల్లవి: కోవిల పలుకదు కొమ్మావిలతల
దైవిక మిదివో తలకిందాయ

చ. 1: ఇటునటు యినుఁడిదె యెండలు గాసీ
నటుగతి గిరుల నభములందు
అటువలెఁ గప్పిన యంధకారమిదె
నిటలపుటలుకల నిక్కములాయ

చ. 2: వెగటునఁ దోఁటల వెన్నెలగాసీ
ఒగిఁ గలువకొలకు లుబ్బఁగను
అగపడి అటువలెనైనాఁ జెలి నీఁ
మొగమునఁ గోపము ముచ్చటలాయ

చ. 3: సొరిది నలుగడలఁ జుక్కలు గాసీ
నరుదుగ నే నిట్లయినాను
తిరువేంకటగిరి దేవుని కౌఁగిట
కరుణ మన్మథ గ్రహణంబాయ

రేకు: 0008-2 సాళంగనాట సం: 05-045

పల్లవి: చాలుఁజాలును భోగసమయమున మైమఱపు-
పాలుపడునట యేఁటి బ్రదుకురా వోరి

చ. 1: ఇందుముఖి నిను గౌఁగిలించి లోపలి జగము
కందునని నీ బిగువుఁ గౌఁగిలే వదలె
పొందైన వారితోఁ బొసఁగఁ గౌఁగిఁట జేర్పఁ
బొందుగాదట యేఁటి పొందురా వోరి

చ. 2: నెలఁత నీ వాలుఁగన్నులు మూసి జగమెల్లఁ
గలయఁ జీఁకట్లైన గక్కనను వదలె
వలచినంగనలు తమ వలసిన విలాసముల-
వలను నెరపని దేఁటి వలపురా వోరి

చ. 3: కొమ్మ నీవురముపై గోరు దివియుచు నాత్మ-
నిమ్మైన ననుఁదాక నిద్దరిని దాఁకె
దిమ్మరివి కోనేటితిమ్మ నీపైఁ బ్రియము
కుమ్మరించని దేఁటి కోర్కిరా వోరి

రేకు:	0008-3 కాంభోది సం:	05-046

పల్లవి:	ఎప్పుడు గాని రాఁడో యెంతదడవాయ కాలి-
	చప్పుడాలకించి మతి జల్లురనెనమ్మా

చ. 1:	ఇద్దరమదరిపాటు యేకాంతాన నాడుకొన్న-
	సుద్దులు దలఁచిమేను చురుకనెనమ్మా
	పెద్దగాఁ గస్తూరిబొట్టు పెట్టిన నాతఁడు గోర
	తిద్దుట దలఁచి మేను దిగులనెనమ్మా

చ. 2:	పాయక యాతఁడూ నేనుఁ బవ్వళించే యింటివంకఁ
	బోయి పోయి కడుఁ జిన్న బోతి నోయమ్మా
	తోయపు గుబ్బల చన్నుదోయి మీఁద వాఁడొ త్తిన-
	పాయపు జంద్రుల జూచి భ్రమసితినమ్మా

చ. 3:	కూడిన సౌఖ్యములందు కొదలేని వాని నా-
	వేడుక మతి దలఁచి వెరగాయ నమ్మా
	యీడులేని తిరువేంకటేశుఁడిదె నాతోడ
	నాడినట్టే నాచిత్తమలరించె నమ్మా

రేకు: 0008-4 సామంతం సం: 05-047

పల్లవి: ఎట్టయినఁ జేయరా నీ వింకనేలా నన్నుఁ
బట్టకుర పలుమారు పదివేలు వచ్చెను

చ. 1: ఇంత సేసితివి చాలు నింకనేలా తొల్లే
యింతటివాఁడని నిన్నెఱఁగనా
ఇంతులపై దయగలదింక నేలా నీ-
పంతములే నీకుఁజెల్లె పదివేలు వచ్చెను

చ. 2: ఇచ్చలాడకురా నాతో నికఁనేలా నీ-
యచ్చుటమ్మునే నిజమాయఁగా
యెచ్చరిక మఱచితినింకనేలా నన్ను
పచ్చిసేయకురా యింత పదివేలు వచ్చెను

చ. 3: ఇనుమడించె నీచేఁత లింకనేలా నీ-
కనుమాయలిన్నియుఁ గంటిమిగా
యెనసి వేంకటపతి యింకనేలా నన్నుఁ
బనుపరచితివిట్టే పదివేలు వచ్చెను

రేకు: 0008-5 లలిత సం: 05-048

పల్లవి: బండి దొౘ్కఁ బాముసెౘ్కఁ బనులెల్లాఁ దక్కె
అండఁ జిక్కె గోపికలకందరికి మొక్కె

చ. 1: ఈతఁడు దొంగిలె వెన్న యీతఁడు నాకంటెఁ బిన్న
నేతఁ బాల నోలలాడె నిన్న మొన్న
పాతకపు రాకాసిపల్లెలు చూరలుగొన్న-
యేతరిపై నేరమి మాకేఁటికిఁక నెన్న

చ. 2: కూరిమినీతడు దొల్లి కొనగొనలనే తల్లి (?)
మారాపిళ్ళాడించెనే మారుదల్లి
ఆరుమూరు సేసి విద్యలందరికిఁ బారఁజల్లి
పారితెంచి వోలలాడెఁ బాలవెల్లి

చ. 3: ముచ్చువలె నిప్పుడుండె మూఁడులోకములు నిండె
రచ్చసేసెఁ జూడరే రాతిగుండె
తచ్చితచ్చి వింటినారి దనుజులనెల్లాఁ జెండె
పచ్చిదేర వేంకటాద్రి పానుపుగాఁ బండె

రేకు: 0008-6 ఆహిరి సం: 05-049

పల్లవి: ఓ యమ్మా వినరో యమ్మా
మాయలాఁడి మానిని

చ. 1: ఈ యింతికి విభుఁడిచ్చినా చన-
వేయెడాఁ బోవదిదిగదే
రాయంచ నడపుల రాజసమ్మున
పాయంపు రమణునిఁ బాయదు

చ. 2: సారె సటములు సందడింపుచు
జారీఁ బయ్యెద సరుగనా
దరి రమణునిఁ దొలఁకుఁ గన్నుల
నీరు నించదు నిలువరే

చ. 3: అంకించి పిలిచినప్పుడా తిరు-
వేంకటేశ్వరు వెరవున
బొంకు లేని యట్టి పొందు చేకొని
పంకజానన పైకొనే

రేకు: 0009-1 శ్రీరాగం సం: 05-050

పల్లవి: వద్దు నీకు నాతోడి వట్టిమాటలు
ముద్దులు నీపైఁ గునిసి మురిసీఁబో యిఁకను

చ. 1: ఈడ వచ్చి ప్రియము నాకేమి చెప్పేవిందాఁకాఁ
గూడినాకెకే ప్రియము గులుకరాదా
వాడిక నిందాఁక నీవు వచ్చిన నేరమికి
సూడుఁ బాడుఁ జెనకీఁ బో సొలపుఁ జేఁతలనే

చ. 2: ఎదిరి నావంకఁ దప్పకేమి చూచేవిఁక నీ-
ముదితపైనే చూపులు ముంచరాదా
మెదలి నా ముంగిలిది మెట్టిన తప్పునకును
సద చేసి జగడాలు చల్లెడిఁబో యిఁకను

చ. 3: ఇట్టు నట్టుఁ జెఱఁగు నాకేల పట్టేవిదె మున్ను
పెట్టినాకెకే చెఱఁగు పట్టరాదా
వెట్టికూటములు చాలు వేంకటేశ యిదె నిన్ను
బెట్టుగాఁగా నలుకలఁ బెట్టుఁగదా యిఁకను

రేకు: 0009-2 భైరవి సం: 05-051

పల్లవి: కాలమెల్లా మోసపోవు కానియ్యరా కల-
కాలమెల్లా జరుపేవు కానియ్యరా

చ. 1: ఎడపుల జవ్వనపుటింతి నొకతెఁ గూడి
కడలనే తిరిగేవు కానియ్యరా
మెడగట్టుకొకతెకు మేలుఁవాడవై నీవు
కడవ బొంకేవు నాతో కానియ్యరా

చ. 2: బంగారు మెఱుఁగుచాయ పడఁతినొకతె గూడి
కంగనాడేవు నాతో కానియ్యరా
అంగన నొకతె వెనకమర దాచుకొని చొఁ
క్కంగఁ జేసి ముద్దాడేవు కానియ్యరా

చ. 3: సంపద గలాసెఁ గూడి సరములాడుచు
కంపులే పూసేవు కానియ్యలా
వెంపరలాడుచు నీ వెంటనొకతె రాఁగా
కంపించకు వేంకటేశ కానియ్యరా

రేకు: 0009-3 ముఖారి సం: 05-052

పల్లవి: వెరతుమయ్య చూపు వేఁటకాడ
తరితీపు సేసి మమ్మింతటనె యేఁచేవు

చ. 1: ఉంటవింటఁ గప్పురాన నుబ్బి నన్ను నేసేవు
యింటి వారెవ్వరుంటా యెరఁగవు
కంటిమి నీ యదలింపు కరఁగి నేఁబై కొన్న
వెంట వెంటఁ దిరిగాడి వెతలఁ బెట్టేవు

చ. 2: పేలరివై యేడనైనాఁ బేరుకొని పిలిచేవు
యేలిన వారెవ్వరంటా నెఱఁగవు
తాలిమి మీరఁగ నీ చిత్తములో మెలఁగఁగ
కాలూఁదనియ్యక యింత కాఁకలఁ బెట్టేవు

చ. 3: కొప్పులోని విరులు చెక్కుల జారఁ జెనకేవు
యెప్పుడైనా నెవ్వరుంటా నెఱఁగవు
కప్పకుర చెఱఁగు వేంకటరాయ చెమటలఁ
దొప్పఁదోఁగి యెవ్వతో పొందులకు నేఁగితివి

రేకు: 0009-4 మాళవశ్రీ సం: 05-053

పల్లవి: దుప్పటెల్లా జవ్వాదినే తొప్పఁదోఁగె నీకడనే
వొప్పదా యింతేసి నీకు వో వలపా

చ. 1: ఉత్తలపు విరహన నుడుకుచు వయసు మీఁ-
దెత్తినది సతి నీకు నిందుకొరకా
వత్తునని విచ్చేసి వనితల కుచముల
వొత్తగిలి వున్నాఁడ వోహో వలపా

చ. 2: నిదుర గంటకి రాక నెలఁత పానుపుమీఁద-
నెదురు చూచీ నీకు నిందుకొరకా
ముదితల కౌఁగిట ముంచిన కస్తూరి నీకు
వుదిరెడి వురమున నో వలపా

చ. 3: కన్నుల కలికి నింత కరఁగించి కవుఁగిట
ఎన్నిక సేసితివి నీ విందుకొరకా
చిన్ని చిన్న నగవుల శ్రీవేంకటేశ నీ-
వున్నాఁడవొరపులై వోహో వలపా

రేకు: 0009-5 సామంతం సం: 05-054

పల్లవి: మదము దొలఁకెడి యట్టి మంచివయసున మనకు
తుదలేని వేడుకలు దొరకుటెన్నఁడురా

చ. 1: ఉదుటుఁ జనుదోయి నీవురముపై దనివార-
నదిమి మోమును మోము నలమి యలమి
వదలైన నీవితో నాలుఁగన్నుల జంకెఁ
లొదవ నీ మీఁద నే నొరగుటెన్నఁడురా

చ. 2: కలికితనమునఁ నాదు కప్పురపుఁ దమ్ములము
కులికి నీ వదనమునఁ గుమ్మరించి
పలచనగు గోళ్ళ నీ పగడవాతెర నొక్కి
చెలువమగు నునుగంటి సేయుటెన్నఁడురా

చ. 3: గరగరని కురులతో కస్తూరివాసనలు
విరితావులతోడ విసరఁగాను
తిరువేంకటాచలాధిపుఁడ నిను గూడి నే-
నరమరచి సదమదములౌట యెన్నఁడురా

రేకు: 0009-6 సౌరాష్ట్రం సం: 05-055

పల్లవి: ఊరులేని పొలిమేర పేరు పెంపు లేని బ్రతుకు
గారవంబు లేని ప్రియము కదియనేఁటికే

చ. 1: ఉండరాని విరహవేదన వుండని సురతసుఖమేల
యెండలేని నాఁటి నీడ యేమిసేయనే
దండిగలుగు తమకమనెడి దండలేని తాలిమేల
రెండునొకటి గాని రచన ప్రియములేఁటికే

చ. 2: మెచ్చులేనిచోట మంచిమేలు గలిగినేమి సెలవు
మచ్చికలేనిచోట మంచిమాటలేఁటికే
పెచ్చు పెరుగలేనిచోట ప్రియముగలిగి యేమిఫలము
ఇచ్చలేనినాటి సొబగులేమి సేయనే

చ. 3: బొంకులేని చెలిమిగాని పొందులేల మనసులోన
శంకలేక కదియలేని చనవులేఁటికే
కొంకుగొసరు లేని మంచికూటమలర నిట్లఁ గూడి
వేంకటాద్రివిభుఁడు లేని వేడుకేఁటికే

రేకు: 0010-1 సామంతం సం: 05-056

పల్లవి: ఒద్దేలు మొక్కేవో వుద్ధవుఁడా తన
ఉద్దండాలె చెల్లెనుద్ధవుఁడా

చ. 1: ఊరూర వలపులుద్ధవుఁడా నే-
మోరుతుమా యిఁక నుద్ధవుఁడా
ఊరడించ వచ్చేవు వుద్ధవుఁడా తన-
వూరట చెలుములుద్ధవుఁడా

చ. 2: ఒప్పులర మావురిసిన పుం-
డ్లుప్పులు వెట్టించె నుద్ధవుఁడా
చెప్పకు మమ్మిఁక చెలువుఁడాతఁడే
వొప్పివుంటేఁ జాలు నుద్ధవుఁడా

చ. 3: గోపకల మమ్ము గూరిమిఁజిక్కించె-
నోపమింతేసి నేముద్ధవుఁడా
పైపైనే మమ్మింత ప్రాణము నిలుప-
నోపెఁగా తానైన నుద్ధవుఁడా

చ. 4: తెగి తన్నుఁ గూడే తెరఁగు దలఁచి
యుగములై నవి ఉద్ధవుఁడా
పగటున మా మా ప్రాణము మాకిఁక
నొగరే తీపాయే నుద్ధవుఁడా

చ. 5: చెల్లించె మా ప్రేమ శ్రీవేంకటేశుఁడు
వుల్లమలర నేఁడుద్ధవుఁడా
చల్లని కూటపు జనవిచ్చి మామా-
వొళ్లెల్లఁ జెనకె నుద్ధవుఁడా

రేకు: 0010-2 ముఖారి సం: 05-057

పల్లవి: పలుమరు వుట్లపండుగను
చిలుక చిడుక్కని చిందఁగను

చ. 1: ఊళ్ళ వీధుల వుట్లు కృష్ణుఁడు
తాళ్ళు దెగిపడఁ దన్నుచును
పెళ్లు కఠిల్లు పెఠిల్లు చిఠిల్లని
పెళ్ళుగ మ్రెసె పెనురవము

చ. 2: బంగారు బిందెలఁ బాలుఁ బెరుగులు
ముంగిట నెగయుచు మోఁదఁగను
కంగు కళింగు కఠింగు ఖణింగని
రంగుమీరు పెనురవములై

చ. 3: నిగ్గుగ వేంకటనిలయుఁడుట్టిపాఁ
లగ్గలికఁ బగుల నడువఁగను
భగ్గు భగిల్ల ని పరమామృతములు
గుగ్గిలి పదనుగఁ గురియగను

రేకు: 0010-3 ఆహిరి సం: 05-058

పల్లవి: చెడ్డ చెడ్డ మనసుల చెంచువారము- ఆల-
దొడ్డివాఁడ పోవయ్య దూళికాళ్ల రాక

చ. 1: ఏఁటి దాననైతినేమి యెవ్వతె నేనైతినేమి
ఆఁటదాని నన్ను నీకు నడుగనేలా
మూఁట మాఁటలనె కడు మోవనాడవద్దు లేటి-
వేఁటకాఁడ పోవయ్య వెంటవెంట రాక

చ. 2: ఎవ్వరి వారైరేమి యేడనేడ నుండిరేమి
దవ్వుచేరువలు నీకు దడవనేలా
నవ్వకుండఁగానె వట్టి నవ్వునవ్వేవెవ్వరైన
పువ్వక పూచెననేరు పోవయ్య రాక

చ. 3: ఎక్కువ కొప్పయిననేమి యెంత గుబ్బలైన నేమి
చక్కఁదనము వొగడ సారె నీకేలా
వెక్కసాలు మాని మాతో వేంకటేశ మాయింటి-
యిక్కువకే పోవయ్య యింతనంత రాక

రేకు: 0010-4 శుద్ధదేశి సం: 05-059

పల్లవి: ఎందరిఁ జెనకేవేరా నీవు
అందపు నీ మేన నలముచు

చ. 1: ఎక్కడికైనా విచ్చేసి యేరా నీవు
వెక్కస మాడేవు వెఱవక
యిక్కువలంటఁగ వచ్చేవేరా నీవు
నిక్కపు నీ ప్రేమ నెరపుచు

చ. 2: ఎప్పుడు మానవు బిగువేరా నీవు
కప్పురపు నోరఁ గసరుచు
యిప్పుడె యింతేసి చేసేవేరా నీవు
వొప్పదు నాతోడి వుదుటులు

చ. 3: ఏతరుణిఁ దలఁచితొ యేరా నీవు
కాతరాన నన్నుఁ గలయుచు
యేతరి వేంకటేశుఁడ యేరా నీవు
బూతులమాటాడి పాదలేవు

రేకు: 0010-5 హిజ్జిజి సం: 05-060

పల్లవి: తరుణిపై మరునికి దయలేదు నీవు
మరునినే పోలితి మరియేఁటిబ్రదుకు

చ. 1: ఎదురు చూచి చూచి యింతక యేమౌనో
హృదయము ఝల్లనీ నిటుదలఁచి
పొదల తీగెలయింటఁ బొరలి యేమౌనో
మదిరాక్షికొకటైన మరియేఁటిబ్రదుకు

చ. 2: చెలుల దూరిదూరి సిగ్గునసేమౌనో
తలఁచి తలఁచి గుండె తల్లడించీని
కల నిన్నుఁగని లేచి గక్కున నేమౌనో
మలసి వెన్నెలమంట మరియేఁటిబ్రదుకు

చ. 3: ఇంతి గలయకున్న నిఁక నెంత యౌనో
పంతపు వేంకటరాయ భయమయ్యీని
ఇంత నీకరుణ నిఁక నెంత యౌనో
మంతనమింత లేకున్న మరియేఁటి బ్రదుకు

రేకు: 0010-6 రామక్రియ సం: 05-061

పల్లవి: వద్దే గొల్లెత వదలకువేఁ నీఁ
ముద్దు మాటలకు మొక్కేమయ్యా

చ. 1: యేలే యేలే యేలే గొల్లెత
నాలాగెఱఁగవా నన్ను నేఁచేవు
చాలుఁజాలు నీకఁజాలు నీరచనలు
పోలవు బొంకులు పోవయ్యా

చ. 2: కానీ కానీ కానిలే గొల్లెత
పోనీలే నీవెందు వోయినను
మాని మాని పలుమారుఁ జెనుకుచు మా-
తోనిటు సొలయక తొలవయ్యా

చ. 3: రావా రావా రావా గొల్లెత
శ్రీవేంకటగిరి చెలువుఁడను
నీవె నీవె నను నించితి కౌఁగిట
కైవశమైతినిఁ గదవయ్యా

రేకు: 0011-1 శుద్ధవసంతం సం: 05-062

పల్లవి: మెచ్చితి బళిరా వోరి మేటిజాణ నన్నుఁ
బచ్చి చేసేదింత నీకు బంతమా లోకానను

చ. 1: ఏకతాన సొలసి నేనేమి నీతోఁ బలికినా
ఆకెతోనే విన్నవించేవాపఁగ లేక
పైకొని వలచి కిందుపడిన యింతులమాఁట
కాకు సేసే మగవాఁడు గలఁడా లోకానను

చ. 2: చక్కఁగా నేఁదీసిన సన్నపు నీపై రేక
యెక్కువ నాకెకే చుపేవేతులకును
మక్కువ నిలుపలేని మగువల వెలిపుచ్చి
వెక్కమయినవాఁడు విభుఁడా లోకానను

చ. 3: ఉండలేక చేతనున్న వుంగరమిచ్చినఁ బోయి
వెండియు నాకెకేయిచ్చి విట్టువీఁగేవు
కండగట్టుకొంటివా వేంకటరమణుఁడ దీన
బండుసేసితివి నన్ను బాపురా లోకానను

రేకు: 0011-2 ముఖారి, ఏకతాళిసం: 05-063

పల్లవి: సన్నపు నవ్వుఁజూపుల చల్లులాఁడి యిప్పు-
డిన్నివిధముల మించె నిదివో తపము

చ. 1: ఏడునిలువుల పైఁడిమేడమీఁద నుండి నిన్నుఁ
జూడ వేడుకైన మించుఁజూపు లాడి
వాడుచు నీకునెదురు వడిఁజూడ నంతలో నీ-
వేడనుండో విచ్చేసితివిదివో తపము

చ. 2: కొత్తలయిన మాణికపు కొలువుటోవరిలోన
ముత్తేల చెఱఁగుదూలు మురువులాఁడి
తత్తరానఁ దమకించి తరుణికోరికలెల్ల-
నిత్తునని విచ్చేసితివిదివో తపము

చ. 3: పుప్పొడితావులు చల్లు పువ్వులచప్పరములో
కొప్పు నన్నుఁ బెట్టుమన్న గుబ్బలాఁడి
తెప్పలుగ నినుఁగూడి తిరువేంకటేశ నిన్ను-
నెప్పుడుఁ బాయకున్నదిదివో తపము

రేకు: 0011-3 ముఖారి సం: 05-064

పల్లవి: కలగన్నచోటికిని గంప యెత్తిన యట్లు
అలవు మీఱినదెట్లనమ్మా

చ. 1: ఎలయింపుఁ గడకంట నెన్నఁడో వొకనాఁడు
చెలఁగి తను నతఁడు చూచినవాఁడట
పొలఁతి యదిదలఁచి యిప్పుడు మదనవేదనల-
నలసీ నీఁకనెట్లనమ్మా

చ. 2: ఎఱుకయును మఱపుగా నేఁటికో వొకనాఁడు
కెఱలి తను నొవ్వఁ బలికినవాఁడట
తఱినదియె చెలి యిపుడు దలఁచి పరితాపాగ్ని-
నఱగీ నీఁకనెట్లనమ్మా

చ. 3: ఇయ్యకోలుగఁ గలసి యెప్పుడో యిదెనేఁడు
నెయ్యమున చెలిలోన నెలకొనెనట
తియ్యముల సటకాఁడు తిరువేంకటేశ్వరుఁడు
అయ్యో యిఁకనెట్లనమ్మా

రేకు: 0011-4 కాంభోది సం: 05-065

పల్లవి: పొందెఱుఁగుదునందువు భోగినందువు నీ-
యందరు సతులకు నేనాకు మడిచిత్తునా

చ. 1: ఎవ్వతెకైనాఁ జనవిచ్చేవు మెచ్చేవు నీ-
నవ్వులకైనాను మన్ననఁ జూచేవు
అవ్వలి యివ్వలి నీ యంగనల వొద్దను
పవ్వళించి వుండఁగా నే బాదములొత్తుదునా

చ. 2: ఏపున నెక్కడికైనా నేఁగేవు దాఁగేవు నీ-
కోపాన నాతోనైన మేకులు సేసేవు
వైపున నీవెందుండైనా వచ్చిన నేనంతలో-
నోపికనప్పుడు నీ కూడిగాలు సేతునా

చ. 3: వేడుకలెందైనాఁ బారవేసేవు నీ-
వాడికచేఁతలెన్నైనా వన్నె వెట్టేవు
ఈడు లేని తిరువేంకటేశ కూడితివి నన్ను
వాడుచు నీ తోడ నేను వాసి చూపఁగలనా

రేకు: 0011-5 పాడి సం: 05-066

పల్లవి: సుతుని నరకునిఁ జంప జూచినాఁడవు సుమ్మీ
మతి నన్నుఁ దలచక మానిన నీకాన

చ. 1: ఎత్తుక నీతోడఁ బుట్టు హిరణ్యకశిపుని
నెత్తురు దాగితి సుమ్మీ నేఁడే రాకుంటే
ఉత్తలాన నేడనైనా నుండుదువో యని భీతి
బిత్తరముగాఁ బెట్టితి పెట్టరాని యాన

చ. 2: కప్పుక నీ మేనమామ కంసుని ప్రాణానకు
తప్పినవాఁడవు సుమ్మీ తడసితేను
ఇప్పుడిట్టే నీవు రాని యీరసానఁ బ్రియములు
చెప్పలేక పాడిచితి చెడుగైన యాన

చ. 3: సిరుల మేన మరఁది శిశుపాలు నీ విట్టే
పొరిగొంటివి సుమ్మీ పోయితే నీవు
తిరువేంకటేశ నన్నుఁ దివిరి కూడి వని
కరుణఁ బెట్టితి నీకుఁ గపటాన నాన

రేకు: 0011-6 శుద్ధవసంతం సం: 05-067

పల్లవి: చాలదా యీా చనవులు
మేలపు సేఁతల నిన్ను మెచ్చించ గలిగె

చ. 1: ఎంతటిదిరా నిన్ను విందాఁక రానీక
పంతమాడి వలపించి బాసగొన్నది
ఇంతి నోఁచినట్టి నోము యెటువంటిదో నీ
చెంతఁజేరీ నీ మంచి చెక్కు నొక్కఁగలిగె

చ. 2: ఎవ్వతెరా నిన్ను నెలయించి తన నిండుఁ
జవ్వనము విలువిచ్చి జట్టి గొన్నది
అవ్వల దాని భాగ్యమది యెట్టిదో నీవు
పవ్వళించు పరుపుపై పవ్వళించఁ గలిగె

చ. 3: ఎట్టిదిరా సతి నిన్ను యింటిలోన వెళ్ళనీక
పట్టుకొని కౌఁగిటిలోఁ బాయనీనిది
అట్టె నిన్ను తిరువేంకటాధీశుఁడా నీవు
దట్టించు నీ కౌఁగిటిలో తగులఁగఁ గలిగె

రేకు: 0012-1 ఆహిరి సం: 05-068

పల్లవి: చక్కఁదనములచేత జవ్వన భారము చేత
యెక్కడౌటాఁ గానదిఁక నేమి సేతమే

చ. 1: ఒయ్యనె బంగారు తూఁగుటుయ్యాల మంచముమీఁద
పయ్యెద చెఱఁగు జారఁ బవ్వళించి
ముయ్యక మూసిన రెప్ప మూయుచుఁ దెరచుఁ గాని
నెయ్యమునఁ జూడనేరదేమి సేతమే

చ. 2: ముత్తేల గద్దియమీఁద ముద్దుల కురులు దూల-
నొత్తిలి యొకతె మీఁద నొరగుండి
చిత్తగించి చేతనున్న చెంగలున బంతిఁ జెక్కు-
లొత్తుఁగాని మాటలొల్లదేమి సేతమే

చ. 3: కమ్మని తావులతోడ కన్నుల నవ్వులతోడ
చిమ్ముఁ జెమటలతోడఁ జెలువొంది
కొమ్మకు నేడుఁగలిగె కోనేటిరాయని పొందు
నెమ్మనము దాఁచ నేరదేమి సేతమే

రేకు: 0012-2 ఆహిరి సం: 05-069

పల్లవి: దవ్వుల నుండవే యాల దగ్గరేవు ఆతఁ-
దెవ్వరౌతా నెఱఁగవిదేమే చెలియా

చ. 1: ఒద్దికతో చనుదోయి నొరయుచు కంట-
నద్దలింపుచుఁ దిట్టేవు అమ్మమీఁదను
ముద్దుమోము విరియించి మురిసేవు ఇంత
వద్దువో ఆతనితో గర్వము నీకుఁ జెలియా

చ. 2: బొమ్మముడి జంకెనలఁ బొలయుచు మోవిఁ
దమ్మచూపి సన్న సేసి తనరేవు
చిమ్మేవు నీ చెమటలు చెక్కు మీఁద ఓ-
యమ్మరో యాతనితో వొయ్యార మేలే చెలియా

చ. 3: మొరము మెట్టెలు పాదమున మెట్టి
చెరఁగులోపల గోరఁ జెనకేవు
కరఁగి వేంకటపతి కౌఁగిట నీ-
నెరతనములు చూప నేర్తువా చెలియా

రేకు: 0012-3 శంకరాభరణం సం: 05-070

పల్లవి: తరుణి నీ యలుకకెంతటిదింతినీ వేళఁ
గరుణించఁగదర వేంకటశై లనాథా

చ. 1: ఒకమారు సంసారమొల్లఁ బొమ్మని తలఁచు
ఒకమారు విధిసేఁతలూహించి పొగడు
ఒకమారు తనుఁజూచి వూరకే తలవూఁచు-
నొకమారు హర్షమున నొంది మే మఱచు

చ. 2: నిన్నుఁ జూచి వొకమారు నిలువెల్లఁ బులకించు
తన్నుఁ జూచి వొకమారు తలపోసి నగును
కన్ను దెరచి నినుఁజూచి కడు సిగ్గువడి నిలిచి
యిన్నియునుఁ దలపోసి యింతలో మఱచు

చ. 3: వదలైన మొలనూలు గడియించు నొకమారు
చెదరిన కురులెల్లఁ జెరుగునొకమారు
అదనెరిఁగి తిరువేంకటాదీశ పొందితివి
చదురుఁడవు నినుఁ బాయఁజాలదొక మారు

రేకు: 0012-4 బౌళి సం: 05-071

పల్లవి: మోహము సేయించుకొని మురిసేవు నీ-
సాహసములె దురా చదురాలికిపుడు

చ. 1: ఒక్క చక్రమె నీకునున్నది గాని, యింతిఁ
రెక్కల చక్రాలె పో రెండు గుబ్బలు
మక్కువ సేయించుకొని మలసేవు నీ-
చక్కఁదనమెదురా జవరాలికిపుడు

చ. 2: నీలమేఘము చాయ నీమేను గాని పెద్ద-
నీలమేఘమే పో నెలఁత కొప్పు
జాలిఁ బొరలించేవు సతిని నీవు నీ-
తాలిములెదురా తరుణికి విపుడు

చ. 3: మరుని ప్రతినిధి నీ మహిమ గాని ఆ-
మరుని సంపదే పో మగువ నేఁడు
తిరువేంకటేశ పొందితివి గాని నీ-
సరసము లెదురా సకియకు నిపుడు

రేకు: 0012-5 పాడి సం: 05-072

పల్లవి: వచ్చెరా మా యమ్మతోడు వన్నెలుగావు నీ-
మచ్చరములెల్ల మాని మందకేఁగ నియ్యరా

చ. 1: ఓసోసి యెందు వొయ్యేవే వొయ్యారపుగొల్లెతా
దోసము మమ్మునంటక తొలఁగరటు
మూసేవే గుబ్బలఁ గొంగు మురిపెంపుగొల్లెతా
మూసినది చీరకొంగు మందకేఁగ నియ్యరా

చ. 2: సానఁ బట్టేవే మాటలే చల్లజంపు గొల్లెతా
నేనేమి బాఁతిరా నీకు నెరజాణా
కానిలే రావైతివిగా గబ్బిచూపుగొల్లెతా
మానమువంకఁ జూడక మందకేఁగ నియ్యరా

చ. 3: జంకించేవే బొమ్మలను జవ్వనంపుగొల్లెతా
వేంకటవిభుఁడ నీకు వెరతుమయ్య
అంకపు గుబ్బలను నన్ను నదిమేవె గొల్లెతా
మంకుఁ గూటములు మాని మందకేఁగ నియ్యరా

రేకు: 0012-6 దేసాళం సం: 05-073

పల్లవి: కులుకక నడవరో కొమ్మలాలా
జలజలన రాలీని జాజులు మా యమ్మకు

చ. 1: ఒయ్యనే మేను గదిలీ నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాదతాఁకు కాంతలాలా
పయ్యెద చెఱగు జారీ భారపు గుబ్బలమీఁద
అయ్యో చెమరించె మా యమ్మకు నెన్నుదురు

చ. 2: చల్లెడి గందవొడి మైజారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు బణఁతులాల
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర
గల్లనుచుఁ గంకణాలు గదలీ మాయమ్మకు

చ. 3: జమళి ముత్యాలతోడి చమ్మాళిగ లిడరో
రమణికి మణుల నారతులెత్తురో
అమరించి కౌగిట నలమేలుమంగనిదె
సమకూడె వేంకటేశ్వరుఁడు మాయమ్మకు

రేకు: 0013-1 ఆహిరి సం: 05-074

పల్లవి: కొమ్మ తన ముత్యాల కొంగు జారఁగఁ బగటు
కుమ్మరింపచుఁ దెచ్చుకొన్నదీవలపు

చ. 1: ఒయ్యారమున విభుని వొరపు గనుఁగొని రెప్ప
ముయ్యనేరక మహ మురిపెమునను
కయ్యంపుఁ గూటమికిఁ గాలుదువ్వుచు నెంతె
కొయ్యతనమునఁ దెచ్చుకొన్నదీవలపు

చ. 2: పైపైనె ఆరగింపకుము పన్నీరు గడు-
తాపమవునని చెలులు దలఁకగానే
తోపు సేయుచుఁ గెంపు దొలఁకుఁ గన్నుల కొనల
కోపగింపుచుఁ దెచ్చుకొన్నదీవలపు

చ. 3: ఎప్పుడునుఁ బతితోడ నింతేసి మేలుములు
ఒప్పదని చెలి గోర నొత్తఁగానే
యెప్పుడో తిరువేంకటేశు కౌఁగిఁట గూడి
కొప్పుగులుకుచుఁ దెచ్చుకొన్నదీవలపు

రేకు: 0013-2 ముఖారి సం: 05-075

పల్లవి: పొదలు నీ సొబగెల్ల పోదేల కొల్ల
తుదలేని నీ మేలు దొరకెఁగా నాకు

చ. 1: ఒడలిపై నీచెమట వూరు వాడెడు చెలమ
జడియు నీ తమకంబు సంత తగరు
కడగంటి నీచూపు కట్ట వదలిన క్రేపు
వడి నిన్నుఁ గరఁగింప వశమా నాకు

చ. 2: చిఱునవ్వు నీపలుకు జిగురు చుట్టిన కండె
తెఱవలకు నీ మోవి తెరువు పెసరు
పఱచు నీనునుఁజేఁత బట్టబాయిటి యీఁత
తఱి నిన్నుఁ బైకొనఁగ దరమా నాకు

చ. 3: చెలువంపు నీ చెలిమి చెఱకు వండిన పండు
కెలపు నీ యలుక తంగేటి జున్ను
చలివాపు నీచనవు జాజులుఁ బ్రాసాదంబు
కలిగె నీకరుణ వేంకట విభుఁడ నాకు

రేకు: 0013-3 ఆహిరి సం: 05-076

పల్లవి: మచ్చికల మొగసిరి మందులాఁడ నీ-
కిచ్చిన దేహమిది యెట్టయినఁ జేయరా

చ. 1: ఓడక యెక్కడనైన నుండి నీవు
వేడుకతో మాయింటికి విచ్చేయఁగాను
వాడుమోముఁ జూచి నవ్వువచ్చుఁ గాని కోప-
మేడఁ దెచ్చుకొన్నరాదు యెట్టైనాఁ జేయరా

చ. 2: ఎంతవొద్దు వోయియైనా యెటునీవు
వింతలేక మాయింటికి విచ్చేయఁగాను
చింతతో నీ కెదురు చూచితి గాని
యెంతైనాఁ బాయలేను యెట్టయినాఁ జేయరా

చ. 3: కుంకుమచెక్కుల మెఱుఁగులతోడ తిరు-
వేంకటేశ మాయింటికి విచ్చేయఁగాను
వంకటాడి నినుఁ గూడవలెఁగాని
యింక నిన్నుఁ బాయలేను యెట్టయినాఁ జేయరా

రేకు: 0013-4 ఆహిరి సం: 05-077

పల్లవి: వలపు నిలుపలేని వారము నేమటుగాన
పలుమారు బట్టుకోన్నఁ బయికొనవేలరా

చ. 1: ఒత్తి నీవాడినమాటకోరువఁ జాలక నే-
ముత్తరమిత్తము గాని ఊరకుండలేమురా
బత్తి గొట్టానఁ బెట్టఁగఁ బనిలేదు వోరి నీ-
చిత్తమింతేకాని యిఁక జెప్పనేమున్నదిరా

చ. 2: కాఁకఁల బెరిగినట్టి కళవళమున నిన్నుఁ
దాఁకనాడుదుము గాని తడవుండలేమురా
యేఁకటఁ జెందినయట్టి యింతుల మాటకు నీవు
సోఁకోరువవలెఁ గాక చురుకనరాదురా

చ. 3: సారెకు నీవెడసిన సైఁచలేము నీవు
చేరువనలిగి మమ్ముఁ జేకొనవేరా
ధీరుఁడవు కోనేటితిరువేంకటేశ నన్ను
గారవించి యిట్లానే కరుణించఁ గదరా

రేకు: 0013-5 శంకరాభరణం సం: 05-078

పల్లవి: అహో సురతివిహారోయం సహజ పరాజయశంకా నాస్తి

చ. 1: యమునాకూలే సమలతాగృహే విమలసైకత వివిధస్థలే
రమణీరమణౌ రమతస్తనేయోః ప్రమదస్య పరాత్పరం నాస్తి

చ. 2: రజనీ కావా ప్రాతః కింవా త్యజనం భజనం తత్కింవా
విజయః కోవాపజయః కోవా భుజపరిరంభ స్ఫుటం నాస్తి

చ. 3: చీనాంశుక రంజితమేఖలావి తానే జఘనంతరతి సతి
మానవికలనే మానినీమణే హీనాధిక పరిహృతి నాస్తి

చ. 4: కింవా మిళనం కింవా మిళనం త్వం వాం హంవా తన్నాస్తి
సంవాదో వా సరసః కోవా కింవా వాచ్యా క్రియా నాస్తి

చ. 5: ఆదిదేవ పీతాంశుక బద్ధా స్వేద సురభి కాశ్మీరజలం
సాదురుంహ్యాం లజ్జావివశతయా ఖేదేన వచః కించిన్నాస్తి

చ. 6: వరకుచాగ్ర సంవ్యానం కరేణ హరౌ పరం పరిహరతి సతి
సరసలోచనంచల వివశతయా తరుణ్యాం చైతన్యం నాస్తి

చ. 7: సురతాంతశ్రమ సుఖం కింవా వరలజ్జా సావా కావా
పరమశతను వైభవం కింవా నిరతాం తయో నికృతిం నాస్తి

చ. 8: పరమళ భరిత ప్రచుర సుశీతల వరమృదువాయౌ వాతి సతి
తిరువేంకటగిరిదేవ రాధయో స్సరసరతి సుఖశ్రాంతిర్నాస్తి

రేకు: 0014-1 శ్రీరాగం సం: 05-079

పల్లవి: విరహమొ సంభోగంబుల వెడుక శృంగారమొ యిది
సరసిజముఖిఁగని ప్రాణము జల్లనఁ గలఁగెడిసే

చ. 1: కుటిలాలకి మైఁబూసిన కుంకుమగంధపు రసములు
చిటిపొటి చెమటలఁ బెనఁగొని చిప్పిలి రాలఁగను
విటరాయని యలరమ్ములు వీఁపున వెడలఁగ నాఁటిన
తొట తొటఁ దొరిగిన నెత్తురుతోఁ దులదూఁగెడినే

చ. 2: మృగలోచన చనుఁగవపై మెత్తిన కమ్మని తావుల
మృగమదమంటినచోట్లు మెఱుఁగులు వారెడిని
చిగురాకున మరుఁడేసిన చిచ్చిరబాణంబులచే
ఎగసిన పొగలై తోఁచీ నేమని చెప్పుదునే

చ. 3: యోగవియోగంబులచే నొనగూడిన యీ చెలియకు
నాగరికంబుల చేఁతలు నటనలు మీరఁగను
శ్రీగురుఁడై చెలువొందిన శ్రీవేంకటగిరి నిలయుని
భోగించిన పరిణామపు పొందులు దెలిపెడినే

రేకు: 0014-2 నాదరామక్రియ సం: 05-080

పల్లవి: చెలియకు విరహపు వేదన సేయని సింగారంబిది
సొలవకు వలపుల ముద్రల చొప్పులు మాపకువే

చ. 1: కిక్కిరిసిన చనుగుబ్బలు గీఁటిన బగిలెడి నయ్యో
పక్కనఁ గనుకలి దాఁకీ బయ్యెద దెరవకువే
వెక్కసమగు ముఖకాంతికి వెడవెడ మరుఁగై తోఁచెడి
చెక్కుల చెమటలు గందెడి చేతులు వెట్టకువే

చ. 2: అంగన మేనికిఁ బులకలు అడ్డము దోఁచెడి నయ్యో
బంగరు మొలకలవంటివి పైపైఁ దుడువకువే
తొంగలి రెప్పల కెలఁకుల తొరిగెడి కన్నుల మెరుఁగుల
ముంగిటవేసిన చూపుల మురిపెము మానుపువే

చ. 3: తిరువేంకటపతినింతికి దెచ్చెదమనఁగా నయ్యో
కరుణించినవాఁడాతఁడె కళవళమందకువే
తరుణీమణి మా దేవునిఁ దగఁ గౌఁగిట సౌఖ్యంబులు
పరవశమందినదేమో పలుమరుఁ బిలువకువే

రేకు: 0014-3 పాడి సం: 05-081

పల్లవి: అంత సేయకుండితే నే నాఁటదాననా
పంతపు నీ బిగువెల్ల బయట వేయింతునా

చ. 1: కూరిమి సతుల భీతి గోర నన్ను నంటనీక
సారెకుఁ దప్పించు కొంటా సాము సేసేవు
యేరా నీకు నింత వెరపిటువంటి నిన్ననే పో
జీరలు మేనెల్లఁ జేసి సిగ్గు విడిపింతునా

చ. 2: మొక్కుచుఁ గెమ్మోవి మీఁద మోవనియ్యవేర పల్లు
వెక్కసపు తమకాన విఱ్ఱ వీఁగేవు
చిక్కితి వెక్కడికి విచ్చే సేవు నిన్ను నే
దక్కగొని మదన విద్యలనే చొక్కింతునా

చ. 3: ఎక్కువ నామేని జవ్వాదిందరుఁ దెలిసేరంటా
మిక్కిలి నీ మేనితావి మెరయించేవు
చక్కని వేంకటగిరి స్వామి నన్ను గూడితివి
గక్కన నాచూపు నీకుఁ గావలి వెట్టింతునా

రేకు: 0014-4 నాదరామక్రియ సం: 05-082

పల్లవి: ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా

చ. 1: కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరే చెలులు
నలువున బ్రాణేశ్వరుపై నాటిన యాకొన చూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా

చ. 2: పడఁతికి చనుఁగవ మెఱుఁగులు పైపై బయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖ శశి రేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల గాదు గదా

చ. 3: ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁ జెమటల అందము గాదు గదా

రేకు: 0014-4 శ్రీరాగం సం: 05-083

పల్లవి: చిమ్మకువే గోళ్ళంత జీరలయ్యీని
చిమ్ముఁ జెమటల నిన్నుఁ జిక్కించె నతఁడు

చ. 1: కులికి నవ్వకువే కొప్పు వీడీని బెట్టు-
పలుకకువే మోవి బయలయ్యీని
వులికి పడకువే వొళ్ళు నొచ్చీని ని-
న్నెలయించి వలపుల నింత సేసె నతఁడు

చ. 2: కన్నుల మొక్కకువే కాఁక రేఁగీని నీ-
వన్నెలు చూపకువే వడ చల్లీని
సన్నలఁ దిట్టకువే చలమెక్కీని నిన్ను
మన్ననలనే సిగ్గు మరపించె నతఁడు

చ. 3: గుట్టున నడవవే కొంగు జారీని యింత-
తట్టుపుణుఁగేఁటికే తల నొచ్చీని
గట్టిగ శ్రీ తిరువేంకటరాయఁడు నిన్నుఁ
బెట్టని చోట్లఁ బెట్టిఁ పెద్దసేసె నతఁడు

రేకు: 0014-5 ఆహిరి సం: 05-084

పల్లవి: లంజకాఁడవౌదువురా లంజకాఁడవౌదువు నీ లాగులెల్లఁ గానవచ్చె
ముంజేతఁ బెట్టిన సొమ్ములకద్దమేలరా

చ. 1: కొంకక యెవ్వతో కాని కోరి నీబుజము మీఁద
కంకణాల చేయి వేసి కౌఁగిలించఁ బోలును
వంకలైన వొత్తులెల్ల వడిఁ గానవచ్చె నింక
బొంక నేమిటికిరా నీ బూమెలెల్లఁ గంటిమి

చ. 2: ఒద్దిక నెవ్వతో గాని వోరి నీవురము మీఁద
నిద్దిరించఁ గంటమాల నీలములొత్తినది
తిద్దిన జాణవుగాన తిరిగి తిరిగి మాతో
బద్దనేఁటికిరా నేఁ బచ్చి సేయఁ జాలను

చ. 3: వేడుక నెవ్వతో తిరువేంకటేశ్వర నిన్ను
కూడిన నీమేనితావి కొల్ల వట్టుకొన్నది
తోడనె నాకౌఁగిటిలో దొరకొంటి వింక నిన్ను-
నాడ నేమిటికిరా నా యలపెల్లఁ దీరెను

రేకు: 0015-1 ఆహిరి సం: 05-085

పల్లవి: లేత మాయలు నీకు నింతేసి పూత సిగ్గులే బూమిలో వారికి
యీాఁత వలపు చిత్తములోన నెవ్వరికైనాఁ దెలుసునే

చ. 1: కొప్పునఁ జిన్ని కొనలు సాగ కురులు దురుమ నేఁటికే
కుప్పలే గాఁగఁ జెక్కులదాఁ క కుంకుమ పూయనేఁటికే
ముప్పిరి గొసఁగ రెప్పల తుదల ముద్దులు గునియ నేఁటికే
నిప్పక సెలవిఁబార నవ్వుచు వింతలు సేయనేఁటికే

చ. 2: గుబ్బల మించులు పయ్యెద వెడల కులికి నడవ నేఁటికే
గబ్బితనము చూపులోని కలికి లాగుల లేఁటికే
వొబ్బిడియైన చెలుల లోన వొయ్యారము లేఁటికే
అబ్బుర పడఁ జూచిన వారి కాసలు సేయనేఁటికే

చ. 3: కొండల తిమ్మని జూచి లోలో కుతిల కుదువ నేఁటికే
కొండుక వయసు వారికింత గుట్టున నడవ నేఁటికే
యెండయు నీడయు నిపుడె కంటి మెమ్మెలఁ బొరల నేఁటికే
కొండత మేలు సేసిన వారిని కొడి మెలెన్న నేఁటికే

రేకు: 0015-2 తెలుఁగుఁగాంబోది సం: 05-086

పల్లవి: చెట్ట వట్టేవేరా నన్నుఁ జెంచుదానిని
పుట్టతేనెలారగించి పోకవుండేవా

చ. 1: కుదురు గదలని నాగుబ్బలే చూచితి గాని
గదరుఁ బుణుఁగు కంపు గానవైతివిగా
చిదిమినా నెఱిఁగవు చేరేవు నా పొగడని
గుదికొన్నమరునమ్ము గుండె దాఁకెనా

చ. 2: తొరంపు నా మెఱుఁగుల తొడలే చూచితి గాని
జీరల నాచెమటమ్మై చిత్తగించవా
కేరేవు నా పొడగని కిందుపడి నీవు నాకు
యీరాని చనవులెల్లా నియ్యనోపుదా

చ. 3: పిక్కటిల్లు తేనెల నా పెదవే చూచితి గాని
చొక్కపు నా యెంగిలిని చూడవైతిగా
ఇక్కువ గరఁగి వేంకటేశ నన్నుఁ గూడితివి
వొక్కనిమిషమోరవ నోపవైతిగా

రేకు: 0015-3 శ్రీరాగం సం: 05-087

పల్లవి: తేనెయు నేయు నంపోవు తీపుమాటల
కానీలే తేనెయు నేయుఁ గాదా నీయలుక

చ. 1: కప్పురమే యంపోవు కటకటా అందుతోనే
అప్పుడైనా నిమ్మపండు నంపవైతివి
కప్పురగంధికి నీ కరుణ లేకుండుటే
కప్పురము నిమ్మపండుఁ గాదా నీయలుక

చ. 2: సంపెంగనూనె యంపేవు సారెసారె నందుతోనె
అంపవైతి గన్నెరలు అప్పుడైనాను
ఇంపులేని కోమలికి నేఁటికి సంపెంగనూనె
కంపులును గన్నెరలుఁ గాదా నీయలుక

చ. 3: నేరేడుఁ బండ్లే యంపేవు నెలఁతకు నందుతోనె
ఆరనియానవాలై నా నంపవైతివి
కోరి వేంకటేశ యింతిఁ గూడితిగాక లేకుంటే
నేరేడుఁబండ్లుఁ బాలును నేఁడేపో నీయలుక

రేకు: 0015-4 కన్నడగౌళ సం: 05-088

పల్లవి: ఏమనఁగలదిఁకఁ గాలము యింతయు విపరీతములై
భామినిదేము పరితాపంబున వేఁగెడిని

చ. 1: కప్పురమియ్యని వీడెము గైకొనకొల్లని కాంతకు
కప్పురమంటిన చోట్లే కడుఁగడుఁ దొక్కెడిని
పుప్పొడివెన్నెల పొళ్ళు (?) పొలఁతికి వెన్నెల బాయిలు
నిప్పులఁ దోఁగినయట్లే నిలువునఁ గాఁగెడిని

చ. 2: పానుపు పువ్వులఁ బరవక పవళింపుని సతి పూవులఁ
పానుపు కన్నులఁ జూచినఁ బరవశమందెడిని
లేనగవొదవని మాటలు లేనిలతాంగికి నగవులు
కానుకపట్టిన నొల్లక కన్నుల విసిగెడివి

చ. 3: కందర్పుని గురుఁడనఁగాఁ గలిగిన తిరువేంకటపతి - చందము చూపుల బామిని చనవున నొప్పెడిని
ఇందు వదనకే దేవుఁడు యింపులఁగడు మన్నించిన
కందువ పొలయలుకలఁ దమకమువడి రేఁపెడిని

రేకు: 0015-5 ముఖారి సం: 05-089
పల్లవి: ఆతఁడేపో చెలియా మాయాతఁడు
చేతనే పరము చూపి చెలువైన యాతఁడు
చ. 1: కుప్పలుగాఁ గస్తూరియు కుంకుమయు మయినిండ -
నప్పళించుకొని యున్న యాతఁడు
గొప్పగొప్ప ముత్తేల కుప్పె సవరము పెద్ద -
కొప్పుతోఁ జెలఁగీనదె కో మా యాతఁడు
చ. 2: మలయుఁ జెక్కుల నవ్వు మకర కుండలముల
అలర నిగ్గులె చల్లే యాతఁడు
బలువైన ముత్యాల పదకాల హరాల
వెలుఁగొందీ నదె చూడవే మా యాతఁడు
చ. 3: సంకుఁ జక్రపుఁ జేతుల సందుల బాహుపురుల
అంకెలఁబ్రభల మించే యాతఁడు
వేంకట నగము మీఁద విభవంపుఁ గౌఁగిలి నా -
కుంకువగా నిచ్చె నదెకో మా యాతఁడు

రేకు: 0016-1 సామంతం సం: 05-090

పల్లవి: వద్దు నాతో బొంక నిటువలె నీకు నీ -
సుద్దుల కాఁకల మంట సొద చొచ్చేరా

చ. 1: కనలి నే నపరాధిఁ గానని కలికి నీ -
కొనచూపులనే యలుగులఁ బారేనే
యెనసి యెవ్వతెకొ మోహింతువని నీ మోవి
మనసార నాలిక మద్దువట్టే రా

చ. 2: మఱచి యెవ్వతెతో నే మాటాడనని నీ -
చిఱునవ్వు నిప్పులు దోసిట ముంచేనే
తెఱలఁ గాఁగిన నీ దేహపు టుక్కుఁ గంబము
కఱతలిన్నియు నని కౌఁగిలించేరా

చ. 3: నెలఁత దక్కితినని నీ వీడెపు రసము
చలివాయ నిపుడు పోసము దాగేనే
కలసియు నన్ను వెంకటరాయ కపటాన -
నలయించేవని నీపై నాన వెట్టేరా

రేకు: 0016-2 వరాళి సం: 05-091

పల్లవి: పన్నీరు చల్లెరా నీపై పలచని దెవ్వతో
అన్నువయలపుతోడ నసలాయఁ జెక్కులు

చ. 1: కప్పురము చల్లె నీపై కలికి యదెవ్వతో
యిప్పుడె నీ వురమెల్ల నెఱ్ఱ నాయను
చెప్పరాని మురిపెంపు చేఁతలెల్ల నాకును
కప్పిఁన గప్పుఁగరాని గతులాయ నిప్పుడు

చ. 2: మృగనాభి చల్లె నీపై మెలుఁత యదెవ్వతో
తెగువ నీమోమెల్ల తెల్లనాయను
నగపు మేలము గాదు నమ్మరా నా పలుకు
సగవాయ నిప్పుడే యీా చక్కని నీ దేహము

చ. 3: కుంకుమ చల్లెర నీపై కోమలి యదెవ్వతో
సంకె దేరి నీమేనెల్లా చల్లనాయను
వేంకట విభుఁడ నీకు వెచ్చమైతిఁ జెప్పరా
వుంపకుగా నాకు నబ్బె ఉదుటు నీచేఁతలు

రేకు: 0016-3 ఆహిరి సం: 05-092

పల్లవి: కుందణంపుమై గొల్లెత తా -
నెందును బుట్టని యేతరి జాతి

చ. 1: కప్పులు దేరేటి కస్తూరి చంకల
కొప్పెర గుబ్బల గొల్లెత
చప్పుడు మట్టెల చల్లలమ్మేడిని
అప్పని ముందట హస్తిణిజాతి

చ. 2: దుంప వెంట్రుకల దొడ్డతురుముగల -
గుంపెన నడపుల గొల్లెత
జంపుల నటనలఁ జల్లలమ్మేడిని
చెంపల చెమటల చిత్తిణిజాతి

చ. 3: వీఁపున నఖములు వెడవెడ నాఁటిన
కోపపుఁ జూపుల గొల్లెత
చాఁపున కట్టిగఁ జల్లలమ్మేడిని
చాపేటి యెలుగున శంకిణిజాతి

చ. 4: గారవమున వేంకటపతి కౌఁగిట
కూరిమిఁ బాయని గొల్లెత
సారెకు నతనితో చల్లలమ్మేడిని
బారపుటలపుల పద్మిణిజాతి

రేకు: 0016-4 ముఖారి సం: 05-093

పల్లవి: సతి గర్వమిది నీ తేజము గాదా
అతివఁ బ్రేమముతోడ నాదరించవయ్యా

చ. 1: కనకపుఁ జమ్మాళిగలు మెట్టియల జ-
వ్వని గర్వమున నిట్టె వచ్చి వచ్చి
వెనక వెనకకె పోయీ వెఱచి దేవరఁగని
కనకపందలము గక్కన నంపవయ్యా

చ. 2: అడప తొయ్యలి తన కాకు మడిచియ్యఁగా
నడపుల మురిపేన నవ్వుచు వచ్చి
అడరి నీ పొడగని ఆకదే తనకుఁ దానె
మడుచుకొనెడి నీవె మడిచియ్యవయ్యా

చ. 3: కొప్పున సంపంగిరేకులు గానరాఁ జెరిగి
కప్పుచు నెరుల నిన్నుఁగని కలికి
యెప్పుడునుఁ దిరువేంకటేశుఁడ నీ వెఱపెల్ల
చెప్పరాని తమకమే చిత్తగించవయ్యా

రేకు: 0016-5 భైరవి సం: 05-094

పల్లవి: గోళ్ళు మీఁటుచునుండెఁ గొన్నాళ్ళు గొల్ల-
వీళ్ళ పాలారగించె వీఁడు కొన్నాళ్ళు

చ. 1: కోడెకాఁడ్డై తిరిగెఁ గొన్నాళ్ళు తాఁ
గోడెల నావుల- గాచెఁ గొన్నాళ్ళు
కోడెల వల్లైతాడ్డై గొల్లైతలా తాఁ
గూడి పైకొననుండెఁ గోరి కొన్నాళ్ళు

చ. 2: గుజ్జు రూపము ధరించెఁ గొన్నాళ్ళు
గుజ్జనగూళ్ళారగించెఁ గొన్నాళ్ళు
గుజ్జుబాలకిఁ దగిలెఁ గొన్నాళ్ళు తా
బొజ్జెనె లోకము నించె పొందుగఁ గొన్నాళ్ళు

చ. 3: కొండ గొడుగుగాఁ బట్టెఁ గొన్నాళ్ళు తాఁ
గొండముచ్చుల నేలెఁ గొన్నాళ్ళు
కొండల కోనేటివాఁడ్డై కోరికలా తాఁ
గొండుక చేఁతలు దొంకొనియెఁ గొన్నాళ్ళు

రేకు: 0016-6 ముఖారి సం: 05-095

పల్లవి: దొరకెఁగా పూజ కందువపూజ నీ-
విరహపు తనుతావి విరవాదిపూజ

చ. 1: కలికి నీ కనుచూపు కలువరేకులపూజ
లలన నీ నగవు మొల్లల పూజ
తలపోఁత చింత చిత్తపుఁ గమలపు పూజ
చలివేఁడి పూర్పు నీ సంపంగి పూజ

చ. 2: కవలుఁ జెక్కునఁ జేయి కరపల్లవపు పూజ
తనుపులకలు జాజినలపూజ
తనరు నీవలులు దొంతరపూవుల పూజ
మొనయుఁ జెమట మల్లె మొగ్గలపూజ

చ. 3: చెనకు నీ గోళ్ళే చిఱుగేదఁగుల పూజ
గునియు గుబ్బలు పూవుగుత్తుల పూజ
ఘనతమైఁ గూడి వేంకటపతి మోము సోఁ-
కిన నీదుమోవి మంకెనపూవు పూజ

రేకు: 0017-1 ముఖారి సం: 05-096

పల్లవి: పసులు గాచేటి కోల పసపుఁ జేల
పొసఁగ నీకింతయేల బుద్ధుల గోల

చ. 1: కట్టిన చిక్కపు బుత్తి కచ్చకాయల తిత్తి
చుట్టిన పించెపుఁ బాగ చుంగుల సోగ
ఇట్టి సింగారము సేయ నింత నీకుఁ బ్రియమాయ
వెట్ట నీచేతల మాయ విట్టలరాయ

చ. 2: పేయలఁ బిలుచుకూఁత పిల్లఁగోవి బలుమోఁత
సేయరాని గొల్లెతల సిగ్గులచేఁత
ఆయెడలఁ దలపోఁత యమున లోపలి యీఁత
వేయరాని మోపులాయ విట్టలరాయ

చ. 3: కొంకులేని పాలయాట కూరిములలో తేట
అంకెల బాలులతోడి యాట పాట
పొంకపు తుత్తురు కొమ్ము పాలుపైన నీ సొమ్ము
వేంకటనగము చాయ విట్టలరాయ

రేకు: 0017-2 భైరవి సం: 05-097

పల్లవి: ఉగ్గు వెట్టరే వోయమ్మా చె-
యొగ్గీనిదె శిశువోయమ్మా

చ. 1: కడుపులోని లోకమ్ములు గదలీ-
నొడలూఁచకురే వోయమ్మా
తొడికెడి సరుగనఁ దొలఁగఁ దీయరే
పుడికెడి పాలివి వోయమ్మా

చ. 2: చప్పలు వట్టుక సన్నపుబాలుని-
నుప్పరమెత్తకురో యమ్మా
అప్పుడె సకలము నదిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా

చ. 3: తొయ్యలులిటు చేతుల నలఁగించక
పుయ్యల నిడరే వోయమ్మా
కొయ్య మాటలను కొండల తిమ్మని-
నొయ్యన తిట్టకురోరమ్మా

రేకు: 0017-3 దేసాళం సం: 05-098

పల్లవి: కొలనిదోఁపరికి గొబ్బిళ్ళో యదు-
కులము స్వామికిని గొబ్బిళ్ళో

చ. 1: కొండ గొడుగుగా గోవులఁ గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యులకెల్లను తల-
గుండు గండనికి గొబ్బిళ్ళో

చ. 2: పాపవిధుల శిశుపాలుని తిట్ల-
కోపగానికిని గొబ్బిళ్ళో
యేపునఁ గంసుని యిడుమలఁ బెట్టిన-
గోపబాలునికి గొబ్బిళ్ళో

చ. 3: దండి వైరులను తఱిమిని దనుజుల-
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండిఁ బైఁడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో

రేకు: 0017-4 కాంబోది సం: 05-099

పల్లవి: తమ్ములాల అన్నలాల తల్లులాల నే
నెమ్మనపు హరిఁ బాసి నిలువనేనిఁకను

చ. 1: కొమ్మలాల మరుకోట కొమ్మలాల వో-
యమ్మలాల తొలరె నా యక్కలాల
తమ్మిరేకుఁ గన్నుల యాతనిఁ బాసి నే-
నుమ్మల సొమ్మలచేత నుండలేనిఁకను

చ. 2: చెలులాల కలికి తొయ్యలులాల వో-
యెల జవ్వనముల మోహినులాల
చెలువంపు హరిఁ దలఁచిన నాకు నే -
నులుకుఁ గన్నీ రాఁపకుండలే నిఁకను

చ. 3: బోఁటులాల జవ్వనపు మేఁటులాల వో-
గాఁటపుఁ దురుముల చీఁకటులాల
వాఁటమైన వేంకటేశ్వరుఁ బాసి నే-
నాఁటదాననై జన్మమందలేనిఁకను

రేకు: 0017-5 పాడి సం: 05-100

పల్లవి: ఏఁటికిఁ జేరీనేమితఁడు
నాఁటించి రతి నన్నేలె

చ. 1: కన్నుల మొక్కీఁ గానుకలంపీ -
నెన్నటికెన్నఁడిదేమితఁడు
నిన్నట నుండియు నెయ్యమె పెంచీ
నన్నేలీతఁడు నవ్వీనే

చ. 2: పువ్వుల వేసీఁ బొంచుక లాసీ-
నెవ్వరికెవ్వరిదేమితఁడు
దవ్వుల నున్నాఁ దాపము రేఁచీ
రవ్వలనే కడు రాసీనే

చ. 3: కంపులె పూసీఁ గౌఁగిట మూసీ-
నింపులు నేసీనేమితఁడు
చెంపల చెమటల శ్రీ వేంకటేశుఁడు
అంపరాని విభుఁడాయఁ గదే

రేకు: 0017-6 శ్రీరాగం సం: 05-101

పల్లవి: సామాన్యమా వలపు సతులుఁ బతులనుభవన -
లేమరినఁ బ్రాణంబులేరీతి నుండు

చ. 1: కలికి చూపుల మనసు గరఁగ కెటువలె నుండు
అలయింతలను దేహమలయకేలుండు
బులుపుఁ బిలుపుల మేను పులకించకేలుండు
మొలకనగవుల యాస మొలవకేలుండు

చ. 2: పచ్చిచూపులు కాఁడి పారకెటువలెనుండు
వెచ్చనూర్పులు మనసు వేఁచకేలుండు
మచ్చికల హృదయంబు మరులు గొనకేలుండు
అచ్చలంబునఁ గాఁకలలమకేలుండు

చ. 3: దంటమాటలఁ గూర్మి దగుల కెటువలెనుండు
నంటునను మోహంబు నాఁటకేలుండు
గొంటుఁజేఁతల మనసు కొల్లగొనకేలుండు
రెంటలను విరహగ్ని రేఁచకేలుండు

చ. 4: కింకలను దమకంబు కెరలకెటువలె నుండు
జంకెనలఁ బ్రేమ కొనసాఁగకేలుండు
వేంకటవిభుఁనిఁ గలసి వెడయలుక యేలుండు
పంకజానన వానిఁ బాసియేలుండు

రేకు: 0018-1 మంగళకౌశిక సం: 05-102

పల్లవి: నేనేలెవ్వరునేల నీకింక లో-
లోనె వలపు లోఁచీఁ బోవయ్యా

చ. 1: కలువరేకులు నీకుఁ గానుక యిచ్చినదట
చెలఁగి నీవెందో విచ్చేయఁగాను
అలమి కన్నులనె నీ వందుకొంటివని యాకె
పిలిచీనంటాఁ బిలిచేరు పోవయ్యా

చ. 2: చిగురుఁదేనెలు నీపై చిలకించినదట
నగవు నీ వెందో నగఁగాను
జిగిగా నీ వపుడే చేకొంటివంటా నాపె
నొగిలీనంటా నొగిలేరు పోవయ్యా

చ. 3: మోవిపండు నీకు మోవినిచ్చినదఁట
మావికింద నీవు మలయఁగాను
శ్రీవేంకటేశ యిచ్చితివి కౌఁగిలి నాకు
నీ వెందు వలచినా నేనే పోవయ్యా

రేకు: 0018-2 శ్రీరాగం సం: 05-103

పల్లవి: గొల్లెతలకేలరా గోవజవ్వాది నీకు
చెల్లుఁగాక యెటువలెఁ జేసినా నన్ను

చ. 1: కట్టినది అంచులతొగరుఁ జీర సందిఁ
బెట్టినది మొలవంక పెద్దగాజు
మెట్టిన కంచుమట్టెల మించుమోఁత చేత-
బట్టినది చల్లచాడె పట్టకురా నన్నును

చ. 2: మాసినది తురుము చెమరుకంపు నే
వేసినది వెండికుప్పె వెంట్రుకదండ
వోసికొల్లు గొట్టి కంచుటుంగరాల చేయి
తీసేవు నీ చెల్లెతోడు తియ్యకురా నన్నును

చ. 3: ముంచినవి చెమటలు మోమునిండ కడు-
నంచినది చూడరా నావాలుఁజూపు
యెంచనేల నన్నునిట్టె యేలితివి వోరి
చెంచెతల లంజకాఁడ శ్రీవేంకటేశుఁడా

రేకు: 0018-3 పాడి సం: 05-104

పల్లవి: ఏతులే నెరప వచ్చినెవ్వఁడే వీఁడు తన-
రాతిగుండెతోడ నన్ను రమ్మనీనే చెలియా

చ. 1: కదిమిన చూపులకుఁ గన్నుల నవ్వుచు నా-
యెదురయి నిలుచున్నాఁడెవ్వఁడే వీఁడు
ఉదుటు మీరి తిరిగీ నొదిగి వీనిమదము
సదసేసి వడి నణఁచఁగదె వో చెలియా

చ. 2: చేరువనె నిలుచుండి చెలితో నవ్వఁగను
యీరసములే యాడీ నెవ్వఁడే వీఁడు
వారించకిటువంటివానిఁ బట్టి కొనగోరఁ
జీరలుగా నొడలెల్లఁ జించఁగదె చెలియా

చ. 3: చెంతనుండి నన్ను వేసీ సేమంతిపూవులనే
యెంత చెప్పినా మానఁడెవ్వఁడే వీఁడు
ఇంతటి యీ తిరువేంకటేశుఁడిదె నన్నుఁ గూడి
పంతము నెరపి పోయీఁ బట్టుకొనవే చెలియా

రేకు: 0018-4 లలిత సం: 05-105

పల్లవి: నిక్కమటే యీ మాట నిజమనేవు
నిక్కముగాక బొంకనేర్తుమా బాలుఁడా

చ. 1: కంటివటే వెన్న దియ్యఁగా గొల్లెతా ని-
న్నంటిమా మా వెన్న వోయనంటిమి గాక
ఇంటికి నే వచ్చితినటే గొల్లెతా మా-
యింటికిఁక నీకు రానేలయ్య బాలుఁడా

చ. 2: ఏలే మాకుఁ బాలు లేవటే గొల్లెతా నీకు-
నేలలేవు మమ్మునిట్టె యేఁచేవు గాక
పాల నేఁబండుట దలంపవే గొల్లెతా ఆ-
పాలు నీకునేల మా పాలేకాక బాలుఁడా

చ. 3: కల్లలాడ దొరకొంటిగా గొల్లెతా యేల
పల్లదాలు వేంకటాద్రిపై బాలుఁడా
చెల్లఁబో నన్నొల్లవటే చిన్ని గొల్లెతా నీకుఁ
జెల్లునిట్టె యేమైనఁ జేయవయ్య బాలుఁడా

రేకు: 0018-5 పాడి సం: 05-106

పల్లవి: అప్పటిని చెక్కు నొక్కే వందుకా యిది
యెప్పుడో కూడితిరి మీరిందుకా యిది

చ. 1: కుందనపు బొమ్మవలెఁ గోపగించుకొని రాఁగా-
నందలానఁ బెట్టుకొంటివందుకా యిది
జందెపు ముత్తెపుఁ బేరు సందులదండల నిట్టే
యిందమంటానింతికిచ్చితిందుకా యిది

చ. 2: దీకొని కోమలి నిన్నుఁ దిట్టుచు దగ్గరి రాఁగా
ఆకు మడిచియ్యఁ జూచేవందుకా యిది
మీకు మీకే మందటాడి మీరు మీరేమీలోన
యేకమై కూడితిరి మీరిందుకా యిది

చ. 3: ముద్దులమోముల మీ మీ మోవులపై చేఁతలెల్ల
నద్దములోపలఁ జూచేరందుకా యిది
తిద్దుకొంటిరి రతులు తిరువేంకటేశ మీ-
యిద్దరికి నింపులాయ నిందుకా యిది

రేకు: 0018-6 పాడి సం: 05-107

పల్లవి: చక్కని తల్లికి చాఁగుబళా తన-
చక్కెరమోవికి చాఁగుబళా

చ. 1: కులికేటి మురిపెపు గుమ్మరింపుఁ దన-
సళుపుఁ జూపులకు చాఁగుబళా
పలుకుల సొలపులఁ బతితోఁ గసరెడి-
చలముల యలుకకు చాఁగుబళా

చ. 2: కిన్నెరతోఁ బతి కెలన నిలుచుఁ దన-
చన్ను మెఱుఁగులకు చాఁగుబళా
ఉన్నతిఁ బతిపైనొరగి నిలుచుఁ దన-
సన్నపు నడిమికి చాఁగుబళా

చ. 3: జందెపు ముత్యపు సరులహారముల -
చందనగంధికి చాఁగుబళా
విందయి వేంకటవిభుఁ బెనఁచిన తన-
సందిదండలకు చాఁగుబళా

రేకు: 0020-1 శంకరాభరణం సం: 05-108

పల్లవి: పోదిగా నేఁడతనికే పాలిఁతి మానము గావ
సేదదేరఁ జెమటలు చిలికించెఁ జూడరే

చ. 1: కుంతలపు నెరుల చిక్కుల చీఁకటులఁ జిక్కి
యింతలోనే ముఖచంద్రుఁడింతికి నేఁడు
చెంత వాయఁ బతివచ్చి జిగిచన్నుఁగొండలపై
వింత చందురుల దండు విడియించెఁ జూడరే

చ. 2: ఈతల నిట్టూరుపుల యెండమావులనె వాడె
లేఁతమోవి చిగురు యీ లేమకు నేఁడు
పూఁతగాఁ దెచ్చి చెలియ పులకలవెల్లి నించె
మేఁతలాడి రమణుఁడీ మెలుఁతమైఁ జూడరే

చ. 3: పుట్టుబోగి సిగ్గుల చూపుల పూవుఁదీగెలపై
పిట్టపిడుగాయ సతిప్రేమము నేఁడు
గట్టిగ వేంకటపతి కౌఁగిటనలమి కొమ్మ
దిట్టఁజేసి భయమెల్ల దిగఁదోసెఁ జూడరే

రేకు: 0020-2 నారణి సం: 05-109

పల్లవి: ఏమి సేయఁగవచ్చు నేకాలమేత్రోవ
ఆమీఁది దైవగతులటుగాక పోదు

చ. 1: కనుమాయ నెన్నడిమికరవుననె లలితాంగి
పసువుచునుఁ గుచగిరుల పాలాయను
కనలి లోలోని దొంగలచేతఁ బోటుపడి
వొనరఁ గట్టనచీరయును శిథిలమాయ

చ. 2: పెడమరలి నునుఁదురుము పెదచీఁకటినె చెలియ
బడలి వదనము వంచఁ బాలాయను
వెడఁదకన్నుల చూపువేడుకల వగలెల్ల-
దడవి హితవైన చిత్తంబు నెరవాయ

చ. 3: అరుదైన పరవశంబను అడవిలోఁ దగిలి
పరిమళపుఁ జెమట నది పాలాయను
యిరవైన తిరువేంకటేశు కౌఁగిటఁ గూడి
కురులు సవరించ సిగ్గులునుఁ బగలాయ

రేకు: 0020-3 శ్రీరాగం సం: 05-110

పల్లవి: అంతరంతకు గాలినణఁగునా యనలంబు
కాంత నిట్టూర్పులాఁకలి చెరిచెఁగాక

చ. 1: కలువలూరక నీటఁ గందునా యెందైనఁ
జెలియకన్నీరిట్లఁ జేసెఁ గాక
జలజంబుపై వేఁడి చల్లునా రవి యిట్ల
నలఁచి మదనాగ్ని వదనము నొంచెఁగాక

చ. 2: విరులకునుఁ దుమ్మిదలు వెరచునా యెందైన
మరుబాణముల నెరులు మలఁగెఁగాక
సరుస మంచునఁ దీగె వాడునా యెందైన
అరిది చెమటలనె దేహము నొగిలెఁ గాక

చ. 3: కుముదహితుఁడెందైనఁ గూడునా జక్కవల
కొమరె గుబ్బలమీఁదఁ గూడెఁ గాక
తిమిరంబు తిమిరమునఁ దెమలునా యెందైన
రమణి వేంకటవిభుని రతిమఱపుగాక

రేకు: 0020-4 ముఖారి సం: 05-111

పల్లవి: ఆపలేక నిను దూరేనంతె గాక
యేఁపుచుఁ గూడేటి పొందులేలయ్య విభుఁడా

చ. 1: కోపగించుకొన్నచోట కూరిమితో వినయమే
చూపిన నామాట నీకు సొగసీనటే
యేపు రేఁగి నీకుఁ బ్రియమెక్కడనో వుండఁగాను
తాపమయ్యే పొందు నీకుఁ దగదయ్య విభుఁడా

చ. 2: నేరములెన్నఁగ నేను నిజములు పలికిన
వైరములే యౌఁగాక వలపౌనటే
యీరుదీయఁ బేను వచ్చినిఁకనేల మాటలు నీ-
వారము మమ్మిఁకఁ దడవకుమయ్య విభుఁడా

చ. 3: ననిచి కూడినవారు నమ్మక ప్రియునిమీఁద
కనలి యాడినమాట కసరౌనటే
ఘనుఁడవు తిరువేంకటరాయ మనలోని-
కినుకలన్నియు నిట్టె గెలుపయ్య విభుఁడా

రేకు: 0020-5 కాంబోది సం: 05-112

పల్లవి: అతివ జవ్వనము రాయలకుఁ బెట్టిన కోట
పతి మదనసుఖరాజ్యబారంబు నిలుప

చ. 1: కాంతకనుచూపు మేఘంబులోపలి మెఱుఁగు
కాంతుని మనంబు చీఁకటి వాపను
ఇంతి చక్కనివదన మిందుబింబము విభుని-
వంత కనుదోయి కలువలఁ జొక్కఁజేయ

చ. 2: అలివేణిధమ్మిల్లమంధకారపు భూమి
కలికి రమణునకు నేకతమొసఁగను
పొలఁతికి బాహువులు పూవుఁదీగెల కొనలు
పొలసి ప్రాణేశు వలపుల లతలఁ బెనచ

చ. 3: పంకజాననరూపు బంగారులో నిగ్గు
వేంకటేశ్వరు సిరులు వెదచల్లఁగా
చింకచూపుల చెలియచేఁత మదనునిచేఁత
యింకా నతనినె మోహించఁ జేయఁగను

రేకు: 0020-6 నాదరామక్రియ సం: 05-113

పల్లవి: ఏమి సేయుదునమ్మ యిన్నియును నిటుగూడె
తామసపుఁ బ్రేమ వేదనఁ బాయనీదు

చ. 1: కినిసి నే పొలసి పలికెద నంటినా యతని-
నెనయుదఁడఁబాటు నోరెత్తనీదు
చెనకి యలపార జూచెద నంటినా యతని-
కనుఁగవ జలంబు సరుగనఁ జూడనీదు

చ. 2: కిందుపడి కదిసి మ్రొక్కెద నంటినా యతని-
యంది పరవశము చేయాడ నీదు
డెందంబు మఱచి యుండెద నంటినా యతనిఁ
జెందిన తలఁపు మఱచియు మఱవనీదు

చ. 3: తిరువేంకటేశుఁ బొందితినంటినా యతని-
దొరతనము నాగరిమ దోఁచనీదు
సిరిదొలఁకు రతుల నలసితి నంటినా యతని-
సరసంబు వేడుకలఁ జాలించనీదు

రేకు: 0021-1 కాంబోది-రచ్చతాళం సం: 05-114

పల్లవి: తవ మాం ద్రష్టుం దయాస్తివా
త్రివిధైర్భునాని తే నామాని

చ. 1: కరరమణీ కంకణైర్భునకుచ-
గిరౌ స్థాపిత కిన్నరీయం
సరసం మ్లేచ్ఛరచనాని త్వయి
స్థిరా నదయతి తే నామాని

చ. 2: కలవర కంపిత కఠంవిలసనం
కిలకిలమేళన కిన్నరీయం
లలనా కావా లంఘితవాద్యం
తిలకయతి తదా తే నామాని

చ. 3: నిరత మూర్ఛనా నిబిడతాళరవ
గిరాయోజిత కిన్నరీయం
తరుణీ రణయతి తదా సమీపే
తిరువేంకటవర తే నామాని

రేకు: 0021-2 వరాళి సం: 05-115

పల్లవి: సొంపుల నీ వదనపు సోమశిల కనుమ
యింపులెల్లఁ జేకొనఁగ నిల్లు నీపతికి

చ. 1: కలికి నీపిఱుఁదనే గద్దెరాతికనుమ
మొలనూళ్ళలతలనే ముంచుకొన్నది
కలయఁ బోకముడినే కట్లువడ్డది
అలరువిలుతుదాడికడ్డము నీ పతికి

చ. 2: ఇదివో నీ కెమ్మోవి యెఱ్ఱశిల కనుమ
కదిసి లేఁజిగురులఁ గప్పుకొన్నది
వదలకింతకుఁ దలవాకిలైనది
మదనుని బారికి మాఁటువో నీ పతికి

చ. 3: కాంత నీ చిత్తమే దొంగలసాని కనుమ
యింతటి వేంకటపతికిరవైనది
పంతపు నీ గుబ్బలే గుబ్బలికొండకనుమ
మంతనాల కనుమాయ మగువ నీ పతికి

రేకు: 0021-3 కన్నడగౌళ-అటతాళం సం: 05-116

పల్లవి: తురుము నీవియు జార తొయ్యలి వెరగంద
సిరులఁ బరవశము సేసితిగా నీవు

చ. 1: కొమ్మమోవి నీకుఁ బిల్లగోవిగాఁగ నిడుకొని
కుమ్మరించుఁగుత్తుకలోఁ గులుకుచును
తమ్ములపు రసము చిత్తడిగాఁ గురియుచు
చిమ్మిరేఁగ రాగము నించితివిగా నీవు

చ. 2: పడఁతిగుబ్బలు నీకుఁ బాంచజన్యములుగా
కడివోని మొనలోలిఁ గదియ నొత్తి
తడయక మదనయుద్ధము గెలిచితినంటా
వొడలి చెమటలార నూదితిగా నీవు

చ. 3: వెలఁదివీపిది నీకు వీణె వొళవుగా
ములువాఁడి కొనగోళ్ళ మోఁపి మోఁపి
కలసి కౌఁగిటను వేంకటగిరి విభుఁడ నీ-
మెలుపుఁగళల తంతి మీఁటితిగా నీవు

రేకు: 0021-4 కన్నడగౌళ సం: 05-117

పల్లవి: రమణి సురటిగాఁ జెరఁగు వీచీని
చెమరించెనంటాఁ జెలి దూరీని

చ. 1: కలగంటినంటా కాటుకకనుల నీరు
వొలకఁగా మలగు పై నుసురనీని
తల నొచ్చీనంటా దంతపుటోవరిలోన
పలుకదు పిలిచినాఁ బవ్వళించీని

చ. 2: తొలఁగితినంటా తూఁగుమంచముమీఁ ద
సెలవినవ్వులతోడ శిరసూఁచీని
అలసితినంటా నలరుఁబానుపుఁ మీద
పులకలమేనితోఁ బొరలెడిని

చ. 3: సొరిగితినంటా సురతపరవశాన-
నరవిరి కనురెప్పలల్లాడించీని
తిరమాయనంటాఁ దిరువేంకటేశ్వరుఁ
దరుణి గలసి యింకాఁ దమకించీని

రేకు: 0021-5 ఆహిరి సం: 05-118

పల్లవి: చెంగటనె చెలువంపుఁ జీఁకటి దవ్వఁగను
ముంగిట నిధానమబ్బె మొక్కుదుఁగాకిఁకను

చ. 1: కొండుకవయసు కొమ్మగుబ్బలపై బ్రేమపు-
టెండదాఁకి పులకలనెన్ను వెళ్ళఁగా
బెండుపడి కైవాలెఁ బెనుదురుమిఁకనేమి
పండెఁ గోసుకొందుగాక పనులేఁటికిఁకను

చ. 2: చక్కని జవ్వని కన్నుఁజాయల పాదరసము
పుక్కిటి వెచ్చని పూరుపుల నూదఁగా
గక్కన బంగారాయ కడలేని కోరికలు
దక్కెఁ దీసుకొందుగాక తడవేల యిఁకను

చ. 3: పల్లదపుఁ జెమటల పాల జలనిధి దచ్చి
వెల్లిగొన సిరులెల్ల వేంకటేశుఁడా
పల్లవాధరిచనపు పచ్చిదేర వేడుకెల్ల
కొల్ల చేకొందువుగాక కొంకనేఁటికిఁకను

రేకు: 0021-6 ముఖారి సం: 05-119

పల్లవి: ఏలే దగ్గర నియ్యవిట్టె నన్ను
తూలపుచ్చి మరుబారిఁదోయ దొరకొంటివి

చ. 1: కాలు దాఁకి మొక్కేమయ్యా గబ్బినవేవు గనక
యేల దగ్గర విచ్చేసేవిట్టె నన్ను
వాలుఁగన్నుల రెప్పలు వంచి వంచి మొక్కేవు
చాలదటే నన్ను నిట్టె చంపనెత్తుకొంటివి

చ. 2: తమ్మరసము వడీని తలవయ్య నీ మీఁద
యెమ్మెలకడ్డము వచ్చేవు యేఁటికే నీవు
వమ్ముదొలి మాటలనె వాఁడివసులనె నన్ను
కుమ్ముచుఁ బ్రాణమునిట్టె కొనదొరకొంటివి

చ. 3: గుబ్బలచెమట దాఁకీఁ గోపగించేవు గనక
ఆబ్బురంపుఁ దిరువేంకటాధీశుఁడా
జొబ్బిలు నా చెమటల సోనల నించక యట్టే
జొబ్బలుగా నామేనెల్లాఁ బొక్కించ దొరకొంటివి

రేకు:	0022-1 పళపంజరం	సం:	05-120

పల్లవి:	ఏమిటికిఁ జింత యిదె నీకు
ప్రేమపుఁ బెండ్లి బెరసెఁగా నీకు

చ. 1:	కలికి నీ చూపుల కలువదండలు దెచ్చి
తలఁకకాతనిమెడఁ దగులవేసి
మొలక నగవుల నీ ముత్యపుసేసలు చల్లి
తొలఁగని పెండ్లి దొరకెఁగా నీకు

చ. 2:	చనపుఁ గూరిముల కొసరులను గరమిడి
ఘనమైన కాఁకలఁ గాలుదొక్కి
పనివడి వెన్నెల పాలకూడు గుడిచి
తనివోని పెండ్లి దగిలెఁగా నీకు

చ. 3:	తరుణి నీ హృదయపుఁ దమ్మిపరపుతోడ-
నిరవైన సిరులతో నిల్లు నించి
తిరువేంకటగిరి దేవునితోఁగూడి
సరసపు బెండ్లి జరగెఁగా నీకు

రేకు: 0022-2 కాంబోది సం: 05-121

పల్లవి: చెంపల యేరు ముండ్ల చెంచువారము నీకు-
నింపుగాని మా పొందులేలయ్యా

చ. 1: కమ్మనిమామయి పూఁత గదరుఁబిల్లుల గబ్బు
యెమ్మెల మాపట్టుచీర యేపెనార
సొమ్ములుఁ బెంచపుకన్నుఁ జూపులయమ్ములనె
వొమ్మదు నీ పొందు నాకు నొల్లమయ్యా

చ. 2: కొప్పుగేదఁగులు మాకు కొన నమలీకలు
గొపముత్యాలివి మాకు గురిగింజలు
కప్పురంబు మాకేటి గడ్డల తెల్లని మన్ను
వొప్పదు మాకేల యిచ్చేవొల్లము నేమయ్యా

చ. 3: కుంకుమ మా కిపుడు జేగురుఁదొడి నుదుటికి
బింకపుఁ దిట్లె మా ప్రియములు
కంకిగాఁగ నెలయించి కౌఁగిటఁ గూడితి నన్ను
వేంకటవిభుఁడ యిఁక వీడవయ్యా

రేకు: 0022-3 వరాళి సం: 05-122

పల్లవి: కటకట సతిశృంగారము కన్నులపండువు దోఁపుచు
యిటువలె నిలిచి చిత్తంబిందరినేఁపెడిని

చ. 1: కోమలి కొప్పునఁ జెరివిన క్రొవ్విరులాత్మజు శరములు
వేమరుఁ బొదిగొన నాఁటిన విధమున నొప్పెడిని
కామిని పూసిన కస్తూరి కంతుని బాణారుణిమే
యీమైఁ బైపైఁ బేరిన యిటువలె నొప్పెడిని

చ. 2: అతివకు భూషణజాలంబంతయు మరువస్త్రములకు
జతనంబగు మైమరువై సరిఁ జెలువొందెడిని
సతి గట్టిన వెలిపుట్టము చంపెడు మదనుని బారికి
సితకరుఁడడ్డము చొచ్చిన చెలువము దోఁపెడిని

చ. 3: బలుపగు చెలిచనుగుబ్బలపై వేంకటపతి నించిన-
లలితపు రేఖల బిత్తరిలాగులు దోఁపుచును
వలరాయని చిరునమ్ములు వడిఁదాకిన గంట్లవలెఁ
బొలుపుగఁ జూచినవారల బొమ్మరపరపెడిని

రేకు: 0022-4 ఆహిరి సం: 05-123

పల్లవి: అన్ని జాతులు దానె యైవున్నది
కన్నులకలికి మాయగరచెనో యనఁగ

చ. 1: కన్నె శంకిణిజాతి గాఁబోలు వీఁపునను
సన్నపు మదనాంకములు జడి గొన్నవి
వన్నెలుగ వలరాజు వలపు తలకెక్కించ
పన్నినటువంటి సోపానములో యనఁగా

చ. 2: తెఱవ దలపోయ చిత్తిణిజాతి గాఁబోలు
నెఱులు విచ్చుచు వీధి నిలుచున్నది
నెఱతనము మరుఁడు తను నిండవేసిన యంప-
గరులిన్ని యనుచు లెక్కలు వెట్టుగతిని

చ. 3: కాంత హస్తిణిజాతి గాఁబోలు కరమూలము-
లంతకంతకు నలుపులై యున్నవి
పంతంపుమరుఁడు తన భండారమిండ్లకును
దొంతిగా నిడిన కస్తూరి ముద్రలనఁగా

చ. 4: ఘనత పద్మిణిజాతి గాఁబోలు నీలలన
తనువెల్ల పద్మగంధంబైనది
మినుకుగా మరుఁడు తామెరలమ్ములనె మేను
కనలించి వడిఁ బువ్వుగట్టెనో యనఁగా

చ. 5: ఇదియు జగదేక మోహిణి దానె కాఁబోలు
కదలు కనుఁగవకెంపు గలిగున్నది
వదలకిటు వేంకటేశ్వరుని కుంకుమపూఁత
చెదరి చెలికనుఁగొనలఁ జిందెనోయనఁగా

రేకు: 0022-5 ఆహిరి సం: 05-124

పల్లవి: కెరలి బయట దాఁగీ వీఁడు తన-
వొరపులు చూపుచు నొరగీ వీఁడు

చ. 1: కొమ్మ చూడవే కొలిమిగూటిలో-
నమ్మెడి సూదులె యదె వీఁడు
ఎమ్మెలు నెరపుచు నెక్కడఁ దిరిగో
నమ్మికబొంకుల నను సొలసీని

చ. 2: నాఁతిరో చూడవే నవ్వుచు మీలకు-
నీఁతలు గరపీనిదె వీఁడు
కాఁతాళంబునఁ గనలెడి నాపై
చేఁతలు సేసిఁ జెలఁగుచుఁ దాను

చ. 3: అల్లనె చూడవె అడవిమృగములకుఁ
బల్లము వేసీఁ బైవీఁడు
వొల్లని నననిదె వుల్లమి చేకొనెఁ
గల్లరి తిరువేంకటపతి వీఁడు

రేకు: 0022-5 ఆహిరి సం: 05-125

పల్లవి: మూసిన ముత్యాన కేలే మొరఁగులు
ఆసల చిత్తానకేలే అలవోకలు

చ. 1: కందులేని మోము కేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే సేమంతులు
మందయానమునకేలే మట్టెలమోఁత
గందమేలే పైపై కమ్మని నీ మేనికి

చ. 2: బారపు గుబ్బలకేలే పయ్యెద నీ-
బీరపుఁ జూపుల కేలే పెడమోము
జీరల బుజాలకేలే చెమటలు నీ-
గోరంట గోళ్ళకేలే కొనవాండ్లు

చ. 3: ముద్దుల మాఁటలకేలే ముదములు నీ-
యద్దపుఁ జెక్కులకేలే అరవిరి
వొద్దిక మాటల కేలే వూర్పులు నీకు-
నద్దమేలే తిరువేంకటాద్రీశుఁ గూడి

రేకు: 0023-1 శ్రీరాగం సం: 05-126

పల్లవి: కలకి కాఁతాళమలు కారింపులా
లలితంపు వలపులకు లంచములు గాక

చ. 1: కిసరు కనుఁగొనల జంకెనలు విరసంబులా
రసములొలికెడి మనోరతులు గాక
కొసరు గుంపెనల సిగ్గుల విళంబంబులా
దుసికిలని మోహముల దొంతరలు గాక

చ. 2: అబ్బురములైన పొలయలుక లోలంబులా
గబ్బుఁ దమకముల మీఁగడలు గాక
గబ్బిమాటలు సాళంగంబులవి యేతులా
గుబ్బతిలు మోహముల కుంటెనలు గాక

చ. 3: కొనబు కొనగోళ్ళ తాఁకులవి మే నొప్పులా
ననుపులకు నుబ్బుఁగవణములు గాక
వనితకీవేంకటేశ్వరు సిరులు మరపులా
మనసు మర్మముల తన్మయములవి గాక

రేకు: 0023-2 భైరవి సం: 05-127

పల్లవి: భామ నోఁచిన నోము ఫలము సఫలముగాను
కామతాపంబునకు కాండవము నోమె

చ. 1: కొమ్మ చలిమందులకు గొంతిదామెర నోమె
కమ్మఁదావులకు ముసు గౌరినోమె
నెమ్మదిని కన్నీట నిండుఁగొలఁకులు నోమె
ముమ్మడించిన వగల ముచ్చింత నోమె

చ. 2: చెదరు గందంబునకు చిట్టిబొట్లు నోమె
కదియు పులకలకు మొలకలనోము నోమె
ముదిత మాటాడకిదె మోనదాగెలు నోమె
పొదలు చెమటలకు నినుపులనోము నోమె

చ. 3: నెలఁత మొగమునకు వెన్నెలమించులటు నోమె
వెలయుఁగాంతికి వీధివెలుఁగు దా నోమె
ఎలమితోఁ దిరువేంకటేశుకౌఁగిటఁ గూడి
లలితాంగి నిచ్చకల్యాణంబు నోమె

రేకు: 0023-3 సామంతం సం: 05-128

పల్లవి: అపురూపమైన మోహము దాఁచి యిటువంటి-
కపటపు నటనలు గడియించనేలే

చ. 1: కిన్నెరకాయలఁ బోలు కిక్కిరిసినట్టి గుబ్బ-
చన్నులపై నను(గొంగు జారఁగ
కిన్నెర మీఁటుచు మంచి సన్నపు నడపుతో
కన్నులు దేలఁగమేను కదలించేవేలే

చ. 2: వీడియు వీడనికొప్పు వేగన ముడుచుచు
ఆడెడి బిత్తరిమాటలమరఁగా
చూడనొప్పె నీ మంచి సుద్దులు చెప్పఁగనెంతే
వాడక వాడుదురే వైతాళమేలే

చ. 3: చెక్కుటద్దములమీఁది చెమట చిత్తడితోడ
సొక్కులు దేరఁగ మేను సుదతికి
చిక్కించి నిన్నుఁగూడె శేషగిరీంద్రుఁడు నీ పయి
మక్కువగలిగి కొంత మనసియ్యఁడేలే

రేకు: 0023-4 పాడి సం: 05-129

పల్లవి: ఒఱపో మెఱుపో వొయ్యారమో నీకు
వెఱతుమయ్య గోవిందుఁడా

చ. 1: కపటమో నిజమో కరుణ కోపమో
వుపచారవమో వుపతాపమో
నిపుణత తనపై నెయ్యమే సేసేవు
విపరీతము గోవిందుఁడా

చ. 2: ననుపో నగవో నయమో ప్రియమో
చనవో చలమో సరసమో
కనుకూరిమియో గయ్యాళితనమొ
వెనుతగిలేవు గోవిందుఁడా

చ. 3: మంకో మరులో మదమో ముదమో
జంకో లంకో జగడమో
శంకలేక నను సరుగనఁ గూడితి
వేంకటగిరి గోవిందుఁడా

రేకు: 0023-5 ఆహిరి సం: 05-130

పల్లవి: లలితలావణ్య విలాసముతోడ
నెలంత ధన్యత గలిగె నేఁటితోడ

చ. 1: కుప్పలుగా మైనసలుకొన్న కస్తూరితోడ
తొప్పఁదోగేటి చెమటతోడ
అప్పుడటు శశిరేఖలైన చనుఁగనతోడ
దప్పిదేరేటి మోముఁదమ్మితోడ

చ. 2: కులుకుఁ గబరీభరము కుంతలంబులతోడ
తొలఁగఁ దోయని ప్రేమతోడ
మొలకనవ్వులు దొలఁకు ముద్దుఁజూపులతోడ
పులకలు పొడవైన పొలుపుతోడ

చ. 3: తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ
సరిలేని దివ్యవాసనలతోడ
పరికించరాని అరవిరిభావముతోడ
సిరి దొలఁకెడి చిన్నిసిగ్గుతోడ

రేకు: 0023-6 సామంతం సం: 05-131

పల్లవి: చింతాపరంపరలు చిత్తంబునకుఁ దొడవు
ఇంతి సౌభాగ్యంబులిన్నిటికిఁ దొడవు

చ. 1: కలికి నెమ్మోమునకుఁ గబరీభరము తొడవు
తళుకుఁజూపులు చక్కఁదనమునకుఁ దొడవు
ఎలమిచెక్కుల మించులిరువంకలకుఁ దొడవు
మొలకనగవులు సొబగు మురిపెముల తొడవు

చ. 2: కరమూలరుచులు బంగారంబునకుఁ దొడవు
గురిగాని కౌఁదీగె గుబ్బలకుఁ దొడవు
సిరిదొలఁకు జఘనంబు చిన్నినడపుల తొడవు
నిరతంపుఁ బాదములు నిలువునకుఁ దొడవు

చ. 3: శ్రీవేంకటేశుకృప చెలియ కెప్పుడుఁ దొడవు
భావసంగతులకునుఁ బరవశమె తొడవు
ఈ వెలఁది నునుఁబలుకులించువిలుతుని తొడవు
లావణ్యములకు నీలలన దాఁ దొడవు

రేకు: 0024-1 పాడి సం: 05-132

పల్లవి: అవి యెటువంటి రహస్యములో
సవరని సతులకు ఝల్లనె మేను

చ. 1: కల గని చెలితో కాంత నాయకుని-
చెలువము చెప్పుచు చిడిముడితో
పలుకఁగ నేరక భ్రమసిన మాటలు
తలఁచి చెలులు కడుఁ దత్తరపడిరి

చ. 2: రమణుఁడు కలలో రమణితో ననిన-
ప్రమదపు దైన్యపు పలుకులివి
చెమరించఁగ విని శిరసులు వంచుక
కొమెరలు దలఁచిరి కూరిమిపతుల

చ. 3: వేంకటరమణుఁడు వెలఁదియుఁ గలలో
బింకపుఁ గూటమిఁ బెనఁగుటలు
లంకెల పొందులు లలనలు విని విని
కొంకక కనుఁగొనఁ గురిసిరి నీరు

రేకు: 0024-2 సామంతం సం: 05-133

పల్లవి: కొనచూపులనె వింతకోరికలు దైవార
పెనగొన్న తమకములఁ బెనఁగు టెన్నఁడురా

చ. 1: కమ్మ కస్తూరితావి కప్పురపువాసనల-
తమ్ములము నోరిలోఁ దగఁ గులికి కులికి
ఉమ్మగింతల రతులనుడివోని వేడుకల
ఇమ్ములను గడి సుఖియించు టెన్నఁడురా

చ. 2: బిగువుఁ గౌఁగిటఁ జేర్చి బిత్తరపుఁ జూపులను
నగవు దేరఁగ మనసు నాఁటించి మించి
మొగము మొగమునఁజేర్చి ముద్దుమాటలను నునుఁ-
బగడవాతెర గదలఁ బలుకు టెన్నఁడురా

చ. 3: కడు మోహమున సిగ్గు గదియు టెన్నఁడు లేక
యెడలేని కూటముల యెచ్చరిక లేక
విడువకిటువలెనె తిరువేంకటేశుఁడ నీవు
వడిఁదలఁచి నాకడకు వచ్చుటెన్నఁడురా

రేకు: 0024-3 శ్రీరాగం సం: 05-134

పల్లవి: దైవకృత మెవ్వరికిఁ దప్పింపరాదనుచు
భావించి జనులాడుపలుకు నిజమాయ

చ. 1: కందునకుఁ బెడఁబాసి చందురుఁడింతి ముఖ-
చందురుఁడైన నది అందును గలిగె
కందువగు చెలినొసలి కస్తూరితిలకమను -
కందు ముఖచంద్రునకుఁ గడునందమాయ

చ. 2: జలజములు శశిచేతనులికి యీ కాంతకుచ-
జలజంబులైన నది సరుసనే కలిగె
లలితమగు ప్రాణవల్లభుని సురతాంకమున
విలువ సేయఁగరాని విదియచందురులు

చ. 3: తీగె బహుజలములకుఁ దెమలి కామిని మేనుఁ-
దీగె యయ్యిన నదియుఁ దిరుగ మరి కలిగె
ఈ గతులఁ దిరువేంకటేశ్వరుని సమసురత-
యోగంబువలన ఘర్మోదకశ్రీలు

రేకు: 0024-4 ముఖారి సం: 05-135

పల్లవి: జానామ్యహంతే సరసలీలాం
నానావిధ కపటనాటక సఖత్వమ్

చ. 1: కిం కరోమి త్వాం కితవ పరకాంతాన-
ఖాంకురప్రకటన మతీవ కురుషే
శంకాం విసృజ్య మమసంవ్యాన కర్షణం
కింకారణమిదం తే ఖేలన మిదానీం

చ. 2: కిం భాషయసి మాం కృతమానసతయా
డాంభికతయా విట విడంబయసి కిం
గాంభీర్యమావహసి కాతరత్వేన తవ
సంభోగ చాతుర్య సాదరతయా కిం

చ. 3: కిమితి మామనునయసి కృపణ వేంకటశైల-
రమణ భవదభిమతసురతమనుభవ
ప్రమదేన మత్ప్రియం ప్రచురయసి మానహర
మమతయా మదననిర్మాతా నకిం త్వం

రేకు: 0024-5 ఆహిరి సం: 05-136

పల్లవి: వట్టిటసలు గాక నాకు వలతు ననెడి మాటలెల్ల
నెట్టుకొన్న మోహమైన నిలువనెట్టు వచ్చురా

చ. 1: కొప్పువెట్టుకొనుచునున్నకొమ్మబాహుమూలమిపుడు
చొప్పదప్ప రెప్పలెత్తి చూడనెట్టు వచ్చురా
అప్పుడుపరిసురతవేళలందుఁ ఇచ్చి దోఁచునట్టి-
చెప్పరాని పనులవంకఁ జిత్తగించినాఁడవో

చ. 2: మొలకనవ్వు నవ్వుచున్న ముదితముద్దు మోవిమీఁది-
చిలుకవోటు చూచి సన్న నేయనెట్లు వచ్చురా
వలను మెరసి నీకునందు వన్నెలైన చేఁతలెల్లఁ
గలయఁ జేయుపనికిఁ గొంత కన్నువేసినాఁడవో

చ. 3: తట్టుపుణుఁగు శిరసుమీఁద దైలువారనంటి నొసలఁ
బట్టువెట్టుకోరి నన్నుఁ బట్టనెట్టు వచ్చురా
వెట్టిగాదు వేంకటాద్రివిభుఁడ నీవు మదనరచన-
లట్టు నిట్టుసేయ నన్నుంగవించినాఁడవో

రేకు: 0024-6 మాళవి సం: 05-137

పల్లవి: ఏమిసేయఁగనగు నెట్టువలసిననౌ
కాముకుల పూర్వసంకల్పమో కాక

చ. 1: కమలోచనహృదయకమలంబె మరుచేతి-
కమలమై తనమనసు గాఁడి పారినది
గములైన యాపదలు గదిరినప్పుడు దమ్ము
తమచేతియమ్ములే తాఁకునో కాక

చ. 2: లోలలోచన మేనిలోని యనలము లోని-
గాలి గూడక చిచ్చు గాలివలెనాయ
తాలిమెడతెగి రతులు దప్పినప్పుడు లోని-
తాలిమే తమకములతాపలో కాక

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చెలియఁ గరుణించినను
కైవశంబయిఁ యవియ కడునితవులాయ
దైవకృప గలిగినను తమకు నాపదలెల్ల
భావింప నిత్యవైభములో కాక

రేకు: 0025-1 సామంతం సం: 05-138

పల్లవి: పొద్దిఁకనెన్నఁడు వొడచునొ పోయినచెలి రాదాయను
నిదుర గంటికిఁ దోఁపదు నిమిషంబొకయేఁడు

చ. 1: కన్నుల నవ్వెడి నవ్వులు గబ్బితనంబుల మాటలు
నున్నని యొయ్యారంబులు నొచ్చినచూపులును
విన్నఁదనంబుల మఱపులు వేడుకమీరిన యలపులు
సన్నపుఁజెమటలుఁ దలఁచిన ఝల్లనె నామనసు

చ. 2: ఆఁగినరెప్పల నీరును నగ్గలమగు పన్నీటను
దోంగియుఁ దోఁగనిభావము దోఁచిన పయ్యెదయు
కాఁగిన దేహపు సెకలును కప్పిన పువ్వుల సొరబులు
వేఁగిన చెలితాపమునకు వెన్నెల మండెడివి

చ. 3: దేవశిఖామణి తిరుమలదేవునిఁ దలఁచినఁ బాయక
భావించిన యీ కామిని భావములోపలను
ఆవిభుఁడే తానుండిఁక నాతఁడె తానెఱఁగఁగవలె
నీ వెలఁదికిఁ గల విరహంబేమని చెప్పుదము

రేకు: 0025-2 మలహరి సం: 05-139

పల్లవి: ఎందరి దూరుదమిందరుఁ గూడుక
సందడివలుపులఁ జంపేరే

చ. 1: కంటఁ బుట్టినవాఁడు కమలముఖులకడ-
కంటఁ బుట్టినవాఁడు గవగూడి
జంట వాసినఁ జంపుదుమని లేని-
వెంటలు గడియించి వేఁచేరే

చ. 2: ఏఁటఁ బుట్టెడివాఁడు నేడు దెరువులై
వూఁటాడెడివాఁడు నొనగూడి
మాఁటమాఁటాకు మాయపు మనసులు
తీఁటలు రేఁచుక తిరిగేరే

చ. 3: కొండలరాయఁడు కోనేటి తిమ్మయ్య
వుండినచోట నేనుండఁగా
పండిన మోహము బాధలఁ జిత్తము
మెండైన వేడుక మెచ్చినే

రేకు: 0025-3 నాట సం: 05-140

పల్లవి: చిత్తము నిజమైనఁ జేరు నేపనులైన
బత్తి సౌఖ్యమునకుఁ బ్రాణము

చ. 1: కన్నుల కలికికిఁ గలిగెఁబో కడ-
కన్నులమీఁది బింకపు నవ్వు
చిన్నిచెక్కులమీఁది చెమటలు -మేన-
నన్నువ మురిపెపుటలపులు

చ. 2: తోయజగంధికి దొరకెఁబో మన -
మాయ నియతితోడి మఱపులు
సోయగమగు మోము సొబగులు- కడు-
రాయిడి చనుదోయి రచనలు

చ. 3: లావణ్యమతి మీఁద లాసెఁబో
శ్రీ వేంకటేశుని చెలుములు
తావి చల్లెడి కమ్మఁదనములు - పాసి-
పోవని విభుతోడి పొందులు

రేకు: 0025-4 కాంబోది సం: 05-141

పల్లవి: ఒయ్యనె దగ్గరరమ్మ పూఁడిగాల సతులు
అయ్యో విసరరమ్మ అలశున్నవాఁడు

చ. 1: కరఁగు-జెమటలతో గందపుఁ బేంట్లతోడ
ఒరగి పవ్వళించున్నాఁడొ త్తగిల్లి
సరసపు మాటలతో చాఁచిన పాదములతో
గురియైన సతులతో గోవిందరాజు

చ. 2: తెల్లని కన్నులతోడ తేనెగారు మోవితోడ
చెల్లుబడిఁ బవ్వళించీ శేషునిమీఁద
వెల్లిగొను పూర్పులతో వెన్నెల నవ్వులతోడ
కొల్లవలపులతోడ గోవిందరాజు

చ. 3: బొడ్డు పూఁపకొడుకుతో పుక్కిటి తమ్ములముతో -
నొడ్డిన రతులతోడ నోలలాడీని
వెడ్డు వెట్టి కూడెనిదె వేంకటేశుఁడింతులను
గొడ్డువోని వరముల గోవిందరాజు

రేకు: 0025-5 ఆహిరి సం: 05-142

పల్లవి: కామించి నీవరుగఁ గలయు నాయకుఁడు నేఁ-
డేమి భాగ్యము సేసెనే తరుణి

చ. 1: కాఁగిన గుబ్బలమీఁద కమ్మఁజెమటలఁ దొప్పఁ-
దోఁగిన పయ్యెదకొంగు దూలఁగను
వేఁగైన కొప్పున క్రొవ్విరులు దురిమి విఱ్ఱి-
వీఁగుచు నీవెటు వొయ్యేవే తరుణిం

చ. 2: ఒప్పైన శిరసుమీఁదఁ గుప్పళించిన జవ్వాది
చిప్పిలి చెక్కులవెంటఁ జిందఁగను
అప్పళించిన కస్తూరిలప్పలు రాలఁగ నీ-
విప్పుడెక్కడికి నేఁగేవే వోతరుణి

చ. 3: వీడినది మొలనూలు విరులు చెదరెఁ గొంత
వాడినది కెమ్మోని వన్నెలై
యీడులేని తిరువేంకటేశుఁడిదె నిన్నుఁ గూడె
యీడఁ గొత్తలివి యేఁటివే వోతరుణి

రేకు: 0025-6 శుద్దవసంతం సం: 05-143

పల్లవి: ఇన్ని రాసులయునికి యింతి చెలువపురాశి
కన్నె నీరాశికూటమి గలిగినరాశి

చ. 1: కలికి బొమవిండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలఁగు హరిమధ్యకును సింహరాశి

చ. 2: చిన్నిమకరాంకపు బయ్యెద చేడెకు మకరరాశి
కన్నెపాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైఁడితులఁదూఁగు వనితకుఁ దులారాశి
తిన్ననివాఁడి గోళ్ళసతికి వృశ్చికరాశి

చ. 3: ఆముకొను నొరపుల మెరయు నతివకు వృషభరాశి
గామిడి గుట్టుమాఁటల సతి కర్కాటకరాశి
కోమలపు చిగురువమోవి కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతిఁ గలసె ప్రియమిథునరాశి

రేకు: 0026-1 సామంతం సం: 05-144

పల్లవి: ఎట్టు ధరింపఁగనగు భువినిట్టి వియోగావలస్థల-
నట్టును నిట్టును విధి దమునారడిఁ బెట్టఁగను

చ. 1: కాంతునిచూపులఁ జిక్కినకాంత వియోగాగ్నికిఁ దగ
శాంతికిఁ జెంగలువలుపైఁ జల్లిరి నెచ్చెలులు
కాంతుఁడు చూచినతొల్లిటి కనుచూపులె బహుళములై
కాంతశరీరంబంతయుఁ గప్పిన తెఱఁగాయ

చ. 2: రమణునిమాటలఁ దగిలిన రమణికి నంగజతాపం-
బమరఁగ మకరందముపై నలికిరి నెచ్చెలులు
రమణుని తియ్యని మాటాలరచనలె కడునగ్గలమై
కమలదళాక్షికిఁ బై పై గట్టినతెఱఁగాయ

చ. 3: ప్రాణము సందియమై యీ పడతికిఁ బ్రాణము వచ్చెను
ప్రాణేశుఁడు తిరువేంకటపతి గరుణించినను
ఏణాక్షికి నొకతెకుఁ గాదీయఖిలంబున కీ దేవుఁడు
ప్రాణము ప్రాణంబనియెడి పలుకిది నిజమాయ

రేకు: 0026-2 కాంభోది సం: 05-145

పల్లవి: ఇంతగాఁ జేసితి నన్ను నింతలోననె వోరి
సంతవలపుబేరాల జట్టికాఁడ రారా

చ. 1: గంపంత దురుముతోడి గబ్బిచూపుఁగన్నుల
గుంపెన గుబ్బలది మేకులు సేయఁగా
అంపలేక మాటలాడే వాపె తోడనె వోరి
జంపు వలపుబేరాల జట్టికాఁడ రారా

చ. 2: గుద్దలింపుఁ గులుకుల కొనవంపుచూపుల -
అద్దపుఁ జెక్కులది నిన్నద్దలించఁగా
పెద్దరికా లాకెతోడ బెరయించేవా వోరి
చద్దివలపుబేరాల జట్టికాఁడ రారా

చ. 3: మెల్లనె మురిపములమ్మెడి లేఁతమాటల-
గొల్లెతచిత్తమంతయుఁ గొల్లగొంటివి
వెల్లిగా నన్నుఁ గూడితి వేంకటేశుఁడా వోరి
చద్దివలపుబేరాల జట్టికాఁడ రారా

రేకు: 0026-3 సామంతం సం: 05-146

పల్లవి: సింగారరాయనిఁ దిట్టిఁ జెంచెత వేలి-
వుంగరాలచేత నన్నొత్తకు నీవనుచు

చ. 1: గురువింద పొదమరఁగున నుండి బిగిసీని
సిరివరు నెదుటనే చెంచెత
దొరలకే కాక నెత్తురుమన్ను మాకేల
బురదచెమటనామై పొలకంపనుచు

చ. 2: గుదిగొన్న మొగలిరేకుల యెన్ను కొనగోరఁ
జిదిమి దేవునివేసీఁ జెంచెత
గదరుఁ బిల్లుల నేతికంపు నీ వొళ్ళెల్ల
కదియకు నా మేను కంటగించీననుచు

చ. 3: కప్పురపుఁ దావి వేంకటపతికౌఁగిటఁ
జెప్పక యేతులే చెప్పీఁ జెంచెత
దప్పిదేరు తేనెల తనివార నీమోవి
యెప్పుడుఁ బాయక ఇట్టె ఇచ్చేవో యనుచు

రేకు: 0026-4 ఆహిరి సం: 05-147

పల్లవి: అయ్యో వీఁడు నన్నుణఁకించీనే వీని-
కొయ్యతనాలణఁచక కోపమేల తీరునే

చ. 1: గుట్టున వాఁడిందు రాఁగ గొబ్బున నే ముంగురులు
పట్టుకొని పరపుపైఁ బడఁదీసి
గట్టిగ గుబ్బలమీఁది కస్తూరిచెమటలనే
అట్టునిట్టు సేయక నాయల పేల తీరునే

చ. 2: గక్కున వాఁడిందు రాఁగా గడెవెట్టి తమకాన
చెక్కుదోయి నాకొనచేతనే నొక్కి
పుక్కిటితమ్ములమిడిపొదిగొన్న కౌఁగిటిలో
నొక్కినఁగాని నానొగులేల తీరునే

చ. 3: కూరిమి వాఁడిందు రాఁగా కొంకక నా వాఁడిగోళ్ళ
జీరలుగా నొడలెల్ల జిమ్ముచుఁ దీసి
ధీరత వేంకటగిరి దేవుఁడైన వానికి నా-
నేరుపెల్లఁ జూపక నా నెగులేల తీరునే

రేకు: 0026-5 దేవగాంధారి సం: 05-148

పల్లవి: ఇట్టిముద్దులాఁడిబాలుఁ డేడవాఁడు వానిఁ
బట్టితెచ్చి పొట్ట నిండఁ బాలు పోయరే

చ. 1: గామిడై పారితెంచి కాఁగేటివెన్నలలోన
చేమపూవుకడియాలచేయి వెట్టి
చీమ గుట్టెనని తనచెక్కిటఁ గన్నీరు జార
వేమరు వాపోయె వాని వెడ్డువెట్టరే

చ. 2: ముచ్చువలె వచ్చి తనముంగై మురువులచేయి
తచ్చేటిపరుగులోనఁ దగఁ బెట్టి
నొచ్చెనని చేయి దీసి నోరనెల్లఁ జొల్లుగార
వొచ్చెలి వాపోవునాని సూరడించరే

చ. 3: యెప్పుడు వచ్చెనో మాయిల్లు చొచ్చి పెట్టెలోన
చెప్పరానివుంగరాల చేయి వెట్టీ
అప్పడైనవేంకటేశుఁడాపాలకుఁడు గాన
తప్పకుండ పెట్టె వానితల కెత్తరే

రేకు: 0026-6 శ్రీరాగం సం: 05-149

పల్లవి: వద్దు వోరా నీవు గడు వచ్చి తడవాయనేరు
నిద్దురవుచ్చేవు నేము నీ కొలఁదివారమా

చ. 1: గయ్యాళి యెవ్వతో కాని కస్తూరివాట్లు చూడ
నొయ్యారముగా వేసె నుదుటైన గుబ్బల
కయ్యపుఁ గూటముల నీ కౌఁగిలెల్లానంటె నీవు
పుయ్యక పూసిన కమ్మఁబూత వింతలాయరా

చ. 2: గొంటెత యెవ్వతోకాని కొదలేని తమకి తా-
నంటఁగాక నిన్నుఁగూడె నదిరి పాటునను
వెంటనే తెచ్చితివోరి వెడగెంపునీరు కోక-
నంటినది నీవు మమ్ము నంటక తొలఁగరా

చ. 3: కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడ యెందు
వుండిన నామనలోనుండి పాయలేవురా
నిండిన కౌఁగిటఁజేర్చ నీవు దానై కూడి-
యుండినట్లనే పాయకుండె నెవ్వతెరా

రేకు: 0027-1 రామక్రియ సం: 05-150

పల్లవి: కొంచెము మాకులము గుణము చంచలము
చెంచతతో నీకు నేల చెప్పవయ్యు చలము

చ. 1: గదరుఁ గస్తూరిమన్ను కమ్మనిమై పూఁత
చెదరిని పట్టునార చీరపాఁత
పదిలమైన పండు ఫలము మామేఁత
ఇదివో నే మెవ్వరికి నేలయ్యు రోఁత

చ. 2: గుబ్బలపై వెడజారు గురుగింజ పేరు
సిబ్బపుఁ జెక్కుల నవ్వుచిక్కుఁ జీరు
మబ్బు మబ్బు నెరుల దిమ్మరి కొప్పుతీరు
గబ్బిచూపు కన్నుల మాకడనేల నోరు

చ. 3: అడవి లేఁతచిగురదివో మాపరపు
వెడ వెడ నగనే మావింత వొరపు
యెడయక తిరువేంకటేశ మాపై వెరపు
గొడవకూటమి నిన్నుఁ గూడిన మైమరపు

రేకు: 0027-2 వరాళి-ఏకతాళి సం: 05-151

పల్లవి: తక్కులచేతల మాయదారివట బొంకు-
నిక్కములు నేయనేమి నేరవా యీనీవు

చ. 1: గుట్టున నూఁదిన పిల్లఁగోవి నీ రవమున
వట్టిమాఁకుల నిగురు వెట్టీనట
పట్టినఁ గందెడి నామై పై పులకలిగురు -
వెట్టఁగా నన్నింత సేయ బెట్ట యీ నీకు

చ. 2: పాదముచెమటనీరు పరపి దురితముల
సేదదేర నిందరిని జేసీనట
మేదినీధరుఁడ నీ మేని చెమటలతావి-
నాదరించి ననుఁగాచుటరుదా యీ నీకు

చ. 3: అల నీమదిఁబుట్టిన అంగజుఁడు లోకులను
చెలరేఁగి కాఁపురాలు సేయించీనట
కలసి వేంకటేశ్వర కందువరతుల నన్ను
కలకాలమునేలుట ఘనమా యీ నీకు

రేకు: 0027-3 సౌరాష్ట్రగుజ్జరి సం: 05-152

పల్లవి: కన్నునే నవ్వితే నే గబ్బిదాననా నీవు
నన్నునేల యిట్లా సన్నలనే తిట్టేవు

చ. 1: గొల్లచల్లంటానే యక్కునఁ బోయుమనేవు
చెల్లఁబో గొల్లవారింత చెడఁబోయిరా
గొల్లువేసి యలకల కొప్పున నే ముడిచిన
మల్లెపూవులేల నీకు మనసాయ నిపుడు

చ. 2: కొంత కోక నల్ల నైతే గొరుపడము సవేవు
అంత నేను సదరమనైతినా నీకు
పంతగాఁడవట్టియాకంబళి నీవు ధరియించి
అంత నింతనుండి యాల ఆవులఁగాచితివి

చ. 3: మాఁటలాడ నేరకుంటే మాయదారిననేవు
వేఁటలోన ననునింత వేఁచుమంటినా
యేఁటికింత తిరువేంకటేశ నన్నుఁ గరఁగించి
పూఁట పూఁటకింతేసి బూమెలు సేసేవు

రేకు: 0027-4 శ్రీరాగం సం: 05-153

పల్లవి: అతఁడు చొచ్చినవేళ నలరు యడవి
సతి నీదుమురిపెంపు జవ్వనపుటడవి

చ. 1: గురుకుచముగిరుల నెక్కువయ్యైన యడవి
తరుణంపు బాహులతల యడవి
పురిగొన్న వాలుఁజూపుల తేట యడవి
గరిమతోఁ దనుతావి కప్పురపుటడవి

చ. 2: గనియైన నెరులచీఁకటి పెనుయడవి
ఘనమైన జఘనకందకములడవి
నునుపు నడపుల యేనుక పెద్దయడవి
చెనకు నట్టనడిమి సింహపుటడవి

చ. 3: అతివ నీ వూరుల యరంట్లయడవి
కత కఱపుల చిలుకల యడవి
ప్రతిలేని వేంకటపతి యాఁక యడవి
తతి నీకుఁ గానతఁడు తపమున్న యడవి

రేకు: 0027-5 శంకరాభరణం సం: 05-154

పల్లవి: తలపట్టు వెట్టుకొన్న తరుణీమణి నిన్ను
నలసి వేమరుదూరు నాకెవో యీకె

చ. 1: గొప్పలయిన గుబ్బలవేఁగుల నలయు సతులు
కొప్పులు జారఁగఁ దన్నుఁ గొలిచి రాఁగా
చెప్పరాని నటనల సింగారపుఁ దోఁటలోన
అప్పుడు నిన్నుఁ జూచిన ఆకెవో యీకె

చ. 2: పాదపుఁబెండేలు మ్రోయఁ బడఁతులిరువంకల
సేదలు దేరుచుఁ దనచెంగట రాఁగా
మేదకపు తొలుకరి మెఱుఁగంటా నీ పప్పు-
డాదిగొని చూచిన ఆకెవో యీకె

చ. 3: బంగారు చెరఁగుచీర పయ్యెదకొంగు దూలఁగా
అంగన వొకతె దనకాకు చుట్టీఁగా
ఇంగితమెఱిఁగి వేంకటేశుఁడ నిన్నుఁ గలసి
అంగడినెల్లఁ బెట్టిన ఆకెవో యీకె

రేకు: 0027-6 ఆహిరి సం: 05-155

పల్లవి: దిక్కులేక పోయెనిట్టే దినదినము
వెక్కసపు లోకమేలే విభుఁడెవ్వఁడో

చ. 1: గుత్తముగా నెల్లవారుఁ గుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టేకోక బయట వేసిన
మెత్తనిదంటాఁ బట్టి మింగె నెవ్వఁడో

చ. 2: బంతిగాఁగ నెల్లవారుఁ బండేటి మంచమూర -
గుంతలో విరుగఁదోసె కూళఁడెవ్వఁడో
దొంతుల కడవలోనఁ దొరలి దాఁచిన పెద్ద-
పొంతకూటికుండ గొంటఁబోయె నెవ్వఁడో

చ. 3: సారిది సంతలలోని సుద్దులెల్లా విని విని
విరసములెల్లఁ బాపె వీఁడెవ్వఁడో
తిరువేంకటగిరిదేవుఁడై యిందరికిఁ
గరుణ లోకముగాచె ఘనుఁడెవ్వఁడో

రేకు: 0028-1 ముఖారి సం: 05-156

పల్లవి: చిన్ననాఁడు ముద్దులు వంచినవాఁడు తా-
నున్నవాఁడే యిపుడు నాయెడయఁడై నేఁడు

చ. 1: గోవులఁ గాచినవాఁడు గొల్లెతల మేనిగబ్బుఁ -
దావుల పెనుభ్రమలఁ దగులువాఁడు
కోవిదుఁడెట్లనాయఁ గోమలులఁ బదియారు-
వేవురను వలపించే వెరవరెట్టాయెనే

చ. 2: వెన్నలారగించువాఁడు విడువక వెకలియై
కన్నచోనే తిరిగేటి గద్దరీఁడు
వన్నెకాఁడెట్లానాయ వడి గోపవనితల -
నెన్నరాని చేఁతలెల్ల నెట్టు సేసినాఁడే

చ. 3: కొండలెక్కి దాఁటువాఁడు కొండ మోచునట్టివాఁడు
కొండలే నెలవుగాఁ గైకొన్నవాఁడు
కొండుక పాయపువాఁడు గుబురైన తిరుమల-
కొండమీఁద నెలకొన్న కోనేటివాఁడు

రేకు: 0028-2 ముఖారి సం: 05-157

పల్లవి: కలికి కోరికల నుంగరము వెట్టిననాఁడె
చెలువంపు విరహగ్ని సేసెఁగా పెండ్లి

చ. 1: గరిమెఁ గేయూరకంకణహస్తముల సతులు
మురియుచును నిన్నుఁ గరములఁ జూపఁగా
తరుణి నినుఁ జూచినంతటనె మదనుఁడిద్దరికి-
నరవిరుల సేసలిడె నాయెఁగా పెండ్లి

చ. 2: పొదరిండ్ల చవికెలో పువ్వుఁదేనెల చెమట
చెదరకిరువంక నభిషేకములుగా
కొదమ తేంట్ల విప్రకోటి మిమ్మిద్దరిని
పొదలించఁ జిత్తములు పొసగెఁగా పెండ్లి

చ. 3: సోలుచును పేరఁటపు శుకపికంబులు మిమ్ముఁ
బాలుపడి నలుగడలఁ బాడఁగాను
తేలించి లలితాంగి తిరువేంకటేశ నినుఁ
గాలు దొక్కినదిపుడె కలిగెఁగా పెండ్లి

రేకు: 0028-3 కన్నడగౌళ సం: 05-158

పల్లవి: వంచన ప్రియములవారే కాక
నించిన కన్నీటి నేనేల నీకు

చ. 1: గిలుకు మట్టెలతోడ కిందిచూపులతోడ
సెలవి నవ్వులు నీ పైఁ జిందఁగాను
వలతువుగాక యెవ్వతి కైనఁ జిత్తము
నిలుపఁగనోపని నేనేల నీకు

చ. 2: గోడచాట్లతోడ కోనచీఁకటితోడ
వాడల నెలయించువారేకాక
వాడుచు లేమావి వడచల్ల వెడమాయ-
నీడలనెండే నేనేల నీకు

చ. 3: జగడంబులతోడ సణఁగు సొలపుతోడ
వగ నిన్ను భ్రమయించువారె కాక
దిగులులేక నిన్ను తిరువేంకటేశుఁడ
నెగులెఱుఁగక కూడు నేనేల నీకు

రేకు: 0028-4 ఆహిరి సం: 05-159

పల్లవి: వేడుక నెవ్వతెరా విడుపక నిన్నంటి
వాడుదేరే వలపుల వన్నెలు వెట్టనది

చ. 1: గద్దరి యెవ్వతెరా నీ గారవంపు చెక్కున
నిద్దంపు చంద్రరేఖ నిలిపినది
అద్దిరా దానిగయ్యాళితనమెట్టిదో
ముద్దుఁదనమోహము నీ మోహమున రాచినది

చ. 2: దిట్టైన యది యెవ్వతెర నీ యధరమందు
కొట్టఁగొన మరుచిలుకులొత్తినది
గట్టిగఁ జూడర దానిగబ్బితనమెట్టిదో తన-
గుట్టెల్ల నీకు నాకున వ్రాసెంపినది

చ. 3: చక్కనిదెవ్వతెర నీ సరిలేని మేనఁ దన-
మిక్కుటంపు మేనితావి మేళవించినది
అక్కరగాఁ దిరువేంకటాధీశ కూడితివి
మక్కువతో నీకు పరిమళములంపినది

రేకు: 0028-5 పాడి సం: 05-160

పల్లవి: అలమేలుమంగ నీవభినవరూపము
జలజాక్షుకన్నులకు చవులిచ్చేనమ్మా

చ. 1: గరుడాచలాధీశు ఘన వక్షమున నుండి
పరమానందం సంభరితవై
నెరతనములు చూపి నిరంతరము నాథుని
హరుషించఁగఁ జేసితి గదమ్మా

చ. 2: శశికిరణములకు చలువల చూపులు
విశదముగా మీఁద వెదచల్లుచు
రసికత పెంపునఁ గరఁగించి యెప్పుడు నీ-
వశము చేసుకొంటి వల్లభునోయమ్మా

చ. 3: రట్టడి శ్రీ వేంకటరాయనికి నీవు
పట్టపురాణివై పరఁగుచు
వట్టిమాఁకులిగిరించు వలపుమాటల విభు
జట్టిగొని పురమున సతమైతివమ్మా

రేకు: 0028-6 దేశాక్షి సం: 05-161

పల్లవి: ఒడయఁడవు నినుఁబాసి యుండవశమా తరుణి
చిడుముడియలుక చేతిచిలుకఁ బగచేసె

చ. 1: గారవపు జలరాశికన్య నీతోనలిగి
ఆరామములలోన నలయఁగాను
వైరంపుబాణమై వనజమిరుమై గాఁడె
ఈ రీతి నీ యలుక యిల్లు పగఁజేసె

చ. 2: ఎలజవ్వనిటు నీకు నెదురుచూచుచు వెడలి
చెలఁగి వెన్నెలకు విచ్చేయఁగాను
నలువొందఁ జంద్రకిరణములు మయివడిఁ బొక్కె
బులుపుఁ గోపము తోడఁబుట్టుఁ బగచేసె

చ. 3: పంతంపు శ్రీసతికిఁ బతివి వేంకటరమణ
కాంతహృదయంబెటిఁగి కలయఁగాను
అంతలోననె మదనుఁడలయించె నిప్పుడిటు
కొంతవడి నీకసరు కొడుకుఁ బగచేసె

రేకు: 0029-1 సామంతం సం: 05-162

పల్లవి: ఎన్ని సేఁతలై నఁ జేయునిపుడు యీతఁడు
కన్నెవయసువారినెల్ల గాఁకదేర్చె నీతఁడు

చ. 1: గుబ్బచన్నుదోయి మెఱుఁగుఁ గులుకరించి చెలఁగి నడచు
గబ్బుతావిరమణి చల్లకడవతోడను
సిబ్బమైన చెక్కులందు చిన్నిచెమటగారఁ జెనకి
గబ్బిసేఁతలెల్లఁ జేసె కళలుగరఁగ నీతఁడు

చ. 2: వాలుఁగన్నుదోయి మెఱుఁగు వల్లెవేసివేసి రతికి
కాలుదవ్వురమణి చల్లకడవతోడను
కేలుదమ్మి కంకణాలు గిలుకరించి చెలఁగి నడచు
కీలుగొప్పు సడిలి జారఁ గిందుపరిచె నీతఁడు

చ. 3: కొదలుదేరు కోవిలెలుఁగు కుత్తికందు సాళగించి
కదలుమోవిరమణి చల్లకడవతోడను
ఎదురమెరయు వేంకటేశుఁడింతి ప్రేమదీరఁ జెనకి
కదిసి మదనకదనమందు కలికిఁజేసె నీతఁడు

రేకు: 0029-2 పాడి సం: 05-163

పల్లవి: ఏలేయేలే మరఁదలా చాలుఁజాలు చాలును
చాలు నీతోడి సరసంబు బావ

చ. 1: గాఁటపు గుబ్బలు గదలఁగఁ గులికేవు
మాటలఁ దేటల మరఁదలా
చీటికి మాటికిఁ జెనకేవే వట్టి-
బూటకాలు మాని పోవే బావ

చ. 2: అందిందె నన్ను నదలించి వేసేవు
మందమేలపు మరఁదలా
సందుకోఁ దిరిగేవు సటకారి వోబావ
పొందు గాదిఁకఁ బోవే బావ

చ. 3: చొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువ నేసిన మరఁదలా
గక్కున నను వేంకటపతి కూడితి
దక్కించుకొంటివి తగులైతి బావ

రేకు: 0029-3 ఆహిరి సం: 05-164

పల్లవి: కామిని నీ సౌభాగ్యము గలిగిన ఫలమిది గలిగెను
ఆమని వెన్నెలకేఁటికి నలయుచు వచ్చెదవే

చ. 1: గుబ్బల చెమటల పయ్యెద కొనగొంగున నల్లార్పుచు
ఉబ్బున గమనావస్థల నూఁటాడెదవేలే
బబ్బిలికాయల రవములు పదనూపురములఁ గెలయఁగ
తబ్బిబ్బుగ నునుపాదము తాటించెదవేలే

చ. 2: ఎత్తిన కరమూలపురుచులిరుగడ మెఱుఁగులు దొలఁకఁగ
తత్తరమందుచు నెవ్వనిఁ దలఁపుచు మ్రొక్కెదవు
ముత్తెపుసరముల వేఁగున మరియుచు నెచ్చరివై నీ-
వొత్తిలి నిట్టూర్పులతో నొయ్యన పలికెదవే

చ. 3: తావులు చల్లెటి దేహము తలఁపులుమీరిన హరుషము
లోవెలుతుల వెడయాసలు లోపలి కోరికలు
శ్రీవేంకటగిరినాథుని చెలువపు కొఁగిటి వుయ్యాల
భావజసౌఖ్యాంబుధిలో పలుమరుఁ జెలఁగెదవే

రేకు: 0029-4 కాంబోది సం: 05-165

పల్లవి: చెలికిఁ జక్కఁదనము నేసిన యజుఁడు భూమిఁ
గలవారికెల్లఁ బ్రేమ గలిగించెఁ గదవే

చ. 1: గుబ్బలపై కొనగోరి గురుతు లంటినచోటు-
లబ్బురమై మృగమందమంటినది చూడవే
గబ్బికన్నుల కలికి కప్పిన పయ్యదలోన
నిబ్బరపుఁ దనువల్లి నిగ్గులు వెళ్ళఁబారెనే

చ. 2: కొప్పునఁ దట్టుపుణుఁగు కొలఁదిమీరఁగ నంటిన-
జిప్పిలి చెక్కులవెంటఁ జిందినది చూడవే
ఒప్పయిన నీ నడపున నొడికపుమట్టియల-
చప్పుడు విన్నఁ జిత్తము జల్లురనెఁ గదవే

చ. 3: చక్కఁదనములచేత సరిలేనివాఁడు గన
దిక్కుల వెలసినట్టి తిరువేంకటేశుఁడు
మక్కువలరఁగ నింతి మరగించి ప్రియమెల్లఁ
జక్కఁదనముగఁ జేసెఁ జాలదా యింతయును

రేకు: 0029-5 రీతిగౌళ సం: 05-166

పల్లవి: రాధామాదవరతిచరితమితి బోధావహం శ్రుతిభూషణం

చ. 1: గహనే ద్వావపి గత్వా గత్వా రహసి రతిం ప్రేరయతి సతి
విహరతస్తదా విలసంతౌ విహతగృహశౌ వివశౌ తౌ

చ. 2: లజ్జాశణళ విలాసలీలయా కజ్జలనయన వికారేణ
హృజ్జావ్యవహృత హృదయా రతి స్సజ్జా సంభ్రమచపలా జాతా

చ. 3: పురతో యాతం పురుషం వకుళైః కురంటకైర్వా కుటజైర్వా
పరమం ప్రహరతి పశ్చాల్లగ్నా గిరం వినాపి వికిరతి ముదం

చ. 4: హరి సురభూరుహ మర్థతివస్వ చరణేన కటిం సంవేష్ట్య
పరిరంభణ సంపాదితపులకై- స్సురుచిర్జాతా సుమలతికేవ

చ. 5: విధుముఖదర్శన విగళితలజ్జా త్వధరబింబఫలమాస్వాద్య
మధురోపాయనమార్గేణ కుచౌ నిధివద త్వా నిత్యసుఖమితా

చ. 6: సురుచిరకేతక సమదళ నఖరైర్వరచిబుకం సా పరివృత్య
తరుణిమసింధౌ తదీయదృగ్జల- చరయుగళం సంసక్తం చకార

చ. 7: వచన విలాసైర్వశీకృత తం నిచులకుంజ మానితదేశే
ప్రచురసైకతే పల్లవశయనే రచితరతికళా రాగేణాస

చ. 8: అభినవకల్యాణాంచితరూపా వభినివేళ సంయతచిత్తౌ
బభూవతు స్తత్పరౌ వేంకట విభుణా సా తద్విధినా సతయా

చ. 9: సచ లజ్జావీక్షణో భవతి తం కచభరం గంధం ఘ్రాపయతి
నచలతిచేన్మానవతీ తథాపి కుచసంగాదనుకూలయతి

చ. 10: అవనతశిరసాప్యతి సుభగం వివిధాలపైర్వివశయతి
ప్రవిమల కరరుహరచన విలాసై- ర్భువనపతి తం భూషయతి

చ. 11: లతాగృహమేళనం నవసై - కతవైభవ సౌఖ్యం దృష్ట్వా
తత స్తతశ్చరసౌ కేలీ- వ్రతచర్యాం తాం వాంఛంతౌ

చ. 12: వనకుసుమ విశదవరవాసనయా ఘనసారరజోగంధైశ్చ
జనయతి పవనే సపది వికారం వనితా పురుషౌ జనితాశౌ

చ. 13: ఏవం విచర హేలా విముఖ- శ్రీస్వేంకటగిరి దేవోయం
పావనరాధాపరిరంభసుఖ- శ్రీ వైభవసుస్థిరో భవతి

రేకు: 0030-1 ధన్యాశి సం: 05-167

పల్లవి: ఏవం దర్శయసి హితమతిరివ
కేవలంతే ప్రియసఖీవా తులసీ

చ. 1: ఘటిత మృగమద మృత్తికా స్థాసకం
పటు శరీరే తే ప్రబలయతి
కుటిలతద్ఘనభారకుచవిలగ్నంవా
పిటర స్థలే మృత్పీతా తుళసీ

చ. 2: లలిత నవ ఘర్మలీలా విలసనో-
జ్జ్వలనం తవ తనుం వంచయతి
జల విమలకేలీవశా సతతం
అలిక ఘర్మాంచిత విహరా తులసీ

చ. 3: సరస నఖచంద్రలేశా స్తే సదా
పరమం లావణ్యం పాలయతి
తిరువేంకటేశ తత్కరుణా గుణా వా
వరరూప నవచంద్రవదనా తులసీ

రేకు: 0030-2 సామంతం సం: 05-168

పల్లవి: సారెసారె విన్నవించఁ జాలమిఁక నీవు
దారిదప్ప దిరిగేవు తగవా వోరి

చ. 1: చెప్పరాదు కడు వలచిన వానివలె నా-
కొప్పులోని సవరము కొంటఁబోయి
అప్పుడే వొక్కతికిచ్చితట వోరి నా-
తప్పుగాని నీవల్లఁ దప్పులేదు వోరి

చ. 2: కడలేని మోహంబు గలవానివలె నా-
కడితాను చీర నీవు కాసెవోసి
వడిగా నేఁగెదవు యవ్వతికియ్యవలెనో నన్ను
వడిఁబెట్టి యింతసేయవలెనా వోరి

చ. 3: ముద్దుల నా వేలనున్న ముద్దుటుంగరము నీవు
వుద్దండానఁ గొంటఁబోతి వోరి
తిద్దలేము నీగుణాలు తిరువేంకటేశ నీవు
వొద్దికతో నన్నుఁబాయకుండరా వోరి

రేకు:	0030-3 సామంతం	సం:	05-169

పల్లవి:	తలనొక్కమాటాడఁ దలకెక్కె వలపు దీని-
తలఁపు రేఁచక మీరు తలరమ్మా

చ. 1:	చిత్తజు నమ్ములు దాఁకి జీర వారినందుకు పూ-
వత్తులు వేయక కాని వాడదమ్మా
బత్తిగల వారిందరు పచ్చకప్పురము మేన
మెత్తకకాని మానదు మెత్తరమ్మా

చ. 2:	కంటిచూపు కాయజుని వింటిబాణములు దాఁకి
గంటిలేని పోటులాయఁ గదరమ్మా
అంట ముట్టరాని తాప మగ్గలమైనది ముల్లు
ముంటఁగాని పోదు మేను మూయరమ్మా

చ. 3:	అప్పుడింత సొబగు లేదతివమొగమునందు
చొప్పులెల్ల బాగులాయ చూడరమ్మా
అప్పుడు శేషాద్రిరాయఁడంగనఁ గలిసెఁ గాన
యెప్పుడూఁ బాయని చనవిచ్చె నమ్మా

రేకు: 0030-4 పాడి సం: 05-170

పల్లవి: చింతల చిగురులె చిచ్చులట
యింతటిలోనిఁక నేలాగే

చ. 1: చక్కని మన్మథ సంవత్సరంబున
చుక్కలరాజే సూరియుఁడై
యెక్కువరాత్రుల యెండగాయునట
యెక్కడిదిఁక బ్రదుకేలాగే

చ. 2: కాంతల నడుములఁ గఱవయ్యెడినట
అంతట జవ్వనపామనిని
వింత మీన సని వెలఁదులకన్నుల -
నెంత గనమౌనొ యేలాగే

చ. 3: కంకుమగుబ్బల కుంభరాశికిని
వంకల చంద్రుఁడు వచ్చెనట
వేంకటరమణుఁడు వెలఁదిఁ గూడెనట
యింక నీ తమక మేలాగే

రేకు: 0030-5 పాడి సం: 05-171

పల్లవి: మారుకు మారు సేయ మఱచి నీ వంతలోనె
నేరములెంచుకొనేవు నేఁటిలోనే తప్పెనా

చ. 1: చొక్కపు నీ గుబ్బలపై జూజపు నేఁతలవలె
చిక్కులు జీరలువారఁ జించెనాతఁడు
తెక్కుల నీ వూరకుండి తెలిగన్నుల నీళ్ళు
గుక్కేవు నీ చేతులేమి కూరగోయఁ బోయెనా

చ. 2: ముసిముసి నగవుల మోవిమీఁది కెంపులవి
కసిగాటు సేఁతలనే కప్పె నతఁడు
అసురుసురై నీవు అతనిఁజేయఁగలేక
వుసురనేవప్పుడేమి వూరలేక వుంటివా

చ. 3: కూరిమి నీ కౌఁగిటిలోఁ గూడి నీ చిత్తమనెడి
వూరిలోనఁ గాఁపురమైవుండె నాతఁడు
వేరులేని మహిమల వెంకటేశుఁడతనిమై
చూరగొంటి వప్పుడేమి జోడువెట్టుకుండెనా

రేకు: 0030-6 కాంబోది సం: 05-172

పల్లవి: ఉయ్యాల మంచముమీఁద నూఁచి వేసారితిమి
ముయ్యదించుకయు రెప్ప మూసినాఁ దెరచును

చ. 1: చందమామ పాదమాన సతికి వేఁగినదాఁకా
యెందును నిద్రలేదేమి సేతమే
గందపుటోవరిలోనఁ గప్పురంపుటింటిలోన
యిందుముఖి పవ్వళించు నింతలోనే లేచును

చ. 2: పంచసాయకుని పుష్పబాణమాన యిందాఁక
మంచముపై బవ్వళించి మాటలాడదు
నించిన వాలుగన్నుల నిద్దురంటానుండితిమి
వంచిన రెప్పలవెంట వడిసీఁ గన్నీరు

చ. 3: వెన్నెలల వేంకటాద్రివిభుని లేనవ్వులాన
నన్నుఁ జూచియైనాఁ జెలి నవ్వదాయను
ఇన్నిటాను సంతసిల్లి యీ దేవదేవుని గూడి
మన్ననల యింత లోన మలసీని జెలియ

రేకు: 0031-5 కాంబోది సం: 05-173

పల్లవి: ఉండఁబాసీ నడవిలో వొకతె నేను
ఎండలు నీడలు గాసీ నేమి సేతురా

చ. 1: చిన్నినానడుము చూచి సింహము దగ్గరెనంటా
ఉన్నతపుఁ గుచముల కొరసెఁ గరి
మున్నిటి పొందులు వైరమును జేసె మృగపతి
యిన్నిటికి నగ్గమైతి నేమి సేతురా

చ. 2: నిండు నా నడపు చూచి నెమలి దగ్గరి వచ్చె
బండు నేసి నారుసూచి పాయదు పాము
రెండుఁ జూచి పగయుఁ గూరిమి దోఁచె నింతలోనే
యిండె వట్టె నిన్నిటికి నేమి సేతురా

చ. 3: కోరి నాపలుకు విని కోవిల దగ్గర వచ్చె
చేరీ నామోవికిదె చిలుక నేఁడు
గారవాన నిన్నియు వేంకటగిరి విభుఁడా
యేరా యిట్టె చేకొంటివేమి సేతురా

రేకు: 0031-6 శంకరాభరణం సం: 05-174

పల్లవి: వెక్కసమగుఁ గుచవిభవములు
జక్కవా పులుగుల జగడములే

చ. 1: చింతచేత నిదె చెలియ నుదిటిపై
చెంతలఁ జెదరిన చిరునెరులు
కాంత కన్నులను గండుమీలకును
కంతుఁడు వేసిన గాలములే

చ. 2: తమకంబునఁ గాంతకుఁ గరమూలపు-
చెమటల తావుల చెలువములు
మమతలఁ బెంచిన మరుని కొంతముల-
జమళితీఁగెలకు జలకములే

చ. 3: తెఱమోవిపై తిరువేంకటపతి
గుఱుతులు సేసిన కురుఁబసలు
ఒఱిగి వివశతల నుండఁగ సురతపు
మఱపులు దెలిపిన మర్మములే

రేకు: 0061-1 కొండమలహరి సం: 05-175

పల్లవి: భోగీంద్రశయనుని బోయతి దివ్య-
భోగాలు మరిగిన బోయతి

చ. 1: పొదిగొన్న పెనుఁగొప్పు బోయతి మించుఁ-
బొదలిన గుబ్బల బోయతి
పొదలఁ బూవులు చూచి బోయతి యంప-
పొది సవి వెరచెనె బోయతి

చ. 2: పొడల గందపుమేని బోయతి పచ్చి-
పొడికప్పురపు బూఁత బోయతి
పొడవైన హరిఁ జూచి బోయతి నేఁడు
పుడుకు వేఁదురుగొన్న బోయతి

చ. 3: పొందైన రచనల బోయతి పతిఁ
బొందక పొందిన బోయతి
పొందులెరఁగని బోయతి రతిఁ
బొందె వేంకటపతి బోయతి

రేకు: 0061-2 ముఖారి సం: 05-176

పల్లవి: ఎవ్వఁడో వీఁడేల తంగి వచ్చి
నవ్వీ నవ్వీ నాతోనే

చ. 1: పచ్చిపాలే పచ్చిపాలే
పచ్చిపాలే తోడంటుఁబాలే
వచ్చి వచ్చి వాడ వాడలఁ
జొచ్చియారగించెఁ జూడరే

చ. 2: పెంట పెరుగే పెంట పెరుగే
పెంటమంద పెనుఁబెంట పెరుగే
అంటకంటకు మనఁగానే వాఁడు
వొంటి నారగించీ నోయమ్మా

చ. 3: బొంకుగోరో బొంకుగోరో
బొంకుగోరో కోరో పాలఁతులు
వేంకటేశుండు వేసాలరాయఁడు
అంకెలా నన్ను నలరించెనే

రేకు: 0061-3 సామంతం సం: 05-177

పల్లవి: ఎటువంటి భోగి వీఁడెటువంటి జాణ
వటపత్రమున నున్నవాఁడా వీఁడు

చ. 1: పొదిగొనఁ బూచిన పున్నాగతరులలో
పొదలుఁ బుప్పొళ్ళపైఁ బూఁదేనె సోనలు
గదలుచు జడివానకాలంపుఁ బెదపెద్ద-
నదులై పారనున్నతిని
కదలని నడిగడ్డ కల్పభూజంబుల
పదిలమైన నీడ బంగారు చవికెలో
కదిసిన జలరాశి కన్నెకౌఁగిటఁ గూడి
వదలకెప్పుడు నున్నవాఁడా వీఁడు

చ. 2: వలనగు తావుల వాంతికలలోన
కెలఁకుల నరవెడ్పుఁ గెందామరలయందు
పొలయుచు గొజ్జంగపూవుల దూళితో
లలితంపు గాలి చల్లఁగను
కొలందిమీరిన మంచి కోనేటి పన్నీటి-
జలములలో నున్న జలముఖులుఁ దాను
అలరుచుఁ దననోలలాడుచు నేప్రొద్దు
వలపులు చల్లినవాఁడా వీఁడు

చ. 3: లోకము లోపలి లోలలోచనలెల్లా
జోకైన తనవాలుఁ జూపులచేఁ జిక్కి
యీకడాకడ చూడనెఱఁగక నిజమైన-
సాకారమునకె మెచ్చఁగను
పైకొన్న సరసపుఁ బలుకులఁ గరఁగించి
యేంకాతమున సౌఖ్యమెల్లఁ జేకొనుచుఁ దా-
నీకడఁ దిరువేంకటేశుఁ డై యున్నాఁడు
వైకుంఠపతియైన వాఁడా వీఁడు

రేకు: 0061-4 శ్రీరాగం సం: 05-178

పల్లవి: వేవేగన రానివిభునితోడి పొందు
యేవూరికేవూరు యేవూరే

చ. 1: ప్రేమమెఱఁగి రాఁడు పలిచిన పతితోడ
యేమందమేమందమేమందమే
భామిని తను నొవ్వఁబలికెననుచు నాడె
యేవమాఁటకేమాఁట యిది యేఁటికే

చ. 2: జామాయ నిదె వచ్చి సటలెల్లఁ బచరించి
యేమేలుకేమేలు ఇదియేఁటికే
కామునిశరములఁ గాఁగునింతకుఁ జెలి
యేమిటికింక మనమేమిటికే

చ. 3: దిమ్మరితనములఁ దిరువేంకటేశుని
రమ్మను రమ్మను రమ్మనవే
నెమ్మనమలరఁగ నేఁడింతలోననే
కమ్మరఁ గమ్మరఁ గరుణించెనే

రేకు: 0061-4 దేసాళం సం: 05-179

పల్లవి: నెయ్యములల్లోనేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

చ. 1: పలచని చెమటల బాహుమూలముల-
చెలమలలోనాఁ జెలుపములే
థళథళమను ముత్యపు జెఱఁగు సురటి
దులిపేటి నీళ్ళతుంపిళ్ళో

చ. 2: తొటతొటఁ గన్నులఁ దొరిగేటి నీళ్ళ
చిటి పొటి యలుకల చిరునగవే
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటుకలలోనా గుక్కిళ్ళో

చ. 3: గరగరికల వేంకటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చనలు
మరునివింటి కమ్మనియంప విరుల-
గురితాఁకులినుపగుగ్గిళ్ళో

రేకు: 0061-5 శుద్ధవసంతం సం: 05-180

పల్లవి: ఎన్ని సేసినా నీకు నిది గొత్తలా
అన్నిటిలోపల నుండే అతఁడౌదో కావో

చ. 1: వొలఁతి మొయిఁదీగెపై పులకలు వొడమించే-
విల నిన్నుఁ దలఁపించి యిది గొత్తలా
తలకొన్న వేణునాదముననె వట్టిమాఁకు-
లలర- జేసినవాఁడవౌదువో కావో

చ. 2: గుట్టునఁ బయ్యెదకొంగు గుబ్బలనె జారించే-
విట్టె నీ ప్రేమనే యిఁతికిది గొత్తలా
మట్టుకొని వేణురవమున గొల్లెతల చీర-
లట్టు నిట్టు వదలించి నాతఁడౌదో కావో

చ. 3: కాంత కవుఁగిటను వేంకటగిరి విభుఁడా నీ-
వింత మేను మఱపించుటిది గొత్తలా
పంతమూడి యడవిలో పసుల నీరాగాల-
రంతులనే మఱపించే రాజవవుదో కావో

రేకు: 0062-1 ఆహిరి సం: 05-181

పల్లవి: ఎంతవడి దాఁక నీ యెల యింపులు
నంతమై విభునికిటు చనవియ్యరాదా

చ. 1: పొగరుఁగెమ్మోవి గిరుపుల నగవులాఁడి నీ-
పగడవాతెర దెరచి పలుకవమ్మా
బిగువుఁ బొలయలుక మురిపెముల నీ సొబగెల్ల
సగమాయఁ జలమింకఁ జాలించరాదా

చ. 2: కలికి నునుమెఱుఁగుఁ బుల కల గుబ్బలాఁడి నీ-
సొలపుఁ గన్నులు దెరచి చూడవమ్మా
వలపు వసివాడ జవ్వనపు లేఁదీగతో
తలఁకేవు కోపంబు తలఁగించరాదా

చ. 3: లావణ్యముల సొబగులాఁడి నీ ప్రియుఁడైన-
కోవిదునిపైఁ బ్రేమ గులుకవమ్మా
శ్రీ వేంకటేశ్వరుఁడు చెలఁగి నిను మన్నించె-
నీ వేఁడుకలనైన నిట్లుండరాదా

రేకు:	0062-2 ఆహిరి	సం:	05-182

పల్లవి:	శిఱుత నవ్వులవాఁడు శిన్నెకా వీఁడు
వెఱపెఱఁగడు సూడవే సిన్నెకా

చ. 1:	పొలసుమేనివాఁడు బోరవీఁపువాఁడు
సెలసు మోరవాఁడు సిన్నెకా
గొలసుల వంకల కోరలతో బూమి
వెలసినాఁడు సూడవే సిన్నెకా

చ. 2:	మేఁటి కుఱుచవాఁడు మెడమీఁది గొడ్డలి-
సీటకాలవాఁడు సిన్నెకా
ఆఁటదానిఁ బాసి అడవిలో రాకాశి-
వేఁటలాడీఁ జూడవే సిన్నెకా

చ. 3:	బింకపుమోఁతల పిల్లఁగోవివాఁడు
సింక సూపులవాఁడు సిన్నెకా
కొంకక కలికియై కొసరి కూడె నన్ను
వేంకటేశుఁడు సూడవే సిన్నెకా

రేకు: 0062-3 శ్రీరాగం సం: 05-183

పల్లవి: చెల్లఁబో అలుగ నేఁడు సిగ్గుగాదా
వొల్లని వీనిఁ బాసి వుడికి నామనసు

చ. 1: పొలసి యీ ప్రాణమిట్టే పోయినాఁ బోయఁ గాక
తలవంపు సేసే యీ తను వేఁటికే
కలసియుఁ గలయని కఠిచిత్తుని వీని
సొలసి కమ్మరఁ జూచీ నా మనసు

చ. 2: మరుతాపమున మేను మాఁడిన మాఁడెఁగాక
పరులబారికిఁ జిక్కే బ్రదుకేఁటికే
విరహాన నొకతెవై వేదనఁ బొరలు వీని-
కరుణలే కోరీని కష్టపు నామనసు

చ. 3: సడిఁబెట్టి వయసిట్టే చంపినఁ జంపెఁ గాక
వడిఁ బెట్టి వేఁచే నావయసేఁటికే
కడు జాణఁడైన వేంకటగిరీంద్రుఁడు వాని-
వొడలు సోఁకిన నిట్టే వుబ్బెడి నామనసు

రేకు: 0062-4 కాంబోది సం: 05-184

పల్లవి: ఇదె మొగంబిదె యద్దమిఁకనేఁటికే మిగులఁ
బదరేవు చెలివద్ద బవళించి నీవు

చ. 1: పెట్టినది నాయకుని బిరుదు పెనుఁబెండెంబు
కట్టినది యతనిమెడ కంటమాల
యెట్టు బొంకెదవె చెలి యిందాఁక బంగారు-
పట్టెమంచముమీఁదఁ బవళించి నీవు

చ. 2: పుక్కిటిది నాయకుని పొందైన తమ్ములము
చెక్కిటిది పతినొసలి చిన్నిచెమట
యిక్కు వెరిఁగియు బొంకనిఁకనేలె చెలి యతని-
పక్కనే యిందాఁకఁ బవళించి నీవు

చ. 3: బచ్చెనలు కుచయుగముపై నతని మృగమదము
లచ్చెనలు కొనగోళ్ళలాంచనములు
ఇచ్చకునిఁ దిరువేంకటేశుఁ గూడితివె చెలి
పచ్చలోవరి లోనఁ బవళించి నీవు

రేకు: 0062-5 శ్రీరాగం సం: 05-185

పల్లవి: పిడికిటి తలఁబాల పెండ్లికూఁతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూఁతురు

చ. 1: పేరుకల జవరాలె పెండ్లికూఁతురు పెద్ద-
పేరులముత్యాలమేడ పెండ్లికూఁతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లికూఁతురు విభుఁ
బేరు కుచ్చ సిగ్గువడీఁ బెండ్లికూఁతురు

చ. 2: బిరుదు పెండెము వెట్టెఁ బెండ్లికూఁతురు నెర-
బిరుదు మగనికంటెఁ బెండ్లికూఁతురు
పిరిదూ రినప్పుడె పెండ్లికూఁతురు పతిఁ
బెరరేఁచీ నిదివో పెండ్లికూఁతురు

చ. 3: పెట్టెనె పెద్దతురుము పెండ్లికూఁతురు నేఁడె
పెట్టెఁడు చీరలుగట్టెఁ బెండ్లికూఁతురు
గట్టిగ వేంకటపతికౌఁగిటను వడి-
పెట్టిన నిధానమైన పెండ్లికూఁతురు

రేకు: 0062-6 బౌళి సం: 05-186

పల్లవి: పెట్టని కోటిందరికిఁ బెండ్లికొడుకు బొమ్మ-
బెట్టె నసురలకెల్ల- బెండ్లికొడుకు

చ. 1: పెల్లగించి భూమెత్తీఁ బెండ్లికొడుకు వాఁడె
పిల్లఁగోవి రాగాల పెండ్లికొడుకు
పెల్లైన యీావుల పెండ్లికొడుకు వాఁడె
పిల్లఁదీపుపెన్నుద్ది పెండ్లికొడుకు

చ. 2: పెంచెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం-
పించిన కోపగించీఁ బెండ్లికొడుకు
పెంచకప్పుడే పెరిగెఁ బెండ్లికొడుకు వల-
పించెఁ జక్కనిసిరిఁ బెండ్లికొడుకు

చ. 3: పెంట పెరుగులదొంగ పెండ్లికొడుకు భూమిఁ
బెంటి పోతులఁ గూరిచెఁ బెండ్లికొడుకు
గెంటులేని వేంకటగిరిమీఁదను వాఁడె
పెంట వెట్టుకున్నవాఁడు పెండ్లికొడుకు

రేకు: 0063-1 ముఖారి సం: 05-187

పల్లవి: పైపై దూరక పదరో యింతి
కోపాన బాసైనఁ గొనీఁ గాని

చ. 1: పరివారపుఁ బడఁతులేఁటికే
దొరలనంటేరు తొలరో
సరసపు తమ జగడాల నిట్టే
పరుల దూరేరు పచ్చిగనే

చ. 2: చక్కని విభుని సారెకుఁ జెలులు
వెక్కసాలాడక విడరో
దిక్కులకెల్లాను తెలివఁ బాసి తాఁ
నొక్కఁడే విచ్చేయుటొచ్చెమని

చ. 3: శ్రీ వేంకటేశుఁడు చెలువుఁ డొక్కఁడే
యేవంకకేఁగిన నేమౌను
భావించి యురముపనున్న కొమ్మదాఁ
నేవేవి గడించె నెఱుఁగరా

రేకు: 0063-2 ఆహిరి సం: 05-188

పల్లవి: గుట్టునఁ గోరికలెల్లఁ గొల్లవట్టీ నీ-
పట్టపుదేవికి నీకుఁ బల్లాండు పల్లాండే

చ. 1: పచ్చల సందిదండలు బాహుపురులు మెరయ
నెచ్చెలిపై మేను సోఁక నిలుచుండి
పచ్చవిలుకానితల్లి బంగారు దోసిట నీపై
బచ్చకప్పురము చల్లీఁ బల్లాండు పల్లాండే

చ. 2: మంతనపు మాఁటలతో మాఁటుగ నిన్ను సొలసి
కొంతపు గోళ్ళ నిగ్గు గుమ్మరింపుచు
చెంతలఁజెంగలువలు చెలులు చేనందియ్యఁగ
పంతమున నీపై వేసి పల్లాండు పల్లాండే

చ. 3: అలరుల మేడలోన అలమేలు మంగ నీ
యలయిక దీరఁ బ్రేమ నలరఁ జేసి
కలసి వేంకటేశ నీ కౌఁగిలి చేకొనీ నిదే
పలుమారు మీకు మీకుఁ బల్లాండు పల్లాండే

రేకు: 0063-3 మాళవి సం: 05-189

పల్లవి: తఱచు సూసకపు ముత్యపుఁ దలఁబాలతో
నెఱుల తుఱుము వంచీనే నెలఁత

చ. 1: పచ్చఁదోరణముఁ బలుకులింటికిని
పచ్చిముత్యాలనే కట్టె బాసికము
ముచ్చటలేనగవుల ముంగిట ముగ్గులుపెట్టి
నిచ్చకల్యాణములాడీనే నెలఁత

చ. 2: బచ్చెనల మెఱుఁగు గుబ్బల అయిరాణి దెచ్చి
కుచ్చుఁ బులకల బూజ గుండలాయను
దిచ్చరిమరునిఁ దెచ్చి తెరమరఁ గెడలించి
హెచ్చిన పెండ్లికూఁతురే నెలఁత

చ. 3: మరువింటి పేరింటి మంచిలగ్నమునందు
పరువంపుఁ జనుదోయి పరుపుమీఁద
తిరువేంకటగిరిదేవునికౌఁగిటఁ గూడి
నిరతంపు సిరులందెనే నెలఁత

రేకు: 0063-4 నారణి దేశాక్షి సం: 05-190

పల్లవి: ఎందరికి మెహించి యెందువోతివో నీ-
యందపు జేఁతలు నాతో నానతియ్యరాదా

చ. 1: పాదమున నంటిన పచ్చకప్పురములోన
వేదుగాఁ దులసితావి విసరీని
యేదెసఁ బవ్వళించితి వెవ్వతె పాదములొత్తె-
నాదరముతోడ నాతో నానతియ్యరాదా

చ. 2: చెలువంపు నొల నించిన పచ్చి కస్తూరి
తులసి పరిమళము దొలఁకీని
యెలమి నెక్కడకేఁగి యెవ్వతెకు మొక్కితివో
అలవి దేరఁగ నాతో నానతియ్యరాదా

చ. 3: ఉరము నీ మాణికాన వొనరిన జవ్వాది
సరిగాఁ దులసితావి చల్లీని
తిరువేంకటేశ పొందితివి నన్నిదె నీ-
యరవిరి విధమైన నానతియ్యరాదా

రేకు: 0063-5 శ్రీరాగం సం: 05-191

పల్లవి: చలిగాలి వేఁడేల చల్లీనె కప్పురపు
మలయజము తానేల మండీనే

చ. 1: పాపంపు మనసేల పారీనే నలుగడల
చూపేల నలువంకఁ జూచీనే
తాపంపుమేనేల తడవీనె పూవింటి-
తూపేల చిత్తంబు దూరీనే

చ. 2: వాయెత్తి చిలుకేల వదరీనె పలుమారు
కోయిలలు దామేల గొణఁగీనే
రాయడికి నలులేల రాసీనె మాతోను
కాయజుఁడు తానేల కసరీనే

చ. 3: ఏకాంతముననేల యెదురైతినే తనకు
లోకాధిపతికేల లోనైతినే
చేకొనిదె మన్నించె శేషాద్రివల్లభుఁడు
పైకొనిదె మమ్మేల పాలించెనే

రేకు: 0063-6 వరాళి సం: 05-192

పల్లవి: కొలిచి బిందెలఁ దోసుకొనుఁగాక యీఁ
మలయుఁగోరికలనెడి మాడలే పండె

చ. 1: పొలఁతి సిగ్గులపోడు వొడిచి చిత్తపుటడవి
తొలుచూపు బదనునవె దున్నఁగాను
తలపోఁత విత్తఁగా తను చెమటవానలనె
బలువైన తమకమను బంగారు పండె

చ. 2: ఇచ్చకపుఁ జిరునగవులింటిలోపలి తోఁట
మచ్చుఁజీఁకట్లె పలుమరుఁ దవ్వఁగా
ఎచ్చుకుందుల సొలపులేతపుజలము వారి
నచ్చుఁగాఁకల పైఁడినక్కులే పండె

చ. 3: తగిలి వేంకటవిభుని తనివోని కౌఁగిటను
జగడంపుఁ గూర్మి సరసము చల్లఁగా
నిగనిగని పలుకుఁదేనియలు వేమఱుఁ బారి
నిగుడు విరహాగ్ని మాణికములే పండె

రేకు: 0064-1 శంకరాభరణం సం: 05-193

పల్లవి: నాకుఁ జెప్పరె వలపు నలుపో తెలుపో
నూకి పోవఁగరాదు నుయ్యా కొండో

చ. 1: పొలఁతి మరునికి వెరవ పులియా యెలువో
వులుకుఁదుమ్మిదమోఁత వురుమో మెరుమో
తిలకింపఁ జందనము తేలో పామో
యెలమిఁ గోవిలకూఁత యేదో పోదో

చ. 2: పొదలిన చలిగాలి పొగయో వగయో
వదలిన కన్నీరు వాఁగో వంతో
వుదరమునఁ బన్నీరు వుడుకో మిడుకో
యెదుటఁ దలవంచుకొనుటెగ్గో సిగ్గో

చ. 3: అసమశరుపై పరపుటదనో పదనో
పసగలవానిమోవి పంచదారో తేనో
అసమగతి వానిరాక ఆదోపాదో
రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో

రేకు: 0064-2 వరాళి సం: 05-194

పల్లవి: చెలఁగి కూఁతాకుగాఁ జేసేవునీ-
తలమీఁదనుండే తరుణిఁబో నేను

చ. 1: పిసుకకు పలుమారు పసురువేసీ నంత
వసివాడుకోర్చిన వనితఁ గాను
పస రేఁచి నీవింత పాలించు తొల్లిటిఁ
సిసువయిన నీ పెట్టుఁ జెట్టఁబో నేను

చ. 2: చిదుమకు పరుమారు చెక్కునొచ్చీ నీవు
వదనము నొక్కేటి వనితఁ గాను
ఎదురెదురనే భూమినెందరు లేరు నీఁ
నిదురవుచ్చినవారు నేనెవ్వతిని

చ. 3: కందించకు నన్నుఁ గౌఁగిట కాఁకల
అందునిందును గడు నలముచును
ఇందిరాపతి వేంకటేశ నీరతుల
పొందు నాకిదె మఱపుకెల్ల నెలవు

రేకు: 0064-3 శంకరాభరణం సం: 05-195

పల్లవి: లేఁతచెమటలనె తెలిసె మాకు నీకు
నీఁతలు మోఁతలునైన యింటిలోని సాము

చ. 1: పొదలు నీ నిట్టూరుపులనె తెలిసె మాకు
తుద మీరు వలరాచతొలిసాము
చెదరు నీ నెరులు చూచిననె తెలిసె మాకు
వెదచలు కాఁకల విరహపు సాము

చ. 2: పొలిఁతి నీ చూపువంపులనె తెలిసె మాకు
తలపోఁతవగల బిత్తరిసాము
పలుకకుండిన నీ కోపాననె తెలిసె మాకు
అలవోక నగవు నీ అరవిరిసాము

చ. 3: వొద్దికఁ గస్తూరితావులనె తెలిసె మాకు
గద్దరి నీ రతుల చీఁకటిసాము
ముద్దుల నీ నగవుల మోమునఁ దెలిసె మాకు
నిద్దపు వేంకటపతి నేరిపిన సాము

రేకు: 0064-4 శ్రీరాగం సం: 05-196

పల్లవి: ఎనలేని బీరములెండ మావులు
ఇనుపగుగ్గిళ్ళు నీవేమిసేసేవే

చ. 1: పల్లదపుఁ గోరికల బలిమి గలుగఁబట్టి
తల్లడపు దమకము దక్కెఁగాక
వెల్లిగొను మమతపై విసిగేవు యీ-
యిల్లులేని ముంగిలి నీవేమి సేసేవే

చ. 2: లేఁత నీచిత్తములోఁ దాలిమి గలుగఁగఁ బట్టి
చేఁతల నీయలుకెల్లఁ జెల్లఁగాక
పూఁతమాఁటల సొలపుబొంకులనె దూరేవు
యీఁతలేని చల్లులాట యేమిసేసేవే

చ. 3: నెరతనముల నీ నెయ్యము గలుగఁబట్టి
తొరలి వేంకటపతి దొరకెఁగాక
తెరవ నీకితనికిఁ దియ్యపుఁ గూటముల
యెరుకలేనిమఱపులేమి సేసేవే

రేకు: 0064-5 ఆహిరి సం: 05-197

పల్లవి: బయలీఁ దించేవే గొల్లపడుచా- నీవె
బయలీఁదించేవు లోపలనె కన్నులను

చ. 1: పాలు వోయవుగా గొల్లపడుచా-యీా-
పాలుకుండలివి లోలోపల నున్నవి
పాలుమాలేవేలే గొల్ల పడుచా- మా-
పాలు నీ కేలయ్య్య పాలవారివాఁడవు

చ. 2: పచ్చితేనె దేవే గొల్లపడుచ- మాకు
పచ్చితేనె లేదు మావిపంటనే కాని
పచ్చిమాటలేలే గొల్లపడుచ- పూవుఁ-
బచ్చితేనెలివివో నీ పలుకుల కొనలు

చ. 3: పసిచల్లమ్మే గొల్లపడుచా- నీవె
పసివడి తిరిగేవు బడివాయక
పసిబాలవటె గొల్లపడుచా- కురుఁ-
బల వేంకటగిరిపతి నన్నేలితివి

రేకు: 0064-6 ధన్యాశి సం: 05-198

పల్లవి: ఇందూ నందును రుచులెట్లుండునో
కందువెరిఁగి మేలుకైకొందువు

చ. 1: పదివేలు పళ్యాల పళ్ళిభోగము నీఁ
వదన నారగింతువప్పాలతో
పొదవిన యింతేసి పొందైన మతితో నీ-
సుదతికెమ్మోవినే చొక్కితివిగా

చ. 2: సరిలేని కల్పభూజముల పూవుల పూజ
సిరులుగా సురలచేఁ జేకొందువు
పరిపరివిధముల పరిమళములనెడి-
తరుణి పువ్వులతావిఁ దగిలితిగా

చ. 3: కొత్తయిన కస్తూరితోఁ గోరి తట్టుపుణుఁగు
మెత్తుకొందువు నీవు మేనిండను
ఇత్తరిఁ దిరువేంకటేశ యీ చెలిఁగూడి
హత్తిన చెమటలతో నలరితిగా

రేకు: 0065-1 కాంబోది సం: 05-199

పల్లవి: కూరిములే కదవమ్మ కోపమయ్యీని కడు-
భారమైన పోటుగాదా పచ్చిదేరే పలుకు

చ. 1: పున్నమచందురుని తోఁబుట్టుగైన నీమోము-
వెన్నెలలే కదవమ్మ వేఁచఁజొచ్చీని
పన్నిన పగల వెలుపటివారికంటెను
ఎన్నరాని పగగాదా యింటిలోని పోరు

చ. 2: చిత్తజుని జనియించఁ జేసే మొక్కలపు నీ-
చిత్తమిదే కదవమ్మ సిగ్గు వాపీని
మిత్తివలెఁ జెలరేఁగి మీఁదఁగానే యెండకంటే
నెత్తిమీఁదిచిచ్చుగాదా నీడలోని యెండ

చ. 3: కట్టఁగడ చందనపుగాలికి మీరిన నీ-
నిట్టూరుపులేకావా నిగ్గుదేరీని
యిట్టె యివె తిరువేంకటేశుఁగూడఁ బట్టి నీకు
చుట్టపుఁ బగలే మంచిచుట్టములైనవి

రేకు: 0065-2 సామంతం సం: 05-200

పల్లవి: కడు నీకు మోహించుఁగాని చక్కనివిభు-
నెడసి నిమిషమైన నెట్టోరిచేవే

చ. 1: పసిఁడిమంచముమీఁదఁ బవళించి యతనితో
కసరులాడెడియట్టు గాదువో నేఁడు
విసిగించెఁ గదనె యీ విరహానలము నిన్ను-
నిసుమంత దడవైన నెట్లోరిచేవే

చ. 2: అడుగులొత్తుచు నీ యడుగులు నతనియ్మై
కడఁగి వొత్తినయట్లు గాదువో నేఁడు
బడలించెఁ గదవె యీ పరితాపమున నిన్ను-
నెడయెడ యలుకలనెట్టోరిచేవే

చ. 3: ఒరపైన యతినిపై నొరగి యాతనిమతిఁ
గరఁగించునటువలెఁ గాదువో నేఁడు
వెరవక కలసితి వేంకటపతితోడ-
నెఱిఁగెఱుంగని చేఁతలెట్టోరిచేవే

రేకు: 0065-3 శ్రీరాగం సం: 05-201

పల్లవి: వనితలఁ గరఁగించు వన్నెకాఁడవు యిట్టె
తనివి దీరవేమిటఁ దగునయ్య విట్ఠల

చ. 1: పైపైనె యేరమణిగుబ్బలతో యిచ్చితివి నీ-
వైపైన కరముల వాఁడిగోళ్ళు
దూపిలిన రతితోడఁ దోయఁ డు చేతులతోడ
యేపుననున్నాఁడవిపుడేమయ్య విట్ఠల

చ. 2: పొందైన యేలలన చూపులకొ యిచ్చితివి నీ-
విందైన మురిపెపు వేయిగన్నులు
అందపు రెండుగన్నులరవిరి నీ మోమున
చెందమ్మి రేకులఁ బోలుఁ జెల్లునయ్య విట్ఠల

చ. 3: కింకల నేసతికో చిక్కెను నీచిత్తమెల్లను
అంకెల నన్ను నేలితివబ్బురంబుగా
పంకంపుఁ గస్తూరిమేన పండరంగిపతివైన-
వేంకటనగముమీఁది వెడమాయ విట్ఠల

రేకు: 0065-4 ముఖారి సం: 05-202

పల్లవి: కలిసి కాఁకలఁబెట్ట కనుసన్నలనె తిట్ట
చలపట్ట నీకుఁ జెల్లే జాణఁడే యతఁడు

చ. 1: పగటుగుబ్బలురాయ పసిఁడి మట్టెలు మ్రోయ
నగవువెన్నెల గాయ నడచేవు
వగ నిన్ను భ్రమయించ వలపువారిధి ముంచ
జగడాలు వచరించ చతురుఁడే యతఁడు

చ. 2: చూపులనె పగచాట సొబగులఁ గనుగీఁ టఁ
దీపు పైపైమీఁటఁ దిరిగేవు
కోపగింతలనేఁప కూరిములు పైఁజాఁప
రావులు పెరరేఁప రసికుఁడే యతఁడు

చ. 3: సందుల దండలు జార జవ్వాదిచెమట గార
నందములు దైవార నలసేవు
కందువుల నినుఁగూడి కరఁగి సిగ్గులు వీడి
విందై నీతోడుతనాడే వేంకటేశుఁడితఁడు

రేకు: 0065-5 ఆహిరి సం: 05-203

పల్లవి: ఎంతపని యిది యానతియ్యరాదా యీ-
చింతచే నీ మనసు చిముడఁబెట్టేవు

చ. 1: పండువెన్నెల బయటఁ బవళించి వేడుకల-
నుండి చెలి యేఁటికో వుసురంటివి
కొండుకవయసు నిడుకోరికల నిట్టూర్పు-
టెండలనె యీ చిత్తమేల వేఁచేవు

చ. 2: తూఁగు మంచముమీఁదఁ దురుముఁ బయ్యద జార-
నూఁగుచును నేఁటికో వుసురంటివి
కాఁగేటి కుచగిరులు కమ్మఁజెమటలఁ దొప్పఁ-
దోఁగగా తమకంబు తొలఁగ దాఁచేవే

చ. 3: నిద్దంపు వేడుకల నీవు వేంకటవిభుని-
వొద్దికై యేఁటికో వుసురంటివి
వొద్ద నీకెపుడాతఁడుండవలె నాతనిని
వద్దనఁగ రాదనుచు వాడఁబారేవు

రేకు: 0065-6 బౌళి సం: 05-204

పల్లవి: కావరాదా కరుణించి
వావిగాని వావి వాడీఁ దరుణి

చ. 1: పచ్చిదేరునగ్గి బగబగ మండేటిఁ
చిచ్చరకోలల చేఁతల
వెచ్చియు వేవని వేదనఁబొరలుచు
అచ్చపుటాసల నలసీఁ దరుణి

చ. 2: నీడలేని మాఁకు నిక్కపుటెండల
తాడులేని కట్టుఁదగులున
గోడలేని పెద్దకోరిక చిత్తారు
వాడుచు లోలోనె వ్రాసీఁ దరుణి

చ. 3: పొందు లేని పొందు భోగపుఁ బ్రియముల
కందెడి తనలోని కరఁగుల
కందువెఱిఁగి వేంకటగిరిపతి నినుఁ
బొందిన తమకానఁ బొరలీఁ దరుణి

రేకు: 0066-1 దేశి సం: 05-205

పల్లవి: ముదిత చిత్తమునకు మొక్కరమ్మా
తుదలేని పతినిదె తోడితెంచె నిపుడు

చ. 1: పొలఁతి గుబ్బలనెడి పొడపు గుబ్బలిమీఁది-
మొలకచందురునకు మొక్కరమ్మా
నెలవుగఁ దనపతి నిద్దిరించే యింటిలోన
వెలయు వెన్నెలతీగె వెంటఁదెచ్చె నిపుడు

చ. 2: వనిత కన్నులనేటి వనజదళములపై
మొన చెంగలువలకు మొక్కరమ్మా
పెనగొన్న తనవిభ పెదపెద కన్నుల
గొనకొన్న పొందులెల్లఁ గొంటవచ్చె నిపుడు

చ. 3: అంచగమనకుఁ దొడవైన జవ్వాది నీట
ముంచిన మేనితావికి మొక్కరమ్మా
యెంచరాని తిరువేంకటేశుఁ గూడి యాతనిఁ
లంచపుఁ గౌఁగిటితావి లంకెఁ బెట్టె నిపుడు

రేకు: 0066-2 ముఖారి సం: 05-206

పల్లవి: రాఁడుగాక సరుగన రసికుఁడు యిట్టే
నేఁడే మచ్చికలనే నిధులు నిలుపఁడా

చ. 1: ప్రేమపు నీ యధరమే పెట్టరానిజీతము
కోమలి నీ తమ్ములమే కొంగుభత్యము
జాము నిన్నుఁ గొలిచిన చక్కని నీ విభుఁడు
యేమరక వలపులయేకరాజ్యమేలఁడా

చ. 2: పూఁత నీ గర్వముల చూపులే వారకములు
లేఁత నీ నగవులే పళ్ళెములో కూడు
పూఁతగాని చిత్తమనే పుప్పరిగెనుండినా
బాఁతి పడి నీ గుబ్బలపైఁడి కుండలెత్తఁడా

చ. 3: పుయ్యని నీ మేనితావి పువ్వుల చప్పరము
తొయ్యలి నీ కౌఁగిలిది తూఁగుమంచము
కయ్యపుఁ గూటముల వేంకటగిరివిభుఁడు
గయ్యాళి నీ కోరికల గద్దెమీఁద నుండఁడా

రేకు: 0066-3 ముఖారి సం: 05-207

పల్లవి: ఇందరినేలితి వికనేలే నీ-
యందపు బనులకు నంపుదు గాక

చ. 1: పొక్కుచు నిదె వలపుల సింహాసన-
మెక్కితి వంగన యికనేమే
పుక్కిటి నిట్టూర్పుల ప్రసాదములు
చక్కని చెలులకుఁ జల్లుదు గాక

చ. 2: పరిమళపు నుదుటఁ బట్టునఁ బట్టము
ఇరువుగఁ గట్టితివికనేమే
తరగని మేని ప్రతాపానలమున
అరుదగు సిగ్గుల నణఁతువు గాక

చ. 3: రాఁపుల మోహపురతుల రాజ్యమిది
యేపునఁ జేసితివికనేమే
పైపై వేంకటపతిరూప సిరులు
చేపడె నిన్నిటఁ జెలఁగుదు గాక

రేకు: 0066-4 ముఖారి సం: 05-208

పల్లవి: వెరవకువే యింత వెరగేలా నీకు
నెఱిఁ గురిసీఁ గొప్పున నీలాలు

చ. 1: పగడాలు వాతెరఁ బాయక కురియఁగ
మొగిఁ గురిసీఁ గన్నుల ముత్యాలు
మగువ నీవిభుని ప్రేమపుఁగూటమి గన్నుల
మగుడఁ గురిసీ నింక మాణికాలు

చ. 2: పడఁతి నీపుట్టానఁ బచ్చలు గురియఁగా
వడిసీని నీమేన వజ్రాలు
కడఁగి నీరమణుని కాఁకలఁ గూడఁగ
తొడరీ నీగోళ్ళతుదఁ గెంపులు

చ. 3: హితవైన తిరువేంకటేశుకౌఁగిట మోహ-
రతులఁ బొడమె నవరత్నాలు
ప్రతలేని లప్పలైన పచ్చి కస్తూరి శయ్య
మితిలేక రాలెనే గోమేధికాలు

రేకు: 0066-5 ముఖారి-ఆటతాళం సం: 05-209

పల్లవి: ఎవ్వరిపై నింతేసి యేల దూరేవే
పువ్వులు నిన్నే తాఁకఁ బొంచెనటవే

చ. 1: పండువెన్నెలలు నీపై గాయఁగా నీఁ
కెండలాయెనంటా నేల తిట్టేవే
నిండిన చందురుఁడు నీకు నాతనికి
కొండుకపాయము రూపు కూడపెట్టె నటవే

చ. 2: చల్లగాలి నిన్నును జాలిఁబెట్టెనంటా
వెల్లిగ నాకేలేలట్టే విఱిచేవే
మెల్లనే నీవిభుని మేనితావి యింతేసి
చల్లుమని గాలియేమి చాటెనటవే

చ. 3: కోవిలలు నిన్నుఁ గోపగించెనంటా
యీవల నావలనెల్ల నేల దూరేవే
శ్రీ వేంకటేశుని చెలియ నీకొఁగిట
చేవగాఁ గూడుమని చెప్పెనటవే

రేకు: 0066-6 సాళంగం సం: 05-210

పల్లవి: నీవు దురగముమీఁద నేర్పు మెరయ
వేవేలు రూపములు వెదచల్లితపుడు

చ. 1: పదిలముగ నిరువంక పసిఁడిపింజల యంప-
పొదుల తరకసములొరపులు నెరపఁగ
గదయు శంఖంబుఁ జక్రము ధను: ఖడ్గములు
పదివేలు సూర్యబింబములైనవపుడు

చ. 2: సారిది శేషుని పెద్దచుట్టు పెనుఁ గేవడము
సిరిదొలఁక నొకచేతఁ జిత్తగించి
దురమునకుఁ దొడవైన ధూమకేతువు చేత-
నిరవైన బల్లెమై యేచెనందపుడు

చ. 3: కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌఁగిట నిన్నుఁ దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువుమని
మెరుఁగు కుచకుంభముల మిసిమితో నపుడు

రేకు: 0067-1 కాంబోది సం: 05-211

పల్లవి: కాంత నీ నెరుల చీఁకటినతఁడు భ్రమయఁగా
చింత చీఁకట్లు ముంచినది యరుదా

చ. 1: పొలఁతి నీ చిఱునవ్వు పువ్వులాతఁడు గోసి
కులికి కన్నుల నొత్తుకొనఁగాను
వలరాయఁడపుడు తన వాఁడి పువ్వు టమ్ములను
చలముకొని మిమ్ము ముంచక మానునా

చ. 2: నెలఁత నీపలుకుఁదేనియలాతఁడిటు గ్రోలి
సొలయుచును మైమరచి చొక్కఁగాను
తలఁపఁ గోవిలల యమృతంపుఁ బలుకుల వెల్లి
అలర మీమీఁదఁ గురియక మానునా

చ. 3: పరగు నీ మెఱుఁగు గుబ్బలనెడి గిరులపై
తిరువేంకటేశ్వరుఁడు తిరుగఁగాను
పరువంపు వలపు తాపల పెద్దకొండలై
గరిమతో మీకుఁ బెరుగక మానునా

రేకు: 0067-2 శ్రీరాగం సం: 05-212

పల్లవి: పతిఁ గలసి మేనెల్ల పరవశంబగుకంటె
హితవిరహమున నెదిరి నెఱఁగుటే మేలు

చ. 1: పరపీడ గావించి బతుకు బతుకుటకంటె
పరహితము చేయునాపదలె మేలు
సిరుల నడిమికి భయము సేయు చనుఁగవకంటె
తరుణి నీ నెన్నడిమి దైన్యమే మేలు

చ. 2: కాంత నితరులకింద గరువించుకంటె మతిఁ
జింతఁగందుచు నలయు సిలుగె మేలు
కుంతలంబుల కిందఁ గులుకుఁ జూపులకంటె
చెంతలను నీతురుము చెదరుటే మేలు

చ. 3: తొడరి సరివారి వొత్తుడుకు నోర్చుటకంటె
గొడవతో వాఁడి గైకొనుటె మేలు
పడఁతి నీ వేంకటప్పనిరతి నలయుకంటె
కెడపి కొనగోళ్ళ సోఁకించుటే మేలు

రేకు: 0067-3 ముఖారి సం: 05-213

పల్లవి: పన్నెమాటల వలతువా నీవు నామనసు
కన్న పెట్టఁగఁ గదా కడుబేలనైతి

చ. 1: పట్టుకొని నిన్నుఁ గోపముదీర చూపులనె
కట్టివేసినఁగదా గర్వమడఁగు
అట్టునిట్టును నీకు నయ్యలునసాదలును
బెట్టైకా నీచేతఁ బిరివీకులైతి

చ. 2: మరిగించి నిన్ను నా మనసారఁ గుచగిరుల-
చరులఁ దోసినఁ గదా చలమణఁగును
అరిది మోహమున నీ యడుగులకు మడుగులేఁ
బరచికా విరహతాపమునఁ బడవలసె

చ. 3: చెనకి నిన్నిట్ల నాచేయారఁ గోరికల
తనివి దీర్చినఁగదా తగులవదువు
ఘనమూర్తివైన వేంకటగిరీశ్వర నీకు-
నొనర లోనైకదా వొడలెరఁగనైతి

రేకు: 0067-4 ముఖారి సం: 05-214

పల్లవి: కొలవిలోన మును గోపికలు
మొలక నవ్వులతో మ్రొక్కిరి నీకు

చ. 1: పిరుఁదులు దాఁటిన పించెపుటలకల
తురుములు వీడఁగఁ దొయ్యలులు
అరిదినితంబములందునె దాఁచుక
మురిపెపుఁ గరముల మొక్కిరి నీకు

చ. 2: నిద్దపు మానము నెలఁతలు లోఁగుచు
గద్దరి తొడలనె కట్టుచును
ముద్దుటుంగరంబుల కరములతో
ముద్దులు గునియుచు మొక్కిరి నీకు

చ. 3: పాలిండ్ల పెనుభారంబుల కర-
మూలపు మెఱుఁగులు ముంచఁగను
వేలపుఁ బ్రియముల వేంకటేశ నిను
మూలకుఁ బిలుచుచు మొక్కిరి నీకు

రేకు: 0067-5 రామక్రియ సం: 05-215

పల్లవి: మానరె మాయలు మగువలు నేఁ
గాను కాననుచుఁ గనలీ శిశువు

చ. 1: పాలట దొంగిలె బాలుఁడు గో-
పాలులఁ గూడుక పలుమరును
పోలవీమాఁటలు బొంకులు యిది
యేలె యేలె మీరెలజవ్వనులు

చ. 2: సారెకు వెన్నలు చవులట యీా-
దూరులు మీకిఁక దొసగులు
చేరువ గరిమలు చెల్లవు మీరు
పోరె పోరె వొరపుల నెర సతులు

చ. 3: కింకలు మీకివి గెలుపులు నెల-
వంకలు మీకివి వన్నెలు
వేంకటపతి మీ విభుఁడట మీరు
బొంకక బొంకక పొలఁతులు మనరే

రేకు: 0067-6 ముఖారి సం: 05-216

పల్లవి: ఎండలు రేయెండలుగా నిరువంకఁజూచువాఁడు
కొండలుఁ గోట్లునయిన గుణములవాఁడు

చ. 1: పాలవెల్లి కొండమీఁదఁ బల్లెగట్టినవాఁడు
పాలలోని పాపఁడన్న ప్రాణమైనవాఁడు
పాలఁ బుట్టినట్టికూఁడు పంచిపెట్టినవాఁడు
పాలునేయి ముచ్చిలించి బదికినవాఁడు

చ. 2: అలపోతువానితోడ నంటినమేనివాఁడు
ఆలఁగాపరులతోడ నాడినవాఁడు
ఆలజాలమైన నీటనలరఁ దేలినవాఁడు
ఆలపోతు కొండమీఁద ననువైనవాఁడు

చ. 3: పాఁపరేని మేను దన పానుపు వేసినవాఁడు
మోఁపరయి సకలము మోచినవాఁడు
కోపము శాంతములేని కొండలకోనేటివాఁడు
పాపముఁ బుణ్యము లేక బదికినవాఁడు

రేకు: 0068-1 శంకరాభరణం సం: 05-217

పల్లవి: వేఁటకాఁడనంటా నా వెంటఁ బాయవు వోరి
చీటకపు చెంచెత నాచేతిలాగెరఁ గవా

చ. 1: పొదలో నేనేసిన పులి నీవేసితినని
పెదపెద్ద యెలుగుఁల బెదరించేవు
కుదురుగుబ్బల నిన్నుఁ గుమ్ముదునో వుండేవో మేను
చిదియఁగా మేటిచెంచెత నన్నెఱఁగవా

చ. 2: చేరువ నామోఁటునఁ జేరిన నామెకముల
నేరుపరినంటా నీవునేసేవు
జీరలుగా కొమ్ము గోరఁ జింతుతో వూరకుండేవో
పేరుకల చెంచెత నాబిరుదులెరఁగవా

చ. 3: చొల్లెపు చుట్టలతోడ చూపులకు నడ్డాలు
చెల్లునంటా వచ్చి చెట్టవట్టేవు
నొల్లననఁగా గూడేవు వుద్దండపు వేంకటేశ
జల్లివింటి చెంచెత నాచలములెరఁగవా

రేకు: 0068-2 భైరవి సం: 05-218

పల్లవి: ఏమీననకురే యెప్పుడు మీరు
గామిడియై కాలిసన్నఁ గదలీని బిడ్డఁడు

చ. 1: పాలసీననకురే పాదిగె యిందరుఁగూఁడి
పులికి తలదీసుకవున్న బాలుని
పలుకఁడనకురే బలుమోరతోపుఁ గొపి
తలఁకి సిబ్బితిగొని తలరమ్మ బిడ్డఁడు

చ. 2: అడిగీననకురే ఆసదీరదనకురే
కడఁగి చలమరియై గాసిఁబెట్టీని
జడలున్న వనకురే జననుతుఁడీశిశువు
కడు దూరీ గిరులకు గమనించి బిడ్డఁడు

చ. 3: బిత్తలున్నాఁడనకురే పృథివిలోఁ బిన్నవాఁడు
మత్తులై వున్నవారి మడియించీని
చిత్తిణివాఁడనకురే శ్రీ వేంకటేశుఁడు
యెత్తుక యీరేడులోకాలేలీని బిడ్డఁడు

రేకు: 0068-3 సామంతం సం: 05-219

పల్లవి: అడుగడుగుకు నీ వాడఁగాను మా-
బడలికంతయుఁ దోయ పండరంగిరాయ

చ. 1: పాదికెత్తు మెరుఁగారు బంగారుగుండు
సేదదేర మెడఁగట్ట చిత్తగించితి
యేదెస కానికదెచ్చి యిచ్చిరి నీ కెవ్వరో
పాదపుగజ్జెలు మోయ పండరంగిరాయ

చ. 2: మద్దికాయలు చెవుల మాణికాల పోఁగులు
పెద్దపెద్దముత్యాలు పెంపు మీరఁగా
ముద్దల వెన్నపాలు ముచ్చిలించు సేఁతలవి
బద్దుల పనులైపోయ పండరంగిరాయ

చ. 3: వెల్లిగొను వేడుకల వేంకటాదిపతివై
తెల్లనికన్నుల నవ్వుతీగె సోగల
గొల్లెతల గుబ్బలపై కూరిమి మెరయఁగా
పల్లకి నీకిప్పుడాయ పండరంగిరాయ

రేకు: 0068-4 మంగళకౌశిక సం: 05-220

పల్లవి: అబ్బురంపు శిశువు ఆకుమీఁదిశిశువు
దొబ్బుడు రోలశిశువు త్రువ్వి త్రువ్వి త్రువ్వి

చ. 1: పుట్టు శంఖుచక్రములఁ బుట్టిన యాశిశువు
పుట్టక తోల్లే మారుపుట్టువైన శిశువు
వొట్టుపక పాలువెన్నలు నోలలాడు శిశువు
తొట్టెలలోని శిశువు త్రువ్వి త్రువ్వి త్రువ్వి

చ. 2: నిండిన బండి దన్నిన చిన్నిశిశువు
అండవారి మదమెల్ల నణఁచిన శిశువు
కొండలంతేశసురులఁ గొట్టిన యా శిశువు
దుండగంపు శిశువు త్రువ్వి త్రువ్వి త్రువ్వి

చ. 3: వేఁగైన వేంకటగిరి వెలసిన శిశువు
కౌఁగిటి యిందిరా దొలఁగని శిశువు
ఆఁగి పాలజలధిలో నందమైన పెనుఁబాము
తూఁగుమంచము శిశువు త్రువ్వి త్రువ్వి త్రువ్వి

రేకు: 0068-5 ముఖారి సం: 05-221

పల్లవి: పలుకుఁదేనియల నుపారమియ్యవే
అలరువాసనల నీ యధరబింబానకు

చ. 1: పుక్కిటి లేనగవు పొంగుఁబాలు చూపవే
చక్కని నీవదనంపు చందమామకు
అక్కరొ నీవాలుఁగన్నులా రతిగా నెత్తవే
గక్కన నీచెక్కుతొలుకరి మెరుపులకు

చ. 2: కమ్మని నీమేని తావి కానుకగా నియ్యవే
వుమ్మగింత చల్లెడి నీవూరుపులకు
చిమ్ముల నీచెమటలఁ జేయవే మజ్జనము
దిమ్మరి నీమురిపెపు తీగమేనికి

చ. 3: పతి వేంకటేశుఁ గూడి పరవశమియ్యవే
యితవైన నీమంచి హృదయానకు
అతనినే తలఁచఁగ నానతియ్యఁ గదవె
తతితోడ నీలోని తలపోఁతలకు

రేకు: 0068-6 భైరవి సం: 05-222

పల్లవి: ఆనపెట్టుదువు నీవప్పటి నానోరణఁచి వోరి
నీ నిజానకు నాతో నేఁడైన మానరా

చ. 1: పచ్చడాన జవ్వాది పరిమళమేడదిరా
పచ్చిసేఁతలు చెక్కిళ్ళపై నీకేడవిరా
గచ్చు మోవిమీఁదనున్న కసిగాటులేడవిరా
యిచ్చకుఁడ కనుఁగెంపులేడవి గలిగెరా

చ. 2: ముద్దుల చక్కని నీదు మోముకళలేడవిరా
కొద్దిగాని సందొత్తుగోరేడదిరా
గద్దరీఁడ యీ చిట్లు గందము నీకేడదిరా
తిద్దెను గస్తూరిబొట్టు దిమ్మరి యెవ్వతెరా

చ. 3: భీతితో నీవాడేటి తబ్బిబ్బుమాటలేడవిరా
రాతిరేడ నుండితి వెరవక చెప్పరా
యేతరీఁడ తిరువేంకటేశ నన్ను నేలితివి
యేతులతో వలపించ నెంత కలికివిరా

రేకు: 0069-1 కన్నడగౌళ సం: 05-223

పల్లవి: కామయాగము చేసెఁ గలికి తన-
ప్రేమమే దేవతాప్రీతిగాను

చ. 1: పొలుపలర సురతతాంబులరసపానంబు
నలినాక్షి సోమపానంబు గాను
కలకలంబుల మంచి గళరవంబుల మోఁత
తలకొన్న వేదమంత్రములుగాను

చ. 2: పడఁతి తన విరతాపమునఁ బుట్టిన యగ్ని
అడరి దరికొన్న హోమాగ్నిగాను
ఒడఁబడిక సమరతుల నుదయించిన చెమటఁ
దడియుటే యది యవభృథంబుగాను

చ. 3: తనరఁ గుచముల రుచులు దంతాక్షత క్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను

రేకు: 0069-2 శ్రీరాగం సం: 05-224

పల్లవి: పట్టనీఁకనోప నాప్రాణంబులు నీ-
పట్టు దైవమె యెరుఁగు బ్రదుకవయ్యా

చ. 1: పడితినిన్నాళ్ళు నిర్బంధమున నాచేత
కడమొదలు లేని కాఁకల సొలపుల
బడలెఁ గడు నామేను పట్టనీఁకనోప నీ-
పడఁతులను గూడుకొని బ్రదుకవయ్యా

చ. 2: నొగిలితివి నాచేత నొప్పిమాటలనెంతె
వగలఁ గడు నన్ను విడువఁగనోపక
జగడమిఁక లేదు విరసము మాని సుఖివియై
పగలేక యిఁకనైన బ్రదుకవయ్యా

చ. 3: ఎంత నొగిలినను నాకేమాయ నీకు నీ-
సంతోషమబ్బినను జాలుఁగాక
యింతసేసియు వేంకటేశ కూడితివి నీ-
పంతంబు చెల్లెనిఁక బ్రదుకవయ్యా

రేకు: 0069-3 శ్రీరాగం సం: 05-225

పల్లవి: కవయఁగవలెనంటి కాఁగలించేవా నీ-
వువిదలఁ దలఁచకవుండనోసేవా

చ. 1: పారిటాకులు గట్టి పారనోపేవా
యేరులెల్ల దాఁటి కొండలెక్కనోపేవా
యీరీతి వెదురుబియ్యమేరనోపేవా
పేరినతేనెలు తెచ్చి పెట్టనోపేవా

చ. 2: యెడమఁ గుడిని వింటనేయనోపేవా
అడవిమెకాల వేఁటలాడనోపేవా
కడఁగి చెంచెత నాతోఁ గలశుండేవా
అడరి నాపొత్తుల నారగించేవా

చ. 3: యిప్పటి మాఁటలు యీడేరించనోపేవా
చెప్పినట్టే కాఁపురము సేయనోపేవా
కప్పిరంపుశయ్యపై వేంకటరాయఁడా
యెప్పుడుఁ బాయని చనవియ్యనోపేవా

రేకు: 0069-4 మాళవి సం: 05-226

పల్లవి: చూడవమ్మ యశోదమ్మ
వాడల వాడల వరదలివిగో

చ. 1: పొంచి పులివాలుఁ బెరుగు
మించు మించు మీఁగడలు
వంచి వారలుపట్టిన
కంచపుటుట్ల కాఁగులివిగో

చ. 2: పేరీఁ బేరని నేతులు
చూరలు వెన్నల జున్నులును
ఆరగించి యట సగఁబాళ్ళు
పారవేసిన బానలివిగో

చ. 3: తెల్లని కనుఁదీగెల సొగల
చల్లలమ్మేటి జవ్వనుల
చెల్లినట్లనే శ్రీవేంకటపతి
కొల్లలాడిన గురుతులివిగో

రేకు: 0069-5 ధన్యాశి సం: 05-227

పల్లవి: బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీఁడు వచ్చె దోబూచి

చ. 1: పెరుగు వెన్నలుఁ బ్రియమున వే-
మరు ముచ్చిలించు మాయకాఁడు
వెరవున్నాఁ దనవిధము దాఁచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి

చ. 2: పడుచు గుబ్బెత పరపుపై పోక-
ముడి గొంగు నిద్రముంపునను
పడియుఁదా వద్దఁ బవళించినట్టి-
తొడుకుదొంగ వచ్చె దోబూచి

చ. 3: గొల్లపల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెకాఁడు
యెల్లయినా వేంకటేశుఁడు ఇదె
తొల్లిటిదొంగ వచ్చె దోబూచి

రేకు: 0069-6 సామంతం సం: 05-228

పల్లవి: చల్లనై కాయఁగదొ చందమామా నీ
వెల్లగాఁ దిరువేంకటేశునెదుర
మొల్లమిగ నమృతంపు వెల్లి గొల్పుచు లోక-
మెల్ల నినుఁ గొనియాడఁగాను

చ. 1: పొందైన హితులు నాప్తులు రసికులును గవులు
నందమగు నునుమాటలాడ నేర్చిన ఘనులు
చిందులకు నాడేటి సీమంతినీ మణులు
చెలఁగి యిరుగడఁ గొలువఁగాను

చ. 2: వందిమాగదులు గైవారింపఁ దనదివ్య-
మందిరోపాంత ఘనమార్గమునఁ గోనేటి-
ముందటను మంద మందప్రయాణములతోఁ
నిందిరాపతి మెరయఁగాను

చ. 3: ఏకాంత ముఖగోష్ఠినింపొంద మానవా-
నీకంబులెడఁ గలసి నిలిచి సేవింపఁ గాం-
తాకదంబముల హస్తముల కంకణఝుణ-
త్కారములు నిగుడఁ జామరములిడఁగ

చ. 4: జోకైన మణిగణస్తోమాంకితంబులై
సొంపొందు నాలపట్టములు గరములఁ దాల్చి
యేకాంతులిరువంక నెదిరి కొలువఁగ సకల-
లోకేశ్వరుఁడు మెరయఁగాను

చ. 5: బంగారుపత్రిమలకు ప్రతులైన దివిజలోఁ
కాంగనలు ఘనవిమానాంగణంబుననుండి
చెంగలువలును మంచిసేవంతిరేకులను
చెలఁగి యిరుగడఁ జల్లఁ గాను

చ. 6: మంగళాత్మకములగు మహితవేదాంత వే-
దాంగవిద్యలకు ప్రియమంది చేకొనుచుఁ దిరుఁ
వేంగళేశ్వరుఁడు గడు వేడుకలతోడఁ దిరుఁ
వీథులను విరించఁగాను

రేకు: 0070-1 పాడి సం: 05-229

పల్లవి: మూలమూల నమ్ముడుఁజల్ల ఇది
రేలుఁ బగలుఁ గొనరే చల్ల

చ. 1: పిక్కటిల్లు చన్నుల గుబ్బెత వొకతి కడుఁ-
జక్కనిది చిలికిన చల్ల
అక్కునఁ జెమటగార నమ్మీని యిది
యెక్కడఁ బుట్టదు గొనరే చల్ల

చ. 2: పడచల్లు మేని జవ్వని వొకతి కడు-
జడియుచుఁ జిలికిన చల్ల
తడఁబడు కమ్మనితావులది మీ-
రెడయకిపుడు గొనరే చల్ల

చ. 3: అంకులకరముల వొయ్యారొకతి కడు-
జంకెనలఁ జిలికిన చల్ల
వేంకటగిరిపతి వేడుకది
యింకానమ్మీఁ గొనరే చల్ల

రేకు: 0070-2 పాడి సం: 05-230

పల్లవి: అదిగాక సౌభాగ్యమదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికిఁ గలదా

చ. 1: ప్రాణవల్లభునిఁ బెడఁబాసి మరుబాణములు
ప్రాణబాధల నెగులుపడుటేఁటి వలపే
ప్రాణేశ్వరుఁడు దన్నుఁ బాయఁ జూచిన యపుడు
ప్రాణంబు మేనిలోఁ బాయంగవలదా

చ. 2: ఒద్దికై ప్రియునితోనొడఁ గూడి యుండినపు-
డిద్దరై విహరించుటిది యేఁటివలుపు
పొద్దువోకలకుఁ దమపొలయలుకకూటముల
బుద్దిలోఁ బరవశము పొందంగవలదా

చ. 3: చిత్తంబులోపలను శ్రీవేంకటేశ్వరుని
హత్తించి వాఁడు దానయివుండవలదా
కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల
తత్తరము మున్నాడి తగులంగవలదా

రేకు: 0070-3 భూపాళం సం: 05-231

పల్లవి: ఎట్టుసేయనైన నేర్చు నిందునందు నీతఁడు
నెట్టుకొన్న విద్యలెల్ల నేర్చుఁగాన యీతఁడు

చ. 1: పలుదెరఁగుల దొంతులైన పాలపెరుగుకుండలెల్లఁ
దొలఁగ దించి పాలుద్రాగి దొంతివేర్చె నీతఁడు
తొలఁగఁ దోసి జగములెల్లఁ దొల్లిటట్ల బహువిధముల
నెలవుకొలిపి దొంతివేర్చ నేర్చుఁగాన యీతఁడు

చ. 2: పాలమీఁగడెల్లఁ దిగిచి పలుదెరఁగులఁ దోడనాడు
బాలులైనవారికెల్లఁ బంచిపెట్టె నీతఁడు
మేలిమైన పాలజలధి మీఁగడఖిలదేవతలకు
నోలిఁబంచి పెట్టినట్టి యోగిగాన యీతఁడు

చ. 3: తలుపుదెరచి కన్నె మేలుకొలిపి విభుఁడు గానివానిఁ
నెలమిఁ గలపినట్టి వేంకటేశుఁడమ్మ యీతఁడు
తలఁపులోని నాగకన్నెఁ దెలిపి పరపురుషునిఁ గూడి
కలయఁ జేయనేర్చినట్టి ఘనుఁడు గాన యీతఁడు

రేకు: 0070-4 కాంబోది సం: 05-232

పల్లవి: వెలినుండి లోనుండి వెలితిగాకుండి
వెలి లోను పలుమారు వెదకేవె గాలి

చ. 1: పండువెన్నెలలకునుఁ బ్రాణమగు గాలి
నిండుఁగొలఁకులలోన నెలకొన్న గాలి
బొండుమల్లె లతావిఁ బొడవైన గాలి
యెండమావులఁ బోలితేలయ్యె గాలి

చ. 2: కొమ్మావిచవికెలోఁ గొలువుండు గాలి
తమ్మికుడుకులఁ దేనె దాగేటి గాలి
యిమ్మయిన చలువలకిరవైన గాలి
కుమ్మరింపుచు వేఁడి గురిసేవె గాలి

చ. 3: తిరువేంకటాదిపైఁ దిరమైన గాలి
సురతాంతముల జనులఁ జొక్కించు గాలి
తొరలి పయ్యదలలోఁ దూరేటి గాలి
విరహాతురులనింత వేచకువె గాలి

రేకు: 0070-5 సామంతం సం: 05-233

పల్లవి: రెప్పవేసి లోకమెల్ల రేయుఁ బగలుఁ జేయనేర్చుఁ
చెప్పరాని చేఁతలెల్ల చెప్పిచూపనేర్చునే

చ. 1: పాలలోను దచ్చి వెన్న పలుదెరఁగులఁ దివియనేర్చు
రాలువేసి నీరుమీఁదఁ దేలఁజేయు నేర్చును
గాలిపుంటి సంటి లోనఁ గాఁపురంబు సేయనేర్చు
అలికట్టుఁ జీరలోన నాలిఁబడయనేర్చును

చ. 2: ముద్దులాఁడికొడుకుచేత ముజ్జగములు దిప్పనేర్చును
చద్దికంట వేఁడికంటఁ జక్కఁజూడ నేర్చును
గద్దెరాతి కొండవింట గసికయ్యె చెలఁగనేర్చు
సుద్దులెల్ల మందులనఁగ సొంపుమిగులనేర్చును

చ. 3: పాఁపరేని కొండమీఁదఁ బందివేఁటలాడ నేర్చు
గోపసతుల మానమెల్ల కొల్లలాడనేర్చును
యేపు మీరినట్టి వేంకటేశుఁడనెడివాఁడు పిన్న-
పాఁపడై యశోదయెదుట పరువులిడఁగ నేర్చును

రేకు:	0070-6 బౌళి	సం:	05-234

పల్లవి:	ఏమి సోద్యమిది యెంతయును వెరగాయ
ఈ మగువ విభుఁగలయుటెట్లనో యనుచు

చ. 1:	పొలసి నునుఁజెమటలుబ్బుచు నణంగుచున్న-
చెలియభావము చూచి చెప్ప వెరపాయ
కలికి వలరాజు బింకపుశరము వాఁడిగా
పలుమరునుఁ బదనిడిన భావమో యనుచు

చ. 2:	చలముకొని వేఁడి వెదచల్లు చూపులతోడి
నెలఁతఁ గని కట్టెదుర నిలువ వెరపాయ
చెలఁగి లోపలనున్న చిత్తజానలమెల్ల
వెలికి వెళ్ళుచు వెల్లివిరిసెనో యనుచు

చ. 3:	తిరువేంకటేశుఁ బొందిన యింతిచనుదోయి-
కురునఖాంకములు గనుఁగొనఁగ వెరపాయ
తరుణినేపిన విధుఁడు దైవయోగమువలన
అరుదయిన శకలంబులా యనో యనుచు

రేకు: 0071-1 కాంబోది సం: 05-235

పల్లవి: ఏల రాఁడమ్మ యింతిరో వాఁ-
డేల రాఁడమ్మ నన్నేలినవాఁడు

చ. 1: పచ్చని పులుగుల బండిమీఁద నుండు-
పచ్చవింటి పిన్నబాలుని తండ్రి
పచ్చనిచాయలఁ బాయని బంగారు-
పచ్చడము గట్టి బాగైనవాఁడు

చ. 2: తెల్లని పులుగుపైఁ దిరుగ మరిగినట్టి-
తెల్లని సతిపాలి దేవరతండ్రి
తెల్లని పరపుపైఁ దేలిపొరలు వెట్టు-
తెల్లని కన్నుల తెలివైనవాఁడు

చ. 3: కొండవింటివాని గుత్తగొనిన యట్టి-
కొండుక పాయపుఁ గూఁతురుతండ్రి
కొండలరాయఁడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైనవాఁడు

రేకు: 0071-2 శ్రీరాగం సం: 05-236

పల్లవి: చంపరాని పగనంబు: చల్లగాలి వేఁడి చిగురు-
టంపకోల దాఁకి దేహమప్పుడెట్లనోర్చనే

చ. 1: పువ్వుటమ్మ దాఁకి చెలికిఁ బొక్కె మేను విభునిచూపు-
లివ్వలవలఁ గాఁడినప్పుడెట్లనోర్చనే
జవ్వనంపు గుచభరము జడిసె నడుము కొప్పు వేఁగు
రవ్వదోఁప నడపుచేతి రాయిడెట్లనోర్చనే

చ. 2: తప్పకెపుడు నతనిఁ జూచి తనివివోని తరుణి నేఁ-
డిప్పుడింత దడవు వాసి యెట్లనోర్చనే
నొప్పికించుకోర్వలేక నొసలఁబట్టు వెట్టుకాంత
దప్పిదేరునట్టి విరహతాపమెట్లనోర్చనే

చ. 3: ఇంచుకంత కప్పురమునఁ బారు తనువుమీఁద
నెంచరాని మదనరేఖలెట్లనోర్చనే
మించి వేంకటాద్రివిభుఁడు మీఁదమీఁదనొరసి కూ
చరాని కంటసరులు వనిత యెట్లనోర్చనే

రేకు: 0071-3 ఆహిరి సం: 05-237

పల్లవి: ఆపదలె సంపదలకాధారమ్మై తోఁచె
పైపైనె తమకంబె పరిణామమాయ

చ. 1: పురిగొన్న మదనాగ్ని పుటము దాఁకినవలన
తరుణిదేహంబు కుందణమువలెనాయ
నురుగక వియోగాగ్ని చొచ్చి వెలువడెఁ గాన
మరుజన్మమై మహమహిమఁ బొగడొందె

చ. 2: పొలుపైన యిరులచేఁ బూవుగట్టిన వలన
సొలయకే మేను జాజుల పొట్లమాయి
నెలకొన్న గొజ్జంగనీటఁ దడియఁగఁబట్టి
కలకంటిమేను పులు గడగినట్లాయ

చ. 3: అందుపైఁ దిరువేంకటాద్రీశు నిజకృపా-
నందంబు తనకు బ్రహ్మానందమాయ
పొందైన వేడుకలు పొదిగొన్న చెలువంబు-
నందమయి సౌభాగ్యమగ్గలంబాయ

రేకు: 0071-4 సాళంగనాట సం: 05-238

పల్లవి: తనువెల్లఁ గోమలము తలఁపు వెగ్గలమాయ
వనితభాగ్యము గంటివా తరుణి

చ. 1: పోఁకలంతేసి ముత్యముల కంటసరులవి
వేఁకపు గుబ్బలమీఁద వేఁగుఁగాక మానునా
కాఁకల నడుము చిక్కఁగదె గోరుచుట్టుపై
రోఁకటిపోటాయనమ్మరో తరుణి

చ. 2: ముమ్మడించినట్టి పెద్దమొగపుల మొలనూలు
యిమ్మైన పిరుఁదుమీఁద నింతభారమేఁటికే
బొమ్మరపోయెడి నవ్వులఁ బూఁటకూటిమీఁదఁ
దమ్మ పుమియఁగాదా తరుణి

చ. 3: సరసరూపవిలాసముల నింతికి నెందు
తిరువేంకటాచలాదిపుఁడెట్ల నిచ్చెనే
అరిదిబంగారునకు నపురూపమగుమణి
దొరకినట్లాయఁగాదో తరుణి

రేకు: 0071-5 ముఖారి సం: 05-239

పల్లవి: ఎవ్వరు గలరీతనికిఁక నేమిటికిని వెరవకు మన-
నెవ్వరుగలరాత్మరక్ష యేప్రొద్దునుఁ జేయను

చ. 1: పసిబాలకు బండివిరిగి పడి మేనెల్ల నొచ్చెను
కసుగందుకు నీరుపాముకాటున మై గందెను
నసికొల్లఁగోడెచేత నరుమాయను శిశువింతయు
వసముగాని చను ద్రావినవలనఁ బాపఁడు వాడెను

చ. 2: పెనుమాఁకుల పైపాటున బెదరి వెరచెఁ బిన్నవాఁడు
ఘనమగు సుడిగాలి దాఁకి కనుమూయనోపఁడు
అనువున వేంకటగిరిపై నన్నిసంకటములుఁ బాసి
మునిజనముల గేహముననుండెడి దేవుఁడు

రేకు:	0071-6 ముఖారి సం:	05-240
పల్లవి:	ఎంత నేరఁడీదైవమిందరికి
	భ్రాంతి గడుఁ బుట్టించి పరము మరపించె
చ. 1:	ప్రాయమనియెడి మహాబహురూపమిది యొకటి
	కాయములఁ గరఁగించీఁ గళలనెక్కించి
	సోయగంబగు కన్నుచూపులనియెడు మహ-
	మాయములఁ బొరలించి మనసు నాటించె
చ. 2:	చక్కఁదనమనెడి వేషంబొకటి మేనిపై
	నిక్కించి యది గోర్కి నెలవుగాఁ జేసి
	తక్కువలు నెక్కువలు తమకములు నొల్లములు
	మక్కువలు గలిగించి మల్లువెనఁగించె
చ. 3:	ఇట్టి మోహము వేంకటేశ్వరుఁడు దనమీఁదఁ
	బెట్టించుకొనె నయినఁ బ్రేమగల ఫలము
	నెట్టుకొని తానతని నిజమెఱిఁగి మేలు చే-
	పట్టినైనను జన్మపరుఁడైన ఫలము

రేకు: 0072-1 భైరవి సం: 05-241

పల్లవి: పుడమిలోన మగలు గలుగు పొలఁతులకును దిరుగఁబాసె
అడవివారినుండనియ్యఁడమ్మ నీ కొమారుఁడు

చ. 1: భారమైన కుచభరంబుపై చెరంగు జారనొకతె
జారుఁజూపులాఁడి మంచిసాళగంపుటెలుఁగున
కోరో చల్లయనుచు మెరుఁగుగుచములదర మెట్టినడవ
గోరుదీసి పారితెంచె కొమ్మ నీ కుమారుఁడు

చ. 2: నెరులు దొంగలించినట్టి నీలవేణి యొకతె పెద్ద
తురుము దురిమి చల్లకడవతో విలాసమమరఁగా
చెరఁగుదూల వాఁడిగోళ్ళ చేయివీచి పిలిచి గోప-
తరుఁణిఁ గొంగువట్టి తీసె తల్లి నీ కుమారుఁడు

చ. 3: కంచుమట్టియల రవంబు గజబజింపఁ బదము దా-
టించి గబ్బినడపు నడచు మించుగుబ్బలాఁడిని
ఇంచుకంతవాఁడు వేంకటేశుఁడంటఁబట్టి కౌఁగిఁ
లించి మోవి గంటిసేసె నిపుడు నీకుమారుఁడు

రేకు: 0072-2 శంకరాభరణం సం: 05-242

పల్లవి: కొలమున మొదలనె గొల్లవారము యీ-
చలమునఁ బగ నిన్ను సాదించ నేరుతుమా

చ. 1: బూతులఁ దిట్టుచు సొలపులఁ జూచేవు మేనిఁ
నేతులకంపుల నేము నీ కేలరా
యేతులు రేఁపుచు మమ్ము నెలయించేవు యేర
మాతోనే యింతేసి నేము మాటలు నేరుతుమా

చ. 2: కన్నుల సద్దలింపుచు గయ్యాళించేవు వోరి
నిన్ను మెప్పించఁ గలేము నేమేలరా
వెన్నలుఁ బాలునమ్మేటి వెఱ్ఱివారము యీ-
కిన్నెర మీట్ల గిలిగించఁగ నేరుతుమా

చ. 3: చేరి నన్నుఁ బోసినని చేయివట్టేవు యేమీ
నేరనివారము నీకు నేమేలరా
గారవపు తిరువేంకటగిరివిభుఁడ యీ
కూరిమినిట్టే నిన్నుఁ గూడఁగ నేరుతుమా

రేకు: 0072-3 శ్రీరాగం సం: 05-243

పల్లవి: ఊరకుంటే నన్ను నుండనియ్యవు ఇంత
పేరుకుచ్చి తిట్ట నన్నుఁ బ్రియమా నీకు

చ. 1: బుజముపైఁ జేయి వేసి బుజ్జగించేవు ఇంత-
నిజమా నామీఁద నీ కరుణ
భజన మొరయ నన్నుఁ బచ్చి సేసేవు ఇంత-
గజరుఁజేఁతలకోపఁగలనా యిఁకను

చ. 2: కాలుమీఁదఁ గాలువేసి కరఁగించేవు యింత-
మేలా నాతోడి సమేళములు
వాలుకచూపుల నాకు వాఁడివెట్టేవు యింత-
యేలికవై యిటుసేయనేలా యిపుడు

చ. 3: చక్కఁదనమిది నాది జట్టిసేసేవు నా
చెక్కుల రేకలు వ్రాయఁ జిత్తగించేవు
చక్కని వేంకటగిరిస్వామీ నీవు యిట్టే
దక్కిన నన్నింత సేయఁ దగునా యిఁకను

రేకు: 0072-4 నాట సం: 05-244

పల్లవి: నల్లనిమేని నగవుఁ జూపులవాఁడు
తెల్లనికన్నుల దేవుఁడు

చ. 1: బిరుసైన దనుజుల పీఁచమణఁచినట్టి--
తిరుపుఁగైదువతోడి దేవుఁడు
చరిఁబడ్డ జగమెల్లఁ జక్కఁజాయకుఁ దెచ్చి
తెరువు చూపినట్టి దేవుఁడు

చ. 2: నీటఁ గలసినట్టి నిండిన చదువులు
తేటపరచినట్టి దేవుఁడు
పాటి మాలినట్టి ప్రాణుల దురితపు-
తీఁట వాపినట్టి దేవుఁడు

చ. 3: గురుతు వెట్టఁగరాని గుణముల నెలకొన్న-
తిరువేంకటాదిపై దేవుఁడు
తిరముగ ధ్రువునికి దివ్యపదంబిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుఁడు

రేకు: 0072-5 భైరవి సం: 05-245

పల్లవి: అతనుచే నెట్టయిన నౌదుఁగాక యీ-
గతిమాలి సొలసే కాయము నాకేఁటికే

చ. 1: బాససేసి యైనఁ గొంత పట్టలేను చిత్తము
దోసము మాటాడఁ దనతో నాకును
అసలాఁపలేక చేరి యంటిఁ గాక యింత-
సేసిన యాతనిమోము చెల్లఁబో నేఁజూతునా

చ. 2: దగ్గరి నావద్దఁ దనతరుణిఁ దలఁచినంత
సిగ్గుపడవలెను నాచిత్తమునందే
నిగ్గుదేరేకాఁకతోడ నిలువలేఁ గాక యింత-
బగ్గన నాదేహమిది పారవేయ సరకా

చ. 3: దేవుఁడంటాఁ దనమీఁద తెగి సొలపుమాటల
మోవనాడలేక యింత మొక్కితిఁ గాని
శ్రీ వేంకటేశుఁడింత చిత్తిణివిద్యల నాతఁ-
డేవంక కేఁగినను మాయింటికి విచ్చేసెఁగా

రేకు: 0072-6 శంకరాభరణం సం: 05-246

పల్లవి: ఉయ్యాలా బాలునూఁచెదరు కడుఁ
నొయ్యనొయ్య నొయ్యనుచు

చ. 1: బాలయవ్వనలు పసిఁడివుయ్యాల
బాలునివద్దఁ బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలా లాలి లాలి లాలనుచు

చ. 2: తమ్మిరేకుఁ గనుఁదమ్ముల నవ్వుల
పమ్ముఁ జూపులఁ బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు

చ. 3: చల్లుఁజూపుల జవరాండ్లు రే-
పల్లెబాలునిఁ బాడేరు
బల్లిదు వేంకటపతిఁ జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు

రేకు: 0073-1 శంకరాభరణం సం: 05-247

పల్లవి: సారెకు నంటకురే జడనందురు
ధీరుఁడాతఁడున్నతపు దేహియట

చ. 1: బాయిటఁ బెట్టకురే పక్షులు పారెడిపొద్దు
వోయమ్మ బాలులకు నొప్పదందురు
మాయపు బులుగొకటి మచ్చికనీబాలుని
చేయిచ్చి యెక్కించుకొనఁ జేరీనట

చ. 2: పంచలఁ దిప్పకురే పాములు వెళ్ళేటి పొద్దు
కొంచెపుబాలులఁ బైకొనునందురు
మించిన పామొకటి మెరసి యీ బాలుని
దించక యెక్కించుకొనఁ దిరిగీనట

చ. 3: అలమి పట్టకురే అంటఁ గాకుండెడివారు
తొలరమ్మ బాలులకు దోసమందురు
కలికి యీ తిరువేంకటపతిఁ గదిసిన
చెలఁగి వేగమే చీరచిక్కీనట

రేకు: 0073-2 శ్రీరాగం సం: 05-248

పల్లవి: కొప్పుతావి సారెసారె కుప్పళించవలసి
అప్పటి నీ మారుమొగమయ్యేవాతనికి

చ. 1: భారపు నీ గుబ్బల సంపద చూపవలసి
వోరగా నొరగుమీఁద నొరగేవు
తోరపు నీకన్నుల యేతులె చూపవలసి
సారెకు చూపులఁ బగచాటేవాతనిని

చ. 2: తట్టెడి నీమట్టెలమోఁతలు చూపవలసి
పట్టఁబట్టఁ గానే పుష్పరిగెక్కేవు
వట్టి నీకోపాన చెలువము చూపవలసి
పెట్టినహారముల గుంపెనలఁ దీసేవు

చ. 3: తొయ్యలి నీ మేని మృదువు చూపవలసి
కయ్యపు వేంకటపతిఁ గౌఁగిలించేవు
చయ్యనవే నీ సరసము చూపవలసి
చయ్యాటములనె యిట్టె జంపులనేచేవు

రేకు: 0073-3 ఆహిరి సం: 05-249

పల్లవి: కాల కడఁ దెగెఁ జెలియగర్వంపు దాలిములు
కాలగతి యిఁకనెంత గాఁగలదొ మీఁద

చ. 1: బలుపుఁ దురుమరజాతి పగలుచీఁకట్లాయె
పొలయుఁగన్నీట నిప్పులు గురిసెను
చలితాపమున శశియు సవితుండుఁ గవఁబొడచె
ఇల మదనదైవికం బెటుగాఁ గలదొ

చ. 2: చెడుగు నిట్టూరుపుల చిచ్చు గాలియుఁ గూడె
వెడగుఁ జెమటల జలధి వెల్లివిరిసె
కడుఁబులకలనె శిథిలి కన్నచోటనె పొడమె
సుడిసి చెలిసిగ్గెట్ల చూరఁబోఁగలదో

చ. 3: భామకుచముల మీఁదఁ బ్రతిచందురులు వొడచె
చీమ దొంతర లతలఁ జిగిరించెను
వామాక్షి వేంకటేశ్వరుకౌఁగిటను గలసె
ప్రేమమిఁక నిదియెంత పెద్దగాఁగలదో

రేకు: 0073-4 శ్రీరాగం సం: 05-250

పల్లవి: ఇచ్చకాలు రమణికి నెంత చేసేవు నీ-
ముచ్చిమిసేఁతలిన్నియు మూసేటి కొరకా

చ. 1: బెట్టుగఁ బెద్దతురుము పెట్టేననుచు నింతి-
తట్టుపుణుఁగునెరుల తలదువ్వేవు
గట్టిగ నెవ్వతెఁ గూడో కౌఁగిటఁదెచ్చిన నీ-
తట్టుపుణుఁగుల తావి దాఁచేటికొరకా-

చ. 2: గబ్బివై నీపదకము గట్టేననుచుఁ జెలి-
గుబ్బల మించుఁజెరఁగుకొంగు దీసేవు
వుబ్బున నెక్కడనో వుండి నీవిదె వచ్చిన-
దెబ్బలవాట్ల తప్పు దీరేటికొరకా

చ. 3: ఇప్పుడిట్లనే విడెమిచ్చేననుచు నీవు
కప్పురము ఘనముగఁ గడునిచ్చేవు
అప్పుడె శ్రీ తిరువేంకటాద్రీశ యీ యింతి
చొప్పుదప్ప రతిఁగూడి చొక్కించుకొరకా

రేకు: 0073-5 ఆహిరి సం: 05-251

పల్లవి: వద్దు మమ్మింత నెవ్వగల వలయించ నిటు
పొద్దువొద్దునకు నోపుదుమా వోరి

చ. 1: బీరమున నిన్ను వలపించుకొన నేమంత-
వారమా వట్టిగరువములు గాక
నేరుపే కలిగినను నీచేఁతలకు నింత
దూరుచును కాఁకఁ గందుదుమా వోరి

చ. 2: కన్నులనె వలపు చిలుకఁగఁ జూడ నేమంత-
కున్నారమా నీవుదుటు గాక
వన్నెలను నిన్ను నేవలపింతునైన నీ-
వున్నవిధమిటు చూడనోర్తుమా వోరి

చ. 3: నీ నేరములు దక్కె నీకు నినుఁ బాయఁగల-
నైన నేనిట్టవుదు నటరా
కోనేటిరాయ తక్కులుమాని మచ్చికల-
నూని నాకౌఁగిటనె వుండరా వోరి

రేకు: 0073-6 శ్రీరాగం సం: 05-252

పల్లవి: మామనునేతు మాగతవానసి
కాముకవిద్యాకల చలరే

చ. 1: భిల్లవధూకుచపీడన కుతుకో-
త్ఫుల్లకరాంబుజ భూషణ
పల్లవ గోపక పరివృత శరజన-
వల్లభ రతిపరవశ చలరే

చ. 2: గోపీజన కుచకుంకుమ పంక వి-
లేపన మిళిత లలితదేహ
తాపకరణ సంతత బహువినయా-
లాప రూపమేళన చలరే

చ. 3: పరవనితామణి పరతంత్రత్వాం
త్పరుష నఖాంకిత పతిరసికిమ్
కురవకభూరుహ కుంజగృహంతే
తిరువేంకటనగాధిప చలరే

రేకు: 0074-1 శుద్ధదేశి సం: 05-253

పల్లవి: కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని

చ. 1: బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును
చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీయిండ్లు జతనాలు మీరుసేసికొనక
పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని

చ. 2: మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ
ఆసపడకుందురా ఆడేబిడ్డలు
వోసరించి మోసపోక వుండలేక మీరు
సేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని

చ. 3: చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును
చిక్కినవిడుతురా చిన్నిబిడ్డలు
మిక్కిలి పూజలు నేసి మెచ్చించఁ దగదా
యెక్కువైన తిరువేంకటేశుఁడైన బిడ్డని

రేకు: 0074-2 కాంబోది సం: 05-254

పల్లవి: పేగుల జంద్యాలు వేసి పెంచపునమలిపురి
పాగగాఁ జుట్టిన నాబాఁపనయ్య వీఁడివో

చ. 1: బిత్తలై పరువులిడి పిన్నబోడితలతోడ
కొత్తబొమ్మచారియై గోచిగట్టెను
నెత్తురుదానమునేసి నిండిన జడలతోడ
బత్తుఁడైన చక్కని నాబాఁపనయ్య వీఁడివో

చ. 2: కఱవిద్యబాఁపనిచేఁ గఱచె నేరుపులెల్ల
గుఱుతుబాఁపనిఁ గనెఁ గొడుకుఁగాను
తఱితోడ సందెపొద్దు దప్పనీక జలధిలోఁ
బఱపుగాఁ బండిన నాబాఁపనయ్య వీఁడివో

చ. 3: పచ్చియిఱ్ఱి తోలుచొచ్చి బడలి చొరనిచోటు
చొచ్చి తెచ్చె వేదాలు చూడరమ్మా
మచ్చిక వేంకటగిరి మరిగి నాకౌఁగిట
పచ్చనిదోపతి నాబాపనయ్య వీఁడివో

రేకు: 0074-3 సామంతం సం: 05-255

పల్లవి: ఏకాలమేది దనకెట్ల సుఖమైయుండు -
నాకాలవశతఁ దానట్లుండవలనె

చ. 1: బలువియోగాగ్ని దలఁపంగ నెట్టిదొకాని
చలిగాలి యెండనుచు జాలిఁ బడవలనె
వలరాజుకోపమెటువంటిదో పడఁతులకు
తలిరాకు చేఁదనుచుఁ దలపోయవలనె

చ. 2: భావంబు తలపోఁత బలిమెట్టిదోకాని
నోవి దోఁపనిచోట నొచ్చెననవలనె
ఈ విరహపరితాపమిఁకనెట్టిదో కాని
కోవిలల కూఁతలకుఁ గోపించవలనె

చ. 3: తిరువేంకటేశుకృప తియ్యమెట్టిదొ కాని
చిరునవ్వు మోవిపైఁ జెరలాడవలనె
సురతసౌభాగ్యముల సొంపులెట్టివొ కాని
మురిపెంపుఁ గనుచూపు ముయ్యఁగావలనె

రేకు: 0074-4 శంకరాభరణం సం: 05-256

పల్లవి: అప్పఁడు మజ్జనమాడీనంగనఁ గూడి
కుప్పలుఁ దెప్పలుగాఁ గుమ్మరించరో

చ. 1: బంగారుకొప్పెరల పన్నీరు నించి
రంగైన పచ్చకప్పురపు ధూళొత్తి
చెంగటఁ గస్తూరిధూళి చికిలి గావించి
పొంగారుఁదట్టుపుణుఁగు పోయరో గిన్నెలను

చ. 2: పటికంపు గాఁగుల పరిమళాలెల్లా
ఘటియించి కుంకుమతోఁ గడు మేదించి
అటునిటు గొజ్జంగనీరందంద నించి
కుటిలకుంతలులు పైఁగుమ్మరించరో

చ. 3: బలుపింగాణులఁ గదంబము గంధమును
కలపము గావించి గంబూరముతో
వెలయ మజ్జనమాడీ వేంకటాద్రివిభుఁడు
చెలఁగి యింతులు చేరి సేస చల్లరో

రేకు: 0074-5 భూపాళం సం: 05-257

పల్లవి: కలిమి నిందరిని దగ్గరుకొరకే- వీఁడె
సులభుఁడై తిరిగీని చూడరమ్మా

చ. 1: భంగపెట్టి గొల్లవారి పాలువెన్నలు
దొంగిలించు కొరకే తోవలనెల్లా
చెంగలించి చేతులెత్తి చెలఁగుచును- వీఁడె
దొంగి దొంగి తిరిగీని తోలరమ్మా

చ. 2: గుట్టుదీర రేపల్లెకొమ్మలనెల్లా
రట్టుసేయుకొరకే రచ్చలనెల్ల
గట్టిగాఁ జాటెడి మొలగంటలతోడ- వీఁడె
చుట్టపుబాలునివలెఁ జూడరమ్మా

చ. 3: చెప్పరాని తనమాయచేత నిందరినిఁ
గప్పెడికొరకే వేంకటవిభుఁడు
కప్పెడి నల్లనియలకలనుదురు-వీఁడె
గుప్పెడి ముద్దులు యెత్తుకొనరమ్మా

రేకు: 0074-6 ఆహిరి సం: 05-258

పల్లవి: వలతునందువు నాకు వడినెప్పుడును నేఁ-
డెలమి నొకచో భావ మెట్లుండె నీకు

చ. 1: బరువైన మదనతాపంబునకు వెరవకిటు
పురవేదనలను నేఁబొరలఁగాను
సరసమున నీవచట సతులకౌఁగిటనుండి
యిరవుకొననపుడు మనసెట్టుండె నీకు

చ. 2: వదలిన తురుముతోడ వాడువదనముతోడ
వొదిగినేనిటు చింతనుండఁ గాను
సదమదముగాఁగ నొకసతిని గౌఁగిటి రతుల-
గదియంగఁ జిత్తమేగతి నుండె నీకు

చ. 3: జమలి మొలనూళ్ళతో జవ్వాదిమేనితో
నమరి యీరీతి నేనలరఁగాను
కొమరొందఁ గూడితివి కోనేటిరాయ నీ-
తమకమెందాఁక నెంతటినుండి నీకు

రేకు: 0075-1 ముఖారి సం: 05-259

పల్లవి: చెప్పరాదీయింతి సిరులు - దీని -
వొప్పులిన్నియుఁ జూడ వొరపులోకాని

చ. 1: ముదితజఘనముమీఁది మొలనూలిగంటలవి
కదలు రవమెట్లుండెఁ గంటిరే చెలులు
మదనుఁడుండెడి హేమమందిరము దిరిగిరాఁ
గదిసి మ్రొసెడి పారిఘంటలో కాని

చ. 2: కొమ్మపయ్యెదలోని కుచమూలరుచి వెలికిఁ
జిమ్ముటది యెట్లుండెఁ జెప్పరే చెలులు
యిమ్మైన మరుధనములెల్ల రాసులు వోసి
కమ్ముకొని చెంగావి గప్పిరో కాని

చ. 3: నెలతకంఠమునందు నీలమణిహారములు
అలరుటెట్లుండు కొనియాడరే చెలులు
లలితాంగి ప్రాణవల్లభుఁడు వేంకటవిభుఁడు
నెలకొన్న కౌఁగిటనె నిలిచెనో కాని

రేకు: 0075-2 ఆహిరి సం: 05-260

పల్లవి: మానసీఁడు పుంటినోవి మరఁది వీఁడే
నూనముపైఁ జేయి చాఁచీ మందవారిమరఁది

చ. 1: మంచమెక్కి వావిచూచీ మరఁది వీఁడే
మంచినీటి చెలమల మరఁది
మంచు గుంచానఁ గొలిచే మరఁది వీఁడే
పించెపు శిరసు పాగ పిన్ననాఁటి మరఁది

చ. 2: మంద మిరియాలు చల్లే మరఁది వీఁడే
మందు నూరీ మాటలనే మరఁది
మందుమాయసేఁతల మరఁది వీఁడే
కుందణపు వన్నెదట్టి కొంగు జారే మరఁది

చ. 3: మక్కళించే వలపుల మరఁది వీఁడే
మక్కువ నాకౌఁగిట మరఁది
మక్కువలఁ గరఁగించే మరఁది వీఁడే
చిక్కె వేంకటాద్రిమీఁది చిన్ననాఁటి మరఁది

రేకు: 0075-3 సామంతం సం: 05-261

పల్లవి: చెలువపు సేఁతల శిన్నెకా పెద్ద
వలపువేదనల వాడీనయ్యో

చ. 1: మొగమునకెగరెడి మొనవాఁడి గుబ్బల-
చిగురుఁబెదవులాఁడి శిన్నెకా
నిగనిగ మెరిచేటి నీలిమేనివానిఁ-
సొగసు చూచి వాని సొలశీనయ్యో

చ. 2: మొగ్గల మొలకల మురిపెపుఁ గన్నుల-
శిగ్గుల చిరునవ్వు శిన్నెకా
ఉగ్గున రేపల్లె వుసురు గొనేటివాని
దగ్గరి తమకానఁ దడవీనయో

చ. 3: చంకల బంగారు చల్లిన మెఱుఁగుల
చింకబెదరులాఁడి శిన్నెకా
వేంకటపతిఁ గూడి వేడుక తోడుత
సుంకుల సోగల సొలశీనయ్యో

రేకు: 0075-4 శ్రీరాగం సం: 05-262

పల్లవి: మరుని నగరిదండ మాయిల్లెఱఁగవా
విరుల తావులు వెల్లవిరిసేటి చోటు

చ. 1: మఱఁగు మూఁక చింతల మాయిల్లెఱఁగవా
గుఱుతైన బంగారుకొండల సంది
మఱపు దెలివి యిక్క మాయిల్లెఱఁగవా
వెఱవక మదనుఁడు వేఁటాడేచోటు

చ. 2: మదనుని వేదంత మాయిల్లెఱఁగవా
చెదరియు జెదరని చిమ్మఁ జీఁకటి
మదిలోన నీవుండేటి మాయిల్లెఱఁగవా
కొదలేక మమతలు కొలువుండేచోటు

చ. 3: మరులుమ్మెతల తోఁట మాయిల్లెఱఁగవా
తిరువేంకటగిరిదేవుఁడ నీవు
మరుముద్రల వాకిలి మాయిల్లెఱఁగవా
నిరతము నీ సిరులు నించేటిచోటు

రేకు: 0075-5 ఆహిరి సం: 05-263

పల్లవి: ఏందాఁకా జాగిది యేలే- తన-
అందములచటనె అయ్యీఁగాక

చ. 1: మృగమదమీతఁడు మెత్తీనిదె మై
ధగధగమనఁగాఁ దనకేలే
మగువకుచముల చెమట నంటిన యా-
పొగరుఁ బరిమళమె పూసీఁ గాక

చ. 2: బెడిదపుఁ దురుమిదె పెట్టీనీతఁడు
తడవుగ నలరులు తనకేలే
పడఁతి శిరసునను పైపైఁ జెరిగిన-
జడివాన విరులు జారీఁ గాక

చ. 3: చిమ్ముచు వీడెము సేసీనీతఁడు
తమ్ములమమియఁడు తనకేలే
కొమ్మ వీడెమిఁక కోనేటప్పఁడు
తమ్మివదనమున దాఁచీఁ గాక

రేకు: 0075-6 శ్రీరాగం సం: 05-264

పల్లవి: బిగ్గెఁ గాఁగలించుకోవే పిరితీయక
నిగ్గుల యాతనిమేను నేఁడే నొచ్చీనా

చ. 1: మందరమెత్తినవాఁడు మల్లుల మొత్తినవాఁడు
అందపు నీ గుబ్బల వేఁగాన లేఁడా
గొందినున్న కుచములు కొనవాండ్లైతేను
చెందిన యాతనిమేను చిల్లులయ్యీనా

చ. 2: భూమెల్ల మోఁచినవాఁడు పొడవు దాఁచినవాఁడు
భామ నీ మొలనూలు భారమనీనా
వోమక యాతనితోడి వుపరిసురతానకు
యేమని వేఁడుకొనిన యేల లోఁగేవే

చ. 3: వేంకటనగమువాఁడు వెన్నెలమొగమువాఁడు
కింకల నీ చేఁతలకుఁ గిందుపడీనా
పంకజవదన నీకుఁ బాయలేక చెనకిన
కుంకుమగుబ్బల చెనకులకోపఁడా

రేకు: 0076-1 దేశాక్షి సం: 05-265

పల్లవి: అవ్వలిమాటలే హితవవుఁగాక
రవ్వలై నీకింక నిందు రాఁదీరునా

చ. 1: మందలించి మధురలో మగువల మాటలే
విందుగాక చెవులకు విందులుగాను
మందల మగువుల మా మాటలు చెవులకు గో-
విందుఁడా మాసుద్దులిఁక వినఁదీరునా

చ. 2: వాసనగాఁ బువ్వులింటివారతోడి పొందులే
సేసి నీవు మమ్ము నీవు చెనకే వింక
దోసాలు గావుగద మాతోడి పొందులివి శ్రీని-
వాసుఁడా మాచేతలను వడదీరునా

చ. 3: మాయలు మందులుసేసే మానినుల పొందులే
రేయుఁబగలును నీకు రేసులుగాక
పాయక కూడితి నన్ను బాపురే వేంకటగిరి-
రాయఁడా మాకౌఁగిటి రట్టుకోపుదా

రేకు: 0076-2 శంకరాభరణం సం: 05-266

పల్లవి: ఇంతి భువనమోహినియైన ఫలము
కాంతునిఁ దలఁచి వగలఁ జిక్కెనిపుడు

చ. 1: మెలుఁతకన్నులు గండుమీలైన ఫలము
తొలఁకురెప్పల నీరు దొరకె నేఁడు
లలనమై నవపుష్పలతయైన ఫలము
వలపు చెమట నీట వడిఁ దోఁగె నిపుడు

చ. 2: మెఱుఁగారు నెరులు తుమ్మెదలైన ఫలము
నెఱిఁ దమ్మిమోముపై నెలకొన్నవి
పఱచు జక్కవలు గుబ్బలైన ఫలము
తొఱలి తాపపురవితోఁ గూడె నిపుడు

చ. 3: పలు వన్నెమోవి బింబమైన ఫలము
చిలుక వోట్లచేతఁ జెలువొందెను
కలికి వేంకటపతిఁ గలసిన ఫలము
సొలసినాడనె నిత్యసుఖమబ్బె నిపుడు

రేకు: 0076-3 ఆహిరి సం: 05-267

పల్లవి: ముచ్చటకెవ్వరు లేరు మోహమిది బలుదూరు
యెచ్చట నెవ్వరులేరు యేఁటికే నాపేరు

చ. 1: మంచముపై నుండరాదు మలఁగుపైఁ బొద్దువోదు
నించిన వుయ్యెలలోనా నిద్దుర రాదు
అంచెలఁ గన్నుల నీరు ఆఁపరాదాతనిఁబాసి
యించుకంత నిలువలే నెట్లు ధరియింతునే

చ. 2: పవ్వళించేటిల్లు చూచి ప్రాణము నిలుపరాదు
దివ్వెచూచి తాలిమైనఁ దిప్పఁగరాదు
దువ్వటపుఁ బయ్యదపైఁ దోఁగిన తట్టు పుణుఁగు
పువ్వుటమ్ము బాసటమై పొక్కనేమిసేతునే

చ. 3: చింతతో ధరించరాదు చెల్లఁ బో మేనైనఁ బోదు
ఇంతటఁ జెలులకైన యెఱుక లేదు
ఇంతలోనె వేంకటేశుఁడింతి మరుఁగుననుండి
యెంతసేసెఁ గలికి వీఁడేమని చెప్పుదునే

రేకు: 0076-4 బౌళి సం: 05-268

పల్లవి: శిన్నెక తేవే శెలువుని తా
వెన్నలు సవిగొను వెన్నుని తా

చ. 1: మూటల్ మాటల్ మూరల్ బారల్
బాటల్ సదివే బాపలు తా
వేటల్ వీపుల్ వేలుపు గుడుపుల్
తేటలు మరగిన దేవుని తా

చ. 2: వాకుల్ చీకుల్ వాదుల్ పోదుల్
సోకపు తొల్లిటి సుద్దుల్ తా
పోకులు లోకుల్ పొగడఁగ మనిపెడి
కేకిగరుల తల కిష్ణుని తా

చ. 3: బగ్గుల్ నగ్గుల్ బావుల్ సారెగా
దగ్గర వెరపగు తపసుల తా
సిగ్గుల్ వాపెడి శ్రీ వేంకటపతి-
నగ్గపు సొమ్ములయాతని తా

రేకు: 0076-5 ముఖారి సం: 05-269

పల్లవి: భావమెరఁగని పడుచా వోసి
పోవే పోవే పోవే పడుచా

చ. 1: మొరఁగు మరఁగు వింత కరఁగుదేనెల-
పరచుమాటల పడుచా
చురుకు మెరుపు వాలుఁజూపుల కన్నుల
కెరలఁ బొడిచి గిలిగించేవే పడుచా

చ. 2: కెలపు మలపుఁ బయిఁడి గిలుకుల మట్టెల-
బలుపుమోఁతల పడుచా
అలపు సొలపు ముద్దులొలుకు నవ్వుల
జలుకువలపు మీఁదఁ జల్లేవే పడుచా

చ. 3: వెదకి వెదకి తిరువేంకటేశ్వరుఁ
బదరి కూడిన పడుచా
కదలు గుబ్బల కలికిచేఁతల
పుదుటు నడపులనె వొరగేవే పడుచా

రేకు: 0076-6 శంకరాభరణం సం: 05-270

పల్లవి: దిమ్మరివలె నిటులఁ దిరుగకువే
చిమ్ముల వలపు నీపైఁ జిలికించీఁ గృష్ణుఁడు

చ. 1: మెల్లనే వుద్దాలు మెట్టి మీరిన తురుము పెట్టి
తెల్లని ముత్యాలు గట్ట తిరుగకువే
చల్లలమ్మేనంటా నీవు చక్కని గొల్లెతవు
వల్లెవేసీఁ జూపులనే వన్నెకాఁడు కృష్ణుఁడు

చ. 2: మట్టెలనే గిలుకొట్టి మణుల పెండెముపట్టి
దిట్టనడపుల వీధిఁ దిరుగకువే
జట్టిగొనుచూపుల జంకెన గొల్లెతవు
పెట్టెడుఁ జిక్కుల నిన్ను బిత్తరీఁడు కృష్ణుఁడు

చ. 3: చెక్కులదాఁకాఁ గస్తూరి చెలఁగి నొసలఁ బెట్టి
దిక్కులు చూచుచునంత తిరుగకువే
గక్కున శ్రీవేంకటాద్రి ఘనుఁడు కౌఁగిటను
చొక్కులఁ బెట్టెడి నిన్ను చూరకాఁడు కృష్ణుఁడు

రేకు: 0077-1 వరాళి సం: 05-271

పల్లవి: మోపుల చిగురుల చిమ్ముల వేదము
ఆవుల మందలలోని ఆవేదము

చ. 1: మంచముపైఁ జదివేది మరవకుమీ
కొంచెపు లేఁబలుకుల కొనవేదము
పించెపు శిరసుతోడఁ బిన్ననాఁడే చదివిన
తుంచి తుంచిన మాటల తొలువేదము

చ. 2: చల్లలమ్మే గొల్లెతల చక్కనిజంకెనలకు
గొల్లపల్లెలోన దొరకొన్న వేదము
తల్లిబిడ్డలనక యందరినొక్కవావిగా
పిల్లఁ గోవి నేరిపిన పెనువేదము

చ. 3: పంకజభవాదుల బడిబడిఁ జదివించే
లంకెలు చెలఁగిన మేలపువేదము
వేంకటనగముమీఁద వెలయ నిందిరఁగూడి
కొంకక చదివిన చొక్కుల వేదము

రేకు: 0077-2 వరాళి సం: 05-272

పల్లవి: నిండిన వేడుకలెల్ల నీకె గాక
అండనె తాపము చల్ల నమరెగా నాకు

చ. 1: మగువకన్నుల మొక్కు మట్టెల పాదపుఁ దొక్కు
నిగుడు వాతెరనొక్కు నీకె కాక
అగడునెరుల చిక్కు అరచేతిపై చెక్కు
వగల గుక్కును మిక్కు వన్నెగా నాకు

చ. 2: తొయ్యలిఁ గూడినరట్టు తుదచెమటల మెట్టు
నెయ్యపుమాటల గుట్టు నీకె కాక
పయ్యద జారినకట్టు భారంపు నొసలిపట్టు
కయ్యపుటలుక తిట్టు గలిగెఁగా నాకు

చ. 3: మొగలిపువ్వులతావి ముంచినకన్నులకావి
నిగనిగ నగుమోవి నీకె కాక
సగము జారిన నీవి చనవుల నీదేవి-
నగుట వేంకటేశ నేఁడబ్బెఁగా నాకు

రేకు: 0077-3 శ్రీరాగం సం: 05-273

పల్లవి: ఆలవట్టములు వట్టేరవధరించఁ గదో పెద్ద-
పాలిండ్ల బరవున భామ బడలితివి

చ. 1: మజ్జనమవధరింతు మగువ విచ్చేయవో
గొజ్జంగ కస్తూరినీటఁ గుంకుమనీట
గజ్జల గరుడునిపై కలికి విభునిఁ గూడి
ముజ్జగములఁ దిరిగి మొగినలసితివి

చ. 2: బోనము వెట్టినారిదె పొలఁతి విచ్చేయవో
ఐనకూరలెల్లఁ జల్లనారీనిదే
తేనెలూరెడి కెమ్మోవితీపులు నీ విభునకుఁ
గానుకగా నిచ్చియిచ్చి కడునలసితివి

చ. 3: చప్పరమంచముపైకి సరుగ విచ్చేయవో
అప్పఁడు వేంకటరాయఁడలరీ వాఁడే
కొప్పెరగుబ్బలమీఁది కొనగోరిరచనల
కప్పురము మెత్తిమెత్తి కడునలసితివి

రేకు: 0077-4 హిందోళవసంతం సం: 05-274

పల్లవి: జగడపుఁ జనవుల జాజర
సగినల మంచపు జాజర

చ. 1: మొల్లలు దురుముల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లనఁ బుప్పొడి జారఁగఁ బతిపై
చల్లేరతివలు జాజర

చ. 2: భారపుఁ గుచముల పైపైఁ గడు సిం-
గారము నెరుపేటి గందవొడి
చేరువ పతిపై చిందఁగఁ బడఁతులు
సారెకుఁ జల్లేరు జాజర

చ. 3: బింకపుఁ గూటమి పెనఁగేటి చెమటల-
పంకపుఁ బూఁతల పరిమళము
వేంకటపతిపై వెలఁదులు నించేరు
సంకుమదంబుల జాజర

రేకు: 0077-5 ముఖారి సం: 05-275

పల్లవి: పొద్దువోకలివి నీకు భువిలో నెన్నఁగ నీ-
సుద్దులు చెప్పెదమన్న చూడఁజూడఁ గొత్తలు

చ. 1: మోఁతనీటిలోని యీఁత మూఁపునఁ బుట్టిన మేఁత
మూఁతిమీఁది కత్తికోఁత మొనగోరివాఁత
బాఁతిలేని దారవోఁత పాపముచూడనిచేఁత
నాఁతిమీఁది తలపోఁత నాఁగేటిగీఁత

చ. 2: వలపు చల్లినలాగు వాజినెక్కినబాగు
వలసి నొల్లములైన వలవనిజాగు
తెలిసితిమిదెనేఁడు తిరువేంకటేశ్వర
తలఁపు ప్రాణులమీఁద- దగులుటేలాగు

రేకు: 0077-6 శ్రీరాగం సం: 05-276

పల్లవి: నేనెందు వోయె తా నెందు వోయీా
రానీలే రానీలే రానీలే

చ. 1: మీనైన నాఁటి తన మిడుకెల్ల దిగవలెకానీలే కానీలే కానీలే
చ. 2: తలచూపేనాఁటి తలఁపెల్ల దిగవలె తలఁచనీ తలఁచనీ తలఁచనీవే
చ. 3: కిరయైన నాఁటి కిటుకెల్ల దిగవలెతిరుగనీ తిరుగనీ తిరుగనీవే
చ. 4: హరియైన నాఁటి అదటెల్ల దిగవలె జరగనీ జరగనీ జరగనీవే
 చ. 5: వడుగైన నాఁటి వస విడువఁగ వలె తడవకు తడవకు తడవకువే
 చ. 6: కలుషించే నాఁటి కడమెల్ల దిగవలె అలుగనీ అలుగనీ అలుగనీవే
 చ. 7: సతిఁ బాసేనాఁటి చల్లమెల్ల దిగవలె తతిగానీ తతిగానీ తతిగానీవే
 చ. 8: ముసలైన నాఁటి ముసుపెల్ల దిగవలె విసుగనీ విసుగనీ విసుగనీవే
 చ. 9: మానైన నాఁటి మదమెల్ల దిగవలె పోనీవే పోనీవే పోనీవే
 చ. 10: కలికైన నాఁటి గజరెల్ల దిగవలె చెలఁగనీ చెలఁగనీ చెలఁగనీవే
 చ. 11: వేడుకతో నాఁటి వేంకటపతి నన్నుఁ గూడనీ కూడనీ కూడనీవే

రేకు: 0078-1 భూపాళం సం: 05-277

పల్లవి: ఎందరు వలె నీకింకాను - యీ-
యిందరు చాలర యింకాను

చ. 1: మోహపు సతితో ముచ్చటఁ గలసిన-
దేహము మనసునిదియ కాదా
సాహసమున నది చాలక మదిలో
యీహలఁ దిరిగే వింకాను

చ. 2: కసరుల మురిపెపు గయ్యాళిసతులతో
ఆసురుసురులతో నలసితివి
కొసరుచు నాతోఁ గూటమిసేసే-
ఎసరెత్తకుమీ యింకాను

చ. 3: కాఁకల నటనల- గరగింపుచు నను
దేఁకువఁ గూడితి దిమ్మరివై
వేఁకపువలపుల వేంకటేశ నీ-
యేఁకట దీరదు యింకాను

రేకు: 0078-2 ఆహిరి సం: 05-278

పల్లవి: ఇట్టే నామదిఁ గోపమెచ్చరించేవు
వట్టి వలుపే నాపై వారించ వలెనా

చ. 1: మోహపు సంకుటుంగరముల వెలిగోర నా-
దేహముపై నునురేక దియ్యఁజూచేవు
సాహసివిరా వోరి వెచ్చపు నీవలపులోని-
దాహమెల్లా నాతోనే యింతటఁ జూపవలెనా

చ. 2: తళుకుబంగారంచుల దట్టి చీరకొంగుఁ
లలర నీమేను నాపైనప్పళించేవు
వలదు వోరి వెచ్చపువలపు నీదెల్లాను
పలుమారునిట్ల నాపైఁ బూయవల నా

చ. 3: సన్నపుమణుల కుప్పెనసవరము కొప్పు నా-
కన్నులు దాఁకఁగ నాపైఁ గడు వీఁగేవు
కన్నుల కలికి వేంకటరాయ నీకౌఁగిటి
వన్నెలెల్ల నాపై నిటువలెఁ జేయవలెనా

రేకు: 0078-3 శ్రీరాగం సం: 05-279

పల్లవి: ఉండవద్దా యిటువంటి వొడికాలను చను-
గొండలపై నుదయించెఁ గొండుక చందురుఁడు

చ. 1: మింటిమీఁది చందురుఁడు మేదినిపై కలువల
నంటు సేసెనట యేఁటి నాటకములే
కంటిచూపు కలువల కలకకోరిచెఁ బైఁడి-
వంటిమేని జవరాలి వదన చందురుఁడు

చ. 2: జలధిలో జనియించి చందురుఁడె పగలాయ
జలజములకు నేఁటి శాంతములే
మెలుఁతమోమై నేఁడు మెత్తనికరతలము-
జలజానఁ బవళించెఁ జక్కని చందురుఁడు

చ. 3: చింకచందురుఁడు కందుఁజీఁకటి మైచీఁకటే
యింకఁజేసి పారఁదోలీనేఁటిపొందులే
వేంకటేశుని కౌఁగిట వెలఁదిమోమై నేఁడు
వంక నెరిచీఁకటి వలఁచె జందురుఁడు

రేకు: 0078-4 దేవగాంధారి సం: 05-280

పల్లవి: ఎంతటివాఁడవు నిన్ను నేమందును యిట్టె
సంతమైతివింతితోడ చాలదా నీకు

చ. 1: మాణికపుటుంగరాల మగువ దా వాయించేటి-
వీణలోనే చల్లీఁ దనవిరహమెల్లను
ఏణనయన నింతేసి యెలయించినట్టి నీ-
జాణతనమె యింత చాలదా నీకు

చ. 2: గిలుకుఁగంకణముల కీరవాణి కిన్నెరలో
కులికీనిదె పై కోపమెల్లాను
సొలపుఁ జూపులనిట్టే సుదతినింతేసి నీ-
చలము సాదించితివి చాలదా నీకు

చ. 3: కుంకుమగుబ్బలతోడి కోమలిచెక్కు చెమట-
వంకనే వచ్చీ నీపై వలపెల్లను
వేంకటగిరిరమణ వేడుక నీలలితాంగి
సంకెదేరఁ గూడితివి చాలదా నీకు

రేకు: 0078-5 శ్రీరాగం సం: 05-281

పల్లవి: పువ్వుగట్టినట్టి మేన- బుక్కిలించీఁ జెమట నీ-
జవ్వనపు మదమెపో చలపట్టిని

చ. 1: మోలకనవ్వు చిగురుమోవి మోపనీక నీ-
పలుకుఁ గోవిలలె పో పగచాటీని
తిలకపుమోమునకుఁ దేంట్ల రానీక నీ-
యలకల చెదరె పో యదలించీని

చ. 2: చనవున నీముఖచందురుని వంక నీ-
చనుజక్కవలె పో చాడిచెప్పీని
మనసు చీఁకట్ల నీమదనతాపపుఁ జింత
కనుఁగవలె పో గాదెఁబోసీని

చ. 3: దటపుఁ దమకపు మైదావానలానకు
నిట్టూపురులె పో నీడవెట్టీని
గుట్టుతోనుండిన కూరిమిపంపులే పోనీ-
పట్టపు వేంకటపతిఁ బట్టి తెచ్చీని

రేకు: 0078-6 భూపాళం సం: 05-282

పల్లవి: ఇన్నిచేతలును జేసెనిందుకొరకే - వీఁడు
కన్నులనె పొద్దుపుచ్చీఁ గదవె నీకొరకే

చ. 1: మీనమాయఁ జెమటల మేను ముంచుకొరకే
తానే కమఠమునాయ దాఁగుకొరకే
ఆనుకొని కిటియాయ నదలించుకొరకే
మానఁడు కంబముచాటు మారుమోముకొరకే

చ. 2: కాలుచాఁచె నేలమీఁద గమనించుకొరకే
జాలిఁబెట్టె చేఁతలనే చంపుకొరకే
యేలికాయ విరహులనేఁ పెడికొరకే
శైలమెత్తె నీకుచములెత్తే కొరకే

చ. 3: కలవెల్ల నిరసించేఁ గదవె నీకొరకే
కలికియాయెను నీసంగతికొరకే
వలపుల వేంకటేశ్వరుఁడు లోకమున
చెలువముతో మెరసెను నీకొరకే

రేకు: 0079-1 కేదారగౌళ సం: 05-283

పల్లవి: రమ్మనవే వాని రమ్మనవే- యీ -
తమ్మికనుఁగొనల తళుకులవాని

చ. 1: మెలుపున నేను మేడమీఁద యీ-
చిలుకఁ బేరుకొని పిలువఁగను
అలపున వీథిఁ దానరుగుచును తనుఁ
బిలిచితినంటాఁ బలికినవాని

చ. 2: కేరడమైన కిన్నెరలో యీ-
నారణి ముట్టుచు నలుగడను
చేరువల తాఁజెలఁగుచును యిటు
పేరుకొనుచు ననుఁ బిలిచినవాని

చ. 3: పరవశమై నేఁ బానుపున యీ-
గిరికుచముల నొడ్డగిలఁగాను
తిరువేంకటఘనగిరిపతి ననుచును యీ-
సిరులుగ ననునిటు చెనకినవాని

రేకు: 0079-2 ముఖారి-అటతాళం సం: 05-284

పల్లవి: చేయరాని చేఁతలెల్లఁ జేసితివి యింత
పాయరాని సతిమీఁద భయము నీకెట్టిదో

చ. 1: ముత్తేల పెండెమిది ముదితది ఆ-
గుత్తపుఁ బాదమునకుఁ గొలఁదైనది
బిత్తరపు ముంజేతనే పెట్టితిని యీ -
మత్తగజగమనపై మన్నన నీకెట్టిదో

చ. 2: కుందనంపు మట్టెలివి కోమలివి మోఁత-
లందెలతో జగడించనందమైనవి
యిందు నీకు నుంగరాలై యేచినవి యీ-
యిందుముఖి మీఁది మోహమెంత నీకునెట్టిదో

చ. 3: గట్టివలిపెపు చంద్రకాని యిది యింతి
కట్టి విడిచిన నేఁటికమ్మఁదానిది
కట్టి కాసించితివి వేంకటరాయా యీ -
బెట్టైన చెలిమీఁదిప్రేమము నీకెట్టిదో

రేకు: 0079-3 ముఖారి సం: 05-285

పల్లవి: సెల్లునంటా నేమైన చేయవచ్చేవు నే-
నొల్లనిన్ను సక్కసాయ నుండేవో వుండవో

చ. 1: మేసవారి పిన్నదాని మేకుసేసి యింటిలోనఁ
దోసుకొంటివెఱఁగవా దుండగీఁడ
ఆసలఁ బెట్టేవు నన్ను నట్టనే యింతేసి
వేసాలఁబోక కొంగు వీడేవో వీడవో

చ. 2: పాయపు వలపులనే పైడివంటి గొల్లెతల
సాయంపంపి తొలఁగవా సటకాఁడ
మాయల- బెట్టుచు నీవు మంచునీరు కుంచాలఁ
బోయుచు నన్నేఁపక పోయేవో పోవో

చ. 3: గాఁటమైన గుబ్బల చక్కనిదాని నమ్మనంటా
ఆఁటదాని బాగొనేవడవిలోనే
నాఁటకపు వేంకటేశ నన్నుఁ గూడితివి యిట్టె
మాఁటనెందూనాడక మానేవో మానవో

రేకు: 0079-4 ఆహిరి సం: 05-286

పల్లవి: ఇన్నియుఁ జేసితివిఁకనేలా నీ-
చిన్నినగపు మూసెర నీచేత

చ. 1: మఱవకురా నీమాటలు ని-
న్నెఱుఁగుదు నిన్నియు నిఁకనేలా
మొఱఁగకురా నీమోహము నా-
చెఱఁగు మాసెనిదె చెల్లె నీచేత

చ. 2: చిందకురా నీ చెలువములు ఇపు-
డిందరునున్నారిఁకనేలా
కందకురా నీ కాఁకలను యిటు
కిందుపడితినిదె గెలిచె నీచేత

చ. 3: నొంపకురా నే నొగులఁగా నీ-
యింపులు నెరపేనిఁకనేలా
జంపుల వేంకటశైలపతీ నా-
కెంపుమోవి దక్కెర నీచేత

రేకు:	0079-5 బౌళి-ఏకతాళి	సం:	05-287

పల్లవి: ఎవ్వరు గలరమ్మ యిఁక నాకు
నెవ్వగలలోఁ జిత్తము నెలకొన్నదిపుడు

చ. 1: మనసుకోరిక దీని మానిపెదనంటినా
వొనగూడి మనసు నావొద్దలేదు
పెనఁగి తమకము వా పెదనంటినా మేన
అనయమువెరపు దానై యున్నదిపుడు

చ. 2: చింత తాలిముల ముంచెదనంటినా మేన
సంతాపములు సేయఁ జలపట్టెను
అంతరంగము నాదియంటివా నెలపున
సంతతమునాతఁడే జట్టిగొనె నిపుడు

చ. 3: సింగారపుమేను నాచేతికి లోనంటినా
అంగవించి పరవశమై యున్నది
యింగితమెరిఁగి వేంకటేశుఁడు నాకంటినా
కంగి నన్నుఁ గారించి కలసెనిపుడు

రేకు: 0079-6 వరాళి సం: 05-288

పల్లవి: వెలయు నీకల్యాణవేదిగా మతినుండి
కలికి జవ్వనపు యాగము సేసెనతఁడు

చ. 1: మలయు నీనాభిహోమపు గుండమునను
నెలకొన్న విరహాగ్ని నిండాఁ బోసి
పొలయు నీ నిట్టూరుపుల విసరుచును
వొలుకుఁ జెమటల నాహుతి వోసె నతఁడు

చ. 2: కదిసి నీనెన్నడిమి గగనమునందు
పొదలిన యారనే పొగ నిండఁగా
మదిరాక్షి నీమంచి మానపుఁ బశువు
నదనెరిఁగి వేలిచె నతివ నీకతఁడు

చ. 3: కాటుకకన్నుల నిన్నుఁ గడునలయించి
బూటకముల చిటిపొటి సిగ్గుల
గాఁటపుఁ గరుణ వేంకటగిరివిభుఁడు
కోటిహోమము సేసెఁ గూడి నిన్నతఁడు

రేకు: 0080-1 శ్రీరాగం సం: 05-289

పల్లవి: అంజలిరంజలిరయం తే
కిం జనయసి మమ ఖేదం వచనైః

చ. 1: మాం కిం భజనే మయా కింతే
త్వం కోవా మే తవ కాహం
కిం కార్యమితో గేహే మమ తే
శంకాం వినా కిం సమాగతోసి

చ. 2: నను వినయోక్తైర్న యోగ్యాహం
పున: పునస్త్వం పూజ్యోసి
దినదిన కలహవిదినా తే కిం
మనసిజజనక రమారమణ

చ. 3: దైవం బలవత్తరం భువనే
నైవ రోచతే నర్మ మయి
ఏవమేవ భవదిష్టం కురు కురు
శ్రీవేంకటాద్రి శ్రీనివాస

రేకు: 0080-2 సామంతం సం: 05-290

పల్లవి: విరహన నినుఁబాసి వేఁగేను
తరుణి నేను నిన్నుఁ దప్పఁ దోయఁగలవా

చ. 1: మున్ను నీవు రేపల్లెను ముచ్చిలించుకొన్న పాలు-
వెన్నలునారగించి విఱ్ఱవీఁగేవు
సన్నపు నడిమితోడి జవ్వనాన నలయుచు-
నున్నదాన నీతోడ నోపుదునా పెనఁగ

చ. 2: నేరుపునఁ బాలజలనిధిలో నమృతమెల్ల-
నారగించి లావున నన్నుప్పళించేవు
బీరమునఁ జిగురాకుఁ బెదవితోఁ గనుచూపు-
గూరిమి నేనుఁ డి నిన్నుఁ గుచ్చి పట్టఁగలనా

చ. 3: గుద్దలించి దనుజుని గోరఁ జెనకిన నిన్ను
అద్దలించి చెనక నీయంతదాననా
గద్దరివి తిరువేంకటగిరివిభుఁడ నీ-
నిద్దపుఁ గస్తూరిమేను నేనాఁగగలనా

రేకు: 0080-3 ముఖారి సం: 05-291

పల్లవి: ఎక్కడిదిఁకఁ బరిణామము యీమదనానలమునఁ బ్రియ-
మెక్కుడు దోఁపఁగ ధైర్యంబింతయుఁ దీరెడిని

చ. 1: మనసునఁదలఁచినతలఁపులు మాటల వెడలఁగ నాడిన
గొనకొని కన్నుల నీళ్ళు గుత్తుకవట్టెడిని
కనుఁగవ చూచినచూపులు కౌఁగిటఁ జేర్పఁగఁ బోయిన
పనివడి హృదయంబంతయుఁ బరవశమయ్యెడిని

చ. 2: తనువున నాటినమాటలు తప్పక మతిఁ జింతించిన
అనువుగనది పరితాపంబై పెరరేఁ పెడిని
వెనకదినంబుల కూటమి వేడుకలని తలపోసిన
పెనగొన పూఁటకుఁ బూటకు ప్రేమము పెరిగెడిని

చ. 3: తిరువేంకటగిరినాథుని దేవోత్తముఁ గూడిన మది
యెరగొని దేహవికారములెరవై తోఁపెడిని
పరమాత్మునికరుణారస పానము సేసిన జిహ్వకు
అరుదుగ నితరపదార్థములన్నియు రోసెడిని

రేకు: 0080-4 శ్రీరాగం సం: 05-292

పల్లవి: తానట ప్రాణేశుండట తమకము తమకముఁ గూడఁగ
వేనలి జారినఁ దలఁకని వేడుకలెట్టివొకో

చ. 1: మీఁటినఁ బగిలెడిగుబ్బలమీఁద నలందిన గందపు-
వేటులతళుకులు పయ్యెద వెలుఁపలఁబొలయఁగను
నాఁటిన మదనుని శరముల నలఁకువనొయ్యన తోఁపఁగ
మాటకు మాఁటాడదు చెలిమర్మంబెట్టిదొకో

చ. 2: మించిన తొడల మెఱుంగుల మెలుఁతుక గట్టిన పుట్టము
చించుక వెడలిన నిగ్గులు సిగ్గులు దొలఁకగను
వంచినరెప్పల కన్నుల వడియు జలంబులు చెక్కుల
నించినఁ బలుకనిభావపు నెవ్వగలెట్టివొకో

చ. 3: కమ్మనితావుల చెమటల గాలికి నొయ్యన మెచ్చుచు
సొమ్ములఁదేలెడి మరపుల సొక్కులఁ దేలుచును
దిమ్మరికోనేటప్పని తిరువేంకటపతిఁ గూడిన
కొమ్మకు మీఁదటియాసల కోరికలెటివొకో

రేకు: 0080-5 నాదనామక్రియ సం: 05-293

పల్లవి: మలసిన తుమ్మిద మగవాఁడు
నిలిచి నాకు వెరవ నీకేలయ్యా

చ. 1: మగువలు సురతపు మఱపునఁ గుచములఁ
దగిలిన రేకలతరిఁ జెలఁగి
పగటున సిగ్గులు పడుదురుగాకిటు
నిగిడిన సిగ్గులు నీకేలయ్యా

చ. 2: వనితలు రతిపరవశమున మురిపెపు-
కనుఁగవచూపులఁ గరఁగుచును
జొనుగుల చూపులు చూతురుగాకిటు
యెనసినెనయములు యిఁకనేలయ్యా

చ. 3: లోలో మముబోంట్లు వనితలు వగఁ
దూలుచు జడమౌదురు గాక
తేలించితి రతి తిరువేంకటపతి
నాలికాఁడ నీనగవేలయ్యా

రేకు: 0080-6 దేశాక్షి సం: 05-294

పల్లవి: ఏడనున్నదో యీతరుణి
చూడక చూచిన చూపులలోన

చ. 1: మేఁతలు మరిగిన మీల పిల్లలకు
నీఁతలు నేరిపి యీతరుణి
కాఁతాళించిన కన్నుల నీళ్ళ
చేఁతల నిండిన చెరువులలోన

చ. 2: ముత్తెపునవ్వుల మురిపెపుఁ బువ్వుల
యెత్తులె కట్టి యీతరుణి
లత్తిక మోవికి లంచముగా పై
మెత్తిన దంతపు మెరుఁగులలోన

చ. 3: పసని చీఁకట్ల పలుమరుఁ దవ్వి
యిసుక పాఁతరలె యీతరుణి
కసిగాట్ల వేంకటపతి కౌఁగిట
రసములొలుక నేరములెన్నుచును

రేకు: 0081-1 లలిత సం: 05-295

పల్లవి: తెప్పగా మఱ్ఱాకుమీఁదఁ దేలాడువాఁడు
ఎప్పుడు లోకములెల్ల నేలేటివాఁడు

చ. 1: మోఁతనీటి మడుగులో యీఁతగరచినవాఁడు
పాఁతగిలే నతికిందఁబాయనివాఁడు
మూఁతి దోసిపట్టి మంటిముద్ద పెల్లగించువాఁడు
రోఁతయైన పేగుల పేరుల గలవాఁడు

చ. 2: కోడికూఁతనోరివాని కుఱ్ఱతమ్ముఁడైనవాఁడు
బూడిది పూసినవాని బుద్ధులవాఁడు
మాడవన్నె లేటివెంట మాయలఁ దగిలినవాఁడు
దూడల నావులఁ గాచి దొరయైనవాఁడు

చ. 3: ఆకసానఁ బారేవూరి అతివల మానములు
కాకు సేయువాఁడు తురగముపైవాఁడు
ఏకమై వేంకటగిరి నిందిరారమణిఁ గూడి
యేకాలముఁ బాయని యెనలేనివాఁడు

రేకు: 0081-2 సామంతం సం: 05-296

పల్లవి: పెద్దపిన్నవరుసఁ బెరుగవలసి తా-
నిద్దరైన యాతఁడీతఁడు

చ. 1: మెరుఁగురెక్కల పెద్దమేని పులుగునెక్కి
యిరులుకొనెడి యాతఁడీతఁడు
ఎరమంటలెగయంగ నేచిన పురముల-
నెరియించిన యాతఁడీతఁడు

చ. 2: చల్లని చూపుల సతికి వలచి పోయి
యిల్లిటమున్నవాఁడీతఁడు
తెల్లనీటిపై దిక్కులు వెలుగఁగ-
నిల్లుగట్టిన యాతఁడీతఁడు

చ. 3: చూచిన చూపుల సుఖదుఃఖములఁజేయ-
నేచిన పెనుదైవమీతఁడు
ఆచందముల వేంకటాద్రిపై నెలకొని
యీచోటనున్న వాఁడీతఁడు

రేకు: 0081-3 ముఖారి సం: 05-297

పల్లవి: కంటిమి నీలాగులెల్లఁ గన్నుల యాఁకలి దీర
బంది బంటు తనమేల మాతోఁ బంతమింత చాలదా

చ. 1: మింటిమీఁది కంటిచూపు వంటలేని కూడు నీకు
గుంటిమీఁది తోడఁబుట్టు గొల్లవారికలిమి
ఒంటిగాక లోకమెల్లనొక్కటైన మేను మంచి-
జూంటితోడిఁ బుటినాలు సుకమింత చాలదా

చ. 2: నాలుగు మోములబిడ్డ నవ్వుల సంసారము
వేలుమోపరానియిల్లు వింతవింతచెలువు
కాలిగోరఁ బుట్టినట్టి గద్దరికూఁతురు మంచి
పాలమీఁదిపడుక నీ బ్రదుకింత చాలదా

చ. 3: ఎల్లనాఁడు నురముమీఁద నెండగాయ కావిరాయి
గుల్లకూఁతతోడినోరు కొనగోరుబలిమి
చెల్లురా నీకింతవట్టు శ్రీవేంకటేశ్వరుఁడ
మల్లువారితోడి పోరుమానవింత చాలదా

రేకు: 0081-4 ముఖారి సం: 05-298

పల్లవి: కడగంటనే కెంపు గదురఁగాను
పడఁతి మురిపెపునటనఁ బాయ దేమియును

చ. 1: మగువ ముత్తియపు గమ్మల వెన్నెలలుఁ జిన్నిఁ
నగవువెన్నెలలు నున్నతిఁ బొలయఁగాను
జగడించి విభుని విరసంబులనె సొలయఁగా
మొగముననుఁ గోపంబు మొలవదేమియును

చ. 2: రమణికుచకుంభభారమును మొలనూళ్ళ భా-
రమును నెన్నడిమి సన్నము దెలుపఁగా
ప్రమదంపు విభునిఁ బెడఁ బాసి చెనకుచు లోని-
తమకంపు సంభ్రమము తరగదేమియును

చ. 3: ముదిత మై సింగారములుఁ జక్కదనములును
పదివేలు విధములై పరఁగఁగాను
కదిసి వేంకటవిభుని కమ్మఁగౌఁగిటి రతులఁ
జెదరు నలకల సిరులు చెదరవేమియును

రేకు: 0081-5 బౌళి సం: 05-299

పల్లవి: బహుళకర్మభోగంపు పనులెల్ల నిట్లనే
యిహసుఖంబిందరికి నెట్లనో కాని

చ. 1: మెలుఁత విభుఁ బాసియును మితిలేని వేదనల-
నలరి యాతనిఁగూడు నభిరతుల నలసె
అలిగినను గూడినను కలిగె వలపులు దనకు-
నెలమిఁ దనసుఖములిఁక నెప్పుడో కాని

చ. 2: ఉడుగని వియోగాగ్ని నూర్పు గడు వేఁడాయ
కడు రతులతో నూర్పు గాఁగి వేఁడాయ
కడఁగిననుతాపంబె కప్పె మై తాపంబె
యెడలేని తమి యింత నెప్పుడో కాని

చ. 3: తిరువేంకటాచలాధిపునిఁ బాసినయపుడు
తరుణి యాతనినిపుడు తగఁ గూడినపుడు
పరవశము దఱచాయ పైపైనె ఘుమమాయ
యిరవైన యెరుకలిఁక నెప్పుడో కాని

రేకు: 0081-6 శ్రీరాగం సం: 05-300

పల్లవి: కుంకుమచెమటలంటా గొబ్బిగేవు మరు-
దొంకెన తామరల నెత్తురుచారలమ్మా

చ. 1: కోవిదునిమీఁద నేల కోపగించేవతని కె-
మ్మోవి కప్పు మరునియమ్ములతాఁకులే
తావుల వింతలకుఁ గాఁతాళించేవతనిపై
భావజువింటి పూవు బారిఁ బడెనమ్మా

చ. 2: నొసలి కస్తూరంటా నొగిలేవాతనిపై
కసటుఁగాఁకల కందుగందము చూచి
యెసగ గందవొడంటా యెట్టిఁబారేవాతనిపై
పసని మదనుదాడి బలుదుమ్ములమ్మా

చ. 3: ఆఁటదాని గోరితాఁకుల నేవాతనిపై
నాఁటినచందురుని సన్నపు రేకలే
గాఁటపుఁ గాఁగిటను వేంకటపతి నీకు దక్కె
యేఁటికి నాతనివింకా నెగ్గులెన్నేవమ్మా

రేకు: 0082-1 శ్రీరాగం సం: 05-301

పల్లవి: ప్రతిలేని పూజ దలఁపఁగఁ గోటిమణుఁగులై
అతివ పరవశము బ్రహ్మానందమాయ

చ. 1: మానినీమణి మనసు మంచియాసనమాయ-
నానందబాష్పజలమర్ఘ్యాదులాయ-
మీనాక్షికనుదోయి మించుదీపములాయ-
నాననసుధారంబభిషేకమాయ

చ. 2: మగువ చిరునవ్వులే మంచిక్రొవ్విరులాయ
తగుమేనితావి చందనమలఁదుటాయ
నిగనిగని తనుకాంతి నీరాజనంబాయ
జగడంపుటలుకలుపచారంబులాయ

చ. 3: ననుపైన పొందులే నైవేద్యతతులాయ
తనివోని వేడుకలు తాంబలమాయ
వనిత తిరువేంకటేశ్వరుని కౌఁగిటఁ జేయుఁ
వినయవివరంబులరవిరిమొక్కులాయ

రేకు: 0082-2 ఆహిరి సం: 05-302

పల్లవి: మోహంపురతిముదము ముద్దుఁజూపుల మదము
దేహంపు సొబగెల్లఁ దెలిపె సదమదము

చ. 1: మించుమట్టెల గిలుకు మెరుఁగుగుబ్బల కులుకు
వంచుఁ జూపుల చిలుకు వసివాడుఁ బలుకు
మంచుఁ జెమటల తళుకు మనసు లోపలి యళుకు
అంచుటధరపుబెళుకు అలమేఁటి జళుకు

చ. 2: కరమూలములఁ గరఁగు కదలుఁ బయ్యెద చెరఁగు
సిరులచెలువపుమొరఁగు చెక్కుపై మరఁగు
గరగరికె తతులెరుఁగు ఘాతలంటిన తెరఁగు
గరిమెతో చెలియునికి కప్పురపుటరఁగు

చ. 3: కలికితనముల పోగు కమ్మఁదావులవేఁగు
వలపుతమకముల పరవశము పెనుజాగు
కలకంటిబాగు వేంకటపతికిఁ జెలరేఁగు
చెలియ సమరతుల మించిన వింత బాగు

రేకు: 0082-3 పాడి సం: 05-303

పల్లవి: ముద్దులు మోమున ముంచఁగను
నిద్దపుఁ గూరిమి నించీని

చ. 1: మొల చిరుఘంటలు మువ్వలు గజ్జలు
ఘలఘలమనఁగాఁ గదలఁగను
ఎలనవ్వులతో నీతఁడు వచ్చి
జలజపుచేతులు చాఁచీని

చ. 2: అచ్చపుఁ గుచ్చుముత్యాల హారములు
పచ్చల చంద్రాభరణములు
తచ్చిన చేతుల తానె దైవమని
అచ్చట నిచ్చట నాడీని

చ. 3: బాలుఁడు కృష్ణుఁడు పరమపురుషుఁడు
నేలకు నింగికి నెరిఁబొడవై
చాలించి వేంకటాచలపతి దానై
మేలిమిసేఁతల మించీని

రేకు: 0082-4 రామక్రియ సం: 05-304

పల్లవి: చూడరమ్మ యిటువంటి సుదతులు లేరెందు
యేడనైన నిటువంటి యింతులు పుట్టుదురా

చ. 1: ముదితనడపులలోని మురిపెమే వెయిసేసు
కొాదమగుబ్బలతీరు కోటివేలు సేసు
సుదతిబిత్తరిచూపు సొన్నాటంకాలే సేసు
అదరబింబముతీరు ఆరువేలు సేసు

చ. 2: సన్నపు నడుము లోని సైకమే లక్షసేసు
పన్నుగాఁ బిరుఁదువన్నె పదివేలు సేసు
యెన్నిక మెఱుఁగుఁదొడలెంతధనమైనఁ జేసు
నున్నఁగా దువ్వినకొప్పునూరువేలు సేసునే

చ. 3: అంగనభాగ్యమెట్టిదో అతిమోహమై తిరు-
వెంగళరాయనికృప వేవేలు సేసునే
బంగారుచవికెలోఁ బడఁతిఁ గూడిన సొంపు
రంగుగాఁ జెలియరూపు రాజ్యమెల్లఁ జేసునే

రేకు: 0082-5 ఆహిరి సం: 05-305

పల్లవి: జవ్వనంపుమదమున జడిసేటి తరుణి
పువ్వుల పానుపమీఁదఁ బొరలీఁ జూడరే

చ. 1: ముత్తేలకంకణాల మురిసేటి కరము
చిత్తగించు చెలి నేఁడు చెక్కుమీఁదను
కొత్తనెత్తావి విరుల కొమరైన తురుము
వత్తుల నెరులతోడ వదలీఁ జూడరే

చ. 2: పయ్యెదవెలి మించు పగటైన గుబ్బలు
ముయ్యరాని పెనుతాపమునఁ గాఁగీని
వొయ్యారపు రచనలతో వొరపైన చూపులు
వొయ్యనె కన్నులనీట వులికీఁ జూడరే

చ. 3: కప్పురపుతావితోడ కరఁగేటి తనువు
వొప్పైన కస్తూరిచేత నొరపైనది
యిప్పుడిట్టె తిరువేంకటేశుఁగూడి యింతి
చెప్పరాని వేడుకలఁ జెలఁగీఁ జూడరే

రేకు: 0082-6 కన్నడగౌళ సం: 05-306

పల్లవి: ఏలా యీా యనుమానములింతి మనంబునఁ బాయని-
తాలిమి తప్పుఁదెరువున దాఁగెఁగదోయమ్మా

చ. 1: మాయపుమంటలు చల్లెడు మందమారుతము
పాయము దిరుగఁబారెడు పండుఁజందురుఁడు
కాయము తల్లడపరపెడు గండుగోయిలలు
యేయెడనోర్వదు చెలిలాగేలాగోయమ్మా

చ. 2: ఇంటఁ బుట్టిన యాతఁడే యింటఁ బుట్టిన యమ్ముల
యింటఁ బలుమారునేయఁగ నేమందునోయమ్మా
వింటఁ బాసిన శరముల వెంటఁ దగిలెడు నారిని
యంటిన మదనానలమిఁక నారుపరాదమ్మా

చ. 3: కొండలరాయఁడు చెలిచనుఁ గొండల నించిన గురుతులు
కొండుకచందురులైనవి కొత్తగదోయమ్మ
నిండిన విరహంబింతయు నేఁడిదె యమృతంబాయను
పండిన తమకము మేలై పలియించెనోయమ్మా

రేకు: 0083-1 రామక్రియ సం: 05-307

పల్లవి: కమలాన సౌభాగ్యము కలికితనంబులు సొబగులు
ప్రమదంబులు నింతంతని పలుకంగా రాదు

చ. 1: మించిన చొక్కులు మీరినయాసలు
పంచేంద్రియముల భాగ్యములు
యెంచిన తలఁపులు యెడపని వలవులు
పంచబాణుని పరిణతలూ

చ. 2: కనుఁగవ జలములు కమ్మనిచెమటలు
ఆనయముఁ జెలులకు నాడికలు
తనువున మఱపులు తప్పని వెఱపులు
వినుకలి కనుకలి వేడుకలు

చ. 3: మోవి మెరుంగులు ముద్దుల నగవులు
శ్రీ వేంకటపతిచిత్తములు
తావుల పూఁతలు దర్పకు వ్రాఁతలు
ఆ విభుఁగూడిన యలసములు

రేకు: 0083-2 పాడి సం: 05-308

పల్లవి: విభుని వినయములు వినవమ్మా నినుఁ
నభయంబడిగీ నయ్యా తాను

చ. 1: రహస్యమున శ్రీరమణుఁడు పంపిన
విహరణలేకలు వినవమ్మా
ఆహిపతిశయనంబతితాపంబై
బహువేదనకు అగపడె నటతాను

చ. 2: అదిమపతి నీ యడుగులు కెరగిన-
వేదాంతరచన వినవమ్మా
నీదయగానక నిమిషమె యుగమై
ఖేదంబున నలఁగీనట తాను

చ. 3: కింకరుఁడట నీ కినుకసేఁతలకు
వేంకటపతిగతి వినవమ్మా
సంకెలేక నీచనవున జగములు
కొంకకిపుడె చేకొనెనట తాను

రేకు: 0083-3 ముఖారి సం: 05-309

పల్లవి: ఎఱఁగవితని చంద మిట్టివాఁడనుచు నింతి
తెఱవల నీమీఁదఁ దేనోపుఁ జుమ్మీ

చ. 1: రంగుమీరిన మంచిరత్నాలు దాచిన నీ-
వుంగరాలచేతఁ బాదమొత్తకువమ్మ
అంగన పుట్టెనుఁ బాదమంటి శిలను దొల్లి
కంగి నీకుఁ బ్రతిమొన గడియించీఁ జుమ్మీ

చ. 2: కొమ్మ నీదు వాలారుగోళ్ళ నితనికిని
యిమ్ములఁ దొడలు సోఁకనియ్యకు వమ్మా
దొమ్ముల సిరుల గోరఁ దొడనింతిఁ బుట్టించె
కమ్మర నీకు నిట్టెకలిగించీఁ జుమ్మీ

చ. 3: నొక్కుచుఁ జెమటల పానుపున వేంకటపతి-
నుక్కున నీచనుఁగొండలొత్తకువమ్మా
పక్కనను గొండవేసి పానుపుజలది దచ్చె
చక్కని తరుణి నిట్టె సడిఁబెట్టీఁ జుమ్మీ

రేకు: 0083-4 భైరవి సం: 05-310

పల్లవి: కూరిమెరఁగి కైకోవు-నీ-
బీరములే నెరుపేవు

చ. 1: రంతులె సేసిటు రావు -
యెంతైనాఁ జననీవు
చెంతలె కడుఁ దలఁచేవు -
ఇంతలోనె రవయ్యేవు

చ. 2: పొలయుచు నూరకె పోవు-
గిలిగింపుచుఁ దిరిగేవు
చెలఁగుచు వడి మురిసేవు-
నిలరా యించుక నీవు

చ. 3: బొంకుచు నూరకె పోవు-
తెంకికి నెవ్వతెఁ దేవు
వేంకటపతి నవ్వేవు-
పొంకమైతివికఁ బోవు

రేకు: 0083-5 పాడి సం: 05-311

పల్లవి: సత్యభామ సరసపు నగవు
నిత్యము హరిమదినే నెలవాయ

చ. 1: రుకుమిణిదేవికి రూపయవ్వనికి
సకల విభవముల సౌఖ్యతలు
చికురాంబరమునఁ జెదరిన యలకలు
వికచాబ్జముఖము వెయివేలాయ

చ. 2: తొడవుల శ్రీసతి తొలుమెఱుఁగులమై
నడపుల మురిపెపు నగుమోము
తడయక వారిధి దచ్చిన హరికిని
బడలిక వాపను పరమంబాయ

చ. 3: అనుదినమును నీ యలమేలుమంగ
కనుఁగవ జంకెన గర్వములు
దినదినంబులును తిరువేంకటపతి-
చనవుల సొబగుల సంపదలాయ

రేకు: 0083-6 శ్రీరాగం సం: 05-312

పల్లవి: ఎట్టు సైఁతువె వలపు యింతి పరులు
రట్టునేయఁగ మిగుల రాఁపవునె కొంత

చ. 1: రాక విభుఁడేపటి రాజసంబొకకొంత
చీకాకు పడఁజేయు చింత వొకకొంత
పైకొన్న చిత్తంబు పట్టరానిది గొంత
మేకులకుఁ జెలులాడు మేలమొకకొంత

చ. 2: పలుమారు వలయించు పరవశంబొకకొంత
పొలయలుకలను బొడము బూకలొకకొంత
కలికి కన్నులఁ బొలయు కాఁతాళమొకకొంత
కొలఁదిమీరిన మంచికోపమొకకొంత

చ. 3: గరగరిక వేడుకల కలపుకోలొకకొంత
వరుసఁ గోమలమైన వయసులొకకొంత
తిరువేంకటాద్రీశు దివ్యమహిమలు గొంత
సరిలేని పొందికల చనవులొకకొంత

రేకు: 0083-7 పాడి సం: 05-313

పల్లవి: రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా, పొందులునీతోఁజాలును

చ. 1: రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా

చ. 2: ఈడాడ నలుగురు నేగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకుఁ బదుగురి వలపించుకొని నీవు
ఆడాడఁ దిరిగేవు అత్తయ్యా

చ. 3: బొడ్డునఁ బుట్టిన పూఁపనికే నిన్ను
గొడ్డేరు తెస్తినే కోడల
గుడ్డముపయినున్న కోనేటిరాయని-
నడ్డగించుకొంటివత్తయ్యా

రేకు: 0084-1 సామంతం సం: 05-314

పల్లవి: ఎచ్చరించెదననిన యీజగంబనఁగాను
సచ్చరిత్రుఁడ నీకు సరకా వోరి

చ. 1: రుచుల నారాయణ పరో జ్యోతి యని
పచరించి నిను శ్రుతులు పలుకఁగాను
వచియింపరాని యిటువంటి నీ యెదుట నా-
కుచకుంభములకాంతి కొలుపునా వోరి

చ. 2: రమణ నారాయణ పరబహ్మమని
ప్రమదమున నిను శ్రుతులు పలుకఁగాను
తమకమున నను నీవు తగిలితివి యీసుఖము
నిమిషమాసుఖము గానేర్చువా వోరి

చ. 3: అరయ నారాయణ పరాత్పరంబని నిన్ను
సరసవిద్యలు శ్రుతులు చాటఁగాను
సిరుల ననుఁగూడితివి శ్రీ వేంకటేశ నీఁ
కరుణకిటు నేనోర్వఁగలనా వోరి

రేకు: 0084-2 భైరవి సం: 05-315

పల్లవి: వేంకటాద్రివిభునిఁబాసి విరహియైన రమణిఁ జూచి
రంకెలు వేయనేఁటికమ్మ రాజసమునను

చ. 1: విసప కోర సోఁకినపుడె వేఁడిలేని చందమామ
మిసిమిగలుగు వేఁడిచూపు మింట మలయునే
నొలికంటికాఁకనణఁగి నొగిలినపుడె తొడుగలేక
కుసుమశరము మదనుఁడతివకొరకు దాఁచెనే

చ. 2: చిగురుమేఁతకాండ్లెల్ల చెలఁగి మావికొమ్మలెక్కిఁ
మగువమీఁదఁగూఁతరేఁచి మరునిఁగూడిరే
తగవరైన దశరథేంద్రుతనయు శాపమొసఁగినపుడె
తెగువమీఁదఁగూఁతరేఁచ తెరఁగులెరఁగరా

చ. 3: నెయ్యమలర మంచివిరులశయ్య వేంకటాద్రివిభుఁడు
లియ్యమైనచెలికిఁ జనవులియ్యఁదొణఁ గెనే
కుయ్యవెరచెఁ గోవిలలును కుంకెఁ జందమామకళలు
తియ్యవింటివాఁడు వెనకతియ్యఁదొడఁగెనే

రేకు: 0084-3 శంకరాభరణం సం: 05-316

పల్లవి: జవ్వాది మెత్తినది తన-
జవ్వనమే జన్నెవట్టినది

చ. 1: ముద్దుల మాఁటలది చెక్కు-
టద్దముల కాంతినలరినది
గద్దరిచూపులది తన-
వొద్ది చెలియమీఁద నొరగున్నది

చ. 2: పుత్తడిఁ బోలినది తన-
చిత్తము నీసొమ్ముచేసినది
గుత్తపు గుబ్బలది అల-
చిత్తజుని లెక్కసేయనిది

చ. 3: ఎమ్మెలు యెఱఁగనిది తన-
కెమ్మోవిఁ జిరునవ్వు గెరలున్నది
కమ్ముకొనఁగ వెంకటారాయా నీ-
కమ్మనికౌఁగిటఁ గలశున్నది

రేకు: 0084-4 ఆహిరి సం: 05-317

పల్లవి: తిట్టినఁ దిట్టినదే తప్పా
బెట్టమ్మా గుంపెన నీచేత

చ. 1: వెనక మరలి నవ్వినదే తప్పా
వినమమ్మా నీ విభుఁడౌట
చెనకఁగ జంకించినదే తప్పా
అనవమ్మా నీ వాతనిఁ గినిసి

చ. 2: ఎదుట నిలిచి తురుమిడుటే తప్పా
వదలిన పయ్యెద వాలఁగను
అదన నలసి వుసురనుటే తప్పా
వుదుటుఁదమకముననుండఁ గలేక

చ. 3: కేలనె యిటు మొక్కినదే తప్పా
కాలు దాఁకి వేంకటపతికి
వోలి నే నతనిపై నొరగుటె తప్పా
మేలములాడుచు మెరయఁగనతఁడు

రేకు: 0084-5 రామక్రియ సం: 05-318

పల్లవి: దంతచ్ఛదముద్రా మదనాస్త్రల-
తాంతశాంతికృతిరహో భవతి

చ. 1: వనితాకుచయోర్వరనఖ రేఖా-
ర్జన శశిచిహ్నం సఫలమిదం
ఘనకరుణాం మయి ఘటయ చంద్ర ఇ-
త్యనునయకారణమహో భవతి

చ. 2: సతీమణీ విలసత్కరమూలే
చతురలాంఛనం సఫలమిదం
వ్రతతిభయహృతే వరదాస్య కలన-
మతిఘతాకృతిరహో భవతి

చ. 3: తరుణీ తనుగంధ విలేపన వి-
స్తరసౌభాగ్యం సఫలమిదం
పరిరంభసుఖే తిరువేంకటగిరి-
హరే: పూజనమహో భవతి

రేకు: 0084-6 శ్రీరాగం సం: 05-319

పల్లవి: ఇంతి కన్నీరొలుకనిట్లఁ జదివె
కొంతంపు కనుఁగొనల కోపమును జదివె

చ. 1: వెలఁది వినుకలినే వినికి విని తోడనే
తలపోఁతనదివో చింతనసేసెను
తలకొన్న నేలవ్రాఁతలనె పొలుపుగ వ్రాసె
తొలుతఁ బాదపువేలి ధూళక్షరములు

చ. 2: పడఁతి కనుకలినే పులకవ్రాలును వ్రాసె
తడవి నీ చెలువ చిత్తపుఁ బలకనే
కడుఁదెలివికిని బాసి కలవెల్ల మఱచి తన-
పెడఁగు జెక్కు చేతితో వెదకినిదివో

చ. 3: వరుస గంటపువ్రాలు వ్రాసెఁ గొనగోరనే
కురుఁ బసల నీవు చెక్కులు గిల్లఁగా
తిరువేంకటాచలాధిపుఁడ నీతోఁగూడి
సరిలేని శబ్దశాస్త్రములెల్లఁ జదివె

రేకు: 0085-1 సామంతం సం: 05-320

పల్లవి: పడఁతి నినుఁదలచి పో పలుకఁడతఁడు, నీ-
వెడసినను బ్రాణంబులెరవులాతనికి

చ. 1: వెదచల్లు నీ మోమువెన్నెలలఁ దలఁచిపో
పొదలు వెన్నెలబయటఁ బొలయఁడతఁడు
ముదిత నీ నెరులు దురుమును దలఁచిపో యతఁడు
కొదమతేంట్ల గనిన గుండె జల్లనును

చ. 2: లలితాంగి నీ దేహలత దలఁచి పో యిపుడు
చెలఁగి వనమునకు విచ్చేయఁడతఁడు
వెలఁది నీమోవికావిరి దలఁచి పో యతఁడు
తలిరాకు గని గుండె తల్లడంబౌను

చ. 3: కోమలిరో నీ యిట్ల కూటములు దలఁచిపో
ప్రేమమితరములపైఁ బెట్టఁడతఁడు
దీమసపు వేంకటాధిపుఁడుగన యాతనికి
సామాన్యసరసతలు సరుకుగావరయ

రేకు: 0085-2 ముఖారి సం: 05-321

పల్లవి: ఏలే పడుసా యేదేని గుడుసా
చాలునేఁపకువే జవ్వనంపు గడుసా

చ. 1: వద్దేలే కసరు వలనని కిసరు
పొద్దువొద్దులకుఁ జూపుల యసరు
పెద్దైన వలపుల పిసరు లోన-
న్నద్దేవు నేనైతినసురుసురు

చ. 2: వచ్చేనేననవే నా వలపు చేకొనవే
మచ్చుచల్లక నామాట వినవే
ఇచ్చేననవే నీహృదయమింతటనైన
రిచ్చపడిన నాకూరిమి గనుఁగొనవే

చ. 3: రావే సంగడికి రతుల యంగడికి
శ్రీ వేంకటేశుఁడ నా చెంగటికిని
నీవే కౌఁగిటికి నిధులలోఁగిటికి
మోవీవే వెరవక మోహపుటాఁకటికి

రేకు: 0085-3 తెలుఁగుఁగాంబోది సం: 05-322

పల్లవి: చక్కఁదనములనే వేసాలఁబొయ్యేవు నీ-
యెక్కువలె యింతసేసె నెక్కడ చొచ్చేవే

చ. 1: వెన్నెలలకునె యింత వెరచేవు నీమోము
వెన్నెలలచే నెట్టు వేఁగించేవే
సన్నపుఁ దేంట్లకెట్టె జడిసేవు నెలఁత నీ-
యిన్ని నెరిఁదుమ్మెదలకెట్ల లోఁగేవే

చ. 2: చిలుకలకునే యింత చిమిడేవు నీ చిలుక-
పలుకుల నెక్కడికిఁ బారఁదోలేవే
చలిగాలికినె యింత జడిసేవు నెలఁత య-
గ్గలపుటూర్పుగాలికెక్కడ నొదిగేవే

చ. 3: మదనుఁడనినను వేమారు గలఁగేవు నీ-
మదనగురునికెట్టు మనసిచ్చేవే
ఇదె వేంకటేశుఁడు నిన్నెనసి కౌఁగిటఁగూడె
పొదలుఁదావులకెట్టు పొంగుచుఁ జొక్కేవె

రేకు: 0085-4 వరాళి సం: 05-323

పల్లవి: చూపులనే సొలసేవు చూడరాదా మమ్ముఁ
గాపురము సేయనీక కారించేవా

చ. 1: వదినెంటాఁ బిలిచేవు వద్దు సుమ్మీ యెవ్వరోయి
వదినెలు నీకు వాడవారి మరఁది
యెదురైతే మొక్కేవు యేఁటికోయి యింతేసి
వుదుటులు మాని చక్కనుండనేరవా

చ. 2: అత్తనంటాఁ బిలిచేవు అక్కడ నిక్కడ నీకు
అత్తలెవ్వరోయి వూరఁ బొత్తులల్లుఁడా
వత్తునంటాఁ జెప్పంపేవు వడదాఁకి కూకులును
వత్తులునై పొదుఁగాని వచ్చి చూడరాదా

చ. 3: చీర వెలిగా నవ్వేవు చెల్లఁబో యెక్కడనైన
మారుజాతి వారికైన మానములేదా
తీరు నీకు నింతేసి తిరువేంకటేశుఁడ
కూరిమి యెరిఁగి నన్నుఁ గూడితివౌరా

రేకు: 0085-5 కొండమలహరి సం: 05-324

పల్లవి: కొండలోఁ గోవిల గుయ్యి గుండె వగిలె నీ-
యండకు రాఁగాఁ బ్రాణమంతలో బ్రదికెరా

చ. 1: వలచి నిన్ను వెదకి వడి నే రాఁగాను
పులివలె మగఁడుండెఁ బోనియ్యక
తలఁచి నాకంతలోనే తల నొవ్వఁగాను
చిలుకుఁ బులకలెత్తి సిగ్గువలె వలపు

చ. 2: ఏమరించి యింటివారినెడసి నే రాఁగాను
గామైన బిడ్డయేడ్చెఁ గదలనీక
తామసించి యుండలేక తల్లడించఁగాను
చీమలు మైవాఁకినట్టు చిమ్మిరేఁగె వలపు

చ. 3: వుండలేక యిప్పుడు నీ వొద్దికి నే రాఁగాను
కొండవలె మరఁదుండెఁ గోపగించుక
బొండుమల్లెపరపుపైఁ బొరలేటి యిట్టి నన్ను
కొండలరాయఁడ నిన్నుఁ గూడించె నావలపు

రేకు: 0085-6 భూపాళం సం: 05-325

పల్లవి: రాయడికాఁడు గదమ్మ రంతు నేసీని
పాయపుసతులనే గోపాల గోవిందుఁడు

చ. 1: వట్టిమాయలఁ బెట్టవలదన్న మానఁడు
బెట్టుగ రేపల్లె గోపికలనెల్ల
యెట్టు వేగింతురమ్మ యెల్లవారలును
రట్టడియైనట్టి రాచగోవిందుఁడు

చ. 2: లేని పగలు చాటి లేమలనిందరిని
కాని కానిమ్మనుచుఁ గరఁగించీని
మాని మాని కమ్మర మగుడ మమ్మేఁచీని
రానిలే చూచుఁగాని రాచగోవిందుఁడు

చ. 3: పొద్దు వొద్దునకెంతే బూమెలు సేయుచును
వొద్దికై నాతోడ నొనగూడీని
అద్దో యింకా మానఁడాసలఁ బెట్టెడిని
గద్దరి శ్రీ తిరువేంకటపు గోవిందుఁడు

రేకు: 0086-1 ఆహిరి సం: 05-326

పల్లవి: జట్టిగొనెర నిన్ను జవరాలు
చిట్టంటు చేతల జెలఁగితివపుడు

చ. 1: వాలుకచూపులు వాడఁగ నాటక-
సాలలోన నిను జవరాలు
చాలుగ మురియుచు సరుగనఁ జివుకన
కాలఁ జిమ్మినను కలఁగితివపుడు

చ. 2: సొలపుగొనుచు మించుల మొలనూళ్ళ
సళుపుల మురిపెపు జవరాలు
గలగల గజ్జెలు గదలఁగ నునుఁదొడ
బలిమిఁ గదలిచిన బ్రమసితివపుడు

చ. 3: సొంపగు తల చంచుల మునివేళ్ళ-
సంపద నడపుల జవరాలు
యింపులు నెరవుచు నిటె నినుఁ గదిసిన
కంపించితి వేంకటగిరిరమణ

రేకు: 0086-2 సామంతం సం: 05-327

పల్లవి: అద్దిరా చిమ్ముల మాటలప్పటి నీకు
పెద్దరికాలనె మురిపెములే చిమ్మేవు

చ. 1: వద్దన్న మానవు నేనెవ్వతెరా నీకు నీ-
నిద్దురచూపులు నాపై నివాళించేవు
బద్దులెల్లనేడ నగపడెరా నీకు యీ-
ముద్దులమాటలాడుచు మోమే వంచేవు

చ. 2: డెందములో నేనిఁకనేఁటికిరా నీకు నీ-
యందిపాటుచేఁతల నన్నలయించేవు
కిందిచూపులేడ దొరకెరా నీకు నీ-
చెందమ్మిచేతుల నాచెఱఁగువట్టేవు

చ. 3: బింకములెవ్వతె నేరిపెరా నీకు నీ-
కుంకుమపూఁతలే చెరఁగునఁ గుప్పేవు
యింక నిన్నియునేల యిదె నీకు తిరు-
వేంకటేశ నాకౌఁగిట వేడుకఁ గూడితివి

రేకు: 0086-3 రామక్రియ సం: 05-328

పల్లవి: పంతమాడి పిలిచినఁ బలుకదెవ్వరితోడ
యింతవలచిన వలపెంచునైనఁ గలదా

చ. 1: వెక్కనపు గుబ్బలపైవేసిన కప్పురమెల్ల
నొక్కమాటే నీరాయనోయమ్మా
మిక్కుటమైన దీని మేనిమీఁది వెక్కచూచి
వక్కలాయ గుండె యిట్టి వలపెందుఁ గలదా

చ. 2: గుప్పెడి నిట్టూరుపుల కోమలిహారములెల్ల
వుప్పరాలెగయఁ జొచ్చెనోయమ్మా
వుప్పతిల్లుఁ జెమటల నోలలాడఁగానె మేను
నిప్పువలెనున్నదిట్టి నెయ్యమెందుఁ గలదా

చ. 3: కొయ్యతనమునిట్టె కోనెటిరాయనిఁ గూడి
వుయ్యాలమంచముమీఁదనోయమ్మా
పయ్యెదచెరఁగు జారఁ బచ్చిసేఁతలిన్నియును
ముయ్యఁజూచీ నిటువంటిమోహమెందుఁ గలదా

రేకు: 0086-4 బౌళి సం: 05-329

పల్లవి: ఎపుడు నాయెడ నికు నిదివలెనా
కపటాలు నిజములు కలిగినాతఁడవు

చ. 1: వెల్లిగా నీవూర్పు వేదమట వేఁడి
చల్లిని శ్రుతికి నుష్ణము గలదా
పెల్లుగ నిరువంకఁ బిరువీకులై వేఁడి
చల్ల నీదైనా వెచ్చనిది గావలదా

చ. 2: నగు నీమాటలే పురాణంబులట బొంకు
దగిలీని చదువులింతయు బొంకులా
తెగి యిరువంకలఁ దీదీపులై నీ
పొగరుల మాటలెప్పుడును నిక్కము లా

చ. 3: చలివేఁడిచూపుల జాణవట యిట్టె
బలసి నాపైఁ బరపఁగవలెనా
కలికివై తిరువేంకటవిభుఁడ నన్నుఁ
గలయక యలయించి కలిసితివిపుడు

రేకు: 0086-5 శ్రీరాగం-రచ్చెతాళం సం: 05-330

పల్లవి: కనలకువే మతి కలఁగిని యీ-
వనజోదరుఁడిదె వచ్చీనిపుడు

చ. 1: వడిఁ గుచభరమున వ్రాలెడి వేగము
నడవకువే సన్నపు నడుము
చిడుముడి నన్నుఁ జేసిన గోవిందుఁడు
తడయఁడు నిన్నుఁ దగిలీనిపుడు

చ. 2: కొప్పువేఁగుననె కుదిసిన మెడ గడు-
తిప్పకువే కందెడి సరులు
దప్పివొదలఁ బరితాపము నీమై
కప్పిన శ్రీహరి గదిసీఁ గాని

చ. 3: పొరలుచు నిట్టూర్పులను సురనియెదు
వెరవకుమెన్నఁడు వేదనల
కరఁగి నీవు వేంకటపతికౌఁగిట
మెరసితివిటు కడు మించిన రతుల

రేకు: 0086-6 ఆహిరి సం: 05-331

పల్లవి: అలికి సంపెంగ తావికణఁగి నట్టు
తొలఁగీ నుదుట జారి తుమ్మిదల పిల్లలు

చ. 1: వెలఁదియారను పాము వెంటఁబెట్టుకొని రాఁగా
తలఁకి చంద్రుఁడు వోయి దాఁగినట్టు
పలువెన్నె మెఱుఁగుల పయ్యదలోనె దాఁగె
చలివేఁడి మెఱుఁగుల చందమామపిల్లలు

చ. 2: కోవిలపలుకుదాడి కోపగించి వెంటరాఁగా
తావుల చిగురువోయి దాఁగినట్టు
మోవి సూదివాటులై మొనసి కానవచ్చీని
మావుల చిగురులోని మాణికాలపిల్లలు

చ. 3: భారమైన విరహతాపపు సూరియుండు రాఁగా
తారితారి చకోరాలు దాఁగినట్టు
కూరిమి వేంకటపతిఁ గూడిన తమకమున
గోరగించీనిదివో చకోరములు పిల్లలు

రేకు: 0087-1 ముఖారి సం: 05-332

పల్లవి: చాలుఁ జాలు నీ జాజర నన్ను
జాలిఁ బరచె నీ జాజర

చ. 1: వలపు వేదనల వాడేను యీ-
తలనొప్పులచేఁ దలఁకేను
పులకలమేనితోఁ బొరలేను కడుఁ-
జలిగొని చల్లకు జాజర

చ. 2: ఒల్లని నినుఁగని వుడికేను నీ-
చిల్లరచేఁతలఁ జిమిడేను
కల్లగందవొడిఁ గాఁగేను పైఁ
జల్లకు చల్లకు జాజర

చ. 3: తివిరి వేంకటాదిప నేను నీ-
కవుఁగిటికబ్బితిఁ గడు నేను
రవరవ చెమటఁ గరఁగి నేఁడు యిదె
చవులాయను నీ జాజర

రేకు: 0087-2 శ్రీరాగం సం: 05-333

పల్లవి: విరహంపుఁ గోమలికి వెలయంగఁ గలవెల్ల
అరుదుగాఁ బండి పొల్లయిన ఫలమాయె

చ. 1: వేమారుఁ జెలికి నరవిందశయ్యలె పరవ
బాముచెడి యిందునే బడలెఁ గాని
తామెరై డెందమీ తలిరుదేహములోన
లేమకిది గలిగియును లేని ఫలమాయె

చ. 2: వెలఁదిమై సురటులనె విసరఁగా లలితాంగి-
నలమి అదియే తాపమయ్యెఁగాని
పెలుచైన నిట్టూర్పు పెనుగాలి లోలోనె
కలిగియును తమవారుగాని ఫలమాయె

చ. 3: కాంత కనుదోయి నునుఁగలువలై కలువలనె
అంతకంతకు వగల నలపెఁ గాని
యింతలోఁ దిరువేంకటేశుఁ గూడియుఁ జెలికి
చెంతనే కనుదోయి చెంగలువలాయె

రేకు:	0087-3 ఆహిరి	సం:	05-334

పల్లవి:	మోవిపై వీడెపు కెంపు ముచ్చటాడఁగ
చేవవచ్చి చిగురుపైఁ జిమ్మిరేఁగీనే

చ. 1:	వానగుబ్బలమీఁద వల్లెవాటుగా జార-
వేసిన వయ్యెదకొంగు వెంటఁ దూలఁగ
తీసిన ఘాతల ముద్దుఁదీగె చందురులమీఁదఁ
గానేటి వెన్నెలవలెఁ గానవచ్చీనే

చ. 2:	వేఁకపు నెరులకొప్పు వెక్కసపు విరులతో
తేఁకువమీరఁగఁ గడు దీపించఁగా
చీఁకటిలోపల మించు చిన్నిచిన్ని వెన్నెలలు
తోఁకచుక్కలై చూడఁ దొంగలించీనే

చ. 3:	పాదముల దాటించు పసిఁడి మట్టెల మోఁత
మోదపు కంకణరవముల మీరఁగా
గాదిలి నీ కౌఁగిటి వేంకటపతిమీఁదిపాట
వేదముల మీరినట్లు వెదచల్లీనే

రేకు: 0087-4 మాళవిఁగౌళ సం: 05-335

పల్లవి: చాఁచిన చలముల సటకాఁడ యిట్టె
వేఁచితివిపుడు నీవే కావోరి

చ. 1: విరులు గోయఁగ నన్ను వేడుకతోఁ జూచి
విరులెంత ప్రియమొ యీ వెలఁదికని
మరుని తియ్యని వింటి మాయపుఁ గ్రొవ్వాఁడి
విరులేయించితివి నీవేకావోరి

చ. 2: జలము గేళాకూళిఁ జల్లులాడఁగఁ జూచి
జలమెంత ప్రియమొ యీ సతికినని
చెలఁగి కాఁక చెమట చెలమ నాపై సేఁదు
వెలయఁ జేసితివి నీవే కావోరి

చ. 3: తొడవులిడుచు నేను తొంగలించఁగఁ జూచి
తొడవులే ప్రియము యీ తొయ్యలికని
కడుఁదొడవులే వేంకటరాయ కొనగోర
విడువకిచ్చితివి నీవే కావోరి

రేకు: 0087-5 దేశాక్షి సం: 05-336

పల్లవి: ఎప్పుడు వచ్చునో యంటా నెదురు చూచీఁ బతికి
దప్పిదేరు మోముతోడ దాఁచలేదు ప్రియము

చ. 1: వేఁటవోయిన మగఁడు వీధి రాఁగాఁ గిన్నెర
మీఁటుచుఁదా నిక్కిచూచి మేడపైనుండి
గాఁటపు గుబ్బలకొంగు గప్పదు జారిన నింత-
అఁటది వలచెనేని ఆఁపరాదు ప్రియము

చ. 2: ఇంతి చూడఁగానె విభుఁడేతుల గుబ్బము దోలి
చెంతనున్న సతులెల్ల చేతఁజూపఁగా
అంతలోనె యాకె తనువంతయుఁ బులకించె
పంతపుసతులకైనఁ బట్టరాదు ప్రియము

చ. 3: తేఁకువ మెరసి రాఁగా తిరువేంకటేశుఁ జూచి
వేఁకపుఁదురుముతోడ విఱ్ఱవీఁగీని
కాఁకతోడఁ జిత్తమెల్లఁ గరఁగి నీరై మించె
యేఁకట నెవ్వరికైన నెంతగాదు ప్రియము

రేకు: 0087-6 సామంతం సం: 05-337

పల్లవి: ఎవ్వరికిఁ జెల్లునమ్మ యింతేసి పనులు
నొవ్వని నొప్పులతోడ నొగిలీఁ జెలియ

చ. 1: వీఁగెడి తురుముతోడ వేఁకపు సొమ్ములతోడ
కాఁగిన దేహముమీఁది కస్తూరితోడ
ఆఁగిన యాసలతోడ నతిరాజసముతోడ
వేఁగెడిఁ బ్రాణేశుఁబాసి విరహనఁ జెలియ

చ. 2: విప్పని రెప్పలతోడ వేఁడిచెమటల తోడ
పుప్పొడి దాఁకినమేని పొక్కులతోడ
కప్పక కప్పిన మంచి కలికిపయ్యెదతోడ
కప్పురపుటూర్పులఁ గరఁగీఁ జెలియ

చ. 3: భావపువింతలతోడ పచ్చిసింగారముతోడ
ఆవులు వారెడిమేని అలపులతోడ
శ్రీ వేంకటేశ్వరుఁగూడి సిగ్గులగర్వముతోడ
ఆవలిమోమై మాఁటలాడీఁ జెలియ

రేకు: 0088-1 కాంబోది సం: 05-338

పల్లవి: భారపుటూర్పులతోఁ బవళించీవి వీఁడె
కూరిమిసతులు మేలుకొలుపరమ్మా

చ. 1: వేగినంతకునితఁడు వెలఁదులతోడి రతి
భోగించి వచ్చి నిద్రవోయీని
సోగకనురెప్పలు మూసుక యిప్పుడెంతేసిఁ
జాగరపుఁ బతితోడ చరచరమ్మా

చ. 2: వొప్పైన సతులతో వుదరములోపల
యిప్పుడు నితఁడు సుఖియించీని
దప్పిదేరు తనమోముఁదమ్మితోడనిదె వీఁడె
వుప్పవడముగఁ బాదాలొత్తరమ్మా

చ. 3: సరుగున మేలుకొని సరసపుఁ గౌఁగిట
గరగరికెల నన్నుఁ గలసీని
అరవిరి సురమున అలయుచును వీఁడె
తిరువేంకటపతిఁ దెలుపరమ్మా

రేకు: 0088-2 కన్నడగౌళ సం: 05-339

పల్లవి: తరుణికనుఁగవ మోడ్పు తగఁ జూడరే
వరునిఁ దనమతి సొలసి వడిఁ జూచినట్లు

చ. 1: వెలఁది ముక్కున వెడలు వేఁడి నిట్టూరుపుల -
చెలువమెటువలెనుండెఁ జెప్ప-గదరే
చలముకొను నలులకును సంపంగి పెనుగాలి
కలకంటిమేనికిని కాపిడినయట్లు

చ. 2: పడతిపైనునుఁ జెమట పన్నీటితావితో
బడిబడినె యెట్లుండె భావింపరే
అడరు విరహానలంబప్పటప్పటికార్చ
కడువేగముదకముడుగక చల్లి నట్లు

చ. 3: ఇంతినెన్నుదుటిపై నిపుడు చెదరిన కురులు
వింతలై యెట్లుండె వివరించరే
సంతమై వేంకటేశ్వరుఁడు చెలినేఁపు శశి-
సంతముడుపఁగఁ దమము పరె విడిచినట్లు

రేకు: 0088-3 రామక్రియ సం: 05-340

పల్లవి: తమకమును దలపోఁతయును గలదెందాఁక
అమరుఁ జెలువము దనకు నందాకఁ దరుణి

చ. 1: విరసంపు మరునిపై వెరపు మతికెందాఁక
ఆరయఁ దనయాపదయు నందాఁక
సిరిదొలఁకు జవ్వనపు సిగ్గు నీకెందాఁక
అరవిరి విలాసంబునందాఁకఁ దరుణి

చ. 2: ఎనయు ముదములును దనయేతులును నెందాఁక
అనుఁగుఁ గోరికలు దనకందాఁక
కనుఁగొనల నవ్వులును కాఁకలును నెందాఁక
అనవరతసుఖము దనకందాఁకఁ దరుణి

చ. 3: తలఁపు వేంకటవిభుని తగులు గలదెందాఁక
అలరుఁదెలుపులు మతులునందాఁక
కలయునాతని చనవు కరుణగలదెందాఁక
అలవోక పరిణతలునందాఁకఁ దరుణి

రేకు: 0088-4 సామంతం సం: 05-341

పల్లవి: బొంకకురే చతురుఁడప్పుడె వచ్చీనా
సంకు దేరీఁ జూపు మంచి సుద్దో మద్దో

చ. 1: వన్నెలాఁడి చెలి నీవు వచ్చుదాఁకా యిటె
వున్నదానఁ బ్రాణములునుచుకొని
వున్నతుఁడా తఁడు మమ్మునొలిసీనా యేలె
కన్నుల నవ్వేవు చెలి కాయో పండో

చ. 2: చక్కనమ్మ నీమాఁట చల్లుదాఁకా యీ-
చెక్కుమీఁది చేతితోను చింతించేను
నిక్కమునాతనికింక నేనేలే నీవు
నొక్కకువే నాచెక్కు నుయ్యో కొండో

చ. 3: కప్పురగంది యింత దగ్గరకువే నీ-
వప్పుడే కౌఁగిట నన్ను నలమేవు
అప్పఁడు వేంకటవిభుఁడలరించె నిదె
యిప్పుడె యీతనికృప యీఁతో మోఁతో

రేకు: 0088-5 వరాళి సం: 05-342

పల్లవి: నిలు నిలు దగ్గరకు నీ యాన నీకు
వలచితినని మావారెల్ల నగరా

చ. 1: వద్దు వద్దు కొండలలోవారికి మాకింతేసి
పెద్దపెద్ద ముత్యాలుపేరులిన్నేసి
అద్దము చూచిదె నాకు నంతకంటె సిగ్గయ్యీని
గద్దరి మాచెంచువారు గని నిన్ను నగరా

చ. 2: చాలుఁజాలు బంగారు సరుపణు లుంగరాలు
నీలపుఁగంట సరులు నీకే వుండనీ
మూలనుండేవారు గాక ముత్యాలచెరఁగుల-
చేలగట్టుకొన్న నన్ను చెంచెతలు నగరా

చ. 3: రాకురాకు యీడకు నీ రమణుల పాదమాన
నాకు నీకు నింతేసి ననుపేఁటికి
దీకొని కూడితి నన్ను తిరువేంకటేశ యీ-
కాకరిచేఁతలకు లోకమువారు నగరా

రేకు: 0088-6 మలహరి సం: 05-343

పల్లవి: నిద్దిరించి పాల జలనిధివలెనే
వొద్దిక శ్రీరమణునికి వొత్తరే పాదములు

చ. 1: వేగుదాఁకాఁ జిత్తగించి విద్యలెల్ల నాదరించి
బాగుగాఁ గృపారసము పంచి పంచి
యేగతిఁ బవ్వళించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని వూఁచరే వుయ్యాలను

చ. 2: వాలుఁగన్నుల రెప్పల వడదాఁకి తనుతావి
చాలుకొన్న వూర్పులు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరవుచు నొకయింత-
కాలము గన్నులఁ దిప్పికప్పరే దోమతెర

చ. 3: సరుగన యోగనిద్ర చాలించి లోకమెల్లఁ
గరుణించఁ దలఁచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుఁడయి మించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు

రేకు: 0089-1 శ్రీరాగం సం: 05-344

పల్లవి: అటు గొంతకాలంబులనుభవించఁగఁ గలిగె
యిటు గొంతకాలంబు యివి చూడవలనె

చ. 1: వెన్నెలలుఁ జీఁకట్లు వెలఁది సుఖదుఃఖములు
కన్నుదెరచి మూయుటలు గతులు నవగతులు
మన్ననలు వొల్లములు మగువ పగలును రేయి
తన్నుఁదానె సమకూడుఁ దనుఁదానె తొలఁగు

చ. 2: కిందు మీఁదైవచ్చుఁ గినుకలును దాలిములు
ముందు వెనకగుఁ జెలియ మోదఖేదములు
పొందికలు పాయుటలు పొలఁతి సౌభాగ్యములు
ఇందరికి సరిగాఁగ నెదురెదురనుండు

చ. 3: మరచినను తలఁచినను మనసు తనపైనుండు-
టెరుఁగునది తిరువేంకటేశ్వరుండు
తెరవనిదె కరుణించె దేవుఁడే నాయకుఁడు
తరితీపుసేయుఁ గాని తలఁపులోనుండు

రేకు: 0089-2 ఆహిరి సం: 05-345

పల్లవి: అప్పమైన నీయరే యమ్మలాలా నేఁ-
డప్పడా రగించీనదె యమ్మలాలా

చ. 1: వాడుదేరి వదనము వడదాఁక నిందాఁక-
నాడివచ్చెఁ జూడరే యమ్మలాల
నీడకేఁగనెరఁగఁడు నిక్కపు బాలునివలె
ఆడనీడ దిరిగాడీనమ్మలాల

చ. 2: వెడ్డు వెట్టీనాటలకు విచ్చేసేనని నన్ను-
నడ్డములాడకురే యమ్మలాల
దొడ్డివారియిండ్లెల్లాఁ దూరి తూరి పారాడీ-
నడ్డములు నిడుపులు నమ్మలాల

చ. 3: వేఁకువజాముననుండి వెయిమారులారగించు
నాఁకటికోరువలేఁడమ్మలాల
తేఁకువ వేంకటగిరిదేవుఁడైన బాలుఁడిదె
ఆఁకతాడువట్టి తీసీనమ్మలాలా

రేకు: 0089-3 నారణి సం: 05-346

పల్లవి: పంతపు బిగువులఁ బదరేవు నీ-
వంతలు మానుప వసమా వోరి

చ. 1: వేఁకపుఁ దురుముల వెలఁదుల యలకల-
చీఁకటి దవ్వుచుఁ జెలఁగేవు
ఆఁకటి చూపులనలసి మలయు నీ-
కాఁకలు మానుపఁగలనా వోరి

చ. 2: సన్నపు నగవుల సతుల కపోలపు-
వెన్నెలలే యిటు వెదకేవు
వన్నెలతనువున వాడుచు నొయ్యన
తన్నేవు నేనితరమా వోరి

చ. 3: పడఁతుల కుచముల పరిమళపుఁ జెమట-
తడిపయ్యెదలను దాఁగేవు
కడుఁ గౌఁగిట వేంకటగిరివర నను
పుడికెదవంతకోపుదునా వోరి

రేకు: 0089-4 ఆహిరి సం: 05-347

పల్లవి: పచ్చిదేరే వలపు బయలువెరపు
నచ్చుగోరి నాటు కిన్నరి తంత్రి మీటు

చ. 1: వెలయఁ జల్లనిగాలి విరులెదిర్చిన జాలి
తలఁప పూధూళి చిత్తజు వయ్యాళి
కలయ వెన్నెల వెలుఁగు కాలకూటపు నలుఁగు
పలుకుఁ దేనెలచిందు బడబాగ్నివిందు

చ. 2: అగడు గోవిలకూఁత అంగన నొసలివ్రాఁత
నిగనిగని పన్నీరు నిప్పులయేరు
సొగసుచాలనిచోటు చురుకుటలుగుల పోటు
నగవుఁ జిలుకల నుడుగు నమ్మించు పిడుగు

చ. 3: తనివోని రతికాఁక తప్పుసేయని యాఁక
వనితకీపతిమాట వలపుమూట
వినయంపు రతికింపు వేంకటేశ్వరు సొంపు
తనువుమెత్తనిపరపు తనువెల్లమరపు

రేకు: 0089-5 ఆహిరి సం: 05-348

పల్లవి: ఉవిదతనులత యేఁటికులికి పడెనే
కవ మదనబాణాగ్నిఁ గాఁగదుగదా

చ. 1: వనితలావణ్యంపు వదనశశికలములు
చనుగిరులపై నేల జారివడెనే
వెనకఁ దురమను రాహు వేవేలు రూపులై
తనర ముఖచందురుఁడు తలకఁడుగదా

చ. 2: మొలకలై గుమురులై ముదితమై మరునంప-
ములుకులంతటనేల ముణుఁగఁబడెనే
పొలయు మరునస్త్రమటు పుంఖానుపుంఖములు
పొలఁతిమీఁదనె రాశివోయఁడు గదా

చ. 3: కొమరైన పెనుదండు కుసుమాయుధుఁడు గదలి
తెమలి రాకిపుడెట్లఁ దిరుగఁబడెనే
విమలాంగికౌఁగిటను వేంకటేశ్వరునిఁ గని
భ్రమసి ప్రతిదండనుచు పదరఁడుగదా

రేకు: 0089-6 ముఖారి సం: 05-349

పల్లవి: చెప్పిన హృదయము దలఁకెడు చెలి దానిపుడెట్లున్నదొ
అప్పుడు పరితాపంబున నలసిన చందములు

చ. 1: వేడుకతో సంగీతము విని కన్నుల మెచ్చుచు-
నాడుచుఁ బ్రాణేశ్వరుఁగొనియాడెడి చందములు
కాడిన మర్మపుమాటల కంపంబునఁ దలయూఁపుచు
చూడక చూచిన చూపుల చొక్కెడిచందములు

చ. 2: చనుఁగవ సన్నపు చెమటలు జారెడి పయ్యెదనార్చుచు-
నొసరిన నిట్టూర్పులచే నూటాడెడి చందములు
తనువునఁ బలుమరుఁ బొడమెడి దట్టపు పులకాంకురములు
అనువున మెత్తక కరమున నంటిన చందములు

చ. 3: తిరువేంకటగిరివల్లభు దేవశిఖామణికౌఁగిట
తరుణి మనోభవుబారినిఁ దప్పిన చందములు
యిరవుగ నాతని చేఁతలు నింపగుఁ బరవశములచే
దొరలిన మరపుల నెరుకలఁ దూలెడి చందములు

రేకు: 0090-1 ముఖారి సం: 05-350

పల్లవి: కొండల గుబ్బల నాతో గోరాదిగొనేవు
కొండల నావులఁగాచిన కోడెకాఁడఁ గాన

చ. 1: వంకలకురులదాన వద్దు నే నీకు మూఁడు-
వంకలవెంటఁ దిరిగేవాఁడఁ గాన
సంకుమెడదాన నీతో సరివచ్చేనా
సంకుచేతి నన్ను నీవు జట్టిగొంటి చాలదా

చ. 2: యేనుఁగు నడుపుదాన నేల నే నీకు తొల్లి
యేనుఁగుఁ గాచినవాఁడ యేనుఁగాన
మీనుకవగంటిదాన మెచ్చేవా నన్ను మేటిఁ
మీననై జలదిలో మెరసినవాఁడను

చ. 3: చీఁకటితురుముదాన చేరకు నన్ను
చీఁకటి నల్లనిమేని చెలువుఁడను
వేఁకపుఁ బిరుఁదుమీఁద వేయకు చెయి
వేఁకమైన భూమిమోఁచే వేంకటవిభుఁడను

రేకు: 0090-2 ఆహిరి సం: 05-351

పల్లవి: ఎడయాట మాటల నేచినవలపు
పొడమిన యాసల పొద్దొకవలపు

చ. 1: వేఁకమైన కోరికె వినుకలి వలపు
కాఁకలఁ బొరలుటెల్లఁ గనుచూపువలపు
మూఁకలైన తలఁపులు ముదినవలపు
ఆఁకలిదీరని పొందులడియాసవలపు

చ. 2: నడురేయి గమనము నాఁటినవలపు
విడువనితాపము వేఁడివేఁడివలపు
తడఁబాటు తానౌట తలఁపనివలపు
నిడివేఁడి యూర్పులు నెట్టుకొన్నవలపు

చ. 3: తిరువేంకటేశుపై తిరమైనవలపు
సరసరీతులచేత సరిలేనివలపు
గురుతైన రచనలు కూడినవలపస
తరుణికి నతనికిఁ దగులైన వలపు

రేకు: 0090-3 నాదరామక్రియ సం: 05-352

పల్లవి: నెలఁతకుఁ గొండలతిమ్మని నేనిదె తోడ్కొనివచ్చెద
ఎలనాగలు మీరిందరు నేమరకుఁడి చెలిని

చ. 1: వలపుల రెనికి చెంగలువల కొండము చొర మొక్కుఁడి
అలులకు పూఁదేనియ సోయగములు మెయికొనుఁడి
ఫలరసములు మీఁదెత్తుఁడి పదరి చిలుకలకును గోవిలలకు
పొలఁతికి కెందమ్మిరేకులు పోయుఁడు బడిమిగను

చ. 2 కట్టుఁడి సన్నపువలిపెము కర్పూరముఁ బన్నీరును
దట్టముగాఁ బైనలఁదుఁడి తరుణీమణికి
ఒట్టుఁడి జాజులు పరపున నొరపెరిఁగిన చెలికత్తెలఁ
బెట్టుఁచి మరుబలములచే బెగ్గిలి పడకుండ

చ. 3: చిగురునఁ గెంపులు మొలచెను చిత్రము చూడఁగదమ్మా
మొగుడులపైనల చంద్రుని మూఁకలు మరిగినవి
మొగమున బిత్తరిచేఁతలు మును లేనివి చెలికబ్బెను
మగువయు తిరువేంకటపతి మమతల పరిణతలు

రేకు: 0090-4 కేదారగౌళ సం: 05-353

పల్లవి: సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెదరోలాల

చ. 1: వనితల మనసులు కుందెన చేసిటు
వలపులు తగ నించో లాల
కనుసన్నలనెడు రోఁకండ్లను
కన్నెలు దంచెదరోలాల

చ. 2: బంగారు చెరఁగుల పట్టుపుట్టముల-
కొంగులు దూలఁగనోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెదరోలాల

చ. 3: కురులు దూలఁగ మంచి గుబ్బచన్నులపై
సరులు దూలాడఁగ నోలాల
అరవిరి బాగుల నతివలు ముద్దులు
గురియుచు దంచెదరోలాల

చ. 4: ఘల్లు ఘల్లుమని కంకణరవములు
పల్లవ పాణులకోలాల
అల్లన నడుములు అసియాడుచు సతు-
లొల్లనె దంచెదరోలాల

చ. 5: కప్పుర గందులు కమ్మని పువ్వుల-
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁ దేలుచుఁ గోనే-
టప్పనిఁ బాడెదరోలాల

రేకు: 0090-5 శ్రీరాగం సం: 05-354

పల్లవి: కూరిమిచేఁతలు కొండలుఁ గోట్లయి
గారవించి యింతిఁగాచినది

చ. 1: వన్నెల మాటల వాకిటితంగేటి-
జున్నుకు వడగాలి సోఁకినది
విన్నని చూపుల వెన్నెల బయిటను
సన్నపు ముత్యాలు చల్లినవి

చ. 2: ముద్దుల నవ్వులు ముంగిటిబంగారు
అద్దములోఁ జిగురంటినది
తిద్దిన మెఱుంగు దీఁగెకుఁ బన్నీట-
నద్దుట గడు వేడుకైనది

చ. 3: చక్కని కొండల చరులీ వెన్నెల-
వక్కలు పైపైనె వాలినవి
యెక్కువై శ్రీ వేంకటేశుని కౌఁగిటి-
నొక్కుల కిట్టే నోఁచినది

రేకు: 0090-6 శ్రీరాగం సం: 05-355

పల్లవి: ఎట్టు ధరియించెనో యీ యింతి హృదయంబు
పట్టనెట్లోపునో ప్రాణవాయువులు

చ. 1: వడియుఁ జెమటలనుఁ దుడువఁ గరాని పన్నీట
తడియుఁ బయ్యదయుఁ దత్తరమందు మనసు
సుడియుఁ దమకములచే సొలయు నలపుల మేన
విడియుఁ బులకలు చూడ వెరగైన మోము

చ. 2: మురియుఁదలఁపులును జలమునఁబొదలు మదనాగ్నిఁ
నురియుదేహంబు గడు నుదుటుఁగోరికలు
విరియు మానంబు నరవిరి సొలపుమాఁటలునుఁ
గురియు మోహజలంబు కొదలుఁజూపులును

చ. 3: వెదచల్లునూర్పులును వెలితైన నవ్వులును
సదమదంబైన పలుచనిమేనిపూఁత
అదన శ్రీ తిరువేంకటాద్రీశు కౌఁగిటను
గదిసి యింపులఁ బొదలఁ గలిగె నీ చెలికి

రేకు: 0091-1 ఆహిరి సం: 05-356

పల్లవి: ఇంతి చేసిన భాగ్యమిట్లుండె దైవకృత-
మింతయును గడపంగ నెవ్వరికి రాదు

చ. 1: విరహవేదనచేత వేఁగెడి విలాసినుల
సొరిది నింతకు మున్ను చూడమో వినమో
అరుదైన దుస్తరంబై ధరించఁగరాని-
దురవస్థలెవ్వరికి దొరకవనికాక

చ. 2: తల దోఁకలేని చిత్తమున వలపులఁ బొరలు-
పొలఁతులింతకుమున్ను పుట్టరో చనరో
అలవోక తెలుపులును అబ్బురపు మరపులును
కొలఁదిమీరుట మిగుల గోరమనికాక

చ. 3: దేవతాకృపగలిగి దివ్యవైభవములను
భూవలయమున సతులు పుట్టరో మనరో
శ్రీ వేంకటేశుఁడీచెలియకిచ్చిన చనవు-
లేవెలఁదులకు నాతఁడియ్యఁడనికాక

రేకు: 0091-2 భైరవి సం: 05-357

పల్లవి: ఎవ్వతెరా నినుఁజూచె నేమని పుత్తెంచె
పువ్వుబంతి నిను వేసి పొందుచూపి మొక్కినది

చ. 1: వీడియు వీడని కొప్పు వేఁగున వీఁగుచు మాట -
లాడియు నాడక చెలినల్లన దూరినది
వాడియు వాడని తమ్మివంటిమోము గలది తాఁ
జూడక చూచిన వాలుఁజూపుల బిత్తరిది

చ. 2: జారియు జారని గుబ్బచన్నుల పయ్యెదది లో-
నారియు నారని కోపమైన మోహముది
పేరియుఁ బేరనికాఁక- బెచ్చువెరిగినది తాఁ
జేరియుఁ జేరక నీ చేరువ దాఁగినది

చ. 3: మాట లాడుచును మోవి మఱఁగు నేసినదొక-
పూఁటలోనె నీ కౌఁగిటి పొందులనుబ్బినది
యేఁటికిరా తిరువేంకటేశుఁడ బొంకఁగ నీ-
నాటకపు బ్రియముతో నన్నుఁ గలసితివి

రేకు:	0091-3 దన్నాసి	సం:	05-358

పల్లవి:	ఏమి బాఁతి నేఁడిదె నీకు మముఁ
గామించు సిరులింతె కదవయ్యా

చ. 1:	వెనక ముందర వెలయఁగ ముందర-
వెనకలింతే విభవాలు
వనితల పిఱుఁదులు వాఁడికుచములు కొప్పు
కనుఁగొన భ్రమలింతె కదవయ్యా

చ. 2:	వెలుఁగు చీఁకటి విరసాలు విభవాలు
కలిమిలేములే కదవయ్యా
పలువన్నె మాటలు పనితేటలు నివి
కలవెంత కలలింతె కదవయ్యా

చ. 3:	పగటుగుబ్బలు పాయపునడపులు
తగులుమాఁటలు తమకయ్యా
తగు వేంకటగిరిదైవమ నీ పొందు
తగులు దొరకుటమృతము సోఁకుటయ్యా

రేకు: 0091-4 ముఖారి సం: 05-359

పల్లవి: మాటలు నేరుతువుగా మాయమ్మా
యేఁటికి నాతని నీవే యేలవమ్మా

చ. 1: చేయరాని విన్నపాలు నేసిసేసి విభునింత
మాయలఁబెట్టితివి గా మాయమ్మా
రాయడించి యిఁకను నారాజ్యమెల్ల నీవే
నేయవమ్మా నేనేమి సేసేనమ్మా

చ. 2: ఎందును నీకతఁడు నోరెత్తకుండ మంత్రాలు
మందులు నేరుతువుగా మాయమ్మా
చెందరాని సుఖమెల్లఁ జెలఁగి యాతఁడు నీవే
చెందవమ్మా నాకేల చిన్నదానికమ్మా

చ. 3: వన్నెల వేంకటపతి వలఁబెట్టి యతనిచే
మన్ననఁ బొందితిగా మాయమ్మా
నన్నుఁజూడుమిఁకను నీ ననిచిన యతని నే
నన్నలఁ జిక్కించుకొంటిఁ జాలదా నాకమ్మా

రేకు: 0091-5 అమరసింధు సం: 05-360

పల్లవి: తలఁచిన దేహము నిలువదు తాననుఁ దలఁచునో తలఁచఁడొ
వలనుగఁ జెలిమాటలు విని వచ్చీనో రాఁడో

చ. 1: శిరసున నంటిన పునుఁగిటు చెక్కుల జారెడిననుచును
ఉరవడిఁ దివియుచుఁ గొనగోరూఁదిన చందములు
మురిపెపు మొలనూళ్ళపై మొగపుల సొబగులు చూచుచు-
నరుదుగ గరమున నక్కడ నంటెడి యాసలును

చ. 2: చెనకుల వీడెపురసమిదె సెలవులఁ జెదరెడిననుచును
నునుపగు గోళ్ళ వాతెర నొక్కినచందములు
పెనగొను ముత్యపుసరముల పెక్కువ దీర్చెదననుచును
చనవునఁ జనుఁగవపై జే చాఁచిన చందములు

చ. 3: పుద్దపు నడపులలోపల నొయ్యన పాదము జారిన-
నొద్దికతో నునుఁగౌఁగిట నొరసిన చందములు
నిద్దపుఁ దిరువేంకటగిరినిలయుఁడు ననుఁ దనకౌఁగిట-
నద్దిన కస్తూరిచెమటల నలమిన చందములు

రేకు: 0091-6 భూపాళం సం: 05-361

పల్లవి: సువ్వి సువ్వి సువ్వలమ్మ
నవ్వుచు దేవకి నందనుఁ గనియె

చ. 1: శశి వొడచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్ళు విడిచె

చ. 2: కావిరా విరిసె కంసుఁడు గినిసె
వావిరిఁ బువ్వులవానలు గురిసె

చ. 3: గతిసేసె ఆటు గాడిద గూనె
కుతిలకుడిచి జనకుఁడు నోరుమూసె

చ. 4: గగురు పొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియఁగ యమున పై నడచె

చ. 5: కలి జారె వేంకటపతి మీరె
అలమేల్మంగనాచారలుకలు దీరె

రేకు: 0092-1 శ్రీరాగం సం: 05-362

పల్లవి: వాఁడు నాకు నిక్కముగా వలచినను
నేఁడు వచ్చి బంటువలె నిలుచుండుమనవే

చ. 1: సిగ్గు గొంత పరులపై చింతగొంత తనకు
యెగ్గు గొంత నామీఁదనేఁటివలుపే
అగ్గలమై తానేలే అన్నిలోకములును
తగ్గనీక నాకునిట్టే దక్కఁగ నిమ్మనవే

చ. 2: బొంకు గొంత సత్యములు పొందు గొంత తనకు
యింకా మానఁడు నాపైనేఁటివలుపే
సంకెలేక వెంటవెంట సటలెల్ల విడిచి
కొంకక నాయందలము గొలిచి రమ్మనవే

చ. 3: రచ్చగొంత రాఁపుగొంత రాజసము దనకు
యెచ్చుగొంత కుందుగొంత నేఁటి వలుపే
వెచ్చనై కౌఁగిటఁ గూడె వేంకటేశ్వరుఁడు
మచ్చిక నిట్టెయాకు మడిచి యిమ్మనవే

రేకు: 0092-2 సావేరి-జంపె సం: 05-363

పల్లవి: మెచ్చెనొకరాగంబు మీఁద మీఁద కడు-
నిచ్చెనొకరాగంబు యింతులకునెల్ల

చ. 1: చేసెనొకరాగంబు చెలియెదుటఁ గన్నులనె
మూసెనొకరాగంబు ముదిత మతినె
పూసెనొకరాగంబు పొలఁతిపులకలమేన
వ్రాసెనొకరాగంబు వనిత నినుఁబాసి

చ. 2: పట్టెనొకరాగంబు ప్రాణములపై నలిగి
తిట్టెనొకరాగంబు తిరిగి తిరిగి
పుట్టెనొకరాగంబు పొలఁతిడెందమునకును
మెట్టెనొకరాగంబు మెరయుచునె కదలి

చ. 3: కురిసెనొకరాగంబు కొప్పు పువ్వులనె సతి
మురిసెనొకరాగంబు ముంచి మేన
తిరువేంకటేశ్వరుఁడ తెలుసుకో నినుఁబొంది
పొరసెనొకరాగంబు పొలఁతికుచములనే

రేకు: 0092-3 రామక్రియ సం: 05-364

పల్లవి: చాలుఁ జాలు నీతోడి సరసాలు యిట్టె
పాలిండ్లకొంగుజారి బయటఁ బడితిమి

చ. 1: సిగ్గువడితిమిర నీ చేసిన చేఁతలకు-
నగ్గమైతిమిర మరునమ్ములకును
దగ్గరి నీకాఁకలఁ దగులఁబట్టి నేఁడు
బగ్గన నిందరిలోనఁ బలచనైతిమి

చ. 2: నొగిలితిమిర నేము నోఁచిన నోములకు
పొగిలితిమిర నీపొందులకును
తెగి నీవు నన్ను రతిఁదేలించి తేలించి నాకు
పగటు బిగువులెల్లఁ బచ్చిగాఁ జేసితివి

చ. 3: దప్పిఁ బడితిమిర నీతాలిములనే కడు
నొప్పిఁ బడితిమీర నీ నొక్కుఁజేఁతల
ఇప్పుడిట్టె తిరువేంకటేశుఁడ నీవు నా-
కొప్పు సవరము దీసి కొల్లగొంటి మానము

రేకు: 0092-4 కాంబోది సం: 05-365

పల్లవి: వలుపేడఁ గలిగెనే వామలోచనకు దీని
వలపించినటువంటివాఁ డింకనెవ్వఁడో

చ. 1: సిరులు గల మోమెల్ల చిరునవ్వుగనుదోయి
విరివైన వురమెల్ల వేఁకమైన గుబ్బలు
తరుణికి వెనకెల్లఁ దురుము పిఱుఁదులును మంచి-
నిరతంపు నడపెల్ల నిండుమురిపెములు

చ. 2: జలజాక్షినిలువెల్ల చక్కఁదనముల పోగు
కలికితనమెల్లఁ గన్నులపండువు
కలకంటివయసెల్ల గడుఁ గోమలము దీని-
పలకుఁదేనియలెల్ల పంచదారకుప్పలు

చ. 3: చెలువైన మోవెల్ల చిలుకవోట్లు దీనిఁ
కలదేహమింతయునుఁ గస్తూరివాసనలు
అలరించెఁ దిరువేంకటాధీశ్వరుఁడు దీని-
తలఁపెల్ల విభునిలో దాఁగున్న కరువు

రేకు: 0092-5 కాంబోది సం: 05-366

పల్లవి: ఎవ్వతిర ప్రియము నీకింత నేసినది చూచి
దవ్వుల నిన్నొకమాట తగులనాడినది

చ. 1: సిబ్బెంపు గుబ్బలమీఁది జిలుగుఁ బయ్యదది
గబ్బిచూపు నిన్నుఁ జూచి కన్నుల నవ్వినది
బబ్బిలికాయలతోడి పసిఁడిమెట్టెలది
జొబ్బిలిన చెమటలచేఁ జొక్కి నిలిచినది

చ. 2: తొంగలిరెప్పలతోడి తోరపుఁ గన్నులది
చెంగటిచెలియచేతఁ జెయివేసి నవ్వినది
చెంగలువబంతిచేతఁ జెక్కునొక్కినది
వుంగరాలవేళ్ళ నీ కొయ్యనె మొక్కినది

చ. 3: వీడక వీడని కొప్పువిరులు జారినది
వాడక వాడని మోవివన్నెలు దోఁచినది
యీడులేని తిరువేంకటేశ నినుఁబొంది యీ-
కోడెవయసున నింతి కోరికెలందినది

రేకు: 0093-6 ఆహిరి సం: 05-367

పల్లవి: జిగురువంటివాఁడె శినకాటి చింత-
శిగురమ్మఁబోనీఁడె శిన కాటి

చ. 1: సేఁతి కుత్తికవాఁడు సెడ కుండ దాఁచిన-
పాఁతపెద్దవిల్లు బలువున
నాఁతికొరకు వచ్చి నడిమికి విఱిశిన-
శేఁతలాఁడుగదె శినకాటి

చ. 2: రట్టడిశేఁతల రాకాశినాయని
పట్టపుశెలి యలిఁ బడవేశి
కొట్టఁ గొనముక్కు గోశివేశినట్టి-
శిట్టగీఁడుగదె శినకాటి

చ. 3: నలుపున వెంకటనగమునఁ గోనేటి-
నెలవున సొంపుతో నెలకొని
కలిమి పదుసుతోడి కాఁపురమున్నట్టి
శిలుగులాఁడుగదె శినకాటి

రేకు: 0093-1 పాడి సం: 05-368

పల్లవి: జాజు జాజేకాక దిరశపుఁ బువ్వౌనా
నీజాడెంతయిన నీవు మానేవా

చ. 1: సంపెంగపూవులలోన సారెకుఁ జూచిన తన-
కంపే కాక తనకాఁక మానీనా
యింపులు గొందరికి యీరసాలు గొందరికి
జంపుల నీ గుణముల జాడ మానేవా

చ. 2: పొగడ పూవులలోన పొందుగఁ జూచిన తావి
తగుఁగాక తా మదము మానీనా
నిగిడిన నీచేఁత నీ బోంట్ల కే కాక
మగిడి నీగుణములు మంచివయ్యీనా

చ. 3: కామించి కలువలు కన్నులనద్దుకొనిన
కామునమ్ములునేఁడు గాక మానీనా
దీమసపు వేంకటేశ తెమలని కూటముల
ఆమని మాకోరికల ఆస మానీనా

రేకు: 0093-2 ముఖారి సం: 05-369

పల్లవి: వంచిన పన్నీటఁబో వాడె నీమోము
మంచునఁ దామెరసొంపు మాయుఁగదవే

చ. 1: సంపెంగ నూనియనే మజ్జనము సేయఁగఁ బో
చెంపజారి తురుమెల్లఁ జెదరీ నేఁడు
గుంపులైన తుమ్మిదలు కొమ్మ నీయలకలివి
రంపపుఁగంపునకు వెరచుఁగదవే

చ. 2: జవ్వాది యెప్పుడు నీ నొసల మెత్తఁగానె పో
యెవ్వరు నిలిచిన నోరెత్తవు నేఁడు
కొవ్విన చిలుకపలుకులు దీనిగాలికి
దవ్వుదవ్వులనె కడు దాఁగుఁగదవే

చ. 3: ఒక్కటై వేంకటవిభుఁడొత్తినరేఖలఁ బో
చక్కని నీచనుఁ గొంగు జారీ నేఁడు
జక్కవపులుగులివి చందురుఁడుదయమైన
పుక్కమీరి బెదరుచునుండుఁ గదవే

రేకు: 0093-3 శంకరాభరణం సం: 05-370

పల్లవి: సల్లుసూవుల సలమారి యిఁక
వెల్లఁబో నన్ను సెనకఁడుగా

చ. 1: సంకు సక్రముల సక్కనయ్యకుఁ దన-
వుంకువవో నావొళ్ళెల్లా
సంకనున్న తన సదురాలి మొరఁగైన
సింకసూపు నాపై సిమ్మఁడుగా

చ. 2: మాపురేపుసూపు మాయలయ్యకుఁ దన-
దాఁపురమువో నాతలఁపెల్లా
వీఁపురమణికంత వెఱవకయినఁ దన
పూఁపనవ్వు నాపైఁ బుయ్యఁడుగా

చ. 3: వుసురుఁ బడుకమీఁదనొరగిన్న సక్కని-
రసికుఁడు వేంకటరాయఁడు
పసపుశీర నాకుఁ బరపుగాఁ బరపించి
యెసగ నిట్టె సనవియ్యఁడుగా

రేకు: 0093-4 కేదారగౌళ సం: 05-371

పల్లవి: తనివిదీరమికిఁ గుంటెనలె యాస
అనుమతులకుఁ దాఁకనాడుటే యాస

చ. 1: సరినెలయింపులకు సళుపుఁ జూపులె యాస
గిరుపుఁగన్నులకు జంకెనలె యాస
సరసంబునకు నలసపుఁ గసరులే యాస
మరు పెరరేఁపులకు మంతనమె యాస

చ. 2: కడుఁ గోరికలకుఁ లోఁగాఁతాళములె యాస
చిడిముడికాఁకలకుఁ జింతలే యాస
బడలికకౌఁగిటికి బట్టబయలే యాస
పడరానియెడఁ గడపటిచేఁతె యాస

చ. 3: రతిసమయమునకు రాకొట్టులే యాస
అతివమోహమునకుఁ గయ్యములె యాస
యితమైన తిరువేంకటేశు కౌఁగిటఁ గూడి
మతిలోనికెపుడుఁ దమకములె యాస

రేకు: 0093-5 శుద్ధదేశి సం: 05-372

పల్లవి: మొలనూలి గొల్లెత మురియుచును
వలవంతఁ దిరిగీని వాడవాడలను

చ. 1: సంపెఁగలతురుముతో చల్లలమ్మీనిదివో
పంపుమోము గొల్లెత వాడలను
యింపులకోరికె తో నిందిరాపతి యెదుట
జంపుల నటనలతో సాళగింపుచును

చ. 2: నొసలికస్తూరితోఁ గన్నుల నవ్వీనిదివో
పసివాడు గొల్లెత వాడలను
కసరుచు హరిమీఁదికాఁకల కోపముతో
యెసరుఁ జెమట గోర యెమ్మెలఁ జిమ్ముచును

చ. 3: చెలువంపుటుంగరాల చెయి వీచీనిదివో
వలపుల గొల్లెత వాడలను
కలికియై తిరువేంకటవిభుకౌఁగిట
అలసిన నటనల నల్లంతనేఁగుచును

రేకు: 0093-6 శంకరాభరణం సం: 05-373

పల్లవి: మెట్టో నేననఁగానే మొక్కేవుగాని
వెట్టినేను వెట్టినేను వెట్టినేను సుమ్మీ

చ. 1: సడ్డలాడఁగానే కడు జారినపయ్యద చూచి
యెడ్డ నన్ను జాణఁజేసేవేఁటికో కాని
వడ్డివారే వలపుల వన్నెవెట్టనేర నే
గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుమ్మీ

చ. 2: ఒల్లననఁగానే నన్నునుద్దండపుఁ దుటారాల
చల్లలమ్మఁగానే పగ చాటేవు గాని
కల్లలాడనేర నీతో కపటాలు నేర నే
గొల్లదాన గొల్లదాన గొల్లదానఁ జుమ్మీ

చ. 3: వేంకటేశుఁడ నేనంటా వేసాలఁ బొయ్యేనంటా
అంకులచేతులుచూచి యంటితి గాని
కంకిగా గుబ్బలమీఁద గాజునఁ దీసేవు నే
పుంకువొల్ల నుంకునొల్ల నుంకునొల్లఁ జుమ్మీ

రేకు: 0094-1 కేదారగౌళ సం: 05-374

పల్లవి: దశవిధాచణం తన్నభవతి దశవిధావస్థార్థం తే తత్ర

చ. 1: స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన దీపితోయం మత్స్యదేహ: పురా
వ్యాపారోయ మేవం నచ తరుణ్యా రూపజలధౌ కేళిరుచయే తత్ర

 చ. 2: ధారయిష్యామి మందరమితి వ్యాజేన చారుకచ్ఛప విధాచ. పురా
నీరసేయం తవ మనీషా ప్రియవధూ భారకుచమందరౌ భర్తుం తత్ర

 చ. 3: భువముద్ధరిష్యామి పునరితి వ్యాజేన ధవళ కిటి వైభవం ధత్సే పురా
వ్యవహృతిరియం నచ మహామహీకుచతటే తవ దంతక్షతం దాతుం తత్ర

 చ. 4: దనుజం హరిష్యామి తమితి వ్యాజేన ఘన నారసింహవిక్రమణం పురా
దనుజర తవ మహత్త్వం తన్నచ నఖార్జనమిందిరాయా ప్రసర్తుం తత్ర

 చ. 5: అపరిహరిష్యామి బలిమహమితి వ్యాజేనకపటవామనరూపకలనం పురా
నిపుణ ఏవం నఖలు నియతిస్సతీషు తే కపటాచణం ఘటయితుం తత్ర

 చ. 6: సంహరిష్యామి నృపజనమితి వ్యాజేన బహ్వారుణతోయేప్రాప్తి: పురా
సింహవిక్రమణతే స్థితిరియం నచ సతీ విహ్వాలత్వం తదా వేత్తుం తత్ర

 చ. 7: రావణం జేష్యామి రణ ఇతి వ్యాజేన భూవరత్వే తే భోగ: పురా
ఏవం నభవతి మహీసుతా విరహంసావధానేన ప్రహర్తుం తత్ర

 చ. 8: కంసం హనిష్యా మి ఖలమితి వ్యాజేన సంసారోయమాచరిత: పురా
హింసాదూర నచ హితమిదం వ్రజవధూసంసరణలీలాం ప్రసక్తుం తత్ర

 చ. 9: పాతయిష్యే ప్రలంబమితి వ్యాజేనజాతరోషస్య తే జననం పురా
భూతరక్షక తే ప్రభుత్వం తన్నఖలు భూతలే రేవతీం భోక్తుం తత్ర

 చ. 10: బుద్ధో భవిష్యామి పురహృతివ్యాజేన బద్ధరోష ఇతి తేప్రాప్తి: పురా
తద్ధితం నహిఖలు తదా వధూహస్త సిద్ధ ప్రసారేణ సేవితుం తత్ర

 చ. 11: మారయిష్యామి కలిమతమితి వ్యాజేన క్రూర కల్క్యవతారకోప: పురా
ధీర వేంకటనగాధీశ ఏవం నఖలుభీరుముర్వీంసంప్రీణయితుమత్ర

రేకు: 0094-2 ముఖారి సం: 05-375

పల్లవి: ఎంత సేయఁగనేరదింతి గోపించినను
కంతుని గెలిపించెను ఘనుఁడైన విభుని

చ. 1: సతవింత తాపాన చందురుఁడేపఁగఁ బో
ప్రతిచందురుండాయ పడఁతిమోము
అతివఁ గోవిలకూఁతలలయించఁగాఁ బో
తతిఁ గోవిలలకూఁత తానాయఁ బలుకు

చ. 2: మలయానిలుఁడు దన్ను మలసి యేఁచఁగఁ బో
చెలివూర్పు చిరుగాలిఁ జిత్రెంచెను
తలపోఁతచింత చిత్తము సేయఁగాఁ బో
కలికిచిత్తము పతికడకంటెనిపుడు

చ. 3: తిరుగఁ జంద్రుఁడు తన్ను తిలకించగాఁ బో
ధరియించెఁ గుచముల తానతని
తిరువేంకటగిరిదేవునికౌఁగిటి-
సిరులఁబో యిన్నిటాఁ జెలువాయె నిపుడు

రేకు: 0094-3 ఆహిరి సం: 05-376

పల్లవి: నిన్నుఁ గూడిన విభుని నిలువెల్ల సొంపాయ
నిన్నియును నొనగూడె నింతలోపలనె

చ. 1: సొలపు నీ కడగంటిచూపు హృదయము గాఁడి
లలినితఁడు శ్రీవత్సలాంఛనుండాయ
వెలఁది నినుఁ బెడఁ బాసి విరహంపుమెయికాఁక -
వలన నీతఁడు నీలవర్ణుఁడైనాఁడు

చ. 2: అదన నీ చనుగుబ్బలను చక్రముల చేతఁ
బదిలపరపుచు చక్రపాణియైనాఁడు
సుదతి నీ దేహమున సొబగు కుంకుమపూఁత-
లెదిగి పీతాంబరంబీతనికి నాయ

చ. 3: ఆలింగనాపేక్షననయంబు నినుఁగూడ
లోలుఁడటుగాన నాలుగుచేతులాయ
శ్రీలలితమూ ర్తియగు శ్రీ వేంకటేశ్వరుఁడు
పాలించె నిను నీకుఁ బరితోషమాయ

రేకు: 0094-4 ముఖారి సం: 05-377

పల్లవి: కందువ నేఁడెందరైనాఁ గలరు నీకు
యిందరిలో నాప్రియమీడేరీనా

చ. 1: సన్నలు సేసేటి వారు సరసమాడేటివారు
కన్నుల మొక్కేటివారు గలరు నీకు
విన్ననై యిందరికిని వెరవనే కాక నాఁ
విన్నపమెంతైన నీకు వినఁదీరీనా

చ. 2: తేఁకువఁ జేరేటివారు తేనెల మాఁటలవారు
కాఁకలు సేసేటివారు గలరు నీకు
యేఁకటనిందరికడ నెడతాఁకనేకాక
సోఁకనాడే నావంక చూడఁగూడీనా

చ. 3: ముద్దులు గునియువారు ముచ్చటలాడెడివారు
గద్దించి తిట్టెడివారు గలరు నీకు
తిద్దిన నీవిద్యలివి తిరువేంకటేశ నా-
వొద్దఁ గూడి యిట్ల నీకు వుండఁగూడీనా

రేకు: 0095-1 మాళవి గౌళ సం: 05-378

పల్లవి: సీతక పడుసు దోసిటి పాల మగఁడు - బాతి పడిన నగపడునటె వీఁడు

ච. 1: మూడు గాళ్ళపెద్ద ముసలి సవులుగొన్న పాఁడిమేకల పాల పాశము
వేఁడి జుట్టినతల్లి వేఁకటియై కన్న- వాఁడు వీఁడు శిన్న వాఁడటె వీఁడు

చ. 2: కొండలంత సను గుబ్బలరాకాశి - మిండెత గవిశి పై మింగ రాఁగా
గుండె వగులనొక్క కోలనె సరగన -సెండివేసినట్టి సిసు వటె వీఁడు

చ. 3: వుడుకు నుదుటివాఁడు వుదుటున దాఁసిన- బెడిదపు మోతల పెనువిల్లు
తొడికి విరిశివేశి దోమటి నునుఁబాల- కడుపుల తొలి పెండ్లికొడుకటె వీఁడు

చ. 4: మారుదల్లి సేతిమాటలఁ బడలేక -వూరు విడిశి యడవులకేఁగి
సేరవచ్చిన యింతి సెవులు ముక్కుఁగోశి - పేరువారిన పెద్దబిరుదటె వీఁడు

చ. 5: పొగదాగు తపసుల పుల్లవెలుగు మంట - లగడు శేయఁగ ముగురసురల
సగము సాయ సంపి సడిఁబెట్టి విడిశిన-బగిడికాఁడు సిన్నపడుసటె వీఁడు

చ. 6: మిసమిస మెరసేటి మెగముమేనిపై - పసలఁ దగిలి వెంటఁ బారి పారి
గసిక వింటికోల గరిగాఁడనేసిన -మసిమాయల సలమరి గదె వీఁడు

చ. 7: రవ్వల సేఁతల రాకాశినాయని - కొవ్విన మదము తె క్కోలుగొని
యివ్వలఁ దిరువేంకటేశుఁడై యున్నాఁడు -గువ్వెక నిను జట్టిగొనెఁగదె వీఁడు

రేకు: 0095-2 శ్రీరాగం సం: 05-379

పల్లవి: ఇప్పుడెట్లున్నదో యిందువదన
అప్పటికిఁ గొంత గుణమాయ నావేళ

చ. 1: తెలుప శశికాంతవేదికమీఁద మలఁగుపై -
నొలిగి పరితాపాగ్నినుడుకఁ గాను
నెటి దొలఁకు మోముమెన్నెలకు శశికాంతంపు -
టఱఁగు గరఁగిన శైత్యమాయెనావేళ

చ. 2: చెలియ పొన్నల విడ చిగురుఁబానుపుమీఁద
పలుమారు నినుదూరి పొడఁగాను
చెలఁగి పొన్నల విరియు చిలుకుఁదేనెల సోనఁ
దెలివొంది కొంత వడదీరెనావేళ

చ. 3: తొయ్యలి విలాసమున తఁగు మంచముమీఁద
పయ్యెదరజార నినుఁ బాడఁగాను
తియ్యమునఁ గూడితివి తిరువేంకటేశ్వరుఁడ
నెయ్యంపు వేడుకలు నినిచెనావేళ

రేకు: 0095-3 ఆహిరి సం: 05-380

పల్లవి: ఎంత మన్నించితో యీ యింతినిదె నీవు
అంతకంతకుఁ బ్రేమనలరీనిపుడు

చ. 1: పడఁతి నాట్యశ్రాంతిఁ బవళించి తొల్లి నీ -
తొడలపై నీవు తల దువ్వఁగాను
కడలేని యటువంటి కళలు దలఁచే కదా
విడువని వియోగమున వేఁగీనిపుడు

చ. 2: ఒనరఁ గుచభారమున నొరఁగి యీ మలఁగుపై-
నెనసి నీవాకు మడిచియ్యఁగాను
వనిత నేఁడటువంటి వలపుదలఁచే కదా
ఘనమైన తాపమునఁ గాఁగీనిపుడు

చ. 3: సిరులు నీ మోముపైఁ జెక్కు లొయ్యన చేర్చి
యరమోడ్చి కనురెప్పలలమి యలమి
తిరువేంకటాచలాధిపుఁడ నినుఁ గూడియే
పరవశానంద సంపదఁ దేలెనిపుడు

రేకు: 0042-1 ఆహిరి సంపుటం: 06-001

పల్లవి: చిన్ని శిశువూ చిన్ని శిశువూ
యెన్నఁడుం జూడ మమ్మ యిటువంటి శిశువూ

చ. 1: తోయపుంగురులతోడఁ దూ గేటి శిరసు, చింత
కాయలవంటి జడలగములతోడ
మ్రోయుచున్న కనకంపు మువ్వల పాదాలతోడ
పాయక యశోదవెంటఁ బాఱాడు శిశువూ

చ. 2: ముద్దుల వ్రేళ్లతోడ మొరవంక యుంగరాల
నిద్దపుంజేతుల పైఁడి బొద్దులతోడ
అద్దపుంజెక్కులతోడ నప్పలప్ప లనినంత
గద్దించి యశోద మేనుఁ కౌఁగిలించు శిశువూ

చ. 3: బలుపైన పొట్ట మీఁది పాల చాఱల తోడ
నులి వేఁడి వెన్న దిన్న నోరి తోడ
చెలఁగి నేఁడిదె వచ్చి శ్రీ వేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువూ

రేకు: 0042-2 భైరవి సంపుటం: 06-002

పల్లవి: ప్రాయంపు మదములే పరిణామము మతిఁ
బాయని రమణికి నీపై నెంతవలపో

చ. 1: తుమ్మిపూవుఁగొలనిలో తరుణులుందాము మిండ
తుమ్మెద లీఁదులాడంగ దొంగి చూచి
కొమ్మ నినుఁ గూడి కేళాకూళితోఁ గస్తూరినీట
నిమ్ముల నోలలాడిన దెటువంటి వలపో

చ. 2: కొదమమావిపై గండుఁగోవిల లేఁజిగురాకు
ముదిత కందీఁగా ప్రేమమునఁదాఁజూచి
అదివొ యుప్పరిగెపై నాకుమడిచి నీ వీఁగా
వదనాన నందుకొనె వడి నెంత వలపో

చ. 3: నెయ్యంపుఁ జకోరము వెన్నెల రస మింతినోర
నొయ్యనె కుమ్మరించంగ నువిదచూచి
కయ్యంపుంగూటమిని వేంకటేశుండ తమ్మరస
మియ్యంగఁ జొక్కితివి నీ విపుడెంతవలపో?

రేకు: 0042-3 ముఖారి సంపుటం: 06-003

పల్లవి: రమణి నేర్పు నేరములాయె
జమళివిధుల సరసపు విభుఁడా

చ. 1: తెఱవకు నంపిన తెల్లని కలువలు
మఱపున కెందామర లాయె
నెఱుఁగము నీవిపు డింతచేతువని
కఱతలకలికివి గా విభుఁడా

చ. 2: మగువకు నంపిన మకరంద మిచ్చటి
జిగి దొలంకేటి చిఱుచేఁదాయె
అగు నీ యెకసక్యమ్ముల మాటల
వగ నెఱజాణండవా విభుఁడా

చ. 3: చెంతల ముత్యపుం జిప్పల తోయము
లంతలోనె ముత్యములాయె
సంతత కరుణా జలనిధి లక్ష్మీ
కాంతుఁడవఁట వేంకట విభుఁడా

రేకు: 0042-4 కాంబోజి సంపుటం: 06-004

పల్లవి: ఆరగింపవో మాయప్ప యివే
పేరిన నేతులు పెరుగులును

చ. 1: తేనెలు జున్నులు తెంకాయ పాలును
ఆనవాలు వెన్నట్లును
నూనె బూరెలును నురుగులు వడలును
పానకములు బహు ఫలములును

చ. 2: పరమాన్నంబులు పంచదారలును
అరిసెలు గారెలు నవుగులును
కరజికాయలును ఖండమండెఁగలు
పరి పరి విధముల భక్ష్యములు

చ. 3: కడు మధురంబగు కమ్మఁబూరణపుఁ
గుడుములు నిడ్డెన కుడుములును
సుడిగొనునప్పాలు సుకినప్పాలును
పొడి బెల్లముతోఁ బొరఁటుచును

చ. 4: కాయపు రుచులకు గనియగు మిరియపుఁ
గాయలు నేలకి కాయలును
పాయరానియంబాళపుఁగాయలు
నాయతమగు దధ్యన్నములు

చ. 5: ఒడికపుఁ గూరలు నొలుపుఁబప్పులును
అడియాలపు రాజాన్నములు
బడిబడిఁ గనకపుఁ బళ్లెరములతోఁ
గడు వేడుక వేంకటరమణా

రేకు: 0042-5 సామంతం సంపుటం: 06-005

పల్లవి: అల్లవాఁడెవో అతివరో కడు
పెల్లైన ముత్యాల పేరులవాఁడు

చ. 1: తెప్పమీద నున్న వాఁడు తెల్లని కన్నులవాఁడు
దుప్పటి కంకుమనీటఁ దొప్పందోఁగినాడు
పుప్పొడి మేనెల్లనిండఁ బూవులవేల్లాడి
కప్పురగందులనెల్లం గరఁగించినాఁడు

చ. 2: క్రుమ్ముడి జారిన వాఁడు కోమలి చిమ్మనం గ్రోవి
చిమ్మెడి పన్నీట మోము చెమరించువాఁడు
కమ్మని కస్తూరి బొట్టు కరఁగిచెదర కను
దమ్ముల నలుపు చూపు దైవాఱువాఁడు

చ. 3: మంచి మంచి మణులు దాపించిన గద్దియ మీఁద
అంచగమనలుం దాను నాట చూచువాఁడు
మించిన కోనేటివాఁడు మెరసి వైభవముల
నెంచంగల తిరువేంకటేశుండనువాఁడు

రేకు: 0042-6 శంకరాభరణం సంపుటం: 06-006

పల్లవి: ఒక్కలాగువాఁడవా యోరి యిట్టి
తక్కులం బెట్టితి నన్నుఁ దగిలించి నీవు

చ. 1: తెలిసితిమిలే తెప్ప తిరుణాళ్లనాఁటి
జలముల నామీఁద జల్లుతానే
సొలపుం జూపుల నిట్టె సొంపుగఁ జూచి చూచి
వలపు జల్లితివి యెవ్వతె పైనోరి

చ. 2: కంటిమి నీలాగుగ్రక్కనఁ దిరువీథుల
నింటి ముంగిటను నీ వేఁగుతానే
వెంటనె యాలవట్టము విసరేటి సతి గుబ్బ
చంటిమీఁద నొరగి వేసాలఁ బోతివో

చ. 3: ఇన్నియు మెచ్చితిరా నిన్నింతలోనె యిప్పుడు నీ
వున్న పైఁడియుయ్యాల నీ వూగుతానే
మన్నవ కౌఁగిట నన్ను మరపించి యెక్కడికొ
కన్నులార్చితివి వేంకటరాయ యోరి

రేకు: 0043-1 శంకరాభరణం సంపుటం: 06-007

పల్లవి: అతను సంపదకంటె నసదా చెలిరూపు
మతిచింతచేత వేమరు నలఁగెఁ గాక

చ. 1: తగుఁ జందురుని నణఁచఁ దగదా చెలిమోము
వగలచే నొకయింత వాడెఁగాక
పగటుఁగోవెల మించి పాఱదా సతి పలుకు
జగడమునఁ బతిఁబాసి సన్నగిలెఁ గాక

చ. 2: కదలు గందపు గాలి గా(వ?)దా చెలియూర్పు
కదిమేటి మదనాగ్నిఁగ్రాఁగెఁ గాక
కొదమ తుమ్మెదగమికిఁ గొఱఁతా చెలితురుము
చెదరి మరుబాణముల చే జాఱెఁగాక

చ. 3: లీలఁబన్నీటికిని లేఁతా చెలి చెమట
లోలిఁ బూఁబానుపున నుడికెఁగాక
యేలచిగురునకంటె నెరవా చెలిమోవి
గేలి వేంకట విభుఁడు గీలించెఁగాక

రేకు: 0043-2 శ్రీరాగం సంపుటం: 06-008

పల్లవి: ఒప్పదువోయింత కొరపులం జూఁడేవు నా
నొప్పులెఱుంగవు యింత నొగిలించే వేలరా

చ. 1: తెల్లని కన్నుఁ గొన తీగె మెఱుపుల చూపు
చల్లకునే నాగుండె జల్లనీని
మెల్లని సొలపుల మెత్తనిమాటలకు నే
దల్లడించఁగానె యింతతాఁక నాడే వేలరా

చ. 2: పూఁచిన యొఱుపుల బొమ్మముడిజంకెనల
లోఁచకువే మనసు చిల్లులువోయీని
దాఁచిన నీ చిత్తపు బిత్తరపుటానలు నాపై
చాఁచి చాఁచి పలుమారు చంపంజూచేవేలరా

చ. 3: చిమ్ముల మురిపెపుఁ జిఱు నవ్వులనే నన్నుఁ
గ్రుమ్మకువే మనసెల్ల గొల్లంబోయీని
దిమ్మరిజాణఁడవోరి తిరువేంకటేశ నన్ను
క్రమ్మరఁ గ్రమ్మరఁ గూడి కాఁకరించేవేలరా

రేకు: 0043-3 శ్రీరాగం-ఏకతాళి సంపుటం: 06-009

పల్లవి: తొల్లిటివలెఁ గావు తుమ్మెదా యింక
నొల్లవుగా మమ్మునో తుమ్మెదా

చ. 1: తోరంపు రచనల తుమ్మెదా కడుఁ
దూరేవు గొందులే తుమ్మెదా
దూరిన నెఱఁగవు తుమ్మెదా మమ్ము
నోరగఁజూడకువో వో తుమ్మెదా

చ. 2: తొలు ప్రాయపు మిండ తుమ్మెదా కడుఁ
దొలిచేవు చేఁగలే తుమ్మెదా
తొలుకరి మెఱుఁగనే తుమ్మెదా యింక
నులికేవు మముఁగని వో వోతుమ్మెదా

చ. 3: దొరవు వేంకటగిరి తుమ్మెదా మా
తురు మేల చెనకేవు తుమ్మెదా
దొరకె నీ చనవులు తుమ్మెదా యింక
నొరు లెటెంగిరి గదవో వో తుమ్మెదా

రేకు: 0043-4 శ్రీరాగం సంపుటం: 06-010

పల్లవి: చాలు నింక నిటువంటి సంసారము మరుని
పాలైతి నిపు డింటి భాగ్యమిది నాకు

చ. 1: తనియు కిటు నీవు గాంతల నెల్లనా యెదుట
గొనియాడ దొరకొంటి కొంకులేక
వినియుఁ బ్రాణము తోడ విషమైన యీకూడు
దినఁజేరినది యేఁటి దేహ మిది నాకు

చ. 2: వెఱప కిటు సతుల నీ వెను వెంటఁ బెట్టుకొని
మెఱయ దొరకొంటివిదె మేరలేక
యెఱిఁగియునుఁ దీపనుచు నిట్టి నీ మన్ననల
చెఱఁబెట్టినది యేఁటి జీవమిది నాకు

చ. 3: ఎక్కువగు నీతరుణు లిందరిని నాకిట్ల
మ్రొక్కించ దొరకొంటి మొఱఁగు లేక
గ్రక్కునను నన్ను వేంకటగిరీశ్వర కలసి
చిక్కనైతివి చాలుఁ జిన్నమిది నాకు

రేకు:	0043-5 సామంతం	సంపుటం:	06-011

పల్లవి: చెలిదా మతి నీచెఱిగాక
తలఁపగ నీకిది తగులైపోయె

చ. 1: తరుణీమణివా తమ్మికన్నులివి
అరయ నెపుడు నీయవె కాక
నిరతపుఁజూపులు నీచెలువమునకే
యిరవై వనితకు నెరవైపోయె

చ. 2: మెలుఁతది గా దీమే నిటుకాఁకల
కలవఱచిన నీయదే కాక
పులకజొంపములఁ బ్రుంగు డగుచు నీ
యలుకల చెమటల కమ్ముడొవోయె

చ. 3: పంకజముఖివా బలుపుఁ గుచములు న
ఖాంకరుచుల నీయవే కాక
వేంకటేశ నీ వేడుక కౌఁగిట
నంకురించె నీవవునోకావో

రేకు: 0043-6 ఆహిరి సంపుటం: 06-012

పల్లవి: సతికి నిటువంటి రాజస మేల కలిగెనే
తతిగొన్న విరహాగ్ని ధరియించలేదు

చ. 1: తోరమగు భారంపు తురుమేల కలిగెనే
నారీమణికి మెఱుఁగు నళినముఖికి
వైరంపు మరుని నెవ్వగల బాణాగ్నిచే
జారఁగా పలుమారు సవరించ లేదు

చ. 2: వెలఁదికి జఘనంపుఁ బ్రేఁగేల కలిగెనే
కలహంస గమనమునఁ గదల లేదు
నలికంపు నడుము సన్నమున నవకపు మణుల
మొలనూలు జారఁగా మోవనే లేదు

చ. 3: ఇంతికిని చక్కఁదన మింతేల కలిగెనే
వంతఁ బొరలించు యౌవన మదమున
ఇంత లోననె వేంకటేశు కౌఁగిటఁగలసి
మంతనపుఁ బరవశము మతిఁ దెలియలేదు

రేకు: 0044-1 బౌళి సంపుటం: 06-013

పల్లవి: కనుమూసెఁగదె దీని గరువంపుఁ దెలివి
చనుదోయి పైకొంగు జారిన నెఱుఁగదు

చ. 1: తలకెక్కెఁగదె దీని తనువికారములు
పొలుపైన నెరులు కొప్పున జారెను
చలి ముంచెఁగదె దీని జవ్వనపు మదము
పులకజొంపములచేఁ బొరలెక్కె మేను

చ. 2: వడదాఁకెఁగదె దీని వాల్ గన్నుఁగొనలు
చిడుముడి ముచ్చటతో సిగ్గువడీని
బడిదప్పెఁ గదె దీని పలుకుఁదేనియలు
తడఁబాటుతోడ చిత్తము దాఁచెనిపుడు

చ. 3: కసరెక్కెఁగదె దీని కస్తూరి చెమట
అసలుఁ గుంకుమ తోడ నలరీని మేన
ఉసురెక్కెఁగదె దీని యొరుపు నూరుపుల
పొసఁగి వేంకటపతి పొందు దెలిపెడిని

రేకు: 0044-2 ఆహిరి సంపుటం: 06-014

పల్లవి: తొడరు నటువలెనే దొర కోపము
అడియాలమిటు సేసె నబ్బెఁగా బలిమి

చ. 1: తనుఁబాసినంతనే తరుణిఁ గడునేఁపెనని
వనజారి మీఁదఁ బ్రియవరుఁడు గూడి
కనలి కొనగోళ్లఁ దునుక లుసేసి జవరాలి
చను జక్కవలకొసగెఁ జాలదా బలిమి

చ. 2: కలికి కోమలికి చిలుకలు గండుఁ గోవిలలు
పలుకులనె వేఁచెనని ప్రాణ విభుండు
కెలపుఁ బలుకుల సన్నగిలఁ జేసి యలబలము
తలిరు మోవినె యేఁచె దక్కెఁగా బలిమి

చ. 3: మతినుండి చిత్తజుఁడు మగువ గారించెనని
పతి వేంకటేశ్వరుఁడు పడతిఁ గదిసి
ప్రతిలేని మనసెల్లఁ బరవశము చేసి మరు
నతివ కన్నుల నించె నదియపో బలిమి

రేకు: 0044-3 ఆహిరి సంపుటం: 06-015

పల్లవి: పచ్చి కస్తురి నీకు బ్రాఁతిగాని
ఒచ్చెమని పూయ నొల్లమి దెన్నఁడును

చ. 1: తట్టుపునుఁ గొడల నంతటా నలంది
దిట్టవై పరిమళానఁ దిరిగేవు
ఇట్టిది మాయడవిలో నింతా నిదే
ఒట్టి యుండు నే మొల్ల మిదెన్నఁడును

చ. 2: కప్పురపుఁ దావి తోడఁ గదియుచు
చిప్పిలేటి చెమటలఁ జెలంగేవు
తప్పక యింటింట దీని తరువులే నే
మెప్పుడు మాచేత నంట మిదెన్నఁడును

చ. 3: జవ్వాది శిరసు నిండఁ జమరుకా యిట్టె
పవ్వళించే విదె నాపక్కనీవు
రవ్వయిన వేంకటరమణుఁడా మే
మెవ్వరమూ దీని నెఱుఁగ మెన్నఁడును

రేకు:	0044-4 కాంబోది సంపుటం:	06-016

పల్లవి:	వలపుల దాడి వచ్చె వనితలారా మరుం
డెలగో లేయంగఁ జొచ్చె నేలాగే

చ. 1:	తూరుపునం బొడిచెఁ జందురుఁడు మిన్నుల మోవ
పాఱుతెంచె విరహుల బందికాఁడు
గోరపు వెన్నెల వెల్లి గొని మీఁదమీఁద నిప్పు
లేటై పారఁగఁజొచ్చె నెందు చొత్తమే

చ. 2:	చందనపుఁ గొండ వంక చల్లగాలి తుదముట్టి
ముందు ముందె కదిసె దుమ్ములు లేవఁగా
మందమై పన్నీటి సోన మందు చల్లె నమ్ములై
యెందు చూచినఁ దానె యేమి సేతమె

చ. 3:	క్రొచ్చి పారె గుబ్బచన్నుఁ గొండల చెమ్మటనీరు
రొచ్చుగం గరి దరులు జారఁగా
పచ్చిగా వేంకటగిరి పతి యింతిఁ గూడఁగాను
ఇచ్చకాలె గనమాయె నింక నేఁటిదే

రేకు:	0044-5 సామంతం	సంపుటం:	06-017

పల్లవి:	వలదన నొరులకు వసమటవే
	తలఁచినట్ల నిది దైవమే చేసె

చ. 1:	తరుణి కుచములను తామర మొగుడలు
	విరిసేనోయని వెరపునను
	సరగునఁ బతి నఖ చంద్రశకలములు
	దరులఁ గలుగ నివి దైవమె చేసె

చ. 2:	పొలఁతి వదనమును పున్నమ చంద్రుఁడు
	బలిమి నెగయునని భయమునను
	మెలఁత చికుర ధమ్మిల్లపు రాహువు
	తలఁ జెదరఁగ నిది దైవమే సేసె

చ. 3:	వనితకు వాడునొ వలపు తాపమున
	తనులతికయనుచుఁ దమకమున
	ఘన వేంకటపతి కౌఁగిట చెమటలఁ
	దనివి దీర్చనిది దైవమె సేసె

రేకు: 0044-6 ఆహిరి సంపుటం: 06-018

పల్లవి: విన్నవించఁగరాదు విచ్చేయు మనరాదు
అన్ని విన్నపములు అవియె యివియు

చ. 1: తూఁగు మంచముమీఁద తొయ్యలి పవ్వళించి
వ్రేఁగైన తురు మరవీడఁగాను
కాఁగిన మేనితో కన్నుఁ దమ్ముల నీ
రాఁగియాడిన మాట లవియె యివియు

చ. 2: గొప్పలయిన చనుఁగొండలా పైపైనె
చిప్పిలు చెమ్మట చిందఁగాను
చెప్పక చెప్పుచు చెలి తడంబాటుతో
నప్పుడాడిన మాట లవియె యివియు

చ. 3: నీవి చెఱఁగు జారి నెలఁత నీ కౌఁగిట
కావిక న్నులతోడఁ గరఁగుచును
శ్రీ వేంకటేశ్వర చెలరేఁగి నివ్వెర
గై వెనుకఁదలంచె నవియె యివియు

రేకు: 0045-1 ఆహిరి సంపుటం: 06-019

పల్లవి: సుదతి నీ కింతవంటా చూచెఁగాని
యెదనున్న నీతలం పెఱుఁగలేదాయె

చ. 1: తగులనాడితి వంటా తమక మందితి వంటా
నగితివంటా నింతి నమ్మెఁ గాని
జగడించి వేఁటొక్క సతికి మోహము సేసి
తెగి తన్ను విడిచేది తెలియలేదాయె

చ. 2: కలలో వచ్చితివంటా కన్నుల మొక్కితివంటా
వెలఁది పువ్వుల బంతి వేసెఁ గాని
కలికి చేఁతల వట్టికాఁకలు వొడమించి
తలవంపిఁచేవని తలఁచలేదాయె

చ. 3: వేరుసేయ వంటా వేంకటపతి వంటా
కూరిమి గలవంటాఁ గూడెఁ గాని
నేరుపు మెరయించి నెలఁత నీ వెంతేని
ఊరడించినదాఁక నుండలేదాయె

రేకు: 0045-2 ఆహిరి సంపుటం: 06-020

పల్లవి: ఇంతగా జేసెఁగా యింతి కన్నుల నగవు
సంతరించగరాని చనుదోయి బిగువు

చ. 1: తనివి మాలిన తలఁపు తడవోరువని బులుపు
అనువెఱుంగని కెలపు అడియాసమెలపు
కనుఁగలువలో సొలపు కాఁకదీరని యలపు
వనిత చిత్తములోని వడిగొన్న వలపు

చ. 2: ఒడలెఱుంగని నెగులు నుల్లంబులోఁదగులు
వడియుఁగన్నీటిలో వగలు
పొడలువె ట్టెడి పొగులు పొందు వాసిన దిగులు
పడఁతికి నిది యెల్ల బరికించఁ బగులు

చ. 3: వెరవెఱుంగని పురపు వింతలాగులయొరపు
మిరుమిట్లు గొనుమేనిమెరుపు
తిరువేంకటాచలాధీశ్వరుని కనుగిరుపు
తరుణి కిటువంటి మెత్తని పూవుఁబరపు

రేకు: 0045-3 సౌరాష్ట్రం సంపుటం: 06-021

పల్లవి: ఈడేరని యట్టి వలపేఁటికమ్మా
యీడు జోడుగాని వలపేఁటికమ్మా

చ. 1: తనువు తనువు గూడి తమకము మీఁద మీఁద
నినుమడించని వలపేఁటికమ్మా
మనసు మనసు తోడ మక్కళించి సందు లేక
యెనసి వుండని వలపేఁటికమ్మా

చ. 2: మచ్చికల చేఁతల మతి లోలురై తా
మిచ్చ యెఱుఁగని వలపేఁటికమ్మా
తచ్చనయలుకలతో ధన్యత ప్రేమల
యెచ్చుకున్న యట్టి వలపేఁటికమ్మా

చ. 3: పంతము చెరిచి వాఁడు పానుపు మీదికి వచ్చి
యింత సేయ లేని వలపేఁటికమ్మా
కంతు నీఁకేలని శ్రీ వేంకటపతి నన్ను గూడె
నింత హెచ్చులేని వలపేఁటికమ్మా

రేకు: 0045-4 శుద్ధవసంతం సంపుటం: 06-022

పల్లవి: ఎంతమాయల వాఁడెంచి చూడఁగ వీఁడు
ఇంతి యీతని రూప మెవ్వరెఱుఁగుదురు

చ. 1: తెలుపు జలములలోన తెప్పవలెఁదేలీనే
తలఁకి పాతాళమున దాఁగియుండీనే
కెలసి తన కన్నులను కెంపువగాఁ జేసీనే
నెలఁత భీకరముగా నేఁడు నవ్వీనే

చ. 2: ఒరపుగా భూదాన మొకరిఁదా నడిగీనే
తరుణి భూమొక్కరికి ధారవోసీనే
మరలి పద్మజుని మనుమనినైనఁ జంపీనే
పరచుఁదనమున వృథా పాలుమాలీనే

చ. 3: పలుమారు తన సిగ్గు బయటఁ బడవేసీనే
కలికితనమునఁ దాను గడవఁబాసీనే
వెలఁది వేంకటగిరి విభుఁడు నా కౌఁగిట
తొలఁగక చెమటలఁ దొప్పఁదోఁచీనే

రేకు: 0045-5 సౌరాష్ట్రం సంపుటం: 06-023

పల్లవి: ఎట్టుగడియించె నమ్మ యీవలపు
పుట్టించి నటువంటి పూఁటకాఁపు మరుండు

చ. 1: తడఁబాటు నాలికకు తలఁకు మానంబునకు
నొడఁబాటు మఱపులకు నుదుటుఁ దలఁపులకు
కడువేడుకలు కోరికలకు భయ మాసలకు
బెడిదంపుఁ గోపంబు బిత్తరి చూపులకు

చ. 2: అతిముదము చింతకును అలపు గర్వంబునకు
మితిలేని తాపంబు మెత్తని తనువునకు
రతి గమ్మచెమటలకు రచన విరహంబునకు
ధృతి లేమి మనసునకు గతి గమనమునకు

చ. 3: కురులు నెన్నుదుటికిని గుఱుతు లధరంబునకు
మురిపెంపుఁ జిఱునగవు ముద్దుమోమునకుఁ
దిరమైన వేడుకలు తిరువేంకటేశునకుఁ
బరిణాపు మాటలివి పడఁతు లిందఱికి

రేకు: 0045-6 ముఖారి సంపుటం: 06-024

పల్లవి: అహో సాధు తవాగమనం
బహుళవైభవైః ప్రతివచనైః కిమ్

చ. 1: తతోపసర మిథ్యాశరవచనై
రితస్త్వైమ మ హితం కిమ్
బత మమ దేహోత్ప్రాణ స్తథాపి
గత ఏవై తత్ కారణమిహ కిమ్

చ. 2: సంవృతి చేలం జహి చపల త్వం
సంవాదేమే సతతం కిమ్
త్వం వా మమ చిత్తం సాంత్వయసి
కిం వా కురు మమ ఖేలనమిహ కిమ్

చ. 3: అతి బిభేమి భవదాచరణాదిహ
చతుర వేంకటాచలరమణ
సతీం మా మనుసరసి కిమథం
రతిరాజవిభవ రచనమిదం కిమ్

రేకు: 0046-1 భూపాళం సంపుటం: 06-025

పల్లవి: విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా

చ. 1: తెల్లవారె జామెక్కె దేవతలు మునులు
అల్లనల్ల నంతనింత నదివో వారె
చల్లని తమ్మిరేకుల సారస్యపుఁ గన్నులు
మెల్ల మెల్లనె విచ్చి మేలుకొనవేలయ్యా

చ. 2: గరుడకిన్నరయక్ష కామినులు గములై
విరహపు గీతముల వింతతాళాల
పరిపరివిధములం బాడేరు రాగాల నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించవేలయ్యా

చ. 3: పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజ భవాదులు నీ పాదాలు చేరి
అంకెల నున్నారు లేచి అలమేలుమంగను
వేంకటేశుఁడా రెప్పలు విచ్చి చూచి లేవయ్యా

రేకు: 0046-2 లలిత సంపుటం: 06-026

పల్లవి: ఎందరి వలపించెనో యంటనింట
చిందుల పాటలు వింట సిరులు చేకొంట

చ. 1: తుంగభద్ర యేటికాడ తోరమైనకొండనీడ
రంగుమీరి పైఁడి గోడ రాతిమేడ
అంగడి నున్నాఁడు చూడ నదివో పెడతల
చుంగుల పించెపు గూడ చుట్టు బాగతోడ

చ. 2: పండరంగినుండి వచ్చి పామరుల నెల్ల మెచ్చి
యెండలేని నీడలోన యెచ్చి యెచ్చి
వెండి బైఁడిఁదడంబడ విభవాలఁ బ్రొద్దు పుచ్చి
కొండనుచు వరములు కోరిక లిచ్చి

చ. 3: చక్కని యావిట్ఠలుండై జవ్వనానఁ జెలువుండై
ప్రక్క నున్న సతి తోడఁ బ్రబలుండై
మక్కువ వేంకటగిరి మాయధారి దేవుండై
యెక్కడా నెదురులేక యీాడ నున్నాఁడిడివో

రేకు: 0046-3 సామంతం సంపుటం: 06-027

పల్లవి: తార వలచినయపుడె తరుణిరతుల
తారసము లెట్లుండు తగవు లెట్లుండు

చ. 1: తరితీపు లెట్లుండు తాలుము లెట్లుండు
గరువంబు లెట్లుండు కసరు లెట్లుండు
పొరపొచ్చె మెట్లుండు పొలయలుక లెట్లుండు
నెరవరిక లెట్లుండు నెఱుక లెట్లుండు

చ. 2: ఓపికలు నెట్లుండు నొల్లములు నెట్లుండు
చూపోప మెట్లుండు సొలపు లెట్లుండు
దాఁపరము లెట్లుండు తగుమాన మెట్లుండు
కోపంబు లెట్లుండు కొఱఁత లెట్లుండు

చ. 3: సిరిదొలఁకు లెట్లుండు శేషాద్రిపతికరుణ
కిరవైన సతి మనసు నెపుడు నెట్లుం
మురిపమది యెట్లుండు ముద్దుఁజనుగవమీద
నరచందురుని రేక లపుడెట్టులుండు

రేకు: 0046-4 మెంచబౌళి సంపుటం: 06-028

పల్లవి: నీకు నేల తమకము నీకు అలపు నేఁడు
నీకు వాఁడు మోహించి నీలోనె యుండఁగా

చ. 1: తొడవుగాఁ గమ్మని కస్తురిఁ బొట్టుగాఁబెట్టి
జెడలల్లి జవ్వాది శిరసుపై నంటి
విడువని విరహపు వెచ్చ మేన దైవాఱ
నిడువాలుఁ గనుదోయి నీరు నించ నేఁటికి

చ. 2: కొత్త ముత్యపు సరుల కుచ్చులు వీపున వ్రేల
నొత్తిలి చెక్కునఁ గర మూఁది మోమువంచి
లత్తుక మోవి గదల లలన నీచిన్నయెలుఁ
గెత్తి ప్రేమ దైవాఱ నెవ్వరిఁ బాడెదవే

చ. 3: కొండలరాయుఁడు వాఁడు కోనేటితిమ్మఁడు నీ
నిండిన చిత్తములోన నీవు దానై యుండఁగాఁ
గొండగొన్న సుఖమెల్లఁ గొల్లలాడుదువుగాక
బొండుమల్లె పానుపుపై బొరలఁగ నేఁటికే

రేకు: 0046-5 ముఖారి సంపుటం: 06-029

పల్లవి: నీకుఁ గాంతకుఁ దెలు నీవెఱుఁగు దది యెఱుఁగు
నీకడాకడవార లెవ్వ రెఱుఁగుదురు

చ. 1: తప్పకిటు నినుఁ జూచి తరుణి చనుఁగవమీఁదఁ
గప్పిన చెఱఁగువదలఁ గప్పనేఁటికిరా
చెప్పఁ జాలక పాలిఁతి చెలికరముఁదనకరము
నప్పళించుచు గోర నదిమె నేఁటికిరా

చ. 2: కాంత నీ చిరునవ్వు కనుఁగొనలఁ గని మనసు
వంత దెలుపక మొగము వంచ నేఁటికిరా
ఇంతి వేఱొకతె నిను నెలయించఁగాఁ జూచి
యంతలో నవలిమొగ మాయె నేఁటికిరా

చ. 3: ఎలమిఁగైకొని వేంకటేశ! నీవాతరుణి
నలమి కౌఁగిటఁ జేర్ప నసమబాణములు
జలజాయతాక్షి విచ్చనవిడిని తను మఱచి
యలర నేర్పులు నెఱపదాయె నేఁటికిరా

రేకు: 0046-6 భైరవి సంపుటం: 06-030

పల్లవి: ఎంత సేసెఁబో దైవ మింతలోన నయ్యో
సంతపాకలంజవలె చల్లుఁ జూపు లేఁటికి

చ. 1: తల్లులు బిడ్డలు మందలలోన నిందఱును
చల్లలమ్మే చేసెరు సంసారాలు
చెల్లఁబో నీ వుంగరాల చేతుల గోళ్లువెంచి
గొల్లదానవై యింత కొప్పువెట్ట నేఁటికి

చ. 2: ఎడ్డెలైన వారిఁ జూచి యిట్టిమన్న కులమని
సడ్డ సేయరిందఱును జరయఁగాను
ఒడ్డుఁ బొడవగు గుబ్బ లొరయుచుఁ గానరాఁగా
దొడ్డవారికిఁ బయ్యద తూల నింత యేఁటికి

చ. 3: ముంగిట నిధానములు ములుగంగ సొమ్ములతో
సంగడి గొల్లెతలెల్ల జడియఁగాను
అంగడివేంకటపతి నలమి పుట్టుక నీవు
చెంగలించి సొమ్ము గాఁగఁ జేసుకొంటి వేఁటికి

రేకు: 0047-1 నాదనామక్రియ సంపుటం: 06-031

పల్లవి: ఏగతి నోఁచెనో యిందువదన యీ
బాగులు ఖేదముఁ బాపెడిని

చ. 1: తొలఁకెడి జలములతోడికన్నుఁగవ
తలఁచి డెందము తలఁకీని
అలయుచుఁ జలితో నాడినమాటలు
పలికిన నామది భ్రమసీని

చ. 2: తొడరిన చెమటలఁ దోఁగిన పయ్యెద
పొడగని దేహము పొగిలీని
ఉడికెటి వ్రేఁకపుటూర్పుల వేఁడికి
నుడిగిన నాలుక నొగిలీని

చ. 3: కదిసిన తిరువేంకటపతి చేతలు
సుదతి విలాసము చూపెడిని
వదనము తావికి వలగొనుతేఁటుల
సదమద మగు రుతి చాటీని

రేకు: 0047-2 శ్రీరాగం సంపుటం: 06-032

పల్లవి: వేడుక కాఁడవై విడివడి తిరిగేవు తుమ్మెదరో
చూడఁ జూడఁగఁదొంటి చూపు దప్పకువయ్య తుమ్మెదరో

చ. 1: తలఁపుదామరలోన తావై యుండుదు నీవు తుమ్మెదరో
తలఁపఁగ నీవె తలఁప వైతివి మమ్ముఁదుమ్మెదరో
పొలయఁ గమ్మని తావి పొందునఁ దిరిగేవు తుమ్మెదరో
పొలసినీ తిరిగేటి పొందులెఱుంగుదుము తుమ్మెదరో

చ. 2: పచ్చని విలుకాని బంటవైతివిగద తుమ్మెదరో
మచ్చిక తలఁపులు మనలోనె సరివోలు తుమ్మెదరో
అచ్చపుదీమస మందరి కెక్కడిదయ్య తుమ్మెదరో
చిచ్చువటి వెన్నెల చెలిమి సేయకువయ్య తుమ్మెదరో

చ. 3: తిరువేంకటాద్రిపైఁ దిరమై నిలిచినట్టి తుమ్మెదరో
పరమయోగుల పూలఁ బరిమళములు గొన్న తుమ్మెదరో
కరుణించి మామీఁదఁగలిగిన యీప్రేమ తుమ్మెదరో
ఇరవాయె నిటువలె నెలసివుండంగదవె తుమ్మెదరో

రేకు: 0047-3 సామంతం సంపుటం: 06-033

పల్లవి: గుబ్బచన్నుఁగవ లెల్ల గుబ్బలి కొండలు మంచి
గబ్బితనములె కన్నుగానని వలపులు

చ. 1: తేనియల చెలమలు తియ్యనిమోవులు మించు
లైనయమృతపుఁబిళ్ల లాననపద్మములు
మానైన చక్కెర బొమ్మలు మేనుదీగెలు
లేనగవు మెఱుఁగులు లేఁతవెన్నెలలు

చ. 2: సానఁ బట్టిన తూపులు చక్కని చూపులు మంచి
వేనలి కమ్మని తావులానిన తుమ్మెదలు
చేనిపంటల కొల్చులు చెప్పరాని చెయ్దులు
మానమానని చింతలు మాటలలో మూఁటలు

చ. 3: వెలలేని రచనలు వేడుక చేఁతలు వట్టి
పొలయలుకలు ప్రొద్దువోని బూటకములు
ఎలమితోఁ దిరువేంకటేశుని బొందినయట్టి
చెలియ గర్వము నేఁడు చెప్పఁజూపఁగతులు

రేకు: 0047-4 ముఖారి సంపుటం: 06-034

పల్లవి: చూపు లోపలి చూపు చూడకుర వోరి నీ
పైపూఁత చూపులకుఁ బాలైతి మోరి

చ. 1: తనువెల్లఁ గడువేఁడి దగ్గరకు రోరి నీ
యనుభవనచేఁ దమక మారదా వోరి
వెన్నుకొన్న నిట్టూర్పు విడువవలె నోరి నీ
మనసు మదనానలము మానదా వోరి

చ. 2: ఉదుటైన కళలతో నున్నాఁడవోరి నినుఁ
గదియఁ జూచిన యింతి కలికిరా వోరి
వెదచల్లు నగవులకు వెరతుమిదె వోరి రతి
సదమదము కాటింత చాలదా వోరి

చ. 3: వేవేలు సతులతో విహరింతు వోరినేఁడు
రావలసి నీ కింద్దురాఁ దీరెనా వోరి
ఆవేళలా మమతలవి యెఱుంగుదోరి నీకు
శ్రీవేంకటేశ్వరుఁడ చెల్లురా వోరి

రేకు: 0047-5 ఆహిరి సంపుటం: 06-035

పల్లవి: ఏమి సేయఁగ వచ్చు నిట్టుండు భాగ్యవశ
మామనియుఁ దాఁ గూడెఁ నక్కటా చెలికి

చ. 1: తుడువరే కమ్మఁ గస్తురి బొట్టు నొస లెల్ల
కడుఁ గ్రాఁగే పొక్కె నదె కటకటా చెలికి
కడుగరే శిర సెల్లఁ గ్రాఁగి జవ్వాదిచే
జెడగట్టె ముంగురులు చెల్లఁబో చెలికి

చ. 2: తియ్యరే నునుఁగౌనుఁ దీగ యొడ్డాణంబు
నొయ్యనె యిఁకనైన నొప్పదీ చెలికి
ముయ్యరే కుచకుంభములు బయలు పడకుండ
పయ్యదయు సవరించ భారమీ చెలికి

చ. 3: చూపరే నాయకుని సుదతికి మేనెల్ల
ఆపసోపము రేఁగె నద్దిరా చెలికి
ఏపుమీఱఁగ వేంకటేశు డింతట వచ్చి
తాప మింతయు మాన్చి దక్కఁగాఁజెలికి

రేకు: 0047-6 శంకరాభరణం సంపుటం: 06-036

పల్లవి: మచ్చికల మఱపులకు మదనబాధల మేను
వెచ్చినా నేమిటను విడువదీబాధ

చ. 1: తను వయో మదమునకుఁ దమకములచే బాధ
గొనకొన్న తమికి రతికోర్కి బాధ
అనుభవనరతికిఁ బాయని ప్రేమముల బాధ
ఘనకూటమికి వియోగములచే బాధ

చ. 2: తఱి విరహ వేదనకు తలపోఁతచే బాధ
పఱచుఁదలఁపులకుఁ దాపముల బాధ
తఱచు తాపంబులకుఁ దడఁబాటుచే బాధ
పఱివోనినేర్పులకు పరవశము బాధ

చ. 3: అలరు సింగారముల కలపుఁ జెమటల బాధ
చెలియ చెమటకుఁ దావిచేతి బాధ
కలికితనములకు వేంకటవిభుని రతిఁ గూడి
కొలఁదికిని మిగులు సిగ్గులచేత బాధ

రేకు: 0048-1 రామక్రియ సంపుటం: 06-037

పల్లవి: వెఱవక యింత విన్న వించఁగలమా నీ
మొఱఁగులు మానర మొక్కేము నీకు

చ. 1: దేవతలిందఱు నీకుఁ దిరిగి తిరిగి మ్రొక్కి
దేవుండవు నిన్నుఁ దిట్ట వచ్చునా
గోవిందుఁడవైన నీకొయ్యతనాలకుఁ గడు
మోవనాడ వెఱతుము మొక్కేము నీకు

చ. 2: చెలువుగ నజుఁడు పూజించె నీపాదాలు
తొలఁగక కాల నేఁ ద్రొక్క వచ్చునా
కలికితనముల వికారపుచేతల నా
మొలనూలు వట్టకురా మొక్కేము నీకు

చ. 3: ఒక్కటై శ్రీసతిఁ బాయకుండ నీవురమున
మొక్కలపు నాగుబ్బలు మోవ వచ్చునా
చక్కని వేంకటగిరిస్వామి నన్నుఁ గూడితివి
మ్రొక్కిన మొక్కుల మారు మ్రొక్కేము నీకు

రేకు: 0048-2 శ్రీరాగం సంపుటం: 06-038

పల్లవి: తనివి దీరక నన్ను తమకమున నెంతేని
చెనకేవు వద్దు నీ చిత్తమిఁక నోరి

చ. 1: దంటవై నాచేతఁ దలఁపించు కొనఁగ దొర
కొంటి వింక నిది నీకు కొలఁదిఁ బడునా
నంటున నా ప్రియము నాఁటిలను నిన్నునా
వెంట ద్రిప్పక నిన్ను విడుతునా వోరి

చ. 2: గబ్బివై నావాలుఁ గనుఁగొనల నవ్వులకు
నుబ్బేవు నీవు నీ వొడఁబడికల
నిబ్బరపు నావలపు నెలకొన్న యపుడేని
అబ్బురంబగు గర్వమణఁచనా వోరి

చ. 3: మెట్టుకొని నీవు నామెఱుఁగుఁ బయ్యద చెఱఁగు
పట్టేవు నీకు నీపరిణామమమా
దిట్టవై కూడితివి తిరువేంకటేశ్వరుఁడ
యిట్టట్టు నిన్నుఁ బోనిత్తునా వోరి

రేకు: 0048-3 లలిత సంపుటం: 06-039

పల్లవి: బాల బొౌమ్మచారివి పట్టుపువికారివి
ఓలినీ వెవ్వరిఁగన్నా నూరకుండేవా

చ. 1: దొౌంగిలి వెన్నలుఁ బాలు దొౌడికేటినీచేయి
ముంగిట నిధానమున్న మోసపోయీనా
చెంగట నిన్నెవ్వరైనాఁ జెనకి నవ్వీననూ
అంగవించి కొౌనగోర నంటకుండేవా

చ. 2: సిగ్గరి గొౌల్లెతలపైఁ జిమ్మిడి నీ చూపు
బగ్గన నిచ్చున చోటఁ బారవేసేవా
దగ్గరి నిన్నెవ్వరైనాఁ దగులనాడిననూ
ఎగ్గెఱుఁగ కెందుకైనా నేఁగకుండేవా

చ. 3: కొౌమ్మల చీరలు దీసుకొౌని యున్న నీవూ
దిమ్మరి చేఁతల నిట్టె దిగఁ దోసేవా
క్రమ్మర నావలెనె వేంకటగిరి విభుండా
బిమ్మిటిగాఁ గూడి ప్రేమ పెంచకుండేవా

రేకు: 0048-4 సామంతం సంపుటం: 06-040

పల్లవి: విట్ఠలయ్య వీధికేఁగి వేగవచ్చెవో
కట్టుఁగాలు వలసొంపు గందువు గాని

చ. 1: దూపిలి నొచ్చితివి తొయ్యలి మెచ్చితివి
భూపతి చెరువు దాఁకాఁ బోయిరా రాధా
యేపు మీర నీఁదులాడి యింతుల నిండ్దరిఁ గూడి
వైపుగాఁగ మాపటెంత వత్తువు గాని

చ. 2: యెండ దాఁకితివి కడు నిచ్చల రచ్చలు సేసి
కొండచరిఁబొలమోరఁ గూరుచుంటివో
కొండలెక్కి కడునిక్కి కూరుముల నాకు దక్కి
బొండుమల్లెల తోఁటకుఁ బోదువుగాని

చ. 3: విజయనగరములో వీధుల వీధుల వెంట
భుజమురికలతోడఁ బొద్దువుచ్చెవో
త్రిజగములు నేలిన తిరువేంకటేశుండ
భజన నిలిచితి భూపతి చెరువుకాడను

రేకు: 0048-5 దేసాక్షి సంపుటం: 06-041

పల్లవి: ఇచ్చకపు మాటాలా యేతులాఁడా కడు
పచ్చిదేరే మే నెల్లఁబట్టకు నన్నింకనూ

చ. 1: దండగాఁగ మెడఁగుచ్చి తగిలించుకొంటివి
అండనుండే వారు చాల కాపె నొకతె
వెండియు నంతటఁ బోక వేగునంతకు నాడనే
పండి వచ్చితివి చాలు పట్టకు నన్నింకను

చ. 2: పొద్దు వొద్దునకు తలఁబూజించుకొంటివి
వద్దనక యాకెమీఁది వాఁడుఁబువ్వులూ
ముద్దు సేసి యాకె తావి ముక్కు వాయ నియ్యనీ
పద్దుల మాటలె చాలు పట్టకు నన్నింకను

చ. 3: చిందనీక యాకె మేని చిఱుఁజెమ టెల్లను
పొందుగ నామీఁదం దెచ్చి పూసినాఁడవూ
కందుఁగాక మేని వేంకటగిరి విభుఁడ నీ
పందెపుఁ గూటమే చాలు పట్టకు నన్నింకను

రేకు: 0048-6 సామంతం సంపుటం: 06-042

పల్లవి: ఎంత మేలు చేసినదో యేమిచెప్ప చిత్త
మంతయు నీకిచ్చిన యొయ్యారి యెవ్వతెరా

చ. 1: దాడింబ పువ్వులవన్నె తళుకుఁబయ్యెద కొంగు
వేడుకతో వల్లెవాటు వేశి
గోడనిక్కి చూచి తనకొప్పు చెంగలువబంతి
నోడక వేసినయట్టి యొరపరెవ్వతెరా

చ. 2: కంకణాల మెఱఁగుల కరము లొయ్యన యిరు
వంకల చెలలుమీఁద వైచి
కొంకక తమలపాకు కొనవంక గఱచి నీ
వంక చూచి సన్న సేసె వనిత యెవ్వతెరా

చ. 3: పిక్కటిల్లునట్టి తన బిగువుఁజన్నుల కాంతి
వెక్కసమై యిరువంక వెడల
యెక్కువతోఁ దిరువేంకటేశుండ నిన్నుఁ గూడి
చెక్కునొక్కి కౌఁగిలించ్చె చిత్తణి యెవ్వతెరా

రేకు: 0049-1 గౌళ సంపుటం: 06-043

పల్లవి: అల్లవాఁడే వాఁడల్లవాఁడే
యెల్ల లోకములకుఁ దానేలికైనవాఁడు

చ. 1: దొడ్డమేఁక పాలగూడు దోమటి దొడికినాఁడు
గడ్డువయసగు బిడ్డగన్నవాఁడు
నడ్డి ముక్కుతోడ వెట్టి నవ్వులు నవ్వినవాఁడు
అడ్డపాపఁడై యున్న ఆకుమీఁదివాఁడు

చ. 2: ఆలి యిల్లు బొడ్డుతోడ నంటఁగట్టుకొన్నవాఁడు
కోలలేక లోకమెల్లఁ గొలిచినాఁడు
కాలువగా మింటి నీరు కాలఁదన్ని తీసినాఁడు
నేలకింది పరపుపై నెలకొన్నవాఁడు

చ. 3: మించుల మించుల వన్నె మెకము నేసినవాఁడు
దంచేటి కైదువచేఁదనరువాఁడు
కంచముగా గొల్లవారి కడవలపాలెల్ల
వంచుకొని దోసిట వారవట్టువాఁడు

చ. 4: పోటుమీరిన యసురపురము లిన్నియుఁ జొచ్చి
వీటిబుచ్చి దుమ్ములుగా వేసినవాఁడు
బూటకపు సురలతోఁ బున్నమ కప్పురమున
కూటువగాఁ జాపకూడు గుడిచినవాఁడు

చ. 5: అల్లిందామరల పొందులైన కన్నులవాఁడు
తల్లిఁ గూఁతుఁ గౌఁగిటఁ దగిలినాఁడు
చల్లనైన వేంకట శైలముపై నున్న
నల్లని మేనివాఁడు నవ్వుమోమువాఁడు

రేకు:	0049-2 సామంతం	సంపుటం:	06-044

పల్లవి:	మనసునఁ బొడమిన కోపము మనసునకంటెనుఘనమఁట
	మనసిజుఁడుద్బోధకుఁడఁట మాటల పని యేల

చ. 1:	దవ్వుల కొండల పవనుఁడు తనుతాప ప్రేరకుఁడట
	నవ్వులఁ బుట్టిన చూపులు నాటెడి యమ్ములఁటా
	పువ్వులు సోఁకిన యంతనే పొక్కెడునఁట దేహంబులు
	యెవ్వఁడెఱుంగును ఈవిధమేమని చెప్పుదమూ

చ. 2:	చక్కఁదనములఁట గుండెలు జల్లనం జేయఁగలవఁట
	మక్కువలఁట దేహంబులు మరవఁగఁ జేయునఁటా
	కిక్కిఱిసిన తమకంబులు క్రిందును మీఁదు నెఱుఁగవఁట
	ఔక్కల పులుగుల పలుకులు ఊఁపెడువుండ్లఁటా

చ. 3:	సంతసములుఁ జతురతలును సౌభాగ్యవిలాసములును
	మంతనములు మోహంబులు మందులసంచులటా
	యింతటికిని తగుమూలం బీవేంకటవిభుఁడట
	యింతి తలంపునఁ గలుగుట లిఁక నెన్నఁగనేలా

రేకు: 0049-3 కన్నడగౌళ సంపుటం: 06-045

పల్లవి: హరి రసమవిహారి సతు
సరసోయం మమ శ్రమసంహారీ

చ. 1: దయానివృతతనుధారీ సం
శయాతిశయసంచారీ
కయా ప్యజితవికారీ
క్రియావిముఖ కృపాణధారీ

చ. 2: సదా మిథ్యాజ్ఞానీ స తు
మదాలి మతాభిమానీ
తదాశ్రితసంధానీ స తు
తదా తదా చింతాశయనాని

చ. 3: పరామృతం సంపాదీ
స్థిరానందాస్వేదీ
వరాలాపవివాదీ శ్రీ
తిరువేంకటగిరి దివ్యవినోదీ

రేకు: 0049-4 సామంతం సంపుటం: 06-046

పల్లవి: తత్తా తిగుడి దింధి తక దింధిం
తిత్తి తిత్తితి తితి తితి తితి

చ. 1: దానవవదనవితానదాన సం
ధాన రుధిరనిజపానమిదం
నానా భూతగణానాం గానం
దీనజనానాం తిత్తితి తితి

చ. 2: విమతదనుజమత విభవ పరిభవిత
సమధికం తవ శౌర్యమిదం
ప్రమదా భవ్యం ప్రమదాభరణం
తిమిరనిరసనం తిత్తితి తితి

చ. 3: తిరువేంకటగిరి దేవనిధానం
పరమామృతరసభాగ్యం మిదం
కరుణావరణం కమలాఘటనం
తిరొ తిరొ తిత్తితి తితి తితి

రేకు: 0049-5 నాట సంపుటం: 06-047

పల్లవి: తిరొ తిరొ జవరాల తిత్తి తిత్తి యీా
తరలమైన నీత(తా?)రహార మదురే

చ. 1: ధిమి ధిమ్కి తోంగ తోంగ దిద్ధిమిక్కి ఆరే
మమారే పాత్రరావు మజ్జా మజ్జా
కమలనాభుని తమకపుటింతి! నీకు
నమరెఁదీరుపు ఇదే అవధరించఁగదో

చ. 2: ఝుకజక్క జంఝుం ఝుణణకిణాని
ప్రకటపు మురువొప్పె భళాభళా
సకలపతికి సరసపుగొమ్మా నీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెములా

చ. 3: మాయిమాయి యలమేలుమంగ నాచ్చారి మతిఁ
బాయని వేంకటపతి పట్టపురాణి
మ్రోయఁ జిరుగజ్జెలా నీ మ్రోత లానేని
సోయగమైన నీ సొలపుం జూ పమరే

రేకు: 0049-6 శ్రీరాగం సంపుటం: 06-048

పల్లవి: అతిశోభితేయం రాధా నతతవిలాసవశా రాధా

చ. 1: దప కబలబోధా రాధా తపణ గంధవిధా రాధా దప్ప
యుతక్రోధా రాదా దప్ప కరసవేధా రాధా

చ. 2: తారితావరోధా రాధా తారుణ్యోద్బోధా రాధా
ధారితానురోధా రాధా దారితాపరాధా రాధా

చ. 3: తరుణీమరుగాథా రాధా ధరసమకుచబాధా రాధా
తరుణసదనుబోధా రాధా ధరణిదుస్సాధా రాధా

చ. 4: తనుభవగురుగాథా రాధా స్తనకృతగిరిరోధా రాధా
తనువరవచనసుధా రాధా ధ్వనిజితపికమేధా రాధా

చ. 5: తరుణసఖీసవిధా రాధా దరశశిరుచిసాధా రాధా
తరళితతటిద్విధా రాధా దరహసనవరోధా రాధా

చ. 6: ధనగర్వ నిషేధా రాధా స్తవతత్పరవిభుధా రాధా
ద్రవధునీకృతసుధా రాధా దవమదనవ్యాధా రాధా

చ. 7: తరుణత్వ పురోధా రాధా తరుణస్మరయోధా రాధా
తరుపశుమణిగుణధారక బహుల వి తరణపరా బహుధా రాధా

చ.8: దైవికసుఖోపధా రాధా ద్రావకనిజాభిధా రాధా
శ్రీవేంకటగిరిదేవకృపాముదావైభవ నాథా రాధా

రేకు: 0050-1 ముఖారి సంపుటం: 06-049

పల్లవి: ఏమి సోద్యం బిదియు నెన్న నాశ్చర్యంబు
కామాతురులకుఁ జీఁకటి వెన్నెలాయె

చ. 1: ధవళమగుకలుహారదళ నఖంబులచేత
యువతి కుచగిరులఁజంద్రోదయం బాయె
తివిరి ముఖచందురుని తెలివి యౌవనసుధా
ర్ణవమునకు సురతమథనంబు ఘనమాయె

చ. 2: తొడరి నవఘమ బిందువుల వానలు గురియుఁ
గడఁగి కచనీల మేఘము గారుక్రమ్మె
విడువ కిటుసంతసపు వెల్లి పై పై నిగుడ
కడిది నిట్టూర్పుఁ సురగాలి వీతెంచె

చ. 3: తలకొన్న సాత్త్వికోదయముచేఁ బరవశం
బలమి సౌఖ్యములు దెలివి పడదాయె
వలచి తిరువేంకటేశ్వరునిం బొందిన మరుని
తలఁపు లన్నియును ముందర వెనుక లాయె

రేకు: 0050-2 ముఖారి సంపుటం: 06-050

పల్లవి: కొమ్మమనసు దెలియరాదు కోర కలరఁగోనేటి
తిమ్మని తలంపులెల్లఁ దెలియ నెవ్వరివసమురా

చ. 1: నిన్నుఁ దలఁచి పులకరించి నెలఁత చలి యటంచుఁజెలుల
కన్ను మొఱఁగి పయ్యద కొంగున కప్పు నొయ్యన దేహము
సన్నపుఁ జెమట నొసలఁ బొడమగన్నులు దేలగిలఁగఁజొక్కుచు
మిన్నక మదన మెత్తె ననుచు మెలుఁత తమ్ముల ముమియ

చ. 2: వెక్కసమైన యూపుఁ గముల వెల్లువ లొయ్యన నిలిపి నిలిపి
పుక్కిట నించి గుబ్బలమీఁద పొలయఁ జెమట లార్చును
మిక్కుటమైన కన్నులనీరు మెఱుఁగు రెప్పలతుదలనాన
చుక్కలం జూతమనుచు లేచి సుదతిమాయలు నేసును

చ. 3: చెక్కిట నీవు సేసినముద్దుల చేఁతలు చెలుల కెల్ల మొఱఁగి
చెక్కునఁజెయి మోపుఁకొనుచు చెలియ యొయ్యనె గప్పుదు
యిక్కు వెఱింగి వేంకటాచలేంద్ర నీవు రమణిఁ గలసి
చొక్కపుఁజేఁతల నుల్ల మరసి చొక్కఁ జేసి తౌదురా

రేకు: 0050-3 పాడి సంపుటం: 06-051

పల్లవి: రమ్మనవే మాని రచనలు తా
నెమ్మదిఁ గూడిన నేఁడే రేపు

చ. 1: నల్లని మేనికేలే నడురేయి తన
తెల్లని కన్నులకేలే తెల్లవాఱిను
కల్లజంపులు సేసి కాఁకలఁ దా
బల్లిదుండై తేఁ బగలే రేయి

చ. 2: సిగ్గుల మోము కేలే చిఱునవ్వు తన
నిగ్గుల చూపులకేలే నెరసులు
దగ్గఱి యింకా నేలే తమకము తా
వెగ్గలము వలచిన వెలియే లోను

చ. 3: తావులమేనికేలే తాపము తన
కావులకన్నుల కేలే కనరులు
శ్రీవేంకటపతి చెలువుండిట్లే
కావలె నంటే కడయే నడుము

రేకు: 0050-4 శ్రీరాగం సంపుటం: 06-052

పల్లవి: కొల్లవలపులు చేకొనరాదా కడు
మెల్లని మాటాడరాదా మెకురేల సేయును

చ. 1: నిక్కి నిక్కి చూచెఁగా నీవంక నెవ్వతో
మొక్కిన ఱెప్పల నింపు ముంచిముంచి
ఇక్కడ నీవుండఁగాను ఎంత గోపించునో
గ్రక్కున విచ్చేయరాదా కడుఁ దడవాయెను

చ. 2: కన్ను సన్న జేసిన కలికి య దెవ్వతో
సన్నపు నవ్వులు నీపైఁ జల్లిచల్లి
ఎన్నరాని కాఁకలను ఏమిచేసునో నిన్ను
వన్నెలాఁడి నిను నింత వలపించుకొన్నది

చ. 3: కొప్పు గడు దీచి తనకొనగొళ్ల నెవ్వతో
చెప్పరానిసిగ్గు నీపైఁ జిమ్మి చిమ్మి
యిప్పడె శ్రీవేంకటేశ యింతిం గూడుకొంటి వౌర
యెప్పుడుఁ బాయక మమ్ము నిక్కడ నీవుండరా

రేకు: 0050-5 సామంతం సంపుటం: 06-053

పల్లవి: తగని మాటలేలె తలపోఁత లవి యేలె
తెగు వేలె యిటువంటి దిట్టతన మేలె

చ. 1: నున్నని చెమట లేలె నొసలఁ బట్టిదియేలె
చిన్నఁబోయియుండనేలె చెక్కిటఁ జేయేలె
విన్నని నగవు లేలే వెరగుఁజూ పిదియేలె
కన్నులఁ గోప మదేలె కాఁతాళమేలె

చ. 2: వ్రేకపుటూరుపు లేలె వెచ్చని మే నిదియేలె
తాఁకియుఁ దలఁచ వదేలే దప్పిదేర వదేలె
చీఁకటి ద్రవ్వెదవేలె చీజినఁ బలుకవేలె
ఆఁకలిదడవవేలె అవలిమోమేలె

చ. 3: కొప్పు వదలిన దేలె గుబ్బలపై జీర లేలె
దప్పులు మోమున నేలె తడఁబాటు లేలె
చెప్పక దాఁచెదవేలె చెలియరో తిరువేంక
టప్పునిఁ గలసి మమ్ము నణఁకించె వేలె

రేకు: 0050-6 శ్రీరాగం సంపుటం: 06-054

పల్లవి: మగవాఁడు మాయకాఁడు యీ
జగడంపుం జనవులు సతములౌనాయమ్మ

చ. 1: నిండిన నీమది నాతఁడు నిజముగ
నుండంగానే ఉడికే వేలె
అండల యాసల నాఁకలా యిటువంటి
యెండ చూపులను దప్పులేల తీరునోయమ్మ

చ. 2: మందపు నవ్వుల నాతఁడు మాటలు
చిందంగానే చిమిడే వేలె
అందియు నందని యాసల నిటువంటి
చందమామగుటకలు సతము లవునా యమ్మ

చ. 3: కలికి వేంకటరాయఁడూ కౌఁగిట
నలరంగానే అలసేవేలె
చెలువఁ డాతతి చేఁతల నిటువంటి
తొలు మించు మెఱుఁగులు తొడవులౌనాయమ్మ

రేకు: 0051-1 శుద్ధవసంతం సంపుటం: 06-055

పల్లవి: లోనివారి మొఱఁగేటి లోకదొంగవు కనిం
గాననట్టె రాకు మామంగారు వినేరు

చ. 1: వడికి రేయివచ్చి నాతోడనే కడు
వెడమాటలాడేవు వేసదారివి
కడఁగి యిందాఁకా నెక్కడనుంటివో మాట
కడునాడకుర మామంగారు వినేరు

చ. 2: తొట్టెల పాపఁడ వింతె తొడ్డవాఁడవూ చల
పట్టి నాతొడలమీఁదఁ బవ్వళించేవు
పట్టకుర నాచెలఁగు బలిమీ నీవు మొల
కట్టురవములు మామంగారు వినేరు

చ. 3: పగ సాధించ వచ్చిన పంతగాఁడవూ ఈ
వగఁబట్టి మంచ మెక్కి వానిఁ జూసేవూ
నగకురా వేంకటనాథ నీవు మేను
గగురు పొడిచి మామంగారు వినేరు

రేకు: 0051-2 శంకరాభరణం సంపుటం: 06-056

పల్లవి: గుఱు తెఱిఁగిన దొంగ కూగూగు వీఁడె
గుడిలోనె దాఁగేని కూగూగు

చ. 1: నెలఁతల దోఁచేని నీళ్లాడఁగానె
కొలని దరిని దొంగ కూగూగు
బలువైనవుట్ల పాలారగించేని
కొలఁది మీఱిన దొంగ కూగూగు

చ. 2: చల్ల లమ్మంగ చనుకట్టు దొడికేని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిల్లు దప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు

చ. 3: తావుకొన్న దొంగఁ దగిలి పట్టుండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీ వేంకటగిరి చెలువుండొ యేమొ
కోవిదుఁడగు దొంగ కూగూగూ

రేకు: 0051-3 నాదరామక్రియ సంపుటం: 06-057

పల్లవి: మనములోని విభుఁడు మఱవఁడే కాలంబు
నినుఁగలయునున్నాఁడు నీకేలె వెఱవ

చ. 1: నెలనాళ్లవాఁ డొకఁడు నిర్మలంబైన రె
న్నెలలవాఁ డొకఁడు మూన్నెలలవాఁ డొకఁడు
నెలలు పండ్రెండ్డైన నిజబాలుఁ డొక్కండు
నెలఁత యింతటి పనికె నీకేలె వెఱవ

చ. 2: ప్రొద్దుపొడుపుల దొకటి ప్రొద్దు గ్రుంకుల దొకటి
ప్రొద్దువ్రొద్దులకు రహిపొయ్యేటి దొకటి
పొద్దెటింగిన దొకటి పొద్దెఱుంగని దొకటి
నిద్దంపుఁ బువ్వులకు నీకేలె వెఱవ

చ. 3: నిండుఁ జంచల మొకటి నిమిషమాత్రము దొకటి
వుండి నట్లనె వుండి వుడి వోపునొకటి
కొండలలో నెలకొన్న కోనేటిరాయండు నీ
నిండుఁ గౌఁగిటఁ గూడె నీ కేలె వెఱవ

రేకు: 0051-4 సామంతం సంపుటం: 06-058

పల్లవి: యెన్ని మారులు యిట్టె నీపనులు
ఇన్ని మాయలు నన్ను నేఁచనేఁటికిరా

చ. 1: నీళ్లే నమలేవు నీలోనె సన్నల
వేళ్లే చూపేవు వెలుపలికి
పేళ్లె తప్పేవు బిరుసుగ నింతేసి
గోళ్ల రాచేవు కోపమేఁటికిరా

చ. 2: మేనె దాఁచేవు మెస్తిర గొడ్డలి
నానం బెట్టేవు నయముననే
పోని తెరువుల పోకులఁ బోయేవు
కానిరా యేటివంకలు తిద్దవశమా

చ. 3: చేరి కపటాలె చేసేవు యిఁకనైనా
సారెం బరువులు చాలించరా
ధీరుండవుగాన తిరువేంకటపతి
కూరి మెఱిఁగి నన్నుఁ గడితి విపుడూ

రేకు: 0051-5 ముఖారి సంపుటం: 06-059

పల్లవి: ఏడకేడ యెంతకెంత యెక్కడికి నెక్కడ నీ
తోడ నలుగఁగ నంత దొడ్డదాననా

చ. 1: నాకు నీకు నేమి వోదు నాఁడె నాఁటి కాయెఁబోయె
పోకుమంటా నాఁగేవు పొద్దువోదా
పైకొన చుట్టుటికానం బగ సాధించఁగ నీకు
లోకము లోపలను మెలుంతలు లేరా

చ. 2: నన్ను నేల చెనకేవు నా తెరువు నీకునేల
నున్నట్ల చక్కఁజాడ నుండరాదా
కన్నుల లేనగవుల కసరుల జంకెనల
సన్నలఁదిట్టఁగ నే నీ సరిదాననా

చ. 3: నాదెస యేమి చూచేవు నమ్మిక బాసలె చాలు
సేద దేర నేమైనాఁ జేయరాదా
ఆదరించి నన్ను వేంకటాద్రీశ కూడితివి
కాదన నీకంటె నేఁ జక్కని దాననా

రేకు: 0051-6 రామక్రియ సంపుటం: 06-060

పల్లవి: బిడ్డఁ డంటా నమ్మి యెట్టు వెట్టుకొన్నా రిందుకంటె
గొడ్డువో మేలు యిట్టి కొత్త లెందుఁగలవా

చ. 1: నోరనిండాఁ జన్ను లేక నొగిలెడిఁ బాప మయ్యో
ఊరివారిపాపఁ డఁటా నొకయింతి
నేరుపునం జన్నియ్యంగ నెత్తు రెల్లఁ దాగి తాగి
గోరపెట్టి చంపె నిట్టి కొత్త లెందుఁగలవా

చ. 2: ఎత్తుకొనేవారు లేక యేఁకరే నటంచు నొక్కఁ
డెత్తుకొని వేడుకతో నేఁగఁగానే
బత్తిగలవానివలె ప్రాణము వోయినదాఁకా
కుత్తుక బిగించె నిట్టి కొత్త లెందుఁగలవా

చ. 3: నిప్పు వలె నెండగాయ నీడలే దటంచుబండి
యొప్పుగం జాటిడి తనకుండంగానే
అప్పుడు వేంకటరాయఁ డడ్డపాపఁ డరకాల
కుప్పవడఁ దన్నె నిట్టి కొత్త లెందుఁగలవా

రేకు: 0052-1 శుద్ధదేశి సంపుటం: 06-061

పల్లవి: వెన్నెలల బయట వేడుకకాఁడ
యిన్నే సిలాగుల నెలయించితిగా వోరి

చ. 1: నగుతానె సారెసారె నాతో నీవింతేసి
పగటులు నెరుపేవు బాపురా
తెగి నిన్నుఁ జూడలేను తెమలకుండఁగలేను
సగము బీరము నాపైఁ జల్లితిగావోరి

చ. 2: నయమున నిట్లనె నన్నుఁ గడుఁ గరఁగించి
బయ లీఁదించం జూచేవు బాపురా
నియమించలేను నిన్ను నిమిష మెడయలేను
ప్రియము భయము నాపైఁ బెట్టితిగా వోరి

చ. 3: తక్కులనే పెట్టి పెట్టి తనివి దీరని నీ
పక్కఁబాయ నియ్యవైతి బాపురా
చక్కని వేంకటగిరిస్వామి నీపాదాలకే
మొక్కఁగానే యింపులు ముంచితిగావోరి

రేకు: 0052-2 ఆహిరి సంపుటం: 06-062

పల్లవి: ఎటువంటి బిడ్డండె యితఁడు
ఇటువంటి వయసుననె యిట్లఁజేసీని

చ. 1: నడుఁక కెటు నీటిలోననె యీఁదులాడేని
తడవి పట్టెదమనిన దాఁగిపోయీని
తడఁబడక నేలగుంతలువోవఁ దవ్వీని
కడపమీఁదనె వుండి కదలఁడెప్పుడును

చ. 2: కలిమిలే మెఱుంగఁడిదె కల వెల్ల నడిగీని
చలమ రెవ్వరినైనఁ జావ నడిచీని
అలయ కడవులవెంట నాటలకే తిరిగీని
తొలఁగకిటు గిరులెక్కి దుముకు లాడీని

చ. 3: విచ్చన విడినె తడువు విడిచి పారెడిని
రచ్చలనె యింత గుబ్బము వంటికొడుకు
దిచ్చరీఁడై యిట్లు దిరువేంకటేశ్వరుండు
నిచ్చ నిచ్చలును గడుఁబెచ్చు వెరిగీని

రేకు: 0052-3 లలిత సంపుటం: 06-063

పల్లవి: బాలుండై రేపల్లె లోపల
నాలరియాటలె యాడెనే యితఁడు

చ. 1: నెలఁతల సన్నపు నెన్నుదుళ్లపై
నెలయింతలరతి నిలు గట్టి
కెలపుల నును జంకెనలనె కలయుచు
నలరి బొమ్మ పెండ్లాడెనె యితఁడు

చ. 2: గుబ్బల మెఱుఁగుల గురుగులలోపల
నుబ్బనానఁబాలొగి నించి
ఒబ్బిడి గాఁ బెదవులనే నమలుచు
నబ్బిన యాటలె యాడెనే యితఁడు

చ. 3: ఎప్పుడు నిటువలె నిండ్లు గట్టుక
కప్పుర గందులఁ గలయుచునూ
తెప్పలఁ దేలుచుఁ దిరువేంకటగిరి
యప్పఁడు మహిమల నాడెనె యితఁడు

రేకు: 0052-4 భైరవి సంపుటం: 06-064

పల్లవి: అమ్మమ్మ యేమమ్మ అలమేల్మంగ నాచారమ్మ
తమ్మి యింట నలరుకొమ్మా వోయమ్మా

చ. 1: నీరిలో నాఁదల్లడించి నీకే తలవంచి
నీరికిందాఁ బులకించి నీ రమణుండు
గోరికొనఁ జెమరించి గోపమే పచరించి
సారెకు నీయల కిట్టె చాలించవమ్మా

చ. 2: నీకుఁగానె చెయిజాఁచి నిండాఁ గోపమురేఁచి
మేకొని నీవిరహాన మేను వెంచేని
యీకడాకడి సతుల హృదయమే పెరరేఁచీ
నాకు మడిచియ్యనైనా నానతియ్యవమ్మా

చ. 3: చక్కఁదనములె పెంచి నకలముఁగాల దలంచి
నిక్కపు వేంకటేశుండు నీకె పొంచేని
మక్కువతో నలమేల్ మంగనాచారమ్మా నీ
యక్కున నాతని నిట్టె అలరించవమ్మా

రేకు: 0052-5 శ్రీరాగం సంపుటం: 06-065

పల్లవి: చిఱునవ్వు మెఱుఁగారు సిగ్గుల మోముతోడ
మరగె నిన్నలమేల్మంగ నాచారి

చ. 1: నిలువుఁదురుము మీఁది నెమలిపాదపుడాలు
తొలి మెఱంగుల మించి దొలఁకఁగాను
అలరుచు నినుఁ జూచి అప్పుడె వెరగువడి
మలయుచు నలమేలుమంగ నాచారి

చ. 2: పరగునీమెడ సరపణులవుయ్యాలలో
ఉరుటు మురిపమున నూఁగుచును
గిరికొన్న తమకాన కిందుమిఁదెఱుఁగక
మరచె మే నలమేలు మంగనాచారి

చ. 3: కంచము గని మోవి కమ్మఁదేనే లారగించి
లంచముగఁ గస్తూరి లప్పలు రాల
యెంచఁగఁ దిరువేంకటేశుఁడు నీ పాఁపసజ్జ
మంచమెక్కె నలమేల్మంగనాచారి

రేకు: 0052-6 శంకరాభరణం సంపుటం: 06-066

పల్లవి: నీడల చూపులు నీకేలే యీ
వాడక వాడెడి వడ నీకేలె

చ. 1: నిలువుల నటనలు నీకేలే యీ
నిలుగుల నడపులు నీకేలే
నెలవులకరఁగులు నీకేలే యీ
కులికెటి నును సిగ్గులు నీకేలే

చ. 2: నెఱుల చెదరులివి నీకేలే యీ
నెఱవగు చదరులు నీకేలే
నెఱతనపుసరులు నీకేలే యిదె
చెఱఁగునమూసెదు చెలి నీకేలే

చ. 3: నిక్కపుఁబోఁకులు నీకేలే యిదె
నిక్కలగంటివి నీకేలే
నిక్కితి వొరపుల నీకేలే యిదె
దక్కె వేంకటోత్తముఁడు నీకేలే

రేకు: 0053-1 హిందోళవసంతం సంపుటం: 06-067

పల్లవి: నన్నేల యేఁచేరే నగుబాట్లు
అన్నింటా నాకె ఘనమై యుండుఁగాక

చ. 1: నాకేలె యీసింగారాలు నాకేలె యీనటనలు
ఆకడ నాతఁడు సుఖ మందఁగాను
కైకొనె నాతని చెంతఁ గల దెల్ల నా మనసు
ఆకె పట్టపు దేవు లై యుండుఁగాఁక

చ. 2: నేనేలె యాతనికి నేనేలె బాలకిని
ఊనిన సుఖమునందా నుండఁగాను
కానిక లాకె నవ్వులు కన్నులఁ బట్టఁగను
ఆనేరుపులే చవులై యుండుఁగాక

చ. 3: వద్దేలే నాతోడి పొందువద్దేలే తనకు
ఒద్దిక లక్కడం గలి గుండంగాను
గద్దిరియై కలసి వేంకట విభుండు
అద్దొ యింకా నన్ను నణకించుంగాక

రేకు: 0053-2 సామంతం సంపుటం: 06-068

పల్లవి: కస్తూరి వాట్లం గరంగేవు మ్యెఁ
గస్తూరి నాతనిం గమ్మంగ రాదా

చ. 1: నీరు వసంతం నీపైఁజల్లిన
మారు కుమారు రమణి నీవు
సారపు నీరతి జవ్వాది చెమటల
నీరాతనిపై నించంగరాదా

చ. 2: పువ్వులు నీపై బొలుపుగఁ బోసిన
నెవ్వ దీఱఁగ నీవతని
రవ్వగు నీ వుపరతులఁ గూడి తల
పువ్వులతని దిగఁ బోయఁగ రాదా

చ. 3: పంకజమునఁ దాఁ బైకొని చేరి
వెంకటపతి నిను వేయఁగను
కొంకక నిరతింగూడి నీవు ముఖ
పంకజ మాతనిఁ బైకొనరాదా

రేకు: 0053-3 దేశాక్షి సంపుటం: 06-069

పల్లవి: మదవికారములు మానేవో, నా
యెదురనె నీవు నేఁ డింకాఁజేసేవో

చ. 1: నందవ్రజములోన నాఁడు నీవు గొల్ల
మందల మగువల మరగించీనా
మందులుమాయలు మఱచితివో, యిప్పు
డిందూ నామీఁద నింకాఁ జేసేవో

చ. 2: నలినాప్తకులుఁడవైనాఁడు నీవు ఇంతిం
గలకాలమెల్ల నంగడిబెట్టినా
మలినపు మాటలు మఱచితివో నన్ను
నెలయించి కాఁకల నింకా సేపేవో

చ. 3: నరసింహుఁడవై నాఁడు నీవు పెక్కు
మురిపెంపు వికారములఁ బోయినా
తిరువేంకటేశ పొందితివి నన్ను నీ
యిర వైన యీా చేఁత లింకాఁ జేసేవో

రేకు: 0053-4 వరాళి-ఏకతాళి సంపుటం: 06-070

పల్లవి: ఇప్పుడిటు విభుఁ బాసి యింతలోననె నేఁడు
తప్పు లోపలి తప్పు దైవమా చెలికి

చ. 1: నగవు లోపలి యలపు నంపైన పొలయలుక
పగటు లోపలి వెరగు పచ్చివేఁడి
మొగము కాంతుల మెఱపు ముంచు నలకల చెదరు
పగలు చీఁకట్లాయె బాపురా చెలికి

చ. 2: బలిమి లోపలి భయము పలుకుఁదేనెల కనరు
చెలిమి లోపలి చేఁదుచింత చెలికి
బలుపుఁగుచముల లోని బట్టబయ లగు నడుము
కలిమి లోపలి లేమి కటకటా చెలికి

చ. 3: నిడుపు లోపలి కురుచ నీడలోపలియెండ
వడిమంచి తరువు విడువని తమకము
కడువేంకటేశ్వరుని కౌఁగిటను పరవశము
మడుఁగు లోపలి మైల మాన దీ చెలికి

రేకు: 0053-5 సామంతం సంపుటం: 06-071

పల్లవి: విరహపు రాజదె విడిదికి రాఁగా
సిరులఁ జేసె నిదె సింగారములూ

చ. 1: నెలఁత నుదుటిపై నీలపుఁగురులనె
తొలుతనె కట్టెను తోరణము
మొలకచెమటలనె ముత్యపు మ్రుగ్గులు
అలరిచె మదనుం డదె చెలిమేన

చ. 2: దట్టముగాఁ జింతాలతనే వడిఁ
బెట్టెఁ జప్పరము పెనఁగొనఁగ
పట్టినమైతావుల పరిమళములు
కట్టించెను చెంగట వలరాజు

చ. 3: విందగు వేంకట విభుని ప్రేమచేఁ
బొందుగఁ బెట్టెను బోనాలు
ఇందువదన కియిందిరావిభుని
కందుదేర నలుకలు చవిచేసె

రేకు: 0053-6 శ్రీరాగం సంపుటం: 06-072

పల్లవి: తెలియ దెవ్వరికిని దేవదేవేశ యీ
నెలఁత భావం బెల్ల నీవెఱుఁగు దిఁకనూ

చ. 1: నిలుచుఁ దలయూఁచుఁ గన్నీరు వాలిక గోళ్లఁ
జినుకు నివ్వెఱఁగుపడుఁ జింతించును
పులకించు నలయుఁ దలపోయు నినుఁ జిత్తమున
నిలువునంగన విధము నీ వెఱుఁగు దిఁకను

చ. 2: కమలంబు చెక్కుతోఁ గదియించు నెన్నుదుట
చెమటఁ బయ్యెదఁ దుడుచు సెలవినగును
తమకంపుఁగోరికలు తరుణి యిదె నినుఁబాసి
నిమిష మోర్వఁగలేదు నీ వెఱుఁగు దిఁకను

చ. 3: వెక్కసపు నునుదురుము వెడవదల నేరదు
చిక్కుదేరఁగఁ గొంతసిగ్గు వడును
ఇక్కువలఁ దిరువేంకటేశ నినుఁ గూడె నిదె
నిక్కమీ చెలివగల నీవెఱుఁగు దిఁకనూ

రేకు: 0054-1 పాడి సంపుటం: 06-073

పల్లవి: చింత లేమనుచుఁ జేసితివో
కాంతాళించియుఁ గదలదు మనసు

చ. 1: నిలువునఁ బులకలు నిండెను నామెయిఁ
దలపున నేమని తలఁచితివో
సొలసియు నినుఁ గడు సోఁకఁగ నాడఁగఁ
దలఁచియు నాలికఁ దగులదు మాట

చ. 2: తాపమె హృదయము దాఁకెం బయిపయి
చూపుల నేమని చూచితివో
కోపము కన్నులఁ గురిసి మోమున
నేపునఁ జిఱునగ వెడయదు నాకు

చ. 3: ఆఁగిన కుచముల నలసారఁగ నా
కౌఁగిట నేమని కలసితివో
రాఁగపు వేంకట రమణుని చెమటలఁ
దోఁగియు వేడుక దొలగదు నాకు

రేకు: 0054-2 సాళంగనాట సంపుటం: 06-074

పల్లవి: పలుకుఁదేనెల తల్లి పవళించెను
కలికితనముల విభునిఁ గలసినది గాన

చ. 1: నిగనిగని మోముపై నెఱులు గెలఁకులఁ జెదర
పగలైన దాఁకఁ జెలి పవళించెను
తెగని పరిణతులతోఁ దెల్లవాఱినదాఁక
జగదేకపతి మనసు జట్టిగొనెఁగాన

చ. 2: కొంగుజాఱిన మెఱుఁగు గుబ్బలొలయఁగఁ దరుణి
బంగారు మేడపైఁ బవళించెను
చెంగలువ కనుఁగొనల సింగారములు దొలఁక
నంగజగురునితోడ నలసినదికాన

చ. 3: మురిపెంపు నటనతో ముత్యాలమలఁగుపై
పరవశంబునఁ దరుణి పవళించెను
తిరువేంకటచలాధిపుని కౌఁగిటఁ గలసి
యరవిరైననుఁ జెమట నంటినదికాన

రేకు: 0054-3 సామంతం సంపుటం: 06-075

పల్లవి: మంటలంటా బెదరీని మాణిక్యాలు చూచి చెలి
యింటిలోనూ నెరవాయె నేమిసేతమే

చ. 1: నిండుఁబరితాపమున నీలపుమణులమేడ
నుండరాక దేహమెల్ల నుమ్మగించంగా
పండు వెన్నెలల మంచిబయట నిలిచిచెలి
యెండనవి తల్లడించె నేమిసేతమే

చ. 2: గ్రక్కనఁ జెలులుచేరి కప్పురపు బాగాలు
చెక్కువట్టి కదలించి చేతి కియ్యంగా
పొక్కుచుఁ జెలులఁ గన్ను బొమ్మలవిండ్లఁగోప
మెక్కువట్టి యేయ జూచి నేమిసేతమే

చ. 3: పాయక వేంకటపతి పచ్చఁబట్టు ముసుఁగులో
సోయగపు రతులను చొక్కుచునుండి
రాయడి నెవ్వతె పసపాయెనో పచ్చడమని
యేయెడ నైనా దూరే నేమిసేతమే

రేకు: 0054-4 పాడి సంపుటం: 06-076

పల్లవి: నెఱజాణ తనమూ నీ కింత కలదట
చిఱునవ్వు జెలికింత చింతైనవలదా

చ. 1: నిక్కమైన బిగువు నీకింత గలదట
చక్కనియింతికి వద్దా జడనైనాను
ఎక్కడో నీమనసు ఎంతైనఁ గలదట
చెక్కు మీఁద దరుణికిఁ జేయైన వలదా

చ. 2: నెలకొన్నకసరు నీ కింత గలదట
వెలఁదిమతికి వద్దా వెరగైనా
నిలువుఁజెలువమూ నీకింత కలదట
కలికి చెలికిఁ గొంత కాఁకైన వలదా

చ. 3: నీమేనివెరపూ నీ కింతకలదట
భామకు వద్దా తలప ట్టయినా
నేమము వేంకటేశ నీ కింతగలదట
కామినికి నింత వద్దా కౌఁగిట నీచనవూ

రేకు: 0054-5 సామంతం సంపుటం: 06-077

పల్లవి: ఎరవు గడు సత మాయె నిదియెకదవె
అరవీడుటే సొబగు లాయెఁ దురుమునకు

చ. 1: నిక్కముగ ననలమున నీరు జనియించెనను
టిక్కడనె పొడగంటి మిదియుఁగదవె
పొక్కుచును విరహాగ్నిఁ బొరలఁగాఁ జెలిమేనఁ
జిక్కఁ బైపైఁ బొడమె జవ్వాది చెమట

చ. 2: కలుగు ననలంబుకడ గాలి యనఁగా నదియు
నెలమి నిచ్చట కలిగె నిదయెకదవె
చెలఁగేటి చెలిమేనఁ జిత్త జాగ్నికిఁదోడు
నిలువ నియ్యక కలిగె నిట్టూర్పుగాలి

చ. 3: నీడల నెండలును నెయ్య మలరఁగఁ గూడు
టీడనే పొడగంటి మిదియుఁగదవె
వేడు కలరంగఁ దిరువేంకటేశ్వరుఁ గూడి
వాడుదేరఁగఁ గలిగె వనిత పరవశము

రేకు: 0054-6 భూపాళం సంపుటం: 06-078

పల్లవి: నిండిన యాసల యెండ నీడలాయె నేఁటికే
బెండువడ్డ మేనుఁదీగె బీరువోయెనేఁటికే

చ. 1: నుదురైనశశి నీచన్నుల కేల జాఱెనె
చెదరి నీముత్యాలు చెక్కుల కే లెక్కెనే
ముదిత నీతో సిగ్గు ముంగి లేల వెళ్లెనే
నిదురమానిన మోము నిగ్గులేల తోఁచెనె

చ. 2: బచ్చన నీ సింగారము బయలేఁటికాయెనే
ముచ్చట నీ మాటలకు ముసుగేల జాఱెనే
వెచ్చిన నీ మేని సొంపు వింతదోఁచె నేఁటికే
మచ్చిక నీకోరికలు మదమెక్కె నేఁటికే

చ. 3: చూపులు వెన్నెలమించుఁ జూరలాడె నేఁటికే
కోపపు నీజంకెనలగొనబాయె నేఁటికే
ఏపుమీఱి తిరువేంకటేశుఁ గూడి నీకుఁ
దాపలైనతలఁపులు దరిచేరె నేఁటికే

రేకు: 0055-1 వరాళి సంపుటం: 06-079

పల్లవి: నీకువలచిన సతికి నెగులు గలదా మీఁద
నీ కరుణ మఱవ కింతియు చాలును

చ. 1: నీ వంటి చతురునకు నిక్కంబుగా వలఁచి
జీవంబు విడిచినా సేగిగలదా
భావముల నినుఁదలచి పడఁతి యిట్లాయెనని
ఆవేళ నను దలఁచు మంతేచాలు

చ. 2: తగిలి నినుఁ బాసి సంతాపదావాగ్ని నిటు
నొగిలి నా నాకిందు నొప్పిగలదా
పగదేర మరుని పూ బాణములఁ దెగినపాం
దుగ నప్పుడైన వగతువుగా నీవు

చ. 3: కూరుముల నిటు నిన్నుఁ గూడినలతాంగికిని
వేఱె యిఁక మరుచేతి వెఱపు గలదా
సారమతి వేంకటేశ్వర నన్ను నలయించి
యీరీతి నైనఁ జన విత్తుగా నీవు

రేకు: 0055-2 భైరవి సంపుటం: 06-080

పల్లవి: భామ తొల్లిటి పూజఫలము సఫలముగాను
యేమఱక వేడుకల నిట్లఁ బూజించె

చ. 1: నొసలిలేఁ జెమటలను నునుఁగురులఁ బూజించె
కసిగాట్ల నధరంబు కలయఁ బూజించె
కొసరు కనుఁగవ కెంపు కొనలఁ బూజించె
వసివాడు మేనిపై వాసనలఁ బూజించె

చ. 2: మొలకనవ్వుల ముద్దుమో మలరఁ బూజించె
చిలుకుఁ జూపుల లోని సిగ్గుఁ బూజించె
నిలువుఁబులకలచేత నిలువెల్లఁ బూజించె
నెలఁతచనుదోయి క్రొన్నెలలఁ బూజించె

చ. 3: మనసు గోరికల కళ మర్మములఁ బూజించె
గొనకొన్న రతులచేఁ గొలికి పూజించె
ఎనసి శ్రీ తిరువేంకటేశు కౌఁగిటిలోన
వనిత సంభోగ పరవశముఁ బూజించె

రేకు: 0055-3 పాడి సంపుటం: 06-081

పల్లవి: ఘుమ్మనియెడిశ్రుతి గూడఁగను
కమ్మని నేతులు కాఁగఁగఁ జెలఁగె

చ. 1: నీలవర్ణుఁ డని నీరజాక్షుఁడని
బాలుని నతివలు పాడేరో
పాలు విదుకుచును బానల కాఁగుల
సోలి పెరుగు త్రచ్చుచుఁ జెలరేఁగి

చ. 2: మందరధరుఁ డని మాధవుఁడని గో
విందునిఁ బాడేరు వెలఁదు లిదె
నందవ్రజమున నలుగడ నావుల
మందలఁ బేయల మంచిరవముల

చ. 3: వేంకటపతి యని వేదనిలయుఁడని
పంకజనాభునిఁ బాడేరో
అంకులచేతను నలరురవంబుల
బింకపుమాటల బృందావనమున

రేకు: 0055-4 సామంతం సంపుటం: 06-082

పల్లవి: కొమ్మ నీ వెవో కోపంతు వతఁడు
రమ్మనఁగఁ బిలువ నిటు రావమ్మా

చ. 1: నెయ్య మెఱింగి చెలియ నీవె పో యతనితో
చయ్యాటములనే పగ చాటేవు
కయ్యపుమాటలకు కనుచూపు కాఁకలకు
నియ్యకొన కతనిచన వియ్యవమ్మా

చ. 2: అందముగ నతఁడు మాటాడఁగా నతనితో
మందమందమె కాని మాటాడవు
గొంది నిందాఁక చెక్కునఁ జేయి తియ్యవిదె
మందలించక వెనక మఱవవమ్మా

చ. 3: ఇప్పుడిదె తిరువేంకటేశ్వరుఁడు పచ్చడము
కప్పఁగానే కొంత కసరేవు
రెప్పలను నవ్వు పచరించి తింతటిలోన
నెప్పుడును నిటువలెనె యెనయవమ్మా

రేకు: 0055-5 భూపాళం సంపుటం: 06-083

పల్లవి: అంతదొడ్డవారమా అందుకుఁ దగుదుమా
మంతనపు మాటల మరగించేవు

చ. 1: నిన్నుఁ బోలువారమా నీయంతవారమా
వెన్నెలుఁ జల్లలు నమ్మువెలఁదులము
పన్నిన యీ రత్నాల బంగారుటిండ్లలో
యెన్నకైన తూఁగుమంచ మెక్కు మనేవు

చ. 2: చెప్పరానివారమా చెమటపై వారమా
కప్పురంపుఁ జవి యెఱుఁగనివారమా
చిప్పిలేటితేనెల సేమంతివిరుల
చప్పరములోనికి సారెఁ బిలిచేవు

చ. 3: జంకెనలవారమా సరసపు వారమా
మంకుమంకు మాటల మందవారమా
వేంకటాద్రి విభుఁడా వేడుకలరాయఁడా
తెంకికి నెప్పరిగమీఁదికి రమ్మనేవు

రేకు: 0055-6 ముఖారి సంపుటం: 06-084

పల్లవి: నినుఁ బాసినయట్లు నెలఁతకు వియోగదశ
లెన్నడునుఁ దోప విది యేమోగాని

చ. 1: నినుఁ దలచి లలితాంగి నీరూప మాత్మలోఁ
గని నీవు నవి బయలు కౌఁగిలించినది
తనర నాకాశతత్త్వము నీమహత్త్వమని
వనిత యెవ్వరిచేత వినెనోకాని

చ. 2: నినుఁ బొగడి నీరూపు కనుదోయి కెదురైన
తనివి దీఱక బయలు తగఁ జూడఁదొడఁగి
మునుకొన్న సర్వతోముఖుఁడ వనఁగా నిన్ను
వెనుక కే భావమున వినెనో కాని

చ. 3: తలఁపునను వాకుననుఁ దలఁపఁ దలఁపఁగ నీవు
కలసి యీ కమలాక్షిఁ గౌగిలించితివి
తెలసితిమి వేంకటాధిపతి నీ విన్నింటఁ
గలవనెడిమాట నిక్కంబువోకాని

రేకు: 0056-1 రామక్రియ సంపుటం: 06-085

పల్లవి: నతు మమ తాసన్మానస్త్వదీయ
నితాంతహితసరణిం నమామి

చ. 1: న వదతు భవాన్ జనార్దన ఘనరతి
వివాదవచనం వృధా వృధా
తవ మృదువేదసుధామయవచనై
ర్వివిధావశపదవీం వహామి

చ. 2: న భజతు మాం కరుణానిధే భవ
ద్విభవవినయశ్చ వృధా వృధా
త్రిభువన సుఖకర దివ్యరూప తే
ప్రభుతయాపరాభవం భజామి

చ. 3: న చలతు వేంకటానాథ మాం వినా
విచరణమపి తే వృధా వృధా
సుచరిత్రస్త్వం సుభగస్త్వం త్వాం
కుచయో: పులకాంకురై ధ రామి

రేకు: 0056-2 కన్నడగౌళ సంపుటం: 06-086

పల్లవి: ఒప్పమి మేలై యొనఁగూడె నాకు
నె(త?)ప్పులే ఒప్పవుట చెప్పనేలమ్మా

చ. 1: నవ్వులచూపులు నాఁటినచోటు
నొవ్వులు సేయక నొచ్చినే
దవ్వులమాటలు తాఁకినతావూ
రవ్వలచేఁతల రాఁగినే

చ. 2: తియ్యపుఁ జేఁతలఁ ద్రవ్వినచోటు
వయ్యమై హృదయము నాఁడినె
కయ్యపుఁ గాఁకలఁ గ్రాఁగినతావూ
ఒయ్యన పై పై నుడికినే

చ. 3: కొండలరాయనిఁ గూడిన మనసూ
కొండయి లోలోనె కూడినే
నిండిన తమకము నించిన యతఁడూ
మెండైన నాప్రేమ మెచ్చినే

రేకు: 0056-3 ఆహిరి సంపుటం: 06-087

పల్లవి: ఇన్నియును దగఁగలిగె నీయింతి కిదె యిపుడు
కన్నియల కిందరికిఁ గలిగె మోహములూ

చ. 1: నిగనిగని మెఱుఁగు వెన్నెల మోమునకుఁ గలిగె
చిగురుమోవికిఁ గలిగెఁ జిఱునగవులు
పగటుఁగనుఁగొనలఁ బలపలని కెంపులు గలిగె
పొగరుఁజెమటలు గలిగె పొలఁతిచెక్కులను

చ. 2: ఒయ్యార మగు నలపు లువిదమేనికిఁ గలిగె
గయ్యాళి నడపులకుఁ గలిగె మురిపెములు
తొయ్యలికిఁ గలిగె సంతోషంపుఁ బరవశము
పయ్యెదకుఁ గలిగెఁ బయిపైని నునుఁబూఁత

చ. 3: వెలఁది కిప్పుడు గలిగె వేంకటేశ్వరు కరుణ
తలఁపులకుఁ గలిగె చింతా వియోగంబు
పులకలకుఁ గలిగెఁ దలఁపులలోని జొంపములు
అలుకలకుఁ గలిగెఁ బాయని విలాసములు

రేకు: 0056-4 సామంతం సంపుటం: 06-088

పల్లవి: పలుకులఁదేనియ లొలికెడిచక్కని
వెలఁదులు కోనేటి విభునిఁ బాడెదరె

చ. 1: నలికపుఁజూపుల నగవుల నునుసిగ్గు
దొలఁకంగ నిగ్గు దోఁపంగ
కలికికి కన్నుఁగవ కాంతలు ప్రేమ
నెలయించి తిరువేంకటేశునిఁ బాడెదరె

చ. 2: పెదవుల సన్నపు బీటల మెఱుఁగులు
పొదలంగ ముద్దులు పొలయంగా
వదనము సొబగులు వనితలు కడుఁ
గదసి వెంకటగిరి ఘనునిఁ బాడెదరె

చ. 3: భారపుఁ గుచముల కన్నీటి చెమటలు
జారంగా తావిచల్లంగా
కూరిమి రచనలు గొసరుచుఁ గడు
ధీరునిఁ గోనేటి తిమ్మనిఁ బాడెదరె

రేకు: 0056-5 సామంతం సంపుటం: 06-089

పల్లవి: ఎట్టు దొరికెనె చెలియ యిద్దరికి నిటువంటిఁ
పట్టనిలుపఁగరాని బరువైన వలపు

చ. 1: నిడివి తమకములచే నిట్టూర్పు లివె నీకు
అడియాస తమకంబు లాతనికిని
కడలేని వేదనల కన్నీళ్లివే నీకు
అడరుఁబరితాపంబు లాతనికిని

చ. 2: గుఱుతైన యతనిపై గోరాటలదె నీకు
అరుదైన ప్రియమాన మాతనికిని
పురిగొన్న విరహమునఁ బొరలాట లవె నీకు
అరమరపుఁ బరవశము లాతనికిని

చ. 3: ఎనసి యాతనిరాక కెదురుచూచుట నీకు
అనుకూలుఁడై కలయు టాతనికిని
అనయంబు తిరువేంకటాధీశుఁ డిడె నీకు
అనుభవన కెల్ల నీ వాతనికిని

రేకు: 0056-6 భైరవి సంపుటం: 06-090

పల్లవి: పట్టి కింత మాచెలిఁగు బాపఁడా నాఁడె
వుట్టిఁ గట్టితివి కుల మోబాఁపఁడా

చ. 1: పలుకుల వాదాలబాఁపఁడా యిట్టె
పలునీళ్ల మునిఁగె బాపఁడా
పలువంచలఁ బొరలే బాఁపఁడా యిట్టె
వొలికిజంటెలఁ గోప మోబాఁపఁడా

చ. 2: పాయనియాసాదపు బాఁపఁడా ఇట్టె
బాయిటఁ బడె నీ విద్య బాఁపఁడా
పాయపు తల జడల బాఁపఁడా యిట్టె
వోయయ్య బతిమాలకు మోబాఁపఁడా

చ. 3: పారవేసేవు సిగ్గెల్ల బాఁపఁడా యిట్టె
పాఱుతెంచేటి కమ్మటి బాఁపఁడా
భారపు వేంకటగిరి బాఁపఁడా మమ్ము
నోరసేయక కూడితి వోబాఁపఁడా

రేకు: 0057-1 నాట సంపుటం: 06-091

పల్లవి: ఇంకా నేఁటికి నింతులు
వేకంటరాయఁడ విడు విడు చెఱఁగూ

చ. 1: పిరిగొన్న ముత్యపుఁ బేరులనడుమను
తెరవను దాఁచుక తిరుగుచును
కెరలుచు నాకౌఁగిటికి దగ్గఁటేవు
వెఱపు లేక నీవు విడువిడు చెఱఁగు

చ. 2: ప్రేమ మలర నతి బింకపునీనగు
మోమున నలముక మురియుచును
తామసమతితో తమ్ముల మిడుకొని
వేమరుఁ గోరక విడు విడు చెఱఁగు

చ. 3: చుట్టుఁద పారపు చుంగుల నడుమను
పెట్టితి వింపున ప్రియసతిని
రట్టడి వేంకట రమణుఁడ కలసితి
వెట్టిగాద యింక నిడు విడు చెఱఁగూ

రేకు: 0057-2 శ్రీరాగం సంపుటం: 06-092

పల్లవి: కటకటా విరహు లెక్కడ బ్రదుకఁగలవారు
కుటిలపుఁ గీరముల గూఁటఁ బడ వాయె

చ. 1: పంచబాణునకు నాపద లెందు లేవాయె
మంచుఁగిరణము లతనిమీద మణఁగదాయె
పెంచుకోవిలనోరు పెడతటికిఁ బోదాయె
చంచరీకములకునుఁ జావు లేదాయె

చ. 2: చిగురాకుఁ గులమునకుఁ జే టెందు లేదాయె
పగటు నునుగాలిఁ బెనుఁబాము దినదాయె
సొగఁసుగమ్మని విరులచొప్పణఁగి పోదాయె
బిగువు నామనిమీఁదఁ బిడుగువడదాయె

చ. 3: తిరువేంకటాచలాధిపుని కరుణారసము
తరుణులకు నందటికి దైవాఱదాయె
పరివోని సురత సంపదలఁ దెప్పలఁదేలి
వరవధూతతికిఁ బరవశము లేదాయె

రేకు: 0057-3 శంకరాభరణం సంపుటం: 06-093

పల్లవి: కుటిలా లేఁటికి కోమలియెడ నేఁ
డిటువలెఁ జేయఁగ నిం పౌనా

చ. 1: పుప్పొడిచల్లినఁ బొక్కెటిదేహము
కప్పుర మేఁటికిఁ గలుపేరె
ఒప్పుగ వేనీ ళ్లొల్లనిదేహము
నిప్పులు చల్లఁగ నిలచీనా

చ. 2: వెన్నెలబాయట వేగెటిమేనికి
పన్నీ రేఁటికిఁ బామేరె
సున్నపురాతికి జొబ్బిల నుదకము
నున్నతిఁ జల్లఁగ నోర్చీనా

చ. 3: తిరువేంకటపతి తెప్పలఁ దేలఁగ
తరుణికి నేఁటికిఁ దాపములూ
దొరకొని దైవముతో మాటలాడఁగ
పరికెలు వెట్టఁగఁ బాడౌనా

రేకు: 0057-4 కాంబోది సంపుటం: 06-094

పల్లవి: ఇన్నియుఁ గొత్తలు దోఁచె నింతలోనె చెలి నీకు
విన్నని నగవు లెస్సవిధ మేఁటి కాయెనే

చ. 1: పెట్టిన కస్తూరి బొట్టు పెదవిపై కేలా జాఱె
కట్టిన చెంగావి కెంపు కన్నుల కే లెక్కెనె
పుట్టిన లేఁజమటలు పులక లేఁటికిఁ గప్పె
పట్టిన తామరమొగ్గ పదనేఁటి కాయెనే

చ. 2: కప్పినపయ్యదకొంగు కడకు నేఁటికి జాఱె
తిప్పిన మొగములోన తెలివేటేఁకుండెనే
చెప్పినమాటలలోన చిఱునవ్వు లేల తోఁచె
ఒప్పైన చెలువ నీకు నొరుపేఁటి కాయెనే

చ. 3: నిండిన సైరణలకు నిజ మేల లేదాయె
పండిన కోరికలకు ప్రాణ మేల వచ్చెనే
కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు గూడె
యెండ లేని నీడ నీకు నితవేల ఆయెనే

రేకు: 0057-5 సామంతం సంపుటం: 06-095

పల్లవి: చక్కఁదనములు గొంత జాణతనములు గొంత నీ
వెక్కసము లెల్లఁ జాలు వేసాలఁ బోకురా

చ. 1: పూసిన తట్టు పుణుఁగు బూమిలోనా లేనివింత
వాసనై లోకము వారి వలపించఁగా
ఆసలనే మమ్ముఁ గడు నలయించే వోరి నీవు
చేసినట్టి చేతు గాని చెఱఁగు విడువరా

చ. 2: మెత్తినట్టి మృగనాభి మేన నెల్ల నిండె నిత్య
కొత్తలై నీ సొబగెల్లఁ గుప్పళించంగా
బిత్తరి చూపులతోడ ప్రియమైన కడకేఁగి
వత్తుగాని అంతకు నీవన్నె చూడనియ్యరా

చ. 3: కట్టినట్టి పచ్చఁబట్టు కమ్మని పువ్వులతావి
యిట్టు నట్టు నెల్లవారి నెలయించఁగా
దిట్టనాయకుఁడ వోరి తిరువేంకటేశ నీ
పట్టినచలమే దక్కె బాపు వూరకుండరా

రేకు: 0057-6 ముఖారి సంపుటం: 06-096

పల్లవి: అడవిచాటున నుండి యాఁటదానను న
న్నుడి కించే వేరా నీ వుడుకునను

చ. 1: పించెపుఁ బయ్యెదలోని పెనుగుబ్బలు మూయుచు
చెంచెత యేల యేఁచేవె చెల్లఁబో నన్ను
మంచుఁబులకలచాటు మగనాలిగుబ్బలు సో
ధించి చూచే వేరా తెట్టఁదెరువునను

చ. 2: తొలుకరి మెఱుఁగుల తొడలయాకుఁజీరచె
నలయించే వేఁటికి నీ వయ్యో నన్ను
నులివెచ్చమాటల నొవ్వ నామనము సోఁకఁ
బలికే వదేర బట్టబాయిటను

చ. 3: చిక్కనితేనెలతావి చిగురుమోవి నవ్వుచు
చక్కఁజూడ కేల పగచాటేవె నన్ను
చక్కని వేంకటగిరిస్వామి నాకౌఁగిలి నీకు
పుక్కట దొరకె పొట్టఁబొరుగుననూ

రేకు: 0058-1 ఆహిరి సంపుటం: 06-097

పల్లవి: అపు డేమనె నేమను మనెను
తపమే విరహపుఁ దాపమనె

చ. 1: పవనజ యేమనె పడఁతి మఱేమనె
అవనిజ నిను నేమను మనెను
రవికులేంద్ర భారము ప్రాణంబనై
ఇవల నెట్ల దరియించే ననె

చ. 2: యింకా నేమనె యింతి మఱేమనె
కొంకక యేమని కొసరుమనె
బొంకులదేహము పోదిది వేగనె
చింకవేఁట యిటు చేసె ననె

చ. 3: నను నేమనె ప్రాణము మన కొకటనె
తనకు నీవలెనె తాపమనె
మనుకులేశ ప్రేమపుమనకూటమి
ఘనవేంకటగిరిఁ గంటి ననె

రేకు: 0058-2 ఆహిరి సంపుటం: 06-098

పల్లవి: అంతకంతకును వెఱపయ్యీని
యెంత నను వలపించి యేఁపేవో యనుచు

చ. 1: పయ్యె దెడలించి గుబ్బల నిన్ను నలమఁ బ్రియ
మయ్యీని మిగుల వెఱ పయ్యీని
గయ్యాళి రతుల ననుఁ గరఁగించి మరుబారి
నుయ్యాల పాలయలుక నూఁచేవో యనుచు

చ. 2: వెడవెడని తమ్ములము వీడుదోడాడ మన
సడరీని తలఁప వెఱపయ్యీని
వడిలోక మేలు దేవర దివ్యవదనంబు
కడుల నెంగిలని యొరులుగందురో యనుచు

చ. 3: గొప్ప సవరంబు నాకొప్పులో ముడిచేవు
అప్పటి నాకు వెఱపయ్యీని
చెప్పఁగడు నరు దైన శ్రీవేంకటేశ యిది
యిప్పు డెవ్వతెకు నీ విత్తువోయనుచు

రేకు: 0058-3 పాడి సంపుటం: 06-099

పల్లవి: తోడనే పుండెరువ మందు నేరిచెనె
విడని తలంపు లివి వేఁగీనె తామును

చ. 1: పతిఁ బాసి మేను తాపమైన నాయెఁగాక
యితవైన యూరుపుల కేమి మూడెనె
సతతము నా హృదయజలజములోఁ బాయని
యతని నంటియుఁ దాప మందెనె తామును

చ. 2: కినిసి కోరికలు వేఁగినను వేఁగెఁగాక
తనివోని కన్ను లేల తమకించీనె
యెనలేని చూపులనె యెదుటఁ బ్రాణ విభునిఁ
గనుఁగొనుచు వగలఁ గందీనే తామును

చ. 3: అరిది ముదములకు నక్కరయిన నాయెఁగాక
పరవశముల కేమి బాధ వచ్చెనె
దిరు వేంకటగిరి దేవుని కౌఁగిటఁ గూడి
బిరుసుగ మేను మఱపించీనె తామును

రేకు: 0058-4 ఆహిరి సంపుటం: 06-100

పల్లవి: ఆకాశపాకాశ మాయెఁ గోమలినడుము
వైకుంఠపతిపొందు వడిఁ దెలుపుకొఱకు

చ. 1: పరగఁ గెమ్మోవిపై పగలు చుక్కలు వొడిచె
పరివేషమృగనాభిఁ బరగె మోము
మరునిసమరమునఁ గోమలి విభునితోఁ జెనకు
సరసతల కిదియ సూచన చంద మాయె

చ. 2: ఎలమి బొమ్మలజంకె లింద్రధనువులు వొడిచె
మొలచెఁ గన్నులఁగావి మొయిలు ఘనమై
కొలఁది కగ్గలపుఁగుంకుమచెమట నెత్తురులు
పొలఁతిపైఁ గురియుటకుఁ బోటివలె నాయె

చ. 3: అంగనకునెడమతొడ అదరి భూకంపంబు
సంగతి వహించెఁ జంచలము లేక
ఇంగితంబుగ వేంకటేశుఁ గూడినపొందు
కొంగుబంగారమై కోరికలు మీఱె

రేకు: 0058-5 సామంతం సంపుటం: 06-101

పల్లవి: ఎటువంటి మోహమో యెట్టితమకమొ కాని
తటుకనను దేహ మంతయు మఱచెఁ జెలియ

చ. 1: పలుకుఁదేనెలఁ గొసరి పసిఁడి కిన్నెర మీఁటి
పలుచ నెలుఁగున నిన్నుఁ బాడి పాడి
కలికి కన్నీరు బంగారు పయ్యద నొలుక
తలయూఁచి తనలోనె తలవంచుఁ జెలియ

చ. 2: పడఁతి నీవునుఁ దాను పపళించు పరపువై
పొడము పరితాపమునఁ బొరలి పొరలి
జడిగొన్న జవ్వాది జారు చెమటలఁ దోఁగి
యుడుకు నూరుపుల నుసురుసురాయెఁ జెలియ

చ. 3: తావి చల్లెడి మోము దమ్మి గడు వికసించె
లోవెలితి నవ్వులను లోఁగి లోఁగి
శ్రీవేంకటేశ లక్ష్మీకాంత నినుఁ గలసి
యీ వైభవము లందె నిదివో చెలియ

రేకు: 0058-6 కాంబోది సంపుటం: 06-102

పల్లవి: ఉప్పవడము గావయ్యా ఉయ్యాలమంచముమీఁద
గొప్పగొప్ప కన్నుల గోవిందరాజా

చ. 1: పవ్వళించే వీడ వచ్చి పాయనినీయలపెల్ల
మువ్వంక మే నితోడ ముచ్చట దీఱ
నవ్వేటి శ్రీ సతి చూపు నాటిన చిత్తపుమేన
క్రువ్వనికలువదండై గోవిందరాజా

చ. 2: నిద్దరించే వీడ వచ్చి నిలుచున్నయలపెల్ల
ప్రొద్దువొద్దునకుఁ దీర భోగీంద్రుపై
యిద్దరు సతులు నీకు నేచిన తాళగతుల
గుద్దేటి పాదములతో గోవిందరాజా

చ. 3: మెండుగ మేలుకొంటివి మించిన కౌఁగిటిలోన
కొండుకపాయపుసిరి కోపించంగా
ఉండవయ్యా సుఖలీల నుడివోనిప్రియముతో
కొండలకోనేటిరాయ గోవిందరాజా

రేకు: 0059-1 సామంతం సంపుటం: 06-103

పల్లవి: భ్రమయించే విట్టే పదిమారులు
నిమిష మేఁడాయె నీ చేత నాకు

చ. 1: పాఁతమడుగుగడ్డఁ బడి యీఁతకాఁడవు
లోఁతు చొరకురా లోఁగేవు
మూఁతులే గిరువంగ మోము నొచ్చినంత
బాఁతి మీఱఁ బకపక నవ్వకురా

చ. 2: అలవిగాని మోహపు టాసకాఁడ నీ
వలుగకురా వెఱపయ్యీని
అలరి నీటఁ గొండలైనఁ దేలించేవు
లలనపైనె నీలా వింత వలెనా

చ. 3: రచ్చరావికింద రంతులె చేసేవు
బచ్చనమాటల వసకాఁడ
రచ్చ చేసే వింక రాతి గుండె తోడ
వెచ్చపు సొలపుల వేంకట విభుఁడా

రేకు: 0059-2 రామక్రియ సంపుటం: 06-104

పల్లవి: విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా
మచ్చిక మరుని ఢాక మగువ నీ రాక

చ. 1: పంచల పసిండి నిగ్గు వచ్చిదేరే సిగ్గు
వంచన వలపు తీపు వాలుక చూపు
కంచపుంబాలకూడు కాఁకలనీవాడు
మంచపు నీ తలఁబ్రాలు మట్టెల పాదాలు

చ. 2: కోవిల కొసరుఁబాట కొమ్మరో నీ మాట
తావులచెంగావి నీ తళుకు మోవి
గోవ జవ్వాదికరంగు గుబ్బల నీ మెఱుంగు
భావజు దాడి రొదలు పాదపు నీ కదలు

చ. 3: ముద్దుల నీ నగవు చిమ్ముల రతి బిగువు
అద్దలింపుఁ గసరు మోహంపుఁ గొసరు
గద్దరి నీ యలపు వెంకటపతి తలఁపు
అద్దపునీమోము మోహనరతిసాము

రేకు: 0059-3 సామంతం సంపుటం: 06-105

పల్లవి: మాట లాడనేరని రమణిఁబో నేను, నా
మాటలెల్లఁ బైఁడి వంటి మాటలే గదె

చ. 1: పచ్చగందని పడుచఁ బడఁతి నేను, నేఁ
డచ్చి వేసినట్టి వనితనె కదవె
లచ్చిగొండి నీవంటినెలఁతనా నేను, యింత
పెచ్చువెరిగే వదేమె పిన్నదానవా

చ. 2: మిగులదళము గలమేఁటిఁబో నేను, నీ
దగునింటి ముంగిటి నిధానమంగదే
జగడాలగంప దింపుసతినా నేను, యింత
చిగురుఁగొమ్మ వదేమె చిన్నదానవా

చ. 3: తలపూ వాడని తరుణినే నేను, నే
నలరుఁజవికలోనియాకెనే కదే
కలికి వేంకటపతి కాంతనేనూ నేఁ
దొలియింతి నాకంటె దొడ్డదానవా

రేకు: 0059-4 సామంతం సంపుటం: 06-106

పల్లవి: పొద్దు వోయె నింక నేల బూమెలు, యింత
వద్దు నీకు సింగారాలు వచ్చేవొ రావొ

చ. 1: పల్లవపు బరపుపై పవ్వళించు చెలిలాగు
తల్లడ మయ్యేడి నేము దలఁచినా
చొల్లెపుఁజుట్లే నీకుఁ జుట్టబట్టె నింతవడి
వల్లడి వలపు కాఁడ వచ్చేవొ రావొ

చ. 2: పొడలు వెట్టుచునున్న పొలఁతిభావము చెప్ప
తడఁబడె నాలిక తమకాన
కడు ముత్యపుఁ బేరులె కట్టఁబట్టె మెడనిండ
వడచల్లు చూపుకాఁడ వచ్చేవొ రావొ

చ. 3: యింతి మేనిపరితాప మింతేసి నే మెఱింగింప
పంతానికె విచ్చేసితి పైకొని
కంతునిగురుఁడ వేంకటరాయ యిటమీఁద
వంతఁబెట్టక యిట్టె వచ్చేవొరావొ

రేకు: 0059-5 శంకరాభరణం సంపుటం: 06-107

పల్లవి: సిగ్గున నీవలె నేఁ జెప్పుకొనఁ గాకా
దగ్గటి నాదేహ మంటి దానవైన నమ్మేవా

చ. 1: పాయ లేక నన్నుఁ బాసి పట్లువెట్టు కొంటినంటా
మాయలుసేసే వదేర మాఁటిమాఁటికి
యీయెడ నేఁ బుట్టుతొ నీయెదుటనె నిలుచున్న
చాయలమాట లనక చాల నీవు నమ్మేవా

చ. 2: పట్టలేక నన్నుఁ బాసి ప్రాణ మింతా బరవంటా
వొట్టుక నామీఁద నీవు వొలవేసేవు
గుట్టున నేవూరుపులు గుమ్మరించ నెఱుంగక
పట్టిన నాప్రాణ మిదె పైపై నున్నదిరా

చ. 3: ఇప్పుడు ననుఁ బాసి యిదె మేను చొక్కెనంటా
వొప్పుగ నామీఁదఁదెచ్చి వొళ్లువేసేవు
కప్పురా పచ్చడము వేంకటగిరీంద్రుఁడ నాకు
నప్పుడె నీకంటెను లోనైతి నిదె చాలదా

రేకు: 0059-6 మలహరి సంపుటం: 06-108

పల్లవి: మొల్లలేలె నాకు తన్నె ముడుచు కొమ్మనవె నేఁ
జెల్ల పూవు కొప్పుతావి చెంచుదానను

చ. 1: పట్టుచీరేఁటికి నాకు పారిటాకులె చాలు
దట్టిగట్టుకొమ్మనవే తనమొలనే
పట్టెమంచ మేలె నాకు పవ్వళించు మనవె నేఁ
జెట్టుకిందఁ బొరలాడే చెంచుదానను

చ. 2: సందిదండ లేలె నాకు సంకుఁగడియమె చాలు
యిందవే యెవ్వతెకైన నిమ్మనవె
గందమేలె నాకు చక్కని తనకే కాక నేఁ
జిందువందు చెమట మై చెంచుదానను

చ. 3: కుచ్చుముత్యా లేలె నాకు గురివిందలె చాలు
కుచ్చి తనమెడఁ గట్టి కొమ్మనవె
కచ్చుపెట్టి కూడె వేంకటగిరీంద్రుఁడు నను
చిచ్చినే నడవిలో చెంచుదాననూ

రేకు: 0060-1 పాడి సంపుటం: 06-109

పల్లవి: పిల్లఁ గ్రోవి పట్టుమంటాఁ బెరరేఁచీని మా
గొల్లవారి పిల్లఁగోవి కోరో చల్లా

చ. 1: పాడుమంటా దండెమీఁటెఁ బలుమారునుం దా
వేడుక నెవ్వతెపాట వినవచ్చెనో
వాడలోఁ జల్లలమ్మె వనిత నింతే శ్రుతి
గూడి నేఁ బాడేటిచల్ల కోరో చల్లా

చ. 2: చేరి నన్ను నాడుమంటాఁ జెక్కు నొక్కీని తా
గారవాన నెవ్వతాట గనివచ్చెనో
మారుకు మారాడేటి మందవారము మేము
కోరికి నాడేటి చల్ల కోరో చల్లా

చ. 3: కిన్నెర మీటుమంటాఁ గెలసీని తన్నుఁ
గిన్నెర మీట్ల నేది గిలిగెంచెనో
కన్నుల కలికి వేంకటపతిపై వెట్టి
గొన్న కిన్నెరగుబ్బల కోరో చల్లా

రేకు: 0060-2 సామంతం సంపుటం: 06-110

పల్లవి: వింత వింత వింతలూ, నీ
చింతలే పో చిగిరింతలూ,

చ. 1: పోపో పోపో విడవోయీ నీ
చూపు మాపై జూఁడించకా,
రేపే పో రేసులెల్లా నీ
తీపేపో తీదీపులూ,

చ. 2: చాలుఁ జాలుఁ జాలుఁ బోవోయీ, నీ
జాలి మాపై జల్లించకా
రేలేపో రిచ్చలెల్లా నీ
మేలే మేలే పో మెరమెరలూ

చ. 3: రాఁపు రాఁపు రాఁపు లేలోయీ నీవు
మాపుదాఁకా మాతోడనే
యేఁపకు వేంకటేశ నన్ను నీ
కాపురమే పో కరఁగింతలూ

రేకు: 0060-3 నాదనామక్రియ సంపుటం: 06-111

పల్లవి: చెల్లెఁగా నీవు సేసినచేఁతలు నీవు
వొల్లకే విభునింతవొడలు వేఁచితివి

చ. 1: పొడవుఁ జందురుఁడు నొప్పులు సేయువిరహులను
పెడమొకముచేసి నొప్పించేవు
కడుఁ బలికి కీరములు కారించు విరహులను
పడతి పగఁబెట్టితివి పలుకకే విభుని

చ. 2: తొలుమెఱుపు మెఱచి పాంథుల నొంచు నీ వెదుట
పొలయకే నొంచితివి పొలిఁతి యతని
బలుపువెన్నెల భంగపఱచు విరహుల నింత
నలఁగించితివి నీవు నవ్వకే విభుని

చ. 3: పన్నీరు విరహులను బరవశముసేయు నీ
మన్ననఁ గౌఁగిటఁ జేర్చి మరపించితి
కన్నియరో నీవు వేంకటవిభుని కౌఁగిటను
ఇన్నిటను గడుమించి తేమి చెప్పెడిదే

రేకు: 0060-4 శంకరాభరణం సంపుటం: 06-112

పల్లవి: ఓయమ్మ వెరపించె నొకభూతమూ
రోయక యిన్నిటనుం దిరుగు భూతమూ

చ. 1: పది శిరసుల పెద్ద బమ్మ రాకాసునిని
జెదరనీక యడిచిన భూతమూ
మదమున బాలెంత మగువ నెత్తురు పిన్న
పెదవిఁ బీలిచెఁ బెను భూతమూ

చ. 2: వేయి చేతుల పెద్ద వెడగు దానవునిఁ
జేయి చాఁచి యడిచిన భూతమూ
రాయడింపుచు బెద్దదంటరక్కసుని
బాయం జీరిన బలు భూతమూ

చ. 3: పడుచుఁ బట్టుక వేఁచే పసిఁడిదైత్యునిని
కడుపు చించిన ఘన భూతమూ
అడరి శ్రీ తిరువేంకటాద్రి మీఁద నుండి
పొడచూపె నదివో పెంపుడు భూతమూ

రేకు: 0060-5 శ్రీరాగం సంపుటం: 06-113

పల్లవి: జాణతనా లాడే వేలే జంపు గొల్లెతా వోరి
ఆణిముత్యముల చల్ల లవి నీకుఁ గొల్లలా

చ. 1: పోయవే కొసరుఁజల్ల బొంకుగొల్లెతా, వోరి
మాయింటి చల్లేల నీకు మనసయ్యీరా
మూయకువే చల్ల చాడిముచ్చు గొల్లెతా వోరి
పోయవో పోవో మాచల్ల పులు సేల నీకును

చ. 2: చిలుకవే గోరం జల్ల జిడ్డుగొల్లెతా వోరి
పలచని చల్ల నీకు బాఁతిగాదురా
కలఁచవే లోనిచల్ల గబ్బిగొల్లెతా వోరి
తొలరా మా చల్లేల దొరవైతి నీకు

చ. 3: అమ్మకువే చల్లలు వొయ్యారిగొల్లెతా వోరి
క్రమ్మర మాతోడ నిట్టే గయ్యాళించేవు
సొమ్మెలం బోయే వేలే సొంపుగొల్లెతా వోరి
దిమ్మరి కోనేటిరాయ తిరమైతి నికును

రేకు: 0060-6 సామంతం సంపుటం: 06-114

పల్లవి: అందుకే వెఱచేనో యమ్మలాలా తన
కందువకే పారంబోయి కాలుజారె బిడ్డండు

చ. 1: పాలకడవలును బానలవెన్నలును
ఓలిం బెట్టి వుట్లపై నుండంగాను
నేలనుండి యెగసి నిక్కితీసె నిదివో
పాలు గాసు సేయ విడి పడఁబోయె బిడ్డఁడు

చ. 2: కమ్మని నేతులును గడ్డల జున్నులును
కమ్మి వెద్దకాఁగులతో కాఁగంగాను
దిమ్మరియై తొడికి తియ్యం బోయీ నిదివో
అమ్మరో వ్రేళ్లు పొక్కి అగ్గిదాఁకి బిడ్డఁడు

చ. 3: కోడెలఁ బేయలను కూడఁగట్టి విడిచి
వోడక వీథులం బరువులు దోలీని
వేడుక కాఁ డిదెవో వేంకటేశ్వరుఁడు
ఆడకు నీడకుఁ బాటి అలసీని బిడ్డఁడు

రేకు: 0061-1 మలహరి సంపుటం: 06-115

పల్లవి: ఆయలేరే యేమి చెప్పి రాతనిసుద్దులు నాకూ
తాయిమక్కళాలె కాక దయగద్దా తనకు

చ. 1: కన్నులఁ జూడనె పట్టె కాఁకలు సేయనె పట్టె
ఇన్నిటా తా నన్నుఁ గూడే దెప్పుడో కాని
సన్నలు సేయనే పట్టె చవులు చూపనే పట్టె
వెన్నెలబాయిటికి రా వేళ లేదు తనకు

చ. 2: నవ్వులు నవ్వనే పట్టె నాలిసేయనే పట్టె
ఇవ్వల నన్నుం గూడేది యెన్నఁడే తాను
పువ్వుల వేయనే పట్టె బుజ్జగించనే పట్టె
పవ్వళించం బ్రొద్దులేదు పను లేలే తనకు

చ. 3: మాటలాడనే పట్టె మనసు చూడనే పట్టె
ఈటునం గాలు దొక్కేది యెన్నఁడే తాను
పాటించి శ్రీ వెంకటాదిపతి నన్ను నురముపై
తేటలుగా నెక్కించుక దించ నెడలేదు

రేకు: 0061-2 ముఖారి సంపుటం: 06-116

పల్లవి: పట్టి రైరిగా మిమ్ముఁ బడఁతులు వద్దనుండి
ఒట్టిచే ముట్టి సరసా లొద్దంటిఁగా

చ. 1: పువ్వులచెండున వేసి పప్పొడి వాటులం బడి
నొవ్విఁ బడే వేలే కన్నులఁ దిట్టు తా
అవ్వలివ్వలివెములై అలిగితి రిద్దఱు
నవ్విన నవ్వి జగడాలు నడుమనే వచ్చెఁగా

చ. 2: చిలుకవే గోరం జల్ల జిడ్డుగొల్లెతా వోరి
పలచని చల్ల నీకు బాఁతిగాదురా
కలఁచవే లోనిచల్ల గబ్బిగొల్లెతా వోరి
తొలరా మా చల్లేల దొరవైతి నీకు

చ. 3: అమ్మకునే చల్లలు వొయ్యారిగొల్లెతా వోరి
క్రమ్మర మాతోడ నిట్టే గయ్యాళించేవు
సొమ్మేలం బోయే వేలే సొంపుగొల్లెతా వోరి
దిమ్మరి కోనేటిరాయ తిరమైతి నీకును

రేకు: 0032-1 రామక్రియ సంపుటం: 06-117

పల్లవి: తానే చూడవే యీతండు నన్ను
పోనీ పోనీ పోనీ ననీనే

చ. 1: చల్ల లమ్మనీడే సారెకు నాపైఁ
జల్లీఁ జల్లి చక్కందనమే
నల్లని జాణుండు వీఁడే నే
నొల్ల నొల్ల నొల్ల నోయమ్మా!

చ. 2: పువ్వుల నిప్పుడు వేసేని నాతో
నవ్వి నవ్వి నక్కుం జూపుల
దవ్వుల నీతండు చూడవే నే
నవ్వా నవ్వా నవ్వా నోయమ్మా!

చ. 3: ఇంకా నలమీ నీతండు నాతోఁ
గొంకీ కొంకి కోరికల
వేంకటేశుం డరవిరియై నేఁ
బొంకా బొంకా బొంకా నోయమ్మా!

రేకు: 0032-2 ఆహిరి సంపుటం: 06-118

పల్లవి: చక్కని బోయ జవరాలు మించు
చెక్కుపై చేతితో చెలి దూరే నిపుడు

చ. 1: చింతచిగురుదెచ్చి చెలువైన వలపుల
సంతనమ్మిన బోయ జవరాలు
కంతుగురుఁడ నిన్నుఁగలయంగఁ దలపోసి
చింతచిగురుచేతఁ జిమిడే నిపుడు

చ. 2: కిన్నర కులుకుల కెరలి జారెడి గుబ్బ
చన్ను మూయదు బోయ జవరాలు
వెన్నుఁడ నినుఁ బాసి వెడమాయ కోవిల
కున్నల కులుకులు గులికే నిపుడు

చ. 3: వల్లెవాట్లతోడ వడిఁ బెద్దకన్నుల
చల్లుఁ జూపులబోయజవరాలు
నల్లని తిరుమల నాయని కౌఁగిట
చల్లని చూపుల జంకించె నిపుడు

రేకు: 0032-3 ముఖారి సంపుటం: 06-119

పల్లవి: ఏమి సేయఁ గలమయ్య యేలికయ్య
సోముని కళల మోము చూడకుంటేఁ జూడవు

చ. 1: చెలి చక్కనిది గాదో చిత్త మేమి రాదో
కొలఁది మీఱిన నీపై కూరిమి లేదో
ఎల జవ్వనము కొల్ల లీదో వాదో
ఒలసీనొల్లముల నీ వొల్లకుంటే నొల్లవు

చ. 2: మరుఁ డేమి మతిలేఁడొ మఱచి వున్నాఁడొ
గరిమల విలుకాఁడు గాఁడో లేఁడో
దొరకుం జెఱకు విల్లు తూఁడో యేఁడో
సిరుల నీచిత్త మిది చేరకుంటేఁ జేరదు

చ. 3: మ్రొక్కనిదే చలమో మోహ మేమి ఖిలమో
పక్కం బాసినందు కేమిఫలమో
యెక్కువ వేంకటరాయ యేతులేని పాలమో
మిక్కిలైతి విందాఁక మెచ్చకుంటే మెచ్చవు

రేకు: 0032-4 శంకరాభరణం సంపుటం: 06-120

పల్లవి: తమ్మిం దమ్మిం దాఁకె తపియించంగా
అమ్ములే యమ్ములఁ దాఁకె నంతలోనె

చ. 1: చందురుం జందురు నేఁచె జాలికి జాలివుట్టె
మందమారుతము సోఁకె మందమాయే గాలి
తీఁగె సోఁకి తీఁగ వాడె తేనె దాఁకి తేనె చిందె
చేఁగ చిగురునం గాఁగె చెంగావి చిగురు

చ. 2: వేంకటేశ్వరునిమిఁద వేంకటేశ్వరుండు వచ్చె
సంకె మీదసంకె దేరె సకియభాగ్యమే

రేకు: 0032-5 ఆహిరి సంపుటం: 06-121

పల్లవి: బడలివున్నాఁడు ఉప్పరిగలోన గుట్టు
విడిచి విభునిం జేర వచ్చేయవె

చ. 1: చిలుకు నీనగవులే చిలుపాలు నీ
పలుచని నీ తెలి చూపుం బాశాలు
చలివేఁడికసరులే శాకాలు యింపు
దొలఁచి నీపతికి విందులు వెట్టవే

చ. 2: జడియు నీ చెమటలే జలకాలు నీ
కడుమంచి మెయితావి గందాలు
వెడయూర్పు విసరులే విభవాలు నీ
పొడముఁ బలుకుల తప్పులు వాపవే

చ. 3: కమ్మని నీమాటలే కప్పురాలు నీ
తమ్ములపుంజెదరులే తలఁబ్రాలు
నెమ్మది వేంకటగిరి నిలయుని నీవు
క్రమ్మఱం గ్రమ్మర నిట్టే కౌఁగిలించవే

రేకు:	0032-6 శ్రీరాగం సంపుటం:	06-122

పల్లవి: పాయపు మీ మీ ఫలమ్మూ, యీ
కాయపు సుఖములు గైకొనవద్దా

చ. 1: చింతమోముతోడఁ జెక్కునం జేతితో
నెంతైనం బొదల విదే మమ్మా
అంతటి రమణుం డబ్బె ననుచు నీ
చెంతనే కౌఁగిటం జేకొనవద్దా!

చ. 2: విసుగుమోముతో వెరగులాగుతో
నిసుమంత నవ్వ వేమమ్మా!
కసరేమి లేక కౌఁగిట నీవిట్టే
ఒసపరిరీతి నుండంగ వద్దా

చ. 3: అరవిరిరీతి నబ్బురపుమేన
నెరపై వుండే విదేమమ్మా!
తిరువేంకటేశుం దెగఁగొంటివిట్టే
ఉరముపై దిగ కుండంగవద్దా

రేకు: 0032-7 శ్రీరాగం సంపుటం: 06-123

పల్లవి: కౌఁగిట నిన్నుం గలయం గలవాఁడు విరహాన
వేఁగక యెట్లానుండు వినవే తరుణి

చ. 1: చిత్తజానలముచేతఁ జిట్లె గందపుఁబూత
మెత్తని తనువుమీఁద మెఱయంగా
ఒత్తిలి యొకతెమీఁద నొరగి పలుకవు నీ
చిత్త మిప్పు డెందువోయెఁ జెప్పవే తరుణి!

చ. 2: తొంగలి రెప్పలలోని తొలుకరి మెఱుఁగులు
చెంగలించి నలువంకఁ జెదరంగాను
బంగారు పతిమవంటి పడఁతి నీమ్మెఁదీఁగ
ముంగిట వేయక యిట్టె ముయ్యవే తరుణి

చ. 3: వీడినది మొలనూలు విరులు చెదరెం గొంత
వాడినది కెమ్మోవి వన్నెలై
కూడితివి చెలి నీవు కోనేటిరాయనిపొందు
ఈడఁ గొత్తలాయ నేఁటికే వోతరుణి!

రేకు: 0033-1 హిజ్జజి సంపుటం: 06-124

పల్లవి: ఇయ్యింతిమురిపెము యెట్లుండెనే
ఒయ్యారముతో నొరపోలికనో యనఁగా

చ. 1: చక్కని రమణి గుబ్బ చనుదోయి కడు నిండి
యెక్కువ మద నరేఖ లెట్లుండెనే
అక్కరతో సతి హృదయమున వలపు విత్త
దుక్కిగా మరుఁడు గోళ్ళ దున్నించె ననఁగా

చ. 2: లలనకుంబులక మొలకలపైఁ జెమటలు
ఎలనవ్వుం జెక్కులపై నెట్లుండెనే
వలపను నునుంబైరు వాడకుండా మదనుండు
నెలవుగాఁ బైపైనె నీరు నించె ననంగా

చ. 3: అందపు నెఱులలోన నలరురేకులు జాఱి
యిందువదనకుం దురు మెట్లుండెనే
కందువ వెంకటపతి కౌఁగిటి పరవశాన
వందులేక పండి కైవ్రాలెనో యనంగా

రేకు: 0033-2 ఆహిరి సంపుటం: 06-125

పల్లవి: ఇందవయ్య మీసొమ్ము లేల మాకు
క్రిందుపడి యెవ్వతె యెంగిలి నేల నన్నదో

చ. 1: చెట్ట వట్టి తియ్యంగానే చేయి దీసుకొనేవు
ఒట్టు వెట్టుకొని నన్ను నొల్లనంటాను
రట్టుగ నాముద్దుటుంగరము నీచేఁ జిక్కె నిదే
పెట్టుకో యెవ్వతెవ్రేలం బెట్టి వేసారినదో

చ. 2: పాదమువట్టుకొనంగానే పలుకవైతివి నాతో
ఆదరించంబడేనంటా అలుకతోడ
పేదవారము మాకాల పెండెముచిక్కెనిదె వో
ఏదెస నెవ్వతెకాలిదెరవుదెచ్చినదో

చ. 3: కోపగించుకొన్న నాకుం గొమ్మనుచుం గంటమాల
మేపెటితీపులచేత మెడంబెట్టేవు
ఏపలరఁదిరువేంకటేశ నాతోనిటువలె
నీపనికింత సేసితి వింక నేమిసేతువో

రేకు: 0033-3 భూపాళం సంపుటం: 06-126

పల్లవి: సుదతితో నిం తేలని చూపి చెప్పరమ్మా
ఎదురెదురే చూచీ నెటువంటివలపో

చ. 1: చెక్కుమీది చెయ్యి దీయఁ జెప్పరమ్మా దీని,
చిక్కనిగుబ్బలు మూయఁ జెప్పరమ్మా!
చిక్కునెఱులు ముడువఁ జెప్పరమ్మా దేహ
మెక్కడో త నెఱుఁగదు యెటువంటి వలపో

చ. 2: చిత్త మేమిటికి వేఁచీఁ జెప్పరమ్మా యీ
చిత్తజుచే నేల నొచ్చీఁ జెప్పరమ్మా!
చిత్తణివిద్యలు మానఁ జెప్పరమ్మా శిర
సెత్తి యెవ్వరిని జూడఁ డెటువంటివలపో

చ. 3: చిదుగాయ సిగ్గు లెల్లాఁ జెప్పరమ్మా వొళ్లు
చిదిమి నా నెఱుంగదు చెప్పరమ్మా
చెదరెడిఁ దమకము చెప్పరమ్మా యిప్పు
డిదె వేంకటేశుఁ గూడె నెటువంటివలపో

రేకు: 0033-4 ఆహిరి సంపుటం: 06-127

పల్లవి: లంపుగుబ్బ గొల్లెతల లంజకాఁడ నీ
యింపులే వెదకంబట్టీ నెట్లరా వోరి!

చ. 1: చెప్పరాని వేడుకల సిగ్గులనే నిన్నాళ్లు
ఉప్పతిల్లుం గోరికల నుంటిం గాని
ఇప్పు డింతనిలువలే నేమిసేతు నీచిత్త
మెప్పుడు గాని రాదో యెట్లరా వోరి

చ. 2: చిల్లర సింగారాలు చెలులు సేయఁగ నేను
వొల్లనని యిన్నాళ్లు నుంటిం గాని
మల్లెపూవు వంటినన్ను మాసిన చీర తోడ
నిల్లు వెళ్లకుండఁ జేసి తెట్లరా వోరి!

చ. 3: కమ్మ నిపానుపున నీ కౌఁగిటలో నిన్నాళ్లు
ఉమ్మగింపుమేనితో నుంటిం గాని
దిమ్మరిసేఁతలతోడి తిరువేంకటేశ! నీ
యెమ్మె లింకా మానలే వెట్లరా వోరి

రేకు: 0033-5 శ్రీరాగం సంపుటం: 06-128

పల్లవి: ఎఱుంగుదు మిదే నీయేతు లెల్లా
తెఱవల నిటు దినదినము నేఁచేవు

చ. 1: చూపులనే తనిపేవు సొలపు లాడేవు
తీపులం గ్రిందుపడేవు తేలించేవు
ఆపనికి బెట్టుగా న న్నదలించేవు
మాపటి చేఁతలకే మచ్చిక చల్లేవు

చ. 2: అడుగరాని దడిగే వాసలు సేసేవు
మడుగులు గలంచేటి మాట లాడేవు
అడరి రాయి గరంగ నలపు చూపేవు
వడి నందనిపనికి వలపు చల్లేవు

చ. 3: చీర వెలిగా నవ్వేవు సిగ్గు విడిచేవు
మోర నిడుపు చేసుక మూఁతులు నాఁకేవు
చేరి చెఱంగు వట్టేవు శ్రీవేంకటేశుండా
సారెకు నిట్టే కూడేవు చనువు లిచ్చేవు

రేకు: 0033-6 శ్రీరాగం సంపుటం: 06-129

పల్లవి: రాను మీకడకు వోరమణులార పూవుం
బానుపు హరికి నేఁ బఱపవలయు నేఁడు

చ. 1: చెలఁగి దేవుండు నేఁడు సిరితో నేఁటికి నో
పాలయలుకలవలపులు నటించి
తలఁపోఁత విరహవేదనల నున్నాఁడు ఈ
చలిమందు లతనికి చాఁతవలయు నేఁడు

చ. 2: రమణుం డిప్పుడు ఇందిరాదేవియెదుటను
తమకించి యెవ్వతెనో తలంచెనట
కమల గోపింపం గాఁకల నారగింపండు ఈ
హిమజల మతనికి నీయవలయు నేఁడు

చ. 3: వెలఁదిఁ బాసి తిరువేంకటేశ్వరుడు
కలికియై కౌఁగిటఁ గలసెనట
తిలకము గరఁగేటి తిరుమేనిచమట యీ
వెలినుండి పలుమారు విసరవలయు నేఁడు

రేకు: 0034-1 శ్రీరాగం సంపుటం: 06-130

పల్లవి: ఏటితమకమే నా కింకను విని
నాటకములు బడి నమ్మిన వెనక

చ. 1: చెల్లఁబో యేలే నాచెలువము వీని
వొల్లనిమేనితో నుడుకుచును
వెల్లాయ మేలే నావిభవము వీని
చల్లఁగౌఁగిలి జడిసిన వెనుక

చ. 2: పొలిఁతి నా కేలే యీపొందులు వీని
అలయింతవలపుల నలయుచును
చెలియ నాకేలే యీసిరులు వీని
తలఁ పంతకాఁకలం దగిలిన వెనుక

చ. 3: కదిసి నా కేలే యీగరువము వీని
పొదలుంబరవశానఁ బొరలుచును
ఇదివో శ్రీ వేంకటేశుండు వీని
యుదుటుంగూటముల నే నోసరినవెనుక

రేకు: 0034-2 భైరవి సంపుటం: 06-131

పల్లవి: అంత నంతం దమకాన నలసేవు మా
వింతగాని పొందు నీకు వ్రేఁగాయఁగా

చ. 1: చాయలకే మ్రొక్కేవు సన్నలకే చిక్కేవు
మాయిల్లు నీకింత మఱపాయఁగా
పోయినరాతిరి నిన్నుం బోకు మంటాఁ బలుమారు
చేయివట్టి పెనఁగుట చేఁ దాయంగా

చ. 2: మచ్చరాన మలసేవు మాటలనే సొలసేవు
వెచ్చందనమే నీకు వ్రేఁగాయంగా
వచ్చివచ్చి నిలిచేవు వాడికలు సేసేవు
తచ్చన ప్రేమము నీకుం దగవాయంగా

చ. 3: మంచి విడె మిచ్చేవు మనసెల్లాఁ దచ్చేవు
వంచనలే కిట్టయినా వచ్చేవుగా
ఎంచరాని తిరువేంకటేశ నన్నుం గూడితివి
పొంచి పొంచి కానికగాఁ బొందితివిగా

రేకు: 0034-3 శంకరాభరణం సంపుటం: 06-132

పల్లవి: నేర్చితి నీవును నెయ్యము లూని
తేర్చినతేటలు తెలియవుగా

చ. 1: చదివితి నీవును సాందీపు(ప)నితో
వెదకే వెదకమును వేదములు
పెదవులు గదలియుం గదలని
మదనుని చదువులు నాఁడవి చదువవుగా

చ. 2: కరచితి నీవును కౌశికమునిచే
నెఱి నాయుధముల నేరుపులు
గుఱుతులు సోకిన గుబ్బున సారిగెటి
వొఱపులకై దువు లొల్లవుగా

చ. 3: తడిసితి నీవును దగుజలనిధిలో
నడరుచు మీనమ వై నాఁడు
కడుఁజెమటల వేంకటపతి నారతిం
దడసినట్ల మును దడియవుగా

రేకు: 0034-4 కాంబోది సంపుటం: 06-133

పల్లవి: చెలియ మోహము చూడరమ్మా
చెలియ మోహము నేఁడు చెలుల కగ్గలమాయ

చ. 1: చిత్త మాతని మీఁద చేయి చెలియ మీఁద
కొత్తైన గమనంబు కొన వేళ్ల మీఁద
తత్తరపుఁ దాపంబు తనువల్లి మీఁద
బిత్తరపుఁ గోపంబు ప్రియ సతుల మీఁద

చ. 2: అలపులును సొలపులును అంగజుని మీఁద
తలపంత యెడ లేక దైవంబు మీఁద
పలుకులును బంతములు ప్రాణంబు మీఁద
తెలుపులును తెగువలును దీమసము మీద

చ. 3: ఇంపు సొంపులు వేంకటేశ్వరుని మీఁద
గుంపైన చందురులు కుచయుగము మీఁద
కెంపుఁ గనుగవచూపు గిలిగింత మీఁద
దంపతుల పరిణతులు తమకంబు మీఁద

రేకు: 0034-5 పాడి సంపుటం: 06-134

పల్లవి: చింతచేఁ జిత్తంబు చిక్కువడిన ట్లాయ
కాంతక్రొవ్విరుల సింగారంపుఁ దురుము

చ. 1: చెలినుదుట మరుఁడు వ్రాసిన వ్రాఁతవలె నాయ
సొలపునను జెదరుంగస్తూరి పట్టు
జలజ లోచన గుండె జల్లనిన యట్లాయ
పులక జొంపముల మెఱుపుల చన్నుదోయి

చ. 2: వనిత వలపుల జలధి వడి మునిఁగినట్లాయ
కొన మిగిలి జారు చెక్కుల చెమటలు
మనసి జాగ్నుల పొగలు మతి నెగసిన ట్లాయ
తనివోని నిట్టూర్పు తాపంబు గాలి

చ. 3: కాంత పరిణత(తు)లు లెక్కలు వెట్టినట్లాయ
కంతు నునురేఖ లంగనమేనను
అంతరంగమున విభుఁడలముకొనిన ట్లాయ
సంతసపు వేంకటేశ్వరుపొందు చెలికి

రేకు: 0034-6 సామంతం సంపుటం: 06-135

పల్లవి: పులకజొంపములె పో పుంఖాను పుంఖముల
తెలుపులును మఱపులును దెచ్చెఁ గోమలికి

చ. 1: చేటెఱుంగనికూన చెలి చిత్తమే కదా
కోటికిని బడ గెత్తెఁ గోరికలను
తేటైన తమకములు దీని పొందుననెపో
పోటుఁబాటును జేసెఁ బొలిఁతి కన్నీరు

చ. 2: కలి మెఱుంగని విందు కాంత పయసే కదా
కలశంబు లెత్తెఁ దమకపు మేడకు
తెలిఁగన్నుఁగవచూపు దీనిచేఁతలనెపో
తలవాకిటికిఁ దెచ్చెఁ దరుణి ప్రాణములు

చ. 3: తనివెఱుంగనియాన తరుణి వేడుక గదా
నినుపులై రతులు పెన్నిధు లాయెను
వినుతింప నిదియపో వేంకటేశ్వరుఁ దెచ్చి
ఘన పరవశము తరంగములు గావించె

రేకు: 0035-1 సామంతం సంపుటం: 06-136

పల్లవి: తొయ్యలి కొప్పున సేవంతులు నించే విట్లనె
నెయ్యమెల్ల నీకపైనె నించరాదా

చ. 1: చెలి శిరసు నెఱులు చిక్కు వుచ్చే విట్లనె
బలుపుంజిత్తము చిక్కు వాప రాదా
కులుకుచుం దరుణి చెక్కులు నొక్కి తిట్లనె
నులిచి నీవే యాస నొక్కరాదా?

చ. 2: సుదతికి నొసలం గస్తూరి మెత్తే విట్లనె
మృదువుమైఁ జలు విట్లే మెత్తరాదా
కుదురుగుబ్బలమీద గోర నంటే విట్లనె
అదనంగౌఁగిట నిట్టేయంటరాదా?

చ. 3: పడఁతిపై నొరపుగం బవళించే విట్లనె
ఒడలిపై నాకెనిట్లే యుంచరాదా
తడసి వేంకటరాయ తమకించే విట్లనె
కడు దీని ప్రేమ మిట్టే కానరాదా?

రేకు: 0035-1 ఆహిరి సంపుటం: 06-137

పల్లవి: వావి గాదు నీకు నాకు వద్దు వద్దు నీ
తోవరా వెఱుతు మన్నా దోసాలు గట్టకురా

చ. 1: చక్కనివాఁడ ననుచు సారెసారె నీవు వోరి
లెక్కలేని నొయ్యారములే చల్లేవు
తక్కుల మొన్న నామఱందలితోడ నీవు వోరి
తొక్కులాడితివి చాలు దోసాలు గట్టకురా

చ. 2: చూడకురా నా వంక సోయగపు నీవు యీ
వేడుక చిఱునగవే వెదచల్లేవు
కూడితి నాచెలిమి మక్కువ విన్న నీవు వోరి
తోడనే యింతేసి నాకు దోసాలు గట్టకురా

చ. 3: రాఁగినది నీ చిత్తము రంతుకాఁడ నీవు వోరి
మాఁగిన నా మనసు పై మచ్చు చల్లేవూ
కౌఁగిలించి నన్ను వెంకటరాయ నీవు వోరి
తఁగు మంచానకుం దీసి దోసాలు గట్టకురా!

రేకు: 0035-3 శంకరాభరణం సంపుటం: 06-138

పల్లవి: చతురుం డని నాసరసతలూ
ఇతరము లైనవి యేమి సేతురా

చ. 1: చెనకుచు నీవు నాకు సేసిన మేలు
పెనఁగొని మతిలోఁ బెరిగేని
మనసు తమకమై మదనతాపమయి
యెనలేని విభుఁడ యేమి సేతురా

చ. 2: కదలు నీ మురిపపుంగన్నుల నగవు
పొదలుచు నామతిఁ బొలసిని
చెదరని యలపై చింతారతియై
హృదయము రేఁచి నేమిసేతురా

చ. 3: ఇపు డిటు నీవు నా కిచ్చినచనవు
అపరిమితములై యలరీని
విపులవిభవమై వేంకటేశ!నా
కెపుడు బాయ దిదే యేమి సేతురా

రేకు: 0035-4 ముఖారి సంపుటం: 06-139

పల్లవి: అరిది చేఁదుం దీపై నంతకంటేనా
సరిలేని విభుతోడఁ జయ్యాటమాడేవు

చ. 1: చలమునం బగవారు సైతము నొకవేళ
పలుక దేరే రట యంతకంటేనా
పొలయలుకలు దీరి పురుషుఁడిప్పుఁడు నిన్నుఁ
బిలువఁ బంపనయంత బిగు వేలే నీకు

చ. 2: తప్పులు సేసిన వారి దయసేసి రాజైన
అప్పుడే మచ్చికం గూడీ నంతకంటేనా?
తిప్పిన మొకము తోడి ధీరుండు విభుండు నీకు
గప్పురపు విడె మియ్యంగఁ గడకంటఁ జూడవు

చ. 3: యెడసి యెదిరిం దము నెఱుంగక పైకొన్న
నడవిమెకాలు గూడీ నంతకంటేనా?
కడు నొవ్వ నాడి వెంకటవిభునికి నీవే
వెడమోము కూటముల వెఱపించుకొనేవు

రేకు: 0035-5 వరాళి సంపుటం: 06-140

పల్లవి: కలిగెంగా నేఁడు కాంతకు లోని
వలవంత సొలపులే వరునిసన్నుతులు

చ. 1: చెలువపు విభునిఁ జూచిన కన్నులకును
మలయు లేఁగురులే చామరతతులు
కలికి రమణునిఁ బొగడిననోరికిని
అలము నిట్టూర్పులే ఆలవట్టములు

చ. 2: సిరులందు విభుని డాఁచిన తలంపునకు
అరిది తలంపులే పాయనిపూజలు
పరువంపుఁబతి నాసపడిన గుబ్బలకు
అరవిరి చెమటలే అభిషేకములు

చ. 3: వెంకటపతితో నవ్విన నవ్వులకును
అంకెలమోవి తియ్యని బోనము
జంకించి యితనిపైఁ జూఁచు బొమ్మలకు
బింకపునటనలే ప్రియములగములు

రేకు: 0035-6 ఆహిరి సంపుటం: 06-141

పల్లవి: కాఁగె నిట్టూర్పులై గాలి మారుకుమారు
ఈఁగి చేసినదైవ మెఱుఁగఁడాచేత

చ. 1: చెలికి విరహాగ్ని రేఁచినఫలము చెదరఁగా
ఎలఁదేఁటు లలకలై యెదు రెదురనె
పొలఁతికోవిలలు నటువలెనెపో లలితాంగి
పలుకులై సన్నగిలెం బాయునా చేఁత

చ. 2: చెంది వెన్నెలల వేఁచిన ఫలము బడలెఁగా
చందురుఁడు వదనమై సతి కిచటనె
అందంద కలువలకు నట్లఁబో కలువలై
పొందెడలి యరమొగిచెఁ బో నాచేఁత

చ. 3: పడతివేఁచిన ఫలము పన్నీరు నుడికెఁగా
ఉడికేటి చెమటలై యొడలిమీద
అడరి యంతట వేంకటాధిపుని కౌఁగిటనె
తొడరి యిన్నియు దీర్చె దొరకెఁగా చేఁత

రేకు: 0036-1 ముఖారి సంపుటం: 06-142

పల్లవి: కన్నుల తుదలం గెంపు గానరాఁగాను నీకు
నన్నువ యలుకలు వేఁజాయ నొసవితిమి

చ. 1: చేరి నీ గుబ్బలమీఁది చెమట ముత్యము లోలి
తోరపు ముత్యాల సందుల నుండంగా
కూరిమి నీ పతి రతిఁ గూడిన నిబ్బరమున
హారములు చెదరి యే మాయ నొసవితిమి

చ. 2: పెట్టిన కస్తూరి బొట్టు బెరసి నీ కురులతో
నట్టునిట్టుం జిందు వందు రై యుండంగా
మెట్టుకొని చందురుని మింటిమీది రాహు వచ్చి
పట్టపగలె యెలమిం బట్టె నొసవితిమి

చ. 3: ముదిత నీకరమూలములను వేంకటపతి
ఉదుటుంజేఁతలు నిండి ఉండంగాను
పొదలు మొగ్గలతోడి పూలతీగెలతావి
వెదచల్లుచును విఙ్టవీఁగె నొసవితిమి

రేకు: 0036-2 శ్రీరాగం సంపుటం: 06-143

పల్లవి: అతనుని సరకులే యంగడివి
అతివలె కడు నీ కమ్మెద రదివో

చ. 1: చక్కందనములు జవ్వనమదములు
చెక్కుల నగవులు సిగ్గులును
మొక్కుల చూపులు మురిపంబులు నీ
యక్కఱ దీరఁగ నమ్మెద రదివో

చ. 2: గుబ్బల మించులు కొప్పుల చెదరులు
సిబ్బెపు మేనుల చెమటలును
గబ్బితనంబులు గసరుల జంకెలు
అబ్బురముగ నీ కమ్మెద రదివో

చ. 3: తలపోఁతలు చింతాపరవశములు
వలచి వేంకటేశ్వర నీకు
కల వీ యంగడిఁ గదియకు నన్నిటు
లలసితి విదె నీ కమ్మెద రదివో

రేకు: 0036-3 కాంబోది సంపుటం: 06-144

పల్లవి: మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడె
ముత్తెమువలె నున్నాఁడు ముద్దులాఁడు

చ. 1: చక్కని యశోద దన్ను సలిగతో మొత్తరాఁగా
మొక్కఁబోయీఁ గాళ్లకు ముద్దులాఁడు
వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాఁకా
ముక్కున వయ్యంగఁదిన్న ముద్దులాఁడు

చ. 2: రువ్వెడితాళ్లఁదల్లిరోలఁ దన్నుఁ గట్టెనంటా
మువ్వల గంటలతోడి ముద్దులాఁడు
నవ్వెడిఁ జెక్కులనిండా నమ్మిక బాలునివలె
మువ్వురలో నెక్కుడైన ముద్దులాఁడు

చ. 3: వేల సంఖ్యల సతుల వెంటఁ బెట్టుకొని రాఁగా
మూలఁ జన్ను గుడిచీ నీముద్దులాఁడు
మేలిమి వెంకటగిరి మీఁద నున్నాఁడిదె వచ్చె
మూల భూతి దానైన ముద్దులాఁడు

రేకు: 0036-4 దేసాళం సంపుటం: 06-145

పల్లవి: ఇంతిరో నీ కోప మింతేటికే
చింతవాయఁ గరుణఁ జూచీ గాని నిన్నును

చ. 1: చిత్తమేమి రాయో చెలియ నిన్నతఁడేమి
కొత్తగాఁబాలించె నో కూరిమి లేదో
వత్తునని రాకుంటె వచ్చీగా కిందేమి
తత్తరానఁ గన్నీటఁ దడిపేవు పయ్యెద

చ. 2: అలుకేమి బరవో యతఁ డేమి యరవో
కలికి చేఁతలు నీకుఁ గరవో
సొలసి నీ కడకంటఁ జూచినఁ నాతని గుండె
తలఁక కెట్టుండె నీతలఁ కేలె నీకూ

చ. 3: పువ్వుల వేసినంతనే పొక్కేనట నీమేను
నవ్వు లెంత జూపు నీకు నమ్మికగాదా!
యివ్వల నప్పుడే వేంకటేశుం డిదె నన్నుఁ గూడె
దవ్వులే చేరువ లాయె దక్కెఁగా నీ పనులు

రేకు: 0036-5 దేశాక్షి-యెకతాళి సంపుటం: 06-146

పల్లవి: పరతత్త్వం బగు బాలుఁడు
పరిపరి విధముల బాలుఁడు

చ. 1: చద్దుల మూటలు చంకల వ్రేలెడి
ముద్దుల పడుచుల మూఁకలతో
పెద్దటీకంబునఁ బేయలఁ గాచిన
బద్దుల నటనల బాలుండూ

చ. 2: వెన్నెలు దాఁకఁగ వేల్లాడుచును
సన్నపు బడుచుల సంగడిని
కన్నెలు దూరఁగఁ గలకల నవ్విన
పన్నిన మాయల బాలుండు

చ. 3: బచ్చన రూపుల పాయపుఁ బడుచులు
నిచ్చలుఁ గొలువఁగ నెమ్మదిని
నచ్చిన వేంకట నగమున నాడెడి
పచ్చిల పదకపు బాలుండు

రేకు: 0036-6 శ్రీరాగం సంపుటం: 06-147

పల్లవి: అప్పళించిన జవ్వాది యంటినమేనులతోడ
తొప్పం దోఁగు చెమటల దొరుగు టెన్నండురా

చ. 1: చెక్కువట్టి కదలించి చిఱునవ్వుతోడి నోరు
నొక్కి కౌఁగిలించి నోరునోరు గదియించి
అక్కిలివొయ్యనిమాట లాడి పేరుకొని తిద్ది
మక్కువ దలంచి మేను మఱచు టెన్నండురా!

చ. 2: ఉరముపై చనుగుబ్బ లూఁది పులకలు నించి
సరిలేని యధరము సారెసారెయు నాని
సిరిగల కొనగోరు సిరసు పై నొత్తియొత్తి
సుర వైభవములఁ జొక్కు టెన్నండురా

చ. 3: చాలియుం జాలని యట్టి సౌఖ్య సంపదలచే
తేలగిలెడికన్నుల తెలివాలుఁ జూపుల
యీలాగు తిరువేంకటేశుండు మనకు నబ్బి
నీ లోపల నేఁగలసి నీవౌట యెన్నండురా!

రేకు: 0037-1 భూపాళం సంపుటం: 06-148

పల్లవి: తొయ్యలి భారపుఁ దురుమమరె
ముయ్యక మూసిన మురిపమున

చ. 1: చందన గంధికిఁ జనుగుబ్బలపైఁ
జందెపు ముత్తెపు సరులమరె
చెందిన వేడుక చెలి నుపనయనము
జందెము వేసిన చందమున

చ. 2: అంచగమనకును అలపుల నడపుల
ముంచిన మట్టెల మ్రోఁతమరె
పంచమ వేదము పంచసాయకుఁడు
చంచునఁ జాఁటినచందమున

చ. 3: బొట్టుగఁ గుంకుమ పాలఁతి నుదుటిపై
గుట్టుగఁ బెట్టిన గుఱు తమరె
రట్టడి వేంకటరమణునికౌఁగిటఁ
బట్టము గట్టిన భావమును

రేకు: 0037-2 శ్రీరాగం సంపుటం: 06-149

పల్లవి: ఉదయాద్రి తెలుపాయె నుడురాజు కొలువిడె
అదనెఱిఁగి రాఁడాయె నమ్మ నా విభుఁడు

చ. 1: చన్నులపై ముత్యాల సరు లెల్లఁ జల్లనాయె
కన్నులకుఁ గప్పాదవెఁ గాంత నాకిపుడు
కన్నెకలువల జాతి కనుమోడ్చినది మీఁద
వెన్నెల వేసంగి మొగ్గ వికసించె గదవె

చ. 2: పువ్వుల లోపలి కురులు బుగులుకొనఁగా నెఱసె
దవ్వులఁ దుమ్మెద గములు తరమి డాయఁగను
రవ్వసేయశుకపికము రాయడి కోర్వఁగరాదు
అవ్వల నెవ్వతెపసల కలరున్న వాఁడో

చ. 3: పన్నీట జలక మార్చి పచ్చకప్రము మెత్తి
చెన్నుగం గొప్పున విరులు చెరువం దురిమి
యెన్నంగల తిరువేంకటేశుం డిదె ననుం గూడె
కన్నులు మనసు నుం దనియం గరుణించెం గదవే

రేకు: 0037-3 శుద్ధవసంతం సంపుటం: 06-150

పల్లవి: తాపంబుం గోపంబు తమకుందామే వేఁగు
పై పై నే వగపు లోపలి కెల్లా వేఁగు

చ. 1: చెలియ దురిమిన తురుము శిరసునకుఁ గడువేఁగు
తలపోత శిరసు కరతలమునకు వేఁగు
కొలఁది మీఱిన యూర్పు కుచయుగములకు వేఁగు
బలువు కుచములు నాభిపయి కల్లవేఁగు

చ. 2: మురిపంపు నడపు చెలిమొలనూలికిని వేఁగు
బిరుసైన మొలనూలు పిరుఁదునకు వేఁగు
అరిది జఘనము మందయానంబునకు వేఁగు
తరుణి గమనము పాదతలమునకు వేఁగు

చ. 3: మృగనేత్రిప్రాణంబు మేని కింతకు వేఁగు
బుగులుకొను మైకాఁక పులకలకు వేఁగు
తగు వేంకటేశు కృప ధైర్యంబునకు వేఁగు
అగపడిన యీపొందు అలుకలకు వేఁగు

రేకు: 0037-4 కన్నడగౌళ సంపుటం: 06-151

పల్లవి: చక్కని సరసపు శిశువు
పెక్కుమాయల పెను శిశువు

చ. 1: చిమ్మెడి విషములు చేపిన రొమ్ములు
కొమ్మని యిచ్చినఁ గుడిచేని
బొమ్మర పోవఁడు పూతకిఁ బొరిగొని
అమ్మరో గయ్యాళి శిశువు

చ. 2: చుట్టమువలెనే సుడిగాలినిఁ గని
బెట్టుగఁ గౌఁగిట బిగించేని
పుట్టఁడు వొడమఁడు బూమెలే చేసీ
పట్టరే పసి బాల శిశువు

చ. 3: పాదము చాఁ చటు బండి జాతురకు
ఆదిగొనుచు తా నలరీని
వేదవేద్యుఁ డగు వేంకటగిరిపై
మోద మందిన మున్నిటి శిశువు

రేకు: 0037-5 ముఖారి సంపుటం: 06-152

పల్లవి: ఇంతి చేసిన పూజ లిట్లుండెఁ దన హృదయ
మంతయును బూజించె నడియాసచేత

చ. 1: చనుదోయి పూజించె జాజుఁబులకలచేత
కనుదోయి పూజించెఁ గన్నీటి చేత
మనసు పూజించెఁ బ్రేమపుఁ గోరికల చేత
తనువు పూజించెఁ బరితాపంబు చేత

చ. 2: తలపు పూజించెఁ చింతాపరంపర చేత
అలపు పూజించె నొయ్యని పలుకుచేత
వలపు పూజించెఁ బొలయలుక చేతను నెంతే
సొలపు పూజించెఁ దన చూపరల చేత

చ. 3: అనఘుఁ డీ తిరువేంకటాద్రీశు కృప చేత
వనిత సంభోగ పరవశముఁ బూజించె
తనివోని గుఱుతుచే తనవిలాసములచే
గనుపట్టఁ బూజించె గళమర్మములను

రేకు: 0037-6 భూపాళం సంపుటం: 06-153

పల్లవి: లేని భ్రమ లుడిగి లేవయ్యా
లేనగుమోముతో లేవయ్యా

చ. 1: చెంచెత కౌఁగిటఁ జెలఁగి వేడుకఁ బవ
ళించిన నాథుండ లేవయ్యా
పించెపుం బయ్యెదఁ బెనగి రతినిఁ జా
లించి యింతటను లేవయ్యా

చ. 2: చక్కని శ్రీసతి చనుఁగవ సన్నపు
లెక్కలు వ్రాయక లేవయ్యా
పెక్కగు నమృతము పెదవికోమలికి
లిక్కిగఁ జేసితి లేవయ్యా

చ. 3: ఏకాంతలో ని న్నెనసి తలఁచి రని
లేకలు వచ్చెను లేవయ్యా
శ్రీ కాంతుఁడవగు శ్రీ వేంకటనా
ళీకదళాక్షుఁడ లేవయ్యా

రేకు: 0038-1 పాడి సంపుటం: 06-154

పల్లవి: ఇంతేపో వల పిందరికి
దొంతల వింతల రంతులును

చ. 1: చిత్తపు టీతఁలు చిడిముడి సేఁతలు
పొత్తుల తమ తల పోఁతలును
మెత్తని యధరపు మేఁతలు లోలో
కుత్తికెఁ గులికెడి కూఁతలును,

చ. 2: చూపుల తీపులు సొక్కుల పులకలు
దాపుల తమతమ తమకములు
కోపపు కిసరులు కూటపు కొసరులు
ఏపున విరహపు టెసరులును

చ. 3: పువ్వుల వాట్లు వున్నమ చాట్లు
నవ్వుల హృదయపు నాట్లును
రవ్వగు వేంకటరమణునిఁ గలిసిన
యివ్వల మరువం పేట్లును

రేకు: 0038-2 కన్నడగౌళ సంపుటం: 06-155

పల్లవి: మనసు తన పాలింటి మమకార భూతమై
అనయంబు నిన్నిటికి నాధార మాయ

చ. 1: చూపులాసలఁ దగిలి సుఖయించఁ బోయినను
పై పైనె తలఁపులో పరితాప మాయ
తాపంబుం బరవశము తనువు సొగసిన మఱియు
నాపదల కన్నిటికి నది మూల మాయ

చ. 2: తలఁపు లోపలి రతులఁ దమకించఁ బోయినను
తలఁపు వలపుల కెల్లఁ దగులాట మాయ
వలపులనియెడి మహా వైభవము వొడగనిన
నలపులును సొలపులును నతిఘనము లాయ

చ. 3: కడు సొలసి శేషాద్రి ఘనుని దూరినయంత
అడరి యాతని కోప మగ్గలం బాయ
కడలేని కోపంబు కరుణారసముతోఁ
దడిసి యీపొందులకుఁ దరవుకాఁ డాయ

రేకు: 0038-3 కాంబోది సంపుటం: 06-156

పల్లవి: ఏలరాఁడే చెలి నన్ను నెలయించి పచ్చవన్నె
చేలగట్టి పిలిచుంగు చెరిగినవాఁడు

చ. 1: చీకటి మేని వాఁడు చెలువై నమణులకు
వేకటైన తరుణికి కూఁకటతో మగండు
రోఁకటి కైదువవాఁడు రోలఁ గట్టువడ్డవాఁడు
ఆఁకటికి పాలువెన్న లారగించేవాఁడు

చ. 2: పంకజములోని యింతిం జంకంబెట్టి యంతఁబోక
అంకులచేతులవారి కాసచేసేవాఁడు
బింకపు రాకాసుల పేరుమాల్చినవాఁడు
వంకల వంకల మేన వన్నె వెట్టువాఁడు

చ. 3: పాలవారియింటి పిన్న పాపఁడై తిరిగినాఁడు
గాలి దాగువాని మీఁదఁ గాలు సాఁచినాఁడు
పాలమీఁది కొండమిఁదఁ బల్లెగట్టిలోక మెల్ల
నేలుచున్నవాఁడు వేంకటేశుఁ డమ్మ యితడు

రేకు: 0038-3 రీతి గౌళ సంపుటం: 06-157

పల్లవి: నాలం వా తవ నయవచనం
చేలం త్యజ తే చేటి భవామి

చ. 1: చల చల మమ సంఘటనే కిం
కులిశ హృదయ బహుగుణ విభవ
పులకిత తను సంభృత వేదనయా
మలినం వహామి మదం త్యజామి

చ. 2: భజ భజ తే ప్రియా భావం సతతం
సుజన స్త్వం నిజ సుఖ నిలయ
భజ రేఖా రతి భోగిభవసికిం
విజయీభవ మద్విధిం వదామి

చ. 3: నయ నయ మా మనునయనవిధం తే
ప్రియకాంతాయం ప్రేమభవమ్
భయహర వేంకటపతే త్వం మ
త్ప్రియోభవసి శోభితా భవామి

రేకు: 0038-4 శ్రీరాగం సంపుటం: 06-158

పల్లవి: పువ్వుల వలన నార పొదలి తలకెక్కిన
ట్లెవ్వరును నినుఁ గూడి యేపు మిగులుదురు

చ. 1: చెలియకీ పెనుఁదురుము చీకటే వెలుఁగాయ
కలికి కనుఁగొనల తొలుకరి మెఱుపులా
వలనైన తెల్లగల వారి సంగడి నున్న
మలిన దేహులు కాంతి మహిమఁ జెందుదురు

చ. 2: లేమకీనెన్నడిమి లేమే కలి మాయ
మోమునకు నెగురు కుచముల బరువున
కామించి పేదలును గలవారికడ నున్న
వేమారు సంపదల విఱ్ఱవీఁగుదురు

చ. 3: జలజాక్షి చిత్తచంచలమే తిర మాయ
కెలసి నిన్నిట్ల కౌఁగిటఁ గలయఁగా
వెలుఁగొందు నిశ్చలులు వేంకటేశ్వరుఁడ నీ
చెలిమి వెడమ మతులైన సిరులఁ జెందుదురు

రేకు: 0038-5 సామంతం సంపుటం: 06-159

పల్లవి: వలపువో కారణము వైభవంబులకుఁ దమ
తలఁపువో సకలంబుఁ దగులు సేసినది

చ. 1: చూపువో ప్రియములకుఁ జోటుసేసినది తరి
తీపువో వెడ యాస దీరనీయనిది
రూపువో సౌఖ్యంబు రుచి సేసినది పువ్వుఁ
దూపువో హృదయంబు దూరిపాఱినది

చ. 2: ఒఱపువో పెడఁబాసి వు డనియ్యనిది తమ
వెఱపువో దేహంబు వెచ్చఁజేసినది
మఱపువో ధైర్యంబు మానిపించినది కను
గిఱుపువో సిగ్గెల్లఁ గ్రిందు పఱిచినది

చ. 3: చెలిమివో కారణము శ్రీ వేంకటేశు కృప
కలిమివో మచ్చికలు కలుగఁజేసినది
ఎలమివో యీపొందు లితవు సేసినది మరు
బలిమివో కోరికలఁ బట్టి తెచ్చినది

రేకు: 0039-1 కాంబోది సంపుటం: 06-160

పల్లవి: కుసుమ కోమలి విభునిఁ గొనియాడునెయ్యంపు
వసివాడు మోము నవ్వక నవ్వినట్లు

చ. 1: చెలియ గుబ్బలమీఁది జిలుఁగుఁ బయ్యెద మెఱుఁగు
చలివెలుఁగు ననల దాఁచక దాఁచినట్లు
పొలఁతి మొలనూలి మొగపులదీప్తి సంసార
ఫల మిక్కడనుచు చూపక చూపినట్లు

చ. 2: తరుణి కనుఁగొనల బిత్తరి చూపు విభుమీఁది
పరవశం బెల్లఁ జెప్పక చెప్పినట్లు
గరితవ్రేఁకపుఁగొప్పు గడలు లావణ్యంబు
సరసత్వ మెల్లఁ బెంచక పెంచినట్లు

చ. 3: ఇంతి శ్రీ తిరువేంకటేశుఁ బొందినరతి
శ్రాంతి సౌఖ్యములు దలఁచక తలఁచినట్లు
కాంత లోఁ గొన్న మరుగతులు చెలులకుఁ దెలుపు
మంతనపు బాస పొడమక పొడిమినట్లు

రేకు: 0039-2 హిందోళవసంతం సంపుటం: 06-161

పల్లవి: లలితాంగి యౌవనము లావణ్యముల ప్రోవు
అలరి యిటువలెఁ జేసెనమ్మా

చ. 1: జవ్వాది మిగుల నుష్ణము మీఁద సంపంగి
పువ్వు గట్టినది గన పాదలెఁ దాపంబు
నివ్వటిలు గొజ్జంగి నీట నొయ్యన కడిగి
దువ్వటపుఁ బయ్యెదను దుడువరమ్మా!

చ. 2: మృగమదము గడు వేఁడి మెలుఁత తలపట్టునకు
అగలు గూడఁగ వేద నగ్గలంబాయ
బిగువైన కస్తూరి బేం ట్లొయ్యనగోరి
నగలించి తట్టుపునుఁ గంటరమ్మా

చ. 3: విరహతాపంబునకు వేరొండు గతిలేదు
పొరసి వేగించినాఁ బోదు
తిరువేంకటాచలాధిపుని మన్ననఁ గాని
అరిది మోహము దీరదమ్మా!

రేకు: 0039-3 పాడి సంపుటం: 06-162

పల్లవి: సదయ మానస సరోజాత మాదృశ వశం
వద ముదాహం త్వ వంచనీయా కిమ్

చ. 1: జలధికన్యా పాంగ చారు విద్యుల్లతా
వలయ వాగురి కాంత వనకురంగ
లలితభవ దీక్షా విలాస మనసిజబాణ
కులిశపాతై రహం క్షోభణీయా కిమ్

చ. 2: ధరణీవధూ పయోధర కనకమేదినీ
ధరశిఖర కేళితత్పర మయూర
పరమ భవదీయ శోభనవదనచంద్రాంశు
తరణికిరణై రహం తాపనీయా కిమ్

చ. 3: చతుర వేంకటనాథ సంభావయసి సం
ప్రతి యథా తత్ప్రకారం విహాయ
అతిచిర మనాగత్య హంత సంతాపకర
కితవకృత్యై రహం ఖేదనీయా కిమ్

రేకు: 0039-4 బౌళి సంపుటం: 06-163

పల్లవి: ఒడలి తాపముమీఁద నుసురనీని
కడలేని చిచ్చుమీఁద గాలి చల్లీఁ దరుణి

చ. 1: జల్లనం గొప్పు విరులు జారఁ దోఁచి జవరాలు
మెల్లనే తుమ్మిదలకు మేఁత వెట్టీని
చెల్లఁబో మీఁ దెఱుఁగదు జెప్పరమ్మ పెనుఁబాము
పిల్లలకుఁ బాలువోసి పెంచఁజూచీఁ దరుణి

చ. 2: గొప్పవైన గుబ్బలపైఁ గుంకుమ కస్తూరి పూఁత
లప్పులు గాలికిఁ దెచ్చి లంచ మిచ్చీని
ఒప్పదు మానుపరమ్మా ఉప్పతిలఁ బలుమారు
నిప్పుల మీఁదటఁ దెచ్చి నేయి చల్లీఁ దరుణి

చ. 3: చెనకించి యధరంపుఁ జిగురాకు కెంపుల
నొనరుఁ గోవిల నోరూరించీని
చనవున వేంకటస్వామి కౌఁగిటఁ గూడి
కినిసి పాసెములూఁ జక్కెర వెట్టెఁ దరుణి

రేకు: 0039-5 ఆహిరి సంపుటం: 06-164

పల్లవి: చూచియుం జూడవు సుదతివంక
నీచేఁత లిన్నియు నీకె చెల్లును

చ. 1: జిగి మించు నుంగరాల చెక్కుమీఁది చేయి
చిగురు చెంద్రిక గోళ్ల జెలువొందంగా
పగటుఁ గోపము తోడ భారపు టూర్పులతోడ
నిగి డున్న చెలి లాగు నీకే తెలును

చ. 2: పొడపు గుబ్బలి మీఁది పులిపట్టు చెఱంగు
జడిసి హారపుఁ గాంతి ఝళిపించఁగా
వడ చల్లుమేనితో వసివాఁడు జూపుల
నిడువాలుఁ గనుసొంపు నీకే తెలుసును

చ. 3: భారపుఁ దురుము మీఁద పసమించు నెఱులు
జీరువారి విరులతోఁ జెంగలించఁగా
చేరువనే కూడితివి శ్రీ వేంకటేశుండ
నీరజవదనలాగు నీకే తెలుసును

రేకు: 0039-6 సావేరి సంపుటం: 06-165

పల్లవి: ఊరకే పోనియ్యరా నన్నుద్దండాన
చేర లంతేసి కన్నులఁ జెంగలించే విప్పుడు

చ. 1: జూద మాడఁ బిలిచేవు చూపులనే జంకించేవు
పేదవారి మేన సొమ్ము పెట్టనియ్యవా
కేదమున నోడి గెలిచితినంటా నా
పాద మంటి తీసుకోరా బంగారు మట్టెలు

చ. 2: నెత్తమాడఁ బిలిచేవు నెఱవాది సంటాను
అత్తమామ గలవార మదేమి రా!
ఒత్తి విన్నవించలేము ఓడితేను నీకు నాకు
రిత్తమాట వద్దు రేఖరేఖ పందెమా!

చ. 3: సొక్కటాలు నిన్న నాడి సోలి సత్యభామకు
మ్రొక్కితివి నేఁడు నాకు మ్రొక్కవలెఁగా
చక్కని వేంకటపతిస్వామి నన్నుం గూడితివి
మొక్కెద కర్పూర తాంబల మిరా చాలును

రేకు: 0040-1 దేశా(సా)క్షి సంపుటం: 06-166

పల్లవి: అటువంటి వైభవము లమరఁ జేసినదైవ
మిటువంటియోగంబు లిన్నియును జేసి

చ. 1: జలజాక్షి లావణ్య జలధి నుప్పొంగింప
నలివేణి ముఖచంద్రుఁ డభ్యుదయమాయ
కలికి వలరాయఁడను కాలకూటంబుతో
దలకొన్న యధరామృతంబు జన్మించె

చ. 2: వనిత సౌభాగ్యంబువనధిలోపలఁ దోఁచె
గొనకొన్న గుఱుతైన కుచపర్వతములు
తనివోనికోరికల తగుతురంగములతో
ననువైన విరహ బడబానలము గలిగె

చ. 3: భామ యవ్వనమనెడి పాలజలనిధిలోన
వామాక్షియైన యవ్వనలక్ష్మి గలిగె
యీమంచి తిరువేంకటేశ్వరుం డిందులోఁ
బ్రేమమున సుఖియించి పెంపొందఁగలిగె

రేకు: 0040-2 ఆహిరి సంపుటం: 06-167

పల్లవి: ఏఁపుచు నాకా ళ్లితఁడేల పట్టేనె
రాఁపు సేసి నాకుఁ బెద్దమోఁపు గట్టినట్లు

చ. 1: తలమాసి కోకమాసి తాపమున నుండంగాను
యెలయించి యితఁడు నన్నేల యేఁచీనే
మలినమై దేహమెల్ల మఱచినఁ దలఁపించి
వులికి కాలఁగఁ గొఱవులఁజూఁడినట్లు

చ. 2: కూడుఁబాసి నీటిఁబాసి కొరమాలి వుండఁగాను
యేడనుండో వచ్చి యీతఁ డేల పోరీనే
వేడుక లన్నియు మాని వేదనల నుండఁగాను
కాఁడినపోట్లలోన కత్తిఁగోసినట్లు

చ. 3: తల్లిఁబాసి యిల్లువాసి తరిలేక వుండఁగాను
యెల్లగా కౌఁగిట నితఁ డేల నొక్కీనే
చెల్లునంటా నన్ను గూడి శ్రీ వేంకటేశుండు
ముల్లు ముంటనే తీసి మోసపుచ్చినట్లు

రేకు: 0040-3 ఆహిరి సంపుటం: 06-168

పల్లవి: నేరుపులమాట గాదు నీయాన
కూరమి నీచే జట్టిగొనక నిన్నొల్లను

చ. 1: తట్టుపునుంగుల తలచెంచెతను నన్ను
పట్టకురా నీకు నీపాదమాన
గట్టిగఁ దామరలోని కాంత మానితినని
గుట్టుదీర నానవెట్టుకొనక నిన్నొల్లను

చ. 2: పయ్యెద పాఱుటాకుల భారంపు గుబ్బల నన్ను
తియ్యకురా నీకు నీదేవరాన
ప్రయ్యములు తొమ్మిదైన వనిత మానితినని
కొయ్యతనమున బాసగొనక నిన్నొల్లను

చ. 3: నలఁగు జవ్వాదిమేని నన్నుఁ గడుంగౌగిట
నలమకు నీకు నీయమ్మాన
ఎలయించి తిరువేంకటేశ కూడితి నన్ను
కెలన నీవెటు దొలంగినను నిన్నొల్లను

రేకు: 0040-4 ఆహిరి సంపుటం: 06-169

పల్లవి: రమణుని చేఁతలు దక్కెను రావులు రంతుకు నెక్కెను
మమతలు లోలోఁ జొక్కెను మాటలు మఱియేలే

చ. 1: తలపోఁతలు తనుఁ గూడెను తాలిమి గంటును వీడెను
కలువలు ఇరుమైఁ గాఁడెను కటకట యిఁక నేమే
బులుపులు సిగ్గుల కోడెను పులకలు సమతలు గూడెను
చలములకును విధి మూడెను జవ్వన మిది యేలే!

చ. 2: మచ్చికమానము రేఁగెను మచ్చరములె మతి మూఁగెను
చిచ్చును గాలియుఁ గూడెను చీచీ యిఁక నేమే!
ముచ్చట రతి కెదురేఁగెను మురిపము వెనుకకు వీఁగెను
వెచ్చి వివేకము, రాఁగెను వేడుక లిఁక నేలే

చ. 3: భారపు చెమటలు జాఱెను పై చెమటలు దైవాఱెను
కూరిమి కడుఁ దుద మీఱెను కొంకెడి దిఁక నేలే
వీరిఁడి వెఱపును జాఱెను వేంకటపతి కృప చేరెను
గారవములు కడుఁబేరెను కసరెడి దిఁక నేలె

రేకు: 0040-5 శ్రీరాగం సంపుటం: 06-170

పల్లవి: రాకురాకు మయ్యా మాతో రంతు లింతేలా
వాకు నిష్ఠూరాన నిన్ను వద్దనే నేఁ జాలను

చ. 1: తొలవయ్య కాలుదాఁకి దోసాలు గట్టకా
తొలుతేమి చేసితినో తొయ్యలినైతి
చెలఁగి యిందఱూ నీకుఁ జేయెత్తి మ్రొక్కగా
చిలుకు గోళ్ల నిన్నుఁ జెనక నేఁ జాలను

చ. 2: ఏమిటికి నంటించేవు ఎంగిలి మామోవి
బూమిలేని చదువుల పుట్ట నీనోరు
వేమాఱు నిందఱు నీకు వినుతించి మ్రొక్కంగ
ప్రేమపునో ర నిన్ను పేరఁ దిట్టఁజాలను

చ. 3: యేల కిందుపడి మొక్కే వేమి బాఁతినే నీకు
కూళ నింతేని కాలిగోరఁ బోలను
మేలిమి శ్రీ వేంకటేశ మెఱసి మాచనవు
మేలములాడుచు నిన్ను మెప్పించ నేఁ జాలను

రేకు: 0040-6 ఆహిరి సంపుటం: 06-171

పల్లవి: కరేణ కిం మాం గృహీతుం తే
హరే ఫణిశయ్యా సంభోగ

చ. 1: జలే తవ సంచరణ మిహాధస్
స్థలే భవనం తవ సంతతం
బలె రూప ప్రకటన మతులా
చలే స్థానం చల చల రమణా

చ. 2: పదే భువన ప్రామాణ్యం తవ
హ్రదే ప్రచుర విహరణ మిదం
ముదేమునీనాం మోహనం తనుం
మదే తవ నర్మ చ మాం విసృజ

చ. 3: స్మరే విజయ స్తవ విమలతురగ
ఖురే రతిసంకుల రచన
పురే తవ విస్ఫురణం వేంకట
గిరే: పతే తే ఖేలాఘటిత

రేకు: 0041-1 సామంతం సంపుటం: 06-172

పల్లవి: దిమ్మరి గాకేల మాను ధీరుఁడైన కోనేటి
తిమ్మఁడు దా లోకమెల్లఁ దిరుగాడువాఁడు

చ. 1: తోరమైన ముత్యాల తొళసిపూసల పెద్ద
పేరు దనవురముపై బెట్టినవాఁడు
గారవంపుఁ బచ్చఁబట్టు గట్టినవాడు వొ
య్యారపు గొల్లెతలఁ గూడాడినట్టివాఁడు

చ. 2: పీలిచుట్టుదలవాఁడు పెదపెదకన్నుల
వాలుఁజూపుల సిరికి వలచువాఁడు
జాలిబెట్టి లోకమెల్ల జట్టిగొన్నవాఁడు తా
నేలనుండి మింటఁబాఱ గాలు చాఁచువాఁడు

చ. 3: కొండ మోఁచినట్టి వాఁడు కొండ వేల నెత్తువాఁడు
కొండంత రాకాసులఁ గొట్టినవాఁడు
కొండవంటిదొరయైన కొండల కోనేటివాఁడు
కొండమోపరుల నెల్లఁ గూడపెట్టినాఁడు

రేకు: 0041-2 కన్నడగౌళ సంపుటం: 06-173

పల్లవి: మఱపైన నొకకొంత మాటుగాదా
తెఱవ నూరక యేల తెలిపేరు సతులూ

చ. 1: తరుణిని విరహ సంతాపంబు దావాగ్ని
ధరియించ చెమటైన దండ గాదా
మరుని కార్ముకబాణమహిమ గడు నెఱిఁగించె
దురదురనఁ జేతులనె తుడిచేరు సతులు

చ. 2: పొఁలితి కిపుడొకయింత పొద్దువోకలు సేయ
తలపోఁతయైన దరిదాపు గాదా
వెలలేని సోయగపు విభుని చల్లని రూపు
పెలచమాటలనే మరపించేరు సతులు

చ. 3: అలివేణి మేని విరహాగ్ను లొయ్యన పూడ
నలరు నిట్టూర్పైన యాసగాదా
వలపెరిఁగి వేంకటేశ్వరుఁడు గరుణించె నిదె
కలువ పూవుల బంతి గట్టేరు సతులు

రేకు: 0041-3 కేదారగౌళ సంపుటం: 06-174

పల్లవి: ఏమి చెలియా యేలాగే
వేమారును వెల్లి విరిసీఁ బ్రేమా

చ. 1: తోడితేదొకో తొయ్యలివానిఁ
దోడితేదొకో తొయ్యలి
వాడీఁ జిత్తమిదె వనితరొ మై
గాఁడి మదనుని కమ్మవిరులు

చ. 2: తానే రాఁడొకో దైవమా వాఁడు
తానే రాఁడొకో దైవమా
నేనోప నిలువంగ నింకను
నానేరుపుల నానదు నామనసూ

చ. 3: వీఁడేఁ గదవే వేంకటేశుఁడూ వీఁడే
వీఁడెఁ గదవే వేంకటేశుఁడూ
నాఁడే నమ్మించే నన్నును
నేఁడే కౌఁగిట నెలకొనె నాకు

రేకు: 0041-4 భూపాళం సంపుటం: 06-175

పల్లవి: పొలయలుక నిద్దరలు భోగించ దొరకొంటి
అలర వడి మేల్కొనవె అఖిలేశ్వర

చ. 1: తరుణిమైనపుడె పరితాప సూర్యుఁడు వొడిచె
వరుసఁ జెలి కన్నుఁగలువలు మొగిచెను
మరుని సాయకపు తామరలు వికసించె
కరుణతో మేల్కొనవె కమలేశ్వర

చ. 2: కాంత నిట్టూర్పులను గాలియును నగ్నియును
వంత చెమటలవాన వరుణుండును
వింతలుగ నిన్ను సేవింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె పరమేశ్వర

చ. 3: మెలుఁత పెనుఁదురుమనెడి మేఘమండలములో
నలుగడలఁ జెలఁగె సుమనసపంక్తులు
కులికి పూవులవాన గురియంగ నున్న దిదే
చలముడిగి మేల్కొనవె సర్వేశ్వర

చ. 4: కదిసి పులకలసృష్టి కడలేక పొడమించు
మదనుఁడను మానస కమల భవుఁడును
ముదిత కోపపుహరుఁడు మొనసి యున్నారిదే
నిదుర మేల్కొనవె జలనిధిశయనుఁడ

చ. 5: ఒడికముగఁ జెలిలోన నుదయరాగము వొడమె
వెడలె నదె పలుకుఁ గోవిలరవములు
పడఁతిఁ గూడితివి రవి పరవశం బిఁకనైన
కడఁగి మేల్కనవె వేంకటరమణుఁడ

రేకు: 0041-5 ఆహిరి సంపుటం: 06-176

పల్లవి: వోవలఁబుచ్చే వూరకిటు
నీవలె సొలయఁగ నేరర నేను

చ. 1: తీపులఁ బొదిగిన తేనెల యలుగుల
చూపు చల్లకువే సుదతి
ఏపున నీకిపు డెదురులు చూచిన
చూపుల నేమిటిఁ జూతుర నేను

చ. 2: చంచలబరచి చక్కని వదనము
వంచి నవ్వకువే వనిత
నించిన కాన్కల నినుఁ గని వదనము
వంచి నవ్వ నిట్టు వలదా నేను

చ. 3: తాలిమి హృదయము తల్లడ మంది
కాలు దొక్కకువే కలికి
జాలి వేంకటేశ్వర కౌఁగిట నిను
కాలు దాఁకె నేఁకటఁ బడ నేను

రేకు: 0041-6 ముఖారి సంపుటం: 06-177

పల్లవి: బయలీఁదించకురే పలుమరు యీ
ప్రియునిపేర నిందరినిఁ బిలిచీఁ జెలియా

చ. 1: తడవి తవ్వకురే తమకపుఁజెలమ
పుడుకుచు నువ్విళ్లూరీని
పుడికి పెంచకురే పులకల నారూ
వొడలి బడలికల నొరగీఁ జెలియా

చ. 2: దరికొలుపకురే తలపోఁతదాలి
కరసాన కాఁకలఁ గనలీని
పురికొలుపకురే పుక్కిటి వూరుపూలూ
శిరసు నొప్పుల చేతఁ జిమిడీఁ జెలియా

చ. 3: మంతన మాడకురే మతిలోని యలపులు
వంతలనే వదనము వంచీని
చెంతల విసరరె శ్రీ వేంకటపతి
సంతపు లేఁజెమటల జడిసీఁ జెలియా

రేకు: 0031-1 శ్రీరాగం సంపుటం: 06-178

పల్లవి: ఎటువంటి మోహంబు యెటువంటి పరిణతలో
అటువంటి సతి పొందు లవి నీకె తగురా

చ. 1: చక్కని జవరా లొకతె జారెడికొప్పొకచేతఁ
జెక్కుచు సన్నపు నవ్వు చిలికి చిలికి
చెక్కునఁ జెదరిన కమ్మం జెమటల తావులను
చొక్కుచు నిన్నరగంటం జూచె నెవ్వతెరా

చ. 2: గద్దరి కన్నుల కలికి కమ్మని చల్లగాలి
అద్దిన దేహము తోడ నలసి యలసి
ముద్దుల రెప్పలు దెరచి ముందటి నీ తనవలపు
సుద్దులు దెలుపుచు నిన్నుం జూచె నెవ్వతెరా

చ. 3: కొండల రాయండ నీ కొమరైన చెలిచన్నుఁ
గొండల నీ కెంగేలం గులికి గులికి
నిండిన కౌఁగిటిలోన నీవుం దానుం గలశుండి
వుండినటువలెం గూడి వుండె నెవ్వతెరా

రేకు: 0031-2 ఆహిరి సంపుటం: 06-179

పల్లవి: పాయరాని పదివేలు పనులు నీకు యీ
కాయము నీ విప్పుడైన కౌఁగిలించుమీ

చ. 1: చిత్తజు తాపము చేత చిక్కవడ్డ దానం గాన
వొత్తి నీతో విన్నవించ నోపం గాని
యెత్తిన నీ విరహాన యే మౌదునో నన్ను
చిత్తగించి యెప్పుడైనాఁ జేరంగరమ్మీ

చ. 2: తరి నిన్నుం బాసి మాట తడఁబడే దానం గాన
నెరి నిన్నుం దూరనాడ నేరం గాని
యెరగొని తలచీర యెరంగకున్నప్పుడైన
కరఁగి మఱవక నాకడ చూడుమీ

చ. 3: దవ్వుల నిందాఁక నీకు తమకించే దానం గాన
జవ్వన మంటకు మనం జాలం గాని
రవ్వైన వేంకటరమణ నావద్ద నిట్టే
పవ్వళించి నేఁడైనాఁ బాయకుండుమీ

రేకు: 0031-3 భైరవి సంపుటం: 06-180

పల్లవి: ఏటిపొందుయేఁటి గుణము యేటి సవరందనముమనసు
నాఁటుకొలుపం జేయలేని నటన లేఁటికే

చ. 1: చూపు చూపు తారుకాణ చూపులోని నగవులెల్ల
చూపి పులకరించ లేని సొబగు లేఁటికే
యేఁపు రేఁగి కోరికలకు యెత్తు సేసి మీఁదఁ మీద
తాప మందఁజేయలేని తనువు లేఁటికే

చ. 2: కదిసినపుడే మేను మఱచి కౌఁగిలించినట్టి చేయి
వదలి కన్ను ముయ్యలేని వలపు లేఁటికే
తుదలనైన చెమటగముల తొప్పఁదోఁగి మోహరతుల
సదమదముగఁ దనుపలేని చనవు లేఁటికే

చ. 3: దేహధారి యైనఫలము తెలిసి వేంకటాద్రి విభుని
మోహ మందఁజేయలేని మురిప మేఁటికే
ఊహ దలఁచి తమక మంది వొకరి కొకరు యిట్ల నేఁడు
సాహసించి కలయకున్న జన్మ మేఁటికే

రేకు: 0031-4 దేసాళం సంపుటం: 06-181

పల్లవి: ఎట్టు ధరించే నింకాను
పట్టుట బరువీ ప్రాయము నాకు

చ. 1: చెప్పక వచ్చిన చిత్తము లోపలి
నొప్పులనేమై నొగిలీని
యెప్పుడు దలఁచిన హృదయము ఝల్లని
కుప్పలుగా మైఁ గురిసీఁ జెమటా

చ. 2: అంపలేక నన్నంపిన యప్పటి
తెంపు దలఁచిపో దిగుల నేను
యింపునఁదా నిపు డెట్లున్నాఁడో
కంపించీ మది కటకట యిపుడూ

చ. 3: తిరిగి చూచినను దేహము చిత్తముఁ
బరవశ మయ్యీఁ బలుమారు
తిరువేంకటగిరి దేవుఁడు కౌఁగిటఁ
గరుణించఁగఁ జీఁకటి వెడఁబాసె

రేకు: 0101-1 సామంతం సంపుటం: 07-001

పల్లవి: అతివ నీయంగములె అతను తాపపు మాటు
తతినొకటికొకటికని దైవమే సేసె

చ. 1: నిట్టూర్పుగాలికిని నీలాహివేణికిని
నెట్టనను విరహంపునెగులేఁటికే
చుట్టుఁ గన్నీటికిని చూపుఁజాతకములవె
తొట్టి యిఁక మీఁదనవి తుదమీఱఁ గలవా

చ. 2: చిగిరింత పులకలకు జిగిఁబలుకుఁగోవిలదె
పగటు మరుఘాతలకు వెగటేఁటికే
ఆగడుఁ దాపపురవికి నారనే రాహువదె
తెగి యిందుమీఁదనది దిష్టించఁగలదా

చ. 3: రతి మనసు మఱపులకు రమణి నీ గోరదివొ
ప్రతిమరునియుద్ధముల భ్రమతేఁటికే
యితవైన శ్రీవేంకటేశ్వరుఁడు నినుఁగూడె
చతురతల యివి నిన్ను సాధించఁగలవా

రేకు: 0101-2 రామక్రియ సంపుటం: 07-002

పల్లవి: ఎఱఁగనా నీగుణాలు యింతక తొల్లి
విఱుగని నామనసే వెట్టిఁజేసెఁ గాక

చ. 1: సేసపాల పెండ్లివారు సేనలుండఁగాను
ఆసపడి నాతో నవ్వేవంతే కాదా
యీ సుద్దులకెకా నే నీయింటికి రాను వెఱతు
దోసకారి చెలికత్తె తోడితెచ్చెఁ గాని

చ. 2: తఱితో వరుసవారు దగ్గరి కాచుకుండఁగా
నఱిముఱిఁ జేయివట్టేవంతె కాదా
యెఱిఁగుండి మానక నేనిట్టె మాటాడఁదగునా
పఱచుగూఁటి చిలుక పలికించెఁ గాని

చ. 3: కప్పురపుఁబళ్ళవారు కాచుకిట్టే వుండఁగాను
అప్పుడే నన్నుఁ గూడితివంతె కాదా
నెప్పున శ్రీ వేంకటేశ నేనూ నీవూ నొక్కటే
యిప్పుడే వీరిడి మరుఁడింత సేసెఁ గాని

రేకు: 0101-3 నాదరామక్రియ సంపుటం: 07-003

పల్లవి: దేవరవైతివిన్నిటా దేవులాయనాపె నీకు
ఆవల మిమ్మిద్దరినేమని పొగడేమయ్యా

చ. 1: పున్నమ వెన్నెలజోడు పూవులలోని వాసన
ఉన్నతిమీరి నీ వురమెక్కెను
మన్నన సంపద రాశి మదనుని పుట్టినిల్లు
వన్నెతో నీకు రాణివాసమాయను

చ. 2: పాల జలనిధి తేట బంగారు లోపలి కళ
కీలితముగా నీకెంగేలు వట్టెను
మేలులో సాకారము మించులోకము భాగ్యము
తాలిమితో నీకు మూలధనమాయను

చ. 3: అందరిని గన్నతల్లి ఆదిమూలమైన లక్ష్మి
కందువ నీ ముంజేతి కంకణమాయను
యిందునె శ్రీవేంకటేశ యీపె సర్వ మోహనము
కందు వాయ నిన్నుఁగూడె కలిమెల్లా మెరసె

రేకు: 0101-4 సామంతం సంపుటం: 07-004

పల్లవి: నీవెట్టితనమెంతునో నిన్నుఁ బుత్తెంచినట్టి
ఆవెట్టితనమెంతునో అమ్మరో నేఁడు

చ. 1: అక్క విలిచీనంటా నాతఁడూ కొలువుండఁగా
ఇక్కడఁ బిలువ వచ్చేవింత యేఁటికే
చిక్కించుక యింటిలోనే చెల్లినట్లు శేసుఁగాక
తక్కి మీయేలికసాని తగవేఁటి తగవే

చ. 2: అప్పటిఁ బోదువుగాని అందాఁకా విచ్చేయుమంటా
దుప్పటి కొంగు వట్టేవు దొడ్డదానవే
చెప్పి తన వూడిగెపు చెలిచే నింత సేయించె
తప్పని మీయాపె దొరతనమేఁటితనమే

చ. 3: ఆసలు చూపి మాటాడి ఆనవెట్టి సన్నసేసి
బేసబెల్లితనమునఁ బెనఁగేవవునే
యీసుల శ్రీ వేంకటేశు నింత సేయించి తాఁగూడె
వాసితో మీదొరసాని వరుసేఁటి వరుసే

రేకు: 0101-5 శ్రీరాగం సంపుటం: 07-005

పల్లవి: ఆదట దయదలఁచి యాదరించినంతె చాలు
సోదించి యాతని నంత జోలిఁబెట్టఁ జాలను

చ. 1: చనవు మెఱయఁబోతే స్వతంత్రము చూపవలె
మనవి చెప్పఁగఁబోతే మారు మాట్లాడవలె
ననుపు నడపఁబోతే నగి మందెమేళమౌను
ఘనుఁడాతనికి నేనింత గాసిఁబెట్టు నోపను

చ. 2: బలిమి సేయఁగఁబోతే పట్టి పెనఁగఁగవలె
చలము సాధించఁబోతే జంకించవలె
అలిగి సొలయఁబోతే అన్నియునుఁ దలఁపౌను
చెలువుఁడాతనినంత చిమ్మిరేఁచనోపను

చ. 3: మేలములాడఁగఁబోతే మీఁదఁ జెయివేయవలె
నాలిమొగదాకిరైతే నాయంత నేనుండవలె
ఈలీల శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
ఆలరి యాతనినంత అలయించనోపను

రేకు: 0101-6 గౌళ సంపుటం: 07-006

పల్లవి: అందుకే వేగిరమయ్యీనప్పటినుండి
గొందికిట్టే రాఁడుసుమ్మీ కొంకు విడిపింతును

చ. 1: తప్పక చూచినవాఁడు దగ్గరి రాఁడు సుమ్మీ
కప్పురము నోరికిచ్చి కౌఁగిలింతును
అప్పుడె నవ్వేటివాఁడు ఆయములంటఁడు సుమ్మీ
చిప్పిల మెయి చెమరించఁ జేతును

చ. 2: చేకొని మాటాడేవాఁడు చెఱఁగు వట్టఁడు సుమ్మీ
దాకొనఁ బెదవిని ముద్రలు వేతును
యీకడ నింతటివాఁడు యెదురుపడఁడు సుమ్మీ
లోకమెల్లా మెచ్చనిట్టే లోఁగొందును

చ. 3: కాఁకలు చల్లేటివాఁడు కందువ దీర్చఁడు సుమ్మీ
మాఁకువలె మేనెల్లా మఱపింతును
యేఁకటతో శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁ గూడె
వూఁకొనఁడు సుమ్మీ పంతాలొప్పగింతును

రేకు: 0102-1 మంగళకౌశిక సంపుటం: 07-007

పల్లవి: ఏల తలవంచుకొనేరిద్దరును నన్నుఁ జూచి
తాలిమినద్దరిపాటు తగదు నావల్ల

చ. 1: ఇక్కడ నీ వేళ చూడనింతి నంపి మఱికాక
గక్కన నేవచ్చినదే కల్ల నావల్ల
మక్కువ నదియుఁగాక మంచముపై సోదించక
మొక్కళానఁ గూచుండుటె మోసము నావల్ల

చ. 2: అందంద మాటలాడే అలబలము చూడక
కందువఁ దెరదీసుటే కల్ల నావల్ల
దిందుపడూరకుండక దీపమెగసన దొబ్బి
ముందు నేనే నవ్వినది మోసము నావల్ల

చ. 3: ఇన్నాళ్ళువలెనె యంటా నీపెకు వరుసియ్యక
కన్నులవిఁ గూడినదె కల్ల నావల్ల
యిన్నిటా శ్రీవేంకటేశ యిఁకనేల నే నిన్న
మొన్ననే రానిదియెల్లా మోసము నావల్ల

రేకు: 0102-2 సామంతం సంపుటం: 07-008

పల్లవి: ఇంత సేయఁగఁగదా యీాడ వెల వెట్టితివి
కాంతుఁడవు నీవు మాణిక్యమువంటివాఁడవు

చ. 1: మచ్చరించఁగఁ గదా మనసు పట్టఁ దిరిగే
విచ్చకములాడుకంటె యిదె మేలు
కచ్చుపెట్టి బంగారము కరఁగక వన్నెలేదు
అచ్చముగ వోరి నీవు అటువంటివాఁడవు

చ. 2: రాకుండఁగ నీవే నన్ను రతికిఁ బిలిచితివి
యేకమై వుండుటకంటె యిదె మేలు
మేకొని కస్తూరైనా మేదించక యెనయదు
ఆకడ నీవు వోరి అటువంటివాఁడవు

చ. 3: గుట్టుననుండఁగఁ గదా కూడితి శ్రీ వేంకటేశ
యిట్టునట్టు దూరుకంటె యిదె మేలు
చెట్టుమీఁది విరులైనా చేతులఁ గోయకరావు
అట్టెవోరి నీవు అటువంటివాఁడవు

రేకు: 0102-3 వరాళి సంపుటం: 07-009

పల్లవి: ఎరవా నీవు నాకు యిందుకే కాక
సరవితో నుండనా యీచలాలకే కాక

చ. 1: పంతమా నే నీకు బాగాలిచ్చేయందుకు
అంతలో నీవాపెకిచ్చేవని కాక
చెంతల నీకేమి సేవ చేసినాను దోసమా
కొంత నీతోఁగూడి యాపె కూచుండఁగాఁగాక

చ. 2: నలువంక నేనీతో నవ్వకుండేదాననా
సొలసి యాపె యీదిక్కు చూడఁగాఁ గాక
మలసి యప్పటి నీతో మాటాడఁ దగదా
వెలయ నీవద్దనాపె వినఁగాఁ గాక

చ. 3: యేమాయ నీపాదములిటు నేము పిసికితే
దోమటినాపెకాలు దొక్కఁగాఁ గాక
నేమాన శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
మోముచూతునా యాపెను మొక్కించఁగాఁ గాక

రేకు: 0102-4 ముఖారి సంపుటం: 07-010

పల్లవి: నిండనానలు వెట్టుకు నీ వంతాను
అండనితశత్రుఁడ నీయాఁబడిఁ జిక్కితిరా

చ. 1: కప్పురపు ధూళిదెచ్చి కన్నులనిండాఁ జల్లి
అప్పుడే యాపెఁ గూడితివౌరా నీవు
తప్పులే కూడైనట్టి తాటోటుకాఁడవు నీతో
యిప్పుడు నమ్మి నీ పొందులెట్టు నేఁజేసితిరా

చ. 2: చేరెఁడు తట్టుపుణుఁగు చెవులనిండాఁ బోసి
యీరీతి మాటలాడితి వింతితోడను
తీరువడ్డ పెనులోకదిమ్మరివి నీకు నేను
ఆరితేరి నేఁడు నీకు నాలనెట్లైతిరా

చ. 3: కౌఁగిట నన్నుబిగించి కళ వట్టించి యాపెతో
చేఁగదేర నవ్వితివి శ్రీ వేంకటేశ
దాఁగిలి ముచ్చిములాడే దాయగాఁడవైన నిన్ను
తోఁగి చూచెట్టు నీరతిదొమ్మికి లోనైతిరా

రేకు: 0102-5 రామక్రియ సంపుటం: 07-011

పల్లవి: అంగన యెట్టుండినా నమరుఁగాక
సంగతే నీకు నాపె సాటికిఁ బెనఁగను

చ. 1: తనకుఁ బోదైనచోట తగిలి మాటాడకున్న
మనుజుఁడా వాఁడు పెద్దమాకు గాక
చనవునఁ బెనఁగఁగా సమ్మతించకుండితేను
ఘనత యేది? చులకఁదనమే కాక

చ. 2: చెల్లుబడి గలచోట సిగ్గులు విడువకున్న
బల్లిదుఁడా వాఁడు కడు పందగాక
వెల్లివిరి నవ్వఁగాను వీడుదోఁళ్ళాడకున్న
చల్లేటి వలపులేవి? సటలింతే కాక

చ. 3: తారుకాణలైనచోట తమకించి కూడకున్న
చేరఁగ జాణఁడా గోడచేరుపు గాక
యీరీతి శ్రీ వేంకటేశ యిట్టె రఘునాథుఁడవై
కూరిమిఁ గూడితివిది కొత్తలింతే కాక

రేకు: 0102-6 ముఖారి సంపుటం: 07-012

పల్లవి: అంది వాదులకు వచ్చేవదేమోపే
మంద పసులు దవ్వేఁగె మమ్ము విడవోపే

చ. 1: పేయ చొరఁగానె యిల్లు బెంబడిఁ జొచ్చితిఁగాక
ఆయెడ నన్నేల తిట్టేవదే మోపె
చాయలనా పుట్టుచెండు చవి నేనంటితిఁగాక
మాయల నీ చన్నులంట మాకేలవోపే

చ. 2: బచ్చెన మంచము దాఁకి పైఁబడితి నీ వుండేది
యచ్చుట నెవ్వఁడెఱుఁగునదేమోపే
పెచ్చుఁబిల్లఁగోవెనుచుఁ బెదవిమోఁపితిఁగాక
పచ్చి నీమోవనెఱిఁగే పని మాకేలోపే

చ. 3: ముందర నీతొడదాఁకి మొలగంట వాఁగెఁగాక
అందుకు నన్నంటఁబట్టేవదేమోపే
అంది శ్రీ వేంకటపతి ననక తోదోపులనె
సందడిఁ బెనఁగితివి చాలదా వోపే

రేకు: 0103-1 ఆహిరి సంపుటం: 07-013

పల్లవి: ఏల మమ్ము గేలిసేసేరింతులాల
మేలుమీఁది దాననింత మెచ్చుఁగదరమ్మా

చ. 1: చలము సాదించఁబోతే జవ్వన మాఁపఁగరాదు
పలుకకుండేనంటే ఫలము లేదు
చెలువుఁడెదుట వచ్చి చెయి వట్టుకున్నవాఁడు
తొలఁగఁదోయఁగరాక తూర నవ్వేనమ్మా

చ. 2: కోపగించుకొనఁబోతే కొసరఁగఁ జోటులేదు
చూపుల జంకించేనంటే సొగయదది
యేపున నితఁడు వీరెమిందమనుచున్నవాఁడు
పై పై నొదుగలేక భావించేనమ్మా

చ. 3: పంతములాడేనంటే పతితో బలము లేదు
వింత సేసుకుండేనంటే వేడుక లేదు
యింతలో శ్రీ వేంకటేశుఁడెమ్మెచూపినన్నుఁగూడె
చింతదీర వెరగుతోడి సిగ్గుపడేనమ్మా

రేకు: 0103-2 పాడి సంపుటం: 07-014

పల్లవి: ఎవ్వరెవ్వరి చిత్తాలు యెట్టుండునో
యివ్వల నీకు మొక్కేది యెట్టుండునో

చ. 1: పగట్ల నీతోఁ బలుమారు నవ్వఁగాను
యెగసెక్కెమని నీకు నెట్టుండునో
తగిలి నీవొద్దనట్టె దాయక పాయకుండఁగ
అగడుగ నేమడిగేనని వుండునో

చ. 2: చెంతల నీ చెక్కు నొక్కి సేవలు నేఁజేయఁబోతే
ఎంత బట్టడిది యని యెట్టుండునో
పొంతనే యాటపాటల పొద్దులు గడపితేను
యింత మాయదారి యని యెట్టుండునో

చ. 3: కాతరాన మాయింటికి గక్కనఁ బిలిచితేను
యేతులెంత సేసేనని యెట్టుండునో
ఆతుమై శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యీతగుమన్నన నాపై నెట్టుండునో

రేకు: 0103-3 వరాళి సంపుటం: 07-015

పల్లవి: ఏకతంబాయనిదె యిద్దరికి నొకచోట
యేకొలఁదిఁ బడునొ వలుపేమందునే

చ. 1: ననుపు గలవారికిని నవ్వకుండఁగరాదు
మనసులెనసిన తగులు మానరాదు
చనవు వెగ్గళమైన సరసముల కొదలేదు
తనివి దీరఁడు విభుఁడు తనకు నే నెదురా

చ. 2: మగలకును సతులకును మాటలాడక పోదు
మొగమోట గలచోట మొరఁగ రాదు
పగలేని తావుకును పంతంబు పనిలేదు
తగవులెంచీనతఁడు తనకు నే నెదురా

చ. 3: కూటములు గలయపుడు కొంకు గొసరే లేదు
పాటించి మొక్కఁగాఁ బదరఁదగదు
యీటుతో శ్రీ వేంక టేశుఁడిటు ననుఁ గలసి
తాటించి పొగడీని తనకు నే నెదురా

రేకు: 0103-4 సాళంగనాట సంపుటం: 07-016

పల్లవి: మాతోడి నవ్వులు మఱి యాల చే
చేత నెందురు చూచీనదె చెలియ

చ. 1: వలసిన యెడలకు వచ్చేదే మేలు
వలవని జోలికి వాదె మేలు
బలిమి సేయమిఁక పడఁతికడకు మ
మ్మెలమి నంపినా యెట్టైనా మేలు

చ. 2: మనసు వచ్చితే మాటాడుటే మేలు
నసుచకున్న మోనము మేలు
అనలేము నిన్నునాసపడినచెలిఁ
జెనకక నీవేమి సేసినా మేలు

చ. 3: పొందే కలిగిన భోగించుటే మేలు
కందిన యెడ నలుకలు మేలు
యిందులో శ్రీ వేంకటేశ కూడితివి
యిందుముఖికి నీకిదియే మేలు

రేకు: 0103-5 గౌళ సంపుటం: 07-017

పల్లవి: వేటే నేమూరకుండిన వెంగెమే కాదా
నీఱుపైఁ గోపాలు చూప నీయంతవారమా

చ. 1: కొంగువట్టి నిన్నుఁ బేరుకొననైతినని దూరే
వెంగిలి నోరఁ బిలిచేదెగ్గు గాదా
కుంగని కుచాలు దాఁచుకొంటినంట నాడేవు
నింగిమోవఁ బెరుగఁగ నీ యంతవారమా

చ. 2: అంచ నీవొద్దఁ గూచుండనని యలిగేవు నీ
మంచము కాళ్ళఁ దొక్కేది మదము గాదా
అంచు మోవనోరఁగఁగ ఆనుకోనైతినవేవు
నించిన కొండలు మోవ నీయంతవారమా

చ. 3: అమర నీతోఁ బెనఁగనైతినంటా గొణగేవు
చెమటమెయి నీపైమోవ సిబ్బితి గాదా
తమితో శ్రీ వేంకటేశ దక్కి నన్నుఁ గూడితివి
నెమకిప్రేమఁ గూడఁగ నీయంతవారమా

రేకు: 0103-6 రామక్రియ సంపుటం: 07-018

పల్లవి: వేడుక పడేముగాక వెంగెమాడేమా నిన్ను
వాడలో నాపెతో నేము వాదడిచేమా

చ. 1: ఏయింతికి వలతువు యిట్టె నిజమాడుమంటే
మాయలు సేసి మాటలు మఱపించేవు
ఆయము లెఱఁగ నేము అరుహులము గామా
చాయల నిన్నంతలోనే సాదించేమా

చ. 2: ఎంత చక్కనిది యాపె యిట్టె నేఁజూచేనంటే
దంతపు నవ్వుల జాణతనమాడేవు
ఇంతటి నీ మేలుచూడ యిందుకును దగమా
అంతలోనే నిన్ను పెద్ద ఆరడిఁ బెట్టేమా

చ. 3: ఏమని యడుగు నిన్ను యిట్టె నీ ప్రియురాలంటే
కామించి పరాకుసేసి కౌఁగిలించేవు
చేముంచి శ్రీ వేంకటేశ చేకొంటివిదె నన్ను
ఆమగువఁ దెచ్చుకొంటే అడ్డమాడేమా

రేకు: 0104-1 దేసాళం సంపుటం: 07-019

పల్లవి: అట్టె మీఁదనైనట్టులయ్యీఁ గాని
పట్టినదె పంతమై బలియగఁ జొచ్చును

చ. 1: మగవారిచేఁతలకు మానినులైనవారు
వెగట్లాడకుండరు వేయైనాను
అగపడి యెవ్వరైనా నారిచి తీరిచేమంటే
చిగురుఁ గొమ్మును చాఁగై చిమ్మిరేఁగఁజొచ్చును

చ. 2: వసమైనవారిమాట వలచి వచ్చినవారు
పిసరు మందెమేళాల పెంచకుండరు
అసమున నండవారు అందాలు సేసేమంటే
పిసికితే పసురై పిప్పిరేఁగఁజొచ్చును

చ. 3: సరసుల పొందులకు జాణలైన సతులెల్లా
ఒరసి సాదించకుండరొకమాటైనా
యిరవై శ్రీ వేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
పెరరేఁగిన రతులు పెంటలుగాఁ జొచ్చును

రేకు: 0104-2 శ్రీరాగం సంపుటం: 07-020

పల్లవి: ఇచ్చకములాడరే యింతులాల
పచ్చి జవ్వన మింతలో పదను దీసీనా

చ. 1: ఏఁటికి విభుఁడు రాఁడొ యింటనట్టేవుండనీ
మాటలైనా నాడి రారె మగువలాల
తాఁట తూఁటలూనేల తావచ్చినట్టే వత్తము
పాటించిన నావలపు పండి పొల్లవొయ్యీనా

చ. 2: సొగిసి యెంతపరాకో జూజాలట్టే ఆడీని
మొగమైనాఁ జూచి రారె ముదితలాల
యెగసక్కేలిఁకనేల యేకమౌదమీతనితో
నగఁగానే సరసాలు నాని విరిసీనా

చ. 3: కాయమెంత యలసెనో కడుదప్పిదేరనీ
చేయెత్తి మొక్కియిన రారె చెలియలాల
యీయెడ శ్రీవేంకటేశుఁడేతెంచి తా నన్నుఁగూడె
కోయరాని కోరికలు కొలఁదినుండీనా

రేకు: 0104-3 సామంతం సంపుటం: 07-021

పల్లవి: మిక్కిలి నేర్పరి యలమేలుమంగ
అక్కర దీరిచి పతినల మేలుమంగ

చ. 1: కన్నులనె నవ్వునవ్వి కాంతునిఁ దప్పక చూచి
మిన్నక మాటాడీనలమేలుమంగ
సన్నలనె యాస రేఁచి జంకెన బొమ్మలు వంచి
అన్నువతోఁ గొసరీని యలమేలుమంగ

చ. 2: సారెకుఁ జెక్కులు నొక్కి సరుసనె కూచుండి
మేరలు మీరీ నలమేలుమంగ
గారవించి విభునికిఁ గప్పురవిడెమిచ్చి
యారతులెత్తీనదె యలమేలుమంగ

చ. 3: ఇచ్చకాలు సేసి సేసి యిక్కువలంటి యంటి
మెచ్చీనతని నలమేలుమంగ
చెచ్చెర కౌఁగిటఁ గూడి శ్రీ వేంకటేశ్వరుని
అచ్చముగానురమెక్కీ నలమేలుమంగ

రేకు: 0104-4 ఆహిరి సంపుటం: 07-022

పల్లవి: ఏమి భాగ్యముననో యిటు విచ్చేసితిగాక
వోమి నీయవసరము వొకరికినబ్బునా

చ. 1: కడు విరహినై నిన్నుఁ గన్నులఁ జూచేమంటేను
వడదేరి కొలువు చావడినుందువు
తడవి అక్కడికైన దగ్గరేనంటే నిన్ను
యెడసి నావంటివారు ఎందరైనా వత్తురు

చ. 2: పక్కన నే నీకు విన్నపము సేసుకొనేనంటే
యెక్కడ లేని పరాకు యెప్పుడు నీకు
చెక్కు వట్టి తీసి నిన్ను చేతనెచ్చరించేనంటే
వెక్కసాన నట్టివారు వేవేలు గలరు

చ. 3: పారితెంచి నే నిన్ను బలిమిఁ గూడేనంటే
నేరుతు రందుకుఁ దగు నెపములెల్లా
కోరి శ్రీ వేంకటేశుఁడ కూడితివి నన్ను నిట్టె
యీరీతి నలమేల్మంగను యిందరుఁ జుట్టాలే

రేకు: 0104-5 సాళంగనాట సంపుటం: 07-023

పల్లవి: ఆతఁడు నీవు నొక్కటైతే నౌదురుగాక
యేతున మమ్మింటకు నేమెవ్వరిలోవారము

చ. 1: వంతులకుఁ బెనఁగేవు వద్దు సుమీ నీవు నాతో
యింత పోరితే నీవే యెఱుఁగుదువు
రంతుల నేనేమన్నా రాఁగఁజేసి దూరవద్దు
యెంతకెంత సేసేవు నే మెవ్వరిలో వారము

చ. 2: నేనున్నాడనే వుండేవు నీకిదేమే చలమా
కానీ లేవే మీఁదటెత్తు గనుకొనేవు
పూని మమ్మురేఁచి వట్టి బూమెలు సేయవద్దు
యీ నేరుపులేఁటికి నే మెవ్వరిలోవారము

చ. 3: నన్నుఁ బేరుకొనకుమీ నాయముగాదు నీకు
చిన్నదానవు నేఁజాటి చెప్పితి నీకు
యెన్నికెతో శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ గలనె
ఇన్నాళ్ళుదాఁకాను నే మెవ్వరిలోవారము

రేకు: 0104-6 సాళంగనాట సంపుటం: 07-024

పల్లవి: ఔలే విరహుల జాడలటు వలెనే
తాలిమి లేక తామే తమకింతురు

చ. 1: మాటకు మునుపనే మగువలఁ దిట్టేవు
పాటించి వినఁగరాదా పనులెల్లాను
సూటిగా నీ పతిమోము చూచిన యంతటిలోనే
కాటుక కన్నుల నీరు కడు నించేవు

చ. 2: చేయివట్టి తీయఁగానే చిమ్ముచు విదిలించేవు
ఆయెడ నోరుచ రాదా అయినదాఁకాను
దాయికొని రమణుఁడు దగ్గరఁ గూచుండితేనే
పాయక అవ్వలిమోమై పవ్వళించేవు

చ. 3: వీడెము నేనియ్యఁగానే వేసరి వొల్లనేవు
యీడనె మీ నేరుపులెంచుకోరాదా
పాడిగాఁ గానట్టే పక్కన శ్రీవేంకటేశ
కూడితి వింతటిలోనే కొల్లున నవ్వేవు

రేకు: 0105-1 సాళంగనాట సంపుటం: 07-025

పల్లవి: మేకులు నావద్దనే మెరసీనా
యీకతలెఱుఁగుదు నన్నేల పిలిచీనే

చ. 1: సంగడిఁ గూచుండి సరసములాడి యాపె
అంగము కస్తూరి పూఁతలంటించుకొనె
ఎంగిలి దేహము తోనే యీడకు విచ్చేసినాఁడు
యింగిత మెఱిఁగితి నన్నేల పిలిచీనే

చ. 2: నమ్మిక లాపెకు నిచ్చి నయగారమున నాపె
సొమ్ములు దాఁబెట్టుకొనెఁ జూడఁగానే
అమ్మరో నా మంచముపై నాపెఁదానునున్నవాఁడు
యెమ్మెలెల్లాఁ గంటి నన్నునేల పిలిచీనే

చ. 3: చేరి యాపె వాసన చూచిన చెంగలువ బంతి
మేరతోఁ దాఁబట్టుకుండి మీఁదవేసెను
యీరీతి శ్రీ వేంకటేశుఁ డిప్పుడిట్టె నన్నుఁగూడి
యీరానిచనవులిచ్చె నేల పిలిచీనే

రేకు: 0105-2 మాళవిగౌళ సంపుటం: 07-026

పల్లవి: మరిగేమి నెఱఁగను మంకు గొల్లదాన నేను
సరిలేని నవ్వులతో సరసమాడుదును

చ. 1: బలిమి నేఁ జేయఁ గాని పంతమాడి నిన్నునిట్టె
వలపించి నీ మోము వాడు దేర్తును
చలము సాదించఁ గాని చనవు చేసుక నీ
వెలలేని మోవెల్లా వేడుకల నింతును

చ. 2: బొమ్మల జంకించఁ గాని పొద్దు పొద్దుఁ గాచుకుండి
సమ్మతించ నీ మనసు జట్టిగొందును
చిమ్ముచుఁ గొసరఁ గాని చేతులు నీపైఁ జాచి
ఉమ్మడి నా గోరి కొనలొడలెల్ల నింతును

చ. 3: నేరమెంచఁ గాని నేను నీతోనే మాఁటలాడి
చేరువ నీ మన్ననలు చేకొందును
యీరీతి శ్రీ వేకంటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పేరుకొని యిఁక నిన్ను ప్రియాన మెప్పింతును

రేకు: 0105-3 ముఖారి సంపుటం: 07-027

పల్లవి: ఇన్నాళ్ళు నెఱఁగనైతి నెచ్చుకుందులాడితి నీ
వన్నెదీయ మెరసేది వనితా భూమిని

చ. 1: యెందరు సతులు నీకు యెట్టైనానుందురుగాక
ముందరి వీడెము నాది మోహము నాది
పొందులఁ దొలుత నిన్ను భోగించిన నా యెంగిలి
అందుక చేయొగ్గినది ఆఁటదా భూమిని

చ. 2: అవ్వల నీవారమని ఆడుకోనీ యెవ్వరైనా
నవ్వులు నీవు నాతోనే ననుపు నాదే
రవ్వల నే నిన్ను నిట్టె రతిసేసిన వలపు
తవ్వి తలకెత్తుకొంటే తరుణే భూమిని

చ. 3: పైకొని నిన్నెవ్వరాస పడేది పడుట గాక
కైకొన్న కౌఁగిలి నాది ఘనత నాది
యీకడ శ్రీ వెంకటేశ యిట్టు నన్నుఁ గూడితివి
వాకు కసివుచ్చుకుంటే వనితా భూమిని

రేకు: 0105-4 ముఖారి సంపుటం: 07-028

పల్లవి: చెల్లఁబో యింకానేల సిగ్గుగాదా
యెల్లవారునెరిఁగిరి యిఁకనేడ సుద్దులు

చ. 1: సిరులతోఁ జెఱఁగు మాసినదానిఁ జేరరాకు
సొరిది నల్లంతనుండి చూతువు గాని
వరుస దప్పితే నాడవారిమీఁది యానే సుమ్మీ
యెరవులవారమైతి మిఁకనేడ సుద్దులు

చ. 2: మాఁటుననున్న దానితో మాటాడకువయ్య నీవు
ఆఁటాదానిచేతనే చెప్పంపుదు గాని,
కూటమికిఁ బెనఁగితే కుచ్చి అట్టు సేతు సుమ్మీ
యేఁటికి నవ్వులు నవ్వేవిఁకనేడ సుద్దులు

చ. 3: చిందువందైనదానిఁ జెనకకువయ్య నీవు
కందువ చెప్పంపి మీఁదఁ గలతు గాని
పొందితి వింతలో నన్నుఁ బోనీక శ్రీ వేంకటేశ
యిందులో నన్నియుఁ గంటిమిఁకనేడ సుద్దులు

రేకు: 0105-5 గౌళ సంపుటం: 07-029

పల్లవి: ఎంతకెంత నా దిక్కు యేమి చూచేవు
కాంతుఁడవు నాకు ఆపె గలయంత కాలము

చ. 1: మఱి వరుస దప్పని మగువవంక గాక నీ
పఱచు గుణాల కెల్లపాటి వున్నదా
యెఱఁగనా నీ సుద్దులు యేల నవ్వే వెన్నటికి
మఱచేవే యాకెఁజూచి మఱచితిఁ గాక

చ. 2: అంగవించి మాటాడేవు ఆపెకు వెఱచే కాక
ముంగిటి నీయంత నీకు మోహమున్నదే
యింగితానఁ గానరాదా యేల మొరఁగేవు నాకు
కంగవద్దా ఆపెఁ జూచే కంగనైతిఁ గాక

చ. 3: కౌఁగిటఁ గూడితి వాపె కనుసన్నలనె కాక
వీఁగి శ్రీ వేంకటాద్రి గోవిందరాజా
చేఁగదేరనింకేల నీ చేఁతలకు గడెవెట్టి
ఆఁగవద్దా ఆపెఁ జూచే ఆఁగనైతిఁ గాక

రేకు: 0105-6 రామక్రియ సంపుటం: 07-030

పల్లవి: ఏల మమ్ము రట్టు సేసేవింతటిలోనే పెను
వేలనే గడెవెట్టితి వెళ్ళునియ్య నిన్నును

చ. 1: వొద్దనఁగాఁ బొయ్యేవు వొంటిఁ జిక్కించుక యాపె
అద్దలించి యేమైనాననకుండీనా
అద్దో నాతో నీవు అలిగి యందు చేరిన
పొద్దుగాని పొద్దనక పొందులు సేసేరా

చ. 2: తుమ్మఁగానే లేచేవు తొయ్యలి యెవ్వతెయైనా
దిమ్మరేఁచి వాదుదీసి తిట్టకుండీనా
యెమ్మెల నాతో మేకులకెవ్వతెఁ బలిపించినా
నమ్మరాదనక నీతో నవ్వవచ్చేరా

చ. 3: మొక్కఁగా నడుగిడేవు ముందటనెవ్వతెయైనా
చిక్కించుక చేఁతలెల్లాఁ జేయకుండీనా
మక్కువ శ్రీ వేంకటేశ మగిడి నన్నుఁ గూడితివి
తక్కిన వారు నవ్వక తాము లోనయ్యేరా

రేకు: 0106-1 సామంతం సంపుటం: 07-031

పల్లవి: మగువలతోడిదేల మందెమేళాలు
తగినయంతే కాక తమకమేలయ్యా

చ. 1: పెక్కుమాటలాడితేను ప్రియమెల్లాఁ జవుకౌను
యెక్కుడు సుద్దులు నన్నునేలడిగేవు
మొక్కులే సారెకునైనా మోపులై వేసటవుట్టు
యెక్కసక్యాలకుఁ బాదమేల పట్టేవయ్యా

చ. 2: విడువక నవ్వితేను వెస మొగచాటగును
అడరి మాతో సరసాలంత యేలయ్యా
యెడయక చూచితేను యెదిరికి సిగ్గువుట్టు
కడు నీయెదుటనేల కమ్ముకొనేవయ్యా

చ. 3: బలువై కౌఁగలించితే పరవశములు మించు
నెలకొని మమ్మునెంత నెట్టుకొనేవు
వెలయ శ్రీ వేంకటేశ వేమారు నన్నుఁ గూడితి
వలపులజడి యంత వంచితివో అయ్యా

రేకు: 0106-2 పాడి సంపుటం: 07-032

పల్లవి: ఇంకనేల సుద్దులు యెదురూఁ గుదురుగాను
సుంకు మోచిన కళలు సూట్లాయను

చ. 1: సరస నిలుచుండఁగా సతి తురుము విరులు
పరిమళముతో నీపై రాలెను
ధరనవే నేసలాయ తగ మరునమ్ములాయ
మరిగితీమరఁగేల మంచిదాయను

చ. 2: చేతికి విడెమియ్యఁగ చెలియకుచాలు నీకు
నాతల యీతలను ఆయాలు మోచెను
ఘాత నిమ్మపండ్లాయ కానికలవే ఆయ
యీతల మాయలేఁటికి నియ్యకోలే ఆయను

చ. 3: ఇదె శ్రీ వేంకటేశ నేఁడింతి నీతో మాటాడఁగా
పెదవి పెదవి దాకి ప్రేమము రేఁగె
అదన నన్నుఁ గూడితి వనువాయఁ దనివాయ
కొదలెల్లాఁ దీరెనిదే గుఱులాయను

రేకు: 0106-3 ముఖారి సంపుటం: 07-033

పల్లవి: ఏల నాతో బొంకవచ్చే వెఱఁగనా నేఁదొల్లి
వాలాయించి మాకు మంచివాఁడవే యెప్పుడును

చ. 1: దవ్వులనే మొక్కుమని దయ నాపైఁ బెట్టుమని
యెవ్వతె చెప్పెనో కాక యీబుద్ధులు
నివ్వటిల్ల నీ యంత నీవెఱఁగవింతేసి
చివ్వన నొకరి పెట్టుఁజెట్టవే యెప్పుడును

చ. 2: చేచేత వేఁడుకొమ్మని చెక్కునాకు నొక్కుమని
యే చదువులోనుండెనో యీవోజలు
నీ చందములివి గావు నేఁడు గొత్తలా నాకు
సూచింప నొకరాడించే సూత్రమవెప్పుడును

చ. 3: అక్కర నిచ్చలాడేవు ఆయము గరఁగించేవు
యెక్కడ నేరిచితివి యీరతులు
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నేఁడు గూడితివిగాక
గుక్కకొకని పెంపుడుగున్నవే యెప్పుడును

రేకు: 0106-4 శంకరాభరణం సంపుటం: 07-034

పల్లవి: ఇందులోపలఁ దనకు నెందువారమె నేము
అందంబుగానతని నడుగరే చెలులు

చ. 1: తగులు గలిగిన యడల తమకమింతయు నమరు
నగినయడలను మిగుల నటనలమరు
తెగువ గలిగిన యడల తేఁకువలు గడునమరు
మొగమోట గల యెడల మోహంబులమరు

చ. 2: మనసు లెనసిన యెడల మాటలన్నియునమరు
ననుపు గలిగినయడల నయములమరు
చనవు గలిగిన యడల సరసమంతయునమరు
పెనకువలు గల యడల ప్రియములునునమరు

చ. 3: కూడియుండెటియడల గుఱుతులిన్నియునమరు
వాడికలు గలయడల వలపులమరు
యీడనే శ్రీ వేంకటేశుఁడిటు ననుఁ గూడె
వేడుకలు యీయెడల వేవేలునమరు

రేకు: 0106-5 శ్రీరాగం సంపుటం: 07-035

పల్లవి: మాపుదాఁకా వట్టిమాటలేమిటికి నిఁక
తీపులకుఁ గుఱి మోవిదిష్టంబులే

చ. 1: తలపోఁతలకును గుఱి తమకంబులే చెలియ
వలపులకు గుఱి నిండు వయసు మదమే
చలములకు గుఱి తగిన సమరతుల నిబ్బరము
పిలుపులకు గుఱి మంచి ప్రియములివియే

చ. 2: యెనయు నాసలకు గుఱి యెడతాఁకులే చెలియ
ననుపులకు గుఱి సెలవినవ్వులివియే
చనవులకు గుఱి మిగుల సలిగెలు మెరయుటలు
మొనయ పొందులకు గుఱి మొగమోటలే

చ. 3: జిగిఁ గలయికలకు గుఱి సిగ్గు విడుచుటె చెలియ
తగులమికి గుఱి యేకతములవునికే
తగిన శ్రీ వేంకటోత్తముఁడు నను నిటు గూడె
పొగరుమన్ననకు గుఱి భోగంబులే

రేకు: 0106-6 గౌళ సంపుటం: 07-036

పల్లవి: ఓసరించి యేమిటికి నోపినట్టి దానఁ గాను
ఆసల రక్షించు పుణ్యమదే సుమ్మీ యిఁకను

చ. 1: ఊరకున్న నన్నుఁదెచ్చి వొకటొకటే నేరిపి
యీరీతినె చనవిచ్చి యింత సేసితి
నేరుపు నేరాలెంచవు నీవు గాచేవాఁడవే
గోరపెట్టి విరహానఁ గుమ్మకుమీ నన్నును

చ. 2: చిన్ననాఁడే నన్నుఁ దెచ్చి సేవలు సేయించుకొని
యిన్నిటాఁ బెద్దరికాన యింత సేసితి
వన్నెలు యెప్పుడు సేసేవే వలపు నే నెరుఁగుదు
వున్నమాయలకు నన్ను వొడ్డకుమీ యిఁకను

చ. 3: మాయింటికి విచ్చేసి మంతనాన నమ్మికిచ్చి
యీా యెడనే నన్నుఁ గూడి యింతసేసితి
పాయపు శ్రీ వేంకటేశ బదికించేదెఱఁగనా
చాయల అపకీర్తికి చాల సుమ్మీ యిఁకను

రేకు: 0107-1 మధ్యమావతి సంపుటం: 07-037

పల్లవి: ఏల వేగిరించేవీపె నిట్టెమాటలాడుమని
నాలినాపె మోము చూచి నవ్వులేఁటికయ్యా

చ. 1: వేగినంతా నీ తోడ వెలఁది మాటలాడి
భోగించీ నిద్దురలిదె పొద్దెక్కినంతా
చేగదేరినట్టి పెక్కుచింతలు గలవాఁడవు
యీగతి నిద్దురలు నీకేల వచ్చీనయ్యా

చ. 2: పెక్కుదడవు నీతోడఁ బెనఁగినది గనక
వుక్కుననలసి కొంత వూరకున్నది
అక్కడ సాములు చేసే యలవాటు గలవాఁడ
విక్కడ నీ కింతయలపేల వచ్చె (చ్చీ ?) నయ్యా

చ. 3: తతిగొన్న నీరతులఁ దనిసినది గనుక
మతిపరవశముల మఱచున్నది
యితవై శ్రీ వేంకటేశ యీపెఁ గూడితివి నీకు
నితరకాంతలవలె నేలవుండీనయ్యా

రేకు: 0107-2 ముఖారి సంపుటం: 07-038

పల్లవి: మొక్కేలేవే యిందులకు మొదల నేను
మొక్కితే దీవెనలు ముందుముందే రావా

చ. 1: చిగురుఁ జేతులకేలే చిమ్మువాఁడి కొనగోళ్ళు
చిగురుఁగొమ్మున వోరి చేఁగలే కావా
తగు తీఁగెవంటి నీకు దంటతనమింతయేలే
వెగటుతీఁగెలే కావా విఱ్ఱవీఁగఁ గాచును

చ. 2: ఇంచుకంత మోమునకు యింతలేసి కన్నులేలే
యించుకంత అద్దమేరా యిన్నీఁ జూచేది
కొంచెపు నీనోరికేలే కొండలంతలు మాటలు
కొంచపు నడుమే కాదా కుచగిరులానును

చ. 3: పండువంటి మోవికేలే పచ్చిలక్కముద్రలివి
పండినపంటకే కావా బలుముద్రలు
నిండు శ్రీ వేంకటేశుఁడ నిన్ననేఁ గూడితిఁగదే
నిండు నీపురము నాకు నెలవు గాదా

రేకు: 0107-3 శ్రీరాగం సంపుటం: 07-039

పల్లవి: ఈపాటి వలపులు యెఱఁగనివా
పోపో ఆతనికేల బుద్ధి చెప్పేరే

చ. 1: మనసు ముట్టినఁ గాని మాటలూనుఁ జవిగావు
తనువు సోఁకినఁ గాని తనివి లేదు
చనవులిచ్చినఁ గాని సరసములు చెల్లవు
పెనఁగి యాతనినేల పెరరేఁచేరే

చ. 2: తప్పక చూచినఁగాని దగ్గరి రాఁగొలుపదు
చెప్పుడు సుద్దులఁ గాని చింత దీరదు
చొప్పుగా నవ్వినఁ గాని చుట్టరికము నిండదు
యిప్పుడే యాతనినేల యేసపెట్టేరే

చ. 3: ఏకతమయ్యినఁ గాని యెరవులు విడువవు
రాకలఁ బోకలఁ గాని రతిపుట్టదు
కైకొని శ్రీ వేంకటాద్రి ఘనుఁడిట్టె నన్నుఁ గూడె
యీకడ యాతనినేల యియ్యకొలిపేరే

రేకు: 0107-4 సాళంగనాట సంపుటం: 07-040

పల్లవి: నవ్వితినే నీమాటకు నాలో నేను
నవ్వులలోనున్నదిరా నాఁటుకొన్న వలపు

చ. 1: కప్పురము వంటి మాట కారము వంటి చూపులు
చొప్పులు రెండువంకలాఁ జూపేవిదేమే
దెప్పరపు మదముతోఁ దెలుసుకోవేర నీవు
కప్పురపు విడెములోఁ గారమే కాదా

చ. 2: విందువంటి వినయాలు వేఁడివంటి జంకెనలు
అందుక రెండు నడుపేవౌనే నీవు
అందరినీ వారి వీరినడుగవేమో కాని
విందువెట్టినందులోనే వేఁడి చవిగాదా

చ. 3: మెత్తని పరవశాలు మిక్కిలి గట్టి చన్నుల
నొత్తి కూడిన కూటాల నొద్దికైతివే
యిత్తల శ్రీ వేంకటేశ యిప్పుడెటిఁగితివేమో
మెత్తనినేలనుండవా మేటియైన కొండలు

రేకు: 0107-5 హిందోళవసంతం సంపుటం: 07-041

పల్లవి: ఏమనేవే యీతగవులిందరూ నెఱఁగరా
కోమలపు మగవాఁడు కొలఁదులెఱుఁగునా

చ. 1: వరుసలంతా సరే వలపే యెక్కుడు గాని
గరిమెల నీవేల కాఁతాళించేవే
పురుషుఁడు నాతఁడే భోగించే వారి భాగ్యము
మరిగించి కలిసితే మఱి చలివాయదా

చ. 2: సవతులంతా సరే చనవే యెక్కుడు గాని
వివరించుకొనకేలే వేగిరింపులు
కవగూడి (డే?) వాఁడొకఁడే కలసే వారి నేరుపు
చివురు బలిసితేనే చేఁగలై నిలువవా

చ. 3: కళలూనంతా సరే కరఁగేదెక్కుడు గాని
పలుమారు నీవేల పంతమాడేవే
అలమె శ్రీ వేంకటేశుఁడంటిన మావొడఁబాటు
తొలుత మీనవ్వులెల్లా దొతులకునెక్కవా

రేకు: 0107-6 శంకరాభరణం సంపుటం: 07-042

పల్లవి: ఎవ్వరికిఁ గలదమ్మ యింతభాగ్యము
ఇవ్వల నీతోసరి యెంచరాదే వొరుల

చ. 1: వీడిన తురుము తోడ విరులు పై పైరాల
వాడిన కన్నుల తోడ వచ్చేవేమే
యేడనుంటి విందాఁకా యెవ్వఁడు నిన్ను భోగించె
చేడె నీ సొబగులిదే చెప్పరాదె నేఁడు

చ. 2: వడియుఁ జెమటల తోడ వత్తివంటి మోవి తోడ
నడపు మురిపెముతో నవ్వేవేమే
యెడచొచ్చి నీ జవ్వన మెవ్వఁడు కొల్లలుగొనె
పడఁతి నీ చెలువము పట్టురాదె యిపుడు

చ. 3: నిద్దుర కన్నుల తోడ నిండుఁ బులకల తోడ
ముద్దుగారే మోము తోడ మురిసేవేమే
వొద్దనె శ్రీ వేంకటేశుఁడొగిఁ గూడుతె (టె?) అఁగమే
ముద్దరాల నేఁడు నీమోహమెంచరాదే

రేకు: 0108-1 కేదారగౌళ సంపుటం: 07-043

పల్లవి: మాఱుమోమిదేఁటికి మందకుఁదనమేఁటికి
జాఱువడ నేనవ్వితే సంతసించవలదా

చ. 1: వడి నీకెమ్మోవిమీఁది వన్నెదీసినది చూచి
తొడరి వీడెమిచ్చితే దోసమాయిది
కడుచెమటల నీపై గందవొడి చల్లి తేను
జడియక నీవిందుకు సంతసించవలదా

చ. 2: కులికి నీ కన్నులపై కుంకుమవన్నెలు చూచి
బలిమిఁ బన్నీరిచ్చితే పాపమా యిది
కలసిన వేఁడి వేఁడి కాఁకలమేనటు చూచి
చలిగా నే విసరితే సంతసించవలదా

చ. 3: పిప్పియైన నీమేని పెక్కులాగులటు చూచి
ముప్పిరిఁ గళలంటితే మోసమా యిది
అప్పటి శ్రీ వేంకటేశ అలమితివిటు నన్ను
చప్పుడుగాకియ్యకొంటే సంతసించవలదా

రేకు: 0108-2 ఆహిరి సంపుటం: 07-044

పల్లవి: సిగ్గువడఁ బోతేను చింతలెక్కీని
వెగ్గళించితే వెన్నెల వేఁడులయ్యీని

చ. 1: చెలువవు నీమోము చెక్కిటనేల మోపేవే
వలపు వెసురు (?) దాఁకి వాడఁబారీని
నిలువునఁ దలవంచి నేలలేల వ్రాసేవే
చలివాసి మదనుఁడు చదివించీని

చ. 2: మూలనున్న నిట్టూర్పు ముంగిటనేల వేసేవే
గాలిగొట్టై యధరము గరివడీని
జాలిఁబడ్డ చెమటల సరితెప్పలేలెక్కేవే
వేళతోనే చల్లగాలి వేఁటలాడీని

చ. 3: నంటు మీఱి నెలవుల నవ్వులేల వుమిసేవే
గెంటు లేని కన్నులను కెంపులెక్కీని
యింటిలోనే శ్రీ వేంకటేశుఁడఁ గూడితి నేను
పంటలై పులకపైరు పాలలెక్కీని

రేకు: 0108-3 రామక్రియ సంపుటం: 07-045

పల్లవి: పోపో నీకిదియేమి పొద్దువోదా
తీపులు చూపి మమ్ముఁ దియ్యకురా యింకను

చ. 1: ఒల్లనివాఁడవు మమ్ము నూరకేల పిలిచేవు
మల్లాడి మాపై మనసు మఱవరాదా
బల్లిదురాలాకె గొన్న బాస దప్పినాఁ దప్పని
పల్లదాననిఁక నీవు పట్టకురా నన్నును

చ. 2: ఇంటికి రానివాఁడవు యేడనైనా నవ్వనేల
వెంటనే మాతో తగులు విడువరాదా
గొంటరై యిందుకు నాపె కోపగించినాఁ గోపించీ
అంటి ముట్టి సరసములాడకురా యిఁకను

చ. 3: పంతపు వాఁడవు మమ్ము పట్టి కౌఁగిలించనేలా
అంతయు నాపెనేపో అడుగరాదా
చెంతనే శ్రీ వేంకటేశ చేకొని నన్నుఁ గూడితి
వింతకంటె రతినలయించకురా నీవు

రేకు: 0108-4 భైరవి సంపుటం: 07-046

పల్లవి: ఇందరి సాకిరి వెట్టేవిందుకే నీవు
అందిన చెలులతోడ నాడుకోరాదా

చ. 1: కోపగించి నిన్నునింత కొసరఁగరాదు గాక
మోపుగట్టి వొక్కచేత మొక్కరాదా
తీపుల పెదవి వంచి తిట్టరాదు గాక నిన్ను
చూపులఁ దప్పకయైనాఁ జూడరాదా

చ. 2: వాసికెక్కించి నీతో వాదులెల్లా మానెఁగాక
వూసగుచ్చి నీగుణాలు పొగడరాదా
వేసరించి నీగుట్టు వెళ్ళవేయరాదు గాక
వేసాలకు నిన్ను నేదీవించరాదా

చ. 3: నీవు గాఁగలించఁగాను నిన్నేమనరాదు గాక
నావలపు చూచి నన్ను నవ్వుకోరాదా
శ్రీ వేంకటేశ యిట్టె చేరి కూడితివి నేఁడు
తావుల నాకొనగోరు తాఁకించరాదా

రేకు: 0105-5 రామక్రియ సంపుటం: 07-047

పల్లవి: ఇంత సేసెఁగా నేఁడు యింతి నీగుణములెల్లా
చెంతలనాకె పసలఁ జిక్కితిగా నీవు

చ. 1: కోపగించుకొన్నవేళ కోరి నీవు మోహించిన
ఆపెపైనాన వెట్టితే నట్టె మానేవు
పైపై నాపెమీఁది పదములు వాడితేను
మాపుదాఁకా పరాకెల్ల మానుదుగా నీవు

చ. 2: అనవసరపువేళ నాపెవారు వచ్చిరంటే
వెనుకొని యెదురుగా వెళ్ళి వచ్చేవు
పనివడి యాపె అప్పణగల మగువల
వినయపు విన్నపాలు విందువుగా నీవు

చ. 3: అలసి నిద్రించేవేళ నాపె నీవొద్దఁ గూచుంటే
పలురతులకు లోనై భ్రమతువుగా
వొలిసి శ్రీ వేంకటాద్రినుండి వచ్చి మాడుపూర
మలసి నన్నుఁగూడి మన్నించితిగా

రేకు: 0108-6 సామంతం సంపుటం: 07-048

పల్లవి: అంగనలేమన్నా నన్ననంటిరి గాని
కుంగని కుచాలఁ దన్ను కుమ్మవద్దాయిఁకను

చ. 1: అల్లవిగో తనమేననప్పటి పెంజెమటలు
మల్లాడి నామేనఁ జమరవచ్చీని
పల్లదాన నేఁదన్ను పట్టుక యిందుకుఁదగ
వెల్లవిరిఁ దమలాన వేయవద్దా యిఁకను

చ. 2: ఇదిగదే తనమేన యెరవులకంటమాల
బెదరక నామెడఁ బెట్టవచ్చీని
కుదియించి యిందుకుఁ దనకురులు నాపదమున
నదిమి యేమైనాఁ జేసి ఆఁగవద్దా యిఁకను

చ. 3: కట్టుకవున్నాఁడదె కానెగా యెవ్వతో చీర
వెట్టికి నాపైఁ గొంగు వేయవచ్చీని
ఇట్టె శ్రీ వేంకటేశుఁడు యెమ్మెతోఁగూడినందుకు
తిట్టురాని తిట్లెల్లాఁ దిట్టవద్దా యిఁకను

రేకు: 0109-1 ముఖారి సంపుటం: 07-049

పల్లవి: అప్పటినాతనినేమి యనేవు సుమ్మీ
కుప్పలైన వలపుల గుణమిది సుమ్మీ

చ. 1: పాసిన కూటమి చవి భావించు(వించి) లోలో రెప్ప
మూసి యెత్తి చూచినట్టి మోహము చవి
యీసున సాదించేనంటా యింటికి వచ్చుట చవి
వేసరి యాతనినేమి వెంగెములాడకువే

చ. 2: తగవులఁ బెట్టినట్టి తరితీపులు చవి
అగపడకున్నఁ బెట్టేయానలు చవి
జగడపువేళల సరియాఁకలు చవి
తగదనాతనినేమి తప్పులెంచవలదే

చ. 3: తెర మాటున నుండే తేటల మాటలు చవి
సురతపు వేళ గోరిసోఁకులు చవి
ఇరవై శ్రీ వేంకటేశుఁడింతలో నిన్నుఁగూడె
తరవాతి పనులెల్లా దక్కె నీకుఁ గదవే

రేకు: 0109-2 నాదరామక్రియ సంపుటం: 07-050

పల్లవి: నీతలనే వేఁగెనా నిన్ను దూరఁ బనిలేదు
జాతిఁ బుల్లఁదీఁగెలకు సారెనలుగుదురు

చ. 1: తియ్యని మాటలెపో తెఱవ మోవినాడేది
కయ్యమడిచి వూరకే కారమనేవు
అయ్యరో నీవేకాదు ఆలినొల్లనివారు
వొయ్యనె యీలకూరకు వుప్పు చాలదందురు

చ. 2: చల్లని చూపులేపో సతికన్నులఁ జల్లేవి
వొల్లనివాఁడవై అవే వుడుకనేవు
మెల్లనె నీవేకాదు మేలుమేలు అంటే నీళ్ళు
బల్లిదులైనవారు పాటిగంపదెత్తురు

చ. 3: కూరిమి కౌఁగిలేకా కొమ్మనిన్నుఁ గూడినది
బీరాన నీవేమిటికో బిగువనేవు
యీరీతి శ్రీ వేంకటేశ యేకమైతివితరులు
మేరమీరేవారిఁగంటే మిక్కిలి లోనౌదురు

రేకు: 0109-3 రామక్రియ సంపుటం: 07-051

పల్లవి: ఇటమీఁద నాకు బుద్ధియేదే చెలియ నీవు
తటుకన నెటిఁగించు తడవు సేయకువే

చ. 1: కంటివటె వానిని కాంతరో నేనన్న ట్టె
అంటివా యించుకించుక ఆయాలు సోఁక
వొంటినున్నాఁడో వేరేవొకరు వద్దనున్నారో
యింటికి నేనే వత్తునో యేమనెనే వాఁడు

చ. 2: తెచ్చితివా వానిని తివిరి నే నిమ్మన్నవి
యిచ్చితివా ముందుముందే యియ్యకొనెనా
వెచ్చపెట్టఁడు గదా వేడుకనెవ్వరికైనా
అచ్చలాన నేనాసుద్ది యడుగుదునా

చ. 3: నగితివా వానిని నా మనసులోనున్నట్టే
అగడుగా నా సంగడి నట్టే నిలిపి
పగటు శ్రీ వేంకటపతి నన్నునిదె కూడి
తగులాయ నన్నియును తారుకాణలాయెనే

రేకు: 0109-4 సామంతం సంపుటం: 07-052

పల్లవి: ఎగ్గు సిగ్గు దలఁచవు యేరా నీవు
వొగ్గుచు నిద్దరు సతులొద్దనె వుండఁగను

చ. 1: కొనవేలు వట్టి యాకెఁ గూచుండఁబెట్టుకోఁగా
తనువిందువంకఁ గొంత తనిసెనా
పెనఁగి పాదాలు నాచేఁ బిసికించుకొనేవిదె
వనిత నీవద్దనుండి వలపు చల్లఁగను

చ. 2: అప్పుడే వీఁపునఁ జన్నులానుకొంటా నాపెచేత
కొప్పు వెట్టించుకొనేవు కోరికాయనా
యిప్పుడే నాచెక్కు మోవనేకతములాడేవు
చిక్కించుక సతి నీపైఁ జేతులు చాఁచఁగను

చ. 3: సంగతిగా నాపె తోడ జాణతనాలాడేవు
అంగవించి నేఁడు నీకు నాసపుట్టెనా
ముంగిట శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
కంగక మగువ నీకుఁ గాచుకవుండఁగను

రేకు: 0109-5 బౌళి సంపుటం: 07-053

పల్లవి: చెప్పుకున్న దోసము చెంగటఁ గన్నంతవట్టు
యిప్పుడె యాతని చిత్తమేమైనాఁ జేయని

చ. 1: మంతనపు విచారాలు మాటల పచారాలు
కాంతకు విభునిఁ బాసి కలిగె నేఁడు
యింతయును గంటిరిగా యింతులార మీరైనా
వింతగానిట్టే విన్నవించరే యాతనికి

చ. 2: మంచముపై ముసుగులు మనసులో విసుగులు
అంచగమనకిదివో అమరె నేఁడు
మించినవో చెలులాల మీరే తెలిసితిరిగా
ముంచి మీరాతనిపై మోపుగట్టి వేయరే

చ. 3: కన్నుల తెలినిగ్గులు కాఁకలలో సిగ్గులు (ను)
పన్నిన యీసతిపైనే పైకొనె నేఁడు
యిన్నిట శ్రీ వేంకటేశుఁడింతలో విచ్చేసి కూడె
కన్నెతపము ఫలించె ఘనునిట్టే మెచ్చరే

రేకు: 0109-6 సామంతం సంపుటం: 07-054

పల్లవి: ఇంతట విచ్చేయవయ్యా యింతి విలిచీనిదివో
ఎంతలేదిదెంచుకొంటే నిద్దరునూనొక్కటే

చ. 1: జవ్వన గర్వముతోడి సతులు దమకోపాన
రవ్వలుగానాడుదురు రమణులను
నవ్వులు సేసుకొనక నాతులతో జగడించి
పువ్వుమొన వాఁడిసేసే పురుషుఁడూఁ గలఁడా

చ. 2: సరసమాడేటి వేళ సతులట్టే చనవున
సిరులతో వెగ్గళించి చేయి ముంతురు
సరుస గురుతు మా యించకీకెను రట్టు సేసి
బిరుగాలి ముడిగట్టే ప్రియుఁడూఁ గలఁడా

చ. 3: రానీ పోనీ తమకాన రాములు తమచూపుల
సానలఁ బట్టుచుఁ బగ చాటుదురు
దీనికే శ్రీ వేంకటేశ తెలిపఁ గూడితివిట్టె
మైనము సూలము సేసే మగవాఁడూఁ గలఁడా

రేకు: 0110-1 సామంతం సంపుటం: 07-055

పల్లవి: ఇట్టె నిన్ను రమ్మనె నేమమ్మ
నెట్టుకొన్న తమమేలు నేఁజూడవలెనా

చ. 1: కప్పురమింద కోవమ్మ కాంతుఁడు నీకుఁ బెట్టెంపె
అప్పుడే పెండ్లి దనకాయనటరే
ముప్పిరి పువ్వులు నీకు ముడుచుకోనంపెనమ్మ
చెప్పరే యాపెయుఁ దానుఁ జేకొని మిగిలెనా

చ. 2: గందము నీకుఁబెట్టెంపెఁ గైకొనఁ గదవమ్మ
అందుతోనే సోబనపుటక్షతలివా
చందనకాపులు నీకు సరిగట్టునంపెనమ్మ
యిందు నాగవెల్లికట్నాలింతలోనే వచ్చెనా

చ. 3: పై పై నీకిదివో పల్లకి వెట్టెంపె నమ్మ
యీపొద్దే తమకు నేఁడేఁగుఁబెండ్లా
చేపట్టి నిన్నిదె కూడె శ్రీ వేంకటేశుఁడోయమ్మ
కోపులఁ దోడఁబెండ్లికూఁతురనా నేను

రేకు: 0110-2 ముఖారి సంపుటం: 07-056

పల్లవి: ఏఁటికే యీదోసము మీరెఱఁగరటే
ఆఁటదాననింతే నన్ను ఆఱడిఁబెట్టకురే

చ. 1: తామరమొగ్గలవంటి తగిన నాచన్నులివి
కామునియమ్ములనేరు కాంతలిదేమే
నామగనికౌఁగిటిలో ననిచే జక్కవలవి
ప్రేమమున మారుఁబేరు పెట్టుదురటే

 చ. 2: చందురునిఁ బోలేటి సరసపు నా మోము
అందపుఁబూబంతియంటానాడుకోకురే
ముందు నారమణునికి మోము చూచేటద్దమిది
కందువలేని నిందలు గడింతురటే

 చ. 3: తీగెవంటి నామేను దిక్కుల మెఱుఁగనుచు
పోగులుగా సారెసారెఁ బొగడకురే
బాగుగ శ్రీ వేంకటేశు పానుపుపై చిగురిది
యోగము గూడెను వేరే వుప్పటించనేఁటికే

రేకు: 0110-3 రామక్రియ సంపుటం: 07-057

పల్లవి: ఎంతచెప్పినా నెఱఁగవేలే చలము
పంతగాఁడు నేఁడువాని పనులెల్లా దక్కెను

చ. 1: ఆతఁడు నీతో మాటలాడఁడంటా నిలుచుంటే
యేతులకే పాటవాడేవేమే చలము
కాతరించి యాఁటదింత కక్కూరితిపడితేను
చేతులార మగవాఁడు చేసినట్టే చెల్లదా

చ. 2: చుట్టి చుట్టాతఁడు నన్నుఁ జూడవలెనంటానే
యిట్టే జోలి మొక్కు మొక్కేవేలే చలము
గుట్టు తోడి మగువలు కోరి తామె పైకొంటే
బెట్టుగాఁ దన విభుఁడు బిగియక మానఁడు

చ. 3: పై పై శ్రీ వేంకటేశుఁడు పరాకై వున్నాఁడంటే
యేపు మీఱి నవ్వు నవ్వేవేలే చలము
రాఁపుగాని యాఁటదింత రతికిఁ బెనఁగితేను
యీపొద్దాతఁడిట్టె కూడె నెదురాడఁగలనా

రేకు: 0110-4 సాళంగనాట సంపుటం: 07-058

పల్లవి: చొల్లెపుఁ జట్టుతోడి చుంగుల రాజసముతో
వెల్లవిరిగానేఁగీ వెలఁదులు గొలువ

చ. 1: వీఁపునఁ గుచాలు మోఁపి వెలఁది కౌఁగిలించఁగా
నేపున నేనుగనెక్కెనిదె దేవుఁడు
చేపట్టి యాపెచేతులు చేతులఁ బిగ్గఁ బట్టుక
పైపై వీధులవెంటఁ బరువుదోలీని

చ. 2: అంగనకుఁ దన పాదాలంకె వన్నెలు సేసుక
రంగుగాఁ దొడఁదొడము రాయఁగాను
సింగారపు సొమ్ములతో చెంగావి ముసుఁగుతోడ
అంగవించి యాపె దనకాసలు రేఁచఁగను

చ. 3: కలకల నవ్వుతోడ కస్తూరి నామముతోడ
అలమేలుమంగ దన్నునట్టె మెచ్చఁగా
యెలమి శ్రీ వేంకటేశుఁడేతులు నెరపుతాను
బలిమి నంకుశమునఁ బట్టి వొ త్తీనదివో

రేకు: 0110-5 రామక్రియ సంపుటం: 07-059

పల్లవి: ఉండనీరా యీపాటి వూరకే నన్ను
కొండెగోడితనాలకుఁ గోపమెల్లా వచ్చును

చ. 1: చుట్టుమవుతానెఱఁగము సూడుబంటవో యెఱఁగ
మట్టె నాతో నాపె సుద్దులాడుకొనేవు
ముట్టి ముట్టి నేము నీతో ముచ్చటలు చెప్పుకోఁగా
యెట్టు వచ్చునో యెఱఁగమేమీననొల్లము

చ. 2: నగవవుతా నెఱఁగము నాటకమో యెఱఁగము
తగవు నన్నడిగేవాతరుణిమాట
నిగిడి పోపో చాలు నిన్నునెవ్వఁడెఱుఁగును
యెగసక్కేఁడవు తొల్లే యేమీననోపము

చ. 3: నెపమవుతా నెఱఁగము నెయ్యమవుతానెఱఁగము
యిపుడు వచ్చితిరి మాయింటికి మీరు
అపుడె శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
చపలతఁ గూడితిని సాదించ నేనోపను

రేకు: 0110-6 గౌళ సంపుటం: 07-060

పల్లవి: పూవుఁబోణుల కొలువే పుష్పయాగము
పూవక పూచె నీకిట్టె పుష్పయాగము

చ. 1: కలువ రేకుల వంటి ఘనమైన కన్నుల
పొలఁతుల చూపులె నీ పుష్పయాగము
తలఁచి తలఁచి నిన్నుఁ దమమేనులఁ బొడమే
పులకజొంపములె నీ పుష్పయాగము

చ. 2: కరకమలములను కందువ గోపికలెల్లా
పొరసి నినుఁ జూపుటే పుష్పయాగము
సరసపు మాటలే సారెనాడి తమనవ్వు
పొరి నీపైఁ జల్లుటే పుష్పయాగము

చ. 3: గాఁట్టపుఁ గొలనిదండఁ గాంతలు సిగ్గున నిన్ను
బూటకానకుఁ దిట్టుటే పుష్పయాగము
యీటున శ్రీ వేంకటేశ యిట్టె యలమేలుమంగ
పూఁటవూఁటరతులివి పుష్పయాగము

రేకు: 0111-1 లలిత సంపుటం: 07-061

పల్లవి: దక్కె నీకుఁ బంతము తగిలినప్పుడె నేము
మొక్కితిమిట్టె నీతో మొక్కలములొల్లము

చ. 1: కూరిమినైనాఁ గాని కోపాననైనాఁ గాని
వూరకే నీమోము చూడకుండలేమురా
చేరి యిట్టె పట్టరాని చిత్తమువారము నేము
యేరీతినైనాఁ జేయుమిఁకనేల మాటలు

చ. 2: తత్తరానకైనాఁ గాని తగవునకైనాఁ గాని
వొత్తి నిన్నుఁ బిలువక వుండలేమురా
చిత్తిణిగుణాన నీకే చిక్కినవారము నేము
వుత్తరువు నీకునిదె వొద్దనే వున్నారము

చ. 3: నగవునకైనాఁ గాని నాటకానకైనాఁ గాని
వొగి నిన్నుఁగూడక వుండలేమురా
చిగురుఁబాయమునాఁడే సేసవెట్టితిమి నేము
మిగుల శ్రీ వేంకటేశ మెచ్చితి నిన్నిపుడు

రేకు: 0111-2 కాంబోది సంపుటం: 07-062

పల్లవి: తారుకాణలై యుండఁగ దాఁచనేల
కూరిమెల్ల నీమీఁద గుంపులైన యట్లు

చ. 1: కలువ పువ్వుల బంతి కన్నులనదుముకొని
బలువుగ నిన్ను వేసెఁ బడఁతి యిదె
సొలసి తాఁజూచినట్టి చూపులు నీకుఁ దెలిపి
సళుపు మరునమ్ములు సాక్షివెట్టినట్లు

చ. 2: తుంచి తమలపాకుల తొడమెలు నీమీఁద
ఇంచుకించుకె వేసెనిందరుఁ జూడ
ముంచి చిగురుమోవినీమోవి మోఁపెనని చెప్పి
పొంచి వసంతుని నీకుఁ బూఁటవెట్టినట్లు

చ. 3: మొగలిరేకుల లేఁతముంటికొన నీమేను
వగగా రేకలు దీసె వంకలుగాను
తగు శ్రీ వేంకటేశుఁడ తరుణి దనపెండ్లికి
మొగిఁ జందురులనెల్ల మూఁకగూర్చినట్లు

రేకు: 0111-3 సామంతం సంపుటం: 07-063

పల్లవి: నీవంటి సతులతో నెయ్యమాతఁడు చూపఁగా
ఆవలిమోమై యుందానవారడింత గలదా

చ. 1: సిగ్గున నుందానవో చింతతోనుందానవో
సిగ్గుకుఁ జింతకు సాక్షి చెక్కిటిచేయే
దగ్గరి నీరమణుఁడు తమకించి పిలువఁగ
అగ్గలమయ్యేవదేమే ఆఱడింత గలదా

చ. 2: మాయలు సేసేవో మంతనాననుందానవో
మాయకు మంతనానకు మంచమే సాక్షి
చేయివట్టి యాతఁడు నీచింతదీరఁ దియ్యఁగాను
ఆయాలు దాఁక దొబ్బేవు ఆఱడింత గలదా

చ. 3: కరుణ నీకుఁ బుట్టెనో కాఁకలు నీకు ముంచెనో
కరుణకుఁ గాఁకలకు కాఁగిలే సాక్షి
అరుదై శ్రీ వేంకటేశుఁడట్టె నిన్నుఁ గలసెను
అరమరచేవు మేను ఆఱడింత గలదా

రేకు: 0111-4 ముఖారి సంపుటం: 07-064

పల్లవి: అదివో నిన్నంటిఁగా అప్పుడే నిన్ను వోసి
తుదమొదలెఱఁగక దోసమేలాడేవే

చ. 1: అట్టె కోపించకుమీ అడిగే నేనొకమాట
యెట్టునెదుర వున్నాపె యేమౌరా నీకు
ఉట్టిపడి వోసిపోవె వొకటికొకటి గట్టేవు
చుట్టపు వరుస వారి సోఁకనాడవచ్చునా

చ. 2: సిగ్గువడకుమీ వోరి చెప్పేరా నేనొకమాట
దగ్గరి కూచుండనాపె తనకేలరా
వొగ్గి మాటలాడితే వూరకే నిందవేసేవు
నిగ్గులవారితో వాదు నీకింత వలెనా

చ. 3: నవ్వకు శ్రీ వేంకటేశ నమ్మించే నేనొకమాట
యివ్వలఁ బండుండ ఆమె యేమౌరా నీకు
పువ్వక పూచెననేవు పొరుగిరుగులవారి
రవ్వసేయకువే యింత రతి నిన్నుఁ గూడనా

రేకు: 0111-5 శ్రీరాగం సంపుటం: 07-065

పల్లవి: ఇంతమోహించిన పతివిన్నియును నీకుఁ జవి
యెంతలేదు నేమెల్లా నిటువంటివారము

చ. 1: కోమలులు మీఁదమీఁద కోపగించినాఁ జవి
దీమసానఁ బెదవులఁ దిట్టినాఁ జవి
నేమమున మాటాడఁగా నేరకుండినాఁ జవి
వోముచును ముద్దరాలైవుండినాఁ జవి

చ. 2: చనవుల బొమ్మలను జంకించినాఁ జవి
చెనకి గబ్బితనాలు చేసినాఁ జవి
వనజము వంటి మోము వంచుకొనినాఁ జవి
గునిసి కొప్పుభారాన కొంకినాఁ జవి

చ. 3: చెక్కు చేతి తోడుత సిగ్గువడినాఁ జవి
మొక్కలపు నవ్వులెల్లా ముంచినాఁ జవి
యెక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
వొక్క మనసున నిట్టే వుండుటే చవి

రేకు: 0111-6 శంకరాభరణం సంపుటం: 07-066

పల్లవి: ఔదువే దొడ్డదానవందరిలోన
సాదువలెనే యితని సాదించను

చ. 1: తపము సేసితివే తరుణి నీరమణుఁడు
యెపుడు నీవద్దనుండి యిచ్చలాడును
వుపమనేరుతువె వొద్దికతోనాతఁడు
కపురుగా నవ్వు నవ్వి కరఁగించను

చ. 2: అన్నిటా జాణవె నీవు అంగవించి నాయకుని
పన్నిన మాటలఁ బెట్టి భ్రమయించను
సన్నల గెలిచితివే చాయల చూపులు చూచి
వన్నెల నీతని నింత వలపించను

చ. 3: చెల్లునె యెప్పటివలె శ్రీ వేంకటేశ్వరుని
మెల్లనె కౌఁగిటఁగూడి మెప్పించను
తల్లివె మాకెల్ల నీవు తగు నీకు చెలులము
అల్లిదామెరలై నీవాతనిఁ జొక్కించను

రేకు: 0112-1 శుద్ధవసంతం సంపుటం: 07-067

పల్లవి: ఎఱుఁగుదుమిఁక మమ్ము నేల రేఁచీనే
మఱవమెపుడునివి మనసులోననవే

చ. 1: తన నగవులె కావా తరుణులకెల్లాను
చెనకేవేళ ముత్యాల నేసలైనవి
పనివడి తనచేతి పచ్చిచేఁతలె కావా
ఘనమై మరుచావడికళలు దించేవి

చ. 2: నేటిమాటలె కావా నెలఁతులకెల్లాను
మాటులేని వలపుల మందులైనవి
కోటి సేయ తానడచే గుణములివె కావా
పాటించి రతియాసల బంతి సాగించినవి

చ. 3: చూపులివియె కావా సూటులై మాబోంట్లకు
రేపుమాపు కడుఁబెరరేఁపులైనవి
యేపున శ్రీ వెంకటేశుఁడిదె తానె మమ్ముఁగూడె
తీపుల మోవికెంపుల తిద్దుబడియైనవి

రేకు: 0112-2 శ్రీరాగం సంపుటం: 07-068

పల్లవి: చెప్పినట్టు సేయవే చెలువునికి
కప్పురము దిన్ననోటఁ గడు దప్పిగలదా

చ. 1: చలమెంత గలిగినా సతులకుఁ బతితోడ
కొలచి కూరిమి చల్లి కొసరేదే
బలిమి సేసీనతఁడు పట్టిపెనఁగనేల
యెలమినీఁతకు మిక్కిలిఁకలోఁతు గలదా

చ. 2: బింకమెంత గలిగినా ప్రియురాండ్లు విభునితో
వంకలొత్తి మరిఁగొంత వలపించేదే
లంకెలకుఁ బొదిగితే లావులు చూపఁగనేల
వుంకువపట్టినమీఁద నొడఁబాట్లున్నవా

చ. 3: సిగ్గులెంత గలిగినా శ్రీ వేంకటేశుతో నీవు
బిగ్గెఁ జన్నులొత్తి కూడి బిగియించేదే
దిగ్గనఁ గలసె నింక దేవునికి మరఁగేల
దగ్గరి మోములుచూచి తలపోఁతలున్నవా

రేకు: 0112-3 సామంతం సంపుటం: 07-069

పల్లవి: నేము నీవారమె యిందు నెరుసులేవి
చేమీఁదయిన మీఁద చెప్పనేల పనులు

చ. 1: కందువ పనులు సేయఁ గలవు నీవేమైనా
అందాలు సేసుకరాను ఆపె గలదు
పొందులు చూచి మిమ్ము పొగడనేము గలము
మందలించి నగవయ్య మఱి యాల కడమ

చ. 2: వన్నెలనెవ్వరినైనా వలపించ నీకుఁ జెల్లు
అన్నిటాను దొరతనమాపెకుఁ జెల్లు
కన్నచోటనెల్లా వూడిగానకు నేము గలము
యిన్నిటా మెరయవయ్య యిఁకనేల మరఁగు

చ. 3: నెలఁతల మర్మములు నీకొక్కనికె పాలు
అలరిన నీరతులు ఆపెపాలు
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరిసేవా మాపాలు
నిలువునఁ జొక్కవయ్యా నీకేల వెఱపు

రేకు: 0112-4 ముఖారి సంపుటం: 07-070

పల్లవి: ఇద్దరికీ వచ్చె దూరులేఁటికే నీకు
తిద్దుకొంటే నీవంకనే తేరుఁగదవే

చ. 1: మాటలాడే విభునితో మారువలుకక వుంటే
ఆఁటదానికెంత గర్వమనరటవే
చీటికి మాటికి నీవు సిగ్గువడేదెఱఁగరు
నీటున నాతని మీఁద నిందలెంచరా

చ. 2: నవ్వు నవ్వే పతి తోడ నగుతా నీవుండకున్న
జవ్వనమదములు రచ్చఁ బడవటే
రవ్వగా నీవు ముద్దరాలవౌట యెఱఁగరు
నివ్వటిల్ల నాతనినే నిష్టూరి యనరా

చ. 3: కలసే శ్రీ వేంకటేశు కొఁగిటఁ గూడకుండితే
కలికితనమునకు కందు గాదటే
చెలిమి సేసి యాతని సెలవిచ్చు టెఱఁగరు
నెలవై కళలాతని నిండుకొనవా

రేకు: 0112-5 భైరవి సంపుటం: 07-071

పల్లవి: జాణఁడవు నీకునిదే చద్దివలపు
రాణించె నింకెన్నఁడు నీరపమాయ వలపు

చ. 1: చెక్కు నొక్కి తనివోక చెలి నీపై మోహాన
మొక్కులు మొక్కీనూరకే మోము చూచీని
చిక్కని నవ్వులు నవ్వి చిదిమినా నెఱఁగదు
వెక్కసములాయఁ బట్టు వేఁడి వేఁడి వలపు

చ. 2: మమత నీపైఁ బెంచి మనసు పట్టఁగ లేక
భ్రమసి నీలోఁచి (?) లోలో బయలీఁదీవి
కొమెరమదానఁ జొక్కి కోపంచినా నెఱఁగదు
తమితోడఁ బట్టుమీ పదను వచ్చేవలపు

చ. 3: పవళించి సన్నచేసి భావము నిలుపలేక
చెవిలోన మాటచెప్పి చెమరించీని
తివిరి శ్రీ వేంకటేశ తెరవేసి నిన్నుఁ గూడె
నవకానఁ బట్టుమీ కొన్నదికోలు వలపు

రేకు: 0112-6 నాదరామక్రియ సంపుటం: 07-072

పల్లవి: ఇయ్యకొంటి గానీవే యిందుకేమి
నెయ్యపు మాటలకెల్లా నెరవాది తాను

చ. 1: చాయ నేనుక వుండితే సంతోషమే కదవే
చేయి మీఁదైన తన చేఁతలకును
మాయలకు లోనైతే మంచి దానవే కదవే
పాయపు మదముతోడి పంతగాఁడు తాను

చ. 2: ఎదురు మాటాడకున్న నింతా మేలే కదవే
కదిసి తానాడేటి కల్లలకును
చెదరక నేనవ్వితే చిత్తము వచ్చుఁగదవే
వెదచల్లే వలపుల వేసదారి తాను

చ. 3: చెప్పినట్టు సేసితేను సెలవాయఁ గదవే
యిప్పుడు గూడె శ్రీ వేంకటేశుఁడు నన్ను
చిప్పిలు మోవి చేకొంటే చింతదీరెఁ గదవే
దప్పికి నెయ్యిదాగేటి తగవరి తాను

రేకు: 0113-1 పాడి సంపుటం: 07-073

పల్లవి: ఎరవులేని రమణుఁడితఁడే కదే
ఆరుదై నాకే మోహించునంటిఁ గదరే

చ. 1: ఏతులకు వనితలు యెవ్వరేమి యాడుకొన్నా
నాతఁడు నేనునొక్కటే అంటిఁ గదరే
యీతల రమణుఁడు వారింట నుంటే నుండెఁ గాని
ఆతుమ నాతోఁ జెప్పెనంటిఁ గదరే

చ. 2: వాసికిఁ గొలువులో నెవ్వరిదిక్కు చూచినాను
ఆసలెల్లా నామీఁదివంటిఁ గదరే
బాస యెందో సేసెనంటా భామలు నాతోఁ జెప్పితే
ఆ సుద్ది నేనెఱఁగినదంటిఁ గదరే

చ. 3: పదరి యాతని మేను పచ్చియై వున్నదంటే
అదియెల్లా నాచేఁతలంటిఁ గదరే
యెదుట శ్రీ వేంకటేశుఁడిదివో నన్నుఁగూడె
అది మీరే తెలుసుకొమ్మంటిఁ గదరే

రేకు: 0113-2 దేసాళం సంపుటం: 07-074

పల్లవి: మీఱి వచ్చిన పనికి మీరె సాక్షి
వీఱిడితనము నాకు వీసమంతానున్నదా

చ. 1: తగులనాడినవాఁడు దాపిరపు మాటలేలే
నగవులు నగి నాతో ననుచుఁ గాక
బిగిసితేనిఁక నాకు పెలుచుఁ గోపము రాదా
మగువలాల నా యందు మఱి తప్పులున్నవా

చ. 2: తప్పక చూచిన వాఁడు తమకించకుండనేలే
కప్పుర విడెమిచ్చి కలసుఁ గాక
వుప్పతించితే నను వోరుచుకుండఁ గలనా
కప్పుర గందులాల కపటములున్నవా

చ. 3: చేయి పట్టుకున్నవాఁడు సిగ్గులు వడఁగనేలే
యీ యెడనే నాకు మనసిచ్చుఁ గాక
పాయపు శ్రీ వేంకటపతి నన్ను నిటు గూడె
చాయల మగువలాల చలము నాకున్నదా

రేకు: 0113-3 సామంతం సంపుటం: 07-075

పల్లవి: మాటలు నేరుతువే మాపుదాఁకాను వోరి
మాటలాడినట్టే వుండు మంతనపుఁ జేఁతలు

చ. 1: ఇంతలోనే నవ్వేవు యేమే చెలి అవురా
యెంత కెంత కోపగించేనెందాఁకాను
పంతములాడవదేమే పలుమారును నీవు
అంతేసి పాడినదుపేవందుమీఁదఁ గలదా

చ. 2: ఇచ్చకమేల సేసేవే యింతిరో నాకు
మచ్చరించితే నీవు మాట వినేవా
వొచ్చెములెంచవదేమే వొక్కమాటును నిన్ను
మెచ్చినందుమీఁదటను మెరమెర గలదా

చ. 3: కన్నులనేల మొక్కేవే కలికి నాకు నిన్ను
యెన్నికె తిట్లు దిట్టి యేమి గనేరా
నన్నెఱిఁగి కూడితివి జవరాలవే
మన్నన శ్రీ వేంకటేశ మనసిచ్చితివిరా

రేకు: 0113-4 మంగళకౌశిక సంపుటం: 07-076

పల్లవి: నిండుమోహమున నాపె నిలుచున్నదీమేలు
వండ వండనట్లాయ వచ్చేవో రావో

చ. 1: పిలువఁగఁ బిలువఁగ బిగిసేవు సారెసారె
చలము సాదింతురా సతులతోను
తలఁపు గడుమెత్తన దంటతనమే గాని
వలవని సటలేల వచ్చేవో రావో

చ. 2: తడవఁగఁ దడవఁగఁ దప్పించుకోఁ జూచేవు
నిడివిఁ బెట్టుదురా నెలఁతలను
వడిసీఁ జెమటలు నీకు వట్టి దీమసమె కాని
వడచల్లీ విరహము వచ్చేవో రావో

చ. 3: కూడఁగఁ గూడఁగఁ గొసరేవు మీఁద మీఁద
తోడనె యలయింతురా తొయ్యలులను
వేడుకతో దగ్గరి శ్రీ వేంకటేశ కూడితివి
వాడికెగా నిట్లనే వచ్చేవో రావో

రేకు: 0113-5 రామక్రియ సంపుటం: 07-077

పల్లవి: పొద్దువోదా నీక దేమి పోరులేలే
పెద్దరికెము సేసితే బిగిసేవేమే

చ. 1: బల్లిదురాలవైతే భ్రమయించవే పతిని
పల్లదపు మాటలకుఁ బనిలేదే
వెల్లవిరి నాతనికి వేడుక మీఁది వారము
తల్లడించి మమ్ము దూరఁ దగవేదే

చ. 2: కలిమి గలిగితేను గడు సింగారించుకోవే
చులుకఁదనానఁ జూడఁ జోటులేదే
వలపులు చవిగాఁగా వాసికెక్కిన వారము
చలివాసి వాదించ సంగతేదే

చ. 3: చేయి మీఁదైనదానవు చేఁతలు సేయించుకోవే
మాయలు మాతో నింకా మఱి యేలే
యీయెడ శ్రీ వేంకటేశుఁడెనసె నన్నిన్నిటను
నీయిచ్చ నేరములెంచ నెపమేదే

రేకు: 0113-6 శంకరాభరణం సంపుటం: 07-078

పల్లవి: అదియు నాపెద్దిరికమన్నిటాఁ గాదా
పదరినా యిందరును బలఁగమే కదవే

చ. 1: మన్నించే యాతనికిని మఱిఁగొందరు రానీవే
కన్నులెంత పెద్దవైనా కలిమే కదే
మున్నిటి వారి కతఁడు మొక్కులెల్లా మొక్కనీవే
చన్నులెంత పెద్దలయినా జవ్వనమే కదవే

చ. 2: అడఁగి మడఁగి వారికట్టే తా నడచీని
నడుమెంత కొంచెమైనా నయమే కదే
బడిబడిఁ గన్నచోట బాసలెల్లాఁ జేసీని
కడు గొప్ప పిఱుఁదు సింగారమే కదవే

చ. 3: సరికి బేసికిఁ దాను జాణతనాలాడీని
కురులు గూడితేఁ గొప్పు గొప్పౌఁగదే
యిరవై శ్రీవేంకటేశుఁ డిందరిలో నన్నుఁ గూడె
వొరసితే మోవితేనెలూరేవే కదవే

రేకు: 0114-1 ఆహిరి సంపుటం: 07-079

పల్లవి: నమ్మవా యింకా నీవు నామనసు
చిమ్ముఁ బలుకుఁ దేనెల సేద దేర్తుఁ గాక

చ. 1: ఇయ్యకొన్నదాన నీకు నెదురాడేనా నేను
నెయ్యపుటిచ్చకములే నెరుపేఁ గాక
పయ్యెదకొంగు వట్టేవు బలిమికత్తైనా యింత
వొయ్యన నీప్రియములకొడిగట్టేఁ గాక

చ. 2: వలచినదాన నీకు వసము గాకుండేనా
పలుమారు నీచిత్తము పట్టుదుఁ గాక
తలఁపు నాతోఁ జెప్పేవు తగిలి వింతదాననా
కలిసినట్టే కలసి కైకొనేఁ గాక

చ. 3: నీవే నేనైనదాన నెరుసులు వెదకేనా
చేవమీరి నీరతులఁ జెలఁగేఁ గాక
శ్రీవేంకటేశ నన్నుఁ జిత్తగించి కూడితివి
పూవులు వాసన వలెఁ బొంది వుందుఁ గాక

రేకు: 0114-2 పాడి సంపుటం: 07-080

పల్లవి: ఆతఁడు నీవును నేకమైనట్టే వుందురుగాక
యీతల నాతలా బింకాలేల దూసేరే

చ. 1: మచ్చిక చేసినవారు మాటలఁ గొసరుదురు
పచ్చిగా నవ్వేటివారు పైకొందురు
విచ్చిన విడైనవారు వెఱపు లేకుండుదురు
యెచ్చుకుందులు మీలోననేల పట్టేరే

చ. 2: పొద్దువోని యట్టివారు బొమ్మల జంకింతురు
వద్దనున్నవారు లోలో వాసి రేఁతురు
కొద్దిమీరినట్టివారు గురులు దాఁకింతురు
యిద్దరూను పంతాలకు యేల పెనఁగేరే

చ. 3: చనవులు గలవారు సరసాలు చూపుదురు
తనియఁ గూడెడివారు తమకింతురు
యెనసితిరి శ్రీ వేంకటేశుఁడు నీవును నిట్టే
యినుమడించెఁ దగవులేల పెట్టేరే

రేకు: 0114-3 రామక్రియ సంపుటం: 07-081

పల్లవి: ఏల నీకు నీవే పతినింత సేసేవే
మేలు మీఁదనుండితేనే మెచ్చవచ్చుఁగాక

చ. 1: మచ్చిక చుట్టాలైతే మర్మాలెత్తుదురా
యిచ్చకములాడితేనే యింపులుగాక
తచ్చి నీరు వేఁడైతే తామర వోరుచునా
చెచ్చెరఁ జల్లనైవుంటేఁ జెంగలించుఁ గాక

చ. 2: వొడఁబాటు గలవారు వొచ్చము పట్టుదురా
ఆడరి సరసమాడేదందముగాక
బెడసి కూడు వేఁడైతే పెదవులోరుచునా
జడిసీ దగు పాటైతేఁ జవి పుట్టుఁ గాక

చ. 3: కౌఁగిటఁ గడినవారు కడమ వెట్టుదురా
వీఁగక పెనఁగితేనే వేడుక గాక
ఆఁగెను నిన్నురముపైనట్టై శ్రీ వేంకటేశుఁడు
వేఁగా తీగెకుఁగాయ వినోదమేకాక

రేకు: 0114-4 ముఖారి సంపుటం: 07-082

పల్లవి: అటువంటి సతిఁ గాని యాదరించవు
మటుమాయముల మాటుమందులే నీకు

చ. 1: కాటుక కన్నుల యింతి కందువ చూపులు దాఁకి
నాటుకొని నీ తనువు నల్లనాయను
మేటియై యాపెచెక్కుల మెఱుఁగు కళలు దాఁకి
పాటించి నీకోకయెల్లాఁ బచ్చనాయను

చ. 2: జలజవదనమేని జవ్వనభావాలు సోఁకి
పొలుపొంద నీబొడ్డు పూవక పూచెను
అలర జఘన చక్ర మాపె పొందుసేయఁగాను
తిలకింపఁ జక్రము చేతికి వచ్చెను

చ. 3: పాల వెల్లి కూఁతురుఁ జేపట్టి పెండ్లాడఁగాను
పాల సముద్రము నీకుఁ బడుకాయను
యీలీల శ్రీ వేంకటేశ యిందర మాపె వారమే
వేల సంఖ్యల సతుల విటతనమబ్బెను

రేకు: 0114-5 నాదరామక్రియ సంపుటం: 07-083

పల్లవి: నీవల్లనె కొత్తగాదు నిండుజవ్వనము గల
కావరపు వారి కెల్లా కలదిదే చాలు

చ. 1: ఏమని మాటలాడెనో యింతి నీతోనల్లప్పుడే
మోమునఁ గళలు దేరీ ముదము తోడ
చేముట్టి నాతోనప్పటి చేరి సరస మాడేవు
ఆమని కాలముగాఁగా నగ్గువాయ వలపు

చ. 2: సన్నలేమి సేసెనో జలజాక్షి నీ కప్పుడు
పన్నిన నీ చిత్తమెల్లా పరాకైనది
మన్నించి అప్పటి నాతో మాటలూనాడేవు
నున్నగానుప్పొలికి యినుమడాయ వలపు

చ. 3: కలసిన రతి యెట్టో కౌఁగిటను మదిరాక్షి
నిలువెల్లాఁ బులకలై నిగ్గుదేరెను
అలరి శ్రీవేంకటేశ అప్పటి నన్నుఁ గూడితి
బలిమిఁ బయిరు సేయఁగ పంటవండె వలపు

రేకు: 0114-6 వరాళి సంపుటం: 07-084

పల్లవి: ఎంతయినా మీలోన యెరవున్నదా
చెంతనున్న తీగెలెకా చిగిరించేవి

చ. 1: జగడాలు మానరాదా సరసమాడేటి వేళ
యెగదిగనాడితే యెగ్గులున్నవా
పొగరు మాఁకుల మీఁది పువ్వుల వొగ రేకాదా
తెగడి పెరఁ బెట్టితే తెనెలయ్యేవి

చ. 2: పెనఁగక వుండరాదా ప్రియముతో నాపె నిన్ను
చనవున ముట్టితేనే సడివచ్చెనా
పనివడి వోరుచుక పలుమారు సాదించితే
తినఁదిన వేములేకా తీపులయ్యేవి

చ. 3: పిలిచి శ్రీ వేంకటేశ బిగియఁగనేల యాపె
బలిమిఁ గూడితేనే పంతమాయనా
చలువగాఁ దూరుపున చంద్రోదయమైతే
వెలయఁ జీఁకటేకాదా వెన్నెలయ్యేది

రేకు: 0115-1 శంకరాభరణం సంపుటం: 07-085

పల్లవి: చేయి మీఁదాయను నీకుఁ జెల్లదా మఱి
మాయింటనే వుండఁగాను మావంకదే చలము

చ. 1: దూరినదాన నేనింతే తొల్లి నీవు శాంతుఁడవే
వూరకున్న వారి తోడ నూరోపదు
మారాడవన్నీఁ జేసి మంచివాఁడ వౌదువు
మేరతో నుండి మిమ్మాడేమేమే మంకులము

చ. 2: సన్నల నేఁ దిట్టేదాన సాదించవెన్నఁడూ నీవు
కన్నులు మూసితేనే లోకము మఱఁగు
యెన్నిటికైనా నోర్చేవు యెందుండో వచ్చి దొరవు
చన్నుల మోచి నిన్నొత్తి చపలపువారము

చ. 3: సేవకురాల నేనింతే శ్రీ వేంకటేశుఁడ నీవు
దేవరవంటివాఁడవే దిట్టువిన్నిటా
చేవనలమేల్ మంగనై చెలఁగే నీవేలితివి
కైవశమైవుండి నేమే కాతరపువారము

రేకు: 0115-2 సామంతం సంపుటం: 07-086

పల్లవి: ఇందరినే మడిగే విందాఁకాను
సందడి మీకిద్దరికి జవ్వనమే సాక్షి

చ. 1: సెలవి నవ్వులకును సిగ్గులే దాపు
కలికి చూపులకును కన్నులు దాపు
నిలుచున్న యాపెకును నీవు దాపు
మలసిన నీకు నాపె మంతనాలు దాపు

చ. 2: చెక్కిటి మెఱుఁగులకు చేయి మాటు
పెక్కుల మాటలకు పెదవి మాటు
చక్కని యాపెకు నీ సన్నలు మాటు
మొక్కలపు నీకు నాపె మొక్కులు మాటు

చ. 3: భారపు గుబ్బలకును పయ్యద కాపు
పేరిన వలపులకు బింకము గాపు
ఆరయ శ్రీ వేంకటేశ అలమేల్మంగకు నీకు
యీరీతినొనగూడిన యింపులే కాపు

రేకు: 0115-3 కాంబోది సంపుటం: 07-087

పల్లవి: చవి గంటి విడువఁడు సారె సారె నేపనులు
యివల నీతని పొందులెట్టు సేసేదే

చ. 1: పాలమీఁదఁ బవ్వళించి పాల వారి యింటఁ బుట్టి
పాలు దొంగిలించినట్టి బాలుఁడీతఁడు
గాలికూటివాని మెట్టి గాలి రాకాసునిఁ గొట్టి
గాలిబిడ్డ తమ్ముని సంగడి నాడె నీతఁడు

చ. 2: పసుల యేలిక నేలి పసులకు మారు దెచ్చి
పసులఁ గాచిన యట్టి బాలుఁడీతఁడు
వసుధ భారము దించి వసుధ కొడుకుఁ గొట్టి
వసుధ యేలిన యట్టి వాఁడు గదె వీఁడు

చ. 3: బండి బోయుఁడైవచ్చి బండి గాలి కత్తి వట్టి
బండి విఱిచినయట్టి బాలుఁడీతఁడు
కొండ యెత్తి కొండ దచ్చి గురుతై శ్రీ వేంకటాద్రి
కొండపై నలమేల్ మంగఁ గూడినాఁడితడు

రేకు:	0115-4 కాంబోది సంపుటం:	07-088

పల్లవి:	ఇటువంటివారి పొందులింపులాయ నీకు
అటమటాలు నేమైతేనంతేసి నేరముగా

చ. 1:	బిగువుఁగొనగోళ్ళను బిరుదులే తొలఁకీని
మొగమిచ్చకుఁ జేతులు మొక్కీఁ గాని
తెగువలు కన్నులను తేరి కెంపులెక్కీని
నగవులే సెలవుల నయమిచ్చీఁ గాని

చ. 2:	గట్టి చను మొనలైతే కరసానఁ బట్టీని
వొట్టుక మాటలె తేనెలూరీఁ గాని
జట్టిగొన్న బొమ్మలైతే జంకెనలే చూపీని
దట్టపుఁ జక్కఁదనమే తమిరేఁచీఁ గాని

చ. 3:	మచ్చిక జవ్వనమైతే మనసెల్లాఁ గరఁచీని
కొచ్చి కోరికలే ఆస కొలిపీఁ గాని
అచ్చపు శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
నిచ్చలుఁ గూడితి నాపె నిన్నుఁ గూడెఁ గాని

రేకు: 0115-5 గౌళ సంపుటం: 07-089

పల్లవి: మఱి యేఁటి సుద్దులు మాపు దాఁకాను
గుఱియైన చేఁతలివె కొల్లలాయను

చ. 1: కాటుక కన్నుల నిన్ను కలికి చూడఁగానే
నాటనుండి నీమేను నల్లనాయను
చీటికి మాటికి నాపె సిగ్గులు పైఁజల్లఁగానె
తేటలుగా నీకన్నులు తెల్లనాయను

చ. 2: బలిమినే వలపుల పదను చల్లఁగానే
పలుమారు నీ మేను పచ్చియాయను
యెలిమి నీతో నాపె యిచ్చకములాడఁగాను
వెలయ నీమాట వెచ్చి వేవదాయను

చ. 3: అండనుండి పానుపుపైనలిగి కూడినదెల్లా
యెండలాయ నీడలాయనింతలోననే
దండి గోవిందరాజవై దగ్గరి శ్రీ వేంకటాద్రి
కొండపై నన్నుఁగూడఁగా కోరినట్టేయాయను

రేకు: 0115-6 భైరవి సంపుటం: 07-090

పల్లవి: పంతమునేనాడుకొన్నాఁ బలుమారు మెచ్చేవు
యెంతవాఁడ వింత సేసే విట్టిదివో వలపు

చ. 1: పచ్చిమాటలాడితేను భావమెల్లాఁ గరఁగేవు
హెచ్చుకుందులాడినా యియ్యకొనేవు
కచ్చుపెట్టి జంకించితే కాఁగిటనే పొదిగేవు
యిచ్చితివి చనవులు యిట్టిదివో వలపు

చ. 2: చెక్కు నొక్కి పలికితే చెమరించేవు మేనెల్లా
వొక్కటై గోరనూఁదినా నోరిచేవు
మొక్కలాననలిగితే మోహము పైఁజల్లేవు
యెక్కడాను నన్నుఁ బాయవిట్టిదివో వలపు

చ. 3: మొగము నేఁజూచితేనే ముచ్చటతో భ్రమసేవు
అగడుగా నేఁగూడినా నందుకోపేవు
తగిలి శ్రీ వేంకటేశ తమితో మన్నించితివి
యిగిరించేవు పై పై నె యిట్టిదివో వలపు

రేకు: 0116-1 సాళంగనాట సంపుటం: 07-091

పల్లవి: ఏమి చెప్పేది నీనేర్పు యెంతవాఁడవు
వామి వలపొక్కమాటే వారవట్టేవా

చ. 1: దగ్గరి రాదంటాను తరుణినేల తిట్టేవు
సిగ్గులు వడఁగవద్దా చిన్నదానికి
వెగ్గళించే బిట్టుడుల వేమారుఁ బొంది పొంది
యెగ్గులు నెమ్మెలు నేఁడు యీడఁజూపేవా

చ. 2: ఉరుటుగాఁ జూడదంటానువిదనేల జంకించేవు
శిరసు వంచఁగవద్దా చిన్నదానికి
వెరవైన సతులతో వేమారు నవ్వి నవ్వి
యిరవైన అలవాట్లీడఁ జేసేవా

చ. 3: చన్నులవొత్తదంటాను సతినేల జరసేవు
చెన్నుమీర మొక్కవద్దా చిన్నదానికి
యిన్నిటా శ్రీ వేంకటేశ యీపెఁగూడి పురముపై
యెన్నికమీరఁ బెట్టుక యింపుచల్లేవా

రేకు: 0116-2 శంకరాభరణం సంపుటం: 07-092

పల్లవి: ఎరవై దూరితిమి యిన్నాళ్ళుదాఁకా నిన్ను
సరసములాడఁగాను సాదించేమా

చ. 1: వల్లెవేసి కోడెలను వంచుకొనేయట్టి నీకు
చెల్లునెంత నీవు చేఁత చేసినా మమ్ము
వెల్లవిరిగా దొంగిలి వెన్నలు దినినచోట
పల్లదాలేమాడినాను పాటివట్టేమా

చ. 2: మెండుగఁ జీరలుదీసి మెరసిన చేతుల
దుండగాలెంత నించినా దోసమనేమా
అండనే పదారువేల ఆయాలు మోచిన నీమై
వొండె మాచన్నులు మోవనోపదనీనా

చ. 3: గోవుల చన్నులు నోర గుమ్మలాడిన నీమోవి
యీవల మాకియ్యఁగాను యెంగిలనేమా
శ్రీ వేంకటేశ నన్నుఁజేరి యిట్టె కూడితి
వావిరినెంతమెచ్చినా వలదనేనా

రేకు: 0116-3 ఆహిరి సంపుటం: 07-093

పల్లవి: ఏల పురుఁడు వెట్టుక యింత సేసేవు నన్ను
మేలిమివాఁడవు నీవు మెంగదాన నేను

చ. 1: విరహానఁ గాఁకరేఁగి వేసాలకుఁ జలిగాసి
దొరతనాలు సేసేటి దొడ్డవాఁడవు
గురువింద పూవులు కోరి మనసునఁ గోసి
వరుస నిన్నుఁ బూజించే వనితను నేను

చ. 2: నారలు నాలివొలిచి నమ్మికలఁ దాడు వేఁడి
పోరచిని వల్లెవేసే పొట్టివాఁడవు
గారవపు నవ్వులనే కప్పురాలు నూరి నూరి
సారెకు నీపైనఁ బూసే జలజాక్షిని నేను

చ. 3: కలలోనుంకువవెట్టి కౌఁగిటిలో నన్నుఁ గూడి
సొలసేటి శ్రీ వేంకటేశుఁడవు నీవు
పలచని చెమటల పన్నీటికాలువదెచ్చి
జలకములార్చేటి సకియ నేను

రేకు: 0116-4 దేసాళం సంపుటం: 07-094

పల్లవి: ఇరవైన సరసుఁడు యించుకంతలోఁ దెలుసు
సారిదిఁదప్పక యిట్టె చూచితేనే చాలదా

చ. 1: నగవులే నయమైతే నాటుకోవా ప్రియములు
తగవులఁ బెట్టఁగానే దాఁగీఁ గాక
అగడు సేయకరావె ఆతనినేల దూరేవే
మొగము చూచి చూచి మొక్కితేనే చాలదా

చ. 2: కోరికలే కుప్పలైతే కొండంత గాదా వయసు
ఆరితేరఁగా వెగటయ్యీఁ గాక
పేరఁబెట్టకిఁక రావే పెనఁగనంతేశాలే
మేరతోనే వొకమాట మెచ్చితేనే చాలదా

చ. 3: మాటలెల్లా మూటలైతే మనసులొక్కంత గాదా
పాటిసేయకుండఁగానే భ్రమసీఁ గాక
యీటులేక శ్రీ వేంకటేశుఁ డింతి నిట్టే కూడె
నీటుతో డనిఁకరావే నిలిచితేఁ జాలదా

రేకు: 0116-5 గౌళ సంపుటం: 07-095

పల్లవి: వనితల తలఁపులు వడ్డికిఁ బారీ నీమీఁద
యెనయుమెక్కడనైనా యేదుగాను సతుల

చ. 1: చేతి నేసవడ్డవారు చేరియున్నారు నీవారె
ఆతల మరిఁ జెనకుమదిలాభము
లాతుగాఁ బదారువేలు లాయాలు నీనగరెల్లా
యీతలనింకాఁ గూర్చుమేదుగాను సతుల

చ. 2: కలయఁ గొనినవారు కలరూరెల్లా నీవారే
అలరి మరిఁ గలయుమదిలాభము
తొలఁకే నందవ్రజపుదొడ్లే నీయందలాలు
యెలమినింకానుఁ దెమ్మా యేదుగాను సతుల

చ. 3: ఉరము శిరసు పీఁపందున్నవారు నీవారె
అరయుమష్టమహిషులది లాభము
ధర శ్రీ వేంకటేశ నీతావెల్లా రాణివాసాలే
యిరవై మమ్మూనేలితివేదుగాను సతుల

రేకు: 0116-6 బౌళి సంపుటం: 07-096

పల్లవి: నేనింత సేసితినంటా నేరమెంచేవు గనక
తానే నన్నంటెఁ జుమ్మీ తప్పులేదు నాయందు

చ. 1: పొద్దున నీయింటికి నీపొందులు సేయవచ్చితే
సుద్దులు చెప్పఁగ వచ్చీఁ జూడవె తాను
బుద్ధులెఱుఁగుదునంటా పొరుగుపోరచి యంటా
ఉద్దండానఁ జన్నులంటీ నోయక్కరో వీఁడు

చ. 2: నీమగఁడు బావంటా నే వద్దఁ గూరుచుండితేను
కామించి కౌఁగలించెను కానీవే తాను
నేమము వట్టితినంటా నేనే వేరటాలనంటా
ప్రేమమున మోవితేనె పెట్టెఁగదే వీఁడు

చ. 3: మాటాడఁ బనిగలిగి మరి నిన్ను లేపరాఁగా
యీటుగాఁ గూడె శ్రీ వేంకటేశుఁడే తాను
నీటు నీ చెల్లెలనంటా నీమారు నేనంటా
గీఁటుచుఁ దమ్ములము పుక్కిట నించె వీఁడు

రేకు: 0117-1 ముఖారి సంపుటం: 07-097

పల్లవి: ఇల్లురికి పేరటములేల చెప్ప వచ్చేవే
పల్లదాన నీవుఁ గొంత పైకొసరా

చ. 1: వలపులు చవియంటా వంతులకుఁ గొసరేవు
చెలి యీ విభుఁడు పెట్టుఁజెట్టా నీకు
కలికి నీ కొద్దివారా కాచుకున్నారిక్కడను
నెలకొని భోగించ నీయంత నేరరా

చ. 2: నవ్వులే కలవంటా నంటునఁ దొడెక్కేవు
పవ్వళించి యీ విభుఁడు బాడిగెవాఁడా
జవ్వనులిక్కడివారు జాలిరొప్పనున్నారా
చివ్వన నీవలె సేవ నేయనోపరా

చ. 3: కావరాన నీవు గూడి కౌఁగిటనే పిసికేవు
శ్రీ వేంకటవిభుఁడు చిమ్మిలిబొమ్మా
యీవేళనే మమ్మిందరి నితఁడిట్టే కూడినాఁడు
వేవేలకు నీవంటివేడుకలే కావా

రేకు: 0117-2 ఆహిరి సంపుటం: 07-098

పల్లవి: చెప్ప వేగు వచ్చెనా చేరి మీకెల్లా బుద్ధులు
చిప్పిలుచు వినివిని చిల్లులాయ మనసు

చ. 1: పలుకులే వాఁడైతే పట్టవచ్చునా మఱి
అలుగులైనా వొరల నట్టుండుఁ గాక
యెలమినాతఁడాడఁగా నెట్టోరువ వచ్చునే
చెలులార వినివిని చిల్లులాయ మనసు

చ. 2: చేరి వలపు వేఁడైతే చేతనంటవచ్చునా
సూరియుఁడైనా మొయిలు చొచ్చుఁగాక
కోరి యాతఁడు దిట్టఁగా గుట్టున నెట్టుండుటే
చేరువలు వినివిని చిల్లులాయ మనసు

చ. 3: నవ్వులే నయములైతే నారొలువవచ్చునా
పువ్వులందే పిందెలును బుట్టుఁగాక
యివ్వల శ్రీ వేంకటేశుఁడెనసె నేమందునే
చివ్వన బూతులు విని చిల్లులాయ మనసు

రేకు: 0117-3 దేసాళం సంపుటం: 07-099

పల్లవి: ఇప్పుడేమి కడమా యెన్నాళ్ళకైనాను
అప్పులిచ్చే రమ్మనవే అల్లనాఁటి నవ్వులు

చ. 1: చిత్తమెఱిఁగినదాన చేరి కోపగించేనా
యెత్తి యిచ్చులాడఁగాక యింకా నేను
తత్తరమింతటిలోనే తనకేల రమణుఁడు
హత్తుకొను రమ్మనవే అల్లనాటి పొందులు

చ. 2: మొగము చూచినదాన ముంచి నేరాలెంచేనా
జిగిఁ దాను చెప్పినట్టు సేసేఁ గాక
తనగి సిగ్గులదేలే తానాకుమేలువాఁడు
అగపడె రమ్మనవే అల్లనాఁటి వలపు

చ. 3: ఇంటికి వచ్చినదాననెగసక్కెము సేసేనా
పెంటలుగాఁ గాఁగిటిలోఁ బెనఁగేఁ గాక
దంట శ్రీ వేంకటేశుఁడు తానే నన్నుఁగూడినాఁడు
అంటీననే రమ్మనవే అల్లనాటి మాఁటలు

రేకు: 0117-4 రామక్రియ సంపుటం: 07-100

పల్లవి: ఆడినట్టే ఆడీ వీఁడు అద్దములో నీడవలె
జాడతోడ కన్నులనే సన్న సేసీనే

చ. 1: కోరి జలకము కేళాకూళిలో నేనాడఁగాను
ఆరసి తానీద వచ్చీనాడకే తాను
తారసిలి సిగ్గుతో నేఁ దామరమొగ్గలంటితే
సారపుఁగమలాలంటాఁ జన్నులంటీనే

చ. 2: చెంది పొదరింటి లోన చీర నేఁగట్టుకోఁగాను
అందిమ్మనీఁ బచ్చడము ఆడనే తాను
కందువ సిగ్గుతో నేను కమ్మఁజిగురు వట్టితే
ముందే నాచిగురుమోవి మోవిఁ బట్టీనే

చ. 3: అలసి నేనొకచోటనారగించఁ గూచుండితే
వలెనంటా నాపొత్తుకు వచ్చీనే తాను
అలరి సిగ్గుతోడ నేనట్టె చేయెత్తి మొక్కితే
యెలమి శ్రీ వేంకటేశుఁడిటుగూడి మొక్కెనే

రేకు: 0117-5 మధ్యమావతి సంపుటం: 07-101

పల్లవి: వేగునంతానేల జాలి వెలుమజోలి
సోగకన్నుల నాతనిఁ జూడఁగరాదా

చ. 1: చలమే నీకు బలమా సరసములాడరాదా
వలచిన రమణుఁడు వద్దనుండఁగా
అలిగితేనేమాయ నప్పటికపుడె పోయ
చెలులు చెప్పఁగా సందుచేకొనరాదా

చ. 2: పట్టినదే పంతమా పైకొని మాటాడరాదా
గుట్టుతో నీపతి చెంతఁ గూచుండఁగా
వొట్టుక దోసములేదు వొగి నీకుఁ బొద్దువోదు
పెట్టే గిలిగింతలకే బెట్టి నవ్వరాదా

చ. 3: సిగ్గులే మూలధనమా చేరి పైకొనఁగ రాదా
అగ్గమై శ్రీ వేంకటేశుఁడలమఁగాను
యెగ్గులెల్లా నేఁడె జారె యెదుటఁ బ్రియములూరె
వెగ్గళించె నాస వెల్లవిరులు గారాదా

రేకు: 0117-6 నాదరామక్రియ సంపుటం: 07-102

పల్లవి: వేగిరమా యిప్పుడేమి వేఁడి వలపు
చేఁగదేరఁగా నీవే చేరి మన్నించేవు

చ. 1: మాటలు నీతోనాడి మనసులు సోదించ
అఁటది నేరుచునా అంతేసి
పాటించి ప్రూడిగాలుసేసే బల్లిదురాలనైతేను
నీటున నీగుట్టెల్లా నీవే ఆనతిచ్చేవు

చ. 2: సన్నలు నీతోడినాడి చాయకు నిన్ను దిద్దుకో
కన్నెలు నేరుతురా కపటాలను
అన్నిటా యిచ్చలాడీ సుద్దాత్మురాలనైతేను
వున్నతి వోజకు వచ్చి వుబ్బున మెచ్చేవు

చ. 3: మెల్లనే నిన్నుఁ బొగడి మేరలు మాఱి నవ్వఁగా
యిల్లాండ్రతరమా యెందునైనాను
యిల్లిదె శ్రీవేంకటేశ యెనలుతి విట్లయితే
పల్లదాన నెప్పుడూనుఁ బాయకవుండేవు

రేకు: 0118-1 పాడి సంపుటం: 07-103

పల్లవి: అన్నిటాఁ గలికివైతే నౌదువు గాని
యెన్నరాదాతని ప్రియమియ్యకొనవే

చ. 1: వసముగాని పతితో వాసులేల నెరపేవే
కసుగాటు వలపుల కాయవు నీవు
రసములు చిందీనదె రమణుఁడు మాటలనే
విసువక ఆదరించి వినఁగదవే

చ. 2: మేటియైన విభునితో మేకులు చూపకువే
తేట వయసుల పూవుఁదీగెవు నీవు
మాటులేని మందు నూరీ మగఁడు నవ్వులనే
చాటుకుఁ బోకందుకొని సమ్మతించవే

చ. 3: శ్రీ వేంకటేశ్వరునితో సిగ్గులు వడకువే
దేవరవంటి పట్టపుదేవివి నీవు
చేవదేర మన్నించి చేఁతల నిన్నీతఁడు
పూవువలె నిట్లనే భోగించవే

రేకు: 0118-2 శ్రీరాగం సంపుటం: 07-104

పల్లవి: ఏల దాఁచేవింతలోనే యిందరిముందరా నేఁడు
చాల మెచ్చేఁగాని యాసతిఁ జూపరాదా

చ. 1: చెంతల నేఁబిలిచితే చేరి వూరకున్నాఁడవు
పంతము దప్పినా పలికితేను
యింతలో నేమస్తునిగా నెవ్వతె సేసెనో నిన్ను
సంతోసించేఁ గాని ఆసతిఁ జూపరాదా

చ. 2: అంకెలఁ జెక్కు నొక్కితే నట్టే తల వంచేవు
సుంకము వచ్చినా చూచితేను
పంకించకెవ్వతె నిన్ను బమ్మచారిఁ జేసెనో
సంకెదేరిచేఁ గాని ఆసతిఁ జూపరాదా

చ. 3: తనువు చేతనంటితే దాఁగి నన్నుఁ గూడితివి
అనువు నిన్నుఁ గొనేరా అట్టే వచ్చితే
యెనసి శ్రీ వేంకటేశ యెవ్వతె నీకు నేర్పెనో
చనవు చూచేఁగాని యాసతిఁ జూపరాదా

రేకు: 0118-3 కేదారగౌళ సంపుటం: 07-105

పల్లవి: ఎన్నఁడూ నలుగకుమీ యెదురుమాటాడకుమీ
పన్ని యీతని మనసు పట్టదే చెలియా

చ. 1: మంచితనములకే మగలు లోనౌదురు
వంచనచేఁతలకే వలతురు
చంచులఁ బాడినందుకే సతమై కరఁగుదురు
అంచల నింతులకివి అందములే చెలియా

చ. 2: ఇచ్చకపు మాటలకే యెన్నఁడును బాయరు
పచ్చిమోవితేనెలకే పైకొందురు
యిచ్చినచనవులకే యీడుజోడై చిక్కుదురు
నిచ్చలుఁ గామినులకు నేరుపులే చెలియా

చ. 3: తగులాయమైనందుకే తమకింతురెప్పుడును
నగవులతేటలకే ననుపొదురు
నిగిడి శ్రీ వేంకటాద్రి నిలయునిఁ గూడితివి
తగిన సతులకివే తగవులే చెలియా

రేకు: 0118-4 ముఖారి సంపుటం: 07-106

పల్లవి: చెలులము నేమెందాఁకా చేరి విన్నవించేము
సొలసి నిన్నుఁ జూడఁగ చుఋకనె మనసు

చ. 1: ఈడనేకతమాడఁగా నింతి నన్నుఁ గోపగించె
ఆడరాదా అందు గొంత ఆపెతోడను
వాడుమోవి వంచుకొనె వత్తివలెనాయ మేను
చూడరాదా ఆపెదిక్కు చుఋకనె మనసు

చ. 2: చెంగలించి నీవు రచ్చసేయఁగా నీతోనలిగె
అంగవించి వుండరాదా ఆకింటాఁ గొంత
కుంగి చేతిపైనొరగి గొబ్బున మెయి చెమరించె
చుంగుపయ్యదెత్తరాదా చుఋకనె మనసు

చ. 3: వలపంతటాఁ జల్లఁగా వనిత నిన్ను దూరీని
కలయఁ జల్లఁగరాదా కామినిమీఁద
యెలమి శ్రీ వేంకటేశ యిప్పుడాకెఁ గూడితివి
సళువు దెలుపరాదా చుఋకనె మనసు

రేకు: 0118-5 శుద్ధవసంతం సంపుటం: 07-107

పల్లవి: నీకేమయ్యా నీకు నీవే దొడ్డవాఁడవు
చేకొని చెట్టడిచితే చేటఁడేసీ వావులు

చ. 1: తలపోఁతలొక్కటైతే తమక మినుమడాయ
నిలువుకు నిలువే నీబేరము
కొలిచినందే కొలిచి గోపికలకెల్లాను
వలవఁదీసితివిగా వలపులు నీవు

చ. 2: నగవులు మానెఁడైతే ననుపులడ్డెఁడేశాయ
నిగిడె నన్నచోట్లా నీబేరము
అగడుగా నాఁగిచ్చి (?) అంగనలకెల్లాను
జిగి వడ్డిగొంటివి సిగ్గులెల్లా నీవు

చ. 3: మోవితేనగ్గువలైతే ముదములు లాభమాయ
నీవు నన్నుఁ గూడినదే నీబేరము
భావించి శ్రీ వేంకటేశ పడఁతులకెల్లాను
వావాత నమ్మితివిగా వయసులు నీవు

రేకు: 0118-6 సౌరాష్ట్రం సంపుటం: 07-108

పల్లవి: నయగారి నీ సుద్దులు నాకుఁ గొత్తలా
ప్రియములన్నియు దాఁచి పెట్టెఁ బెట్టవయ్యా

చ. 1: మిక్కిలి నీవు మెచ్చఁగా మేనికి వెంగెమై తోఁచీ
దిక్కులవారు నవ్వేరంతేశాలయ్యా
చక్కెర యేదుగానైతే చవి మొగచాటు గాదా
వొక్కమారే యింతగద్దా వూరకుండవయ్యా

చ. 2: పూని సారెఁ బొగడఁగా పొందులకు వేఁగయ్యా
తేనె గారీఁ దీపుల నంతేశాలయ్యా
నూనె గొలచే కుంచము నునుపెక్కు మీఁద మీఁద
ఆనక మై దిగువారీనాయనాయనయ్యా

చ. 3: నగవులేదు గాఁగా నాము గడువేసీని
తెగరానిచోట్లు అంతేశాలయ్యా
పగటు శ్రీ వేంకటేశ పైకొంటివి కడపలో
అగపడె రతులు నీయాసలెంతేశయ్యా

రేకు: 0119-1 వరాళి సంపుటం: 07-109

పల్లవి: సరికి బేసికి మీచదురుఁదనాలు మించె
ఇరుగుపొరుగులను యిద్దరును జాణలే

చ. 1: కలువల వేసితేను కమలాన వేసెనాపె
మలసి యెడమాటలు మఱియేఁటికి
పలువరుస చూపితే తలయెత్తి నిక్కెనాపె
యెలమిఁ దెలుసుకొంటిరిద్దరూను జాణలే

చ. 2: పరగ చేత మొక్కితే పాపట దువ్వెనాపె
అరసి లేకలు వా సి అంపనేఁటికి
పొరిఁ గస్తూరి చల్లితే పొంచి కుంకుమాపె చల్లె
యిరవు దెలుసుకొంటిరిద్దరూను జాణలే

చ. 3: పచ్చడము గప్పుకుంటే పయ్యెద దెఱచెనాపె
ఇచ్చట సన్నలుసేయనిఁకనేఁటికి
మెచ్చితే శ్రీ వేంకటేశ మెయిలచ్చన చూపెనాపె
యెచ్చి లోలోనే కూడితిరిద్దరూను జాణలే

రేకు: 0119-2 శుద్ధవసంతం సంపుటం: 07-110

పల్లవి: ఇప్పుడుగాక మఱి యిఁకనెన్నఁడు
గుప్పేటి కానుకలందుకొనవయ్య

చ. 1: పొలితి నీవద్దనుండి బుద్ధులెల్లాఁ జెప్పఁగాను
చెలఁగి పారుపత్యాలు సేయవయ్యా
పలుమారునాకె రాయబారాలకు నడవఁగ
కొలువులు సేయించుకొనవయ్యా

చ. 2: అంగనలిందరని నీకతివ లెక్క చెప్పఁగ
చెంగటఁ గళ దింపుచుఁ జెన్నొందవయ్యా
సంగతిగా నాపె యవసరములు చెప్పఁగాను
అంగీకరించి యట్టె ఆదరించవయ్యా

చ. 3: అక్కజమై సతి నీకు నడపము పట్టఁగాను
పెక్కు వీడేలింతులకుఁ బెట్టవయ్యా
యిక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
మక్కువ తోడుతనిట్టే మన్నించవయ్యా

రేకు: 0119-3 ఆహిరి సంపుటం: 07-111

పల్లవి: నీతోడి విరహానను నెలఁతమై నిన్నియును
కాతరించి బెదరీ సంగతి సేయవయ్యా

చ. 1: కందువలఁ బొదివి జక్కవలను దువ్వుదువు
ముందు ముందె తుమ్మిదల మూఁక గూర్తువు
విందుగా చకోరాలకు వెన్నెలలావటింతువు
యిందుముఖి పిలిచీని యిట్టె రావయ్యా

చ. 2: కలయ మాటాడి చిలుకలఁ బలికింతువు
పలుమారుఁ గోవిలలఁ బాడింతువు
అలర ముంగిటను రాయంచలనాడింతువు
యెలమినంగన విల్చీ నిట్టె రావయ్యా

చ. 3: నెయ్యము మీఱఁగ తేనియ పెరరేఁతువు
చెయ్యంటి మయూరముఁ జెలఁగింతువు
వొయ్యనె శ్రీ వేంకటేశ వొనగూడితివింతలో
యియ్యెడఁ గామిని విల్చీ నిట్టె రావయ్యా

రేకు: 0119-4 శ్రీరాగం సంపుటం: 07-112

పల్లవి: ఆకెఱుఁగు నీవూ నెఱుఁగుదదియె మాట
చేకానిక నీకిమ్మనె చెలియ నన్నిపుడు

చ. 1: వెన్నెల బాయిటనుండి వెలఁదిపాట వింటాను
చన్నులపైనొత్తితివి చంద్రవంకలు
అన్నిటా నీపై వలపులవె తలఁపించునని
విన్నపము సేయుమనె వింతగా నన్నిపుడు

చ. 2: చవికెలోపలనుండి చదురంగమాడుతాను
వువిదకిచ్చితివి నీవుంగరము
జవళినదే నిన్ను సారెఁ దలఁపించునని
తవిలి నీకెచ్చరించఁ దరవిచ్చెనిపుడు

చ. 3: పానుపు మీఁదట నుండి పడఁతికౌఁగిటఁ గూడి
పూని మోవిమీఁదఁ గెంపులు నించితి
నాని శ్రీ వేంకటేశుఁడ నసుపవే రేఁచునని
మోనాన మఱవకుండా మొక్కుమనెనిపుడు

రేకు: 0119-5 భైరవి సంపుటం: 07-113

పల్లవి: ఎంత వేగిరపడే వింతటిలోనే
చెంతనుండి యిప్పుడేల చెనకేవు నీవు

చ. 1: మనసు లోపలి మాట మంతనానఁ జెప్పీఁగాక
యెనసి యిందరిలోననేలడిగేవు
పనులేమి గలిగినా పానుపుపైఁ జెప్పీఁ గాక
వొనర యాల వొరసేవు నీవు

చ. 2: వేడుకైన ముచ్చటలు వెనకఁ జెప్పీఁ గాక
ఆడుమని మఱియేల ఆనవెట్టేవు
వీడెమిచ్చినప్పుడే వినయాలు చెప్పీఁ గాక
జాడెఱఁగకిప్పుడేల జరసేవు నీవు

చ. 3: కందువైన ముచ్చటలు కౌఁగిటిలోఁ జెప్పీఁ గాక
గందమియ్యఁగానే యేల గరిసించేవు
ఇందునే శ్రీ వెంకటేశ యేలితివి చెలినిట్టే
పొందులట్టే యిప్పుడేల బోధించేవు నీవు

రేకు: 0119-6 మంగళకౌశిక సంపుటం: 07-114

పల్లవి: ఎందాఁకఁ దెరలోన నేమి సేసేవు
చందమాయఁ బనులెల్ల చనవియ్యఁగదవే

చ. 1: చిలుకలకొలికి సిగ్గులు వడనేఁటికి
పలుకఁగదవే నీపతితోను
పిలిచి యాతఁడు నీకుఁ బ్రియములు చెప్పీని
అలుకలు దేరినీక నండకు రాఁగదవే

చ. 2: వనముకోగిలా వట్టిజాగులేఁటికే
కనుఁగొనవే నీకాంతునిని
చనవిచ్చి యాతఁడు సరసములాడీని
మనసులు గలిసెను మంతనమాడఁగదే

చ. 3: కొలని రాయంచా కొంక నీకేఁటికే
కలయఁగదే శ్రీవేంకటేశ్వరుని
లలినేలి నిన్నాతఁడు లాలించి కాఁగిలించి
వలపుల మితిమీరె వడదేర్చఁ గదవే

రేకు: 0120-1 ఆహిరి సంపుటం: 07-115

పల్లవి: ఏమి గట్టుకొనేవయ్య యిందువంకను
కామినులనింతసేయఁ గడు దోసమనరా

చ. 1: కమ్మి నీకు మోహించి కానుకియ్యఁగాని వట్టి
కొమ్మల నిమ్మపండ్లందుకొమ్మందురా
వుమ్మడిఁ జూచినవారు వొల్లనాలు గాఁగాను
యెమ్మెలకిప్పుడితఁడింత సేసెననరా

చ. 2: అప్పటినుండియు నేనాకు మడిచియ్యఁగాను
దెప్పరమీతమ్మ వొక్కతెకిడుదురా
కప్పితోడివారిపై చప్పని వలపు గాఁగా
చిప్పిలి యింతేసి కాకు సేసెనితఁడనరా

చ. 3: కైకొని శ్రీ వేంకటేశ కౌఁగిటఁ గూడుండఁగా
ఆకడనొక్కతె మాటలాలకింతురా
ఈకడ విన్నవారెల్లా నిది మేలుదిగాఁగాను
దీకొని యీతఁడు తరితీపు సేసెననరా

రేకు: 0120-2 నాట సంపుటం: 07-116

పల్లవి: వాఁడివో కంటిరటరే వన్నెలవాఁడు
పైడి మోలముకటారుపరుజులవాఁడు

చ. 1: పెద్ద కిరీటము వాఁడు పీతాంబరమువాఁడు
వొద్దికఁ గౌస్తుభ మణివురము వాఁడు
ముద్దుల మొగమువాఁడు ముత్తేల నామమువాఁడు
అద్దిగో శంఖచక్రాల హస్తాలవాఁడు

చ. 2: అందిన కటిహస్తము నభయహస్తమువాఁడు
అందెల గజ్జలఁ బాదాల మరువాఁడు
కుందణంపు యీ మకరకుండలంబులవాఁడు
కందువ బాహుపురుల కడియాలవాఁడు

చ. 3: నగవుఁజూపులవాఁడు నాభికమలమువాఁడు
మొగపుల మొలనూళ్ళ మొలవాఁడు
చిగురుమోము వాఁడు శ్రీ వేంకటేశుఁడు
తగు నలమేలుమంగ తాళిమెడవాఁడు

రేకు: 0120-3 గౌళ సంపుటం: 07-117

పల్లవి: ఔనయ్య మంచివాఁడవన్నిటా నీవు
వేనలి ముట్టి చెలిని వేడుక చేసేవు

చ. 1: అందలమెక్కిన నిన్ను ఆకె గొలిచి రాఁగాను
పొందుగాఁ జన్నులొత్తేవు బొట్టనవేల
అందుకుఁగా వేరొక్కతె అట్టె నిన్ను సాదించితే
విందువలె నాపె చెక్కు వేలనొత్తేవు

చ. 2: కుంచె వేసే యట్టి యాపె కుచ్చులమీఁద మోచేత
అంచలనూఁదుకొనేవు ఆయాలు సోఁక
పొంచి వేరొక్కతె నిన్ను బొమ్మల జంకించితే
చంచుల మోవి చూపి సన్నచేసేవు

చ. 3: కాళాంజివట్టే సతికైదండ వట్టుకొని
గోలవై శ్రీ వేంకటేశ గోరనూదేవు
మేలుతో నలమేలుమంగ మెచ్చికౌఁగలించుకొంటే
యీలీల నురముమీఁద నెక్కించుకొనేవు

రేకు: 0120-4 సాళంగనాట సంపుటం: 07-118

పల్లవి: ఇట్టుండవలదా యిరవైన మోహము
వొట్టుకొనీఁ జెమటలు ఉవ్విళ్ళూరను

చ. 1: తలపోసి తలపోసి తనువెల్లాఁ బులకించి
వలపులఁ బొద్దువుచ్చీ వనిత
నెలకొని పానుపుపై నిద్దిరించి నిద్దిరించి
కలలోన నిన్నుఁ గూడీఁ గామిని

చ. 2: నీ పదాలు పాడీ పాడి నెయ్యమునఁ గరఁగుచు
రాపుగానానందించీ రమణి
చూపుల నెదురు చూచి చూచి యంతలోనె తరి
తీపులనే తనిసీని తెఱవ

చ. 3: వచ్చివచ్చి నీతోడ వన్నెగా సరసమాడి
మెచ్చీనిదివో యలమేలుమంగ
యిచ్చకుఁడ శ్రీ వేంకటేశ నిన్నిపుడు గూడి
నిచ్చలు నిన్నుభోగించీ నీ పట్టపుదేవి

రేకు: 0120-5 రామక్రియ సంపుటం: 07-119

పల్లవి: రసికుఁడ తిరుపతి రఘువీరా
కొసరుగాదు నాలోని కూరిములు గాని

చ. 1: వెలయ నీవిఱిచిన విల్లువంటిది గాదు
విలసిల్లు నాబొమ్మలవిండ్లు గాని
చెలఁగి తపసుచేసే చిత్రకూటగిరి గాదు
గిలుకొట్టు నాకుచగిరులు గాని

చ. 2: మేటియై నీవు వేసిన మెకముచూపు గాదు
సూటిదప్పని నా కనుచూపులు గాని
గాఁటమై నీవు సేతువు గట్టిన జలధి గాదు
చాటువ నాచెమటల జలధులు గాని

చ. 3: తగ నీవు గెలిచిన దనుజయుద్ధము గాదు
దగతోడి నా మదన యుద్ధము గాని
నగు శ్రీ వేంకటేశ కనక సతి పొందు గాదు
పొగడే సీతనైన నాపొందులు గాని

రేకు: 0120-6 నాదరామక్రియ సంపుటం: 07-120

పల్లవి: రాఁగదవే యిఁకనేల రాపు బీరాలు
మూఁగిన మోవి తేనెకు మరిగిన దానవు

చ. 1: సిగ్గులువడ్డవారె పో చేతికి లోనౌదురు
యెగ్గులు వట్టేవారె పో యియ్యకొందురు
నిగ్గుల నెంచి చూచితే నీ కొలఁదివారా భువి
తగ్గక మరుతంత్రాల తగిలేటివారు

చ. 2: పట్టి పెనఁగే వారె పో పంతములెల్లా నిత్తురు
గుట్టు తోడనుండే వారే కూడుదురు
నెట్టన నెందరులేరు నీవలె పెచ్చురేఁగి
గట్టిగా మనసులు కరఁగేటివారలు

చ. 3: అనుమానించేవారె పో ఆసలకు లోనౌదురు
తనిసినవారె పో తమకింతురు
చెనకి యలమేలుమంగ శ్రీ వేంకటేశుఁడ నేను
మనవలెఁ గూడేవారే మచ్చికైనవారలు

రేకు: 0121-1 దేసాళం సంపుటం: 07-121

పల్లవి: ఆలికి మగనికి నాఁడేఁటికే
తాలిమితోడ లోలో తనివందరాదా

చ. 1: దొంతిఁబెట్ట వలపులు తోరపు బూజగుండలా
పంతాలు సంగడిఁ బార బండికండ్లా
యింతేసి మీరిద్దరును యేఁటికిఁ బెచ్చు రేఁగేరు
యెంతకెంత సేసేరు యెనసి వుండరాదా

చ. 2: మమతలు పేరఁబెట్ట మందలపాలా యేమి
తమకము తులదూఁచ తాసుచిప్పలా
జమళినిద్దరూనెంత సరులకుఁ బెనఁగేరు
తిమురనేఁటికి మీలో దిందుపడరాదా

చ. 3: సరిబేసి మాటలాడ జంట జూజాలా యివి
సిరులతోఁ బెనఁగఁగ జెట్టిసాదనా
గరిమె శ్రీ వేంకటేశ కాంతా నీవుఁ గూడితిరి
గరువాలేఁటికి నింకాఁ గలయఁగ రాదా

రేకు: 0121-2 సామంతం సంపుటం: 07-122

పల్లవి: దవ్వుల వీఁగక దండకుఁ జేరరె
పువ్విళ్ళూరుచు నొదుగరె మీరు

చ. 1: చెలువులు రాతిరి చేసిన చేఁతలు
చెలితో వేగిటు చెప్పె సతి
జల జల నంతలో జడివట్టెఁ జెమట
వెలఁదులు సురటి విసరరె మీరు

చ. 2: కాంతుఁడే కాంతముగాఁ జెప్పిన కత
సంతోసమునఁ జెప్పె సకితోను
పొంతనె దొంతర పులకలు వొడమెను
వింతలుగాఁ దెరవేయరె మీరు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు చెందిన కలయిక
వావిరిఁ జెప్పం సవతితోను
చేవల నవ్వులు సెలవులఁ బొడమెను
భావించి మొక్కరె పలుమరు మీరు

రేకు: 0121-3 హిందోళవసంతం సంపుటం: 07-123

పల్లవి: చెప్పవట్టి నీ సుద్దులు చెంగట నేనుండఁగానె
కొప్పువట్టి తీయవా ఆకొమ్మను నీవిపుడు

చ. 1: చేరి తూఁగు మంచమూఁచే చెలియ చనుమొనలు
తారుచు బొట్టనవేలఁ దాఁకించవా
కోరి సిగ్గువడి యాపె కుంచెవేయ వచ్చితేను
సారెకుఁ బోఁకముడి జారించవా యపుడు

చ. 2: వీడెమియ్య రాఁగాను వెలఁదిని సన్నచేసి
కూడఁగూడ మీఁజేతులు గోరనొత్తవా
తోడనే వొడ్డించుకుంటా దోసిటఁ బువ్వులియ్యఁగా
వేడుకనుంగరమాకెవేలఁ బెట్టవా

చ. 3: కంటసరి వెట్టఁగాను కామినిఁ గాఁగిట నించి
గెంటక యాకెమోవి యెంగిలిసేయవా
యింటిలోన నన్నుఁగూడి యిదివో శ్రీ వేంకటేశ
అంటి పాదాలొత్తఁగా నీవాకెమర్మాలంటవా

రేకు: 0121-4 శ్రీరాగం సంపుటం: 07-124

పల్లవి: సూడువట్టేనని మిమ్ము సుదతి గాచుకున్నది
ఆడరాదీతగవు మిమ్మడిగేమయ్యా

చ. 1: ఉవిదచన్నులు నీవు వుంట వింట వేసితేను
తవిలి పూబంతిఁ గొప్పు తరుణి వేసె
జవళి నీరెండు వద్దిసతిమీఁదఁ బడెనదే
తివిరి పంతమెవ్వరు దిద్దవలెనయ్యా

చ. 2: కైరవడినాళమునఁ గాంతపై నీవూదితేను
వూరక నీపైఁ దమ్ములముమిసెనాపె
యీరెండు మిట్టించి యాయింతిమీఁదనె తాఁకె
తీరుగా నీచిక్కెవ్వరు తీర్చవలెనయ్యా

చ. 3: శ్రీ వేంకటేశ్వర గోరఁజిమ్మి యాపె గూడితేను
చేవ మీరఁ బాదమునఁ జిమ్మె నిన్నాపె
ఆవల రెండును వచ్చి అండనాపెకె తగిలె
కోవరపు పొందెవ్వరు గూర్చవలెనయ్యా

రేకు: 0121-5 రామక్రియ సంపుటం: 07-125

పల్లవి: నీవే జాణవైతే నిన్ను మెచ్చేను
ఆవలనెమ్మెలూరక ఆడుకోకువే

చ. 1: చలువయినదెయ్యది చవులలోనేది చవి
తలఁపులోననేది దగిలియుండు
చెలఁగు మోమేమిట చిఱునవ్వెప్పుడు వచ్చు
వలపెరిఁగితే నిది వర్ణించవే

చ. 2: ఆసలేమిట నిండు ఆయమేమిటఁ గరఁగు
బాలెందాఁకాను పనికి వచ్చు
యీసులేరీతిఁ దీరు యింపులేగతిఁబుట్టు
వాసి నేర్పులు గలితే వర్ణించవే

చ. 3: చింతలేమిటఁ బాయు సిగ్గులేవల్లఁ దీరు
పంతమెందుల వచ్చు పనిగొంటేను
యింతలో శ్రీ వేంకటేశుఁడిటు నన్ను నిన్నుఁ గూడె
వంతుదానవై తేను వర్ణించవే

రేకు: 0121-6 ఆహిరి సంపుటం: 07-126

పల్లవి: ఇంత మాయకాఁడవౌత యెఱఁగనైతి నేను
పొంతల నాచే గందము పూయించుకొంటివి

చ. 1: సారెకు నావలపు రచ్చలఁ బట్టేనని కా
పోరుచు నాచీర కాసె పోయుమంటిమి
వారి వీరిచేత నన్ను దూరించేనని కా
కేరుచు నాకొనగోర గీరించుకొంటివి

చ. 2: ఆడుకో నన్నునింత అలయించేనని కా
వేడుకతోఁ గమలాన వేయుమంటివి
జాడతోనింతేసి దోసాలు గట్టేనని కా
వీడక తొడపైఁ దొడ వేయించుకొంటివి

చ. 3: పందెమాడి నన్నునింత పచ్చి చేసేనని కా
చెంది నీమోవి యెంగిలి సేయుమంటివి
అంది శ్రీ వేంకటేశ నన్నంటి పాయనని కా
ముందరనే నన్నుఁగూడి మొక్కింపించుకొంటివి

రేకు: 0122-1 పాడి సంపుటం: 07-127

పల్లవి: చుట్టమవో మఱి నీవు సూడుబంటవో
గుట్టుతోడనుండఁగానే గోరసేతురా

చ. 1: సెలవుల నవ్వుతానే చేతిగోరఁ జిమ్ముదురా
పలువినయాలు చేసే పడఁతిని
కొలువు సేయించుకొంటాఁ గొప్పువట్టి తీతురా
వలపులు నెరుపే నీవద్దిదానిని

చ. 2: చల్లని మాటాడుతా చన్నులు విసుకుదురా
మెల్లనే పాదాలొత్తే మెలుఁతను
కొల్లగా నాకందుకొంటాఁ గొంగువట్టి తీతురా
వుల్లము నీకొప్పగించి వుండేటిదానిని

చ. 3: కన్నులను మొక్కుతానే కౌఁగిట బిగింతురా
సన్నలఁ బ్రియము చెప్పే జవరాలిని
యెన్నఁగ శ్రీ వేంకటేశ యేలితివి చెలినిట్టే
మన్ననల విఱ్ఱవీగి మలసేటిదానిని

రేకు: 0122-2 ముఖారి సంపుటం: 07-128

పల్లవి: నేనూ నీదేవులనే నిండుకవుండుట మేలు
పేని పట్టి యిందుకేల పిలిచేవు నీవు

చ. 1: మగువలకు నీకును మాపుదాఁకాఁ గొచ్చి కొచ్చి
తగవులు చెప్పనేల తడవనేల
వెగటుగా మీలోమీరు వేసాలకునలిగితే
పగటుతోనింతవొడఁబరచఁగనేలా

చ. 2: పోసరించి వూరివారి పొందులు నేయించి నీచే
బాసలు సేయించనేల పరచనేల
బేసబెల్లితనముల పెనఁగులాడఁగ మిమ్ము
తోసుకవచ్చి యడ్డము తూర నాకేలా

చ. 3: అవ్వలిమోమైన మిమ్ము నాఁకలి గొంటిరంటా
బువ్వానఁ బెట్టఁగనేల పాదుగనేల
యివ్వల శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టే
రవ్వల మీరతులెల్లా రాఁపు సేయనేలా

రేకు: 0122-3 నాదరామక్రియ సంపుటం: 07-129

పల్లవి: చెప్పరాదు నీవుండేటి చెలువములు
చిప్పిలీ నీమేననెల్లా సింగారాలు

చ. 1: కతలుగాఁ బానుపుపై కాఁగిటఁ బెనఁగేవేళ
సతిచెమటే పన్నీటి జలకములు
యితవుగా లోలోన యెనసి వుండేటివేళ
గతిగూడ నవ్వేనవ్వు కప్పురకాపు

చ. 2: సొలసి సొలసి నీతో జోడైవుండేటివేళ
తలిరుఁబోడిచూపులే తట్టుపుణుఁగు
పులుకనితమకాన వురమెక్కినట్టివేళ
నిలువుమేనికాంతి నీమేని సొమ్ములు

చ. 3: అంగపురతులఁ గూడి అలసివుండేటివేళ
అంగనమోవితీపులే యారగింపులు
చెంగటనలమేల్మంగ శ్రీ వేంకటేశ నిన్ను
నంగవించి కూడె నీవే యఖిలభోగాలు

రేకు: 0122-4 హిజ్జిజి సంపుటం: 07-130

పల్లవి: ఎప్పుడును దొరలతో యేలాటములైనా మేలు
చప్పనైన నీచులతో సంగాతాలకంటెను

చ. 1: జక్కవపులుగులు నీచన్నులకు నోడినాను
పెక్కుదేశములనెల్లాఁ బేరుపడెఁగా
నిక్కి తుమ్మిదలు నీనెరులకెన రాకున్నా
మిక్కిలి మొరసెననే మేకులైనాఁ గల్గెఁగా

చ. 2: చందురుఁడు నీమొగముతో సరిరాకున్నా లోలో
కుందుచునుపమలకు గుఱుతాయఁగా
నిందతోడ సింహము నీనడుముఁ బోలకున్నా
యెందుఁ దలఁపించుకొని యీడువెట్టుకొనెఁగా

చ. 3: అంచలు నీనడపుల అందములు రాకున్నా
యెంచి కవితలలోన నిరవాయఁగా
నించి శ్రీ వేంకటేశుఁడు నీకౌఁగిటఁ గూడినాను
పెంచెపుటురాన నిన్నుఁ బెట్టుకొనెఁగా

రేకు: 0122-5 శ్రీరాగం సంపుటం: 07-131

పల్లవి: కంటిమి నేమీభాగ్యము కన్నుల తుదలను నీఁడిదె
జంటలు నీకీవిద్దెలు సాజమె కదవయ్యా

చ. 1: విందులమోవులయీవులు వీఁపుననానినకుచములు
పొందులకొనగోరొత్తులు పొలఁతికి నీకమరె
చిందేటి నెలవుల నవ్వులు సిగ్గుల మోముల వంపులు
కందుననుండెడి యీచెలికత్తియలకు నమరె

చ. 2: తొడఁదొడ మోచినమేలముదోమటివీడెపుటుదుటులు
జడిగొను చూపుల ననుపులు సతికిని నీకమరె
యెడనెడఁ బయ్యెదమరఁగులు యెఱుఁగమి సేయు పరాకులు
ఆడియాలపుమీకొలువులయంగనలకు నమరె

చ. 3: ఆయములంటినమఱపులు నడఁచియు నడఁచని పూర్పులు
యీయెడ శ్రీ వేంకటేశ యిద్దరికిదె యమరె
చాయల సన్నలపదరులు సరిఁదెరవాల్చిన నేర్పులు
పాయని నీవూడిగముల పడఁతుకలకునమరె

రేకు: 0122-6 ఆహిరి సంపుటం: 07-132

పల్లవి: బాపురే నేమచ్చితిని భాగ్యమాయను
ఆపె భోగించినవి నీకందమాయను

చ. 1: వనిత చెక్కులవెంట వడిసే జవ్వాదినే
మినుకై నీమేనెల్లా మెఱుఁగాయను
పెనఁగులాడేటివేళ బెరసిన చెమటల
పనుపడి నీతమికిఁ బదనాయను

చ. 2: రమణి కొప్పువిరులు రాలి నీపైఁ జిందఁగాను
సమరతివెట్ట దీరి చల్లనాయను
జమళి సరసమాడ చన్నుల కస్తూరిపూఁత
అమరి నీవురమున కడియాలమాయను

చ. 3: పడఁతిమోవితేనెలు పలుమారు నీకియ్యఁగా
విడువని నీపొందుకు విందులాయను
అడరి శ్రీ వేంకటేశ అట్టె నన్నునేలితివి
బడిబడినే మేలు పైకొసరాయను

రేకు: 0123-1 సామంతం సంపుటం: 07-133

పల్లవి: దయ దలఁచేదికఁ దనచిత్తము
నయముగా మాటాడితే నాభాగ్యము

చ. 1: మొగము చూచి నేను మొక్కి నిలుచుండఁగానే
తగవులు నడపినాఁ దనచిత్తము
జిగితోఁ దనపాదాలసేవలు నేఁ జేయఁగాను
నగి యెంత మన్నించినా నాభాగ్యము

చ. 2: కలిమితోఁ దనకు నే కాపురము సేయఁగాను
తలఁ పెంత గలిగినాఁ దనచిత్తము
పిలిచి యప్పటి నేనే ప్రియములు చెప్పఁగాను
నలిరేఁగి మెచ్చేది నాభాగ్యము

చ. 3: కనుఁగొని నేఁ దన్ను కాఁగలించి కూడఁగాను
తనివెంత సేసినానుఁ దనచిత్తము
యెనసె శ్రీ వేంకటేశుఁడిచ్చకము నేనాడఁగా
ననుపై యిట్టేవుండేది నాభాగ్యము

రేకు: 0123-2 రామక్రియ సంపుటం: 07-134

పల్లవి: ఊరకున్నా నెఱఁగఁడు వొడులు సోదించ వచ్చీ
కేరి వొక్కరొక్కరమే గెలువఁగలేమా

చ. 1: అంకులచేతులు వట్టి యానలేల పెట్టీని
సంకెలేని కొయ్యకాఁడు జాజరకాఁడు
మంకుల గొల్లెతలము మందవారమెల్లాఁ గూడి
కుంకుమగుబ్బలనే కుచ్చి యెత్తలేమా

చ. 2: చల్లచాడెలంటుకొని జాణతనాలాడీని
పల్లదపు గద్దరీఁడు బయకాఁడు
కల్లరి దొడ్డివారము కన్నెలమెల్లాఁ గదిసి
పల్లుసోఁకులనె మోవి పచ్చిసేయ లేమా

చ. 3: తోడనె వెన్నదుబ్బులు తొడుకనేల వచ్చీని
వేడుకకాఁడు శ్రీ వేంకటేశుఁడు
కూడె మమ్ము రేపల్లెకొమ్మలెల్లానిఁక
వీడెపుఁ దమ్ములు వెట్టి వింతసేయలేమా

రేకు: 0123-3 కేదారగౌళ సంపుటం: 07-135

పల్లవి: ఓరుచుకోవే యెట్టయినా వువిద నీవు
నేరుపరి నీవిభుఁడు నేఁడే వచ్చీనీడకు

చ. 1: కలువల వేసితేలే కాముఁడు చుట్టము గాఁడా
వెలయు విరహులకు వెగటుగాక
చలివెన్నెల గాసితే చందురుఁడు పగవాఁడా
పొలయలుకలవారే పొగడరుగాక

చ. 2: కొసరుచుఁ బాడితేనే కోయిలగుండెబెదరా
అసు (స?) దు విరహులు కాదందురుగాక
ముసరితేఁ దుమ్మిదమూఁకలు దయలేనివా
విసిగిన కాముకులే వినలేరుగాక

చ. 3: వనము సింగారించితే వసంతుఁడు క్రూరుఁడా
వొనరని విరహులకొంటదుగాక
యెనసి శ్రీ వెంకటేశుఁడేలె నిన్ను చిలుకలు
కినిసేవా పాంథులకు కేరడముగాక

రేకు: 0123-4 మధ్యమావతి సంపుటం: 07-136

పల్లవి: ఆతఁడిచ్చిన చనవే అన్నిటా నీకు
గాతసేయకింతట మొక్కఁగరాదా నీవు

చ. 1: సన్నచేసి రమణుఁడు సలిగె నీకిచ్చెనంటా
యెన్నిమాటలాడేవే యేమే నీవు
ఉన్నతినెందుకైనాను వోరిచీనాతఁడంటా
మిన్నక నేఁడెంత మేరమీరేవే నీవు

చ. 2: దొరతనమిచ్చి నీపొందులకు లోనాయనంటా
కెరలి యేమిటికి జంకించేవే నీవు
సిరుల నీచేఁతలెల్లాఁ జెల్లించీనంటాను
వొరసి గోరనేల వూఁదేవు నీవు

చ. 3: కదిసి యాతఁడు మెచ్చి కాఁగలించుకొనెనంటా
వుదుటుఁ జన్నులనేల వొత్తేవే నీవు
వెదకి యిటువంటి శ్రీ వేంకటేశుఁడేలెనంటా
ముదమున రతినెంత ముంచేవే నీవు

రేకు: 0123-5 శంకరాభరణం సంపుటం: 07-137

పల్లవి: దేవ నీవునికి తేటతెల్లమాయను
భావించ మాకుఁ గన్నులపండుగాయను

చ. 1: పన్నీటిజలకములు భామకనుచూపులును
యెన్నికెఁ గూడుక నీమైనేరులై పారె
తిన్ననిచెమటలెల్లా తిరుమేననెల్లా నిండి
అన్నిటా ముత్యాలపెనుహారములాయ

చ. 2: తెల్లని కప్పురకాపుతెలవనవ్వులు గూడి
పొల్లుగాని పుప్పొళ్ళపోగులాయను
మెల్లనె నీవురూపుల మించుల రవలురేఁగి
వొల్లనె తడిసూళ్ళవొత్తులాయను

చ. 3: అంగంపుఁ బుళుగుకాపు అలమేలుమంగఁ గూడి
సింగారాలాయను మంచిసిరులాయను
ముంగిట శ్రీ వేంకటేశ మోహనపుమీకూటమి
సంగతిఁ బువ్వుదండల జాడలాయను

రేకు: 0123-6 ముఖారి సంపుటం: 07-138

పల్లవి: నీవే యింత సేతువట సేనియ్యకొనలేనా
పోవులై నీకే చింత పుట్టునని కాక

చ. 1: తాపానఁ బొందింతువట తగనేఁబొరలలేనా
పాపముఁ నీకంటుననే భయముగాక
కోపగింతువట నీవు కోరి నేనోరువలేనా
దీపించనన్నిటా నీకుఁ దిట్టువాటని కాక

చ. 2: ఆసకొలుపుదువట అలఁతకోఁగలేనా
దాసులు నిన్ను నమ్మరింతానని కాక
మోసపుత్తువట నీమొరఁగుకు లోఁగాలేనా
వీసమంత నీదయకు వెలితని కాక

చ. 3: కౌఁగలింతువట నిన్నుఁ గరఁగించ నేలేనా
చేఁగ నీచిత్తము దెలిసేనని కాక
దాఁగక శ్రీ వేంకటేశ దక్క నన్నుఁ గూడితివి
తూఁగలేనా నీకు సరి దొరవని కాక

రేకు: 0124-1 నాదరామక్రియ సంపుటం: 07-139

పల్లవి: చిత్తగించవయ్యా చెలియసింగారాలు
కొత్తకొత్తబాగులై గుంపులు గట్టీని

చ. 1: వలిపెపయ్యదలోన వడివెట్టు వలపులు
కలికి చన్నులై మించెఁ గాంతకును
కులుకుఁజూపులెల్లాను కూడపోయఁగానె కాదా
తలరాశై చీఁకటి దట్టపుఁ గొప్పాయెను

చ. 2: మనసులో కోరికలు మట్టుమీరి దైవారి
పెనుఁబులకలై నిండి పెరిగె మేన
పెనపరిమాటలెల్లా పెదవిపై నూరి వూరి
తనివోని యధరామృతములై నిలిచెను

చ. 3: జిగిమించు రతులలో చిమ్మిరేఁగి వేడుకలు
మొగమునఁ గళలై ముంచుకొనెను
తగిలి శ్రీ వేంకటేశ తతినీకెఁ గూడితివి
నగవులు సెలవుల నారుకొనఁ జొచ్చెను

రేకు: 0124-2 భైరవి సంపుటం: 07-140

పల్లవి: ఎంతవాఁడవయ్యా నీవు యేమని పొగడుదును
పొంతనే నీమేలక్కునఁ బోసి చూపవచ్చును

చ. 1: గొంటరిసతులు నిన్నుఁ గొసరుదురింతెకాని
నంటున నీబాసలన్నీ నమ్మవచ్చును
వొంటిఁ జిక్కించుక నిన్నునొరయుదురింతెకాని
జంట నీమంచితనాలు చాటించవచ్చును

చ. 2: నాలికత్తెలు నీమాఁట నవ్వుదురింతెకాని
వాలాయించి మంత్రముగా వ్రాయవచ్చును
పోలించి మంచిగుణాలు బోధించవత్తురుగాని
మేలిమి నీకీర్తెల్లా మెఱయించవచ్చును

చ. 3: తక్కరికాంతలు నీతో తమకింతురింతె కాని
పెక్కు నీరతులు దొంతిఁ బెట్టవచ్చును
అక్కరతో శ్రీ వెంకటాధిప నన్నేలితివి
వెక్కసపు నీమహిమ వెలయించవచ్చును

రేకు: 0124-3 ముఖారి సంపుటం: 07-141

పల్లవి: ఇంకనేల దాఁచేవు యిన్నియు నెరుంగుదుము
కొంకు గొసరెల్లాఁ దీరె కోడెకాఁడా

చ. 1: మచ్చికైన యీయింతిమాఁటలచవులఁ జొక్కి
వచ్చినదెరఁగమా వన్నెకాఁడ
యిచ్చగించి యేపొద్దు యీపెచన్నుఁగవకే
పచ్చారేది యెఱఁగమా పంతగాఁడా

చ. 2: నంటున యీపె సెలవి నవ్వుల పసఁ దగిలి
యింటనుండేదెఱఁగమా యెమ్మెకాఁడ
జంటల నప్పటిఁ గన్నుసన్నలకు లోనై
వెంట వచ్చేదెఱఁగమా వేడుకకాఁడా

చ. 3: దినదినమీ పె మోవితేనెలకాసపడేవు
మనసు నేమెరఁగమా మాయకాఁడ
యెనసితి విటు నన్ను యిప్పుడె శ్రీ వేంకటేశ
ఘనుఁడ నిన్నెరఁగమా కతలకాఁడా

రేకు: 0124-4 హిజ్జిజి సంపుటం: 07-142

పల్లవి: నీవే విచారించుకొమ్మా నెఱజాణవు
యీవేళఁ జెలియమోహమిచ్చగించవచ్చును

చ. 1: చెంతనుండి కొలువులు సేసేటిరమణితో
పంతమాడవద్దుగాని పనిగొనవచ్చును
మంతనాన నీతో మనవి చేప్పేవేళను
వింతసేయవద్దుగాని వీనులొగ్గవచ్చును

చ. 2: కోరి నిన్ను వేఁడుకొంటా గుట్టుతోనున్న చెలిని
జేరఁదీయవద్దుగాని చెక్కునొక్కవచ్చును
పూరకైన వట్టితేనెలూర మాటలాడి చప్పు
చారు సేయవద్దుగాని చవిగొనవచ్చును

చ. 3: తాలిమితో కొఁగిటికి తమకించే వనితను
జాలిఁబెట్టవద్దుగాని చన్నులంటవచ్చును
యేలితివి శ్రీ వేంకటేశ యిన్నిటానీకెను
బేలుఁజేయవద్దుగాని ప్రేమ నించవచ్చును

రేకు: 0124-5 వరాళి సంపుటం: 07-143

పల్లవి: ఇప్పుడే యేల పెనఁగేవీకెతో నీవు
లప్పలకప్రమచ్చి యలపు దీర్చవయ్యా

చ. 1: కలకల నవ్వుతాను కాంత పరువున వచ్చి
బలిమిఁ గాఁగిట నిన్ను నలమఁగాను
వెలయంగఁ గొప్పు విడి విరులు జల్లున రాలె
ములువాడిగోళ్ళదువ్వియుడువవయ్యా

చ. 2: వొట్టువెట్టి పోకుమని వొడివట్టుకొని నిన్ను
దిట్టయై తెరలోనికిఁ దియ్యఁగాను
గుట్టునఁ బయ్యెదెడలి కుచములు గానవచ్చె
జట్టిగొని వూరడించి చక్కఁబెట్టవయ్యా

చ. 3: గయ్యాళితనముచూపి కళలంటి రతిసేసి
నెయ్యపుమోవితేనెలు నించఁగాను
చయ్యన శ్రీ వెంకటేశ సరులెల్లాఁ బెనగొనె
యియ్యెడఁ జిక్కుదీరిచి యేలుకొనవయ్యా

రేకు: 0124-6 ఆహిరి సంపుటం: 07-144

పల్లవి: సిగ్గరి పెండ్లికూఁతురు చెలియనింతసేతురా
తగ్గక సెలవి నవ్వు తతిగొనెను

చ. 1: పువ్వుల వేసినవేటు పుప్పొడి నిండాఁ జింది
జవ్వని చన్నులమీఁద జాజుకొనెను
చివ్వన మైచెమరించి చిత్తడిచెమటతోడ
దువ్వటపుఁ బయ్యదెల్లాఁ దొప్పఁదోఁగెను

చ. 2: పన్నీటఁ జిమ్మిన చిమ్ము పదను పైపైఁ గప్పి
కన్నెచెక్కులమీఁద కారుకమ్మెను
వున్నతితోఁ బులకించి వొగిఁ బోకముడి జారి
తన్నుఁదానె నిట్టూర్పులఁ దడఁబడెను

చ. 3: గందానఁ బూసినపూఁత కడగి లప్పలు గట్టి
యిందుముఖిలమేల్మంగకింపులాయను
కందువ శ్రీ వేంకటేశు కౌఁగిటఁ బేంట్లు రాలి
సందడిరతులలోన సంగతాయను

రేకు: 0125-1 శ్రీరాగం సంపుటం: 07-145

పల్లవి: బొమ్మల జంకించెనంటా పొలఁతిని దూరేవు
క్రమ్మరనిందుకుఁగానె కరఁగీ లోలోపలను

చ. 1: జక్కన పిట్టలవంటి చన్నులమీఁద నీవు
వుక్కువంటి కొనగోరనూఁదవచ్చునా
లక్కవంటి మనసిది లలన యిందుకుఁగానె
వొక్కరీతి సిగ్గువడి వున్నది లోపలను

చ. 2: తలిరాకువంటి మెత్తనిమోవిమీఁదను
ములువాడిదంతములు మోపవచ్చునా
కలువకామవంటి కామిని యిందుకుఁగానే
వులువచ్చి (?) చేఁతలతో వున్నది లోపలను

చ. 3: కడులేఁతతీగెవంటి కాయముమీఁద నిట్టే
అడరి నీగట్టియురమదిమితివి
యెడయక శ్రీ వేంకటేశ యిందుకుఁగాఁ జెలి
వుడివోని రతులతో నున్నది లోపలను

రేకు: 0125-2 శంకరాభరణం సంపుటం: 07-146

పల్లవి: మరగి నాపొందె నీకు మాటుమందు
సరుసనిద్దరమును సతులమె కామా

చ. 1: వెన్నెలబాయిట నీవు వెలఁదిఁ దలఁచుకొని
వన్నెకాఁడ విరహాన వడదాఁకేవు
నన్ను నాకెమారుగా మనసున నిలుపుకొని
చెన్నుమీరఁ గాఁక చల్లఁజేసుకొనరాదా

చ. 2: సింగారపుఁదోఁటలోన చెలిని దవ్వులఁ జూచి
అంగపుఁజెమటనుస్సురస్సురనేవు
చెంగట నన్ను నాకె చెల్లెలిఁగా భావించుక
సంగడినలపార్చుక సంతోసించరాదా

చ. 3: ఇందుకాంతవేదిపైనింతితోడ మాఁటలాడి
కందువలు గరఁగుచుఁ గాఁగలించేవు
పొందితివి నన్ను నాకె పోలికలకే నీవు
అందపు శ్రీ వేంకటేశ అట్టే కానీరాదా

రేకు: 0125-3 పాడి సంపుటం: 07-147

పల్లవి: ఇంతటి నీ నోముఫలమేమి చెప్పేది
కాంతరో యిదె నిచ్చకల్యాణముగాదా

చ. 1: మాట జవదాఁటని మగవాఁడు గలిగితే
ఆఁటదాని భాగ్యమేమని చెప్పేదే
యీటుననాతఁడుఁదాను యేకచిత్తమై వుండితే
చాటువకెక్కిన జన్మసాఫల్యము గాదా

చ. 2: వెంటవెంటఁ దిరిగేటి విభుఁడు గలిగితేను
యింటిలోనిల్లాలిపుణ్యమేమి చెప్పేదే
బంటువలెఁ బనిసేసి పాయకాతఁడుండితే
అంటి మనోరథఫలమబ్బుటది గాదా

చ. 3: పక్కవాయకుండేటి ప్రాణేశుఁడు గలిగితే
యెక్కువైన సతిసౌఖ్యమేమి చెప్పేదే
ఇక్కడ శ్రీ వేంకటేశుఁడిటు నిన్నూ నన్నుఁ గూడె
తక్కక మనకుఁ దాఁ బ్రత్యక్షమవుటగాదా

రేకు: 0125-4 సాళంగనాట సంపుటం: 07-148

పల్లవి: తనకు బుద్ధిచెప్పేటి దాననా నేను
చనవున విన్నవించే సమ్మతించుమనవే

చ. 1: బడివాయకుండితేను పాయమే కామధేనువు
యెడయని పతులకు నింతులకును
చిడిముడి మానితేను చిత్తమే తనచుట్టము
తడయక రమణునిఁ దలఁచుకొమ్మనవే

చ. 2: వదలక కూడుండితే వలపే సామ్రాజ్యము
సదరానఁ బైకొనేటి జాణలకును
కదిసి వెత మానితే కాయమే నిధానము
యెదలోన తన్నుఁదానె యెరుఁగుకొమ్మనవే

చ. 3: కందువలొనఁగూడితే కాఁగిలే కల్పతరువు
సందడిఁ బెనఁగ నేర్చే సరసులకు
యిందరిలో శ్రీ వేంకటేశుఁడు నన్నేలినాఁడు
మందలించి యిట్లానే మన్నించుమనవే

రేకు: 0125-5 కాంబోది సంపుటం: 07-149

పల్లవి: వేసాలు వేయఁగనేలే వేడుకకాఁడు
రాసులు వోశున్నవవే రచ్చలఁ దనబాసలు

చ. 1: మంతనములేలాడీనే మగువలతో నెల్లాను
సంతలోని వలపుల జాజరకాఁడు
వింతలెవ్వరితోఁ జేసీ విద్యలన్నీ నెఱుఁగుదు
దొంతిఁ బెట్టుకున్నదాన తొంటితనసుద్దులు

చ. 2: ప్రియముతో వావులేల పెనచీనే చెలులతో
బయలీఁతనగవుల బచ్చెనకాఁడు
నయములెంత చూపీనే నాకుఁదెలుసునన్నియు
క్రయముగాఁ గొంటిఁ దనకందువమర్మములు

చ. 3: జాడనింతులకు మోవిచవులేల చూపీనే
గాడిఁగట్టుకూటముల కతలకాఁడు
యీడనే శ్రీ వేంకటేశుఁడేలినాఁడు నన్నునిట్టే
కూడపెట్టుకొంటిఁ దనగురుతైన చేఁతలు

రేకు: 0125-6 బౌళి సంపుటం: 07-150

పల్లవి: ఏమని చెపఁగవచ్చు యింతా నీభాగ్యమే
వేమారునెంచి చూచితే వింతలై నిలుచును

చ. 1: ధరలోఁ గప్పురమందరికిఁ జల్లనైయుండు
విరహులకైతేను వేఁడై యుండును
తరుణులకు నవ్వులు తగవినోదమైయుండు
కెరలించ నీకవే వెంగెములై పరగును

చ. 2: ఇమ్ముల సంపంగిపూవులిందరికితవై యుండు
తుమ్మిదలకైతేనే దొరయకుండు
కొమ్మలకు జంకెనలు కోరి సింగారాలై యుండు
వుమ్మడి నీకైతే మర్మాలొరయుచుండును

చ. 3: భూమికెల్లాఁ జందమామ పొసఁగించు వేడుకలు
తామరలకైతేనే తలవంపులు
కామించి శ్రీ వేంకటేశ గక్కన నన్నేలితివి
యీమేలు నీకైతేను యియ్యకోలై యుండను

రేకు: 0126-1 శంకరాభరణం సంపుటం: 07-151

పల్లవి: దొరవైతేనేమాయ దోసమా మీలో మీకు
యెరవులేనిచోటికి యితవులే కావా

చ. 1: పలుమారునాపెనిట్టే పాటలు వాడుమనేవు
మెలుపున నీవు దండె మీటరాదా
చెలువుఁడవీమాటకు సిగ్గువడేవదియేమీ
కలుపుకోలైన మేళగాఁడవు గావా

చ. 2: అంతలోనే పగడసాలాడుమనేవాకెను
యింతి యలసెఁ బాసికలెత్తియ్యరాదా
పంతాన నామోము తప్పక చూచేవదియేమీ
వంతుకుఁ బాగకాఁడవీవల నీవేకావా

చ. 3: పొందుగా పరిమళము పూయమని పెనఁగేవు
గందము దీసిచ్చి పొదుగఁగరాదా
చెంది నన్నుఁ గూడితివి శ్రీ వేంకటేశ యేమీ
యిందుకునందుకు నీవే హితుఁడవు గావా

రేకు: 0126-2 గుజ్జరి సంపుటం: 07-152

పల్లవి: తనిసినదాఁకా తానే తగులుఁ గాక
కనుఁగొన్నవారికేల కాఁతాళించఁగను

చ. 1: యేడలేని సతులఁ దానెందరిఁ బెండ్లాడినాను
వాడవారికేమి వోదు వద్దనఁగను
జాడతోడ జవ్వనుల చన్నులాతఁడు మోచితే
వేడుకకత్తెలకేల వేఁగు వచ్చెనే

చ. 2: నారుకొన నెన్నికంకణాలు దాఁగట్టుకొనినా
వూరివారికేమిటికే వుప్పతించను
కోరి కొమ్మలచే మోవిగురుతులు సేయించుకొంటే
పేరటాండ్లకేమిటికే పెదవులు విరుచ

చ. 3: వరుసలు వెట్టుకొని వనితలఁ గూడఁగాను
పొరుగువారికినేలే బుద్ధిచెప్పను
యిరవై శ్రీ వేంకటేశుఁడితఁడిట్టే నన్నునేలె
యెరవులవారికేలే యేఁకట చూపఁగను

రేకు: 0126-3 గౌళ సంపుటం: 07-153

పల్లవి: ఇద్దరికి మీకుఁ దగునింతలేసి
బద్దులేల నెరపేవు బారెఁడేసి

చ. 1: నెలకొన్న సేఁతలు నీవేమి సేసితివొ
సెలవుల నవ్వినాపె చేటఁడేసి
మలసి మలసి నీవు మర్మములెట్టంటితివో
కులికీని సిగ్గులెల్లా గుంపెఁడేసి

చ. 2: సందడి మీ కెటువలె సమ్మతులైనవొ కాని
కందువమాఁటలాడీని గాదెఁడేసి
మందలించి నీవెంత మరిగించితివొ నేఁడు
పొందులు చూపీనిట్టే పుట్టెఁడేసి

చ. 3: మంచముపై రతినెంత మనసు గరఁగించితివొ
వంచీఁ జూపులు నీపై వామెఁడేసి
యెంచఁగ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నించి వలపులెల్లా నిలివెఁడేసి

రేకు: 0126-4 బౌళి సంపుటం: 07-154

పల్లవి: నేనెఱంగనా నీనేరుపులివి
నానాగతుల లాలించి నవ్వింతువు

చ. 1: వెలి నీవేడనుండినా వెసనేఁదలఁచితే నా
తలఁపులోననెయుండి దయసేతువు
లలినెంతపరాకైనా లక్షించి నిన్నుఁ జూచితే
చలువమోవియొసగి చనవిత్తువు

చ. 2: పాటించి నీపేరుకుచ్చి బయలుమాఁటలాడితే
మాటలోనుగానే వచ్చి మన్నింతువు
నీటునఁ గొలువులోన నీకు నేనిట్టె మొక్కితే
చోటు చూపి నాతోనే సుద్దులు చెప్పుదువు

చ. 3: ఆతలిమోమైవుండఁగానట్టే చేతులు చాఁచితే
చేతులనే సన్నసేసి చెనకుదువు
యీతల శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ బెండ్లాడితి
రాతిరిఁ బగలు నన్ను రతులఁ జొక్కింతువు

రేకు: 0126-5 రామక్రియ సంపుటం: 07-155

పల్లవి: ఎదుటనేవుండి యాల యెలయించేవే
అదనఁ జేకొనఁగాను అలయకువే

చ. 1: కలికి నీకన్నులు కడు సోగలు
మొలక చన్నులె ములుచేఁగలు
వెలయ వలచె నీవిభుఁడిందుకే
పిలిచీ సారెకునిఁకఁ బెనఁగకువే

చ. 2: నీలాలవంటివి నీకప్పునెఱిఁగురులు
తాలిమి నీనడపులు తగుఁగరులు
కాలమందె మోహించె నీకాంతుఁడిందుకే
కేలుచాఁచీ నీమీఁద జంకించకువే

చ. 3: ముంచిన నీచెక్కులద్దముల మించులు
పంచ మోవిచుంచులు బింబపుటంచులు
యెంచఁగ శ్రీ వేంకటేశుఁడేలె నిందుకే
కంచపురతి యొసఁగె కదుమకువే

రేకు: 0126-6 సాళంగనాట సంపుటం: 07-156

పల్లవి: ఎగసక్కెఁడవు నిన్ను నేమి చెప్పేము
నగితేనే సెలవుల నానఁబాలు చూపేవు

చ. 1: చిల్లరలయ్యిన నీచేఁతలే కొత్తలుగాక
తొల్లిటివాఁడవే కావా దొరవు నీవు
గొల్లదాననైతేనేమి కొలువుకు వచ్చితేను
చల్లకుండలంటాను నాచన్నులంటేవు

చ. 2: అప్పటప్పటికిఁ బెట్టే ఆనలే వేరుగాక
యెప్పటిగుణాలే కావా యెంచితే నీకు
కప్పి దొడ్డివారమైతే కన్నులమొక్కినంతలో
పిప్పి మీఁగడున్నదంటా పెదవులానేవు

చ. 3: మత్తిలి నన్నేలితివి మన్ననలెన్నిచ్చినాను
పొత్తులకాఁగిలే కాదా భోగించేది
హత్తి శ్రీ వేంకటేశ ఆలవారమైతేఁ జూచి
కొత్తపేయల గూడంటా కొప్పంటేవు

రేకు: 0127-1 గుండక్రియ సంపుటం: 07-157

పల్లవి: భావమెరఁగనివారు పచ్చెందురుగాని గోరు
తావులెరిఁగితే సురతపుసొమ్ము గోరు

చ. 1: అలిగినవేళలనంటకుండాఁ జిమ్ము గోరు
వలపు నిలుపరాక వడిఁజాఁచేదొక గోరు
చలపట్టి వేరొకతె జగడము దీసే గోరు
బలిమి పంతానకుపచరించేది గోరు

చ. 2: శిరసువంపులలోని సిగ్గులు వాపేది గోరు
సరిఁ బరవశములెచ్చరించు గోరు
వొరసితే గురిసేను నుబ్బుఁగవణపు గోరు
సరసమాడేవేళ చవిరేఁచు గోరు

చ. 3: సమ్మతించకుంటేఁ దాఁకి జంటకు లోఁజేసు గోరు
పమ్మి మనసుకుఁ జలివాపు గోరు
దిమ్ముల వయోమదము తెలియని సాక్షి గోరు
కొమ్మ శ్రీ వేంకటేశుతోఁ గూడే యిక్కువ గోరు

రేకు: 0127-2 పాడి సంపుటం: 07-158

పల్లవి: నేనెఱఁగనా వోయి నీజాడలు
లేని మరుఁగులు వెట్టి కాననీవు వలపు

చ. 1: యింతిఁజూచి యారూపే యదలోనఁ బెట్టుకొని
చెంతనున్న సతులనుఁ జిత్తగించవు
మంతనాననాడిన మాటలు దలఁచుకొని
వింతవారిమాటలు వీనులఁబెట్టవు

చ. 2: యెదుటనే ఆపెనవ్వు యెగపోసి దిగపోసి
కదిసెందరు నవ్వినాఁ గనుఁగొనవు
మొదలఁ గూడినభావములకు లోలోఁ జిక్కి
సుదతులెందరంటినా సోంపులఁ గరఁగవు

చ. 3: ఘనమైన చన్నుల కాఁగిలి యిట్టే మరిగి
పనిగొన్న తమకాన భ్రమసితివి
యెనసితివిటు నన్ను యింతలో శ్రీ వేంకటేశ
ననుపుసతుల సన్నలకిచ్చగించవు

రేకు: 0127-3 దేసాక్షి సంపుటం: 07-159

పల్లవి: ఏమని వుండునొకో యీతని మనసులోన
వేమరుఁ జెలులు విన్నవించరె మీరైనను

చ. 1: పంతమునఁ దనుఁ జూచే పరాకున నేను
మంతనానఁ గాఁగిలించ మఱచితిని
సంతసాన మాఁటలాడే సంబురముతోడనే
యింతలో ముత్యాలఆరతెత్త మఱచితిని

చ. 2: ననుపునఁ దనతోడ నవ్వేటివేడుకనే
మనవిఁ బ్రియము చెప్ప మఱచితిని
చెనకి పెండ్లిపీటపై నేసచల్లే సందడినె
పెనఁగి మోవివిందు పెట్టమఱచితిని

చ. 3: వొఱగి తనవద్దఁ గూచున్న మందెమేళానవే
మఱఁగుగఁ దెరవేయ మఱచితిని
యెఱిఁగి శ్రీ వేంకటేశుఁడేలె నన్ను మన్నించి
నెఱవైన గురుతులు నించ మఱచితిని

రేకు: 0127-4 ధన్నాశి సంపుటం: 07-160

పల్లవి: ఒక్కటి విన్నపమే వున్నమాటఁలికనేల
యిక్కువతో రమణునికెరుఁగించఁ గదవే

చ. 1: యెడమాటలాడేనంటే యోందాఁకఁ దిరుగవచ్చు
నడుమఁ దనచిత్తము నాభాగ్యము
తడయక చూచెనంటే తనివి యెంతటఁ గల్గు
చిడిముడి నాచనవు చెల్లించుమనఁగదే

చ. 2: యెలమిఁ బెనఁగేనంటే యెంతటఁ దీరీనాస
బలిమికాఁడు తాను భావను నేను
వెలయఁ బిలిచేనంటే వేళయెట్టుగాఁ దెలిసు
తలకొని ననునిట్టే దయఁజూడమనుమీ

చ. 3: వెస బెండ్లాయాడేనంటే వేడుకకు విలువేది
వనమాయఁ దా నాకు వలపు నాది
యెసగి శ్రీవేంకటేశుఁడేలే నన్ను దూరనేల
పొసఁగ నన్నికనిట్టే భోగించు మనవే

రేకు: 0127-5 సామంతం సంపుటం: 07-161

పల్లవి: సందు సుడివలపుల జాజరకాఁడ
యిందరిపైనడియాసలేల చూపేవయ్యా

చ. 1: వరుసకు వచ్చినాపె వద్దనే వుండఁగాను
యిరుగు పొరుగులాపె యేఁకారఁగాను
సరిఁ గానుకిచ్చినాపె సారెకుఁ జూడఁగాను
గొొరబుగ నన్నునేల కొంగువట్టేవయ్యా

చ. 2: సన్నలు సేసినయాపె సముకాననుండఁగాను
కన్నుల మొక్కినయాపె కాచుకుండఁగా
కిన్నరమీంట్లయాపె గిలిగింతలు సేయఁగా
చిన్నదాన నాపైనేల చేయిచాఁచేవయ్యా

చ. 3: ఇంటిలోననున్నయాపె యెదురులు చూడఁగాను
జంటయై పెండ్లాడినాపె సాదించఁగాను
నంటున శ్రీ వేంకటేశ నన్ను నీకాఁగిటఁ గూడి
అంటి ముట్టి నన్నునెంత ఆదరించేవయ్యా

రేకు: 0127-6 పాడి సంపుటం: 07-162

పల్లవి: ఔనే ఇది జాణతనమందుకు నేమెచ్చితిని
నానోరఁ బలికేనంటే నవ్వు వచ్చీఁ గాని

చ. 1: కానుకగా తనకు నేఁగప్పురమంపితినని
ఆనవాలు చెప్పిపంపీనందుకేమే
పూని తా వలచినట్టి పొలఁతిఁ దోడితెమ్మంటే
దీనికి నేనియ్యకొని తేరాదు గాని

చ. 2: అడరి సొమ్ములిద్దరమట్టే మార్చుకొంటిమని
అడియాలమిచ్చి పంపీనందుకేమే
తడవి యేమైనాను తనకును నాపెకును
యెడనెడఁ బండుండఁ జోటియ్యరాదు గాని

చ. 3: రంగుగ నేఁ గూడినట్టి రహస్యపు వేళదని
అంగపుగురుతు చూపీనందుకేమే
యింగితాన శ్రీ వేంకటేశుఁడాకె తన పొందు
కంగవించి సాకిరై తనకనరాదు గాని

రేకు: 0128-1 సామంతం సంపుటం: 07-163

పల్లవి: తనతో పంతములాడేదాననా నేను
పనులు పదిమారులు పచరించేవాఁడు

చ. 1: వాడికమాటలఁ జొక్కి వలకు లోనైనవాఁడు
వోడక రాళ్ళుదేలించనోపినవాఁడు
జాడతో భూమెల్లా ముకుచాయనె యేలినవాఁడు
వేడుకఁ గంబసూత్రపువేసాలవాఁడు

చ. 2: పసలేని యాసలకు బయలువాఁకేవాఁడు
ముసరుకొన్న చలాల మునిఁగేవాఁడు
సుసరాన నమ్మలేక సొంట్లు సోదించేవాఁడు
ముసలిఁ గన్యకఁజేసి మోహించినవాఁడు

చ. 3: వెనక ముందరసేసి వెలఁదులఁ గూడేవాఁడు
కనుసన్నలఁ దిరిగే కలికి వాఁడు
అనిశము శ్రీ వేంకటాద్రిమీఁదటివాఁడు
ననుఁ గూడి నెలకొన్న నయగారివాఁడు

రేకు: 0128-2 శ్రీరాగం సంపుటం: 07-164

పల్లవి: అందమాయనయ్యనేఁడు అన్నిటా నీవిభవాలు
చందపుతరులైనవి సంబంధాలు

చ. 1: కోరి నీమోహపుసతి గుబ్బలవలెనున్నవి
పోరచి నీపెండ్లిలోని బూజగుండలు
చేరి యాపె కుమ్మరించే సిగ్గువలెనున్నది
వేరె యిద్దరినడుమ వేసిన తెర

చ. 2: ననిచిన యీలేమనవ్వువలెనున్నది
మునుకొని నీశిరసుముత్యాల సేస
చొనిపి యెదురుచూచే చూపులవలెనున్నవి
ఘనముగా వేసుకొన్న కలువలదండలు

చ. 3: జోడుగాఁ జెలియిచ్చిన సొమ్ములవలెనున్నవి
కూడినవేళ నీమేని గోరొత్తులు
యీడుగా శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టె
వేడుకవలెనున్నది విందుల నీమోవి

రేకు: 0128-3 బౌళి సంపుటం: 07-165

పల్లవి: ఇందాఁకానెరఁగనైతి నీవుపాయము
కందువలంటినప్పుడు గాక లోనౌనటవే

చ. 1: అడరి యెవ్వతోయింటికరిగేవేళ విభుని
వడిఁ జేపట్టి తీసితే నచ్చీనటే
బడినే యరిగి యాకెఁ బచారించి యానవెట్టి
కడుబలిమిఁ గూడినఁగాక వీఁడబ్బునటే

చ. 2: నలువంక సతులతో నవ్వులు నవ్వేటివేళ
పలుమారుఁ బిలిచినఁ బలికీనటే
యెలయించి వొక్కనినె యేకతమునకుఁ దీసి
యెలమిఁ జన్నులనొత్తకితఁడు చిక్కునటే

చ. 3: అత్తలవిందియ్యకొన్నయట్టి శ్రీ వేంకటేశుఁడు
పొత్తులకుఁ బిలిచితే భుజించీనటే
బత్తితోఁ గూడితిఁ దనపచ్చడము ముసుఁగిడి
కొత్తయింతసేయకతానేకొంకుదేరునటవే

రేకు: 0128-4 ముఖారి సంపుటం: 07-166

పల్లవి: సుదతి సింగారాలు చూడరమ్మ చెలులాల
మదనుబలాల మారుమలయవలసెను

చ. 1: జక్కవలె చన్నులై జంటవాయకుండఁగాను
పక్కనఁ గొండలతోడి పంగెమేఁటికే
నిక్కిచందురుఁడే మోమై నిండుఁగళలుదేరఁగ
పుక్కటనద్దముతోడి పురుడేఁటికే

చ. 2: తుమ్మిదలే తురుమై తోదోపులాడఁగాను
సమ్మతిఁ జీఁకటితోడి సడ్డయేఁటికే
నెమ్మదిని సింహమే నెన్నడుమై వుండఁగాను
వుమ్మిడినాకసముతో వుపమేఁటికే

చ. 3: చిగురులే పాదములై చెలువములు చూపఁగా
పొగరుఁదామరలతో పొందులేఁటికే
జిగి నేఁడీయింతితోడ శ్రీ వేంకటేశుఁడు గూడె
తగునంటానెన్నెనానందాలు చెప్పనేఁటికే

రేకు: 0128-5 పాడి సంపుటం: 07-167

పల్లవి: ఏల కొంగువట్టేవు యెమ్మెకాఁడా
నీలాగులిట్లానా నీటుకాఁడా

చ. 1: గొల్లచల్ల నెత్తిఁబెట్టుకొని నీకునమ్మరాఁగా
చల్లులాడేవేమోయి జాజరకాఁడా
పుల్లలనొత్తిన పచ్చి పునుఁగు గని తేఁగాను
వొళ్ళ (ల్ల?) నాకేల పూసేవు వుదుటుకాఁడా

చ. 2: పదిలానఁ బాలపండ్లు పయ్యెదలోఁ గొంటా రాఁగా
అదేల పిసికేవోయి ఆగడీఁడ
పొదల పువ్వులుగోసి పొత్తరగట్టుకుండఁగా
వెదచల్లుదురా నాపై వేసాలవాఁడా

చ. 3: వొలిసి పులిజూజము వొడిఁగట్టుకొని రాఁగా
అలరి నన్నాడించేవు అందగాఁడా
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నే మొక్కఁగా
అలమేవు కమ్మటినాసోదకాఁడా

రేకు: 0128-6 బౌళి సంపుటం: 07-168

పల్లవి: అన్నిటా భాగ్యవంతుఁడవవుదువయ్యా
పన్నినందుకల్లా వచ్చు భామ నీకునిపుడు

చ. 1: పడఁతి మోహరసము పన్నీటిమజ్జనము
కడలేని యాపెసిగ్గు కప్పురకాపు
నిడుదకన్నుచూపులు నించినతట్టుపునుఁగు
తొడిఁబడ సులభాన దొరకె నీకిపుడు

చ. 2: కామినికెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రగావి
ఆముకొన్న మోహకళలాభరణాలు
దోమటిమాటలవిందు ధూపదీపనైవేద్యాలు
కామించినటువలెనె కలిగె నీకిపుడు

చ. 3: అలమేలుమంగనవ్వులంగవు పువ్వుదండలు
కలసి వురాన నీకే కట్టినతాళి
చలపట్టి యీకెరతి సకలసంపదలు
యిలనబ్బె శ్రీ వేంకటేశ నీకు నిపుడు

రేకు: 0129-1 శ్రీరాగం సంపుటం: 07-169

పల్లవి: ఇట్టి నిన్ను నుతియించ యెవ్వరితరములయ్యా
నెట్టున పెక్కురూపాల నెలవై నీవుంటివి

చ. 1: నిక్కి దేవుళ్ళు ముత్యాల నీపై వసంతమాడఁగా
చుక్కలలో చంద్రుఁడవై చూపట్టితివి
గక్కన మఱియు వడగండ్లవానలతోడి
మిక్కుటపు తొలుకరి మేఘమవై యుంటివి

చ. 2: నిగ్గుగల ముత్యాలు నెలఁతలు చల్లఁగాను
బుగ్గలతో వారాశిఁ బోలితివి
అగ్గమై అప్పటినీఅంగములనంటితేను
తగ్గక బ్రహ్మాండాలు ధరించినట్టుంటివి

చ. 3: తడవెలమేల్మంగ ముత్యాలసేస చల్లఁగాను
పొడము మొగ్గల సురపొన్నఁ బోలితి
కడఁగి శ్రీ వేంకటేశ క్రమ్మరనెంచి చూచితే
వడియు నురుగుల కవ్వపుఁగొండఁ బోలితి

రేకు: 0129-2 కన్నడగౌళ సంపుటం: 07-170

పల్లవి: ఎట్టు నమ్మి పొందులు సేసేరింతులు నీతోను
మట్టెరిఁగి నీవె యిట్టే మన్నించవలెఁ గాక

చ. 1: తొల్లిటిమాటలకుఁగా తొడరి సూడువట్టేవు
మల్లాడి రాతికి మారుమలసేవు
చుల్లరీఁడవై యెందైనా జొరఁబారేవు కెరలి
పల్లటీఁడవై పడుచుపనులఁ దిరిగేవు

చ. 2: పిన్నవాఁడవై యుండి పెచ్చు పెరిగేవు సారె
కన్నవారితోనెల్లా కలహించేవు
పన్నియాఁటదానిచేత బాససేయించుకొనేవు
సన్నలఁ బక్షపాతాన సాముసేయించేవు

చ. 3: బతిమాలించి మతులు భ్రమయించఁ జేసేవు
రతికేళినే కడుఁగరాళించేవు
ఇతవై శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టె
చతురతల వలపు సాదించేవు

రేకు: 0129-3 వరాళి సంపుటం: 07-171

పల్లవి: మేరమీరి నడచితే మెలుఁతలేల మానేరు
నేరుపులు కన్నవారె నెరపకుండుదురా

చ. 1: వుద్దాలు వెట్టే యాపె వూడిగము సేయఁగాను
వొద్దఁ గూచుండుమనుచు వొడివట్టేవు
కొద్దిమీరనదిచూచి కుంచెవేసే ఆపెవచ్చి
వుద్దండానఁ గూడుమంటే వోపననవచ్చునా

చ. 2: గొడుగువట్టేయాపె కోరి బత్తిసేయఁగాను
కడుఁ బాదాలొత్తుమని కాఁగలించేవు
అడరి యీసుద్దివిని అడపముసతి వచ్చి
తడవి మోవడిగితే దాఁచుకొనవచ్చునా

చ. 3: సురటి విసరేయాపె చొచ్చి కొలువుసేయఁగా
తెరవేయి మని కూడి మరిగించేవు
ఇరవై శ్రీ వేంకటేశ యిందుకే నేనిటు వచ్చి
గరిమఁ బెండ్లాడితి కాదనవచ్చునా

రేకు: 0129-4 శంకరాభరణం సంపుటం: 07-172

పల్లవి: ఏఁటికింకా నీవిభునినేల దూరేవే
గాఁట్టపు మదమునను గరిసించనేఁటికే

చ. 1: కగ్గులేని జక్కవలు ఘనాలని పొగడితే
సిగ్గువడనేమిటికే చెలియ నీకు
నిగ్గుల తుమ్మిదలను నెట్టుకొని మెచ్చితేను
తగ్గి బొమ్మజంకెనల తాటించనేఁటికే

చ. 2: అడవిలోని సింహమును అట్టె చేతఁబట్టితేను
గుడిగొన నాయకునిఁ గొసరనేలే
తడవి లేఁదీగెల మొదళ్ళు గోరనొత్తితేను
వుడిగుడిగి నీపెదవులఁ దిట్టునేఁటికే

చ. 3: ఆరఁటులుఁ జిగురులునాసపడి చూచితేను
నెరవుతోడుతఁ దెరవేయనేఁటికే
అరిది శ్రీ వేంకటేశుఁడలమేల్మంగవు నిన్ను
సరవిఁ గూడెను యింకా సాదించనేఁటికే

రేకు: 0129-5 నాదరామక్రియ సంపుటం: 07-173

పల్లవి: చూడనొక్కఁడవుగాని సుద్దులెన్నైనాఁ గలవు
వేడుకలు దైవారె వెలఁదులిందరికి

చ. 1: ఒక్క నీ రూపమేకాదా వూరివారెల్లాఁ జూచితే
పెక్కులై మనసులోఁ బెనగొనేది
వుక్కున నీవాడినమాటొక్కటే కాదా యిందరి
వెక్కసపువీనులలో వింత వింతలైనవి

చ. 2: చేసిన నీసన్నేకాదా చెలులమర్మములకు
ఆసకొలిపి మోహాలంటించినది
పోసరించి నీమోవితీపులేకావా గొల్లెతల
వాసుల నోరూరించి వలలఁ బెట్టినవి

చ. 3: సెలవి నీనవ్వేకాదా చిమ్మిరేఁచి యింతులకు
పులకలు మేనులఁ బొడమించేది
వెలయ నన్నేలితివి శ్రీ వేంకటేశ యిదె కాదా
కలయికలిందరికి కాంక్షలురేఁచినది

రేకు: 0129-6 హిజ్జిజ్జి సంపుటం: 07-174

పల్లవి: ఎంత చనవిచ్చితివి యీపెకు నీవు
వంతులకు వట్టివళావళ్ళు సేసీనిపుడు

చ. 1: పవళించి నీవుండఁగా పడఁతికొలువులోన
చెవిలోన విన్నపాలు సేసీనీకె
తవిలి యొకతెపై పాదము నీవు చాఁచఁగాను
తివిరి వేళ్ళ చిటికె దియ్యవచ్చీ నీకును

చ. 2: వెలఁదులచే నీవు వీణె వాయింపించుకోఁగా
కిలకిల నవ్వు నవ్వి కెలసీనీపె
నెలవుగాఁ గప్పురము నీవొకతెకియ్యఁగాను
తొలుత నడుముదూరి దోసిలొగ్గీనిపుడు

చ. 3: అడపపుటింతిచేత ఆకు నీవందుకోఁగాను
వెడఁగుఁదనాన తెర వేసీనీపె
అడరి శ్రీ వేంకటేశ అంతలో నన్నేలితివి
బడివాయక తాను నీపానుపెక్కేనిపుడు

రేకు: 0130-1 శంకరాభరణం సంపుటం: 07-175

పల్లవి: కానవచ్చె నీసుద్దులు కడలనున్నవారికి
ఆనతియ్యవయ్యా మేమునందుకు మెచ్చేము

చ. 1: చిలుకపలుకులకు చెవులొగ్గియాలించేవు
జలజాక్షిమాటలతో సరివచ్చెనా
తలుకొత్త తుమ్మిదలఁ దప్పక చూచేవిట్టె
యెలమినాకెకొప్పుతో యీడువచ్చెనా

చ. 2: చెంది జక్కవలమీఁదఁ జేతులు చాఁచేవు నీవు
యిందుముఖిచన్నులతో నీడువచ్చునా
విందువలె హంసలవెంటవెంటఁ దిరిగేవు
పొంది ఆకెనడపుల పోలికాయనా

చ. 3: బంతిఁ జెకోరములఁ దప్పక చూచేవీరీతి
కాంతకన్నులతోఁ దారుకాణ వచ్చెనా
యింతలో శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టె
వింతై నావలెనాకె గోవిలపాట వాడెనా

రేకు: 0130-2 మాళవి సంపుటం: 07-176

పల్లవి: వట్టి దీమసములేలే వనిత నీకు
గుట్టుతోడి నీగుణమక్కునఁ బోసి చూపేనా

చ. 1: అగ్గలపుఁదమకాన ఆతఁడు వీడెమిచ్చితే
వొగ్గి పిడికిటఁ బట్టుకుం దానవేమే
సిగ్గులీవేళనేఁటికే సెలవుల నవ్వులేలే
కగ్గి యీతనిమాఁటకుఁ గాదనఁగలవా

చ. 2: కడఁగి నీవేలనుంగరమాతఁడు వెట్టితే
వొడిలోనఁ జెయివెట్టుకుందానవేమే
వెడవెడమోనాలేలే వేసాలు చూపుఁగనేలే
తొడరి యీతనియాన తోయంగఁ గలవా

చ. 3: శ్రీ వేంకటేశుఁడు సేస శిరసుపైఁ జల్లితేను
కూవగాఁ గొప్పులో దాఁచుకొనేవేమే
యీవేళ నన్నేలి మఱి యీతఁడే నిన్నునేలె
సోవలనీతనిమోవిఁ జొక్కకుండఁగలవా

రేకు: 0130-3 పాడి సంపుటం: 07-177

పల్లవి: ఇదిగో నీతగవెల్లానిందులోనే కానవచ్చె
వుదుటు కోడెకాని వోజ యిట్టిదయ్యా

చ. 1: భూములెల్లాఁ జాటించి పూవుదండ మెడవేసి
ప్రేమముతో నిన్నొకాపె పెండ్లాడెను
ఆమేలెరఁగవద్దా అప్పటిఁ బెండ్లాడితివి
యేమయ్యా మగవానికేడ పాటెయ్యా

చ. 2: నయానఁ బందెమువేసి నడుమ మేనపడుచు
ప్రియపడి నిన్ను నిట్టె పెండ్లాడెను
క్రియ దెలియక వేరే కెలనఁ బెండ్లాడితివి
నయగారిపతినెట్టు నమ్మవచ్చునయ్యా

చ. 3: వున్నతిఁ బుట్టినప్పుడే వురముపై నెలకొని
పిన్ననాఁడె నిన్నొకాపె పెండ్లాడెను
నన్నుఁ బెండ్లాడితివి నంటున శ్రీ వేంకటేశ
యిన్నిటా వేడుకకానికేడ నేమమయ్యా

రేకు: 0130-4 గుండక్రియ సంపుటం: 07-178

పల్లవి: తొలుతనే వలచిన తొయ్యలి నేను
మలసి నిన్నుఁ గాదని మారుకొనవచ్చునా

చ. 1: వేడుకతో నీమాటలు వినేదే మేలుగాక
జోడుగూడ నందుఁ గొంత సోదించనేలా
వీడెము చేతికిచ్చితే వేసుకొనుటే కాక
వూడిగము సేసే చెలివొడిఁ బెట్టనేలా

చ. 2: ననిచి నీసేఁతలకు నవ్వేదే మేలుగాక
చెనకి యింతేసి గరిసించఁగనేలా
మొనసాదము చాఁచితే మొక్కేదే తగవుగాక
పెనఁగి అట్టె బటువుబిల్లవెట్టనేలా

చ. 3: గుట్టుతో నీసన్నలకుఁ గూడేదే మేలుగాక
వట్టి సిగ్గుతోఁ దలవంచఁగనేలా
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
బెట్టి మోవితేనిచ్చితే పెరఁబెట్టనేలా

రేకు: 0130-5 శుద్ధవసంతం సంపుటం: 07-179

పల్లవి: ఇంతిఁ గరుణించవయ్యా యేల యేఁచేవు
చెంతనుండి నీకు బుద్ధి చెప్పేటివారమా

చ. 1: చన్నుగుబ్బల మదము సమరతినైతేఁ గాక
కన్నులఁ జూచినంతనే కాంక్షదీరునా
కన్నెపాయపు సిగ్గులు కలయికలనుగాక
విన్న వినుకలినే విడిపంచవశమా

చ. 2: జవ్వనములో బిగువు సాములుసేసినఁ గాక
నివ్వటిల్లు మాటలఁ దనివి దీరునా
మవ్వపుమాయలగుట్టు మచ్చికచేఁతలఁ గాక
నవ్వినమాత్రములోనె నలి మాన్పవశమా

చ. 3: గరిమ చేతులకసి కాఁగిటఁ గూడినఁ గాక
సరసములాడితే నాసలు దీరునా
సరి నిట్టే యేలితివి సతిని శ్రీ వేంకటేశ
తెరవేసికొన్నంతనే తెలియఁగవశమా

రేకు: 0130-6 నాదరామక్రియ సంపుటం: 07-180

పల్లవి: ఇంతబాఁతిపడేవానినేల మాకుఁ దక్కరించ
చెంతనిదే వెన్నచిట్టిఁ జిట్టెఁడేసి వలపు

చ. 1: చేలకొంగువట్టితి సిగ్గువడఁగా మానము
వాలుకరెప్పలు వంచి వంచి చూచేవు
ఆలదొడ్డివారము నేమంతేసి యెఱఁగము
పాలదుత్త దుత్తెఁడేసి పట్టవయ్య వలపు

చ. 2: పెల్లుగ జేతులువాపి పెనఁగగానె గుబ్బలు
కొల్లలుగాఁ జేతఁబట్టి గోర గీరేవు
గొల్లెతలమెఱఁగము గొప్పజాణతనములు
చల్లదుబ్బ దుబ్బెఁడేసి చల్లేము వలపు

చ. 3: కాయపుమదము గారఁగానె శ్రీ వేంకటేశ
సోయఁగానఁ గూడి మరి సోదించేవు
నేయమ్మేవారము నవ్వనేరము పోసేమిదె
చేయిచాఁచు పెరుగుచిప్పఁ జప్పెఁడేసి వలపు

రేకు: 0131-1 భూపాళం సంపుటం: 07-181

పల్లవి: ఏబాసకియ్యకొనేవే యిప్పుడు నీవు
వాబలిమిమాటల వాదుకోపఁ గాని

చ. 1: నెట్టన నీవు నన్నాడే నిందలెల్లాఁ దప్పదని
చుట్టి మరుగుడి వాసి చొచ్చి వెళ్ళేవా
నట్టనడుమ నేనైనా ననలయలుగులను
కిట్టి నానిజము మించ గెలిచేఁ గాని

చ. 2: ఆలాగువాఁడ నేనని చిలుకజోదుల
వాలు తిరుమిక్కిళ్ళకు (?) వడి నిల్చేవా
వాలాయించి నేనైనా నావల్లఁ గల్లలేకుండా
బాలకోవిలభ్రతముఁ బలికించేఁ గాని

చ. 3: ఇలనేఁ గపటినని యీపూవుఁ దేనెనీటను
నెలకొని నీవు మునిఁగి లేచేవా
కలసితి నేను శ్రీ వేంకటపతినిపుడని
తొలుత నీచన్నుదిబ్బాలు దొడికేఁ గాని

రేకు: 0131-2 మలహరి సంపుటం: 07-182

పల్లవి: ఏమి సేసెనే విభుఁడు యేఁటికి వేగిరించేవే
భామిని మీలపిల్లలఁ బాలువోసి పెంతురా

చ. 1: ఇంతేసి జక్కవలను యేల గూఁట వేసేవే
పంతపు వాఁడమ్ములేల పారాడించేవే
కాంతుల యద్దములను కవిసెనఁబెట్టనేలే
వింతగాఁ దుమ్మిదపిండు విరియించ నేఁటికే

చ. 2: చిగురుటాకుల తేనె చిందనేల పోసేవే
మొగిచి పట్టఁగనేలే ముంపుఁదీగెలు
యెగసక్కేనకు బయలేల ముడివేసేవే
జగతిఁ గరికుంభాలు సారెకునూఁదుదురా

చ. 3: బలిమినరంట్లను పక్కనఁ బైఁ దోయనేలే
అలమి యంచులఁ బాతురాడింతురా
అలమేలుమంగవు నీ వాతఁడు శ్రీ వేంకటేశుఁ
డెలమిఁ గూడితిరి మిక్కిలియే వేడుకలా

రేకు: 0131-3 దేవగాంధారి సంపుటం: 07-183

పల్లవి: కొత్తలు నీ చేఁతలు గోవిందరాజ
పొత్తుల మగఁడవై భోగించే విపుడు

చ. 1: పాదము లిద్దరి మీఁదఁ బంచివేసి చాఁచుకొని
సోదించి నీవిరుమొన సూదివైతివి
సాదించి యిద్దరు చేతి సన్నల నిన్నునొత్తఁగా
దాదాత వలపు దూఁచే తాసు వలెనైతివి

చ. 2: కన్ను సన్నల నిద్దరి కళలు రేఁచి రేఁచి
వన్నెసరసముల కావడివైతివి
అన్నిటా సెలవుల నవ్వాపెకు నీపెకు నిచ్చి
పన్ని రెండు చక్రముల బండివైతివి

చ. 3: అండనె శ్రీ వేంకటేశ అదె గోవిందరాజవై
చండిదీర సిరికి భూసతికి నీవు
రెండు చేతుల యిద్దరికిఁ గాఁగిలిచ్చియిచ్చి
కొండుక జమళి పెండ్లి కొడుకవునైతివి

రేకు: 0131-4 శ్రీరాగం సంపుటం: 07-184

పల్లవి: రమణుఁడు చూచుఁగాని రమ్మనరె యీవేళ
తమితోనిట్టే దయ దలఁచుమీ యనరే

చ. 1: వదన చందురునిపై వాసన కస్తూరి బొట్టు
చెదరుచున్నది చూడరే చెలులాల
పదరి రాహువు దన్నుఁ బట్టినట్టి పగదీర
పదిలాన తా మగుడఁ బట్టిన యట్లుండె

చ. 2: చల్లఁగాఁ జెలి చెక్కులఁ జల్లిన కప్పురధూళి
జల్లన రాలీఁ జూడరే సతులాల
కొల్లలుగా నయనచకోరములు వెన్నెలలు
వొల్లనె తనిసి వెళ్ళను మిసినట్లుండె

చ. 3: తుమ్మిఁద గుంపువంటి తొయ్యలినెరుల రాలె
కమ్మవిరులు చూడరే కాంతలాల
కొమ్మ శ్రీ వేంకటేశునిఁ గూడిన రతికి మెచ్చి
తమ్ముఁదామె నిండు వసంతమాడినట్లుండె

రేకు: 0131-5 శంకరాభరణం సంపుటం: 07-185

పల్లవి: పొంచి నా చన్నులంటేవు పోకముడి జారించేవు
నించే నీ పొందులకు నేనూఁ బైకొసరా

చ. 1: ఇందరు సతులలో నాయెచ్చుకుందులు చూడవు
సందడిఁ గాలుదొక్కేవు సారెసారెకు
చందమైన నీ పాదము సంతముద్రకోలాయ
యిందుకు నేనూ లోనై యిరవుకోవలెనా

చ. 2: జంగిలి కాంతల నెల్లా సంగతులెంచక నీవు
యెంగిలి సేసేవు మోవి యేకముగాను
పంగించ నీనోరు బందెయెద్దుమోరాయ
కంగులేక కదుపునఁ గలపఁగవలెనా

చ. 3: కొలువుకాంతలనెల్లా కొంకక శ్రీ వేంకటేశ
కలగొన నీవురానఁ గాఁగిలించేవు
వలపుల నీ మేను చలివందిలినీడాయ
చెలరేఁగి నిన్నుఁగూడి సేస చల్లవలెనా

రేకు: 0131-6 సామంతం సంపుటం: 07-186

పల్లవి: ఏఁటికి గేలిసేసేవు యింతినింతలోననే
తేటల నీమోహానకు తేఁకువగాదా

చ. 1: తియ్యని మాఁటలకు తేఁకువతోఁ జొక్కి చొక్కి
పయ్యెద వెట్టమరచి భ్రమసెఁ గాక
నెయ్యపు నీ చేఁతలకు నీతోఁ బెనఁగఁగాను
చయ్యన గొప్పతురుము జారెనిట్టె కాక

చ. 2: నంటున నీవు నవ్వే ననుపైన నవ్వులకు
అంటి చెక్కుచేత వెరఁగందెఁ గాక
దంటతనమున నిన్నుఁ దప్పక చూచినందుకు
వొంటుచు నిట్టూర్పుల వుసురనెఁ గాక

చ. 3: కందువ నిన్నింతలోనె కాఁగిలించుకొన్నందుకు
మందలించి యిట్టె మారుమలసెఁ గాక
అందుకొని శ్రీ వేంకటాధిప కూడినందుకు
ముందు ముందు నీ కిదిగో మొక్కుమొక్కెఁ గాక

రేకు: 0132-1 భైరవి సంపుటం: 07-187

పల్లవి: ఆడనుండేమి తగవులట్టె చెప్పేవు
నీడల నిన్నియునాయ నీకడయే యింకను

చ. 1: పలుకఁగ నేర్తువు పాదాలు గుద్దనేర్తువు
సొలసి వాకిలి దెరచుక రాఁగదే
అలుక దీర్చఁ గలవు ఆయములంటఁగలవు
బలిమి నీపతితొడపైఁ గూచుండఁగదే

చ. 2: పగడసాలాడుదువు పక్కన నవ్వింతువు
మొగము చూపీతనికి మొక్కఁగదవే
పొగడుదు విచ్చేరిఁగి పొద్దులు గొంతవుత్తువు
మగని ముసుఁ గుదీసి మంతనమాడఁగదే

చ. 3: వీడెము చేతికిత్తువు వెరపులు వాపుదువు
తోడఁ బెండ్లి కూఁతురవై తొక్కవే కాలు
యీడనె శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నుఁగూడె
జాడనేనంతెరఁగను సరసమాడఁగదే

రేకు: 0132-2 గుండక్రియ సంపుటం: 07-188

పల్లవి: అందరు సంతోసించేరు యశోదమ్మ వినవమ్మ
కందువైన బిడ్డనిఁ గంటివోయమ్మా

చ. 1: వనకేలి సేయఁబోతే వచ్చి మాఁకులెక్కిని
యెనసి జలకేలిలో యీఁదులాడీని
మునుపె మాకంటె మంచముపైఁదానె పండుండీని
ఘనుఁడైన యీకృష్ణునిఁ గంటివోయమ్మా

చ. 2: అంగడి బేరము గొంటే అమ్మవచ్చీఁ దానె మాకు
ముంగిటనాలఁ బిండితే ముంతవట్టీని
సింగారించు కొనఁబోతే చీర గట్ట వచ్చీఁదానె
కంగుదేరిన బిడ్డనిఁ గంటివోయమ్మా

చ. 3: కంచము మొదలనుంటేఁ గడియెత్తిపొత్తునను
కొంచి కన్నుమూసితేను కూడీఁ గాఁగిట
యెంచఁగ శ్రీ వేంకటాద్రినిరవై యాడేయట్టి
కాంచనమువంటి బిడ్డఁ గంటివోయమ్మా

రేకు: 0132-3 నాట సంపుటం: 07-189

పల్లవి: పతిఁ బాసి విరహాన భ్రమయకువే నిన్ను
మతకానఁ దమిరేఁచి మన్నించె నితఁడు

చ. 1: నిండుఁబున్నమగదే నీ మోము - నేఁడు
యెండలేఁటికి నాయ యీవెన్నెల
కొండలే కదవె బాగుల చన్నులు - యీ
గండుఁ గోవిల కూఁత కారించీనటవే

చ. 2: కలికి బింబఫలముగదె నీమోవి
పలుకుఁ జిలుకలకేల పగలాయనే
అలులే తురుముగదే అదె నీకు
వలరాజు విలునారి వడిఁబెట్టీనటవే

చ. 3: మెఱుఁగుఁదీగె గదే మేను నీది
నెఱిఁబూవుటమ్ములేల నెగులాయనే
గుఱి శ్రీ వేంకటేశుఁడు కూడె నిన్ను
తఱితో మున్నిటి సుద్ది దలఁపించీనటవే

రేకు: 0132-4 సామంతం సంపుటం: 07-190

పల్లవి: అప్పటి నుండి సిగ్గుతో నవ్వలి మోమైవున్నది
చెప్పరాని ప్రియమెల్ల జెప్పఁగదవయ్యా

చ. 1: వోపననఁగానె నీవు వొడివట్టి తీసితివి
పూప చన్నులు విసికి పొదిగితివి
కోపగించుకొనఁగానే కొనగోర నూఁదితివి
ఆపడఁతినిఁకనైనా నాదరించవయ్యా

చ. 2: చేతులెత్తి మొక్కఁగానె చెనకితివి మర్మము
యేతునఁ బెనఁగి అలయించితివి
కాతరించి తిట్టఁగానే కాఁగిట బిగించితివి
ఆతుమగా మాటలాడి ఆదరించవయ్యా

చ. 3: చాలుఁ జాలుననఁగానె సంగడిఁ బెట్టుకొంటివి
యీలీల శ్రీ వేంకటేశ యేలుకొంటివి
మూలనున్న యాపె నింత ముంగిటను వేసితివి
ఆలినేల రట్టుసేసేవాదరించవయ్యా

రేకు: 0132-5 పాడి సంపుటం: 07-191

పల్లవి: నేరుచుకొంటివే మేలు నేఁడే యింతేసి
మేరమీరి సేసినదే మేలుబంతిగాదా

చ. 1: నేనాతనితో నవ్వితే నీవేమనేవే వోసి
కానీవే అన్నియునిఁకఁ గనుకొనేవు
దానికేమే మాటలేల దగ్గరి రావే వోసి
మైనము సూలమౌనటే మాపుదాఁకాను

చ. 2: కాంతునికి నేమొక్కితే కాదనేవటే వోసి
యింత బలవంతురాలవెందు వొయ్యేవే
పంతములన్నియునేరుపరచేలేవే వోసి
యెంత తొండమున్నా దోమ యేనుగవునటే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు గూడే చింత నీకేలే వోసి
కైవశము తొల్లేనాకుఁ గదే ఇతఁడు
రావే అక్కచెల్లెండ్లము రవ్వయ్యైతిమే వోసి
నీవు నీరడిచితేను నేఁడు రెండౌనటవే

రేకు: 0132-6 శ్రీరాగం సంపుటం: 07-192

పల్లవి: తిరు వీధుల మెరసీ దేవదేవుఁడు
గరిమల మించిన సింగారముల తోడను

చ. 1: తిరు దండెల పై నేఁగీ దేవుఁడిదే తొలునాఁడు
సిరుల రెండవ నాఁడు శేషుని మీఁద
మురిపేన మూఁడోనాఁడు ముత్యాల పందిరి క్రింద
పొరి నాలుగోనాఁడు పువ్వుఁ గోవిలలోను

చ. 2: గక్కన నయిదవనాఁడు గరుడుని మీఁదను
యెక్కెను ఆరవనాఁడు యేనుగమీఁద
చొక్కమై యేడవనాఁడు సూర్యప్రభ లోనను
యిక్కువఁ దేరును గుఱ్ఱమెనిమిదోనాఁడు

చ. 3: కనకపుటందలము కదిసి తొమ్మిదోనాఁడు
పెనచి పదోనాఁడు పెండ్లిపీఁట
యెనసి శ్రీ వేకంటేశుఁడింతి యలమేల్మంగతో
వనితల నడుమను వాహనాలమీఁదను

రేకు: 0133-1 మలహరి సంపుటం: 07-193

పల్లవి: ఇరుగుపొరుగువారు యేమందురే
అరసి నీపై వలపు అందిరపై బూతురా

చ. 1: నిగ్గుల నీ రమణుఁడు నీతో మాటలాడితేను
యెగ్గులు వేరొకతెపై నేలపెట్టేవే
వొగ్గుచు నిన్నాతఁడు వొడివట్టి తీసితేను
బగ్గన నాపె కొంగు పట్టించేవదేమే

చ. 2: తమకించి నిన్నాతఁడు తప్పక చూచితే నెడో
రమణిని దెచ్చి ముందరను దోసేవే
సముకాన కొనగోర సారెనొత్త వచ్చితేను
అమర వేరొకతె మేనటు దాఁకించేవే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడితేను
వావిరి నాపెకు నేల వంతువెట్టేవే
నీ వలమేలుమంగవు నిన్నుర మెక్కించుకొంటే
భూవనితఁ దెచ్చి అట్టే బుజమెక్కించేవే

రేకు: 0133-2 బౌళి సంపుటం: 07-194

పల్లవి: ఓరుపు గలవారికి వోరుచుకొంటేనే మేలు
యేరితేను మలిగండ్లు యెందులోను లేవే

చ. 1: నారమణునిపైఁ జాడి నాతోనేమి చెప్పేరే
తేరకొన నాచేనేల తిట్టించేరే
గోరుమేననుండదంటా గురుతులేమి చూపేరే
తారి బియ్యము దంచితే తవుడు వెళ్ళకుండునా

చ. 2: భావమిద్దరికొక్కటే పగలేల పుట్టించేరే
ఆవేళ నాచే వెంగెములాడించనేలే
మోవనాడె తని మర్మము లేల తలపించేరే
భావించ రత్నాకరానఁ బచ్చి గుల్లలుండవా

చ. 3: గక్కన శ్రీ వేంకటేశుఁ గడునేల నవ్వించేరే
వొక్కటైతేఁ జన్నులచే నొత్తించేరేలే
పెక్కురతులలోనేల పిరివీకు సేయించేరే
గక్కన నీళ్ళు నీడ గానరాక మానునా

రేకు: 0133-3 శ్రీరాగం సంపుటం: 07-195

పల్లవి: తనకే తెలుసునమ్మ తమకపు వేడుకలు
కొనచూపుల నవ్వీని గోవిందరాజు

చ. 1: పడఁతులిద్దరు తన పాదములొత్తఁగాను
నడుమఁ గొడుకుఁగనె నగుతాఁ దాను
పొడమి కాంతలకుఁగా పురుషుఁడు బిడ్డఁగన్న
కొడిమెలు గట్టుకొనె గోవిందరాజు

చ. 2: సేదదేరి యీచెలుల చేతి చెమటలఁ దోఁగి
పాదాలఁ గూఁతురుఁగనెఁ బైపైఁ దాను
ఆదిగొని మగవాఁడు ఆఁడువారికి వేఁకటై
సాదుఁదనము మోచెనిచ్చట గోవిందరాజు

చ. 3: పెనఁగి లక్ష్మీ భూముల ప్రేమపుటంగాలు సోఁకి
మనసున బిడ్డఁగనె మరిగి తాను
వనితలకు మగఁడు వరుసకానుపుగనె
కొనబు శ్రీ వేంకటాద్రి గోవిందరాజు

రేకు: 0133-4 హిందోళవసంతం సంపుటం: 07-196

పల్లవి: చేసినట్టు తాఁజేసె చేరి నేనూరకుందాన
యీసులెల్లా మానెనిఁక యేమనీనే తాను

చ. 1: తనువుమీఁదటిరేక తప్పులు దిద్దఁగరాదు
మనసులోని నొప్పికి మందులేదు
కనుచూపుఁబోట్లకు గంట్లు చూపఁగరాదు
యెనసి యింకా నాతో యేమనీనే తాను

చ. 2: మొగము లోపలి కళ మూసి దాఁచిపెట్టరాదు
చిగురుఁ గోరికలలో చేఁగలేదు
నగవుల వెన్నెలలు నాములు చూపకపోవు
యెగసక్యములు గావు యేమనీనే తాను

చ. 3: చిత్తము లోపలి సిగ్గు చేతఁబెట్టి చూపరాదు
కొత్త జవ్వనమునకు గురుతులేదు
హత్తి శ్రీ వెంకటేశుఁడు అందుకే తా నన్నుఁగూడె
యిత్తల యీవలపులకేమనీనే తాను

రేకు: 0133-5 పాడి సంపుటం: 07-197

పల్లవి: ఏల నీవు సిగ్గువడే వింతలోనను
మేలిమి యిల్లాల నీకు మించి నేనేకాదా

చ. 1: ఎక్కడఁ దిరిగినా మాయింటికే వత్తువు నీవు
తొక్కుమెట్టాడి నిన్ను దూరనేఁటికి
పుక్కట తుమ్మిదకును పువ్వులెన్ని కలిగినా
తక్కిన చుట్టుపు పొందు తామరే కాదా

చ. 2: తలఁపు నీకేడనున్న తనువు నాపై వేతువు
చెలరేఁగి నిన్ను రట్టుసేయనేఁటికి
సొలసి చల్లగాలికి చోట్లెన్ని గలిగినా
మలయఁ బేరైనచోటు మలయాద్రిగాదా

చ. 3: నింద నీకెంత మోచినా నీవె నన్నుఁ గూడితివి
కందువ నీ గుణాలు పొగడనేఁటికి
యెందరు శ్రీ వెంకటేశ యింతులు గలిగినాను
యిందిరను నీయిల్లు నా యెదలోనె కాదా

రేకు: 0133-6 సౌరాష్ట్రం సంపుటం: 07-198

పల్లవి: శ్రీ వేంకటేశ్వరునికి చెలి యలమేలుమంగ
వోవరిగా నెలకొని పురముపైనున్నది

చ. 1: పొంచి మచ్చ మైననాఁటి పొలసు కంపులు వాయ
సంచులఁ బన్నీట మజ్జన మార్పరే
అంచెఁ గూర్మ వరహములైనట్టి సొగటుదీర
మించఁ గప్పుర ధూళి మెత్తరే మేనను

చ. 2: నరసింహపు గదరు నాఁటి వామనపు జిడ్డు
పరశురామునిగబ్బు పచ్చిపీడను
పరిమళముగట్టిన బంగారుగిన్నెఁ దెచ్చి
పొరిఁ దిరుమేనఁ దట్టుపునుఁగిట్టె నించరే

చ. 3: గొల్లముంజురాచజడ్డు కోరి బుద్ధుడైన సిగ్గు
చొల్లుగుట్టపు నూఁగురొచ్చులు మానునా
ఇల్లిదె శ్రీ వేంకటేశుఁడీరూపై తానున్నవాఁడు
యెల్లపూదండలు సొమ్ములెక్కించరే

రేకు: 0134-1 భైరవి సంపుటం: 07-199

పల్లవి: వారిధివంటిది యీవలపే కాదా
వారకము నీకు నాకు వలపే కాదా

చ. 1: సుద్దులెల్లా విని నన్ను సోదించక తొలుతే నీ
వద్దికి రప్పించినది వలపేకాదా
పొద్దువొద్దునకు నీ భోగములే మరిపించి
వద్దన్నాఁ బోనియ్యదు యీ వలపేకాదా

చ. 2: మేడెపు రతుల నిన్ను మెప్పించే అంతలోనే
వాడికె నవ్వు నవ్వించె వలపేకాదా
వీడెము చేతికిప్పించి వెంట వెంట నీపొందుల
వాడలెల్లఁ దిరిగించె వలపే కాదా

చ. 3: కలసి శ్రీ వెంకటేశ కౌఁగిట నీ మనసెల్లా
వలవ దీసినది యీ వలపేకాదా
సులభమై లోలోని చూపుల తీగెలనే
వలలొడ్డించినది యీవలపేకాదా

రేకు: 0134-2 శంకరాభరణం సంపుటం: 07-200

పల్లవి: ఆతఁడే యెరుఁగును అంకెలైన తగులు
చేతిలోనే వున్నదిది చెప్పరాని తగులు

చ. 1: మలసి చూచిన చూపు మనసులో తగులు
తలఁపు లోపలి చింత తనువుకుఁ దగులు
వెలయుమేని సోఁకులు వేడుకకుఁ దగులు
అలరు వేడుకలే అన్నిటికిఁ దగులు

చ. 2: చిమ్ముచు నవ్విన నవ్వు సిగ్గులకుఁ దగులు
కుమ్మరించు సిగ్గులే తక్కుల తగులు
వుమ్మడి తక్కులెల్లా వొక్కటికిఁ దగులు
యిమ్ముల నొక్కటైతేనే యిరవాయఁ దగులు

చ. 3: మచ్చిక మాటలన్నియు మంతనాల తగులు
నిచ్చలు మంతనములు నిండురతి తగులు
చెచ్చెర నీ తగులు నా శ్రీ వేంకటేశుఁ గూడె
పచ్చి దోఁచిన కూటమి పంతముల తగులు

రేకు: 0134-3 కాంబోది సంపుటం: 07-201

పల్లవి: ఎగసక్కేలు నేర్చిన యింతులము
తగవెరిఁగిన మంచితనమే మేలును

చ. 1: పందేలకు నీవు నాతో పగడసాలాడఁగాను
మందెమేళాన నేమైనా మాటాడుదుము
అందుకుఁగా నీవప్పుడారడిఁ బెట్టఁగవద్దు
ముందు ముందె దొరతనమునునుంటే మేలును

చ. 2: తెగడి నీతోఁ బిల్లదీపులాడఁ బిలిచేవు
జిగిమించనేమైనాఁ జేతుము నిన్ను
వెగటుగా నీవప్పుడు వేసాలు సేయవద్దు
వొగి గుట్టు తోడ నూరకుండుటే మేలును

చ. 3: వడి సరసాన నాతో వానగుంటలాడఁగాను
బెడిదమై చెయివట్టి పెనఁగుదుము
కడఁగి శ్రీ వేంకటేశ కలిసితివి మాటకే
విడువక మాతోడి వేడుకలే మేలును

రేకు: 0134-4 గుజ్జరి సంపుటం: 07-202

పల్లవి: సారిది మీసరితెలు చూతుముగాక
అరిది మమ్మేల సాకిరడిగేరు మీరు

చ. 1: చెలిమికాఁడవు గాన చెలి నీకుఁ బెట్టెఁ దమ్మ
మలసి నవ్వులు నవ్వ మాకేలా
బలిమికాఁడవుగాన పట్టి నిన్నుఁ దియ్యఁగాను
అలరి యడ్డాలు రానంతమాకేలా

చ. 2: చేకొద్దివాఁడవుగాన చెప్పె నీకుఁ బనులెల్లా
మాకు నిన్ను గేలిసేయ మరియేలా
పైకొన్నవాఁడవుగాన పడఁతి రాకొట్టుగొట్టె
కైకొని మీ మాటల వంకలు దిద్దనేలా

చ. 3: మేనవాఁడవటుగాన మెడగట్టుకొనిపించె
తానె అలమేలుమంగ తమకమేలా
పూని శ్రీ వేంకటేశుఁడ పొందుగా మమ్మేలితివి
కానిలే మిమ్మెరిఁగితి కడమలింకేలా

రేకు: 0134-5 కన్నడగౌళ సంపుటం: 07-203

పల్లవి: వెలఁది నిన్నీడకే విచ్చేయి మనె
బలిమి సేసినది యప్పటి యానవాలు

చ. 1: కొంగువట్టి నిన్నుఁదీసి కొనగోరు మేననూఁది
అంగన సన్నసేసినదానవాలు
వుంగరాలవేళ్ళ నీవొడిగట్టుకొని మోవి
యెంగిలిగాఁ జేసినది యిదియానవాలు

చ. 2: గుబ్బలురమున నూఁది కొల్లునను నవ్వు నవ్వి
అబ్బురము సేసినది ఆనవాలు
వుబ్బు నీకుఁ బొడమించి వొగి బొమ్మల జంకించి
నిబ్బరము చూపినది నీకు నానవాలు

చ. 3: కాయజకేలిని నిన్ను కన్నులనె మెచ్చిమెచ్చి
ఆయములు సోఁకించినదానవాలు
చాయల శ్రీ వేంకటేశ సతిఁ గూడితివి నీవు
యేయెడనెన్నటికి నిదే యానవాలు

రేకు: 0134-6 సౌరాష్ట్రం సంపుటం: 07-204

పల్లవి: తెలిసిన వారికిదె తేనెకంటెఁ దీపులు
వలసితేఁ జేకొనవే వనితరో నీవు

చ. 1: నేరిచినవారికి నీడవంటిది మోహము
నేరనివారికి నెండ వెన్నెలవంటిది
కూరిమి గొసరితేను కోపము చెల్లదిందుకు
మేరమీరినఁ దమలో మెచ్చవలెఁ గాని

చ. 2: వోపనవారికి వయసోడబేరము వంటిది
వోపినివారికి వేఁటవుచ్చువంటిది
చేపట్టి తీసితేను సిగ్గులువడఁ దగదు
పై పైఁ గూడిన బాఁతిపడవలెఁ గాని

చ. 3: కూడినవారికి రతి కొట్టిన పిండివంటిది
కూడనివారికి కలగూరవంటిది
యీడుజోడై శ్రీ వేంకటేశుఁడిదె నిన్నుఁగూడీ
వేడుకతోఁ జెప్పినట్టు వినవలెఁగాని

రేకు: 0135-1 శ్రీరాగం సంపుటం: 07-205

పల్లవి: ఎవ్వరు నేమి చెప్పిన యేఁటిమాట
వువ్విళ్ళూరఁ జిత్తగించుటొక్కటేమాట

చ. 1: చేయి చాఁచి మీఁద సిగ్గువడేయట్టుగాను
ఆయము సోఁకనాడినదదివో మాట
పాయపు వయసు నీది పచ్చివెచ్చిగాఁజేసి
యీాయకోలు సేసినది యిదివోమాట

చ. 2: మంకుఁదనము దీరిచి మనసెల్లఁ జొక్కించి
అంకెకు రప్పించినది అదివోమాట
లంకెల సరివెనఁగి లాగులెల్లఁ జూపి నిన్ను
నింకాఁ గొసరుచున్నదిదివో మాట

చ. 3: చిప్పిలఁ గాఁగిటఁగూడి శ్రీ వెంకటేశ్వర నిన్ను
అప్పటినాస రేఁచినదదివో మాట
దప్పిదేరఁ గూడితిమి దాయక పాయక మన
మెప్పుడు నిట్లానుండేదిదివో మాట

రేకు: 0135-2 భైరవి సంపుటం: 07-206

పల్లవి: వద్దనేమా నేము వలసిన వనులకు
యిద్దరునేకమై మాకు యేల లోఁగేవే

చ. 1: ముచ్చట నేమడిగితే మొఱఁగు మాటలాడేవు
బచ్చించి యాల నేరెడుఁబండులమ్మేవే
యిచ్చకానకాతనితో యిన్నినియ్యకొని వచ్చి
తచ్చనకు మాముందర తగవులాడేవే

చ. 2: మొగము నేము చూచితే మోసులువార నవ్వేవు
తగు వసంతపు నీట దైలు వోసేవే
అగపడి నీ విభుని కంకెలెల్లాఁ జెప్పి వచ్చి
పగటుతో మాముందర బయలీఁదించెవే

చ. 3: అందాలు నేమెరిఁగితే ఆయములు దాఁచేవు
గొందినే చెరువుకు మూకుడు మూసేవే
విందువలెనట్టై శ్రీ వేంకటేశుఁగూడి వచ్చి
చెంది మాముందరనేల సిగ్గులు వడేవే

రేకు: 0135-3 బౌళి సంపుటం: 07-207

పల్లవి: ఏల చెప్పేవు నీసుద్దులు యెందాఁకా మాతోను
పాలుమాలకింతలోనే బమ్మచారివైతివి

చ. 1: ఎలమి గొల్లెతలను యిన్నాళ్ళు పొంది పొంది
తొలఁగి మధురలోన దొరవైతివి
కొలఁది ఆవులఁగాచి గొల్లవాఁడవై యుండి
వలవంత నేఁడు రాచవాఁడవైతివి

చ. 2: వేడుకలకింటింట వెన్నదొంగిలి నేఁడు
ఆడ ద్వారకలో సోమయాజివైతివి
వోడక రుక్మిణీ దేవి నూరకే యెత్తుకవచ్చి
పాడితోనగ్రపూజకు పాత్రుఁడవైతివి

చ. 3: రక్కసుల కాఁపురాలు రచ్చలకెక్కఁ జెరిచి
పెక్కుధర్మాలు నిలిపి పెద్దవైతివి
చిక్కువాసి నన్నుఁగూడి శ్రీ వేంకటాద్రి మీఁద
దిక్కుల నిందరిపాలి దేవరవునైతివి

రేకు: 0135-4 వరాళి సంపుటం: 07-208

పల్లవి: మేలే జాణవౌదువు మెస్తినే నిన్ను
మేలు వాని వలపుల మేడలోనే వున్నది

చ. 1: పలుకవే పతి తోను పదవే సకినలే
పలికీనతఁడు పండే పట్టె మంచాన
చిలుకవే నవ్వులు నెలవుల నదియేలే
బలిమిఁ జిలుక తనిపంజరాననున్నది

చ. 2: రూపుఁజూపవే నీవు రొచ్చులుగఁ జేరి తొల్లే
రూపులెల్లా నద్దములో రూడినున్నవి
తీపుల మోవియ్యవే తెలుసుకోవే నీవు
కోపులఁ దరి తీపులు కొంగుపైఁడైవున్నది

చ. 3: మొక్కవే ఆతనికి మోహము రెట్టించ నేఁడు
మొక్కఁబోయిన దేవర మొదలే తాను
యిక్కువ శ్రీ వేంకటేశుఁడిట్టే కలసెఁగదే
యెక్కువ కాఁగిటిలోన యిరవాయఁ గదవే

రేకు: 0135-5 ఆహిరి సంపుటం: 07-209

పల్లవి: సంతలోని జాణవు జాజరలో వాఁడవు
వింతలేదు నాకు నీకు విన్నపమిదయ్యా

చ. 1: గొల్ల చల్ల పుల్లన గున్నచింత చల్లన
వొల్లనె మా పొందులకు నోపుదువా
చల్లదుబ్బదుబ్బెడు సాదించితే వలపులు
తెల్లవారె మా గుట్టు తెలుసుకోవయ్యా

చ. 2: దొడ్డిగంపలప్పెఁడు తొలిపాలు చిప్పెఁడు
వొడ్డారపు మాతో పొందుకోపుదువా
జిడ్డుదేరి దుత్తెఁడు చిత్తములోని రతులు
తెడ్డెఁడేసి మోవితీపు తెలుసుకోవయ్యా

చ. 3: మందావులు కల్లలు మాకులెల్లా మొల్లలు
వొందిలి మాతోడి పొందుకోపుదువా
కందువ శ్రీ వేంకటేశ కలసితివిదే నన్ను
దిందుపడే మా నవ్వులు తెలుసుకోవయ్యా

రేకు: 0135-6 కన్నడగౌళ సంపుటం: 07-210

పల్లవి: నవ్వవయ్య యింకను నయగారాలు సేసేను
యివ్వలఁ బంతమిచ్చితి నింకనేల అలుక

చ. 1: చెక్కుచేతనూఁదితేనే చేరి కోపగించేవు
మొక్కేమయ్య యింతనుండి ముందరికిని
చక్కగుణమెరఁగక సరసమాడితి నీతో
యిక్కువలు దెలిసితి మింకనేల అలుక

చ. 2: చన్నులు దాఁకించితేనే సాదించ వచ్చేవు
యెన్నఁ బాదాలొత్తేమయ్య యింతనుండి
సన్నదెలియక నీకు జవ్వనము చూపితివి
యిన్నియు నేరుచుకొంటిమింకనేల అలుక

చ. 3: అంది కాఁగలించుకొంటే ఆసలకుఁ బెనఁగేవు
పొందేనయ్య యింతనుండి భోగమెరిఁగి
అందపు శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
యింద విడెమొక్కటైతిమింకనేల అలుక

రేకు: 0136-1 దేసాళం సంపుటం: 07-211

పల్లవి: రట్టెతిమన్నిటాను దిట్టవు నీవు
గుట్టు తోడ నుండఁగాను కొసరకు నీవు

చ. 1: తగని నీచేఁతకు నేఁ దలవంచుకుండఁగాను
నగకుమీ సారె సారె నాతో నీవు
అగడై తొల్లె నేను ఆలనైవుండఁగాను
మొగము చూచి అప్పటి మొక్కకుమీ నీవు

చ. 2: అంతటా నేనీతో పొలయలుకతో నుండఁగాను
అంతలోఁ గొంగువట్టి తియ్యకుమీ నీవు
చెంతలనిట్టే నేను సిగ్గువడి వుండఁగాను
బంతినెడమాటాడి అంపకుమీ నీవు

చ. 3: పైకొని యేపొద్దు నేఁ బానుపుపైనుండఁగాను
వాకుచ్చి పేరునఁ బిలువకుమీ నీవు
చేకొని కూడితివిదె శ్రీ వెంకటేశ నన్ను
యీ కొలఁది మన్ననలే యిమ్మీ నీవు

రేకు: 0136-2 నాదరామక్రియ సంపుటం: 07-212

పల్లవి: ఎరఁగవా వోయి నీవు యేల నన్నునడిగేవు
తరితారుకాణైవుండు తరితీపు వలపు

చ. 1: వచ్చీరాని పదము వంటిదివో వలపు
తచ్చన మాటలవంటి తమి వలపు
పచ్చని తీగెవలఁ బారేది వలపు
యిచ్చకపు చల్లగాలి యీడువచ్చు వలపు

చ. 2: వలరాయని గరిడి వంటిదివో వలపు
పిలిచి బిడ్డనిచ్చిన ప్రియమిది వలపు
చెలరేఁగే ముంజేతి చిలుకవో వలపు
నిలువు నూరువండేటి మొలకవో వలపు

చ. 3: వనములో వసంతమువంటిదివో వలపు
మనసులో నెలకొన్న మర్మమువో వలపు
యెనసితివి శ్రీ వేంకటేశ నీవు నన్నునిట్టె
కనుఁగొంటిమిద్దరికిఁ గాణాచి వలపు

రేకు: 0136-3 హిజ్జిజి సంపుటం: 07-213

పల్లవి: ఏమని వొడఁబరచేవింకా నన్ను
ఆముక రెంటదెప్పరాలాయఁబో వలపులు

చ. 1: ఆరమణికి నీవు అంపిన సొమ్ములీడకుఁ
జేరెను తబ్బిబ్బుగాను చీట్లతోనే
పోరుకుఁ జాలకిందుకుఁ బుత్తెంచిన విడెమిదే
కూరాకువలెనాయ కోపపు నాచేతను

చ. 2: ఆయింతిని దాఁగివుండుమంటే నెరఁగక తానే
మాయింటికి వచ్చి చెప్పె మతకమెల్లా
మాయలకనుచరించ మరి నావద్దికి రాఁగా
యీయెడఁ బాయిటఁబడెనిదివో నీతరుణి

చ. 3: ఆపెను సన్న సేయఁగా నండనున్న నన్ను సోఁకె
యేపున నీ కొనగోరు యెచ్చరికగా
పై పై నన్నుఁగూడితివి బాపురె శ్రీ వేంకటేశ
చూపులఁ దనిసె యాకె చుట్టమాయ నీకును

రేకు: 0136-4 పాడి సంపుటం: 07-214

పల్లవి: నీ వలె నింత గర్వించనేరనే నేను
యీవలనావలఁ దానే యిందుకేమిసేసేవే

చ. 1: ఉద్దండాన నిన్నాతఁడు వొడివట్టి తీసెనంటా
పెద్దరిక మెందాఁకఁ జెప్పేవే నీవు
వొద్దికతో నాకైతే వుంగర మిచ్చినాఁడు
యిద్దరము నిద్దరమే యిందుకేమి సేసేవే

చ. 2: జక్కవ కుచాలమీఁద చందురుల నించెనంటా
చొక్కుచుఁ జెలులకేల చూపేవే నీవు
అక్కరతో నాకైతే అచ్చువేసి యేలినాఁడు
యెక్కుఁడు మన పంతాలు యిందుకేమి సేసేవే

చ. 3: కప్పి నిన్నునింతలోనే కౌఁగలించుకొనెనంటా
చిప్పిలుఁ జెమటలనేల చిమ్మిరేఁగేవే
వొప్పుగ యీ శ్రీ వేంకటోత్తముఁడు నన్నుఁగూడె
యెప్పుడు మనసొక్కటే యిందుకేమి సేసేవే

రేకు: 0136-5 కేదారగౌళ సంపుటం: 07-215

పల్లవి: తానె తలఁచుకొని తగిలి మన్నించీఁ గాని
మోనముతో మోము చూపి మొత్తమున రావే

చ. 1: మున్నిటి తన మాటలు ముదులకించి రావే
అన్నిటా తన సన్నలు అడిగి రావే
చన్నులు నేలమోవ సాగిలి మొక్కి రావే
వున్నతిని చేకానికె వొద్దఁబెట్టి రావే

చ. 2: అప్పుడు నేఁగన్నకల ఆతనితోఁ జెప్పి రావే
వొప్పుగాను మనసంతయు నొరసి రావే
విప్పుచుఁ బెదవులను వినయము చూపి రావే
అప్పటి గోడ గురుతు నటు వ్రాసి రావే

చ. 3: సంగడి నుండిన వారి సాకిరివెట్టి రావే
కంగులేక తనబుద్ధి కైకొని రావే
చెంగటికి తానే వచ్చి శ్రీవేంకటేశుఁడు గూడె
సంగతాయననిమెచ్చి సరసకు రావే

రేకు: 0136-6 భైరవి సంపుటం: 07-216

పల్లవి: సిగ్గులేల లోనికి విచ్చేయవయ్య
అగ్గమాయ నావంటిదే ఆపెయు నీకిపుడు

చ. 1: మఱఁగుకు రావయ్య మంచిమేలు సుద్దిచెప్పె
మెఱసి నీవెంత మెచ్చు మెచ్చేవో కాని
తఱి తెరమరఁగింతే తారుకాణించఁగవచ్చు
యెఱిఁగి వలచి వచ్చెనేమౌనో కాని

చ. 2: చేయిచాఁచఁగదవయ్య చేకానుకొకటి ఇచ్చే
ఆయమెరిఁగెంతముదమందేవో కాని
పాయని చుట్టురికాలు పడితళించఁగ వచ్చు
చాయల నీ గురుతులు సరివచ్చివున్నవి

చ. 3: పెనఁగక వుండవయ్య పేరు నీవీఁపున వ్రాసే
ననిచి నీవందుకెంత నవ్వేవో కాని
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసితివిటు నన్ను
యెనసిన నానీడే యిందాఁకా నేనన్నది

రేకు: 0137-1 రామక్రియ సంపుటం: 07-217

పల్లవి: నీవెరఁగవటవయ్యా నెలఁతకు గర్వమని
ఆవల నీ వలనట్టే ఆడేవు గాక

చ. 1: ఆఁటదానికిని సిగ్గే అంతటా నిండినసొమ్ము
నాఁటుకోఁజూచే చూపే నమ్మినసొమ్ము
మేఁటి మురిపెములే మిక్కిలి దాఁచినసొమ్ము
వాఁటపు సెలవినవ్వే వన్నెలసొమ్ము

చ. 2: కాంతకును గుట్టు తోడి గంభీరమే సొమ్ము
యెంతైనాఁ బదరకుండుటెక్కువసొమ్ము
పంతపు మాటలాడుటె భావము నిండిన సొమ్ము
మంతుకెక్కే సణఁగులు మాయని సొమ్ము

చ. 3: తరుణికిఁ బతితోడి తరితీపులే సొమ్ము
బిరుదురతులె చాలాఁ బెట్టిన సొమ్ము
నిరతి శ్రీ వేంకటేశ నీతోఁ బెనఁగుటే సొమ్ము
సరుస మంచముపై రాజసమే సొమ్ము

రేకు: 0137-2 ఆహిరి సంపుటం: 07-218

పల్లవి: ఆపోలికౌనో కాదో అట్టే నీవు చూచుకొమ్మా
పూఁపలై వలపు లెల్లా పూచినట్లున్నది

చ. 1: తగులు కొనెనో మెడఁ దరుణి చూపులెల్లా
అగపడి కల్వదండలై వున్నవి
చిగురుఁబాదాల నిగ్గు జెడగట్టెనో అప్పటి
తగి యల్లదె తులసి దండ వలె నున్నది

చ. 2: చిక్కుకొనెనో నొసలఁ జెలియ నగవులెల్లా
అక్కర ముత్తెపు నామమై నీకున్నది
జక్కవ చన్నుల నీడ సరి నీ యందునంటెనో
నిక్కి నీ చేతుల సంకుఁ జక్కురాలైవున్నవి

చ. 3: మొలచెనో నీవు రాన ముంచి యలమేలుమంగ
మలసి తానే కౌస్తుభమణి యైనది
అలరి శ్రీ వేంకటేశ కలసెనో తా భూసతై
నిలిచి శ్యామ వర్ణము నీమేనైవున్నది

రేకు: 0137-3 ముఖారి సంపుటం: 07-219

పల్లవి: అంతటఁ దనవుడుకారును అయినట్టయ్యీఁ బంతము
చెంతల నావిన్నపమిది చేకొనుమనఁగదవే

చ. 1: పొందులుసేసేదెల్లా పోరాటముకొరకేనా
యిందుకునేమీననఁ దను నింటికి రమ్మనవే
కొందరు సతులను జూపుచు కోపము రేఁచఁగనప్పుడు
ముందుగనేమని యంటినొ మొక్కితి నేననవే

చ. 2: యెనయుచు నవ్వినదెల్లా యెగ్గులు పట్టుటకేనా
వెనకటివిఁకఁ దడపేనా వీడెము గొమ్మనవే
వనితలయిండ్ల వాకిట వడిఁ దా రచ్చలుసేయఁగ
మొనగోరటు సోఁకించితి మొక్కితి నేననవే

చ. 3: సొలసిన కౌఁగిటి రతులివి సూడులు పట్టుటకేనా
అలమేల్మంగను నేనే అలను తనకనవే
యెలమిని శ్రీ వేంకటేశుఁడుయెవ్వతె సుద్దులొ తలచఁగ
మొలనూలునఁ దనువేసితి మొక్కితి నేననవే

రేకు: 0137-4 నాదరామక్రియ సంపుటం: 07-220

పల్లవి: ఏమని నుతించవచ్చు యీతని ప్రతాపము
కామించి యీరేడు లోకములెల్లా నిండెను

చ. 1: యీవల దేవుఁడు రథమెక్కితేను దైత్యులెల్ల
కావిరిఁ జక్రవాళాద్రికడకెక్కిరి
భావించి చక్ర మీతఁడు పట్టితే నసురలెల్ల
ధావతితోడుతను పాతాళమువట్టిరి

చ. 2: గరుడ ధ్వజము హరి కట్టెదుర నెత్తించితే
పరువెత్తిరి దానవ బలమెల్లను
గరిమ నీ తేరి బండికండ్లు గదలితేను
ఖరమైన దైత్యసేన క్రక్కదలి విరిగె

చ. 3: ధృతి శ్రీ వేంకటేశుఁడు తిరువీధులేఁగితేను
కుతిలాన శత్రులు దిక్కులకేఁగిరి
తతి నలమేల్మంగతో తన నగరు చొచ్చితే
సతమై బలి ముఖ్యులు శరణము చొచ్చిరి

రేకు: 0137-5 శ్రీరాగం సంపుటం: 07-221

పల్లవి: రమణి నూరడింతువు రావయ్య నీవు
తమకించి తన్నుఁదానె తల్లడించీ నిదివో

చ. 1: అప్పుడు నిన్ను సొలసి యాడి యాలాడితినంటా
దప్పిదేరే మోవితోడఁ దలఁకించీఁ జెలి
కొప్పువట్టి తియ్యఁగాను గోరు నిన్నుఁ దాఁకెనంటా
అప్పటి లోలోనె వుస్సురనీ నిదివో

చ. 2: వెంగేన నిమ్మపంటను వేసేలవేసితినంటా
కంగి మనికితపడి కరఁగీఁ జెలి
ముంగిటఁ బెనఁగఁగాను యెంగిలి మోవంటె నంటె
పొంగుఁ జెమటలతోఁ దాఁ బొగిలీనిదివో

చ. 3: వుబ్బునఁ జనుమొనల నొత్తేల వొత్తితినంటా
అబ్బురానఁ జిన్నఁబోయి అలసీఁ జెలి
గబ్బి శ్రీ వేంకటేశుఁడ కాఁగిట నిన్నటుగూడి
గుబ్బలొత్తెనంటా నీకుఁ గొంకి మొక్కీనిదివో

రేకు: 0137-6 వరాళి సంపుటం: 07-222

పల్లవి: ఇసుక పాతర యిందుకేది కడగురుతు
రసికుఁడ నన్నునింత రవ్వశాయనేఁటికి

చ. 1: బయలు వలెనుండును పట్టరాదు వలపు
మొయిలువలెనుండును ముద్దశాయరాదు
నియతములేదించుకు నేరిచినవారిసొమ్ము
క్రియ యెరుంగుతా నన్నుఁ గెరలించనేఁటికి

చ. 2: గాలివలెఁ బారుచుండు కానరాదు మనసు
పాలవలెఁ బొంగుచుండు పక్కననణఁగదు
యేలీలా గెలువరాదు యెక్కితే యేనుగగుజ్జు
లోలోనె మమ్మునింత లోఁచి చూడనేఁటికి

చ. 3: వెన్నెలే కాయుచునుండు వింతగాదు వయసు
అన్నిటా వసంతరుతువై యుండుఁ బోదు
వున్నతి శ్రీ వేంకటేశుఁడుండనుండఁ జవి వుట్టు
మన్నించె యింక మారుమాటలాడనేఁటికి

రేకు: 0138-1 యాలపదాలు - దేసాళం సం: 07-223

చ. 1: మేడలెక్కి నిన్నుఁజూచి - కూడేననే యాస తోడ
వాడు దేరి వుస్సురందురా-వేంకటేశ యాడనుంటి విందాకానురా
పిక్కటిల్లు చన్నులపై - చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా- వేంకటేశ లక్కవలె ముద్రలంటెరా
దప్పిగొంటివని నీకుఁ- గప్పురము పారమిచ్చి
ముప్పిరి నీవిరహానను - వేంకటేశ నిప్పనుచు భ్రమసితిరా
నిండఁబూచిన మావిపై- గండుఁగోవిల గూయఁగా
నిండిన నీయెలుఁగంటాను వేంకటేశ అండకు నిన్ను రమ్మంటిరా
వుదయచందురుఁ జూచి- అదె నీపంజని సవి
యెదురుకేనే వచ్చితిరా - వేంకటేశ బెదరి మారుమోమైతిరా
మిన్నక కేళాకూళీలో వున్న తమ్మివిరులు నీ
కన్నులంటా జేరఁబోఁగాను - వేంకటేశ పన్ని మరునమ్మలాయరా
అనిన తుమ్మెదలు నీ - మేనికాంతిఁ బోలునని
పూనిచేతఁ బట్టఁబోఁగాను వేంకటేశసునాస్తుని వేగులాయరా
కందువ మై చమరించి గందవొడి చల్లుకొని పొంద
నిన్ను దలఁచితిరా వేంకటేశా అంద చొక్కుమందులాయరా
బొందుమల్లె పానుపుపై నుండి నిన్నుఁ బాడి పాడి
నిందుజాగరములంటిరా -వేంకటేశ యెండలాయ వెన్నెలలురా
నిద్దిరించి నీవు నాకు - వొద్దునుండఁ గలగంటి
చద్దివేఁడి వలపాయరా- వేంకటేశ సుద్దులింకా నేమి సేసేరా
మల్లెపూవు కొనదాఁకి ఝల్లనను బులకించి
వుల్లము నీకొప్పించితిరా-వేంకటేశ కల్లగాదు మమ్ముఁ గావరా
జోడుగూడి నీవు నేను- నాడు కొన్న మాటలెల్లా
గోడలేని చిత్తరువులై- వేంకటేశ యాడా నామతిఁ బాయవురా
అద్దము నీడలు చూచి ముద్దు మోవి గంటుండఁగా కొద్దిలేని కాఁకతోడను - వేంకటేశ పొద్దువోకతమకింతురా

పావురమురెక్కఁ జీటి- నీవొద్దికిఁ గట్టియంపి
దేవరకే మొక్కుకొందురా - వేంకటేశ నీవిందు రా వలెనంటాను
బంగారు పీఁటపైనుండి- ముంగిటకి నీవురాఁగా
తొంగిచూచి నిలుచుండఁగా - వేంకటేశ యెంగిలిమోవేలడిగేవు
దంతపుఁ బావాలు మెట్టి- పంతాన నేను రాఁగాను
యింతలో బలిమిఁ బట్టేవు - వేంకటేశ అంత నీకుఁ బ్రియమైతినా
పట్టు చీర కొంగు జారి- గుట్టు తో నేనుండఁగాను
వట్టి నవ్వు లేల నవ్వేవు - వేంకటేశ దిట్టవు నీ యంతవారమా
కొప్పుపట్టి తీసి నీవు -చెప్పరాని సేఁత సేసి
తప్పక నేఁ జూచినంతలో - వేంకటేశ చిప్పిలేల చెమరించేవు
బొమ్మల జంకించి నిన్ను- తమ్మిపూవున వేసితే
కమ్మియేల తిట్టు దిట్టేవు - వేంకటేశ నిమ్మపంట వేతునటరా
నెత్తమాడేనంటా రతి- పొత్తుల పందేలు వేసి
వొత్తి నీవే వోడే వేలరా - వేంకటేశ కొత్తలైన జాణవౌదువు
వున్నతి శ్రీవెంకటేశ మన్నించి కూడితివిదే
నన్నునెంత మెచ్చు మెచ్చేవు - వేంకటేశ కన్నులపండువలాయరా
చిలుకలు మనలోన- కలిసిన యట్టివేళ
పలుకు రతిరహస్యాలు - వేంకటేశ తలఁచినేఁ దలపూఁతరా
నీకు వలచిన వలపు- లాకలెత్తె నామతిని
వాకున నేఁ జెప్పఁ జాలరా - వేంకటేశ లోకమెల్లా నెరిఁగినదే

పాయము నీకొక్కనికే- చాయగా మీఁదెత్తితిని
యీయెడఁ గైవాలకుండను - వేంకటేశ మాయింటినే పాయకుండరా
ముమ్మాటికి నీబాసలే- నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీ కరుణ - వేంకటేశ చిమ్ముఁజీకటెల్ల బాయను

రేకు: 0138-2 కేదారగౌళ సంపుటం: 07-224

పల్లవి: నీవింత యలుగుదురా నివ్వెరగుతోనుందురా
మూవంక వీఁగీ వాఁడె మొక్కుదువో యంటాను

చ. 1: వాకిటనున్నాఁడు వాఁడె వనిత నీరమణుఁడు
తూకొని నీవెదురువత్తువో యంటాను
చేకొని చాఁచీ వాఁడె చేయి నీమీఁదనతఁడు
యీకడఁ గైదండ నీవిత్తువో యంటాను

చ. 2: తప్పక చూచీ వాఁడె తరుణి నీమోముదిక్కు
చొప్పుగా మారుకుమారు చూతువంటాను
వొప్పుగఁ బవళించీని వొద్ద నీవునట్టె వచ్చి
దప్పిదేరఁ బవళించి తమకింతువంటాను

చ. 3: మాటలాడీనదె వాఁడె మర్మములు సోఁకఁగ
కోటులుగ నీవు పలుకుదువంటాను
గాఁటమైకూడెను శ్రీ వేంకటపతి యిదె వీఁడె
మేటివై పురముమీఁద మెరతువంటాను

రేకు: 0139-1 గుజ్జరి సంపుటం: 07-225

పల్లవి: ఏఁటికి మంకుఁదనము యీవేళను
గాఁటాన నొడఁబరచీఁ గానిమ్మనఁ గదవే

చ. 1: చలము సాదించఁబోతే చప్పనౌను బ్రియము
బలిమిసేయఁగఁబోతే పలచనౌను
పిలువఁగ రాకున్న బెట్టుగా వేసటవుట్టు
చెలఁగి నీ రమణుఁడు చెప్పినట్టు సేయవే

చ. 2: యెదురు మాటాడితే యెగసక్యమౌ పొందు
పదరితే కడుఁగడుఁ బాటి చాలదు
పొదుగఁగ నూరకున్న పోరచి కాఁకలు రేఁగు
అదన నీపతిమతి ఆస యీడేరించవే

చ. 3: చేవల్లకు రాకుండితేఁ జిగిరించు పంతము
భావించక లోఁచితేను పచ్చిదేరును
యీవేళఁ గూడె నిన్నునింటికిఁ దానే వచ్చి
శ్రీ వేంకటేశ్వరుఁడు చెనకీని నవ్వవే

రేకు: 0139-2 సౌరాష్ట్రం సంపుటం: 07-226

పల్లవి: చేసినట్టే సేసుఁగాక చెప్పేదేమి
సేస వెట్టినట్టి తన చేతి లోని దానను

చ. 1: వేడుకకు వెలలేదు వెన్నెలకుఁ గాటువోదు
ఆడనీవే తన మాట కడ్డము లేదు
గోడ గడుగవచ్చునా కొసరఁగనిఁకనేల
కూడిన తన సతుల గుంపులలోని దానను

చ. 2: జవ్వనము పొల్లవోదు చలిగాలి బొందువోదు
నవ్వనీవే తనవావి నడుమఁబోదు
గవ్వ వొరయవచ్చునా కక్కసించ నిఁకనేల
కువ్వగాఁ బోసిన త నకొలువులోదానను

చ. 3: తియ్యవిల్లు చప్పగాదు దీకొన్న వలపు వోదు
యియ్యనీవే తన మోవికెంగిలిలేదు
పయ్యదంటి శ్రీ వేంకటపతి నన్నునిదె కూడె
యియ్యెడఁ దాఁ బవళించే యింటిలోనిదానను

రేకు: 0139-3 పాడి సంపుటం: 07-227

పల్లవి: ఆనక పోరాదుగాని అండనుండ వారము
నిను నీవెరఁగలేవు నీకేడ వలపు

చ. 1: ఆఁటదానిఁ గంటే పతి ఆదరించనే వలె
వేఁటకానివలెనుంటే వేడుకేడది
గాఁటానఁ గొలువుసేయఁగా గద్దెమీఁదనుండి
నీటుతోనే సాదించేవు నీకేడ వలపు

చ. 2: పాసివున్న సతిఁగంటే బాఁతిపడి నవ్వవలె
మాసటీనివలెనుంటే మచ్చికేడది
ఆసపడి చూడఁగాను అట్టె మలఁగుపైఁబండి
నీ సుద్దులే చెప్పేవు నీకేడ వలపు

చ. 3: తరుణి కూటమి గంటే దప్పిదేర్చనేవలె
తరకానివలెనుంటే తమియాడది
అరిది శ్రీ వేంకటేశ ఆపె నిన్నుఁ గూడఁగాను
నెరుపేవు సిగ్గులే నీకేడ వలపు

రేకు: 0139-4 హిందోళం సంపుటం: 07-228

పల్లవి: నేరములెంచేదెల్లా నిన్నా నేను
నేరిచి మాటాడేది నీతోనా నేను

చ. 1: కపటాలు గలవంటా కల్లరివి నీవంటా
నెపములెన్నేదల్లా నిన్నా నేను
వుపమల దాననంటా వొరపులు నేర్తునంటా
నిపుణత మెరసేది నీతోనా నేను

చ. 2: యెక్కడనో వుంటివంటా యెరవులవాఁడవంటా
నిక్కపుబాసడిగేది నిన్నానేను
చక్కనిదాననంటా చలము సాదింతునంటా
నెక్కొని నవ్వునవ్వేది నీతోనా నేను

చ. 3: మట్టున నడవుమంటా మాయింటికి రమ్మంటా
నెట్టనఁ గొంగువట్టేది నిన్నానేను
గట్టిగ శ్రీ వేంకటేశ కలసితివిటు నన్ను
నిట్టూర్పుతో నలసినది నీతోనా నేను

రేకు: 0139-5 బౌళిరామక్రియ సంపుటం: 07-229

పల్లవి: నాకే వలతువోయి నరహరి
చేకొని నేనెరుఁగుదు చెప్పకు నరహరి

చ. 1: నగేవు నామోము చూచి నరహరి నీ
నగరెల్లా సతులే నరహరి
నగములు మాచన్నులు నరహరి
పగటున నిన్ను నాఁటేఁ బట్టకు నరహరి

చ. 2: నలుగడఁ జూచి చూచి నరహరి మోవి
నలినలిసేతురా నరహరి
నలఁగనియ్యకు కొంగు నరహరి
బలిమినెవ్వరెవ్వరు పట్టిరో నరహరి

చ. 3: నానారతులఁ గూడి నరహరి కడు
నానఁబెట్టేవు వలపులు నరహరి
మానక శ్రీ వేంకటేశ మండెమురాయఁడవై
పూని నన్ను మన్నించి పొందేవు నరహరి

రేకు: 0139-6 శంకరాభరణం సంపుటం: 07-230

పల్లవి: ఏఁటిమాఁటలాడేవే యెందాఁకా నీవు వోరి
వాఁటముగ యిట్టే వట్టి వళకులాడకురా

చ. 1: పయ్యదలో వాలెనవే పట్టియ్యవే జక్కవల
కొయ్యకాఁడ కావుర కుచములివి
ముయ్యనేఁటికే అట్లైతే మొరఁగక చూపఁగదే
యియ్యెడఁ బైఁడి బిందెలెట్లు చూపవచ్చురా

చ. 2: వొడిలోన దాఁగెనదే వొప్పగించవే సింహము
గడుసుకాఁడ కాదది నడుమింతేరా
విడిచి సోదనీవే విచ్చనవిడినట్లైతే
సుడిసి ఆకసమెట్లు సోదనగోనేవురా

చ. 3: కుచ్చులలోపల దాఁగె కొమ్మ నెమళ్ళ నీవే
అచ్చపు నడపులింతే అవిగావురా
కుచ్చి శ్రీ వేంకటేశుఁడ గురితేది అట్టైతే
యిచ్చఁగూడితివి గురుతెటు చూపవచ్చురా

రేకు: 0140-1 శ్రీరాగం సంపుటం: 07-231

పల్లవి: గుట్టుగలవాఁడు గల కొసరఁడాతఁడు నిన్ను
రట్టడితనమున నాఱడిసేయకువే

చ. 1: యెండమావుల నీరు యేకతపు పాలయలుక
వండఁగ వండఁగ నట్లు వలపులెల్ల
కొండల నున్ననిచూపు గొనకొన్న వెడయాస
అండనుండే విభుని నలయించనేలే

చ. 2: గుంటిమీఁదటివాన కొనబు సరసపుటాన
వెంటవెంట తోడినీడ వేడ్కతగులు
పంటవండిన పాల్లు పాసివుండినకాఁక
జంటఆయిన పతినింత సడిఁబెట్టనేలే

చ. 3: బేగడపసిఁడి నిగ్గు బీరపుబిగువులివి
లాగవేగపుగోరి లాంచనములు (?)
చేగదేరఁగఁ గూడె శ్రీ వేంకటేశ్వరుఁడు
యీగతి నితనినింక యెలయించనేలే

రేకు: 0140-2 శంకరాభరణం సంపుటం: 07-232

పల్లవి: ఎన్నఁడు లేనిగురుతులివె నీమేనఁ గంటిమి
సన్నల యీసుద్దులెట్లు చవిసేసేవే

చ. 1: చెదరెను నీకురులు చెమట చెక్కుల నిండె
యెదురి మెచ్చఁగ నర్థమేమి చెప్పేవే
వదలె నీమొలనూలు వాడెను నీకెమ్మోవి
పొదలి యిందుకెట్లా బొంకఁగలవే

చ. 2: కంకణాలు వదలెను గందపుఁబూఁత చిట్లె
వంకలొత్తి యిందుకెట్టు వాదించేవే
సుంకుమోపెఁ బలుకులఁ జూపులఁ గొత్తలు దోఁచె
సంకెలేక యివియెట్లు సటలనేవే

చ. 3: మోమునఁ గళలు నించె ముక్కున నిట్టూర్పురేఁగె
యీమాటకుత్తరమెట్లిచ్చేవే మాకు
ఆముక శ్రీ వేంకటేశుఁడన్నిటాను నిన్నుఁగూడె
ఆమని సెలవినవ్వులాఁపనెట్లు వచ్చునే

రేకు: 0140-3 కాంబోది సంపుటం: 07-233

పల్లవి: ఎంతసంతోసమోకాని యేమి చెప్పేది
వింతలైన వలపుల విడిదాయఁ దాను

చ. 1: అమరనాదరించి చెప్పంపిన నీమాటవిని
చెమటలచెలమాయఁ జెలియ
గమకపు నీముద్దుటుంగరపు గురుతుచూచి
గములైన మెఱుఁగులగని యాయ మొగము

చ. 2: అలరనాసరేఁచ నీవంపిన విడెము చూచి
పులకలపోగాయఁ బొలఁతి
వలనై పొందికల నీవ్రాలకమ్మలు చూచి
పలచని నవ్వుల పండుగాయ మోవి

చ. 3: కడఁగి శ్రీవేంకటేశ కాఁగిట నీవు నించితే
కడు సిగ్గులకొండాయఁ గలికి
వుడివోని నీరతుల వొడఁబడికలఁ జెంది
అడియాలమైన మణిహారమాయను

రేకు: 0140-4 ముఖారి సంపుటం: 07-234

పల్లవి: వింతవాఁడా తానేమి వేమరుఁ జెప్పించుకొన
బంతినే తరితీపులు పచరించవలెనా

చ. 1: తనమాటే నామాట దగ్గరి రమ్మనవే
యెనసియునెడమాటలేలాడించీని
మనసుకు మనసే మరి తారుకాణగదే
చెనకి పొందులు యింకాఁ జేసి చూపవలెనా

చ. 2: అక్కడే యిక్కడ నాఅండనుండుమనవే
పెక్కుప్రియములెల్లాఁ జెప్పించఁగనేల
చొక్కమైన చూపుకు చూపులే గురిగదే
పక్కన నింకా నొడఁబరచఁగవలెనా

చ. 3: యీవలఁ దానే నేను యిప్పుడె కూడుమనవే
శ్రీ వేంకటేశుఁడేల సిగ్గువడీని
వావులకు వావులే వలపించెఁగదవే
వేవేలుగా మన్నించె వేఁడుకొనవలెనా

రేకు: 0140-5 కేదారగౌళ సంపుటం: 07-235

పల్లవి: ఒక్కరికిఁ జెప్పరాదు వూఁకొనరాదు
పక్కననేమనినాను పైఁడికతవంటిదే

చ. 1: ఆరెఁ దేరె నెడమాటలాడించ మీతోనేలే
చేరి తానే యడిగితేఁ జెప్పేఁ గాని
గోర గీరితే నీరయ్యీ గుట్టుననుండనియ్యరే
మేర మీరితే నతని మెప్పించేఁ గాని

చ. 2: పక్కణగా నాకుమీఁద వాసి పంపనేలే నా
దిక్కునఁ జూచితేఁ దనకే తెలిపేఁ గాని
వొక్కటంటే రెండయ్యీనూరకే వుండనియ్యరే
వెక్కసమైతేఁ దనతో వెలయించేఁగాని

చ. 3: తప్పులెంచి అందరిచేఁ దగవులఁ బెట్టనేలే
యిప్పుడే యేకతమైతే యెంచేఁగాని
పుప్పు చిందినుమడయ్యీ వొనరె నుండఁగనీరే
కప్పి శ్రీ వేంకటేశుఁ గాఁగిలించేఁగాని

రేకు: 0140-6 బౌళిరామక్రియ సంపుటం: 07-236

పల్లవి: ఎక్కడ నేరిచితివే యేడలేని వేసాలు
వెక్కసాలేల చేతి విడెమియ్యఁ గదవే

చ. 1: మువ్వంకల నీకునీవె ములిగేవు సారెసారె
నవ్వులకాడినమాట నాటెనటవే
పవ్వళించి అప్పటి నీపానుపుపైఁ బొరలేవు
పవ్వుల వేసినపోటు బొప్పిగట్టెనటవే

చ. 2: కప్పుచుఁ బయ్యదకొంగు కడునొడ్డించుకొనేవు
తప్పక చూచినచూపు తాఁకె నటవే
తిప్పి తిప్పి చూచేవు తేరకొనఁ జన్నులపై
కప్పురము చల్లితే కసుగందె నటవే

చ. 3: కినిసి యంతటలోనె కిందుపడి మొక్కేవు
వొనరఁ గాఁగిలించితే వొత్తెనటవే
యెనసి శ్రీ వేంకటేశునెదురుగాఁ గొసరేవు
చెనకితే మేనిమీఁద జీరవారె నటవే

రేకు: 0141-1 మాళవిగౌళ సంపుటం: 07-237

పల్లవి: ఒక్కరియెంగిలి సొత్తుకొకరాసపడుదురా
దక్కని సొమ్ములకును తానేల వచ్చీని

చ. 1: పయ్యదంటి నీవు నన్నుఁ బైకొనఁగా వచ్చి యీపె
కయ్యమడువఁ దనకుఁ గలదా పని
ఇయ్యెడనేకతమున యిద్దరమునుండఁగాను
దయ్యమువలె నిప్పుడు తానేల వచ్చీని

చ. 2: చెంది నీవు నాతొడపై శిరసువెట్టుకుండఁగా
సందు చొచ్చి చూడనేమి సమ్మందము
సందుడివలపుల సదమదమై వుండఁగా
దందు పసురమువలె తానేల వచ్చీని

చ. 3: నిగిడి శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితేను
తగునని పొగడఁగఁ దనకేమి
మొగము చూచుకొని ముచ్చట నీతో నాడఁగా
తగిలి పొట్టేలువలె తానేల వచ్చీనే

రేకు: 0141-2 సౌరాష్ట్రం సంపుటం: 07-238

పల్లవి: ఎట్టు దరియించవచ్చును యిటువంటివెల్లఁ జూచి
బట్టబయలీఁదించఁగా భ్రమసినట్టయ్యీని

చ. 1: పమ్మి నీమేనిమీఁదట పచ్చిచెమట గారఁగా
నమ్మికలియ్యఁగనే పో నవ్వు వచ్చీని
చిమ్ముచు వెంగెమాడితే సిగ్గులువడక నీవు
నెమ్మదినూఁకొనఁగానే నివ్వెరగయ్యీని

చ. 2: పోదిగా నీపెదవికెంపులు రేఁగ మాటలాడి
ఆదరించఁగానె పో అదరీ మేను
ఆదెస నేరమెంచితే అందాలు సేసుక నీవు
వాదుకు రాకుండఁగా నివ్వల సోద్యమయ్యీని

చ. 3: మేరతో ఆఁడుసొమ్ములు నీమెడఁ బెట్టుకొని వచ్చి
సారెఁ గాఁగలించఁగా బో చలమెక్కీని
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిట్టే
గారవించఁగా నప్పటిఁ గరుణ వుట్టీని

రేకు: 0141-3 బౌళి సంపుటం: 07-239

పల్లవి: ఔనే జాణక త్తెవు అన్నిటా నీవు
యేనిగె గుజ్జొఁగదే యెక్కినవారికిని

చ. 1: ఇంతవాసి గలదానవేల నవ్వితివే ముందు
చెంతఁ బెట్టనికోటవై చెలఁగవద్దా
వంతులకు నీవెంత వలపించుకొనినాను
పంతపు విభుఁడు కిందుపడునా నీకు

చ. 2: యెగ్గుపట్టేటి దానవు యేల రమ్మంటివే ముందు
వొగ్గి వీడనిగంటవై యుండఁగరాదా
అగ్గలమై నీవెంత అట్టె బాసగొనినాను
సిగ్గులాతఁడు ప్రియము చెప్పునా నీకు

చ. 3: యెలయించేటిదానవు యేల మొక్కితివే ముందు
అల కదలనికంబమై యుండరాదా
బలిమి శ్రీ వెంకటేశుఁగలసి యెంతవుండిన
బలువుఁడీతఁడు తడఁబడునా నీకు

రేకు: 0141-4 శంకరాభరణం సంపుటం: 07-240

పల్లవి: నీవె విచ్చేయవయ్య నేరుపరివిందుకెల్ల
నీవనిత యలుకలు నేము దిద్దఁగలమా

చ. 1: మాఁటవోరువఁగలేని మంకు దానిఁ గేరడాలు
యేఁటికినాడితివయ్య యింతలో నీవు
వాఁటమై పారెఁ గన్నీటివరదలు చన్నులపై
నీఁటున నింతటెలుక నేము దిద్దఁగలమా

చ. 2: కాఁకకోరువఁగలేని కాంతకుఁ గోపమురేఁచి
సోఁకింతురా కొనగోరు చురుకనను
వేఁకపు నిట్టూరుపులు విసరీ హారములపై
యేఁకటనింతేసి పనులేము దిద్దఁగలమా

చ. 3: రవ్వకోరువఁగలేని రమణితో జూజాలాడి
నవ్వుదురా శ్రీ వేంకటనగవిహార
పువ్వులు కొప్పువి రాలె పొందితే బుజాలమీఁద
నివ్వటిల్లు మీవోజలు నేము దిద్దఁగలమా

రేకు: 0141-5 శ్రీరాగం సంపుటం: 07-241

పల్లవి: ఏల కొనఁబెట్టేవే యెందాఁకా మాటలు
నాలితో వండినకూడు ననుఁబాయే కాదా

చ. 1: పెక్కువనితలమీఁది ప్రియము గలవానికి
యెక్కడిది మోహము నీవేమి చెప్పేవే
వొక్కమాఁటె సారెసారెనొట్టుకొని చవిగొంటే
మొక్కలానఁ బంచదార మొగచాటుగాదా

చ. 2: గాఁటపుసతులఁబొంది కాయాటైన వానికి
యేఁటికిఁ గరఁగీ గుండె యెమిచెప్పేవే
మేఁటియై మేనినిండా మితిలేక పెట్టుకొంటే
నీఁటున బంగారైన నిండా వేఁగుగాదా

చ. 3: ఊరఁ జుట్టపు శ్రీ వేంకటోత్తముఁడైనవానికి
యేరీతిఁ దమిరేగీనేమి చెప్పేవే
యీరీతి నన్నునేలె యింకాఁ గొసరితేను
పేరఁబెట్టితే పాలు పెరుగేకాదా

రేకు: 0141-6 గౌళ సంపుటం: 07-242

పల్లవి: తరుణిమేనికిని నీతనువె మాటు
నిరతపుటాసకు నిండుఁజూపె మాటు

చ. 1: చెలియసిగ్గులకు చెక్కుఁచేయే మాటు
పలుకులకును మోవిపండె మాటు
నెలకొన్న చింతలకు నివ్వెరగే మాటు
బలుజవ్వనమునకు పయ్యదే మాటు

చ. 2: ముంచిన నవ్వులకును మొక్కులివే మాటు
మంచి నడపులకును మట్టెలే మాటు
వంచిన శిరసునకు వాలుఁగొప్పే మాటు
కొంచని చనులకు కొనగోరె మాటు

చ. 3: పొందుల రతులకను పుక్కిటివిడెమె మాటు
అందిన వేడుకకు నాయములె మాటు
విందుల వలపులకు వేవేలు రతులె మాటు
యిందుముఖికై శ్రీవేంకటేశ నీ యింపె మాటు

రేకు: 0142-1 గుజ్జరి సంపుటం: 07-243

పల్లవి: తెలిసినవాఁడవు ధీరుఁడవిన్నిటా నీవు
చలము సాదింతురా సతులతో నీవు

చ. 1: అప్పటి మానవు మాటలాపెతో నీవు
కప్పురమిచ్చినమీఁద గలదా వాదు
చెప్పరాని తిట్టుదిట్టి చేయెత్తి మొక్కితేను
వొప్పుగొనవద్దా మఱి వొరట్లేమిటికి

చ. 2: తలవంచుకున్నాఁడవు తరుణియెదుట నీవు
సెలవి నవ్వినమీఁద సేతురా యింత
కలువపువ్వులవేసి కౌఁగలించుకొంటేను
అలుకదీరఁగవద్దా ఆనలు మరేఁటికి

చ. 3: బింకములు నెఱపేవు ప్రియురాలి యెదుటను
సంకెలు దీర్చినమీఁద చలమేఁటికి
అంకెల శ్రీవేంకటేశ ఆలయించి నిన్నుఁగూడె
మంకులు మానఁగవద్దా మదము మరేటికి

రేకు: 0142-2 శ్రీరాగం సంపుటం: 07-244

పల్లవి: ఇందవయ్య కానుకయిచ్చె నీకుఁజెలియ
మందలించేనింటికాడ మగువతో నిన్నును

చ. 1: కలువరేకులవాఁడి కాంతచూపులనున్నది
వలరాజు నమ్ములకు వాసనే కాని
చలివేఁడి వలపులు చన్నులకొనల నవే
చెలువుఁడ నీవిఁకనేల సేసేవు జాగులు

చ. 2: ననిచిన చిగురెల్లా నాఁతిమోవినె వున్నది
వనముల మాకులెల్లా వట్టివే కాని
మనసుమర్మములెల్లా మాటలతుదలఁదోఁచె
ఘనుఁడవు యిఁకనేల కప్పేవు తమకము

చ. 3: నిండుమేఘము మెరుఁగు నెలఁతమోమున నిదే
వుండు మింటననే పేరు వొక్కటేకాని
కొండల శ్రీవేంకటేశ కూడితిరిద్దరు నేఁడు
గండికాఁడ యిఁకనేల కాదనేవు మాటలు

రేకు: 0142-3 పాడి సంపుటం: 07-245

పల్లవి: ఏల నన్నునొరసేవు యిన్నేసిచేఁతలను
చాలుననేనా మోవి చప్పఁజేతుఁగాక

చ. 1: పంతములాడేనా పరాకున నీవుండితే
చింతదేర నీసేవ సేసేఁ గాక
వంతులడిగేనా నిన్ను వనితలలోన నుంటే
దొంతరవలపులను తొప్పఁదోఁగింతుఁ గాక

చ. 2: కన్నులఁ దిట్టేనా గక్కన నీవు రాకుంటే
చన్నులనే వొత్తి నిన్ను సాదింతుఁగాక
విన్నపాలు సేసేనా విచ్చనవిడినే వుంటే
కిన్నర మీఁట్లలోనే గిలిగింతుఁగాక

చ. 3: కపటాలు సేసేనా కాఁగలించుకోకుండితే
వుపమ వీడేనకుఁ జేయొగ్గింతుఁ గాక
యిపుడె శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
అపలాపించేనా నేనట్టే మెత్తుఁగాక

రేకు: 0142-4 శ్రీరాగం సంపుటం: 07-246

పల్లవి: తానిటువంటివాఁడా తనగుణమిదిగాదు
వూని యీ వెరపు మతిఁబుట్టించినదెవ్వతె

చ. 1: కొత్తకొత్తవలపులు కొంతకొంత నెరపుతా
వత్తునంటాఁ జెప్పింపవలెనా నేఁడు
యిత్తలఁ దా వింతవాఁడా యెవ్వరన్నా వద్దనేరా
చిత్తములోనింత కొంకఁజేసినది యెవ్వతె

చ. 2: వేఁడివేఁడి తమకము వేసివేసి తనచేయి
వాఁడి నాచన్నులమోపవలెనా నేఁడు
పేఁడుకొనేమా చలము భేదమా తనకు నాకు
పోఁడిమి తనకునింత బుద్ధిచ్చినదెవ్వతె

చ. 3: ముద్దుముద్దుమాటల ముంచి ముంచి బాసలిచ్చి
వద్దనుండి గోరగీరవలెనా నేఁడు
అద్దుక శ్రీవేంకటేశుఁడన్నిటాఁదా నన్నుఁగూడె
తిద్దినట్టి తనపాలిదేవరైనదెవ్వతె

రేకు: 0142-5 ముఖారి సంపుటం: 07-247

పల్లవి: కంటకములాడనేల కాఁతాళమేఁటికి నీతో
మంటదీర నా పనులు మానివుండేఁ గాక

చ. 1: కోపగించేనా నీతో కొప్పువట్టి తీసితేను
యేపున ముడుచుకొనేనేమాయను
పైపై దొరలతోడి పంతాలకు నేమిపని
ఆపరాకై వానగుంటలాడుకొనేఁ గాక

చ. 2: కమ్మటిఁ దిట్టేనా నిన్ను కాలు నీవు దొక్కితేను
యెమ్మెలేక తీసికొనేనేమాయను
దిమ్మరి విభునితోడ దీకొనేవాదులేల
యిమ్ములఁ జుక్కలై నానెంచుకొనేఁ గాక

చ. 3: పక్కన నొట్టువెట్టేనా పచ్చడము గప్పితేను
యిక్కువలు గరఁగేను యేమాయను
నిక్కి శ్రీవేంకటేశుఁడ నిన్నుఁగూడి కొంకువద్దా
చక్కనైతి నీమోవి చవిచూచేఁగాక

రేకు: 0142-6 భైరవి సంపుటం: 07-248

పల్లవి: ఓరుపే నేరుపు సుమ్మీ వువిదలకు
మారుకోకు మగవాని మనసు మెత్తనిది

చ. 1: చలము సాదించవద్దు చనవే మెఱయవే
చెలువుఁడాతఁడే నీచేతఁ జిక్కీని
బలుములు చూపవద్దు పకపక నగవే
అలరిన జాణతనమందులోనే వున్నది

చ. 2: పగలు చాటఁగవద్దు పైకొని మెలఁగవే
సొగిసి ఆతఁడే నీసొమ్మై వుండీని
తగవులఁబెట్టవద్దు తమకము చూపవే
అగపడ్డ నీ పంతములందులోనే వున్నవి

చ. 3: మొక్కలమేమియునొద్దు మోహములు చల్లవే
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్నుఁగూడెను
తక్కులఁ బెట్టఁగవొద్దు దయలు దలఁచవే
అక్కజపు నీరతులు అందులోనే వున్నవి

రేకు: 0143-1 సౌరాష్ట్రం సంపుటం: 07-249

పల్లవి: పొత్తుల మగువలకుఁ బోవునా యింక
యిత్తలఁ గూడుండుదము యీడకిట్టేరావే

చ. 1: మచ్చరము నాకేలే మగఁడు మొదలనే
మచ్చికచేసి నిన్ను మన్నించునట
వెచ్చనూర్పు నీకేలే వెరపులింకానేలే
కుచ్చినేనూఁ గౌఁగిలించుకొనేఁ గాని రావే

చ. 2: వెంగెమాడ నాకేలే విభుఁడు వేడుకపడి
సింగారించి నిన్ను రట్టుసేసుఁ దానట
ముంగిటనే కొంకనేలే ముసిముసి నవ్వులేలే
సంగడిబూవానకు చలివాపీ రావే

చ. 3: పెనఁగఁగ నాకేలే ప్రియుడు లోలోనె వచ్చి
కనుసన్న సేసి నిన్నుఁ గలపునట
నను శ్రీవేంకటేశుఁడు నవ్వుతానిట్టెకూడె
తనిసిన రతులు చింతనసేసే రావే

రేకు: 0143-2 దేసాళం సంపుటం: 07-250

పల్లవి: ఇద్దరము నిద్దరమే వోవోయి
వద్దుసుమ్మీ వట్టిపంతాలోవోయి

చ. 1: యెఱఁగవా మాగుట్టు యేమోయి మమ్ము
ఉఱక గుట్టరసేవు వోవోయి
యెటికెతనా నీకు యేమోయి - మాపై
వొఱగుంటే నేమాయనో వోవోయి

చ. 2: యెప్పటికెప్పటి సుద్దులేమోయి - నీపై
నుప్పరాలెగసీఁ జన్నులేమోయి
యిప్పలేర్లులాయ మోవి యేమోయి
వొప్పన గొనుమీ నేఁడు వోవోయి

చ. 3: యెమ్మెలు మనలోనేల యేమోయి
వుమ్మగిలీ వలపులు వోవోయి
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోనె కూడితిమి
వొమ్మె గా జాణతనాలోవోయి

రేకు: 0143-3 దేశి సంపుటం: 07-251

పల్లవి: మేలయ్య నీచేతలు మెచ్చితినయ్య
తాలిమిలేస్సపనాయఁ దగవరివవుదువు

చ. 1: పడఁతిఁ బిలువనంపి పగడసాలాడేవు
పుడుగకీపరాకులకోపునా ఆపె
యెడసి పానుపుమీఁద యెదురుచూచీఁ జెలియ
నడుమ మామోముచూచి నవ్వేవిక్కడను

చ. 2: కొమ్మను లోనికినంపి కొలువున్నాఁడవు యీాడ
వుమ్మగిలు నికాఁకలకోపునా ఆపె
చెమ్మఁ జెమటలతోడ చేసన్న సేసేనబల
పమ్మి మాకునుడిబడి పనులుచెప్పేవు

చ. 3: దోమతెర వేయించి తొంగిచూచేవిందరిని
వోముచు నీవేసాలకోపునా ఆపె
ఆముకొని శ్రీవేంకటాధిప నిన్నింతి గూడె
వేమారు మమ్మిక్కడను వీడేలడిగేవు

రేకు: 0143-4 మాళవిగౌళ సంపుటం: 07-252

పల్లవి: ఎవ్వరినేల తడవేవీడ వారేమిసేతురు
జవ్వనపాయముమీఁద సడివేయవే

చ. 1: మందలించి మాతోనేల మాటలకు వచ్చేవు
కందువలు పతినడుగవే నీవు
అంది వుండఁబట్టకుంటే ఆతని నిన్నుఁగూర్చిన
ముందరి మరునికే మొరవెట్టవే

చ. 2: యిల్లురికి మాతోనేల యీసడించ వచ్చేవు
చెల్లుబడాతనిమీఁదఁ జేయవే నీవు
పల్లదమంత గలిగితే పై పై నెడమాటలాడే
తెల్లమైన నీచెలులఁ దిట్టవే నీవు

చ. 3: సంగడిఁ గూచుండి నీవు సణఁగులేల రాల్చేవు
బంగించి యీతనిఁ దప్పుపట్టవే నీవు
రంగై శ్రీ వేంకటేశుఁడు రమించె నీతఁడు నాతో
అంగడి జాణతనములాడవే నీవు

రేకు: 0143-5 కేదారగౌళ సంపుటం: 07-253

పల్లవి: నిక్కము నాబదుకెల్ల నీచేతిది
మక్కువలు నెరవేరె మఱి యేఁటిమాటలు

చ. 1: తలఁపు నాలోనిది తగవు నీచేతిది
వలపు పదారేండ్లవయసుది
నిలువెల్లఁ జెమరించె నీవొద్దనుండాన
చెలులింకనేమని చెప్పేరు బుద్ధులు

చ. 2: సిగ్గులు నామేనివి చెనకు నీగోళ్ళది
తగ్గనియాసలు మనతమకమువి
వెగ్గళించెఁ బులకలు వేడుకలు గనమాయ
కగ్గుదేర నేమని కానుకలిచ్చేను

చ. 3: చన్నులు నావురమువి చనవు నీకౌఁగిటిది
పన్నిన పరవశాలు భావరతివి
అన్నిటా శ్రీవెంకటేశ అట్టె నన్నుఁగూడితివి
యెన్నిలేవు నీగుణాలు యెదురేది నీకు

రేకు: 0143-6 కన్నడగౌళ సంపుటం: 07-254

పల్లవి: నీకెరవుగాను నేను నీవునాపెఁ గూడితేను
రేకగా నీళ్ళుడచితే రెండయ్యీనా యెపుడు

చ. 1: నేరుపున నాపెతోడ నీవే మాటాడరాదా
చేరి నేఁబిలువఁబోతే సిగ్గువడీని
సారెఁ బ్రియముచెప్పినా సవతుల నమ్మదురా
పేరనిపాలఁ దోడంటుపెట్టితేను పేరునా

చ. 2: పంతాన నీవేకతాన బలిమిసేయఁగరాదా
చెంతలనేఁ జేవట్టితే సిగ్గువడీని
యింతటి మావంటివారి యిచ్చకాలియ్యకొందురా
కొంతైనా నినుముతోఁ గూడునా కనకము

చ. 3: వల్లెవేసి యాపెఁగూడి వావులు చెప్పుకోరాదా
చెల్లెలవంటేఁ దాను సిగ్గువడీని
యిల్లిదె శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వొళ్ళుఁబెట్టిన సొమ్ములు వొద్దికెఁగూడుండవా

రేకు: 0144-1 శ్రీరాగం సంపుటం: 07-255

పల్లవి: బాపు బాపు నాతపసు ఫలియించెను
యేపున నీచెప్పినట్టే యిఁకనుండే నేను

చ. 1: మచ్చరము నాకుఁదీరె మనసెల్ల నొక్కటాయ
నచ్చులనాపె నీతో నవ్వఁగాను
విచ్చనవిడిఁజలఁగు వెంగెమాడ నిన్నుమటి
యిచ్చకురాలనై నీకు యిఁకనుండే నేను

చ. 2: వేడుకలు నాకుఁబుట్టె వెరపులిన్నియుఁ బాసె
కూడా నీతొడపైనాపె కూచుండఁగాను
వోడక సిగ్గువిడువు వుల్లసాలాడ నిన్ను
యీడనె సతమై నీకు యిఁకనుండే నేను

చ. 3: తారుకాణ నాకువచ్చె దయపుట్టె నాలోన
చేరి కౌఁగిలించి యాపె చెనకఁగాను
యీరీతి శ్రీవేంకటేశ యిటునన్నుఁ గూడితివి
యీరసము మానెఁ బాయకిఁకనుండే నేను

రేకు: 0144-2 గుజ్జరి సంపుటం: 07-256

పల్లవి: ఒక్కటే విన్నపము వొచ్చెములేనిమాట
యెక్కువగా నిందరిలో నేలవయ్య మమ్మును

చ. 1: యెగదిగఁబోసితేను యెంతేసినేరవు నీవు
జిగిఁ బనిగొనేవారిచేతిదేకాక
బిగిసి కామినులకుఁ బిండంతే నిప్పటి నీవు
యెగసక్కెములు మాని యేలవయ్య మమ్మును

చ. 2: ఇచ్చకములాడితేను యేపని సేయవు నీవు
కొచ్చికొసరేటివారి కొలఁదేకాక
నిచ్చలుఁ గామినులకు నీరు కొద్ది తామెరవు
యెచ్చరిక తోడ నీఁకనేలవయ్య మమ్మును

చ. 3: యియ్యకోలై నడచితే నెందరిఁ గూడవు నీవు
నెయ్యానఁ బెండ్లాడేవారి నేమమేకాక
కొయ్యవై శ్రీవేంకటేశ కూడితివి నన్నునిట్లే
యెయ్యెడఁ బూఁపలే పిందెలేలవయ్య మమ్మును

రేకు: 0144-3 సామంతం సంపుటం: 07-257

పల్లవి: ఆఁటదానిబలువిది ఆడుకోనేమున్నది
కూటములు గలిగితే కొంగువట్టి తీసును

చ. 1: కూరిమిగలుగు సతి కోపగించుకొంటేను
పేరడి కన్నీరు నించు ప్రియుని తోను
ఆరీతి నాఁబడికత్తెయైతే మఱియొకతె
నేరుపుతోడ నూరకే నెటికవిరుచు

చ. 2: యేఁపిన విభుఁడువచ్చి యెదుట నిలిచితేను
దాపుగఁజేయెత్తిమొక్కి తలవంచును
రావుతోడ వేరొకతె రాజసమైనది యైతే
తీపుల మోవి మీఁద తిట్టులెల్లాఁదిట్టును

చ. 3: ఆసపడ్డ మగువను ఆయములంటితేను
నేసవెట్టి లోనౌను సిగ్గుతోడను
యీసుదీర శ్రీవేంకటేశ ననుఁబోఁటిదైతే
వాసికి నిన్నుఁగూడి వలపెల్లా నింతును

రేకు: 0144-4 శ్రీరాగం సంపుటం: 07-258

పల్లవి: నెపములన్నియు నీవు నేరిచినవే
కపటాలు మాయెడకు గడించకువయ్యా

చ. 1: చిగురువంటిది మేను శిలవంటిది మనసు
యెగసక్యములు మాతోనేలయ్యా
నగవువంటిది తమి నాముపంటిది వలపు
తగవులఁబెట్టి మాతో తక్కించకువయ్యా

చ. 2: అద్దమువంటి వయసు అమ్ముపంటికోపము
సుద్దుల మా మనసేమి సోదించేవయ్యా
పొద్దువంటిదడియాస పూఁసవంటిది గుణము
గద్దించి మమ్మేల నీవు కైకొలిపేవయ్యా

చ. 3: చుట్టమువంటిది వావి సూదివంటిది చూపు
చెట్టువట్టి మమ్మునేల చెనకేవయ్యా
యిట్టె శ్రీ వేంకటేశ యెనసితివిటు నన్ను
పట్టిన పంతముదక్కెఁ బదరకువయ్యా

రేకు: 0144-5 కాంబోది సంపుటం: 07-259

పల్లవి: ఏమిగాఁ జూచితివి నన్నెంతసేసేవయ్య్య నీవు
కామించి రతులలోనే కనేవు నాజాడలు

చ. 1: చిన్నారి పొన్నారినాటి చీరలలో సిగ్గులా
కన్నెనైన నామంచి కను చూపులు
వెన్నలు దొంగిలేనాటి వెఱ్ఱిగొల్లెతలలో నీ
సన్నల నాతోడి నీసరసాలు

చ. 2: పసులఁ గాచేనాటి బాఁపెతల విందులా
ముసరే తుమ్మెద నామోవితీపులు
సిసువవై యెమునలోని చీఁకటి నీ తప్పులా
యెసఁగిన నాతోడి యియ్యకోలుఁ జాఁతలు

చ. 3: బలిమి రుక్మిణిఁదెచ్చి పైకొన్న నీకూటమా
చెలరేఁగినట్టి నాసేసపెండ్లి
యెలమి శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అల పదారువేలతో అంకెలా నాలంకెబు

రేకు: 0144-6 శంకరాభరణం సంపుటం: 07-260

పల్లవి: నీవాడినదే మాట నేఁజేసినదే చేఁత
యీవిధాన మనలోన యెరవులు గలవా

చ. 1: చిత్తమెల్ల నీసొమ్ము సిగ్గులివి నాసొమ్ము
మత్తిలి పూవుటమ్ములు మరునిసొమ్ము
కొత్తగా నీవు నేను కుప్పలుసేసుకొంటిమి
యిత్తల నీకును నాకు హెచ్చుకుందులున్నవా

చ. 2: మొక్కులెల్ల నీపాలు మోవినవ్వు నాపాలు
చిక్కి యెడమాటలు చెలులపాలు
తొక్క మెట్టుగాను మనము దొరయఁ బంచుకొంటిమి
కక్కసించి చూచితేను కడమలిందున్నవా

చ. 3: వినయాలు నీచేతివి వేగిరాలు నాచేతివి
అనువైన యాసలు పాయముచేతివి
ఘనుఁడ శ్రీవెంకటేశ కలిసితిమింతలోనె
చనవుల రతులలో జంపులు మరున్నవా

రేకు: 0145-1 బౌళి సంపుటం: 07-261

పల్లవి: ఇందరూను జూడఁగానే యింతసేతురా
చెందమ్మిరేకుల కొన చేపలాయ నేఁడు

చ. 1: చేరి సిగ్గువడఁగానె చెయిపట్టి తీసేవు
సారెకును మగవానిజాడగా యిది
తేరకొన మెత్తనైతే దిగఁబడేదన్నమాఁట
యేరా నీవల్లఁగంటిమిదివో నేఁడు

చ. 2: గద్దించి జంకించఁగానె కళలంటఁ జూచేవు
వొద్దనున్న రమణుని వోజగా యిది
అద్దుకొని మాఁటలలోనంటు బచ్చలన్నమాట
తిద్ది నీవద్దనున్నది తేరకొన నేఁడు

చ. 3: పయ్యద దొలఁగఁగానె పట్టేవు కుచములు
నెయ్యపు విటునికెల్ల నేర్పుగా యిది
గయ్యాళిరతిఁ గన్నదే కందికుడుమన్నమాట
నియ్యందే శ్రీవేంకటేశ నిజమాయ నేఁడు

రేకు: 0145-2 శుద్ధవసంతం సంపుటం: 07-262

పల్లవి: పోపో నీకిదియేమి పొద్దువోదు
తీపులు చూపి మమ్ముఁ దియ్యకురా యిఁకను

చ. 1: ఒల్లనివాఁడవు మమ్మునూరకేల పిలిచేవు
మల్లాడి మాపైమనసు మరవరాదా
బల్లిదురాలాకెగొన్న బాసదప్పినాఁ దప్పీ
పల్లదాననిఁక నీవు పట్టకురా మమ్మును

చ. 2: ఇంటికి రానివాఁడవు యేడనైన నవ్వనేల
వెంటనే మాతో తగులు విడువరాదా
గొంటరై యిందుకునాపె కోపగించినా కోపించీ
అంటి ముట్టి సరసములాడకురా యిఁకను

చ. 3: పంతపువాఁడవు మమ్ము పట్టి కౌఁగిలించనేల
అంతయు నాపెనే పోయి అడుగరాదా
చెంతనే శ్రీవెంకటేశ చేకొని నన్నుఁగూడితి
వింతకంటె రతినలయించకురా నీవు

రేకు: 0145-3 పాడి సంపుటం: 07-263

పల్లవి: ఊరకున్న వారినేల వుప్పటించేవే
దూరులేక దూరితేను దోసముగాదా

చ. 1: ఎక్కడికెక్కడి సుద్దులేదో మనసునఁబెట్టి
చక్కఁ జూడనైతినంటా సాదించేవు
వొక్కట్టిపై వొక్కటివేశూరకె వాదడిచితి
అక్కరతోఁ జేయివట్టితే అపరాధమా

చ. 2: పనిలేని పనులకు పంతములెక్కించుకొని
చనవుననవునంటా సాదించేవు
అనుమానములకుఁగా అట్టెవొలలు వేసితి
నినుఁ గాగలించితేనే నేరమాయనా

చ. 3: తమకమెడలేనిది తనువునఁ బెట్టుకొని
సమమోహము లేదంటా సాదించేవు
భ్రమదీర శ్రీవెంకటపతినంటా నన్నుఁగూడి
జమళిఁ బాయవు నేఁడు సంతోసించితివా

రేకు: 0145-4 దేశి సంపుటం: 07-264

పల్లవి: ఏల మమ్ముఁ దడవేవు యింకానయ్యా
యేలితివి నాఁడెనాఁడె యెరుఁగుదుమయ్యా

చ. 1: చిత్తములో చింతలెక్కి చిగురులు గోసేవారు
అత్తి నిన్ను వెదకేరు అదిగోవయ్యా
వొత్తిలి నవ్వులు నవ్వి వొడుళ్ళు నించేవారు
బత్తులు సేసేరు నీకుఁ బైకొనవయ్యా

చ. 2: మించులమాటల మంద మిరియాలు చల్లేవారు
అంచుల నిన్నుఁబిలిచేరాలకించవయ్యా
పొంచి నీతో జాళెలేక బొమ్మరాలు వేసేవారు
ముంచి చేతులు చాఁచేరు మొగిఁజూడవయ్యా

చ. 3: తోడనెసరెత్తి లేళ్ళఁ దోలేటియట్టివారు
యీడనే విందులు చెప్పేరియ్యకోవయ్యా
కూడితి శ్రీవెంకటేశ గొబ్బున నిదె నేఁడు
వాడికెగా కొంతగొంత వారిమెచ్చవయ్యా

రేకు: 0145-5 సౌరాష్ట్రం సంపుటం: 07-265

పల్లవి: బలు నీ నేమము చూచి ప్రత్యక్షమయితి నీకు
అలమి నాకౌఁగిటనే అనుభవించవయ్యా

చ. 1: కొమ్మచన్నులకౌఁగిలి కొండలమీఁది తపసు
సమ్మతిమాటలే మంత్రజపములు
పన్నిన నిట్టూర్పులే ప్రాణాయామములు
నెమ్మది మాకూటములె నిండుయోగాలు

చ. 2: సారె సారె వీడేలు శాఖాహారములు
సారమైన సిగ్గులు పైపై సన్యాసాలు
ఆరయఁ బరవశాలు అందిన బ్రహ్మానందాలు
తీరనితనుభోగాలు దేవపూజలు

చ. 3: బొడ్డు హోమపుగుంటలు పొంగుఁజెమటలు నేయి
అడ్డములేని సరసాలాచారాలు
వెడ్డువెట్టి కూడితి శ్రీవేంకటేశ నన్నునిట్టే
వొడ్డిన తమకములే వున్నతపదవులు

రేకు: 0145-6 నాదరామక్రియ సంపుటం: 07-266

పల్లవి: అందుకుంటే గెలిచితివౌనే నీవు
సందడినెప్పుడు నీవు చనవులిచ్చేవో

చ. 1: కూరిమి నీయెలుఁగులు కోవిలకూఁతలును
వోరలేకని చందాలొక్కటందురు
ఆరితేరి ఆరునెల్లకైనాఁ బలుకవని
పేరుకొన్నా నీవైతే బీరానఁ బలుకవు

చ. 2: కమ్మిన నీ కన్నులును కలువ పూవులును
నెమ్మదిని వొక్కతోడునీడలందురు
పమ్మి వికసించు మాపటికవి నీవైతే
వుమ్మడి నే వొద్దనుంటే వొక్కింతాఁ జూడవు

చ. 3: అంది నీ చేతులుఁ దీగెలవి వొక్కసరందురు
కందువనరడునవి కౌఁగలించవు
చెంది కూడితివింతలో శ్రీ వేంకటేశుఁడనని
ముందునేనంటితేఁ గాని మొనగోరు మోపవు

రేకు: 0146-1 భైరవి సంపుటం: 07-267

పల్లవి: ఏమి సేతువు నీవు యిందరికిఁ గలిగినదే
నీమనసుకిచ్చకమే నేర్తు నేనయ్యా

చ. 1: తగులు గలవారికిని తమకములె చెలరేఁగు
యెతగసక్కెమాడినా యెగ్గులేదు
పగటు నగవులె కాని భయమించుకా లేదు
అగడుసేసీఁక నిన్ను నాడనేలయ్యా

చ. 2: ఆసగలవారికిని అంగములెరఁగరావు
దోసమని పుణ్యమని తోఁచదొకటి
వేసటించుకలేదు వెంటవెంటనె తిరుగు
కోసి రాచిఁక నిన్నుఁ గొసరనేలయ్యా

చ. 3: చవులు గలవారికిని సమరతులె పనులగును
దివములును రాత్రులు తెలియదెప్పుడును
ఇవలనిదె శ్రీ వేంకటేశ ననుఁ గూడితివి
జవళి నీతో మాకు చలములేలయ్యా

రేకు: 0146-2 కేదారగౌళ సంపుటం: 07-268

పల్లవి: ఇంతవాఁడవు గాకున్న యిన్నినేల సేసేవు
చెంతల నీసరితెలు చూచేనింతేకాక

చ. 1: వొట్టుక నేనేమనిన వూరకే వున్నాఁడవు నీ
గుట్టుతోడిచేఁ తలకు కొసరా యిది
యిట్టె నే నెంతసేసినా యించుకాఁ గోపగించవు
తిట్టమై చిన్ననాఁడె సాదించితివో యిది

చ. 2: తప్పక చూచితే నట్టే తలవంచుకుండేవు
వొప్పుగా నీవొళ్ళుఁ గలవోజా యిది
తప్పు నీపై మోపినాను తగినంతే నవ్వేవు
చప్పఁగాని నిజగడుసుఁ జదువా యిది

చ. 3: కందువ నేఁగూడఁగాను కలకల నవ్వేవు
దిందుపడ్డ నీ తరితీపా యిది
అందగాఁడ శ్రీ వేంకటాధిప నన్నుఁ గూడితి
విందుల నీ విటరాచవిద్దెలా యివి

రేకు: 0146-3 బౌళిరామక్రియ సంపుటం: 07-269

పల్లవి: మేలుగా నీ మేకులు
వాలుఁజూపులట్టే పంచేవు

చ. 1: చెంది నిన్నాతఁడు చెనకఁగా యేమే
కందువలంటక కసరేవు
యిందులోనే కొన్నియెమ్మెలా విడె
మంది యిమ్మనఁగ నలసేవు

చ. 2: పేరుకొని నిన్నుఁ బిలువఁగా యేమే
కూరిమి గొసరక కొంకేవు
నేరుచుకొంటివే నిన్నిట్లూ పతి
గోర గీరితేను గొణఁగేవు

చ. 3: నిండుఁగాఁగిట నించఁగా చన్నుఁ
గొండలనొత్తక గునిసేవు
అండనే శ్రీవేంకటాధీశుఁడు గూడె
మెండుకొనఁగానే మించేవు

రేకు: 0146-4 శుద్ధవసంతం సంపుటం: 07-270

పల్లవి: చిత్తము వచ్చినట్టల్లా సేతువుగాక వోరి
పొత్తుల నీబాసలకు పూఁటయేది

చ. 1: రొట్టెకును రేవేది రుచిగొనుటేకాక
వొట్టిన నీ కోరికలకొడియేది
వెట్టికిని వెలయేది వివరించి చూడఁబోతే
గుట్టుతో నీవిద్యలకు గురియేది

చ. 2: చక్కెరకు మొదలేదిసంతసించుకొంటగాక
మిక్కిలి నీనవ్వులకు మేర యేది
చుక్కలకు లెక్కలేవి చూచుటింతేకాక నీ
అక్కజపు సుద్దులకు అవుఁగాములేవి

చ. 3: కప్పుర విడెములోన కారమెంచఁ జోటేది
గుప్పెటి నీఁకాగిటిలోఁ గొసరేది
అప్పుడె శ్రీ వేంకటేశ ఆలమేలుమంగ నేను
దప్పిదీరఁ గూడితివి తతియెంచనేది

రేకు: 0146-5 శ్రీరాగం సంపుటం: 07-271

పల్లవి: వనితపాలికిని దేవరవు నీవు
వనమె జవ్వనమిందె వరమియ్యవలెను

చ. 1: ముదితకు నీతోమాట మోహనమంత్రము
చదరపు నీవురము జపశాల
మదిలోన నీరూపు మరవని ధ్యానము
వదలరాదిఁక నీవు వరమియ్యవలెను

చ. 2: పడఁతికి నీశయ్య బలుపుణ్యక్షేత్రము
వొడలిచెమట నీపై హోమకృత్యము
అడరుమోవితేనెలు ఆరగింపు నవేద్యాలు
వడిఁ జేకొనిఁక నీవు వరమియ్యవలెను

చ. 3: కామినికి నీకూటమి ఘనదివ్యయోగము
నేమపుఁ బరవశము నిజానందము
ఆముక శ్రీవేంకటేశ ఆపె నీవుఁ గూడితిరి
వాములుగా నింకానిట్టే వరమియ్యవలెను

రేకు: 0146-6 మధ్యమావతి సంపుటం: 07-272

పల్లవి: ఏల నాతోఁ గరాళించి యిది వో తప్పు
యీలకూరకుప్పు చాలదిదివో తప్పు

చ. 1: మరఁగున నాపె నీతో మాటలెల్లఁ జెప్పఁగాను
యెరఁగక వింటిమి యిదివో తప్పు
మెరయఁగ సరసము మీఁదమీఁదనాడఁగాను
యెరుకతో వద్దనుంటిమిదివో తప్పు

చ. 2: చెక్కు నొక్కి ఆపె నీతో చేఁతలెల్లాఁ జేయఁగాను
యెక్కుడుగా నవ్వితిని యిదివో తప్పు
వక్కణించి నీతోఁ దన వలపులు చెప్పఁగాను
యిక్కువలు గరఁగితి యిదివో తప్పు

చ. 3: మెచ్చి తనచన్నులు మీఁదనట్టె మోపఁగాను
యెచ్చరిక సేసితివి యిదివో తప్పు
నచ్చుల శ్రీ వేంకటేశ నన్ను నీవు గూడఁగాను
హెచ్చి తన్నునడిగితి యిదివో తప్పు

రేకు: 0147-1 కేదారగౌళ సంపుటం: 07-273

పల్లవి: ఎప్పుడును గుట్టుతోడి యిల్లాండ్లము నేము
వొప్పుగ సిగ్గు విడువనోజగాదు మాకును

చ. 1: మాటమాటలను నీకు మనసిచ్చి మెచ్చి యాపె
కాటుకకన్నులఁ జూచి కరఁగించీని
తేటలు నేరుచునాపె తేలించనోపునాపె
యేఁటికి యవ్వరిపొందులేమిబాఁతి యిఁకను

చ. 2: చేయివేసి చేయివేసి చెక్కునొక్కి చేత మొక్కి
మాయపు నవ్వులు నవ్వి మరిగించీని
చాయలకు వచ్చునాపె సరసములాడునాపె
ఆయనాయ పున్నసుద్దులాడనేల యిఁకను

చ. 3: వలపులు చల్లిచల్లి వాడికెగా నిన్నుఁగూడి
యెలయించనేర్చునాపె యిన్నిటానాపె
అలరి శ్రీ వేంకటేశ అప్పటి నన్నుఁగూడితి
తొలుతటిసుద్దులేల దొమ్ములేల యిఁకను

రేకు: 0147-2 మాళవిగౌళ సంపుటం: 07-274

పల్లవి: ఇన్నిటా నీవేకరాజ్యమేలుదు గాక
మన్ననకాంతవైతివి మరి యాలే వెలితి

చ. 1: ఈతల నీరమణుఁడు యే పొద్దు చూచిననిట్లే
చేతికి లోనై యుండగఁ చింతలేలా
కాతరపుఁజెలులెంత కాతాళించి దూరినాను
యేతులనందువుగాక యిఁకనేలే వెరపు

చ. 2: చెప్పినట్టుల్లాఁ జేయ చేరి యాతఁడు గలఁడు
చిప్పిల నీవు చెయిసేసుకోనేలే
పుప్పతిల్లి సవతులు వొరసి యెంత చూచినా
నెప్పుననుందువుగాక నీకేలే వెరపు

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేకొని నిన్నుఁ గూడి నీ
భావములోనుండఁగాను పదరనేల
వేవేలకునిందరును వెగటువాయ మొక్కిరి
చేవ మీరి నీచేఁతలే చెల్లనేలే వెరపు

రేకు: 0147-3 పాడి సంపుటం: 07-275

పల్లవి: తొల్లి నేఁజేసిన గురుతులంటానేలాడేవు
తెల్లమిగనింక నీవు తెలుకోవయ్యా

చ. 1: మచ్చికనెవ్వతో నీమంచిరూపు గోడ వ్రాసి
నచ్చుల చూపులు నీమై నాఁటించఁబోలు
ఇచ్చుట నీతనువుననింతటా రేకలు నిండె
చెచ్చెర మీఁదటిమాఁట చింతించుకోవయ్యా

చ. 2: పొంచి మరెవ్వతో నిన్నుఁ బొందుగా మాఁకునఁజేసి
చుంచుల నీమోవి చవిచూడఁబోలును
అంచల నీయధరాననవిగో కెంపులు నిండె
దించి ఆవొచ్చాలు నీవే తీరుచుకోవయ్యా

చ. 3: బత్తితో నెవ్వతో నిన్ను బయలు దలఁచి యాడ
వొత్తి కాఁగలించుకొని వుండఁబోలును
ఇత్తల శ్రీ వేంకటేశ ఇటు నేఁ గాఁగిలించితి
హత్తి నిందలాడితి నీకవి యేఁటికయ్యా

రేకు: 0147-4 మధ్యమావతి సంపుటం: 07-276

పల్లవి: పంతపుఁ జెలులలోన భాగ్యము నాది
యింతటిదాననై రూఢికెక్కితి నేనమ్మా

చ. 1: పవళించి వుండినాను పాదము నామీఁదనే
కవగూడనుండినాను కాఁక నామీఁద
అవలఁ బొరకై యున్న హస్తము నామీఁదనే
యివల నాపతిమోహమేమి చెప్పేనమ్మా

చ. 2: తలవంచుకుండినాను తలఁపు నామీఁదనే
పలుకకుండిన నాసబాస నామీఁద
కొలువులోనుండినాను గురుతు నామీఁదనే
యెలమి నాపెద్దరికమేమి చెప్పేనమ్మా

చ. 3: పనిగలిగుండినాను పక్షము నామీఁదనే
మనవి వింటానున్నా మర్మము నామీఁద
అనువై శ్రీ వేంకటేశుఁడన్నిటాను నన్నుఁగూడె
యినుమడించె వలపులేమిచెప్పేనమ్మా

రేకు: 0147-5 పాడి సంపుటం: 07-277

పల్లవి: తనకేమి విచారమే తా నిన్నిటా బలువుఁడు
మనసునఁ బెట్టి మమ్ము మన్నించుమనవే

చ. 1: యేళ్ళవెనుకచాలు యెదుటనే ఫలియించె
రాళ్ళపై నడపులు రట్టుకెక్కెను
తాళ్ళపై చప్పుడుకు తగనిమూకలుగూడె
నీళ్ళపైఁ జొప్పులనె నెరవేరెఁ బనులు

చ. 2: కొండపైఁ బుట్టినవాడు గొప్పయమ్ముమొనఁ దీరె
యెండ పంటివానికులమేలె లోకము
వెండిశికరమువాని వెట్టియీవి తుదముట్టె
పండనికూటివారికి వైపాయఁ బనులు

చ. 3: పాముశిరసుపైసొమ్ము బలురామరాజ్యమాయ
దోమటివిందులవాదు దొడ్డవారైరి
సేమముతోనుండనీవె శ్రీ వెంకటేశుఁడు దాను
తామసములెల్లఁ బాసె దక్కెనీకఁ బనులు

రేకు: 0147-6 వరాళి సంపుటం: 07-278

పల్లవి: నిన్నుఁ బాసియు నీపతి నీవద్దనున్నాఁడనంటా
పన్ని నీరూపుదలఁచి భావరతి సేయును

చ. 1: పట్టెమంచముకోటిగుబ్బలు నీచన్నులంటా
పట్టి పట్టిచూచి మోమప్పుళించుకొను
అట్టె చిన్నిమలగు అదియె నీమేనంటా
బెట్టి కాఁగలించుకొని బిగియించు సారెకు

చ. 2: మడిచి యిచ్చినయాకు మగువ నీమోవంటా
పడఁతిచేనందుక చప్పరించును
ముడిచిన మేలుకట్టు మొల్లలదండలు నీ
కడగంటి చూపులంటా ఘాతఁ బైపైఁ జూచును

చ. 3: కప్పిన దుప్పటికొంగు కాంత నీపయ్యదంటా
తప్పితారి బలిమిని తన్నుఁదానె తీసును
చెప్పరానిమోహముతో శ్రీ వేంకటేశుఁడు గూడె
యిప్పుడిట్టె నీవురాఁగా ఇదే నిజమాయను

రేకు: 0148-1 గుండక్రియ సంపుటం: 07-279

పల్లవి: చెలువుఁడ చూడుమా యీ చెలియసింగారము
మెలఁగి మెలఁగి మంచిమేలెల్లాఁ గూడెను

చ. 1: గక్కన సంపెంగపూవు కలువలు దామరయు
నొక్కట నీచెలిమెమ్మై యొనగూడెను
పక్కన వజ్రములును పగడాలు నీలములు
అక్కరతోఁ గడుకొని అందుకే తోడాయను

చ. 2: కొండలును దీగెలును గుహలోని సింహమును
మెండుకొని యీవనితమేనాయను
గండుఁదుమ్మిదల చేరుఁ గనకము శంఖమును
అండనె పొత్తుగలిసి యందుకుఁ దోడాయను

చ. 3: చిగురును నరంట్లు చిత్తజుబండికండ్లు
తగనింతిపిరుఁదుఁ బాదాలుఁ దొడలై
నిగిడి శ్రీ వేంకటేశ నీకు మంచివస్తువుల
వగలలమేలుమంగ వనితయ్యై కూడెను

రేకు: 0148-2 వరాళి సంపుటం: 07-280

పల్లవి: నెలమూఁడు శోభనాలు నీకు నతనికిఁ దగు
కలకాలమును నిచ్చకల్యాణమమ్మా

చ. 1: రామనామమతనిది రామవు నీవైతేను
చామన వర్ణమతఁడు చామవు నీవు
వామనుఁడందురతని వామనయనవు నీవు
ప్రేమపు యిద్దరికి పేరుబలమొకటే

చ. 2: హరి పేరాతనికి హరిణేక్షణువు నీవు
కరిఁ గాచెఁ దాను నీవు కరియానవు
సరిఁ దా జలధిశాయి జలధికన్యవు నీవు
బెరసి మీ యిద్దరికిఁ బేరుబలమొకటే

చ. 3: జలజనాభుఁడతఁడు జలజముఖివి నీవు
అలమేలుమంగవు నిన్నలమెఁ దాను
ఇలలో శ్రీ వేంకటేశుఁడిటు నిన్నురాన మెచె
పిలిచి పేరుచెప్పెఁ బేరుబలమొకటే

రేకు: 0148-3 మంగళకౌశిక సంపుటం: 07-281

పల్లవి: ఆదిమపురుమనియండ నదే
సోదించి చూచిన సుదతై నిలిచె

చ. 1: పున్నమచంద్రుఁడు పొడచెనల్లదివొ
పన్నిన తుమ్మెదపొఁజులవే
సన్నపుమదనుని శంఖమునల్లదె
యెన్నిక వట్టఁగ నింతై తోఁచె

చ. 2: జక్కవపులుగులు జడిసీనల్లవె
తెక్కుల నిరుదెసఁ దీగెలవే
యిక్కువబయలదె యిసుకదిబ్బలవె
చక్కజాడగా సతియై తోఁచె

చ. 3: సరిననంట్లు రాజనపుఁ బొట్టలవె
వెరవున తామరవిరులునవే
యిరవై శ్రీవెంకటేశ్వరుకాఁగిట
మరిగిన యలమేల్మంగైతోఁచె

రేకు: 0148-4 దేశాక్షి సంపుటం: 07-282

పల్లవి: నవరములదీనళినాక్షి
జవకట్టి నీకుఁ జవిసేసీని

చ. 1: శృంగారరసము చెలియమొకంబున
సంగతి వీరరసము గోళ్ళ
రంగగు కరుణారము పెదవులను
అంగపుఁ గుచముల నద్భుతరసము

చ. 2: చెలి హస్యరసము సెలవుల నిండీ
పలుచని నడుమున భయరసము
కలికి వాడుఁగన్నుల బీభత్సము
అలబొమ జంకెన నదె రౌద్రంబు

చ. 3: సతిరతిమరపుల శాంతరసంబదె
అతిమోహము పదియవరసము
ఇతవుగ శ్రీ వెంకటేశ కూడితివి
సతమై యీపెకుసంతోసరసము

రేకు: 0148-5 కేదారగౌళ సంపుటం: 07-283

పల్లవి: ఎట్టి బాలుఁడు పుట్టెనే యశోద నీకు
వుట్టిపడీనింతలేసికోపనమ్మ నేను

చ. 1: సారెఁ జంకనిడుకొంటే చన్నులకే చెయి చాఁచీ
నీరీతి వీనినెత్తుకోనిందుకే నేను
కోరి తొడలపైనిడుకొని బాల్పోయఁగా నవ్వీ
ఆరసి వీనిదగ్గరనందుకే నేను

చ. 2: ముద్దుపెట్టుకొనఁబోతే ముంగురులు చుట్టి పట్ట
వొద్దికి రాసయించదు ఓయమ్మ నేను
గద్దించి చెక్కునొక్కితే కాఁగలించి విడువఁడు
చద్దివేఁడి వీనిపొందు చాలు (ల?) నమ్మ నేను

చ. 3: అప్పులప్పలనఁబోతే నంగమెల్లా మరపంచీ
ఇప్పుడేమి సేకొంటినిస్సీ నేను
అప్పఁడు శ్రీ వెంకటేశుఁడన్నిఁ దానె యెరుఁగు
చిప్పిలి యాచేతలెఁ జెప్పఁజాల నేను

రేకు: 0148-6 శంకరాభరణం సంపుటం: 07-284

పల్లవి: తినరాని కొనరాని దేవలోకపుఁబండు
మనసునఁ దలఁచితే మరిగించే పండు

చ. 1: పంటకెక్కి పాలవెల్లిఁ బండిన పాలపండు
తొంటిగొల్లెతల మెవి దొండపండు
అంటుకొన్న మేనిచాయ అల్లునేరేడుఁబండు
ముంటిసింహపుగోళ్ళ ముండ్లపండు

చ. 2: ఇచ్చల వేదశాస్త్రాలు దెచ్చిన పేరీఁతపండు
తచ్చిన దైత్యమారి దేవదారుఁబండు
పచ్చిదేర మెరిసిన బండిగురువిందపండు
యిచ్చవలెనన్న వారియింటనంటిపండు

చ. 3: తెమ్మగా మునులపాలి తియ్యనిచింతపండు
తెమ్మల సిరివలపుఁదేనెపండు
యిమ్ముల శ్రీ వెంకటాద్రినింటింటిముంగిటిపండు
కొమ్మల పదారువేల గొప్పమామిడిపండు

రేకు: 0149-1 సామంతం సంపుటం: 07-285

పల్లవి: నీ విభుఁడు వచ్చుదాఁక నిచ్చలాన నుండే వే
వేవేలకును రేయి వేగించలేమే

చ. 1: పూయకు కస్తూరి మేనఁ బొద్దుగూఁకెఁ జీఁకటంటా
నోయమ్మ చందురుఁడుదయించెను
చాయల వెన్నెలదాఁకి చల్లజంపు యెండలంటా
ఆయెడ నీవు వేఁగఁగ నదిచూడలేమే

చ. 2: గందము పుయ్యకువే కలికి నీకుచములే
చందనపుఁ గొండలంటాఁ జల్లీ గాలి
అందులో పూవుతావి దాఁకి అమ్ముమొనలంటెనంటా
మందమై మేనుమరవఁగ మందులుదేలేమే

చ. 3: వద్దేలే కుంకుమలు వసంతపుఁ జిగురంటా
నద్దితేఁ గోవిల భూతమని లోఁగేవు
నిద్దపు శ్రీ వెంకటాద్రినిలయుఁడిట్టె కూడె
యిద్దరి మీవలపులు యింక నెంచలేమే

రేకు: 0149-2 ముఖారి సంపుటం: 07-286

పల్లవి: ఉవిదకు వొకట్గైతే వొకటిగాదు
వివరించి చూడవయ్యి విరసముగాదు

చ. 1: చెమటల యేరు వారి చింతలచెరువు నిండె
కమలాక్షికిది వానకాలముగాదు
జమళిఁ జంద్రోదయమై చకోరములు దనిసె
అమరె శారదసమయమునూఁ గాదు

చ. 2: కన్నీటిమంచు గురిసి కరపల్లవాలు ముంచె
కన్నెకిది హేమంతకాలము గాదు
వెన్నెల నవ్వుచల్లితే వెళ్ళె జాజిపులకలు
విన్నకన్నశిశిరపువేళయుఁ గాదు

చ. 3: వలపులు చిగిరించె వసంతరుతువుఁగాదు
వెలసె విరహపెండ వేసవి గాదు
అలమేలుమంగఁ గూడితపుడె శ్రీ వెంకటేశ
మలయు నీమన్ననలు మరుపేరాదు

రేకు: 0149-3 రామక్రియ సంపుటం: 07-287

పల్లవి: ఒకటిఁ బోలిచిన వేరొకటి మరి తోఁచీని
సకలముఁ బోలిచేము సతిసింగారములు

చ. 1: కలువలుఁ జకోరాలు గండుమీలుఁ దామరలు
చలిముత్తెపుఁ జిప్పలు సతికన్నులు
అలులు నీలపుమణులంధకారము మేఘము
నలుపులరాశివో నలినాక్షితురుము

చ. 2: జక్కవలు నిమ్మపండ్లు సరిఁ బూగుత్తులుఁ గొండ
లెక్కువ మరుమిద్దెలు యింతిచన్నులు
చుక్కలు సురవొన్నలు సూదివజ్రాలు గోళ్ళు
అక్కరయేనుఁగ తొండాలరంట్లే తొడలు

చ. 3: సోగతీగెలు తూండ్లు దతి బాహువులివె
చేగ చిగురు లత్తిక చెలిపాదాలు
యీగతి శ్రీవేంకటేశ యింతి నీవురముమీఁద
బాగుగ నమరి పైఁడిపతిమఁ బోలినది

రేకు: 0149-4 సాళంగనాట సంపుటం: 07-288

పల్లవి: తనమతి నామతి తారుకాణ గాఁబోలు
వనితకు నాకునొక్కవలపే కాఁబోలును

చ. 1: పొలిఁతిరూపము మతిఁ బొలసినట్టాయ నాకు
తలఁపులో నాకె నన్నుఁ దలఁచఁబోలు
కలసి యింతి నన్నుఁ గాఁగలించినట్టాయ
కలలోననాడ నన్నుఁ గలయంగఁ బోలును

చ. 2: వనజాక్షిచూపు నాపై వడిఁ జల్లినట్టాయ
జునిగి యాకె యెదురుచూడఁబోలును
యెనసి యామగువ యెలుగైనయట్టాయ
అనుఁగుఁజెలితో నన్ను నాడుకొనఁబోలును

చ. 3: అంగన అప్పుడే నా అండ నుండినట్టాయ
రంగుగ నావద్దికిట్టె రాఁబోలును
చెంగటఁ గడితినిట్టె శ్రీవేంకటేశుఁడ నేను
పంగెననిద్దరికొక్క ప్రాణమే కాఁబోలును

రేకు: 0149-5 వరాళి సంపుటం: 07-289

పల్లవి: ఒకటికినుమడాయ వువిద నీబలఁగము
వొకఁడింతె మరునికి వొదుగనేమిటికి

చ. 1: గండుమీలవంటివి నీకన్నులు కంతునికైతే
గండుమీరనొక్కటెక్కెమే కలఁగకువే
అండనే వొంటితామర అతనిబాణముగాని
రెండుదామరలు నీరిచ్చలహస్తములు

చ. 2: చిలుకల తేరింతే చిత్తజునకు నీకైతే
చిలుకల పలుకులు సేనాసేన
అలులనారివిల్లు అతనికైతే నీకు
అలుల బొమ్మలవిండ్లవె రెండు గదవే

చ. 3: చిగురుఁగైదువ మరుచేతిదింతే నీకయితే
చిగురుఁబాదాలు రెండు చింతయేఁటికే
తగిలి యాతఁడు యేకతాననే వుండుఁ గాని
నిగిడి శ్రీ వేంకటేశు నీవు గూడితివి

రేకు: 0149-6 పాడి సంపుటం: 07-290

పల్లవి: ఇదివో యింతట వరంబీవయ్యా
కదిసి ప్రత్యక్షంబు గావయ్యా చెలికి

చ. 1: తరుణి నిన్నుఁ బెడఁబాసి తపము శాయఁగఁ దొడఁగె
విరహంపు నులిగురుల విరజడలతో
అరమోడ్పు కనుఁగొనల ఆనందములతోడ
బరువైన నిట్టూర్పు పవనముతోడ

చ. 2: ముదిత నినుఁ దలపోసి మునిమార్గమునఁ జెలఁగె
మొదల నివ్వెరపాటుమోనంబుతో
వదలని పులకగముల వనవాసములతోడ
అదనెరఁగని నిరాహరంబుతోడ

చ. 3: ఉవిద నీతోఁగూడి యోగంబు సాధించె
వివరంబుతోడ శ్రీ వెంకటేశ
నవకమగు రతుల నానావిధంబులతోడ
కవగూడియున్న చిరకాలంబుతోడ

రేకు: 0150-1 రామక్రియ సంపుటం: 07-291

పల్లవి: భ్రమయకు చెలువుఁడ పలుమారు నీ
తమకపు పట్టుపు తరుణినింతే

చ. 1: నినుఁగని వొకచెలి నిలువునఁ గరఁగెనె
కనకపు బొమ్మే కాఁబోలు
అనువున నదిగాదయితే మెదలునా
మినుకన మెరచిన మెరుఁగింతే

చ. 2: పొలఁతి నీయెదుటఁ బులకించెనొరపు
గల పుష్పలతిక గాఁబోలు
తలఁచకుమటువలెఁ దగదట్లైతే
చెలఁగి పలుకునా చిలుకింతే

చ. 3: పడఁతి నీయురముపై నెలకొనెనదె
కడఁగిన హారము గాఁబోలు
కడపట శ్రీవేంకటపతి గాదది
జడిసెటి నీ శ్రీసతి యింతే

రేకు: 0150-2 శంకరాభరణం సంపుటం: 07-292

పల్లవి: వలపులు వలపులు వయ్యాళి
చలమరి మరుఁడును సమేళి

చ. 1: నెలఁతవమోమునకు నీకనుచూపులు
నిలువున ముత్తెపు నివాళి
కొలఁదికి మీరిన గురుకుచములకును
తొలఁకు నీమనసు దువాళి

చ. 2: వనితనిండు జవ్వన గర్వమునకు
ఘనమగు నీరతి కరాళి
వెనకముందరల వెలఁదిమేనికి నీ
పెనఁగు గోరికొన పిసాళి

చ. 3: పడఁతికోరికల భావంబునకును
కడుఁగడు నీతమి గయాళి
చిడిముడి మగువకు శ్రీ వేంకటపతి
విడువనికూటపు విరాళి

రేకు: 0150-3 వరాళి సంపుటం: 07-293

పల్లవి: ఎరఁగను కపటాలు యెరిఁగి మరతురా
చిరుతపాయముదాన చిత్తము నీకెట్టిదో

చ. 1: మలసి కోపింతుఁగాని మాటాడకుండలేరా
అలసి జంకింతుఁగాని అలుగలేరా
తలఁపె తెగుదు గాని దగ్గరకుండఁగలేరా
సిలుగు నామోహమిది చిత్తము నీకెట్టిదో

చ. 2: నేరములె యెంతుఁగాని నిన్ను మెచ్చకుండలేరా
దూరి పలుకుదుఁగాని తొలఁగలేరా
ఆరసి మొక్కుదుఁగాని అవ్వలిమోము గాలేరా
చేరిన నాభావమిది చిత్తము నీకెట్టిదో

చ. 3: పచ్చిగా నవ్వుదుఁగాని పంతమియ్యకుండలేరా
గచ్చుల నీవంటితే నే కాదనలేరా
నిచ్చలు శ్రీవేంకటేశ నిన్నుఁ గూడితినిదే
చెచ్చెర నాగుణమిది చిత్తము నీకెట్టిదో

రేకు: 0150-4 శ్రీరాగం సంపుటం: 07-294

పల్లవి: సారెసారెకును నేల జంపుమాఁటలు
ఆరెఁ దేరెఁ బదరోరి ఆరడైతిఁకును

చ. 1: ఆడరాదు దొరవని ఆడకున్నఁ బోదు నిన్ను
చూడఁ జూడ నీమోవేల చుక్కలాయరా
తోడ నేఁగోరితి వెంట తొడుకులైనట్లాయ నీ
జాడలెల్లఁ గంటి వింటి చాలుఁజాలుఁ బదరోరి

చ. 2: మొదల నే నెరఁగక మోసపోతిఁగాకనే
కదిసి యేపొద్దు వద్దఁ గాచుకుండనా
యిది మింగినకడికి యింకఁ జవులెంచనేల
చెదర నీపంతమెల్లఁ జెల్లెఁజెల్లెఁ బదరోరి

చ. 3: సిగ్గులెల్లఁ దీరెఁదీరె శ్రీవేంకటేశుఁడ నేఁడు
వెగ్గళమై నీనాసంది వింతలేలరా
దగ్గరి కూడినమీఁద తలపోఁతలింకనేల నే
నగ్గలమై నీ నా కోపమారెఁదేరెఁ బదరోరి

రేకు: 0150-5 బౌళిరామక్రియ సంపుటం: 07-295

పల్లవి: ఏమనఁ గలదే యిందుకును
ఆమనినాఁడే అదవధలాయ

చ. 1: తరచగు తురుమున దాకొనె మేఘము
మెరుఁగుల కన్నుల మెరిచె నిదే
వరదల చెమటల వానలు గురిసెను
తెరవకు దప్పులు దీరకపోయ

చ. 2: పొలుపగు తనువునఁ బులకలు మొలచెను
నులిఁ గోరికలెన్నులు వెడలె
బలిమిఁ గుచంబులఁ బాలు గొనియెనిదె
తలిరుఁబోఁడి మతిఁ దనియకపోయ

చ. 3: కాంతను శ్రీ వేంకటపతి గూడఁగ
బంతిరతుల వైభవమలరె
అంతట నరగొరలన్నియుఁ దీరెను
దొంతిమదములకుఁ దుదలేదాయ

రేకు: 0150-6 కేదారగౌళ సంపుటం: 07-296

పల్లవి: చెప్పుడు మాఁటలివేల చెలులలోన మిమ్ము
మెప్పించరాదుట మీలో మీకే తెలుసును

చ. 1: చాలుకొన్న జంకెనల జగడాలు మీ
వేలికొనగోళ్ళలో విగడాలు
పాలుపుఁ గోపపు చూపుపగడాలు యివి
మేలుమేలు మీలో మీకే తెలును

చ. 2: కింకల మాటలలోని కిసరులు మీ
వుంకువకాఁకలలోని వుసురులు
కొంకనికూరిమిలోని కొసరులు మీ
మంకుల మత్సరములు మనసులే యెరుఁగును

చ. 3: పూనిన మీవలపుల పొంతనాలు నేఁడు
మానరాని కూటముల మంతనాలు
కోనల శ్రీ వేంకటేశ కొమ్మకు నీకు మీ
మేనులు సోఁకినరతి మేకే తెలుసును

రేకు: 0151-1 శ్రీరాగం సంపుటం: 07-297

పల్లవి: ఎంతని చెప్పదు నీలేమజవ్వన
మంతయు నెరుఁగు నంగజుఁడు

చ. 1: మిన్నెల్లా నిండెను మెరుఁగులే చెలి
కన్నుల మించులు గలుగఁగా
పున్నమవెన్నెల పోయెఁ జోటులేక
సన్నముగాఁ జొచ్చె చందురుఁడు

చ. 2: దిక్కుల నింతటఁ దిమిరము గప్పె
నిక్కి కొమ్మకొప్పు నెగడఁగా
చిక్కి రాతురుల చీఁకటి చెదరి
చుక్కల రాసులు చూపట్టెనే

చ. 3: ఇంతలో శ్రీ వేంకటేశు కౌఁగిటికి
నింతికుచగిరులెదుగఁగా
వంతలఁ గొండలు వానలఁ గరఁగి
యింతలింతలాయె నిన్నియును

రేకు: 0151-2 శంకరాభరణం సంపుటం: 07-298

పల్లవి: ఒకటి కొకటి పైనొరపాయ
చికురభరములో చిడిముడియాయ

చ. 1: జలజపువదనకు చాయలకన్నులు
జలజపురేకులు సహజములే
నలుపునఁ జనుపక నాసికమొకటే
కలసి కదంబపు కలబెరికాయ

చ. 2: పెనుగజయానకు పిరుఁదిబటువులే
మొనకుంభస్థలములు దొరసె
చెనసి అందుపై సింహపునడుమే
వెనక ముందరికి విరసములాయ

చ. 3: నిరతి బాహులతల నెలఁత కుచములే
విరిపూ గుత్తుల విధమమరె
ఇరవుగ శ్రీవేంకటేశుని కూటమి
పరిమళములలోఁ బరిమళమాయ

రేకు: 0151-3 కన్నడగౌళ సంపుటం: 07-299

పల్లవి: అయ్యోయేమనవచ్చునాసాస నీపతి
యేయెడఁ బాయకపోయనేమవునోయమ్మా

చ. 1: కోవిలకూఁతలు విని కొమ్మ విలిచీనంటా
దావతితో రమణుఁడు దగ్గరఁబోయి
ఆవలనొక నెమలి అంతలోనేఁగఁగఁ జూచి
వేవేగ చెలియంటా వెంటఁ గూడఁబారె

చ. 2: కీరము వేరొకచోటఁ గెలయుచునుండఁగాను
చేరఁబోయె సతియందుఁ జెలఁగీనంటా
నీరులోతామరమీఁద నిండుఁదుమ్మిదలఁ జూచి
కోరి యింతిముఖమంటాఁ గొలనిలో దుమికె

చ. 3: చెంతఁబావురాలమోఁత చెలిమంతనములంటా
సంతసానఁ బొదరింటి చాయకేఁగెను
అంతలో శ్రీవేంకటేశుఁడలమేలుమంగఁ గని
వింతరతులను గూడి విఙ్ఞవీఁగెను

రేకు: 0151-4 శ్రీరాగం సంపుటం: 07-300

పల్లవి: ఎవ్వరికిఁ బోరాదు యెదిరిఁజేసిన ఫలము
దివ్వెయై చేచేత దిష్టమౌఁగాని

చ. 1: వేమారు విరహులను వెతలఁ బెట్టిన ఫలము
కామునికి నేఁటేఁటఁ గనలవలసె
దీమసపుఁ గోవిలలు తెగువఁ బలికిన ఫలము
ఆమనియెడలదాఁక నణఁగుండవలసె

చ. 2: చందురుఁడు కాముకుల జాలిఁబెట్టిన ఫలము
కుందుచును నెలనెలకుఁ గొవరవలసె
మందానిలుండెదిరి మనసుగలఁచిన ఫలము
కందువగు శేషునికిఁ గాటియ్యవలసె

చ. 3: రావమున దంపతుల రవ్వసేసిన ఫలము
తావిసంపెఁగకలులు తలఁకవలసె
శ్రీవెంకటేశ్వరుఁడు చెలియనిటు గూడఁగా
భావమున నిన్నియును బంతమీవలసె

రేకు: 0151-5 ముఖారి సంపుటం: 07-301

పల్లవి: ఎడమాటలిఁకనేల యేమనీనే
అడుగవే చేముంచేదప్పుడో యిప్పుడో

చ. 1: విరహమే వేఁడి విరులే వాఁడి
యెరవుల రమణుఁడు యేమనీనే
దరిఁ దొక్కెఁ దలఁపు దట్టుమాయ వలపు
తరవాతిపనులింకఁ దనకో నాకో

చ. 2: తత్తరమే తరవు తాలిములు గరవు
యిత్తల రమణుఁడు దానేమనీనే
వొత్తవచ్చె మరపు వుడివోయ వెరవు
మొత్తమిఁ దనకు నాకు మునుపో వెనకో

చ. 3: పట్టినదె పంతమో పాయమిదిసంతమో
యిట్టె శ్రీవెంకటేశుఁడేమనీనే
రట్టుకెక్కెఁ గాఁగిలి గుట్టెల్ల రతికెక్కె
జట్టిగొనె తానునేను చలి మోబలిమో

రేకు: 0151-6 మాళవిగౌళ సంపుటం: 07-302

పల్లవి: కొమ్మల జవ్వనములు కోరువట్టేనా
కమ్మర మాకోరికలు గాదెఁబోసేవా

చ. 1: నామనరయనేల నన్ను నీవొరయనేల
యేమీ మాకుచగిరులెంతలెంతలాయనేమి
లేమల చక్కఁదనాలు లెక్కవా సేవా

చ. 2: ఎక్కువ నాకనుసోగలెంతలెంతలాయనేమి
కక్కసించి యందులోసుంకముగొనేవా
చక్కని నాగోళ్ళివి సరిగాని బేసిగాని
పక్కన నాతో నీవు పందెమాడేవా

చ. 3: చెంతలఁ గూడితి నన్ను శ్రీ వెంకటేశ నా
సంతసపుమోవి లంచముగొనేవా
మంతనాలు నెరుపేవు మరురాజ్యపదవికి
యింతటికి నన్నుఁ బట్టుమేలించేవా

రేకు: 0152-1 హిందోళవసంతం సంపుటం: 07-303

పల్లవి: చెప్పనేల నీగుణాలు చెలువుఁడ చాలుఁజాలు
వుప్పుదినుటాఁ గాక వుపతాపమా

చ. 1: కంటిఁ గంటి నీచేఁత కన్నులతుదలనే
వెంటనే వీనులనింక వినవలెనా
కంటకములాడ నిన్ను ఘనుఁడ నేనోపనోప
గింటెల నవ్వులలోన గిలిగింతలా

చ. 2: విరహన నీకుఁగా నే వేదనఁబొందుట గాక
వెరవెరఁగక నీతో వెళ్ళనాడేనా
నెరజాణవిన్నిటాను నీవేడ నేనేడ
వులిసిన మీఁదనింక వుడుకులునా

చ. 3: బెట్టుగాఁ గాఁగిట నిన్ను బిగియించుకొంట గాక
నట్టుకొట్టి మోవిమీఁద నసికాట్ల
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితివి నన్నునిట్లే
చెట్టువట్టి తీసి యింకాఁ జేసన్నలా

రేకు: 0152-1 శంకరాభరణం సంపుటం: 07-304

పల్లవి: ఇంకనేసుద్దులు యెరఁగమిదే
సంకె లేనికోర్కె సఫలంబాయ

చ. 1: నిలువునఁ బులకలు నిండఁగ నిండఁగ
పొలఁతి వలపు పూవక పూచె
పొలయుచు నీపేరు కిన్నెర మీటఁగ
కలికిచనుఁగవలు కాయక కాచె

చ. 2: పనివడి ప్రియములు పలుకఁగఁబలుకఁగ
ననుపుమెవి పండక పండె
ఘనమగు కాఁకల కడు చెమరించఁగ
వొనర నవరసములొలుకక వొలికె

చ. 3: సుడిగొని నీపలు సోఁకఁగ సోఁకఁగ
వడిగొని మై మరవక మరచె
యెడయక శ్రీవేంకటేశ నినుఁగలసి
పొడవుగ నిను చెలి పొగడక పొగడె

రేకు: 0152-2 రామక్రియ సంపుటం: 07-305

పల్లవి: ఇంతలోనివాఁడా తానిస్సీ వీఁడు
పంతమెల్లఁ గంటిఁజాలు పదవే వీఁడు

చ. 1: అలిగి నాతో మాటలాడనివాఁడు నా
చిలుకతో మాటలాడీ చీచీ వీఁడు
నలువంక నాతో నవ్వనివాఁడు నా
చెలితో నవ్వఁగనేలే చెల్లఁబో వీఁడు

చ. 2: వొద్దనె నామోముచూడకుండినవాఁడు నా
అద్దమేల చూచీనే అయ్యో వీఁడు
అద్దో నాకుచములు అంటనివాఁడు నా
ముద్దుఁ గిన్నెరకాయలు ముట్టెనే వీఁడు

చ. 3: పొత్తుమాని వున్నవాఁడు పొదిగి నాయడపము
పొత్తుయేల కలసీనే పోపో వీఁడు
యిత్తల శ్రీవేంకటేశుఁడింత సేసి నన్నుఁగూడె
తత్తరపువాఁడు గదే తగునే వీఁడు

రేకు: 0152-3 సాళంగం సంపుటం: 07-306

పల్లవి: ఇంతివల్ల నెపో యింతేసి
మంతనంబులే మరపై నిలిచె

చ. 1: కొండల పాడవుల కోరికలింతికి
నిండుఁగుచములై నెరిఁబెరిగె
పండిన జవ్వనభారము తరమయి
మెండుకొనఁదొడఁగె మీఁదటనెట్లో

చ. 2: ఎరగొని చెమటల యేరుల కతమున
పిరిఁది యిసుకదిబ్బలు వొదలె
తిరముగ మాటల తీపులకతమున
తెరలక యధరపుతేనెలు వడిసె

చ. 3: వెలయ వలపు మది వెదలువెట్టఁగా
పులకననలు యింపుల మొలచె
కలగొని శ్రీవెంకటపతి గూడఁగ
వెలిగోరిమణులు వేవేలాయ

రేకు: 0152-4 శంకరాభరణం సంపుటం: 07-307

పల్లవి: వరుకు మాపటంత వచ్చేఁ గాని
గెరసు దాఁటకువోయి కేశవరాయ

చ. 1: చేసన్న చాలదా చెట్టవట్టి తియ్యనేల
ఆసల నెదురుచూచే ఆఁటదానికి
రాసీఁ గుచములవి రాయడిఁబెట్టుకువోయి
సేసకొప్పుగంటుజారెఁ జెన్నరాయా

చ. 2: పదమంట చాలదా బలిమిసేయఁగనేల
కదియఁగఁ దమకించే కామినికిని
చెదరెఁ గస్తూరిబొట్టు చెరఁగు విడువవోయి
అదె నామ్మై చెమరించె హరికృష్ణరాయ

చ. 3: కాఁగిలిదే చాలదా కన్నుల మొక్కఁగనే
నాఁగువారే ననుపుల ననుఁబోఁటికి
ఆఁగి కూడితివి నన్ను అలసితి రతులలో
వీఁగేవు చెప్పల్లి శ్రీవేంకటరాయా

రేకు: 0152-5 పాడి సంపుటం: 07-308

పల్లవి: ఒకరికొకరి అన్యోన్యము చూడరే
సకలమునెరిఁగిన సరసులె వీరు

చ. 1: చెలిచంద్రముఖమునిరుల నాయకుఁడు
కలువలకన్నులఁ గడుఁ జూచె
చెలువ సూర్యతేజపుఁ బతిని మరల
జలజాక్షంబుల సతియును జూచె

చ. 2: తారని బింబాధరితో రమణుఁడు
కోరి చిలుకపలుకులఁ బలికె
తోరపు మేఘపుతురుము విభునితో
ఆరయ మయూరయానయుఁ బలికె

చ. 3: పడఁతిదేహలత ప్రాణనాథుఁడిటు
వొదలి చెమటచెరువులఁ దడిపె
కడఁగిన శ్రీవేంకటగిరిపతితోఁ
దడవి సింహమధ్యయునొనఁగూడె

రేకు: 0153-1 దేసాళం సంపుటం: 07-309

పల్లవి: ఇద్దరినేలేననీఁ బో యెనయదమ్మా యీ
సుద్దులేల యీడకే తాఁజొచ్చి రానీవమ్మా

చ. 1: ఒప్పుగనాకెను నన్నునొక్కటిసేయఁ బనిచీ
వుప్పులోఁ గప్పురమేల వొద్దమ్మా
అప్పటి నావుసురుల నాకెవుసురులఁ దన్ను
దప్పిదేర విసరేయు తనకేమోయమ్మా

చ. 2: మూలనాకెచేత నాకు మొక్కించఁ బలిచీని
పాలలోఁ బులుసేల పదవమ్మా
ఆలి నామైకాఁక నాకెమేని కాఁకలను
కాలపువరుసఁ జలిగాయిమనమ్మా

చ. 3: తానాకె మానితినని తారుకాణించఁ బిలిచీ
తేనెలోఁ దీపులేల తెలిసెనమ్మా
పూని శ్రీవేంకటతి బుజ్జగించి నన్నుఁగూడె
తానె యాకెఁజూపెనిందాఁక సటకమ్మా

రేకు: 0153-2 శంకరాభరణం సంపుటం: 07-310

పల్లవి: ఘనుఁడవు నీమహిమ గన్నవారెవ్వరు
మినుకుల కొంతకొంత మెచ్చుటింతేకాని

చ. 1: జలధినీరు సొచ్చి సారెసారెనీఁదవచ్చు
ములుగుచుఁ గొండైన మోవవచ్చును
యిలయెల్లనెత్తవచ్చు నేరూపైనఁ గావచ్చు
బలిమి నీచిత్తమే పట్టరాదుగాని

చ. 2: ఆకసమింతంతని యంటికొలవఁగవచ్చు
చేకొని ఘోరతపము సేయవచ్చును
రాకాసులఁ జంపవచ్చు రామలఁగలయవచ్చు
ఆకడ నీగుట్టు తెలియఁగరాదు గాని

చ. 3: పట్టరానివ్రతములు పట్టించి సేయించవచ్చు
గట్టి రాయైనాఁ గడుఁ గరఁచవచ్చు
ఇట్టె శ్రీవేంకటేశ యిటు నన్ను గూడితివి
దిట్టు నీనాలోన భేదించరాదుగాని

రేకు: 0153-3 భైరవి సంపుటం: 07-311

పల్లవి: నిన్నుఁ బాసినకతాన నెలఁతకింతేసి పుట్టె
కన్నులఁ జూచితివింకఁ గావవయ్యా చెలిని

చ. 1: జలములోపలఁ బుట్టె జలజమందురు గాని
జలజాస్యమున నేత్రజలములుబ్బె
అలయగ్ని నీటిచే నారునందురు గాని
వెలయఁ జెమటనీరు విరహగ్నినిగిరె

చ. 2: ఇంపులఁ దీగెఁ బూవులెసఁగునందురు గాని
తంపి పూవులనదివో తనులత
సంపెంగకు తుమ్మిదలు జరగునందురు గాని
సంపెంగ ముక్కునవాలె జాలియలినెరులు

చ. 3: మించె మేఘముమీఁద మెరుఁగనందురు గాని
నించుఁ జెలిమెరుఁగుపై నీలమేఘాము
అంచల శ్రీవేంకటేశ అతివ నీవు గూడఁగా
యెంచఁగ నీమన్ననలనెక్కుడాయఁ గాని

రేకు: 0153-4 తెలుఁగుఁగాంబోది సంపుటం: 07-312

పల్లవి: ఎరుక చెప్పే నీయిచ్చ యెల్లానెరుఁగుదు
మెరుఁగైన సొమ్ములిచ్చి మెచ్చవయ్య నన్ను

చ. 1: చేతికి కల పలము చెప్పే రావయ్య నీకు
ఘాతలఁ బరాంగనలఁ గాఁగిలింతువు
ఈతలఁ గన్నులమేలిటు చెప్పే రావయ్య
సూతకపుమానములు (?) చూడఁగలదిఁకను

చ. 2: మోవిలక్షణాలు నీకు మోవఁజెప్పే రావయ్య
చావనొక్కరాకాసిచన్ను దాగితి
వావిరి నీపాదముల వ్రాఁతల జయము చెప్పే
బావిమడుగునొక్క పాముఁ దొక్కితివి

చ. 3: ఇంగితాకారపుభాగ్యమిటు చెప్పే నీవురాన
నంగన మోహించి పాయకయున్నది
తంగని శ్రీ వేంకటేశ తలఁపు చెప్పే నన్నుఁ
బొంగుచుఁ గూడి యిట్టె పోననేవయ్యా

రేకు: 0153-5 నాదరామక్రియ సంపుటం: 07-313

పల్లవి: కాంతయైతే నీకుఁ జేసీ కమలముపైఁ దపము
వంతుల రమణుఁడవు వరమియ్యవయ్యా

చ. 1: కూటువ నీయింతికనుఁగొనలఁ బోలుదుమని
నీటనే తపము సేసీ నీరజములు
చాటి కొమ్మతురుముతో సరివచ్చేమని మింట
మీటుఁదపములు సేసీ మేఘములు

చ. 2: మెండగు చెలినడుము మించేమనుచు నేఁడు
కొండలఁ దపాలు సేసీ కోరి సింహాలు
అండ నీసతిచన్నుల అందములకు వనాల
చండిఁ దపములు సేసీఁ జక్రవాకాలు

చ. 3: యీవనితపాదముల యీడుకుఁగా చిగురులు
దావతిఁ దపాలు సేసీ తరువులపై
శ్రీవేంకటేశ నీవు చెలినిట్టే కూడుమని
భావజుఁడు తపియించీఁ బంచాగ్నినడుమ

రేకు: 0153-6 వరాళి సంపుటం: 07-314

పల్లవి: ఒరయుచు నురమున నునిచితివీకె నీవు
అరయఁ గాంతారత్నమన్నిటాఁ గనక

చ. 1: మాటలాడి చూచితేనే మంచివైడూర్యాలు రాలీ
గాట్టఁపుజూపల మాణికాలు రాలీని
మూటగాఁగ నవ్వితే ముత్యాలు రాలీని
కూటువ నీసతి రత్నకోమలి గనక

చ. 2: బడినడుగడుగుకుఁ బద్మరాగములు రాలీ
జడిసి పొలసిఁ బచ్చలు రాలీని
పడఁతి చేవిసరినఁ బగడాలు రాలీని
నడుమ నీసతి యంగనామణి గనక

చ. 3: కుంకుమచెమటల గోమేధికాలు రాలీ
సంకుగోరికొన వజ్రాలు రాలీని
పొంకపుఁబుష్యరాగాలు పొంగీ నీకూటమిని
ఇంక శ్రీ వేంకటేశ నీయింతి రత్నాంగి గాన

రేకు: 0154-1 భైరవి సంపుటం: 07-315

పల్లవి: చెల్లెఁ జెల్లె నీచేఁత శింగరి నీ
వుల్లమెల్లఁ దక్కఁ గొంటినో శింగరి

చ. 1: చిక్కని నీనవ్వుచూచి శింగరి నే
నొక్కటై నీకు మొక్కితినో శింగరి
చెక్కులఁ జెమటగారె శింగరి నీ
వుక్కుగోరు సోఁకనీకు వో శింగరి

చ. 2: చిరుత నిట్టూర్పుల శింగరి నిను
నొరసీఁబో నాకు చాలు వోశింగరి
సిరుల నిట్టచూపు శింగరి నీ
వొరపు నాచేతఁజిక్కెనో శింగరి

చ. 3: చేవదేరె నీమోవి శింగరి నే
నోవరిలోఁ గూడఁగాన వో శింగరి
శ్రీ వేంకటాద్రిమీఁది శింగరి
వోవమన సిగ్గుదేరెనో శింగరి

రేకు: 0154-2 ముఖారి సంపుటం: 07-316

పల్లవి: అలుగుత లేదు సుమ్మీ అప్పుడు నీతో
యెలమి నోరమణుఁడ యేమనివుండితివో

చ. 1: ఎదుట నీవుండఁగాను యేఁపే మరుఁడో యంటా
అదివో గుండెబెదరి అవ్వలిమోమైతి
కదిసి చేయివేయఁగాఁ గమ్మచిగురుటమ్మంటా
నుదిరిపడి వెరచి వుస్సురంటిని

చ. 2: మలసి చూడఁగఁ జల్లె మంతపువెన్నెలలంటా
తొలఁగి పయ్యద నామైఁ దుడుచుకొంటి
పలికి మాటాడఁగాను పంపుడుఁ జిలుకలంటా
నిలువున వెరగంది తలవంచుకొంటివి

చ. 3: కాఁగిట నీవు గూడఁగాఁ గలలోని భ్రమతలంటా
కాఁగిన కుచములతోఁ గన్నుమూసితి
సొగల నీకొనగోరి సోఁకులనిన్నీఁ దెలిసి
బాగుల శ్రీ వెంకటేశ పైకొంటివి

రేకు: 0154-3 ముఖారి సంపుటం: 07-317

పల్లవి: ఎటువంటి తమకమో యెదుటనల్లదె చూడు
యిటు నీచిత్తముకొలఁదిఁకనేమి యంపునో

చ. 1: కాంత నిన్నుఁబిలువ నీకడకు నన్నంపి యట్టే
కాంతుఁడ నీపేర లేకలూనంపె
దొంతిగా నావెంటనె తొంగలిచూపులునంపె
యింతట విచ్చేయకున్న యిఁకయేమి యంపునో

చ. 2: కామిని నాచేత నీకుఁ గానికంపె తోడనే
మైమరచి యీడకుఁ దా మనసూనంప
కోమలపుమాఁటల కోవిలయెలుగులంపె
యేమిట విచ్చేయకున్న నిఁకనేమి యంపునో

చ. 3: ఉంగరమానవాలంపె వువిద వాయువేగాన
అంగపు నిట్టుర్పుగాలి అదివో అంపె
తంగక శ్రీ వెంకటేశ తన నడపులు నంపె
యింగితాన నిదెకూడె యిఁకనేమి యంపునో

రేకు: 0154-4 శ్రీరాగం సంపుటం: 07-318

పల్లవి: బుద్ధి చెప్పవే పతికిఁ బొద్దోక వింత వలెనా
వొద్దనుండే యింతసేపు వుపచారాలేలే

చ. 1: నిమ్మపండియ్యఁగ వచ్చి నెట్టున నావురమున
నిమ్మపండ్లు రండవే నేనేమి సేసేనే
తమ్మిపువ్వియ్యఁగ వచ్చె దాకొని నాపాదముల
తమ్మివిరులు రెండవె తనవి నాకేలే

చ. 2: నీలము గానుక యిచ్చి నిక్కిన నాతురుమున
నీలములెన్నైననివే నేనేమి సేసేనే
యేలే యద్దము నాచేతికిచ్చె నాచెక్కులివే
మేలిమి యద్దాలు రండు మించేది గానఁడా

చ. 3: నిగ్గుముత్యాలియ్య వచ్చి నేఁడు నామేనిచెమట
నిగ్గుముత్యాలై వూరీ నేనేమి సేసేనే
అగ్గమై శ్రీ వెంకటేశుఁడంతలోనే ననుఁగూడి
వొగ్గి మోవియిచ్చి రతులనోలలార్చెఁ జాలదా

రేకు: 0154-5 రామక్రియ సంపుటం: 07-319

పల్లవి: చిత్తగించి యేఁటికో విచ్చేసితి గాక
హత్తి నన్ను బుజ్జగించేవన్నిటా జాణవయ్యా

చ. 1: సరసమాడఁగ నీకు సతి శూర్పనఖ గద్దు
పొరిఁ జన్నిచ్చి పెంచఁగఁ బూతకి గద్దు
పొరసి కామించి నిన్ను భోగించఁ గుబ్జ గద్దు
తిరిగి మాయింటికి రాఁదీరునటవయ్యా

చ. 2: అంది నీకుఁ గావఁబో నావులమంద గలదు
కుంది వయ్యాళికి రాతిగుఱ్ఱము గద్దు
అందపుబోయిఁడవుగా నర్జునుని బండి గద్దు
దిందుపడి యీడకు రాఁదీరునటవయ్యా

చ. 3: సారెఁ బవళించఁ బాలజలనిధి నీకుఁ గద్దు
పోరచి దానమడుగ భూమి గద్దు
చేరి నిక్కిచూడ శ్రీవేంకటాద్రి గద్దు
తేరి నన్నుఁ గూడితివి తీరునటయ్యా

రేకు: 0154-6 కాంబోది సంపుటం: 07-320

పల్లవి: ఇందరి భావము నీవే యెరుఁగుదాకె యెరుఁగు
యిందుకుఁగా నింతసేయనేమిటికయ్యా

చ. 1: సుదతి నిన్నుఁ గోపానఁ జూడకొక్క మాను చూచె
అదె యొక్క మానితో మాటాడె సొలసి
పదరి పరవాశానఁ బట్టెనొక్క మానికొమ్ము
వొదిగె యొకమానిపై నుస్సురనెను

చ. 2: మానిని యొకమానిపై మదనరాగము చిమ్మె
ఆనిన పూఁదేనె యొక్క మానఁ జిలికె
పూనిన నీబాసలకు నొకమానిపై నవ్వె
తానుడుకు దీర నొకమానిపొంతఁ బాడెను

చ. 3: అంత నీవు దగ్గరితే అందు మాను చేతనంటె
కాంత నీమారొకమాను కాలఁదన్నెను
ఇంతలో శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగను
వింతగా నీతరువుల విరులు నీకిచ్చెను

రేకు: 0155-1 హిందోళవసంతం సంపుటం: 07-321

పల్లవి: ఒకటి గలిగినచోట నొకటి లేదు
వికటంపుటలుకేలె విభుఁడెదుట వీఁడె

చ. 1: ఉవిద నీమోము చంద్రోదయంబై యుండి
నివురు నీ నవ్వువెన్నెల గాయదు
చివురుమోవి వసంతసిరి దొలఁకి యుండియును
యివలఁ గోవిలేల యెలుఁగియ్యవే

చ. 2: వనిత నీ నిండుజవ్వనవనము గలిగియును
మినుకు నడపులకరులు మెదలవేలే
ఘనమైన చన్నుజక్కవలు మితిమీరఁగా
చెనసి నివ్వెరగుమతి చీఁకటిఁకనేలే

చ. 3: మెలుఁత నీ నెరిఁదురుము మేఘంబు గలిగియును
తొలఁకు మెరుఁగులకళలు దోఁచవేలే
ఎలమితో శ్రీవేంకటేశుఁడింతటఁ గూడె
కలదెల్ల గర్వమై ఘటియించనేలే

రేకు: 0155-2 శ్రీరాగం సంపుటం: 07-322

పల్లవి: చల్లలమ్మేదానవు అచ్చపుమగనాలవు
మల్లడిమాపొందులేల మరిగేవు నీవు

చ. 1: కమ్మి పున్నమవెన్నెల గాదెఁబోసికొంటివటే
యెమ్మెకే సెలవి నవ్వేవేపొద్దును
తమ్మిరేకులెల్లాఁదెచ్చి దాఁచుకవుందానవటే
కుమ్మరించేవు కన్నులఁ గుచ్చికుచ్చి మీఁదను

చ. 2: చిలుకపలుకులెల్లఁ జేన విత్తుకొంటివటే
వొలికేవు పెదవుల నొకటొకటే
కులికి చిగురులెల్లఁ గోసితటే మావాకిట
వెలయ నీయడుగుల వెదచల్లేవు

చ. 3: సొగతీఁగెలెల్ల నీసొమ్మటే నీచేతులను
భోగపుఁ గాఁగిట నన్నుఁ బొదిగేవు
యీగతి నే శ్రీ వేంకటేశుఁడ కూడితి నిన్ను
జాగులేల యిక్కడనే సతమై నిలువవే

రేకు: 0155-3 మధ్యమావతి సంపుటం: 07-323

పల్లవి: వెలఁది చక్కఁదనము వేరొకటి గాదు సుండి
చెలులార చూడరమ్మ చెప్పరాదు వింతలు

చ. 1: చెందమ్మిరేకులలోనఁ జేరి తుమ్మిదలు వాలె
కందువఁ జెలికినవే కన్నులాయను
చందమై వొకతీగెపై జక్కవపిట్టలు వాలె
గొందినవే యెంచిచూడఁ గుచములాయను

చ. 2: నిండుఁజందురునిమీఁద నీలముల గని వుట్టె
కొండవంటి చెలికవే కురులాయరు
పండుటరఁటులమీఁద బలుసింహమదె యెక్కె
మెండగు నెన్నడుమై మించెనిదె యిప్పుడే

చ. 3: పచ్చని చిగురుమీఁద పగడపుఁబండు వండె
అచ్చపుఁ జెలియకదె అధరమాయ
ఇచ్చకుఁడై శ్రీవేంకటేశుఁడింతలోఁ గూడె
నిచ్చకల్యాణములై నిలిచె నిన్నిటను

రేకు: 0155-4 దేసాళం సంపుటం: 07-324

పల్లవి: ఏల వెరచేవే నీవు యిదివో నీపతివచ్చె
జాలివాయ నిన్నుఁగూడిసంతసమిచ్చీని

చ. 1: నీరధిలోఁ బుట్టివట్టి నీరుచిచ్చైన పూవు
నూరిపోసినట్టి పామునోరిలో కడి
మారుతో నగ్నిఁబడిన మాకులలో భూతము
యీరీతి విరహులకెగ్గు సేయకుందురా

చ. 2: తల్లిదండ్రి వెంచనట్టి తగుఁబలుగాకి చూర
చల్లుఁ బుప్పొడి దొంగిలిన జాజరకాఁడు
మల్లాడి చెట్లమీఁద మధువువట్టిన పాత
వెల్లిగా మంచిగుణాలు వీనికింక వచ్చునా

చ. 3: వంగి వంచనేర్చిన వడిఁదియ్యని గుణము
ముంగిట నిందరి చిత్తముల వేలుపు
ఇంగితాన శ్రీ వేంకటేశు నిన్నుఁ గూడఁజేసి
రంగన నీపాలింటికి అందరను హితులే

రేకు: 0155-5 ఆహిరి సంపుటం: 07-325

పల్లవి: ఇదె వీఁడె చూడవే యించుక మాటాడవే
యెదురై కూడితిరి మీరిఁకనేలె యలుక

చ. 1: తామెరలు వికసించె తరుణి నేఁడు నీమోహము
తామర వికసించదు తగునటవే
తామెరకుఁ జుట్టుము ధరణిపై సూర్యుఁడు
నీమోముదామెరకు నీవిభుఁడు చుట్టుము

చ. 2: కలువలు వికసించె కలికి నేఁడు నీకన్నుఁ
గలువలు ముకుళించఁ గారణమేమే
కలువలచెలికాఁడు కందువచంద్రుఁడు నీ
కలువకన్నులకు నీకాంతుఁడెపో చుట్టుము

చ. 3: వనములు వికసించె వనిత నేఁడు నీజ
వ్వనమును వికసించ వైపాయనే
వనదేవతందుకైతే వసంతుఁడు నీకు మిం
చినవనదేవతైతే శ్రీ వెంకటేశుఁడు

రేకు: 0155-6 శంకరాభరణం సంపుటం: 07-326

పల్లవి: ఎంతజాణ నీచెలియనేమని పొగడవచ్చు
దొంతులమాఁటలలోనే దోమటి దొడికెను

చ. 1: మెట్టిన చమ్మాళిగలు మించఁ బారితెంచి నిన్ను
పట్టితీసి మొలనూలు పైపై చెలి
అట్టె కోపాన నీవు ఆఁపలేక పెనఁగఁగ
తిట్టిన నీమోవి గంటి తెగి సేసెనప్పుడే

చ. 2: పంచిన పయ్యదకొంగు వల్లెవాటు వేసుకొని
కొంచక నీమొగమై కొనగోరను
ఇంచుకంత నీవందుకు యియ్యకొనకుండఁగాను
ముంచి నిన్నుఁ దనచను మొనలనాఁగీని

చ. 3: వాకునిండా కస్తూరివాసనలు చల్లి చల్లి
యేకతమాడి చెలి యిప్పుడే నీతోను
యీకడ శ్రీ వేంకటేశ యియ్యకొని కూడఁగాను
లోకము మెచ్చేటి నిన్ను లోను కొనెను

రేకు: 0156-1 వరాళి సంపుటం: 07-327

పల్లవి: ఏమని పొగడవచ్చునిట్టి వింత సింగారము
నేమముతో రమణుఁడ నీభాగ్యమాయను

చ. 1: కమలముమీఁద రెండుకలువలు వికసించె
జమళినందువల్లనే సంపెఁగ పూచె
తమితో నాకొట్టఁగొనఁ దగదొండపండు పండె
అమరనిన్నియుఁగూడి అతివమోమాయను

చ. 2: కన్నెయరఁటులమీఁద కంతునిరథము చాలె
పన్ని సింహమొకటి యాపైనెక్కెను
సన్నలనామెకముపై సతి జక్కవలు వాలె
ఇన్నియుఁ గూడఁ గూడ నింతిరూపమాయను

చ. 3: అంచెలఁ గూర్మాలు రెండుహంసలతోఁ బొందుసేసె
పొంచి బిసాలు సంకముపొత్తు గూడెను
నించి శ్రీ వెంకటేశుఁడ నీసందిటఁ బట్టఁగా
యెంచక వేపురముపై నిందిరాదేవాయను

రేకు:	0156-2 శ్రీరాగం సంపుటం:	07-328

పల్లవి:	ఇంత యేల బిగువు యిది లెస్స తగవు
	నంతకూటపుమాటలు చాలునయ్య నీవు

చ. 1:	పట్టినదే పంతమా పడతిఁ బిలువరాదా
	చుట్టుమవో నీవు లేక సూడుబంటవో
	యెట్టుయెదురనున్నారు యెడమాటలాడలేము
	రట్టుపాలకమ్మకెక్కె యిట్టెరావయ్యా నీవు

చ. 2:	చెల్లినంతాఁ జేఁతా చెలియఁ జేకొనరాదా
	యెల్లగా నవ్వులకో యిదే నిజమో
	తెల్లవారె సిగులనే తెగి మిమ్ము దూరలేము
	అల్లమే సొంటిగాదా అవునయ్య నీవు

చ. 3:	ఆడినదే యాటా ఆకెఁజక్కఁజూడరాదా
	వీడుదోడువయసులు వేడుకో వెట్టో
	ఈడనే శ్రీ వేంకటేశ యింతిఁ గూడితివి నీవు
	వోడలు బండ్లవచ్చు వుండవయ్య నీవు

రేకు: 0156-3 బౌళి సంపుటం: 07-329

పల్లవి: హరి యేమనెనే అలిగెనో
విరహినై నేనుండఁగా యేలరాఁడాయ

చ. 1: మరలి మరలి తన్ను మాటలఁ గొసరను
యిరవైన విభుఁడేమనెనే
తరుణులే వచ్చితిరి తానాడనున్నాఁడు
యెరవెరవై తానేమనెనే

చ. 2: వాకిటికిందాఁక వచ్చి తిరిగెనట
యేకారణమిది యేమనెనే
రాకలఁ బోకల రాతిరాయనిదె
యీకడఁ దుదమాఁటేమనెనే

చ. 3: తలపులో ప్రియరము తానే యెరుఁగును
యెలుఁ గెత్తొకమాఁటేమనెనే
బలిమి శ్రీవేంకటపతి దా విచ్చేసి
యిల ననుఁగూడెను యేమనెనే

రేకు: 0156-4 బౌళి సంపుటం: 07-330

పల్లవి: ఇందాఁక నెరఁగము యీవింత సతి
కందు వాసె శ్రీకాంతావిభుఁడ

చ. 1: సుదతికి నీరాక సూర్యోదయమై
వదనకమలమిటు వడిఁ జెలఁగె
పొదలిన నీనవ్వుపున్నమవెన్నెలకు
కదిసి చకోరపుకన్నులు దెలిసె

చ. 2: వనితకు నీచూపు వసంతకాలమై
వెనకఁ బలుకుఁగోవిలలొదరె
మినుకు నీతనువుమేఘకాంతులకు
పనివడి పులకలపైరులు దేరె

చ. 3: సతికి నీపొందులె జలధిమథనమై
రతినధరామృతరసమబ్బె
ఇతవై శ్రీ వెంకటేశ నీవు చెలిఁ
దతిఁ గూడఁగ మరుతంత్రము గెలిచె

రేకు: 0156-5 పాడి సంపుటం: 07-331

పల్లవి: ఏమి సేతు ముచ్చటకు యెవ్వరు గలరు నాకు
యేమీననకూరకున్న యెగ్గుపట్టుఁగా

చ. 1: అడుగుదునో వానినాడనేల వుంటివని
అడుగఁబోనలుగుఁగా అందుకతఁడు
తుడుతునో వానిమేనఁ దొరిగే వేఁడిచెమట
చిడిముడి వాఁడందుకు సిగ్గువడుఁగా

చ. 2: విసరుదునో సురటి విభునియలపు దీర
విసరఁబో అదియును వెంగెమౌఁగా
కొసరుదునో తనగుట్టు నేఁగనినదాఁకా
ఇమంతపనికి మనసు నొచ్చుఁగా

చ. 3: నవ్వుదునో రమణుఁడు నాతోఁ గరఁగినవేళ
నవ్వఁబో ఆతనిమేలు నామేలుగా
రవ్వగా శ్రీ వేంకటాద్రిరాయఁడిట్టె నన్నుఁగూడె
యివ్వల మోవియిత్తునో యిచ్చగించఁగా

రేకు: 0156-6 శంకరాభరణం సంపుటం: 07-332

పల్లవి: పోపో అదేఁటిమాట పొద్దువోదా
మాపుదాఁకా నదే కాక మరియేఁటిమాటలే

చ. 1: గుత్తులపూవులు నీవు కోవయ్య కానికె ఆ
గుత్తులేల నీచనుగుత్తులీరాదా
జొత్తులైన లతలవే చూడవయ్య మాటలేల
హత్తి నీబాహులతలు అవె కంటినే

చ. 2: పండుబలమిదివో పట్టువయ్య సూడిదె
పండులేల నీమోవిపండె కాక
మెండగుఁ దామరలు మీఁదవేసేఁ జుమ్మీ
దండి నీచేతులె రెండుతామరలు గావా

చ. 3: కప్పురమిచ్చే నీకుఁ గైకోవయ్యా ఆ
కప్పురాలు నీనోరికతలెకావా
యిప్పుడె శ్రీ వెంకటేశ యిటుగూడితి నేఁ
డిప్పుడా అల్లప్పుడెపో యెరఁగవు గాని

రేకు: 0157-1 బౌళిరామక్రియ సంపుటం: 07-333

పల్లవి: అలిగినవేళ విభుఁడంటితేఁ గోపమే తోఁచు
తెలుసుక నీలోనే తేరుకొవే చిత్తము

చ. 1: వేసవికాలమునాఁడు వేడుకైన వెన్నెలలే
యీల విరహవేళనెండలై తోఁచు
వాసితోఁ దానేరిపిన వన్నెచిలుకమాటైన
పాసినదంపతులకు పగిలించు మర్మము

చ. 2: సోవఁ దనమేవనున్న సొంపుల జవ్వనమైన
కోవిలకూఁతలవేళ గొరబై తోఁచు
పూవులు తాఁ గొప్పులోన పూఁచి ముడిచినవైన
కావిరిఁ దానొంటినుంటే కంతునమ్ములౌను

చ. 3: ప్రతిలేని తనలో ప్రాణపుటూరుపైన
రతినలసినవేళ రంపమై తోఁచు
యితవై శ్రీ వేంకటేశుఁడింతలోనె నిన్నుఁగూడె
సతమై యీవిరసాలే సరసములాయెనే

రేకు: 0157-2 శుద్ధవసంతం సంపుటం: 07-334

పల్లవి: బలిమిసేయక నీవు పదవమ్మా
చెలియ నామనసు చేకొనవమ్మా

చ. 1: ననుపు లేనిచోట నవ్వుటకంటెను
జునిగి వాదులడుచుటె సుఖము
మనసు రానిచోట మాటలాడుకంటెను
మునుపనే తనలోనిమోనమే సుఖము

చ. 2: ప్రేమలేనిపతిఁ బిలుచుకంటెను
సోమరై వేగించుటె సుఖము
కామించనిరతిఁ గరఁగుటకంటెను
ఆమారు కంభమునలముటె సుఖము

చ. 3: ఒల్లమి సరిఁ గూచుండుటకంటెను
చల్లఁగఁ దొలఁగుటె సమసుఖము
ఎల్లగ శ్రీవేంకటేశుఁడు నన్నుఁగూడె
కొల్లగనిదియే కోరుట సుఖము

రేకు: 0157-3 మధ్యమావతి సంపుటం: 07-335

పల్లవి: చేసినట్టుల్లాఁ జెల్లె సేఁతలు నీకు
గాసిఁబెట్టుకిఁక నన్నుఁ గరుణించవయ్యా

చ. 1: చెప్పినట్టుసేయఁగానె చెరఁగేల పట్టేవు
తప్పులెంచననఁగానె తడవనేల
కొప్పువంచి మొక్కఁగానె గుంపెనపంతాలేల
ముప్పిరి దప్పులు దేర మోవియ్యవయ్యా

చ. 2: సరములాడఁగానె సాదించనేల వచ్చేవు
కెరలించకుండఁగానె కేరడమేల
పరగ నేఁ బండఁగానె బలిమిసేయఁగనేల
గరిమ నాకోరినట్లు కాఁగలియ్యవయ్యా

చ. 3: కూడి రతిసేయఁగానె కొరేల చూపేవు
వీడెమందుకొనఁగానె వేసాలేలా
పాడితో శ్రీవేంకట పట్టపలమేల్మంగను
జాడతోనింకాను సేలు చల్లవయ్యా

రేకు: 0157-4 కాంబోది సంపుటం: 07-336

పల్లవి: నీవిభుని ప్రియములు నెట్టునఁ జేకొనఁగదే
కావలసిన మేలెల్లాఁ గాచుకున్నది

చ. 1: తనంతనయ్యేపనికి తమకించఁ బనిలేదు
వినవలసినందుకు వేసరవద్దు
మనసు నమ్మినందుకు మరివిచారములేల
కొనసాగేయందులకుఁ గోపమేఁటికి

చ. 2: ఆస గలిగినచోట అంటు విడువఁదగదు
వాసితోడి పొందెపుడు వంచించరాదు
యీసులేక పెనఁగితే యియ్యకొనకుండనేల
చేసూటిని మెలఁగఁగ చెప్పించఁ జనదు

చ. 3: కూటపుమాటలాడఁగఁ గొసరేదండము గాదు
నీటునఁ గాఁగలించఁగ నేరమెక్కడు
యీటున శ్రీ వేంకటేశుఁడేలె నిన్నునింతలోనె
సాటికి బేటికి మీలో జంటలికఁ బాయవు

రేకు: 0157-5 సామంతం సంపుటం: 07-337

పల్లవి: ఏమని పొగడుదుమె యీచెలిచక్కఁదనము
యీమేఁటి యలమేల్మంగ యెక్కువైతానిలిచె

చ. 1: అరచంద్రుఁడుఁ జకోరాలద్దాలు సంపెఁగయు
ధర శింగిణులు శ్రీలు తలిరులును
అరుదుగాఁ దుమ్మిదలుసందముగాఁ గూడఁగాను
మరుతల్లి యలమేలుమంగమోమై నిలిచె

చ. 2: బిసములు శంఖమును పెనుఁజక్రవాకములా
కసము నీలపుఁజేరు కరికుంభాలు
పొసఁగ నివెల్లానొకపోఁడియై నిలువఁగాను
మసలక అలమేలుమంగమేనై నిలిచె

చ. 3: అనఁటులంపపాదులు నబ్జములు ముత్తేలు
వొనరి వరుసఁ గూడి వుండఁగాను
ఘనుఁడైన శ్రీ వెంకటేశునురముమీఁద
పనుపడలమేల్మంగ పాదములై నిలిచె

రేకు: 0157-6 గౌళ సంపుటం: 07-338

పల్లవి: తనసేవ నేఁజేయనా తగవు దప్పఁగాఁ గాక
చెనకీఁ దానిందుకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 1: కడుఁ దమకాన నేను కస్తూరి నూరఁగాను
తడఁబడ నామీఁదఁ బాదము చాఁచీని
బెడిదమై ఆఁటదాని పెండెము వెట్టుకున్నాఁడు
చిడిముడి నిందుకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 2: పొందుగా నేను గొజ్జంగ పువ్వుదండ గుచ్చఁగాను
చెంది నాబుజముమీఁదఁ జెయివేసీని
మందెమేళాన నెవ్వతో మట్టెలు వేలనున్నవి
చిందువందసేఁతకేపో సిబ్బితయ్యీ నాకు

చ. 3: పొలుపుగా నేఁదట్టుపునుఁగు వాసించఁగాను
అలమీ శ్రీ వేంకటేశుఁడంతలో నన్ను
మొలనూలేడదో పురమునఁ బెట్టుకున్నాఁడు
చెలరేఁగి కూడఁగానే సిబ్బితయ్యీ నాకు

రేకు: 0158-1 హిందోళవసంతం సంపుటం: 07-339

పల్లవి: చెలులము నేము బుద్ధి చెప్పనోపమాకెకు
అలరి నీవాపెను మాఁటాడించవయ్యా

చ. 1: మక్కువతో నాపె నీవు మాటలాడేవంటాను
పక్కునఁ బాన్పుపైనీకె పవళించె
వెక్కసాన నింతలోన విచ్చేసితివీడకు
నెక్కొని నీవే యిఁక నిద్రలేపవయ్యా

చ. 2: తతితో విందాకెయింటఁ దగనారగించేవంటా
అతివ బోనమెల్లా చల్లారఁబెట్టెను
అతివేడుకనింతలో నాఁకలిగొంటినేవు
కతగా నీవే వడ్డించఁ గైకొలుపవయ్యా

చ. 3: కందువనాపెతో నేఁడు కాఁపురము సేసేవంటా
వొందిలీఁ దలుపు మూసుకున్నది చెలి
అందుకె శ్రీ వేంకటేశ అండకేఁగి కూడితివి
చెంది నీవె వాకిలాపెచేఁ దెరపించవయ్యా

రేకు: 0158-2 శంకరాభరణం సంపుటం: 07-340

పల్లవి: ఎంత తమకమో చెలికేమి చెప్పేది
వింతవింతవేడుకలు వెల్లివిరిసీని

చ. 1: జారినపయ్యదతోడ సగము చన్నులు చూపి
నేరుపుల మాటలాడీ నెలఁత నీతో
కూరుములు గొసరుతా గోరఁజెమట చిమ్ముతా
తారుమారైవలపుల తన్నుఁదానెరఁగదు

చ. 2: కడుఁగొప్పు దువ్వుకొంటా కరమూలములు చూపి
వెడయాస నవ్వు నవ్వీ వెలఁది నీతో
నిడువాలుఁజూపులతో నిన్నుఁ దానొరసుకొంటా
తడఁబాటుచిత్తముతో తన్నుఁ దానెరఁగదు

చ. 3: బిగ్గెనొడ్డాణము గట్టి పిరిఁదిబటువు చూపి
అగ్గలమై కాలుదొక్కీనతివ నీతో
నిగ్గుల శ్రీ వేంకటేశ నిన్నుఁగూడి మొక్కు మొక్కి
తగ్గని కోర్కులతోడ తన్నుఁ దానెరఁగదు

రేకు: 0158-3 బౌళి సంపుటం: 07-341

పల్లవి: ఆతని తలఁపు మీరే అడుగరే చెలులాల
కాతరములేని సిగ్గరిదాన నేను

చ. 1: మలసి యాతనితోను మారుమాటాడేనటవే
తలకొన్న మొగమోటదానను నేను
కలువలఁ దాఁకవేసి గద్దించేనటవే
నలువంక మెత్తని మనసుదానను నేను

చ. 2: జఱసి యతని జంకించఁగఁ గలనటవే
తఱితోడ వలచినదానను నేను
వెఱవక చెయివట్టి వెసఁ దియ్యగలనటే
కఱకరిలేని యిచ్చకపుదాన నేను

చ. 3: అంచల నాసలు చూపి యలయించేనటవే
మంచితలఁపలమేలుమంగను నేను
ఇంచుకంతా శ్రీ వెంకటేశు మీరేనటవే
వంచనసేయని చనవరిదాన నేను

రేకు: 0158-4 రామక్రియ సంపుటం: 07-342

పల్లవి: నీవోజ నేనెరఁగనా నెపాలేల చెప్పేవు
వేవేలకు నాకు వింతవాఁడవా

చ. 1: ఎప్పుడు నామోహమోరఁగవా నీకక్కడ
కప్పి యెంతపని నీకుఁ గల్గెనోకాక
నెప్పున మాయింటికి నీవు రానివాఁడవా
అప్పటి నేచుట్టాలు మాటాడుతా నీకుండిరో

చ. 2: మలసి నన్ను నీవు మరచేటివాఁడవా
చెలులెవ్వరు పరాకుసేసిరోకాక
తలఁపు నామీఁద నీకుఁ దగిలివున్నదే కాదా
సొలసేవారిమొగాలు చూడనందుండితివో

చ. 3: వరుస నన్నుఁజేపట్టి వదలుదువా నీవు
యిరవై నీచిత్తాననేమెంచేవో కాక
నిరతి శ్రీ వేంకటేశ నేనలమేర్ మంగను
కరుణించితి విప్పుడు గలయ వేళాయనో

రేకు: 0158-5 పాడి సంపుటం: 07-343

పల్లవి: ఎప్పుడూ మేలువాఁడవే యెరుఁగుదు నిన్నునేను
కప్పి వోరువనియ్యవు కాంక్షలే నన్నును

చ. 1: ఆవేళ నీవురావని అలుగఁదలఁతుఁ గాని
భావించితే నామనసు పట్టులేను
నీవంకఁ దుప్పేమీలేదు నేనెంచి చూచితేను
తావుకొన్న నాలోని తమకమే కాని

చ. 2: చేముట్టిపెనఁగవని చింతఁ దలవంతుఁ గాని
నీమోము చూడక నే మానలేను
కామించి నీగుణాలలో కడమలు మరిలేవు
ప్రేమపు నాకోరికలు పెనగోనీఁ గాని

చ. 3: పరఁగఁగ బరపుపై పంతాననుండుదుఁ గాని
సరిఁ గాఁగిటికి చేయి చాఁచకుండలేను
అరిది శ్రీ వెంకటేశ అలమేల్మంగ నేను
గరిమెనేలితివేలొ కాఁతాళింతుఁ గాని

రేకు: 0158-6 హిజ్జిజి సంపుటం: 07-344

పల్లవి: ఇంతవాఁడవు గాఁగానే యిందరు మోహింతురు
సంతసానఁ జెలఁగుదు సరసుఁడవు నీవు

చ. 1: విరహవేళ నెంతేసి వెంగెములాడుదు నిన్ను
యెరవు లేక వోరుతువిన్నియు నీవు
సరసమాడే యప్పుడు సారెనలయింతు నేను
విరసము లేకుందువు వేడుకతో నీవు

చ. 2: కొసరేటి తరినెంత గోరనూఁదుదు నిన్న
అసముతో నవ్వుదువందుకు నీవు
పొసఁగఁ బరాకారైనచో పూబంతినివేతు నిన్ను
సుసరాన వేఁడుకొని చొక్కింతువు నీవు

చ. 3: సరిఁ గూడేయెడనెంత జంకింతు నిన్ను నేను
గరిమనెంత మెత్తువు కాఁగిట నీవు
నిరతి శ్రీవెంకటేశ నేనలమేల్మంగను
మరిగితి నేను కడు మన్నింతువు నీవు

రేకు: 0159-1 మంగళకౌశిక సంపుటం: 07-345

పల్లవి: మఱచితినంటా నీవు మమ్మెంత బుజ్జగించేవు
యెఱుక గలచోట యెట్టుండినా యేమి

చ. 1: అక్కడే పరాకైతే అట్టే యెచ్చరింతుఁ గాక
దిక్కరించి నిన్ను సాదించేనా నేను
మక్కువ నూరకుండితే మాట నేనాడింతుఁ గాక
చిక్కించుక గొరబులు సేసేనా నిన్నును

చ. 2: పెలుచవై రాకుండితే పిలువనంపుదుఁ గాక
చలమున నీతోను వేసరుకొనేనా
తలవంచుకుండితేను తమకము రేఁతుఁ గాక
తలుపుమాటుకుఁ బోయి తరితీపుసేసేనా

చ. 3: పవళించివుండితేను పాదములొత్తుదుఁ గాక
ఇవల వాసులు వంతులెంచఁ జూచేనా
వివరించి నన్నిట్టై శ్రీ వెంకటేశ కూడితివి
నవమైన నీచేతలు నవ్వించవా నన్నును

రేకు: 0159-2 మాళవిగౌళ సంపుటం: 07-346

పల్లవి: నీకునింతి వలచుటే నీవెరఁగవా
చేకొని యీకెదిక్కు చిత్తగించరాదా

చ. 1: చెక్కునొక్కి ఆపె నిన్ను చెయివట్టి తియ్యఁగాను
యెక్కడ పరాకు సేసేవేమయ్యా నీవు
యిక్కువలు గోరనంటి యింటికిఁ బిలువఁగాను
గక్కననేమి నవ్వేవు కానిమ్మనరాదా

చ. 2: వేడుకతోడ సారెకు విందులు నీకుఁ జెప్పఁగా
ఆడేవు జూజాలిప్పుడే అదేమయ్యా
వీడెము చేతఁబట్టుక వెనక నిలుచుండఁగా
పాడితివి పాటలప్పటనుండి నీవు

చ. 3: పానుపువరచుకొని పడఁతి సన్నసేయఁగా
కానుకలందుకొనేవు కాంతలచేత
మోనాన నలమేల్మంగ మొక్కి నిన్నుఁ గాఁగలించె
తానకమై యేలితివింతట శ్రీ వేంకటేశ

రేకు: 0159-3 కేదారగౌళ సంపుటం: 07-347

పల్లవి: మేలుమేలు యిందుకిట్టే మెచ్చితి నిన్ను
తాలిమితో నిన్నీరీతి దక్కించుకొనెఁగా

చ. 1: మంతనాననేపొద్దు మాటలాడేవాపెతోను
ఇంత వలపించెఁగా యింతి నిన్ను
పొంతనే నీవెంగిలిపొత్తు గలపుకొంటివి
పంతాన నిందుకొగ్గించి భ్రమయించెఁగా

చ. 2: తతిగొని చూచేవు తరుణిమొకమే నీవు
బతిమాలింపించెఁ గా భామ నిన్ను
సతముగాఁ బానుపుపై జంటవాయనియ్యదు
మతిఁ దనకాఁగిలి మరగించుకొనెఁ గా

చ. 3: చెలరేఁగి విడేలకు చేతులు చాఁచేవు నీవు
అలవాటు సేసెఁగా అంగన నిన్ను
అలమేలుమంగ ఆకె అట్టె శ్రీ వెంకటేశ్వర
నలిఁ గూడితివి నీచే నన్నూ నెలిఁపించె గా

రేకు: 0159-4 వసంతం సంపుటం: 07-348

పల్లవి: ఇటులా నేముసేసేమా యిల్లాండ్లము నేము
తటుకన నీమదిలోఁ దడఁబడకిఁకను

చ. 1: యేడనైనా గయ్యాళియైనది చనవు గలితే
ఆడరానిమాఁట నిన్నాడుఁగాక
వేడుకకత్తెయినది విచారించకందరిలో
వీడెమిచ్చి కాలుఁజేయి వేసును నీమీఁదను

చ. 2: మందెమేళమైనది మరగితే నీమేన
చిందరవందరసేఁత సేయుఁగాక
అందునిందు రట్టడియైనది వెరవులేక
చెంది నీబుజాన మోము చేర్చుకొని నవ్వును

చ. 3: సారెకు దిట్టైనది సంగడిఁ బెట్టుక వుండితే
చేరి రతివేళఁ గక్కసించుఁ గాక
ఆరీతి శ్రీ వెంకటేశ అలమేల్మంగను నేను
కోరి నన్నునేలితివి కొంకకాపె మెచ్చును

రేకు: 0159-5 దేసాళం సంపుటం: 07-349

పల్లవి: ఏల వెరచేవు నమ్ము యేమీననదాపె నిన్ను
తాలిమితో మాటాడితే తప్పులన్నీఁ దీరును

చ. 1: చెలి పిలువనంపఁగా సింగారించుకొనేనంటా
యెలిమితో జరపులనేల పెట్టేవు
వెలయలేకలంపెను వేలఁ దగిలించుకొని
సొలపుల మమ్మునేమి సుద్దులడిగేవు

చ. 2: భామ నీదిక్కుచూడఁగా పనిగలవానివలె
వేమారుఁ దలవంచేవు వీదిలోనుండి
తామరగొని వేసితే తగఁజేతఁ బట్టుకొని
ప్రేమముతో మాకునెంత ప్రియాలు చెప్పేవు

చ. 3: అలమేలుమంగను అదరిపాటువలెను
కలసేవాకెను శ్రీ వెంకటేశ్వర
యెలమినెదురుచూచెనిందాఁకా నీకుఁ గాను
వెలినాకకేమి విన్నవించకుమనేవు

రేకు: 0159-6 శంకరాభరణం సంపుటం: 07-350

పల్లవి: చెల్లునయ్యా యీచేఁతలు చెలియకు నీకును
చిల్లరచెనకులకు సిగ్గేయానందము

చ. 1: సతులకుఁ బతులకూ జవ్వనమే భాగ్యము
రతివేళలనెల్లా రహస్యమే వేడుక
తతితో మనసులకు తలపోఁతే పండుగ
సతమైన మోహాలకు సరసమే సౌఖ్యము

చ. 2: వొట్టిన తమకములకొద్దనుండుటే ఫలము
ముట్టినయాసలకు మోముచూపే తనివి
పట్టరానికోరికకు పచ్చిమాటే సోబనము
చిట్టుకపుచేఁతలకు చిరునవ్వే లాభము

చ. 3: ననుపైన కూటమికి నాటుగోరే సింగారము
పెనఁగుటకు కాఁగిటిబిగువులే సంపద
యెనసితివి శ్రీ వేంకటేశ యలమేల్మంగను
చనవులకును మోవిచవులె సామ్రాజ్యాలు

రేకు: 0160-1 కేదారగౌళ సంపుటం: 07-351

పల్లవి: ఇప్పుడు మాఅక్క వింటే యేమనువో యిందుకు
దప్పిదేర సారెనేల తడవేవు మమ్మును

చ. 1: పంతముతోఁ గూచుండఁగా పనిగద్దు రమ్మనేవు
యెంతలేదు ఆపని నేనెరిఁగినదే
సంతోసాన నీమొగము చక్కఁజూడుమనేవు
దొంతరలుగా నేనెప్పుడ తొల్లే చూచినది

చ. 2: తొరలి యప్పటి నన్ను నీతోడుత నవ్వుమనేవు
గరిమ నీచేఁతలకుఁ గడు నవ్వుదురు
మరుమాటలు నాతో మక్కువనాడుమనేవు
అరసి నీవాడితివి అవే నామాటలు

చ. 3: కొలఁది మీరఁగ నాకూటమికిఁ బెనఁగేవు
అలమేల్మంగఁ గూడితివదియె నారతి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్నునేఁడు
బలిమిఁ దొల్లే యేలుబడిదానఁ గానా

రేకు: 0160-2 నాదరామక్రియ సంపుటం: 07-352

పల్లవి: ఎవ్వతెకో యీకెయంటా యెంతేసి తుటారించితి
చివ్వన నిందుకుఁగాను చిన్నఁబోకు మీఁకను

చ. 1: ఆపెపై బత్తిగలిగితే నప్పుడే చెప్పవలదా
చేపట్టి నేనిచ్చకము సేకుందును
యీపాటి నీదేవులైతే నింటికిఁ దెచ్చుకోవద్దా
చూపెట్టుకో వొక్కమనసుననుందును

చ. 2: తగులు నీకుఁ గలితే తారుకాణించవలదా
పగటున నేనూ వొడఁబడియుందును
నగినవాఁడవా పొందు నడపఁగ వలదా
తగినట్టు తగవులు తప్పక నేనుందును

చ. 3: చుట్టురికము గలితే నాకుఁ జూపఁగవలదా
వొట్టుకొని సంతోసాన నూరకుందును
నెట్టన శ్రీ వెంకటేశ నేనలమేల్మంగను
గట్టిగా నన్నేలితివి కానిమ్మని వుందును

రేకు: 0160-3 పాడి సంపుటం: 07-353

పల్లవి: ఎక్కడ పరాకు నీకు యిటుచిత్తగించరాదా
పక్కనఁ బలిచితేఁ జాలు బత్తిగలదానికి

చ. 1: కడనుండి రమణుఁడు కన్నులఁ జూచినఁజాలు
అడియాసఁ బొరలేటి ఆఁటదానికి
చిడిముడితోఁ గొంత సెలవుల నవ్వినఁ జాలు
యెడసియుండి రతులకేఁకరేటిదానికి

చ. 2: మలసి మగఁడేపాటి మాటలాడినాఁ జాలు
చెలరేఁగి కడు వలచినదానికి
నెలకొని ముందట నిలుచుండినాఁ జాలు
సొలసి యెట్టుయెదురు చూచేటిదానికి

చ. 3: ఇచ్చగించి నాయకుఁడు యింటికి వచ్చినాఁ జాలు
కచ్చుపెట్టి ప్రేమము గలదానికి
కొచ్చి శ్రీ వెంకటేశ కూడితివలమేల్మంగ
నిచ్చట నీవుంటేఁ జాలునింపుగలదానికి

రేకు: 0160-4 కాంబోది సంపుటం: 07-354

పల్లవి: మగవాఁడిది యెరిఁగి మగువలనేలవలె
నిగిడి వోరమణుఁడ నీచిత్తమికను

చ. 1: వినయమే చూపును విభుఁడెంత జరసినా
చనవున గర్వించదు జాణైనది
పెనఁగులాడదు యెంత బెట్టిసరసమాడినా
మనసు రామెలఁగును మర్మమెరిగినది

చ. 2: మచ్చికలే నెరపును మగఁడెంత పరాకైనా
కొొచ్చి నేరాలెంచదు గుణియైనది
రచ్చలోఁ జెప్పుకొనదు రతికెంత పలిచినా
విచ్చనవిడి భోగించు వెరవరియైనది

చ. 3: గక్కనఁ గాఁగిటనించు కాంతుఁడెంత బిగిసినా
వుక్కుమీరి యలుగదు వొద్దికైనది
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యిక్కువలు గరఁగించు యితవరియైనది

రేకు: 0160-5 సాళంగనాట సంపుటం: 07-355

పల్లవి: ఎక్కడ పరాకు యిదివో నీకు
మిక్కిలిఁ జేసితివి నమ్మినయడ మేకు

చ. 1: కలికి పొంచి నిన్నుఁ గలయ
వెలలేని వలపులు వెలయ
సులభుఁడవా నీవు సొలయ
మెలుపున నవ్వీని మేనెల్లానలయ

చ. 2: ముచ్చటతోడ మొక్కీ మొదల
కచ్చుపట్టి కుచములు గదల
పచ్చిదేరీ మదనసంపదల
మచ్చరము లేదీకెకు మాటలతుదల

చ. 3: వెక్కముగా వేసీ విరుల
చక్కఁగా దిద్దీ తన సరుల
యిక్కువ శ్రీ వేంకటేశ యీకె యలమేల్మంగ
చెక్కునొక్కి నిన్నుఁగూడె చెదరినకురుల

రేకు: 0160-6 మంగళకౌశిక సంపుటం: 07-356

పల్లవి: అటుగాన నీచేతలమృతములె నీకు
యెటువలెనైనా మీకిద్దరికిఁ దగును

చ. 1: మొక్కలాన నడచినా మురిపెములై తోఁచు
చక్కఁదనములు గల జలజాక్షులు
కక్కసించి మాటాడినా కామమంత్రమై తోఁచు
వెక్కసపు జవ్వనాన విఱవీఁగేవారలు

చ. 2: అలవోకగా నవ్విన ఆయములు గరఁగను
వలపించ నేరిచిన వనితలు
తలకొని జంకించినా తరితీపులై యుండు
నిలిచి జంటవాయని నెరజాణలు

చ. 3: వొడివట్టి పెనఁగినా వొడఁబాటులై మించు
కడువిలాసాలతోడి కామినులు
అడరి శ్రీ వెంకటేశ అలమేలుమంగ యీకె
తడయక కూడెనిదె తగవందురిందరు

రేకు: 0161-1 శ్రీరాగం సంపుటం: 07-357

పల్లవి: ఏఁటికిఁ బొద్దు గడుపేవిటు మాతోను
చోటిచ్చి యాపెను రతిఁజొక్కించరాదా

చ. 1: చెలిమిసేయఁగ నేర్చు చెప్పనేర్చు బుద్ధులెల్లా
పిలిపించి యాపెనొద్దఁ బెట్టుకోరాదా
నిలిచి కొలువుసేసు నీమర్మాలు దానెరుఁగు
చలివాయ మాటలాడి చనవియ్యరాదా

చ. 2: చెనకి నిన్ను నవ్వించు సిగ్గులుదేర్చునాపె
యెనసి వూడిగాలు సేయించుకోరాదా
వినయాలు సేసుఁ గడు వేడుకలు నీకు రేఁచు
వొనరఁ బానుపుపైఁ దోడుండుమనరాదా

చ. 3: మరిగించుకొనునాపె మనసురా మెలఁగును
సిరులఁ జుట్టరికము సేయరాదా
నిరతి శ్రీ వెంకటేశ నేనలమేలుమంగను
సరి నన్నేలితివాపె సమ్మతిసేయరాదా

రేకు: 0161-2 సామంతం సంపుటం: 07-358

పల్లవి: ఇట్టుండవలదా యెనసి సంగాతము
వొట్టి వొకటొకటికొద్దికలాయ

చ. 1: కలువ రేకులే మంచి కన్నులుగాఁగా
చెలిమొగము మెరసి శశియాయ
వెలయ బొమలు మరువిండ్లుగాఁగా
నలి సంపెగవిరి నాసికమాయ

చ. 2: సతతముఁ గుచములు శైలములుగాఁగ
అతివ కరంబులు లతలాయ
తతిగొను నాభియె తగు బిలముగాఁగ
మితిమీర నడుము మృగపతియాయ

చ. 3: పొగరు జఘనము పులినము గాఁగ
మగువపదములు తామరలాయ
సొగిసి శ్రీ వెంకటేశుఁడు మగఁడుగాఁగ
తగిలినవలుపే తలపోఁతలాయ

రేకు: 0161-3 కన్నడగౌళ సంపుటం: 07-359

పల్లవి: ఏమయ్యా నీవెరఁగవా యింతిగుణమెల్లాను
కామించి నీదేవులాయఁ గడమలు గలవా

చ. 1: సతులెంతైనా దీమసమే చూపుదురుగాక
తతిఁ దమవాసి వన్నె దప్పఁగలరా
పతి యెట్టు నడపినాఁ బరిణామింతురుగాక
బతిమాలి సవతుల పంగెనకుఁ జొత్తురా

చ. 2: నెట్టున దొరతనమే నెరపఁ జూతురుగాక
గుట్టువిడువ నేర్తురా గుణవతులు
దట్టుపుమానముతోనే తగురై వుందురుగాక
తొట్టి సిగ్గులు విడుతురా యెప్పుడును

చ. 3: వెలలేని పంతముల విఱ్ఱవీఁగుదురు గాక
అలసి లోఁగుదురా అందరిలోన
యెలమి శ్రీవెంకటేశ యీకెనిట్టె యేలితివి
బలిమి మానుదురా నిబ్బరమైన రతిని

రేకు: 0161-4 భైరవి సంపుటం: 07-360

పల్లవి: ఇంత సేసినవాఁడవు యిదె నీవె కదవయ్యా
వింతలుగా సారెసారె విఱ్ఱవీఁగీఁ దాను

చ. 1: పొలఁతి గుబ్బలమీఁది పొగడ పువ్వుల దండ
చెలఁగి యాపెకు నీవిచ్చితివి వోయి
చెలులతోఁ జెప్పుతాను చెంగటి సవతులకు
పలుమారుఁ జూపి యెమ్మె పచరించీఁ దాను

చ. 2: పెదవిపై గానవచ్చే పెద్దకప్పురపు లప్ప
అదన నీవంపితివా ఆపెకు నేఁడు
పుదుటునఁ జవిగొంటా వొద్దనుండే యింతులను
యెదుట నోరూరించి యెలయించీఁ దాను

చ. 3: అందపుఁ జెక్కులమీఁదనంటి బేంట్లు రాలీ
గందము వూసితివా కాంతకు నీవు
ముందె నన్నుఁగూడితివి మోహన శ్రీ వేంకటేశ
చిందినరజములెల్లా చేతనెత్తీఁ దాను

రేకు: 0161-5 కాంబోది సంపుటం: 07-361

పల్లవి: ఏమి సేతుఁ జెప్పవయ్యా యెందుకౌదును
వేమరు నామొగమాట విడువఁగఁ గలనా

చ. 1: చెక్కులు నొక్కితివంటా చేరి వేఁడుకొంటివంటా
పక్కన నీసతులకుఁ బంతమిత్తురా
మిక్కిలి వలపునాది మీఁద మదనుఁడు పోది
వొక్కమారు నిన్నుఁబాసి వోరువఁగఁ గలనా

చ. 2: కమ్మటి నవ్వితివంటా కన్ను గిరిపతివంటా
దొమ్మికాంతలతోడఁబొత్తు గలతురా
నమ్మితి నేనీబాస నాదే మదినడియాస
యెమ్మెలకైనా నీతో యెదురాడఁగలనా

చ. 3: సరసమాడితివంటా చనవులిచ్చితివంటా
సరివారికి మొక్కి వంచనసేతురా
గరిమ శ్రీవేంకటేశ కాఁగిలి నన్నింతసేసె
అరసి నన్నేలితివి అవుఁగాదనఁగలనా

రేకు: 0161-6 శంకరాభరణం సంపుటం: 07-362

పల్లవి: ఆడఁగల మాటగాఁగానాడితిఁగాక
పాడిపంతాలిందులోన పచారించనేఁటికే

చ. 1: మనసునఁ గలితేనే మాటలాడనింపు వుట్ట
చనవులు సతమైతే సంతోసమౌను
పెనఁగఁగఁ జోటిచ్చితే ప్రియములు గడునిండు
ఘనుఁడు తానేమన్నాఁ గాదనేనటవే

చ. 2: ఆసగలిగినచోట అన్నిటాఁ గొసరఁదగు
వేసట లేనిపొందు వెగటుగాదు
వాసితోడిమెలఁకువ వలపు దానె పుట్టించు
సేసవెట్టేఁ దనమాట చెల్లనని యనవే

చ. 3: పరగ నవ్వు నవ్వితే పనులెల్లాఁ జేకూరు
తరితీపులైతేనే తమిరేఁగును
యిరవై శ్రీవేంకటేశుఁడింతలోనే నన్నునేలె
సరసమెంతాడినాను సమ్మతి నాకనవే

రేకు:	0162-1 సామంతం	సంపుటం:	07-363

పల్లవి:	పిలిచీ రాఁగదవే ప్రియుఁడు నిన్ను
బలిమి సేసినంతనే పనులెల్లా దక్కునా

చ. 1:	కలసి మెలసి వుంటే కాపురమీడేరుఁ గాక
పెలుచుఁదనాననుంటే ప్రేమ వుట్టునా
నెలఁతకు మగనితో నేస్తమే మంచిదిగాక
అలుకలు నెరపితే నట్టే విసుగరా

చ. 2:	మాటలు సారెనాడఁగా మనసులెనయుఁగాక
జూటుఁదనాన నుండితే సొంపు గల్గునా
మేటిజవ్వనపువారు మేలుమీఁదివారుగాక
బూటకము చూపితేను పొందులు వొసఁగునా

చ. 3:	సరసములాడఁగానే చవులు గానిపించుఁగాక
యెరపరికములైతే యెబ్బిడి గాదా
సిరుల నిన్నేలె నేఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
మరిగి పాయకుండితే మచ్చికలు రేఁగవా

రేకు: 0162-2 ముఖారి సంపుటం: 07-364

పల్లవి: గద్దించి నేఁడు కొత్తలు గడించెఁ గాక
వొద్దికై మందెమేళాననుండమా తొల్లి

చ. 1: వొంటి నేఁజెనకితే వొరపులు వట్టీని
నంటునఁ దాను నేను నవ్వమా తొల్లి
వెంటవెంట నెరసులు వెదకీనప్పటివచ్చి
అంటి ముట్టి సరసములాడమా తొల్లి

చ. 2: కందువ నాచన్నులు దాఁకఁగా దప్పక చూచీని
అంది కమలాల వేట్లాడమా తొల్లి
ముందు నాయెంగిలిమోవి మోవ మాటాడితినని
విందుపొత్తులు గలసి వెలయమా తొల్లి

చ. 3: బీరమునఁ దనతోడఁ బెనఁగితినని యాడీ
కూరిమితోఁ గాఁగలించుకొనమా తొల్లి
యీరీతి శ్రీ వేంకటేశుఁడిన్నిటా నన్నేలినాఁడు
చేరి చుట్టురికాలెల్లాఁ జేయమా తొల్లి

రేకు: 0161-3 పాడి సంపుటం: 07-365

పల్లవి: ఎప్పుడూఁ దగులాయమె యెంతైనాఁ బోదు
తప్పదు నాయకుఁడిందు తానే వచ్చీని

చ. 1: పట్టి పెనఁగితేనేమి పంతములాడితేనేమి
గట్టిగా మేనరికము గలవారికి
వొట్టు వెట్టితేనేమి వొరసి పైకొంటేనేమి
చుట్టురికమియ్యకొన్న సులభపువారికి

చ. 2: తప్పక చూచితేనేమి తలవంచుకొంటేనేమి
అప్పసము వలచిన యట్టివారికి
కొప్పువట్టితేనేమి కొనగోరూఁదితేనేమి
వొప్పుగ సరసమాడే వొద్దికైనవారికి

చ. 3: చేసన్న చేసితేనేమి సిగ్గులువడితేనేమి
యీసులేక మెలఁగేటి యింటివారికి
వేసరక యీతఁడె శ్రీ వేంకటేశుఁడు నన్నేలె
పాసివుండరాదు నేరుపరులైనవారికి

రేకు: 0162-4 కేదారగౌళ సంపుటం: 07-366

పల్లవి: తెలిసితి నిపుడు నీతెరఁగెల్లాను
నిలుకడతో నన్నునిట్టె మన్నించవయ్యా

చ. 1: మనసొక్కచోఁ బెట్టి మాటలాడఁబోతేను
పెనఁగులు వడుఁగాని బెంబడిరాదు
నను చనిచోటను నంటుసేయఁ దలఁచితే
అనుమానమె కాని అమరికరాదు

చ. 2: చేతులొకతెపైఁ జాఁచి సెలవుల నవ్వితేను
కాతరమై తోఁచుఁగాని కాంక్షదీరదు
యేతరితనాలకు యెన్నియీవులిచ్చినాను
నీతులెన్నుదురు గాని నిజమని నమ్మరు

చ. 3: దిక్కులాలించుకొంటా బత్తితోఁ గాఁగిలించితేను
తక్కులందురుగాని తగులనరు
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్నునేఁడు
మక్కువలు నిండుఁగాని మరివేరుగాదు

రేకు: 0162-5 కన్నడగౌళ సంపుటం: 07-367

పల్లవి: ఆతనితోనేల పంతాలాడేవే నీవు
యేతరివాఁడు గుట్టుతోనెడయఁగ నేర్చునా

చ. 1: సరమాడినవాఁడుసంగడిఁ గూచుండుఁగాక
పరగ వట్టిసిగ్గులు వడునటవే
వరుసతో మాటాడినవాఁడు చెయిచాఁచుఁగాక
శిరసువంచి చింతతో చిక్కువడునా

చ. 2: మొగముచూచినవాఁడు మోహించి పైకొనుఁగాక
బిగిసి వట్టిబీరాలు పెంచునటవే
తగుల వలచువాఁడు తమకమె చూపుఁగాక
అగడైన అడియాస లణఁచఁగఁ గలఁడా

చ. 3: చేపట్టి కూడినవాఁడు చేరిమోవియిచ్చుఁగాక
చాపలాన రతులకు జడియునటే
యేపున శ్రీ వెంకటేశుఁడిట్టె నిన్నుఁగూడె నేఁడు
కాఁపురములీడేరె గరిసించనోపునా

రేకు: 0162-6 రీతిగౌళ సంపుటం: 07-368

పల్లవి: ఏల సిగ్గులు వడేవు యిందరిలోన
పాలిండ్లు చూపి నాపె బాఁతిపడివున్నది

చ. 1: దీకొని మోమైనాను దిట్టించి చూడరాదా
నీకు మొక్కినాపె యిట్టె నిలుచున్నది
మైకొని వూరకే మంచిమాటైనానాడరాదా
ఆకుమడిచిచ్చినాపె ఆసపడియున్నది

చ. 2: ఆనుకొని పరిణామమైన నడుగరాదా
కానుకలిచ్చినయాపె కాచుకున్నది
నానఁబెట్టి సెలవుల నవ్వైనా నవ్వఁగరాదా
పూని సన్నసేసినాపె పొలయుచున్నది

చ. 3: కొంగువట్టి రతులకు గురుతు చెప్పఁగరాదా
వుంగరమువట్టినాపె వొద్దనున్నది
చెంగట శ్రీ వెంకటేశ చేరి నన్నుఁ గూడితివి
యింగిత మెరిఁగినాపె యెదుటనే వున్నది

రేకు: 0163-1 బౌళిరామక్రియ సంపుటం: 07-369

పల్లవి: చిత్తగించవయ్యా యీపె చెలువములు
కొత్తలుగా మోవి చిగురు చెంగలించెను

చ. 1: జలజ లోచన నిండు జవ్వన వనములోన
మొలక నవ్వు వెన్నెల మోసులెత్తెను
వలరాజనెడి తోఁటవాఁడు పొదిసేయఁగాను
పులక జాజిననలు పూవక పూచెను

చ. 2: కాంతనెరిఁగురుల చీకటి పొదరింటిలోన
వింత తుమ్మిదగూండ్లు విరివాయను
చెంత గాలియనే తపసి నెలవైయుండఁగాను
అంతటా నానందకళాలాని నిండుకొనెను

చ. 3: సతి వలపుల పెద్ద జలజాకరములోన
తతిఁ గన్నుల మీలు చందములాయను
అతివ యలమేల్మంగ యాకె శ్రీ వెంకటేశ్వర
రతిఁగూడ మోహనమరందములు గురిసె

రేకు: 0163-2 మధ్యమావతి సంపుటం: 07-370

పల్లవి: చెలులెల్లాఁ జూచిసంతోసించి మెచ్చి పొగడేరు
కలిగె నీకు మేలము కలకాలము

చ. 1: చెలియ నీవద్దనుండి సెలవి నవ్విన నవ్వు
వెలలేని వలపుల వెన్నెలపువ్వు
అలవోక నీమీఁదనంట జూచినచూపు
తలకొన్న జవ్వనమదము తరితీపు

చ. 2: పొంచి నీదేవులు నీతోఁ బూఁచి యాడినపలుకు
వంచి తీసిన మరువాఁడిచిలుకు
అంచి నీయెదుటఁ బచరించిన సింగారము
పంచలఁ బదారువన్నె బంగారము

చ. 3: వనిత నీతోఁబెనఁగి వలలఁబెట్టిన యాస
మునుకొన్న తమితోడి ముత్తెల సేస
చనవిచ్చి శ్రీవెంకటేశ్వర యీకెనేలితివి
చెనకురతిమెండు చెరకునఁ బండు

రేకు: 0163-3 భైరవి సంపుటం: 07-371

పల్లవి: నేనే వింతగాని నీ చుట్టాలవేయివి
కానుకగా నేఁదెచ్చితే కడు వెంగమనేవు

చ. 1: కప్పురము నేనిచ్చితే కసరుదురా
దప్పికి నెవ్వతో నీకు దాఁచినది
తెప్పిర సురటి వీచితే జంకింతురా
వొప్పుగా నాపేరూపు వొనర వ్రాసినది

చ. 2: పానుపు వరచితే సిగ్గువడుదురా యిందాఁక
నీనెలఁత యెవ్వతో నిద్రించినది
పూని గందమిచ్చితే వొల్లనందురా
మేననాకె పూనుకొని మిగిలినది

చ. 3: సారెఁ బువ్వుల వేసితే సాదింతురా
కూరిమి నీ సతి పెద్ద కొప్పులోనివి
చేరి నన్నుఁ గూడితివి శ్రీ వేంకటేశ్వర
వారిదాననే నేను వచ్చి పెండ్లాడితిని

రేకు: 0163-4 శ్రీరాగం సంపుటం: 07-372

పల్లవి: వెలఁది సింగారము వింత వింత బాగులాయ
చెలువపు విభుఁడవు చిత్తగించవయ్యా

చ. 1: తేఁటులు పువ్వులుండిన చోటికి వచ్చుఁగాక
తేఁటులలోఁ బువ్వులెట్టు తిరమాయను
గాఁటపు చందురురాక కలువలు గోరుఁగాక
వాఁటమై చంద్రునిలోఁ గల్వలు తావుకొనునా

చ. 2: చివ్వనను సంపెంగ చిగురుపై బూచుఁగాక
పువ్వుకొనఁ జిగురు దాపుగనుండునా
వువ్విళ్ళూరఁ గొండలపై నుండుఁగాక సింహము
కొవ్వు మీరి సింహము కొండలుదామోచునా

చ. 3: అల మరుతేరిపైనంపపోదులుండుఁ గాక
అలరులు పొదులు తేరునఁ గలవా
బలిమి నీలానకు బంగారు గమ్యోఁగాక
నెలవై శ్రీ వేంకటేశ నీలము గమ్యోనా

రేకు: 0163-5 శంకరాభరణం సంపుటం: 07-373

పల్లవి: గుట్టు చేసుకొని పతిఁ గూడి మాడి యుండరాదా
చుట్టిచుట్టి యిప్పుడెంత చొప్పులెత్తేవే

చ. 1: మొగలి రేకులు వంగి ముంగురుల జారెనంటా
యెగసక్కేలాతని నీవేలాడేవే
నగుతా నీతోడనానలు సారెఁ బెట్టుకోఁగా
సొగిసి మచ్చములేల చూపవచ్చేవే

చ. 2: కడు నోసలికస్తూరి కరఁగి మోవంటెనంటా
జడిసి యీతనివేల సాదించేవే
పడఁతుల సాకిరులు పలుమారుఁ దెలుపుకోఁగా
వెడవెడగానేల వెంగేలాడేవే

చ. 3: చెమట రేఁగి రెంటెము చిప్పిలఁ దడిసెనంటా
జమళి శ్రీ వేంకటేశు జంకించనేలే
తమితోఁ గాఁగిటఁగూడి తానె వచ్చివేఁడుకోఁగా
నెమకుచు నిట్టె యింత నీటులు చూపేవే

రేకు: 0163-6 కేదారగౌళ సంపుటం: 07-374

పల్లవి: చిత్తగించు నీవీకెకు సింగారము
బత్తిసేసెనాపె నీకుఁ బాయనిసింగారము

చ. 1: చెలియ మోమునకును చిరునవ్వు సింగారము
చిలుకుఁ జూపు కన్నుల సింగారము
కలితంపుఁజెక్కులకు కళలు సింగారము
లలిమీర నొసలి కలకలు సింగారము

చ. 2: ఉన్నతపు చన్నులకు నొరపు సింగారము
చిన్ననడిమికి నారు సింగారము
అన్నువ చేతులకు నొయ్యారి గోళ్ళే సింగారము
తిన్ననిమెడకు సోగతీరు సింగారము

చ. 3: నవకపుఁబాదాలకు నడపు సింగారము
చివురుమోవికి మించు సింగారము
తివిరి శ్రీ వేంకటేశ తెరవఁగూడితి విట్టే
సవరనిమేనికందచందమే సింగారము

రేకు: 0164-1 సౌరాష్ట్రం సంపుటం: 07-375
పల్లవి: ఔనో కాదో యీతగవులడుగవే రమణుని
కానుకలెంత యిచ్చినా కంటకమై వుండును
చ. 1: మనసురానిసతి మంచిమాటలాడినాను
విని విని పతికది వెంగెమై తోఁచు
ననుపు లేనియాకె నవ్వులెన్ని నవ్వినాను
కినిసి యాతనికి కేరడమై వుండును
చ. 2: ఎరవెరవైనయాకె యిచ్చకము సేసినాను
విరసానాతనికి వెగటై తోఁచు
పొరపొచ్చెమైనయాకె పొదుగఁగ వచ్చితేను
గరిమ నాతనికిని కదిమినట్లుండును
చ. 3: వెగటైనయాపె యెంత వేడుకలు చూపినాను
యెగసక్కెపువానికి యెగ్గులైవుండు
తగు శ్రీ వేంకటేశుఁడు తానె వచ్చి నన్నుఁ గూడె
మగఁడైన యాతనికి మర్మము గరఁగును

రేకు: 0164-2 దేసాళం సంపుటం: 07-376

పల్లవి: అదేల నవ్వేవంటానడిగేవప్పటి నన్ను
సుదతులలో నిన్నుఁ జూచి నవ్వురాదా

చ. 1: ఇంటింటికేఁగి వచ్చి యిందరు నీవారంటా
నంటు చూపి మాటాడఁగా నవ్వురాదా
దంటయైన చెమటలచేఁ దడిసిన పచ్చడము
అంటించి చేతికియ్యఁగానందుకు నవ్వురాదా

చ. 2: వెలఁదుల పొత్తులను విందులారగించి వచ్చి
నలిఁ జవులు చెప్పఁగా నవ్వురాదా
కొలువుకాంతలిచ్చిన గొప్ప నిమ్మపండ్లెల్లా
లలి నీచేనుండఁగా మెల్లనె నవ్వురాదా

చ. 3: పడఁతులకుఁ గప్పురబాగాలు నీవు వెట్టఁగా
నడుమ నుండిన నాకు నవ్వురాదా
యెడయక శ్రీ వెంకటేశ నన్నునేలితివి
కడమలేని రతులకింకా నవ్వురాదా

రేకు: 0164-3 శ్రీరాగం సంపుటం: 07-377

పల్లవి: ఇందుకుపాయము నీవు యెటుసేసేవో
యిందరిలోపల నిన్ను నేమీననకున్నది

చ. 1: అక్కడిబాగాలు దెచ్చి అతివకు నియ్యఁగాను
పక్కననొల్లననదు పట్టదు చేత
మొక్కలపుటల్క గొంత మొకదాకిరి గొంత
నిక్కముగా నీకుఁజూపి నివ్వెరగందినది

చ. 2: ఊరివారి చిల్కదెచ్చి వొడిలో నీవు వెట్టఁగా
నేరుపదు మాటలు దాని విడువదు
ఆరితేరిన సిగ్గుగొంత ఆసపాటు మరికొంత
కూరిమి లోలోఁదలఁచి గుట్టుతోడనున్నది

చ. 3: సవతుల కానికలుసంగడి నీవిడఁగాను
తివిరి కోపగించదు దిష్టించదు
యివల శ్రీ వేంకటేశ యింపుగొంత తెంపుగొంత
కవగూడి అన్నిటాను కైవసమయినది

రేకు: 0164-4 హిజ్జిజి సంపుటం: 07-378

పల్లవి: మంకు గొల్లవారైతేనే మానము లేదా
బింకమున నాతోనెంత పెనఁగులాడేవు

చ. 1: కాఁపురము సేసేదానిఁ గలువ పువ్వుల వేసి
రాఁపుసేసి మమ్ముఁనేల రచ్చఁబెట్టేవు
పూఁపచన్నులు పయ్యదఁ బొదిగి దాఁచుకుండఁగా
చూపుమని మమ్ముఁనెంత సోదించేవు

చ. 2: సిగ్గుతోడున్నదానిఁ జేతులు వట్టి తీసి
కగ్గుదేర నెంత నవ్వి కాకుసేసేవు
వొగ్గి తేనెమోవి చేతనూరకే మూసుకుండఁగా
వెగ్గళించి యెంగిలి గావించనేల వచ్చేవు

చ. 3: పానుపుపై నున్నదానిపక్కఁ బండి కౌఁగిలించి
మేను ముట్టి నన్నునెట్టు మేర మీరేవు
పూని శ్రీ వెంకటేశుఁడ పొంచి తెరలోనుండఁగా
ఆనవెట్టి రతినెంత అలయించేవు

రేకు: 0164-5 పాడి సంపుటం: 07-379

పల్లవి: విచ్చేయరాదా వెలఁదిఁ జూతువుగాని
హెచ్చిన తమకముతో నింటిలోననున్నది

చ. 1: తలఁచిన తలఁపులు తరుణియురమునను
మొలచెను మొలకలై మొగిఁ జన్నులు
వలచిన వలపులు వడియుచుఁ జెక్కులను
జలజలఁ జెమటలై జడివట్టెనిదివో

చ. 2: కోరిన కోరికలెల్లాఁ గొనసాగి శిరసున
పేరడిగాఁ బెరిగెను పెనుఁదురుమై
నేరిచిన నేరుపులు నిండా మోవితేనెయై నో
రూరఁజొచ్చె నీ సతికి నొద్దికతో నిదివో

చ. 3: ననిచిన ననుపులు నాతిని నీవు గూడఁగ
గొనకొనీ గోరితాకుల లతలై
అనిశము శ్రీ వేంకటాధిప యీరీతినే
దినదినమును మాకు దిష్టమాయనిదివో

రేకు: 0164-6 దేశి సంపుటం: 07-380

పల్లవి: కొమ్మ కడకు విచ్చేసి కోరినవరమీరాదా
యెమ్మెల మానసతపమీకె చేసీని

చ. 1: వెన్నెలయెండలలోన విరహతాపానఁ జెలి
పన్ని మిక్కుటమైన తపము చేసీని
చెన్నుమీరఁ బరచిన చిగురుఁగత్తులమీఁద
యెన్నరాని వుగ్రతపమిదె చేసీని

చ. 2: మొనసి చెమటఁ దలమునుకల నీటిలోన
పనివడి నీకుఁ దపము చేసీని
ఘనమైన నిట్టూరుపు గాలి లోనఁ జెలించక
యెనలేని ఘోరతపమిదె చేసీని

చ. 3: బాయిటనె తనమేని పచ్చిజవ్వనవనాన
పాయక నీరతికిఁ దపము చేసీని
నీయింట శ్రీ వెంకటేశ నిన్నుఁగూడెలమేల్మంగ
యీయెడ మోహనతపమిదె చేసీని

రేకు: 0165-1 భైరవి సంపుటం: 07-381

పల్లవి: చేతలు నీవిచూచి సిగ్గయ్యీ మాకు
కాతరమింకానెంతే కతకారి నీకు

చ. 1: నీడనుండె యలసేవు నిన్ను నీవె సొలసేవు
చేడెరో నీమగఁడు చూచీనంటాను
పాడిపాడి చొక్కేవు పలుమారు నిక్కేవు
యేడ నేరుచుకొంటివే యెమ్మెలాఁడి నీవు

చ. 2: వేసాలకే మురిసేవు వెస ముద్దుగురిసేవు
పోసరించి యాతఁడు పొగడీనంటా
ఆసలు గడు రేఁచేవు అట్టె సిగ్గులు దాఁచేవు
మాసుద్దులు వినరాదా మాయదారి నీవు

చ. 3: బొమ్మనె జంకించేవు పొందులనె లంకించేవు
కమ్మి శ్రీ వేంకటేశుఁడు కైకొనీనంటా
నెమ్మది నన్నేలినాఁడు నేనలమేల్‌మంగను
సమ్మతించ నేరుతువే సటకారి నీవు

రేకు: 0165-2 బౌళిరామక్రియ సంపుటం: 07-382

పల్లవి: ఆతఁడేమనునో యని అనుమానించఁగనేల
చేతికిఁ గానుకియ్యవే చెప్పీఁ దానె సుద్దులు

చ. 1: వలవనేర్చినవాఁడు వట్టిజాలిఁ బెట్టఁడు
పలుకనేర్చినవాఁడు బాసదప్పఁడు
కలయనేర్చినవాఁడు గర్వములు చూపఁడు
పిలువవే యతని నాప్రేమ తానె యెరుఁగును

చ. 2: మనసెరిఁగినవాఁడు మరి జవదాఁటఁడు
తనవాఁడైనవాఁడు వింతలు సేయఁడు
ననుపు గలుగువాఁడు నవ్వినానెగ్గుపట్టఁడు
వినయానఁ దోడితేవే విభుఁడన్నీ నెరుఁగు

చ. 3: ఆసలుగలవాఁడు అట్టె జోలిసేయఁడు
వాసిగలవాఁడు తనవారిఁ బాయఁడు
సేసవెట్టెఁ దానె వచ్చి శ్రీ వేంకటేశుఁడు గూడె
రాసికెక్కె దినమును రప్పించవే ఆతని

రేకు: 0165-3 కాంబోది సంపుటం: 07-383

పల్లవి: ఏమి సేసితిమి నిన్ను యేల తడవేవు మమ్ము
మోము చూచితే నీకు మొక్కరాదా యేమి

చ. 1: మచ్చరాన వెంగెముగా మాటలాడరాదు గాక
యిచ్చకములాడితేను యెగ్గాయేమి
కొచ్చి మూతులుగిరిపి గుంపించవద్దుగాక
మెచ్చి తలవూబితేను మేలుగాదా యేమి

చ. 2: చేరి నీపైఁ దప్పువేసి చేయిచాఁచరాదు గాక
కోరి పాదాలొత్తితేను కోపమా యేమి
బీరముతోనొడివట్టి పెనఁగఁగ వద్దుగాక
కూరిమిఁ గొంగువట్టితే కొరతా యేమి

చ. 3: సరి నీకు మనసు దాఁచఁగరాదు గాక
తెరవేసి కూడితేను దిగ్గుడా యేమి
యిరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్నునిటె
విరులవేసి నవ్వితే వెగటా యేమి

రేకు: 0165-4 పాడి సంపుటం: 07-384

పల్లవి: ఆపె చేసిన చేఁతకు అమరునా నీమేలు
మోపులు గట్టేవు యింతి మునుకొన్న సుద్దులు

చ. 1: చుట్టుపు వరుసనాకె సుద్దులెల్లా నిన్నడిగి
అట్టె కప్పురము మోవి అంది యిచ్చెను
ముట్టి పయ్యదకొంగు నీముంజేతఁ జుట్టుకొని
బట్టబయలీఁదించేవు పడఁతి చన్నులను

చ. 2: మంచితనముననె మచ్చికలు నీకుఁ జూపి
అంచగమన బాగాలు అంది యిచ్చెను
ముంచిన వేడుకతో మునివేళ్ళ శిరసెత్తి
అంచలఁ దేలించేవు అంగనచూపులను

చ. 3: ఒడఁబాటుతోఁ గూడి నిన్నొరసినలమేల్మంగ
అడియాలమగు సొమ్ములంది యిచ్చెను
తొడఁదొడ మోయ కాలుదొక్కి శ్రీవెంకటేశ
పడియించేవు చెమట వనితదేహమున

రేకు: 0165-5 సామంతం సంపుటం: 07-385

పల్లవి: పుట్టిన మాటలివి భూమిలోనను
దట్టుపు సిగ్గులతోడ తానేల నవ్వీనే

చ. 1: తుమ్మిదలు బెదరెను దొండపండు గంటివడె
కొమ్మలాల చూడరే యీకొత్తలు నేఁడు
యిమ్ముల నీసోద్యములిందరమునాడుకొంటే
తమ్మికంటి యిందుకుఁగా తానేల నవ్వీనే

చ. 2: జల్లన ముత్యాలు రాలె చందురుఁడుదయమాయ
యిల్లదివో వినరె వోయింతులాల
చల్లఁగా నేమిదిచూచి సంతోసించుకొంటేను
దల్లాళితనముతోడ తానేల నవ్వీనే

చ. 3: కలువలు చెంగలించె కన్నెజాజులు ననిచె
లలిమీరి వోభామలాల మెచ్చరే
అలమి శ్రీ వెంకటేశుఁడాడనున్నాఁడంటిమింతే
తలపోసి తలపోసి తానేల నవ్వీనే

రేకు: 0165-6 మాళవిగౌళ సంపుటం: 07-386

పల్లవి: ఆనతిమ్ము నాతోను అనుమానము గలితే
నేనిక్కడనుండఁగానో నేమముచూపేవు

చ. 1: ఆసపడి వచ్చివున్న అంగనఁ జేకొనకుంటే
దోసమనే మాట నీవు తొల్లి వినవా
వాసిగల బొమ్మచారివలెనే వూరకుండేవు
బాసిచ్చి వచ్చితివో యేపడఁతికైనాను

చ. 2: చుట్టమై వచ్చినాపెకుఁ జోటియ్యకుండితేను
వట్టి నిష్ఠూరముగాదా వరవాతను
ముట్టుక తపముచేసే మునివలెనె వుండేవు
గుట్టుతోడనుండేనని గుణముగైకొంటివో

చ. 3: గరిమ మొక్క వచ్చిన కాంతఁ గౌఁగిలించకుంటే
యెరవెరవై తోఁచదా యెవ్వరికైనా
దొరవై శ్రీ వేంకటేశ గురునివలెనుండేవు
సరినన్నేలితివి నాసమ్మతి గావలశో

రేకు: 0166-1 కేదారగౌళ సంపుటం: 07-387

పల్లవి: ఏమోయని యెంచకుమీ యిందరిలోన నీవు
కామించిన జాడసుమ్మీ కలికి యిన్నియును

చ. 1: కొమ్మ నీపయ్యదలోనికుచముల మారు సుమ్మీ
నిమ్మపండ్లెగరవేసీ నీరమణుఁడు
రమ్మని చేతులఁ జూపరాక సుమ్మీ సన్నగాను
తమ్మిపూవులను వేసీ దవ్వులనే తాను

చ. 2: నిద్దరపుమెరుఁగుల నీచెక్కులమారు సుమ్మీ
అద్దముల నీడచూచీనప్పటిఁ దాను
వుద్దండాన నిన్ను గోరఁసూదిన భావము సుమ్మీ
కొద్దిమీరి గేదంగిరేకులనె చిమ్మీని

చ. 3: మలసి నిన్నుఁ గూడిన మారు సుమ్మీ నీవంపిన
చెలికత్తెఁ గాఁగిలించె సిగ్గుదేరను
కలసెను నిన్ను శ్రీ వెంకటేశుఁడీడకు వచ్చి
అలయించలేక సుమ్మీ ఆయములంటీని

రేకు: 0166-2 సౌరాష్ట్రం సంపుటం: 07-388

పల్లవి: పడఁతి చందములు నీభాగ్యమాయను
యెడయకాపెకు నిట్టె యేకచిత్తమాయను

చ. 1: కొలువులోఁ గొప్పువీడి కొమ్మ చక్కఁబెట్టుకోఁగా
వలుద చన్నులు గానవచ్చెనదివో
చెలఁగి రెంటికిఁగాను సిగ్గువడి యెంతలోనే
బలిమి నీ పచ్చడము పైఁగప్పుకొనెను

చ. 2: కాంత మేను చెమరించి కట్టుఁజీర తొప్పఁదోఁగి
వింతగాఁ దొడలకాంతి వెలిఁబడెను
చెంతనేమీననరాక శిరసు వంచుకొని
మంతనాన నీ మలఁగుమాటునఁ గూచుండెను

చ. 3: అలమేల్మంగ పులకలంగమున నుబ్బఁగాను
బలిమిఁ గుచ్చల జారి పచ్చిదేరెను
అలరి అందుకు నిందుకౌఁగాదనఁగ రాక
నెలవై శ్రీ వేంకటేశ నిన్నుఁ గాఁగిలించెను

రేకు: 0166-3 దేసాళం సంపుటం: 07-389

పల్లవి: ఏమి నీకు తమకమో యెరఁగ నేను
వాములాయ పులకలు వట్రువ నాచన్నుల

చ. 1: చేరి యాల పట్టేవు నాచేఁకట
యేరా యెంతలేదు నీయేఁకట
ఆరజము సేయకు మమ్మందరిలోన
చేరెఁడేసీ కురిసె నీచెమట నామేన

చ. 2: సూటిగానేమి చూచేవు చొక్కపుమోవి
తేటగానందునున్నది తియ్యనితావి
యేఁటికి రేఁచేవు సారెనిటె నాసిగ్గు
గాఁటపు నానగవులె కప్పురపు ముగ్గు

చ. 3: కందువమేలిదివో నాకాఁగిట
విందు నీసుద్దులెల్లా భావించి లోఁగిట
చెంది నీచింతలో శ్రీ వెంకటేశ
సందడినొండొంటితో చన్నులు రాశె

రేకు: 0166-4 నాదరామక్రియ సంపుటం: 07-390

పల్లవి: మన్నించి నన్నేలుకోర మచ్చిక తోడ
యిన్నిటా జాణఁడవు నన్నిట్టె యీడ

చ. 1: మక్కువతో నీకుఁగొంటి మరులు
వెక్కసమై రాలీఁ గొప్పువిరులు
కక్కసించీ మరునంపగరులు
యిక్కువఁ జెయిచాఁచర యివె కుచ గిరులు

చ. 2: పొదలెను మనలోని పొందులు
సదరాన నదరీ నీసందులు
మదమెత్తించీ వీడేల మందులు
పెదవిపై నివె నీకు పెరతేనెవిందులు

చ. 3: ముందరనె మొక్కే నీకు మొక్కులు
అంది నీకు నాకూటమినవె చొక్కులు
ఇందరిలోఁ గూడితివి యిట్టె శ్రీ వెంకటేశ
సందడించీఁ బాదముల సరసపు తొక్కులు

రేకు: 0166-5 శ్రీరాగం సంపుటం: 07-391

పల్లవి: ఏమి గావలెనో నీకు నిదివో ఆపె
ఆముకొని చక్కఁజూడవయ్యా నీవిపుడు

చ. 1: సొలసి సొలసి నిన్నుఁ జూచినల్లాడనుండి
కలువ రేకుల నుండి కన్నులాపె
పిలిచీనప్పటి నిన్నుఁ బేరుకొని సారెసారె
నలిరేఁగి సెలవుల నవ్వులాపె

చ. 2: సందడిలోననె నీకు సన్నలుసేసీఁ దాను
పొందుల నీమేనమామపోలికలాపె
కందువలనుండి పోఁకకాయలను నిన్నువేసి
చిందెడి చెక్కులమీఁదిచెమటలాపె

చ. 3: చిత్తజకేలికినిట్టె చేతులుచాఁచీ నీపై
కొత్త కొత్త మెరుఁగుల గుబ్బలయాపె
యిత్తల శ్రీ వెంకటేశ యేలితివి నన్నునేఁడు
పొత్తుగలసీ నీతో పొరచి యాపె

రేకు: 0165-6 శంకరాభరణం సంపుటం: 07-392

పల్లవి: వెలఁది భావము నీకు విన్నవించితి
యెలమి నాపె వలపులేమి చెప్పేదిఁకను

చ. 1: నిరతముఁ బ్రేమతోడ నీవు చేసిన చేఁతలు
తరుణికినే పొద్దు తలపోఁతలు
సరవి నీవు దీసిన చన్నులపై గీఁతలు
సిరుల జవ్వనపు లచ్చెనవాఁతలు

చ. 2: చతురుఁడ నీవు మున్ను చల్లిన యట్టి శాసలు
అతివకు పాయని అడియాసలు
యితరులెరఁగఁగానె యిచ్చిన నీ బాసలు
తతి సవతులకు సదా గోసనాసలు

చ. 3: వొలిసి నీవాడిన వొడఁబాటు మాటలు
చెలికి వీణలో వాయించే పాటలు
యెలమి శ్రీ వెంకటేశ యీకె నిట్టె కూడితివి
అల మోవి తేనె వూటలమృతపుఁ దేటలు

రేకు: 0167-1 శ్రీరాగం సంపుటం: 07-393

పల్లవి: అంగనకు నీకుఁబొందు అధరామృతపు విందు
అంగవించి సరసములాడ నిదే సందు

చ. 1: మనసులొక్కటులాయ మర్మములొండొంటి రాయ
తనివోని వలపులు తగులుసేయ
ఎనసి మీరున్నవారు యింపులకిదే తీరు
చెనకి మీలో మీకు చెల్లదిఁక దూరు

చ. 2: తలపోఁతలొనఁగూడె దట్టపు సిగ్గులు వీడె
యెలమి మీ కోరికలు యీడుజోడాడె
పులకలు నిండె మేన పొసఁగదు తొల్లిటాన
చెలరేఁగెనిద్దరికిఁ జెమటల సోన

చ. 3: మొగమునఁ గళలెక్కె ముచ్చటలెల్లా దక్కె
సొగసైన రతుల చొక్కులు నిక్కె
నిగిడి శ్రీ వెంకటేశ నెలఁతఁ గూడితివిదె
మొగమోట నీకునీపో ముందరను మొక్కె

రేకు: 0166-2 బౌళిరామక్రియ సంపుటం: 07-394

పల్లవి: ఇంతిరో నీపతిని నీవేమి సేసినానేమాయ
కాంతునివద్దికి రావే కడు సిగ్గులేఁటికి

చ. 1: కూడి వున్నచోటను కుచ్చితము వద్దుగాని
ఆడరానిమాటలన్నీ నాడవచ్చును
వేడుకే కలిగితేను వేసరుకోవద్దుగాని
జాడతోడ బొమ్మలను జంకించవచ్చును

చ. 2: కూరిమిగల పట్టున గుట్టుసేయవద్దుగాని
నారుకొననెంతైనా నవ్వవచ్చును
మేరతోడిపొందులకు మేకు చూపవద్దుగాని
బీరపు సమ రతులఁ బెనఁగఁగ వచ్చును

చ. 3: చనవుగల యెడను చలములు వద్దుగాని
వెనుకొని విరులను వేయవచ్చును
చెనకి నన్నిదె కూడె శ్రీ వెంకటేశుఁడు
పొనుఁగఁగ వద్దుగాని భోగించవచ్చును

రేకు: 0167-3 వరాళి సంపుటం: 07-395

పల్లవి: ఉపకారముచేయుట ఊహించుకోవద్దా
కపటము గలిగితే కాదనుటగాక

చ. 1: చన్నులమీఁదిపయ్యద జారఁదీసీనంటాను
కన్నుల జంకించేవు కాంతుని నీవు
వున్నతపు జక్కవలు వుమ్మడిఁజిక్కివుండఁగాను
యెన్నఁగ బాయిట వేయుటెగ్గా యిది

చ. 2: కొప్పు సంపెంగ పువ్వులు కుమ్మరించెనంటాను
అప్పుడె యాతని దూరేవౌనే నీవు
తప్పకుండా నెరితుమ్మెదలకును జిక్కకుండా
వొప్పుగాఁగ దులుపుట వుచితము గాదా

చ. 3: మునుకొని నీపోకముడి విడిచెనంటాను
యెనసి శ్రీ వెంకటేశునేల తిట్టేవే
ఘనకరికుంభములు కట్టుగాడినుండఁగాను
కని మరఁగు దీయుట కడు నేర్పు గాదా

రేకు: 0167-4 వరాళి సంపుటం: 07-396

పల్లవి: ఆతని చిత్తమెట్టిదో అదెరఁగను
నీతి తోడ నడపితే నెట్టుకొనే నేను

చ. 1: చలపట్టువద్దుగాని చనవిచ్చి మన్నించితే
చెలరేఁగి యెంతైనా సేవచేసేను
అలుగఁగనోపఁగాని ఆసవెట్టి చెనకితే
నలువంకనెంతైనా నవ్వే నేను

చ. 2: కపటము వద్దుగాని కడుఁబొందు సేసితేను
యెపుడైనా తనమాటకియ్యకొనేను
నెపమెంచనోపఁగాని నేరుపున లాలించితే
వుపమలఁ దనచేఁతకొడఁబడే నేను

చ. 3: మచ్చరము వద్దుగాని మంచితనానఁ గూడితే
మచ్చికఁ దన్నునిట్లా మరిగే నేను
తచ్చనలకోపఁ గాని తగిలి శ్రీవేంకటేశుఁ
డిచ్చట నన్నేలినాఁడు యిరవైతి నేను

రేకు: 0167-5 సామంతం సంపుటం: 07-397

పల్లవి: ఇల్లాలైనదానికి యివి గుణాలా
మెల్లనె గుట్టుతోడనె మెరతురు గాక

చ. 1: కాతరించి సారె సారెఁ గడు సరసమాడేవు
ఆతనికి నీవు దొల్లి ఆలవా యేమి
యేతుల మాటలాడి యిట్టె నవ్వించేవతని
జాతిక ర్తవా నీవు జాణతనాలాడను

చ. 2: సముకాన నీవిట్టే చనవులు నెరుపేవు
తమితోడఁ బోరానిచుట్టుమవా యేమి
చెమటలు గారఁగాను సేవలెల్లాఁ జేసేవు
అమరఁగ నూడిగపు అంగనవా యీడను

చ. 3: పతివద్దనందరికి పనులెల్లాఁ జెప్పేవు
సతతమునదికారిసానివా నీవు
తతి శ్రీ వెంకటేశుఁడు తగ నన్నుఁ గూడె నేఁడు
కతకారిదానవా చక్కటులు చెప్పఁగను

రేకు: 0167-6 ముఖారి సంపుటం: 07-398

పల్లవి: చెప్పుమని యడిగినఁ జెప్పదు మాతోనిదె
చొప్పులు నీకె తెలు సోదించుకోవయ్యా

చ. 1: చిత్తరుపటము చూచి చెలి లోలోఁ దలపూఁచి
చిత్తడిచెమటతోడ సిగ్గువడెను
యిత్తల నీవందులోన నేమి వ్రాసితివో కాని
అత్తి నీవాపనే యింకానడుగవయ్యా

చ. 2: బొమ్మలపెండెము చూచి పొలఁతి యేమీననక
వుమ్మడినే నవ్వునవ్వుచున్నది యిట్టే
చిమ్ములనేమిభావాలు సేయించితివందులోనె
నెమ్మదినందలిమేలు నీవడుగవయ్యా

చ. 3: పట్టినసురటి చూచి పడఁతి శ్రీ వెంకటేశ
గట్టితమకాన నిన్నుఁ గాఁగిలించెను
గుట్టుననందేమి మేకులు గడించితివో
అట్టునిటునా పెతలఁపడుగవయ్యా

రేకు: 0168-1 మాళవిగౌళ సంపుటం: 07-399

పల్లవి: ఇంకనేల వట్టిజోలి యిందులోనే వున్నది
తెంకినే ఆపెకిన్నియుఁ దెలుపఁగరాదా

చ. 1: కన్నుచూపె వాండ్లైతే కడునొడ్డించుకోనేది
వెన్నెలలే వేండ్లైతే విచారమేది
కన్నె నిన్నుడుగుమనెఁ గరుణించి యిఁకను మా
విన్నపము వినాడకు విచ్చేయరాదా

చ. 2: నవ్వులే నాములెక్కితే నయమైన మందులేవి
పువ్వులే పోటుకువస్తే బుద్ధులేవి
జవ్వనిట్టె ఆడుమనె సముకమే యిద్దరికి
దవ్వులేల యించుకంత దగ్గరి రారాదా

చ. 3: చల్లగాలి పగలైతే సందిమాటలిఁకనేవి
వల్లెతాడు వలపైతే వద్దననేది
ఇల్లిదె శ్రీ వేంకటేశ యింతి నీకుఁ జెప్పించె
లొల్లిఁ గూడితివిఁకను లోననుండరాదా

రేకు: 0168-2 నాదరామక్రియ సంపుటం: 07-400

పల్లవి: ఇందుకేల వలచితి మింతులము
పందెపు మరు పూబంతులము

చ. 1: మలకలయిన నీమాటలు
యెలయింపులకును యేటలు
పలుమరుఁ బాడేటి పాటలు
తెలిగన్నులకును తేటలు

చ. 2: నడుమంత్రపు నీనగవులు
తడవినవారికి తగవులు
బెడిదపుఁ జూపుల బిగువులు
యెడయనియాసల యెగువదిగువలు

చ. 3: కలయ నీకాఁగిటి కరఁగులు
తెలియఁగలుగు రతితెరఁగులు
కలసితి శ్రీ వేంకటపతి ననునిటు
మలసిన మర్మపు మరఁగులు

రేకు: 0168-3 ఆహిరి సంపుటం: 07-401

పల్లవి: వద్దు చలమింతటను వనితఁ గావఁగరాదా
ముద్దసేసి తమకము మూలఁబెట్టకొనేవా

చ. 1: కోరికలు పెడరేచి గుట్టుననున్నాఁడవు
ఆరీతినలయింతురా ఆఁటదానిని
రారాదా యిఁకనైనా రమణిపానుపుపైకి
వూరనిచ్చి విరహము వుట్టిఁగట్టేవా

చ. 2: చెమటపుట్టఁ జెనకి సిగ్గుననున్నాఁడవు
చిమిడింతురా మనసు చెలియకును
జమళినింతిచన్నుల సాములు సేయఁగరాదా
వుమరఁబెట్టి వలపు వొడినించుకొనేవా

చ. 3: కాఁగిలించి కరఁగించి కన్నులు మూసుకొనేవు
దాఁగిలిముచ్చిమేఁటికి తరుణితోను
వీఁగక శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితివిట్టే
మాఁగనిచ్చి మోవితేనె మరిఁ గొసరేవా

రేకు: 0168-4 సాళంగనాట సంపుటం: 07-402

పల్లవి: ఇందులోనె వున్నదిదె యింతి తమకములేల
గొందినే కోరికలెల్లా కొమ్ములేకిగిర్చెను

చ. 1: చెలి నీకడకు రాఁగా చెమటలఁ దొప్పఁదోఁగె
వలపులు వానలేనివరదాయను
ఎలమి నీరాకల కెదురులు చూడఁగాను
వెలయఁగ దీవె లేకే వెలుఁగు గాన్పించెను

చ. 2: వెదకుతానే నిన్నువెలఁది కాఁకలఁ బొందె
యెదుటఁ బొద్దువొడవకెండ గాసెను
ఇదె నీపై యాసలనిట్టె మేను పలకరించె
వెదవెట్టుక ససులు వేవేలు మొలచెను

చ. 3: నీరతికిఁ జేయి చాఁచి నిట్టూర్పుల నిండెఁ జెలి
కోరి యాస గాలిలేక తూరుపెత్తెను
సారె శ్రీ వెంకటేశుఁడ చన్నుల నిన్నునొత్తి
బోరునఁదా జాళెలేని బొమ్మరాలువేసెను

రేకు: 0168-5 బలహంస సంపుటం: 07-403

పల్లవి: కడుఁ జుట్టుమవు నీవు కావంటినా
యెడయక నన్నునిట్టె యేలుమంటిఁ గాక

చ. 1: చెక్కునొక్కి నీవు నాచేయిమీఁదఁ జేయి వేసి
తక్కక నవ్వులు నవ్వఁగాఁ దగదంటినా
వొక్కతెపైఁ బెట్టి మాట వొక్కొక్కటి తడవఁగా
వక్కణించనంతేసి వద్దంటిఁ గాక

చ. 2: ఏపున నావద్దనుండి యింత కలసి మెలసి
కాఁపురము సేయఁగాను కాదంటినా
చూపి మోపి యాడోవారి సొమ్ములు మేనఁబెట్టుక
రాఁపులుసేయఁగా నందుకోపనంటిఁ గాక

చ. 3: చన్నులురమున రాయ సారెఁ గాఁగలించుకొని
యెన్నిచేఁతలు సేసినానేఁటికంటినా
అన్నిట శ్రీ వేంకటేశ అలమేల్మంగనే నేను
మన్నించి కూడితివిది మాననంటిఁ గాక

రేకు: 0168-6 బౌళిరామక్రియ సంపుటం: 07-404

పల్లవి: ఇందుకే నేఁ జింతించేను యెటువలెనున్నాఁడవో
సందడిపెండ్లిండ్లాయ సరుస నీబతుకు

చ. 1: చెంతలనాపె నీపైఁ జెలు చాఁచఁగాను
వంతుకుఁ జెయి చాఁచితినివ్వల నేనుండి
యింతుల మిద్దరమును యిరువంకలానుండఁగా
సంతకూటమాయను చక్కని నీమేను

చ. 2: ఆకడనాకె నీకు నాకుమడిచియ్యఁగాను
యీకడ నేనూ నీకునిచ్చితినిట్టే
కైకొని యిద్దరునూడిగము నీకుఁ జేయఁగాను
కాకువడి కలగూరగంపాయ నీనోరు

చ. 3: గక్కన నాపె నిన్నుఁ గాఁగిటఁ గూడఁగాను
వొక్కటై నేనూనట్టే వొనరఁగాను
యిక్కువ శ్రీ వెంకటేశ యెనసి యిద్దరివల్లా
అక్కర నురిపేకళ్ళమాయను నీవురము

రేకు: 0169-1 మధ్యమావతి సంపుటం: 07-405

పల్లవి: మించెనివె సింగారాలు మెలుఁతలాల
పంచబాణు సవరణ పరగినయట్లు

చ. 1: నలినాక్షి కన్నుల నడుమనీనాసికము
చెలఁగి యమరెనె వోచెలులాల
కలువల బొమ్మవిండ్లఁ గంతుఁడేయఁగాఁ జూచి
యెలమి సంపెగపవ్వు యెడచొచ్చినట్లు

చ. 2: ముదిత కుచాంతరమునను యీరోమరాజి
అదివో యంత చూపట్టె నంగనలాల
కదిసి పెట్టలు గుండ్లు కంఠనాళమున మరుఁ
డెదిగించఁ బొగబాణమెడచొచ్చినట్లు

చ. 3: శ్రీసతి పిరుఁదుచెంత శ్రీ వెంకటేశునురము
ఆసరినెట్టుండెనో అంగనలాల
రాసి మధ్యరంగానఁ జక్రాలు మరుఁడొనరింప
యీసుదీర హరిగె దానెడచొచ్చినట్లు

రేకు: 0169-2 దేసాళం సంపుటం: 07-406

పల్లవి: అంగన చెలువు చూడవయ్యా నీవు
సంగడి సింగారాలు సతమై నిలిచెను

చ. 1: వెంటనె చంద్రుఁడు గడు వెన్నెల గాయఁగాను
వొంటిఁ జీఁకటి వెనకకొదిగినట్లు
నంటున నేఁడీచెలియ నవ్వుమోముతోనుండఁగ
అంటి వీఁపునఁ దురుము అందమై నిలిచెను

చ. 2: చెలరేఁగి సింహము చేరి యెక్కితే భారాన
వెలికిఁ గరికుంభాలు వీఁగినయట్లు
మెలుఁత సన్నపు నడిమితోఁ జెలఁగఁగాను
బలిమిఁ బిరుఁదు కిందుపడి తా నిలిచెను

చ. 3: కోవిల వేడుకఁ జవిగొనఁగా లేఁతచిగురు
శ్రీ వెంకటేశ్వర చిల్లులైనట్లు
నీవింతిఁ గూడఁగా నాపె నేరుపుల మాటలతో
వావాత మోవి కెంపులు వరుసలై నిలిచె

రేకు: 0169-3 శ్రీరాగం సంపుటం: 07-407

పల్లవి: చిత్తజు వేడుకొనరే చెలియలాల
తత్తరించి పతిమీఁది తలపోఁతనున్నది

చ. 1: అతివవై మదనుఁడు అనలాస్త్రమేయఁబోలు
కతలుగ విరహగ్నిఁ గాఁగీనదే
యితవుగా వరుణాస్త్రమేయఁబోలునప్పటిని
తతిఁ జెమటవానలఁ దడియుచునున్నది

చ. 2: అమరగ నంతలో వాయవ్యాస్త్రమేయఁబోలు
వుమరఁబడి నిట్టూర్పులొగి రేఁగెను
జమళిఁ గూడఁగ నట్టె శైలాస్త్రమేయఁబోలు
భ్రమసి చనుఁగొండలు బాయిటఁ గాన్పించెను

చ. 3: మునుకొని పంతాన సమ్మోనాస్త్రమేయఁబోలు
మనసు పరవశాన మరపందెను
అనిశము రక్షగా నారాయణాస్త్రమేయఁబోలు
ఘన శ్రీవేంకటేశుఁడు కాఁగిటిలోఁ గూడెను

రేకు: 0169-4 కేదారగౌళ సంపుటం: 07-408

పల్లవి: ఇద్దరి భావములును యెంచగ నలవిగావు
వొద్దికలై సింగారాలు వొడ్డినయట్లుండెను

చ. 1: చెలువపు రమణుఁడు చెమట పైఁ జిమ్మితేను
జలజలఁ జెమరించి సకి యెట్లుండె
నెలవై లావణ్య జలధిలో స్వాతి వానచే
బలిసి ముత్యాల పంట వండినట్లుండెను

చ. 2: సరసపు నాయకుఁడు జాజి మొగ్గలు వేసితే
తరుణి మైపులకించి తానెట్టుండెనే
మరిగి పాయపుచేన మన్మథాస్త్రపు మొలక
పారి వసంతుఁడు చల్ల పాదలినట్లుండెను

చ. 3: శ్రీ వెంకటేశ్వరుఁడు చెంది మోవి యిచ్చితేను
యీా వనితమోము కళ యెట్టుండెనే
పోపులై మోహపు నిండుఁబున్న మనమృతముబ్బి
ఆవేళఁ జంద్రకళలానినయట్లుండెను

రేకు: 0169-5 నాదరామక్రియ సంపుటం: 07-409

పల్లవి: ఇంకానేఁటికి జోలి యిదె నీ భాగ్యమాయ
పొంకపు రతుల నిట్టె భోగించవయ్యా

చ. 1: మదిరాక్షి చన్నులనే మందర గిరులు మోవ
చెదరని యారనే శేషునిఁ బూఁచి
ముదమున లావణ్య సముద్రము మరుఁడు దచ్చె
అదె అధరామృతము అవధరించవయ్యా

చ. 2: అతివమోముఁజంద్రుఁడనేటి సానబిల్లకు
తతి జడియనేటి సూత్రము చుట్టి
అతనుఁడు చూపులయమ్ములు సానఁబట్టితే
సతమై మోహపుఁబొడి సారె రాలీఁ గోవయ్యా

చ. 3: పడఁతిపిరుఁదనేటి బండికండ్లతోడను
తొడలనే కలహంస నడలఁ గట్టి
యెడయక శ్రీవేంకటేశ నిన్నెక్కించె మరుఁ
డడరి వలపు బండ్లవచ్చె నీకయ్యా

రేకు: 0169-6 సాళంగనాట సంపుటం: 07-410

పల్లవి: రావయ్య చూతువుగాని రమణిలాగు
దైవార నిన్నే మతిని దలఁచినట్టున్నది

చ. 1: వెలఁది నిన్నుఁబాసి విరహాగ్నిచేఁ గాఁగి
వొలిసి కేళాకూళిలో నోలలాడఁగా
వలరాజుకరవాలు వసంతుఁడనేటి కమ్మరి
పెలుచుగ వాఁడిపదను పెట్టినయట్టున్నది

చ. 2: సతి నీపై తమకాన చంద్రకాంత శిల మీఁద
ఇతవుగాఁ బవళించి యింపొందఁగా
రతిరాజు నిజ కీర్తి ప్రతిమఁ జంద్రవిధాత
తతి మెరుఁగువెట్టితే తళుకున్నట్టున్నది

చ. 3: ఇంతి నీవు గూడేటప్పుడెడలేని పూదండలు
చెంతలఁ జుట్టుకొనఁగా శ్రీ వేంకటేశ్వరా
కంతుని తోఁట పూఁదీగె గాలియనే దోహళజ్ఞఁ
డంతటఁ బుట్టించఁ జేసినటువలెనున్నది

రేకు: 0170-1 నాదరామక్రియ సంపుటం: 07-411

పల్లవి: చిత్తగించవయ్య యీచెలిని నేఁడు
పొత్తుల వలపులిట్టె పొదిసేసినట్లు

చ. 1: మగువ నీకు మొక్కె మాయింటికి రమ్మని
జిగిఁ దన శిరసుపై జేతులు మోడ్చి
వొగి చంపకనాసికమున్నదని యలులకు
వెగటుగాఁ దామరలు వేగు చెప్పినట్లు

చ. 2: వెలఁది నిన్నుఁ బిలిచె విడెము చేకొనుమని
సెలవుల నవ్వు గండ స్తలులు మోవ
అల తాటంకరవులున్నవని కనుఁగల్వలకు
వెలయ మోముఁజంద్రుఁడు వేగు చెప్పంపినట్లు

చ. 3: కన్నె శ్రీ వెంకటేశుఁడ కాఁగిలించి యేలుమని
చన్నులు బిగ్గెనదిమి సందులంటను
వున్నవి యానమయూరాలొద్దనె పాములకు
విన్నపముగాఁ గొండలు వేగుచెప్పినట్లు

రేకు: 0170-2 వరాళి సంపుటం: 07-412

పల్లవి: ఆతఁడేమి నీవేమి అవుఁగాములిందులోనేమి
కాతరపుఁ దమకము కలదె యిద్దరికి

చ. 1: మించుఁదేనె పెదవిపై మిరియాలు చల్లుదురా
పంచదార చల్లుదురు పైపైఁగాక
మంచిమాటలాడవే మరి వెంగేలేమిటికే
కంచపుఁబొత్తువలపు కలసెనిద్దరికి

చ. 2: కలువకన్నుచూపుల కాఁకలు చల్లుదురా
చలువవెన్నెలతేట చల్లుటగాక
కలయ సన్నసేయవే కడు జంకించనేఁటికే
కలికి సిగ్గులపొత్తు కలదె యిద్దరికి

చ. 3: పచ్చిగుబ్బలటు చూపి పంతాలు చల్లుదురా
కొచ్చి మెరుఁగులు చల్లఁగూడుఁగాక
ఇచ్చట శ్రీ వెంకటేశునెనసితివి రట్టేల
గచ్చుల వీడేలపొత్తుకలదె యిద్దరికి

రేకు: 0170-3 శ్రీరాగం సంపుటం: 07-413

పల్లవి: చెలులు గనుఁగొనరె యీసింగారము
నిలువెల్ల రతికళలు నిండుకొనుమాడ్కి

చ. 1: అతివవురమున కంఠహారములు కడుఁ బెక్కు
తతిఁ గట్టుకొన్నచందంబమరెను
కతలుగా ముఖచంద్రుఁగని చన్నుజక్కవలు
క్షితిఁ బాయకుండ లంకెలఁ బెనఁచినట్లు

చ. 2: సుదతి నెన్నుదుటఁ గస్తూరినామము వెలయ
చెదరకుండఁగ దీర్చిన భావము
పొదినూర్పుగాలిచప్పుడుకుఁ గనుచకొరాలు
కదలకుండఁగఁ గట్టుకంభమో యనఁగా

చ. 3: నెలఁత శిరసున విరులు నించుకొనె నీ సొబగు
కలిగి శ్రీ వేంకటేశుఁ గదిసి వుండి
కలికి నాసిక చనుపకము తావికి కురుల
అలులు వోకుండ వలలమరించుగతిని

రేకు: 0170-4 పాడి సంపుటం: 07-414

పల్లవి: ఎవ్వరికిఁ దమసొమ్ములెంత తీపులో
నివ్వటిల్ల మీవంక నెరసె నీసుద్దులు

చ. 1: ఈకడ నింత కంతపు టెలుఁగుఁ గోవిలలకు
మేకొని చిగురాకులు మేపినయట్లు
ఆకుమడిచి మడిచి అంది నీవియ్యఁగాను
దాకొని చిగురుటడిదము దాఁచె మరుఁడు

చ. 2: నెలకొని యీ వనిత పలుకుఁ జిలుకలకు
యెలమి బింబ ఫలములిచ్చిన యట్లు
పలుమారు నీమోవిపండు చవిచూపుఁగాను
కలపండ్లు గోటరానఁ గప్పెను వసంతుఁడు

చ. 3: కందువతో నీమగువకనుఁజకోరములకు
అంది వెన్నెల విందులానించినట్లు
చెంది శ్రీ వెంకటేశుఁడ చిరునవ్వు నవ్వఁగాను
యెందువెంటఁదిప్పికళ లిదివోచందురుఁడు

రేకు: 0170-5 దేసాళం సంపుటం: 07-415

పల్లవి: అందుమీఁదనాలఁ గాచేవతి మంకుఁ దనము
సందుల వంకలొత్తితే చాయకు వచ్చీనా

చ. 1: వెన్నతోఁ బెట్టిరి నీకు వేడుక కారితనము
చిన్ననాఁడె గొల్లెతలు చెప్పఁగనేల
పన్ని కడమ దొడమ పాలలో నూరి పోసిరి
సన్నల బుద్ధి చెప్పితే చక్కనుండేవా

చ. 2: పెరుగుతోడఁ బొదిగి పెట్టిరి దుష్టుఁదనము
పెరుగఁ బెరుగ నాఁడె ప్రియురాండ్లెల్లా
నిరతిని వలపులు నేతితో లోనికిచ్చిరి
వొరసి నేనేమనినా వోజకు వచ్చేవా

చ. 3: మోవితేనెలోఁ బెట్టిరి మోహపునాలితనము
శ్రీ వెంకటేశ్వర నాఁడె చెలులెల్లాను
కూవలుగా నేరుపులు గుబ్బలలో హత్తించిరి
యీవల నన్నుఁ గూడితి విఁక నెడసేవా

రేకు: 0170-6 దేశి సంపుటం: 07-416

పల్లవి: వింతగా నానతీవయ్య వినే నేను
పంతానఁ దాను విన్నపము లెట్టుసేసెను

చ. 1: సెలవుల నవ్వుతాను చెక్కుగోర గీరుతాను
మలసి నీతో నాకె మాఁటలాడెను
వలపులు చల్లుతాను వడిఁగొప్పు దువ్వుతాను
సొలసి మరేమని సుద్దులెల్లాఁ జెప్పెను

చ. 2: సిగ్గులు నెరపుతాను చెమట దుడుచుతాను
దగ్గరక యేమికతలు చెప్పెను
అగ్గలమై మొక్కుతాను ఆయములంటుతాను
తగ్గక యంతవడి తలపోసుకొనెను

చ. 3: సురటి విసరుతాను సొమ్ములు చక్కఁబెట్టుతా
అరసి కౌఁగిటనే ప్రియము చెప్పెను
ఇరవై శ్రీ వెంకటేశ యిట్లు నన్నుఁ గూడితివి
నిరతి నీచుట్టుమేల నిన్నొడఁబరచెను

రేకు: 0171-1 శంకరాభరణం సంపుటం: 07-417

పల్లవి: చెలులాల యీ భావము చెప్పఁగ నలవిగాదు
వలపుల పంటవండి వలసినట్టున్నది

చ. 1: వనితచెక్కుచేతితో వజ్రాలకమ్మ వోరయ
ఎనసి చింతించే భావమెట్లున్నది
ఘన తాప సూర్యుఁడును కమలాబాణమును
తనపై దండెత్తనేకాంతమాడినట్టున్నది

చ. 2: పమ్మిన నిట్టూర్పులు పళ్ళెపుమోవినోరయ
యిమ్ములఁ గందినభావమెట్టున్నది
చిమ్మిరేఁగి చల్లగాలి చిగురుటడిదమును
కొమ్మను సాదించ పొత్తుగూడినట్టున్నది

చ. 3: దిట్టు శ్రీ వెంకటేశురతివేళ కాంతకు
యిట్టె బొమ్మలపైఁ గురులెట్టున్నది
తొట్టి మరువిండ్లును తుమ్మిదలు యీకెతోడి
చుట్టురికానకు వచ్చి జోడైనట్టున్నది

రేకు: 0171-2 పాడి సంపుటం: 07-418

పల్లవి: ఎఱిఁగిన పనులకు యేఁటికి నింక
నెరవాదై మెరసేది నీగుణమే కా

చ. 1: సెలవి నవ్వఁగనేమి చెక్కు నొక్కఁగానేమి
నెలకొని కరఁగేది నీమనసే కా
బలిమి సేయఁగనేమి పైకొని మొక్కఁగనేమి
నిలిచి సత్యమాడేది నీనాలికే కా

చ. 2: బెట్టువెనఁగఁగనేమి ప్రియము చెప్పఁగనేమి
నెట్టుకొని వుండేది నీతనువే కా
యిట్టట్టనఁగానేమి యెదుటనుండఁగనేమి
నిట్టుచూపు చూచేవి నీకన్నులే కా

చ. 3: సమ్మతించఁగా నేమి సంగడికి రాఁగానేమి
నెమ్మది చెవుల వినేది నీ తగవే కా
యిమ్ముల శ్రీ వెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నిమ్మలము సేసేది నీకరుణే కా

రేకు: 0171-3 శుద్ధవసంతం సంపుటం: 07-419

పల్లవి: ఇద్దరిభావములును యీడు జోళ్ళాయ నిదె
అడ్డుకొని తులఁదూఁగినట్టి చందమాయను

చ. 1: తళుకున నీ విప్పుడు తరుణిఁ జూచితేను
తొలఁకి చెక్కుఁచెమట దొరుగఁజొచ్చె
లలి మీరి ఆ మెరుపులకు యీ తురుము మేఘ
మలరి వానగురిసినట్టిచందమాయను

చ. 2: చదురుమాఁటల నీవు జలజాక్షిఁ బిలిచితే
పొదిగొని నిలువెల్ల బులకించెను
కదిసి ఆమాఁటలగాలికి యీమెైఁదీగె
అదనుగూడ ననిచినట్టిచందమాయను

చ. 3: ననుపై శ్రీ వెంకటేశ నవ్వి నీవు గూడితేను
యెనసి కామినిచిత్తమెల్లఁ గరఁగె
వొనరి ఆవెన్నెలకీమనసనే చంద్రకాంత
మనువుగాఁ గరఁగినయట్టి చందమాయను

రేకు: 0171-4 బౌళిరామక్రియ సంపుటం: 07-420

పల్లవి: ఎటువంటి పందెగాఁడె యితఁడు
అటమటలనే ఆటలన్నీ గెలిచీని

చ. 1: ఆసతో నేఁబగడసాలాడఁగానె పిడికిటి
పాసికలు దీసి తానప్పటి వేసెనే
యీసుతోడ తనపాళి యింటిసారె దాఁకితేను
రాసి యట్టుట్టుండెనంటా బాసచేసీనే

చ. 2: అండనూఁటుకొన్న కాయలట్టె నేఁ బరాకైతే
పండెనంటాఁ బడదొబ్బి పట్టునియ్యఁడే
చండితోడ నాపయ్యెద జార నే వేసిన బారా
వొండొక నెత్తమనుచు వోరచూపీనే

చ. 3: జోడుగూడుకొని వచ్చి సారిది నేఁ దాఁకితేను
జోడు తానంటాఁ గూడి చొక్కించెనే
యీడులేని శ్రీ వెంకటేశుఁడిచ్చకానకోడి
వీడెము పందేనకిచ్చి వేడుకచేసీనే

రేకు: 0171-5 నాదరామక్రియ సంపుటం: 07-421

పల్లవి: ఎదురుబడి కాఁగిళ్ళు యేరులాయ మీవలపు
అదనుఁ బదనుఁగూడి అడుసాయ వలపు

చ. 1: చిక్కని చెమటలను చిప్పిలీని వలపు
చొక్కపుకరఁగులను జొబ్బిలీని వలపు
చక్కని సరసముల జాలువాలీ వలపు
తెక్కుల మచ్చికలచే దిగి వారీ వలపు

చ. 2: జవ్వనముకళల రసములుబ్బీ వలపు
నివ్వటిల్లు కోరికల నీరుకమ్మీ వలపు
రవ్వల తమకముల వువ్విళ్ళూరీ వలపు
చివ్వనఁ దరితీపుల జిడ్డుకట్టీ వలపు

చ. 3: పంతపు రతులనే పాలుగారీ వలపు
బంతి మోవులనె కడుఁ బచ్చిదేరీ వలపు
ఇంతలో శ్రీ వెంకటేశ యెనసి మీరుండఁగాను
దొంతరచుట్టిరికానఁ దొప్పఁదోఁగీ వలపు

రేకు: 0171-6 కేదారగౌళ సంపుటం: 07-422

పల్లవి: కాఁక నీవు రేచఁగాను కన్నవారినేల దూరీ
వీఁకపుఁగోరికతోడ విఱ్ఱవీఁగీని

చ. 1: కోమలి నిన్నుఁబాసి కోవిలకూఁతలు విని
వేమరు కోపానవుంట వింట వేసీని
ఆమని చిగురు చూచి అంతలోనే వేసారి
దోమటికొనగోరి కత్తులు చాఁచీని

చ. 2: వెన్నెల తేటలు చూచి విసుగుచు వెళ్ళఁజల్లీ
కిన్నెరకాయల ముంచి కిమ్ములకును
తిన్నని మేఘము చూచి తిట్టుచు నీరెల్లఁగార
సన్నపుటల్లికామల చాఁచి పిలిచీని

చ. 3: తుమ్మెద మూఁకలఁ జూచి దూరుచు తురుములోని
కొమ్మ సంపెంగ విరులఁ గొని వేసీని
నెమ్మది శ్రీ వెంకటేశ నీవింతలోఁ గూడఁగాను
కమ్మి మరుబలములఁ గని నవ్వీని

రేకు: 0172-1 శంకరాభరణం సంపుటం: 07-423

పల్లవి: ఆవధరించఁగదయ్య అన్నిరసములు నీవు
తివురుచునబ్బెనిదె తేనెమోవిరసము

చ. 1: చెలియచక్కఁదనాన శృంగారరసము
వెలయ బొమజంకెనల వీరరసము
కలయు రతికాంక్షలను కరుణారసము
అలరు మైపులకలను అద్భుతరసంబు

చ. 2: తరుణిసరసములను తగుహాస్యరసము
పరుషంపువిరహన భయరసంబు
బెరయు నిబ్బరములను బీభత్సరసము
గరిమ మరుయుద్ధాన ఘనరౌద్రరసము

చ. 3: వనిత ఆనందముల వడిశాంతరసము
ననుపుమంతనములను నవరసములు
యెనలేని శ్రీ వేంకటేశ నీతోఁ గూడి
దిన దిన వినోదాల తిరమాయ రసము

రేకు:	0172-2 కాంబోధి సంపుటం:	07-424

పల్లవి:	నావొళ్ళ దోసములేదు నాఁటి నీపుణ్యములింతే
	పూవులు నాకొప్పులలోవి పొంది నీపై రాలెను

చ. 1:	యెవ్వతె తిట్టు దాఁకెనో యిదె నీకు నాతమ్మ
	పవ్వలించి వుండగానె పైఁబడెను
	యివ్వల నప్పటి మరి నెవ్వతె దీవించెనో
	దవ్వుల నీవుంటే నాపాదము దాఁకెను

చ. 2:	ఉమ్మడి నెవ్వతె గోరుకుండెనో నీవెంట్రుకలు
	కెమ్ములనే నాపిడికిటఁ జిక్కెను
	పమ్మిన యెవ్వతె తప:	ఫలమో నా మెట్టెలతో
	కమ్మి నీ కంఠహారాలు కట్టువడెను

చ. 3:	వారించి యెవ్వతె యేదేవరకు మొక్కెనో నా
	గోరు దాఁకి నీమేను జీరలాయను
	యీరీతి శ్రీవెంకటేశ యేలితివి నన్నునిట్టె
	చేరెవ్వతెమంత్రానవో చెంది నా కిందైతివి

రేకు: 0172-3 మధ్యమావతి సంపుటం: 07-425

పల్లవి: పడఁతికిని నాయకుఁడ బలుతొడవు లిచ్చితివి
యెడనెడలఁ జూచినను ఇన్నియునుఁ దొడవు

చ. 1: జలజాక్షి మేనికిని జవ్వనంబిది దొడవు
పొలుపుఁ గన్నులకు చూపులు దొడవు
నెలకొన్న శిరసునకు నిలువుఁ దురుమే తొడవు
కలికి యీ చెక్కులకు కళలు దొడవు

చ. 2: ఘన కుచంబులకు నీ గట్టితనమే తొడవు
వొనరు నడిమికి నాభి వొప్పుఁ దొడవు
అనువైన పిరుఁదులకు నందలి బటువు దొడవు
పెనుఁదొడల కచటఁ బంబిన మెరుఁగు దొడవు

చ. 3: చిగురుఁబాదంబులకు చెంగావియే తొడవు
తగు రూపునకు మంచితనము దొడవు
జిగి నీపైఁ గూడితివి శ్రీవెంకటేశ్వరుఁడ
నగవులకు మిగులనానందములు దొడవు

రేకు: 0172-4 వరాళి సంపుటం: 07-426

పల్లవి: నీతోడి సాములకు నెలఁత వోపఁగలదా
రాతిరిఁ బగలు నింత రాఁపుసేతురా

చ. 1: కామతంత్రముల నిట్టె కడు నలయించఁగాను
మోము చూచి యింతి నీకు మొక్కు మొక్కీని
గోమునఁ బెంచినయట్టి గొజ్జఁగపూవువంటిది
గామిడితనాల నింత గాసిసేతురా

చ. 2: చలపట్టి కుచములు సారె నీవు పిసుకఁగా
వెలది గడ్డమువట్టి వేఁడుకొనీని
నెలకొన్న అరచేతి నిమ్మపండువంటిది
వలపుల కాతరాన వాడింతురా

చ. 3: మునుకొని కూడుతానె మోవిగంటి సేయఁగాను
అనువుగా నీకుఁ బ్రియము చెప్పీని
ఘనుఁడ శ్రీ వెంకటేశ కప్పురమువంటిదీకె
పెనఁగులాటలనే బెండుసేతురా

రేకు: 0172-5 కన్నడగౌళ సంపుటం: 07-427

పల్లవి: చెప్పినట్టు సేసేఁ గా నీ చిత్తము రాను
అప్పసముగా నాపె అప్పణదేరాదా

చ. 1: అక్క వూడిగెపుదాన నంటానే చెనకేవు
గుక్కక ఆపె గంటేఁ గోపగించదా
తొక్కి నీవు మాఁటఁబడి దూరు నాపై వేయకు
అక్కర అంత గలితే అప్పణదేరాదా

చ. 2: అమ్మపేరిటిదాన నంటానే నవ్వేవు
నెమ్మది నాపె వింటేను నిన్నుఁ దిట్టుదా
నెమ్మి నీవు చేఁతఁబడి నేరము నాపై వేయక
అమ్మరో యిఁనైనాను అప్పణదేరాదా

చ. 3: అలమేలుమంగతొత్తనంటా సొమ్ములిచ్చేవు
చలమున నిందుకాసె సాదించదా
యెలమి శ్రీవెంకటేశ యిద్దరిని నేలితివి
అలవాటుగా నాపె అప్పణదేరాదా

రేకు: 0172-6 శోకవరాళి సంపుటం: 07-428

పల్లవి: ఆఁడువారమైతేనే అంత సిగ్గు విడిచేమా
పేఁడుక పానుపుపైకి పిలిచేవు నీవు

చ. 1: ఏకాంతముననుం మీరిద్దరూ నుండఁగాను
కాకుసేసి నేను దగ్గరవచ్చునా
మేకొని మీలోపల మీరే నవ్వుకోఁగా
యీకడ నే నెడచొచ్చి యెలయించవచ్చునా

చ. 2: మచ్చిక నొకరొకరుమాఁటలాఁడుకొనగాను
వచ్చి నేఁ బొత్తు గలయవచ్చునా నేఁడు
పచ్చియైన వలపులను పరవశమై యుండఁగ
పచ్చడము గప్పి మిముఁ బలికించవచ్చునా

చ. 3: నీవు నాపె గూడి నేరుపులు మెరయఁగాను
చేవదేర నేను సేవ సేయవచ్చునా
శ్రీ వెంకటేశ్వర నన్నుఁ జెందితివాకెకుఁ జెప్పి
మా వంటి వారికి మేలు మరవఁగవచ్చునా

రేకు: 0173-1 శంకరాభరణం సంపుటం: 07-429

పల్లవి: ఆఁటదాన నేను నీ వధికుఁడవు
వాటముగా మాయింటికి వచ్చినట్టే రార

చ. 1: కూరిమి గలిగితేను కొట్టినాఁ గోపము లేదు
బీరము గలిగితేను భీతి లేదు
వోరుపు గలిగితేను వుల్లములో వెత లేదు
చేరి నీ వుద్దండాలు సేసినట్టు సేయరా

చ. 2: తెలివి గలిగితేను తీరని మరుఁగు లేదు
బలిమి గలిగితే తడఁబాటు లేదు
చెలిమి గలిగితేను సిగ్గునెగ్గును లేదు
చెలఁగి నీవుద్దండాలు సేసినట్టు సేయరా

చ. 3: ఆస గలిగితే అడ్డాఁకెందును లేదు
బాసనిజము గలిగితే దోసము లేదు
వాసితో శ్రీవేంకటేశ వడి నన్నుఁ గూడితివి
సేసవెట్టి వుద్దందాలు సేసినట్టు సేయరా

రేకు: 0173-2 కన్నడగౌళ సంపుటం: 07-430

పల్లవి: ఏమి దలఁచుకొంటివి యేమిపని సేసితివి
గామిడి నీచేఁతలకు కాంతాళాలు రేఁగవా

చ. 1: మంతనమాడి నమ్మించి మరఁగున నన్నుఁబెట్టి
ఇంతలో నాకె వద్దికి నెట్టువోతివి
వింతవారు నవ్వేరని వెరపుమానితేఁ బోనీ
దొంతర నీ బాసలకు దోసమైనా ముట్టునా

చ. 2: కత చెప్పి నిద్ర పుచ్చి కడు నన్నెరఁగకుండా
రతినెట్టు గూడితివారామ నీడనే
మతిలో వెత లేకుంటే మాననీ దీనిపట్టుకు
కితకుఁడవనే అపకీరితైనాఁ బుట్టదా

చ. 3: యీకడ ననుఁగూడి యెంగిలితోనే పోయి
వాకిట నాపెఁగూడి వచ్చితివిట్టే
చేకొని శ్రీవెంకటేశ సిగ్గులేకుంటే మాననీ
దాకొని యిరువంకల దగయైనాఁ దొట్టుదా

రేకు: 0173-3 ఆహిరి సంపుటం: 07-431

పల్లవి: ఇల్లురికి వత్తురా యెవ్వరైన సవతులు
మెల్లమెల్లన నీవు మేకులేల సేసేవే

చ. 1: వలపు పదను చూచి వడ్డించితి నేఁబతికి
కలయనేల పెట్టేవే కాంత నీవును
తొలుత నెసరువెట్టి తొయ్యలుల నేనంపితి
పిలువని పేరటము ప్రియమేల చల్లేవే

చ. 2: నవ్వులు దొంతివెట్టితి నడుమంత్రమున నీవు
కువ్వగానేల చూపేవే కూరాకుమోవి
పవ్వళించి యింటిలోన పళ్ళెము నేనె పెట్టితి
మువ్వంక అప్పటి నీవు ముగ్గులేల పెట్టేవే

చ. 3: శ్రీ వెంకటేశుఁ గూడితి చెప్పరాని విందువెట్టి
వావితో విడేలేల వచ్చియిచ్చేవే
చేవదేర గురుతులు చెక్కుల నేనే వొత్తితి
నీవొళ్ళఁ గలిగిన నేర్పులేమి చూపేవే

రేకు: 0173-4 కాంబోధి సంపుటం: 07-432

పల్లవి: ఎందరికి వలతువో యెవ్వఁడెరుఁగు
కందువ నీ చేఁతలిక్కడ నేనెరఁగనా

చ. 1: కట్టిన వన్నెదట్టి కైదండిచ్చినాపెది
కట్టుకొన్న కంటసరి కాళాంజాపెది
పెట్టుకొన్న పదకము పెద్దఅడపమాపెది
నెట్టున నీ సింగారాలు నేనెరఁగనా

చ. 2: కొనవేలి వుంగరము కుంచె వేసేయాపెది
కొనబు వొడ్డాణము గొడగాపెది
అనువైన పువ్వుదండ అవసరమాపెది
నినుపు నీసింగారాలు నేనెరఁగనా

చ. 3: ముడిచిన సవరము మురిపెపుగిండాపెది
బడినే నీ పెండెము పావడాపెది
పొడవై శ్రీ వెంకటేశ పుక్కిటివీడెము నాది
నిడివి నీ సింగారాలు నేనెరఁగనా

రేకు: 0173-5 భైరవి సంపుటం: 07-433

పల్లవి: ధరణిపై వెన్నెల యెందరు గాయరు
యిరవై నీతో భోగమెంతలేదు మాకు

చ. 1: చిత్తము వచ్చితేఁ జాలు చెలులనెందరినైనా
కొత్తగాఁగ నీవు దెచ్చుకోవయ్యా
హత్తి పూడిగముసేసి అండనుండి బుద్ధిచెప్పి
యిత్తల నానందించ నెంతలేదు మాకు

చ. 2: ఇచ్చ నీకైతేఁజాలు యెందరిసొమ్ములైనాను
కుచ్చులుగా మేన మోచుకొనవయ్యా
పచ్చిగా నీపాదాలొత్తి పనులెల్లఁ జేసి చేసి
యెచ్చరి చొక్కుచునుండే నెంత లేదుమాకు

చ. 3: వేడుక నీకైతేఁజాలు వేవేలు సతులను
కూడపెట్టి పెండ్లాడుకొనవయ్యా
నీడల శ్రీవెంకటేశ నిన్నుఁ గూడి కూడి
యీడుజోడుగాఁబెనఁగ నెంతలేదు మాకు

రేకు: 0173-6 బౌళిరామక్రియ సంపుటం: 07-434

పల్లవి: పలుమారు వలపుల పైరులు విత్తఁగవలె
సొలసి తప్పక యిట్టె చూడవయ్య నీవు

చ. 1: చెలియ తమకములు చెక్కుల చెమటలై
నిలువున జిందీని నీయెదుటను
యొలమి జన్నులసందియేరులై పారీ నిదె
కలసి కౌఁగిట గండి గట్టరాదా నీవు

చ. 2: పడఁతి సరసములు పై పైనె నవ్వులై
బడినె మేనఁ జెడలువారఁజొచ్చెను
యెడయక కళలనే యిదివో పదనులెక్కె
కడగోరి రేక నచ్చుకట్టురాదా నీవు

చ. 3: అట్టె అలమేలుమంగ ఆసలే పోదియై
జట్టిగొని పులకలససులొత్తెను
ఇట్టె శ్రీవెంకటేశ నీవెనయఁ దపసువండె
నెట్టున వేడుక గాదె నించరాదా నీవు

రేకు: 0174-1 ముఖారి సంపుటం: 07-435

పల్లవి: ముప్పిరిగొనెఁగా మేలు ముదితలాల
తిప్పరాని తమి తరితీపులతో మించెనే

చ. 1: సొలసి చీఁకటిమాను చుక్కలతో మాటాడగాఁ
వెలి మెరుఁగుఁజంద్రుఁడు వెన్నెల గాసె
బలిమి నీరెండుఁ జూచి పంతమున వేరె తెల్లఁ
గలువలేమిటికి చెంగలువలాయనే

చ. 2: గక్కన నిండుమొయిలు గాలివాన గురియఁగా
చిక్కులువడక తీగె చెంగలించెను
తక్కక వొండొంటితో దప్పిదేరఁ బొరుగున
నెక్కువెట్టి చెరకువిండ్లేకతమేలాడెనే

చ. 3: కావించి నీలపుఁ గొండ కళలు పైఁ జల్లఁగాను
సోవలఁ బైఁడియేరు జోడుగూడెను
శ్రీ వెంకటేశుఁడు ప్రేమ చిలుకనెదఁ బెట్టితే
పావురమట్టె బుజముపై నేలకొనెనే

రేకు: 0174-2 మాళవిశ్రీ సంపుటం: 07-436

పల్లవి: సిగ్గరికాఁడతఁడు చెప్పఁడున మనతోనేవి
యెగ్గులెంచ నేనతని యీడకుఁ బిలువరే

చ. 1: పొంతనె సాములు సేయఁబోలు మేను చెమరించె
వంతుకు నిద్రించఁబోలు వదలెఁ గొప్పు
సంతమాటలాడఁబోలు చక్కనిమోవి గంటాయ
కాంతుని కుపచారాలు కడుమీరు సేయరే

చ. 2: కమ్మి యీఁదులాడఁబోలు కస్తూరిబొట్టు చెదరె
వుమ్మడి కొండెక్కఁబోలు వూర్పులు రేఁగె
పమ్మి జాజరాడఁబోలు పచ్చడము పసపాయ
సొమ్ములతోడి ఆతనిఁజూచి మీరు మెచ్చరే

చ. 3: పువ్వుఁదోఁటనుండఁబోలు పొసఁగ మై వాసనంటె
నవ్వఁబోలు మేలు(ను?) మిన్నక యలసె
రవ్వగా నన్నుఁగూడి రతులను జొక్కించె
ఇవ్వల శ్రీ వెంకటేశు యేతులెల్లాఁ జూడరే

రేకు: 0174-3 నాదరామక్రియ సంపుటం: 07-437

పల్లవి: చెప్పరాని నీ చేఁతలు
చిప్పలీ మేనఁ జెమటలేడవిరా

చ. 1: కంటిఁగా నీ కతలెల్లాఁ నాఁడె
అంటిఁగా నీవన్నట్టే
ఇంటికి వచ్చేవిప్పుడు నీ
వెంటనే వచ్చీ వెలఁది యెవ్వతెరా

చ. 2: నిలిచెఁగా నీ నేరుపులు అవే
తలఁచేఁగా నేఁ దమకమున
పిలిచే వెదుటనే ప్రియుఁడవై నీకు
వలచినటువంటి వనిత యెవ్వతెరా

చ. 3: వొరసెఁగా నీవుదుటుగోరు నే
బెరసేఁగా నీపెనురతిని
ఇరవై శ్రీ వెంకటేశ యేలితివి నన్ను
గరిసించి యడిగె నీకాంత యెవ్వతెరా

రేకు: 0174-4 హిందోళవసంతం సంపుటం: 07-438

పల్లవి: తానేల సిగ్గువడీనే దండకు రమ్మనఁగదే
మేనిపై మచ్చములుంటే మెచ్చి పొగడుదునే

చ. 1: యేమిసేసి వచ్చినాను యెదురాడఁ జాలనే
నాములుగా సెలవుల నవ్వుదుఁగాని
కోమలులఁ దెచ్చుకొంటే కోపగించఁ జాలనే
చేముంచి యిచ్చకములే సేతుఁగాని

చ. 2: తప్పులెన్ని మోచినాను తారుకాణించఁ జాలనే
చిప్పిలఁ జెక్కులు నొక్కి చెల్లింతుఁగాని
దుప్పటి పసపైవుంటే దొమ్మిగా జంకించనే
కొప్పుపై సేసలు చల్లి కూర్చుకొందుఁగాని

చ. 3: వెక్కసమై కళలుంటే వెంగెములాడనే
గక్కున విడెమిచ్చి కలతుఁగాను
యిక్కడ శ్రీవెంకటేశుఁ డిన్నిటా నన్ను నేలె
తక్కులింకఁ జాపనే తమకింతుఁ గాని

రేకు: 0174-5 నారాయణి సంపుటం: 07-439

పల్లవి: వింతవారైతే నిన్ను వెంగెమాడరా
జంతఁ గాఁ గనక నీతో సాదనై వుందాన

చ. 1: మచ్చిక నీతరితీపుమాటలు మరిగికదా
యిచ్చకములాడుకొంటా యిట్లుందాన
వచ్చి వచ్చి నీవలపు వలలకుఁ జిక్కికదా
కుచ్చి నీచేఁతలు మెచ్చుకొంటానుందాన

చ. 2: ననుపైన నీసెలవి నవ్వులాసపడి కాదా
మొనసి సారె సారెకు మొక్కుచుందాన
చొనిపి నీకడగంటిచూపులను జొక్కికదా
పనులు సేయుచు నిన్నుఁ బాయకుందాన

చ. 3: రాపుల నీకాఁగిలిరతులఁ దగిలి కదా
వోపి తములానకు చేయొగ్గుచుందాన
పై పై శ్రీ వెంకటేశ పచ్చిమోవిసోఁకి కదా
తేపలైన రతుల నీదేవినైవుందాన

రేకు: 0174-6 శ్రీరాగం సంపుటం: 07-440

పల్లవి: ఎంతవాఁడవయ్యా నీవు యేమని పొగడుదుము
చెంతలఁ గూర్చున్నదాని సిగ్గులు దేర్చితివి

చ. 1: మాఁటలఁ బందిలివెట్టి మగువపాదము మెట్టి
గీఁటుచు కొనగోరను గిలుకొట్టి
మేఁటిరమణుఁడాకె మెరుఁగుఁజన్నులు ముట్టి
పాటించి ముద్దరాలిని ప్రౌఢఁ జేసితివి

చ. 2: పెనువేల మెచ్చు మెచ్చి ప్రియముతోఁ జనవిచ్చి
ననుపు సరసముల నమ్మికలిచ్చి
పనివడి నీవాకె పయ్యదకొంగు వచ్చి
కనుకలిఁ గన్నెఁ దెచ్చి కలికిఁ జేసితివి

చ. 3: కందువలఁ బేరువారి కాఁగిటికూటము మీరి
మందపు నవ్వులనే మందులు నూరి
అందపు శ్రీ వెంకటేశ ఆపెనిట్టె కోరి కోరి
విందులనే బాలఁదెచ్చి వెకలిఁ జేసితివి

రేకు: 0175-1 మధ్యమావతి సంపుటం: 07-441

పల్లవి: ఇద్దర నిద్దరే మోహమేమి చెప్పేది
అద్దుకొని యిదివో పెండ్లాడినది మొదలు

చ. 1: ఒండొరులఁ జూచి యాసనొగి రెప్పలు వేయరు
యెండలేక చెమరించిరిద్దరు నట్టే
దిండుకొని పానుపుపై తెల్లవారుటెరుఁగరు
నిండుకున్నారు రతుల నేరుపులఁ దాము

చ. 2: పచ్చిమోవితేనెలాని పలుమారుఁ దనియరు
లచ్చనై వొకమాఁటే పులకలురేఁగె
హెచ్చుగా నాకు మడిచి యిచ్చే చెలులఁ జూడరు
పెచ్చువెరిగేరు తమ ప్రియములఁ దాము

చ. 3: తమ మేనులపై గోరితాఁకులౌత చూచుకోరు
జమళి నలపులకు జడియరు
అమర శ్రీ వెంకటేశుఁడలమేలుమంగాఁ గూడి
తమకించేరు లోలోతలఁపులఁ దాము

రేకు: 0175-2 కేదారగౌళ సంపుటం: 07-442

పల్లవి: చెప్పఁగదే అది చక్కఁజేసేనిపుడు
పిప్పిగట్టు నతనితో బిగిసేటిభావమో

చ. 1: బంతిబోజనానకు పతి గాచుకుండఁగాను
యింతి తోడ నెత్తమాడే వెరఁగనట్టే
ఇంత సేయనేమిటికి యేకతానసేమైనా
కొంత గొంత వొట్టు వెట్టుకొంటివో చలానను

చ. 2: వీడెమియ్య రాఁగాను విభుని కెదురురాక
నీడ ముసుఁగిడుకొని నిద్దిరించేవు
జోడువాయఁ బనిలేదు సొఁగియనివేళను
ఆడ బ్రహ్మచారి వ్రతమట్టె పట్టితివో

చ. 3: శ్రీ వెంకటేశ్వరుఁడు చేరికూడి వుండఁగాను
పావురము పెట్టె మీఁద బత్తిసేసేవు
నీవాతని విడువవు నీమారు పలుకఁగ
యీవిగానతనిచేత నిప్పించుకొంటివో

రేకు: 0175-3 శ్రీరాగం సంపుటం: 07-443

పల్లవి: మీరిని నీతురుము తుమ్మిదమూకలా
కారుకమ్మే కామాంధకారముగాక

చ. 1: అలివేణి నీమోము అద్దమా మోవితేనె
చెలరేగే అమృతపుఁజెలమ గాక
తలఁప నీచేతులేమి తామరతూఁడులా మంచి
వలరాజు మోహనవల్లి కలుగాక

చ. 2: గరిమ నీ చన్నులు జక్కవలా వలపులు
పెరరేఁచే బంగారు కొప్పెరలు గాక
సిరుల నీనడుమేమి సింహమా నా మనసు
పరువువెట్టే వయ్యాళి బయలుగాక

చ. 3: యెంచఁగ నీపిరుఁదిది యిసుకదిబ్బె యేమి
మించినరతిచుట్టు మేడెముగాక
పొంచి శ్రీవెంకటేశుఁడ ననుఁబొందితివి నీపాదాలు
పందల చిగురు రాజ్య పదములు గాక

రేకు: 0175-4 కాంబోది సంపుటం: 07-444

పల్లవి: వేసంగి కాలమున వేడ్క సలుపు
శ్రీ సతియు భూసతియుఁ జేరి కలయఁగను

చ. 1: మెఱయు శశికాంతంపు మేడలోపలను
ఆఱిమురి కప్రంపుటరుగుమీఁద
తఱచు వాసనల గందపుఁగోళ్ళ మంచమున
పఱచిఁగుంకమపవ్వు పరపు మీఁద

చ. 2: చలువైన కురువేరు చప్పరములోఁబన్ని
తలకొన్న వట్టివేళ్ళ దడియుఁ గట్టి
మెలుపుఁ జెంగలువలయ మేలుకట్లమరించి
మలసిశేవంతి చామరలు వీవఁగను

చ. 3: పన్నీటి తిత్తులే పై మంచు గురియఁగా
వన్నె తామర నూలి వలువగట్టి
యెన్నఁగల శ్రీ వేంకటేశ్వరుఁడు రతి సలిపె
వెన్నెల రసము చాల వెదచల్లఁగాను

రేకు: 0175-5 వరాళి సంపుటం: 07-445

పల్లవి: వరుసతో సాసముఖా వసంత పూర్ణిమ నేఁడు
సిరుల యీ విభవాలు సేవించరో

చ. 1: లలితపు గోవిందుఁడు లక్ష్మీమండపమందున్న
వలరాజదివో కొలువఁగ వచ్చెను
వెలిఁ జంద్రుఁడు తోడనే వెల్లగొడగటు వట్టె
సులభానఁ బవనుఁడు సురటి విసరెను

చ. 2: పొందుగా వసంతుఁడు పువ్వులఁ బూజించవచ్చె
కందువతోఁ దుమ్మిదలు గానముసేసె
సందడించి చిలుకలు చదువఁజొచ్చె పద్యాలు
గొందినే కట్టిగ వారై కోవిలలుగ్గడించె

చ. 3: రతిదేవి మొదలైన రమణులు నాట్యమాడి
రతివసంతమాడె మేఘావళి యెల్ల
తతి శ్రీ వెంకటగిరిఁ దాపుకొని యిందునందూ
మితిమీరఁగా మొక్కేరు మెరసి దేవతలు

రేకు: 0175-6 పాడి సంపుటం: 07-446

పల్లవి: భావము దెలియరే పడఁతులాల
యీవలనావలాను యెన్నఁగొత్తలాయను

చ. 1: తొలుతనే కలువలు తుమ్మిదలనంపితేను
మొలచి తామెర వురుములనంపెను
అల చంద్రుఁడు కానరానట్టె కప్రమంపితేను
తొలఁకి చిగురాకులు దుర్గాలు చేకొనెను

చ. 2: గక్కన మొగలిరేకు కస్తూరి రేఁచితేను
మక్కువ మొల్లమెగ్గలు మణులానించె
యెక్కువ మరుని పుట్టినింటఁ దేరులు గూడితే
చక్కని కరితుండాలు చక్రముతో నమరె

చ. 3: ముగ్గని మెరుఁగుఁదీగె ముత్తేల పంట పండితే
వెగ్గళించి తేనెపండు వెన్నెలగాసె
అగ్గమై పువ్వులకొమ్మ ఆకులఁగాయలునిచ్చె
సిగ్గుల రాజ్యమేలె శ్రీ వెంకటేశుఁడు

రేకు: 0176-1 భైరవి సంపుటం: 07-447

పల్లవి: మఱియేఁటి విన్నపము మాపుదాఁకాను
కఱదలఁ బెట్టుకింకఁ గావఁగదవయ్యా

చ. 1: చెలి నిన్నుఁబాసివుండి చెమటముత్యాలు చల్లీ
వెలయఁ బారులు గుచ్చి వేసుకోవయ్యా
వెలవెలఁ బారుచు వెసఁ గప్పురాలంపే
వొలిసితే నీవు పెద్దవొడిగట్టుకోవయ్యా

చ. 2: పొందులు నీవి దలఁచి పులకల విరులిచ్చీ
సందేఁడు దండలుగట్టి చాతుకోవయ్యా
సందడి నిట్టూర్పుల విసరుకో సురటిగట్టీ
చెంది అందుకును నీవు సేదదేరవయ్యా

చ. 3: కూడఁగ నిన్నుఁ దలఁచి కోరికలఁ జిగిరించీ
వోడక బంతిగట్టుక వుంచుకోవయ్యా
యీడనె శ్రీ వేంకటేశ యింతినిట్టె యేలితివి
వాడకుండా బుజ్జగించి వరమియ్యవయ్యా

రేకు: 0176-2 శంకరాభరణం సంపుటం: 07-448

పల్లవి: లేవే యెక్కడసుద్ది లెస్సాయను
యీవేళ విడెమియ్యవే యీతనికిని

చ. 1: జవ్వన పాయపు సతి చలము సాదించితేను
యెవ్వరు బుద్ధులు సెప్పేరింక మరి
నవ్వుతా విభుఁడంటితే నాటెనింతే కొనగోరు
పవ్వళించి యిందుకుఁగాఁ బలుకకుండుదురా

చ. 2: ఆఁటది మంకువట్టి అట్టె మాఁటాడకుంటే
వాఁటానఁజెప్ప నొరుల వశమౌనా
చాటువఁబట్టి తీసితే జారెనింతే నీతురుము
తేటలుగా నింతలోనే తెరవేసుకొందురా

చ. 3: దేవులు శ్రీ వెంకటేశుఁ దెలిసి వురమెక్కితే
కావరించి నేము వంకలు దిద్దేమా
భావించి నిన్నుఁగూడితే పచ్చాయనింతె మోవి
మూవంక సిగ్గునఁ గరముల మూసుకొందురా

రేకు: 0176-3 గౌళ సంపుటం: 07-449

పల్లవి: కొమ్మలాల యిదె మంచి కొలువు వేళ
చిమ్ముచు విన్నపాలెల్లఁ జేయరే యిపుడు

చ. 1: భామఁ దొడపై నిడుక ప్రహ్లాద వరదుఁడు
ఆముకొని సరసములాడుచున్నాఁడు
దోమటి వలపులను తొప్పఁదోఁగి చెమటల
ఆమని వేడుకనోలలాడుచున్నాఁడు

చ. 2: చెలి విడెమియ్యఁగాను శ్రీ నారసింహుఁడు
నలువంకఁ బకపక నవ్వుచున్నాఁడు
పులకల జొంపముల పువ్వుదండల తోడ
చెలరేఁగి మచ్చికలు సేయుచున్నాఁడు

చ. 3: పొంది లకిమమ్మతోడ బొమ్మిరెడ్డిచెర్లహరి
యిందరి శ్రీ వెంకటేశుఁ డేలుచున్నాఁడు
సందడి రతులఁ జొక్కి జవ్వనమదము మించి
మందెమేళాము సేసుక మన్నింపుచున్నాఁడు

రేకు: 0176-4 మాళవి సంపుటం: 07-450

పల్లవి: కామినిసింగారాల కాలమువేళలెరఁగి
భూమిలోన నిన్నిటాను భోగించవయ్యా

చ. 1: నిలుపుఁదురుముఁ జారి నిండా జీఁకటివడె
సొలపు మోవి కెంపులఁ జుక్కలు నిండె
మొలచిన కళల మోమునఁ జంద్రుఁడుదయించె
వెలలేని నగవుల వెన్నెలగానె

చ. 2: అదనఁ గనుఁగొనల నరుణోదయంబాయ
యెదలోని సంతోషాన నిదె వేఁగెను
పొదలు రతికాఁకను పొద్దులువొడచి వచ్చె
ఇదివొ తమకమున నీరెండలూఁ గాసెను

చ. 3: చెక్కుల చిరు చెమట చిక్కని మంచు గురిసె
చక్కఁగా పులకల వసం తము వచ్చె
యిక్కువ శ్రీవెంకటేశ యింతినిట్టె కూడితివి
యెక్కువాయ దినముల యేండ్లకొలఁదుల

రేకు: 0176-5 భైరవి సంపుటం: 07-451

పల్లవి: నీ చిత్తము కొలఁదింతే నేనేమనేను
చేచేతనేమి సేసినాఁ జెల్లు నీకు నన్నియు

చ. 1: దొసిట వెన్నెల వట్టి తొడికి చూపవచ్చునా
ఆసల నీకోరికింతంతనవచ్చునా
లాసి నాతోఁ బెనఁగేవు దోసమో అందుకేమి
సేసవెట్టినప్పుడే చెల్లు నీకు నన్నియు

చ. 2: తగిలి యాకసమిట్టే తాసునఁ దూఁచవచ్చునా
జిగి నీమాఁటలకర్థాలు చెప్పవచ్చునా
నగుతా నేమడిగేవు నాకు నీతో బలిమా
చిగురుఁజేఁతలిప్పుడు చెల్లు నీకు నన్నియు

చ. 3: కోవిలకూఁతలొక్కట గుంపు సేయవచ్చునా
ఆవటించి నీవేడుకలాఁపవచ్చునా
కావించి కూడితివి చేఁగల మట్టిచెన్నుఁడవై
శ్రీవెంకటేశుఁడ యింకఁ జెల్లు నీకు నన్నియు

రేకు: 0176-6 పాడి సంపుటం: 07-452

పల్లవి: చేయవయ్య యింకా నీకుఁ జెల్లినటులనెల్లాను
పాయరానిచుట్టుమవై పనిగొంటివయ్యా

చ. 1: నీనయగారితనమే నిచ్చ నన్ను వలపించె
నానాఁటి ప్రియములు నమ్మింపించె
వీనుల వినుకులే వేడుకలు పుట్టించె
కానీవయ్య యింకా నీవే కలవుగా నాకును

చ. 2: మంచి జాణతనములే మరులు గొలిపె మతి
వంచిన మొక్కులు నీకు వసముసేసె
పెంచిన నవ్వులు నీతో పెనఁగలాటకుఁదెచ్చె
యెందకువయ్య నీవే యిచ్చేవింకాఁ జనవు

చ. 3: కాఁగిట నీ కూటములు కళలెల్లమొలపించె
చేఁగదీరిన మోవులు చిమ్మిరేఁచెను
వీఁగక శ్రీ వెంకటేశ వింతలుగాఁ గూడితివి
రేఁగించేవయ్య నీవె రేసులేని మెచ్చులు

రేకు: 0177-1 మంగళకౌశిక సంపుటం: 07-453

పల్లవి: ఇంకనెన్ని గాఁగలవో యింతి నీవల్లఁ బనులు
సుంకులు మోచినవెల్లాఁ జూచేము నేము

చ. 1: చెలియరో నీవలపు చెక్కులపై రతికెక్కె
పలుకుఁదేనెలఁ గొంత పాలుగారీని
కులుకుఁ గుచములను కొనలు వెళ్ళఁగఁజొచ్చె
పలుదెరఁగులనింత బయలాయ సిగ్గులు

చ. 2: కామినిరో నీ యాసలు కన్నుల రెప్పలు నిండె
దామెనమోవులఁ బంచదార చిందీని
వేమరుఁ దురుము జారి విరులు రాలఁగఁజొచ్చె
ఆమని ఆసలతోనే అగడాయఁ బొందులు

చ. 3: అంగనరో నీకూటమి ఆయములన్నియు ముట్టె
రంగుగా మోవి కళల రసములూరె
అంగవించి శ్రీవేంకటాధిపుఁ గూడితివిట్టే
వెంగలితనాన వెల్లవిరులాయఁ జేఁతలు

రేకు: 0177-2 ఆహిరి సంపుటం: 07-454

పల్లవి: తటి నిట్టిపనులెల్లా తగ నీవెఱఁగవలె
యెఱుకలు సేసునా యిల్లాలు

చ. 1: చెలి నీమొగము చూచి సెలవిఁ బారఁగ నవ్వె
మలసి మాఁటాడునా మగనాలు
తలుపు మాఁటున నిల్చి తలచూపి నిలుచుండె
చలివాసి తిరుగునా జవరాలు

చ. 2: నీపై భారము వేసి నిట్టూర్పు నిగుడించె
మోపుగట్టునా వలపు ముద్దరాలు
తీపులు మోవిఁగార తేఁకువతోఁ జెమరించె
చాపలానఁ బైపడునా చదురాలు

చ. 3: కొప్పుదువ్వి పయ్యదకొంగు నీపైసోఁకించె
కప్పి సిగ్గు విడుచునా ఘనురాలు
యిప్పడె శ్రీ వెంకటేశ యెనసె నిన్ను గుట్టున
విప్పుచు రట్టుసేసునా విత్తరాలు

రేకు: 0177-3 వరాళి సంపుటం: 07-455

పల్లవి: కానీవయ్యా దానికేమి కలది గలట్టయ్యీ
ఆనుక నీకింకనెంత ఆసోదమో

చ. 1: పాలఁతి నయమంటేను పూఁటలు నన్నడిగేవు
తెలిపిన రతియప్పు తీర్చఁగలనా
యెలమి నాకె వలపు యెరవు నాపైఁ బెట్టేవు
చెలులకింకానెంతేసి సిగ్గువాట్లో

చ. 2: వాడిక యింతికిఁ గుదువగా నన్నుండు మనేవు
కూడి వావి విడిపించుకొనఁగవసమా
మాడలవలె సతుల మారిపెళ్ళాడేవు
తోడనిట్టేయందరిని దొడ్డిఁబెట్టేవో

చ. 3: కొమ్మను గాఁగిటఁ గూడి కొసరు నన్నడిగేవు
కమ్మర నేనూఁ దగులు గావలెనా
దొమ్మి శ్రీ వెంకటేశుఁడ తోడఁబెండ్లాడేవు
మమ్మిద్దరి నిక్కడనే మండెమురాయఁడవై

రేకు: 0177-4 సాళంగనాట సంపుటం: 07-456

పల్లవి: పురుష విరహ మింత పొగులాయ నీవల్ల
సరిఁజూతువు రావమ్మ చక్కని నీవిభుని

చ. 1: తలపోతలనె నీపైఁ దమకించి తమకించీ
పిలుపులనే నిన్నుఁ బేరుకొనీ
చెలులు యెదుటనుంటే చేరి నీసుద్దులడిగీ
కలతువు రావమ్మ గక్కన నీప్రియుని

చ. 2: బయలుగాఁగిళ్ళనే పైపైనె పొద్దువుచ్చీ
నియతిఁ జక్కఁదనాల నిన్నువర్ణించీ
రయమునచేడనైనా వ్రాఁతల నీరూపువ్రాసీ
క్రియఁ గూడరావమ్మ కేలుచాఁచి మగని

చ. 3: ఇక్కువ నీ పానుపుపై నెదురులు చూచి చూచి
గక్కన నిన్నుఁగూడె నీ కడకు వచ్చి
యెక్కువ మన్నించి నిన్ను నింటిలోనఁ బెట్టుకొనె
చెక్కునొక్క రావమ్మ శ్రీ వెంకటపతిని

రేకు: 0177-5 కాంబోది సంపుటం: 07-457

పల్లవి: నిన్నుఁ గొసరేటియట్టి నేనే యెడ్డనింతేకాక
యెన్నిమాటలాడినా నీకేడ మొకదాకిరి

చ. 1: సిగ్గులనే తెరగట్టి చెలిమోవి విందువెట్టె
కగ్గనిచనవులుడుగరలిచ్చెను
అగ్గలమై ఆపెకడ ఆడకెట్టు మానేవు
నిగ్గుల నిచ్చకునికి నీకేడ నిజము

చ. 2: కన్నుల నివాళిచ్చె కాఁగిట విడిది వెట్టె
కన్నె దన కుచముల కప్పము వట్టె
చెన్నుమీరనాపెపంపు సేయకెట్టు మానవచ్చు
మన్ననఁ బక్షపాతికి మరియేడ తగవు

చ. 3: ఇచ్చకానఁ బోఁకవెట్టి యింపులనె పెండ్లాడె
మెచ్చెను శ్రీ వెంకటేశ మేలములను
ఇచ్చట నన్నుఁ గూడితివిరుమొనసూదివైతి
విచ్చన విడికాఁడవు వెరుపేల యిఁకను

రేకు: 0177-6 శంకరాభరణం సంపుటం: 07-458

పల్లవి: ఇదివో తెలుసుకొమ్మా యీరెంటికి నీవే గురి
పదివేలు విన్నపాలు భావించుకోనీవే

చ. 1: సరవితో నడచితవే జగడముఁ జవులే
విరసాన నడచితే వెగటౌఁ బొందు
నిరతి నావద్దనుంటే నీవేమన్నా నాకునింపౌ
పరులవొద్దనుంటే నీపలుకే వేసటలు

చ. 2: తగవులు దప్పకుంటే తమవారే యిందరును
యెగసక్యమైతే తనయిల్లే యెరవు
నగుతా నీవూరకుంటే ననుపులీడేరును
మొగము మురుచుకొంటే మోవులోఁ బ్రియములు

చ. 3: కాఁగలించుకొంటేను కపటమంతయుఁ బాసు
ఆఁగుక వూరకుండితే అదియే కాఁక
వీఁగక శ్రీ వెంకటేశ వెస నన్నుఁగూడితివి
మాఁగిన నీనా మనసు మాఁటువే యిన్నియును

రేకు: 0178-1 దేసాళం సంపుటం: 07-459

పల్లవి: చద్దికి వేఁడి వలపు సరికి బేసి
ఇద్దరూను యిద్దరమే యేలయింత గర్వము

చ. 1: సలిగెలఁ బొరలే నీసరితలు చూచేఁగాక
నెలఁతరో నీయంత నేరనా నేను
ఎలమితో రమణుఁడు యిద్దరినడిమితాసు
యిలపై యెందు వీఁగునో యేలయింత గర్వము

చ. 2: ఆసోదపు నీలోని అనువు దెలిసేఁగాక
వోసతిరో నీపాటి వోపనా నేను
పూసలలో దారమీపురుషుఁడు నీకు నాకు
యేసూటివచ్చునో నీకు యేలయింత గర్వము

చ. 3: కూడిన కొత్తరికపు గుణము చూచేఁగాక
చేడెరో నీ పాటి పొందు చెల్లదా నాకు
యీడనే శ్రీ వెంకటేశుఁడెనసె నిన్నును నన్ను
యేడకేడ మాఁటలాడేవేల యింత గర్వము

రేకు: 0178-2 మధ్యమావతి సంపుటం: 07-460

పల్లవి: లోకముల జాడలివి లోనాయ విభుఁడు నీకు
సాకిరివెట్టి నీవేల సాదించేవే

చ. 1: చలములు మానితేనే జగడాలు చక్కనౌను
అలుకలు దీరితేనే ఆసలు మించు
కలయికలు గలితే కపటాలన్నియుఁ బాసు
వెలినుండి నీవేల వెంగెమాడేవే

చ. 2: బింకములాడుకోకుంటే బెరయుఁ జుట్టురికము
మంకు లేని పొందులైతే మతి గరఁగు
అంకెలఁ బైకొంటేనే అరమరపులు నిండు
సంకు మోపి నీవేల సొలయ వచ్చేవే

చ. 3: వేడుకలఁ గూడితేనే వెలయు సెలవి నవ్వు
వాడికెలు గలితేనే వడదేరును
యీడనె శ్రీ వెంకటేశుఁడింతలోనె నిన్నుఁగూడె
జాడ తోడ నింకనేల సన్నసేసేవే

రేకు: 0178-3 కేదారగౌళ సంపుటం: 07-461

పల్లవి: పొంచి యెదురుకట్లకుఁ బోవమ్మ పతి వాఁడె
ముంచి యాతనికి నీవు మొక్కనేర్తువు

చ. 1: చవులుగా విచ్చివిచ్చి సారెసారెనాతనికి
చెవిలో నీమాఁటలెల్లఁ జెప్పనేర్తువు
చివురుఁదమకముబ్బ చిత్తజకళలు రేఁగ
నవకానఁ గవకవ నవ్వనేర్తువు

చ. 2: మంచము దగ్గర నుండి మారుకొని ఆతనితో
అంచ సరసము నీవాడనేర్తువు
కొంచక కొప్పు విడిచి కురుల చిక్కులుదీసి
పెంచి పెంచి వలపులు పేర్చనేర్తువు

చ. 3: గక్కనఁ గాఁగిట నించి కప్పురము నోటికిచ్చి
వుక్కునఁ గొనగోరనొత్తనేర్తువు
ఇక్కువ శ్రీ వెంకటేశుఁడింతలో నన్నుఁ గూడె
యెక్కవమ్మ వురమెలయించనేర్తువు

రేకు: 0178-4 శంకరాభరణం సంపుటం: 07-462

పల్లవి: ఎంత రట్టుడియిది యిట్టి నేమపువానిని
ఇంతసేసెఁ జూడరమ్మ యిఁకనేమి సేసీనో

చ. 1: పిలిచి తా రాకుండఁగాఁ బ్రియునితోఁ బగచాటి
నెల పొడపు వెన్నెల నిద్రించేవాని
చెలీఁ దాను మంచముపైఁ జేరి యింటికిఁ గొంపోయి
మెలుత గాఁగలించితే మేలుకొనెనతఁడు

చ. 2: పందెమంటానంతలో పగడసాలాడె విభుఁడు
దిందుపడి మచ్చరానఁ దెల్లవారెను
ముందుయెడకె వచ్చె మొకమజ్జనానకు
కందువగానాపె వచ్చి గూడె వెట్టెనే

చ. 3: శ్రీ వెంకటేశుఁడందుకుఁ జేరి తనపురముపై
దేవులుఁ జూపతే తెలిసి మొక్కె
కావించి వారిద్దరును కైకొని మన్నించఁగాను
చేవదేర నూడిగాలు సేసి తా వెలసెనే

రేకు: 0178-5 దేసాళం సంపుటం: 07-463

పల్లవి: తప్పుగాదు రావయ్యా దానికేమి దోసమా
వుప్పుచింది యెత్తితేను వొకటి రెండవుఁ గా

చ. 1: నగితిఁగా నేను నామోము నీవు చూడఁగ
తగి యిన్నాళ్ళకు నేను తలఁపయితిఁగా
చిగిరించిన వలపు చేగలెక్కెవి యిపుడు
మొగి ముమ్మారు నాఁటితే ములుక వంగవుఁ గా

చ. 2: విరుల వేసితిఁగా వెరగుతో నీవురాఁగా
పరగ నీ కూటమికి బాఁత్రైతిఁ గా
మురిపేన మూలవావి ముంగిటికి వచ్చెనేఁడు
పొరలి మా జవ్వనాలు పోఁకకు పుట్టేఁడు గా

చ. 3: మొకమెడితిఁగా నేను ముంచి నీవు గూడఁగాను
వొకవేళనైనాను వొద్దికైతిఁగా
వెకలివై నన్నును శ్రీవెంకటేశ యేలితివి
ప్రకటమై పేరితే పాలే పెరుగవుఁగా

రేకు: 0178-6 పాడి సంపుటం: 07-464

పల్లవి: చూతువు విచ్చేయవయ్య సారిది విరహమిది
చేత నీకు విన్నపము సేసేయట్టే వున్నది

చ. 1: చెక్కునఁ బెట్టిన చెయి చేరఁడేసి కన్నులకు
యిక్కువ చెప్పినయట్టు యింతికున్నది
మిక్కిలి కస్తూరిపట్టు మించు మోవి చంద్రునికి
దిక్కుల విహరించే రాతిరివలెనున్నది

చ. 2: పూవులపానుపు మీఁదఁ బొరలేటి చెలిబాగు
వావి నీకుఁబెట్టే సేసవలెనున్నది
యీవల తుమ్మిద కురులిట్టే చెదరివుండఁగ
వేవేలకు మరుదండు విడిదలై యున్నది

చ. 3: కడుఁ దాపమునకుఁగా గంధము పూసినపూఁత
వడి వలపుల వెల్లి వలెనున్నది
యెడయక శ్రీ వెంకటేశయీకెఁ గూడితివి
నడుకొత్తి నిచ్చకల్యాణమువలెనున్నది

రేకు: 0179-1 కేదారగౌళ సంపుటం: 07-465

పల్లవి: అడుగరే యీమాఁట అన్నియుఁ జెప్పేఁగాని
తడఁబాటు నవ్వులకు తానోపఁగలఁడా

చ. 1: ఇప్పుడు తనవొద్దికి యేల రమ్మనీనే
అప్పటిమాటలే కావా ఆడేవి
నెప్పున మాతోడిపొందు నిజము నిష్టూరమింతే
తప్పులు నేఁబట్టితేను తానోపఁగలఁడా

చ. 2: పీఁట మీఁద నుండి వచ్చి పెనఁగనేఁటికే నాతో
నాఁటి బాసలే కావా నడుపేవి
పాటించ మా విన్నపాలు పట్టినదే పంతమింతే
దాఁటరానినడకకు తానోపఁగలఁడా

చ. 3: ఆస మీరఁ దెరవేసి అంతలోనె నన్నుఁగూడె
చేసిన చేఁతలే కావా చెల్లేది
రాసికెక్క శ్రీ వెంకట రమణుఁడే తాఁగలఁడు
తాసువలె సరిదూఁగ తానోపఁగలఁడా

రేకు: 0179-2 కన్నడగౌళ సంపుటం: 07-466

పల్లవి: ఆతనిఁ గోసరకురే అందేమున్నది
ఆతుమలో సరివచ్చెనందేమున్నది

చ. 1: చాయపాటుమాఁటలెల్ల చవిసేసుకొంటగాక
ఆయడఁ దప్పువట్టితే అందేమున్నది
శేయరానిచేఁత చూచి సెలవి నవ్వుటగాక
ఆయరత దిద్దఁబోతే అందేమున్నది

చ. 2: ఒలిసి నొల్లని వలపాడిఁ బెట్టుకొంటగాక
అలిగి సొలయఁబోతే అందేమున్నది
బలిమి చుట్టరికము పైఁబొదుగుటగాక
అలరి విచ్చి చూచితే నందేమున్నది

చ. 3: ఎగసక్కేలేమి గల్లా యెదఁబెట్టుకొంటగాక
అగడు శాయఁబోతే నందేమున్నది
నిగిడి శ్రీ వెంకటాద్రి నిలయుఁడే నన్నుఁగూడె
అగపడ్డ మీఁద నేరాలందేమున్నది

రేకు: 0179-3 ఆహిరి సంపుటం: 07-467

పల్లవి: ఎప్పుడు తనదాననే యెగ్గువట్టేనా
చొప్పుగ నావంక దయఁజూచితేనే చాలదా

చ. 1: తానేల వేఁడుకొనీనే తడిసీఁ జెమటచేయి
అని విరహన గిజ్జిడైవుందానను
మానక సరిసేసుక మాఁటలేలాడీ నాతో
వీనులకు వెట్టదోఁచు విభుఁడు తాఁదాను

చ. 2: దగ్గరేల కూచుండీనే తనమేను కసుగందీ
వెగ్గళపు కాఁకలచే వేఁడై వుందాన
బగ్గన నాకేల తాను పచ్చడము గప్పితేనె
వొగ్గి జీడివంటివలపు వొమ్మునో వొమ్మదో

చ. 3: అంతేల కాఁగిలించీనే ఆయములు తన్ను సోఁకీ
కంతునియమ్ములు మేనెల్లా కాఁడివుందాన
ఇంతలో శ్రీ వెంకటేశుఁడెనసీఁ దమకమేలే
వింత మోవి తేనె లెల్ల విందులాయ తనకు

రేకు: 0179-4 సౌరాష్ట్రం సంపుటం: 07-468

పల్లవి: ఇదివో మాతోడి పొందులిటువంటివి
పుదుటున నిందుకెల్ల వోపుదువా నీవు

చ. 1: చిగురుమోవిని నేను చెలఁగి మాఁటాడఁగా
వొగరుగాదుగదా వో విభుఁడా
నిగిడి పద్మపు మోము నీకు నేను చూపఁగాను
తగిలి మరునియమ్ము తలఁపుగాదుగదా

చ. 2: కలువ కన్నుల నిన్నుఁ గాఁడిపారఁ జూడఁగాను
చలిగొనదు గదా యిచ్చట విభుఁడా
బలు కుచ గిరులను పై పై నిన్నొత్తఁగాను
నులివడి నీమేను నొవ్వదుగదా

చ. 3: అంది బాహులతల నిన్నట్టె చుట్టుకొనఁగాను
కందదుగదా శ్రీ వెంకట విభుఁడా
అందముగాఁ గలసితి నలమేలుమంగ నేను
విందువంటి మోవితేనె వెగటుగాదుగదా

రేకు: 0179-5 రామక్రియ సంపుటం: 07-469

పల్లవి: అప్పుడుట నీవు నవ్వితివౌనోకాదో
చొప్పులు సోరణగండ్లఁ జూచితినావేళను

చ. 1: వనిత చన్నుల మీఁది వాసన కస్తూరి పూఁత
మునుప నీవురముపై ముద్రలంటెను
వెనకనొక్కతె వచ్చి వెస గాఁగిలించుకొంటే
తన చన్నుల నంటితే తాఁదెలిసి తిట్టెను

చ. 2: తరుణివుపరిసురతపువేళ మెడదండ
గిరికొని నీమెడఁ దగిలియుండఁగగా
తరువాత వేరొకతె తా నీరతికి కింద్దై
మరలి దండ దగుల మరి నిన్నుఁ దిట్టెను

చ. 3: అలమేలుమంగ చెమటట్టే నీమేనిపైఁ జింది
చెలఁగి శ్రీ వెంకటేశ చిప్పిలుండఁగా
కలసి తులసీదేవి కాఁగిలించి ఆనీట
మెలుపునఁ దొప్పఁదోఁగి మెచ్చిమెచ్చి తిట్టెను

రేకు: 0179-6 దేసాళం సంపుటం: 07-470

పల్లవి: కొమ్మలాల యెంతవాఁడే గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు

చ. 1: వులిపచ్చినవ్వులతో వొత్తగిలి పవ్వళించి
కొలవు సేయించుకొనీ గోవిందరాజు
జలజాక్షులిద్దరూను సరిఁ బాదాలొత్తఁగాను
కొలఁదిమీర మెచ్చీని గోవిందరాజు

చ. 2: అదె నాభికమలాననజునిఁ బుట్టించి తాను
కొదలేక వున్నవాఁడు గోవిందరాజు
చెదరక తనవద్ద సేవసేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు

చ. 3: వొప్పుగా వామకరము వొగిఁజాఁచి వలకేల
కొప్పుగడునెత్తినాఁడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీ వెంకటాద్రినిరవై శంఖు చక్రాలు
కుప్పెకటారముఁబట్టె గోవిందరాజు

రేకు: 0180-1 ముఖారి సంపుటం: 07-471

పల్లవి: వినుమా ఆపె చేతనే వింతలుగఁ గాకుచేసి
అనఁబోలుదువు నీవే ఆపెతో నేఁడు

చ. 1: మంతనాన నీవు నేను మాఁటలాడుకొన్న మాఁట
అంతలో నెవ్వరు చెప్పిరాపెతో నేఁడు
చెంత నీచేఁతకు నేను చేయెత్తి మొక్కిన మొక్కు
అంతరంగమెట్టు చెప్పిరాపెతో నేఁడు

చ. 2: పరపు పై నిద్దరము పచ్చుగా నవ్విన నవ్వు
అరసి యెవ్వరు చెప్పిరాపెతో నేఁడు
తెరలోని మనగుట్టు దిష్టముగ వివరించి
అరుదుగానెట్టు చెప్పిరాపెతో నేఁడు

చ. 3: మనలోఁ గూడిన యట్టి మదన బంధములెల్ల
అనువులెవ్వరు చెప్పిరాపెతో నేఁడు
ఘనుఁడ శ్రీవెంకటేశ కలసితివప్పటిని
అనవయ్య యింకా నీవు ఆపెతో నేఁడు

రేకు: 0180-2 మాళవిశ్రీ సంపుటం: 07-472

పల్లవి: చెల్లఁబో నీవెటువంటి చెలివైతివే
కొల్లలుగానతనినే కూడితివిగా

చ. 1: మనసిచ్చి ఆతనితో మాఁటాడవైతివిగా
చనవు సేసుకొని కొసరవైతిగా
పెనఁగి చేతులువట్టి పిలువవైతివిగా
వినయాన భారము పై వేయవైతిగా

చ. 2: తప్పరాని బాసలెల్ల తలఁపించవైతివిగా
అప్పసము నేమొక్కితిననవైతిగా
అప్పుడె ముద్దుటుంగరమటు చూపవైతివిగా
నెప్పునానాలు వెట్టి నెట్టుకొనవైతిగా

చ. 3: నగవులనే వలపు నానఁబెట్టువైతివిగా
చిగిరించ నిచ్చకాలు సేయవైతిగా
తగు శ్రీ వెంకటేశుఁడు తానెవచ్చి నన్నుఁగూడె
నిగిడి నీయంత నీవు నేర్పవైతిగా

రేకు: 0180-3 మలహరి సంపుటం: 07-473

పల్లవి: తిరు మజ్జనపు వేళ దేవునికి నిదివో
పరగ నారదాదులు పాడరో యిందరును

చ. 1: చింతదీర వేంచేసి సింహాసనమున నుండి
దంతధావనాది కృత్యములు చేసి
సంతసాననంటరో సంపెంగ నూనియదెచ్చి
కాంతలు గందపుటటికలి వెట్టురో

చ. 2: పంచామృతముల తోడ పన్నీట మజ్జనమాడె
కాంచనాంబరాలు గట్టె కస్తూరిపూసె
నించుకొనె సొమ్ములెల్లా నిలువు దండలు చాతె
పొంచి దూపదీపతాంబూలములొసఁగరో

చ. 3: పాదుకలు వాహనాలు బహుఛత్రచామరాలు
ఆదరించె శంఖకాహళాదివాద్యాలు
వేదపారాయణలతో వెసఁజూచెఁ గపిలను
గాదెలలెక్కలడిగె గడేరాలు వినెను

చ. 4: అంగరంగవైభవాలకరళుపాడులు వెట్టె
అంగపు నిత్యదానాదులన్నియుఁజెసె
చెంగటనలమేల్మంగ శ్రీ వెంకటేశుఁడు గూడి
ముంగిటిపారుపత్యములు చేసీని

రేకు: 0180-4 మధ్యమావతి సంపుటం: 07-474

పల్లవి: తెట్టఁదెరువుననేల తేరకాఁడా
యెట్టువలసిననయ్యా నింటికి రావయ్యా

చ. 1: గొల్లెతల నీవేల కొప్పువట్టి తీసేవు
చల్లచాడె వదిలము జాజరకాడ
గుల్లసంకుదుబ్బను కొలచి పోయిమనేవు
యిల్లిదె యిప్పుడె మాయింటికి రావయ్యా

చ. 2: వుమురుఁగూటాన నావొడివట్టి పెనఁగేవు
చమురు చిందీనోయి జగడగాఁడ
బమసి పిల్లఁగోవి పడిరోఁ బోయిమనేవు
యిముడుకోవలసితే యింటికి రావయ్యా

చ. 3: బాలుఁడ శ్రీవెంకటేశ పయ్యదేల తొడికేవు
పాలు దొలఁకీనోయి పంతగాఁడ
కోలుముంద్దై నీతుత్తురుఁగొమ్ములోఁబోయుమనేవు
యేలుకొందుగాని మాయింటికి రావయ్యా

రేకు: 0180-5 కేదారగౌళ సంపుటం: 07-475

పల్లవి: పట్టియలుకల నీవే వలఁబడితివి గాక
పట్టి పెనఁగఁగా నీతోఁ బదరితినా

చ. 1: అడరి నే వద్దకి రానంటాఁ గోపగించేవు
వొడివట్టి తియ్యఁగా నే నోపనంటినా
పడితిఁ గాఁకలనంటాఁ బలుమారు దూరేవు
కడఁగి కాఁగిలించఁగాఁ గాదంటినా

చ. 2: కతలనే తెల్లవారెఁగా యంటాఁ గినిసేవు
రతిఁబిలువఁగా నే రానంటినా
తతి మోవి తేనెకుఁగా దవ్వులఁబొరలే విట్టే
ఇతవై నీవడుఁగఁగా నియ్యనంటినా

చ. 3: అంచల నేకతమాడనంటాను మొరసేవు
వంచి తెరవేయఁగా నేవద్దంటినా
పొంచి శ్రీ వెంకటేశ యిప్పుడు నన్నుఁబొందితివి
మంచముపై నల్లపుడు మారుకొంటినా

రేకు: 0180-6 సాళంగనాట సంపుటం: 07-476

పల్లవి: నిజము నిష్ఠూరము నేమైతేను
గుజగుజలను యాల కొసరింపించేవు

చ. 1: నెమ్మినాపెను వేఁడుకో నీవే నేరుతువు
కొమ్మ కోపము దప్పించుకో నేరుతువు
దొమ్మరి చేఁతలు సేసి తిద్దుకొననే రుతువు
మమ్మేల యందుకునెడమాఁటలాడించేవు

చ. 2: పొసఁగ నీయంకెకు రాబుద్ధిచెప్ప నేరుతువు
అసు దైయాపెపంపుశాయఁగ నేర్తువు
పసలుగా సారెసారె బాసలు సేయనేర్తువు
యెసగి నే వెంటవచ్చియేమి సేసేనయ్యా

చ. 3: ఈవులిచ్చి యింటికిరా నెలయించ నేరుతువు
వేవేలు విధముల నవ్వించ నేర్తువు
శ్రీ వెంకటేశుఁడ నీవే చెలియఁగూడితి విట్టే
దేవుఁడవు మమ్మేంత పొదిగి మెచ్చేవిపుడు

రేకు: 0181-1 సాళంగనాట సంపుటం: 07-477

పల్లవి: ఆస తికి నీకుఁబోదు అండనుండేవారమింతే
బేసబెల్లితనమునఁ బెనఁగ మాకేల

చ. 1: కురులెంత చిక్కువడ్డాఁ గొనగోళ్ళే తీర్చు
సరులెంత పెనగొన్నా చన్నులే యాను
తరుణెంత గోపించినాఁ దగ నీవే వోర్చేవు
పెరరేఁచి సారెసారెఁ బెనఁగ మాకేల

చ. 2: పిక్కటిల్లుఁదిట్టులెల్లా పెదవి మోవఁగవలె
వెక్కసపుఁ గన్నులైతే విడిది మోమే
నిక్కముగ చెలి పంతము నీవే చెల్లించవలె
పెక్కువిధముల మీతోఁ బెనఁగ మాకేల

చ. 3: కందువ రతులకెల్లా కాఁగిలి యొక్కటే గురి
అందపుఁబిరుదు భారమానుఁ బాదాలు
యిందునె శ్రీ వెంకటేశ యీపె నీవురమెక్కెను
పెందలకాడనుండి పెనఁగ మాకేల

రేకు: 0181-2 సామంతం సంపుటం: 07-478

పల్లవి: ఊరకుండితే మేలు వూఁకొంటేఁ బైఁడికతౌను
బారపెట్టితే నలపు పచ్చిదేరెనందువు

చ. 1: పగడవాతెర విచ్చి పలుమారు మాఁటాడితే
దగర యెంతటిది రట్టడియందువు
మొగమెత్తి నేను నీమోము సారెకుఁ జూచితే
జిగిమించ నిదియెంత సిగ్గులేనిదందువు

చ. 2: చెలఁగి నీ చిత్తము రా సెలవుల నగితేను
కెలసి యెంత యెగసక్కెపుదందువు
తలఁపించి నీబాసలు తడవి పేరుకొంటేను
వలవంతనిది యెంతవళకులదందువు

చ. 3: గక్కన నేనే ముందు కాఁగలించుకొంటేను
దక్కి నీకంటె బలిమిదాననందువు
ఎక్కువ శ్రీవెంకటేశ యింతలో నన్నేలితివి
మిక్కిలినిఁ బెనఁగితే మీరితి నేనందువు

రేకు: 0181-3 పాడి సంపుటం: 07-479

పల్లవి: ఆతఁడెంత నీవెంత అవునే మేలు
యేతరిదానవు నీకునెంచనున్నదా

చ. 1: చెల్లుబడిగలితేను శింగారించుకొందుగాక
పల్లదాలాడుదురా పతితోను
గొల్లవారి తోడిపని గొడ్డలి నానఁబెట్టుట
మల్లాడి బుద్ధిచెప్పితే మంకు మానీనా

చ. 2: మేనదానవై తేను మేరతోఁ గైకొందుగాక
ఆనలువెట్టుదురా ఆతనితోను
పూని చల్లలమ్మేవారిపొందు దూలమూఁతకోల
ఆనుకెంత కిందుపడ్డా నారడి మానీనా

చ. 3: చనవరివైవుండితే సరసమాడుదుగాక
యెనసి శ్రీ వెంకటేశునెగ్గులెంతురా
గునిసి మందలవారిగుణము రాతిపైనార
ననుపెంత గలిగినా నాలి మానీనా

రేకు: 0181-4 హిందోళవసంతం సంపుటం: 07-480

పల్లవి: నీవైన విన్నవించవే నేర్చుకొనునాతఁడు
వేవేలు కోరికలకు వెల వలెనా

చ. 1: యీడువెట్టుకాడఁగాను యేది నిజమౌనో
యేడ లేనిమాఁటలునేల పెంచీనే
వాడికవలపులకు వచ్చినంతే లాభము
వోడక ఆసోదానకు వొడిగట్టువలెనా

చ. 2: దొంతల సరసముల దొమ్మియెంత గూడునో
యెంత దరవైన నవ్వులేమి సేసీనే
బంతి భోజనాలకు పట్టినదెల్లాఁ గడి
వింతజాణతనాలకు వేళ చూడవలెనా

చ. 3: మచ్చికఁ బరవశాన మఱతునో తలఁతునో
హెచ్చి తన మోహమేల యెచ్చరించీనే
తచ్చి శ్రీ వెంకటేశుఁడు తానె నన్నిదె కూడె
కొచ్చి కొచ్చి తమకము గుదిగుచ్చవలెనా

రేకు: 0181-5 హిజ్జిజ్జి సంపుటం: 07-481

పల్లవి: తానేకల గనెనో తప్పక చెప్పుమనవే
మానక తెల్లవారఁగా మాయింటికి వచ్చెను

చ. 1: ఆకు మడిచిత్తునంటా ఆయములూనంటెనంటా
కైకొని యిద్దరూనుండఁగల గంటినే
దాకొని నవ్వితినంటా తములమువెట్టెనంటా
కాకరితనాల మంచి కల గంటినే

చ. 2: పెనఁగితి నేనంటా ప్రియము తాఁజెప్పెనంటా
కనుమూసినంతలోనే కల గంటినే
కొనగోరంటితినంటా కొప్పువట్టి తీసెనంటా
ఘనమైన వలపుల కల గంటినే

చ. 3: లలి సన్నసేతునంటా లాగుగాఁ జేపట్టునంటా
కలికితనాలనొక్క కల గంటినే
అలమేల్‌మంగనేను అట్టె శ్రీ వెంకటేశుఁ
గలసితినిట్లా నేకల గంటినే

రేకు: 0181-6 కేదారగౌళ సంపుటం: 07-482

పల్లవి: ఎప్పుడూను నీ సుద్దులిటువంటివి
గుప్పి సముద్రములోనే కురియించేవు వాన

చ. 1: కానికె దెచ్చినయాపె కాచుకిట్టే వుండఁగాను
వూని వీఁగేయాపెనేల వొడివట్టేవు
ఆని దప్పిగొంటినన్న యాపెనటువెట్టి నీళ్ళ
నానుచున్నయాపెకేల పానకమిచ్చేవు

చ. 2: పెండిలికి వచ్చినాపె పెరట విడిశుండఁగా
చండి పొరుగాపెనేల సన్నసేసేవు
అండ నాఁకలిగొన్నాపె అట్టెమోముచూడగాను
నిండఁదనిసినాపెకు నీవువిందు వెట్టేవు

చ. 3: వొద్ది యలమేలుమంగనురమునఁ బెట్టుకొని
గద్దించి కడవారిపై కాలుచాఁచేవు
కొద్దితో శ్రీ వెంకటేశ కూడినాపె వుండఁగగాను
అద్ది పిల్చినాపెకేల ఆసలు నించేవు

రేకు: 0182-1 ముఖారి సంపుటం: 07-483

పల్లవి: నేమే దొరసానులము నేరక లోననుందుము
సాముసేయ నెంతలేదు సముకపువారికి

చ. 1: సిగ్గువడ నెంతలేదు చెయిచాఁచ నెంతలేదు
దగ్గరి సేవలు సేసే తరుణులకు
వొగ్గి పిల్వ నెంతలేదు వోపనన నెంతలేదు
అగ్గలమై కాచుక అండనుండేవారికి

చ. 2: అందిపొంద నెంతలేదు ఆనవెట్టు నెంతలేదు
కందువనుండేటి వూడిగపువారికి
చెందికూడ నెంతలేదు చెల్లించుకో నెంతలేదు
యెందుకైనానొడిగట్టే యింటిలోనివారికి

చ. 3: రవ్వసేయ నెంతలేదు రచ్చకెక్క నెంతలేదు
నవ్వులు నవ్వించే మన్ననవారికి
జవ్వనపు శ్రీ వెంకటేశ్వరుఁడిదె నన్నుఁ గూడె
నివ్వటిల్ల నెంతలేదు నీవంటివారికి

రేకు: 0182-2 బౌళిరామక్రియ సంపుటం: 07-484

పల్లవి: నేరుపరివౌదువే నీవిన్నిటా- వోరి
నేరకుంటే నేఁడుమమ్ము నీవింత సేతువా

చ. 1: పూని మాఁటలాడఁగదే పొలఁతీ -వోరి
వాన పలుమారువైతే వరదలౌరా
నానితేఁ గొంత వలపు నయమౌఁగదే-వోరి
నానునా గొడ్డలివంటి నాలైన నీచిత్తము

చ. 2: కలయవే మాపొత్తు కలికీ -వోరి
కలగలపు గిజ్జడి గాదటరా
పలురతులేకాదా పరిణామముఁ-వోరి
పలువంచలఁ బడెను పాయపు నీదేహము

చ. 3: సేస వెట్టితిగదే శ్రీసతీ-వోరి
సేసుకుంటే పుణ్యములు చేరకుండునా
రాసులైతే మేలే నీ రచనలెల్లా -వోరి
ఆసలు శ్రీ వెంకటేశ ఆయములు సోఁకెరా

రేకు: 0182-3 భైరవి సంపుటం: 07-485

పల్లవి: పైఁడికతవంటిదాయ పైకొన్ననీతోడిమేలు
వేఁడి వేఁడి కోరికలు వెల్లవిరులౌను

చ. 1: తిలకించి చూడఁబోతే ద్రిష్టి దాఁకీనందువు
పలికితేనే బహుభాషిదందువు
చెలరేఁగి నవ్వితేనే సిగ్గులేనిదందువు
యెలమి నీతోడిపొందు యెందుకైనా వచ్చును

చ. 2: సరసములాడితేనే చలివాసెనందువు
కరఁగితినంటే బూటకములందువు
సారెది నీకు మొక్కితే జూటరినేనందువు
యిరవై నీతోడిపొందు యెందుకైన వచ్చును

చ. 3: పైపైఁ జెయివేసితే పంతమిచ్చెనందువు
రాపుగ మెచ్చితే బీరములందువు
బాపురా శ్రీవెంకటేశ బలిమిఁ గూడితి నన్ను
యేపున నీతోడిపొందు యెందుకైనా వచ్చును

రేకు: 0182-4 సామంతం సంపుటం: 07-486

పల్లవి: ఇందుకే మెచ్చేరు చూచి యింతులెల్ల నిన్నును
విందుల నీ సొబగుకే వెలలేదుగాక

చ. 1: పన్నిన కొలువులోని పతిమెలెందరు లేరు
నిన్ను మోహింపించినదే నెలఁతగాక
యెన్నిలేవు కళలు నీకివె చెక్కుల మీఁదట
చిన్నికొనగోరురేకే చెప్పరాదుగాక

చ. 2: చప్పని వుప్పని మాఁటసరసములెన్ని లేవు
కొప్పువట్టి తీసినదే కొత్తలుగాక
ముప్పిరి మోవి మీఁదటి మొగచాటులెన్ని లేవు
కప్పి తములమిడుటే కతలాయఁగాక

చ. 3: సిగ్గువడ్డ చిత్తములో చిందువందులెన్ని లేవు
దగ్గరికూడినదే తగులుగాక
అగ్గమై శ్రీ వెంకటేశ ఆసలాసలెన్ని లేవు
నిగ్గుల యీకూటములే నేరుపులుగాక

రేకు: 0182-5 రామక్రియ సంపుటం: 07-487

పల్లవి: ఇన్నిటా సరసుఁడవు యెంతసేసేవు
వెన్నెల పులుగములా వేడుక నీసిగ్గులు

చ. 1: మలసి యాలకొంకేవు మరికొంత నవ్వరాదా
వెలవెట్టి కొంటివా యీవీటనేమైనా
అలరి మాఁటాడుమంటే అందునిందుఁ గలపేవు
కలగూరా యేమైనా గజిబిజి సేయను

చ. 2: మరులేని కొలిపేవు మనసు నాకియ్యరాదా
అరివేనఁ దెచ్చితివా అప్పుడే నీవు
తెరలోన దాఁగేవు తేరి నిన్నుఁ జూచితేను
సరిబేశా నీ చేఁతలు సారెసారె ముయ్యను

చ. 3: కొద్దినేల లోభించేవు కూరిమి పైజల్లరాదా
మద్దులెక్కి కోసితివా మరియలసి
గద్దరి శ్రీ వెంకటేశ కలసితి విటు నన్ను
చద్ది మూటలా రతులు సారెకు భోగించను

రేకు: 0182-6 కాంబోది సంపుటం: 07-488

పల్లవి: వద్దనేమా నేము వలవనిజోలైతే
తిద్దలేము తగవులు దిష్టమైన పనికి

చ. 1: వగలు వెట్టుక నీవు వట్టి కూరిమి గొసరి
యెగసక్కేలాడితే నేనెరఁగఁ గాక
మగువ గుణములెంచి మరి నీ గుణములెంచి
నగుమా వోరిచీ నాపె నాయమైనపనికి

చ. 2: దిమ్ములు రేఁచుక నీవు తెరవలఁ జూపి మోపి
యెమ్మెలెల్లా నెరపితే నెరఁగఁ గాక
నెమ్మదిఁ దగవెరిఁగా నెలఁతయిరవెరిఁగి
రమ్మా కలసీ నాపె రవ్వగాని పనికి

చ. 3: పంతములెల్లానాడి బలిమిఁ గాఁగిటఁ బట్టి
యింత కిందుపడితే నేనెఱఁగఁ గాక
యింతలో శ్రీ వెంకటేశ యెనసితి విటులానే
వంతిమ్మా పెనఁగీ నాపె వసమైన పనికి

రేకు: 0183-1 రామక్రియ సంపుటం: 07-489

పల్లవి: కొచ్చి కొచ్చి కొసరీనే గొల్లకొసరు
కుచ్చి యెత్తెవే చన్నుల గొల్లకొసరు

చ. 1: చేరువనుండి నిన్నుఁ జెనకీనదివో వాఁడు
గోరికొనలనొత్తవే గొల్లకొసరు
మారుకొని నీతోనిట్టె మాఁటలాడ వచ్చీని
కూరిమిఁ దిట్టఁగదవే గొల్లకొసరు

చ. 2: పఱచుఁజేఁతలు చేసి పైకొనీ వచ్చి వాఁడు
గుఱుతు మోవిసేయవే గొల్లకొసరు
మెఱసి పెనఁగవచ్చీ మిక్కుటపురతులను
కొఱకొఱఁ బెట్టఁగదే గొల్లకొసరు

చ. 3: చెల్లుబడి వావిచెప్పీ శ్రీవెంకటేశుఁడు గూడె
కొల్లున నవ్వఁగదవే గొల్లకొసరు
బల్లిదుఁడాతఁడు నీవు పట్టపు దేవులవై
కొల్లలాడేవే వలపు గొల్ల కొసరు

రేకు: 0183-2 కేదారగౌళ సంపుటం: 07-490

పల్లవి: చద్దికి వేఁడికి మీరు సరసములాడరాదా
యిద్దరుఁ గూడితిరి మీకికనేల అలుక

చ. 1: మచ్చరపు గొణఁగులు మాఁటలాడినందాఁకానే
అచ్చలము మోము చూచినందాఁకనే
తచ్చనలన్నియు నేకాంతములైనందాఁకానే
యెచ్చుకొందు లేదు మీకు యికనేల అలుక

చ. 2: మునుకొన్నజగడము మొక్కు మొక్కినందాఁకానే
అనుగుమోనము నవ్వినందాఁకానే
పెనఁగులాటలు తమిపెరరేఁచినందాఁకానే
యెనసెఁ జుట్టురికములికనేలె అలుక

చ. 3: నేసవెట్టిన సిగ్గులు చేయి మోఁచినందాఁకానే
ఆసలెల్లాఁ గాఁగిలించినందాఁకానే
వాసితో శ్రీ వెంకటేశ్వర కూడితిరి మీరు
యీసులెల్లాఁ బెడఁబాసెనికనేఁటియలుక

రేకు: 0183-3 పాడి సంపుటం: 07-491

పల్లవి: చెవులారా వినేఁగాని చెప్పుమా నాకాసుద్ది
జవళి వలపు లిట్టే చల్లుదురా

చ. 1: పొరి నిన్నుఁ దలఁతునెప్పుడునంటానాడేవు
తరుణులఁ బొందేవేళఁ దలఁతువా
యెరవులేక నాకే యెదురు చూతుననేవు
కరఁగి చొక్కే వేళ కనువిచ్చి చూతువా

చ. 2: వనజాక్ష నారుపే వ్రాసి చూతుననియేవు
వనితల వురముపై వ్రాతువా
చనవున నాపేరే జపయింతుననేవు నీ
యనుఁగుఁగాంతఁ బిలిచేయప్పుడు జపింతువా

చ. 3: ఎమ్మెలతో నేరుపులెంతునంటానాడేవు
కొమ్మలతోడుత నట్టే కొనేడుదువా
మమ్ము శ్రీ వెంకటేశ మండెమురాయఁడవై
సమ్మతిఁ గూడితి విట్టే చనవిత్తువా

రేకు: 0183-4 సాళంగనాట సంపుటం: 07-492

పల్లవి: ఎందాఁక వేసరించే నిదివో నిన్ను
పొందితే నీ కాఁగిటిలో పొఁగేదేకాక

చ. 1: చిగురుఁ గొమ్మకు నెంత చేగలెక్కినామేలే
మగువనెంత వెంచినా మాకుమేలే
జగడాలకేమి వని సాదువలెనుండి నీవు
మొగము చూచినంతలో మొక్కేదే కాక

చ. 2: వలరాజునమ్ముకెంత వాఁడివెట్టినామేలే
చెలిని నీవెంత సింగారించినామేలే
చలపోర మరియేల చనవుకొలఁదినే
పిలిచినప్పుడే నీతోఁ బెనఁగేదే కాక

చ. 3: బంగారు ప్రతిమ కెంత ప్రాణము వోసినామేలే
అంగనకెంత లోనైనా మేలే
సంగతి శ్రీ వెంకటేశ సరి నన్నుఁ గూడితివి
పొంగి నీవు చెనకితే భోగించుటే కాక

రేకు: 0183-5 శ్రీరాగం సంపుటం: 07-493

పల్లవి: మదనుని తండ్రికి మజ్జనవేళ
పొదిగొనీ సింగారపు భోగములెల్లాను

చ. 1: పడఁతుల నవ్వులెల్లా పైనంటుకొన్నట్టు
కడలేక పొగడొందెఁ గప్పురకాపు
నిడివిఁ గల్ప వృక్షము నిండాఁ బూచినట్టు
కడుఁ దెల్లనై యమరెఁ గప్పురకాపు

చ. 2: సుదతుల చూపులు సొరిది పైఁగప్పినట్టు
పొదిగొని జొబ్బిలీని పుణుఁగుకాపు
అదన నల్లగలువలట్టె ముంచుకొన్నట్టు
పొదలెఁ దిరుమేనను పుణుఁగుకాపు

చ. 3: అలమేలుమంగ పురమందుండి యనురాగము
కులికినట్టు పన్నీరుఁ గుంకుమకాపు
యెలమి శ్రీ వెంకటేశుఁడిన్ని సొమ్ములు నించుక
కొలువెల్లా నిండుకొని కుంకుమకాపు

రేకు: 0183-6 శంకరాభరణం సంపుటం: 07-494

పల్లవి: ఇదివో ద్రిష్టాంతము యిచట మీయందె కంటి
యెదిరితే వెనకముందింతాఁ బెడరేఁచును

చ. 1: యేకతమైతేఁ జాలు యెంతటలుకైనాను
పోకుండా లోలోనే పొందుసేసును
సాకిరి గలితేఁ జాలు సరినెంతమోనమైనా
వాకిచ్చి మాటాడించి వడిఁ గొసరించును

చ. 2: పానుపొక్కటైతేఁ జాలు పచ్చివొట్లెట్టివైనా
మానఁజేసి తమకము మతిఁరేఁచు
మేనులు సోఁకితేఁ జాలు మిక్కుటపు కాఁకలెల్లా
ఆనుకొని చల్లఁజేసి ఆయములు గరఁచు

చ. 3: బాగాలందుకొంటేఁ జాలు పరాకులన్ని మాన్పి
చేగలెక్కి రతులెల్లాఁ జిమ్మిరేఁచును
యీగతి శ్రీ వెంకటేశ యీకె నీవుఁ గూడితిరి
జాగులేని సరసాలు చనవులిప్పించును

రేకు: 0184-1 నాదరామక్రియ సంపుటం: 07-495

పల్లవి: చిత్తగించు మామాఁట శ్రీ నరసింహా
చిత్తజ జనక వో శ్రీ నరసింహా

చ. 1: చెలరేఁగి వున్నాఁడవు శ్రీ నరసింహా - నీకు
జెలులెల్లా మొక్కేరు శ్రీ నరసింహా
సెలవుల నవ్వేవిట్టే శ్రీ నరసింహా- నీకే
సెలవు మావలపులు శ్రీ నరసింహా

చ. 2: చిందీని మైఁజెమటలు శ్రీ నరసింహాఁ నిన్ను
జెందినది కడు జాణ శ్రీ నరసింహా
చెందమ్మి రేకుల గోళ్ళ శ్రీ నరసింహా- నీపై
చిందులెల్లా బాడేము శ్రీ నరసింహా

చ. 3: సిరినెరకాఁగిటి శ్రీ నరసింహా- మంచి
సిరుల నహోబలము శ్రీ నరసింహా
శిరసెత్తు శ్రీవెంకట శ్రీ నరసింహా
చెరలాటాలిఁకనేల శ్రీనరసింహా

రేకు: 0184-2 శంకరాభరణం సంపుటం: 07-496

పల్లవి: సందడెంతైనాఁ గలదు సతులలో నీకు
అందరిలోఁ గరుణించి ఆదరింతుగాని

చ. 1: మోము చూచి నీకు నేను మొక్కితిఁ జుమ్మీ రమణ
ఆముకొని యాడో పరాకైతిననక
వోముక నీ చేతలు నావొళ్ళిపై నున్నవి సుమ్మీ
చేముట్టి తడివిచూచి చిత్తగింతుగాని

చ. 2: గక్కనఁ గైదండయిచ్చి కదిసి వుండితిఁ జుమ్మీ
చిక్కి ఆ వేళను మరచితి ననక
మక్కువ నాతోనాడిన మాటపట్టున్నది సుమ్మీ
పక్కన నాపాలఁజిక్కి పాయకుందుగాని

చ. 3: ననుపున నీతో నేను నవ్వులు నవ్వితిఁ జుమ్మీ
చెనకనేరక భ్రమసితిననక
మొనసి శ్రీ వెంకటేశ ముంచి కూడితివి సుమ్మీ
పెనచి నీమహిమెల్లా బెరయింతుగాని

రేకు: 0184-3 దేసాళం సంపుటం: 07-497

పల్లవి: నీ మీఁది తలపోఁతలే నిండు రతిగా భావించి
ప్రేమతోనున్నది యిట్టె ప్రియము చేకోవయ్యా

చ. 1: వీడెమిచ్చే యప్పటి వేడుకలు దలపోసి
ఆడుకోలుమాఁటలెల్ల నటుదలఁచి
కూడివున్నవేళల గురుతులు దలపోసి
వోడక సంతోసములనోలలాడుచున్నది

చ. 2: కేళాకూళిలో నీమేలములు దలపోసి
చేలకొంగువట్టిన సిగ్గు దలఁచి
సోలిఁ గొలు వున్నచోటి చూపులు దలపోసి
వోలి సంతోసములలో నోలలాడుచున్నది

చ. 3: ముప్పిరిగొనిన నీమోవితీపు దలపోసి
నెప్పున నీవు గూడిన నేర్పు దలఁచి
యిప్పుడు శ్రీ వెంకటేశ యీకె యలమేలుమంగ
వొప్పుగు సంతోసాన నోలలాడుచున్నది

రేకు: 0184-4 పాడి సంపుటం: 07-498

పల్లవి: తనకు నే విన్నవించేదానవా చెలులాల
కనుఁగొంటే నాకుఁ దనకరుణే కలది

చ. 1: మనసులెనసితేను మంతనాలు సైకమౌను
కనుచూపులింపులైతే కలుగు రతి
చెనకులియ్యకోలైతే చేతలెల్లా సమ్మతౌను
పెనఁగితే వలపులు పిప్పిగట్టునే

చ. 2: సమ్మతించి పూఁకొంటే చవులౌను కతలెల్లా
కుమ్మరించితే ప్రియాలు కొనసాగును
నమ్మితేఁ జుట్టురికము నాఁటుకొని దైలువారు
దిమ్మరేఁచితే సిగ్గులఁ దెల్లవారునే

చ. 3: సరవులు నెరపితే సతమౌను కాఁగిలి
మరిగితే సరసము మక్కళించు
యిరవై శ్రీవెంకటేశుఁడితఁడె నన్నుఁగూడె
అరసి పైకొంటేనాసలే మించునే

రేకు: 0184-5 దేసాళం సంపుటం: 07-499

పల్లవి: ఇంతి మోహము లిఁకనేమని చేప్పేము నీకు
మంతనాన నాకె నేలి మన్నించవయ్యా

చ. 1: చిలుకలు మాటాడితేఁ జేరి నీవంపినయట్టి
చెలుల పలుకులంటాఁ జెవి యొగ్గి వినును
అలులు మొరసితే నీవాడకు వచ్చేయప్పటి
బలుశంఖరావాలని పై పై నాలకించును

చ. 2: మరుని పంచబాణాలు మనసున నాఁటితే
విరుల వేసేవంటా వెస నవ్వును
సురటుల విసరితేఁ జూచి నీ వూరుపు గాలి
సరుగనే తెంచెనని సంతోసించుకొనును

చ. 3: చందురుఁడుదయించితే చాయల నీపంజనుచు
యిందుముఖి నీరాకకునెదురువచ్చు
అందపు శ్రీ వెంకటేశ అంతలో నీవేలితివి
యిందులోఁ దెలిసి వాని హితులంటా మెచ్చును

రేకు: 0184-6 ఆహిరి సంపుటం: 07-500

పల్లవి: ఆతనివల్లఁ దప్పేది అరసి చూచేనంటే
కాతరపు నాగుణాల గతులింతే కాక

చ. 1: చనవుమెరసి నేను సారెకు మాటలాడఁగ
వినక మానీనా విభుఁడు తాను
ననిచి నాపై ప్రేమ నాఁటెనో నాఁటదో యని
అనుమానపు నామనసల్లాడీఁ గాక

చ. 2: వీడిన తురుముతోడ వేగమె నేమొక్కఁగాను
చూడక మానీనా సుగుణ తాను
వాడుదేర నన్నుఁగూడ వచ్చినో రాఁడోయని
వేడుకతోఁ దమకించే విధమింతే గాక

చ. 3: పొంకానఁ గాఁగిలించి పొఁగ నేఁగూడఁగాను
లంకెగాక మానీనా శ్రీ వెంకటేశుఁడు
కొంకక నా రతులియ్యకొనునో కొనఁడోయని
సంకెలేని నాలో విచారమింతే కాక

రేకు: 0185-1 సామంతం సంపుటం: 07-501

పల్లవి: తల వంచుకోకుమీ తప్పు నీయందేమి లేదు
బలుదొరతనానకుఁ బాడి యిదే సుమ్మీ

చ. 1: ఇంతేసి నేనాడేది యిచ్చకము గాదు సుమ్మీ
కాంతలఁ జూచితే నీవు కరుణింతువు
అంతవాఁడవీమాటకు నట్టే సిగ్గువడకుమీ
బంతి దయగలవారి పాడి యిదే సుమ్మీ

చ. 2: వేడుక నిన్నుమెచ్చేది వెంగెములు గావు సుమ్మీ
కూడేమంటే సతులకుఁ గొంగిత్తువు
వాడికింతే యిందుకుఁగా వడి నవ్వునవ్వకుమీ
పాడిపంతాలవారికిఁ బాడి ఇదె సుమ్మీ

చ. 3: నమ్మించి కాఁగలించేది నమ్మనిది గాదు సుమ్మీ
యిమ్ముల సులభుఁడవు యెవ్వరికైనా
కమ్మి శ్రీ వెంకటేశుఁడ కలసితివిటు నన్ను
పమ్మి మోహపువారికిఁ బాడి యిదె సుమ్మీ

రేకు: 0185-2 బౌళి సంపుటం: 07-502

పల్లవి: కంటివటవయ్య నీవు కన్నుఁగొనల
వెంటనే చెయివట్టి తెరవేయవయ్య ఇపుడు

చ. 1: కంకణసూడిగములు గల్లురనఁగాఁ జెలి
పంకముగాఁ గస్తూరి నీపైనలఁది
సుంకులఁ గుచాలు నిన్ను సోఁకెనంటా సిగ్గువడి
అంకెలఁ దలవంచుక అదివో నవ్వీని

చ. 2: మొలనూలిగంటలు మోయఁగా నీశిరసున
నలరు తట్టుపుణుఁడు అట్టె నీకంటి
యెలమి మర్మాలు నీకునెక్కడనో తాఁకెనంటా
తెలిగన్నులను నీదిక్కే చూచీని

చ. 3: మట్టెల రవళితోడ మంచముమీఁదటనుండి
అట్టుగా మెప్పించె నిన్నాఁడిభావాల
ఇటె శ్రీవెంకటేశ యింత సేయించితివంటా
ముట్టి మోవితేనెలాని మోహము చల్లీని

రేకు: 0185-3 పాడి సంపుటం: 07-503

పల్లవి: మరలి యేఁటిమాట మనమున్నచోటి
తరితీపులే కాక తమకించనేఁటికే

చ. 1: తేనెగారీ నీమోవి తేటలాయ నీమొగము
మోనానవిందుకే నేను మొక్కే నీకు
వానలాయఁ జెంజెమట వడి నీమేననెల్లా
ఆనుక పులకపైరులంటెను నామేనను

చ. 2: తెల్లనాయ నీకన్నులు దిష్టమాయ నీచేఁత
మొల్లమినిందుకే నేను మొక్కే నీకు
వొల్లనె నీముక్కున నిట్టూర్పుగాలి విసరఁగ
పల్లదపు నాగుబ్బలపైకొంగు జారెను

చ. 3: సరులు నీమేననొత్తి సరివచ్చె నీనవ్వు
మురిపెములాయ నేను మొక్కే నీకు
యిరవుగ శ్రీ వెంకటేశ నన్నునేలితివి
తెరలోనే నీకునాకుఁ దేరెను జగడము

రేకు: 0185-4 పాడి సంపుటం: 07-504

పల్లవి: సిగ్గులు పడకువయ్య చెక్కుచెయి దీయవయ్యా
నిగ్గుల నవ్వితిమి నీజాడలెరఁగక

చ. 1: వేడుకకాఁడవు నీవు వెలఁదులఁ గంటేను
కూడుకవత్తువుగాని కొల్లాడవు
వోడవేపనికినైనా వోపికగలవాఁడవు
ఆడుకొంటిమిందాఁక నీ ఆయాలెరఁగక

చ. 2: పాయపువాఁడవు నీవు పడఁతులేమి చేసిన
చాయల మెత్తువుగాని చలపోరవు
యీయకొందువేమైనా నింటివాఁడవందరికి
చేయివట్టి తీసితిమి చిత్తమిదెరఁగక

చ. 3: చెల్లుబడివాఁడవు శ్రీ వెంకటేశ యింతుల
పల్లదాలకు లోఁగాని పాయవెన్నఁడు
యిల్లిదె మమ్మేలితివి యిన్నిట దయానిధివి
వల్లెవేసితిమి నీవరుసలెరఁగక

రేకు: 0185-5 గౌళ సంపుటం: 07-505

పల్లవి: ఏమని విన్నవించేము యిన్నిటాజాణవు నీవు
కామినిభావము చూచి కరుణించవయ్యా

చ. 1: తలఁపులు వలపులు తరుణిపులక లాయ
సొలసి యాసలు కనుచూపులాయను
పిలిచేటి పిలుపులు పెదవిపై నవ్వులాయ
నెలఁతభాగ్యములిఁక నీ చేతివయ్యా

చ. 2: కోరినకోరికలెల్ల గుబ్బలమెరుఁగులాయ
పైరడిఁ గరఁగులెల్లఁ జెంజెమటాయ
నేరిచిన విన్నపాలు నిండునివ్వెరగులాయ
ధీరుఁడవిన్నిపనులుఁ దెలుకోవయ్యా

చ. 3: కందువతమకములు కాఁగిటిలో రతులాయ
ముందువెనకటిచింత ముచ్చటాయను
యిందులోనె శ్రీ వెంకటేశ యింతిఁ గూడితివి
విందుల విభవముల వెలసితివయ్యా

రేకు: 0185-6 శ్రీరాగం సంపుటం: 07-506

పల్లవి: మెత్తని మనసున మేలుదాన నిదె
చిత్తగించె దయసేయవయ్యా

చ. 1: పెంచిన చిలుకలు పెక్కులు పేలీ
నంచెల నిటు మాటాడవయ్యా
పంచలకోవిల పాటలు వాడీ
కొంచక వద్దనె కూచుండవయ్యా

చ. 2: గూఁటితుమ్మిదలు గొణఁగులు గొణఁగీ
గాఁటపు నీకొంగు గప్పవయ్యా
ఆటలనెమళ్ళు అవె కేఁకరించీ
నీటునఁ గాఁగిట నించవయ్యా

చ. 3: జక్కవపులుగులు సగినాలు చెప్పీ
పెక్కురతుల ననుఁ బెనఁగవయ్యా
యిక్కువ శ్రీ వెంకటేశ కూడితివి
తొక్కిహంసలు దొలఁగకువయ్యా

రేకు: 0186-1 శ్రీరాగం సంపుటం: 07-507

పల్లవి: ఎట్టు వలపంచితివి యింతగా నన్ను
బట్టుబయటనే నీపంతమెల్లఁ జెల్లెను

చ. 1: తమకమే మీఁదమీఁద దైలువారుఁ గాని
ఆమరు నీరతిఁ దనివందదు మతి
తిమురుచు నీరపు దిష్టించి చూచీఁ గాని
తెమలి రెప్పముయ్యవు తెల్లని నాకన్నులు

చ. 2: చేరి నీతో మాటలకు సిగ్గులు వాపీఁ గాని
ఆరీతిఁ బొంది యలయవడియాసలు
మేరతో నీకాఁగిటికి మెరుఁగులెక్కీఁ గాని
బీరము మానవు నాబిరుదైన చన్నులు

చ. 3: కందువ నీకాఁగిటిలో కతలు నేరిపీఁ గాని
సందడినలయదు నాచల్లనిమేను
అంది శ్రీ వెంకటేశ నిన్నలమి మెచ్చీఁ గాని
గొందినొదుగదు నాకోరికతో గుణము

రేకు: 0186-2 ముఖారి సంపుటం: 07-508

పల్లవి: కూడితిమిందరము గుంపులాయ నీమోహము
వేడుకకు వెలలేదు వెరుపేల నీకు

చ. 1: సతమైన పనులకు చంచలము మరియాల
మతిలో నిర్మలమౌటే మంచిదౌఁగాక
గతి నీకునాపె నీవుగలిగితివాపెకును
వెతదీరెనందరికి వెరుపేల నీకు

చ. 2: చేసిన చేఁతలకును చింతించ మరియాల
ఆల భోగించుటే అందమౌఁగాక
సేస నీవు చల్లితివి చేతులు నీపైమోచె
వేసటెల్లాఁ బాసెనిఁక వెరుపేల నీకు

చ. 3: కలిగిన పనులకు కడమలు మరియాల
కొలముగా నిల్లునించుకొందువుగాక
యెలమి శ్రీ వెంకటేశ యిట్టె నన్నునేలితివి
వెలసె నీసుద్దులెల్లా వెరుపేల నీకు

రేకు: 0186-3 రామక్రియ సంపుటం: 07-509

పల్లవి: ఎంతటిమగవాఁడవు యేఁటికి నీకుఁగొంకను
చింతలేక నీయిచ్చలఁ జెలరేఁగరాదా

చ. 1: మొగము చూచిన లోలో ముసుగువెట్టుకొనేవు
చిగురుగోరిచేఁతలు చెక్కులంటెనో
నగుతా కొంగువట్టితే నంటున సిగ్గువడేవు
అగడుగా నెవ్వతైనా ఆయాలు సోఁకించెనో

చ. 2: కందువమేను ముట్టితే గందము వూసుకొనేవు
విందుల నీపులకలు వెల్లవిరయ్యీనా
మందలించి మాటాడితే మౌనాననున్నాఁడవు
యిందులో నీబుసకొట్లెరఁగ వచ్చీనా

చ. 3: చన్నుల నిన్నొత్తితే సారెసారె లోఁగేవు
అన్నిటా నీవలపులు అట్టే కాఁగీనా
మన్నించిన యలమేలు మంగనై నిన్నుఁగూడితి
సన్నల శ్రీవెంకటేశ సంతోసషములాయఁగా

రేకు: 0186-4 దేసాక్షి సంపుటం: 07-510

పల్లవి: ఏమిసేసు మరి యెక్కడ చొచ్చును
సామజవరదుని సహజమిదియ పో

చ. 1: ఏకతమాడెను యింతితోనతఁడు
దాకొని యిదేమి తప్పుటవే
కైకొనవచ్చినఁ గన్నులఁ జూచెను
యేకడనితనికి యివి నేరములా

చ. 2: నవ్వులు నవ్వెను నలినాక్షితోడ
అవ్వలనిదేమి అన్యాయమా
రవ్వగ మొక్కిన రతిఁ జెయిచాఁచెను
చివ్వన నది సేసినదోసములా

చ. 3: గక్కనఁ గూడెను కలికి దగ్గరిన
వెక్కసమిదేమి వెలితౌనా
యెక్కువ శ్రీ వెంకటేశుఁడు గూడెను
మక్కువ నలమేల్మంగనౌదునే

రేకు: 0186-5 భైరవి సంపుటం: 07-511

పల్లవి: విన్నపములెల్ల నాచే విందువుగాక
సన్నలెల్ల సరివచ్చె జాగులిఁకనేలా

చ. 1: నగినట్టివాఁడవు నాలియిఁకఁ జేయకుమీ
చిగురుమోవిచవులఁ జిక్కుదుగాని
మొగమెదుటనుందాన మోహము నీలోనున్నది
అగడాయఁ బనులెల్లననుమానాలేలా

చ. 2: మాటలాడినవాఁడవు మరిగుట్టుసేయకుమీ
యీటుగా నీమనసెల్లనిత్తువుగాని
పాటించి నీకు మొక్కితి భావము నీవెరుఁగుదు
కూటములు నెరవేరె కొంకుగొసరేలా

చ. 3: మెచ్చినట్టివాఁడవు మేకులిఁకఁ జేయకుమీ
అచ్చలాన యిక్కువలే అంటుదుగాని
యిచ్చగించి శ్రీ వెంకటేశ నన్నుఁ గూడితివి
లచ్చనలే గురుతాయ లాగవేగాలేలా

రేకు: 0186-6 గౌళ సంపుటం: 07-512

పల్లవి: నేనే యింతసులభమా నీకెపుడు
ఆనుక సరిగాఁ జూడుమాతని నన్నిపుడు

చ. 1: ఆతనిమాటలకును అడ్డమాడఁగలనా
నీతాలే బోధించేవే నీవు మాతోను
చేతులువట్టుకొంటేనే చేఁతలెల్లా మరచేనా
యేతుల నాయకునికి యిట్టె విన్నవించవే

చ. 2: చిత్తమురా తనకును సేవసేయఁగలనా
వొత్తి నన్నింత యాల వొడివట్టేవే
బత్తిసేసినంతలోనే పంతము విడుతునా
హత్తిన రమణునికి ఆయములు దెలుపవే

చ. 3: శ్రీ వెంకటేశుతోడ సిగ్గువడఁగలనా
నీవిన్నియు నాకునేల నేరిపేవే
యీవేళ నన్నిటుగూడె యెప్పుడూ మఱతునా
చేవదేర నితనికి సెలవులు వెట్టువే

రేకు: 0187-1 కేదారగౌళ సంపుటం: 07-513

పల్లవి: అందులోనే వున్నవి ఆయములెల్ల
మందలించనివాఁడవా మతకరివి

చ. 1: మన్నించే నీనాలోనొక్కమాటపట్టుకే కదా
నన్ను నిన్నుఁ జూచుకొని నవ్వితి నేఁడు
విన్నపాలిందుకుఁగాను వేగినంతాఁజేయనేల
సన్నెరఁగనివాఁడవా చతురుఁడవు

చ. 2: ఇచ్చకపు నీవు సేసే యెన్నికలకే కదా
పచ్చిచేఁతలెల్లాఁజేసి భ్రమసితిని
తచ్చితచ్చియిందులోనే తగవులఁ బెట్టునేల
మచ్చికలేనివాఁడవా మాటకారివి

చ. 3: కోరిక నీవుగూడిన కూటములకే కదా
చూరలైన రతులను చొక్కితినిట్టే
యీరీతి శ్రీవెంకటేశ యేలితివి నన్నునిట్టే
మారునితండ్రివి నీవే మండెమురాయఁడవు

రేకు: 0187-2 సాళంగనాట సంపుటం: 07-514

పల్లవి: ఆసోదకాఁడవు నీవు అయితే నౌదువుగాక
వేసటౌను కొసరితే వేమారు వలెనా

చ. 1: మోవిపంటిలోననే మోహపురసాలు నించి
వేవేలు విందులువెట్టీ వెలఁది నీకు
యీవల మమ్ముఁవిందులు యేలడిగేవప్పటిని
భావించితే మొగచాటు పైపైనే వలెనా

చ. 2: కడుమంచి చూపులనే కప్పురాలు నించి నించి
యెడయక విడేలిచ్చీ నింతి నీకు
వడి మా విడేలకే వరుఁసజేయిచాఁచేవు
విడువకైతే కారాలు వేగినంతా వలెనా

చ. 3: వింతవింతకాఁగిటను వియ్యమందెనాపె నీతో
చెంతల నవ్వులు నవ్వీ శ్రీవెంకటేశ
బంతి నన్నుఁ గూడితివి పచ్చిగాఁగ బుజ్జగించి
కాంతల చుట్టురికము కందువ గావలెనా

రేకు: 0187-3 నాదరామక్రియ సంపుటం: 07-515

పల్లవి: నీతలనే వేగెనా నెట్టుకొన్న వలపులు
యేతుల సిగ్గువడకు యింటికాడిబేరము

చ. 1: చేసెనా అంగన నీకు చేసన్నలెల్లాను
వ్రాసెనా చెక్కుల గోరివాతలెల్లాను
మూసుకొనేవేమి నేడు మొగవాఁడవిందరిలో
దోసమా నీకందుకేమి తొలుసారిలాబము

చ. 2: నేరిపెనా ఆపెనీకు నిండుకొన్న విద్యలెల్లా
సారపుమోవితీపులు చవిచూపెనా
ఆరసియుఁ గొంకనేల అన్నిటా జాణవు నీకు
భారములేదించుకంతా బండవలము నీకు

చ. 3: కూడించె యాపె నీకు గురుతైన పొంతనాలు
వీడెమిచ్చెనా యిట్టే వెల్లవిరిగా
యీడనే శ్రీ వెంకటేశ యిటు నన్నునేలితివి
ఆడనీడానొక్కవెలే అంగడిలో సరకు

రేకు: 0187-4 శంకరాభరణం సంపుటం: 07-516

పల్లవి: ఎందరు చుట్టాలు గల్లానింతకు మేలే
అందుకోలువలపులకంగవించేఁ గాక

చ. 1: బత్తిసేసీనాపె నీపై పరాకుసేయకువయ్య
చిత్తములోఁ గల మాటే చెప్పీ నీకు
హత్తినేను వద్దనుండ యందుకింత సేయనేల
సత్తుగా నే వద్దనేలా సంతోషించేఁ గాక

చ. 2: ఇచ్చకముసేసీనాపె యేల వూరకున్నాఁడవు
చెచ్చెరఁ జేసేమాటే చెప్పీ నీకు
ముచ్చట నేనెరిఁగితే మూసిదాఁచనింతయాల
మచ్చికలేమి గల్లాను మరిమెచ్చేఁ గాక

చ. 3: కలసిపెనఁగీనాపె కడమలేల పెట్టేవు
చెలిమికత్తెల సుద్ది చెప్పీ నీకు
యెలమి శ్రీ వెంకటేశ యీడనున్నఁ గూడితివి
నలువంకమేకులకు నవ్వు నవ్వేఁ గాక

రేకు: 0187-5 సామంతం సంపుటం: 07-517

పల్లవి: పంచుక అనుభవించు పడఁతులమిందరము
ముంచి నీమన్నన నాపై మోహముగలంతే

చ. 1: మనసిచ్చి నాతోను మాటాడుటే పదివేలు
యెనయుమనుచు దూరనెంతదానను
చనవు నీదొకటే సతులు పదారువేలు
పెనఁగితే నెంతవచ్చు బెరసి నావంతు

చ. 2: యిచ్చగించి నాయెదుట నిరవవుటే పదివేలు
యెచ్చరించి కొసర నేనెంతదానను
అచ్చపు నీకాఁగిలిడే అతివలు శానాశాన
ఇచ్చితివి నావంతు యెంతవచ్చునందును

చ. 3: కందువ నీరతి నన్నుఁ గలయుటే పదివేలు
యిందరిలోఁ జెప్పేనంటే యెంతదానను
విందుల శ్రీ వెంకటేశ విభుఁడవు నేమాండ్ల
మిందులో మించితి వంతుకెంత వచ్చునిపుడు

రేకు: 0187-6 కాంభోది సంపుటం: 07-518

పల్లవి: పదియారువేలు నిన్నుఁబైకొనుట యేమరుదు
మొదలనె నిన్నుఁగంటే మోహించకుందురా

చ. 1: చెక్కులకళల నిన్ను సెలవినవ్వుల నిన్ను
పక్కన నేనిటు చూచి భ్రమసితివి
చక్కనివాఁడవు తొల్లే సరి నివి గొన్నియైతే
మొక్కుచుఁ జెలులు నీకు మోహించకుందురా

చ. 2: తేనెలమాటల నిన్ను తియ్యనిమోవి నిన్ను
పూని దగ్గరినంతలో పొంగితినిదే
ఆనుక వయసువాఁడ వందుకుఁదోడివియైతే
మోనమున సతులెల్ల మోహించకుందురా

చ. 3: నేరుపురతుల నిన్ను నీటురాజసాల నిన్ను
గారవించి కాఁగలించి కరఁగితిని
యీరీతి శ్రీ వెంకటేశ యిది నీకె వన్నెవెట్టె
మోరతోపుచెలులైన మోహించకుందురా

రేకు: 0188-1 సామంతం సంపుటం: 07-519

పల్లవి: ఏమాయనే మీకునేలె చింత
యీమేరవలపులు యిమ్మడికి ముమ్మడి

చ. 1: నగవులే తగవులు నయములే ప్రియములు
జగడాలు మానినట్టి సతులకును
మిగిలి పతియున్నాఁడు మీయిద్దరినడుమను
జగతి మీవలపులు సరియె బేసి

చ. 2: మాటలే మూటలు మంతనాలే పొంతనాలు
కూటములెరిఁగినట్టి కోమలులకు
వాటముగా నిద్దరికి వరుసయిచ్చె విభుఁడు
మోట్టుపెట్టి వలపులు ముదియనాఁగాయను

చ. 3: కనుచూపులే తీపులు కరఁగులే మొరఁగులు
చనవులు గలిగిన సతులకును
యెనసె శ్రీ వెంకటేశుఁడిద్దరిని నొక్కమాటె
ననుపు వలపురెంటినడుమ మెరసెను

రేకు: 0188-2 దేసాళం సంపుటం: 07-520

పల్లవి: ఏమిచెప్పేవిఁక మాతోనెందాఁకను
మామాటలివియపో మరినేమెరఁగము

చ. 1: కూరిమియాఁటదానికి కొసరినంతాఁ జెల్లు
ఆరసి యింకానేమి ఆడేవయ్యా
నేరుపు నీకుఁ గలితే నావాపెకు లోనౌట
యేరీతి మాటాడినా యింకానేమెరఁగము

చ. 2: పాయపువనితకును పచ్చివలపెల్లాఁ జెల్లు
చేయివట్టి యిఁకనేమి చెప్పేవయ్యా
నాయమే నడపితేను నగుతా సమ్మతించుట
మాయపు కతలకెల్ల మరినేమెరఁగము

చ. 3: చక్కనియింతికి మరి సాదించినట్టే చెల్లు
పెక్కుసుద్దులిఁకనేల పెంచేవయ్యా
గక్కన శ్రీ వెంకటేశ కలసితిరిద్దరును
మక్కళించి విన్నపాలు మరినేమెరఁగము

రేకు: 0188-3 రామక్రియ సంపుటం: 07-521

పల్లవి: ఆతఁడు జాణగాఁబట్టి అట్టేలోనికిఁ దీసి
యేతులెల్లాఁ జెల్లఁబెట్టె నేమి సేసేవే

చ. 1: చనవున నాయకుఁడు సరిఁ జన్నులంటితేను
పెనఁగి తిట్టుదురటే ప్రియురాలవు
గునియఁగానిందరిలో గురుతులు మోఁచితేను
యెనలేదప్పుడు సిగ్గు యేమి సేసేవే

చ. 2: కూరిమితో రమణుఁడు కొప్పువట్టి తగిలితే
గోరున గీఁటుదువటే గుణనిధివి
ఆరసి చూచితే పయ్యెదకొంగు జారితేను
యేరీతినుండునో సిగ్గుయేమి సేసేవే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడితేను
కావించి మీరుదురటే కలదానవు
మోవిగంటి సేసితివి ముద్రలు నిన్నంటెనిట్టే
యీవేళ సిగ్గులకు నీవేమి సేసేవే

రేకు: 0188-4 మధ్యమావతి సంపుటం: 07-522

పల్లవి: రావయ్య నీకేల యింత రామలతో బాసలు
భావించి నిన్నుఁజూచితే పై కొనకవుందురా

చ. 1: వుండుండి బూమివారెల్లా వూరకే నీకన్నులను
పుండరీకములనిట్టే పోలునందురు
కొండవలె నీవునేఁడు గొల్లెతలనంటఁగాను
అండనె నీపై నిందలాడకుందురా

చ. 2: యింతలో నల్లనుండఁగ యిందరు నీతిరుమేను
పొంతనట్టే నీలాద్రిఁ బోలునందురు
వింతగా చీఁకటిలోన వెన్నలు దొంగిలు నిన్ను
యెంతైనా నల్లఁదెల్లలు యెంచకుందురా

చ. 3: శ్రీ వెంకటేశుఁడ నీచేతిశంఖచక్రాలు
పూవుగుత్తుల చన్నులఁ బోలునందురు
కావించి మావంటివారిఁ గాఁగిలించి కూడితివి
చేవదేరె నిన్నురట్టు సేయకుందురా

రేకు: 0188-4 లలిత సంపుటం: 07-523

పల్లవి: దానికేమి దోసమా తగులములెంచుకొని
తానకమై లోలోనే తప్పక మించితివి

చ. 1: యింతి నీతో బలిమా యెదురాడఁగలదా
చెంతల నీవుండఁగాను చెయి వట్టెను
పంతగాఁడవౌదువు పడఁతికంటాఁ దొల్లి
దొంతరలైతే వలపులు తోయరాకున్నాఁడవు

చ. 2: కోపమింకఁ దగునా కోమలి చలాలదా
కోపుల నీవు నవ్వఁగా గోరగీరెను
తీపులు నేరుతువు దిక్కులెల్లానెరుఁగును
పూఁపలు చన్నులుగాఁగా పొందులుసేసితివి

చ. 3: గుట్టు నీకుఁజేసునా గురుతులు వెట్టునా
యిట్టె నీవుగూడఁగాను యెనసెఁగాక
దిట్టువు నీవౌదువు తేఁకువ శ్రీ వెంకటేశ
పట్టిన వ్రతముగాఁగా పైకొని మెచ్చితివి

రేకు: 0188-5 మంగళకౌశిక సంపుటం: 07-524

పల్లవి: నిజమై ఆతఁడు వచ్చి నిలుచున్నాఁడెదుటను
త్రిజగములును మెచ్చ దిష్టమాయఁ బనులు

చ. 1: లక్కవంటి నాచిత్తాన లచ్చనై ఆతనిరూపు
వొక్కటైవున్నదినేఁడు వొక్కటొక్కటే
యిక్కువ మామోముచూచి యేమినవ్వేరే చెలులు
చిక్కె మాకిద్దరికి మీచేసినట్టి పొందులు

చ. 2: పూవువంటినాకోరిక పూఁపవంటాతనిమాట
తావుకొనివున్నవిలే తమలోనను
యీవల మాగుణాలకు నేమి మెచ్చేరే మీరు
దీవించి మీరిట్టె దిద్దిన దిద్దుబడులు

చ. 3: పాలవంటినాయాస పంచదారాతనిమోవి
తాలిమిఁగూడి వలపుద్దై వారీని
యీలోన శ్రీ వెంకటేశుఁడిచ్చగించి నన్నుఁగూడె
మేలనేరు యిదిమీరు మీసంతోసములే

రేకు: 0189-1 శంకరాభరణం సంపుటం: 07-525

పల్లవి: ఆఁటదానఁ గనక నిన్నంటి నేను
గాఁటపు దేవరవింకఁ గరుణించవయ్యా

చ. 1: మనసు దెలియలేక మరి నేఁ దమకించితి
ఘనుఁడవు నీవొళ్ళఁ గడమున్నదా
వెనకటిసుద్దులకు వేవేల వెంగేలాడితి
నినుపునిజమరివి నీకుఁ దప్పులున్నవా

చ. 2: వలపు నాపైనుండఁగ వట్టినేరములెంచితి
చెలువుఁడవు నన్ను రక్షించకుందువా
చలములకే నీతో సారెసారెఁ బెనఁగితి
పలుకుపంతగాఁడవు పాడిదప్పేవా

చ. 3: చేయి నీవు చాఁచఁగాను చెక్కుగోరు దాఁకించితి
ఆయములు నీవెరఁగనట్టివున్నవా
పాయపు శ్రీ వెంకటేశ పైపైనన్నుఁగూడితివి
దాయగాఁడవు నన్నిట్టే దరిచేర్చవా

రేకు: 0189-2 ముఖారి సంపుటం: 07-526

పల్లవి: కలికి చిలుకలకొలికి నీకునేము
చెలులముసంతోసము చేసితివే మాకు

చ. 1: అవ్వలిమోమైనవాని ఆయములు సోఁకనాడి
యివ్వల చేకొంటివిదివో నేర్పు
పవ్వళించి సతులపై పరాకై వుండినవేళ
నవ్వులు నవ్వించితివి నయగారివౌదువే

చ. 2: పంతములాడినవాని పానుపుమీఁదికి నేఁడు
యింతగా రప్పించుకొంటివిదివోనేర్పు
చెంతల నవ్వఁగా నన్నుచేరి జూజమాడేవేళ
వింతరతికిఁ దీసితి వివరి వౌదువే

చ. 3: సన్నలు సేసినవాని చాయఁ బైఁదీసుకొని
యెన్నిక చేకొంటివిదివో నేర్పు
అన్నిటా శ్రీ వెంకటేశుఁడాతఁడు చేకొన్నవేళ
మన్ననల మించితివి మంచిదానవౌదువే

రేకు: 0189-3 దేసాక్షి సంపుటం: 07-527

పల్లవి: చెలులమెందాఁక నీకు చెప్పేము బుద్ధి
నిలుచుకున్నది యింతి నీరాకకెదురు

చ. 1: పలికితివాకెతోడ పంచమవేదములు
తలఁచుకోవయ్య నీవు తగులాయాలు
పిలిచితిమిదే నిన్ను ప్రియమెల్లాఁ జెప్పితిమి
తెలుకోవయ్య యిట్టె తేనెమోవితీపులు

చ. 2: కురిసితివి నవ్వుల గురిగాఁబువ్వులవాన
కరఁగుకోవయ్య లోలో గట్టిమనసు
మరిగించితివి మరి మచ్చికలు సేసితివి
వొరసుకోవయ్య చన్నులొగిఁ బైఁడికుండలు

చ. 3: పెట్టితివి చూపులనే పెనకప్పురవీడేలు
మెట్టురయ్య పాదములు మీరు మీలోన
యిట్టె శ్రీ వెంకటేశ యిద్దరిఁ గూరిచితిమి
జట్టిగొనవయ్య నీవు సరసపురతులు

రేకు: 0189-4 గౌళ సంపుటం: 07-528

పల్లవి: ఇందవయ్య్య విడెము యేలకొంకేవు
సందుకొని మెచ్చేఁ గాక జంకించేనా

చ. 1: తాలిమిగలదొకతె తగ నీతోనలిగితే
యీలీల మోహించి నేమింతకోపేమా
నాలిక త్తెలమ్మై నేము నవ్వనేర్తుముగాక
వీలుచును మొగమోట విడువఁగఁగలమా

చ. 2: గుట్టుచేసి వేరొక్కతె కొసరి నిన్నుఁ దిట్టితే
యిట్టె మన్ననలవారమింతకోపేమా
దట్టించి నీబాసలెల్లఁ దలఁపించనేర్తుఁ గాక
వెట్టుయ్యైన నిష్టూరము వేయఁగనోపుదుమా

చ. 3: కూడేవేళ యెవ్వతైన గోరనిన్ను గీరితేను
యీడవెట్టుకొని నేము యింతకోపేమా
కూడితి శ్రీవెంకటేశ గురుతులివేకాక
పాడిపంతములు నీతోఁ బచరించేమా

రేకు: 0189-5 దేసాళం సంపుటం: 07-529

పల్లవి: ఎందరికిని వుత్తరమిచ్చేవు నీవు
సందడించి వొక్కమాటే చల్లేరు సరసము

చ. 1: చెంతలనుండి నీవు సెలవుస నవ్వఁగాను
కాంత నీమొగముచూచి కన్నులార్చీని
వింతలు మీచేతలెల్లా వెలఁదులు చూచి తాము
దొంతిఁబెట్టి వలపులు తోడురేచుకొనిరి

చ. 2: పలుమారు నీమీఁదిపాటలు నీవు వాడఁగ
వెలఁది వీనుల విని వెరగందీని
కొలువువారెల్ల మీగురుతులు చూచి తాము
చలపట్టి అందరును చవిరేచుకొనిరి

చ. 3: శ్రీ వెంకటేశ రతికి చేతులు నీవు చాఁచఁగ
కావించి నిన్నునదిమీ కాంతచన్నుల
వోపరిలోనుండఁగాను వూడిగాలవారెల్ల
సేవలుచేసి మొక్కి చిమ్మిరేచుకొనిరి

రేకు: 0189-6 భైరవి సంపుటం: 07-530

పల్లవి: వట్టి సిగ్గులిఁకనేల వద్దనున్నది
గట్టియాస నీపనులు కడపరాయ

చ. 1: ముంగిట నీకుపారము మోవితేనెలిటు చూపి
యెంగిలివలపుచల్లెనిదివో ఆకె
సింగారించుక చన్నులజిగి నీమొకముసేసి
అంగడివలపు చల్లెనదివో నీకు

చ. 2: కువాడానఁ జెప్పరాని గురుతు కన్నులఁ జెప్పి
నివాళివలపుచల్లె నీమీఁద నాకె
భవంతిమేడలో నిన్నుఁ బారితెంచి కాఁగలించి
దువాళివలపు చల్లె తొయ్యలి నీకు

చ. 3: పంతాన నీవు మెచ్చ వుపరిసురతముసేసి
దొంతవలపుచల్లె దొరసి యాపె
యింతలో శ్రీ వెంకటాద్రినెనసితివిటు నన్ను
బంతివలపులుచల్లె పయిపయి నీకు

రేకు: 0190-1 రామక్రియ సంపుటం: 07-531

పల్లవి: ఒంటి నీకెదురుచూచి వుందాన నేనింటిలోన
వెంటవెంటఁ దిరిగాడి వేరించనేరను

చ. 1: సిగ్గున నుందానఁ జుమ్మీ చెలువుఁడ నీవు నాతో
నిగ్గుల మాటాడి ప్రేమ నించుదాఁకాను
యెగ్గులేక నీకు మీఁదెత్తితి జవ్వనమెల్లా
వెగ్గళపు విన్నపాలు వేరే సేయనేరను

చ. 2: నవ్వుతానుందానఁ జుమ్మీ నాలోనియాసతో నీవు
చివ్వన తలయెత్తి చూచినదాఁకాను
యివ్వల కానుకిచ్చితి విట్టే చక్కఁదనమెల్లా
రవ్వగాఁ గొరి నిన్ను రాఁపుసేయనేరను

చ. 3: ఆసలనుందానఁ జుమ్మీ అట్టె శ్రీ వెంకటేశ
నీసరి నేఁడు గూడి మన్నించుదాఁకాను
వాసుల నీకందిచ్చితి వన్నెల నామనసెల్లా
సేసవెట్టితివి మరి చింతించనేరను

రేకు: 0190-2 బౌళి సంపుటం: 07-532

పల్లవి: వీడెమింద కోపయ్యు వింతవారమా
వేడుకకు వెలలేదు వెరుపేల నీకు

చ. 1: కొండవంటిచెలి నిన్ను కొంగువట్టి తీసితేను
దండిమొగమోటమునఁ దగిలితివి
దుండగపువాఁడవా దోసము నీవల్లనేది
నిండినది తగవె పోనీకేల వెరపు

చ. 2: పొద్దువోనియాపె నీపై బొమ్మలమేలు చల్లితే
గద్దించఁజాలక నీవుగైకొంటివి
దిద్దరానివాఁడవా దీనికి వచ్చినదేది
కద్దు నీవొళ్ళు నిజము కాదున నీకు వెరపు

చ. 3: ఆయమెరిఁగినతి అంటితేఁ గడపలోన
పాయపువెంకటేశ పట్టి కూడితి
కాయకపువాఁడవా కైకొంటివి నన్నునిట్టే
నీయందుఁ గడమేది నీకేల వెరపు

రేకు: 0190-3 మాళవి సంపుటం: 07-533

పల్లవి: ఇంతసేతురటవే యీతని నేఁడు
వింతలు మామాటలివి వినవే వోచెలియా

చ. 1: పంతమాడుకొనరాదువ పతితోడ సతికిని
అంతరంగమెరిఁగిచ్చలాడుటగాని
దొంతులు వెట్టఁగరాదు తోడుతనే చలములు
కొంత వినయాన వంచుకొనవలెఁ గాని

చ. 2: వాసికిఁ బెనఁగరాదు వద్దనున్న నాయకుని
మోసలేక మెప్పించి మొక్కుటగాని
ఆసలు మానుపరాదు ఆయాలు సోఁకినవేళ
సేసవెట్టి తనివంద చెందవలెఁగాని

చ. 3: కాదుగూడదనరాదు కాఁగిట శ్రీ వెంకటేశు
నాదరించి సరసములాడుటగాని
పోదితోనాతఁడె నిన్ను భోగించె కడమలేదు
పాదుకొన్న తమకము పంచుకొంటగాని

రేకు: 0190-4 రామక్రియ సంపుటం: 07-534

పల్లవి: చేకొనుమీ నల్లఁబల్లి చెన్నకేశవా
యీకడ నీ కిన్నిటికినిదవో మొక్కేను

చ. 1: పొంచి నీవు విలిచితే బొమ్మల జంకించితిని
మంచముపై నుండితిని మన్ననలను
కంచముపొత్తుకుఁ దియ్యఁగా నీతోఁ బెనఁగితి
యెంచకుమీ యీనేరాలిదివో మొక్కేను

చ. 2: సరసము నీవాడితే సారెసారెఁ దిట్టితిని
సిరులఁ జెనకితేనే చెలఁగితిని
శిరసు వంచుకొంటిని చెరఁగు నీవు వట్టితే
యెరవుసేయకు నన్నునిదివో మొక్కేను

చ. 3: సెలవి నీవు నవ్వితే సిగ్గులు పైఁజల్లితిని
సొలసి చెక్కు నొక్కితే చొక్కితి నేను
కలసితివిదె శ్రీవెంకటగిరినుండి వచ్చి
యెలమిఁ దమకించకు యిదివో మొక్కేను

రేకు: 0190-5 నారణి సంపుటం: 07-535

పల్లవి: గుణము దెలిసెనంటా గుబ్బున నున్నాఁడతఁడు
అని వెట్టి మమ్ము మాటలాడించేవే నీవు

చ. 1: చెక్కునఁ బెట్టినచేయి సిగ్గులే వడియఁజొచ్చె
యెక్కువపతిఁ జెనకేదెపుడే యిఁక
ముక్కునఁ బెట్టినవేలు ముసిముసి నవ్వులూరీ
మక్కళించి నీవాడే మాటలెప్పుడే

చ. 2: తప్పక చూచినచూపు తలపోఁతలే పెంచీ
కప్పురబాగాలిచ్చే గతులెప్పుడే
కప్పిన పయ్యదకొంగు కమ్మఁజెమటలుబ్బించీ
విప్పుచు మోవితేనెవిందులు వెట్టేదెవుడే

చ. 3: మంచముపై నున్నకేలు మర్మములెల్లానెత్తిచ్చీ
నించిన రతులలోని నేరుపెప్పుడే
యెంచుక శ్రీవెంకటేశునింతలోనఁ గూడితివి
చుంచుల సరసముల సుద్దులెప్పుడే

రేకు: 0190-6 దేసాక్షి సంపుటం: 07-536

పల్లవి: మామాట విని నీవు మచ్చికలు దైవార
ఆముకొని పతిమేను అంటంగరాదా

చ. 1: మనసు నమ్మినయందు మతకాలెంచఁగనేల
చనవు గలిగినందు జరయనేలా
కినుకలు లేనియందు కేరడము మరియాల
పెనఁగక పతినిట్టే పిలువరాదా

చ. 2: చేతికి లోనైనయందు సిగ్గులువడఁగనేల
బీతి విడిచినయందు బీరములేల
యేతులు నెరపనందు యెగ్గులు దలఁచనేల
జాతి నీనవ్వులు మీఁదఁ జల్లరాదా

చ. 3: కప్పురవీడేలందు కాఁకలు చల్లఁగనేల
చిప్పిలు రతులయందు చింతించనేల
యిప్పుడే శ్రీవెంకటేశుఁడీతఁడిదె నిన్నుఁగూడె
దప్పిదీర మోవియిచ్చి తనివందరాదా

రేకు: 0191-1 శుద్ధవసంతం సంపుటం: 07-537

పల్లవి: కరుణించవయ్య యిఁక కడు జాణవౌదువు
వొరసేరింతులు పొదటూరిచెన్నరాయా

చ. 1: దగ్గరి కొలనిదరి తరుణులెల్లాఁగూడి
సిగ్గులఁ జాఁచేరదివో చేతులు నీపై
వెగ్గళించి కన్నుల వెడనవ్వులు నవ్వుతా
వొగ్గేరు వలపు పొదటూరిచెన్నరాయా

చ. 2: తొల్లి నోఁచిననోములు తోడనిట్టే పలియించె
వల్లెగా నీపొందులకు వచ్చివున్నారు
చల్లలమ్మేమాటలనే సరసములాడేరు
వుల్లములలర పొదటూరిచెన్నరాయా

చ. 3: చీరలు నీవియ్యఁగాను చేకొని కాఁగలించిరి
మేరతో శ్రీ వెంకటాద్రిమీఁదనే నిన్ను
గారవించి యిందునందు కందువలు మెరసిరి
వూరటగా నీకుఁ బొదటూరిచెన్నరాయా

రేకు: 0191-2 వరాళి సంపుటం: 07-538

పల్లవి: కాదు గూడదననేల కక్కసించ నీతోనేల
సేదదేర నేర్చినట్టు సేవ సేసేను

చ. 1: ఆపెకు బుద్దులుచెప్పి అట్టెనాకు మొక్కించి
యేపుననున్నాఁడ విట్టె యెరఁగనట్టే
కోపగించుకొనరాదు కోరి నీతో నవ్వరాదు
వోపినపనిసేసి వొద్దనుండే నేను

చ. 2: కామినికి సన్నసేసి కానిక నాకిప్పించి
యేమియని అడిగేవు యెరఁగనట్టే
మోమోట విడువరాదున మొక్కలముసేయరాదు
గోమున నీకొలువులో కుంచ వేసే నేను

చ. 3: యింతిచే విడెమిప్పించి యెగ్గులెల్లాఁ దీర్చితివి
యెంతకెంత సేసితివి యెరఁగనట్టే
కాంతుఁడ శ్రీ వెంకటేశ కలసితివిటు నన్ను
పంతానకు నీకునేఁడు పాదాలొత్తే నేను

రేకు: 0191-3 హిజ్జిజి సంపుటం: 07-539

పల్లవి: ఎంతకెంత విచారములేమున్నవి
పొంతల నేము చేసిన పుణ్యమిదిగాక

చ. 1: మరిగినదాన నే మాటల దూరితిఁ గాక
దొరవు కోపములు నీతోఁ జెల్లునా
తెరమరుఁగింతె నీవు తెలియనిదేమున్నది
పొరసి నేము సేసిన పుణ్యమిదిగాక

చ. 2: పాయపుదాననై పదరి అంటితిఁ గాక
చాయకాఁడవు నీతో సలిగెల నా
నాయములెంచి చూచితే నాకు నీకు భేదమేది
పోయినరాత్రి సేసిన పుణ్యమిది గాక

చ. 3: మనసులోదాననై మర్మములు రేఁచితిఁగాక
చెనకి నీమేను పచ్చిసేయఁదగునా
ఘనుఁడ శ్రీ వెంకటేశ కలసితిమిద్దరము
పొనుఁగక నేఁజేసిన పుణ్యమిదిగాక

రేకు: 0191-4 మంగళకౌశిక సంపుటం: 07-540

పల్లవి: పొంచి నే వారికినెల్లాబుద్ది చెప్పేను
యెంచరానిమాటాడేవారెవ్వరయ్యా నిన్నును

చ. 1: చేరి నిన్నునాపెచూచి చిత్తములో గురి దాఁకె
సారెనిఁక మరేల విచారించేవు
చేరువ నేనున్నదాన చేతిలోనిదాననింతే
యీరసానఁ గాదనేవారెవ్వరయ్యా నిన్నును

చ. 2: నవ్వేవారెల్లా నవ్విరి ననుపు నీకంతనాయ
నివ్వటిల్ల నీకు వట్టి నేమములేలా
ముప్వంక నీచేఁతలెల్ల మూసి దాఁచేదాననింతే
యివ్వలరట్టు సేసేవారెవ్వరయ్యా నిన్నును

చ. 3: వూడిగము నేఁజేసితి వొద్దనున్నఁ గూడితివి
వేడుకతోనిందుకెంత వెరగందేవు
పాడితో శ్రీ వెంకటేశ పట్టపుదేవిని నేను
యీడఁ దప్పునవట్టేటి వారెవ్వరయ్యా నిన్నును

రేకు: 0191-5 పాడి సంపుటం: 07-541

పల్లవి: ఎందు వోయ నేనీకు యెప్పుడు గలదాననే
కందువ వింతవారి గక్కనఁ జూడరాదా

చ. 1: ప్రియములు చెప్పఁగాని బిగియఁగ నేనోప
నయములే కాని జంకెనలకునోప
దయఁజూడు నన్ను నీవు తగిలి యాల పట్టేవు
క్రియెరిఁగినదానిపైఁ గేలు చాఁచరాదా

చ. 2: మచ్చిక చల్లేఁగాని మంకుఁదనమునకోప
యిచ్చకమే కాని వట్టియెగ్గులకోప
వచ్చినట్టే రమ్మా నన్ను వద్దికేల పిలిచేవు
మెచ్చినట్టివారితోనే మేలమాడరాదా

చ. 3: యేకతానఁ గూడేఁగాని యెరవుసేయఁగనోప
పైకొని మొక్కేఁగాని పంతానకోప
యీకడఁ బొందితివి నన్నింతలో శ్రీవేంకటేశ
నాకొరకునందరితో నవ్వు నవ్వరాదా

రేకు: 0191-6 ముఖారి సంపుటం: 07-542

పల్లవి: ఇప్పటి కక్కూరితికినెంత సేసేనే
కప్పుక వున్నారందరు కాఁతాళించరా

చ. 1: యేమిటికిఁ దారుకాణలెరిఁగిన పనులకు
కామించి తానెరఁగని కల్లలున్నవా
వాములై పెండ్లికూఁతుర్లు వద్దనే కాచుకున్నారు
వోముచుఁ దానిట్లంటే వోరుతురా వారు

చ. 2: అంతేసేలే ఆనలందరికిఁ గలదే
చెంతలఁ దాఁజేయనిచేఁతలాడేరా
కాంతలిందరును నిదే కనుపెట్టుకున్నవారు
యింతకుఁ దాఁజొచ్చితేను యెగ్గుపట్టరా

చ. 3: కమ్మటిఁ బెనఁగనేలే కాఁగిటఁ గూడితిమిదే
యెమ్మెతో శ్రీ వెంకటేశుఁడిఁక మానీనా
పమ్మి తనమేలువారు పైపైనే వున్నారు
నమ్మించినయందుకెల్లా నవ్వుకోపరా

రేకు: 0192-1 వరాళి సంపుటం: 07-543

పల్లవి: నన్నేమి వొగడీనే నాథుఁడు తాను
యెన్నికెలెంచి చూచితే యింతాఁ దానె కాఁడా

చ. 1: పాయము నామేనిమీఁదఁ బచరించుచున్నది గాని
ఆయమై వుండినవాఁడంతాఁ దానే
చాయల సన్నలచేత జడిసివుందానఁ గాని
చేయిమీఁదైనవాఁడు చేరి తానే కాఁడా

చ. 2: చెంతల నాసిగ్గులెల్లా చెలరేఁగున్నవి గాని
అంతరంగములో వాఁడంతాఁ దానే
కాంతుల నామొగమున కళలిట్టే నిండెఁ గాని
యింతనాచక్కఁదనాలకేలిక దాఁ గాఁడా

చ. 3: మంచితనమెల్లా నామాటలనున్నది గాని
అంచెలనందలి యర్థమంతాఁ దానే
కొంచక నన్నుఁ గలసే కోరికలు నావి గాని
మించి శ్రీ వెంకటేశుఁడుక మేలు దానే కాఁడా

రేకు: 0192-2 ముఖారి సంపుటం: 07-544

పల్లవి: వెరవు విచారించుకొంటే వేగిరించేవు
యెరవేది యిందునాపె యేమిసేసునయ్యా

చ. 1: జగడములెల్లాఁ దీరె సరసములాడితేను
నగితే కోపములేదు ననుపాయను
వెగటుఁగాఁతాళాలు వీడెను విడెమిచ్చితే
యెగసక్యమేది యింతి యేమిసేసునయ్యా

చ. 2: మఱఁగులెల్లాఁబాసె మాట్టపలుకాడితేను
మఱచితేఁబగలేదు మనసిచ్చెను
కొఱకొఱలెల్లఁ దీరె కొచ్చికొచ్చిచూచితేను
యెఱఁగనిదేది యింతి యేమిసేసునయ్యా

చ. 3: మచ్చరమింతా మానె మరి వద్దఁ గూచుండితే
లచ్చనంటితేఁ గొంకదు లాగాయను
పచ్చిదేరే శ్రీవెంకటపతినాపె గలసితే
యెచ్చుకుందులేవి యింతి యేమిసేసునయ్యా

రేకు: 0192-3 శ్రీరాగం సంపుటం: 07-545

పల్లవి: అందరిలో నీవౌఁగదవే
అందితివి పదవులౌఁగదవే

చ. 1: చతురతఁ దెరలోసందించినవా
రతఁడును నీవును నౌఁగదవే
కతలు చెప్పుతా గయ్యాళించితి
పతివెవు నీవే యౌఁగదవే

చ. 2: తప్పక యింటిలోఁ దమ్ములముమిసితి
రప్పసము మీరె యౌఁగదవే
ముప్పిరి నగితివి మునుపన యేఁటికొ
అప్పుడు నీవే యౌఁగదవే

చ. 3: మక్కువ నునిటు మన్నింపించితి
వక్కరొ నీవే యౌఁగదవే
వెక్కసముగ శ్రీ వెంకటేశ్వరుని
యక్కున నిలిచితి వవుఁగదవే

రేకు: 0192-4 కన్నడగౌళ సంపుటం: 07-546

పల్లవి: వలచినదానఁ దొల్లే వడి మనసు మెత్తన
నిలువునఁ గరఁగుదు నీకొరకేపొద్దును

చ. 1: చెమ్మగిలీ దేహమెల్లా చేతుల నీవంటితేనే
వుమ్మడినించుకవడి వుండరా నీవు
దిమ్మరేఁగీ నిట్టూర్పు దిట్టించి నీవు చూచితె
కమ్మిక నీపచ్చడము కప్పరా నాకు

చ. 2: చెక్కులెల్లాఁ బులకించె సిగ్గులు మోవనాడితే
వొక్కరీతిఁ గొంతవడి వుండరా నీవు
లక్కవంటిది నాగుండె లలిమీరీ నీసుద్దుల
యిక్కువకు వచ్చి చనవియ్యరా నాకు

చ. 3: కన్నులనే చొక్కుదేరీ కాఁగిట నన్నుఁ గూడితే
వున్నవేమిఁ దడవక వుండరా నీవు
యెన్నిక శ్రీ వెంకటేశ యియ్యకొంటి పనులెల్ల
మిన్నక నీగందమిట్టె మెత్తరా నాకు

రేకు: 0192-5 భైరవి సంపుటం: 07-547

పల్లవి: ఆనతియ్యవయ్యా నీయప్పణ గావలె నాకు
కానుకింద నిమ్మపండు కందువయేదిఁకను

చ. 1: చనవుగలాపె నీసంగడిఁ గూచున్నది
మనవిగలాపె నీతో మాట చెప్పని
ననుపుగలాపె సారె నవ్వులు నవ్వీనిడె
వొాసర నేఁజేసేటి వూడిగమేదిఁకను

చ. 2: పంతము గలాపె నీతో పలుమారు బింకమాడీ
చింత గలిగగినయాపె చేయి చాఁచీని
వంతు గలిగినయాపె వరుసకు వచ్చున్నది
బంతినున్నదాన నాకుఁ బనియేదిఁకను

చ. 3: వాసిగల్గినయాపె వన్నెతో మొగము చూచీ
ఆసగలిగినయాపె ఆయాలంటీని
యీసరినే శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
నేస చల్లితివి నాకు సేవ యేఁటిదిఁకను

రేకు: 0192-6 కాంభోది సంపుటం: 07-548

పల్లవి: మంకులెల్లఁ బనిలేదే మాపుదాఁకాన
యింకాఁ దనకే మోహించేనేమిసేతునే

చ. 1: ఆడఁబోతే మాటలలో ఆతఁడే తొరలి వచ్చీ
చూడఁబోతే గురియై చూపులలోన
వేడుకకాఁడు గనక విభునికింతాఁ జెల్లు
యేడఁ జూచినాఁ దానే యేమిసేతునే

చ. 2: సారెకు నవ్వఁగఁబోతే సరసమాతని మోచీ
నేరఁబోతే తనచేఁతే నిండుకొనీని
పేరుకల దొర తాను ప్రియమైనట్టు నడచు
యేరులాయ గోరికొన యేమిసేతునే

చ. 3: చేతికొనవట్టితేనే శ్రీ వెంకటేశుఁడే వచ్చి
కాతరించితే రతులఁ గలనె నేఁడు
పోతరించున్నాఁడు తాను పొందులుసేసినవెల్లా
యేతులునెమ్మెలునాయనేమిసేతునే

రేకు: 0193-1 కేదారగౌళ సంపుటం: 07-549

పల్లవి: వొడఁబరచఁగనేలే వొద్దే యిఁక
కడునైతే చవిగాదూ కానరాదా మీకు

చ. 1: చలము లేకున్నఁ జాలుసంతోసమే పనులెల్ల
చెలిమికత్తెలు మీరు చెప్పరే బుద్ధి
తలఁపు లేశములైతే తనమాటె నామాట
తెలుసునో తెలియదో దిష్టిములిందరికి

చ. 2: వేసట లేకున్నఁ జాలు వేడుకలే పొందులెల్ల
గాసిఁబెట్టి యిఁకనట్టే కానీ లేరే
ఆసలు గలిగితే అన్నిటాఁ దానే నేను
యీసుగద్దొలేదొ మీరె యెంచుకొరే యిందును

చ. 3: యెఱుక గలిగితేఁ జాలు యియ్యకోరె వలపెల్ల
మఱఁగులు వాపితిరి మంచిదాయనే
మఱి శ్రీ వెంకటేశుఁడు మన్నించి యిటు గూడె
గుఱిగా మీమనసులఁ గోరినట్టే ఆయనే

రేకు: 0193-2 కాంభోది సంపుటం: 07-550

పల్లవి: చెల్లు నీకు నిఁక నీ చేతఁ జిక్కె వలపు
యెల్లవారమును నిన్ను యిఁక దూరేమా

చ. 1: చేసిన చేఁతల కెల్ల శికర మెత్తిన యట్టు
యీసతి వంచిన శిరసెత్తెఁగా నీకు
వేసారని సిగ్గులగు వెరపి వెట్టినయట్టు
మూసిన మోవి పై నాపె ముద్రవెట్టెఁగా

చ. 2: సంగడి కోరికలకు సఫలమైనయట్టు
వుంగిటిఁ గుచాల నాపె వొత్తెఁగా నిన్ను
కంగులేని నీ గుణాలు కవిలెల వ్రాసినట్టు
అంగమెల్ల గోర గీరి అంటెఁగా నిన్ను

చ. 3: కూడిన కూటములెల్ల కోటికొండలైనట్టు
నీడలుగాఁ బులకలు నించెఁగా ఆపె
యీడనె మావాఁడవైతివిప్పుడె శ్రీ వెంకటేశ
వోడఁగట్టిన దూలమై వొద్దనాపె వుండెఁగా

రేకు: 0193-3 గౌళ సంపుటం: 07-551

పల్లవి: మాపుదాఁకా నమర నీ మాయలేలా
వీఁపు గానరాఁగా దాఁగే విధములేలా

చ. 1: వాడుదేరీ మోమని వలసి నేనడిగితే
యేడలేని మాటలేల యెన్నికలేల
నీడకు నిన్నుఁదీసితే నిలువుఁ జెమటలకు
వీడెపుఁ జొక్కుమందులు వేమారునేలా

చ. 2: పచ్చిదేరే నీ మేను భావించి నేఁజూచితేను
యిచ్చకాలు సేయనేల యింతలో నీకు
వెచ్చనిమేనిపైఁ జెయివేసి నిన్ను నవ్వితేను
బచ్చెన మాటలేల పరాకులెలా

చ. 3: కన్నెలు నీవద్దివారు ఘనుఁడవు నీవంటే
కన్నుల తేలింపులేల కరఁగులేలా
యిన్నిటా శ్రీవేంకటేశ యెనసి నేమొక్కితేను
వన్నెల నింతేసి పరవశములేలా

రేకు: 0193-4 నాదరామక్రియ సంపుటం: 07-552

పల్లవి: ఇంతకంటే నేరము యెపుడు నీవారము
వంతుల మాచన్నులకు వాఁడి వచ్చెనిపుడు

చ. 1: జగడించేవారికెల్లా సారెసారె వెంగెములు
తగులై నవారికైతే తమకములు
మొగమేమి చూచేవు మొరఁగులు మరఁగులు
చిగురుమోవిమాట చేఁగలెక్కెనిపుడు

చ. 2: అలిగినవారికెల్లా అసురులు నుసురులు
కలసినవారికైతే కడుమేలాలు
వలుపేమి లోఁచేవు వలరాజుబాణాలైన
తెలిఁగన్నుల చూపులు తేటలెక్కె నిపుడు

చ. 3: పెనఁగేటి వారికెల్లా పెచ్చురేఁగుఁ జెమటలు
తనిసినవారికైతే దగదొట్టును
మనసేమి దెలిసేవు మచ్చిక శ్రీ వెంకటేశ
యెనసితిమి యాసలు యెదురెక్కెనిపుడు

రేకు: 0193-5 హిజ్జిజి సంపుటం: 07-553

పల్లవి: అప్పటినుండియు విభుఁడట్టె తప్పక చూచీ
యిప్పుడిట్టె రాఁగదవె యియ్యకొన్నదానవు

చ. 1: చిత్తము పతికినిచ్చి సిగ్గులువడఁగనేలె
పొత్తుకు రమ్మనీ వలపుల నాతఁడు
కొత్తగాఁ బొందుసేసేవా కొంగువట్టి తీసితేను
వుత్తరువేమి చెప్పవే వూరకున్నదానవు

చ. 2: యింటిలోననే వుండి యింకా మరఁగులేలే
అంటి పానుపుపైకి రమ్మనీ నాతఁడు
జంటలు నేఁడాయనా సత్తువలఁ బెనఁగితే
వొంటి నట్టే వుండఁగదే వొడఁబడ్డదానవు

చ. 3: కలసి కాఁగిటఁ గూడి కన్నుల జంకెనలేలే
యెలయించీ శ్రీ వేంకటేశుఁడాతఁడు
చలములు యిఁకఁగద్దా చన్నులుగోరనొత్తితే
కొలఁదెరిఁగి నవ్వవే గుట్టుగలదానవు

రేకు: 0193-6 కొండమలహరి సంపుటం: 07-554

పల్లవి: ఎంత చెప్పినా నెరఁగదేమి సేతమే
సంతోసాన చెలులెల్లా సాకిరిగా వినరే

చ. 1: విన్నటివలపుగాఁగ నేఁడ పెంచీఁగాక
యెన్నికగలదియ్యైతే నెమ్మేసేసునా
వన్నెకెక్కిన తుమ్మెదవంటివాఁడు మగవాఁడు
అన్నిటా నాతనిమనసంత నమ్మేనా

చ. 2: కొత్త మాట పట్టుగాఁగ కొంగువట్టి తీసెఁగాక
అత్తి సడిసన్నదైతే నంత మీరునా
మెత్తని పండు వంటిది మించిన పతి చిత్తము
వొత్తి పిసుకఁగఁబోతే వోరువఁగద్దా

చ. 3: సరి వయసులుగాఁగ సాముతోఁ బెనఁగీఁగాక
వొరయ వచ్చినదైతే వోరుచుకోదా
యిరవై శ్రీవెంకటేశుఁడేనుగవంటివాఁడు
అరసి కలసెనిఁక నడ్డమున్నదా

రేకు: 0194-1 కేదారగౌళ సంపుటం: 07-555

పల్లవి: నీవు వింతవాఁడవో నే వింతదాననో
చేవదేరి నా నవ్వు సిగ్గుదెచ్చీఁ గాక

చ. 1: నీతలఁపులోనిదాన నీకు నిచ్చకురాలను
కాతరించి నీవనఁగాఁ గాదనేనా
రేతిరిమాటలకును రిచ్చలాయ నామనసు
పైతరవై అందుకొడఁబడనీదు గాక

చ. 2: కైవశమయ్యిన నేను కందువ చేఁతల నేను
వోవరిలోని వంటఁగా నోపననేనా
నీవొళ్ళివేసాలకు నిండుఁగాఁక రేఁగి లోలో
భావముఁ జలము నేఁడు పంతమాడీఁ గాక

చ. 3: ఎనసితివి రతికి నియ్యకోలు చేసుకొంటి
తనిసి నీవల్ల మరి తప్పులెంచేనా
ఘనుఁడ శ్రీ వెంకటేశ కడమదొడమలకు
అనుఁగుఁగూరిములెల్లా ఆసపడీఁ గాక

రేకు: 0194-2 ముఖారి సంపుటం: 07-556

పల్లవి: బుద్ధి నేము చెప్పేమా పూఁటఁపూటకు
గద్దరిఁడు తానె యెరఁగవలెఁ గాక

చ. 1: వెగటుగ నేమంతేసి విన్నవించవలెనా
తగవెరిఁనవాఁడు తాఁ గాక
మగువ లేమాడినాను మచ్చరించఁదగునా
నగవు సేసుక పై కొనఁగవలెఁ గాక

చ. 2: భ్రమయించి మాగుట్టు పచరించవలెనా
తమకపడేటివాఁడు తాఁగాఁడా
రమణులకు కూరిములు రచ్చఁబెట్టవలెనా
సమ రతులకుఁ జేయి చాఁచవలెఁ గాక

చ. 3: చెక్కునొక్కి నేమిఁకఁ జెనకఁగవలెనా
దక్కగొని నన్నుఁగూడి తానెరఁగఁడా
చిక్కి శ్రీ వెంకటేశుఁడు సెలవి నవ్వవలెనా
మిక్కిలి రతులఁజొక్కి మేలమాడుఁ గాక

రేకు: 0194-3 దేసాక్షి సంపుటం: 07-557

పల్లవి: మాపుదాఁకా జోలి మరి యేఁటికి
కోపుల మీరెను కొసరులు

చ. 1: సరివచ్చె నేఁడు సతికి నీకును
సిరుల నవ్వుల సెలవులు
పొరుగుకు వచ్చె పొద్దున మీకిదె
గరగరికెల కరఁగులు

చ. 2: చొప్పుణఁగె నేఁడు సుదతికి నీకు
తప్పక చూచేవి తడవులు
ముప్పిరి గొనెను మోహము లోననే
కొప్పులు జారి గురుతులు

చ. 3: తగవులఁ బెట్టీ తరుణికి నీకు
బిగువు కాఁగిటి పెనఁగులు
జిగిఁ గూడితిరి శ్రీ వెంకటేశుఁడ
తగులాయ మీతలఁపులు

రేకు: 0194-4 నాట సంపుటం: 07-558

పల్లవి: ఆడినట్టే యాడరాదు ఆపెతో నీవు
వాడికెసరసములే వైపులింతే కొని

చ. 1: కోమలి తోడుత నీకుఁ గోపగించుకొనరాదు
యేమేమి మాటలాడినా నెంతదూరినా
కామించి వచ్చినదాపె కైకొని గురియైతివి
దామెన నీనగవులే తగవింతే కాని

చ. 2: అట్టె చలపట్టరాదు అంగనయడకు నీవు
అట్టు నిన్నెంతసేసి యాఅడిఁ బెట్టినా
చుట్టపు వరుస దాపె చొక్కి చనవిచ్చితివి
నిట్ట చూపుల మెచ్చులే నేరుపులు గాని

చ. 3: జోడువాయనిఁకరాదు సుదతి యింటను నీవు
యీడు యెంత మీరినాను యెలయించునా
వేడుకకత్తె యాపె శ్రీవేంకటేశుఁడవు నీవు
కూడిన యీకూటములే గుణములు గాని

రేకు: 0193-5 రామక్రియ సంపుటం: 07-559

పల్లవి: నీదేవులే నిన్ను నేరములెంచీఁ గాక
పాదు సేసుకొని నిన్ను పచ్చిసేయఁ దగునా

చ. 1: మఱచినా నీమాట మాడసేసుఁ గోటిసేసు
యెఱిఁగి తలఁచుకొంటే యెంతైనాఁ జేసు
యెఱఁగనెట్టువచ్చు యింతేసి దొరలను
తఱి వేచి చెలులము తప్పులెంచఁ దగునా

చ. 2: రాతిరింటి నీపనులు రతికెక్కు రచ్చకెక్కు
యీతల వేగి లేచితే నింటికెక్కును
చేతనటు చూపువచ్చు చెల్లుబడిగలవారి
ఘాతసేసి చెలులము కక్కసించఁ దగునా

చ. 3: మునుకొన్న నీగుట్టు మొదలౌను కొనయౌను
ననిచి చించివేసితే నడుమౌను
వనితఁ గూడితివిట్టె వైపుగా శ్రీవెంకటేశ
పనివడి చెలులము బాసగొనఁ దగునా

రేకు: 0193-6 లలిత సంపుటం: 07-560

పల్లవి: ఇటువంటివే నీకు యితవులౌను
కుటిలకుంతలిచేఁత గురియాయ నీకు

చ. 1: చెలియ నీయెదుటను చేతులెత్తి మొక్కితేను
మొలక చన్నులు నీపై మొనలెత్తెను
అలరి చంకగుదియ నట్టే శరణనేటి
నిలుకడయిన మాట నిజమాయ నీకు

చ. 2: కోమలి నీవూడిగేన కుంచె విసరఁ జొచ్చితే
దామెనహారాలు వల్లెతగిలించెను
వేమారు నోమేది నోము వేసేవి గాలాలు
యీమాటలెల్ల నేఁ డు యిరవాయ నీకు

చ. 3: కందువ శ్రీవెంకటేశ కాఁగిట నిన్ను నించితే
యిందుముఖి మోవి నిన్ను నెంగిలిసేసె
విందులలోనే మరి వీడుదోడుగూడినట్టి
అందమైన మాటలెల్ల నసువాయ నీకు

రేకు: 0195-1 శ్రీరాగం సంపుటం: 07-561

పల్లవి: తాను చేసినచేఁత తారుణిమేనను నిండె
వీనులు చల్లఁగ నిట్టె విన్నవించరే

చ. 1: జక్కవ గుబ్బలమీఁద చంద్రోదయములాయ
చుక్కలు మొలచెనిదె సొంపుమోవిని
అక్కజపుతురుమున నద్దమరేతిరి నిండె
వెక్కసపుపతికిది వేళ చెప్పరే

చ. 2: కనుచూపు తామెరల గక్కుననుఁ దెల్లవారె
యెనయని తలపోఁతనెండలు గానె
పనివడి విరహన పట్టపగలై తోఁచె
ననిచిన పతికి సన్నలు సేయరే

చ. 3: వడిగొన్న జవ్వనాన వసంతకాలము వచ్చె
పొడవైన కళలను పున్నమ గూడె
యెడమిచ్చి శ్రీ వెంకటేశుఁడింతలోఁ గూడె
జడివాయకుండఁ దన్ను బాసగొనరే

రేకు: 0195-2 పాడి సంపుటం: 07-562

పల్లవి: తనకు నాకు నెప్పుడు తగులేకదే
మనసు మర్మములకు మంచిదే కదే

చ. 1: మొక్కలాన నటు చనుమొనలు నే మోపితేను
వెక్కసీఁడు తనకిఁక వెరుపేఁటికే
జక్కవ పిట్టిలు నావి జవ్వన వనమె తాను
యెక్కడపోవును వాని కిరవే కదే

చ. 2: సంతోసపుఁ జూపులచక్కెర నేఁజల్లితేను
పంతగాఁడు తానేల భ్రమసీనే
కంతువిండ్లు నా బొమలు గవిశన తనమేను
పొంతనెంచి చూచుకొంటే పొందులేకదే

చ. 3: బలిమి కాఁగిటఁ దనపైఁ జేతులు వేసితేను
యెలమి శ్రీవెంకటేశుఁడేల నవ్వీనే
జలజములివి నావి సరవిఁ బూజ తనది
నిలుకడలకు నివి నిజమే కదే

రేకు: 0195-3 సౌరాష్ట్రం సంపుటం: 07-563

పల్లవి: నేఁడు గొత్తగాదు తొల్లే నీకు నాకుఁ గలదే
ఆఁడుదాన బలిమేది ఆయము నీ చేతిది

చ. 1: వొట్టిన నీ చేఁతలకు వొడిగట్టుకొన్నదాన
గట్టిచనుఁగవవారకపుదానను
ఎట్టుసేసినా నీచిత్తమెదురాడేవారెవ్వరు
పట్టిన నావలపుభారము నీమీఁదిది

చ. 2: పొంచుకొని పాదముల పొందులు మెట్టినదాన
పంచల సిగ్గుల తలఁబాలదానను
కంచము పొత్తుకు లోనుకలది నీచేతిదింతే
మంచముపైఁ బెనఁగే నామర్మము నీచేతిది

చ. 3: వేడుక మోవి తీపుల విందుకు లోనైనదాన
వీడెమందుకొన్న యరవిరిదానను
జాడతోడ శ్రీ వెంకటేశ చనవిచ్చితివి నాకు
కూడితివి నాలోని గుణము నీచేతిది

రేకు: 0195-4 సామంతం సంపుటం: 07-564

పల్లవి: ఆపెతోనేమి మాటాడీనంతవాఁడు
యీపనికి నావంక నిటుచూడుమనవే

చ. 1: తగవు చెప్పఁగఁబోతే తన మీఁద మోఁచు మాట
మగువలకెంతైనా మంచితనాలే
యెగసక్యాలిఁక వద్దు యేల రట్టుసేసుకొని
యిగిరించె వలపులు యీడకు రమ్మనవే

చ. 2: పంతములాడఁగఁబోతే పాడి దానే యియ్యవలె
కాంతల నెవ్వరైనాను కాదనరు
వింతలేల సేసుకొని వేగిరమే తనకును
యెంతైనాఁ బోదు వావి యీడకు రమ్మనవే

చ. 3: వెనక సుద్దులెంచితే వేవేలుఁ దనవల్లనే
వనితల కెప్పుడును వాసి వన్నెలే
యెనసెను శ్రీ వెంకటేశుఁడు ముందె నన్ను
యినుమడించెఁ దమక మీడకు రమ్మనవే

రేకు: 0195-4 శ్రీరాగం సంపుటం: 07-565

పల్లవి: తమకించకురె మీరు తరుణులాల
సముకపు నవ్వె మేలు జాణనితోను

చ. 1: విన్నవించినా మేలు వెరగుతోనున్నా మేలు
అన్నియు నెరిఁగినట్టి యాతనితోను
కన్నుల మొక్కినా మేలు కాఁకలు చల్లినా మేలు
సన్నెరిఁగి మేలఁగేటి సరసునితోను

చ. 2: ప్రియము చెప్పినా మేలు బిగువుతోనున్నా మేలు
నయగారి గుణముల నాథునితోను
క్రియలు చూపినా మేలు కేలెత్తి మెచ్చినా మేలు
దయదలఁచనేర్చిన తగుదొరతోను

చ. 3: సేవలు చేసినా మేలు చెక్కులు నొక్కినా మేలు
యీవల నన్నుఁ గూడిన యీతని తోను
వావులు చెప్పినా మేలు వన్నెలు చూపినా మేలు
శ్రీ వెంకటేశుఁడైనా చెలువునితోను

రేకు: 0195-5 భైరవి సంపుటం: 07-566

పల్లవి: అల్లదివో నిలుచుక ఆతఁడున్నాఁడు
తెల్లమిగా నిన్నుఁగూర్చే తెలుసుకోరాదా

చ. 1: అదనెరిఁగి మాటాడేనాతని నీడకుఁ దెచ్చే
సుదతి నానేరుపెల్లఁ జూడరాదా
కొదలెల్లఁ దీరవలె గురుతులు గావలె
చదరుఁదనము నీవు సంతోసించరాదా

చ. 2: తలఁపెల్ల భ్రమయించే తరి తీపు పుట్టించే
మెలుఁతరో నీవు నన్ను మెచ్చరాదా
సెలవుల నవ్వించే చేతికి లోనుగాఁ జేసే
సెలవు నాకిదె నేఁడు చిత్తగించరాదా

చ. 3: ఆసలెల్లఁ బుట్టించే నలవాట్లెల్లఁ జేసే
చేసన్నకు లోనుసేసేఁ జేపట్టరాదా
యీసరికి శ్రీవేంకటేశుడట్టె విచ్చేసి
రాసికెక్క నినుఁగూడె రాజ్యమేలరాదా

రేకు: 0196-1 రామక్రియ సంపుటం: 07-567

పల్లవి: మఱి యేమి యెఱఁగను మాటలు నేను
నెఱవైన యట్టి దిక్కు నీవే నాకు

చ. 1: తపము చేసినదాన తగులనాడినదాన
నెపము సేసినదాన నేనే నీకు
రపమయ్యేవాఁడవు రక్షించేవాఁడవు
నిపుణుఁడ విన్నిటాను నీవే నాకు

చ. 2: పట్టి కొలిచినదాన పనులు చేసినదాన
నెట్టన నీదయవల్ల నేనే నీకు
జట్టిగొన్నవాఁడవు చనవిచ్చినవాఁడవు
నెట్టెపు మోహపుగురి నీవే నాకు

చ. 3: గక్కనఁ జూచినదాన కాఁగిటఁ గూడినదాన
నెక్కొని తొలుదొలుత నేనే నీకు
యెక్కువ శ్రీ వెంకటేశ యేలుకొన్నవాఁడవు
నిక్కెమిన్నిపనులందు నీవే నాకు

రేకు: 0196-2 సాళంగనాట సంపుటం: 07-568

పల్లవి: ఎటువంటివాఁడవు యెంతమెత్తనివాఁడవు
మటమాయములలోని మరఁగు దెలియవు

చ. 1: మచ్చరించేనా నీతో మనసు చూడవలసి
యెచ్చరికెగా నంటినేమైనను
కొచ్చికొచ్చి పోరేనా కొనగొన చన్నులను
తచ్చనకు నదిమితే తమకించేవు

చ. 2: తప్పువట్టేనా నీ తగవు చూడవలసి
చొప్పులెత్తి నీమేను సోదించితి
వుప్పటించి పెనఁగేనా వుడివోని సరసాన
కొప్పువట్టినంతలోనే కొసర వచ్చేవు

చ. 3: చలపట్టేనా నీవు సారెకు మెచ్చవలసి
కలసి కాఁగిలఁ గూడి కరఁగించితి
బలిమి చూపేనా నీతో పక్కన శ్రీ వెంకటేశ
తెలిపి మోముచూచితేఁ దిట్టువచ్చేవు

రేకు: 0196-3 లలిత సంపుటం: 07-569

పల్లవి: ఎవ్వరితోఁ జెప్పరాదు యీసుద్దులు
నివ్వటిల్ల నాతోను నీవే ఆనతియ్యవయ్య

చ. 1: కన్నులనే కొసరను కాఁకలు విసరను
వున్నదాన నీయెదుట వూరకే నేను
సన్నలు సేసేవు నీవు సంగతేమి దెలియదు
పిన్నదాన యాకతానఁ బిలిచి ఆనతీవయ్యా

చ. 2: పక్కన వేసరించను పంతాన నోసరించను
వొక్కటై కాచుకుందాన వొద్దనే నేను
మొక్కులు మొక్కేవు నీవు ముందువెనకెరఁగను
చిక్కితి నీవలపులఁ జేరి ఆనతీవయ్యా

చ. 3: చలములు సాదించను సారెసారె బోదించను
కొలఁది మీరఁగ నిన్నుఁ గూడితి నేను
బలిమి శ్రీ వెంకటేశ పైకొంటివి నన్నునిట్టె
తలఁపు నీవెరఁగవా తగ నానతీవయ్యా

రేకు: 0196-4 లలిత సంపుటం: 07-570

పల్లవి: మొగదాకిరివాఁడవు మొదలే నీవు
తెగనాడవేమిటికి దేవరవు నీవు

చ. 1: చెప్పినట్టు సేతునంటే చెలఁగి మందెమేళాన
యెప్పుడైనా విన్నవింతునేమైనను
యిప్పుడిట్టే పదారువేలేకతాలకారు నీకు
వొప్పి యెవ్వరిమాటలు వూకొనేవు నీవు

చ. 2: చేతిలోని వాఁడవంటాఁ జిక్కించుక కాతరాన
యీతల నాతలఁ దీతునేడకైనను
ఆతుమ నీకుఁ బాయరానట్టివారు యెనమండ్రు
యేతుల నెవ్వరిచన వియ్యకొనేవు నీవు

చ. 3: కూడినట్టే కూడేవని గుఱిగా శ్రీ వెంకటేశ
యీడులేక పెనఁగితినిందాఁకాను
వాడికె గొల్లెతలైతే వలసినందరు నీకు
మేడేన నెవ్వరిపొందు మెచ్చేవు నీవు

రేకు: 0196-5 బౌళి సంపుటం: 07-571

పల్లవి: దీనికేమి దోసమా తగిన గేస్తురాలవు
నేను నిన్నునేమనేను నీకేలే సిగ్గులు

చ. 1: కొండవంటి దొర నిన్ను కొంగువట్టి తీసితేను
వొండేమీననలేక వొద్దికైతివే
అండనుండి సారెసారె నాతఁడే పిలువఁగాను
బందుబందు గాలేక పలికితివే

చ. 2: చక్కని జాణఁడు నీ జవ్వనము దడవఁగ
గక్కన విడువలేక కైకొంటివే
వెక్కసానఁ గమ్మటిని వీడె మాతఁడియ్యఁగాను
అక్కరఁ దోయలేక అందుకొంటివే

చ. 3: శ్రీవెంకటేశ్వరుఁడు చెక్కు నిన్ను నొక్కఁగాను
కైవశమై అంతలోనఁ గరఁగితివే
యీవేళ నన్నేలి వచ్చి నిద్దరి సవతులఁగా
కావించి నవ్వితి నిట్టే కదిసితివే

రేకు: 0196-6 ముఖారి సంపుటం: 07-572

పల్లవి: చెప్పవద్దు నీలాగు చెలులెరఁగనిదా
ముప్పిరి నీవు వెనకముందెంచేవాఁడవా

చ. 1: పూరటగానందరిని వొకరొకరినే పట్టి
పోరుదీరఁ బొద్దునను భోగించితివి
యీరీతి నెవ్వతెవద్దకేఁగవలశో కాక
పొరసతులపై నింత బత్తిగలవాఁడవా

చ. 2: వొగ్గి నీవే పిలిపించి వూరివారినెల్లాను
సిగ్గుదేర లోలోనే చెనకితివి
యెగ్గులేక యవ్వెతె నీయింటికి రాఁగానో కాక
నిగ్గుల నింత మోహము నించేటివాఁడవా

చ. 3: యిల్లిల్లు దప్పక చొచ్చి యింతియైన దానినెల్లా
కొల్లదీర నొక్కమాటే కూడితివి
యిల్లిదె నన్ను శ్రీ వెంకటేశ కూడేకొరకుఁగా
యెల్లవారిమేకులకు నింత చిక్కేవాఁడవా

రేకు: 0197-1 సామంతం సంపుటం: 07-573

పల్లవి: నంటున నీ చేఁతలకు నవ్వే నేను
వెంట వెంట నీగుణాలు వెల్లవిరి ఆయను

చ. 1: పిలిచి నీవు నాతోఁ బెనఁగి బాఁతిపడఁగ
నెలమి నే మారుత్తరమియ్యఁ గాక
కలసిన నీసతుల కాలిగోరఁ బోలుదునా
నిలిపిన నీమహిమ నీవే యెరుఁగుదువు

చ. 2: పక్కన నీవు నాపైఁ జెయ్యి వేయఁగాను
చిక్కిలోనై నీసేవ సేసేఁ గాక
చక్కని నీయింతులతో సరిపెనఁగఁ గలనా
మిక్కిలి నీచెల్లుబడి మెరయించేవిప్పుడు

చ. 3: కందువఁ గూడిననన్ను కాఁగలించుకొనఁగాను
పొంది నిన్నునన్నిటా బోగించేఁ గాక
సందడి శ్రీ వెంకటేశ సమరతికర్తమా
యెందు నీమన్ననలనింత సేసేఁ గాక

రేకు: 0197-2 కన్నడగౌళ సంపుటం: 07-574

పల్లవి: కానుక నీకిచ్చితిమి కాచుకున్నారము నేము
ఆనేరుపులీఁకమీఁద నడుగము

చ. 1: వేవేలు చెలిభావాలు విన్నవించితిమి నేఁడు
దేవరచిత్తమెట్టో తెలియదు
చేవమీరె విరహము చెమరించెనింతిమేను
యేవేళఁ గరుణించేవో యెరఁగము

చ. 2: పచ్చిదోఁచెనాకెమేలు పైకొని నీవే ఆడకు
విచ్చేసినయందాఁక వేగిరించము
నిచ్చలు నీచేఁతలెట్టో నీవేగతి మరిలేరు
చెచ్చెరనేమి సేసేవో చిమ్మిరేఁచము

చ. 3: కన్నులెదుట నిద్దరిఁ గదియించితిమి నేఁడు
మన్నించితివింతికిఁగా మండాడము
యెన్నికెఁ శ్రీ వెంకటేశ యీపె నీవునొక్కటే
మిన్నకయైనా సారె మెచ్చుకిట్టే మానము

రేకు: 0197-3 సాళంగనాట సంపుటం: 07-575

పల్లవి: వచ్చినవారమిదివో వాకిటనె వున్నారము
నెచ్చెలి యెదురుచూచీ నీచిత్తమిఁకను

చ. 1: నవ్వుల పండుగలాయ ననుపులెండుగలాయ
యివ్వల చెలితో పొందులిఁకనెన్నఁడు
రవ్వలాయ నీచేఁతలు రాజసమే నెరపఁగా
దివ్వెలెత్తుఁబొద్దులకు తిరమాయఁ బనులు

చ. 2: మాటలివే విందులాయ మంతనాలే సందులాయ
యీటున కాంతతో మేలమిఁకనెన్నఁడు
మూటలాయ నేర్పులు మోచుకవున్నారమిదే
మేటిశింగారాల వేగీ మిగిలె చీఁకట్లు

చ. 3: వీడెములే వొడినిండె వేడుకలు పంటవండె
యీడ వచ్చున్నది చెలియ యిఁకనెన్నఁడు
పాడితో శ్రీ వెంకటేశ పడఁతిఁ గూడితివిట్టె
యేడుమద్యాన్నములెక్కె యెట్టి రహస్యములో

రేకు: 0197-4 గుండక్రియ సంపుటం: 07-576

పల్లవి: పడఁతిరో నీవేల బత్తి గొట్టానఁ బెట్టేవే భూమి
పొడమి సతులతల పూరిగట్టునేఁటికే

చ. 1: పుట్టిపడఁ దేనెలెంత పూరిపడ మాటాడిన
మట్టులేక భ్రమసీనా మగవాఁడు
చుట్టురికాలెంత సూటిపడఁ జెప్పినాను
కట్టుకొనునా మెడఁ గమ్మర నిన్నతఁడు

చ. 2: కన్నుసన్నల నీవెంత కప్పురాలు చల్లినాను
యెన్నికలేక మెచ్చీనా యింతవాఁడు
పన్ని నీమచ్చికచూపి పాదాలెంత పిసికినా
చెన్నుమీర నన్ను నరచేతఁబెట్టుకుండునా

చ. 3: సిగ్గువడకాతనిపై చేతులెంత చాఁచినాను
వెగ్గళించుమనీనా శ్రీ వెంకటేశుఁడు
అగ్గమై నన్నిటుగూడెనట్టె నీవూఁ గొసరితే
నిగ్గులపూజగా నిన్ను నెత్తిఁ బెట్టుకొనునా

రేకు: 0197-5 గౌళ సంపుటం: 07-577

పల్లవి: ఆయము నీచేతనున్నదన్నిటికిని
పాయముపదను వచ్చెఁ బైకొనవయ్యా

చ. 1: అలిగినదానివలెనంటక వున్నది గాని
నిలువెల్లాఁ దమకమే నీమీఁదను
బలిమేపాటిసేసిన పైపైనున్నది చెలి
చెలులఁ జూపక నీవే చేయి చాఁచవయ్యా

చ. 2: యెనయనిదానివలె నెక్కడో చూచీఁ గాని
తనువెల్లనాసలే తగులమికి
చెనకితేఁ జాలుఁగాని చేతిలోనున్నది యింతి
పెనఁగదు పిలిచితేఁ బేరుకొనవయ్యా

చ. 3: సిగ్గువడ్డదానివలె శిరసు వంచీఁ గాని
అగ్గలికెల్లా నీసొమ్మై ఆముకొన్నది
అగ్గమై శ్రీ వెంకటాధిప నిన్నుఁ గూడెను
యెగ్గులేదు మీలోన నిట్టే వుండవయ్యా

రేకు: 0139-5 రామక్రియ సంపుటం: 07-578

పల్లవి: మండాటమింతటిమీఁద మరిలేదు
అండనుండేవారమింతే అదివో నీచిత్తము

చ. 1: పంతానకెక్కినమాట పాయానకెక్కినమాట
కాంత నీతోనాడినది కలదొక్కటే
చింతలోని దాఁపిరయు సేయఁగల కాఁపిరము
వింతలుగ నేముసేసే విన్నపములోనివే

చ. 2: కందువనెలల వాఁత కమ్మలలోపలి వాఁత
యిందుముఖి నీసందికిది యొక్కటే
యిందమన్న కానికలు యెంచుకొన్న పూనికలు
ముందు నీకిందరము మొక్కిన మొక్కులవే

చ. 3: కనుఁగొన్నట్టి వేడుక కాఁగిటిలోని వేడుక
పనివడి సతిభాగ్యఫలమొక్కటే
ననిచె శ్రీవెంకటేశ నయములుఁ బ్రియములు
చనవు మెరసిన మా సమ్మతాలలోనివే

రేకు: 0198-1 శంకరాభరణం సంపుటం: 07-579

పల్లవి: చెప్పఁగనేఁటికి చెలి మనతోడ
కప్పెఁ జింతలవె కానఁగరాదా

చ. 1: తలఁపులోపలి తమకమెల్లాను
సెలవినవ్వులఁ జిందీఁ గదే
కొలఁది మీరిన కోరికలప్పటి
మొలకపులక మొత్తములాయ

చ. 2: వినుకలి తన విరహమెల్లాను
కనుఁగొనలనే కమ్మీఁ గదే
చనవుల తన సరసమప్పటి
ననుపుమాటల నటనలాయ

చ. 3: గక్కనఁ గూడిన కందువలెల్లాను
మిక్కిలి మోవిపై మించెఁ గదే
యెక్కువ శ్రీ వేంకటేశు మేలప్పటి
వొక్కటై పాయని వొద్దికలాయ

రేకు: 0198-2 వరాళి సంపుటం: 07-580

పల్లవి: పట్టిన చలములేలే పైపైనాతనితోడ
వొట్టుక పంతమిప్పించె వువిదచేఁ జాలదా

చ. 1: వెంగెము లాడకువే విభుఁడు నీసవతైన
అంగననీడకుఁ దెచ్చె నదిచాలదా
కంగువెట్టుకోకువే కమ్మనిపూవులచెండు
కుంగరాల వేళ్ళచేత నొగ్గింపించెఁ జాలదా

చ. 2: చలము సాదించకువే సవతిని నాయకుఁడు
అలరి నీచేతి కిచ్చె నదిచాలదా
బలిమి సేయకువే ప్రాణేశ్వరుఁడు ఆపెఁ
గొలువులోఁ బెట్టి నినుఁ గొసరించెఁ జాలదా

చ. 3: చేపట్టి బిగియకువే శ్రీ వెంకటేశుఁడు నిన్ను
ఆపెచేతఁ బొగడించె నదిచాలదా
రాఁపులీఁకఁ జేయకువే రతికేలిలోపలను
మోపుగట్టించె వలపు ముదితచేఁ జాలదా

రేకు: 0198-3 నాదరామక్రియ సంపుటం: 07-581

పల్లవి: మరిఁగించ మరి లేవా మాటలు మాపుదాఁక
పొరుగు పొంతల నీకుఁ బొద్దు వోదా

చ. 1: వంచనతో నీవు నాకు వలచినవలపెల్ల
కంచపుమోవియందే కానవచ్చెను
చంచులనిందరిలోన సతమేమి నెరపేవు
పొంచి పొంచి నీకదేమి పొద్దువోదా

చ. 2: తలఁచిన నీలోని తలపోఁతలెల్లాను
పిలిచిన పిలుపులోఁ బెనగొనెను
మలశి యెప్పటినెడమాటలేమాడించేవు
పులిమేవు నవ్వులేమి పొద్దువోదా

చ. 3: జాడల నీ నా సంది సరసములెల్లాను
కూడినకూటమిలోనే గురులాయను
యీడనె శ్రీ వెంకటేశ యెంతకెంత సేసేవు
ప్రోడవౌదువు నీకింకఁ బొద్దువోదా

రేకు: 0198-4 సామంతం సంపుటం: 07-582

పల్లవి: కొలమునొకటిగాదు గుణమునొకటిగాదు
శెలిమి శేయవచ్చీని శెనకకుమనవే

చ. 1: యిల్లిదివో మమ్ము సూడు యేనుగవంటి నడపు
సల్లని తేటసూపులే సక్కదనాలు
సెల్లఁబో సూడుమనవే శింయ్యముపంటి నడుము
గొల్లనికి శెంచెతకు కూటము సెల్లునా

చ. 2: నిచ్చలు మాసెంపలపై నెమిలివంటిది కొప్పు
పచ్చులవంటివి మాబలు సన్నులు
కుచ్చుల పారిటాకులు గిరిగింజ సరుములు
అచ్చపుటూరవాఁడు మాయడవినుండీనా

చ. 3: వసుముగాని శిలుకవంటిదివో మామాట
పసని తేనెల మోవి పశిమివొల్లు
యెసగ శ్రీ వెంకటేశుఁడేటవెట్టి నన్నుఁగూడె
రసికుఁడు దాను నేను రాశిపాటదాననే

రేకు: 0198-5 లలిత సంపుటం: 07-583

పల్లవి: ఏమిటికాసపడేవు యెందుకైనాను
సాముసేసినట్టి నీతో సాటివచ్చేమా

చ. 1: తచ్చి చూడ నీకునిది దట్టిగట్టు నౌనేమో
పచ్చనాకు మాకొంగు పట్టేవు నీవు
యిచ్చ మాకాకిపైఁడిబొట్టేమి చూచేవింతలోనే
బచ్చెన నీపైఁడిచీర పాటిదయ్యీనా

చ. 2: యెంచుకో నీ సొమ్ములలో యిది దాఁచవచ్చునేమో
పంచెపు మాగురిగింజపేరడిగేవు
దించనట్టి మావింటిదిక్కేమి చూచేవు
సంచపు నీ చుట్టుఁగత్తి సరివచ్చీనా

చ. 3: యిప్పుడే తెలుసుకో నీకిది గూడయ్యీనేమో
నెప్పున మామోవితేనె నీవు గోరేవు
ముప్పిరి శ్రీ వెంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
యెప్పుడూనురముకాంత కెనవచ్చీ నా

రేకు: 0198-6 బౌళి సంపుటం: 07-584

పల్లవి: చేసిన తనచేఁతలు చెప్పరాదు
యీ సటలవానితోడ నేమిసేతునే

చ. 1: వలపు గలవారికి వాసులు పనికిరావు
పిలిచితేఁ బలుకక బిగియరాదు
చలపట్టి వేఁడుకొంటే సమ్మతించకుండరాదు
యెలయించీనిదె తాను యేమిసేతునే

చ. 2: మన్ననగలవారికి మంకులు చూపరాదు
సన్నలేమి సేసినాను సాదించరాదు
కన్నులనే నవ్వినాను కాఁతాళము చూపరాదు
యిన్నేసి ప్రియాలు చెప్పీ నేమిసేతునే

చ. 3: కూటమిగలవారికి కోపగించు కొనరాదు
పాటించి మేలమాడఁగఁ బదరరాదు
గాఁటమై శ్రీ వేంకటఘనుఁడిట్టె నన్నుఁగూడె
యీటువెట్టెఁ దనతోడ నేమిసేతునే

రేకు: 0199-1 సాళంగనాట సంపుటం: 07-585

పల్లవి: అంకెకు రానిపనులై నపాటి చాలును
మంకులు చెల్లవు నిన్ను మరిగినదానను

చ. 1: పచరించి నీకు విన్నపములు సేసేవారి
వచనాలలోనే కానవచ్చె వలపు
రచనలు నేరుతుము రాజసాలు నేరుతుము
వుచితముగాకుండఁగా వూరకున్నదానను

చ. 2: సగము మొగము వంచి సన్నలు సేసేవారి
నగవందే అంతా వున్నది నిజము
పగటు నెరుఁగుదుము పంతమూనెరుగుదుము
జగడాలు చేరినంటా సమ్మతించుకొంటిని

చ. 3: ఆయములు చూపి మోపి అప్పణలిచ్చేవారి
కాయకపు మొక్కులకే కలిగె మేలు
యీయెడ శ్రీ వెంకటేశ యిటు నిన్నుఁ గూడితిని
చేయి మీఁదై నవ్వులకు సెలవు పెట్టితిని

రేకు: 0199-2 దేసాళం సంపుటం: 07-586

పల్లవి: గుట్టుననుండఁగరాదా కొంతకొంతైనా
అట్టులు సేయఁబోతే నాఅడిఁ బడుఁ బనులు

చ. 1: ఆమనికాలము డొల్లే ఆయాలు పైపైనున్నవి
చేముట్టి సరసాలేలే చెల్లఁబో నీకు
గామిడివాఁడాతఁడు కప్పురపుమోవి నీది
వేమారు మాటాడఁబోతే వెల్లవిరౌఁబనులు

చ. 2: సిగ్గులకాలము దొల్లే చెక్కులు చేతనున్నవి
దగ్గరియాకతాలేలే తరుణి నీకు
బగ్గడికాఁడాతఁడ పంతకత్తెవు నీవైతే
వెగ్గళించఁ జూచితేను వింతదోఁచుఁ బనులు

చ. 3: ముచ్చటకాలము దొల్లే మోహము లోననున్నది
పచ్చిదేర నవ్వనేలే పదరి నీకు
యిచ్చట శ్రీ వెంకటేశుఁడీతఁడిట్టె నిన్నుఁగూడె
యెచ్చరికె లేకుంటే యేమౌనో పనులు

రేకు: 0199-3 పాడి సంపుటం: 07-587

పల్లవి: రమణులము నేమింత రవ్వకోపేమా
చెమరించీని మొకము చేరి విసరినాను

చ. 1: మచ్చిక మీఁదఁ గల మగువలకెల్లాను
యిచ్చకమే సేయవలె నెక్కడా నీకు
యెచ్చుకుందులైన మాటలేమీనాడఁగరాదు
పచ్చిదేరీని పనులు భావించి చూచినను

చ. 2: పెట్టిన శాసల నీ ప్రియురాండ్రెల్లాను
గుట్టుతోడనుండవలెఁ గోరి నీవద్ద
చిట్టకాలు సేయరాదు చింతతోనుండఁగరాదు
వొట్టుకొనె వానలెల్లా వొరసిచూచినను

చ. 3: కూడిన నీకూటములకోమలులకెల్లాను
తోడునీడై యుండవలె తొరలి నీకు
జాడతో నన్నుఁగూడితి సాదించరాదు నిన్ను
వోడక శ్రీ వెంకటేశ వొద్దికైతివిపుడు

రేకు: 0199-4 ఆహిరి సంపుటం: 07-588

పల్లవి: ఈయెడనేమిసేసినా నేమనే నీచిత్తము
కాయకపుఁ జేఁతలెల్లఁ గప్పవచ్చేనా

చ. 1: యెగసక్యాలకు నీవు యేమని పొగడినాను
జగడాలకు వచ్చేనా సారె నీతోను
తగవులు దప్పి నీవు తమకించి మొక్కి తేను
తెగడి నిన్నిఁక వేరే తిట్టవచ్చేనా

చ. 2: నాటకాలనూరకే నవ్వులెంత నవ్వినాను
ఆటకానఁ గన్నుల నిన్నదలించేనా
జూటరితనాల నన్ను సుద్దులెన్నియడిగినా
మాటలు వెలుచుకొని మచ్చరించేనా

చ. 3: వేసాలకు నీవెంత వేడుకఁ గాఁగలించినా
ఆసపడి నిన్ను నేను ఆయాలంటేనా
రాసికెక్క శ్రీ వెంకటరమణ నన్నుఁ గూడితి
బాసదప్పెనంటా నిన్నుఁ బచ్చిసేసేనా

రేకు: 0199-5 నాదరామక్రియ సంపుటం: 07-589

పల్లవి: ఎచ్చరిక మఱవకు మిన్నిటానమ్మ
విచ్చనవిడాయ నీకు వేడుకలమ్మా

చ. 1: మితిమీరి సోబనాలమీఁద నీవు నడవఁగ
నతఁడు కైలాగిచ్చీ నదిగోవమ్మా
రతిసేసి అలసిన రమణివి తొలుతనే
చతురునికిని నీకు జతనమమ్మ

చ. 2: మేడయెక్కి అలసి నీమేను చెమరించఁగాను
ఆడ సురటి విసరీ నదిగోవమ్మా
వాడుదేరె వదనము వనితవందుకుఁ దోడు
యీడుజోడయ్యీనది మీకు నెడపరాకమ్మ

చ. 3: చప్పరమాళిగెలోన సరిఁ బవళించే నీకు
నప్పుడే తాఁ దొడచాఁచీ నదిగోవమ్మా
కప్పి శ్రీ వెంకటేశుఁడు కలసె నివ్వెరగైతి
రెప్పుడు మరవకుఁడీయెన్నికలోయమ్మా

రేకు: 0199-6 రామక్రియ సంపుటం: 07-590

పల్లవి: మేలు మేలు రాఁగా రాఁగా మేటివైతివి
వాలుఁజూపులఁ జూచితే వచ్చెఁగా పని

చ. 1: చెంతనాతఁడు నీచెలిసేవలకు మెచ్చితేను
యింతమాట యెంతసేసేవిదిగో నీవు
సంతతమునాపె గన సరసములాడితేను
వంతులకు నీచెత వచ్చెఁగా పని

చ. 2: నీవు పిలువనంపిన నెలఁతకు సొమ్ములిచ్చే
యీవిలోనే వావిగట్టేవిదిగో నీవు
కావలెననుచు నాపె కాఁగిలించుకొంటే గన
వావాత నీచేతనే వచ్చెఁగా పని

చ. 3: పాదాలొత్తే పడఁతిపై పచ్చడముకొంగువడె
నాదరించి కూడెననేవంతలో నీవు
యీదెస శ్రీ వెంకటేశుఁడెనని నిన్నిఁక నాపె
వాదొద్దని మొక్కించెను వచ్చెఁగా పని

రేకు: 0200-1 మంగళకౌశిక సంపుటం: 07-591

పల్లవి: ఏల నీవు దాఁచేవు యింతలో మాకు
తాలిమినిలుచునందు తగులములున్నవి

చ. 1: అంచల మూఁకలలోనున్న అతివపై నీవు గొంత
ముంచిన నవ్వులలోన మోహమున్నది
తుంచి తుంచి తామెరల తూండ్లు నీవు వేయఁగ
వంచిన యాపెచూపుల వలపులునున్నవి

చ. 2: ఆసపడి నీవిప్పుడు అండనుండి యేమేమో
సేసిన చేఁతలలోన సిగ్గులున్నవి
సేసవెట్టి పువ్వులను చిమ్మిరేఁగ నన్నులను
వాసిన యాపెవ్రాలలో వాడికెల్లానున్నది

చ. 3: తోడనె శ్రీ వెంకటేశ దొరసి మీరిద్దరును
కూడిన కూటమిలోన గురులున్నవి
వాడుదేర నేఁడాపె వంకలొత్తి నీచేతికి
వీడెమిచ్చినందులోనే వేడుకెల్లానున్నది

రేకు: 0200-2 శుద్ధవసంతం సంపుటం: 07-592

పల్లవి: ఊరకున్నవారితోడ నూరెల్లానోపునటే
వోరపోరల తోడను వూరకున్నఁ జాలదా

చ. 1: చెలిమి సేసినచోట సిగ్గులనెగ్గులూలేవు
అలుగఁగఁ దగునటే ఆతనితోను
పెలుచమాటలుగదే బెట్టికోపాలురేఁచీని
వొలిసి మోనముతోడ వూరకున్నఁ జాలదా

చ. 2: చనవులిచ్చినచోట సాదించఁబనిలేదు
పెనఁగి వేసరింతురా ప్రియునినింత
చెనకులింతే కదే జిగిరేసు వుట్టించు
వొనర నవ్వులు నవ్వి వూరకున్నఁ జాలదా

చ. 3: గక్కనఁ గూడినచోట కాఁతాళించ మరివొద్దు
కక్కసములేలే శ్రీ వేంకటపతితో
వొక్కటైనదిందే కదే వొగి మందెమేళమాయ
వుక్కుమీరి లోలోఁజొక్కి వూరకున్నఁ జాలదా

రేకు: 0200-3 బౌళి సంపుటం: 07-593

పల్లవి: మానరే ఆతనినేల మండాడేరు
కానుక మామొక్కులివి కడ్డాయము గాదు

చ. 1: తనకే సెలవయ్యిన తరుణి నేను
వనితలు పెక్కుగలవాఁడాతఁడు
యెనసిన మాపొందులేడకునేడ
మొనసి నేఁజేసే బత్తి మొగచాటే కాదా

చ. 2: వొక్కచో తానే గతై వుండుదు నేను
పెక్కుచోట్ల మెట్టేటి ప్రియుఁడాతఁడు
మక్కళించి మామాటలు మరియింకానా
వుక్కుమీరితే వలపు వుంగిటే కాదా

చ. 3: కందువఁ దన్నుఁ గూడిన కాంతను నేను
యిందరిలో శ్రీ వేంకటేశుఁడాతఁడు
ముందు వెనకల మేలు మోపులాయను
విందుమీఁద విందులైతే వెగటులే కావా

రేకు: 0200-4 ఆహిరి సంపుటం: 07-594

పల్లవి: ఎక్కడికెక్కడి ఆస యేమి సేసేనే
యిక్కడ నాతో నవ్వే నిది యంత చాలదా

చ. 1: కాయమంటిన నన్నునేలే కాఁగలించవలెనా
చాయల నన్నుఁ జూచినచాలదా యింత
మాయల వలపులేల మాపుదాఁకా జోలియాల
వేయిటికొక్కటే నన్ను విడువఁడు చాలదా

చ. 2: వొంటినున్న నన్నుఁజేరి వొడియంటవలెనా
జంటయై మాటలాడినఁ జాలదా యింత
పెంటల సరసమేల బేసబెల్లితనమేల
తొంటిపొందే వొకలక్ష తోయలేఁడు చాలదా

చ. 3: పలుమారు నాకునింత బాససేయవలెనా
అలపు దీరఁగఁ గూడెనంత చాలదా
చెలఁగి శ్రీ వెంకటేశుచేఁతలఁ బడఁగనేల
పలికినదే పంతము పచ్చిసేసెఁ జాలదా

రేకు: 0200-5 తెలుఁగుకాంబోది సంపుటం: 07-595

పల్లవి: అదె తాఁడానే కదవే అంగన వీఁడు
వెదకి యెందు చూచిన వీఁడేవాఁడు

చ. 1: కలలో వచ్చినవాఁడు కప్పురమిచ్చినవాఁడు
చెలఁగేటి పురముపై చెలియవాఁడు
తెలిసి మేలుకొంటేను దేవరవలెనున్నాఁడు
వెలుపలఁ దానె యై వీఁడేవాఁడు

చ. 2: నిక్కిచూచినట్టివాఁడు నిన్నటిమొన్నటివాఁడు
తక్కక తులసిపెద్దదండలవాఁడు
పక్కనఁ బేరుకొంటేను పలికీ నిప్పుడే వీఁడు
వెక్కసపు నవ్వులతో వీఁడేవాఁడు

చ. 3: అడుగనంపినవాఁడు ఆయములంటినవాఁడు
కడలేని శ్రీ వెంకటప్పవాఁడు
అడియాలముగఁ గూడెనంతలోనిప్పుడు వీఁడు
విడువని మహిమల వీఁడేవాఁడు

రేకు: 0200-6 ముఖారి సంపుటం: 07-596

పల్లవి: నాకుఁ దెలియదు నీనాటకములు
దాకొంటి విప్పుడెందలివాఁడవో

చ. 1: నగవు నాతోఁగొంత నవ్వుతానే ఆవలఁ
బగటు మరియుఁగొంత పచరింతువు
మొగిచి నీమనసు యిరుమొనసూదియ్యెయిపుడు
తగిలీని నీవు యెందలివాఁడవో

చ. 2: పలుకులొకకొన్ని నాపైఁ జల్లుతా నవల
వలపులొకకొన్ని నివ్వటిలింతువు
తొలఁగకిటు రెండుచేతుల వెలంకాయలై
తళుకొత్తెఁ జేఁతలెందలివాఁడవో

చ. 3: యిప్పుడిన్నిట నన్నునెనసి యెమ్మెలు నవల
చెప్పికొన్నిట నన్నుఁ జింతింతువు
చిప్పి లుచునిందుకే శ్రీ వెంకటేశ్వరుఁడ
దప్పిదేరెదవు యెందలివాఁడవో

రేకు: 0201-1 మధ్యమావతి సంపుటం: 08-001

పల్లవి: తెగని పనులకు నింతేసి యాలే
మొగమోటతోడివి మోహములెల్లను

చ. 1: అలిగిన విభుఁడు నిన్నట్టె వేడుకొనవచ్చె
చలమో ఫలమో సతి నీకు
వెలలేని కోపములు వేగినంతాఁ జేసినాను
కలయక మానేరా కాఁకలెల్లఁ దీరను

చ. 2: తతి మాటాడనివాఁడు తానే సరసములాడీ
వ్రతమో యితవో వనిత నీకు
మతకాన మీరెంత మారుమోములై యుండిన
రతిఁ గూడకుండేరా రచనలతోడను

చ. 3: యేడోవున్న శ్రీవేంకటేశుఁడే యింటికి వచ్చె
ఆడికో వాడికో అంగన నీకు
పాడి పంతములతోడ బలుములెంత చూపిన
వీడెమిచ్చి కూడితిరి వేరులయ్యేరా

రేకు: 0201-2 హిందోళవసంతం సంపుటం: 08-002

పల్లవి: తనమాటే నిజము తా బొంకినా
తనువంటినంతలోనే తాపమారీనా

చ. 1: తప్పక చూచినవాఁడు తలవంచుకొననేలే
నెప్పుదాఁక గురులేసి నేఁ గాననీనా
అప్పటి నే నొలయఁగ నాయములంటీ తాను
కొప్పుజారినంతలోనే కోపమారీనా

చ. 2: తగులనాడినవాఁడు తప్పుదిద్దుకొననేలే
నిగిడి మేడెము చొచ్చి నేఁ గాననీనా
జిగి నా మొగమోటకు చేతులు చాఁచీ తాను
గగురుపొడిచితేనే కాఁకలారీనా

చ. 3: మచ్చికె చేసినవాఁడు మంకులు నెరపనేలే
నెచ్చెలి సాకిరివెట్టి నేఁ గాననీనా
అచ్చపు శ్రీవేంకటేశుఁడన్నిటాను నన్నునేలె
రచ్చకెక్కెనిఁక తాను రాకుండీనా

రేకు: 0201-3 నారణి సంపుటం: 08-003

పల్లవి: ఏల బుద్దులు చెప్పేరే యింతలో నాకు
మేలిమి విభుఁనితోడ మేకులేలే

చ. 1: తన మాటలు చెల్లించి తగవులనే చెల్లించి (?)
చనవే చేకొందుఁగాక జగడాలేలే
పెఁనగినట్టే పెనఁగి ప్రియములలో మునిఁగి
మనసు దెలిసేఁ గాక మరియాలేలే

చ. 2: మాటలెల్లా నూఁకొని మచ్చికెల్లాఁ జేకొని
పాటలు పాడుదుఁ గాక పదరనేలే
కాటుకకన్నులఁ జూచి కందువవేళలు గాచి
చాటి చెప్పేఁగాక యిఁక జాగులేలే

చ. 3: కరఁగినట్టే కరఁగి కరతలెల్లా మొరఁగి
సిరులఁ గూడుదుఁ గాక చింతలేలే
యిరవై శ్రీవేంకటేశుఁడెనసెఁ దానే నన్ను
తొరలించుకొందుఁ గాక తోయనేలే

రేకు: 0201-4 వరాళి సంపుటం: 08-004

పల్లవి: ఇంట గెలిచి కా నీవు యిఁక రచ్చ గెలిచేది
వెంటనే ఆనతీరాదా వినవలె నేను

చ. 1: మాయలెంత సేసినాను మచ్చికెంత వూసినాను
ఆయెడ నావలె నిన్నునాపె నమ్మీనా
కాయపు నీ ఘాతలివి కందువ మచ్చములివి
యేయింతి సేసినవంటే యేమనేవు నీవు

చ. 2: కల్లలెన్ని ఆడినాను కదిసెంత గూడినాను
యిల్లదె నావలెనాపె యియ్యకొనీనా
తెల్లనికన్నులతేట దిష్టమైన యాచెమట
చెల్లఁబెట్టుకొని యాపె చింతవాపఁ గలవా (దా?)

చ. 3: నెమ్మినెంత పొగడినా నీకు నీకే పొగడినా (?)
రమ్మని నావలెనాప రతిఁ గూడీనా
యెమ్మెల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
సమ్మతించనాడనెట్టు సరస మాడేవు

రేకు: 0201-5 మాళవి గౌళ సంపుటం: 08-005

పల్లవి: ఏలాతని దూరేవే యింకా నీవు
ఆలీలఁ బుణ్యఫలములవి నీకే వలదా

చ. 1: గుట్టుతోడ నీమోవి గురుతు సేసినాఁడింతే
తిట్టకువే రమణుని తెరవ నీవు
వట్టిమాకులిగిరించు వనిత నీమాట వింటే
నెట్టన ఆగుణములు నీకు నీకే వలదా

చ. 2: రేసుల నీచేతులను రెట్టింపు సేయఁగనేలే
ఆసల సాదించకువే ఆతని నీవు
వాసికిఁ బూవకపూచు వనిత నీచేఁతలకు
బాసల నీయందే అవి పతి చూపవలదా

చ. 3: ముంచి వొత్తిన చన్నుల ముద్రలు వొత్తినాఁడింతే
అంచల శ్రీవేంకటేశునకు నీవు
యెంచనీతనిఁ గూడితెందైనాఁ గావక కాచు
నించి నీజాణతనాలు నీమీఁదనే వలదా

రేకు: 0201-6 శ్రీరాగం సంపుటం: 08-006

పల్లవి: పదరుదురా యిటు పైపైపనే
అదన నీకు మోహపు వాఁడతఁడు

చ. 1: చెలువుఁడు నీకటు సేసిన బాసలు
తలఁచుకొనఁగదవె తరుణీ
అలుగక ములుగక ఆతనిగుణములు
తెలసుకొనఁగదవె దినదినములను

చ. 2: అంతరంగమున నాడిన మాటలు
చింతించుకొనవె చెలియా
పంతములాడక పలుమరుఁ గొసరక
పొంతనె కనుకో పూఁటకుఁ బూఁట

చ. 3: శ్రీవేంకటపతి చెనకిన చెనకులు
భావించి చూడమో పడఁతీ
యీవిభుఁడె కలసె నిఁక నేమిననక
ఆవటించు ముదమడగడుగుకును

రేకు: 0202-1 శ్రీరాగం సంపుటం: 08-007

పల్లవి: రచనలనిన్నిట రసికుఁడవు
యిచట విన్నపంబిదె సేసెదను

చ. 1: పలుకుల చిలుకల పాటకోవిలల
పిలుచులుగా చెలి పెంచెనదే
అలుగకుమీ నీవందుకు రమణుఁడ
కల సహజమె యిది కసరులు గావు

చ. 2: చనుజక్కవలను సతి నెరుయలుల
ఘనముగ మూఁకలు గట్టించె
మొనలుచూపె మోపుగట్టెనని
ననిచి వేరకు నాథుఁడవు

చ. 3: నడపుల హంసల నయనచాతకముల
పడఁతి శ్రీవేంకటపతి పాదిగె
నిడువులఁ గడుచు నిన్నుసోఁకించెనని
జడియకుమీ నీచనవులె మెరసి

రేకు: 0202-2 నాదరామక్రియ సంపుటం: 08-008

పల్లవి: వింత వింత సతులాల వినరమ్మా
యెంతలేదు మీ కెల్లా నిదెచాలు సుండి

చ. 1: చనవేమెరతుఁగాని చలము సాదింపనోప
చెనకీనంటా నేల చేయి వట్టీనే
కనుసన్న మెలఁగేటి కాంతను నాకీపాటి
కొనగోరుదాఁకించిన కొమ్మలకేపాటో

చ. 2: యిచ్చకమూడుదుఁగాని యీసడించ నెన్నఁడును
తుచ్చమాడకుండా నాన తూరిపట్టీనే
మచ్చికైన సతిని నామాటలకే యింతసేసె
హెచ్చి తన్నుఁ దిట్టేవారినెంత సేసునో

చ. 3: గక్కనఁ గూడితిఁగాని కాఁకలు సేయనెప్పుడు
వెక్కసించీఁ జన్నులంటా వేల మొ(నొ?)క్కీనే
వొక్కటైన నాతో నవ్వీ వూరకే శ్రీవేంకటేశుఁ
డిక్కువలనున్నవారినెంత నవ్వునో

రేకు: 0202-3 రామక్రియ సంపుటం: 08-009

పల్లవి: నీకంకణము గట్టినట్టి నెలఁత నేను
ఆ కంటు దీరుచవయ్యా ఆపరాధి నేను

చ. 1: వెలఁదులు నిన్నాడఁగా వింటిని నేను
అలిగి పాసిన విరహపువేళల
పలికి వారిఁ దిట్టని పాపజాతిదాన నేను
యెలమి నన్నప్పటి నీవేల మెచ్చేవయ్యా

చ. 2: మచ్చికై నీవిందుండఁగా మాయింటనే వుంటి నేను
రచ్చఁ జెలులు పంతాన రానియ్యరైరి
యిచ్చగించి వుండినట్టి యెడ్డగుణము సతిని
పచ్చిగా నాకేల నీవు బాఁతిపడేవయ్యా

చ. 3: నీవు గాఁగలించుకోఁగా నివ్వెరగుతోనుండితి
ఆవేళ నన్నెచ్చరించరైరి చెలులు
కావిరి నూరకుండిన కడుమత్తురాలను నేను
శ్రీవేంకటేశ నన్నేల చెక్కునొక్కేవయ్యా

రేకు: 0202-4 దేసాళం సంపుటం: 08-010

పల్లవి: చూతువురావయ్యా సుదతికాఁపురము
యీతలనిదె నీయింటిలోనను

చ. 1: తీపు మోవిలోని తేనెలు గరఁచీ
చూపులకాఁకల చురుకులను
దాపగు చెక్కుటద్దములు దోమీ
పూపుల నవ్వుగప్పురానను

చ. 2: పులకబియ్యాలఁ బొంగలివెట్టీ
చలి వలపుల చన్నులను
పొలపునెరుల పోరుల వాపీ
ములువాఁడి గోళ్ళ ముచ్చటను

చ. 3: మొనపి సిగ్గులను ముగ్గులు వెట్టీ
చెనకేటి చెక్కు చేతులను
యెనసె శ్రీవెంకటేశ నిన్నునాపె
కని నీవు రాఁగాఁ గాఁగిటను

రేకు: 0202-5 మాళవి గౌళ సంపుటం: 08-011

పల్లవి: ఏల నన్ను దూరేవే యేమనేవే నన్నును
మేలు మేలని యెప్పుడు మెచ్చువే నీవు

చ. 1: సేనలు వానిసుద్దులు చెప్పవే నీవెందాఁక
వీనులు చల్లగ నాఁడే వింటినే నేను
తానె యిందు విచ్చేసితే తరవాతిపనులకు
ఐనట్లాఁ దోఁచినమాటాడేనే నేను

చ. 2: సూటిగాఁ గమ్మటినేల చూచేవే యాతనిదిక్కు
కాటుకకన్నులఁ దొల్లె కంటినే నేను
పాటించి తానిప్పుడు నాపానుపుపైఁ గూచుండితే
చీటికి మాటికి సేవ సేసేనే నేను

చ. 3: వొడఁబరిచి మమ్మేల వొక్కటి సేసేవే నీవు
కడు వేడుకనప్పుడే కలసితిమే
అడరి శ్రీ వేంకటేశుఁడాయములు నన్నంటితే
చిడుముడిగురులుగాఁ జెనకేనే నేను

రేకు: 0202-6 కన్నడగౌళ సంపుటం: 08-012

పల్లవి: ఇంకా విన వేడుకయ్యీనేమంటివి
బొంకకుమీ నాతోనాపెపొందులకేమంటివి

చ. 1: తొయ్యలి నిన్నొకమాటు తొంగి చూచెనేమంటివి
యియ్యెడకుఁ దానె వచ్చెనేమంటివి
పయ్యద జారఁగ నిల్చె భ్రమయించ నేమంటివి
అయ్యఅసాదలు వెట్టేనందుకు నేమంటివి

చ. 2: నవ్వుతా నిన్నుమెచ్చిన నాటకానకేమంటివి
యివ్వల నీకు మొక్కితే నేమంటివి
రవ్వగానాపె వుండిన రాజసానకేమంటివి
పవ్వళించి సొలసిన పనికినేమంటివి

చ. 3: వెలఁది నిన్నుఁ గూడితే వేడుకతోనేమంటివి
యెలమి శ్రీవేంకటేశ యింకేమంటివి
కొలఁది మీరఁగ నన్నుఁ గూడితి వింతలోలననే
తెలిసితి నీగుట్టల్లా తిరుగనేమంటివి

రేకు: 0203-1 శంకరాభరణం సంపుటం: 08-013

పల్లవి: ఆడమె యింకనేమీ నౌఁగాదనుచుఁ దన్ను
సూడుఁబాడు దిద్దేవాఁడు సుద్దులిన్ని నేరఁడా

చ. 1: పెక్కులు నేర్చినతఁడు బెంబాడిచేఁతలతఁడు
దిక్కులఁ దననేరాలు దిద్దుకోలేఁడా
చక్కని పదారువేలు సతులఁ దెచ్చినతఁడు
పక్కన మావంటివారి భ్రమయించనోపఁడా

చ. 2: రాతిరిపనులాతఁడు రవ్వల కెక్కినతఁడు
భీతిలేక ఆనలెల్లాఁ బెట్టుకోలేఁడా
ఈతల రుక్మిణీదేవి నెత్తుక తెచ్చినతఁడు
చేతులు మాపై జాఁచి చెనకక మానునా

చ. 3: దేవర దానై నతఁడు దిమ్మరివిద్యలతఁడు
యీవేళ నాకోరిక యీడేర్చలేఁడా
శ్రీ వేంకటేశుఁ డితఁడు చేరి నన్నునిటు గూడె
వేవేలు మన్ననలచే వెలయించుటరుదా

రేకు: 0203-2 బౌళి సంపుటం: 08-014

పల్లవి: ఏమి సేసేరో తాము యిద్దరమూనేకము
కామించి తామెంత నన్ను గరశించేరు

చ. 1: అప్పుడు నీవును నేను నాడుకొన్న మాటలే
చెప్పుమనుచును సారెఁ జెలులనేరు
చిప్పిల సరికిబేసిఁ జెనకిన చెనకులే
చొప్పులెత్తి తమకెల్లాఁ జూపుమనేరు

చ. 2: నంటున మనమిక్కడ నవ్వినట్టి నవ్వులే
వొంటినుండి యీడనాతోనూహించేరు
జంటలఁ జెల్లించుకొన్న సరసపు చనవులే
వెంటవెంట వచ్చి వచ్చి వెలుచుకొనేరు

చ. 3: వాడికెనొండొరులము వలచిన వలపులే
కోడి యెరుకలు సేసికొన వచ్చేరు
యీడనె శ్రీవేంకటేశ యెనసితి మింతలోనే
వీడెమిచ్చేమని యిట్టే వేగిరించేరు

రేకు: 0203-3 శ్రీరాగం సంపుటం: 08-015

పల్లవి: ఇంతలోనేమేమి వుట్టునోయింతికి నీవలపుల
చింతదీర విచ్చేసి చిత్తగించవయ్యా

చ. 1: ఆసల నలపువుట్టెనంగన కించుకించుక
వేసటనెదురు చూచి వెరగువుట్టె
పాసిన తమకమునఁ బరాకులెల్లాఁ బుట్టె
సేసేటి నావిన్నపాలు చిత్తగించవయ్యా

చ. 2: చెక్కులఁ జెమటవుట్టె చింతతోడ సిగ్గులను
నెక్కొని రానికోపాన నిట్టూర్పు వుట్టె
వెక్కసపు నీగుణాలు వినివేడుకలు వుట్టె
చిక్కెను నీపాలనిదె చిత్తగించవయ్యా

చ. 3: సెలవుల నవ్వువుట్టె చేరువకు నీవు రాఁగా
కలసిన నీకాఁగిట గర్వము వుట్టె
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా ధైర్యము వుట్టె
చిలుకుఁజెలువములు చిత్తగించవయ్యా

రేకు: 0203-4 కాంబోది సంపుటం: 08-016

పల్లవి: దవ్వుల విరహమోప దగ్గరి గుట్టును నేర
పువ్వువంటిది నామతి బుద్ధులిఁకఁ జెప్పరే

చ. 1: తమకించి పాదిగితే తరితీపు చాలదు
జమళి సిగ్గులైతే చవిలేదు
తెమలని వొరపైతే తేఁకువలు మెరయవు
భ్రమసి వుందాన నింకఁ బతితో నేమందునే

చ. 2: పక్కన నే నవ్వితేను పంతానకు వెలితయ్యీ
లక్కవలెఁ గరఁగితే లావు చాలదు
వెక్కసానఁ బెనఁగితే వేసటలు గనమౌను
యెక్కడనున్నదో మేను యిట్లానుందాననే

చ. 3: తొలుత నేఁ జెనకితే దొమ్ములయ్యీఁ జేఁతలు
తలవంచుకుండితే దంటనందురు
కలసెను శ్రీవేంకట ఘనుఁడింతలో నన్ను
నెలకొంటి సంతసాన నేరుపులింకెట్టివే

రేకు: 0203-5 కేదారగౌళ సంపుటం: 08-017

పల్లవి: విన్నవించనేమున్నది వేగినంతాను
యిన్నిటా నీసొమ్ము నేను యీడేర్తువు గాక

చ. 1: యెదురు చూచితి నీకు నింతులచేఁ జెప్పించితి
వెదకితి నీవుండేటి విడిదలను
చెదరని వలపులు చిమిడితేఁ గొరయౌనా
పదను దప్పకుండాను పాలింతువుగాక

చ. 2: పట్టితి వ్రతము నీకు పైపైఁ దమకించితిని
బెట్టి పేరుకొని నిన్నుఁ బిలచితిని
వెట్టిగాని మనసిది వేఁచితేను చవియౌనా
యిట్టే పసివాడకుండా నేలుదువుగాక

చ. 3: వేళలు గాచితి నీకు వేగించితి నిందాఁక
మూలమైనదేవరకు మొక్కుకొంటిని
యీలీల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
బాలకి నన్నిట్టే చేపట్టుదువు గాక

రేకు: 0203-6 సామంతం సంపుటం: 08-018

పల్లవి: కక్కసించc బనిలేదు కడనున్నవారికెల్లా
చక్కని నీవలపులే సాదింతువెపుడు

చ. 1: చనువుగలవారిది చక్కనిమాట
వినవలసితే నీవు వింటివప్పుడే
మనసువచ్చినవారి మనవులెల్లా
కనుసన్నలోననే కైకొందువపుడే

చ. 2: చెల్లుబడిగలవారు చేసినచేఁత
చెల్లc బెట్ట వలసితేc జెల్లింతువు
వుల్లమువచ్చినవారి వూడిగాలెల్లా
మెల్లనే యేపాటైనా మెత్తువు నీవు

చ. 3: అంది పొందినట్టివారి యాసలెల్లా
యెందునున్నానొనగూర్చి యీడేర్తువు
కందువ శ్రీవేంకటేశ కలసితివి
ముందె నన్ను మెచ్చితివి ముచ్చటతోనపుడు

రేకు: 0204-1 సాళంగనాట సంపుటం: 08-019

పల్లవి: మనసుకుఁ గమ్మటి నీమనసే తారుకాణ
వెనక ముందరనవి విచ్చిచెప్పరాదు

చ. 1: సతి నీతో విన్నవించే జవ్వనపుఁగతలెల్ల
సతమై కొననాలికెఁ జదివితివి
యితరులేమీ నెఱఁగరిద్దరును నవ్వుకోఁగా
వితగాని మీపనులు వెల్లవిరులాయను

చ. 2: సుదతి నీకునొఁగే సోబనపక్షంతలు
అదన నీవు మీఁజేతనందుకొంటివి
అదె పెండ్లి పేరటాననాపె నీవుఁ బెనఁగఁగ
పదిలపు మీగుట్టు బట్టబయలాయను

చ. 3: కలికి సూడిదవట్టే కమలపు మొగ్గలను
వొలిసి నీవురమున నొత్తుకొంటివి
సొలసి శ్రీవేంకటేశ చూచేటి మీచూపులను
తెలిసి మీరతులెల్ల తేటతెల్లమాయను

రేకు: 0204-2 పాడి సంపుటం: 08-020

పల్లవి: కాంత నీసందిమోహము గానవచ్చెను
చింతదీర బుజ్జగించి చిత్తగించరాదా

చ. 1: మొగమునఁ గళదెరె మోవిపైకి నవ్వువచ్చె
మగువ నీతోనేమని మాట చెప్పెనో
సగటున నటునిటు పరాకులేల సేసేవు
తగు విన్నపములవధరించరాదా

చ. 2: కన్నులఁ దేటలువారె కాయమెల్లాఁ బులకించె
కన్నె నీతోనిఁకనేమి సన్నసేసెనో
చిన్నితేఁతసిగ్గులను శిరసేల వంచేవు
వన్నెల నేకతాన కవసరమీరాదా

చ. 3: నిలువెల్లఁ జెమరించె నిట్టూరుపులు రేఁగె
కలికి నిన్నెటువలెఁ గాఁగిలించెనో
అలమి శ్రీవేంకటేశ అట్టెనీవు గూడితివి
మలసి యిటువలెనే మన్నించరాదా

రేకు: 0204-3 శ్రీరాగం సంపుటం: 08-021

పల్లవి: ఎడమాటలిఁకనేల యెందాఁకాను
విడువరాని బాసలు వెంట వచ్చినయ్యా

చ. 1: పడఁతి పయ్యదలోని పాలిండ్లు నీకునిట్టె
విడిదల సేసెనిందు విచ్చాయవయ్యా
వుడివోని వలపుల వులుపా వట్టినదిదె
వెడఁగుఁదనాలేఁటికి విచ్చేయవయ్యా

చ. 2: కందువ తేనెల మోవి కలగంపుచూపులతో
విందులు నీకుఁ బెట్టీ విచ్చేయవయ్యా
కందువమాటలఁ జెప్పి కడునుపచారాలు
విందువుగాని యీడకు విచ్చేయవయ్యా

చ. 3: కూడఁగఁ దనమేను చిగురుఁబానుపుగా నీకు
వేడుకఁ బరచెనిదె విచ్చేయవయ్యా
యీడనె శ్రీవేంకటేశ యింతిని గలసితివి
వీడెమిచ్చినిట్లనే విచ్చేయవయ్యా

రేకు: 0204-4 మంగళకౌశిక సంపుటం: 08-022

పల్లవి: ఎరఁగరటే ఆతనినెందాఁకనే
తరితీపు సేసేటి మీతగవెందాఁకానే

చ. 1: ఇక్కడనుండే విభుఁడు యెదురుచూచును నాకు
యిక్కడనే శింగారించే రెందాఁకనే
వెక్కసమ్మై నామాటకు వీనులాలకించునట్టే
చుక్కబొట్టే పెట్టఁబట్టె సూటియెందాఁకనే

చ. 2: సొరిదినింతక (కు?) నా సుద్దులే యడుగుచుండు
యిరవుగఁ గొప్పువెట్టేరెందాఁకనే
మరపి యాతఁడు నన్ను మనసులోఁ దలపోయి
తిరముగ పల్లకి దెచ్చుటెందాఁకనే

చ. 3: మలసి నాకుఁగా లోన మంతనమాడుతానుండు
యెలమిఁదోడుక వచ్చేరెందాఁకనే
కలసితినిట్టె వచ్చి ఘను శ్రీవేంకటేశ్వరుఁ
గొలిచి యిట్టేవుండే గుట్లెందాఁకనే

రేకు: 0204-5 నాదరామక్రియ సంపుటం: 08-023

పల్లవి: వేగిరించనేల నీతో వేమారును
బాగులు నీవెఱఁగనివా బతికించేవాఁడవు

చ. 1: వన్నెల నీమీఁద నేను వలపెంత చల్లినాను
మన్నించేవాఁడవు నీవె మాఁటిమాఁటికి
విన్నపాలప్పటి నీతో వేగినంతాఁ జేసినాను
సన్నల నీచిత్తమే సమ్మతించేది

చ. 2: జవ్వనమదాన నీతో సరసమెంతాడినాను
నవ్వేటివాఁడవు నీవే నానాఁటికి
రవ్వగా నీచెయ్యివట్టి రతికెంత దీసినాను
నివ్వటిల్లఁ గరఁగేది నీదేహమే

చ. 3: చెలరేగి నేనెంత సిగ్గులతో మొక్కినాను
కలసేవాఁడవు శ్రీవేంకటేశ నీవే
నిలువునఁ జెమరించె (చి?) నే నిన్ను నెనసితే
కలదెల్ల నీకరుణే కందువైనది

రేకు: 0204-6 బౌళి సంపుటం: 08-024

పల్లవి: ఇద్దరుఁ దెలుసుకోరే యిన్నిటా జాణలు మీరు
పొద్దునఁ దెర వేసేము పొలఁతుల మిపుడు

చ. 1: మొలచెనది గదవే మోవినే చిరునగవు
తలఁచిన పని యేదో తరుణి నీవు
చెలువుఁడంతటిలోనె సిగ్గువడీ నీయెదుట
యెలమిఁ దెలియవు మాకిటమీఁది పనులు

చ. 2: చెమరించెనదిగదే చెలియ నీమేనెల్ల
తమకించిన పనేదొ తగిలి నీవు
జమళినాతఁడందుకు సన్నల మెచ్చెఁ గన్నుల
సమములై తోఁచీ మాకుసంతోసపుఁబనులు

చ. 3: పొడమెనదిగదవే పులకలు నీమేన
జడిగొన్న నీలోనిసంతోసమెంతో
అడరి శ్రీవేంకటేశుఁడలమె నిన్నంతలోనే
వుడివోనివాయ మాకు వుద్యోగపుఁబనులు

రేకు: 0205-1 ఆహిరి సంపుటం: 08-025

పల్లవి: పగవారికైనా నిట్టిపాటు వద్దయ్యా
తెగువలు నీవురాఁగాఁ దిప్పుకొంటిఁ గాని

చ. 1: నీసుద్దులే ఆడుకొంటా నెలఁతలతోడుత
ఆసలు మతిఁ బెట్టుక అలసితిని
గాసిలినమీఁద కాఁకలు దొట్టించఁగాను
వీసమంత పొద్దైనా వేగించరాదాయ

చ. 2: చొప్పుగా నీకెదురులు చూచిచూచి వాకిటను
రెప్పల ముయ్యఁగలేక రేసువడితి
వుప్పతిల్లు వలపెల్ల నొక్కమాటె రేఁగఁగాను
నిప్పువంటి తమకము నీఁగఁగ రాదాయను

చ. 3: కందువకు నీవురాఁగా గక్కనఁ గాఁగిట నించి
యిందుకా శ్రీవేంకటేశ యిట్టె మెచ్చితి
విందుల నీరతులలో వేడుక పిక్కటిల్లఁగా
సందడించి కుచములు సదమదమాయను

రేకు: 0205-2 వరాళి సంపుటం: 08-026

పల్లవి: రండూ నేరుతువే రమణి నీవు
వెండిపైఁడి వుంగరాలు వేలనే పెట్టితివే

చ. 1: అంగములు గరఁగఁగా నాతనితో మాటలాడి
యెంగిలినవ్వులు చిందేవేమే నీవు
వెంగెముల లోపలనే విరహపుటెండ గాసె
చెంగట వెన్నెల గొంత సెలవిఁ జూచితివే

చ. 2: కనుఁగవ చూపులను కాంతునిఁ దప్పక చూచి
కొనగోరితాఁకులను గొసరేవే
తనివోక తొలుతను తామెరవిరుల వేసి
వెనకఁ జందురులను వెంటనంపితివే

చ. 3: గక్కన శ్రీవేంకటేశుఁ గాఁగిటను లాలించి
వొక్కమాటే చన్నులను వొత్తేవిపుడు
తెక్కులను నడురేయి తీగెల గూండ్లువెట్టి
జక్కవ పులుగులను సారెఁ గూడించేది

రేకు: 0205-3 గౌళ సంపుటం: 08-027

పల్లవి: రాఁగా రాఁగా వలపులు రచ్చబడీని
చేఁగదేరి వున్నాడవు చెల్లు నీకునిపుడు

చ. 1: వేసారవు నీవైతే విన్నపాలు వినుటకు
సేసేనంటే యెంతలేదు చెలియకును
యీసుద్దులకే వున్నారమిద్దరికి నడుమను
చేసినట్లు చేయవ చెల్లు నీకునన్నియు

చ. 2: తనియవు నవ్వి నవ్వి దగ్గరిన వేడుకల
చెనకఁగ నెంతలేదు చెలియకును
ననుపుల వంకలొత్త నడుమ నేమున్నారము
చినికేవు తరితీపు చెల్లు నీకు నింకను

చ. 3: విడువవు నీవిట్టె వెలఁది చెఱఁగు వట్టి
చిడిముడి పడదు యీచెలి యిందుకు
యెడయక శ్రీవేంకటేశ యిట్టె కూడితిరి
చెడదు మావూడిగము చెల్లు నీకునిపుడు

రేకు: 0205-4 మధ్యమావతి సంపుటం: 08-028

పల్లవి: ఏది నాకు బుద్ధి యిఁకనేమి సేతును
యీాదె నీకృప నాపై యిరవైవున్నది

చ. 1: మందలించి నీతో నేను మాటలాడేనంటేను
యెందునో పరాకు నీకు నేమిసేతును
విందువెట్టి మోవితేనె వెసనీకిచ్చేనంటే
చిందరై నీయధరము చీకాకై వున్నది

చ. 2: నవ్వు నవ్వి నీతోను నటనలు నేనేనంటే
యెవ్వలనో జూడమాడేవేమిసేతును
పువ్వువలె నీమేను పొదిగి భోగించేనంటే
చివ్వనఁ బెంజెమటల చిత్తడి మైనున్నది

చ. 3: పరపుపై నిన్నునేను పచ్చిగాఁ జేసేనంటే
యిరవుగా వేడుకొనేవేమిసేతును
గరిమె శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
నిరతపు నీమోహము నిజము నాకైనది

రేకు: 0205-5 శుద్ధవసంతం సంపుటం: 08-029

పల్లవి: ఇచ్చగించి నవ్వు నవ్వేవేమనేవయ్యా
యెచ్చుకుందు లేదు మీలోనిఁకనానతీవయ్యా

చ. 1: యిందుముఖి నీకు మొక్కి యిచ్చెనిదివో కానికె
అందుకు నీవేమనేవు ఆనతీవయ్యా
చెంది నీతో సిగ్గువడి చేరువ నిలుచున్నది
యెందాఁకా వట్టిజోలి యిఁకనానతీవయ్యా

చ. 2: కన్నులఁ దప్పక చూచి కంబము వట్టుకున్నది
అన్నినాయ నీతలఁపు ఆనతీవయ్యా
సన్నలు మాకుఁ జేసీ సంగడికిఁ దెమ్మనుచు
యెన్నరాదు తమకము యిఁకనానతీవయ్యా

చ. 3: యేకశయ్యమీఁదనుండి యెడమాటలాడించీ
ఆకతలవి యెట్టివో ఆనతీవయ్యా
కైకొని శ్రీవేంకటేశ కాంతనిట్టెకూడితివి
యేకాలముఁ బాయమని యిఁకనానతీవయ్యా

రేకు: 0205-6 భైరవి సంపుటం: 08-030

పల్లవి: కంటిమి వింటిమి నీకతలు నేఁడు
నంటుననే ఆసలు సానలఁ బట్టేవా

చ. 1: కన్నులనే సొలసేవు కాఁకలనే ఆలసేవు
కన్నెరొ నీకాతనికి కలదా పొందు
నన్ననేల మొరఁగేవు నాకునేల దాఁచేవు
సన్నలనే వలపులు చవిగొనేవా

చ. 2: సెలవులనే నవ్వేవు చెక్కులు చెమరించేవు
మలసి మీ యిద్దరికి మాటలందెనా
చెలఁగి యేల బొంకేవు సిగ్గులేల పెంచేవు
వెలినుండే రతులెల్లా వెలసేసేవా

చ. 3: భావములనె చొక్కేవు పైపైఁ బులకించేవు
శ్రీవేంకటేశ్వరు మేలు చేకూడెనా
పూవువలెఁ బొదిగేవు బుసకొట్టే వింతలోనె
యీవిధాన నేమిమ్ము యెనయించనేరనా

రేకు: 0206-1 ముఖారి సంపుటం: 08-031

పల్లవి: ఇంత యేఁతురా సతులనెందాఁకాను
యెంతవడికెంతవడి యిప్పుడా నీవలపు

చ. 1: మాటలకు తుదలేదు మనసుకు గురిలేదు
యేఁటికి మమ్ము బోదించేవెందాఁకాను
కాటుకకన్నుల నీరుగ్రమ్మ నెదురుచూచితి
యీటులేక బుజ్జగించేవిపుడా నీవలపు

చ. 2: నవ్వులకు గుట్టులేదు నంటునకు వెలలేదు
యివ్వలనేఁటికి యానలెందాఁకాను
చివ్వన నిట్టూర్పురేఁగ చెక్కునఁ జేయి వెట్టితి
వె(నె?)వ్వరి సాకిరివేట్టేవిప్పుడా నీవలపు

చ. 3: ఆసలకు తనివి లేదాయాలకు సిగ్గులేదు
యేసేవు చూపుల యమ్ములెందాఁకాను
నేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ్వర నేఁడు
యీసుదీరఁ గరుణించేవిప్పుడా నీవలపు

రేకు: 0206-2 బౌళి సంపుటం: 08-032

పల్లవి: సేయవయ్య నీవు నీచిత్తము వచ్చినట్టల్లాను
యీయెడ నీమతకములెట్టుగాఁగలదో

చ. 1: నగవులే తరచాయ నాకు నీకునేపొద్దు
వగటులే మీఁదమీఁదఁ బాయకున్నవి
మొగముచూపులే కడు ముంచుకొనునేపొద్దు
యెగసక్యాలికమీఁదనెట్టుగాఁగలదో

చ. 2: ముచ్చటలే గనమాయ మోహములనిద్దరికి
రచ్చలఁ బడెను లోలో రతులెల్లాను
పచ్చిదేరెఁ బంతములు పైపై సరసమాడఁగా
యెచ్చరికలిటమీఁదనేమిగాఁగలదో

చ. 3: యేకతాలు సమకూడెనియ్యకోళ్ళేమనకు
వాకులు పోకులు వొక వావి గూడెను
చేకొని శ్రీవేంకటేశ జిగినన్నుఁ గూడితివి
యీకడ మేలుకు మేలులెంతేసి కాఁగలదో

రేకు: 0206-3 ఆహిరి సంపుటం: 08-033

పల్లవి: ఇంకనేడ సుద్దులు యెవ్వరెందుకును దిక్కు
బింకమున నీకే మొరపట్టుతింతే (ట్టుడిం?) కాక

చ. 1: ఆసకొలిపి నీవు అన్నిటాను వలపించి
పాసి వుండితే మనసు పట్టవచ్చునా
నేసవెట్టి పెండ్లాడి చేతికి లోనై
వేసరుకొంటే నాదెస విన్నవించవచ్చునా

చ. 2: పెంచి పెద్దరికమిచ్చి పిలువక సతులలో
కొంచెపరచితేనంత గోడు గలదా
మంచముమీఁదికిఁ దీసి మన్నించి అంతలోనే
కొంచించి నిద్రవోఁబోతే కొల దాఁకదా

చ. 3: కాఁగలించనప్పణిచ్చి కడుఁ జన్నుల నొత్తితే
లోఁగేవు నవ్వరా నిన్ను లోకులెల్లాను
యేఁగి వచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చేఁగదేర మెచ్చితేను చెవి సోఁకెనా

రేకు: 0206-4 సామంతం సంపుటం: 08-034

పల్లవి: కోరి నీకు నీయందే గుక్కిళ్ళున్నవి
యేరీతైనాఁ జేయవచ్చునేమి గొరతయ్యా

చ. 1: పయ్యదలో నీచెలికి పసిఁడిబిందెలున్నవి
తియ్యని మోవిలోన తేనెలున్నవి
ఆయ్యెడ మాటల బెల్లాలప్పటిఁ గొన్ని వున్నవి
యెయ్యెడఁ జూచిన నీకు యేమి గొరతయ్యా

చ. 2: చెంది యాపెమోములోనే చెక్కుటద్దములున్నవి
కందువచూపు ముత్యాల గనులున్నవి
మందలించిన కాఁగిట మర్మములెల్లానున్నవి
యెందునైనా నీసిరులే యేమిగొరతయ్యా

చ. 3: అవిగో కమ్మని వూర్పులాలవట్టములున్నవి
తవిలిన రతుల నిధానమున్నది
కవగూడితిరి శ్రీ వెంకటరాయ మీరిద్దరు
యివలఁ జూచిన మరియేమి గొరతయ్యా

రేకు: 0206-5 రీతి గౌళ సంపుటం: 08-035

పల్లవి: నెయ్యని పోసుకోరాదు నీళ్ళని చల్లఁగరాదు
చెయ్యార(ఁ)గంటిమి నేఁడు చేరి నితోపొందులు

చ. 1: ప్రేమము చాలాఁజేసి పెక్కుసతుల నీతోను
మోముచూడ సిగ్గువడి ముసుఁగుతోనున్నదాన
జాముహోయి వచ్చి నీవు సరసములాడేవు
యేమని నేనియ్యకొందు నేఁటిజన్మమయ్యె

చ. 2: పలుమారు నీతోనవ్వి పరాకై వుండిన నీతో
పలుకఁగ సిగ్గుపడి భావింపుచునున్నదాన
కలగన్నట్లావచ్చి కందువలంటేవు నన్ను
బలిమి యేమున్నది నాబదుకు నీచేతిది

చ. 3: మచ్చికతో నిన్నుఁ గూడి మన్నించిన నీతోను
పచ్చిసేయ సిగ్గువడి పదరక వున్నదాన
యెచ్చుగా శ్రీవేంకటేశ యిట్టె నన్నునేలితివి
విచ్చన విడాయ నా విభుఁవములెల్లను

రేకు: 0206-6 పాడి సంపుటం: 08-036

పల్లవి: నేనేమీననఁ జూమ్మీ నెలఁతలాల
తానకమై సిగ్గువడీ తాఁదానే

చ. 1: అప్పుడు వచ్చేనని యానలు వెట్టినవాఁడు
తప్పని బొంకనివాఁడు తాఁదానే
ముప్పిరి నేనింతలోనే మోముచూచి నవ్వితేను
దప్పిదేర సిగ్గువడీ తాఁదానే

చ. 2: పుక్కు మీరి విరహాన పుడికించినట్టివాఁడు
తక్కికరుణించేవాఁడు తాఁదానే
ముక్కుమీఁద వేలిడుక మోనమున నేనుండితే
దక్కి సిగ్గుల మునిఁగీ తాఁదానే

చ. 3: అగపడి రాజసాననట్టె విఱ్ఱవీఁగేవాఁడు
తగిలి కూడినవాఁడు తాఁదానే
జిగిమించి రతులలో శ్రీవేంకటేశ్వరుఁడు
దగదొట్టి సిగ్గువడీ తాఁదానే

రేకు: 0207-1 సామంతం సంపుటం: 08-037

పల్లవి: పొద్దువోనివాఁడవై పూఁచి మమ్ముఁ జెనకేవు
సుద్దులు చెప్పినవారు సూడిచ్చేరా

చ. 1: ఆడినమాటకుత్తరమాపె నీకీవలెఁ గాక
వాడికచెలుల మెల్లా వాదించేమా
జాడగాదు మాతోనేల సరసాలాడేవు
వీడేలందుకొన్నవారు వియ్యమందేరా

చ. 2: చేసినచేఁతకుఁజేఁత చెలి నిన్నుఁ జేసుఁగాక
యీసుదీర్చెచెలులము యియ్యకొనేమా
సేసలువెట్టితినంటా చెరగులేల పట్టేవు
కైసేసిన పేరఁటాండ్లు కాలుదొక్కేరా

చ. 3: కొంకక నీరతులకు గురి నీదేవులే కాక
వంకలొత్తే చెలులము వావి చెప్పేమా
కంకిగా శ్రీవేంకటేశ కాంత దానే వచ్చి కూడె
లంకెల చుట్టాలము మేలములాడేమా

రేకు: 0207-2 ముఖారి సంపుటం: 08-038

పల్లవి: తెలిసితిమిన్నాళ్ళకు దేవరగుట్టు
వెలుపల లోపల వెలసితివింతటా

చ. 1: కాయము వొక్కతెమీఁద కనుచూపొక్క తెపై
ఆయనాయనెంత నీకు ఆసోదము
యేయెడఁ జూచిన నీవు యిరుమొనసూదివై
చాయలకు నాలుగుహస్తములు ధరించితి

చ. 2: వుండేది వొక్కతెయింట పండేది వొక్కతెవద్ద
రండును నడుపేవు నీ రాజమున
పండును గాయయునైన బలుపుల్లదొరవై
యెండ నీడ కన్నులను యెలయించేవిపుడు

చ. 3: వురమున మహలక్ష్మి వుర్విని వీఁపున మోవి
సిరుల మించేవు నేఁడు శ్రీవేంకటేశ
తొరలించి వలపుగుదులు గుచ్చినవాఁడవై
పరమున నిహమునఁ బాయవు నీవిపుడు

రేకు: 0207-3 భైరవి సంపుటం: 08-039

పల్లవి: నీకునీకే యేలికవు నేనంటినా
కాకరివిద్యలఁ బొంది కరఁగేవుగాక

చ. 1: తీయని నామోవిమీఁద తేనెల తీపులేకాక
వోయయ్య ఆమాటలలో వొగరున్నదా
నీయంతనీవు సేసేటి నెరసులచేఁతలలో
పాయక వెంగేలుంద భ్రమసేవుగాక

చ. 2: కన్నుల నాచూపులలో కమ్మిన తేటలేకాక
యెన్నటికెన్నటి సుద్ది యెఱ్ఱనున్నవా
నిన్న మొన్న నించుకొన్న నీమేనిరేకలు చూచి
పన్ని వొక్కటొక్కటే భావించేవుగాక

చ. 3: నెట్టన నాచేఁతలలో నిండు సరసమేకాక
గట్టివజ్రపుగోళ్ళ ఘాతలున్నవా
యిట్టె శ్రీవేంకటేశ యెనసితివిటునన్ను
గుట్టున నవియూనిదీ గూడించేవుగాక

రేకు: 0207-4 నాట సంపుటం: 08-040

పల్లవి: ఎంతసటకాఁడవో యెవ్వరి నెలయించేవు
చింతించితే నాకైతే చిమ్మిరేఁగీఁ గోపము

చ. 1: కన్నుల జంకించేవు కడుసోఁకనాడితేను
సన్నలు సేసేవు నీవు సాదించితేను
యిన్నిటా సోఁకనాడితే యెట్లానయ్యానీకు
నిన్నుఁజూచి నాకైతే నిండుకొలది గోపము

చ. 2: చేయిచేతదిమేపు సెలవుల నవ్వితేను
కాయము సోదించితే యేకతమాడేవు
ఆయాలు నేఁదడివితే నలుపేల వచ్చెనీకు
మాయలుచూచి నాకైతే మక్కళింనీఁ గోపము

చ. 3: నించేవు కాఁగిటను నిన్నుఁజూచి నవ్వితేను
మంచముపైకిఁదీసితే మన్నించేవు
యెంచఁగ శ్రీవేంకటేశ యింపులెట్లాయనీకు
అందలమోవిగంటికి నందుకొనీఁ గోపము

రేకు: 0207-5 శ్రీరాగం సంపుటం: 08-041

పల్లవి: ఇంతయేటికి చాలు నిందరూ వినేరు
రంతుసేయకిపుడిట్టే రావయ్యలోనికి

చ. 1: కోపములెల్లాఁ బాసె కొఱతలెల్లాఁ దీరె
ఆపొద్దే నీవురాఁగా నలుకమానె
నీపలుకులెల్లావింటి నీవు వేఁడు కొననేల
రాఁపుసేయకిపుడిట్టే రావయ్యలోనికి

చ. 2: వేసటయించుకలేదు వెరపులు పనిలేదు
సేసలునీవు వెట్టఁగఁ జింతయింకేలా
నీసేఁతలెల్లా మంచివే నిన్నునాడఁజోటులేదు
రాసికెక్కెవలపులు రావయ్యలోనికి

చ. 3: చెమటలు చల్లనారె చిత్తముపుడుకు వోయ
నెమకి శ్రీవేంకటేశ నీవుగూడఁగా
తమకములిద్దరిని తప్పులెవ్వరికి లేవు
రమణుఁడ నీకు మొక్కే రావయ్యాలోనికి

రేకు: 0207-6 దేవగాంధారి సంపుటం: 08-042

పల్లవి: రారే ఆతనినేల రవ్వసేసేరు
దూరించుకోఁడు వచ్చిసంతోస పెట్టీనిపుడు

చ. 1: చతురుఁడైనవాఁడు చనవులిచ్చినవాఁడు
సతిఁ గరుణించి మన్నించక మానునా
మతిలోఁ బాయనివాఁడు మనముచెప్పినదాఁక
యితవెరగనిచేఁత లింతసేసీనా

చ. 2: మాటలాడేయట్టివాఁడు మర్మమెరిఁగినవాఁడు
ఆఁటదానికి బాసిచ్చి అదెరఁగఁడా
సూటిదెలిసినవాఁడు సొలసి యందరిచేత
కూటమిఁ గొసరింపంచుకొనఁ బోయీనా

చ. 3: శ్రీ వెంకటాద్రివాఁడు చేరి నమ్మించినవాఁడు
యీవనితఁ గలసి తానెరవయ్యీనా
దేవుఁడితఁడైనఁవాఁడు తెరవలు నవ్వేదెల్ల
భావించుకొనుచు మేలే పచరించఁడా

రేకు: 0208-1 రామక్రియ సంపుటం: 08-043

పల్లవి: సాకిరులు నేము నేమే సతులుమీరడుగరే
దీకొనిమానిజములు దెలుసుకోరే

చ. 1: పొంచి తాను నగఁగాను బొమ్మల జంకించితిని
తెంచక చెలులు పాడి దీర్చరే మీరు
కంచముపొత్తుకు రాఁగాఁ గప్పురాన వేసితివి
యెంచక యెవ్వరిది మేలేర్పరచరే

చ. 2: పేరుకొని పిలువఁగఁ బెదవుల గొణఁగితి
తేరిచి మాడుఁబాడు దిద్దరే మీరు
చేరి జారించెఁ బయ్యద చేతఁ గొప్పువట్టితి
సారపు మాపంతములు చక్కఁ బెట్టరే

చ. 3: మోవిదానె యియ్యఁగాను మొనపల్లు సోఁకించితి
శ్రీవేంకటేశునకు నాకుఁ జెప్పరే బుద్ధి
దేవుఁడు తా నన్నుఁ గూడె తెలిసి నేనే మొక్కితి
యేవలఁ జూచిన మీరు యిఁక నేమనేరే

రేకు: 0208-2 సౌరాష్ట్రం సంపుటం: 08-044

పల్లవి: మమ్మేమి బుజ్జగించేవు మాకేమి
సమ్మతించి నీకు సంతోసములై తేమేలు

చ. 1: పయ్యద జారిననేమి భ్రమసిన నేమి నేను
నెయ్యమెంత చేసినాను నీకుమేలు
యియ్యెడ సతులతోన నెమ్మెలు మెరసేనీకు
అయ్యజియ్యవెట్టినాను అప్పటినిమేలు

చ. 2: పవ్వళించి వుంటేనేమి బడలి వుండితేనేమి
నివ్వటించి కాఁగిలించ నీకుమేలు
రవ్వగా నీకొలువులో రాజసము చెల్లించి
పువ్వులవేసినందుకు పొగడితే మేలు

చ. 3: తలవీడి వుంటేనేమి తప్పకచూచిననేమి
నెలవునఁగూడితివి నీకుమేలు
చెలఁగి శ్రీవేంకటేశ చేత నన్ను నేలితివి
యెలమి మనసరసాలెందుకైనమేలు

రేకు: 0208-3 హిందోళవసంతం సంపుటం: 08-045

పల్లవి: మనసెఱిఁగినకల్ల మానుపరాదు
యెనలేనిదొరవు నీవేమిసేతువయ్యా

చ. 1: దప్పిగొంటివని నీకు దయదలంచితిఁగాక
చిప్పిలి యేపనులో చేసితివంటినా
రెప్పలెత్తి చూచేవు రేసలువుట్టఁ దిట్టేవు
నెప్పున నామోము చూచి నీకేల కలఁగ

చ. 2: కళలు నీమోముననే కానవచ్చీనంటిఁగాక
సొలసి నీరతులలో చొప్పులెత్తేనా
చలముల జంకించేవు సన్నలను సాదించేవు
నెలవై నాయిచ్చలకు నీకేల కలఁగ

చ. 3: నేరుపరివౌదువని నిన్ను నేమెచ్చితిఁగాక
తారుకాణ సేసి మాట తగిలించేనా
యీరతి శ్రీవేంకటేశ యెనసితివిటునన్ను
నీరచనకు నవ్వితే నీకేల కలఁగ

రేకు: 0208-4 శంకరాభరణం సంపుటం: 08-046

పల్లవి: తానేడ ఆతఁడేడ దయలు దలఁచ వచ్చీ
యీనెపానఁ గంటిమిగా యివిగొన్ని సుద్దులు

చ. 1: నగుతా నాతనినంటే నాతో నీపె వాదించీ
తగవు చెప్పరే మీరు తనమగఁడా
జిగితో నేనేకతానఁ జేసేటి చేఁతలవేళ
అగపడి తానప్పుడడ్డాలువచ్చీనా

చ. 2: కొప్పు నేజారఁదీసితే కురులు దాఁగూడదువ్వీ
తప్పక చెప్పరే మీరు తనమగఁడా
చిప్పిలు రతులలోనఁ జీకాకు సేసేటివేళ
అప్పటివలెనే తావహించుకవచ్చీనా

చ. 3: చెమరించ నేఁగూడితే చేరి తావిసరవచ్చీ
తమకించక చెప్పరే తనమగఁడా
జమళి శ్రీవేంకటేశు సాదించేటి యట్టివేళ
గమిగూడుకొని తాను కావఁగవచ్చీనా

రేకు: 0208-5 నాదరామక్రియ సంపుటం: 08-047

పల్లవి: రచ్చలఁబడెవలపు రావయ్యాఁ
చెచ్చరవచ్చి ప్రియాలు చెప్పించుకోవయ్యా

చ. 1: దగదొట్టెవలపు తరుణి నిట్టూర్పుల
యెగసక్కెములు సేసే వేమయ్యా
చిగిరించెవలపు చిత్తములో కోరికల
మొగముచూచియైన మొక్కించుకోరాదా

చ. 2: కుచ్చిపారీ వలపులు కొమ్మచెమట యేరుల
మచ్చరమేమి గల్లాను మానవయ్యా
పచ్చనాయ వలపులు పలు పులకపైరుల
ముచ్చటాడి ఆపెచేత మొక్కించుకోరాదా

చ. 3: నాని విరిసె వలపు నాతి సెలవినవ్వుల
లేని తరితీపుమాని లేవయ్యా
కోనల శ్రీవేంకటేశ కూడితిరి మీరిద్దరు
మోనాన నూరకే యిట్టె మొక్కించుకోరాదా

రేకు: 0208-6 దేశా(సా)క్షి సంపుటం: 08-048

పల్లవి: చెప్పరాదు వాయెత్తి చేసేటి మీ చేఁతలెల్ల
కప్పిన నీగుట్టెల్లఁ గానవచ్చునిఁకను

చ. 1: కామిని యిప్పుడు నీతోఁ గన్నులనే మాటలాడె
ఏమని యనినదో యెఱఁగఁగాని
వాములై నవవిగొన్ని వలపులు పులకలై
యీమాట కామాఁట యెనవచ్చునిఁకను

చ. 2: చెలియ యిప్పుడు నీకుఁ జేతులార సేవచేసె
చల్లపట్టి మర్మమెత్తి సాదించఁగాని
నిలువెల్లఁ జెమరించె నీఁకు మోహరసములై
తలఁపులు తలఁపులు తారుకాణే యిఁకను

చ. 3: అంగన యిప్పుడు నిన్ను నాయములంటఁగఁ గూడె
పంగించి మీభావములేర్పరచఁ గాని
యింగితాన శ్రీవేంకటేశ నీవే నవ్వితివి
యెంగిలి మీమోవులివి యేరుపడెనిఁకను

రేకు: 0209-1 లలిత సంపుటం: 08-049

పల్లవి: పండిపొల్లవోయీనా పట్టరానిమనసు
యెండకు నీడకుఁ దీసి యింతకోపఁగలనా

చ. 1: చాలుఁజాలు చెలియ చవిగాదుసొలయ
మేలువాఁడై తేఁగదా మీరఁజూచేది
నాలికాఁడు మొదలనే నవ్వులనె పొద్దువుచ్చీ
యేలినప్పుడేలీఁగాక యింతకోపఁగలనా

చ. 2: రావెరావె ముగవా రతికెక్కె తెగువ
మోవులు సోఁకితేఁగదా మొనచూపేది
రావిజిగురై నవాఁడు రచియించీ తరితీపు
యేవివరమో కందము యింతకోపఁగలనా

చ. 3: వింటివింటి కాంతా వేళవచ్చెఁగొంత
తొంటివలెనై తేఁగదా దొమ్మిసేసేది
దంట శ్రీవేంకటేశుఁడు తానేవచ్చి నన్నుఁ గూడె
యింటిలోనే నన్ను మెచ్చీ యింతకోపఁగలనా

రేకు: 0209-2 మంగళకౌశిక సంపుటం: 08-050

పల్లవి: కరుణదెచ్చుక యింతిఁ కాతువు గాక
దొరతనము చూపితే దూరఁగనేమున్నది

చ. 1: నిండుకొన్న విరహాన నిన్నటనుండిఁ జెలి
యెండనుండఁగా నాడించే వెడమాటలు
వండవండనల్లాయ వలచినవలపెల్ల
గుండె రాయిసేకొంటేఁ గొరనేమున్నది

చ. 2: పట్టరాని తమకాన పానుపుపై నుండి చెలి
వెట్టనుండఁగా జల్లేవు వెడనవ్వులు
పటఁ బట్టఁ బాములాయ పంతపుఁ గోరికెలెల్ల
పట్టినదే చలమైతే పలుకనేమున్నది

చ. 3: కన్నుదనియక నిన్నుఁ గాఁగిలించుకుండి చెలి
చన్నులనొత్తఁగ నీవు సారె లోఁగేవు
పన్నఁబన్న పందిలాయ బయలు శ్రీవేంకటేశ
నిన్నునాపెఁ జూచుకొంటే నేరములేమున్నవి

రేకు: 0209-3 లలిత సంపుటం: 08-051

పల్లవి: ఆరంగఁ జూడరే అదె కృష్ణమహిమలు
కూరిమి మించిన గోపికలు

చ. 1: కొట్టేటివుట్లు కోలలగుంపులు
గుట్టులఁ బొంచెడి గోపాలులు
అట్టులుఁ బండ్లు నట్టె చక్కిలాలు
చుట్టుల నెక్కడ చూచినను

చ. 2: యేఁగేటి వీధులు యిండ్లిండ్ల వాకిళ్ల
వాఁగే పంచమహావాద్యములు
దాఁగిలి ముచ్చిమిఁ ద్రావేటి పాలును
చేఁగదేరీనెందు చేయిచాఁచినా

చ. 3: కారేటి జున్నులు గడ్డపెరుగులు
వారలువట్టేటి వైపులును
యీరీతి శ్రీవేంకటేశుని సన్నిది
ఆరితేరె నెంద నరసినను

రేకు: 0209-4 రామక్రియ సంపుటం: 08-052

పల్లవి: నీమనసాపె యెరుఁగు నిక్కముగాను
గామిడితనానఁగాని కలుగదు వలపు

చ. 1: చెక్కు నొక్కి నీవు ముందు చేయివట్టి తీయుదాఁకా
అక్కడనే నిలుచుండె నాపె సాదించి
నిక్కము నింతేసిసేయ నేరిచినవారికిఁగా
చిక్కి చేతికిని లోనై సిద్ధించు వలపు

చ. 2: ననుపున నీవింతేసి నవ్వులు నవ్వినదాఁక
అనువుగా మాటలాడె నాపె సాదించి
పెనఁగేటి యిటువంటి బేసబెల్లివారికేకా
వెనకముందరికెల్లా వెలవెట్టు వలపు

చ. 3: కందువల నీవుగూడిన కరగించిన దాఁకా
అందాన వేళలు గాచె నాపె సాదించి
యిందునే శ్రీవేంకటేశ యిటువంటివారికిఁగా
సందడించి మీయందే సరిదాఁకె వలపు

రేకు: 0209-5 ముఖారి సంపుటం: 08-053

పల్లవి: ఇంకనేల గుట్లు యిన్నియు బయటఁబడె
మంకులెల్లఁదీరె నిఁక మానరాదు పొందులు

చ. 1: చేసినదెల్లా నీపైచెలి చేసినదిచేఁత
వాసినవి కొనగోరి వాఁతలు నివి
తాసువలె వలపులు తారుకాణలకువచ్చె
మూసి మంతనాలేఁటికి మోహరించె పొందులు

చ. 2: ఆడినట్టెల్లఁ జెల్లెనంగన మాటనీతో
వేడుక నీ సొమ్మాయ నీ వినోదముల
వీడుదోడై మీనవ్వులు వెన్నెల తేటలుగాసె
యీడనేల మీసిగ్గులు యితవాయ పొందులు

చ. 3: పట్టినదెల్లాఁ బంతము పడఁతి నీరతులలో
ముట్టినవి చన్నులు నీమొనచేతుల
యిట్టె శ్రీవేంకటేశ యిద్దరును గూడితిరి
అట్టుకెక్కె నిందరిలో నాఁడిడి మీపొందులు

రేకు: 0209-6 గౌళ సంపుటం: 08-054

పల్లవి: వద్దు వద్దు మీలోన వట్టివాదులు
సుద్దుల మాటలకే సూడువట్టేరా

చ. 1: పంతములాడితేనేమి బలిమిచేసితేనేమి
వింతలేని మనసుల వెలఁదులకు
దొంతర వలపులెల్ల తోడుతనే వెంటరాఁగా
యింతమాత్రపు వలఁపు లివి చెల్లవా

చ. 2: గబ్బితనమైననేమి గర్వము చూపిననేమి
వుబ్బేటి జవ్వనముల వువిదలకు
నిబ్బరపు టాసలెల్ల నిండుకొని వుండఁగాను
అబ్బురపుఁ దమకములవి మానీనా

చ. 3: కన్నుల నొక్కిననేమి కాఁగిలించుకొన్ననేమి
నిన్నుఁ గూడి వుండినట్టి నెలఁతలకు
మన్నించు శ్రీవేంకటేశ మరి నీ యాసవుండఁగా
సన్నపు మోవితీపుల చవులెక్కవా

రేకు: 0210-1 నారణి సంపుటం: 08-055

పల్లవి: పంతమిచ్చేఁ గోపయ్య పట్టవయ్య
యింత నీవుమన్నించితే యియ్య కొంటినయ్యా

చ. 1: సెలవికి నవ్వువచ్చె చేరి నీతో మాటాడఁగ
పులివచ్చి సాము నీతో నోపమయ్యా
పులకలు మేననిండె పొంచి వద్దఁ గూచుండఁగ
యెలమి నిన్నొరయఁగ నెంత దాననయ్యా

చ. 2: చెక్కులఁ జెమటనిండె సిగ్గులు నేఁబడఁగా
వొక్కమాటే జాణతనాలోపమయ్యా
చొక్కులు మతికి వచ్చె సుద్దులు నీచేవినఁగ
దక్కె నన్నిపనులును తమకించనయ్యా

చ. 3: కాయము కళలురేఁగె కాఁగిట నిన్నుఁ గూడఁగా
వోయయ్య నిన్నలయించ నోపమయ్యా
యీయెడ శ్రీవేంకటేశ యిట్టైనన్ను నేలితివి
చాయలు సన్నలు లోలో సరివచ్చెనయ్యా

రేకు: 0210-2 కొండమలహరి సంపుటం: 08-056

పల్లవి: కొంక నీకేఁటికి లోనఁగూచున్న దదెచెలి
అంకెకు నీవు రాఁగాను అలుగునా యీకె

చ. 1: ఎక్కడ నీవుండినాను యింతొపొందు నీకు గురి
చిక్కించి యింతికిని నీ చిత్తమే గురి
పుక్కిట చెలులెందరు పోరాటాలు వెట్టినాను
అక్కరగలదు నీతో అలుగునా యీకె

చ. 2: యేమేమి సేసివచ్చినా యింటికి విచ్చేసితివి
కామించి కన్నులఁ జూచె కాంత నీమోము
గామిడి చెలులెంతేసి గడియించి చెప్పినాను
ఆముకొన వలచి నీకలుగునా యీకె

చ. 3: సతులెందరు గల్లా చనవు లీసతివే
దృతినీకుఁ బట్టానకు దేవులాయెను
యితవై శ్రీవేంకటేశ యేకమైరి చెలులెల్ల
అతిరతిఁ గూడె నీతో నలుగునా యీకె

రేకు: 0210-3 వరాళి సంపుటం: 08-057

పల్లవి: వచ్చి వచ్చి రమణుఁడు వాకిట నేల నిలిచె
తచ్చనలెల్లాఁ దెలిపె దగ్గరి రమ్మనవే

చ. 1: వలచిన యట్టివారు వడినేమి యాడినాను
మలసి నవ్వుట గాక మంకులేఁటికి
చలములు సాదించ సవతిపోరాయేమి
తలఁపులో కొదదీర్చ దగ్గరి రమ్మనవే

చ. 2: కొమెరపాయపువారు కొచ్చి కొచ్చి పెనఁగితే
జమళిఁ గైకొంటగాక సటలేఁటికి
వుమురఁ బెట్టగ నట్టె వుక్కిసకూడాయేమి
తమకము చెల్లఁబెట్టె దగ్గరి రమ్మనవే

చ. 3: పొత్తుగూడినట్టివారు పొదిగి కాగిలలించితే
హత్తి మెచ్చవలెగాఁక ఆనలేఁటికి
వొత్తి శ్రీవేంకటేశుఁడు వొడివట్టి నన్నుఁగూడె
తత్తరీఁడు మాటచెప్పె దగ్గరి రమ్మనవే

రేకు: 0210-4 దేశా(సా)క్షి సంపుటం: 08-058

పల్లవి: వట్టిసిగ్గు లిఁకనేల వనితెల యెదుటను
వెట్టదీరనేము తెర వేతుమా యిద్దరికి

చ. 1: పలుకుఁదేనెల విందు పచ్చిమోవి బాగాలు
కలిగె నేఁడు నీకుఁ గాంతవల్లను
పులక పువ్వుల సే బుసకొట్టు సురట్లు
నెలఁత చేకొనె నిదె నీవల్లను

చ. 2: సిరుల నవ్వుగందాలు చెమటల పన్నీరు
దొరకె నేఁడు నీకు తొయ్యలివల్ల
సరసపుఁ బొంతనాలు సళుపుగోరి సొమ్ములు
నిరతినాపెకుఁ గూడె నీవల్లను

చ. 3: గబ్బి బొమజంకెనలు కళలమే సుంకువలు
అబ్బెను నేఁడు నీకు నంగనవల్ల
గొబ్బున శ్రీవేంకటేశ కూడితివి జవ్వనికి
నిబ్బరపు తమి నిండె నీవల్లను

రేకు: 0210-5 ధన్నాశి సంపుటం: 08-059

పల్లవి: వేసవియెండలుండునా వేరె వానకాలానకు
పాసినకాఁకలు రతి పచరించ వచ్చునా

చ. 1: పేరఁబెట్టితే వలపు పెరుగువంటిదెపో
కేరి కాచఁబోతే విరిగి పోవుఁ గాని
గారవించే రమణుని కతలకు లోఁగావే
దూరఁబొయ్యేవుగనక తుత్తుమురౌ మనసు

చ. 2: చవిగొంటే తమకము చక్కెరవంటిదె పో
కవ వాసితే అట్టె కారమౌఁ గాని
నవకపు నాయకుని నవ్వులెల్లాఁ జేకొనవే
తిరిరేరుగనక పై తీగె సాగు చలము

చ. 3: పనిగొంటే జవ్వనము బంగారువంటిదె పో
దినములు దొబ్బితే వన్నెదీఁ గాని
యెనసెను శ్రీవేంకటేశుఁడు న(ని?)న్నింతలోనే
పెనఁగేవుగనక ముప్పిరిగొను బీరము

రేకు: 0210-6 దేవగాంధారి సంపుటం: 08-060

పల్లవి: ఇంకేల మొరఁగేవే యింతి మాతో నేఁడు
లంకెసింగారముల లలి మీరుఁ గాక

చ. 1: చిగురుఁ గెమ్మోవిపై చిలుక వోట్లమరునా
మిగులఁగ కోవిలల మేఁత గాక
జిగిఁ జెక్కుటద్దముల చెమటచిత్తడేలే
పొగరుమెఱుఁగుల కళల పొడి రాలుఁగాక

చ. 2: జక్కవకుచంబులకు చంద్రోదయములేలే
నిక్కి రత్నపుటెండ నిగుడుఁ గాక
పక్కన నడుమును బయలువాఁకనేలే ఆరు
అక్కడ నిట్టూర్పుగాలి అలరుఁ గాక

చ. 3: పొంచి తనువల్లిపై పులకమొలకలు (ల?) దేలె
పంచాస్త్రువిదులందు పరుగుఁ గాక
యెంచగల శ్రీవేంకటేశుఁడిదివో కూడె
ముంచుకొని తలఁబాలు మురుకొనుఁ గాక

రేకు: 0211-1 ఆహిరి సంపుటం: 08-061

పల్లవి: ఏఁటి బుద్దులు చెప్పేరే యింకా నాకు
మాఁటలాడుటగాక మచ్చుచల్లేదా

చ. 1: పతిఁబాసిన నేరమి పైకొని నాకుండఁగాను
అతనినెంతేసి మాఁటలాడుమనేరే
మతిలోని నామంకే మళ్ళవేకొని కొంత
వెతదీర్చుకొంటగాక వేగిరించేదా

చ. 2: పంతమాడిన గర్వపుబలిమి నాకుండఁగాను
రంతుల నాతనినెట్టు రవ్వసేతునే
వంత నా వల్ల వచ్చిన వగపల్లాఁబెడఁబాయ
చింతదీర్చుకొంట గాక సిగ్గువడేదా

చ. 3: కాఁగిటఁ గూడినయట్టి ఘనత నాకుండఁగాను
ఆఁగుచు నాతనినెట్టు అలయింతునే
తోఁగిన చెమటలాడ తోడనే శ్రీవేంకటేశు
రేఁగి నవ్వించుటగాక రిచ్చవడేదా

రేకు: 0211-2 దేసాళం సంపుటం: 08-062

పల్లవి: విన్నపము లిఁకనేల వేగినంతాను
మన్నించకిఁకనుంటే మఱియేది త్రాణ

చ. 1: కాంతకు నీవు చూచిన కనుచూపులే త్రాణ
మంతనాన నీవాడిన మాటలే త్రాణ
పొంత నీపై తలపోఁత పొద్దువోకలే త్రాణ
యింతట నీవురాకున్ననిఁకనేది త్రాణ

చ. 2: నలినాక్షికపుడు నీ నవ్విన నవ్వులే త్రాణ
పలుమారుఁ జేసినట్టి బాసలే త్రాణ
పొలసి నీవువేసిన పువ్వులచెండే త్రాణ
పిలుపించకిఁకనుంటే పిక్కటిల్లుఁ ద్రాణ

చ. 3: సతికి నీకూటమిలో చనవిచ్చుటలె త్రాణ
వ్రతముగా నీవింటికి వచ్చుటే త్రాణ
గతియై శ్రీవేంకటేశ కాఁగిలించి నదె త్రాణ
తతినిట్టె కూడకుంటే తగనేది త్రాణ

రేకు: 0211-3 మధ్యమావతి సంపుటం: 08-063

పల్లవి: ఎన్నిటికిఁక దయ యేడనున్నది
వన్నె చిత్తరువు వ్రాసి వనితఁజేసితివా

చ. 1: చిత్తమెల్ల నీరాయ సిగ్గులెల్ల నెగ్గులాయ
వత్తివలె విరహాన వాడె దేహము
యిత్తల నీవెట్టఁ బొంది యెన్నఁడిఁక వడదేరు
కొత్తగా కరుగుగట్టి కోమలిఁ జేసితివా

చ. 2: చెమ్మగించె తనువల్లి చెక్కులు చేతికివచ్చె
చిమ్మిరేఁగి పులకలచెట్లు మొలచె
తమ్మివలెఁ జెంగలించె తరి యెన్నఁడిఁక తోలు
బొమ్మకు ప్రాణమువోసి పొలఁతిఁ జేసితివా

చ. 3: వీడెపు మోవి వెలసె వెగటులెల్లాఁ బాసె
వేడుక రతులచేత విఱ్ఱవీఁగెను
యీడనే శ్రీవేంకటేశ యింతినిట్టే కూడితివి
నీడకు చైతన్యమిచ్చి నెలఁతఁ జేసితివా

రేకు: 0211-4 కేదారగౌళ సంపుటం: 08-064

పల్లవి: ఆయములకెల్లా గురి అతనుని బాణములు
చాయ చూఁచెకొమ్మనవె జామెక్కెనిపుడు

చ. 1: తలపోఁతలకు గురి తాననేనూనిద్దరము
పలుకులకెల్లా గురిపంతమొక్కటే
సెలవి నవ్వులకును చెలులిందరును గురి
తెలుకో రమ్మనవే తెల్లవారెనిపుడు

చ. 2: తగులాయాలకు గురి తననాసందిపొందులు
పగటులకెల్లా గురి పచ్చిసేఁతలు
అగపడ్డందుకు మేని అడియాలములు గురి
మొగమేది రమ్మనవే ముప్వరజామెక్కెను

చ. 3: ఇచ్చిన కాఁగిళ్ళు గురి యిద్దరితమకములు
విచ్చనవీళ్ళుకు గురి వింతరతులు
యిచ్చట శ్రీవేంకటేశుడింతసేసి కూడెనింకా
మచ్చికెతో రమ్మనవే మద్యాన్న మెక్కెను

రేకు: 0211-5 ఆహిరి సంపుటం: 08-065

పల్లవి: మగువకు దిక్కెవ్వరు మరియును నీవేకాక
తగవు ధర్మాలు నీవే తలపోయ వలదా

చ. 1: యేపున నీయంతనీవు యింతి విచారించకున్నా
ఆపెమాట వినవద్దా అయ్యో నీవు
చాపలాన నీకంటె సవతికి దయవుట్టె
పాపపణ్యములు నీవు భావించుకోవలదా

చ. 2: పంతాన నీకెవద్దికి పైకొని నీవురాకున్నా
కాంతపంపు సేయవద్దా కట్టా నీవు
పొంతనే మొగమోటము పొరుగువారెందుగలిగె
చెంత నీవిచ్చినబాస చెల్లించుకోవలదా

చ. 3: ఇల శ్రీవేంకటేశుఁడ యెంతరాజసమైనా
చెలిమేలు చూడవద్దా చెల్లఁబో నీవు
తొలఁగక కూడితివి తోడియాపె యెచ్చరించఁగ
నెలకొన్న నీ గుణాలు నెరపఁగ వలదా

రేకు: 0211-6 పాడి సంపుటం: 08-066

పల్లవి: తాసువంటిది మన తప్పులు నీకా లేవు
మూసిన ముత్యాలవలె ముంచీని నవ్వులు

చ. 1: పొలఁతికి బాసయిచ్చి బొమ్మచారివై వుండఁగ
చెలి వేరొకతె వచ్చి చేయివట్టీని
బలిమి యెవ్వరిదో పనులు దాదాత మోచె
నిలువునూరు వండీని నీమేనిపలకలు

చ. 2: వనితకు సన్నసేసి వ్రతము వట్టుకుండఁగ
పెనఁగి వేరొకతె తాఁ బిలిచీ నిన్ను
చనవు లెవ్వరిపాలో చవులు రెంటాఁదోఁచి
పొనిఁగి పోఁకను నీపై పుట్టెడమ్మీ వలఁపు

చ. 3: కొమ్మవొకతెతోఁ బెండ్లికొడుకవై నీవుండఁగ
కమ్మర నొకతెవచ్చి కాఁగిలించీని
యెమ్మెల శ్రీవేంకటేశ యిద్దరితో మొగమాట
యిమ్ముల కోటికిఁ బడిగెత్తెను నీరతులు

రేకు: 0212-1 శంకరాభరణం సంపుటం: 08-067

పల్లవి: ఏమైనానాడేవారి నేమందును
మోము చూచితే చెరువుముయ్యమూకుడున్నదా

చ. 1: అడియాలముగ నీవు ఆదేవి సత్యాలే కాక
కడు మావంటి వారితోఁ గల్లలాడేవా
జడిసి తొల్లి అసురతులతో నేమో కాక
తడవితే నేటివేళ తప్పు నీయందున్నదా

చ. 2: చిమ్మిరేఁగ నీవిన్నిటాఁ జేసేవి పుణ్యాలే కాక
పమ్మి నీవొళ్ళ నెంచితే పాపమున్నదా
కుమ్మరించి యీసుద్దులు గొల్లెతలందేమో కాక
నెమ్మది నీపొద్దుకు నింద నీయందున్నదా

చ. 3: దగ్గరితే నీవల్లను దయదాక్షిణ్యాలే కాక
కగ్గిన నిష్ఠూర మించుకంతగలదా
వెగ్గళించి నన్నును శ్రీవేంకటేశ కూడితివి
వొగ్గి నిన్నుదూరఁబోతే వొచ్చము నీకున్నదా

రేకు: 0212-2 సామంతం సంపుటం: 08-068

పల్లవి: ఇంక నీచిత్తముకొద్ది యింతిభాగ్యము
వుంకువ కోరికెలలో నోలలాడీనదివో

చ. 1: వనిత వాలుక చూపు వంచి (అట్టె)
పెనఁగుచు పులకలు పెంచి
మునుకొన్న తమకము ముంచీనదె
గునిసి నీతో నలుగఁ గొంచీనదివో

చ. 2: పొలసి మోహముమాట పొదిగి అట్టె
సెలవుల నవ్వులెల్లాఁ జిదిగి
యెలమి జవ్వనమున నెదిగి
వులివచ్చి గోరుమోప నొదిగీనదివో

చ. 3: మొక్కపుటూరుపులు విసరి అట్టె
గుక్కక పైపై రతులు గొసరి
చక్కని శ్రీవేంకటేశ సతి గూడి నిన్ను
మొక్కుచు మోవితేనెకు ముసరీనదివో

రేకు: 0212-3 భైరవి సంపుటం: 08-069

పల్లవి: కోపించ నేరుతునా గునిసీఁ దాను
తీపుమోవికిఁగా నేల తిట్టీనే తాను

చ. 1: పొద్దువోదా వలపులు పోగువోసి వున్నవా
పెద్దరికేలకు నేల పిలిపించీనే
చద్దివేఁడి జవ్వనాన సడి దనమీఁదవేసి
వొద్దనున్న నన్నింతేల వొరసీనే తాను

చ. 2: మాటలేదా మరి తనమనసుకు రూపుగద్దా
చీటికిమాటికి నేల చేఁత చేసీనే
పాటించిన తమకాన పంతమెల్లా తనకిచ్చి
యేటవెట్టుకొంటే యాలయెగ్గులేఁచీఁ దాను

చ. 3: ఇట్టెకొత్తా తనలోని యెన్నికకు తప్పుగద్దా
పట్టి కాఁగిలించి యాల భ్రమయించీనే
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గూడి నే సంతోసించఁగా
గట్టియైనందుకు నెంత కరఁచీనే తాను

రేకు: 0212-4 తెలుఁగుఁగాంబోది సంపుటం: 08-070

పల్లవి: ఒద్దేలే జగడాలు వోయింతి
సిద్దెబట్టి కోరికలు చిత్తగించఁ గదవే

చ. 1: మొగముచూచి యతఁడు మోవితేనెలడుగఁగా
వొగరులేలాడేవే వోయింతి
నగవుల పంచదార నాథుఁ డందుపై జల్లి
జిగి చవిచేకొనీఁ జిత్తగించఁ గదవే

చ. 2: వాటపు వలపతఁడు వారవట్టుకుండఁగాను
వూటలేల పోఁ జల్లేవే వోయింతి
పాటించి సరసముల పన్నీరతఁడు నించి
చీటికి మాటికి వేఁడీ చిత్తగించ గదవే

చ. 3: అప్పుడే కాఁగిటఁ గూడి ఆయములతఁడంటఁగా
వుప్పతించేవేలె రతులోయింతి
చిప్పిలె కాఁగిటిలోన శ్రీవేంకటేశ్వరుఁడు
చెప్పరాని చేఁత సేసీఁ జిత్తగించ గదవే

రేకు: 0212-5 రామక్రియ సంపుటం: 08-071

పల్లవి: ఏలనాచే మొక్కించేరే యిప్పుడేనన్ను
కాలగాలమున మేలు కనుఁగొనేఁగాక

చ. 1: పంతమే ఫలముగాఁక బ్రదికేటి వారికి
చెంతలఁ బ్రియాలు చెప్పఁజెల్లునటవే
దొంతులు వేరిచేనంటే తోదోపులు వలపులు
కాంతుఁడు మన్నించిన కనుఁగొనేఁగాక

చ. 2: రాజసమే ఫలముగా రచ్చసేసేవారికి
వోజదప్పి కిందుపడ నొనరునటే
సాజము చూచేనంటే చలములు బహళము
పూజ లాతనిచేతనే పొరసేఁగాక

చ. 3: కూటములె ఫలముగా గురియైనవారికి
పాటించి కోపించుకొనఁ బాడియటవే
యీటున శ్రీవేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
తేటలనాతనివల్లఁ దిరమయ్యేఁ గాక

రేకు: 0212-6 సామంతం సంపుటం: 08-072

పల్లవి: ఇద్దరును నవ్విరిదె యెడమాటలికనేల
కొద్దిమీర మనమెల్లాఁ గోరినట్టే ఆయెను

చ. 1: సరసములాఁడగాను చవిపుట్టె వలపులు
విరసపుటలుకలు వెడజారెను
తరితీపులవల్లను తమిపుట్టె మీఁద మీఁద
కెరలిన వోట్లలో కిసరులు వాసెను

చ. 2: కందువలనుండఁగా కన్నులకు నింపులాయ
మందలించె వెనకటి మంకులుమానె
సందడించి పెనగఁగా చనవులు మితిమీరె
చిందువందులై నట్టి సిగ్గు వెడజారెను

చ. 3: ముంచి మాటలాడఁగాను మోవులతేనె దొరకె
చంచలపుఁ గపటాల సడిదీరెను
యెంచఁగ శ్రీవేంకటేశుఁడింతియునుఁ గూడిరిదె
కొంచముదొడ్డెరఁగని కొసరులు దక్కెను

రేకు: 0213-1 హిజ్జిజి సంపుటం: 08-073

పల్లవి: కానీవే యెంతకెంత గబ్బితనము
యీనెపములెల్లాను యెరఁగనటె

చ. 1: నవ్వులనె వొకమాట నటనలనొకమాట
దివ్వెనలనొకమాట తిట్టేవేమే
పువ్వులనె వొకవాటు పోరచినె వొకవాటు
యివ్వలనే వేసితేను యేమిసేసేవే

చ. 2: కన్నులమొనలుచూపి కతలమొనలుచూపి
చన్నులమొనలుచూపి సాదించేవే
నున్ననిగోరుదీసి నూఁగురుల కొప్పుదీసి
యిన్నినే రట్టుసేసితే నేమిసేసేవే

చ. 3: బిగువుఁగాఁగిటఁ బట్టి బీరమునఁ జలపట్టి
పగటున కొనగొంగు పట్టేవేమే
జిగిమించఁగలసితి శ్రీవేంకటేశుఁడఁదాను
యెగసక్కేల దూరితే నేమిసేసేవే

రేకు: 0213-2 మలహరి సంపుటం: 08-074

పల్లవి: ఏలనన్నుఁబాసితివి యిందాఁకానేడపరాకు
తాలిమిగలదాననా తలఁచి నీయడకు

చ. 1: మొక్కితిఁగా అల్లనాఁడె మొరఁగులు మానుమని
తక్కులేక వలచినదాన నేనని
నిక్కపుటాసలు నాలో నిండియుండవివియని
మక్కువనాతోఁగూడి మన్నించుమని

చ. 2: సేవలెల్లాఁ జేసితిగా సిగ్గులు వడకుమని
వేవేలు నావిన్నపాలు వినుమని
భావించునావల్ల నీకు పంతమెల్లాఁజేరెనని
నీవల్లఁ దప్పులేకుండా నెరవేరించుమని

చ. 3: కప్పితిఁగాపయ్యద యీకపటము వాసెనని
చిప్పిలె నాచిత్తము నీచేఁతలనని
యిప్పుడె శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
దప్పిదేరె మోవితేనెఁదనిసితినని

రేకు: 0213-3 నాదరామక్రియ సంపుటం: 08-075

పల్లవి: మీరే యెరఁగరా యిన్ని మేటిజాణలు
మారుమోములిఁకనేల మాటాడరాదా

చ. 1: సతమైన కూరిమికి సాదించనేల
హితవైన వినయాలే యింపులుగాక
కుతిలంబులేని మతి కొరనేల
రతికెక్కె చనవు మెరయుటగాక

చ. 2: ఆసపడ్డ చూపులకు నడ్డాఁకలేల
వేసటలేక నవ్వుటే వేడుకగాక
సేసవాలవాపులకు సిబ్బితియేల
మోసపోని కూటములే ముచ్చటలుగాక

చ. 3: ఆయాలు సోఁకిన పనికచ్చికమేలా
చాయలు సన్నలునే చవులుగాక
యీయెడ శ్రీవేంకటేశ యింతీనీవూఁ గూడితిరి
రేయిఁబగలివే పెరరేఁపులు గాక

రేకు: 0213-4 శుద్ద దేశి సంపుటం: 08-076

పల్లవి: వెల్లవిరాయఁ బనులు వేసాలేలే
గొల్లదానవా నీవు కొంకనిఁకనేఁటికే

చ. 1: కన్నులతేటలు వారె కళలు మోమునమీరె
చిన్నదానవా యింకా సిగ్గులేఁటికే
చన్నులకొండలమీద చంద్రవంకలవె నిండె
కన్నెపడుచవా నీవు కప్పి దాఁచనేఁటికే

చ. 2: పొలుకొనెఁ బులకలు పమ్మె సిగ్గుమొలకలు
గోలదానవా యేమి గుట్టుదాఁచేవే
తూలుచును నీకొప్పు తుమ్మిదలెల్లా బెదరె
బాలదానవా వట్టిభయము నీకేఁటికే

చ. 3: గాఁటపు నిట్టూర్పురేఁగె కమ్మని మోవెల్లరేఁగె
నేఁటిదానవా నీవు నివ్వెరగేలే
యీటువెట్టి శ్రీవేంకటేశుఁడిదె నిన్నుఁ గూడె
మాఁటుదానవా నీకు మతకములేఁటికే

రేకు: 0213-5 సౌరాష్ట్రం సంపుటం: 08-077

పల్లవి: మనలోనే యింతగద్దా మాఁటి మాఁటికి
విసిపించే వినవయ్యా విన్నిపములెల్లను

చ. 1: పక్కన నవ్వినప్పుడే భయమెల్లఁ బాసెనీవు
చెక్కు నొక్కినప్పుడే చింత దీరెను
యెక్కువ ప్రియములతో యేల వేడుకొనేవింత
మొక్కే నుండవయ్యా నీకు మోహించినదానను

చ. 2: దండఁ గూచుండినప్పుడే తగవులెల్ల నీడేరె
కొండల చన్నులంటఁగా కోరికె దక్కె
వెండియు నాకెంతేసి వినయాలు సేసేవు
పండేనయ్యా నీవద్ద నేబత్తిగలదానను

చ. 3: కలసిన యప్పుడే కాయము తనివిఁబొందె
చెలిమి నేసినప్పుడే చెమరించెను
యెలమి శ్రీవేంకటేశ యీడేరితి నీ రతుల
చెలఁగే నిదిగోవయ్య సేవసేసేదానను

రేకు: 0213-6 దేశా(సా)క్షి సంపుటం: 08-078

పల్లవి: సరివచ్చెఁ గదవే చల్లేటి నీవలపులు
గరిమె నీరమణుఁడుల గాలివంటివాఁడు

చ. 1: తాలిమిగలవారికి తలఁపెల్లానీడేరు
అలరి కోపక త్రైలకాలు సోఁకు
యేల తప్పక చూచేవు యెఱఁగవా నీవిది
మేలిమి నీమగఁడు తుమ్మిదవంటివాఁడు

చ. 2: చెంతనున్నవారికి చేతికిఁ జిక్కు బనులు
పంతపు మగువలకుఁ బట్టుఁ జలము
మంతనమేమాడేవు మాఁటిమాఁటికి నాతోను
మంతుకెక్కి పతి నీడమానివంటివాఁడు

చ. 3: కూడినట్టివారికి గుణములెల్లా మంచివి
వేడుక వనితలకు వెలియే లోను
యీడనే శ్రీవేంకటేశునింతినీవు గూడితివి
తోడనితఁడెంచితే చంద్రునివంటివాఁడు

రేకు: 0214-1 మాళవిగౌళ సంపుటం: 08-079

పల్లవి: ఏడనుండా నాసొమ్ము యెందు వొయ్యీనే
వీడెములో కప్పురమే వీనివలపెల్లను

చ. 1: పంతమాడుకొనఁ గాని భావించ నాతనిరూపు
చింతించ నాలోనిదే చెప్పనేలే
దొంతివెట్టి గొల్లెతలు దోమటిదొడుకఁగాను
బంతిచిక్కినట్టి మోవిపండు నే దాఁచితినే

చ. 2: విచ్చి చెప్పఁగాని తనవింతచక్కఁ దనమెల్ల
పచ్చి నాచపులలోనే పదరనేలె
ముచ్చటఁ బదారువేలు ముడిచివేసినపువ్వు
తెచ్చి నేదాఁచుకొంటిని దేవర యెరఁగదా

చ. 3: ఱట్టు నీ నారతి నాఱడి శ్రీవేంకటేశుఁ
డొట్టి వొరసినవొర వొరయనేలె
అట్టె తొల్లిటివారి అరచేతి నిమ్మపండు
గుట్టున నేదీసుకొంటి గుఱుతులడుగరె

రేకు: 0214-2 హిందోళవసంతం సంపుటం: 08-080

పల్లవి: నేనుసేసే చేఁతలలో నెరుసున్నదా
మీనుల వినుమంటేను వేసరేవుగాక

చ. 1: కప్పుర మిచ్చితిఁ గాక కవకవ నవ్వితినా
రెప్పల మొక్కితిఁగాక రేసు రేచేఁనా
ముప్పిరినెవ్వతెచేనో ముందువాడివచ్చి
దప్పితో నొక్కటొక్కటే తలచేవుగాక

చ. 2: చిగురందిచ్చితిఁగాక చేగోరు దాఁకించితినా
మొగమోటనుంటిఁగాక ముంచికైకోనా
మగువ యెవ్వతెచేనో మర్మాలు తొరలి వచ్చి
పగటులనూరకే భ్రమసేవుగాక

చ. 3: రతులఁ గూడితిఁ గాక రాజసము చూపితినా
సతమై యుండితిఁగాక సాదురీతిని
గతియై శ్రీవేంకటేశ కడపలోఁ గూడితివి
మతి నెవ్వతోఁ దలఁచి మలసేవుగాక

రేకు: 0214-3 ముఖారి సంపుటం: 08-081

పల్లవి: అవునయ్యా దొరవౌదువన్నిటా నీవు
వివరముతోడి నన్ను వీరిడిఁజేసేవు

చ. 1: యెవ్వతెనో సరివెట్టేవేఁటికి నాతోఁ జలము
పువ్వువంటి మనసిట్టె పూఁపసేసేవు
జవ్వనమదముతోనే సరినన్నుఁ జేరితేను
నవ్వులనె పొద్దువుచ్చి నాలిసేసేవు

చ. 2: యెక్కడికైనాఁ బిలిచేవెగసక్కె మెంత నీకు
లక్కవంటి వలపేల వుక్కుసేసేవు
లెక్కలేని యాసతోడ తెమ్మని నేఁగొసరితే
జక్కవ చన్నులేముట్టి జాగుసేసేవు

చ. 3: యెంతవడైనాఁ గూడేవేమి నేరుచుకొంటివి
వంతవంటి సిగ్గేఁటికి వాఁకసేసేవు
యింతలో శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
దొంతిమోవి తేనెలిచ్చి దొరఁజేసేవు

రేకు: 0214-4 వసంతవరాళి సంపుటం: 08-082

పల్లవి: ఆతఁడిదె నీవిదె ఆసలెల్లా నెరవేరె
చేతికి లోనాయఁ బతి చెల్లునమ్మా

చ. 1: మగఁడు నిన్ను మన్నించె మనసొక్కటాయనిఁక
నగవద్దా యిఁకనీవు నలినాక్షి
మగువలమున్నారము మంకుమీయలుకదీర్చ
జిగినీవు చేసినదే చేఁత యిఁకనమ్మా

చ. 2: రమణుఁడు చెయి వట్టె రాజసము నీకుఁ దగు
చెమరించ నీకువద్దా చిగురుఁబోఁడి
అమరించఁగలము నీయంకెకు నన్నిపనులు
విమలము నీపగటు విచ్చనవిడెమ్మా

చ. 3: శ్రీవేంకటేశుఁడు గూడె చెలివలమేల్మంగవు
నీ వాతని మెచ్చవద్దా నీలవేణి
చేపదేరె మాకొలువు సేవలిట్టే సేసేము
కైవసమాయ రతులు కళదేరవమ్మా

రేకు: 0214-5 మెంచభౌళి సంపుటం: 08-083

పల్లవి: ఎంతవానికెంతవట యేలే యింత
మంతనాన నుండియును మాకుదీరదా

చ. 1: కొప్పు దువ్వితేఁ బతిపైఁ గోపగించుకొనేవేమే
తప్పులేని తప్పుమోపి తమకింతురా
విప్పుచుఁ బ్రియము చెప్పి వేఁడుకొనీ నాతఁడే
దప్పిదేరె మోవిచూచి దయ పుట్టదా

చ. 2: ధీరతతోఁ జెక్కు నొక్కితేను విదిలించేవేమే
దూరులేని దూరుగట్టి దొమ్మిసేసేవు
సారపు నీసుద్దులెల్లా చవిసేసినాతఁడే
ఆరీతినాతనిఁ జూచి ఆయము గరఁగదా

చ. 3: చిప్పిలఁ గాఁగిలించితే జీరవారెననేవేమె
చొప్పులేని చొప్పులెత్తి సూడువట్టేవే
అప్పఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చొప్పులుగాఁ బెంజెమట చూచి చింత వాయదా

రేకు: 0214-6 శ్రీరాగం సంపుటం: 08-084

పల్లవి: ఎత్తరే ఆరతులీపె కింతులాల
హత్తెను శ్రీవేంకటేశు కలమేలుమంగ

చ. 1: హరి వురముపై సొమ్ము అరతఁగట్టినతాళి
సరిలేని దేవుని సంసారఫలము
సిరులకుఁ బుట్టినిల్లు సింగారములవిత్తు
మెరుఁగుఁబోడి యలమేలుమంగ

చ. 2: పరమాత్మునికి నాత్మభావములో కీలుబొమ్మ
కెరలుచునితఁడు భోగించే మేడ
సరసపు సముద్రము సతమైన కొంగుపైఁడి
అరిదిసంపదలది యలమేలుమంగ

చ. 3: శ్రీవేంకటేశుని దేవి చిత్తజునిఁ గన్నతల్లి
యీ విభుఁని కాఁగిటిలో యేచిన కళ
బూవపు పెండ్లిమేలు పొందిన నిధానము
ఆవల నీవల నీపె యలమేలుమంగ

రేకు: 0215-1 వరాళి సంపుటం: 08-085

పల్లవి: అంతేసి యెరఁగలేము ఆడువారము
మంతనాన విన్నవించే మన్నించవయ్యా

చ. 1: నీతో నేమాటాడితే నిజము నిష్ఠూరము
నీతెరిఁగి మాటలెల్ల నీవాడవయ్యా
చేతి మీఁదనే వుండవి చేకొను నామొక్కులెల్లా
మాతలఁపు లీడేరించి మన్నించవయ్యా

చ. 2: సారె నీతో నవ్వితేనే సరసమే విరసము
నారీతి చూచి నీవే నవ్వవయ్యా
గారవపు నాగోళ్ళు నీగడ్డము పైనుండవి
మారుకొని వేఁడుకొనే మన్నించవయ్యా

చ. 3: చన్నుల నిన్నొత్తితేనే చలములే పలములు
వున్నతిఁ గాఁగిట నీవే వొత్తవయ్యా
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
మన్నించి కూడితివింకా మన్నించవయ్యా

రేకు: 0215-2 శ్రీరాగం సంపుటం: 08-086

పల్లవి: తలవంచు కొననేలే తరుణి నీకు
యెలమిఁదప్పకచూచీ నిదివో నీవిభుఁడు

చ. 1: తాలిమిగలచెలికి తలఁపెల్లా నీడేరు
జాలిఁబొరలకున్న చవియౌ మేలు
నాలి నెరపకుండితే నవ్వులు వేళమేవచ్చు
యీలీలనే వుండరాదా యిదివో నీవిభుఁడు

చ. 2: మాట వొడఁబడికైతే మనసులు గరఁగును
యీటుకుఁ బెనఁగితేను యిచ్చక మవును
కూటములు గలిగితే గుణములు చక్కనవును
యేఁటికి నూరకుందాన విదివో నీవిభుఁడు

చ. 3: తగవుల నడచితే తప్పదు సంతోషము
మొగమోట గలిగితే మోహముమించు
జిగి యలమేలుమంగ శ్రీవేంకటాద్రివిభుఁని
యెగసక్యాలకే కూడితితఁడే నీవిభుఁడు

రేకు: 0215-3 బౌళి సంపుటం: 08-087

పల్లవి: నీకుదొరకితేఁగన నీవుమానేవా
మైకొని నన్నిన్నిటాను మన్నించునితఁడు

చ. 1: సేసవెట్టిన పతిని చెప్పినట్టు సేయించుకో
దోసమా నీవేల దూరవచ్చేవే
యీసు రేఁచుక దొడ్డ హితవరివలెనే
పోసరించి నాకేల బుద్దిచెప్పవే

చ. 2: చేతికి లోనైనవాని చెక్కు వేల మీఁటితేను
యేతులా నీకేల యెకసక్యాలు
కాతరించి నీవే దగ్గరిన చుట్టమవలె
ఆతుమై నీవేఁటికి నాయాలు తిద్దేవే

చ. 3: కూడిన శ్రీవేంకటేశు గోరనేను గీరితేను
ఆడికల నీవేల అడ్డమాడేవే
నీడనలమేల్మంగను నే నాకంటె నెక్కుడా
చూడఁజూడ నీవేల జోహరనేవు

రేకు: 0215-4 మాళవ శ్రీ సంపుటం: 08-088

పల్లవి: అప్పణిచ్చేనిదె నీకు ననుమానించకుమింక
చిప్పిల మోహించిన నీచేతిలోనిదానను

చ. 1: యెంతనవ్వినా మేలే యెరిఁగిన విభుఁడవు
చెంతనుండి మరియేమి సేసినా మేలే
యింతమాత్రమునకే యెగ్గులెంచ తప్పులెంచ
సంతోసాన నీకులోనై సమ్మతించేదానను

చ. 2: అలయించినా మేలే ఆయములెరుఁగుదువు
కొలువు యిట్టె సేయించుకొన్నా మేలే
మలసినమాత్రానకే మచ్చరించ నెచ్చరించ
చెలఁగుదు నీపాదాల సేవసేసేదానను

చ. 3: చేరి కూడితివి మేలే శ్రీవేంకటేశుఁడవు
యీరీతినలమేల్ మంగనేమన్నా మేలే
సారె యీమాత్రానకే జంకించ బొంకించ
మేరతోనుండుదు నిన్ను మెచ్చేటిదానను

రేకు: 0215-5 సాళంగనాట సంపుటం: 08-089

పల్లవి: అన్నిటా నేరుపరిగా అలమేలుమంగ నీకు
చిన్నిచిన్ని ముద్దులనే సిగ్గువిడిపించెను

చ. 1: చనవు మెరసి నిన్ను సారెసారెఁ బేరుకొని
మనసు దనియ నాపె మాటలాడెను
కనుసన్నచూపులనె కప్పురవిడెములిచ్చి
తనువు దనియ నీపైఁ దలఁబాలు వోసెను

చ. 2: పన్నుగడలతోడనే పానుపుచేరువనే
కన్నులుదనియఁగ దగ్గరి నిల్చెను
మన్ననలు దైవార మచ్చికలు పెడరేఁచి
విన్నవీనులు దనియ విన్నపాలు సేసెను

చ. 3: మాఁగిన మోవియిచ్చు మనసు గరఁచి యిట్టే
కాఁగిలి దనియ నీకుఁ గప్పెఁ బయ్యద
వీఁగక శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితివిట్టె
రాఁగా వయసుదనియ రతికేలిసేసెను

రేకు: 0215-6 శుద్ధవసంతం సంపుటం: 08-090

పల్లవి: అలమేలుమంగ యీకె ఆనుకవద్దనుండది
చెలరేఁగి కందువలు చిత్తగించవయ్యా

చ. 1: తరుణిదేహమే నీకు తగుదివ్యరథము
గరుడధ్వజంబాపె కప్పుపయ్యద
తురగములు రతులఁ దోలెడు కోరికెలు
సరినెక్కి వలపులు జయించవయ్యా

చ. 2: దిండు కలపిఋఁదులు తేరు బండికండ్లు
అండనే పవ్వులుగుత్తులా పెచన్నులు
కొండవంటి శృంగారము కోపునఁగల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవేగెలువవయ్యా

చ. 3: వెలఁదికంఠము నీకు విజయశంఖమదిగో
నిలువెల్ల సాధనాలు నీకునాపె
యెలమి శ్రీవేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
పలుజయముల నిట్టే పరగవయ్యా

రేకు: 0216-1 గౌళ సంపుటం: 08-091

పల్లవి: ఏమిచూచేవు మాదిక్కు యివియేమేలు
నీమనసే యెరుఁగును నీవు సేసేమేలు

చ. 1: మాటకుమాటాడఁబోతే మరియెన్నైనాఁ గలవు
మోటుపెట్టి నేము నీకు మొక్కేదే మేలు
పాటించి సతులకెల్లా పైఁడికొంగువరచిన
మేటివి నిన్నెందుకైనా మెచ్చేదే మేలు

చ. 2: చేతకుఁజేత సేసితేఁ జిక్కులెన్నైనాఁ గలవు
నాఁతినింతే నిలుచుండి నవ్వేదేమేలు
కాఁతాళించి చెలులకే గద్దెవెట్టితివురము
పూఁతవలపులనిన్నుఁ బొగడేదే మేలు

చ. 3: సేసకును సేసచల్లఁ జేయికిఁ జేయి గలదు
పోసరించి నీకాఁగిటఁ బొందేదే మేలు
ఆల శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మోసపోక కూడితిమి మోహములే మేలు

రేకు: 0216-2 వరాళి సంపుటం: 08-092

పల్లవి: ఎన్నఁడూనెరఁగమయ్య యిటువంటి పనులు
నిన్నునాపెఁ గంటిమయ్య నేరుపులపొగుల

చ. 1: నిన్నుఁజూచి వడదేరీ నెలఁత అల్లంతనుండి
కన్నులనే వలపులు కాచుకున్నవో
పన్నిన సిగ్గులువీడఁ బయ్యద జారఁగఁదోసె
చన్నులనే జవ్వనము సాదించీనో

చ. 2: ఘాతలనె చెనకీని కాంత నీమోము చూచి
చేతులనె తమకము చిమ్మిరేఁగీనో
కాతరాన నీగుణాలు కడుఁగడుఁ గొసరీని
దూతికెవలెనే మాట దొమ్మిసేసీనో

చ. 3: అక్కుపైనిలిచి కూడె నలమేలుమంగ నిన్ను
చక్కఁదనమెల్ల నీకు సంచమాయనో
గక్కన శ్రీవేంకటేశ కాయముఁ గాయమునంటె
పెక్కువ సింగారాలు పెనఁబెట్టెనో

రేకు: 0216-3 దేసాళం సంపుటం: 08-093

పల్లవి: అన్నేసి నాకునాకే ఆడుకోరాదు
యెన్నుకొమ్మీ నామాటలితవైనయపుడు

చ. 1: అలుకలు దీర్చితివి ఆయములంటితివి
చెలఁగి నీచెప్పినట్టు సేసేమయ్యా
చెలపట్టేవేళగాదు సరిదాఁకీనిటమీఁద
తలఁచుకో నామాఁట తతి వచ్చినపుడు

చ. 2: చేయి మీఁదవేసితివి సిగ్గులెల్లాఁ బాసితివి
ఆయనాయ నీకునడ్డమాడనయ్యా
రాయడించే చోటుగాదు రతికెక్కినపుడైనా
చాయకుఁ దెచ్చుకో మాట చవులై నయపుడు

చ. 3: కన్నులనే నవ్వితివి కాఁగిటఁ గూడితివి
మిన్నకైనా నిన్ను సారె మెచ్చేనయ్యా
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్‌మంగను నేను
వన్నెకుఁ దెచ్చుకో మాట వహికెక్కినపుడు

రేకు: 0216-4 సామంతం సంపుటం: 08-094

పల్లవి: అప్పటనుంటియుఁ జెప్పేవాసుద్దులు
అప్పుడే అన్నియువింటినాసుద్దులు

చ. 1: అంగడికెల్లానెక్కెను ఆసుద్దులు
అంగనలందరు విన్నారాసుద్దులు
అంగమా నాకాడుకోను ఆసుద్దులు నీకు
నంగదలన్నియుఁ బాపనాసుద్దులు

చ. 2: ఆరితేరెనింతలోనే ఆసుద్దులు
ఆరచి కతలవంటివాసుద్దులు
ఆరఁగాఁ బండినపంటలాసుద్దులు
ఆరీతినే యియ్యకొంటినాసుద్దులు

చ. 3: అలుకలిన్నియుఁబాపె నాసుద్దులు
అలయని రతులలో నాసుద్దులు
అలమేల్మంగను నేను ఆసుద్దులు
అలమితి శ్రీవేంకటేశాసుద్దులు

రేకు: 0216-5 భైరవి సంపుటం: 08-095

పల్లవి: ఆతనివగలెరఁగరమ్మలాల
చేతులువట్టి బలిమిసేయకురే మీరు

చ. 1: నిద్దిరించేనంటాను నెలఁతలరాకలకు
వొద్దికెఁగాచుక వున్నాఁ డూరకే తాను
వొద్దికి రమ్మనీనంటా వొడివట్టి తియ్యకురే
యిద్దరు చెలులున్నారు యెక్కుడా నేను

చ. 2: మోనానసుండేనంటా మచ్చుటతోఁజెలులకు
ఆనుక పొంచుక వున్నాఁడక్కడఁదాను
ఆనవెట్టైనాతఁడంగానందరుఁబిలువకురే
లోననున్నవారికంటె గుట్లునేరుతునా

చ. 3: చేసన్న సేసేనంటా సేమంతి బంతిని నన్ను
వేసె శ్రీవేంకటాద్రి గోవిందుఁడే తాను
సేసవెట్టి కూడినాఁడు చెరఁగు వట్టించకురే
బాసగొన్నవారికంటె బలువా నేను

రేకు: 0216-6 ముఖారి సంపుటం: 08-096

పల్లవి: పువ్వుల వేసినవారిఁ బూఁపల వేతురటవే
నివ్వటిల్ల మీలోమాట నీవేయెఱఁగవా

చ. 1: చేసన్న సేసినందుకు సెలవియ్యవలెఁగాక
మాసటీనివలె మారుమలయనేలె
ఆసపడ్డవేళ నీవు అంగీకరించకవుంటే
దోసమందురదినీవు తొల్లేయెఱఁగవా

చ. 2: చెంతఁ గూచుండినందుకు సేసవెట్టవలెఁగాక
పంతగత్తెవలె మారుపలుకకువే
మంతనమైనవేళ మరఁగులు వెట్టితేను
జంతందురు లోకులజాడ నీవెఱఁగవా

చ. 3: ఇట్టెకూడినందుకును యిచ్చగించవలెఁగాక
జట్టిబేరగానివలె సటలేఁటికే
గుట్టుతో శ్రీవేంకటేశుఁ గూడియుఁ గొరితేను
దిట్టతనమందురు యీతెరఁగులెఱఁగవా

రేకు: 0217-1 సామంతం సంపుటం: 08-097

పల్లవి: వెన్న చేఁతబట్టుకొని వేఁడనేలే నేతికి
కన్నుచూపుల నతని గంపఁగమ్మనేరవా

చ. 1: చేరి చేయిచేఁత బట్టి సిగ్గున బాసడిగేవు
పోరచి నీవిభుఁడెందు వోయీనే యింక
సారెకు నీపయ్యదలో చన్నులు దాఁచినట్టు
తారసిల్లి రమణుని దాఁచనేరవా

చ. 2: వొంటిఁ జిక్కించుక నీవు వొట్టు వెట్టుకొమ్మనేవు
దంటయై వేరొకతెను తగిలీనట్టే
గంటువేసి పోఁకముడి గట్టిగాఁ గట్టినయట్టు
వొంటిగాకుండా నాతని వొడిఁగట్టనేరవా

చ. 3: మొక్కలానఁ గాఁగిలించి మోవిముద్రలు వెట్టేవు
వెక్కసా శ్రీవేంకటగోవిందుఁడు నీకు
వొక్కమాటే కంఠహారమురమునఁ గట్టినట్టు
చక్కని నీమేనితోడ జంటసేయ నేరవా

రేకు: 0217-2 సాళంగనాట సంపుటం: 08-098

పల్లవి: ఇద్దర సరిగెలువ నింతలోనే జూజమా
వొద్దికై వొకరొకరు వూరకుంట గాక

చ. 1: సలిగెమాటాడితేను సాదించేవారు గలరా
వొలుగులు వారఁగ నవ్వుదురుగాక
చెలిపంతమేమాడినా చెల్లించఁగవలదా
బలిమి నీవింతలోనే పచారించవలెనా

చ. 2: కొంగువట్టి తీసితేను కోపగింతురాయేమి
అంగవించి అందుకు లోనౌదురుగాక
అంగనల చేఁతలకు అంగీకరించవలదా
సంగతితో నీరాజసము చూపవలెనా

చ. 3: అక్కున నిన్నదిమితే నప్పుడ జంకింతురా
చెక్కు నొక్కి కరఁగి మెచ్చింతురుగాక
యెక్కువ శ్రీవేంకటేశ ఈపె నిన్నుఁ గూడెనిట్టె
పిక్కటిల్లు నీనేర్పులఁ బెనఁగఁగవలెనా

రేకు: 0217-3 లలిత సంపుటం: 08-099

పల్లవి: అన్నియుఁ దెలుకొందమాతఁడే వద్దనున్నాఁడు
మన్నన గనుకొందము మరవకురే

చ. 1: మనసువచ్చినవారి మాటలే చవులుగాక
యెనయనివారితోడ నేఁటిసుద్దులు
చనవు దానిచ్చితేను సాదించ నేనేరనా
పనిగలయందాఁకాఁ బదరకురే

చ. 2: జోడుగూడినట్టి వారి చూపులే యింపులుగాక
యీడుగానివారికొసరెంతై నానేమే
వాడికగలయప్పుడు వంచు కొననేరనా
జాడకు వచ్చినదాఁకా చలమేఁటికే

చ. 3: రతిఁ గూడినట్టివారిరచనలే మెచ్చుగాక
కతలు చెప్పేటివారి గతులేఁటివే
యితవై శ్రీవేంకటేశుఁడింతలోనే నన్నుఁ గూడె
తతివచ్చెనికమీఁద తలవంచనేఁటికే

రేకు: 0217-4 శంకరాభరణం సంపుటం: 08-100

పల్లవి: నేరుచుకోవేనీవు నిక్కము దంటతనము
ఆరితేరితే నిన్నునటు రట్టుసేయఁడా

చ. 1: చెక్కుచేతితోడనింకా సిగ్గుపడేవు పతితో
మక్కువనేకతవేళ మరఁగేఁటికే
పక్కనఁ గన్నెవుగాఁగా పాలార్చీఁ గాకతఁడు
వెక్కసపు బ్రోడవైతే వెల్లవిరి సేయఁగా

చ. 2: నాలిసేసి పానుపుపై నవ్వులు నవ్వేవు ఈనవు
కోలుముందైనమీఁదఁ గొంకనేఁటికే
పోలించి ముగ్ధవుగాఁగా పొదిగీఁగాకాతఁడు
అలరి గద్దరివైతే నాయాలు సోఁకించఁడా

చ. 3: పొంచినట్టి రతివేళ బొమ్మల జంకించేవు
మంచమెక్కి వావులింకా మానవేఁటికే
అంచెనురమెక్కించెఁగా కలమేలుమంగవని
నించి శ్రీవేంకటేశుఁడు నీకంటె మించఁడా

రేకు: 0217-5 ముఖారి సంపుటం: 08-101

పల్లవి: వీఁపుగానరాఁగా దాఁగే విధమేఁటికే
తోపునకుడిందునేది దొరసానివిపుడు

చ. 1: నీరాక గోరుకొని నిలుచున్నాఁ డితఁడు
యీరీతినే వద్దనుంటే నేల లోఁగేవే
పేరే నా వరుస గాక పెనఁగేటినారతులలో
దూరల్లా నీదేకాదా దొరసానివిపుడు

చ. 2: మాటలు నీవాడేవంటా మలసు కొన్నాఁడతఁడు
యేఁటికే నన్నుఁజూచి యేల లోఁగేవే
కూటమే నాదిగాక గురుతులు సోకించేటి
తూఁటరివి నీవుగావా దొరసానివిపుడు

చ. 3: సరినీవు చూచేవంటా సన్నలు సేసీ నతఁడు
యిరవై నేఁ దిట్టేనంటా నేల లోఁగేవే
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
తొరలఁ గూడితిమిదే దొరసానివిపుడు

రేకు: 0217-6 పాడి సంపుటం: 08-102

పల్లవి: ఏమని వూరడించేవో యిఁక నీచిత్తముకొద్ది
దామెన తిట్లతోడ తలవంచీనదివో

చ. 1: చెలి నినుఁ జేరవచ్చి చేతులెత్తి మొక్కగా
చెలరేఁగి చన్నులపైఁ జేయి చాఁచేవు
వెలఁదితో నవ్వులకు వేళావేళలు లేవా
సెలవుల నవ్వులనె సిగ్గుపడీనదివో

చ. 2: అంగన బాగాలిచ్చి ఆకు మడిచీయఁగానా
యెంగిలి సేసేవు మోవి యిందరిలోన
గుంగిలి సరసాలకు కొంతైనా మరఁగువద్దా
సంగతి గాదని నీతో సన్నసేసీనదివో

చ. 3: వువిద పైపై నీకు వూడిగాలు సేయఁగానా
జవళిఁ బాదాలు చాఁచి సారె పంచేవు
కవగూడితివి శ్రీవేంకటేశ తగవే కదా
పవళించి యింకా నీతో పంతమాడీనదివో

రేకు: 0218-1 దేవగాంధారి సంపుటం: 08-103

పల్లవి: బాపు బాపు యిఁకనాకుఁ బరిణామము
ఆపనులెల్లానావి అదియే నావలపు

చ. 1: మంతనాన నీవు నాపె మాటలాడఁగాఁ జూచి
చింతలెల్లఁ బాసి యేక చిత్తమాయను
వంతులకు నే నీకు వలతునాపెకు నీవు
అంతకంటె వలతువు అదియే నావలపు

చ. 2: చలివాసి యిద్దరును సరసమాడఁగఁ జూచి
బలిమి నాజన్మము సఫలమాయెను
అలరి నే నీకు లోను ఆపెకు నీవులోనై
అలవాటాయఁ గనక అదియే నావలపు

చ. 3: మంచముపై నిద్దర నెమ్మదినుండఁగాఁ జూచి
సంచమై నామేనెల్ల చల్లనాయను
యెంచఁగ శ్రీవేంకటేశ యిద్దరము నీసొమ్ము
అంచెలఁ గూడితిమిదె అదియే నావలపు

రేకు: 0218-2 భూపాళం సంపుటం: 08-104

పల్లవి: ఎగ్గుపట్ట నీకేలే యిందుకుఁగాను
దగ్గరి పైఁ జేయిచాఁచి తమకించరాదా

చ. 1: వెక్కసాలంతేసి వద్దు విభుఁడు పరాకైతే
యిక్కువలంటఁగరాదా యింకా నీవు
దిక్కులు చూచితేనేమి దేహము నీమీఁదనదే
చిక్కించుక సేయరాని సేఁత సేయరాదా

చ. 2: అలుకలంతేసి వద్దు ఆతఁడు కొలువైవుంటే
వలపు రేఁచఁగరాదా వన్నెతో నీవు
వెలి విసరిననేమి వెంటనే నీవుందానవు
చలమెల్ల సాదించి జట్టి గొనరాదా

చ. 3: యెగసక్కేలంతవద్దు యింతలోనే ఆతఁడుంటే
జిగిఁ గాఁగిలించరాదా చెలఁగి నీవు
అగపడి శ్రీవేంకటాధిపుఁడు గూడెనిట్టే
మిగులా నీవు రతుల మెప్పించరాదా

రేకు: 0218-3 బౌళి సంపుటం: 08-105

పల్లవి: ఇంకనేఁటివెరపు యిన్నియు మంచివే కాక
సంకెదీర బొమ్మలను సాదించేనా

చ. 1: వట్టిసిగ్గులు నీకేల వద్దనున్నది వనిత
యెట్టుసేసినా నిన్న దేఁటికనేనా
జట్టిగొన్న నీచేఁతకు సమ్మతింతునేకాక
కట్టఁగడవారివలెఁ గాకుసేసేనా

చ. 2: మూసి దాఁపిరములేల మోవినున్నవి కెంపులు
నీసుద్దులు వాఁడిసేసి నేరమెంచేనా
వేసినట్టేవేసి నీతో వేడుకపడుఁదుఁగాక
మాసటీలవలె నీతో మారుమలసేనా

చ. 3: సెలవుల నవ్వులేల చేతికి లోనాయఁ బని
అలరి కూడితివిఁకనడ్డమాడేనా
మలసి శ్రీవేంకటేశ మాలోనిదే ఆపెగాక
వెలుపటివారివలె వింత సేసేనా

రేకు: 0218-4 ఆహిరి సంపుటం: 08-106

పల్లవి: ఎంతకెంతసేసేవు యెమ్మెలీడను
పంతము చెల్లినమీఁద పాలార్చఁ దగదా

చ. 1: సిగ్గుపడి వున్నాపెను సెలవి నవ్వుదురా
దగ్గరి పైఁ జేయివేయఁదగుఁగాక
కగ్గుదేరీఁ గెమ్మోవి కాటుకకన్నుల మొక్కి
తగ్గక నీ చిత్తములో దయవుట్టదగదా

చ. 2: వనాపతి అయినాపను మన సోదింతురా
ఆనుకొని మెచ్చఁదగవౌఁగాక
నానెఁజెమటల మేను ననలొత్తెఁ బులకలు
తానకమై మతిలోన దయవుట్టదగదా

చ. 3: చేరి కాఁగలించినాపెఁ జిక్కించి కొసరుదురా
కోరికెలు మీరనిట్టె కూడుతగాక
మేరతో శ్రీవేంకటేశ మెలుఁత నిన్నునెనసీ
తారుకాణ నీరీతినే దయవుట్టఁదగదా

రేకు: 0218-5 మలహరి సంపుటం: 08-107

పల్లవి: నీవల్లనే కదవే నీమగఁడు రతికెక్కె
ఆవటించ నీకే కలవంతలేసి బుద్దులు

చ. 1: హితవుగల సతికి యెరపరికము లేదు
పతిమాటే తనమాటై పరగుఁగాని
సతులెందరుండినాను చంచలము దోఁచదు
అతివరో నీకే కలవంతేసి బుద్దులు

చ. 2: యిరవెరిఁగినకాంత యెడమాటలాడించదు
సరవి మాటాడుఁ బతిముకానను
పరులవాదుకుఁ బోదు భయములేదేమిటాను
అరయ నీకే కలవంతేసి బుద్దులు

చ. 3: నేరుపుగల మగువ నెరుసులకుఁ జొరదు
మేరమీరి రతులనే మెప్పించును
యీరీతి శ్రీవేంకటేశునిట్టే నీవు గూడితివి
ఆరితేరి నీకే కలవంతేసి బుద్దులు

రేకు: 0218-6 శ్రీరాగం సంపుటం: 08-108

పల్లవి: ఏనాఁటికేనాడు యేమనేవు
నీ నాటకములెల్ల నీకేతెలును

చ. 1: దగ్గరి నీగుణములు తలపోయుచుండఁగాను
కగ్గి నీతో నెరుపేటి గర్వమనేవు
సిగ్గుపడి యప్పటిని చెక్కు చేతనుండఁగాను
ఆగ్గలమై చింతించే అలుకలనేవు

చ. 2: పొదిగి నీచేఁతలెల్ల పొగడుతానుండఁగాను
వెదకి వెదకి యాడేవెంగమనేవు
నిదురకన్నులతోడ నిన్నుఁ గొంత చూడఁగాను
గుదిగుచ్చి కుమ్మరించే కోపమనేవు

చ. 3: కలిసి మెలసి నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
నెలి పెనఁగి బిగిసితిననేవు
బలిమి శ్రీవేంకటేశ పైకొని కూడితి నన్ను
మలసి మెచ్చితే నిన్ను మతకమనేవు

రేకు: 0219-1 మంగళకౌశిక సంపుటం: 08-109

పల్లవి: కందము విందము దన కతలెల్లాను
పందెమిదే జూజమిదే పలుమారు నేఁటికే

చ. 1: మగనిముందరనే మాటలాడి నాపెతోను
జగడా లడుతురా సారెసారెకు
తెగువలేమి గల్లాను తెరమరఁగునఁ గాక
మొగము నద్దమునిదే ముందటెత్తు లేఁటికే

చ. 2: ఆతఁడు చూడఁగానే ఆయాలంటి ఆపెమీఁద
చేతులు చాఁపుదురా చెలరేఁగి
నీతులేమి యెంచినాను నిన్నమొన్ననేకాక
జీతమిదే కొలువిదే సిగ్గులిఁక నేఁటికే

చ. 3: శ్రీవేంకటేశుఁ బొత్తుల సేసవెట్టే ఆపెను
కావరించి జంకింతురా కనుసన్నల
యీవేళ నన్నుఁగూడె యీతఁడే నానాయకుఁడు
భావమిదే కాయమిదే పలుచేఁత లేఁటికే

రేకు: 0219-2 లలిత సంపుటం: 08-110

పల్లవి: నీకు నవ్వులు రావటే నెలఁతల దిక్కుచూచి
దాకొని యింతట మమ్ము దయఁజూడరాదా

చ. 1: నిండు రాజసముతోడ నీవాతని వద్దనుండి
యెండకన్ను నీడకన్ను నెరిఁగేవటే
వెండియు పతిఁబాసిన విరహపు సతులకు
దుండగపు తలపోఁత దొమ్మిసేసుఁగాక

చ. 2: మదనరాగముతోడ మగనికాఁగిటనుండి
యెదిటివారినినిన్ను నెరిఁగేవటే
అదనుగాచుక రతికాసపడే యింతులకు
చదురపు తమకము చండిసేసుఁగాక

చ. 3: శ్రీవేంకటేశ్వరుని చేతికి లోను సేసుక
మావంటివారి నీవు మరచేవటే
యీవేళనే మమ్మునిద్దరు మన్నించితిరి
కైవసపుమదములు కాణాచులౌఁగాక

రేకు: 0219-3 దేశా(సా)క్షి సంపుటం: 08-111

పల్లవి: ఉపకారమింతేకాని వొరటుగాదు
కపటాలుమాని సతిఁగాఁగిలించవయ్యా

చ. 1: మంకుగాదు చెలియ నీమనసు చూచేనంటా
వుంకువ సిగ్గులతోడ నూరకున్నది
సంకెగాదు నిన్నుఁ దనచన్నులు నాటించితేను
అంకెఁ గుమ్మెలయ్యీనంటా నట్టె మూసెఁ బయ్యెద

చ. 2: తిట్టుగాదు నీగుణము తెలుసుకొనవలసి
బెట్టిమాటలనిన్నుఁ బెదవులను
ఋట్టుసేయదాపె నిన్నాఋడిఁ బెనఁగకున్న
దిట్టతనము నేరక దిగేవంటాను

చ. 3: గబ్బితనములుగాదు కాఁగిలించి పట్టినిన్ను
తబ్బిబ్బుగాకుండ రతిఁదనిపేనంటా
అబ్బురపు శ్రీవేంకటాధిప నిన్నుఁగలసె
జొబ్బిలఁ బ్రేమము నీకుఁ జూపేనంటాను

రేకు: 0219-4 నారణి సంపుటం: 08-112

పల్లవి: ఏలగడించుకొనేవు యెక్కడాలేనిసుద్దులు
తాలిమిఁ బానుపుచేరి తమకించరాదా

చ. 1: జంకెనచూపులచేత చలివాపెఁ గాకయింతి
కొంకుఁగొసరుల నిన్నుఁగోపగించునా
వంకల చంద్రుల నించి వాఁడివెట్టెఁగాకనీకు
కంకిగా రతులలో ఘాతసేసునా

చ. 2: నిట్టూర్పు గాలిచేత నిన్ను సేదదేర్చెఁగాక
జట్టిగొని వుంకించి కొసరవచ్చునా
బట్టబయలు మాటలపందిలిగాఁ బెట్టెగాక
నెట్టుకొన్న తిట్లతో నేరమెంచునా

చ. 3: చిగురుఁజేతులచేత జిగిఁగాఁగిలించెఁగాక
వొగరుఁబంతాల నిన్ను వొరయించునా
అగపడి శ్రీవేంకటాధిప కూడితివిట్టే
మొగమోడెఁగాక నీకుమోవిగంటిసేసునా

రేకు: 0219-5 ధన్నాశి సంపుటం: 08-113

పల్లవి: నేనేల కాఁగిలించేను నెలఁతనెవ్వతెనైనా
కానుకలాయమోహము కడుమెచ్చవలదా

చ. 1: మచ్చరములెల్ల మానె మనసొక్కటాయ నాకు
లచ్చనలు నీమోవిపై లలినుండఁగా
చొచ్చి యధరామృతము సొమ్ము పదిలముగాను
పచ్చిముద్రలు వెట్టె నీపని మెచ్చవలదా

చ. 2: చింతలిన్నియునుఁ బాసె సెలవుల నవ్వువచ్చె
పొంతనుండి నీలోనే బుసకొట్టఁగా
దొంతినున్న వలపులు తూరుపెత్తేవేళలకు
అంతలో పొలివారించె నది మెచ్చవలదా

చ. 3: చేతికి లోనాయ రతి సేస పిడికిటనిండె
నీతల నన్ను శ్రీవేంకటేశ కూడఁగా
జాతితో నిద్దరమును చద్దికి వేఁడికిఁగాను
యేతులఁ దోడు గడించె నిది మెచ్చవలదా

రేకు: 0219-6 సాళంగనాట సంపుటం: 08-114

పల్లవి: ఇందరితో నేకతాలు యెందాఁకాను
మందలించి ఆతనికే మచ్చికలుచూపవే

చ. 1: మోహమే నిజమైతే ముచ్చటలు నిజమే
సాహసము నిజమైతే జయమూ నిజమే
వూహా పోహలు సారె వువిదతో నేలే
కూహకములేల పతికొంగు వట్టి తియ్యవే

చ. 2: నయములు గలితేను ననుపులుఁగలవే
ప్రియములు గలిగితే పిలుపులుఁ గలవే
దయపుట్టఁ జెప్పియంపే తగువిన్నపములేలే
నియతి నాతని నీలోనికిఁ దియ్యరాదా

చ. 3: చనవులు దొరకితే సంతసాలు దొరకును
చెనకులు దొరకితే సిగ్గులు దొరకును
యెనసెను శ్రీవేంకటేశుఁడు నిన్నింతలోనే
చనుమొనలనొత్తి బాసలు గొనరాదా

రేకు: 0220-1 శంకరాభరణం సంపుటం: 08-115

పల్లవి: ఏల పెనఁగేవునాతో నిట్టె విన్నవించుమని
వేళలెరఁగక నీతో వివరించఁగాని

చ. 1: ఆయాలు సోఁకిన మాటలవియే యితవుగాక
చాయపాట్లైనవెల్లా చవిపుట్టీనా
నీయడ కొపె నేరుచు నేనూఁగొంతనేరుతు
వేయైనా నీవడుగక వెళ్లనాడఁగాని

చ. 2: సొలసి సొలసి చూచే చూపులే వేడుకగాక
అలవోకలవి యెల్లా నాసరేఁచీనా
అలరి నిన్నాపె చూచు నావెనుక నేనుఁజూతు
బలిమి దెలియక నేఁ బచరించఁగాని

చ. 3: గక్కనఁ గూడినయట్టి కలయికే మేలుగాక
తక్కక పెనఁగినవి తమినించీనా
యిక్కువ శ్రీవేంకటేశ యిద్దరము గూడితిమి
చెక్కులు నొక్కక నీపై చెయి చాఁచఁగాని

రేకు: 0220-2 రామక్రియ సంపుటం: 08-116

పల్లవి: మాకేమి బుద్ధి చెప్పేవు మాటి మాటికి
జోకలతో నీవాపెకు చుట్టమవే కావా

చ. 1: మక్కువ గలవాఁడవు మానిని వేఁడుకోరాదా
చెక్కుచేతితోడ లోనఁ జింతించీని
యెక్కువ తక్కువ మాటలిద్దరము నాడుకొంటే
చొక్కముగా నీవాపెకు చుట్టమవే కావా

చ. 2: నగవులవాఁడవు నవ్వించరాదా ఆపెను
వగ విరహానఁ దలవంచు కున్నది
యెగసక్యాలు మాలోనెటువలెనుండినాను
సొగసి నీవాపెకు చుట్టమవే కావా

చ. 3: అట్టె చెనకేవాఁడవాపె చెక్కు నొక్కరాదా
దట్టపు నీరతిఁగూడి దగ్గరున్నది
గుట్టున శ్రీవేంకటేశ కోరినన్నుఁ గూడితివి
చుట్టిచుట్టి తొల్లేపెకు చుట్టమవే కావా

రేకు: 0220-3 ముఖారి సంపుటం: 08-117

పల్లవి: అంతదాననా నేను ఆనవెట్టఁదగుదునా
వింతవలపులు నాపై వేసితివి చాలదా

చ. 1: వద్దనుండి మొక్కించేవు వనితలచే మొక్కులు
బద్దులు నీవి చాలవా పలుమారును
వొద్దికె నప్పటిఁగొన్ని వుపచారాలు వలెనా
తిద్దుబడి నోరుచుకో తిద్దితివి చాలదా

చ. 2: చెలులచే సారెసారె చేయివట్టి తీయించేవు
చలమునీది చాలదా సాదించను
మలసి మావల్లనీకు మందెమేళాలువలెనా
నిలువెల్లాఁ దరితీపే నించితివి చాలదా

చ. 3: అట్టె తెరవేయించేవు అండవారి చేతనెల్ల
రట్టులునివి చాలవా రాఁపుసేయను
దిట్టవై శ్రీవేంకటేశ తిరమై కలసితివి
మెట్టి పట్టుకొని నన్నుమించితివి చాలదా

రేకు: 0220-4 కాంబోది సంపుటం: 08-118

పల్లవి: కొంత వోరచుకోరాదా కోపగించేమా
బంతినున్న మాగోలు బారచాఁచీనా

చ. 1: పంతానకే పెనఁగేము పైపై నూరకే నిన్ను
చెంతనుండి యేమైనాఁ జేయవచ్చేమా
వంతులకే సొలసేము వారివీరివలె మరి
దొంతిఁబెట్టి వలపుల దొమ్మిసేసేమా

చ. 2: ఆలకే పిలిచేము అప్పటి నిన్నిందులోనే
బాసగొని నీకొంగు పట్టుకుండేమా
వాసులకే నవ్వేము వన్నెల నీమేనుచూచి
వేసాలంటా నిన్నునిట్టే వెంగమాడేమా

చ. 3: సిగ్గులకే లోఁగేము చిత్తడి చెమటలను
కగ్గువెట్టికొని నిన్నుఁ గాఁకరేఁచేమా
నిగ్గుల శ్రీవేంకటేశ నీవెనన్నుఁ గూడితివి
దగ్గరి వుండినదాన తడఁబడేనా

రేకు: 0220-5 నాదరామక్రియ సంపుటం: 08-119

పల్లవి: ఆతని భ్రమయించే (చవే?) వే అండనున్నాఁడు
యేతులునెమ్మెలుఁ జూపేవిప్పుడే మాతోనా

చ. 1: చన్నులు ఘనములైతే సాధించవే రమణుని
కన్నులు ఘనములైతే కాఁడి పారఁ జూడవే
యెన్న నీసింగారాలు యెవ్వరికిఁ జూపేవు
పన్నిన సవతినింతే పగటు మాతోనా

చ. 2: వలపు చిత్తాననుంటే వంచుకోవే నీవిభుని
పలుకుల నేర్పులుంటేఁ బచరించవే
సొలపుల నీనటన చూచేవారిందెవ్వరే
చెలిమికత్తెలమింతే చేఁతలు మాతోనా

చ. 3: సిగ్గులు సెలవినుంటే శ్రీవేంకటేశు ముంచవే
నిగ్గులు చెక్కులనుంటే నీటు చూపవే
యెగ్గులేక ఆతఁడే యిద్దరినేలెను నేఁడు
వెగ్గళించి మురిసేటి వింతలు మాతోనా

రేకు: 0220-6 సామంతం సంపుటం: 08-120

పల్లవి: ఇంకా నీచిత్తము యేమనే నిన్ను
అంకెకు రావు సిగ్గులు ఆఱడాయ వలపు

చ. 1: చలము సాదించరాదు చనువు మెరయరాదు
పలిచి చన్నులంటేవు ప్రియముతోడ
కలకల నవ్వేవు కప్పురము చల్లేవు
చలివాయవు సిగ్గులు చండిపడె వలపు

చ. 2: పేరుకొని దూరరాదు పెనఁగి మొక్కఁగరాదు
నారువోసేవు నామీఁద నయగారాలు
మేరమీరి చెనకేవు మెచ్చి విడెమిచ్చేవు
తీరవెంతైనా సిగ్గులు దిమ్మురేఁగె వలపు

చ. 3: గక్కన జంకించరాదు కాయము మరవరాదు
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె కూడితి
దక్కి నాకు లోఁగేవు తనువెల్ల నిమిరేవు
తక్కువగావు సిగ్గులు తతిగొనె వలపు

రేకు: 0221-1 ?? సంపుటం: 08-121

పల్లవి: నిన్నటినుండిఁ జూచేను నీసరితలు
యెన్నికె కెక్కేదెట్లో యిందరిలో నేను

చ. 1: చెంతలఁ జేరినవారిని చెక్కులు నొక్కేవు
అంతనింతానుండ వారినాదరించేవు
దొంతులు వెరిగి గొల్లదోమటాయ వలపు
యెంతటి దానయ్యేనో యిందరిలో నేను

చ. 2: మాటలాడినవారిని మనసులు గరఁచేవు
సూటిఁ జూచినవారినిఁ జొక్కించేవు
వాటమై వరత వచ్చె వనితల కోరికలు
యీటు వెట్టుకొన నేను యెవ్వరిఁ బోలుదును

చ. 3: కూడిన కాఁగిటివారి కొప్పులు దువ్వేవు
మేడెపు రతులవారి మెప్పించేవు
వాడుదేరె జవ్వనాలు వంతుల శ్రీవేంకటేశ
యీడ నన్నుఁ గూడితివి యెంతభాగ్యమోనాది

రేకు: 0221-2 మధ్యమావతి సంపుటం: 08-122

పల్లవి: ఇంకనేఁటి విచారాలు యెందాఁకారా
లంకెపాటు తమకాలు లావుసేసెఁ గదరా

చ. 1: పట్టరాదు నీవయసు పాయరాదు నీపొందు
యెట్టననరాదు నిన్ను నేమి సేతురా
గుట్టువేఁచె మదనుఁడు గుమిగట్టెఁ గోరికలు
అట్టయితి నీచేఁతలాఁటిడికెక్కెఁ గదరా

చ. 2: చెప్పరాదు నీమనసు చించరాదు నీవలపు
యెప్పుడ నేనొక్కజోడె యేమిసేతురా
చొప్పులెత్తె పువ్వుటమ్ము సోలినిండెఁ బులకలు
దప్పిగొంటి నీసుద్దుల తతి వచ్చెఁగదరా

చ. 3: తుంచరాదు నీమదము దొబ్బరావు దినములు
యించుకంతె నాసిగ్గు యేమిసేతురా
కొంచక శ్రీవేంకటేశ కూడితివి నన్నునిట్టె
పంచల నీమన్ననలు పాటమాయఁ గదరా

రేకు: 0221-3 పాడి సంపుటం: 08-123

పల్లవి: లేలే యెక్కడిసుద్ది లేమమాట వినవయ్య
నాలితో రుక్మిణిఁ దెచ్చేనాఁడు లేదా నీకు

చ. 1: చెలి నిన్నుఁ బిలువఁగ చెయివట్టి తియ్యఁగాను
సెలవి నవ్వులతోడ సిగ్గువడేవు
కొలఁదిమీరనీబుద్ది కొలనిలో గొల్లెతల
నలుగడఁ బైకొనేటినాఁడు లేదా నీకు

చ. 2: పడతి మోవియ్యఁగాను బలిమి గోరనంటఁగ
అడరి తప్పించుకొనేవప్పటి నీవు
కడఁగి పదారువేలు కాఁగలించుకొనఁగాను
నడుమనే యీబుద్ది నాఁడు లేదా నీకు

చ. 3: కొమ్మ నినుఁ గూడఁగాను కుచముల నొత్తఁగాను
దొమ్మి శ్రీవేంకటేశ యిందు నలసేవు
యెమ్మెల భూవియు సిరి యిరువంకఁ బెండ్లాడఁగ
నమ్మికతో యీబుద్ది నాఁడు లేదా నీకు

రేకు: 0221-4 వరాళి సంపుటం: 08-124

పల్లవి: ఇందవయ్య వీడెమిఁక నెరవులేవి
సందులేని కూరిమికి జగడములేవి

చ. 1: చిత్తములేకములైతే సిగ్గులెందు వెదకేది
కొత్తవలపులై తేను కొంకఁ జోటేది
పొత్తుల భోగములైతే పొద్దులు దెలియనేది
అత్తిన సంసారఫలమయి వుండుఁగాక

చ. 2: వాడికెలు గలిగితే వంచన సోదించనేది
వేడుకలు మించితేను వెలువలేవి
ఆడుకోలు మాటలకు నవుగాములు మరియేవి
యీడనే జన్మఫలము లీడేరుఁ గాక

చ. 3: కూటములు గలిగితే గురుతులు వెట్టనేది
వాటపు నవ్వులకున వరుసేది
మేటి శ్రీవేంకటేశుఁడ మించి నన్నుఁ గూడితివి
పాటించి జవ్వన భాగ్యఫలమంటుఁ గాక

రేకు: 0221-5 శుద్ధవసంతం సంపుటం: 08-125

పల్లవి: ఇద్దరుఁ గదిసి కొంకనిఁక నేఁటికే
చద్దివేఁడి సరసాలు సరిచూడరాదా

చ. 1: కదలించేవపునవునే గక్కున విభుఁనితోడ
పెదవిమరఁగుననె పెనుమాటలు
పుదుటుఁ దమకమున నోపిక కలిగితేను
యెదుటి మరుసామున కియ్యకొనరాదా

చ. 2: పన్ని వేసే వవునవునే పదరి యాతని మీఁద
కన్నురెప్ప మరఁగల కాముబాణాలు
సన్నల మీలోనింత చనవులు గలిగితే
నున్నతపు రతికేలి నొరయఁగ రాదా

చ. 3: నెట్టన నొత్తేవేమే నీవు శ్రీవేంకటేశ్వరు
పుట్టిన పయ్యదమాటు పూబంతుల
అట్టుగాఁ గూడితివి మీఁఅఁగ రాజసము మించి
తొట్టిన మదములను దొమ్మిసేయరాదా

రేకు: 0221-6 కన్నడగౌళ సంపుటం: 08-126

పల్లవి: దిట్టనా నేనంత యేమి దేవరవన్నిటా నీవు
యెట్టైనా నెగ్గులెంచక యీడేర్చుమీ

చ. 1: నయగారి మాటలెల్ల నమ్మితిఁ గనక యిట్టే
భయము విడిచినీతోఁ బలికే నేను
దయగలవు గనక తడఁబడక యేపొద్దు
ప్రియములు చెప్పి నిన్నుఁ బిలిచే నేను

చ. 2: ముంచిన నీచేఁతలకు మోహించిన దాననై
పొంచి వూడిగేలు సేసి పొలసే నేను
కంచముపొత్తువాఁడవు గనక నీపాదాలకు
వంచనలేక యేల వడిమొక్కే నేను

చ. 3: కూడిన వాఁడవు గాన కొంకక శ్రీవేంకటేశ
వేడుక నీతో నవ్వి వెలసే నేను
యీడు లేక మన్నించితి వియ్యకొంటి నన్నిటికి
పాడితో నీయిచ్చకాన బరగితి నేను

రేకు: 0222-1 కేదారగౌళ సంపుటం: 08-127

పల్లవి: ఏమి నేరుచు కొంటివింతేసి నీవు
కామిను లీసుద్దివింటే కాఁకనిన్ను రేఁచరా

చ. 1: కలసి మెలసి యిట్టే కాంత నిన్ను వేఁడుకోఁగా
అలసి వున్నాఁడనంటా నట్టె వీఁగేవు
వలచిన సతి గాఁగా వడిఁ గిందుపడెఁ గాక
పెలుచు వేరొక్కతయితే పెను అట్టుసేయదా

చ. 2: యిచ్చకములే సేసి యింతి నిన్నుఁ జెనకఁగా
కొచ్చకుమీ మేనంటా గుట్టు సేసేవు
నిచ్చ నీదేవులు గాఁగా నేరమెంచదాయఁ గాక
పచ్చిగా వేరొక్కతైతే బలిమెల్లాఁ జూపదా

చ. 3: కందువకు నిన్నుఁ బిలిచి కలికి నిన్నుఁ గూడఁగా
అందముగాఁ బరవశమైతినవేవు
యిందునె శ్రీవేంకటేశ యీకె నీవు గాఁగాఁ గాక
సందడి వేరొక్కతైతే చనవు మెరయదా

రేకు: 0222-2 ఛాయనాట సంపుటం: 08-128

పల్లవి: ఆఁడుజాతెల్లానొక్కటే అందరికి నొక్కచాలే
వాఁడి తనగోరే అయితే వద్దనేవారెవ్వరు

చ. 1: సిగ్గువడ్డ నిన్నుఁ జూచి చిత్తమెల్లా నీరాయ
అగ్గలమై నిన్ను నాడే యాపె మాటకు
కగ్గదేర నీవు మున్ను కట్టుకొన్న బయిరూపము
వొగ్గి ఆడక పోవునా వోరుచుకో యిఁకను

చ. 2: తలవంచే నిన్నుఁ జూచి దైలువారె నాచెమట
చెలరేఁగి ఆపె నిన్నుఁ జేసేచేఁతకు
యెలమి నీవేడుకకు యెత్తుకొన్న యెత్తుకోలు
తెలిసిన వాఁడవిఁక దించవచ్చునా

చ. 3: తేలగిలే నిన్నుఁ జూచి తెలివొందె నామొగము
కోలుముందై ఆపె నిన్నుఁ గూడఁగాను
యీలీల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వేళకు వచ్చిన మేలు విడువఁగ వచ్చునా

రేకు: 0222-3 పాడి సంపుటం: 08-129

పల్లవి: రారే యింకానతని రవ్వసేతురా
ధీరుఁడైనవానినంత తెమలించవచ్చునా

చ. 1: నయగారి వానికిఁ గా నంటుతోడి సరసాలు
ప్రియునికిఁ గా మంచిప్రేమమెల్లాను
క్రియ గలవానికిఁ గా క్రిందిమీఁది విచారాలు
భుఁయము లేనివానికి పట్టినదే పంతము

చ. 2: ఆసగలవానికిఁ గా అందరితో వినయాలు
బాసగల వానికిఁ గా పాలకూళ్ళు
వేసరని వానికిఁ గా విచ్చనవిడి నవ్వులు
దోసమొల్లవానికి తోఁచినదే హితవు

చ. 3: పనిగల వానికిఁ గా పైపై తమకములు
యెనసిన వానికిఁ గాను యేకాంతాలు
ఘన శ్రీవేంకటేశుఁడు గలసె నన్నింతలోనే
యెనలేక యీతనికి యెక్కినదే వయసు

రేకు: 0222-4 గౌళ సంపుటం: 08-130

పల్లవి: ఏలయ్య యింతేసి మమ్ము యిటు రట్టుసేసేవు
తాలిమితోడుత నీదయలోనివారము

చ. 1: కనుఁగొన చపులనే కరఁగించితిననేవు
వినయాలు చెప్పనీకు వింతవారమా
పెనఁగి మోవితేనెల పిలిచి విందువేట్టేవు
వెనకా ముందరా నీకు వినయాలవారమా

చ. 2: సరుగ మంచముపై నాసలఁ గూచుండుమనేవు
సరుకు రాను నీసరివారమా
యెరవుసేయక మాతో నేకతములాడేవు
అరసి నీకు బుద్ధిచెప్పేయంతేసివారమా

చ. 3: కలసిన రతులెల్లా ఘనముగాఁ బొగడేవు
తొలుతనే నీకంటె దొడ్డవారమా
చెలఁగి శ్రీవేంకటేశ చేకొని కూడితివిట్టే
పొలసిన నీవంటి పోలికలవారమా

రేకు: 0222-5 సాళంగనాట సంపుటం: 08-131

పల్లవి: పొంచి యేమి సేసినాను పుచ్చకాయలోర్చుఁ గాక
యెంచి వేలఁజూపితేను యితరములోర్చునా

చ. 1: కన్నుల నొకతె నిన్ను కాఁతాళించి తిట్టితేను
వెన్నెలరేకు నవ్వులు వెదచల్లేవు
నిన్నువంటిచేఁతలు నేఁడు వకు నున్నవా
వెన్నదీసినట్టి చల్ల వేఁడనెట్టివారము (?)

చ. 2: పొలసి సిగ్గునవొకతె బొమ్మల నదలించితే
చెలరేఁగి చెలరేఁగి చెక్కునొక్కేవు
తలఁపులో నీవలె తాలిమి మాకున్నదా
వొలిసి యీలకూరకు నుప్పడిగేవారము

చ. 3: కడు వాఁడికుచములఁ గాఁగిలించి వొత్తితేను
జడియక ఆపెకిట్టే సంతసించేవు
కడఁగి శ్రీవేంకటేశ కలసితివికనేము
వడియని మోవితేనె వారవట్టువారము

రేకు: 0222-6 ముఖారి సంపుటం: 08-132

పల్లవి: అడుగరే చెలులాల అంతేసి నేనెరఁగ
బడివాయఁడాసలకో పంతాలకునో

చ. 1: నగవొక్కటేకాని ననిచి రెంటికి వచ్చు
జగడానకో లోలో సరసానకో
తగినట్టి బలుదొర తానేల మొక్కీనే
యెగసక్యాలకో మరి యింపులకునో

చ. 2: పిలుపొకటేకాని పెనఁగ రెంటికి వచ్చు
వలపులకో వట్టి వారకానకో
వెలలేని నేరుపరి వేఁడుకొననింత యాలే
తలఁపు దెలుసుకోనో దంటతనమో

చ. 3: కూడినదొక్కటే కాని గురుతు రెంటికి వచ్చు
వేడుకలకో రతివేసాలకో
యీడనే శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నునేలె
వాడికలకో నిండువహి కెక్కనో

రేకు: 0223-1 భైరవి సంపుటం: 08-133

పల్లవి: వలపుపచారాల వనితలము
పులుగులిగెత్తఁగాను (?) వోపదువా నీవు

చ. 1: నగవులే తెలుపులు నవ్వులలో సుద్దులయితే
పగటు మీరఁగనట్టే పంచవన్నెలు
చిగురుటధరమున చిందఁజొచ్చె నింతలోనే
వొగరువేసునో యేమో వోపుదువా నీవు

చ. 2: మాటలే తేనెలు మాటలలో తేటలయితే
గాటమైన మిరియాలకంటెఁ గారాలు
వాటమై నాలికమీఁద వడిగొని వచ్చీనవి
వూటలైన యీ యెంగిలికోపుదువా నీవు

చ. 3: కలయికలే చల్లన కలయికలలోపల
వెలలేని రతులెల్లా వేఁడివేఁడ్లు
యెలమి శ్రీవేంకటేశ యెనసితివి మాచేతి
పులివచ్చీ చేఁతలకు నోపుదువా నీవు

రేకు: 0223-2 సామంతం సంపుటం: 08-134

పల్లవి: నీకే తెలునాపెకు నీకంటేఁ దెలుసు
వాకు నిష్ఠూరాల మీలో వంతువెట్టేవారమా

చ. 1: సందడించి నీపయినింతి సణఁగులు చల్లఁగాను
విందువలె నీ వాపెను వేఁడుకోఁగాను
కందువచూడఁ గన్నులు గలవారమింతే నేము
చెంది మీతో సాకిర్లు చెప్పేటివారమా

చ. 2: పంతమాడి నీకు చెలి పగటులు చూపఁగాను
యెంతకైనా నీవాపెతో నియ్యకోఁగాను
సంతలోని పనివలె సమ్మతించేవారమింతే
బంతిఁబెట్టి మిమ్ము నొడఁబరచేవారమా

చ. 3: కాయమిచ్చి సతి నిన్ను కాఁగిటఁ గూడఁగాను
నీయంత శ్రీవేంకటేశ నీవు మెచ్చఁగా
పాయపు వలపు తొల్లే పాలువట్టేవారమింతే
నాయములు చెప్పి మిమ్ము నవ్వేటివారమా

రేకు: 0223-3 మాళవిగౌళ సంపుటం: 08-135

పల్లవి: విభుఁడు నీపై భుక్తితో వీఁడె వున్నాఁడు
సభఁలో మాకెల్లా నీవు చనవియ్యవమ్మా

చ. 1: చలము సాదించఁగాను జగడాలు దిద్దరాదు
నలువంకఁ దగవులే నడపవమ్మ
వెలయుచుఁ దిట్టఁగాను విన్నపాలు సేయరాదు
చలువైన శాంతానఁ జిక్కఁగావమ్మా

చ. 2: సమ్మతించననఁగాను సందడి మాటాడరాదు
నిమ్మపండందుకొంటే నీవే నేనమ్మా
యెమ్మెలు నెరపఁగాను యియ్యకోలు సేయరాదు
వుమ్మడి మీఁదటెత్తులు వూహించవమ్మా

చ. 3: యింత సిగ్గుపడఁగాను యెరుకలు సేయరాదు
వింతలు సేయక తెర వేయవమ్మ
చెంతలనే నిన్నుఁగూడె శ్రీవేంకటేశుఁడు లోలో
బంతినే మోవితీపులు పచారించవమ్మా

రేకు: 0223-4 లలిత సంపుటం: 08-136

పల్లవి: నాకే కాచుకుంటివా నడుమ నీవు
యీకతలెల్లా నేర్చి యెందు వోతివే

చ. 1: చెంతల నాతనిమాటే చెల్లఁబెట్ట వచ్చేవు
యెంత తగవరివే యేమే నీవు
పంతపురమణుఁడూర బావయై రాఁగాను
యింతేసి బుద్దులు చెప్పకెందు వోతివే

చ. 2: కూడఁగట్టి నాలోనిగుట్లే అడిగేవు
యేడకేడ నీనేర్పులేమే నీవు
నీడనున్న రమణుని నిందలిందరాడఁగాను
యీడ నీవుత్తరాలాడకెందు వోతివే

చ. 3: కందువనాతని నన్నుఁ గాఁగిలించఁ జేసితివి
యిందుకా నీజాణతనాలేమే నీవు
అందపు శ్రీవేంకటేశుఁ డక్కడా నిక్కడా నేఁడు
యిందెను చేసిన చేఁతలెందు వోతివే

రేకు:	0223-5 మంగళకౌశిక	సంపుటం:	08-137

పల్లవి:	కానవచ్చెఁ గదే మీకు కాంతలాల
నాననిచ్చితేనే కొంత నయము వచ్చీని

చ. 1:	మనసులోపలి చింత మాటలోనే కానరాదా
మనసేమి సోదించేవే మగఁడాతఁడు
కొనగొనలనే వద్ద గుట్టుననుండుటే మేలు
పనివడి పిసికితే పవురు వేసీని

చ. 2:	ముంచిన వలపుతీపు మోవిమీఁదఁ గానరాదా
యెంచనేలే గుణాలు ప్రాణేశుఁ డాతఁడు
అంచలనిచ్చకమాడి ఆసలనుండుటేమేలు
కంచముపొత్తుకుఁబోతే కారాలు సోఁకీని

చ. 3:	కాయము సోఁకినరతి కళలోఁ గానరాదా
యేయెడను శ్రీవేంకటేశుఁడాతఁడు
పాయక కూడెనితఁడు పంతముగొనుటే మేలు
వాయఁబోతే కొనగోరు వాఁటాలు సేసీని (?)

రేకు: 0223-6 హిజ్జిజి సంపుటం: 08-138

పల్లవి: దానికేమి తప్పదింతా తానే నేను
కానుకలు పచరించ కాలమెల్లా వలెనా

చ. 1: మాటలే మూటలాయ మంతనములాడఁగాను
యేఁటివే తనసుద్దులు యెందాఁకానే
పాటించి తా మగఁడైన ఫలమిది చాలదా
కూటమికిఁ గొసరఁగ కొలువులో వలెనా

చ. 2: చూపూలే రూపులాయ చూడఁగాఁ జూడఁగాను
యేపునఁ దనయెమ్మెలు యెందాఁకానే
చేపట్టి తాఁ బెండ్లాడేచేఁత యిదే చాలదా
తీపులు పచరించను తెరలోనే వలెనా

చ. 3: నవ్వులే పువ్వులాయ నాపైఁ దనమోహమున
యెవ్వరు నెరఁగనివా యెందాఁకానే
రవ్వగాఁ గూడె శ్రీ వెంకటరాయఁడిది చాలదా
పువ్విళ్ళూర సన్నసేయ వొద్దనిట్టే వలెనా

రేకు: 0224-1 హిందోళవసంతం సంపుటం: 08-139

పల్లవి: చెల్లునయ్య నీవు నాకుఁ జేసే చేఁత
యెల్లవారిలోన నిది యెక్కుడా నాకు

చ. 1: చనవిచ్చితివి నీవు చలము నే మానితి
యెనసి వేఁడుకొనేవు యెక్కుడా నాకు
పెనఁగితివిట్టే నేఁడు బిగువులు సడలితి
యినుమారు పంతమిచ్చేవెక్కుడా నాకు

చ. 2: పయ్యద నీవంటితివి పనులకు లోనైతి
యియ్యరాని బాసయిచ్చే వెక్కడా నాకు
నెయ్యము పై వేసితివి నీవే నేనై యుంటి
యెయ్యెడ చూచినా నవ్వేవెక్కుడా నాకు

చ. 3: కందువ దెలిపితివి కాఁగిలించుకొంటెనిన్ను
యిందర మెచ్చ మన్నించే వెక్కుడా నాకు
కందర్పగురుఁడ శ్రీ వెంకటరాయ కూడితివి
యింద నందూనేలితివెక్కుడా నాకు

రేకు: 0224-2 శంకరాభరణం సంపుటం: 08-140

పల్లవి: ఇద్దరూ నిద్దరే మనమేమి చెప్పదే
బద్దుగా దాపెను మెచ్చెఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 1: చక్కని మొకముచూసి సారెసారె మాటలాడి
చిక్కించెనాపె తొలుత చేరియాతని
మిక్కిలి మేలుదియ్యై మేను చెమరించఁగాను
పక్కన నాపెను నవ్వెఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 2: పీఁటమీఁదఁ గూచుండి ప్రియములు చెప్పి చెప్పి
దూఁటి చన్నులనొత్తెను తొలుతాతని
పాటించి యాతని మోవిపండు చూచి నోరూరఁగా
బాటగానాపెను నవ్వెఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 3: కాఁగిలించుక యిందిర కన్నులవలపు చల్లి
ఆఁగెను శ్రీవేంకటేశు నౌభళానను
చేఁగదేరఁ జొక్కియాపెఁ జూచి ఆతఁడె తానై
పాఁగినరతుల నవ్వెఁ బ్రహ్లాదవరదుఁడు

రేకు: 0224-3 సాళంగనాట సంపుటం: 08-141

పల్లవి: నడుమఁ జెమట భవనాశియేరు మీకునబ్బె
ఆడియాలముగ లోలోనందెఁగా మీవలపు

చ. 1: యెదురుఁ గొండపైనెక్కి యిందిర నీపైఁ గుచము
లెదురుచాఁచి వొత్తెనేడకు నేడ
కదిసి శ్రీ నరసింహ కాఁగలించితి వాపెను
అదన నిందుకు నందు నందెఁగా మీవలపు

చ. 2: యీడనుండి తన పాదమింతి నీతొడపైఁ జాఁచి
యీడుజోడుగాఁ గూచుండెనిచ్చ యెరిఁగి
వేడుక నీమోవినాపె ఇందుగా మోవంటితివి
ఆడానీడా దోఁటిగా నేఁడందెఁగా మీవలపు

చ. 3: నీనీడ ఆపైపైఁ బారి నీపైనాపెనీడవారి
తానకమై రెంటా మీరు తగిలితిరి
పూని యహోబలమునఁ బొంచి శ్రీ వేంకటేశుఁడ
ఆనకమై రెంటాఁ బెండ్లైయంటెఁగామీవలపు

రేకు: 0224-4 గౌళ సంపుటం: 08-142

పల్లవి: ఏమందునే వీనిమాయ లెన్నైనాఁ గలవు
కామించి నన్నునేలె కమ్మటీని చూడరే

చ. 1: కొప్పున రాలీ విరులు గురుతులు చూడరే
చిప్పిలీఁ జెమటలివె చేరిచూడరే
వుప్పతిల్లే పులకలనున్నాఁడు చూడరే
కప్పీఁ బడ్బడము నాకు కమ్మటీనిఁ జూడరే

చ. 2: గందపుఁ బేఁట్లు రాలీఁ గమ్మటీనిఁ జూడరే
చిందీ లేఁతనవ్వులు సెలవులఁ జూడరే
అందమైన బుసకొట్లవి గొన్నిజూడరే
అందుకొనీ నా చన్నులంతలోనే చూడరే

చ. 3: వాడుమోవియును వింతవాసనలఁ జూడరే
వేడుకకాఁడై వచ్చి వేఁడుకొనీఁ జూడరే
వీడెమిచ్చీఁ గోన తిరువెంగళేశుఁడై వచ్చి
కూడెను శ్రీవెంకటాద్రి కొండమీఁదఁ జూడరే

రేకు: 0224-5 లలిత సంపుటం: 08-143

పల్లవి: వినవే విభునిమాట వింతదానవా
చెనకేటి వేళనింత సిగ్గులు వడుదురా

చ. 1: యీసు లేని వాఁడతఁడు యిచ్చకురాలవు నీవు
తాసులవంటివే నీతలఁపు లెల్లా
సేస వెట్టినాఁడతఁడు చేయివట్టితివి నీవు
వాసులకు నీవుతల వంచుకొందురా

చ. 2: సరసపు వాఁడతఁడు చాయకు వత్తువు నీవు
సరిబేసి వంటివే మీచనవులెల్లా
తెరవేసినాఁడతఁడు తిరమై నిలిచితివి
శిరసువంచుక నీవు చెక్కు చేతనుందురా

చ. 3: శ్రీ వెంకటేశుఁడతఁడు శ్రీమహలక్ష్మివి నీవు
పూవు వాసనవంటివే బుద్ధులెల్లాను
భావించి కూడెనతఁడు పైకొంటి విట్టెనీవు
తావున రతుల నిట్టే తమకింతురా

రేకు: 0224-6 కన్నడగౌళ సంపుటం: 08-144

పల్లవి: ఇంతసేసినవాఁడవు యిదినేరవా
కాంత వున్నభావము కందువు రావయ్యా

చ. 1: చెక్కుల లేఁతచిగురు చేతిలోఁ దామరపవ్వు
వొక్కపరేఁ రెండనబ్బెనువిదకును
యెక్కడయేసునో మరుఁడు యెవ్వరి మర్మమంటునో
చొక్కముగ నీతిఁ జూతువు రావయ్యా

చ. 2: ఱెప్పల ముత్యాలవాన ఱేసులనే మీలయీఁత
అప్పుడే రెండూఁ గలిగెనంగనకును
తప్పులెవ్వరివల్లనో దైవికమెట్టున్నదో
చొప్పులీ వనితవల్లఁ జూతువు రావయ్యా

చ. 3: చిత్తములో నీరూపు చింతలు నీమీఁదను
హత్తెను రెండూ నిట్టే అతివకును
కొత్తగా శ్రీవెంకటేశ కూడితివింతక ముందు
జొత్తుల చెమటచెలిఁ జూతువు రావయ్యా

రేకు: 0225-1 నాట సంపుటం: 08-145

పల్లవి: నీతోను సరి బొంక నేనోపను
కాతరించినట్టి నీకనుసన్నదానను

చ. 1: చెక్కునొక్కి వేఁడుకొంటే సేదలెల్లాఁ దేరిచితి
మొక్కితిఁజుమ్మీనీకు మొన్న మొన్ననే
తక్కరివిద్యలుయేమీఁ దలఁచకుమీ అయ్య
చిక్కఁగా వలచిన నీచేతిలోనిదానను

చ. 2: పాదములు పట్టుకొంటి పంతములు నీకిచ్చితి
అదిగొన నే నవ్వితి నప్పుడప్పుడే
కాదుగూడదనకుమీ కాఁకలు సేయకుమయ్య
యేదెసచూచినా నీకునింటిలోనిదానను

చ. 3: యిచ్చకములు సేసితినియ్యకొంటి నన్నిటికి
కొచ్చి శ్రీవెంకటేశ నేఁగూడితి నేఁడే
పచ్చి సేఁతలెల్లాఁ జేసి పదరకుమీ అయ్య
కచ్చుపెట్టుక వుండే నీ కాఁగిటిలోదానను

రేకు: 0225-2 రామక్రియ సంపుటం: 08-146

పల్లవి: ఊరకున్నదంటానేల వొరయఁగ వచ్చేవు
నేరుపుల కెల్లానిది నెపమింతే కాక

చ. 1: పట్టరాదు ముట్టరాదు పడఁతుల మోహము
గుట్టుదెలిసినదాఁకా గురిగాదు
అట్టడివి నిన్నాపె యాఁఅడిసేయ నోపునా
పట్టిన వ్రతముతోడి బలిమే కాక

చ. 2: చెప్పరాదు చూపరాదు చెలుల కోరికలు
ముప్పిరి మాఁటాడుదాఁకా ముచ్చటాడదు
తప్పనివాఁడవు నీతో తారుకాణ కోపునా
తెప్పగా నీతో నవ్వేతెలివే కాక

చ. 3: పాయరాదు తోయరాదు పడఁతుల సంగములు
చేయి మీఁదయినదాఁకా సిగ్గువడ (వీడ?) దు
యీయెడ శ్రీవేంకటేశ యింతి నీపురాన నిల్చె
వాయకు గర్వించేదా సలిగింతే కాక

రేకు: 0225-3 ఆహిరి సంపుటం: 08-147

పల్లవి: నే నేరుపవలెనా నెలఁతకు నివియల్లా
సానఁ బట్టుకో నేరదా సకియ నీమనసు

చ. 1: నవ్వులనే నీవింత నాలిసేసేవాఁడవౌత
యెవ్వరు నెఱఁగరా యెమ్మెలేఁటికి
నివ్వటిల్లఁ గైలాటాలు నేఁ బెట్టితిననేవింత
జవ్వని యాపెఱఁగదా చల్లని నీగుణము

చ. 2: జంకెననే నీవప్పటి సందుకొనేవాఁడవౌత
పొంకాన వచ్చేదేకాదా పొద్దువొద్దుకు
సంకెదీర నిన్నాపెతో జగడాలు వెట్టితినా
అంకెల నాపెఱఁగదా అచ్చప నీసాజము

చ. 3: కందువనింతులఁ జూచి కలసేటి వాఁడవౌత
చందమయ్యేకాదా (?) సారె సారెకు
పొందితి శ్రీవెంకటేశ పొరుగున మమ్మిద్దరి
ముందర నాపెఱఁగదా ముచ్చట నీవలపు

రేకు: 0225-4 బౌళిరామక్రియ సంపుటం: 08-148

పల్లవి: నేరుపరులకునెల్లా నీవు సేసినదే పాడి
అరయఁ గడపరాయ అంతవాఁడవౌదువు

చ. 1: కందువమాటలనే కంకణాలు గట్టికట్టి
సందడిఁ బెండ్లాడేవు చతురుఁడవు
చందమామగుటుకల సారెనవ్వి వావులెల్లా
అందలానఁ బెట్టుకొంటి వంతవాఁడవౌదువు

చ. 2: పోరచి మోవితేనెలు పాదిగి తోడంటువెట్టి
సారెకు విందవెట్టేవు చతురుఁడవు
కోరి నిన్నుఁ జూచితే నాకొనచూపుల ముత్యాల
హారాలుగా వేసుకొనే వంతవాఁడవౌదువు

చ. 3: వొల్లనే చేతులు చాఁచి వుడివోని వలపులు
చల్లి వుంకువలిచ్చేవు చతురుఁడవు
యెల్లగా శ్రీవెంకటాద్రినెనసి నావిన్నపాలు
అల్లంతనే వింటివంతవాఁడవౌదువు

రేకు: 0225-5 ధన్నాశి సంపుటం: 08-149

పల్లవి: సాము సేతువుగా నీవు సరుస రాముఁడవై
యీమగువనేరుపులు యివి చూడరాదా

చ. 1: బొమ్మల విండ్లచేత పూఁచి చూపుల యమ్ముల
కుమ్మరించి చెలి నీపై గురులేసీని
సమ్మతించి యిరువంక చన్నుల కాంతులు సారెఁ
జిమ్ము పయ్యదలోఁ బుట్ట చెండ్లాడీని

చ. 2: గక్కన బిసకాండపు కరముల సన్నలను
అక్కజపు నీతోఁ గోలాటమాడీని
చెక్కుచెమట గోరులఁ జిందకుండా మీఁటుచు
చక్కు బుఙ్జటకొమ్ములు సాధించీని

చ. 3: చిగురుమోవిమాటల చేకత్తుల పంతాలఁ
దగిలి నీపైనాపె దండ వెట్టీని
నగుతా శ్రీవెంకటేశ నంటున నీవు గూడితి
అగపడి నీగరిడినన్నిటా మించీని

రేకు: 0225-6 ఆహిరి సంపుటం: 08-150

పల్లవి: ఏమయ్య యిందుకు నిన్నే మందును
కామించవలదా కైకొని నీవిపుడు

చ. 1: గాలించి గాలించి కలికి మాటలాడఁగా
లాలించవలదా లలనఁ గొంత
పోలించి పోలించి పొగడఁగా నప్పటిని
పాలించవలదా పయికొని నీవిపుడు

చ. 2: సోదించి సోదించి సుద్దుల నిన్ను మెచ్చఁగా
ఆదరించఁగ వద్దా అన్నిటా నీవు
సాదించి సాదించి సరి నీతో నవ్వఁగా
మోదించవలదా మొదల నీవిపుడు

చ. 3: కరఁగించి కరఁగించి కాఁగిట నిన్నుఁ గూడఁగా
పొరయించవలదా పొందుల నేఁడు
సిరులుమించఁగ మించ శ్రీవెంకటేశుఁడుగూడె
యిరువుకోవలదా యిచ్చకములిపుడు

రేకు: 0226-1 మాళవి గౌళ సంపుటం: 08-151

పల్లవి: మాతోనింకానా మజ్జాతాయను వకు (?)
చేతికి లోనై నమీఁదఁ జెప్పవలెనా

చ. 1: జంగిలి సతుల నీవు సారెసారె నమ్మించఁగా
అంగడిఁ బడీనవె నీ అన్నమాటలు
యెంగిలిగా నీమోవి యెవ్వరైనాఁ జేయఁగాను
ముంగిట మెరసెను నీముసిముసి నవ్వులు

చ. 2: చేరి పదారువేలకు సేసలు నీవు వెట్టఁగా
ఆరీతిఁ బడెనవే నీ అన్ని చేఁతలు
కోరికలు మించినట్టి కొలనిసతులచేత
నీరువంక తుంగైనవి నీగుణాలు

చ. 3: యింపుల రాచకూఁతురునెత్తుక నీవు రాఁగానే
సంపద మించినవి నీచతురతలు
ముంపున శ్రీవెంకటేశ ముందె నన్నుఁ గూడితివి
చెంపల నిలిచెను నీసిగ్గులెల్లాను

రేకు: 0226-2 భైరవి సంపుటం: 08-152

పల్లవి: చిత్తము రా సేవలెల్లఁ జేతువుగాక
కొత్తలా మీయిద్దరికిఁ గొంకనేలే యిఁకను

చ. 1: సెలవి నవ్వునిండితే సిగ్గులేల పెంచేవే
నిలువున నవిరెండు నీవొళ్ళివే
వలుపే పూవఁగాను వాసనలు మానునా
కొలువులో పతితోడఁ గొంకనేలే యిఁకను

చ. 2: తనువు చెమరించితే తలయాల దాఁచేవే
నినుపుననవి రెండు నీవొళ్ళివే
మనసు గరఁగఁగాను మచ్చికలు మానునా
కొనితెచ్చేవా బుద్ది కొంకనేలే యింకను

చ. 3: మఱపు పైకొంటేను మాటలేల కొదికేవే
నెఱతనాలవి రెండ నీవొళ్ళివే
చిఱుతల మేలుమంగ శ్రీవెంకటేశుఁడు గూడె
గుఱియైన పనులకు కొంకనేలే యిఁకను

రేకు: 0226-3 శంకరాభరణం సంపుటం: 08-153

పల్లవి: నేఁడె శుక్కురారము నెలఁతలాల
పోఁడిమి సేవసేయరే పుణుఁగుకాపు

చ. 1: పన్నిటి కాలువలు పారీనిఁజూడరే
అన్నిటాఁ గొండవంటి శ్రీహరిమీఁదను
యెన్ననభిషేకమంత్రాలిదె చెప్పేరు వినరే
తిన్నని పుణుగుకాపు దేవునికి నేఁడు

చ. 2: రాలీని కప్పురరజమిదె చూడరే
నీలమేఘమువంటి యీ నీరజాక్షుపై
తాలమితో జాలువారీ తట్టుపుణుఁగదిగోరే
పోలింపఁ బుణుఁగుకాపు పురుషోత్తమునికి

చ. 3: అలమేలు మంగతోడి హారాలు సేవించరే
వెలయ ధరించెను శ్రీవెంకటేశుఁడు
పలువిందులారగించె బాగాలు యియ్యరే
చెలఁగీ పుణుఁగుకాపు శేషాద్రిపతికి

రేకు: 0226-4 సౌరాష్ట్రం సంపుటం: 08-154

పల్లవి: ఏఁటిదో నీచిత్తము నేమెఱఁగమయ్య
వాఁటమైన వెల్లవిరివారమయ్యా

చ. 1: సిగ్గుపడితిమింతతో సెలవి నీవు నవ్వఁగా
యెగ్గొ తప్పొ యేమంటినో యెరఁగమయ్య
దగ్గరి సేవ సేసితి తగినదొరవు నీవు
నిగ్గులఁ గుచ్చితములు నేరమయ్య

చ. 2: మోరగందితినింతలో వేఁడుకొనే నిన్నుఁజూచి
మొరఁగులిందేమున్నవో మొక్కేమయ్య
మరినీకు లోనయితి మంచిదేవరవు నీవు
మెరసి నీతోఁ బెనఁగ మేము నేరమయ్య

చ. 3: చెమరించితివి నీవు చేరి నన్నుఁ గూడఁగాను
తమకమా తడఁబాటో తలఁచమయ్య
అమర శ్రీవెంకటేశ అలమేల్మంగను నేను
అమరిన రతికడ్డమాడమయ్య

రేకు: 0226-5 మేఁచభౌళి సంపుటం: 08-155

పల్లవి: నీవారమిన్ని టాను నీకంటెనెక్కుడు లేరు
సేవలు సేసేము నీవు చిత్తగించవయ్యా

చ. 1: సేసినచేఁతలు నీవే చెల్లఁబెట్టుదువు గాక
యీసరి మానేరుపులు యేమున్నవి
సేసవెట్టి రాజు వలచినదే దేవులందురు
రాసికెక్క నీసొమ్ము రక్షించుకోవయ్యా

చ. 2: పట్టిన నీపంతమే బలువు సేతువు గాక
యెట్టైన మాగుణములు యేమి చూచేవు
అట్టే పరుసమంటితేనదియే బంగారందురు
పెట్టని చోట్లఁ బెట్టి పెద్ద సెయ్యవయ్యా

చ. 3: కూడిన నీకూటములె గురులు సేతువు గాక
యీడనే మాయసోదాలేమున్నవి
యేడను శ్రీవెంకటేశ యేలితేనే బంటందురు
పాడేటివారము నిన్ను బత్తిచేకోవయ్యా

రేకు: 0226-6 ముఖారి సంపుటం: 08-156

పల్లవి: ఆయలవాటే చూచి అప్పటిమాతో నేఁడు
చాయలనీపనికెంత సాముసేసెనో

చ. 1: వీడెమియ్యఁగలఁ గాక వీడెమిచ్చే చేతుల
తోడఁ దోడఁ బెనఁగఁగా దొబ్బఁగలనా
వోడక ని నిష్ఠూరానకొడిగట్టే సతులనుఁ
గూడి యేమిసేయించుకొని వచ్చెనో

చ. 2: మాటలాడఁగలఁ గాక మంచితనమైన నోట
తేటగా నవ్వేటి తన్నుఁ దిట్టఁగలనా
నీటున రాఁగతనాలు నెరుపేటి కాంతలను
పాటించి కలసి యేమి భ్రమసినాఁడో

చ. 3: కాఁగిలించఁగలఁ గాక కైకొన్న చేతుల గోళ్ళ
చేఁగదేర మొక్కఁగాను చిమ్మఁగలనా
వీఁగక శ్రీవెంకటాద్రి విభుఁడిట్టె నన్నుఁ గూడె
యేఁగి వచ్చి యేయింతులకిట్టె పంతమిచ్చెనో

రేకు: 0227-1 నాదరామక్రియ సంపుటం: 08-157

పల్లవి: ఎప్పుడును నీమనసు యెరఁగని కల్లలేదు
ముప్పిరిగొనేటి యీమోసమేలయ్యా

చ. 1: వలపులు సరివచ్చె వనిత యిందుకు మెచ్చె
వెలినేల లోనికిఁక విచ్చేయరాదా
యెలమి సరిబేసికి యిదె సుద్ది నిన్ననేల
నిలువు నివ్వెరగులు నీకేలయ్యా

చ. 2: మాటలు తారుకాణాయ మగువకుఁ బ్రియమాయ
మాటికి నవ్వఁగనేల మన్నించరాదా
తేటలుగా నీనిజాలే తెలిసీఁ జెలులకెల్ల
యీటుతోడి కుచ్చితాలు యిఁకనేలయ్యా

చ. 3: రతిఁ దమకము నిండె రమణిభాగ్యము పండె
కతలేల పంతములు గైకొనరాదా
యితవై శ్రీవెంకటేశ యింతినిట్టె కూడితివి
మతకరి తరితీపు మరియేలయ్యా

రేకు: 0227-2 కాంబోది సంపుటం: 08-158

పల్లవి: వట్టి పంతములనేల వసివాడువాడ నీకు
నెట్టన నీవాఁడనని నిలుచుండరాదా

చ. 1: కలికిచూపులు నీకుఁ గలువరేకులెకాక
వెలినుండి యింతలోనే వెట్టలయ్యీనా
పొలసిన విరహానఁ బొరలేవు యీడనుండి
వలచి వచ్చితినంటా వద్దికి రారాదా

చ. 2: కామిని నవ్వులు నీకుఁ గప్పురవిడేలే కాక
చే ముంచి మరివేరే చేఁదయ్యీనా
ఆమని యాసలతోడ నసురుసురయ్యేవిట్టే
దోమటిమోవితేనెలు తొడుకఁగరాదా

చ. 3: కాంతమాటలు నీకుఁ గట్టిన ముడుపు గాక
చింతల నింతలోననే చిల్లరయ్యీనా
యింతట శ్రీవెంకటేశ యెనసితి విందుమండే
పొంతకు వచ్చినందుకు పూఁచి మొక్కరాదా

రేకు: 0227-3 లలిత సంపుటం: 08-159

పల్లవి: ఎఱఁగమైతిమయ్య (మమ్మ?) యిన్నాళ్ళును
కఱకరిఁ బెట్టఁగోరే కాతరీఁడా తాను

చ. 1: పొందులిట్టే రేఁచఁగాను పొత్తులు వేడుకలాయ
సందడించఁగా వలపు చవులాయను
యిందాఁకాఁ దనమనసెవ్వరిదై వుండెనే
ముందు వెనక లెంచని మొక్కలీఁడా తాను

చ. 2: కాయము గిలిగించఁగా గక్కన నవ్వులు వుట్టె
చేయి చేతనంటఁగాను చెమరించెను
పాయపుమదమెవ్వతె పంచనుండెనే యిన్నాళ్ళు
చాయలు సన్నెరఁగని జడ్డువాఁడా తాను

చ. 3: గక్కున నేఁగూడఁగాను కళలు మోమున నిండె
నొక్కుచు మోవియ్యఁగాను నోరూరెను
యిక్కువ శ్రీవెంకటేశుఁడెంత భ్రమసి వుండెనే
యెక్కువ నాతోరమించె నిచ్చకుఁడా తాను

రేకు: 0227-4 నాగవరాళి సంపుటం: 08-160

పల్లవి: ఇంటికి రావయ్యా యిఁకనేఁటికి
కంటగించఁ దొల్లింటికతలెన్నిలేవు

చ. 1: కావరించి యెట్టుండినాఁ గడు మంచివాఁడవే
నీవేమేమాడినాను నిజమరిచే
కైవసపు వనితలు కల్లలు గారులు నిన్ను
ఆవటించి వూరకైనా నాడుదురుగాని

చ. 2: సేసేటి నీచేఁతలెల్లా చేరువపుణ్యాలే
నీ సుద్దులు విన్నవల్లా నీతితోడివే
పాసినట్టి మగువలు పట్టలేక వయసులు
వేసరి నిన్నుఁ దిట్టుతా వీఁగుదురు గాని

చ. 3: కలసిన నీరతులు కందువ వుచితములే
సులభాన నీవు నాకుఁ జుట్టమవే
యెలమి శ్రీవెంకటేశ యెరవుల వనితలు
చలమరివని నిన్ను సాదింతురు గాని

రేకు: 0227-5 మెంచభౌళి సంపుటం: 08-161

పల్లవి: ఎప్పుడు నీవు వచ్చినా నేమాయను చన
విప్పించుకొనేఁగాక యేమాయను

చ. 1: నీకు సెలవైనదాన నీచేతిలోనిదాన
యేకడ నేనే నుండినాను యేమాయను
ఆకు మడిచిచ్చేదాన ఆయాలు సోఁకినదాన
యేకొలఁది నుండినాను యేమాయను

చ. 2: వంతువరుసల దాన వలచివుండిన దాన
యెంత విరహాన నున్నా నేమాయను
చింత నీకెక్కినదాన చిగురుఁగోరికదాన
యింత నీవు పెనఁగితే నేమాయను

చ. 3: మనసు నమ్మినదాన మానము నీకై నదాన
యెనసి నిన్ను మెచ్చితే నేమాయను
తనిసితి నీకూటమిఁ దగు శ్రీ వేంకటేశ్వర
యినుమడించి నవ్వితేనేమాయను

రేకు: 0227-6 ముఖారి సంపుటం: 08-162

పల్లవి: మిక్కిలి కళదేరేవు మేలుగా నీవు
చక్కని సరసానకు జాణవుగా నీవు

చ. 1: యెప్పుడూను వింతలేదు యేసతుల యడాటాన
మెప్పించుకోనేర్తువు మేలుగా నీవు
చిప్పిల నవ్వు నవ్వితేను సిగ్గుపడవేమిటాను
చెప్పరాని మహిమలు సేతువుగా నీవు

చ. 2: అంగళ్ళు ముంగిళ్ళు నల్లారుముద్దు చూపేవు
మెంగతనాలు నీసొమ్ము మేలుగా నీవు
సంగడి నేఁ జెనకితే సమ్మతించే వెందుకైనా
జంగిలి రతులకు వేసరవుగా నీవు

చ. 3: పిలిచితేఁ బలికేవు భేదము లేదేమిటాను
మెలకువగల వింత మేలుగా నీవు
అలరి శ్రీవెంకటేశ అంటితేనే కూడితివి
కలపుకోలన్నిటాను కలవుగా నీవు

రేకు: 0228-1 శ్రీరాగం సంపుటం: 08-163

పల్లవి: బంగారువంటిదాన పచ్చివిటుఁడవు నీవు
యెంగిలి నీమాటవింటి నేమి సేతురా

చ. 1: కందువగు నీమేను కాఁగిలించఁగానె నామై
చందముగ నీమేనిలచ్చనలంటెను
చిందరవందరలైన జీడివంటిది వలపు
యిందులోనే కొనవచ్చె నేమిసేతురా

చ. 2: మొక్కితి నీపాదాలకు ముందర మొక్కినవారి
యెక్కడో కస్తూరిబొట్టు యిదె నన్నంటె
మొక్కలాన ముయికిని ముయివంటిది వలపు
యిక్కడనే కానవచ్చె నేమిసేతురా

చ. 3: బాగాలు నీకిచ్చితేను పాఁగిన నీతమ్ములము
పోగులై తోడుత నాపుక్కిలి నిండె
బాగుగా శ్రీవెంకటేశ పంటవంటిది వలపు
యీగతినే కానవచ్చెనేమిసేతురా

రేకు: 0228-2 దేసాళం సంపుటం: 08-164

పల్లవి: నీకు బాఁతే చెలులము నీగుణ మిట్టిది గాక
యీకొలఁది నీభావాలేమని నుతింతును

చ. 1: చెప్పినట్టే చేసేవు చేరి నేనెంత నీ వెంత
అప్పసము నీ వలుపేమని నుతింతు
చిప్పిలఁ గొంగు వట్టితే చేతికి లోనై వచ్చేవు
యెప్పుడూ నీ కృపారసమేమని నుతింతును

చ. 2: ఆడినట్టే ఆడేవు ఆతుమ నన్నుఁ జేసుక
ఆడిన నీ సొలభుఁమేమని నుతింతు
వీడెము చేతికిచ్చితే వేడుక నందుకొనేవు
యీాడ నీ మంచితనము యేమని నుతింతును

చ. 3: కోరినట్టెల్లాఁ గూడేవు కొసరుకు గొసరెల్లా మాని
ఆరీతిఁ జుట్టరికమేమని నుతింతు
సారపు శ్రీవేంకటేశ చనవిచ్చి కలసితి
యేరా నీ రతికేలి నేమని నుతింతును

రేకు: 0228-3 భైరవి సంపుటం: 08-165

పల్లవి: కానవచ్చీ నన్నియును గలసుద్దులపుడు
నీ నేరుపులేర్పడీ లోనికి నేఁగరాదా

చ. 1: చలము నీతోనేల సారె సారెనాపెకు
పలుకు బెంబడినే పచ్చిసేసీని
అలవోకమాటలా పెనాడితివి దానికేమి
నెలవుల రతికి లోనికి నేఁగరావా

చ. 2: కోపగించ నీతోనేల కొసరుచునాపెకు
తీపుల బెంబడినే దిమ్మురేఁచీని
చూపులనే రాజము చూపితివందుకేమి
నీపనులు దెలిసి లోనికి నేఁగరాదా

చ. 3: విచ్చిచెప్ప నీతోనేల వేరేవేరే యాపెకు
మెచ్చుల కాఁగిటిలోనే మెప్పించీని
కొచ్చి శ్రీ వేంకటేశుఁడ కూడితివి అందుకేమి
నిచ్చఁబెండ్లాయను లోనికి నేఁగరాదా

రేకు: 0228-4 భూపాళం సంపుటం: 08-166

పల్లవి: చవులుసేక నీవు సారెసారెకు
అవరములతోడ నారగించవయ్యా

చ. 1: మాటలమూటల చద్ది మనసులో చిలుపాలు
యేఁటిసేసి విందువెట్టీ నింతి నీకును
పాటలపంచదారలు పచ్చిమోవితేనెలు నీ
యాటలాయ నేఁడిట్టే ఆరగించవయ్యా

చ. 2: జంకెనల కారాలు చవుల సాకములు
లంకెల విందులు వెట్టీ లలన నీరు
పొంకపుఁ జూపులంబళ్ళు పొరినవ్వుల పచ్చళ్ళు
అంకెలాయ నేఁడిట్టే ఆరగించవయ్యా

చ. 3: కరజపు వినయాలు కాఁగిటి రతిబువ్వాలు
సిరులతో విందువెట్టీ శ్రీ సతి నీకు
గరిమ శ్రీ వెంకటేశ కలసితి రిద్దరును
అరుదాయ నేఁడిట్టే ఆరగించవయ్యా

రేకు: 0228-5 కాంబోది సంపుటం: 08-167

పల్లవి: ఎరవుగా నీవు నన్ను ఇందరివలెఁ జూచేవు
దొరతనమే కాక దొమ్మిసేసేనా

చ. 1: వలపు నీపైఁ జల్లి వానికిఁ బెనగేఁ గాక
చెలులతో జగడాలు సేసేదాననా
పలుకుల బువ్వాలబంతికి వచ్చేఁ గాక
అలుకలు మీద మాటలాడేదాననా

చ. 2: యింగితమెరిఁగి నిన్ను నింటికిఁ బిలిచేఁ గాక
కొంగువట్టి తీసి యింత కొచ్చేదాననా
పొంగుచు నీవద్దనుండి బుద్ధి చెప్పేదానఁ గాక
సంగతి దెలియకింత సాదించేదాననా

చ. 3: కప్పురము నోరికిచ్చి కారాలు రేఁచితిఁ గాక
చిప్పిల నీమోవి గంటిసేసేదాననా
ముప్పిరి శ్రీవెంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
అప్పసపుదానఁగాక అటువంటిదాననా

రేకు: 0228-6 సాళంగనాట సంపుటం: 08-168

పల్లవి: పేరు కుచ్చి యాతనితో పిలిపించుకోవలెనా
చేరి వీడెమియ్యఁగదే సిగ్గులింకా నేఁటికి

చ. 1: సరి నీవు నవ్వితేనే సరసానఁ బైకొంట
యిరవుగాఁ జూచితేనే యియ్యకొనుట
గరిమ మాటాడితేనే కంకణము గట్టుకొంట
సరుగ రావే యేల జాగులు సేసేవు

చ. 2: చేరి తిట్టినపుడే చేఁతలకు లోనౌట
సారెఁ బయ్యద మూయుటే చవి రేఁచుట
కోరఁగా నానవెట్టుట గోరికొనకు లోనౌట
కూరిమి చేకొని రావే గుట్టింతచూపక

చ. 3: యెదురెదురనుంటేనే యిచ్చల సేసవెట్టుట
యిదె చెక్కుచేయంటితే నింపు చల్లుట
అదిన శ్రీవేంకటేశుఁడాతఁడు తా నిన్నుఁగూడె
చెదరకిట్ల రావే చెప్పించుకొనక

రేకు: 0229-1 దేవగాంధారి సంపుటం: 08-169

పల్లవి: ఆయమంటి మోవితీపులానఁగ రాదా
వోయమ్మ వద్దనున్నాఁడు వూరకుండ నేఁటికే

చ. 1: చెక్కు నొక్కఁ బొద్దులేదో సేదదేరఁ బొద్దులేదొ
గుక్కక పతిఁ గాఁగిటఁ గూడఁగ రాదా
వెక్కసపు విరహాన విసిగితివిందాఁక
యిక్కడికే పతి వచ్చె నిఁకనేలే కొసరు

చ. 2: నవ్వు నవ్వ వేళలేదొ నమ్మికకు వేళలేదో
పువ్వువలెఁ గాఁగిటను పొదుగరాదా
దవ్వుల నున్నాఁడంటా తమకించితివిందాఁక
యివ్వల నీ గుబ్బలంటె నిఁక జాగువలెనా

చ. 3: మాటాడఁ దతిలేదొ మనసియ్యఁ దతిలేదొ
గాఁటముగ దెరవేసి కలయరాదా
యేఁట వెట్టి శ్రీ వెంకటేశుఁడిదె నిన్నుఁగూడె
యీటుగానే మన్నించె నిఁక నెదురేదే

రేకు: 0229-2 దేశా(సా)క్షి సంపుటం: 08-170

పల్లవి: మర్మము నీవె యెఱిఁగి మన్నింతువుగాక నన్ను
ధర్మమా నీకునాకుఁ దారుకాణలయ్యా

చ. 1: పల్లదపు నామాటకు భావించేఅర్థము నీవు
చల్లని నామనసుకు సాక్షివి నీవు
తెల్లముగా నామోములో తేటలకళలు నీవు
చెల్లఁబో యింకా విచ్చెచెప్పనేఁటికయ్యా

చ. 2: చెప్పరాని నాచేఁతకు సెలవినవ్వులు నీవు
వొప్పు నావయసునించే వొడివి నీవు
ముప్పిరి నాచక్కఁదనమున కద్దమవు నీవు
చిప్పిల నింకా విచ్చిచెప్పనేఁటికయ్యా

చ. 3: గట్టి నాచన్నులమీఁది ఘనహారమవు నీవు
పట్టిన నావ్రతానకు ఫలము నీవు
యిట్టె శ్రీవేంకటేశ యెనసితివింత నన్ను
చిట్టకాననిఁక వచ్చిచెప్పనేఁటికయ్యా

రేకు: 0229-3 వరాళి సంపుటం: 08-171

పల్లవి: శిరసుండ మోకాలికి సేసలు చల్లిన యట్లు
మురిపేన చెలికత్తె మొగమేమి చూచేవే

చ. 1: చెంతలఁ బిలువఁగాను చెలి వూరకుందానవు
పంతము దప్పిన యట్టే పలుకఁగాను
వంతుతో నీ రమణుఁడు వద్ద నిట్టే వుండఁగాను
మంతనానఁ జెలులచే మాటలాడించేవే

చ. 2: కొనగోరఁ జెనకఁగాను గుట్టుసేకొనేవీడ
ననుపున నాఁటినట్టే నవ్వఁగాను
యెనసి యాతఁడు నీయెదటనే వుండగాఁను
చనవిచ్చి చెలులను సాకిరి గోరేవే

చ. 3: వున్నతిఁ గాఁగిలించితే నొంటినే సిగ్గువడేవు
చన్నులు గుంగినట్టే సరినొత్తఁగా
అన్నిటా శ్రీ వేంకటేశుఁడాదరించి నిన్నుఁగూడె
చెన్నుఁడంటానితనిఁ జెలితో మెచ్చేవే

రేకు: 0229-4 వరాళి సంపుటం: 08-172

పల్లవి: కక్కూరితితనమేల కడదాఁకాను
అక్కరతో నింత నిజమాడి బదుకరాదా

చ. 1: శిరసుపై తలఁబాలు చెలిచేతితోనున్నవి
యెరవుగ నాతో నీవు యేలబొంకేవు
నిరతినిందుకుఁ గాను నీతోనేల అలిగేను
అరుదుగ నీవు నిజమాడి బదుకరాదా

చ. 2: నిన్నునొత్తిన చన్నులు నెలఁతరొమ్మునవే
యిన్నిటా నీవు నాతోనేల బొంకేవు
సన్నల నిన్నుఁదిట్టుచు సాదించేనా నేనేమి
అన్నిటాను యిట్టే నిజమాడి బదుకరాదా

చ. 3: నీయధరముపై తేనె నెలఁతపుక్కిలి నిండె
యీయెడనెవ్వరున్నారు యేల బొంకేవు
చేయిచ్చి యలమేల్మంగ శ్రీవేంకటేశుఁడ కూడే
వాయింతినే నేను నిజమాడి బదుకరాదా

రేకు: 0229-5 శుద్ధదేశి సంపుటం: 08-173

పల్లవి: ఎప్పుడూను నీవోజలిటువంటివి
తప్పక ఆసతి నీకుఁ దక్కువా యేమైనాను

చ. 1: పడఁతి లోలోసిగ్గు పచ్చినవ్వే మోళ్ళుఁగాక
అడిగితేఁ జెప్పునా అదియేఁటిది
కడలేని మగవాని కాతరము జాడిట్టిదే
గడుసుఁ దనాననింతఁ గాకుసేయఁ జూచును

చ. 2: చెలియతమకమెల్లా చెమటలై కారుఁగాక
వెలిఁబెట్టవచ్చునా వేఁడుకొనేవు
మలసేటి జాణని మతకములిట్టివే
చలివాపి సతులనాలురేఁచఁ జూచును

చ. 3: అంగనరతులచొక్కు ఆతుమలో నుండుఁగాక
సంగడించితేనంటునా సారె నీకును
యింగితాన శ్రీవేంకటేశ నీకూటమిగల్గె
రంగుగ నీబోఁటిమేలు రచ్చఁబెట్పఁ జూచును

రేకు: 0229-6 మాళవశ్రీ సంపుటం: 08-174

పల్లవి: మఱియేఁటి సుద్దులు మమ్మేమడిగేవు నీవు
మెఱసి మీయిక్కువలు మించెను దోమట్లె

చ. 1: యింతిని నీవు చూచితే నింగితాకారమెరేఁగి
చింతతోడఁ దలవంచి సిగ్గువడెను
వింతగానందుకు నీవు వెడనవ్వు నవ్వితివి
పొంతనే కమ్మర నాకె బొమ్మల జంకించెను

చ. 2: పడఁతిని దగ్గరితే భావమెల్లాఁ దెలుసుక
చిడుముడి తమకానఁ జెమరించెను
బడినే అందుకుఁ బూవుబంతి నీవు వేసితివి
వొడిఁ బెట్టుకొని యాకె వుద్దండాన మొక్కెను

చ. 3: అంగనఁ గాఁగిలించితే ఆయములట్టే కరఁగె
సంగతిగాఁ బవళించె శయ్యమీఁదను
అంగవించి శ్రీవెంకటాధిప నీవు గూడితివి
వుంగరములా కెవేళ(ళ్ళ?) నొగి మార్పులాడెను

రేకు: 0230-1 సామంతం సంపుటం: 08-175

పల్లవి: ఏమని భావింతు నిన్ను నెంతని సంతోసింతు
శ్రీమంతుఁడ నన్నుదిద్దే చేఁతోయిది

చ. 1: కాంతుఁడ నేనెంతాడినా గక్కదలవు నీవు
యెంత రాతిగుండెవాఁడ వేమి చెప్పేది
శాంతుఁడవో గట్టువాయిజాణతనమో యిట్టె
మంతుకెక్కించే నామీఁది మన్ననో యిద

చ. 2: దిట్టనై నేజంక్కిచితే తెమలవేమిటా నీవు
యెట్టి చలపాదివాఁడ వేమి చెప్పేది
గుట్టు నీకింతగలదో గుణము చండిపడెనో
గట్టిగా నన్నీడేర్చే కరుణో యిది

చ. 3: బిగ్గె నేఁగాఁగిలించితే బెగడవేమిటా నీవు
యెగ్గులెంతెంచనివాఁడ వేమి చెప్పేది
సిగ్గరితనమో నేఁడు శ్రీవేంకటేశ నీనవ్వో
కగ్గులేకేలితివి నాకన్నవరమో యిది

రేకు: 0230-2 శుద్ధవసంతం సంపుటం: 08-176

పల్లవి: చెప్పుకున్న దోసము చేఁతలెరిఁగినవారు
కప్పిన సంతోసాలఁ గందువలెరఁగరు

చ. 1: కన్నెలాల మీరిద్దరు కాఁగిలించేరు చుట్టాలై
పిన్నలు చన్నులొత్తీనే పెరిగేపొద్దు
మున్నాడి యొక్కరొక్కరు మొక్కలాడేరప్పటిని
కన్నచో గోళ్ళుదాఁకీనే కడువాఁడిపొద్దు

చ. 2: దిట్టలై ముచ్చటలుగా తీపులు మాటలాడేరు
యిట్టె తేనెగారీ నిప్పలెర్లించే (?) పొద్దు
చెట్టపట్టాలు వట్టేరు చేరి పిరుఁదులురాయ
బట్టబయలయ్యా మరుబండ్లు వారేపొద్దు

చ. 3: బంతినే మీరిద్దరును పాదుగాఁ గూచుండేరు
గుంతలయ్యీఁ బరపల్లాఁ గూడేటిపొద్దు
యింతలో శ్రీవేంకటేశుఁడెనసె నిన్నునూ నన్నూ
రంతుగా మాచేనాడించే రాజసమీపొద్దు

రేకు: 0230-3 కాంబోది సంపుటం: 08-177

పల్లవి: ఎట్టుసేసినాఁ జేయుమిక నాతఁడల్లవాడే
పట్టరాని వ్రతములో పానువుపైనే

చ. 1: కప్పురపుమోవి నీవు కాంతునికిఁ జూపఁగాను
దప్పిదేరీ నాతఁడదే దవ్వులనుండే
చెప్పరానిచేఁతలు చేరి నీవు సేయఁగాను
చిప్పిలీ నీరతులను చిత్తములోనే

చ. 2: చన్నులఁ బయ్యద నీవు జారఁదోయఁగా నతఁడు
కన్నుల పండుగసేసీఁ గడనుండే
వెన్నెలనవ్వులు నీవు వెదచల్లఁగాఁ జూచి
మిన్నక మోమునసెల్లా మించీని కళలు

చ. 3: చివ్వన దగ్గరి నీవు శ్రీ వేంకటేశుఁ గూడఁగా
జవ్వనాన ఫలమంది సరుసనుండె
రవ్వగా సరసము నీరపముగా నాడఁగాను
బువ్వపువిందులు చేత భోగించే నిపుడు

రేకు: 0230-4 పాడి సంపుటం: 08-178

పల్లవి: చూడ నిట్టున్నాఁడవు సోదించి చూచితేను
మాడకు వేగురిఁదెచ్చే మతకమెరఁగను

చ. 1: తగిలి యెవ్వతెయైనాఁ దప్పక నిన్నుఁ జూచితే
జిగురంటినట్టేకాక చేరి పాసీనా
మగువ భ్రమయించును మగవాని నందురు
మగువల మించితివి మహిమలెరఁగను

చ. 2: నీఁటుకత్తె యెవ్వతైనా నీతోను మాటాడితే
వేఁటమేకమౌఁగాక వేరె పాసీనా
మాఁటల పందిలివెట్టు మానిని యందురుగాని
మాఁటల గుళ్ళుగట్టి మము నింతసేసేవు

చ. 3: పొలసితే నీ ముందరఁ బోరాక యెవ్వతైనా
వలలకు లోనేకాక వడిఁ దాసీనా
యిల లక్ష్మీ శ్రీవేంకటేశ నీ వురమెక్కెను
మలసి నా వురమెక్కి మన్నించు టెరఁగను

రేకు: 0230-5 సాళంగం సంపుటం: 08-179

పల్లవి: మొగమోటమున నీకు మొక్కే నేను
తగవులఁబెట్టుకొని దగ్గర నున్నాఁడవు

చ. 1: నేరుపుగల మగువ నిన్నుఁ బిలిపించితేను
వోరుపుగలిగినాపె వొద్దఁ గూచుండె
మేర పరి నవ్వరాదు మెలుఁతను దూరరాదు
నీరువంకతుంగవలె నీవున్నాఁడవు

చ. 2: కన్నులు గొప్పలైనాపె గక్కన సన్నసేసితే
చన్నులు పిన్నలైనాపె చల్లె వలపు
నిన్నుఁ గైకొనఁగరాదు నెలఁతఁ బొమ్మనరాదు
అన్నిటా రొంపికంబమవై నీవున్నాఁడవు

చ. 3: ఆయాలు సోఁకించినాపె అట్టె నిన్నుఁ గూడితేను
మాయలు నేరిచినాపె మరిఁ గూడెను
యీయెడ శ్రీవేంకటేశ యిద్దరి మిమ్మనరాదు
పాయక నా వురముపై పంతాననున్నాఁడవు

రేకు: 0230-6 మెంచభౌళి సంపుటం: 08-180

పల్లవి: ఎవ్వరు బుద్ధిచెప్పేరు యిద్దరికి మీకు నిఁక
అవ్వల నివ్వల నీవే ఆదరించు మీపెను

చ. 1: మచ్చరపు సతులతో మారుమలతువుగాక
యిచ్చకపు సతితోడ నింతగలదా
తచ్చి నీకు కుంచవేసి తలవంచుకున్నదాపె
గుచ్చి నీవైతే మోనాన గుట్టుననున్నాఁడవు

చ. 2: పంతపు వనితలనె పైపై సాదింతువుగాక
చింతించే నీవద్దిచెలిఁ జిమ్మిరేఁతురా
మంతనాన విడెమిచ్చి మానాన మణిఁగీనాపె
రంతుల నీవైతేను రాజముచూపేవు

చ. 3: వేసాల మగువలతో విఱ్ఱవీఁగుదువుగాక
ఆసపడ్డకాంత నింత అలయింతురా
పాసిన కాఁకలుదీర పాదములొత్తీనాపె
శ్రీ సతీశ కూడితివి శ్రీ వెంకటేశుఁడవు

రేకు: 0231-1 కన్నడగౌళ సంపుటం: 08-181

పల్లవి: ఎవ్వరి నేమడిగేవు యేమని చెప్పేము నేము
జవ్వనపు నీ పంతము సంగడినేవున్నది

చ. 1: పడఁతి మాటలలోని భావము దెలుసుకొంటే
అడరిన నీ మోహమందేవున్నది
తడఁబడే మతిలోని తలఁపు దెలుసుకొంటే
విడువని నీ నేర్పు వెనకనేవున్నది

చ. 2: అంగన నవ్వునవ్విన ఆయము దెలుసుకొంటే
అంగవించే నీ భోగ మందేవున్నది
సంగడినాడే సరసములే తెలుసుకొంటే
చెంగటి జాణతనాలు నీ చేతిలోనేవున్నవి

చ. 3: యింతి కాఁగిలించుకొన్న యితవు దెలుసుకొంటే
అంతటివేడుక నీ యాత్మనున్నది
వంతుల శ్రీవెంకటేశ వనితఁ గూడితివిట్టే
మంతనాలన్నియు నీ మర్మములోనున్నవి

రేకు: 0231-2 రామక్రియ సంపుటం: 08-182

పల్లవి: ఇంక నేమిసేయఁగల మింతకంటే రావయ్య
అంకెల మా యింటిలోని కాసపడ్డవారము

చ. 1: అంగన లేమిటివారు ఆయము నీ చేనున్నది
సంగతెరిఁగి నడుపే సరవి నీది
వుంగిటిగాఁ గోపగింతు మొకమారు నవ్వుదుము
యెంగిలిమోవి బత్తేల నేలుకొన్నవారము

చ. 2: పడఁతు లెంతటివారు భావము నీ నేర్పినది
విడువక భోగించే వేడుక నీది
చిడుముడి జంకింతుము చెక్కు లట్టెనొక్కుదుము
తొడసోఁకిన జీతాలదొమ్మిపొఁజువారము

చ. 3: వనిత లెందలివారు వలపు నీ వసముది
ననుపుగాఁగూడిన యీ నటన నీది
కొనగోరంటింతుము మొక్కుదుము శ్రీ వెంకటేశ
వొనరిన నీ రతుల వూడిగపువారము

రేకు: 0231-2 ఆహిరి సంపుటం: 08-183

పల్లవి: మానిని నింతే నేను మన్నించవలదా
యేనాట నావల్ల గుణమీపాటి చాలదా

చ. 1: తనువు నీకప్పగించి తమకాన భోగించఁగా
మనసేమి సోదించేవు మరియూనన్ను
ఘనులకు నిమ్మపండు కానుకగాఁ బెట్టితేనే
తనివొంది పదవులు తామే యొసఁగుదురు

చ. 2: చూపులు నీపైనిలిపి సుద్దులు నేఁ జెప్పఁగాను
తీపు లేమి వెదకేవు దిష్టించి నన్ను
యేపుమీరిన దొరలు యేపాటినుతించినాను
పైపై నందుకులోనై పమ్మి కరఁగుదురు

చ. 3: అన్నిరతులకులోనై అట్టే చొక్కించఁగాను
చన్నులేల గోరూఁదేవు సారెకు నన్ను
యిన్నిటా శ్రీవెంకటేశ యీకతలు నీచెలుల
కెన్నికతో నానతిమ్మా యిట్టే నిన్నుమెత్తురు

రేకు: 0231-3 మధ్యమావతి సంపుటం: 08-184

పల్లవి: ఇట్టె (నే?) సీసవెట్టి నీవు యేమరేనా నీపనులు
బట్టగుత్తలైనవారు ఫలమందుకుందురా

చ. 1: యేలుకొన్నవాఁడవు నన్నేల దిగవిడిచేవు
చేలకొంగువట్టి యింతసేతువుగాక
బాలకివై యెంత సిగ్గుపడినాను నీకేమి
కూలిచ్చినవారు పనిగొనక విడుతురా

చ. 2: మాటలాడినవాఁడవు మన్నించ నేలపాయ్యేవు
వాటముగా నీ యిచ్చకకు వత్తువుగాక
నీఁటుతోడ వేడుకకు నిదించితే నీకేమి
గూంటనున్నపక్షి చేతవేఁటాడ లోఁగేరా

చ. 3: కూడినవాఁడవు నామై గోరూఁదకేల చిక్కేవు
మేడెపురతిఁ జొక్కించి మింతువుగాక
నీడనె శ్రీ వెంకటేశ నే నలసితే నీకేమి
వాడుఁజేన వానగురిసి వరదచాలించునా

రేకు: 0231-4 కన్నడగౌళ సంపుటం: 08-185

పల్లవి: హత్తి రాజసపువాఁడ వయినాఁగాని
చిత్తమువచ్చినయట్టు సేతువుగాని

చ. 1: చనవు గలిగేనంటా సారె సారె మాటలాడె
విని విని నీవేమి వేరకుమీ
మనసునఁ గలదెల్లా మరిదాఁచనే నీకు
మునుకొన్న సతులకు ముచ్చట స్వభావము

చ. 2: నిండిన మందెమేళాన నీతో సరసమాడేను
అండనే అందుకు లోనై అలయకుమీ
వుండిన దున్నట్టేకాని వూరకే కల్పించనోప
నిండు గరితెలాడితే నిజమునిష్ఠూరము

చ. 3: కాతరాన నిన్ను నిట్టే కాఁగిలించుక కూడితి
నాతమకములుచూచి నవ్వేవు సుమ్మీ
ఘాతల శ్రీవెంకటేశ కైకొంటివి నిన్ను దూర
రాతిరిఁబగలునుండి రతులఁ జొక్కితివి

రేకు: 0231-5 దేసాళం సంపుటం: 08-186

పల్లవి: అవునే యింతేసి సేసేవపుడే నీవు
చవులుసేసి యిచ్చేది జవ్వనమేకాదా

చ. 1: సిగ్గువడ్డవారికిని చెక్కిటి చేయేమరఁగు
దగ్గరి రాఁగదవే ఆతఁడు విల్చీని
కగ్గులేక నీవంటి కన్నెలేకారా పతిని
యెగ్గులుఁ దప్పులుసోఁక నెలయించేవారు

చ. 2: సెలవి నవ్వేవారికి చేతిమొక్కులే మరఁగు
తలఁగకుండఁగదే ఆతఁడు ముట్టీని
మొలచిన నీవంటి ముగ్ధలేకారా పతిని
తెలిపి రతికిఁదీసి తెమలీఁచేవారు

చ. 3: కాఁగిటఁగూడేవారికి కనురెప్పలే మరఁగు
వీఁగకువే కూడెను శ్రీవెంకటేశుఁడు
మాఁగినమోవి నీవంటి మానాపతులేకారా
రాఁగలై యీతనిఁ బొంది రవ్వకెక్కినారు

రేకు: 0232-1 సాళంగనాట సంపుటం: 08-187

పల్లవి: ఇన్నాళ్ళు నెరఁగమైతి మిదివో తాను
పన్నుక వూరక వొడఁబరచీఁ దాను

చ. 1: తలఁపే తెలిసితేను తాఁదానే కదవే
నలువంక నూరకే నవ్వీఁ దాను
వెలియల్లాఁ జూచితేను వెల్లవిరి గదవే
పిలిచి నాతో నానపెట్టుకొనీఁ దాను

చ. 2: అడుగఁబోతే సుద్దులు అంతా మేలేకదవే
కొడిమె లెంచేనంటేఁ గొంకీఁ దాను
చిడుముడి మొక్కి తేను సిగ్గురేఁగీఁ గదవే
బడిబడి మీఁదటికి బాసచేసీఁ దాను

చ. 3: కన్నుల నేఁ జూచితేనే గట్టియాయ గదవే
యిన్నిటా శ్రీవెంకటేశుఁ డెనసెఁ దాను
విన్న వినికెల్లా నేఁడు వేడుకలే కదవే
మన్ననలు నాకిచ్చి మచ్చికాయఁ దాను

రేకు: 0232-2 ముఖారి సంపుటం: 08-188

పల్లవి: ఇందుకుఁగాఁ బ్రతివాదాలేలే విభుఁనితోడ
పందెమువలె గెలుపు పైపైనేవుండును

చ. 1: మచ్చికసేసీ నతఁడు మారుమాటాడకువే
కుచ్చిపట్టి కాఁగిలించికూడె నిన్నును
వచ్చిరాని పందెమువంటిదే యీవలపెల్లా
కొచ్చి లోలోఁ దలఁపంచుకొంటాఁ దానుండును

చ. 2: చెక్కులునొక్కీ నతఁడు చెమరించీ తిట్టకువే
పక్కన నిట్టేకాఁగిటఁబట్టీ నిన్నును
చక్కెరబొమ్మవంటిది చవిగొంటే నీవలపు
యెక్కడఁ జిక్కించుకొన్నా నింతాఁ దీపైవుండును

చ. 3: యేలెను శ్రీవెంకటేశుఁ డెగ్గులేమీ నెంచకువే
లాలించె రతులఁ బెక్కులాగుల నిన్ను
పాలజలధివంటిది పచరించిన వలపు
వేళ నెంతవాడినాను వెలితిగాకుండును

రేకు: 0232-3 రామక్రియ సంపుటం: 08-189

పల్లవి: ఏమనునో దగ్గరఁబో యీవేళ నేఁ జెనకితే
కామించి కామాంధకారాననున్నాఁడు

చ. 1: నవ్వు నవ్వనోప నానాలికాఁడు రమణుఁడు
అవ్వల నేమనునో యనీకాక
దివ్వెత్తుఁ బొద్దుదాఁకా తిరిగివచ్చి యింటిలో
వువ్విళ్ళూరుచు నసురుసురై వున్నాఁడు

చ. 2: పంతమాడనేర నాపల్లటీఁడు నాయకుఁడు
అంతరంగము దెలిసె ననీకాక
బంతుల చుట్టాలకెల్లా పనులెల్లా జేసివచ్చి
అంతటఁ బానుపుమీఁద నలసివున్నాఁడు

చ. 3: కమ్మి చూడనోప నాగబ్బిశ్రీవెంకటేశుఁడు
అమ్మలాల నన్నుఁ గూడె ననీకాక
సమ్మతించి సతులతో సాములుసేసివచ్చి
కుమ్మరింపు సిగ్గులతో గుట్టుననున్నాఁడు

రేకు: 0232-4 సౌరాష్ట్రం సంపుటం: 08-190

పల్లవి: నామర్మమిట్టిది యిఁక నీమర్మమానతీరా
యీమేరఁజూచినవారి కెంతబంటోయిఁకను

చ. 1: మక్కువ నీతో నేను మాటలాడినంతలోనే
పుక్కిటిబంటె (టా?) యరా పూఁచి వలపు
చెక్కుల చెమటలెల్లా చెరువుల వానలాయ
యిక్కడ నన్నుఁ జూచి నీకెంతబంటో యిఁకను

చ. 2: కన్నుల నీరూపుచూచి కరఁగి గుండెలుమోఁచి
చన్నులబంటె(టా?)యరా సరివలపు
వున్నతిఁ మోవితేనియ లువ్విళ్లూరఁగఁ జొచ్చె
యిన్నిటా నా జోడైతి వెంతబంటోయిఁకను

చ. 3: కలసి నీవద్ద నేను గట్టిపీఁటపై గూచుండి
మొలబంటియాయరా యిమ్ములవలపు
కులికి శ్రీవెంకటేశ కూడితివి వయోమద
మెలిమి మదుగులుబ్బె నెంతబంటోయిఁకను

రేకు: 0232-5 కొండమలహరి సంపుటం: 08-191

పల్లవి: ఇన్నాళ్లునెఱఁగమైతి మింతేసిసుద్దులు
విన్నవి రాఁగారాఁగా వెల్లవిరులాయను

చ. 1: మంతనాన నీతోను మాటలు నేనాడినని
యింతులెల్లా నాడుకొనే రిదేమయ్యా
చెంతల నీవింతేసి సిగ్గులు విడిచితేను
కాంతలు నీతో పొందుగావించుటే నేరమి

చ. 2: రతివేళ నామేనరచించిన నీచేతలు
సతులెల్లా సోదించేరు సారెసారెకు
యితవై నీవాడికకు యింతేసి వెరవకున్న
హితులూడిగాలు సేయనేఁటికి నీయెడకు

చ. 3: ననుపున నీవు నేను నవ్వినవ్వులకును
వనితలెల్లా మెచ్చేరు వద్దనున్నట్టే
యెనసితివి శ్రీవెంకటేశ నన్నింతేసిగాను
చనవరులకును మజ్జాతియాయ నిపుడు

రేకు: 0232-6 ముఖారి సంపుటం: 08-192

పల్లవి: జిగురువంటివాఁడవు చెలులంగటే విడువవు
అగపడి యింటివారు అన్నంతాఁ గలిగెను

చ. 1: చిక్కని నీమాటలకే చెమరించె మే నెల్లా
తక్కిన చేఁతలు వింటే తలఁపెట్టౌనో
అక్కజపు నీవినయ మాయనాయఁ దనిసితి
మొక్కేనన్నా విడువవు మొలవట్టేవిపుడు

చ. 2: వెడ నీ నవ్వులకే వెరగందె నిలువెల్లా
అడరి నీవద్దనుంటే నాస యెంతౌనో
మిడిమాలపు నీమెచ్చు మేలుమేలు కైకొంటి
వడి నోపనన్నాఁబోవు వచ్చి కాఁగలించేవు

చ. 3: కన్నుల నీచూపులకే గరివడఁ బులకించె
చన్నుల నిన్నొత్తితేను చవి యేరీతో
పన్నిన శ్రీ వెంకటేశ బాపు బాపు కూడితిమి
సన్నసేసినాఁ గొంకపు సారె మన్నించేవు

రేకు: 0233-1 శంకరాభరణం సంపుటం: 08-193

పల్లవి: నేరుపరి విన్నిటాను నీకు నే లోను
కారముగాదు కప్రము కానీవయ్యా

చ. 1: పలుకనేరిచితేను బయలెల్లాఁ బందిలి
చలము సాదించితే శశియేరవి
యెలమి నీమాటలకు నెదురాడగలనా
కలసి కాఁగిలించేవు కానీవయ్యాయిఁకను

చ. 2: వేసరక నిలిచితే వేగ్గైనఁ జలువే
రాసి దంచదొరకొంటే రాయేపండి
ఆసపడి నీ వున్నందు కడ్డయీడఁగలనా
కై సేసుక నన్నంటేవు కానీవయ్యా

చ. 3: గారవించి కూడితేను కాఁగిలే చెమటనీరు
గోర గీరఁబోతేను గుంతేయేరు
సారపు శ్రీవెంకటేశ సన్న సేయఁగలనా
కారణానఁ గూడితివి కానీవయ్యా

రేకు: 0233-2 నాట సంపుటం: 08-194

పల్లవి: ఏఁటికి దగ్గరేవయ్యా యిదేమి నీవు
మోఁటుననుందానఁ జన్ను మొనలు దాఁకీని

చ. 1: పచ్చని చీరగట్టిన బలుదొరనంటానే
కుచ్చుల పీలిచుంగుల కొంగువట్టేవు
దిచ్చరి చెంచువారికి దేవరకు నేమిపని
ముచ్చట లాడఁగఁ జన్నుమొనలు నాఁటీని

చ. 2: రొమ్మునఁ బూసగల వురుటు నాయఁడనంటానే
బమ్మరపోవుచు మాపై నొరగేవు
దొమ్ముల మేసువారికి దొడ్డవారి నేఁటిమాట
ముమ్మాటికి విను చన్నుమొనలు దాఁకీని

చ. 3: వెక్కసపుకొండపై శ్రీ వెంకటేశుఁడనంటానే
కక్కసించికూడి మమ్ముఁ గాఁగిలించేవు
తక్కక మంకువారికిఁ దగు గొల్లఁడ నీపొందు
మొక్కలీఁడ నాచన్ను మొనలు దాఁకీని

రేకు: 0233-3 భైరవి సంపుటం: 08-195

పల్లవి: మఱి యేమి సేసునే మంచివే యన్నిపనులు
వెఱపులెల్లాఁ దీర వేఁడుకొనీఁగాక

చ. 1: ఆసగలిగినవాఁడు ఆతఁడు నీయడకును
వేసరునా మీఁద మీఁద వేడుకేకాక
రాసికెక్క నంతేసి రతి నలయింతువట
మోసపోయీనా నీకు మొక్కేఁగాక

చ. 2: పైపై వలచినవాఁడు పంతపు నీచేతలకు
కోపగించునా మరిఁ గోరేదేకాక
తీపుమోవితేనెలిచ్చి తెలిపి చొక్కింతువట
వోపననినా నిన్ను వొడఁబరచీఁగాక

చ. 3: కాఁగిటఁ గూడినవాఁడు కడు నీచెనకులకు
లోఁగీనా యెంతైనా లోఁగొనీఁగాక
చేఁగదేరఁ గూడితివి శ్రీ వెంకటేశ్వరునట
దాఁగీనా నీ యింపులకుఁ దమకించీఁగాక

రేకు: 0233-4 శ్రీరాగం సంపుటం: 08-196

పల్లవి: అలయఁగఁ బొద్దులేదా అప్పటినీకు
చలివానె లేవయ్య జాగులెందాఁకాను

చ. 1: అంగమెల్లఁ జెమరించె నట్టే గందము గరఁగె
సింగారించుకొన్న కొప్పు చీఁదరరేఁగె
యెంగిలి వాయఁగ నీకు నిదే జలకమువట్టె
సంగతిగా లేవయ్య జాగులెందాఁకాను

చ. 2: పులకలు గడునిండె బుసకొట్లు చెలఁగె
తెలుపెక్కి కనుచూపు తేటవారెను
బలుపుసత్తువరాను పాలునేయిఁదెచ్చితిని
సళుపక లేవయ్య జాగులెందాఁకాను

చ. 3: మోమునఁ గళలుముంచె మోవిపై చేఁతలురాఁగె
నామతో శ్రీ వెంకటేశ నన్నుఁ గూడితి
చేముట్టిచ్చే మాటుమందు చెనకుల నాతోపొందు
జామాయను లేవయ్య జాగులెందాఁకాను

రేకు: 0233-5 సామంతం సంపుటం: 08-197

పల్లవి: ఆసతి మరఁగువాఁడ వన్నిటా నీవు
మోసపోక నీవాపె ముదులదేరాదా

చ. 1: చేపట్టేవు నీకు నేఁ జెప్పినట్టు సేసేఁగాని
ఆపె నడిగి రారాదా ఆమాటే
దూపిలేవు నీచేఁతకుఁ దొరలకుందాననంటా
చాపలాన నీవాపెను సమ్మతింపించరాదా

చ. 2: పైకొనేవు నీకు నేఁ బనులుసేసేఁగాని
ఆకాంతఁ దోడితేరాదా అప్పణగాను
కాకరివై దూరేవు గక్కన విడెమీనంటా
పోకులఁబోక నీవాపెఁ బూఁటవెట్టరాదా

చ. 3: పూవులవేసేవు నీకు పొందైవుండేఁగాని
ఆవనితఁ గూడరాదా అప్పుడే ముందే
శ్రీ వెంకటేశ నన్నుఁ జెందితివి ఆలనంటా
కావించే(చా?) పెకుఁ జెల్లెలిఁగా నన్నుఁ జేయరాదా

రేకు: 0233-6 గౌళ సంపుటం: 08-198

పల్లవి: ఎవ్వరికిఁ గలదయ్య యిటువంటి నేరుపు
దవ్వులనుండఁగా నీవు తావులిచ్చేవు

చ. 1: వెలఁదు లెవ్వరిఁగన్నా వింతలేదుగాన నీకు
సులభాననే దొరకుఁ జుట్టరికము
మలసి చల్లలమ్మక మందనుండిరాఁగానే
కలపుకోలుఁదనానఁ గాఁగిలించేవు

చ. 2: అంగనలఁ గంటే వావులట్టే నీకు దొరకుఁగా
చెంగటనే చెట్టడువఁ జేటఁడేసి
ముంగిటనే పాలుగాఁచి మూలఁ దోడంటువెట్టఁగా
సంగతిగా నప్పుడే మంచమువంచేవు

చ. 3: పొరుగు సతులుండితే పొరచి వేడకలౌఁగా
దొరకొలుదాసికిఁ బొందులు దాఁతే
యిరవై శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
తెరవేసి వలపుల తీపుచల్లేవు

రేకు: 0234-1 కేదారగౌళ సంపుటం: 08-199

పల్లవి: ఎందువోయితి విందాఁకా యెక్కడనుండె నీనేర్పు
బందెకు నప్పుడాతని పట్టుకుండవలదా

చ. 1: నేనాతనితో నవ్వితే నీకేలే చింత
నాననిచ్చి నీవూఁ గొంత నవ్వరాదా
సానఁబెట్టె(ట్ట?)తఁడు చూపు జళిపించేయపుడు
మానుపరాదా నీమగని సన్నలను

చ. 2: చెక్కాతని నేనొక్కితే చిమిడేవదేమే
చిక్కనిచ్చి నీవూఁ జేఁత సేయరాదా
మక్కువ నాతఁడు నామర్మమంటేయపుడు
నిక్కి కోపగించరాదా నీపతినెమ్మెలను

చ. 3: కలసితే నీవితని గద్దించే వెవ్వతవే
వలసినప్పుడు నీవూ వంచుకోరాదా
యెలమి శ్రీవెంకటేశుఁ డెలయించేయపుడు
వలపించి నీవిభుఁని వంకలొత్తరాదా

రేకు: 0234-2 సాళంగం సంపుటం: 08-200

పల్లవి: నీయితవు దెలియక నే వేగిరపడరాదు
యీయెడ నీయాలనై యింటనే వుందానను

చ. 1: సారె నేనవ్విన నవ్వు చలువో వేఁడో
ఆరీతి నీమతిఁ గలట్టానఁ లేవయ్యా
నీరుకొద్ది తామరనై నీతోఁ బొందుసేసేను
పేరబెట్టితేవలపు పిండంతేనిప్పటి

చ. 2: పలికేటి నామాట పలచనో చిక్కనో
అలరి నీకుఁ దోఁచినట్టానతీవయ్యా
బలిమికొది పంతానఁ బట్టి నిన్నుఁ బెనఁగేను
వలచినవలపులు వచ్చినంతేలాభము

చ. 3: కూడినట్టి నాకూటమి కొసరో పిసరో
ఆడినంతా నియ్యకొనే నానతీవయ్యా
వేడుక శ్రీవెంకటేశ వెన్నకొద్దేనెయ్యీ
తోడరాఁగా వలపులు తరినంతేవాకిలి

రేకు: 0234-3 సామంతం సంపుటం: 08-201

పల్లవి: వలెగా యివిగొన్ని వట్టివేసాలు
అలసితివన్నిటాను ఆయనాయలేవే

చ. 1: చిక్కని చెమటలకే సిగ్గులు వడేవు నీవు
యెక్కువనిట్టూర్పులకు నేమి సేసేవే
నెక్కొన్న రతిచిన్నలు నీతలనే వేగెనటే
ముక్కునబంటి భోగించే ముగుదువా నీవు

చ. 2: అలకల చెదరకు నట్టే సిరసు వంచేవు
యెలమిఁ గన్నులతేట లెందుఁబెట్టేవే
నెలకొన్న యీవన్నెలు నీవల్లనే వచ్చెనటే
కలగంపగాఁ గలసే కన్నెవానీవు

చ. 3: బొట్టు చెదరినందుకు పొంచి తెరలు వేసేవు
యిట్టె నీమోము కళలెట్టు దాఁచేవే
నెట్టన శ్రీవెంకటేశు నీవేకూడితివటే
పటము గట్టక పొందే చాలవా నీవు

రేకు: 0234-4 ఆహిరి సంపుటం: 08-202

పల్లవి: తప్పులెంచవని నిన్ను దగ్గరితి నిటుగాక
వొప్పగించే బీరాల కోపుదునా నేను

చ. 1: చిక్కని నీనవ్వులకు చేసేటి చేతలకు
యెక్కువగా నింతేసి మోహించితిఁగాక
తక్కుల నీగుట్లకు తచ్చన సన్నలకు
వొక్కమాఁటే యీపనులకోపుదునా నేను

చ. 2: కన్నుల నీమొక్కులకు కరుణారసానకు
కన్నెనయ్యే నీకు తాళి గట్టితిఁగాక
మిన్నక నీమేకులకు మేరలు మీరుటకు
వున్నతి నీరాఁపులకు నోపుదునా నేను

చ. 3: కలిసితివి రతికిఁ గడలేని మన్ననకు
పిలిచి నీకే సేస వెట్టితిఁగాక
యెలమి శ్రీవెంకటేశ యిట్టి నీవినయాలకు
వొళవుగా సిగ్గువడ నోపుదునా నేను

రేకు: 0234-5 మాళవిగౌళ సంపుటం: 08-203

పల్లవి: ఇంక నెంతగాఁగలదో యింతివల్ల నీకు
సంకుఁజక్రాలచేతుల సరుసకువచ్చెను

చ. 1: నల్లగలువలవంటి నాతిచూపు నీమైనంటి
నల్లనాయ నిలువెల్లా నాథుఁడ నీకు
వెల్లువైన వలపులు వేడుకల నీపైసోఁకె
వెల్లియేరు పాదముతోఁవిభుడవు నైతివి

చ. 2: బంగారువంటి రూపుపడఁతి పొందు సేయఁగ
బంగరుదట్టిగురుతుపతివైతివి
సంగతిగాఁ దామరలసరవిపాలుమోఁచి
అంగజగురుఁడ జలజాక్షుఁడవైతివి

చ. 3: వేవేలుమాటలనేర్పువెలఁది కాఁగిటఁగూడి
వేవేలు పేళ్ళు గలిగె వెన్నుఁడ నీకు
భావించఁ గొండలవంటి బలు కుచములునాఁటి
శ్రీ వెంకటేశుఁడవై సిరుల మించితివి

రేకు: 0234-6 భైరవి సంపుటం: 08-204

పల్లవి: సంగతి గానిపనికి సాకిరున్నారా
అంగవించి విడెమీఁగా నదేమంటిఁగాక

చ. 1: సమ్మతించినమాటకు జగడములున్నావా
దొమ్మిసేసి యంటఁగానె దూరేఁగాక
యిమ్ముల నేరమంటే యిప్పుడే లేదనేనా
అమ్మరో యిల్లుచొరఁగా నదేమంటిఁగాక

చ. 2: చుట్టరికము గలితే సూదువట్ట వచ్చేనా
వెట్టికిఁ బైకొనఁగాను వేసరేఁగాక
గట్టిగానె నవ్వితేను కాదని తొలఁగేనా
అట్టె సందుకొనగాను అదేమంటిఁగాక

చ. 3: తొలుతనె చెప్పితేను తొలమని తోసేనా
బలిమిఁ బెనఁగఁగాను పదరేఁగాక
యెలిమి శ్రీ వెంకటేశుఁ డిన్నిటా నన్నుఁగూడెను
అలయించఁగా రతుల నదేమంటిఁగాక

రేకు: 0235-1 బౌళిరామక్రియ సంపుటం: 08-205

పల్లవి: కూరిమి సిగ్గులు తెగీ కొంకనేఁటికి
యేరీతికైనా నీవు యియ్యకొనవయ్యా

చ. 1: పట్టినదే వ్రతము పడఁతులకుఁ జలము
అట్టె పతులకుఁ జేయకపోరాదు
ఙట్టడి యాపె మోవిచూఱలకు నాసపడేవు
యెట్లైనఁ జేయనీ నీవియ్యకొనవయ్యా

చ. 2: ఆడినదేమాటా అంగనలు పంతమున
నాడోడికయినా వినకపోరాదు
తోడనే మేలుది యాపె తొలఁగలేవు నీవు
యేడసుద్దికైనా నీవియ్యకొనవయ్యా

చ. 3: తలఁచినదే పొద్దు తరుణుల కాఁగిటికి
వలపులు ముదిరెను వద్దనరాదు
బలువాపెది శ్రీ వెంకటపతివి నిన్నుఁ గూడె
యెలమి నన్నిటికి నీవియ్యకొనవయ్యా

రేకు: 0235-2 పాడి సంపుటం: 08-206

పల్లవి: ఒట్టువెట్టుకొంటే నేమి వొద్దు దోసములేదనె
వట్టిచింతఁ బొరలక వద్దికి రారాదా

చ. 1: మలసేయప్పటివేళ మాటమాటజగడాల
అలిగి లేచిపోయితే నందుకేమి
వెలినుండి నీవేల విరహానఁ బొరలేవు
చలమొద్దు నావద్దికి సరుగ రారాదా

చ. 2: నినుఁ జూచి నవ్వితేను నిజము నెరపెనంటా
గునిసి యల్లంతనే కూచుంటివి
మనసు పట్టగలేక మరియేల పొరలేవు
చనవుసేక నామంచానకు రారాదా

చ. 3: వేడుక యీరతి నీవె వేళమె ముందుగరఁగి
తోడనె సిగ్గులఁబొంది దూరుకొనేవు
యీడకేతెంచి శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
మాడమాడ పంతములా మరియు రారాదా

రేకు: 0235-3 భైరవి సంపుటం: 08-207

పల్లవి: మూసినముత్యాలవంటి ముద్దరాండ్లము
యీసరిబేసికి నీతో నెదురాడఁగలమా

చ. 1: బలిమేలసేయను పలుకకుండినవారి
అలిగేటివారులేరా ఆఁడువారు
చలపట్టి మాటలాడ జాణలులేరా వూరిలో
యెలమి నీతో నేము యెదురాడఁగలమా

చ. 2: సిరసేలయెత్తను సిగ్గువడివున్నవారి
జరసేటివారులేరా సారెనింతులు
దొరవై పనులుగొన తొత్తులు బంట్లులేరా
యిరవై నీతో నేము యెదురాడఁగలమా

చ. 3: కొంగులేలపట్టను గుట్టుననుండినవారి
కంగివున్నవారులేరా కామినులు
రంగుగ శ్రీవెంకటేశ రతి నన్నుఁగూడితివి
యింగితాన నీతో నేము యెదురాడఁగలమా

రేకు: 0235-4 కాంబోది సంపుటం: 08-208

పల్లవి: పుట్టుభోగిజవరాలు పొలఁతి యిది
పట్టెమంచముమీఁదటఁ బవళించేదేవుడు

చ. 1: కందువ నీకిందాఁకా గతులు చెప్పనేపట్టె
యెందాఁకా వేగించు నింతి నీతోను
అందముగ నిలుచుండి ఆకుమడిచియ్యఁబట్టె
కుందణపు గద్దెమీఁదఁ గూచుండేదేవుడు

చ. 2: వూడిగాలుసేసి నీవొద్దనుండనేపట్టె
యేడగాఁ గొలువుసేసు నెదుట నీకు
పాడితోఁ బందెమువేసి పగడసాలాడఁబట్టె
ఆడనే పరపుమీఁద నలపారే దెపుడు

చ. 3: గక్కన నీవు గూడఁగా కన్నుల జంకించఁబట్టె
యెక్కడగా సన్నసేసు నింతేసి నీకు
చక్కని శ్రీవెంకటేశ సమ్మతించుకొనఁబట్టె
వొక్క మలగుపై నొరగుండి నవ్వేదెపుడు

రేకు: 0235-5 సామంతం సంపుటం: 08-209

పల్లవి: అట్టె కానీవయ్య్య నేము నట్లానె సేసేము
గట్టియైన సతులకుగాని నీవు లోఁగవు

చ. 1: కామించి నీవాకిలి గాచుక నేనుండఁగాను
నామొగము చూచి నీకు నగవురాదా
వేమరుఁ బంతములాడి వెసఁ బసులఁ గాపించే
గామిడి గొల్లెతలకుఁగాని నీవు లోఁగవు

చ. 2: యేపొద్దును నీరూపే యెగదిగఁజూడఁగాను
నాపొంతనేవుండి నీకు నగవురాదా
చేపట్టి మానాలుచూడ చెట్టెక్కించి వేళలు
కాపించే గొల్లెతలకుఁగాని నీవులోఁగవు

చ. 3: యెనసి నీకాఁగిటిలో యేపొద్దూ నేనుండఁగాను
ననుపైతే నీకింతేసి నగవురాదా
మును శ్రీవెంకటేశ యమునలోనాటలాడించే
ఘనమై గొల్లెతలకుఁగాని నీవు లోఁగవు

రేకు: 0235-6 గుజ్జరి సంపుటం: 08-210

పల్లవి: అప్పుడే గెలిచితివా ఆపె వూరకుండితేనే
తప్పులు నీమీదివెల్లా దాఁచుకిట్టేవున్నది

చ. 1: పలుకనేరదుగాని భావములోనిచేత
బెళకకుండా నట్టె పెట్టుకున్నది
అలుగకున్నదిగాని అనువువచ్చినదాఁకా
చలములు యేకతాన సాదించనున్నది

చ. 2: జంకించకున్నదిగాని జగడాలు కొనగోళ్ళ
యింకనెప్పుడోయని మీఁదెత్తుకున్నది
కొంకి తిట్టదేకాని గురియైన రతిదాఁకా
పొంకపు బూతుమాటలఁ బూఁచుకున్నది

చ. 3: గుట్టువిడవదుగాని కొసరుల మొక్కులెల్లా
దట్టమై నీపాదాలకు దాఁచుకున్నది
యిట్టె శ్రీవెంకటేశ యెనసితివిందాఁకా
అట్టెవున్నది నీతలపుఁ లడుగఁగనున్నది

రేకు: 0236-1 పాడి సంపుటం: 08-211

పల్లవి: ఇందుకుఁగా నెవ్వర మరేమిసేసేరు
మందెమేళమోపకున్న మరియూ మొక్కేను

చ. 1: చనవు గలుగఁగానె చవిగాక వలపులు
మనసు లెరవులైతే మరిచప్పనే
యెనసితివంటా నిన్ను నిట్టె తిట్టితిఁగాక
పెనచి యెగ్గుపట్టితే బెరసి మొక్కేను

చ. 2: నగఁగానె సరసాన నయమెక్కుఁ దీపులు
సొగయకుండితేఁ దమచూపులేవెట్ట
తగిలితివంటా నీముందల నేముట్టితిఁగాక
బిగువంతగలిగితే పిలిచి మొక్కేను

చ. 3: మెఱసి కూచుండగానె మేకొను కూటములు
గుఱుతులు సోఁకకున్న కూడదువాని
నెఱి శ్రీవెంకటేశ మన్నించఁగా గూడితిఁగాక
తఱి నలసితినంటే దగ్గరి మొక్కేను

రేకు: 0236-2 శ్రీరాగం సంపుటం: 08-212

పల్లవి: మిక్కుటపు సరసాలు మించి మొగచాటయ్యా
దక్కినట్టి కాఁపురానఁ దనిసివున్నారము

చ. 1: కొలువుపతిమెలెల్లా గోడచేరువులెకాక
కలయిక రతులకుఁ గారణమేమి
వల దేల గొంగువట్టీ వద్దనరే రమణుని
తలఁగక కన్నులనే తనిసివున్నారము

చ. 2: తోడునీడ సతులెల్లా తోలుబొమ్మలెకాక
వేడుక కూటములకు వెలవెట్టేరా
చూడకు మనరె వొత్తి సొలపులనాయకుని
తాడుపడ్డ ఆసలనే తనిసివున్నారాము

చ. 3: సిగ్గుపడ్డ కాంతలెల్లా చిత్తరురూపులెకాక
దగ్గరి చేతఁలు సేయ దమయాటలా
అగ్గమై శ్రీ వెంకటేశు నన్నిటా మీరుమెచ్చరే
తగ్గక నేఁడిట్టెకూడె తనిసివున్నారము

రేకు: 0236-3 లలిత సంపుటం: 08-213

పల్లవి: ఏలపంతాలాడేవు యింతితోను
ఆలు గరగించే నిన్ను అట్టుసేయవచ్చునా

చ. 1: మాటల దూరఁగలేక మగువ గోర నొత్తితే
నాఁటెనంటా నీవేల సన్నలఁ దిట్టేవు
చాటిచెప్పె నింతేకాక సాదుఁగొయ్యతనమున
జూటుఁ దనమున నిన్నుసూడువట్టవచ్చెనా

చ. 2: బొమ్మల జంకించలేక పువ్వుల వేసితేను
తమ్మిమోము దాఁకెనంటాఁ దట్టేవు రొమ్ము
చిమ్మి నవ్వితేనె మాయసిగ్గుతోడి చిత్తమున
అమ్మరో నీతోడి చయ్యాటలకువచ్చెనా

చ. 3: వేసరింపించఁగలేక వెసనిన్నుఁగూడితేను
సేసకొప్పు జారెనంటాఁ జెలరేఁగేవు
ఆసల శ్రీ వెంకటేశ ఆపె నీవు నొక్కటే
బాసలు నీవిచ్చినవి విచారించవచ్చెనా

రేకు: 0236-4 రీతిగౌళ సంపుటం: 08-214

పల్లవి: కతలు పూవకపూచె కావకకాచె
రతుల మెప్పించేఁగాని రారాదా లోనికి

చ. 1: చింతలేదు వింతలేదు చెక్కుచేతితో నేను
పొంత నీరూప తలపోసేనదే
మంతనాన నీవేల మాటలనే తనిసేవు
రంతులుసేయక యింక రారాదా లోనికి

చ. 2: వాడాలేదు పీడాలేదు వచ్చేవంటా నీరాకకు
తోడనే యెదురుచూచే తొలఁగకిదే
యేడగా నాకు నిట్టె యిచ్చకాలాడేవు నీ
రాడువచ్చి ముంతచొచ్చె రారాదా లోనికి

చ. 3: యీసులేదు రేసులేదు యిపుడునీవుగూడఁగా
ఆసల నలపుదేరే నన్నిటానిదే
సేసవెట్టేదెందాఁకా శ్రీ వెంకటేశ నీవు
రాసికెక్కితివిన్నిటా రారాదా లోనికి

రేకు: 0236-5 ఆహిరి సంపుటం: 08-215

పల్లవి: ఏమిసేసినాఁ జేయనీ యియ్యకొనవే
వేమరు నింతగలదా విభునితోను

చ. 1: వచ్చినట్టె వచ్చితేను వలుపేపో సుఖము
హెచ్చి మాటలాడితే నెరఁగఁగాని
కుచ్చిపట్టి నాయకుఁడు కొంగువట్టి తియ్యఁగాను
పచ్చిగానుఁ బెనఁగేవు పాసివుండఁ గలవా

చ. 2: చెప్పినట్టు సేసితేను చిత్తమేపో చుట్టము
యెప్పుడూ నొడ్డారమైతే నెరఁగఁగాని
వొప్పుగా నాయకుఁడు వొడఁబరచఁగా నీవు
తప్పులెంచే వప్పుటిని తాలిమికిఁ గలవా

చ. 3: మెట్టినట్టె మెట్టితేను మీకు మీకేపెండ్లి
యిట్టె సిగ్గులు వడితే నెరఁగఁగాని
వొట్టుక శ్రీవెంకటేశుఁ డొనగూడె నిన్నును
గుట్టుతోడ నవ్వేవు గురిసేయఁ గలవా

రేకు: 0236-6 శుద్దవసంతం సంపుటం: 08-216

పల్లవి: సవతి మచ్చరమున సతులదూరితి నేను
పవళించనేల నీకుఁ బంతమిచ్చేమయ్యా

చ. 1: నిన్నునంటినట్టివారు నీయంతవారు
యెన్నియైనా నేము వెంగే లేలాడేము
చిన్నఁబోవ నీకేల చిత్తమురాకున్నఁ గన
పన్నివారిమారు నీకుఁ బంతమిచ్చేమయ్యా

చ. 2: నీవూడిగములవారు నీకంటె ఘనులు
వేవేలకు వారినేల వేసరించేము
నీవు వాడనేలందుకు నేఁడుగావలసితేను
భావించి వారికి నీకు బంతమిచ్చేమయ్యా

చ. 3: నీసరిభోగపువారు నీవారు మాకును
వీసమంత పనికేల వేరు సేసేము
యీసుదీర శ్రీ వెంకటేశ మమ్ముఁగూడితివి
బాసతో నీ కింతైతే పంతమిచ్చేమయ్యా

రేకు: 0237-1 నాదరామక్రియ సంపుటం: 08-217

పల్లవి: ఎచటనుండివచ్చితి వెదురుచూచితి నీకు
రచనమన్నించి నన్ను రవ్వగాఁజేసితివి

చ. 1: కొండలరాయఁడ నన్నుఁ గోరి వలపంచితివి
నిండు నాతలపోఁతలు నీకె శలవు
దండి విరహము రేఁచి తడవేలసేసితివి
అండనే నాచిరుఁజెమటది నీకె శలవు

చ. 2: కోనేటివిభుఁడ నన్ను గురుతుగానేలితివి
నేనెట్లనుండినాను నీకె శలవు
ఆనుకొని యింతేసి ఆసలనె పెట్టితివి
పూనిన పులకమోపులు నీకె శలవు

చ. 3: శ్రీవెంకటేశుఁడ నన్ను సేసవెట్టి కూడితివి
నీవద్ద నలసినది నీకె శలవు
కైవసము చేసుకొని కందువఁ జొక్కితివి
యీవిధాల నేభోగించే దిది నీకె శలవు

రేకు: 0237-2 ముఖారి సంపుటం: 08-218

పల్లవి: కప్పురవిడెమియ్యఁగాఁ గాదనరాదు
తప్పులేదు నీయందు తగిలితి నిన్నును

చ. 1: చెచ్చెర నీవు చేసినచేఁతలు వింటి నీవిందు
వచ్చేనని చెప్పఁగా వద్దనరాదు
యిచ్చకములాడేవారి నిటు రమ్మందురుగాన
విచ్చేయుమా యింటికిట్టె వింటిమి నీమాఁటలు

చ. 2: చెంగట నీసతిఁగంటి సిగ్గువడి అంతలో నా
కొంగువట్టఁగా నిన్నుఁ గోపించరాదు
ముంగిట వేఁడుకొంటేను మొగమోడుదురుగాన
అంగవించె రావయ్య అలుకలు దేరెను

చ. 3: యెంచుకొంటి నీగుణాలు యిందరఁజూడఁగా నా
కంచముపొత్తుకు రాఁగాఁ గాదనరాదు
అంచెల శ్రీవెంకటేశ అట్టె నన్నేలితిగాన
యించుకించుకె నవ్వేను యియ్యకొంటిసుద్దులు

రేకు: 0237-3 రామక్రియ సంపుటం: 08-219

పల్లవి: ఏఁటికి విచారమిఁక నాకు
కూటములే నను గురిసేసీని

చ. 1: యేపున నేనేమి నెఱఁగకుండినా
నీపయి తలఁపులు నేర్పీని
మాపుదాఁక మైమఱచివుండినా
దాపగు వలపులు తలపించీని

చ. 2: అసురుసురయి నేనటు కనుచొక్కిన
కొసరి కలలు మేల్కొలిపీని
ముసరుసిగ్గులె మోనానునుండిన
పస నీపదములె పాడించీని

చ. 3: అలమితి రతి నేనలసినాను నీ
తెలిమోవి దప్పిదేర్చీని
యెలిమిని శ్రీవెంకటేశ నాకడమ
గలిగినా నీదయగాచీ నన్నును

రేకు: 0237-4 శ్రీరాగం సంపుటం: 08-220

పల్లవి: ఊడిగాలు సేసుకొంటా నుండనీవయ్యా
దాడివెట్టినిన్నుఁ బట్టేదాన నీకుఁబ్రియమా

చ. 1: చెప్పినట్టె యెపనైనాఁ జేయఁగాఁ గొంగు వట్టేవు
వుప్పటించె యీపనైతే నోపఁగలనా
ముప్పిరిగొన్నసతులు ముయ్యేడువారున్నారు
తప్పులు నిన్నుఁ బట్టేటి దానను నేఁబ్రియమా

చ. 2: లోనైనీకు నుండఁగాను లోనింటికిఁ బిలిచేవు
కోనల నిందుకు నియ్యకొనఁగలనా
రానిపోని మూలలను రాణివాసాలున్నవారు
తానకమై మారుకొనేదాన నీకుఁబ్రియమా

చ. 3: గందము నీకుఁ బూయఁగాఁ గాఁగిలించి కూడితివి
అందుకొని యింత అలయఁగఁ గలనా
యిందుకే శ్రీ వెంకటేశ యిదే గోపికలున్నారు
దందువంటి రాజపుదాన నీకుఁ బ్రియమా

రేకు: 0237-5 ముఖారి సంపుటం: 08-221

పల్లవి: సిగ్గువడ నీకేల చింతలేలా
తగ్గు మొగ్గులేలా నీకు తలవంచ నేఁటికి

చ. 1: విన్న కన్న సుద్దులెల్లా వెల్లవిరి సేసేనంటే
కన్నుల జంకించి చూచి కాఁతాళించేవు
అన్నినీమొకదాకిరి నాతుమలోఁ బెట్టుకొంటే
చిన్ని సెలవుల నాకు చిరునవ్వయి ముంచెను

చ. 2: నానాటికి నీగుణాలు నానించి కడిగేనంటే
కోనల ముంజేయివట్టి గోరనొత్తేవు
పాని నీపై మచ్చరము పండ్లఁ బెట్టుకుండితేను
మోనాన వాండ్లెక్కి నీమోవిమీఁద నిండెను

చ. 3: సొరిది నీమనసిది సోదించి మెచ్చేనంటే
కరఁగి కరఁగి యట్టే గారవించేవు
గరిమ శ్రీవెంకటేశ కలసితి మొక్కేనంటే
తరితీపులై చేతికి తలఁబాలై నిండెను

రేకు: 0237-6 దేసాళం సంపుటం: 08-222

పల్లవి: చిఱుత నవ్వులేల సిగ్గులు వడఁగనేల
గుటిఁ దలరాయి సేసుకొంద మిఁకలేవయ్యా

చ. 1: చెప్పఁబోతేఁ బసలేవు చేసిన నీచేఁతలివి
యిప్పటి చీఁకటితప్పులివియేకాని
వుప్పటించి యాడకుండా వూరివారికెల్లాను
చప్పుడుజాగంటవేసి చాటుదములేవయ్యా

చ. 2: నవ్వఁబోతేఁ బసలేదు నడవడి లోననెల్లా
పువ్వుల కురపిదానిఁ బొందుటేకాని
రవ్వ నిన్నుఁ జేయకుండా రచ్చలోని వారికెల్లా
అవ్వల లేకలువ్రాసి అంపుదము లేవయ్యా

చ. 3: పట్టఁబోతేఁ బసలేదు పైపై నీనేరమి
వొట్టి చీరలుదీసిన దొక్క టేకాని
నెట్టన శ్రీ వెంకటేశ నీవు నన్నేలితివి నీ
చుట్టాలకు గురిసేసి చూపుదములేవయ్యా

రేకు: 0238-1 బౌళి సంపుటం: 08-223

పల్లవి: నీతోనేల దూతికకు నిష్టూరము
ఆతరుణి వచ్చి మరి అన్నిఁజూచుకొనీని

చ. 1: యిప్పుడేలకోపించేవు యింతితో నొకమాఁటు
చెప్పుమన్న మాఁటలాపె చెప్పేఁగాక
తప్పులేదు నీయందనీ దానికైనా సంతోసించు
ముప్పిరిగాఁ గలవెల్లా ముందరనయ్యాని

చ. 2: గద్దించనేల నీకు కామినిని వేళచూడ
వద్దికిఁ బొమ్మనగాఁను వచ్చేఁగాక
సుద్దుల నీకులోనయ్యీ చుట్టము జేసుకోయిఁక
తిద్దుకొనేవారు గల్తే తేరీఁ దగవులు

చ. 3: వాదులాటలేల నీకు వనిత నీగుణమిట్టె
సోదించి రమ్మనఁగాను సోదించెఁగాక
యీదెసఁ గూడితివి నీవింతలో శ్రీవెంకటేశ
పోదిగా నాపెఁగూడె పొసఁగె నీపొందులు

రేకు: 0238-2 పాడి సంపుటం: 08-224

పల్లవి: వట్టి వలపులుచల్లి వనితలఁ గొసరేవు
పట్టకు నీవంతేసి బలిమేల వొట్టేవు

చ. 1: చిక్కని తేనెలవంటి చెలియమాటలె నీకు
చెక్కుచేతి చింతలకు జిగురైయంటె
యెక్కడ నెవ్వతెయ్యైనా నేల నీమనసు వచ్చీ
చక్క నూరకుండవయ్య సటలేల సేసేవు

చ. 2: పల్లైతాడువంటి వనితచూపులు నీకు
వుల్లముకోరికలకు నురులైనిల్చె
యెల్లకాంతలుండినాను యేల నీవు మెచ్చేవు
బెల్లించకువయ్య లేనిప్రియాలేల చెప్పేవు

చ. 3: కందువ చక్కెరవంటి కాంతకెమ్మోవి నీకు
మందులై నీకాఁగిటికి మరులుగొల్పె
యిందరి శ్రీవెంకటేశ యిటు నన్నూఁగూడితివి
చందాలు సేయకువయ్య చవులేల చూపేవు

రేకు: 0238-3 కన్నడగౌళ సంపుటం: 08-225

పల్లవి: మంచివాఁడె నావిభుఁడు మగువలాల
వంచుకోవలసి తానె వలపంచెఁగాకా

చ. 1: మొగముచూచినవాఁడు మొదలఁ దానె కదవె
నగవురాఁగా వెనక నవ్వితిఁగాని
యెగసక్యపుదానవా యిందరు నెరఁగకుండ
అగడు సేయవలసి అనీనింతెకాకా

చ. 2: కాఁగిలించుకొన్నవాఁడు గట్టిగఁ దానె కదవె
పాఁగిన మచ్చాలు మరి పట్టితిఁగాని
రాఁగతనముదాననా రాసికెక్కిన్నాళ్లాయ
వేఁగుసేసి మోచిదించ వింతసేసిఁగాకా

చ. 3: చేరి కూడినట్టివాఁడు శ్రీవెంకటేశుఁడె కదె
ఆరయ నేనిపుడు నంటితిఁగాని
బీరములదాననా పెడ్లి నేఁడెఆయ
సారెసారెవేఁడుకొంటా చనవిచ్చిఁగాక

రేకు: 0238-4 వరాళి సంపుటం: 08-226

పల్లవి: వేడుకకాఁడవు నీకు వెరుపలయ్యా
పాడిదప్పక యిచ్చేవు పంతాలేలయ్యా

చ. 1: కావరించి వేగినంతా కలిగిన పనులెల్లా
వేవేలుఁ జేసివచ్చి వెరుపేలయ్యా
వోవరిలో నాచేతికి వొంటిఁజిక్కి యిప్పుడిట్టె
వోపలబెట్టెనంటా వొట్లేలయ్యా

చ. 2: అంది పొంది వాడలోన అందరి యిండ్లనెల్లా
విందులారగించి వచ్చి వెరుపేలయ్యా
బందెఁజిక్కినట్టు మాపరువుపైఁ బవళించి
సందడిలో వారి వీరి సాకిరులేలయ్యా

చ. 3: అచ్చముగా నన్నుఁ గూడి అన్నిటా శ్రీవెంకటేశ
విచ్చనవిడాయ నింక వెరుపేలయ్యా
మచ్చెము చిక్కెను నీమనసు నామీఁదను
వొచ్చెములెల్లాఁ దీరె నొడఁబాట్లేలయ్యా

రేకు: 0238-5 దేసాళం సంపుటం: 08-227

పల్లవి: ఆడుకోకు నీకునీవే అంతేసి పంతాలు
జాడతోడ మరినవె చాలునయ్య యింకను

చ. 1: నిగమములై తేను నిలువఁ బెట్టేవాడవు
మగువలతోఁ గల్ల మాటలాడేవా
అగడై అసురకాంతలందుకు సాకిరున్నారు
జగతి సత్యము లవె చాలునయ్యా యింకను

చ. 2: పెరిమ యజ్ఞభాగాలు పెద్దవై ఆరగించేవు
అరిది వెన్నలు ముచ్చి లారగించేవా
యిరవై గొల్లెతలెల్లా నిందుకు సాకిరున్నారు
సరి నట్టి విశ్వాసాలె చాలునయ్య యింకను

చ. 3: జమళి నవ్వుతా నాకు చాఁచె హస్తాలు నీవి
కొమరెలనంటి యెత్తుకొని వచ్చేవా
సమరతి రుకుమిణి సాకిరి శ్రీవెంకటేశ
సముకమైతిమి బొంకుచాలునయ్య యింకను

రేకు: 0238-6 దేవగాంధారి సంపుటం: 08-228

పల్లవి: ఎట్టున్నదో నీచిత్తము యెరఁగ విన్నవించేను
గుట్టున నేనుండితేను కోపముగాదుసుమ్మీ

చ. 1: యెగ్గులేక పతితోడ నెటువంటి వేళనైనా
సిగ్గె మూలధనము చెలులకును
వొగ్గి నీవు సారె సారె నొడివట్టి తియ్యఁగాను
దగ్గర రానైతి నిది తప్పుగాదుసుమ్మీ

చ. 2: యివ్వల మగవారితోనె మాటలాడినాను
నవ్వె మూలధనము నాతులకును
మవ్వపు సరసమున మానము సోఁకనాడఁగా
రవ్వగాఁ గేరితి నిది రాఁపుగాదుసుమ్మీ

చ. 3: సారెఁ గొప్పంటిన ప్రాణసఖునితోఁ జెనకఁగ
వోరుపె మూలధనము పువిదలకు
కోరిక శ్రీవెంకటేశ కూడి నన్ను మెచ్చఁగాను
ధీరతనుండితి నంతదిట్టఁగాను సుమ్మీ

రేకు: 0239-1 హిందోళవసంతం సంపుటం: 08-229

పల్లవి: ఆయనాయ నుండవయ్య అన్నియుఁగంటిమి నేము
చేయి చేతఁ బట్టియ్యఁగా సిగ్గువడవలదా

చ. 1: నిగ్గుల నీవంటివారు నిజమాడి బతుకఁగా
కగ్గినవేళల నేము కల్లలాడేమా
బగ్గన నంటివి నీవు బమ్మచారి నంటాను
వెగ్గళించి పదారువేలు సతులుండఁగా

చ. 2: పలుమారు నీవె యింత పంతము లాడుకోఁగా
కెలన నేమిఁక మరి కిందుపడేమా
పొలసి విఱ్ఱవీఁగేవు పరుషుఁత్తముఁడనంటా
వొలిసి లకిమమ్మ నీవురమెక్కివుండఁగా

చ. 3: పైపై శ్రీవెంకటేశ పాదము నీవు చాఁచఁగా
యేపున మొక్కేవారమిప్పుడు నేమా
దాపుగ నన్నుఁగూడి ధర్మాలు బోధించేవు
రూపై యెత్తుకవచ్చిన రుకుమిణివుండఁగా

రేకు: 0239-2 భైరవి సంపుటం: 08-230

పల్లవి: ఊరకే గడించుకొని వొక్కటొక్కటే తాను
మారుకొంటినంటాఁ దానే మతకానఁ జూచీనే

చ. 1: తనివిదీరక వెనుతగిలితే నాయకుఁడు
యెనసి నే నమ్మనంటా నెగ్గుపట్టీనే
చనవు చేసుక మరి సరిఁ గొంగువట్టితేను
పెనఁగి పోనియ్యనంటా పెక్కులాడీనే

చ. 2: చుట్టముఁజేసుక తన్ను సుద్దులెల్లా నడిగితే
పెట్టుకుండె నెపాలంటా బీరాలెంచీనే
వొట్టిన యాసలతోడ వొళ్ళు గాఁగిలించుకొంటే
అట్టె బలిమి సేసితినంటా దూరీనే

చ. 3: కందువ రతికేళికి గడియ నేఁ బెట్టితేను
యిందరి నంటసీవంటా నింత సేసీనే
అందపు శ్రీవెంకటేశుఁ డప్పటిఁ దన్నుఁగూడితె
పొందుల భ్రమించెనంటా పూఁచి నవ్వీనే

రేకు: 0239-3 సామంతం సంపుటం: 08-231

పల్లవి: మీలోనే కలిముదిరి మేడి దాయను
జాలిదీర నెటువలె సరసమాడేవే

చ. 1: కప్పురమువంటి నవ్వు కారీని సెలవుల
గొప్పగొప్పకన్నులను కోపమేఁటికే
కుప్పె సవరపుపతిఁ గొప్పువట్టి తీసితివి
దెప్పరపు చేఁతెల్లాఁ దీరుచుకొనేవే

చ. 2: పుట్టి తేనెవంటి మాటలూరీని పెదవుల
తిట్టులు నాలికె నెట్టు దీకొలిపేవే
పట్టి బంగారుపాదుక బలిమి మేననూఁడితి
యిట్టి పంతమాతనికి నెట్టుదిద్దేవే

చ. 3: రీతి జిరుగువంటిది రేకలు నీమేన నివే
జాతిచన్నులనెట్టొత్తి అట్టుసేసేవే
యీతల శ్రీవెంకటేశు నెనసితి వింతలోనే
నీతితో యిప్పుడెట్లా నీవుమొక్కేవే

రేకు: 0239-4 సౌరాష్ట్రం సంపుటం: 08-232

పల్లవి: ఇదివో నీదొరతన మేఁటిదయ్యా
అదనాయ నేనేమైనా నాడఁజెల్లునయ్యా

చ. 1: నాదిక్కుఁచూచీ నాపె నవ్వి తలవంచేవు
యీదెస నీ జాణతన మేఁటిదయ్యా
ఆదిగో నాపె దూతికనై వచ్చితి నీవద్దికి
పాదుగా నన్నింతసేసి పరాకై తివేమయ్యా

చ. 2: మచ్చాలువేసీ నాపె మాటలాడేవు నీవైతే
యిచ్చట నీ జాణతన మేఁటిదయ్యా
నెచ్చెలింటికి రమ్మంటే నీవు నన్ను ముట్టితివి
అచ్చలాన గుట్టుసేసేవదేమయ్యా

చ. 3: వెల్లవిరిసేసీ నాపె వింత నీ జాణతనాలు
యిల్లిదె శ్రీవెంకటేశ యేఁటిదయ్యా
తొల్లె యాపెఁగూడి జెల్లెల నన్నూఁగూడితి
వుల్లసాన మెచ్చేవు నీ వుపమిదేమయ్యా

రేకు: 0239-5 రామక్రియ సంపుటం: 08-233

పల్లవి: చలము రేఁగేదెల్లా సవతుల కింతేకాక
నెలకొనె నాతఁడితే నెరవేరెనే

చ. 1: ఘాతల నందరితోడ కడు నవ్వులు నవ్వేవు
చేతికి లోనాయఁ బతి చెల్లులేవే
పోతరించి యప్పటి నిప్పుడు మారుమలసేవు
నీతితో నాతఁడుమేలు నీకె మేలే

చ. 2: చెనకుచుఁ బగటుతో చెలరేఁగి వుందానవు
అనువాయ నీ బొగట (డ?) లౌలేవే
కనుసన్నఁ జెలులతో కమ్మర మాటాడేవు
చనవు నీకాతఁడిచ్చె జయము చేకొంటివే

చ. 3: తావున నాకును మంచితనములు నెరుపేవు
శ్రీ వెంకటేశుఁడే బుద్ధిచెప్పిలేవే
వేవేలకు రాజసాన విఱ్ఱవీఁగే వన్నిటాను
కైవసమాయ నాతఁడె ఘనురాలవౌదువే

రేకు: 0239-6 నాదరామక్రియ సంపుటం: 08-234

పల్లవి: నిచ్చలు సేవలుసేసి నేనే వేసరితి
అచ్చలానఁ దనకంటే అలసితిని

చ. 1: కన్నుల కాఁకలుదీర కప్పురము చరమవే
యెన్నిక నెవ్వతెకో యెదురుచూచె
సన్నలుచేసిన చేయి సకియరో పిసుకవే
పన్ని సారె వంచి వంచి బడలినాఁడు

చ. 2: పెదవికిఁ బదనురాఁ బిలిచి పన్నీరివే
కదిసి యెవ్వతెకో కతలు చెప్పి
పొదిగినమేనఁ దట్టుపునుఁగయినాఁ బూయవే
మదనగరిడి సదమదమైనాఁడు

చ. 3: వురముమీఁదికి నిట్టె వుపచారాలు సేయవే
మొరసి చన్ను మోపు మోఁచినాఁడు
యిరవై శ్రీవెంకటేశుఁ డెనసె నాకాఁగిట
మరిగించి నన్నిట్లా మన్నించినాఁడు

రేకు: 0240-1 దేశా(సా)క్షి సంపుటం: 08-235

పల్లవి: కానీవయ్య దానికేమి కర్తవు నీవు
తానకమైతిమి యింకా దండనుండేమయ్యా

చ. 1: చతురుఁడ వన్నిటాను సముకాన నున్నదాన
రతికిఁ బిలువవంటా రవ్వసేసేనా
గతి నీమో మాకు మరి కాఁతాళించి సేసేదేమి
తతివచ్చినందాఁక దండనుండేమయ్యా

చ. 2: నేరుపరి వన్నిటాను నీకుఁ గట్టితి నేఁ దాళి
చేరి మాటాడకున్నాఁ జెచ్చెరఁ దిట్టేనా
కోరినకోరిక నీవు గుంపించి సేసేదేమి
తారుకాణైనదాఁకా నీదండనుండేమయ్యా

చ. 3: బలువుఁడ వన్నిటాను పట్టితి వ్రతము నీకు
అలయఁ గూడితి వీఁక నౌఁగాదనేనా
యిల శ్రీ వెంకటేశుఁడ మెప్పుడూఁ జేసేదేమి
తలఁపు నిలుపు దాఁకా దండనుండేమయ్యా

రేకు: 0240-2 నారాయణి సంపుటం: 08-236

పల్లవి: ఇల్లాండ్లెరిఁగిరా యింతేసి సోదించ
కల్లలు నిజాలుసేయఁ గడకూ నేరుతువు

చ. 1: చెప్పరాని కూరిమితో చేరి నావద్దనుందువు
యెప్పుడో ఆపె యింటికి నేఁగి వత్తువు
చొప్పులు నీమేన నవె చూపి చెప్పరాదు మాయ
నెప్పున నీవొళ్లి కల్ల నీవె యెరుఁగుదువు

చ. 2: అరిది నాపొత్తున నీవారగించె వుండుదువు
సరినాపె విందెప్పుడో చవి చూతువు
సరవులె అట్టున్నవి చాటిచెప్ప గురిలేదు
నిరతపు నీసుద్దులు నీవె యెరుఁగుదువు

చ. 3: శ్రీ వెంకటేశ నన్నె చేకొని కూడుండుదువు
యేవేళనో కాఁగి లాపె కెరవిత్తువు
భావనలె యింతెకాని పచారించరాదు మరి
నీవిధములన్నియును నీవె యెరుఁగుదువు

రేకు: 0240-3 లలిత సంపుటం: 08-237

పల్లవి: ఏడఁజూచినా నీకు నేమి బాఁతి
ఆడానీడాఁ దిరుగఁగా నగ్గువాయ వలపు

చ. 1: చెంగావిమోవి నీది సెలవి నవ్వులు నావి
యెంగిలి పొత్తులపతి వేమనేమయ్య
కొంగు వట్టేవేల నీవు కొనవేలు నేఁ బట్టగా
జంగిలి సతులకెల్లా చవుకాయ వలపు

చ. 2: చెక్కుల రేకలు నీవి సిగ్గుల రాసులు నావి
యెక్కిరింత పతివైతి వేమనేమయ్య
కక్కసించేవు రతికి కడుఁదమకించే నేను
చక్కని యింతుల మీఁద జాజరాయ వలపు

చ. 3: గుట్టుతో నలపు నీది కూడిన కాఁగిలి నాది
యిట్టి శ్రీవెంకటపతి వేమనేమయ్య
పట్టేవు నాకుచములు పయ్యద నేఁగప్పఁగాను
జట్టిగొన్న మొక్కులకు సందేఁడాయ వలపు

రేకు: 0240-4 కేదారగౌళ సంపుటం: 08-238

పల్లవి: నీకంటె వేగిరము నిండు నావేడుకలివి
కైకొనేఁగాని పయ్యద గప్పనియ్యవయ్యా

చ. 1: చెప్పినట్టు సేసేఁగాని చెక్కు నొక్కనియ్యవయ్య
ఆ(అ?)ప్పుడె నవ్వేఁగాని మోవాననీవయ్య
దప్పులు దేరిచేఁగాని తమ్ముల మిడనీవయ్య
గుప్పేఁగాని వలపులు గోరొత్తనీవయ్య

చ. 2: సమ్మతించి వుండేఁగాని చన్నుల నొత్తనీవయ్య
తెమ్మగా మొక్కేఁగాని తిట్టనీవయ్య
కుమ్మరించేఁగాని మేలు కొప్పువట్టనీవయ్య
చిమ్మేఁగాని సిగ్గులెల్లాఁ జెనకనీవయ్య

చ. 3: యెదురు మాటాడఁగాని యేకతము వినవయ్య
అదను చెప్పేఁగాని అంటనీవయ్య
పొదిగేఁగాని అలసి బుసకొట్టనీవయ్య
యిదివో శ్రీవెంకటేశ యెనసితివయ్యా

రేకు: 0240-5 కాంబోది సంపుటం: 08-239

పల్లవి: ఇంతేసి సేసేదెల్లా నిందు కొరకా
పంతము నెరపఁబోయి భ్రమసేవు నీవును

చ. 1: చనుఁగవ దాఁకించేవు సారెఁ బాదపువేలను
గునుకుచు నీపల్లికి గొలిచిరాఁగా
తనువెల్ల జెమరించి తప్పక నిన్నుఁ జూచితే
కనుఁగొనలతేటలఁ గరగేవు నీవును

చ. 2: కుచ్చులపై నుమిసేవు కోరి నీతమ్మరసము
నెచ్చెలిచేకాళాఁజి నేఁబట్టఁగా
ముచ్చటతో సిగ్గువడి మోవ నిన్నుఁ దిట్టితే
అచ్చుమోవఁ బరవస మందేవు నీవును

చ. 3: చెక్కు మోవినంటించేవు చేవదేరిన యాసతో
కక్కసించి నీవూడిగాలు సేయఁగా
అక్కుపై శ్రీవెంకటేశ అలమేల్మంగను నేను
గక్కననే యలసేవు కలయుచు నీవును

రేకు: 0240-6 బౌళి సంపుటం: 08-240

పల్లవి: కప్పురమిచ్చితే నీకుఁ గారమాయనా
యిప్పుడు నీభాగ్యానకు నేమిసేసునే

చ. 1: చెలిమిచేసేవేళ చెక్కునొక్కి వేఁడుకొంటే
అలిగి విభునిఁ దిట్టే వదేమె నీవు
కొలఁదిమీరి తప్పి కొనగోరు దాఁకితేను
యెలమి నింతలో నితఁడేమి సేసునే

చ. 2: చేరి బుద్దిచెప్పేవేళ చెవిలో మాటాడితేను
ఆరయఁ దప్పక చూచే వదేమె నీవు
మారులేక అవియె నీమర్మములు సోఁకితేను
యీరీతి నింకా నితఁడేమి సేసునె

చ. 3: మోవితేనె విందువేళ మొనపల్లు సోఁకితేను
ఆవల చూచి నవ్వేవు అదేమె నీవు
నీవె అలమేల్మంగవు నిన్నేలె శ్రీవెంకటేశుఁ
డీవేళను ఆయ నాతఁడేమి సేసునే

రేకు: 0241-1 సామంతం సంపుటం: 08-241

పల్లవి: వింత లాపెవద్దనుండి వినీఁ గాని
యింతయు మాతో నానతియ్యవయ్య నీవు

చ. 1: చెప్పినట్టె సేసి తెలిసిగ్గువడి వున్నదింతె
అప్పుడె మెచ్చేఁజుమ్మీ ఆపె నిన్ను
కుప్పరగంధి మతిలోఁగలమాట నేమాడేము
చెప్పేమాటలు మాతోనె చెప్పవయ్య నీవు

చ. 2: మన్నించితి వన్నిటాను మనసు వచ్చెవున్నది
కన్నులనె మొక్కేఁజుమ్మీ కాంతనీకు
సన్నలు సేసినమోల్లా సరినేము దెలిపేము
యిన్నియు మాకుత్తరము లియ్యవయ్య నీవు

చ. 3: కాఁగిటఁ గూడితి విదె కైకొనె నలమేల్మంగ
ఆఁగి వురమెక్కేఁజుమ్మీ ఆపె నిన్నంటి
వీఁగము శ్రీవెంకటేశ విన్నవించే మిఁక నీతో
పోఁగు వోఁగుఁ బొంద మమ్ముఁ బొందించుమీనీవు

రేకు: 0241-2 పాడి సంపుటం: 08-242

పల్లవి: దేవుఁడు దేవియు నదె తెరదియ్యరె
పూవులదండలు దీసి పువ్వులియ్యవే

చ. 1: కన్నుల నిద్దురదేర గక్కన మేలుకొని
వున్నతి మొకాలు చూచే రొకరొకరు
పన్నీ రందియ్యరె పావడలు నందియ్యరె
గన్ననఁ గాళాంజి దగ్గరఁ బట్టరే

చ. 2: నగవులు నగుకొంటా నంటున లేచి కూచిండి
వొగిఁ గురులు దిద్దే రొకరొకరు
తగ నద్దాలు చూపరె తతితో బాగాలియ్యరె
వొగరుదేరఁ గస్తూరి వుండ లియ్యరే

చ. 3: బిగ్గెఁ గాఁగిలించుకొంటా ప్రియములె ఆడుకొంటా
వొగ్గిరి రతులకును వొకరొకరు
అగ్గమై శ్రీవెంకటేశుఁ డలమేలుమంగాఁ గూడి
వెగ్గళించే రలపార విసరరే యిపుడు

రేకు: 0241-3 రామక్రియ సంపుటం: 08-243

పల్లవి: గడుసుఁదన మేఁటికి కలికి మోనమటే
తడవకున్న దిట్టతన మిదియనఁడా

చ. 1: పంతమాడరాదుగాక పతితోడ సతికిని
అంతరంగమైనఁ గొంత ఆనతీరాదా
మంతుకెక్కి వద్దనుండి మారుత్తరాలియ్య విదే
కాంతుఁడు నీకిదియెల్లా గర్వముగాఁ జూడఁడా

చ. 2: తిట్టరాదుగా కతనిఁ దేరిచూచి నీకింతేసి
తెట్టెలుగా మొక్కఁగాను దీవించరాదా
చెట్టవట్టి పెనఁగఁగాఁ జెప్పఁగదే వినయాలు
గుట్టుతోడ నుండితేను కుచ్చిత మిదనఁడా

చ. 3: బాధించరాదుగాక బడి శ్రీవెంకటేశ్వరుఁ
బాదుగాను మెచ్చి మెచ్చి పాడరాదా
యీదెస నలమేల్‌మంగ వెనసితి వితని
పోదితో నిటుగాకున్న పొరపొచ్చ మెంచఁడా

రేకు: 0241-4 దేసాళం సంపుటం: 08-244

పల్లవి: అన్నిటికిఁ గలవట అందుకులేవా నీవు
నిన్ను నీవె యెంచుకొంటే నేరవా యీపనులు

చ. 1: నవ్వులకు నొకమాట నంటున నీతో నాడితే
యివ్వల నందుకుఁగాను యెగ్గుపట్టేవు
రవ్వనవాఁడవుగావా రాజవుగావా మున్నే
అవ్వల నెంచిచూచితే నందుకునుఁ దగవా

చ. 2: చెలిమితో నొకమాఁటు చెక్కుచేత నూఁదితేను
కలఁగి నీలోనివే కాఁతాళించేవు
వలపు నీసొమ్ముగాదా వాడికవాఁడవుగావా
అలవాటు నీకులేదా అందుకునుఁ దగవా

చ. 3: చనవుల నొకమాఁటు చన్నుల నేనొత్తితేను
కొనచూపులనే చూచి కూడితి విట్టే
విను శ్రీ వెంకటాద్రి గోవిందుఁడవు నీవుగావా
అనిపించుకో మాచే నందుకునుఁ దగవా

రేకు: 0241-5 శుద్ధదేశి సంపుటం: 08-245

పల్లవి: కాఁతాళించి వున్నది నీకడ సుద్దులెల్లా విని
చేఁతలేమిఁ జూపక చేరి వూరకుండుమీ

చ. 1: వనిత నీచిత్తము రావలసి యిందాఁకాను
వొనర నన్నిమాఁటలు నోరిచెఁగాని
చెనకి నీవె యిఁక చేతులెత్తి మొక్కినాను
కొనచూపుటలుగులఁ గుచ్చి యెత్తుఁ జుమ్మీ

చ. 2: అతివ నిన్ను మెప్పించె అందుకొర కిందాఁకాను
చతురత మోనములు జరపెఁగాని
యితవుగా నీవె యిఁక నిచ్చకము లాడినాను
రతిరాజు గుఱ్ఱాల నోరనే తోలుఁజుమ్మీ

చ. 3: చెలి నీవు గూడిన యీసిగ్గున నిందాఁకాను
మొలకనవ్వులు లోలో మొరఁగెఁగాని
నెలవై శ్రీ వెంకటేశ నీవె యెంతవేఁడుకొన్నా
తలిరు మోవిపైని ముద్రలు వెట్టుజుమ్మీ

రేకు: 0241-6 సాళంగం సంపుటం: 08-246

పల్లవి: మేమొక జాడవారము మీరలేము మీమాటలు
ఆమాటలు నెరపితే నందరికి సమ్మతా

చ. 1: పోఁడిమి నాశాంతాలు పొగడేవు సారె సారె
నాఁడె నీవిచ్చిన బుద్ధి నాకుఁ గద్దుగా
కోఁడి నన్ను లోనుసేసుకొని నీయిచ్చఁ దిరిగి
ఆఁడుజాతి కిదేచాలు అంటె వారోరుతురా

చ. 2: పిలిచి నన్నిందరిలో పెద్దరికము సేసేవు
తొలుతె చేపట్టితిగా తూరి రక్షించ
యిల నన్నొడఁ బరచి యిందరినిఁ బెండ్లాడి
పొలమెల్లా నిట్టె చుట్టుకొంటె వారోరుతురా

చ. 3: కూడి నన్ను నారతులె గురుతులు సేసాడేవు
జోడు గద్దుగా నిన్నుఁ జూపి చెప్పను
యీడనె శ్రీవెంకటేశ యేలితివి నన్ని (న్ను?) సూటి
వాడకెల్లా నేర్పెనంటె వారిందు కోరుతురా

రేకు: 0242-1 సాళంగనాట సంపుటం: 08-247

పల్లవి: ఆడ నీడ నుండఁగా నిన్ననేఁగాక
కూడి యిట్టె వుండితేను కోపగించేనా

చ. 1: నామొగము చూడుమా నగితేనె కానవచ్చీ
నీ మనసులోననున్న నిజముఁ గల్లా
యేమతకములు నేల యింతేసి ఆనలేల
నామంచముమీఁద నుంటే నమ్మ నే ననేనా

చ. 2: ముమ్మారునాడుమామాట మొదలనే తెలిసెను
కమ్మిన నీచేఁతల కపటాలెల్లా
సమ్మతించు మననేల చలము సాధించనేల
యిమ్ముల మాయిచ్చనుంటే యీసడించేనా

చ. 3: కాఁగిలించుకుండుమాకాఁక లోనెముంచుకొని
ఆఁగి పెదవి దడిపె ఆసలెల్లాను
వీఁగనేల యిఁకను శ్రీవెంకటేశ కూడితివి
పొఁగి యిట్టె నెలకొంటె బాసలాడిగేనా

రేకు: 0242-2 వరాళి సంపుటం: 08-248

పల్లవి: ఆసపడ్డవారికి నలమట సేయకిఁక
రాసికెక్క మన్నించి రక్షించవయ్యా

చ. 1: నీమొగము చూచి చెలి నిట్టూర్పు నిగుడించె
యేమో అడుగవయ్య యేకతాన
సాముువార సెలవినె నవ్వులు లోలోనదాఁచీ
దీమసాన తలఁపెల్లాఁ దెలుసుకోవయ్య

చ. 2: చేతికి విడెమిచ్చి చెమరించీ మేనెల్లా
యేతున నేమడిగెనో యియ్యవయ్య
ఆతుమలోఁ గోరి కోరి అట్టె నివ్వెరగందీ
కాతరాన నట్లానె కానిమ్మనవయ్య

చ. 3: దగ్గరఁ గూచుండి యదె తలవంచీ సిగ్గుపడి
వెగ్గళించ కిఁకఁ దెరవేయవయ్య
కగ్గక శ్రీవెంకటేశ కాఁగిట నిన్నింతి గూడె
వొగ్గినరతులకు నీ వొడిగట్టవయ్యా

రేకు: 0242-3 ఆహిరి సంపుటం: 08-249

పల్లవి: విచ్చి చెప్పె నిదె నీకు వివరముగా నేఁడు
నెచ్చెలి నిన్నిటికిని నేనేగురి సుమ్మీ

చ. 1: అంగవించి నీతో మాటలాడక యిట్టెవున్నది
అంగన చిత్తము దెలియఁగఁ గలవా
యెంగిలిమోవితోడ నేమిమాటలాడినాను
పంగించె యెంతైనా నంటుపాయదంటాఁ జుమ్మీ

చ. 2: తరుణి యెదుటనె తలవంచుక వున్నది
వెరవున నీపెను నవ్వించఁ గలవా
సరసము లాడితేను జంగిలి కడుపులోనఁ
దొరలితేనది గడుదోసమనీ సుమ్మీ

చ. 3: కామిని శ్రీవెంకటేశ కాఁగిటఁ గలసె నేఁడు
చేముంచి ఆకారణము చెప్పఁగలవా
వాములై యెవ్వతెకైనా వయసు మీఁదువోతేను
దీమసాన నిన్నే నిందింతురంటాఁ జుమ్మీ

రేకు: 0242-4 శుద్ధవసంతం సంపుటం: 08-250

పల్లవి: అందుకెపో నిన్ననేది అన్నిటా నేను
యెందుకైనా వెరవవు యెప్పుడూ నీవూ

చ. 1: నివ్వటిల్ల నాకైతె నిన్నుఁ జూచినప్పుడెల్లా
నవ్వులె గనమాయ నానాటికి
జవ్వనపువాఁడవు సవరనివాఁడవు
రవ్వలకు వెరవవు రచ్చలనెల్లాను

చ. 2: తాటించి నిన్ను నేను దగ్గరిన యప్పుడెల్లా
మాటలె గనమాయ మరి నోరికి
నీటుతోడివాఁడవు నేరుపరివాఁడవు
యేటికైనా వెరవవు యీడా నాడను

చ. 3: అంకెల నిన్నుఁ గాఁగిట నలమిన యప్పుడెల్లా
జంకెనలె మిగిలెను సారె సారెకు
పొంకపు శ్రీవెంకటేశ పురుషోత్తముఁడవు
లంకెలకు వెరవవు లలనలయెడను

రేకు: 0242-5 నాదరామక్రియ సంపుటం: 08-251

పల్లవి: ఇంకా నేమిగావలె నిట్టె ఆనతివయ్య
జంకించఁగాని నీసలిగె చూపెను

చ. 1: మతకము నేరఁగాని మంతనాన నీతోను
చతురతమిగులఁ గొర నేరుతు
బతిమాలనోపఁగాని పంతపు నీరతివేళ
నితవై నీచెప్పినట్టు యేమైనాఁ జేసేను

చ. 2: వాదించరాఁగాని వన్నెలుమెరసి నీతో
ఆదిగొని సరసము లాడవచ్చేను
సాదించవద్దుగాని చల్లని నీకాఁగిటిలో
సాదువలె నీకతలు సమ్మతించేను

చ. 3: కోపగించఁగాని నిన్నుఁ గూరిమి శ్రీవెంకటేశ
కాఁపురము సేసి నీపక్కనె వుండేను
యేపున బింకము లేల యిట్టె నన్నుఁ గూడితివి
తీపుల మోవిమాటలఁ దేనె వూసేను

రేకు: 0242-6 ముఖారి సంపుటం: 08-252

పల్లవి: పదరకువె యింకాఁ బనిగలదు
కదియుట నిన్ను నాపై కాఁతాళముగాదా

చ. 1: కన్నుల నవ్వితే నేమె కాఁకలు చల్లితే నేమె
వన్నెల మాయింటికి రావలెఁగా తానూ
యెన్నిలేవు వానియెమ్మె లెవ్వరుండిరో వద్దను
నిన్ను నాతఁడేమనినా నన్ను నంటగాదా

చ. 2: సేలు వెట్టితే నేమె చేతులు ముట్టితే నేమె
వాసుల నామోము చూడవలెఁగా తాను
వేసాలు నెరపనీవె వీడెపు మదమో యేమో
బాసికము నీకిచ్చిన పని నాకేకాదా

చ. 3: ఆడ నిన్నంటితే నేమె అట్టె తావచ్చితే నేమె
వాడుమోము నాకుఁ జూపవలెఁగా తాన
యీడనె శ్రీవెంకటేశుఁ డెనసెఁ గదవె నన్ను
వేడుకలక్కడివి నాతోడి తమేకాదా

రేకు: 0243-1 శ్రీరాగం సంపుటం: 08-253

పల్లవి: తొల్లిటి సుద్దులకుఁగా దూర నేఁటికి
పల్లదా లన్నియునాడి పంతమిచ్చెఁ జాలును

చ. 1: చెక్కునబెట్టిన చేయి సేపట్టినట్టి చేయి
వొక్క టెకాదా మన సొందు రెండాయ
నిక్కి తానేమి సేసునె నేఁడు నాభాగ్యముగాక
మొక్కితి ననవె తానె మొకమోడె నాకును

చ. 2: అప్పుడు నవ్విన మోము అలిగిన మారుమోము
యెప్పటిదెకాదా యించుముంచాయ
తప్పులు తనందునేవె దైవము చేఁతలుగాక
కప్పురము గానుకీవె కరుణించె నన్నును

చ. 3: కొంచి పెనఁగిన మేను గొబ్బనఁ గూడిన మేను
యెంచఁగ నిదియెకాదా యీడుజోడాయ
వంచనేలె శ్రీవెంకటేశ్వరుఁడు తా ననుఁ గూడె
మంచివె పనులనవె మన్నించె నన్నును

రేకు: 0243-2 పాడి సంపుటం: 08-254

పల్లవి: తాఁకనేల వంగనేల తలఁచుకో యిఁకనైనా
సోఁకోరిచితేఁ బనులు చొప్పణఁగుఁగా

చ. 1: పల్లదము లాడఁగానె పంతము లియ్యవలనె
అల్లదివో విభుఁడ నేఁ డాఁడు వారికి
మొల్లమి నీపాటిబుద్ధి మునుపనె కలిగితె
వొల్లనె దొరతనాన నుండవచ్చుఁగా

చ. 2: చేతులు పైఁజాఁచఁగాను సిగ్గులు వడవల
యేతువ లెత్తా దించుక యిందరిలోన
నీతి విచారించుకొని నెమ్మది గుట్టుననుంటె
రీతితోఁ బెద్దరికము రేఁచుకొనవచ్చుఁగా

చ. 3: కాఁగిలించుకొనఁగానె కైవము గావలసె
మాగిన మోవితేనెల మముబోఁటికి
చేఁగదేరఁ గూడితివి శ్రీవెంకటేశ నేఁడు
నాఁగువార్ల మీఁద మీఁద నవ్వువచ్చుఁగా

రేకు: 0243-3 సామంతం సంపుటం: 08-255

పల్లవి: రాఁగదె పాయము రచ్చలఁ బెట్టక
కాఁగక మీఁగడ గట్టి నటవే

చ. 1: వలచిన రమణికి వడిఁ బతితోడుత
యెలమిని పంతము లేమిటికే
కలయికలకె మరి కాచుకుండఁగా
చెలరేఁగీ యతని చిత్తముగాకా

చ. 2: వొగ్గి ననుపుతో నుండిన కాంతకు
యెగ్గులు దప్పులు నేమిటికే
సిగ్గుతోఁ బ్రియము చెప్పఁగఁ జెప్పఁగ
నిగ్గునఁ దా మన్నించీగాకా

చ. 3: కదిసెను శ్రీవెంకటపతితో నీకు
యెదురు మాటలిఁక నేమిటికే
పదరక వురమున బలుసుకుండఁగా
ముదములు పైపై ముంచీఁగాకా

రేకు: 0243-4 శంకరాభరణం సంపుటం: 08-256

పల్లవి: పడఁతులు సేసినట్టి భాగ్యముకొద్దీ
వుడివోనియట్టి యెన్నో వుద్యోగాలవాఁడవూ

చ. 1: కొత్త కొత్త సింగారాల కానబుకాఁడవు నీవు
బత్తి వొకరిమీఁదనె పాటించేవా
యిత్తల గొల్లెతలు నాఁడెట్టు వేగించిరో నీతో
మత్తలి నీవైతే వేయి మనసులవాఁడవు

చ. 2: పొద్దు వోద్దు వేడుకల బూమెలవాఁడవు నీవు
సుద్దు లింతెకాక వొక్కచోటనుండేవా
వుద్దండాలు రాచకూఁతు లోరించి యెట్టుండిరో
గద్దరివై వూరరి కాఁపురాలవాఁడవు

చ. 3: నిచ్చ నిచ్చఁ బోదిసేసె నేరుపువాఁడవు నీవు
యిచ్చకుఁడవై వొక్క రింటనుండేవా
మచ్చిక శ్రీవెంకటేశ మన్నించి నన్నఁ గూడితి
ముచ్చటతో నందరికి మోహించేవాఁడవు

రేకు: 0243-5 మధ్యమావతి సంపుటం: 08-257

పల్లవి: తమకించి రమణుఁడు తరిగాచుకున్నవాఁడు
సమరతి వుపరతి సాము సేసేదెవుడే

చ. 1: చెనకిన చెనకులు సిగ్గులకె కొలఁదాయ
మనసిచ్చి మీలోని మాటలెపుడే
కొనచూపు లన్నియును కోరికకె మొదలాయ
చనవిచ్చ మోవితేనె చవిగొనేదెవుడే

చ. 2: నగినట్టి నగవులు ననుపులకెపట్టె
పొగరువలపు గడఁబోసేదెవుడే
జిగిమించు వేడుకలు సింగారించనేపట్టె
అగపడ్డ కాఁగిటికి ఆయమిఁకనెపుడే

చ. 3: కూడిన మీకూటములు గురుతు మేనులనిండె
సూడుఁబాడుఁ బంతాల నించుటయెపుడే
యీడ శ్రీ వెంకటేశు మీ యిచ్చకములె నిండీ
వీడెపుమెచ్చులు మెచ్చేవేళయెపుడే

రేకు: 0243-6 ఆహిరి సంపుటం: 08-258

పల్లవి: ఆనతీవయ్యా యింకా ననుమానా లేఁటికి
యేనెపాల లేకున్న నిటువలెఁ జేసునా

చ. 1: వసివాఁడు జూపులు వంచి నిన్నుఁ గొసరుచు
ససురుసురయ్యీఁ జెలి అది యేఁటికి
యెఁసగి యిందాఁకా మీరు యేకతాననె వుంటిరి
కనుగాటు రతులలోఁ గడమ యేమాయనో

చ. 2: తలవంచుకొని నీతో తమకపు మాటలాడి
సొలయుచు నింతి మొక్కి పొలగిలీని
చలివాయ నిందాఁకా సరసము లాడితిరి
చలముతో మతికేమి సమ్మతిగాదాయనో

చ. 3: సన్నలనే జంకించి జవ్వనపు మదమున
చన్ను మొన లటుచూపి సాదించీని
యిన్నిటా శ్రీవెంకటేశ యెనసితి రిద్దరును
పన్నిన మీపంతముల బలిమి యెంతాయనో

రేకు: 0244-1 దేశా(సా)క్షి సంపుటం: 08-259

పల్లవి: ఇద్దరికిఁ దగు తగు నిఁక నెన్నఁడూ
కొద్దిలేని పొంతనాలు గూడె మీకు నిపుడు

చ. 1: పచ్చని మోవిచిగురు పందిలివెట్టె మాటల
దిచ్చరి సిగ్గుల నింతి తెరగట్టెను
పెచ్చువలపులఁ దానె పెండ్లికూతురై వున్నది
రచ్చసేసే వెందాఁకా రావయ్య లోనికి

చ. 2: పెలుచుఁ దమకమున పెండ్లిపీఁట వెట్టుకొని
సెలవి నవ్వుల నించె సేసపాలు
కలికి కన్నుల నెగడె కుడు (కాటు?) కవెట్టెను
చలువగా నీకరుణ చల్లవయ్య సతికి

చ. 3: పానుపు మీఁదికిఁ దీసె పాణిగ్రహణమున
నానారతులఁ జేసె నాగవెల్లి
మోనాన శ్రీవెంకటేశ మోవిబువ్వాలు దొడికె
ఆనిన వేడుకలనె అందవయ్య వియ్యము

రేకు: 0244-2 సాళంగనాట సంపుటం: 08-260

పల్లవి: పొద్దువోని వానికిట్టె బుద్ధి చెప్పవే
వుద్దండాలు చూప మోవి వూరడించేనే

చ. 1: చదురులాడి యాతఁడు సారెకు నేరుతునంటా
వదరుఁదనములనె వాదించెనే
పరది యందుకు నేను పైకొని కొంగుపట్టితే
సదరము సేసుకొని సాదించెనే

చ. 2: చలివాపి యింతలోనె సంగడి నిలువఁబెట్టి
పొలతులఁ దెచ్చి నాతోఁ బోలించీనే
తెలిసి అప్పటి నేను దీకొని నిలిచితేను
సొలపుల సొక్కించి సోలించీనే

చ. 3: ఆరయ శ్రీ వెంకటేశుఁ డాయములంటి నన్ను
కోరి తన కాఁగిటిలోఁ గూడించీనే
తేరిచూచి యీవేళ తేనెమోవి యానితేను
ఆరితేరి మారుమాట లాడించీనే

రేకు: 0244-3 సామంతం సంపుటం: 08-261

పల్లవి: అడుగరే విభుఁ నివె యైతేఁ గనక
విడువక మాయింటికి విచ్చేయు మనవే

చ. 1: పెలుచుమాటలలోని ప్రియములు
యెలమి నెవ్వరికైనా యితవవునా
కలదింతె మావొళ్ళి కపురులు
పలుమారు తనకేవి బాఁతియయ్యీనా

చ. 2: బిగువురాజసముల పిలుపులు
జగముల దొరలకు చవిపుట్టీనా
తగు ధన మిదియె దాఁపురమూ
అగపడె యిదినేఁడు అనువయ్యీనా

చ. 3: బింకపురతులలోని పెనఁగులు
మంకుచందాలవారికి మర్మమంటీనా
పొంకాన నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
లంకెలాయ తనకిది లావయ్యీనా

రేకు: 0244-4 ధన్నాశి సంపుటం: 08-262

పల్లవి: ఎప్పుడు నీవారమే నేమిదె వద్దనున్నారము
అప్పగించే నందరిని అన్నిటా మన్నించుమీ

చ. 1: వరుసకు వంతుకును వచ్చినవారె యిందరు
సరుస బెట్టుకో నీవు చల్లఁగా నేఁడు
తరవాతి పనులకు తగు గొల్లెతలు వారె
మరుగకు మింకా నీ మనసునను

చ. 2: ఆసల బాసలవారు అదె పెండ్లికూఁతురులు
సేసుకో యింకా నీవు చేయి మీఁదుగా
రాసికి మీఁదమిక్కిలి రాకాసి సతులున్నారు
మోసమోక యేలుకో నీ మోహమునను

చ. 3: వాడికె వేడుకవారె వలచివున్నా రిందరు
కూడవయ్య కాఁగిటను గురుతులుగా
యీడనె శ్రీవెంకటేశ యెనసితి నిదె నేను
యీడువెట్టి మెరయించు మిన్నిటా నీవు

రేకు: 0244-5 తెలుఁగుఁగాంబోది సంపుటం: 08-263

పల్లవి: ఇంకా నింకా రమణుఁడు యేమనీనె
వంక లొత్తఁబోతేను వాసివుట్టీ నాకు

చ. 1: చనవు తానిచ్చినది చలముతో మాఁటాడితి
పెనఁగఁ బోయితే మరి పిరివీకులె
తనమాఁట నామాఁట తరుణు లెరుఁగుదురు
ననిచి తడవఁబోతే నవ్వువచ్చీ నాకు

చ. 2: సమ్మతించినదె తాను సరసము నేనాడితి
కమ్మరఁ గమ్మర నయితే కసిగాట్లె
నెమ్మనము లిద్దరివి నిండుక అట్టె వున్నవి
పమ్మి కొసరఁగఁబోతే పచ్చిదోఁచీ నాకు

చ. 3: నేరిపె నన్నియుఁ దా నెయ్యమున నేఁగూడితి
తారుకాణించఁగఁ బోతే తగులాయమె
యీరీతి శ్రీవెంకటేశుఁ డిన్నిటాను నన్నునేలె
చేరి చెనకఁగఁబోతే సిగ్గువచ్చీ నాకు

రేకు: 0244-6 కేదారగౌళ సంపుటం: 08-264

పల్లవి: ఎనసిన యాకెతో నీకింత యేఁటికి
వెనుకొని నావెంటనె విచ్చేయవయ్యా

చ. 1: పలికినట్టనెపో పంతము
చలిమి బలిమిగల సతులకు
తలఁచినయట్లనె తగులము
వలపులు నెలకొన్నవారికెల్లాను

చ. 2: చేసినవెల్లాఁ జెల్లు చేఁతలు
బాలు నమ్మినయట్టి పడఁతులకు
ఆసపడిన కోరిక లబ్బునపుడె
సేసవట్టుకుండినట్టి చెలులకును

చ. 3: చూచినట్లనెవచ్చు సూటులు
యేచి కూడిన మీవంటిద్దరికిని
చేచేత శ్రీవెంకటేశ చెలి యలమేల్మంగ
లాచి నట్లనె మించె లావణ్యాలు

రేకు: 0245-1 శ్రీరాగం సంపుటం: 08-265

పల్లవి: చెప్పినట్టు సేయకున్న చిన్నఁబోరాదు
కప్పురగందులకెల్లాఁ గల దిదె చాలు

చ. 1: చనవు లేనిచోటి జగడాలు
పెనఁగఁబోతే వట్టి పిరివీకులు
కనుకొని మాటాడరె కాంతలు
వనితల కిందరికి వాసితోడి బతుకు

చ. 2: అందియు నందనిచోటి యాసలు
సందడిఁ బెనఁగఁబోతే సటవటలు
పొందులు దెలుసుకోరె పొలఁతులు
చెందిన యింతుల కెల్ల సిగ్గు మూలధనము

చ. 3: అలసిన రతిలోని యలుకలు
చలపట్టఁబోతేను సదమదము
కలసె సన్నిదె శ్రీవెంకటవిభుఁడు
లలనలకెల్లా నీలాగులెపో లంకెలు

రేకు: 0245-2 కాంబోది సంపుటం: 08-266

పల్లవి: ఏమయ్యా నే మంతేసి యెఱఁగనివారమా
కామించితే నీమాట కాదనఁగఁ దరమా

చ. 1: సలిగెంత గలిగినా సరస మాడుటెకాక
మెలఁగి నీకంటె మితిమీరవచ్చునా
వలపు మిక్కిలియైతె వసమై చొక్కుటగాక
కలఁచి కలఁచి నిన్నుఁ గక్కసించఁదగునా

చ. 2: నగవెంత దఱచైన ననుపై యుండుటగాక
మిగులా మందెమేళాల మించనగునా
మొగమెంత చూచినా మొక్కులె మొక్కుటగాక
యెగసక్యాలకు నిన్ను యేఁపఁదీరునా

చ. 3: నీవెంత మన్నించినా నిన్నిట్టె కూడుటగాక
చేవదేర నిన్నుఁ బచ్చి సేయఁగూడునా
యీవేళ శ్రీవెంకటేశ యేలితి విటు నన్ను
ఆవటించి నిన్ను రతి నలయించఁజెల్లునా

రేకు: 0245-3 సామంతం సంపుటం: 08-267

పల్లవి: అప్పటి కాఁతాళాన నందుముగాక
తిప్పఁబోతే నీగుణాలు తీరౌనా మాకు

చ. 1: నేరుపుననాడె కల్ల నిజమువలెనెవుండు
యేరుపరచేమంటె యెటువచ్చును
నీరచనల నీవును నిలువునూరువండు
తారుకాణించే మంటె తరమా మాకు

చ. 2: దరిచేరి దండాలు తనవద్దనెవుండు
సరవికి దిద్దేమంటె చాయకురావు
వెరసి మెయిగురుతులు వేయిసే నొక్కొక్కటి
వొరసి వెలవెట్టఁగ నోపికేది మాకు

చ. 3: ప్రేమపు మోవితేనెలు పెదవిమీఁదనెవుండు
చేముట్టి వడ్డించఁబోతె చిరునవ్వులు
గామిడి శ్రీవెంకటేశ కలసితి విటు నన్ను
దోమటి దొడికేమంటె దొడ్డా మాకు

రేకు: 0245-4 మాళవిగౌళ సంపుటం: 08-268

పల్లవి: విన్నపము లింత విన్నవించవలెనా
సన్నకు మేలే నీవు జరపఁగవలదా

చ. 1: మాటలకు గురియ మనసులో మర్మములు
తేటల తెల్లములాయ తెలిఁగన్నులు
యేఁటికి జాగులు సేసే విచ్చుట నచ్చుటనుండి
ఆఁటదాని అసురురంత నీకువలెనా

చ. 2: చెక్కుమీఁది చేయాయ చిప్పిలుఁ దమకమెల్ల
మొక్కులాయ విరహము ముంచిన యాస
తక్కులఁ బెట్టఁగనేల తరితీపు నేరుచుక
చక్కని కోమలాంగిజాలి నీకు వలెనా

చ. 3: నవ్వులకు మొదలాయ ననుపులోపలిసిగ్గు
రవ్వలకుఁ జోటాయ రతి చిహ్నలు
యివ్వల శ్రీవెంకటేశ యింతి నిట్టె కూడితివి
జవ్వని నలయించి (చనీకు?)న చలమింతవలెనా

రేకు: 0245-5 వరాళి సంపుటం: 08-269

పల్లవి: వలపు నీరువంటిది వాడరాదు
తలఁపు మాకిద్దరికె తారుకాణైవుండును

చ. 1: మలసి ఆతఁడాడిన మాటలు నాతోఁ జెప్పి
చలము రేచకురె సతులాల
తెలిసితి నేఁ దొల్లె తేనె(లె?) పొన్నాకుమీఁ దిదె
మెలఁగి నేఁడు గొత్తలు మీకింతె కాని

చ. 2: యిదివో విభుఁని నన్ను నెదురుకట్లఁజూపి
మదము వెంచకురె మగువలాల
పదరి పండిదేరెనుఁ బంటిలోని రసములు
అదనెరఁగక మీరు అలసేరుగాని

చ. 3: గక్కన శ్రీవెంకటేశ కాఁగిటిలో నన్నుఁగూర్చి
పక్కన నవ్వకురె పడఁతులాల
చిక్కెను నాకుఁ దొల్లె చెరకుపండినపండు
పెక్కుమారులు మీరు పెనఁగేరుగాని

రేకు: 0245-6 దేసాళం సంపుటం: 08-270

పల్లవి: బుద్ధిమంతుఁడ వౌదువు పూఁచి బతుకఁ గలవు
వొద్దికతో నాకిపు డొక్క మనసాయను

చ. 1: యేతులు నెరపవచ్చు నెమ్మోలాడుకొనవచ్చు
నాతోడి నవ్వులె నయమా నీకు
ఆతలివారైతె నిన్ను నన్నిటాఁ గాకు సేతురు
చేతికి లోనయినవారిఁ జెనకితే మేలుగా

చ. 2: బాలు సేయంగవచ్చు పలుమారు బొంకవచ్చు
ఆసలు మాతోడిపొందు అనువా నీకు
పోసవోని వారయితె ముయికి మయి సేతురు
వాసి మానాపతులనె వంచుకొంటేఁ జెల్లునా

చ. 3: గుట్టుసేసుకొనవచ్చు కూరిమి గొరవచ్చు
యిట్టి మాకూటములె యితవా నీకు
అట్టుసేతు రిందరు నాఅడి శ్రీవెంకటేశ
మట్టుతోడి వారినె మన్నించితేఁ దగుఁగా

రేకు:	0246-1 శంకరాభరణం	సంపుటం:	08-271
పల్లవి:	విచారించు కొమ్మనవే వేడుక నింకాఁ దానె
	పచారించి మాతో నేల పలుక వచ్చీనే
చ. 1:	విరసాలె రసాలు వేగిరపడకవుంటె
	తెరమరఁగె బయలు తెలిసితేను
	సరవులె వెరవులు చనవు గలిగితేను
	యిరవాయఁదా నాకు నేమి బోధించీనె
చ. 2:	పంతనాలె పొంతనాలు పనులెల్లా నియ్యకొంటె
	చింతలే మనోరథాలు సేసుకొంటేను
	వింతలే ననుపు లవును వేసినట్టె వేసితేను
	యెంతసేసి నన్నుఁదాను యేమిబోధించీనే
చ. 3:	వెగటులే పగటులు మోరపులులేకున్న
	తెగువలే నగవులు దిద్దుకొంటేను
	తగు శ్రీ వెంకటేశుఁడు తమకించి నన్నుఁగూడె
	యెగసక్కే లిఁకలేవు యేమి బోధించీనే

రేకు: 0246-2 వరాళి సంపుటం: 08-272

పల్లవి: గుట్టుతోడిదాన నేను కొసరనేల
దిట్టతనమె నాది తెలుకొనవయ్యా

చ. 1: పెక్కుమాట లాడఁగాను ప్రియుఁడ నీతో నేను
వొక్కటి హితవౌను వేరొక్కటిగాదు
చక్కటులు నీవాఁడితే సారెకు వినేఁగాని
అక్కరతో మారుమాట లడుగకువయ్యా

చ. 2: సారె నీతో నవ్వఁగాను చప్పనవునో వుప్పనవునో
తేరకొనని మనసు తిద్దుకోరాదు
కేరి నీవు నవ్వితేను కిమ్ములఁ జూచేఁగాని
ఆరయ నన్నుఁ గలుపే వంతయేఁటికయ్యా

చ. 3: నిన్ను బాసగొనఁగాను నిలుపుదువోమరి
సన్నలఁ దోతువో అంతసాధించనేల
యెన్నఁగ నన్నుఁ గూడితి విదిగో శ్రీవెంకటేశ
వెన్నవంటి నయముతో వేఁడుకోనేలయ్యా

రేకు: 0246-3 ముఖారి సంపుటం: 08-273

పల్లవి: ఎవ్వరి కెవ్వరి చుట్టా లేమి బూమెలు సేసేవు
రవ్వల నాఁడు బుద్ధులు రండూ రెండే

చ. 1: కన్నెల అలుక దీర్చి కాఁగిలించఁ బెట్టఁగాను
చన్నులుఁ జన్నులుఁ దాఁకి చప్పుడాయను
యెన్నికఁ గపటములు యెదలోనివి మాన్పేవా
సన్నల సవతులైతే జాతివైరాలు

చ. 2: మానినుల నిద్దరిని మాటలాడించఁగాను
తేనెలుఁ దేనెలు సోఁకి తియ్య నాయను
నానిన వెంగేల వాఁడినాఁటినవి మానిపేవా
పూనిన వరుసవంతు పొరపొచ్చాలు

చ. 3: కూడిన నీసతులనుఁ గూచుండఁ బెట్టుకోఁగా
తోడులు నీడలు నొక్క దోమటాయను
వాడిక పిన్నపెద్దల వావి నీవు వద్దనేవా
యీడుతో శ్రీవెంకటేశ కుందులు

రేకు: 0246-4 శ్రీరాగం సంపుటం: 08-274

పల్లవి: ఎరుఁగుదుము నీ నాయా లేల చెప్పేవు
వొరిమె గలవాఁడవు వూరకుఁడ రాదా

చ. 1: మొగమోట గలవారు మోహించిన సతులకు
తగవు చెప్పేరా తప్పకుండాను
మగఁడ వై తేనేమి మచ్చికగలచోటికి
తెగెవా పరులకైతే దీకొందువుగాక

చ. 2: చుట్టపుఁ బొందైనవారు చూచి చూచి సవతుల
యెట్టయినా వున్నట్టే యేలాడేరు
దిట్ట వైతేనేమి నీతీరుకు వచ్చేవారిఁ జే
పట్టవా వింతవారైతే భ్రమయింతువుగాక

చ. 3: కడు వేడుకకాండ్లు గలిగినట్టె ధర్మము
నడుపేరా శ్రీవెంకటనాయక నేఁడు
అడరి నన్నుఁ గూడితి వాపెనుఁ గొంతమాత్రము
విడిచేవా యిది నీ వేసా లింతేకాక

రేకు: 0246-5 సాళంగనాట సంపుటం: 08-275

పల్లవి: ఇంకాఁ జదువవయ్య యిటువంటివి
లంకెలాయ నీవిద్య లావరివి నైతివి

చ. 1: పెదవిపై సుద్దులు ప్రియములు బద్దులు
యెదుగాఁ జదివితివి యిపుడు నీవు
వదరు సతులు నీతో(నీతో)వాదించే వారెవ్వరు
తుదకెక్కె నీవిద్య దొడ్డవాఁడ వైతివి

చ. 2: మంతనపు మంత్రాలు మంకుగోరి యంత్రాలు
యింతగా నేరుచుకొంటి విపుడు నీవు
జంతల సతుల నిన్ను సాధించే వారెవ్వరు
దొంతినున్నది నీవిద్య దొడ్డవాఁడ వైతివి

చ. 3: అట్టయిన సత్యా లాఅడి జోలినిత్యాలు
యిట్టివె నేరుచుకొంటి విపుడు నీవు
గట్టిగా శ్రీవెంకటేశ కాఁగిలించితివి నన్ను
తొట్టెను నీవిద్యలె దొడ్డవాడవైతివి

రేకు: 0246-6 దేసాళం సంపుటం: 08-276

పల్లవి: మావంటివారి దీవెన మరి యేకాలము గద్దు
భావించి విచ్చనవిడి బతుకఁగదయ్యా

చ. 1: వెలలేని వలపులు వేమారు గొనఁగాను
లలియెత్తితమకము లాభఁమాయను
పలచని వద్ది(ట్టి?)శిగ్గు పదారువేలకుఁ దారె
బలిమి నీకఁ గోటికిఁ బడిగెత్తవయ్యా

చ. 2: చదరపు సరసాలు చాలుమూలనడవఁగా
గుదిగొన్న నగవు లగ్గువ లాయను
అదిగో పట్టపుదేవు లారడి పంతముచేరె
పదరక సవరాజ్యపట్ట మేలవయ్యా

చ. 3: పాయపు తరితీపుల పంటలెల్లఁ బండఁగాను
చాయల రతిభోగాలు సదరమాయ
యీయెడ శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
లాయపుటింతుల పొఁజులనుఁ గూర్చవయ్యా

రేకు: 0247-1 నాదరామక్రియ సంపుటం: 08-277

పల్లవి: ఊరకుండవయ్యా వుడివోవు వలపులు
కోరుకొంటా వున్నదాన గొప్పలు నీకన్నులు

చ. 1: చనవు నీవిచ్చితివి చలము లన్నియుఁ దేరె
మనసొక్కటాయ నీతో మారుమాటేల
ననిచివుందాన నిదె నన్ను నేల రేఁచేవు
వినుకొంటానున్నదాన వింతలు నీసుద్దులు

చ. 2: ప్రియములు చెప్పితివి పెనఁగితివిందాఁక
నయమాయ సరసాలు నవ్వులంతేల
క్రియ నే నెఱుఁగుదును కెరలించ కిఁక నీవు
జయము చేకొంటి నిదె చక్కనె నీమాటలు

చ. 3: తెలిపితివి బుద్దులు దిష్టముగాఁ గూడితివి
వెలసె నీమోములు వెరపు లేల
యెలమి శ్రీ వెంకటేశ యెచ్చరించకు గోరను
తలపోయుచున్నదాన తగు నీగుణములు

రేకు: 0247-2 మధ్యమావతి సంపుటం: 08-278

పల్లవి: దానికేమి యిప్పుడేమి తప్పిపోయీనా
వూని యెదురుకట్లనె వున్నాఁడుగా

చ. 1: అలసిన రతివేళ ఆడినట్టి యీమాటలు
తలఁచుకొమ్మనమో తనుఁ దానె
పిలిపించి నాతోఁ దాను పెనఁగిన పెనఁగులు
తెలిపే లేవె యింకా తెరమరఁగుననె

చ. 2: చిడుముడి మంచముపై చెనకిన చెనకులు
తడవి చూచుకొమ్మనవె తన మేననె
వుడివోక తారుమారై వునిచిన వుంగరాలు
తడఁబడీ వేళ్లను తానెరఁగఁడా

చ. 3: కొత్తగా నాకాఁగిటిలో కూడినట్టి కూటములు
యెత్తి యిమ్మనవె యీవేళనె
హత్తెను శ్రీ వెంకటేశుఁ డట్టె తానన్ను
తత్తరపు దమకము తనివి నొందీనా

రేకు: 0247-3 శ్రీరాగం సంపుటం: 08-279

పల్లవి: చిన్నఁబోయివుందాననా చేరి నీతో నలిగేనా
సన్నల నిన్నుఁ జింతించే జాడ లింతేకాక

చ. 1: నెక్కొన్న వేడుకలకు నీవు గలవు మాకు
చెక్కు చేతితోడుతను చింత మాకేల
వక్కణతోఁ గన్నుఁ గలువలు గలమోముతోడ
గుక్కక తామెర చేయిఁ గూర్చితిఁగాక

చ. 2: దట్టమై నామతిలోన తగు నీరూపెడయదు
వట్టి విరహాన వసివాడనేల
పట్టి తనువల్లిగాన పన్నీరు గంద మందుకు
పెట్టి పొరలించె మెత్తి పెద్దసేసేఁగాక

చ. 3: కాఁగిట నీవుగలవు కమ్మఁజెమటల రతి
నాఁగి యాఁగి సారె సారె నలయనేలా
కాఁగిటఁ గూడితి శ్రీవెంకటేశ నీ యలపార్చ
వేఁగక నిట్టూరుపుల విసరేఁగాక

రేకు: 0247-4 రామక్రియ సంపుటం: 08-280

పల్లవి: అటుగాన యెంచనేల ఆవలివారి భాగ్యము
యెటులైనా నీపట్టు కెప్పుడును మంచిదే

చ. 1: తప్పు నీయందున్నదా తగవరి వన్నిటాను
చొప్ప లెత్త బోతేను సూటికిరాదు
కప్పురపు చవిలోన కారములుండునా
కప్పిన విరహులకే కాఁక లౌఁగాదో

చ. 2: సరవి నీవెరుఁగవా సర్వజ్ఞుఁడవు నీవు
కెరలించఁ బోతేను కిందుపడును
వరుసలఁ బూవులకు వాఁడి తొల్లివున్నాదా
విరసపువేళనే వెల్లివి రౌఁగాదో

చ. 3: చేకొననివాఁడవా శ్రీ వెంకటేశుఁడవు
కాకుసేయఁ బోతేను గరివడును
యీకడ చంద్రుడు వెట్టా యేలితివి నన్ను నిట్టే
పైకొని అలిగేవారి పాలిటికి అవుఁగాదో

రేకు: 0247-5 ముఖారి సంపుటం: 08-281

పల్లవి: ఏఁటిమాఁట లిటువంటి వేలాడేవు
గాఁటమై యేకతమైతేఁ గాదనేనా

చ. 1: చెప్పినట్టు సేతుఁగాక చిత్తములోపలి సిగ్గు
వొప్పగించి నీముందర నూరకుండేనా
కుప్పలైన కుచములు కొండలవలె నుండఁగా
తప్పక నాపయ్యదను దాఁచుకుందునా

చ. 2: సమ్మతించి వుందుఁగాక జవ్వనపు నాగుట్టు
కుమ్మరించి నాకు నాకె కొనవేతునా
తెమ్మలైన పిరుఁదు మరుతేరువలె నుండఁగాను
నెమ్మది నీకెదురుగా నిలుచుందునా

చ. 3: కూడితివి మెత్తుఁగాక కొనగోరి చేఁతలను
వేడుకకాని తనమును వెలివేతునా
యీడనె శ్రీ వెంకటేశ యెనసితి మిద్దరము
వాడిక వలపు లింక వడియఁ గట్టుదునా

రేకు: 0247-6 ఆహిరి సంపుటం: 08-282

పల్లవి: నెలంతఁ బాసితే నీకు నిమిష మేఁడవును
యెలమి దగ్గరివుంటే నేఁడు నిమిషమవును

చ. 1: కన్నులఁ బెట్టినయట్టి కాటుకచూపులు నీపై
పన్ని చెలి చల్లితేనె పగలు రేయౌ
వున్నతి పద్మరాగాల వుంగరాలచేతినిన్ను
తిన్నఁగా నంటితే నట్టె తెల్లవారును

చ. 2: వీడెపు మోవిసెలవి వేడుకతో నవ్వితేను
నీడలఁ గాసిన వెల్లా నిండు వన్నెలౌ
పొడితో యించుకవడి ప్రణయకలహమయితే
యేడచూచినా నదె యెండగానును

చ. 3: శ్రీవెంకటేశ యిట్టె చెలి నిన్నుఁగూడెఁగాన
సోవలుగా మోవిమీఁదఁ జుక్కలు నిండె
వేవేలు రతులచేత వెలయఁగా దిక్కులెల్ల
కావిరి మాని హృదయకమలము నించెను

రేకు: 0248-1 శుద్ధవసంతం సంపుటం: 08-283

పల్లవి: సంగడినున్నవారము సాకిరి చెప్పకపోదు
యింగిత మెరిఁగి నీవె యియ్యకోవయ్యా

చ. 1: వనిత చూచినదెంత వడి నీవేల లోఁగేవు
చెనకినదెంత నీవు సేసేదెంత
వినవయ్యా ఆపెమాట వేఁడుకొనె నింతగద్దా
యెనసి ఆడినమాట కియ్యకోవయ్యా

చ. 2: ఆపె నవ్వినది నవ్వు అప్పటి నీమతి దవ్వు
పోపో మరునియేటు పూచిన పువ్వు
వోపవయ్యా చెలి నిన్ను వొరసి చన్నులనూఁది
తీపులమోవికతలు తెలసుకోవయ్యా

చ. 3: పిలిచిన పిలుపడ బిగిసే నీగతి యేడ
వలపిల కిదా జాడ వట్టిది నీడ
యెలమి శ్రీవెంకటేశ యింతి నిన్ను నిదె కూడె
పలుకుఁ బంతాలు నీ కెప్పటివలెనయ్యా

రేకు: 0248-2 రామక్రియ సంపుటం: 08-284

పల్లవి: బల్లిదుఁడవైతివి బతుకవయ్యా
పొల్లలేకుండా నిన్నుఁ బొగడేమయ్యా

చ. 1: యెక్కడి కెక్కడి బుద్ధులెవ్వరు చెప్పరయ్య
చిక్కి నీకుఁగాఁగ ఆపె చెప్పేఁగాక
తక్కక యెవ్వరు జాణతనాలు నేరిపరయ్య
నెక్కొన్న చుట్టరికాన నేరిపెఁగాక

చ. 2: తతి నెవ్వరి కెవ్వరు దాయిదండయ్యేరయ్య
అతివ నీకుఁగాఁగా నాయఁగాక
రతుల కెవ్వరిపాటి రమ్మని పిలిచేరయ్య
గతియైవుండె తానె గక్కునఁ బిలిచెఁగాక

చ. 3: కందువతో నెవ్వరు కాఁగిలించుకొనేరయ్య
అంది నిన్నుఁగాఁగా ఆపె అలమెఁగాక
యిందులో శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
విందువలె తానూ నీవెంటవచ్చెఁగాక

రేకు: 0248-3 భైరవి సంపుటం: 08-285

పల్లవి: పూవువంటిదానను పూఁపవంటిది వయసు
సావదానమున నీసంసారఫలము

చ. 1: నీవు బోధించినయట్టి నిజములె నానిజము
భావించి నీవు నడపె పంతము నాది
లావుల నీమన్నన కొలఁదుల వారమువేము
వోపసేసి మమ్ము నేల వొరసేవువిభుఁడా

చ. 2: చక్కఁగా నీవు నడపె సమేళము నాసలిగె
చెక్కుల నీవు వొత్తిన చిన్న లివిగో
పక్కన నీవు గప్పినపచ్చడము నామీఁదిది
తెక్కుల నన్నెంత కెంత తెలిపేవువిభుఁడా

చ. 3: కాఁగిట నీవుగూడిన గరిమ నేఁ బొగడేది
మాఁగిన నీమోవితేనె మావిందులు
రాఁగిన సంతోసపు రతుల నన్నేలితివి
చేఁగదేరించఁగ నేల శ్రీ వెంకటవిభుఁడా

రేకు: 0248-4 సాళంగం సంపుటం: 08-286

పల్లవి: అనవలసేమైనా నిన్నంటిఁగాక
మునుకొని నే నీకు మొక్కకుండేనా

చ. 1: సంతతము నందరును జయలువెట్టఁగ నీకు
కాంత లిఁక వేరె నిన్నుఁ గాదనేరా
వింతగా ఆవులు నీవెంటవెంటఁ దిరుగఁగా
మంతనాన గోపికలు మరుగకుండేరా

చ. 2: పచ్చి పిల్లఁగోవిలోన బలు రాగాలు రాఁగాను
రచ్చకెక్కే సతులెల్ల రాకుండేరా
గచ్చులసిరి మోహాన కమలాన వేయఁగాను
తచ్చి రుక్మిణి పువ్వులదండ వేయకుండునా

చ. 3: నిండు జలధులనీరు నిన్నుం గంటెఁ బేరఁగాను
అండ మావలపు పేరే దదియెంత
కొండల శ్రీ వెంకటేశ కూడితిమి నేము నిట్టె
పుండనుండఁదరితీపు (ల?) రూరకుండీనా

రేకు: 0248-5 సామంతం సంపుటం: 08-287

పల్లవి: దొరలకె కానిలేదు తుంటతనము
జరసి నీతో నవ్వ సరిదాననా

చ. 1: పతినలు వలుకఁగఁ బలుమారుఁగొసరఁగ
కతగరిచినవారుగాని నేరరు
మతిఁ బెట్టుకొని సారె మమ్మునే నమ్మించేవు
చతురతఁ బెనఁగ నీసరిదాననా

చ. 2: బడిబడిఁ దిరుగఁగ పైపై బుజ్జగించఁగ
గడుసులయినవారుగాని నేరరు
అడియాసలు వుట్టించి ఆయము లేలంటేవు
సడిఁబెట్టి నిన్నుదూర సరిదాననా

చ. 3: రాయడిరతిఁ బెనఁగ రారాఁపులకు నోప
కాయాటులయినవారుగాని నేరరు
యీయెడ శ్రీవెంకటేశ యిటునన్నుఁ గూడితివి
చాయలు బోధించ నీకు సరిదాననా

రేకు: 0248-6 సౌరాష్టం సంపుటం: 08-288

పల్లవి: ఏల సాకిరి గోరేరు యిద్దరు నన్ను
నాలి నేఁ జూచినప్పుడె నవ్వుతానె వుంటిరి

చ. 1: మతకా లెరఁగఁగాని మగువ నీమోముచూచి
చతురతలు మెరసి జంకించెను
రతికి దగ్గరఁగాని రహస్యాన నీవుండి
మితిమీరి కొనగోరు మీటుకొంటివి

చ. 2: తగవులు చెప్పఁగాని తరుణి నీవన్నందుకు
వొగరుఁజూపుల పెదవులఁ దిట్టెను
మిగిలినవేవోకాని మీదమిక్కిలి నీవైతె
జిగిఁ బంతములు చూపి చెలఁగితివి

చ. 3: యీరీతి వేరుసేయఁగా నింతి శ్రీవెంకటేశ్వర
గారవించి నిన్నుఁ గూడి కాఁగిలించెను
తేరెఁగాని నీవల్లనె తేటతెల్లమై నేఁడు
మేరతోనె పంతమిచ్చి మేకొంటివి

రేకు: 0249-1 శ్రీరాగం సంపుటం: 08-289

పల్లవి: గొల్లెతలై తేనె కొఱతా
పల్లదపు నీచే పడిరిగాకా

చ. 1: కంచుఁబదనుల కాంతల నేఁడిట్టె
వంచుకొన నీకువసమా
పంచబాణముల దారికి లోనై
ముంచి చేతులెత్తి మొక్కిరిగాకా

చ. 2: కోడెవయసు కొమెరలేమల
వాడికెకుఁ దేనువసమా
కూడఁగూడఁ బిల్లఁగోవి రాగాలకు
వాడవారు వెంటవచ్చిరిగాకా

చ. 3: కొలఁదిలేనట్టి గుబ్బెతలనెల్ల
వలపించుకొనవసమా
యెలమి శ్రీవెంకటేశ కూడఁగాను
సొలసి చనవుచూపరిగాకా

రేకు: 0249-2 శుద్ధవసంతం సంపుటం: 08-290

పల్లవి: పెనఁగకువే యిఁక ప్రియునితో నీవింత
మనసు లెఱుఁగుదుము మరి మాటలేలే

చ. 1: అలుకదేరిచి పతి అట్టె పైకొనఁగాను
చలమరితనమేల సతులకును
జలజలఁ జెమరించె జాజుకొనఁ బులకించె
చెలఁగి వేగి మిగిలి చీఁకటులు గలవా

చ. 2: నవ్వు నవ్వి యీతఁడె పనుపులు సేయఁగాను
రవ్వలఁ బెట్టఁగనేలే రామలకును
జవ్వనపు కళలుబ్బె సమ్మతులు మతికబ్బె
పువ్వులలోపలిపొల్ల పూఁచిచెప్పఁగలవా

చ. 3: శ్రీవెంకటేశ్వరుఁడు చెక్కునొక్కి వేఁడుకోఁగా
వేవేలు మాఁటలేలే యీవెలఁదులకు
నీవాతనిఁ గూడితివి నీటులునుఁ జూపితివి
చేవల చిగురు నాఁడె సేసిపెట్టఁగలవా

రేకు: 0249-3 కొండమలహరి సంపుటం: 08-291

పల్లవి: అమ్మరొ యెంతగడుసరి వదేమె నీవు వల
పమ్మకతొల్లె కొనేవు అదేమె నీవూ

చ. 1: మలసి విభుఁడు నీతో మాటలాడకతొల్లె
అలిగి యెగ్గులువట్టే వదేమె నీవూ
కలసి యాతఁడు నిన్నుఁ గరఁగించకతొల్లె
అలసి వుస్సురనేవు అదేమె నీవూ

చ. 2: చక్కఁగాను నీపతి సరసమాడకతొల్లె
అక్కడజీరె ననేవు అదేమె నీవు
తక్కక యాతఁడు నీకు తమ్ముల మిడకతొల్లె
అక్కట కారమనేవు అదేమె నీవూ

చ. 3: యెనసె శ్రీవెంకటేశుఁ డిప్పుడు యింతకతొల్లె
అనుకొనే వాలనంటా నదేమె నీవూ
చెనకితి వితఁడు పైఁ జేయి చాఁచకతొల్లె
అనలుఁగొనలకెక్కే వదేమె నీవూ

రేకు: 0249-4 మంగళకౌశిక సంపుటం: 08-292

పల్లవి: ఎందాఁకాఁజూతుము నే మిటువంటి యాగడాలు
అందినచెలులము నే మాడకుండరాదు

చ. 1: వువిద తాఁ బెట్టె తొంటి వుంగర మిమ్మంటేను
యివల నింతదొరవు యేల తిట్టేవు
జవళిగన్నీరుతోడ చలపట్టుకుండఁగాను
తవిలి నీకింకా నేల దయపుట్టదు

చ. 2: నీలాగులుచూచి యాపె నీబాస వొప్పగించితే
కోలుముందుగా నేల కొంగువట్టేవు
తూలెటినెరులతోడ దోసిలించి మొక్కఁగాను
పాలుపడి దోసానకు భయమేలవుట్టదు

చ. 3: పడఁతి నీగుణాలకు పయ్యద బిగించుకొంటే
సడిఁబెట్టి నీవేల చన్నులంటేవు
తొడరి శ్రీవెంకటేశ దొమ్మిఁగలసితి వాపె
జడిసి గోరంటినా నెచ్చరి కేలపట్టదు

రేకు: 0249-5 వరాళి సంపుటం: 08-293

పల్లవి: వారివారిభాగ్యము వలపుల కొలఁది
నేరుపు గలిగితేను నిన్నమాపే రేపూ

చ. 1: కనుసన్న నాపె నిన్నుఁ గరఁగించఁ జూచితేను
యెనసి అవె(వ?)మ్ముకలైతే నేమిసేసును
వెనుకొని అవియెల్ల విరహవేళల నింతె
మన లొక్కటైతె తామరపూజలవును

చ. 2: వుదవి చన్నులనొత్తి వూరడించఁ జూచితేను
యిమో పిడిగుండ్లయితే నేమిసేసును
పవళించి అవి రతిపంతమాడేవేళనింతె
కవగూడితేను జక్కవరూపులవును

చ. 3: పెదవులెత్తి చెలియ ప్రియము చెప్పఁజూచితే
యెదురుగాలములైతే నేమిసేసును
కదియనివేళ నింతెకాని శ్రీవెంకటేశుఁడ
యిదె కూడితిరి యివె యిఁక తేనెలవును

రేకు: 0249-6 హిందోళవసంతం సంపుటం: 08-294

పల్లవి: ఏఁటికి వేగిరపడే వింతలో నీవు
మేఁటిరమణుఁడ నిన్నె మెప్పించీఁగాకా

చ. 1: మచ్చికసేసినచెలి మాటలాడకమానీనా
దిచ్చరి నీతలఁపులు దెలిసీఁగాక
యిచ్చకము నీవాడఁగా నియ్యకొనకుండీనా
కచ్చుపెట్టి కొంతగొంత కైకొనీఁగాక

చ. 2: దగ్గరి వచ్చినచెలి తప్పకచూడకుండీనా
సిగ్గులు నీపైఁ గొంత చిమ్మీఁగాక
వొగ్గి విడెమిచ్చినాపె వోపననీనా యిఁక
నిగ్గులవలపు నీకు నేరిపీఁగాక

చ. 3: చేకొని కూడినమీఁద సేవసేయకమానీనా
యీకడ ముందువెనక లెంచీఁగాక
శ్రీకాంతనేలితివి శ్రీవెంకటేశ్వర నేఁడు
మాకొరకు నిన్నాపె సమ్మతింపించీఁగాక

రేకు: 0250-1 ముఖారి సంపుటం: 08-295

పల్లవి: ఊరకుండుమనవే వొక్కటొక్కటే రేచక
తేరకత్తె నైతేనేమి తిద్దుబడి తనదే

చ. 1: తగిన నాచెలువము తనకె శలవాయ
పొగడఁగవలెనా పొరుగులను
నగిన నానగవులు ననుపులకునువచ్చె
మగనాలనైతేనేమి మనువెల్లాఁ దనదే

చ. 2: పట్టిన నాపంతమిది పైపైఁ దనలోనాయ
అట్టె నన్నేల మెచ్చినె అందరితోను
తిట్టిన నాతిట్టులివి దీవెనలై సరిదాఁకె
చుట్టమనై తేనేమి సొమ్మయితిఁ దనకే

చ. 3: యిల్లిదె నాజవ్వనము యెప్పుడూఁ దనకెఅబ్బె
వెల్లవిరి సేయనేలె వీధివీధిని
చెల్లుబడితోఁ దానె శ్రీవెంకటేశుఁడుగూడె
గొల్లదాననైతేనేమి కొలుమొల్లాఁ దనదే

రేకు: 0250-2 సామంతం సంపుటం: 08-296

పల్లవి: ఉండరే యెక్కడిసుద్ది వొడఁబరచకురే
యెండలెల్ల నీడలాయ నిద్దరికి మాకు

చ. 1: కూరిమిలేనిపొందు కొనలెటువలెసాగు
పేరులేని పిలుపులు ప్రియమెట్టౌను
తారుకాణించేనంటే తానాడ నేనీడ
మారుత్తరమియ్యరాదు మనసులేయెరుఁగు

చ. 2: నగవురానిమేలము నయమెటువలెనౌను
మొగముచూడని మొక్కు మోచేదేడ
తగులఁబెట్టేనంటే తతిలేదు మితిలేదు
పగటు లాడఁగరాదు పట్టినదేపంతము

చ. 3: పలచఁగానిసిగ్గులు పనికెటువలెవచ్చు
చలివాయనివలపు సాదించేదెట్టు
యెలమి శ్రీవెంకటేశుఁ డీడనుండె నన్నుఁగూడె
వెలపరచఁగరాదు వేడుకలేనిండెను

రేకు: 0250-3 ధన్నాశి సంపుటం: 08-297

పల్లవి: మాపుదాఁకాఁ గొసరిన మాను మానే రాయి రాయే
దాపుదండ నీవు నాకు తగవు నీచేతిది

చ. 1: మొక్కలపు మాటలెల్ల మొన్ననె ఆడితిఁగాని
పుక్కటయిన నిన్ను నేనుఁ బొగడ నేఁడూ
వుక్కువంటి గుండెలోన లక్కవంటి మనసిదే
దక్కియున్నదాన నీకు ధర్మము నీచేతిది

చ. 2: అంగడిఁ బెట్టినచేత లప్పుడెపెట్టితిఁగాని
ముంగిట నీసుద్దులెల్ల మూసేనిపుడు
యెంగిలిసెలవితోన రంగువంటిమనసిదే
పొంగివున్నదాన నీకు పుణ్యము నీచేతిది

చ. 3: లోచి నిన్నుఁ గూడేది లోననే కూడితిఁగాని
యేచి నిన్నుఁగూడేను యీచాయ నేను
చేచేత నీదేవులను శ్రీవెంకటేశుఁడవు
తాచియున్నదాన దయ దలఁపు నీచేతిది

రేకు: 0250-4 కేదారగౌళ సంపుటం: 08-298

పల్లవి: నేఁడుగొత్తలా తన నేరుపులివి
వాఁడిపట్టి ముంటికొన వాదులడిచేనా

చ. 1: కానిమ్మంటినే యిఁక గాదని యెదురాడనే
తానాడినదే మాట తప్పులులేవు
రానీవే యందుకేమి రతిఁ గరఁగించుఁ దాను
నానఁబెట్టీగొడ్డలి సన్నల నింతయేఁటికే

చ. 2: బాసయిచ్చితినే తనపంతము చెల్లించేనే
సేసినదేచేఁత మరి చిక్కులులేవు
ఆసపడనీవె తాను అంబుధులు పేరఁబెట్టు
కోసి రాతనారొలిచి కూరిము లింతేఁటికే

చ. 3: కూడితినే కాఁగిటను గురుతులు నించితినే
ఆడనీవే సరసాలు అంకెలాయనే
వేడుకవెలవెట్టె శ్రీ వెంకటేశ్వరుఁడు తాను
వీడెమిచ్చి బుజ్జగించీ వేసాలిఁకనేఁటికే

రేకు: 0250-5 ముఖారి సంపుటం: 08-299

పల్లవి: ఏఁటికి బాఁతిపడేవు యేల మమ్ముఁ జెనకేవు
కాటుకవన్నెచూపులు కలవి మాజాబులు

చ. 1: కన్నులె గొప్పలుగాని కడుఁ గొంచపు మొకము
యెన్నఁగ మాచక్కఁదన మేమున్నది
వున్నతాలె కుచములు వొంటినడుము సన్నము
యెన్ని చూడఁబోతేను యిదివో మాసొబగు

చ. 2: బారెఁడె కురులుగాని చేరఁడేసి పాదాలు
యీరీతిదె మాగుట్టు యేమున్నది
నోరు మాణిక్యాలగని నొక్కితేఁ దేనెపెదవి
పేరుకొనఁబోతేను పెలుచు మాగుణము

చ. 3: చేతులె మెత్తనగాని చిమ్ము గోళ్ళు కఠినాలు
యేతులు నెమ్మెలు మాయందేమున్నది
ఘాతల శ్రీవెంకటేశ కలసితి విటునన్ను
నీతి విచారించుకొంటే నిండెను నీమన్ననే

రేకు: 0250-6 దేశా(సా)క్షి సంపుటం: 08-300

పల్లవి: ఇంతి నీసొమ్ముగాదా యెరవున్నదా
వింతవారివలె నేము వెంగె మాడేమా

చ. 1: జగడాలన్నియుఁ దేరె సతి నీతోసంతమాయ
మగుడి మగుడి నీతో మాటలింకానా
తగవరి వవుదువు తప్పులు నీయందు లేవు
మొగము చూచి చూచి మొక్కు లింకానా

చ. 2: పనులెల్లాఁ జక్కనాయ పదివేలువచ్చె నేఁడు
చెనకి చెనకి నీతో చేఁత లింకానా
వెనకటి వెంతలేవు వేడుకకాఁడవు నీవు
కొనచూపులనుఁ జూచి కొసరు లింకానా

చ. 3: కోరికలు గొనసాగె కూటములు మీకు నబ్బె
సారె సారెఁ గొరేటి చల మింకానా
యీరీతి శ్రీ వెంకటేశ యిచ్చకుఁడ వన్నిటాను
చేరి నీవు నవ్వఁగాను సిగ్గు లింకానా

రేకు: 0251-1 దేసాక్షి సం: 09-001

పల్లవి: దగ్గరితె మొగచాటు దువ్వులు నుంటేఁ జవి
నిగ్గుల యీరెండూను నీవొళ్లనే కంటినే

చ. 1: చెలియ పతిఁ గానక చింతతో నుండి ఆతఁడే
పిలువఁగా యిప్పుడైతే బిగిసేవే
కలయ నంటా దూరి గక్కనఁ జెయి వట్టితే
మొలకనవ్వులతోడ ములిగేవే

చ. 2: అప్పుడైతే యెడమాట లాడించి నాయకుఁడు
తప్పక చూచితే నిట్టె తల వంచేవే
వుప్పతించి దూరఁగగానె వొద్దఁ గూచుండి నాతఁడు
పిప్పిగట్టే సిగ్గులతోఁ బెనఁగేవే

చ. 3: చిత్తములోఁ గోరినట్టి శ్రీవెంకటేశ్వరుఁడు
అత్తి నిన్నుఁ గూడితేనె అలసేవే
పొత్తుల మోవితేనెతీపుల సోకించె నితఁడు
బత్తి సేయఁగా నీవు భ్రమసేవే

రేకు: 0251-2 పాడి సం: 09-002

పల్లవి: ఏమే నేవచ్చి యిప్పుడెంత దడ వాయనే
దీమసపుదానవు నేఁ దెమలించఁ గలనా

చ. 1: నిక్కిచూచి నన్నాతఁడు నీవద్దికిఁ బెట్టిపంపె
యెక్కడ నున్నది చిత్తమే మంటివే
కక్కసించి యడిగితే కంట నీరు వెట్టేవు
యెక్కడ గెలవవచ్చు నిటువంటివారిని

చ. 2: వాకిటఁ దా నిలుచుండి వడి నాతో సన్నసేసి
యీకడ నా కిఁక బుద్ధి యేమంటివే
పైకొని కొంగు వట్టితే బలిమి నుసు రనేవు
నీకు నీకే తెలుసునే నెరవాదితనము

చ. 3: యిదిగో శ్రీవెంకటేశుఁ డెచ్చరింపించి నాచేత
యెదుటనె పెనగొనీ నే మనేవే
పొదిగి కలసెఁ దానె పూఁచి నీవు నవ్వేవు
ముదమునఁ బను లెల్ల ముందువెన కాయనే

రేకు: 0251-3 భైరవి సం: 09-003

పల్లవి: ఏమి సేతు నాగుణ మీపాటిది
కామించి వీవుగాఁగాఁ గైకొనేవు గాని

చ. 1: ననుపు నటించఁగానె నంటు నీతో నైతిఁగాని
పెనఁగితేఁ గడుఁ గడు పెలుచ నేను
మనసు నమ్మించఁగానె మారుమాట లాడఁ గాని
ఘనమై మీరి వచ్చితె గబ్బిదాన నేను

చ. 2: సలిగె చెల్లించఁగానె సరుసమాడేఁ గాని
మలసితే నంతకంటె మంకను నేను
చలివాసి నవ్వఁగానె సంతోసించుకొంటిఁ గాని
సొలసి కపటమైతె జూటుదాన నేను

చ. 3: కైవసము గాఁగానె కరఁగి మెచ్చితిఁ గాని
మూవంకలు మెట్టితేనె మొక్కలి నేను
శ్రీవెంకటేశ నీవు చేరి కూడఁగానె కాని
సోవలుగా మొరఁగితే జూజరి నేను

రేకు: 0251-4 లలిత సం: 09-004

పల్లవి: ఆపెనందునో నిన్ను నందునో యీచేఁతలకు
యేపున వూరెల్లా పొందు లింతగాఁ జేసితివి

చ. 1: యిద్దర మేకతమాడె యీవేళ మనవద్ద
గుద్దిరాన నాపె వచ్చి కూచున్నది
దిద్దరాదా అప్పేమైనఁ దీసుకొంటేఁ గనక నీ
విద్దెస సతుల కస మింతగా నిచ్చితివి

చ. 2: లోనికేఁగి నీవు నేను లోలత నవ్వుచుండఁగా
తానువచ్చి నీకుఁబాదము లొత్తీని
సేనగా నియ్యఁగరాదా జీఁతము చిక్కితేఁగన
యీ నెపాన మందెమేళ మింతగాఁ జేసితివి

చ. 3: వోరిచి ముసుఁగు వెట్టు కొగి నిన్నుఁ గూడితేను
పేరున శ్రీవెంకటేశ పిలిచీ నాపె
యీరాదా ఆపె సొమ్ము లెత్తుక వచ్చితేఁగన
యీరీతి చనవు లిచ్చి యింతగాఁ బెంచితివి

రేకు: 0251-5 శ్రీరాగం సం: 09-005

పల్లవి: ఎవ్వరి నే మన లేవు యింతేసికి నోపము
పువ్వునఁ బుట్టినయట్టి పూఁపవంటివాఁడవు

చ. 1: మిక్కిలి నీతో నేను మేరలు మీరిన నైతే
యెక్కడ నెవ్వతె వచ్చి యేమనునో
దక్కితి సారెసారెకుఁ దడవకువయ్య మమ్ము
చిక్కి నీ వందరిపెట్టుఁ జెట్టువంటివాఁడవు

చ. 2: చెనకి నీ బుజముపై చెయి నేను వేసితేను
వనిత యెవ్వతె వచ్చి వంతు వట్టునో
పెనఁగి నీ వాడా నీడాఁ బిలువకువయ్య నన్ను
తనిసి సూదిపిరిఁది తాడువంటివాఁడవు

చ. 3: గుట్టున నిన్నుఁ గూడితి గోర నిన్ను నూఁదితేను
దిట్టయై యెవ్వతె వచ్చి తేరి చూచునో
పట్టి శ్రీ వెంకటేశ్వర భ్రమలఁ బెట్టకువయ్య
బట్టబయటిపెసరుఁబంటవంటివాఁడవు

రేకు: 0251-6 సౌరాష్ట్రం సం: 09-006

పల్లవి: అలిగేదె సహజము ఆఁడువారికి
మలసి నీవె తిద్దుక మన్నించవయ్యా

చ. 1: పలుకక నే నెంత పంతాన నీతో నుండిన
తలఁపు నీపైదెకాన తప్పులేదు
చెలఁగి మందెమేళాన చెయివట్టి తీసినాను
యెలమి నీవూడిగాన కెగ్గు లేదు

చ. 2: మల్లాడి కోపముతోడ మంచము దిగకుండిన
తొల్లె నీకాలు దొక్కితి దోసము లేదు
పల్లదాన వెంగెమాడి పకపక నవ్వినాను
వెల్లవిరి నాపనికి వెగటు లేదు

చ. 3: కావరించి నిన్నుఁగూడి గర్వముతో నుండినాను
కైవసముయితిఁగాన కడమ రేదు
శ్రీ వెంకటేశ నన్ను జిత్తగించి యేలితివి
వేవేలు భోగములకు వేసట లేదు

రేకు: 0252-1 రామక్రియ సం: 09-007

పల్లవి: కానీవయ్య దానికేమి కాంత యవివేకి గాదు
సానఁబట్టి చూచీని సరిత లన్నియును

చ. 1: మంతనాన నీతోను మాటలాడినంతలోనె
పంతము దప్పదుగా పడఁతికిని
సంతసాన నిన్నుఁజూచి సరసమాడినంతలో
దొంతుల కురుకఁడుగా దొరకొని మరుఁడు

చ. 2: వరు సెరిఁగి కాచుక వద్దఁ గూచుండి నంతలో
దొరతనము దప్పదు తొయ్యలికిని
విరసములేక నీకు విడె మిచ్చినంతలోనె
కరకరిఁ బెట్టవుగా కప్పురపుటుండలు

చ. 3: ననుపుసేసుక నీతో నవ్వి నంతలోననె
తన నేరుపు దప్పదు తరుణికిని
యెనసె శ్రీ వెంకటేశ యిటు నీవాదరించఁగా
పెనపులఁ బెట్టవుగా ప్రేమపువలపులు

రేకు:	0252-2 కాంబోది సం:	09-008

పల్లవి:	చెప్పినట్టె పతిపంపు సేతువు గాక
	చిప్పిలుఁ జెమటలతో సిగ్గు లేఁటికే

చ. 1:	చెక్కు చేతఁ బెట్టుకోగా సెలవుల నవ్వు నీకుఁ
	జిక్కె నేఁడు మరి వేరె చింత యేఁటికే
	దక్కె నీకు వలపులు దండ నున్నాఁడు విభుఁడు
	మొక్కలపు వెరగుతో మోన మేఁటికే

చ. 2:	నిట్టూర్పు నించఁగాను నిక్కుఁగుచములమీఁద
	యిట్టి పులకలు నిండె నేఁకటేఁటికే
	జట్టిగొనె వేడుకలు చనవు లాతఁడె యిచ్చె
	వట్టి అలుకతోఁ దలవంచ నేఁటికే

చ. 3:	పానుపుపై నుండఁగానె బలిమి శ్రీవెంకటేశుఁ
	డానుక నిన్నుఁ గలసె నార డేఁటికే
	నీనోము లీడేరె నీమొగఁడు నిన్ను మెచ్చె
	కోనల బొమ్మజంకెన కొస రేఁటికే

రేకు: 0252-3 బౌళి సం: 09-009

పల్లవి: మానుసులకుఁ దరమా మరి యివి నీకె కాక
ఆనుకొని సేసే వీ దయ్యపు చేఁతలు

చ. 1: నిండు గొల్లతనమున నీకె తగునయ్య
కొండ యెత్తినట్టి గొడగుల నీడలు
గండపురాకాసివేఁటకాఁడవు నీ కమరును
దుండగపుటూరజాతురబోనాలు

చ. 2: యిల దేవపిండమవయ్యిన నీ యాటలయ్య
బలుసముద్రాలమీఁది పాటపరువు
అలరు కాముకుఁడవుఅయిన నీకుఁ జెల్లునయ్య
చలమరి బ్రహ్మతోడి చయ్యాటాలు

చ. 3: కొయ్యరాచవాఁడవు కోరి నీకు నబ్బె నయ్య
పుయ్యక దూలచుట్టాల పోరాటాలు
యియ్యెడ శ్రీవెంకటేశ యేలితి పదారువేల
నెయ్యాన నన్నుఁ గూడితి నిలిచెఁ బైకొసరు

రేకు: 0252-4 హిజ్జిజి సం: 09-010

పల్లవి: ఏమి చూచే వాపెదిక్కు యెందాఁకాను
నేమసేసేపనిగాదు నెయ్యపు యీవేళను

చ. 1: చెలి నీతో నవ్వు నవ్వి చెక్కు లెల్లాఁ జెమరించె
వలిపె పావడఁ దుడువఁగరాదా
నిలువెల్లఁ బులకించె నీతో మంతనమాడి
చలివాయఁ బచ్చడ మిచ్చుటఁ గప్పరాదా

చ. 2: కాంత నీపదాలు వాడి కడు దప్పిగొనె నిదె
యింతట మోవితేనియ లియ్యరాదా
చెంత నీపాదా లొత్తి సిగ్గునఁ గుమ్మడి జారె
కాంతుఁడవు యింతటను కాఁగిలించరాదా

చ. 3: వనిత నీమోము చూచి వసివాడు వాడీ నదె
వెనుకొని నీవు తెర వేయరాదా
ఘనుఁడ శ్రీ వెంకటేశ కలసితి వింతలోనె
ననిచె నలమేల్మంగ నంటు సేయరాదా

రేకు: 0252-5 భైరవి సం: 09-011

పల్లవి: నీవు వాఁటె దూర నేలె నిన్ను నంటినకతాన
యీవిధిఁ బొందెను నిన్ను నివి దూరుఁగాక

చ. 1: కప్పుర మేమి సేసునె కాంతుఁడు రాకుండఁగాను
అప్పటివేళనె కారమాయఁగాక
తప్పుగద్దా గందానకు తాపాన నీ వుండఁగాను
వుప్పతిల్లి దానికె వుడుకెత్తెఁగాక

చ. 2: విరులకు నేర మేదె విరహంపువేళ నీకు
గరిమ వేఁడికి నొడిగట్టెఁగాక
మరుఁడు పగవాఁడా నీమనసులో కాఁక సోఁకి
తిరమై అనంగుఁ డంటా తిట్టువడెఁగాక

చ. 3: చల్లగాలి వెట్ట యౌనా సారె నీమీఁద విసరి
పల్లదాన వడ దాఁకి భ్రమసెఁగాక
యిల్లిదె శ్రీ వెంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడఁగాను
యెల్లవారు మంచివారై యీడేరిరిగాక

రేకు: 0252-6 ఆహిరి సం: 09-012

పల్లవి: చెప్పినట్టు సేసేఁగాక చెనక నేలా
కప్పితివి పచ్చడము ఘన తిదె చాలదా

చ. 1: యెన్నిలేవు మంచిమాట లెందాఁకా నాదేవు
విన్న వినుకులె కావా వెనకకును
సన్నముగాఁ బులకించె జలజలఁ జెమరించె
కన్నుల నీళ్ళు దుడిచి కైకొంటివి చాలదా

చ. 2: యింతలోనె చెక్కు నొక్కే వేమి నేరుచుకొంటివి
వంతు వచ్చినదెకాదా వనితలతో
దొంతులాయఁ గోరికలు తురుమునెరులు జారె
యింతట వంచినశిర సెత్తితివి చాలదా

చ. 3: కలసితి విట్టె నిన్ను కడుజాణ మవుదువు
తొలుతనె మెచ్చనా దూరుతా నిన్ను
యెలమి శ్రీ వెంకటేశ యేకచిత్తమాయ నాకు
తెలిగన్నులనె సిగ్గు దేర్చితివి చాలదా

రేకు: 0253-1 సామంతం సం: 09-013

పల్లవి: గుట్టువాఁడ వంటాఁ గొసరితి
యిట్టి నీ వంటేది యెఱఁగముగా

చ. 1: చెక్కుఁచేతితో సెలవి నవ్వితే
తొక్కేవు పాదాలు దోమటిగా
అక్కర నీ వింత ఆసకాఁడ వవుత
యిక్కడ మాలోనె యెఱఁగముగా

చ. 2: మంతనాన నీతో మాటలాడితే
సంతసానఁ గొంగు జారించేవు
బంతినె నీ వింత పంతగాఁడ వౌత
యెంత కెంత నేము యెఱఁగముగా

చ. 3: సిగ్గుతోడనే సేవ సేసితే
యెగ్గు దీర నన్ను నెనసితివి
అగ్గపు శ్రీ వెంకటాధిప యిట్టవుత
హిగ్గిన వేడుక నెఱఁగముగా

రేకు: 0253-2 ముఖారి సం: 09-014

పల్లవి: ఏలే చెలియ యీా యింతుల కెల్ల
సోలగిలి నీ చనవు చూపవలెనా

చ. 1: మిక్కిలి యాతఁడు నీపై మేలు గలఁడంటానె
వెక్కసాన నిందరిలో విఱ్ఱవీఁగేవు
చక్కనివిభుఁడు నీ జవదాఁట కుండితేనె
తక్కక నీ వొకతెవే దక్కఁ గొంటివా

చ. 2: మనసి చ్చాతఁడు నిన్ను మన్నించె నంటానె
యెనలేక యిందరి నీ వేలఁ జూచేవు
ఘనమైన మోహపుకాంత నవుదు నంటానె
గునియుచు సారె నాడుకొనవలెనా

చ. 3: అన్నిటాఁ బట్టపురాణి వైతె నవుదువు గాక
వెన్నుఁడు శ్రీవెంకట విభునికిని
వన్నెలు చూపవలెనా వడి నీ సవతులకుఁ
బన్నియాతఁడును నీవె బ్రదుకరమ్మా

రేకు: 0253-3 దేవగాంధారి సం: 09-015

పల్లవి: అతిరాజసపు దొరవైన నిన్నును
సతమైన నే నిట్టె సాదించవచ్చునా

చ. 1: వెడఁగు నీ సుద్దులెల్ల వీనుల వినుటగాక
నొడిగి నిన్నవి నే మానుపవచ్చునా
కడఁగిన చేత లెల్ల కన్నుఁజూచుటగాక
అడఁచి నీతో నౌఁగా దనవచ్చునా

చ. 2: పచ్చి నీగుణములకు పరిణామించుటగాక
కెచ్చురేఁగి బొమ్మల జంకించవచ్చునా
తచ్చిన నీ యెమ్మెలకుఁ దలవంచుకొంటగాక
వొచ్చమని నిన్ను మెచ్చకుండవచ్చునా

చ. 3: దక్కిన నీకాఁగిటను తనివి నొందుటగాక
చక్కని నిన్ను నేఁ గొసరవచ్చునా
అక్కున శ్రీ వెంకటేశ అలమేలుమంగనేను
యెక్కువ నీరతు లివి యెంచవచ్చునా

రేకు: 0253-4 లలిత సం: 09-016

పల్లవి: కల దింతె మాఁట కంతుని యాఁట
తెలుసుకో నీలోనిదియె పూఁటపూఁట

చ. 1: అలమేలుమంగా హరియంతరంగా
కలితనాట్యరంగ కరుణాపాంగ
చెలువుఁడు వీఁడె చేకొను నేఁడె
వలరాజుతూపులివి వాఁడిమీఁది వాఁడి

చ. 2: అలినీలవేణి యంబుజపాణి
వెలయంగ జగదేకవిభునిరాణి
కలయు నీ పతి వచ్చె గక్కన నిన్నిదె మెచ్చె
పలికీని చిలుకలు పచ్చి మీఁదఁబచ్చి

చ. 3: సితచంద్రవదనా సింగారసదనా
చతురదాడిమబీజచయరదనా
యితవైన శ్రీ వెంకటేశుఁడు నిన్నిదె కూడె
తతిఁ దలపోఁతలు తలకూడెఁ గూడె

రేకు: 0253-5 ముఖారి సం: 09-017

పల్లవి: మగువ నేను నీవు మగవాఁడవు
తగ దొక్కజాతి గాదు తలవయ్య నీవు

చ. 1: వేఁకపు వెన్నెలముగ్గు వేడుక నామోము నిగ్గు
చీఁకటినీలపుగీము జిగి నీమోము
యేఁకట నీకును నాకు నేఁటిపొందు నన్నంత
తాఁకనాఁడవద్దు వద్దు తలవయ్య నీవు

చ. 2: కలువరేకులముంపు కలికి నీకనుసొంపు
జలజపురూపు నీ చాయలచూపు
యెలమితో నిందు కందు కేవ్రూరి కేవ్రూరు
తొలఁకు గచ్చులు మాని తొలవయ్య నీవు

చ. 3: తనరుఁ గొండల తరతరము నావురము
మినుకువజ్రపుటేను మించు నీమేను
ఘనుఁడ శ్రీ వెంకటేశ కలయు నీరతులలోఁ
దనిసి నే నొక్క టైతిఁ దలవయ్య నీవు

రేకు: 0253-6 భూపాళం సం: 09-018

పల్లవి: మూలనున్నవారి మమ్ము ముంగిటవేసీఁగాక
జోలి దవ్వీఁగాక నే సోదించఁగలనా

చ. 1: వెన్నెలలె యెండలంటా వేగించె తనకుఁగాను
నన్ను నవ్వీఁ దనతో నే నవ్వఁగలనా
చిన్నిచెమటలవాన చిత్తడిపాలైననా
చన్ను లంటీఁ దన్ను నే జంకించఁగలనా

చ. 2: పాయ మిది భారమంటాఁ బలికె నాతో మాట
లాయము దాఁక నాడీ మారాడఁగలనా
కాయంపుఁ బులకలచే గజిబిజియైన నాపైఁ
జేయి వేసీఁ దన కిది చెల్ల దనఁగలనా

చ. 3: నిమిషమె యుగమై నివ్వెరగైన నన్నుఁ
దమి నడియాస ముంచీఁ దాళఁగలనా
సమరతి ననుఁ గూడె జంట శ్రీ వేంకటపతి
కమలపుటింతి నింతేఁ గాదనఁగలనా

రేకు: 0254-1 మంగళకౌశిక సం: 09-019

పల్లవి: దవ్వులసరసములు తగునా నీకు
పువ్విళ్లే మేన నొచ్చుమున్నవానివలెను

చ. 1: గోడ నిక్కి చూచేవు గొబ్బున దగ్గరి రావు
ఆడనుండె యెడమాట లాడించేవు
వీడెపు నీమోవి చూపి వికవిక నవ్వేవు
కూడి ముట్టువారి ముట్టుకొన్నవానివలెను

చ. 2: యెదుట సన్నలు సేసే వేకతము లాడేవు
పొదిగి నే రమ్మంటేఁ బొందు చూపేవు
బెదరేవు నీమేను పెనుగోర నంటితేను
చెదరి చీఁకటితప్పు సేయువాని వలెను

చ. 3: అలికేవు పులికేవు అంతలోన భ్రమసేవు
వెలయ నిలువుననె వెరగందేవు
యెలమి శ్రీ వెంకటేశ యీడకు విచ్చేసి నీవు
కలసితి విదె కలగన్నవానివలెను

రేకు: 0254-2 ముఖారి సం: 09-020

పల్లవి: కూడని దొకటొకటి కోరీ మరుబలము
ఆడనె నీసతి కన్నియుఁ గూడె

చ. 1: పొంగెటిమనసే వెలిపులక మొలకలు
అంగపుఁ జెమట మోహపుఁ గరఁగు
వెంగలితమకములు విసరెటి వూర్పులు
అంగన కిదివో అన్నియునుఁ గూడె

చ. 2: యెనసిన యాసలె యెదురుల చూపులు
అనుగుఁ గూరిములె ఆలకింపులు
నినుపు మోమోటములె నిండిన నివ్వెరగులు
అనయము సతి కిప్పు డన్నియునుఁ గూడె

చ. 3: కాఁగిటిపరవశాలు కన్నులతేలింపులు
చేఁగల సిగ్గులె చిరునవ్వులూ
యీగతి శ్రీ వెంకటేశ యింతలో విచ్చేసి చెలి
నాఁగి కూడఁగా నివి యన్నియునుఁ గూడె

రేకు: 0254-4 మంగళకౌశిక సం: 09-021

పల్లవి: చేరి నీవు చెప్పినట్టు సేసితి నేనూ
వారి వీరివలె మఱవకుమీ నన్నునూ

చ. 1: జలధి దచ్చి లక్ష్మిని సంగడిఁ బెండ్లాడునాఁడు
అలరి రుక్మిణిఁ బెండ్లి ఆడెనాఁడు
సెలసువిల్లు విఱిచి సీతఁ బెండ్లి యాడునాఁడు
పలికి బొంకనిమాఁటపట్టు నాకు నిమ్మీ

చ. 2: సరుసఁ బదారువేలుసతులఁ బెండ్లాడునాఁడు
అరసి భూసతిఁ బెండ్లియాడు నాఁడు
పరగ రేపల్లె గోపభామలఁ బెండ్లాడునాఁడు
యిరవై యిచ్చినబాస యిమ్మీ నాకు

చ. 3: ఆదె శ్రీ వెంకటపతి అలమేలుమంగ నిట్టె
అదన నీవు పెండ్లియాడునాడూ
యిదె నన్నుఁ గూడితివి యెక్కువగా మన్నించి
యెదుట నమ్మించినవి యెంచుమీ నాకు

రేకు: 0254-4 లలిత సం: 09-022

పల్లవి: పోయిన దెల్లాఁ బొల్లు పూఁచిన దొక్కటె కాక
కాయజకేళికి నింకఁ గదియ రమ్మనవే

చ. 1: అడిగిరావె విభుఁ డందు కేమనీనో
యెడయనిబాస నీకిచ్చినాఁడు
నుడుగులు దప్పినాను నోముఫలము దప్పదు
తడవి యింతటనైన దగ్గరి రమ్మనవే

చ. 2: పిలిచి రాఁ గదె తనబిరు దెట్టు చెల్లీనో
పెలుచు మే నాహి నాకుఁ బెట్టినాఁడు
వెలయఁ దినఁగ నదె వేమైనఁ దీపవును
తలఁగక యింకనైన దగ్గరి రమ్మనవే

చ. 3: యిచ్చిరావె యీవిడెము యిన్నిటా మెచ్చితినని
కొచ్చినరతుల నన్నుఁ గూడె నేఁడు
తచ్చిన పక్వాన నంటు తరువఁ దరువ వెన్న
యిచ్చుట శ్రీ వెంకటేశు నిట్టె రమ్మనవే

రేకు: 0254-5 శంకరాభరణం సం: 09-023

పల్లవి: ఇద్దరు మోనాన నున్నా రిది యేమయ్యా
వద్ద నాకె పైకొని నీవలెనె పో అయ్యా

చ. 1: పూచిన తంగేడువలె పొలఁతి దండ నుండఁగ
యేచి కూచుండు మన విది యేమయ్యా
చాఁచి కప్పురవిడెము సరి నీకు నందియ్యఁగ
చేచేత నందుకోవు చెల్లఁబో యేమయ్యా

చ. 2: ముంగిటి నిధానమై ముదిత పూఁకొనఁగానె
అంగవించి మాటలాడ వదేమయ్యా
బంగారుసురటి నీపై చెమటలు విసరఁగ
అంగ మెల్ల మరచితి వది యేమయ్యా

చ. 3: నిండిన సంపదవలె నెలఁత ని న్నంటితేను
అండ నో రెత్తలే వైతి వదేమయ్య
మెండగు శ్రీవెంకటేశ మెలుఁత నిన్నుఁ గూడఁగ
యెండ లెల్ల నీడ లాయ నిది యేమయ్యా

రేకు: 0254-6 లలిత సం: 09-024

పల్లవి: ఇక నేలయ్యా మా యెడమాటలు
మొకమొక మెదుటనె ముయికి ముయాయ

చ. 1: సుదతికి నీచూపు సూసకమై చెలువిందె
కది సాకెచూపు బాసికము నీ కాయ
యెదుర నీకు నాకెకు నిద్దరి మీచిఱునవ్వు
వెదచల్లు కప్పురపు విడెము లాయ

చ. 2: తొయ్యలికిఁ జేసన్నఁ దోరణపుఁ జిగు రాయ
యెయ్యెడఁ దొయ్యలిమోహ మీడుదో డాయ
యియ్యెడ నాయెడ మీయిద్దరి సరసములు
కయ్యములులేని కంకణదారా లాయ

చ. 3: నెలఁతకు నీమోవి నిచ్చ కొత్తవిందులాయ
పొలఁతిమోవి నీకు బువ్వము లాయ
యెలమి శ్రీ వెంకటేశ యిద్దరి మీకూటములు
కలకాలమును మీకుఁ గాణాచు లాయ

రేకు: 0255-1 శంకరాభరణం సం: 09-025

పల్లవి: మానవుగా మమ్ము నేల మగనాలిఁ జెనకేవు
కానీ కానీలే యింకాఁ జాలదా

చ. 1: దక్కె నీకుఁ జాలదా తగు రుకుమిణి నీవు
వెక్కసాన లూటిసేసి వేసుకొన్నది
మొక్కల మది చాలదా మున్ను త్రిపురాంగనలఁ
జిక్కించి చీఁకటితప్పు సేసినది

చ. 2: చెల్లె నదె చాలదా చేకొని రేపల్లె నీవు
గొల్లెతల మానములు కొల్లగొన్నది
అల్లది చాలదా నరకాసురుఁడు దెచ్చుకొన్న
పెల్లగు కామినులనుఁ బెండ్లాడినది

చ. 3: అంత నీకుఁ జాలదా అల పూవులవారింటి
కాంత నీవు దొడికిన కల్లతనము
చెంతలఁ గూడితి నన్ను శ్రీ వెంకటేశ నీవు
మంతు కెక్కితిఁ జాలదా మన్నించినది

రేకు: 0255-2 సామంతం సం: 09-026

పల్లవి: వెఱపించఁ బోయి మరి వెఱచినట్టయ్యీఁ జుమ్మీ
నెఱి నాతోడి యలుక నీతిగాదు సుమ్మీ

చ. 1: మోనముతో నుండే వేమె ముదిత నీమాట లెల్ల
నాని నాని మొలచీఁ గనక లోలోనె
ఆనకమ్మై నవ్వ వేమె అంగన నీనగవులు
వూని నీకుత్తికెలోన వుక్కిపోవుఁ జుమ్మీ

చ. 2: ధీరతఁ జూడ వదేమె తెరవ నీకనుచూపు
కేరి యిమ్ముచాలక కిక్కిరిసీఁ జుమ్మీ
మారుమోమయ్యే వదేమె మగువ నీమోము కళలు
పేరడై వొక్కచోటనె పెంటలయ్యీఁ జుమ్మీ

చ. 3: వుసురనే వప్పుడేమె వువిద నాకాఁగిటిలో
వుసురు నీచనుఁగొండ లోడీఁ జుమ్మీ
నసల శ్రీ వెంకటేశుఁడ నారతిమ్మై మఱచేవు
కసుగాటై నీమోవి గంటివడుఁ జుమ్మీ

రేకు: 0255-3 మంగళకౌశిక సం: 09-027

పల్లవి: మనసుకు మనసే మర్మము గాక
వినికివలెఁ దనకు విన్నవించఁ గలనా

చ. 1: తలుపులో తమకము తానె యెరఁగ డట
యెలమిఁ దన్నుఁ గొసర నేలె నాకూ
కలిమిఁ జంద్రునిరాక కలువపువ్వులకును
తెలిపిరా యెవ్వరైన దినదినమునకు

చ. 2: తప్పక వరు సెరిఁగి తానె విచ్చేయుఁ డట
యిప్పుడు విలువ నంప నేలె నాకూ
వుపతిల్లుఁ గోవిలకు నొగి వసంతకాలము
చెప్పుదురా యెవ్వరైనఁ జెలఁగి యేఁటేఁటను

చ. 3: దగ్గరి వచ్చినవాఁడు తానె యెరుఁగుఁ గాక
యెగ్గు సిగ్గు లిటు దీర్చ నేలెనాకు
అగ్గమై శ్రీవెంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
నిగ్గు నిలువుకు నీడ నేర్పిరా యితరులు

రేకు: 0255-4 వరాళి సం: 09-028

పల్లవి: ఏల నన్ను నేర మెంచే వింత కున్నదా
చాలు నో విభుఁడ నీతోఁ జలము నా కున్నదా

చ. 1: గద్దరి నామొకము నాకన్నులకె పాటి గాక
సుద్దుల నీచూపు చల్లఁ జో టున్నదా
బద్దమై నావదనము పాటలకె కొద్దిగాక
యిద్దివో నాతో మాట కెడ మున్నదా

చ. 2: కొనబు నాచేతులు నాకొప్పు వెట్టనె కాక
వొనరి నీకైదండ కోపి కున్నదా
పెనఁగు నాపాదములు పిరుఁదు మోవనె కాక
ననిచి నీవొద్దికి రా నడ పున్నదా

చ. 3: సరి నావురము నాకుచాలకె తావు గాక
సరవి నీకాఁగిటికి సందున్నదా
కరఁగి కూడితి శ్రీవెంకటపతినె నిన్ను
యిరవైన నీకు నాకు నెర వున్నదా

రేకు: 0255-5 హిజ్జిజి సం: 09-029

పల్లవి: ఘనుఁడవు తెగి కొరికఁగ నేల
నవిచిన కొలఁదుల నడపవు గాక

చ. 1: చూచీఁ జూడని చూపులు నీకె
లోచూపై మదిలో నాటె
కాచిన మూకులు కమ్మరఁ దమకే
మోచిన కొలఁదుల మో పైనట్లూ

చ. 2: ఆడియు నాడని అరమాటలె నీ
కాడనె చిరునగవై వెడలె
గాడపుటింటికి కట్టలు గట్టిన
వేడుక నలుగుల వెళ్లినయట్లూ

చ. 3: చిందియుఁ జిందని సిగ్గులు నీకే
విందుల కాఁగిట వెగ టాయ
యిందునె శ్రీ వెంకటేశుఁడ నీ నా
గొందుల చెనకులు గుఱు తయినట్లా

రేకు: 0255-6 వరాళి సం: 09-030

పల్లవి: ఇంతటిది గావలదా యింతి యైతేను
కాంతునిఁ గళ లంటి కరఁగించె నిపుడు

చ. 1: అలిగి వచ్చినపతి నలమి కాఁగిట నెత్తి
పలుకుల వినయాలు పచరించఁగా
సొలసి కోపాన నాఁటఁ జూచె విభుఁ డంతలోనె
చెలియ చెమట గోరఁ జిమ్మెఁబో కన్నులనూ

చ. 2: మక్కువ మంకులతోడ మాటలాడకున్న పతి
చెక్కు నొక్కి జలజాక్షి సేద దేర్చఁగా
వెక్కసము లాడెటి విభుని వదనమున
పుక్కిటి తమ్ముల మిడి పొలిఁతి వాలించెనే

చ. 3: పంతపు శ్రీవెంకటేశుఁ బడఁతి వొయ్యనె చేరి
అంతరంగ మెల్ల దేర్చి యాదరించఁగా
రంతుతో రతుల నిబ్బరము చూపె నాతఁడును
మంతనానఁ జొక్కించి మఱపించె మేనూ

రేకు: 0256-1 ముఖారి సం: 09-031

పల్లవి: ఇంక నేల ఆ సుద్దులు యేరా నీవు
కొంకుతా నేఁ గొసరితే కూళతనము రాదా

చ. 1: కానరాదా నీ గుణాలు కడు నీ మైకాఁక లందె
మానక యప్పటినె మాటాడేఁ గాక
మోనపుగుట్టు విడిచి ముసిముసి నవ్వు నీపై
నానఁబెట్టి చల్లితేను నగుఁబాటు గాదా

చ. 2: తెలియరాదా నీ మోహము తెల్లవారి వచ్చినందె
అలుగలేక నీచే విడె ముందితిఁ గాక
నిలువుకు నిలువున నీ మోహము చూచి నేను
బలిమి సేసి పెనఁగితేఁ బరువేయదా

చ. 3: యిరవుగాదా నీపంతము యిప్పుడు నన్నుఁగూడినందె
పొరసి నిన్ను బట్టువలెఁ బొగడఁ గాక
అరిది శ్రీ వెంకటపతి ఆయము లంటితినిన్ను
యెరవుగా నిన్నేమనిన యెచ్చు కుందు గాదా

రేకు: 0256-2 సాళంగం సం: 09-032

పల్లవి: నేఁ దన్నుఁ గైకోని నేర మిందేదే
యీఁదేఁ దనమంచ మెక్క నైతినా

చ. 1: అలుకేదె జలుకేదె ఆకెయింటనుండ నన్ను
సొలసి చూచిన మారుచూడునా నేను
యెలమిఁ గోప మిందేటి దిద్దరు ముచ్చటలాడ
వెలినుండి యిన్నియును వినవైతి నటవే

చ. 2: కుచ్చితపున సణఁ గేదె గొణఁ గేది నాయందు
నచ్చుఁ దనమోవి చూచి నవ్వ నైతినా
కెచ్చురేఁగి కపటాలు గిపటాల కేది యెడ
రచ్చఁ దనసేఁత లెల్ల మెచ్చనైతినా

చ. 3: వేస టేది వోస టేది వింతచెలి విడిపించి
గోస నాసచేసి తన్నుఁ గూడనా నేను
లాసిన శ్రీవెంకటేశు లాగు లెల్లఁ గనుఁగొని
యీసడముదీర పుర మెక్క నైతినా

రేకు: 0256-3 కాంబోది సం: 09-033

పల్లవి: ఆయ నాయఁ బోయఁ బోయ నల్లనాఁడె నీ
చాయల సన్నల పొందు చాలువయ్యా

చ. 1: వెన్నెలలు వేఁడెనుచు విసరించుకొనె నాపై
కన్నుల నవ్వులు చల్లి కాఁక రేఁచేవు
పన్ని వురిసిన యందుపై నుడుకు చల్లినట్లు
యెన్న మాతో మేకు సేసేవిఁక నేలయ్యా

చ. 2: పాయము వేఁగని యిట్టె బడలివుండె నాపై
నీ యడ మాట మూట లేల యేత్తేవు
చాయల వేయిటి మీఁద జవ్వాది కొమ్ము రీతి
ఆయములు సోకించే వవునయ్యా

చ. 3: సరసాలు వాఁడెనుచు సారెకు మొక్కె ననుచు
మురిపెము గోరేల మోపే వయ్యా
గరిమ శ్రీ వెంకటేశ కరుణించి మెచ్చినట్టు
కరఁగి కూడితి నన్నుఁ గత లేలయ్యా

రేకు: 0256-4 సాళంగం సం: 09-034

పల్లవి: ఇంతుల నెంత దూరునో యింత కపుడె
యింతట రావమ్మ మెచ్చు నింత కపుడె

చ. 1: యిదె వచ్చి నదెవచ్చి నింతి యని యాసాస
నెదురుచూచుఁ బతి వింత కపుడె
వెదవీడనితురుము విడువ ముడువఁ బట్టె
హృదయ మేమౌనో పతి కింత కపుడె

చ. 2: పొంది యెవ్వరు ముందరఁ బొలసిన నీవె యని
యెందు నిన్నె పేరుకొను నింత కపుడె
ముందు నీపయ్యెదకొంగు మూయఁదియ్యనె పట్టె
యెందరి నంపునో పై పై నింత కపుడె

చ. 3: నిన్నుఁ దలఁచి తలఁచి నిద్దిరించి కలలోన
యెన్నఁగఁ గాఁగిటఁ గడు నింత కపుడె
పన్నిన శ్రీవెంకటేశుఁ బైకొని కూడితి విట్టె
యిన్నాళ్లిటులఁ గాదు యింత కపుడె

రేకు: 0256-5 ముఖారి సం: 09-035

పల్లవి: ఔనో కాదో నీ వాన తీవయ్య
పని వేరొకటి యిఁకఁ బోలదయ్యా

చ. 1: చంచలము నాచూపు చంచలము నీగుణము
యెంచె నీ వే మనేవొ యెరఁగమయ్య
ముంచి నా గుబ్బలు రాయి మొగి నీ గుండెరాయి
అంచల నాకడ నేమి యాడుకొనేవయ్యా

చ. 2: చిగురు నా యధరము చిగురు నీ చిత్త మదె
తగెఁ దగ దందు కేమి తలవయ్య
నగవు నా మోమెల్ల నగుఁబాటు నీచింత యీ
తగవు చెలులతోడ తరిఁ జెప్పవయ్యా

చ. 3: లేఁత నాకుఁ గొనగోరు లేఁత నీవయసు గడు
యీఁతలు మోఁతలు నిఁక నేలయ్యా
ఘాతల శ్రీవెంకటేశ కదిసి కూడితి నన్ను
యీతల నిద్దరిభావాలేక మాయనయ్యా

రేకు: 0256-6 మధ్యమావతి సం: 09-036

పల్లవి: ఆయము లంటే యారచికత యిది
చాయల సన్నకు చలి యిఁక నేదయ్యా

చ. 1: మూయక మూసిన ముత్యపుమొగడలు
మోయక మోచే మొదలేదే
పూయక పూచిన పున్నమవెన్నెల
పాయక కానే బయ లేదయ్యా

చ. 2: పుట్టక పుట్టిన పొది జక్కవలవి
మెట్టక మెట్టే మేరేదే
పెట్టక పెట్టిన పెనుమేఘమునకుఁ
బట్టన చోటను బలు వేదయ్యా

చ. 3: పారక పారిన బలుతీఁగెలకును
ఆరితేర నిఁక నరుదేదే
యీరీతి శ్రీవెంకటేశుఁడ నే నిన్నుఁ
గోరి కూడితిని కొద యేదయ్యా

రేకు: 0257-1 హిజ్జిజి సం: 09-037

పల్లవి: జలములఁ బాసిన జలజాప్తునిచే
జలజము నొగిలిన చందంబాయ

చ. 1: చక్కని యీపతి సతిఁ బెడఁబాసిన
వెక్కసపు మనసే వేఁడాయ
చెక్కు చేతితోఁ జింత్తించిన నది
అక్కట మదనుని యడిదంబాయ

చ. 2: రమణి పతికడకు రాక నిలిచినా
తమి నిట్టూర్పులు దగులాయ
తమకంబున సతి దలపోయంగా
భ్రమసి చూచురెప్పలు నొప్పాయ

చ. 3: యింతలో నిద్దరి కెడ మాటాడఁగ
అంతట వీనుల కాసాయ
యింతయు శ్రీవెంకటేశ్వరుఁ గూడఁగ
యింతేసి యిందాఁక నేమేమో ఆయ

రేకు: 0257-2 దేసాళం సం: 09-038

పల్లవి: ఏడ కేడ యెంచి చూచి యెఱఁగవటే
కూడునా కపటములు కూటము లెందైనను

చ. 1: మోమువంపుఁ గోప మేడ ముసిముసి నవ్వు లేడ
యేమే యెండలు వెన్నెల లెనయునటే
దోమటి వొట్లివి యాడ తొంగిచూపు లివి యాడ
సామై నల్లవేఁడియునుఁ జలువయుఁ గూడునా

చ. 2: అంటితేఁ బెనఁగు లేడ అందులోఁ గొంకు లేడ
జంటఁ గారములు దీపఁ జవు లౌనటే
బంటు బంటు పంత మేడ బాస లెచ్చరించ నేల
వొంటిఁ జీఁకటి వెలుఁగు వుండునా యెందైనను

చ. 3: అవ్వలయి వుండ నేల అద్దములో సన్నలేల
దవ్వులుఁ జేరువ లొక తారుకాణటే
రవ్వల శ్రీవెంకటాద్రిరమణుఁడనె నిన్ను
యివ్వలఁ గూడితి నింక నెర వౌనటే

రేకు: 0257-3 వరాళి సం: 09-039

పల్లవి: నీట ముంచు పాల ముంచు నీచిత్త మిఁకను
యీటగు నీపతిభావ మిది గలది

చ. 1: తప్పక చూచుఁ జూచు తలవంచు నంతలోనె
వుప్పతిల్లఁ బులకించు నుస్సురనును
కప్పురగంధి నీవుఁ గదిసి కూడిన కాఁక
చెప్పరాదు విరహము చెంతల నీపతికి

చ. 2: చిన్నఁబోవు నంతలోనె చెలులపైఁ గోపగించు
కన్నచో వెదకు మేనఁ గప్పు కప్పును
కన్నెరొ విభఁడు నీవు కళ లంటినదాఁక
మిన్నక చింతాజలధి మీరరాదో యమ్మ

చ. 3: బుద్దు లెంచుకొను లోలో పొసరించి కల్లపడు
అద్దివొ శ్రీవెంకటేశుఁ డాడ నాడనె
వొద్దికై నీ విటువలె వొనగూడి వుండుదాఁక
చద్దికి వేఁడికి వెదచల్లు లాయ వలపు

రేకు: 0257-4 రామక్రియ సం: 09-040

పల్లవి: నీవు బడలితివి నేనుఁ జూచి బడలితి
కావించి నన్ను మరి కలసేవు గాని

చ. 1: చెదరెఁ గస్తూరిబొట్టు చేత దిద్దుకొనవయ్య
అదన నిట్టూర్పులు ఆఁపవయ్య
వదలె తురుముగొంత వడిఁ జక్కఁ బెట్టవయ్య
పదరి వెనక మాతో బాససేతు గాని

చ. 2: కడుఁ బులకించె మేను కప్పవయ్య పచ్చడాన
జడిసీఁ జెమటలు విసరు కోవయ్య
చిడియుఁ గెంపులమోవి చేత మూసుకొనవయ్య
నిడివి నిజము మాతో నెరుపేవు గాని

చ. 3: గందపుబేఁట్లు రాలీ కాఁగిలించుకొనవయ్య
విందుల పొందుల శ్రీవెంకటేశుఁడ
కందువ నాకూట మిది కడదంటా భ్రమసితి
పొందితి విప్పుడు యింకాఁ బొదిగేవు గాని

రేకు: 0257-5 సామంతం సం: 09-041

పల్లవి: ఉదయించె నతఁడు నీ వుదయించ వేలయ్యా
మదిరాక్షిఁ గూడి యిట్టె మన్నించవయ్యా

చ. 1: జలజబంధుఁ డతఁడు జలజాక్షి వదనపు
జలజబాంధవుఁడవు సరుస నీవు
అలరి నాకాశమందె యతనికి విహరించఁ
గలికి నడిమియాకస మిదె నీకు

చ. 2: చీఁకటివైరి యతఁడు చెలియమనసులోని
చీఁకటివైరివి నీవు చేచేతనే
ఆఁక జక్కవలఁ గూర్చు నతఁడు నీ వీడ నైతె
కాఁక చనుజక్క వలఁ గలపఁగ వలదా

చ. 3: దినరా జతఁడు భూమిఁ దెరవపాలికి నీవు
దినదినరాజవు తేజమనను
ఘనుఁడ శ్రీవెంకటేశ కాంతఁ గూడితివి నేఁడు
గనియై యాతఁడు సూర్యకాంతమునఁ గూడెను

రేకు: 0252-6 సామంతం సం: 09-042

పల్లవి: పూవక పూచిన వెల్లాఁ బూఁపలయ్యీనా
చేవదేర దగ్గరక చింత లెల్లఁ దీరునా

చ. 1: రేపు నవ్వుదువుగాని రేయి నాకొం గంటకురా
దాపుల సరములఁ దని వయ్యీనా
తీపు నీరువట్టుగొంటె తేటనేయి మందవునా
పై పైఁ గలయక యీపచ్చిచేఁత లేలరా

చ. 2: యిచ్చక మూఁడుదుగాని యియ్యకొంటిఁ బో పోరా
గచ్చుల వినయములు గాకమానీనా
మచ్చిక నాఁకలివేళ మంచి విరు లింపవునా
హెచ్చినరతులఁ గాక యిందువల్ల నేమిరా

చ. 3: అవ్వల మొక్కుదుగాని అంతేసి సేయకురా
రవ్వనిన్నుఁ జేయక నా రాఁపు వాసీనా
యివ్వల శ్రీవెంకటేశ యింతలోఁ గూడితి నన్ను
దవ్వులే చేరువ లాయఁ దలపోఁత లేలరా

రేకు: 0258-1 సామంతం సం: 09-043

పల్లవి: ఎందు కెందుఁ బోలిచేవె యింతి వోరి
అందుకె కాదా నీయడియాసలు

చ. 1: పాదమున నే నిట్టె బయలుచిమ్మిన నీవు
వాదుకు వచ్చే వేమె వనితా
యీదెస నెంచి చూచితె నిటువంటి బయలె నా
గాదిలి నడు మవుత కానవా నీవు

చ. 2: దాపునఁ దామరమీఁదఁ దమ్ముల ముమిసితేను
కోపగించుకొనే వేమె కోమలి
పో పో ఆతామరనెపోలిన నా నెమ్మోము
చూపులు గలుగు నన్నుఁ జూడవా నీవు

చ. 3: అద్దము మెరుఁగు వెట్టేనని గోర నంటితేను
గద్దించే విది యేమే కలికి
నిద్దపు శ్రీవెంకటేశ నీవు నన్నుఁ గూడితివి
అద్దపు నాచెక్కు లిప్పుడవి చూచెటఁగవా

రేకు: 0258-2 శుద్ధవసంతం సం: 09-044

పల్లవి: నే సతము గాక నీకు నీవు నేనుఁ గలదాఁక
యీసులేని విభుఁడ నీకివి సతమా

చ. 1: మంతనపు నీ వొట్లు మాట నే నాడినదాఁకా
చింతల నీ సిగ్గు వొంటిఁ జిక్కినదాఁకా
పంతపు నీబిగువు నేఁ బచ్చి సేసినదాఁకా
అంతటి మీఁదట నీకు నవి సతమా

చ. 2: అలుకలుఁ జలములు ఆయము లంటినదాఁకా
బలిమి సరసము నేఁ బైకొనుదాఁకా
తలఁపు నీగుట్టు నేఁ దప్పక చూచినదాఁకా
అలరి యంతటిమీఁద నవి సతమా

చ. 3: కన్నుల నీమొక్కులు నేఁ గాఁగిలించినదాఁకా
మిన్నక రతులు నే మెచ్చినదాఁకా
యెన్నఁగల శ్రీవెంకటేశ నిన్నుఁ గూడితినే
అన్నులకడలపొందు లవి సతమా

రేకు: 0258-3 ముఖారి సం: 09-045

పల్లవి: ఇందు నందునె యింతిపోలికలు
విందుల విభునికి వేడుకలాయ

చ. 1: వెడఁగుఁ దీగెలను విరులపరిమళము
పడఁతిమాటలనుఁ బరిమళము
బడిఁ గనకమునకుఁ బదారువన్నెలు
సుడిగొని వనితకు షోడశకళలు

చ. 2: కులికి సురతరుపుకొమ్మునఁ బూఁపలు
పొలఁతికుచంబునఁ బూఁపలు
వెలయు వసంతపువేళనె చిగురులు
చెలి పాదములను చేఁగ చిగురులు

చ. 3: పొంత జలనిధులఁ బొడమెఁ దామెరలు
కాంతకరములె కమలములు
యింతట శ్రీవెంకటేశుఁడు గూడఁగ
కాంతరతుల కివి కదంబమాయ

రేకు: 0258-4 లలిత సం: 09-046

పల్లవి: విచ్చేయవయ్య నీవు వేగమె యింతటనైన
తచ్చి యిన్నియును సరిదాఁకెఁ గదవయ్యా

చ. 1: యింతిమనోరథములు యెంచరాదు పంచరాదు
కాంతుఁడ నీకురులు లెక్కకు రానట్టు
పొంత నాకె తలపోఁతఁ బుట్టిన విరహములు
వింతగా నీశిరసున వెళ్ళెఁ గదవయ్యా

చ. 2: చెలి చింతాలత లివి చిక్కులాయ జీర లాయ
కెలన నీరేకలు మైఁ గెరలినట్టు
అలరి యాకె మదనానలపుఁబొగ లెల్లాను
కులికి నీమేనఁ జుట్టుకొనెఁ గదవయ్యా

చ. 3: సతికరములు నీసమరతులఁ బెనఁగె
రతి నీచూపులు మేన రానైనట్టు
యితవై శ్రీవెంకటేశ యిన్నిటా మీయిద్దరికి
సతమైన వలపులు జట్లాయ నయ్యా

రేకు: 0258-5 శంకరాభరణం సం: 09-047

పల్లవి: నిన్ననె పెండ్లి నాకు నేఁడు నీకు
తన్నుఁ దానె సమకూడె దైవము మెచ్చితిరా

చ. 1: మిక్కిలి మోహము నాకు మేఁటి రాజసము నీకు
నిక్కి చూపు లెల్ల నాకు నిండుఁ బరాకు నీకు
మొక్కుల మాటలు నాకు మోనపుగుట్లు నీకు
తక్కక సేసినయట్టి దైవము మెచ్చితిరా

చ. 2: విరహపుఁగాఁక నాకు వెన్నెల నవ్వులు నీకు
సరసపుఁ దమి నాకు జంపులు నీకు
పెరిగె యాసలు నాకు బీరపు బిగువు నీకు
దరియై గడించినట్టి దైవము మెచ్చితిరా

చ. 3: బిగువుఁగాఁగిలి నాకు పెనుఁజెమటలు నీకు
జిగిమోవిఁ దేనె నాకు జీరలు నీకు
పగటు శ్రీవెంకటేశ పైపయిఁ గూడితి మిట్టె
తగుఁ దగు నిన్నిటికి దైవము మెచ్చితిరా

రేకు: 0258-6 భౌళి రామక్రియ సం: 09-048

పల్లవి: ఏమాట కేమాట యెంత కెంతరా
యీమాటె యాడవె నీ వింకా నొకమారు

చ. 1: అంటఁగాక వున్నదాన నట్టెవుండరా
అంటెనె నీచూపులు న న్నంతక తొల్లె
అంటువాయఁ జెమట నీరాడవా నీవు చి
ట్టంటు నీచేతలు నామై నంటవలదా

చ. 2: తలపట్టుతో నుందాన దగ్గరకురా నా
తలఁ పట్టె నీ మీఁదఁ దగు లాయనే
తలపోఁత పేరు నీమ్మైఁ దలకొనదా
తలపడి మేను మేనుఁ దడఁబడవలదా

చ. 3: కన్నుల నిద్దుర వచ్చీఁ గాఁగి లేలరా నీ
కన్నుల సన్నలె కావా కందువ చెప్పె
నన్ను నిట్టె శ్రీవెంకటనాథ కూడితి
కన్నెరొ యిట్టె రతులఁ గరగించవలదా

రేకు: 0259-1 ముఖారి సం: 09-049

పల్లవి: విభునికి నీమాటె విన్నివించరా
సభల దూరపుటేర్లు జలధులఁ గూడవా

చ. 1: దవ్వులనుండితేనె దగ్గరి వుండుట గాదా
దవ్వులనుండిన తన్నుఁ దలఁచఁ గదే
దవ్వుగాదా సూర్యునికి ధరణిఁ దామరలకు
దవ్వుల పొందులె కడుఁ దగులము లాయనే

చ. 2: ఆకడి మో మైతేనె యీకడి మో మౌత గాదా
ఆకడఁ దనదిక్కు మో మైతినేఁ గదే
ఆకసపు మొయి లేడ అడవినెమలి యాడ
దాకొని వింతగుచూపు తరితీపు దానే

చ. 3: ఆసమాట లాడితేనె అండకు వచ్చుట గాదా
వాసి నేఁ దనకడకు వచ్చితిఁ గదే
యీసులేక శ్రీ వెంకటేశుఁ డేడ నే నేడ
వేరక కూడితిమి వింత లెల్లఁ జేరెనే

రేకు: 0259-2 లలిత సం: 09-050

పల్లవి: ఇందు కేమె అందు కేమె యింతలోనె యరవౌనా
అందపుఁ జుట్టాల మౌత అందరు నెరఁగరా

చ. 1: వొద్దనుండవలెనా వొక్కటై తాను నేను
యిద్దరము నున్న నేల యేకమె కాదా
సుద్దముగ మోము మోముఁ జూడవలెనాయెదుట
కొద్దిచంద్రునందు రెండు గూడవా మా చూపులు

చ. 2: మాటలాడవలెనా నామాటలుఁ దనమాటలు
గాఁటపు ఆకసమందుఁ గలసీఁ గదె
చోట నిట్టె మేను మేను సోఁకవలెనా తన్ను
నాఁటి సోఁకినట్టి గాలె నన్ను సోఁకీఁ గదవే

చ. 3: కలయఁగవలెనా కందువ మా మనసులు
గలపిన చిత్తజుఁ డొక్కఁడె కదె
యెలమి శ్రీవెంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
పలుకుఁ బంతము నొక్కపాటాయఁ గదవే

రేకు: 0259-3 ముఖారి సం: 09-051

పల్లవి: ఓపో ఆదేమోయి వో బావ యింక
వోపనంటేఁ బోవునటె వో వో మరఁదలా

చ. 1: వొరసే వదేమోయి వో బావ నిన్ను
వొరసీఁ బో నీకుచాలె వో మరఁదల
వొరకు నెత్తుకు సరి వో బావ నీవె
వొర తొమ్మిది చాఁచేవో వో మరఁదలా

చ. 2: వొగరులాడే వోయి వో బావ నీకు
వొగరు మోవిచిగురు వో మరఁదల
వొగరుఁ జిగురె చేఁగ వో బావ అదె
వొగిఁ బిసికితేఁ బసురో వో మరఁదలా

చ. 3: వొంటి దగ్గరే వోయి వో బావ నాకు
నొంటి గాదు నీ వుండఁగ నో మరఁదల
గొంటవై శ్రీ వెంకటాద్రిఁ గూడితి బావ మన
కొంటి నేల ఆమాఁటలో వో మరఁదలా

రేకు: 0259-4 హిందోళవసంతం సం: 09-052

పల్లవి: ఎంచ నిన్నిటికి లోనయితిఁగా నేను
అంచెలఁ దలఁచుకొంటె నరుదయ్యీ నాకు

చ. 1: రేసు వెన్నెల యండ కోరిచెఁగా నాతనువు
ఆసల నా ప్రాణవిభుఁ డాతనిఁ బాసి
వోసరి నిట్టూర్పుగాలి కోపెఁగా నామనసు
గాసిలి యీతని తమకపువేళను

చ. 2: విరహానలము చొచ్చి వెళ్ళెఁగా నామనసు
సరుగనఁ బతితోను సారె నలిగి
పొరిఁ గన్నీటివఱదఁ బోక వచ్చెఁగా నాచూపు
గిరవై చింతల మునిఁగినవేళను

చ. 3: వుమ్మల మోనానఁ బతికుండెఁగా నా నగవు
అమ్మరొ యీతఁడు మాటలాడినదాఁకా
నెమ్మిఁ బరవశములో నిలిచెఁగా నాముదము
కమ్మర శ్రీ వెంకటేశుకాఁగిట యీవేళను

రేకు: 0259-5 వరాళి సం: 09-053

పల్లవి: ఏమౌత నెఱఁగ నీ వేమనేవె
నీ మన సొక్కటాయ నీవే నేనూ

చ. 1: కొప్పు గడు వెడ జారె గుణము తేటలు దేరె
యిప్పుడు చెలియ నాతో నేమనేవె
రెప్పల ముత్యాలు గారె కప్పి చెక్కు చేయి చేరె
చెప్పిన బుద్ధులు వింటిఁ జీఁకటె వెలుఁగు

చ. 2: నిలువురాఁకలఁ గాఁగె నిట్టూర్పు గడు రేఁగె
యెలుఁగెత్తి నీవు నాతో నేమనేవె
వలపులు దల కెక్కె వాఁడి కుచముల కెక్కె
చెలియ నీ వూఁకొంటి చేవె చిగురు

చ. 3: చెదరి పయ్యెదజారె సిగ్గులు సెలవిఁ గారె
యెదు రెదురనె చెలి యేమనేవె
యిదివో శ్రీ వెంకటేశుఁ డిటువచ్చి నన్నుఁ గూడె
సదమదమైతి రతిచలమె ఫలము

రేకు: 0259-6 ఆహిరి సం: 09-054

పల్లవి: ఏల జోలిఁ బెట్టేనే నిన్నిందాఁకాను
వోలి నీ కెదురు చూచు చున్నాఁడ నేను

చ. 1: యేమిసేసీనె చెలి యింతి నీ వేఁగెటివేళ
యేమె నీరాక కెదు రేతెంచెనా
ఆమాటలెల్ల నీవు ఆకె కెఱిఁగించితివా
యేమని చెప్పమనెనె యెడమాట నాకు

చ. 2: ఔనె నావుంగరము ఆకె వేల నున్నదా
మానిని నామేలు నీతో మది నెంచునా
తాను వచ్చే ననునో యీతరి నన్ను రమ్మనునో
పూని తన వ్రాలాకు పుత్తెంచెనా

చ. 3: సతిమాఁట కింటివారు సమ్మతించి వుందురా
అతివ నీ మఱఁగున నది యెవ్వరె
యితవైన శ్రీ వెంకటేశుఁడ నైనందుకును
సతి నన్నుఁ గూడినదె సఫలము లాయ

రేకు: 0260-1 భూపాళం సం: 09-055

పల్లవి: నిండు సోబనము నేఁడు నెయ్యపు దంపతులకు
మెండుగ నారతులెత్తి మీఁద సేసచల్లరే

చ. 1: కట్టుఁడు కలువడాలు ఘనమైన తోరణాలు
గట్టిగాఁ బట్టణము సింగారించరే
కిట్టి రుక్మిణిదేవిఁ గృష్ణుఁడు పెండ్లాడి వచ్చె
పెట్టుఁ డిందరికి నేఁడు పెండ్లి విడేలు

చ. 2: పాడరె సోబనాలు పై పై నె పేరఁటాండ్లు
యీ డా డనక వీధు లేఁగించరే
జాడతో వాయించరె పంచమహావాయిద్యాలు
యీడనె పెండ్లికట్నా లియ్యరె యిద్దరికి

చ. 3: పొత్తుల విందులు దెచ్చి బువ్వమున నిడరే
హత్తి గంధాక్షత లీరె అందరు నేఁడు
నిత్తెమై శ్రీ వెంకటాద్రి నిలయుఁ డీ కృష్ణుఁడు
తత్తరాన నీకెఁ గూడె దగ్గరి సేవించరే

రేకు: 0260-2 రామక్రియ సం: 09-056

పల్లవి: ఇంతట నిట్టె విచ్చేసి యింతిఁ గూడితేఁ గనక
వంతుకు నిన్ను జాణదేవర వనవచ్చును

చ. 1: తనలోనె తలపోసి తప్పక చూచేవేళ
వనితను దేవగన్య యనవచ్చును
పనివి నిన్నుఁ దలఁచి పాటలు వాడేవేళ
అనుగు గంధర్వకాంత యనవచ్చును

చ. 2: చలపట్టి విరహాన జలకేళి సేయువేళ
అలివేణి నాగకన్య యనవచ్చును
చలువకుఁ జంద్రకాంత శిలపైఁ బొరలువేళ
అలరిన చంద్రకన్య యనవచ్చును

చ. 3: శ్రీ వెంకటేశ నీవు చెలియఁ గూడినవేళ
ఆవటించి నిజలక్ష్మి యనవచ్చును
వోవల నీ సొమ్ములలో వురమున మోచువేళ
దేవి యలమేలుమంగ దిష్ట మనవచ్చును

రేకు: 0260-3 పాడి సం: 09-057

పల్లవి: చెఱఁగుమాసినసుద్ది చెప్పఁ జాల కుండేవు
యెఱఁగము కైదప్పు లెందు మోచునో

చ. 1: చెక్కుచేతితో నీవు సిగ్గువడి నవ్వేవు
చొక్కపు విభుఁడు నిన్నుఁ జూచె నంటాను
తక్కక యాతఁడు నిన్ను దగ్గరి పైఁ జెయి వేసి
యిక్కువ లంటినప్పుడు యేమి సేసేవే

చ. 2: కాలిమీఁదఁ గాలు వేసి కడుఁ దల వంచేవు
అలరి కేలికిని రమ్మనె నంటాను
కోలుముందై యాతఁడె గొబ్బున దగ్గరి వచ్చి
కేలుఁ గేలఁ బెనచితె కిందు పడేవా

చ. 3: సరిలేని తమకాన జలకేళి సేసేవు
అరిది శ్రీ వెంకటేశుఁ డంటీ నంటా
గరగరికల నిన్నుఁ గలసె నాతఁ డిట్టె
అరయఁగ నంటుముట్టు లవి దీరెఁ గదవే

రేకు: 0260-4 ఆహిరి సం: 09-058

పల్లవి: తరవాతి పనులెల్లఁ దగవాయఁగా
యెరవు సతము సేసీ నే మందునే

చ. 1: కుప్పలుగాఁ దన్ను దూరి కోపగించె యందులోఁదా
తప్పు వట్టీ నిది లెస్స తగవాయఁగా
చెప్పనేల రాళ్లు చక్కఁజేసి మలిగండ్లేరీ
నిప్పు డిట్టె నే నిందు కేమందునే

చ. 2: పూని తన్ను నేర మెంచి బుద్ధిచెప్పె యందులోను
తానూ బుద్ధులు చెప్పీ దగవాయఁ గా
ఆని కస్తూరి నల్ల నంటెఁ దెలుకపిండి
యీా నెపాన నల్లనంటె నేమందునే

చ. 3: చెమరించీ తొలమని చేతనంటి తోయఁబోతె
తమకానఁ గాఁగిలించీఁ దగవాయఁగా
సమరతి నన్నుఁ గూడె సరి శ్రీ వెంకటపతి
యిమిడె సంతసముల నేమందమే

రేకు: 0260-5 శ్రీరాగం సం: 09-059

పల్లవి: తగుఁ దగు నీకు నాకుఁ దలవయ్యా
తగవు లగవులాయఁ దమకించకువే

చ. 1: మొఱఁగి కన్నుల నీకు మొక్కేమయ్యా వో
తెఱవ నేఁ గన్నులనె దీవించితినే
వెఱగంది మోవి నీకు విందు చెప్పేఁ బో నిన్ను
జఱసి నే గుక్కిళ్లఁ జివిగొంటిఁ బో

చ. 2: పెలుచు నా కోరికలఁ బిలిచేనయ్యా నేనుఁ
బలుమారు నాలోనె పలికితినే
మెలఁగి ని న్నొకవేల మెచ్చేనయ్యా
నలువంక సెలవుల నవ్వితి నేను

చ. 3: పెంపుడుఁగుచాల నిన్నుఁ బెద్దసేసేఁ బోనే
నింపుల రతుల ని న్నెచ్చరించేనే
గుంపెన శ్రీ వెంకటేశ కూడితిమయ్యా నిన్ను
దింపక నా వురమున దిష్టము మోచితివే

రేకు: 0250-6 కాంబోది సం: 09-060

పల్లవి: చేతనైనపాటి సేవ సేయుదుఁ గాక
ఆత లీతలి పనులు అవి నావశమా

చ. 1: గచ్చుల నీ మన సిట్టె కరఁగించఁ గలఁ గాక
నచ్చు నీ చెమట మాన్ప నావశమా
పచ్చిగా నీమోవిమీఁదఁ బల్లు మోపఁగలఁ గాక
లచ్చన గుఱుతు మాన్ప లాగుల నావశమా

చ. 2: చేరి నీసిగ్గులు దేరఁ జెయి వేయఁగలఁ గాక
నారుఁ బులకలు మాన్ప నావశమా
సారె నీ మోము నేను చక్కఁ జూడఁగలఁ గాక
యేరా నీనవ్వులు మాన్పనివి నావశమా

చ. 3: అంటి నిన్నుఁ గాఁగిటిలో నలయించఁగలఁ గాక
నంటు నీ నిట్టూర్పు మాన్పనావశమా
జంటవై శ్రీ వెంకటేశ సరుసఁ గూడితి విట్టి
వెంట రాకు మని మాన్ప విభుఁడ నావశమా

రేకు: 0261-1 ముఖారి సం: 09-061

పల్లవి: దూరలేను పోరలేను దొమ్మి దన్నుఁ జేయలేను
మోరతోపుఁదనముల మోనమెచాలు

చ. 1: తత్తరించకురె పతి తానె నన్ను వలపించె
చిత్తము వచ్చినయట్టె సేయనీఁగదె
యెత్తి నది మీఁదు దనకె మేనుఁ బ్రాయమును
మొత్తమి నా కిఁకమీఁద మోనమెచాలు

చ. 2: పిలువకురె మీరు పెండ్లాడె ననుఁ దొల్లె
వలసి నప్పుడు రానీ వరుసకును
పలికితిఁ దనదని ప్రాణమును మానమును
ములువాఁడి చెక్కుచేతి మోనమెచాలు

చ. 3: కక్కసపెట్టకురె కమ్మరఁ విచ్చేసెఁ దానె
మక్కువ గలుగుపాటి మన్నించనీవె
అక్కున శ్రీ వెంకటేశుఁ డాదరించి నన్నుఁగూడె
మొక్కలాన నాకింక మోనమెచాలు

రేకు: 0261-2 కేదారగౌళ సం: 09-062

పల్లవి: ఎరవె సతము చేసె నేఁటికొ కాని
తరుణిసింగార మిది తలపోయరే

చ. 1: గరిమె మెరుఁగుఁబోఁడిగాన కొప్పు ఘనమాయ
విరులు ముడిచె యి దేవిధమొకాని
సరి సింహమధ్య భాగాన శైలకుచము లమరె
గరిమఁ బయ్యెద నేల కప్పీనొ కాని

చ. 2: కాంత చంద్రముఖిగాన కలువకన్ను లమరె
చెంతఁ జీఁకటిచూపేల చిమ్మీనొ కాని
బంతి వజ్రదంతి గాన పగడపుమో వమరె
పొంతఁ దమ్ములాన నేల పొదిపీనొకాని

చ. 3: పసిఁడిపతిమగాన పదారుగళల మించె
యెసఁగెఁ దెల్లనినవ్వు లేడవొ కాని
కొసరి శ్రీ వెంకటేశుఁ గూడె నింతలోన నీకె
అసముదించని ఆస అది యెంతొకాని

రేకు: 0261-3 ముఖారి సం: 09-063

పల్లవి: ఇంక నేల వేగిరము యింతలోని పనికిఁగా
తెంకి నే పానుపుమీఁద దిద్దుకొనేఁ గాని

చ. 1: అంతనీవు దగ్గరకు ఆయములు సోఁకీని
పంతపు మాటాడకుర పచ్చి రేఁగీని
కొంత నీవు నవ్వకురా గుండె గడు ఝల్లురనీ
మంతనాన నీ పగటు మందలించేఁ గాని

చ. 2: తప్పక చూడకురా తనువెల్లఁ బులకించీ
చిప్పిలఁ బెనఁగకురా చెమరించీని
కప్పకుర పచ్చడము కడు సిగ్గు ముంచీని
చెప్పగల సుద్ది రేయి చెప్పేఁ గాని

చ. 3: బొమ్మల జంకించకురా పొరి నాకు చాలురా నీ
తమ్మ మోవి మోపకురా దప్పి దేరీని
చెమ్మగిలఁ గూడితివి శ్రీ వెంకటేశ నన్ను
సమ్మతించ నీగుణము చలి వాపేఁగాని

రేకు: 0261-4 రామక్రియ సం: 09-064

పల్లవి: నీకు నీకె తెలుసుకో నీ సుద్దులు
నాకుఁ బొద్దుసేసి నవ్వు నవ్వఁ దగునా

చ. 1: కూడనన్న మానదు నాగుణ మేమొకాని
ఆడ నీ చేఁతకు నిన్ను నంటఁ దగునా
చూడ నన్న మానవు నా చూపు లేమొ కాని
వాడికె నీ మోముదిక్కై వద్ద నుండఁ దగునా

చ. 2: విన నన్న మానవు నా వీనులేమొ కాని
కొనబు నీ మాఁట లూ కొనఁ దగునా
నినుఁ బేరుకొన నన్న నిలువదు నా నోరు
పెనఁగి ని న్నీడకుఁ బిలువఁగఁ దగునా

చ. 3: సోఁక నన్న మానదు నా సోగ మే నేమొ కాని
పైకొని నీ పచ్చి మీఁదఁ బచ్చి దగునా
యీకడ శ్రీ వెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
కాకుగా నిన్నియుఁ దారు కాణించఁ దగునా

రేకు: 0261-5 ఆహిరి సం: 09-065

పల్లవి: కదిసిన మిము మెచ్చఁ గలము గాకా
యెదిటి మీ యలుకలు యివి చూడఁ గలమా

చ. 1: కన్నుఁ గొనలె వేరు కమ్మఁ జూపు లొకటె
మిన్నక వుండె మీలో మీ రొకటె
చిన్నఁబోయి నీ వాడ చెక్కు చేతఁ జెలియాడ
వున్నభావ మిది చూచి వోరుచఁగఁ గలమా

చ. 2: వీను లివియె వేరు వినుకలి యొకటె
ఆనకపు మీ మోహాలవి యొకటె
పానుపై నాకె వెలుపల మలగుపై నీవు
పూని వున్నమీకు నేము బుద్ధి చెప్పఁగలమా

చ. 3: కడఁగి చేతులె వేరు కాఁగిలిది యొకటె
యెడసి కూడిన మీరిద్ద రొకటె
అడరిన శ్రీ వెంకటాధిప మీ యిద్దరిలో
జడియుఁ బంతములకు సాక్షి చెప్పఁ గలమా

రేకు: 0261-6 రామక్రియ సం: 09-066

పల్లవి: గుట్టుతో లోలో గొణఁగుట గాక
దట్టించి చెలులాల తను ననే దేమె

చ. 1: ఆకసపుఁ జంద్రునికి నాసపడఁగా నేమి
వాకైరాని పతికి వలవఁగా నేమి
ఆకడ నందనిపంటి కఱ్ఱుచాఁచఁగా నేమి
జోకకురాని పతినిఁ జూడఁగా నేమి

చ. 2: కొనబువెట్టి చెరకు కొనయేమి మొదలేమి
యెనయని పతిమాట లెన్నైనా నేమి
పొనిగి యంపలిచెట్టు పూచె నేమి కాచె నేమి
ననుచని పతి యంత నవ్వినా నేమి

చ. 3: వసంతకాలము దప్పి వంబు గావఁగా నేమి
కసిగాటై యెలయించి కలయఁగా నేమి
యొసఁగి శ్రీ వెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వసమైన మీఁద నింక వాసు లెంచ నేమి

రేకు: 0262-1 ముఖారి సం: 09-067

పల్లవి: అతివ నీ సింగార మట్టిదెకా అందుమీఁద
పతివిరహము నైతె భావించ వసమా

చ. 1: తామెరపైఁ దుమ్మిదలు దట్టమై మూఁగుండఁగాను
నేమముగ నది చూచి నీ విభుఁడు
కోమలి నీ విప్పు డిట్టె కుత్తికబంటి జలాన
ఆముక యీఁదులాడే వని తానూ దుమికె

చ. 2: మించు జక్కవలు తీఁగెమీఁద వాలి వుండఁగాను
అంచెల నీరమణుఁడు అది చూచి
వుంచానఁ బయ్యెద జార నొగి విరులు గోసెటి
చంచని తా లేచి వచ్చి సరిఁ గాఁగిలించెను

చ. 3: నిక్కి మేడలోన నొక్క నెమలి నటించఁ జూచి
అక్కడ శ్రీ వెంకటేశుఁ డది నీ వని
అక్కరతో దగ్గరఁగా నంతలోన నీవు వచ్చి
పక్కనఁ గూడఁగ దనభ్రమలెల్లఁ బాసెను

రేకు: 0262-2 భైరవి సం: 09-068

పల్లవి: ఆపాటి కాపాటి అందుకేమె
యీపని సరికి సరి యిందు కేమె

చ. 1: యిదె తన మోవిఁగెంపు లెక్కఁ జూచి నా కన్నుల
కదనఁ గెంపు లెక్కె నందు కేమె
చెదరెఁ గురులు దననుదిటి పై నా చిత్త
మెదుటనె చెదరెఁ బో యిందు కేమె

చ. 2: వన్నెలఁ దా ముడిచినవాడుఁ బువ్వు లటు చూచి
అన్నువ నా మోము వాడె నందుకేమె
పన్ని చిట్లుగందాల భావము చూచి నా మాట
లిన్నియుఁ జిటులు మనీ నిందు కేమె

చ. 3: సేయఁగల వెల్లఁ జేసి చేరి నన్నుఁ గూడఁగాను
ఆయెడ నేనుఁ గూడితి నందు కేమె
పాయపు శ్రీ వెంకటపతి మేను నామేను
యీయెడ నేకము లాయ నిందు కేమె

రేకు: 0262-3 సామంతం సం: 09-069

పల్లవి: అప్పటి కప్పటి మాట లంతె చాలు
యిప్పుడు కాలు దాఁకించ నేల మొక్క నేల

చ. 1: కూరవండి కసవేరె గుణము లోలో నేల
యేరా నిన్నుఁగూడి పాసె యెగపోఁ తేలా
నీరువట్టుగొని యిట్టె నెయ్యైనాఁ దెమ్మన నేల
సారె నీవు రానప్పటి చలిమందు లేలా

చ. 2: జాగరము సేయనేల సరిగా నిద్రించ నేల
వేడి నే వేఁగినందుకు వెంట రా నేల
యీగతి నడుసు చొర నేల కడుగఁగనేల
భోగించి నీకు నేపొద్దు బుద్ది చెప్పనేల

చ. 3: ఆకడఁ బంతము లేల అట్టె పందతన మేల
చేకొని గో రంటనేల సిగ్గువడ నేల
మేకుల శ్రీ వెంకటేశ మేలు నన్ను భ్రమయించి
పైకొని కూడితి వింక బా సడుగ నేల

రేకు: 0262-4 శ్రీరాగం సం: 09-070

పల్లవి: ఒకటి కొకటి నుండఁ జెలిభావ మిది
మొకమెదుటనె నన్ను మోవ వ్రాసెనే

చ. 1: పొలఁతికురులు వ్రాయఁబోతేఁ దుమ్మిదలాయ
తలఁగకుండఁగ మోముఁదమ్మి వ్రాసెనే
కలికికన్నులు వ్రాయ గండుమీలై పొడచూపె
చెలపచెమట నీటిచెక్కులు వ్రాసెనే

చ. 2: సరిఁ గుచములు వ్రాయ జక్కవలై పొడచూపె
నిరుదెస బాహులత లిటు వ్రాసెనే
గరిమ నడుము వ్రాయఁగా సింహమై తోఁచె
వరుసఁ దొడల యంటివనము వ్రాసెనే

చ. 3: కోమలిపాదాలు వ్రాయఁ గూర్మములై పొడచూపె
ఆమని జవ్వనపులోఁ తటు వ్రాసెనే
యీమేర శ్రీ వెంకటేశఁ డే ననుచుఁ గూడె
రామ యిట్టె యిదివో నా రతి వ్రాసెనే

రేకు: 0262-5 సామంతం సం: 09-071

పల్లవి: ఇచ్చక మాడ నెఱఁగ నేమి సేతునే
హెచ్చీఁ బెంజెమటలు యేమి సేతునే

చ. 1: చక్కని పతిగుణాలు సారె నాతోఁ జెప్పఁగాను
యెక్కడో వినీ వీను లేమి సేతునే
పెక్కువ నాతఁడు నన్నుఁ బిలువ నంపె ననఁగా
యిక్కడ నా మోము నవ్వీ నిఁక నేమి సేతునే

చ. 2: యిదె మేడపై నతఁడు యిటు నన్నుఁ జూచెనంటే
హృదయము చిల్లులయ్యీ నేమిసేతునే
వదల కాతఁడు నా వాకిటికి వచ్చె నంటే
యెదుటఁ గన్నీ ళ్లూరీ నిఁక నేమి సేతునే

చ. 3: బలిమి నాతఁడు నాపైఁ జేయి వేయఁగాను
యెలమి నిట్టూర్పు రేఁగె నేమి సేతునే
కలసి శ్రీ వెంకటాద్రిఘనుఁడు నన్నుఁ గూడఁగ
యెలఁదీగెమనేను వొంగె నేమి సేతునే

రేకు: 0262-6 శుద్ధవసంతం సం: 09-072

పల్లవి: చాలుఁజాలు నాతో జాణతనాలా
చాలుకొన్న నీచూపు జళిపించ నేలరా

చ. 1: పలుకవె చెలియ పచ్చిగా నదె రోరి
పలుకు నీ కప్పురపు బరణి నదె
నిలువవె కొంతవడి నే వచ్చినందాఁక
నిలువు నీ నామమందె నిక్కమాయ నదెరా

చ. 2: అడిగేనె యింతి అప్పటి ని న్నొక సుద్ది
అడుగులు నీయందునవె కదరా
ముడికారి సట లేలె ముదితా
ముడి నీ సిరసునఁ గొమ్ముడి యిదె కదరా

చ. 3: కలసితిఁ గదె నిన్నుఁ గలికి నీవు
కలగంపపతి వౌతఁ గంటిరా నేను
అలరి ని న్నురమున నానితిఁ గదె నిన్ను
నల శ్రీ వెంకటగిరి యానెఁ గదరా

రేకు: 0263-1 రామక్రియ సం: 09-073

పల్లవి: చెల్లెఁ జెల్లె నీవు సేసె చేఁత లెల్లాను నీ
పల్లదా లిన్నియు బండిబాటాయఁ దగవు

చ. 1: కద్దు గద్దు నీ మాట కల్ల లేదు పొల్ల లేదు
వద్దు వద్దు నీతోడి వాదులు నాకు
ముద్దు ముద్దు సేసి నిన్ను మోవఁ బెంచె మీ తల్లి
పొద్దు వొద్దుఁ గోమటిండ్లపొరుగాయ బదుకు

చ. 2: ఆయ నాయ నీ మాట లల్లములు బెల్లములు
మూయ మూయ నీకె మూరెఁడు నోరు
తోయఁ దోయఁ దల్లి వెన్నతోడఁ బెట్టె ముచ్చిములు
పోయఁ బోయ గొల్లదోమటాయఁ బో మా పెరుగు

చ. 3: వింటి వింటి నిన్ననె నీవేసాల బాసలును
కంటిఁ గంటి నిఁక నేల కైకొంటివి
యింట నింట శ్రీ వెంకటేశ పంతమిచ్చి నన్ను
నంటి యంటి నిచ్చకొత్తలాయఁ బో నా మనువు

రేకు: 0263-2 ముఖారి సం: 09-074

పల్లవి: మానిని భావము చూచి మాకు వెరగాయ నిదె
పూని చూ పోపక నీ పైఁ బూవు లెత్తి చల్లెను

చ. 1: విందు నీ మై సొమ్ముల నిగ్గు మాణికములలో
అండఁ దననీడ చెలి యన్నిటాఁ జూచి
కొండుక పదారువేలు గోపాంగనలు నీమై
నుండ వా రని తలఁచి వొగ్గిఁ దల వంచెను

చ. 2: వన్నెల నీ పచ్చడాన వ్రాసిన కోలాటపు
అన్నువపతిమలను అటు చూచి
మున్ను పురకామినుల మోహము మఱవ లేక
పన్నుక వున్నాడ వని పకపక నవ్వెను

చ. 3: కూడిన నీ రతిఁ దానె కోరి పెక్కుబంధముల
వేడుకఁ బెనఁగి శ్రీ వెంకటేశుఁడ
పాడి నిన్ని నేరుపులు పచరించితిఁ దా నని
చేడె వూరకె భ్రమసి సిగ్గు వడీ నదివో

రేకు: 0263-3 గౌళ సం: 09-075

పల్లవి: నీటినడు మడచితే నేఁడు రెండౌనా
యేఁటి కింక గొంకేవు యింతిఁ జేకోవయ్యా

చ. 1: వాసులఁ జందురులోనె వడిఁగందు గద్దు గాక
కాసే వెన్నెలలోనఁ గందు గలదా
ఆసల మోమునఁ గోప మటు నీపైఁ జల్లెఁ గాక
యీ సతికి మతిఁ గోప మింతయిన నున్నదా

చ. 2: కొలనిలో కలువలకొట్ట గొన వాఁడి గాక
అలరుఁ బరిమళము లవియూ వాఁడె
సొలసి చూచిన యింతి చూపులె వాఁడి గాక
నలువంకఁ గన్నులలో నవ్వులూ వాఁడా

చ. 3: అంది నారికళపుఁ గాయకుఁ బైనె గట్టి గాక
కందువ లోనూ నట్టె గట్టి యయ్యీనా
పొందిన శ్రీ వెంకటేశ పొలఁతి పై గుట్టు గాక
గొందినె కూడిన యింతిగుణము కఠినమా

రేకు: 0263-4 ముఖారి సం: 09-076

పల్లవి: ఏమే యిందు కెగ్గు లెంచఁ దగునా
కాముఁడు సేసినయట్టి కత లింతె కాక

చ. 1: నేనా తనతో నెమ్మిఁ గొసరేదాన తన్నుఁ
గానక యెదురుచూచె కన్నులు గాకా
కానీ కానిమ్మని కడుఁ బగ చాటితినా
వూని జంకించినవె బొమ్మలింతె కాకా

చ. 2: అలిగి తనతో నే నవ్వలిమో మౌదునా
చెలఁగి వంచినది నా సిరసె కాక
మలసి తనతోను మాటలాడ కుందునా
వెలసిన విరహపు పింతె కాక

చ. 3: పట్టఁగా నేనా పైకొనకుండేదాన
గుట్టుతోడ నుండెటి నా గుణము గాక
యిట్టె శ్రీ వెంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
పట్టిన నా నోము ఫల మింతె కాకా

రేకు: 0263-5 లలిత సం: 09-077

పల్లవి: మదనరాగము నీకు మదనాతురము నాకు
యెదు రెదురఁ గలిగె నిందుకే మెచ్చితిఁ బో

చ. 1: నిలువుల చెమటల నీమేను చూచినా
నిలువెల్ల జెమరించె నేఁ డిదివో
కలువ కన్నుల నీ కావి చూచి నా కన్నుఁ
గలువలు కావి దేరీఁ గాఁకల కోపమునా

చ. 2: వేఁడి నిట్టూరుపుల నీ వేషము చూచి నాకు
వేఁడినిట్టూర్పులు రేఁగె వెల్లవిరి
వాడుదేరెకళల నీ వదనము చూచి నేఁడు
వాడుదేరి చిన్నఁబోయ వదనము నాకు

చ. 3: యెవ్వతో కాఁగిటి నీ యీ మేనిపచ్చి చూచి
యివ్వల నీ కాఁగిలి నీ కెక్కె నిపుడు
రవ్వల శ్రీ వెంకటేశ రతుల సంగడి నిట్టె
నివ్వటిల్ల నిన్నంటి నీయంత నైతి

రేకు: 0263-6 శంకరాభరణం సం: 09-078

పల్లవి: తా నెట్ల నున్నాఁడో తరుణి వినిపించవే
కానక నినుఁ గన్న నతనిఁ గన్నట్ల నాయనే

చ. 1: కొంతవడిఁ దనుపేరు కోరి నాలుకఁ దలఁతునే
కొంతవడి దనసుద్దులు కొమ్మలచే బిందునే
కొంతవడి తానున్న కొలువుచిత్తరువు చూతు
కాంతయీరీతిఁ బొద్దు గడపుదునే నేను

చ. 2: మది నొక్క వేళఁ దనమాట దలపోతునే
కదిసి యొకవేళ దన్నుఁ గలలోనఁ గందునే
పదములనె వొకవేళ యెదురు నడతు నేఁ దనకు
తుద నిట్ల దినదినము దొబ్బుదునే నేనూ

చ. 3: సగినములు చూచుచు నే జరపుదునే వొకగడియ
వగలఁ దను దూరి లేకలు వ్రాతుఁ గొంతదడవు
జిగి నింతలోఁ గూడె శ్రీవెంకటేశ్వరుఁడు
మగిడి యల్లాడ నపుడు మలఁగుపయి నిపుడూ

రేకు: 0264-1 రామక్రియ సం: 09-079

పల్లవి: ఆకెవో నాప్రాణ మోహనపురాణి
దాకొని వేవేలు కాంతలలోన నున్నది

చ. 1: ముదితకురుల నెల్లా ముత్యములు మాణికాలు
గుదిగుచ్చి కీలుగంటు గొన్నది
సదరపు పసిఁడివజ్రాల చనుకట్టుది
అదె పైడిపూవులపయ్యెద వల్లెవాటుది

చ. 2: పచ్చలు దాచినయట్టి పాదుకలు మెట్టినది
లచ్చన మొగవుల మొలనూళ్లది
అచ్చపుటుంగరముల అందెలుఁ బాయవట్టాలు
గచ్చుల ముంజేతుల కంకణసూడిగేలది

చ. 3: నానాభూషణముల నానాసింగారాల
పానిపట్టి నా దిక్కే తప్పక చూచేది
ఆనకపు శ్రీ వెంకటాద్రిపతినైన నన్ను
తానె వచ్చి కూడి నాదగ్గరనె వున్నది

రేకు: 0264-2 సామంతం సం: 09-080

పల్లవి: అతనిదెస చూచి నిన్నపుడు దూరితి మమ్మ
వెతదీర నిఁకనైన విచ్చేయ వమ్మా

చ. 1: వుదయచందురుఁ జూచి వువిద నీ మో మనుచు
అదనరావైతివని యలిగి యవ్వలిమో మాయ విభుఁడు
యెదిటి మేఘముఁ జూచి యిదియె నీతురు మనుచు
కొదలుచును తల వంచి కొసరె నిన్ను

చ. 2: చిలుకపలుకులు నీదుపలుకులని యిందాఁక
యెలయించి తనిగొణఁగియెడసి వీనులు మూసుకొనియుండెను
తళుకునను మెరువ నంతట నీదుచూపులని
తెలియనిభ్రమల దోమతెరలోని కేఁగె

చ. 3: కోవిలలరొదలు విని కొమ్మ నీ యెలుఁ గనుచు
భావజుచేఁ బరచితని పదరి నినువేవేలు మాటలాడె
యీవేళ విచ్చేసి యిటు నీవు గలయఁగా
శ్రీవెంకటేశ్వరుఁడు చిక్కెఁరఁగఁ డాయ

రేకు: 0264-3 రామక్రియ సం: 09-081

పల్లవి: ఔనె మాటకు మాట ఆడితివి వోరి
కాని యింకా నేమి గలిగినాఁ జెప్పరా

చ. 1: కోరి నీ మోవి మెత్తన కుచముల కఠినాలు
చేరి నీతో పొందెట్టు సేయవచ్చునే
వోరి నీగుణము రాయి వొట్టిమాట చిగు రని
ఆరీతి నిందరికిఁ జూప ననువుగావలసిరా

చ. 2: కుత్తికె మరుశంఖము కురులు వంకగాలాలు
కొత్తనీకు నాకుఁ బొందు గూడు నటవే
వొత్తి నీ చదువు వేదా లొడ్డినవి గాలాలు
జొత్తుగా నింతటఁ జెప్పి చూపఁగ వలసిరా

చ. 3: కడు నీ నవ్వు చల్లన కనుచూపు చురుకులు
కొడిమె నీవు నన్నెట్టు గూడితివే
వడి శ్రీవెంకటేశుఁడ వలపులరతి నీకు
నుడిసి చలి వేఁడని చూపె నింతేరా

రేకు:	0264-4 బౌళి	సం:	09-082
పల్లవి:	సరికి బేసి కవె పగ సాధించుఁ గాని
	పరగ నందుకు నవె పతిమాఁటు చూపు
చ. 1:	వెన్నెలలె యెండ లట విరులె వాఁడెట
	యెన్నఁగ నిందుకుఁగా నేల వెరవ
	అన్నువ వెన్నెలరేని కారను రాహువుఁ జూ పు
	విన్ననై విరులకును విరహాగ్నిఁ జూపు
చ. 2:	చిగురులే చేగ లట చిత్తజుఁడే పగ లట
	యెగసక్కెముల నిందు కేల వెరవ
	గుగురుఁ జిగురునకు కుత్తికె కోవిలఁ జూపు
	పొగరుఁజంద్రుపుమోము పున్నమమారుకుఁ జూపు
చ. 3:	గాలియె వేఁడట జక్కవ లుద్దీపన మట
	యేల వెరవ శ్రీవెంకటేశుఁడు గూడె
	గాలికిఁ జనుఁగొండలు కమ్మర నడ్డము చూపు
	నాలి జక్కవలకు నీ నవ్వువెన్నెల చూపు

రేకు: 0264-5 శంకరాభరణం సం: 09-083

పల్లవి: అది గురుతు మరవ ననవె నేను
అదన నిన్నిట జాణఁ డనవె తాను

చ. 1: దోమటి నెందొ తన్నుఁ దోఁగి చూచితే నేను
నా మోము చూచి యట్టె నవ్వెఁగా తాను
కామించి యాడో సింగారములు నించుకోఁగా
వేమారు మొక్కితే దీవించెఁగా తాను

చ. 2: దంతపుటోవరిలోన తా నేపని నుండఁగానో
కొంత నేఁ బిలిచితే నూఁకొనెఁగా తాను
దొంతులఁ దమ్ములముపొత్తులఁ జేయఁగాఁ గంటె
చెంత నన్నుఁ దప్పక చూచెఁగా తాను

చ. 3: యీడకె శ్రీవెంకటేశుఁ డిప్పు డిట్టె విచ్చేసి
వాడికె సిగ్గులఁ దల వంచెఁగా తాను
కూడి చొక్కేవేళ మోము గురిగాఁ జూచితే నేను
మేడెపుఁ గాఁగిట నొక్కి మెరసెఁగా తాను

రేకు: 0264-5 ముఖారి సం: 09-084

పల్లవి: వేగుదాఁకా జాగరాల వేసారితిమి
వాగపు బిత్తరికాఁడ వచ్చేవొ రావొ

చ. 1: తళుకున మోము చూపి తల దీసే వంతలోనే
తొలుత నీ చేఁతల సుద్దులే తవ్వేవు
చలపట్టి వూరకైన సారె సారె నవ్వేవు
వలవంత సటకాఁడ వచ్చేవొ రావొ

చ. 2: పొడవులు చూపేవు పొంచి పగ చాటేవు
యెడసితే వెదకేవు యింతలోనే
బడి బడి నీడుగానిపనులకే పెనఁగేవు
వడఁబెట్టి సటకాఁడ వచ్చేవొరావో

చ. 3: బుద్దులఁ బోయేవు మెట్టి బూములెల్లాఁ దిరిగేవు
పొద్దువొద్దునకు నన్నుఁ బొదిగేవు
అద్దిర శ్రీవెంకటేశ అలమి కూడితి విట్టె
వద్దనుండి యిట్లనె వచ్చేవొ రావో

రేకు: 0265-1 వరాళి సం: 09-085

పల్లవి: కంటిమి వొకటిసేయఁగా నొకటి నీయందె
వొంట దొకటొకటికి నొద్దు మాతో బొంకులు

చ. 1: మాటలాడఁబోతే మచ్చము మోవిఁ దోఁచె
నాటఁజూడఁబోతేను నవ్వు దోఁచెను
నీటున నుండఁగఁ బోతే నిద్దుర గన్నులఁ దేరె
యేటి కింకఁ జాలు చాలు నేల మాతో బొంకులు

చ. 2: దగ్గరిరాఁబోతే వింతతాపులు బుగులుకొనె
వొగ్గి విడె మియ్యఁబోతే నొలికె సిగ్గు
బెగ్గిలి వేఁడుకోఁబోతే పెంజెమట మేనఁ జిందె
యెగ్గు లెంచ నిఁక నిన్ను బొంకే వయ్యా

చ. 3: కాఁగిట నన్నంటఁబోతే గందపు బేఁటులు రాలె
మాఁగిన రతులనుఁ దమకము రేఁగె
వేఁగుదాఁకా మాటల శ్రీవెంకటేశ కూడితివి
నీ గతులు చూడఁ జూడ నిజమె పో బొంకులు

రేకు: 0265-2 భైరవి సం: 09-086

పల్లవి: ఆడనుండె యేమి గల్లా నానతియ్యరా
జాడతో నలుక గాదు చాలించరా

చ. 1: చిగురాకు నామోవి చిత్తజు నడిద మట
తెగుఁజేసు నీ వంత దిష్టించకురా
పగటు నాకుచములు పాయని జక్కవ లట
యెగరుఁజేసు నీ వింత దగ్గరకురా

చ. 2: నల్లని నాయారు యిది నంజువంటి పామట
చెల్లఁబో యేమౌనో మమ్ముఁ జేరకురా
వెల్లవిరి నా నడుము వింత మేఁటి సింహ మట
కల్లరి యేమి సేసునో కాఁగిలించకురా

చ. 3: గరిమల నామేను కనకమువంటి దింతే
కరఁగజేసు నిట్టూర్పు గమ్మనీకురా
సిరుల శ్రీ వెంకటేశ చేరి కూడితి వింక
తరగు మొరఁగు దీరె దవ్వే చేరువరా

రేకు: 0265-3 కొండమలహరి సం: 09-087

పల్లవి: ఏమో సేయఁగఁ బోగా నేమో ఆయ
యేమని చెప్పుదుఁ బను లిటువంటివే

చ. 1: వుక్కుమీరి కృష్ణుఁడు మావుట్లు దించఁబోఁగాఁ
బక్కన నేఁ బారి తెంచి పట్టుకొంటినే
మొక్కలాన నతఁడు నా మోము చూచె నంతలోనె
మక్కువ నా మే నెల్ల మర పాయనే

చ. 2: కమ్మర నంతటఁబోక కాఁగులపాలంటఁ బోఁగా
బిమ్మిటిగాఁ గిందుమీఁదై పెనఁగితినే
యెమ్మెల నాతఁడు నా యిక్కువకుఁ జేయి చాఁచె
కమ్మి నా చిత్తము నీరై కరఁగితినే

చ. 3: వుద్దండాన గట్టి వెన్నముద్ద లారగించఁగానె
గద్దించి కాఁగిట నేఁ గమ్ముకొంటినే
వొద్దనె శ్రీ వెంకటేశుఁ డొంటి నన్నుఁ గూడఁగా
నిద్దరికిఁ బులకించి యేక మైతిమే

రేకు: 0265-4 సాళంగనాట సం: 09-088

పల్లవి: ఎటువంటి మోహమో యెట్టి సంతసములో
ఘటియించె నిద్దరికిఁ గందువ మాయెదుటా

చ. 1: కామిని యెదురు చూడగఁ గన్నుల పండుగలాయ
ఆమని నీ రాకల మోహనరూపము
వేమరు నాలకించఁగా వీనుల పండుగలాయ
కోమలితో నీ వాడే గురిమాటలు

చ. 2: మానినికి నింతలోనె మంచి వుట్ల పండు గాయ
ఆనెటి నీ మించు నధరామృతము
తానకమాయ నిదిగో తగు దివ్వెల పండుగ
పాని నీ కరుణఁ జూచే పచ్చి చూపులు

చ. 3: కలికికి నిపు డిట్టె కాఁగిటి పండుగ లాయ
చలువ నీ కూటముల సమరతులు
అలరి శ్రీ వెంకటేశ అన్నిటాఁ బండుగ లాయ
జలజాక్షి నీలోని సరసములు

రేకు: 0265-5 నాదరామక్రియ సం: 09-089

పల్లవి: చెలువుఁడ నీవు మేలు చిత్తమె తీలుగాని
పలుకులఁ దనిసితి బాస లెట్టో కాని

చ. 1: అంది నీ మాటలు మోవి యమృతపుఁ దీపె పో
చిందర నీ చేఁతలె చేఁదు గాని
విందుల నీ ప్రియములు వెన్నకంటె నున్ననె పో
కందువ నీ గుండె యిదె కడురాయి గాని

చ. 2: సొంపుల నీ యిచ్చకాలు చుక్కలకంటె గనము
గుంపెన నీ గుణమె కొంచము గాని
తంపి నీ చుట్టరికము తామెరకంటె దంపర
యింపు నీ వలపె యార డిన్నిటిలోఁ గాని

చ. 3: గరిమె నీ నగవులు కప్పురాలకంటెఁ జవి
కరఁగు నీ విడెమె కారము గాని
యిరవై శ్రీ వెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సరవు లిప్పుడు మేలు సటదొల్లెకాని

రేకు: 0265-6 పాడి సం: 09-090

పల్లవి: ఎట్టు సింగారింత మమ్మ యీ యింతిని
ముట్టని సింగారము ముందు ముందె యమరే

చ. 1: పొలితి చంద్రవంకబొట్టు వెట్టఁ బోయి సంది
మలసే గోరొత్తు చూచి మాని నవ్వెను
కలిమిఁ జంద్రగావి గట్టఁబోయి అద్దములో
సొలపుఁ గన్నుల కావి చూచి నవ్వెను

చ. 2: అమరిన ముత్యాలహారములు వెట్టఁ బోయి
చెమటముత్యాలు చూచి చెలి నవ్వెను
కొమరె యరవిరులు కొప్పున ముడువఁ బోయి
తమిఁ బులక విరులు తాఁ జూచి కొంకెను

చ. 3: వీఁగుచుఁ బరిమళము వెలఁది వూయఁగఁ బోయి
కాఁగిటి వాసన చూచి కడు నవ్వెను
సొగల శ్రీవెంకటేశు సురతసింగారము
వాగమై యమరెఁ గాన వన్నెలెల్ల నమరే

రేకు: 0266-1 లలిత సం: 09-091

పల్లవి: మనలోని మాఁటా మనసులో తీఁట
వెనకఁ జెప్పేఁ గాని విడువు మీ పూఁటా

చ. 1: మొగములో బిగువు మోవిమీఁది తగవు
జిగి దేరె నిందరిలోఁ జెప్పనేలా
చిగురుఁగొప్పు చెదరు చిమ్ముఁ జూపుల బెదరు
నగితేనె పచ్చి దేరి నన్ను నేమీ ననకు

చ. 2: ముక్కున వుసురులు చెక్కుల యసరులు
కుక్కి తోయ కంత కొంత గుట్టె మేలు
అక్కుపై గురుతులు అంగపు సరతులు
మక్కళించనేల యిది మరువకు చాలు

చ. 3: కాఁగిటి మైతావులు కన్నుఁగవకావులు
యీగతి నా భావము నా యెదుట నేల
భోగపు శ్రీ వెంకటేశ పొందితివి నన్ను నిట్టె
రాఁగిన సరసములు రచ్చలలోఁ దగునా

రేకు: 0266-2 పాడి సం: 09-092

పల్లవి: ఇందుకేమి దోసమా యింతలోనిపని కేమి
కందుఁ గుందు నేరుపుచేఁ గప్పి పోయఁ బో

చ. 1: చక్కని నీ వదనము చందరునికంటె మేలు
ముక్క పోయినది నీ మోవి యింతె పో
మిక్కిలి నీతురుమిది మేఘముకంటె మేలు
చిక్కువడి జారివది సిగ్గువాటి పో

చ. 2: నిచ్చలు నీ దేహ మిది నీలముకంటె మేలు
పచ్చియై వున్నది నీ భావ మింతె పో
తచ్చిన నీ కరములు తామెరకంటె మేలు
కొచ్చి దయలేనిది నీ కొనగోరె పో

చ. 3: పమ్మిన నీ కాఁగిలిది పానుపు కంటె మేలు
వుమ్మచెమటలఁ దోఁగె వుర మింతె పో
యెమ్మెల శ్రీ వెంకటేశ యిన్నిటా నీపు మేలు
చిమ్మి చిక్కించేది నీ చెలువమె పో

రేకు: 0266-3 భైరవి సం: 09-093
పల్లవి: విన్నపాల కెవ్వరికి వేళ గాదు
వున్నతి నంతరంగాన నున్నాఁడు దేవుఁడూ
చ. 1: సరుస చెమటలు మేన జారఁ గాను
నిరతపు నిట్టూరుపు నిగుడఁగాను
సరిఁ గరఁగి జవ్వాది జారఁగాను
వొరసి మలఁగుమీఁద నున్నాఁడు దేవుఁడూ
చ. 2: తెల్లని కన్నుల నిద్ర దేరఁగాను
చిల్లరై గంధపుబేఁట్లు చిట్లఁగాను
వొల్లనె కొప్పున విరు లొలుకఁగాను
వుల్లసాన నరవిరై వున్నాఁడు దేవుఁడూ
చ. 3: అలమేలుమంగ మేలమాడఁగాను
కలయఁ దమకములు గదుమఁగాను
అలరి శ్రీవెంకటేశుఁ డల్ల వాఁడె
వొలిసి యేకతమున నున్నాఁడు దేవుఁడూ

రేకు: 0266-4 శుద్ధవంతం సం: 09-094

పల్లవి: తిట్టనేర్తునా నిన్ను దీవించ నేరుతుఁ గాక
దిట్టనై నీకు మోహించు తెరవ నేఁ గాక

చ. 1: కోరి నీ వేమి సేసినఁ గోపగించ నేరుతునా
నేరుపునఁ జెక్కు నొక్క నేరుతుఁ గాక
సారె నిన్ను వెంగెమాడి జరయఁగ నేరుతునా
ఆరీతినె నిన్నుఁ గొనియాడ నేర్తుఁ గాక

చ. 2: చీకాకుమై చూచి వుదాసీనము సేయ నేర్తునా
నీకు నేఁ బ్రియము చెప్ప నేరుతుఁ గాక
ఆకడ నీనిట్టూర్పుల కదే మన నేర్తునా
దీకొని నీ యల పెల్లఁ దీర్చ నేర్తుఁ గాక

చ. 3: కామించి మొక్కఁగ నిన్నుఁ గాల దొబ్బ నేరుతునా
నేమమునఁ గాఁగిలించ నేరుతుఁ గాక
గోమున శ్రీవెంకటేశ కూడితివి బాస సేసి
యీ మేలు మరవ నే నెంతైన నేర్తునా

రేకు: 0266-5 మంగళకౌశిక సం: 09-095

పల్లవి: సొరిది నీ జాడ లెల్లఁ జూచుట గాక
యెరవు సతము లెంచ నిఁక నేల విభుఁడా

చ. 1: నీవే నే నైతే నిలుచుందువా ఆడ
వోవరి నామీఁద నొరగుందువు గాక
పూవే పిందైతే పూఁప లనే మాఁట లేల
చేవదీరి శమువలెఁ జెప్పి చూపుఁ గాకా

చ. 2: తమకమే కలిగితే దవ్వుల మాటాడుదువా
అమరి నాతో నేకత మాడుదు గాక
కమలమే కలువైతేఁ గడరేయి మొగుచునా
సమమై కాంచనముల జాడ నుండుఁ గాక

చ. 3: చిత్తము లేకము లైతేఁ జేతి కిత్తువా విడెము
పొత్తుల మోవినె అంది యిత్తువు గాక
యిత్తల శ్రీవెంకటేశ యిటు గూడిన నీ పొందు
హత్తి పాలునీరువలె నైక్యమాయఁ గాక

రేకు: 0266-6 పాడి సం: 09-096

పల్లవి: అక్కలాల అమ్మలాల అందరు నున్నా రిదె
చెక్కుచేత నుంటిఁ గాక సిగ్గువడి వుంటినా

చ. 1: వుండి వుండి నాలోన నుసురంటి నింతె పో
అండ నేఁ దను వెంగెము లాడితినా
దండియై కన్నీళ తోనే తప్పక చూచితిఁ బో
నిండుఁ గొలువునఁ దన్ను నేరము లెంచితినా

చ. 2: నా తమకములు చూచి నవ్వుకొంటి నింతె పో
చేతికి లో నని తన్నుఁ జెనకితినా
మోతలఁ గాఁకలతోనే మోము వంచితి నింతెపో
పై తరవువెట్టి తన్ను బలిమి సేసితినా

చ. 3: కడలేని మోహమునఁ గాఁగిలించితి నింతెపో
వుడివోని వెరగుతో నూరకుంటినా
యెడలేక శ్రీవెంకటేశుఁడు న న్నేలఁగాను
కడు నే మెచ్చితిఁ బో కాదంటినా

రేకు: 0267-1 సామంతం సం: 09-097

పల్లవి: తొల్లిసేసినంతె చాలు తోడఁ జేతనం బెట్లు
చిల్లరచేఁతలు యిఁక జేయఁగ వద్దనవే

చ. 1: గొల్లెత లుసురు పిల్లఁగోవిమోతలై యంటె
వొల్లనె నన్నిఁక నేఁప నొద్దనవే
మెల్లనె వారితొ బొంకిమే నెల్ల నల్ల నాయ
కల్లలు నాతో నాడఁ గమ్మటి వద్దనవే

చ. 2: నెలఁతల కనుదిష్టి నెమలిచుంగులై యంటె
వలఁబెట్టి చలపట్ట వద్దనవే
అల మదరాగము పీతాంబరమై మొల నంటె
యెలయించి ననుఁ బాయ నింకా వద్దనవే

చ. 3: చేరినవారి పొందులు శ్రీసతియై వుర మంటె
వోరసేయ నాతో నొద్దనవే
యీరీతి శ్రీవెంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడి
గారవించె నిఁక నెందూఁ గదల వద్దనవే

రేకు: 0267-2 శంకరాభరణం సం: 09-098

పల్లవి: నాకు నాకే వెరగయ్యీ నన్నుఁ జూచి
పైకొని మరుఁడు సేసే భ్రమత గాఁబోలును

చ. 1: పులకించితి నింతె పూవుల మొగ్గలు రాలీ
కలికి వసంతము గాఁబోలు
పలికితి నింతె నేను పైకొనీ కెంజాయకెంపు
కలయగ నెరసంజ గాబోలును

చ. 2: విందుల నవ్వితి నింతె వెన్నెలపాలపుగాని
కందువ చంద్రోదయము గాఁబోలును
ముందరఁ జూచితి నింతె ముంపు దామెరలు రాలీ
దిందుపడి యింతలోనె తెల్లవారఁబోలును

చ. 3: చెమరించితి నింతె నేసముత్యములు రాలీ
తమి శ్రీవెంకటపతి దగ్గరఁ బోలు
అమరఁ గూడితి నింతె ఆతఁడు మేను మరచె
సమమోహములలోని సందడి గాఁబోలును

రేకు: 0267-3 దేసాళం సం: 09-099
పల్లవి: ఇందరు సవతులకు నిటు నేనె గురియా
సందడి నాతనినే జరయ రాదా
చ. 1: కోరి నన్నుఁ జూచి చూచి కోపగించే వది యేమే
ఆరీతి నాతఁడు మాటలాడ కుంటేను
సారె వెంగెమాడేవు చలమున నిది యేమే
రారాఁపై నీ కడకు రాకుంటేనూ
చ. 2: వున్నట్టై నామాట విని వుస్సురనే వది యేమే
అన్నిటా నాతఁడు మేలమాడఁ దంటాను
కన్నులఁ దప్పక చూచి గదరుకొనే వేమే
మన్నన నాతో సరి మన్నించఁ డనుచు
చ. 3: నాలి నా యెదుట నీవు నవ్వు నవ్వే వేమే నిన్నుఁ
బోళిమితోఁ బొంది నన్నుఁ బొందె నంటాను
అలరి శ్రీ వెంకటేశుఁ దాతఁడేమి సేసినాను
నీలాగు భాగ్యము గాక నే నేమి సేతునే

రేకు: 0267-4 బౌళి సం: 09-100

పల్లవి: అయినట్టయ్యీఁ గాని అల్లాడనే
పయిపూఁత సటమాని పదరాదా

చ. 1: కన్నులఁ జూడనిదానవు మమ్ముఁ గవకవ నవ్వనేలెనీ
చిన్నిమోమెత్తనిదానవు చెక్కుచెమరించనదియేలె
కన్నె సిగ్గువడ్డదానవు నన్నుఁగడునిక్కిచూడనేలె యీ
పన్నెటి మాయలు మాని పదరాదా

చ. 2: పొంచి మాటాడనిదానవు మాతో బొమ్మలజంకించనేలె నా
మంచానకు రానిదానవు నీవు మరి వుస్సురననేలె
కంచపు పంతపు దానవు మా కత లాలకించ నేలెయీ
పంచల మాయలు మాని పదరాదా

చ. 3: వొలిసీ నొల్లనిదానవు నీ వొళ్లు పులకించ నేలె నేఁ
గలసితి శ్రీ వెంకటపతిని
బలిమిఁ బెనఁగేదానవు యిట్టె పరవశ మందనేలెనీ
పలుకుల మాయ మాని పదరాదా

రేకు: 0267-5 సామంతం సం: 09-101

పల్లవి: ఆఁటదాని కింత యేల అంతలోని పనికిఁగా
పూఁటపూఁటఁ దనతో నేఁ బోరనేలా

చ. 1: వలవని పతికె వలచే యా రోఁత లేల
మలసెటి విరహాగ్నిమంట లేదా
పలుకని పతితోడఁ బలుకఁగ నది యేల
ములుగుచుఁ బానుపుపై మోనము లేదా

చ. 2: యింటికిరానిపతికి నెదురు వోవఁగ నేల
జంటయి మునుఁగఁ జింతాజలధి లేదా
నంటులేని పతితోడ నవ్వఁబో నంత యేల
అంటరాని చిగురాకుటమ్ములు లేవా

చ. 3: కడదొక్క పతితోడఁ గాఁగిలించ నిది యేల
ముడిచి యవ్వలి మారుమోము లేదా
అడరి శ్రీవెంకటేశుఁ దాదరించి నన్నుఁ గూడె
సడి వూరకే యంటి సరసము లేదా

రేకు: 0262-6 సాళంగం సం: 09-102

పల్లవి: చెప్పకువే వానిసుద్ది చెవు లెల్లాఁ జిల్లు లయ్యీ
దప్పిదేరెఁ జాలు చాలు తానె బదుక నీవే

చ. 1: వొక యింతికిఁ బుట్టి వొకరికొడుక ననె
అకట నేఁ దిట్టఁగా దా నటు రోసినా
వికటించి మేనమామ వీటి కేఁగి తానె చంపే
యెకసక్కెఁడు వీనితో నేఁటి చుట్టరికమే

చ. 2: కొడుకు దెచ్చినయట్టి కొమ్మలు పదారువేల
యెడరై పెండ్లాడెఁ దన కేఁటి వావే
చిడుముడి గొల్లెతల చీరలు దొంగిలినట్టి
అడిబండనికి నేఁటి యాచారమే

చ. 3: శ్రీ వెంకటాద్రి మీద శ్రీసతి నురాన మోచె
యీవలఁ దనకు నిఁక నేఁటి సిగ్గే
కావించి నన్నుఁ గూడి కమ్మరఁ బ్రియము చెప్పె
యీవేళ వెనక యెంచ నిఁక నేఁటికే

రేకు: 0268-1 సాళంగనాట సం: 09-103

పల్లవి: సటలకు జంపు నాతో జరపేఁ గాక యిట్టె
కటకటా నిజ మెల్లఁ గానరాదా నాకు

చ. 1: కడుమోహము నాపైఁ గలవాఁడె తా నైతె
యెడమాట లాడుదాఁకా హృదయము నిలిచీనా
వొడఁబాటులేమి గల్లా వొద్ద నాతో నాడుఁ గాక
విడువు మనవె యిట్టివేషము లెరఁగనా

చ. 2: కరుణె తనమతిఁ గలిగినవాఁ డైతె
అరయ నాహార నిద్ర లాడఁ దన కింపౌనా
కొరతలేమిగల్లాఁ గోరి నాతో నాడుఁ గాక
వెరవున విడు విడు వేసా లెరఁగనా

చ. 3: తానె నే నైతె తనువులు వే రౌనా
తానె మతికి మతిఁ దారుకాణ లౌఁ గాక
యీ నెపాన శ్రీవెంకటేశుఁడు నన్నుఁ గూడె
వీనుల వినిన నింతె వేసా లెరఁగనా

రేకు: 0268-2 పాడి సం: 09-104

పల్లవి: కొండవంటి దొరతోడి కోపములేల
దండనె దవ్వుదవ్వుల దక్కుటింతె కాకా

చ. 1: పూచిన వెన్నెలలంటేఁ బుప్పొడి వెదక నేల
చూచి చూచి కన్నులనె చొక్కుట గాక
యేచి నీవు నవ్వితే న దేమని యడుగ నేల
నాచుల మారుకు మారు నవ్వుటింతె కాక

చ. 2: నేతిబీరకాయంటే నేయి వెదకఁగ నేల
పూఁతగొని లోలోనె పూఁకొంట గాక
చేత నీవు విలిచితే చేరి దగ్గరఁగ నేల
మోఁతల నందుకు మెచ్చి మొక్కుటింతె కాకా

చ. 3: కోరి మోవితేనెలంటే గుక్కిళ్లు మింగ నేల
చేరి నిన్నుఁ గూడి యిట్టె చేకొంట గాక
ఆరయ శ్రీవెంకటేశ అంత నీతోఁ జల మేల
మేర మీరినట్టి నిన్ను మేలనుట గాక

రేకు: 0268-3 రామక్రియ సం: 09-105

పల్లవి: కందము విందము గాక కన్నులారను
అంది యెండ వెన్నెలైతే న దెవ్వరి మేలు

చ. 1: కానీవె అందు కేమి కా దనఁగ వచ్చునా
మోనానఁ దానంటేఁ జాలు మొక్కే నేను
పోనీ పోనీ వీరి వారి బుద్ధులైన వినేఁగా
అని వేము దియ్యనైతే నదెవ్వరి మేలు

చ. 2: తనలోనె నవ్వనీవే దాని కేమి దోసమా
వొనర మమ్ముఁ జెనకకుంటేఁ జాలు
కననీ కననీ తన కడలచుట్టరికాలు
అనుమె మిను మైతేన దెవ్వరి మేలు

చ. 3: మేలు మేలు యిది యేమె మేనవావి బలువా
యీలీల నన్నుఁ గూడె నింతే చాలు
అలరి శ్రీవెంకటేశుఁ డంతటివాఁ డౌఁ గా
ఆలు మగఁ డొక్క టైతేనదెవ్వరి మేలు

రేకు: 0268-4 హిజ్జిజి సం: 09-106

పల్లవి: దక్కె నీకుఁ బంతము తగు నింక సంతము
మక్కువఁ గలసి యనుమాన మింకానా

చ. 1: పచ్చికస్తూరినామము పాదపులత్తుక లాయ
కొచ్చి పతిమీఁద నేలె కోప మింకాను
నిచ్చ సిరసు విరులు నీకుఁ బాదపజ లాయ
దిచ్చరి నీ యలుకింకాఁ దీర దాయనా

చ. 2: పతివదనము తమ్మపడిగ మాయ నీకు
మతిఁ జల మింకా నాకు మానదటవే
ఆతని చెక్కు చెమట లర్ఘ్యపాద్యము లాయ
తతి నీగుండె గరఁగదా యింకాను

చ. 3: మంచి మంచి వుంగరాల మాణిక పు మట్టెలాయ
మంచ మెక్కి వుండి యడమాట లింకానా
వంచనై శ్రీవెంకటేశు వావి వరుసయుఁ గూడె
అంచె రతులఁ గూడితి వాస లింకానా

రేకు: 0268-5 పాడి సం: 09-107

పల్లవి: ఎట్టు గెలువఁగ వచ్చు నిట్టి వానిని
మెట్ట వచ్చి నా కాలు మేలు గాదా

చ. 1: కొచ్చి కొచ్చి తన్నునేఁ గోపగించఁగా తా
నచ్చపు నవ్వులు నవ్వీ నంతె కాదా
వొచ్చ ముదనందు నే నొగిఁ జూపఁగా నన్ను
మెచ్చి చేయి వేయ వచ్చీ మేలు గాదా

చ. 2: వెక్కసమై తన్ననే వెంగెమాడఁగా తా
నక్కడివా రందు మోపీ నంతె కాదా
తెక్కుల నేఁ దన్ను దూరి తిట్టఁ గానె నేఁడు దా
మిక్కిలి నన్ను దీవించీ మేలు గాదా

చ. 3: కడుఁ దమకాన నేఁ గసరఁగా తా
నడరి కాఁగిట నించీ నంతె కాదా
యెడయక శ్రీ వెంకటేశుఁ డిటు గూడి నా
మెడ యెత్తి చెక్కు నొక్కీ మేలు గాదా

రేకు: 0268-6 సామంతం సం: 09-108

పల్లవి: పోపో నీ పోలికలు పోలుచకురా అయితే
నీ పోలికలసాటె నే నయ్యేనే

చ. 1: పాముపడుకవాఁడ పట్టకురా ఆ
పాముపంటి యారు నీకుఁ బాయదు గదే
గామిడి చక్రమువాఁడ కదియకురా వో
చామ నీ పిఱుఁదు ఘనచక్రము గాదా

చ. 2: నెమలిచుంగులవాఁడ నిలు నిలరా ఆ
నెమలినడపు లెల్లా నీకు లేదటే
తమి సంకుఁ బేరివాఁడ తడవకురా
అమరె నీ మెడ శంఖ మదె కదవే

చ. 3: కొండపయి శ్రీ వెంకటేశ కొంకనేలరా ఆ
కొండలకు చాలు నీకుఁ గొలఁదె కదే
నిండుఁ గాఁగిటను నన్ను నించితి వపురా
నిండుఁగళలమోము నెలఁతవు గదవే

రేకు: 0269-1 ముఖారి సం: 09-109

పల్లవి: కాఁగలదయ్యీఁ గాక కాఁక లేఁటికే
దాఁగ నేల యింతలోనె తానె నే ననవే

చ. 1: కంటిచూపు వాఁ డాయ కమ్మనవ్వు వేఁ డాయ
యింటిలో నింకా బుద్ధులేమి చెప్పేవే
కుంటెనలు విసుపైఁ గోరికలు ముసిపై
అంటఁగాక వున్నదాన నానవెట్ట నేఁటికే

చ. 2: మంతనాలు దరచాయ మాటపట్లు గురుచాయ
యెంత కెంత వొడఁబాట్లిఁక నేఁటికే
దొంతులాయఁ గూరిములు దూరులాయ నేరములు
వంతులు వాసులు నింక వద్దనవే

చ. 3: చిత్తమెల్ల నీ రాయ సిగ్గు లెల్ల జారాయ
యిత్తల వెనకసుద్దు లిఁక నేఁటికే
అత్తిన శ్రీవెంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
తత్తరపు వేడుకలు దలకూడెనే

రేకు: 0269-2 మంగళకౌశిక సం: 09-110

పల్లవి: ఏకచిత్త మైనప్పు డిన్నియు మరెయ్యీఁ గాని
నాకు నీ వేళకు నీ నవ్వులె చాలు

చ. 1: చిక్కువడివున్నది నాచిత్తము నీ
చెక్కులఁ జిందరలైన జీరలవలె
చక్క నన్ను మాటాడించకురా నీవూ నీకు
మొక్కేను నా కింక మోనమె చాలు

చ. 2: కడుఁ గాఁక రేఁగె నా కాయము నీ
కడల పుక్కిటతమ్ముకారమువలె
పడి నా పయ్యెదకొంగు పట్టకురా నీకు
వెడఁ బంత మిచ్చే నాకు విరహమె చాలు

చ. 3: పరవశమాయ నా భావము
గరిమ నిద్దురల నీ కన్నులవలె
యిరవై శ్రీవెంకటేశ యేలితివి యిది
మరిగితిమి నాకు నీ మన్ననె చాలు

రేకు: 0269-3 ఆహిరి సం: 09-111

పల్లవి: ఇట్టిదివో సతిమోహ మిదివో మా విన్నపము
యెట్టు వలసినఁ జేయు మిఁక నీచిత్తము

చ. 1: తరుణి నీకు వలచి తనువె మఱచెఁ గాని
మరులు నీపై భక్తి మఱవదు
గిరమ విరహవడఁ గన్నులు మూసెఁ గాని
నిరతి నీవు వచ్చే వని తలుపే మూయదు

చ. 2: నిండు నీపై చింతచేత నిద్దుర విడిచెఁ గాని
దండి నీ నామజపము తా విడువదు
అండనె సింగారించె యాసలె మానెఁ గాని
నిండుఁ జేత నీకు మొక్కే నేమమే మానదు

చ. 3: చిక్కి యిట్టెఁ నిన్నుఁ గూడి సిగ్గులతోఁ బాసెఁ గాని
తక్కక నీ సరసము తాఁ బాయదు
మిక్కిలి శ్రీవెంకటేశ మెచ్చ నిన్ను నేర్చెఁ గాని
చక్క నీ వెటు సేసినా సాదించ నేరదు

రేకు: 0269-4 శ్రీరాగం సం: 09-112

పల్లవి: ఇంతికి నీ వెరవా యిచ్చకా లెరవు గాక
మంతనము నీకు లేదా మారు లేదు గాక

చ. 1: తలపోఁత గరవా తరుణిట్టె నినుఁ బాసె
కలది నెన్నడు మనె కరవు గాక
పులకలుగొంచమా పొలఁతి నిన్నిటు చూడ
కొలఁదివాఁడిన మోమె కొంచము గాక

చ. 2: జాగర మేమి దొడ్డా సతితో నీ వలుగఁగా
తోఁగిన నీటికన్నులె దొడ్డ గాక
బాగుల నిన్నద్దలించ బరవా బొమ్మలను
పాఁగిన యింతికుచాలె పై తరవు కాక

చ. 3: ఆయములు దాఁకవా అంగజుఁడు చెలి సేసె
దాయపుఁ గోరిక కొనదాఁకదు గాక
యీయెడ శ్రీవెంకటేశ యింతి నిట్టె కూడితివి
మాయలా యిన్నియును నీ మన్ననలె కాక

రేకు: 0269-5 కాంబోది సం: 09-113

పల్లవి: విడు విడరే యీ విధ మేల సతి
బడి బడి నేఁటికి భ్రమయించేరే

చ. 1: కామాతురమున కలిగిన కాఁకలు
ఆమని పన్నీట నారీనా
నేమపు నీరువట్టు నేతఁ దీరునా
కామిను లేఁటికిఁ గారించేరే

చ. 2: చిత్తములోపలి చింతలచీఁకటి
యెత్తిన దీపాల నెడసీనా
గుత్తపుటాకలి గుక్కిళ్లఁ దేరునా
యిత్తల సతి నే లేఁచేరే

చ. 3: శ్రీవెంకటపతిఁ జెందెటి యాసలు
తావుఁ గుంటెనలఁ దనిసీనా
యీవేళనె చెలి నితఁడు గూడెను
నావల మీ రేల నవ్వేరే

రేకు: 0269-6 బౌళిరామక్రియ సం: 09-114

పల్లవి: ఒద్దు మమ్ముఁ జెనకక వుండుమనవే
యిద్దరము నెదురైతి మింతె పొమ్మనవే

చ. 1: పాలవంటికులము మా భావము నిచ్చలము
నాలి మమ్ముఁ జూచి యేల నవ్వీనె తాను
పోలింప మా యంకులును పుప్పొడిమై సంకులు
చాలు నిది చూచి తాను సన్నలేల సేసీనే

చ. 2: మోచేవి చల్లలు నేము ముడిచేవి మొల్లలు
పూఁచి యేల రట్టుసేసి పొంచీనె తాను
కాచేదా మా మందలు కడసారె నిందలు
యేచి తాను మమ్ము గేలి యేల సేసీనే

చ. 3: గుంపెన మా నడపు కొప్పు గడు నిడుపు
తెంపున మమ్మేల యింత తేల నాడీనే
యింపుల శ్రీవెంకటేశుఁ డింతలోనె మమ్ముఁ గూడె
సంపదల మమ్ము నేల సాదించీనే

రేకు: 0270-1 నాదరామక్రియ సం: 09-115

పల్లవి: చెల్లని చేఁతలు చెల్లీఁ జెలియ నీ కిట్లని
అల్లదె నీ పతి నిన్ను నడిగి రమ్మనెనే

చ. 1: నాతి నీ మోముఁ దమ్మిలో నవ్వువెన్నెలలు గాసె
యీతల నందుకు నిందు కేమి వోదే
నీతుల నీ యెదుటను నీ రమణుఁ డిటు చూచి
ఆతల నీ భావము అడిగి రమ్మనెనే

చ. 2: కేరి కన్నుఁగలువల కెంపు సూర్యోదయ మాయ
యేరీతి నందుకు నిందు కేమి వోదే
కారణము లేని చేఁత కమ్మర నీ పతి చూచి
ఆరసి నీ భావము అడిగి రమ్మనెనే

చ. 3: జక్కవచన్నుల మీఁద చంద్రవంక లటు నించి
తక్కి శ్రీవెంకటపతి తానె చూచె
యిక్కువతో నిన్నుఁ గూడి యెదురుమేడ యెక్కి
అక్కడ నీ భావము అడిగి రమ్మనెనే

రేకు: 0270-2 సామంతం సం: 09-116

పల్లవి: నీకు నీకె మాకు మాకె నేరుపులు
ఆకడ నీకడ నేమంత కోపఁ గలమా

చ. 1: మందమిరియాలువో నీమాటలు
నిందలకు గురివో నీనీటులూ
సందడిఁ బెండ్లివో నీ సరసాలూ
అందపు రమణుఁడ నే మంత కోపఁ గలమా

చ. 2: సూదుల మూటలువో నీ సుద్దులూ కడుఁ
బోది సేసేకొలఁది నీబుద్దులు
గాదెల కొలుచువో నీ గాథలు
ఆదెస నీదెస నే మంత కోపఁ గలమా

చ. 3: ముట్టితేనె ముయివో నీ మొక్కులు
చెట్టునఁ జేటఁడువో నీచిక్కులు
గుట్టున శ్రీవెంకటేశ కూడితివి యిఁక
నట్టు నిట్టు నిన్ను నాడ నంత కోపఁ గలమా

రేకు: 0270-3 ముఖారి సం: 09-117

పల్లవి: అయినట్టయ్యీఁ గాక అంతయేఁటికే
పయిపైఁ గలపితివి పాఁచి యేఁటికే

చ. 1: వల్లెవాటుఁ బయ్యదతో వాడుఁగొప్పు విరులతో
చల్లె లమ్మె గొల్లెతవు జంకె నేఁటికే
చిల్లర చెమటతోడ చిక్కని పూర్పులతోడ
గొల్లలెక్క లాడేవు కోప మేఁటికే

చ. 2: పులకజొంపాలతోడ బొమ్మంచు మోవితోడ
కొలచినందె కొలచి కొంక నేఁటికే
కలకల నవ్వుతోడ కందువ సిగ్గులతోడ
వెలయఁగఁ జెప్పేవు వింత లేఁటికే

చ. 3: పుక్కిటి విడెముతోడ పూఁతల గందముతోడ
అక్కునఁ బోసి చూపే వాన లేఁటికే
యెక్కువల శ్రీ వెంకటేశుఁడనైన నన్ను
గక్కనఁ గూడితి వింక గద్దించ నేఁటికే

రేకు: 0270-4 రామక్రియ సం: 09-118

పల్లవి: నీవే నే నైతిఁగా నేరుపు నేరాల కేమి
చేవ దేరెఁ జాలు చాలు చెప్పకు నీ సుద్దులు

చ. 1: తలఁ పొక్కటాయఁగా తమకము లెన్నియైనా
పలు కొక్కటాయఁగా పంతము లెన్నైనా
చలములు చెల్లేఁగా సాదింపు లెన్నియైనా
చెలువుఁడ చాలుఁ జాలు చెప్పకు నీ సుద్దులు

చ. 2: చన వెక్కు డాయఁగా సరసాలు గనమైనా
నను పిది గలిగెఁగా నాఁటకము లెన్నైనా
మన విది చెల్లేఁగా మంతనాలు దరచైనా
చెనకకు చాలుఁ జాలు చెప్పకు నీ సుద్దులు

చ. 3: కూటములు గలిగెఁగా కోరికలు దరచైనా
నీటుమీఁద మిక్కిలిగా నిండుఁ బరవసమైనా
యేటికి శ్రీవెంకటేశ యెనసితి మిద్దరము
చీటికి మాటికి నింకఁ జెప్పకు నీ సుద్దులు

రేకు: 0270-5 శ్రీరాగం సం: 09-119

పల్లవి: ఇంత చాలదా యింతి కిదొకటే
రంతుల రమణుని రప్పించెఁ గనక

చ. 1: పలికిన పలుకుకు పంతం బొకటే
వెలఁది విభుని నవ్వించెఁ గనక
నిలిచిన నిలువుకు నిచ్చల మొకటే
మలయని పతిఁ బెడ మరలించెఁ గనక

చ. 2: చూపు చూచుటకు సొద్యం బొకటే
యీపతిఁ జెమటల నెనపెఁ గన
తీపుల నటనకు తేజం బొకటే
కోపపుఁ బతి నూఁ కొనిపంచెఁ గనక

చ. 3: ఘనమగు రతులకుఁ గైవస మొకటే
పెనఁగుల మైమరపించెఁ గన
వనిత కిదొకటే వడి శ్రీ వెంకట
ఘనుని మన్ననలు గైకొనెఁ గనక

రేకు: 0270-6 సామంతం సం: 09-120

పల్లవి: ఇంత యాల అంత యాల యేమాయ నిపు డిట్టె
పంతపు పతికడకె పదరాదా

చ. 1: చెక్కిటిచేయి యేఁటికే చెలి నీ భావముచూడ
చక్కని తామెరమీఁదఁ జంద్రుఁ డున్నట్టు
యెక్కడి కెక్కడి పొందు లేమి గడించేవె
పక్కన పతికడకె పదరాదా

చ. 2: పున్నతిఁ గుచాలమీఁద నుసురనే విది యేమె
సన్నపుగాలి కొండల జడిసినట్టు
యెన్నటి కెన్నటి పొందు లిట్లేల సేసేవె
పన్ని నీ పతికడకె పదరాదా

చ. 3: చేరువఁ గాఁగిటిలోనఁ జెమరించే విది యేమె
చేరు ముత్యా లిటునటుఁ జిందినట్టు
కోరి శ్రీవెంకటపతికూడి మేడ యెక్కెఁ గృపా
పారీణుఁ డాతనొద్దకుఁ బదరాదా

రేకు: 0271-1 రామక్రియ సం: 09-121

పల్లవి: ఆడరాని చూడరాని యట్టి దొర వింతే కాక
యేడ నైనఁ జెలి నీకు నేమి సేసెనయ్యా

చ. 1: కాంత నీకు సన్న సేసె కమ్మరఁ బూబంతి వేసె
సంతమై మరుకాఁకల జలి గాసె
చెంత నీవు చూడఁగాను సిగ్గునఁ బయ్యద మూసె
యింతే కాక ఆకె నిన్ను నేమి సేసెనయ్యా

చ. 2: వలపు నీపై నించె వడిఁ బులకలు వెంచె
చెలప చెమట లవె చెక్కున ముంచె
నిలువు నీ చేఁతలకు నిట్టూర్పులఁ దలవంచె
యెలమి నిన్నాకె మరి యేమి సేసె నయ్యా

చ. 3: నీ యెదుటఁ దాఁ బొలసె నీటున నిన్ను సొలసె
కాయజకేలి నిన్నుఁ గడుఁ గలసె
పాయపు శ్రీవెంకటేశ పడఁతి నీతో వెలసె
యీయెడ నిందాఁక నాకె యేమి సేసెనయ్యా

రేకు: 0271-2 కాంబోది సం: 09-122

పల్లవి: నేఁడుగా యివి తనకు నాఁడె పో నాకు
కూడిన మీరు సాకిరికొమ్మలాల

చ. 1: తాలిమి లేక యిట్టె తనలోనె కోప ముంటె
నాలో నున్నవిగా నవ్వులు
నీలాన తనమాట చిరుచేఁదు లుంటేను
తేలెటి నా మోవిఁ గా తీపులు

చ. 2: తెంపుల తనబొమ్మల తిట్ల సొలపు లుంటె
వంపు నా రెప్పలఁ గా వలపులు
యింపు లేక తనమతి నెగ్గులును తప్పులుంటె
పెంపున నా కున్నవిగా పెను వేలి మొక్కులు

చ. 3: తమ్మి మరునేట్ల తనరు తమక ముంటె
చిమ్ముల నా కున్నవిగా సిగ్గులు
అమ్మరొ శ్రీవెంకటేశుఁడన్నిటా నన్నుఁ గూడె
కుమ్మరించె నాపై కొనగోరిసొమ్ములు

రేకు:	0271-3 కాంబోది సం:	09-123

పల్లవి:	మున్నిటి తానెకాఁడా మోన మింకానా
	కన్నులఁ జూచుట గాక ఘాత లింకానా

చ. 1:	మాయల వేరొకతెతో మాటలాడఁ గానె
	చాయల నేఁ జేసే సన్న లింకానా
	ఆయెడ నా రాక గని అటు తలవంచఁగాను
	యేయెడ నే దూరి తిట్టే దిది యింకానా

చ. 2:	విరహపు నన్నుఁ జూచి వికవిక నగఁగాను
	సరస నా బొమ్మల జంకె లింకానా
	సిరుల నాకె దన చెలియని బొంకఁగాను
	నిరతి నిజము గొల్పే నీటు లింకానా

చ. 3:	యెదుట నామోము చూచి యింటి కిట్టె రాఁగాను
	కొదలు గొణఁగుల నా కోప మింకానా
	అదన శ్రీవెంకటేశుఁ డాదరించి కూడె నన్ను
	కదిసి వుండెటె కాక కా దను టింకానా

రేకు: 0271-4 వరాళి సం: 09-124

పల్లవి: కంటి నే నంతలోఁ గడల మీ భావము
దంటలగు మీర లిద్దరు జాణలే

చ. 1: పెడమరలి అటుచూచి పెదవులనె నినుఁ దిట్టి
పడఁతి మరలెను నీవు పై కొనినను
గొడఁగుచును బొమ్మలనె గొబ్బుననుఁ గోపించి
అడఁగి తలవంచె నీ వపు డేమి సేసితో

చ. 2: తళుకునను నిన్నుఁ గనుఁదమ్ములనె జంకించి
బెళకి నిలిచెను నీవు పేరుకొనఁగ
వులికిపడి నిన్ను నిట్టూర్పులనె కడుఁ గసరి
చెలుల మొరఁగెను నీవు చెనకఁగాను

చ. 3: కొమ్మ కాఁగిటఁ గూడి కొనగోర నిను నడిమి
వుమ్మడిఁ గమ్మరఁ దానె వూరకుండి
చిమ్ములఁ బూఁబొదరింట శ్రీవెంకటేశ్వరుఁడ
నెమ్మది నుంటిరి కళలునిండె మోమునను

రేకు: 0271-5 సాళంగం సం: 09-125

పల్లవి: ఇందుకంటె నేమి సేతు నిదివో నేను
వొందిలిఁ దాఁ బిలిచితే నూఁకొనునా నేను

చ. 1: ఆనిపట్టి తనతో నలిగి వుందాననా
మోనానఁ దన కిప్పుడు మొక్కనా నేను
మానుపడి తనపొందు మానితినా తొల్లి టట్టె
కాను కియ్యనా నేఁడు కడనుండి నేను

చ. 2: గొంటుఁ దనమున నేఁ గోపగించు కుందాననా
వొంటిఁ దలవంచు కొద్ద నుండనా నేను
దంటనై నేఁ జలపట్టి దగ్గర కుందాననా
అంటు ముట్టు గలదాన నాడ నుంటి నేను

చ. 3: కాంతుఁడు కొంగువట్టఁగాఁ గైకొన కుందాననా
అంతలోనె పరవశ మందనా నేను
చింత దీర నన్నుఁ గూడె శ్రీ వెంకటేశ్వరుఁడు
వింత సొబగుల విఱ్ఱవీఁగనా నేను

రేకు: 0271-6 సామంతం సం: 09-126

పల్లవి: విన్నవించనేల యిందు వేమారుఁ దనతో
యెన్నిక నేఁ జేసేదేమి యిఁకఁ దనచిత్తము

చ. 1: చెప్పరాని చూపరాని చిత్తములో మర్మము
అప్పసము నాలోని అడియాస యిదిగో
కప్పియుఁ గప్పగరాని కన్నులలో మర్మము
దప్పి దేరిచే చక్కని తనరూపె పో

చ. 2: పట్టియుఁ బట్టఁగరాని పాయములో మర్మము
ముట్టుపడ్డ పతిమీఁది మోహ మిదిగో
కుట్టియుఁ గుట్టఁగరాని కుచముల మర్మము
పొట్టఁ బొరుగున రేఁగే పులకలు వో

చ. 3: అందియు నందఁగరాని ఆయముల మర్మము
సందడిఁ బరవశాల సంగతిదివో
కందువ శ్రీవెంకటేశుఁ గలసిన మర్మము
గొందినె యీతని గోరిగురుతులె పో

రేకు: 0272-1 లలిత సం: 09-127

పల్లవి: చెల్లుఁ జెల్లు నీకు నాకు సిగ్గు మఱఁగు
యెల్లభావము గంటి మిఁక నేల మఱఁగు

చ. 1: మోవిమీఁది కెంపులకు మోనమె మఱఁగు
కావికన్నులకు నిద్ర కడు మఱఁగు
తేవల నిట్టూర్పులకు తీగెనవ్వే మఱఁగు
యీవిధాలు గంటి నాతో నిఁక నేల మఱఁగు

చ. 2: చెక్కులచెమటలకు చెంపచేయి మఱఁగు
మిక్కిలి వులకలకు మెయిపూఁత మఱఁగు
తక్కి మోము వాఁడుటకు తమ్ములము మఱఁగు
యిక్కడ నిన్నిఁ గంటి నిఁక నేల మఱఁగు

చ. 3: కూడినకూటమునకు గుట్టు యిదె మఱఁగు
జాడల నీ మేనికి నా చన్నుదోయి మఱఁగు
వేడుకకు శ్రీ వెంకటేశ వేసాలు నీ మఱఁగు
యీడ నిన్నిఁ బచ్చిదేరె నిఁక నేల మఱఁగు

రేకు: 0272-2 శుద్ధవసంతం సం: 09-128

పల్లవి: ఎందు వోయీ నింతలోనే
యెందు నుప్పుచింది యినుమడీఁగాకా

చ. 1: పంతమా నీతోఁ బలుమారును నీ
వెంత సేసినా నెరిఁగేము గాకా
వంతులా మారువడిఁ దిట్టను
అంతయు నొకపక్క నణఁగుండిఁ గాక

చ. 2: యెమ్మెలా నీతో నెదురాడను నీ
దిమ్ముఁ జేఁతలు దెలిసేము గాక
కమ్మరా నిన్నుఁ గాదనేమా
కిమ్ములా నిన్నుఁ గీర్తించేఁ గాకా

చ. 3: చలవ నిన్ను సాదించను నీవు
చెలిమిఁ గూడఁగాఁ జేకొంట గాకా
అలరు శ్రీ వెంకటాధీశుడా నీ
వలపు గాగిలె వైపాయఁగాక

రేకు: 0272-3 కాంబోది సం: 09-129

పల్లవి: ఇంత చాలదా మాకు నిదినేఁడు
కంతునివోజల పెండ్లి గలిగెఁ గా నేఁడు

చ. 1: కాంతకును నీకును కనురెప్పలె తెర
దంతపు నవ్వులె మీకు తలఁబాలు
రంతుల వూరుపలె రవళి సోబనాలు
చెంతల మీ కీ పెండ్లి చెల్లెఁగా నేఁడు

చ. 2: ముదితకు నీకును మోవులె బువ్వములు
కదియు సిగ్గులె మంచి కమ్మగందాలు
సదరపు సరసాలె చల్లు వెదవీడేలు
యెదుదెదురనె పెండ్లి యెసగెఁగా నేఁడు

చ. 3: వుంచపు గోరితాఁకులె వుంకువ సొమ్ములు
ముంచిన పలు సోఁకులె ముయికిముయి
యెంచఁగ శ్రీవెంకటేశ యిందిర నీ కూటములు
కంచపుఁ బెండ్లి మీకుఁ గలిగెఁగా నేఁడు

రేకు: 0272-4 సామంతం సం: 09-130

పల్లవి: తగుమాట లేమిగల్లా దవ్వులఁ జెప్పుదుగాని
అగడయ్యీ నీవు నన్ను నంత దగ్గరకురా

చ. 1: యెగరే జక్కవలు యిదివో నాకుచములు
గగనపు చకోరాలు కనుఁగవలు
తొగరుఁ దుమ్మిదలు నాతురు మిదివో నేఁడు
బెగడుఁ జేసు నన్ను బెట్టి పిలువకురా

చ. 2: కొండలసింహము నా కొనబైన నడుము
గండు మీరి నా పిరుఁదు కరికుంభాలు
నిండిన నా పాదములు నీటిలోని తాఁబేళ్ళు
చండిపడ నీవు నన్ను సారెఁ జెనకకురా

చ. 3: మించులమెరఁగు లివి మేఁటి నాతనువు
దించని తేనెల పెరతీపు నా మోవి
అంచల శ్రీవెంకటేశ అంతలోనె కూడితివి
యెంచఁగ నిన్ను మరిగె నిన్నిటాఁ బాయకురా

రేకు: 0272-5 ఆహిరి సం: 09-131

పల్లవి: అయ్యో తా నేమని నప్పటిఁ దాను
పయ్యదలో సిగ్గు దాఁచి బడలఁగాను

చ. 1: చూపులనె గుండె వట్టి సుద్దులనె మిన్ను ముట్టి
దాపు సేసుకొని తన్నుఁ దలఁచఁగాను
తీపు మేలములఁ జిక్కి దిక్కులఁ దనకు మొక్కి
తోపు నూకుడు వయసు దొబ్బఁగాను

చ. 2: ఆసఁ బులకలు వెంచి అంగము చెమట ముంచి
బాసలు తనవి నమ్మి బతుకఁ గాను
వాసికిఁ దనువు మోచి వంతుకుఁ బ్రాణముగాచి
వోసరించి వూరకె నే నుండఁగాను

చ. 3: తానె నే నని యాడి దగ్గరి కాఁగిటఁ గూడి
నానిన నవ్వులు గుట్టు నడపఁగాను
యీ నెపాన శ్రీ వెంకటేశుఁ డింతలో నన్ను
పూనుక మన్నించె నని పొగడఁగాను

రేకు: 0272-6 బౌళి సం: 09-132

పల్లవి: మేఁటులాల బోఁటులాల మీ రెరఁగరా నన్ను
నీటునఁ దా నొద్ద నుంటె నేర మెంతునా

చ. 1: మోము చూడఁగా నేను మొరఁగి నవ్వితిఁ గాక
తా ముందు పూరకుంటెఁ దడవితినా
ప్రేమమునఁ బిలువఁగా బెట్టి వూఁకొంటిఁ గాక
దోమటిఁ దడవకుంటె దొమ్మి సేతునా

చ. 2: చెక్కు నొక్కఁగా నే జీర వారించితిఁ గాక
చక్క నుంటెఁ దన్ను నే సాదింతునా
నిక్కి పూవుల వేయఁగా నీటునఁ దిట్టితిఁ గాక
మిక్కిలి గుట్టున నుంటె మితిమీరుదునా

చ. 3: బలిమిసేయఁగఁ దన్నుఁ బైకొని కూడితిఁ గాక
చలమునఁ బంత మంటె సాగనిత్తునా
యెలమి శ్రీవెంకటేశు నింపులఁ జొక్కితిఁ గాక
తలఁ పెరఁగక వుంటె దగ్గరుదునా

రేకు: 0273-1 శుద్ధవసంతం సం: 09-133

పల్లవి: చాలుఁ జాలు నేతులు సటలు నీ రీతులు యీ
నీలిచేఁతపతిఁ గాక ని న్నేమనేదే

చ. 1: వద్దేలె మాటలు వలవని నీటులు
వొద్దనె నే మింతలేసి కోపుదు మటే
యిద్దరిలో నినుఁ బెంచి యింత సేసె నాతఁడు
నిద్దమై యాతనిఁ గాక ని న్నేమనేదే

చ. 2: ఔనె నీ సుద్దులు ఆడెటి బద్దులు
వూని యింతలేసికి నే నోపుదునటే
యీ నీకుఁ జిన విచ్చి యింత సేసె నాతఁడు
నే నింకా నాతనిఁ గాక ని న్నేమనేదే

చ. 3: పోపో నీ కతలు పోకుల నీ గతులు
వూఁపుల రాఁపుల నే నోపుదు నటే
యేపున శ్రీ వెకంటేశుఁ డింతలో నన్నుఁ గూడె
నీ పొందులాతనిఁ గాక ని న్నేమనేదే

రేకు: 0273-2 సామంతం సం: 09-134

పల్లవి: చాలుఁ జాలుఁ బొగడకు జాణకాఁడే
నాలి నేఁ దనిసితిఁబో నాఁడు నాఁడే

చ. 1: తనకు వలచినట్టి తరుణి సూర్పనకను
పెను ముక్కుగోసిన బీరగాఁడే
మునుపనె వుపకారము నున్న బలి నట్టె
పనివడి కట్టినట్టి పంతగాఁడే

చ. 2: కోరి తన్నుఁ గూడినట్టి గొల్లల మానములు
మేర మీరి చేకొనిన మేటివాఁడే
కౌరవులఁ బాండవులఁ గడుఁ జుట్టాల నెల్ల
పోరువెట్టి యంపినట్టి పుణ్యపువాఁడే

చ. 3: నిండు వురమున నింతి నిలిపి శ్రీ వెంకటాద్రి
కొండమీఁద నెక్కుకొన్న కోడెకాఁడే
అండనిట్టె నన్నుఁ గూడి ఆయము లంటిమెప్పించి
దండియై మెరసినట్టి దైవపువాఁడే

రేకు: 0273-3 ముఖారి సం: 09-135

పల్లవి: పదిలమై వుందుగాని పదరకుమీ
వెదకితేఁ జూపవలె వెస జుమ్మీ విభుఁడ

చ. 1: అందపు నీ మోవితేనె లాని యాని యెవ్వతో
అందుపైఁ గెంపులు నించె నదె చూడుమా
పొందుల నదెవ్వరికి పొరసి నీ వియ్య కుండా
కందువ మెత్తులు వేయు గతి సుమ్మీ విభుఁడ

చ. 2: చక్కని నీ దేహమంటి సారె సారె నెవ్వతో
అక్కడ రేకలు నించె నది యెవ్వతో
గక్కన వేరొకతెకుఁ గాఁగిలి నీ వియ్యకుండా
లెక్కల లచ్చెనవెట్టే లీల సుమ్మీ విభుఁడ

చ. 3: కూరిమి నీ రతిఁ గూడి గురుతుగాఁ గుచముల
కోరి ముద్ర లురమునఁ గుంకుమ నొత్తె
ఆరీతి శ్రీవెంకటేశ అరమరపంచినది
నేరుపరెవ్వరుఁ గారు నేఁ జుమ్మీ విభుఁడ

రేకు: 0273-4 ముఖారి సం: 09-136

పల్లవి: ఇంత సేసినట్టి పతి నే మందమే
మంతుకు నెక్కించినట్టి మనసు నే మందమే

చ. 1: చెక్కునఁ బెట్టెను చేయి చిత్తములోపలి నూయి
యిక్కడ నీసతి భావ మేమందమే
ముక్కునఁ గీలించె వేలు మొనగోర నదె వ్రాలు
మక్కువ యింతసేసిన మరుని నే మందమే

చ. 2: కన్నుల నించెను నీరు కలిగెఁ బయ్యద జారు
యెన్నఁగ నీ యింతి మోహమే మందమే
పన్నుకొనె నిట్టూర్పు పారదోసె తన నేర్పు
యిన్నిటాను నోముఫల మిఁక నే మందమే

చ. 3: చెలిపై వేసెను మేను సిగ్గుల మునిఁగెఁ దాను
యెలమి నీ చెలి మర పే మందమే
అలరి శ్రీవెంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
తలఁపు ప్రేరేచినట్టి దైవము నే మందమే

రేకు: 0273-5 శంకరాభరణం సం: 09-137

పల్లవి: ఏమి నెరఁగని బాల నేమి సేసితివో
ఆమని కాలములోనె అది యేమి సేసితో

చ. 1: కన్ను లెల్లఁ దెల్లనాయ కాయ మెల్లఁ జల్లనాయ
కన్నె నేమి సేసితివో కట్టా కట్టా
వన్నె మేనఁ జంజారేఁగె వాడుమోవి గడు మాఁగె
ఇన్నాళ్లవలెఁగాదు యేమి సేసితివో

చ. 2: కొప్పు గడుఁ జిక్కు వడె కుచములు తొక్కవడె
అప్పటి నేమిసేసితి వయ్యో అయ్యో
చిప్పిలె నిట్టూరుపులు సిగ్గులివె గొరుపులు
యిప్పు డిట్టె యీ సతి నేమి సేసితో

చ. 3: చెక్కు లెల్లఁ జెమరించె సెలవుల నవ్వు ముంచె
వొక్కమాటె యింత సేసి తోహో వోహో
నిక్కి శ్రీ వెంకటపతి నీవు గూడఁ బోలుదువు
యెక్కువ మేనిగుతురు లేమి సేసితో

రేకు: 0273-6 కాంబోది సం: 09-138

పల్లవి: అంత నింత నుండి ఆనవెట్టీ రమణుఁడు
అంత లేదుగా నాకు నాయము సోఁకీని

చ. 1: ఔనె తనకు నాకు నంత పొందా తొలినాఁడు
నానిన వలపులతో నవ్వ వచ్చీని
పోని పోని వుపవేసి పొత్తు గలయ వచ్చీని
నే నోపఁగా యింతేసికి నిద్దుర వచ్చీని

చ. 2: లేలె తనగురుతు లెస్సగా నెఱుఁగుదునా
వేళ గాదన్నా బందెలు వేయ వచ్చీని
చాలుఁ జాలు వెలువెట్టి సారె నిమ్ము గొనవచ్చీ
తాలిమి లేదుగా నన్నుఁదల్లి విలిచీని

చ. 3: రావె తానూ నేను రతి నే వూరు కేవూరు
కోవరము నిన్నుఁ బెట్టి కొంగు వట్టీని
శ్రీ వెంకటేశ్వరుఁడు చెక్కు నొక్కి నన్నుఁ గూడె
వావులఁ బోదుగా నాకు వాసులు వుట్టీని

రేకు: 0274-1 సామంతం సం: 09-139

పల్లవి: ఊరకె తా నుండట్టె నుండుఁగాక
తారుకాణ లైనమీఁదఁ దగవుఁగొంతా

చ. 1: తనకేమె నాలోనఁ దల వంచు కొంటేను
నసుపులేని చోట నవ్వఁ బొయ్యేదా
అననేలె నన్ను సారె నవ్వలిమో మైతి నంటా
చనవులేని చోట సలిగెఁగొంతా

చ. 2: చింత యాలె తనకు నేఁ జెక్కిటఁ జే యిడు కొంటే
సంతముగాని చోట సరసములా
యింత యాలె యడమాట లేకతాన నే నుంటే
పంతగాఁడు తాను నేఁ బచరించఁ గలనా

చ. 3: వలపు చల్లఁగ నేలె వంతుకు నే నలిగితే
చలము సాధించఁగాను జాణతనాలా
యెలమి శ్రీ వెంకటేశుఁ డింత చేసి నన్నుఁ గూడె
కలసిన మీఁద నింక కపటములా

రేకు: 0274-2 కాంబోది సం: 09-140

పల్లవి: చూచితిఁ దన సరిత సుద్దు లేఁటి కో యమ్మ
చేచేత నిఁక బొంకఁ జెల్ల దో యమ్మా

చ. 1: జడిసి లోఁతుమాటల జాణతనా లాడీ నన్ను
తడవితేఁ దలదీసి తక్కించీ నమ్మ
చిడుముడి చుల్లరపు సేఁతల మమ్ముఁ జెనకీ
పడుచుమాటలవాని పస యేఁటిదమ్మా

చ. 2: ఆరీతి నాఅడిఁబెట్టి యంతలో నడుగుకొనీ
గోరఁ బొయ్యేదాని కింత గొడ్డ లేలమ్మ
సారెకు మాటపట్లు సాదించి నడచీని
తీరకుండా జగడాలు తిద్దఁబొయ్యీ నమ్మా

చ. 3: పొందుగానిమతకాల బోదించ వచ్చీని
యిందరిలో నెక్కు డాయ నిఁక నేలమ్మా
అందపు శ్రీ వెంకటేశుఁ డాదరించి కూడె నన్ను
నింద లెల్లఁ బాసె నింక నెమ్మదినే యమ్మా

రేకు: 0274-3 వరాళి సం: 09-141

పల్లవి: నేఁడు రేపుఁ జూతు గాని నిలరా నీవు
వాఁడి వాఁడి నా గోరు వద్దురా నీవు

చ. 1: చేసన్న నేమి గల్లాఁ జెప్పి చూపుదువు గాని
మాసిన చెరఁ గంటక మానరా నీవు
మూసి మరఁగుల కెల్లా ముందట మొక్కుదు గాని
దోసముబంట ననక తొలరా నీవు

చ. 2: యేమి పని గలిగినా నింతుల నంపుదు గాని
రామలకుఁ గల దింతె రాకురా నీవు
నామీఁద మోహము గల్తె నవ్వులు నవ్వుదు గాని
మోముచూడ సిగ్గయ్యీని మొనసేవు నీవు

చ. 3: కూట మిది యంత గల్లా గుట్టున నుందువు గాని
పోటిఁ గోల నాడితేనె పోకురా నీవు
మేటివై శ్రీ వెంకటేశ మెచ్చుగాఁ గూడితి విట్టె
గాఁటాన నే నంటి నింతె కల్ల సుమ్మీ నీవు

రేకు: 0273-4 సాళంగం సం: 09-142

పల్లవి: నవ్వవొద్దా యిందుకుఁగా నాకు నాకె నిన్నుఁ జూచి
యివ్వలనెయింత సేసే వేలయ్య నాయకుఁడ

చ. 1: చూడవొద్దా ఆకె నిన్నుఁ జూచి సారె మొక్కఁగాను
యేడ నన్నా సిగ్గువడే వింత దగునా
ఆడవొద్దా మారుమాట ఆకె నిన్నుఁ బిలువఁగా
యేడో పరాకయ్య వేలయ్య నాయకుఁడ

చ. 2: చేరవొద్దా మగువను చెనకి సరసమాడ
కూరిమి దెలిసేరంటా గుట్టు సేసేవు
మేరమీరవొద్దా ఆకె మెచ్చి చెయి వేయఁగాను
యీరీతి వొలసీ నొల్లా లేలయ్య నాయకుఁడ

చ. 3: కప్పవొద్దా పచ్చడము కాఁగిలించి కూడఁగాను
దప్పి దేరె మోవితేనె దగ దొట్టేవు
వొప్పుగా శ్రీ వెంకటేశ వుండవొద్దా రాజసాన
యిప్పుడే పెండ్లాడి తింత యేలయ్య నాయకుఁడ

రేకు: 0273-5 ఆహిరి సం: 09-143

పల్లవి: సేతునో నీ మేన నెల్ల జీరలుగాను
ఆతల సూడువట్టే దదె చూచేఁ గాని

చ. 1: ఔప్ప లెత్తి చూచితేనె ఔసు వుట్టె నిదె నీకు
దుప్పటి కొంగు వట్టితే దూర కుండేవా
చొప్పుగానా యించుకంతఁ జూతమువో యిఁక నేల
కప్పిన నీ బింక మెల్లఁ గనుఁగొనేఁ గాని

చ. 2: కవ కవ నవ్వితేనె కాఁగిపడే విప్పు డిట్టె
తివిరి కాలు దాఁకితే తిట్ట కుండేవా
వివరించి అది వెల్లవిరి సేతునో వోరి
అవల నీతో జగడమైన నయ్యీఁ గాని

చ. 3: ఆయము లంటఁగఁ బోతే ననుమానించే వందుకు
చేయి వేసి కూడితేను చిక్క కుండేవా
చాయల శ్రీ వెంకటేశ సమ్మతించి కూడితివి
సేయఁగలవి సేతునో చేరి మొక్కేఁ గాని

రేకు: 0273-6 ముఖారి సం: 09-144

పల్లవి: దొర వైతె నింతలోనె దోసమా యేమి
గరిమ మా వినయాలు కానివా యేమి

చ. 1: మలసి యీడా నాడ మాట లాడకున్న నేమి
తొలుతె యింటికిరాను దోసమా యేమి
తలఁపిట్టె వుండిన దగ్గరక మానేవా
కలపుకోలుఁదనము కానిదా యేమి

చ. 2: పడిఁ జుట్టాలముగామా వావి చెడ మందు గద్దా
కడు మమ్ము మన్నించితే కానిదా యేమి
కడకన్నులఁ దేలించి కాఁక రేఁచకున్న నేమి
తొడఁగి విడె మందితే దోసమా యేమి

చ. 3: చేరి చేరి బుజముపై జెయి వేయకున్న నేమి
దూరక కాఁగిలించితే దోసమా యేమి
యీరీతి శ్రీ వెంకటేశ యిక్కువ నుండి కూడి
గారవించితి యిది కానిదా యేమి

రేకు: 0275-1 పాడి సం: 09-145

పల్లవి: చుట్టపువరుసఁ గొంత చూచిఁ గాక
అట్టె యే మన్నా నెదురాడేవా నీవు

చ. 1: అలిగి రాకుండఁగాను ఆనలె పట్టెఁ గాక
చెలి నిన్నుఁ దిట్టితేను చెల్లదా నేఁడు
పులవచ్చి సిగ్గుతోడ నూరకున్న నుండెఁ గాక
చలివాయఁ జెనకితే జంకించేవా నీవు

చ. 2: పంతము నీ వాడఁగాను పాడియె నడపెఁగాక
కాంత యేది దలఁచినాఁ గాక మానీనా
జంతతనమేలంటాఁ జక్కనుంటె నుండెఁ గాక
దొంతిగాఁ బై నొరగితే దూరేవా నీవు

చ. 3: చెక్కు నొక్కి కూడఁగాను సెలవినె నవ్వెఁ గాక
చుక్కలు మోవి నించితే సూడు వట్టేవా
యెక్కువ శ్రీ వెంకటేశ యింతి నీతో నొక్కటాయ
మక్కువ నీ మేలింకా మరచేవా నీవు

రేకు: 0275-2 దేసాళం సం: 09-146

పల్లవి: మంచివానివలెనె మాట లాడీనె
యించుకంతా నెరఁగఁడు యేడవాఁడే తాను

చ. 1: తీపులపెదవి వంచి తిట్టినా మానఁడు నేఁ
గోపగించు కొనఁగానె కొల్లున నవ్వీనే
రాపుగా నానలు వెట్టి రాకు మన్నా మానఁడే
వోపనని రాఁగా నా వొద్దికి వచ్చీనే

చ. 2: గొణఁగి గొణఁగి లోలో గుంపించినా మానఁడే
అణఁగి నిద్దిరించఁగా నాయ మంటెనే
వొణికెవేసుక నే నూరకున్నా మానఁడే
సణఁగు లాడఁగ వేరె సాకిరి వెట్టీనే

చ. 3: వెఱతు మనుచు మొక్కి వేసరినా మానఁడే
కఱకు లాడేవేళ కాఁగిలించీనే
వుఱక శ్రీ వెంకటాద్రినుండి వచ్చి నన్నుఁగూడె
మొఱఁగి వావిలిపాటి ముద్దురామచంద్రుఁడె

రేకు: 0275-3 ముఖారి సం: 09-147

పల్లవి: ఎంత మొగమాయకాఁడో యేమో కాని
యింతులార వెర గైతి మిఁక నేమో కాని

చ. 1: మొదల నేమైనఁ జేసి ముందట నీవుండితేను
యెదురు మాటాడఁజాల నేమో కాని
పెదవి కెంపులు రేఁగబెట్టి నాతో నవ్వితేను
యిదివో నే భ్రమసితి నిఁక నేమో కాని

చ. 2: కొయ్యతనా లెల్ల నాడి కొంగువట్టి తీసితేను
యియ్యకొంటిఁ బనులకు నేమో కాని
పయ్యదపైఁ జెయి వేసి పచ్చితిట్టు దిట్టి తేను
నెయ్యమునఁ గరఁగితి నే నిదేమో కాని

చ. 3: పంతము లిన్నియు నాడి బలిమిసేసి కూడితి
నింతలోఁ బంత మిచ్చితి నేమో కాని
వంతుకు శ్రీ వెంకటేశ వలపించి నందు కెల్ల
మంతనాన లోనైతి మరి యేమో కాని

రేకు: 0275-4 వరాళి సం: 09-148

పల్లవి: మేలుగలవారి కెల్ల మీఁద మీఁద నాస లిట్టె
చాలుకొనుఁ గాని మరి చాలించ దెంతైనా

చ. 1: గక్కనఁ జూచిన చూపు కాంక్ష దీర దెంతైనా
కిక్కిరించి మరియు మగిడి చూడకా
చొక్కుచు రెప్పవేయక చూచినాఁ దనివోదు
తక్కక ఆరూపె మతిఁ దలపోయకుండినా

చ. 2: అంది వొకమాటాడితే నంతటఁ దీరదు తమి
మందలించి అట్టె మారు మాటాడకా
పొంది ముచ్చటాడినాఁ బోవు కోరిక లన్నియు
కందువఁ జెలులతో కతలు తాఁ జెప్పకా

చ. 3: కన్నప్పుడె వొకమాటు కలసినా సొంపులేదు
యెన్నికఁ బెక్కుగతుల నెనయకా
యిన్నిటా శ్రీవెంకటేశుఁ డెరిఁగిన జాణ గాన
నన్నుఁ గూడె నివి నాలో ననుప గాకుండదు

రేకు: 0275-5 ముఖారి సం: 09-149

పల్లవి: ఒయ్యనె విన్నవించరె వొద్దనున్న పతిఁ జూపి
నెయ్యపు నివ్వెరగుతో నిలుచున్నాఁ డితఁడు

చ. 1: తలపోఁత చింత యెంతో తరుణివిరహ మెంతో
చెలువుఁడె వచ్చి పిలిచినా నెరఁగదు
తొలుతె వియోగముతోనె అలసెఁ గాన
నలువంక నిజ మాడినా నమ్మదు

చ. 2: నిట్టూర్పుగములతో నెరుల చెదరుతోడ
పట్టి కళ లంటినాఁ బతికడ చూడదు
యిట్టె యెదురు చూచి యిందాఁక వేసారెఁగా
గట్టిగా నెదుర నున్నాఁ గల్ల లంటా నున్నది

చ. 3: విరులపానుపు మీఁద వెడఁజారుఁ బయ్యదతో
సరుఁస బండిన పతిచందము దెలియదు
శిర సెత్తి యిదె కూడె శ్రీవెంకటేశ్వరుఁ
డరుదైన కల గంటి నంటా నాడీని

రేకు: 0275-6 మధ్యమావతి సం: 09-150

పల్లవి: ఆమాట మీ రెరఁగ రాతఁడె కాని
తామసించి నాడనుండె తన కేలె వెఱపు

చ. 1: విచ్చేయు మనవె విభుని నిక్కడికె
యిచ్చుటనె విన్నవించె నేమి గల్లాను
ముచ్చట దీరదు తనమొగము చూచినదాఁకా
తచ్చివేసి నేనుండఁగ తన కేలె వెఱపు

చ. 2: తప్పక చూడు మనవె తా నిట్టె నాదిక్కు
యిప్పుడె మంచిది సేసే నేమి గల్లాను
దప్పివోదు నేఁడు నాకు తనతో మాటాడుదాఁకా
తప్పు లెల్ల వొప్పు లయ్యీ తన కేలె వెఱపు

చ. 3: తలఁచుకొమ్మనవె తనపొందు నాపొందు
యెలమిఁ గాఁగిటఁ దీర్చే నేమి గల్లాను
అలమె శ్రీవెంకటేశుఁ డందుకే మెచ్చినదాఁకా
తలవంచుకున్నాఁడు తన కేలె వెఱపు

రేకు: 0276-1 ముఖారి సం: 09-151

పల్లవి: ఎవ్వరికిఁ గలదురా యిటువంటి యనుభవత
యివ్వల నీ వాకెవలె నిటు నోమవలదా

చ. 1: కంకణాలచేత నీ కరమప్పళించి చెలి
అంకెలఁ గుచాలమీఁద నది మదిమీ
తెంకిఁ గూచుండి కన్నులు తేలవేసి నిన్నుఁ జూచి
కొంకక నీ చెవిలోనఁ గూరి మేమో చెప్పెరా

చ. 2: వుంగరపువేళ్ల నిన్ను నువిదచెక్కులు నొక్కి
యెంగిలిపొత్తాకు మడి చిచ్చి యిచ్చి
పొంగెటి పులకలతో పొందు చూపి మాటాడి
సంగతిగాఁ గాఁగిలించెఁ జాలదా యీ భాగ్యము

చ. 3: నిలువుఁ బయ్యదవేసి నీపైఁ బాదముచాఁచి
నలువంకఁ దొడలఁ బెనచి పెనచి
యెలమి శ్రీవెంకటేశ యిటు నిన్నుఁ దెరవేసి
కలసె నిన్నాకె అంతకంటెరా నేను

రేకు: 0276-2 శంకరాభరణం సం: 09-152

పల్లవి: నీవు చల్లఁగాబదుకు నీకేల యీగొడవ
నీవలపులకు నెల్ల నేనే గురి

చ. 1: చెక్కు నొక్కకుర నాచెమట నీచేతనంటి
గక్కన నీకుఁగానైన కరఁగులివి
యెక్కువ నాతాపము నీవేల కట్టుకొనేవు నేఁ
బుక్కట నాలో నెట్టైనఁ బొరలేఁగాని

చ. 2: కాఁగిలించకుర నాకాఁకల నీమేనువాడి
తీఁగెల నీవల్లనైన తేజములివి
నీఁగని నామరులిదె నీవు చుట్టుకొననేల
ఆఁగి నేనె పొట్టువొరలయ్యేఁగాని

చ. 3: నామోవి యడుగకుర నానలేదు కడునెండె
వేమరు నీవల్లనైన వెట్టలివి
ఆముకొని శ్రీవెంకటాధిప కూడితి వింక
సోమరినై నాలోనె చొక్కేఁగాని

రేకు: 0276-3 దేసాళం సం: 09-153

పల్లవి: కాంత నీవు గూడఁగా నేఁగంటి నేలలోఁగేవు
వింతగాఁ గంటికిఁ జూపు వేరయ్యీనా

చ. 1: నీవు నాకుఁ జుట్టమవై నిలిచినాఁడవుగాన
నీవద్దియింతులు నాకు నెమ్మిఁ జుట్టాలె
పూవులుముడిచితేను పూవులలోవాసనలు
వేవేలుచెప్పినాను వేరులయ్యీనా

చ. 2: నీమనసు నామనసు నిక్కమూ నొక్కటె కాన
కామించిన నీపనులు కా దన నేను
దీమసాన సొమ్ములెల్ల దేహమున నించుకొంటె
వేమరు వానికాంతులు వేరె వుండీనా

చ. 3: యెప్పుడూ నీ నా ప్రాణా లేకమయ్యేవుండుఁగాన
యిప్పటి నీజాడలెల్లా నితవె నాకు
అప్పటి శ్రీవెంకటేశ ఆయమంటి కూడితివి
విప్పరాని చనవులు వేరయ్యీనా

రేకు: 0276-4 కేదారగౌళ సం: 09-154

పల్లవి: ఆసుద్దులేల తడవే వాయలేవయ్య
సేసితివి చెప్పినటె చేకొనవయ్యా

చ. 1: వున్నతి నీవద్దఁ బాయకుండినదె నేరుపు
నిన్నుఁబాసి వుండినదె నేరమి
అన్నియు నిన్ను వెనక నసఁగానేమి
చెన్నుమీరె గతజలసేతుబంధాలు

చ. 2: సరి నిన్నుఁ బొగడేదె జాణతనము
కరి కరిఁబెట్టేదె గబ్బితనము
యెరవెల్లఁ బాసె దిఁకనేమి
మరలి వెదకు టెండమావులనీళ్లు

చ. 3: చక్క నీమోము చూచుటె సరసము
వెక్కసపు మారుమోమె విరసము
గక్కన శ్రీవెంకటేశ కలసితివి
యిక్కువ లన్నియు నింక నింటిలోనిధానము

రేకు: 0276-5 సాళంగనాట సం: 09-155

పల్లవి: ఆసోదకాఁడవో అన్నిటా జాణవో
వాసితో నే నుండితేను వలచి వచ్చేవూ

చ. 1: నీతోడి చలమా నిన్ను దూరఁగలమా
చేతులెత్తి మొక్కిన దించిక వెంగెమా
కాతరించ నిన్న మొన్న కాఁగిలించఁగలమా
యీతల నే రానంటె యింతలోనె కడమా

చ. 2: దండినెఁ బైతరవా తగునె నీకెరవా
నిండుకొనె వుండితేనె నీకు నగవా
పెండెమిచ్చి నన్నిందాఁకాఁ బిలిపించుకొనవా
వుండినట్టె వుండితేను వొళ్లిగర్వమనవా

చ. 3: కూటమి నేఁడరుదా కొసరితే బిరుదా
యీటున మనలో నేఁడింత గలదా
గాఁటపు శ్రీవెంకేటశ కలసితి మిట్టైకాదా
నాఁటిసుద్ది దడవితే నను మెచ్చవలదా

రేకు: 0276-6 మంగళకౌశిక సం: 09-156

పల్లవి: నేమెంతేసివారమైనా నిన్ను మీరఁగలమా
కామించి నీవు వచ్చితేఁ గైకొనేముగాకా

చ. 1: నేరుపులు చరించ నీతోడఁ జెల్లునా
వూరెల్లాఁ జుట్టాలఁ జేసుకుండఁగాను
భారపు పైఁడికొండలో బచ్చుబేరా లమరునా
వూరకె నీమేలు గోరుకుండు టింతెకాకా

చ. 2: తమిరేఁచేమని నిన్ను దగ్గరఁగఁ జెల్లునా
గములైన సతులతోఁ గరఁగఁగాను
భ్రమసి రేపల్లెవాడఁ బాలమ్మితే సరకౌనా
ప్రమదాన నీకు మొక్కి బ్రదుకుటగాకా

చ. 3: ఆవటించి నీకు నేఁ బ్రియాలు చెప్పఁజెల్లునా
వేవేలురతుల నీవె వేఁడుకోఁగాను
వావిరిఁ బువ్వులకును వాసనలు గట్టుదురా
శ్రీవెంకటేశ కూడితి చెక్కునొక్కేఁగాకా

రేకు:	0277-1 మధ్యమావతి	సం:	09-157

పల్లవి:	సారెకు వలవఁ బోతే చప్పనేకాదా
	వూరకుండేవారిఁగంటే వొత్తరాదా నీకు

చ. 1:	మొగము నేఁ జూచితేను ముంచి నీవు నవ్వితివి
	యెగసక్యానకో కాక యేపనికో
	తెగి అంతేసి లోఁతులు తెలుకొ నెరఁగవు
	పగటున నేము నగుఁబాటుగాదా నీకు

చ. 2:	పొంత నేఁ గూచిండితేను పొనిగి చోటిచ్చితివి
	యెంత వొల్లఁబెట్లోకాక యేమిటికో
	వింతగా నంతేసి వెల్లవిరిసేయ నెరఁగవు
	యింత దగ్గరితే యెడమియ్యవొద్దా నీకు

చ. 3:	సరసము నే నాడితే సరుగఁ గాఁగిలించితి
	విరవుగా నెరిఁగితి వేమిటికో
	గరిమ శ్రీ వెంకటేశ కలసితి విదెరఁగ
	సరసకు వచ్చితేనె సందుగాదా నీకు

రేకు: 0277-2 దేశాక్షి సం: 09-158

పల్లవి: ఒక్కరి కొకరు లోనైవుండుటగాక
చక్కట్లు చెప్పఁబోతే సమ్మతౌనా సుద్దులు

చ. 1: మచ్చర మేమిటికమ్మ మగవాఁడు నీతోడ
తచ్చనలు నెరపితే తరిఁ జెల్లదా
ముచ్చటలు మీరాడరా ముందరను వెనకకు
యెచ్చుకుందులు వట్టితే నెనసీనా పొందులు

చ. 2: చలము లేమిటికమ్మ సరసుఁడు నీతోను
సొలయుచు నవ్వితేను సొంపుదప్పునా
కలయరా యిఁక మీరు కలనైన వెలినైన
కలఁగి తేరఁగఁబోతే గట్టియవునా పనులు

చ. 3: యెగ్గు లింకేమిటికమ్మ యిదె శ్రీవెంకటేశుఁడు
వెగ్గళించి నిన్నుఁ గూడె వేసటలౌనా
నిగ్గులు చనవు లీరా నేఁడైనా నాఁడైన
సిగ్గులు నెరపఁబోతే చెందునా కోరికలు

రేకు: 0277-3 పాడి సం: 09-159

పల్లవి: అన్నిటాను జాణఁడు అప్పటి నెరఁగఁడు
చిన్నదాన మీకు బుద్ధిచెప్పరె యీతనికె

చ. 1: ముల్లుచూప తొలుతేల మొక్కి తలవంచనేల
వొల్లనె యప్పటి జాడ నుండరాదా
చల్లరపు నేఁతలేల సుదతికిఁ జిక్కనేల
జెల్లుబడిగా బుద్ధులుచెప్పరె యీతనికి

చ. 2: వట్టి కపటములేల వాకిలి గావఁగనేల
చుట్టరిక మట్లానె చూపరాదా
మట్టులే కలుగనేల మరి వెదకఁగనేల
చిట్టకముదీర బుద్ధిచెప్పరె యీతనికి

చ. 3: మానినుల పొందులేల మాకుపడివుండనేల
కానీవె బుద్దెరఁగఁడా కలికిగాఁడా
ఆనుక శ్రీవెంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
సేనలుగా యిఁక బుద్ధిచెప్పరె యీతనికి

రేకు: 0277-4 దేసాళం సం: 09-160

పల్లవి: ఎక్కడఁ జూచినఁ దానై యీతఁడున్నాఁడు
వెక్కసపు మనపాలి విష్ణుదేవుఁడు

చ. 1: చూడరె పదారువేలు సొరిది యిండ్లలోన
వేడుక నన్నిరూపులై విఱ్ఱవీఁగీని
జాడతో దేవతలకు జలనిధి దచ్చి తచ్చి
పాడితోడ నమృతము పంచిపెట్టీని

చ. 2: మొక్కరె రేపల్లెలోన ముంచి యాలమందలలో
నక్కడ గోపాలులతో నాటలాడీని
దిక్కులు సాధించి తనదేవుల నండఁ బెట్టుక
రెక్కల గుఱ్ఱముపై పేరెముదోలీని

చ. 3: సేవలెల్లాఁ జేయరె శ్రీవెంకటాద్రిమీఁద
వావిరి నందరికిని వరాలిచ్చీని
ఆవల నీవలఁ దానె అంతరాత్మ యిందరికి
భావాలలోన విశ్వరూపముచూపీని

రేకు: 0277-5 సామంతం సం: 09-161

పల్లవి: నీకేల వెరపు నీవూ నేనూ నొక్కటే
కోకొమ్మని విడెమిచ్చీఁ గొంకకువయ్యా

చ. 1: ముందరనె నిలుచుండి ముసిముసి నవ్వునవ్వి
కందువలు నీకుఁ జూపీఁ గలికి యదే
అందుకు నీవెఱఁగక అంకెలకు రాకుండితే
విందులు చెప్పి పిలిచీ వినవయ్యా

చ. 2: చాయలకు మాటలాడి సరసముఁ గొంతచూపి
చేయి నీపై వేసీని చెలియ యిదే
నీయంత సన్నెరఁగక నిండుకొని వుండితేను
ఆయములు గోరనొత్తీనదె కదవయ్యా

చ. 3: కన్నులఁ దప్పక చూచి కరఁగుచు నట్టె మెచ్చి
కన్నె నిన్నుఁ గూడె శ్రీవెంకటవిభుఁడా
యెన్నికై కడపలోన నిట్టె నన్నుఁ గూడితివి
విన్నపము నీకుఁ జేసీ వింటి వటవయ్యా

రేకు: 0277-6 శంకరాభరణం సం: 09-162

పల్లవి: ఎందుకైనావచ్చు నీతో యేలాటాలు
నిందలాడ మాకేల నీచిత్తమిఁకను

చ. 1: నగినగి నీతోను నను పు నటించితేను
యెగసక్కేలివియంటా నేల దూరేవు
పగటున నీతో పలుకకవుండితేను
అగడుసేసి యిట్టె అలిగితివనవా

చ. 2: యెప్పటివలె నే నీతో యెదురుమాటాడితేను
తప్పులు వట్టితినంటాఁ దలవంచేవు
ముప్పిరి నీతోఁ గనక మోనాననేవుండితేను
కుప్పలూఁ దెప్పలునైన కోపములివెనవా

చ. 3: నిలిపి కాఁగిట నిన్ను నిబ్బరానఁ గూడితేను
అలయించితినంటా నట్టే చూచేవు
చెలఁగి శ్రీవెంకటేశ సిగ్గున నే నుండితేను
వలవంతతోడి గర్వము లివియనవా

రేకు:	0278-1 ఆహిరి	సం:	09-163

పల్లవి:	నిలుచున్నాఁ డాతఁడు నివ్వెరగంది నీవు
సళుపుఁ జూపుల నేల సాదించేవే

చ. 1:	చనవుసేసుక నీవు సణఁగులు చల్లితేను
ననుపు సేసు కతఁడు నవ్వు నవ్వెను
పెనచి సరికిసరె బేసిగాదు నీవేల
వెనకటి నేరాలెంచి విడనాడేవే

చ. 2:	నిందలువేసి నీవు నేరము లెంచితేను
కందువలంటి యతఁడు కళరేఁచెను
యిందుకు నందుకు నీడె యీఁతకంటె లోతులేదు
మందెమేళాన నింకేల మచ్చరించేవే

చ. 3:	వావులుచూపి నీవు వలపించి కూడితేను
మోవులుచూపి యితఁడు మోహింపించెను
నీవు నాతఁడు నొక్కటే నేమె మీఁదమిక్కిలి
శ్రీవెంకటేశుఁడె తాను చిమ్ములురేఁచకువే

రేకు: 0278-2 శ్రీరాగం సం: 09-164

పల్లవి: వరుసతోనె వచ్చితే వలపులు చవులౌను
అరమరచి విభుఁడు అందేమి సేసీనె

చ. 1: మనసులో కాంక్షకు మాటాడితేఁ గొంతాస
ననిచినమీఁద మరి నవ్వులింపౌను
చనవుగలిగితేను సరసమాడఁ జెల్లును
పెనఁగేపాటిచేఁతల ప్రియము లీడేరును

చ. 2: కాయముమీఁది తమికి కనుచూపు గొంతాస
చేయి చేయిఁ గదిసితే సిగ్గులొంటును
ఆయములు గరఁగితే నందిపొందికలు దగు
తోయరాని మొగమోట తుదలుమీరించును

చ. 3: అట్టె పాయపుమదాల కండనుండాఁ గొంతాస
జట్టిగొన్నయందుమీఁద సన్నలుమేలు
అట్టె శ్రీవెంకటేశుండు అలమేల్మంగను నేఁ
బట్టితి ననుచుఁ గూడెఁ బనులెల్లా దక్కును

రేకు: 0278-3 సామంతం సం: 09-165

పల్లవి: నీవే యిన్నిట నిజమరివి
వావిదెలుప యిఁక వద్దయ్యా

చ. 1: వచ్చినపుడె నీవలపులు దక్కెను
యెచ్చు కుందు లిఁక నేమిటికి
కుచ్చెను కాఁగిట గుఱిగా నిన్నిదె
రచ్చలఁ బెట్టక రావయ్యా

చ. 2: పలికినపుడె నీ పంతము చెల్లెను
యెలయింపుల పనులేమిటికి
పిలిచీ రతులకుఁ బేరుకొనుచునిను
కొలఁదితేనె వూఁకొనవయ్యా

చ. 3: కూడినపుడె నీగుణములు దెలిసెను
యేడసుద్దు లిఁకనేలయ్యా
యీడనె శ్రీవెంకటేశ యెనసితిమి
మేడెపు రతులివి మెచ్చవయ్యా

రేకు: 0278-4 భైరవి సం: 09-166

పల్లవి: నాకుఁజూడ నిదె నీవు నావాఁడవు
లోకులమాటకెల్ల లోనైవున్నాఁడవు

చ. 1: హత్తి నాకాత్మవుగాన అన్నియు విన్నవించితి
చిత్త మెట్టున్నదో చెప్పఁగరాదా
పొత్తులమగఁడవట పొరచి కాఁపురమట
యిత్తల నాపై భక్తి యింకా నీకుఁ గలదా

చ. 2: అట్టె మన్నింతువుగన ఆనవెట్టి యడిగితి
జట్టిగా మోహము నీ కే సతిపైనయ్యా
చుట్టమ వందరికట చొట్లు నీకిన్నినట
ముట్టేవు నాచన్నులిఁక మోహమిందు గలదా

చ. 3: నీవు నే నొక్కటిగాఁగ నిజము విన్నాడించితి
దేవుళ్లు నీకెందరు తెలుపవయ్య
శ్రీవెంకటేశ నేను జిగి నలమేల్మంగను
తావుగాను రమించితి తగులింత గలదా

రేకు: 0278-5 దేసాళం సం: 09-167

పల్లవి: ఆపె నిన్ను దిద్దుకొన నయఁగారుగా
మాపుదాఁకా నూరకున్న మత్తుడవైవుందుగా

చ. 1: యింతి నీకు మోహించి యింటికి విచ్చేయఁగాఁగా
రంతుల నీవలపెల్లా రచ్చకెక్కెను
కాంతుఁడ యిటుగాకున్న కన్నవారివెంటనెల్లా
పంతపు నీమనసిది పరచై తిరుగుఁగా

చ. 2: చెలి నిన్ను బుజ్జగించి చెనకి నవ్వఁగాఁగా
యిలపై నీవిటతన మెన్నిక కెక్కె
లలియింతరేఁచకున్న లాగుల నీవయసెల్లా
పలచనై లోలోనె పండి తాఁ గైవాలుఁగా

చ. 3: నిండుఁగాఁగిటనె యాపై నేరుపరిఁ జేయఁగాఁగా
దుండగవు నీచేఁతలు తుదకెక్కెను
అండనె శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
రండూ నింతగాకున్న రతి చవిగాదుగా

రేకు: 0278-6 వరాళి సం: 09-168

పల్లవి: అప్పటి కప్పటి మాట లంటి మింతే
వుప్పొలి కినుమడాయ నూరకేవుండవయ్యా

చ. 1: కంగులేక నీవొళ్లఁ గపటము లేదందువు
అంగముపై పెంజెమట లవిగోవయ్యా
వెంగలితనాన నిన్ను వెల్లవిరి సేయరాదు
అంగడిఁబెట్టకు పను లట్టె వుండనీవయ్యా

చ. 2: వొద్దనున్నవారితోడ వొట్టులు వెట్టుకొందువు
అద్దము చూచుకో నీ మోమదిగోవయ్యా
గద్దించిందరిలోఁ దారుకాణలఁ బెట్టఁగరాదు
యిద్దరమే యెరుఁగుదు మిఁక నంతయేలయ్యా

చ. 3: పలుమారు మాముందర పంతాలు నెరపుదువు
అలవిమీరే గురుతు లవిగోవయ్యా
యెలమి శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తొలఁకీని మేలు పొత్తున నుండనీవయ్యా

రేకు: 0279-1 నాదరామక్రియ సం: 09-169

పల్లవి: ఒలసితే నొకమాట వొల్లకుంటే నొకమాట
బలిమి వలపులకు పాటియేది యిందుకు

చ. 1: చెక్కు నొక్కి వేఁడుకో నీచే సూటికి రాకున్న
కక్కసించి యేరా నీవు కడుఁ దిట్టేవు
యెక్కువ నీ వొక్క నోరె యెందుకైనావచ్చు నిఁక
నిక్కమేది కల్లయేది నేనెట్టు నమ్మేను

చ. 2: నవ్వు నవ్వి చేయి వేసి నయ మింతలేకున్న
పవ్వళించి యేరా నీవు పగచాటేవు
రవ్వగా నీగుణమిదె రండూ నడపఁజొచ్చె
యివ్వల నీయెడమాట లేమివినే మిఁకను

చ. 3: అట్టె నన్నుఁ గాఁగిలించి అన్నిటాఁ గిందుపడితే
జట్టిగొని తొల్లిటివోజకు వచ్చేవు
నెట్టన శ్రీవెంకటేశ నీవు నేను నొక్కటే
యిట్టు నట్టు నందాలకు నిన్ని నేరుతువు

రేకు: 0279-2 సామంతం సం: 09-170

పల్లవి: నీతలనె వేఁగెనా నిండు భోగాలు
కాతరపుఁ దమకము కాదనఁగఁ గలవా

చ. 1: దగ్గరి వున్నాఁ డతఁడు తలవంచనేలే
సిగ్గువడఁ బొద్దులేదా చెల్లఁబో నీకు
అగ్గమై చిన్నదానవు అయితే నౌదువుగాక
అగ్గలపు జవ్వనము ఆఁప నింకఁ గలవా

చ. 2: మాటలాడీ నాతఁడు మౌనము నీకేలే
గాఁటపు నివ్వెరగుకుఁ గాలములేదా
నేఁటనె కొత్తరికము నీకు నైతేనాయఁగాక
వాఁటపు మరుబాణాల వాఁడిచూపఁ గలవా

చ. 3: కాఁగిలించీ నాతఁడు కళవళమేలే
వీఁగి పరవశాలకు వేళలేదా
చేఁగదేరఁ గూడె నిన్ను శ్రీవెంకటేశుఁ డతఁడు
నాఁగువారె సరసాలు నవ్వకుండఁ గలవా

రేకు: 0279-3 కాంబోది సం: 09-171

పల్లవి: చాలుఁ జాలు నేల మాతో జాణతనాలు నాకు
కోలుముందై నీపొందు జిగురువంటిదయ్యా

చ. 1: చెచ్చెర నీమాఁటలు చెవియొగ్గి వినఁబోతే
మచ్చిక నల్లాపె నీకె మరులాయను
హెచ్చుగాఁ బదారువేల నీరీతిగడించుకొంటి
తెచ్చి నీకు నెవ్వ రుపదేశమిచ్చిరయ్యా

చ. 2: ముందరనుండఁగ నీమొగము చూడఁగఁబోతే
అందరిలోపల నాపె ఆలాయను
యిందువంకనె రేపల్లె యింతుల భ్రమించితివి
సందడి నెవ్వరు నిన్నుఁ జదివించిరయ్యా

చ. 3: చేరువ నీవుండఁగా నీసేవలు సేయఁగఁబోతే
సారె నీవురాన నాపె సతమాయను
యీరీతి శ్రీవెంకటేశ యిల్లాండ్లఁ దెచ్చుకొంటే
నేరిపె యెవ్వ రింతేని నిన్ను దిద్దిరయ్యా

రేకు: 0279-4 పాడి సం: 09-172

పల్లవి: ఆపెకు నీకుఁ దెలుసు నటమీఁది పనులెల్లా
చేపట్టినే మింతకంటెఁ జెప్పఁగఁ జోటేది

చ. 1: లోకములో నెవ్వతైనా లోఁచి మాటలాడఁగాను
పైకొనవి వానికిఁ బంతమేది
రాకలఁ బోకల నట్టె రాయడించి కొసరఁగ
మైకొని లోఁగాకున్న మగతనమేది

చ. 2: నంటున నెవ్వతెయైనా నవ్వులు సారె నవ్వఁగా
యింటికి రాకున్నవాని యెరుకేది
జంటలఁ దనమొకము సారె సారెఁ జూడఁగాను
వెంటఁ దగులకున్నను విటతనమేది

చ. 3: యెమ్మెచూపి యెవ్వతైనా యెదుటనే నిలుచుంటే
నెమ్మిఁ గలయనివాని నేరుపేది
కొమ్మను శ్రీవెంకటేశ కూడి నన్నుఁ గూడితివి
సమ్మతి నిటుగాకున్న జాణతనమేది

రేకు: 0279-5 దేసాక్షి సం: 09-173

పల్లవి: వినవమ్మ యశోద గోవింద కృష్ణుఁడు
చెనకి యెన్నిపనులు చేసెనమ్మ కృష్ణుఁడు

చ. 1: పుట్టులు దాఁగొట్టుఁగాను పువిదలు దిట్టఁగాను
అట్టాయ వీథులలో నుఱక కృష్ణుడు
పట్టినకోలల గొల్లపొఁజు లిరువంకరాఁగ
పట్టుకొన్న గొల్లెతల భ్రమయించీఁ గృష్ణుఁడు

చ. 2: పాలు దనపై గారఁగా పడఁతులు నవ్వఁగాను
గేలికి లోనాయను జంగిలి కృష్ణుఁడు
అలరి యెలుఁగులతో నడ్డమువచ్చినవారి
మేలపు చేతలు చేసి మెప్పించీఁ గృష్ణుఁడు

చ. 3: యిండులు దాఁజొరఁగాను యింతులు పైకొనఁగాను
బందుకు లోనాయను గోపాలకృష్ణుఁడు
అండనె శ్రీవెంకటాద్రి నలమేలుమంగఁ గూడి
దుండగపుఁ జేఁతలనె దొరాయఁ గృష్ణుఁడు

రేకు: 0279-6 పాడి సం: 09-174

పల్లవి: కన్నులఁ జూచేవు మాతొ కందువ మాటలాడేవు
కొన్నదికోలు నీకిఁక గోవిందరాజా

చ. 1: పవ్వళించేయప్పుడూను పాదాలొత్తే వారిద్దరు
యివ్వల నే నీతో నవ్వ నేకతమేది
దవ్వుల నుండే మమ్ముఁ దడవేవు నీవొళ్ల
కువ్వలాయ వలపులు గోవిందరాజా

చ. 2: యిద్దిరి చే నిమ్మపండ వేమి సేయవచ్చు నిన్ను
అద్ది నీతో మాటలాడ ననువయ్యీనా
చద్దికి వేఁడి కప్పటి జాణతనా లాడేవు
కొద్దిఁబడవు పనులు గోవిందరాజా

చ. 3: యిరుమొనసూదివి యెవ్వరివాఁడ వందుము
దొరవై నన్నుఁ గూడితి తొల్లె నీవు
తరవాతి చేఁతలెల్ల దక్కె నీకు నిందరిలో
గొరబై శ్రీవెంకటాద్రి గోవిందరాజా

రేకు: 0280-1 హిజ్జిజి సం: 09-175

పల్లవి: ఎఱిఁగెనపనులకు నిఁకనేఁటికి నీకుఁ
దఱితో నవ్వేవారె తగు నింతేకాకా

చ. 1: మగువలు వద్దనుంటె మఱతు వన్నిపనులు
తగిలి వెనకముందు తలపోసేవా
వెగటుగ నేమసేసే విన్నప మెందుకెక్కును
బగివాయకుండేవారి భాగ్య మింతేకాక

చ. 2: కొంగువట్టి తీసితేనె గబ్బున లోనౌదువు
పంగించిచెప్ప నీ కొక్కపాటి వున్నదా
పొంగి నీబాసలు నేఁడు పొగడఁగ నేమున్నది
వుంగరపువేలివారి వోపి కింతేకాక

చ. 3: కాఁగిలించి కూడితేనె కరఁగుదు వంతలోనె
దాఁగి పెనఁగఁగ నీకు తగవున్నదా
చేఁగదేరఁ గలసితి శ్రీవెంకటేశ నన్ను
వీఁగక నిలుచువారి వెర వింతేకాకా

రేకు: 0280-2 కేదారగౌళ సం: 09-176

పల్లవి: అందుమీఁద మేలుదాన వాతనికి నీవు దొల్లె
కందువె చూతువుగాక గరిసించ నేఁటికే

చ. 1: చిక్కని వెన్నెలతేట చెలియ నీ మొగమోట
అక్కజపు పతి నింకేమనఁగలవే
నిక్కి యాతఁడన్నీఁజేసె నీపై వలపువేసె
మక్కువ నాడ సుద్దులు మమ్మే మడిగేవే

చ. 2: పచ్చితేనె కులుకులు పడఁతి నీపలుకులు
యిచ్చట నాతని నింకా నేమనేవే
రచ్చలకు నాఁడెయెక్కె రాతిరి నీకు మొక్కె
ముచ్చట కిందేమి మామోములు చూచేవే

చ. 3: చెప్పరాని విందులు సేసెటి నీ పొందులు
యిప్పుడు శ్రీవెంకటేశు నేమిసేసేవే
తప్ప కితఁడె కలసె తమకములు వలసె
వొప్పుగా మమ్ము మెచ్చితి వొరయ నేమిటికే

రేకు: 0280-3 దేసాళం సం: 09-177

పల్లవి: ముగురము జాణలమే మోహమెవ్వరి దనేది
నిగిడి నామోము చూచి నీవేల లోఁగేవు

చ. 1: యింతి తెంకాయ కానుక యిచ్చె నీవు గైకొంటివి
యింతలేసి యాపె కుచాలివి యంటాను
సంతమై యిద్దరి సన్న సరికి బేసికి వచ్చె
అంతటి మీ నేరుపుల కట్టె నేను మెచ్చితి

చ. 2: దొండపండు కానుకిచ్చె తోడ నీ వందుకొంటివి
దండ నిటువంటిదె యధరమనుచు
దండి మీపొదరులవి తాసుగట్లెయు నాయ
అండ నుందానఁ గాన అట్టె నేమెచ్చితి

చ. 3: పువ్వుగుత్తి కానుకిచ్చెఁ బుచ్చుకొని కూడితివి
జవ్వనము ఆపెకు యీజాడ దంటాను
అవ్వలి మోమైవుండి అప్పుడె శ్రీవెంకటేశ
యివ్వలఁ గాఁగిలించి మీయిద్దరి మెచ్చితిని

రేకు: 0280-4 హిందోళవసంతం సం: 09-178

పల్లవి: ఇంతవాఁడు చెనకీ నెక్కడ చూచేవె నీవు
యింతలో గోడచిత్తరు వేమి వ్రాసేవే

చ. 1: ఆతల నీరమణుఁడు అట్టె నిలుచుకుండఁగా
యేతుల మాతో మాటాడే విది యేఁటిదే
బూతులఁ దిట్టీ నతఁడు పూని నీగర్వము చూచి
యీతల నేఁటి నవ్వులు యిటు నవ్వేవే

చ. 2: రతికి నాతఁడు నిన్ను రమ్మని పిలువఁగాను
కత లడిగేవు మమ్మిక్కడ నేటిదే
చతురుఁడు సురటి నిచ్చుట నిన్నుఁ దాఁకవేసె
వెతదీరఁ బుచ్చుకొని విసరుకొనే వేమే

చ. 3: శ్రీవెంకటేశుఁడు నిన్ను చేరి కాఁగిలించఁగాను
వోవరిలో నన్ను నేల వుండు మనేవే
దేవుఁ డాతఁ డంతలోనె తెరవేసి నిన్నుఁ గూడె
చేవదేరె నాతో నేల సిగ్గు వడేవే

రేకు: 0280-5 దేవగాంధారి సం: 09-179

పల్లవి: పొద్దుగూఁకె తెల్లవారె పొంతనె యాతఁడున్నాఁడు
గద్దరితన మింతేసి కలదటవే

చ. 1: చిత్త మెడసివున్నది చెప్పుడు మాటలవల్ల
వొత్తి యాతఁ డేమనిన వూఁకొనవు
అత్తివున్న చెలుల మమ్మడుగవే సుద్దులును
యిత్తలఁ దేరే వివర మెటువలెనే

చ. 2: పట్టిన చలమున్నది పాసిన కాఁకలవల్ల
జట్టిగొని వేఁడుకొన్నా సమ్మతించవు
అట్టె యాతనిచే నొక్క ఆనైనఁ బెట్టించుకోవు
గుట్టుతో నుండఁగాను కూడు టెన్నఁడే

చ. 3: పంత మెక్కుడైవున్నది బలు రారాఁపులవల్ల
కొంత గొంత సమ్మతించి కొంకుదేరవు
యింతలో శ్రీవెంకటేశుఁ డిదెరిఁగి నిన్నుఁ గూడె
వింత రతులనుచు నివ్వెరగు లేలే

రేకు: 0280-6 పాడి సం: 09-180

పల్లవి: అన్నియు నందె అమరె నదె
సన్నపునవ్వులు చల్లే నిపుడు

చ. 1: చెక్కు నొక్కి నను సేదదేర్చి యిటు
దిక్కనఁ గోపము దీర్చితివి
యెక్కువ నినుఁ దొలు తేమని యంటినో
చిక్కి కాఁగిలించెద నే నిపుడు

చ. 2: చనవులిచ్చి నను సమతు సేసి యిటు
పెనఁగి మంకు విడిపించితివి
యెనయ నపుడు నిను నెంతసేసితినో
చెనకి యధర మిచ్చెద నే నిపుడు

చ. 3: సరసమాడి కడుఁ జవులుచూపి యిటు
గరిమతోడ ననుఁ గలసితివి
సరవి శ్రీవెంకటేశ్వర యే మెరఁగనో
అరసి తనిసి కొనియాడెద నిపుడు

రేకు: 0281-1 నాదరామక్రియ సం: 09-181

పల్లవి: మనసుమెత్తనిదాన మరి నీకు మోహింతు
పనుపడి నీవెట్టు పాలార్చేవయ్యా

చ. 1: సరసపు నీమాటకు జంకించితి నీవంతలో
వొరసి చిన్నఁబోయి వూరకుంటివి
కరఁగితి నదిచూచి కరుణ మిక్కిలిఁబుట్టి
తిరుగ నామన సెట్టు తేరిచేవయ్యా

చ. 2: చేయి నామీఁద వేయఁగా సెలసి విదలించితి
చాయసేసుకో లోఁగి జడిసితివి
ఆయా లంటి చింతించితి అంతసేసితి నే నని
కాయ మంటి నన్ను నెట్టు గారవించేవయ్యా

చ. 3: నీవు నన్నుఁ గూడఁగాను నివ్వెరగుతోఁ జొక్కితి
నీవె తప్పు లెంచుకొని నేర నంటివి
శ్రీవెంకటేశ యిందుకే సిబ్బితి యింతయుఁ బాసె
చేవగా నా చన వెట్టు చెల్లించేవయ్యా

రేకు: 0281-2 సామంతం సం: 09-182

పల్లవి: ఎగ్గో తప్పో యెఱంగ నిది
నిగ్గులు దేరఁగ నినుఁ బైకొందు

చ. 1: పలుమరు నీతోఁ బంతము లాడను
అలసి సొలసి మాటాడుదును
కులికి కులికి నినుఁ గోపించి చూడను
నలుగడఁ గూరిమిఁనాఁటఁగ జూతు

చ. 2: కమ్మర నీపై కాఁకలు చల్లను
సమ్మతి వలపులు చల్లుదును
దిమ్మరేఁచి తరితీఁపులఁ బెట్టను
కొమ్మని మేకులు కొనఁ బెట్టుదును

చ. 3: పాసివుంటి వని బడలిక సేయను
ఆసల రతులనె అలయింతు
సేసలఁ గూడితి శ్రీవెంకటేశ్వర
వేసరించ నిను విడువ నెప్పుడును

రేకు: 0281-3 సాళంగనాట సం: 09-183

పల్లవి: ఎంతటివాఁడవు నిన్ను నేమందును
కాంతలకు మాకుఁ దొల్లి కారణము గలదా

చ. 1: ఆపె నీకె మొక్కనీ ఆపెకు నీవైనా మొక్కు
కేపున మాకేఁటికి మొక్కించేవయ్యా
యేపున నే నేమంటి యీయింతి నన్నేమనె
చేపట్టి నీకొర కింత సేసేవు గాకా

చ. 2: ఆవిడెము నీ వందుకో నీవిడె మట్టె పెట్టు
యీవల నెవ్వరి విడే లేమి సేసేము
యేవూరి యక్కను నేను యేవూరి చెల్లె లాపె
వావులు నీవల్ల నింతవచ్చె నింతె కాకా

చ. 3: చేయివట్టి తియ్యనీ చేసన్న నీవు సేయి
బాయిట మ మ్మెపుడూనుఁ బట్టవద్దు
పాయ వలమేల్మంగను పైకొంటి శ్రీవెంకటేశ
కాయకపువారి నీవే కట్టుకొందు గాకా

రేకు: 0281-4 భైరవి సం: 09-184

పల్లవి: ఏల సిగ్గు వడే వానతియ్యరాదా
మేలిమిచెలుల మిదె మీవారమె

చ. 1: తురుము నీవియు జార తొయ్యలి యెదురుకొనె
యిరవగు పతివి నీ వింటికి రాఁగా
పరగఁ జూచితి మాపె పట్టరాని సంతోసము
సరవి నీ మనసు యే చందమో యిపుడు

చ. 2: కన్నులా నోరా వినెను కాంత నీవు మాటాడఁగా
సన్నపుఁ జిరునవ్వులు జాలు వారఁగా
మున్నె యెరిఁగితి మాపె మోహ మింత గలదని
పన్నిన నీగుట్టు యేరుపడ దింతే కాని

చ. 3: చేతులాఁ జన్నుల నిండాఁ జెలి యప్పళించుకొనె
ఘాతల శ్రీవెంకటేశ కాఁగిలియ్యఁగా
యీతలఁ దెలుసుకొంటి మీ యలమేల్మంగ యాస
యేతుల నీ యాకతము లెట్టుడెనో

రేకు: 0281-5 శ్రీరాగం సం: 09-185

పల్లవి: ఎవ్వరిపై మోహ మెట్టు దెలుసు మరి
యివ్వల నాతో నెనసితివి

చ. 1: మందపు నడపుల మగువ రాకలకు
పొందుగ రమణుఁడ పొగడేవు
కందువ వేరొక కాంత చూడఁగా
చిందెటి చెమటలఁ జెలఁగేవు

చ. 2: చతురత నొకసతి సరసము లాడఁగ
మితిమీరఁగ నిటు మెచ్చేవు
తతిగొని వేరొక తరుణి నవ్వఁగా
యితవులాడి చన విచ్చేవు

చ. 3: వంతుకు నొకచెలి వలపులు చల్లఁగ
చెంతల సన్నలు సేసేవు
యింతలో శ్రీవెంకటేశ నేఁ గూడఁగ
సంతమై నాకె సత మయితివి

రేకు: 0281-6 దేసాళం సం: 09-186

పల్లవి: ఎవ్వరి నేమనఁ జాల విది యేఁటిదో
అవ్వలి యివ్వలి భావ మది యేఁటిదో

చ. 1: కందువ నీ కాపె చూపి కాఁకలు నీ మీఁదఁ జల్లి
అందపు ముసుఁగు వెట్టె నది యేఁటిదో
యింద మని విడె మిచ్చి యియ్యకోలు మాటలాడి
యిందె నిలుచుకున్నది యిది యేఁటిదో

చ. 2: సెలవు నీ కాపె సేసి చేతులు నీ మీఁదఁ జాఁపి
అలసి పండున్న దాపె అది యేఁటిదో
మలఁగు నీకు వేసి మరి తానూ నం దొరగి
యెలమి నూరకేవున్న దిది యేఁటిదో

చ. 3: చక్కని భూకాంత యాపె చనవు నీ మీఁదఁ జాఁపి
అక్కర నీ వీఁపెక్కె నది యేఁటిదో
గక్కన శ్రీవెంకటేశ కైకొని నీ పురమెక్కె
యిక్కువ నలమేల్మంగ యిది యేఁటిదో

రేకు: 0282-1 సాళంగం సం: 09-187

పల్లవి: ఇదివో వలపు చింది యినుమ డాయను
యెదుట నీభాగ్య మాయ నిఁక నేఁటిదయ్యా

చ. 1: చెలియ నీ వింటికి విచ్చేసిన పరాకున
మలసి పయ్యద వెట్ట మరచె నదే
వెలయ నీ వింతలో నవ్విన నవ్వులకు నిట్టె
చలివాసి తన కొప్పు జారుటా నెరఁగదు

చ. 2: పడఁతి నీ చూపులు పైఁ బారిన సంభ్రమమున
బడినె పాయపు సిగ్గుపడ మరచె
జడియక నీ వంతలో సరసము లాడితేను
వొడలఁ జెమట నిండి వొలుకుట చూడదు

చ. 3: వేవేగ నీవు గూడిన వేడుక నలమేల్మంగ
శ్రీవెంకటేశుఁడు తనచేఁత మఱచె
భావించి నీవంతలోనె పైపై నెచ్చరించఁగాను
ఆవటించి తన మేని అలయికఁ గానదు

రేకు: 0282-2 శ్రీరాగం సం: 09-188

పల్లవి: తరుణి యిందుకే తలవంచె
సరసము లెటువలె జరపితివో

చ. 1: పంతము లాడుచుఁ బరతెంచిన చెలి
చెంతల నినుఁ గని సిగ్గువడె
మంతు కెక్కి కనుమరఁగులలోనె
యెంత సేసితివో యే మంటివో

చ. 2: జంకెల బొమ్మల జరసే నని సతి
అంకెల నినుఁ గని అరమఱచె
సంకెలేని నీ చాయలలోనె
వుంకువ నీ వెట్లుండితివో

చ. 3: అటు నినుఁ గలయుచు నలమేలుమంగ
నటనల నినుఁ గని నవ్వె నదే
చిటిపొటి రతులను శ్రీవెంకటేశ్వర
యెటువలె నొకటయి యెనసితివో

రేకు: 0282-3 శంకరాభరణం సం: 09-189

పల్లవి: తనివారఁ దిరువనందలము సేవ నేఁడు
అనువుగా సేవించరో అమరులు ఋషులు

చ. 1: యెదురుగాఁ గూచుండి యిద్దరు నందల మెక్కి
కదిసి మీఁదఁ బన్నాగము గట్టించి
ముదమున నొండొరులు మోములు చూచుకొంటా
యిదివో దేవులు దేవుఁ డేఁగేరు వీధులా

చ. 2: చదురులమాఁటలు సతు లాడఁగా వింటా
పుదుటునఁ దమ యంగా లొరయఁగను
అద నెరిఁగి మోవుల నంతలో నవ్వులు నవ్వి
యెదు రెదుర దంపతు లేఁగేరు వీధులా

చ. 3: పొదిగి యలమేల్మంగ పూఁచి కాఁగిలించఁగాను
కదలక కూడీ శ్రీవెంకటేశ్వరుఁడు
అదివో యాతఁడు మెచ్చె నాతని నాపె మెచ్చె
యెదిగి నగరిలోనె యేఁగేరు వీధులా

రేకు: 0282-4 నాట సం: 09-190

పల్లవి: పై పై నిన్నుఁ గొసరితే పసురే కాదా
వైపులు సేసుక నే నే వద్దనుండేఁ గాకా

చ. 1: యిచ్చకము లాడఁగానె యిటు రమ్మనేవు గాక
చెచ్చెర నిజ మాడితే చేర నిచ్చేవా
పచ్చిగాఁగ నీగుణము పచరించ నేమున్నది
కొచ్చి నా నేరుపుననె గుట్టుసేసేఁ గాకా

చ. 2: చాయచేసు కుండఁగానె చవులై వుందానఁగాక
నాయము నడపు మంటే నన్ను మెచ్చేవా
సోయగాన నిన్నంత సోదించ నేమున్నది
తీయని మాటాడి నిన్ను తిద్దుకొనేఁ గాక

చ. 3: కదిసి నేఁ గూడఁగానె కరఁగి చొక్కేవు గాక
వదరి నే నూరకున్న వస మయ్యేవా
అదె శ్రీ వెంకటేశుఁడ అలమేలుమంగ నేను
పొదిగి నేనుండఁగానె భోగించేవు గాకా

రేకు: 0282-5 లలిత సం: 09-191

పల్లవి: నాటి సుద్దులె వింటిమి నేటి సుద్దులు గంటిమి
పాటింప నావేడుకలు ప్రత్యక్షమైవున్నవి

చ. 1: ఆదనఁ గోనేటిదండ హరి గూచుండి చూడఁగ
యెదుటనె జలకేలి నింతు లుండఁగా
కదిసి యమునలోన కందువైన గోపికలు
పొదిగి వలపుచల్లే పోలికయ్యె వున్నది

చ. 2: అంతలోనె వలువలు అందరుఁ గట్టుక వచ్చి
చెంత నితని కొలువు సేయఁగాను
చింతదీరఁ దొల్లి అందె చీర లిన్ని నిప్పించుక
సంతసాన నిట్లుండే సరవినే వున్నది

చ. 3: అట్టె శ్రీవెంకటేశుఁ డలమేల్మంగనుఁ గూడి
నెట్టన పైఁడిమేడలో నిందు కుండఁగా
అట్టుగా వీ రిందరు నాఅడిసేసి నవ్వఁగాను
తెట్టెలై నాటి పొందులు తెలిపి నట్టున్నది

రేకు: 0282-2 శుద్ధవంతం సం: 09-192

పల్లవి: ఎంతమాట కెంత సేసే వేమీ నీవు
పంతాలు నెరపఁ బోతే పసచూప నున్నదా

చ. 1: చేసుకొన్న చెలిగాన చేకొని కొసరితే
యీసులు రేఁచుకొనే వేమీ నీవు
ఆసగలవాఁడ వైతె నన్నిటి కోరుతు గాక
వేసరుకొనేవు నీకు విన్నవించ నున్నదా

చ. 2: వొరసి సతి నీతోడ నూరకే అటుండితేను
యెరవులు సేసుకొనే వేమీ నీవు
కరఁగ నేరిచితేను కైవసమై వుందు గాక
పొరలఁ జూచేవు యిఁక పొందు సేయ నున్నదా

చ. 3: తగవులకాంత నీతో తచ్చనలు నెరపితే
నెగసక్కె లంటా నవ్వే వేమీ నీవు
నిగిడి శ్రీవెంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
మొగము చూచేవు నీతో మూసి దాఁచ నున్నదా

రేకు: 0283-1 భూపాలం సం: 09-193

పల్లవి: రమణుని చిత్త మింతే రాఁపులు మాతో నేల
సమముగాఁ జూడు మని చండిసేయవచ్చునా

చ. 1: పంతపు నీమాటలకు పనిలేదు మాతోను
చెంతలఁ బతికె బుద్ధి చెప్పరాదా
యెంతలేదు నీసణఁగు యేల వాదుకు వచ్చేవు
బంతిఁబెట్టి వలపులు పంచిపెట్ట వచ్చునా

చ. 2: జంకెన బొమ్మల మమ్ము సాదించఁ బనిలేదు
వంకల నీనేరుపుల వంచుకోరాదా
మంకుల నీగుణములు మాకుఁ గొత్తలా నేఁడు
అంకెలుగా నీమనసు అంటించ వచ్చునా

చ. 3: యీడుకుగా మాతోను యింతసేయఁ బనిలేదు
ఆడుకోలు గలిగితే ననరాదా
యీడనె శ్రీవెంకటేశుఁ డిరవై నన్నుఁ గూడె
వేడుకకూటములకు వెలవెట్టవచ్చునా

రేకు: 0283-3 పాడి సం: 09-194

పల్లవి: ఎప్పటివాఁడవె కావా యెరఁగఁ గాకా
చిప్పిల నేనే మరచితిఁ గాని

చ. 1: యింగితము చూచి నీ విటువంటివాఁడ వని
అంగనలు నాతోఁ జెప్పి రల్లనాఁడె
సంగడి నేనే నిన్ను సాదించనేరక
వుంగిటి మొగమోటాన నుండితిఁ గాని

చ. 2: దట్టమై నీ వింతేసి తలఁచే తలఁపులకు
అట్టె సగినాలు చెప్పి రల్లనాఁడె
వట్టి ఆసలను నేనే వాదువెట్టనేరక
గుట్టు సేసుకొని యింత కొంకితిఁ గాని

చ. 3: గుమితాన నింతసేసి కూడుదువు నన్ను నని
అమరఁ గలలు గని రల్లనాఁడె
తమితో శ్రీవెంకటేశ తగ నట్టె కూడితివి
సమరతి నేనే నిన్ను జట్టి గొంటిఁ గాని

రేకు:	0283-3 ముఖారి సం:	09-195

పల్లవి:	మేలు నీతోడి పొందులు మేకు లాయను
వేళ వేళ నీ సతికి వింత లాయను

చ. 1:	చిల్లరగా చెలి నీతో సెలవుల నవ్వఁబోతే
వెల్లవిరులై పెద్ద వెన్నె లాయను
చల్లని నీ సరసాలు జాలువారి జాలువారి
యిల్లిదివో వలపుల యేరు లాయను

చ. 2:	మంతనాన నీతోను మాటలాడఁ బోతేను
చింతదీర నీపె కవె సిగ్గు లాయను
చెంత నీతో సంగాతాలు చిమ్మిరేఁగి చిమ్మిరేఁగి
కాంతుల మరుబాణాలు గను లాయను

చ. 3:	సమ్మతించి యింతి నిన్నుఁ జక్కఁ జూడఁ బోతేను
కుమ్మరింపుఁ దమకపు గురు లాయను
కొమ్మకు శ్రీవెంకటేశ కూడిన నీ కూటములు
దొమ్ము లాసల రతుల దొంతు లాయను

రేకు: 0283-4 మధ్యమావతి సం: 09-196

పల్లవి: అన్నిటా భాగ్యవంతుఁడ వాయమెరిఁగి కూడితి
యెన్నికలు మీరితేను యెట్టుండునో సుద్దులు

చ. 1: చింతలనె కొంతపొద్దు చెక్కిటిచేఁ గొంతవొద్దు
కాంతలతోఁ గొంతవొద్దు గడపెఁ జెలి
యింతలో నీవు విచ్చేసి తిన్నియును లెస్సలాయ
యెంతలేసి పను లౌనో యించు కూరకుండినా

చ. 2: యెదురుచూచే యాస నిల్లుసింగారించే యాస
వెదకేటియాస గొంత వెలసెఁ జెలి
అద నెరిఁగి దగ్గరి అంతలో నీవు నవ్వితి
యెదుగా సరసమైతే నెన్నేసివిధులో

చ. 3: చూపులనె కొంతరతి సుద్దులనె కొంతరతి
యేపులనె కొంతరతి నెనసెఁ జెలి
పై పై శ్రీవెంకటేశ భామ నిట్టె కూడితివి
యీపొద్దు లివిదక్కె నింకా నెంతదక్కునో

రేకు: 0283-5 ఆహిరి సం: 09-197

పల్లవి: ఇంతకంటె వలపు నేనేమి చెప్పేను
కాంతుఁడవు నీవె యింకాఁ గనుకోవోయీ

చ. 1: అంతరంగములోనను ఆయము నీచింత నాకు
బంతి నీమాటలె చెవులపండుగ నాకు
సంతమైన సరసాలె జగమెల్లా నేలుట
వింత వింత చనవులె వేవేలు విధులు

చ. 2: కన్నులకు నీరూపు కామనిధానము నాకు
పనిన్న నీ చనవులె పంటలు నాకు
మన్ననల నగవులె మంచి కప్పురవిడేలు
మున్నిటి పొందుల సిగ్గు ముత్యాలసేన

చ. 3: మేనికి నీకాఁగిలి మెత్తని పరపు నాకు
తానకపు నీరతులె తగుభోగాలు
మానక శ్రీవెంకటేశ మరిగి నన్నుఁ గూడితి
నానెటి చెమట లివె నవరసాలు

రేకు: 0283-6 సౌరాష్ట్రం సం: 09-198

పల్లవి: ఇద్దరిఁ గూర్చినవారు యిప్పుడు మీరెకారా
వొద్దిక్క నప్పటి నేల వొరపులాడేరే

చ. 1: కచ్చుపెట్టి నే నతనిఁ గన్నులఁ బిలిచితేను
యిచ్చుటఁ జెలులు మీరు యేల నవ్వేరే
ముచ్చటమాటులఁ గడు మోహముపైఁ జల్లితేను
పచ్చారుచుఁ జెలు లేల పచ్చిసేసేరే

చ. 2: పాయక నే నాతనిపయిఁ జెయివేసితేను
చాయల మీలో నేల సన్న లాడేరే
ఆయము లెరిఁగి నే నాకు మడిచియ్యఁగాను
వేయేసిలాగుల నేల వెంగేలాడేరే

చ. 3: భావించి శ్రీవెంకటేశుపాదాలు నే నొత్తితేను
వేవేగ సిగ్గున నేల వెలి నుండేరే
ఆవటించి కూడితిమి అప్పుడే మీరు లోనికి
యీవేళ వచ్చితి రింక నిట్టె వుండరే

రేకు:	0284-1 రామక్రియ	సం:	09-199

పల్లవి:	తొలుతె మీతమకము దోసిటిపాలు
	అలరి యింకాఁ బెండ్లి ఆడవయ్య యిపుడు

చ. 1:	సతికి నీకుఁ జూపుల సరిపొంతనాలుగూడె
	చతురత మాట లనె సందివిడేలు
	మతకరినవ్వు లనె మంచి పాశాల విందులు
	అతిశయమగుఁ బెండ్లి ఆడవయ్య యిపుడు

చ. 2:	యింతికి నీకు వయసు లిరువంకఁ గంకణాలు
	పంతపుఁ దమకములె బాసికములు
	కొంతఁ గొంత లేఁతసిగ్గు కొంగులువేసిన ముడి
	అంతలో వేడుకపెండ్లి ఆడవయ్య యిపుడు

చ. 3:	నంటుతోడి సరసాలు నాగవల్లి సోబనాలు
	పెంటలైన సమరతి పట్టిన పేఁట
	యింటిలో శ్రీవెంకటేశ యీయలమేల్మంగను
	అంటి ముట్టి మంచిపెండ్లి ఆడవయ్య యిపుడు

రేకు: 0284-2 బౌళి సం: 09-200

పల్లవి: నివ్వెరగై వున్నాఁడవు నే మెంత పిలిచినా
మువ్వంక వలపులు ముంచకుండీనా

చ. 1: సొలసి సొలసి నిన్నుఁ జూచిన యీ చెలిచూపు
నలిరేఁగి నీ మతిలో నాటకుండీనా
మలసి మలసి యిట్టె మాటలాడిన మాట
కలసి నీ మర్మాలు కలఁచకుండీనా

చ. 2: చిమ్ముచుఁ జిమ్ముచు నింతి చెనకిన చెనకులు
కిమ్ముల నిన్నిట్టె గిలిగించకుండీనా
కమ్మరఁ గమ్మర నీతో కందువ నవ్విన నవ్వు
దిమ్మరేచి నీగుణము తేలించకుండీనా

చ. 3: కరఁగి కరఁగి కాంత కాఁగిలించిన కాఁగిలి
అరమరపించి ఆయా లంటకుండీనా
యిరవై శ్రీవెంకటేశ యిద్దరి మమ్ముఁ గూడితి
గరిమ నీకిట్టె తారుకాణగాకుండీనా

రేకు: 0284-3 పాడి సం: 09-201

పల్లవి: ఇట్టి నీకు వలచిన యింతిదె జన్మముగాదా
వట్టి మోహించినవారి భాగ్యమవె కావా

చ. 1: నీవు మన్నించేటి యట్టి నెలఁతల కెల్లాను
తావుల లీలారవిందమవె కావా
భావింప నీచూపులు వారినవారి కెల్లా
ఆవటించి మెడకంఠహారమవె కావా

చ. 2: కప్పురపు బల్లందిన కాంతలకెల్లాను(?)
కప్పిన శిరోవణికమమె కావా
చొప్పుగా నీపాదాలు సోఁకినవారికెల్లా
కప్పమైన ముంజేతి కంకణమవె కావా

చ. 3: కోరి నీవు కాఁగిటిలోఁ గూడుండె సతుల కెల్లా
నారుకొన్నయట్టి నిధానమవె కావా
యీరీతి శ్రీ వెంకటేశ యెనసి నన్నేలితివి
తేరకొన నాపాలి దేవుఁడవె కావా

రేకు: 0284-4 శ్రీరాగం సం: 09-202

పల్లవి: ఇటువంటి నీ భాగ్య మేమని చెప్పుదుమమ్మ
తటుకనను నీపతితపము లీడేరె

చ. 1: చెక్కుల మకరాంకము జిగిఁగన్నుల మచ్చములును
మిక్కిలి శంఖము మెడను మీఁగాళ్లఁ గచ్ఛపములు
చిక్కని నీరూపఁపు సింగార జలనిధికిని
నెక్కొని తామొనరి నవనిధులాయఁ గదవే

చ. 2: వదనమునఁ బద్మంబు వరము కుచగిరులకును
అదె దంతములఁ గుందము లలకము లనిలములు
అద నెరిఁగి నిలిచి నీయవ్వనపు జలనిధికి
పొదిగి నవనిధులగుచుఁ బొడమె నదె కదవే

చ. 3: కాఁగిటను శ్రీవెంకటగిరి ముకుందంబు
మూఁగిన వరము లెల్ల ముంగిటందు
చేఁగమీరిన రతులచెమట లను జలనిధికి
ఆఁగి యిటు నవనిధులు నాయఁ గదవే

రేకు: 0284-5 సామంతం సం: 09-203

పల్లవి: నేనే యెరుఁగుదును నీవూ నెరుఁగుదువు
పూనిన రుత్తమాటలు భూమి నెన్నిలేవురా

చ. 1: తలఁచినట్టె నీవు దగ్గరి విచ్చేసితివి
వలపు లంటె నిటువలె నుండురా
సొలసి నేఁ జూడఁగానె చూచితివి నీవు నట్టె
యెలమి లోలోని యాస కిది దిష్టాంతమురా

చ. 2: ననిచి నానవ్వులు నీనవ్వులు నొక్కటాయ
యెనసిన యింపులకు నీగురుతేరా
వొనర నిద్దరికిని వొక్కమాటే పులకించె
తనువు లొక్కటౌటకు తారుకాణ లివిరా

చ. 3: రాణించి నేఁ గోరినట్టే రతి నీవు సేసితివి
ప్రాణము లెరవుగాని భావ మిదిరా
జాణవు శ్రీవెంకటేశ జంటవాయ మిద్దరము
నాణెపు వేడుకలెల్ల నాకు నీకె తగురా

రేకు: 0284-6 బౌళి సం: 09-204

పల్లవి: ఎవ్వరితోనైనాఁ జేయుమీ మాయలు
రవ్వలఁ బెట్టఁగ నేము రాఁపువారమా

చ. 1: తక్కక నీవు మాపై తలఁపు గలితేఁ జాలు
అక్కడ యిక్కడె కాదా అందు కేమీ
చొక్కులఁ బెట్టుచు మాతో చుట్టరికము నెరప
వెక్కసాన నేఁడు నీకు వింతవారమా

చ. 2: పొద్దుపొద్దు మా ముంగిటఁ బొలసి వుండితేఁ జాలు
యిద్దర మొక్కటె కాదా యిందు కేమీ
కొద్దిమీర నీవు మమ్ముఁ గొంగువట్టి తీసేవు
గద్దించి నీతోఁ బెనఁగ కడవారమా

చ. 3: సమరతిఁ గూడితివి సారెకుఁ బొగడవద్దు
తమక మొక్కటె కాదా దాని కేమీ
అమరె శ్రీవెంకటేశ అన్నియుఁ గడపలోన
జమళిబాస లియ్య మెచ్చునివారమా

రేకు: 0285-1 సామంతం సం: 09-205

పల్లవి: నిందలేని పతి విదె నీవు నాసొమ్ము
కందువ సొమ్ములమీఁదఁ గలిగెను సొమ్ము

చ. 1: సూటిగా నీవు చూచేటి చూపు నాసొమ్ము
పాటించి నీవు పలికేపలుకు నాసొమ్ము
కూటమిరతుల కొనగోరు నాసొమ్ము
యీటున నీమేనిసొమ్ము లిచ్చేవు నాకు

చ. 2: చవిగా నాడే నీ సరసము నాసొమ్ము
జవకట్టక యిచ్చే నీచనవు నాసొమ్ము
నవకమయిన నీనవ్వు నాసొమ్ము
యివల నింకా సొమ్ము లిచ్చేవు నాకు

చ. 3: కింకలేని దిదే నీకాఁగిలి నాసొమ్ము
లంకెలైన నీమతివలపు నాసొమ్ము
అంకెల శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యింకా సొమ్ము లిచ్చేవు యెన్నియైనా నీవు

రేకు: 0285-2 ముఖారి సం: 09-206

పల్లవి: ఏమిటికి వేఁడుకొనే వింతలోఁ దమకించేవు
కామించి నీ వాడినట్టు కాదంటినా

చ. 1: మచ్చరములెల్లఁ దీరె మంతనాన నీవు నాతో
యిచ్చకము లాడితేనె యియ్యకొంటివి
కుచ్చి కాఁగిలించి నాచెక్కులు నొక్కే వేమిటికి
నిచ్చలు నీచెప్పినట్టు నేఁ జేయనంటినా

చ. 2: ఆనలెల్ల విడిచితి నంటఁబట్టి నీవు నాకు
తేనెమోవి యిచ్చితేనె తిరమైతివి
పూనిక నా కొంగువట్టి పొంచి యాలపెనఁగేవు
పూని నీతో పొందులు నే నొల్లనంటినా

చ. 3: మంకు లన్నియుఁ దొలఁగె మనసుమర్మములంటి
సంకెలు దీరిచితేనె సమ్మతించితి
కొంకక శ్రీవెంకటేశ కూడి యింకాఁ బొదిగేవు
పొంకమైన మీఁదాఁ దప్పులు వట్టేనా

రేకు: 0285-3 సాళంగనాట సం: 09-207

పల్లవి: పిలువవచ్చిన నేను పెంట వెట్టుకొన్నదాన
తలఁపు నీ కెట్టున్నదో దంటఁగాను నేను

చ. 1: కామినులతోడి మాట కలది కలట్టేకాని
కోమలపు కల్లలైతె కోపగింతురు
జామాయ నీవద్దనుండి సరినాపెతో నేమందు
నీమతకము లేఁటివో నే మెరఁగ మిఁకను

చ. 2: వలచినవారిపొందు వచ్చినట్టె వచ్చుఁగాని
కొలఁదికి రాకున్న కొసరుదురు
నెలకొంటి నిక్కడ నేనె నాపె నెట్టు నమ్మింతు
యెలమి మీ కిద్దరికి నెదురాడ నోపను

చ. 3: యిల్లాండ్ల కన్నియును యియ్యకోలై వుండుఁగాని
జల్లించి సందుగలితే సాధించరు
యిల్లిదె నన్నుఁ గూడి యింట నాపెఁ గూడితివి
వొల్లనె శ్రీవెంకటేశ వూరకుండే నిపుడు

రేకు: 0285-4 శ్రీరాగం సం: 09-208

పల్లవి: ముట్టితేనె ముయిముచ్చటలూ
అట్టు సేయ నాఁబిడిదానినా

చ. 1: గక్కన నీతనిఁ గన్నులఁ జూచిన
పిక్కటిల్లె నిదె పెంజెమట
చెక్కడచితేను చేటఁడు వలపులు
వొక్కమాటె నే నోపుదునా

చ. 2: నవ్వి యితనితో ననుపులు సేసిన
పువ్వకపూచెను పులక లివి
రవ్వగాఁ బెనఁగితే రాసెఁడు తమకము
జవ్వనము మోవఁ జాలుదునా

చ. 3: కాఁగిట నితనిఁ గలసితి నిందుకు
చేఁగలు దేరెను చిత్తమిది
వీఁగఁ డితఁడు శ్రీవెంకటేశ్వరుఁడు
నీఁగని చలములు నేరుతునా

రేకు: 0284-5 ఆహిరి సం: 09-209

పల్లవి: ఇద్దరుఁ గూడినమీఁద నిఁక నేఁటి సుద్దులే
పొద్దు వొద్దు కాతఁడు బుజ్జగించఁగాను

చ. 1: తమకించే వేఁటికె తా నిన్న రానియందుకు
అమర నాతఁడు నీతో నానతీఁగాను
చెమరించే వేఁటికె చెక్కు నొక్కి యాతఁడు
జమళి వేఁడుకొని యిచ్చకము సేయఁగాను

చ. 2: పచ్చిసేయ నేఁటికె పరాకై తా రున్నందుకు
చెచ్చెర నాతఁడు నిన్నె చెనకఁగాను
మెచ్చ వింకానేఁటికె మేకుల నిన్నుఁ బొగడి
వొచ్చముదీర నాతఁడు వుపచరించఁగను

చ. 3: ఆరీతి యింకేఁటికే అన్ని చేఁతలకు నిన్నుఁ
గోరి శ్రీవెంకటేశుఁడు కూడఁగాను
బీరములు మానవె పెనఁగి నిన్నుఁ గలసి
ఆరసి యీాతఁడె నీకు నందాలు చెప్పఁగనూ

రేకు: 0285-6 మాళవి గౌళ సం: 09-210

పల్లవి: ఈతఁడు వద్దనుండఁగ యేల యెమ్మెలు చెప్పేరే
గాతల మగలవద్ద గర్వములు గలవా

చ. 1: చెంగట మామొగమున చేరఁడేసి కన్నులంటా
అంగన లందరు నన్ను నాడుకొనేరే
పంగించి మానెరులివి బారెఁడేసి ఆయనంటా
వుంగిటిగా సారె నేల వుప్పతించేరే

చ. 2: పంతాన నాకుచములు బంగారుకుండలంటా
బంతినుండి చెలులేల పచ్చారేరే
యింతలో నాపిరుఁదులు యిసుక దిబ్బెములంటా
రంతులుగాఁ గడు నేల రాఁపు సేసేరే

చ. 3: పొంచి నా రూపమిది పుత్తడిఁ బోలునంటా
యెంచి యెంచి మమ్మునేల యింతసేసేరే
అంచల శ్రీవెంకటేశుఁ డన్నిటా నన్నుఁ గలసె
మించుగాఁగ మమ్ము నేల మెరయించేరే

రేకు: 0286-1 శ్రీరాగం సం: 09-211

పల్లవి: వలపులా గటువంటిదివో
పిలిచేటి ప్రియమున బీరము మఱచె

చ. 1: వెలఁది నిన్నుఁ గని వేడుకతోడను
అలుక లన్నియును నటు మఱచె
నలుగడ నీతో నవ్వేటి సందడి
చలములు లోలో సాదించ మఱచె

చ. 2: యింతి విడె మిదె యిచ్చె పరాకున
పంతపు టొట్లపని మఱచె
చెంతల నినుఁ గడు చెనకే సొబగున
కొంతయినఁ దొల్లిటి కోపము మఱచె

చ. 3: కొమ్మ కాఁగిటను కూడే తమకమున
సమ్మతి జంకించఁగ మఱచె
యిమ్ముల శ్రీవెంకటేశ కలసితివి
చిమ్ముల యెరవులు సేయఁగ మఱచె

రేకు: 0286-2 రామక్రియ సం: 09-212

పల్లవి: ఎటువంటి చుట్టరిక మెటువంటి పొందులు
నటవటలకు నేల సాదించేవే

చ. 1: అప్పటినుండియు నీ అండ నిట్టెవుండఁగాను
రెప్పలెత్తి చూచి చూచి రేసు లాడేవు
చెప్పినవారిమాటకు చెవియొగ్గి విని విని
తప్పుఁదారుల నేల తమకించేవే

చ. 2: మనసిచ్చి నే నీతో మాట లిట్టె ఆడఁగాను
వెనకసుద్దుల కేల వెంగె మాడేవే
తనిసి వొకటొకటె తలఁచుక తలఁచుక
పెనఁగి నేఁ బిలువఁగ బిగిసే వేలే

చ. 3: కందువ లంటి నేను కాఁగిలించి కూడఁగాను
చందపు బొమ్మల నేల జంకించేవే
చెందితి నిదివో నిన్ను శ్రీవెంకటేశుఁడ నేను
అందిన రతుల నేల అలయించేవే

రేకు: 0286-3 దేశా(సా)క్షి సం: 09-213

పల్లవి: తా నదివో నే నిదివో తారుకాణ లైతిమి
మోనముతోడ నవ్వరే మోవులనవ్వా

చ. 1: ఆడ నీడ నుండి వచ్చీ అలసి సొలసి మెచ్చీ
వేడుకకాని కియ్యవే విడె మిదిగో
నీడనుండె అలసీని నిలుచుండె కలసీని
పాడితోడనె మొక్కరే పండుగమొక్కు

చ. 2: చేయఁగలవెల్లాఁ జేసీ చేరి నాపైఁ జెయి వేసీ
పాయపు వాని కియ్యరే బలు కట్నాలు
చాయలకె మాటలాడీ సన్నలకె పాట పాడీ
దాయముగాఁ జూడరే సంతసపుఁ జూపు

చ. 3: కాంతలలోన వెలసీ కాఁగిట నన్నుఁ గలసీ
పంతగాని పై జల్లరే బలు సేసలు
యింతలో శ్రీవెంకటేశుఁ డితఁడిదె నన్నుఁ గూడె
వింతగా విందు చెప్పరే వియ్యపు విందు

రేకు: 0286-4 లలిత సం: 09-214

పల్లవి: ఎవ్వరి బుద్ధులు యెక్కడి కెక్కును
నవ్వులె జాణల నను పయ్యేడివి

చ. 1: పంతము లాడరు బలుములు చూపరు
వంతు లెంచ రటు వలపులకు
సంతసంబులునుఁ జవు లగు సరసము
లెంతైన లోలో నెర వయ్యేడివి

చ. 2: వేసట చూపరు వింతలు సేయరు
వాసులు నెరపరు వలపులకు
ఆసల తమకము అంగపుఁ గరఁగులు
తాసులవలెనే తగు లయ్యేడివి

చ. 3: గుట్టున జడియరు కొంకుచు మొరయరు
వట్టువోరు తమ వలపులకు
యిట్టె శ్రీవెంకటేశ మీకూటమి
నెట్టన రతులివె నిలిచినవి

రేకు: 0286-5 ముఖారి సం: 09-215

పల్లవి: ఎఱఁగని యాఁటదయితే యిది నిజమంటా నమ్ము
నెఱియ మాతో నిజమే నెరపవలయురా

చ. 1: యెదుటనె వలపు యింటికాడ బులుపు
వదల కేడ నేరిచి వచ్చితివిరా
పెదవులపై మాట బిగువులలో తేట
సదరమ్మై నీకెపుడు సాజమే కదరా

చ. 2: చెనకితే సిగ్గులు చేఁతలనే యెగ్గులు
ననుపున రెండూ నెట్టు నడపేవురా
మునుపనె మొక్కులు మోచి వచ్చితె తెక్కులు
పొనిగి నీవు పుట్టఁగఁ బుట్టినవే కదరా

చ. 3: మెచ్చితేనె మేకులు మీరితేనె కూకులు
యిచ్చకొలఁది నడతు వేమందురా
ముచ్చట శ్రీవెంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
చెచ్చెరఁ బరులకైతె సేతువు మాయలురా

రేకు: 0286-6 మంగళకౌశిక సం: 09-216

పల్లవి: సవతుల కెల్ల నీవు చాటి చెప్పింతువు గాక
నవకాన మూలనుంటె నమ్మేరా దేవులని

చ. 1: ఆతనివద్ద నుంటె నీ వాల వని యందుఁ గాక
యీతల నీ వెట్టుండినా నెవ్వ రందుము
యేతులకు నీవు మాతో నెరుకలు సేసుకొని
బూతులఁ దిట్టితేనె నీ పొందు గానవచ్చునా

చ. 2: ముచ్చట మీరాడుకొంటే మోహాలు గందుము గాక
పచ్చి గుట్టున నుంటె నీ భావ మెందుండు
మచ్చిక నీ చనవులు మా ముందర మెరయించి
కొచ్చి యాతనిఁ జూచితే గుట్టు గానవచ్చునా

చ. 3: కాఁగిట శ్రీవెంకటేశుఁ గాఁగిలించుకొంటెఁ గాక
ఆఁగి నీవూర కుండితే నందములౌనా
చేఁగదేర నన్నుఁ గూడె చేరి యాతఁడని నీవె
రాఁగి నీలోనె నవ్వితే రచ్చలకు నెక్కునా

రేకు: 0287-1 నాదరామక్రియ సం: 09-217

పల్లవి: ఎటువంటి మోహమో యీపెకు నాతని మీఁద
ఘటియించె నిద్దరికి కందువ వేడుకలు

చ. 1: సంగడిఁ గూచున్నది చనవు చేకొన్నది
అంగపుఁ జెమట నోల లాడినది
యెంగిలిపొత్తున విడే లిచ్చినది మెచ్చినది
పంగించీ నిందిరాదేవి ప్రహ్లాదవరదుని

చ. 2: మొక్కుచు నవ్వినది ముచ్చట లాడినది
యిక్కువ లంటుచు లోలో నెన సున్నది
చెక్కుఁ జెక్కుఁ గదియించి జిగిఁ బులకించినది
చిక్కించీఁ గమలాదేవి శ్రీనరసింహునిని

చ. 3: కనుసన్న చేసినది కాఁగిట నించినది
తనివార రతులను దక్కఁ గొన్నది
చెనకి యహోబలాన శ్రీవెంకటాద్రి మీఁద
ననిచె శ్రీమహాలక్ష్మి నరమృగదేవుని

రేకు: 0287-2 దేసాళం సం: 09-218

పల్లవి: అప్పటి నమ్మఁడు తన్ను నటు వెంగి లాడే నంటా
యిప్పుడూ నానవెట్టెను యింకనేలె నవ్వులు

చ. 1: బాగాలు వెట్టరె పైకొని విభునికి
వాగమై యింతుల కెల్లా వలపు మని
యీగతి మూసి మంతనా లిన్నాళ్లుఁ దనకు
వేగమె యప్పణిచ్చితి వెరుపేలె యిఁకను

చ. 2: వుపమ లెత్తియ్యరె వొకటొకటె పతికి
నెపాన సతులఁ బొంద నేరుపు మని
కపటాన దాఁ గొంత కనియుఁ గానము లేల
యెపుడూఁ దనకు లోనె యిఁక నేలె కొంకను

చ. 3: చేయెత్తి మీరు మొక్కరె శ్రీవెంకటేశ్వరునికి
పాయపువారి మనసు పట్టుమని
యీయెడఁదా నన్నుఁగూడె యిచ్చకము సేసుకొని
నాయము నేనె చెప్పెను ననుపాయ నిఁకను

రేకు:	0287-3 రామక్రియ	సం:	09-219

పల్లవి:	ఏల నీవు చిన్నఁబొయ్యే వేఁటి కానలు వెట్టేవు
	జాలిఁ బెట్టి బొమ్మలను జంకించేనా

చ. 1:	అలిగి నీతో మాటలాడ కెంతవుండినాను
	చలములు గడు నేము సాదించేమా
	నిలిచి నేఁ గడు నిన్ను నేరము లె న్నెంచినాను
	బలుములు చూపి యిట్టె భ్రమయించేమా

చ. 2:	యెనయక కోపాన నే యింటిలోనె వుండినాను
	వెనక నీ చేఁతలు నేవెళ్ల వేసేనా
	మనసునఁ గాఁతాళించి మంకులు నే నెరపిన
	పెనఁగి పిలిచి నీతో బీరము లాడేనా

చ. 3:	పదరి నీతో నెంత పంతము నే నాడినాను
	అదన నిన్నుఁ గూడక అలయించేనా
	యెదుట శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గలసితి
	వుదుటున నే నీతో నోప ననేనా

రేకు: 0287-4 భైరవి సం: 09-220

పల్లవి: ఆఁటదానికి పతితో నంతచెల్లునా
చీటికి మాటికి యంతసేసేవె నీవు

చ. 1: పట్టినదె చల మని పంతములె నెరుపేవు
అట్టె యాతని ప్రియము లంగవించవు
చిట్టకాలు వద్దనిన చెలుల మాటలు చెవిఁ
బెట్టవు నీకుఁ దగిన బీరములె కాని

చ. 2: ఆడినదె మాటసేసి యట్టె నిలువఁ బెట్టేవు
జోడుగా నాతని మాట చౌరనియ్యవు
తోడనె నే మిద్దరి చేతులుఁ బట్టికూరిచిన
కూడియుఁ గూడవు నీ గుణములె కాని

చ. 3: మొదలివొట్టుకు నీ మొనలు చూపేవు గాని
అదనైన మీఁద నింక నటు మెచ్చవు
యిదివో శ్రీ వెంకటేశుఁ డిదె నన్నుఁ గూడినాఁడు
చదురు లింకా నీవు సాదించేవు గాని

రేకు: 0287-5 మంగళకౌశిక సం: 09-221

పల్లవి: దయఁదలఁచుక నేనె తగిలి కూడితి నిన్ను
క్రియ చూపక నే నుంటె గెంటించఁ గలవా

చ. 1: నంటున నీతో నేను నగఁగానె సందుకొని
అంటు ముట్టి సరసము లాడేవు గాక
జంటమాటలాడక చలపట్టి నే నుండితే
వొంటినే సాదించి నన్ను వొరయఁగఁ గలవా

చ. 2: పొత్తుకుఁ బిలిచి నేనె పొదుగఁగానె నీవు
హత్తుక నీ వింతేసి పొందై తివి గాక
గుత్తపు నాగుణముతో గుట్టు సేసుక వుండితె
చిత్తగించి నీ చలము చెల్లించుకోఁ గలవా

చ. 3: చేయి చాఁచి నే నిన్ను చెనకి కాఁగిలించఁగా
యీయడ నన్ను నేఁడె యేలితి గాక
చాయల శ్రీవెంకటేశ సరికి బేసికి నీతో
మాయలు నేఁజేసితేను మారు కొనఁగలవా

రేకు: 0287-6 పాడి సం: 09-222

పల్లవి: ఇంతిమాటలకు నేల యెగ్గు పట్టేవు
చెంతల నాపె చనవు చెల్లించరాదా

చ. 1: అగపడి లోనైతె అన్ని నవ్వులె కాక
యెగసక్కే లాడే నంటే యెంతలేదు
చిగిరించినట్టి వేళ జిగిఁ బండినట్టి వేళ
వొగరుఁ దీపునుఁ దోఁచు నొక్కటందే కాదా

చ. 2: సరిఁ జుట్టరికానకు సరసాలె అన్నియును
యెరవులు సేసుకొంటే నెంతలేదు
తొరలఁ గాఁచినప్పుడు తోడంటు వెట్టినప్పుడు
పెరుగుఁ బాలును నొక్క పేరుపునే కాదా

చ. 3: కొయ్యవై శ్రీవెంకటేశ కూడుకొంటి వాపె నిట్టె
యియ్యకోలు సేసుకొంటే నెంతలేదు
చయ్యన దంచినచోట చవిగా వండినచోట
బియ్యము వంటకమై బెరసేదే కాదా

రేకు:	0288-1 సామంతం	సం:	09-223
పల్లవి:	అప్పటినన్నె కొసరీ నదివో ఆపె
	నెప్పున నన్నిపనులు నీకె తెలును
చ. 1:	తెగరానిచోట వాదుదీసి యెంతమాటాడిన
	పగలేదు చనవుల బలిమె కాని
	మగవాఁడ వందుమీఁద మట్టు పడనోపుదువు
	తగవులు మమ్మేల యిత్తరి నడిగేవు
చ. 2:	వలచినవారు పై పై వాసులెంత నెరపిన
	చలములుగావు రతిచవులె కాని
	బలువుఁడ వందు మీఁద పనిగొన నోపుదువు
	చలివాసి మమ్మేల సాకిరివెట్టేవు
చ. 3:	ఆరితేరిన దంపతు లాయము లెం తంటినాను
	నేరుపులేకాని అందు నెగులులేదు
	కూరిమి శ్రీవెంకటేశ కూడితి వందుమీఁదను
	నారుకొన మాతో నేల నవ్వులు నవ్వేవు

రేకు: 0288-2 లలిత సం: 09-224

పల్లవి: ఎక్కడి సుద్దు లేలె యిది గొంతా
చిక్కితి నీపాలను విచ్చేయవయ్య లోనికి

చ. 1: చింతలేక నీకు నీవె సేసిన సేఁతలకును
యెంత నేము దూరినా నీకేఁటి వెరపు
చింతించ నీ కేఁటికి చెక్కుచేయి యేఁటికి
వింతవార లిదిగంటే వేసా లనరా

చ. 2: దెప్పరాన నీవు లోలోఁ దిరిగే తిమ్మటలకు
యిప్పటి మా యలుకలు యేడ కెక్కును
రెప్ప లెత్తి చూచేవు రేసువడి యున్నాఁడవు
యిప్పటి నీజాడలెల్లా యెగసక్కే లనరా

చ. 3: కదిసి నీ మేనను కల్ల లెన్ని దోఁచినాను
యెదుట నున్నాఁడవు నిన్నే మనేము
అదన శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
చదురుఁడ విన్నిటను జాణవు నీ వనరా

రేకు: 0288-3 హిందోళం సం: 09-225

పల్లవి: అందాఁకా వేగిరమా ఆటుడికాఁడ
చిందేవు మాటలఁదేనె చెల్లు నీకు నయ్యా

చ. 1: నవ్వుతా నే నుండఁగానె నంటున గిలిగించేవు
అవ్వల నీ కింకా నెంత ఆసోద మోయి
పువ్వువంటి నావయసు పూఁచి నీపైఁ జల్లఁగానె
తవ్వేవు జాణతనాలు తమకి వౌదువు

చ. 2: దగ్గరి నే నుండఁగానె దండకు నొత్తుకొనేవు
వెగ్గళించి నీకెంత వేగిరమోయి
సిగ్గుదేరి నీ మీఁద చేతులు నేఁ జాఁచఁగానె
వొగ్గి కాఁగిట బిగించేవు వుబ్బుకాఁడ వౌదువు

చ. 3: కలసి నే నుండఁగానె కమ్మి రతికిఁ దీసేవు
లలి శ్రీవెంకటేశుఁడ లావరి వోయి
యెలమి నన్నేలితివి యియ్యకొంటి నే నట్టె
పలుకుఁ బంతము చెల్లె పనివాఁడ వౌదువు

రేకు: 0288-4 ధన్నాశి సం: 09-226

పల్లవి: కోరి చేకొనఁగరాదు కోపగించు కొనరాదు
యీరీతి విచ్చేసితివి యేడనుండో యీడకు

చ. 1: పొదిగేవు వొకవేళ పొరలేవు వొకవేళ
అదిబిదుకు వలపు లవియాల
వెదకితి మాపునంత వేగించితి వేగునంత
యిదిగో విచ్చేసితివి యేడనుండో యీడకు

చ. 2: మనసువ చ్చొకమాట మనరా కొక మాట
అనుమానపు చెనకు లవియాల
చనవు చల్లితిగొంత సరస మాడితిగొంత
యెనయ విచ్చేసితివి యేడనుండో యీడకు

చ. 3: చేయిచాఁచే వప్పటిని సిగ్గువడేవు కమ్మటి
ఆయ మెరఁగని రతు లవియాల
పాయక శ్రీవెంకటేశ పైకొని కూడితి విట్టె
యీయెడ మేలుకొంటివి యేడనుందో యీడకు

రేకు: 0288-5 ముఖారి సం: 09-227

పల్లవి: కూరిమిఁ గొసర నేల కొంక నేల
బీరముతో నుండుఁగాక పెనఁగంగ నోపమే

చ. 1: సంగడిఁ గూచుండనేల జగడ మాడఁగనేల
వుంగిటి నివ్వలిమోమై వుండేమె నేము
ముంగిటఁ దా రమణుఁడు ముసి ముసి నవ్వులతో
రంగుమీరి వుండుఁగాక రవ్వసేయ నోపమే

చ. 2: యింటికిని రానేల యెగసక్కె మాడనేల
వొంటినైనాఁ బానుపుపై నుండేమె నేము
జంటలై తా నందరితో సరసము లాడుకొంటా
వెంట వెంట రానీవె వేసరించ నోపము

చ. 3: తప్పక చూడఁగనేల తమకించ నింతయేల
వొప్పగు నివ్వెరగుతో నుండేమె నేము
అప్పటి శ్రీవెంకటేశుఁ డాతఁ డిట్టె నన్నుఁ గూడె
వుప్పటించి వూరడించి వొద్దఁ బాయ నోపము

రేకు: 0288-6 పాడి సం: 09-228

పల్లవి: ఎవ్వరి బలువెక్కుడో యిద్దరిలోన
రవ్వగా నానతీవయ్య రామచంద్ర మాకు

చ. 1: చెక్కిటఁ బెట్టిన చేయి సేతువుగట్టినకట్ట
చక్కని సీతాచింతాజలధికిని
పెక్కు కొండలచే నీవు పెనచి కట్టించితివి
వొక్కమాటె ఆపె అయితె నుండుమంటె నుండెను

చ. 2: ముంచి చెలి పులకింపు మోహవనవాసము
మించిన విరహముల మితిమేరకు
సంచరించి నీవైతె జగమెల్ల నిండితివి
యించుకంతలోన నాపె యీడనుండె నిండెను

చ. 3: వొట్టిన నీకాఁగి లయోధ్యలోని పట్టము
నెట్టన శ్రీవెంకటేశ నీ దేవికి
అట్టుగా నీ వింతలో నాఁడి రాజ్య మేలితివి
యిట్టె మరురాజ్యమేలే యీ యింతి రతులను

రేకు: 0289-1 ముఖారి సం: 09-229

పల్లవి: ఎంతలేదు మాటలు యేడ కేడ సుద్దులు
యింతవాఁడ వౌత నిన్ను నెరఁగనా నేను

చ. 1: యెక్కడనుండోవచ్చి యిచ్చకము సేసి నా
చెక్కులు నొక్కినదె సెలవా నాకు
వొక్కమాటె నవ్వు నవ్వి వొడివట్టి తీసి నన్ను
తక్కులఁ బెట్టినదె తనివారెనా

చ. 2: నిద్దుర గంటికిరాఁగా నీ చేఁతలు దాఁచుకొంటా
వద్దఁ గూచుండినదె వరుసా నాకు
సుద్దులెల్లఁ జెప్పి చెప్పి చొక్కులఁ బెట్టుచు నాతో
పొద్దున మంచ మెక్కితె పొందికాయనా

చ. 3: వేడుకలు దైవార వేసాలకుఁ బొగడుతా
యీడ నన్నుఁ జెనకేదె యీడె నాకు
కూడితి శ్రీ వెంకటేశ గుణ మెరిఁగి నన్నిట్టె
జోడువాయ కుండితేనె సోద్యమాయనా

రేకు: 0289-2 నాదరామక్రియ సం: 09-230

పల్లవి: విన్నప మేఁటికి వేమారు
పన్నిన కరఁగులఁ బదరీఁ జెలియా

చ. 1: ముసి ముసి నవ్వుల ముంగారు ముంపులు
వసివాడుఁ జెమట వానలు
ముసుఁగుల సిగ్గుల మూఁడామంచులు
కుసుమై వలపులె కురిసీఁ జెలియా

చ. 2: కన్నుల తేటల కప్పుర మాకుల
సన్నపు నిట్టూర్పు సంపెంగల
చిన్ని నెరిఁ గురుల చీఁకటి మాకుల
వన్నె మదరసము వడిసీఁ జెలియా

చ. 3: సరి మోవులనె వసంతపు చిగురుల
పరగుఁ గుచము లను ఫలములను
యిరవై శ్రీ వెంకటేశ నినుఁ గలసి
పొరిఁ బొరి విందుల పూచీఁ జెలియా

రేకు: 0289-3 సాళంగనాట సం: 09-231

పల్లవి: చేతికి లో నైనప్పుడు చెప్పేఁగాని
యేతుల సెలవి నవ్వు లీడ నేలా

చ. 1: ముంగిట నే నుండఁగాను మోహించి చెనకేవు
అంగడిచుట్టరికాలు అవియాల
రంగుగా నీవున్నచోటు రాతిరే వింటిమి నేము
యెంగిలి పొత్తుల మాట లీడ నేలా

చ. 2: వొంటి నే నుండఁగాను వొడివట్టి పెనఁగేవు
కంటిఁ గంటి గురుమ కత లేల
వుంటిమి నీవన్నిటాను వొరపరి వొదువు
పెంటపట్టు సరసాలఁ బెనఁగ నేలా

చ. 3: కదిసి నే నుండఁగానె కొఁగిటిఁ గూడితివి
పొదుగుడువలపుల పొదు లేల
అదివో శ్రీవెంకటేశ అన్నిటాఁ జొక్కితి నేను
అదనైనప్పుడె జోహా రన నేలా

రేకు: 0289-4 వరాళి సం: 09-232

పల్లవి: మీరు మీరు నొక్కటే మీఁద నన్నీ మంచివే
ఆరితేరె మీ వంక నలయించకువ మ్మా

చ. 1: చెంతల నాతఁడు నీ చెక్కు నొక్కి వేఁడుకొనీ
పంతము దప్పదు నేఁడు పలుకవమ్మా
యంతలే దీ యలుకలు యెవ్వరికి సతమాయ
వింతదానఁ గాను సిగ్గు విడువవమ్మా

చ. 2: పక్కన నీరమణుఁడు పచ్చడము గప్పెనదే
వెక్కసపు సాదనలఁ గట్టుకొనే దేమున్నది
కక్కసపు సాదనలఁ గట్టుకొనే దేమున్నది
యిక్కడ ననుమానించే వెవ్వ రున్నారమ్మా

చ. 3: శ్రీ వెంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడె నిదె
చేవదేరెఁ గెమ్మోవి చెలఁగవమ్మా
వేవేలు చెప్పినాను వేడుకకు వెలలేదు
మోవులనె నవ్వేవు మొరఁగ నే లమ్మా

రేకు: 0289-5 గౌళ సం: 09-233

పల్లవి: ఏఁటికయ్య మాఁటలు యింకా తాటతూఁటలు
యీటువెట్టుకొని నిన్ను నే మనేము నేము

చ. 1: చెంగట నీవు సేసిన చేఁతలు లే వనఁగాను
అంగమెల్లఁ జెమరించె నందుకుఁగానె
సింగారపు నీ మేని చిందువందు లెల్లఁ జూచి
యింగితానఁ బులకించె నిందుకుఁగానె

చ. 2: నెట్టునఁ గొత్తలుగొన్ని నేరుచుక వుండఁగానె
అట్టె వుసురంటి నే నందుకుఁగానె
వొట్టువెట్టుక నిన్ను వొడివట్టి తియ్యఁగాను
యెట్టకేల కియ్యకొంటి నిందుకుఁగానె

చ. 3: గక్కనఁ గాఁగిట నన్నుఁ గాఁగిలించి కూడఁగానె
అక్కరతో నియ్యకొంటి నందుకుఁగానె
మక్కువ శ్రీవెంకటేశ మంచితనాలు సేయఁగ
యిక్కువలంటి మొక్కితి నిందుకుఁగానె

రేకు: 0289-6 దేసాళం సం: 09-234

పల్లవి: నిన్నటి మొన్నటికాఁక నేఁ డేఁటికే
యెన్నికెతో రమణుఁడ యియ్యకో లైతివి

చ. 1: మక్కువ నాపైఁజల్లి మన్ననలు నించితివి
యెక్కడి సుద్దులు నీకు నేమి చెప్పేము
చెక్కులూనుఁ బులకించె చేతు లిట్టె చెమరించె
వెక్కసానవె నిన్ను వెంగెమాడ నేఁటికే

చ. 2: మెచ్చి నన్నుఁ బొగడుచు మీఁదఁ జేయి వేసితివి
మచ్చరాలుఁ గపటాలు మానితి మిఁక
పచ్చడము గప్పఁగాను భావ మెల్లఁ గరఁగితి
కొచ్చి కొచ్చి యిఁక నిన్నుఁ గొర నేమిటికే

చ. 3: కన్నుఁ గొనలనె నవ్వి కాఁగిట నన్నుఁ గూడితి
వెన్నెని సంతోసాలు యిఁక నెంచేము
వున్నతి శ్రీవెంకటేశ వొద్దికైతి మిద్దరము
పన్నుకొని వాసిరేఁచే పంతము లేమిటికే

రేకు: 0290-1 మెంచభౌళి సం: 09-235

పల్లవి: ఔదువుజాణవు నీవు అన్నీ నెరుంగుదుము
నీ దొరతనము లెల్ల నెలఁతపయినా

చ. 1: చెనకి ఆపె నీకుఁ జేసిన మేలుకును
ననిచి నీ కన్నులను నాటఁ జూచేదా
చనవిచ్చి కమ్మటిని చన్నుల నొత్తినందుకు
పనిలేని బీరాలతో పంతమాడేదా

చ. 2: లలన నిన్నుఁ దిట్టి లాలించిన లాలనకు
చలపట్టి బొమ్మలను జంకించేదా
నెలవుగ నీ మేను నిమిరినందుకు నీవు
కొలఁదిలేని తిట్లఁ గోపగించేదా

చ. 3: కందువ నీ దేవి నిన్నుఁ గాఁగిట నించినందుకు
చందముసేసుక నీవు సారె నవ్వేదా
యిందునె శ్రీవెంకటేశ యిద్దరూ నొక్కటైతిరి
యిందరిలోపల నీవు యెమ్మెలాడేదా

రేకు: 0290-2 భైరవి సం: 09-236

పల్లవి: వాకిట నే లున్నాఁడవు వనితమాటలె యివి
లోకులు మెత్తురు నిన్ను లోనికిరావయ్యా

చ. 1: అంగనపాదంబుల అందెలు మెట్టెలునె
సంగతి నిన్నుఁ బిలిచీఁ జాలదా యిది
యెంగిలినోటఁ బిలిచే దెగ్గనివుంటే నీవు
అంగవించి లోనికిరా వదియేమయ్యా

చ. 2: కంకణసూడిగములె కడు నీతో మాఁటలాడీ
యింక ననుమానము నీ కేఁటికి నేఁడు
పొంకపు మొనదంతాలు పూఁచి ప్రియముచెప్పదు
అంకెలఁ బానుపు మీఁద నట్టె కూచుండవయ్యా

చ. 3: మొలనూలిగంటలనె ముచ్చట నీతో నాడీ
యెలమి శ్రీవెంకటేశ యియ్యకోరాదా
మెలఁగి పెదవితేనె మీఁదు నీ కెత్తుకున్నది
కలసితి నాపె నిట్టె కంటివిగదయ్యా

రేకు: 0290-3 ముఖారి సం: 09-237

పల్లవి: కదిసితి రిద్దరూను కడమ లేలా
పొదిగి చెలులుచెప్పే బుద్ధులెల్లా వినవే

చ. 1: వద్దేలెకోపము వలవని తాపము
సుద్దులు విన్నందుకె సూడువట్టేవా
చద్దులాయను వొట్లు చలము సాధించనేల
గద్దించినందు కతనిఁ గాఁగిలించుకొనవే

చ. 2: యేమిటికే బిగువు యింకానా తగవు
మోము చూచి నవ్వితేనె మోపుగట్టేవా
నాములెక్కెఁ బంతములు నాలిసేయ నీఁకనేల
కై మీరినందు కతనిఁ గాఁగిలించుకొనవే

చ. 3: అలయకువే నీవు అప్పటి సొలయకువే
తలఁపులో రతులు పాఁతరఁ బెట్టేవా
యెలమి శ్రీవెంకటేశుఁ డింపు సేసి నిన్నుఁ గూడె
కలఁక లన్నియుఁ బాసె కాఁగిలించుకొనవే

రేకు: 0290-4 రామక్రియ సం: 09-238

పల్లవి: ఎంతటి వేగిరకాఁడు యేమే తాను
చెంతల నిలుచుంటే నే చెరఁగువట్టీనా

చ. 1: కోపగించ వద్దు గాక కొసరవద్దంటినా
తీపులువెట్టుక యాలో తిట్టీఁగాకా
యీపనికి నే నవ్వి యిందరివలెనె కొంత
చూపులు పై మోపితేనె సుంకము గొనీనా

చ. 2: బీర మాడవద్దు గాక పెనఁగవద్దంటినా
కేరడాన నేఁటికో జంకించీఁ గాక
గోరగీరీని చెమటకుమ్మరించఁ జోటులేక
జోరునఁ బైఁ జిమ్మితేనె సూళ్లువట్టీనా

చ. 3: కాఁక రేఁచవద్దు గాక కలయవద్దంటినా
వేఁకపుఁదావులు యాలో వేసీఁ గాక
యేఁకటతో శ్రీవెకంటేశుఁడె తా నన్నుఁ గూడె
సోఁకె చన్ను మొనలకు జోడుదొడిగీనా

రేకు: 0290-5 సామంతం సం: 09-239

పల్లవి: నీ వెఱఁగవా నిండుఁ దగవు లివి
కావరంపుఁ బని కాంతకుఁ దగునా

చ. 1: నిగ్గుల పతి వట నెలఁతను నే నట
సిగ్గువడక నినుఁ జెనకుదునా
యెగ్గులు వట్టితి వెదురురానను చు
బగ్గన నాఁటది బలిమిసేయునా

చ. 2: చదురుల దొర వట జవ్వని నే నట
అదనెఱఁగక నిను నలముదునా
కదిమి కొసరితివి గర్వినైతి నని
గుదిగొని కామిని గొరబుసేతునా

చ. 3: శ్రీవెంకటేశ్వర శ్రీసతి నేనట
సోవగా నవ్వక సొలయుదునా
యీవలఁ గూడితి వియ్యకొంటి నని
కైవసమగు సతి కాదనునా

రేకు: 0290-6 శంకరాభరణం సం: 09-240

పల్లవి: దొడ్డవాఁడ వవుదువు దొరవూను నవుదువు
జిడ్డులేక వుండేది నీ చిత్త మింతేకాని

చ. 1: తప్పక చూడఁగవచ్చు తలవంచుకొనవచ్చు
అప్పుడు గాతి కోరి చే దరుదుగాని
తిప్పుచుండవచ్చు మోము తేరకొన నవ్వవచ్చు
యిప్పటివలె నడపే దెక్కు డింతేకాని

చ. 2: వొగ్గి చేయి చాఁచవచ్చు నుద్దండాలు సేయవచ్చు
కగ్గులేక వలచేది ఘనముగాని
నిగ్గుబాస గొనవచ్చు నెలఁతలఁ బొందవచ్చు
యెగ్గులేక మెలఁగేదె యెన్నికింతేకాని

చ. 3: మాటలు బోదించవచ్చు మట్టుమీరి దాఁటవచ్చు
పాటించి రతి కెక్కేది భాగ్యముగాని
నీటున శ్రీవెంకటేశ నేఁడు నన్ను నేలితివి
వాటమై యిట్టె వుండేదె వన్నెమించుఁగాని

రేకు: 0291-1 శంకరాభరణం సం: 09-241

పల్లవి: బాపు బాపు మేలు మేలు పంతగత్తె వొదువే
నీ పంతములెల్లదక్కె నేర మేమిగంటివే

చ. 1: చలము మానినఁ గాక సమ్మతింపించవచ్చునా
పెలుచుఁదనపు నీతోఁ బెనఁగేఁగాక
నిలుచున్నాఁ డాతఁ డదె నే నిన్ను వేఁడుకొనేను
పలుకవు నీవైతే ఫల మేమిగంటివే

చ. 2: మాటలాడేనంటేఁ గాక మంకు దెలుపవచ్చునా
సాటికి బేటికి నిన్ను సాదించెఁగాక
గీటీ గోర నతఁడు కేలుచాఁచి తీసే నేను
నీటువెట్టుకుందానవు నీ వేమిగంటివే

చ. 3: నయముగలితేఁ గాక నాయము చెప్పవచ్చునా
దయవుట్టి నేనె నిన్నుఁ దగిలెఁగాక
క్రియఁగూడె శ్రీవెంకటగిరిపతి నే మెచ్చితి
ప్రియపడే విదె నీవు భేద మేమిగంటివే

రేకు:	0291-2 గౌళ	సం:	09-242

పల్లవి:	ఆతఁడు నీవు నొక్కటె అందరు నెఱుఁగుదురు
మాతోనె యింతేసి మతకమేలె నీవు

చ. 1:	తప్పక వొట్లువెట్టి దగ్గరి రమ్మనే వేమె
చెప్పరాదా నీ మాట సేసేఁ గాని
నెప్పున నాతఁడున్నాఁడు నే నెరఁగనా నీ వొద్ద
చెప్పక నాతో మాయలు సేయనేలె నీవు

చ. 2:	వట్టి యాకతాలు చెప్పి వద్దికి దగ్గరే విదె
అట్టె వుండరాదా అన్నినయ్యీఁ గాని
తట్టి ఆతని ముదుల తచ్చనగాఁబోలు నిది
నట్టనడుమనె యేఁటి నాటకమె నీవు

చ. 3:	యిచ్చకము సేసి నన్ను యెలయించే విన్నిటాను
పచ్చిదేరేఁ బనులెల్ల పదవె యింక
చెచ్చెర నన్ను నలమి శ్రీవెంకటేశ్వుఁడు గూడె
వచ్చె నీ పంతములు నవ్వఁగదె నీవు

రేకు: 0291-3 శ్రీరాగం సం: 09-243

పల్లవి: మాటలు యింకానా మానరు మీరు
నాటికి నేటికి మేలు నయమాయనే

చ. 1: తెల్లనాయఁ గన్నులు తేనెగారెఁ గెమ్మోవి
వల్లెవాటుతోనున్నాఁడు వాఁడె చూడరే
పొల్లవద్దనుంటిరి పూనుక వచ్చితిరి
కల్లలు నిజము నందె కానవచ్చెనే

చ. 2: వింతవాసనలు నించె వెల్లులాయఁ జెమటలు
పంతముతోనున్నవాఁ డప్పటిఁ జూడరే
యింతులెల్లఁ గూడితిరి యియ్యకోలు సేసితిరి
యింతలోనె పాడిఁబంతా లెన్నికాయనే

చ. 3: చెక్కులెల్లఁ బులకించె చెలికిఁ జెయిలోనాయ
వెక్కసాన దగ్గరీని వీఁడె చూడరే
యిక్కడ శ్రీవెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెక్కువ తక్కువ లెల్లా నెంచనేఁటికే

రేకు: 0291-4 కొండమలహరి సం: 09-244

పల్లవి: అన్నిటా నేఁ దనిసితి అందరును మెచ్చిరి
మన్ననలు తుదకెక్కె మాట లింకేలయ్యా

చ. 1: యెప్పుడు వత్తువో యని యెదురు చూచినందుకు
చొప్పుతో నీ వున్నందుకు జోకలాయను
రెప్పలెత్తి చూచితేనె రేసువడె నామనసు
కప్పిన వేడుకలకు కడమలేదయ్యా

చ. 2: బత్తిగలవని నేను భామలతో నన్నందుకు
తత్తరపు నీ చేఁతకు తగవాయను
మెత్తనైతి నీయడకు మేలములు నమరెను
యెత్తి నీతో నున్న సుద్దు లేలచెప్పేనయ్యా

చ. 3: పొదిగి నే నీతోను పొందులు సేసినందుకు
యిదె నీవు గూడినందు కితవాయను
యెదిగి శ్రీవెంకటేశ యిరవైతిఁ దరవైతి
కదిసి నీరతులకుఁ గడమయేదయ్యా

రేకు: 0291-5 సామంతం సం: 09-245

పల్లవి: నన్నుఁ జూచి నీవేల నవ్వే విఁక
యిన్ని సుద్దులకు నెల్లా యియ్యకొందువు గాక

చ. 1: కన్నుల మొక్కినది కందువ చూపినది
యెన్నేసి చేఁతలు చేసీ నీపిన్నది
సన్నలు చేసినది చనవు మెరసినది
పన్నుగడలాఁ దొల్లె పనిగొందువు గాకా

చ. 2: ఆయాలు మోపినది ఆసలు రేఁచినది
యేయెడఁ జూచిన నీతో నీపిన్నది
చాయకుఁ దెచ్చినది సరస మాడినది
కాయముల కళలెక్కఁ గైకొందువు గాకా

చ. 3: చేతులు చాఁచినది సేసలు వెట్టినది
యేతుల శ్రీవెంకటేశ యీ పిన్నది
నాతోఁ గూడించినది నలి నిన్నుఁ గడపలో
రాతిరిఁ బగలు నిట్టె రమింతువు గాకా

రేకు: 0291-4 శుద్ధవసంతం సం: 09-246

పల్లవి: ఇచ్చగించుకొంట గాక యింపులే కలిగితేను
అచ్చలానఁ బెనఁగితే నది జాణతనమా

చ. 1: తగులనాడినప్పుడు తమకించి నప్పుడును
జగడాలకుఁ బెనఁగ జాణతనమా
నగఁ దలఁచి నప్పుడు నాఁటఁ జూచినప్పుడును
అగడుసేయఁ బూనితే నది జాణతనమా

చ. 2: కూరిమి చల్లినప్పుడు కొంగు వట్టినప్పుడును
సారె నూరకె వుండేది జాణతనమా
మేర మీరినప్పుడును మిక్కిలి లోనైన ప్పుడు
ఆరీతి మాటలాడే దది జాణతనమా

చ. 3: కందువ లంటినప్పుడు కాఁగిలించి నప్పుడును
చందము సేసుకోకున్న జాణతనమా
యిందులోనె శ్రీవెంకటేశుఁడు ని న్నిదెకూడె
అందుకేలె వెరగందే వది జాణతనమా

రేకు: 0292-1 మంగళకౌశిక సం: 09-247

పల్లవి: ఏల రట్టు సేసే వేమీ నేఁడు
చాలుఁ జాలు మాయెడను సటసేయవలదు

చ. 1: పెదవుల మమ్మింతేసి పేరఁ బిలువకు మని
మొదల నిందుకుఁగానె మొక్కనా నీకు
అదనఁ గోపమున నీ యంకెకు రాకుండుదుము
యెదుట నప్పుడు నీవు యెగ్గు లెంచవలదు

చ. 2: కన్నుల నవ్వకు మని కాఁకలు సేయకు మని
నున్నని చెక్కులు చేతనొక్కనా నేను
పన్నిన పంతములను పరాకున నుండుదుము
వన్నెల నీ వంతేసి వాసు లెంచవలదు

చ. 3: పచ్చిసేసి నీవు మమ్ము బలిమిఁ బట్టకు మని
చెచ్చెర నీకుఁ బ్రియము చెప్పనా తొల్లె
యిచ్చల శ్రీవెంకటేశ యిటు నిన్నుఁ గూడితిమి
తచ్చనలుగావు యిఁకఁ దమకించవలదు

రేకు: 0292-2 పాడి సం: 09-248

పల్లవి: ఎటిఁగె వుందువుగాని యిందరివలెఁ జూడక
మఱవరానియట్టి మానాపతి సుమ్మీ

చ. 1: చెలిచేత మాటాడించి సిగ్గువడి నీతోను
తలుపుమాటునునుండె తరుణి యదె
బలిమి నీ వంతలోనె పైకొనఁగా లోనాయ
యిలువెళ్ల రానియట్టి యిల్లాలుసుమ్మీ

చ. 2: వొడికాన విడెమిచ్చి వున్నతిఁ జేతులుచాఁచి
కడపలోననె వుండి కాంత యదె
చిడుముడి నీ వంతలో చేపట్టఁగా లోనాయ
కడుముద్దరాలైన ఘనురాలు సుమ్మీ

చ. 3: చేవదేర నిన్ను నదె చిలుకచేఁ బిలిపించి
వోవరిలోఁ బానుపుపై నుండి మగువ
నీ వంతలో లోనికేఁగి నెమ్మిఁ గూడఁగా లోనాయ
శ్రీవెంకటేశుఁడ యీపె చిన్నికన్నెసుమ్మీ

రేకు: 0292-3 గౌళ సం: 09-249

పల్లవి: పచ్చిదేరెఁ బనులు పమ్ముఁ జూపు మొనలు
హెచ్చె నిదె నామాట లియ్యకొనరాదా

చ. 1: చెక్కుల నీ మెరుఁగు చిత్తజుని కరఁగు
యెక్కువ సిగ్గులఁ దల యేలవంచేవే
తక్కులేలె యింకను తగులాయ బొంకను
చక్కని నీ కెమ్మోవి చవిచూపరాదా

చ. 2: మొలక నీ నగవు మోహముల తగవు
చెలఁగి నీ వది యేల చేతఁ గప్పేవే
పిలువవే యింటికి ప్రియమాయఁ గంటికి
తలఁచుక నీమాటకు దయఁజూడరాదా

చ. 3: జంటల నీ చన్నులు జవ్వనపు టెన్నులు
అంటఁగాఁ బయ్యద నేల అట్టె మూసేవే
వెంటనే కూడితివి శ్రీవెంకటేశుఁడను నేను
పెంటలుగ నిట్లానె పెనఁగఁగరాదా

రేకు: 0292-4 శ్రీరాగం సం: 09-250

పల్లవి: విన్నవించ నేఁటికి విచారము లేఁటికి
నిన్నటనుండియు నాస నీకంటె గనము

చ. 1: సిగ్గువడ్డ చెలిగాన చెనక కున్నదిగాని
అగ్గలము నీమీఁద నడియాస
దగ్గరె మొగమోటానఁ దలవంచుకుందిగాని
తగ్గని మోహము నీ చిత్తముకంటె గనము

చ. 2: కొొత్తగాఁ బెండ్లాడెఁగాన గుట్టున నున్నదిగాని
తత్తరించీ లోలోని తమకమైతె
హత్తి నీవు నవ్వేవని అంపకవున్నదిగాని
చిత్తిణి కోరికల నీ జిగికంటె గనము

చ. 3: రతికిదగ్గరెఁగాన రవ్వసేయకుందిఁ గాని
చతురతలను నిన్ను జట్టిగొనును
యిత వెరిఁగి శ్రీవెంకటేశ యిట్టె కూడితివి
మితిమీరె యందుల నీమేలుకంటె గనము

రేకు: 0292-5 ముఖారి సం: 09-251

పల్లవి: కోపగించుకోఁగ నన్ను కొంగు వట్టే వింతెకాక
నాపొందు వలసితేను నవ్వక నేనుందునా

చ. 1: పంతములే యాడేవు బలిమిఁ జెయివట్టేవు
చెంతల నీచెప్పినట్టు సేయనాతొల్లి
యింత వేగిరకాఁడవు యెందువోతివి నిన్న నేఁ
జింతించేయప్పుడు రాఁగఁ జేకొననైతినా

చ. 2: సరసానకు వచ్చేవు సాదించఁ జూచేవు
గరిమ నీ వేమనినఁ గాదనేనా
నిరతి నే బాఁతైతే నీటుతో నేలవుంటివి
తరితీపై చెనకితే తనుపకమానేనా

చ. 3: యిచ్చకము లాడేవు యిట్టె కాఁగిలించేవు
గచ్చుల నలమేల్మంగఁగానా నేను
అచ్చపు శ్రీవెంకటేశ ఆయ మెరిఁగికూడితి
వెచ్చరికెతో నుండఁగ యిట్టె మెచ్చనైతినా

రేకు: 0292-6 కాంబోది సం: 09-252

పల్లవి: కైవసపుదానఁగాని కపటిఁగాను
చేవదేర వలచితిఁ జిత్తగించవయ్యా

చ. 1: కాయపు కాఁకలచేతఁ గసరుదు నొకవేళ
పాయపు మదము చేతఁ బదరుదును
చాయల సన్నల నిన్ను సాదింతు నొకవేళ
చేయెత్తి మొక్కే నిందుకే చిత్తగించవయ్యా

చ. 2: యిచ్చిన చనవునను యీసడింతు నొకవేళ
గచ్చుల నీవద్ద నుండి గర్వింతును
ముచ్చటలాడుచు గోరుమోపుదు నే నొకవేళ
చెచ్చెరఁ బంతమిచ్చేను చిత్తగించవయ్యా

చ. 3: పాదములొత్తుచు నిన్ను భ్రమయింతు నొకవేళ
సోదించి శ్రీవెంకటేశ సొలయుదును
ఆదిగొని కూడితి నిన్నలమేల్మంగ నవుదును
సేదదేర మన్నించి చిత్తగించవయ్యా

రేకు: 0293-1 శంకరాభరణం సం: 09-253

పల్లవి: ఏల వేగిరించేవు యిట్టె నిన్నుఁ బంగించి
మేలిమి చేఁతలుచూపి మెప్పించెఁ జుమ్మీ

చ. 1: నయగారి మాటలాడి నవ్వులు మాతో నవ్వేది
నియతము నీకుఁ దొల్లె నేఁడు గొత్తలా
ప్రియము నిన్నుఁ జేయించి బిగుసుకుండేవారు
కయివసముగ నీపైఁ గలిగేరు సుమ్మీ

చ. 2: చాయల వలపుచల్లి సరస మాడేది నాతో
నీయందు గలిగినవే నేఁడు గొత్తలా
మాయలు నీతో నడపి మరులు గొలిపేవారు
కాయపుఁజుట్టాలే నీకుఁ గలిగేరు సుమ్మీ

చ. 3: అడరి శ్రీవెంకటేశ అన్నిటా గెలుతువు యీ
నిడుదమొక్కులు దొల్లె నేఁడు గొత్తలా
యెడయక నన్నుఁ గూడి తిది చూచి సిగ్గువడి
కడకుఁ దొలఁగేవారు గలిగేరు సుమ్మీ

రేకు: 0293-2 ముఖారి సం: 09-254

పల్లవి: నలుగడ నిందరు నవ్వేరు
పెలుచై తానేల బెదరీనే

చ. 1: నెయ్యపు మాటలు నీతోఁ జెప్పఁగ
వొయ్యనె తానేల వొరసీనే
అయ్యెడ నిజమరి అట్టెవుండక
కయ్యానఁ దానేల కలఁగీనే

చ. 2: తగవుకు నే నినుఁ దప్పక చూచిన
అగడుగఁ దానేల అడిగీనే
మొగమోటకాఁడు మోనాన నుండక
బెగడి ఆనేఁటికిఁ బెట్టెనే

చ. 3: లోఁగుచు నే నిను లోనికిఁ బిలువఁగ
కాఁగిట తానేల కదిమీనే
వీఁగక కూడె శ్రీవెంకటేశ్వరుఁడు
పొఁగి తానేఁటికి భ్రమసీనే

రేకు: 0293-3 మంగళకౌశిక సం: 09-255

పల్లవి: ఇందాఁకా మాపని యిఁక నీపని
కందువాయ వలపులు కపట మే మున్నది

చ. 1: చేతులనె మొక్కు మొక్కి సెలవుల నవ్వు నవ్వి
ఆతలనె నిలుచున్న దదివో చెలి
కాతరాన యిఁకమీఁదఁ గలిగిన పనులు నీ
చేతి వింతె యిఁక నీతో చెప్పనేమివున్నది

చ. 2: కన్నులనె నిన్నుఁ జూచి కానుక నీ కంది యిచ్చి
అన్నిటా గుట్టున నున్న దదివో చెలి
సన్నలూను మీలోని సరసాలు నిటమీఁద
పన్నుకో నీవె నేర్తువు పలుక నే మున్నది

చ. 3: మచ్చిక నీకుఁ జేసి మనసు నీపైఁ బెట్టి
యిచ్చటఁ గాఁగిలించె నిదివో చెలి
అచ్చపు శ్రీవెంకటేశ అట్టె నీవు గూడితివి
యిచ్చకములు లిటమీఁద నిన్ని నెఱుఁగుదువు

రేకు: 0293-4 రామక్రియ సం: 09-256

పల్లవి: మించిన నాపంతములు మీ రెరఁగరా
నించిన కూరిములతో నెరవేరెఁ బనులు

చ. 1: మనసిచ్చి తా నాతోను మాటలాడితేఁ జాలు
యెనయక వలవక యెందువోయీనే
పెనఁగక మీ రాతనిఁ బిలుచుకరారే యిందు
తనుఁదానె అన్ని నయ్యీఁ దరవాతిపనులు

చ. 2: దంటతనమున కటు తగులఁ జూచితేఁ జాలు
యింటికిరాక డాయక యెందువోయీనే
గొంటుపరచక వద్దఁ గూచుండఁ బెట్టితేఁ జాలు
నంటుతోన మంచి వయ్యీ నడుమనే పనులు

చ. 3: వట్టి శ్రీవెంకటేశుఁడు బలువుఁడు నన్నుఁ గూడె
యిట్టెవుండక యిఁక నెందువొయ్యీనే
గట్టిసేసితిరి మీరు గలిగివుండితేఁ జాలు
నెట్టన రతికెనెక్కె నేరుపైన పనులు

రేకు: 0293-5 సామంతం సం: 09-257

పల్లవి: కోడెకాఁడు వీఁడె వీఁడె గోవిందుఁడు
కూడె నిద్దరుసతుల గోవిందుఁడు

చ. 1: గొల్లెతల వలపించె గోవిందుఁడు
కొల్లలాడె వెన్నలు గోవిందుఁడు
గుల్ల సంకుఁజక్రముల గోవిందుఁడు
గొల్లవారింటఁ బెరిగె గోవిందుఁడు

చ. 2: కోలచేఁ బసులగాచె గోవిందుఁడు
కూలఁగుమ్మెఁ గంసుని గోవిందుఁడు
గోలయై వేలఁ గొండెత్తె గోవిందుఁడు
గూళెపుసతులఁ దెచ్చె గోవిందుఁడు

చ. 3: కుందనపు చేలతోడి గోవిందుఁడు
గొందులు సందులు దూరె గోవిందుఁడు
కుందని శ్రీవెంకటాద్రి గోవిందుఁడు
గొందిఁ దోసె నసురల గోవిందుఁడు

రేకు: 0293-6 శంకరాభరణం సం: 09-258

పల్లవి: వద్దేలె బలిమి వసముగాఁ డీఁక
బుద్దెరిఁగి తానె పొదిగీఁ గాకా

చ. 1: వలవనివారిని వలపించఁబోతే
వెలికి లోనికె వేసటలే
ములిగేటివారి మోపుమోపుమంటే
కొలఁదిమీరిన కోపమురాదా

చ. 2: మాటాడనివారి మాటాడించఁబోతే
తాటించి యెగ్గులుఁ దప్పులునే
పోటిదొరలతోఁ బొందులు సేసితే
సాటికిఁ బేటికి జంపులెకావా

చ. 3: వూరకున్నవారి నొడివట్టితేను
బీరాలతో వట్టిపెనఁగులే
యీరీతి శ్రీవెంకటేశుఁడు గూడెను
నేరుపులకెల్ల నేగురిగాదా

రేకు: 0294-1 కన్నడగౌళ సం: 09-259

పల్లవి: ప్రియములెల్లా నీవి బిగువు నాది
దయలేనిదాన యేలో తగిలేవొ కాని

చ. 1: చెక్కులు నీవు నొక్కఁగ సిగ్గువడ్డదాన నేను
యెక్కడికెక్కిన మాట లేమాడేవు
మొక్కులు నీవు మొక్కఁగ మోనాననుందాననేను
చొక్కుల నీ కేనాటి చుట్టమునొ నేను

చ. 2: సరసము నీవాడఁగ జంకించినదాన నేను
యెరవులపొందు నాతో నే సేసేవు
సిర నీవు ముట్టఁగ చెనకకుందాన నేను
సరిగా నీ కెటువలెఁ జవులైతి నేను

చ. 3: నీవు గాఁగిలించుకోఁగ నివ్వెరగందితి నేను
చేవదేరెఁ బను లెంత సేసేవు నీవు
శ్రీవెంకటేశ్వర నన్నుఁ జేకొని కూడితి విట్టె
సేవగా నిచ్చక మెంతసేసితినొ నేను

రేకు: 0294-2 భైరవి సం: 09-260

పల్లవి: మామాటవినవెకొంత మన్నించి నీవు
నీమనసు కోరికల నేరుపులలోనా

చ. 1: మొక్కకువె నిన్నతఁడు మొగము చూచినదాఁక
గుక్కుచు నింతుల పెద్దకొలువులోన
పెక్కుమాట లాడకువె పేరఁ బిలిచినదాఁక
అక్కరైన సరసపుటాసలలోన

చ. 2: కేరి నవ్వకువె తానె కేలు పయిచాఁచినదాఁక
సారమైన వలపుల సందడిలోన
ఆరసి చూడకువె నిన్నాయము లంటినదాఁక
బీరపు తమకముల పెనఁగులలోన

చ. 3: కొసరకువె యాతఁడు గొబ్బునఁ గూడినదాఁక
ముసగసల యాకతముల మీలోన
యెసగె శ్రీవెంకటేశుఁడ డిదివో నిన్నుఁ గలసె
ఆసురుసురుగాకు నెయ్యములలోన

రేకు: 0294-3 బౌళి సం: 09-261

పల్లవి: తొల్లిటివంటిదానవా తొయ్యలినీవు నీ
వెల్లవారికంటె జాణ వెన్నికాయఁ జేఁతలు

చ. 1: దగ్గరఁ బిలిచి నిన్ను తన్నుఁదానె మాటదీసి
సిగ్గు విడిపించెఁగదె చెలువుఁడు
వెగ్గళించి ఆతనిమ్మై వేసితివి చేయి నీ
అగ్గళిక లెల్లఁ జెల్లె నాయఁగదె పనులు

చ. 2: సరసపు మాటలాడి సన్నల నవ్వులు నవ్వి
వెరవు చూపీఁ గదె విభుఁడు నీకు
దొరతనము నెరపి తొక్కితివి పాదము నీ
యిరవు చేకొంటివి యిఁక నేలె సుద్దులు

చ. 3: అందాన నిన్నుఁ బొగడె నలమేలుమంగ వని
విందుగా నిన్నుఁ గూడె శ్రీవెంకటేశుఁడు
మందెమేళమున నీవు మర్మము లంటితి విట్టె
యిందరిలోపలఁ దుదకెక్కెఁ గదె కతలు

రేకు: 0294-4 శంకరాభరణం సం: 09-262

పల్లవి: నేనేల తనునాడె నేఁడుగొత్తలా నాకు
తేనెగారే తనమోవి దిష్టమున్న దనవే

చ. 1: తెల్లని తనకన్నులు దిమ్మరి జాగరముల
నెల్లవారుఁ జూడఁజూడ నెఱ్ఱనాయను
యెల్లిదము లాడేనంటా నెవ్వరిఁ గోపగించీనె
చల్లని తనచేఁతే విచారించుకొమ్మనవే

చ. 2: పాలుగారే తనమోము భామలతో సాములను
వాలాయముగా నిదివో వసివాడెను
గేలితో నేఁజూచేనంటా కేరడ మే లాడీనె
తేలింపుఁ దనగుణమే తెలుసుకొమ్మనవే

చ. 3: జిగిగొన్న తనమేను చెప్పరాని చేఁతలను
వెగటుఁ జెమట లుబ్బి వింతలాయను
నగి శ్రీవెంకటేశుఁడు నన్నుఁ గూడె నింతలోనె
మగటిమి నింక నిట్టె మన్నించుమనవే

రేకు: 0294-5 మధ్యమావతి సం: 09-263

పల్లవి: అన్నిటా జాణవుగావా అంతేసి నీవెఱఁగవా
యెన్నికగా మన్నించక యేలమానేవూ

చ. 1: వచ్చుదాఁకా వేగిరమై వడిఁ బిలువనంపుదు
యిచ్చల నీ విందురాక యేలమావు
పచ్చియైన నామనసు పట్టలే నింతెకాక
యిచ్చిన నీబాసలు నీ వేలతప్పేవు

చ. 2: నవ్వుదాఁకా వేగిరమై నలిఁ బదరుదుఁగాక
యివ్వల నన్నుఁ జెనక కేలమానేవు
రవ్వసేతు నింతెకాక రతి నాసవతులలో
నెవ్వరి మెచ్చుక పొంద కేలవిడిచేవు

చ. 3: వెసఁ గాఁగిలించుదాఁకా వేగిరించి కొసరుదు
యెసగి నన్నుఁ గలయ కేలమానేవు
కొసరి శ్రీవెంకటేశ కూడితివి నన్ను నీవె
యిసుకమీఁదైన చేఁత లేలమరచేవు

రేకు: 0294-6 కాంబోది సం: 09-264

పల్లవి: ఎఱఁగవుగాక నీవు యిందరివలెనా నేను
గుఱుతైన చేఁతచెప్పఁ గూళలున్నారా

చ. 1: పచ్చిగా నిన్నుఁ గూడించి పంత మాడేదాననా
తచ్చి గుట్టు సేసి దాఁచేదానఁగాక
యిచ్చల సిగ్గువడి నాకేల వెరచేవు నీవు
ముచ్చట బాయిటవేసే మూఢులున్నారా

చ. 2: మాటలు వెలుచుక ఆ మర్మా లెత్తేదాననా
తాటించి కప్పుకవచ్చేదానఁగాకా
గాఁటాన నన్నుఁజూ చేల కడుఁ దలవంచేవు
కూటమి ఱట్టుసేయను గొల్లదాననా

చ. 3: వెలి నిన్ను మరిగించి వెంటఁ దిప్పేదాననా
తలఁగక యెనసుండేదానఁగాకా
యెలమి శ్రీవెంకటేశ యిట్టె పొందేల లోఁగేవు
యెలయించి నిన్ను నవ్వేయెడ్డలున్నారా

రేకు: 0295-1 దేసాక్షి సం: 09-265

పల్లవి: ఏమినవ్వేవు మాతోను యెందాఁకా నీపంతము
మోముచూచి ఆపెచేత మొక్కించుకోవయ్యా

చ. 1: చన్నులతోనె మొలచె సతికి నీపై వలపు
కన్నుల చూపుల నంటెఁ గడు నీరూపు
వున్నది నీరాకగోరి వోవరిలోపల నిట్టె
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా

చ. 2: కురులయన్నె కలవు కొమ్మకు నీపై చింతలు
తొరలెఁ జుట్టరికము దొమ్మిమేలాల
పరపుపై నదె నీపై పాటలువింటాఁ జొక్కి
యిరవిదె మన్ననకు యెఱుఁగుకోవయ్యా

చ. 3: మాటలవెంటాఁ దగిలె మనసు యీకాంతకు
కూటము లన్నియునాయ కొనయాసల
యీటుతో శ్రీవెంకటేశ యెనసె నీవు రాఁగాను
తేటతెల్ల మాయ మేలు తెలుకోవయ్యా

రేకు: 0295-2 వరాళి సం: 09-266

పల్లవి: చూచితి నప్పుడే వాని సోరణగండ్ల నేను
యేచివేరె సింగారించి యిటుదోడితేరే

చ. 1: గందవొడి చల్లరెకడుఁ జెమరించె మేను
ముందు ముందు విడెమీరె మోవివాడెను
చెంది నే నవిచూచితే సిగ్గువడీ నాతఁడు
మందలించి యలపార్చి మరితోడితేరే

చ. 2: నిండఁ బన్నీరు చల్లరె నిట్టూర్పు నించీని
దండనె విసరరె దప్పిఁ బొందీని
వొండుపచారాలు నే నొకటిసేసినా లోఁగీ
యెండలెల్లఁ బాపి తగ నిటుదోడితేరే

చ. 3: విరులు పైఁ జల్లరె వెట్టఁ బొరలున్నవాఁడు
తొరలఁ గప్పురమీరె తొట్టీఁ దగ
యిరవై శ్రీవెంకటేశుఁ డిట్టె నన్ను ముందుగూడె
సరినాపెఁ గూడివచ్చె చాలుఁ దోడితేరే

రేకు: 0295-3 శుద్ధవసంతం సం: 09-267

పల్లవి: వట్టి పెద్దరికా లీడ వడినేల చెప్పేవు
తిట్టినవెనక నాపె దీవించఁబోలు

చ. 1: వొకతె పైఁ బెట్టి మాట లొకలొకటెయాడి
యెకసక్కేలకుఁ గల్ల లేలయాడేవు
ప్రకటించి రమ్మనుచు పాదాలువట్టునా ఆపె
తకపికలుగను ముందల పట్టఁబోలు

చ. 2: వలచివచ్చె ననుచు వట్టి సాకిరులు వెట్టి
చలివాసి నీవేల బాసలు సేసేవు
పిలిచి నీయింటి కాపె ప్రియము చెప్పవచ్చెనా
వలవంత నిల్లురికి వాదుకురాఁబోలు

చ. 3: యీవేళ విడెము లంచమిచ్చి యాకెగూడె నని
శ్రీవెంకటేశ్వర నీవె సిగ్గువడేవు
కామించి నన్నుఁగూడితి కప్పమువెట్టునా ఆప
మోవని నోరినిండాఁ దమ్ములమిడఁబోలు

రేకు: 0295-4 ఆహిరి సం: 09-268

పల్లవి: నీతోడివారమా నిను దూరేమా నీ
చేతిలోనివారము నీచిత్తము నాభాగ్యము

చ. 1: బీరమాడి బెళకేవు పెనఁగి తలవంచేవు
ఔరా నీపొందు లెందుకై నావచ్చును
మారుమలనే వప్పటి మరి రండూ నడుపేవు
నేరుతు వన్నిపనులు నేనెఱఁగఁగాని

చ. 2: అడిగి పెచ్చువెరిగే వానించి పంత మాడేవు
యెడరు నీసుద్దు లేమ నెంచవచ్చును
బడి బడి నిలిచేవు పట్టేవు కోకకొంగులు
గడుస వన్నిటా నీవు కడుముద్దరాలను

చ. 3: బోదించి చిగిరించేవు పూఁచి కడలుదొక్కేవు
ఆదిగొని నిన్నెట్టు గాదనవచ్చును
యీదెస శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పాదగు జాణవు నే నీ పలుకులోదానను

రేకు: 0295-5 దేసాళం సం: 09-269

పల్లవి: ఇంటిదాన నే నుండఁగా యెరవు సతమా నీకు
పెంటవెట్టుక నావద్దఁ బ్రియాలు చల్లేవు

చ. 1: చొక్కుచు దయదలఁచి చూచేవు ఆపె నీకు
మొక్కిన మొక్కులె కడు మోపాయనా
చిక్కి నీకుఁ జేయఁగల సేవలెల్లా నేఁజేయఁగా
చెక్కులనొక్కులు మాకు సెలవు సేసేవు

చ. 2: చెచ్చెర విన్నపాలకె చెవులొగ్గే వాపె నీకు
ముచ్చటాడిన మాఁటలే ముదుపాయనా
నిచ్చ పెండ్లికూఁతురవై నేనె నీవై యుండఁగ
నచ్చుల నీమోవితమ్మె నావంతు సేసేవు

చ. 3: గునిసి మమ్మిద్దరినిఁ గూరిచితి వాపె నీపై
మొనగోరు మోపినదె మొదలాయనా
యెనసితిమి శ్రీవెంకటేశ నే నిన్ను మెచ్చితి
చనవి మనవి నాకె సతము సేసేవు

రేకు: 0295-6 నాదరామక్రియ సం: 09-270

పల్లవి: మగువలకొసరులు మగఁడె చేకొనవలె
నిగిడి బుద్దులు నాకు నేరుపవయ్యా

చ. 1: చేముట్టి నీవు నాతోఁచేరి సరసమాడఁగ
యేమంటినో నిన్ను యెరఁగ నేను
కామించిన నా మోహమే కానుకవట్టితి నీకు
దీమసపు నా తప్పు దిద్దుకోవ య్యా

చ. 2: పంతమున నీవు నన్ను పచ్చిసేసి పెనఁగఁగ
యెంతసేసితినో నిన్ను యెరఁగ నేను
సంతతము నావయసు జన్నెవట్టితి నీకు
యెంతైనా నావిన్నప మీడేరించవయ్యా

చ. 3: గట్టిగా నీరతులలోఁ గలసి భోగించఁగాను
యెట్టుండెనో నీచిత్త మెరఁగ నేను
యిట్టె శ్రీవెంకటేశ యేలితివి నన్ను నీవు
మట్టులేని నాకోరిక మన్నించవయ్యా

రేకు: 0296-1 కొండమలహరి సం: 09-271

పల్లవి: ఏమిసేతు నీ సుద్దుల కేమందును
దోమటిఁ గొంగువట్టఁగ తొలఁగి పోరాదు

చ. 1: అత్తల నిత్తల నీకు ఆపె నేను నుండఁగాను
పొత్తుల నవ్వునవ్వేవు పో పో నీవు
చిత్తజమదమెకాని సిగ్గువడే దెరఁగవు
కొత్తలుగా నీతో నేము కోపగించరాదు

చ. 2: తప్పక యిద్దరము పాదాలు నీకు నొత్తఁగాను
చెప్పరాని మాటాడేవు ఛీ ఛీ నీవు
కుప్పళించెజవ్వనాన కొంకుగొన రెరఁగవు
యిప్పుడు నీతో మాకు నెదురాడరాదు

చ. 3: యిరు దెస నీతో నేము యేకతములాడఁగాను
తొరలఁ గాగలించేవు తో తో నీవు
కెరలి శ్రీవెంకటేశ కిందుమీఁదు నెరఁగవు
పరగ నీరతుల నే పచ్చిసేయరాదు

రేకు: 0296-2 సాళంగనాట సం: 09-272

పల్లవి: మెచ్చితిరా నిన్ను నేను మేఁటి వౌదువు
యిచ్చకురాల నైతిని యిఁకనేఁటి మాటలూ

చ. 1: మచ్చరముమాని నీతో మాటాడినది చాలక
కొచ్చి యంతలోనె నన్నుఁ గొంగువట్టేవు
యెచ్చి యెక్కినట్టివాని కేనుగ గుజ్జన్నమాఁట
యిచ్చట నీవల్లఁగంటి మిఁకనేఁటిమాటలు

చ. 2: చేయిచాఁచి నీమీఁద నేసవెట్టుట చాలక
కాయ మంటి బలిమిని కాఁగిలించేవు
చాయసందైతె చావడి చంకఁబెట్టుకొన్నమాట
యీయెడ నీయందె వున్న దిఁకనేఁటిమాటలు

చ. 3: కాఁకదీర నిన్ను నేను కదియుట చాలక
సోఁకనాఁడి నన్నుఁ గూడి చొక్కఁ జేసేవు
ఆఁక శ్రీవెంకటేశ పా లంటె గుటుకన్నమాట
యేఁకట నీజాడలాయ నిఁకనేఁటి మాటలు

రేకు: 0296-3 పాడి సం: 09-273

పల్లవి: ఎందుకైనా వత్తువు నిన్నేమిసేతురా
యిందరిలోపల నిన్ను నేమిసేతురా

చ. 1: చెక్కులూ నొక్కితి నీకు చేతులెత్తి మొక్కితిని
యెక్కడా నీవోజ మాన వేమిసేతురా
తక్కరివాఁడవుతొల్లె దగ్గరి నేనంటితేను
యిక్కువలూఁ గరఁగేవు యేమి సేతురా

చ. 2: కొచ్చి వెంగేలు నాడితి కొంగువట్టి తీసితిని
హెచ్చిన పరాకుమాన వేమి సేతురా
మెచ్చునివాఁడవు మున్నె మీరి నేఁ జెనకితేను
యిచ్చకములాడవచ్చే వేమిసేతురా

చ. 3: కన్నులాను జంకించితి కాఁగిటాఁ గూడితి నిన్ను
యెన్నేసి బాసలు సేసే వేమిసేతురా
మన్నించి కూడితి నాఁడె మక్కువ శ్రీవెంకటేశ
యిన్నిటా రతులఁజొక్కే వేమిసేతురా

రేకు: 0296-4 సౌరాష్ట్రం సం: 09-274

పల్లవి: ఇంటిలోనున్నదానను యెప్పుడూఁ దనసొమ్మె
వెంటవచ్చినవారితో వేగఁ గూడుమనవే

చ. 1: పలుకనివారి నేలపలికించీనె తాను
చలములు మాతోనె సాదించీనా
వలచివచ్చినవారు వాకిటఁ గాచుకున్నారు
అలరి ముచ్చట లందె యాడుమనవే

చ. 2: దగ్గరనివారి నేల దండకుఁ దీసీనె తాను
నిగ్గుల మాతోనె యివి నేర్చుకొనీనా
సిగ్గువడనివా రదె చేసూటినెవున్నవారు
కగ్గులేక గొబ్బుననుఁ గాఁగిలించుమనవే

చ. 3: నగనివారి నదేల నగుమనీనె తాను
పగటులు మాతోనె పచరించీనా
జిగి నన్నుఁ గలసెను శ్రీవెంకటేశుఁడు తాను
మొగముచూచేవారిని మొరఁగు కొమ్మనవే

రేకు: 0296-5 శ్రీరాగం సం: 09-275

పల్లవి: తనకె విన్నవించరె తరవాతి పనులెల్లా
చనవు లిచ్చినవాఁడు చక్కఁ బెట్టనేరఁడా

చ. 1: పొసఁగని సవతులపోరు మాకు నేఁటికె
కొసరుల కెల్లాఁ దానె గురిగాకా
యెసఁగ రమణులను యేలేవాఁడు రమణుఁడే
దొసఁగువారికి బుద్ధులు చెప్పనేరఁడా

చ. 2: వాడవనితలతోడి వంతులు మాకేఁటికె
యీడు వెట్టుకొని దూరే దితనిఁగాకా
జాడతో నడుపేవాఁడు సతులకు నాయకుఁడే
పాడిపంతము యేరుపరచఁ దా నేరఁడా

చ. 3: కన్నవారితోడ మాకు కాఁతాళించ నేఁటికె
యిన్నినడప శ్రీవెంకటేశుఁడెకాకా
మన్నించి నన్నుఁ గలసె మరి వారికి నాతఁడె
కన్నెల నందరిని వొక్కటి సేయనేరఁడా

రేకు: 0296-6 కేదారగౌళ సం: 09-276

పల్లవి: తలఁచిన తలఁపులు దలకూడె
వెలుపలె లోపల వెర గిఁకనేలే

చ. 1: వలచిన వలపులు వడ్డికిఁ బారీ
తలుపు దెరవవే తరుణి యిఁక
పిలువక వచ్చెను ప్రియుఁడు వాకిటికి
నిలువుల బిగువులు నీ కిఁకనేలే

చ. 2: ముసి ముసి నగవులు మోవులనుండఁగ
ముసుగిడనేలే ముదిత యిఁక
రసములు గురిసీ రమణుఁడు నీతో
దొసఁగుల సుద్దులు తుద నిఁకనేలే

చ. 3: కరఁగిన చెమటలు కాఁగిట నున్నవి
నిరతి మరఁగేలే నెలఁత యిఁక
యిరవుగ శ్రీవెంకటేశుఁడు గూడెను
ధర లోఁగొంటివి తడఁబాటేలే

రేకు: 0297-1 గౌళ సం: 09-277

పల్లవి: ఎట్టుండెనో నీభాగ్య మేనోము నోచెనో ఆకె
గుట్టుతోనె నీవలపు కొల్లగొనెఁ గదరా

చ. 1: నీటున వయ్యాళి వోయి నీవురాగా నదె చెలి
కోటకొమ్మ నొరగుండి గొబ్బునఁ జూచి
గాఁటపుఁ జన్నులు గొంత గానరాఁగాఁ జూపి మోపి
మాటలాడి యాపె నీమనసు గరఁచెఁగా

చ. 2: యేనుగ పై నిలుచుండి యింతికిఁ జెయిచాఁచఁగాని
న్నానించి యెక్కించి తనఅండకుఁ దీసి
మేను మేను గాఁగిలించి మెచ్చి మెచ్చి తనయింటి
లోనికిఁ బిలించి నిన్ను లోలునిఁగాఁ జేసెఁగా

చ. 3: వాకిటికి నీవురాఁగా వనిత సన్నలుసేసి
చేకొని నన్నిటు గని శ్రీవెంకటేశ
యీకొలఁదులను మన మిద్దరముఁ గూడితిమి
నీకు నాకుఁ దాఁ జుట్టమై నేరుపున నవ్వెఁగా

రేకు: 0297-2 బౌళి సం: 09-278

పల్లవి: విన్నమాట యిదెసుమ్మీ వెల్లవిరిగా నేము
నిన్నటి మొన్నటి సుద్దినె మరియెరఁగము

చ. 1: శిరసునెరులు నీవు చిక్కు దియ్యఁగా విభుఁడు
కరఁగి నీమోము చూచి క గ్గిరుపఁగా
తెరవేసిరి చెలులు దిష్టముగా నంతలోనె
సరసపు మీసుద్దు లచ్చుట మే మెరఁగము

చ. 2: మేనిగందమటు నీవు మెల్లనె నలఁచగాను
మోనాన నాతఁడు నీకు మోవియియ్యఁగా
పూని వూడిగేలవారు పొంచి వాకిటనుండిరి
మేనులుసోఁకినరతి మీఁద నే మెరఁగము

చ. 3: పమ్మినచెమట నీవు పయ్యెదఁ దుడువఁగాను
కమ్మి శ్రీవెంకటేశుఁడు కాఁగిలించఁగా
చిమ్ములఁ గొలువువారు సిగ్గున లోనికేఁగిరి
దొమ్మిగా నేఁ గూడితి మీతుద నే మెరఁగము

రేకు: 0297-3 లలిత సం: 09-279

పల్లవి: రంతుశాయ కిఁకరావయ్య
కొంత గొంత యిటుగూచుండవయ్యా

చ. 1: ముచ్చటదీరక మోము చూచితే
అచ్చట లోఁగే వదేమయ్యా
చెచ్చెర నీమీఁదఁ జేయని కోపము
కొచ్చెటు గడించుకోనేలయ్యా

చ. 2: చనవున నేఁ జేయి చాఁచిన యపుడే
అనయముఁ బెనఁగే వదేమయ్యా
తనియుచు నాలోఁ దలఁచని తలఁపులు
నినుపున నూహించ నీ కేలయ్యా

చ. 3: తమకంబున నే దగ్గరి కొసరఁగ
భ్రమసిన మాఁటల పనేలయ్యా
అమరఁగ శ్రీవెంకటాధిప కూడితి
చెమరించితివిఁక చింతేలయ్యా

రేకు: 0297-4 ముఖారి సం: 09-280

పల్లవి: ఏడలేని మొగమాట యిపుడుగలిగె నీకు
తోడ నిందాఁకా మమ్ము దూరు మని యంటివి

చ. 1: తలఁచఁగానె వచ్చె తరుణి నీ రమణుఁడు
అలసి సొలసి నీవెఆడవె మాట
అలుక దేరిచే నంటా అండనే కూచున్నవాఁడు
చెలరేఁగి యేమైనఁ జేయవే చేఁత

చ. 2: అడిగే నే ననఁగానె అరగొరలెల్లఁ దేర్చె
కడమలుమాని నవ్వఁ గదవె యిఁక
వొడలు నొడలు సోఁక నొద్దికై యాతఁ డున్నాఁడు
యెడయ కాతని భ్రమయించవే నేఁడు

చ. 3: కరగించే ననఁగానె కాఁగిటఁ గూడి చొక్కె
యెరవులేక చన వియ్యవే నీవు
యిరవై శ్రీవెంకటేశుఁ డిన్నిటా నీ సొమ్మాయ
నురముపై నొరపుగనుండవే కాఁపురము

రేకు: 0297-5 కాంబోది సం: 09-281

పల్లవి: ఇదియౌనె నీమాట యియ్యకొంటి నిఁకను
సుదతిరో మీ రిట్టె చుట్టములై వుండరే

చ. 1: కమలాక్షుఁ డాతఁడు కలువకంటిని నేను
తమిఁ గూట మిద్దరికిఁ దగులు టెట్టే
జమళి నందుకొరకె చందసూర్యులకన్నుల
నమరివున్నాఁడు గదె అదివో రమణుఁడు

చ. 2: బింబాధరుఁ డాతఁడు పికవాణిని నేను
యింబడర నిద్దరికి నేఁటిపొందులే
వంబులేక అందుకెపో వైపుగ మాధవుఁడనే
పంబిన పేరుధరించెఁ బక్కన నీవిభుఁడు

చ. 3: తాను కౌస్తుభవక్షుఁడు తగు నే లతాంగిని
యీనెలవులఁ గూడితి మెటువంటిదే
పూని శ్రీవెంకటేశుఁడు పొసఁగె నీమేరలకె
కానవచ్చె నిన్నిటాను ఘనుఁడె నీమగఁడు

రేకు: 0297-6 సామంతం సం: 09-282

పల్లవి: ఏఁటికె యిందరూ నన్నియెరిఁగిన పనులకు
నాటకములు నాతోను నడపఁగవలెనా

చ. 1: దవ్వులనున్న కోపము దగ్గరినప్పుడులేదు
యివ్వలనుండి విభుని నేల తిట్టేవె
చివ్వన నాతఁడువచ్చి చేయివట్టి తీసితేను
నవ్వకుండఁ గలవా నే నవ్వుదుఁ బో అపుడు

చ. 2: ముంగిటఁ బెట్టిన వొట్టు మూలకుఁ బోతేలేదు
యింగితానఁ బతినేల యెత్తిపెట్టేవె
వుంగిటినాతఁడు నీతో నొడివట్టి పెనఁగితే
నంగవించవా నే ని న్నాడుదుఁ బో అపుడు

చ. 3: కనుబొమ్మ యీజంకెలు కాఁగిటిలోనికిలేదు
యెనసె శ్రీవెంకటేశు నేల దూరేవె
ఘనుఁ డాతఁడిదె నిన్నుఁ గరఁగించి కొసరితే
చనవీకుందువా ని న్నెచ్చరింతుఁ బో అపుడు

రేకు: 0298-1 శ్రీరాగం సం: 09-283

పల్లవి: నీ కేమిటఁగడమ నీచేతిలో వాఁడతఁడు
మైకొని నీయడఁ జేసే మన్నన యెరఁగవా

చ. 1: ఆరీతి మాటాడఁగా నిన్నోఁ గాదనరాదు గాక
కూరిమి నీపతి యిచ్చకుఁడెకాఁడా
మేరలు మీరినచోట మెప్పించరాదుగాక
యీరాని చనవు లాతఁ డిచ్చుట యెరఁగవా

చ. 2: కాఁతాళించివున్నవేళ కై కొలుపరాదుగాక
చేఁతల నీచెప్పినట్టు సేయఁడా తొల్లి
మోఁతతోఁ దలవంచఁగా మొగి నవ్వరాదుగాక
బాఁతిపడి యతఁడు చేపట్టుట యెరఁగవా

చ. 3: తప్పకచూడఁగా నిన్ను తలపించరాదుగాక
యెప్పుడూ శ్రీవెంకటేశుఁ డిరవెకాఁడా
నెప్పునఁ దలవంచఁగా నేర మెంచరాదుగాక
కుప్పలుఁ దెప్పలుగాఁగ కూడుట యెరఁగవా

రేకు: 0298-2 రామక్రియ సం: 09-284

పల్లవి: ఏల మమ్మురేఁచేవు యింతటిట్టు మా కేఁటికి
మేలు మీఁదనుండరాదా మెప్పించేఁగాని

చ. 1: మాయదారిమాటలేల మరఁగుననున్న యాపె
చాయల నీ మోహపు సతిగాదా
తీయరాదా నీచేతనె తెరమరఁ గించుకంతా
చేయిచాఁచి నీ కన్నియుఁ జెప్పి చూపేఁగాని

చ. 2: యీడుగాని యానలేల యింటిలోన నున్న యాపె
జోడుగ నీ ప్రాణమైన సుదతిగాదా
యేడసుద్ది గడియ దీయించరాదా నేఁ జూచి
యీడనె పేరుఁ బెంపు నీ కెత్తియిచ్చేఁగాని

చ. 3: సారెకు నవ్వులేల పచ్చడములోనున్న యాపె
కూరిమి నీ కొత్తపండ్లికూఁతురుగాదా
చేర నా కెదురువచ్చి శ్రీవెంకటేశ కూడితి
పూరకుండరాదా నీకు వొప్పగించేఁగాని

రేకు: 0298-3 పాడి సం: 09-285

పల్లవి: ఇంకనేలరావయ్యా యిద్దరము నిద్దరమే
సంకెదేఁరె బనులెల్ల రికి బేసాయను

చ. 1: కన్నుల నే నవ్వితిని కాఁకలు పైఁ జల్లితిని
చన్నుల నొత్తితి నిన్ను సారె సారెకు
పన్ని నన్నుఁ దిట్టితివి పక్కన జంకించితివి
సన్నలఁ గొసరితివి సరికి బేసాయను

చ. 2: మారుమాట లాడితిని మనసెల్ల సోదించితి
మేరమీరఁ జెనకితి మీఁద మీఁదను
తేరకొనఁ జూచితివి తెక్కులఁ జేకొంటివి
సారెఁ గొంగుదీసితివి సరికి బేసాయను

చ. 3: లాగులెల్లఁ జూపితిని లంకెలతోఁ బెనఁగితి
చేగదేరఁ గూడితిని శ్రీవెంకటేశ
బాగుగా మన్నించితివి పంతమెల్లా నిచ్చితివి
సాగిన సబలలోన సరికి బేసాయను

రేకు: 0298-4 హిందోళవసంతం సం: 09-286

పల్లవి: ఆతఁడు సేసేచేఁత కవిసరిదాఁకితేను
యీతల నే నిందరిలో నిది వెంగెమాడుటా

చ. 1: దగ్గరి యాతనెదుట తలచిక్కు దీసుకొంటే
వెగ్గళించి నేఁ బతిని వెంగెమాడుటా
సిగ్గుతోడ సురటిని చెమట విసరుకొంటే
అగ్గలముగా నప్పటి నది వెంగెమాడుటా

చ. 2: తటి నితనియెదుట తమ్ముల ముమిసితేను
వెఱవక నే నిప్పుడు వెంగెమాడుటా
నెఱవుగ నామేని నీడలు చూచుకొంటే
అఱిముఱిఁ దనుఁ జూచి అది వెంగెమాడుటా

చ. 3: చిలుకనుఁ బేరుకొని శ్రీరామ రామ యంటే
వెలయఁగ నే నింతలో వెంగెమాడుటా
యెలమి శ్రీవెంకటేశుఁ డిందులకె నన్నుఁ గూడె
అలమి మోముచూచితే నది వెంగెమాడుటా

రేకు: 0298-5 ఆహిరి సం: 09-287

పల్లవి: కూళతనమున నిన్నుఁ గొసరే మింతేకాక
జాలి మావలపు నీకుఁ జవులయ్యీనా

చ. 1: తేలింపుఁ గన్నుల యాపె తీపులమాటల యాపె
లోలునిఁగాఁ జేసె నిన్ను లోక మెరఁగ
మాలుగొని వున్నాఁడవు మదమెత్తివున్నాఁడవు
ఆలరి మావిన్నపము లాలకించేవా

చ. 2: సెలవినవ్వుల యాపె చేఁతలకలికి యాపె
బలిమి నీ మనసెల్లా భ్రమఁ బెట్టెను
చెలరేఁగి వున్నాఁడవు సిగ్గువిడిచున్నాఁడవు
అలరి మావంక యించుకంతైనాఁ జూచేవా

చ. 3: కన్నుల మొక్కుల యాపె గయ్యాళితనము లాపె
సన్నలుసేసి నిన్ను జట్టిగొనెను
నన్నుఁ గూడి శ్రీవెంకటనాయక మించినాఁడవు
పన్నిన నీవయసు ఆపఁగఁగలవా

రేకు: 0296-6 భైరవి సం: 09-288

పల్లవి: కదిసితి రిద్దరును కన్నులపండుగగాను
పెదవుల తేనెలనే పిక్కటిల్లీఁ బ్రేమము

చ. 1: పలుకుల కొదలుతో పయ్యద వదలుతోడ
చెలి నీపై వలపులు చిందఁ జొచ్చెను
అలుగకు నీవంత ఆయములు రేఁగీని
చలపట్టి వోరిచితే చక్కనయ్యీఁ బనులు

చ. 2: కొప్పుజారు విరులతో కులుకుఁ జూపులతోడ
చిప్పిలు నాసలు నీపైఁ జిందఁ జొచ్చెను
వుప్పటించ కంత నీవు వొడలెల్లఁ బులకించి
తొప్పఁదోగ నవ్వితేనె తుదకెక్కీఁ రతులు

చ. 3: కూరిమి మొక్కులతోడ కొనగోరి తాకులతో
సారెకు సిగ్గులు నీపైఁ జల్ల జొచ్చెను
పేరడిఁ బెట్టకు మంత ప్రేమపు శ్రీవెంకటేశ
యీరీతిఁ గూడితి వింకనిరవయ్యీ మెచ్చులు

రేకు: 0299-1 ముఖారి సం: 09-289

పల్లవి: చదురాల నేను జాణఁడవు నీవు
తుది మొదల లెంచితేను దొమ్మిగాదా

చ. 1: మనసు నెరుఁగుదు మర్మము నెరుఁగుదును
ననుఁజూచి నీవింత నవ్వవలెనా
పనులెల్లాఁ దక్కెను పంతము తుద కెక్కెను
పెనఁగఁబోతే నింక పిప్పి గాదా

చ. 2: పలుకఁగ నేరుతును భ్రమయించ నేరుతును
యెలమి నాతో నింత యెమ్మెవలెనా
తలఁపు లీడేరెను తమకము దైవారెను
చలపట్టితే నింక చప్పఁ గాదా

చ. 3: పట్టెమంచ మెక్కితిని బలువావి చేకొంటిని
మెట్టుక నాతో నింత మెచ్చవలెనా
అట్టె శ్రీవెంకటేశుఁ డలమేలుమంగ నేను
గుట్టుతో నుండితే నింక కొసరుగాదా

రేకు: 0299-2 దేసాళం సం: 09-290

పల్లవి: ఎవ్వరింక సరినీకు నేమిటికిని
యివ్వలను నవ్వలను నిద్దరికె తగును

చ. 1: చూపులనె భ్రమయించె సుదతి తనకెమ్మోవి
తీపులనె తేలించె దిష్టముగను
రూపుననె మరిగించి రుచులుగొనె నీవలపు
యీపనులు నేఁడు మీకిద్దరికె తగును

చ. 2: ఆసలనెతమిరేఁచె నతివ దనచిరునవ్వు
మోసులనె మొలపించె మోహమెల్ల
బాసలనె నీచేతి పంతంబు దక్కఁగొనె
యీసుద్దులెల్ల మీయిద్దరికె తగును

చ. 3: అంకెలరతుల గెలిచె నలమేలుమంగ దన
లంకెలనుఁగూడి నిను లాలించెను
వుంకువలు శ్రీవెంకటోత్తముఁడ నీ కొసఁగె
యింకా నిట్ల మీకు నిద్దరికె తగును

రేకు: 0299-3 రామక్రియ సం: 09-291

పల్లవి: దూరుదురు మమ్మును బుద్ధులు చెప్పరంటాను
యీరీతి నింతలోనె యిటువలెఁ జూతురా

చ. 1: చిత్తములో చింతలేలె సిగ్గులు వడఁగనేలె
కొత్తపండ్లికూఁతురవా కొమ్మ నీవు
చిత్తిణిగుణమాతఁడు సెలవుల నవ్వుతోడ
పొత్తుకుఁ బిలువఁగాను బొమ్మల జంకింతురా

చ. 2: కన్నుల మొరఁగులేలె కడు నివ్వెరగులేలె
కన్నెపడుచవాయేమె కలికి నీవు
వెన్నవంటివాఁ డతఁడు వేడుకఁ గొంగు వట్టఁగా
సన్నలతిట్లతోడ చలము సాధింతురా

చ. 3: వుసురన నిఁకనేలె వొగిఁ దలవంచనేలె
పసిబాలవాయేమె పడఁతి నేఁడు
అసుదు శ్రీవెంకటేశుఁ డలమేల్ మంగ నీవు
పొసఁగ నాతఁడు గూడి పూఁచి కొసరుదురా

రేకు: 0299-4 ఆహిరి సం: 09-292

పల్లవి: వట్టిచనవులఁబోతే వాసిగలదా
నెట్టన నీకు మొక్కితే నీవె మెచ్చేవూ

చ. 1: మన్ననగలకాంతలు మాటలాడఁ జెల్లుఁగాక
వున్నవారు మాటాడితే నొద్దికలౌనా
విన్నా విననియట్టు కన్నాఁ గననియట్టు
సన్నల మెలఁగితేనె జాణతనముగాకా

చ. 2: ననుపు గలుగువారు నవ్వినా నమరుఁగాక
వనితలెల్లా నవ్వితే వాడికలౌనా
పెనఁగినాఁ బెనఁగక బిగిసినా బిగియక
మనసులో మెలఁగుటే మంచిదిగాకా

చ. 3: అలమేలుమంగను నే నంటిముట్టఁ జెల్లుఁగాక
వెలుపలివా రంటితే వేడుకలౌనా
నెలవై శ్రీవెంకటేశ నీవు నన్నుఁ గూడితివి
బలిమి మెరయుటే పంతముగాకా

రేకు: 0299-5 హిందోళవసంతం సం: 09-293

పల్లవి: అమ్మవారు నయ్యవారు నండనె కూచున్నవారు
యిమ్ముల నిద్దర జాణ లేమందమే

చ. 1: కొల్లున నవ్వీ నతఁడు గుట్టున నున్నది యాకె
తెల్లవారుదాఁకా మాఁటదిద్దనె పట్టె
పల్లద మాతనివంక పంతము లీచెలివంక
యిల్లిదె యిద్దరూ సరె యేమందమే

చ. 2: తొక్కుఁ బాదము లతఁడు తొరలి పెనఁగు నీకె
చెక్కులు నొక్కి బుద్ధులు చెప్పనె పట్టె
మొక్కల మాతనిపాలు మురిపె మీసతిపాలు
యెక్కుఁజల మిద్దరికి నేమందమే

చ. 3: చేతులు చాఁచు నతఁడు సిగ్గుననుండు నీకె
యీతల విడే లిద్దరి కియ్యనె పట్టె
ఆతఁడు శ్రీవెంకటేశుఁ డలమేలుమంగయింతి
యేతుల నిద్దరూఁ గూడి రేమందమే

రేకు: 0299-6 పాడి సం: 09-294

పల్లవి: వేసరివున్నారు తొల్లె వెలఁదులిందరు నీతో
వీసమంతపనికైనా వీఁగింతురు సుమ్మీ

చ. 1: నీవు మోహించినసతి నిన్నేమనినాఁ జెల్లు
ఆవటించి నీ వాపె నేమనినాఁ జెల్లు
పూవుఁగాక పిందెఁగాక పోదిఁ బెట్టుకున్నవారి
దీవెనమాటలాడినాఁ దిట్టుదురు సుమ్మీ

చ. 2: చనవుగలుగుయింతి జంకించ నిన్నుఁదగు
చెనకి నీవాపె నేమిసేసినాఁ దగు
ననిచియు ననచక నవ్వుకే లోనైనవారిఁ
దనువులు నిమిరినాఁ దట్టింతురు సుమ్మీ

చ. 3: పట్టపు అలమేల్‌మంగ పై కొంటివి నీమెచ్చు
గుట్టు శ్రీవెంకటేశ నీకూటమి మెచ్చు
అట్టుగా నాపెచేత నాఁబడిఁబడ్డయట్టివారిఁ
బట్టి బలిమిఁ గూడితి పంగింతురు సుమ్మీ

రేకు: 0300-1 మంగళకౌశిక సం: 09-295

పల్లవి: ఇద్దరూ నవ్వుతా నున్నా రింతటిలోనె
యెద్దుబండికంటి సంది యేమాయనయ్య

చ. 1: చెంగలువబంతి వేసె సేయరాని చేఁత సేసె
ముంగురులు పట్టి తీసె మొదలఁ జెలి
అంగనయింటిలో కేఁగి తటమీఁది సుద్దెరఁగ
యింగితపు మీవాదు లేమాయనయ్యా

చ. 2: కన్నులఁ దప్పక తిట్టె గక్కన నీచేయి వట్టె
చన్నులు రొమ్మునఁ బెట్టె సాధించె నిన్ను
యెన్నికఁ దెరవేసితి వేమిసేసితో యెరఁగ
యిన్నేసి మీ పంతములు యేమాయనయ్యా

చ. 3: కప్పురము నోటికిచ్చె కాఁగిలించి నిన్నుమెచ్చె
అప్పుడె శ్రీవెంకటేశ అలమేల్మంగ
దప్పిదేరితి వాపెతో తగ నన్ను మన్నించితి
యిప్పుడు మీ యెన్నికలు యేమాయనయ్యా

రేకు: 0300-2 శ్రీరాగం సం: 09-296

పల్లవి: మనసు మెత్తనిదాన మరిగినదాన నీకు
చనవు చేకొన్నదాన సమ్మతించవయ్యా

చ. 1: మొక్కలానఁ గోపగించి మోము చూడకుందుఁ గాని
తక్కక నీరూపు నాతలఁపులోనెవుండు
చిక్కక ఆవేళ నీచిత్త మెట్టుండునో యని
మొక్కెద నిదివో నీకు మొగిఁజేకోవయ్యా

చ. 2: చెప్పుడు వారి మాఁటకు చింతతోడనుందుఁగాని
యెప్పుడూ నీరాకకు నెదురు గాచుకుండుదు
కుప్పించి నాఘాత కెంతకొంకుచునుందువో నీవు
చెప్పి యందుకె సేవసేసేఁ జూడవయ్యా

చ. 3: వచ్చిన వూఁకున నిన్ను వడిఁ దమకింతుఁగాని
యిచ్చకురాలనే నీకు నిటు నేను
అచ్చపు శ్రీవెంకటేశ అలమేలుమంగను
మచ్చికఁ గూడితి నిఁక మన్నించవయ్యా

రేకు: 0300-3 దేసాళం సం: 09-297

పల్లవి: అంగమెల్లఁ జెమరించె నమ్మఁగారికి
అంగజరసములుబ్బీ నయ్యఁగారికి

చ. 1: చెక్కునఁబెట్టిన చేయి సెలవి నవ్విన నవ్వు
అక్కజమై తోఁచీ నదె అమ్మఁగారికి
చిక్కని మోముకళలు చెయివట్టి పెనఁగేటి
అక్కరవేడుకనిండె నయ్యఁగారికి

చ. 2: సరుస కంబముమాఁటు సమరతితోడు చూపు
అరుదుగఁ జిమ్మిరేఁగె నమ్మఁగారికి
తొరలనాడినమాట తొడమీఁదనింతిఁ బె ట్టి
అరమరపులు నిండె నయ్యఁగారికి

చ. 3: మంచముపై సరసాలు మర్మముపై మంతనాలు
అంచుమోచె నెదుటనె అమ్మఁగారికి
కొంచక అలమేల్మంగఁ గూడినట్టి గురుతిదె
అంచ శ్రీవెంకటగిరి అయ్యఁగారికి

రేకు: 0300-4 సామంతం సం: 09-298

పల్లవి: మాయింటికి విచ్చేసిన మన్నన యిది చాలదా
యేయెడనుండివచ్చిన నెరవుసే సేమా

చ. 1: కప్పురపుఁ జూపులు ఆకాంత నీపైఁ జల్లఁగాను
వుప్పతిల్ల వెన్నెల నవ్వులు చల్లేవు
చప్పుడుసేయక యింకఁ జల్లఁగా బదుకరయ్య
యెప్పుడు నీవారమె నే మెరవుసేసేమా

చ. 2: వేడుకమాటల నాపె విందునీకుఁ బెట్టఁగాను
యీడనె వలపుసొమ్ము లియ్యఁ జూచేవు
యీడుజోడుగూడుక మీరిద్దరు బదుకరయ్య
యేడసుద్ది మిమ్ము నేము యెరవుసేసేమా

చ. 3: అలమేలుమంగ నీకు నాసలుగానుకియ్యఁగ
కలిమి శ్రీవెంకటేశ కప్ప మిచ్చేవు
మెలఁగి వొకరొకరు మీ రిట్టె బదుకరయ్య
యెలమి నన్నుఁ గూడితి వెరవుసేసేమా

రేకు: 0300-5 గౌళ సం: 09-299

పల్లవి: అంగనకు నీవె అఖిలసామ్రాజ్యము
శ్రింగారరాయఁడ నీకు శ్రీపతినిధానము

చ. 1: కమలాలపానుపు కాంతకు నీవురము
ప్రమదపు నీమనసు పాలజలధి
అమరు నీభుజాంతర మట్టె తీగెపొదరిల్లు
రమణీయ హారాలు రత్నాలమేడలు

చ. 2: సతికి నీమెడ రతిసాముసేసేకంబము
ప్రతిలేని వయ్యాళి బయలు నీవు
మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము
మితిలేని శ్రీవత్సము మించు బండారుముద్ర

చ. 3: నెమ్మి నలమేల్మంగ నీ కాఁగిలి పెండ్లిపీఁట
చిమ్ముల చందనచర్చ సేసపాలు
వుమ్మడి మెడనూళ్ళు వుయ్యాలసరపణులు
పమ్మి శ్రీవెంకటేశ నీభావమే భోగము

రేకు: 0300-6 సాళంగనాట సం: 09-300

పల్లవి: అలుగకువమ్మ నీ వాతనితో నెన్నఁడును
పలువేడుకలతోనె పాయకుండరమ్మా

చ. 1: జలధిఁ దపము సేసె సాధించెఁ బాతాళము
నెలఁత నీరమణుఁడు నీకుఁగానె
యిలవెల్లా హరించె నెనసెఁ గొండగుహల
యెలమి నిన్నిటాను నీకితవుగానె

చ. 2: బాలబొమ్మచారై యుండెపగలెల్లా సాధించె
నీలీలలు దలఁచి నీకుఁగానె
తాలిమి వ్రతమువట్టి ధర్మముతోఁ గూడుండె
పాలించి నీవుచెప్పిన పనికిఁగానె

చ. 3: యెగ్గు సిగ్గుఁ జూడఁడాయె యెక్కెను శిలాతలము
నిగ్గుల నన్నిటా మించె నీకుఁగానె
అగ్గలపు శ్రీవెంకటాద్రీశుఁడై నిలిచె
వొగ్గి నిన్నురాన మోచివుండుటకుఁ గానె

చి.ఆ.రేకు: 0001-01 వరాళి సం: 10-001

పల్లవి: రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరతశతుఘ్నులతోడ జయమందు దశరథరాఘవా

చ. 1: శిరసు కూఁకటుల రాఘవా చిన్నారిపొన్నారి రాఘవా
గరిమ నావయసున తాటకిఁ జంపిన కౌల్యనందన రాఘవా
అరిది యజ్ఞముగాచి రాఘవా యట్టె హరునివిల్లువిరిచినరాఘవా
సిరులతో జనకునియింట జానకిఁ జెలఁగి పెండ్లాడినరాఘవా

చ. 2: మలయు నయోధ్యారాఘవా మాయామృగాంతక రాఘవా
చెలఁగి చుప్పనాతిగర్వ మడఁచి దైత్య సేనల జంపిన రాఘవా
సొలసి వాలిఁజంపి రాఘవా దండి సుగ్రీవు నేలిన రాఘవా
జలధి బంధించిన రాఘవా లంకసంహరించిన రాఘవా

చ. 3: దేవతలుచూడ రాఘవా దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁ జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి రాఘవా
శ్రీవెంకటగిరిమీద నభయములు చెలఁగి మాకిచ్చిన రాఘవా

ఛి.ఆ.రేకు: 0001-02 బౌళి సం: 10-002

పల్లవి: గోవింద గోవింద యని కొలువరె
గోవిందా యని కొలువరె

చ. 1: హరి యచ్యుతా యని యాడరె
పురుషోత్తమా యని పొగడరె
పరమ పురుషా యని పలుకరె
సిరివర యనుచునుఁ జెలఁగరే జనులు

చ. 2: పాండవ వరద యని పాడరె
అండజ వాహనుఁ గొనియాడరె
కొండలరాయనినే కోరరె
దండితో మాధవునినే తలఁచరె జనులు

చ. 3: దేవుఁడు శ్రీవిభుఁడని తెలియరె
సోవల ననంతునిఁ జూడరె
శ్రీవేంకటనాధునిఁ చేరరె
పావనమై యెప్పుడును బ్రదుకరే జనులు

చి.ఆ.రేకు: 0001-03 దేసాక్షి సం: 10-003

పల్లవి: ఎన్నటికి నీకు జీవుఁడా యిదియె బుద్ధి వోజీవుఁడా
మన్నించిన నీగురువులపాదము మఱవకువో వోయిజీవుఁడా

చ. 1: మాటచెప్పెఁద జీవుఁడా మారు మాఁటలేటికి జీవుఁడా
నాటకంబుల పంచేంద్రియముల నమ్మకు వో వో జీవుఁడా
చాటితిఁ జుమ్మీ జీవుఁడా నీకుఁజాటువో హరిభక్తి జీవుఁడా
కూటువగూడిన కామక్రోధాదులఁ గూడకువో వోయిజీవుఁడా

చ. 2: ఎప్పుడు మనసులో జీవుఁడా హరిఁ దప్పక తలఁచవో జీవుఁడా
తప్పుఁదెరువుల దేవతాంతరాలు దడవకువో వోయిజీవుఁడా
దప్పిఁబడనేల జీవుడా నీవు ధన్యుఁడ వవుదు వోజీవుఁడా
చిప్పిలువేడుక శ్రీవెంకటనాథు సేవించవో వోయిజీవుఁడా

చి.ఆ.రేకు: 0001-04 గుజ్జరి సం: 10-004

పల్లవి: మచ్చరములుఁ గపటంబులు మానినంత మరికదా
విచ్చలవిడి నాయాసల వీఁగఁదోల నోపుటా

చ. 1: చంచలమగు నామనసిది మంచిదైన మరికదా
పంచేంద్రియముల పోరునఁ బడకమానుటా
కొంచెపరచునాకోపముఁ గోసివేసి మరికదా
కంచపుఁ బాపంబులలోఁ గడతేరుటా

చ. 2: వుడివోని దీపనమున కోరిచినె మరికదా
జడివట్టిన నాజిహ్వాచాపల్యము మానుటా
చిడుముడి నాభోగంబులఁ జిక్కువడక మరికదా
విడువని సంసార మనెటివెల్లి దాఁటనోపుటా

చ. 3: తరితీపులమోహంబునఁ మరికదా
కెరలిన యీలోభంబున గెలువ నోపుటా
నెరవుగ శ్రీవిష్ణుభక్తి నిలుకడైన మరికదా
గరగరికలనె శ్రీవెంకటనాథునిఁ జేరుటా

చి.ఆ.రేకు: 0001-05 దేవగాంధారి సం: 10-005

పల్లవి: ఏమొకొ నేమేమొకో
యీ మోహము మానమేమొకో

చ. 1: కావరించినట్టి కాఁపురములలో
నీవలావలయ్యే మేమొకో
దావతిసుఖముల దారి దెలిసియు
నేవగించలే మేమొకో

చ. 2: గాలపుఁజిక్కుల కర్మపుతొడసుల
యీలకరచే మేమొకో
తాలిమిచెరిచెటి ధనముమీఁదివాంఛ
యేలొ యింకా మాన మేమొకో

చ. 3: వోడుపోయినట్టి వుంగిటిబతుకుల
యీడగిలఁబడే మేమొకో
వేడుకతో శ్రీవెంకటనాథుఁడు
యీడనె మముఁ గాచె నేమొకో

చి.ఆ.రేకు: 0002-01 మలహరిసం: 10-006

పల్లవి: హరికి మొరవెట్టితె అన్నిపనులు లెస్సవును
సరవి నెన్నాళ్లని జాలిఁ బడవచ్చును

చ. 1: యేమిసేయేనీజీవుఁ డీయరివర్గాలతోడ
బూమెల నెన్నాళ్లని పోరాడీని
చూమరలఁ జూడఁ జూడఁ జుట్టాలవలనె వుండి
దోమటిపంచేంద్రియాలు దోడుగాకపోయను

చ. 2: యెక్కడచొచ్చిజీవుఁడీ కర్మపురుణములు
పెక్కు విధములఁ బిరువీకు సేయఁగా
వొకొ్కక్కనాఁటివడ్డె వొదిగీఁగాని తల
తిక్కగొన్న పాపములు దీరకెపోయను

చ. 3: యెవ్వరుదిక్కీ జీవుని కెంతని యీఁదఁగలఁడు
యివ్వల సంసార మనె యీవారిధి
నవ్వుతా శ్రీవెంకటనాథుని మఱఁగుచొచ్చి
యివ్వగఁ దా దరిచేరి యిన్నియు గెలిచెను

చి.ఆ.రేకు: 0002-02 సామంతం సం: 10-007

పల్లవి: మాజహిహి దుష్టమనాయితి
యోజయ తవపదయుగామృతేన

చ. 1: పరమాత్మన్ మమపామరచిత్తం
చిరం పాపం చికీర్షతి
కరుణానిధేర్యకారణబంధో
గురుతరాం కృపాం కురు మయి దేవ

చ. 2: అంతర్యామి హరే మదాశా
సంతపఏవ సమేధతే
దాంతికరానంతగుణానిధే
భ్రాంతిం వారయ పావనచరిత

చ. 3: నలినోదర మాం నానామోహా
విలసత్కృతీవ విమోహయ
కలిత శ్రీవెంకటనాథ త్వం
సలలితం ప్రసాదయ స్వామి

చి.ఆ.రేకు: 0002-03 దేవగాంధారి సం: 10-008

పల్లవి: ఎవ్వరుచెప్పినా మనసేల మానును
యివ్వలవ్వలౌఁగాక యేలమానును

చ. 1: కమ్ముకొన్న యింద్రియాలు గారడించఁగా జీవుఁ
డెమ్మెలఁ బొరలక మరేల మానును
యిమ్ములేనికోరికలు యెక్కెక్కు లాడఁగాను
వుమ్మడికర్మాలుసేయ కూర కేల మానును

చ. 2: పేరడిమదములెల్లా పెనగొనఁగా నొరుల
నీరసించ కీ దేహి యేలమానును
తీరనిచలము లివి తెలివి చెరుచఁగాను
యేరవెట్టుకొనియుండ కేలమానును

చ. 3: వుడివోనియాసలు వొత్తుకోలుసేయఁగాను
యిడియక యీప్రాణుఁ డేలమానును
కడువేగ శ్రీవెంకటనాథుఁడు గావఁగా
నెడయక కని మన కేలమానును

చి.ఆ.రేకు: 0002-04 మలహరిసం: 10-009

పల్లవి: హిత విదె తెలుసుకొమ్మీ
సతతముఁ జాటితిని

చ. 1: సేయవోయిజిహ్వ యీశ్రీహరి నుతియెపుడూ
రోయవోయి నీవు యీరుచుల యందలి వేడుకా

చ. 2: కోరవోయి మనసా యిఁక గోవిందుని చింతా
చేరకువోయి నీవు యీ చెడుగుఁ గామాదులను

చ. 3: విడువకువోయి దేహి శ్రీవెంకటగిరినాథుని
వుడుగవోయి నీవు యీవులుకుఁ దొల్లిటిచేఁతలు

చి.ఆ.రేకు: 0002-05 గుజ్జరి సం: 10-010

పల్లవి: ఎంతలే దిది యెంచిన
సంతోషించని సంసారంబు

చ. 1: యేలకొ నేఁ డీదేహి
ఆలరి భోగము లడిగీఁగాక
చాలించఁగఁ జాలఁడు
కోలుముందు హరిఁ గొలువఁగరాదా

చ. 2: యెందైనను యీమనసు
పందదనంబునఁ బారీఁగాక
ముందరికోరిక ముణుఁగదు
కందువ శ్రీవిభుఁ గానఁగరాదా

చ. 3: విడువనితగు లీవేడుక
తొడిఁబడ నెందైన దొరసీఁగాక
కడగని శ్రీవెంకటనాథు
బడిబడిఁ దిరుగుచు బ్రదుకఁగరాదా

చి.ఆ.రేకు: 0002-06 బౌళి సం: 10-011

పల్లవి: బ్రహ్మఁగన్న వాఁడు పసిబిడ్డ
బ్రహ్మమైనవాఁడు పసిబిడ్డ

చ. 1: వగపులేక చంపవచ్చిన బూతకి
పగసాధించినవాఁడు పసిబిడ్డ
పగటునఁ దనమీఁదఁ బారవచ్చినబండి
పగులఁ దన్నినవాఁడు పసిబిడ్డా

చ. 2: గుట్టున నావులకొరకు వేలనె కొండ
పట్టి యెత్తినవాఁడు పసిబిడ్డా
జెట్టిపోరునఁ దన్ను జెనకవచ్చినవానిఁ
బట్టి చంపినవాఁడు పసిబిడ్డా

చ. 3: మిడికెటికోపపు మేనమామఁ బట్టి
పడనడిచినవాఁడు పసిబిడ్డా
కడువేగ శ్రీవెంకటనాథుఁడై గొల్ల
పడఁతులఁ గూడినాఁడు పసిబిడ్డా

చి.ఆ.రేకు: 0002-07 లలిత సం: 10-012

పల్లవి: చెప్పే నామాట విను చిత్తమా
చిప్పిలు నెండమావుల చెరువులు నున్నావా

చ. 1: వెగటైనవిషయాల వేడుకపడకు మవి
జిగురుఁగండెలు సుమ్మీ చిత్తమా
పొగరుమూఁపుఁదనాలఁ బొరలకు మవియెల్ల
తగులు విరిపందెల దారివంటివి

చ. 2: బలిమినె యాసలబారిఁ బడకు మవి
చిలుకల వోఁదా లోచిత్తమా
తలఁచిచూచితేనె తప్పులుఁ దారులె
కలలోని రతులయాఁకట వంటివి

చ. 3: మేరమీరెకోరికల మిసిమి చూడకు మవి
జీరుకుబండ లోయిచిత్తమా
చేరువనె కాచెటి శ్రీవెంకటనాథుఁగని
గారవాన బ్రదుకుమీ కల్పవృక్ష మతఁడు

చి.ఆ.రేకు: 0003-01 లలిత సం: 10-013

పల్లవి: పచ్చిగాఁ దెలియకుంటె బహుముఖమై తోఁచు
అచ్చమై యిన్నియును శ్రీహరి కల్పితములే

చ. 1: కొందరు దిట్టుదురూ కొందరు దీవింతురు
చందపుసంసారము జాడలివి
కందువ రేయీఁ బగలుఁ గాలము నడచినట్టె
అందరిలో గలుగు శ్రీహరికల్పితములే

చ. 2: కొన్నిట్టిపైకోపము కొన్నిటి పైవేడుక
వున్నతి దేహధారుల వోజ లివి
పన్ని కాయ పండు దొండపంటియందె తోఁచినట్టు
అన్నియుఁ బుట్టించిన శ్రీహరికల్పితములే

చ. 3: కొంతచోట మనుజులు కొంతచోట దేవతలు
అంతా శ్రీవెంకటనాథు నాజ్ఞ యిది
చెంత చప్పనయుఁ దీపు చెఱకందె వుండినట్టు
కాంతుఁడైన శ్రీహరికల్పితములే

చి.ఆ.రేకు: 0003-02 వరాళి సం: 10-014

పల్లవి: మాఁటిమాఁటికిఁ జూచి మరపులేలె
నీటునఁ బాటిగంప నీళ్లు మోచేవా

చ. 1: తెలిపేగురుఁ డుండఁగ తెలియఁగ నేరవు
చిలుకచదువులే లోజీవుఁడా
అలవోక నెంద్రై న ఆస మానలేవు
కల గన్నచోటి కెల్ల గంపయెత్తేవా

చ. 2: వొబ్బిడైనవేదమార్గ మొల్లనిపుణ్య మంటేవు
జిబ్బిటాయతప మేలె జీవుఁడ
అబ్బురపువేడుకల నలుసేవు పలుమారు
గబ్బివై పారేబండికిఁ గాలు చాఁచేవా

చ. 3: వొల్లనెసంసారములో నూరకె గర్వించేవు
చెల్లఁబో రొయ్యకోవ్వేలె జీవుఁడా
నల్లని శ్రీవెంకటనాథుని బంటవైతివి
తల్లకిందేల మేరువు తలగడనుండఁగా

చి.ఆ.రేకు: 0003-03 గుజ్జరి సం: 10-015

పల్లవి: చంచలమతులకుఁ దెలియునే సాత్వికధర్మములు
మంచమునీడవలె బహుమార్గములై తోఁచున్

చ. 1: తీపుల అల్పపుచదువుల తెలివేలా కలుగు
కాపై మిడుఁగురుబురువులఁ గడచునె చీఁకట్లు
పైపై ప్రాకృతదృష్టికి పరమేలా కలుగు
పాపము కనుమాయలవలె భ్రమయించుఁ గాక

చ. 2: కొద్దెరఁగని జడునికి సద్గుణ మేలా కలుగూ
అద్దము చిలు ముబ్బినక్రియ అజ్ఞానము వొడమున్
నిద్దము కామాతురునకు నిజ మేలా తెలియూ
వద్దనె యండమావులవలెఁ దోఁచుఁ గాక

చ. 3: అనువుగ నక్షయపుణ్యము అది యేలా చెడును
పెనఁగెటి తననీడవలెనె పెడవాయదు యెపుడు
ఘనుఁడగుజీవుఁడు శ్రీవెంకటనాథునిఁ గని నా
పనివడి రత్నము సానఁబట్టినగతిఁ జెలఁగున్

చి.ఆ.రేకు: 0003-04 సామంతం సం: 10-016

పల్లవి: అల్లము బెల్లమౌనా అన్నలాల
యెల్లకాలమును గుణ మేల మానీనయ్యా

చ. 1: నిక్కము గొండలనీరు నేలకు వేగమె పారు
యెక్కువనేలపై నీరు యెక్కు దండుకు
మిక్కిలి ప్రకృతిలోన మెలఁగెటివానికి
చొక్క మైనజ్ఞాన మెట్లు సొగసీనయ్యా

చ. 2: అచ్చపుఁబాలలోన తోడంటితేనె పెరుగౌను
పచ్చి సేసినఁ బెరుగు పాలు గాదు
వచ్చి వచ్చి యెఱఁగనివానికిఁ దెలుపవచ్చు
కుచ్చితుని నెటువలె గుణిఁ జేసేదయ్యా

చ. 3: చందనపువానలు సంగడి మాఁకుల నంటు
అందలివాన లిందు నంట వెన్నఁడు
కందువైన శ్రీవెంకటనాథుని దాసు
లెందుండినా నితరము లేల తోఁచీనయ్యా

చి.ఆ.రేకు: 0003-05 బౌళి సం: 10-017

పల్లవి: తనకోరిక లేఁటికి నాతఁడె యిన్నియుఁ గల్పించఁగ
అనువుగ నిందుకు యిద్దరియత్నంబులు వలెనా

చ. 1: అద్దముచూచెటియాతఁ డలరుచు నవ్విన నవ్వును
అద్దములోపలినీడయు నారీతినె కాదా
గద్దరియగు శ్రీవిభుసంకల్పంబుననె జగముల
సుద్దులు దుఃఖము సుఖమును సూటిఁబఁడె గానా

చ. 2: నాఁటక మాడించునతఁడు నయమునఁ గదలింపంగా
నాఁటక మందలిబొమ్మలు నానాగతిఁ జెలఁగున్
ఆటలఁ జేతన్యాత్మకుఁడగు దేవుని చేష్టలనె
పాటిగఁ బాపముఁ బుణ్యము బహుళం బగుఁగానా

చ. 3: అరదము నడపెటిసారథి యటునిటు వాగెటు వట్టిన
అరదముగుఱ్ఱములు మెలఁగు నాయాముఖములను
నరులను శ్రీవెంకటగిరినాథుఁడె తగ బ్రేరింపఁగ
గరవము లేమియుఁ గలిమియుఁ గలిగుండుఁ గానా

చి.ఆ.రేకు: 0003-06 మలహరిసం: 10-018

పల్లవి: తలఁ పెన్నఁడు నినుఁ దగులునయ్యా
చల మెన్నఁడు కడచనునోయయ్యా

చ. 1: మోహం బెన్నఁడు ముదుసునయ్యా
దాహం బెన్నఁడు తలఁగునయ్యా
సాహస మెన్నఁడు జరగునయ్యా
శ్రీహరి తెలియఁగ జెప్పఁగదయ్యా

చ. 2: కపటం బెన్నఁడు గడచునయ్యా
చపలత లెన్నఁడు జారునయ్యా
నిపుణత లెన్నఁడు నెగడునయ్యా
ప్రపంచముగ హరి పలుకఁగదయ్యా

చ. 3: మచ్చర మెన్నడు మానునయ్యా
నిచ్చల మెన్నఁడు నిలుచునోయయ్యా
గచ్చుల శ్రీవెంకటనాథ
పచ్చిదేర హరి పలుకఁగదయ్యా

చి.ఆ.రేకు: 0004-01 లలిత సం: 10-019

పల్లవి: కుడువనికుడుపులు కొనసాగె మమతలు
కడువేగ శ్రీహరిఁ గానఁగవలదా

చ. 1: నమలక చవులయ్యె నాతుల సుద్దులు
అమర చింతకాయలవంటివి
భ్రమసి కొరుకఁబోతె పండ్లు పులుసును
తెమలక శ్రీహరిఁ దెలియఁగ వలదా

చ. 2: విచ్చక మెరుఁగులు విడివడ్డ వలపులు
పచ్చి మేడిపంటి భావమువి
మెచ్చి లోను చూడ మెదలుపురువులె
గచ్చుల యివి మాని కనవద్దా హరిని

చ. 3: బడలని పంట వో పైపైనే హరిభక్తి
కడలేని కల్పవృక్షమువంటిది
కడఁగి కొలువ శ్రీవెంకటనాథుఁడె గురి
బడినె యీతనిఁ గని బ్రదుకఁగ వలదా

చి.ఆ.రేకు: 0004-02 మలహరిసం: 10-020

పల్లవి: సంకె లేక తలఁచిన జాణలకు
సంకీర్తనమెపో సర్వశాంతి

చ. 1: భవహరమగు శ్రీపతి నామమె
జవకట్టి తలఁచితే జన్మశాంతి
తవిలి హరిపూజ తాఁ జేయుటె
కువలయమున నిదిగో గృహశాంతి

చ. 2: అంది ధ్రువవరుఁదుడ యనినదే
కందువైన సర్వగహశాంతి
యిందురవినయనుని నెరుఁగుటె
చందమైన దిదివో నక్షత్రశాంతి

చ. 3: భావించి యనంతునిఁ బలుకుటే
కావించిన దిదివో కాలశాంతి
శ్రీవెంకటనాథునిఁ జేరుటె
దేవమానవులకును దేహశాంతి

చి.ఆ.రేకు: 0004-03 మాళవిగౌళ సం: 10-021

పల్లవి: మనసె వశమైతేఁగా మరి మీఁదటిపనులు
తనువులోపలి హరిదయ యింతె కాకా

చ. 1: వొద్దనె పుత్రమిత్రాదు లువ్విళ్లూరించఁగాను
అద్దొ వైరాగ్య మేమి ఆటపాటలా
కొద్దిలేనివిషయాలు గుంపు గూడు కుండఁగాను
వద్దని కడకుఁ దోయ వశ మవునా

చ. 2: వొయ్యనె ధనధాన్యాలు వొడ్డుకొని వుండఁగాను
అయ్యో సుజ్ఞానము లల్లాడఁబడెనా
గయ్యాళికోరిక లెల్లా గమిగూడ కుండఁగాను
పుయ్యక దూలయాసలఁ బోఁదోల వసమా

చ. 3: పల్లదపుటాఁక లిది పాయక వుండఁగాను
చెల్లఁబో వోరుపు లింత చెడఁబోయనా
నల్లని శ్రీవెంకటనాథుఁడె యందరికిని
తల్లి దండ్రియై కావఁగా తప్పువాసెఁ గాకా

చి.ఆ.రేకు: 0004-04 రామక్రియ సం: 10-022

పల్లవి: భవరోగవైద్యుఁడైన బలువెజ్జు
సవరని పైఁడిపక్షిసకినగాఁడు

చ. 1: తల్లి వద్ద నోరిలోన తగ లోకములు చూపి
వెల్లవిరి నింద్రజాలవిద్యవాఁడు
చెల్లుబడి నొక్కకొండ చేతఁ బట్టి యెత్తినాఁడు
బల్లిదుఁడు వాడివో బారివిద్యవాఁడు

చ. 2: మునుపె సకలభూతములను నేలికయై
మనసెల్లా నెరిగిన మంత్రవాది
చనవున జలధిలో సంప దింద్రునికిఁ జూపె
అనువరి వాఁడివో అంజనగాఁడు

చ. 3: పట్టరాని కాళింగుపడిగెలమీఁదు మెట్టి
పట్టినాఁడు వాఁడువో పాములవాఁడు
అట్టె శ్రీవెంకటనాథుఁ డమరుల నెల్లనుఁ జే
పట్టి దైత్యులఁ జంపించే పాళగాఁడు

చి.ఆ.రేకు: 0004-05 సాళంగనాట సం: 10-023

పల్లవి: అప్పనివరప్రసాది అన్నమయ్యా
అప్పసము మాకె కలఁ డన్నమయ్యా

చ. 1: అంతటికి నేలికైన ఆదినారాయణుఁ దన
యంతరంగాన నిలిపీ నన్నమయ్యా
సంతసానఁ జెలువొందె సనకసనందనాదు
లంతటివాఁడు తాళ్లపాకన్నమయ్యా

చ. 2: బిరుదు టెక్కెములుగా బెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్యా
విరివిగలిగినట్టి వేదముల యర్థ మెల్లా
అరసి తెలిపినాఁడు అన్నమయ్యా

చ. 3: అందమైన రామానుజాచార్యమతమున
అందుకొని నిలిచినాఁ డన్నమయ్యా
విందువలె మాకును శ్రీవేంకటనాథుని నిచ్చె
అందరిలో దాళ్లపాక అన్నమయ్యా

చి.ఆ.రేకు: 0004-06 దేవగాంధారి సం: 10-024

పల్లవి: నేరి చెవ్వఁడు బ్రదికె నేరక యెవ్వఁడు చెడె
భారకుఁ డందరికి శ్రీపతి యింతె కాక

చ. 1: వొక్కరి నేరము లైతె నూరకె వెడకఁ జూచే
నక్కటా నాగుణదోషా లవి యెంచను
వొక్కటై విచారించితే వొరు లేమి తా నేమి
అక్కడ నిక్కడ గురి హరి యింతె కాక

చ. 2: దట్టించి వొక్కరి నైతె తప్పు లెంచఁ జూచేను
అట్టే నాయపరాధాల కాజ్ఞ యేదో
నెట్టనఁ దలపోసితే నేనేమి పరు లేమి
గట్టిగా స్వతంత్రుడు శ్రీకాంతుఁ డింతె కాక

చ. 3: వూరకె వొక్కరి నైతే వొచ్చములు వట్టేను
కారుకమ్మినట్టి నాకల్ల లెంచను
గారవించి శ్రీవెంకటనాథుఁడు నన్ను
సారెకు రక్షించఁగాను జయ మాయఁ గాకా

చి.ఆ.రేకు: 0005-01 గుండక్రియ సం: 10-025

పల్లవి: పట్టివిచారము లేల వలవని చింత లేల
దిట్టతనాన రక్షించ దేవుఁ డుండఁగాను

చ. 1: తానె బుద్దెరిఁగితే తప్పులేల వచ్చీని
మానక యేలిక లెస్స మన్నించుఁ గాక
మేనిలోఁ బాపము లేక మించిన భయ మేఁటికి
ఆనుకొని రక్షించ శ్రీహరి యుండగాను

చ. 2: చేరి తానె కొలిచితే జీత మేల తప్పీని
భారకుఁడై దొరయే చేపట్టుఁ గాక
మారుముద్ర గాని మంచిమాడకు వట్టము లేల
తారుకాణగా హరి తానె రక్షించుఁ గాక

చ. 3: చనవె కలిగితేను సలి గేల తప్పీని
తన చెప్పినట్టు రాజు తాఁ జేసుఁగాక
పనివడి రాచవారి పనులకు బందె యేది
నను శ్రీవెంకటగిరినాథుడు రక్షించఁగా

చి.ఆ.రేకు: 0005-02 గౌళ సం: 10-026

పల్లవి: నిచ్చలూఁ జెడనియట్టి నీకె తెలుసుఁ గాక
యిచ్చల మావంటివా రేమెరుఁగుదు రయ్యా

చ. 1: బాలుఁడు వృద్ధనియెటి పరిభాష లన్నియును
మూలమూలలను దేహమునకె కాక
యీలో నెంచి చూచితే నెన్నటివాఁడు
కోలుముంద్రై పెరిగినో కొంచె మయ్యానో

చ. 2: మంచిది చెడ్డ దనెటిమాఁట లెల్లా భువిలోన
యెంచి చూడ మనుజుల కింతె కాక
నించి సర్వపూర్ణుఁడవై నీవు లేనిచోటేది
తుంచరాదు పెంచరాదు తొల్లె కలవు

చ. 3: వాఁడు వీఁడనియెటివచనాలు జగములో
పోఁడిమి జీవులయందె పొసఁ గెఁ గాక
వేఁడినా కొసరినాను విశ్వవ్యాపకుఁడవై
నాఁడు నేఁడు శ్రీవెంకటనాథుఁడవె కలవూ

చి.ఆ.రేకు: 0005-03 నారాయణదేసాక్షి సం: 10-027

పల్లవి: ఐన దేది కాని దందులో నేది
నానారూపి శ్రీనాథుఁడె కాకా

చ. 1: యెవ్వరి దూషించే మెవ్వరి భూషించే
మెవ్వరు స్వతంత్రు లిందులో
అవ్వల నివ్వల నంతరాత్ముఁడైన
యవ్వనజాక్షుని ననుట గాకా

చ. 2: యెందుకుఁ గోపించే మెందుకు మెచ్చే
మెందుఁ గద్దు మే లిందులో
అందు నిందుఁ దానె యల్లుకొన్న
నందనందనునే నమ్ముట గాకా

చ. 3: యేచోటు మంచిది యేచోటు చెడ్డది
యేచోటు సతమౌ నిందులో
కాచేటి శ్రీవెంకటనాథుఁడె
చేచేతఁ గాణాచై చెల్లించెఁ గాకా

చి.ఆ.రేకు: 0005-04 గుజ్జరి సం: 10-028

పల్లవి: చలమె చెల్లించుకొన్న సతులాల
సులభమా మీతోపొందు సుతులాల

చ. 1: వ్రతినైన యతినైన వలలమాటలఁ బెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల
హితవరులువలెనె యింత నంత నెలయించి
తతిగొందురుగా ధనధాన్యములాల

చ. 2: పెద్దనైన పిన్ననైన పెలుచుఁదనమె రేఁచి
కొద్దిమీరించిన కామక్రోధములాల
అద్దొ యెంతవిరక్తు నైనా విషయాలకె
తిద్దితిరిగా పంచేంద్రియములాల

చ. 3: మునినైన ఋషినైన మోహమె పెంచి మరపి
మొనసితిరిగా యిల్లు ముంగిళ్లాల
ఘనుఁడైన శ్రీవెంకటనాథుపాదములు
చనవునఁ జూపతి రాచార్యులాలా

ఛి.ఆ.రేకు: 0005-05 మలహరిసం: 10-029

పల్లవి: నిండునిధానమువలె నీవు గలిగుండఁగాను
పండినయోగికిఁ బూర్ణభావనె మంచిది

చ. 1: కలకాలము భూమిఁ గతలె వింటిమిగాని
నలనహుషాదు లున్నారా యేమి
యిలలో నితరు లెల్లా నేమి లేక్క యిందుకుఁగా
యెలయింపువిషయాల యేమరఁగఁ దగునా

చ. 2: చేపట్టి పురాణాలు చెప్పఁగా వింటిమి గాని
బాపురె దుర్యోధనుసంపద యేది
కాపాడ నిప్పటివారికలిమి యెంచఁగ నేది
యీపాటిపనికిఁగా నిది గోరఁ దగునా

చ. 3: మళ్లీ మళ్లీ భూమిలోన మాటలె వింటిమి గాని
తొల్లిటి బలాఢ్యుల సత్తువ లేవి
వెల్లవిరై యెప్పుడూ శ్రీవెంకటనాథ నీదాసు
లెల్లకాలముఁ జెడని యీబలిమె నిజము

చి.ఆ.రేకు: 0005-06 లలిత సం: 10-030

పల్లవి: బండించితేఁ గలుగునా పరమాత్మునిదాస్యము
నిండుమతి నుండితేను నెరవేరుఁ గాక

చ. 1: బాధకు నోపనివాఁడు పాపము సేయ నేల
పోది సేయఁ దొలుతేమి బుద్ధి లేదా
సాదువలె నుండితేను సర్వేశ్వరుఁడె తన్ను
వాదులాట లెల్ల మాన్పి వహించుకో లేఁడా

చ. 2: దండుగ కోపనివాఁడు తప్పులు సేయఁగ నేల
వుండరాదా తా నుండె వొడికానను
కొండవంటి యాసతోడ కోరక తా నుండితేను
తండు ముండై లంపటాలు తగిలీనా తనకు

చ. 3: వళుకు కోపనివాఁడు వచ్చి పూఁటవడ నేల
వొలిసినట్లు తనంత నుండరాదా
కలకాలము శ్రీవెంకటనాథుఁ గొలిచితె
అలరి యభయ మిచ్చి అట్టె కావ నోపఁడా

చి.ఆ.రేకు: 0006-01 గుజ్జరి సం: 10-031

పల్లవి: వద్దుసుమ్మీ చెప్పితిని వలలఁ బడఁగ వద్దు
పెద్దరికాన దేవునిఁ బేరుకొన రాదా

చ. 1: పల్లదపు సంసారానఁ బాయలేక తిరిగేవు
చెల్లఁబో జీవుఁడ యింకా సిగ్గు గాదుగా
వెల్లవిరి నింతయాల వెనకముందరిపాటు
దళ్లాలితనము మాని తలఁచుకో రాదా

చ. 2: వెయ్యైనా మీఁద మీఁద వేసరక కోరేవు
అయ్యో యింకా నిందు కాసపడేవా
వొయ్యనె వెనకజన్మ మొక్కటొక్క టెంచి చూచి
తియ్యని విష్ణుభక్తి తెలుసుకో రాదా

చ. 3: యేపు మీరి యేమైనా నింపులు సేసుకొనేవు
పో పో యింకా రోఁత వుట్టదాయఁగా
చేపట్టి కాచేయట్టి శ్రీవెంకటనాథుఁడె
దాపై వున్నాఁ డిదె దరిసించ రాదా

చి.ఆ.రేకు: 0006-02 గౌళ సం: 10-032

పల్లవి: చిన్నవాఁడు నాలుగుచేతులతో నున్నాఁడు
కన్నప్పుడె శంఖముఁ జక్రముఁ జేత నున్నది

చ. 1: నడురేయి రోహిణినక్షత్రమునఁ బుట్టె
వడిఁ గృష్ణుఁడిదివో దేవతలందు
పడిన మీబాధ లెల్ల ప్రజలాల యిప్పుడిట్టె
విడుగరాయ మీరు వెరవకుఁ డిఁకను

చ. 2: పుట్టుతానె బాలుఁడు అబ్బురమైన మాఁటలెల్ల
అట్టె వసుదేవుని కాన తిచ్చెను
వట్టిజా లింకేల దేవతలాల మునులాల
వెట్టివేములు మానెను వెరవకుఁ డిఁకను

చ. 3: శ్రీవెంకటనాథుఁడె యాసిసువు దా నైనాఁడు
యీవల వరము లెల్లా నిచ్చుచును
కావఁగ దిక్కైనాఁ డిక్కడనె వోదాసులాల
వేవేగ వేడుకతోడ వెరవకుఁ డిఁకను

చి.ఆ.రేకు: 0006-03 సాళంగనాట సం: 10-033

పల్లవి: ఈలగద్ద మూకఁలోన యించుకకోడిపిల్లకు
మూలమూలలఁ దలారికములు చెల్లునా

చ. 1: మంచుకుఁ బెట్టినయట్టి మైనపుఁగుళ్లాయలు
అంచెల లవుడి పెట్టు లానఁ బోయీనా
పంచేంద్రియము లెల్ల బలవంతములై వుండఁగా
యించుక నావైరాగ్య మేడ కెక్కీని

చ. 2: గుగ్గిళ్లు వెలవెట్టి కొనిన గుఱము లెల్ల
దగ్గరి యగడుతలు దాఁటఁబోయీనా
నిగ్గుల బాదకుఁ గాక నేరిచిన సుద్దులెల్లా
వెగ్గళమై యింతటను వెలవెట్టీనా

చ. 3: పోరుకుఁ జాలక పోయి పొడిచే పోటు లెల్లా
నారటిలుఁ గాక అవి నాటఁ బోయినా
గారవాన శ్రీవెంకటనాథుఁడు గావఁగా
భారములు భయములుఁ బాసె నింతె కాకా

చి.ఆ.రేకు: 0006-04 దేసాళం సం: 10-034

పల్లవి: ఏలికెవై నన్నొకని నేలఁగాను నీ
లీలావిభూతి కొకలేశము దక్కువా

చ. 1: పనివూని నాయొకనిపాపము మానుపఁగా నీ
ఘనసంకల్పమునకుఁ గడమా
చెనకి నేనే పూజ సేయఁగా మెచ్చేనంటె
కనుకొనే వందేమి కండ గట్టుకొంటివో

చ. 2: దేవుఁడవై నామనసు దెరిచి రక్షించఁగాను
గోవింద నీమాయ కేమి గొఱతా
సోవల నాలోని భక్తి చూచి కాచే నంటివా
కావలసి నీ వెంత గాదెఁ బోసుకొంటివో

చ. 3: అలరి నాహృదయమునందుఁ గానుపించితేను
వెలయ నీమహిమకు వెలితా
కలిమితో నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యిలమీఁద నీకు నిప్పు డెంతకీ ర్తి గూడెనో

చి.ఆ.రేకు: 0006-05 లలిత సం: 10-035

పల్లవి: తచ్చిచూచితేఁ జాలు దైవమే కలఁడుగాక
హెచ్చినమాయలఁ బడ నేల మాకు నిఁకను

చ. 1: సారె సారె నే నెంతసంపదలు గోరినాను
పోరచి నీదేహమెకా భోగించేది
యీరీతి మనసు దా నెన్నటికిఁ దనిసీని
గారవాన హరి నిన్నుఁ గన్నదె దక్కెను

చ. 2: పలుమారు చావులేనిబదుకు కాసపడేది
యిలలోసంసారమెకా యేఁ జేసేది
కలిగినయాస యేకాలమున ముదుసును
అలరి విష్ణునిశర ణన్నదె నిలిచె

చ. 3: వేడుకతో ఘనమైనవిద్యలు నేరిచినాను
జోడుగా నిందరికిని చూపు టింతేకా
వీడని తలఁపుతో శ్రీవెంకటనాథునిఁ గొల్చి
యీడేరి బదుకుటె యెన్ని కింతె కాకా

చి.ఆ.రేకు: 0006-06 లలిత సం: 10-036

పల్లవి: భారము నీదిగాన పట్టి విన్నవించేఁ గాక
ఆరితేరి బుద్దెరిఁగే దది యెన్నఁడయ్యా

చ. 1: వీలనిసంసారపువెట్టి నేఁ జేయఁగాను
యేలిన నిన్నుఁ గొలిచే దెన్నఁడయ్యా
కాలమెల్లా విషయాల గాడినె కట్టుండఁగాను
ఆలించి నీసేవ సేసే దది యెన్నఁడయ్యా

చ. 2: బట్టబయలు మాయలబారిఁ బడివుండగాను
యిట్టె నిన్నుఁ దలఁచే దెన్నఁడయ్యా
వుట్టిపడేకోరికల వువ్విళ్లూరఁగాను
అట్టె నిన్నుఁ బొగడే దది యెన్నఁడయ్యా

చ. 3: సొలసి నాలుక నూరసుద్దులె తడవఁగాను
యిలపై నిన్ను నుతించే దెన్నఁడయ్యా
కలిగి నన్నును శ్రీవెంకటనాథ కాచితివి
ఫలియించెఁ దపము యీబాగు లెన్నఁడయ్యా

 చి.ఆ.రేకు: 0007-01 సాళంగనాట సం: 10-037

పల్లవి: తన దాసునికొరకు ధరియించె నీరూపము
దిన దిన వేడుకఁ గదిరి నారసింహుఁడు

చ. 1: బలురక్కసు నొడిసిపట్టి తొడలపైఁ బెట్టి
చెలఁగి కొనగోళ్లఁ జించినాఁడు
చలపట్టి పేగులజంధ్యాలతోడుతను
తెలివై వున్నాఁడు కదిరి నారసింహుఁడు

చ. 2: ఘోరధానవు కంఠకుహర రక్తము ముంచి
సారెకు వసంతముగాఁ జల్లినాఁడు
మారుకొన్నదైత్యుని చర్మ మొలిచి మేనిమీఁద
ధీరతఁ గప్పినాఁడు కదిరి నారసింహుఁడు

చ. 3: అందపులక్ష్మియు బ్రహ్లాదుఁడు నుతింపఁగాను
విందుగా నాగముపాల వెలసినాఁడు
అంది శ్రీవెంకటనాథుఁడై యీడా నాడాను
దిందుపడున్నాఁడు కదిరి నారసింహుఁడు

చి.ఆ.రేకు: 0007-02 సామంతం సం: 10-038

పల్లవి: దవ్వులతెరువు మరేఁటికి తడఁబాటులు మరి యేటిఁకి
యెవ్వరు దలఁచిన నిదియె యీపరముల నొసఁగున్

చ. 1: మన సనియెడు పెనువింటను మాయాలక్ష్యముపైని
పనివడి జ్ఞాన బనియెడి బాణం బేసినను
వెనకటి దుష్కర్మంబులు వేళ్లతోడఁ బెకలిన
తనయకతనె సకలంబును తప్పక కాన నగు

చ. 2: మలయుచు మంత్రార్థం బను మందరగిరిచేతను
చలమున సంసారం బను జలనిధి దచ్చినను
అలవడ హరిభక్తి యనెడి యమృతము వొడమినను
పొలసెటి చావునుఁ బుట్టుగు పొడమక బదుక నగున్

చ. 3: జీవుఁ డనియెడిపాదున చిరకాలంబును మొలచిన
శ్రీవెంకటనాథుండును సిద్ధౌషధతరువు
భావింపఁగఁ దనకృపయను పండూ వండినను
కావలసిన యర్థము దనకైవస మగుఁ గానా

చి.ఆ.రేకు: 0007-03 లలిత సం: 10-039

పల్లవి: తాళపాకన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమె శ్రీహరిఁ గనేవెర వానతిచ్చితివి

చ. 1: గురుఁడవు నీవెసుమ్మీ కుమతి నై ననాకు
సరవి బ్రహ్మోపదేశము సేసితి
పరమబంధుఁడ వైనా పరికింప నీవెసుమ్మీ
వరుస నేఁ జెడకుండ వహించుకొంటివి

చ. 2: తల్లివైన నీవెసుమ్మీ తగిన విషయాలలో
పల్లదానఁ బడకుండా బ్రదికించితి
అల్లుకొని తోడునీడవైనా నీవెసుమ్మీ
చిల్లరమాయలలోనఁ జెడకుండాఁ జేసితి

చ. 3: దాతవు నీవెసుమ్మీ తగు శ్రీవెంకటనాథు
నాతలఁపులో నిలిపి నమ్మఁ జేసితి
యేతలఁ జూచినా నాకు నేడుగడయు నీవె
ఆతల నీతల నన్ను నాడుకొని కాచితి

చి.ఆ.రేకు: 0007-04 ఆహిరినాట సం: 10-040

పల్లవి: ఇందురు నేల దూరేరు హితవే నీవు సేయఁగా
ముందు ముందె తమ్ముఁ గర్మములు సేయు మంటివా

చ. 1: తెలిసి నిన్నుఁ గొలువ దేహ మిచ్చితివి గాక
బలిమినె మాయలలోఁ బడు మంటివా
మలసి నిన్నుఁ దలఁచ మన సిచ్చితివి గాక
కొలగట్టి విషయాలఁ గోరు మంటివా

చ. 2: నగుతా నిన్నుఁ బొగడ నాలు కిచ్చితివి గాక
అగడుగా నూరమాఁట లాడు మంటివా
సొగసి నిన్నుఁ జూడఁగాఁ జూప లిచ్చితివి గాక
వగవగలతో నూరివారిఁ జూడు మంటివా

చ. 3: శ్రీవెంకటనాథ నిన్నుఁ జేరు మ నంటివి గాక
జీవులను మనుజులాఁ జేరు మంటివా
భావించి నీదాసులనె భజించు మంటివి గాక
దావతి లంపటాలలోఁ దడఁబడు మంటివా

చి.ఆ.రేకు: 0007-05 నాట సం: 10-041

పల్లవి: ఎన్నిచేఁత లెన్నిగుణా లెన్నిభావాలు
యిన్నేసి నీమహిమ లివి నీకె తెలుసు

చ. 1: యేమిలీలలు నటించే వేమయ్యా దేవుఁడా
భూమిలో జీవుల నెల్లఁ బుట్టించుచు
ప్రేమతో నాటలాడేపిన్న వాఁడవూఁ గావు
నీమహిమ లిన్నయూ నీకె తెలుసు

చ. 2: యెంతని పరఁదుకొనే విందిరానాథుఁడా
అంతరంగములనుండె అందరిలోన
వింతలు లేవు నీకు వెట్టివాఁడవూఁ గావు
యింతేసి విచారాలు యివి నీకె తెలుసు

చ. 3: చెలఁగి వరాలిచ్చేవు శ్రీవెంకటనాథుఁడా
తలఁకక నిన్నుఁ గొల్చే దాసులకు
అలరి నీవై తేను ఆశకుండవూఁ గావు
నెలవైన నీసుద్దులు నీకె తెలుసు

చి.ఆ.రేకు: 0007-06 రామక్రియ సం: 10-042

పల్లవి: మాయలో మునుఁగ నేల మమత లేల
చేయరా దేవుఁ డీపాటి సేయ నోపఁడా

చ. 1: అట్టె దేహసమ్మంధ మాసపడేజీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుకరాదా
నెట్టన సర్వాంతరాత్మై నిలుచున్న దేవుఁడిట్టె
చుట్టాలపక్కాలపాటి శుభ మియ్య నోపఁడా

చ. 2: మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
వేసరక విష్ణుభక్తి వెదకరాదా
రాసి కెక్క యిందరిని రక్షించేదేవుఁడె
కాసువీసములపాటి కావ నోపఁడా

చ. 3: వెలయ రాజులను దీవించే ప్రాణులాల
కల శ్రీవెంకటనాథుఁ గానఁగ రాదా
వలె నని యిందరికి వరాలిచ్చే దేవుఁ డేమి
కొలువునిలువుపాటిగుణ మియ్య నోపఁడా

చి.ఆ.రేకు: 0008-01 దేసాళం సం: 10-043

పల్లవి: వట్టి విచారములేల వగపులేల
నెట్టన శ్రీహరిఁ జేర నేరవలెఁగాక

చ. 1: కాల మేమి సేసీని కర్మ మేమి సేసీని
యేలిన శ్రీరమణుఁడె యెదనుండఁగా
ఆలించిన ధ్రువునిని అజామిళునిని
కాల మేమిసేసె నయ్య కర్మ మేమిసేసెను

చ. 2: పాప మేమి సేసీని పగ యేమి వేసీని
కాపాడె దేవుఁడె దగ్గరనుండఁగా
యేపున ఘంటాకర్ణుని యెలమిఁ బ్రహ్లాదుని
పాప మేమి సేసెనయ్య పగయేమి సేసెను

చ. 3: కుల మేమి సేసీని గుణ మేమి సేసీని
నలువైన శ్రీవెంకటనాథుఁ డుండఁగా
ఆలరి వాల్మీకికి అలనాఁ డహల్యకు
కుల మేమి సేసెనయ్య గుణ మేమిసేసెను

చి.ఆ.రేకు: 0008-02 లలిత సం: 10-044

పల్లవి: అందరు వికార మందుదురె
నిందలేని నీవు నీదాసులుదక్క

చ. 1: సతుల సుతులఁ జూచి జగములోవారెల్లా
మతిలోన భ్రమయక మానరు
రతికెక్కఁగా హేయరాగరహితుఁడవై
సతతము గలిగినస్వామివి నీవు దక్క

చ. 2: ధనధాన్యములుచూచి తగినజీవులు వాని
వెనువెంటఁ దిరుగక విడువరు
పనివూని యాశాపాశ దూరుఁడవై
ఘనతగలుగు శ్రీకాంతుఁడ నీవుదక్క

చ. 3: యిల్లుముంగిలిచూచి యీదేహులు వాని
నొల్ల మనుచురోసి వుడుగరు
వెల్లవిరిగ శ్రీవెంకటనాథుఁడవై
తెల్లమైనయట్టి దేవుఁడవుదక్క

చి.ఆ.రేకు: 0008-03 సాళంగనాట సం: 10-045

పల్లవి: ఎటులఁబుట్టించితో నీవెరుఁగుదువు
ఘటన నన్నియు నీసంకల్ప మేలయ్యా

చ. 1: చచ్చేవారిఁజూచి చావుకు వెరతుగాఁన
రొచ్చులసంసారముప రోతుఁగాని
కచ్చుపెట్టి ఆదియె కాలాఁజేతాఁబెనఁగఁగ
మచ్చికసేయుదుఁగాని మానలేనయ్యా

చ. 2: బడలేవారిఁ జూచి బడల నోపఁగాన
విడువనిసంపదపై విసిగేఁగాని
పెడవాయ కదియె పెరుగుచురాఁగాను
బడిఁ దిరుగుదుఁగాని పాయలేనయ్యా

చ. 3: ములిగేవారిఁ జూచి ములుగ నోడుదుఁగాన
శిలుగుఁగోరికలఁ గోసితిఁ గాని
కలిమితో శ్రీవెంకటనాథ నీభక్తి
వెలయఁ గోరుదుఁగాని విడువలేనయ్యా

చి.ఆ.రేకు: 0008-04 రామక్రియ సం: 10-046

పల్లవి: నీవుగలిగినఁ జాలు నిక్కము అన్నీఁ గలవు
ఆవల మాయాచార్యుఁ డానతిచ్చెనయ్యా

చ. 1: యేలోకముననున్న యెడయనిసొమ్ము నీవె
తాలిమి యెందుఁ బోనిధనము నీవె
కాలముకడాతరగని ధాన్యము నీవని
ఆలించి మాగురుఁ డిట్టె ఆనతిచ్చెనయ్యా

చ. 2: యెందెందుం దిరిగిన యేలికవు నీవె
నిందలేనియట్టి తోడునీడవు నీవె
ముందువెనకల నిల్లు ముంగిలియు నీవె యని
అందముగ దేశికుఁడె ఆనతిచ్చెనయ్యా

చ. 3: యెన్నఁడుఁ గలఁగనట్టి హితుఁడవు నీవె
పన్నినట్టెవుండె నిచ్చపంటా నీవె
నన్నుఁ గాచే శ్రీవెంకటనాథుఁడ వని తాళ్లపా
కన్నమయ్యంగారె నాకు నానతిచ్చిరయ్యా

చి.ఆ.రేకు: 0008-05 లలిత సం: 10-047

పల్లవి: జగదీశ్వరుని లీలాచక్రములోపలనుండి
మగుడ దాసుఁడుగాక మాయ దాఁట వసమా

చ. 1: తనువు నాదెయనఁగ తనకు స్వతంత్రమేది
తనువులో తాను హరి తను వెకాన
మనసులో యీసుద్ది మరినమ్మితేఁ జాలు
వెనకముందరలకు విచారమేలేదు

చ. 2: సొమ్ములు నావియనఁగ సోధించఁ దానెవ్వఁడు
సొమ్ములునుఁ దాను హరిసొమ్ము లెకాన
సమ్మతి నీతలఁపె సహజమై కలిగితే
నెమ్మదిఁ దా నిన్నిటా నిశ్చింతుఁడౌను

చ. 3: బంటులు నావారనఁగఁ బరికించ నెవ్వఁడు
బంటులును దాను హరిబంట్లెకాన
నంటున శ్రీవెంకటనాథునిఁ గొలిచితేను
కంటకములెల్లాఁ బాసి ఘనుఁడె తానౌను

చి.ఆ.రేకు: 0008-06 శుద్ధవసంతం సం: 10-048

పల్లవి: మేలేమి కీడేమి మించిన నీరూపమె
వాలాయించి తెలిసినవానికి

చ. 1: యినుమేమి పసిఁడేమి యెంచిచూచితె
మనసు దెలిసిన నిర్మలునికి
ఘనమేమి కిరుదేమి కలవెల్లా నీ
తనువుగఁ దెలిసిన తత్వజ్ఞునికి

చ. 2: పగయేమి చెలిమేమి పలుమారు నిన్ను
పొగడుచునుండెటి పుణ్యునికి
వగుపేమి వేడుకేమి వరుసతో నిన్ను
వెగటులేక కొలిచే వివేకికి

చ. 3: చేరువేమి దవ్వేమి శ్రీవెంకటనాథ నిన్ను
కూరిమిఁ గొలిచిన సద్గుణునికి
బారమేమి పాటేమి పరమాత్మా నిన్ను
సారమతిఁ దెలిసిన సర్వజ్ఞునికిని

ఛి.ఆ.రేకు: 0009-01 లలిత సం: 10-049

పల్లవి: ఏలికయైన హరి నేల మరవఁగవలె
పాలుమాలి మరియాల భంగపడవలెను

చ. 1: యిరుకుమానిసంది నేఁటికిఁ జొరవలె
తిరుగలేక యేల తినుకవలె
యెరవులవిషయాల నేల పొరలవలె
కొరగాని పాపాలగొడ వేలవలెను

చ. 2: మిగుల పురులలోన మెడ యాల పెట్టవలె
తగిలించుకొని యేల పొగులవలె
యెగసక్కెపుఁగోరిక లేల కోరవలె
జిగురువంటిబందాలఁ జిక్క నేలవలెను

చ. 3: పారేబండికింద పాద మేల చాఁచవలె
జారుపడి మరియాల జడియవలె
మీరి శ్రీవెంకటనాథు మిక్కిలివేడుకఁ గొల్చి
పోరుమాలివుండ కేల పొడిఁబడవలెను

చి.ఆ.రేకు: 0009-02 పాడి సం: 10-050

పల్లవి: తానేడ వారేడ తనువేడ మరి తక్కినవెల్లానేడ
మానలే ననుచు తరితీపు సేసే మన సేడ నుండునో

చ. 1: కందువమానిపై నోరూరించెటికాయలుఁ బండ్లుపక్వముదప్పిన
అందముగ మున్ను గోరినట్టివారి యాసలెందుండునో
పొందున వలచి పులకించినట్టిపురుషులు సతులట్టెముదిసితె
ముందర వెనక నెరఁగనియ్యనిమోహ మెందుండునో

చ. 2: కొత్తమెరుఁగులచేత భ్రమయించే కోకలు చివిరె పాఁతగిలితె
బత్తితోఁ గావలె నని కొన్నవారిభ్రమ లెందుండునో
రిత్తజవ్వనాన కొప్పుగోళ్ల దిద్ది రీతిగానుండెటి సింగారంబులు
పత్తివలెనై బట్టగట్టఁదనభావ మెందుండునో

చ. 3: తావితో బుగులుకొనెటివుూవులు దాఁపఁగ నవియె వాడినపిమ్మట
భావించి చూచితే నందలి తొల్లిటిపస యెందుండునో
శ్రీవెంకటనాథుఁ డిట్టె యేలెఁగాకచెల్లఁ బోతాఁదొల్లి భోగించినవెల్ల
వేవేగ మరునాఁ డవియె చూడ నేవిధమైయుండునో

చి.ఆ.రేకు: 0009-03 మాళవిగౌళ సం: 10-051

పల్లవి: శ్రీపతిపురనాయకా జయచింతితాభీష్టదాయకా

చ. 1: వున్నతోన్నతవిగ్రహ దాసోపరిస్థానుగ్రహా
నన్ను తామరగసుగ్రహా సామవదపరిగ్రహా

చ. 2: జానకీప్రియకారకా శివసాధితాఖిలతారకా
మానుషాహితమారకా మామకాఘనివారకా

చ. 3: శ్రీవెంకటనాథరూపకా సంచితరఘుకులదీపకా
భావసంతోషప్రాపకా అభంగమంజులచాపకా

చి.ఆ.రేకు: 0009-04 దేసాళం సం: 10-052

పల్లవి: ఎట్టిహితోపదేశకుఁ డెటువంటిదయాళువు
అట్టె తాళ్లపాకన్నమాచార్యులు

చ. 1: పచ్చితామసుల మమ్ముఁ బరమసాత్వికులఁగా
యిచ్చటనె సేసినాఁడు యెంతచిత్తము
యిచ్చగించి మాకులాన నెన్నఁడులేనివైష్ణవ
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు

చ. 2: ముదిరిన పాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁ జేసె నెంతసోద్యము
కదిసి యేజన్మానఁ గాననిసంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుడు

చ. 3: గడుసుఁదనపు మమ్ముఁ గడు వివేకులఁ జేసి
యిడుమలెల్లాఁ బాప నేమరుదు
నడుమనె యెన్నఁడుఁ గానని శ్రీవెంకటనాథు
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు

చి.ఆ.రేకు: 0009-05 సామంతం సం: 10-053

పల్లవి: తోఁటకూరదొంగలాల తొయ్యలులాల
నాఁటకపు మీమోహము నమ్మ నెట్టువచ్చును

చ. 1: పాపపుణ్యపు టోఁదాలపాలు సేసి జీవులను
చూపలనె భ్రమయించే సుద్దులు మీవి
దాపుదండై శ్రీవిభుఁడు తానె కాచెఁగాక
యేపున రిత్తవారి మీ రెంతంత సేయరు

చ. 2: కీడు మే లనె వురులఁ గీలించి మనుజులఁ
బాడితోనె యెంచెటిభావము మీది
యీడేరించి నాగురుఁడు యిందిరేశుఁ జూపెఁగాక
యీడనె రుత్తవారి మీ రెంతంతసేయరు

చ. 3: చావుఁ బుట్టుగు లనెటి సముద్రాలఁ బడఁదోసి
జీవులను విసిగించేచిత్తము మీకు
శ్రీవెంకటనాథుఁడె చేపట్టి మమ్మేలెఁగాక
వేవేగనఁ బేదలచే వెట్టి యెంతగొనరు

చి.ఆ.రేకు: 0009-06 మాళవి సం: 10-054

పల్లవి: నూరవద్దు తాగవద్దు నోరు చేఁదుగావద్దు
చేరువ నొకచోట సంజీవి వున్న దిదివో

చ. 1: పాలమెల్లాఁ దిరిగాడి పాడిఁబడనెవద్దు
తలఁకక గడ్డపారఁ దవ్వవద్దు
వలవని వాఁగుల వంకల వెదకవద్దు
చెలఁగి వొకచోటసంజీవి వున్న దిదివో

చ. 2: మొక్కలానఁ జెరువులో మునిఁగి చూడవద్దు
నిక్కిన పుట్టలమీఁద నెమకవద్దు
వెక్కసానఁ జేతిపైఁడి వెలవెట్టి కొనవద్దు
చిక్కులెల్లా బాపెటిసంజీవి వున్న దిదివో

చ. 3: దీవులను నోడలెక్కి తిరుగాడనేవద్దు
సోవల బిలములోనఁ జొరవద్దు
కావించి గ్రహణాదికాలము వెదకవద్దు
శ్రీవెంకటనాథుడైసంజీవి వున్న దిదివో

చి.ఆ.రేకు: 0010-01 దేసాళం సం: 10-055

పల్లవి: ఎఱుక గలిగితేను యీతఁడె దిక్కు
మఱి నిమిష మీతని మానివుండఁదగునా

చ. 1: యెవ్వరిసొమ్ముగుడిచి యెవ్వరిగుఱ్ఱాలవెంట
కొవ్వుదీరఁ బారాడి కొలిచేది
యివ్వలఁ బుట్టించి పెంచి యేలిన దేవుఁ డుండఁగా
అవ్వ లివ్వలివారిని ఆసపడఁ దగునా

చ. 2: తా నెవ్వరికి బుట్టి తలఁకక వూరివారి
నానందాన అయ్య లమ్మ లనుకొనేది
పానిపట్టి సర్వవిధబంధుఁడు విష్ణుఁడుండఁగా
మానిసిచుట్టరికాలు మరుగగ జెల్లునా

చ. 3: యెందువంకనో యీదేహి యేమిటినో పొగడుచు
విందువలె నెవ్వరిని వెట్టిఁజేసేది
కందువైన శ్రీవెంకటనాథుఁడు గావఁగా
సందుసుడి కోరికల సటఁ బడఁ జెల్లునా

చి.ఆ.రేకు: 0010-02 నాట సం: 10-056

పల్లవి: ఇందరి జూచి చూచి యెఱఁగవద్దా
బందెపసులకు మెడ పన్నించ నేలా

చ. 1: యినుమునఁ జేసిరా యెవ్వరిదేహమైనా
పొనిఁగి పోతేఁబోవు పోకుంటే మాను
పనివడి యిందుకుఁగా బాటువడ నేమిటికి
మొనసి దొసపంటికి యినుప కట్టేలా

చ. 2: మంచి రాతఁ జేసిరా మనుజునిమే నేమి
నించి చెడితేఁ జెడు నిల్చితే నిల్చు
పొంచి పొంచి యిందుకుఁగా పొడిఁబడ నేఁటికి
పంచ నీరుబుగ్గ రాతిబరణిఁ బెట్ట నేలా

చ. 3: చేఁగమానఁ జేసిరా చెల్లఁబో నరుల నెల్లా
యీఁగి కుంగితేఁగుంగు హెచ్చితే హెచ్చు
నాఁగువార శ్రీవెంకటనాథుఁడు మన్నించఁగాను
దాఁగి జీలుగుబెండుకు తరమువెట్ట నేలా

చి.ఆ.రేకు: 0010-03 భూపాళం సం: 10-057

పల్లవి: గోవిందా మేల్కొనవయ్యా
కావించి భోగము కడమా నీకు

చ. 1: కమలజ చల్లనికాఁగిటఁ దగిలి
సమరతి బాయఁగఁ జాలవూ
కమలభవాదులు కడు నుతియింపఁగ
విమలపుశయనము విడువగ లేవు

చ. 2: భూసతితోడుత పొందులు మరిగి
వేసర విదె నీవేడుకలా
వాసవముఖ్యులు వాకిట నుండఁగ
పాసి వుండ నని పవళించేవూ

చ. 3: నీళామనసిజలీలలఁ దగిలి
నాలితోడ మానఁగ లేవూ
వేళాయను శ్రీవెంకటనాథుఁడ
పాలించి దాసుల బ్రతికించఁగనూ

చి.ఆ.రేకు: 0010-04 లలిత సం: 10-058

పల్లవి: సకలపురాణములు చాటి నినుఁ బొగడఁగా
తకమకలుగా నల్పార్థము చెప్పఁదగునా

చ. 1: నిను నిర్గుణు డనేటి నీచజాతులయందు
యెనయు దుర్గుణము దా నెంతో
కనకంబు నిను మనుచు కారునాయంబులను
యెనలేనిదుర్వాదుల నేమనఁగఁగలము

చ. 2: నీవె తా మనుకొనేటి నిందితాత్ములు దాము
కావించుద్రోహంబు కడమా
దావతులఁ దనుఁగన్నతల్లి గొడ్డనిపల్కు
దేవతానిందకులఁ దెలుపంగ వశమా

చ. 3: అమరుసర్గము మిథ్య యనుశూన్యభాషులకు
తమితోడ భ్రమ యేల తరగు
తమగురువు శాస్త్రంబు తామె కల్లనఁ గాను
క్రమబుద్ధి శ్రీవెంకటనాథ యిత్తువా

చి.ఆ.రేకు: 0010-05 దేవగాంధారి సం: 10-059

పల్లవి: నిమిష మెడతెగక హరి నిన్ను దలచి
మమత నీమీఁదనే మరిపి బదుకుట గాక

చ. 1: నిదురచేఁ గొన్నాళ్లు నేరములఁ గొన్నాళ్లు
ముదిమిచేఁ గొన్నాళ్లు మోసపోయి
కదిసి కోరినను గతకాలంబు వచ్చునె
మది మదినె వుండి యేమరక బదుకుట గాక

చ. 2: కడుఁ దనయులకు గొంత కాంతలకు నొకకొంత
వెడలయాసలకుఁ గొంత వెట్టిసేసి
అడరి కావలె ననిన నందు సుఖ మున్నదా
చెడక నీసేవలే సేసి బదుకుట గాక

చ. 3: ధనమువెంటాఁ దగిలి ధాన్యంబునకు దగిలి
తనవారిఁ దగిలి కాతరుఁ డైనను
కనుకలిగి శ్రీవెంకటనాథ కాతువె
కొనసాగి నిన్ననే కొలిచి బదుకుట గాక

చి.ఆ.రేకు: 0010-06 వరాళి సం: 10-060

పల్లవి: గాడిదెపిల్ల కోమలికమె కలిగినది
వేడుక పడు సంసారమె విసిగించు వెనక

చ. 1: అగపడు సంపదమీదట నాసలు కడుఁ బుట్టు
వగ నది భరియింప వసమె కాదయ్య
మొగమె చూడఁగ నాపై ముదమునఁ గనుపట్టు
పొగులఁగ గరచెటికాట్లు పులికంటె బెట్టు

చ. 2: విడువని భోగంబులపై వేడుక కడుఁ బుట్టు
తడఁబడులంపట మైతే తలఁచనె రాదయ్య
తొడి మెను మాగినపండైతే తోఁచుఁ జూచినను
వడియఁబడి గొడ్డంటికి వసమె కాదెవుడు

చ. 3: మోవఁగ విషయంబులపై మోహము కడుఁ బుట్టు
శ్రీవెంకటనాథా అది చెప్పఁగ రాదయ్య
ఆవలఁజూడఁగఁ జల్లనై వుండుఁ గాని
తేవలఁ గూఁకటవేళ్లు తెగఁ బారును మిగులా

చి.శృం.రేకు: 01-1 వరాళి సం: 10-1

పల్లవి: ఎట్టకేల కిదేలరా యెన్నఁడులే నలవాటు
చిట్టకాల కిన్నా ళ్లిట్టె సేయవత్తువా

చ. 1: దవ్వుల నాటఁ జూచేవు దగ్గరి మాఁటలాడేవు
యెవ్వతైనా మతకాన కీడ కంపెనో
యివ్వల నిన్నాళ్లు మనమిద్దరము నొక్కవూరె
నవ్వులు మాతో నిట్టె నవ్వవత్తునా

చ. 2: వొరసేవు రమ్మనేవు వోరి ముచ్చట లాడేవు
గరిమ రేతిరి కలగంటివా నీవు
యిరవుగ నేను నీవూ నిద్దరము నొక్కవూరె
నెరతనా లిట్లానె నెరపుదునా

చ. 3: యిక్కువ నాతోఁజెప్పేవు యిప్పుడిట్టె రమ్మనేవు
యెక్కువ నామనసు నీవెఱుఁగుదువా
చక్క శ్రీవెంకటనాథ సరవి నన్నుఁ గూడితి
మక్కువ వెనక కిట్టె మన్నింతువా

చి.శృం.రేకు: 01-2 మధ్యమావతి సం: 10-2

పల్లవి: విన్నవించవే వోరమణి విభునికి వింత లింకనేలె
వున్నతిఁ దన్ను నే నేమైన నంటినా వోరుచుకొమ్మనవే

చ. 1: చెలులలో నన్నె చేపట్టినవాఁ డలుగనేఁ టికినే
వలచి తానాకు నిచ్చినబాసలు వాకిటనె పోయనా
తలఁచి తలఁచి తాపాన నే నిట్టె తలఁకుచు నుండఁగా
కలయఁ దా రాక యెడమాఁటలనె కాఁకరేఁచ నేలె

చ. 2: యెప్పుడు నావద్దఁ బాయనివాడు నేఁ డేమిటికిఁ బోయనే
తప్పెనో నామీఁది మోహము తనకు తామసించ నేలె
ముప్పిరిగొన్నట్టి జవ్వనము నే మోవలేకవుండఁగా
యిప్పుడెవిచ్చేసి నన్నుఁ గలయక యేమిటికున్నాఁడె

చ. 3: యెక్కుడుమాఁట దన్నాడని నాతోడనేఁటికిఁ గోపించెనే
వొక్కటై నే నెంతమీరి నవ్వినా నూరకుండేవాఁడు
చక్కని శ్రీవెంకటనాథుఁడు నన్ను సరవితోఁ గూడెనే
మక్కువ న న్నింక దిగవిడువక మన్నించు మనవె

చి.శృం.రేకు: 01-3 సామంతం సం: 10-3

పల్లవి: అవునె లెస్సతగవులాయనె నేఁడు
తివిరి నీకింత నాతో దీకొనఁగవలెనా

చ. 1: మాఁటల దేలించనేర్చుమగువా నీకు నిప్పుడు
యేఁటికె నా విభునితో నేకాంతము
వాఁటమై నాపతిపొందు వద్దన్నా మానవు
గాఁటాన నీకింతయేలె గామిడితనాలు

చ. 2: కూరిమిపుట్టించనేర్చుకోమలి యేఁటికే నీకు
చేరి నారమణునితోఁ జేసన్నలు
సారెకు నామగనితో సరసాలు మానవు
కారణములేని దేలె గయ్యాళితనాలు

చ. 3: కలసి మెప్పించనేర్చుకామిని యేఁటికె నీకు
నెలవై నాకాంతునితో నెయ్యములు
యిల శ్రీవెంకటనాథుఁ డిద్దరి మన్నించికూడె
మలసి మనలో నిఁక మచ్చరా లేమిటికె

 చి.శృం.రేకు: 01-4 పాడి సం: 10-4

పల్లవి: మానరా నారో నింక మరఁగులు
పోనీనెంతైనా నిన్ను బొంకకు నాతోను

చ. 1: గుఱుతైన యాకెమేనికుంకుమపరిమళము
మెఱయ నేఁటికిరా నీమేనియందును
మెఱుఁగు నీమేనిమీఁద మించిని కెంపేలవచ్చె
పొఱపొచ్చముల నీవు బొంకకు నాతోను

చ. 2: లలనపాదాననున్న లత్తుక నీనొసలను
కలుగ నేమిటికి వేగనచెప్పరా
కలికిపుక్కిటనున్న కప్పురపుఁ దమ్ములము
పొలుపై నీకేలవచ్చె బొంకకు నాతోను

చ. 3: పడఁతి నీమేన నిట్టె బాగుగానించినయట్టి
జడిగొన్న కొనగోళ్లజాడ లేడవి
కడఁగి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
పొడవైనచెలిసుద్ది బొంకకు నాతోను

 చి.శృం.రేకు: 01-5 పాడి సం: 10-5

పల్లవి: మేలురా యీనీగుణము మెచ్చవచ్చును
పోలించ నీచేఁత పూఁట పూఁట కొత్తేకాదా

చ. 1: దిట్టయై యెవ్వతెయైనాఁ దిట్టినా నవ్వేటి నీవు
యెట్టు నేఁ బొగడినాను యీరసించేవు
యిట్టె వలపించేవా రేమ్మనినా జెల్లుఁగాక
నెట్టన నేనూరకున్నా నీకు నెగ్గేకాదా

చ. 2: తొయ్యలి యెవ్వతెయైనాఁ దోకినా నవ్వేటి నీవు
యియ్యెడ నేమొక్కినాను యేవగించేవు
నెయ్యపువారిచేఁతలె నీకు నితవౌఁగాక
చయ్యన నామోహమైన చప్పనెకాదా

చ. 3: వొదుగ కెవ్వతె గైకోకుండినా నవ్వేటి నీవు
యెదురుకొన్నా నామో మిటుచూడవు
యిదె శ్రీవెంకటనాథ యిట్టె నన్నుఁగూడి నా
మదిలోఁ బాయవైతివి మంచిదెకాదా

చి.శృం.రేకు: 02-1 పాడి సం: 10-6

పల్లవి: ఒద్దన్న జలము సేసీ నోయమ్మ వీఁడు తన
వుద్దండా లెంతైనా మానఁ డోయమ్మ వీఁడు

చ. 1: యేపుమీరి నాతోడ నెగసక్కే లాడీని
వో పో పొమ్మన్న మానఁ డోయమ్మ వీఁడు
పై పై నన్నుఁ జెనకి బలిమి సేయవచ్చీనే
నోపనన్నాఁ గొంగువట్టీ నోయమ్మ వీఁడు

చ. 2: సారెకుఁ బేరఁ బిలిచి సన్నలు సేయవచ్చీని
వూరకపోయెటి నన్ను నోయమ్మ వీఁడు
నేరుపరి నంటానె నిండువావి సేసుకొనీ
నోరిచిన నెరఁగఁడు వోయమ్మ వీఁడు

చ. 3: యేలుకొన్నవానివలె నెవ్వరుంటా నెరఁగఁడు
వోలవేయవచ్చీ నాపై నొయమ్మ వీఁడు
నాలికాఁడు శ్రీవెంకటనాథుఁడు నన్ను విట్టె
వోలివెట్టెకె కూడె నోయమ్మ వీఁడు.

చి.శృం.రేకు: 02-2 శంకరాభరణం సం: 10-7

పల్లవి: చాలుఁ జాలు నే నెరంగనా నాఁడు నాఁడె
ఆలరి నీసుద్దు లెల్ల నన్నిఁ గంటిని

చ. 1: సారె సారె నన్ను నేల పిలిచేవు
యేరా నీ వలపు నే నెరఁగనిదా
వూరకె యింకా నేలరా మాఁటలనె
దూరేవు నీసుద్దు లెల్ల తొల్లె కంటిమి

చ. 2: సన్నలు సేసే సేమిరా యెరఁగనా
చిన్ననాఁడె నీ చేఁత లెల్లాను
చన్నులుముట్టే వేమిరా నాలికాఁడ
వున్నతి నీసుద్దు లెల్లా నిన్ననె కంటిమి

చ. 3: దగ్గరి చేయి వట్టేవురా యెప్పుడును
నిగ్గుల నీ చల మెల్లా నే నెరఁగనా
అగ్గమై శ్రీవెంకటనాథ కడపలో
దగ్గరి నన్నుఁ గూడగా తలఁ పెల్లాఁ గంటిమి

చి.శృం.రేకు: 02-3 శ్రీరాగం సం: 10-8

పల్లవి: ఇంతిచక్కఁదన మిఁక నేమని కొనాడుదమ
చెంత నాతఁడును నీపె చేతలకె భ్రమసె

చ. 1: మొలక నవ్వుల చెలిమోము చూచి విభుఁడు
తొలఁకువెన్నెలల చందురుఁ డని భ్రమసె
మలయు జంకెనల బొమ్మలుచూచి రమణుఁడు
వెలయఁగ మదనుని విండ్లని భ్రమసె

చ. 2: సొగసిన చెలి చూపు చూడ జూచి ప్రియుఁడు
పగతో మరుఁ డేసిన బాణ మని భ్రమసె
మగువ యాడినయట్టి మాఁట విని నాయకుఁడు
పగటునఁ గోవిలపలు కని భ్రమసె

చ. 3: కరఁగించి చెలి దన్ను కాఁగిలించిననుఁ బతి
తిరమైయున్న మెరుఁగుఁ దీగె యని భ్రమసె
గరిమతోడుత శ్రీవెంటనాథుడు కాంత
వరుసఁ గూడఁగ పరవశమున భ్రమసె

చి.శృం.రేకు: 02-4 హిజ్జిజీ సం: 10-9

పల్లవి: నీ వేమి సేతువు నానేరమోయమ్మా
చేవ నీయిచ్చు రాజ్యము సేయవోయమ్మా

చ. 1: వలపించి రమణుని వాకిలి వెళ్లనీవు
కలికిచేఁతలనె కదవమ్మా
చలమున నావిభుని జంకించి నాఁడు నాఁడె
నెలవై నే నింతేసి నేరనైతినమ్మా

చ. 2: నయమున నాపతిని నాయింటికిరాకుండా
బయకారించితివిగా పదవమ్మా
పయిపడి యతనిచే బాసలెల్లఁ జేయించుక
జయముతోడుత నుండఁజాలనై తినమ్మా

చ. 3: నటలకు నామగని జంటవాయక న న్నిట్టె
అటమటించితివిగా అవునమ్మా
నటనతో శ్రీవెంకటనాథుడు మ నిద్దరిని
యిటులనె సరిగా నేలెనోయమ్మా

చి.శృం.రేకు: 02-5 పాడి సం: 10-010

పల్లవి: ఎంత సేసినాను ని న్నేమనేనురా
వింతదాననా యలిగి వెరపుచూపను

చ. 1: యేడనై నా నిలిచి నీ వెవ్వతెతో నైన మాఁట
లాడుకొన్న నిన్ను నే నద్దలింతునా
యీడనుండె నన్ను నీ వెవ్వతెపేరఁ బిలిచినాను
కోడెకాఁడ నిన్ను నిట్టె కోపగింతునా

చ. 2: కలికివైన నిన్ను నేకాంతయింటఁ జూచినాను
చలము సాధించి నిన్ను సాధింతునా
సొలసి నీమేన నెవ్వతె సొమ్ముపెట్టు కుండినాను
కులుకుమాఁటలను నిన్ను గుంపింతునా

చ. 3: వన్నెకాఁడ యేరమణి వాకిలిగాచున్నా నిన్ను
సన్న సేసి సారె సారె జంకింతునా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవెకూడి నేఁడు
కన్నెనైన నామనంబు కఁరఁగ జేసితి

చి.శృం.రేకు: 02-6 ఆహిరి సం: 10-011

పల్లవి: ఇంతలోసందుకొనే వేమీ నీవు
యెంతసేతువో నీతో నీతో నిట్టె పొందుసేసిన

చ. 1: తేలగిలఁ జూచితేనె తెలిసె నీమన సంటా
తాలిమితోడుత నన్ను దగ్గరేవు
పోలికగా నామేను పులకించినంతలోనె
ఆలిఁ జూచినట్టె చూచే వవునయ్య నీవు

చ. 2: అలవోకగా నీపే రడిగినయంతలోనె
చెలరేఁగి నీవావి చెప్పేవూ
జలకపుఁ జెమటలు సారె నామైఁ బొడమితె
వలపుచల్లి చొక్కించవచ్చేవు నీవూ

చ. 3: సవరనివాఁడ వంటా జాణతన మాడితేనె
రవళిఁ జెయిముట్టి సరస మాడేవు
నవకపు శ్రీవెంకటనాథ కాఁగిలించితేనె
కవకవనవ్వి రతిఁ గలసితి నీవూ.

చి.శృం.రేకు: 03-1 ముఖారి సం: 10-012

పల్లవి: ఇన్నియు నేమి సేయునె యింపు లిన్నియునుఁగూడి
కన్నెపాయానెనె నన్నుఁ గలికి జేయఁగను

చ. 1: మన సేమి సేయునె మచ్చిక యీవలపులు
కొనసాగి లోలోనె గుబ్బతిలఁగా
తను వేమి సేయునె తతిగొన్న తమకము
వెనుకొని పోనీక వీరిడిఁ జేయఁగను

చ. 2: చూపు లేమి సేయునే సుడిగొన్న జవ్వనము
పై పైఁ దీపు లెక్కించి భ్రమయించఁగా
కోప మేమి సేయునె గురియై యీ విరహము
ఆపసోపాలె రేఁచి అలయించఁగాను

చ. 3: పులక లేమి సేయునె పొదియై పతికాఁగిలి
కళలలోని మర్మాలు గలఁచఁగాను
చెలువ మేమి సేయునె శ్రీవెంకటనాథుఁడు
సొలపులరతిఁ గూడి చొక్కించఁగాను

చి.శృం.రేకు: 03-2 కేదారగౌళ సం: 10-013

పల్లవి: వలపించనేరుతువు వడి నేఁచనేరుతువు
సిలుగు కోప నీవు నేసినట్టె సేయరా

చ. 1: ప్రియముతోడుత నన్నుఁ బిలిచేవు యీ
నయమె యీడేర నడపేవా
బయకారించే నీచే బడలితిని నీ
చెయి మీఁ దింతె నీవు సేసినట్టె సేయరా

చ. 2: దగ్గరి నాతో మంచితన మాడేవు యీ
నిగ్గుల నీమే లిట్టె నిలిపేవా
వెగ్గళించే నీచేత విసిగితిని నాకు
సెగ్గెము గాదు నీవు సేసినట్టె సేయరా

చ. 3: కలసితి నన్ను శ్రీవెంకటనాథుడా నీ
తలఁపులో దయ నాపైఁ దప్పేనా
యెలయింపు నీచేత నింతైతిని నాపై
చెలిమిగలవు నీవు సేసినట్టె సేయరా

చి.శృం.రేకు: 03-3 కేదారగౌళ సం: 10-014

పల్లవి: చాలు నాతో నింతేసి జంపు లేలా
ఆలరి నీచేఁత లెవ్వరితోనైనఁ జేయరా

చ. 1: రాకాఁ బోకాఁ నాతో నింతేసి రంతు లేలా
నీకు నీకె చుట్టరికములు నెరపేవు
నాకు నీకు నేమి వోదు నన్ను నవ్వుతానె
యేకమైన మాఁటలనె నన్ను యెలయించేవు

చ. 2: సారె సారె నాతో నింతేసి సట లేలా
వూరకె నీవాపులు దెలిసి వొరసేవు
తారుకాణమాఁటల నిక్కువ దాఁక నాడి
మేరమీరి యాసలు వెట్టుతా మేకొనేవూ

చ. 3: మెచ్చి మెచ్చి నాతో నింతేసి మేకు లేలా
యిచ్చకము సేసి సేసి నన్ను యేలఁ జూచేవు
విచ్చలవిడిఁ గూడితి నన్ను శ్రీవెంకటనాథ
పచ్చిదేర నన్ను నింకా నొడఁబరచేవూ.

 చి.శృం.రేకు: 03-4 హిజ్జిజి సం: 10-015

పల్లవి: ఎటువంటివాఁడె యీతఁడు
యిటువలె దగ్గరీ నీతఁడు

చ. 1: తలయెత్తి చూచితే తనుఁ జూచితి నంటా
యెలయించవచ్చీ నీతఁడు
చెలులతోడ నేఁ జేసన్న సేసితే
యెలమి దగ్గరవచ్చీ నీతఁడు

చ. 2: యింతిఁ బిలిచితే యెరపరికము లేక
యింతలోఁ బలికీ నీతఁడు
చెంత నాసకొప్పై జెయివేయఁబోతే
యెంత కెంత చెయ్యొగ్గీ నీతఁడు

చ. 3: యెదుటనున్నసతితో నేకతము లాడఁబోతే
యిదివో కాఁగిలించీ నీతఁడు
కదిసి యిప్పుడు శ్రీవెంకటనాథుఁడు నా
యెదలోనె పాయకున్నాఁ డీతఁడు

చి.శృం.రేకు: 03-5 కేదారగౌళ సం: 10-016

పల్లవి: పడఁతి నీయాసనె బతి కున్నది
యెడయక నీవింక నెట్టయినాఁ జేయుమీ

చ. 1: గుబ్బలమీఁద జెలి కొంగు వేయదు
నిబ్బరపుమోహమున నిన్నుఁ దలచి
గబ్బియైన మరునిచే కాఁకలు బెట్టు
అబ్బురపు విరహమూ నాఁపలేక వున్నది

చ. 2: పొలఁతి మేనఁ గస్తూరి వూయ నొల్లదు
నెలకొన్న వలపుల నిన్నుఁ దలచి
కలువ బాణాలచేతిగాసియూ బెట్టు
బలిమైన తాపముల బారిఁ బడి యున్నది

చ. 3: సతి నీవు గూడఁగాను సంతసించెను
గతియైన శ్రీవెంకటనాథుఁడా
యితవైన పాయము నీ కెక్కెను నేఁడు
సతతము నిన్నుఁ గూడి చల్లనై వున్నది.

చి.శృం.రేకు: 03-6 శంకరాభరణం సం: 10-017

పల్లవి: తగు నీకు నాకును దయ్యమె కూరిచినాఁడు
నగవుల సరసాలె నయమాయ మనకు

చ. 1: జూటుఁజూపులనె నన్నుఁ జూచేటి వోజవరాల
సూటి నామనసు నీపైఁ జోటు గైకొనె
నాటుకొన్నతమకము నాకు నీకు నొక్కపాటె
యేటలమాయల యెర వేఁటి కింక మనకు

చ. 2: ఆనమాఁటలనె నన్ను నద్దలించే వోయింతి
వాసి నామోహము నీతో వావి గలసె
యీసుల మరనికాఁక యిద్దరికి నొక్కసరె
వేసాలజగడముల వేఁగ నేల మనకు

చ. 3: వలపులు చల్లి నన్నె వలవఁ దీసేటి కాంత
చెలిమి నే నీతోడఁ జేసితి నిట్టె
నలువైన శ్రీవెంకటనాథుఁడ నిన్ను గూఁడి
వులుకు లేక వుండఁగా నొనగూడె మనకు.

ఛి.శృం.రేకు: 04-1 కాంభోది సం: 10-018

పల్లవి: నాలితనా లేఁటికోయి నారసింహుఁడా
నాలోనె నవ్వు వచ్చీ నారసింహుఁడా

చ. 1: చేరువని ప్రియములు చెప్పి చెప్పి నామీఁద
నారువోసేవు వలపు నారసింహుఁడా
దారాసుద్దవుమాఁటలు తాఁకనాడి మదనుని
నారసాలు సేయకు నారసింహుఁడా

చ. 2: వెనుకొని నా వెంట వెంటఁ దిరిగి నామీఁద
ననుపు మోపు గట్టేవు నారసింహుఁడా
కనుచూపులనె వట్టి కాఁక రేచి మెత్తనైన
ననలు వాఁడి సేయకు నారసింహుఁడా

చ. 3: చిలుకుగోళ్ల నన్నుఁ జెనకుచు నీపై నా
నలు వెట్టై వచ్చేవు నారసింహుఁడా
కలికితనాన శ్రీవెంకటనాథ కూడితివి
నలువై వోగునూతుల నారసింహుఁడా

చి.శృం.రేకు: 04-2 ఆహిరి సం: 10-019

పల్లవి: మిక్కిలి నేరుపరివి మేలు మేలోయి
గుక్కనివలపుల వో కోన చెన్నరాయఁడా

చ. 1: గారవించి నామనసు కరఁగించ వచ్చేవు
వారకపు వలపుల దేవరవు గావా
పేరడి నీపెనపుల ప్రియములనె నన్ను
కూరిమి గొసరెటి వో కోన చెన్నరాయఁడా

చ. 2: మెచ్చి మెచ్చి నాతో నమ్మికమాఁట లాడేవు
తచ్చన వినయాల యాతఁడవు గావా
ముచ్చట నీజాణతనములనె నామీఁద గుది
గుచ్చేవు మాయ లెల్లాఁ గోన చెన్నరాయఁడా

చ. 3: యెన్నికసరసాల నా కిచ్చకాలు సేసేవు
కన్నెవలపు వేడుకకాఁడవు గావా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ కూడితివి
కొన్నదె కో లిఁక నీకుఁ గోన చెన్నరాయఁడా.

ఛి.శృం.రేకు: 04-3 మలహరిసం: 10-020

పల్లవి: చుల్లరవెట్టుఁ జేతల చొక్కనాథఁడు
వుల్లములో నీ నెలఁదలూరి చొక్కనాథఁడు

చ. 1: అద్దమరాతిరికాడ నంటువడి వచ్చి తాను
సుద్దు లేమి పచరించీఁ జొక్కనాథఁడు
వద్దు వొమ్మనవె రేపువచ్చుఁ గాని యిప్పు డేల
వొద్దికి వచ్చీ నెలఁదూరి చొక్కనాథఁడు

చ. 2: మిక్కిలిఁ దా నెక్కడనో మీఁదువోయివచ్చి నేఁడు
చక్కటు లేమి చెప్పినె చొక్కనాథఁడు
పెక్కు లేల నేనె పిలిపించఁగా వచ్చీ
వొక్కటిగా నీ నెలఁదలూరి చొక్కనాథఁడు

చ. 3: యిప్పుడె తా నెవ్వతెకో యెంగిలియై వచ్చియిట్టె
చొప్పులు మాస వచ్చినె చొక్కనాథఁడు
కప్పురపుమోవి శ్రీవెంకటనాథుఁడె నన్ను
వొప్పుగాఁ గూడె నెలఁదలూరి చొక్కనాథఁడు.

చి.శృం.రేకు: 04-4 మేసబౌళి సం: 10-021

పల్లవి: సింగారపు మేనిచెలువరి యింత
చెంగలింతురా చెలువరీ

చ. 1: నెఱతనా లూరకె నెరపుచు యిట్టె
చిఱునవ్వు నవ్వేవు చెలువరీ
తఱి నగి నగి వాని దగిలీని అంత
చెఱఁగు ముట్టకువోయి చెలువరీ

చ. 2: నిలువున మోహము నింపుచు మాపై
చిలికించేవు చూపు చెలువరీ
నెలవైన మాఁటలె నిజ మయ్యీని మాకు
శెలవు సేయకు వోయి చెలువరీ

చ. 3: వొక్కటిమాఁటల నొడఁబరచి నా
చెక్కు నొక్కకు వోయి చెలువరీ
గక్కన శ్రీవెంకటనాథుఁడా నీకు
జిక్కితి కాఁగిట చెలువరీ.

చి.శృం.రేకు: 04-5 సాళంగనాట సం: 10-022

పల్లవి: దొరపు నిన్నొఁగా దని దూరవచ్చునా
అరిదిపడేము గాక యాదవనారాయణా

చ. 1: నిమ్మపంట వేయగాను నిక్కము వచ్చే వని
నమ్మితిఁగా యాదవనారాయణా
చిమ్ముల నాచూపులకు చిక్కినట్టె వుండితివి
అమ్మరో యింత సేతురా యాదవనారాయణా

చ. 2: పువ్వులు నీ వంపఁగాను పులకించి సంతోసాన
నవ్వితిఁగా యాదవనారాయణా
దవ్వులనుండె నాకు దక్కినట్టె వుండితివి
యౌవ్వనపుమదమున యాదవనారాయణా

చ. 3: యింటికి నీవె రాఁగా యిప్పు డిట్టె భ్రమసితి
నంటుఁజూపుల యాదవనారాయణా
వెంట వెంటఁ దిరిగి శ్రీవెంకటనాథుఁడవై
అంటుకొని కూడితివి యాదవనారాయణా.

చి.శృం.రేకు: 04-6 రామక్రియ సం: 10-023

పల్లవి: వద్దు నాతో వెచ్చీ వేవని మాయలు
వుద్దండపు వో సంబటూరి చెన్నరాయఁడా

చ. 1: అమ్మమీఁద నానవెట్టి ఆసవుట్టె మాఁటలాడి
నమ్మించ వచ్చేవు నాకుఁ గొత్తలా
సమ్మతి నీ వలపుల సతులవద్దికె పోయి
యెమ్మెలు నెరుపేవారి నెలయించవయ్యా

చ. 2: మానము సోఁకనాడి మచ్చిక బాస లిచ్చేవు
యీనెపాలెల్లా నే నెఱఁగనివా
వూనినవేడుకల నీ వువిదలతోడుతను
నీ నేరుపు సట లెల్లా నెరపవయ్యా

చ. 3: కాఁగిటికిఁ జేరఁ దీసి కన్నుల మొక్కులు మొక్కి
ఆఁగేవు నేఁ దెలియనిపనులా
నాఁగువార శ్రీవెంకటనాథ నన్నుఁ గూడితివి
యేగి వచ్చి యిట్టె మాయింట నుండవయ్యా

చి.శృం.రేకు: 05-1 మాళవిగౌళ సం: 10-024

పల్లవి: తియ్యనిమాఁటలఁ దేలించేవూ
వొయ్యారపు వూటుకూరి చెన్నరాయ

చ. 1: పిలిచే వూరకె పిన్ననాఁటి పొందు
గలవానివలెనె యాఁకటతోడ
చలిమినె నన్నింత సందడి సరసాల
వులికించకు వూటుకూరి చెన్నరాయ

చ. 2: చెనకే వూరకె చేవమీరి కడు
చనవరివలెనె ముచ్చటతోడ
పెనఁగుచు నీ విట్టె ప్రియములు నెరసేవు
వునుపుఁజేతఁల వూటుకూరి చెన్నరాయ

చ. 3: తివిరే వూరకె దిట్టతనమునను
కవగూడే ననుచు నక్కరతోడ
నవకపు శ్రీవెంకటనాథ నన్నుఁ గూడి
తువిదలలో నూటుకూరి చెన్నరాయ.

చి.శృం.రేకు: 05-2 దేసాళం సం: 10-025

పల్లవి: నేఁడు నీచేఁత లెల్లా నీ వెరఁగవా
నీడనుండె యలసేవు నీ వెరఁగవా

చ. 1: వేమారు నాచేత వెళ్ల నాడించ నేఁటికి
నీమనసులోని కల్ల నీ వెరఁగవా
దీమసానఁ బెక్కిండ్లు దిరిగి వచ్చేవాఁడవు
నేమపు నీగుణములు నీ వెరఁగవా

చ. 2: గుట్టున నుండక నాకుఁ గోపము రేఁచ నేటికి
నెట్టన నీనడవడి నీ వెరఁగవా
చుట్టాలసురభి వని సోఁకనాడినంతలోనె
నిట్టచూపులు చూచేవు నీ వెరఁగవా

చ. 3: పన్ని నీనిజము లీడఁ బచరించ నేఁటికి
నిన్నటి నీసుద్దు లెల్లా నీ వెరఁగవా
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవె కూడి
నిన్ను నన్ను మెచ్చేవు నీ వెరఁగవా.

చి.శృం.రేకు: 05-3 రామక్రియ సం: 10-026

పల్లవి: మేలు మేలె నిన్ను నీవె మెచ్చుకొనవే
కోలుముందైన పనులకు కొంకఁ దగునా

చ. 1: పచ్చిగా గుబ్బలమీఁది పయ్యద జారినందుకు
యెచ్చరించితేఁ గోపించే వేమాయనే
కచ్చు పెట్టి యింత వాసి గలదానవు నీవు
మెచ్చి మెచ్చి నన్నుఁ జూచి మెయి మరవఁదగునా

చ. 2: అక్కరైన మోహముతో నరగన్ను మొగిచినందు
కిక్కు వంటితేఁ గోపించే వేమాయనే
చిక్కక మనసులోన సిబ్బితి గలదానవు
గక్కన నాయెదుటను కరఁగఁగ దగునా

చ. 3: పొంతనె నామోహముతో చూచి పులకించినందుకు
యెంత నేఁ జేసినా నందు కేమాయనే
కంతుని కేలిని శ్రీవెంకటనాథుఁడు గూడఁగా
వంతుకు నీ కింత పరవశము గాఁ దగునా.

చి.శృం.రేకు: 05-4 సాళంగనాట సం: 10-027

పల్లవి: రచ్చ కెక్కితివి పండరంగివితలా
పచ్చిదేరే వింతలోనె పండరంగివితలా

చ. 1: గుట్టుగల దొర వని కొసరి చూచినంతనె
రట్టుగా నవ్వేవు పండరంగివితలా
మట్టుమీరి తమకపు మాఁటలనె నీవలపు
బట్టబయలె సేసేవు పండరంగివితలా

చ. 2: సాగినసబలలోన సన్న సేసినంతలోనె
రాగిదేలించేవు పండరంగివితలా
వేగిరపుఁ జేఁతలనె విరివి నీమోహ మెల్ల
బాగుగా వెళ్ల వేసేవు పండరంగివితలా

చ. 3: తతి నీ వున్న చోటికి దగ్గర వచ్చినంతనె
రతిఁ గూడితివి పండరంగివితలా
గతి యైన శ్రీవెంకటనాథ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగివితలా

చి.శృం.రేకు: 05-5 శంకరాభరణం సం: 10-028

పల్లవి: చెల్లె నీవు సేసినట్టి చేఁత లెల్లాను
కొల్లలై కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా

చ. 1: అసము దించక మాఁటలాడేవు గాక నాకు
వసమయ్యేవా యింతవన్నె కాఁడవు
కసిగాటువలపుల గబ్బివైన నిన్ను నేల
కొసరేఁ గోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా

చ. 2: సడికి వెరచి నాతో సరసమాడేవు గాక
తొడరేవా నీ వింత దొడ్డవాఁడవు
విడువని పొందులతో విట్టువీఁగేనీకు నేల
కొడిమె కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా

చ. 3: బాసకు వెరచి నన్నుఁ బై కొని కూడితి గాక
ఆసగద్దా నీకు నింత అందగాఁడవు
వేసారవు రతుల శ్రీవెంకటనాథ వొకరి
కోసమా కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా

చి.శృం.రేకు: 05-6 నాదరామక్రియ సం: 10-029

పల్లవి: వేవేలుచేఁతలవాఁడు వీఁడె వీఁడె
దేవుఁడుగదె ప్రసన్న తిరువెంగళప్పఁడు

చ. 1: యిద్దరు సతులు తన యిరువంకలఁ గొలువ
గద్దెన చూపులనె కరఁగింపుచు
అద్దరిపాటు సేసి ఆయములు ముట్టీని
తిద్దిన గోల్ల ప్రసన్న తిరువెంగళప్పఁడు

చ. 2: కామినులు నలువంక కదిసి సేవలు సేయ
సామపు మాటలనె యాసలు సేయుచు
దోమటి చెనకులనె దుండగాలు సేసీని
దీమముతో ప్రసన్న తిరువెంగళప్పఁడు

చ. 3: అలమేలుమంగ దన కాకుమడి చియ్యఁగాను
సొలపుల మాఁటలనె చొక్కింపుచు
నలువై శ్రీవెంకటనాథుడై కూడినవాఁడు
తెలిఁగన్నుల ప్రసన్న తిరువెంగళప్పఁడు

చి.శృం.రేకు: 06-1 సామంతం సం: 10-030

పల్లవి: ఇన్నాళ్ల నీవుగావో యెప్పటి నేనె కానో
వెన్నుఁడ నీచేఁతలె వింత లింతే కాక

చ. 1: దాఁపరాని చెక్కుగోరు తలపించె నీగుణాలు
మాపుదాఁకాఁ దెలుపఁగ మావసమా
ఆఁపరాన తమకాన ఆపె నీమోహ మెల్లా
రూపు సేయఁగా నింత రూఢి కెక్కెఁ గాక

చ. 2: అంటినమోవిపై కెంపె అంగమచ్చమాయఁగాక
నంటునఁ దారుకాణించ నావసమా
యింటికాడ నిన్ను నాపె యెనసిన భోగ మెల్లా
వెంట వెంటనె వెల్లవిరి సేసీఁ గాక

చ. 3: విడువనివాసనలె వెలయించె నీపొందులు
వడి నీతో వాదించ వసమా నాకు
కడువేగ శ్రీవెంకటనాథ నీవె నన్ను
వొడఁబరచి కాఁగిట నొక్కటై కూడితివి.

చి.శృం.రేకు: 06-2 శంకరాభరణం సం: 10-031

పల్లవి: వలపులకలగంప వాని కేమె
వలరాజుఁ గన్న తండ్రి వాని కేమె

చ. 1: వాడికగాఁ దానె యెవ్వతెనైనా వలపించు
వాడనివాసనపువ్వు వాని కేమె
వోడఁ డెందరికినైనా వుత్తరువె చెప్పిని
వాడమగువలవిందు వాని కేమె

చ. 2: తగిలి యెక్కడ నైనాఁ దనమేలె చూచుకొను
వగలమగతుమ్మిద వాని కేమె
తగిన ట్టిందరితో దరితీపులె సేసు
వగకాఁ డల్లారుముద్దు వాని కేమె

చ. 3: యెనసి యెక్కడనైనా యిచ్చకమె సేసుకొను
వనితల పెనుబాఁతి వాని కేమె
ఘనుఁడు దానె శ్రీవెంకటనాథుఁడు వచ్చి
వనజాక్షి ననుఁ గూడె వాని కేమె.

చి.శృం.రేకు: 06-3 ముఖారి సం: 10-032

పల్లవి: తమకపడ నేఁటికి దాని కేమి దోసమా
అమర మన సిచ్చి మాఁటాడవయ్య విభుఁడా

చ. 1: మోవనాడి పిలిచినా మోనాన నున్నాడవు
చేవల నామాఁటలకు సిగ్గాయనో
మావంటివారితోడ మాఁటాడవల దని
మోవిమీఁద నెవ్వతైనా ముద్ర వెట్టెనో

చ. 2: కాతరానఁ జెనకినా కడుఁగడుఁ జొక్కేవు
ఘాతల నాచేఁత లేమి కళ లంటెనో
జాతిగా మాతోడుతను సరస మాడకు మని
చేతుల నెవ్వతైనా లచ్చెన వెట్టెనో

చ. 3: కమ్మి నేనిన్నుఁ గూడఁగా కప్పుకొనేవు నాకొంగు
యిమ్ముల నీ కిది దానె యితవాయనో
నమ్మి కిచ్చి శ్రీవెంకటనాథ వెనకదినాల
రొమ్ముపై నెవ్వతైనా గురుతు వెట్టెనో

చి.శృం.రేకు: 06-4 ఆహిరి సం: 10-033

పల్లవి: నన్ను నేఁ బొగడుకొన్నా నాయము గాదు గాక
కన్నెనాటనుండి నీకెకాఁ బాటువడనా

చ. 1: అ యింటివారిచే నారడిఁ బడితిఁగా
నెయ్యపు వలలఁ జిక్కి నీకొరకు
గయ్యాళి నావలపులు కతలై నిలిచెఁగా
వెయ్యైనాఁ దలచుకొంటె వెనకముందరికి

చ. 2: అక్కటా చెలులతోఁ గల్లానలు వెట్టితిఁగా
పక్కన నీవిచ్చినట్టి బాసలు నమ్మి
రొక్కమైన నాపొందులు రోఁకటఁ బాడిరిగా
దిక్కులు నిండెఁగా నీవు తెలియకుండినను

చ. 3: చెల్లఁబో యిందరిలోఁ బచ్చి సేయించుకొంటిఁగా
యిల్లు వెళ్ల నట్టి నీ యిచ్చకానకె
కల్ల లాడక శ్రీవెంకటనాథ కూడితివి
మల్లడి యీరతి మనమనసు లెరుఁగుఁగా

చి.శృం.రేకు: 06-5 పాడి సం: 10-034

పల్లవి: ఇంతేసి పారుపత్తే లేమీ నీకు
అంతంతకు గరిసించే వత్తునా నే నీకు

చ. 1: కూడఁ బారివచ్చి నా కుల మేల యడిగేవు
వేడుకకాఁడ నాతో వియ్య మందేవా
నాడొడివటనె నాప రే లడిగేవు
చేడెలపైఁ బద్దేలు చెప్పుదువో నీవు

చ. 2: సరసానఁ జెయివట్టి సత్తు వేమి చూచేవు
బిరుదుకు నాతోడఁ బెనఁ గేవా
సొరిది నాపై నోరచూప లేమి చూచేవు
తిరిగి తిరిగి వంక దిద్ద వచ్చేవా

చ. 3: ముద్దు ముద్దువలె నాకు మొక్కు లేమి మొక్కేవు
కొద్దిమీర నీవు నన్నుఁ గోలిచేవా
అద్దొ మండెమురాయఁడవై నన్నుఁ గూడితివి
గద్దరివైన శ్రీవెంకటనాథుఁడా

చి.శృం.రేకు: 06-6 వరాళి సం: 10-035

పల్లవి: వలుపేమి దాఁగునా వన్నెకాఁడ
అలవడి నీ వెంత అణఁచఁ జూచినను

చ. 1: గక్కన మొక్కకుంటేను కాంత నిన్ను దీవించునా
తక్కి మాతో సిగ్గువడి దాఁచేవు గాక
చక్కఁగా నవ్వ కుండితె సరసము లాడునా
లెక్కించి మాకు వెఱచి లే దనేవు గాకా

చ. 2: చెనకక నీ వుంటె చెలి పూవుల వేసునా
పొనిగి మాతో లేదని బొంకేవు గాక
గునిసి యరువకుంటె కొంగు నిన్నుఁ బట్టునా
తనివోని నీననుపు దాఁచేవు గాకా

చ. 3: కన్నుసన్న సేయ కుంటె కాఁగిట నిన్నుఁ బట్టునా
అన్నిటా మాతోడుతఁ దోశాడేవు గాక
వెన్నడించి యాపెను శ్రీవెంకటనాథుఁడ కూడి
మన్నించితి నన్ను నిట్టె మండెమురాయఁడవె.

చి.శృం.రేకు: 07-1 రామక్రియ సం: 10-036

పల్లవి: తెలివ లందరుఁ గూడి తిద్దిరిగా నిన్నును
మలపు వెలపు లేక మాకొరకుఁగానె

చ. 1: కన్నులనె వలపించే కాంతలు గలుగఁగా
పిన్ననాఁడె గుణములఁ బెద్ద పైతివి
మున్నిటివారి యధరముల తేనె సోఁకఁగా
తిన్నని నీమాటలకు తీపు లెక్కెను

చ. 2: యిచ్చకాన సింగారించే యింతులు గలుగఁగా
కచ్చుపెట్టి యింత వన్నెకాఁడ వైతివి
మచ్చికతోడ నందుక మరిగి రాఁగా గఁదా
నిచ్చలపుఁ బిల్లఁగోవి నెరజాణ వైతివి

చ. 3: తరుణులు నీతో జాణతనము లాఁడగఁగా
గరువతనాన మాటకారి వైతివి
కరఁగి వారెల్లా శ్రీవెంకటనాథ కూడఁగాఁగా
పరువపు నారతి బెంబడి నోడ వైతివి.

చి.శృం.రేకు: 07-2 శంకరాభరణం సం: 10-037

పల్లవి: అన్నిటా నీదిద్దుబడె అది విచారించవయ్య
యెన్నుకొని నన్ను నేర మెంచకుమీ అయ్యా

చ. 1: నీవొళ్లి నేరము లెంచి నెరవాది నైతిఁ గాక
కావించి నేఁ దొల్లేమి కతకారినా
కోవరపు నీగుణాలు కోపము రేఁచెఁ గాక
కావలసి నేఁ దొల్లి గయ్యాళినా

చ. 2: సారె నీబాసతప్పులె చలపాదిఁ జేసెఁ గాక
నేరిచి నాయంత నేనె నిష్టూరినా
పేరడి నీయెడమాట పెచ్చు వెరిగించెఁ గాక
రారాఁపుల నేఁ దొల్లి రచ్చ కెక్కేనా

చ. 3: తక్కరి నీవిద్యలె దంటఁ జేసెఁ గాక నన్ను
గక్కనఁ దొల్లి కయ్యాన కాలు దవ్వేనా
కక్కసించి శ్రీవెంకటనాథ కూడితివి
లక్కవలెఁ గరగక లాఁతిదాననా.

చి.శృం.రేకు: 07-3 సాళంగనాట సం: 10-038

పల్లవి: తగవో బలిమో నీతలఁపై నాతోఁ జెప్పర
నగువమోముతోఁ గదిరినాథ నీవు

చ. 1: యేరా వొద్దన్న మాన విల్లురికి నాతోను
మీరి నవ్వేవు కోమటిమేనరికమా
వారము వజ్జ మనక వాకిట నన్ను నాఁగేవు
పోరచి మావారు నీకుఁ బోఁక వెట్టిరా

చ. 2: కొంత గొంత కోపించిన కొంగువట్టి నాతోను
రంతులు సేసేవు నీకు రాచబలిమా
వంతుకు వాసికి నన్ను వావిదేరఁ బిలిచేవు
కొంతైనా మావారు నీవుంకువ వట్టిరా

చ. 3: గబ్బినై యదలించిన కన్నుల మొక్కుచునన్ను
గొబ్బునఁ గాఁగిలించేవు గొల్లదోమటా
అబ్బురపు శ్రీవెంకటాద్రినాథ కూడితివి
సిబ్బితివాయఁ బెండ్లి సేసిరా నీకూ

చి.శృం.రేకు: 07-4 ఆహిరి సం: 10-039

పల్లవి: ఎందు కెందుకు గడించీ యిది యేమె
మందలించినదె మారుమాఁట లవునటె

చ. 1: చెనకి నన్నుఁ బట్టఁగ చెయి విదిలించితేను
కొనగోరు దాఁకినదె కొస రవునటె
పెనఁగి తనపై నానపట్టఁగానె లోఁగితేను
యెనసి తనచేతఁకు యియ్యకోలటె

చ. 2: పువ్విళ్లూర నవ్వఁగాను వూరకె కోపము రేఁగి
పువ్వుబంతి వేసితేనె పొందవునటె
రవ్వగాఁ దా దూరఁగాను రాఁగతనానఁ దిట్టెక
అవ్వల సిగ్గువడితె అస లవునటె

చ. 3: వెగ్గళించి తనుఁ దానె విడెము నా కియ్యఁగాను
దగ్గరి యందుకొంటేను తగు లవునటె
కగ్గు లేక శ్రీవెంకటనాథుఁడు గూడఁగ
అగ్గలమై కూడితేను ఆ లవునటె

చి.శృం.రేకు: 07-5 శంకరాభరణం సం: 10-040

పల్లవి: ఇది నీకె సమ్మతైతె యెవ్వరైనాఁ గాదనేరా
మదిలో నీ వేల కొంకు మానవో కాకా

చ. 1: పొలఁతి యంపిన లేక బూతులు దొరలఁ బోలు
వెలయ నే మడిగినా వెళ్లనాడవు
యెలమి నాపె కానికె యెంగిలై యుండఁగఁ బోలు
సొలసి చెలులకును చూప వైతివి

చ. 2: అతివంపిన యేకాంత మాయములుసోఁకఁబోలు
యితవై నీలోలోనె యిందుకొంటివి
సతి వంపిన పువ్వుల సవరము గాఁబోలు
తతి నేము దగ్గరిన దాఁచుకొంటివి

చ. 3: కలికి దగ్గరితేను కాఁకలు రేఁగఁగ బోలు
చెలరేఁగి పానుపు చేరఁబోతివి
వెలయ నిన్నును శ్రీవెంకటనాథ కూడఁగా
మెలుఁత మించఁగఁ బోలు మెచ్చుకొంటివి

చి.శృం.రేకు: 07-6 వరాళి సం: 10-041

పల్లవి: నీగుణా లేల మానీని నేనె వేసరఁ గాక
యేగతిఁ జెప్పినను నీయిచ్చ మానేవా

చ. 1: పోరి పోరి నేఁ జెప్పినను బుద్ధు లెల్లా నీ వాపెఁ
జేరఁబోయి కానికగాఁ జెప్పకుండేవా
గోరసేసి నడుమను గోళ్లురాచి నీ వలపు
పేరడిగా జగడాలు పెంచకుండేవా

చ. 2: అద్దలించి నేఁ బెట్టిన ఆన లెల్లా నీ వాపె
వొద్దఁ బోయి సూడిదెగా వొట్టకుండేవా
బద్దుల నేరుపు లెల్లా పచరించి నీ మోహము
పెద్ద సేసి కైలాటాలు పెట్టకుండేవా

చ. 3: పాసి పోకు మని నిన్ను బలిమి నేనేఁ గొన్న
బాస లాపెకుఁ గప్పము పట్టకుండేవా
గాసి చేసి నిన్ను శ్రీవెంకటనాథ కూడితిని
ఆసపడి నీ వాపె నంటకుండేవా.

చి.శృం.రేకు: 08-1 శ్రీరాగం సం: 10-042

పల్లవి: సంగతిగా మాఁటలాడ జాణ వౌదువె నీ
సంగతి గలదు గాన జాణనె పో యెపుడు

చ. 1: యెక్కువఁ బయ్యదలోని వేఁటివె యింతి అవి
పక్కనె వలపు నించే పైఁడికుండలు
పెక్కువ మేడలమీఁదఁ బెట్టవచ్చుఁబో నీవు
మిక్కిలి నెప్పుడు నుండే మేడవో నాదేహము

చ. 2: హెచ్చె నీమైఁ బులక లివేఁటికె యింతి అవి
ముచ్చట మోహపునోము మొలకలురా
పెచ్చుగా దేవరమీఁదఁ బెట్టచ్చుఁబో నీవె
వచ్చి వరము లిచ్చే దేవరవెపో నాకును

చ. 3: యినుమడించెఁ జెమట లేఁటికే యింతి రతిఁ
దనివోని కళలెల్ల దైలువారెరా
అనువై అట్లానైతె అగ్గువాయఁబో నన్ను
ఘనమై కూడితి శ్రీవేంకటనాథుఁడా.

చి.శృం.రేకు: 08-2 శంకరాభరణం సం: 10-043

పల్లవి: ఎంచి మీచుట్టరికము లిందులో దెలుసుఁగా
మించి నడచితి రైన మీకు మీ యాన

చ. 1: యేలా చల్లనిగాలి యింతి నేచ నేఁటికి
జాలి రేఁచితైన నీకు చందన మాన
మేలిమి తుమ్మిదలాల మెలుఁత వోరువ లేదు
కోలుముందై కూసిన మీకులము నాన

చ. 2: మదనుఁడా చెలిమీఁద మానవయ్య కోపము
పదరితి వైన పంచబాణము లాన
పొదలినా చందమామ పున్నమవెన్నెల గాసి
కదిసి యెంచితి వైన కలువ లాన

చ. 3: చక్కని కోవిలలాల జవరా లోపఁగ లేదు
చిక్కని కూఁత రేఁచితే చిగురు లాన
గక్కన నింతిని శ్రీవెంకటనాథుఁడు గూడె
మక్కువ నిందరికిని మానితి నాన

ఛి.శృం.రేకు: 08-3 పాడి సం: 10-044

పల్లవి: ఆతఁ డేమి దవ్వుగాఁడు అతివ ప్రాణనాథుఁడె
నీతితోడ వానిఁ గూర్చి నెలఁతఁ గావఁగదరే

చ. 1: చల్లనైన గాలిచేత జాలిరేఁచె వలపు
పిల్లఁగోవి వట్టె వాఁడు పెచ్చురేఁచెనే
పొల్లవోని పూవులపప్పొడి పొదిసేసెనే
వొల్లనన్నఁ బోదు దీని కోమరమ్మ చెలులు

చ. 2: రవ్వలైన వెన్నెలల రాఁపాయ మోహము
నవ్వి నవ్వి వాని చూపు నాముకేఁచెనే
కొవ్వినట్టి కోవిలలకూఁతచేఁత గనమాయ
యెవ్వ రేమి సేతు రిఁక యెదరమ్మ దీనిని

చ. 3: మదను పూవుటమ్ము సోఁకి మదము రేఁగె ప్రేమము
కదిసి విభుఁడు మోము చూపి కళలు రేఁచెనే
యిదివో శ్రీవెంకటనాథుఁ డింతి నిట్టె కూడినాఁడు
చెదరనట్టి వేడుకెల్ల చెందెనమ్మ యింతికి

 చి.శృం.రేకు: 08-4 సామంతం సం: 10-045

పల్లవి: వెలఁది నీ చెమటలె వెల్ల వేయఁగా
తలఁగి నేఁ జెప్పకుంటే దాఁగఁ బొయ్యీనా

చ. 1: సంగతి నీమోహ మెల్లా సకితోఁ జెప్పఁగఁ బోతే
అంగడిఁ బెట్టెకు మని ఆనవెట్టేవే
దొంగిలి గజ్జలపేరు తొలఁగఁ బెట్టెఁగఁ బోతే
వెంగలితనమె కాక వినక మానేరా

చ. 2: యీకడ నీ విరహము యింతితో జెప్పఁగఁ బోతే
కాకుసేయ వద్దంటా కన్ను గీఁటేవే
పైకొని కన్నులు మూసి పాలు దాగఁబోతేను
జోకగా నింటివారు చూడక మానేరా

చ. 3: జిగి విభుని దెమ్మని చెలులతోఁ జెప్పఁబోతే
అగడు సేయకు మని ఆన వెట్టేవే
నగుతా శ్రీవెంకటనాథుఁడె తా నిన్నుఁ గూడె
చిగిరింపుఁ గోరికల చేఁత డాఁగీనా.

చి.శృం.రేకు: 08-5 వరాళి సం: 10-046

పల్లవి: తెలిసినమాఁట తేటతెల్లమిగాఁ జెప్పేను
తలిరుఁబోణి విభునిదండ నుండవలెనా

చ. 1: ముదిత మేని పులక మొలకలు పన్నీటి
పదనునఁ దీఁ గెలువారీఁ జుండి
కదిసి వోచెలులాల గందవొడి పాదిచేత
అదన నవియుఁ బొదలయ్యీఁ జుండి

చ. 2: చెలి చనుఁగొండలపై చెమట వూట పూఁదేనె
నలుకఁగాఁ గాలువలయ్యీఁ జుండి
కలికికోరికలచే కన్నుల నీరు గూడఁగా
యిలపై మదనుపేరి టేరులయ్యీఁ జుండి

చ. 3: కాంతమదిలోఁ బతి గడు గడుఁ దలఁచఁగా
అంతటా నాతఁడె తా నయ్యీఁ జుండి
వింతగా నింతిని శ్రీవెంకటనాథుఁడు గూడె
పంతమునఁ జెలికిఁ దాపము మాఁనె జుండి.

చి.శృం.రేకు: 08-6 వరాళి సం: 10-047

పల్లవి: ఆపె యెరుఁగును నీ వన్నియూ నెరుంగుదువు
రేపు మాపు నే నెచ్చరించేనా విభుఁడ

చ. 1: చిలుకచే మాఁటలు చెప్పెంప్పి మరు
చిలుకలపాలుగఁ జేయ నేల
కల గని లేచి లేకలు వ్రాసి కాఁ
కలఁ బొరలుచునె నీకడ కంపెఁ జెలియా

చ. 2: కడువేగ ముదుర వుంగరమె యంపి మరు
కడివోని బాణాలఁ గాఁచ నేల
బడి బడి విరహనఁ బడలేక మా
పడఁతి నీకుఁ జిత్తరుపట మంపె నిదివో

చ. 3: విందువలెఁ గప్పురపు విడె మిచ్చి గో
విందుఁడ వయిన శ్రీవెంకటనాథ
కందు లేనివేడుక నాకందుకొని నీ
కందువ లంటి కూడెఁ గాంతయు నిన్నిపుడూ

చి.శృం.రేకు: 09-1 కేదారగౌళ సం: 10-048

పల్లవి: ఎందరి దూరె యెవ్వరి వేఁడె యెంతని వేగించేనె
పొందు దలఁచుక వచ్చెనా వానిచే పుణ్యమింతే కాక

చ. 1: పుక్కిలిబంటి కాఁకలలోనె పొద్దువోవు టెట్లే
యెక్కువైన నా వమోహము చెలుల నెరఁగ రేమందునే
వొక్కనిమిషము వానిఁ బాసి నేవోరువఁ గలనటే
మొక్కళీఁడయిన మరునమ్ములకు మొకవమోట గలదా

చ. 2: తలమునుకల విరహము నే ధరియించు టెట్లే
వల పెరిఁగియు సకులు మీరైన వానిఁ దే రేమందునే
అలిగినవానిఁ బాసి నిమిషము ఆడఁ గలనటవే
దళమ్మై కప్పెటి పూవుటమ్ములకు దయగల దటవే

చ. 3: ఇట్టె యీఁదరాని తమకముననె యీడేరే దెట్లే
వొట్టిన నా కాఁక లెరిఁ గింతు లూరకున్నారేమందునే
నెట్టెన శ్రీవెంకటనాథుడు నేఁడు నన్నుఁ గూడెనే
గట్టిగ నాయింట కాఁపురమున్నాఁడు కడమలున్న వటే

చి.శృం.రేకు: 09-2 పాడి సం: 10-049

పల్లవి: అతనినె దూరరమ్మ అలుగ కుండిన నాఁడు
యీతల నాతల నివి యితవుగా కుండెనా

చ. 1: పున్నమచందురుఁడు దప్పులురేఁచ బగవాఁడ
ఇన్నిటా నా విభుఁడె గురింతె కాక
సన్నపు జల్లనిగాలి జాలి రేఁచఁ బగవాఁడ
మన్నమగఁడు సేసిన మతకము గాక

చ. 2: కమ్మని పువ్వులు మేను కాడిఁపార సూడుగద్దా
చిమ్ముల నా రమణుని చేఁతలె కాక
దొమ్మిసేసి తుమ్మిదలు తొలియాడ వైరులా
నమ్మించి బాస దప్పిననాథుఁ డింతె కాక

చ. 3: ముప్పిరి మరుఁడు కాక ముంచఁగ దోసమువాఁడ
యెప్పుడు నీచేఁతలు ప్రాణేశువె కాక
కప్పుచు నన్నును శ్రీవెంకటనాథుఁడు గూడె
అప్పట్టప్పటి చేఁతలు ఆతనివె కాక

చి.శృం.రేకు: 09-3 బౌళి సం: 10-050

పల్లవి: నీ వేమి సేతు వాపె నిన్నుఁ బెరరేఁచగాను
తావుల సాకిరి గోరఁ దగదా నిన్నును

చ. 1: పోరాడే వాపెకుఁగా వూనుక నీవు రాఁగా
మేరతోఁ జుట్టా లెల్లా మెచ్చకుండేరా
సారె సారెఁ బిరిదూరి సాకిరులు చెప్పఁగాను
తీరిచేటి చెలు లెల్ల దీవించకుందురా

చ. 2: కన్నుగీఁ టాపెకు నాకుఁ గై లాటాలు వెట్టఁగాను
కన్న విన్న వారెల్లాఁ బొగడకుండేరా
మన్నించి యాపెకు నీవు మాఁట లందియియ్యఁగాను
సన్నల వాడవారెల్లా సంతసించకుందురా

చ. 3: సందడి జగడాలలో సారె నన్నుఁ బట్టఁగాను
అందరును నిన్నె మేలనకుండేరా
అంది శ్రీవెంకటనాథ ఆపెను నన్నుఁ గూడితి
విందురు నీచేఁత లివి యెంచకుండేరా.

చి.శృం.రేకు: 09-4 వరాళి సం: 10-051

పల్లవి: నీ వేల వత్తువయ్య నెలఁతఁ బాసి
మావంటివారు నీకు మనసయ్యేరా

చ. 1: ఇప్పటికి మాతోడ యిచ్చక మాడేవు గాక
తప్పరాని బాస నీవు దాఁటఁ గలవా
అప్పసమై తలఁపెల్లా ఆపెకుఁ గుదువవెట్టి
దెప్పరమై మావెంటఁ దిరుగ నోపుదువా

చ. 2: నిక్కమువంటి మాఁటలే నెరుపేవు గాక నీవు
వొక్కమనసై యీడ నుండఁ గలవా
అక్కజపు నీమేను ఆపెకు మీదుచ్చి
యిక్కడ మాతొంటిపొందు యితవయ్యీనా

చ. 3: ముచ్చట సేక మాతో మొగమోడే వింతే పక్క
మచ్చికయాపె కాఁగిలి మాన గలవా
కచ్చుపెట్టి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యెచ్చరిక నిట్టె మాయింటికి రాఁగలవా

చి.శృం.రేకు: 09-5 దేసాళం సం: 10-052

పల్లవి: కలితె నానతీవయ్యా కానిదానికి నేమి
చెలరేఁగి ఆపె మాఁట చెల్లించేఁ గాని

చ. 1: వెడ్డువెట్టి నే నిన్ను వేడుకతోఁ గొసరఁగా
అడ్డాలు వచ్చీ నాకంటే నంత చుట్టమా
వొడ్డినగర్వాన నాతో వొరగోసుకొన్నది
సడ్డలాడి నీ వింత చనవు లిచ్చితివా

చ. 2: బాసగొని నే నిన్ను పై పైఁ బలుకఁగాను
యీసడించీ నాకంటే యితవరా
గాసిలి మచ్చరాన నీకాంత మాసటీనివలె
సేసిన చేఁతల కల్లా చెల్లుబ డిచ్చితివా

చ. 3: యీపొద్దె నిన్ను మాయింటికిఁ దోడుక పోఁగా
కోపగించీ నాకంటెఁ గూరిచినదా
కైపు గాక నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
పై పై నాపెకుఁ బారుపత్యము లిచ్చితివా.

చి.శృం.రేకు: 09-6 పాడి సం: 10-053

పల్లవి: కాదని వేగిరించితే కరఁగీనా ఆతఁ డేమి
వాదు మాని వచ్చినట్టె వచ్చేదె చాలును

చ. 1: మాఁట లాడించకురే మదనమంత్రాలు దప్పీ
నేఁటిదాఁక నాపెవద్ద నేరిచినవి
నీటుతోడ నాతనిని నిండునిధానమువలె
సూచీచూపుల మనము చూచేదె చాలును

చ. 2: గందము వ్రాయకురే యంగజునిముద్రలుమాసీ
కందువ నిన్నాళ్ల దాఁకా గడించినవి
దిందుపడ నుపారము దేవరకుఁ జూపినట్టు
ముందర నన్నియుఁ బెట్టి మొక్కేదె చాలును

చ. 3: మల్లాడి తియ్యకురె మన్మథయోగ మెడసీ
తొల్లియూ నాపెవలన దొరకినది
కల్ల గాదు నన్ను శ్రీవెంకటనాథుఁడె కూఁడె
చెల్లుబడి నీచనవు చేకొనేదె చాలును

చి.శృం.రేకు:	10-1	మాళవిగౌళ	సం:	10-054

పల్లవి:	మంచితనము ల దెట్టు మరచీనయ్యా
	మంచముపై నున్న నెట్టు మరచీనయ్యా

చ. 1:	యెచ్చరించి వొక రొక రెనసి కూడుండేటి
	మచ్చికలు చెలి యెట్టు మరచీనయ్యా
	వచ్చినదాఁకాఁ దలవాకిటనె కాచుకుండే
	మచ్చులచేఁత ల దెట్టు మరచీనయ్యా

చ. 2:	యిత వెరిఁ గొక రొక రిచ్చకాలు సేసేది
	మతిలోనఁ జెలి యెట్టు మరచీనయ్యా
	సతతము నొండొరుల జవ్వనమె కుదువైన
	మతములు చెలి యెట్టు మరచీనయ్యా

చ. 3:	సంతసాన మనసులే సరిదాఁకినట్టి నీ
	మంతనాలు చెలి యెట్టు మరచీనయ్యా
	కాంతను నీవె శ్రీవెంకటనాథ కూఁడగాను
	మంతు కెక్కె నిది యెట్టు మరచీనయ్యా

చి.శృం.రేకు: 10-2 భైరవి సం: 10-055

పల్లవి: తనువే యిక్కడఁ గాని తలఁ పెల్లా నక్కడనె
మనసులో నాపె నింక మానననైనఁ గలవా

చ. 1: మాయింటాడ నిచ్చకపు మాఁటలాడే వింతే కాక
వోయీ నీ వాపెఁ బాసి వుండ నోపేవా
ఆయెలే మాముందటను అసము దించవు గాక
చేయూర నీవె యాపెను చెనక కుండేవా

చ. 2: మానలేనివానివలె మన సరసేవు గాక
ఔనా ఆపె వడ్డించ కారగించేవా
తేనెలమాఁటఁల దరితీపులు సేసేవు గాక
కానీలె యాపెపై తమకమె పట్టెఁగలవా

చ. 3: యీపొద్దుకు నాకాఁగిలి యింపాయ ననేవు గాక
పో పో నీవాపెఁ దలపోయ కుండేవా
కాపాడి నన్నును శ్రీవెంకటనాథ కూడితివి
మాపొందు లాసెవద్దను మఱవఁగఁ గలవా

చి.శృం.రేకు: 10-3 కాంబోది సం: 10-056

పల్లవి: ఇరుమొనసూది వనియింపు సేసుకుందుఁగాని
మరిగినే మన సిచ్చి మాఁటలాడఁ జాలరా

చ. 1: ఆపెతోఁ బురుడువెట్టి ఆడక వుండినఁ గదా
నాపై నీవల పెల్ల నమ్మి కుందును
చూపుల నాపె కెదురుచూడక వుండితేఁగదా
చేపట్టి నాముచ్చ టెల్లాఁ జెప్పుదు నీతోను

చ. 2: ఇచ్చక మాపె కాడక యీడనె వుండినఁ గదా
ఇచ్చిన నీబాస లెల్ల నియ్యకొందును
కచ్చుపెట్టి యాపెతో నేకతము మానినఁ గదా
తచ్చనలు మాని నీతో దగ్గరి నవ్వుదును

చ. 3: కడలు దొక్కక నాకాఁగిట నుండినఁ గదా
అడియాలముగఁ గళ లంటుదు నిన్ను
కడువేగ శ్రీవెంకటనాథ నీవె నన్ను
యెడయక వుండఁగానె యితవాయఁ గాకా

చి.శృం.రేకు: 10-4 నాదరామక్రియ సం: 10-057

పల్లవి: వేగిరమా నీవు విభుఁడవు నీ వెలఁదిని నేను
సోగకన్నుల నీసొలపు జూపులసొంపు నాకుఁ జాలదా

చ. 1: చెలియ మునుపు సింగారించుకొన్న చెంగావిచీర యిది నీవు
తలఁకక నేడు దట్టిగట్టుకొంటె దాని కేమిదోసమా
అలిగేనా నేను అందుండె మాఁటాడు అంటుకొన నోపను అది
తలఁగ వేరొక్క తావునఁ బెట్టిరా దగ్గరుందు గాకి

చ. 2: కందువతో నాపె కస్తూరి పూయఁగ గట్టిబేఁటులు రాలితే నీవు
పొందు చెడకుండ బొట్టు వెట్టుకొంటె బోగానకుఁ గడమా
నింద నిన్నాడేనా నేటి కటుండరా నే నందు కోరువనువొక
చందానఁ బన్నీట జలక మాడి నాసంగడికి రారా

చ. 3: ముద్దియ వేలనె ముందర నుండెటి ముద్దురవుంగరమునీవు
పెద్దరికానకు ప్రియమునఁ గేల బెట్టుకొంటేఁ దగదా
గద్దరివై శ్రీవెంకటనాథ నన్నుఁ గరఁగించి కూడితి నా
వద్దనె పాయక వాలాయించి దేవరవలె నుండరా.

చి.శృం.రేకు: 10-5 తెలుగుగాంబోది సం: 10-058

పల్లవి: చెప్పరె మీరైనా బుద్ధి చెలులాల
అప్పసము మా కదిరి యప్పునికి

చ. 1: యింతగా వలచినవాఁ డింటికి వచ్చితే నేమి
అంతలోఁ దనకును సిగ్గాయ నటవే
పంతము దప్పిపోయీనా పచ్చిదేరేమాఁటలను
అంతేసి తన్నుఁ దూరనాడఁ జాలఁ గాక

చ. 2: మన సిచ్చినట్టివాఁడు మాఁటలాడితే నేమి
తను నెవ్వరైనా వద్దనే రటే
చనుమొనలు సోఁకగాఁ జాణతనపుఁజేఁతల
చెనకలేనా కొంత చేకాచి కాక

చ. 3: కదిసినవాఁడు నన్నుఁ గాఁగిలించితే నేమి
అదను గాదా తనకు నడ్డమా యేమి
వెదచల్లుఁ గరిమి శ్రీవెంకటనాథుఁ డై కూడె
పదిలమై యిఁక దన్నుఁ బాయలేనుఁ గాకా.

చి.శృం.రేకు: 10-6 బౌళి సం: 10-059

పల్లవి: ఏలరా కృష్ణుఁడా

ච. 1: పగటూ మాఁటల నొగరూ దోఁచఁగ
మగనాలిని నన్ను నగఁ జూచే వేరా

ච. 2: కొనబూ విటుఁడ నీ కనుచూపులనె నా
మనసూ గరఁగించఁ బెనఁగే వేరా

ච. 3: కలికిచేఁతల వలపంచి నను నిట్టె
కలసితి శ్రీవెంకటగిరినాథా

చి.శృం.రేకు: 11-1 పాడి సం: 10-060

పల్లవి: అంత మనసరి వని ఆడేనా నిన్ను
చింతించే నీయాల ననే సిగ్గు కింతే కాకా

చ. 1: నవ్వులు నవ్వేవు నీవు ననుపువానివలెనె
యెవ్వతెతో నైనా న దేరా నీవు
దువ్వటపుఁ బయ్యదపైఁ దోఁగిన చెమట నీపై
చివ్వనగోళ్ల నాపె చిమ్మె ననీ కాక

చ. 2: ముచ్చట నెవ్వతె నైన మొకము దగ్గరఁ బోయి
యిచ్చకము లాడేవు యేరా నీవు
మచ్చిక నాపె నీతోను మారుమాఁట లాడఁగాను
తచ్చన వీడెపుటాలి దాఁకె ననీ కాక

చ. 3: చనవున మెచ్చి మెచ్చి సారెకు నెవ్వతె నైనా
యెనసి కాఁగిలించేవు యేరా నీవు
నను నిట్టె శ్రీవెంకటనాథుడ కూడితివి
అనువై యాపె వాసన లంటె ననీ కాక.

చి.శృం.రేకు: 11-2 శంకరాభరణం సం: 10-061

పల్లవి: నా కన్నిచేఁత లెల్ల నాయకుఁడ యియ్యకోలె
యీకడ నీవేడుక యీడేరితేఁ జాలును

చ. 1: దాపుగా వారింటఁ గాని దగ్గరి మాయింటఁ గాని
వోపికతో నీవు లెస్స వుంటేఁ జాలు
ఆపెవద్దఁ గాని అట్టె నావద్దఁ గాని
తీపు లైన నీముచ్చట తీరితేఁ జాలును

చ. 2: అతివచేతనె కాని అట్టె నాచేతఁ గాని
యితవుగా నీవు భూజియించితేఁ జాలు
సతమై యాపెతోఁ గాని జట్టిగా నాతోఁ గాని
బతిమివట్టినట్లాఁ బాయకుంటేఁ జాలును

చ. 3: అలయింతిరతిఁ గాని అట్టె నారతిఁ గాని
చెలువమై నీసుఖము చెల్లితేఁ జాలు
చెలరేఁగి యిద్దరిని శ్రీవెంకటనాథుఁడ
చలపట్టి కూడితిగా సత మైతేఁ జాలును.

చి.శృం.రేకు: 11-3 మాళవిగౌళ సం: 10-062

పల్లవి: ఇంచుక యస మిచ్చితే యెవ్వరూ నేల మానేరు
కొంచేవా నీ వికఁ గోన చెన్నరాయఁడ

చ. 1: మొగము చూచి వలచి ముందు ముందె నీకుఁగేలు
మొగిచి మొక్కినదె వె మాయఁగా
సగముచూపులఁ జూచి జాణతనా లాడేవు
తగునా చేఁతకు నీచేఁతలు వో విభుఁడా

చ. 2: కలికి నీచేఁతలకు కాఁక రేఁగి నాకు నేనె
నిలిచి మాటాడినదె నేర మాయఁగా
చిలుకుగోళ నూఁది చేరి సరస మాడేవు
తలఁపనందుకు నీవు తగునయ్య విభుఁడా

చ. 3: అగ్గలపు వేడుకతో నలపు దీర నీమీఁద
దగ్గరి చేయి చాచుటే తగు లాయఁగా
వెగ్గళించి కూడితి శ్రీవెంకటనాథుఁడ నన్ను
సిగ్గుదీర నిదె కోనచెన్నరాయఁడవై.

 చి.శృం.రేకు: 11-4 సామంతం సం: 10-063

పల్లవి: ఆఁటదాన గనక నే నాసలు మానలేఁ గాక
యేఁటికి మాచక్కఁదనా లింపు గాని నీకున

చ. 1: వాడికై ననాఁటికి వలతు వింతే కాక
నేఁడు బాస చెల్లించ నీ కేలయ్యా
వాడుదేరుకూలికి వలచిని వలపులు
యీడేరించుకొనేది యింత పిన్నపనులా

చ. 2: పనిగల యప్పు డెల్లాఁ బైకొందు వింతే కాక
ననిచి యెప్పుడూ నేల నడుపేవయ్యా
చెనకి గడ్డాయముగాఁ జేసినబాస లెల్ల
అనువుగా నడపఁగ నల్లాడఁ బడెనా

చ. 3: చిత్తము నిలుప లేక శ్రీవెంకటనాథుఁడ
హత్తి కూడితివి గాక అల పేలయ్యా
కొత్తగాఁ దమకముఁ గూడినకూట మెల్లా
తత్తరపడక యుండఁ దమయిచ్చుటా.

చి.శృం.రేకు: 11-5 రామక్రియ సం: 10-064

పల్లవి: పించెపుతలజడల పిన్నవాడు
పెంచీనె వలపులు పిన్నవాఁడు

చ. 1: చనవరివలెనె వేసాలచేఁతలు సేసి
పెనఁగీ గుచములతోఁ బిన్నవాఁడు
ఘన మై ముద్దులు చూపి కరఁగించియింతలోనె
పెనపులఁ బెట్టీనె పిన్నవాఁడు

చ. 2: చెలిమికానివలెనె సిగ్గు వీడ మాఁటలాడి
పిలిచీ యేకతానకుఁ బిన్న వాఁడు
కులమువావులు చెప్పి గుట్టు దెలుసుక నాతో
పెలుచుమాఁట లాడీనె పిన్నవాఁడు

చ. 3: చిట్టకపు చేఁతలను చెనకి నావేలఁ దెచ్చి
పెట్టీనె వుంగరము పిన్నవాఁడు
గట్టిగాఁ దానె శ్రీవెంకటనాథుఁ డై వచ్చి
బెట్టుగా నన్నుఁగూడెనే పిన్నవాఁడు.

చి.శృం.రేకు: 11-6 శంకరాభరణం సం: 10-065

పల్లవి: ఏఁటి కిఁక నాకు నీతో నెగ్గు లెంచను
మాఁటలాడినప్పుడె మానేనయ్యా కోపము

చ. 1: మాన లేక నీవు పెక్కు మానినులఁ దెచ్చినాను
దాని కేమీ నేను పెద్దదాననె కానా
నాననట్టివలపులు నాఁడు నాఁడె చవులు గావా
సానఁ బట్టినమణులు చాయలె కావా

చ. 2: పొందులె మానక నీ వేపొలఁతి యింటనుండినా
అందుకే మెపుడు నీకు నాలనే కదా
ముందు ముందె యిట్లానైన మోహములు తీపులే కా
యెందు నాఁక లైనవిందు యితవు లవునె కా

చ. 3: కళలు మించ నీ వెవ్వతెఁ గాగిలించుకొన్నానేమి
బలిమి నైన నావరుస పాయవే కదా
చెలిమి సేసేనాటిబాస శ్రీవెంకటనాథ నీవు
తలఁచి కూడితి నాతోఁ దనియక వుందునా.

చి.శృం.రేకు: 12-1 బౌళి సం: 10-066

పల్లవి: చిత్తమె చిమ్మి రేఁగితే సిగ్గేమి యెగ్గేమి
రుత్తవోని వేడుకల రుచి గన్నవారికి

చ. 1: మొక్కలానఁ దిట్టినాను మోహమెపెచ్చువెరుగు
దక్క వలచినయట్టి తరితీపున
వుక్కుగోరు సోఁకినాను వుపచార మై తోఁచు
నిక్క మై సరస మాడ నేరిచినవారికి

చ. 2: కాలు దాఁకించిన నైన కళ లంటిన ట్లౌను
వేళమె మోహించినట్టి వేడుకను
పేలరి మాఁట లాడిన ప్రియములై తోఁచును
వాలాయించి నను పైనవారికిని

చ. 3: ఎంగిలి సోఁకించినాను యిచ్చక మై తోఁచును
పొంగెటి తమకపు తీపులవేళను
చెంగలించె నీచెలియ శ్రీవెంకటనాథుఁ గూడి
అంగ మైన మండెమురాయఁడె తానై యుండఁగా

చి.శృం.రేకు: 12-2 పాడి సం: 10-067

పల్లవి: రావయ్య వావిలిపాటి రామచంద్ర
రావాడివలపులు రామచంద్ర

చ. 1: మూఁగినసబలలోన ముంచి మాఁటలాడఁగాను
రాఁగెఁగా నీ మోవికెంపు రామచంద్ర
మాఁగినమాఁటలనె మర్మము లెత్తితి నని
రాఁగతనాలు మానుమీ రామచంద్ర

చ. 2: బట్టబయలుమాఁటల బాసలు సేయ రాఁగా
రట్టాయ నీ సుద్దులు రామచంద్ర
గుట్టు దెలిసినందుకు కోపగించుకొనకుమీ
రట్టెడిచేఁతల వో రామచంద్ర

చ. 3: ఆసలమాఁటల నన్ను నలమి పట్టఁగ నిన్ను
రాసెఁగా నా కొనగోరు రామచంద్ర
వేసాలు మాని నన్ను శ్రీవెంకటనాథుఁడ వై
రాసి కెక్కఁ గూడితివి రామచంద్ర.

ఛి.శృం.రేకు: 12-3 దేసాళం సం: 10-068

పల్లవి: కాంతుఁడు మరునియాజ్ఞ కడవలేఁ డింతే కాక
కొంతై న నెరఁగఁడా కోన చెన్నరాయఁడు

చ. 1: వలపు నిలుప లేక వనితకు మొక్కెఁ గాక
సొలప వాఁ డటువంటి సుద్దులవాఁడా
చెలిమి విడువ లేక చెయివ్రాఁత యిచ్చెఁ గాక
కొలమున నేమి తక్కువవాఁడా

చ. 2: ఆసలు మానఁగ లేక ఆకు మడి చిచ్చెఁ గాక
వేసాల వాఁ డటువంటి విద్యలవాఁడా
బాసలు దప్పఁగ లేక బడినె తిరిగెఁ గాక
యీసున దొరతనము లెఱుఁగనివాఁడా

చ. 3: పొందు విడువఁగ లేక పొత్తున భుజించెఁ గాక
అందగాఁ డాతఁ డెంగి లంటేవాఁడా
అంది శ్రీవెంకటనాథు డాపెఁ గూడితే నేమి
చందముగా నాతోడి సమరతి మానేనా.

చి.శృం.రేకు: 12-4 వరాళి సం: 10-069

పల్లవి: మాటకు మాఁటె యాడి మంచితనము సేయక
నీటున సరస మాడ నేఁడు నాకుఁ జెల్లునా

చ. 1: ఘనుఁడ వంటా నీకుఁ గానుక చేతి కిచ్చితే
యెనసి నీ వాపెచేతి కియ్యఁ దగునా
ననిచి నీనేరమా నానేర మింతే కాక
నిను దొర వని నమ్మి నేస్తము సేసినది

చ. 2: కాంతుఁడ వనుచు నాపుంగరము వేలఁ బెట్టితే
అంతలో నాపె కిచ్చితి వది దగునా
అంతయు నీకడమలా అది నాకడమ గాక
వింత లేనిపొందు నీతో వేడుకఁ జేసినది

చ. 3: హితవరి వని నీతో నేకతము చెప్పితేను
అతివతోఁ జెప్పితివి అవురా నీవు
కతకారి శ్రీవెంకటనాథ నన్నుఁ గూడి
బతిమివట్టు కుండఁగా బాసడుగఁ జెల్లునా.

చి.శృం.రేకు: 12-5 ముఖారి సం: 10-070

పల్లవి: సవతుల మైనాను సంగతి దప్పఁ దగునా
రవళి వావిలిపాటి రామచంద్రుముందర

చ. 1: నీ వనఁగా నే ననఁగా నిష్టూరా లేఁటికే
చేవదేరే మాఁట లెల్ల చిగిరించీని
మోవరాని దూరు లెల్ల మోపులు గట్టఁగాను
వేవేగ నిన్నియు మనవిభుఁడు మోఁచీనా

చ. 2: కా దనఁగా నౌ ననఁగా కరక రేమిటికే
మీఁద మీఁద జగడాలు మితిమీరీని
వాదుల యీ సుద్దు లెల్ల వాములు వెట్టెఁగాను
కా దని మనవిభుఁడు గాదెలఁ బోసీనా

చ. 3: రమ్మనఁగ పొమ్మనఁగ రారాఁపు లేఁటికే
దొమ్మి రేఁగి కాఁకలు తోదోపు లాడీని
నమ్మించి శ్రీవెంకటనాథుఁడు నిన్ను నన్నును
సమ్మతిగాఁ గూడఁగాను సతము లై తిమిగా.

చి.శృం.రేకు: 12-6 రామక్రియ సం: 10-071

పల్లవి: కాంతాళించాడినమాఁట గాదు సుమ్మీ వోవిభుఁడ
దొంతిమాయలఁ జిక్కఁగ దొరలకుఁ జెల్లునా

చ. 1: వేడుకతో నీ వాపె వెంట వెంటఁ దిరుగగా
చేడెలలో నెల్ల నాకు సిగ్గాయరా
యీడు లేని వలపు నిన్నెరఁగని దింతే కాక
తోడనె యీ పను లెల్ల దొరలకుఁ జెల్లునా

చ. 2: వొయ్యనె నీ వాపెకు వూడిగాలు సేయఁగాను
నెయ్యపు నా కపు డెంత నెగు లాయరా
గయ్యాళితమి నీకు కన్నులఁ గప్పెఁ గాక
తొయ్యలికి నింత లోఁగ దొరలకుఁ జెల్లునా

చ. 3: ఆసపడి నీ వాపెకు అట్టె కొలువు సేయఁగా
యీసున నాకునుఁ గోప మెంత వచ్చెరా
కోసువానిపల్లెలోనఁ గూడి శ్రీవెంకటనాథ
తోసిపోవైతివి యింత దొరలకుఁ జెల్లునా.

చి.శృం.రేకు: 13-1 దేసాళం సం: 10-072

పల్లవి: చాలు లేరె మీ రేల చక్కటులు చెప్పేరె
మేలు గలవారికి మెచ్చకుండఁ జెల్లునా

చ. 1: వలచినవాఁ డైతె వద్దికి తా వచ్చుఁ గాక
అలిగి తా నెడమాఁట లాడించునా
చెలిమే కలిగితేను సిగ్గుపడవలెఁ గాక
వొలసీనొల్లముతో నూరకుండఁ జెల్లునా

చ. 2: ప్రియమే కలిగితేను పిలువ రావలెఁ గాక
దయ లేక యింతవడి తామసించునా
నయమే కలిగితేను నమ్మించవలెఁ గాక
భయము లే కింతవడి పట్టెడఁ జెల్లునా

చ. 3: ఆసలే కలిగితేను అలముకోవలెఁ గాక
యీసున మరి యెగ్గు లెంచఁ జెల్లునా
వేసాలు మాని నన్ను శ్రీవెంకటనాథుఁడు గూడె
వాసు లెంచి యాతఁ డీఁక వాదించఁ జెల్లునా.

చి.శృం.రేకు: 13-2 గౌళ సం: 10-073

పల్లవి: మేర లేనివల పిద మీ కేల తెలుసునే
యీరస మయ్యేబుద్ధు లేల చెప్పేరే

చ. 1: ఆఁట దెంత గబ్బి యన్నా ననుఁడ మీరిఁకవేయి
మాఁట లన్నా వాని నేను మాన లేనే
వేఁటలాడేమదనుఁడు విరహులఁ బొడగంటే
యీ టెలవంటి పూబాణా లేమరుండీనా

చ. 2: అమ్మరో యంతటికల్ల యన్నా నంటిరి గాని
వమ్ము వోని వానిపొందు వదల లేనే
కమ్మటిఁ జందురుఁడు కాఁకలఁ బొరలేవారిపై
కుమ్మువంటి వెన్నెలలు గుప్పకుండీనా

చ. 3: అతివ మారాడఁ జెల్ల దన్నా నంటిరి గాని
వెత లేనివానిరతి విడువ లేనే
కతకారై నన్ను శ్రీవెంకటనాథుఁ గూడె
యిత వైనకళ లెల్లా హెచ్చకుండీనా

చి.శృం.రేకు: 13-3 ముఖారి సం: 10-074

పల్లవి: ఎక్కడి పరాకుననో యిందాఁకా నుండెఁ గాక
మక్కువ నాపై బత్తి మానలేఁడె వాఁడు

చ. 1: పాయరాని వలపులు పక్కనఁ దలఁచుకొంటే
రాయా మనసు గరఁగ కేమే
వో యమ్మలాల నావుంగరము చూపరమ్మ
వేయేల తా నిప్పుడే విచ్చేసీ నీడకే

చ. 2: వూనినట్టిసరసాలు వూహించుకొంటేను
మానా దేహము తమకించ కేమే
మానినులాల వొక్కమాఁట విన్నవించరమ్మ
తానె వచ్చి నన్నుసంతస మందించీనే

చ. 3: నేదదేరే చనవులు చిత్తమునఁ దగిలితే
దూదేవయ సేమి వూదితేఁ బోను
ఆదెస మండెమురాయఁ డైన శ్రీవెంకటనాథుఁ
డాదరించి నన్నుఁ గూడె నతివమోహముననూ

చి.శృం.రేకు: 13-4 సామంతం సం: 10-075

పల్లవి: ఈడేర వలచితే యేపని సేయఁగ రాదు
యేడ నైనా యెగ్గు సిగ్గు లెంచేరా భూమిని

చ. 1: వనిత చెప్పితే జాలు వారి దైనా నీఁదేవు
అనువుగాఁ గొండ మోవు మన్నా మోఁచేవు
తనివోక బూ మెల్లాఁ దవ్వు మన్నాఁ దవ్వేవు
వొనర బహురూపాన నుండు మన్నా నుండేవు

చ. 2: ఇంతి చెప్పితేఁ జాలు యెంతైనాఁ గొంచెపడేవు
అంతలోఁ బగరఁ జంపు మన్నాఁ జంపేవు
చెంత నాపె తపములు సేయు మన్నాఁ జేసేవు
కాంత దనపసులనుఁ గావు మన్నాఁ గాసేవు

చ. 3: అతివ చూచి కల్ల లాడు మన్నా నాడేవు
బతిమిఁ బారాడు మన్నాఁ బారాడేవు
పతి వైన కోసువానిపల్లె శ్రీవెంకటనాథ
గతియై కూ డుండు మన్నాఁ గాఁగిట నుండేవు.

చి.శృం.రేకు: 13-5 కేదారగౌళ సం: 10-076

పల్లవి: నేనె యనంగ నేల నీమనసూ నెరఁగదా
ఆనవెట్టి చెప్పేఁ జుమ్మీ ఆసగింతు నీకు

చ. 1: చిగిరించె కోపమున జేఁదై నవలపు
తెగనట్టి తమకానఁ దీపాయరా
వొగరుఁగాకలచేత నుడికేటి దేహము
సగము మొగమోటానఁ జల్ల నాయరా

చ. 2: చిమ్మిరేఁగె జగడాల జీఁక టైనమోహము
దిమ్మరియెడమాఁటలఁ దేటవారెరా
సమ్మతిగా నీ వొట్ల సైంచనిపొందుల
యెమ్మెల కోరికలచే నితవాయరా

చ. 3: చెదరని రేసులఁ జిన్న బోయె మోములు
కదిసి మేను సోఁకితేఁ గళ రేఁగెరా
వెదకి నీవు నేనూ శ్రీవెంకటనాథ కూడఁగా
మదిలోని మచ్చికలు మక్కళించెరా

చి.శృం.రేకు: 13-6 శుద్ధదేశి సం: 10-077

పల్లవి: కొండవంటిదొరవు నీగుణ మేల విడిచేవు
వుండరాదా నీ వుండేవొడికానను

చ. 1: కడుఁ దగవు చెప్పేవు కట్టెకానికలు వెట్టి
అడిగితిమా నిన్ను నయ్యా నేఁడు
బడి బడి నీవు చెప్తే పండితనాయానకు
తొడిఁబడ నెవ్వతైనా తుచ్చ మాడకుండునా

చ. 2: వెట్టిసాకిరి చెప్పేవు విత్తూఁ దిమ్మిరి వేసి
నెట్టెనఁ గరి గోరేమా నేఁడు నిన్నును
బెట్టిమాఁట లాడి నీవు పిరిదూరి రాఁగాను
గుట్టుచెడ నెవ్వతైనాఁ గోపగించకుండునా

చ. 3: నీతులు చెప్ప వచ్చేవు నినుఁ బెద్దతన మిచ్చి
ఆతల నడిగితిమా అప్పటినిన్ను
కాతరాన నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
ఘాత రతిలోపల నాకాలు దాఁకకుండునా.

చి.శృం.రేకు: 14-1 దేసాళం సం: 10-078

పల్లవి: ఒక్కరి నౌ నన నేల వొకరిఁ గా దన నేల
చెక్కు నొక్కి ప్రియములే చెప్పించుకో రాదా

చ. 1: మేలురా నాతో నీవు మితిమీరి మాఁటాడేవు
ఔలే నాతోడి వాదు కాపో నీవో
యేలరా నీపాలిటికి నిద్దరము సమమే
మేల మాడి సారె సారె మెప్పించుకో రాదా

చ. 2: ఇప్పుడు నీవె వాసు లెక్కించుక వచ్చేవు
అప్పటి నాతోడి సవ తాపో నీవో
అప్పసమై యిద్దరము నాండ్ల మింతే నీకు
ముప్పిరి దేవరవలె మొక్కించుకో రాదా

చ. 3: కన్నుల జంకెనలతో గరిసించి యడిగేవు
అన్ని వొట్లకు గురి యాపో నీవో
నన్ను నిట్టె శ్రీవెంకటనాథుఁడ నీవె కూడితి
వెన్నఁడూ నిద్దరి నిట్టె యేలుకొన రాదా

చి.శృం.రేకు: 14-2 ముఖారి-ఏకతాళి సం: 10-079

పల్లవి: తేటతెల్ల మిమాఁటలఁ దెలియ నాడఁ గదరా
మాటి మాటి కింత యేల మరఁగు లాడేవు

చ. 1: కన్నుల నవ్వుల నేల గయ్యాళించేవు నేము
నిన్ను వంటి వొరపులే నేరుతుమా
సన్నలా చాయలా నేల సాధించేవు వో
వెన్నుఁడా నే మింతేసి వెర వెఱుఁగుదుమా

చ. 2: తక్కరిమాఁటల జాణతన మాడేవు నేము
చక్కఁగా నీవలె నంత చదివితిమా
మిక్కిలి వాఁడిగోళ్లు మీఁదఁ జిమ్మేవు నేము
కక్కసపు జేఁతలకు కరఁగ నేరుతుమా

చ. 3: నిబ్బరపు గాఁగిటను నించే వేమిరా నేము
అబ్బురంపు నిన్ను నౌఁ గా దనఁ గలమా
గబ్బివై కూడితి శ్రీవెంకటనాథుఁడా నేము
వొబ్బిడి నింత సేసితే వొద్దనఁగఁ గలమా

చి.శృం.రేకు: 14-3 మాళవిగౌళ సం: 10-080

పల్లవి: బెల్లపుమాఁటల చెల్లపిళ్ల రాయఁడా నీకు
జెల్లునయ్య యేమైన చెల్లపిళ్ల రాయఁడా

చ. 1: పేలరిమాఁట లాడేవు పెద్దతనమా యిది
పీలిచుంగుతోడి చెల్లపిళ్ల రాయఁడా
కాలు దాఁకించినప్పుడె కళ లంటె నిఁక నేల
చేలకొంగు వట్టే వు చెల్లపిళ్ల రాయఁడా

చ. 2: యీతల నాకుఁ బరచే వింతటి దొరవు నీ
పీతాంబరము చెల్లపిళ్లరాయఁడా
ఘాతల నీగోరు దాఁకి కరఁగితి నిఁక నే నీ
చేతిలోని దాన నింతె చెల్లపిళ్లరాయఁడా

చ. 3: నెట్టన దేవరవంటి నీమేనిసొమ్ము నాకుఁ
బెట్టేవుగా చెల్లపిళ్లరాయఁడా
గట్టిగా నన్ను శ్రీవెంకటనాథుఁడ వై కూడి
చిట్టెకాలు సేసేవు చెల్లపిళ్లరాయడా.

చి.శృం.రేకు: 14-4 కన్నడబంగాళం సం: 10-081

పల్లవి: బాలుఁడు సేసెటి పనులా
వోల వేయవచ్చీ నోయమ్మా

చ. 1: చన్నులపైఁ జెయి చాఁచీనే యివి
చిన్నవాండ్ల చేఁతలా
కన్నులు గిరిపీ గామి డై
వున్నాఁ డిప్పుడు వోయమ్మా

చ. 2: పస నీమోవిపైఁ బల్లు సోఁకించీ
పసిబిడ్డలబాగులా
కొసరుమాఁటల గో రంటి విడె
మొసఁగీ నిప్పుడె కోయమ్మా

చ. 3: నిండారఁ గాఁగిట నించీనే యివి
కొండుకబిడ్డలగుణములా
వెండిఁ బైఁడి నిచ్చి శ్రీవెంకటనాథుఁడు
వుం డుండి నను గూడె నోయమ్మా

చి.శృం.రేకు: 14-5 నాదరామక్రియ సం: 10-082

పల్లవి: రారా చిన్నన్నా రా రోరి చిన్నవాఁడ
రార ముద్దులాఁడ రా రోరి బాలకృష్ణ

చ. 1: కిందిచూపుల గిలిగించి ఆల
మంద గొల్లెతల మరిగించి
సందడి వలపించి జవరాండ్ల వూర
విందవైనయట్టి వేడుకకాఁడ

చ. 2: కొదలుమాఁటలనె గొణఁగుచు భూమి
సుదతుల శిగ్గులు చూరాడి
చిదుగుచేఁతలనె చెనకుచు ముద్దుఁ
బెదవిచవులు చూపిన జాణకాఁడ

చ. 3: కలికితనముననె కరఁగించి కాచె
చెలుల కాఁగిటనె చెలఁగి
లలనామణి యైన లకిమమ్మఁ
గలసుక శ్రీవెంకటనాథుఁడైనవాఁడ

ఛి.శృం.రేకు: 14-6 కాంబోదిసం: 10-083

పల్లవి: మచ్చికఁ బందిలి వెట్టే మాయకాఁడ
కుచ్చితపు వేరుపుల కుశీలికాఁడ

చ. 1: పలుకునయమె కాని పస లేదు నేస్తము
వలపులబేరాల వన్నెకాఁడ
మొలకనవ్వులె కాని మోహ మెరఁగ రాదు
నిలువు రాజసముల నీటుకాఁడ

చ. 2: దవ్వులపొందె కాని దగ్గరఁగ నెడ లేదు
జవ్వనపుమదముల జాణకాఁడ
పువ్వులవాట్లె కాని పొరపొచ్చము మానవు
రవ్వలసరముల రాయడికాఁడ

చ. 3: తమకపుఁ జూపె కాని తలఁపు దెలియ నీవు
అమరినరతులలో ఆసోదకాఁడ
క్రమమున నన్ను శ్రీవెంకటనాథ నీవె కూడి
భ్రమయించి తౌర వోరి పంతగాఁడా

చి.శృం.రేకు: 15-1 లలిత సం: 10-084

పల్లవి: చాలా మేలుదిరా యీబాలామణిపుడు నీ
పాలిటఁ జిక్కెరా గోపాలక కృష్ణమ్మా

చ. 1: పంకాజముఖి నీవంకా చూచి నప్పుడే
పొంకాముగా వలచె యింకా నే మందురా
సంకె లేక నీమీఁద నంకిత మైనపాట
లంకించి పాడీ నీతో లంకెలఁ గృష్ణమ్మా

చ. 2: పల్లాదమున నీవు మొల్లామి నందరిలో
మొల్లాపూబంతి వేయ జల్లానఁ గరఁగెరా
మెల్లానె వ్రాసి చూచీఁ జల్లాఁగ నీ రూపమె
కల్లా గాదురా శ్రీవల్లభ కృష్ణమ్మా

చ. 3: తటుకానా నీ వప్పుడు నటనాలా సరసాన
యిటు నటుఁ గాగిలించ నెట్లాఁ దా జొక్కెరా
విటరాయఁడవు శ్రీవెంకటనాథ నీ కూటమి
ఘటియించ వేడుక మిక్కుట మాయఁగృష్ణమ్మా

చి.శృం.రేకు: 15-2 దేసాళం సం: 10-085

పల్లవి: ఎన్నఁడయ్యా నీ నేరుపు లిప్పుడు గాక
మున్నిటిపాం దై నవారి ముందరనె కాక

చ. 1: వాడలోన నీమోమె వనితలు చూడఁగాను
యీడనె సేయవద్దా నీ యెమ్మెలు
చేడె లెల్లా నీ మాఁటలె చెవి యొగ్గి వినఁగాను
ఆడవద్దా నీకు దోఁచి న ట్టెల్లాను

చ. 2: సతు లెల్లా మూఁకగట్టి సంగడి నిలుచుండఁగా
సతమై కరఁగ వద్దా సారెకు నీవు
అతివలె చెయి ముట్టి అంటి సరస మాడఁగ
మతిలోనఁ జొక్కవద్దా మాముందర నీవు

చ. 3: సందడిలో నింతు లెల్లా చన్నుల నిన్నొరయఁగా
కందువ లంటఁగ వద్దా గబ్బి వై నీవు
యిందె శ్రీవెంకటనాథ యేకతమై వుండఁగాను
అందముగా నన్నుఁ గూడి తవునయ్యా నీవు

చి.శృం.రేకు: 15-3 ఆహిరి సం: 10-086

పల్లవి: అయ్యో దయ వలదా ఆఁటదానికి
చయ్యాట మాడినాను సంగతి గావలదా

చ. 1: జీరల నీ మేను చూచి సిగ్గయ్యీ నా కైతె
ఆరడి నీ కె ట్లితవాయనో కాని
కూరిమితో నాపెకు నీ కుందణమువంటి మేను
యీరీతిఁ జేయఁగఁ జేతు లెట్టాడెనో

చ. 2: గంటైన నీ మోవి చూచి కనికిర మయ్యీని
కంటకము నీ కెట్లా గాదో గాని
గొంటరియాపె దానె చిగురువంటి నీ మోవి
అంటి యింత సేసె నెంత అగ్గలికో కాని

చ. 3: కురులు నలఁగిన నీ కొప్పు చూచి వెరగయ్యీ
శిరసు నీ కె ట్టోరిచెనో కాని
గరిమఁ గూడితి శ్రీవెంకటనాథ నను నిటె
నిరతిఁ గడపరాయ నిను మించఁ గలనా.

చి.శృం.రేకు: 15-4 హిందోళం సం: 10-087

పల్లవి: పాలు దాగె వెన్న దినె బానల పెరుగు జుట్టె
సోలి కాఁగులనేతులు చూరలాడె నమ్మా

చ. 1: చిన్నవాని ఆరడి సేసినట్లు వుండుఁ గాని
యెన్నెన్నిపోకిళ్లఁ బోయ్యా యీకృష్ణుఁడు
కన్నెలు ముద్దాడఁ బోతే గంటి సేసి మోవు లెల్ల
తన్నుఁ గానట్టున్నాఁడు దయ్యపువాడమ్మా

చ. 2: తగినపసిబిడ్డనిఁ దతిగొన్న ట్టుండుఁ గాని
యెగసక్కె లెన్ని నేర్చె యీగోవిందుడు
మగువ లెత్తుకొంటేను మరి గోళ్లువెట్టి తానె
తగవులు చెప్పెఁ గతలకారోయమ్మా

చ. 3: పలుదూరులు బాలునిపైఁ జెప్పినట్టుండుఁ గాని
కలికివాఁడమ్మ శ్రీవెంకటనాథుఁడు
చెలులు కాఁగిలించితే సిగ్గు వీడఁ గూడి కూడి
వలపించినాడు యెటువంటివా డోయమ్మా

చి.శృం.రేకు: 15-5 పాడి సం: 10-088

పల్లవి: అంతేపో నాతోడ నౌఁ గా దనఁ గ రాదు
పంతమాడి గెలిచితే బంట వయ్యేవా

చ. 1: కానీ లేరా పొడుపుడుఁగతలు వొడువు మని
ఆనవెట్టి న న్నేల అడ్డగించేవు
పూని నా కతలు నీకుఁ బొందుగాఁదెలియకుంటే
పానిపట్టి నీవె నా బంట వయ్యేవా

చ. 2: చలపటి నాతోడ సరిబేసు లాడు మని
బలిమి నాకొం గేల పట్టి తీసేవు
వొలిసి ని న్నిప్పుడె వొడించితే నాతోడఁ
బలుమాఁట లేల నాబంట వయ్యేవా

చ. 3: నీవు దలఁచిన సుద్ది నిక్కి నన్నుఁ జెప్పుమని
కావించి మండెమురాయ కాఁగిలించేవు
శ్రీవెంకటనాథుఁడవె చెలఁగి నీ వనుచు నీ
భావ మెరిఁగి కూడితి బంట వయ్యేవా.

చి.శృం.రేకు: 15-6 ముఖారి సం: 10-089

పల్లవి: ఇది యేమె వీనిగుణ మొటువంటిదే
వదలక నవ్వ నూరవదినెనా నేను

చ. 1: చక్కనివాఁ డైతేఁ దానె చల్లఁగా నుండుఁ గాక
యిక్కడ నెవ్వరి భ్రమయించ వచ్చినె
వక్కణలమాఁటలకు వలచి వెంటఁ దిరుగ
తక్కరి రేపల్లె గొల్లదాననా యేమి

చ. 2: పాయపువాఁ డైతేను బదుక నీవె యిట్టె
కాయక మై యెవ్వరిపైఁ గన్ను లార్చినె
సోయగ మై తనమోము చూచి నట్టె మోహించి
పాయకుండ మేనవారిపడుచనా నేను

చ. 3: నేరుపది దా నైతె నెమ్మది నుండుఁ గాక
కేరి కేరి యెవ్వరిపై గేలు చాఁచీనె
చేర వచ్చి నెల్లూరి శ్రీవెంకటనాథుఁ డిట్టె
యీరీతినె ననుఁ గడె యిందిరనా నేను.

ఛి.శృం.రేకు: 16-1 శ్రీరాగం సం: 10-090

పల్లవి: వల పేమి గంపఁ గమ్మవచ్చునా యెందైన
చెలులాల మాయిద్దరి చిత్తములే యెరుఁగు

చ. 1: యెనయని కోపమున యేమైనా నంటిఁ గాక
మనసులో మమతలు మానఁ గలనా
ఘనమైన పొలయలుకలఁ గొసరితిఁ గాక
వినరమ్మె రమణుని వితనాడఁ గలనా

చ. 2: ఆలసించి రాఁగానె అన్నియుఁ దిటితిఁ గాక
మేలుదాన వానిఁ బాసి మించఁ గలనా
ఆలరి యై తిరుగఁగ నమ్మరో దూరితిఁ గాక
బాలకి నైన వానిఁ బాసి వుండఁ గలనా

చ. 3: దగ్గరని కాఁతాళాన తగుఁ దగ దంటిఁ గాక
యెగ్గువట్టి వానితప్పులెంచఁ గలనా
కగ్గు లేక శ్రీవెంకటనాథుఁడె నన్ను
అగ్గల మై కూడె వానియండ వాయఁ గలనా.

చి.శృం.రేకు: 16-2 వరాళి సం: 10-091

పల్లవి: ఎటువంటి దొర వైతి వేమయ్య నీవు
అటమటముల నీకు నాచార మేది

చ. 1: వెనక నా యడపమువెలఁది మో వానితివి
అనువుగ నేఁ గంటి నద్దములోన
తనియక నాకు నిట్టె తమ్ముల మిడ వచ్చేవు
యెనసి వూడిగపుదానెంగిలి కోపుదునా

చ. 2: ముచ్చట నా కాళాంజిముదితఁ గాఁగిలించితి
వచ్చుగా నే రత్నపుగోడావలఁ గంటి
యిచ్చకాన నామీఁద నిట్టె చెయి వేసేవు
చెచ్చెర సేవకురాలిచెమట కోపుదునా

చ. 3: వొద్దనె నా కుంచదాని నొగిఁ దోఁటలోఁ గూడఁగా
నిద్దపుఁ గేళారూళి నీటిలోఁ గంటి
గద్దరివై నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
అద్దో పరిచారకురాలంటుకు నోపుదునా.

చి.శృం.రేకు: 16-3 పాడి సం: 10-092

పల్లవి: సుసరాన మంచి దాయ సుదతులాల
విసుగక పతిఁ దేస్తే వెద లేమి లేవే

చ. 1: తమ్మితూఁడు లాళమునఁ దగిన కస్తూరివుంట
వుమ్మడినె మదనుఁడు వూదఁగను
కొమ్మ చనుజక్కవల గొబ్బున నెగయఁగాను
కమ్మి పతిపె పయ్యద గలుగఁగ నిల్చెనే

చ. 2: మొగలిరే కొడిశంట ముదురుఁగ ప్రపులప్ప
వెగటున మదనుఁడు వేయఁగను
అగడై యింతి నడపుటంచలు బెదరఁగాను
వొగిఁ బాదపుపెండెము లోపికె నిలిపెనే

చ. 3: చెఱకుఁదూఁట సింగిణి చెంగలువ మిట్టకోల
వెఱవక మదనుఁడు వేయఁగను
పఱచికురులతేంట్లు పారఁగా నడ్డ మై కాంతఁ
గఱఁగించి కూడీ శ్రీవెంకటనాథుఁ డాపెనే

చి.శృం.రేకు: 16-4 శుద్ధదేశి సం: 10-093

పల్లవి: కన్నెపడుచుతో నేమి గయ్యాళించేవు
అన్నిటా మచ్చికైతె నిన్నాపె మించ నోపదా

చ. 1: దివ్వెకు మానెవోనె పతిమఁ జూచి ముద్దరాలు
యెవ్వతో వున్న దని యిదె కొంకీని
నవ్వు లేమి నవ్వేవు నాలికాఁడ చెయివట్టి
జవ్వనిఁ దియ్యరాదా చలివాయను

చ. 2: పొదిగి పాదాలు గుద్దె బొమ్మఁ జూచి గోలయై
అదెవ్వతో వున్న దని అండు కాచీని
యిదేమి వేడుక చూచే వెమ్మె కాఁడ కొంగువట్టి
కదియఁ దియ్యఁగ రాదా కళ రేఁగను

చ. 3: చేయంటి సురటి వీచే చేఁతాళపు రూప్పు చూచి
పాయని దెవ్వతో యని బాల లోఁగీని
కాయజకేలిని శ్రీవెంకటనాథ కూడితివి
ఆయెడ న న్నింద నిల్పి యతి మోదమునను.

చి.శృం.రేకు: 16-5 భైరవి సం: 10-094

పల్లవి: ఎంతనేరుపరివి ని న్నే మందమే
పంత మాడె యాపె నింత భ్రమయించెఁ జూడరే

చ. 1: చలపాదియాపె నా సంగడినె వుండఁగాను
వెలఁది రమణుఁ డొక్కవిధము సేసె
అల చుక్కల నెంచవె యని దాని నేమరించి
కళ లంటి నను బిగ్గఁ గాఁగిలించెనే

చ. 2: మొక్కళాన యాపె నాతో మొనసి సాటికిరాఁగా
చక్కనిరమణు డొక్కజాడ సేసెనే
అక్కడ దాగిలిముచ్చు లాడి దాని గన్నుమూసి
దక్కి నామో వాని నాకుఁ దమ్ములము వెట్టెనే

చ. 3: బట్టె గుత్తె యాపె నేఁడు పాయక వద్ద నుండఁగా
యిట్టె శ్రీవెంకటనాథుఁ డిటు సేసెనే
గట్టిగా నాపె కన్నులఁ గప్రమునిండాఁబెట్టి
జట్టిగా నాతోఁ గూడి సమరతి సేసెనే.

చి.శృం.రేకు: 16-6 నాదరామక్రియ సం: 10-095

పల్లవి: ఎత్తూ నొరాఁ గల దిటువంటిది వలపు
యిత్తరి గాఁకల వన్ను యించుకాఁ దియ్యదు

చ. 1: మచ్చికతోడుతఁ దూఁగు మంచపుఁ దాసుమీఁద
నిచ్చ నిండ జవ్వనపు నీవొక్కచో
నిచ్చలపు గుణముల నే నొక్కచో నుండఁగాను
అచ్చముగా సరిఁ దూఁచె నతనుఁడే యిపుడు

చ. 2: మించి చలువరాయనే మెచ్చుల వొరగంటిపై
నించినట్టి వేడుకల నీదేహము
దించని తమకపు నాదేహమూఁ బెనఁగఁగా
పొంచి సరిగా నొరసె పూవిలుతుఁ డిపుడు

చ. 3: కలసె పూఁబానుపు మొగ్గల గొప్పసళాకలు
నిలువున శ్రీవెంకటనాథ నీరతికి
కొలఁది మీరఁగ నేఁ గడిన సమరతికి
వలె నని వనె వెట్టీ వలరాయఁడిపుడు

చి.శృం.రేకు: 17-1 దేసాళం సం: 10-096

పల్లవి: సిగ్గువడ నేమిటికి చెలువమె యిది నీకు
యెగ్గు లేదు యిట్టె సింగారించుకొనవయ్యా

చ. 1: కపురపు బలుకుల కంటసరులు నీకు
యిపు డిట్టె చెలి యంపె నిందవయ్యా
చపలపు నీమెడ చంద్రవంకల మీఁద
కపురై వుండు నిట్టె కట్టుకొనవయ్యా

చ. 2: నెలకొన్నకస్తూరి నిగరపుఁ బోఁగులు
కలికి నీకు నంపెఁ గైకొనవయ్యా
యెలమిని మేదించినితరవాసనఁ గప్పి
పెలుచ వందురు యిట్టె పెట్టుకొనవయ్యా

చ. 3: కోవరపుఁ బచ్చికుంకుమపూవుదండ లంపె
శ్రీవెంకటనాథ యింతిఁ జేకొనవయ్యా
తోవల నీమై నంటిన తొలుతటి పస పెల్లా
వేవేగ నిది గప్పి వేసుకొనవయ్యా

చి.శృం.రేకు: 17-2 ముఖారి సం: 10-097

పల్లవి: దానిసాహసము మేలు తరవాత నీవు మేలు
వూనిన యారడికి ని న్నొడి గట్టించినది

చ. 1: రవ్వగా మే నెల్లా జీరలుగాఁ జేయించుక
మవ్వపు నాయెదుట నీవు మలసేవు
నవ్వుల కైనాను నామాఁట మీరనినిన్ను
యెవ్వతెరా నిన్ను నింతగాఁ జేసినది

చ. 2: చిగురు నీమోవి యెల్లా చిల్లులుగాఁ జేయించుక
వెగటుగా నాయెదుట విఱ్ఱవీఁగేవు
తగవుల కైనా జివగాఁటని నిన్నుఁ దెచ్చి
జగ నీపై యింత సేసి చలి వాపెను

చ. 3: చేవ దేర నీతురుము చిక్కువడఁ జేయించుక
శ్రీవెంకటనాథ కడుఁ జెలఁగేవు
యేవేళ నన్నుఁబాయక యెనసి వుండితినిన్ను
యీవేళఁ జెనకుచు యెమ్మెలు సేసినది

చి.శృం.రేకు: 17-3 సాళంగనాట సం: 10-098

పల్లవి: ఔనయ్యా మే లెరిఁగిన ఆణికాఁడవు
తానక మైన నీ దొరతన మెల్లాఁ గంటిమి

చ. 1: జక్కఁదన మెరఁగనిజాణవా నీ వేమైనా
తక్కరి వై గుజ్జుదానిఁ దగిలితివి
యెక్కువగా నాముందర యెవ్వరినో యెంచఁగాను
చక్కఁగా నామదిలోన చల్లఁ గాక వుండునా

చ. 2: కన్నెపాయ మెరఁగని ఘనుఁడవా నీ వేమి
పిన్న వై రేవతిదేవిఁ బెండ్లాడితివి
యెన్నికె నాముందర నీయింతులజవ్వనమెంచె
తన్నిటా నామదిలోన నానందించ కుందునా

చ. 3: యిట్టె వినయము నీ వెరఁగవా నీ రొమ్ము
మెట్టినయింతికె కడు మేలువాఁడవు
చిట్టకము లెంచేటి శ్రీవెంకటనాథ నన్ను
గటిగాఁ గూడితివి నేఁ గరఁగక వుందునా.

చి.శృం.రేకు: 17-4 సామంతం సం: 10-099

పల్లవి: ఇచ్చకమె సేసే వేరా నీవు
యెచ్చోటి చనవరి వేరా నీవు

చ. 1: మన్నించి నన్ను నిట్టె మరఁదల రమ్మనేవు
యెన్నటి మేనవాఁడ వేరా నీవు
వెన్నుఁడ నన్ను నిట్టె విడెము దెమ్మనేవు
యెన్ని దాఁచఁ బెట్టితివి యేరా నీవు

చ. 2: మెప్పించి నాతోడ మేలము లాడేవు
యెప్పటి నేస్తకాఁడ వేరా నీవు
దుప్పటికొంగు నాపై దొడిఁబడఁ గప్పేవు
యిప్పు డెన్నటిపొందు యేరా నీవు

చ. 3: కానిరా నను నిట్టె కాఁగిలించుకొనేవు
యేనాటి చుట్టమవు యేరా నీవు
కానిపించి నన్ను శ్రీవెంకటనాథ కూడితివి
యేనెలవున నేలితి వేరా నీవూ.

 చి.శృం.రేకు: 17-5 బౌళి-వర్మతాళం సం: 10-100

పల్లవి: ఇంక నేలా నాతోడ యింత సేయ
అంకెకాఁడ వౌర శేషాద్రినాథా

చ. 1: చల్ల లమ్మేవారి కేల చందనము
చెల్లు నీవె పూసుకోరా చిన్నవాఁడ
కల్లరివై నాతో నేల గయ్యాళించ
మల్లాడ నీ వదినెనో మరఁదలనో

చ. 2: జట్టిగా గొల్లెతల కేల చంద్రగావి
గట్టి గాఁగా నీవె దట్టి గట్టుకోరా
గట్టువాతనమునఁ గదిసి నన్ను
పట్టేవు నీ చుట్టెమనో పక్కమనో

చ. 3: మందలోనివారి కేల మల్లెలు
ముందు నీవె కొప్పులోన ముడుచుకోరా
అంది శ్రీవెంకటనాథ అవురా నన్ను
అందముగాఁ గూడితివి ఆల నటరా

చి.శృం.రేకు: 17-6 బౌళిరామక్రియ సం: 10-101

పల్లవి: గుజ్జనఁగూడు వండెనె కోమలి నేఁడు
గొజ్జువెన్నెలబాయిటఁ గొమ్మలుఁ దాను

చ. 1: గోమున సేవంతిపవ్వు గురుగులలోపల
యేమరక పూఁదేనె నెసరు వెట్టి
ప్రేమతోఁ బచ్చక ప్రపుబియ్యము కొద్దికిఁ బోసి
దోమటిగా మంచి పూవుఁదోఁటవెంట వాలెను

చ. 2: మచ్చికఁ బన్నీటను మారెసరుగాఁ బోసి
కచ్చు పెట్టి మల్లెమొగ్గఁ గలయఁ బెట్టి
మెచ్చుల మరువమున మించినట్టి పాం గణఁచి
ముచ్చటఁ బచ్చాకున మూఁకుడు మూసి

చ. 3: చెలఁగి వట్టివేళ్ల జిబిలికెను వారిచి
కులికి పుప్పొళ్లనే కూరలు వండి
కలికి చుట్టెపు శ్రీవెంకటనాథురతిఁ గూడె
వెలయ నాతనికి విందు వెట్టెనూ

చి.శృం.రేకు: 18-1 రామక్రియ – అటతాళం సం: 10-102

పల్లవి: తలఁపు దలఁపు లెస్స తగు లాయను
కలకంటి యిందుకె నిక్కము వలచెనయ్యా

చ. 1: యేనుగపై నీవు రాఁగా యింతి పయ్యద జారఁగ
పూని మిద్దెమీఁద నుండి పొసఁగఁ జూచె
ఆని కరికుంభములు అంకుశాన నీ వూఁదిన
కానుక నీ చేఁతలకు గడు వలచెనయ్యా

చ. 2: నీవు గుఱ్ఱముఁ దోలఁగ నెలఁత చిక్కు దీయుచు
తావుల మేడపై నుండి తప్పక చూచె
కావించి నీ సమకట్లలో నల్ల జల్లి
దూవిన నేరుపుల కెదురు వలచెనయ్యా

చ. 3: తేరుపై నీ వెక్కి రాఁగా తెఱవ మై పులకించి
చేరువ వుప్పరి గెప్పెఁ జెలఁగి చచె
గారవించి వచ్చి శ్రీవెంకటనాథ నీవు గూడ
తారుకాణ చేఁతలకు దగ వలచెనయ్యా

చి.శృం.రేకు: 18-2 బౌళి సం: 10-103

పల్లవి: అటువంటివారికి నీ వప్పుడే వలతువు
అటు నిటు నిన్నుఁ బా లార్చీనా యేమి

చ. 1: గుట్టున మొగలిరేకు కొమ్మపయ్యదపై వేయఁ
బుట్టిచెండు పుచ్చుకొని పొలిఁతి వేసె
అట్టె నీ చేఁతకుఁ జేఁత ఆపె సేసె నావలెనె
దట్టించక నీపై దయ దలఁచీనా యేమి

చ. 2: మెత్తని తామెరపుప్వు మెలుతపై నీవు వేయ
బొత్తుగా బాదపుటందెఁ బొలిఁతి వేసె
మత్తిలి యాపె మారుకు మారు సేసె నావలెనె
బత్తి సేసి ని న్నూరకె పాటించీనా యేమి

చ. 3: యించుక దగ్గరి నీ వేకతము చెప్పఁబోతే
లంచముగా నీకుఁ దమ్ములము వెట్టెను
నించి శ్రీవెంకటనాథ నిన్నుఁగూడె నావలెనె
మంచితనమునఁ గూడి మన్నించీనా యేమి

చి.శృం.రేకు: 18-3 సామంతం సం: 10-104

పల్లవి: మందుల మాయల బోదె మంచివలపు
బొందితోఁ బతికాఁగిట భోగింపించుఁ గాని

చ. 1: కారుచిచ్చుయినాఁ దొలుకరివానచే నారు
ఆరదు పన్నీటిజడి నంగతాపము
ఆరడై నీటిచేత ననల మారకుండునా
సారెఁ జెలి కోరిక వెచ్చులు రేఁచెఁ గాక

చ. 2: జడివానైనా వెలుచు సంగడి చలికాలాన
యెడయదు చలువల నింతి చెమట
నిడివిఁ బుప్పొడి చల్ల నీరు దియ్యకుండునా
కడుఁ జెలియ మనసు కరఁగించీఁ గాకా

చ. 3: వేవేగ నాయిటివోతె విసరదు బెట్టుగాలి
పోవు నిట్టూర్పులు పతిఁ బొందినా నీవె
శ్రీవెంకటనాథుఁ గూడి చెల్లునటె వుసురన
భావజకేలిలోపలి పరిణత గాకా

చి.శృం.రేకు: 18-4 వరాళి సం: 10-105

పల్లవి: వెఱపించితిగా వోయి వేడుకకాఁడ
తెఱవ నీ మాఁట విని దిందుపడెఁ గాని

చ. 1: పొలిఁతి నీమోముచూచి పున్నమచందురుఁడని
వెల వెలఁ బారి చాలా వెరచెనయ్యా
వలచి నీతామెరలవంటి కన్నుల జూడఁగా
కలఁకదేరి మరి కనువిచ్చి చూచెను

చ. 2: కొమ్మ నీకురులు చచి గుంపుఁదుమ్మిదలనుచు
వుమ్మలూర మదిలోన నులికెనయ్యా
పమ్మిన పీలిపించపుపాగ చూచి నీ వనుచు
దిమ్ము విడిచి వొయ్యనె తెప్పిరిలె నిపుడు

చ. 3: నల్లఁగలువ చేఁబట్టి నయముతో నీవు రాఁగా
పల్లదపు మరుఁడని భామ లోఁగెను
వెల్లవిరై కాఁగిట శ్రీవెంకటనాథ యింతిని
చల్లఁగా నీవు గూడఁగ సమరతి సేసెను.

చి.శృం.రేకు: 18-5 కేదారగౌళ సం: 10-106

పల్లవి: నిండుదొర వౌదు నీగుణము వేలు నిన్ను నమ్మవలెఁబో
పండినమామిడిపై చిలుకవలె పచ్చి దేర నేలతిరిగేవయ్యా

చ. 1: వనిత కొండంత వలపుతో నీ వరుసఁకు గాచుకుండఁగా
చినుకు జీఁకటి పొద్దున నీ వేడ చెలితో నవ్వేవయ్యా
మనసార నీవె నిప్పువంటిబాస మగువకు నిచ్చి వచ్చితి
అనుగు నామనికోవిలవలె నాడా నీదా నేల తిరిగేవయ్యా

చ. 2: యింతి సముద్రమువంటి తమకాన యెదురెదురె చూడఁగా
యింతలోఁ గాఁదారి మాఁదారి పొద్దుననెవ్వతెఁజూచేవయ్యా
వంతదీరఁ దాఁచుఁబాముపంటి దేవరమీంద నానవెట్టితి
వంతుకు నీ విట్టె జుంటియీఁగవలె వాడ వాడ నేల తిరిగేవయ్యా

చ. 3: చెలి చుక్క లన్ని కోరికలతోడ చిత్తము నీ కిచ్చుకుండఁగా
పొలసి ముచ్చిమి పొద్దున నెడపూఁబోఁడిఁ బిలిచేవయ్యా
కలికి శ్రీవెంకటనాథ నీవె గారవించి సతిఁ గూడితి
కొలఁకుల నీఁదేరాయంచవలె కోడెకాఁడ యేలతిరిగేవయ్యా

చి.శృం.రేకు: 18-6 మాళవిగౌళ సం: 10-107

పల్లవి: నీ వెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో
రావయ్య తిరుపతి రఘురామచంద్ర

చ. 1: తుమురుగ దనుజులఁ దోలి తొప్పర లాడి
అమరఁగ గెలిచితి నందుపు
మమతతోడుత నిన్ను మదనయుద్ధమునందు
రమణి నిన్ను గెలిచె రఘురామచంద్ర

చ. 2: తవిలి శివుఁడు కాశి దారకబహ్మ మని
యివల నిన్నుపదేశ మియ్యగా
నవ మై శ్రీవెంకటనాథ మరుతంత్రము
రవళి నీ కీపె యిచ్చె రఘురామచంద్రా.

ఛి.శృం.రేకు: 19-1 దేసాళం సం: 10-108

పల్లవి: ఏమి మందు గద్దె యింతు లాల యీ
రామకుఁ దిరుపతి రాముడే మందు

చ. 1: వెలసెటి విరహన వేఁగెటియింతికి
చెలియలాల యేమి సేతమే
చలివేఁడివలపుల చవి గన్న యీపెకు
వలపించిన తనవరుఁడే మందు

చ. 2: పొదిగొన్న తమకానఁ బొరలెటి కాంతకు
చెదరక మన మేమి సేతమే
పుదుటుఁ గోరికల నొనరెటి యీపెకు
మదిలోపలి తనమగఁడే మందు

చ. 3: పొల్లవోని యాసఁ బొరలెటి మగువకు
చెల్లఁ బో మన మేమి సేతమే
కొల్లగా రతి నింతిఁ గూడినాఁడీపెకు
నల్లని శ్రీవెంకటనాథుఁడే మందు.

చి.శృం.రేకు: 19-2 నాదరామక్రియ సం: 10-109

పల్లవి: ఇన్నాళ్లు దా యేడ నుండెనమ్మ
వన్నెగాఁ గొసరవచ్చీ నేఁడు

చ. 1: వేఁకపు విరహన వేఁగ లేక నేను
సోఁకఁగ నెదురు చూడఁగా
తాఁకి తలఁచఁడు తరుణులఁ గూడి
యేఁకట నిపుడు నే నిత వైతినా

చ. 2: కడు నొంటిఁబొద్దు గడపఁగ లేక
వొడికపుటాసల నుండఁగా
తడవఁడు నన్ను దనయిచ్చలనే
అడరి యిప్పుడే నాపై ఆ వుట్టెనా

చ. 3: గొప్పతమకానఁ గుందుచుండ లేక
అప్పుడె పిలువ నంపఁగా
కప్పి నన్ను శ్రీవెంకటనాథుఁడు గూడె
యిప్పుడు నారతు లింపు వుట్టెనా.

చి.శృం.రేకు: 19-3 దేవగాంధారి సం: 10-110

పల్లవి: చల్లని చూపులవాని చక్కనివాని పీలి
చొల్లెపుఁ జుట్లవానిఁ జూపరమ్మ చెలులు

చ. 1: వాడలోని చెలులను వలపించి వచ్చెనే వాడు
చేడెల మనసు దొంగ చిన్నికృష్ణుఁడు
యేడుగడయునుఁ దానై యెలయించె నన్నును వాని
జూడక వుండఁగ లేను చూపరమ్మ చెలులు

చ. 2: మందలోని గొల్లెతల మరిగించి వచ్చెనే వాడు
సందడి పెండ్లికొడుకు జాణకృష్ణుఁడు
ముందు వెనకా నలమి మోహింపంచెనన్నును వాని
పొందులు మానఁగ లేను పోనీకురే చెలులు

చ. 3: ఇంటింటి యింతులనెల్లా యెలయించి వచ్చెనే వాడు
దంటవాఁడు కవికిచేఁతల కృష్ణుఁడు
నంటునను శ్రీవెంకటనాథుఁడై నన్ను గూడెనే వాని
వొంటిఁ బాయలే నావద్ద నుంచరమ్మ చెలులు.

చి.శృం.రేకు: 19-4 పాడి సం: 10-111

పల్లవి: బాలుఁడటవే సా దటవే వీఁడు పల్లదీఁడు గాక
కోలుముందై తనమాఁటలే గెలువ గొబ్బనఁదగవు చెప్పీనమ్మా

చ. 1: పసులఁ బేయలఁ గూరిచీనమ్మా పాలు నేయినారగించీనమ్మా
పసిబిడ్డఁ డంటా నెట్టు నమ్మవచ్చు బాలకృష్ణురాయని
కొసరి కన్నులు గీఁటీనమ్మా కొంగువ ట్టొయ్యనె తీసీనమ్మా
యిసుమంతలోనె కన్నుమొరఁగించి యిల్లిల్లు దప్పక తిరిగీనమ్మా

చ. 2: నీరాటిరేవులఁ బొంచీనమ్మా నిక్కి నిక్కి తానెచూచీనమ్మా
వేరులేక యెట్టు దగ్గరుదము గోవిందకృష్ణురాయని
ఆరడితో నొడిదొడికీనమ్మా ఆనలువెట్టుచుఁ బోనీడమ్మా
వీరిడిమాయల నిందరినిఁ దాసు వెంట వెంట నేల తిప్పీనమ్మా

చ. 3: వొంటినె కాఁగిట నించీనమ్మా వొయ్యనె కళలు రేంచీనమ్మా
నంటున మమ్మెల్లఁ గూడె శ్రీవెంకటనాథు కృష్ణరాయఁడు
జంటవలపులు చల్లీనమ్మా చలమున దక్కగొనె నోయమ్మా
బంటుగా నేలి అందరి మన్నించి పరిణామమున నున్నాఁ డమ్మా

చి.శృం.రేకు: 19-5 శ్రీరాగం సం: 10-112

పల్లవి: తామెరయాఁటదియును భువిలో దప్పులఁ బొరలఁగఁగలదా
కామించిన తన కులపురుషని కరముల నలమినఁ గాకా

చ. 1: ఇందుకళామౌళికి నతనుని కేకాలము వైరము గాదా
కందువతో బున్నమ గాఁగా గండము గడచే
ముందరనె యెనసెటిశరములముం బారముగడపఁగవసమా
అందముగా నడుములయమ్ములు అసిఁ బోయఁ గాకా

చ. 2: కమలోత్పత్తికి హిమరుతువుకుఁ గలకాలము వైరము గాదా
అమలాంబరమునుఁ గూడఁగ నాపద గడచే
అమరంగాఁ జక్రముఁ బాపిన అదియునుఁ గడవఁగవశమా
క్రమమునహంసాగమమునఁ గడతేరెఁ గాకా

చ. 3: నీలాంబుదశిఖకును గాలికి నిక్కముగా వైరము గాదా
మేలిమి మీఁదటి యోగము పేర్మినీబాదలు గడచే
ఆలించిన నదియ అపూర్వం బైననుఁ గడవఁగ వశమా
తాలిమి శ్రీవెంకటనాథుఁడు తాఁగూడఁగ బ్రతికెఁ గాకా.

చి.శృం.రేకు: 19-6 సాళంగనాట సం: 10-113

పల్లవి: జాజరవలపు జాణఁడే
వోజ దప్పఁడుగా నోయమ్మా

చ. 1: పూని పిలువఁగ నొల్లక పోయిన
మేనవాఁడ ననీ మేలే
మానలేక పోయి మళ్లివస్తి నని
ఆనవెట్టీఁ జవు లవునట్టే

చ. 2: పట్టి పెనఁగఁగ బరాకు సేసిన
చుట్టెమ ననీఁ జూడరే
నెట్టెన నాఁటికి నేడు వస్తి నని
దిట్టెమాఁట లాడీఁ దెలిసెనా

చ. 3: చెయివట్టినాఁ జేరరాకుంటే నా
ప్రియుఁడనీఁ బ్రేమతో
కయికొని శ్రీవెంకనాథుఁ డిట్టె
పయి పయి నన్నుఁ బాలించెనే.

చి.శృం.రేకు: 20-1 పాడి సం: 10-114

పల్లవి: వేళావేళలు లేవా వినోదములకై నాను
యేలా తమకించి వస్తే యిది నీ వెఱఁగవా

చ. 1: అయ్యో సారె నన్ను నలయించే వేరా
వొయ్యారపువాఁడ యింత కోపుదునా
చయ్యాటాన జాజిమొగసానఁ బట్టే వేరా
నెయ్యపు నాతలఁ పిది నీ వెఱఁగవా

చ. 2: యిటె మాఁటిమాఁటికి యేఁచే విదేమిరా
పట్టిన నీ చలాన నేఁ బడఁగలనా
పుట్టిపడి చిగురాకు పుక్కఁ బెట్టే వేరా
నెట్టెన నా వల పిది నీ వెఱఁగవా

చ. 3: చాలాఁ దరితీపుల సటలు సేసే వేరా
బాలకి నింతే నిన్నుఁ బాయ గలనా
మేలిమి దామెరలోఁ దుమ్మిద గూడినటునన్ను
యేలి శ్రీవెంకటనాథ యిది నీ వెఱఁగవా.

చి.శృం.రేకు: 20-2 శంకరాభరణం సం: 10-115

పల్లవి: ఒగ్గాలివాఁడు గదె వోయమ్మా
సిగ్గున నా కగపడె చిలుకచందమునా

చ. 1: తలఁచుకొంటేఁ జాలు తా నాడ కేఁగునమ్మా
వొలసి కమ్మగట్టు పావురమువలే
నెలత మదిఁ బారితే నిదురే కానఁడమ్మా
చలపాదిరా తిరిటి జక్కవచందమునా

చ. 2: ముదిత యెలుఁగు వింటే మొక్కలాన వాలునమ్మా
బెదరని పెంపుడుఁ బికిలివలే
సుదతి వుండిన యింటిచుట్టూఁ దిరుగునమ్మా
చెదరని మతితోడ జీనువవలెను

చ. 3: గోమున నో యని యంటే గొబ్బున నోయనునమ్మా
కోమలపు వసంతపు కోవిలరీతి
కామించి మమ్మును శ్రీవెంకటనాథుఁడు గూడె
రామలలోఁ బాయలేని రాయంచవలెను.

చి.శృం.రేకు: 20-3 ముఖారి సం: 10-116

పల్లవి: ఉపదేశ మిచ్చెగా పువిద మా కెల్లాను
యిపుడు నీ మన సాపె యెట్లా నెరిఁగెనో

చ. 1: కలికి నిన్నునుఁ బాదకమలానఁ బూజించె
నెలపై దేవర వని నేము మొక్కఁగా
వులివచ్చి నవ్వులతో వున్నాఁడ వందుకునీవు
మెలమి నీ మన సాపె యెటులా నెరిఁగెనో

చ. 2: తరుణి నీకు పుక్కిటితమ్ములాన విందు వెట్టె
వొర వని నేము నిన్ను దొడ్డసేయఁగా
సరసాన నీవూ నది చవి సేసు కున్నాఁడవు
యిరవై నీ మన సాపె యెటులా నెరిఁగెనో

చ. 3: మగువ నిన్ను బూతుమాఁటలు కొనియాడె
నిగిడి యేలికె వని నేము గొల్వఁగా
నగుతా శ్రీవెంకటనాథ మమ్ముఁ గూడితివి
యెగువ నీ మనసాపె యెటులా నెరిఁగెనో.

చి.శృం.రేకు: 20-4 మాళవిగౌళ సం: 10-117

పల్లవి: గాలి కూటి పేరిగట్టు మీఁదటివాఁడ
నేలసోద్యము పేరినెలఁత యె నిన్ను మెచ్చె

చ. 1: తెలిమొయిలుపేరిటి తిలకము వెట్టి
వెలయఁ బైరెడి పేరి విరులు ముడిచి
బలిమి మరుని పేరిపండు చేఁ బట్టి
జలజము పేరిటిసతి నిన్నుఁ జూచె

చ. 2: రేగాముపరిటి రెంటెము గట్టి
భోగపేరితీగాకు పొఁసఁగ జుట్టుచును
బాగుగాఁ జుక్క పేరి యాభరణాలు వెట్టి
నాగముపేరిటి నాతి నిన్నుఁ బిలిచె

చ. 3: సురపతిపేరిట్టి సరులు ధరించి
శిరుల మౌనిపేరి జీవముఁబట్టి
పొరి నీటిపేరిపొన్నున శ్రీవెంకటనాథ
విరిమీఁదిబిడ్డపేరి వెలఁది నిన్నుఁ గూడె.

చి.శృం.రేకు: 20-5 రామక్రియ సం: 10-118

పల్లవి: చెప్పకురే వానిసుద్ది చెలులాల
వొప్పులు సేసిన తనవోజలు మానీనా

చ. 1: తా నేవూరు నే నేవూరు తల మనవే చాలు
మానరాని వావు లేల మాకుఁ జెప్పీని
మోనాన నూరకుండరే మొన్నటివాఁడు గాఁడా
వూని గరివడ్డగింజ వుడుకఁ బోయ్యీనా

చ. 2: యెక్కడి కెక్కడిపొందు లేలా మొక్కులుమొక్కి
దక్కినట్టి బాస లెల్లఁ దలపించీని
తక్కరించె నిన్నటి తగవరి తానె కాఁడా
మక్కువైనా చిలుక మానీనా గుణము

చ. 3: యెంత కెంత మందెమేళ మిట్టె సంగతి నుండి
కాంతుఁడు న న్నేమిటికిఁ గాఁగిలించీనె
వింత లేక నన్నును శ్రీవెంకటనాథుఁడు గూడె
యెంత సేసినాఁ జక్కెర యేల తీపు మానును.

చి.శృం.రేకు: 20-6 సాళంగనాట సం: 10-119

పల్లవి: అందు కేమి దోసమా అయితే నేమి
కందువై లోకములోనఁ గలదే కాదా

చ. 1: వలచి యిందిరాదేవి వన్నెలుఁ జక్కఁదనాలు
తలఁపులో నేపొద్దూఁ దలపోయఁగా
సలిగెతోడుత నాపె సారూప్య మందినట్టు
నలు వై గోవిందుఁడే నారాయణి యాయను

చ. 2: బాలకి య్యై లకిమమ్మ పైపై శిగ్గువడఁగా
తేలించి యాపె మనసు తెలియఁ బూని
చాలా వేడుక నాకె సకియె యుండినటు
ఆలికిఁ గా భువనమోహనరూప యాయను

చ. 3: యెడయ కింతులలో మే లెల్లాఁ దెలియఁ బూని
కడఁగి యాఁడురూపము గైకొని చూచి
బడినె తనకు నెందూఁ బతిలేనివాఁడు గాన
కడ గోవిందుఁడే శ్రీవెంకటనాథుఁడాయను

రేకు: 0301-1 సాళంగనాట సంపుటం: 11-001

పల్లవి: నీ విన్నిటా నేర్పరివి నే నంతేసి నేరను
మోవి గిరిపే నింతె మంచి యేమి సేసేరా

చ. 1: కప్పురము నోటి కిచ్చి కాఁక లెల్లా రేఁచేవు
యెప్పటివాడవె కావా యేరా నీవు
అప్పటి మంచివాఁడవై యానలు వెట్టుకొనేవు
రెప్ప లెత్తి చూచే నింతె రేసు లేమి సేసేరా

చ. 2: అంచెలను విడె మిచ్చి ఆసలు పుట్టించేవు
మంచి చుట్టుమవె కావా మాకు నెప్పుడు
లంచము మో విచ్చె నంటా లావులనె పెనఁగేవు
మంచానకుఁ దీనే నింతె మరి యేమి సేసేరా

చ. 3: గందవొడి మీద జల్లి కాగిలించుకొనేవు
అందగాఁడవె కావా అన్నిటా నీవు
పొందుల శ్రీవెంకటేశ భోగించితివి నన్ను
మందెమేళా లాడే నింతె మరి యేమి సేసేరా

రేకు: 0301-2 పాడి సంపుటం: 11-002

పల్లవి: ఏమి బాఁతి నే నీకు యిటు నాకె దక్కితిని
దోమటి నిందుకె పో నీ తొత్త నైతి నేను

చ. 1: మన్నించి విచ్చేసితివి మా యింటికి నేఁడునీవు
కన్నుసన్న నేసితేనె కా దన వైతి
పిన్నదాన నవక నా ప్రియమె చేకొంటివి
యిన్నేసి నావలపుల కెల్లా లోనైతివి

చ. 2: తప్పక చూచినంతలో దగ్గరి కూచుండితివి
కప్పురవిడె మిచ్చితేఁ గైకొంటివి
చెప్పినట్టల్లాఁ జేసి చేఁతలకు గురైతివి
యిప్పుడు నా యంకెలకు యియ్యకో లైతివి

చ. 3: గక్కనఁ గాగిలించితే కన్నులు దేలించితివి
పక్కన నా రతులకు భ్రమసితివి
యిక్కువ శ్రీవెంకటేశ యిందునె నన్ను గూడితి
మిక్కిలి నాయెడ కూనుమేలువాఁడ వైతివి

రేకు: 0301-3 హిజ్జిజి సంపుటం: 11-003

పల్లవి: నీ వోజగా దిది ని న్నెఱఁగనా
బూవపుసరసా లేల పూఁచ వచ్చేవూ

చ. 1: అంగనమొగము చూచి అప్పటప్పటికి నాతో
యెంగిలిమాటలు నేర్చి యే లాడేవు
సంగడి జాణతనాలు సతు లెల్ల నాడఁగాను
జంగిలివలపు లేల చల్ల వచ్చేవూ

చ. 2: తరుణి అప్పణగొని తమకించి నాతోడ
యెరవుల నవ్వులు నీ వేల నవ్వేవు
వరుస వంతులవారి వాసుల గొంత రేఁచుక
పొరుగు పొరచు లేల పుయ్య వచ్చేవూ

చ. 3: యింతి కైదండ వట్టుక యిప్పు డిట్టె నామీఁద
యింతలోనె నీ చేయి యేల వేసేవు
బంతినె శ్రీవెంకటేశ పై కొని నన్ను గూడితి
దొంతరరతుల కేల దొమ్మి సేసేవూ

రేకు: 0301-4 సాళంగం సంపుటం: 11-004

పల్లవి: ఆవధరించవయ్య అనుమాన మిఁక నేల
చివురుఁజేతులనె సేసెవెట్టీ నిదివో

చ. 1: కాంత మోవివిందు వెట్టి కన్నులనవ్వుఁజూపుల
వింతలుగ గప్పురపువిడే లిచ్చి
పొంతనె సరసముల పువ్వుబాసికేలు గట్టి
చింత దీర చెనకుల సేస వెట్టీ నిదివో

చ. 2: పక్కనఁ దనతొడలఁ బానుపు వరచి నీకు
గక్కన మోహా లనేకట్నా లిచ్చి
వెక్కసపుఁ దమకాల వియ్యము లట్టె యంది
చిక్కని చనుగుబ్బలనేస వెట్టీ నిదివో

చ. 3: దొమ్మిఁ గాఁగిటనే గురుతుల సొమ్ము లెల్ల నించి
నెమ్మది నానందముల నెలవుకొని
కొమ్మ శ్రీవెంకటేశుఁడ కూడె నిన్ను మేడలోన
చిమ్ముఁజెమటల ముత్తేలసేస వెట్టీ నిదివో

రేకు: 0301-5 ముఖారి సంపుటం: 11-005

పల్లవి: ఆయము లీఁక నిద్దరి కంటుఁ గాక
చేయివల్ల నుండ నేలె చేఁతల యాతనికి

చ. 1: నిగ్గుల నాతఁ డన్నియు నీకెతోఁ జెప్పఁగాను
యెగ్గు లేల పట్టేవె యేమే నీవు
సిగ్గులు నిను రేఁచితె చింతఁ బొరలేదానవు
దగ్గరి కూచుండ నేలె తమకపాతనివి

చ. 2: నెమ్మది నీమోము చూచి నీవిభుఁడె నవ్వఁగాను
యెమ్మె లేల సేసేవె యేమే నీవు
కమ్మ నీకు మొక్కి తేనె కాఁక రేఁగేదానవు
చెమ్మఁజెమ టార్చ నేలె సేవల నాతనికి

చ. 3: వెకలి శ్రీవెంకటాద్రివిభుఁ డిట్టె కూడఁగాను
యెకసక్కే లే లాడేవె యేమే నీవు
వొకటొకటికి నీవు వొరసెటిదానవు
మొకమిచ్చ లాడ నేలె మొదలె యాతనిని

రేకు: 0301-6 రామక్రియ సంపుటం: 11-006

పల్లవి: దండ నుంటే గైకోఁడు దవ్వుల నుంటేఁ బైకొను
చండి సేసేది అతని సాజమే కాదా

చ. 1: పెనఁగి కానకుంటేను పిలువ నంపు నని
మొనసి నీతో నంటి మొదలే కాదా
పొనిఁగి మీరు నాకు బుద్ధి చెప్ప రాకు మని
మనుపనె చెలులాల మొక్కితి గాదా

చ. 2: మంకుతోడ నూరకుంటే మాటలాడించు నని
అంకెల నీతో నవ్వితి నందుకే కాదా
వంక లొత్తి మాకు మీరు వలపు రేఁచకు మని
పొంకాన మీదాన నని పొందైతిఁ గాదా

చ. 3: యింటిలో నే నూరకుంటే యీడకే విచ్చేసు నని
దంటనై సన్న సేసితి దానికే కాదా
అంటుక శ్రీవెంకటేశుఁ డలమె దూరకుడని
జంటైె మీ సమ్మతినె చక్క నుంటిఁ గాదా

రేకు: 0302-1 నాదరామక్రియ సంపుటం: 11-007

పల్లవి: చవులు వేరె వేరె సరసులకు వలపు
యువిదలకుఁ బతుల కొక్కటే వలపు

చ. 1: కనుకలివేళను కలుగు నొక్కవలపు
వినుకలిఁ బొడమేది వేరె వలపు
అనఁగి పెనఁగేవేళ నదియు నొక్కవలపు
వొనరినప్పు డిన్నియు నొక్కటే వలపు

చ. 2: సరస మాడేటివేళ సంగతౌ నొక్కవలపు
సరి నెడమాటలది జంటవలపు
తెరమరఁగున నుండి తేలించే దొకవలపు
వొరసి మర్మ మంటితే నొక్కటే వలపు

చ. 3: వుపరతి సమరతి నుండు నొక్కవలపు
యెపుడూనుఁ దలపోఁత లేకవలపు
రప మై శ్రీవెంకటేశ రతి నన్నుఁ గూడితివి
వుపమించి చూడ నింతా నొక్కటే వలపు

రేకు: 0302-2 సామంతం సంపుటం: 11-008

పల్లవి: ఓర్చుక నావద్ద నున్నాఁడవు
తేర్చి నాగుణము తెలిసితివా

చ. 1: నెలఁత నీకు నటు-నేర్పిననేర్పుల
మలకలమాటలు మఱచితివా
పలుకవు మాతోఁ బలుమారు నవ్వేవు
కెలయ కిందుకనె గెలిచేవా

చ. 2: వనిత నీకు నటు వంతులు వెట్టిన
మనసులో పనులు మఱచితివా
పెనఁగక నాతో బ్రియములు చూపేవు
ననుపు లిందునవె నడపేవా

చ. 3: కాంత నీవు ననుఁ గలయు మనిన యల
మంతనపురతులు మఱచితివా
యింతట శ్రీవెంకటేశ్వర ననుఁ గూడితి
సంతత మిట్లనె జరుపేవా

రేకు: 0302-3 శుద్ధవసంతం సంపుటం: 11-009

పల్లవి: అందాఁకా నీకు మొక్కుతా నంతా నింతా నుండేఁ గాక
యిందరిలోఁ బదరితే నిది సిగ్గు గాదా

చ. 1: ఆవల నీ వొకతెతో అట్టె మాటలాడఁగాను
చేపట్టి తియ్యఁగ బోతే సిగ్గు గాదా
వావిరి నాపెయు నీవు వసంతము లాడఁగాను
యీ వేళ నీ మోము చూచి దిది సిగ్గు గాదా

చ. 2: కోరటు పరాకై నీవు కొమ్మను గూడుండగాను
చేరి నీతో నవ్వఁబోతే సిగ్గు గాదా
గారవించి యాపెతోయాకతము నీ వాడఁగాను
యీరీతి దగ్గరితేను యిది సిగ్గు గాదా

చ. 3: అక్కడిరతుల నీవు అలసి వుండేవేళ
చెక్కులు నే నొక్కితేను సిగ్గు గాదా
గక్కన శ్రీవెంకటేశ కలసితి విటు నన్ను
యిక్కడ నవి దడవే దిది సిగ్గు గాదా

రేకు: 0302-4 మధ్యమావతి సంపుటం: 11-010

పల్లవి: కాంతలకుఁ బతులకు కల సాజమె యిది
వింతదాననా నీకు వెర పేలమ్మా

చ. 1: కందువకు దీసేది కన్నుల నదలించేది
యిందరికి గలదె యే మమ్మా
యిందుకుఁగా నాతఁడు యెగ్గు వట్టీనా నిన్ను
విందుల వెరపు చల్లీ వెర పేలమ్మా

చ. 2: పెనఁగితేఁ దిట్టేది బెరసితే మెచ్చేది
వనితల కీపాటి వలె నమ్మా
చన విచ్చె నాతఁడు సలిగె గలదు నీకు
వెనక ముందరి కింక వెర పేలమ్మా

చ. 3: కూడి యిట్టె చొక్కేది గురుతులు నించేది
పాడి పంత మెక్కె నీకు పైపై నమ్మా
వోడక శ్రీవెంకటేశుఁ డురమున బెట్టె నిన్ను
వేడుకకు వెల లేదు వెర పేలమ్మా

రేకు: 0302-5 రామక్రియ సంపుటం: 11-011

పల్లవి: సిగ్గరి చెలులము నీచిత్తము వచ్చునో రాదో
యొగ్గులు తప్పు లెంతుము యింతేసికి నోప

చ. 1: చనవు లెల్ల నెరపి సలిగెలఁ బొరలుచు
ననుపు నీ కాపె సేసీ నాయెదుటనె
మనసు వచ్చు నీ కది మాకు నిన్ను నన నేల
చెనకి యింకా బనులు నేయించుకో నీవు

చ. 2: తగులాలు చెప్పుకొని దండ నుండి కుంచ వేసి
నగీ నాపె నీతోను నాయెదటనె
జిగి నీకు బ్రియ మిది చింతలు రేఁచఁగ నేల
వొగరు లే కింకా నందె వోలలాడు నీవు

చ. 3: అంటి మేను దాఁకించి ఆకుమడిచి నీ కిచ్చి
నంటు సేసీ నీతోను నాయెదుటనె
గొంటవై శ్రీవెంకటేశ కూడితిని నన్ను నిట్టె
దంటతనమున నవి తలఁచుకో నీవు

రేకు: 0302-6 కేదారగౌళ సంపుటం: 11-012

పల్లవి: వెలఁది నీరతుల వీఁగ దిఁక
నిలవున నెమ్మోలు నెరపకు వయ్యా

చ. 1: పలుమరు నీతో పంతము లాడఁగ
చెలియకుఁ గచుములు చేఁ గెక్కే
చలమునఁ బై కొని సాములు సేయఁగ
మొలకలపులకలు మొన లాయ

చ. 2: సరసము నీపైఁ జల్లఁగ జల్లఁగ
వరుస గోరికొన వాఁ డెక్కే
సరుగఁ గూరిమి గొసరఁగఁ గన్నుల
నిరతపు మెఱుఁగులు నిండె నవే

చ. 3: వొప్పుగ మేనులు వొరయఁగ మీకును
చిప్పిలుఁ జెమటల చితు కెక్కే
అప్పుఁడ శ్రీవెంకటాధిప కూడితి
కప్పురగందికి కళ లవె మించే

రేకు: 0303-1 వసంతవరాళి సంపుటం: 11-013

పల్లవి: పంతపువా రెల్ల నిటువలె మొక్కేరా
యింత నీవు నావలె యెన సుండేరా

చ. 1: యీకడ తమ అంకెల కింతె కాక కాంత లెల్ల
నీ కిచ్చకము లాడేరా నేనె కాక
మేకొని మీఁద మిక్కిలి మేనరికపువా రింతె
నాకొలఁది నీసేవకు నన్నుఁ బోలేరా

చ. 2: వలచినవారు తమవైపులె చూతురు గాక
నెల వై నిన్ను మెచ్చేరా నేనె కాక
వొలసి యిందరు నీ నవ్వులతోడివా రింతె
నలువంక నీపట్టుకు నన్నుఁ బోలేరా

చ. 3: పచ్చిగా గూడినవారు పరవశు లింతె కాక
నిచ్చ నిన్నుఁ జొక్కించేరా నేనె కాక
యిచ్చఁ గూడితి శ్రీవెంకటేశ నన్నుఁ బరు లెల్ల
నచ్చుల నీలాగులకు నన్నుఁ బోలేరా

రేకు: 0303-2 హిందోళవసంతం సంపుటం: 11-014

పల్లవి: ఆపాటి కాపాటి అంతే చాలు
యేపొద్దు నీజాడ లెల్ల నెరఁగనా నేను

చ. 1: ప్రేమము లేనిమాట పెదవిపైనె వుండు
కామించని చూపు లెల్లఁగడల నుండు
ఆముకొని తలపోఁత లాతుమలోననె వుండు
యేమిటికి నును ముట్టే వెరఁగనా నేను

చ. 2: తమి లేనిపొందికలు తనువుమీఁదనె వుండు
కొమరాఁక లెల గోరికొనల నుండు
అమరని సరసాలు ఆసాసలై యుండు
యిముడకు మమ్ము నందతే నెరఁగనా నేను

చ. 3: అంకెకు రానివేడుక లరమరపుల నుండు
లంకె గానపెనఁగులు లావుల నందు
పొంకపు శ్రీవెంకటేశ భోగించితివి నన్ను
యింకా నేల అనుమానా లెరఁగనా నేను

రేకు: 0303-3 పాడి సంపుటం: 11-015

పల్లవి: ఊరకుండవయ్యా నీవు వువిదతో మారాడక
ఆరయ నొచ్చము లేదు అంగనల కెపుడు

చ. 1: యే మాడిన నాఁటదాని కెగ్గులేదు తప్పు లేదు
నేమాన నూరకుండిన నేరమి లేదు
దోమటిగాఁ జూచినాను దొరతన మై తోఁచు
వేమారు నవ్విన నవి వేడుకలై నిలుచు

చ. 2: తల వంచుకుండినాను తగ్గు లేదు మొగ్గు లేదు
పలుకక వుండినాను భయము లేదు
బలుములై చూపినాను పంతము లై రతి కెక్కు
పెలుచుఁజేత సేసినా ప్రియము లై తగులు

చ. 3: మించి కాఁగిటఁ గూడిన మితి లేదు మేర లేదు
యించుక గుట్టున నున్న యెరవె లేదు
అంచల శ్రీవెంకటేశ అంగనఁ గూడితి విట్టె
మంచముపైఁ గూచుండిన మర్మము లై మించును

రేకు: 0303-4 బౌళి సంపుటం: 11-016

పల్లవి: ఎందు వొయ్యే మీఁకనూ యెరిఁగేము గాక నిన్ను
కందువలనె తెలిపేఁ గానీవయ్య యిపుడు

చ. 1: యింతుల తిట్లకును యెగ్గు వట్టెవారె కాక
సంతసించి నవ్వు నవ్వేజాణ లెవ్వరు
అంతలోనే నని వచ్చే వాయము సోఁక నాడి
పంత మెల్లఁ గనుకొనే పదవయ్య లోనికి

చ. 2: కొమ్మల సణఁగులకు గోర సేసేవారె కాక
సమ్మతించి మెచ్చు మెచ్చేజాణ లెవ్వరు
కమ్మర దీకోనేవు నీకడమ లెల్లాఁ బాపి
నమ్మి నీవోపిక చూచేఁ బదవయ్య లోనికి

చ. 3: మగువల మేకులకు మట్టుపడేవారె కాక
జగములోఁగా దనేటిజాణ లెవ్వరు
నిగిడి శ్రీవెంకటేశ నిన్ను నేనె కూడితిని
పగటు లేరుపరచేఁ బదవయ్య లోనికి

రేకు: 0303-5 కేదారగౌళ సంపుటం: 11-017

పల్లవి: చిత్త మెట్టుండెనో నేఁడు చేసిన నాచేఁతలకు
అత్తి మొక్కి అందుకె నీ వానలు వెట్టితిని

చ. 1: యీడు జోడై కూడి నీవె యిచ్చినచనవునను
ఆడినట్టె ఆడి నిన్ను నలయించితి
జాడతోడి నా వొళ్లి జవ్వనమదమునను
వోడక నీ వంటితేను వోప నంటిని

చ. 2: మంతనము లాడినట్టి మందెమేళముననె
పంతములే నీ యడకుఁ బచరించితి
అంతగా నీ విచ్చినట్టి అతిరాజసమునను
సంతసాన నీకు మంచము దిగ నైతిని

చ. 3: మదనకేలిఁ జొక్కించి మన సిచ్చినందువంక
పదిమారులును నిన్నుఁ బచ్చి సేసితి
యిదె శ్రీవెంకటేశ్వర నీ వెనయుపరవశాన
వుదుటు మీరఁగ నీవురముపై నెక్కితి

రేకు: 0303-6 శ్రీరంగం సంపుటం: 11-018

పల్లవి: ఎందరి భ్రమించితివో యిటువలెనే
యెందును నీ మర్మ మిది యెరఁగ మైతిమిరా

చ. 1: మచ్చికల నీతోడ మాటలాడి నిన్నటి
మచ్చరపుటుకలు మరచితిని
మచ్చుట నీవిటువంటి మెకమాయకాఁడ వౌత
యిచ్చలోన నేము తొల్లె యెరఁగ మైతిమిరా

చ. 2: పక్కన నిన్ను దగ్గరి పంతపుమాట లెల్ల
మక్కళించి యాడ నీతో మరచితిని
గక్కన నీ వింతతమకములు నేరుచుకొంట
యిక్కువగా నేఁడు నేము యెరఁగ మైతిమిరా

చ. 3: పెనఁగి పెనఁగి నీతోఁ బెట్టుకొన్నవొట్లెల్ల
మన సిచ్చి కూడి నే మరిచితిని
ననిచి శ్రీవెంకటేశ నాఁటఁకీడ వవుత నిన్ను
యెనసినవేళ నేమీ నెరఁగ మైతిమిరా

రేకు: 0304-1 లలిత సంపుటం: 11-019

పల్లవి: ఇంక నేఁటి బిగువు యేల నీకును
వంక లొత్త నొరగులౌ వాసిమీఁదను

చ. 1: తిలకించి నీచేఁతకు తిట్టు కేల మానును
చలిమి బలిమిఁ గల జవరాలు
అలుగ నీకుఁ దగదు ఆయములు సోఁక నాపె
ఆలమి లోనికి దీసె నందుమీఁదను

చ. 2: చెనకే నీ మాటలకు చేయి చాఁచ కేల మాను
మనసు మర్మము గన్న మదిరాక్షి
పెనఁగ నీకుఁ దగదు ప్రేమములు రేఁగ నాపె
అనువుగగా కళ రేఁచె నందుమీఁదను

చ. 3: కూడిన నీకూటమికి కొన కెక్క కేల మాను
సూడుఁ బాడు నెరింగిన సుదతీమణి
యీడనె శ్రీవెంకటేశ యెనసి నిన్నిదె యాపె
ఆడుకోలు చెల్లించె నందుమీఁదను

రేకు: 0304-2 మంగళకౌశిక సంపుటం: 11-020

పల్లవి: చేసినంతే చేఁతగాక చెలు లెల్లా నీపట్టుకు
తాసువలె మెలఁగితే తగ వెటిఁగేవా

చ. 1: వద్దనుండి నీ కాపె వలపులు రేఁచఁగాను
బుద్ది చెప్పితే వినేవా పొరుగువారు
వుద్దండాననె నిన్ను వొడివట్టి తియ్యఁగాను
కొద్ది నుంటి వింతే కాక గుణ మెరిఁగేవా

చ. 2: నలుగడ నాకె నీతో నవ్వు లట్టె నవ్వఁగాను
పిలిచినాఁ బలికేవా పెరవారు
చలము సాదించి నిన్ను సరిఁ గాఁగిలించు కొఁగా
కలయ వచ్చేవు గాక కరఁగేటి వాఁడవా

చ. 3: రతులచవులు చూపి రచ్చ నిన్ను వేయఁగా
యితవు సేసితేఁ జవులా యింటివారు
మితి మీరి నేఁ గూడఁగ మెల్లనె శ్రీవెంకటేశ
తతిఁ జేకొంటివి గాక తగిలేటివాఁడవా

రేకు: 0304-3 సామంతం సంపుటం: 11-021

పల్లవి: ఊడిగపువారము నీ కొప్పించేము లోనిమాట
వేడుకఁ దెలుసుకొమ్మీ వేరె వేరె నీవు

చ. 1: చిలుకలు వలికీని చెవి యొగ్గి వినవయ్య
కలువలు వికసించెఁ గై కోవయ్య
చెలిమి సేసీఁ దీగెలు చేత నందుకొనవయ్య
వెల నీకుఁ జెప్పరాని విన్నప మిదయ్యా

చ. 2: జక్కవలు మెదలీని సరవులు చూడవయ్య
నిక్కెను మేఘ మదివో నీ వంటవయ్య
మిక్కి లద్దాలు మెరిచీ మించి నీడ చూడవయ్య
వెక్కసపు గుట్టుతోడి విన్నప మిదయ్య

చ. 3: వెన్నెల గాసీఁ జంద్రుఁడు వెలయఁగ మెచ్చవయ్య
సన్నల మోవిపండు చవి గొనవయ్య
నిన్ను శ్రీవెంకటేశుఁడ నీరాణివాసము గూడె
వెన్నవంటి మెత్తని విన్నప మిదయ్యా

రేకు: 0304-4 సాళంగనాట సంపుటం: 11-022

పల్లవి: ఏఁటివో నీకే తెలుసు నివి యిన్నియు
మాటు లేని నీగుణాలు మట్టు లేనివె

చ. 1: తేనెలు గారెడిమాట తేరకొన నాడేవు
కానుక వట్టెటిచూపు కడు జల్లేవు
లోనైరెనీ కిందుకే లోకములో చెలు లెల్ల
వీనుల నీసుద్దు లైతే వినఁ గొత్తలె

చ. 2: కడు నీవినయములు కస్తురివంటివె
బడిబడి నీవలపు పాలవంటిదె
విడువరు ని న్నిందుకే వీదివీదిసతు లెల్ల
తడవతే నీవిధాలు తమకించేవే

చ. 3: చెలఁగి నీకూటములు జిగు రయి అంటుకొను
అలరు నీముచ్చటలు ఆనందాలు
కలసితి విదె శ్రీవెంకటగిరీశ్వర నన్ను
బలు నీ మన్ననలు పైపై భాగ్యాలె

రేకు: 0304-5 నాదరామక్రియ సంపుటం: 11-023

పల్లవి: ఇందరము నెరిగితి మిఁక నేలా
సందడి సవతులలో సరి నుండుఁ గాకా

చ. 1: నిక్కి నిక్కి చూచి యాపె నీతో నేల సన్న సేసీ
రక్కసితనము మాని రమ్మన రాదా
దక్కి వున్నాఁడవు నీవు తనపాలిటికిఁ దొల్లె
వెక్కస మై నే నుండితే వెర పేల తనకు

చ. 2: అంత నింత నుండి నీతో ఆపె యాల నవ్వీని
వంతుకు నీతోఁ బెనఁగ వచ్చుఁ గాక
వింతవాఁడవా నీవు వేరు నే మింతే కాక
యింతేసి పనులు సేసె యిఁక నేల వెఱపూ

చ. 3: పొరుగుపొంతల నాపె పూఁచి ని న్నేల కూడీని
సిరులు నీసొమ్ము గాఁగఁ జేసుకో రాదా
యిరవై నన్నుఁ గూడితి విదె శ్రీవెంకటేశుఁడ
తెరవాసె వెర పేల తెల్ల మాయఁ బనులు

రేకు: 0304-6 మెంచబౌళి సంపుటం: 11-024

పల్లవి: అతఁడెంత నీ వెంత ఔ నవునే
ఘాతఁ బెద్దరిక మింతాఁ గట్టుకొంటివే

చ. 1: పంతము లన్నియును నీపతిపైనె నెరుపేపు
పొంతల నిన్నే మని పొగడుదునే
అంతటి నీకొనగోరు అతనిపై మోపితిని
దొంతరమొనలు చూప దొడ్డదానవే

చ. 2: చలము లితనిపైనె సాదించ నేరిచితివి
నిలిచె నింత లాభము నీవద్దనే
పిలువఁగానె పెనఁగి బీరమునుఁ జూపితిని
కలికితనము లిందె కైకొంటివే

చ. 3: యేతు లెల్ల శ్రీవెంకటేశ్వరునికె చూపేవు
నీతి నడచేవారిలో నీవే కదె
యీతల మామాటలకు నితని నిట్టె కూడితి
పోతరించి యిన్నిటా నీపుణ్య మాయఁ గదవే

రేకు: 0305-1 భైరవి సంపుటం: 11-025

పల్లవి: సిగ్గు వడ దప్పటినాచిత్తము నన్నుఁ గొసరీ
అగ్గలపుచనవులు అప్పిచ్చినవారమా

చ. 1: కరుణించి నీవు నన్నుఁ గాఁగిలించుకొంటి గాక
వరుసల మాపై నంత వల పున్నదా
సొరిది మన్నించి నన్నుఁ జూచితి వింతె కాక
సరవితో నే నీకుఁ జక్కనిదాననా

చ. 2: సేస వెట్టినవాఁడ వై చేకొంటివి గాక నాతోఁ
బాసి వుండనంత నాపైఁ బరా కున్నదా
బాస దప్పనందుకుఁగా పక్కన నవ్వితి గాక
ఆసలఁ బెనఁగ నీకు నందరిలోవారమా

చ. 3: నీవు ధర్మపుణ్యానకు నెల వై కూడితి గాక
దావతి నానలు వెట్టఁ దగ వున్నదా
శ్రీవెంకటేశ నన్నుఁ జెనకి మెచ్చితి గాక
వావులు చెప్పఁగ నీతో వడి మేనవారమా

రేకు: 0305-2 దేసాక్షి సంపుటం: 11-026

పల్లవి: ఇతరులే మెరుగదు రేమని చెప్పఁగ వచ్చు
పతులకు సతులకు భావజుఁడే సాక్షి

చ. 1: తలఁపు గలిగితేను దవ్వు లేమి నేరు వేమి
అలరి సమ్మతించితె నడ్డాఁక లేమి
కొలఁది మీరినప్పుడు కొంచ మేమి దొడ్డ యేమి
నెల విచ్చి యేకతానఁ జేసినది చేఁత

చ. 2: యిచ్చకమె కలిగితే యెక్కు వేమి తక్కు వేమి
హెచ్చినమోహములకు నెగ్గు సిగ్గేది
పచ్చి యైనపనులకు పాడి యాల పంతమేల
చెచ్చెరఁ దమకుఁ దాము చెప్పినది మాట

చ. 3: అన్నిటా నొక్కటియైతే నైన దేమి కాని దేమి
యెన్నికల కెక్కితేను యీడు జోడేది
వున్నతి శ్రీవెంకటేశుఁ డొనగూడె నేర్పు లివి
కన్నెలుఁ దాఁ గూడిన గతులే సంగతులు

రేకు: 0305-3 కాంబోది సంపుటం: 11-027

పల్లవి: ఎవ్వరీ బుద్దులు విన రెందాఁకాను
యివ్వల జాగరా లున్నా రెందాఁకాను

చ. 1: చక్కెరమోవులు వాడె సరసములలోననె
యెక్కడి ఆలుకలు మీ కెందాఁకాను
ముక్కున నూర్పులు రేఁగె ముట్టీముట్టుక తొల్లె
యిక్కువ పంతములు మీ కెందాఁకాను

చ. 2: కన్నులఁ గావులు గప్పె కందువనవ్వులలోనె
యెన్నేసి వొట్లు వెట్టే రెందాఁకాను
తన్నుఁ దానె చెవరించె తనువుల నిద్దరికి
యిన్నిటా మీ మతకము లెందాఁకాను

చ. 3: మోమునఁ గళలు రేగె ముంచినసిగ్గులలోనె
యేమిటికి ననుమానా లెందాఁకాను
వేమారుఁ గూడితిరి శ్రీవెంకటేశుఁడును నీవు
యీ మాట లందరుఁ జెప్పే రెందాఁకాను

రేకు: 0305-4 సౌరాష్ట్రం సంపుటం: 11-028

పల్లవి: ఏల బుద్దులు చెప్పేరె యెందాఁకా నితనికి
తాలిమి గలితే నేమె తగ వెరిఁగేము

చ. 1: తలఁ పాకచో నుండఁగ తనపైకి దీసుకొని
బలిమి నేయఁగఁ బోతే పచ్చి దోఁచును
పెలుచుఁ జిత్త మాతనిఁ బెనఁగి యేమి సేసినా
చలములు రేఁగుఁ గాని చవి చాలదు

చ. 2: అవ్వల మాటలాడఁగ నందుకెతా మాటాడితె
పువ్వక పూచినట్టు పుల్లఁబారును
రవ్వగా నాతని నెంత రతలకుఁ దీసినాను
నవ్వుఁ బాటై యిందరిలో నారటిలునూ

చ. 3: యెందొ యెదురు చూడఁగా నెదిటికిఁ బోతేను
సందడి యనుచు మతి సమ్మతించదు
చెంది యింత చెప్పఁగాను శ్రీవెంకటేశుఁడు గూడె
మందలించి యివి యల్లా మచ్చికల కెక్కును

రేకు: 0305-5 పాడి సంపుటం: 11-029

పల్లవి: ఇంకా నేల నాచేతి యెడమాటలు
అంకెకు వచ్చున్న వాఁడు ఆడనె నీ వాడవే

చ. 1: తుచ్చము లే మాడితవో దూరు లెంత దూరితవో
ముచ్చట దీరఁ బతికి మొక్కవే నీవు
పచ్చిగా నీ మంచముపై పవళించి వున్నవాఁడు
యిచ్చకపుప్రియములు యేకతానఁ జేయవే

చ. 2: యే మని చెప్పించితివో యెంతేసి పెనఁగితివో
మోము చూచి వొక్కమాటు మొక్కవే నీవు
చే ముట్టక నీవద్దనె సిరసు వంచుకున్నాఁడు
కామించి యాతనిమతి కరఁగించఁగదవే

చ. 3: నవ్వులేమి నవ్వితినో నాలి యెంత సేవితివో
మువ్వంక నందుకుఁ దగ మొక్కవే నీవు
యివ్వల శ్రీవెంకటేశుఁ డిరవుగ నన్నుఁ గూడె
రవ్వలు సేయక లోలో రతుల మొప్పించవే

రేకు: 0305-6 బౌళి సంపుటం: 11-030

పల్లవి: కన్నవారిదె కాదా కందికుడు మన్నమాట
యెన్నఁడు జెప్పఁగ విని యెరఁగవో కాక

చ. 1: మక్కువ నీ రమణుఁడు మాయింటికి వచ్చె నంటా
యెక్కువతోఁ బిలవ నీ వేల వచ్చేవే
వొక్కరు నోచినసొమ్ము లొకరికి నేల వచ్చు
పక్కనఁ గైకొన్న వారిభాగ్య మింతే కాక

చ. 2: నాఁడు నీ వడిగేసొమ్ము నాకుఁ దెచ్చి యిచ్చె నంటా
వాఁడిమి నీ వేల యింత వాదించేవే
వేఁడయెట్టిమానిబంక వెట్టిమాన నేల యంటు
పోఁడిఁమి జేసినవారిపుణ్య మింతే కాక

చ. 3: నీ వరు సై వుండఁగాను నేఁడు నన్నుఁ గూడెనంటా
శ్రీవెంకటేశ్వరు నేల చిమ్మి రేఁచేవే
దేవర వర మిచ్చితే తేరకాఁడు పూజరి
భావించి తొల్లిటి దానఫల మింతే కాకా

రేకు: 0306-1 దేసాళం సంపుటం: 11-031

పల్లవి: మాతో నేల తన కింత మచ్చరాలు నీవె
పోతరించినయాపెకు బుద్ధిచెప్ప రాధా

చ. 1: పక్కన నీతో నేను పదరి నవ్వితి నంటా
అక్కడనుండె సణఁగు లాపె ఆడీని
తక్కి చలిమి బలిమి తన కింత గలితేను
చిక్కించుక నిన్నేమైనాఁ జేయఁగ వలెఁబో

చ. 2: మంచముపై నీవు నేను మరిగి వున్నారమని
యించుకంత చూడ నోప కీసడించీని
నించి తన కంతేసి నేరుపే కలిగితేను
అంచల నిన్ను రప్పించి అదలింవలెఁ బో

చ. 3: కందువ నీవు నన్నుఁ గాఁగిట గూడితి వంటా
చెంది లోలోనే తాను చిన్నఁ బోయ్యిని
యిందుకు శ్రీవెంకటేశ యిన్నిటా తా జా ణైతేఁ
బొంది యిచ్చకము నేసి పొదుగఁగ వలెఁబో

రేకు: 0306-2 రామక్రియ సంపుటం: 11-032

పల్లవి: చిత్తగించు నీకు నేఁ జెప్పినదానఁనా
యిత్తల నంతేసి నీ వెఱఁగనివాఁడవా

చ. 1: నీవు మన్నించదాన నీకు వలచినదాన
యీవల నల్లది నాతో యీడుజోడుదా
వావాత నావాదు నీవు వహించుకో కుంటేను
చేవలు మీరి నిన్ను మోచినదాఁకా రాదా

చ. 2: సేస వెట్టితిని నీవు చేయి చాఁచితి నేను
వాసితో నల్లది నాతో వంతు వచ్చేదా
బాసతో నాకుఁగా నీవు పట్టి పెనఁగ కుండితే
ఆసల నాస లని అందాఁకా రాదా

చ. 3: దక్కితివి నీకు నాకు తగు లైతి నే నీకు
మొక్కక అల్లది నాతో మొన చూపేదా
యిక్కువఁ గూడితివి నన్నిట్టె మెరయించకుంటే
నిక్కి శ్రీవెంకటేశ్వర నిన్ను ముట్టి రాదా

రేకు: 0306-3 వరాళి సంపుటం: 11-033

పల్లవి: అంత సేసినవాఁడవు పంత మీవయ్యా
చెంతల నీకుఁ బ్రియము చెప్ప దిదివో

చ. 1: చెక్కులు నొక్కిననొక్కు చిత్తమెల్లఁ బులకించి
మక్కువకామిని నీతో మాట లాడదు
అక్కడ నవ్వినవ్వు ఆయ మెల్లఁ గాఁడి పారి
చొక్కుచు నిన్నుఁ దప్పక చూడ దిదివో

చ. 2: సరస మాడినచేఁత సందుసందులనుఁ జిక్కి
వొరయుదు చన్నుల ని న్నూరికె చెలి
యిరవుగాఁ జూచినచూ పెదలోనఁ బాయదు
తెరమరఁ గెంతైన దియ్య దిదివో

చ. 3: బిగియించిన కాఁగిట ప్రియముల తల కెక్కి
వెగటుసంతోసముల విఱ్ఱవీఁగీని
నిగిడి శ్రీవెంకటేశ నీ వింతలోఁ గూడఁగాను
తగిలిన రతులకె తమకించీ నిదివో

రేకు: 0306-4 శ్రీరాగం సంపుటం: 11-034

పల్లవి: చలువలు వేండ్లు జరపఁగ నేటికి
నెల వగు మేలే నించఁగ రాదా

చ. 1: మోహము చెలిపై ముంచినవాఁడవు
దాహపువిరహము తర వేల
సాహసి మొదలనె చలముల కోపదు
యీహల నీవే యెఱుఁగుదు విఁకను

చ. 2: చేసన్నలనే చెనకినవాఁడవు
వాసులు సతిపై వంచుదురా
ఆసలనే కడు నలసిన దిందాఁక
ఆ సుద్దులు మ మ్మడుగకు మిఁకమ

చ. 3: కాఁగిట నంగనఁ గలసినవాఁడవు
మాఁగినసిగ్గులు మరి యాల
చేఁగ దేర్చె నిదె శ్రీవెంకటేశ్వర
వీఁగక నసుపులు విడుమాకు మిఁకనూ

రేకు: 0306-4 మాళవిగౌళ సంపుటం: 11-035

పల్లవి: వలెఁగా వేసాలు వద్దన్న మానఁడు
యెలయింపులమాటల నెంత సేసినె

చ. 1: కన్నుల నే మొక్కితేను కాఁక రేల రేఁగీనా
యిన్నిటాఁ జేతులు మోపి యేల చూపీనే
వెన్నెలబయట నుంటె వెత రేల రేఁగీనె
నిన్న నేటనె కతలు నేరిచేఁడాఁ గదవే

చ. 2: పొలసి నే నగితేను పులక లేల పుట్టీనె
యెలమిఁ జూడు మ నెన లేల పెట్టినె
చిలుకలు వలికితే చింత లేల పొడమీనె
మలక లెల్లఁ బెనచేమాయకాఁడు గదవే

చ. 3: గక్కునఁ గాఁగిలించితె కడుఁ జెమరించ నేలె
మిక్కిలి గోర నూరిచి మీఁదఁ జిమ్మీనె
యెక్కువ శ్రీవెంకేశుఁ డెనసె నన్నిటా నన్ను
చక్కరసరసముల జాణకాఁడు గదవే

రేకు: 0306-5 భైరవి సంపుటం: 11-036

పల్లవి: దైవము సేసిన మాయ తగ నింతేసి కాఁబోయి
నీవొళ్లికల్ల గాదు నిజమె యీమాఁట

చ. 1: చెప్పేవు సలిగెలు సేసేవు చేఁతలు
అప్పుడు ఆతఁడు నిన్ను నంటె నంటాను
కప్పురపుఁబడి తోడికాంత రెల్లా నుండఁగాను
దెప్పరపువారికి యీ తెక్కు లేల వచ్చును

చ. 2: సారె సారె నవ్వేవు సంగడిఁ గూచుండేవు
దూరి ని న్నాతఁడు కాలు దొక్కె నంటాను
చేరినట్టి సేసపాల చెలు లెల్ల నుండఁగాను
పోరచిసతుల కేల బూటకాలు వచ్చునూ

చ. 3: పెంచేవు పగటులు పెనచేవు వావులు
ముంచి యొండొకమాటు ముట్టె నంటాను
యెంచఁగ శ్రీవెంకటేశు నింటిదానవేఁ గూడితి
పంచల నుండేవారికి బద్దు లేల వచ్చును

రేకు: 0307-1 హిజ్జిజి సంపుటం: 11-037

పల్లవి: ననుబోఁటి చెలు లెల్లా నవ్వరా నిన్ను పతి
చెనకినదాఁకా గుట్టు నేయంగ వలదా

చ. 1: కనుసన్న సేసితేనె కరఁగితి రమణుఁడు
తనువు సోఁకితే నెంత తమకింతువో
యెనసెటివేళనె యిన్నియు నయ్యీఁ గాక
అనువు నీ ప్రియములు అందరిలో వలెనా

చ. 2: మాటలాడినంతలోనే మరుగుగొంటి వాతఁడు
నాటఁగ నవ్వితే నెంత నయ మవుదునో
పాటించి యేకతమందె పచ్చి దేరీఁ గాక నీవు
వాల మైన సరసాలు వాకిటనె వలెనా

చ. 3: యిక్కువఁ గూడినంతలో యిచ్చితివి చన వెల్ల
మొక్కితే విభుని కెంత మోహింతువో
మక్కువ శ్రీవెంకటేశ్వమహిమ లీడేరుఁ గాక
చెక్కులు నొక్కక తొల్లె సిగ్గు లింత వలెనా

రేకు: 0307-2 ఆహిరి సంపుటం: 11-038

పల్లవి: ఇప్పటనుంటియు నేల యెరవు నేయకు వమ్మ
తప్పు లెల్ల వొప్పులుగా దగఁ జేసేఁ గాని

చ. 1: మచ్చిక నీ మాటతఁడు మన సొగ్గి వినీ నదె
విచ్చనవిడిని విన్నవించ వమ్మా
చెచ్చెర యీవేళ నీకుఁ జెల్లి నంతాఁ జేయవమ్మ
మచ్చరపు మా సుద్దులు మరి చేప్పేఁ గాని

చ. 2: నెలవై నాయకుఁడదె నీవంక చూచీని
సొలసి చక్కఁదనాలు చూపవమ్మా
బలి మెంత గలిగినాఁ బచరించవమ్మ యిట్టె
చలము వెనక నేనె సాదించేగాని

చ. 3: చేయి చాఁచి నీమీఁద జెనకేనని యాతఁడు
ఆయ మెరిఁగి సరసా లాడవమ్మా
యీయెడ శ్రీవెంటేశుఁ డింత సేసీ నిన్ను గూడె
చాయ లేల సన్న లేలసంత మయ్యేఁ గాని

రేకు: 0307-3 ముఖారి సంపుటం: 11-039

పల్లవి: అందరుఁ జెప్పేరు విను అది దగవా
యిందరిలో బొంకను నీ కిది దగవా

చ. 1: చేరి గొల్లెతలు నీతో చీఁకటితప్పు సేసితే
ఆరితేరి నవ్వితివి అద దగవా
చీరలు దీసితి వట చేరి కొలనిదరిని
యీరీతి నింతటిదొర విది దగవా

చ. 2: చెలఁగి వుట్లపై దాఁచిన వెన్నలునుఁ బాలు
అలమి ఆరగించితి వది దగవా
కలపితి వట వారికట్టినదూడల నాల
యిలపై నీ వుద్దండాలు యింత దగవా

చ. 3: చక్కిలాలు నురుగు సతులు దాఁచిన వెల్ల
అక్కరఁ గైకొంటి మాట అది దగనా
గుక్కక శ్రీవెంకటాద్రికోమలపుకృష్ణుఁడవై
యెక్కి వేసాలు సేసే విది దగవా

రేకు: 0307-4 సాళంగం సంపుటం: 11-040

పల్లవి: నీవు నాతఁ డొక్కటె నేము నీవారమె
వోవరి లోననే వుండి వొడఁబా ట్లేఁటికే

చ. 1: మొక్కిన నీ మొక్కు లెల్ల మొదలి పెండ్లివిడేలు
చిక్కని నీనవ్వులె నేసపాలు
తక్కినసుద్దు లేఁటికి తగు లాయఁ బను రెల్ల
యిక్కడి కక్కడి కింక నెడమాట లేఁటికే

చ. 2: చూచినచూపులు నీకు చుట్టుపుసమ్మంధాలు
తాచినగంధాక్షతలు తలపోఁతలు
చేచేత మీ కిద్దరికి చేసిన చేఁతలు దక్కె
యేచ యిందరునుఁ జెప్పే యియ్యకో ళ్లేఁటికే

చ. 3: కలసినకలయిక కందువసోబనములు
పలుసంతసాలె మీ మీ బాసికాలు
యెలమి శ్రీవెంకటేశు నిటు నీవె కూడితివి
యెలయింపుఁ జెలులచే నెగపోఁత లేఁటికే

రేకు: 0307-5 రామక్రియ సంపుటం: 11-041

పల్లవి: ఇచ్చకము సేయ వచ్చే వే మందును
బచ్చెన సటకాఁడవు భళరా మెచ్చితిని

చ. 1: చేయి వట్టి పెనఁగేవు చెక్కు నొక్క వచ్చేవు
యీయెడ నీతో నింక నే మందును
చాయలకె నవ్వేవు సరసము లాడేవు
పాయపువగకాఁడవు భళరా మెచ్చితిని

చ. 2: చెలఁగి విడె మిచ్చేవు చెమటలు దుడిచేవు
యెలయింపు నీచేఁతల కే ముందును
వలపులు చల్లేవు వద్ద నిట్టె కూచుండేవు
బలిమి మాయకాఁడవు భళరా మెచ్చితిని

చ. 3: చన్నులపయి నొరగేవు సారె గాఁగిలించేవు
యేన్నేసి నీ వినయాలు యే ముందును
యిన్నిటా శ్రీవెంకటేశ యిట్టే నన్నుఁ గూడితిని
పన్నినగండికాఁడవు భఁళరా మెచ్చితిని

రేకు: 0307-6 శంకరాభరణం సంపుటం: 11-042

పల్లవి: తక్కినసుద్దులు తడవ మిఁక
చొక్కులఁ బెట్టుచు సొలయకువయ్యా

చ. 1: చెల్లుగడి గని చేసినచేఁతలు
చల్లనిమాటల సడి వాసె
తొల్లిటిదానవె తొడిఁబడఁ జెక్కులు
యిల్లిదె నొక్కే విదేఁటికయ్యా

చ. 2: పన్నిన మాయలఁ బాసినకాఁకలు
కన్నుల నవ్వుల కసి దీరె
చిన్నదాననె చేతికి లోనె
చన్నులు ముట్టేవు సట లేలయ్యా

చ. 3: అండనె కాఁగిట నలసిన అలయిక
నిండు మోవితేనెలఁ దేరె
వెండియు నిటు శ్రీ వెంకటేశ నమ
మెండుగఁ గూడితి మెచ్చితి నయ్యా

రేకు: 0308-1 మాళవి సంపుటం: 11-043

పల్లవి: ఇందుకుఁగా వట్టి వాదు లిఁక నీతో నేలయ్యా
పొందు లెల్లఁ జేకొంటిమి పొద్దున రావయ్యా

చ. 1: నీచేత మాటలకు నీకన్నుల తేటలకు
యేచి లోనైనవారికి నేల కోపము
పూచినట్టె వుండుఁ గాని పున్నమినాఁటివెన్నెల
చూచితేఁ బువ్వులు లేవు సొద్య మింతే కాని

చ. 2: సేసేటి నీ మేకులకు సెలవుల నవ్వులకు
ఆసపడ్డవారము మా కలు కేఁటికి
పూసినట్లనె వుండు పుప్పొడి పై రాలితేను
వోసరి గందమువలె వొళ్ల నేమ నంటదు

చ. 3: నిక్కపు నీ సేసలకు నిండిన నీ కాఁగిటికి
చిక్కినవారము మాకు చింత లేటికి
యిక్కువ శ్రీవెంకటేశ యేక మైతివి వలపు
లెక్కకు వచ్చినట్టుండు లేదు మితి మేరా

రేకు: 0308-2 నాదరామక్రియ సంపుటం: 11-044

పల్లవి: ఏమయ్య నీ దొరతన మిటువంటిదా
నీ మనసు నాపై బత్తి నే నెరగనా

చ. 1: ఆపె నిన్ను వెడమాట లాడఁగాను విని నీవు
యేపున నూరకుండితి వేమయ్య
నీ పొందు లిటువంటివా నిన్నిందరుఁ గనరా
వో పో నమ్మినదాని నొప్పగింతురా

చ. 2: వోరతోడ నాపె సేసే వుద్దండా లెల్లాఁ జూచి
బీరాన నీవు వచ్చి పెనఁగ వద్దా
నేరపు లేనివాఁడవా నీ వెరఁగవా యిన్ని
కోరి నీవే గతి యంటే కూడుక రావలదా

చ. 3: పొంచి యాపె చేసేసుక పోఁగా నేఁ డా గర్వ మెల్ల
తుంచి వేయకుంటె నది దోసము గాదా
మించి శ్రీవెంటేశుఁడ మే లిచ్చి నన్నుఁ గూడితి
తెంచి నా పగ లన్నియుఁ దీరిచితి విపుడు

రేకు: 0308-3 పాడి సంపుటం: 11-045

పల్లవి: మాన వెప్పుడును నీ మాయ లెల్లాను
నానిన నా నసుపులు నవ్వించీఁ గాని

చ. 1: వాలుకరెప్పలు నీపై వంచి నే నెంత లోఁచినా
తాలిమె చూపుదు గాక తత్తరించేనా
వాలాయించి రాతిగుండెవాఁడ వౌత యెఱుఁగుదు
పాలుమాలిన నా యాస పాయ నీదు గాని

చ. 2: ఆయములు సోఁక మాటలాడి యంత కొసరిన
చాయకాఁడవె కాక సమ్మతించేవా
కాయకపు నీసరిత గట్టిగా నే నెరుఁగదు
పాయపు నా వేడుకలు పై కొలిపీఁ గాని

చ. 3: చిమ్ముచు నీ కాఁగిటిలో చేత లెంత నేసినాను
కుమ్మరించి నాతోను నీ గుట్టు చెప్పేవా
కమ్మటి శ్రీవెంకటాద్రి కడపరాయఁడవై
నెమ్మది గూడితి విదె నిజమాయఁ గాని

రేకు: 0308-4 సాళంగం సంపుటం: 11-046

పల్లవి: ఇటువంటి తగవులే యెక్కడ చూచినను
నటనలు బూమిలోన నడచీ నయ్యా

చ. 1: కన్నుల నవ్వినందుకు కాఁతాళించే వేమయ్య
యెన్ని కెగాఁ దిట్టితే నీ వేమి నేతువో
వున్నతి నెవ్వరుఁ దమ వొళ్ళికల్ల చూచుకోరు
యిన్నిటాఁ దమ్ము సోఁకితే యెగ్గు పట్టఁ జూతురు

చ. 2: పైకొని మాటాడితేనె పగ చాటే వేమయ్య
యీకడ చెత నంటితే యేమి సేతువో
ఆకడఁ దమచేఁతలు అందము లనుకొందురు
లోకు లవి గాదంటే లోఁచి నా దడుతురు

చ. 3: మొక్కి మొకము చూచితే మొరయుచు జంకించేవు
యిక్కువ గోర గీరితే నేమి సేతువో
మక్కువ శ్రీవెంకటేశ మంచివాఁడ వై కూడితి
తక్కక వా రిది గంటే దంటవు నీ వందురు

రేకు: 0308-5 రామక్రియ సంపుటం: 11-047

పల్లవి: ఎక్కినవానికిఁ జూడ యేనుగ గజ్జెయుండు
వెక్కస మై వెలువ వేవేలు సేసునయ్యా

చ. 1: నన్ను నాడుకోఁ గాని నాయంతటిది లేదు
వున్నత మయిన నీవూడిగానకు
పిన్నదాని కింత నీవు పెద్దరికము గట్టితి
విన్ని నీ పెద్దరికమే యెంచి చూడవయ్యా

చ. 2: వెల్లవిరి సేయఁ గాని వెలితి లేదు నాకు
వెల్లనె రతుల నిన్ను మెప్పించేయందుకు
చెల్లబడి సేసితివి జిగి నీ యాఁటదానిని
కల్ల గా దివెల్లను నీ ఘనతే కాదా

చ. 3: ఆన వెట్టుకోఁ గాని అన్నిటా జాణను నేను
మెనాన నీపాదాలు మెక్కేయందుకు
పూని శ్రీవెంకటేశుఁడ భోగించితి విటు నన్ను
యీా నగవు లీ సంతోస మిది నీదె సుమ్మీ

రేకు: 0308-6 కేదారగౌళ సంపుటం: 11-048

పల్లవి: అప్పటినాతో నేల అమరమాట లాడేవు
తిప్పరాని నీవలపు దిష్టమై వుండఁగను

చ. 1: కప్పురవిడె మిచ్చితే కార మై తోఁచెగా
చొప్పుగ నీమో మాపె చూడకుండఁగా
దప్పి దేరే మోముతోడ దగ్గరి నే నుండఁగాను
చిప్పిల నీ మే నెల్లఁ జెమరించెఁగా

చ. 2: వొగిఁ బన్నీరు చల్లితే వులివెచ్చ దోఁచెఁగా
నగి నగి ఆపె నీతో నాలి నేయఁగా
చిగురుచిత్తముతోనె చేత నిన్ను నంటఁగాను
మొగచా టై రతు లెల్ల మొన చూచెఁగా

చ. 3: గందము వుయ్యగ నీకు కడుఁ బచ్చి దోఁచెఁగా
ముందరనే ఆపె నీకు మోవి యియ్యఁగా
యిందులోనె శ్రీవెంకటేశ నే నిన్నుఁ గూడితి
యిందరిలోనె నాపొందు యితవాయఁగా

రేకు: 0309-1 మంగళకౌశిక సంపుటం: 11-049

పల్లవి: విచ్చేయు మాయింటి కిట్టె వింతవాఁడవా
వచ్చిదేరెఁ బను లెల్ల పైపై నీవల్లనే

చ. 1: యిచ్చక మై యుండేవాడ వెగ్గు లేల పట్టేవు
నచ్చుల నే తిట్టినాను నవ్వవలెఁ బో
చెచ్చెర నా కెల వలచితి నని యందువు
యెచ్చు కుందు లాయ మాట యిదివో నీ వల్లనే

చ. 2: చుట్టము వైనాఁడవు సోలి చిన్నఁ బో నేల
అట్టె నే రాకు మనిన నంటవలెఁ బో
దట్టముగ నాకుఁగా వ్రతము వట్టితి నందువు
వెట్టిపొందు లెల్లాను వెలసె నీవల్లనే

చ. 3: తగులు గలవాఁడవు తడఁబాటు లేఁక నేల
మొగము నేఁ జూచిలేను మొక్కవలెఁ బో
నిగిడి శ్రీవెంకటేశ నీవు నేనుఁ గూడితిమి
తెగనిమహిమ లెల్లఁ దెలినె నీవల్లనే

రేకు: 0309-2 శంకరాభరణం సంపుటం: 11-050

పల్లవి: మెత్తనిమనసుదాన మేలు దాఁచ నే నేర
కొత్తగా నింతేసికిని గురి యైతి నయ్యా

చ. 1: సిగ్గుపడి నీ వుండఁగ సెలవుల నవ్వు వచ్చీ
వొగ్గి మాటాడిన నవ్వు లొగి వచ్చీని
నిగ్గుల నీ రెంటికిని నీ మోవియే సాక్షి
యెగ్గులు న న్నేల పట్టే వేమి సేతు నయ్యా

చ. 2: తలవంచు కుండినాను దయ నాకుఁ బుట్టీని
అలసి చూచిన దయ అట్టె పుట్టీని
మొలచి యీ రెంటికి నీ మోముకళలె సాక్షి
కులికి మమ్మేల యింత గోర నేనే వయ్యా

చ. 3: వూరకే నీ వుండినాను వొనరీని వలపులు
ఆరీతి నుండినా ఘన మయ్యీ వలపు
యీరీతి నీ చక్కఁదన మీ రెంటికిన సాక్షి
చేరు శ్రీవెంకటేశ మెచ్చి కూడితి వయ్యా

రేకు: 0309-3 భైరవి సంపుటం: 11-051

పల్లవి: నీవు మంచవాఁడవె నే నెట్టుండితి నేమి
యీ విధము లెరఁగక యెడ్డదాన నైతిని

చ. 1: నిండిన నీతలపోఁత నే నెరఁగఁగా నావద్ద
నుండఁగా నావాఁడ వని వుంటిఁ గాని
యెండమావులనీళ్లు యేరు లంటా నుండి నట్టు
కొండవంటి యాసచేత కూళదాన నైతిని

చ. 2: పంతాలు నే నెరఁగఁగా పలుకక నీ వుండఁగ
అంతలో నా కెదురాడ మాని వుంటిని
బంతినె తెల్లని వెల్లఁ బాలంటా చవి గొన్నట్టు
రంతులబాసలు నమ్మి రాఁపుదాన నైతిని

చ. 3: నీ మోహము లెరఁగఁగా నిక్కము నాకు మొక్కఁగ
అముకొని యెగసక్యా లని వుంటివి
చేముంచి శ్రీవెంకటేశ చెఱకున పండున్నట్టు
కామించి నీవుర మెక్కి ఘనురాల నైతిని

రేకు: 0309-4 కొండమలహరి సంపుటం: 11-052

పల్లవి: కాంతలు పదారువేలు గలవాఁడవు
యెంత నేనే విటు నీతో నెదురాడే దాననా

చ. 1: నన్ను మన్నించ వలసి నాతో నవ్వితిని గాక
యెన్నఁగ నావంటివారు యెంత లేదు
చిన్నఁబోకుండాను నాచెక్కు నొక్కే వింతే కాక
మిన్నక నేర్పుల నిన్ను మెప్పించేదానా

చ. 2: నామీద కృప గలిగి ననుపు సేసేవు గాక
యేమీ నే నిందరిలో నేమి బాఁతి
దీమసము చెడకుండ తివిరి బుజ్జగించేవు
కామించి నీమన సంత కరఁగించేదానా

చ. 3: కడు నన్ను నేలె నని కాఁగిలించు కొంటి గాక
యెడమని నీరతికి యీడా నేను
బడినె శ్రీవెంకటేశ పాయకుండా మరపేవు
కడ లేనిమోహానకు కాణాచిదానా

రేకు: 0309-5 సామంతం సంపుటం: 11-053

పల్లవి: మనవి చెప్పితిని మఱవమకుమీ
కనుఁగొని నామాఁట కడుమకుమీ

చ. 1: యిచ్చక మాడితి వీడనె వుంటవి
మచ్చిక నా మేలు మఱవకుమీ
వచ్చి వేకేరొకతె వలపులు చల్లిన
పచ్చిదేరి మరి పదరకుమీ

చ. 2: సరస మాడితివి చనవు లిచ్చితిని
మరిగిననాపొందు మానకుమీ
సరిగా మరొకతె సందులు దూరిన
తొరలి యపుడు మరి తొలఁచకుమీ

చ. 3: కలసితి విప్పుడు కాఁగిలించితివి
పొలసి యిట్లనె భోగించుమీ
యెలమిని శ్రీవెంకటేశ్వర మరొకతె
పిలిచితేను మరి పెనఁగకుమీ

రేకు: 0309-6 రామక్రియ సంపుటం: 11-054

పల్లవి: ఈఁపాటివాఁడవా యిస్సీ నీవు
యేపున నీ దీమసము యేడ నుండె నపుడూ

చ. 1: ఆయము సోఁకినమాట లాపె నీతో నాడఁగాను
కాయ మెల్లఁ గరఁగేవు కాక దేరఁగా
యీయెడ వద్ద నున్నవా రెవ్వ రవుతా నెరఁగవు
చేయి వట్టి తియ్యఁగానె సిగ్గు వడే విపుడు

చ. 2: చిప్పిల సెలవులను చెలి యట్టె నవ్వఁగాను
తప్పక చూచే వక్కడె దైవారుతా
చెప్పి చెప్పి నిన్ను గోరఁ జిదిమినా నెరఁగవు
కొప్పువట్టి తియ్యఁగా కొంకి లోఁగే విపుడు

చ. 3: చెక్కు నొక్కి సతి నీ సేవ లెల్లఁ జేయఁగాను
మిక్కిలి లోలుఁడ వైతి మేర మీరఁగా
కక్క సించి నేఁ గూడితె గక్కన శ్రీ వేంకటేశ
మొక్కుచు నాతో నింతలో ముచ్చటాడే విపుడు

రేకు: 0310-1 రామక్రియ సంపుటం: 11-055

పల్లవి: ఒద్దికతో మము నీవు వూరకె చూడఁగ రాదా
చద్దికి వేడికి మేమే సంతముల అయ్యేము

చ. 1: యిద్దము నేకతము నాయెదటనె ఆడఁగాను
వుద్దంగాలు సేయక యెట్టోరుతు నేను
వొద్ద నీ వుండగా నింతి నోరసితి ననివాదు
వద్దన్నా మానక యేల వహించుకొనేవు

చ. 2: జాఱిక నీవును నాపె సన్నలు సేసుకోఁగాను
చూఱలుగ నెలువలెఁ జూతు నేను
మీఱి నీ మంచముమీఁదిమెలుత నంటితి నని
ఆఱడి నీ వేల ఆపె కడ్డాలు వచ్చేవు

చ. 3: చెక్కు నొక్కి నీవు నది సెలవుల నవ్వుకోఁగా
తెక్కుల నెట్ల సమ్మతింతు నేను
చిక్కించి నిన్నుఁ గూడితి శ్రీవెంకటేశ్వర నేను
కక్కసించితే నాపెకుఁగా నేల మొక్కేవు

రేకు: 0310-2 దేశాక్షి సంపుటం: 11-056

పల్లవి: ఇంతేసి దొరపొందు యెందుకు నైనా వచ్చు
చింత దీర నా మనసు చెలఁగించవయ్యా

చ. 1: పలుమారు నీతోను పలచఁగా నే నవ్వితే
యెలమి నీ చిత్త మిఁక నెట్టుండునో
పిలువఁగ నీతోను బిగిసి వూరకుండితే
అలరి కైకొనని అదియు నెట్టుండునో

చ. 2: పిక్కటిల్ల నీతోను బెరసి మాటలాడితే
యెక్కువ తక్కువలందు నెట్టుండునో
వక్కణించగా నీతో వడి గుట్టున నుండితే
అక్కజపు గర్వమని అదియు నెట్టుండునో

చ. 3: కదియఁగ నీతోను కడు నేఁ గొసరితేను
ఇదె శ్రీవెంకటేశ నేఁ డెట్టుండునో
పొదిగి కూడితి వింకఁ బూఁచి సిగ్గు వడితేను
అదను గా దని సంత మదియు నెట్టుండునో

రేకు: 0310-3 పాడి సంపుటం: 11-057

పల్లవి: చెప్పఁగల మాట లిఁకఁ జెప్పవయ్య
ముప్పిరి నిందుకె నేను మోము వంచే నయ్యా

చ. 1: చలివేఁడి సటకాఁడ చదురుల జాణకాఁడ
మొలకనవ్వులతోను మొక్కె మయ్య
వలపులయండ గాసీ వాడికవెన్నెల గాసీ
అలరి యిందుకు వెర గందే మయ్యా

చ. 2: వీదుల జాజరకాఁడ వేసాల వేడుకకాఁడ
యీదెస బాయము కాను కిచ్చే మయ్యా
తోదోపువసంత మిదే తొక్కుడుసరస మిదే
ఆదరాన నిందులోనే అలసే మయ్యా

చ. 3: కైకోలు వేగిరకాఁడ కందువల వగకాఁడ
చేకొని నీచెప్పినట్టు సేసే మయ్యా
యీకడ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
మేకొని యిన్నిటా నిన్ను మెచ్చే మయ్యా

రేకు: 0310-4 కాంబోది సంపుటం: 11-058

పల్లవి: ఓరి నీకు నది యేమి వుండఁబట్టదా
వారి వీరివలె మాట వడిఁబెట్ట వద్దురా

చ. 1: యీసు రేఁచ నేఁటికి యందరిలోపల నిన్ను
వాసి దెచ్చుకొని యెంత వంచఁ జూతునో
రాసి కెక్కితివి తొల్లె రచ్చకూ నెక్కితివి
బేసబెల్లి నా కోపము పెంచ నిఁక వొద్దురా

చ. 2: కన్నుసన్న లేటికి కడు సిగ్గునను నీ
మన్ననఁ గూడి యే మని మాటాడుదువో
వెన్న వేసినవారిని వెస రాత వెయ్య రాదు
అన్నిటా జాణఁ జేసితి వటు మీర వద్దురా

చ. 3: దొమ్మి సేయ నేఁటికి తొడిఁబడఁ గాఁగిటి మీ
యిమ్ముల నిన్నలయించి యే ముందునో
నమ్మించి శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి నీవు
సమ్మతించిన మీఁదటఁ జలపట్ట వద్దురా

రేకు: 0310-5 కాంబోది సంపుటం: 11-059

పల్లవి: చలములు మాని అన్నిఁ జవి సేసుకోంటిఁ గాక
తెలివి మొగమునను దేరునా వొరులకు

చ. 1: చిత్తము నొవ్వకుండ చేతుల మొక్కితిఁ గాక
యిత్తల నీ చేసేచేఁత లెన్ని లేవు
వత్తివలె వాడక నీవద్దఁ జెలఁగేఁ గాక
కొత్తలుగ మోము చూడఁ గొలుపుగా యిందుకు

చ. 2: కాఁకలు రేఁగకుండఁగ గానుక లిచ్చితిఁ గాక
యేఁకట నీ పొరపొచ్చే లెన్ని లేవు
ఆఁకలు సేయక నీకు నట్టే నే లో నైతిఁ గాక
పూఁకొన నైన రతికి నుద్యోగము పుట్టునా

చ. 3: తగవులు దప్పకుండ దయతోఁ గూడితిఁ గాక
యెగసక్యాలు నీ వైతె నెన్ని లేవు
ఆగవడి శ్రీవెంటాధిప కూడితి నన్ను
వెగ టైన యిందుమీఁదు వేసటలు పుట్టునా

రేకు: 0310-6 ముఖారి సంపుటం: 11-060
పల్లవి: వట్టి సటలకు నింత వాసు లేల
మెట్టుక వున్నాఁ డతఁడు మేలమాడ రాదా
చ. 1: కూడి వుండినట్టిచోట గోప మేల మంచి
జాడకు వచ్చియు మరిఁ జల మేల
వేడుకలలోపల విసు పేల
వీడె మిచ్చీ నాతఁడు వేగ నందుకోవే
చ. 2: మేర మీర రానీ నీతో మెణ కేల నిన్ను
గారవించఁగా యాడో కత లేల
నేరము లేనివెనక నెగు లేలా నిన్ను
సారెకుఁ జెక్కు నొక్కీని చనవు చేకోవే
చ. 3: మంతన మై యుండఁగాను మరఁగేల
పంత మిచ్చినందుమీఁద బలిమేల
యింతలో శ్రీవెంకటేశుఁడిటు గూడెను
మంతు కెక్కెఁ దొల్లిటిమాట లిఁక నేలే

రేకు: 0311-1 దేవగాంధారి సంపుటం: 11-061

పల్లవి: నీవంటిచిత్తమె నాకు నిలుప రాదా
చేవ దేర నీ యిచ్చలోఁ జెలగే నయ్యా

చ. 1: సంతస మయనవేళ సారె నవ్వ వచ్చుఁ గాక
చింతించే వేళా నట్టే చేకూరునా
పంతపు నీ చేఁతలు నా భావములో నుండఁగాను
చెంత సరస మాడేవు చెల్లు నయ్య నీకు

చ. 2: చెక్కు నొక్కేటట్టివేళ సేదదేర వచ్చుఁ గాక
కక్కసించేటట్టివేళ కై కొలుపునా
వెక్కసపు నీ మాటలు వింటా నే నుండఁగాను
తొక్కేవు పాదము నేకే తోఁచునయ్య యిట్టివి

చ. 3: మించఁ దనిసినవేళ మే మఱవ వచ్చుఁ గాక
అంచఁ దమకపువేళ నను వు లౌనా
యెంచఁగ శ్రీవెంకటేశ యెనసితి విటు నన్ను
నించితి వేడుక లెల్ల నేర్తు వయ్య నీవు

రేకు: 0311-2 మలహరిసంపుటం: 11-062

పల్లవి: విన్నపము లిఁక నేల వేఁడుకో నేల
చిన్ననాఁటి సిగ్గు లెల్ల చిమ్మి రేఁగె నీఁకను

చ. 1: మన్ననలకె మొక్కితి మాటలకే చొక్కితిని
యిన్నేసి నిన్నుఁ దూరఁగ నీఁకఁ జోటేది
అన్నిటా జాణవు నీవు ఆయము లెఱుఁగుదువు
పన్నిన నా జవ్వనము ఫలియంచె నీఁకను

చ. 2: నవ్వులనె తనిసితి నయాలనే మొనసితి
యెవ్వరు నేమి చెప్పేరు యెడసుద్దులు
నివ్వటిల్లు విటుఁడవు నిజ మాడ నేరుతువు
రవ్వ లైన నాభాగ్యము రతి కెక్కె నీఁకను

చ. 3: ముచ్చటఁ దొప్పఁ దోఁగితి మోహాన విఱ్ఱవీఁగితి
వచ్చె నాపంతము లెల్ల వాసు లేఁటివి
యిచ్చట శ్రీవెంకటేశ్వర యిట్టె నన్నుఁ గూడితివి
మెచ్చిత మొదలు నిన్ను మే లాయ నీఁకమ

రేకు: 0311-3 దేసాక్షి సంపుటం: 11-063

పల్లవి: ఎంత మొగమాయకాఁడ వే మందు నిన్ను
పంతము నెరపఁ బోయి పైకొంటి నేను

చ. 1: నే నిన్నుఁ గోపగించితే నీవు నవ్వితి వందుకు
మోనాన నంతలోన నే మొక్కే నిదె
ఆనుకొని మేటిదొర వన్నిటికి నేరుతువు
కాని మ్మని యీ పనికె కరఁగితి నేనూ

చ. 2: అవ్వలిమోము నే నైతే నడ్డాలు వచ్చేవు నీవు
మువ్వంక నే నిందుకుఁగా మొక్కే నిదె
రవ్వ సేసి భోగించ రంటికి వత్తువు నీవు
యివ్వల నీ వినయాల కియ్యకొంటి నేను

చ. 3: కడుగుట్టు నేఁ జేసితే కాఁగిలించుకొంటి విట్టె
ముడిదీరె నిటమీఁద మొక్కే నిదె
ఆడరి శ్రీవెంకటేశ అందగాఁడ కూడితిని
జడియక మెచ్చి మెచ్చి సత మైతి నేనూ

రేకు: 0311-4 లలిత సంపుటం: 11-064

పల్లవి: ముంచుకొంటే వలపులు మొగచాటవును
మంచముపై జాగరాలు మరి యేలయ్యా

చ. 1: పచ్చనిచిగురువంటి పళ్లెపు మోవిచెలి
కుచ్చి తేనెలమాటులు కురుసీ నదె
ఇచ్చకానఁ జెవి యొగ్గి యియ్యకొంటి వన్నియును
మచ్చిక నాపైఁ జల్లేవు మరి యేలయ్యా

చ. 2: కలువరేకులవంటి కన్నుల వెన్నెలతేట
పొలితి నేపై దిగఁజోసీ నదె
పొలసి నిలువుననె పూజ గొంటివి నీ వందు
మలసి మాకు మొక్కేవు మరి యేలయ్యా

చ. 3: సారె నిమ్మపండ్లవంటి చన్నులవొత్తులఁ జెలి
కోరిక రతులు నీపైఁ గులికీ నదె
కూరిమి శ్రీవెంకటేశ కూడితివి నన్నునిట్టె
మారు గొసరేవు నీవు మరి యేలయ్యా

రేకు: 0311-5 పాడి సంపుటం: 11-065

పల్లవి: ఏల వొడఁబరచేవు యింతలోననే నన్ను
నాలి సేసి నోతోను నవ్వేదాననా

చ. 1: మన సిచ్చి నీవు నాతో మాట లెల్లాఁ జెప్పఁగాను
విని నవ్వవలెఁ గాక వేసరేనా
చనవు నీ విచ్చితివి సరి గాదా నను నేను
తనియఁగ వలె గాక తప్పు లెంచేనా

చ. 2: చేయి పట్టుకొని నీవు చేఁత లెల్లఁ జేయఁగాను
యీయకొనవలెఁ గాక యీసడించేనా
ఆయాలు సోఁకించితివి ఆరమరచి చొక్కిలి
చాయ నేయవలెఁ గాక సాదించేనా

చ. 3: కందువ నుచిని నీవు కాఁగిలింగి కూడఁగాను
పొందు సేయవలెఁ గాక పొద్దు వుచ్చేనా
ముందె శ్రీవెంటేశ మోహించితి కలసితి
చెంది మెచ్చవలెఁ గాక సిగ్గు వడేనా

రేకు: 0311-6 వరాళి సంపుటం: 11-066

పల్లవి: నీకు నాకు నీపాటి నెయ్యము లెందు గలవె
కాకుగాఁ జేయ నేలోకో కడ నున్నచెలికి

చ. 1: చనవు సేసుక నీతో సారె సారె నవ్వఁగాను
యెన లేనియెగ్గు లెంచీ యీపె నాతోను
వొనర నీ వన్నిటికి నోరుచుక వుండఁగాను
తన కేల వచ్చెనొకో తమక మీచెలికి

చ. 2: పొందు సేసుక నిన్ను పువ్వులనె వేయఁగాను
యిందు కే లడ్డాలు వచ్చీ నీపె నాతోను
సందడి నాచేఁత నీకు సమ్మతులై వుండఁగాను
అంది వాదు లింతోలొకో అండ నున్నచెలికి

చ. 3: కైవసము సేసుకొని కాఁగిట నిన్ను నించఁగా
యీవల పంత మే లాడీ నీపె నాతోను
చేవదేరఁ గూడితిని శ్రీవెంకటేశ నన్ను
యేవ లేల వచ్చెనొకో యెరవులచెలికి

రేకు: 0312-1 శుద్ధవసంతం సంపుటం: 11-067

పల్లవి: నీతోడిచుట్టరికాలు నిజ మాయను
యేతుల నీ జాణతనా లివి నిజ మాయను

చ. 1: వావి గద్దంటాఁ జెప్పి వద్దఁ గూచండి మెల్లనె
నీవు నవ్విన నవ్వులె నిజ మాయను
చేవ దేర బుజ్జగించి చెక్కులు నొక్కిన నేఁటి
కోవరపు నీ చెనకులు నిజ మాయను

చ. 2: గారవించి సందిగొందిఁ గన్నయప్పు డెల్లాను
నేరుపుల నీ మొక్కులు నిజ మాయను
వారివీరిచేత నీవు వడిఁబె ట్టింపినయట్టి
యీరీతినీ పైఁడిలేక లివి నిజ మాయను

చ. 3: కన్నులలె సన్న సేసి కాఁగిలించుకొన్నట్టి
నిన్న మొన్నటి సుద్దులు నిజ మాయను
మన్నించి శ్రీవెంకటేశ మరిగి నన్ను నేలితి
మున్నిటి నీకోరికలు నిజ మాయను

రేకు: 0312-2 మధ్యమావతి సంపుటం: 11-068

పల్లవి: మనసు లొక్కటులైతే మరి యేల మఱఁగూ
పని గలితేఁ జేసే బాయిట నే వేయనూ

చ. 1: నీ కెంత సంతోష మైనా నేడు నా సంతోస మదె
ఆకడ నీవు నవ్వితే నది నానవ్వె
లోకలోడిమాఁట గాదు లోను వెలి నొక్కటె
ఆకె నీడకె తేవయ్య నవుఁగాము లెంచను

చ. 2: నీవు లెస్స వుండితే నేనె లెస్స వుండిన దది
లావు నీకుఁ గలితే నా లావూ నాదె
కావర మించుకాఁ గాదు కలగుణము నా కిది
వావులు చెప్పుకోరయ్య వద్దని నే నసను

చ. 3: నీ మేలె నా మేలు నే నేరుపె నా నేరుపు
ప్రేమపు నీ ప్రియమె నా ప్రియ మిదివో
కామించి శ్రీవెంకటేశ గక్కనఁ గూడితి నన్ను
దోమటి దొడికించితే దూరను నే నాపెను

రేకు: 0312-3 రాయగౌళ సంపుటం: 11-069

పల్లవి: ఏల వేగిరపడేర యింతలో మీరు
తాలిమి చూపి యతఁడె దయసేసీఁ గాకా

చ. 1: చనవు లిచ్చినవాఁడు సరవు లేల తప్పునె
మనసు చూడ వలసి మాయలు గాక
నను పై యుండేవాఁడు నవ్వ కేల మానునె
పెనఁగించుకొని తానె బెరసీఁ గాకా

చ. 2: యిచ్చక మాడెటివాఁడు యెగ్గు లేల పట్టునె
ముచ్చట లాడ వలసి మొరఁగీఁ గాక
మెచ్చినట్టివాఁడు మేలు మెరయ కేల మానునె
రచ్చ కెక్కినందాక రాఁపు సేసీఁ గాకా

చ. 3: కలసినయట్టివాఁడు కరఁగ కేలు లండునె
అలపు దేరినదాఁకా ఆలించీఁ గాక
యెలమి శ్రీవెంకటేశుఁడిక నేల లోఁచీనె
చెలఁగి తనబాసలు చెల్లించీఁ గాకా

రేకు: 0312-4 సామంతం సంపుటం: 11-070

పల్లవి: వేసాలవాఁడు గదవే విట్ఠలేశుఁడు
తా వేసారఁ డెందుకు నైనా విట్ఠలేశుఁడు

చ. 1: వేడుకకాఁడు గదవే విట్ఠలేశుఁడు నాకు
వీడె మిచ్చీ నింతనోనె విట్ఠలేశుఁడు
వీడ నాడనీఁడు నన్ను విట్ఠలేశుఁడు అట్టె
వేడెవట్టీ వలపులు విట్ఠలేశుఁడు

చ. 2: వెన్నెలనవ్వులు నవ్వీ విట్ఠలేశుఁడు యాడో
విన్నపము లాలకించీ విట్ఠలేశుఁడు
వెన్నముచ్చిమి విద్యల విట్ఠలేశుఁడు నా
విన్నఁదన మెల్లా బాపీ విట్ఠలేశుఁడు

చ. 3: విరులు నాపైఁ జల్లీ విట్ఠలేశుఁడు కడు
విరివికాఁడు గదవే విట్ఠలేశుఁడు
ఆరిది శ్రీవెంకటాద్రి నందు నిందు నన్నుఁ గూడె
వెరవరి గదవె యీ విట్ఠలేశుఁడూ

రేకు: 0312-5 కన్నడగౌళ సంపుటం: 11-071

పల్లవి: నిన్ను నిచ్చా నా బదుకు నీచేతిది
యిచ్చక మ్మై యెందు కైనా నియ్యకొందు నేనూ

చ. 1: చెక్కు నొక్కినందుకె సేద దేరితిఁ గాక
వెక్కసపుఁజింతతోడ వేగించనా
గుక్కక నీ చేఁతలకు గోపము వచ్చునంతలో
పక్కన వేఁడు కోంటేను పైపై లో నౌదును

చ. 2: చేయి వేసినందుకె సెలవి నవ్వితిఁ గాక
చాయ సేసుక బొమ్మల జంకించనా
మాయపు నీ గుణాలను మారుకొందు నంతలోనె
ఆయములు నీ వంటితే నన్నియు మఱతును

చ. 3: కాఁగిలించుకొన్నందుకె కళల మించితిఁ గాక
చేఁగ దేఁర దల వంచి చెమరించనా
కాఁగి మాటల దూరుదు కరఁగుదు నంతలోనె
ఆఁగి శ్రీవెంకటేశ నిన్నలమి నే మెత్తును

రేకు: 0312-6 శ్రీరాగం సంపుటం: 11-072

పల్లవి: వలపు విసికితేను వాసన గద్దా
చలము సాదించఁ బోతే చవి గావు పనులు

చ. 1: మచ్చిక నీతో నిట్టె మాటలాడినప్పుడె
చెచ్చెర నీ పొందు నేఁ జేసినదాన
కొచ్చి కొచ్చి నన్నేల కొంగు వట్టి తీసేవు
వచ్చినదాననె యాల వడిఁబట్టె వీఁకను

చ. 2: కన్నుఁగొనలను నిన్నుఁ గనుఁగొన్నయప్పుడె
యిన్నిపనులకు నే నియ్యకొందాన
మన్నించి యేకతములు మరి యేల చెప్పేవు
విన్నదాననె తొల్లి వేసరించ కిఁకను

చ. 3: గక్కననె నిన్ను మెచ్చి కాఁగిలించినప్పుడె
గుక్కక రతులలోఁ గూడినదాన
యిక్కువ శ్రీవెంకటేశ యేలితివి నన్ను నిట్టె
దక్కినదాననె తొల్లె దయఁ జూడు మిఁకను

రేకు: 0313-1 బౌళరామక్రియ సంపుటం: 11-073

పల్లవి: ముందటనె నిలుచుండి మొక్కేము గాక
అందముగా మారుమాట లాఁడ గలమా

చ. 1: అంగన నీమోము చూచె నట్టె నీవు చూచితిని
యింగితా లెరుఁగుదురు యిద్దరు మీరు
చెంగట నుండినయట్టి చెలులము నే మెల్ల
సంగ తెరఁగక మాటసరి తియ్యవచ్చునా

చ. 2: వనిత నీతో నవ్వె వడి నీవూ నవ్వితివి
యెనలేని నేరుపరు లిద్దరూ మీరు
పనులు సేసేయట్టి పడఁతులము మేము
వెనక ముందటి మాట విన్నవించ వచ్చునా

చ. 3: సతి నిన్ను గాఁగిలించె సమ్మతించి కూడితివి
యితవు లెరుఁగుదురు యిద్దరూ మీరు
తతి శ్రీవెంకటేశుఁడ తగు మీవారము నేము
మతకాన నిఁక మారుమాట లాడ వచ్చునా

రేకు: 0313-2 గౌళ సంపుటం: 11-074

పల్లవి: ఏమే సంగ తెరఁగ వింతిరో నీవు
ఆమె కులువ చరించ కయ్యో నీవు

చ. 1: సంకె లేక యాతఁడు జాణఁడై తిరుగఁగాను
అంకెలకు వంక లొత్తే వప్పటినీవు
మంకుదానఁ దొలుతనె మారు మలయఁగఁ బైపై
నింకా బుద్దులు చెప్పే వెట్టో నీవు

చ. 2: వొడ్డినందు కెల్లా నాతఁ డోపికతో నుండఁగాను
అడ్డాలు దుడ్డాలు వచ్చే వప్పటి నీవు
వడ్డివారె శిగ్గుతోడి వనితను వానిఁ దెచ్చి
జిడ్డు దేర నవ్వించేవు చీచీ నీవు

చ. 3: బలిమిఁ గాఁగిటఁ గూడి బడలి వాఁ డుండఁగాను
అలపు సొలపుఁ దేర్చే వప్పటినీవు
యెలమి శ్రీవెంకటేశు నెదలోనిదాన నేను
చెలరేఁగించే విన్నిటాఁ జెల్లునె నీవు

రేకు: 0313-3 భైరవి సంపుటం: 11-075

పల్లవి: చెచ్చెర నీవ్రతమే చెల్లెఁ గాక
యిచ్చకురాల నేను యింకా నేడ సుద్దులు

చ. 1: చేసిన నీచేఁతలకు చెక్కు నొక్కేదానఁ గాక
వేసరించి నిన్ను నంత వెంగె మాడేనా
మూసినముత్యమువలె ముంగిటికి వచ్చితివి
యీసులు నీతో నేల యింకా నేడ సుద్దులు

చ. 2: నానాటి నీగుణాలకు నవ్వు నవ్వేదానఁ గాక
కాని మ్మని పగ చాటి కాఁక రేఁచేనా
మోనాన నా యెదుటను మోహము చల్లెటి నీపై
యేనెపము వెట్టఁగల నింకా నేడ సుద్దులు

చ. 3: గక్కనఁ గూడినందుకు కరఁగేటిదానఁ గాక
యెక్కువతక్కువలు ని న్నెంచ వచ్చునా
చిక్కితిని నాపాలికి శ్రీవెంకటేశ్వర
యిక్కడనెవుండు నీవు యింకా నేడ సుద్దులు

రేకు: 0313-4 మాళవిగౌళ సంపుటం: 11-076

పల్లవి: చిత్తము వచ్చినప్పుడు చేర వచ్చే వింతే కాక
యిత్తల నిందరిలోన నేమి బాఁతి నేను

చ. 1: చెక్కులు నొక్కేటివారు సేసలు వెట్టేటివారు
యిక్కువ లంటేటివారు యెందురు నీకు
వెక్కస మీ సందడిలో వేసరించఁ బోతేను
యెక్కడి కెక్కు నావల పేమి బాఁతి నేను

చ. 2: ముచ్చట నుండేటివారు మొగము చూచేటివారు
యిచ్చకా లాడేటివారు యెందరు నీకు
పచ్చిగా నీమూఁకలలో పచరించఁ బోతేను
యెచ్చుటఁ గనేవు గురు తేమి బాఁతి నేను

చ. 3: కమ్మిక కూడేటివారు కాఁకలు చల్లేటివారు
యెమ్మెలు సెరుపేవారు యెందరు నీకు
దొమ్మిలో శ్రీవెంకటేశ తొల్లె నన్నుఁ గూడితివి
యిమ్ములఁ జెయి వట్టేవు యేమి బాఁతి నేను

రేకు: 0313-5 సామంతం సంపుటం: 11-077

పల్లవి: ఇందరు నవ్వే దెరఁగ దెవ్వతో యీపె
యెందు కైనాఁ దానె వచ్చీ నెవ్వతో యీపె

చ. 1: మచ్చికతో నీవు నేను మాట లాడఁగా విని
యెచ్చు కుందు లెంచ వచ్చీ నెవ్వతో యీపె
కుచ్చితాన తనలోన కోపము కొంత వెట్టుక
యిచ్చట మెచ్చులు మెచ్చీ నెవ్వతో యీపె

చ. 2: నగుతా నిద్దరమును ననుపు నటించఁగాను
యెగసక్యములు సేసీ నెవ్వతో యీపె
తగవులు చెప్పుతాఁ గాఁతాళము గొంత రేఁచుక
యెగుసనఁ బెట్టీ రేసు లెవ్వతో యీపె

చ. 3: నెయ్యపు శ్రీ వెంకటేశ నేఁడు మనము గూడఁగ
యియ్యకొని పూఁకోనీ నెవ్వతో యీపె
చయ్యాటా లిన్నియు మాని చవి సేసుక పాదిగి
యెయ్యెడ నున్నదో తాను యెవ్వతో యీపె

రేకు: 0313-6 పాడి సంపుటం: 11-078

పల్లవి: ఆపెమారు విన్నవించే నదివో నేను
చేపట్టిన నీచేతివే సేసెటిపనులు

చ. 1: ఆంగన నీ మాటలకు నాయములు గరఁగెను
పొంగుచునుఁ జెమరించెఁ బులకించెను
చెంగటి సిగ్గుతోడఁ జేరి నీతో మాటాడదు
యింగితాన నీ చేతివే యిటమీఁదిపనులు

చ. 2: నీవు చే చాఁచినందుకె నివ్వెరగులఁ బొందెను
భావము యింత మందె పచ్చి దేరెను
తావుల కోరికల సందడిఁ బడి వున్న దదె
యేవిధాన నీ చేతివే యిటమీఁదిపనులు

చ. 3: ఆడెటి నీ సరసాన కంతరంగము దనిసె
వీడె మందుకొన నిన్నీ వేళఁ గూడెను
జోడై శ్రీవెంకటేశ చొక్కులనె వోలవాడి
యేడ నయినా నీ చేతివే యిటమీఁదిపనులూ

రేకు: 0314-1 రీతిగౌళ సంపుటం: 11-079

పల్లవి: చాయ సేసుకొనుఁ గాక సతుల యడాటాన
పాయపు రమణుఁడైతే పంతము గొనీనా

చ. 1: చెక్కు నొక్కి సేద దేర్చి సేవలు సేసితిని
యెక్కువ తక్కువ లెల్లా నిఁక నేడవే
గక్కన మీరు చెప్పఁగా గాని మ్మంటి మీమాట
అక్కడనె నిలుచున్నాఁ డప్పటిఁదా నేఁటిదే

చ. 2: కొంకు వాయఁ గాఁగిలించి కూరిమి నవ్వు నవ్వి
యింకఁ జెమరించితిని యిఁక నేఁటిదే
మంకుదాన ననే రంటా మారుమాటలాడ మీకు
బింకము లింగా మానఁడు పెనఁగనే వలెనా

చ. 3: మోవి యిచ్చి మొక్కు మొక్కు మోహ మెల్లా జల్లితి
యీవల వట్టిగుట్లు యిఁక నేఁటికే
మే వెంచి శ్రీవెంకటేశు మీ మొకమోటఁ గూడితి
నావాఁడనె అనీఁ దాను నమ్మికలు వలెనా

రేకు: 0314-2 దేసాళం సంపుటం: 11-080

పల్లవి: ముందటికి వెనకకు మొక్కేము నీకు
కందువ లన్నియు నీవె కనుకొమ్మీ యికను

చ. 1: యిచ్చక మాడితి నేడు యింటికి నీవు రాఁగాను
కొచ్చి నిన్న రాకుండఁగఁ గొసరితిని
బచ్చెన వేఁడివలపు పచ్చి దోఁచి చిగురాయ
తచ్చి తొల్లిటియలుక తలఁచకు మీఁకను

చ. 2: కమ్మి నీవు చూడఁగాను కాను కిచ్చితి విప్పుడు
తమ్మిని వేసితిఁ దొల్లి తల వంచఁగా
వుమ్మగిలి నాసరస మొగ రెక్కి నిండఁ బూచె
దిమ్ము రేఁగినచలము తిప్పుకోకు మీఁకను

చ. 3: గక్కన నీవు గూడఁగ గాఁగిలించుకొంటి నిట్టె
మెక్కలాన నల్లప్పుడు మొరఁగితిని
చిక్కన య్యనును నాయఁ జిత్తము శ్రీవెంకటేశ
నిక్కి నీకపటములు నెరపకు మీఁకను

రేకు: 0314-3 బౌళి సంపుటం: 11-081

పల్లవి: చేతికి నీవు లోఁ గాఁగ జెప్పేఁ గాని
యేతులఁ గుచ్చితా లుండె యిందాఁక నాకును

చ. 1: మంతన మాడితిని మగువతో నీ వప్పుడు
పంతము లాడితెనే నీ పడఁతితోడ
యింతలో నీవు రాఁగానె యేకచిత్త మాయఁ గాని
దొంతర చలము లెక్కె తోడఁదోడ నాకును

చ. 2: చేతులు చాఁచితివ చెలియపై నీ వప్పుడు
కాతరాలు రేఁచితి నా కాయములోన
యీతలఁ జెక్కు నొక్కఁగా యియ్యకొంటి నేనన్నియు
వాతులు మోవఁగఁ బొంగె వాసు లెల్ల నాకును

చ. 3: కన్నులచె మొక్కితివి కాంతకు నీ వల్లప్పుడు
సన్నలఁ దిట్టితి నిన్ను సారెకు నేను
అన్నిటా శ్రీవెంటకేశ అలమఁగ మెచ్చేఁగాని
నున్ననిచెమట నిండె నొసలనె నాకునూ

రేకు: 0314-4 రామక్రియ సంపుటం: 11-082

పల్లవి: ఇచ్చకుఁడ విన్నిటాను యే మంటివి
యెచ్చరించే నింతె నిన్ను యే మంటివి

చ. 1: కాంత నిన్నుఁ దెమ్మనఁగఁ గాచుకున్నదాన నేను
యింత వొద్దాయ నింక నే మంటివి
చింతతో నెదురు చూచి సేసవెట్టె నంటా నీకు
యెంత లేదు నీకు బని యే మంటివి

చ. 2: ఆకె నీకడ నున్న అంపఁగా వచ్చితి నేను
యేకచిత్తమున నిట్టె యే మంటివి
లేకలు నీకడ కంపె లేచి విచ్చేయఁగదవయ్య
యేకతాన నప్పుడు నీ వే మంటివి

చ. 3: కొమ్మ లోననుండి వచ్చి కొంగు వట్టి నిన్నుఁ దీసె
యిమ్ముల నీ మొగమాట నే మంటివి
సమ్మ తై శ్రీవెంకటేశ సరుగఁ గూడితి రిదె
యిమ్మనీ విడెము నిన్ను నే మంటివి

రేకు: 0314-5 వరాళి సంపుటం: 11-083

పల్లవి: చూచినవారికి జూడ పోద్యా లివి
యేచినవేడుకె కాని యెంతైనా వీఁగదూ

చ. 1: యెట్టు నమ్మెనో నీ చిత్త మింతి యెవ్వరు చెప్పిన
జట్టిగొన నవ్వుఁ గాని చంచలించదు
మట్టు లేని నీ వెంతమాట పట్టిచ్చితివో
గుట్టుతోనే మెచ్చుఁ గాని కొంతైన వెరవదూ

చ. 2: కలికి నీ నిజ మెట్టు గనెనో నీ సుద్దులకు
చెలరేఁగె వుండుఁ గాని చిన్నఁబోదు
చెలిమి నీ వాపె కెంత చేతికి లో నైతివో
వలపులె చల్లుఁ గాని వసివాడదూ

చ. 3: నీ మర్మ మె ట్టెటిఁగెనో నెలఁత నీరతులకు
వేమారుఁ బైకొనుఁ గాని వేసారదు
నేమపు శ్రీవెంకటేశ నీ వెంత చొక్కించితివో
ఆమనిభోగమె కాని ఆలయి కెరఁగదు

రేకు: 0314-6 ఆహిరి సంపుటం: 11-084

పల్లవి: చెలులము మా కెప్పుడు సిగ్గె మేలు
సొలసి నిన్నుఁ గన్నుల జూచుటే మేలు

చ. 1: మంచిమాట లాడినాను మర్మములు సోఁకీ నిన్ను
యించుక గుట్టున నుండే దిదె మేలు
అంచెల నీ వాన తీఁగా అట్టె విని చొక్కుకొంటా
వుంచముతో సారె సారె నూఁకొనుటె మేలు

చ. 2: వూడిగాలు సేసినాను వోరసిన ట్లయ్యీని
వోడక కొలిచి నిలచుండుటె మేలు
వేడుక నీవు చేయి వేయఁగా బొగడుకంటా
వాడికెతోడ నీకుఁ గైవస మౌటె మేలు

చ. 3: చేయి పట్టి తీసితేను సేవలు గొన్న ట్టయ్యీని
చాయల నీదాన ననేసలిగె మేల
యీయెడ శ్రీవెంకటేశ యింతలో నన్నుఁ గూడితి
పాయక యిట్ల నుండేభాగ్యమె మేలు

రేకు: 0315-1 భైరవి సంపుటం: 11-085

పల్లవి: సకలాపరాధము శమియించుకోవయ్య
అకలంక మైననీ యానతిలో దానను

చ. 1: చేరి నీ పాదములకు సేవ సేసే నంటినా
నేరుపులు నీ వెరంగనివి లేవు
యేరీతి నైనాను చేయెత్తి మొక్కే నంటినా
కారాణాలు నీ విన్నిఁ గాననవి గావు

చ. 2: మన సిచ్చి నోతోను మాట లాడే నంటినా
వెనక ముందర నీకు వింత గాదు
చనవు మెరసి నీసరుస నుండే నంటినా
వినికిగా నీవు తొల్లి విననిది గాదు

చ. 3: గక్కనఁ గాఁగిట నిన్ను గరఁగించే నంటినా
యిక్కువల నీకు నిది యెరవు గాదు
చిక్కి నన్నుఁ గూడితివి శ్రీవెంకటేశ్వర నేఁడు
పెక్కుసుద్దు లెల్ల నీకు భేదము గాదూ

రేకు: 0315-2 శంకరాభరణం సంపుటం: 11-086

పల్లవి: తెలుసుకో యిఁక నీవు తేటతెల్ల మిగ మమ్ము
తలఁచుకో వారివంటిదాననె యింతనుండి

చ. 1: యిచ్చక మాడేటివారు యిన్నిటా నితవరులు
నిచ్చ బుద్ది చెప్పేవారె నిష్టూరులు
యెచ్చుకుంద లింతేసి యెరఁగ నైతి నిన్నాళ్లు
తచ్చన నే వారితోదాననె యింతనుండి

చ. 2: మాయలు నేర్చినవారు మహిలోన జాణలు
నాయాలు నడచేవారె నాలికూళలు
బాయలుపందిలి వన్ని భ్రమించ నైతి నిన్నాళ్లు
దాయగత్తెనై వారిలోదాననె యింతనుండి

చ. 3: గక్కన జంకించువారె కందువచనవరులు
చిక్కి లోనై నవారె జిగి వెఱ్ఱులు
యిక్కువ శ్రీవెంకటేశ యెనసితి నేడిన్నాళ్లు
తక్కక నీవారిలోదాననె యింతనుండి

రేకు: 0315-3 దేసాళం సంపుటం: 11-087

పల్లవి: ఎన్నఁడు నీ దయ మాపై నిఁకఁ బెట్టేవు
తిన్నని యెడమాటలఁ దెల్లవార వచ్చెను

చ. 1: కొంగు వట్టినవాఁడవు గుట్ట గొంత నడుపేవు
అంగవించి జాణవు గా వని యందునా
చెంగట నిందరిలోన సిగ్గుపడి వుందానను
వుంగిటి దీరనివేళ నూరడించ వలదా

చ. 2: చెక్కు నొక్కినవాఁడవు చెప్పవు ఆమీఁదిమాట
లెక్కించి నీ ప్రేమ నాపై లే దందునా
తక్కక యాపనులకె తలవంచుకుందానను
అక్కరతో యీవేళ నాదరించ వలదా

చ. 3: యియ్యకొన్నట్టివాఁడవు యెదురు చేయి చాఁచేవు
నెయ్యపు సరసములు నేర వందునా
యియ్యెడ శ్రీవెంకటేశ యిందుకె కూడుందానను
వొయ్యన నీ మన్ననల నోలలార్చ వలదా

రేకు: 0315-4 సామంతం సంపుటం: 11-088

పల్లవి: కంటే సుంకము మరి కానకుంటే బింకము
యింటికాఁడ మాతో మాయ లేల సేసే వీఁకను

చ. 1: కప్పి యాపె తనచేతికానుక నీ కియ్యఁగాను
ముప్పిరి నీ వప్పటి నా మోము చూచేవు
అప్పణ గొంటివా గోపాంగనల కెల్లఁ దొల్లి
యిప్పుడు నాతో మాయ లేల సేసే వీఁకను

చ. 2: పరగి యాపె నీకుఁ బనులు సేయ రాఁగాను
సరి నాకుఁ జేయు మంటా సన్న సేసేవు
పొరుగు పొరచిగా నీ పొలఁతులకుఁ జేయించు
యిరవు నాతో మాయ లేల సేసే వీఁకను

చ. 3: కందువ నాపె నిన్నుఁ గాఁగిలించుకోఁగాను
అంది నన్నుఁ గాఁగిలించి తందులోననె
పొందుమా శ్రీవెంకటేశ భూసతి శ్రీసతి నిట్టె
యిందులోనె నాతో మాయ లేల సేసే వీఁకయ

రేకు: 0315-5 వరాళి సంపుటం: 11-089

పల్లవి: ఎట్టు సేసిన నాతని నేమీ ననకురమ్మ
గుట్టు సేసు కుండితేను గుణవంతుఁ డౌనె

చ. 1: మచ్చరించఁ బని లేదు మాపుదాఁకా బతితోడ
పచ్చి దేర నవ్వితేనె పంత మాడటా
యెచ్చుకుందు లేమి గల్ల నిచ్చగించి గక్కునను
కొచ్చి కౌఁగిలించుకొంటె గుణవంతుఁడౌనె

చ. 2: వెంగె మాడఁ బని లేదు వేవేలైనా నాతని
సంగడిఁ గూచుండితేనె సాధించుటా
సంగతి దప్పినవేళ సరసుని రతులకు
కొంగు పట్టి తీసితేను గుణవంతుఁడౌనె

చ. 3: బాస గొనఁ బని లేదు పైకొని కాఁగిటిలోనె
సేసవెట్టి కూడితేనె చిక్కించుటా
యీాసు దీర శ్రీవెంకటేశుఁ గలసితి వీఁక
గోసనాస గొనంకుంటె గుణవంతుఁడౌనె

రేకు: 0315-6 లలిత సంపుటం: 11-090

పల్లవి: మమ్ము నిన్నిటా నీకఁ మన్నించుఁ గాక
చిమ్ముసిగ్గులఁ దడవు సేయ నేఁటికే

చ. 1: వలపించుకొన్నవాఁడు వాకిటికె వచ్చుఁ గాక
పిలిపించుకొన నేలె పెనఁగ నేలె
చలి వాసినట్టివాఁడు సరసము లాడుఁ గాక
యెలయించి యెడమాఁట లీఁక నేఁటికే

చ. 2: చేసుకొన్న యట్టివాఁడు చెప్పినట్టె నేసుఁ గాక
మూసి దాపిరము లేలె మొరఁగు లేలె
ఆసపడినట్టివాఁడు అండనె కూచుండుఁగాక
వోసరించి మరి కొన్ని వొడఁబా ట్లేఁటికే

చ. 3: చేయి చాఁచినట్టివాఁడు చెనకి కలసుఁగాక
నాయముల వెట్ట నేలె నలన లేలె
యీయెడ శ్రీవెంకటశుఁ డేకమై కూడినవాఁడు
చాయలకు లోలోనిసన్న లీఁక నేఁటికే

రేకు: 0316-1 శ్రీరాగం సంపుటం: 11-091

పల్లవి: ఏడ దాఁచుకుండెనో యి విందాఁకాను
వాడుదేరె నీవు తనవద్ద నుండఁగాను

చ. 1: సెలవినవ్వులు గారె చెక్కులఁ గళలు దేరె
మలసి చెలితో నీవు మాటలాడఁగా
కలువకన్నులు విచ్చె కతలు చెప్పఁగఁ జొచ్చె
పొలసి పొలసి నీవు బుజ్జగించఁగాను

చ. 2: పొంచినయాసలు రేఁగె పులకలు విఱ్ఱవీఁగె
మంచముపై నుండి నీవు మన సియ్యఁగా
ముంచి పైపైఁ జెమరించె మోహము నీ కొప్పగించె
అంచెల మర్మముల నేఁడట్టె నీ వంటఁగాను

చ. 3: కమ్మరఁ జేతుల మొక్కె కాఁగిట నీకుఁ జొక్కె
వుమ్మగిలురతులు నీ వొసఁగఁగాను
యిమ్ముల శ్రీవెంకటేశ యిన్నిటాను నిన్నుఁ గూడె
సమ్మతించి నీ విట్టె చన వియ్యఁగాను

రేకు: 0316-2 ముఖారి సంపుటం: 11-092

పల్లవి: నయ మిచ్చి మాటలాడ నావంటిదా ఆపె
ప్రియముల బిగువులఁ బెనఁగెడుఁ గాక

చ. 1: గుట్టు దెలిసిన దాపె గొసరునా నిన్ను మరి
వట్టి సణఁగులు చల్లి వంచుఁ గాక
ఱట్టడి మొదలనె యాఱడి కింక లోఁగీనా
తిట్టులును దీవెనలు దిగఁబోసుఁ గాక

చ. 2: యింతచనవుల దాపె యిచ్చకము లాడీనా
పంతములనె నిన్నుఁ బంగించుఁ గాక
అంతేసి నేరిచినాపె అప్పణ నిన్నడిగీనా
వంతుల వాసులను మోవఁగఁ గూడుఁ గాక

చ. 3: మందెమేళముల దాపె మట్టున నుండునా నిన్నుఁ
గిందుపరచి తాఁ గరఁగించుఁ గాక
పొందితి శ్రీవెంకటేశ పొంచి నన్ను నిఁక నాపె
చందాలను చాయలను సమ్మతించుఁ గాక

రేకు: 0316-3 సామంతం సంపుటం: 11-093

పల్లవి: కాకిబెగడశీరను కాశ వోసినాడు తాను
వాకిటికి వాచ్చినాఁడు వలశితి ననవే

చ. 1: పచ్చనిసాపమీఁదఁ బవళించు మనవే
కుచ్చి మాసూపులు దన్ను గురి దాఁకెను
చెచ్చెరఁ బారుటాకుల చెంచవార మనవే
తెచ్చేను మా దొండపంటితేనె లిదే అనవే

చ. 2: కొండపడ మేడలలోఁ గూరుసుండు మనవే
నిండునెమలిగరులు నెత్తి కెక్కెను
దిండు మా వెలఁగపండ్లు తీపు లెక్క ననవే
అండనె వుందాన తన కప్పగించే ననవే

చ. 3: కొప్పుల మొలల సే కుప్పవడె ననవే
కప్పురపు తనతమ్మ కార మనవే
వొప్పుగా శ్రీవెంకటేశుఁ డొనగూడె ననవే
ముప్పిరి నేమీ నెఱఁగ మొక్కితి నే ననవే

రేకు: 0316-4 సౌరాష్ట్రం సంపుటం: 11-094

పల్లవి: కమ్మరఁ గమ్మరఁ జెప్ప కత లాయనే
చిమ్ముల నీపతి వాఁడె చిత్తగించవే

చ. 1: చెక్కునఁ బెట్టినచేయి చెలువుఁ డింతలో రాఁగా
అక్కజపు నీ సిగ్గు కడ్డ మాయనే
తక్కక పయ్యదలోన దాఁచిన నీ కుచములు
పుక్క టైన జక్కవల పోరు గాయనే

చ. 2: సెలవి నవ్వినన వ్వు చేరి నీ పలుకులకు
చలువ లై యడనెడ చవు లాయనే
మెలుపున ముడిచిన మీ టైన నీతురుము
పొలయు తుమ్మిదలకు పూఁ టాయనే

చ. 3: సేసెటి నీ విడెము శ్రీవెంకటేశు కూటమి
వీసరపోక మంచివిందు లాయనే
సేసపాల రతులలో చిప్పిలు నీ కెమ్మోవి
రాసి కెక్కి చిగురులరచ్చ లాయనే

రేకు: 0316-5 నాదరామక్రియ సంపుటం: 11-095

పల్లవి: ఎడమాట లిఁక నేల యెదురుచూపు లేల
తడ వాయ నిన్నిటాను తా నెరుంగానే

చ. 1: మొగము చూచినఁ గాని ముచ్చటలు వాయవు
నగుతా నుండినఁ గాన ననుపు లేదు
తగులాయ మైనఁ గాని తమకము వొడమదు
వగ దీర నాతనివద్ద నుండవే

చ. 2: కందుల లంటినఁ గాని కరఁగవు మర్మములు
మందెమేళ మైనఁ గాని మాఁట లెక్కవు
చెంది చెనకినఁ గాని చిత్తము తనవి లేదు
విందువలె నిఁక వేరె విన్నప మేలే

చ. 3: చెక్కులు నొక్కినఁ గాని చేతులకసి దీరదు
వొక్కచో నుండినఁ గాని వొద్దికగాదు
యిక్కు పెరిగి శ్రీవెంకటేశుఁ డిట్టె నన్ను గూడె
చక్క నాయఁ బను లెల్ల జాణ తా నవునే

రేకు: 0316-6 శంకరాభరణం సంపుటం: 11-096

పల్లవి: ఇంగితాకారము లెత్త నెరిఁగినవాఁడవు
సంగ తాయఁ బను లెల్ల జయవెట్టే మయ్యా

చ. 1: చెలియభారము నీది సిగ్గులు నీ చేతివి
పలువిన్నపము లిఁకఁ బని లే దయ్యా
అలరినే మాడేమాట లన్నియు నీ వాడితివి
చలువాయ మా మనసు సారె మెక్కే మయ్యా

చ. 2: వనితపాలిటి దిద వహించుకో కిఁకఁ బోదు
అనఁగి పెనఁగ నోతో నంత యేలయ్యా
ననుపు లెల్లా నెరపి నమ్మిక నీ విచ్చితివి
తనిసితి మిఁక నీ చేఁతలకు లో నయ్యా

చ. 3: కోమలి మన్నన నీది కోరికె లెల్లా నీవి
వేమరు మండాటాల వింత లే లయ్యా
కామించి శ్రీవెంకటేశ కలసితివి యింతిని
ఆముకొంటి మిఁక నిన్ను నట్టె మెచ్చే మయ్యా

రేకు: 0317-1 శంకరాభరణం సంపుటం: 11-097

పల్లవి: అతివ నిన్నే మనిన నది యెగ్గా
చతురు లైనవారికి చవులే కాదా

చ. 1: కూరిమి గొసరఁగాను కోపముగాఁ జేసుకొంటే
యిరీతిఁ జెలుల కెల్లా నేది గతి
మేర మీరే నవ్వులకే మిక్కిలి బీరా లాడీతే
తారుకాణమోహలకు తగులాయ మేది

చ. 2: చనవు మెరయ రాఁగా సారెకువేసారుకొంటే
వినయపుసతు లెల్ల వేగించు టెట్టు
కనుఁగొనలఁ జూడఁగ కాఁతాళాలు నెరపితే
ననుపుల లోపలికి నయగారా లేవి

చ. 3: కుచ్చి కాఁగిలించుకోఁగా కుచములు నాటె నంటే
ముచ్చటాడేయింతులకు మొదలేది
యిచ్చికుఁడ శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
విచ్చనవిళ్లలోన విన్నవించ నేది

రేకు: 0317-2 శుద్ధవసంతం సంపుటం: 11-098

పల్లవి: చెలులాల మీ రిం తేల చెప్పే రాతనికి బుద్ది
చలివలపులు చిల్లి జాగులు సేసీనా

చ. 1: సేస వెట్టినట్టివాఁడుచేరి కాఁగిలించుఁ గాక
ఆసలాసలె రేఁచి అట్టె వుండీనా
వాసి వుటించినవాడు వడిఁ జింత మిచ్చుఁ గాక
బేసబెల్లితనమున బిగువు లాడీనా

చ. 2: ససర మాడినవాఁడు చన విచ్చి కూడుఁ గాక
తరఁగుమరఁగు లాడి తక్కి వుండీనా
కరఁగి మెచ్చినవాఁడు కందువకుఁ దీసుఁ గాక
సరవు లెరంగక సాదించీనా

చ. 3: దగ్గరి వచ్చినవాఁడు దయ నాపైఁ జేసుఁ గాక
సిగ్గులు వడుచు వేరె చిమ్మి రేఁచీనా
యెగ్గు దీర శ్రీవెంటేశుడిట్టె నన్నుఁ గూడె
వొగ్గి నా సొమ్మాయఁ గాక వొల్ల ననీనా

రేకు: 0317-3 మంగళకౌశిక సంపుటం: 11-099

పల్లవి: తానె యెరఁగఁడా తనలాగు
మోనాన నే నొక్కమారు మొక్కితేనె చాలునే

చ. 1: పిలువ నేర్చినవాఁడు ప్రియము చెప్ప నేరఁడా
వెలిని లోనను విన్నవించ నోపనే
తలఁపు దెలిసేవాఁడు తమకించ నేరఁడా
పలుమారు నతనిఁ జేయి వట్టి తియ్య నోపనే

చ. 2: ఆయము అంటినవాఁడు అవ్వలిపని నేరఁడా
రేయిఁ బగలు నాతని రేఁచ నోపనే
చాయగా నవ్వినవాఁడు చవి గోన నేరఁడా
పాయపురచన లెల్ల బచరించ నోపనే

చ. 3: కన్నుల జూచినవాఁడు కాఁగిలించ నేరఁడా
వున్నతపుగుబ్బల నే నొత్త నోపనే
యిన్నిటా శ్రీవెంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడెను
వెన్నెలబాయిట నంత వేసరించ నోపనే

రేకు: 0317-4 దేసాక్షి సంపుటం: 11-100

పల్లవి: మాఁటలు నాతో మా కేల
ఆఁటదాని కస రంటీఁ గాని

చ. 1: చెప్పక చెప్పిన చెలివిన్నపములు
ఱెప్పల తుదలనె ఱెట్టించే
వుప్పతించి ని న్నొకటి నాడము
తప్పనిబాసలె తగిలీఁ గాని

చ. 2: అంపక యంపిన అంగన కానికె
ముంపుకుచములనె మొన చూపే
గుంపెనతో నిఁక కూరిమి గొసరము
పెంపువిరహమె పెనగోనీఁ గాని

చ. 3: కూడక కూడిన కోమలికోరికె
వాడుమోవిని వన్నాయి
యీడనె శ్రీవెంకటేశ యేలితవి
వేడుకవలపులె వెతకీఁ గాని

రేకు: 0317-5 హిందోళవసంతం సంపుటం: 11-101

పల్లవి: కడు ముద్దరాలు గన కక్కసించ నోపదు
వడిఁ బెట్ట కిఁక నిట్టె వర మియ్యవయ్యా

చ. 1: నిన్నుఁ జూచి నవ్వు నవ్వి నివ్వెరగుఁ బొందెఁ జెలి
సన్నలు నీకే తెలుసు సరసుఁడవు
విన్నపము నేనే నంటె వెలది చిత్త మెఱఁగ
వున్నతి చెలి మోహము వొప్పు గొనవయ్యా

చ. 2: అప్పసము చేయి చాఁచి ఆయములు గరఁగె యీ
చొప్పు నీవె యెరుఁగుదు సుజాణఁడవు
అప్పటిఁ గొసరే మంటె ఆపెమర్మ మెరఁగము
చిప్పిలువయసు నీకే సెలవు సుమ్మయ్యా

చ. 3: మేరతో దగ్గరుతానె మెచ్చె నిన్నిటా నీకె
ఆ రతి నీ వెరుఁగుదు వధికుఁడవు
కూరిమి శ్రీవెంకటేశ కూడితివి మగువను
నేరుతుమా నే మంత నీనే రక్షించవయ్యా

రేకు: 0317-6 ముఖారి సంపుటం: 11-102

పల్లవి: నీవుసేసిన బాలు నీ వెరఁగవా
రేవగలు నెట్టు వేసరించేము నిన్నును

చ. 1: ఆడినప్పటి మాటలో నర్తము నీ వెరఁగవా
యీడకు వచ్చుండఁగాను యిం తెరఁగవా
వేడుక పడ్డవాఁడవు వెలయించ నెరఁగవా
తోడనెని న్నెందాఁక దూరేము నిన్నును

చ. 2: నవ్వినసవ్వులలోని నయము నీ వెరఁగవా
రవ్వ సేసినఁవాఁడవు రా నెరఁగవా
జవ్వనపువాఁడ వాసలు నీ వెరఁగవా
రివ్వలుగ నెందాఁక రేచేము నిన్నుము

చ. 3: యిట్టె చూచినవాఁడవు యిచ్చక మెరఁగవా
జట్టి గొన్నవాఁడవు మెచ్చ నెరఁగవా
నెట్టన శ్రీవెంకటేశ నీవె నన్నుఁ గూడితివి
గుట్టుతోడ నెందాఁకా కొసరేము నిన్నును

రేకు: 0318-1 దేసాక్షి సంపుటం: 11-103

పల్లవి: మందెమేళమె నాకు మన్నింతవు గాన నీతో
యిందుకుఁగా నీవు యెగ్గు లెంచకుమీ అయ్యా

చ. 1: వాలుకరెప్పల వంచి వడి నేఁ గొసరితిని
తాలిమి లేక నీపైఁ దమకించితి
వేళావే ళెరఁగక వేసరించితిని నిన్ను
యీలీల నీచిత్త మెట్టో యెరఁగఁజుమ్మీ అయ్య

చ. 2: కుచ్చి కుచ్చి నిన్ను సారె గుబ్బల నే నొత్తితిని
తచ్చి తచ్చి నోతోఁ బంతము లాడితి
హెచ్చుగా సెలవి నిన్ను నిందరిలో నవ్వితిని
మచ్చుట నిన్నిటికిగా మొక్కెఁ జుమ్మీ అయ్యా

చ. 3: పాయపుమదాన నిన్నుఁ బట్టి చేతఁ దీసితిని
చాయల సన్నల నిన్ను జంకించితి
ఆయ మెరఁగక నిన్ను నలయించి కూడితిని
మాయల శ్రీవెంకటేశ మానఁ జుమ్మీ అయ్యా

రేకు: 0318-2 దన్నాసి సంపుటం: 11-104

పల్లవి: నీవు చేసినది చేఁత నీకు నడ్డమాడ నేను
పావన మైతిని నీపాలిదాన నేను

చ. 1: యిందరు నెరఁగ నన్ను నిటు మన్నించిన నీవు
మందలించి యిఁక వేరె మానఁ బొయ్యేవా
పొందిన నా పొందు లివె పూఁచి నా మన సుండఁగ
సందేహ మింక నేల సత మైతి నేను

చ. 2: కావలె ననుచు నన్నుఁ గైకొన్నఁవాడవు
వేవేలైన దగ విడిచేవా
నీ వేలివుంగర మిదె నేఁడు నాచేఁ జిక్కినది
దావతి యిఁక నేటికిఁ దగు లైతి నేను

చ. 3: కచ్చుపెట్టి నీవు నన్నుఁ గాగిలంచినవాఁడవు
యిచ్చకమె నేతు గాక యెర వయ్యేవా
నిచ్చలు శ్రీవెంకటేశ నీకూటమి నాకు నబ్బె
మచ్చుమాయ లిఁక నేల మరిగితి నేను

రేకు: 0318-3 భైరవి సంపుటం: 11-105

పల్లవి: నీ వెరఁగవా తగవు నీకు విన్నవించేమా
వేవేలు సతులోన వెలయించ రాదా

చ. 1: నలుదిక్కులుఁ జూచేవు నాదిక్కు చూడఁగ రాదా
వలపు నీ పై జల్లెటివనిత నేను
పిలిచినవాఁడవు ప్రేమ చూపక మానవు
తొలుతె కాఁగిట నించి దొద్ద సేయ రాదా

చ. 2: కానుక లందేవాఁడవు గక్కన నన్నంట రాదా
పానికుచముల నిమ్మపండ్లదానను
పూని నవ్వినవాఁడవు భోగించక మానవు
నే నడిగినవేళనె నీవు లోఁగ రాదా

చ. 3: కడు నా సోదకాడఁవు కాఁగిలించుకో రాదా
ఆడియాల మైన నీ యాఁటదానమ
యెడయక శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
కడమ లేకుండ నిట్టె గతి గూడ రాదా

రేకు: 0318-4 శ్రీ రాగం సంపుటం: 11-106

పల్లవి: మేలు మేలు రమణుఁడ మెచ్చితి నిన్ను
చాలి నీసేఁతల కెల్ల సంతోసింతు నేను

చ. 1: కలవు నామీఁద బత్తి కన్నులఁ జూచితి విదె
వలచినవలపులు వన్నె కెక్కెను
తలఁపులు దెలియక తమకింతు నింతె కాక
యెలమి నీవల్ల నీవల్ల వెల తించుకంత లేదు

చ. 2: నిక్కమె నీ మాట లెల్ల నేఁ డీడకు వచ్చితిని
తొక్కినపాదపుఁ దొక్కు తుదు కెక్కెను
యెక్కుడు నీ నవ్వులకు నీసడింతు నింతె కాక
యెక్కడా నీవొళ్ల దప్పు లెంచఁ జోటు గలదా

చ. 3: చెల్లెను నీ సేఁత లెల్ల చేపట్టి కూడితి విదె
యెల్లగా నా కోరెకెలు యీడేరెను
కొల్లగా శ్రీవెంకటేశ కొసరుదు నింతె కాక
పొల్లు లేని నీగుణాల పొరపొచ్చ మున్నదా

రేకు: 0318-5 శంకరాభరణం సంపుటం: 11-107

పల్లవి: ఏ మందు నా గుణ మిదె యెంత మెహించితినో
చేముట్టి నీమీఁద నున్నచేయి దియ్యఁ జాలరా

చ. 1: చెప్ప రానిమాట లైన జేసేఁ గాని నీతో
నప్పటి నెదురు మాటలాడ నోపరా
కుప్పళించి పెంజెమట గురిసేఁ గాని నీకుఁగా
తప్ప కిట్టె మోము చూచి తలవంచ నోపరా

చ. 2: నేయ రానిపని కైన చేరి వొడిగట్టేఁ గాని
ఆయెడె నిన్నుఁ బాసే అందు కోపరా
చాయల సరసమున సందడిఁ బొరలేఁ గాని
పాయపుమదాన సిగ్గువడఁగ నే నోపరా

చ. 3: యేకతాన నెందు నైన నియ్యకొనేఁ గాని నిన్నుఁ
గాకుగా మందెమేళాలఁ గప్పు నోపరా
యీకడ శ్రీవెంకటేశ యిట్లాఁ గూడుండేఁ గాని
దాకొని జంకించి నిన్ను తక్కించ నోపరా

రేకు: 0318-6 గౌళ సంపుటం: 11-108

పల్లవి: మోనాన నూరకె నీకు మొక్కేఁ గాక
కానికలు సారె నేమి కప్పు మంపే నీకును

చ. 1: తలఁపు నామీఁద నీకు తగిలి వుండఁగాను
చెలు లేమి విన్నపాలు సేసేరు నీకు
చలిమి బమిలి నాకు సరి గలిగి యుండఁగ
మలసి సొలసి యేమి మాటలాడే నిన్నును

చ. 2: మంతనాన నీవు నాకు మనసిచ్చి యండఁగాను
దొంతులబుద్ధులు యేమి దోఁచీ నీకు
పంత మిచ్చి నీవు నాపై పక్షమై యుండఁగాను
కొంత గొంత యిఁక నేమి గొసరేము నిన్నును

చ. 3: కందువల నీవు నన్నుఁ గాఁగిలించు కుండఁగాను
విందుల నాగుణములు వింతా నీకు
పొందుగ శ్రీవెంకటేశ పూఁచి నన్నుఁ గలసితి
చందముగా యిఁక నేమి జరసేము నిన్నును

రేకు: 0319-1 కాంబోది సంపుటం: 11-109

పల్లవి: ఏమని మెత్తు నిన్ను యింత మేలు చేసితిని
కామిని నామాన మిట్టె కాచితివి నీవు

చ. 1: యెదురు చూడగాఁనె యింతలో విచ్చేసి నీవు
అదన నా చేయి వట్టి ఆదరించితి
వదలుఁ బయ్యదతోడ వసివాడే నన్నుఁ జూచి
పొదిగి పయ్యద గప్పి పొది సేనితివి

చ. 2: మొక్కుకోఁగానె నీకు ముంచి నాకు వర మిచ్చి
చెక్కు నొక్కి బుజ్జగించి సేద దేర్చితి
లక్కవంటి మదితోడ లాచక వుండిన నాతో
మక్కువలు చల్లి చల్లి మంతన మాడితివి

చ. 3: చేయి చాఁచగానె నన్ను శ్రీవెంకటేశుఁడ కూడి
చాయల నవ్వులు నవ్వి సన్న సేసితి
పాయపువేడుకతోడ పదరుచు నుండేనన్ను
ఆయము లంటుచు మరి అట్టె మన్నించితిని

రేకు: 0319-2 ముఖారి సంపుటం: 11-110

పల్లవి: ఏల మాతోఁ జెల్లఁ బెట్టే వెమ్మెలు నీవు
నాలి నేయ కిఁక నీవు నవ్వు వచ్చీ మాకు

చ. 1: పంత మేల నీవు నాతోఁ బచరించే వప్పటిని
యెంత లేదు ని న్నిందఁరు నెరఁగనిదా
కాంత యైతేఁ జాలు నీవు కడు గుజ్జైనాఁ గాని
చింత దీర భోగించి సేస వెట్టవా

చ. 2: వాసు లేల నెరుపేపు వచ్చి వచ్చి నా ముందర
నీ సుద్దులు మా కెల్ల నేఁడు గొత్తలా
ఆసపడి ఆఁటదాని కడవు లెల్లాఁ దిరిగి
రాసి కెక్కఁ దెచ్చుకొని రవ్వఁ బడవా

చ. 3: కడుఁ బరా కే లయ్యేవు గక్కన దీరునివలె
ఆడరి శ్రీవెంకటేశ ఆడ వలెనా
మెడఁ గట్టుకొంటి విదె మించి యలమేల్మంగను
తొడిఁబడ నన్నుఁ గూడి దొరవై నిలువవా

రేకు: 0319-3 బౌళి సంపుటం: 11-111

పల్లవి: అన్ని నేరిచినవాఁడ వామీఁదు నేరవా
సన్న నేసినవాఁడవు చాయకు రా నేరావా

చ. 1: కాయ మంటినవాఁడవు కప్పురము నోటి కిచ్చి
ఆయములు గరఁగించ నంత నేరవా
సోయగపుచూపులఁ జూచినవాఁడవు నీవు
పాయపుకోరికె లిచ్చి పచరించ నేరవా

చ. 2: నగినవాఁడవు నీవు నానారీతుల నాతో
అగపడి సరసము లాడ నేరవా
మిగుల నాచేఁతలతో మించినవాఁడవు యిట్టె
బిగువుఁగాఁగిటఁ గడు ప్రేమ రేఁచ నేరవా

చ. 3: మెచ్చినట్టివాఁడవు మేకులు సేసి నేసి
యిచ్చగించి కలయఁగ నింత నేరవా
కుచ్చి శ్రీవెంకటేశుఁడ కూడి మన్నించితి విదె
నిచ్చలు నీమేలు నాపై నెరపఁగ నేవరా

రేకు: 0319-4 పాడి సంపుటం: 11-112

పల్లవి: మూసినముత్యవలె మూల లే లోయి
మోస మెట్లాఁ దేరె నిఁక మొరఁగే లోయి

చ. 1: పచ్చికస్తూరిబో ట్టంటి పరిమళించే దెల్లా
మెచ్చులా యిద్దరిలో నీ మేననా వోయి
గచ్చుల నెవ్వ రవుతా కానకుంటి మిందాఁకా
మచ్చెము బాయిటఁ బడె మాటలాడ వోయి

చ. 2: ముడిచివేసే పువ్వులు ముంగిట రాలే దెల్లా
చిడుముడి నెరుల నీ సిరసా వోయి
యెడసి యీగురు తిది యేరుపడ దిందాఁక
ఆడియాలము గంటిమి ఆన లేల వోయి

చ. 3: కుంకుమచెమటబొట్లు కురిసె నీడ నెల్లాను
లంకెలైన నీ చెక్కుల లాగాలా వోయి
అంకెల శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
సంకె లెల్లఁ దేరె నిఁక జాగు లేల వోయి

రేకు: 0319-5 మధ్యమావతి సంపుటం: 11-113

పల్లవి: ఎంతటిదానవు నీవు యేమి చెప్పేము
పంతము లన్నియు దక్కెఁ బలుకు లీడేరెను

చ. 1: చింత లెల్లఁ బెడబాసె చెక్కుచెయి దియ్యవమ్మ
కాంతుఁ డింటికి విచ్చేసె కడమ దీరె
దొంతి నున్నవలపులు తొడికితేఁ జేతఁ జిక్కె
యింతయు నీ మహిమలె యిఁక నేల జాగులు

చ. 2: కోరికలు సమకూడె గోరివాఁత మానవమ్మ
గారవించె నాతఁడు నీ కైవస మాయ
చేరినట్టి జవ్వనము చెల్లుబడి కెక్కె నిదె
నేరు పెల్ల నీ సొమ్మె నీ కేల మరఁగు

చ. 3: తతి వచ్చె కూటమికి తలవంచ నేలమ్మ
అతఁడు శ్రీవెంకటేశుఁ డంకెం గలసె
మతిలోని ముదములు మాటలసోన గురిసె
చతురత నీ పాలాయ సంకేల నీకును

రేకు: 0319-6 సౌరాష్ట్రం సంపుటం: 11-114

పల్లవి: ఏలినవాఁడవు నీవె యే మయ్యా
మేలు నాకు నీవల్ల మీఁద కిక్కి లయ్యా

చ. 1: అందగారి మాట లెల్ల నాడి నన్ను నమ్మించి
కందువకుఁ దీసితివి గదవయ్యా
చెందమ్మిరేకులవంటి చేరఁడేసి నా కన్నుల
కిందు కెల్ల గురి యైతి విఁక నీ చిత్త మయ్యా

చ. 2: యింట నూరకుండేదాన నెలయించి నవ్వించి
గంటి సేసితివి మోవి గదవయ్యా
గొంటరి నా చనుఁబువ్వు గుత్తుల పూజలకును
నంటున లో నయితిని నాఁడె కదవయ్యా

చ. 3: కోరి నీవు కాఁగిటిలో గూడినచనవు లెల్ల
గారవానఁ చెల్లించితి గదవయ్యా
యీరీతి శ్రీవెంకటేశ యెనసి నా చిత్తమనే
వూరిలో నెలకొంటివి వొడఁబాటే అయ్యా

రేకు: 0320-1 సామంతం సంపుటం: 11-115

పల్లవి: నాతోనె ఆన తీవయ్య నంటున సంతంసించేను
చేతికి లో నైతి వీడc జేరె నాకు మేలు

చ. 1: చెప్పి నే నంపినమాట చెవుల కిం పాయనా
తప్పులు లేవు గదా ఆతరవాతను
నెప్పున దాcచcగ నేల నిన్నుc బాయలే నంటి
యిప్పు డిట్టె విచ్చేసితి వియ్యకోలా నీకు

చ. 2: జిగి నా కాకుక నీకు చిత్తము వచ్చెనా నేcడు
వెగట్లు నీవు గదా వేరె అందు
నిగిడి కొంకcగ నేల నీబాస దలcచు మంటి
అగపడితివి నాకు అవునా నా పొందులు

చ. 3: మొక్కిన నా మొక్కు నీకు మొగమోట కెక్కెనా
మొక్కలము లేదు గదా మోహములోన
యిక్కు వెరిcగి శ్రీవెంకటేశ నన్నుc గూడితిని
దక్కితిని యింత నాపై దయ గద్దా నీవూ

రేకు: 0320-2 సాళంగనాట సంపుటం: 11-116

పల్లవి: అప్పటి నాతో నీవు ఆడ వలెనా
కప్ప నేల పచ్చడము కాఁగి లుండఁగాను

చ. 1: తప్పని నీ కృప నాపై తగిలి వున్నది గాన
ముప్పిరి నున్నవి నా మోముకళలు
నెప్పున నీ మహిమకు నేనె తారుకాణ
చెప్ప నేల నిఁక వేరె చేసి చూపఁగాను

చ. 2: చెలఁగు నీ మాటలు నా చెవి సోఁకినవి గాన
పులకలు నా మేనఁ బొది గొన్నవి
అలరు నీ మంచితనాలన్నిటికి నే గురతు
తెలుప వలెనా వేరె దిష్టమై యుండఁగను

చ. 3: అందపు నీ కూటమి నా కమరి వున్నది గాన
సందడించి నాలోని సంతంసా లేల
యిందు మనలో శ్రీవెంకటేశ యివె కారణము
చెందఁగ వలెనా వేర చేకొ నుండఁగాను

రేకు: 0320-3 హిజ్జిజి సంపుటం: 11-117

పల్లవి: చెప్పఁబోతే దనతోను సిగ్గయ్యీ నాకు
యిప్పుడు వద్ద నున్నాఁడు యెచ్చరించరే

చ. 1: చూడఁగానె నా కన్నులు సారిదిఁ జేరఁడే సాయ
యిడఁ దన చక్కఁదన మెంతో కాని
దాడితో నెడతెగదు తనమీఁది తలపోఁత
వేడుకకు వెల లేదు విన్నవించరే

చ. 2: కదిసితే నా చన్నులు కాఁగేఁడేసి కాఁబెరిగె
యిదివో తనభారము యెంతో కాని
వొదగాయఁ దనమీఁద నుదు టైనతమకము
యెదుట నా మోహ మెల్ల నెరిఁగించరే

చ. 3: పైఁకొనఁగ నాతురుము బారేఁడేసి కొన సాగె
యీ కొలది తననేర్పు యిటు సేసెను
దాకొని శ్రీవెంకటేశు తగు లైనకూటమి
మేకొని నామారు మీరు మెచ్చఁ గదరే

రేకు: 0320-4 గుండక్రియ సంపుటం: 11-118

పల్లవి: సారె నిన్ను వేసరించ సంగతే నాకు
మారాడ నే నాలిసొమ్ము మగనిదె కాదా

చ. 1: నిన్ను వేగిరించేనా నీవె యెఱఁగవా
కన్నుల మొక్కితేఁ దానె కరఁగేవు
చన్నులె గొప్పలు గాని సరి నడుము బడలె
విన్నపము లీఁక నేల వింతదానఁ గాను

చ. 2: చలము సాధించేనా జాణఁడవు గావా
నిటుచుండఁగాఁ గరుణించేవు నీవె
లలిఁ గొప్ప గొప్పగాని లాచి మోము చిన్నఁబోయ
బలిమి చూపఁగ నీతో బంతగత్తెనా

చ. 3: నింద వేసేదాననా నీవు శ్రీవెంకటేశుఁడ
వందాలు సేసుకోఁగానె ఆదరించేవు
కందవకన్నులె గొప్ప గాని పాదాలు సన్నాలు
మందలించి నీతో మారు మలయంగఁ గలనా

రేకు: 0320-5 ఆహిరి సంపుటం: 11-119

పల్లవి: ఇట్టుండ వలదా నీవు యెవ్వతెకు మోహించినా
దట్టముగ నిచ్చితేను తప్పవు నీ బాసలు

చ. 1: ఆపెమాట లైనా నీవు ఆలకించి మా యింటికి
యీ పొద్దు విచ్చేసితివి యెన్నికె గాను
దాపగు సవతులకు దయ పుట్టఁగాఁ గదా
కాపాడితి వీక నిన్ను కంటిమి నీ గుణము

చ. 2: అండ నుండి ఆపె నీకు అప్ప ణియ్యఁగా నైనా
గుండె వట్టి నావద్దఁ గూచుండితివి
దండిగ తోడివారు తగవు నడపఁగాఁగా
నిండ నన్ను మన్నించితి నెగెడె నీ పుణ్యము

చ. 3: మొక్కిన యాపెమొక్కు మొగిఁ జిత్తానఁ బెట్టైనా
గక్కనఁ గాఁగిటఁ గూడి కైకొంటివి
దిక్కై శ్రీవెంకటేశ యిందిరకు సెలవుగఁగా
మిక్కిలి న న్నేలితివి మెరసె నీ కీరితి

రేకు: 0320-6 వసంతవరాళి సంపుటం: 11-120

పల్లవి: వినవే యెక్కడి సుద్ది వేగ మామాట
మనసులోఁ జల ముంటే మర్మములు మాన్పునా

చ. 1: యెంతేసి మాట లాడిన యెచ్చు కుందు గలిగినా
కాంతలకు మగలకుఁ గలదా వేరు
చింత దీర నావేళకు చెక్కు చేయే మరఁ గింతె
పంతపు నెలవినవ్వు బతిమాలింపించెను

చ. 2: అవ్వలిమోము లై వున్నా నలుకలు ముంచుకన్నా
జవ్వనపువలపుల చవి దప్పీనా
దవ్వులై యావేళకు తలవంపులే మరఁగు
చివ్వనఁ గనుచూపులె చెలుములు నేయవా

చ. 3: సిగ్గులు పైకొనినాను చేఁతలు గడు మీరినా
నగ్గళపు రతివేళ నడ్డ మున్నదా
యెగ్గు దీ శ్రీవెంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
బెగ్గిలినాఁ దమకము ప్రియములు రేఁచునే

రేకు: 0321-1 మంగళకౌశిక సంపుటం: 11-121

పల్లవి: పడుచుఁజేఁతలు గావు బాలకృష్ణుఁడు
తొడికీ మోవిపంటికె దుండగపుఁగృష్ణుఁడు

చ. 1: వెన్న చేతఁ బట్టుకొని వేలు చాఁచి వుట్లకు
సన్న చేసిఁ గదవమ్మ జాణ కృష్ణుఁడు
కన్నెలు ద న్నెత్తుకొంటె కాఁగిటిచూపులు చూపీ
యెన్నిట తా నసకాడె యీ కృష్ణుఁడు

చ. 2: అంకెల దొంగెడు తానె అందపుచూపులు చల్లీ
లంకె మగనాండ్లపై లలిఁ గృష్ణుఁడు
పొంకపుచెక్కు గిఁటితె పుక్కిట లోకాలు చూపీ
సంకె లేక యశోదకు సటకాఁడు కృష్ణుఁడు

చ. 3: గొల్లెతలు ముద్దాడితె గురుతు లెల్లా నించె
చల్లచాడెలకాడనె సరి గృష్ణుఁడు
అల్ల శ్రీవెంకటాద్రిని అదె తుంగభద్రదరి
కొల్లలుగా వరా లిచ్చీ గోవిందకృష్ణుఁడు

రేకు: 0321-2 బౌళి సంపుటం: 11-122

పల్లవి: వలెనా యింకా నంత వలపు గలయఁ బెట్ట
సళుపుఁజూపుల నాయ సమతారుకాణలు

చ. 1: చేసినట్టిచేఁత లెల్లఁ జెల్లించ నీవు గలవు
ఆస చూపి నీకు మొక్క నాపె గలదు
యీసు లేక వోరుచుక యియ్యకొన నేఁగలను
రాసి కెక్క నీవు నవ్వు రాకుండునా యిఁకను

చ. 2: పసిఁడిపట్టెమంచము పవళించి వుండఁ గల
దసమున భోగించ నాపె గలదు
పసగా నుండఁగను నా బంగారుమేడ గలదు
వెస సంతంసాల విట్టువీఁగ వద్దా యిఁకను

చ. 3: వుంగరము వేలఁ బెట్ట నొరసి యాపె గలదు
సింగారించుకొనను నీ చేయి గలదు
అంగవించి నిన్నుఁ గూడేయందకు నేనూఁ గలను
చుంగుల శ్రీవేంకటేశ చొక్క వద్దా యింకను

రేకు: 0321-3 వరాళి సంపుటం: 11-123

పల్లవి: సొమ్ము గలవాఁడవు సోఁపు గని యిచ్చె కాఁక
సమ్మతిఁ గాక వంచన సేయ వచ్చునా

చ. 1: సిగ్గువ డుండుత గాక చెనకే నీ చేఁతలకు
తగ్గి తప్పించుకొంటేను తప్పు లెంచవా
వొగ్గి మొదలనె నీకు వొప్పగించిన దీ మేను
దగ్గరి పైకొంట గాక దాఁచ వచ్చునా

చ. 2: మోనాన నుండుత గాక మోహపు నీ మాటలకు
దానికె నే మారాడితేఁ దమకించవా
నానినది మొదలనె నానోరు నీ యెంగిటనె
పూని పట్టుకుందుఁ గాక బొంకె నన వచ్చునా

చ. 3: ఆసతో నుండుత గాక అంటిన నీరతులకు
వీస మంత నే మీరినా వెర గందవా
నీ సొమ్ము మొదలనె నా నెయ్యము శ్రీవెంకటేశ
మూసి దాఁచుకుందుఁగాక మొరఁగఁగ వచ్చునా

రేకు: 0321-4 భైరవి సంపుటం: 11-124

పల్లవి: ఏమో యెరఁగను యోట్టైనాఁ గాని
వేమరు నీ కెక్కినది వేడుక నా బదుకు

చ. 1: చింత దీర నీ మన్నన చెప్పుకొనఁగా విని
పంతపుసతులు పకపక నవ్వేరు
మంతనానా నీచేఁతలు మరి యే మైనాఁ గలవో
యెంత వలచినది సి గ్గించ దంటానో

చ. 2: సమరతి నీ పాన్పుపై సరి నే నుండఁగాఁ జూచి
జమళిఁ దమలోననె సన్న సేసేరు
అమరదో నీవు నేనూ నంటుకొన్నపొందులు
తమితో నాగర్వ మింత తగ దంటానో

చ. 3: చేరి వేడుకొంటా నే నీ చెక్కు నొక్కఁగాఁ జూచి
సారెఁ దమమెకా లిచ్చులఁ జూచేరు
యీరీతి శ్రీవెంకటేశ యిచ్చఁ గూడితిమి మన
నేరుపుల నన్నిటాను నీవె నే నంటానో

రేకు: 0321-5 కన్నడగౌళ సంపుటం: 11-125

పల్లవి: మరుఁడు సేసేనమాయ మరి తెలియదు గాక
సరవు లిద్దరివిని సరికి బే సాయనా

చ. 1: చనవు సేసుక నిన్ను సరిఁ గొంగు వట్టితిని
యెనసి యింత నేయ నీ యీడుదాననా
పెనఁగ కంతలో నీవు బెరసి లో నైతిని
ననిచి కరణ యింత నా మీఁద నుండెనా

చ. 2: నవ్వు నేసుకొని నీపై నలిఁ జేయి వేసితిని
రవ్వ నిన్నింత నేయ బీరపుదొరనా
చివ్వన నీ వప్పటిని చేరి బత్తి సేసేవు
యివ్వల నీ మోహము నన్నింత దొడ్డ సేసెనా

చ. 3: బలిమి సేసుక నే నీపయిఁ జేయి వేసితిని
కలసితి వింతేసికిఁ గలనా నేను
నెల వై శ్రీవెంకటేశ నీ వింకాఁ జెక్కు నొక్కేవు
సలిగె లిన్నియు నీవె సమ్మతించితివా

రేకు: 0321-6 హిందోళవసంతం సంపుటం: 11-126

పల్లవి: ఏల వెగిరించేవె యీతనితోడ
మూలలనె వుండ నీరె ముచ్చటల మాఁటా

చ. 1: చిత్తము వచ్చినచోట సేసినదె విన్నపము
హత్తి పొసఁగనిచోట ననుమానమె
యిత్తలఁ దన నా సంది యీ రెండుఁ దెలయుదాఁకా
పొత్తులనె వుండ నీరె పొరుగుల మాఁటా

చ. 2: ఆస గలిగినచోట నాడినదె సరసము
వేసట లయ్యినచోట విచారములె
వాసితోఁ దనకు నాకు వైపులు గూడినదాఁకా
మూసినట్టె వుండ నీరె ముందరి ఆమాఁటా

చ. 3: వొడఁబాటు గలచోల నొనగూడి వుండు నవ్వు
వెడవెడ లైనచోట వేరువేరులె
యెడయక శ్రీవెంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వొడికమైవుండ నీరె వొరపుల మాఁటా

రేకు: 0322-1 దేసాళం సంపుటం: 11-127
పల్లవి: రసికుఁడ వౌదు పండరంగినాథా నీ
పసలఁ జిక్కిలి మిదె పండరంగినాథా
చ. 1: యివ్వల నవ్వల నేఁడు యిటు నీతో నవ్వి నవ్వి
రవ్వైతిమి గదో పండరంగినాథా
కువ్వ లాయ నీ చేఁతలు గురి యయితి మింతకు
పవ్వళించితిరి మేలు పండరంగినాథా
చ. 2: రుచు లైన నీ మాఁటలె రూఢి కెక్కించెను మమ్ము
రచనకాఁడ వో పండరంగినాథా
యిచట నీ రాకలను నెదురు చూపించి మేలె
పచరించితివి బాపు పండరంగినాథా
చ. 3: సారెఁ దీసితివి కొప్పు చన్ను లంటి చూచితివి
రారాదా యిఁక పండరంగినాథా
కూరిమి శ్రీవెంకటాద్రిఁ గూడి చొక్కించితి మమ్ము
పైరు లాయఁ బులకలు పండరంగినాథా

రేకు: 0322-2 శ్రీరాగం సంపుటం: 11-128

పల్లవి: సరసుఁడవు నీ వైతే చదురాలు నీ కాపె
ఆరు దాయ నన్నిటాను అమరు నిద్దరికే

చ. 1: చెప్పఁగలవల పెల్లఁ జెలి నీతోఁ జెప్పి చెప్పి
చెప్పరానిమాటలకు సిగ్గు వడ్డది
చిప్పిలునవ్వులఁ గొంత శిరసువంపులఁ గొంత
అప్పగించీఁ దెలుసుకో అవ్వలివిన్నపము

చ. 2: సేయఁగల వూడిగాలు సేసి సేసి నీ కాపె
నేయరానిచేఁతలకు సిగ్గు వడ్డది
చేయెత్తిఁ మొక్కులఁ గొంత చిమ్మునిట్టూర్పులఁగొంత
కాయము సోఁకఁగ జేసీ కడమ వూడిగెము

చ. 3: చెక్కు నొక్కు నొక్కి యిట్టె శ్రీవెంకటేశ్వర నిన్ను
చెక్కు చేతితోడనె తా సిగ్గు వడ్డది
పుక్కిటి విడేలఁ గొంత పొరచిచేఁతల గొంత
గక్కన నీ కంది యిచ్చీ కడమదొడములు

రేకు: 0322-3 పాడి సంపుటం: 11-129

పల్లవి: చెప్పరా దిందాఁక నైతె చెలి యున్న భావము
వుప్పుచిం దినుమడించె నుండ నుండఁగాను

చ. 1: మగువకు నేఁడుగా మనికిత మెల్లఁ బానె
వెగటు వో నీ వింటికి విచ్చేయఁగాను
మొగచాటు లే దాయ ముచ్చట లెల్లఁ దీరె
సొగిసి నీవు మొగము చూడఁగాను

చ. 2: సుదతి కీ వేళ గా షోడశకళలు నిండె
మదనజకనకపు నీవు మన్నించఁగాను
తుదిపదమున కెక్క తుందుడుకు లెల్లఁ బోయ
పొదిగి పట్టి కాఁగిట బుజ్జగించఁగాను

చ. 3: అంగన కిట్టె కా ఆతు మెల్ల జల నాయ
సంగతిగా రతిఁ గూడి చన వియ్యఁగా
చెంగల శ్రీవెంకటేశ చేరఁగలమేలు చేరె
సింగారించి మీఁద చెక్కు నొక్కఁగాను

రేకు: 0322-4 సాళంగనాట సంపుటం: 11-130

పల్లవి: మేలు మేలు బాపు బాపు మెచ్చితి నిన్ను
తాలిమితో నున్నాఁడవు తగవరి వౌదువు

చ. 1: యేకడనో వుంటి వట యే మేమో సేసితి వట
ఆకె నాతోఁ జెప్పనవి ఆ మాటలె
వాకున నాడ నోపక వాసితో నూరకుండితే
నీకు నీకె నవ్వేవు నెరజాణ వౌదువు

చ. 2: మంతనా లాడితి వట మరికొన్ని గల వట
యింతి నాకు మొక్కినది యీ సుద్దికె
అంత నిన్నుఁ బచ్చి సేయ కట్టె అణఁచుకుంటే
దొంత వెట్టేవు సటలె దొరవు నీ వౌదువు

చ. 3: వొడఁబరచితి వట వొక్క టై కూడితి వట
పడఁతి యెచ్చరించె నీ పనులకునె
తడవక నే నుండితె తలపించే నప్పటిని
అడరి శ్రీవెంకటేశ అంతవాఁడ వౌదువు

రేకు: 0322-5 రామక్రియ సంపుటం: 11-131

పల్లవి: ఏనుగలతోడ నేల యేలాటాలు
కానుక లిచ్చె గుట్టు గనుకొనేను

చ. 1: రమ్మన నేఁటికి నిన్ను రాకు మన నేఁటికి
వుమ్మడి నుండె నీ వోజ చూచేను
సమ్మతించఁగా నెట్టొ జగడించఁగా నెట్టొ
నిమ్మపంటిచేతితోడ నివ్వెర గందేనూ

చ. 2: నవ్వు నవ్వ నేఁటికి నాలితన మేఁటికి
దవ్వులనుండె నీ తమి చూచేను
పువ్వు లనఁగా నెట్టొ పూఁప లనఁగా నెట్టొ
మువ్వంక సాసముత్యాల ముగ్గులు వెట్టేను

చ. 3: వొడఁబరచ నేఁటికి వోప నన నేఁటికి
కడలేని మోహముతోఁ గాఁగిలించేను
నడుమనె కూడితివి నమ్మించి శ్రీవెంకటేశ
చిడుముడి నుంగరాలచేతఁ జెక్కు నొక్కేను

రేకు: 0322-6 నాదరామక్రియ సంపుటం: 11-132

పల్లవి: మన మెఱిఁగినవె మాయ లిన్నియును
వెనకసుద్దు లెంచితె వేవేలుఁ గలవూ

చ. 1: మొగము చూచితిఁగా మొక్కితిఁగా నీకు నిట్టె
జగడా లింకా నేల చాలించు
తగవు చెప్పకు మింక తడవ నే నా సుద్ది
వగ లెన్నైనాఁ గలవు వడిఁ దప్పించుకోనూ

చ. 2: నెలవి నవ్వితిఁ గా చెప్పినట్టె వింటిఁ గా
చలము లింకా నేల చాలించు
బలిమి నేయకు మింక పంతము లిచ్చితి తొల్లె
వలపు రేఁచఁగ బోతే వసము గా దిఁకనూ

చ. 3: కన్నుల మెచ్చితిఁగా కాఁగిట నించితిఁగా
సన్నలు చాయలు నిఁకఁ జాలించు
వున్నతి శ్రీవెంకటేశ వొద్ది కైతి నీతోను
వన్నెలు వాసులు నెంచ వలెనా యిందులోనూ

రేకు: 0323-1 ముఖారి సంపుటం: 11-133

పల్లవి: ఎంత కెంత సేసేవు యేమమ్మా
చింత దీర నాతనిపైఁ జెయి వేయ వమ్మా

చ. 1: చేతిమీఁది చెక్కి దేల చెలవుఁడు వేఁడుకొనీ
అతనిమాటలు కాని మ్మన వమ్మా
రాతిటనుంటియు జాగరములె సేయఁగఁ బట్టె
యీ తరుణులఁ జూ చైన యియ్యకొన వమ్మా

చ. 2: కొప్పు ముడవ వి దేల కోపము దీర్చె నాతఁడు
చెప్పిన ట్టల్లా నిఁకఁ జేయ వమ్మా
తెప్పలు రిచ్చవడె మీ టేసు లెల్లాఁ జూచి చూచి
చిప్పిల నీ నవ్వులనె సేసవెట్ట మమ్మా

చ. 3: వట్టి మోనా లిఁక నేల వాఁడె సరసము లాడీ
పట్టినచలము మాని పలుక వమ్మా
యిట్టె శ్రీవెంకటేశుఁ డితఁడు గూడె నిన్ను
నెట్టుకొని రతుల నిన్నిటా మెచ్చ వమ్మా

రేకు: 0323-2 దేసాళం సంపుటం: 11-134

పల్లవి: ఏమి చూచుకొన్నాండవో యెఱఁగ నేను
కామించి నీ మన్ననలో కడమలూఁ గానము

చ. 1: దవ్వుల నుండిననన్ను దగ్గరఁ బిలుచుకొంటే
చివ్వన నీకు మేలు చేరదా నేఁడు
రవ్వగానీ కొలువులో రాజసమె చూపఁగాను
యివ్వల నవ్వల నీవు యేమి గట్టుకొంటివి

చ. 2: దట్టపువిరహి నన్నుఁ దప్పక చూచితేను
అట్టె దయ గలవాఁడ వని మెచ్చనా
గుట్టుతోడ నిందరిలో కొంచి కొంచి నవ్వఁగాను
యెట్ట నెదురుకట్ల నందు కెక్కెఁ బనులు

చ. 3: యింటిలో నుండిననన్ను యిటు నీవు గలసితే
జంట వై పొందులు సేయ జాణవు గావా
అంటితివి శ్రీవెంకటాధిప తెరలో నన్ను
వెంట వచ్చి కూడితిని వింత లాయఁ జేతలు

రేకు: 0323-3 సామంతం సంపుటం: 11-135

పల్లవి: కందము నీ సరితలు కడదాఁకాను
యిందరిలో నన్న మాఁట లేల బొంకే విఁకను

చ. 1: పంతగాఁడ వౌదువు పడఁతి నింత యెంచితి
వంత నీకుఁ బెద్దరిక మైతేఁ జాలు
వంతు లాడేవు పిలువ వచ్చినమాతోనె నీవు
యింత గుండెవాఁడ వైతే నెటు వొయ్యీఁ బనులు

చ. 2: నేరుపరి వౌదువు నెలఁతఁ బాసి వుంటివి
ఆరయ నీ కింత చవు లైఁతే జాలు
చేరువకు వచ్చి లో లో సిగ్గు వడే వప్పటిని
యీ రీతి నుండితేఁ జాలు నీడేరె మోహము

చ. 3: మంచివాఁడ వౌదువు మగువఁ గూడితి విట్టె
అంచెల నీ కిదే పని యైతేఁ జాలు
ముంచిన శ్రీవెంకటేశ మెదలె యిట్టుండ రాదా
యెంచేము నీ గుణములు యే మాయ నిపుడు

రేకు: 0323-4 శుద్ధవసంతం సంపుటం: 11-136

పల్లవి: వేవేలు జాగు లిఁక విడవయ్యా
యీ వేళ నాకుఁ జన వియ్యవయ్యా

చ. 1: శిర సేల వంచేవు సిగ్గు లేల పెంచేవు
సొరిది మా వంక నిటు చూడవయ్యా
మరిగి యున్నదాన మాయ లెల్ల విన్నదాన
యిరవు నేయఁగ నిక నేఁటి కయ్యా

చ. 2: యేడ పరాకై వున్నాఁడ వేమి దలఁచుకొన్నాఁడ
వాడఁగలమాట లెల్ల నాడవయ్యా
మేడెపువల పిదివో మెత్తనిపర పిదివో
వాడిక నీమేలు నాపై వంచవయ్యా

చ. 3: చెక్కు లేల నొక్కేవు చెంది యేల చొక్కేవు
పక్కన యింటిలోనికిఁ బదవయ్యా
యిక్కువ శ్రీవెంకటేశ యెనసితి వింకా నాస
నిక్కి నాకు నన్నిట్టె మన్నించవయ్యా

రేకు: 0323-5 ఆహిరి సంపుటం: 11-137

పల్లవి: వలపులె కాండి పారి వరుస నిద్దరికిని
నిలవుఁదమకములు నీవే యెరుఁగుదువూ

చ. 1: యెన్నఁడొకో నీవు నన్ను యెనసి మన్నించేది
చన్నుల నే నిన్ను నొత్తి సాధించేది
వున్నదాన మేడమీఁద నొంటి నేఁ బొడవునను
సన్న సేసేవు నీ వైతే సారెకు దిగువను

చ. 2: యెప్పుడొకో నా మేను యిటు నీ మేను సోఁకేది
అప్పటి నే మారుకు మా రప్పళించేది
కప్పురపుబాగాలు కట్టివేసితిని నీపై
నెప్పున నందుకొంటివి నిచ్చె నెక్కి నీవూ

చ. 3: యేవేళకో నామంచ మెక్కి నీవు గూచుండేడి
తావుల నేనె నిన్ను దక్కఁ గొనేది
శ్రీవెంకటేశ్వర నిన్ను చేపట్టి యెక్కించుకొంటి
మావి యిచ్చి కూడితిని ముచ్చటతో నీవు

రేకు: 0323-6 కన్నడగౌళ సంపుటం: 11-138

పల్లవి: నీమేలులోనిదాన నీవు మన్నించేటిదాన
దోమటి నన్నియు నీ చేతుల నున్న వికఁను

చ. 1: సేస వెట్టి నవ్వినట్టిచెలియను నేను నాకు
ఆసలు రేఁచితి వికఁ నలయించకు
వాసితో నీ వే మనినా వద్దనేటిదానఁ గాను
దోసముఁ బుణ్యము నీ చేతుల నున్న వికఁను

చ. 2: యిల్లాల నయినయట్టి యిచ్చకురాల నా
వుల్లము దెలుసుకొంటి వొరసితిని
వెల్లవిరి నీ వెటున్నా వెంగె మాడేదానఁ గాను
తొల్లిటిబాసలు నీ చేతుల నున్న వికఁనూ

చ. 3: పట్టపుదేవిని నాపంత మెల్లా నీడేరించి
జిట్టిగొంటివి నామాట సమ్మతించితి
గుట్టుతో శ్రీవెంటేశ కూడితివి వింతగాను
తొట్టి నా భోగము నీ చేతుల నున్న దికఁనూ

రేకు: 0324-1 సాళంగనాట సంపుటం: 11-139

పల్లవి: జయ మాయ నీకు నాపె సరసములూ
నయగారి ముడుయము నారసింహా

చ. 1: మోము చూచి నీతోడ ముచ్చట లాడ వలసి
కోమలి నీ తొడమీఁదఁ గూచున్నది
ఆముకొని అట్టె మాట లాడ వయ్య ఆపెతోడ
నామాట విని యిట్టె నారసింహా

చ. 2: మన్నన నీ యలుకల మంకు దెలవ వలసి
చన్ను లురమునఁ బెట్టి సత మైనది
చెన్నుఁడ వాపె చనవు చెల్లించ వయ్య యిట్టె
న న్నడిగే దింకా నేమి నారసింహా

చ. 3: చేతుల నిన్ను నలమి చెక్కుఁ జెక్కుఁ గదియించి
నీతితో నీ మెడసొమ్మై నెలకొన్నది
యీతల శ్రీవెంకటాద్రి నెనసితి వాపెతోడ
నా తలఁపు లీడేరించి నారసింహా

రేకు: 0324-2 శంకరాభరణం సంపుటం: 11-140

పల్లవి: చెప్ప నే మున్నవి నీ నేసేటిచేఁతలు
అప్పటి కప్పటివేళ అను వింతే కాకా

చ. 1: చేరి మొక్కఁగా నీవు సెలవి నవ్వేవు గాక
వూరకుండవా నీయంత నొగి నిందాఁకా
యేరీ తని యాడ వచ్చు నిటువంటి నీ చిత్తము
వారికి వారికి భాగ్యవశ మింతే కాకా

చ. 2: చెనకఁగా నీ వంతలో చిమ్మి రేఁగే వింతే కాక
తనిసి గుట్టున నుంటేఁ దడవేవా
ఘన మైన నీ మహిమ కానఁగ నెట్ల వచ్చు
గొనకొన్న నీ యిచ్చకొలఁదే కాకా

చ. 3: బలిమి గూడఁగా నీవు పైకొంటి విపుడె కాక
తెలుసుకొంద మ నెంటే తేటపడేవా
నెల వై శ్రీవెంకటేశ నిచ్చళించ నెట్టు వచ్చు
కులికెటి నీ వలపు కొలఁదే కాకా

రేకు: 0324-3 శంకరాభరణం సంపుటం: 11-141

పల్లవి: బడిబడిఁ దిరిగాడీ బాలకృష్ణుఁడు
యెడయనిజాణ గదె యీ బాలకృష్ణుఁడూ

చ. 1: సొక్కుచు సోలుచు వచ్చి సుదతులు యెత్తుకొంటె
పక్కన నవ్వులు నవ్వీ బాలకృష్ణుఁడు
యిక్కువకుఁ జేయి చాఁచీ నేడ నైనాఁ దొంగి చూచీ
యెక్కుడు గామిడి గదె యీ బాలకృష్ణుఁడు

చ. 2: చన్ను లంటి సారె సారె చవిగా ముద్దులు వెట్టి
పన్నీఁ గదె మెహ మెల్ల బాలకృష్ణుఁడు
సన్నలనె మొక్కు మొక్కీ సమ్మతిఁ బయ్యెద దీసీ
యేన్నేసి నేరిచినాఁడె యీ బాలకృష్ణుఁడు

చ. 3: నిండుఁగాగిట నించి నేరుపులు పచరించి
బండుమాట లాడీఁ గదె బాలకృష్ణుఁడు
అండనె శ్రీవెంకటాద్రి నాయ మెరిఁగి తాఁ గూడె
యెండ నీడ కన్నులతో నీ బాలకృష్ణుఁడూ

రేకు: 0324-4 రామక్రియ సంపుటం: 11-142

పల్లవి: ఊరకె గుట్టున నిఁక నండవయ్య
యే రీతి కైనా వచ్చు యీ చేఁత లయ్యా

చ. 1: కన్నుల నీవు నవ్వితె గక్కనఁ గోపము వచ్చీ
వున్నతిఁ జలము రేచ కుండవయ్య
వన్నెలు వాసులతోడ వడి బతికేవారము
నిన్నువలెనా నేము నిలవయ్యా

చ. 2: కొంగు వట్టే విట్టె నీవు కొలఁది వీరేను నేను
వుంగిటాయ సరసము లుండవయ్య
కుంగనబీరములు యేగ్గులపుట్టలము నేము
యెంగిలి కోరుతువు నిన్నే మనేమయ్యా

చ. 3: బలిమి సేసేవు నీవు పంతము లెక్కీ నాకు
వొలిసిన వెల్ల నాయ వుండవయ్య
కలతి విట్టె నన్ను కాఁగిట శ్రీవెంకటేశ
చెలిమి మనకు నేఁడు చెల్లునయ్యా

రేకు: 0324-5 నాదరామక్రియ సంపుటం: 11-143

పల్లవి: ఇద్దరు నున్నారు యెదురెదురనె మీరు
బద్దుల మీతో నాడఁ బని లేదుమాకు

చ. 1: సెలవి నవ్వినవ్వు సిగ్గులకు మొద లాయ
పలకు దండుకె నీతోఁ బలుమారును
నెలఁత నెచ్చరించేది నీ చెతిదె యిఁక
బలిమి నేయఁగ మాకుఁ బని లేదు యిఁకను

చ. 2: చెక్కునఁ బెట్టినచేయి చేఁతలకు మూల మాయ
చక్కఁగా నందుకె నిన్ను సారెఁ జూడదు
నిక్కి యాపె బుజ్జగించ నీ చేతదిదె యిఁక
చిక్కించుక నేము బుద్ధి చెప్పఁ బని లేదు

చ. 3: ముంచినవూరుపు లెల్ల మోహానకె తగు లాయ
పంచల నందుకె నిన్నుఁ బాయ నోపదు
కొంచక శ్రీవెంకటేశ కూట మిది నీచేతిదె
మించి యప్పటి నేల మెచ్చేరు చెలులు

రేకు: 0324-6 బౌళి సంపుటం: 11-144

పల్లవి: తానె యెఱుఁగుఁ గాక తరవాతి చేఁతలు
వీనుల మా బుద్ధు లిఁక వినేవా నీ వయ్యా

చ. 1: పైకొని చెలియనీకుఁ గానుక వట్టు కుండఁగ
యేకడో పరా కై వుంటి విందాఁకను
సాకిరి వెట్టెను సన్నీ సరితలు చూడు మంటా
యీకడ నిన్ను నేనే యే మనఁగల నయ్యా

చ. 2: దగ్గరి విన్నపానకు తరుణి గాచు కుండఁగా
వొగ్గక వంటివి తడ వున్నదాఁకాను
యెగ్గు వట్టి మాఁటు నేసీ నిటువంటివాఁడ వని
దిగ్గన నీ వోజలు దిద్దేనా నే నయ్యా

చ. 3: లోనికిఁ దీసి ని న్నింతి లోను సేసుకొనఁగాను
మోహనాననే వుంటి వట మొక్కుదాఁకను
పూని శ్రీవెంటేశ నీ పొందిక నాతోఁ జెప్పె
నే ననకున్న నంతేసి నేరవా నీ వయ్యా

రేకు: 0325-1 సామంతం సంపుటం: 11-145

పల్లవి: దగ్గర నున్నా నతఁడు తానె యెరుఁగును
వెగ్గళించకురె మీరు విచారించె నన్నియు

చ. 1: ఆస పడినట్టివాఁడు ఆయములె అంటుఁ గాని
వోసరించి గుట్టుతోడ నూరకుండఁడు
వాసితో నే నుండగానె వల పల్లా గాన వచ్చీ
వేరించకురే మీరు విచారించె నన్నియు

చ. 2: సత మైనయట్టివాడు చనవులె యించు గాని
రతికి నెక్కక వేరె రవ్వ నేయడు
తతి దప్పకుండఁగానె తగ వెల్లా నీడేరీ
వెత సేయకురె మీరు విచారించె నిన్నయు

చ. 3: చెక్కు నొక్కినట్టివాడు చెప్పినట్టె సేసుఁ గాని
తక్కించి వేరె తాను దమకించడు
యిక్కు వెరిగె శ్రీవెంకటేశు డిట్టె కూడె నన్ను
వెక్కసము లాడకురె విచారించె నన్నియును

రేకు: 0325-2 ముఖారి సంపుటం: 11-146

పల్లవి: తమకించcదన కేలే తానే నేను
సమకూడేదానc గాక సాదించేదాననా

చ. 1: చేసన్న చేసితి నింతే చెక్కులు నొక్కితి నింతే
వాసులు వంతుల కేల వచ్చినె తాను
రాసి కెక్కె తనమేలు రచ్చ కెక్కె చేత లెల్ల
ఆసపడేదానc గాక అడ్డ మాడేదాననా

చ. 2: కన్నుల నవ్వితి నింతే కాయము సోcకొతి నింతే
పన్నినవొరపు లే పట్టినె తాను
యెన్ని కాయc దనపొందు యిర వాయc గోరికలు
మన్ననలోదానc గాక మారుకొనేదాననా

చ. 3: సిరసు వంచితి నింతే చేతుల మొక్కితి నింతే
కెరలి నన్నేల గిలిగించినె తాను
యిరవై శ్రీవెంకటేశుడిన్నిటాను నన్నుc గూడె
పెర రేcచేదానc గాక బిగిసేటిదాననా

రేకు: 0325-3 రామక్రియ సంపుటం: 11-147

పల్లవి: కైవస మై తనకు నేఁ గలదానను
తావుల నా మన సెల్ల తా నెఱుఁగునే

చ. 1: పెక్కుసతులు గలిగి పెద్దగా బదుక నీవే
చొక్కపుఁ గన్నుల దన్నుఁ జూచేఁ గాని
యిక్కువ నందరి సొమ్ము లెల్ల ధరించుకో నీవే
చక్కఁగా నేఁ బెట్టినంత సంతోసమూ

చ. 2: వియ్యా లంది వీడుకూళ్లు వేమారుఁ గుడువ నీవే
వొయ్యనె తనకు లో నై వుండేఁ గాని
ప య్యాడినవారిచేతి బాగా లందుకో నీవే
యియ్యకో లై ఆకు మడి చిచ్చేఁ గాని

చ. 3: సమరతి నుపరతి జల్లఁగా వెలయ నీవే
తమితో సేవలు నేసి దక్కేఁ గాని
అమర శ్రీవెంకేటశుఁ డట్టె నన్నుఁ గూడ నీవే
గుమి గూడి నేఁ గూడి గురి యైతి నిపుడూ

రేకు: 0325-4 దేసాళం సంపుటం: 11-148

పల్లవి: కడవారి నీ మా టడుగవే నీవు
వెడగు నీ గుణములు విచారించుకొనవే

చ. 1: నీసవతి నైతిఁ గాక నిన్ను నే మైనా నంటినా
వాసు లెక్కించుక వట్టివా దేలే నీకు
ఆల నిద్దరికిని ఆతఁడే గురుతు గాక
రేసులు పుట్టించి యాల రేఁచేవే మమ్మును

చ. 2: తప్పక చూచితిఁ గాక తడవితినా నిన్ను
వుప్పటించి యంతేసి మ మ్మొరనేవే
తప్పులుఁ దారులు వాప తగ వాతఁడే యెఱఁగు
చప్ప నాయ మానవే నీట లెల్ల నిఁకయ

చ. 3: తెలిసితి నన్నియు నీ తెరువు వచ్చితనా
చలము లిక్కడ నింక సాదించకువే
అలరి శ్రీవెంకటేశుఁ డన్నిటాను నన్నుఁ గూడె
పెలుచవు నిన్నెఱుఁగు పెనఁగ నేమిటికే

రేకు: 0325-5 వంతవరాళి సంపుటం: 11-149

పల్లవి: ఇదివో నా భాగ్యము యేమి చెప్పేనే
ముదముతోఁ దన కొట్టె మొక్కితి నే ననవే

చ. 1: చుట్టమైన యట్టివాఁడు సులభుఁ డైనట్టివాఁడు
దట్టమై నా కిన్నిటాను తానే కదే
పొట్టఁబొరుగున నుండి పొరచి వెట్టంపి నేఁడు
గట్టిగా నింతకరుణ గలదు గా నాకు

చ. 2: అంతరంగ మైనవాఁడు ఆయ మెరిఁగినవాఁడు
చెంతలఁ దానే అని చెప్పేఁ గదే
వంతులు వాసు లెంచక వాకిటికి వచ్చె నేఁడు
యింత మన్నించఁ దాఁ గాక యిఁక నెవ్వరే

చ. 3: వహించుకొనేవాఁడు వద్ద నిట్టె వుండేవాఁడు
విహరించ నా కిన్నటా వెలనె తానె
వహి కెక్క శ్రీవెంకటవల్లభుఁ డితఁడే నన్ను
తహతహ దీరఁ గూడె తగవరి అవుఁ గదే

రేకు: 0325-6 భైరవి సంపుటం: 11-150

పల్లవి: తొల్లో నీకంటే నే దొడ్డదానవా
బల్లిదుఁడ నీవే నన్ను పాలింతువు గాకా

చ. 1: చిత్తము రా నీకు నే సేవ సేయఁ గలనా
సత్తగు నీ దయ నాపైఁ జల్లుదు గాక
నిత్తెము నిన్ను మెప్పించ నేరుతునా యే మైనా
కొత్తగా నన్నిట్టే దిద్దుకొందువు గాకా

చ. 2: యిట్టి దని నీ మహిమ యెరుఁగుదునా నేను
నెట్టన బుద్ధి చెప్ప మన్నింతు గాకా
వొట్టి నీకు విన్నవించ నోపఁ గలనా నేను
వట్టి నీవే తెలుసుక పయికొందువు గాకా

చ. 3: కందువ లెరిఁగి నిన్ను కాఁగిలించఁ గలనా
అందాలు సేసుక నీవే అంటుదు గాక
యిందుకే శ్రీవెంకటేశ యియ్యకొని కూడితివి
మందలించఁ గలానా మరుగుదు గాకా

రేకు: 0326-1 సాళంగనాట సంపుటం: 11-151

పల్లవి: రచ్చలఁ బెట్టక యిట్టే రావయ్యా
గచ్చులు మాని యిన్నీఁ గనుకోవయ్యా

చ. 1: పంతము దప్పదు నీతో బలికినమాత్రమున
వంతుకుఁ జెలి కిందులో వాసి వోదు
యింతిచేత నేఁ జెప్పించే యెడమాట లీడ నేల
వింతల నీ సుద్దు లిందే వినుకోవయ్యా

చ. 2: సూటి దప్ప దింతలోనే చూచిన మాత్రమున
ఆఁటదాని కిందుకుఁగా నాస వోదు
కూటమి నాపెచేత గురుతులు పట్టింపించే
దీఁట నైనా నాచేఁతలు తెలుసుకోవయ్యా

చ. 3: ఘనత లేమిఁ దప్పదు కాఁగిలించినంతలోనే
పెనఁగించె ఆపెచేత పెరిమె వోదు
చెనకి కూడితి విట్టే చేరి శ్రీవెంకటేశుఁడ
మన సిచ్చి రక్షించి మన్నించుకోవయ్యా

రేకు: 0326-2 గౌళ సంపుటం: 11-152

పల్లవి: ముంచి నిన్నే మనఁ జాల మొక్కే మయ్యా నీ
మంచితన మెల్లఁ గంటి మరఁగే లయ్యా

చ. 1: యేకతాన నే నిన్ను నే మంటినో యంటా
ఆకడఁ జెలులతోడ నాడుకొనేవు
చేకొలఁది వైన నిన్నుఁ జేసినచేతలు మరి
రాకల పోకల నింత రచ్చ వేతురా

చ. 2: తరితీపులను నీపైఁ దమకించితి నంటా
యిరుగుపొరుగు లేల యెరిఁగించేవు
సరసుఁడ వైన నిన్ను చనవునఁ గొసరితే
విరివి గొనుచు వెల్లవిరి నేతురా

చ. 3: గెంటక పెనఁగేవేళ గిలిగించితి నంటా
యింటివా రెల్ల వినఁగ నేల నవ్వేవు
జంటవై శ్రీవెంకటేశ సరి నన్నుఁ గూడితివి
నంటుతమకము లింత నాన వేతరా

రేకు: 0326-3 వరాళి సంపుటం: 11-153

పల్లవి: ఏ మని చెప్పుదు మయ్య యీపె వలపు
నీ మేని రతులఁ జొక్కి నేర మెంచీ నిపుడు

చ. 1: అద్దము చూచి చెలి యంతలేనో నవ్వు నవ్వి
గద్దరిచూపుల నీ మొగము చూచెను
యిద్దరుఁ గూడి యున్నప్పు డెరఁగ దాయనో కాని
చద్దిగురుతులకే సాధించీ నిపుడు

చ. 2: పొలిఁతి బాగా లందుక పుక్కిట నీ విడినట్టి
తొలుతటితమ్మ చూచి తల వంచెను
కలసినప్పటివేళ గతు లెట్టుండెనో కాని
సొలసి యందుకుఁ గానె సూడి వట్టీ నిపుడు

చ. 3: పవళించఁ బోయి నీవే పర మయి వుండఁగఁ జెలి
జవళివేడుకలకు సంతసించెను
యివల శ్రీవెంకటేశ యే మని మెచ్చెనో కాని
కవ గూడి మన్ననల మించీ నిపుడూ

రేకు: 0326-4 శ్రీరాగం సంపుటం: 11-154

పల్లవి: బలిమి నేయకురే పట్టి పెనఁగకురే
పొలసి పా వచ్చినాఁడు పోనియ్యఁ గదరే

చ. 1: కొసరే మా మాటలు కూరిములో తేటలు
నసలు నేఁ డిం పౌనా నాఁడే కాక
వస మైనాఁ డెవ్వతెకో వలసీ నొల్లము లీడఁ
బొసఁగినా వాని కట్టె పోనియ్యఁ గదరే

చ. 2: రవ్వల మా పిలుపులు రాయిడించే సొలపులు
నవ్వులు నేఁ డిం పౌనా నాఁడే కాక
యేవ్వ తాస యిచ్చనదో యింతకు నేరఁడు తొల్లి
పువ్వువంటిది వలపు పోనియ్యఁ గదరే

చ. 3: తనవోనిరతులనును తలపోఁతమతులును
ననుపు నే డిం పౌనా నాఁడే కాక
యెననెను శ్రీవెంకటేశుఁడింత సేసి నన్ను
పొనిగి పోయినసుద్ది పోనియ్యఁ గదరే

రేకు: 0326-5 ముఖారి సంపుటం: 11-155

పల్లవి: అప్పుడే బలిమి సేసే వందు కేమి
చిప్పిలఁ బనివనిగాఁ జెప్పర నాతోను

చ. 1: వోప నంటాఁ బెనగఁగ వొడివట్టి తియ్యకురా
కోపపుఁ జూపులు కనుఁగొనే వారము
చేపట్టి తీదీపులను చేయి దాఁకు గాలు దాఁకు
ఆపి మాట మాటగాఁనె ఆడరా నాతోను

చ. 2: పెడమర లుండఁగాను పేరునఁ బిలవకురా
వడి మురిపెముల గర్వపువారమూ
తడవఁగఁ బలుమారు తప్పు లౌనో వొప్పు లౌనో
నడుమ నవ్వు నవ్వుగ నవ్వరా నాతోను

చ. 3: పవళించి వుండగాను పైపైఁ బడే వ దేమిరా
చివురేచేఁ గల గోరిచేతివారము
యిపల శ్రీవెంకటేశ యిట్టె కూడితిని నన్ను
చవిగా ముద్దుముద్దుగాఁ జన వీరా నాకునూ

రేకు: 0326-6 కొండమలహరి సంపుటం: 11-156

పల్లవి: ఇద్దరి మనసులు నేక మైనఁ గా
కొద్దిక విరివో టౌనరీనా

చ. 1: చెలువుఁడు యేమో చింతించఁగ నే
కలయు మనుట సంగతు లౌనా
వలవనియలపుతో వడఁబడి యుండఁగ
యెలమి నేఁ జెనకు టిం పవునా

చ. 2: అదె పొడిఁ బడి పతి యసు రుసు రనఁగా
పదరి నేఁ బిలుచట పొడి యౌనా
నిదరుమోముతో నెరి విరి గుండఁగ
గుదిగొని నేఁ బైకొనఁ దగవా

చ. 3: తమకించి యతఁడు దవ్వుల నుండఁగ
జమళిఁ గలయఁ బోతే సర వెవునా
తిమిరి శ్రీవెంకటదేవుఁ డతఁడె నను
ప్రమదమునఁ గలనెఁ బాసీనా

రేకు: 0327-1 శంకరాభరణం సంపుటం: 11-157

పల్లవి: కోపము దీరినమీఁదణ గూడేవు గాక
కైపుగ నీ వొళ్లిదె కల్ల యనవయ్యా

చ. 1: యే మంటివో కాని యింతి గడుఁ జిన్నఁ బోయ
వేమారు నలుక దీర వేఁడుకోవయ్యు
ప్రేమతో బలిమి నేసి పెనఁగి యేమి నేసితో
వాములుగఁ దిట్టకోనీ వద్దనవయ్యా

చ. 2: యింతిచిత్తము నొవ్వఁగ యెవ్వరిదిక్కు చూచితో
అంతలో దల వంచె లే దనవయ్యా
అంతటఁ బోక నీవు అట్టె యేమి నవ్వితివో
చింతతో లోనికిఁ బోయీ చేరి పట్టవయ్యా

చ. 3: మితియేమి మీరితివో మెలుఁత నిట్టూర్పు నించె
చతురతఁ గరిములు చల్లవయ్యా
తతితో శ్రీవెంకటేశ దగ్గరి కూడితి వాకె
రతి నలనెను మోవిరస మియ్యవయ్యా

రేకు: 0327-2 దేసాళం సంపుటం: 11-158

పల్లవి: ఏల మమ్ముఁ జెనకేవు యెడ్డవా నీవు
వేలఁ జూపేరు నిన్నునె వినుకొన రాదా

చ. 1: యేరా మా కస్తూరిబొట్టు యె ట్టుండె నేమి నీకు
గోర దిద్ద వచ్చేవు కూళవా నీవు
గారవపు నీ మేనఁ గస్తూరి రేక లవిగో
తేరకొన వంక లెల్ల దొద్దుకొన రాదా

చ. 2: చెల్లఁబో నా హారములు చిక్కువడితే నేమి
మల్లాడి దిద్ద వచ్చేవు మంకవా నీవు
చిల్లా పొల్లాయ నీ మెయిఁ జెమటముత్తెము లెల్ల
పెల్లు రేగి నీవె చక్కఁ బెట్టుకొన రాదా

చ. 3: చనుఁగొంగు జారె నంటాఁ జక్క దొబ్బ వచ్చేవు
చనవున నన్నిటాను జాణవా నీవు
చెనకి కాఁగిలించితి శ్రీవెంకటేశ నీవు
ననిచి నీ పచ్చడము నాకు గప్ప రాదా

రేకు: 0327-3 సామంతం సంపుటం: 11-159

పల్లవి: వలపు చప్పు జేసెటివగకాఁడనీ
బలిమి నా మనసుకు బల్ల కట్ట వలెనా

చ. 1: పలికేవు కమ్మటిని పరాకు నయ్యేవు
అలిగినాఁ బోనీవు అదేరా నీవు
పిలిచితే వచ్చినది పెనుఁ దప్పు నావొళ్లఁ
గలదు నీ వింక నన్నుఁ గాకు నేయ వలెను

చ. 2: పైపైఁ గొంగు వట్టేవు పరులతో నవ్వేవు
వోప నన్నఁ బోనీవు వోరి నీవూ
పాప మింతే నీవు నేసే భ్రమకు లో నయినది
యేపున నెంతైనాఁ గద్దు యింత సేయ వలెనా

చ. 3: యిచ్చగించి కూడేవు యే మేమో తలఁచేవు
హెచ్చి మూల నుండనీవు యేరా నీవూ
అచ్చపు శ్రీవెంకటేశ అన్ని టాను నిన్ను గూడి
మెచ్చినదె మే లాయ మేకు నేయ వలెనా

రేకు: 0327-4 సాళంగనాట సంపుటం: 11-160

పల్లవి: పొద్దు వోదా తన కేమి పోరు వెట్టి వేగి తేచి
ఉద్దండీఁడు తన కేమి పూరకుండఁ బట్టదా

చ. 1: యెప్పటి కుత్తర మిచ్చే దప్పుడే యిచ్చేఁ గాక
యిప్పటినుండియు మాట లేలే నాకు
కప్పి నిజ మాడు మంటా కమ్మర నానవెట్టిని
తప్పు లౌతా వొప్పు లౌతా నెరఁగఁడా

చ. 2: చేయవలసినప్పుడే చేయి ముంచి చేసేఁ గాక
యీ యెడ నుండియు బంతా లేలే నాకు
ఆయ మంటి వేగిరించి నప్పుడె తనకుఁ దానే
కా యౌతా పండౌతాఁ గనీఁ గాకా

చ. 3: దగ్గరితి మిద్దరము తరవాయి వచ్చీఁ గాక
యెగ్గులు నెమ్ములుఁ బట్ట నేలే నాకు
బగ్గన శ్రీవెంకటాద్రిపతి నన్నుఁ గూడె నిఁక
ముగ్గుపిండి అట్లకు మొద లయ్యీనా

రేకు: 0327-5 లలిత సంపుటం: 11-161

పల్లవి: అన్నియు నేరుచుకొన్నాఁ డలవాటే యాతనికి
యెన్ని యైనఁ గల విట్టే యింటి కింక రావే

చ. 1: వట్టిమాకు లిగిరించు వాఁడు మాట లాడితేను
యిట్టె నన్ను గరఁగించు టేమి సోద్యమే
వెట్టికి వింటేం జాలు వేగాదాఁకఁ జెప్పఁ దాను
బట్టబయ లీఁద నోపఁ బదవే మాయింటికి

చ. 2: జాతికి గిలిగింత లౌ బట్టడినవానిచేఁతల
యీతల నన్ను నవ్వించే దేమి సోద్యమే
చేతికి లో నైతేఁ జాలు సేయఁగల ట్టెల్లాఁ జేసి
పోతరించి వున్నవాఁడు పోదమే మా యింటికి

చ. 3: యేరు లైన నెదు రెక్కు యిట్టి వీనిఁ బొడగంటే
యీరీతి మనము వచ్చే దేమి సోద్యమే
చేరినన్ను నిటు గూడె శ్రీవెంకటేశ్వరుఁడు
ఆరె దేరెఁ బిలువవే అతని మాయింటికి

రేకు: 0327-6 లలిత సంపుటం: 11-162

పల్లవి: చక్కని యీ వెన్నుఁడూ సంబటూరి చెన్నుఁడూ
అక్కడ నిక్కడ చూపి ఆసలు రేఁచీని

చ. 1: చెన్నునిఁ జూడఁ గదరే చెలులాల నేఁడు
చిన్ని లేనవ్వులనె చెలరేఁగీని
సన్నలు నేసీ వాఁడె సటకాఁడు నాతో
యెన్నటి కెన్నటి పొందు యిపుడే రేఁచీని

చ. 2: యే మనీనె చెన్నుఁడూ యేకతాన నన్నునూ
దొమిటివావులు నాపైఁ దొరలించీని
కోమలపు చేయి చాఁచీ కొత్తపెండ్లికొడుకు
గామిడితనాల నన్నుఁ గాకలు రేఁచీని

చ. 3: శ్రీవెంకటాద్రిమీద చేరి కూడెఁ జెన్నుఁడు
బావించి పచ్చడము పైఁ గప్పీని
మోవి చూపీఁ గమ్మటి మెక్కళీఁడు వీఁడు
దేవుఁడు గదవే వీఁడు తీపులు రేఁచీని

రేకు: 0328-1 మధ్యమావతి సంపుటం: 11-163

పల్లవి: చెనకితే బిగియఁగ జెల్లదా నేఁడు
జినుగుసిగ్గుల నవ్వు చెల్లదా నీకూ

చ. 1: కాయ మట పాయ మట కడు వలచితి నట
నేయఁగల ట్టెల్ల నీకు జెల్లదా నేఁడు
నాయంతనె వచ్చెనా నాతుల కిదె చాలు
చేయ మీఁ దాయను నేఁడు చెల్లదా నీకు

చ. 2: కలి మట బటి మట కదిసి నవ్వే వట
చెలఁగి నే వే మన్నఁ జెల్లదా నేఁడు
చల మెన్నఁటికె యిఁక సాదించవలెఁ గాక
చెలరేఁగి మాటలాడఁ జెల్లదా నీకు

చ. 3: యిల్లట మంచ మట యేకత మిదే యట
చెల్లఁబో యేమి సేసినఁ జెల్లదా నేఁడు
కొల్లగా శ్రీవెంకటేశ కూడితివి నన్ను నిట్టే
చిల్లరపొందులు మానఁ జెల్లదా నీకూ

రేకు: 0328-2 సాళంగనాట సంపుటం: 16-164

పల్లవి: దేవ నీ చెలువములోఁ దిరమై మిక్కిలి నీ
దేవి చెలువము దెచ్చెఁ దేటతెల్లమిగాను

చ. 1: గరిమ నీ వురము కౌస్తుభమాణికముతో
సరి దూఁగి యెక్కు డాయ సతీమణి
వరుస నీదు బాహువల్లుల నడుమను
పెరిగె నీ లలితాంగి పెద్దరిక మందె

చ. 2: నీలమేఘమువంటి నీ మేనికాంతికి
మేలిమివన్నె దెచ్చె మెరుఁగుఁబోఁడి
పోలింప నీదు తమ్మిబొడ్డుకంటెఁ బొడవున
కాలు దొక్కి నిలిచెను కమలాలయ

చ. 3: అదివో నీ బంగారుహరముల నడుమను
పొదిబంగా రై నిలిచె పుత్తడిబొమ్మ
పొదిగి శ్రీవెంకటేశ భోగించె నీ కాఁగిటికి
అదనఁ బుట్టుభో గాయ నలమేలుమంగ

రేకు: 0328-3 సామంతం సంపుటం: 01-165

పల్లవి: ఈపాటివాఁడవు యేల కొపగించితివి
చేపట్టినటులానె సేయ రాదా

చ. 1: చెక్కు నొక్కకుర నీవు చేయి చాఁచకుర నాపై
చక్క నీ మంచితనాలు చాలుఁ జాలు
పక్కనఁ గోపించ వద్దు పైకొని వేఁడుకో వద్దు
వొక్కమారె యింతేసికి నోపను నేను

చ. 2: కాలు దొక్కకుర నీవు కమ్మటి నవ్వకు నాతో
జాలినీ యిచ్చకములు చాలుఁ జాలు
తాలిమిఁ దిట్టా వద్దు దగ్గరి మొక్కా వద్దు
మేలు మీఁదనె వుండే మేరతో నడవరా

చ. 3: మాటలాడకుర నీవు మాయలు సేయకురా
చాటు వాయ నీవలపు చాలుఁ జాలు
గాఁటపు శ్రీవెంకటేశ కరఁగించి కూడితివి
మేటి నీ గుణములకు మెచ్చితి నే నిదివో

రేకు: 0328-4 సామంతం సంపుటం: 11-166

పల్లవి: తా నేల నిలుచున్నాఁడు తడవుల నుండీని
పానిపట్టి చెలులాల పద మనరే

చ. 1: మనసు రాని తలఁపు మాటలోనె కాన వచ్చు
పెనఁగి యప్పటి వీఁడు పిలిచీఁ గొంతా
ననుపు గల దెల్లాను నవ్వినందే తెలిసితి
పని గద్దు వచ్చేఁ గాని పద మనరే

చ. 2: నెరమెచ్చువలపులు నిలిచినందే తోచె
సరసాన వీఁడె చేయి చాఁచీఁ గొంతా
కరుణ గల దెల్లాను కనుచూపులనె కంటి
పరిణామ మాయ నాకుఁ బద మనరే

చ. 3: కలిగిన తమకము కాఁగిటిలోఁ గానవచ్చె
అలరి తాఁ బెట్టుకొనీ ఆనలూఁ గొంతా
వెల లేని వేడుక శ్రీవెంకటేశుఁ డిటు గూడె
పలుకు లేఁటికి నిఁకఁ బద మనరే

రేకు: 0328-5 శంకరాభరణం సంపుటం: 11-167

పల్లవి: చెల్లఁబో నాకె సుద్దులు చెప్పకువయ్యా
పల్లదాన నీవు నీవే బదుకవయ్యా

చ. 1: యేమయ్యా నేము నీ కేమిటి కయ్యా
నేమాన నీ కిచ్చ లాడ నేరనయ్యా
చేముంచి యాపె కీ మేలు సేయనయ్యా
మోము చూచి సంతసించి మొక్కేనయ్యా

చ. 2: తలవయ్యా మమ్ము నేల తడవేవయ్యా
నెలవై నే నిజ మాడి నిష్టూరి నింతే
కెలసి యాకెనె బుజ్జగించవయ్యా
వలచి నే నెపుడు నీ వద్ద నుండే నయ్యా

చ. 3: చెల్లు నయ్యా యే మైనాఁ జేయవయ్యా
యెల్లవారివలె నేమీ నెరఁగ నయ్యా
కొల్లగా శ్రీవెంకటేశ కూడితివి నన్ను నిట్టె
తెల్లముగ నీ వెంటఁ దిరిగే నయ్యా

రేకు: 0328-6 సాళంగనాట సంపుటం: 11-168

పల్లవి: దూరఁ బోతేఁ గోపము దొరకు ముక్కున నుండు
వూరకే తోడుక రారే వొడఁబరచేనూ

చ. 1: అవుఁగా దనకురే ఆడినట్టె ఆడనీరే
యివల నేనే చెప్పే నిన్ని బుద్దులు
తివిరి మీ రిందాఁకాఁ దెచ్చినదే మీపాలు
అవల నంతటిమీఁద నాతడు నాపాలు

చ. 2: చేచేతఁ బెనఁగకురే సేసినట్టే సేయనీరే
యేచి నేనే సేవ సేసే నీడుకు నీడు
కాచిన మమ్మిద్దరినిఁ గదియించుట మీ పని
చూచి వానిఁ గరఁగించి చొక్కుట నా పని

చ. 3: పంత మె ట్టినై వచ్చి బలిమి సేయకురే
మంతనాన మెచ్చు సేసే మంకు లెల్లాను
యింతలో శ్రీవెంకటేశుఁ డిదే కదే నన్నుఁగూడె
వంతులే నీకుఁ జెల్లె వాసి నాకుఁ జెల్లె

రేకు: 0329-1 ఆహిరి సంపుటం: 11-169

పల్లవి: ఇంతి యలిగితేఁ గన యెవ్వరి వసము గాదు
సంతసాన నవ్వేటి సతితోడ నగవూ

చ. 1: యెక్కడ పరాకో యేమి భావించేవో
మొక్కేటిచెలిఁ గాఁగిట ముంచి యెత్తవు
మక్కువ నీకుఁ జాలదో మనసులోఁ గోపమో
నిక్కి చూచేసతితోడ నీ వేమీ ననవూ

చ. 2: సిగ్గు పడ్డ విధమో చెప్పేవారు లేకో
దగ్గరి యున్నసతితోఁ దమకించవు
నిగ్గుల రాజసమో నీ వొళ్లిగుణమో
వెగ్గళించి పిలువఁగ వినియును వినవూ

చ. 3: యేమి దలఁచుకొంటివో యీ వనిత భాగ్యమో
చే ముంచి సరస మాడి చెక్కు నొక్కేవు
కాముఁడు పెర రేఁచెనో కరుణ నీకుఁ బుట్టెనో
నేమపు శ్రీవెంకటేశ నీవే కూడితివి

రేకు: 0329-2 శంకరాభరణం సంపుటం: 11-170

పల్లవి: ఒంటి నన్ను నవ్వ వచ్చీ నో యమ్మా
వుంటవింట వేయు మనీ నో యమ్మా

చ. 1: సుద్దు లవి విను మంటా సారిదిఁ జెక్కులు ముట్టీ
వొద్దన్నా మానఁడే వో యమ్మా
గద్దించి యందుకు నేను కడు జంకించఁ బోతేను
వుద్దండపుమాట లాడీ నూరకే వో యమ్మా

చ. 2: బడి బడి రమ్మంటాఁ బట్టఁ బట్టఁ బైకొని
వొడిసీ నీ పయ్యదను నో యమ్మా
తదవకు మని నేను తన్ను నాన వెట్టితేను
ఉడికి తప్పక చూచీ నూరకే వో యమ్మా

చ. 3: పనిమాలి నేఁడే తన పాదుములు గుద్దు మంటా
వొనర బలిమి నేసీ నో యమ్మా
యెనసెను శ్రీవెంకటేశుఁ డిటువలె నన్ను
పుని కై నిలిచితిమి వూరకే వో యమ్మా

రేకు: 0329-3 వరాళి సంపుటం: 11-171

పల్లవి: పలుమారుఁ బెనఁగక పదవే నీవు
నిలుచున్నాఁ డెదుటనే నీ కెంత పగటే

చ. 1: నెట్టుకొని రమణుఁడు నిన్నే తప్పక చూచీ
పట్టినచలము మాని పదవే నీవు
అట్టె దొర యాఁతడు నిన్నడిగే మాటల కెల్ల
యెట్టైన నుత్తర మియ్య వెంత గుండే నీకు

చ. 2: చేపట్టి పెనఁగీని చెలువపు నీ విభుఁడు
పైపయిఁ దప్పించుకోక పదవే నీవు
యేపున నాతఁడె నీయింటికి వచ్చి యుండఁగా
కోపము మానవు యేటి కొత్తలే నీవూ

చ. 3: చింత దీర నాతఁడు చిరునవ్వు నవ్వఁగాను
పంతాలు చెల్ల దింకఁ బదవే నీవూ
అంతలో శ్రీవెంకటేశుఁ డాదరించి నిన్నుఁ గూడె
యెంతటిదానవు నీవు యెదు రేదే నీకు

రేకు: 0329-4 హిందోళవసంతం సంపుటం: 11-172

పల్లవి: అల్లదె నీ రమణి ఆయిత్తమై వున్నది
పెల్లుగ జాజరాడఁ బిలిచీఁ బోవయ్యా

చ. 1: వనితచూపులు కలువల వసంతములు
ఘన మైనమోహము గంధము వసంతము
మనసులో కోరికలు మంచినీళ్ల వసంతము
పెనఁగి జాజరలాడఁ బిలిచీ నయ్యా

చ. 2: కలికినవ్వులు నీకు కప్పురవసంతములు
నిలిచినకళలు వెన్నెలవసంతములు
పలుకులకొసరులు బంగారువసంతము
బెళకక జాజరాడఁ బిలిచీ నయ్యా

చ. 3: కేలు పట్టి తీసినది కెందామరవసంతము
చాలుఁ బులకలు ముత్యాలవసంతము
యీలాగుల శ్రీవెంకటేశ ఆకెఁ గూడితివి
పేలరి యై జాజరాడఁ బిలిచీ బోవయ్యా

రేకు: 0329-5 మాళవిగౌళ సంపుటం: 11-173

పల్లవి: నీకే చెల్లుఁ గాని నే నింత కోపను
కాకరితనా లెపుడుఁ గలవే నీకును

చ. 1: రమణితో నొకమాట రతి నాతొ నొకమాట
అమరదు యెన్నఁడు నీ వాడకురా
కమలము వొకకన్ను కలువయు వొకకన్ను
జమళి రండు నడప సాజయే నీకును

చ. 2: కంటే నిందు వచ్చే వాకడిమో మైతే రావు
అంటి నన రాదు మాతో నంత యాలరా
వొంటనిసా మొకటియూ వొగి గరుత్మంతుని
బంటులఁగా గాడిఁ గట్టి పరచేటివాఁడవు

చ. 3: కాఁగిలించే విటు నన్ను కన్ను గిరిపే వాపెతో
దాఁగిలిముచ్చు లాడేవు తగ దేలరా
యేఁగి మింటి కొక కొంగ యెత్తి శ్రీవెంకటగిరి
నాఁగితి రెండు వాదాలు నౌరా నీవూ

రేకు: 0329-6 శంకరాభరణం సంపుటం: 11-174

పల్లవి: ఏ మందునె యిందు కిట్టె నిన్ను
కామిను లిట్లైతే కాలమహి మెట్లో

చ. 1: అతఁడు నాతో నవ్వినట్టినవ్వు నీ మీఁదికి
యేతులకుఁ దీసుకొనే విది మేలే
పోతరించి వుప్పు వేసి పొత్తు గలయ వచ్చేవు
చేతులఁ బట్టఁగ రాదు చెలి కూ ళైతేను

చ. 2: పేరుకొని నన్నతఁడు పిలువఁగ నది విని
యీరీతి నీవే పలికే విది మేలే
నీరువట్టు గొన్నవేళ నెయ్యి వోసే వాతనికి
ఆరయ సిగ్గు లేనియాఁటదె పసురమా

చ. 3: చేయి నాపై వేయఁ బోతే శ్రీ వెంకటపతికి
యీయెడఁ గైదండ చిచ్చే విది మేలే
పాయక యీ శ్రీవెంకటపతియే నన్నునుఁ గూడె
చాయ యెఱఁగనియట్టి సతియె పో ములుచా

రేకు: 0330-1 ఆహిరి సంపుటం: 11-175

పల్లవి: మూల నున్న వారి మమ్ము ముంగిట వేసితివి
పోళిమి నాఁడువారు నీ పొరు గవుటే దోసమా

చ. 1: వచ్చి వచ్చి చేయి వట్టి వట్టియాన లెల్లఁ బెట్టి
చెచ్చెర న న్నిట్టె లోను సేసుకొంటివి
యిచ్చకుఁడ నన్నువలె నెవ్వతిఁ జేసితివో
యెచ్చి మగనాండ్లకు నీ యింటికి రాఁ బాసెరా

చ. 2: సారె సారె నవ్వు నవ్వి జవ్వాది చెక్కులఁ బూసి
పారి పారి నన్ను నింత భ్రమయించితి
వూరివారి నెల్లా నంతా వోరి కలయఁ గొంటివో
వారించి మానాపతులు వాడ నుంటే నేరమా

చ. 3: మెల్లనె మెల్లనె మొక్కి మేర మీరఁ గాఁగిలించి
కొల్లగా శ్రీవెంకటాద్రిఁ గూడితి నన్ను
వెల్లివలపులు చల్ల వెన్నముద్దకృష్ణుఁడా
గొల్లెతల కెల్ల నీ కుల మౌటే తగులా

రేకు: 0330-2 ముఖారి సంపుటం: 11-176

పల్లవి: నీవే యెరుఁగుదువు ని న్నాతఁడు పిలువఁగ
వావాత నూఁకొనవు వద్దు చల మమ్మా

చ. 1: ముక్కున నూర్పులు రేఁగ ముంజేయి వట్టి పెనఁగీ
వెక్కసపు సంతంటివాఁడు యింత నిన్ను వేఁడుకోఁగ
యెక్కువ నంతటివాఁడు యింత నిన్ను వేఁడుకోఁగ
చిక్క కిట్టె బిగిసేవు చెల్లునా వో యమ్మా

చ. 2: పూవుల కొప్పెల్ల జార పుడిసిట నిన్ను నెత్తె
వోవల పతికి లో నై వుండవే కొంతా
వేవేలు కాంతలవాఁడు వెస నిన్ను బొదుగఁగ
నీ వెం తైనా గుట్టియ్యవు నీకుఁ దగ దమ్మా

చ. 3: తా నాతఁడు నీకు లోనై తమకానఁ గూడఁగాను
ఆన లెల్లఁ బెట్ట వచ్చే వ దేమే యింకా
పూని శ్రీవెంకటపతి భోగించే నిన్ను రతి
కానిమ్మని పాయకువే కలకాల మమ్మా

రేకు: 0330-3 సామంతం సంపుటం: 11-177

పల్లవి: ఇందుకే పో నేను మీ యింటికి వచ్చితి
పొంద కింక నేఁ బోనియ్యి నిన్ను

చ. 1: కలికి నీ చూపులు కన్నుల నుండఁగ
నలువంక మమ్ము నాటీ నేలే
పిలువక మమ్ముఁ బిలిచే మోవి
వొలుకుఁదేనెల నూరించీని

చ. 2: బాపు నీ కుచములు పయ్యెద నుండఁగ
రేపువలపులు రేఁచీ మమ్ము
నీపైనే వుండఁగ నీ చక్కఁదనము
యేపున నా మన సెలయించీని

చ. 3: చేయి చెక్కుతోడఁ జిమ్మె నీసిగ్గులు
ఆయములు దాఁకీ నద్దో మమ్ము
యీయెడ శ్రీవెంటేశుఁడ నే నిన్నుఁ
బాయక కూడఁగఁ బంత మాడేవూ

రేకు: 0330-4 శ్రీరాగం సంపుటం: 11-178

పల్లవి: కొత్త పెండ్లికూఁతురు కొంకు దేరీఁ దేరదు
చిత్తగించి నీ వైనాఁ జేయి వట్టవయ్యా

చ. 1: చిమ్ముచు నీ మోము చూచీ సిగ్గుతో దగ్గరదు
కొమ్మసంగడి నీ వైనఁ గూచుండవయ్యా
కమ్మి నవ్వులును నవ్వీఁ గలసి మాటలాడదు
పమ్మి నీ వైన నాపెతోఁ బలుకవయ్యా

చ. 2: ఆలవట్టము విసరే నంటి ముట్టి పెనఁగదు
తేలించి యాపె వెరపు తెలపవయ్యా
కాలు దొక్కీ నిన్ను నిట్టె కాఁకదేరఁ గలయదు
పోలిమి నీవే కాఁగిటఁ బొదుగవయ్యా

చ. 3: తనలోనె మోహించీ దంటతనము నేరదు
ననుపులే యాకెతోడ నడపవయ్యా
యెనసె శ్రీవెంకటేశ యింతినిన్ను మెల్లనె
మన సిచ్చి యిటులానె మన్నించవయ్యా

రేకు: 0330-5 కాంబోది సంపుటం: 11-179

పల్లవి: చింతలఁ జిగురులు చెనకులఁ జేఁగలు
వంతల నీ చలుములు వద్ద యిఁకను

చ. 1: చెలి నీ సిగ్గు లివిగో సెలవి వెన్నల గాయ
యెలమి బొమ్మలజంకె యెండ గాసీనె
వలచి విభుఁ డిందుకే వాడుచు వాడుదేరీని
కలువ చూపు లయినఁ గప్పవే మీఁదను

చ. 2: మాటలతేనెలోన మధురము గురియఁగ
గాఁటపు నీ బిగువులు కార మయ్యీనె
వీఁటనె విభుఁ డిందుకు వీఁగీని లోఁగీని
పాటల రాగాల చిలుపా లైనఁ బోయవే

చ. 3: కాంత నీ కాఁగి లనేటి కమ్మఁబూఁదీగెఁ బొదిగీ
యింత నీ ముండ్లగోళ్లనేల వొత్తేవే
పంతపు శ్రీవెంకటాద్రిపతి యిట్టె నన్నుఁ గూడె
అంతలో మెత్తనివినయము లైనఁ జేయవే

రేకు: 0330-6 పాడి సంపుటం: 11-180

పల్లవి: విచ్చేయవయ్యా వేఁగుదాఁకా జాగు లేల
కొచ్చి చెలులము నేము కొండేలు చెప్పేమా

చ. 1: ఈకడ నన్నే మడిగే వింటికి విచ్చేసితేను
ఆకెచేతనే వినేవు అప్పుడు నీవు
జోక నిన్నేఁటికో పిలుచుకొని రమ్మనఁగాను
దాకొని వచ్చితి నింతే తలఁ పెరుఁగుదునా

చ. 2: ఆన లేఁటికిఁ బెట్టేవు అండకు నీ వేఁగితేను
కానఁబగీ నన్నియును కాంతవల్లనే
తానె నీ వేడ నున్నా వెదకి తోడి తెమ్మనఁగ
మోనాన వచ్చితి నింతే ముంద రెరుఁగుదునా

చ. 3: కరికరఁ బెట్ట నేల కాంత నీవుఁ గూడితేను
అరయఁగ మంచి వయ్యా నన్ని పనులు
యిరవై శ్రీవెంకటేశ యింతివద్దఁ గూచుంటివి
సరసా లాడఁగాఁ గంటి సర వెరుఁగుదునా

రేకు: 0331-1 శ్రీరాగం సంపుటం: 11-181

పల్లవి: అయ్యయ్యో భూమిమీఁద నన్నియుఁ గంటిఁ జెరువు
ముయ్య మూకు డడిగేటి మూఁడులు గలరుగా

చ. 1: కడ నీ చెక్కుల గోళ్ల కాఁడినపో ట్లుండఁగ
నొడిగే నా మాట నీకు నొప్పు లాయఁగా
బడి బడి తల్లిదండ్రి పగ లుండఁగా లంజ
గొడవలకుఁ బెనగే కూళలు గలరుగా

చ. 2: పెక్కు సతులు నీ మోవి పిప్పి నేసి వుండఁగాను
యిక్కడ నే వగచుట హీన మాయఁగా
మిక్కిలి రాళ్ల కోపక మెత్త నైనందు గుద్దలి
యెక్కువ వాఁడి చేసేయెడ్డలు గలరుగా

చ. 3: తగనియెవ్వతో కాలితాఁకులు నీమై నుండఁగ
బిగువు నా చన్నులొత్తు బిరు సాయఁగా
అగపడి శ్రీవెంకటాధిప కూడితి విట్టె
నగవు నిజాలు సేసేనాథులు గలరుగా

రేకు: 0331-2 పాడి సంపుటం: 11-182

పల్లవి: ఎంత గట్టువాయతనమి దేమే వీఁడు
అంతకంత కేమన్నా నస మీఁడే వీఁడు

చ. 1: నిద్దుర కన్నులఁ దేరి నీకంటే లే దంటా
గద్దించి తప్పక చూచీఁ గదే వీఁడు
ముద్దుతో నెగసక్కేల మోవికెంపులు రేఁచితే
వొద్దన లేక వోరిచి వున్నాఁడె వీఁడు

చ. 2: ముక్కున నూర్పులు నీకు ముంచె నంటె లే దంటా
అక్కిలించి లోనోనె ఆఁపీనె వీఁడు
అక్కడ నలసి వచ్చే నందుపై నేఁ బెనఁగితె
అక్కరతో రతులకై ఆసపడీ వీఁడు

చ. 3: చెమటలు తన మేను చెరఁగునఁ గప్పీతేను
అమర ముసుఁగు వెట్టీ నప్పటి వీఁడు
తమితో శ్రీవెంకటేశుఁ దగ నిందుకె మెచ్చితే
భ్రమసినట్లఁ బైపైఁ గూడీ వీఁడు

రేకు: 0331-3 రామక్రియ సంపుటం: 11-183

పల్లవి: సిగ్గరి పెండ్లికొడుకుఁ జేరి చూతము
వొగ్గి సదమదము లై వున్నాఁ డటా

చ. 1: వద్ది కిట్టె రమ్మనరే వచ్చీనో రాఁడో
గద్దరి తన లాగులు కందము నేఁడు
బద్దులో నిజమో కాని పచ్చివెచ్చిచేఁతల
వొద్దకతో బండుబం డై వున్నాఁ డటా

చ. 2: మాట మాట దియ్యరే మన సెట్లున్నదో
గాఁటపు తన విద్యలు కందము నేఁడు
చీటకపుచెమ టట చిట్లుగందా లట
మేటిదొరఁ బిలువరే మెరసీ నటా

చ. 3: ముసుఁగు దెరవరే మొకము చూతము నేఁడు
కసుగాటు చేఁత లెల్లఁ గందము గాని
పసతో శ్రీవెంకటపతి నన్ను నిటు గూడె
నస చేసి నాతోనె నవ్వీ నటా

రేకు: 0331-4 దేసాళం సంపుటం: 11-184

పల్లవి: పెనుఁ బండుగలు సేసి పిలిపించె నిన్నమాపె
పెనఁగీఁజిత్తపు చింత పెనులంపటముల

చ. 1: చెవులఁ బండుగ సేనె చెలి నీ సుద్దులు విని
నవకపు వేడుక నిన్నటిమాపె
తివిరి వేగుదాఁకా దీపాళిపండుగ నేసె
జవకట్టి నినుఁ బాసి జాగరాలను

చ. 2: కన్నులపండుగ సేసె కలికి మేడపై నుండి
నిన్నుఁ దప్ప కిట్టె చూచి నిన్నమాపె
వున్నతి నొక నిమిష ముగాదిపండుగ నేనె
తన్నుఁ దానె తనలోని తమకానను

చ. 3: నిచ్చపండుగలు సేసే నీతోడి మాటలనె
నెచ్చెలి యల్లంతనుండి నిన్న మాపె
పచ్చిగా లక్ష్మిదేవి పండుగలు సేసె నిదె
యిచ్చకుఁడ శ్రీవెంకటేశ నిన్నుఁ గూడెనూ

రేకు: 0331-5 నాగవరాళి సంపుటం: 11-185

పల్లవి: ఎట్టున్నదో నీ మనసు యేమి సేతురా
యెట్ట నెదుటఁ బాయ లే నేమి సేతురా

చ. 1: చూచుదాఁకా వేగిరింత సొంపుగా విభుఁడ నీతో
దాఁచి మాటాడినదాఁకఁ దమకింతును
చేచేతఁ దమకింతు చేరువదాఁకా నిట్లనె
యేచి తమకమే నిండె నేమి సేతురా

చ. 2: అట్టె నీ చెనకులకు నాసగింతుఁ దనివోక
ముట్టి యాసగింతు నీ మోవితేనెకు
గట్టిగా నంతటిమీఁద కాఁగిటికి నాసగింతు
యెట్టైనా నాసలే నిండె నేమి సేతురా

చ. 3: అదన నీ మే నంటి అట్టె పరమశ మవుదు
వదలక కూడి పరవశ మవుదును
పొదలి శ్రీవెంకటేశ పొందితిని నన్ను నిట్టె
యెదిరించెఁ బరవశా లేమి సేతురా

రేకు: 0331-6 శ్రీరాగం సంపుటం: 11-186

పల్లవి: నన్నుఁ బాసి వుండ నేల నాయాలకు రా నేల
వున్నట్లానె వుంటే వొరసేరా నిన్ను

చ. 1: కాంతలఁ దిట్టఁగ నేల కాని కాని వొట్లేల
యింతట నీ గుణము నే నెఱఁగనిదా
పంతపుసాకిరు లేల పతితారుకాణ లేల
వంతన నా వద్ద నుంటే వచ్చీనా నిందలు

చ. 2: పదరి కోపించ నేల బాసలు సేయఁగ నేల
కదిసి నీ మోహము నేఁ గన్నదె కాదా
వదరుఁబెదవు లెండ వాదు లడువఁగ నేల
అదన నావద్ద నుంటే ఆడేరా నిన్నును

చ. 3: నే నెంతైనా నమ్మ నంటా నీకె యలుక లేల
కానీ లేరా యిన్నియు నేఁ గన్నవె కావా
పూని శ్రీవెంకటేశుఁడ వొడఁబరచి కూడితి
నేను నీవూ నిట్టె వుంటే నేఁ డనేరా నిన్నునూ

రేకు: 0332-1 హిజ్జిజి సంపుటం: 11-187

పల్లవి: కాంతలాల యింతులాల కంటిరా యిది
యెంత కెంత కెత్తుకొంటి వెరఁగదా నేను

చ. 1: వొక్కమాట నిన్నంటె వూరివారిపైఁ జుట్టేవు
మిక్కిలి ముడికాఁడవు మేలురా నీవు
మక్కళించి నీ చేఁతలు మాయ వలసి యీరీతి
యెక్క డెక్కడో పెనచే దెరఁగరా నేను

చ. 2: వాదు నీతోఁ బెట్టుకొంటె వాడవారిపై బెట్టేవు
మేదకపుకొయ్య వదువు మేలురా నీవు
ఆదెస నీ నేరాలు అందులోనే పులిమేవు
యేది తుది మొద లౌటా నెరఁగరా నేను

చ. 3: పొంచి నీవె కల్ల వంటె పొరుగు కప్పగించేవు
మించెను నీ చలములే మేలురా నీవూ
యెంచి నట్టె శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
యించుకంత కపటము యెఱఁగరా నేను

రేకు: 0332-2 రామక్రియ సంపుటం: 11-188

పల్లవి: వరుస నే నెరుఁగుదు వాని గుణము
కరఁగి నా పేరు వింటే కానుక లందియ్యరే

చ. 1: తగనేఁ గోపగించిన దయ గల దాతనికి
బిగియఁడు వచ్చీఁ గాని పిల్వరే వాని
వొగి నే నంత దిట్టినా వోరువు గ ద్దాతనికి
నగుతా వచ్చీఁ గాని నా పేరు చెప్పరే

చ. 2: మోనాన నేఁ గొసరినా మోహము గ ద్దాతనికి
పేని పట్టి వచ్చీఁ గాని పిల్వరే వాని
పూని నేనెం తలిగినా బుజ్జగించ నేర్చుఁ వాడు
వానికిఁ బొడచూపరే వచ్చి నిందాఁకలను

చ. 3: ముంపు నే గరివి నైనా మొదల వినయివాఁడు
పెంపున దానె వచ్చీఁ బిల్వరే వాని
యింపుల శ్రీవెంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
పంపున నీడనె వుండీ పై పైనె మొక్కరే

రేకు: 0332-3 శంకరాభరణం సంపుటం: 11-189

పల్లవి: దొరతో సంగాతము దొరకినపాటే చాలు
వొరసి మీరఁగఁ బోతే నొక్క రీతి నుండునా

చ. 1: యేకతాన లోన నుండి యేల నన్నుఁ బిలిచేవు
వాకిటికి రావయ్య వలసితేను
చేకొని యొకతె యుంటె సిగ్గుపడి వెళ్లి వచ్చి
కూకులు వత్తులు గాను కూళదాననా

చ. 2: మరిగించి మరఁగున మాట లే లాడించేవు
తెర దియ్యవయ్య అంత తీఁట గలితె
వరుసకు వచ్చినాపె వాదు నాతోఁ బెట్టుకొంటె
విరస మై యూరకుండ వెఱ్ఱిదాననా

చ. 3: పట్టెమంచముపై నుండి పైఁ గాలు చాఁచ నేల
యిట్టె వుర మెక్కవయ్య యింత గలితె
జట్టిగా శ్రీవెంకటేశ సరి నొకతె గూచుంటె
వట్టి యితపు సేసుకో వాసి లేనిదాననా

రేకు: 0332-4 శ్రీరాగం సంపుటం: 11-190

పల్లవి: వలసితే రేపు మాపు వచ్చేవు గాని
అలమి చే యెత్తి మొక్కి అంపించుక రావె

చ. 1: యేడ లేనిమాఁటలు యెందాఁక నైనఁ బెనచి
ఆడెవు మాఁటలు నీవు అతనితోను
తోడ నంపించుక రావె తుద లేదీ యాసలకు
నీ డనపు యెం డనపు నిలుచుండే వీడను

చ. 2: కూరి మెల్లఁ బెట్టి పెట్టి కొనచూపు నాఁటఁ జూచి
ఆరగించఁ బోఁ జాల వాతనిఁ బాసి
యీ రీతి నింత గలితె యింటి కైనాఁ దోడి తేవె
తీరవు మీ ముచ్చటలు దీవెత్తుఁబొద్దాయను

చ. 3: గయ్యాళి వై నవ్వి నవ్వి కాఁగిట బింగించుకొని
యెయ్యేడఁ బోనీవు యేమే యితని
నెయ్యపు శ్రీవెంకటేశు నీవుఁ గూడితివి ఆతఁ
డియ్యడనె వుండీఁ గాని యిల్లు వెళ్ల నీకువే

రేకు: 0332-5 పాడి సంపుటం: 11-191

పల్లవి: ఏమి సేయ వచ్చుఁ గాల మెవ్వరి నెంత సేసునో
నేమాన నవ్వేటి నన్ను నివ్వేర గందించెను

చ. 1: పలుకు బంతపు నన్నుఁ బ్రాయముగ నింత సేసె
చెలుల కెల్లాఁ బ్రియము చెప్పించెను
అలరు రాజసపు న న్నాసలుగా యింత సేసె
నలి రమణునింటికి నడపించెను

చ. 2: వాసితో నుండేటి నన్ను వలపుగా యింత నేసె
వేసాల ఆతని మాటె వినిపించెను
పోసరించి వుండేనన్ను పొందుగా యింత సేసె
పాసితే విరహవేదనపాలు సేనెను

చ. 3: సిగ్గుతో నుండేనన్ను చిత్తమెకా యింత నేసె
తగ్గనితమకములఁ దగిలించెను
వెగ్గళించి యింతలో శ్రీవెంకటేశఁ డిటు గూడె
అగ్గలపు నా రతులె కా అన్ని టాను మించెను

రేకు: 0332-6 సామంతం సంపుటం: 11-192

పల్లవి: కూచుండఁ బెట్టుకొనవే కోప మేఁటికి
కాచుకున్న రమణునిఁ గరుణించ వలదా

చ. 1: నాటుకొన నిన్నుఁ జూచి నవ్వేటిపతితోడ
మాట లాడఁ గదవే మౌన మేఁటికి
ఆఁటదాని కింత యేలె అంతవాఁడు వేఁడుకోగ
కోటి నేరా లేమి గల్గాఁ గూడుకొన వలదా

చ. 2: కొంగు వట్టి నిన్నుఁ దీసి కొసరేటిపతి నిట్టే
సంగడిఁ గాఁగిలించ వేసట లేఁటికి
యింగితాన నొక్కవేళ యిద్దరిలోఁ గలఁగితే
సంగతిఁ జవి సేసుక చన వియ్య వలదా

చ. 3: యిర వై తమ్ములము నీ కింద మనీ నాతఁ డదే
సిర సెత్త గదవే సిగ్గు లేఁటికి
నిరతి శ్రీవెంకటాద్రినిలయుఁడు నిన్నుఁ గూడె
తొరలిన నీరతులఁ దోడు చూప వలదా

రేకు: 0333-1 ధన్నాశి సంపుటం: 11-193

పల్లవి: నేనైతే నేమీ నెరఁగ నీకు నీవే బెదరేవు
తానే బయటఁ బడీని తగని నీచేఁతలు

చ. 1: కొండవంటి దొర నిన్నుఁ గోరి వెంగె మాడుదునా
దుండుగము నీకు నీకే తోఁచీఁ గాకా
అండకు వచ్చి నీ గట్టు అరయఁగ వచ్చితినా
వుండుండి నీకు నీవే వులికేవు గాక

చ. 2: నడుమను నిన్నుఁ జూచి నవ్వులు నవ్వితివా
వడి నీకు నీవే తల వంచేవు గాక
వెడ నీ మేనిచేఁతలు వెదకి చూచితినా
తడవి కప్పుక నీవే దాఁచేవు గాక

చ. 3: నీవు గాఁగిలించుకోఁగా నేరము లెంచితినా
భావించ నీవే సిగ్గు వడేవు గాక
యీవేళ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోవిదుఁడ వై రతిఁ గొంకేవు గాకా

రేకు: 0333-2 బౌళిరామక్రియ సంపుటం: 11-194

పల్లవి: అద్దో మానవుగా అదే మే నీవు
గద్దించి నీవు చూచితే కాళ్లు వణఁకీనా

చ. 1: మచ్చిక నాతఁడు నేడు మా యింటికి వచ్చె నంటా
పచ్చి గొంతా వెచ్చి గొంతాఁ బలికే వేమే
బచ్చెనల నతఁడు నీ సొంగెములో వాఁడై
నెచ్చెలి నీకుఁ గొంకితే నే నీకు వెరతునా

చ. 2: చెప్పి యిందరిలో వాఁడు చేయి నాపై వేసె నంటా
అప్పటనుండి వుడికే వ దేమే నీవు
దెప్పర మాతఁడు నీచేఁ దిట్టించుకొనుఁ గాక
నిప్పువంటిదాన నేను నీచేతఁ బడేనా

చ. 3: గక్కన శ్రీవెంకటాద్రిఘనుఁడు నన్నుఁ గూడితే
పక్కన నాతనిఁ గొంగు వట్టే వేమే
చక్క నీ వండ నుంటె సాదించఁ జెల్లుఁ గాక
యిక్కడ వచ్చే మనేవే యిక నే నోరుతునా

రేకు: 0333-3 దేవగాంధారి సంపుటం: 11-195

పల్లవి: ఈతఁడె నీ కెంత తన విచ్చెనో కాక
యేతుల నీ గుణముల కిందరూను మెత్తురా

చ. 1: పదరి యాతడు నిన్నుఁ బైపైఁ బిలువఁగాను
యెదిటికి రావు లోన నేమి సేసేవే
మదిఁ గోపము గలితె మాటల నాడుదు గాక
కదిసి మోనాన నుంటే గర్వ మనరా

చ. 2: అలరి మాటాడి యాడి యాతఁడు లేప వచ్చితే
యెలమి నిద్దుర బొయ్యే విది యేఁటిదే
చలము నీకుఁ గలితే సాదించవలెఁ గాక
నిలిగి ముసుఁ గిడుటే నిష్టూరము గాదా

చ. 3: శ్రీవెంకటేశ్వరుఁడు చేరి కాఁగిలించుకోఁగా
యీవేళ సిగ్గు వడేవు యిఁకఁ దగునా
వేవేలు గలిగిన వెనకకె చెల్లుఁ గాక
భావించి కూడిన మీఁదఁ బచ్చి దొఁచదా

రేకు: 0333-4 పాడి సంపుటం: 11-196

పల్లవి: మతకాలు నేరిచినమాయదారివి
తతి నీ వడ్డము రాక తలరా వోరి

చ. 1: దవ్వుల నే రాఁగానె తగఁ బలుకరించేవు
యెవ్వతెకు నా రాక యెచ్చరించేవో
అవ్వల నప్పటనుండి అనుమాన మయ్యీ నాకు
పవ్వళించే లోను చూచేఁ బదరా వోరి

చ. 2: యింతట నేఁ జొచ్చి రాఁగా నెదురుగా వెళ్లి వచ్చే
వంత నాకె గోపగించీ నంటానో వోరి
యెంతైన నీవు నన్ను నేమరించఁ జోటు లేదు
చెంత నెవ్వతెఁ దెచ్చితి చెప్పరా వోరి

చ. 3: చేరి నే మంచ మెక్కఁగా చెలులనే పిలిచేవు
వారిలో నాపెఁ గలుపేవగలా యివి
యేరా శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తేరెఁ బను లింక తెర దియ్యరా వోరి

రేకు: 0333-5 రామక్రియ సంపుటం: 11-197

పల్లవి: అందు కేమి నీవు మాతో నన వలెనా
చందముగ నొడఁబరచఁగ నింత వలెనా

చ. 1: ఈ యడకు రా కుండితే యేడనుండైనా నీకు
చే యెత్తి మొక్కిన దొక సెలవే కాదా
పాయ మెంత వెంచినాను ప్రాణము నీ కొప్పగించి
కాయముతో బదికేది ఘనత నీదే కాదా

చ. 2: కన్నులఁ జూడ కుండినా కడ నీ వార మని
వున్నట్టే వుండుట నీకే వొప్పు గాదా
మన్ననలు దవ్వైనా మనసు నీపైఁ బెట్టి
యిన్నిటా నుండుట నీకు నిది గీర్తి గాదా

చ. 3: మునుపఁ జెప్పంపకున్నా మొక్కలాన నిట్టే వచ్చి
చనవు చేకొనుటే చాలదా మాకు
యెన లేక శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
ననిచితి నిది మీకు నయమే కాదా

రేకు: 0333-6 నాదరామక్రియ సంపుటం: 11-198

పల్లవి: కలఁడుగా యిటువంటి గడుసరి భూమిమీఁద
తెలిసితి మిన్నాళ్లకు దిష్టముగ వీనిని

చ. 1: తగని వెల్లాఁ జేసి తనమాఁటె ఘనము
జిగి నా మొగము చూచీ సిగ్గు వడఁడు
నగువారి నెరఁగఁడు నాపై నానలు వెట్టీ
యెగసక్కేఁడు వీని దెంత నేరుపే

చ. 2: తప్పుజగడాలు రేఁచీ తానె మంచివాఁడు
యిప్పుడె వావులు చెప్పీ యెవగించఁడు
ముప్పిరిఁ దల వంచిన మోవితేనె లియ్య వచ్చీ
చప్పుడు గాకుండాఁ జేరీ జాణ గదే వీఁడు

చ. 3: తమకించు నిన్నటాను తగవరిఁ దానె
అమరఁ గతలు చెప్పీ నందు కాతఁడు
తిమిరి శ్రీవెంకటాద్రి దేవుఁ డిట్టె నన్నుఁ గూడె
సమరతి నిన్నిటాను సరుసుఁడు గదవే

రేకు: 0334-1 సౌరాష్ట్రం సంపుటం: 11-199

పల్లవి: నీ విదె నే నదె నెమ్మదిఁ దానూ నదె
ఆవలి మొగము లేల అద్దరిపా టాయను

చ. 1: వచ్చినట్టిపరాకున వనిత నన్నుఁ గానక
యిచ్చ నీవద్ద గూచుండి యిటు చూచి
యెచ్చరి నీ పే రడిగీ నెరఁగనిదానె వలె
తచ్చన లిం కేల సమతారుకాణ లాయను

చ. 2: యీడ నాగురు తెరఁగ కీపె వచ్చి వోయి నీతో
యేడలేనిముచ్చ టాడె యేకతానను
తోడ నీ వెచ్చరించఁగా తొయ్యలి యామాటలె
యేడో కతలు సేసీ నిఁక నేల బొంకులు

చ. 3: పరపుపై నిద్దరము పవళించు టెరఁగక
యిరవుగఁ గాఁగిలించె నిద్దరి నీపె
గరిమ శ్రీవెంకటేశ కలసితి విట్టె మమ్ము
దరి చేరెఁ బను లెల్ల తన కేల సిగ్గులూ

రేకు: 0334-2 నాదరామక్రియ సంపుటం: 11-200

పల్లవి: నీవల్ల దోసము లేదు నేరము నావొళ్లి దింతే
చేవ దేర నిఁక నీవు సేసినంతాఁ జెల్లురా

చ. 1: కొరి నిన్నుఁ జూచి చూచి కోపగించఁ జాలఁగాని
చేర నీవు రానందుకు చిమిడీరా నా మనసు
వోరి నీవు సేసినందు కొల్లక వుండే నంటే
భారపు నాజవ్వనము పై తరవు వెట్టురా

చ. 2: దీకొని నీ పట్టుకు నేఁ దెగఁ జాలకుందుఁ గాని
కాకరి నీ నవ్వు లెల్లాఁ గాఁడిపారె నన్నునూ
వాకున వెళ్లనా డైనా వడిఁ దీర్చుకొనే నంటే
యీకడ నా మొగమాట మింత సేసె నన్నును

చ. 3: కాఁగిలించి నిన్ను నంత కస్తి నేయ నోపఁ గాని
రాగిన నా వలపులు రాసు లై వున్నవిరా
వీఁగక శ్రీవెంకటవిభుఁడ కూడితి నన్ను
మాఁగి నీ కెమ్మోవి మరిగించెఁ దీపులు

రేకు: 0334-3 కేదారగౌళ సంపుటం: 11-201

పల్లవి: ఇంకమీఁద వచ్చేపని కిప్పు డేఁటికే
మంకు దీరఁ దన్నింతలో మంచివానిఁ జేసేనా

చ. 1: కానీ లేవె తనమాట కల్లనేనా యిందరిలో
నాన నిచ్చి వెనకనె నవ్వేఁ గాక
ఆన లేల పెట్టుకొనీ నంతలోనె లే దంటా
నే నిట్టే యిందుకు తన్ను నిజమరి అనేనా

చ. 2: తడవ నేలె నేను తనగుణా లిందరిలో
వడి వెట్టి మరఁగున వంచేఁ గాని
తొడిఁబడఁ జేయ వట్టీ దోస మన్నా మానఁడు
వొడఁబడి యిందుకే నే నొక్కటి యైతినా

చ. 3: దంట నై యలుగ లేనె తనుఁ గోపించేవేళ
వొంటిఁ జిక్కించుక వేరె వొరసేఁ గాక
యింటిలోన శ్రీవెంకటేశుఁడిట్టె నన్ను గూడె
అంటి ముట్టి తొంటివెంగే లాడక మానేనా

రేకు: 0334-4 బౌళిరామక్రియ సంపుటం: 11-202

పల్లవి: పాప మంటా నోరిచితేఁ బదరీఁ దాను
కోపగించి యెవ్వతె య్యైనఁ గుమ్మీ్మ లేవే

చ. 1: వంతులకు వచ్చి వచ్చి వలపులే చల్లీని
పంతగాఁడు తన కేమి పని లేదా
యింత గలితె తన్ను యెవ్వ తైనాఁ బట్టుకొని
చెంతనె సదమదము సేసీ లేవే

చ. 2: దీమసాన రతులకు దిట్టి తిట్టి పిలిచీని
బూమిలోన వీని కేమి పొద్దు వోదా
ఆముకొని యింత లేసి ఆసలకు బెనఁగితే
గామిడి యెవ్వతె య్యైనాఁ గలిగీ లేవే

చ. 3: తొడిఁబడ నవ్వి నవ్వి దొమ్మి సేసి కాఁగిలించి
వొడి వట్టీ వీని కేమి వుండఁ బట్టదా
బడినె శ్రీవెంకటపతి నన్ను నిదె కూడె
కడ నింకా నివ్వ తైన కాచుకుండీ లేవే

రేకు: 0334-5 దేసాళం సంపుటం: 11-203

పల్లవి: కంటిమి నీ సుద్ద లెల్లఁ గానీరా వోరి మా
యింట నున్నప్పుడే నీ యిచ్చలు వోరి

చ. 1: చెక్కు లేల పులకించే జెప్పరా వోరి నాతో
నిక్కి నిక్కి నీ నిజాలె నెరపేవు
యెక్కడికిఁ బోనివాఁడ వేరా వోరి
యిక్కడనె బుసకొట్టేవు యేఁటికిరా వోరి

చ. 2: యేడది కుంకుమపూఁత యీ మేన నోరి
యేడలేనియాచారాలు యీడఁ జేతువు
ఆడి తప్పనివాఁడవు అవురా వోరి
యీడ నీ వెంట వచ్చిన దెవ్వతెరా వోరి

చ. 3: తమకించే వింతలోనె తలరా వోరి నాతో
జమళి నక్క డీ మేలు చల్లేవా వోరి
అమర శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
సముకాన నీ మాఁట సమ్మతించే నోరి

రేకు: 0334-6 హిందోళవసంతం సంపుటం: 11-204

పల్లవి: ఎరవు సేసుకొనేవు యింకా నేలా
సిరసు నీవు వంచితే చేఁత లెల్ల మానునా

చ. 1: సేసకొప్పుతోడిది చెమటముత్యాలది
సేసిన నీ పొందు మాతోఁ జెప్పుకొన్నది
పూసినజవ్వాదిపూఁత బుగులుకొనఁ బయ్యద
వేసిన వల్లెవాటుతో వేలఁ జూపీ నిన్నునూ

చ. 2: దొరతనములది యేతుల చిట్లుగందారిది
మురిపేన నీ దిక్కు మొక్క మైనది
సురతాంతమున నీ సోఁకినగురుతు లెల్ల
పరగఁ జెలుల కెల్ల బయలు సేసీని

చ. 3: కన్నుల మొక్కులది గయ్యాళి చేఁతలది
తన్నుఁ దానె నిన్నుఁ జూచి తనియనిది
యిన్నిటా శ్రీవెంకటేశ యిటు నీవు గూడఁగాను
పన్ని నీ పరవుమీఁదఁ బవళించినది

రేకు: 0335-1 దేసాక్షి సంపుటం: 11-205

పల్లవి: ఇద్దరి జాడలూఁ గంటి మిప్పుడే నేము
ముద్దులు మోవులు మీలో మోఁపి గొణఁగితిరి

చ. 1: మంతనాన నోతోడ మాటలాడేవేళ
యింతి బొమ్మముడి వెట్టె నేఁటికో కాని
చెంతల నందుకుఁ గానె చెప్పరాని తిట్టు దిట్టి
అంతలోఁ గాఁగిలించితి వౌ నయ్య్య నీవు

చ. 2: ఆరజాన నాపె నీకు ఆకు మడి చిచ్చి యిచ్చి
యీారసానఁ గోపగించె నేఁటికో కాని
చేరి నీ వందుకు గానె చేయి వట్టి తోసుకొని
కూరిమి తొడపై నిడుకొంటివయ్య్య నీవు

చ. 3: మంచముపై నుండి యాకె మలగుపై నొరగుతా
యించుకంత గోర నూఁదె నేఁటికో కాని
చంచుల శ్రీవెంకటేశ సన్నెరిఁగి కూడితివి
మించిన మీ నేరుపులు మే లయ్య్య నేఁడు

రేకు: 0335-2 ఆహిరి సంపుటం: 11-206

పల్లవి: ఒత్తి నీవు దగ్గరితే నొద్దనదు సతి నిన్ను
చిత్త మెరఁగక గుట్టు సేసీఁ గాని

చ. 1: నిలువెల్లఁ బులకలే నిన్నుఁ జూచేప్పటనుండి
కలికి పయ్యద నట్టె కప్పీఁ గాని
తలఁ పెల్లఁ దమకమే తనకు నీ విటుపై పైఁ
బిలువఁగా నూరకె బిగిసీఁ గాని

చ. 2: వెలియల్ల చింతలే మినుకలి నాటనుండి
తల వంచి నీకుఁ గొంత దాఁచీఁ గాని
పలు కెల్ల దైన్యమే పడఁతి నియ్యెడకు
చలి వేఁడి రాజసాలు జరపీఁ గాని

చ. 3: వయ సెల్ల వలపులే వనిత నిన్నటనుండి
నయము సేసుక నీతో నవ్వీఁ గాని
క్రియ యెరిఁగి కూడితి కెలన శ్రీవెంకటేశ
జయ మందెఁ జెలి నీతో సరసము గాని

రేకు: 0335-3 శంకరాభరణం సంపుటం: 11-207

పల్లవి: ఆడనె ఆకెచే వెంగె మాడించుకోవయ్యా
తోడనె నీ సుద్ది విన దోస మయ్యా

చ. 1: చిత్తము రా కొకమాట చిత్తము వ చ్చొకమాట
వొత్త నీతో నాడ నే నోప నయ్యా
హత్తిన ఆకెకు నీకే అలవాటు గాని మాకుఁ
దత్తరించి యింత నేయం దగ దయ్యా

చ. 2: కూడినప్పు డొకచూపు కూడనప్పు డొకచూపు
యీడా నాడా రెండూ నెరఁగ మయ్యా
యేడో ఆకెకు నీకు యే మన్న నమరుఁ గాని
వీడుపడ నింత నేయ వెరతు మయ్యా

చ. 3: సంతసించి వొకనవ్వు సంతంసించ కొకనవ్వు
మంతు కెక్కి తొల్లె యివి మానితి మయ్యా
చెంతలఁ గూడితి నన్ను శ్రీవెంకటేశ యాకె
పంత మాడుఁ గాని మాకుఁ బాడి గా దయ్యా

రేకు: 0335-4 హిందోళం సంపుటం: 11-208

పల్లవి: రమ్మనఁగాఁ దనతోనే రా నంటినా
చిమ్ముచు నింత ప్రియము చెప్ప నేలె నాకు

చ. 1: వెల్లవిరిఁ దనమాఁట విన నైతినా నేను
చెల్లఁబో నా కేల సేవ సేసీని తాను
యెల్లవారిఁ దా నేలీ నెవ్వరిఁ బోలుదు నేను
బల్లిదుఁడు నా కేల బాఁతి పడీఁ దానూ

చ. 2: చెప్పిన ట్టెల్లా నేను సేయకుండేదాననా
అప్పటి లేక లేఁటికి నంపీనె తాను
కప్పురపు పడిగల కాంతలు గాచుకుండఁగా
విప్పుచు నాకుఁగా నేల వేగించేనె తానూ

చ. 3: గక్కనఁ దా గూడఁగాను కాదు గూడ దంటినా
ముక్కు మోవ సాగి లెల మొక్కీనె తాను
యెక్కువ శ్రీవెంకటేశుఁ డెననెఁ దా నన్ను నిట్టె
పెక్కు సతులతోననె పెద్ద సేసీఁ దాను

రేకు: 0335-5 సౌరాష్ట్రం సంపుటం: 11-209

పల్లవి: ఇంతకంటె నాతఁడు మ రేమి సేసునే
యింతులాల రమణుని నేల దూరేరే

చ. 1: కన్నుల మెక్కనె పట్టె కాఁకఁల బెనఁగఁ బట్టె
వెన్నెలనవ్వులు నవ్వ వేళ లేదే
పన్ని నెత్త మాడఁ బట్టె పరాకు నేయనె పట్టె
యిన్నిటా జాణఁడు వాని నేల దూరేరే

చ. 2: సరస మాడఁ బట్టె సంగడిఁ గూచుండఁ బట్టె
విరులు ముడువ నైన వేళ లేదే
కురులు దువ్వనె పట్టెఁ గొలువు సేయనె పట్టె
యిర వెరుఁగు నాతఁడె యేల దూరేరే

చ. 3: చొక్కుచు నుండనె పట్టె సుద్దులు చెప్పనె పట్టె
వెక్క సపురతులకు వేళ లేదే
పక్కన శ్రీవెంకటాద్రిపతి నన్ను నిటు గూడె
నిక్కడ నే విన నోప నేల దూరేరే

రేకు: 0335-6 సామంతం సంపుటం: 11-210

పల్లవి: వినవే యీ మాఁట వెలది నీకు నీవె
అనవే నీ నోటనే అందుకు నుత్తరము

చ. 1: పిలిచీఁ గదవె తాను బెట్టుగ సిగ్గు వడఁడు
పిలిచెటిపెద వెందో పిప్పి గట్టెను
కలయు మనీనె కమ్మటిని నన్నును
కలనే తన పురము కాయ గాచె నదివో

చ. 2: నవ్వీఁ గదవె తాను నాతోనుఁ గమ్మటిని
నవ్వెటి తన చెక్కులు నంజు లాయను
పవ్వళించీఁ గదె నా పక్కనె తా నప్పటిని
పవ్వళించే యందె తన పను లెల్లఁ దెలిసే

చ. 3: చేతుల చాచీఁ గదె చేరి నా కాఁగిటికి నా
చేతికి లోనైనవారు చెలులెల్లాను
యీతల శ్రీవెంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
యీతలాతలిపనులు యెన్ని కాయఁ గదవే

రేకు: 0336-1 సాళంగం సంపుటం: 11-211

పల్లవి: ఇంచుకంతా నెరఁగరు యేఁటిదే మీరు
మంచివారు గలితిరి మానరుగా చెలులు

చ. 1: మంకుల వొట్టు వెట్టుక మాటలాడ మన్నమీఁద
యింకా నామాటలా యెరఁగరటే
అంకెల నన్నుఁ గలయు మనేరు దోసాలకుఁ
గొంకరు అప్పటి మీరు కూళలటే చెలులు

చ. 2: తోడనె వాదు వెట్టుక తొలఁగి వచ్చినమీఁద
యీడా నాడాఁ దగవులా యిదిఁ గొంతా
వీడనీ కాతని నీ వెంటఁ దోడి తెచ్చితిరి
ఆడికెకు వెరవరు హంత లటే చెలులు

చ. 3: యెదురెదురుకట్ల నింతకు వచ్చినమీఁద
అదిమి కాఁగిలింపించే రౌనే మీరు
అదన శ్రీవెంకటేశుఁ డంతలోనే నన్ను గూడె
సదరాన నవ్వేరు జాణలుగా చెలులు

రేకు: 0336-2 సామంతం సంపుటం: 11-212

పల్లవి: చెల్ల బో యిందుకు నేల చిన్నఁ బోయ్యేవు
అల్లాడ నీ కేమైన నది నే నచ్చేరా

చ. 1: సరి నెందు వొయ్యే వంటే సకినాలు వాటించి
తిరిగి తిరిగి వచ్చి తిట్టే వేరా
అరుదు నీ కింతైతే నందు వోయ్యేపనులకు
వెరవుతోడఁ జేటవేలుపులఁ జూడరా

చ. 2: ఆరగించి పొమ్మంటే నదియునుఁ గాని దంటా
గోర సేసి ఆనవెట్టి కోపగించేవు
ఆరయ నీ మనసుకు ననుమాన మైతేను
పోరచి నీ పొరుగునఁ బోచిళ్ళు చల్లరా

చ. 3: వొగి నీకు మొక్కినాను వొకచోటి కేఁగేవేళ
తగ దంటా నీకు నీవే తప్ప నాడేవు
జిగి నన్నుఁ గూడితివి శ్రీవెంకటేశ యిట్టె
పొగరుల నీకఁ బోయి పులుగు నర్చించరా

రేకు: 0336-3 బౌళి సంపుటం: 11-213

పల్లవి: నే నెంత చిన్న నైనా నీకే సులభము గాని
పూని నా సరివారికిఁ బొడవే సుమ్మీ

చ. 1: యిచ్చకపుపతివి నీ వే మన్నా నితవే నాకు
కొచ్చి కొచ్చి తిట్టినాను కోప మున్నదా
తెచ్చుకొన్న నీసతులు తేనెల మాఁటాడినాను
మచ్చరములై పెరిగి మర్మములు నాఁటురా

చ. 2: నీఁటున బ్రాణవిభుఁడ నీవేమి సేసినా
వాఁటమై మొక్కుదుఁ గాక వాసి వట్టెనా
నాఁటకపు సవతులు నయగారాలు సేసినా
యీఁటెల పోట్లే కాక యింత కోపేనా

చ. 3: చేరి నన్ను నేలినట్టి శ్రీవెంకటేశ నీవు
యేరీతి నుండినాను యెర వున్నదా
సారెకు నీవు ముట్టినసవతులు వద్ద నున్నా
నీరసమె రేఁగుఁగాని యీయకోలు గాదురా

రేకు: 0336-4 గుండక్రియ సంపుటం: 11-214

పల్లవి: ఛీ ఛీ యిందుకే పో సిగ్గయ్యీ నాకు
యేచి యంతరు మాలిన యీడు జోడు లేలరా

చ. 1: చెప్పిన ట్టెల్లా నేను సేసేఁ గాని యిందరితో
వొప్పగు వరుసవంతు లొల్లరా యింక
యెప్పుడు నీ దీవెనె యిదె నన్ను మన్నించుట
కప్పి వల పెల్ల నొక్కగాడిఁ గట్ట వద్దురా

చ. 2: అంది నీ యా నాజ్ఞలోన నణఁగి వుండేఁ గాని
సందడిలో కొలువులు చాలురా నాకు
ముందు నీవు నావాఁడవె మొక్కేఁ గాని గాజు దెచ్చి
చందపుమాణికముతో సరి సేయ రాకురా

చ. 3: సరుస గూచుండేఁ గాని జంగిలి విడేలలోన
వొరిమెకుఁ జేయి చాఁచ నోపరా నేను
గరిమె శ్రీవెంకటేశ కాఁగిఁట గూడితి విట్టె
పరగఁ దెల్లని వెల్లాఁ బా లంటా నుండకురా

రేకు: 0336-5 శంకరాభరణం సంపుటం: 11-215

పల్లవి: చేరి నీకుఁ దగ బుద్ది చెప్పుఁ గాక
వేరొకతె నీచేత వేఁగఁ బోయీనా

చ. 1: అచ్చట నీ వెవ్వతెనో అంటుకొన్నది చాలక
యిచ్చగించి నాతోఁ జెప్ప విది యొకటె
నిచ్చ నేఁ గాఁగానె కాక నీచేత మరొకతె
వచ్చి వెచ్చి రోఁతలఁ బడఁ బోయీనా

చ. 2: కానకుండ వింతసతి గైకొన్నదిఁ గాక నన్ను
దానిపేర బిలిచేవు తగురా నీవు
కానీరా నాకంటె వేరె గయ్యాళి దొక త్తైతె
పూనిక నీ సుద్దులకు వోరుచు కుండీనా

చ. 3: వీదిఁ బోయేదానితోడ వెస నవ్వుతాఁ గాక
యీదెసకుఁ బిలిచేవు యింత వలెనా
వేద దీర నిను శ్రీవెంకటేశ కూడితిని
ఆదరించి వింతది నీ వాడిన ట్లాడీనా

రేకు: 0336-6 ఆహిరి సంపుటం: 11-216

పల్లవి: ఎంత చెప్పినా మాన దిందాఁక నే మెల్ల
పంతపు దమ కోపాలు పచరించఁ బట్టెను

చ. 1: ఆలవట్టము గాలికి అంగన పయ్యాద జారి
పాలిండ్లు గాన రాఁగాఁ బతిఁ గాఁగిలించెను
మేలు మేలు దీని నేఁడు మెచ్చవలె నిందుకే
వోలి నూరకున్నవారి నొక్కటిగాఁ జేసెఁగా

చ. 2: కప్పురము నోటి కీఁగా కాంత చలిగొని పతి
కప్పినపచ్చడమే కప్పుకొనెను
కుప్పలుగా దీనినె కొనియాడవలె నేఁడు
తప్పక చూడనివారిఁ దగులుగాఁ జేసెను

చ. 3: పన్నీరు చల్లఁగాను పడఁతిమ్మె పులకించి
తన్నుఁ దానె సిగ్గుపడి తల వంచి నవ్వెను
అన్నిటా మొక్కఁగ వలె నందుకే నేఁడు దీనికి
యెన్నఁగ శ్రీవెంకటేశు నింతినిఁ గూడించెను

రేకు: 0337-1 శంకరాభరణం సంపుటం: 11-217

పల్లవి: అప్పట నుంటిఁ గోప మాఁప లేను
వొప్పుగ నీవే నాకు వొడఁబడఁ జెప్పరా

చ. 1: మేఁటి వై నీవొక్కఁడవే మేడమీఁద నుండితిని
ఆఁటది మాఁటలాడిని ట్టాయ నందు
యేఁటికి బొంకేవు నాతో యెవ్వతెఁ దెచ్చితి వోరి
నాఁటకుఁడ నా మనసు నమ్మించరా

చ. 2: నిద్దిరించి పానుపుపై నీవే యంటా నుంటి
యిద్దరుఁ బవళించినయిర వున్నది
వద్దురా మరఁగు నాతో వనిత నెందు దాఁచితి
గద్దరీఁడ నాలోని కలఁ కెల్లఁ బాపరా

చ. 3: కాఁగిటిలో నీవు నేనుఁ గలసితి మిద్దరము
రేఁగి నీ మేనిపై వింతరేక లున్నవి
దాఁగ నీ పనులు నేఁడు దక్కితి శ్రీవెంకటేశ
పొఁగినజాణఁడ నాతోఁ బలికి మెప్పించరా

రేకు: 0337-2 సామంతం సంపుటం: 11-218

పల్లవి: ఎప్పటి కెప్పటి వాదు లిఁక నేఁటికి
కుప్పలుగాఁ బంత మిచ్చేఁ గూచుండఁ గదరా

చ. 1: ఊరకున్నవారి మమ్ము నుడికించి నవ్వ నేల
ఆరయ నా మాఁటఁ బడి యలుగ నేల
కూరిమి గలుగువారు కొసరితే నే మాయ
మేరతోనె వేఁడుకొంటి మెచ్చి నన్నుఁ జూడరా

చ. 2: చింతతో నుండిన నాపైఁ జేయి చాఁచ రా నేల
యింతలో విదిలించి వేయించుకో నేల
యింతు లైనవా రేమన్నా నే మాయఁ బురుషులకు
రంతు లేల నీకు మెక్కే రారా మా యింటికి

చ. 3: పాయపువారిఁ గూడి పాసి కొంత వేఁచ నేల
సేయరానిచేఁతఁ బడి సిగ్గు లిం తేల
యీయెడ శ్రీవెంకటేశ యిట్టె నే నిన్నుఁ గూడితి
కాయము గాయముఁ గూడె కడమ మా టాడరా

రేకు: 0337-3 గౌళ సంపుటం: 11-219

పల్లవి: తా నెంత నే నెంత తగునా తాను
తేనె పూసి మాటలను తేలించీఁ దానూ

చ. 1: రమ్మనఁగా తనతో నే రా నంటినా నాకు
అమ్మరో ప్రియము చెప్పీ న దేమె తాను
కమ్మి సారెకు నలుగఁ గడదాననా
చిమ్ముచు నా కిచ్చకాలు సేయ నేలే తానూ

చ. 2: చలమునఁ దన మాఁట జవదాఁటేనా
చెలులచేఁ జెప్పించీ చెల్లఁబో వీఁడు
చలిమి బలిమి నాతో సారెఁ జెల్లదా
వెలి న న్నొడఁబరచీ వెర పేలే తానూ

చ. 3: యితరులవలెఁ దన్ను నెగ్గు లెంచేనా
అతివినయాలు చేసీ నౌనే తాను
యిత వై శ్రీవెంటేశుడిట్టె కూడెను
మతిలోని వెలుతులు మరి యాలే తానూ

రేకు: 0337-4 సామంతం సంపుటం: 11-220

పల్లవి: ఇంత నేరకున్నవాఁడె యిన్నిటాఁ గూళ
వంతు వా లెంచకుండేవాఁడె జాణ

చ. 1: కూరిమితో నాఁడువారు కోపగించినట్టివేళ
వైరము లేక నవ్వేటివాఁడు వో జాణ
ఆరయ నలుకతోడ నట్టె యంత దిట్టినాను
గారవించి వేడుకొన్నఘనుఁడు వో జాణ

చ. 2: అలిగి ప్రాణేశ్వరి అవ్వలిమో మైనవేళ
వలపుతో బుజ్జగించేవాఁడు వో జాణ
చలి వేఁడి సిగ్గుతోడ సటలకు బిగియఁగా
బలిమి సేసి పైకొన్న పతియ పో జాణ

చ. 3: అల్లప్పుడే రావైతి మని సాదించేవేళ
వల్లె వేసి చెక్కు నొక్కేవాఁడె జాణ
వెల్లవిరి గాఁగ శ్రీవెంకటేశ కూడితివి
చల్లని నీవంటి మంచి సరసుఁడే జాణ

రేకు: 0337-5 ముఖారి సంపుటం: 11-221

పల్లవి: తతి గాని తతి నేల తమకించేరే
మతిలోని నొప్పి గొంత మాన నియ్యరే

చ. 1: పతిఁ బాసి వున్న దాన బలు విరహపువేళ
యిత వంటా విరులు నా కేల యిచ్చేరే
రతిరాజనమ్ము లివి రంట దెప్పరపువేళ
కతుకున నాటుఁ జేసు గవిశన నిడరే

చ. 2: కందువ జవ్వనమునఁ గావరించి వున్నవేళ
యింద మంటా గందము నా కేల పూసేరే
మందమారుతాన కవి మచ్చు చల్లే చొక్కుమందు
యిందు కేల పెట్టెఁ గట్టి యింటిలోన నిడరే

చ. 3: శ్రీవెంకటేశువొద్ద సిగ్గువడి వున్న దాన
చేవ దేర నిప్పు డేమి సింగారించేరే
యీవల నాతఁడు గూడె యీ సొమ్ము లిన్నియును
వేవే లాతఁ డిచ్చినవె వేగిర పడకురే

రేకు: 0337-6 నాదరామక్రియ సంపుటం: 11-222

పల్లవి: నీవే నాపై బత్తి యైతే నేఁడి ట్లేంటి కయ్యీ
కావరపు నీ బత్తి కల్ల యేమో కాక

చ. 1: కొప్పు వీడెఁ గదరా కోరి నీవు మొక్కఁగాను
వొప్పుగా నే నీకు మొక్కే దొమ్మదో కాక
దప్పి గొంటిఁ గదరా తగ నీతో నవ్వఁగాను
అప్పటి నీతో నవ్వు లయి రావో కాక

చ. 2: కాలు జారెఁ గదరా కమ్మి నీ కెదురు రాఁగ
తూలుచు నీ తెరువు రా దోసమో కాక
వోలిఁ జెమరించెరా వొగి నిన్నుఁ జూడగాను
తాలిమి నిన్నుఁ జూచేది తగనిదో కాక

చ. 3: కాఁక రేఁగెఁ గదరా కాఁగిట నిన్నుఁ బట్టఁగ
వేఁకపు నీతో రతి వెంగెమో కాక
యేఁకట శ్రీ వెంకటేశ యిత వాయఁ గదరా
మాఁకు పడ మరుఁ డింత మరిపెనో కాక

రేకు: 0338-1 మాళవిశ్రీ సంపుటం: 11-223

పల్లవి: ఎంత కెంత సేసేవు యేరా నీవు
పంతగాఁడ మేలు మేలు పైకొని వచ్చేవు

చ. 1: వొడివట్టి తీసేవు వోప నంటేఁ దిట్టేవు
పడఁతులతో నేర బలువా నీకు
అడరి నా వెంట వచ్చే వప్పులవానివలె
విడువ వింత పనికి వెరతురా నీకు

చ. 2: ఆదిగొని పై నొరగేవు అట్టట్టే పోతేఁ బట్టేవు
సాదులతోనె యింత చలమా నీకు
గోదిలి సాదించేవు గొనుకొన్నవానివలె
యీ దెస నీ గాతికిన యింత కోపఁ గలవా

చ. 3: కామించి నగ వచ్చేవు కాఁగిట బిగించేవు
యేమి నననివారితో యేతులా నీకు
దోమటి దొడికితిని దొడ్డచుట్టమువలెనె
నేమపు శ్రీవెంకటేశ నీవె నీ నయితిరా

రేకు: 0338-2 కాంబోది సంపుటం: 11-224

పల్లవి: ఏమి సేయు మన్నఁ జేసీ యెరపరికము లేల
చే మంచితి నా యడకు శిబ్బితి పడకురా

చ. 1: చేరి నాతో నేమో మాట చెప్ప వచ్చినవాఁడవు
కోరి యంతలోనే గుక్కుకొందురా నీవు
వూరకే మా యింటిదాఁక నొంటి వచ్చినవాఁడవు
పోరచి వై యట్టె మళ్లి పోదురా నీవు

చ. 2: మొదల నాతో నవ్వ మొగ మెత్తినవాఁడవు
వదలి యంతలోఁ దల వంతురా నీవు
పదిమారులు నన్నుఁ దప్పక చూచినవాఁడవు
చెదరి యట్టె పరాకు సేతురా నీవు

చ. 3: యిట్టె నన్నుఁ గాఁగిటిలో యెచ్చరించినవాఁడవు
అట్టు కెక్క నీ మేను మఱతురా నీవు
గుట్టున శ్రీవెంకటేశ కూడినట్టివాఁడవు
యిట్టినై వెనక ముందు లెంతురా నీవు

రేకు: 0338-3 కేదారగౌళ సంపుటం: 11-225

పల్లవి: నీకు బాఁతి గాక ఆకె నేరువులు మాకు బాఁతె
దాకొని యాసుద్ది నీతోఁ దడవ వచ్చితమా

చ. 1: అంత బత్తిగలవాఁడ వాకె నింటికిఁ గొంపోయి
చెంత నెత్తిఁ బెట్టుక పూజించ రాదా
యెంత లే దాపె మాఁటలే యీడఁ జెల్ల బెట్ట వచ్చే
వంతలో సాకిరి నిన్ను నడుగ వచ్చితిమా

చ. 2: మించి నీ వాపెకుఁ గడు మేలువాఁడ వైతేను
యెంచి నీ మేనిలో సగ మియ్య రాదా
మంచి దంటా నాపె నీడ మంతనానఁ బొగడేవు
యించుక కైనాఁ దేగ మియ్యఁగ వచ్చితిమా

చ. 3: తిరముగ నాపెఁ గొని తెచ్చుకొన్నవాఁడ వైతే
యిర వై నీ గద్దెమీఁద నెక్కించ రాదా
వొరిమి శ్రీవెంకటేశ వురముపై నే నుందాన
సిరసు వంచేవు నీకు సిగ్గులు రేఁచితమా

రేకు: 0338-4 సామంతం సంపుటం: 11-226

పల్లవి: నెఱజాణ విన్నిటాను నీ వెఱఁగవా
యెఱిఁగియును పతి నింత యెలయింతురా

చ. 1: చలము సాదించఁ బోతే సతులు లోఁబడుదురా
వలపించి పైకొనవలెఁ గాక
బలిమిఁ బిసుకఁ బోతే పసురు వేసు విరులు
యెలజవ్వనివి నేఁడు యింత నేతురా

చ. 2: రాజసానఁ దిట్టితేను రామలు మరుగుదురా
తేజమున దగ్గరి బోధింతురు గాక
సాజము దప్పఁగ బోతే సరసమే విరస మౌ
వోజతోడి యీపె నింత వుడికింతురా

చ. 3: పంతాలు నెరపఁ బోతే పడఁతులు లోఁగేరా
చెంత రతులఁ గూడి మెచ్చింతురు గాక
యింతలో శ్రీవెంకటేశ యిద్దరు నేక మయితిరి
అంత కంత కొక రొక రలయింతురా

రేకు: 0338-5 వసంతం సంపుటం: 11-227

పల్లవి: గుమితాన రేపు మాపుఁ గొసి రాపించఁగ నేల
సముకాన దాని నన్ను జగడించ విడరా

చ. 1: దుండగాన నాపెచేతఁ దుటారము లాడించేవు
అండకు రావ ద్దంటే నే నట్టే మానవా
చండి పెట్టి యాఁటదాని జవ్వనము గాకు సేసి
కండ గట్టుకొంటేఁ జాలు కా దనేనా నేను

చ. 2: చన విచ్చి యాపె నాతో సరి వొరించఁగ నేల
తనువు నీ కిమ్మన్న దక్క నియ్యనా
మనసు రానివాఁడవు మాతోడి గొడవేల
కొన మాటాడితేఁ జాలు కొసరేనా నేను

చ. 3: యిద్దరిఁ గాఁగిలింపించి యేకము సేయఁగ నేల
అద్దో నీ చెప్పినట్టు సేయక మానేనా
గద్దరి శ్రీవెంకటేశ కమ్మటిఁ గూడితి నన్ను
వొద్ద నీ విట్టే వుంటే వొరసేనా నేను

రేకు: 0338-6 శుద్ధవసంతం సంపుటం: 11-228

పల్లవి: ఎట్టు నమ్మ వచ్చురా యిటువంటి నిన్నును
వట్టి మాయలఁ బెట్టేవు వద్దు వద్దు తలరా

చ. 1: మంచివానివలెనె నా మాటలు వెలచుకొని
యెంచి చూచి నీలోనె యేల నవ్వేవు
చుంచుల నా చుట్టమవో సూడుబంటవో నీవు
అంచల నన్నియు నాయ నప్పటి నంటకురా

చ. 2: వలచినవానివలె వద్దికి రప్పించుకొని
తలఁపు చేకొని జాణతనా లాడేవు
యిల నీ గుణ మిదెయోయింతయు నా భాగ్యమో
కలపుకో లీఁక నేల కంటి నూరకుండరా

చ. 3: బత్తి గలవానివలె పట్టి యాకు మడి వచ్చి
యిత్తల మదన మెత్తించి యెమ్మె చూపేవు
హత్తిన శ్రీవెంకటేశ అట్టె ఫలమో చలమో
చిత్తగించి కూడితివి సిగ్గు లీఁక నేలరా

రేకు: 0339-1 ముఖారి సంపుటం: 11-229

పల్లవి: ఊఁరకున్నవారితోడ వూ రోప దన్నమాఁట
నేరుచుకొంటి నేను నీ వేమి సేసేవే

చ. 1: చుట్టము లయినవారు సొలసి సొలసి యంత
తిట్టినా యెగ్గు లౌనా తేజమే కాక
వొట్టి నీవు కోపగించి వూరకే యే మనినాను
నట్టనడుమను నాకు నవ్వు వచ్చీనే

చ. 2: చేతికి లో నైనవారు చెనకి యంత మీరినా
ఘాలతలను హీన మౌనా ఘనతే కాక
పోతరించి నీవు నన్ను పూఁచి యేమి సేసినాను
జాతి నా మన సన్నిటా సమ్మతించీనే

చ. 3: కాఁగిఁట గూడినవారు కడుఁ దమకించినాను
మూఁగి వేసట పుట్టునా ముదేమే కాక
యేఁగి వచ్చి శ్రీవెంకటేశుఁడ కూడితి నన్ను
వీఁగని నీ రతు లెల్ల విందు లయ్యీనే

రేకు: 0339-2 శంకరాభరణం సంపుటం: 11-230

పల్లవి: ఏఁటి జన్న మెత్తితి నే నిదె నీకు వెగ టైతి
గాఁటపు నీకు గుంటెనకత్తె నైన మేలూ

చ. 1: చూచిన నీ చూపు లివి చుఱుకున నాఁటీ నన్ను
చేచేత నీ కేమి పగ చేసితి నేను
యీ చాయ నాకే వెఱచే వెవ్వతె నాతో నవ్వినా
కాచి గండెదిగు లైతిఁగా నీకు నేను

చ. 2: ఆడిన నీ మాఁట లెల్ల అట్ట లదరించీ నన్ను
కోడెకాఁడ నీకు నెంత కొల యైతినో
వోడక యిందరిచేతా నొడఁబఱపించేవు
యీడ నీకు మోచి దింపై యింతేసి ఱ ట్టైతిఁ గా

చ. 3: నడుమ నీ వలపులు నాకుఁ గాళ్లఁ బెనఁగెని
కడు నీకు నెన్నాళ్ల సంగర మైతినో
యెడయక శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
బడి బడిఁ గాచుకుండఁ బా లైతిఁగా

రేకు: 0339-3 సామంతం సంపుటం: 11-231

పల్లవి: వేవేలు దండాలు నీకు విడరా నన్ను
యీవల నింత లేకున్న యెట్లు దరించేవురా

చ. 1: వాడుఁగన్నుల చూపుల వడి నాపై నొరగేవు
యేడ నేరుచుకొంటివి యేరా నీవు
ఆడికెకు నామీఁద నంత బత్తి గలయట్టె
వీడె మియ్య వచ్చేవు వెరతురా నీకు

చ. 2: నవ్వుల జాణతనాలు నయగారి వినయాలు
యెవ్వతె నేరిపెరా యేరా నీకు
పవ్వళించి యింతలోనె పైఁ గాలు చాఁచేవు
జవ్వని నింత యాఁప దోసమురా నీకు

చ. 3: కామించి కలయు మని కాఁగిటిలో దైన్యములు
యేమి అభ్యసించితవి యేరా నీవు
చే ముంచి శ్రీవెంకటేశ చెలఁగి కూడితి నన్ను
వాముల ని దెల్లా మరవకురా నీవూ

రేకు: 0339-4 బౌళిరామక్రియ సంపుటం: 11-232

పల్లవి: అన్నిటా ఘనుఁడు దాను అందు కేఁటిదే
వున్నట్టే చెప్పఁ గదరే వూరకుండ నేలా

చ. 1: చెలులఁ దా నంపివాఁడు చెంతనే రాకుండ గాను
అలిగి వుందానఁ దొల్లె అందు కేఁటిదే
కలఁగి ముంగోపమున కానివొట్టు వెట్టుకొంటి
పిలిపించ రాదు నాకు పిన్నదాన నేను

చ. 2: ముంచి లేక లంపినాఁడు మొక్కితి నే నన్నాఁడు
యెంచితే నెంతయినఁ గద్దు యే మందునే
పంచుక యిందరిలోనఁ బంత మెల్ల నాడుకొంటి
అంచల నాకు రారాదు ఆఁటదాన నేను

చ. 3: సంగడిఁ గూచున్నాఁడు చన వెల్ల నిచ్చినాఁడు
యెంగిలిమో వడిగీని యే మందునే
సంగతై శ్రీవెంకటేశ్వరుఁ డిట్టె నన్నుఁ గూడె
చెంగట మెచ్చఁగ రాదు సిగ్గుతోడి నేను

రేకు: 0339-5 పాడి సంపుటం: 11-233

పల్లవి: చిత్తమునఁ గలయట్టు నేతువు గాని
హత్తి మాకుఁ బని గద్దు అంపవయ్య మమ్మును

చ. 1: విన్నపాలు సేయఁ బట్టె వెంటఁ దిరిగాడఁ బట్టె
నిన్నుఁ బొదుగుచు మాకు నేఁ డెల్లాను
కన్నెవద్ది కేఁగ లేదు కలసుద్ది చెప్ప లేదు
అన్న పనులును నాయ నంపవయ్య మమ్మును

చ. 2: యిచ్చకాలె ఆడఁ బట్టె యియ్యకోలె సేయఁ బట్టె
నెచ్చెలుల మిదె నీతో నేఁ డెల్లాను
వచ్చేది నెరఁగము వడి రాని దెరఁగము
అచ్చుపడెఁ జేఁత లెల్ల నంపవయ్య మమ్మును

చ. 3: తోవ నడవనె పట్టె తోడుక రానె పట్టె
నీవు నేముఁ జేరితిమి నేఁ డెల్లాను
శ్రీవెంకటేశ్వరుఁడ చెలితోడఁ గూడితివి
ఆవల వాకిట నుండే నంపవయ్య మమ్మును

రేకు: 0339-6 సామంతం సంపుటం: 11-234

పల్లవి: చేరి మెల్లనె పొందులు సేయ వచ్చేవు
నేరుపుల మాటాడేవు నే మరచితినా

చ. 1: అలిగి యప్పుడు నీతో నాడుకొన్నమాఁట లెల్ల
పలుకుఁబంతాలె కాక బతిమాలేనా
చెలిమి నీతో నింకాఁ జేయ వచ్చితేఁ గనక
పలుమారు నీ వప్పుడు పంగించ రాదా

చ. 2: చేయి ముట్టి ని న్నప్పుడు సేసినట్టిచేఁత లెల్ల
యీయెడ దక్కించుకోక యిఁక మానేనా
వోయి నేఁ బ్రియాలు చెప్ప నొగి వచ్చితేఁ గనక
నాయెడ చూచి నీవు నవ్వ రాదా

చ. 3: కొసరి యప్పుడు నిన్నుఁ గోపించినది యల్లా
పసు రెక్కుఁ గాక యిఁకఁ బంత మిచ్చేనా
యెసగి శ్రీవెంకటేశ యింతలో నన్నుఁ గూడితి
అసము దిగితేఁ గన కప్పుడన రాదా

రేకు: 0340-1 భైరవి సంపుటం: 11-235

పల్లవి: నవ్వుతా నేఁ దిట్టితేను నయ మిచ్చీనా
జవ్వనపు చల్లజంపు చలమరివాఁడు

చ. 1: మింగినచదువు వోతే మిట్టి మీ నై పడ్డవాఁడు
కుంగినకొండకుఁ దల గుట్టుకొన్నాఁడు
ముంగిట నొకసతిని మోరతోపు సేసినవాఁడు
సంగతిగ నీ పడుచుజగడాలవాఁడు

చ. 2: అడిగేఁడు నేలకుఁ గా నాకస మంటినవాఁడు
గొడవకె తిరిగెటి కోపకాఁడు
అడరి పుత్తమురాలి నగ్గిబాస గొన్నవాఁడు
సడి బెట్టి మేనమామఁ జంపినవాఁడు

చ. 3: చిల్లో యంటే పాల్లో యని సిగ్గు విడిచినవాఁడు
పెల్లు రేఁగి పరువులు పెట్టెడివాఁడు
యిల్లిదె శ్రీవెంకటాద్రి యెక్కి నన్నుఁ గూడె నేఁడు
బల్లిదుఁడై దేవతల పట్ట మేలేవాఁడు

రేకు:	0340-2 ముఖారి సంపుటం:	11-236

పల్లవి:	జౌనే నీ సుద్దులకు అడ్డము చెప్పఁగ రాదు
కాననియెడల కైనఁ గలహాలు వుట్టవా

చ. 1:	యింటికి వచ్చెఁ జాలదా యేతువ లెత్తఁగ నేల
కంటు లేని దొడ్డవానిఁ గల్ల నేతురా
అంటి ముట్టి యిందు కెల్ల నాతఁడు గాఁగానె కాక
గొంటరి చెలుల కైనఁ గోపములు రేఁగవా

చ. 2:	పంత మిచ్చెఁ జాలదా పై పై బిగియ నేల
చెంత నీప్రాణవిభునిఁ జిన్నఁ బుత్తురా
అంతే పో నినుబోఁటి కాతఁడే తగుఁ గాక
యంతయు మాకుఁ జూచితే యేవ పుట్టదా

చ. 3:	చెక్కు నొక్కెఁ జాలదా చేతఁ దీసి వేయ నేల
దక్కె శ్రీవెంకటేశుఁ దప్పు లెంతురా
నిక్కము నాతఁడు నీవు నేరుచుకొంటిరి గాక
తక్కిన మావంటివారు తగ వందురా

రేకు: 0340-3 పాడి సంపుటం: 11-237

పల్లవి: ని న్ననఁగ దోసమురా నీకు సాజ మీ గుణము
యిన్నిటా నా మొగమోటే యింత దెచ్చె నాకు

చ. 1: కక్కసించి పెనఁగేవు కటారికాఁ డవా వోరి
వొక్కమాఁటె యింతయితే నోపరా నేను
యెక్కు వైన సటకాఁడ వెవ్వ రిచ్చి రీ బిగువు
మొక్కలపువలపులు మొన లాయ నాకు

చ. 2: అడ్డగించు కొంటివి నా కప్పులవాఁడవా వోరి
గొడ్డేరు నీ కొద్ది కాదు కోపము నాకు
యెడ్డతనాలనె తొల్లి యెందరి భ్రమయించితి
వడ్డితో నా నవ్వులె పై వచ్చెరా నాకు

చ. 3: కూరిమిఁ గాలు చాఁచేవు కొనుకొంటివా వోరి
వూరకె పతికిఁ బతి వోపనా నేను
వేరు లేక నన్నును శ్రీవెంకటేశ కూడితివి
మేరతో నింత నోమితి మేలురా నాకు

రేకు: 0340-4 రామక్రియ సంపుటం: 11-238

పల్లవి: నేరుపరి వవుదువు నీ కే మమ్మ ఆతఁ
డీరానిచనవు లిచ్చె నిఁక నీ కే మమ్మ

చ. 1: మావంటివారికె మన సియ్యఁడు గాక
నీవె ఆతఁడు గావా నీ కే మమ్మ
తోవల నీవును మాతో డట్టె సొలసే వాతఁ
డీవల నీయింట నున్నాఁ డిఁక నీ కే మమ్మా

చ. 2: మే మేమి చెప్పినాను మేరలు మీరుఁ గాక
నీ మాఁట దోయఁడు నీ కే మమ్మ
మోము చూచి మాకు మాకె మొగ మోడితిమి గాక
యేమర వాతని నీవు యిఁక నీ కే మమ్మా

చ. 3: వట్టి సట మా కైతె వరుస వం తిచ్చెఁ గాక
నెట్టుకొనె నిన్నతఁడు నీ కే మమ్మ
జట్టిగొని మమ్ముఁ గూడి సారె శ్రీవెంకటపతి
నిట్టె నీవుఁ గూడితిని యిఁక నీ కే మమ్మా

రేకు: 0340-5 కాంబోధి సంపుటం: 11-239

పల్లవి: తెలిపించుకొ మ్మననే దేశము వారిచేతనే
కులికి సారెకు నా కొంగేల పట్టీనె

చ. 1: వాడలలో తననింద వడిఁ దేర్చుకొనుఁ గాక
యీడ నన్ను నొట్టు వెట్ట నెంతవాఁడే
ఆడితిఁ బో వెరపా అందరు నాడెటిమాఁట
చూడవె తనకు నింత సులభమా నేను

చ. 2: సారెకు దేవుళ్ల వొద్ద సత్యము నెరపుఁ గాక
వూర కైనా నన్ను ముట్టీ నుండఁ బట్టదా
తారుకాణించెఁ బోవె తగిలితే నిందరిని
వోరుచుకుండితే నూరకుండఁడు గా తాను

చ. 3: తనయింటిలోనఁ దానె తగవులు వెట్టుఁ గాక
విను నా తోవ వచ్చితే వెట్టీవాఁడే
అనఁగానె శ్రీవెంకటాధిపుఁడు ననుఁ గూడె
మన సొక్క టాయ నేఁడు మరఁ గేలె యికను

రేకు: 0340-6 రామక్రియ సంపుటం: 11-240

పల్లవి: ఏ మని యెంతునె వల పేరు లై పారఁగఁ జొచ్చె
కామించి కామించి లో లో కాయము మరచెనే

చ. 1: పానుపుమీఁదనే వుండి పని గద్దంటాఁ బిలిచి
మానిని విభునిఁ జూచి మనసు దనియదే
పూని పట్టి నవ్వుతాను బుజముపైఁ జేయి వేసి
నానీఁ జెమటనీట నామాఁట వినదే

చ. 2: ఆరగించి కూరలు చ వాయ నంటాఁ గళ్లు నేసి
చేరి పతి కం దిచ్చి సిగ్గు గొంతాఁ బడదే
పోరచిగా మాఁటలాడి పులకలఁ జిగిరించి
ఆరితేరీ జాము వోయ నంపు మన్నా సంపదే

చ. 3: అట్టె నవ్వులు నవ్వి ఆన లెల్లాఁ బెట్టి పెట్టి
పట్టి శ్రీవెంకటపతిఁ బై కొని తాఁ గూడెనే
నెట్టన నుద్దాలు మెట్టి నిలుచుండి తమకము
మెట్టుక నెరపీఁ గాని మీఁదు కిం దెరఁగదే

రేకు: 0341-1 నాగవరాళి సంపుటం: 11-241

పల్లవి: పొద్దు వోక నీవు నాతో బొంక వచ్చే వింతే కాక
గద్దించి నీ వెట్టుండినఁ గాదు గూడ దనేనా

చ. 1: న న్నొడఁ బరచకుర నమ్మికలు సేయకుర
నిన్నే మయిన నంటినా నీవు గొంకేవు
అన్నిట లోకమువారు ఆడుకొందు రింతే కాక
విన్న నీ సుద్దులు నేను వెల్లవిరి సేసేనా

చ. 2: యింత న న్నుబ్బించకుర యిచ్చకాలు సేయకుర
జంత నై ని న్నిఁక నే సాదించేనా
కాంతుఁడ నీ చుట్టాలు పక్కాలు నమ్మ రింతే కాక
మంతనాన నీపై నింద మరి వేసేనా

చ. 3: గడ్డము వట్టకురా కాఁగిట నించకురా
యెడ్డనై నీమాటకు నే నెదు రాడేనా
వెడ్డు వెట్టి యిట్ల శ్రీవెంకటేశ కూడితివి
దొడ్డదొర వైన నిన్ను దూరు కెక్కించేనా

రేకు: 0341-2 సామంతం సంపుటం: 11-242

పల్లవి: నావంటి సతులు తననగర నెందరు లేరే
భావమున తనుఁ దలచి బతికే నేనూ

చ. 1: తగుల వలచుటె కాని తప్పు సేయట లేదు
జిగి నేల పిలిచీనె చెప్పఁ గదరే
అగడు నేయఁగ మిమ్ము నంపెనా నేఁ డతఁడు
నగుఁబాటు గాక తనకు నాకుఁ బని యేమే

చ. 2: నవ్వు టొక్కటె కాని ననుపు దొంగిలితేను
రవ్వ నాకడకుఁ దా రా నేఁటికే
పువ్విళ్ల నిది వూరకుండ నే లనుచునా
అవ్విభుఁడు చలముకొనె నాఁడుగోల యేలే

చ. 3: యిచ్చ లాడుట గాని యెందు వోతి వన లేదు
పచ్చిగా నా చెరఁగు పట్ట నేలే
అచ్చలాన శ్రీవెంకటాదిపుఁడు నన్నుఁ గూడె
తచ్చన లింతే కాక తానే నేఁ గానా

రేకు: 0341-3 సాళంగనాట సంపుటం: 11-243

పల్లవి: చాలు నూరకుండవయ్య సడి కేల వచ్చీనో
నాలి నే మోనాన నుంటే నన్నుఁ దడవేవా

చ. 1: ఆడితి నే నొకమాఁట అందిరివలెనె నేను
యీాడ నెగ్గెనఁ జేసుకో యిత వైనఁ జేసుకో
వీడె మియ్య నే రాఁగా విందు వెట్టి పగ లాయ
వాడలో నాయింట నుంటే వాదు వెట్టుకొనేవా

చ. 2: మగిడి చూచితి నింతే మగఁడ మంటా నేను
నగినా నగుము కాదాన్నా నన్నుఁ గా దను
వగచితి నీకు నేను వడిఁ జల్ల వేఁ డాయ
మగవాఁడ నై పట్టితే మచ్చరించేవా

చ. 3: పాదము లొత్తితి నింతే బడలి వచ్చితి వంటా
సేదతో వెంగెము నీకు సేవగాఁ గైకొంటివో
ఆదరించి శ్రీవెంకటాధిప నన్నుఁ గూడితి
వేద దీర నే మొక్కితే వీడఁగ నాడేవా

రేకు: 0341-4 మధ్యమావతి సంపుటం: 11-244

పల్లవి: లేలే యిది యంత లేదు లేమలాల
కాలమందే మన మిది కన్నది గాదా

చ. 1: వల పింత గలవాడు వడి నే నలిగి రాఁగా
పిలిచి మాఁటాడ రాదా ప్రియుఁ డప్పుడే
తలఁచుక తలఁచుక తానేఁ డెవ్వరితోను
బెళకుప్రియాలు చెప్పి బేరి బోకొట్టీనే

చ. 2: తగ వెరిఁగినవాడు తారుకాణించఁగ నాతో
నగవు సేసుక నన్ను నమ్మించ రాదా
సగము సగము గొంకి సత్యము లెవ్వరితోడ
నిగిడించి మొక్కి యేరు నిద్దుర వుచ్చీనే

చ. 3: గక్కనఁ గూడెటివాఁడు కన్నీరు నించఁగాను
అక్కరతో నా వగ పారుచ రాదా
యెక్కు శ్రీవెంకటేశుఁ డిప్పుడుగా నన్నుఁ బొందె
మిక్కిలి చెరువునీళ్ల మేలు వడసీనే

రేకు: 0341-5 కేదారగౌళ సంపుటం: 11-245

పల్లవి: నీవే జాణ నందు వాపె నీకంటేఁ గడు జాణ
యేవిదాన నీపంతా లీఁక నీడఁ జెల్లవూ

చ. 1: కలికి పువ్వులచెండు కన్నులనె అద్దుకొంటా
వలపుతో వసివాడు వాడుకొంటాను
అలిగినదిఁ గాక అట్టె కూడినది గాక
మలయుచు చెలులతో మాఁటలాడీ నదివో

చ. 2: పదిమారులును నిమ్మపం డెగర వేసుకొంటా
చెదరినచింతతోఁ జింతించుకొంటా
యెదుట నున్నది గాక యెడసినదిఁ గాక
వొదిగి మలగుపై నొరగీ నదివో

చ. 3: మక్కువ యంతో వడికి మడిచినా కందుకొంటా
అక్కరతో వుస్సు రస్సు రనుకొంటాను
యిక్కు వంటినదిఁ గాక యియ్యకొన్నదిఁ గాక
గక్కన శ్రీవెంకటేశ కాఁగిలించె నదివో

రేకు: 0341-6 బౌళి సంపుటం: 11-246

పల్లవి: చూడవే యప్పటినేనే జూటరి నట
జాడలు తాఁ గట్టినపచ్చడమే యెరుఁగు

చ. 1: ముప్పిరిఁ దారా కుండఁగ ముసుఁగు వెట్టుక వుంటి
అప్పటినేనే కల్ల నటవే చూడు
నెప్పునఁ దమవొళ్లిది నేర మందురా యెవ్వరు
తప్పులు సేసిన వెల్లె దయ్య మెరుఁగుఁ గాక

చ. 2: యెయ్యడకో తాఁ బోఁగా నిందుకు రమ్మంటి నింతే
గయ్యాళి నేనే యట కమ్మటిఁ జూడు
నెయ్యమునఁ దనతోడ నిజము నా దేడ కెక్కు
అయ్యో తనవొళ్లికడ మాతుమే యెరుఁగూ

చ. 3: చెంత దాఁ బిలచుదాఁక సిగ్గున నుండితి నింతే
పంతము నాదే యట బలువు చూడు
యింతిరో శ్రీవెంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
పొంతల తనతగవు పొరు గెల్లా నెరుఁగూ

రేకు: 0342-1 శంకరాభరణం సంపుటం: 11-247

పల్లవి: ఊర కుండ నీరా మమ్ము నుడికించకా
గారవించే నీ నవ్వు గాలమునో నాకు

చ. 1: చిఱుతనవ్వు నవ్వఁగా చెక్కు నొక్కి యెత్తి నన్ను
కఱఁచేవు మరికొంత కారింపే కాదా
తఱి నీ మనసునను దలఁచిన ట్లుండు
గుఱిగా నదివో నాకు గుండెలోనీ అమ్ము

చ. 2: మంచముపై నుండఁగాను మచ్చిక నావొద్దఁ బండి
ముంచి చేయి వేసే వది మోపే కాదా
యెంచి నీకుఁ జూడ నది యిచ్చక మైనట్లుండు
తెంచరాని పొద్దు వొద్దు దిగులువో నాకు

చ. 3: భ్రమసి నేనుండఁగాను పట్టి నన్నుఁ గాఁగిలించి
తమకించే విది గొంత తగులే కాదా
అమర శ్రీవెంకటేశ ఆదరించి కూడితివి
చెమటలు నీకుఁ గాని సేసలువో నాకు

రేకు: 0342-2 హిజ్జిజ్జి సంపుటం: 11-248

పల్లవి: పాప మంటాఁ దనమీఁద బత్తి సేయఁ బోతేను
కొపగించుకొన వచ్చీ కొమ్మలాల చూడరే

చ. 1: అయ్యో యేమే తనకు నే నంటే నెంత సదరమే
కొయ్యగదే ముక్కుననే కోప మున్నది
చయ్యన నెవ్వతెతోనో జగడ మడిచి వచ్చీ
వొయ్యన నేనడిగితే నుడికిపడీని

చ. 2: చెల్ల బో నే నెంత దనచేతికల సత్తినే
పల్లదము దననోరఁ బై పై నున్నది
కెల్లు రేఁగి యాడనో తా గిజి గిజి య్యై వచ్చీ
కల్లగదె చూడఁ బోతే గదరుకొనీని

చ. 3: మేలు మేలె తన కెంత మిక్కిలి యనాదనే
కీలుకొని బొమ్మల జంకెన లున్నది
వే ళెరిఁగి శ్రీవెంకటవిభుఁడిట్టె నన్నుఁ గూడె
కేలు చాఁచి పెనఁగితే కేరుచు నవ్వీనే

రేకు: 0342-3 నాదరామక్రియ సంపుటం: 11-249

పల్లవి: మగవారి కేఁటి మేలు మరతురు వేగిరమే
బగివాయ కుండఁగానె పరా కె ట్టితివిరా

చ. 1: ఆకె విలిచీ నంటా నట్టె విచ్చేసేవు గాని
పైకొని మా యింటికి రాఁ బాపమా నీకు
యీకడ నేఁ జూడఁగానె యించుకంత దయ లేక
కైకొని తోసి విచ్చేయఁ గాళ్లెల్లాడెరా

చ. 2: అల్లది వచ్చీ నంటా అక్కడ చూచేవు గాని
వొల్లనె మామొగ మైతే వొచ్చమా నీకు
తొల్లిటిదానవె నీతొడమీఁదఁ బండుండఁగ
మల్లడి యంతదవ్వు నీ మన సెట్టు వారెరా

చ. 3: మంతన మది యాడఁగ మరిఁ జె వొగ్గేవు గాని
కొంత నామాట వింటే కొరతా నీవు
చెంతల శ్రీవేంకటేశ చెప్పఁగా నన్నుఁ గూడితి
వంతలోనె నీగుణము అ దెట్టు దిరిగెరా

రేకు: 0342-4 శంకరాభరణం సంపుటం: 11-250

పల్లవి: ఇంత నీవు మన్నించుట యిందుకా నన్ను
వింతవారిఁ బతి వెట్ట వేడుకా నీకు

చ. 1: ఆపె నన్ను నాడఁగా నే నాపెతో వా దడువఁగ
యేపున వినేవు నీకు యేమి గూడెరా
వోపి కల్ల గలవారి నొద్దంటే దోసమా
చేపట్టి నీ కేమి పగ సేసితిరా నేనూ

చ. 2: సవతి పగ చాటఁగ సారె నేఁ బగ చాటఁగా
భువిలోఁ జూచేది నీకుఁ బుణ్యమా నేఁడు
వివరించి మా మొర విచారించఁ దగదా
కవ కవ నవ్వి నవ్వి గండి గట్టుకొంటివా

చ. 3: చేతు లాపె చాఁచఁగాను చేరి నే నొట్టు వెట్టఁగ
యీతల నడ్డము రావు యిదె తగునా
జాతిగ శ్రీవెంకటేశ చన విచ్చితివి నాకు
యేతుల నిన్నుఁ గూడితి యిక నేల మరఁగూ

రేకు: 0342-5 రామక్రియ సంపుటం: 11-251

పల్లవి: ఊరకున్నఁ బోనీవు వొక టొకటే రేఁచేవు
గోర గీరితే నే రా మాకూటమి కోపుదువా

చ. 1: చిగురుఁగెమ్మో సోఁకఁ జేరి నే మాడెటిమాఁట
వొగరు లై తోఁచు నందు కోపుదువా
పొగరుతమ్మికన్నుల పూఁచి నేఁజూచెటిచూపు
నిగుడునమ్ము లై తోఁచు నీ వోపుదువా

చ. 2: కొండలవంటి చన్నులు కోరి నిన్నుఁ దాఁకించితే
వుం డుండె కుమ్మెలు వోవు నోపుదువా
బండివంటి మాపిరుఁదు బడి నీకుఁ దగిలితే
అండ నీపైఁ బారుఁ జేసు నందు కోపుదువా

చ. 3: చల్లు మావూరుపుగాలి సమరతివేళల
వుల్ల మెల్లఁ జిందు సేసు నోపుదువా
యెల్లగా శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పెల్లు రేఁగి నేఁడు నాతోఁ బెనఁగ నోపుదువా

రేకు: 0342-6 గౌళ సంపుటం: 11-252

పల్లవి: ఆపెమీఁద మోహ మైతే నౌదువు గాక
మోపుగా నా మీఁద నెపములు వేయ వలెనా

చ. 1: నిన్ను నేమైన నంటినా నేనె తిట్టుకొంటిఁ గాక
కన్ను లెఱ్ఱఁ జేసి నీవె కాఁగి పడేవు
వన్నెల కెందో పొయ్యేవాఁడ వట్టె పోదు గాక
అన్నిటా నాతో నేఁడు అలిగి పోవలెనా

చ. 2: చేరి నిన్ను దొబ్బితి నా చే వట్టకు మంటిఁ గాక
పారి పారి రొమ్ము దట్టి పగ చాటేవు
ఆరీతిఁ బెండ్లాడేవాఁడ వట్టె పెండ్లాడుదు గాక
యీరీతి వాదు వెట్టుక యింత సేయ వలెనా

చ. 3: చెల్ల బో కైకో కుంటినా సిగ్గున నుంటిఁ కాక
వొల్లనె నన్నింత దూరి వోల వేసేవు
కొల్లగా శ్రీవెంకటేశ కూడితిని నన్ను నేఁడు
చిల్లర సతిని నాచేతి కియ్య వలెనా

రేకు: 0343-1 వరాళి సంపుటం: 11-253

పల్లవి: చెల్లఁబో నీ చెప్పినట్టు సేయ నైతినా వోరి
కల్లతో నిజ మోపదు కల దింతే కాక

చ. 1: కోపగించుకొన నేల కోరి వేఁడుకొన నేల
యేపున నిట్టె రెండూ యెడ్డతనమే
పై పై చేఁదు దిన నేల పంచదార నంజ నేల
పూపవయసులవారి పుణ్య మింతే కాక

చ. 2: అట్టె కల్ల లాడ నేల ఆనలు వెట్టుకో నేల
యెట్టివారి కైన యివి యెడ్డతనమే
మెట్టి చలిఁ బడ నేల మించి సీతు గాయ నేల
పట్టి వలచినవారి భాగ్య మింతే కాక

చ. 3: చలము సాధించ నేల సారెకు వగవ నేల
యెలమితో నివి రెండు యెడ్డతనమే
పిలిచ శ్రీవెంకటేశ పెనఁగి నన్నుఁ గూడితి
పలుకుఁబంతాన నీ నా బలు వింతే కాక

రేకు: 0343-2 ధన్నాశి సంపుటం: 11-254

పల్లవి: మోనాన నుందాన వేమే ముని వైతివా
మేనులు సోఁకిన మందెమేళ మైన లేదా

చ. 1: అలిగితే నే మాయ అట్టె వూరకుండ నేల
పలుకుల నైనఁ దూరఁ బాడి గాదా
మలయుచుఁ బోట్లాడే మాసటీలు సయితము
అలరి పగలు చాటే రది యైన లేదా

చ. 2: రా కుండితే నే మాయ రతి నాపై నెరపి
దాకొని చెప్పంప నైనఁ దగవు గాదా
కాకుగాఁ గొట్లాడేటి కడవారు సయితము
ఆకడఁ జేతులు చాఁతు రదియూ లేదా

చ. 3: పంత మైతే నే మాయ పైకొని నే వేఁడుకోగా
అంతట కోపము దీర నైనఁ జెల్లదా
వింతగా శ్రీవెంకటాద్రివిభుఁడ నింతే నేను
యింతలో నన్నుఁ గూడితి యెర వింత లేదా

రేకు: 0343-3 ఆహిరి సంపుటం: 11-255

పల్లవి: ఏమి చూచేవు నావంక యిం దేమైన తప్పు గద్దో
ప్రేమము నీ కొప్పంచితి బిగు వింక నేలా

చ. 1: నిక్కి నా విరహము నీకు మే లైతేఁ జాలు
ముక్క వోయి నా మోహములోన
వొక్కరి కైన సెలవు వున్నదిగా యీ బదుకు
చక్కని వో రమణుఁడ చాలదా యీజన్మము

చ. 2: చింతతోడ నే నుండేది సెలవు నీ కైతేఁ జాలు
పంతము దప్పెనా నాబలువుకును
వంతు వాసి కెక్కఁగా నావగ పోకచోట నైన
సంత మైన నాయకుఁడ చాలదా నాజన్మము

చ. 3: ఆసలచే వేఁగేది నీ కంత వేడు కైతేఁ జాలు
దోసమా నా సైరణకు దొండి వోయీనా
యీసు లేక శ్రీవెంకటేశుఁడ నన్నుఁ గూడితి
శాసించ నేఁటికి నిన్నుఁ జాలదా నా జన్మము

రేకు: 0343-4 వరాళి సంపుటం: 11-256

పల్లవి: ఎప్పుడను వారు వారు నేకము గాక మానరు
యిప్పటికిఁ దగినట్టు యిచ్చకమె ఆడరే

చ. 1: కొసరి విభునిఁ దిట్టి కోపగించి మాఁట లాడి
అసురుసు రై యలసి అట్టె పవ్వళించెను
పసగా నారగించదు పగలును యిప్పు డైన
అసము దించఁగ లేపి ఆరగించఁ బెట్టరే

చ. 2: తానె వొట్టు వెట్టుకొని తరుణి యాతఁ డిచ్చిన
కానుకకప్పుర మెల్ల కడఁ బారఁ జల్లెను
మోనమున దప్పి గొనె ముంచి మీ రైన విడెము
ఆనవెట్టి యిచ్చి యిట్టె ఆకుమడి చియ్యరే

చ. 3: వోపలనె వేగిరించి వూరకె నిందలు గట్టి
శ్రీవెంకటేశ్వరుఁ జూచి శిగ్గువడి వున్నది
కైవసమై అతఁడె గారవించి చెలిఁ గూడె
యీవల నూడిగములు యేమరక సేయరే

రేకు: 0343-5 నాగవరాళి సంపుటం: 11-257

పల్లవి: ఎంత చెల్లుబడి నీకు యెవ్వ రిచ్చి రోరి నీకు
చెంత దొరతనము చెప్పి చూపేవా

చ. 1: మౌనముతో నుండఁగాను మాఁట లాడించ వచ్చేవు
నేనాఁటదాన నైతే నేమము లేదా
పూని జలక మాడఁగ బొంచి యాడకు వచ్చేవు
మేనబావ వైనంతనే మేర మీరేవా

చ. 2: మోము వంచుకుండఁగానెమొక్కులు మొక్క వచ్చేవు
బాముతో జవ్వను లైతే బలవు లేదా
నోము నోమఁగానె చెక్కు నొక్కి రతికిఁ దీసేవు
యేమిరా నీపొరు గైతే నింత సేసేవా

చ. 3: మంచముపై నుండఁగానె మరి కాఁగిలించేవు
అంచె నీవొద్దనుంటే అడ్డము లేదా
యెంచఁగానె శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
కంచము పొత్తున నుంటే కాఁక రేఁచేవా

రేకు: 0343-6 సామంతం సంపుటం: 11-258

పల్లవి: తుదను దాఁచఁగ రాదు తోడ దిష్ట మై వుండఁగ
మది మది యి ట్లెతి మగఁ డూర లేఁడూ

చ. 1: యిందరితో నీ మాఁట యే మని చెప్పుదు నమ్మ
చెంది యీక్రిష్ణుఁడు చీర చిక్కించెను
అందము సేసుక నేను అణఁచుక వుండే నంటే
మంద నున్నాఁ డిదె నామగఁ డూర లేఁడూ

చ. 2: మంచిన మాయింటివారి మొగ మెట్టు చూతు నమ్మ
పెంచిన క్రిష్ణునికిఁ గా బిడ్డఁ గంటివి
పొంచి లోనఁ బెట్టుకొంటే పొరుగిరుగుల నింద
మంచి దాయ బొంకే నంటే మగఁ డూర లేఁడూ

చ. 3: వెనక చుట్టాలతోడ వియ్య మెట్టందుదు నమ్మ
యెనసి శ్రీవెంకటేశుఁడింట నున్నాఁడు
పనివడి నేఁడు వచ్చి భ్రమసి చూచీ నదె
మనికై యీన్నాళ్లదాఁక మగఁ డూర లేఁడూ

రేకు: 0344-1 లలిత సంపుటం: 11-259

పల్లవి: కపటము మాన వైతి కలకాలము
ఉపమ లింతేసి యాపె కున్నవా మొదలను

చ. 1: యే మని చెప్పించితివో యింతితో యేకతమున
ఆమాఁట వింటానె ఆకె వచ్చెను
నీమతకమె కాఁబోలు నేఁడు నాతో జగడించీ
యీ మగుమాకు నిన్నాళ్లు యింత బలు వున్నదా

చ. 2: సన్న యేమి సేసితివో సరి నాపెమోము చూచి
పన్ని నీ సంగడి వచ్చి పవ్వళించెను
కన్నెకు నీ యప్పణి కాఁబోలు నన్ను గద్దించీ
యెన్నఁడైనా యీపె నాతో యీసడించ వచ్చునా

చ. 3: యెప్పుడు నేరిపితివో యీపెకు నీగుణములు
వొప్పుగ నా కిటు మొక్కి వొక్క టాయను
తప్పు దీరఁ గూడితివి దగ్గరి శ్రీవెంకటేశ
మెప్పించితి నీవు నన్ను మే లిం తెరుఁగునా

రేకు: 0344-2 దేశాక్షి సంపుటం: 11-260

పల్లవి: పని గలప్పుడు వచ్చి పలికేఁ గాని
వొరి నీ యింటిలోనె వుండేరా నేను

చ. 1: చిత్తము వచ్చినవేళ చేర వచ్చేఁ గాని నేను
అత్తి యందాఁక లోని కంపరా నన్ను
కత్తిఁ గోసిన ట్టయాఁ గడు నీమాఁటలు వింటే
వొత్తిలి దవ్వుల నైన వుండేరా నేను

చ. 2: నిక్కేము నే నాల నై నీతో నవ్వేఁ గాని
యిక్కువఁ దలవంచుకో నియ్యరా నన్ను
ముక్కు వట్టినట్లయినా మోహము నీవు చల్లితే
వొక్క నీసేవ సేసుక వుండేరా నేను

చ. 3: వలసినప్పుడె నీవద్ద గూచుండేఁ గాని
యిల నందాఁక నలుగు నియ్యరా నన్ను
బలిమి శ్రీవెంకటేశ పట్టి నన్నుఁ గూడితివి
వొలిసే నీతలఁపులోన వుండేరా నేను

రేకు: 0344-3 మలహరి సంపుటం: 11-261

పల్లవి: నీవే యెరుఁగుదు వింతే నీచిత్తము
యీవేళ నే నోరిచితి యింకా నీచిత్తము

చ. 1: చెంతల నవ్వ వచ్చేవు చెయి వట్టి పెనఁగేవు
అంతటి కోపితేఁ జాలు నైతే నీచిత్తము
యింతటిదొర వంటాను యేమి ననఁ జాలు నింతె
యెంత కెంత వెరచెనా యింకా నీ చిత్తము

చ. 2: కప్పురము చల్లేవు కాలు మీఁద వేసేవు
అప్పటి పంతా లాడే వైతే నీచిత్తము
యిప్పుడే నీకు మొక్కితి నిందరును జూడగాను
యెప్పుడు నన్నెరఁగవా యింకా నీచిత్తము

చ. 3: బెట్టి కాఁగిలించేవు పిప్పి సేసేవు నామోవి
అట్టె కానీ లేర అయితే నీ చిత్తము
నెట్టన శ్రీవెంకటేశ నేఁడె నన్నుఁ గూడితివి
యిట్టైతేనేఁ గా దనేనా యింకా నీ చిత్తము

రేకు: 0344-4 ముఖారి సంపుటం: 11-262

పల్లవి: ఇన్నిటా దొరవు నీవు యింత సేతురా
చన్ను లంటే విదె నీకు చల మాయఁగా

చ. 1: చెఱఁగు మాసినవేళ చేరి ముట్ట వచ్చేవు
కొఱ తంటా వద్దంటేఁ గోపగించేవు
మెఱసీ తొల్లిటి దోసమె నేఁ గురియఁగాను
నెఱి నిది యిప్పుడె నీకు బాఁ తాయఁగా

చ. 2: యింట నే భోఁసేనేవేళ యెంగిలి ముట్ట వచ్చేవు
అంటకు మన్నంతలోనె అలిగేవు
వెంటనె నా నోటనుండి వేమారు జిందఁగాను
జంటల నీ కదియున సర కాయఁగా

చ. 3: జలక మాడెటివేళ సంగడికి వచ్చేవు
తొల మంటే కాఁగిలించి దొమ్మి సేసేవు
మలసి శ్రీవెంకటేశ మలినముఁ బాయఁగాను
తిలకించే వది నీకు దిష్ట మాయఁగా

రేకు: 0344-5 లలిత సంపుటం: 11-263

పల్లవి: నీవేడ నే నేడ నేఁడు సిగ్గు వడఁ గాక
భావించి నీకొంగు వట్టెబలువు నా కున్నదా

చ. 1: నిగిడి పదారువేలు నెలఁతలు గల నీకు
జగతి నింకా సతులు సర కయ్యేరా
వగలతో నెరఁగక వలచినదాన నై
జిగి నా మగండ వంటాఁ జెప్పకోనేఁగాక

చ. 2: తొరలి సీత నడవిఁ దోసి రప్పించిననీకు
తరుణులమీఁదఁ గొంత దయ వున్నదా
గరిమి నీ భ్రమఁ బడి గతి లేనిదాన నై
పరులు చూడఁగ నీ పాద మొత్తేఁ గాక

చ. 3: తొడపై శ్రీసతిఁ బెట్టి దొడ్డకొలు వున్ననీకు
తడవి నాపొందు లింకాఁ దల పయ్యీనా
యెడయక శ్రీవెంకటేశ కూడినదాననై
బడి వాయక నీవొద్ద బతికితిఁ గాక

రేకు: 0344-6 రామక్రియ సంపుటం: 11-264

పల్లవి: చెప్పకునే నాతోడ చేరి నీసుద్దులు నేఁడు
కప్పిన నీ నేరు పెల్లాఁ గలది నాతోనా

చ. 1: కానీ లేవె నే నతనిఁ గరఁగించ లే కుండితే
నానఁ బెట్టి కొంత నీవు నవ్వుదు గాని
పోనీ వూరకుండే యేపొద్దుదాఁకఁ గెలసేవు
దాని కేమి నీ యాఁటదానితన మిందుకా

చ. 2: కొంత సయించవె పతి కొరత దీరుచ కుండితే
చెంతల నప్పుడె సంతంసింతువు గాని
పంతము లిప్పు డేఁటికె పని గలప్పుడే కాక
యింత నంతటఁ బడెనా యిల జాణతనము

చ. 3: యిట్టె వోరుచు కుండవె యీతని రతిఁ జిక్కితే
వట్టి సట నీవు దోడై వత్తువు గాని
గట్టిగ శ్రీవెంకటాద్రి ఘనుఁ డిట్టె నన్ను గూడె
పట్టినచలము నీకు బందె దెచ్చినా

రేకు: 0345-1 ముఖారి సంపుటం: 11-265

పల్లవి: ఊరకున్న నన్ను నేల వుడికించ వచ్చేవు
చేరి నీకు యెంత పగ సేసితినో కాని

చ. 1: కొంగు వట్టి తియ్యకుర కూచున్న దాని నన్ను
వుంగిటే నే రా నోప నొళ్లు నొచ్చీని
యింగితాన నన్నుఁ జూచి యించుకంత దయ లేవు
సంగడి నే నెంత పాపజాతినో కాని

చ. 2: బలిమి శాయకురా పలుకఁగ నోప నీతో
లలి నామనసు వొకలా గయ్యీని
తలఁపు నీ వెరిఁగియు తతిగొని పోరేవు
యెలమి నే నేఁటిజన్న మెత్తితినో కాని

చ. 3: కాఁగిలించి పట్టకురా కమ్మటి యిట్టె పొంది
వీగి నిన్నుఁ బాయ నోప వేస టయ్యీని
దాఁగక శ్రీవెంకటేశ తగ నన్నుఁ గూడితిని
రాఁగి యెంత భాగ్యవంతురాలనో కాని

రేకు: 0345-2 మంగళకౌశిక సంపుటం: 11-266

పల్లవి: చెలులాల మీరె యింత సేసితె రిద్దరి నేఁడు
కలయనిమాసటీలఁ గదియింతురా

చ. 1: తక్కరీఁ డంటిఁ గదవే దంట వీఁ డంటిఁ గదవే
అక్కడికతలే చెప్పీ నంటిఁ గదవే
యెక్కువ నాతో నాడేదె మాఁటకె మాఁట
యిక్కడికి వచ్చు టెల్ల యిందుకొరకా

చ. 2: చలమరి యంటిఁ గదే చల్లజం పంటిఁ గదవే
అలపు సొలపె ఘన మంటిఁ గదవే
తలవాకిటనె వుండి తనకు నా కేఁటి పొందే
వలపు నామీఁదఁ జల్లేవరుసా యిది

చ. 3: వేసదారి యంటిఁ గదే వేగిరకాఁ డంటిఁ గదే
ఆసలు చూపిన లో నౌ నంటిఁ గదవే
బాసతో శ్రీవెంకటాదిపతి నిన్ను నిటు గూడె
మోస మెల్లఁ దీరె నింక మొక్కెంచేరా

రేకు: 0345-3 మాళవి సంపుటం: 11-267

పల్లవి: ఎంతైన నీగుణము యేల మానును
చింతతో నీకుఁ బ్రియము చెప్పదుము గాక

చ. 1: కడు నెరదు చూచి మాకన్నులె ఘనము గాక
వడి మాయింటికి నేఁడు వచ్చేవా నీవు
వుడివోనితమకాన వుండజాల కొకమాఁట
అడియాసలనె నిన్ను నాడుదుము గాక

చ. 2: నవ్వి నవ్వి యిదె మానదుమె సన్నము గాక
అవ్వలఁ గొంతైన లోనయ్యేవా నీవు
జవ్వనభారముచేత జడిసి నీభ్రమఁ బడి
పువ్వుల పానుపుమీఁద బొరలదుఁ గాక

చ. 3: సారె నిన్నుఁ గాఁగిలించి చన్నులె గట్టాయఁ గాక
చేరువ నామేలు దలఁచేవా నీవు
కూరిమి శ్రీవెంకటేశ కూడి నేను తమకించి
యీరీతిని నీ పురమె యెక్కు కొంటిఁ గాక

రేకు: 0345-4 సామంతం సంపుటం: 11-268

పల్లవి: నిక్కి నిక్కి చూచేవు నీ కేల నీకు
దక్కితిమి తొల్లె మాపైఁ దల వేలా

చ. 1: కల్లరి వై నీవు రోలఁ గట్టువడుదువు గాక
గొల్లదాన నాతోడి గొడ వేలా
వుల్లసాన నీవు పాలవు ట్లెక్కుదువు గాక
పిల్లఁ గోవిరాగాలఁ బిలువ నేలా

చ. 2: పిన్నవాఁడ వైననీవు పేయలఁ గాతవు గాక
కన్ను లారిచెటిమాతోఁ గాఁక లేలా
అన్నిటా నిందరిచేతి ఆడికఁ బడుదు కాక
సన్నలఁ జాయల మాతో చల మేలా

చ. 3: పుక్కిన లోకాలు చూసి బూమెలు సేతువు గాక
కక్కసించి మాతోడి కాఁపిరే లేలా
యెక్కువ శ్రీవెంటటేశ యిర వై కూడితి నన్ను
మిక్కిలి కృష్ణుఁడ నాతో మేకు లేలా

రేకు: 0345-5 సాళంగం సంపుటం: 11-269

పల్లవి: మేలు మేలు యిందుకె నే మెచ్చితె వీని
కే లెత్తెనె మొక్కితేను కినిసీనె తాను

చ. 1: చిన్నఁబోయి వుండఁగాను సెలవి నే నవ్వితేను
మిన్నక నన్నుఁ గోపించీ మేలే వీఁడు
యెన్నిక నెవ్వతెచేత నేమి మాఁట బఁడి వచ్చో
కన్న వారిమీఁద నెల్ల కసరీనె తాను

చ. 2: తలవంచు కుండఁగాను దగ్గరి మాఁటాడించితే
మెలుపునఁ దిట్ట వచ్చీ మేలే వీఁడు
వలచి తా న్కెడనో వాదు వెట్టుకొని వచ్చి
పొలసి వొద్దివారితోఁ బోరీనె తాను

చ. 3: గక్కన నొంటి నుండఁగఁ గాఁగిలించుకొంటేను
మిక్కిలి తాఁ బెనఁగీని మేలే వీఁడు
యెక్కడనో శ్రీవకెంటేశుఁ డలిగి వచ్చి
దక్కిన రతులకె తమకించీఁ దాను

రేకు: 0345-6 నాదరామక్రియ సంపుటం: 11-270

పల్లవి: చిమ్ముచుఁ దియ్యనినోరఁ జేఁ దేల
నెమ్మది నాకె వుండఁగ నే మేలా

చ. 1: మన సిచ్చి నీతోడ మాఁట లాడేవారితోనె
అనవయ్య పోయి నీ వామాఁట
వెనకటిమాఁటలకె వేదనఁ బొరలేమమ్ము
చెనకి మరిఁ గొంత చింత రేఁచ వలెనా

చ. 2: మొగము చూచి నీకు మొక్కేటివారితోనె
నగవయ్య పోయి నీవు నయమునా
జగడించి పైఁ జేయి చాఁచి మూల నున్నన్నన్ను
తగిలి తగిలి యింకఁ దతి గొన వలెనా

చ. 3: పలుమారు సిగ్గుదేరి పారితెంచేవారినె
పిలవవయ్య పోయి ప్రియమునా
అలిగిననన్ను నిట్టె ఆదరించి కూడితివి
యెలమి శ్రీవెంకటేశ యిఁకఁ గొంత వలెనా

రేకు: 0346-1 శుద్ధవసంతం సంపుటం: 11-271

పల్లవి: నే నెంత నీ వెంత నిక్కేమా యిది
కానీ లేరా యిది యొక్కకాకు సేసేజాడలా

చ. 1: కోరి వేఁడి తగిలినగోపసతు లుండఁగాను
ఆరయ నా కొంగు వట్టె వల సతినా
మేరతోఁ బెండ్లాడినరుక్మిణిదేవి వుండఁగాను
యేరా నాతో నవ్వేవు యెగక్కేమా

చ. 2: చన విచ్చి మన్నించిన సత్యభామ వుండఁగాను
చెనకేవు నే నీకుఁ జిక్కితినా
పనివడి తెచ్చుకొన్నపదారువే లుండఁగాను
ననుఁ జెక్కు నొక్కేవు నాఁటకములా

చ. 3: గంద మిచ్చి మెప్పించినకలికి యొకతె యుండ
అంది నన్నుఁ గాఁగిలించే వాగడములా
కందువ శ్రీవెంకటేశ కలసితి విటు నన్ను
చిందేవు మోహము నాపై చిత్త వింత వచ్చెనా

రేకు: 0346-2 శంకరాభరణం సంపుటం: 11-272

పల్లవి: ఏల చెనకేవు నన్ను నిప్పుడె నీవు
తాలిమితోఁ బదరేటిదానఁ గాను నేనూ

చ. 1: వూర కిట్టె నా మీఁద నొళ్లు వేసితివి నేఁడు
కారణ మేఁటిదో కాని కంద మిఁకను
సారెఁ జట్టి పట్టితివి జారనపయ్యదకొంగు
తేరకొన నిది యేమో తెలిసేరా నేను

చ. 2: మన సిచ్చి నాతోడ మాఁటలాడే విదె నేఁడు
కొన మొద లేదో చూచుకొంద మిఁకను
చన విచ్చి మంచముపై సంగడిఁ గూచుంటి విదె
పని నిన్ను నడిగేరా పలుమారు నేను

చ. 3: గక్కనఁ గాఁగిలిచుక కందువ లంటేవు నేఁడు
యెక్కువగా నవ్వేరా యిందుకే నేను
నిక్కము శ్రీవెంకటేశ నీవు నన్నుఁ గూడితివి
మిక్కిలి నీజాడలకు మెచ్చేరా నేను

రేకు: 0346-3 శంకరాభరణం సంపుటం: 11-273

పల్లవి: ఏల వేగిరించేవు యింట్టిపని గద్దు నాకు
గోల వై వెలుపుల అరఁగుపై నుండవయ్యా

చ. 1: మందలోన నున్ననేము మాపటంతఁ గాని రాము
దిందుపడఁ గొంగువట్టి తియ్యకువయ్యా
పొంది ఆవులు దూడలు బొలానఁ గలసుఁ జేసు
అందాఁకా నీవు మాయింటియాడ నుండవయ్యా

చ. 2: చల్ల దచ్చి తచ్చి నేఁడు సందు లెల్ల నాకు నొచ్చు
వొల్లనె విడె మిమ్మనే వోపనయ్య
గొల్లఁడు దెచ్చినపాలకుండ లందుకొనవలె
యిల్లు చొచ్చి అట్టుగపై నెక్కు కుండవయ్య

చ. 3: వెన్న గాఁచేవేళను విను మనఁ జాలను
చన్ను లేల పిసికేవు సారెకు నయ్య
యెన్నికతో శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
పన్నిన మామంచముపై బవ్వళించవయ్యా

రేకు: 0346-4 శంకరాభరణం సంపుటం: 11-274

పల్లవి: లెస్స బుద్ది చెప్పరే లేమ లిందరుఁ గూడి
వుస్సు రస్సు రనఁగానె వొద్దికి నేఁ బోదునా

చ. 1: పై పై నవ్వేవారితోడ పలుకఁగ వచ్చుఁగాక
కోపగించఁగా కూరిమి గొసరఁగ వచ్చునా
యేపున రమణుఁ డయితే యెదురు రా నైతి నంటా
ఆప లేక తిట్టఁగాను అండకుఁ బిలుతునా

చ. 2: వలచినవారితోడ వా దైన నమరుఁ గాక
యిలఁ బగవారితోడ యిచ్చకము చెల్లునా
కులికి యప్పుడు నేను గోరు దాఁకించితి నంటా
అలిగేటివానికే ఆకుమడి చిత్తునా

చ. 3: ఆదరించేవారితోడ నంటి పొందవలెఁ గాక
గోదిలేటి మగవాని కొంగు వట్ట వచ్చునా
యీదెస శ్రీవెంకటేశుఁ డింత నేసి నన్నుఁ గూడె
పొదుకొని వుండఁగాను పంత మిచ్చే నందునా

రేకు: 0346-5 రామక్రియ సంపుటం: 11-275

పల్లవి: నే నున్న దెస యెంత నేఁడు దనవేడు కెంత
పానిపట్టి యితంలో నే బాఁ తైతినా

చ. 1: అలిగి నే నవ్వలి మోమై వూరకుండేదాని
నలరి పాదము లొత్తు మనీనె తాను
తలఁకి సిగ్గు వడఁడు తనకు నా కంత పొందా
మలసి తనచేతలు మరచెనా తాను

చ. 2: చింతతోడ చెక్కు చేత సిగ్గువడి వున్నదాని
యింతలో నాకు మడిచి యిమ్మనీఁ దాను
మంతనా లాడఁగ వచ్చీ మంచి చుట్టమె నాకు
వింత దన కానోటనె వెళ్లెనా ప్రియము

చ. 3: పట్టెమంచముపై నొంటిఁ బవ్వళించి వున్నదాని
అట్టె తా వచ్చితిని లెమ్మనీనె తాను
దిట్టయై శ్రీవెంకటాద్రిదేవుఁడు నన్నిటు గూడె
గుట్టునను గతి గూడుకొనెఁ గదె యిపుడు

రేకు: 0346-6 ముఖారి సంపుటం: 11-276

పల్లవి: ఇంకాఁ బెనఁగ నేల యింత చాలదా
వుంకువగా నింతపని కోరిచినదాననా

చ. 1: వొద్దికి నే రాఁగానె వొక్కరితో మాఁటలాడే
వద్దో నాకు సిగ్గియ్యా సంపరా నన్ను
పెద్దరికేలకె నేఁ బెనఁగెటిదాన నింతే
సుద్దు లెల్లాఁ గంటి నంత చులుకనిదాననా

చ. 2: దగ్గరి నే నుండఁగానె తలపంచు కుండితివి
అగ్గల మయ్యాఁ గోప మంపరా నన్ను
సిగ్గుతోడి బతు కొక్క చీమం తయినఁ జాలు
యెగ్గు లెంచ మీద టెత్తు యెరఁగనిదాననా

చ. 3: కాఁగిలించుకుండఁగానె కన్నులు మూసేవు నీవు
ఆఁగితిఁగా నిన్నిందాఁకా నంపరా నన్ను
చేఁగ దేఁర గూడితివి శ్రీవెంకటేశ నన్ను
రాఁగిన నీపొందు లెల్ల రచ్చ వేసేదానానా

రేకు: 0347-1 సాళంగం సంపుటం: 11-277

పల్లవి: సమతారుకాణ లైతె చల మెంత యెక్కునో
అమర దింతక తొల్లె యలిగి యెరగును

చ. 1: కోపగించే మాఁటలకు గురి గాఁగ బని లెదు
రాపుగా నావద్ది కింక రాకు మనరే
యేపునఁ జెలులు చేప్పేయెడమాఁటలే చాలు
తీపుల నెన్నఁడుఁ దన్నుఁ దెగనా డెరఁగను

చ. 2: దారి తప్పి నందుమీఁద దగ్గరి రాఁ బని లేదు
సారెకు నన్నుఁ బిలిపించకు మనరే
యీరస మణఁగుదాక యేకతములే మేలు
బీరమునఁ దనతో నేఁ బెనఁగి యెరఁగను

చ. 3: బిలిమి లో నైన మీఁద బంత మాడఁ బని లేదు
వొలిసి కాఁగిట నిట్టె వుండు మనరే
యెలమి శ్రీవెంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
మలసి తన కెదురు మాఁటా డెరఁగను

రేకు: 0347-2 సౌరాష్ట్రం సంపుటం: 11-278

పల్లవి: నిజ మాడితేఁ గనక నీవే నాదేవరవు
గజరు నీచేఁతలకుఁ గలఁగీ నాచిత్తము

చ. 1: యిందరు వినఁగ నిన్ను యెందు వోతి వంటిఁ గాక
నింద లే మైన నీకు నేఁ గట్టితినా
కందువ యింత గలితే గడించుకొదువు నీవు
అందుకె పో నిన్నుఁ గంటే నదరీ నామేను

చ. 2: యింతు ల్లెల్లఁ జూడగాను యిట్టట్టు రమ్మంటి గాక
వింతగురుతులు నీమై వెదకితినా
కాంతలఁ గంటేఁ జాలు కాకు సేయ నేరుతువు
యెంతైన నిందుకె మాఁట యియ్యకొనఁ జాలను

చ. 3: నీ సతుల ముందరనె నే నిటు నవ్వితిఁ గాక
సేస వెట్టి నిన్నుర గేలి సేసితినా
ఆల శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
వేసరక యిందుకె పో వేఁడుకొందు నిన్నును

రేకు: 0347-3 దేశి సంపుటం: 11-279

పల్లవి: ఇటమీఁది పనులకు యిట్టె వేగిరింతునా
కటకటా నే నంత కక్కూ్కరితి సేతునా

చ. 1: యెగ్గు లెంచేదాననా యే మేమి నీవు సేసినా
వొగ్గి నీకు నావయసు వొప్పింతుఁ గాక
దగ్గరి నీ కెవ్వతో తప్పుఁ జెప్పె నింతే కాక
వెగ్గళపు టలుకకు వేళ మీఁద లేదా

చ. 2: వెంగె మాడేదాననా వే రొకతెతో నవ్వితే
అంగము నీ కెక్కేనది యందుఁ గాక
మంగిట నీ కెవ్వతో ముడివెట్టె నింతే కాక
కంగి నిన్నుఁ దిట్టే నంటె కా దనేరా వొరులు

చ. 3: చలపట్టేదాననా సారె నీవు వేఁడుకొంటే
తెలిసి నీతోఁ దెప్పలఁ దేలుదుఁ గాక
బలిమి శ్రీవెంకటేశ పట్టి నన్నుఁ గూడితివి
చెలులు నాతోడివారా చేతి కిచ్చే వాపెను

రేకు: 0347-4 మాళవి శ్రీ సంపుటం: 11-280

పల్లవి: కానీ కానీ మీఁదటెత్తు కంటిమి లేరా
యినెపమె నేనుఁ జేసే నెందు వొయ్యే వీఁకను

చ. 1: సతి నిన్నుఁ గొంగు వట్టె సబలోన నండగాను
రతికిఁ దీసుక పోయ రా ననఁగానె
యితరకాంతల కెల్ల నిదె చా లాయ నీఁక
యితవై నీగుట్టు గంటి మెందు వొయ్యేవీఁకను

చ. 2: మానివి నీ నోరిలోన ముక్కవఁ దమ్ముల మిడె
పానుపుపైఁ బడఁ దోసి పట్టుకోఁగానె
ఆనుక కడమవారి కప్పు ణిచ్చిన ట్లాయ
యీనటన మాకుఁ జిక్కె నెందు వొయ్యే మీఁకమ

చ. 3: కలికి బూతులఁ దిట్టి కాఁగిలించి యంటఁ బట్టి
తలుపు మూసుక వుండెఁ దడవుగాను
లలి శ్రీవెంకటేశుఁడ లంచ మిచ్చి నన్నుఁ గూడే
విల నా కలవాటాయ నెందు వోయ్యే వీఁకను

రేకు: 0347-5 నాదరామక్రియ సంపుటం: 11-281

పల్లవి: ఏమి సేసినాఁ జెల్లురా యీవేళ నీకు
కామించి నీకుఁగా నేను కడు వలచితిరా

చ. 1: వొల్లనివాఁడ వై వుండీ వొక్కొక్క నెపము వేసి
కల్లయలుకలు గాఁ గాటారించేవు
చెల్లు లేరా నీకు నిది సేన సతులు గలరు
వెల్లవిరి నొక్కతెనె వెఱ్ఱి నైతి నేనరా

చ. 2: యెందు వోఁ దలఁచితివో యెదో పని గడించుక
విందువలెఁ బోయే నంటా వేగిరించేవు
నింద లేదురా నీకును నీ విట్టె మగవాఁడవు
అంది పొంది నేనె నీకు ఆల నైతిఁ గదారా

చ. 3: చేరి నన్ను భ్రమించి నాచిత్తము చూడ వలసి
వారి వీరిఁ జూపి నాకు వాసి రేఁచేవు
యేర శ్రీవెంకటేశుఁడ యిట్టె నన్నుఁ గూడితివి
ధారుణి నీ రప మాయ తగు లైతిఁ గదరా

రేకు: 0347-6 పాడి సంపుటం: 11-282

పల్లవి: ఏఁట తలఁ పేఁటి పొందు యీస్సీ రోఁతరా
ఆఁటదాని బతు కెల్ల ఆగడమె ఆయఁగా

చ. 1: చిత్తము రావలె నంటాఁ జెప్పిన ట్టెల్లఁ జేసితి
హత్తి యేమిటాఁ గరఁగ వయ్యో యేలరా
పొత్తుకు రానైతి నంటా పూఁచి కోపించుకొంటివి
యిత్తల నీ నా పొందులు యింతలోని వాయఁగా

చ. 2: చనవరి నయ్యే నంటా సర వెల్ల నడపితి
మనసులో తమకాలు మాన వేలరా
మునుపె నే నవ్వ నంటా మోము ముడుచుకొంటివి
వెనకటి నామే లెల్ల వేరే వేరే ఆయరా

చ. 3: కందువ నెరవు లేక కాఁపుర మెల్ల జేసితి
యిందులోన మెచ్చఁ జాల వింకా నేలరా
విందువలె నేఁటిదో శ్రీవెంకటేశ కూడితివి
చెందిన నా ఆయము నీ చేతికి లో నాయఁగా

రేకు: 0348-1 దేసాళం సంపుటం: 11-283

పల్లవి: అయ్యో ఆఁడుఁదనము అంగడి వేయఁ దగున
యియ్యెడ నేఁ బ్రియమైతే యింత పచ్చి గలదా

చ. 1: సిగ్గువడి నే నుండఁగఁ జేపట్టి తీసీఁ బైపై
యెగ్గెరఁగఁ డించుకంత యేమి సేతునే
దగ్గరనె వున్నవారు తరుణు లందరు నదే
బగ్గనఁ దాఁబైకొంటే పకపక నగరా

చ. 2: యిదివో వంచనతోడ యేమీ ననకుండఁగాను
యెదురు మాఁటాడు మనీ నేమి సేతునే
అదన నెదుటనె అత్తమామ లున్నవారు
వదరు లిం తే లంటా వారైనఁ దిట్టరా

చ. 3: ముప్పరి మంచముమీఁద మొగి నేఁ డుండఁ గాను
యిప్పుడె తా నిలుచున్నాఁ డేమి సేతునే
అప్పఁ డిదె శ్రీవెంటాద్రిపతి నన్నుఁ గూడె
దప్పి వోఁ బొరుగువారు తన్నునే పొగడరా

రేకు: 0348-2 రామక్రియ సంపుటం: 11-284

పల్లవి: ఏ మంచిదాన నై నీయెదుట నుండే నేను
వేమారు నూదితేఁ జల్ల వేఁడియ్యై తోఁచురా

చ. 1: నేనే మనిన నీకు నెరుసు లై తోఁచీని
మౌనాన నుండేఁ గాని మాఁట లాడించకురా
పూని నే దొలుతె నాకు వొల్లనివాన నింతే
తేనెలు వోయఁ బోయినా తెగి చేఁదే తోచురా

చ. 2: కడునే దగ్గరి యుంటె కావ లై తోఁచీని
యెడసి వుండేఁ గాని యిట్టె పిలువకురా
గొడవ వెట్టుక నేను గుండెబెద రైనదాన
నడుమను గోర గీరినా నే రై పారురా

చ. 3: పైకొని కాఁగిలించి బలుము లై తోఁచీని
యేకతాన నుండేఁ గాని యిక్కువ రేఁచకురా
యీకడ శ్రీవెంకటేశ యెనసితిఁ గాని నిన్నె
నీకు నే నిజ మాడితె నిష్ఠూరమై తోఁచురా

రేకు: 0348-3 బౌళి సంపుటం: 11-285

పల్లవి: ఎప్పటి కప్పుడె కాక యింత గలదా
వుప్పొలికి యినుము డౌ నొక్కరీతి వచ్చునా

చ. 1: అద్దో రమ్మనుచు నీవానలు వెట్టకువే
చద్దివల పేడ నైన సంగర మౌనో
తిద్దుబడి నీ కిచ్చినదె మాఁటపట్టు దొల్లి
వుద్దండాన తప్పుఁదారు వూహించిన ట్టుండునా

చ. 2: అండ నుండు మని నన్ను నంత వాలాయించకువే
అందుకొని మరుఁ డేడ నాయ మేసునో
మెండుగా నీకు నిట్టె మీఁ దెత్తినవయసు
బందు సేసి యెవ్వతింటి పంచపాలు సేసునో

చ. 3: కూచుండు మనుచు నన్నుఁ గొంగు వట్టి తియ్యకువే
చూచి చూచి యెవ్వ తైన సూడు వట్టునో
యేచి శ్రీవెంకటేశుఁడ యిట్టె నిన్ను నేఁ గూడితి
యిచాయతమకయిన యిఁక నెంత సేసునో

రేకు: 0348-4 సాళంగం సంపుటం: 11-286

పల్లవి: ఇల్లాలి కిది వోజా యిచ్చకమే వలెఁ గాక
వొల్లనె ఆతఁడు దానే వొద్దకయ్యీఁ గాక

చ. 1: వొత్తుకోలుమోహములు వొగి నెందాఁకా వచ్చీ
హత్తి మనసునఁ గలయంతే కాక
తత్తరించి వాని నిఁకఁ దడవకురే మీరు
కొత్తగా దయ వుట్టితేఁ గోరి వచ్చీఁ గాక

చ. 2: పూసుక వాసుక వచ్చెపొదు లెందాఁకా వచ్చీ
ఆసతోడ నంత నైతే నమరుఁ గాక
వేసరించ నిఁక నేలె వేఁగుదాఁకా నాతని
బాసతో నమ్మి వుండఁగఁ బాలించీఁ గాక

చ. 3: బలిమిఁ బట్టికాఁగిలి బడిబడి నేల వచ్చీ
అలరుఁ గరిమి సరి యైతేఁ గాక
యెలమి శ్రీవెంకటేశుఁడిప్పు డిట్టె నన్నుఁ గూడె
యిలఁ దనసొ మ్మైతి నిట్టె యేలీఁ గాక

రేకు: 0348-5 వరాళి సంపుటం: 11-287

పల్లవి: అప్పటి నిచ్చక మాడే వట్టె నాకు
తప్పని బొంకని మంచి తగవరి వౌదువు

చ. 1: చాపలాన మాయిద్దరి జగడాలు దిద్దవచ్చి
ఆపెమాఁటె వంక లొత్తే వప్పటినీవు
తీపు నీ కామాఁట లైతే తిట్టించుకొందు గాని
పోపో నే నందు కోప పోటిదొర వౌదువు

చ. 2: యెదుట మాకల్లా నిజ మేరుపరచఁగ వచ్చి
అదె పతివాది వయ్యే నప్పటినీవు
బెదరితే నీ వాకెకె ప్రియము చెప్పుదు గాని
కదిసి నన్నుఁ బట్టుకు కడు జాణ వౌదువు

చ. 3: వెడ్డు వెట్టి మమ్ము నేఁడు వేఁడుకొన నిటు వచ్చి
అడ్డము లాపెకు వచ్చే వప్పటినీవు
వొడ్డినకోపము దీర వొక రొకరిఁ గూడితి
వెడ్డవు గావు శ్రీ వెంకటేశ్వరుఁడ వౌదువు

రేకు: 0348-6 కన్నడగౌళ సంపుటం: 11-288

పల్లవి: చెప్పుడుబుద్ధు లెందాఁక చిత్తములో నిలిచీనె
యిప్పడె నాకుఁగాఁ బ్రియ మేల చెప్పేరే

చ. 1: తగులమి లేకుండతే తలఁపులో తమి లేదు
నగవులు లేకుండితె ననుపూ లేదు
తెగినపనులకును తిరిగి చూచుట రోఁత
యెగసక్కెనకు వాని నేల పిలిచేరె

చ. 2: చూపు నాఁట కుండితేను చుట్టరికమే లేదు
పై పైఁ బదర కుండితే బత్తే లేదు
తీపుల చాలనిమాఁట తిరుగ నాడుక రోఁత
యేపున వానితో మీరు యేల పోరెరే

చ. 3: జంటలు వాసి వుంటె సమ్మతించుటే లేదు
వెంట వెంట రాకుండితో వేడుకే లేదు
నంటుతోడ నన్నుఁ గూడె నమ్మ నిదె రోఁత యింక
యింటిలో శ్రీవెంకటేశు నేల కొసరేరే

రేకు: 0349-1 బలహంస సంపుటం: 11-289

పల్లవి: కానీ కానీ యిఁక నేల కడమ దీరుతు గాక
ఆన సుమ్మీ నీవు వచ్చి అట్టటు వోతేను

చ. 1: అస యిచ్చుకొని వద్ద నాతఁడు నిలుచుండఁగ
వేసిన ట్టెల్లా నీకు జెల్లదా నేఁడు
వోసరించి ముడివెట్టి వూరా కాతఁడు నవ్వఁగ
యీసునఁ జేతులు చాఁచ యిఁక నెప్పుడే

చ. 2: మంతనాన నేమో చెప్పి మౌనాన నాతఁ డుండఁగ
యెంతైనా వాదకు రాక యేల మానేవే
యింత నిన్నుఁ జేసినట్టి యీతని దూరుతు గాక
వింతగా నిన్నే మన వెఱ్ఱినా నేను

చ. 3: వొకరి ననఁ జాలక వొప్పగిం చాతఁ డుండఁగ
అకట నీ రప మాయ నట్టె కానీవే
వెకలి య్యై యిత్తరి శ్రీవెంకటేశుఁడు గూడఁగ
మొకమోట నుంటేఁ గాక మోసపొయ్యేనా

రేకు: 0349-2 దేసాళం సంపుటం: 11-290

పల్లవి: సాకిరి మీరే సుండి సతులాలా
యీకడ నన్నే నేరా లెంచ రాకు రమ్మా

చ. 1: వుడివోని తమకాన వొక టొక టాడ వచ్చీ
తడవము తాఁకము తా నేమే వీఁడు
నడుమ నే నే మన్న నానోరె గనమే
వుడుకు నూరుపుతోడ నూరకుండే నమ్మా

చ. 2: చిత్తిణిగుణముతోడ చేతులు చాచఁగ వచ్చీ
బత్తి గలవానివలె పై పై వీఁడు
అత్తినేఁ గోపగించితే నందరు నన్నే దూరేరు
కొత్త నివ్వెరగుతోడఁ గూచుండే నమ్మా

చ. 3: యెవ్వరి ముందర నైన యెమ్మెకే నవ్వఁగ వచ్చీ
పవ్వళించాఁ బోనీఁడు పదరి వీఁడు
యివ్వలఁ గడపరాయఁ డిదె శ్రీవెంకటగిరి
నివ్వటిల్ల నన్నుఁ గూడె నెయ్య మైతి నమ్మా

రేకు: 0349-3 మధ్యమావతి సంపుటం: 11-291

పల్లవి: పొదిగి మమ్ము రేఁచక పో పో నీవు
పొదరు లాడక నీవు పో పో నీవు

చ. 1: గద్దరి నీ మాఁటలకు కడ మొదలే లేదు
పొద్దు వోయ నలసితి పో పో నీవు
అద్దలించి నన్నే నీవు ఆన వెట్ట వచ్చేవు
బుద్దు లంత నేరవు పో పో నీవు

చ. 2: కడ నున్న యాఁడువారి కాలు దొక్క వచ్చేవు
పొడవులు చూపక పో పో నీవు
విడు విడు నీ సుద్ది వింతలా మా కేమి నీవు
పుడకక మమ్మంత పో పో నీవు

చ. 3: కెరలించ కంత మమ్ము కేరి నీగుట్టే చాలు
పొరుగువారు నవ్వేరు పో పో నీవు
గరిమ శ్రీవెంకటాద్రి కడపరాయఁడ నన్ను
పురిగొనఁ గూడితివి పో పో నీవు

రేకు: 0349-4 కేదారగౌళ సంపుటం: 11-292

పల్లవి: ఆన లింకాఁ బెట్టుకొనే వౌరా నీవు
కానవచ్చె నీచేఁతలె కనుకోరా నీవు

చ. 1: కొప్పుపువ్వు లవె కందె గురుతుచెమట చిందె
అప్పటినాతో బొంకే వౌరా నీవు
దప్పి దేరీఁ గెమ్మోవి తగిలెఁ గన్నులకావి
తప్పించుకొనేవు మాఁట తగురా నీవు

చ. 2: చిటిలె గందపుఁబూఁత చెక్కు లెల్లఁ గడు రోఁత
అటమటించేవు నన్నే అవురా నీవు
నిటలాన నలకలు నిండె మేనఁ బులకలు
యిటివంటివొ ట్లేల యేమిరా నీవు

చ. 3: ముక్కున నిట్టూర్పుగాలి మొగాన నిద్దురజోలి
అక్కడనుండె తెచ్చితి వౌరా నీవు
యిక్కడ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
మిక్కిలి జాణ వౌదువు మేలురా నీవు

రేకు: 0349-5 ముఖారి సంపుటం: 11-293

పల్లవి: ఎంత వడి కెంత వడి యేమి దలఁచుకొంటివో
యింత వొలిసీ నొల్లము లెరఁగ దాచెలియా

చ. 1: అప్పుడె మావిన్నపము లవధరించినవాఁడ
విప్పు డేల అడిగేవు యిం కొక్కమాఁటు
వుప్పరిగలోన నుండి వువిద నిన్ను రమ్మని
చెప్పి రమ్మన్నది యింతే చిక్కిన వెరఁగము

చ. 2: కచ్చుపెట్టి యల్లప్పుడె కాను కందితివి మాచే
వచ్చినప నడిగేవు వడి నిప్పుడు
విచ్చేయు మనుచు నింతి వెస గొంగువట్టు మని
యిచ్చె మాకు సెల వింతే యి దేమి నెరగఁదు

చ. 3: ముందె నేము రాఁగాను ముంచి నవ్వినవాఁడవు
యిందుముఖిసుద్దు లిప్పుడే లడిగేవు
కందువ శ్రీవెంకటేశ కలసె నాపె విచ్చేసి
విందు నీకుఁ జెప్పు మనె వేరు సేయ నేరదు

రేకు: 0349-6 దేసాక్షి సంపుటం: 11-294

పల్లవి: అప్పటి బీరముతోనె అట్టె వుండుదువు గాక
పిప్పి సేసినందుమీఁదఁ బిసుకఁగ వత్తురా

చ. 1: వొట్టి నీతో మాటలాడ నొల్ల నొల్ల ననఁగానె
పట్టేవు నాకొంగు బలువా యిది
చిట్టకాన వా దడిచి సిగ్గు గలవాఁడ వట్టె
గుట్టున నుందురు గాక కొసరంగ వత్తురా

చ. 2: ఆరయ నేఁ గోపగించి ఆన లెల్లఁ బెట్టఁగానె
సారె నాతో నవ్వేవు చలమా యిది
యేర నాతోఁ బంత మాడి యింటికి రా నన్నవాఁడ
వూరకే వుండుదు గాక వొరయంగ వత్తురా

చ. 3: తక్కరి నీసుద్దులకు తలవంచు కుండఁగాను
మొక్కేవు నాకు నింకా మోహమా యిది
యెక్కువ శ్రీవెంకటేశ యింత బత్తి గలవాఁడ
వక్కరతో నుందు గాక ఆగడాలు వలెనా

రేకు: 0350-1 నాదరామక్రియ సంపుటం: 11-295

పల్లవి: ఇంతలోనివాఁడవా యేరా నీవు
చెంతల నీకె యివి చెల్లురా నేఁడు

చ. 1: దగ్గరి రా వని నిన్నుఁ దమకానఁ దిట్టితేను
యెగ్గులు సిగ్గులు నెంచే వేరా నీవు
అగ్గల మై నీతోడి అంకెకత్తైనా నేను
దగ్గరినంతాఁ గలిగె తగురా నాకు

చ. 2: తప్పక చూడ వనుచు తామరఁ గొని వేసితే
యిప్పు డింతలో నలిగే వేరా నీవు
కప్పి నీకు నే నింత కంటకపుదాననా
చెప్పినంతాఁ గలిగెను చెలు లెల్ల నాకు

చ. 3: పరవశ మైతి వని పక్కన గోర నూఁదితే
యెరవుగాఁ జూచేవు యేరా నీవు
సరవి శ్రీవెంకటేశ చన విచ్చి కూడితివి
సరవు లన్నియు గలిగె చాలురా చలము

రేకు: 0350-2 పాడి సంపుటం: 11-296

పల్లవి: ఇయ్యకొన వద్దా నీ వింతట నైనా
అయ్యో యెమయ్యి నీకు ఆసపడీఁ జెలియా

చ. 1: చెక్కుల జవ్వాది జార చిరునవ్వు మోవిఁ దేర
నిక్కి చూచి మోహించె నీకు నల్లదె
చక్కని యా లలితాంగి సారె సారె మాఁటలలో
మక్కువ వలపు చల్లీ మదనరాగమునా

చ. 2: తను వెల్లఁ జెమరించి తరిపులకలు నించి
మనసు నీ కప్పగించి మలసీ నదె
అనుఁగుఁబాయపుసతి ఆడనుండి సన్న సేసి
తనుఁ దానె కరఁగీని దప్పి దేరే మోవిని

చ. 3: ముచ్చట సిగ్గులు వీఁగ ముక్కున నూర్పులు రేఁగ
యిచ్చటికి విచ్చేసె నింతలో నాపె
పచ్చిగా శ్రీవెంకటేశ పడఁతి నిన్నిటు గూడి
తచ్చన నీతో నాడీ తమకపురతులా

రేకు: 0350-3 శంకరాభరణం సంపుటం: 11-297

పల్లవి: కడవారు నవ్వేది కానవు గాక
గొడవల మమ్ముఁ జూచి గుద్దిరము లేఁటికే

చ. 1: నిండుఁ బరితాపమున నీ వేల సొలసేవు
అండనె నాతో నవ్వే వాతనిఁ జూచి
చండి పెట్టి మగవాని సాదించి వలవు మంటా
బండు సేసే యాఁటదాని బదు కేఁటి బదుకే

చ. 2: నిక్కి చూచే యాతిని నీ వేల కోపగించేవే
మక్కువ నతఁడు నాతో మాఁట లాడఁగా
వొక్కతెపై తరితీ పై వుండెటివిభునిఁ జూచి
గుక్కిళ్లు మింగేదానిగుణ మేఁటి గుణమే

చ. 3: బలిమి శ్రీవెంకటేశుఁ బగ లేల చాటేవే
కలసి యాతఁడు నన్నుఁ గాగిలించఁగా
పిలువని పేరటము ప్రియునివద్దకి వచ్చి
చలముకొనేటిదాని చల మేఁటి చలమే

రేకు: 0350-4 లలిత సంపుటం: 11-298

పల్లవి: తాలిమి చక్కన గాని తనుక మెం తైనాఁ గద్దు
మేల మాడ వయ్యు చెలి మీఁద మీఁద నున్నది

చ. 1: వనితి పువ్వులవేసి వలపు నీపైఁ బూసి
తనుఁ దానె సిగ్గుపడి తల వంచీని
మనసు నీపై బెట్టి మాఁటలు మాతో నాడీ
పెనఁగి పిలువవయ్యు పేరుకొని నీవు

చ. 2: పడఁతి నీతో నవ్వి పాయపుటాసలు దవ్వి
చిడుముడి సిగ్గుతోడఁ జెమరించీని
కడు నిన్నట్టె చూచి కాయము మాపై వేసీ
వొడి వట్టి తియ్యవయ్యు వొద్దికతో నీవు

చ. 3: కలికి నీకాలు దొక్కి కమ్మటి నీకు మొక్కి
వలవనిసిగ్గుతోడ వడఁ బడీని
నెల వై శ్రీవెంకటేశ నిన్నుఁ గూడె తన్నుఁ దానె
అలమి పైకొన వయ్యు అప్పటివి నీవు

రేకు: 0350-5 మంగళకౌశిక సంపుటం: 11-299

పల్లవి: నావలెనే నీవ నంటా నమ్మితి నేను
దేవర వవుత యింత తెలియరా నేను

చ. 1: మంతనాన నాడినట్టి మాఁట లాకెతోఁ జెప్పి
పంతానకే నవ్వేవు పలుమారును
చింత మది దరికొని శిరసున వెళ్లఁ జొచ్చె
యింతే శవుతఁ దొల్లి యెరఁగరా నేను

చ. 2: నే నిచ్చినపదకము నీ వాకె మెడఁ బెట్టి
పూని యెమ్మెలు చేసేవు పూటఁ పూఁటకు
కానీ లేరా అందు కేమి కాయ మెల్లా నుడికీని
యీ నీ గుణము నాఁడె యెంచ నైతి నేనూ

చ. 3: పీఁటమీఁద నిన్నుఁ దెచ్చి పెట్టుకొంటే నీ వాపెను
పాటించి వద్ద బెట్టుక పాయఁగ లేవు
మాటాడి నే నలమేలుమంగ నంటాఁ గూడితివి
నీటున శ్రీవెంకటేశ నేరరా నేను

రేకు: 0350-6 వరాళి సంపుటం: 11-300

పల్లవి: మంచివాఁడ వౌదవయ్య మానిన అటుండఁగాను
మంచ మెక్కి చెలులతో మాఁట లేటి వయ్యా

చ. 1: కామిని నీవు రాఁగానె గక్కన లేచి నిలిచి
దోమతెరమాటు కేఁగి తొంగి చూచీని
కోమల మయినసతిఁ గూచుండు మనమయ్య
జా మాయ నప్పటినుండి చాలు నీ సరసము

చ. 2: తప్పక నీవు చూడఁగ తరుణి సిగ్గున నవ్వి
వొప్పుగాఁ దల వంచుక వూర కున్నది
ముప్పిరి నీచేత నాకెమో మెత్తి మాటాడవయ్య
యిప్పుడు డింతవడి యాయ నేఁటికీ సరసము

చ. 3: కొంగువట్టి తియ్యఁగాను కోమలి మేను మరచి
వుంగిటి నీ మేనిమీఁద నొర గున్నది
అంగవించి శ్రీవెంకటాదిప కూడితి విట్టె
చెంగట నలమేల్ మంగచేతి దీ సరసమూ

రేకు: 0351-1 గౌళ సంపుటం: 11-301

పల్లవి: అటమీఁద నయినట్లయ్యీఁ గాని
సట లింతే తాముఁ దామే సంతము లయ్యేరు

చ. 1: పలికినంతే చాలు పచ్చి సేయకురే యింతి
నలుక దేరినమీఁద నడిగేఁ గాని
చెలవుఁ డీసుద్ది వింటే చేర వచ్చునో రాడో
కలయిక కిద్దరినిఁ గదియింత మిపుడు

చ. 2: నవ్వినపాటే చాలు నానఁ బెట్టకురే మీరు
నెవ్వగ దీరితే బుద్ది నేనే చెప్పేను
అవ్వల నీపా టైతే నాతనిఁ దేరుచ రాదు
దవ్వుల నిద్దరి సమతారుకాణ నేతము

చ. 3: తానెచూచినంతే చాలు తరువుల వెట్టకురే
మేనులు సోఁకినమీద మించీఁ గాని
ఆనుక శ్రీవెంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
పానిపట్టి యింతలోనే పంగింత మిపుడు

రేకు: 0351-2 పాడి సంపుటం: 11-302

పల్లవి: పిలువరె యింకాను ప్రియము చెప్పేఁ గాని
చల మేల నెరపీనె సారెకుఁ దానూ

చ. 1: తప్పు లెంచఁ బని లేదు తానె నే నైనచోట
కప్పురము గొమ్మనవె కపటా లేల
యిప్పుడు నాప్రియములు యిందాఁకా నియ్యకొనె
అప్పటి నేల వున్నదె ఆడనె తాను

చ. 2: కోపగించఁ బని లేదు కూడితి మిద్దర మీడ
చూపులఁ జూడు మనవె సూడుఁబా డేల
యీ పొద్దుదాఁకా మాట లియ్యకొన్నట్టె వుండె
యేపునఁ దెరలోని కే లేఁగీనె తాను

చ. 3: ఆన వెట్టఁబని లేదు ఆయా లిద్దరికి సోఁకె
పూని కూచుండు మనవె బూటకా లేలా
నేనె శ్రీవెంకటపతిఁ దానె యలమేలుమంగ
మానక కూడితి మిఁక మంచ మెక్క నేఁటికే

రేకు: 0351-3 బౌళి సంపుటం: 11-303

పల్లవి: ఎంతచెప్పినా మాన విదేరా నీవు
కాంత లైన వారి నింత కాకు సేతురా

చ. 1: యిట్టె చన్ను లంటకుర యిస్సీ యిందరుఁ జూడ
వొట్టి నీవద్దికి వచ్చి వున్న నేరమా
తిట్టుదుఁ జుమ్మీ నాతెరువు వచ్చితేఁ గన
గుట్టున నుండుదు గాని కొం తైన నోరి

చ. 2: తొడ మీఁద వేయకుర తోతో యిందరు నవ్వేరు
యెడయక దగ్గరితే నిదే పనా
కడు గోపిఁ జుమ్మీ నేను కలదె విన్నవించితి
బడలించకుర నన్ను పలుమారు నోరి

చ. 3: పచ్చిమాఁట లాడకుర పడఁతు లెల్లా వినేరు
అచ్చ మై నే నీతో మాట లాడినందుకా
యిచ్చగించి శ్రీవెంకటేశ నిన్నుఁ గూడితి
నిచ్చ నలమేలుమంగ నేఁ జుమ్మీ వోరి

రేకు: 0351-4 సాళంగనాట సంపుటం: 11-304

పల్లవి: మొక్కరో మొక్కరో మీరు మోమునఁ గళలు దేరె
యెక్కువ శ్రీవెంకటేశుఁ డింతులో వాఁడె

చ. 1: తేరుమీఁద నెక్కి హరి దేవుళ్లుఁ దానును వాఁడె
భోరునను దేవదుందుభలు వాఁగగా
తోరపుమోఁకులు వట్టి దొరలు బ్రహ్మాదు లెల్ల
ధీరతఁ దీశే రదే తిరువీధులందును

చ. 2: వేడుక రథముమీఁద వెలసే శ్రీపతివొద్ద
ఆడేరు పాడేరు అచ్చర లెల్ల
నీడెపు సెలవులతో వెలఁదులతో హరి
యీడు లేక యేఁగి వచ్చీ నింటింటి వాకిటను

చ. 3: శ్రీవెంకటేశుఁడు వాఁడె చేరి యలమేలుమంగ
సావధానమున సరసము లాడఁగ
దేవాసనం బెక్కి తేఁకువ నారగింపులు
వావిరిఁ జేకొనో వాఁడె వాడవాడలను

రేకు: 0351-5 ఆహిరి సంపుటం: 11-305

పల్లవి: ఇందుకా యింత సేసితి విందాఁకాను
అంది పొంది నీవే బదు కాఁటదాన నేనూ

చ. 1: వొలిసీ నొల్లనివాఁడ వూరకే ఆ సియ్యనేల
పొలసి అప్పుడే నన్నుఁ బొమ్మన రాదా
కులికి నేఁ గొసరఁగఁ గోమటిమేనరికమా
నెల వై సుఖాన నుండు నీవే వొక్కఁడవే

చ. 2: మనసు రానివాఁడవు మాతో నవ్వఁగ నేల
అనువు గాదని విడనాడఁగ రాదా
చనవున నిన్ను నాఁగ పరిఁ బత్రసాలామా
యెనయుచు నేకరాజ్య మేలవయ్యా నీవే

చ. 3: మాయలు సేసేవాఁడవు మమ్ము జాలిఁ బెట్టనేల
రాయి డేల మా యింటికి రా నన రాదా
ఆయ మంటి కూడితివి అలమేలుమంగ నేను
పాయపు శ్రీవెంకటేశ బడి నుండు మిఁకను

రేకు: 0351-6 వరాళి సంపుటం: 11-306

పల్లవి: ఎంత వని కెంత వని యిది యేఁటిదే
పంతమె సతుల కిది పాలతోడఁ బోసిరో

చ. 1: నవ్వుతా నే నన్నందున నాలి నెగ్గు సేసుకొని
యివ్వల నట్టె మాటాడే విది యేమె
పువ్వువంటి యాఁట దైతేఁ బొగరు ముంపుఁదనమె
నివ్వటిల్లునో కాక నీకే తెలసునే

చ. 2: తప్పక చూచినందుకే తగఁ గోపము సేసుక
కొప్పు దువ్వినఁ గసరుకొనే వేమే
చిప్పిల జవ్వని యైతె చెంది యాడ లేని వాసు
లెప్పు డెం దుండి వచ్చునో యెరఁగమే నేము

చ. 3: సరస మాడినందుకె చాల నలుక సేసుక
వొరసి చేయి వట్టిన నులికే వేమే
యిర వైన శ్రీవెంటేశుడ నిన్నుఁ గూడితి
గరిమె నిచ్చగించితి కడు మేలె నీవు

రేకు: 0352-1 ముఖారి సంపుటం: 11-307

పల్లవి: ఓసి పోపో నీకు నేమె వుండఁబట్టదా
వాసులు రేసు లెక్కించి వాదుకు వచ్చేవా

చ. 1: నిరతి నామీఁదట నీ కోప మెంత గల్ల
సొరిది యాతనిమీఁదఁ జూపవే పోయి
మరిగినవారితోడ మాటలాడఁ బాసెనా
వరుస నిల్లురి కేల వాదుకు వచ్చేవే

చ. 2: సారె సారె న న్నెంత సాదించఁ గలిగినాను
మేర మీరి నీ వాతనిమీఁద వెళ్లించు
కూరిమి గలుచుచోటఁ గూడినదె నేరమా
వారి వీరి మాట కేల వాదుకు వచ్చేవే

చ. 3: మలసి నామీఁదట మచ్చర మెంత గల్లాను
నెలవుగా నతనిపై నెరపఁగదే
యెలమి శ్రీవెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వలవనిజోలి నేల వాదుకు వచ్చేవే

రేకు: 0352-2 నాదరామక్రియ సంపుటం: 11-308

పల్లవి: ఆసలును రేసులను అవి రెండు నేలే
కాసు సేయనిపనికి కాఁతాళ మేలే

చ. 1: అలిగినవాఁడు తా నారడనే వుండుఁ గాక
పిలిచి వాదుకు వచ్చి పెనఁగ నేలే
కలయనివాఁడు తాను కడు వాసి నుండుఁ గాక
వొలిసి దగ్గరి తగవుకుఁ దియ్య నేలే

చ. 2: మాటలాడనివాఁడు తా మారుమో మై వుండుఁ గాక
తేటలుగా సారె మమ్ముఁ దిట్టఁగ నేలే
నీటున నుండెటివాఁడు నిక్కము బిగుసుఁ గాక
చీటికి మాటికి మాపైఁ జెయి చాఁచ నేలే

చ. 3: కాఁకలు సేసెటివాఁడు కన్నులనె చూచుఁ గాక
యేఁకటఁ గాఁగిలించీ నన్నింతలో నేలే
వేఁకపు శ్రీవెంకటాద్రివిభుఁ డిట్టె నన్నుఁ గూడె
మాఁకువలె నన్ను మేను మరపించ నేలే

రేకు: 0352-3 శ్రీరాగం సంపుటం: 11-309

పల్లవి: ఏఁటికి జాగులు సేసే రింకా మీరు
చాటి చెప్పి పతి నిట్టె జరయరమ్మా

చ. 1: వలచినవలపులు వనితమేనిమీఁదికి
పులక లై మొలచె నిప్పుడు చూడరే
యెలమిఁ గాఁక లనేటియెన్నులు వెళ్ళక తొల్లె
నెల వై చలిమందులు నించరమ్మా

చ. 2: చిత్తములో చింత లెల్ల చెమట లై సతిమేన
జొత్తులు గారఁగఁ జొచ్చె జూడరె యిది
యెత్తనతమకముల యేరులు వారక తొల్లె
వొత్తి పువ్వుఁబొట్లాల నొగిఁ గాఁచరమ్మా

చ. 3: కడ లేనిజవ్వనము కలికి నిట్టూరుపులై
విడువక చెలరేఁగి వేఁచఁ జొచ్చెను
తొడరి విరహ మనేదుమ్ములు రేఁగక తొల్లె
అడరి శ్రీవేంకటేశుఁ డాదరించె నమ్మా

రేకు: 0352-4 శుద్ధవసంతం సంపుటం: 11-310

పల్లవి: అందుకే వెర గయ్యీనె అప్పటనుండియు మాకు
అందినవారికి మిన్ను అరచేతిదే

చ. 1: పతిమాఁటాడ విదేమే పలుమారుఁ దమకాన
అతఁడు నీతో మాట లాడఁగాను
యిత వై యెక్కినవారి కేనుగ గుజ్జన్న మాట
కతలుగా నీయందె కంటిమే నేము

చ. 2: గక్కన రావది యేమె ఘనుఁడు నవ్వుతా నిన్ను
తెక్కులనె చేయి వట్టి తియ్యఁగాను
నొక్క టై పాలు వోసితే వోకివింత లన్నమాఁట
మిక్కిలి నీవల్లనె మెరసెనే నేఁడు

చ. 3: శ్రీవెంకటేశ్వరుఁడు చేయి నీపై వేయఁగాను
నోవ దనక వాఁడిచన్నుల నొత్తేవు
పూవులవేసినవారిఁ బొంచి రాల వేసినట్టి
భావము నీయందె కంటి భళి భళి గుణములూ

రేకు: 0352-5 ఆహిరి సంపుటం: 11-311

పల్లవి: కాదనేనా నీమాట కానీ లేవే
నాదె నేమి చూచేవు నవ్వేఁ గానీ లేవే

చ. 1: నమ్మించి నీవు వానినయగారాలు చెప్పఁగ
కమ్మి నామై కాఁక రేఁగె కానీ లేవే
నెమ్మది వాని నిజాలు నీవు గల్లలాడే వటే
అమ్మరో ఆన వెట్టకు మట్టె కానీ లేవే

చ. 2: పిలిచీ ననుచు వాని ప్రియము నీవు చెప్పఁగ
కలిగెఁ బెద్దరికము కానీ లేవే
నెల వై వానిచేఁతలు నీవు నాకు దాఁచే వటే
అలుక లన్నియుఁ దీరె నట్టె కానీ లేవే

చ. 3: శ్రీవెంకటేశ్వరుని చేతికి నీ వియ్యఁగాను
కైవస మయితి నట్టె కానీ లేవే
నీవల్లనే కాదా నే మిద్దర మొక్క టైతి
మావటించి యిఁకఁ బాయ మట్టె కానీ లేవే

రేకు: 0352-6 ముఖారి సంపుటం: 11-312

పల్లవి: ఎవ్వరికి బుద్ది చేప్పే నెఱఁగ మరి
యివ్వల నే నుండదాన నెఱఁగ మరి

చ. 1: చెక్కు చెలిచేత నుండె నింత మదిలోన నుండె
యిక్కడికి నే వచ్చితి నెఱఁగమరి
పక్కన నంపవు మమ్ము పదరి నీవు రావు
యెక్కు నీ చిత్త మొట్టో యెఱఁగ మరి

చ. 2: పుమ్మచెమటలఁ దోఁగె నువిద కాఁకల రాఁగె
యిమ్మల నన్నిడ కంపె నెఱఁగ మరి
కొమ్మసుద్దు లడిగేవు గుట్టునఁ దల వంచేవు
యెమ్మె లేమి సేసేవో యెఱఁగ మరి

చ. 3: యిందాఁకాఁ దమకించె యింతి యిట్టె పవ్వళించె
యిందున్నదాన నేను యెఱఁగ మరి
అంది శ్రీవెంకటేశుఁడ ఆడకె నీవు విచ్చేసి
యిందుముఖిఁ గూడితివి యెఱఁగ మరి

రేకు: 0353-1 దేసాక్షి సంపుటం: 11-313

పల్లవి: అప్పటి మానవుబీరాల దేమే నీవు
యిప్పు డేమి దప్పి పోయ నిఁకఁ జూడ రాదా

చ. 1: యేతు నీకుఁ గలిగితే నెందైనాఁ జూపుదు గాక
ఆతని నావద్దఁ దిట్టే వదేమే నీవు
నీ తెరువు వచ్చితిమా నీ కేమి గారణమె
తోతో నా రమణుని దూరుదు గాక

చ. 2: బలువు గలిగితేను బతుకుదు గా కతని
అలమేవు నా యెదుట నదేమే నీవు
తలవే నిన్నుఁ దడవ దగ్గరి నాయకుని
వలసినట్టు సేసితే వద్దనేవా నీవు

చ. 3: వాసి నీకుఁ గలితేను వద్దఁ బెట్టుకుందు గాక
ఆస పడేవు నాపతి కదేమే నీవు
యీసరి శ్రీవెంకటేశుఁ డిందరిఁ గూడినమీఁద
గోస నాస నేయఁ బోతే కోప మేలే నీకు

రేకు: 0353-2 రామక్రియ సంపుటం: 11-314

పల్లవి: మేరతో నే నుండఁగాను మీచేతి బాద బెట్టు
పూరకున్నవారి నేల వుడికించేరే

చ. 1: వొట్టి పతికిఁ బాదము లొత్తి వచ్చితి నిందాఁకా
యిట్టె యలిగితి నంటా నేల పోరేరే
వెట్ట దీరఁగ సురటి విసరితి నాతనకి
చిట్టకాన కింకా నేమి సేయు మనేరే

చ. 2: సన్నతో నేనిందాఁక సముకాననే వుంటి
చిన్నఁబోతి నంటా నేల చేయి వట్టెరే
మున్నె యాతనూడిగాన ముక్కు చెమట జారితే
కన్నీరు రాలె నంటా గడియించే రేటికే

చ. 3: ముక్కువ శ్రీవెంకటేశు మాటలు వింటి నిందాఁక
వొక్కటి గమ్మంటా నేల వొడి వట్టేరే
అక్కరతో నాతఁడె ఆదరించి నన్నుఁ గూడె
మొక్కనైతి నంటా నేల మొరఁగు లాడేరే

రేకు: 0353-3 తెలుఁగుఁగాంబోది సంపుటం: 11-315

పల్లవి: అందరూ విన్నవి నే నాడేఁ గాని
సందడింపుమేకులకు చాలఁ బో నేనూ

చ. 1: సేయ రానిపను లైనఁ జేసేఁ గాని
వో యయ్య నీ వినయము లొల్లఁ బో నేను
పాయరానిరాజసాన బడేఁగాని
వే యైన నీయానలు వినలేఁ బో నేనూ

చ. 2: నగవు రాకుండినను నవ్వేఁ గాని
వొగరు మోహము చల్ల నోపఁ బో నేను
మొగమోటఁ గొండెత్తిన మోచేఁ గాని
తెగువతో నీ గుణము తిద్దలేఁ బో నేనూ

చ. 3: వొదిగి పానుపుమీఁద నుండేఁ గాని
చెదర నిన్నింత పచ్చి నేయఁ బో నేను
పొదిగి శ్రీవెంకటేశ భోగించితి నీవు
వెదకి నీ వెం దున్న విడువలేఁ బో నేనూ

రేకు: 0353-4 సామంత సంపుటం: 11-316

పల్లవి: పో పో యిదేడ సుద్ది పోయినది వో నీవే
రేపు మాపు నిదే పనే రేసు లేల పెంచేవు

చ. 1: పంతములే ఆడేవు పట్టేవు చలము
యింతులకుఁ బతిమీఁద నింత గద్దటే
కొంత నీచెక్కు నొక్కఁగ గోరు దాఁకె నింతే కాక
అంత నీతోఁ బగ పాడే అతఁడు వో చెలియ

చ. 2: పిలిచితేఁ గసరేవు పెనఁగితే విసిగేవు
వలచినయీతనితో వాదు లేఁటికే
బలిమి నిన్నుఁ బట్టఁగ పాపట చెదరెఁ గాక
వలె వలె నని నీతో వాదులకు వచ్చెనా

చ. 3: నిట్టూర్పు నించేవు నివ్వెరగుఁ బొందేవు
యిట్టె శ్రీవెంకటెశు నేఁప నేఁటికే
గుట్టుతోఁ గాఁగిలించఁగఁ గొప్పు వీడె నింతె కాక
తొట్టిన రతులోన దొమ్మి సేయ వచ్చెనా

రేకు: 0353-5 రామక్రియ సంపుటం: 11-317

పల్లవి: మగవాఁడు వలచితే మరి చేతఁ బట్ట రాదు
తగుదునా నే నీకు తమకించే విపుడు

చ. 1: ఆన వెట్టకుర నీ వన్నట్టె వినేఁగాని
మాన వెంత చెప్పినా నీ మంకువోజలూ
కాని మ్మన్నా మొక్కేవు కాఁ గాని దోసాన
నే నెంత నీ వెంత నీకు నేఁబాఁ తైతిఁగా

చ. 2: చెక్కు నొక్కకుర నీవు చెప్పినట్టే సేసేఁ గాని
యిక్కడ నవ్వేవారి నెఱఁగ వోరి
యిక్కువ లంట వచ్చేవు యెంగి లని చూడవు
చక్కనివాఁడవు నే నీసాటికి రాఁ గలవా

చ. 3: పొగడకురా నేనీ పొందులు విడువఁ గాని
నగవులు మానవు నాతో నీవు
తగు లై శ్రీవెంకటేశ తతి నన్నుఁ గూడితివి
మొగము చూచే వింకా మోహ మింత గలదా

రేకు: 0353-6 రామక్రియ సంపుటం: 11-318

పల్లవి: ఈ కోపా లీతాపా లిట్టె వుండీనా
సాకిరి నేఁ దేలిపేఁగా సాదించేదానిని

చ. 1: ఆతఁ డీడకు రాఁగానె ఆన వెట్టుకొందు గాక
కాతరానఁ జెప్పి పంపఁ గారణ మేమే
యీతల నీ రమణుఁడు యెదుట నిలిచితేను
చూతము వో యిట్లనె సొలసెటిదానిని

చ. 2: వోడక నిన్ను రమ్మంటే నొల్ల నందు వింతే కాక
ఆడ నుండఁగానె లేక లంప నేఁటికే
కూడనివారే తమిఁ గూడేరు యిప్పు డెట్టె
తోడనె పంగించేఁ బో తొలఁగెటిదానిని

చ. 3: పెల్లున నీ వొద్దికె పిలిపించు కొందు గాక
యిల్లురికి వచ్చి వాదు లివి యేఁటికే
వొల్లనె శ్రీ వేంకటేశు డొద్దికతో నిన్నుఁ గూడె
పల్లదాన నవ్వేఁ బో పాసియుండేదానిని

రేకు: 0354-1 బౌళి సంపుటం: 11-319

పల్లవి: చెక్కిటఁ బెట్టెను చేయి చిత్తములో నదే నుయ్యి
యెక్కడికిఁ బోరాదు యిఁక నీచిత్తము

చ. 1: జవ్వనపు పైతరపు సతితురుము బరవు
యెవ్వరు విలిచిన నెర వెరపు
యివ్వల నీ విదె చూడు మిదివో నెమ్మోవివాడు
రవ్వ లాయ నీ వలపు రావయ్య యిఁకను

చ. 2: చిగురుఁబులకపైరు చిత్తడిచెమటనీరు
పగటుగుబ్బలమీఁద పయ్యద జారు
నగకు మాతో నింత నాతికి నంతా వింత
వెగటాయ నీమాయ విడవయ్య చలము

చ. 3: కాయములోని యలపు కనుఁగొనల సొలపు
చాయల సన్నలలోని సారె బులుపు
యీయెడ శ్రీవెంకటేశ యింతిన నీవు గూడఁగా
తోయ రాదు నీ చనవు తోడఁ దోడ నిదివో

రేకు: 0354-2 ముఖారి సంపుటం: 11-320

పల్లవి: లోలో నాతనిచేఁత లోక మెఱఁగదు గాని
యేలీల నన్నే దూరే రేమి నేతు నమ్మా

చ. 1: చిఱునవ్వు నవ్వఁగ చేయి వట్టీ నాతఁడు
గుఱిగా నే వద్దంటేఁ గోప మనేరు
అఱిముఱిఁ దానె సాదు అందిరికిఁ జూడఁ జూడ
యెఱుకతో నేనే వెట్టి నేమి సేతు నమ్మా

చ. 2: వూరకె న న్నాతఁడు వొడివట్టి తీసీని
తారి నే రా నోప నంటేఁ దప్పు సేసేరు
వారక తానె మంచివాఁడు విన్న కన్న వారి
కీ రీతి నే నిష్ఠూరి నేమి సేతు నమ్మా

చ. 3: కడ నేఁ గూచుండఁగాను కాగిలించుకొనీఁ దాను
జడిసి నే నుండితే రాజస మనేరు
విడువక నన్నును శ్రీవెంకటేశుఁ డిదె కూడె
యెడసి నే నుండఁ జాల నేమి సేతు నమ్మా

రేకు: 0354-3 బౌళి సంపుటం: 11-321

పల్లవి: తొల్లిటివలెనా నీవు దొర వైతివి
యెల్లవారుఁ జూడఁగా నేనే మందు నిఁకను

చ. 1: యేరా నే వద్ద నుండఁగ యెవ్వతెదిక్కు చూచేవు
మేర మీర దొరకొంటి మెల్ల మెల్లనె
తేరా నా వుంగరము తెలిసితి నీ గుణము
వోరి నీతో జగడించ నోపరా నే నిఁకను

చ. 2: నా యెదురుకట్టులనె నవ్వఁ బొయ్యే వాపెతోడ
యీయెడ నప్పుడె యెంత కెత్తుకొంటివి
చేయి విడువర నీతో చెలిమి నా కయి వచ్చె
చాయలు నే వెంగె మాడఁ జాలరా నిన్నిఁకను

చ. 3: యిట్టె నా యింటనుండి యిల్లురికి మాటాడేవు
తిట్టీ నంటా నాపె నిదె సందుగా
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
పట్టినచలము చెల్లె బ్రదుకరా యిఁకనూ

రేకు: 0354-4 దేసాళం సంపుటం: 11-322

పల్లవి: ఊరి మగనాండ్లకు నుండఁ బాసెను
యీరీతి నన్నింత సేసె నే మందు నమ్మా

చ. 1: వొల్ల ననఁగానె వచ్చి వొక టొకటె యాడి
చెల్లఁ బో వీఁడు నా చేయి వట్టీని
పల్లదపు వీనిచేతి బాధకుఁ గాక నేను
యిల్లిదె నే లోనయితి నిఁక నేఁటి దమ్మా

చ. 2: తల వంచు కుండఁగానె దగ్గరి వద్దఁ గూచుండి
చలి వాయ మాట లాడీ జాణతనాలు
చలపాది వీనిచేతి చండకు నోపక నేను
చెలరేఁగి కాఁపురము సేసితి నో యమ్మా

చ. 3: యింటివారికి వెరవఁ డెదుట నవ్వులు నవ్వి
చంటిమీఁద నొరగుచు సట సేసీని
వెంటఁ బాయ కిది వో శ్రీవెంకటేశ్వరుఁడు గూడె
దంట నై వీనిమాయఁ దగిలితి నమ్మా

రేకు: 0354-5 శంకరాభరణం సంపుటం: 11-323

పల్లవి: మా కేమి నీ వెంత మట్టు మీరి తిరిగిన
లోకమువారే నవ్వేరు లో వెలుతు లేలరా

చ. 1: ఆనలు నే కేమిటికి నంత నిజమరి వైతే
కేనాన నీవే బదికేవు గాక
వూని యన్నీ విన్నదాన నుండఁజాల కొక టంటే
కోనలఁ దెలుపు మంటా కొంగు వట్టే వేమిరా

చ. 2: తారుకాణ లేఁటికి తప్పు లేనివాఁడ వైతే
పేరడి నాచారములు పెంచేవు గాక
కేరి నీవు రాకుంటే వెంగెములు ని న్నాడితేను
పోరి పోరి పోయినిది పోనియ్య వేమిరా

చ. 3: వట్టిమాఁట లేఁటికి వలచినవాఁడ వైతే
అట్టె అన్నిటను జాణ వయ్యేవు గాక
యిట్టె శ్రీవెంకటేశ యిందుకె నిన్నుఁ గూడితి
దెట్టతెరుపున నన్నుఁ దేలించే మేమిరా

రేకు: 0354-6 ముఖారి సంపుటం: 11-324

పల్లవి: ఏమి నేరుచుకొంటివే యెంత కుచ్చితురాలవే
జాము వోయినా మానవు చలమే సాదించేవు

చ. 1: చూడఁ జాల వేమే యే సుదతితో మాటాడిన
యేడా చుట్టాలు లేరా యెవ్వరి కైనా
కూడీఁ గూడక తొల్లె కొడిమెలే కట్టేవు
వాడలో నుండ బాసెఁగా వన్నెమగవానికి

చ. 2: వుడికి పడే విదేమే వూరివారితో నవ్వితే
విడువ కెవ్వరి కైనా వేడుకె లేదా
కడ నున్నవారిమీఁద కానివావులు వేసేవు
తడవి మగవానికి తల యెత్తఁ బాసెఁగా

చ. 3: చిన్నఁబొయ్యే విది యేమే చెలుల నేఁ బిలిచితే
యెన్న కె ముచ్చట లేదా యెవ్వరి కైనా
చెన్నుగా నుర మెక్కితి శ్రీవెంకటేశుఁడ నేను
యిన్నిటాఁ గూడ బాసెఁగా యితరకాంతలను

రేకు: 0355-1 భైరవి సంపుటం: 11-325

పల్లవి: పంతము చెల్లెను నీకు పదర నేలే
చింత దీర పతిమాట చేకొందు గాక

చ. 1: అలిగినరమణుఁడె అట్టె నిన్నుఁ బేరుకొని
పిలిచినమీఁద నింక బిగు వేఁటికే
తల వంచు కుండఁగాను తగ నీపైఁ జేయి వేసి
కలయఁగ నీలోని కపటము లేఁటికే

చ. 2: చేసన్నల రానివాఁడె చెట్ట వట్టి తియ్యఁగాను
వాసుల వంతులతోడి వాదు లేఁటికే
ఆసల నీ వద్దనుండి అట్టె తానె ఆన వెట్టి
సేస చల్లే పతిమీఁద చిడుముడి యేలే

చ. 3: యింటికి రానట్టివాఁడె యిటు నిన్ను వేఁడుకొని
వెంట వెంట రాఁగానె వేస టేఁటికే
అంటుక శ్రీవెంకటేశుఁ డాతఁడె నిన్ను గూడె
జంటయి వుందురు గాక చల మింకా నేలే

రేకు: 0355-2 రామక్రియ సంపుటం: 11-326

పల్లవి: చెప్పరమ్మ మీరు బుద్ది చెలులాల
యిప్పటికోపము మీఁద నిట్టె వుండీనా

చ. 1: చిగురుఁబెదవి వంచి సిగ్గులనె గొణఁగీని
వెగటునఁ బతి దన్ను వేఁడుకోఁగాను
నగుతాఁ బయ్యెదకొంగు నాథుఁడు పట్టఁ బట్టఁగ
జగడించి లోని కేఁగీ సమ్మతించ కదివో

చ. 2: సరుస నవ్వులు దీర సతి యాన లెల్లఁ బెట్టీ
బెరసి విభుఁడు దన్ను బిలువఁగను
పరిమిళము లతఁడు పైపైఁ బూయ బూయఁగ
తెరచీరఁ దుడిచీని తీసి తీసి యదివో

చ. 3: చెమట చెక్కున జార సిరసు వంచుకొనీని
సుముఖుఁడై శ్రీవెంకటేశుఁడు గూడఁగ
అమరఁ గమ్మటి నాతఁ డాయము లంట నంటఁగ
తమితోఁ దిప్పించుకొంటా తాఁ దా నేర్పీ నిదివో

రేకు: 0355-3 పాడి సంపుటం: 11-327

పల్లవి: సిగ్గుగ లాఁటదానికి చెప్పించుకో నింత యేల
దగ్గరి వుండుటె చాలు తడవకు మమ్మును

చ. 1: వొలిసీ నొల్లని నిన్ను వొడివటి తీయుకంటే
అలిగి నేఁ బవళించు టదియే మేలు
పిలువకుండఁగ నీవు పెనఁగి పైఁ బడుకంటే
తల వంచుకొని వుండే తడవకు మమ్మును

చ. 2: కడు రాజసపు నీతో కలకల నవ్వుకంటే
చిడుముడిఁ జిన్నఁ బొయ్యే చింత మేలు
జడిసి వుండిన నీతో చనవు చెప్పుటకంటే
తడతాఁకులఁ బొరలే తడవకు మమ్మును

చ. 3: కపటాలు సేసే నిన్ను కాఁగిలించుకొనుకంటే
నెపముతో నూరకుండే నీటే మేలు
యిపుడె శ్రీవెంకటేశ యేకమై నన్నుఁ గూడితి
తపము ఫలించె నిఁకఁ దడవకు మమ్మును

రేకు: 0355-4 బౌళి సంపుటం: 11-328

పల్లవి: మేరకు మేరే కాక మీర నేఁటికే
నేరుపులు చాలు జాలు నెరవేరెఁ బనులు

చ. 1: వద్దు వద్దేమీఁ దడవకురే మీరు వా
రిద్దరు లోన నుండఁగ నేలే దోసము
కొద్ది మీరి దగ్గరితే కూళ వందురు
తిద్ద నేల పను లెల్లఁ దీరినమీఁదటను

చ. 2: చేకొని మీ రెరుకలు సేసుకొందురా వా
రేకత మయినవేళ యేలె దోసము
కాకు నేయఁ బోతే నన్నే కల్లందురు
లోకమువారే చెప్పేరు లోలోనే వారికి

చ. 3: తెక్కులవాకి లిప్పుడే తెరవకురే వా
రిక్కువఁ గరఁగేవేళ యేలే దోసము
మొక్కి శ్రీవెంకటపతి మొకమోట నన్నుఁ గూడె
నెక్కుడు మా టేల పంత మిచ్చినమీఁదుటనూ

రేకు: 0355-5 శ్రీరాగం సంపుటం: 11-329

పల్లవి: ఇంక నెన్నఁడె నీ యెమ్మెలు నేఁడు గాక
అంకెల నాతఁడు నీ వాడినట్టె యాడఁగా

చ. 1: చెల్లదా నే కేమి నేఁడు చెలువుని వలపించి
యిల్లు వెళ్లకుండాఁ జేసి యింత సేసితి
పల్లదాన నన్నటిని పంత మాడే వేమి దొడ్డె
కెల్లు రేఁగి ఆతఁడు నీ కింకరుఁ డై యండఁగా

చ. 2: తగదా నీ కే మతనిదండనుండి సవతులఁ
బగలు సాదించ నీవె పనిగొనను
నగ నేలె యాతఁడు నీ నటనకుఁ దగినట్టు
చిగులుతా సారె సారెఁ జెప్పినట్టు సేయఁగా

చ. 3: మేలు గాదా యిందరిలో మించి శ్రీవెంకటేశ్వరు
నాల వై మావంటివారి నాదరించేవు
సోలుచు నీ రాజసాలు చూపేవు నీ కెదు రేది
వేళ గాచి యతఁడు నీ వెంట వెంట రాఁగా

రేకు: 0355-6 సామంతం సంపుటం: 11-330

పల్లవి: తత్తరపు నీలోని తాపము మానితేఁ జాలు
యిత్తల మీఁదటి పను లెట్టయినాఁ గాని

చ. 1: పక్క నుండఁగానె నన్ను భ్రమసి పేరఁ బిలిచే
వెక్కడ పరా కైతి వేరా నీవు
తక్కక నీవు మోహించేదాని గుఱుతు చెప్పరా
యిక్కడికిఁ దోడి తెచ్చే యె గ్గినాఁ గాని

చ. 2: ఆకు మడి చియ్యఁగానె అవ్వలఁ జేయి చాఁచేవు
యేకడ వున్నది చిత్త మేరా నీవు
ఆకెతో నీకు నే మని ఆతుమ చెప్పవలసె
చేకొని నాతోఁ జెప్పర చెప్పి వచ్చేఁ గాని

చ. 3: నేమాన నేఁ గూడఁగాను నిలువెల్లఁ గరఁగితి
వే మాఁట దలఁచుకొంటి వేరా నీవు
యేమిర శ్రీవెంకటేశ యెవ్వతె జగడించెరా
కామించి యాన తీరా వొక్కటి సేసేఁ గాని

రేకు: 0356-1 సాళంగం సంపుటం: 11-331

పల్లవి: నీ చెయ్యే మీఁ దాయ నీకుఁ జెల్లురా నిన్ను
యేచి వలపుల బయ లీఁదించ నైతిరా

చ. 1: మంచివానివలెనె మాట లాడఁ బిలిపించి
కంచముపొత్తుకుఁ దీసి కాకు సేసేవు
వంచనతో దవ్వులనె వట్టిగట్టు చేసి నిన్ను
పెంచి నీచేఁ బ్రియము చెప్పించ నేర నైతిరా

చ. 2: బత్తి గలవానివలె పానుపుమీఁదికిఁ దీసి
హత్తి సిగ్గువడ నంటా నట్టె నవ్వేవు
కొత్త సతులవలెనె గొందులనుండి నిన్ను
తత్తరాన నాడ కెడతాఁకించ నైతిరా

చ. 3: యిచ్చకునివలెనె యెలయించి నన్నుఁ గూడి
అచ్చల నా సుద్దులెల్ల నాడుకొనేవు
మెచ్చుగా శ్రీవెంకటేశ మేర మీరి ఆవేళనె
కచ్చు పెట్టి నీ మోవి గంటి సేయ నైతిరా

రేకు: 0356-2 దేసాళం సంపుటం: 11-332

పల్లవి: కడుఁ బసిబాలుఁడవు కటకటా
యెడతాఁకి బడలితి విటువలెఁ గలదా

చ. 1: యేయడనుండి నా యన్న యిపు డాడి వచ్చితివి
కాయ మెల్లఁ జెమరించెఁ గటకటా
బాయిట నాడుతా నెంత పరువులు వెట్టితివో
యీయెడ బుస కొట్టేవు యిటువలెఁ గలదా

చ. 2: విందుల నెవ్వరియింట వేఁడిపా లారగించితి
కందువ నీ మోవి వొక్కెఁ గటకటా
మందలించి యా డేడ మడుగులు చొచ్చితివో
యందు నీమ్మై గరుపారె నిటువలెఁ గలదా

చ. 3: యెన్నెన్నిచోట్ల నీవు యేమి సేసి అలసితో
కన్నుల నిద్దుర దేరీఁ గటకటా
పన్నిన శ్రీవేంకటాద్రి బాలుఁడ వై నవ్వేవు
యిన్ని నీవే యెరుఁగుదు విటువలెఁ గలదా

రేకు: 0356-3 బౌళి సంపుటం: 11-333

పల్లవి: చాలుఁ జాలు నాతోడి చల మేఁటికి
ఆలరి వై వుడికించి ఆదరించ నేఁటికి

చ. 1: జల్లజంపు గాఁకతోడ జాగులు సేయ నోప
అలాడ నేకాంత విరహమే చాలు
పెల్లున నప్పటి నన్నుఁ బిలవకురా నీవు
యిల్లిందాఁకా కాఁకఁ బెట్టి యిఁక నేల ప్రియము

చ. 2: పలు మంచిమాటలనె భ్రమఁబడ నోప నాకు
అలర నీతో వావాద మయినా మేలు
తల యెత్తి మోము చూపి తగులకురా నన్ను
వొలసీ నొల్లక వుండి వూరడించ నేఁటికి

చ. 3: బేసబెల్లి కాఁగిటిబిగువుకు నే నోప
రేసులతో నవ్వు నవ్వే వాసులే మెచ్చు
ఆస యిచ్చి శ్రీవెంకటాధిప నన్నుఁ గూడితి
వేసటగా నలయించి వేఁడుకొన నేఁటికి

రేకు: 0356-4 తెలుఁగుఁగాంబోది సంపుటం: 11-334

పల్లవి: ఏల మమ్ము భ్రమయించే రింతులాల
తేలించేరు మాటలనే తెరవలాల

చ. 1: సిగ్గులు యెగ్గులు వాసె చీఁదక చీమిడి వాసె
దగ్గరి మీ రుండితేఁ దరుణులాల
వొగ్గితి మెంగిలితమ్మ కొకయింత దయ లేదు
వెగ్గళించే రప్పటిని వెలఁదులాల

చ. 2: పాపము లన్నియుఁ దెగె బంధము లన్నియునూడె
కొపగించుకొంటే మీరు కొమ్మలాల
తీపుల మా దేహము తెగ నమ్మితిమి మీకు
యేఁపుల నేల పెట్టేరు యిట్టె సతులాల

చ. 3: దావతిపాట్లు మానె తరవు లుడిగెను మా
తోవ రాకుండితేఁ జాలు తొయ్యలులాల
శ్రీవెంకటేశ్వరుఁడు చేరి మమ్ము దయ నేలె
చేవ దేరె మీకు మాకుఁ జెలులాల

రేకు: 0356-5 సామంత సంపుటం: 11-335

పల్లవి: సిగ్గుపడి నీవు నాతోఁ జెప్ప జాల వింతే కాక
కగ్గిన నీ విరహము కాన రాదా నాకు

చ. 1: చెక్కుమీఁది చేయే చెప్పీఁ జిత్తములోపలిచింత
యిక్కడాఁ బతిపై మోహ మేల దాఁచేవే
లక్కవలెఁ గరఁ గొకలాగుల మాట లాడేవు
నెక్కొన్న విభావములు నే నెరఁగనా

చ. 2: కన్నులచూపులె చెప్పీ గాయముతో తమకము
యెన్నికలు నీవు నాతో నేల దాఁచేవే
పన్ని చెమరించుకొంటా పైపై బొంకేవు నాతో
వెన్నెల నీసుద్దు లెల్ల వినకున్నదాననా

చ. 3: నెలవినవ్వులె చెప్పీ శ్రీవెంకటేశునిపొందు
యెలమి నింకా నాతో నేల దాఁచేవే
వెలయ నాతఁడె నిన్ను వెల్లవిరిగాఁ గూడె
నిలువు నూరూఁ బండె నీ కెలె వెరపూ

రేకు:	0356-6 పాడి	సంపుటం:	11-336

పల్లవి:	ఎప్పుడు మంచిదాననె యిదివో నీకు నాతో
చెప్ప వద్దు గాని నీకు సెల విచ్చేను నేనూ

చ. 1:	నిచ్చలూను నిజ మాడి నీకుఁ బగ యవుకంటే
రిచ్చల నూరకుండితే రేఁచ నే లయ్యు
హెచ్చి నే నే మనినాను యీరు దియ్యఁ బేను వచ్చు
కుచ్చితము గాదు లోనఁ గూచుండే నేను

చ. 2:	కూరిమి నీవెంట వచ్చి గుండెదిగు లవుకంటే
బీరాన నే నీడ నుండేఁ బిల్వకు వయ్యు
కేరడాన నట్టె గోర గీరితే నేరు లవును
నేర నంతేసి యిచ్చులు నిద్దిరించే నేనూ

చ. 3:	గక్కువ నీ మోవి యాని గంటు రాఁగించుకంటే
చిక్కి నీ వశాన నుండే చెనక కయ్యా
పక్కన శ్రీవెంకటేశ బలిమి నన్నుఁ గూడితి
వక్కర దీరినమీఁద నలయించ కయ్యా

రేకు: 0357-1 నాదరామక్రియ సంపుటం: 11-337

పల్లవి: నే నెంత నీ వెంత నీతోనే బలిమా
మానరాని కృపతోడ మన్నించితి గాక

చ. 1: చిత్తము వచ్చి నావద్ద చేరి వున్నాఁడవు గాక
వొత్తుకోలు వల పైతే వుండేవా నీవు
యెత్తిన కోపపుదాన నేమి బాఁతి నే నీకు
బత్తి సేసితివి నాభాగ్య మింతే కాక

చ. 2: పిలిచితి విచ్చేసితి ప్రేమ గలుగఁగఁగాక
సొలసితేఁ బరులకు సులభుఁడవా
చెలులుల మీ కెంత లేదు చేరి నాతోనె మాట
పలు కాడే విదే నాభాగ్య మింతే కాక

చ. 3: యిద్దరి మొక్కటి గాఁగ నిన్నియు నమరెఁ గాక
పొద్దు వోనిచోట చవి వుట్టీనా నీకు
గద్దరి శ్రీవెంకటేశ కాఁగిట నన్నుఁ గూడితి
బద్దు గాదు మెచ్చితి నాభాగ్య మింతే కాక

రేకు: 0357-2 దేసాళం సంపుటం: 11-338

పల్లవి: ఎట్టు గెలువంగ వచ్చు నిటువంటివాని నిన్ను
పట్టినచలముతోడ భ్రమలఁ బెట్టితివి

చ. 1: మంచిమాట లాడఁగానె మఱచితి నిన్నియును
అంచెల నేఁ గోపగించే నంటా నుంటిని
యెంచి కన్ను లెట్టి చూడు యిటువంటిదాని నన్ను
మంచముమీఁదికి దీసి మరిగించితివి

చ. 2: చెక్కు నీవు నొక్కఁగానె చిత్త మెల్లఁ గరఁగితి
అక్కరతోఁ గాఁగి లియ్య నంటా నుంటిని
మిక్కిలి నాకాఁక చూడు మీరి వచ్చేదాని నన్ను
వెక్కసాన నొడి వట్టి వెట్టిఁ జేసి తిపుడు

చ. 3: వొద్దికి నీవు రాఁగానె వొడఁబడితిఁ గాకిట్టె
అద్దలించి ఆన వెట్టే నంటా నుంటివి
గద్దరి శ్రీవెంకటేశ గబ్బి నైననన్నుఁ జూడు
ముద్దుమోము యిచ్చి కూడి మొక మోడించితివి

రేకు: 0357-3 సామంతం సంపుటం: 11-339

పల్లవి: ఇంత చలము నీ కే లమ్మా
కొంతయినఁ దెలుసుకో వమ్మా

చ. 1: అలుకలుఁ బులుకలు నాతనితోడను
వలవని దేఁటికి వద్దమ్మా
మొలకల నవ్వులు ముంచఁగ నీకిఁకఁ
దల వంచు కొనఁగఁ దఁగ దమ్మా

చ. 2: పెనఁగులు జనుగులుఁ బెట్టేవు పిలువఁగ
పని మాలినపని బలు వమ్మా
చనవులు నీ పతి చల్లఁగ మరి యిఁక
వెనకటిమంకులు విడ వమ్మా

చ. 3: అసురులు నుసురులు నందినకాఁగిట
వసివాడులు నిఁక వలె నమ్మా
యెసగిన శ్రీవెంకటేశుఁడు గూడెను
పొసఁగె నిన్నియును భోగించ వమ్మా

రేకు: 0357-4 మధ్యమావతి సంపుటం: 11-340

పల్లవి: పంతములే నెరుపేవు పలుమారును
యెంత కెంత విచారించ కిది నీకుఁ దగునా

చ. 1: వీడ నాడేవు విభుని వీసమంత పని కైన
తోడనె కొండవంటి దొర గాఁడా
యేడ నైనా నీ వైతే నెకసక్కేమే సేసేవు
జాడతో నీచే నాతఁడు సాదింపఁబడునా

చ. 2: చెలరేఁగే వది యేమే చేతికి లోనాయ నంటా
వలపు నీమీఁదఁ గలవాఁడు గాఁడా
సొలసి సొలసి వోరచూపుల జూచే వదేమే
చలపాదితన మింత సతులకుఁ జెల్లునా

చ. 3: సిగ్గువడే విది యేమే చేయ నీపై వేసె నంటా
యెగ్గు లేని శ్రీవెంకటేశుఁడు గాఁడా
అగ్గ మై నీచిత్తము రా నన్నిట నాతఁడు గూడె
కగ్గ దేరినందుమీఁదఁ గపటము చెల్లునా

రేకు: 0357-5 ఆహిరి సంపుటం: 11-341

పల్లవి: ఎందు కైన వచ్చు నీయిటువంటి భావములు
విందుగా నాతో నాడవే వింటా నున్నాఁ డాతడు

చ. 1: చెక్కునఁ బెట్టేవు చేయి సిగ్గుకో చింతకో కాని
తక్కక నేపతిసుద్ది దడవితేను
పక్కన నవ్వే వందుకు పగటో నీ పల్లదమో
వొక్కమాటె ఆన తేవే వొద్ద నున్నాఁ డాతఁడు

చ. 2: తప్పక చూచే వదేమే తగలమో కోపమో
చిప్పిల నాతని నీ చేతి కియ్యఁగా
కుప్పేవు పయ్యదకొంగు కసరులో కొసరులో
వొప్పుగా నాకుఁ జెప్పవే వూరకున్నాఁ డాతఁడు

చ. 3: పవ్వళించే యేమే నీ పంతనాలో పొంతనాలో
యివ్వల శ్రీవెంకటేశుఁడెడ మియ్యఁగా
దవ్వుల నుండిననన్ను దగ్గరఁ బిలిచే వేమే
నివ్వటిల్ల నాన తీవే నిన్నుఁ గూడె నతఁడు

రేకు: 0357-6 బౌళి సంపుటం: 11-342

పల్లవి: కూళతనమౌ బత్తి గొొట్టమునఁ బెట్టఁ బోతే
ఆలసించ కిఁక లేవే ఆకెతోఁ జెప్పుదము

చ. 1: వదలి మనసు రానివాని మాట లెన్నైనా
పెదవులపైనె కాని ప్రియము లేదు
యిదివో తారాఁ డట యీాడ నుండ మన కేల
ఆదనఁ బోదము రావె ఆకెతోఁ జెప్పుదము

చ. 2: ననుపు లేనివాని నగవు లెందాఁక నైన
పని మాలుటే కాని ఫలము లేదు
మనవు లడగఁ డట మనమే చెప్పఁగ నేల
అనమానించక రావె ఆకెతోఁ జెప్పుదము

చ. 3: ఆరయ రాజసపువాఁ డాస లెన్ని వెట్టినాను
పేరడి నుండుటె కాని పెనఁగ రాదు
యీారీతి శ్రీవెంకటేశుఁ డింత చేసి చెలిఁ గూడె
ఆరితేరె నా సుద్దులె ఆకెతోఁ జెప్పుదమూ

రేకు: 0358-1 పాడి సంపుటం: 11-343

పల్లవి: ముద్దు గారీఁ జూడరమ్మ మోహనమురారి వీఁడె
మద్దులు విరిచిన మా మాధవుఁడు

చ. 1: చల్ల లమ్మ నేరిచినజాణ గొల్లెతల కెల్ల
వల్లెతాడు మా చిన్న వాసుదేవుఁడు
మొల్లపు గోపికల మోవిపండులకు నెల్ల
కొల్లకాఁడు గదమ్మ మా గోల గోవిందుఁడు

చ. 2: మందడిసానుల కమ్మని మోముఁదమ్ములకు
చెందినతుమ్మిదవో మా శ్రీకృష్ణుఁడు
చంద మైన దొడ్డివారి సతులవయసులకు
విందువంటివాఁ డమ్మ మా విఠ్ఠలుఁడు

చ. 3: హత్తిన రేపల్లెలోని అంగనామణుల కెల్ల
పొత్తుల సూత్రము మా బుద్ధుల హరి
మత్తిలి వ్రేతెల నిండుమనసుల కెల్లాను
చిత్తజునివంటివాఁడు శ్రీవెంకటేశుఁడు

రేకు: 0358-2 ముఖారి సంపుటం: 11-344

పల్లవి: ఊరకె గుట్టు సేసుక వుండనీ వయ్యు
పేరఁ బెట్టినటువంటి పెరగె మాజరగు

చ. 1: గొల్లవారిమాఁటలు గోనుఁ బువ్వువాటులు
కెల్లు రేఁచి మమ్ముఁ బలికించకు వయ్యు
కొల్లలాడే బాగులు గొడ్డుఁబుల్లతేగెలు
నొల్లనొల్లమి విడే లుంగిటయ్యీ మాకును

చ. 2: చిత్తములో మంకులు చేతు కెల్లా అంకులు
బత్తితో మమ్ము బలిమిఁ బట్టకు వయ్యు
గుత్త మైనమేడలు కొమ్మిమాకునీడలు
కొత్త సున్నపుటిండ్ల కొర యాల మాకును

చ. 3: తొలుతే మా కాఁపురాలు తోఁపుతిత్తి దాఁపురాలు
తిలకించి మా వొడి సోదించకు వయ్యు
నెల వైశ్రీవెంకటేశ నీవు మమ్ముఁ గూడితివి
మొలకలపులకలు మోపు లాయ మాకును

రేకు: 0358-3 ఆహిరి సంపుటం: 11-345

పల్లవి: ఆఁటదానిపై నీ బలు వంతయునుఁ జూపేవా
నాఁటెనా నీ ఆయములు నవ్వుల నా మాటలు

చ. 1: వాలుకరెప్పలు వంచి వడిఁ దప్పక చూచేవు
వొలి నిందాఁక నేడ నుంటి వంటేను
తాలిమి లే కప్పటికి తగఁ గసరుకొనేవు
యేలని నెంజిరి వికం నెంతటాఁ దీరదురా

చ. 2: చేరి మారుమోముతోఁ బిల్చిన నాతోఁ బలుకవు
మేర మీరే నీ గుణాలు మెచ్చే నంటేను
దార దప్ప కందుకె తగఁ బంతా లాడేవు
యేరా నా పై కోప మెంత నీ కున్నదిరా

చ. 3: కోక గట్టుక నాతోను కోరివాదుకు వచ్చేవు
కైకొని నీ పరువులు గంటి నంటేను
యేక మై యిట్టె శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
యీాడక నా గరిమెలు యెందు కైనా వచ్చురా

రేకు: 0358-4 శుద్ధవసంతం సంపుటం: 11-346

పల్లవి: ఓరి పో యిదేడ సుద్ది వుండఁ బట్టదా వోసి
వోరికొట్లు గొట్టఁగా వొద్దికి వచ్చితినే

చ. 1: గొల్లపిన్న వాఁడా గోవులఁ జక్కఁ గావరా
యిల్లిదె మావాకిలి నీ వేల కాచేవు
కల్ల గాదె నీమాట నేఁ గాచే ఆవులపాల
చల్ల లమ్మఁ బోఁగానె పో సాదించ వచ్చితిని

చ. 2: బాలకృష్ణబోయిఁడా పసులు వల్లె వేయరా
వాలుఁ జూపుల మ మ్మేల వల్లె వేసేవు
నేలనుండి మాకోడెలు నీ యింటిచూరు మేసె
తోలవైతి వందుకే పో దూరులు వేసితిని

చ. 3: నాలి శ్రీవెంకటేశుఁడ నాచన్ను లెల పట్టేవు
చాలదా నీవు పసుల చను పట్టేది
మేలిమి ఆవులవారి మెలుతలు మీరు గాన
మూల నన్ను మీ చన్నులు ముట్టి నేఁ గూడితిని

రేకు: 0358-5 హిజ్జిజి సంపుటం: 11-347

పల్లవి: మంచవాని వలనె మాటలు నాడేవు గాక
దించరాని తమకపు దేవరవు గావా

చ. 1: గుట్టున నెవ్వతెమీఁది కోపాన వచ్చి య దెల్ల
వెట్టికి నింటివారిపై వెళ్ళించేవు
దిట్ట నే నొకతెఁ గాఁగా దో కొంటిఁ గాక నీతో
అట్టిపాటి యాఁట దెల్లా నండకు రాఁగలదా

చ. 2: బిగిసి యాడ నెవ్వతే పిలువనికాంతాళన
నగుతా నెవ్వరే మనినాఁ దిట్టేవు
అగపడి నేఁ గాఁగా నన్నియు నమరెఁ గాక
నిగిడి వేరొక్క తై తే నీతోఁ బొందు సేసునా

చ. 3: ఆవల నెవ్వతెతోను అలిగినవాఁడవై
కవ గూడి నన్ను నిట్టె కాఁక సేసేవు
నవ మై శ్రీవెంకటేశ నాకె మజ్జాతి గాక
నివిరి వేరొక్క తై తే నీతోఁ బిందు సేసునా

రేకు: 0358-6 మాళవిగౌళ సంపుటం: 11-348

పల్లవి: ఓప నన్న విడవవు వూఁకొను మనేవు నీవు
నీ పను లివెల్లాను నిన్ననె పో వింటివి

చ. 1: మాను మన్న మానవు మా తొనె నీ సుద్దు లెల్లఁ
దేనె పూసి చెప్పి చెప్పి తేలించేవూ
కాని కాని అందు కేమి కల్ల లాడేవాఁడవా
నే నెరుఁగుదు నంతాను నిన్ననె పో వింటివి

చ. 2: వద్దన్నా విడువవు వాకిటఁ గూచుండీ నీ
పెద్దరికే లెల్ల నాతో పెంచి చెప్పేవు
కద్దు గద్దు నీవల్ల కడము లేమి లేవు
నిద్దరించు నీ గుణము నిన్ననె పోవింటిని

చ. 3: సిగ్గు వడ్డాఁ బో నీవు చేయ వట్టుకొని నాతో
అగ్గలపుఁ బచ్చిమాట లవి చెప్పేవు
దగ్గరి శ్రీవెంకటేశ తగు నన్నుఁ గూడితివి
నిగ్గుల నీ కత లెల్ల నిన్ననేపా వింటని

రేకు: 0359-1 శంకరాభరణం సంపుటం: 11-349

పల్లవి: అదివో నీ రమణుఁడు అలుగఁగఁ దరి గాదు
యెదిటికి రావు లోన నేమి సేసేవే

చ. 1: చిలుక పావురము చెరకు శింగిణివిల్లు
వలరాజు దాడి ముట్టె వసంతవేళ
బలిమిఁ గోవిలకూఁత పరివారముల మోఁత
యెలమి నదివో లోన నేమి సేసేవే

చ. 2: పొడవు మీను టెక్కెము పూవులయమ్ములపొది
వెడలె వరుఁడు దండు విరహులపై
యెడయని వెన్నలలు యెగయుఁ బౌఁజుల ధూళి
యిడమఁ జింతతో లోన నేమి సేసేవే

చ. 3: చిగురుజొంపపు జల్లి చిరుతగాలి ప్రధాని
మగటిమిఁ గాముఁ డెక్కె మనసులపై
తగిన శ్రీవెంకటాద్రి దైవ మిట్టె నన్నుఁ గూడె
యెగసక్కెమున లోన నేమి సేసేవే

రేకు: 0359-2 వరాళి సంపుటం: 11-350

పల్లవి: వాకిట కాతఁడు రాఁగా వద్దంటినా
చేకొని నా కేల చెప్పేవే బుద్ధులు

చ. 1: మన సాతనితగులు మాటలు నీతో తగులు
వొనర నన్నే మనేవే వో చెలియ
కనుచూపు లాతనిపై కాఁకలు నామేనిమీఁద
పెనఁగీ నింకా నేల పెంచేవే దూరులు

చ. 2: సిగ్గు లాడ కంపితిని చెక్కుచేయి నాకు నిదె
యెగ్గులు దప్పులు లేవు యే మనేవే
దగ్గరెఁ దనపొరుపు తాలిమి నాకుఁ గరవు
నిగ్గుల నాపయి నేల నించేవే కోపము

చ. 3: ముంగిట నాతఁడున్నాఁడు మూల నున్నదాన నేను
అంగడి కెక్కె వలపు లవుఁ గదవే
రంగుగా శ్రీవెంకటాద్రిరాయఁ డిట్టె నన్నుఁ గూడె
సంగ తాయి నీ కోరికె చల మేలే యిఁకను

రేకు: 0359-3 పాడి సంపుటం: 11-351

పల్లవి: మేలు మేలు రాఁగా రాఁగా మెచ్చితి నిన్ను
కోలు ముందై యుందే కాక కొండకుఁ బొయ్యేవా

చ. 1: సంతసాన నేనీతో జరసి మాటడఁగాను
పంతము దప్పి నంటాఁ బలుకవు
రంతుల నేఁడె నీకు రాజస మెంత గల్లాను
కాంతలమీఁదనె కాక కడఁ జూపేవా

చ. 2: సలిగెతో నేనెంత నటలు సేసిన నీవు
చలము దప్పి నంటా సరి నగవు
పెలుచుఁదనాన నీకు బీర మెంత గలిగినా
చెలులమీఁదనె యింత సేయక మానేవా

చ. 3: యేపుననీ ముందటనె యెంత నిలుచుండినా నీ
చూపు లరగీ నంటాఁ జూడ జాలవూ
బాపుర శ్రీవెంకటేశ పచ్చిగాఁ గూడితి నన్ను
నీ పొందు నాతోనె కాక నేఁడు మానేవా

రేకు: 0359-4 సామంతం సంపుటం: 11-352

పల్లవి: నీవు విరహి వవుట నే నెరఁగనా
భావించ యెవ్వ రవుతా నేర్పరచలేఁ గాని

చ. 1: కాఁకలు నీ మాటలోనె కాన రాదా నీ మేను
సోఁకించి నా కప్పటిని చూప వలెనా
యేఁకట నాకయిన దిన్ని యెవ్వతెకు నీ వైనది
తేఁకువ నీ రెండూను తెలియలేఁ గాని

చ. 2: కరఁగులు నీ మోము కళలోనె కాన రాదా
ఆర మరిచితి నంటా నాడవలెనా
ధర నిది నా కవుత తగ వేరొకతె కవుత
యిరవుగ నిది నిశ్చయించలేఁ గాని

చ. 3: కూటమి నీ కాఁగిటితో గురి సేయవలెనా నీ
తేటలు ప్రియాలలోనె ద్రిష్టము గాదా
మేఁటివి శ్రీవెంకటేశ మించి నన్నుఁ గూడితివి
యాఁటదాటిపొందవుత అరయలేఁ గాని

రేకు: 0359-5 మంగళకౌశిక సంపుటం: 11-353

పల్లవి: ఇప్పుడె సవతితన మేరుపడె నాకు నేఁడు
తప్పులేదు యిఁక నన్నుఁ దడవక పోవే

చ. 1: ఆతఁడె నీమీఁదిబత్తి అవు నట యిఁక నీవు
యీతల వెంగెము లాడి యేమి సేసేవే
కాతరాన మా గుట్టు కడు బయట వేసితి
భీతి వాసె నిఁక నీవు బీరము లాడకువే

చ. 2: వూరకె మా యింట నాతఁడున్నాఁ డంటా నాడేవు
సారెకు నీవిఁక మరి సాదించే దేమే
యీరీతి మా చలి వాపి యింత ఋట్టు సేసితివి
తేరెఁ బను లన్నియును తెగ నాడేఁ బదవే

చ. 3: శ్రీవెంకటేశ్వరుడు నాకుఁ జేరి వొప్పగించితివి
కావించి నీ వాడేనింద గట్టాయ లేవే
వేవేగ నాతఁడు నన్ను విచ్చనవిడిఁ గూడెను
దేవరే మేలు సేసె తెరమరఁ గేఁటికే

రేకు: 0359-6 ఆహిరి సంపుటం: 11-354

పల్లవి: అప్పుడువో నన్నుఁ జూచే దంతా నీవు
చెప్పక నీవు దాఁచినచెలిఁ గంటేఁ గాని

చ. 1: చెప్ప రాదు గాని నా చిత్తములోని చింత
వుప్పతిల్లి వున్నది నా వొళ్లఁ జూడరా
కప్పురానాఁ బోదు చల్లగాలిచేతా నారదు
తప్పదు నిన్ను రానీనిదానిఁ గంటేఁ గాని

చ. 2: చూప రాదు గాని నా చుట్టుకొన్నతమకము
ఆఁప రానినిట్టూరుపు లందుఁ జూడరా
తీపుల మాటలఁ బోదు తేటల వెన్నలఁ బోదు
తాపి యై నిన్ను బోదించేదానిఁ గంటేఁ గాని

చ. 3: యెంచ రాదు గాని నా యీరసపుఁ జలములు
యించుక నా కాఁగిటిలో నిదె చూడారా
ముంచిన శ్రీవెంకటేశ మూసి మంతనాలఁ బోదు
అంచెల నీ మేలుదాని నట్టెకంటేఁ గాని

రేకు: 0360-1 ముఖారి సంపుటం: 11-355

పల్లవి: బాపు బాపు జాణ గదే బావఁగారు
కోపగించీ నోప నంటే గోల బావఁగారు

చ. 1: చనవు సేసుక నాతో సారె సారె నవ్వీని
పని లేదు తన కేమి బావఁగారు
వినరె మాటల నుప్పు వేసి పొత్తు గలసీని
పెనఁగి యెక్కడ నైనా పెద్దబావఁగారు

చ. 2: నయమున నా యెదుట నన్నుఁ బేరుకొని పాడి
బయలు పందిలి వెట్టీ బావఁగారు
ప్రియముతో మంచ మెక్కీ పిలివని పేరంటము
లయకాఁడు గదవే తొలఁగుబావఁగారు

చ. 3: సులభానఁ దానె మెచ్చి సొమ్ము లెల్లా మెడఁ గట్టీ
బలిమికాఁడు గదవే బావఁగారు
తొలఁగక నన్నుఁ గూడి దొరకోలు సేసుకొని
చెలఁగీ శ్రీవెంకటాద్రి చిన్నబావఁగారు

రేకు: 0360-2 కేదారగౌళ సంపుటం: 11-356

పల్లవి: ఏల నిలువఁ బెట్టేవు యింతేసి వలపులు
పోలికలు గాన రాదా పోయనందుకే

చ. 1: ఆన వెట్టేవు నామీఁద నక్కర గల నంటాను
కాని కాని అందు కేమి కడమా నేఁడు
యీనిజము లెంచఁ బోతే యీరుదియ్యఁ బేనువచ్చు
వోరి నన్ను గుట్టుతోనె నూరకుండ నియ్యరా

చ. 2: తారుకాణించ వచ్చేవు తలఁతు న న్నంటాను
సారె సారె నందు కేమి చాలదా నేఁడు
మారుబాణము లెంచితే మంచముకిందే నుయ్యి
నేరుపుతోఁ బరాకున నెత్త మాడ నియ్యరా

చ. 3: పులకలే చూపేవు పొంది కరఁగితి నంటా
తలతల అందు కేమి తగదా నేఁడు
యెలమితో శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
పలుకుఁబంతము చెల్లె భావించుకో నియ్యరా

రేకు: 0360-3 వరాళి సంపుటం: 11-357

పల్లవి: ఎరవులదానివలె నెందు వొయ్యేవే ఆత
నిరవులు వెదకవే యేమి సేసివో

చ. 1: కంకణాల చేతుల కదల నూఁచుకొంటాను
యింకనిచెమటలతో నెందు వొయ్యేవే
అంకెల నీయింటికి నాతఁడె విచ్చేసె
యింకా రాఁడా వెర గయ్యీ నెంతఁ బోయనో

చ. 2: సెలవుల నవ్వుకొంటా చెంపలఁ దురుము జార
యెలమి నసురుసు రై యెందు వొయ్యేవే
కొలఁది లేనిసొమ్ములు కొంట వచ్చె నీకు నిట్టె
యెలయించి నాతోఁ జెప్పి యేడ నున్నాఁడో

చ. 3: బంగారు పాదాలతోడ పట్టుచీర కొంగ జార
యింగితాల గాన రాఁగా నెందు వోయ్యేవే
అంగన శ్రీవెంకటేశుఁ డప్పుడె నిన్నుఁ గూడెనో
రంగై నీ వెంటనె వచ్చె రాఁపుల వీఁడు గదే

రేకు: 0360-4 కాంబోది సంపుటం: 11-358

పల్లవి: చాలుఁ జాలుఁ దనిసితి సటలనె నేఁ డెల్ల
తాలిమి నిందుకై నిన్నుఁ దప్పక చూచేను

చ. 1: నేయ రానిచేఁత లెల్లఁ జేసి వచ్చి నీవు నన్ను
పాయిని చుట్టమువలెఁ బై కొనేవు
కాయకపువారికె కాని లే వీ వినయాలు
వొయమ్మ నిన్నే మనే నూరకుండేఁ గాక

చ. 2: చిత్త మెక్కడనో పెట్టి చేరి నాతో మాయలకు
బిత్త గలవానివెల పలికే విదే
హత్తి గాయగంట్లె కాని అంతేసి నేరరు
యిత్తల నెట్టు పూఁకొందు నిట్టె నవ్వేఁ గాక

చ. 3: తేరకల్లె నెవ్వతెనో తెచ్చి యాపెచేత నాకు
చేరికొనఁ బెట్టి సేవ సేయించేవు
నేరుపు శ్రీవెంకటేశ నీకె కాని లేదు
సారెనన్నుఁ గూడితివి సమ్మతాయ నిదివో

రేకు: 0360-5 కొండమలహరి సంపుటం: 11-359

పల్లవి: ఇంతటా నీ మనసు రా దెగ్గు లెచం నేఁటి కోయి
చింతతో నుందాన నంటా సిగ్గు వడే వోయీ

చ. 1: చిత్తమును నోవకుండా చిన్నఁబోయి వుండకుండా
మెత్తనిమాట లాడితే మే లదే వోయి
కొత్త లెల్లఁ దొఁచకుండా గుట్టు నీకుఁ జెడకుండా
పొత్తుల నవ్వు నవ్వితి పూఁచి మెచ్చ వోయి

చ. 2: జగడాలు రాకుండా చనవునుఁ దప్పకుండా
సగముచూపు చూచితి చాలదా వోయి
తగులమిఁ బాయకుండా తప్పు నీపైఁ జేయకుండా
మొగము వంచితి నే నీ ముందరనె వోయి

చ. 3: నింద నీపై మోయకుండా నేమమూనుఁ దప్పకుండా
అంది నేఁ బరా కైతి నప్పడే వోయి
కందువ శ్రీవెంకటేశ కాఁగిలించితివి నన్ను
చంద మాయ నిద్దరికి సరి లేదు వోయి

రేకు: 0360-6 పాడి సంపుటం: 11-360

పల్లవి: ఎవ్వ రేమి చెప్పిరె యింతలోననే
నివ్వటిల్ల వింత లెల్ల నేరుచుకొంటివా

చ. 1: మోము చూచి నవ్వఁగానె మోనానఁ దల వంచేవు
యేమిటికే కోపము నీ కెన్నఁడు లేమి
కామించి పిలిపించి కడసారె నలిగేవు
నేమమున నివి గొన్ని నేరుచుకొంటివా

చ. 2: దగ్గరి నేఁ గూచుంటె తగ లేచి నిలిచేవు
సిగ్గు గొంత జిగి గొంతఁ జిలికే వేమే
అగ్గలపుఁ బ్రేమ చల్లి అంతలోఁ బిరి తీసేవు
నిగ్గులు నీడలు కొన్ని నేరుచుకొంటివా

చ. 3: కాఁగిట నే నించఁగాను కన్నులు మూసుకొనేవు
మాఁగఁ బెట్టేవు వలపు మతిలో మేలే
పాఁగిన శ్రీవెంకటపతి నన్నుఁ గూడితవి
నీఁగనిరతులు నేఁడు నేరుచుకొంటివా

రేకు: 0361-1 ముఖారి సంపుటం: 11-361

పల్లవి: తనవొళ్లి భయ మింతే తప్పులు నేఁ బట్టేనా
వినవె సిగ్గు వడీని వేగిరించ నేఁటికే

చ. 1: అద్దము నేఁ జేదు మంటె నాన వెట్టి నవ్వీని
అద్దలించి తన్ను వెంగె మాడేనా నేను
వొద్దికి నే రమ్మంటే నూరకే అట్టట్టు వొయ్యీ
సుద్దు లింతే తన మేను సోదించ వచ్చేనా

చ. 2: జలక మాడే మంటేను సారె సారెఁ దల వంచీ
యెలమిఁ దన కెగ్గవుత యెరఁగను
అలరులు ముడిచే నంటేఁ దా లోఁగీని
మలసి వాడుఁ జూపుల మచ్చము వట్టేనా

చ. 3: నిద్దరించు మంటేను నిట్టచూపు చూచీని
యిద్దరి జాగరాలు నే యెత్తి పెట్టేనా
కద్దులె శ్రీవెంకటాద్రి ఘనుఁ డిట్టె నన్నుఁ గూడె
ముద్దమోము చూచి చూచి మొగ మోడ కుండేనా

రేకు: 0361-2 సౌరాష్ట్రం సంపుటం: 11-362

పల్లవి: ఇందు కేల అలుగ మాయింటికి విచ్చేయవయ్య
ముందు మందె నీకు నేము మొక్కేము గాని

చ. 1: యేడ నైనా జేయి చాచే విందుకే పో సిగ్గువడి
ఆడరాని మాటలు నే నాడితిఁ గాక
జాడతో నేక మైతే సారె నీ వేమి సేసినా
కూడ దనేనా నీకు గుట్టు లేదు కాగ

చ. 2: కొలువులో నుండి నీవు కొంగు వట్టి తియ్యఁగానె
వెలయఁగ విదిలించి వేసేఁ గాక
సెలవునఁ బానుపుపై నిన్నుఁ గసరుకొనఁగ
చలమా నీ కక్కూరితే జరుపేపు గాక

చ. 3: నిద్దుర వోయేవేళ నీవు నన్ను లేపఁగాను
అద్దమరేతిరి వోప నంటిఁ గాక
యిద్దరము సమ్మతల్లి యిటువలెఁ గూడితిమి
అద్దో శ్రీవెంకటేశ అప్పు డేలో కాక

రేకు: 0361-3 శంకరాభరణం సంపుటం: 11-363

పల్లవి: ఇంత నేరకుండితే నీ వేల వచ్చేవు
వింత వింత వగ లెల్ల వింటిఁ గంటిరా

చ. 1: వాలుక రెప్పలు నే వంచిన మాత్రములోనె
నాలికాఁడ నీ తనువు నాఁటె ననేవు
యీలాగు మాట లాడి యిచ్చకాలు సేసుక
కాల మెల్ల బతికితి కానీ కానీరా

చ. 2: చల్లఁగా నే గందవొడి చల్లిన మాత్రములోనె
పల్లదాన తల దిమ్ము పట్టె ననేవు
కల్ల గాదు యింత మాయకాఁడవు గాకుండితేను
యెల్లవారిలోన నేఁడు యెట్టు వేగించేవురా

చ. 3: కొంకక నీ తొడమీఁద గూచున్న మాత్రములోనె
అంకెల నీ కళ దాఁకె నని అనేవు
సంకె లేక నీ వింతేసి జాణవు గాకుండితేను
పొంకపు శ్రీవెంకటేశ పొంచి నన్నుఁ గూడేవా

రేకు: 0361-4 ఆహిరి సంపుటం: 11-364

పల్లవి: నవ్వ నీకుఁ జెల్లు నట నాకుఁ గొసరఁ జెల్లదా
రవ్వగాఁ దడవుదురా రాజసపు వాఁడవు

చ. 1: సిగ్గుపడి వున్నమమ్ముఁ జేయి వట్టి తియ్య నేల
యెగ్గు వట్టె నేల నే నే మన్నాను
అగ్గల మై సరసము లాడ నేర్చినవాఁడ
వొగ్గి అన్ని మాటలనును వోరుచుకో నేరవా

చ. 2: జగడించి యున్నదాని చన్ను లంటి చూడ నేల
తగవులఁ బెట్ట నేల తల మంటెను
చిగులుతా మమ్ము నింత నేయ నేర్చినవాఁడవు
యెగసక్కెపు మాకోపా లిముడుకోఁ జాలవా

చ. 3: కన్ను మూసుకున్నదాని కాఁగిలించి పట్ట నేల
చిన్నఁ బోవ నేల నాచే దాఁకె నంటా
యెన్నికెతో శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
నిన్ను నన్ను నెంచుకొని నిండుకుండ నేరవా

రేకు: 0361-5 మాళవి సంపుటం: 11-365

పల్లవి: నేరుపు గలితేఁ జాలు నీవే నేను
దూరి మాటాడ నోప మందు లిట్టె నూరకురా

చ. 1: యెప్పుడు నీ వారమే యేల పిలిచేవు మమ్ము
చప్పు నై నీ నోరు నొచ్చీఁ జాలించ రాదా
నెప్పున నే నీడ నుంటే నీ వద్ద నుండుట గాదా
ముప్పిరిఁ బెనఁగ నోప ముంజుయి వట్టకురా

చ. 2: పూడిగపువార మింతే వొడ లేల నిమిరేవు
తోడ నీచేతు లరిగీఁ దొలఁగ రాదా
నీడల నే నవ్వితేనె నీ పరిణామము గాదా
వీడ నాడ నే నోప వేసాలు సేయకురా

చ. 3: నీకు మేనదాన నింతే నీ వేల కిందు పడేవు
కాకై నీ రాజసము కైకో రాదా
యీకడ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నీకు నే సరిగా నోప నీ వంత మెచ్చకురా

రేకు: 0361-6 నాగవరాళి సంపుటం: 11-366

పల్లవి: ఎఱఁగ నైతి నిందాఁక యింత నీవు జోలిఁ బెట్టే
దెఱఁగుకో నిన్నుఁ గొల్చే దిందుకొరకా

చ. 1: మాయదారిమాటలే మాపుదాఁకా నాడి నా
కాయముపై నొరగితే కాఁక మానీనా
ఆయములు సళుపఁగ నాసపడి నీరాక
కీయెడ నేఁ గాచుకున్న దొందుకొరకా

చ. 2: నాటకపునవ్వులే నవ్వి నాతో వేగించఁగ
తాఁటలు దూఁటలే కాక తాపము మారీనా
కూటమి గలిగె నంటా కోరన సంతోషముతో
యీటున నుండిన దెల్లా నిందుకొరకా

చ. 3: పెనఁగి వట్టికాఁగిట బిగియించి సారె నా
తనువు నిమిరితేనె తని వయ్యీనా
ఘనుఁడ శ్రీవెంకటేశ గక్కునఁ గూడితి విట్టె
యెన లేని నీ మతకా లిందుకొరకా

రేకు: 0362-1 శంకరాభరణం సంపుటం: 11-367

పల్లవి: నేనె కూళఁ గాని వాడు నెరజాణఁడే
తానె నావెంటవెంటఁ దగిలీనె వీఁడు

చ. 1: మన్ననలు నాకు నిచ్చిన మరి నే నెంత దూరిన
కన్నులనె నవ్వు నవ్వీఁ గదవే వీఁడు
సన్న లెరఁగక నేనె సారెఁ దమకింతుఁ గాని
పన్ని నే నెం తలిగినఁ బదరఁడే వీఁడు

చ. 2: యిచ్చకము నాకుఁ జేసి యెంత నే నలిగినాను
బచ్చనల నావద్దఁ బాయఁడే వీఁడు
కుచ్చుతాన నేనె తన్నుఁ గొంగు వట్టి నియ్యఁ గాని
విచ్చనవడిఁ దా నైతే వేఁడుకొనీనె వీఁడు

చ. 3: తాలిమితోడను నేఁ దల వంచుకుండినాను
కేలు చాఁచి నన్ను బుజ్జగించీనె వీఁడు
వే ళెరిఁగి రతుల శ్రీవెంకటేశుఁడిట్టె కూడె
నాలి దీర నన్నిట్టె నమ్మించెనే వీఁడు

రేకు: 0362-2 భవుళి సంపుటం: 11-368

పల్లవి: సారె విన్నపము లేల చవులు వుట్టించ నేల
దార దప్పకుండేజాణతన మింతే యిఁకనూ

చ. 1: నావలె వలచివట్టి నాతి నీకుఁ గలదా
ఆవల నీవల నే నాడుకోఁ గాక
నీవల్లఁ గడ మున్నదా నెరజాణతనమందు
బావభేదములలోని భాగ్య మింతే కాక

చ. 2: యింత నీతో నవ్వేటియింతి నీ కొకతె యేది
వింతగా నీపై వళకు వేయఁ గాక
చెంత నీచేసినమేలు చెప్పితే నటువంటిదే
కొంత గొంత కూడేవేళ గుణ మింతే యిఁకను

చ. 3: నిన్ను నేఁ గూడినరితి నేరుచునా యెవ్వ తైన
పన్ని నిన్ను నే నిట్టే పంగించఁ గాక
యిన్నిటా శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
మున్నిటివెనకల యీ ముచ్చటలే యిఁకను

రేకు: 0362-3 సాళంగనాట సంపుటం: 11-369

పల్లవి: సందడికిఁ జొర నేల చలము సాధించ నేల
అం దెంది సరసమాడి అండ నుంట గాక

చ. 1: పంతపు నీ మాటల బావించి తెలియఁ బోతే
కొంతము లై నాటుఁ గాక కొర తయ్యీనా
చింత లేల మాకును నీ చేఁతలే చూచుకొంటా
అంత కంతే చాలు ననే దది మేలుగాక

చ. 2: నగెటి నీ నవ్వుల నయాన వహించుకొంటే
వొగరులే మించుఁ గాక వుడి వోయినా
తల వేల నీమంచితనానకే మెచ్చుకుంటా
మొగమొగా లెదుటనే మొక్కు కొంటఁ గాక

చ. 3: కాఁగిటి నీరతులు గాలించి వెదకఁ బోతే
మాఁగినచవులే కాక మానఁ బోయీనా
సాఁగిన శ్రీవెంకటాద్రిపతి నన్నుఁ గూడితివి
పొఁగు వోఁగుఁ బొందినట్టు పురిగొంట గాక

రేకు: 0362-4 కన్నడగౌళ సంపుటం: 11-370

పల్లవి: నీ మన సెట్టుండునో నేనెరఁగను
కోమలపుఁ బలుకులఁ గొసరే నే నిదివో

చ. 1: తప్పక చూడగ నోప తల వంచుకొన నోప
చిప్పిలుఁ జెమటతోడి సిగ్గులే కాని
ముప్పిరి ములుగ నోప ముందటనే నగ నోప
అప్పటప్పటికి నుస్సు రనుటే కాని

చ. 2: యేమీ నడుగనోప యెవ్వరిఁ గోపించ నోప
ఆమని జాగరముల అలపే కాని
నేమపువ్రతాల కోప నిండుమాయలకు నోప
చే మంచి తమకలము చింతించుటే కాని

చ. 3: బుద్దులు చెప్పఁగ నోప బూములు దొక్కఁగ నోప
వొద్దనె పాయక నీతో నుండుటే కాని
గద్దరి శ్రీవెంకటేశ కలసితి విదె నన్ను
వద్దని తోయఁగ నోప వంచుటే కాని

రేకు: 0362-5 దేవగాంధారి సంపుటం: 11-371

పల్లవి: మంచివాఁడ వవుదువు మమ్మును దడవకు చాలు
ముంచి నీకు నేపొద్దు మొక్కేము నేను

చ. 1: తెగనాడఁ జాలఁ గాక తేనెల నీమాటలకే
ఆగపడి చిక్కరా దైత్యాంగనలు
పగ కోప మింతే కాక పడఁతిఁ జంపినవాని
మగతన మే మున్నది మరతునా నేను

చ. 2: యిచ్చకము మానఁ గాక యిట్టె నీ పొందుల సేసి
కొచ్చి మరులు గొనరా గోపికలు
వొచ్చె మిదె నీ కొడుకు వొగిఁ గూడపెట్టఁగాను
తెచ్చుకొంటివి సతుల దేవరవు గావా

చ. 3: యింకా నే లని కాక యిట్టి నీకు మోహించి
కొంకక వొక్కతె ముక్కుగోఁతఁ బడదా
లంకె మమ్ము గూడితి వీలాగు మమ్ముఁ జేయకుమీ
అంకెల శ్రీవెంకటేశ అన్నిటా నమ్మితిని

రేకు: 0362-6 సాళంగం సంపుటం: 11-372

పల్లవి: సడి సన్న యట్టి నెరజాణ నందువు
గొడవలు దీరఁ జెలి గూడ రాదా రతుల

చ. 1: చిగురుఁబానుపుమీఁదఁ జెలి విరహానఁ బొంది
చిగురువంటిచేయి చెక్కునఁ బెట్టి
చిగురులోపలిచేగ చిత్తమునఁ బుట్ట దాయ
చిగురుఁబోణిని దయ్యఁ నేయ రాదా విభుఁడ

చ. 2: పూవులతోఁటలోన పొలఁతి తాపాన నుండి
పూవుల మొగ్గల మేనఁ బులకించెను
పూవులలో పూఁపలు పుట్ట వాయ మాటలలో
పూవుఁబోణి నీవు గొంత బుజ్జగించ రాదా

చ. 3: పండువెన్నెలబయట భామిని యలయుచునుండి
పండువంటిమోవివాఁడు బయల వేసె
పండుగలు గాఁగ నిట్టె బాపురె శ్రీవెంకటేశ
పండుజవ్వనిఁ గూడితి పవ్వళించ రాదా

రేకు: 0363-1 లలిత సంపుటం: 11-373

పల్లవి: ఎంత కెత్తుకొంటివి నీ వేరా వోరి
చెంతల నవ్వు నవ్వేవు చెల్లురా వోరి

చ. 1: చెఱఁగు మాసినదాని చెక్కు ముట్టి వేఁడుకొని
యెఱఁగి నన్నంట వచ్చే వేరా వోరి
యఱియు సురతపుఁజెమటలు జొబ్బిలఁగాను
వుఱక నాపైఁ బూసేవు వుద్దండాలా వోరి

చ. 2: గుట్టున నాకెపొత్తున కోరి యారగించుకొంటా
అట్టె నాకుఁ గడెఁ దిచ్చే వదేరా వోరి
వొట్టుక ఆపెయు నీవు వుండనపరపుమీఁద
యెట్టు గూచుండఁ బిలిచే వేరా నన్ను వోరీ

చ. 3: అచ్చు వాసుకొన్నదాని నట్టె నీవు గూడి వచ్చి
యిచ్చల నన్నుఁ గూడితి వేరా వోరి
పచ్చిగా శ్రీవెంకటేశ భ్రమసితి నీరతుల
మెచ్చితి ని న్నిన్నిటాను మేలు మేలు వోరి

రేకు: 0363-2 దేసాక్షి సంపుటం: 11-374

పల్లవి: అప్పటప్పటికి బాగా లందియ్య వలె మనకు
చెప్పరే కతలు యిఁకఁ జింత లేఁటికి

చ. 1: ముసిముసినవ్వులతో ముంగిట నుండినచెలిఁ
గొసరి కొసరి పతి కొంగు వట్టెను
వసమై యిద్దరు లోన వడిఁ బవ్వళించి రదే
యెసఁగి వాకిట మన మిట్టే వుందమే

చ. 2: చిప్పిలుఁ జెమటతోడ సిగ్గువడి వున్నసతిఁ
గప్పి పచ్చడ మాతఁడు గాఁగిలించెను
దెప్పర మిద్దరు దోమతెరలోఁ గూచుండి రిదే
కొప్పులు ముడుచుకొంటాఁ గూచందమే

చ. 3: మాట లాడె అలమేలుమంగఁ చెక్కు నొక్కి కూడె
మేటి శ్రీవెంటకపతి మించురతుల
మాటున నుండి వచ్చి మనవద్ద నిలిచిర
చాటువ సురటులు విసరు చుందమే

రేకు: 0363-3 భైరవి సంపుటం: 11-375

పల్లవి: అట్టె కాదా తనమోహ మందరు నెరఁగ వద్దా
మిట్టిపడి యిందు కే మెచ్చితిఁ గానేను

చ. 1: సవతులతో నేను సారె వాదు లడువఁగ
తవిలి సాకిరి చెప్పీఁ దన కేలే
యివల నేఁ దనుఁ జూచి యిందుకే వెల గంది
కవకవ నవ్వితిని కడు సంగ తేయఁగా

చ. 2: పగ చాటి వారు నేను పంతములు నెరపితే
తగవులు పచరించీఁ దన కేలే
అగ డై యందుకే నేను అది యటు వెట్టి పతి
మొగమె తప్పక చూచే మగిసెఁనా పనులు

చ. 3: పుఱక మాలో నేము వొట్లు వెట్టుకొంటేను
తటి సందిమాట లాడీఁ దన కేలే
యెఱిఁగి శ్రీవెంకటేశుఁ డిందుకే నన్నుఁ గూడఁగ
మఱచితి నన్నియును మన సొక్క టాయఁ గా

రేకు: 0363-4 వసంతవరాళి సంపుటం: 11-376

పల్లవి: ఆన లేన పెట్టుకొనే వప్పటి నాతో
దాని కేమి దోసమా తగినంతే కాక

చ. 1: చెలచేఁ బిలిపించఁగ చేర వచ్చితిని గాక
వలచి నీ యంత నీవే వచ్చితివా
వెల లేక మోహించి విడువ లేనేఁ గాక
కల నీగుణమే తొల్లి కన్నది గాదా

చ. 2: సేవలు నేఁ జేయఁగాను చిత్తము గరఁగెఁ గాక
కావించి నీ యంత నీవే కరఁగితివా
యీవల గూళ నై నేనె యిట్టె పై కొందుఁ గాక
చేవ గలంతే కాక సేసి పెట్ట వచ్చునా

చ. 3: దండ నేనే వుండఁగాను దయ దలఁచితి గాక
గుండె గరఁగి నీ యంతఁ గూడితివా
నిండి శ్రీవెంకటేశ నీకు నాకుఁ బోదు గాక
వెండియు నీతో విన్నవించ గురి యున్నదా

రేకు: 0363-5 రామక్రియ సంపుటం: 11-377

పల్లవి: ఇంకా నేల తడవేవు యేరా నీవు
సంకె దేరె నాకు నీ చలమూఁ జెల్లెనూ

చ. 1: మాఁట నీతో నాడితిన మనసు దెలిసితిని
యేఁటికి నన్నుఁ బిలిచే వేరా నీవు
యీటుతోఁ బెండ్లాడితిని యిట్టె సేస వెట్టితివి
వాఁట మాయ వలపులు వద్దనే నుందానను

చ. 2: చేత నీకు మొక్కితిని చేరి నీతో నవ్వితిని
యీతల నన్నొరసేవు యేరా నీవు
నీతగులు చూపితివి నెగు లెల్లాఁ బాపితిని
యేతు నీకు గన మాయ యియ్యకొంటి వందుకూ

చ. 3: కన్నుల నిన్నుఁ జూచితి కాఁగిటిలో నున్నదాన
యెన్నేసి ప్రియాలు చేప్పే వేరా నీవూ
నన్ను మన్నించితి విట్టె నంటున శ్రీవెంకటేశ
చిన్నిపులకలు నేఁడె సెలవు నా కాయను

రేకు: 0363-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 11-378

పల్లవి: చుట్టమవు గా వతని సూడుబంటవూఁ గావు
ముట్టి వేఁడుకోఁ గాను మో మేల వంచేవే

చ. 1: గుట్టు లేక ఆతఁడు నీ కొంగు వట్టి తీసీని
పట్టినచలము మాని పదవే నీకు
వుట్టిపడి నీ చెక్కు లుంగరాలచేత నొక్కె
బెట్టుగా నింతేసి యింకాఁ బెనఁగ నేమటికే

చ. 2: గక్కన నవ్వుతా వచ్చి కదిసి కూచున్నాఁడు
వెక్కసపుకోప మింక విడవే నీవు
అక్కరఁ దనపై నీకు ఆన లెల్లఁ బెట్టె నదే
యిక్కడఁ దొల్లిటినేరా లెంచఁగ నేమిటికే

చ. 3: కందువ లంటుచు నిన్ను కాఁగిలించె నాతఁడు
మందెమేళములు యింక మానవే నీవు
అందెంది శ్రీవెంకటేశుఁ డన్నటాను నిన్నుఁ గూడె
చంద మాయఁ బను లెల్ల సాదించ నేమిటికే

రేకు: 0364-1 పాడి సంపుటం: 11-379

పల్లవి: మాయలు మాని నాతో మాటలాడరా
నాయడ మునిమచ్చుఁ దన మేల నీకు

చ. 1: ఆరయ నాకెవంతూ ననేవు నీ వప్పటిని
నేరుపున నాపెమోము నేఁడు చూడవా
కేరి కేరి నవ్వేవు కేఁగండ్లఁ జూచుకొంటా
యేరా లే దటరా యీ మాట నీవు

చ. 2: బత్తి నాకు గల నంటాఁ బాయవు నీ వాపెకు
హత్తిన చెలిచేఁ జెప్పి యంప వామాఁటా
వత్తివలెఁ బైఁ బడేవు వట్టి చనవు సేసుక
ఉత్తర మీరా యిందు కూరకుండేఁ గాని

చ. 3: యేపున నన్నే కాని యెవ్వరి నొల్లననేవు
ఆపె సొమ్ములె కావా అట్టె నీమేన
రాపుగా శ్రీవెంకటేశ రతి నన్నుఁ గూడితివి
ఆపను లిన్నాళ్లదాఁకా నమరెఁ గా నీకు

రేకు: 0364-2 రామక్రియ సంపుటం: 11-380

పల్లవి: ఏఁటికి వాదుకు వచ్చే వింత నీవు
నాటకపుటాన లేల నమ్మినా నేను

చ. 1: చెంతలఁ జెప్పనమాఁట చెవి యొగ్గి వింటిఁ గాక
కాంతుఁడ నీచేఁత లెల్లాఁ గంటినా నేను
యింతలోనేవి నీకుఁ గోప మేల వచ్చె నిందరిలో
నంత నిన్ను గురి సేసి అంటినా నేను

చ. 2: చెక్కుల తమ్మచెదరు చేతఁ దుడిచితిఁ గాక
తక్కిన వెఱుఁగుదునా తప్పులు నేను
గక్కన నీ వేల తారుకాణలకుఁ బెట్టేవు
వొక్క టై నీవద్దఁ బాయ కుండితినా నేను

చ. 3: మించి కాఁగిలించఁగా నీ మేను నిమిరితిఁ గాక
యెంచి నీ మైగురుతు సోదించేనా నేను
అంచల శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యించు కంతయిన నలయించేనా నేను

రేకు: 0364-3 సాళంగనాట సంపుటం: 11-381

పల్లవి: ఇందాఁకా రా వన వేమమ్మా
అందెందె నవ్వేవు అతనితో నమ్మా

చ. 1: యేలినరమణుని కెన్నఁడు నలుగవు
తాలిమి నీకే తగు నమ్మా
యీలాగులనే యిచ్చక మాడేవు
మేలు మేలు నిను మెచ్చితి మమ్మా

చ. 2: దండ నున్నపతిఁ దరవులు వెట్టవు
నిండురాజసము నీ దమ్మా
వెండియు నతనికి వీడె మొసఁగితివి
కొండఁ బోలు నీగుణ మమ్మా

చ. 3: శ్రీవెంకటపతిఁ జెక్కులు నొక్కేవు
నీ వాడినవే నిజ మమ్మా
కైవసంబుగా గాఁగిటఁ గూడితి
దేవుల వతనికిఁ దెలిసితి మమ్మా

రేకు: 0364-4 రామక్రియ సంపుటం: 11-382

పల్లవి: ఆతని నీవేమైనా నంటివా తొల్లి
నీతమి తానె యెరుఁగు నీకేలే వెరపు

చ. 1: మొగము చూచె నతఁడు మొక్కిలి వందుకు నీ
తగ వాతఁ డెఱఁగడా దాని కేమి
పగ యిద్దరికి లేదు సంతాన నుండితి వింతే
నిగిడి యిందుకుఁ గాము నీ కేలే వెరవ

చ. 2: తామెర వేసె నతఁడు తట్టితివి చేత నీవు
దోమటి దోడికేవేళ దోసమా యేమి
యేమిటాను మోసపోరు యిద్దరికి కిద్దరే సాటి
నేమ మేమిటాఁ దప్పదు నీ కేలే వెరవ

చ. 3: చేత నిన్ను నంటఁగాను సిరసు వంచితి వింతే
ఆతఁడె శ్రీవెంకటేశుఁ డందు కేమి
యేతులకుఁ గూడితిరి యిద్దరు నిక్కడనే
నీతితో బదుక వమ్మ నీ కేల వెరవ

రేకు: 0364-5 భవుళి సంపుటం: 11-383

పల్లవి: వెలఁది యీమాఁటె విన్నవించ నంపె
వలవనిజోలి వద్దు సుమీ

చ. 1: తరుణిచూపుల దట్టపు వెన్నెల
గరిమ నీపైఁ గాయఁగానె
విరహపుఁగాక వేసవి యెండలఁ
బోరలే వే మయ్య పొద్దు వోదా

చ. 2: పేఁడుచు మాటలఁ బెరతేనె నీపైఁ
బోఁడి మాపె బూయఁగానె
వేఁడి నిట్టూర్పుల వెసఁ గారముల
మాఁడ నేల నీకు మంకు గద్దా

చ. 3: కొమ్మ నిన్నంతలోఁ గూడి మోవులనె
చిమ్ముచు విందులు నేయఁగానె
యిమ్ముల శ్రీవెంకటేశ ర తెంకలి
కమ్మరఁ బెంచేవు కడ లేదా

రేకు: 0364-6 లలిత సంపుటం: 11-384

పల్లవి: చాలుఁ జాలు నే మన్నఁ జవి గావు
కూళతన మింతే నిన్నుఁ గొసరఁ బోతేను

చ. 1: ఉమ్మగిలుఁ జిత్తముతో నుడుకుతా నుండేనన్ను
యెమ్మెలకుఁ జెనకేవు యేరా నీవూ
తమ్మి మొగ్గవాట్లకె తల్లడించే నామేను
నిమ్మపంట వేసేవు నే నోపఁ గలనా

చ. 2: చెక్కు చేతఁ బెట్టుకొని చింతఁ బొరలెడినాతో
యెక్కువఁ గేరడా లాడే వేరా నీవూ
మొక్కలాన నీకు దక్కి మోసపోయి వున్న నన్ను
తోక్కేవు నాకాలు వట్టి దూరప్పటి వలెనా

చ. 3: వులుకుట్టుఁజేఁతలకు నుస్సు రంటా నున్ననాతో
యెలయించి నవ్వు నవ్వే వేరా నీవూ
నెలవై శ్రీ వెంకటేశ నిన్నుఁ గూడి యలసితి
బలిమిఁ గాఁగిట నిఁక పచ్చి సేయ వలెనా

రేకు: 0365-1 రామక్రియ సంపుటం: 11-385

పల్లవి: మొక మొక మెదుటనె ముంగోప మిఁక నేల
పక పక నగుతానె పంత మిచ్చె నాతఁడు

చ. 1: ఆతడె నీ వున్నచోటి కంగనల నంపఁగాను
యీతలఁ దల వంచేవు యేలమ్మ నీవు
కాతరిం చంతటఁ బోక ఘనుఁడు దానె వచ్చె
చేతులార నీవ నేవ నేయవమ్మ యిపుడు

చ. 2: కడు మోహములె నీకుఁ గప్ప మాతఁడు వెట్టఁగ
యెడమాటలఁ దిట్టించే వే లమ్మ నీవు
తడవి మీ రాతని తరుణులు దొబ్బిరట
గొడవలు దీర వేఁడుకోవమ్మ పతిని

చ. 3: ఆయములు సోఁక నాతఁ డాన లెల్లఁ బెట్టుకోఁగా
యీయేడ నవ్వులు నవ్వే వే మమ్మ నీవు
వోయమ్మ శ్రీవెంకటేశుఁ డోఁగునూతులలోఁ గూడె
నీయిచ్చ నాతఁ డున్నాఁడు నీవు మెచ్చ రాదా

రేకు: 0365-2 లలిత సంపుటం: 11-386

పల్లవి: కానీవయ్య్య అందు కేమి కాల మిట్టే వుండీనా
మాన కెవ్వతె సలిగె మతి నమ్మినాఁడవో

చ. 1: మాట లాడ నాతో నీకు మనసు రా దోమో కాక
పాటించి నేఁ బిలువఁగాఁ బరా కయ్యేవు
చీటికి మాటికిఁ దొల్లి చేసన్నకె వచ్చేవాఁడఁ
వీటున రాజసాన నీ వెవ్వరిఁ గైకొనవు

చ. 2: నగ నైనఁ గొంత నాతో నంటున దోసమో కాక
మొగము నేఁ జూడఁగానె మోము వంచేవు
అగపడి యేపొద్దు నాయండఁ బాయనివాఁడవు
వెగ టై మావిన్నపాలు వినఁ దీర దాయను

చ. 3: నిండినచలము నాపై నీకు నెంత గద్దో కాక
బెం డైననన్నుఁ గాఁగిట బిగియించేవు
కొండల శ్రీవెంకటేశ కూడి లో నైనవాఁడవు
నిండుకొని యే డవుత నిన్ను నీ వెరఁగవు

రేకు: 0365-3 బౌళి సంపుటం: 11-387

పల్లవి: ఏరా నావద్ద నుండే యిది దగునా
ఆరీతిఁ గనీఁ గానమి నది గొంత గాక

చ. 1: కాఁకలు నేయుచు నాపె కన్ను లెదిటికి వచ్చి
సోఁక నిన్ను నవ్వితేనె చొక్కి పడేవు
మూఁకలో నుండి అప్పటి ముసుఁగు వెట్టుక కొమ
రాఁకల నెలయించఁగ నట్టె చూచేవు

చ. 2: మటమాయముల నాపె మాట దీసి నీతోడ
సటులు రెం డాడితేనె చన విచ్చేవు
తటుకున నప్పటిని దగ్గరికివచ్చి యాసె
యెటు నేయు మనినాను యియ్యకొనే విపుడు

చ. 3: సిగ్గుపడ కాపె నిన్ను చేచాఁచి కాఁగిటఁ గూడి
వొగ్గి లోనికిఁ దీసితే వొడఁబడేవు
నిగ్గుల శ్రీవెంకటేశ నీవు న న్నప్పటిఁ గూడి
తగ్గి యాపెచే మొక్కించి తగులు సేసేవూ

రేకు: 0365-4 భవుళి సంపుటం: 11-388

పల్లవి: ఏల చిన్నఁ బోయినాఁడ విందుకుఁ గాను
ఆలరి వినోద మింతే ఆపె నీపైఁ గోపమా

చ. 1: కలికికన్నుఁ గొనల కాంత నిన్ను నవ్వఁగాను
తల వంచే వేమయ్య్య తక్కక నీవు
అలిగినవిధమో నీ వవ్వల యే మైనఁ జేసి
చెలరేఁగి యిందు వచ్చి సిగ్గు వడ్డ విధమో

చ. 2: సోవలు గా నూరివారి సుద్దు లాపె చెప్పితేను
యీవలఁ బైకిఁ దీసుకో నే లయ్య్య నీకు
తావుల నీ కందే మైనా తగులు గలదో కాక
కావిరి నెం దైన మరి కలఁగి వచ్చితివో

చ. 3: గక్కన నాపె నిన్నుఁ గాఁగిటఁ గూడఁగాను
వొక్కటై శ్రీవెంకటేశ వుస్సు రనేవు
అక్కడ నెవ్వతె కైన ఆస యిచ్చి వచ్చితివో
లక్కవలెఁ గరఁగినలాగు రతిఁ జూపేవో

రేకు: 0365-5 సామంతం సంపుటం: 11-389

పల్లవి: అన్నియుఁ గావలసిన ట్టియ్యాఁ గాని
యెన్నికగా మమ్ము నంపు యేల నవ్వే వీఁకను

చ. 1: ఆనుక నీ వాడినట్టే ఆపెతో నే విన్నవించే
వీనుల నీ మాట లెల్ల వింటిఁగా నేను
కానుకగాఁ బట్టె మయ్య కాంతకు నీ సరితెలు
యీ నిజాలె చెల్లించుకో యేల నవ్వే వీఁకను

చ. 2: అక్కడనే పనులు అందాలుగాఁ జేసి వచ్చే
గక్కన నీ చేఁత లెల్లఁ గంటిఁ గా నేను
పెక్కు నీవినయములు బిందెల నించే నాపెకు
యిక్కడనే వుండవయ్య యేల నవ్వే వీఁకను

చ. 3: తీపులు గా నీరాక తేట తెల్లములు సేసే
నాపెకు నీకు లో నైతిఁ గా నేను
యేపున శ్రీవెంకటేశ యిద్దరిఁ గూడించితిని
యేప నైనా నాన తీ నీ వేల నవ్వే వీఁకను

రేకు: 0365-6 వరాళి సంపుటం: 11-390

పల్లవి: ఏమి సేతు మొగమోట మిదివో నాకు
దీమసానఁ దిట్ట లేను దీవించ లేనూ

చ. 1: తోయ రాదు నీ మాఁట దొరవు నీ వాన తీఁగా
సేయ రా దటంటే నీవు చెప్పిన ట్టెల్ల
రాయడిసతుల మచ్చరము నాలో మాన లేను
వే యైనా నీ వారి పొందు విడిపించ లేనూ

చ. 2: తెగ రాదు నీమీఁద తేరి నన్నుఁ బొగడఁగ
నగ కుండ రాదు నీవు నవ్వించఁగ
వొగి నీ వెం దైనఁ బోతే వోరుచు కుండఁగ లేను
మగఁడవు నీ గుణాలు మట్టుపెట్ట లేను

చ. 3: పట్ట రాదు పాయ మిది పైకొని నీవు గూడఁగా
గుట్టు నేయ రాదు నీవు కొంగు వట్టఁగా
చుట్టాలఁ జేసితివి నీ సుదతుల నెల్లాఁ దెచ్చి
యిట్టె శ్రీవెంకటేశ యింక బాయ లేనూ

రేకు: 0366-1 భూపాలం సంపుటం: 11-391

పల్లవి: నిన్నటికి నాయఁ బోయ నేఁడే లయ్యు
కన్నుల బీరాలే కాని కాంక్ష లేకుండ దయ్యా

చ. 1: వొట్టు వెట్టుకొనెఁ గాన వూర కున్నది చెలియ
వెట్టికి మాట లాడక వేఁడుకోవయ్యు
పట్టినపంతమే కాని పై నున్నది ప్రేమ
వట్టియనువనా లేల వద్దికి రావయ్యా

చ. 2: పలుక దింతే కాని భార మెల్ల నీ మీఁదనే
చలి వాయఁ బై చేయి చాఁచవయ్యు
చల మనేపేరు గాని సతి తమకము బెట్టు
కలికిచెక్కులు నొక్కి కాఁగిలించవయ్యా

చ. 3: సిగ్గులే మరఁగు గాని చింతలు వెలి కురికీ
యెగ్గు దీర మంచముపై కేఁగవయ్యు
అగ్గమై శ్రీవెంకటేశ అంగనఁ గూడితి వింక
నిగ్గుల నాపెకోరికె నెరవేర్చవయ్యా

రేకు: 0366-2 నారణి సంపుటం: 11-392

పల్లవి: ఎగసక్కె మాడితేనె యెంత సేసేవు
మగువతోనె నేఁడు మంకు లేల నేకును

చ. 1: పలుమారుఁ బిలిపించీ పదవయ్య చెలి నిన్ను
అలిగి వచ్చితి వంటా అప్పటినుండి
చల మెంత గలిగిన సతి నీవు గూడుకుంటె
తెలుసుకొందురు గాక తెగు వేల యీడను

చ. 2: వాకిట నిలుచున్నది వచ్చినదాఁకా నీవు
రాక తా నారగించదు రమణి నేఁడు
యేకతాన నాపెతోనె యే మన్నా నందువు గాని
వాకునిష్ఠూరము లేల వద్దు వద్దు యీడను

చ. 3: కొంగు వట్టి తీసీ నిన్ను కొమ్మ దానె యిందు వచ్చి
వుంగిటఁ జిన్నఁబోయి వున్నాఁడ వంటా
అంగవించి శ్రీవెంకటాధిప కూడితి విట్టె
వెంగలియాన లెల్ల విడవయ్య యిఁకను

రేకు: 0366-3 ధన్నాశి సంపుటం: 11-393

పల్లవి: మందరిదోసము వాయ మొక్కితి మయ్య
చెంది నీపనికి నోఁచితఁగా నేను

చ. 1: అంగనలతో వాదు లడిచినకోవ మెల్ల
ముంగిట నుండిన నీపై ముంచితి నేను
చెంగట నూరకె నీ చిత్త మింత నొప్పించితి
సంగతిగా నెంత పాపజాతినో నేను

చ. 2: యెగసక్కెపుసవతు లే మేమో నవ్వఁగఁ జూచి
మొగము చూడక నామోము వంచితి
తగ వెఱఁగక నేనే తమకించితి నీ మీఁద
జిగి నన్నింత కట్టిణిఁ జేసెఁ గా దైవమూ

చ. 3: పడఁతులతోడ నేను పంత మాడినదాన నై
చిడుముడిఁ గూడి వచ్చి సేసితి నిన్నూ
కడఁగి శ్రీవెంకటేశ గబ్బి నైతిని రతుల
వెడఁగుఁజలాల నెంత వెట్టినో నేనూ

రేకు: 0366-4 శుద్ధవసంతం సంపుటం: 11-394

పల్లవి: ఏల మమ్ము నెగ్గు లెంచే వే మంటి నిన్ను
తాలిముల కెల్ల గురి తనమనవే

చ. 1: మోహము గలవారికి ముంగోపపుతి ట్లెల్ల
దేహనకు చల్ల నైనదీవెన లౌను
యీహల మనసు రాక యిత వెంత సేసినాను
వూహించి చూచినను వొరటు లై తోఁచుము

చ. 2: అచ్చివచ్చినచోటికి ఆయాలు దాఁకించుకొన్న
మచ్చికఁ గళలు రేఁగేమర్మము లౌను
మచ్చర మైనచోట మరి పాదా లొత్తినాను
కచ్చు పెట్టి యవే కామాకారము లై తోఁచును

చ. 3: అనుమాన మైనందుకు అన్నియానలు వెట్టిన
పనికి వచ్చునో రాదో భావించ రాదు
ఘనుఁడ శ్రీవెంకటేశ కైకొని కూడితి నిన్ను
వెనకటిదయ నాపై విడువకు వయ్యా

రేకు: 0366-5 ఆహిరి సంపుటం: 11-395

పల్లవి: నీవు చేసినచేఁతకు నెలఁత యేమీ ననక
కావికన్నులకొనల కలకల నవ్వెను

చ. 1: ముక్కువ నిన్ను దూరఁగ మనసు నొచ్చనో యని
వుక్కున జంకించఁగాను వొచ్చెమో యని
నిక్కి నిన్నుఁ జూడఁగాను నేరమి మోఁచునో యని
చెక్కు నొక్కి యింతి నిన్నుఁ జేరి నవ్వెనూ

చ. 2: యేల రావైతి వనఁగ నిట్టె చిన్నఁ బోదు వని
వేళ గాచు కుండఁగాను వెంగెమో యని
తాలిమితో నూరకున్నఁ దల వంచుకొందు వని
వేలు ముక్కుపై మోఁవి వికవిక నవ్వెనూ

చ. 3: చేయి వట్టి తియ్యఁగాను సిగ్గు వడుదువో యని
రాయడింపురతులకు రాఁ పయ్యే వని
యీయెడ శ్రీవెంకటేశ యిట్టె నిన్నంగన గూడి
పాయపుమదము తోడ పకపక నవ్వెను

రేకు: 0366-6 కాంబోది సంపుటం: 11-396

పల్లవి: ఇచ్చకమే నడచేటియిల్లాల నేను
పచ్చిసేఁత లివి మాకు పాడిగా దయ్యా

చ. 1: పక్కనఁ దిట్టఁగ నోప పై పై వేఁడుకొన నోప
వొక్కరీతి గుట్టుతోడ నుండే నేను
అక్కడివారెనీకు నన్నిటికి నేరుతురు
చిక్కించుక యిత వైతే నేయించుకో వయ్యా

చ. 2: అలిగి పొమ్మన నోప అప్పటి మొక్కఁగ నోప
నిలిచి రాజసముతో డే నుండేను
వెలయాండ్లే నీకు వినోదాలు నడుపేరు
చెలఁగి నీ కిత వైతే సేయించుకో వయ్యా

చ. 3: బొమ్మల జంకించ నోప పారిఁ జెక్కు నొక్క నోప
యెమ్మె నీరతులఁ జొక్కి యిట్టుండే నేనూ
నెమ్మది శ్రీవెంకటేశ నీవు గూడితివిగ నన్ను
చిమ్మల నీ సేవ నాచేఁ జేయించుకోవయ్యా

రేకు: 0367-1 దేవగాంధారి సంపుటం: 11-397

పల్లవి: మేరకు మేరే కాక మీర వచ్చునా
ఆరీతి నారడి యైతే నంద మవునా మాటలు

చ. 1: మొగమోట గలచోట ముంచి వా దడువ నేల
నగితోనె చాలదా నయముగాను
తెగనాడేమాట లెల్ల తెలుసుకోనీ నాతఁడె
జగడ మయినమీఁద చక్క నవునా పనులు

చ. 2: యెగ్గు పట్ట రానిచోట యెక్కువ తక్కువ లెల్ల
సిగ్గు వడుటే చాలదా సిరసు వంచి
దగ్గరి కాఁ గలపని తనుఁ దానె తోఁచీని
కగ్గినందుమీఁద పతిఁ గైకొలుప వసమా

చ. 3: మన నెరిఁగినచోట మరి యెడమాట లేల
పెనఁగుటే చాలదా ప్రియముతోడ
యెనసె శ్రీవెంటకేశుఁ డింతలోఁ దానె నిన్ను
చన మిచ్చినందుమీఁదఁ జలములు గలవా

రేకు: 0367-2 దేసాక్షి సంపుటం: 11-398

పల్లవి: నేసినట్టు నేయవయ్య చిత్తము వచ్చినయట్టు
బాస దుప్పేమగవానిఁ బట్ట వస వవునా

చ. 1: నేమాన నేపుణ్య మైన నీవో కట్టుకొందు గాక
యే మనిన నీ మాట కెదు రాడేమా
మోము వంచు కాఁడువారు మూలనుండుదురుగాక
గామిడైన మగవానిఁ గక్కసించఁ జెల్లునా

చ. 2: కిమ్ములవా రాడెటికీరితి నీదే కాక
యెమ్మె నెవ్వతెఁ దెచ్చినా నెగ్గ లెంచేమా
వుమ్మడిమానాపతులు వోరుచుకుందురు గాక
దిమ్మరి మగవారితో దీకొనఁగఁ జెల్లునా

చ. 3: పాపపుణ్యములలోని ఫలము నీదే కాక
యేపని సేసిన నీతో నీసడించేమా
చేపట్టి కూడితి నన్ను చేతిలోనిదాన నంటా
పై పై శ్రీవెంకటేశ బలుము చెల్లునా

రేకు: 0367-3 గుండక్రియ సంపుటం: 11-399

పల్లవి: మమ్ము నేల తడవేరు మాటిమాఁటికి
వొమ్మదు మాకు వలపు లో చెలులాల

చ. 1: మన నెల్లా నివ్వెరగు మాటలు నాకు వేసట
యెన లేనికత లెల్లా నేమి చెప్పేరే
విన నోప మారుమాట వివరించా నే నోప
అనుమాన మెల్లఁ దీర నాతని నడుగరే

చ. 2: కాయముపైఁ జెమటలు కన్నులపై వసినాడు
చేయి వట్టాతని నేల చేరఁ దీసేరే
సేయ లేను వినయాలు చేచేతఁ గొసర లేను
మాయకాఁ డాతని మీరె మనసు దెలియరే

చ. 3: నిమిష మొక్కటి యేఁడు నిండుఁబాయము తరవు
భ్రమయించి యాల వొడఁబరచేరే
సమరతి శ్రీవెంకటేశ్వరుఁ డిట్టె నన్ను గూడె
తమితో నాతని మీరు తప్పక నవ్వించరే

రేకు: 0367-4 సామంతం సంపుటం: 11-400

పల్లవి: ఇదివో తెలుసుకోరా యింకా నీవు
మదనపరవశాన మర పాయఁ గాని

చ. 1: వాలుకరెప్పలు నాపై వంచి వంచి చూచేవు
ఆలించి న న్నెరిఁగిన ట్టయ్యీనో నీకు
మేల మాడి చూడు తొల్లి మేనవారమే మనము
సోలిఁ బెక్కుసతులలో చూచి మర పాయను

చ. 2: వీరి వారి యేకాంతాన విచారించి చూచేవు
కారన మే మైన నాతోఁ గద్దో నీకు
చేరి దగ్గరిన తొల్లి చెందిచుట్టాలమే
తారుకాణ లేక సందడి మర పాయనూ

చ. 3: పెనఁగి పెనఁగి నన్ను పే రడిగి చూచేవు
కనుచూపులగురుతు కంటివో నీవు
యెన లే కలమేల్మంగను శ్రీవెంకటేశ్వర
మనరతులనుఁ జొక్కి మర పాయఁ గాని

రేకు: 0367-5 భైరవి సంపుటం: 11-401

పల్లవి: ఎప్పుడు నీసుద్దులు నే మెఱఁగినవే
కప్పురము గోవయ్య తల లెల్ల మాని

చ. 1: నొస లెల్లఁ జెమరించి నున్నని చెక్కుల జారె
కిసరి యెవ్వతె యలిగెనో నీతోను
యిసుమంత వడె కాని యింతి నిన్నుఁ బాయ లేదు
విసరేము రావయ్య వేసాలు మాని

చ. 2: సరు లెల్ల జిక్కువడి చల్లువెద లైన వివే
సిరుల నిన్నెం తాపె చేయి ముట్టెనో
సరస మింతే కాని చలము నీతోఁ గాదు
సరిసేసుకోవయ్య చలములు మాని

చ. 3: నిట్టూరుపులు రేఁగె నిద్దుర కన్నులఁ దేరె
అట్టె యెవ్వతెరతి నలసితివో
నెట్టన శ్రీవెంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
పట్టపలమేల్మంగను పంత మెల్ల మాని

రేకు: 0367-6 రీతిగౌళ సంపుటం: 11-402

పల్లవి: గుబ్బతిల్లె తమలోని గుద్దిరా లింతే కాక
గొబ్బున నీడకు వచ్చి కొంగు వట్టఁ గలదా

చ. 1: ఆతఁడే నాయింట నున్నాఁ డందరు సతులుఁ గూడి
యేతులకుఁ గోపగించి యేమి సేసేరే
చూతమువో వొక్క తైనా సోరిదిఁ గాంతునిఁ దమ
చేతికి లోనుగాఁ జేసి చిక్కించుకోఁ గలదా

చ. 2: చనవు నా కిచ్చినాఁడు సవతు లెందరు గల్లా
యెనయక నామీఁద నేమి సేసెరే
ననుపున నొక తైనా నన్నుఁ గూడినట్టిపతిఁ
బెనఁగి వేరె వలపించుకొనఁ గలదా

చ. 3: బాసతోడ నన్నుఁ గూడెఁ బైకొని శ్రీవెంకటేశుఁ
డీసులవా రిందరును యేమి సేసేరే
ఆస లింతే కాక వచ్చి అందులో నొకతె యైనా
నాసరి నుండి పతితో నవ్వి చూడఁ గలదా

రేకు: 0368-1 పాడి సంపుటం: 11-403

పల్లవి: ఇంతులచేఁ జెప్పి పంపె యిదివో యాతఁడు దానె
సంతసపు మేలుసుద్ది చాటరే యిందరికి

చ. 1: అంగనవద్దికి నేఁడు అతఁడే విచ్చేసీ నట
సింగారింతము రారే చెలులాల
ముంగిల ముగ్గులు వెట్టి ముత్తేల పందిలికింద
బంగారుపీఁట వెట్టి పరపు వరచరే

చ. 2: యిందుముఖి మన్నించ నిప్పుడిది వేళ యట
విం దాయిత్తము సేయరే వెలఁదులాల
గందముఁ గస్తూరియును కప్పురవిడెములును
అందుకఁ బన్నీటఁ బాదా లదె కడుగరే

చ. 3: వాయిదాలు వాయించేరు వాకిటికి రాఁ బోలు
యీాయింతిఁ జేపట్టినాఁ డింతలో నట
యీా యెడ శ్రీవెంకటేశుఁ డీమగువతోఁ గూడె
చే యెత్తే మొక్కరే మీరు సేసినట్టి మేలుకు

రేకు: 0368-2 గౌళ సంపుటం: 11-404

పల్లవి: వాఁడివో నీ రమణుఁడు వలసినట్టు సేయనీ
పేఁడుకొని మాకు నింత పెనఁగ నేమిటికి

చ. 1: బలిమిఁ బట్టఁగ రాదు పరాకున నుండ రాదు
యెలమి నీతోడిపొందు లెటుఁ బో రాదు
వలపు తీపన రాదు వడిఁ గార మన రాదు
చెలులము సారె బుద్ధి చెప్పకుండ రాదు

చ. 2: నవ్వులు నవ్వఁగ రాదు నాలి నూరకుండ రాదు
యివ్వల నీతో సరస మెటుఁబో రాదు
జవ్వన మిందుకో రాదు చాలించి పో దొబ్బ రాదు
మవ్వపు మీతేఁకువలు మాకుఁ జూడ రాదు

చ. 3: తప్పక చూడఁగ రాదు తల వంచు కుండ రాదు
యెప్పుడు నీతోడిజాడ యెందుఁ బో రాదు
అప్పఁడు శ్రీవెంకటేశుఁ డలయేలుమంగ నిన్ను
యిప్పుడిట్టె కూడె మాకు నేమీ నన రాదు

రేకు: 0368-3 శంకరభారణం సంపుటం: 11-405

పల్లవి: మిము దూర నోపను మించతనిఁ బాయ లేను
తమకము దైన్యముఁ దడఁబడెనూ

చ. 1: ఆల విభునియెలుఁగు ఆలించెద నిదె
పలుకకురే అటు పలుమారు
యెలమి నాతనికి నెదు రేఁగెద నిదె
పిలువకురే నను(బెనఁగుచును

చ. 2: వడి నతని నగరివంక చూచెదను
యెడ నడ్డము రా కిటు దలరే
తొడ రతనిసతులతో మాఁట లాడెద
చిడుముడిఁ బరాకు సేయకురే

చ. 3: శ్రీవెంకటపతికిఁ జేతుల మొక్కెద
చేపల బుద్దులు చెప్పకురే
కావించి నన్నతుఁడు కాఁగిటఁ గూడెను
భావించి ననుఁ బై పై నవ్వకురే

రేకు: 0368-4 సామంతం సంపుటం: 11-406

పల్లవి: చీ చీ సతుల మనఁగ సిగ్గు గాదా
తాచి యిన్నియు నింకఁ దడవ నేమిటికి

చ. 1: సొలసియునుఁ దని వోదు చూచియునుఁ దని వోదు
పలుమారు నీమీఁదఁ బాడి తని వోదు
వలవ నేరుచు నాకె వలపించ నేర్చితివి
చెలులబతుకులు యింకఁ జెప్ప నేమిటికి

చ. 2: కదిసియునుఁ దని వోదు కడు నవ్వి తని వోదు
అదన నీతో మాట లాడి తని వోదు
మది నిలిచె నీ కాపె మన్నించితివి నీవు
గుదికొన్న కామినుల గొడవ యేమిటికి

చ. 3: మెచ్చియునుఁ దని వోదు మితిమీరి తని వోదు
కొచ్చి కాఁగిటిరతుల గూడి తని వోదు
యెచ్చటను శ్రీవెంకటేశ ననుఁ గూడితివి
హెచ్చితి మిద్దర మొకటే యితరు లేమిటికి

రేకు: 0368-5 సాళంగం సంపుటం: 11-407

పల్లవి: చాలుఁ జాలు నంత మాతో సత్యా లేల
పోలించి వింటేఁ గల్లలు పుట్టెఁడేసి రాలవా

చ. 1: యెగ్గు పట్టే వని నిన్ను యేమి యనఁ జాలఁ గాక
సిగ్గుపడే వని నీపైఁ జే చాఁచఁ గాక
నిగ్గుల నీతోఁ గనక నే నేపాటి నవ్వినాను
బగ్గన నీయచారాలు బయిటనే పడవా

చ. 2: తల వంచే వని నిన్నుఁ దారుకాణఁ బెట్టఁ గాక
కలఁగే వని పయ్యెదఁ గప్పితిఁ గాక
వొలిసి నేఁ గనక నిన్నొత్తి మాట లాడితేను
యెలమి నీదొరతన మిట్టే యేరుపడదా

చ. 3: పై పైఁ దమకించే వని పచ్చి సేయఁ జాలఁ గాక
కోపగించే వని నిన్నుఁ గూడితిఁ గాక
యేపున శ్రీవెంకటేశ యిట్టె నిన్ను నొరసితే
తీపులనీమోవి తప్పు దీరుచుకోఁ బడదా

రేకు: 0368-6 ముఖారి సంపుటం: 11-408

పల్లవి: ఇట్టివలపులు తల కెక్కెఁ గా నీకు
పెట్టరానిమందు లెల్లఁ బెట్టెఁ గా నీకు

చ. 1: కోపగించి కన్నులనె కొసరుచుఁ దిట్టఁగాను
ఆపెతోడిమాట లిత వాయఁగా నీకు
పో పో కొంగు వీడు మని పోరఁగానె యాపెతోడ
పూపనవ్వు నవ్వ బుద్ధి పుట్టెఁ గా నీకు

చ. 2: పిలువఁ బిలువఁ గానె బిగిసేయాపెతోడ
బలిమిఁ బట్టి పెనఁగ బాఁతిగా నీకు
తల మొల వీడఁగాను తప్పించుకొనేయాపెకు
యెలమిఁ దమ్మ వెట్టేదే యింపుగా నీకు

చ. 3: చెక్కుచేతిసిగ్గుతోడ సిరసు వంచినయాపె
కక్కసపురతులు సంగతిగా నీకూ
అక్కర శ్రీవెంకటేశ అలమేలుమంగ నని
వొక్క టయితి విది మతి నుండెఁ గా నీకూ

రేకు: 0369-1 శంకరాభరణం సంపుటం: 11-409

పల్లవి: అయ్యో యిన్నాళ్లు నీవే నే నని వుంటివి
నెయ్యపు నీ కపటాలు నే నెరఁగ నయ్యా

చ. 1: యీడు గానిచెలి నన్ను నే మేమో ఆడఁగాను
వేడుక నోరాఁ గన్నుల వినేవు నీవు
తాడుపడి నే నందుకు తరిఁ జిన్నఁ బో యుండఁగాఁ
గూడెనా నీ కే మైనాఁ గోరి కట్టుకోవయ్యా

చ. 2: పుక్కటసతులు నాతో పురుఁడుకు రాఁగాను
దక్కెనా నీ పంత మదె తగఁ జూచేవు
పక్కన నే నిందుకుఁ గా పై పై నిన్ను దూరఁగాను
అక్కర దీరెనా నీకు నైతే నీచిత్తమయ్యా

చ. 3: నడుమంత్రాన నొకతె నాయెదుట మురియఁగా
యెడయక సమ్మతాన నేల నవ్వేవు
బడినె శ్రీవెంకటేశ పాయక నేఁ గూడఁగాను
యెడపులవారిపొందు లేమి బాఁతి నీ కయ్యా

రేకు: 0369-2 దేసాళం సంపుటం: 11-410

పల్లవి: ఎట్టు నేసినా నీచిత్త మింతే కాక
వట్టి జాలి నే నేల వాదు లడిచేను

చ. 1: చింత లేమిటికి నీవు చిత్తములో నుండఁగాను
పంత మేఁటికి నీవు చే పట్టి వుండఁగా
వింతదాననా నన్ను వేఁడుకొనే విప్పు డిట్టే
యెంత లేదు నీతో నే నేల యలిగేను

చ. 2: కోప మేఁటికి నీవు కొంగు పట్టు కుండఁ గాను
కైపు లేమిటికి నీవు గలి గుండఁగా
మాపుదాఁకానె నీకు మన్ననదానఁ గాన
యీపాటి కీపాటి యేల యలిగేను

చ. 3: వేసా లేమిటికి నీవు వేమారు నవ్వఁగాను
బాస లేమిటికి నన్నుఁ బచ్చినేయఁగా
ఆసగా శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యీ సుద్దులకే నీతో నేల యలిగేను

రేకు: 0369-3 రామక్రియ సంపుటం: 11-411

పల్లవి: చేసిన ట్టెల్లా నీకే చెల్లుఁ గాకా
ఆ సుద్దులు దడవి నిన్నంత సేయ వచ్చునా

చ. 1: నెమ్మొగము వాడె నంటా నిండుఁజెమ టేడ దంటా
దిమ్మరిమాఁటల నిన్నుఁ దిట్ట వచ్చునా
అమ్మరో పానుపుమీఁద నాకె నీవు నున్నా రంటా
నిమ్మపంటఁ గొని నేము నిన్ను వేయ వచ్చునా

చ. 2: యేతల చూచే వంటా యెంగిలిత మ్మేడ దంటా
చేత వంటి నిన్నే మైనాఁ జేయ వచ్చునా
భీతి లేక ఆపె వెంటఁ బెట్టుక వచ్చితి వంటా
నీతి దప్పి చిన్నఁ బో నిన్నుఁ జేయ వచ్చునా

చ. 3: ఆకెచే మొక్కించే వంటా అట్టె సిగ్గు వడ వంటా
కాకు సేసి నిన్ను గంపఁ గమ్మ వచ్చునా
యీకడ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితిని
పైకొని యింకా నిన్నుఁ బచ్చి సేయ వచ్చునా

రేకు: 0369-4 రామక్రియ సంపుటం: 11-412

పల్లవి: ఇంకా నేల తడవే వేరా నీవు
సంకె దేరె నాకు నీ చలమూఁ జెల్లెనూ

చ. 1: మాట నీతో నాడితిని మనసూఁ దెలిసితిని
యేఁటికి నన్నుఁ బిలిచే వేరా నీవు
యీటుతోఁ బెండ్లాడితివి యిట్టె సేస వెట్టితివి
వాఁట మాయ వలపులు వద్ద చే నుందానను

చ. 2: చేత నీకు మొక్కితిని చేరి నీతో నవ్వితిని
యీతల నన్నొరసేవు యేరా నీవు
నీ తగులు చూపితివి నెగు లెల్లా బాపితిని
యేతు నీకు గన మాయ నియ్యకొంటి నందుకు

చ. 3: కన్నుల నిన్నుఁ జూచితి కాఁగిటిలో నున్నదాన
యేన్నేసి ప్రియాలు చెప్పే వేరా నీవు
నన్ను మన్నింతిని విట్టె నంటున శ్రీవెంకటేశ
చిన్నపులకలు నిండి సెలవు నా కాయనూ

రేకు: 0369-5 శ్రీరాగం సంపుటం: 11-413

పల్లవి: ఇంత సేసినట్టి తన్ను నేమి సేసేమే
చింతతోడ నాచెక్కు చేతిమీఁది కెక్కెనూ

చ. 1: దవ్వుల నుండేతనకు దండము వెట్టితి మిదె
యివ్వల నింకా మాతో నేమి నవ్వీనే
రవ్వ లాయ మావలపురాజ్యములోన నెల్ల
పువ్వుటమ్ములమనసు పుర పురఁ బొక్కెను

చ. 2: పట్టుక తొల్లె తనకుఁ బంత మిచ్చితి మిదె
యిట్టె మాదిక్కు తా నేమి చూచీనే
వెట్టివిన్నపము లాయ వేగుదాఁకా మాకతలు
జట్టిగా మావిరహము చల్లువెద లాయను

చ. 3: చేరి తాఁ బైకొనఁ గానె చేతికి లో నైతి మిదె
యీరీతి నాయడకు తా నెంత సేసీనే
కూరిమి నిట్టె నన్నుఁ గూడె శ్రీవెంకటేశుఁడు
తీరుకు వచ్చి పనులు తేటతెల్ల మాయను

రేకు: 0369-6 దేసాళం సంపుటం: 11-414

పల్లవి: నీకుఁ బోదు నాకుఁ బోదు నీ వెట్టు సేసినాఁ జేయి
సాకిరివంటిది నాజవ్వన మిందుకును

చ. 1: జిగురువంటిది నాచిత్త మిది నీమీఁదఁ
దగిలి విడువరు నీ తగురూపు
తగరువంటిది నాతమకము మీఁద మీఁద
నతడు నేయు నీయాయాలు దాఁకీని

చ. 2: బచ్చనవంటిది నాపలుకు నీయడకును
అచ్చమై చూడఁ జూడఁగ నంద మై యుండు
నిచ్చనలవంటివి నానిండుఁ గోరికలు నీకు
హెచ్చినవలపు తల కెక్కఁ జేసేయెందుకు

చ. 3: గాలమువంటిది నాకాఁగిటికూటమి నీకు
తూలి మరి యెందుకునుఁ దొలఁగ రాదు
తాలమువంటిది నాతగులమి నీమీఁద
మేలిమి శ్రీవెంకటేశ మీఁదఁ గిందఁ బాయదూ

రేకు: 0370-1 సాళంగం సంపుటం: 11-415

పల్లవి: ఎదుట నున్నాఁడు వీఁడె యీబాలుఁడు
మదిఁ దెలయ మమ్మ యేమరులో కాని

చ. 1: పరమపురుషుఁ డట పసులఁ గాచె నట
సరవు లెంచిన విన సంగతా యిది
హరియే తా నటముద్దు లందరికిఁ జేసె నట
యిర వాయ నమ్మ సుద్దు లేఁటివో కాని

చ. 2: వేదాల కొడయఁ డట వెన్నలు దొంగిలె నట
నాదించి విన్నవారికి నమ్మికా యిది
ఆదిమూల మితఁ డటా ఆడికెల చాఁత లట
కా దమ్మ యీసుద్దు లెట్టికతలో కాని

చ. 3: అల బ్రహ్మతండ్రి యట యశోదకు బిడ్డఁడట
కొలఁ దొకరికిఁ జెప్ప గూడునా యిది
తెలిపి శ్రీవెంకటాద్రిదేవుఁడై నిలిచె నట
కల దమ్మ తన కెంత కరుణో కాని

రేకు: 0370-2 లలిత సంపుటం: 11-416

పల్లవి: కా దని మీమాఁట కడచేమా
సోదించి మమ్మే సొలయఁగ రాదా

చ. 1: తెలిసినమాఁటకు తెరమరఁ గేఁటికి
చెలులు తగవు లిటు చెప్పరే
అలిగి యిద్దరము నటు నిటు నుండఁగ
చల మే లని మమ్ము జంకించ రాదా

చ. 2: మునుపు వెన కెరిఁగి మొగమో టేఁటికి
అనవలసినట్ల నాడరే
పెనఁగుచు మాతో బీరము లాడఁగ
కనుసన్నలచే కలఁపఁగ దగదా

చ. 3: అమరినపనులకు ననుమాన మేల
సమము సేసితిరి సరుగ మమ్ము
క్రమమున శ్రీవెంకటపతి గూడెను
గుము రై మా కిటు గురిగాఁ దగదా

రేకు: 0370-3 శంకరాభరణం సంపుటం: 11-417

పల్లవి: ఎవ్వరితో గొడ వేల యింకా నీకు
రవ్వగా నీయింటికి రమ్మనేవు నీవూ

చ. 1: యీయింతిపయి మన్నన నీ కేఁటిదో వొక్కమాఁటలో
సేయరానిపను లైన సేతువు నీవు
మాయ సేసి యాపె నీతో మచ్చిక చల్లితేఁ జాలు
పాయ లేక నిలువున భ్రమతువు నీవూ

చ. 2: యెవ్వ రైనా నాపెను నేఁ డిటు పేరుకొంటేఁ జాలు
అవ్వల మూపులు మూఁడు అవుదువు నీవు
నవ్వులకు నాపెపయి నానలు వెట్టితేఁ జాలు
నివ్వెరగుపడి అట్టె నిలుతువు నీవూ

చ. 3: యెంతదడ వాపె నీయెదుట నుండితేఁ జాలు
రంతులఁ గిందు మీఁదు నరయువు నీవూ
కాంతతో శ్రీవెంకటేశ కడపలోఁ దే రెక్కి
యింత నన్నుఁ గూడి వీదు లేఁగితివి నీవూ

రేకు: 0370-4 లలిత సంపుటం: 11-418

పల్లవి: మానవు జగడము మాతోను
నేనీకిం తేసి నేరుపనా

చ. 1: రపమున న న్నిటు రమ్మని పిలువఁగ
అపుడే నే నోప ననినా
ఉపమల దూరేవు వూరకే నను నిటు
కపటం బిపుడే కైకొంటినా

చ. 2: చెనకుచు నాపైయి చేతులు చాఁచఁగ
కొనచూపుల నినుఁ గోపించగా
తనియక నీవే తగిలేవు గాక
యెనసి యాస నీ కిచ్చితివా

చ. 3: కలయుచు నీవే కాఁగిట నించఁగ
వలపు నీవు మఱవకు మనవా
బలిమి శ్రీవెంకటపతి ననుఁ గూడితి
వలసి యెదురుమా టాడితినా

రేకు: 0370-5 లలిత సంపుటం: 11-419

పల్లవి: ఇందుకే వెరగయ్యీ నన్నెంచుకొంటేనూ
పందను దైవాన కెట్టు బాఁతైతినో నేనూ

చ. 1: యెన్నికకూ మాని సంటా నెట్టు పుట్టించె దైవము
పన్ని యాఁడువా రే మన్నఁ బంత మిత్తును
పున్నమచందురునకు పువ్వులమొనలకును
వెన్నెలబాయిటికిని వెరతు నేనూ

చ. 2: యెందుకుఁ గొ రౌదు సంటా యెట్టు వెంచె దైవము
ముందె ముట్టునెత్తురుముద్దను నేనూ
అంది చనుగొండలలో నధరామృతములలో
అందందె పొట్టువొర లైయలతు నేనూ

చ. 3: యెక్కడిదొర న న న్నేలె శ్రీవెంకటేశుఁడు
మక్కువఁ బయ్యదకొంగమాఁటువాఁడనూ
చక్కెరమాఁటలకును జంకెనబొమ్మలకును
పక్కన లో నై యట్టె భ్రమతు నేనూ

రేకు: 0370-6 ముఖారి సంపుటం: 11-420

పల్లవి: ననుఁబోటిగాఁ గా నాతో నవ్వేఁ గాక
గునినే యాఁట దైతే గుంపించ కుండునా

చ. 1: తక్కక నేను నిన్ను తప్పు లెంచఁ జాలఁ గాక
నిక్కపు నీవొళ్లితప్పు నీ వెఱఁగనా
చెక్కు నొక్కి చెలు లెల్లాఁ జెప్పఁగానె వింటిఁ గాక
వెక్కసపుటాఁట దైతే విడనాడ కుండునా

చ. 2: కావరించి నిన్నుఁ దారుకాణఁ బెట్టఁ జాలఁ గాక
నీ వాడినమాఁటలు నీ వెఱఁగవా
మోవ నాడి యిందరూను మొక్కఁగానె వింటిఁ గాక
చేవ దేరి నాఁట దైతే చిమ్మి రేఁచ కుండునా

చ. 3: కలసినమీఁద నీతోఁ గపటాలు నేరఁగాక
నిలువు నీకుచ్చితాలు నీ వెరఁగవా
చెలఁగి కూడితి విట్టె శ్రీవెంకటేశ నన్ను
అలిగినయాఁట దైతే నలయించ కుండునా

రేకు: 0371-1 లలిత సంపుటం: 11-421

పల్లవి: ఇందుకే వెర గయ్యీ మాకు
అందపురమణుఁడు అతఁడే యెఱుగు

చ. 1: చెలిచిగురుమోవి చిత్తజునడిదము
వొలకుఁదేనె లె ట్లులికెనో
కులుకుఁజూపు పతిగుండెబెదరు లవి
కలికివెన్నె లెటు గాసీవో

చ. 2: కాంతకుచంబులు గట్టికొండ లవి
దొంతివల పెట్లఁ దొరిగోనో
పంతపునడు మది బట్టబయలు గిలి
గింత నెట్లఁ గరఁగీనో తానూ

చ. 3: తరుణిదేహ మింతయు బంగారమె
సొరిదిరతుల నెట్టు చొక్కెనో
యిరవుగ శ్రీవెంకటేశ్వరుఁడు గూడెను
అరిది విభవము లెట్లబ్బెనో

రేకు: 0371-2 కన్నడగౌళ సంపుటం: 11-422

పల్లవి: ఇంక నేల ఆసుద్దులు యిన్నియు నిందే కంటిమి
అంకెల నీ విన్నాళ్లు అంతేసి నేరుతువా

చ. 1: నవ్వేటినిన్నుఁ జూచి నమ్మఁగలదానఁ గాక
యెవ్వరికపటా లెట్టో యెఱఁగుదునా
మవ్వపు నీమేన నేఁడు మచ్చములు గంటిఁ గాక
నెవ్వగ నపనమ్మిక నీపై తొల్లి కంటినా

చ. 2: నీనయగారములకు నేనే మెచ్చుకొందుఁ గాక
యే నెపానకుఁ జేయుట యెరుఁగుదునా
కానీలే నీకపటాలు కానఁబడెఁ గాక నేఁడు
నానాఁడె నీ గుణము నా కింత దెలుసునా

చ. 3: గక్కన నీవు గూడఁగ కాని మ్మని యందుఁ గాక
యెక్కడనుండి వచ్చుట యెరుఁగుదునా
యిక్కువ శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నిక్కి నేఁడు సేసే మేలు నిన్న నెరుఁగుదునా

రేకు: 0371-3 పాడి సంపుటం: 11-423

పల్లవి: నే నొకటి నేయఁగాను నీ వొకటి సేసేవు
కోనచెన్న రాయఁడ నీగుణ మింక మానవు

చ. 1: పక్కన నే తోడ పకపక నగఁగాను
తెక్కుల నీ వైతే నేల తిట్ట వచ్చేవూ
మొక్కలము విడిచి నే ముచ్చట లాడుకోఁగాను
వెక్కసపువెంగె మని వేరె తలఁచేవూ

చ. 2: తనివోక నే నిన్ను తప్పు కిట్టె చూడఁగాను
తనవు చూచుక నీకే తల వంచేవు
అనుమానము లే దని ఆన నీపైఁ బెట్టఁగాను
పెనచి నీ వామాఁట పేరడిఁ బెట్టేవూ

చ. 3: కందువ లంటుచు నిన్ను కాఁగిట నించఁగాను
పొందుల నుప్పు వేసి పొత్తు గూడేవూ
అందపు శ్రీవెంకటేశ అట్టె కొనచెన్నఁడ వై
ముందు వెనకాఁ గూడి మోహము చల్లేవూ

రేకు: 0371-4 శంకరాభరణం సంపుటం: 11-424

పల్లవి: ఎఱఁగమా యింత యెమ్మెకాఁడ
గుటి లేని వట్టి కోపకాఁడా

చ. 1: మాయలు నెరపి మంచిమాఁట లాడి
చాయకు వలచే సటకాఁడా
కాయజకేలికి కాలిసన్నగోర
వాయక వాసేపు వగకాఁడా

చ. 2: అట్టు నిట్టు వచ్చి యాసలు రేఁచేవు
పట్టినచలముల పంతగాఁడా
గుట్టు సేసుకొని కూరిమి చల్లేవు
తొట్టినపాయపు దొమ్మికాఁడా

చ. 3: మన్నించి యింతలో మంచ మెక్కితివి
మిన్నక నవ్వుల మేఁటికాఁడా
యిన్నిటా శ్రీవెంకటేశ కూడితిని
కన్నుల మొక్కెటి గండికాఁడా

రేకు: 0371-5 మంగళకౌశిక సంపుటం: 11-425

పల్లవి: ఇసుమంత పని కైన యియ్యకొందును నీ
వస మైనదాన నీకు వంక లాడ వలెనా

చ. 1: మన్నించి నీవు నాతో మాట లాడితిని గాక
సన్న సేసి నిలచుటే చాలదా నాకూ
నన్నుఁ జూచి మరిఁ గొంత నవ్వు నవ్వితిని గాక
వున్నట్టె నావొద్ద నీవు వుండితేనె చాలదా

చ. 2: కరుణించి నీవు నాకాయ మంటితివి గాక
సరిపేరఁ బిలిచిన చాలదా నాకు
మరిగించుకో లేక మంతన మాడేవు గాక
గరిమె నీసొమ్మ నని కైకొంటే చాలదా

చ. 3: ఆదరించి కాఁగిట నీ వలముకొంటివి గాక
సొద నంటా మెచ్చి తిదె చాలదా నాకు
సేదదేరఁ గూడితివి శ్రీవెంకటేశ నీవు
పాదము చాఁచి నన్నుఁ బైకొనుటే చాలదా

రేకు: 0371-6 రామక్రియ సంపుటం: 11-426

పల్లవి: నీకే తెలుసు నయ్య నీతగవూ
యీక డాకడివారలు యే మందురో కాని

చ. 1: అంచెలఁ బెట్టెను చూపు లంగన నీరాకకు
యించుకంత నీజాగు లెరఁగ రాదూ
మంచివాఁడ వంటానె మమ్ము నంపె నీకడకు
యెంచి యిటమీఁదిపను లె ట్టుండునో కాని

చ. 2: పడఁతి మొక్కులు నీకు పొఁజు లెదురుగా నంపె
అడరి నీరాజన మింతౌ తెరఁగదూ
అడియాలము చెప్పంపె నది యెం తైనాఁ గలదు
యెడసి నీ వుండినందుకు కే మనునో కాని

చ. 3: కాంత కుచములు నీకు కానికెనా మీఁ దెత్తె
పంతము నీవు చెల్లించేబా గెరఁగదూ
అంతలో శ్రీవెంకటేశ ఆదరించి కూడితిని
యింతటి నీ మేలు దక్కె నిఁక నెంతో కాని

రేకు: 0372-1 ముఖారి సంపుటం: 11-427

పల్లవి: వెన్నలు సెలవిఁ గారే విఠ్ఠలేశా
నన్ను చచి నవ్వేవు నాలి విఠ్ఠలేశా

చ. 1: బాలులతో నాడి యాడి బడిలితివి రావయ్య
వేలెటికురుల ముద్దువిఠ్ఠలేశా
కాళింగుఁ దొక్కితి వట కటకట వుద్దండాలు
వోలిఁ జేయ దొరకొంటి వోవిఠ్ఠలేశా

చ. 2: దూడలవెంటఁ దిరిగి దూళి మేన నంటె నిదే
వేడుక యంతో నీకు విఠ్ఠలేశా
యేడకొండో వొకవేల నెత్తితివి నీ వట
వోడక యింత సేతురా వోవిఠ్ఠలేశా

చ. 3: గొల్లెతల నంటి యంటి గొల్లు మేన నిండె నిదే
వెల్లవి రాయఁ బనులు విఠ్ఠలేశా
యిల్లిదె పండరంగిని యిటు శ్రీవెంకటాద్రిని
వుల్ల మలరు నిలిచి తోవిఠ్ఠలేశా

రేకు: 0372-2 సాళంగనాట సంపుటం: 11-428

పల్లవి: నాకు నీమొగము చూచి నవ్వు వచ్చీని
కాకు సేయ కిఁక నైన గతి గూడవయ్యా

చ. 1: పలుకు లెన్ని గలవు పాటించి బొంకఁగఁ బోతే
అలరీనా నీవంటి అందగానికి
చలము సాధించితివి చక్క నాయఁ బను లెల్ల
వెలయ మాయింటి కిఁక విచ్చేయవయ్యా

చ. 2: ఆన లెన్నైనఁ గలవు అటమటించే నంటే
యీనెపాన నీవంటి యెమ్మెకానికి
నీనేర్పు లీడెరె నిన్ను నిందరు మెచ్చిరి
వీనులు చల్ల నాయను వీడె మిందవయ్యా

చ. 3: వొడఁబా టైనఁ గద్దు వోపిక గలిగితేను
విడువక నీవంటి వేసదారికి
తొడిఁబడఁ గూడితివి దొమ్మితో శ్రీవెంకటెశ
బడలితివి రతులఁ బవ్వళించవయ్యా

రేకు: 0372-3 గుండక్రియ సంపుటం: 11-429

పల్లవి: కన్నవా రెవ్వరు దీనిఁ గడ లేని జవ్వనము
తన్నుఁ దానె వలపు లింతకుఁ దెచ్చె నయ్యా

చ. 1: మనసులోపలి చింత మాటలాడుదాఁకాఁ
యెనలేనిమాఁట బయలీఁతకుఁ దెచ్చె
తనవోని బయలీఁత తమకములకుఁ దెచ్చె
పెను నావల పింతగాఁ బెరిగె నోయయ్యా

చ. 2: గక్కనఁ జూచినచూపుకాఁక లింతేసికిఁ దెచ్చె
చిక్కించి కాఁకలు లో లో సిగ్గుకుఁ దెచ్చె
నిక్కినసిగ్గులు నేఁడీ నివ్వెరగులకుఁ దెచ్చె
పిక్కటిల్లి వల పింత పెరిగె నోయయ్యా

చ. 3: మితి లేని మోహములు మేరలు మీరఁగఁ దెచ్చె
రతులమేరలు యింత రవ్వకుఁ దెచ్చె
యిత వై శ్రీవెంకటేశ యిట్టె నీవు గూడితిని
కత రై వలపు లింతగాఁ బెరిగె నయ్యా

రేకు: 0372-4 సామంతం సంపుటం: 11-430

పల్లవి: చేరి మందెమేళ మెంత సేసేవు మమ్ము
మేరకు మేరే కాక మిక్కి లింత చెల్లునా

చ. 1: చివ్వన నీ కూడిగాలు సేసేకాంతలలోన
నెవ్వరిఁ బోలుదు నేన న్నేల పట్టేవు
యివ్వల నీ వే మన్న నెదు రాడఁ జాలఁ గాక
దవ్వుల నుండిననన్ను దగ్గరి రాఁ దీతురా

చ. 2: అంచెల నీతో నవ్వే యాపాటివారమా
పొంచి నన్ను నెంత సేసి పొగడేవు
ముంచి బలిమి సేయఁగా మోనానల నుండితిఁ గాక
మంచ మెక్కి నీసరుస మాట లాడేదానవా

చ. 3: కొంగు వట్టేవు నీకాలిగోరఁ బోరఁ గలనా
యెంగిలి మా మోవితేనె లేల ముట్టేవు
అంగవించి శ్రీవెంకటాదిప కూడితి నన్ను
మంగిటనిధానము వై ముట్టి నన్నుఁ బాయవు

రేకు: 0372-5 శంకరాభరణం సంపుటం: 11-431

పల్లవి: తగ దీకనూ నీ వెటు సేసిన తపములు ఫలియించె
మగలవాఁడూ ప్రియములు చెప్పఁగ మంకులు లేవేఅమ్మా

చ. 1: అలుగుకువే వోచిలియా ఆతఁడు గరి గాఁడు
వలవంతల నీలోఁ బొడమినవలపులు గురి గాని
చలములు యింకా సాదించకువే జగడము పని లేదు
వెలసిన నీ మొగమోటము లుండఁగ వెనక నేరరాదు

చ. 2: తడవకువే ఆతఁడు చేసినతప్పులు గురి గావు
విడువక నీతనువునఁ బెనఁగెటివిరహము గురి గాని
చిడుముడికి యిఁక నేఁటికి నీచేతికి లో నతఁడూ
బడిబడినె నీవే అతనికిఁ బంత మియ్యఁ బడును

చ. 3: పెనగకువే శ్రీవెంకటేశ్వరు బీరము గురి గాదు
కొన మొద లెంచుక మీలోఁ గూడినకూటమి గురి గాని
వినియును వినకే సిగ్గులు వడియెడివెరగులు వని లేదూ
ననిచిన నీసెలవులలో ముసిముసి నవ్వులు దొలఁకఁగను

రేకు: 0372-6 శ్రీరాగం సంపుటం: 11-432

పల్లవి: నీతో వాదుకు నే నోప
యేతుల కిఁక నీ వే మైన ననరా

చ. 1: బచ్చనమాటలు పలుమరు నాడఁగ
యెచ్చుకుందు లిఁక నే మౌనో
వొచ్చము లే కే నూర కుండఁగా
యిచ్చకొలఁది నీ వే మైన ననరా

చ. 2: చేకొని బత్తులు సేయఁగ రాఁగా
నేకొలఁది బడునో యెన్నికలు
చీకా కయి నే సిగ్గున నుండఁగ
యీకొలఁదుల నీ వే మైన ననరా

చ. 3: గుటిగాఁ గాఁగిటఁ గూడఁగఁ రాఁగా
నెఱుకలు మఱపులు నే మవునో
నెఱి శ్రీవెంకటనిలయుఁడ నీవే
యెఱిఁగి కలిసితివి యే మయిన ననరా

రేకు: 0373-1 మంగళకౌశిక సంపుటం: 11-433

పల్లవి: నావాఁడ వని నిన్ను నమ్మి యుందును
యీవేళ నాతోనె యింత గలదా

చ. 1: రావద్దా నీవు నేఁడు రమణుఁడ మాయింటికి
కావిరి నీకు నేము కడవారమా
సోవల నెగ్గులు లేవు చుట్టపువరుసే నాకు
నీ వెరఁగనితగవు నీకుఁ జెప్పేమా

చ. 2: చెప్ప వద్దా నీవు నాకుఁ జేసేపనుల కెల్ల
నెప్పు డైన నేము నీకు నెదు రాడేమా
తప్పించుకోఁ బని లేదు తగుల మైనచోట
ముప్పిరి నీకు వలపు మోపు గట్టేమా

చ. 3: కూడ వద్దా నీకు నీవే కొంగు వట్టి నన్ను నేఁడు
జాడ దప్పి నీకు మెచ్చనివారమా
యీడనె శ్రీవెంకటేశ యింత సేసి కలసితి
వేడుక నీచేఁతలకు వెగ్గళించేమా

రేకు: 0373-2 ముఖారి సంపుటం: 11-434

పల్లవి: కడు గట్టిగుండె నీకుఁ గాఁగాఁ గాక
అడరి పాయపువారి కంతేసి చెల్లునా

చ. 1: పంతము దప్పినఁ దప్పీ పక్కన నవ్వేవు సుమ్మీ
యింతిరో నిన్నటిమాట కిపుడు నీవు
చెంతల నే మిందరము చేరి వేఁడుకోఁ గాను
కాంతునిఁ గాఁగిట నిట్టె కలయఁగ వలదా

చ. 2: మంకులు దీరినాఁ దీరీ మాట లూఁకొనేవు సుమ్మీ
వుంకువగా రాతిరింటివొట్లకును
సంకె దీర మీతగవు సరిగా నే తేర్చఁ గాను
యింకా నేల అలుకలు యియ్యకొన వలదా

చ. 3: సిగ్గులు వీడినా వీడీ సిరసు యెత్తేవు సుమ్మీ
అగ్గ మై శ్రీవెంకటేశుఁడ డండ నున్నాఁడు
వెగ్గళిం చాతఁడే నిన్ను వేఁడుక కాఁగిటఁ గూడె
నిగ్గుల మమ్మిక మెచ్చి నిండుకొన వలదా

రేకు: 0373-3 లలిత సంపుటం: 11-435

పల్లవి: నూఁటికి సెలవు గాఁగ నూలిపోఁగే యందురు
యేఁటి కిఁక మాఁట లెల్లా నిందులోనె వున్నవి

చ. 1: నిండు విరహతాపాన నీవు రాని కోపాన
అండ నే మని దూరి నే నంటినో నిన్ను
వుండుసుద్దు లేల యిఁక వొక్క మాఁటే మొక్కే మిదే
చండి పెట్టి యే మన్నాఁ జవి గాదు ప్రియము

చ. 2: చెప్పుడు మాఁటలకుఁ గా చిత్తము నిలుప లేక
వుప్పటించి నిన్ను నెంత వొరసితివో
ముప్పిరి నాకందు వాయ ముందటికి వచ్చితిమి
యిప్పు డిఁక నే మన్నా నెరవు లై తోఁచును

చ. 3: చెఱఁగు వట్టి తియ్యఁ గా సిగ్గునఁ దప్పించుకోంటా
తఱి నాకొనగో రెందు దాఁకించితినో
నెఱి శ్రీవెంకటేశుఁడ నే నందుకే కూడితిని
మొఱఁగు మఱఁగు లేదు ముంచుకొనీ నవ్వులు

రేకు: 0373-4 శంకరాభరణం సంపుటం: 11-436

పల్లవి: ఎంద రైనఁ గలరు నీ కెరుఁగుదు నది నేను
నింద నీపైఁ బడి నని నే ననేఁ గాని

చ. 1: కాయము నీచేతిది కడు మోహించితిఁ గాన
యేయడకు నీ వేఁగఁగా నే మొదునో
నాయంతకు నే వెరవ నంటున నిన్నందరును
యీయెడ దూరే రని యెంచుకొనేఁగాని

చ. 2: పుసు రెల్ల నీసొమ్ము పూడిగపుదానఁ గాన
దెసలు నీచేతవి నీ తెగు వెట్టొనో
విసుగ నీసుద్దులకు వెక్కసపుటపకీర్తి
ముసరి మీఁదట నీపై మోచీ ననీ కాని

చ. 3: బదు కెల్ల నీసొమ్ము పట్టపుదేవులఁ గాన
యిదె నీరతులలో నే నెంత సేతునో
పొదిగి శ్రీవెంకటేశ పోనీక కూడితి నన్ను
అది గాదు నాతో సరి యయితి వనీ కాని

రేకు: 0373-5 గుండక్రియ సంపుటం: 11-437

పల్లవి: త నంతఁ దా నెఱఁగఁడు తగులక నాకుఁ బోదు
చెనకఁగ నైన దయ్యీ్యా సిగ్గులు వడకురే

చ. 1: యేమా టయినఁ గాని యెగ్గు దప్పు లైనఁ గాని
ఆమాఁటే నామాటగా ననరే మీరు
వేమారుఁ దనతోడ వేసరితి మిన్నిటాను
వోముచు నెన్నాళ్ల దాఁకా వోరుచుక వుందునే

చ. 2: వాసి పంతు లైనాఁ గాని వైపు లెట్టయినాఁ గాని
సేసినదే నాచేఁత చెల్లెనే మీకు
మోసపోతి నిన్నాళ్లు మొగమోటములనే
పాసితే వలపులు చేపట్టు నెట్టు వచ్చునే

చ. 3: చేతికి లో నైనాఁ గాని సేసినట్టే సేయనీ
మీతగవే నాతగవు మీరరే మీరు
యీతల శ్రీవెంకటేశుడింతలో విచ్చేసి కూడె
యీతలఁపు నేఁడు గాక యిన్నాళ్లు నెందుండునే

రేకు: 0373-6 దేసాళం సంపుటం: 11-438

పల్లవి: నీతో మాటాడఁ బోతే నింద వచ్చును
యేతెరువుఁ బో నోప మాయింటనే వుండే మయ్యా

చ. 1: సిగ్గులు ముదిరితే సెలవికి నవ్వు వచ్చు
బగ్గన నవ్వితేఁ గోపము వచ్చును
వొగ్గి కోపగించఁ బోతే వొక టొకటే వచ్చును
యెగ్గులకు నోపము మాయింటనే వుండే మయ్యా

చ. 2: సరసాలు ముదిరితే సారెఁ జేపట్లకు వచ్చుఁ
దొరల చేఁ బట్టఁ బోతే దూరు వచ్చును
మరలి ఆదూరులు మరి యెందు కైనా వచ్చు
నిరవు లెరిఁగితిమి యింటనే వుండే మయ్యా

చ. 3: తప్పక నిన్నుఁ జూచితే తలపోఁతలకు వచ్చు
కప్పినతలపోఁతల కాఁక వచ్చును
యిప్పుడె శ్రీవెంకటేశ యెనసితి విదె నన్ను
యెప్పుడూఁ బాయక మాయింటనే వుండే మయ్యా

రేకు: 0374-1 శంకరాభారణం సంపుటం: 11-439

పల్లవి: నామనసు వేగిరించీ నాకంటేను
తామసించఁ బని లేదు తమకించీ వయసు

చ. 1: పోయి వచ్చి తటె నేఁ బొమ్మన్న చోటికి నీవు
ఆయనా ఆపని నే నన్నట్లనే
మాయలు గావు గదా మన సొక్క టాయనా
యీయెడకు నీవెంటే యిప్పు డిట్టె వచ్చెనా

చ. 2: వేలఁ దగిలించుకొన్న వింతలేక యెక్కడిదే
మేలుసుద్ది నీమొకాన మించీ నదే
వాలుకరెప్పలకొన వంచి సన్న సేసేవు
లోలో మాటాడుదము లోనికి రాఁ గదవే

చ. 3: యేఁటికి నవ్వేవే నీవు యెంచినట్టే ఆయనా
చాటువ నదియ నా సంతోషము
యీటున శ్రీవెంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
పాటించి తా నే మనీనె పంతము లీడెరెనూ

రేకు: 0374-2 లలిత సంపుటం: 11-440

పల్లవి: ఈకాలం బెవ్వరి కైన యిచ్చకమే మేలు
మీకేఁటికి నిష్ఠూరంబులు మితిఁ దానె బుద్ధియెరిఁగీని

చ. 1: నగ నేలే చెలులాలా నటనల మీలోను
అడపడి నేఁ డతఁ డేమని నట్టె అవు ననరే
తెగనాడ వల దింకా తెలిపి చెప్ప నేలా
మొగమోటమినె వుందము మనముందరఁ దానె యెరిఁగీని

చ. 2: కడుఁ గడుఁ దప్పక చూడకురే కపటము దగిలీని
జడిగొని ఆతఁడు యెంత సేసినా సారెఁ బొగడ గదరే
తడవఁగ వల దింకా తరి గా దీవేళ
వడివోనివలపులు గలితే నొగిఁదాఁ బ్రియములు చెప్పీని

చ. 3: వెస నూరకె మొక్కకురే వెంగెము లయ్యీని
పొసఁగ నూరక దండ నిడిచి పొగడకురే మీరు నన్ను
పస గల శ్రీవెంకటేశ్వరుఁడు పై పై నన్నుఁ గూడె
వసమై యాతిని లోనై నడతము వడి నతఁడే మన్నించీని

రేకు: 0374-3 సామంతం సంపుటం: 11-441

పల్లవి: తనకును నాకునుఁ దగు లేదే
పెనఁగి పిలవనిపేరట మిపుడూ

చ. 1: దవ్వుల నాతఁడు దప్పక చూచీ
నెవ్వరి మనసున నె టుండునో
నవ్వ కుండినా నన్నుఁ బెడరేఁచీ
చివ్వన నా కిది సిబ్బితి గాదా

చ. 2: కోపగించినాఁ గొంగులు వట్టీ
యీపెకు నితని కే మనరా
మాపుదాఁక నిదె మాటలె యాడీ
ఆపని మీతో నన సంగతులా

చ. 3: కడు నాన లిడఁగఁ గాఁగిట నించెను
వెడ వెడ గుట్టింక వెలిఁ బడదా
బడి శ్రీవెంకటపతి యిదె తిరిగీ
నిడువుల నిందలు నిజమే కాదా

రేకు: 0374-4 భవుళి సంపుటం: 11-442

పల్లవి: చిత్తగించి చూడవయ్య చిగురుఁ బోఁడిదిక్కు
బత్తి నీవు గల దాపెభాగయ్యముకొలఁ దయ్యా

చ. 1: చెలిచెమటల నాని చిత్తములో వలపులు
పులక లై మొలచెను బుజ కలిగే
యెలమిఁ గోరికె లై యీరికె లెత్తె నవే
బలుపంట లిక నీభాగ్యముకొలఁ దయ్యా

చ. 2: అంగనవిరహవేళ నాయిటిగా లై పూర్పు
వెంగలితనాన నట్టె విసరఁ జొచ్చె
పొంగుచుఁ దూరు పెత్తంగఁ బొలివారె నివ్వెరగు
పంగులఁ గోరు వట్టు నీభాగయ్యకొలఁ దయ్యా

చ. 3: కామినికుచము లనేగాదలెను జవ్వనము
ఆమనికాలము పై పై నదె ముంచెను
చే ముంచి కూడితి విట్టె శ్రీవెంకటేశ యీపెను
భామకు నీకు రతులు భాగ్యముకొలఁ దయ్యా

రేకు: 0374-5 భవుళి సంపుటం: 11-443

పల్లవి: తఱవాతిమాఁట లెల్ల దయ్యా మెఱుఁగు
యెఱఁగనిదాన నేను యే మందు నేనూ

చ. 1: మంతనము లాడుకొంటా మంచముపైఁ గేరుకొంటా
నింతదడవు నుండరా యిద్దరు మీరు
యింతలో నే రాఁగాను యెవ్వ రాపె యీ పెంటా
యెంత కెంత నన్నడిగే వే మందు నేను

చ. 2: అంగము లొరసుకొంటా నాకు మడి చిచ్చుకొంటా
యెంగిలి పొత్తందుకోరా యిద్దరు మీరు
సంగడి నేఁ గూచుండఁగా సతి నా చెలి యనుచు
యింగితానఁ బే రడిగే వే మందు నేను

చ. 3: కమ్మి కాఁగించుకోంటా కాయాలు మరచుకొంటా
యిమ్ములఁ గూడి యుండరా యిద్దరు మీరు
పమ్మి నే దగ్గరఁ గాను పైకొని నన్నుఁ గూడితి
వెమ్మెల శ్రీవెంకటేశ యే మందు నేను

రేకు: 0374-6 పాడి సంపుటం: 11-444

పల్లవి: ఏలోయి విభుఁడా యిప్పుడు బాఁ తైతిమా
తాలిమి నిన్నాళ్లు నీతలఁ పిట్టె వుండేనా

చ. 1: సంగతిగా నాపెతోడ జగడించి రా కుండితే
నంగవించి మాతో మాట లాడుదువా
కుంగక కూడు వేఁ డైతే కూరాకు నంజినట్టు
పొంగుచు నీ నా సంది పొందు లెల్ల నిదివో

చ. 2: సన్నల నాపెతో యకసక్యేలకు నేమో కాక
యెన్నఁడైనా మాయింటికి నిట్టే వత్తువా
పన్నీరు గడుఁ జలైతే పచ్చిచాఁదు పూసినట్టు
యెన్నఁగ నీ నా పొందు లిన్నియు నిట్టెపో

చ. 3: బలిమి నీ వాపెతోడ పంత మాడి రా కుండితే
కొలఁది మీర నన్నిట్టే కూడుదువా
అలరి శ్రీవెంకటేశ ఆయములు సోఁకినట్టు
తలఁగని నీ నా పొందు తారుకాణ సుమ్మీ

రేకు: 0375-1 శంకరాభరణం సంపుటం: 11-445

పల్లవి: ఏల నన్ను బుజ్జగించే వింతటిలోనె
నాలితో నీ వేడ నున్నా నన్ను మానేవా

చ. 1: చిన్నఁబోయి వుండ నేల చెక్కు చేయి నాకేల
మన్నించి నీవే నాతో మాట లాడఁగా
మున్నే నీ కొప్పగించితి ముంచిన నా దేహ మెల్ల
నిన్న నేఁటి వారిమాట నే వినేనా

చ. 2: వెంగె మాడ నా కేల వేసరుకొనఁగ నేల
సంగతిగా నీవే నాతో సారె నవ్వఁగా
వుంగరము వెట్టితిని వున్నదాన నీకుఁ గాను
చెంగట నెవ్వరు నేమి చెప్పేరు యిఁకను

చ. 3: సిగ్గు వడ నా కేల సిరసు వంచఁగ నేల
దగ్గరి నీవె నాకు దక్కి వుండఁగా
నిగ్గుల శ్రీవెంకటేశ నీవే నన్ను గూడితివి
యెగ్గులు దప్పులు మరి యెంచ నేది యిందునూ

రేకు: 0375-2 సాళంగనాట సంపుటం: 11-446

పల్లవి: దగ దొట్టి వుస్సు రనీఁ దన కేలే
మగఁడే యింత సేసితో మరి యేఁటి మాఁటలే

చ. 1: ముప్పిరి నాపె కంటేఁ దాముందై వాదుకు రాఁగ
యిప్పుడుఁ గోపము రాక యింకా నెన్నఁడే
చప్పఁగా నప్పటిఁ దానే సాకిరులు చెప్ప వచ్చీ
కుప్పలుగా నవ్వ కెట్టు గుట్టు చేసుకొందునే

చ. 2: సారెకు నాకెకుఁ గా బాసలు దానే సేయ రాఁగా
యీారు దియ్యఁ బేను రాక యేల మానువే
పోరిచ యెందు కైనాఁ దాఁ బూసుక వాసుక రాఁగా
దూరక దైవముల నేల తోసిపో నిత్తునే

చ. 3: చెంది మ మ్మిందది దానె చెక్కులు నొక్కఁగ రాఁగా
యిందరితోఁ జెప్పక నే నేల మానేనె
కందువ శ్రీవెంకటాద్రిఘనుఁ డట్టె నన్నుఁ గూడె
చందమే కాక నే నెట్టు చలము సాదింతునే

రేకు: 0375-3 నాగవరాళి సంపుటం: 11-447

పల్లవి: వలవు రచ్చల వేసేవారు గలరా
కులమునాండ్ల నింత గోర నేయ వలెనా

చ. 1: నేరుపునఁ గళ లంటి నివ్వెరగుఁ బొందించేవు
వీరు వారుఁ జూచి నన్ను వెఱ్ఱి యనరా
పూర కున్న నామీఁద వొక్కొక్క గురుతు సేసి
ఆరయ నిదెంత చిత్తి ణనిపించ వలెనా

చ. 2: చేతిమీఁద జేయి వేసే చెమరింపించేవు మేను
ఆతలివారు చూచి నన్నట్టె నవ్వరా
కాతరపుమాట లాడి కన్నులకెం పెక్కించేవు
యీతరుణిమదరాగ మిది యెమ్మె లనరా

చ. 3: రతి నేసి తెర దీసి రాములఁ బిలిపించేవు
అతివె లి దెంత పచ్చి యనరా నన్ను
గతిగా శ్రీవెంకటేశ కలసితి విటు నన్ను
యితవరి యిది యెంత యిచ్చకురా లనరా

రేకు: 0375-4 సామంతం సంపుటం: 11-448

పల్లవి: అడ్డ మాడకు వమ్మ నీ వాతనితోను
వొడ్డార మతఁడు నీతో నొనరించీనా

చ. 1: మూలలకుఁ బోకు వమ్మ ముంచి యాతఁడు రాఁగాను
యీలాగు దొరచిత్త మెట్టుండునో
బాలకివి నీ విపుడు ప్రౌఢనాయకుఁ డతఁడు
తాలిమి నీయడకుఁ దప్పి నేసినా

చ. 2: సిగ్గులు వడకు వమ్మ చెనకి యాతనితోను
నిగ్గులమగవాఁడు యేనెప మొంచునో
అగ్గలపు మేనదాన వతఁడు మోహపువాఁడు
యెగ్గలు నీ కొనరించి యెలయించీనా

చ. 3: పక్కన నవ్వకు మమ్మ పట్టి యాతఁడు గూడఁగ
యెక్కువ శ్రీవెంకటేశుఁ డెంత సేసునో
మిక్కిలి వాసికత్తెవు మించి వోరుచు నాతఁడు
వొక్క టైతి రిఁక నీపై నోల వేసీనా

రేకు: 0375-5 సాళంగం సంపుటం: 11-449

పల్లవి: పిండికూరలోనలుపులునేఁబెనఁగి యేరఁగ నోపతన్ను
చండి సేయఁగ రాదు యిఁకసరుగఁగూచుండుమనవేయమ్మా

చ. 1: వేగి మిలిచినచీఁకటి వీఁడేల తడవీ మమ్ము
ఆగడము రాతి రెల్ల సతులు ఆడఁ జేయట చాలదా
యీగతులు నేనెఱఁగనా మరియు యేల రేఁచీమమ్మును
జాగులన్నియును యిఁకచాలుఁ గూచుండుమనరేయమ్మా

చ. 2: పూస గుచ్చినదారము పోనీఁడు తా నన్నును
వాసితో వీరి వారి వెనువెంట వలలఁ దిరుగుట చాలదా
సేసినవి తా నెరఁగఁడా చెప్పఁ బోతే నవ్వులు
ఆసఁ దన కెపుడుగలదూ యిఁక నాయఁగూచుండుమనరేయమ్మా

చ. 3: పూవుల పూఁపలువలెనె పొసఁగఁ దా నన్నుఁ గూడె
భావమున తలఁచి తలఁచి కూడెటిభావరతులెచాలదా
సేవ లెల్లనుఁ జేసితి నేఁడు శ్రీవెంకటేశ్వరునికి
యీవేళ నేఁ దనిసితి యెపుడు నిట్లఁ గూచుండు మనరేయమ్మా

రేకు: 0375-6 లలిత సంపుటం: 11-450

పల్లవి: కంటి మిన్నాళ్లకు గక్కన దొంగను
అంటె నోర నదే అంగమచ్చుము

చ. 1: వుట్టు లెక్కినాఁ డొక్క తొక్కతె
తిట్టఁ దిట్ట వాని దిగఁ బిలవరే
గుట్టుఁ గృష్ణునికి గొల్లెతలకును
యెట్టు గావలసి నట్టయ్యీఁ గాని

చ. 2: మూల నున్నాఁ డదె ముంగిటికిఁ దీసి
రోలఁ గట్టరే రోస మెల్లఁ దీర
నీలవర్ణునితో నేఁడు మనబలి
మేలాగున నైన నెక్కీఁ గాని

చ. 3: మంచముపై వాఁడె మన మిందరము
కొంచక వొక్కొక్కగురుతు నేయరే
యెంచఁగ శ్రీవెంకటేశునకు మనకు
నంచెఁ బొందు లాయ నట్టే కాని

రేకు: 0376-1 నాదరామక్రియ సంపుటం: 11-451

పల్లవి: ఆఊడిం బెట్టకు మమ్ము నప్పటి నీవు
ఆణ నీవు నా కోపము అప్పటి నీవూ

చ. 1: మందు మందె సోఁక నాడి మొరఁగి లే దనేపతి
కందాలు చెప్ప వచ్చేవు అప్పటి నీవు
సందె మాడి వోడి తానె పగ చాటీ లోలోన
అందు కేల నవ్వేనే అప్పటి నీవు

చ. 2: సంగతి గానిచేఁతలు సారెఁ జేసినట్టివాని
నంగవించి కూడు మనే వప్పటి నీవు
ముంగిట వాఁడుండఁ గాను మొక్కి మొక్కిమావలపె
అంగడి వేసేవు మేలే అప్పటి నీవు

చ. 3: యింటికి నాతనిఁ దెచ్చి యిట్టె కాఁగిలించు మంటా
అంటించేవు బటిమినే అప్పటి నీవు
దంట శ్రీవెంకటేశుఁడు తానె కలసె నీమాఁట
కంటే నన రాదు మొక్కే వప్పటి నీవూ

రేకు: 0376-2 సాళంగనాట సంపుటం: 11-452

పల్లవి: ఇంత యెరఁగనియట్టి యెడ్డనా నేను
కాంతుఁడ నీ వంతేసి గరిసించ నేఁటికి

చ. 1: సిగ్గు వడి వొకమాఁట చింతతోడ నొకమాఁట
వెగ్గళించి నిన్ను నాడ వెట్టిదాననా
అగ్గలపుమోహ మైతే అన్నియు నమరుఁ గాక
దగ్గరి నప్పుడె నీతోఁ దమకించఁ దగునా

చ. 2: కన్నప్పుడే మొక్కులూను కాన కున్నఁ దక్కులును
పన్ని యింత నేయ నీకుఁ బగదానవా
మన్నించినవారితోడ మందెమేళ మింపు గాక
నిన్న నేటిలోనకే నిన్ను దూరఁ జెల్లునా

చ. 3: మూల నుండి వొకవాని ముంగిట నొకవావియు
గోల నై చెప్పుక రాను కూళదాననా
యీలాగుల శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
వేళగా కిందాఁక నిన్ను వేసరించ వచ్చునా

రేకు: 0376-3 సామంతం సంపుటం: 11-453

పల్లవి: ఎఱఁగ ననకుండా నీ కెఱిఁగించితిమి నేఁడు
తఱవాతిపనులకు తలఁపు నీ కెట్టిదో

చ. 1: జక్కవకుచములపై జారెటి పయ్యదతోడ
చెక్కుల జారే చెమటచిత్తడితోడ
నిక్కి నిక్కి లోలోనె నీ కెదురు చూచుకొంటా
అక్కడ నున్నది చెలి ఆనతి నీ దెట్టిదో

చ. 2: నిట్టూరుపుగములతో నివ్వెరగుపాటుతోడ
అట్టె నిన్నుఁ గూడెటి యాసలతోడ
నెట్టనఁ దనపాయము నీకే మీఁ దెత్తుకొంటా
యిట్టె వాకిటికి వచ్చె యెన్నికె నీ కెట్టిదో

చ. 3: బారపుఁదురుముతోడఁ బవళించే నీపానుపు
చేరి యం దున్నది నవ్వునెలవితోడ
ఆరయ శ్రీవెంకటేశ అంతలో నేతెంచి యాపె
నూరడించి కూడితివి వున్న దీఁక నెట్టిదో

రేకు: 0376-4 ముఖారి సంపుటం: 11-454

పల్లవి: ఇంక నేల తెగి కొంక నెదురా నేనూ నీవు
కంకిగా నేమి సేసినాఁ గా దనేనా నేను

చ. 1: మక్కువ నీవే నన్ను మన్నించఁగా నింతే కాక
యెక్కడ నీసతులలో నెవ్వతె నేను
మొక్కలపుఁజేఁత లేల మొగమాట మరి యేల
వక్కణించి నీ వే మన్న వద్దనేనా నేను

చ. 2: నీ విచ్చినచనువున నేనే కసరితిఁ గాక
యీవల నీ వూడిగాన కేబాఁతి నేను
ఆవలఁ గపట మేల అట్టె కూటము లేల
నీవలసిన ట్టుండఁగా నిందించేనా నేను

చ. 3: కామించి నీవే నన్నుఁ గలయఁగా నింతే కాక
యేమంచిదాన నీకు యిప్పుడే నేను
ఆముక శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
ప్రేమము నీవు నించఁగా బిగిసేనా నేనూ

రేకు:	0376-5 సామంతం	సంపుటం:	11-455

పల్లవి: ఎటువంటి నీ మాయ యెరంగమురా
యిటువంటి చేఁతలనే యెడ్డ నైతిరా

చ. 1: నగఁ బోతే నీ చేతి నాలికి లోనయితిమి
అగ డాయ మావలపు లట్టే వుండరా
మొగము చూడఁగఁ బోతే ముంచుకొనె మోహ మెల్ల
యగసక్కెములకే యేమి సేతురా

చ. 2: మాఁట లాడఁ బోయి నీతో మంతనాలఁ జిక్కితిమి
యేఁటికి మమ్ముఁ జెనకే వేడ సుద్దిరా
మేఁటినిన్న మెచ్చఁ బోయి మేనవాని చుట్టుకొంటే
యేఁట వెట్టీఁ దమకము యేమి సేతురా

చ. 3: కరఁగించఁ బోయి నీ కాఁగిట నేఁ గూడితి
యిర వాయ వయసు నవ్వీక నేలరా
సరవి శ్రీవెంకటేశ సమ్మటూరిలో మనము
యెరవు లేని యీమేలు కేమి సేతురా

రేకు: 0376-6 సాళంగం సంపుటం: 11-456

పల్లవి: దోసము దోసము దొర నే మనినా
యీసు లేనివిభుఁ డిచ్చకుఁ డతఁడూ

చ. 1: పంతము లాడకు పగతోఁ జూడకు
కాంతుఁడు నిను నిదె కైకొనును
యెంత వడియు నీ వెరఁగక తిట్టిన
వంతుకు మొక్కవె వైపరి యతఁడూ

చ. 2: కోపము మానుము గుంపెన లుడుగుము
తీపుల నీపైఁ దెగఁ డతఁడు
చే పట్టఁగ గోరఁ జిమ్మినయందుకు
మోపుచు శిరసున మొక్కవె యిపుడు

చ. 3: చలము లేమిటికి జంకెన తగ దిఁక
బలిమి శ్రీవెంకటపతి గూడె
తొలుత నీ వతనిఁ దోసి పెనఁగితివి
అలరుచు మొక్కవె అన్నియుఁ దేరె

రేకు: 0377-1 సాళంగం సంపుటం: 11-457

పల్లవి: ఏ మయ్యా వో యయ్య వే మయ్యా నే
మేమి బాఁతి నీకు నేల పిలిచే వయ్యా

చ. 1: నీ సరివారమా నేము నిండు సరసము లాడ
ఆసలఁ బెట్టక మాను మన్నామానవు
కాసు సేయనిపనికి కమ్మటి నాన వెట్టేవు
వేసరక నీవు మావెంట వెంటఁ బాయవు

చ. 2: చనవరులమా నేము సంగడి నీతోఁ గూచుండ
పొనిగి వోయినసుద్ది పో నియ్యవు
ననిచినవావు లెల్ల నాటికి నాఁడే కాక
కొనవేసి మమ్ము నేల కూరిమి గొసరేవు

చ. 3: నిన్ను మీరెవారమా నేఁ డేమి సేసినాను
కన్నులఁ దప్పక చూచి కలసితివి
యిన్నిటా శ్రీవెంకటేశ యిందరు నిట్టె చూడఁగ
నన్ను మన్నించి నాతోనె నవ్వులు నవ్వేవు

రేకు: 0377-2 ముఖారి సంపుటం: 11-458

పల్లవి: అయ్యేపను లేవిధాన నయ్యీఁ గాక
చెయ్యారఁ జేసేపనికి సిగ్గు లీఁక నేలా

చ. 1: పంతము లాడఁగ నేలే బలువులతోడను
చింతతో చెక్కిటిచేతి శిబ్బితె మేలు
చెంతలఁ బెనఁగఁ బోతే చేకత్తిగోళ్లే తాఁకు
నంతేసి లోఁతుల చౌర నాఁడువారి కేలా

చ. 2: కోరి నేరా లెంచ నేలే కొయ్యగాండ్లకుతోడ
వోరుచు కుంటే టస్సు రుసురే మేలు
యేరీతిఁ దమి రేఁచిన నీరు దియ్యఁ బేను వచ్చు
బారపుబండ్లకుఁ గాళ్లు పైం జాఁచ నేలే

చ. 3: కడుఁ గడు నవ్వు లేలే కాములకులతోడను
చిడుముడిఁ జేసెటిసేవలే మేలు
అడరి శ్రీవెంకటేశుఁ డాతడే నన్నుఁ గూడె
విడువనిపొందులకు విచారము లేలే

రేకు: 0377-3 సాళంగం సంపుటం: 11-459

పల్లవి: ఏల తిట్టేవే నన్ను నెంత గబ్బిదాననే
మే లని పొగడితేను మెచ్చ వద్దా నీవూ

చ. 1: చిక్కని వెన్నెలతేట సెలవినె వుండఁ గాను
చక్కని నీ మోమునె చంద్రుడు డంటినే
నిక్కి నిక్కి మూతు లెత్తి నీ మొగాన కెగరఁగా
జక్కవపిట్టలు నీ చన్ను లంటినే

చ. 2: కామించి మురిపెముతోఁ గదలుచు నుండఁ గాను
రామ నీపిరుఁదు మరురథ మంటినే
కోమలపుఁ బోలికలు గురుతులు చూపఁ గాను
తామెరలనె పాదాలు తగ నంటివే

చ. 3: జాతిమెఋఁగులతోడ సరివచ్చి వుండఁగాను
నీతురుమె రాశి యైల నీలా లంటినే
నీతితో నన్నుఁ గూడితి నేను శ్రీవెంకటేశుఁడ
నీతనువె బంగారునెల వంటినే

రేకు: 0377-4 భైరవి సంపుటం: 11-460

పల్లవి: ఇట్టె నేఁ దప్పక చూడ నెంతదానము
పట్టి నీతోఁ బంత మాడి పని గొందువా

చ. 1: పాటించి యిచ్చినమాఁటపట్టుకే నిన్నంటిఁ గాక
యీటున నీతోఁ బెనఁగ నెంతదానము
వాఁట మైన వలపులే వాసి రేఁచెఁ గాక నన్ను
వేఁట వెట్టి నిన్ను నింత వేసరింతునా

చ. 2: కదిసి చెప్పేకతకుఁ గాల్లడిగితిఁ గాక
యెదురుమాటాడ నీతో నెందదానను
మొదల నా మొగమోటె మొక్కించెఁ గాక నీకు
యిదివో నిన్నుఁ దగిలి యింత సేతునా

చ. 3: సందడిఁ గాఁగిలించఁగా సంతోషించితిఁ గాక
యిందరిలో నిన్ను నవ్వ నెంతదాననూ
అంది శ్రీవెంకటేశుఁడ అట్టె నన్నుఁ గూడితివి
పొందుకు మెచ్చే కాక పోనీ కిట్టె వుందునా

రేకు: 0377-5 సామంతం సంపుటం: 11-461

పల్లవి: వాఁడి గలవాఁడ వౌత వడి నే మెఱుఁగుదుము
వేఁడిమి దుష్టులమీఁద విసరంగ రాదా

చ. 1: వోప నంటాఁ బెనఁగితే నుడికి తిట్ట వచ్చేవు
ఆపనికే యెంత కెంత ఔరా నీవు
కోపము గలిగితేను గురిఁ బగవారిమీఁదఁ
జూప రాదా యీడ నేల చూపేవు నీవు

చ. 2: తనిసినవారిమీఁదఁ దగఁ జేతులు చాఁచేవు
యెన లేనికాఁకతోడ నేరానీవు
మొన చూప వలసితే ముంచి నీకు నెదిరించి
చెనకెటివార్పైనే చేఁత సేయ రాదా

చ. 3: పొలసి నంతటిలోనె పొదిగి నన్నుఁ గూడితి
మెలుపు శ్రీవెంకటేశ మేలురా నీవు
బలిమి నీకుఁ గలితే పొఁజులమీఁద నురికి
వలసినట్టు మెరయ వద్దనేనా నేను

రేకు: 0377-6 రామక్రియ సంపుటం: 11-462

పల్లవి: అడుగరే చెలులాల ఆతనినే యీమాఁట
తడవి నే మెవ్వ రైన తన్ను మీరేమా

చ. 1: చదురంగ మాడి యాడి సరిఁ దానె వోడె నింతే
వొదిగి తనకు నసు రుసురేలే
మొదల నేఁ డెవ్వతెకు మొగము చూపి వచ్చెనో
యెదుట నున్నరా రెల్ల నేమి సేతురే

చ. 2: వసంతము లాడ వచ్చి వడిఁ దానె తొప్పఁ దోఁగె
వసివాడి తానె తల వంచ నేలే
దెసల నెవ్వతెచేతి తిట్టు దాఁకి తా వచ్చెనో
యెసఁగి నవ్వేవా రెల్ల నేమి సేతురే

చ. 3: సరస మాడె తనకు సరి నింద మోఁచె నింతే
దరలోన సిగ్గుపడ దన కేలె
యిర వైన శ్రీవెంకటేశుడె తా నన్నుఁ గూడె
యెరవులవా రెల్ల నేమి సేతరే

రేకు: 0378-1 దేసాళం సంపుటం: 11-463

పల్లవి: అన్ని సుద్దులు నెరుఁగు నాతఁడె కాక
యెన్నికలు పలుమారు యే మెంచేనే నేను

చ. 1: నివ్వెరగు వడి యుండి నే నే మనే నిన్ను
నవ్వలిమాటలు నన్ను నడుగ నేలా
దవ్వులఁ దనచేఁతుల తలపోయుచున్నదాన
యెవ్వరిమాటల కని యే మందు నేను

చ. 2: చెక్కుచేత నే నుండి నేనే దేమే నిన్ను
తక్కక నన్నేల మీరు తడవేరే
మొక్కలోన నాతనిమోము చూచె నిదే నేను
యెక్కువ తక్కువలకు నెంతదాన నేనూ

చ. 3: కలకల నవ్వుతాను కా దనే దేమే నిన్ను
చలపట్టి వల పేల చల్లు మనేరే
యెలమి శ్రీవెంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యిల నాకు నెదు రేదే యిర వయితి నేనూ

రేకు: 0378-2 రీతిగౌళ సంపుటం: 11-464

పల్లవి: నిజమే యాడుచు గాక నీ కేల యీవెరపు
గజిబిజి నేసి నిన్ను గాసిఁ బెట్టేనా

చ. 1: మాఁట లాడుటే గురుతు మంచముపై నాపె నీవు
నాటినకూరిమి మించునవ్వులతోడ
యేఁటికి నాతో బొంకే వేసుద్ది నెరఁగ నంటా
ఆఁటదాన నిన్ను నే నే మైనాఁ జేసేనా

చ. 2: చేయి పట్టుటే గురుతు సిగ్గుపడి యున్నచెలి
చాయకుఁ దీసీ నది పూఁజప్పరములో
మాయ లేల నెరపేవు మగువ నింతే నేను
దాయవలె నీతోడఁ దగఁ బోరేనా

చ. 3: చెక్కు నొక్కుటే గురుతు చెలి నీవు మేడమీఁద
నెక్కడి యానలు నాతో నేల పెట్టేవు
యిక్కడ శ్రీవెంకటేశ యేలితివి నన్ను నేఁడు
పక్కన లే కున్న నిన్ను బలిమి సేసేనా

రేకు: 0378-3 ఆహిరి సంపుటం: 11-465

పల్లవి: ఎవ్వరికిఁ దెలుసు నీ యిట్టి మాయలు
రవ్వలుగాఁ జూడఁ బోతే రంటికిని వత్తువూ

చ. 1: నగవులు సారె నీకు నవ్వ వచ్చుఁ గాక మాకు
పగ సవతులచేతఁ బడ వచ్చునా
పగలుమేలము చాలు పద వోయి నీ కేమి
తగులువిరికాఁడవు దక్కినట్టే వుందువూ

చ. 2: చేత లెల్లఁ జేసి నీకుఁ జెక్కు నొక్క వచ్చుఁగాక
బాఁతిపడి విరహనఁ బడఁ గలమా
లేఁతమాట లాడ వద్దు లేవోయి వలపులు
పాఁతగిలితేఁ జాలు పనులే మరతువూ

చ. 3: గతి గూడి నీకు మమ్ముఁ గాఁగిలించ వచ్చుఁ గాక
అతివలయు నిన్ను రమ్మన నోపేమా
సతమై శ్రీవెంకటేశ చన విచ్చి కూడితివి
యిత వయినచోటికి నీ వెట్టయినఁ జేతువూ

రేకు: 0378-4 హిందోళం సంపుటం: 11-466

పల్లవి: వెనక మమ్మన వద్దు వెతలఁ బొరల వద్దు
అనుమాన మెల్లఁ దీరె నరుసుకోవమ్మా

చ. 1: తలఁచఁగానె వచ్చె తరుణి నీరమణుఁడు
అలరి మీమచ్చటలు ఆడుకోరమ్మా
నిలుచున్నాఁ డదివో నీయెదుట నతఁడు
తెలియఁగల వెల్లాను తెలుసుకోవమ్మా

చ. 2: చేతికి లో నై యున్నాఁడు చిల్లరచేఁతలు మేన
ఘాతలుగ లేవు గదా కనుకోవమ్మా
యేతుల నీ చెప్పినట్టు యేమి సేయు మన్నాఁ జేసీ
యీతల నొరసి చూడు మింకా నోయమ్మా

చ. 3: గక్కనఁ బ్రేమ మెరిఁగి కాఁగిలించినాఁ డిదివో
మిక్కిలి శ్రీవెంకటేశు మెచ్చవమ్మా
నిక్కి యీతనిగుణాలు నీ వెరఁగ వలసితే
చెక్కు నొక్కి బుజ్జగించి చిత్తగించవమ్మా

రేకు: 0378-5 శంకరాభరణం సంపుటం: 11-467

పల్లవి: దొరపాటివాఁడు తాన దొరరీతి నుండఁడు
వరుసలు మిరి వచ్చీ వద్దనరే చెలులూ

చ. 1: అంది నాకు బాగా లిచ్చి ఆకు మడి చిచ్చె నంటా
విందువలె నితఁ డేల వేఁడుకొనీనే
యెందు నూడిగపువార మింతే తనకు నేము
మందెమేళములు సేసీ మాను మన్న మానుఁడ

చ. 2: సరిఁ దానిలుచుండి మంచముపైఁ గూచుండుమంటా
అరుదుగ నన్ను నేల ఆన వెట్టినే
సరుసఁ దనకొలవుసతుల మింతే నేము
వెరవులు చెప్ప వచ్చీ వీఁడి దేమే నేఁడు

చ. 3: తల గుచ్చి కాఁగిలించి తమ్ముల మిడు మంటాను
బలిమి నేసి పెనఁగీ పచ్చిగాఁ దానూ
యిల శ్రీవెంకటేశుఁడు యిచ్చలోనివార మింతే
చాలి వాసి మమ్ముఁ గూడె చన వింత గలదా

రేకు: 0378-6 రామక్రియ సంపుటం: 11-468

పల్లవి: ఎంత బలువె తన కెంత నేము సదరమా
అంతే పో తనసుద్దు లవి నే మెరఁగమా

చ. 1: రమ్మని చేరఁ బిలిచీ రా కున్నఁ దనచేతి
నిమ్మపంటఁ గొని వేసీనే నన్నును
కమ్మటిఁ దప్పక చూచీ కడు నేఁ దల వంచితే
అమ్మ మీఁదఁ దిట్టీనే అంతలోనె తానూ

చ. 2: చేయి చాఁచీ నామీఁద సిగ్గున నూర కుండితే
చాయలకుఁ బన్నీరు చల్లీనే వీఁడూ
ఆయములు దా నంటఁగ నందుకు నేఁబెనఁగితే
బాయిట వొట్టు వెట్టీనే పాయ లేక తానూ

చ. 3: కొంగు వట్టి తియ్యఁగాను గుట్టున నే నవ్వితేను
అంగవించి యట్టె కూడె నందుకే తానూ
యింగితము శ్రీవెంకటేశుఁ డితఁడే యెఱుంగు
చెంగట నన్నిటికిని చెక్కు నొక్కీఁ దానూ

రేకు: 0379-1 రామక్రియ సంపుటం: 11-469

పల్లవి: ఎఱికముడి విశ్వాశ మిఁక నేలా
నెఱి నిటమీఁదికీర్తి నీదే కాకా

చ. 1: నీవే నే నై యుండఁగాను నిన్ను దూరఁ జో టేది
కావలసినపనులు గనుటే కాకా
ఆవల మారుమాట లడుగఁగఁ జో టేది
వేవేలు సుద్దులెల్ల వినుటే కాకా

చ. 2: మనసు లొక్క టైయుండి మచ్చరించఁజో టేది
ననుపున నెందు కైన నగుట గాక
చనవులు గలిగియు సాదించఁ జో టేది
వొనరినసంతసాన నుండుటే కాకా

చ. 3: నిండుఁ గాఁగిటనే వుండి నీతోఁ గొంకఁ జో టేది
అండనే మనము వెర గందుట గాకా
కొండల శ్రీవెంకటేశ కూడితిని నన్ను నిట్టె
మెండుగా నిన్నిటా నేను మెచ్చు టింతే కాకా

రేకు: 0379-2 శుద్దవసంతం సంపుటం: 11-470

పల్లవి: అప్పటి నేనే కోపి నందురు మీరు
చెప్పరాని ఆతనిచేఁత లివి చూడరే

చ. 1: నవ్వుతానె మంచితనము నెరుపుత గాక
యెవ్వరిమనసు లెట్టో యెరుఁగుదునా
పువ్వుల నే వేయఁగాను పూఁచి నిమ్మపంట వేసీ
దవ్వుల నుండి యాతని తగవులు చూడరే

చ. 2: మొగము చూచి తనకు మొక్కఁ గలదానఁ గాక
యెగసక్కెము లవుట యెరుఁగుదునా
తగు వెన్నెలలోనికె తన్ను నేఁ బిలువఁ గాను
సగము చీఁకటిలోనె సన్న సేసెఁ జూడరే

చ. 3: చెంది యిట్టె తనసేవ సేయఁ గలదానఁ గాక
యిందుకె నన్ను మెచ్చుట యెరుఁగుదునా
అందపు శ్రీవెంకటేశుఁ డన్నిటా నన్నుఁ గలసె
కందువలు గరఁగించి కడు మీరిఁ జూడరే

రేకు: 0379-3 సాళంగం సంపుటం: 11-471

పల్లవి: అంతటఁ గాని తీర దతివమతి కోపము
యెంత దలపోసినా యిదివో నాయకుఁడా

చ. 1: యిప్పుడైనా నామాట కియ్యకొంటేఁ జాలుఁ గాక
తప్పి పోయినా వలపు తతి మీరీనా
చెప్పునా నీ కప్పుడే సేసిననేరాన కెల్ల
ముప్పిరి నాపె నీపెకు మొక్కించు మని

చ. 2: వెనకటి నీచలము విడిచితేఁ జాలుఁ గాక
అనువుగఁ జేయ లేమా అన్నిపనులు
విన వైతి వింతే కాక వేగమే యెచ్చరించనా
చెనకిన ఆపె నీపెచేతి కిమ్మని

చ. 3: ప్రేమానఁ దగవు నడుపే నంటేఁ జాలుఁ గాక
యీమగువమారుగ నే నియ్యకొననా
కామించి శ్రీవెంకటేశ కలసితి వౌ ననినా
సామాన నాపె నీపెను సరిగాఁ జేయు మని

రేకు: 0379-4 మాళవిగౌళ సంపుటం: 11-472

పల్లవి: ఊరకె ని న్నింత సేసి వుప్పటించేనా
తేరె నన్నిపనులు నిందె మొక్కే రావయ్యా

చ. 1: కప్పురవిడెము నీవు కాంతచేత నుందుకోఁగా
దెప్పురపుకోపమునఁ దిట్టితిఁ గాక
నెప్పున నాపెసొమ్ములు నీమేన నుండఁ గాను
అప్పుడె నాతో నేను అలిగితిఁ గాకా

చ. 2: ముసిముసి నవ్వులతో ముదితమోము చూడఁగా
వెసఁ బూవుబంతిఁ గొని వేసితిఁ గాకా
వసమై యాపె నీతో వట్టిసన్నలు సేయఁగ
యిసు మంత నిన్ను నేర మెంచితిఁ గాకా

చ. 3: గట్టిగా నీ వాసతి కాఁగిట నుండఁగాఁ జూచి
చిట్టకానకుఁ బాదానఁ జిమ్మితిఁ గాకా
నెట్టన శ్రీవెంకటేశ నీవే నన్నుఁ గూడితివి
గుట్టున నన్నిటా నిన్నే కొసరితిఁ గాకా

రేకు:	0379-5 శ్రీరాగం	సంపుటం:	11-473

పల్లవి:	నాకొర కంటినా నీ నాటకాన కంటిఁ గాక
యీకడ నాకు మొక్కే వేఁటి కింతే సొనలు

చ. 1:	చిత్తజకేలికి నీవు చేర వైతి వంటినా
హత్తి నీ వెందో వుంటి వంటిఁ గాకా
పొత్తుకు రావలసి నేఁ బోరి యింతే సంటినా
అత్తలివారిపొత్తు లరసితిఁ గాకా

చ. 2:	వుంగరము నాకు నీవు వుంకువ యిమ్మంటినా
అంగడి నెవ్వతె యిచ్చె నంటిఁ గాకా
కంగి నాతో నీ విట్టె వల్ల లాడే వంటినా
అంగనతో నే మని యంటి వంటిఁ గాకా

చ. 3:	నావద్దనె వుండు మని నమ్మక నే నంటినా
ఆవలివారు నిం దాడే రంటిఁ గాకా
శ్రీవెంకటేశుఁడ నన్ను చేకొని కూడితి విట్టె
భావరితి నాపెనుఁ జెప్పకు మంటిఁ గాకా

రేకు: 0379-6 శంకరాభరణం సంపుటం: 11-474

పల్లవి: నీకు నిచ్చకమే నెరపుదుఁ గా కిటు
కాకు సేసి నినుఁ గదిమేనా

చ. 1: యెమ్మెకు నాతో నెంత నవ్వినా
కిమ్ముల నాతోఁ గిని సేనా
నిమ్మపంటఁ గొని నీవెంత వేసిన
ముమ్మాటికి నే ములిగేనా

చ. 2: తొడిఁబడ నీవే తురుము వట్టితే
బెడిదంబుగ నేఁ బెనఁగేనా
అడరి నీవు రమ్మని నను బిలువఁగ
వోడకఁ బండ నని వొదిగేనా

చ. 3: పైకొని నీవే పాదము చాఁచగ
చేకొని పిసుకక సెలసేనా
యీకడ శ్రీవెంకటేశ్వర కూడితివి
యేకడ కేఁగఁగ నిచ్చేనా

రేకు: 0380-1 వరాళి సంపుటం: 11-475

పల్లవి: ఆడ కేల పిలిచేవే అప్పటి నన్ను
గోడ గడుఁగగఁగ నేల గొబ్బున రాఁ గదవే

చ. 1: లోఁతఁకు జొచ్చినవాఁడు లోన నీమాట వినీనా
మూఁతి మీఁది కెత్తేవాఁడు మోము చూచీనా
చేతలు దవ్వేటివాఁడు సిగ్గు వడ నేరుచునా
పాఁతుమా కై వుండేవాఁడు పైకొనీనా

చ. 2: పెచ్చు వెరిగెటివాఁడు ప్రియము చేకొనునా
మచ్చరమే పెంచేవాఁడు మన సిచ్చీనా
వొచ్చెము వెదకేవాఁడు వొగి నిజ మెరుఁగునా
యెచ్చు కుందు చేతవాఁడు యిత వై చూచీనా

చ. 3: సటల మాటలవాఁడు సరవిగా నడచీనా
కుటిలపుగతివాఁడు గుట్టు చెప్పీనా
యిటు శ్రీవెంకటేశుఁడు యీమాటకే నన్నుఁ గూడె
యిటువలె నుండినామ యింకఁ బాసీనా

రేకు: 0380-2 శుద్ధవసంతం సంపుటం: 11-476

పల్లవి: ఏల వేగిరించీనె తా నింతలోనను
జాలితోఁ బవ్వళించి మంచముపై నుందానను

చ. 1: తెల్లవార నియ్యవే తేనె లుట్టిపడేఅట్టు
మల్లాడి తనతో నేను మాటాడేఁ గాని
యిల్లు గడె వెట్టుకొంటి నీపొద్దుకు నోప లేను
పల్లదాన నిదివో నా పక్క బిడ్డ వున్నది

చ. 2: చలి వాయ నియ్యరే సరి బేసి ఆడినట్టు
వలపులు తనమీఁద వడిఁ జల్లేను
తలఁ బట్టు వెట్టుకొంటిఁ దతి గా దీవేళను
పొలసి మాయత్త నేఁడు పొరుగింట నున్నది

చ. 3: చేగ చేర నియ్యవే చెల్లుబడి గలయట్టు
బాగులుగా తన్ను నేనె పైకొనేను
చేగడియ దీసి చొచ్చి శ్రీవెంకటేశుఁడు గూడె
వేగిరించి మావదినె వెలుపల నున్నది

రేకు: 0380-3 పాడి సంపుటం: 11-477

పల్లవి: సతులకుఁ బతులకు సాజమె యిది
యితవు లెంచుక తామే యేకములు నవుదురు

చ. 1: కూరిమి గలుగుసతి కోరి పతిఁ గాన కున్న
యేరీతి నయిన దూరు యిందరితోడ
దార దప్పి మగవాఁడు తనయిచ్చఁ దిరిగాడి
యీారసాన నే మనిన యెగ్గులునుఁ బట్టఁడు

చ. 2: అంకెకు రా కున్నవేళ నాఁడువారు మగవానిఁ
గంకి నేసి కన్నచోటఁ గాకు సేతురు
వంక లొత్తఁ బోఁడు తనవల్ల నేరుమి గలితే
మంకు దీరి తనుఁ దానె మట్టుకు వచ్చును

చ. 3: కాఁగినచెలియ తనకాఁగిటికి దగ్గరితే
లోఁగి తనవిభునికి లో నవును
వీఁగుచు శ్రీవెంకటేశ వెలఁదిఁ గూడితి విట్టె
చేఁగ దేర నే మిందుకు నెలవి నవ్వుదుమూ

రేకు: 0380-4 నాదరామక్రియ సంపుటం: 11-478

పల్లవి: వద్ద నుండి మీరు చూడ వలసి కాక
కొద్దిమీరి నేనె పైకొన కుండేనా

చ. 1: కగ్గి తనచేఁతలకు కన్నుల మొక్కినదాన
దగ్గరి తనకు మొక్కఁ దడవా నాకు
యెగ్గు లెంచక పనులు యే మైనాఁ జేసినదాన
వొగ్గి వూడిగాలు సేయ కూర కుండేనా

చ. 2: బింకాన నాఁడిట్టె తన్ను పేరఁ బిలిచినదాన
అంకెల తనతో మాట లాడ కుండేనా
కంకి తనసుద్దులకు గక్కన నవ్వినదాన
యింకా సరస మాడ కిటు మానేనా

చ. 3: చెమటమేని తనకు చేలా గిచ్చినదాన
అమరఁ గాఁగిఁట గూడ నరుదా నాకు
సముఖుఁ డై శ్రీవెంకటేశుఁడు దానె ననుఁ బొందె
తమకాన నిద్దరికి తతి పోయినా

రేకు: 0380-5 దేసాక్షి సంపుటం: 11-479

పల్లవి: మామాట లేల వినేవే మగువ నీవు
ఓమి యాతనికే మొక మోడేవు గాని

చ. 1: పంతాన రా నని చలపట్టుకొని వుండఁ గాను
యెంతదడ వైనఁ బోర నేలే మాకు
చెంతల నాతఁడే వచ్చి చేయి వట్టి తియ్యఁ గాను
వంతకు నేఁడు నీ విట్టే వచ్చేవు గాని

చ. 2: మాట లాడ నని నీవు మౌనముతో నుండఁ గాను
యేఁటికిఁ బెనఁగితియే యిందాఁకా నేము
పాటించి యాతఁడే వచ్చి పక్కన నవ్వితేను
గాఁటపుమచ్చట లాడి కరఁగేవు గాని

చ. 3: మంచముపైఁ బవ్వళించి మంతనాన నుండఁ గాను
పొంచి నిన్ను లేప నేలే పొదిగి నేఁడు
అంచెల శ్రీవెంకటేశుఁడదె వచ్చి నిన్నుఁ గూడె
యెంచి యాతనికే చన విత్తువు గాని

రేకు: 0380-6 సౌరాష్ట్రం సంపుటం: 11-480

పల్లవి: నీమనసులోనిమాట నే నెరఁగనా
కామించి నీవే నాకుఁ గల వని వుందునూ

చ. 1: నాకే వలతు వంటా నాపై బత్తి గల వంటా
ఆక డీకడివారితో నాడుకొందును
యీాకడ నన్ను మన్నించి యింటి కిట్టె వచ్చే వంటా
తూకొని నీరాకల కెదురు చూతును

చ. 2: నమ్మఁగలవాఁడ వంటా నామాట గడవ వంటా
కమ్మిని నిన్నే పొద్దునుఁ బొగడుచుందునూ
రమ్మని నిన్నుఁ బిలిచి రతుల మెప్పించే నంటా
నెమ్మది నుపాయములు నేరుచుకుందుదును

చ. 3: యిద్దరము నొక్క టంటా నెగ్గు దప్పు లెంచ వంటా
పెద్దరికమున సరి పెనఁగుదును
అద్దివో శ్రీవెంకటేశ అట్టె కా నన్నుఁ గూడితి
పొద్దు వొద్దు నీకు నిట్టె బోదింతునూ

రేకు: 0381-1 ఆహిరి సంపుటం: 11-481

పల్లవి: చే పట్టి పిలువరమ్మ చెలులారా
వే వేగఁ దా రాకున్న వేసరరా లోకులు

చ. 1: వెదకి కాకన నే విరహాన నుండఁ గాను
పొదిగి తానే వచ్చుట పుణ్యము గాదా
మదిలో నేఁ దలఁచగ మరఁగున దా నుంటే
వదలక దయ లేనివాఁ డనరా లోకులు

చ. 2: తలఁచి తనకుఁ గాను తమకాన నుండఁ గాను
మలసి తాఁ బైకొంటే మంచిది గాదా
వలచినవారి నింత వలలఁ బెట్టఁగఁ బోతే
అలరి యెం తపకీర్తి యనరా లోకులు

చ. 3: తన పేరు నాలికపైఁ దడవుచు నుండఁ గాను
తనియఁ బొందుట జాణతనము గాదా
యెనసె శ్రీవెంకటేశుఁ డిదివో నన్ను రతుల
పొనిగి యానోళ్లనే పొగడరా లోకులూ

రేకు: 0381-2 కాంబోది సంపుటం: 11-482

పల్లవి: ఉన్న వల్లా నటుండనీ వొద్ద నిలుచుండనీ
కన్నులకు నిధానము గలిగెఁ గా నీకు

చ. 1: యేపొద్దు నాపె నీవు యెదఁ గట్టుకొ నుండఁగ
తీపుల నీపాలిటి దేవ రాయఁగా
యీపాటి వారి వీరి నెలయించి యీసు రేఁచ
కాపాడి చెప్పి చూపఁ గలిగెఁ గా నీకు

చ. 2: చేతికి లో నై యాపె చెప్పినట్టె సేసేవు
యీతల నిన్ను వంచుకో నేలి కాయఁగా
రీతిగా సింగారించి రేయిఁ బగలుఁ దాలార్చ
ఘాతల సింగారబొమ్మ గలిగెఁ గా నీకూ

చ. 3: చీ మంత మా టైన చెవిలో నీకు బోదించు
కోమలి నీ కిన్నాళ్లను గురు తాయఁగా
యీ మేర శ్రీవెంకటేశ యిద్దరి మమ్ముఁ గూడితి
కామించి మేకులు సేయఁ గలిగెఁ గా నీకు

రేకు: 0381-3 సామంతం సంపుటం: 11-483

పల్లవి: అందాఁకాఁ గాఁగిన నిన్ను నన రాదు గా
పొందిక లైన మీఁద బుద్ధి చెప్పేఁ గాని

చ. 1: వేడుక నీ రమణుఁడు విచ్చేసుదాఁకా నీ
వాడిన ట్టెల్లా మాకు నాడ వలెఁ గా
యీడుగా సమరితి మి మ్మిద్దరిఁ గూడఁగఁ జేసి
జోడుగా నీతిట్లకు సూడు వట్టెఁ గాని

చ. 2: పక్కన మీలోన మొకబంగారు వాసినదాఁకా
వెక్కసపు నీసణఁగు వినవలెగా
చిక్కు వడ్డ మీలోని చిత్తము లేకము సేసి
దక్కిన నీచేఁత లెల్లాఁ దగఁ దిప్పేఁ గాని

చ. 3: యీకడ నాతఁడు నిన్ను యిట్టె మన్నించినదాఁకా
నాకు నాకే నిన్నుఁ జూచి నవ్వవలెఁ గా
చేకొని యింతలోనె యాశ్రీవెంకటేశుఁడు గూడె
సాకిరి దెలిపి మీద సమ్మతించేఁ గాని

రేకు: 0381-4 సామంతం సంపుటం: 11-484

పల్లవి: ఎప్పుడు నీయిచ్చలోని యింతిఁ గాక
తప్పులు నీమీఁద వేసేతరుణినా నేను

చ. 1: వంతులకు వాసులకు వలపులు చల్లి చల్లి
అంత నిన్ను దూరేటియాఁటదానా
కొంత నిన్నుఁ గోపగించి గొణఁగి గొణఁగి తిట్టి
పంతము వెనక నిచ్చే పడఁతినా నేను

చ. 2: పొద్దు వొద్దు నీవద్ది పొలఁతులవలెనే
అద్దలించి పెనఁగేటి యాఁటదానా
ఉద్దండాలు నీతోఁ జేసి పూరకే వెనకు వచ్చి
తిద్దుకొని మాట లాడేదేవులనా నేను

చ. 3: గారవాన నిన్నుఁ గూడి కాఁగిటి నీచేఁత లెల్ల
ఆరయ జెప్పుకొనేటి యాఁటదానా
నేరుతువు శ్రీవెంకటనిలయ నీయాల నైతి
సారెకు సారె మాటాడేసకియనా నేనూ

రేకు: 0381-5 కొండమలహరి సంపుటం: 11-485

పల్లవి: నీ కేమి దూరుదాన నే నైంతి గాక
వాకున నప్పుడే నీతో వద్దననా

చ. 1: నా మోము చూచి నీవే నవ్వఁగా నవ్వితిఁ గాక
ఆమాట లెల్లా నాపెతో నాడుదురా
ప్రేమాన నా పంపఁగా నే పిలువ వచ్చితి నింతే
చే ముట్టిన యాసుద్ది చెప్పుదురా

చ. 2: రమ్మని చేయి వట్టఁగ రతి నూర కుంటిఁగాక
యెమ్మె కెల్లా నాపెతోడ నెంచుకొందురా
వుమ్మడి నాపెకు నీకు నూడిగపుదాన నింతే
అమ్మరో నావుంగరము ఆపె కిత్తురా

చ. 3: పాదాలు గుద్దు మనఁగా పైకొన గుద్దితిఁ గాక
పోదిగా నాసుద్ది యీడఁ బొగడుదురా
యీదెస నాపెఁ గూడితి విట్టె శ్రీవెంకటేశ
సోదించి నా మో వాపెకుఁ జూప వచ్చునా

రేకు: 0381-6 సామంతం సంపుటం: 11-486

పల్లవి: అంతటఁ గాని తీరదు ఆపెనే చేరి
చెంత లోనికి రమ్మని చే వట్టి తియ్యవయ్యా

చ. 1: యిచ్చగించి నీవు నాపె యేకతము లాడఁ గాను
వచ్చి వచ్చి నిలిచెను వాకటిఁ జెలి
తుచ్చము లాడక తొల్లె తొయ్యలిచే మొక్కించి
మచ్చికగాఁ గిందుపడి మాట లాడవయ్యా

చ. 2: చేచేతమీ రిద్దరును సెలవుల నవ్వఁ గాను
చూచి చూచి తలవంచి సోలగిలీని
యేచి కోపించకతొల్లె యింతిచే సేవ సేయించి
తాచి నీకాఁగిట నీవు తమి రేఁచవయ్యా

చ. 3: మంచముపై నీవు నాపె మలయఁగా ముట్టి ముట్టి
అంచునఁ దా బవ్వళించి అంగవించును
అంచెల శ్రీవెంకటేశ అంతలోఁ గూడితి వాపె
కంచముపొత్తు గలపి కరగించవయ్యా

రేకు: 0382-1 ఛాయనాట సంపుటం: 11-487

పల్లవి: వేసాల నేఁడు నాకుఁగా వెరవ నేల
వాసి యాపె కెక్కించఁగా వద్దనేనా యిపుడు

చ. 1: చాయలు చూచి చూచి సణఁగులు చల్లి చల్లి
ఆయెడనే నిలుచున్న దప్పటనుండి
చేయి మీఁది వేసి యాపె జెంగటఁ గూచుండు మంటే
యీయెడఁ దా వచ్చినా నే లనేనా నేను

చ. 2: వెంగెములే యాడి యాడి వెరగులే నించి నించి
కంగి నిలుచున్న దదే కంబముదండ
సంగడి నీవు నిలిచి చన విచ్చి వేఁడుకొంటే
సింగారము నేఁడు గాదా సిగ్గయ్యినా నీకు

చ. 3: పొందు లట్టె చేసి చేసి బొమ్మలట్టే వంచి వంచి
కందువ శ్రీవెంకటేశ కరఁగీ నదే
యిందు నందుఁ దిరిగాడి యిద్దరిఁ గూడితి విట్టే
ముందరనే యిట్టైతే మొరఁగి నవ్వేనా

రేకు: 0382-2 శుద్దదేశి సంపుటం: 11-488

పల్లవి: వీరి వారివలె నేను వింతదాననా
నేరక నీ వుండినాను నే మెచ్చక మానను

చ. 1: వలచిన మేలు నీవు వలవ కున్నా మేలు
తలఁపు నీమీఁద నాకుఁ దగిలి పోదు
అలిమి పట్టఁగ వద్దు ఆనలు వెట్టఁగ వద్దు
చెలిమి నీతో నెపుడుఁ జేయక నే మానను

చ. 2: యింటికి వచ్చిన మేలు యేడ నున్నా మేలు నీ
వెంట వెంటఁ దిరిగి సేవించక పోను
తొంటిపొందు చెప్ప వద్దు దొమ్మిఁ జెక్కు నొక్క వద్దు
అంటి ముట్టి సరసము లాడక నే మాననూ

చ. 3: యివ్వలమో మైన మేలు యెటువలె నున్న మేలు
నెవ్వగ దీరఁ గూడక నే మానను
రవ్వగ శ్రీవెంకటేశ రతిఁ జొక్కించితి విదె
పువ్వువలె నిన్ను నేఁ బొదుగక మానను

రేకు: 0382-3 భైరవి సంపుటం: 11-489

పల్లవి: ఇంక నేల కొంకఁ దమయిచ్చ లనరే
అంకె నే నుంటేఁ దమ కే మాయ నడగరే

చ. 1: యేకత మాడెటి వేళ నేల నే వచ్చితినో
దాకొని నన్నుఁ గంటానే తల వంచిరి
యీాకడఁ దమ కిద్దరి కెంత వెగ టైతినో
రా కున్న నెట్టాయ నింత రచ్చల కెక్కితిని

చ. 2: మగఁడు నాలు నుండఁగ మంచ మే లెక్కితినో
చిగురుమోవులఁ దాము సిగ్గు వడిరి
సొగిసి యిద్దరి కెంత సుఖవిరుద్ధ మైతినో
మొగ మియ్య ననే రంటా ముందు నుందానను

చ. 3: యెనసినరతివేల నేల కాఁగిలించితివో
తనిసి తమమేనులు తా మెఱుఁగరు
అను వై శ్రీవెంకటేశుఁ డప్పటిని నన్నుఁ గూడె
ఘనగర్వ మనే రంటాం గాని మ్మని యంటిని

రేకు: 0382-4 శ్రీరాగం సంపుటం: 11-490

పల్లవి: చెప్పకున్న దోసమూ సేసినచేతలు నీతో
చొప్పెత్తి పయ్యద గంటే సోదించక మానఁడు

చ. 1: రాఁడని నీతోఁ జెప్ప రాఁగా నీరమణుఁడు
పోఁడిమి గాఁగిటఁ బెట్టెఁ బోకు మంటాను
నాఁడె నీతోఁ జెప్పవా నన్ను నంపకు మనుచు
ఆఁడ దైతేఁ జాలు నాతఁ డంటుకోక మానఁడు

చ. 2: నీపై నాన వెట్టఁ గానె నీవావి మీఁద వేసి
చేపట్టి గిజిగిజిగాఁ జేసె నాతఁడు
వోప నన్నాఁ బో నీక వూడిగాన కంపితిని
యీపాటి సందు గలితే యెనయక మానఁడు

చ. 3: నే నట్టె పెనఁగఁ గాను నీమతకమే యంటా
తానే కూడె శ్రీవెంకటోత్తముఁడు నన్ను
మోనాన నూరకుండితి ముందు నిన్నుఁగూడుదాఁకా
నానాటి కీపాటి నవ్వు నడపక మానఁడు

రేకు: 0382-5 కన్నడగౌళ సంపుటం: 11-491

పల్లవి: మనోభావకుఁడవు మగువ మిక్కిలి జాణ
అనేకవిన్నపము లందులోనే వున్నవి

చ. 1: వంచినరెప్పలవెంట వడిసిన కన్నీరు
కొంచక నీమీఁదఁ జెలి గోరఁ జిమ్మీని
యెంచి నీ విందాఁక రాక యింత నేసినయందుకు
పొంచి నీకు నక్కునఁ బోసి చూప వలదా

చ. 2: సారె నాకొప్పువిరులు సరి నొక్కొక్కటే తీసి
దార దప్ప కుండ నిన్నుఁ దాఁక వేసీని
రా రమ్మనీ పిలువఁ బరా కై వుండినందుకు
వూర కుండి తనపాటు వొప్పగించ వలదా

చ. 3: వెట్టఁ బొరలిన దై వెస నిన్నుఁ గాఁగిలించె
అట్టె తన అసురుసు రదె చూపీని
అట్టుగ శ్రీవెంకటేశ నెట్టనఁ గూడి తీడనె
దిట్టయి నీసేసినమేలు దిగఁ బోయ వలదా

రేకు: 0382-6 సాళంగనాట సంపుటం: 11-492

పల్లవి: అగుగరే చెలులాల ఆతఁడు వాడే
యెడసితే జంకింతుము యింత కోపినా

చ. 1: చేతికి లో నౌదాఁకా జెప్పెటి ప్రియము లింతే
ఆతలి మందెమేళాలె అదు కోపినా
కాతరపుదాన నేను ఘనుఁ డిన్నిటాఁ దాను
యేతులు నెమ్మెలు మాని యింత కోపినా

చ. 2: చనవు గలుగుదాఁకా సరవి నడచు నింతే
వెనకపనులు మీరు వెట్ట కోపినా
మొకతోడిదాన నేను మొక్కలపుదొర దాను
యెనసి మాతోడి జడ్డు కింత కోపినా

చ. 3: కలసిన యందాఁక కన్నుల మొక్కుట యింతే
బలుము లంతటి మీఁదిపని కోపినా
చెలి నింతే నన్నుఁ గూడె శ్రీవెంకటేశుఁడు దాను
యెలయింపులరతుల కింత కోపినా

రేకు: 0383-1 నారణి సంపుటం: 11-493

పల్లవి: తనిసినవాఁడు గాన తమి చాలదు దనకు
పని లేదు తను నింక బడలించ నాకు

చ. 1: సరసమే ఘన మాయ సరి యేఁకలవల పాయ
సరివొద్దు వోయ నింకాఁ జాల దటరే
అరలోనఁ బవ్వళించు మనరే విభుని నేను
పొరిఁ దూఁగుమంచానఁ బొరలేఁ గాని

చ. 2: పందెములే తఱ చాయ బయలీఁత సుద్దు లాయ
చందమామగుటుకలు చాల దటరే
కందువ నిద్ర రా కుంటె కతలు విను మనరే
ముందర నేనే లోన మొక్కు చుండేఁ గాని

చ. 3: చల్లుఁజూపు లెక్కు డాయ జడివానరతు లాయ
జల్లింపు వినయములు చాల దటరే
యిల్లిదె శ్రీవెంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూఁడె
యెల్లకాలమునుఁ దన్ను నెడ వాయఁ గాని

రేకు: 0383-2 ముఖారి సంపుటం: 11-494

పల్లవి: అప్పటిఁ దా మంచివాఁడ ననుకొనును
చెప్పరే బుద్ధులు మీరు చెలులాల పతికి

చ. 1: మోము చూచితే నాకు మొగవమోట దరచూ
దోమటి నాతని నే దూరఁ బొయ్యేనా
గామిటిమాట లాడితే గబ్బి నందురు
యేమి సేతు నమ్మలాల యెం దున్నాఁడో అతఁడు

చ. 2: గక్కనఁ గదిసితే కరఁగు నా చిత్తము
మక్కువ నాతని నేను మట్టు పెట్టేనా
చక్క నూర కుండితే రాజస మందురు
దక్కితి నే నమ్మలాల తా నేడ నున్నాఁడే

చ. 3: సొలసి మా టాడితే చుట్టమ నే నౌదునూ
కలసే శ్రీవెంకటేశుఁ గా దనేనా
చలపట్టి మెచ్చఁ బోతే సట లందురు
వలచితి నమ్మలాల వాఁడె నవ్వీ నదివో

రేకు: 0383-3 దేసాళం సంపుటం: 11-495

పల్లవి: ఏల నాపై నాన వెట్టే వేఁటికి నీకు వెరపు
నీలాగు రమణుఁడనే నెఱఁగనా

చ. 1: తేరకొన నీగుణాలు దెలిసినప్పుడు గాక
వీరి వారి మాటలకె వేగిరించేనా
మేరతో నీవు నాయెడ మెచ్చుగా నడవఁ గానె
కూరిమి గొసరి నిన్నుఁ గోపగించేనా

చ. 2: యెల్లవారు నీచేఁతలు యెఱుఁగుదు మన్నదాఁకా
అల్లంత నిన్నుఁ గంటానె అలిగేనా
కల్ల నిజ మెఱఁగక కాదు గూడ దని నీపై
వెల్లవిరిగా నిందలు వేయఁ బొయ్యేనా

చ. 3: మంతానాన నీ మేన మచ్చము గానకతొల్లె
పంత మాడి నే నీతో పగ చాటేనా
యింతలోఁ గాఁగిలించితి విందుకె శ్రీవెంకటేశ
యెం తయిన నిన్ను నే నెడసి వుండేనా

రేకు: 0383-4 ముఖారి సంపుటం: 11-496

పల్లవి: అన్నియు నీవల్ల నింతే సాయ నయ్యా
నిన్న నేఁటనె యీ మేలు నిండె నయ్యా

చ. 1: సాదించి నేఁ డాపె నీసరిఁ గూచుండినది నీ
పాదము సోఁకినయట్టి బలు వయ్యా
ఆదికొని యిన్నా ళ్లాపె ఆపె గాదో నేఁ గాదో
యీదెస మేరలు మీరి యిట్లనె వుంటిమా

చ. 2: యించు కంత పిన్నది నా కెదురు మాటాడె నిదే
మించి నీ నవ్వినముందెమేళ మయ్య
నించి వొక్కవూరనె నే లేనో ఆపె లేదో
చంచు మీరి యింతేసి రచ్చలకు నెక్కుదుమా

చ. 3: తేరకొన నాపె నన్ను దిష్టించి చూచినది
కోరి నీచేయి వేసినగఱ మయ్యా
యీరీతి శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నేరువు నీ వల్లఁ గాక నే మొక్కటి అవుదుమా

రేకు: 0383-5 భౌళి సంపుటం: 11-497

పల్లవి: కన్నుల నీ రాఁప లేక కాఁకలు నిలుప లేక
పన్ని పెద్దయెలుఁ గెత్తి పాడితి నోయమ్మా

చ. 1: దగ్గరి వచ్చినవాని తడవి నేనే మన్నా
అగ్గలము నావొళ్లిదె యౌ నేరమి
వెగ్గళించ రాదు మరి వెనక తియ్యఁగ రాదు
బగ్గనఁ బాదాలమీఁదఁ బడితి నోయమ్మా

చ. 2: చేయి మీఁద వేసేవాని చేఁత నే నేమి సేసినా
నాయము గా దని మీరు నన్నే అందురు
పోయినట్టె పోనీలేను పొంచి కొత్త సేయ లేను
సేయ రాని వినయాలు చేసితి నోయమ్మా

చ. 3: వుమ్మడిఁ గాఁగిలించఁగ వోప నంటే అంతలోనే
కిమ్ముల నాతఁడు నాకుఁ గిందు పడును
నెమ్మది శ్రీవెంకటేశు నేనె మునుపఁ గూడి
సమ్మతించి ఆనందమే చల్లితి నోయమ్మా

రేకు: 0383-6 పాడి సంపుటం: 11-498

పల్లవి: నేనే పిలువ ననే నేర మేమి గలిగినా
దీన నైనతప్పు మీఁద దిద్దుకొనేఁ గాని

చ. 1: వలపు బలిమి సేసి వంతకుఁ బెనఁగఁ బోతే
చలువలే వేఁ డౌను సతులాల
వెల నున్నరమణుని వేడుక నేఁ బిలిచితే
చులుకఁదనము రాదా చూడఁ గానె యిపుడూ

చ. 2: మనసు రానిచోట మాటలఁ గొసరఁ బోతే
చన వెల్లాఁ జవి దప్పు జాణలాల
ననుపు లేనిపతితో నవ్వులు నవ్వఁగఁ బేతే
పని మాలినది గాదా పై పైనె యిపుడూ

చ. 3: దరదరిఁ గాక నే దగ్గరి కూడఁగఁ బోతే
సరసమే విరస మౌ సకియలాల
యిర వై శ్రీవెంకటేశుఁ డిట్టె విచ్చేసి కూడె
దొరతన మిది గాదా తుద కెక్కె నిపుడూ

రేకు: 0384-1 ఆహిరి సంపుటం: 11-499

పల్లవి: ఒ ద్దన్నా మానవు నీవోజ లిట్టివి
పెద్దరికము నేయుచుఁ బ్రియము లాడేవు

చ. 1: నివ్వటివల్ల నీ నవ్వు నేఁడె నాతో వలెనా
వువ్విళ్లూర రేపు గొంత వుండనీరాదా
జవ్వనపువాఁడవు నీసరివారమా నేము
దవ్వుల నుండి మొక్కితే దగ్గరఁ బిలిచేవూ

చ. 2: కోయ్య నా మాటలు నాకొరకె నేరిచితివా
అయ్యో యీవేళకుఁ దగి నంతే చాలదా
గయ్యాళించి నిన్ను నేమోఁ గా దనేనటివారమా
పయ్యద నే మూసుకొంటే పై నేల వొరగేవు

చ. 3: కన్నులసన్నలు నాకే గాదెఁ బోసు కుండితివా
పన్ని పైఁడియమ్ము లిన్నీఁ బార వేసేవా
యిన్నిటా శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
మన్ననలు పొగడితె మర్మము లంటేవు

రేకు: 0384-2 సామంతం సంపుటం: 11-500

పల్లవి: మన మింత దడ వాయ మంకు వాప లే మైతిమి
ఘనుఁడు గాన యాతఁడు కాంతకాఁక వాపెను

చ. 1: చెలియమోము చూచి చెక్కులు చేత నొక్కి
కలవురేకులకొప్పు కడు దువ్వి
సెలవుల నవ్వించి చేరి మోవితేనె లాని
అలుక దేరిచెఁ బతి అదివో యిప్పుడు

చ. 2: మాటలనె బుజ్జగించి మనసునొప్పులు మాన్పి
కాటుకన్నులయింతి కందువ లంటి
తేటలఁ గతలు చెప్పి దిష్టపుమన్నన లిచ్చి
యీటునఁ గోపము దీర్చె నిదివో విభుఁడు

చ. 3: వనితఁ గాఁగిట నించి వాడినదప్పి దేరిచి
ననుపులు నటియించి నయ మిచ్చి
తనువు నిమిరి యీపె తత్తరాలు మందిలించె
యెనసి శ్రీవెంకటేశుఁ డిదివో యిపుడు

రేకు: 0384-3 శంకరాభరణం సంపుటం: 11-501

పల్లవి: కానీవే తనవేసాలు కనుఁగొంటిఁ గా
వీనులకు యీసుద్దులు వెర గాయఁగా

చ. 1: చెప్పరే చెప్పరే వీనిచేఁతలు నాకు
అప్పుడే యాపెతో మాట లాడి వచ్చెవా
ముప్పిరి నా కిఁక నేఁటి మొకమోటమే
తప్పని బొంకనివాఁడు తా నెందు వోయీనే

చ. 2: యెంత కెంత వీనిసుద్దు లేల దాఁచేరే
దొంతిగా నాపెను వెంటఁ దోడి తెచ్చెనా
పంతపుమోనము లిఁకఁ బనికి రావె
సంతసమే చేసేఁ గాక జగడించేనా

చ. 3: యే మంటి రే మంటిరే యెఱఁగ నేను
చే మట్టి యాపెను నాచేతి కిచ్చెనా
కామించి శ్రీవెంకటాద్రికడపరాయఁడు నన్ను
గోమునఁ గూడె నిదియుఁ గొంత వలెనా

రేకు: 0384-4 కొండమలహరి సంపుటం: 11-502

పల్లవి: చేగ మీరినపనులే సేసే వెల్ల
బాగు మీరఁ దన కది పై వచ్చే దెరఁగఁడూ

చ. 1: సిగ్గు వడి తనుఁ జూచి సిరసు వంచుకొంటేను
దగ్గరి రమ్మంటి నంటా దండ చేరీని
వెగ్గళించ నైతిఁ గాక విదలించి వేసి నేను
బగ్గనఁ దిట్టితే తనభావము చూచీనా

చ. 2: యెదుట నిలవుక నేనింటిలోని కేఁగితేను
అదె సన్న సేసుక నన్నంట వచ్చీని
పదర లే నైతిఁ గాక పక్కనఁ బువ్వులబంతి
నెదరొమ్ము వేసితేను యే మనీనె యపుడూ

చ. 3: నెల వై పానుపుమీఁద ముసుఁగు వెట్టుకుంటే
కలయు మనే నంటాఁ గాఁగిలించీని
యెలమి శ్రీవెంకటేశుఁడింత నేరుపునఁ గూడె
బలి మైతే నాతోడఁ బంత మాడఁ గలండా

రేకు: 0384-5 ముఖారి సంపుటం: 11-503

పల్లవి: పో పోయి దేడ సుద్ది పొద్దు పొద్దు చెలులకు
యేపున నిన్ను రమ్మన నేడదాన నేను

చ. 1: కాతరాన నలుకలు గడించేవు గాక నీవు
నీతో నలుక రేచ నే మెవ్వరము
జాతులకు నీ వాడెటిచారువాకా లింతే కాక
ఆతల నిన్నుఁ గొసర నంత పొందులా

చ. 2: చిన్నఁ బో యుందాన నంటా చెక్కు నొక్కే వింతే కాక
వున్నతి నీముందరను వొచ్చెము గాదా
యిన్నేసి నీ వినయాలు యెగసక్కే లింతే కాక
నన్ను నీవు వేఁడుకోను నంటుదాననా

చ. 3: అక్కడ పూర కుందువా ఆనలు వెట్టేవు గాక
యిక్కడ వా దడువ మా కెవ్వ రున్నారు
గక్కన శ్రీవెంకటేశ కలసితి విటు నన్ను
యెక్కువ తక్కువ లిఁక నేల మాకూ

రేకు: 0384-6 రామక్రియ సంపుటం: 11-504

పల్లవి: ఒద్దన్నా మానవు నన్ను నొడఁబరచేవు నీ
వద్ద యెమ్మెలు మెఱయ వారు వీరు చాలరా

చ. 1: కొండవంటి దొర వని కుంచ నీవు వేయఁ గా న
న్నుండఁ గూచుండు మనుచు నాన వెట్టేవూ
దండితోడ నూడిగపుదాన నయ్యే నంటే నేల
చండి పోరి నీదేవులసానిఁ జేసే వయ్యా

చ. 2: అందచందమునను నీ కాకు మడి చియ్యఁ గాను
అందల మెక్కు మనుచు నాన వెట్టేవూ
గొందినె నీపాదాలు గొలిచి వచ్చే నంటే
యిందరిలో దొర గాన న్నెంత సేసే వయ్యా

చ. 3: కట్టడతో నీమేనఁ గస్తూరి నేఁ బూయఁ గాను
అట్టె కాగిలించు మంటా నాన వెట్టేవూ
గుట్టుతో శ్రీవెంకటేశ కూడితి వింతలో నన్ను
మట్టుతో నుండఁగా నెంత మన్నించే వయ్యా

రేకు: 0385-1 హిజ్జిజి సంపుటం: 11-505

పల్లవి: పో పో యి దేడ సుద్ది పొద్దు వోదా తనకు
దూపకు నేయి దాగేటిదూరు గాకా

చ. 1: యింతిని వద్దఁ బెట్టుక యేల పిలిచీనె నన్ను
బంతిఁ గట్ట రతు లేమి పసులదొడ్డే
దొంతులవేడుకలను తొల్లె తా మోల లాడిరి
యింతలోనఁ జల్లారిన యీా చ వింతే కాక

చ. 2: కమ్మి యాపెపై నొరగి కమ్మటి నన్నేల పట్టీ
కుమ్మి చిందులాడ నేమి గొల్లదోమటే
అమ్మరో తా మిద్దరును అన్నిటాఁ గరఁగి మీఁద
చిమ్ములాన నవ్వితేనె నెల వౌఁగాకా

చ. 3: కన్నుల నొక్కతెఁ జూచి కాఁగిట నన్ను బిగించీ
పన్నినవలపు రేమి బండికండ్లా
యిన్నిటా శ్రీవెంకటేశుఁ డిద్దరిఁ దాఁ గూడినాఁడు
మన్నించ నాపెతో సరి మరిగితిఁ గాకా

రేకు: 0385-2 హిందోళవసంతం సంపుటం: 11-506
పల్లవి: వట్టిమాట లిఁక నేల వాసి గలకాంతలకు
గుట్టుతోడ నుండేదె గుణ మింతే కాక
చ. 1: పూసుక వాసుక వచ్చి పొందులు నీతోఁ జెప్పి
వేసరించేకాఁగిటిలో వేడు కున్నదా
మూసినతముత్యమువలె మూల నుండఁగా నీవే
చేసినపాటి ప్రియము చేకొనేది గాక
చ. 2: చేరి నవ్వి విన్నపాలు చెలుటచేఁ జేయించి
సారెఁ జల్లేకూరిమిలో చవు లున్నవా
వూరక మానావతి నై వోజ దప్ప కుండఁగా నీ
వేరీతి చేసిన నది యియ్యకొంట గాక
చ. 3: యిచ్చకాలు సేసుకొంటా యెరవువలపు చల్లి
తచ్చి యెంత పిలిచినా తమి వుట్టీనా
అచ్చపు శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
యిచ్చట నీవే కూడితి విది మేలు గాకా

రేకు: 0385-3 నాదరామక్రియ సంపుటం: 11-507

పల్లవి: ఏల వేగిరింపించేరే యేమిరే వో చెలులాల
చాలుకొన్న నాయకుని చరితలు చూడకా

చ. 1: నగినయంతటిలొనె నాకు దగ్గర వచ్చునా
తెగ నాడి మన సెల్లఁ దెలియకా
మొగుము చూచె నంటాను ముచ్చ టాడ వచ్చునా
మగవాఁడని లోనిమర్మములు గానకా

చ. 2: వద్ద నున్నాఁ డంటాను వావి చెప్ప వచ్చునా
కొద్ది నాతఁ డుండేటిగు ట్టెరంగకా
పెద్ద చేసె నంటానె పెనగొన వచ్చునా
వుద్దండీఁ డీతని మేనివొరపు లరయకా

చ. 3: యింటికి వచ్చె నంటాను యియ్యకొన వచ్చునా
అంటిము ట్టాతనిసుద్దు లడుగకా
దంట శ్రీవెంకటేశుఁడు తా నలమేలుమంగను
జం టాయ మీర వచ్చునా చవులు సోదించకా

రేకు: 0385-4 మధ్యమావతి సంపుటం: 11-508

పల్లవి: దాని కేమి మీఁదటను దైవమే మేలు సేసీని
తానే యింత చేసు నట తగటు వోయినా

చ. 1: యింత మోహించిననేనె యింటికి రాఁ జెల్లుఁ గాక
పంతగాఁడు తన కేలే పైకొనను
కాంతుఁడు మ మ్మింత నేసి కట్టుకోనీ యామేలు
యింతలోనే సతులకు హీన మయ్యీనా

చ. 2: మనసు లెంతైన నేనె మాటాడించ వలెఁ గాక
తనిసితన కేలే తత్తరించను
ఘనరాజసముతోఁ దా గడకూ బదుక నీవే
వనితల కిందువంక వాసి దప్పీనా

చ. 3: కాఁకఁల బొందిన నేఁ గాఁగిలింతుఁ గాక మా
వీఁకకు రాఁ దన కేలే వేడుకకాఁడు
ఆఁకల శ్రీవెంకటేశుఁ డలమేలుమంగ నేను
యేఁకటఁ గూడితి మిఁక నెఱ మయ్యీనా

రేకు: 0385-5 పాడి సంపుటం: 11-509

పల్లవి: ఇందుకు బాస యిచ్చెద యిటు నీయింటికి రాను
చెంది నీసతులు యింత చేసిరి నీగుణము

చ. 1: నవ్వుతా దగ్గరి వచ్చినాను సరకు గొనవు
యెవ్వరితో మాట లాడే విపుదు నీవు
మువ్వంక నీరాజాసము మున్నిటివంటిదా నేఁడు
రివ్వలుగా సతు లెల్ల రేఁచిరి నీగుణము

చ. 2: బడి బడి మొక్కినాను పరా కై వున్నాఁడవు
కడు దొర వైతి నీకుఁ గాన వచ్చీనా
కడఁగి మావంటివారిఁ గైకొనేవా గొల్లెతలు
బెడసుగొల్ల మంకుతోఁ బెంచిరి నీగుణము

చ. 3: యిట్టె చేయి వట్టినాను యించు కంతాఁ దెమలవు
నెట్టుకొన నీబిగువు నేఁడు గొత్తలా
నెట్టన శ్రీవెంకటేశ నే నల మేలుమంగను
జట్టిగొని కూడితివి సాజమే నీగుణము

రేకు: 0385-6 బలహంస సంపుటం: 11-510

పల్లవి: మిక్కిలి జాణవు నీవు మే మేమి బాఁతి
పక్కన నీ వన్నిటాను బదికితేఁ జాలదా

చ. 1: కూరిములు చల్లుతానె కొసరేగుణము మాది
నేరపు మా కున్నదా నేరమే కాకా
మేరతోడి మ మ్మేల మేకులు సేసేవు రతి
ధీరుఁడవు నీవు మాతెరువు రా వలెనా

చ. 2: నించేసరసములోనె నిండువిరసము మాది
మంచితన మున్నదా మాటలే కాకా
యెంచ నేల మమ్ము నీవు యిల జాణలలో నెల్ల
అంచె నూడి పడ్డవాఁడ వంత మాతో వలెనా

చ. 3: చనవునఁ గూడుతానె జంకించేగుణము మాది
తనివి మా కున్నదా తమియే కాకా
అనుఁగు శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
పెనఁగి కూడితి వింక బెట్టి నవ్వ వలెనా

రేకు: 0386-1 దేవగాంధారి సంపుటం: 11-511

పల్లవి: మట్టు మీరినచేతల మగవాడవు
వట్టి సత్తేలు నెరప వలెనా నీవు

చ. 1: అంగన నీవును మాట లాడుతా నుండగ జూచి
అంగవించి పొందు గద్దో యని వుంటిమి
నింగి మోవ నాన లెల్ల నీ వేల పెట్టుకొనేవు
చెంగట దోసమా నీకు జెల్లదా యేమి

చ. 2: పొలతి నీ వొకవీధిఁ బొలసి నడవఁ గాను
అలరిన నీసమ్మంధ మని వుంటిమి
తెలపు మనుచు నేల తీసేవు నాకోంగు వట్టి
తలఁచ నాపెకు నీకుఁ దగదా యేమి

చ. 3: యింతియును నీవును నేకతాన నుండఁ జూచి
అంతలో నీవు గూడితి వని యుంటిమి
వంతకు శ్రీవెంకటేశ వడి నలమేలుమంగ
నింతటఁ గూడితివి నీ వెగఁరవా యేమి

రేకు: 0386-2 శంకారాభరణం సంపుటం: 11-512

పల్లవి: మేలే నీభాగ్య మలమేలుమంగా అదె
ఆలరి నీపతి మెచ్చె నలమేలుమంగా

చ. 1: యెంచ రాక పతితోడ నిచ్చకము లాడి నేర్పు
మించితివి గదే యలమేలుమంగా
వంచనఁ బ్రియాలు సేసి వడి నాతనిచిత్తము
అంచెల దక్కఁ గొంటివే అలమేలుమంగా

చ. 2: తఱితోడ మంచిజాణతనపుమాటల నెల్ల
మెఱసితి గదే యలమేలుమంగా
తెఱఁగుల నీపతికి తెల్లనినవ్వులు చల్లి
అఱచేతిమణి వైతి వలమేలుమంగా

చ. 3: వొక్కటై శ్రీవేంకటేశవుర మెక్కి యేపొద్దు
మిక్కుట మైతివే యలమేలుమంగా
యెక్కువఁ బదారుమేలుయింతుల మతనికి మ
మ్మక్కర దీర మన్నించి తలమేలుమంగా

రేకు: 0386-3 ఆహిరి సంపుటం: 11-513

పల్లవి: ఇందాఁక రా కుండితే నిది పావగా వలెనా
చందాలు చెప్ప వచ్చేవు సాదించ వచ్చేమా

చ. 1: ముందరికి రా రాదా మో మైనఁ జూచేను
చెంది యింతలో నేల సిగ్గు వడేవు
అందు కేమి మాచుట్టమ వవుత గల్లా యెంతయిన
కందువఁ బెనఁగ నిదె కడ మయ్యీనా

చ. 2: పీఁటపైఁ గూచుండ రాదా పిసికేము పాదాలు
యేఁటి కని వొద్దనేరా యెవ్వ రైనాను
యీటు లేనిమగవాఁడ వేమి సేసినా నేమి
కొటిసతులఁ బొందిన కోపగించేనా

చ. 3: పచ్చడము గప్ప రాదా పక్కనఁ గరఁగించేను
చెచ్చెర నేల నవ్వేవు సెలవులను
అచ్చపు శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
నిచ్చఁ గూడి యున్నారమ నీవే నేఁ గానా

రేకు: 0386-4 కాంబోది సంపుటం: 11-514

పల్లవి: బలిమి సేయఁగ నీతోఁ బంతమా నాకు
పలచఁగా నిన్ను నాడఁ బంతమా నాకు

చ. 1: యిట్టె నీసతులు యే ముందురో అని కాక
పట్టకు మని కోపించఁ బంతమా నాకు
చుట్టుకొన్న నీతగవు చూడవల సింతే కాక
బట్టబయ లీదించఁ బంతమా నాకు

చ. 2: మోసాన నెవ్వతె కైనా మొక మోడే వని కాక
పాసి వేరే మంచ మెక్కఁ బంతమా నాకు
వాసుల నీ మతిలోని వల పెరఁగక కాక
బాసలు నిన్నుఁ జేయించఁ బంతమా నాకు

చ. 3: ఆడిరి మరి నొకతె నాసపడీ నని కాక
బడలించి రతి సేయఁ బంతమా నాకు
వడి శ్రీవెంకటేశుఁడ వా నలయేలుమంగను
బడి వాయ నియ్యకుండఁ బంతమా నాకూ

రేకు: 0386-5 దన్నాసి సంపుటం: 11-515

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్లు నీ విటువంటివాఁడ వవుట
ఉఱక లేనిగుణము లొక్కటే వే యాయను

చ. 1: మంచివానివలెనె మాటలు వెలుచుకొని
పొంచి నవ్వుతాఁ జెప్పేవు పొలఁతికిని
యెంచఁగా నాపె నీకు హితవరురాలు గాని
పంచల వేయఁగ నీకుఁ బగవారమా

చ. 2: నామంచముమీఁద నుండి నయముల సట చేసి
కామించి యాపెమీఁదఁ గాలు వేసేవు
ప్రేమ నాపె నీకు సేస పెండ్లికూఁతు రాయఁగాని
నేము వెట్టికి వచ్చిననెలఁతల మైతిమా

చ. 3: పురముపై నే నిట్టె వుండఁగా శ్రీవెంకటేశ
కరఁగించి యాసతికిఁ గత చెప్పేవు
యెరవుగా నాపెఁ గూడి యింపుగా నన్నుఁ గూడితి
నిర తలమేల్మంగను నేనే మేలుదానాన

రేకు: 0386-6 కురంజి సంపుటం: 11-516

పల్లవి: ఎప్పటివాఁడవె కావా యెరుఁగుదుము
తప్పులు పట్టఁగ నిన్నుఁ దగ దయ్యా మాకును

చ. 1: చనవు సేసుక నే నీసరి నిలుచుందుఁ గాక
మన సిచ్చి నీవు నాతో మాట లాడేవా
వనిత లి దెరఁగరు వడి నేఁ గైకో నందురు
అనుమాన మెల్లఁ బాసె నంపవయ్య మమ్మును

చ. 2: వూర కైనా నేనే వట్టి వూడిగాలు సేతుఁ గాక
మేరతో నీవు గొంతైన మెచ్చఁ బొయ్యేవా
నేర మెల్లఁ దీర నేఁడు నిన్ను ముదులకించితి
పోర నోప నీతోను పోవయ్యీ చాలును

చ. 3: నంటున నీతో నేనే నవ్వులు నవ్వుదుఁ గాక
జంట యై నీ వట్టె సరసము లాడేవా
అంటిని శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
యింటికి వచ్చి కూడితి వేల వయ్య నన్నునూ

రేకు: 0387-1 నాగవరాళి సంపుటం: 11-517

పల్లవి: ఇన్నియు గన్నట్టిమీఁద నిఁక నేలా
యెన్నికలు నీకు నాకు నిఁక నేలా

చ. 1: పొదిగి నీ వనఁ గాను పూఁచి నిన్ను నే నాడఁగా
యెదురుబడి మాటలు యిఁక నేలా
కదిసి యీవలఁ జూచి కన్నవారె నవ్వఁ గాను
యిదివో మనలో వాదు లిఁక నేలా

చ. 2: సారె సారె నీవు నేను సరసము లాడఁ గాను
యీరు దియ్యఁ బేను వచ్చు నిఁక నేలా
మోరతోపుఁదనములు మొగములో నుండఁ గాను
యీరీతి సాకి రడుగ నిఁక నేలా

చ. 3: పంతముల నిందాఁకఁ బరాకులె పచరించి
యింతలోనె యిచ్చము లిఁక నేలా
అంతటి శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
యింతటఁ గూడితి రేసు లిఁక నేలా

రేకు: 0387-2 ఛాయనాట సంపుటం: 11-518

పల్లవి: వట్టి సటలకు తల వంచ నేలే
మట్టు మీరేపని యైతే మానుప కుండేనా

చ. 1: కాతరాన నీవిభుఁడు కదిసి యేపొద్దు నీ
చేతికి లో నై యుండఁగ చింత లేలే
ఆతల నొక్కతెయింట నాతఁ డుండఁగాఁ జూచితే
యేతుల నీ వే మన్న నియ్యకొందుఁ గాకా

చ. 2: చంచలము దీరీ నిన్ను సమ్మతించఁ జెప్పి నీతో
ముంచి నవ్వులు నవ్వఁగ ముసుఁ గేలే
పంచల నాతఁడు వేరే పరా కై వుంటేఁ గనక
వంచన నీకుఁ గా పత్రివాదుల మై యుండేమా

చ. 3: అక్కజపు యేకతాన నంగము లంటుచు నీ
చెక్కులు నొక్కఁగా నీకు సిగ్గు లేలే
అక్కర శ్రీవెంటకేశుఁ డలమేలుమంగవు నీ
విక్కువతోఁ గూడితివి యిట్టె సంతోసించవే

రేకు: 0387-3 భైరవి సంపుటం: 11-519

పల్లవి: ఏమి నేతు నిందుకు ని న్నెటువలె వేఁడుకొందు
చే మంచి నీమోము చూడ సిగ్గయ్యీ నాకు

చ. 1: వేడక నాపె యింటికి విచ్చేయఁ గాఁ జూచి
వోడక నే లేవ నైతి నుడుకనను
యీడ నాతోఁ జెప్పె విను యెంత దోసకారినో
యీడ జో డై సవతిపో రింత సేసే నయ్యా

చ. 2: యిచ్చగించి ఆపెతేనె యిట్టె నవ్వఁగాఁ జూచి
మచ్చరాన నీతోడ మా టాడ నైతి
కచ్చుపెట్టి నే నెంత కట్టడి మతిదాననో
యెచ్చి నాజవ్వనమద మింత సేస నన్నును

చ. 3: గక్కన నాపైకు నీవు కనున్న నేయఁ జూచి
యెక్కువ నీ వున్నమంచ మెక్క నైతిని
అక్కర శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
యిక్కువ నీతోడికూట మింత నేనె నన్నునూ

రేకు: 0387-4 రామక్రియ సంపుటం: 11-520

పల్లవి: ఎంతయిన మానవు ని న్నేమి సేతును
పంతపు నీసుద్దులకు భ్రమ సున్నదానము

చ. 1: నగదు గాదు నీతోడ నాఁడె నేఁ జెప్పనా
తెగి మాలో నవ్వితే నేఁ దిట్టుదు నవి
మొగము చూడఁగ నీకు ముందెనే మొక్కనా
తగుల నాడకు మమ్ముఁ దడవకు మనుచు

చ. 2: నను పై యిన్నా ళ్లాయ నాతలఁ పెరఁగవా
తనివోని కక్కూరితిదానఁ గాన నీ
చనవు నేసి యింతుల సాకిరులుఁ బెట్టనా
పెనఁగకు మమ్ముఁ బేరఁ బిలువకు మనుచు

చ. 3: నీ వేల నమ్మవో కాక నీవే నేఁ గానా
వాని నీవు దెలయవా వదినె నని
ఆవల శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
తావులఁ గూడితి వింకఁ దమక మే లనుచూ

రేకు: 0387-5 శ్రీరాగం సంపుటం: 11-521

పల్లవి: నీవు సేసేపనులకు నేర మేది
తావుల నాతోఁ బెనఁగఁ దగ వేది

చ. 1: వెలఁదులతోడనె వేగువంతాఁ బట్టె నీకు
వెలయ మాయింటికి రా వేళ యేది
కులికి మాకాతరానఁ గొసరేము గాక నిన్ను
పలుమారుఁ బలికించ బలు వేది

చ. 2: యెక్కడనోఁ దిరుగాడ నిందాఁక బట్టె నీకు
దిక్కి మాతో రతి సేయ దల పేది
మక్కువ సేసితి గాన మాన లేము గాక నిన్ను
తక్కులఁ బెట్టగ మాకుఁ దగ వేది

చ. 3: ఆదరించి నీమీఁద నాన వెట్టఁ బట్టె నీకు
సోదించి ని న్నవుఁగా దనఁ జో టేది
ఆదెస శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
ఆదిరించి కూడితివి అడ్డ మాడ నేది

రేకు: 0387-6 నాదరామక్రియ సంపుటం: 11-522

పల్లవి: చెల్లు లేవే యాతఁడు నీచేతఁ జిక్కెనే
పల్లదమే తల్లి నీకుఁ బాలతోనే పోసెనే

చ. 1: తెగువలు వచరించ తేనెలమాట లాడ
పగటుల నడవ నీపాలఁ బోయనే
మొగమిచ్చులు నెరవ ముసిముసినవ్వు నవ్వ
తగవులఁ బెట్ట నీకు తతి వచ్చెనే

చ. 2: సారెకు మొక్కులు మొక్క చలములు సాదించ
ఆరీతి నాన వట్టె నీ కలవా ట్లాయనే
నేర మొకరిపై వేయే నీచేయి మీఁదు సేయ
నేరుపు నాలితానలు నీ వియ్యా వలెనే

చ. 3: అరగపటము చూప నంతలోఁ దిరుగ వేయ
సరిఁ జిన్ననాఁడె యిన్ని సాధించితివే
గరిమ శ్రీవెంకటేశుఁ గలసి న న్నే లించితి
సరి వచ్చితే మెచ్చ జాణ వైతివే

రేకు: 0388-1 ముఖారి సంపుటం: 11-523

పల్లవి: ఏ లోయి మాతోడి యెగసక్యాలు
జాలిఁ బడి వున్నవారి సట సేసేవా

చ. 1: సెలవుల నవ్వు నవ్వి చేతి పువ్వుబంతి వేసి
యెలమి మాకోపము నేఁ డేల రేఁచేవు
పులి వచ్చి విరహన నుడుకుతా నుండేవారి
వలపుల యెండలనే వడ చల్లేవా

చ. 2: దగ్గరనే నిలుచుండి తతిగొని చన్ను లంటి
యెగ్గులతిట్ల మాచే నేల పడేవు
నొగ్గిన సిగ్గులతోడ నుట్టి లేక వూఁగేవారి
అగ్గలపుటాసలవుయ్యాల లూఁచేవా

చ. 3: చేరి పచ్చడము గప్పి చెక్కు నొక్కి కాఁగిలించి
యీరీతి మన్నించి మమ్ము నేల మెచ్చేవు
కూరిమి శ్రీవెంకటేశ కూడిన మావంటివారి
నేరా తరితీపుల నెలయించేవా

రేకు: 0388-2 రాయగౌళ సంపుటం: 11-524

పల్లవి: ఎప్పటివలెనే చన వియ్య రాదా
తప్పు లేనిసతి నింక దయఁ జూడ రాదా

చ. 1: నాలితో నాపె నిన్ను నవ్వుతా నన్న మాఁటకు
యేల కోపగించుకొనే వింతలోనే
మీలోనే యిటు లైతే మెత్తురా లోకమువారు
తాలిమితో నింతి నింక దయఁ జూడ రాదా

చ. 2: చనవు చేసుక యాపె జంకించనయందుకు
యెన లేక చిన్నఁ బొయ్యే వేఁటికి నీవు
కొనగొన మీకు మీకు కోపము లింత చెల్లువా
తనిసి నీ దేవులను దయఁ జూడ రాదా

చ. 3: చుట్టరికమున నాపె సూడు వట్టినందుకు
యెట్టు పెనఁగఁ బోయి నితవు లవునా
యిట్టె శ్రీవెంకటేశ యింతలోఁ గూడితి వీపెఁ
దట్టు ముట్ట సేయ కిట్టె దయఁ జూడ రాదా

రేకు: 0388-3 నారణి సంపుటం: 11-525

పల్లవి: కల మీ సహజానకు కన్నుల మెచ్చుట గాక
తలపోసి మి మ్మడుగఁ దగవా యీవేళనూ

చ. 1: పడఁతి నీమోము చూచి పకపక నవ్వు నవ్వి
చిడుముడి నీచేతిపై చేయి వేసేను
అడరి మీలోని మర్మా లనవి యేమి గలవో
తడవఁగ మాకు నంత దగవా యీవేళను

చ. 2: సారె సారె సన్న సేసి చాయలు దొరల నాడి
మోరతోపుఁదనమున మొక్కు మొక్కెను
కారణ మేఁటికో కాని కందువ మీకే తెలుసు
తారుకాణించఁగ మాకుఁ దగవా యీవేళను

చ. 3: చెనకి పాదము దొక్కి చెలిలోన మాట చెప్పి
ఘనముగ నిన్ను నాపె కాఁగిలించెను
అనుగు శ్రీవెంకటేశ ఆడుకోలుమాటలేవో
తనివి నిట్టె పొగడఁ దగవా యీవేళనూ

రేకు: 0388-4 సామంతం సంపుటం: 11-526

పల్లవి: ఎంత నీవు పతి వైనా యింతులకు లోనే సుమ్మీ
వంత జవ్వనమదపువారు సుమ్మీ వీరు

చ. 1: సొలసి యాడెటిమాట సుమాళముమీఁది పాట
పెలుచుఁగామినులకుఁ బెట్టని కోటా
బలిమి చూపఁగ రాదు పంతపు మగవారికి
వలరాచసలిగెలవారు సుమ్మీ వీరు

చ. 2: కనుచూపుల కొసరు గబ్బితనపుటుసురు
దినవలపులకు నెత్తినయసరు
మొనలు మీరఁగ రాదు ముంచి యెంతకొర తైన
వనవసంతునిపొజువారు సుమ్మీ వీరు

చ. 3: వుదుటుమీఁది సణఁగు వొద్దికతోడి గొణఁగు
మదరాగ మీసతికి మంచి మణుఁగు
ఆదన శ్రీవెంకటేశ అట్టె కూడితి వీపెను
వదనశశినిఁ బోలేవారు సుమ్మీ వీరు

రేకు: 0388-5 భవుళి సంపుటం: 11-527

పల్లవి: ఏమి సేసినా నీ చిత్త మింతే కాక
కాముకుఁ డైన నిన్నుఁ గా దనేటివారమా

చ. 1: నేరిచినవారుగా నీతో మాటాడేది వే
మారును నెదు రాడఁగ మా కేటికి
కారణము గలిగి కా కమ్మర నీతో నవ్వేది
యీరీతి నీతోఁ గెలయ నెంత పని మాకును

చ. 2: అంత కోపినప్పుడుగా నట్టె నిన్ను దగ్గరేది
మంతనాలు విన్నవించ మా కేఁటికి
పంతము నే నాడితేఁగా బలవు నీతోఁ జూపేది
యెంత కెంత నీసుద్దులు యేమి పని మాకునూ

చ. 3: నేనే నీ వయితేంగా నిజ మని నమ్మేది
మానక వావులు చెప్ప మా కేఁటికి
పూనుక శ్రీవెంకటేశ బుజ్జగించి కూడితివి
యే నెపాలకు నింక నేమి పని మాకును

రేకు: 0388-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 11-528

పల్లవి: తను నేమి సేసితినే తా నేల తమకించేనే
యెనయఁగా నూరకున్న దిదే నా నేరమి

చ. 1: తగుల నాడినదదానఁ దల వంచు కుండ నైతి
నగితి నింతే పో నా నేరమీ
మొగుము చూచినదాన మోనము గైకొన నైతి
అగపడి లో నైన దదే నా నేరమీ

చ. 2: యింటికి వచ్చినదాన నే మైనాఁ గొసర నైతి
నంటున నే నుంటి నది నా నేరమీ
అంటినదాన నే నట్టె చెనక నైతి
వొంటి మొగమోటల నే నున్నదే నా నేరమీ

చ. 3: నెమ్మదిఁ గూడినదాన నిజబా సడుగ నైతి
నమ్మితి నే నిదయె కా నా నేరమీ
వుమ్మడి శ్రీవెంకటేశుఁ డొగి నిట్టె నన్నుఁ గూడె
సొమ్ముల మై మఱచి నేఁ జొక్కినదే నేరమీ

రేకు: 0389-1 సాళంగం సంపుటం: 11-529

పల్లవి: కొసరి ని న్నింతలోనె కోపగించేనా
ముసిముసి నవ్వు లెల్లా ముచ్చటలె కావా

చ. 1: తలఁపులో నీరూపు తగిలి పాయ కుండఁగ
యెలమి విరహతాప మెక్కడిది
వెలయ నిందుకుఁ గాను వేఁడుకొనే వేల నన్ను
నలువంక నీమేలె నామేలు గాదా

చ. 2: చేకొని నీ కంకణము చేతఁ జిక్కి వుండఁ గాను
యీాక డాకడి మాటకు నెగ్గు లేది
వాకున నిందుకుఁ గానె వైపులుగా నమ్మించేవు
నీకుఁ గలసంతోసమే నేఁడు నాకుఁ గాదా

చ. 3: కందువ నీవే నాయింటఁ గాఁణా చై వుండఁగాను
చెంది నామనవి నీతోఁ జెప్ప నేది
అంది శ్రీవెంకటేశ నన్నలమితి కడపలో
విందుల నీవేడుకే నావేడుకలు గావా

రేకు: 0389-2 సాళంగనాట సంపుటం: 11-530

పల్లవి: ఎవ్వరితోడ గొడవ లేక నేలా
యివ్వల మ మ్మిందులోనే యేల పొగడేవు

చ. 1: సన్నల సారెకు మెచ్చ సణఁగు నీపైఁ జల్ల
కన్నులెదుట నీ కాపె గలిగెఁగా
మన్ననలు పచరించ మాటికి మాటికి నవ్వ
అన్నిటిమారును నీవు ఆపెకుఁ గలితి గా

చ. 2: యిచ్చకము నీకు నాడ యే మైనఁ బనులు సేయ
గచ్చుల నీకు నేఁ డాపె గలిగెఁ గా
చెచ్చెర వాసు లెక్కించ చెప్పినపనులు సేయ
నిచ్చ నిచ్చ నాపెకు నీవు గలితివి గా

చ. 3: అంది నీకాఁగిఁట గూడ నాయము గరఁగి చొక్క
కందువ లంట నీ కాపె గలిగెఁ గా
అందపు శ్రీవెంకటేశ ఆపెఁ గూడి నన్నుఁ గూడి
తిందులో మాయిద్దరికి నిటు గలితివిగా

రేకు: 0389-3 సాళంగనాట సంపుటం: 11-531

పల్లవి: పెలుచుఁ గోపపుదాన బిరుదుకు మొదలను
యెలమి నీగుణాలే న న్నింత వలపించెను

చ. 1: తత్తరించి నే నిన్ను తగుల నాడినందుకు
చిత్తన నొవ్వక నన్నుఁ జేర వచ్చేవూ
మత్తిలి నేఁ గోసరితే మరి నీవు నవ్వేవు
యిత్తల నీమంచితనా లింత వలపించెనూ

చ. 2: గక్కన నీరాకు నేఁ గైకో కుండినందుకు
అక్కర దీర న న్నంటి ఆదిరించేవూ
వొక్కటి గా కూరకున్న వొడఁబరచ వచ్చేవు
యిక్కువ నీ నేరువు న న్నింత వలపించెనూ

చ. 3: వొంటిఁ గాఁగిలించఁగాని నిన్నొట్టు వెట్టినయందుకు
బంటువలె వెంట వెంటఁ బాయ కుండేవూ
అంట కుంటే శ్రీవెంకటాధిప నన్నుఁ గూడితి
వింటనే నీ చనవులు యింత వలపించెనూ

రేకు: 0389-4 హిందోళం సంపుటం: 11-532

పల్లవి: ఏమి సేసితి విందాఁకా నేడ నుంటివి
చే ముంచి యాపెను నీవే నేద దేర్చవయ్యా

చ. 1: యింతి నీవు వచ్చే వంటా నిందాఁకా నెదురు చూచె
అంతయు నీతోఁ గొంచి యాడఁ జాలదు
చింతతో నున్నది చెలి చెక్కు నొక్కి యీపెకు
సంతోసము సేసి మోవి చవి చూపవయ్యా

చ. 2: నీవే పిలిచే వంటా నిలుచుండె నిందాఁక
ఆవలిమాటలు నిన్ను ననఁ జాలదు
కోవరపుఁ దమకాన గుట్టుతో వున్నగి యీపెఁ
జే వట్టి బుజ్జగించి చిత్తగించవయ్యా

చ. 3: పవళించే వంటాను నీపైనే కన్ను లిందాఁకా
అవుఁ గా దనుచు నిన్ను ననఁ జాలదు
వివరించి కూడితి శ్రీవెంకటేశ యీసతిని
కవ వాయ కిట్లానె కైకొ నుండవయ్యా

రేకు: 0389-5 సాళంగం సంపుటం: 11-533

పల్లవి: అన్నిటాఁ దన్నుఁ జూచుకొ మ్మనరే మీరు
వున్నమచంద్రువెన్నెల భూమి కెల్లాఁ గాదా

చ. 1: యెంత నన్ను బుజ్జగించి యెటువలెఁ బెట్టు కున్నా
అంతయునుఁ దనమే లనరే మీరు
పొంతనె పాదాలమీఁదఁ బూజించినపెద్దరికె
మంతట దేహన కెక్కు నదియే కాదా

చ. 2: సారె సారె దా నెంత చనవు నా కిచ్చినాను
ఆరయఁ దనలాభమో అనరే మీరు
నేరుపుతో వేళ్లపై నీళ్లెల్లాఁ బోసితేను
కూరిమినా తని వెల్లాఁ గొనలకే కాదా

చ. 3: సరి నన్నుఁ గూడి నా మైచలు వెంత వేసినాను
ఆరిది తనకె పుణ్య మనరే మీరు
యిర వై శ్రీ వేంకటేశుఁ డింత వేసి నన్నుఁ గూడె
మరిగె పండ్లతీపు మాకు వల్లఁ గాదా

రేకు: 0389-6 ముఖారి సంపుటం: 11-534

పల్లవి: ఇంతేసి మాయలు పతి యెరుఁగునో యెరఁగఁడో
చింత దీర నాతనితోఁ జెప్పరమ్మ చెలులు

చ. 1: దగ్గరి యాతనితో నే తమితో మాట లాడితే
ఆగ్గలపుసతులు గయ్యాళి యందురూ
సిగ్గు పడి వూర కున్న చెంగలించి వెంగెముల
నిగ్గుల ని దేమియు నేర దందు రూ

చ. 2: నయమున నేఁ గొంత నవ్వులు నవ్వఁగఁ బోతే
బయకారా లని వారే పచ్చి వేతురు
దయతోడ గుట్టు సేసి తల వంచుకొని వుంటే
నియతి నలిగె నంటా నెట్టన గడింతులు

చ. 3: కతగా శ్రీవెంకటేశుఁ గలసి మెప్పించితేను
రతులలో ని దెంతటి రాఁగ యందురూ
యిత వై యీతఁడు నన్న నింతగా మన్నించి కూడె
మతక మింతయును నామర్మమే యందురూ

రేకు: 0390-1 గుండక్రియ సంపుటం: 11-535

పల్లవి: కంటి వటె నామీఁదఁ గల బత్తి యీతనికి
గొంటుఁదనమునఁ దానె కొంకీ నాచేఁతకు

చ. 1: నంటు గలవారిఁ గంటే నవ్వ బుద్ది వుట్టుఁ గాక
కంటకపు వారికిఁ గలదా సొంపు
అంటి ముట్టి నే సరస మాడఁగా నా కినగోరి
ముంటివాఁడి సోఁక కుండా మొక్క వచ్చీ నితఁడు

చ. 2: యేకచిత్త మైనచోట నిన్నియు నితవు గాక
చీకాకు వడినచోటఁ జెప్పఁ గలదా
కైకొని నేఁదను నెంత కరఁగించి మాటాడినా
ఆక డీకడి మాటలు ఆలకించీ నితఁడు

చ. 3: యంత నే విన్నవించఁగా నియ్యకొని కూడెఁ గాక
చెంత నే నాడక వుంటేఁ జిత్తగించీనా
పంతపు శ్రీవెంకటాద్రిపతి యిప్పుడు నారతి
మంతనానఁ జిక్కి చొక్కి మచ్చి కాయ నితఁడు

రేకు: 0390-2 పాడి సంపుటం: 11-536

పల్లవి: ఈపాటి కీపాటి యిఁక నెంతో
కోపగించ రాదు నీతో కూటములు చెల్లునా

చ. 1: సెలవుల నవ్వితేనె చెరఁగు వట్టెవు నీవు
యెలమి నాల నైతే యెంత సేతువో
బలవులతోడి పొందు పై వచ్చునై వచ్చు
చలము సాదించ రాదు చాలు నోప నందుకు

చ. 2: మచ్చికె నిన్నుఁ జూచితే మంచానకుఁ దీసేవు
యిచ్చలు నీకుఁ జేసితే నెంత నేతువో
వచ్చెఁ బలివేలు మాకు వరుస లిందే కంటిమి
మచ్చరించ రాదు నాతో మాట లింతే సేఁటికి

చ. 3: వొంటి నే నిలుచుంటెనే వూరకే కాఁగిలించేవు
యింటికిఁ బిలచుకొంటే నెంత సేతువో
గొంట వై శ్రీవెంకటేశ కూడితిని నన్ను నిట్టె
దంట నై జంకిం రాదు తతి వచ్చె నీకును

రేకు: 0390-3 దేసాళం సంపుటం: 11-537

పల్లవి: వట్టి మండాటము లేల వద్దన నేలా
యిట్టె నీపతి వీడె యే మైన ననవే

చ. 1: వలవనిజోతి యాల వాదుటాల మా కేల
తలఁచఁగానె యాతఁడు తానే వచ్చెను
పొలసి యిందాఁక నేము పూనుక వచ్చితి మింతే
చెలువుఁడు వాఁడె నీవు సేసినట్టు నేయవే

చ. 2: ఆన వెట్ట నా కేల అంతేసి పంతము లేల
వీనుల నాతఁడు దానే వినుచున్నాఁడు
కానీవే ఆతఁడు నీవు గన్నదాఁకా గురియైతి
పోనీక యీతని కిన్ని బుద్దలూనుఁ జెప్పవే

చ. 3: చక్కటి సేయఁగ నేల చవులు చెప్పఁగ నేల
గక్కన నాతఁడును నిన్నుఁ గాఁగిలించెను
యిక్కువ శ్రీవెంకటేశుఁ డెనసి వున్నాఁడు నీతో
యిక్కడు నాతనితో నీ వెట్టయినఁ బెనఁగవే

రేకు: 0390-4 గుండక్రియ సంపుటం: 11-538

పల్లవి: మగవాఁడు గూళ యైతే మరి చేతఁ బట్ట రాదు
తగ వెరఁగక నీవే తమకించే విదివో

చ. 1: అంగనకు నీమనసు అరిసి తెలయుదాఁకా
నంగవించి నవ్వ దాయ నందుకే కదా
కుంగుచు నీవది చూచి కోపగించి వున్న దంటా
నండగెఁ బెట్టి వలపు లాడుకొనే విదివో

చ. 2: పడఁతికి నీ వాకడి పరాకు మానినదాఁకా
నడరి నీతో మాటాడ దుందుకే కదా
కడగి నీతో నాపె కైకొనక వున్న దంటా
వుడివోక గోర సేసి వుప్పతించే విదివో

చ. 3: జలజాక్షికిని నేవీ చనవు లిచ్చినదాఁకా
నలమక వూరకుండె నందుకే కాదా
యెలమి శ్రీవెంకటేశ యిట్టె నీవే కూడితివి
చలము చెల్లించే నంటా జట్టిగొనే విదివో

రేకు: 0390-5 సాళంగం సంపుటం: 11-539

పల్లవి: చెల్లనో నీ వింత నాకుఁ జెప్ప వలెనా
బల్లిదుఁడ నాకు నీ బలు వుండఁగా

చ. 1: సందడించి యవ్వరితో జడగడాలు మా కేల
కందు వై నీవు నాకుఁ గలి గుండఁగా
మందలించి కన్నవారిమాట విన నా కేల
కిందట మీఁదట నీకృప యుండఁగా

చ. 2: పొట్టఁబిరుగువారితో పురుఁడు నా కది యేల
యిట్టె నీవు నాకుఁ జన విచ్చి యుండఁగా
వట్టి విచారము లేల వగలఁ బొరల నేల
గుట్టుతో నీబాస నాకు గురి యుండఁగా

చ. 3: కడవారితో నింకఁ గాఁతాళము నా కేల
ఆడరి నీకాఁగిలి నన్నంటి యుండఁగా
బడినె శ్రీవెంకటేశ పాయక నన్నుఁ గూడితి
జడియ నేల వలపు సరు లయి వుండఁగా

రేకు: 0390-6 సాళంగనాట సంపుటం: 11-540

పల్లవి: నిక్కము నేఁడు మా పొందు నీకు వలెనా
చక్కని విభుఁడ యింత చవి పుట్టీనా

చ. 1: మనసు దెలసి నాతో మాట లాడే విప్పు డిట్టే
తనిసి నేఁ డైన నీచిత్తము వచ్చెనా
చెనకి నామీఁదఁ దెచ్చి చేయి వేసే వప్పిటిని
వెనకముందరి బుద్ధి విచారించుకొంటావా

చ. 2: నయగారమును మాతో నవ్వఁ జూచే విప్పు డిట్టే
జయ మైన సిగ్గు దేరి చలి వాసెనా
ప్రియపడి నన్నుఁ గడు పేరుకొని పిలిచేవు
క్రియతో నీ కింతపని కిమ్ములఁ గలిగెనా

చ. 3: చొక్కుచు నా మోముదిక్కు చూచేవు సారె సారె
పుక్కటై నీలోని వలపులు రేగెనా
యిక్కు వంటి శ్రీవెంకటేశ నన్ను గూడితివి
దిక్కుల నీగుణములు తిద్దుకొంటివా

రేకు: 0391-1 ముఖారి సంపుటం: 11-541

పల్లవి: చెప్పకు నీ వోరపులు సిగ్గు లయ్యీని
కప్పుక రాఁగానె కాక కడుఁ బెలుచవు

చ. 1: ఆయము దప్పక నిన్ను ఆడ కుండఁగానె కాక
వోయయ్య నీ వింతేసి కోరిచేవా
చాయ సేసుకొని నీతో సరి నవ్వే దెరఁగవు
నీయంతనే వచ్చి నిజము నెరుపేవు

చ. 2: సంగడి దప్పి నీపైఁ జేయి చాఁచ కుండఁగానె కాక
యింగితాన నెందు కైన నియ్యకొనేవా
చెంగట నీగుణములు చెల్లఁ బెట్టే దెరఁగవు
ముంగిటిచెలుల కెల్ల ముచ్చట చేప్పేవూ

చ. 3: కిమ్ముల బొమ్మలకు జంకించ కుండఁగానె కాక
నెమ్మది నీ దీమసాలు నెరుపేవా
యిమ్ముల శ్రీవెంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సమ్మతించి యిప్పుడు గా చనువు లిచ్చేవూ

రేకు: 0391-2 మంగళకౌసిక సంపుటం: 11-542

పల్లవి: ఈపాటి మేలు సేసితి వింత చాలదా
మాపట్టుకు నీవు గాఁగా మన్నింతిని గాక

చ. 1: వంతుకు నామనసు రావలె నంటా నాపెచేత
పంతము లిప్పించే వేర పలుమారు
యెంతటివాఁడవు నీవు యే మేమి సేయ నేరవు
మంతనానా మముఁ గొంత మన్నించితి గాకా

చ. 2: ఆది గొని నేనే మైనా ననే నంటా నాపె చేత
పాదాలకు మొక్కించేవు పలుమారు
కా దంటే నీ వెంత కైనఁ గలవు నే నెరఁగనా
మాదెసఁ గొంత నీవు మన్నించితి గాకా

చ. 3: యెనయ నిద్దరి నొకయింటఁ బెట్టి యాపెచేత
పని నాకుఁ జేయించేవు పలుమారు
కొనబు శ్రీవెంకటేశ కూడితిని నన్ను నిట్టె
మన సిచ్చి నేఁ గాఁగా మన్నించితి గాకా

రేకు: 0391-3 వరాళి సంపుటం: 11-543

పల్లవి: మొదల నేమీ నెరఁగ ముగ్ధురాలను
యెదుట నీయాల నేను యీడేరించ వయ్యా

చ. 1: వోపి మంచము దిగక వుందు నొక్కొక్కవేళను
రాపుగ నిన్నుఁ బొందిన రాజసానను
కోపగింతు నొకవేళఁ గొసరుదు నొకవేళ
ఆపాపము లే దని మా కానతియ్య వయ్యా

చ. 2: దగ్గరినవేళ నాపాదము దాఁకు నీ మేను
అగ్గలపుమందెవేళ మట్టె కాఁగాను
వెగ్గళింతు నొకవేళ వేసరింతు నొకవేళ
యెగ్గు లే దని వరము లియ్య వయ్యా

చ. 3: యేకతపువేళ నిన్ను యే మైనా నందుము నేము
కైకొని చనవుతోడఁ గాఁగిట నించి
యీకడ శ్రీవెంకటేశ యేక మైతి మిద్దరము
వాకుదోసము లే దని వల లీవయ్యా

రేకు: 0391-4 లలిత సంపుటం: 11-544

పల్లవి: నిన్ను మీర నోపను నే నెటువలె నుండిన
అన్నిటా నే నీకె లో నవుతే నాతగవూ

చ. 1: యెంత విరహవేదన నెట్లా నేఁ బొరలినా
రంతుల వేగిరించఁగ రాదు నిన్ను
యింతకంటే నీతో నే నెంత వొట్టు వెట్టుకొన్న
వంతలు నీయంకెలకు వచ్చుటే నాతగవు

చ. 2: ముంచి నాకు నీమీఁద మోహ మెంత యెక్కు డైన
చంచలించి వేగరించ సంగతా నాకు
మంచితనాననే నీకు ముందెమేళ మెంతయిన
పొంచి నీవేళ గాచుక పొందుటే నాతగవూ

చ. 3: వరుసతో నే నీకు వద్ద నిట్టే వుండినాను
గరిమె నే ముందు చెనకఁగఁ జెల్లునా
నిరతి శ్రీవెంకటేశ నీవే నన్నుఁ గూడితిని
ధరమీఁది పనులకుఁ దాలిమే నాతగవూ

రేకు: 0391-5 పాడి సంపుటం: 11-545

పల్లవి: పొంచి పొంచి మాతో నేల పురుఁడు వెట్టుకొనేవు
నించి యిన్నిటా దొరవు నీకుఁ జెల్లదా

చ. 1: చలపట్టి మాకే నీతో జవదాఁట రాదు గాక
నెల వై పెచ్చు వెరుగ నీకుఁ జెల్లదా
కలది గ లట్టే మాకు కల్ల లాడ రాదు గాక
నిలువున బొంకు బొంక నీకుఁ జెల్లదా

చ. 2: మఱఁగు లెల్లా విరులు మాకుఁ జెల్ల దింతే గాక
నెఱి దాఁగి పొడచూప నీకుఁ జెల్లదా
తఱిఁ గపటము మాకుఁ దగవు గా దింతే గాక
నెఱవుదొంతగనాలు నీకుఁ జెల్లదా

చ. 3: చిమ్ముచు మాకే నీతో చేరి నవ్వ రాదు గాక
నెమ్మది సిగ్గు విడువ నీకుఁ జెల్లదా
నమ్మించి శ్రీవెంకటేశ నన్ను నిట్టె కూడితివి
నెమ్మి నన్ను మన్నించ నీకుఁ జెల్లదా

రేకు: 0391-6 ముఖారి సంపుటం: 11-546

పల్లవి: చిత్తము వచ్చిన ట్టెల్లఁ జేసుఁ గాకా
బత్తితోడ నేల వొడఁబరచీనె నన్నునూ

చ. 1: చేరి తనతో నవ్వి సేసపాలకు లో నైతి
బీరాన నేఁ బొందు సేసి బేల నైతిని
సారె సారెఁ దనవంక జాలదా నా కింత మేలు
పోరి పోరి యిఁక నేమి బుజ్జగించీ నన్నునూ

చ. 2: కన్నులఁ జూచినందుకు కాలమందె లో నైతి
యెన్ని తనునే నమ్మి యిం తైతిని
మన్ననలు దనవంక మరి యింతకంటే నేవి
కొన్నకో లై యిఁక నేమి గొంగు వట్టీ నన్నునూ

చ. 3: మాటలు దనతో నాడి మన సిట్టె తనిసితి
యీటుకుఁ బెనఁగఁ బోయి యేక మైతిని
గాఁటపు శ్రీవెంకటాద్రిఘనుఁడు దా నన్నుఁ గూడె
ఆఁటదాన నేల మెచ్చీ యప్పటిని నన్నునూ

రేకు: 0392-1 మలహరి సంపుటం: 11-547

పల్లవి: ఎందాఁక నీసిగ్గు లేఁటికిఁ బెంచేవు
పొందులు దొరకెను బోగించ రాదా

చ. 1: చెలఁగి నీకురులు చేతుల దువ్వుచు
మలసెటిపతితో మా టాడవే
సెలవినవ్వుతోఁ జెక్కులు నొక్కి
చెలువుని చనవులు చెల్లించ రాదా

చ. 2: కదిసి చేసురటి కాంతుఁడు విసరీ
నదె చీచేతుల నందుకోవే
మొదల నాతఁడె ముచ్చట లాడీ
యెదు రుత్తరము నీ వియ్యఁగ రాదా

చ. 3: ఆతఁడు కాఁగిట నట్టె బిగించీ
నీతగ విప్పుడు నెరపఁ గదే
కాతరపు శ్రీవెంకటఘనుఁ డితఁడు
ఘాతలఁ గూడెను కనుఁగొన రాదా

రేకు: 0392-2 శంకరాభారణం సంపుటం: 11-548

పల్లవి: నీవు మగవాఁడవు నెలఁత యాపె
వేవేలకు నైనాన వింత సేయఁ జెల్లానా

చ. 1: తచ్చి తచ్చి యాపెతో తారుకాణ నీకు నేల
యిచ్చగించి విన రాదా యింతలో నేమి
హెచ్చినకోపానఁ జెలి యే మన్నా ననెఁ గాక
మచ్చరించ యింత నీకు మారుమాట చెల్లునా

చ. 2: ముంచి తిట్టెయాపెఁ జూచి మోవినె నవ్వఁగ నేల
యించుక వోరుచ రాదా యింతలో నేమి
మించలవనిత యెంత మీరినాము మీరెఁ గాక
అంచెల సతులతో నా కాడుకొనఁ జెల్లునా

చ. 3: కూడినవేళ యాపెతో గోరఁ జెనకఁగ నేల
యీడ జోడై యుండ రాదా యింతలో నేమి
వేడుక శ్రీవెంకటేశ వెలఁదిఁ గలసితివి
తోడనె తనివి లే దొమ్మి సేయఁ జెల్లునా

రేకు: 0392-3 నాదరామక్రియ సంపుటం: 11-549

పల్లవి: అంతే కలితే నీ ఆతనివద్దికి రావే
కాంతరో అన్నియుఁ దారుకాణించె నిపుడు

చ. 1: యేమి సేసినో యంటా నేకతాన దగ్గిరితే
కామించి యాతఁడు నన్నుఁ గరఁగించెనూ
నీమనసున విభుని నేనే యంటితి నంటా
మోము చూచి నవ్వేవు మొరసి యే ముందునే

చ. 2: సూదు వట్టి నే నాతని జూజ మాడఁ బిలిచితే
కూడఁ బట్టి తానె దక్కఁ గొనె నన్నునూ
తోడనె వెంగె మావేడు దొమ్మినేఁ జేసితి నంటా
ఆడియు నాడవు నన్ను నందుకు నే మందునే

చ. 3: నీతోడి చుట్టరికాన నే మొక్కితే నన్నుఁ గూడె
యీతల శ్రీవెంకటేశుఁ డిచ్చకాననూ
నీతితో న నన్నడిగేవు నీ వెఱఁగ వటే యిది
యేతరీఁ డాతఁడు నీతో నే ముందునే

రేకు: 0392-4 సాళంగం సంపుటం: 11-550

పల్లవి: ఎఱఁగ రాదు మీ గుట్టు యి ట్టుండ వలదా
అఱమఱపులే కంటి మవ్వల దెలియదు

చ. 1: అట్టె నీమొగము చూచి అతివ నవ్వినవ్వు
వట్టి శిగ్గుతో నీ తల వంచినవంపు
దట్టపు వెన్నెలకును తామెర ముకుళించిన
ఆ ట్టాయఁ గాని మాకు నవ్వల దెలియదు

చ. 2: చేతి పూవుబంతిఁ గొని చెలియ వేసినవాటు
యీతల నంతలో నీ చె య్యెత్తిన మొక్కూ
ఘాత మరునమ్ములకు గవిశనవలె నాయ
నాతుమలోపల మాకు నవ్వల దెలియదు

చ. 3: తరుణి నీమంచానకు దగ్గరి వచ్చినరాక
నిరతి శ్రీవెంకటేశ నీకూటమి
గరిమఁ బాలును నీరు గలసినయ ట్టాయ
ఆరు దందితిమి మాకు నవ్వల దెలయదూ

రేకు: 0392-5 కొండమలహరి సంపుటం: 11-551

పల్లవి: నేనే కాదు చెలు లెల్ల నీగణ మెరుఁగుదురు
నానినవలపు చెప్ప నాతో నేల యిఁకనూ

చ. 1: మంతనాన మీ రిద్దరు మచ్చిక ముచ్చ టాడఁగ
వింతలుగా మీ సుద్దులు విననా నేను
యింతలో నే నగిగితే యేరుపడఁ గత చెప్పే
వంతరంగ మెఱఁగదా ఆన లేల యిఁకను

చ. 2: మొదలనె మీకళల మొకములలో తేట
కదిసి చూచితి నిట్టె కానాన నేను
అదన నే నవ్వితేను అట్టె తెర వేసేవు
కదిమి నాతో నయగార మేల యిఁకను

చ. 3: పచ్చి గాఁగ నింటిలోన పానుపుపైఁ గూడినది
యెచ్చరికె లెరఁగనా యిప్పుడే నేను
అచ్చపు శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితిని
ముచ్చిమి దీరినమీఁద మొక్కు లేల యిఁకను

రేకు: 0392-6 శుద్ధవసంతం సంపుటం: 11-552

పల్లవి: ఇసుమంత పనికిఁ గా నెంత సేసేవు
విసు పేల వచ్చె నీకు వినవయ్య మాఁటా

చ. 1: తూఁగుమంచ మెక్కుకొని తొయ్యలి లేవ దంటా
తోఁగి చూచి నీవు వోఁగా దొడికి పట్టి
వేఁ గగు కుచభారము వీడఁగాఁ బెనఁగీ నాపె
వీఁగక మన్నించి నేఁడు వినవయ్య మాఁటా

చ. 2: తామెర నాపె వేయఁగఁ దాఁకి నీకు నొచ్చె నంటా
వోమి నీవు కళ వట్టి వూర కుండఁగా
మోము చిన్నఁబోయి యింతి మోవితేనె నీకు నిచ్చి
వేమారు వేఁడుకొనీని వినవయ్య మాఁటా

చ. 3: సిగ్గుతో నున్నది యంటా శ్రీవెంకటేశుఁడ నీవు
బగ్గన నవ్వలిమో మై పవ్వళించఁగా
దగ్గరి యందుకే యింతి తమకించి నిన్నుఁ గూడె
వెగ్గళించ కిపు డిట్టె వినవయ్య మాఁటా

రేకు: 0393-1 శుద్ధవసంతం సంపుటం: 11-553

పల్లవి: ఇప్పు డేల చవు లయ్యీ నింపులు చాలనిపొందు
చప్పు నైనా నుప్ప నౌను సమ్మ తైతేఁ గాకా

చ. 1: చలము సాదించేచోట సలిగెలు చెప్పఁ బోతే
ములుచదాన ననవా మొదల నీవే
వలచినవేళ నెంత వడి నేఁ గోపించినాను
తల ఊయి సేసుకొని తగులుదు గాక

చ. 2: నయము చాలనిచోట నవ్వులు నవ్వఁగఁ బోతే
బయకారించె ననవా పక్కన నీవే
ప్రియము గలవేళను బిగి నెంత నే నుండినా
దయ వుట్టి నీవు నన్ను దగ్గరుదు గాక

చ. 3: తమకము లేనిచోట తతిఁ బెనఁగఁగఁ బోతే
భ్రమసి వున్న దనవా పై పై నీవే
అమర శ్రీవెంకటేశ అట్టె నన్నుఁ గూడితిని
సమ మై యేకతవేళ సత మైతి గాకా

రేకు: 0393-2 సాళంగం సంపుటం: 11-554

పల్లవి: చెలులతో నీసుద్దులు చెప్ప వచ్చునా
చలము మన లోలోనె సాదించుట గాకా

చ. 1: మచ్చిక నీతిట్లూను మనలోని వొట్లూను
చెచ్చెర నొరులతోడఁ జెప్ప వచ్చునా
కొచ్చి బొమ్మల జంకించి కోపముల నుంకించి
రొచ్చుల మతికాఁక దీరుచుకొంట గాకా

చ. 2: నీ చేఁతలను మన నెట్టుకొన్న మర్మములు
చేచేత నొరులతోడఁ జెప్ప వచ్చునా
తాచి నిట్టూర్పు నెరపి తగఁ గన్నులు గిరపి
యేచి మనలో మనమే యిందుకొంట గాకా

చ. 3: యింతేసి నీ వినయాలు యిక్కువ మనరతులు
చెంతల నొకరితోడఁ జెప్ప వచ్చునా
పంతపు శ్రీవెంకటేశ భావములనే చొక్కి
వింత సంతసాల విఱ్ఱవీఁగుకొంట గాకా

రేకు:	0393-3 సాళంగం	సంపుటం:	11-555

పల్లవి:	ఆన వెట్టినా మానరు అప్పటి మీరు
	పానిపట్టి చెలులార పగదాన నటరే

చ. 1:	యెదురుమాటలు నేర యెవ్వరితో నేఁ బోర
	వొదిగి వొకరీతి న న్నుండ నీరే
	అదన నండఁ గూచుండ నాతని సరివారమా
	పొదిగి నా కేల మీరు బుద్ధి చెప్పేరే

చ. 2:	వట్టి పూడిగాల కోప వాదు లాతనిపై మోప
	వెట్టికి మొక్కి నన్నేల వెట్టిఁ జేసేరే
	యిట్టె నన్నాతఁ డే మన్నా నే మాయ లే దంటా
	నొట్టు వెట్టుకొనె నంటా నొడఁబరచకురే

చ. 3:	మంతనా లంతే నెఱఁగ మతిఁ దనకు మొఱఁగ
	యెం తయినఁ దనకాఁగి లేల మానేనే
	యెంతలోనే శ్రీవెంకటేశుఁడు దానె కూడె
	పొంత నన్ను నాతనిఁ బొగడ నేమిటికే

రేకు: 0393-4 గుజ్జరి సంపుటం: 11-556

పల్లవి: ఆలుక గాదు నీతో నన్నిటా మన్ననదాన
చలపట్టి యందరితో సరి సేయ కిఁకను

చ. 1: చిత్తము నొవ్వకుమీ చెప్పే నే నొకమాట
హత్తిమంచ మెక్కు మన కంతే చాలు
యిత్తల నీ కూడిగాలు యెన్ని యైనఁ జేసేఁ గాని
పొత్తుల యెంగిలితోడి బోగము సయించదు

చ. 2: ఆనలు వెట్టకుమీ అడిగే నే కొకయీవి
పూని నాతోడ నవ్వకు పొందులే చాలు
కానిమ్మని నీవద్ద నేఁ గాచుకుండే నేపొద్దు
సానఁ బట్టేసరసాలు చవి గాదు నాకును

చ. 3: చేతుల మొక్కకుమీ సేసేఁ గాని నీమాఁట
రాతిరి నన్నుఁ గూడినరతులే చాలు
యీతల శ్రీవెంకటేశ యిప్పుడు నన్నుఁ గూడితి
కాతరాన నీతోడఁ గపట మెరఁగనూ

రేకు: 0393-5 రామక్రియ సంపుటం: 11-557

పల్లవి: నే మెటుల నుండినాను నీ కేమి
వేమరు మామీఁది ద్రిష్టి విడువవు నీవు

చ. 1: సెలవి నే నగితేను చేరి య దేమిటి కంటా
నలరి చెప్పు మనుచు నాన వెట్టేవూ
తలఁకేవు నీ వ దేమి తప్పు నీవల్లఁ గలదా
తెలుసుకో నీకు నీకే తేటతెల్ల మిఁకను

చ. 2: ముక్కుపై వే లిడుకొంటే ముంచి యేపని కనుచు
గుక్కక తెలుపు మని కొంగు వట్టేవు
మక్కువ నీవల్ల ననుమాన మైనఁ గలదా
చక్క నీవే దిద్దుకొమ్ము చల మేల యిఁకను

చ. 3: తప్పక నేఁ జూచితేను తమకించితి ననుచు
కప్పి కప్పి నన్ను నట్టె కాఁగిలించేవు
యిప్పుడె శ్రీవెంకటేశ యెనసితి విటు నన్ను
అప్పటి కిప్పుడు నీవే అందము సేసుకొమ్మి

రేకు: 0393-6 వరాళి సంపుటం: 11-558

పల్లవి: చేతికి లో నైనవారిఁ జెతురా పగవా రైన
కాతరాన నీవే కళవళించితివి

చ. 1: యెట్టకేలకును నిన్ను యింటికిఁ బిలచుకొంటి
చుట్టము నయినదాన సూడు వట్టేనా
యిట్టె నీ కెవ్వతె చెప్పె యింతసేతుఁ జేయ నని
నెట్టన నాగుణ మెల్ల నీ వెరఁగవా

చ. 2: చెక్కు నొక్కి చేత మొక్కి సేవ లిన్నియునుఁ జేసె
మొక్కలాన నింక నిన్ను మోస వుచ్చేనా
యెక్కడిబుద్ధి దలఁచి తేల సిగ్గు వడ నీకు
యిక్కువ నీ వా సంది యిటువంటిదా

చ. 3: మాఁగినమోమి యిచ్చి మంతానలు నీతో నాడి
కాఁగిట నిన్నుఁ గూడి ఘాత సేసేనా
యేఁగివచ్చి శ్రీవెంకటేశ నన్నుఁ గూడితివి
నాఁగువారె వలపులు నమ్మి కియ్య వలెనా

రేకు: 0394-1 గుండక్రియ సంపుటం: 11-559

పల్లవి: నీవే మంచివాఁడ వయ్యా నేనే వీరిడిఁ గాని
భావించి నామంకు నేనే పాపఁగల నింకను

చ. 1: సారె సారె నిన్ను దూరి సణఁగులే యాడితిని
భారపు నీసతులకుఁ బగ యైతిని
యీరీతి నిన్నుఁ జేసి యేఁటిజన్మ మెత్తితినో
తేరకొన నన్ను నేనే తిట్టుకొంటి నిందుకు

చ. 2: కపటాన నీమీఁద గబ్బిచూపు చూచితిని
కపురుల నీమనసు గలఁచితిని
యిపు డిందు కొడిగట్టి యెందుకు మంచిదాననో
వుపమించి నాకు నాకే వుస్సు రంటి నేను

చ. 3: ఱట్టుగఁ నిన్నుఁ గూడి యుఱక యలయించితిని
కట్టఁగడ నిన్నుఁ దిరుగ నీనైతిని
యిట్టినన్ను శ్రీవెంకటేశ నేఁడు గూడితివి
నట్టనడమ నిందుకే నవ్వుకొంటి నేనూ

రేకు: 0394-2 కేదారగౌళ సంపుటం: 11-560

పల్లవి: విచ్చనవి డాయ నేఁడు వెర పేల యిఁక నీకు
నిచ్చల మాయమనసు నే మే మనే మయ్యా

చ. 1: కన్నుల మొక్కితిమీ కాఁకలఁ జిక్కితిమీ
సన్నలు మాతో నింకాఁ జాలదా అయ్యా
వెన్నెలలే యెండ లాయ వేగే యిది వొ ద్దాయ
నిన్నుఁ గాక వచ్చె నిట్టె నే మే మనే మయ్యా

చ. 2: యిచ్చక మాడితిమీ యింతగా నోడితిమీ
మచ్చిక లింకా మాతో మానవా అయ్యా
రచ్చలో నిన్నుఁ గంటిమి రాతిరే వింటిమి మాట
నెచ్చెలిచేఁ జెప్పెంపేవు నే మే మనే మయ్యా

చ. 3: కుందువ తెరిగితిమీ కాఁగిటఁ గరఁగితిమీ
సందడి నవ్వేవు మాతో చలమా అయ్యా
యిందుకె శ్రీవెంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నింద లెల్లాఁ బాసె నిన్ను నే మే మనే మయ్యా

రేకు: 0394-3 ముఖారి సంపుటం: 11-561

పల్లవి: ఒద్ద నున్నదాన నేను వొక్కటి గాఁ దాడవా
దిద్దుకోఁ గలమా ట్టెల్ల తేరుచుకొ మ్మనవే

చ. 1: తన మేలే కలితేను తాపముఁ బాసేఁ గాక
ఘనుఁడు నిన్నే లంపె యిక్కడికి నేఁడు
మనసుతో నున్నదాన మారుమాట లాడేనా
మనుపటివారి బాస ముగియించు మనవే

చ. 2: యేకత మైనవేళ యిట్టె నే వచ్చేఁ గాక
యీకడ మాయింటికిఁ దా నేల వచ్చీనే
చేకొలఁదిదాన నేను చిత్తము నొప్పించేనా
పై కొన్న వారి పొందులపని దీర్చు మనవే

చ. 3: నే వెట్టినట్టిదాన సేవలు సేసేఁ గాక
ఆస నేల వేఁడుకోనీ నప్పటిఁ దానూ
వేసరక నన్నును శ్రీవెంకటేశ్వరుఁడు గూడె
రాసి కెక్కె నీవలపు రవ్వ మాను మనవే

రేకు: 0394-4 ఆహిరి సంపుటం: 11-562

పల్లవి: నాతో నూరకే నీవు నవ్వేవు గాక
రాతిరి నీమాఁట వూరక పోవ నిచ్చేవా

చ. 1: కొంకక నీవును నేనుఁ గూడి యున్న రతివేళ
బింకము లాడుచు నట్టె పెనఁగితివి
అంకెల నాకుచములు అంతవేఁగు లని నీవు
జంకెనతో ములిగేవు సత్తు వెల్లా నిట్టిదా

చ. 2: మంచముపై నిద్దరము మంతన మున్నంతపడి
కంచువలె వాఁగెను నీ గబ్బికుత్తికె
కొంచపు నామాట లివి కొండలనెల లనుచు
యించుకలో భ్రమసేవు యిట్టిదా నీవోరుపు

చ. 3: మోవి మోవిఁ గూడి తేనె ముసరి యానినఁదాకా
నీవు నే న నెరఁగవు నిండఁ జొక్కుచు
శ్రీవెంకటేశుఁడు గోరఁ జెనకితేఁ దెలిసేవు
యీవల నీతో కూటము లిటుంటివా

రేకు: 0394-5 సామంతం సంపుటం: 11-563

పల్లవి: అటువంటివాఁడవా అద్దో నీవు
నటన మొకమోటాలు నడుపేవు గాకా

చ. 1: తలఁపులోపల నీకు తగులు గలిగితేను
అలరి రా కుండుదువా అక్కడ నీవు
చలముల నెవ్వతో జాగులఁ బెట్టుక నిన్ను
వెలి లోను మఱపించి వెట్టిఁ జేసెఁ గాకా

చ. 2: కడుఁ దమకము నీకుఁ గమ్మి పెరరేఁచితేను
అడరి నాతో మాట లాడ కుందువా
వడి నెవ్వతో నిన్ను వాకట్టు గట్టుక యింత
ముడి వెట్టి విడిచి తా మొప్పెఁ జేసెఁ గాకా

చ. 3: తటుకన నన్నుఁ గూడేదయ నీకు లే కుండితే
ఘటన నెదురుకొని కాఁగిలింతువా
యిటువలె శ్రీవెంకటేశ కడపలోన
సటల కెవ్వతో నిన్ను చండి సేసెఁ గాకా

రేకు: 0394-6 సామంతం సంపుటం: 11-564

పల్లవి: సరవు లెరఁగ మయ్య చాలు నింత కోపము
కరగించి సొలసితే గర్వ మనేవూ

చ. 1: కందువలుగా నీకుఁ గతలు నేఁ జెప్పఁ గాను
అంది నీమీఁద బెట్టుక అట్టె నవ్వేవు
యిందు రమ్మనుచు నిన్ను నింటికిఁ బిలచుకొంటే
యెందో పో నియ్య ననుచు నెమ్మె చూపేవూ

చ. 2: వద్ద నుండి సతులను వారి వీరిఁ జూపితేను
అద్దో నింద లాడె నంటా నాన వెట్టేవు
తిద్దుకో కస్తూరిబొట్టు తెర దిగ వేయు మంటే
గద్దించి యట్టె నన్నుఁ గాఁగిలించేవూ

చ. 3: పూస గుచ్చినట్టు నీకు బుద్దులు నేఁ జెప్పితేను
ఆసతో నామోవి మోవి నందుకొనేవు
వానితో శ్రీవెంకటేశ వడి నన్నుఁ గూడితివి
రాసి కెక్కితి వంటేను రతికిఁ దీసేవూ

రేకు: 0395-1 శుద్ధవసంతం సంపుటం: 11-565

పల్లవి: ఎంతవాఁడ వైన నిన్ను నింత సేసితి
యింతిని నాయపరాదా లెట్టోరిచే వయ్యా

చ. 1: చేర రమ్మంటే రా నైతి చెక్కులు చేత గిల్లితి
గారవించఁగా నిన్ను గసరితిని
కూరిమి గొసరఁగాను కోపాన జంకించితిని
యీరీతి నాయపరాధా లె ట్టోరిచే వయ్యా

చ. 2: మనసు నొప్పించితిని మాట లెల్లా నాడితిని
చెనకఁగా వద్దని పైఁ జేయి వేసితి
పెనఁగితి నీతోడఁ బ్రేమము రెట్టించఁగాను
యెనసి నాయపరాదా లె ట్టోరిచే వయ్యా

చ. 3: కందువులు నీ వంటఁగా గాఁగిలించితి సిగ్గున
విందుల నీరతులకు వేసరుకొంటి
అందుకొని శ్రీవెంకటాధిప నిన్నుఁ గూడితి
నిందు నాయపరాదా లె ట్టోరిచే వయ్యా

రేకు: 0395-2 సామంతం సంపుటం: 11-566

పల్లవి: విన్నప మొక్కటే నీకు వేవేలకు
మన్నించక నీకుఁ బోదు మామనసు నీది

చ. 1: చేరి మొక్కే వారమూ సేవ సేసేవారమూ
యేరితి మాట లాడినా నే మాయ నీకు
నేరనివారు దిట్టితే నీకుఁ బోదు బుద్ధి చెప్ప
భారము నీదే సు మ్మయ్యా పడఁతినే నీకు

చ. 2: నీతోడివారమా నీసరివారమా నేము
యీతల నేఁ గైకొన్న నే మాయ నీకు
కాతరాన నే రా కున్నఁ గదియక నీకుఁ బోదు
నాతప్పులు నీవి సుమ్మీ నాపతిని నీవూ

చ. 3: కాంతుఁడ శ్రీవెంకటేశ కాఁగిటిలోని వారమూ
యెంత నిన్ను జంకించినా నే మాయ నీకు
అంతరంగ మైనవారి నాదరించ కిఁకఁ బోదు
పంతము నీది సుమ్మీ బడిదాన నేను

రేకు: 0395-3 సామంతం సంపుటం: 11-567

పల్లవి: ఇయ్యకో లయినమీఁద నిఁక నేలా
నెయ్యము లాతఁడు నాపై నెరపీఁ జూడరే

చ. 1: యెన్నినేరా లైనఁ గానీ యెక్కడ నైనా నుండనీ
వన్నెగా నేర మ్మంటే వచ్చెఁగా తాను
మన్ననలు నా కిచ్చె మాఁటలూ నాచేత వినె
మున్నిటి సుద్దులిం కేమీ ముదులకించకురే

చ. 2: యెం దైనా సన్న సేయనీ యెవ్వ తైనాఁ గూడనీ
యిందు నాపై నాన వెట్టె నిప్పుడే తానూ
అంది నాపైఁ జేయి వేసే నంతరగ మెల్లఁ జెప్పె
నింద లాడేమాట లెల్ల నిలువఁ బెట్టకురే

చ. 3: మన సెట్టైనై నుండనీ మంతనాలె యాడనీ
కొన కెక్కె నను నేఁడు గూడెఁగా తాను
యెనసెను శ్రీవెంకటేశ్వరుఁ డీతమితోడ
నను పైతి మిద్దరము నవ్వులు నవ్వకురే

రేకు: 0395-4 శుద్ధవసంతం సంపుటం: 11-568

పల్లవి: చెల్లఁబో నామన సింక సిగ్గు వడదు
పల్లదాన నీకు నేల భ్రమసితినో

చ. 1: అడరి నీవు మొక్కఁగా నాపె నిన్నుఁ దిట్టఁ గాను
నడుమ నూరకే నాకు నవ్వు వచ్చెను
వడిఁ జనవు గలట్టివారు ని న్నేమి చేసినా
తడవి నీపై నా కేల దయ వుట్టెనో

చ. 2: చెఱఁగు నీవు ముట్టఁగ చేతు లాపె దొబ్బఁ గాను
కఱకుఁ బెంజెమటలు గారీ నాకు
గుఱి యైనవారు నీతో గొడవలు వెట్టుకుంటే
అఱిమఱి నే నేల అడ్డము వచ్చితినో

చ. 3: కాని మ్మని యాపె రాఁగా కాఁగిట నీవు నించఁగా
తానక మై నావలపు తల కెక్కెను
దీనికె కా నన్నుఁ గూడితిని శ్రీవెంటటేశుఁడ
కానీ లే నీ కెంత నేను కైవస మయితినో

రేకు: 0395-5 శంకరాభరణం సంపుటం: 11-569

పల్లవి: ఏమియుఁ గొలుప వింక నేఁటి మాటలూ
యీమన సెల్లఁ గంటిమి యిఁక నేటి మాటలు

చ. 1: వున్నతి నీ హరములు వొకతెమెడ నుండఁగ
నెన్నుకొంటి విందాఁక నేటి మాటలు
నిన్ను సతు లెల్లాను నేరము లెంచే దెల్లా
నిన్నిటాను సరి వచ్చె నిఁక నేటి మాటలు

చ. 2: మేలిమి వింతవాసన మేన నీవు నించుకొని
యేల న న్నొడఁబరచే వేఁటి మాఁటలు
పాలించి యాపెకు నీవు బాస లెల్ల నిచ్చి వచ్చి
యీలీల ముచ్చట లాడే విఁక నేఁటి మాఁటలు

చ. 3: నవ్వుతా నొకతెతోడ నంటు సేసితి విందాఁక
యివ్వల నన్నుఁ బిలిచే వేఁటి మాటలు
రవ్వగా శ్రీవెంకటేశ రతి నన్నుఁ గూడితివి
యెవ్వతెతోడుత నీకు నిఁక నేఁటి మాటలు

రేకు: 0395-6 హిందోళం సంపుటం: 11-570

పల్లవి: కామిన యప్పటినుండి కాచు కున్నది
యీా మోహ మోటఁగ కున్న నెగ్గు వట్టుఁ జుమ్మీ

చ. 1: చక్కఁ జూడ రాదా సతి నిన్నుఁ జూడఁ గాను
యెక్కడో పరా కై యేమి సేసేవు
మొక్కి నాపెవిద మెంత ముంచి నీరాజస మెంత
తక్కు లిఁక మాన కున్న తమకించుఁ జుమ్మీ

చ. 2: మాట లాడ రాదా మగువ నిలుచుండఁగ
నేఁటికి నీకుచ్చితము లేల చూపేవు
మేఁటి యాపెప్రియ మేడ మించిన ఈ బలు మేడ
నీటుతో మన్నింప కున్న నేరమి యౌ జుమ్మీ

చ. 3: చిత్తగించ రాదా చెలి వద్దఁ గూచుండఁగ
యెత్తిన నీ యెమ్మె లింక నేల మానవూ
పొత్తుల శ్రీవెంకటేశ పొందితి వీపె నింతట
హత్తి యిట్టె వుండ కున్న నాఁడి యౌఁ జుమ్మీ

రేకు: 0396-1 లలిత సంపుటం: 11-571

పల్లవి: ఏ మయ్యు రమణుఁడ యెంత సేసేవూ
భామ నిన్నుఁ దలపోసీఁ బైకొనుదాఁకాను

చ. 1: చింతలచిగురు గోసీఁ జిత్తములోనఁ
గాంతుఁడ ని న్నెదుటనుఁ గన్నదాఁకాను
పొంతఁ బ్రియములఁ జేసీ బోనాలు
సంతతపు వలపుల చవి గొనుదాఁకాను

చ. 2: వెదచల్లీఁ జీఁకటులు వేసలివెంట
అదె నీవిరహతాప మాఁపఁగ లేక
తుదుచూపులనె కట్టె దోరణాలు
వదలక నీ వింటికి వచ్చినదాఁకానూ

చ. 3: ముగ్గులు వెట్టీఁ జెమటుమత్తెములను
అగ్గ మై నీవు తనుఁ బెం డ్లాడుదాఁకాను
సిగ్గుదేరఁ గూడితివి శ్రీవెంకటేశ
అగ్గల మై నీకు మొక్కె నట్టె యిందాఁకానూ

రేకు: 0396-2 సామంతం సంపుటం: 11-572

పల్లవి: రాజసపుదాన నంటా రవ్వ సేసేరు గకన
వోజ నా కిటువంటిదె వూహించుకొనరే

చ. 1: వొలిసీ నొల్లమితోడ వూరకె తా నుండఁ గాను
బలిమి సేసీ పెనఁగఁ బాడి యౌనా
పిలిచినప్పుడు మరి ప్రియముతో వచ్చేఁ గాని
తలఁగి లోననే వుండేఁ దతి యెరిఁ గుండరే

చ. 2: పంతము ముంగిట వేసి పరాకుతో నుండఁ గాను
పొంతఁ జేసన్నలు చూప బుద్ది వుట్టునా
చింతతోఁ గావలె నంటే చెప్పినట్టు సేసేఁ గాని
మంతనానఁ బండి వుండేమన సెరిఁ గుండరే

చ. 3: బయలు మెరసి తానె పైకొని న న్నుంటఁ గాను
నయ మిచ్చి కూడ కున్న నాయమా నాకూ
క్రియతో శ్రీవెంకటాద్రిగిరి నితఁడె కూడె
దయ తనపాటి నాకు తగ వెరిఁ గుండరే

రేకు: 0396-3 శుద్ధవసంతం సంపుటం: 11-573

పల్లవి: పలుకవే చెలియా పంత మెచ్చెనే
చలి వాసి నీవలపు చవు లెక్కెనే

చ. 1: నీ వెంత గోపగించి నేరుపుతోఁ దిట్టి నాను
వావిరి నిండా నవ్వు వచ్చినె నాకు
కావిరితో నీ వెంత కాఁకా దేరఁ జూచినాను
మూవంకఁ దమకమే ముంచీ నాకు

చ. 2: పూఁచి పట్టి నీ వెంత బొమ్మల జంగించినాను
చాఁచి మందెమేళములు జూజుకొనీనే
రేఁచి నీవు నన్నుఁ గడు రేసు లెంత పుట్టించినా
తూఁచినట్టు కళ లెల్లా తుద ముట్టెనే

చ. 3: కాతరించి నీ వెంత కాఁగిట బిగించినాను
యీతల నా కంత కంత కింపు పుట్టెనే
యేతులకు శ్రీవెంకటేశుఁడ కని కూడితి
నీతలఁపు నావలెనె నేర్పున రూ పాయనే

రేకు: 0396-4 శంకరాభరణం సంపుటం: 11-574

పల్లవి: ఏమి గంటివి నావల్ల నిట్టె కాచుక తిరిగి
ఆమీఁదఁ గదా నిన్ను నట్టె మరిగితిని

చ. 1: వుపచిరించ నేరక వూర కున్న నాపై నొక్క
నెపానఁ బాదాలు చాఁచి నీవే మెచ్చేవు
యెపుడూ సరస మాడ నెరఁగని ననుఁ దెచ్చి
వుపమల నాచేయి నీవొళ్లిపై వేసేవు

చ. 2: దవ్వుల నే నూర కున్న దగ్గరఁ బిలిచి నీవే
నవ్వులు నవ్వి ననుపు నటియించేవు
జవ్వనపు సిగ్గుతోడ సరిఁ దల వంచుకొంటే
చివ్వన నామొగ మెత్తి చెక్కు నొక్కేవూ

చ. 3: మాట లాడ కుండితేను మంతనము గడియించి
నీటున మందెమేళాలు నీవే సేసేవూ
గాఁటపు శ్రీవెంకటేశ గక్కనఁ గూడితి నంటా
మాటికి మాటికి నన్ను మన్నించేవూ

రేకు: 0396-5 సాళంగం సంపుటం: 11-575

పల్లవి: కొమ్మలాల అమ్మలాల గోవిందరాజు మీపాల
నిమ్ములఁ జి క్కున్నే వాఁడు యిక నే మమ్మా

చ. 1: పరపుమీఁద నూరక పవళించుండుట గాని
నిరతి మీవిభునికి నిద్దుర లేదు
పరగ మీ రిద్దరును పాదములు పిసుకఁగ
సురతమర్మపుఁ గాఁకఁ జొక్కీ నదే

చ. 2: వున్నతితోఁ గొలు విచ్చి వుండుట యింతే కాని
కన్నులచూపు మీపైనే కదరమ్మా
మన్ననసతులు మీకు మాట లిట్టె యాడఁ గాను
విన్నవినకుల మెచ్చి విఱ్ఱవీఁగీ నదివో

చ. 3: పూఁచి భుజములు మూఁడ్డై పొరలి వుండుట గాని
చాఁచినకరము మీకే సన్న సేసీని
ఆఁచి శ్రీవెంకటగిరి నదె తిరుపతిలోన
రేంచినమోహన గూడె రేయిం బగ లదివో

రేకు: 0396-6 రామక్రియ సంపుటం: 11-576

పల్లవి: ఇంత వెల్లవిరి గద్దా ఇంతుల వలపు లెల్లా
కాంతునికి నొప్పగించి కాకు సేసేవూ

చ. 1: అందుపుఁజెక్కులతోడి యలమేలుమంగ నీ
వంది కైలా గియ్యవయ్యా ఆతినికిని
కందువ కన్నులఁ జూచె కరఁగి వుందానవు
యిందుకే యీతఁడు నవ్వీ నిది గదవమ్మా

చ. 2: బంగారువన్నెలతోడిపడఁతి
సంగతి నీపతికొప్పు చక్కఁ బెట్టవో
ముంగిట నాతఁ డుంటెనె మురిసేవూ
చెంగట నాతఁ డేసుద్ది చెప్పీఁ జెలులకూ

చ. 3: కప్పురపువాసనకలికి
యిప్పుడె శ్రీవెంకటేశు నెనసితివి
తప్పక చూచి మఱియుఁ దమకించేవూ ఆతఁ
డప్పటి నిందుకు లో నాయఁ గదవమ్మా

రేకు: 0397-1 దేసాళం సంపుటం: 11-577

పల్లవి: వెఱవకు నిన్ను నంత వేసరించను
నెఱి నీగుణములు నే నెఱఁగనా

చ. 1: చనవు సేసుక నే నీసరుసఁ గూచుంటిఁ గాక
ననుపు చెప్పుక నీతో నవ్వ వచ్చేనా
వెనకటివాఁడవా నీవిధము నే నెఱఁగనా
చెనిక నీతో నేరమి సేసుకొనేనా

చ. 2: కపట మెఱఁగనా కతలు చెప్పితిఁ గాక
నెపమున వావులు నే నీకుఁ జెప్పేనా
కపురుమొకదాకిరి గడించ నీకు వచ్చునా
యిపు డిట్టె నీకు దా యెస పెట్టేనా

చ. 3: కైవసము గాఁగా నిన్నుఁ గాఁగిట నించితిఁ గాక
భావ మెఱఁగక నిన్నుఁ బైకొనేనా
శ్రీవెంకటేశుఁడ నే మెచ్చి తలమేలుమంగను
నీవే నే నని కాక నీక మొక్కేనా

రేకు: 0397-2 కాంబోది సంపుటం: 11-578

పల్లవి: ఇట్టె వీడె మందుకోవు యెందాఁకాను
పట్టపగలే వచ్చితి పరా కేఁటి కోయి

చ. 1: కంటికి నిద్దుర రాక కాచుకుందాన నీరాక
యింటికి రా వే మోయి యెందాఁకనూ
జంట లైనసతులతో జాణతనా లాడఁ బట్టె
వెంటనే తిరుగ కనువేళ గాన నోయీ

చ. 2: నెయ్యమున విందు చెప్పి నే నీకు మొక్కఁగాను
యియ్యకొన వే మోయి యెందాఁకనూ
యియ్యెడ నందరితో నీ కేకతా లాడనే పట్టె
అయ్యో నిన్ను నిష్ఠూరము లాడ నేర నోయీ

చ. 3: కంకి నేసి రతులను కాఁగిటఁ గూడితి నిన్ను
యింకాఁ దనియ వే మోయి యెందాఁకను
అంకెల శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
సంకె లేదు వురుముపై సత మైతి నోయి

రేకు: 0397-3 మాళవి సంపుటం: 11-579

పల్లవి: పో పో నీపొందు చాలు పొసగ దిఁక
వైపు గా దనుచు నాతో వడిఁ బోరాడేనా

చ. 1: అప్పుడే ఆపెమాఁటకు నదలించ వలదా
విప్పుచు నన్నుఁ దిట్టఁగా విందురా నీవు
చెప్ప నేల నీతోడిచెలి మేఁటి చెలిమి
ముప్పిరి చుట్టమ వంటా మొగము చూచేదా

చ. 2: మచ్చరాన నవ్వఁ గాను మానుపంగ వలదా
వొచ్చాన నావేళ నా పెవొద్ద నుందురా
యిచ్చకాన నీకు నాకు నేఁటి మొగమోట మింక
వచ్చినదే పదివేలు వాదులాటే చాలును

చ. 3: పొత్తునఁ గూచుండితేను పొ మ్మనంగ వలదా
అత్తల సరి నేతురా ఆపెను నన్ను
అత్తిన శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
బత్తితో నన్నుఁ గూడితి పంత మేఁటి పంతమూ

రేకు: 0397-4 కన్నడగౌళ సంపుటం: 11-580

పల్లవి: ఎట్టు సేసినా నీచిత్త మింతే కాక
తట్టి నిన్ను వెగ్గళించఁ దగునా మాకును

చ. 1: మంతన మాకెతో నాడి మరి నన్నుఁ గని లేచి
చెంత నా కిచ్చక మాడి చెక్కు నొక్కేవు
యింతటి మగవాఁడవు యేల నీ కింత వెఱపు
కాంతలము యేమి సేయఁ గల మయ్య నిన్నును

చ. 2: యిద్దరూఁ గూ డుండఁగాఁ జూ చిట్టె నేఁ దిరిగి రాఁగా
గద్దించి నాకొంగు వట్టి గడె వెట్టేవు
వుద్దండీఁడవు మాతోడ నూర కనుచర ణేల
అద్దో వూడిగపువార మవుఁ గా దనేమా

చ. 3: యిట్టె యాచెలియఁ గూడి యే మైనాఁ జేసుకొమ్మని
వొట్టుక నాపైఁ దెచ్చి వొళ్లు వేసేవు
నెట్టన శ్రీవెంకటేశ నే నలమేల్మంగను
అట్టడి నిన్నుఁ గూడి యాఱడికి నోపుదుమా

రేకు: 0397-5 రామక్రియ సంపుటం: 11-581

పల్లవి: వేళ గానివేళ వచ్చి వెదకేవు
యేలినరమణునితో నింత రట్టు గలదా

చ. 1: యేచిన నీనాయకుఁడు యింట నున్నాఁ డంటావచ్చి
చూచేవు నలుదిక్కులు సోదించి
యీచాయ నుండె నాతఁడు యిట్టె పిలుచుక వచ్చేఁ
గూచుండవమ్మా నీవు కోపగించుకొనకా

చ. 2: వొద్ద నెవ్వతెఁ బెట్టుక వున్నాఁడో యనుచు
నద్దమరేతిరి పొంచు లాలకించేవు
నిద్దురతో నెం దున్నాఁడో నే నతనిఁ దోడితెంచే
వద్దు వీడె మిందవమ్మ వట్టిచల మేఁటికి

చ. 3: మామాట వినక నీవు మాడుపుటింటిలో చొచ్చి
కామించి శ్రీవెంకటేశుఁగని కూడితి
యే మమ్మ అలమేల్ మంగ యింటికే యీతనిఁ దెచ్చే
ప్రేమాన నా వెంట రావో పెనఁగించుకొనకా

రేకు: 0397-6 రామక్రియ సంపుటం: 11-582

పల్లవి: ఆతని మంచితనము అట్టె నా మంకుఁదనము
ఘాతల నే నెంచుకొంటేఁ గరఁగీ నామనసు

చ. 1: యింటివాకిటఁ దా నుండి యిట్టె నన్నుఁ బిలువఁగ
అంటఁ గాక వున్నదాన ననిపించితి
బంటువలెఁ దా వాకిటఁ బవళించి వుండఁగాను
మంటమారితనమున మాటలాడ నైతిని

చ. 2: పానుపుమీఁదికి వచ్చి పైఁ జేయి వేసితేను
ఆన వెట్టి నిద్ర వచ్చీ నని తోసితి
దానికిఁ గోపించుకోక తతి గాచు కుండఁగాను
లేనగవుతోఁ గొంత లేచి మొక్క నైతిని

చ. 3: బలిమి శ్రీవెంకటాద్రిపతి నన్నుఁ గూడఁ గాను
మెలుపున నాచేయి మీఁదు సేసితి
అలమేలుమంగ నేను ఆతఁడే నన్ను మెచ్చఁగా
కిలకిల నవ్వుకొంటా కిన్నెర మీఁటితిని

రేకు: 0398-1 లలిత సంపుటం: 11-583

పల్లవి: మానవు నీవోజ లింకా మా కేల యింత
కానీలే మగవాఁడవు కాకు సేసేవా

చ. 1: వాసికి నీమీఁద నేను వలపు చల్లితిఁ గాక
యీసుల యెగసక్యాన కింత నవ్వేనా
చేసిన నీచేఁతలు సిర సూఁచుకొంటిఁ గాక
పాసినతమకానకుఁ బగ చాటేనా

చ. 2: యిచ్చగించి నీపైఁ జేయి యిట్టె నే వేసితిఁ గాక
చొచ్చి నీమేనిగురుతు చొప్పు లెత్తేనా
మెచ్చి నీ వీపనులకు మేఁటి వని యుంటిఁ గాక
విచ్చనివిడిగా నిన్ను వెంగె మాడేనా

చ. 3: కందువకు నీవు రాఁగాఁ గాఁగిట నించితిఁ గాక
అంది నిన్ను బలిమి సేయఁగ వచ్చేవా
అందపు శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
విందువలెఁ గూడితివి వేసరించేనా

రేకు: 0398-2 హిజ్జిజి సంపుటం: 11-584

పల్లవి: బోన మెల్లా జల్ల నారి పొద్దు వోయను
పూని నేము నీ కిట్టె బుద్ది చెప్ప వలెనా

చ. 1: పొత్తుకు నీవు రమ్మంటేఁ బొలఁతి దా సిగ్గువడి
చిత్తములోఁ గొంకి కొంకి చెక్కు చేఁ బెట్టి
హత్తి యాపెకు నీ మీఁద నాన లేల పెట్టేవు
బత్తి గలితేఁ జేయి వట్టి తియ్య రాదా

చ. 2: కడి సేసి చేతి కియ్యఁగా నింతి నవ్వుకొంటా
చిడుముడి మారుమోము సేసుకొని
అడరి రా దాయ నంటా నాపెతో నలుక లేల
కడు నీకు వేడు కైతే కమ్మి మొక్క రాదా

చ. 3: సతిఁ గాఁగిలించి పట్టి చవులు నోటి కియ్యఁగ
రతి బువ్వ మారగించి రమణి మెచ్చె
యిత వై శ్రీవెంకటేశ యీ యలమేలుమంగను
మతకానఁ గూడితివి మరి వేళ లేదా

రేకు: 0398-3 లలిత సంపుటం: 11-585

పల్లవి: ఎంత మొగ మోడి యున్నా నెఱఁగవు నీయంత
పొంతనె నా కిఁక నీవు బుద్ది చెప్ప వలెనా

చ. 1: మనసు నొవ్వదు గదా మాటలాడే నీతోను
విను నిజ మాడెటి వెఱ్ఱిదానను
తనివోక వాడవారిఁ దమకాలు రేఁచి వచ్చి
యెనసి నాతో నవ్వేవు యేది నిజ మయ్యా

చ. 2: సిగ్గు వడవు గదా చెలులఁ దారుకాణించే
కగ్గి కల్ల కోరువనిగబ్బిదానను
వెగ్గళించి వీరి వారి వెంటనె పెట్టుక వచ్చి
అగ్గ మైనవాఁడ నంటా నాన వెట్టే వయ్యా

చ. 3: నెలవి నవ్వవు గదా చేతిలోనే వాసి చూపే
వలచి యెగ్గెంచని భావపుదాననూ
కొలఁది మీఱఁగ నన్నుఁ గూడితి శ్రీవెంకటేశ
అలమేలుమంగను నే నట్టె కావవయ్యా

రేకు: 0398-4 సారంగనాట సంపుటం: 11-586

పల్లవి: ఎటువంటి చుట్టమే నా కెంత కలసినవాఁడే
సటలు సేసి వీని చంద మేమి చందమే

చ. 1: అలుక సేసుక నేనే అవ్వలిమో మై యుండఁగ
పిలిచీ నూరక నన్నుఁ బేరుకొని
పలుక కుండఁగఁ దానె పకపక నవ్వుకొంటా
నిటుచున్నాఁ డిదె వీనినేరు పేమి నేరుపే

చ. 2: ముడిపడ్డ బొమలతో ములుగుతా నుండఁగాను
తడవీ నూరక నన్నుఁ దతి గొని
చిడుముడితో నుండగఁ జేతులు చాఁచుకొంటా
వొడివట్టి నన్నుఁ దీసీ వోరు పేఁటి వోరుపే

చ. 3: పట్టినచలముతో నేఁ బవళించి వుండఁ గాను
వొట్టుక దగ్గరి నామై వొళ్లు వేసీని
అట్టె శ్రీవెంకటపతి అలమేలుమంగ నేను
తిట్టఁగానె కూడె వీనితెగు వేఁటి తెగువే

రేకు: 0398-5 కొండమలహరి సంపుటం: 11-587

పల్లవి: మఱచినవారి నేల మఱవ నియ్యవు మమ్ము
వెఱచినవారి నేల వెఱపించ నేఁటికే

చ. 1: నీకుఁ గట్టినట్టితాళి నీమారు సేసుకొని
యేకచిత్తమున నే నింట నుండఁగా
పైకొని పిలిపించేవు పడఁతుల నంపి నన్ను
దీకొని మమ్మింత సేసి దిమ్ము రేఁచ వలనా

చ. 2: సేస వెట్టిన నీరూపె చిత్తములో నించుకొని
పోసరించి పొద్దు గడపుచు నుండఁగా
ఆస చూపి నీవు నాకు నప్పటి సన్న సేసేవు
వాసితో నుండినవారి వలఁ బెట్ట వలెనా

చ. 3: తప్పక చూడఁగ నీకు దగ్గరనె నిలుచుండి
దప్పులనుఁ బెడఁబాసి తని వొందఁగా
అప్పుడె శ్రీవెంకటేశ అలమేల్మంగను నన్ను
ముప్పిరిగా నిట్టె కూడి మోహించ వలెనా

రేకు: 0398-6 భవుళి సంపుటం: 11-588

పల్లవి: యోగి భోగి నటనం కురు వుల్లాసాననమోహన
సాగరోద్భవకన్యకాపతి సారస శ్రీవెంకటగిరియోగి

చ. 1: లీలా నక్షత్రజాలాధికరండ
మాలాత్త్రివిక్రమాకారయోగి
హలాహలకర కోలాహలకర
శూలాయుదవంద్య పరిపూర్ణయోగి
కాళివినుత ప్రహేళిచరితాహి
మౌళిఘనసారవిన్యస్తయోగి

చ. 2: గరుడపక్షివాహగమనవిహరి
గురునాగశైలేశ గోరక్కు రే
మురళీనాదశృంగ మోహనమురారి రే
కరుణానందసాగరశాయి రే
పరమ శ్రీవెంకటపతియవతార
నరరూపగోపకానాథ గోరక్కు రే

రేకు: 0399-1 సాళంగం సంపుటం: 11-589

పల్లవి: ఆఁడువార మే మనేము అట్టె నీ వేమి సేసినా
నేఁడు పుణ్యపాపాలు నీచేతిది గాకా

చ. 1: నగుతానె ఆపెనూ నన్నునూ వాదులు వెట్టి
పగ సాదించితిగా పంతగాఁడా
తగవులు చెప్పె నంటా దగ్గరించి మావలపు
తగిలించుకొంటివి గా తక్కరికాఁడా

చ. 2: మచ్చిక నే మాడెటిమాటలు వేలుచుకొని
కుచ్చితాలు సేసితిగా కొయ్యకాఁడా
కొచ్చి కొచ్చి నీ మీఁదఁ గోరి యాన లెల్లాఁ బెట్టి
తెచ్చితిగా నీయింటికి దిమ్మరీఁడా

చ. 3: వాసులు మాకు నెక్కించి వద్దఁ బాయకుండఁ జేసి
సేసలు వెట్టితివిగా సిగ్గరీఁడా
ఆసల శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
నాసరి నాకెఁ గూడితి నాఁటకీఁడా

రేకు: 0399-2 సామంతం సంపుటం: 11-590

పల్లవి: తరుణి నైనా నేను దయ లేనిదాననా
వెరవుతో నీ వుండఁగా వేగిరింతునా

చ. 1: మొగము చూచి నాకు మందట నిలుచుండఁగా
పొగరుముంపున నిన్నుఁ బో మ్మందునా
నిగిడి నీవొళ్లఁ దొల్లి నేర మేమి గలిగినా
పగటున నప్పు డట్టె పంగింతునా

చ. 2: మంచివానిలె నాతో మాట లిట్టె యాడఁ గాను
చంచలించి నిన్ను వద్దు చాలు నందునా
యెంచుకొని నీ వెవ్వతెయింట నుండి వచ్చినాను
మంచ మెక్కి యింక నీతో మారుకొనేనా

చ. 3: కడుఁ జుట్టమ వై నన్నుఁ గాఁగిటిలోఁ గలయఁగా
జడిసి వేడుక చెల్లించక వుందునా
అడరి శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
వడి నన్నుఁ గూడితివి వాసులు వట్టుదునా

రేకు: 0399-3 రామక్రియ సంపుటం: 11-591

పల్లవి: నిన్ను మెచ్చుకొనేవో నానేరుపు మెచ్చేవో కాని
పన్ని నీవూడిగానకు ప్రాడఁ జుమ్మీ విభుఁడ

చ. 1: చెక్కులు నీవు నొక్కఁగ చిత్తము గరఁగెఁ గాక
యెక్కువ కోప మెం తందు నిందాఁకను
తక్కరీఁడవు నౌదువు తగవరిని నౌదువు
చక్కఁ జాయకు రా నేను జాణఁ జుమ్మీ విభుఁడ

చ. 2: బాసలు నీవు సేయఁగఁ బరిణామ మాయఁ గాక
యీాసు నీపై నే మందు నిందాఁకను
ఆస చూప నెరుఁగుదు ఆదరించ నెరుఁగదు
రాసి కెక్క నీ కిచ్చకురాలఁ జుమ్మీ విభుఁడ

చ. 3: మచ్చిక నీవు గూడఁగ మరి నే లో నైతిఁ గాక
యెచ్చుకుందు లెంచుకోవా యిందాఁకను
అచ్చపు శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
తచ్చి కూడితిని మేలుదానఁ జుమ్మీ విభుఁడా

రేకు: 0399-4 కేదారగౌళ సంపుటం: 11-592

పల్లవి: ఇప్పుడే వేరిగ మేల యిందుకుఁ గాను
వొప్పగించితిమి వల పోపరో విభుఁడా

చ. 1: నయగారినీమాటలు నమ్మకుండ నెట్టు వచ్చు
రయమును నీవా రైనరమణులకు
ప్రియము నీవు చెప్పఁగ బిగియఁగ నెట్టు వచ్చు
దయ నీకుఁ గలితేను తానే వచ్చీఁ గాకా

చ. 2: నంటున నీవు నవ్వఁగ నవ్వకుండ నెట్టు వచ్చు
జంట లైన సేసపాలసతులకును
వెంట నీవుదిరుగఁగ విడువఁగ నెట్టు వచ్చు
యింటికి విచ్చేసినప్పు డెనసేము గాకా

చ. 3: చేరి కాఁగిలించుకోఁగా సిగ్గువడ నెట్టు వచ్చు
కోరి నీ కెదురు చూచేకొమ్మలకును
ఆరయ శ్రీవెంకటేశ అలమేలుమంగ నేను
యీరీతిఁ గూడఁగ నిన్ను నియ్యకొనేఁ గాకా

రేకు: 0399-5 సామంతం సంపుటం: 11-593

పల్లవి: అప్పు డెంత లే దని నీ వాన వెట్టినా నమ్మదు
ముప్పిరి నాకుఁ గా నింద మోవ నీకు నేఁటికి

చ. 1: పట్టకురా నీవు మమ్ముఁ బలుమారు నీచేతుల
వెట్ట గాఁగినది మేను విరహనను
అట్టె నెవ్వతె నైన నంటఁ బోతే నాపె మరి
వట్టిసందేహాలు నీపై వడిఁ జుట్టుఁ జమ్మీ

చ. 2: మాటలాడకురా నీ నా మనసులు గలయఁగ
గాఁటపు నామన సెల్లఁ గలఁగినది
యీటున నాకలఁక నీ కిట్టె అంటితేఁ గనక
నాటకుఁడ వ నెవ్వతె నవ్వకుండుఁ జుమ్మీ

చ. 3: చూడకురా నాచన్నులు జొబ్బిలీఁ జెమటచేత
జోడుగా శ్రీవెంకటేశ సోఁకి నిన్నును
కూడితిని నన్ను నిట్టె కోరి యలమేల్ మంగను
యెడ నెవ్వ తైన నిన్ను నిఁక నవ్వుఁ జుమ్మీ

రేకు: 0399-6 ముఖారి సంపుటం: 11-594

పల్లవి: నీ కెదురు చూచి చూచి నెలఁత నన్నంపె నిదే
రాకుండితే నాపె వచ్చీ రావయ్య నీవూ

చ. 1: అప్పుడు నీ వాన వెట్టినది నమ్మినది గాక
తప్పులు వట్ట నేర దాతరుణి నిన్ను
నెప్పున నీ విందుకుఁ గా నీవేల వెరచి రావు
చెప్పేఁ గాని యింటికి విచ్చేయవయ్యా నేఁడు

చ. 2: నీసుద్దుల కెల్ల నాపె నెట్టన నోరిచెఁ గాక
సేసే నంటే నీ వింతిచేఁతకు వేలె
పాసి యిందుకుఁ గా సిగ్గుపడి యీడఁ గొంక నేల
సేసతో మాయింటికి విచ్చేయవయ్య ఘనుఁడా

చ. 3: ముంచి యలమేలుమంగ మొకమోడి కూడెఁ గాక
వంచే నంటే నాపె నీతో వాదు వెట్టదా
యెంచుక శ్రీవెంకటేశ యిందుకుఁ గా నవ్వ వేల
చించితి మాట యింకా విచ్చేయవయ్య యింటికి

రేకు: 0400-1 భూపాలం సంపుటం: 11-595

పల్లవి: అంతయను నిన్నుఁ బొందేయందుకొరకే
వింత సేసుక యిందుకు విసిగేవు సుమ్మీ

చ. 1: అంకెకు రానివేళ నాడుదు మే మైన నిన్ను
పొంకము వచ్చినవేళ పొగడుదుము
సంకె లేని మావంటి సతులకు నిది వోజ
పంకించి నీ విందు కెగ్గు పట్టేవు సుమ్మీ

చ. 2: బగి వాసి వున్న వేళ పగ చాటుదుము నిన్ను
మొగము చూచితేనె మొక్కుదుము
యెగసక్కేలె మావంటి యింతులకు సహజము
అగ డైతి నని నీవు అలిగేవు సుమ్మీ

చ. 3: తక్కించినప్పటివేళ తరిఁ జలపట్టుదము
గక్కనఁ గూడితేనె కరఁగుదుము
దక్కితి శ్రీవెంకటేశ తతి నలవేల్మంగను
వొక్క టైతి విది నాకు వొడఁబాటే సుమ్మీ

రేకు: 0400-2 దేసాక్షి సంపుటం: 11-596

పల్లవి: ఇంక నెన్నఁ డమ్మ నీ యెన్నిక జాణతనము
జంకించి మాటాడకున్న సతులఁ గైకొందురా

చ. 1: సూటిగా నిన్నుఁ దప్పక చూచీ నాతఁడు
వాఁటముగఁ దల యెత్తి వంచుకొంటాను
చీటికి మాటికిఁ దానె సెలసి సెలసి నవ్వీ
నాఁటదాన వాతనితో నౌఁ గా దనకుందురా

చ. 2: వేమరుఁ జేయి చాఁచి వేఁడుకొనీ నాతఁడు
సోమరించి దారిమొనాఁ జూపి చూపి
నేమములుఁ బచరించి నెలఁత లంటేఁ జెనకీ
చే ముంచి యాతని నీవు చిమ్మిరేఁచ కుందురా

చ. 3: సిగ్గు విడిచి కూడెను శ్రీవెంకటేశుఁడు
వొగ్గి తల రాయి సేసు కూర కైనాను
నిగ్గుల నలమేల్మంగ ని న్నతఁడు గలసెను
వెగ్గళించి నీవలపు వెదచల్ల కుందురా

రేకు: 0400-3 రామక్రియ సంపుటం: 11-597

పల్లవి: ఇంట నున్నవారము నే మెందు వొయ్యేము
దంటల మై నిన్ను నేము తప్పు వట్టెమా

చ. 1: నివ్వటిల్ల నీకన్నుల నిద్దుర దొట్టి వున్నది
పవ్వళించ రాదా పానుపుమీఁద
చివ్వన న న్నేల నీవు చేయి వట్టి తీసేవు
దవ్వుల మాతోడిపొందు తప్పి పోయినా

చ. 2: ఆసురుసు రెల్లా నీయంగముపైనే వున్నది
విసరించుకో రాదా వేగినంతాను
రసికుఁడ మ మ్మేల రతికిఁ బిలిపించేవు
వెస నెప్పు డైనా నిన్ను వెగ్గళించేమా

చ. 3: వేడుకలు నీ కెపుడు వెల్లివిరిసి వున్నవి
వీడె మింద రాదా వెర పేఁటికి
ఆడెనె శ్రీవెంకటేశ అలమేల్ మంగను నన్ను
కూడితివి యిఁక నీకు గురి దప్పీనా

రేకు: 0400-4 ఆహిరి సంపుటం: 11-598

పల్లవి: గక్కన నాతనిఁ గని గడ్డము వట్టి వేఁడుక
చెక్కు నొక్కినపుడుగా చింత లెల్లఁ బాసును

చ. 1: యే మని దూరితినో యెంత చిత్తము నొచ్చెనో
ప్రేమాన నాతఁడు నన్ను బిలిపించఁడు
మోము చూచి తనకు నేమొక్కే నన్నా నిందురాఁడు
ఆమని విరహతాప మడ్డ మేల వున్నదే

చ. 2: పాదము లొత్త నైతినో పంత మేమి యెంచినాఁడో
నాదెస చూడఁ జెలి నైనా నంపఁడు
ఆదరించి వచ్చే నంటే నట్టె తెల్లవారదు
సాదించి నావలపులే చలముతో నున్నవి

చ. 3: నివ్వెరగుతో నుంటినో నెప మేమి గలిగెనో
నవుచుఁ గాఁగిట నించి నాలి సేసిని
యివ్వల శ్రీవెంకటేశుఁడే నలమేలుమంగ
నువ్విళ్లూర నన్నుఁ గూడె నొద్దెనె దాఁగీని

రేకు: 0400-5 సామంతం-ఏకతాళి సంపుటం: 11-599

పల్లవి: నీమతకము లన్నియు నే నెరఁగనా
యేమి దలఁచుకొంటివో యింతలో నవ్వితిని

చ. 1: పిలిచినప్పుడె రాక పెనఁగి పెనఁగి నాతో
బలిమి వచ్చిన రాక పట్టఁ బనేది
అలుక సేసుకొంటివి అక్కడికిఁ బోవలసి
తెలుసుకొని యేఁటికో తిరిగి వచ్చితివి

చ. 2: తప్పక నేఁ జూడఁ గాను తల వంచి వంచి నీవు
యిప్పుడు నీవు చూచితే నియ్యకొందునా
అప్పుడే వెఱచితి వేయంగన గనునో యంటా
కొప్పు మాఁటు సేసుకొని గొబ్బునఁ జూచితివి

చ. 3: చెనకినప్పుడె లోఁగి చేతులఁ దప్పించుకొని
వెనక నన్నుఁ గూడితే వింత మానునా
అనుఁగు శ్రీవెంకటేశ అలమేలుమంగ నని
మన సిచ్చి యిప్పుడు గా మగుడఁ గూడితివి

రేకు: 0400-6 పాడి సంపుటం: 11-600

పల్లవి: అందుకే పో నవ్వు వచ్చీ నప్పటనుండి
అందుకు మొక్కఁ బోతేను ఆయములు సోఁకెఁగా

చ. 1: సంగడా లెత్తినచేయి చాఁచేవు మావురముపై
నంగనలము మా చన్ను లంత కోపునా
యెంగిలితమ్మ రాలెను యింతలో నీచేతిమీఁద
సంగతి నేమో సేయఁగ సరి నేమో యాయఁగా

చ. 2: విరులు ముడిచి నట్టిసిరసు మాతొడమీఁద
నెరవుగఁ బెట్టుకొని నిద్దరించేవు
పొరి నాపాదాలమీఁద బూవు లెల్ల రాలఁగాను
దొరతనానకు రాఁగా దొమ్మిపూజ లాయఁగా

చ. 3: గందము పూసినమేను కాఁగిట నన్నుఁ గూడఁగ
చిందే నా చెమట నీపై చిప్పిలఁగను
అందపు శ్రీవెంకటేశ అలమేల్మంగను నేను
కందువఁ గూడితి విట్టె కత లై నిలిచెఁ గా

రేకు: 401-1 ధన్నాసి సం: 12-001

పల్లవి: యెక్కడనైనాఁ జేయి యెకసక్యాలు
తక్కిన వారి తోడ తచ్చన లెంచకయ్యా

చ. 1: చెక్కులు గిల్లకు నన్నుఁజేరి వేడుకొనే నంటా
నక్కడ నుండే సరసమాడుదు గాక
నిక్కము నే నెఱఁ గనా నీ మతకము లిన్నియు
మొక్కేము నీకు మాతో మొఱఁ గు లేటి కయ్యా

చ. 2: చెలఁ గి తిట్టు కు మమ్ము చెవిలో మాటాడే నంటా
సొలసి యెమ్మె లెందైనాఁ జూపుదు గాని
యెలమి నీ కపటము లెప్పుడుఁ గలవే కావా
పిలువకు మయ్య నీతోఁ బెనఁగ నోప మయ్యా

చ. 3: కడు నన్నలయించకు కొఁ గిటఁ గూడే నంటా
వుడివోని పూవువలె నుందువు గాని
అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
తడవి కూడితి మాతోఁ దమక మేఁటి కయ్యా

రేకు: 401-2 భవుళి సం: 12-002
పల్లవి: చిత్తము నొచ్చేవు సుమీ చెలియచేఁతలకును
బత్తి నీ పైఁ జేయుటకు పాదువలె నాయను
చ. 1: పువ్వులచెండు వేసెఁ బొలిఁ తి ని న్నినుమారు
రవ్వలుగ నవి నీ వురమునఁ దాఁ కె
జవ్వని దనకు చాల సరి దాఁ కించె నని
చివ్వన నీకుఁ జూపి చెప్పి నయ ట్లాయను
చ. 2: రతికి దగ్గరఁ గాను రాకు మని చేతఁ బట్టే
మతకాన నంతలోనీ మర్మము సోఁ కె
సతిని చేయి వట్టి సరిఁ బెండ్లియాడుటకు
జతనాన నిదియే సూచనలై నిలిచెను
చ. 3: యెదురుమాట లాడి ఇంతి పాదానఁ జిమ్మఁ గా
చెదరి నీవు మొక్కేటి శిరసు దాఁ కె
అదన శ్రీ వేంకటేశ అలమేలుమంగ యాకె
పుదుటునఁ గూడె నిదే వుంకువలై మెరసె.

రేకు: 401-3 సామంతం సం: 12-003

పల్లవి: ఆస లేల పెట్టు కొనే వప్పటి నీవు
లోనై నే నీ కుండితే లోక మైనా మెచ్చునా

చ. 1: మచ్చికతో నాపె యింట మాపు దాఁ కా నుండి వచ్చి
నచ్చుల నా మన నెట్టు నమ్మించేవు
అచ్చపు మగవాఁ డవు అంగనతో నొంటి నుంటే
నెచ్చెలులైనా నిన్ను నింద లాడకుందురా

చ. 2: చేతులార నాపె చేత సేవ సేయించుకొంటానే
నాతో నిజా లెట్టు నడపించేవు
రాతి రొక్కమంచముపై రామా నీవు నుంటి రంటే
ఆతలీతలివారలు ఆడుకోక వుందురా

చ. 3: గౌరవించే నంటా నాఁ పెఁ గౌఁగిలించుకొంటానే
యేర శ్రీ వేంకటేశ నా కెట్టు బొంకేవు
సారె నలమేల్మంగను సరికి సరిఁ గూడితి
వీ రీతికిఁ బొరుగువా రిటు నవ్వకుందురా.

రేకు: 401-4 సాళంగం సం: 12-004

పల్లవి: దేవకామిను లాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుఁ డు కోనేటిదండఁ దిరు వీధి మెరసే

చ. 1: యెత్తిరి గరుడధ్వజ మిందిరాపతి పెండ్లికి
యిత్తల సురలు మును లిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చె నదె కప్పురవిడేలు
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుఁ డు

చ. 2: కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టే పేరటాండ్లు నేఁ డిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్ట లై తిరువాముడి ఘనులు వాడేరు

చ. 3: వెలయ భాష్యకారులు విందుచెప్పెఁ బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
వెలసేరు పెండ్లి చవికెలోన నదివో.

రేకు: 401-5 సామంతం సం: 12-005

పల్లవి: అతని నిక్కడికే రమ్మనే మమ్మా
యేతులకు మరేమన్నా నెఱఁ గ మమ్మా

చ. 1: కన్నెరో విరహముతో కాంతునింటి కేఁగె నంటా
యెన్నుకొని యిల్లు వెళ్ళి యేఁగకు వమ్మా
వెన్నెల యెండలు దాఁ కి వేసవి యెంత సేసునో
యిన్నేసి సాహసాలకు నెఱఁగ మమ్మా

చ. 2: ఆతఁడురానికాఁకలు ఆఁపలేక వొకతెవె
యీాతల వనములోని కేఁగకు వమ్మా
పోతరించి కోవిలల భూతము లందుఁ గలవు
యీా తలఁపు దలఁచేవు యెఱఁగ మమ్మా

చ. 3: అలమేల్మంగ శ్రీ వేంకటప్ప డిట్టే నిన్నుఁ గూడె
యెలమి మేడమీఁదికి నేఁగకు వమ్మా
చిలుకలు మీ చేఁతలు సిగ్గులు దోఁచఁగ నాడీ
ఇలమీఁద నింత కాఁకు యెఱఁగ మమ్మా.

రేకు: 401-6 భవుళి సం: 12-006

పల్లవి: నీకంటె నాపె మేలు నే మాపె సేవ సేసేము
మాకు దిష్టము నీ పొందు మమ్ము నింత సేసేనూ

చ. 1: యిచ్చకమే యాడ నైతి నింతి నీవు గూచుండఁ గా
హెచ్చుకుందు లాడఁగాఁగా నిటురావైతి
అచ్చమై నీకు మొక్కక నాపెకే నే మొక్కనైతి
మచ్చరించఁగాఁగా నాపె మాటలే యాడేరెనూ

చ. 2: పొదా లొత్త నైతి నీవుఁ బడఁతియుఁ బండుండఁగా
వా దడువఁగాఁగా నీవు వలవవైతి
పోదిసేసి ప్రియములు పొలిఁతికి చెప్ప నైతి
నీ దెస చూడఁగాఁగా నెరపెను చలమూ

చ. 3: ఆకు మడి చియ్య నైతి నలమేల్మంగకు నీ
కేకతము చెప్పఁగాఁగా నిట్టే నవ్వేను
ఆకె నడిగి శ్రీ వేంకటాధిప నన్నుఁ గూడితి
చేకొలఁదికి రాఁగాఁగా చెలియే మన్నించెను.

రేకు: 402-1 శ్రీరాగం సం: 12-007

పల్లవి: యేమి సేతు నీ మీఁద నెంతైనా నాన మానదు
మా మీఁది వలపు నీకు మరపాయఁ గా

చ. 1: చేరి నీతో మాటలాడి సేవలు సేసుకొంటా
యీరీతినే నుండినది యిది చాలక
కారించి యిందు మీఁదను కాఁకలు చల్లఁ జూచేవు
గారవపు నీదయ కాన వచ్చెఁగా

చ. 2: కన్నులు చల్లఁగఁ జూచి కడు నీతో నవ్వుకొంటా
యెన్నికగా నే నుండిన దిది చాలక
మిన్నక నీ విందుమీఁద మేకులు సేయఁ జూచేవు
మన్నించెనన్న నీ మాటపట్టు మీరెఁగా

చ. 3: అప్పటప్పటికి నిన్ను నట్టే కౌఁగిలించుకొంటా
యిప్పుడు గూడివుండిన దిది చాలక
అప్పుడ శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
కప్పేవు పచ్చడము నీ గతి గంటిఁ గా.

రేకు: 402-2 దేసాళం సం: 12-008

పల్లవి: తలపించ కింక నది దరి చేరేను
కల గన్నట్ల నాయ కాఁక లేల చాలురా

చ. 1: చెక్కు నొక్కి వేఁడుకోఁగా జేరి యన్ని మరచితి
వొక్కడై నీవు సేసేది వోర్చ వచ్చునా
పుక్కిలి బంటియ్య నీతో పొందులమాటలు నాకు
పిక్కటిల్లె వలపులు పెక్కు లేల చాలురా

చ. 2: పంత మిచ్చి నవ్వించఁగఁ బరిణమించుకొంటివి
యెంత లేదు నీసుద్దులు యెంచ వచ్చునా
దొంతులై యిల్లెల్ల నిండె దొమ్మి నీయాసలు నాకు
సంతకెక్కె నివి సాలు సరసాలు చాలురా

చ. 3: కౌఁగిలించి కూడఁగాను కన్నులనే తనిసితి
చేగ దేరె నీ మన్నన చెప్ప వసమా
ఆఁగకు శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
నాఁగువారి వేడుకలు నటనలు చాలురా.

రేకు: 402-3 గౌళ సం: 12-009

పల్లవి: మూసిన ముత్యమువలె ముంగిట నున్నదాన నేను
యే సుద్దు లెఱఁగ దైవ మెరిఁగితేఁ జాలును

చ. 1: బెట్టి మాట లాఁడఁగాను ప్రియ మౌనో కాదో యంటా
గుట్టున నూర కున్నదానఁ గోపమా ఇది
అట్టి నావలపు నీతో నాడుకొందునా నేనే
ఇట్టి పనులెల్ల దైవ మెరిఁగితేఁ జాలును

చ. 2: వీడెము నీ చేతి కియ్య వేళవునో కాదో యంటా
గోడమాటున నున్నదానఁ గోపమా ఇది
యేడనైనా నిల్లాండ్లు యెదురుకట్ల నుందురా
యేడ కేడ యిది దైవ మెరిఁగితేఁ జాలును

చ. 3: యేచి నిన్నుఁగూడి ఇంకా నెంత గర్వమందు వంటాఁ
గూచుంటేఁ బాదాలవద్దఁ గోపమా ఇది
కాచి యలమేల్మంగను కై కొంటె శ్రీ వేంకటేశ
యీ చాయ నీవే దైవమ దెరిఁగితేఁ జాలును.

రేకు: 402-4 నాగవరాళి సం: 12-010

పల్లవి: మఱవకువయ్య నీవు మాట లెన్నైనాఁ గలవు
తఱవాతఁ జేసేటి తగవు నీ చేతిది

చ. 1: మందలించి నీవు నన్ను మన్నించుకున్నాఁడవు
యెందాకా విన్నపాలు నీ కేమి సేసేది
యిందరివలెనే నేను యెరవుల దానఁగాను
పొందినట్టి నా పాలిటి పుణ్యము నీ చేతిది

చ. 2: నిచ్చలు నామతిలోన నీవె నాకుఁ గలవు
యెచ్చరించ సారె సారె నేటికి మాకు
బచ్చెనచేఁ తల నిన్ను భ్రమయించేదానఁ గాను
పచ్చి దీర నా కిచ్చిన బాసలు నీ చేతివి

చ. 3: కొత్తగాఁ గౌఁగిట నన్నుఁ గూడితి విప్పుడే నీవు
యెత్తినచేతుల నీకు నేడ మొక్కేది
అత్తిన శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పొత్తుల నుండిన నా భోగము నీ చేతిది.

రేకు: 402-5 శుద్ధవసంతం సం: 12-011

పల్లవి: నీయంత నీ వెఱఁ గవు నేనా చెప్పితిఁ జుమ్మీ
చేయి సేకోఁ జాలక సిగ్గున నున్నదానను

చ. 1: ముట్టి నఁ గందేటిమేను మొనవేలు దాఁ క నీకు
మట్టుతో నల్లంత నుండే వటాడరాదా
నెట్టన నాకుచములు నీ కంటేవాండ్లు సుమ్మీ
వొట్టి నే నంత సేయక వూరకున్న దానను

చ. 2: నెఱిఁ బులకచెక్కులు నీ చెక్కులు సోఁ క నీకు
గుఱిగా సంగడి నిట్టే కూచుండరాదా
తఱి నాచూపు నీగుండె తమిఁ గరఁగించుఁ జుమ్మీ
మెఱిమెచ్చులకు మితిమీరక వున్నదానను

చ. 3: వోవిపైఁ బలుసోఁ కులు మోపకు నీవంత మమ్ము
యీవేళ నన్నుఁ గూడితి వింత చాలదా
చేవ మాచేతలు నిట్టెఁ జిగుళ్ళై నిలుచుఁ జుమ్మీ
శ్రీవేంకటేశుఁడ ముందే చేకొనే ఉన్నదానను.

రేకు: 402-6 పాడి సం: 12-012

పల్లవి: ఇందు కంటే నిప్పుడే నీ కెచ్చరించుటే మేలు
కందువ మఱచి వుంటేఁ గడుఁ బొద్దు వోదా

చ. 1: హత్తి నాలో చింత వెళ్ళ నాడఁగా నీ మాటమీఁద
చిత్తము వచ్చిన యట్టు సేసేవు గాక
మొత్తాన నేను నిన్ను ముందు నేరా లెంచఁబోతే
మత్తిలి వెనక నీవు మనికితపడవా

చ. 2: ఇంటికి వచ్చి యెదుట నిట్టె నిలుచుండఁగాను
నంటువ వలసినట్టు నవ్వేవు గాకా
వొంటి నేను విరహాన నుమ్మగిలఁగాఁ జూచి
అంటి ప్రియపడి మొక్క అంత సేయ కుందువా

చ. 3: గక్కన నేనే నిన్నుఁ గౌఁగిలించుకొనఁగాను
నిక్కి వలసినట్టు మన్నించేవు గాక
యెక్కువ శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
గుక్కి సేను రాకుండితేఁ గొంకు నీకుఁ దీరునా.

రేకు: 403-1 భైరవి సం: 12-013

పల్లవి: యేమని విన్నవించె నీ వింత సేసితివి నన్ను
చేముంచి మా బ్రతుకు నీ చేతిది సుమ్మయ్యా

చ. 1: దగ్గరి నీవు రాకున్న తమకింతు నొకవేళ
సిగ్గుపడుదు నంతలో చేయి వేసితే
వెగ్గళింతు నీ వట్టే వేరే పరాకు సేసితే
బగ్గన నీ మీఁది భ్రమ వట్టె నయ్యా నాకూ

చ. 2: చెంత నీవు చూచుదాఁకా చేయెత్తి మొక్కుదు నీకు
మంతనాన మాటాడితే మఱతు మేను
యింతలో గోర నంటితే యెచ్చరి నవ్వుదు నీతో
యెంత నీ వలపు దలకెక్కెనో నాకూ

చ. 3: వెలుపల నీ వుండితే వేగఁ బిలువ నంపుదు
చెలఁగి యిట్టే కూడితే చెక్కు నొక్కుదు
యెలమి శ్రీ వేంకటేశ యిదివో కలసితివి
యిలలో నా జవ్వనమే యింత సేసే నాకూ.

రేకు: 0403-2 సామంతం సంపుటం: 12-014

పల్లవి: యేల నీవు వెరచేవు యింతలోనను
కోలు ముం దాయఁ బనులు కొంక నేఁటి కయ్యా

చ. 1: యేకతాన మీ రుండఁగా నెఱఁగక వచ్చితిని
వాకిట నుండే నన్ను వద్దనకుమీ
రాకుండీ నే నీచేతి రవ్వలఁ బడఁగ రాదు
నీ కతలు చెప్పఁబోతే నివ్వెరగు లయ్యా

చ. 2: మాటలు మీ రాడుకోఁ గా మరచి గక్కన వింటి
నాఁటదాన మగుడ న న్నడుగకుమీ
నీటున నే నూరకున్న నిండుగర్వి నే ననేవు
యేఁటికిఁ గొసర నీ మేలిటువంటి దయ్యా

చ. 3: కూడిన మీ కూటముల గురుతు గక్కనఁ గంటి
వీడె మిచ్చి సిగ్గువడి వీఁగకుమీ
యీడనె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
పాడిఁ బంతములు నీవే పనిగొంటి వయ్యా

రేకు: 0403-3 శంకరాభరణం సంపుటం: 12-015

పల్లవి: కానీవే అందు కేమీ కనుకొనే పనులెల్ల
యీ నాటకములు నే నెఱఁగనివా

చ. 1: పంతము లాడిన తానే భ్రమసీఁ గాక నాకు
యింతలోనె యేమి దప్పె నెందు వోయీని
వింత యడవులవెంట వెదకఁడా సీతఁ దొల్లి
యెంత లేదు తన గుండె యెఱఁ గనిదా

చ. 2: బిగియుచు నున్న వాఁడే బిలిచీఁ గాక నన్ను
తగవులే నెరపేను దాని కేమే
వెగటయి రాధాదేవి వెంట వెంటఁ దిరుగఁడా
యెగువనె తన గుట్టు యెఱఁగనిదా

చ. 3: కడలనున్న వాఁడే కలసీఁగాక నన్ను
తడవకు వాని నిట్టె తతి రానీవే
అడరి శ్రీ వేంకటేశుఁడట్టె నన్నుఁ గలసె
యెడయకున్నాఁడు నే నిది యెఱఁగనిదా

రేకు: 0403-4 గుండక్రియ సంపుటం: 12-016

పల్లవి: చాలుఁ జాలు నిఁకను నీ సట లేఁటికే
యీలీల నే మొక్కితేను యెగసక్కె మనవా

చ. 1: ఆవలిమోమై మాటలాడ నంటా నలిగేవు
చవిగాని మాట లాడ సంగతా నాకు
తవిలి నీమోహ మొక్కతరుణిపై నుండ గాను
వివరించి న మోహము వేడుక పుట్టీనా

చ. 2: రంతుల నే నీయింటికి రానంటాఁ గొసరేవు
వింత వారింటికి రాగా వేడు కయ్యీనా
కాంత వేరొకతె నీకు కనుసన్న సేయఁ గాను
దొంతుల మా చూపులు తొడుసులై యుండవా

చ. 3: అట్టే నీతో నప్ప నైతి నంటా సిగ్గు వట్టేవు
వట్టి నవ్వు నవ్వఁ బోతే వడిఁబడదా
గుట్టున శ్రీ వేంకటేశ కూడితివే నన్ను నిట్టె
దిట్టతనపు మా రతి తెల్లవార కుండీనా

రేకు: 0403-5 లలిత సంపుటం: 12-017

పల్లవి: పరమపురుషుఁడు గోపాలబాలుఁ డైనాఁడు
మురహరుఁడు యెదుట ముద్దుగారీ నిదివో

చ. 1: వేదపురాణములలో విహరించే దేవుఁడు
ఆది మూలమైనట్టి అలబ్రహ్మము
శ్రీ దేవి పాలిటఁ జెలఁగే నిధానము
సేద దేరి యశోదకు శిశువాయ నిదివో

చ. 2: మొక్కేటి నారదాదుల ముందరి సాకారము
అక్కజపు జీవులలో అంతర్యామి
గక్కన బ్రహ్మ గొడుకుఁగాఁ గన్న పరమము
అక్కరతో వెన్నముచ్చై యాటలాడీ నిదివో

చ. 3: దేవతలఁ గాచుటకు దిక్కయిన విష్ణుఁడు
భావము లొక్కరూపైన భావతత్త్వము
శ్రీ వేంకటాద్రి మీఁద జేరున్న యా వరదుఁడు
కైవసమై గొల్లెతల కౌఁగిళ్ళ నిదివో

రేకు: 0403-6 రీతిగౌళ సంపుటం: 12-018

పల్లవి: వెలివకువయ్యు నిన్ను వేసరించను
కలికులాడఁగ నేను గబ్బిదాననా

చ. 1: మోము చూడఁగా నీకు మొక్కితి నింతే కాని
కామించి యే పనులకుఁ గాదు సుమ్మీ
చేముంచి యాపె నీ చేయి పట్టు కుండఁగాను
వేమరు నే నాసపడ వెఱ్ఱిదాననా

చ. 2: గక్కనఁ జేయి వేయఁగ కైదండ యిచ్చితిఁ గాని
లెక్కసేయ నంత పని లేదు సుమ్మీ
మక్కళించి మక్కళించి మాట లాపె యాడఁగాను
యిక్కడ నీ సేవ సేయ నెడ్డదాననా

చ. 3: బడలి రాఁగా నీకు పాదము లొత్తితిఁ గాని
యెడసినందుకుఁ బంత మీయఁ జుమ్మీ
అడరి శ్రీ వేంకటేశ అట్టే నన్ను నేలితివి
కొడిమె లింకా నెంచ గొల్లదాననా

రేకు: 0404-1 శుద్ధవసంతం సంపుటం: 12-019

పల్లవి: చూచినవారెల్ల నన్నే సొరిది నుప్పతింతురు
మా చనవు చెల్లించి మన్నించరాదా ॥పల్లవి॥

చ. 1: యేమి వొడఁబరచేవు యేల నిలుచున్నాఁడవు
గోమున నావద్ద నిట్టే కూచుండరాదా
నీ మాట మీరేనా నీవే నేఁగానా
వాము లాయ వలపులు వడిఁబెట్ట కింకను

చ. 2: కనురెప్పలు వేయవు కడుఁ జేయి చాఁచేవు
యెనసి యేపొద్దు నీకు నీదే పనా
పెనఁగినా నీతోను బెట్టి మాట లాడేనా
తనిసితి మాటలనే తమి యింకా రేఁచేవు

చ. 3: సింగారించు కొంటివి చెక్కులనే నవ్వితివి
కొంగుపట్టి కూడితివి కొంకు దీరెను
యింగితాన శ్రీ వేంకటేశ నీ రతి మెచ్చితి
సంగతాయఁ బనులెల్ల సతమాయ మనసూ.

రేకు: 0404-2 శ్రీరాగం సంపుటం: 12-020

పల్లవి: నీ చిత్త మెట్టుండినా నీ కుండెఁ గాని
చేచేత మా వంటి వారు చెనకక మానరూ

చ. 1: మొకమోట గల సతి మొక్కనే నేరుచుఁ గాని
వెకలియై యెంతైనా వెంగె మాడదు
అకటా నావంటి మంకులైన చెలు లైతే నిన్ను
పక పక నవ్వి నిన్నుఁ బచ్చిసేయ కుండరు

చ. 2: పొంది పొరసిన యింతి పొదుగ నేరుచుఁ గాని
సందడించి నా దడిచి సాదించదు
మందలించి నావంటి మంకులైన వారైతే
నింద వేసి తమ నేర్పు నెరపనే చూతురు

చ. 3: గుట్టు దెలిసిన వారు గుణాన నుందురు గాని
వట్టి నిష్ఠూరము లాడి వలఁబెట్టరు
యిట్టే శ్రీ వేంకటేశ యెనసి నావంటివారు
నెల్లన నీ రతిఁ గూడి నిన్ను బైపై మెత్తురు.

రేకు: 0404-3 కాంబోది సంపుటం: 12-021

పల్లవి: యేమనున్నదో నీ చిత్త మెఱఁగ నేను
దీముగా నింకా మీఁదఁ దెలుసుకొమ్మీ

చ. 1: యెగసక్కేనకు నిన్ను నేమైనా నందుఁ గాని
పగటు నీ మీఁద నాకుఁ బ్రాణము సుమ్మీ
అగ డయ్యీనని నీతో నాడుకో వెఱతుఁ గాని
మిగుల వలచినట్టి మెలఁతఁ జుమ్మీ

చ. 2: నవ్వులకు నీతో మిన్నక యలుగుదుఁ గాని
నివ్వటిల్ల నీటు నీవే నేఁ జుమ్మీ
జవ్వనమదాన నిన్ను జంకించి దూరుదుఁ గాని
పువ్వు వలె నందరితోఁ బొగడుదుఁ జుమ్మీ

చ. 3: దార కాన గుట్టు తోడఁ దల వంచుకుందుఁ గాని
మేరతో నీపై తమి మిగులాఁ జుమ్మీ
యీ రీతి శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితిని
కోరికలు కోటానఁ గోట్లు సుమ్మీ.

రేకు: 0404-4 ఆహిరి సంపుటం: 12-022

పల్లవి: వేగినంతా నిన్ను నేల వేసరించను
నీ గతి దప్పకు చాలు నిండుకుండే నేను

చ. 1: తనివి దీరని నీ దయ గలిగితేఁ జాలు
వొనరి నే నొక కొండై వుండే నేను
మన సిచ్చి నీవు నాతో మాటలాడీతేఁ జాలు
వెను బలము సేసుక విఱ్ఱవీగే నేనూ

చ. 2: నిచ్చలు నే నొకమారు నిన్నుఁ గనుఁగొంటేఁ జాలు
పచ్చిదీరే వేడుకల బతికే నేను
చెచ్చెర నా విన్నపము చెవి యొగ్గి వింటేఁ జాలు
తచ్చి నీ మేలెప్పుడునుఁ దలఁచే నేనూ

చ. 3: తల యెత్తి నామోము తప్పక చూచితేఁ జాలు
వెలి లేని వలపుల వెలసే నేను
యెలమి శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
చలివాసి యిఁ క నిన్ను జట్టి గొనే నేనూ.

రేకు: 0404-5 సామంతం సంపుటం: 12-023

పల్లవి: యెరవు సేసుక యీతఁ డేల దూరెనే
యిరవై తా నున్నాఁ డంటా నేమి సేసేదే

చ. 1: ముచ్చట లాడె నంటా మోహము చల్లె నంటా
యిచ్చకానఁ దనకు నే నేమి సేసేదే
కచ్చుపెట్టి వుండె నంటా కడగోర గీరె నంటా
యిచ్చటఁ దనకు సేవ యేమి సేసేదే

చ. 2: పక్కనఁ దా నవ్వె నంటా పైఁ జేయి వేసె నంటా
యిక్కడఁ దన కతల కేమి సేసేదే
మిక్కిలి వలచె నంటా మేలి మిట్టే యాడె నంటా
యెక్కడ నైనా వేసా లేమి సేసేదే

చ. 3: కన్నులనే మొక్కె నంటా కౌఁగిటికిఁ జిక్కెనంటా
యెన్నిక గురుతులు మై నేమి సేసేదే
నన్ను శ్రీ వేంకటేశుఁడు నయమునఁ గూడె నంటా
యెన్ని మెచ్చులని మెచ్చి యేమి సేసేదే.

రేకు: 0404-6 భవుళి సంపుటం: 12-024

పల్లవి: బతుకు మనవే యింకాఁ బై పైఁ దాను
రతికేల పిలిచేవే రానీవే తాను

చ. 1: ముచ్చటలే యాడి యాడి మొదల నను భ్రమించి
చెచ్చెరఁ బంతాన కింత సేసేఁ గా తానూ
వచ్చి వచ్చి చేయి వేసి వాఁడు మోముకళ రేఁచి
పెచ్చు రేఁగి యింత ఱట్టు పెట్టెఁగా తానూ

చ. 2: నంటు సేసి నవ్వి నవ్వి నాఁటకాలే పచరించి
యింటనే జాగరము సేయించెఁగా తాను
వెంట వెంటఁ దిరిగాడి వేమారుఁ గరఁగించి
దంట తనమున నాకు దక్కెఁగా తానూ

చ. 3: సొలపులఁ జూచి చూచి సొమ్ములెల్లా నాకు నిచ్చి
కొలఁది మీరఁగ నన్నుఁగూడెఁ గా తాను
యెలమి శ్రీ వేంకటేశుఁ డింత నన్ను మన్నించి
బలిమి నుర మెక్కించి పై కొనెగా తానూ

రేకు: 0405-1 ముఖారి సంపుటం: 12-025

పల్లవి: యేమే మీ సేరు పెల్ల నిఁక నెన్నఁడే
మోము చూచి గుట్టు తోనె మొక్కవలెఁ గాఁకా

చ. 1: మాటలాడుకో రాదా మనసు లొక్కటి గాఁగ
గాఁటపు తొల్లిటి మీలో కపట మేలా
ఆఁటదాని కింతయేల ఆతఁ డేమి సేసినను
నాఁటిన చూపులఁ జూచి నవ్వవలెఁ గాకా

చ. 2: బాసలు సేసుకోరాదా పంతములు సరిగాఁగ.
వేసరని మీలోని వెరగు లేల
సేస వెట్టిన వారికి చింతించ నిఁక నేల
ఆసతో నాయము లెల్ల నంటవలెఁ గాకా

చ. 3: కౌఁగిలించుకోరాదా కాఁక మీలోఁ దీరఁగ
చేగ దేరే మీలోని సిగ్గు లేల
వీఁగక న న్నపుడే శ్రీ వేంకటేశుఁడు గూడే
మూఁ గిన మోవులతో సమ్మతిల్లవలెఁ గాకా.

రేకు: 0405-2 భవుళి సంపుటం: 12-026

పల్లవి: యీపాటికి పాటియేరా నీవు నే
నేపున మితి మీరితి నిఁక నెంత సేతువో

చ. 1: మంకుదనమున నొక్కమాట నీతో నాడితేను
కొంకక అదొక పెద్ద కొండ సేసేవు
జంకించి నిన్నుఁ గనక చలమునఁ దిట్టితేను
అంకెలఁ బేరిచి పేర్చి అపుడెంత సేతువో

చ. 2: చెనక రాఁగా నిన్నుఁ జేయి వట్టి నిలిపితే
కినిసి యిందరినీ సాకిరి వెట్టేవు
పెనఁగి నిన్నుఁ గనక బెందుపడఁ జేసితేను
మనసు కాంతాళముతో మరి యెంత సేతువో

చ. 3: రతివేళ నీతోను రాజసాన నుండితేను
తతిఁ గాఁక రేఁగి రేఁగి తమకించేవు
యితవై నన్నుఁ గనక యెలయించి నవ్వితేను
సతమై శ్రీ వేంకటేశ నట లెంత సేతువో.

రేకు: 0405-3 హిందోళవసంతము సంపుటం: 12-027

పల్లవి: యేలే నాకు వేగిరము యింక నేమిటికి చింత
తాలిమి నాతఁడే నాకు దక్కి వుండీఁగాకా

చ. 1: ప్రియ మెంత గలిగినఁ బిలువక వత్తురా
నయముగల దంటాను నవ్వ వచ్చునా
క్రియ యెఱిఁగినయట్టి కిమ్ముల యిల్లాలికి
దయగలదాఁకా పతిఁ దగులుట గాకా

చ. 2: బలి మెంత గలిగినాఁ బైకొనఁగ వచ్చునా
చల మీడేరీ నంటాను జంకింతురా
కుల కాంతలకుఁ దమ గుణముతోనే పతి
తలఁపులో మెలఁగుటే తగ వింతే కాకా

చ. 3: మన్నించి యెంత గూడినా మందెమేలము చెల్లునా
మున్నిటి సుద్దులు నేడు మొనసేతురా
యన్నిటా శ్రీ వేంకటేశుఁ డిప్పుడిట్టే నన్నుఁగూడె
కన్నెనైన నా కితఁడే గతి యంట గాకా.

రేకు: 0405-4 శంకరాభరణం సంపుటం: 12-028

పల్లవి: బలుములు చూపఁగఁ బని లేదు
ఫల భోగము లవి భాగ్యముకొలఁదీ

చ. 1: వంతుకు నీ కిటు వలచిన మాకును
పంతము లాడఁగఁ బని లేదు
కాంతుఁ డని వేళ గాచుకుండఁగా
బంతుల నీ కృప భాగ్యము కొలఁదీ

చ. 2: యిచ్చకురాలనై యి టుండ నాకును
పచ్చి సేయ నినుఁ బని లేదు
చెచ్చెర నీ సేవ సేసు కుండఁగా
బచ్చెన ముదములు భాగ్యముకొలఁదీ

చ. 3: తగిలి నీ కౌఁగిట తనిసిన మాకును
బగివాయఁగ నిఁకఁ బని లేదు
అగడుగ శ్రీ వేంకటాధిప కూడితి
పగటు రతులు మా భాగ్యము కొలఁదీ.

రేకు: 0405-5 గుండక్రియ సంపుటం: 12-029

పల్లవి: యెంతైన నేను నీయింతి ననరా
సంతసాన నుండితేను చన వియ్యవలదా

చ. 1: నీ వంటి రమణుఁడు నిచ్చ నాకుఁ గలుగఁగ
యేవల నా రాజసము లెక్కుడే కాదా
భావించి నీవు రాఁ గా నేఁ బవ్వళించి వుంటి నంటా
వేవేలు దూరు లేల నీ విభవమే కాదా

చ. 2: యింతటి వాఁడవు నా యిచ్చలోనే వుండఁగాను
యెంత లేదు నాగర్వ మేమి చెప్పేది
పంతమాడి నేను నీపైఁ జేయి వేసితి నంటా
వింతమాట లాడేవు నీ వేడుకే కాదా

చ. 3: కరుణానిధివి నా కౌఁగిటిలో నుండఁగాను
యిరవైన సంపదకు నేది మేర
నిరతి శ్రీ వేంకటేశ నిన్ను నేఁ గూడితి నంటా
గరిమెతో మెచ్చేవు కఱితలే కాదా.

రేకు: 0405-6 శంకరాభ రణం సంపుటం: 12-030

పల్లవి: యెట్టుండినా నీవే నన్ను నీడేరించుకొంట గాక
మెట్టిపట్టుకొని నిన్ను మెప్పించఁ గలనా

చ. 1: మట్టు తోడ నీతో నే మాటకు మాటాడే నంటే
జట్టి గొని నీకు నేను సరిదాననా
వొట్టుక నీ వద్ద నుండి వూడిగాలు సేసే నంటే
నెట్టన నే నంతేసికి నేరుపరినా

చ. 2: చనవు సేసుక నీతో సారెకు నవ్వే నంటే
యెనసిన నీ చిత్త మెరుఁగుదునా
పెనఁగి పెనఁగి నీకుఁ బ్రియాలు వుట్టించే నంటే
వెనక ముందు నేనంత వివేకినా

చ. 3: కరఁగించి నే నిన్ను కొఁగిటఁ జొక్కించే నంటే
సరవితో నే నంత చదివితినా
నిరతి శ్రీ వేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
దొరఁ జేసితివి నీవే దొడ్డదాననా.

రేకు: 0406-1 మధ్యమావతి సంపుటం: 12-031

పల్లవి: యింటికి విచ్చేయ వయ్య యేమైనాఁజేసేఁ గాని
కంటువాసినందుమీఁద కడుఁ దడ వేఁ టికీ

చ. 1: నేర మెంచఁ బని లేదు నీకు నాకు నిఁకఁ బోదు
వారి వీరివలె బొంక వైపు గాదు
వోరి యని పిలిచితి వోపనని బిగిసితి
కోరి నీకే మొక్కితిని కోప మిఁక నేఁటికీ

చ. 2: చలము సాదించ నేల సరుస నీకు నే నాల
యెలయించ నీవు నన్ను నిదె వేళా
తొలుత నేఁ బదరితి దొమ్మి నిన్నుఁ జేసితిని
వలచి వచ్చితి నిఁక వట్టి పగ లేఁటికీ

చ. 3: జగడము లింత గద్దా సరి నున్నదాన నీవొద్ద
విగడా లిన్నియు నిఁ క వినవద్దా
నిగిడి శ్రీ వేంకటేశ నిన్నే నేఁ గూడితిని
తగులమయిన మీఁద తమకము లేఁటికీ.

రేకు: 0406-2 పాడి సంపుటం: 12-032

పల్లవి: ఆతనితో నీమాటే అనరమ్మ చెలులు చే
చేత నేనే అనే నంటే సిగ్గయ్యీ నాకూ

చ. 1: వలుపే నాకుఁ గలిగితే వద్ద నాతఁ డుండఁడా
వెలయునా బత్తి యిదె వెట్టి గాఁబోలు
నలి నేనే ఆల నైతే నాతో నాతఁడు నవ్వఁడా
బలిమినేఁ బిలిచేది భ్రమ గాఁబోలు

చ. 2: సేసే తనకు నోమితే నిలిచి మాటాడఁడా
పూనిన నామేని కాఁక బొంకు గాఁబోలు
తానే నే నని యుంటే తల యెత్తి చూడఁడా
మానసీ నా యడియాస మంకు గాఁబోలు

చ. 3: తను మెప్పించ నేర్చితే దయ నాపైఁ జేయఁడా
చనవరి నే నైనది సట గాఁబోలు
పని వడి శ్రీ వేంకటపతి నన్ను నేఁడు గూడె
మనికైన యీ రతులు మన్నన గాఁబోలు

రేకు: 0406-3 గుండక్రియ సంపుటం: 12-033

పల్లవి: మొక్కితి నని చెప్పరే మొదలనే తనకును
చెక్కుచేతితోడఁ దన సేవ సేసే వారము

చ. 1: జగడాలు దీరు మని సారె సారె మిమ్ము నంపె
మగవారికి బలువా మగువలమూ
బిగిసేవారమా తన ప్రియములోవారము
తగిలితే మరిఁ దన దయ లోని వారము

చ. 2: వేమరు నల్లంతనుండి విరుల నేల వేసీనే
కామునమ్ముల కెక్కుడా కాంతలమూ
రా మనేటివారమా రతిలోని వారము
ఆమీఁదటి పనులకు నఱచేతి వారమూ

చ. 3: చలము సాదించి తాను సారెఁ బైఁ జేయి వేసి
వలపులకు వేళా వనితలమూ
అలరి శ్రీ వేంకటేశుఁ డట్టే నన్నుఁ గూడె నిదె
మలసితే నింకాఁ దన మనసులోవారమూ.

రేకు: 0406-4 లలిత సంపుటం: 12-034

పల్లవి: విసిగేవు సుమ్మీ నీవు విడువ నంటా నాపై
వసమైన దానఁ గాన వదల నే నిన్నును

చ. 1: యీడా నాడా నుండి నన్ను నెంత విచారించకున్నా
నాడుకొందు నేను నీ యాల నంటాను
వోడక యిట్టే నీవు వొద్దికిఁ బిలువకున్నా
తోడునీడనై వుందు తొలఁగి పో నెపుడు

చ. 2: మొగము చూచి నీవు మోనాన నట్టే వుంటే
నగుదు నూరకయైన నప్పుసేసుక
వొగరుఁ దీపుగా నీవు వోరగండ్లఁ జూచిన
మగటిమిఁ బూసగొండిమాట లెల్లా నాడుదూ

చ. 3: అంతలో నీవు విచ్చేసి ఆయములు ముట్టి తేను
సంతసాన నీ మోవి చవిగొందును
కాంతుఁడ శ్రీ వేంకటేశ కలసితి విట్టె నన్ను
పంతాన నిందుకే నిన్నుఁ బలుమారు మెత్తును.

రేకు: 0406-5 సామంతం సంపుటం: 12-035

పల్లవి: అటువంటివాఁడా ఆతఁడు మాయెడకు
ఘటన నిప్పుడే నన్నుఁ గరుణించ కుండునా

చ. 1: వేల నంటి మా కెల్ల వేగిరించ వచ్చునా
యేలిన యాతని చిత్త మింతే కాక
తాలిమి నాతఁ డేమైనా దయలేనివాఁడా
వోలి నూర కేమిటికో వున్నాఁడు గాకా

చ. 2: పిర రేఁచి యాతనినేఁ బిలిపించవచ్చునా
మరిగిన రమణుని మన్ననే కాక
సర వెరిఁగినయట్టి సరసుడు గాఁడా
వొరసి యేమి దలఁచి వున్నాఁడో కాకా

చ. 3: పచ్చి సేసియాతని నే భ్రమయించ వచ్చునా
యెచ్చటా శ్రీ వేంకటేశు హితవే కాక
మెచ్చ నేరిచిన యట్టి మేలువాఁ డు గాఁడా
వొచ్చెము దీరుచఁ గాచుకున్నాఁడు గాకా.

రేకు: 0406-6 శ్రీరాగం సంపుటం: 12-036

పల్లవి: నీ చిత్తముకొలఁది నే నడచుట గాక
చూచి చూచి నీ తోడి సూడు నాకుఁ జెల్లునా

చ. 1: పంతము లాడఁగ నేల పైకొని మొక్కుట గాక
వంతు లేక వలచు నావంటి దానికి
అంతటి మీఁదట నీవు అన్నిటాను దొరవు
కొంతైన నీ మీఁదఁ గోపగించఁ జెల్లునా

చ. 2: కపటము లిఁక నేల కన్నుల నప్పుట గాక
యెపుడును నావంటి యిల్లాలికి
నెపమునఁ దొలుతనే నీయిచ్చ రాజవు
విపరీతముగ నిన్ను వెగ్గళించఁ జెల్లునా

చ. 3: కావరించ నిఁక నేల కౌఁగిలించు కొంటగాక
కైవసపు నావంటి కాంతకును
శ్రీ వేంకటేశ్వర నీవే చేరి నన్నుఁ గూడితివి
ఆవటించి యిఁక నిన్ను నలయించఁ జెల్లునా.

రేకు: 0407-1 రామక్రియ సంపుటం: 12-037

పల్లవి: చంచలగుణము నాది సరి ధీరుఁడవు నీవు
నించి నీ మేలే నాపై నెరపవయ్యా

చ. 1: సరి నెఱుఁగుదు నాపై సారె బత్తి గలుగుత
తరవాతికె రాకున్నఁ దమకింతును
కరఁగుదు నీవు నాపైఁ గల మన్నన దలఁచి
తెరమరఁ గైతే నే తెగువలె యాడుదు

చ. 2: వా దడుతుఁ జెలులతో వడి నీవు బొంక వని
నా దెస చూడ కుండితే నమ్మకుండుదు
సాద వని పొగడుదు సరి నెదురాడకున్న
కా దందు నీవు పరాకై కడు నవ్వితేను

చ. 3: చే యెత్తి మొక్కుదు నీవు చేసన్న సేసితేను
చాయ సేసుకుండితేను సాదింతును
యీ యెడ శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
కాయజకేలికే నిన్నుఁ గమ్మరఁ బిలుతును.

రేకు: 0407-2 గుండక్రియ సంపుటం: 12-038

పల్లవి: యీడగుఁ బెండ్లి యిద్దరిఁ జేసేము
చేడెలాల యిది చెప్పరుగా

చ. 1: పచ్చిక బయళ్ళఁ బడఁతి యాడఁగా
ముచ్చటఁ గృష్ణుఁడు మోహించి
వెచ్చపు పూదండ వేసి వచ్చె నట
గచ్చుల నాతనిఁ గానరుగా

చ. 2: ముత్తెపు ముంగిట ముదిత నడవఁగా
వుత్తముఁడే చెలివురముననూ
చిత్తరువు వ్రాసి చెలఁ గి వచ్చె నొళ
జొత్తు మాని యిటు చూపరుగా

చ. 3: కొత్త చవికెలోఁ గొమ్మ నిలిచితే
పొత్తునఁ దలఁబాలు వోసెనటా
యిత్తల శ్రీ వేంకటేశుఁడు నవ్వుచు
హత్తి సతి గూడె నని పాడరుగా.

రేకు: 0407-3 సౌరాష్ట్రం సంపుటం: 12-039

పల్లవి: యెఱపరికము లేల యెంత సేసేవూ
తఱవాతి పనులకుఁ దడవు గాదా

చ. 1: కన్నుల కలికి నీకుఁ గాచుకున్న దదివో
వెన్నెలబయట నీవు విచ్చేసు దాఁకా
నన్నేల యెలయించేవు నాతో నేల నవ్వేవు
యిన్నేసి మాయలకుఁ జో టీడ నున్నదా

చ. 2: ఆసలఁ బొరుగుచెలి అలకించినదివో
వేసాల నీ మాట లెల్ల విన్నదాఁకాను
గాసిఁ బెట్టకు నన్ను యేకతములు మాను నాతో
నీసటల కింతేసి కల్లా నే నోపెనా

చ. 3: మునుపే ని న్నాపె గూడి మోము చూచినదివో
ననుపై సోరణగండ్ల నప్పు కొంటేను
యెనసితి విదె నన్ను యిప్పుడె శ్రీ వేంకటేశ
చెనకే నీ చేఁతలకు చెప్ప నున్నదా.

రేకు: 0407-4 సామంతం సంపుటం: 12-040

పల్లవి: యిప్ప డే విచ్చేసితి విఁక నేలా
అప్పటప్పటి యాసల నలసె నా మనసూ

చ. 1: పిలిపించే వనీ యట్టే ప్రేమతోఁ గాచు కుండితి
చెలుల నంపే వంటాఁ జెంగలించితి
అలరి నీవే వచ్చే వంటా నెదురుచూచితి
వెలలేని వేడుకల వేగెఁ బొద్దు నాకును

చ. 2: యింటిలో నున్నాఁడ వంటా నింతటాను వెదకితి
కంటి నంటా నీడ చూచి గడె వెట్టితి
అంటఁ బారి పట్టఁబోయి ఆయములు మరచితి
వెంటనే నా భ్రమ తల వేగెఁ బొద్దు నాకును

చ. 3: సారె సారె నిన్నుఁ బాడి జాగరాలు చేసితిని
నీ రూపు దలపోసి నివ్వెరగైతి
యీ రీతి శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వే రతికేలి మన్నన వేగె బొద్దు నాకును.

రేకు: 0407-5 దేసాళం సంపుటం: 12-041

పల్లవి: యింక నేల మా విన్నపాలిన్నియు నిందే వున్నవి
సంకు దీరె మాకు మీకు సారె మొక్కేమయ్యా

చ. 1: యెప్పుడు చూతునో యంటా యింతి నిన్నుఁ దలపోసి
చిప్పిలఁ దన చెక్కులు చెమరించెను
అప్పుడే నీవు విచ్చేసి ఆపెమోము చూచి నవ్వి
విప్పుచు సురటిఁ గొని విసరితి వయ్యా

చ. 2: యేమాటో నిన్నాడే నని యెదుట నీ వుండఁగాను
మోమోటానఁ బులకించి మోనాన నుండె
ఆమాటే నీవు నాడి అంగన మే నెల్లా నిండ
చే ముట్టి గందవొడి నించితి గద వయ్యా

చ. 3: ఇట్టే నిన్ను నిలిపి ఇచ్చకము సేసే నంటా
దట్ట మై శ్రీ వేంకటేశ తమకించెను
అట్టి నీవూ నిలిచి అతివఁ గూడి మరియు
మట్టు మీరఁ జన విచ్చి మన్నించితి వయ్యా.

రేకు: 0407-6 సాళంగం సంపుటం: 12-042

పల్లవి: చేసిననేరమి నీతోఁ జెప్పక పోదు
దోసము లే దనవయ్య తొత్త నీకు నేను

చ. 1: సడిఁ బెట్టినట్టి నా సవతి మచ్చరమున
తొడిఁబడ నూరకే దూరితి నిన్ను
జడిగొన్న ఆపె తోడి జగడపు వేళ నిన్ను
వడి నాకాలు దాఁకినా వంగి మొక్క నైతిని

చ. 2: గాఁటపుఁ బొరుగువారి కాంతాళపుఁ బరాకున
మాటాడినా నీ తోడ మాటాడ నైతి
నాఁటఁగ నాపెఁ దిట్టుతా నా తమ్మ నీపైఁ బడితే
పాటించి తుడువ నైతిఁ బంత మియ్య నైతిని

చ. 3: దిమ్మురేఁ చే వారితోడఁ దిట్లాడే పరాకున
యెమ్మెతో నీవు వచ్చిన దెఱఁగ నైతి
కమ్మక శ్రీ వేంకటేశ గక్కున నన్నుఁ గూడితి
నెమ్మది నా సంతసాన నిన్ను మెచ్చ నైతిని.

రేకు: 0408-1 కేదారగౌళ సంపుటం: 12-043

పల్లవి: చేముట్టఁ జూమ్మీ నీవు సేసినందుకు
యే మౌదు నే నీకు నేల మొక్కే వయ్యా

చ. 1: నవ్వఁ జూమ్మీ నే నీతో నాఁడు నీవు రానందుకు
నవ్వులు నీ లోలోనే నవ్వుకో వయ్యా
అవ్వలి మోమైతిఁ జూమ్మీ ఆపె యింట నున్నందుకు
యెవ్వతెను నీకు నేను యేల పట్టే వయ్యా

చ. 2: మాటాడఁ జూమ్మీ నీవు మాయలు సేసినందుకు
మాటలు నీలో నాడుకో మాతో నే లయ్యా
నీటునఁ దిట్టి తిఁ జూమ్మీ నీ సుద్దులు విన్నందుకు
యేఁ టికి బాఁ తి మమ్ము నేల చూచే వయ్యా

చ. 3: కౌఁగిలించఁ జూమ్మీ నీవు కాఁ కలు సేసినందుకు
కౌఁ గిట నీకు నీవె కై కొనవయ్యా
వీఁగక శ్రీ వేంకటేశ వేగ నన్నుఁ గూడితివి
యేఁగుఁ బెండ్లి నేఁ డాయ నేల మెచ్చే వయ్యా.

రేకు: 0408-2 రీతిగౌళ సంపుటం: 12-044

పల్లవి: దగ్గరి నీ వున్నప్పుడే తలఁచఁ గాని
సిగ్గున నే కతవేళఁ జింతింతురా

చ. 1: నీవే కావలెఁ గాక నిచ్చ నే నాడేమాటకు
వేవే లైనా నోరుతురా వే రొకరు
తావున నే నొకవేళ తలపోసి చూచుకొని
కావిరి నా లోలోనే కరఁగుదురా

చ. 2: నీ మనసే కావలె నే సొలసే సొలపుల
వోమి(?) విరుగకుండునా వుండఁ బోఁటిది
ఆ మేలు నాకు నాకె అప్పటప్పటి కెంచుక
వేమరుఁ దల వూఁచుక వెర గౌదురా

చ. 3: నీ నేరుపే కావలె నే బిగిసేయందు కెల్లా
వూనుక మరొకటైతే పొందు గూడునా
నే నిట్టే శ్రీ వేంకటేశ నీ నా రతి నేఁ డు చూచి
నానఁగాఁ గల కాలము నవ్వుకొందురా.

రేకు: 0408-3 సామంతం సంపుటం: 12-045

పల్లవి: యెంత జాణరో యీ కలికి
కాంతుఁడ నీ భోగములకే తగునూ

చ. 1: చెలి నీ కౌఁగిటిచెమటలఁ జేసెను
చలువగ నిప్పుడు జల కేలి
అలరుచుఁ గుచముల నదుముచుఁ జేసెను
పలుమరు ముదములఁ బర్వతకేలి

చ. 2: పై పై బెనఁగుచు బాహులతలనే
వైపుగఁ జేసెను పనకేలి
చూపుల నీపయి సొలయుచుఁ జేసెను
పూఁప వసంతము పూవులకేలి

చ. 3: అరుదుగ నట్టివి యధరామృతముల
సరిఁ జేసెను భోజనకేలి
కరఁగుచు శ్రీ వేంకటేశ సేసేను
పరగిన రతులనె పరిణయకేలి.

రేకు: 0408-4 దేసాళం సంపుటం: 12-046

పల్లవి: అన్నియుఁ గనేఁ గాక అప్పటి నేను
యెన్నరాని వేడుకల నెందు వోయే నేనూ

చ. 1: అతి వేషముల నీవు అన లెల్లాఁ బెట్టు కోఁ గా
పతి మాటలాడ నాకుఁ బంతమా నీతో
జతనాన నీ గుణము చక్క నుంటేఁ జాలుఁ గాక
గతి నీవే అది నా భాగ్యము గాదా

చ. 2: తగవు లుపచరించి తారుకాణకు రాఁ గాను
జగడించ నాకు నేఁడు చలమా నీతో
వగదీర నీవె నావద్ద నుంటేఁ జాలుఁ గాక
తెగని నాపాలిటి దేవరవు గావా

చ. 3: మచ్చిక కౌఁగిటి నించి మంచ మెక్కు మనఁగాను
హెచ్చి నిన్ను దోయఁగ నే నెదురా నీతో
అచ్చమై శ్రీ వేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
కొచ్చి కొచ్చి నేఁ గోరిన కోరి కిదే కాదా.

రేకు: 0408-5 ముఖారి సంపుటం: 12-047

పల్లవి: యేది నీ జాణతన మిందులోనను
సోదించి నీ యెమ్మె నన్ను సూడు వట్టీ నా

చ. 1: చేరి నీవు రాఁగాను సిగ్గువడి వొదిగితే
ఆ రీతి నూరకే తిట్టేవమ్మ మీఁదను
మారుకు మారు నిన్నంటే మరి యేమి సేసేవు
రాజసము మా పయి నెపము వేసీనా

చ. 2: ముప్పిరి నీవు చూడఁ గా ముసుఁ గు నేఁ బెట్టుకొంటే
వొప్పుగఁ బూవుల వేసె వొళ్ళు దాఁకను
అప్పటి నే నిమ్మపంట నట్టే నిన్ను వేసితేను
కప్పి నీ నేరుపు నాపై ఘాత సేసీనా

చ. 3: నెట్టన నీవు పైకోఁగా నివ్వెరగుతో నుండితే
వొట్టి మదన ముద్రలు వొళ్ళ నించితి
గుట్టుతో శ్రీ వేంకటేశ కూడితి నేనే నిన్ను
దిట్ట నీ నవ్వులు మమ్ము దిమ్ము రేచీనా.

రేకు: 0408-6 పాడి సంపుటం: 12-048

పల్లవి: నీ వెంత సేసినాను నీ చిత్త మింతే కాక
కైవసమైన యాతఁడు కాంతాళించీనా

చ. 1: నెట్టుకొని యీడనుండి నీతోనే మాటలాడీ
పట్టిన చలము మాని పలుకరాదా
యిట్టె యెందో వుండె నంటా నింత సేతురా నీవు
గుట్టుతోడివాఁ డతఁడు కోపగించీనా

చ. 2: అప్పటి నీ తిట్లకు నాతఁ డట్టే నవ్వు నవ్వీ
రెప్ప లెత్తి చూడరాదా రేసు లేఁటికే
చెప్పించుకొందురా నీవు చేతికి లోనై నందుకు
తప్పులేనివాఁ డతఁ డు తమకించీనా

చ. 3: కన్నులనే నీకు మొక్కి కౌఁగిలించీ నాతఁడు
యిన్నేసి మతకా లేల, యెనయ రాదా
సన్నల శ్రీవేంకటేశుఁ జన విచ్చి కూడితివి
మన్నించి లోనై నతఁ డు మారుకొనీనా.

రేకు: 0409-1 భౌళి సంపుటం: 12-049

పల్లవి: యెంతైన నా వోజ మానఁ డేమి సేతును
అంతరంగ మెల్లా నాతో నానతియ్యవయ్యా

చ. 1: నీ మన్నన పట్టు కొని నే నిందరీ నవ్వుదును
వేమరు నా రాజసాన విఱ్ఱవీఁగుదు
చేముంచి యిదెల్లా నీ చిత్తము వచ్చునో రాదో
ఆ మాట నాతో నీవానతియ్యవయ్యా

చ. 2: పెంచిన మందెమేళాన పెక్కు వెంగే లాడుదును
కొంచక సవతులను కోపగింతును
పంచల నీ వలపు లేప డఁతిపై నుండునో
అంచు మోవ నాకు నదే ఆనతియ్యవయ్యా

చ. 3: యెనసినసంతసాన యెవ్వరినిఁ గైకోను
చనవున బొమ్మలనే జంకింతును
వొనర శ్రీ వేంకటేశ వొక్క టైతి మిద్దరము
అనుమాన మెల్లఁ బాసె నానతియ్యవయ్యా.

రేకు: 0409-2 భ పుళి సంపుటం: 12-050

పల్లవి: ననుపు లేని చనవు నా కేలయ్యా
యెనసిన వారి మాటే ఇంపులు గాక

చ. 1: తగవులఁ బెట్టి పెట్టి తమకించి నిన్నుఁ దిట్టి
నగి నిన్ను సాదించ నా కేలయ్యా
మొగము చూడఁగా నీ మోహపు మన్ననవారే
అగ డెంత సేసినాను అమరుఁ గాకా

చ. 2: సటలకే మొక్కు మొక్కి సంగడి నీ కాలు దొక్కి
నటనలే పచరించ నా కేలయ్యా
ఘటన మందెమేళాన గద్దించే వారే నీకు
చిటుకన నీ సేవలు సేసేరు గాక

చ. 3: కమ్మటి సన్నలు సేసి కాతరాన గురి వాసి
నమ్మ నంటా బా సడుగ నా కేలయ్యా
యిమ్ముల శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
యెమ్మెలు నీ వెవ్వరైనా నెఱిఁగేరు గాకా.

రేకు: 0409-3 దేవగాంధారి సంపుటం: 12-051

పల్లవి: బడలి వున్నది మోము పచ్చి దేరీని
చిడిముడిఁ బన్నీరు చిత్తగించవయ్యా

చ. 1: విందువలె మా యింటికి విచ్చేసితి విన్నాళ్ళకు
కుందనపు పీఁటమీఁదఁ గూచుండవయ్యా
వొందిలి నిన్నంతేసి వుపచరించ నేరము
అందపు నా చిలుక ప్రియము వినవయ్యా

చ. 2: నా మోమై నన్నుఁ జూచి నవ్వితి విన్నాళ్ళకు
కామించినా జవ్వనమేకాని కేదయ్యా
యే మనవలెనో నీతో నెఱఁగము మాటాడ
ఆమని మా మోవితేనె లారగించవయ్యా

చ. 1: కోరి నాపైఁ జేయి వేసి కూడితి విన్నాళ్ళకు
కేరుచుఁ జుట్టమవు మొక్కించుకోవయ్యా
యీ రీతి శ్రీ వేంకటేశ యిత వేదో తెలియము
నేరుపు నీ బుద్ధి నాకు నేఁడు గృపనయ్యా.

రేకు: 0409-4 సాళంగం సంపుటం: 12-052

పల్లవి: నీవేమి సేతువయ్య నీవు మంచివాఁడవు
ఆవల నీపాపము నిన్ననఁ జోటేది

చ. 1: పాయపు నా వయసేకా పాసినప్పుడెల్ల నిన్ను
తోయపు మాటల నిన్ను దూరించెను
దాయి దండయినా తమకము లివియేకా
సేయరాని వినయాలు సేయించెను

చ. 2: తెగని నామనసేకా దిన దినమాసలనే
వెగటుగ నీ వెంటవెంటఁ దెప్పించె
మొగము చూచి నా మొగమోట మిదియేకా
నగుతానేమిటికైన నన్నేడి గట్టించెను

చ. 2: పొంచిన నా జన్మమేకా పొందు సేసీ నీతోడ
లంచపు కౌఁగిట లోలో లంకె బెట్టెను
యెంచఁగ శ్రీ వేంకటేశ యిట్టే నన్ను గూడితివి
మించిన నారతులెల్ల మెప్పించెనూ.

రేకు: 0409-5 దేసాళం సంపుటం: 12-053

పల్లవి: యింకాఁ జిన్నకూఁతురా యింతేలమ్మా
పొంకపు జవ్వని కిట్టే బుద్ధి చెప్ప రమ్మా

చ. 1: సెలవి నవ్వులుదేరి సిగ్గులు మోమునఁ గారీ
అలివేణి నిదేలని యడుగరమ్మా
బలిమిసేసి యతఁడు పైఁ జేయి వేయఁగాను
వులికి గోళ్ళఁ జిమ్మీ నొద్దనరమ్మా

చ. 2: కన్నులకుఁ గెంపు లెక్కె కాయము లోలోఁ జొక్కె
యిన్నేసి సుద్దులు దనకెక్కడి వమ్మా
సన్నలు సేసి విభుఁడు చనవు మెరయఁగాను
నిన్నటనుండి యలిగీ నేఁడు మొక్కరమ్మా

చ. 3: తమకము మతి నిండెఁ దపము లన్నియుఁ బండె
సముకాన మోనములు చవి గావమ్మా
అమర శ్రీ వేంకటేశుఁ డాదరించి కూడఁగాను
జమలి పంతము లిట్టే సరిఁ దూగీనమ్మా.

రేకు: 0409-6 దేశాక్షి సంపుటం: 12-054

పల్లవి: నే నున్నదాన నని నీ విటు లోఁగక
పూని యాపె నే పొగడుమీ విభుఁ డా

చ. 1: ఘనకుచగిరు లటు గదలఁగ వడిగా
వనిత నీ కెదురు వచ్చినదే
పెనఁగక నీ కాపె ప్రియములు చెప్పిన
చెనకి నీ వా పని సేయుమీ విభుఁడా

చ. 2: దవ్వుల మొక్కులఁ దతిగొని మాటల
జవ్వని వలపులు చల్లినదే
రవ్వగఁ గౌఁగిట రతికిఁ దీసితే
నవ్వక కూడుమీ ననుపున విభుఁడా

చ. 3: మంతన మెఱఁగక మఱి నినుఁ గూడుచు
కాంత పయ్య దటు గప్పినదే
యింతలో శ్రీ వేంకటేశ ననుఁ గూడితి
వంతయు నాపెనే అడుగుమీ విభుఁడా

రేకు: 0410-1 పిసాళం సంపుటం: 12-055

పల్లవి: మరిగి మూసి దాఁచ మన కేల
సొరిది నాతని కీపెఁ జూపరమ్మా

చ. 1: చెక్కునఁ జేయి వెట్టుక చింతలఁ జిగురులమ్మీ
నిక్కువ విరహవేళ నీ లేమ
చొక్కపు విభుఁడు వేఁడె సుంకము దనకు వచ్చు
చిక్కెఁ దనపాలిటికిఁ జెప్పరమ్మ చెలులు

చ. 2: మనసునఁ గాంతాళించి మల్లెలఁ బువ్వులు గోసీ
యెనలేని తమకాన నీయింతి
అనుగు విభుఁడు వాఁడె అరిగోలు దనసొమ్ము
వెనక ముందర విన్నవించరమ్మ చెలులూ

చ. 3: ముంచిన కూటములనె మోవులఁ బండ్లు దాఁచీ
నెంచరాని యడియాస నీ లేమ
యెంచక శ్రీ వేంకటేశుఁ డింతలోనే యీపెఁ గూడె
నంచెల నితనిఁ గొనియాడరమ్మ చెలులు.

రేకు: 0410-2 మంగళ కౌశిక సంపుటం: 12-056

పల్లవి: యెక్కడ వొయ్యేము మనమింతలోననూ
వెక్కసాలు సేయఁబోతే వెగటులై తోఁచవా

చ. 1: వావులు దెలిపి నే నే వచ్చితే నవ్వేవు గాక
చే వట్టి తియ్యకువయ్య చెప్పేఁ గాని
మోవి చూపి మాటాడితే మోహము చల్లేవు గాక
యీవేళ వేగిరించితే నెగసక్కెము గాదా

చ. 2: చేతు లెత్తి మొక్కి చేఁత సేసితే మెచ్చేవు గాక
కాతరించ నేటికియ్య కై కొనెఁ గాని
యీతల నేఁ గొసరితే యియ్యకొనె దప్పుడింతే
యేతులకుఁ బెనఁగితే నిచ్చకము లనరా

చ. 3: పంత మెచ్చి నీ కొంగు పట్టితేఁ గూడేవు గాక
అంతలోనె కలసితి వదేమో కాని
చెంతల శ్రీ వేంకటేశ చెల్లు నీకు నాకు నివి
మంతనాలు నెరపితే మాయలై నిలువవా.

రేకు: 0410-3 శంకరాభ రణం సంపుటం: 12-057

పల్లవి: చెప్పఁగఁ జాలర సిగ్గుననూ
అప్పుడే నవ్వుల నలసితిని

చ. 1: పాయకురా ననుఁ బైకొని నీ
మాయల వలపుల మరిగితిని
చేయి వేసి యింకాఁ జెనకేవా నీ
కాయపు సోఁ కులఁ గరఁగితిని

చ. 2: మానకురా యిటు మాటాడీని
నానుడిబాసలు నమ్మితిని
కానీ లే యెఱుఁగుదుఁ గత లేల
నేనే నీ వై నెగడితిని

చ. 3: విడువకురా వేయి వే యైనా
వుడివోని రతుల నొనరితిని
కడఁగిన శ్రీవేంకట విభుఁడా నీ
గుడికొను కౌఁగిటఁ గూడితిని.

రేకు:	0410-4 మాళవిగౌళ	సంపుటం:	12-058

పల్లవి:	యెందుకైన వత్తువు ని న్నెవ్వఁ డెఱుఁగు
నిందలకు వెరవవు నిలవయ్య చాలును

చ. 1:	వాసు లెక్కించి యెక్కించి వద్దన్నా మానక
యీసులు రేఁచితివి మా యిద్దరిలోన
వోసరించి మమ్మప్పటి నొడఁబరచ వచ్చేవు
నీ సుద్దు లెంత లేదు నిలవయ్య చాలును

చ. 2:	సన్నలు చేసి చేసి చలాలకే పోనీక
యిన్నేసి చేసితివి మా యిద్దరిలోన
నన్ను నాపెఁ గూడు మంటా నాయముఁ జెప్ప వచ్చేవు
నిన్న నే యన్నిఁ గంటిమి నిలవయ్య చాలును

చ. 3:	నగవులు నగి నగి నాటకాలకోప మన్న
యెగసక్కేలు చేసితి విద్దరిలోన
జిగి నిద్దరిఁ గూడితి శ్రీ వేంకటేశుఁడ మమ్ము
నిగిడె నీ మతకాలు నిలవయ్య చాలునూ.

రేకు: 0410-5 సాళంగం సంపుటం: 12-059

పల్లవి: అందుకు నే వద్దనేనా అయ్యో నిన్ను
మందలించి యిదె నొకమాయ సేయవలెనా

చ. 1: విరహ వేదనే వేళ విసిగిన నా విసువు
అరసి యెగ్గులు వట్టే వది యేరా
పొరి నెవ్వతింటికైనాఁ బోవలసో యీపొద్దు
వొరసి నాపై నిదొక మాల వేసేవు

చ. 2: ననిచి యేకత వేళ నవ్వినట్టి నవ్వులు
యెనసి రచ్చలఁ బెట్టే విధి యేరా
మనసురానివాఁడవు మతకాలు సేసి నేను
పెనఁగఁ గానె నాతో బిగువు లాడేవూ

చ. 3: భావపరవశమునఁ బలికిన పలుకులు
చేవల వాఁడి సేసేవు చెల్లఁ బోయెరా
యీవల శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
నావద్ద నుండవలసి నన్నుఁ గొసరేవూ.

రేకు: 0410-6 హిందోళవసంతం సంపుటం: 12-060

పల్లవి: ఆపె తో నిన్నియుఁ జెప్పేద దెలఁగను
తేపగాఁ దన గుణాలు తెలిసెఁగా నాకునూ

చ. 1: జగడాలు మానెఁగా సరుస వెనకటివి
యెగసక్కే లింక నెట్ట యినఁ జేయనీ
నగితి నే నెఱఁగక నామగఁ డంటానే
పగవానివలె నింత పఱచే దెలఁగనూ

చ. 2: మోములు చూచితిమిగా మోనాన నిద్దరమును
ఆ మీఁదటి పనులు యెట్టయినాఁ గానీ
దోమటివీడె మిచ్చితిఁ దొల్లిటివలె నంటానే
వేమరు నేఁ దన కింత వేసటౌ తెలఁగనూ

చ. 3: మనసులు గరఁగేఁగా మదనకేలిలోన
ననుపు లన్నియును నే నడుపెఁ గానీ
వొనరి శ్రీ వేంకటేశుఁ డొక్క టైతి నంటానే
చెనకితి గోర నిది సిగ్గవు టెలఁగనూ.

రేకు: 0411-1 సాళంగనాట సంపుటం: 12-061

పల్లవి: కోరో కోరో రారో కోరి విడేలు
సారె సారె నిందరికిఁ జాటితిమి సుండి

చ. 1: పాలవారి పిన్నదాని బలిమిఁ బెండ్లి సేయఁగ
నాలఁ గాచే శ్రీ కృష్ణునికే నడిగేరు
వోలివెట్టి అంతలోనె వుంగరముఁ బెట్టినారు
నీలవర్ణు సోబనము నేఁడే సుండి

చ. 2: చందమామ తోఁబుట్టుగు సరి నందగోపుని
నందనునికినిఁ బొంతనాలు చూచిరి
డిందుపడ నిద్దరికి తెర ఇట్టే పట్టినారు
అందియ్యరో తలఁబాల కాయిత్తము సుండి

చ. 3: జలధిరాజు కూఁతురు సరి శ్రీ వేంకటపతి
నెలమితో వీదు లెల్ల నేఁగించినారు
కొలము కొలముఁ గూడి కొంగులు ముడిచినారు
తలఁపఁ జక్కఁ దనాలు తగుఁ జుండి.

రేకు: 0411-2 పాడి సంపుటం: 12-062

పల్లవి: యిప్పుడే నే నే మన్న నిత వయ్యీనా
ముప్పిరి నాపెమీఁద మోహము నీ కుండఁగా

చ. 1: చాలుఁ జాలు దాని చేతి సణఁగు లెంతలేదు
పోలించి ఇంతలో నేల పొగడేవు
నాలికత్తె దానిమాట నమ్మితివా నీ వప్పుడె
మూలల ములిగే మేలు ముందరనె వున్నది

చ. 2: నగకు నీ వంతదాని నాటకపుఁ జేఁతలకు
బిగిసి నీ వేల ఆనవెట్టు కొనేవు
మొగ మిచ్చలా పెడితే మొదలనే నిజమా
తగవులఁ బెట్ట నిన్ను దాఁ చుకుండీ గాక

చ. 3: కరఁగకు నీవు దాని కౌఁగిటి రతులకును
కెరలి ఇంతలోఁ దమకించే వేల
ఇరవై శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
తెరమరఁ గెల్లఁ బాసె తెలుసుకో ఇంకను.

రేకు: 0411-3 గౌళ సంపుటం: 12-063

పల్లవి: రంటికి(?) నొక్కటే మాట రమణుఁడ నీతోను
నంటున నీ చిత్త మెట్టో నాకింకఁ దెలియదు

చ. 1: నీవే మంచివాఁడ వైతే నెరి నెం దుండిన నేమి
భావించి నిన్నుఁ బొగడఁ బనిలేదు
యే వంక నీవే నాకు నెరవులవాఁడ వైతే
ఆవటించి నిన్ను దూర నంత పని లేదూ

చ. 2: మనసు లేక మైతే మారు మాట లాడవద్దు
చనవుల విన్నపాలు చవి గావు
యెనయక జగడించి యిద్దర మిట్టే వుండిన
మనలోనే విన్నపాలు మరి చవిగావూ

చ. 3: గక్కనఁ గూడితి మిట్టే కైవసమైతివి నాకు
యెక్కువ తక్కువ పంతా లిఁక నేలా
చక్కని శ్రీ వేంకటేశ చలానకే నీ వుండితే
మక్కువలు పయిఁ జల్ల మరి యిఁక నేలా.

రేకు: 0411-4 సాళంగం సంపుటం: 12-064

పల్లవి: ఆసలు వెట్ట కు నన్ను నంతేసి నీవు
కానీ లే నీమతి నింత గలిగి తేనే చాలును

చ. 1: నీ మాట నీకు వచ్చెనె నిన్నేమీ ననలేను
ఆ మీఁదటిపను లిట్టే ఆడవలెనా
కామించి నేఁ బదరితే కక్కూరితిదాన నౌదు
యీ మెలఁత లిద్దరును యెటిఁ గుంటెఁ జాలును

చ. 2: నిన్ను నే మెప్పించితిని నే నే మంచిదాన నైతి
సన్నలవలపు నీపైఁ జల్లవలెనా
నన్ను నేనే మెచ్చుకొంటే నగుఁబాటుదాన నౌదు
నిన్న నేఁటి పంతములు నిలిచితేఁ జాలునూ

చ. 3: నీవే నన్నుఁ గూడితివి నీ కౌఁగిట నున్నదాన
యీ వేళనే మోవితేనె యియ్యవలెనా
శ్రీ వేంకటేశ నిన్నుఁ జెనకితే గబ్బి నౌదు
యీ విధాన నా పొందు నీ కిత వైతేఁ జాలునూ.

రేకు: 0411-5 శ్రీరాగం సంపుటం: 12-065

పల్లవి: మొదల నేఁటికే మోసములూ
కొదలుచు(?) నైనా గొణఁగుదు గానీ

చ. 1: వూరకయైనా నూఁ కొనరాదా
చేరి విభుఁడు కత చెప్పినదే
ఆరయ నీ కోప మంతె కలిగితే
బీరపు రతులలో పెంతువు గానీ

చ. 2: మొగ మోటనైన మొక్కఁగ రాదా
సొగిసి నిన్నతఁడు చూచినదే
తెగువ నీ మతిని తిరముగఁ గలిగితే
చిగురు మోవులలోఁ జిలుకుదు గానీ

చ. 3: ననుపు సేసుకొని నవ్వఁగ రాదా
ఘనుఁడు పచ్చడము గప్పినదే
యెనసెను శ్రీవేంకటేశుఁ డితఁడు నిను
కినిసి సరసములఁ గెరలుదు గానీ.

రేకు: 0411-6 శంకరాభరణం సంపుటం: 12-066

పల్లవి: చెప్పరే యీ తగవు చెలులాల ఆకెకు
కప్పి ముద్దరాలి కేలే గయ్యాళితనమూ

చ. 1: జవ్వనము గలిగితే సరసమాడఁగఁ జెల్లు
నవ్వ నేర్చితే మాటాడ నాయ మగునూ
రవ్వగా మొక్క నేర్చితే రతి జంకించఁగఁ దగు
దవ్వుల నేమీ నేరనిదాని కేలే పగటు

చ. 2: వినయము గలిగితే వెస గర్వించఁగఁ జెల్లు
మనసు దెలిసితేను మచ్చిక చూప నగు
పెనఁగ నేరిచితేను బెరసి పై కొనఁ దగు
నను పెఱఁగని లలనకు నేలే పంతమూ

చ. 3: కూరిమి గలిగితేను గుట్టుతో నుండఁగఁ దగు
మేరతో నుండ నేర్చితే మించ నగును
యీ రీతి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
చేరి కూడె నిఁక నేలే చిత్తిణికిఁ దాలిమీ.

రేకు: 0412-1 ముఖారి సంపుటం: 12-067

పల్లవి: యేల రట్టు సేసుకొనే విందరిలో నీకు నీవే
ఆలరి నీ చేఁతలు నే నాడుకొనవచ్చునా

చ. 1: మోము చూచితే నవ్వేవు మొదల నెవ్వతెవద్ద
యేమేమి సేసితివో యెఱఁగ నేను
చేముంచి ప్రియము లెల్లాఁ జెప్పే వప్పటినాకు
నీ మనసులో సుద్దులు నీకే తెలుసును

చ. 2: మొక్కితే సిగ్గు వడేవు ముచ్చిలి యే వనితకు
అక్కడఁ బెండ్లికొడుకవై వచ్చితివో
చెక్కు నొక్కి వేఁడుకొని చేరి నన్నుఁ దగిలేవు
నిక్కపు నీ గుణములు నీకే తెలుసును

చ. 3: వట్టి తేనే యలికేవు పై పై నే సతిగురుతు
లిట్టే నీ మేనిమీఁద నెన్ని యున్నవో
అట్టే శ్రీ వేంకటేశ అలమేలు మంగ నేను
నెట్టు కొని కూడితివి నీకే తెలుసునూ.

రేకు: 0412-2 పాడి సంపుటం: 12-068

పల్లవి: యెఱఁ గనా తనసుద్దు లిన్నియు నే విననా
మఱి నాతో దొఱఁగుచు మందలించీఁ గాక

చ. 1: చెలిఁ జూచి పరాకు సేసుకొని నా ముందర
పొలసి నిన్న నెట్లాఁ బొందు సేసేను
యెలమి నావద్ద వచ్చి యెఱఁ గనట్టే వున్నాఁడు
సొలసి ఇందాఁకా నెట్టు జూజాలందు నాడెనే

చ. 2: చేరవచ్చితే నాపెతో సిగ్గులు వడేటివాఁడు
సారెకు నెట్లా సరసము లాడెనే
కూరిమి నన్నుఁ బాయక కూడినట్టే వున్నవాఁడు
గారవించి యెట్లా రేకలు వెట్టి అంపెనే

చ. 3: మగువఁ దాను తెరమఱఁగుల నున్నవారు
తగిలి యెట్టాడ మెడఁ దాళి గట్టే నే
జిగి నలమేల్మంగను శ్రీ వేంకటేశుఁడు దాను
పగటున నన్నుఁ గూడి పాయ కాపెఁ గూఁడెనే.

రేకు: 0412-3 లలిత సంపుటం: 12-069

పల్లవి: మఱి యేల దాఁ చేవూ మాకు నీ వలపులు
యెఱిఁగిన పనులకు నేల వొద్దు వెఱవు

చ. 1: చెక్కు నొక్కి వేఁడుకొనెఁ జెలియ నిన్ను
గక్కున నీ మోమునఁ గళ రెక్కె ను
వొక్కటియ్యై యాకె నీ వొడి పట్టెను
మక్కువతో నీ మేనఁ జెమటలు నిండెను

చ. 2: ఆనుక చన్నుల నొత్తె నంగన నిన్ను
మే నెల్లఁ బులకించె మిక్కిలి నీకు
నానఁ బెట్టి యాకె నీతో నవ్వు నవ్వెను
కానుకగా నీ మనసు కరఁగి చొక్కితివి

చ. 3: పొంచి నిన్నుఁ గౌఁగిలించె భూ రమణి
మించె నీకు నానందము మీఁద మీఁదనూ
యెంచఁగ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
అంచెల నన్నేలితివి ఆకె నిన్ను మెచ్చెనూ.

రేకు:	0412-4 హిజ్జిజి	సంపుటం:	12-070

పల్లవి:	నే నే ప్రియము చెప్పే నేఁ డిందుకు రమ్మనవే
తానే యెఱుఁగు నా తన సంది తగవు

చ. 1:	ఆఁటది యైన దానికి అణఁకువ వలెఁ గాక
యీటు లేని మగవాని కేలే యిది
గాఁటమైన వినయమూఁ గాంతకే వలెఁ గాక
మాటులేని నాయకుఁడు మరి కడమ లేలే

చ. 2:	వనితయైన దానికి వంచనము వలెఁగాక
ఘనుఁడైన వాని కేలే కమ్మటినిది
పెనఁగుచుఁ గామినికి పిలువఁగవలెఁ గాక
యెనలేని పంతగాఁడు యిఁక నేలే తనకు

చ. 3:	దేవులైన దానికి వొద్దిక మొక్కవలెఁ గాక
శ్రీ వేంకటేశ్వరు కేలే సిగ్గుతో నిది
కైవసమై అలమేల్మంగను తానే నన్నుఁగూడె
చేవ మీరినట్టి జాణ చెప్ప నేలే తనకూ.

రేకు: 0412-5 సామంతం సంపుటం: 12-071

పల్లవి: నీకును నివియే నేరుపులు
కై కొని యీ కాంతఁ గరుణ నేలుమూ

చ. 1: చనవరి కాంతలు జరసి (?) పలికితే
మనసునఁ బెట్టఁడు మగవాఁడు
పనివడి వలపునఁ బైఁ జేయి వేసిన
వినయముగాఁ గొను వేడుకతోను

చ. 2: ఆసతోడ సతి ఆయము లంటితే
వేసరఁగ రాదు విభునికిని
వోసరించ కటు వుదుటున నవ్విన
రాసి కెక్క సంతోసము నెరవు

చ. 3: కడు ననిచిన చెలిఁ గౌఁగిట నించితే
విడు మని యెంచఁడు విభుఁడెపుడూ
బడి నలమేల్మంగపతి శ్రీ వేంకటేశ
ఆడరి యేలితివి ఆ తగ వాయ.

రేకు: 0412-6 భైరవి సంపుటం: 12-072

పల్లవి: యిందుముఖిఁ గరుణించు మింతట నీవు
యెందాఁకా విన్నవించేము యింకా నీకూ

చ. 1: మగువకు నీ విచ్చిన మాటపట్టు దలఁచుకో
తగిన చుట్టరికము దలఁచుకో
మొగి నాపె యెడకు నీ మొగమోట దలఁచుకో
నగుతా సరసమాడే ననుపు దలఁచుకో

చ. 3: పడఁతిపై నీవు సేసేబత్తి యెైనాఁ దలఁచుకో
తడఁబడే రతి పొందు దలఁచుకో
కడు బుజ్జగించే నీ కరుణ దలఁచుకో
బడివాయకుండేటి నీ భావము దలఁచుకో

చ. 3: అలమేల్మంగకు రేఁచే యాస లిట్టే తలఁచుకో
తలకొన్న నీ వేడుక దలఁచుకో
యెలమి శ్రీ వేంకటేశ యీకె నిట్టే యేలితివి
పిలిచి మన్నించే నీ బిరుదు దలఁచుకో.

రేకు: 0413-1 సామంతం సంపుటం: 12-073

పల్లవి: నే నెంతదానను నీవే యెక్కుడు గాక
పూని యెంత సంతోషింతు పూఁచి పట్టి నిన్నునూ

చ. 1: మగువల నీవెంత మన్నించి యేలినాను
నెగడు లోకములోన నీ కీరితి
తగిలి నీవెంత పెద్దరికము సేసినాను
పొగడుదురు నిన్ననే పొలఁతు లిందరును

చ. 2: వూడిగపు వారి నెట్టు వుపచరించి మెచ్చినా
తోడ నీ వుదారత్వమే దొడ్డై వుండును
వేడుకతో నీ వెన్ని విధముల రక్షించినా
వాడికతో మెత్తురు నీ వాసివన్నె లెల్లాను

చ. 3: నీవే గతి యనువారి నీ విట్టే మనిపినాను
భావించి చూడ నీ ప్రతాప మే నిండెను
వే వేలై యలమేల్మంగ విభుఁడ శ్రీవేంకటేశ
దైవమా యేలి తి దంతయును నీ సంప దే.

రేకు: 0413-2 బౌళి సంపుటం: 12-074

పల్లవి: పదివేలు మొక్కులు నీ పాదాలకు మొక్కే నిదే
యిదె నిన్ను వేడుకొనే నింటికి రావయ్యా

చ. 1: పొత్తుల మాటలు నిన్నుఁ బొదిగి యే మాడితినో
చిత్తగించి నాపై దయ సేయవయ్యా
కొత్తలుగా నే నెంత గునిసి జంకించితినో
ఇత్తల నోరుచుకొని యింటికి రావయ్యా

చ. 1: చెనకి నిన్నే మేమి సేఁతలు సేసితినో
మనవి చేకొని నన్ను మన్నించవయ్యా
తనివి దీరఁగ నిన్ను తప్పు లెట్టు వట్టితినో
యెనసి నవ్వు సేసుక ఇంటికి రావయ్యా

చ. 1: కడుఁ దమకించి చనుఁగవ నిన్నె ట్టొత్తితినో
చిడిముడితో నన్ను రక్షించుకోవయ్యా
అడరి శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
యెడయ కేలితి విట్టే యింటికి రావయ్యా.

రేకు: 0413-3 గౌళ సంపుటం: 12-075

పల్లవి: యెంత కాతరపు దని యెంచేవు గనక నీవు
సంతోసాన సారె నిన్ను జరతుఁ జూమ్మీ

చ. 1: తలఁపులో నీవు నాపై దయగల దెఱుఁగుదు
వలపు మిక్కుటమై సొలతుఁ గాని
చలివాయ నీవు నాకు చన విచ్చు టెఱుఁగుదు
పిలిచి నీతో నూరకె పెనఁగుదుఁ గాని

చ. 1: చేరి నాతోఁ గాఁపురము సేసేది నే నెఱుఁగుదు
కోరి నీపై బత్తితోడ గునుతుఁ గాని
గారవించి నీవు నన్నుఁ గలసేది నే నెఱుఁగుదు
కేరి నీ వింత రతికి వేగిరింతుఁ గాని

చ. 1: పురము పైన న్నిడుక వుండేది నే నెఱుఁగుదు
సరసములకు నిన్ను సాదింతుఁగాని
నిరతి శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
పరగ నేలితి వింకాఁ బచారింతుఁ గాని.

రేకు: 0413-4 సాళంగనాట సంపుటం: 12-076

పల్లవి: యిట్టి భాగ్యము గంటిమి యిద్దరూ బదుకరయ్యా
పట్టము గట్టు కొంటివి పచ్చి దేరె నయ్యా

చ. 1: చెలియ తోడే నీకు సింహాసనపు గద్దె
అలరుఁ జూపులే రత్నాభిషేకము
చలువైన నవ్వులే ఛత్రచామరములు
కలిగె నీ కింక నేమి గావలె నయ్యా

చ. 2: చనుఁగవలే నీకు సామ్రాజ్యదుర్గములు
నినుపు మోవితేనెలు నిచ్చబోనాలు
వొనరిన కౌఁగిలే వుండెడి నీ నగరు
యెనయ నబ్బె నీ భాగ్య మీడేరె నయ్యా

చ. 3: రతిచెనకులే నీకు రవణపు సొమ్ములు
సతతపు గూటమే సర్వ సంపద
యితవై శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
సత మాయ మమ్ము నేలి జాణ వైతివయ్యా

రేకు: 0413-5 సౌరాష్ట్రం సంపుటం: 12-077

పల్లవి: యీతఁడు దయగలఁడు యెప్పుడును నీమీఁద
చేతులార నీకు నీవే సేవ లెల్లాఁ జేయవే

చ. 1: యిచ్చక మాడితేఁ జాలు నెదురు మాటాడ వచ్చు
వచ్చి దేర సతికి నీ పతితోను
చెచ్చెర మొక్కితేఁ జాలు సేఁత లన్నిఁ జేయవచ్చు
యిచ్చట నితనికేఁగా నేఁటికి లోఁగేవే

చ. 2: చెంది నవ్వితేఁ జాలు చెనకులు నించవచ్చు
మందలించి వనితకు మగనితోను
పొందులు సేసితేఁ జాలు బొమ్మలఁ జంకించ వచ్చు
అందరిముందరా నేల అనుమానించేవే

చ. 3: ప్రియము చెప్పితేఁ జాలు బిగ్గిఁ గౌఁగిలించవచ్చు
నయగారికాంతకు నాథునితోను
దయ నలమేల్మంగ నితఁడు శ్రీ వేంకటేశుఁడు
క్రియతోఁ గూడె నింక జయ మయ్యె నిపుడూ.

రేకు: 0413-6 ధన్నాసి సంపుటం: 12-078

పల్లవి: చూచినారు దయ పుట్టే సొంప నీ చిత్త మెట్టో
కాచి నీకు మొక్కె కప్పుర గంది

చ. 1: కూరిమి గొసరె నిన్నుఁ గొచ్చి కొచ్చి ఇందాఁకా
చేరఁడేసి కన్నుల చెలియ
నేరుపుల మాటల నీకుఁ బ్రియములు చెప్పె
సారె వినయముతో జవరాలూ

చ. 1: వొట్టుక నీ కైలా గిచ్చి వూడిగా లెల్లాఁ జేసె
పట్టెఁడేసి గుబ్బల పడఁతి
నెట్టు కొన్నయాసతోడ నిండు సరసము లాడె
దట్టపు నవ్వులతోడ తగు ముద్దరాలు

చ. 1: సమ్మతించఁ జేసి నిన్ను సారె సారెఁ గొఁగిలించె
కమ్మిక మూరెఁడు గొప్పు కలికి
యిమ్ముల శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
నెమ్మి నీ రతి వెలసె నిచ్చ పెండ్లికూతురూ.

రేకు: 0414-1 మధ్యమావతి సంపుటం: 12-079

పల్లవి: యిన్నిటా మన్నించితివి యీ మే లెఱుఁ గు నింతి
విన్నదాఁ కా సుద్దులకు వేడుక సేసీని

చ. 1: చిత్తమునఁ బట్టె నా చేసిన విన్నపములు
బత్తి నీపైఁ జేసినది భావించితినా
మత్తిలి నీ దేవులకు మారుమాట లేమంటివి
యిత్తల నాకె నీ రాక కెదురుచూచీని

చ. 2: కంటి వాని కంపిన కానిక లెల్లాఁ గన్నుల
ఇంటికి రమ్మన్నందుకు నియ్యకొంటివా
అంటిన నీ తలఁ పు లేమని వక్కణింతు నేను
నంటున నీ కూటమికి నమ్మి కాచుకున్నది

చ. 3: అవధరించితివా ఆదివో అలమేల్మంగ
జవళి శ్రీ వేంకటేశ సతమైతివా
భువి నిట్టె సంతతము పొసఁగఁగ మన్నించేవా
వివరించు దాఁ కా నన్ను వెసఁ జూచుకున్నది.

రేకు: 0414-2 ఆహిరి సంపుటం: 12-080

పల్లవి: యేల తప్పించుకొనేవు యియ్యకోరాదా
వాలాయించిన పనులు వద్దనఁగ వచ్చునా

చ. 1: మచ్చికైన సతి నిన్ను మలసి కౌఁగిలించితే
యిచ్చగించవలెఁ గాని యెడయరాదు
రచ్చఁబడ్డ వలపులు రమణ నణఁగునా
తచ్చి కస్తూరి పూసితే దాఁగునా వాసనలు

చ. 2: వేడుక కత్తెయైనది వీడెము చేతి కిచ్చితే
తోడనే యందుట గాని తొలఁగరాదు
కూడిన తొల్లిటి పొందు గూఁటఁ బెట్టితే నుండునా
నీడగా మొయిలు వచ్చితే నీవు దొబ్బఁ గలవా

చ. 3: కలికియైనది నీపై గక్కన సేస వెట్టితే
పిలిచి యలమి యిఁకఁ బెనఁగరాదు
అలమేలుమంగ పతివైన శ్రీ వేంకటేశ్వర
యిల మేన వారి వావి యెంతైనాఁ బాసునా.

రేకు: 0414-3 లలిత సంపుటం: 12-081

పల్లవి: పేరటాండ్లు సోబాన బెరసి పాడేరు గాని
చేరి మాకు సంతోసము సేయుఁడీ ఇప్పుడు

చ. 2: చెంగలి చూపులఁ జూచెఁ జెలియ నిన్ను
అంగవించి నవ్వితివి అందుకు నీవు
సంగ తాయ నిద్దరికి సరి మోహము
సింగారపుఁ బెండ్లి పీఁటఁ జెంది కూచుండరయ్యా

చ. 1: సరసపుమాట లాడె సకియ నీతో
నిరవుగ సమ్మతించి ఇయ్యకొంటివి
అరుదుగఁ దారుకాణ లాయ మీ పొందు
సరవిగా మీరు సేసలు చల్లరయ్యా

చ. 3: అట్టే నీపైఁ జేయి వేసె నలమేల్మంగ
గట్టిగా శ్రీ వేంకటేశ కౌఁగిలించితి
గుట్టు దెలిసెను మీమీ గుణము లెల్లా
నెట్టు కొని పాయక మీ నేర్పులు చూపరయ్యా.

రేకు: 0414-4 మాళవిగౌళ సంపుటం: 12-082

పల్లవి: కొమ్మ నిన్నుఁ బొగడె నీగుణము లెల్లా నెంచి
యిమ్ముల నీ విద్యలకు నెంత జాణవో

చ. 1: కాఁపురము సేసేవారిఁ గరుణించా నేరుతువు
చేపట్టి లాలసము సేయనేర్తువు
తీపుల మాటలు నేర్పి తిద్దుకొనా నేరుతువు
యే పొద్దుఁ జెలుల మిఁక నేమి విన్నవించేము

చ. 2: కోరినట్టు రతులలోఁ గూడి యుండ నేరుతువు
కూరిమి సేవ సేయించుకొన నేర్తువు
సారె సారె నవ్వు నవ్వి సరసమాడ నేర్తువు
యీరీతిఁ జెలులము యేమి విన్నవించేము

చ. 3: చిత్తగించి పెండ్లాడి సేసవెట్ట నేరుతువు
కొత్తలుగా మన్నించి కూడ నేర్తువు
బత్తితో నలమేల్మంగపతివి శ్రీ వేంకటేశ
యిత్తల చెలులము నే మేమి విన్నవించేము.

రేకు: 0414-5 రామక్రియ సంపుటం: 12-083

పల్లవి: మేలయ్యు మన్నించితివి మెలఁత నీ వేళఁ గాచి
తాలిమితో నిన్ను నిట్టే దక్కఁగొనవలెను

చ. 1: ఆముకొన్న జవ్వనము అది యెంత గలిగినా
కామించి నీ కరుణ గలదే కాంత
నేమముతో నాకె యెంత నేరుపులు నేరిచినా
దోమటి నీ మోవితేనె దొరకుటే భాగ్యము

చ. 2: వే వేలు చక్కఁ దనాల విట్టువీఁ గు చుండినాను
నీవు చేపట్టి నదే నెయ్యపు సతి
తావుకొని మరి యెన్ని తా నోములు నోఁ చినాను
వోవరిలోని దేవులై వుండినదే భాగ్యము

చ. 3: సాదించి మిక్కిలి యెంత సంపద గలిగినా నీ
వాదరించి కూడినదే అలమేల్మంగ
మోదపు శ్రీ వేంకటేశ ముంచి యీకె యెట్టుండినా
ఆది గొన్న నీ రతు లబ్బినదే భాగ్యము.

రేకు: 0414-6 సాళంగనాట సంపుటం: 12-084

పల్లవి: సంతోసాన నుండరో సతులాల
మంతనాన నాతఁడే మన్నించీఁ గాని

చ. 1: చెలులను దూఱవద్దు చిత్తము గలఁగవద్దు
మలసి యాతఁడే నన్ను మన్నించీఁ గాని
బలిమి సేయఁగ వద్దు పదరి పెనఁగ వద్దు
నెలకొన్న కాఁపురము నెరవేర్చీఁ గాని

చ. 2: సన్నలు సేయఁగ వద్దు చలము సాదించవద్దు
యిన్నిటా నాతఁడే నన్ను నేలీఁగాని
విన్నఁ బోవ వద్దు మరి వెలవెలఁ బారవద్దు
పన్నుకొన్న వేడుకలు పచరించీఁ గాని

చ. 3: కొంగువట్టి తియ్యవద్దు కొసరి సొలయవద్దు
యింగిత మెఱిఁగి తానే యెనసీఁ గాని
అంగపు శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
చెంగటఁ గూడె నింకాఁ జిత్తగించీఁ గాని.

రేకు: 0415-1 సాళంగనాట సంపుటం: 12-085

పల్లవి: నీ మన సెట్టు దెలుసు నే మెంతవారము
మోము చూచి నీ కిందుకే మొక్కేము నేము

చ. 1: వొక్కతెపైఁ బరాకై నట్టుండుదువు
గక్కన మా మోము చూచి కరుణింతువు
నిక్కపు రాజసములు నెరపుదువూ
మక్కువఁ జేయి చాఁచి మన్నింతువూ

చ. 2: కుమ్మరింపు సిగ్గులతో గుట్టు సేతువు
సమ్మతించి యంతలోనే చనవిత్తువూ
యెమ్మెలకు నింపు చల్లి యెలయింతువూ
కమ్మర నే పొద్దూ నా కౌఁగిటనే వుందువు

చ. 3: వేడుకకు నీవు సెలవి నవ్వుదువూ
జోడు గూడి నీ మహిమ చూపుదువూ
యీడనే శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
జాడ దప్పక నీ మోవిచవులు చూపుదువు.

రేకు: 0415-2 శ్రీరాగం సంపుటం: 12-086

పల్లవి: వనితలు నీకే వలచు టేమరుదు
వినయము చేకొని వెస నేలుదువూ

చ. 1: సిగ్గులు దేర్తువు చెలుల మన నెఱిఁగి
యెగ్గులు వట్టక యెనయుదువూ
దిగ్గన నలుకలు దేర్చి మన్నింతువు
నిగ్గుల సతులకు నిధానమవూ

చ. 2: సమ్మతి సేతువు చనవు లొసఁగుదువు
నమ్మఁదిరిగి మరి నవ్వుదువూ
తెమ్మలుగా మోవితేనె లొసఁగుదువు
కొమ్మల పాలిటి కొంగుపసిఁడివి

చ. 3: తగవు నడపుదువు దయలు దలఁతువు
నిగిడి శ్రీ వేంకట నిలయుఁడవూ
జిగి నలమేలుమంగ నగు ననుఁ గూడితి
మగువలపాలిటి మనోరథమవూ.

రేకు: 0415-3 దేశాక్షి సంపుటం: 12-087

పల్లవి: యెవ్వరిఁ బోలుదు నే నీ యింతులలోన
నివ్వటిల్ల వలచి మన్నించితివి గాక

చ. 1: చిత్తము రా సేవ నీకుఁ జేసేటివారమా
హత్తి నిన్నుఁ గొలిచేటి యంతవారమా
బత్తితోడ నిన్ను నంత భావించేటివారమా
కొత్తలుగా నన్ను మెచ్చి కొనియాడేవు గాక

చ. 2: నంటున నీతో సారెకు నవ్వేటివారమా
అంటి ముట్టి సరసము లాడేవారమా
జంటల నీ కిచ్చికము జరుపేటి వారమా
యింటనుండి నా రతుల నెనసేవు గాకా

చ. 3: సొలపుఁ జూపులఁ జూచి చొక్కించేటివారమా
పిలిచి యిచ్చలను మెప్పించేవారమా
యెలమి శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
కలసి నన్ను నిట్టే కరుణించేవు గాకా.

రేకు: 0415-4 ముఖారి సంపుటం: 12-088

పల్లవి: మిక్కిలి జాణ వౌదువు మెచ్చి రిందరు నిన్ను
అక్కరతో నీ మహిమ అంతటాఁ జూపితివి

చ. 1: నా కొఱకే వలచితి నన్ను నీ వింతేసి
చేకొని పెద్దరికము సేసేవు గాని
వాకమైన నీవు గుణవంతుఁ డవు గన కిట్టే
మేకొని నీ కీరితి మెరయించు కొంటివి

చ. 2: నా వేడుకకుఁగా నే నంటున నీతో నవ్వితి
నీ వూరకే కృప నాపై నించేవు గాని
భావించి యిన్నిటా నేరుపరివి గనక నేఁడు
వే వేగ నీప్రతాపమే వెలయించుకొంటివి

చ. 3: నాలో నీయాసలనే నమ్మి కొలువు సేసితి
పాలించి శ్రీవేంకటేశ యేలితి గానీ
మేలువాఁడవు గనక మించి యలమేల్మంగను
మేలిమి నీ మంచితనమే నిలుపుకొంటివి.

రేకు: 0415-5 ధన్నాసి సంపుటం: 12-089

పల్లవి: నే నే మని విన్నవించే నీ మంచితనమునకు
ఆనుకొన్న నాలోని అలయిక దేర్తువూ

చ. 1: నీ మనసు దెలియక నేఁ గూరిమి గొసరితే
నా మొగము చూచి నీవు నవ్వుదువూ
ఆముకొన్న తమకము లటు నీకుఁ జూపితేను
ప్రేమ మెఱిఁగి నాతో గాఁపురము సేతువూ

చ. 2: నీడ నుండి చెమటతో నిన్నుదప్పక చూచితే
వేడుక మిగుల నన్ను వేఁడుకొందువు
వోడక నీపై బత్తిని వొడివట్టి తీసితేను
కూడ వచ్చి పానుపు పైఁ గూచుండుదువు

చ. 3: అక్కర గలిగి నీపై నాసల నే నుండితేను
గక్కన నందుకు నీవు కౌఁగిలింతువు
యిక్కువ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
మక్కువ న న్నేలితివి మరియు మన్నింతువు.

రేకు: 0415-6 నాదరామక్రియ సంపుటం: 12-090

పల్లవి: కందువ రేపల్లె లోనే కానవచ్చె నీ సుద్దులు
అందుకొని పొగడ నిన్నలవి గాదు

చ. 1: వారికి వారికి నీవు వలచినట్టున్నాఁడవు
యీ రీతి నీ జాణతన మెటువంటిదో
కోరి నీ వెందరినై నాఁ గొలువు సేయించు కొందు
చేరి నీ యోపిక యెంతో చెప్పరాదు

చ. 2: భావింప నెవ్వరికైనా పక్కనున్నట్లు న్నాఁడవు
తావగు నీ విటరాయతన మెట్టిదో
వేవేలు సతులతోడ వేసారక మాటాడుదు
యేవల్లా నీ నేరుపు యెంచరాదు

చ. 3: అందరికౌఁగిటఁ గూడి నట్లానే వున్నాఁడవు
అందిన నీ చుట్టరిక మది యెంతో
అందపు శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
పొందితివి నీగుణాలు పొగడరాదూ

రేకు: 0416-1 కాంబోది సంపుటం: 12-091

పల్లవి: యిట్టుండ వలదా యెన్నికైన నీ గుణము
అట్టే నిన్నుఁ జూచి నాకు నరుదాయను

చ. 1: మక్కువ తోడుత నా మనసు నీవె యెఱిఁగి
చక్కెర నీ మోవియ్యఁగ సంతోసమాయ
తక్కక యప్పటి నా తమకము గనుఁగొని
వెక్కసాన నవ్వఁగాను వేడుకాయను

చ. 1: వోముక నే విన్నవించే వుపమ నీకే తెలిసి
ఆ మాటే నాతో నాడఁగ నరు దాయను
కామించిన నాయాస గక్కన విచారించి
ప్రేమతోఁ గౌఁగిలించఁగ ప్రియ మాయను

చ. 1: యిందు నా కళలలో నీ యిక్కువలు నీవే యంటి
అంది రతులఁ గూడఁగా నానంద మాయ
అందపు శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
సందడి నన్నేలఁ గాను సమ్మతే యను.

రేకు: 0416-2 వరాళి సంపుటం: 12-092

పల్లవి: చెలియరో యీతఁ డిన్ని చింతల వాఁడే
చలివాపి తన మోవిచవులెల్లఁ జూపెనే

చ. 1: తలవంచుకుండఁగాను తానే నా వొద్దికి వచ్చి
కళ లంటి మొగము చెంగలింపించెనే
పలుకక వుండఁగాను పసగా నన్ను లాలించి
చెలరేఁగించి కతలు చెప్పించుకొనెనే

చ. 2: సిగ్గువడి వుండఁగాను చెక్కు నొక్కి వేఁడుకొని
వెగ్గళముగా నన్ను నవ్వింపించెనే
తగ్గి దిగువ నుండఁగా దండఁ గూచుండఁ బెట్టుక
వొగ్గించి నోరఁ దమ్ముల మొనరఁగఁ బెట్టేనే

చ. 3: గుట్టు తో నే నుండఁగాను కోరి శ్రీ వేంకటేశుఁడు
అట్టే నన్నుఁ గౌఁగిలించి దిట్టఁ జేసెనే
నెట్టుకొని మొక్కఁగాను నే నలమేల్మంగ నని
చుట్టరికమునఁ గూడి సొంపు లిట్టే రేఁచెనే.

రేకు: 0416-3 పాడి సంపుటం: 12-093

పల్లవి: పడఁతి భారము నీదే పరాకు సేయకు మింక
సడిఁ బెట్ట కిట్టే నీవే చన వియ్యవలెను

చ. 1: సిగ్గుతో నున్నది చెలి సేసే విన్నపము లెల్లా
దిగ్గన నీలో నీవే తెలియవలే
యెగ్గు లేమీ నెంచదు ఇచ్చుకురాలై వున్నది
అగ్గలమై నీవే ఇంకా నాదరించవలెను

చ. 2: చింతతో నున్నది యీకె సేసేది సేవ లెల్లా
కాంతుఁడవు నీవే మరి కై కొనవలె
పంతములు నెరపదు భావించి నిన్నుఁ దాను
సంతోసించఁ జేసె నీవే సరిఁ గావ వలెను

చ. 3: వినయముతో నున్నది వెస నీ లేమ కౌఁగిలి
పనివడి నీవే యిచ్చి పాలించవలె
ఘనుఁడ శ్రీ వేంకటేశ కాంత యలమేల్మంగను
తనియ నీవే కూడి దక్కియుండవలెనూ.

రేకు: 0416-4 కన్నడగౌళ సంపుటం: 12-094

పల్లవి: యింత వలపించుకొంటి విదివో నన్ను
యెంత కెంత నాయాసోదమేమి చెప్పేనయ్యా

చ. 1: కన్నులఁ జూతు నిన్ను కరఁగుదు మనసులో
సన్నలనే నీ మోవిచవి గొందును
చన్నుల నొత్తఁ దలఁతు జలజలఁ జెమరింతు
యెన్నికలు నాలోనివి యేమి చెప్పేనయ్యా

చ. 2: చక్కఁదనాలకు మెత్తు సారెఁ జే యెత్తి మొక్కుదు
పక్క నున్నవానిఁగా భావించుకొందు
చొక్కి నిన్నుఁ జేరుకొందు జుమ్మనఁ బులకింతు
యిక్కువ నా తలపోఁత లేమి చెప్పేనయ్యా

చ. 3: చెనకె నంటా వత్తు సిగ్గుపడుదు నంతలో
ననిచి శ్రీ వేంకటేశ నవ్వుదు నీతో
అనిశము నన్నేలితి వలమేల్మంగను నేను
యెనసి నా కోరిక లేమి చెప్పేనయ్యా.

రేకు: 0416-5 రామక్రియ సంపుటం: 12-095

పల్లవి: యెంత తమకీ నని నన్నేలయించేవు
చింత నీపై బుట్టి తేను చెమరించవలదా

చ. 1: కన్నుల నీవు చూచితే గక్కన నెవ్వతెకైనా
మిన్నక యాస లెల్లాను మించ వలదా
సన్నలు నీవు సేసితే సరుగనఁ గౌఁగి టిడి
పన్ని నీమీఁద మనసు పారఁగ వలదా

చ. 2: యిచ్చలఁ జన్ను లంటితే నెవ్వతెకైనా నిట్టే
రిచ్చలతో సిగ్గు లెల్లా రేఁగ వలదా
ముచ్చట మర్మము నీవు మోవఁగఁ బలికితేను
రచ్చలోన నైనా నవ్వు రావలదా

చ. 3: నెట్టనఁ గౌఁగిట నీవు నించితే నెవ్వతెకైనా
గట్టిగా సంతోస మిట్టే కప్పవలదా
అట్టి శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
జట్టిగా నన్నేలితివి సారె మెచ్చవలదా.

రేకు: 0416-6 కొండమలహరి సంపుటం: 12-096

పల్లవి: కంటి నీ గుణము లిట్టే కన్నులతుద నేను
జంటయై కొలిచితేను సంతోసమౌ నీకూ

చ. 1: హత్తి నీకు సేవ సేసే యంగనలఁ గంటేను
చిత్తమునఁ బెట్టి రక్షింతువు నీవూ
బత్తి నీపైఁ గలిగితే భావ మెల్లాఁ జిగిరించు
గుత్తపు నీ నెలవుల గొబ్బున నవ్వు నిండు

చ. 2: యెనసి నీ పట్టుకు నిచ్చకము నెరపితే
ఘనమైన నీమనసు కడుఁ గరఁగు
ననుపుతో నీ మొగము నాటుకొనఁ జూచితేను
గనులై మించి మదనకళ లెల్లా రేఁగునూ

చ. 3: ఆయము లెఱిఁగి నీ యంగములు ముట్టి తేను
పాయపు మదము నిదె పయిపై మించు
యీయెడ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
పాయక నన్నేలితివి పచ్చిదేరు సిగ్గులూ.

రేకు: 0417-1 మంగళకౌశిక సంపుటం: 12-097

పల్లవి: నేర మెన్నఁడును లేదు నెట్టనఁ దనవంకను
వోరుచు కొమ్మనవే నే నొద్దిక మొక్కేను

చ. 1: కడునాపైఁ దా మచ్చిక గలది నెఱుఁగుదునే
యెడయక మన్నించేది నెఱుఁగుదునే
నడుమ సవతు లట్టే నాతో సరి పెనఁగఁగా
పడలే కతను దూఱి పలుకుదుఁ గాని

చ. 2: మిక్కిలిఁదా నాకుఁ జేసే మేలూఁ దలఁతునే
తక్కక కరుణించేదీ దలఁతునే
పుక్కట సతులు తనపొందులు చెప్పుకొనఁగ
తక్కక వెస నోపక తను నందుఁ గాని

చ. 3: అలమి తా నన్నుఁ గూడెనందుకు మెచ్చితినే
మెలఁగి తనరతికి మెచ్చితినే
లలిఁ దా శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగనే నేను
వెలయాండ్ల యెమ్మెలు విినప్పుడుఁ గాని

రేకు: 0417-2 రామక్రియ సంపుటం: 12-098

పల్లవి: యెచ్చరిక దేవ నీకు నెక్కడ పరాకు
మచ్చిక నీమీఁద వే మారుఁ జల్లీని

చ. 1: చెలి నీ యెదుట నదె చిత్తగించు మిప్పు డిట్టే
మలసి సొలసి నీతో మాటలాడీని
కలువపూవు లవె కానుకగాఁ గైకొని
పలుదెరఁగులఁ జేతఁ బట్టు కున్నది

చ. 2: వినయముతో నాకె విన్నప మవధరించు
ననుపున నీకు మనవి చెప్పీని
తనివార నీవు గందము పూయించు కొమ్మిదె
కనుఁగొని నీకు వూడిగము సేసీని

చ. 3: సంగడి శ్రీవేంకటేశ చనవు లీడేరించు
చెంగట నలమేల్మంగ సేసవెట్టీని
యింగిత మెఱిఁగి నీవె యిన్నిటానుఁ గరుణించు
ముంగిటఁ గొలువు సేసి మోము చూచీని.

రేకు: 0417-3 మేచబౌళి సంపుటం: 12-099

పల్లవి: మేలే పతి నిన్నిటా మెప్పించితివి
నీలాగు లెల్లఁ గంటి నేరుపరి వౌదువే

చ. 1: వద్ద నుండి దాని మీఁద వలపులు గడుమించు
అద్దుకొన్న మగవాని కలరుచును
వొద్దికై యంతటిమీఁద నూడిగాలు సేసితేను
పొద్దువొద్దుకుఁ జవులు పట్టి తమి రేఁగును

చ. 2: యిచ్చలాడే దానిపై నే యింపు లెల్లఁ బెనగొను
విచ్చన విడి నుండేటి విభునికిని
పచ్చిగా నంతటిమీఁద బత్తి గడుఁ జూపితేను
నిచ్చకల్యాణములై నిండుకొను రతులు

చ. 3: వినయపు దానిఁ గంటే వేడుకలు దైవారు
ననుపు జుట్టరికపు నాయకునికి
మును శ్రీ వేంకటేశుఁడు నిను నలమేల్మంగను
యెనసిఁ గొసరితేను యిచ్చు సిరు లిప్పుడే.

రేకు: 0417-4 కన్నడగౌళ సంపుటం: 12-100

పల్లవి: కామినుల కెప్పుడునుఁ గలిగిన సాజమిది
తా మగఁడు నే నాలను దయఁ జూడు మనవే

చ. 1: చిత్తము రా నూడిగము సేసితినో సేయనో
హత్తి యెదురు మాట లే మాడితినో
యెత్తి చేతుల మొక్కేను యిన్నిటికి సెలవుగా
బత్తి చేకొని నన్నిట్టే పాయ కుండు మనవే

చ. 2: నిచ్చలు నుపచరించ నేరుతునో నేరనో
ఇచ్చ రతి నెంత యలయించితినో
యెచ్చు కుందులెల్లఁ దీర నిదివో ప్రియము చెప్పె
మచ్చిక నలుక దేరి మన్నించు మనవే

చ. 3: యెనసి వేడుక మోవి యిచ్చితినో యియ్యనో
చనుఁగవ నెంత వొత్తి జరసితినో
అనువై శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
చనవు చెల్లించి నన్ను సారెఁ గూడు మనవే.

రేకు: 0417-5 నాదరామక్రియ సంపుటం: 12-101

పల్లవి: రతి రాజ జనక వో రామా మనోహర
తతి తోడఁ బురుషోత్తముఁడవు నీవే

చ. 1: సతుల మన సెఱిఁ గి సరసము లాడవలె
యితవుగాను మోవి యియ్యవలె
మతకము లెల్ల మాని మర్మము లంటఁగవలె
చతురుఁడ విన్నిటాను జాణవు నీవే

చ. 2: భావించి చూచేవారిఁ బక్కన లాలించవలె
కైవసమై వలపులు గైకొనవలె
చేవమీఱ నవ్వు నవ్వి సిగ్గు దేరుచవలె
కోవిదుఁడ విందుకెల్లా గురువవు నీవే

చ. 3: తొట్టి యిందరికి నీ రతులు నేరుపఁగవలె
నెట్టు కొని యేలి కృప నించఁగవలె
గట్టిగ నే నలమేల్మంగను నన్నుఁ గూడితివి
యిట్టి గుణాల శ్రీ వేంకటేశుఁ డవు నీవే.

రేకు: 0417-6 మాళవిగౌళ సంపుటం: 12-102

పల్లవి: యేమని పొగడవచ్చు నిదివో నీ విలాసము
కామించి నిన్నుఁ బొందినకాంతదే భాగ్యమూ

చ. 1: చొప్పుగా మన్నించి నీవు సుదతిఁ జూచితేను
కప్పి మోమున మదన కళలు నిండే
కొప్పు దువ్వి నీవు కొనగోరు సోకించితేను
అప్పుడే జవ్వన సామ్రాజ్యము చెలరేఁగెనూ

చ. 2: మనసిచ్చి నీ వీకెతో మాట లాడినంతలోనే
వొనరుచుఁ గుచగిరు లుప్పొంగెనూ
పెనఁగుచు నొకమాటు ప్రియానఁ జేయి వట్టితే
పనివడి తమకపు భండారము నిండెనూ

చ. 3: అలరి శ్రీ వేంకటేశ అలమేల్మంగఁ గూడితే
కల చక్కఁదన మెల్లాఁ గనుపట్టేనూ
నిలిచి యీవేళనే నీవు దయఁ జూచితేనూ
బలిమితో మోహన సంపద కెల్లా మించెనూ.

రేకు: 0418-1 మధ్యవవతి సంపుటం: 12-103

పల్లవి: ఔనే మంచివారే మీరు అమ్మరో నేఁడు
వీనులాలఁ బొగడితే విందుఁ గాక యతని

చ. 1: చెలువుని దూరకురే చెలులాల
అలరి ప్రాణమై వుండు నాతఁడు నాకు
తలచుక వచ్చీఁ గాక తానే యీడకు
బలిమి సేతు రటవే బత్తి నాపై గలఁడు

చ. 2: రమణునిఁ గొంగు వట్టి రాఁ దియ్యకురే
అమరి నాపాలి దేవరై వుండును
తమిగలప్పుడు నన్నుఁ దానే కూడీని
తిమురుదురటే నాకు దిక్కయినవాఁ డితఁడు

చ. 3: సన్నల శ్రీ వేంకటేశు జలసే రేలే
అన్నిటా నా కాతఁ డాత్మయై వుండును
మన్నించి కూడె నలమేల్మంగను నేను
పన్నుక నవ్వుదురటే పంతముతో జాణఁడూ

రేకు: 0418-2 ముఖారి సంపుటం: 12-104

పల్లవి: కాంతపై నెప్పుడు బత్తి గలవు నీవు
మంతనాన నేనూ నీకు మనవి చెప్పితిని

చ. 1: అవధరించితివా అతివ విన్నపములు
తవిలి యిప్పుడు నీ చిత్తము వచ్చునా
వివరించి నేఁ డాకె నీవే గతి యని వున్నది
యివలఁ జెలిఁ గనక యెచ్చరించే నేనూ

చ. 2: కరుణించి చూచితివా కాంత యంపినకానికె
సరవితో నీ కది సమ్మతేయనా
నిరతిఁ దనయాసలు నీపైఁ బెట్టు కున్నది
పరిచారకురా లని భావము దెలిసెను

చ. 3: అట్టే మన్నించితివా అలమేల్మంగనుఁ గూడి
వొట్టి శ్రీ వేంకటేశ్వర వోవరిలోన
నెట్టన సంతోసాన నిన్ను మెచ్చుచున్నది
యిట్టే వూడిగపు వార మిద్దరిఁ బొగడేమూ.

రేకు: 0418-3 సాళంగనాట సంపుటం: 12-105

పల్లవి: అతని నే నెఱుఁగుదు నాతఁడు నీ వో జెఱుఁగు
నీ తెరువు వచ్చితినా నీ కేలే పగటు

చ. 1: నన్నుఁ బెండ్లాడె నతఁ డు నాతో నవ్వె నతఁడు
సన్న లేమి సేసేవే సవతి నీవు
కన్నుల మొక్కితి నేను కందువ లంటితి నేను
నిన్ను నేమైనా నంటినా నీకేలే పగటు

చ. 2: చేయి వేసె నా మగఁడు సిగ్గు దేర్చె నా మగఁడు
చాయ లేమి చూపేవే సవతి నీవు
నాయ మడిగితి నేను ననుపై వుండితి నేను
నీ యెమ్మెలు వద్దంటినా నీ కేలే పగటు

చ. 3: అలమె శ్రీ వేంకటేశుఁ డదె శ్రీ వేంకటేశుఁడు
చల మేల మానవె సవతి నీవు
అలమేల్మంగను నేను అన్నిటా దేవుల నేను
నిలిచి నీ బత్తి గంటి నీ కేలే పగటు.

రేకు: 0418-4 శ్రీరాగం సంపుటం: 12-106

పల్లవి: రతిరాజ గురుఁడవు రమణిని నే నీకు
ఇతరము లెల్లాను యేమి చెప్పేమయ్యా

చ. 1: వరుసల నీ చిత్తము వచ్చినదే కాఁపురము
అరసి నిన్నుఁ బాయని దది బదుకు
సరసము నీతో నాడే చనవే సౌఖ్యము
యెరవుల సుద్దు లిఁక సేమి చెప్పేమయ్యా

చ. 2: నెలవి నీవు నవ్విన చెలువమె సఫలము
అలరి నీవు మాటాడుటది సంపద
తలఁచి నీకు వలచు దాని జన్మమే జన్మము
యెలమి నున్న కోరికె లేమి చెప్పేమయ్యా

చ. 3: భావించి నీవు చూచిన భాగ్యమే యెక్కుడు
తావుకొన్న నీ రతులే ధనధాన్యాలు
శ్రీ వేంకటేశ్వర నే నీదేవి నలమేల్మంగను
యీవేళ నేలితి వింక నేమి చెప్పేమయ్యా.

రేకు: 0418-5 శంకరాభరణం సంపుటం: 12-107

పల్లవి: చెలులలో నేను చేసినభాగ్య మెట్టిదో
వెలలేని వేడుకలు విభుఁడే యెఱుఁగునే

చ. 1: అందరికి మోహించిన అట్టే వుండుఁగాని యాతఁ
డందులో నాపై బత్తియై యుండుఁదాను
యిందరితో మాటలు తా నెన్నేసి ఆడినాను
కందువ నాతోనే ఆ కత లెల్లాఁ జెప్పునే

చ. 2: కొలువులో కాంతలఁ బైకొని కనుఁగొను గాని
తలఁపులో నన్నే చూచుఁదా నితఁడు
సెలవులఁ గొందరితో చేకొని నవ్వినాను
చలువల నాతోను సన్నలనే నవ్వునే

చ. 3: అచ్చలాన నెవ్వరిపై నైనాఁ జేయి వేసుఁగాని
కచ్చుపెట్టి నన్నే రతిఁ గౌఁగిలించునే
యిచ్చల శ్రీ వేంకటేశుఁడే నలమేలు మంగను
మచ్చిక నాపైఁ గలఁడు మన్నించునే నన్నును.

రేకు: 0418-6 భైరవి సంపుటం: 12-108

పల్లవి: యిది నాకుఁ బదివేలు యెప్పుడూ నీ దాననే
కొదలేక యెప్పుడైనాఁ గూడేవు గాని

చ. 1: యేపొద్దునేఁ గొలువులో నిటు దవ్వులఁ గొల్చినా
చూపులు నీమీఁద నంటి సోఁకి వుండుఁగా
పైపై నీ వెక్కడను పరాకై వుండినాను
యేపుల నీ మోవి నన్ను నిట్టే నోరూరించుఁగా

చ. 2: తనువుపైఁ బచ్చడము తగఁ గప్పుక వుండినా
మనసు నీతో జంటై పెనఁగాడుఁగా
ననుపున నెవ్వతెతో నవ్వుతా నీ వుండినాను
పనివడి నా మొక్కు నీ పాదాలపై నుండుఁగా

చ. 3: తచ్చన సిగ్గుతో నీవు తలవంచు కుండినాను
నిచ్చ మరఁదలి వావి నీ కైతిఁగా
యిచ్చట శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
హెచ్చి నన్నుఁ గూడితివి యిట్టే సంతోసింతుఁగా

రేకు: 0419-1 దేవగాంధారి సంపుటం: 12-109

పల్లవి: యెటిగించరే పతికి యీ సుద్దు లెల్లాను
కటకటి సేసితేను గయ్యాళి యందురు

చ. 1: మలసి తన కెదురు మాట లాడుటకంటే
చెలిచే మనవి చెప్పించేదే మేలు
పలుమారుఁ దన్నుఁ జూచి పచ్చారుకంటేను
తలవంచుక తన ముందర నుండుటే మేలు

చ. 2: తడివి మందెమేళానఁ దనతో నవ్వుటకంటే
వొడికమై సిగ్గుతోడ నుండుటే మేలు
పడిఁబెట్టి సారె సారె సరస మాడుటకంటే
వుడివోని బత్తితోడ నుమ్మగిలుటే మేలు

చ. 3: ఆనుకొని తన్ను రతి నలయించుటకంటే
పానుపుపై దండ నిట్టే పండుటే మేలు
నే నలమేలుమంగను తాను శ్రీ వేంకటేశుఁడు
మేనంటి తా నన్నుఁ గూడి మెటియుటే మేలు.

రేకు: 0419-2 వరాళి సంపుటం: 12-110

పల్లవి: వేడుకతో నుండుఁ గాని వేసరీఁ జుమ్మీ
జాడతో నా విన్నప మిచ్చుట విను మనవే

చ. 1: వనితలు తనుఁ గంటే వదలి వూరకుందురా
పెనఁగక తక్కుదురా ప్రియముతోను
చనవునఁ బైపై సరస మాడక విడుతురా
వొసర నన్నిటికిని వోరుచు కొమ్మనవే

చ. 2: ఆయములు సోకితే నాసలఁ బోనిత్తురా
పాయపు మదముతోడఁ బాయఁగలరా
చేయి చాఁచి నవ్వక సిగ్గులు వడుదురా
యీయెడ మా కోరికె లీడేర్చు మనవే

చ. 3: నిచ్చలు రతి వేళల నేరుపు మరతురా
విచ్చన వీడైన చోట నీఁగుదురా
ఇచ్చట శ్రీ వేంకటేశు డే నలమేలుమంగను
మచ్చికతో నన్నుఁ గూడె మన్నించు మనవే.

రేకు: 0419-3 భూపాళం సంపుటం: 12-111

పల్లవి: చెలులాల యిదెవో నేఁ జేసినది భాగ్యము
కలిగెఁ దన కరుణ కడమ లింకేఁ టివే

చ. 1: మన్నించి తానే నాపై మచ్చిక గలిగుండఁ గా
విన్నప మేమి సేసే నీ వేగినంతాను
కన్నులెదుటను తాను కైవసమై మెలఁ గీని
సన్న లిఁ క నేఁ టికి సారె సారెకు

చ. 2: కోరినట్లల్లా దానే కొమ్మని యొసగఁ గాను
చేరి వేడుకొనే దేమే చేతులు చాఁ చి
యీ రీతి నావాఁ డై తా నా యింట నిట్టే వుండఁ గాను
కూరిమి గొసరే దేమే కొచ్చి కొచ్చి యిపుడూ

చ. 3: కందువ లంటి తానే కొఁ గిలించి కూఁ డఁ గాను
అంది యాసపడే దేమే అప్పటి నేను
శ్రీ వేంకటేశుఁ డే నలమేలు మంగను
మెచ్చే దేమే మాటిమాటికి.

రేకు: 0419-4 దేవగాంధారి సం: 12-112

పల్లవి: అతివ లూరకుండరే ఆతఁ డే సేనై వున్నదాన
గతి యాతని పాదాలే కడమ లే దిఁకనూ

చ. 1: యిచ్చినాఁడు సలిగలు యిన్నిటా నాతఁడు నాకు
కొచ్చి కూరిము లింకానుఁ గొసరుదురా
మెచ్చినాఁడు తొల్లి నా మిక్కుటపు సేవలకు
ముచ్చట నిప్పుడు రతి మొగచాటు సేతురా

చ. 2: నవ్వినాఁడు వేడుకతో ననుపున నిందాఁక
చివ్వన నింకా మరి చెనకుదురా
పవ్వళించి నా చన్నులపైఁ జేయి చాఁచినాఁడు
వువ్విళ్ళూరి వట్టియాస లూరకే చల్లుదురా

చ. 3: కూడినాఁడు సంతోసాన కుచ్చి నా కౌఁగిట నేఁడు
తోడనే సరసముల దొమ్మి సేతురా
యీడనే శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
జోడు వాయ కేలినాఁడు చుట్టి పెనఁగుదురా

రేకు: 0419-5 పాడి సం: 12-113

పల్లవి: యేలినవాఁడు తాను యే మనఁగల నేను
పోలించి తా నన్నూరకే పొగడీఁ గాక

చ. 1: పంతమాడ నెంతదానఁ బలుమారుఁ దనతోను
చెంతఁదా నా చెప్పినట్టు సేసీ నని
వింతలుగా నందరితో విఱ్ఱవీఁగ నెంతదాన
కాంతుఁ దానిట్టే నాకుఁ గైవస మాయ నని

చ. 2: సేవ సేయ నెంతదాన చెలరేఁగి చెలరేఁగి
చేవమీఱ నా బత్తి చేకొనీ నని
వేవేలైన నాసుద్దులు విన్నవించ నెంతదాన
దేవర వలెఁ దా విని తెలిసి మెచ్చీ నని

చ. 3: పెనగఁ నెంతదాన ప్రియముతోఁ దనతోడ
ననుపునఁ దా నాతో నవ్వీ నని
యెనసి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
పనిగొన నెంతదాన బడిఁ దా నున్నాఁ డని

రేకు: 0419-6 రామక్రియ సం: 12-114

పల్లవి: తా నాకుఁ జేసిన మేలు తలఁపులో నే మఱవ
పూని నన్నుఁ గరుణించి బుద్ధిచెప్పు మనుమీ

చ. 1: మనసార తనతోనే మాటలాడ నేర్చుకొంటే
నినుపు సెలవి నవ్వ నేర్చుకొంటిని
పనులు గొనఁగా తన పాదా లొత్త నేర్చుకొంటి
యెనసి తానే నన్ను నింతదానిఁ జేసెనే

చ. 2: సొలసి కన్నుల తుదఁజూడ నేరుచుకొంటి
నలి రేఁగి రతులఁ జెనక నేర్చితి
వెలయ సంగడి నుండి వినయాలు నేర్చుకొంటి
నెలకొని తానే నన్ను నేరుపరిఁ జేసెనే

చ. 3: పానుపు పై తనుఁ గూడి పై పై మెచ్చ నేర్చుకొంటి
ఆనుకొని మోవిచవు లాన నేర్చితి
తాను శ్రీ వేంకటేశుఁడు నే నలమేలుమంగను
కానిమ్మని యిటువలెఁ గలికిఁగాఁ జేసెనే

రేకు: 0420-1 శుద్ధవసంతం సం: 12-115

పల్లవి: యింత నీ వుపకారము లేమని పొగడుదు
సంతసించి యేలితి నా సరివారిలోన

చ. 1: కలవు నాకు నీ వని గర్వించి వుండుట గాక
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పవత్తునా
నలువంక నటువంటి ననుఁ దెచ్చి నీ సేవకు
అలవఱచుక నన్ను నాదరించితివి

చ. 2: చుట్టరికపు వరుస సుద్దులె చెప్పుదుఁ గాక
నెట్టుక నీ కొలువులో నిలుచుందునా
యిట్టి నన్ను మన్నించి నీ యెదుట నిలుపుకొని
గుట్టు దెలిపి నాకు నీ గుణము నేర్పితివి

చ. 3: నీ విచ్చిన సలిగల నే దొరనై వుందుఁ గాక
యీవిధాన నీ యక్కుపై నిర వౌదునా
శ్రీ వేంకటేశుఁడ నేను జిగి నలమేల్మంగను
వావి తోడ నన్నుఁగూడి వన్నె కెక్కించితివి

రేకు: 0420-2 సామంతం సం: 12-116

పల్లవి: యెంత ఆసోదమో(?) యని యెంచేవు సుమీ
యింతినై వున్నదాన నీకు నేమియు నెఱఁగను

చ. 1: అట్టే నీతోఁ జెలఁగి మాటాడియుఁ దనియను
దట్టపుఁ జూపులఁ జూచీ తనియను
పట్టి పెనఁగి పెనఁగి పలుమారుఁ దనియను
యెట్టు మోహింపించితివో యెఱఁగ నేను

చ. 2: చిమ్ముచు వినయములు సేసియుఁ దనియను
తమ్మి చేతులెత్తి మొక్కిఁ దనియను
పమ్మి నీ గుణములు భావించీ దనియను
ఇమ్ముల నింత సేసితి వేమీ నెఱఁగను

చ. 3: గక్కన నీ పాదములు కౌఁగిలించీ తనియను
దక్కఁగొని మోవి యానీ తనియను
ఇక్కడ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
యెక్కడా నన్నే యేలితి వెఱఁగ నితరము

రేకు: 0420-3 ఆహిరి సం: 12-117

పల్లవి: నీ మహిమ వల్లనే నే బదికే దెల్లాను
వేమరు నా కేల యింక వేసరించ నిన్నును

చ. 1: ఆముకొని నిన్నుఁబాసి అట్టే విరహాన నున్నా
నీ మీఁది మోహమే నన్ను నెరవేర్చును
భామలపై నీవు గొంత పరాకై వుండినాను
నేమపు నీపై తలపే నిన్నుఁదెచ్చి యిచ్చును

చ. 2: యిట్టే నీ కెదురు చూచి యెంత కాఁకఁ బొందినాను
జట్టిగ నీ పై యా చల్లఁజేసును
గుట్టున నేవని తలఁ గూడి నీ వుండినాను
చుట్టపు నీసుద్దులే సొంపులు వుట్టించును

చ. 3: సేసవెట్టి ఇప్పుడెంత సిగ్గుతో నే నుండినాను
రాసి కెక్క నీ కౌఁగిలే రవ్వ సేసును
యీసరి శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
వేసరని నీ రతులే వేడుకలు రేఁచునూ

రేకు: 0420-4 హిజ్జిజి సం: 12-118

పల్లవి: అందుకే మొక్కే నేను ఆతని కిదే
పొందుగా విన్నవించరే పొలఁతులాల

చ. 1: పొంచి సింగారాలకు బొమ్మల జంకింతుఁ గాని
మించి మేలువాఁడు తాను మిక్కిలి నాకూ
అంచెల గుట్టు గాన నీ కటు మెచ్చకుందుఁ గాని
మంచిమాట లెల్లా నాడి మన్నించునే

చ. 2: సేసే తరితీపులకు సిగ్గులు వడుదుఁ గాని
ఆసల నన్నుఁ బెండ్లాడి నప్పుడే తానూ
వాసులు చూప వలసి వన్నెల సొలతుఁ గాని
బాసతోడఁ జనవిచ్చి పాలించునే

చ. 3: చవులు చూపవలసి సమ్మతించకుందుఁ గాని
వివరించి నా ప్రాణవిభుఁడే తాను
జవళి శ్రీ వేంకటేశ్వరుఁ డలమేల్మంగను
కవగూడి నన్నిటాను ఘనుఁడే తాను

రేకు: 0420-5 శుద్ధవసంతం సం: 12-119

పల్లవి: కంటి మిట్టే మీ పొందులు కన్నుల పండుగ గాను
జంటఁ గొసరుదుము మీసరిత లెఱఁగకా

చ. 1: యిద్దరును నొక్కటే యింతులెల్లా విన్నవించే
సుద్దులే వేరుగాని చూడఁ జూడను
వొద్దికతో మారుకు మారొక రొక రుంగరాలు
కొద్దులై వున్నవి మీఁద కొనవేళ్ళ నివివో

చ. 2: తలఁపు లెప్ప టివే తరితీపుల మీకు
చెలి పెనఁగు లాటలే చెప్పఁ గొత్తలు
పులకల నొక్కమాటే పొదలి మీ మేనులను
వెలసెఁ దారుకాణలై వేడుకతో నివివో

చ. 3: అతఁడు శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
రతులే యెంచరానివి రచ్చలోనను
తతితోడఁ గూడితిరి తనువునఁ గళ లంటె
మితి మీఱి మాకుఁ జూడ మెచ్చులాయ నివివో

రేకు: 0420-6 రీతిగౌళ సం: 12-120

పల్లవి: తామే యెఱుఁగుదురు తమపొందులు
ప్రేమములు రేఁచితేను బెరయు వేడుకలు

చ. 1: చెలినోరిలో మాట సిగ్గుల లోపలి తేట
తెలిపి చెప్పి చూపరే తెఱవలాల
పలు సతుల మగఁడు పరాకై వున్నాఁడేమో
తలపించరే మీరు తటుకన నిపుడూ

చ. 2: పెద్ద కన్నులలో యాస పిడికిటి లోని సేస
పొద్దున నెఱిఁగించరే పొలఁతులాల
చద్దివేఁడి వలపుల సందడి నున్నాఁడేమో
బుద్ధిగా సన్నల నింపు వుట్టించరే

చ. 3: అలమేల్మంగలో నవ్వు అరచేతిలోని పువ్వు
లలిఁ దారుకాణించరే లలనలాల
యిల శ్రీ వేంకటేశ్వరుఁ డియ్యకొని యున్నాఁడేమో
కలసె దొలుతే యింకాఁ గరుణ వుట్టించరే

రేకు: 0421-1 దేసాళం సం: 12-121

పల్లవి: యేమైనా నిన్ననేనా యింతి నేఁ డు
చేముంచి యింతలో నేల సిగ్గువడే వయ్యా

చ. 1: వెలఁ ది నిను మెచ్చితే విన వేడుక గాదా
నలువంకా సొలసితే నవ్వు రాదా
తలఁ చి నీకు మొక్కితే దయ వుట్ట వలదా
చెలఁ గి యిందుకు నేల సిగ్గువడే వయ్యా

చ. 2: సారె నిన్నుఁ జూచితేను సంతోసించఁ దగదా
చేరి మాటాడితే పొందు సేయఁ జెల్లదా
కూరిమి దెలిపి తేను గుట్టున నుండవలదా
జీరల చెక్కుల నెంత సిగ్గువడేవయ్యా

చ. 3: కడలేక వూఁ కొంటే కతచెప్ప సందు గాదా
యెడ మిచ్చితే పండుండ నింపులు గావా
అడరి శ్రీ వేంకటేశ యలమేల్మంగఁ బెండ్లాడి
చిడిముడి నీ వెట్టు సిగ్గువడేవయ్యా

రేకు: 0421-2 పాడి సం: 12-122

పల్లవి: యేమయ్యా యేనుగతోడి యేలాట లిఁక నీకేల
కామించి నీకు నీవే కరుణించేవు గాక

చ. 1: సింగారించు కొన్న నిన్నుఁజేరి సంతోసించుఁ గాక
అంగన యెఱుఁగునా ఆ సుద్దులు
ముంగిట నీ వుండఁగాను ముంచి కైలా గిచ్చుఁ గాక
సంగతి యెందు వోయే వని సారె నిన్ను నడుగ

చ. 2: చెమరించీ నని మేను చెలఁగి విసరుఁ గాక
రమణి నీసుద్దు లెల్లా రచ్చవేసునా
జమళి నీ సేవ సేసి చవులు వుట్టించుఁ గాక
అమరునా అంతలోనే ఆకె నిను జరయ

చ. 3: అలరి నీవు గూడితే నానందించుకొనుఁ గాక
అలమేలుమంగ నీ చొప్పులు చూచునా
లలి శ్రీవేంకటేశ నీ లాగులకు నవ్వుఁ గాక
తలపించఁ దగవా తనబత్తి యింకను

రేకు: 0421-3 లలిత సం: 12-123

పల్లవి: చూచి చూచి సంతోసింతు సొద్యముగా నే నెప్పుడు
కాచుక నన్నేలేటి చక్కని నా విభుని

చ. 1: నా తలఁపెఱుఁగునే నన్నిట్టే లాలించునే
యీతని నెట్టు గొసరే నింకా నేను
చేతికి లోనై వుండునే చెప్పినట్టు సేసునే
యీతలఁ దనగుణము లేమని చెప్పుదునే

చ. 2: సన్నలనే మెలఁగునే చనవు నా కిచ్చునే
విన్నప మేమి సేసేనే వేరే మరియూ
తన్నుఁదానె వచ్చునే తగవులు నెరపునే
యిన్నిటా మెచ్చె నంటే యెంతదాననే

చ. 3: చెలిమి సేయ జాణఁడే శ్రీ వేంకటేశుఁడే
తెలుప నేలే నా పాలిట దేవరే తాను
అలమేల్మంగనే నేను అన్నిటాను నన్నుఁగూడె
అలవి గాదు పొగడే నంటే నిట్టే మొక్కేనే

రేకు: 0421-4 గుజ్జరి సం: 12-124

పల్లవి: యెంత జాణతనమో నా కెటువంటి మొగమోటో
సంతోసించఁ జేసి నీకు చనవరి యాయను

చ. 1: చెప్పరాని ప్రియములు చెప్పి నిన్నింత వలపు
చిప్పిలఁ దన మొగము సేసుకొనెను
నెప్పున నీ చిత్తము రా నిచ్చలూ గొలిచీ నిన్ను
నప్పుడే మంచిమాటలూ నాడించుకొనెను

చ. 2: పెనఁగి పెనఁగి నీకు పెక్కు వూడిగాలు సేసి
ననుపున నీ నెలవి నవ్వు రేఁ చెను
చెనకి వినయమున చెక్కు నొక్కి వేఁడుకొని
తనిపి నీ మోవి తేనె తా నిప్పించుకొనెను

చ. 3: పానుపు పైఁ బవ్వళించి పక్కనఁ జన్నుల నొత్తి
సోనల చెమట తోడఁ జొక్కించెను
పూని యలమేలుమంగ పొంచి శ్రీ వేంకటేశ్వర
తానే నిన్నుఁ బెండ్లాడి తగులై నిలిచెనూ

రేకు: 0421-5 ముఖారి సం: 12-125

పల్లవి: ఆతనినే రమ్మనరే అంగనలాల
యీతలనే విన్నవించే నిన్ని విన్నపములూ

చ. 1: అరతఁ జేసే విన్నపా లడియాసలై యుండు
తరి తీపులై యుండు దవ్వుల విన్నపములు
వొరుల విన్నపములు వొడఁ బాటులై తోఁచు
వెరవేది పతికింక విన్నవించ నిపుడూ

చ. 2: చెవిలోని విన్నపాలు సిగ్గులెల్లాఁ బెడఁబాప
చవులెల్లాఁ బుట్టించు సరసపు విన్నపము
సవినయ విన్నపము సంతతముఁ దలపించు
వివర మేది పతికి విన్నవించ నిఁకను

చ. 3: యేకతపు విన్నపము లిచ్చకము వుట్టించు
రాకొట్టులై పెనగొను రతివేళ విన్నపము
యీకడ శ్రీవేంకటేశుఁడే నలమేలు మంగను
చేకొని విన్నపములు సేసే దేమె యిఁకను

రేకు: 0421-6 నీలాంబరం సం: 12-126

పల్లవి: యెంత భాగ్యవంతుఁడవో ఇటువంటి సతి గల్గె
సంతోసించుకొంటిమి మీ సరితెలు చూచి

చ. 1: అండనుండి యెవ్వతో అట్టే నీకు నొక్కొక్కటే
బొండుమల్లె పానుపుపై బుద్ధి చెప్పిని
పండఁబడి మోవితేనె పానకముచవి చూపి
చండి పెట్టి చన్నులతో సాము సేయించీని

చ. 2: తా నెవ్వతో పెచ్చు రేఁగి దంతపుటోవరిలోన
నానుఁ జెమటల నిన్ను నవ్వింపించీని
సానఁబట్టేచూపులను సన్నలనే జంకించి
వూనిన రతులలోన నోలలాడించీని

చ. 3: గుట్టున నెవ్వతో యిది కోరి పచ్చడములో
చుట్టుక చుట్టుక కూడి సొంపు నించీని
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యిట్టే నన్ను నేలితివి యీకె నిన్ను మెచ్చీని

రేకు: 0422-1 దేశాక్షి సం: 12-127

పల్లవి: మనసులోఁ దనమేలు మఱవ ననరే మీరు
యెనసిన రమణుని కెచ్చరించరే

చ. 1: కానుక చేకొనెఁగా కవకవ నవ్వుకొంటా
వీనులను విన్నపాలు వినెఁగా తాను
మేను మేను సోఁక నిట్టే మేలములూ నాడెఁగా
ఆనుకొన్నసంతోస మెంతని చెప్పే నిఁకను

చ. 2: పువ్వుల బంతి యిచ్చెఁగా పొలఁతి నా చేతికి
దవ్వులనుండి వచ్చేఁగా తానే వొద్దికి
నివ్వటిల్ల మోవి తేనియ నాకు నిచ్చెఁగా
యివ్వల నా భాగ్యఫల మీడేరె నిప్పుడూ

చ. 3: చేతులెత్తి నా మీఁద సేసలునుఁ బెట్టేఁగా
కాతరాన నన్నుఁ గూడి కరుణించెఁగా
యీతల శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
యేతుల నాయానంద మిరవాయ నిదివో

రేకు: 0422-2 మలహరి సం: 12-128

పల్లవి: నీ వెట్టు సేసినా నీ కీరితే
భావించి నీవల్లనే బ్రదుకుట గాకా

చ. 1: నికు మోహించిన వారు నిన్ను మరి దూరుదురా
కైకొను మనేవారు కాంతాళింతురా
వాకుచ్చి పొగడేవారు వడి వెంగేలాడుదురా
పైకొని నీ చిత్తము రా బదుకుట గాకా

చ. 2: నీతోడ నవ్వేవారు నిన్ను నటు జంకింతురా
చేతు లెత్తి మొక్కేవారు జేర దీతురా
ఆతుమఁ దలఁచేవారు అలుకలు చూపుదురా
పై తరవు బత్తి సేసి బదుకుట గాకా

చ. 3: తగఁ బెండ్లాడిన వారు తప్పులు వట్టుదురా
మొగిఁ భాయలేనివారు మోము వంతురా
నిగిడి శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
బగివాయ కేలితివి బదుకుట గాకా

రేకు: 0422-3 భైరవి సం: 12-129

పల్లవి: యెట్టయినా నాయఁగాక యేమాయను
నెట్టు కొన్న నావలపు నీ చేతిది యిఁకను

చ. 1: తగ నీవు మన్నించేది తలఁపున నెఱుఁగుదు
సొగిసి యట్టే పదరి సొలయుదును
నిగిడి నన్ను నడుపే నీ నేరుపో యిది
బగివాయకున్న నా భ్రమతో యెఱఁగను

చ. 2: చేకొన్నవాఁ వు నన్నుఁ జేరి యేలే దెఱుఁగుదు
యీాకడ విరహమున నిట్టే దూరుదు
జోకతో నింత సేసే నీ సొంపుల యాలాటమో
కాకరి(?) నా తమకపు కందువో యెఱఁగను

చ. 3: సరుస నన్నుఁ బెండ్లాడి చనవిచ్చు టెఱుఁగుదు
పరవశపుఁ గౌఁగిట పచారింతును
యిరవై శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
సిరుల నీగుణ మింత సేసేది యెఱఁగనూ

రేకు: 0422-4 ఆహిరి సం: 12-130

పల్లవి: యేలే పొగిలేవే యిప్పు డింతిరో నీవు
వాలాయించి నీ విభుఁడు వచ్చి కూడీఁగాక

చ. 1: కడుఁ దమకముతోడఁ గాచుకున్నకాంతను
సడిఁ బెట్టి యేఁపునా సరఁసుడు
జడియక మోవితేనె చవిచూపి చెక్కు నొక్కి
బడలిక లెల్లాఁ దీర్చి పచారించుఁగాక

చ. 2: ఆసల నెదురుచూచి అండకు వచ్చినదాని
గాసిలఁ గాఁక రేఁచునా కాంతుఁడు
వేసరక నవ్వు నవ్వి వెడసిగ్గులు దేర్చి
రాసికెక్కఁ జన విచ్చి రక్షించుఁ గాక

చ. 3: మించి వుర మెక్కి యలమేలుమంగవైన నిన్ను
వంచించునా శ్రీ వేంకట వల్లభుఁడు
పొంచి కౌఁగిలించుకొని భోగపు రతుల నించి
యెంచరాని నీతలఁపు లీడేర్చుఁ గాకా

రేకు: 0422-5 శ్రీరాగం సం: 12-131

పల్లవి: ఔనో కాదో యీమాట అంగనలాల
దానఁ బెట్టక వలపు నను పొ నిలుచునా

చ. 1: యెన్ని తలపోఁతలతో నెంచుకొని వుండినాను
కన్నులఁ బతిఁ జూడక కాంక్ష దీరునా
సన్నలు వేడుక తోడ సారె సారెఁ జేసినాను
విన్నపము సేయక వెసఁ దనివారునా

చ. 2: చాయవాటుగా నెట్టు సరసము లాడినాను
చేయి చాఁచి పెనఁగక చెమరించునా
పాయపుమదాన నెంత పచ్చిదేర నవ్వినాను
రాయడి రతులఁ గాక రంజకము వుట్టునా

చ. 3: ఆసల లోలోనెంత ఆరడిఁ బొరలినాను
సేసవెట్టి పెండ్లాడక చే చిక్కునా
యీసరి నలమేల్మంగ నేను శ్రీ వేంకటేశుఁడు
వాసితోఁ దా నన్ను నిటువలెఁ గూడకుండునా

రేకు: 0422-6 ముఖారి సం: 12-132

పల్లవి: యిదివో నీ తోడిపొందు యిట్లానే కదవయ్యా
సదరాననే వచ్చి జాజుకొనెఁ గూరిమి

చ. 1: సుద్దులువలెనే వుండు సొలపుల సరసాలు
కొద్దితో మఱవరాదు గుండెలు మోచు
అద్ది వూరకున్న ట్టుండు ఆనకపు కాఁపురాలు
ముద్దు ముద్దువలె నౌను మోవరాని మోపులు

చ. 2: తేటలు వలెనే వుండు తెలిఁ గన్నుల చూపులు
నాటుకొని సాయరాని నాము లెక్కును
గాటమై దక్కినట్టుండుఁ గప్పురపు వీడేలు
మేటి సమరతులలో మిక్కిలిఁ జొక్కించును

చ. 3: సులభాలు వలె నుండు చుట్టు కొన్న కూటములు
తలపించఁ దలపించ తమి రేఁచును
యెలమి శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
కలసితి నిఁక నివి కాణాచులై యుండునూ

రేకు: 0423-1 మేచభవుళి సం: 12-133

పల్లవి: యెంచకు నానేరమి యెంతకోపి నైనాను
నించి నన్నేలు కొనుటే నీ నేర్పు

చ. 1: పాసివున్న తమకానఁ బడఁతు లే మాడినాను
వాసితో నేర్చిన మగవానిదే నేర్పు
ఆసలతోడఁ బెనఁగి అట్టే కొంగు వట్టి తేను
వోసరించి గుట్టు తోడ నుండుటే నేర్పు

చ. 2: తగులైనది పెనఁగి తా నెం తలయించినాను
నగుతా నోరిచిన జాణనిదే నేర్పు
వెగటైన కాతరాన వేసటగాఁ గొల్చినాను
పగటున నాదరించి పాయనిదే నేర్పు

చ. 3: కాఁకలఁ బొరలినది కౌఁగిటఁ గొసరినాను
సోఁ కోర్చి మెచ్చే సరసునిదే నేర్పు
యాఁకట శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
వాకముగాఁ గూడితివి వడి నిదే నేర్పు

రేకు: 0423-2 సౌరాష్ట్రం సం: 12-134

పల్లవి: యిన్ని విన్నపములును యిందులోనే వున్నవి
పన్ని నన్ను నేలే నిఁక బతికితి ననవే

చ. 1: యెనసిన మీఁద నేలే యెరవులూ
ననిచిన మీఁద నేలే నమ్మికలూ
తనిసిన మీఁద నేలే తమకములు
మనవి చేకొని యిఁక మఱవకు మనవే

చ. 2: మరిగిన మీఁద నేలే మరిచింతలూ
కరఁగిన మీఁద నేలే కాంతాళింపులు
సరియైన మీఁద నేలే సాదింపులు
గరిమ నా కిచ్చె నిఁకఁ గరుణించు మనవే

చ. 3: కలసిన మీఁద నేలే కడువాసుల
పిలిచిన మీఁద నేలే బిగువులూ
యెలమి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
తలఁ నట్టే కూడఁ దగు నింక ననవే

రేకు:	0423-3 సామంతం	సం:	12-135

పల్లవి:	తగవరి వన్నిటాను దయఁ జూడవలదా
	వెగటుగాఁ జెలు లింత విన్నవించవలెనా

చ. 1:	కందువ నీ వేళలు గాచుక యాపె వుండఁగా
	యెందుండో వచ్చి నవ్వీ యీలేమ నీతో
	ముందు వెనక దెలిసి మోహము చేకొనవద్దా
	సందు సుడికత్తెలకు చనవు లీఁ దగునా

చ. 2:	యెప్పుడు మాటాడే వంటా నీపెమోము చూడఁగా
	దెప్పరమై కత చెప్పీదెరవ నీతో
	తప్పకుండాఁ బెద్ద పిన్నంతరువులు చూడవద్దా
	చిప్పిలఁ బొరుగువారిఁ జిమ్మి రేఁచవలెనా

చ. 3:	అలమేలుమంగ పురమందు నెక్కుకుండఁ గాను
	వెలినున్నసతి నీతో వియ్య మందీని
	యెలమి శ్రీ వేంకటేశ యిద్దరినిఁ గూడితివి
	కెలనివారితోఁ బొత్తు గలపఁగ వలెనా

రేకు: 0423-4 మంగళకౌశిక సం: 12-136

పల్లవి: నిన్నుఁజూచి చెలులకు నివ్వెఱఁగులై వున్నవి
పన్నిన వలపులకు పండుగాయ నేఁడు

చ. 1: వీడె మిచ్చి చెలి నీకు విన్నపము సేయఁగాను
వేడుకల కన్నియును వినేవు నీవు
తోడనే వినయాలెల్లా తోడు చూపఁగా నీకు
జాడ తోరేగీ సంతములెల్లా నేఁడు

చ. 2: సంగడిఁ గూచుండి యీకె చనవునఁ జెనకఁగా
అంగమెల్లాఁ జెమరించి యానందించేవు
రంగుమీఱ నీమీద రతిఁజేయి చాఁచఁగా
వుంగిటి(?) మదనకళ లుబ్బీ నీకు నేఁడు

చ. 3: ఆలిమేలుమంగ నీ యక్కుమీఁద నిలువఁగా
బలిమి శ్రీ వేంకటేశ పచ్చిదేరేవు
యెలమి నీకె మమ్ము నిందరి నేలు మనఁగా
వెల లేని భోగములు వింతలాయ నేఁడు

రేకు: 0423-5 సాళంగనాట సం: 12-137

పల్లవి: గోవిందుడీ బాలుడు గోపాలుడు
కావింప రేపల్లె లోని కాంతాలోలుడు

చ. 1: జనియించె గృష్ణుడు సర్వలోక జిష్ణుడు
దనుజాంతకుడు యీతడే విష్ణుడు
పనివడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుడు
సనకాదుల మతుల సంచరిష్ణుడు

చ. 2: పెరిగె గంస జైత్రుడు భీషణ తేజ మిత్రుడు
వర వసు దేవ దేవకీ పుత్రుడు
సరస భావించి చూడ సర్వజీవగాత్రుడు
పరగ రుక్మిణి సత్యభామాకళత్రుడు

చ. 3: వెలసె భూధరుడు విశ్వలోక గురుడు
సులలిత బలభద్ర సోదరుడు
కలిత నిశ్చల శ్రీ వేంకటగిరి సంచారుడు
కలసిన యలమేల్మంగా మనోహరుడు

రేకు: 0423-6 గుండక్రియ సం: 12-138

పల్లవి: చెలులాల రమణుఁడు చిత్తగించీ నల వాఁడె
మెలఁగి సేవ సేయరే మెచ్చీ నిందరిని

చ. 1: మంచి మాట లాడవలె మనసు గరఁచవలె
కంచపు మో వియ్యవలె కాంతునికి
పంచనతో మొక్కవలె వద్దఁ గాచుకుండవలె
కొంచక లోనికి రారే కొలువు వేళాయను

చ. 2: యిచ్చకము చూపవలె నింపులే నెరపవలె
మచ్చిక నవ్వఁగవలె మగనితోను
కచ్చు పెట్టు కుండవలె కానుక లందుకోవలె
కొచ్చి విన్నవించరే కొలువు వేళాయను

చ. 3: వేడుకలు రేఁచవలె వెస నలమేల్మంగకు
వీడె మియ్యవలె శ్రీవేంకటేశుకు
యీడుకుఁ బొగడవలె యిద్దరును ముద్దువలె
గూడిరి తెరదీయరే కొలువు వేళాయన

రేకు: 0424-1 లలిత సం: 12-139

పల్లవి: యెన్ని నేరుచుకొన్నాఁడే యిందుకే వేరగయ్యీని
చెన్నుమీర యశోదకుఁ జెప్పరే యీ సుద్దులు

చ. 1: వుట్లు దించఁగఁ గాచుకున్న కృష్ణుఁనిఁజూచి
తిట్లు దిట్టు గొల్లెత తేరి చూడఁగా
చెట్ల వంటి చన్నులు చేత ముట్టి పెనఁగీని
చుట్ల చొల్లేల తోడఁ జూడరే యీబాలుని

చ. 2: వేవేలు పండ్ల గంప విడుమంటా వేరొకతె
పూవుల చెండునఁ గృష్ణుఁ బూఁచివేయఁ గా
మోవి పండ్లంట్ట బట్టె ముంచియాకె యధరము
చేవమీఱి యున్నాఁడేమి సేతమే యీ బాలుని

చ. 3: మలసె నేఁడలమేలుమంగ శ్రీవేంకటకృష్ణుఁ
నలమిపట్టి చేతికోలలు దియ్యఁగా
కలసె నంతలోనే కౌఁగిలించి రతులను
వెలసి మెచ్చఁగదరే వేడుక యీ బాలుని

రేకు: 0424-2 హిజ్జిజి సం: 12-140

పల్లవి: నెఱజాణ విభుఁడవు నీవు యిన్ని నేరుతువు
తఱితోడ నీ విదివో దయఁజూచితివి

చ. 1: కన్నుల నవ్వితివి కానుక చేకొంటివి
విన్నపము లెల్లాను వింటివి నేఁడు
సన్నలఁ జొక్కితివి చనవు లిచ్చితివి
ఇన్నిటా నీ వుపకార మేమని చెప్పుదును

చ. 2: సరస మాడితివి చవులమో విచ్చితివి
పరిమళములు నాపైఁ బూసితివి
అరుదైన మాటలాడి ఆదరించితివి నన్ను
పరుగ నీచేత కెంత సంతోసించు కొందును

చ. 3: చెలిమి చేకొంటివి సేస నాపైఁ బెట్టి తివి
తలఁపులో నిలిచి చింత వాపితివి
అలమేల్మంగను నేను అంకెల శ్రీ వేంకటేశ
కలసి యేలితివి యీగతి యెట్టు మెత్తును

రేకు: 0424-3 భైరవి సం: 12-141

పల్లవి: నాలోని వేడుకలు నామనసే యెఱుఁగును
కే లెత్తి తన కిట్టే మొక్కితి నే ననవే

చ. 1: వొడఁ బరచ నేరుచు వొద్దికై వుండఁగలఁడు
చిడిముడిఁ బతికిఁకఁ జెప్ప దేమే
అడియాలా లిచ్చి నాఁడు అన్నిటా మన్నించినాఁడు
తడవనున్న పనులు తానే యెఱుఁగునే

చ. 2: తను నిట్టే మరిగించె తమకమునాకు రేఁచె
చెనకి యింకా వేరే చెప్పేదేమే
మన సొక్కటిగాఁ జేసె మంతనానఁ జస విచ్చె
తనిసితిఁ గోరికల తానే యెఱుఁగునే

చ. 3: గ నాకు నేర్పె కమ్మి నావద్ద నున్నాఁడు
చెలికత్తెలాల మరి చెప్పేదేమే
అలమేలుమంగను తా నదె శ్రీ వేంకటేశుఁడు
తలపులోఁ బాయఁడు తానే యెఱుఁగునే

రేకు: 0424-4 సామంతం సం: 12-142

పల్లవి: యెవ్వరే నీకు సరి యింతులు
చివ్వన నలమేల్మంగ చెల్లునే నీ రంతులూ

చ. 1: తరుణి నీ కన్నుల బిత్తరి చూపులూ
మరునికి నవియే కమ్మని తూపులూ
బిరుదుల నీ పతికె పెరరేఁపులూ
వరుసఁ జల్లితి వౌనే వలపుల రాఁపులూ

చ. 2: పగటున నీరతి పలుకులూ
జిగి మతిఁ దగిలిన చిలుకులూ
తగిన నవ్వు దంతపు తళుకులూ
మొగి మర్మములు రేఁచే ములుకులూ

చ. 3: పొసఁగే నీ కౌఁగిటి పొందులూ
సుసరాన మోవితేనె జుంటి విందులూ
కసిదీరని తమకపు మందులూ
కొసరి శ్రీ వేంకటేశుఁ గూడుటకే సందులూ

రేకు: 0424-5 కేదారగౌళ సం: 12-143

పల్లవి: నా రమణునిఁ జూడరే నలినాక్షులాల నేఁడు
గారవముతోడ నన్నుఁ గరుణించీ నిదివో

చ. 1: మరిగిన యెడాటాన మంకు లేమి రేఁగవు
సరవితోఁ బెనగితే చలము లేదు
తిరమైన పొందులకు తెరమరఁ గెంచవద్దు
నిరతపు వేడుకలే నిండుకొను మతిని

చ. 2: మొగము చూచినమీఁద మొనయవు కాఁకలు
నగఁ దొడఁ గితే మఱి నాట దలుక
చిగిరించిన వలపు చేగలు దీరకపోదు
మిగులాఁ దమకములే మేనఁ బెనగొనుము

చ. 3: బలిమిఁ గూడిన తటిఁ బంతములు పుట్టవు
చెలఁగి యేకతమైతే సిగ్గు మించదు
అలమేల్మంగను నేను అతఁడు శ్రీ వేంకటేశుఁ
డిల నన్ను నేలె నిఁక నిచ్చకమౌ రతులు

రేకు: 0424-6 మధ్యమావతి సం: 12-144

పల్లవి: చెలులాల యిందుకే సిగ్గయ్యీ నాకు
తలకొన్న నా గుణము దాఁచ నేలే యిపుడూ

చ. 1: అతఁడు చేసిన మేలు ఆడుకొన వేడుకౌను
యితర సతులు విని యే మందురో
తతితో వాని గుణాలు తలఁచితే వెరగౌను
మితిమీరి సవతులు మించెట్టు నవ్వుదురో

చ. 2: చిమ్ముల నా రమణుని చేఁతలు నేఁ జూచుకొందు
కిమ్ముల వనిత లెంత గేలి సేతురో
నమ్మి వానిఁ బేరుకొని నాలోనేఁ జొక్కుకొందు
కొమ్మలు మోమోము లెట్టు కోరి చూచుకొందురో

చ. 3: గక్కన శ్రీ వేంకటేశుఁ గంటేఁ గౌఁగిలించుకొందు
పక్కనున్నవా రెంత పచ్చిసేతురో
ఇక్కువఁ దా నన్నుఁ గూడె యే నలమేలుమంగను
మొక్కుదు నందు కిందరు ముంచి యెట్టు మెత్తురో

రేకు: 0425-1 భూపాళం సం: 12-145

పల్లవి: యిందరికిఁ గలుగునా యిటువంటి భాగ్యాలు
చెందేవారికి వారు నోఁచిన యంతే కాక

చ. 1: పాదము నాపై నతఁడు పక్కన జాఁచితేను
సోదించి మీ మొగా లేమి చూచుకొనేరే
సాదించి తా మోవితేనె చవులు నాకిచ్చితేను
ఆదికొని నో గూరే రది యేమే మీరు

చ. 2: తమ్ముల మాతఁడు నాకు తానే పిల్చి యొసగితే
చిమ్ముచు మీ రేమి సన్న సేసుకొనేరే
కమ్మర నప్పటి నా కైదండ వట్టు కుండితే
పమ్మి లోలోనే సిగ్గులు పడనేలే మీరు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జేరి కౌఁగిలించుకొంటే
యీవల దోమతెర యేమి వేసేరే
ఆవటించి పెండ్లాడె నలమేల్మంగను నేను
బూవాన నిద్దరి నెంత పొగడేరే మీరు

రేకు: 0425-2 నారణి సం: 12-146

పల్లవి: పతికి విన్నవించరే పడఁతులాల
తతితోడఁ దను మదిఁదలఁతు నే ననరే

చ. 1: యిచ్చకమయినచెలి యేపనులైనాఁ జేయు
కచ్చు పెట్టు కున్నది కాంక్ష రేఁగును
మచ్చిక గలిగినది మందెమేళాన సొలయు
యెచ్చు కుందులెంచి మరి యెగ్గుపట్టఁ దగదే

చ. 2: ఆసతో నుండినది ఆలకించుఁ దనమాట
వాసి గలిగినది సేవలు సేయును
బాసలు నమ్మినది తప్పని గుట్టుతో నుండు
రాసి కెక్కించి ఇది రవ్వసేయఁ దగదే

చ. 3: యిల్లాలై వుండినది యెదుటనే కాచుకుండు
వెల్లివిరి నవ్వులది వేడ్కతో నుండు
యిల్లిదే శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
తెల్లమిగా నన్నుఁగూడె తిరమైతి ననరే

రేకు:	0425-3 గౌళ	సం:	12-147

పల్లవి:	వేసరించేదానఁ గాను వేగినంతా నిన్నును
	రాసి కెక్క నీకృప నే రతిఁ జెలఁగుదును

చ. 1:	నట్ట నడుమనే నీవు నావాఁడవై వుంటేఁ జాలు
	అట్టే నే నెంతటిదాన నైనా నౌదును
	గుట్టు తోడ నీవు నాకుఁగొలు విచ్చితేఁ జాలు
	నెట్టన లోకమునకు నేనే రాజ నౌదును

చ. 2:	కందువ నీవు నన్నుఁ గన్నులఁ జూచితేఁ జాలు
	అందపు సిరుల నోలలాడుదును
	మందలించి నాతో నొక మాటాడితేనే చాలు
	పందెమాడి నీచే తుది పదము చేకొందును

చ. 3:	చేరి శ్రీ వేంకటేశ్వర సెలవి నవ్వితేఁ జాలు
	కోరి నీవలపులకు గురి యౌదును
	సారె నలమేల్మంగను సతి నీకు నైతేఁ జాలు
	మేరతోఁ గూడితిని మేలెల్లా సాదింతునూ

రేకు: 0425-4 శంకరాభరణం సం: 12-148

పల్లవి: తానే వచ్చీగాని తరవులు వెట్టకురే
మోనమునఁ జెలులాల మొక్కరే మీరు

చ. 1: మనసు వచ్చినసతి మరి దవ్వుల నుండినా
తనువు సోకినట్ల తలఁచుఁ బతి
యెనయికయైన మాట యెక్కడనాడినాను
అనిశముఁ జెవిలోనే ఆడినట్టే వినును

చ. 2: యిచ్చకపు జవరాలు యెదుటికి రాకుండినా
పచ్చిగా మఱపు లేక భావించును
బచ్చెన సిగ్గుల తోడఁ బచ్చడము గప్పుకొన్నా
విచ్చి విచ్చి కన్నులను వేమారుఁ జూచును

చ. 3: మానావతియైనది మఱఁగున నుండినాను
పూని వచ్చి కౌఁగిటఁ బొంచి కూడును
యే నలమేలుమంగను యీతఁడు శ్రీవేంకటేశుఁ
డానుకొని నన్ను నేలే నన్నిటాను మెచ్చును

రేకు: 0425-5 కాంబోది సం: 12-149

పల్లవి: కాంతలాల చూడరే కన్నుల పండుగ లివి
వింత యైన తనలోని వేడు కెటువంటిదో

చ. 1: సింగారించుకొనఁ గాను చెలియ విభునిఁ జూచి
అంగ మెల్లఁ జెమరించె నా యెట్టిదో
రంగుగ మోవిమీఁది రసముల నిగ్గు చూచి
సంగతిగా నో రూరీచవు లెట్టివో

చ. 2: పతి వాఁడే జవరాలు పవళించుండగఁ జూచి
మతి నివెవ్వరగులయ్యీ మక్కువెట్టిదో
చతురతఁ గొలువులో చక్కఁదనములు చూచి
తతిగొని పులకంచీ దమకము లెట్టివో

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు సెలవి నవ్వఁగాఁ జూచి
భావించీ నలమేల్మంగబత్తి యెట్టిదో
యీవేళఁ గౌఁగిటఁ గూడి యీతనినేరుపు చూచి
చేవ దేరీఁ గళలతో చేఁత లెట్టివో

రేకు: 0425-6 నాదరామక్రియ సం: 12-150

పల్లవి: అడుగఁగ సిగ్గయ్యీ నా కందుకే నేఁడు
చిడిముడి చేఁతల చిన్నదానఁ గనకా

చ. 1: చిత్త మెట్టున్నదో నాపై చెలువునికి
యిత్తల నాపొందు లింక నేమి సేసీనో
బిత్తరపు రతులలో ప్రియ మేటిదో
హత్తిన వో చెలులాల అదె విచారించెనూ

చ. 2: యెప్పుడు వచ్చునో మా యింటికిఁ దాను
చిప్పిలఁ గాంతల చేత చెప్పంపినాఁడు
దొప్పుగాఁ గరుణ నన్నుఁ జూచె నిందాఁకా
తప్పక యీ వుపమలే తలపోసీ నేనూ

చ. 3: వోవరిలోఁ బవళించి వున్నాఁడట
కైవసమై యెంతలోనే కలసె నన్ను
సేవ నలమేల్మంగను శ్రీ వేంకటేశుఁడు తాను
భావించి నే నిందుకే పై పై మెచ్చేనూ

రేకు: 0426-1 దేశాక్షి సం: 12-151

పల్లవి: యెవ్వరికిఁ గలుగు నేఁడీ భాగ్యము
నివ్వటిల్ల నన్ను మన్నించితివి గాకా

చ. 1: వేడు కౌను నీ గుణాలు వెలఁదులు పొగడితే
చూడఁ జూడ నీ రూపు సోద్యము లౌను
కూడి వున్నంత దడవు గొబ్బున సంతోసమవును
యీాడ నామనసు నీపై నెంత మరిపితివో

చ. 2: నెమ్మది నిద్రించితేను నీకలలే కందును
కొమ్మలతో నిన్నుఁ బేరుకొని మెత్తును
కమ్మర నీగురుతులు కాయ మంటితేఁ జొక్కుదు
ఇమ్ముల నీమీఁదిబత్తి యెంత నా కిచ్చితివో

చ. 3: చిగిరించు నవ్వులు చేయి నాపైఁ జాచితే
నిగుడుఁ దమకములు నీవు చేరితే
తగు నలమేల్మంగ నింతట శ్రీ వేంకటేశ్వర
వొగి నీ రతుల కెంత వొడిగట్టించితివో

రేకు: 0426-2 ఛాయానాట సం: 12-152

పల్లవి: అందుకే వో చెలియా అరుదయ్యీ నాకు నిట్టే
చందమాయఁ బను లెల్లా సంతోసమా నీకు

చ. 1: ఆనుకొని చెలులచే ఆతఁడు సేసేచేఁత
వీనుల పండుగ గాను వింటివా నీవు
పూనిన వేడుక తోడ నుండేటి లాగు లెల్ల
కానుకగాఁ గన్నులారఁ గంటివా నీవు

చ. 2: ఆరి తేరి వద్ద నుండి యాతని తలఁపు లెల్లా
చేరి మాటలాడి తెలిసితివా నీవు
నారుకొనే నప్పటి నీ నయగారితనములు
మేరమీఱి పచారించి మెచ్చితివా నీవు

చ. 3: మెఱయ శ్రీ వేంకటేశు మేలిమినేరుపు లెల్లా
గుఱిగాఁ గౌఁగిటిలోఁ జేకొంటివా నీవూ
మఱియును నలమేలుమంగ నైన నన్నుఁ గూడె
తెఱవలలోన సమ్మతించితివా నీవు

రేకు: 0426-3 బౌళి సం: 12-153

పల్లవి: నీ దిక్కే తప్పక చూచీ నీ విభుఁడు
మోదముతోఁ జేతు లెత్తి మొక్కు మొక్కఁగదవే

చ. 1: బాసికము గట్టు కొని పదరఁగ నేఁటికి
సేసలు చల్లే అప్పుడు సిగ్గు లింకానా
ఆసతోఁ బెనఁగుతాను అనుమానము దగునా
వేసరని వలపుల విట్టువీఁగ గదవే

చ. 2: పీడెము చే నందుకొని వింత సేయవలెనా
కూడిమాడి వుండి మరి గుట్టు సేతురా
వాడికగాఁ బొందుసేసి వావు లడుగుదురా
జోడు గూడి కౌగిటిలో సొంపు మీఱఁగదవే

చ. 3: మంతనాన దక్కగొని మరగు వెదకుదురా
పంతము లీడేరె మరి కొసరేలా
చెంత నలమేల్మంగవు శ్రీ వేంకటేశుఁడతఁడు
సంతోసించి నిన్ను నేలే జట్టి గొనగదవే

రేకు: 0426-4 మధ్యమావతి సం: 12-154

పల్లవి: నీ కెప్పుడు చూచినాను నేనే యితవరిఁ జుమీ
పై కొని ముందుగా విన్నపము సేసికొంటిని

చ. 1: కొప్పు జారే నంటీ నింతే కొంగు వట్టేవు సుమీ
దెప్పరాన నేఁడది తెలుపు మని
యిప్పు డద్దము చూపితే నిట్టే కోపగించకుమీ
కప్పి సింగారము తారుకాణించవలెను

చ. 2: కళలు నిండే మోమంటే కాంతాళించేవు సుమీ
సొలసి నీకు దిష్టాలు చూపు మని
చెలఁగి తెర వేసితే సిగ్గులు వడకుమీ
అలపారఁ బవళించు మంటీ నింతే నేను

చ. 3: వూరకే నవ్వితి నింతే వొట్టు వెట్టేవు సుమీ
కారణ మిందుకుఁ బోల గడించు మని
యీ రీతి శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
చేరి నన్నేలఁగా సంతోసించితి నేను

రేకు: 0426-5 ఆహిరి సం: 12-155

పల్లవి: తలపోసి తలపోసి తమకించీ నామనసు
తలుపు దెఱచి నా దండకుఁ బిలువరే

చ. 1: చెలి కత్తెల మాటలు చేకొని వినినవాఁ డు
యెలమి నిక్కడి కిప్పుడేల రాఁడే
కల కల నవ్వుతాను కానుక లందినవాఁడు
పలుమారు నెక్కడి పరాకున నున్నాఁడే

చ. 2: ఆసవెట్టి నాకు లేక లంపినయట్టి వాఁడు
పాసి తా నక్కడ నేమిపని కున్నాఁడే
వాసి కెక్క నాపై వలపు చల్లనవాఁడు
సేస చేఁ బట్టుక యెంత సిగ్గుతో నున్నాఁడే

చ. 3: పక్కన నా యండ వచ్చి పవళించి వున్నవాఁడు
మొక్కలాన నే లవ్వలిమోమై వున్నాఁడే
యిక్కడ శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
మిక్కిలి నన్నేలే యెట్టు మెచ్చుతా నున్నాఁడే

రేకు: 0426-6 దేసాళం సం: 12-156

పల్లవి: యింతకంటె నేమి సేసు యిది చాలదా నాకు
సంతసము రేచి ఇంత చన విచ్చినాఁడూ

చ. 1: తగవరి తా నౌనే దయగలవాఁడూ నౌనే
జగమెల్లా నెరిఁగిన జాణఁడూ నౌనే
వెగటుగా తన్నుఁబాసి విరహాన నున్న నన్ను
మొగము చూచి నాచే మొక్కించుకొన్నాఁడే

చ. 2: వొడఁబరచ నేర్చునే వొద్దికై వుండ నేర్చునే
చిడిముడి నంది పొందుసేయ నేర్చునే
కడఁగి తన్నుఁజూడక కాఁకలఁ బొరలే నన్ను
వొడివట్టి నాకు మోవి యొసఁగినాఁడు

చ. 3: విన్నపాలు వినేనే వీడు దొర్లాడేనే
యిన్నిటాఁ దా శ్రీ వేంకటేశ్వరుఁడే
మన్నించి యలమేలు మంగనైన నన్నుఁ గూడె
వున్నతపు రతులను వోలలార్చినాఁడు

రేకు: 0427-1 శ్రీరాగం సం: 12-157

పల్లవి: విరహ మేడదే నాకు వెస నీ కరుణ గద్దు
అరసి నీ కతల నోలాడుచుందుఁ గాక

చ. 1: తలఁపులో నీ వుండఁగా తడఁబాటు లేల నాకు
వలపు గలిగుండగా వగ పేల
చెలిమి నీవు సేయఁగా చింతలెల్లాఁ బెడఁ బాసె
పలుమారు సంతోసానఁ బరగుదుఁ గాక

చ. 2: వేల నీ వుంగర మిదే వేళలు చూడ నేఁటికి
సోలి నీసతులు వీరే సొలయవద్దు
వోలివెట్టి పెండ్లాడితి వొడఁ బరచవలెనా
మేలు తోడిదాననై మెలఁగదుఁ గాక

చ. 3: నీ పేరు నానోర నిదే నేరములు లేవు నాకు
కాఁపురము నీకుఁ జేసే కడ మెంచను
యే పొద్దు శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
వోపి నన్ను నేలితివి వొనరుదుఁ గాకా

రేకు: 0427-2 ముఖారి సం: 12-158

పల్లవి: కాచుకున్నారు నీవూడిగపు చెలు లిందరును
చేచేఁత జలక మాడ చిత్తగించే దెపుడే

చ. 1: గుట్టునఁ బతిగుణాలు కొనియాడనే పట్టె
చుట్టి యాతనిమొగము చూడనే పట్టె
అట్టే పీడె మిచ్చి నీవు ఆకు మడిచియ్యఁ బట్టె
నెట్టన సింగారించుకో నీకు వేళ యపుడే

చ. 2: ననిచి యాతని తోడ నవ్వులు నవ్వనే పట్టె
పెనఁగి వలపు లెల్లాఁ బెంచనే పట్టె
తనివోని రతులపైఁ దమి రేఁచనే పట్టె
అనువునఁ గూచుండి ఆరగించే దెపుడే

చ. 3: సతతముఁ గెమ్మోవులు చవులు చూడనే పట్టె
మితి మీరె నేరుపులు మెచ్చనే పట్టె
అతఁడు శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
పతికిఁ బతి గూడేరు పవ్వళించే దెపుడే

రేకు: 0427-3 ధన్నాసి సం: 12-159

పల్లవి: అటువంటి గుణాలదే అలమేల్మంగ
తటుకునఁ జిత్తగించి తగిలి మెచ్చవయ్యా

చ. 1: కొనియాడ నేర్చిన కొమ్మ పొందుసేయ నేర్చు
ననువు గలిగినది నవ్వ నేరుచు
చెనకినది వెనకఁ జేరి మొక్క నేరుచు
వినయ మెరిఁగినది వేఁడుకొన నేర్చును

చ. 2: గుట్టు గలిగినయది కోరి వలపించ నేర్చు
దిట్టయైనది మాట తెలుప నేర్చు
అట్టడి యయినది మీఱక వుండఁగ నేరుచు
చుట్ట మైనది కలయ సుసరాన నేర్చును

చ. 3: సిగ్గు గలిగినది మచ్చిక సేవ సేయ నేర్చు
యెగ్గు పట్టనిది యిట్టే యొనయ నేర్చు
అగ్గమై శ్రీ వేంకటేశ అన్నిటా ని న్నీపె గూడె
తగ్గు మొగ్గు లేనిది దయనుండ నేర్చునూ

రేకు: 0427-4 కురంజి సం: 12-160

పల్లవి: సందుసుడి వనితవు జాణవమ్మా
అందుకోలు పెండ్లాడే వౌనమ్మా

చ. 1: కాతరాన రమణుఁడేకతమున నుండఁగాను
ఆతనిపై బత్తి నేనే వౌనమ్మా
యీతల నెవ్వతెకో తా నెదురులు చూడఁగాను
చేతు లెత్తి మొక్కేవు చేరీ మేలు నమ్మా

చ. 2: వేడుకతో నేమిటికో వీను లాలకించఁగాను
ఆడేవు నీమాటలు అవునమ్మా
జాడతోనే అడపముసతుల వెదకఁగాను
వీడెము నీ విచ్చేవు విటకత్తె వమ్మా

చ. 3: యింటిలో యలమేల్మంగ నెదఁబెట్టు కుండఁగాను
అంటేవు శ్రీ వేంకటేశు నౌనమ్మా
జంటలై యీతఁడే మమ్ము సరి నేలుకుండఁగాను
నంటున నీవు మెచ్చేవు నయగారివమ్మా

రేకు: 0427-5 నట్టనారాయణి సం: 12-161

పల్లవి: వోజ దప్పకుండావలె నొయ్యారపు దానికి
సాజపు రమణుని కే చందమైనా నమరును

చ. 1: కరుణించి తానే వచ్చి కలసితేఁ దగుఁగాక
వరుసఁ దరవువెట్ట వచ్చునా నాకు
మరిగి యప్పటి నాతో మాటాడితే నాడేఁగాక
యెరవుల దానివలె యెచ్చరించఁ దగవా

చ. 2: సమ్మతించి నామోవి చవిగొంటే నింపు గాక
నెమ్మది నొడఁబరచ నేరుపా నాకు
చిమ్ముచుఁ జెనకితేను సేవసేయఁ గూడుఁగాక
దిమ్మరితనాన నాకు దీకొన సరవులా

చ. 3: సారె సారె నవ్వితేను సరసమాడుదుఁ గాక
చేరి మందెమేళాలు చెల్లునా నాకు
యీరీతి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
కూరిమి నన్నేలినాఁడు కొసర నుచితమా

రేకు: 0427-6 కుంతలవరాళి సం: 12-162

పల్లవి: మరుఁడు సేసిన మాయ మగలకు నాండ్లకు
విరసాలు వుట్టవు వేడుకే కాని

చ. 1: యెంత దూరి మాటాడినా యింపు లయ్యే వుండుఁగాని
పంతము రేఁగ దింతిపైఁ బతికి
పొంతనుండి సారె సారె బొమ్మల జంకించినాను
వింతలు దోఁచవు మరి వేడుకే కాని

చ. 2: చలపట్టి సరసము జరయుచు నాడినాను
అలయిక వుట్టదు దేహమునకును
పెలుచుఁ దనాన మరి పెనఁగులా టాడినాను
వెలయ వేసటగాదు వేడుకేకాని

చ. 3: మిన్నక కొసరి మందె మేళ మెంత సేసినాను
అన్నిటా లోలో నెగ్గులై మించవు
యెన్నఁగ శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
విన్నప్పుడే కూడె మాకు వేడుకలె కాని

రేకు: 0428-1 ధన్నాసి సం: 12-163

పల్లవి: చెప్పేనంటా నే నే వుండి సిగ్గుపడుదు నెదుట
వొప్పుగ నాతనికి మీ రొగి విన్నవించరే

చ. 1: చనవరితనమున సారెకు మాటలాడుదు
ననుపైనకతమున నవ్వుదును
వినయము నేర్తునంటా వేవేలు సేవలు సేతు
యెనలేని నా రమణుఁ డెగ్గుపట్టీఁ జుమ్మీ

చ. 2: చిన్నదానఁ గనకనే చేఁతలెల్లాఁ జేయవత్తు
మన్నించిన కతమున మలయుదును
సన్నకు లోనైతిఁ గన సంతోసానఁ దమకింతు
యిన్ని నెఱిఁగినవాఁడు యెగ్గుపట్టీఁ జుమ్మీ

చ. 3: పట్టపు దేవులనై పై పై బెనఁగుదును
గుట్టు తోదానఁ గనక కొంచి మొక్కుదు
యిట్టే శ్రీ వేంకటేశుఁ డే నలమేలుమంగను
యెట్టై నఁ దా నన్నుఁ గూడె నెగ్గప ట్టీఁ జుమ్మీ

రేకు: 0428-2 దేశాక్షి సం: 12-164

పల్లవి: తనచిత్త మెట్టుండునో తగ వెఱుఁగుదు నేను
వినయము గొంత చూపి వెలసేఁ గాకా

చ. 1: యేలినవాఁడు నన్ను నిట్టే మన్నించకుండినా
కొలుముందుగాఁ గొంత కొసరేఁగాక
చేల కొంగంటినవాఁడు చెనకఁడా యెప్పుడును
వాలుకచూ పాతనిపై వంచేఁ గాకా

చ. 2: కప్పుర మంపినవాఁడు కౌఁ గిటికి వచ్చునేకా
పిప్పి గట్ట మరి నవ్వి పెనఁగేఁ గాక
యిప్పుడు బత్తిగలవాఁ డెప్పుడూనుఁ జుట్ట మౌనే
దప్పికి మోవి యడిగి తనిసేఁగాక

చ. 3: చేతికి లోనైనవాఁడు సిగ్గువడునా యిఁక
ఘతలఁ గౌఁగిటఁ గూడి కలసేఁగాక
యీతఁడు శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
కాతరాన నా పయ్యద గప్పేఁగాకా

రేకు: 0428-3 తోడి సం: 12-165

పల్లవి: చెప్పినట్టల్లా మరి చేసుటగాక
దప్పిదేరి లో లోనే తలవంచ నేఁటికీ

చ. 1: సిగ్గులు వడేవారికి చింతఁ బొరలే వారికి
యెగ్గులు పట్టఁగఁ జెల్లు నెంతైనను
అగ్గలమై పతిమీఁది యాసకు లోనైనవారు
తగ్గు మొగ్గు వాసులలోఁ దడఁబడ నేఁటికి

చ. 2: పంతము లాడేవారికి భావించుకొనేవారికి
వింతగా జరయఁ దగు వేమారును
చెంతనుండి రతులలోఁ జెలిమి సేసేవారు
మంతనాన వట్టి యనుమానము లేఁటికీ

చ. 3: చలపాదివారికి జడియనివారికి
కిలకిల నవ్వవచ్చుఁ గేరడానను
యెలమి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
కలసె నన్నితఁడు కక్కసించ నేఁటికీ

రేకు: 0428-4 నాగవరాళి సం: 12-166

పల్లవి: యేమి విన్నపము సేసే వెంతైనాఁ గలదు పని
గామిడితనా లెఱఁగఁ గరుణించు మనవే

చ. 1: పట్టీ పెనఁగఁగ నోప బాస లడుగఁగ నోప
వొట్టుక వొద్దఁ గాచుకుండ నోపుదు
ఱట్టడి విభుఁడు తాను ఱాతిగుండెవాఁడు తాను
గట్టిగా నా భావ మెంచి కరుణించు మనవే

చ. 2: వేసాలదానఁ గాను వేగిరపు దానఁగాను
ఆసతో సేవలు సేసే అందు కొదును
రాసి కెక్కెఁ దొల్లే తాను రాజసపువాఁడు తాను
వాసితో నన్నుఁ బాయని వరుస ఇమ్మనవే

చ. 3: చలములు పచరించ జంకెనలు పచరించ
పలుమారు వలపులే బడి నింతును
చెలి యలమేల్మంగను శ్రీ వేంకటేశుఁడు తాను
కలసె నాగుణ మింకాఁ గనుఁగొన మనవే

రేకు: 0428-5 పూర్వగౌళ సం: 12-167

పల్లవి: యెంతటి నేరుపరివి యేమని పొగడవచ్చు
వింత నీ సుద్దులు చూచి వేడు కాయ నాకును

చ. 1: చనవిచ్చి నీవు మోవి చవులు చూపఁగాను
తనివిఁ బొందె నాతలఁ పెల్లను
మునుకొని నీవు నామొగమై నిలువఁగాను
పెనగొన్న సంతోసము పెడరేఁగె నాకును

చ. 2: పక్కన నీవు నాకు బాగా లొసఁగఁగాను
యిక్కువలు గరఁగను ఇంతలోనె
చెక్కు నొక్కి నీవు నన్ను సిగ్గులు దేరుచఁగాను
నెక్కొన్న కోరికలు నెరవేరె నాకును

చ. 3: కందువ నుండినన్నుఁ గౌఁగిలించుకొనఁగాను
చిందె నా సెలవులనుఁ జిరునవ్వులు
యిందునే శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
పొందితివి రతుల నీభోగ మబ్బె నాకును

రేకు: 0428-6 సావేరి సం: 12-168

పల్లవి: తన చిత్తము వచ్చితే తానే కరుణించీఁగాక
ఘనుఁడైన రమణునిఁ గక్కసించ నేఁటికే

చ. 1: వూహగలవారికి నుపమలు దోఁచును
దాహ మణఁచేవారికి దప్పిదేరును
మోహముగలవారికి మునుకొను సంతోసము
వోహో రిత్తవారికి నొడఁబాటు లేఁటికే

చ. 2: మనసు వచ్చినప్పుడు మాటలెల్లాఁ జవు లౌను
తనిసి వున్నయప్పుడు తాలిమి నిండు
ననిచిన యప్పుడు నవ్వులు తానే వచ్చు
పని లేని యప్పుడు పచారించ నేఁటికే

చ. 3: కూటములు గలిగితే గుణములు చక్కనౌను
పాటించి పొందు గలిగితేఁ బంత మీడేరు
యీటున శ్రీ వేంకటేశుఁడిదివో నన్ను నేలె
మేటా మేటి రతులలో మెఱయఁగ నేఁటికే

రేకు: 0429-1 లలిత సం: 12-169

పల్లవి: విభుఁడు వద్ద నున్నాఁడు వేవేలు చందాలాను
సభలో సిగ్గు లేటికే చనవరి తాను

చ. 1: చిన్నఁబోవ నేటికే చెంగలించి వుండుగాక
మన్నన దేవులైన మగువ తాను
సన్న సేయ నేటికే చక్కఁగా మాటాడుఁగాక
కన్న వెల్లా నేర్చిన కలికి తాను

చ. 2: తలుపు మాటేఁటికే దండనే కూచుండుఁ గాక
కులముతోడి పెండ్లికూఁతురు తాను
అలయఁగ నేఁటికే ఆసలఁ జేకొనఁగాక
పలురచనల మించె పంతగత్తె తాను

చ. 3: కానుక లంప నేఁటికే కౌఁగిటనే కూడుఁగాక
పూని సలిగెలు చల్లే పొలఁతి దాను
ఆనుక శ్రీ వేంకటేశుఁ డంతలోనే నన్నుఁగూడె
ఆన లేఁటికే నిజమాడే లేమ తాను

రేకు: 0429-2 మనోహరం సం: 12-170

పల్లవి: అడుగరే యీసుద్ది ఆతనినే చెలులాల
చిడిముడిఁ జెప్పినట్టు సేసేఁగాని

చ. 1: కొత్త కొత్త విన్నపాలు కోరి వేఁడిఁ జేయఁగాను
చిత్త మెట్టుండునొకా చెలువునికి
బత్తి తోడ సారె సారెఁ బాదాలు విసుకఁగాను
తత్తరపు గోళ్ళేడఁదాకునో తనకు

చ. 2: యెగ్గెఱఁగక సేవనే నిందరిలోఁ జేయఁగాను
సిగ్గులెంత నిండునొకా చేరి పతికి
వొగ్గి యే పొద్దునుఁ దనవొద్దఁ గాచుకుండఁగాను
వెగ్గళించరాక యెంత వేసటొకొ తనకు

చ. 3: గట్టి నా గుబ్బల నొత్తి కరఁగించఁగాను పంత
మెట్టొకా శ్రీ వేంకటేశ్వరునికి
యిట్టే తా నన్నుఁగూడె యింకా నేఁగొసరఁగా
రెట్టించి తమకములు రేఁగునొకా తనకు

రేకు: 0429-3 భైరవి సం: 12-171

పల్లవి: విన వేడుకయ్యీ నాకు వెస నిద్దరి సుద్దులు
మన సొక్కటై వుండే మఱి యెఱిఁగించరే

చ. 1: వెలఁది తలఁపు లెల్లా వినెనా రమణుఁడు
చెలులతోఁ బరాకు సేయఁడుగదా
తలఁపులు తలఁపులు తారుకాణ వచ్చెనా
చెలికత్తెనే నేనూఁ జెప్పరే మీరు

చ. 2: పడఁతిచే కానుక పట్టె నా చేయి చాఁచి
అడియాలాలు మఱస్తి ననఁడుగదా
బడినుండియాతని విభావము దెలిసితిరా
చిడిముడి పడకుండాఁ జెప్పరే మీరు

చ. 3: చేరియాకెఁ గూడేనా శ్రీ వేంకటేశ్వరుఁడు
జీరగాఁగఁ గొనగోరఁ జిమ్మఁడుగదా
ఆరితేరి యిద్దరిని అడిగితిరా నేఁడు
చేరువ సంతోసాలు చెప్పరే మీరు

రేకు: 0429-4 ఆహిరి సం: 12-172

పల్లవి: చెప్పరాని మోహపు చెలివి నీవు
చప్పుఁగా నాతని నీవు సాదించ నేఁటికే

చ. 1: చేతిలోనె వున్నవివే సేసపాలు
కాతరించ నేఁటికే కాంతునితోను
ఆతుమలో నిండెఁగదే అడియాసలు
యేతుల నీ పంతము లింత చూప నేఁటికే

చ. 2: యిప్పుడిప్పుడే మొలచీ నివె చన్నులూ
చొప్పు లెత్తి పతి నేల సొలసేవే
చిప్పిలే వేడుకల చిన్నదానవూ
తిప్పరాని తమితోడ దీకొనఁగ నేఁటికే

చ. 3: పరిపాకమైన దీనిపాయము
యిరవై శ్రీ వేంకటేశు నెంత దూరేవే
యెరవులేక యిట్టే యెనసితివి
తరి తీపుతో మరి తమకించ నేఁటికే

రేకు: 0429-5 బళహంస సం: 12-173

పల్లవి: యెంతైనాఁ దనివోవఁ డిదివో తాను
బంతి నిట్టే నా పొందులు బాఁతెయ్యీనా తనకు

చ. 1: చెక్కులపై జవ్వాది చేతఁదీసి కాంతకు
మిక్కిలి వేడుక తోడ మెత్తీఁ దాను
చొక్కపు సిరస నిండాఁ జుట్టు కొన్న పూదండలు
మిక్కుటముగా నాపె మెడ వేసీఁదానూ

చ. 2: పాదమున నున్న తన బంగారు పెండెము
ఆదిగొని మెచ్చి పెట్టీ నాపెకుఁదాను
పోదిగా నంతటిలోనే పుక్కిటి తమ్ములము
మోదాన నాపెకుఁజూపి మోవి యిచ్చీఁదాను

చ. 3: చందనకావివన్నె పచ్చడ మాపెకును నాకు
కందువల సరిగానే కప్పీఁ దాను
యిందులోనే శ్రీ వేంకటేశ్వరుఁడు నన్ను నేలే
కుందనఁపు టుంగరము గురు తిచ్చీఁదాను

రేకు: 0429-6 శుద్ధవసంతం సం: 12-174

పల్లవి: వరుసతో రమణుని వలపించవలెఁ గాక
సరసము లాడితేనే సవతులై రా తాము

చ. 1: కాంతుని నూరకైనా కన్నుల జంకించితేనే
పంతములు వచ్చెనా పడఁతులకు
చెంతనుండి సెలవుల చిఱునవ్వు నవ్వితేనే
బంతి నన్నిటా నేరుపరులైరా తాము

చ. 2: చనవున నాతని చన్నులఁ దాకించితేనే
తనిసెనా మనసులు తమకెల్లాను
వినయానఁ బాదాలు వేమారుఁ బిసికితేనే
పెనఁగినవారైనా బీరపు రతులనూ

చ. 3: వలవని జోలి తోడ వద్దఁగాచుకుండితేనే
చలములు దక్కెనా నా చక్క జాడను
యెలమి శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
పలికినంతటిలోనే పనులు చేకూరీనా

రేకు: 0430-1 బలహంస సం: 12-175

పల్లవి: యింక నేఁటి మేలములు యింతితోడ నీకును
అంకెలఁ గరుణ నేలి ఆదరించరాదా

చ. 1: చెంది నీకు మొక్కఁగాను చెమటలు గరఁగీని
కందువ నీ పాదాలంటె కస్తూరి బొట్టు
అంది కానుకియ్యఁగాను అట్టే తన కొప్పువీడి
ఇందు నిన్నుఁగప్పుకొనె నింద్రనీలాలు

చ. 2: విన్నపము సేసుకోఁగా వెసఁదామరలవలె
నిన్నంటెఁ బూజించినట్టు నిండుఁ జన్నులు
చెన్నుమీరఁ జేయరాని సేవ నీకుఁ జేయఁగాను
పన్నీరు గులికినట్టు పైఁజిందేఁ జెమటా

చ. 3: మంచి మాట లాడఁగాను మధురాలు సోఁకి సోఁకి
ముంచి నీ పెదవి నంటె మోవిపండు
యెంచఁగ శ్రీ వేంకటేశ యీకె నిట్టే యేలితివి
మించె జవ్వనమదపు మేటి వాసన

రేకు: 0430-2 నీలాంబరం సం: 12-176

పల్లవి: మేలే నీనేరుపులు మెలఁత
చాలుకొన్నసరసాలు చవులాయను

చ. 1: సూటి దప్పవు గదవే చూపులు నీవి
పాటించి నేఁడాతనిపై నిండెను
వాటమాయఁ గదవే నీవలపులు
కూటము లాతనివద్దఁ గుప్పలాయను

చ. 2: నాములాయగదవే నీ నవ్వులు
కామించి యాతని మోహము కళ లెక్కెను
వాములువడెఁ గదవే వట్టి మాటలూ
కోమలపు వీనుల కొటారులఁ జేరెనూ

చ. 3: కమ్ముకొనెఁ గదవే కౌగిలి నిది
పమ్మి శ్రీ వేంకటేశ్వరుఁ బాయ వెన్నఁడూ
చిమ్మిరేఁగెఁ గదవే చెమట లెల్లా
కుమ్మరింపు వేడుకల గుఱుతులాయనూ

రేకు: 0430-3 రాయగౌళ సం: 12-177

పల్లవి: యెందాఁకా సిగ్గువడే విప్పుడు నీవు
కందువ లెల్లా నంటి కౌఁగిలించరాదా

చ. 1: వూచిన తంగేడువలెఁ బొలఁతి నిలుచున్నది
కూచుండు మనరాదా కోరి నీ వద్ద
రాచిలుక వలెనే రవళిగా మాట లాడీ
చే చేత మెచ్చి సంతోసించఁగరాదా

చ. 2: యెలమి రాయంచవలె నింటికి వచ్చె నప్పుడే
చెలరేఁగి కాఁపురాలు సేయరాదా
కొలని తుమ్మెదవలె కోరి నిన్నుఁ బాయలేదు
పిలిచి లాలన సేసి బెరయఁ గరాదా

చ. 3: అందపుఁ గోవెలవలె ఆకు కొరికి నీ కిచ్చి
చెంది పొత్తుల వీడెము సేయరాదా
యిందునే శ్రీ వేంకటేశ యీకె నిట్టే యేలితివి
పొందుల రతులు దలపోసుకొనరాదా

రేకు: 0430-4 సాళంగనాట సం: 12-178

పల్లవి: యిన్నినేరుపుల యాకె యీ యలమేలు మంగ
నిన్ను జట్టి గొనె నిట్టే నెగడఁగఁ దగును

చ. 1: మక్కువ గలుగు పతి మనసు గలఁచరాదు
వక్కణతో మెప్పించ వలె గాని
వెక్కసపు మాటలు వేమారు నాడఁగరాదు
పక్కన వినయములే పచరించఁదగును

చ. 2: బత్తి సేసి యాతనిఁ బై పై గొసరరాదు
మెత్తని మోవి యిచ్చుటే మేలుగాని
హత్తి సరసమాడఁగ నలయించఁగరాదు
గుత్తపు చన్నుల నొత్తి కూడఁగఁ దగును

చ. 3: యేలిన శ్రీ వేంకటేశు నెలయించఁగ రాదు
చాలాఁ గౌఁగిలించుటే చందము గాని
జోలిఁ బెట్టి వూరకైనా సారిదిఁ బెనఁగరాదు
యీ లీల నొకరొకరు యెనయుటే తగును

రేకు: 0430-5 శ్రీరాగం సం: 12-179

పల్లవి: యెంత నే నెఱఁగకున్నా నెప్పుడూ నీవే గతి
వింతలేక మన్నించి విచ్చేయుమా యింటికి

చ. 1: నినుఁ గూడే తమకము నిలుప లేక నేను
కినిసి వేమారు వెంగెములాడుదు
పొనుఁగ నీ రతి దలపోసి పోసి నేను
అనువురాక వట్టి యలుకఁ బొరలుదు

చ. 2: కన్నుల నిన్నుఁ జూచే కాంతాళమున నేను
పన్నుక సారెఁ దప్పులు పట్టుతా నుందు
యెన్నరాని కౌఁగిలి యిట్టే కోరి కోరి నేను
నన్నలా చాయలాను జంకించి సొలతును

చ. 3: నీ మన్నన లింతంతన నేరక ఇప్పుడు నేను
కామించి నీ కౌఁగిట గర్వింతును
యీ మేరల శ్రీ వేంకటేశ నన్నేలితివి
ఆముకొన్న సంతోసాన నానందింతునూ

రేకు: 0430-6 మధ్యమావతి సం: 12-180

పల్లవి: ఇంతులు నోఁచిన నోఁమో ఇది నీకు విలాసమో
యెంతైనానుఁ బొఁగడక యెట్లు మానవచ్చును

చ. 1: సిగ్గుతో నేనుండితేను చేరి మాటలాడింతువు
దగ్గర లోఁగితే వచ్చి తమి రేఁతువు
వెగ్గళించక కొంకితే వెఱప దెలుపుదువు
యెగ్గులేని నీ గుణాలు కెవ్వరు వలవరు

చ. 2: వినయాన నేనుండితే వేడుకఁ జేయి చాఁతువు
నను నేనే దూరుకొంటే నవ్వింతువు
మన సెఱఁగ కుండితే మందెమేళము సేతువు
యెనలేని నీచేఁ తల కెవ్వరిఁక మెచ్చరు

చ. 3: గుట్టున నే నుండితేను కూడి చనవిత్తువు
చుట్టరికాలెంచుకొంటేఁ జొక్కింతువు
నెట్టన శ్రీ వేంకటేశ నేఁడు నన్ను నేలితివి
యిట్టే నీసుద్దులకు నెవ్వ రిటు మొక్కరూ

రేకు: 0431-1 మంగళకౌశిక సం: 12-181

పల్లవి: ఆతఁడు తానే మన్నించినపుడు నన్ను
చేతికి లోనుగానే చెప్పవే నా వలపు

చ. 1: తలఁపు దెలుకో దయపుట్ట మాటలాడు
చలము సాదించకు చతురునితో
సొలయకు సారె సారె చూపు వినయములే
చెలియరో యీ రీతిఁ జెప్పవే నా వలపు

చ. 2: యెదుటనే నిలుచుండు ఇచ్చకమే పచరించు
పదరకు మెంతయినా పతితోడను
పొదిగి కొలువు సేయి పుట్టించు వేడుక లెల్లా
చెదరకుండాఁ దగిలి చెప్పవే నా వలపు

చ. 3: మొక్కుము నా మారుగాను మునుకొని యెచ్చరించు
వెక్కసాన దూరకు శ్రీ వేంకటేశ్వరు
తక్కక నన్నింతలోనే తా నిందు విచ్చేసి కూడె
చెక్కు నొక్కి యింకానుఁ జెప్పవే నా వలపూ

రేకు: 0431-2 నారణి సం: 12-182

పల్లవి: చేరి నీవు చెప్పినట్టు సేయనేవలెఁ గాని
మేర మీఱరాదుగా మిక్కిలి నీతోను

చ. 1: వెడ్డు వెట్టి చెక్కు నొక్కి వేఁడుకోఁగా నీతోను
వొడ్డించుకోరాదుగా వువిదకును
జిడ్డుదేరఁ గత లెల్లాఁ జెప్పి వొడఁబఱచఁగ
అడ్డ మాడరాదుగా ఆపెకు నీతోను

చ. 2: కప్పుర మిచ్చి నీవు కౌఁగిలించుకొనఁగాను
తప్పుంచుకోరాదుగా తరుణికిని
దప్పిదేర మోవి యాని తమ్ములము నీ విడఁగా
వుప్పతించరాదుగా వూరకే నీతోను

చ. 3: తిద్దుచు రతులఁ గూడి తెప్పలఁ చేలుచఁ గాను
గద్దించరాదుగా కాంతకును
అద్దుక శ్రీ వేంకటేశ ఆదరించి యేలితివి
కొద్ది మీఱఁ దగదుగా కొసరి నీతోను

రేకు: 0431-3 తెలుఁగు కాంబోదిసం: 12-183

పల్లవి: ఇంతి యేమి సేసీవంటా యేమి యడిగేవు మమ్ము
అంతేసి యెఱుఁగుదుమా ఆపె నీవే కాక

చ. 1: తలపోయుచున్నది తరుణి నీ రూపము
చెలరేఁగి చెక్కిటి చేత నున్నది
వలపులు కొనగోర వాసుకొంటా నున్నది
సెలవుల నవ్వుతోడ సిగ్గువడి వున్నది

చ. 2: అడుగుతా నున్నది అంగనల నీసుద్దులు
అడరి తా నుస్సు రస్సు రంటా నున్నది
అడియాలపు నీ సొమ్ము లవి చూచుచున్నది
బడి బడి నీ పదాలు పాడుకొంటా నున్నది

చ. 3: యిదె పవ్వళించి వున్న దెప్పుడు వత్తువో యంటా
కదిమి నీ కూటమికిఁ గాచుకున్నది
అదన శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
ముదమునఁ గూడితివి మొక్కుతా నున్నది

రేకు: 0431-4 పళవంజరం సం: 12-184

పల్లవి: మేలు మేలు యిదే బుద్ధి మెలఁతల కెల్లాను
నీ లీల లన్నియు మాకు నేరుపఁగదే

చ. 1: పతికి నిచ్చక మాడి భావము గరఁగించేవు
కతకారి వవుదువే కలికి
అతివినయాలు చూపి అట్టే సేవలు సేసేవు
చతురత లెల్లా నేర్చి జాణ వైతివే

చ. 2: సెలవి నవ్వులు నవ్వి చేతికి వీడె మిచ్చేవు
వలపించ నోపుదువే వనిత
నిలువుఁ గొలువు సేసి నెట్టనఁ దమి రేఁచేవు
పలుకుఁ బంతములకుఁ బంతగత్తె వవుదువే

చ. 3: యిచ్చట శ్రీ వేంకటేశు నెదపై నెలకొంటివి
మెచ్చులాఁడివే అలమేలుమంగా
అచ్చముగ మమ్ము నేలుమని యప్పణిచ్చితివి
కచ్చుపెట్టి నీవు దయగలదాన వవుదువే

రేకు: 0431-5 పూరిభి సం: 12-185

పల్లవి: యెఱుఁగునో యెఱఁగఁడో యింతులు విన్నవించరే
మెఱసి యిన్నిటా నేను మేలుదానఁజుమ్మీ

చ. 1: కోపగించఁ జుమ్మీ కొసరి తనతో నేను
చపులలో నా బత్తి చూపితిఁ గాని
వోపననఁ జుమ్మీ వొడివట్టితేఁ దనతో
కాఁపురము సేసేవారి గతు లివిగాని

చ. 2: వేసరించఁ జుమ్మీ వెడమాట లాడి నేను
ఆసపడి సరసము లాడుదుఁ గాని
వాసు లెంచఁ జుమ్మీ వలచి తన సరుస
సేసవెట్టి కూచుండి చెలఁగితిఁ గాని

చ. 3: అలయించఁ జుమ్మీ అట్టే తాఁ గూడఁగా నేను
యెలమి రతులఁ దనియించితిఁ గాని
అలరి శ్రీ వేంకటేశుఁ డంతలోనే నన్నుఁగూడే
అలమేల్మంగను నేను అవునంటిఁ గాని

రేకు: 0431-6 ఆరభి సం: 12-186

పల్లవి: యేమయ్యా ఆపె మీఁద నింత బత్తి గలిగితేను
కామించి పెండ్లాడ రాదా కాదనేరా నిన్నును

చ. 1: పలచఁ గా నవ్వు నవ్వి పాపట దువ్వుకొంటా
కొలువు సేసే యాపెఁ గోరి చూచేవు
వలిదపయ్యదలోని వట్రువ గుబ్బలమీఁద
కలువ పువ్వులు వేసి కాంతాళించేవూ

చ. 2: వీడెపు సెలవి తోడ వీఁగి సిగ్గువడుకొంటా
కూడి మాడి వున్నయాపెఁ గొంగు వట్టేవు
జాడతోడ నిట్టే మేని చక్కఁదనాలకు మెచ్చి
చేడెలతోఁ బొగడుతాఁ జెలరేఁగేవూ

చ. 3: యింతుల సన్నలు సేసి యేకతము లాడుకొంటా
చెంత నున్నయాపె మీఁదఁ జేయివేసేవూ
యింతలోనే శ్రీ వేంకటేశ మమ్ము నేలితివి
పొంత నీ చెలి కౌఁగిట భోగించేవూ

రేకు: 0432-1 సామవరాళి సం: 12-187

పల్లవి: వెలలేని గొల్లెతలే వేడుక గాక
పిలువక వచ్చేవారు ప్రియమయ్యేరా

చ. 1: దొంతర చూపులు చూచి తొరలింపు మాటలాడి
పంతాలు గొనే సతులు దాఁతెయ్యేరా
వింతగా నవ్వులు నవ్వి వేడుకలు నీకు రేఁచి
చెంతఁ గాచుకుండేవారు చిత్తము వచ్చేరా

చ. 2: పచ్చిదేరఁ జెనకుచు బాగాలు చేతి కిచ్చి
యిచ్చకము సేసేవారు ఇత వయ్యేరా
కొచ్చి కానుక లొసఁగి కొలువులు సారెఁజేసి
ముచ్చట లాడేవారు మచ్చి కయ్యేరా

చ. 3: కన్నులనే నీకు మొక్కి కందువ నెదురు చూచి
సన్నల మెలఁగేవారు సమ్మతయ్యేరా
మన్నించి శ్రీ వేంకటేశ మమ్ము నిట్టే యేలితివి
వున్నవారల్లా నీకు నొద్ది కయ్యేరా

రేకు: 0432-2 కోకిల పంచమం సం: 12-188

పల్లవి: యింత కంటే సుద్దులు నే మెఱఁగము
వింత లెల్లా నీకు విన్నవించఁగ వచ్చితిమీ

చ. 1: మనసెల్లా నీ మీఁద మంతనాలు చెలులతో
తనువు పానుపుమీఁదఁ దరుణికిని
కనుఁగొంటే దయ పుట్టు కడ నున్నవారికైనా
వినవయ్య నీకు విన్నవించఁ గ వచ్చితిమి

చ. 2: గుఱిగాఁ జేయి చెక్కుపై కొనచూపు నీ రాకపై
జఱము నిట్టూర్పులు చన్నులమీఁద
కఱకురా యైనాను కరఁగుఁబో నీకువలె
వెఱగంది యిదే విన్న వించఁగ వచ్చితిమి

చ. 3: అలయిక తనలోన ఆసలు నీ కౌఁగిటిపై
సెలవుల లేనగవు శ్రీ వేంకటేశ
కలిసితి వింక మేడ కంబమైనా నిగిరించు
వెలసే వేడుక విన్నవించఁగ వచ్చితిమి

రేకు: 0432-3 బంగాళం సం: 12-189

పల్లవి: పుత్తమ నాయకుఁడవు వోరుపు గలవు నీవు
చిత్తగించి నా బత్తి చేకొనవయ్యా

చ. 1: ఇంగిత మెఱఁగ నైతి నేడలేనివి గడించి
వెంగెము నిన్నాడితి వెనకకును
సంగతెఱిఁగితి నిట్టే సమ్మతించితి నీ మాట
చెంగలించి నీకు మొక్కేఁ జేకొనవయ్యా

చ. 2: విరహపుఁ గాఁకఁ జెంది వేఁడుకోఁ గానే నిన్ను
విరులు గొని వేసితి వేమారును
సరుపు లెల్లా గంటి సంతోసించు కొంటి నిన్ను
సిరుల బంతము లిచ్చె జేకొనవయ్యా

చ. 3: మిక్కిలి మోహము తొడ మేన వాడ వనగానే
వెక్కసాన జంకించితి విచ్చనవిడి
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చెక్కు నొక్కి నవ్వించేఁ జే కొనవయ్యా

రేకు: 0432-4 కన్నడగౌళ సం: 12-190

పల్లవి: యెట్టు చేసినాఁ జేయి యేమీ ననఁజాల నిన్ను
ముట్టిన నా మతిలోను మోహము చెప్పితిని

చ. 1: విరహాగ్నిఁ గాఁగి నిన్ను వెంగె మాడఁ దలఁతును
కరఁగి యంతలో నాడక మానుదును
విరుల యమ్ములు నాటి వేయఁ బూనుదు పూవుల
పరగ నా మేలుగానే భావించి వూరకుందు

చ. 2: తమక మాపఁగ లేక దాకొని జంకించిఁ జూతు
మమత తో జంకించక మరి సొలతు
వుమురు వెన్నెలకుఁగా కుహింతు నిన్నుఁబైకొన
భ్రమసి నీవే నే నని భావించి వూరకుందు

చ. 3: కోవిల కూతలకుఁగా కూచుందు నీ తొడమీఁద
కావిరిఁ గూచుండ కటు కౌఁగిలింతును
శ్రీ వేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టే
భావము లొక్కటిగానే భావించి వూరకుందు

రేకు: 0432-5 ద్రావిడ భైరవి సం: 12-191

పల్లవి: యేడ కేడ నా గుణ మెఱఁ గనివాఁడవా
యీాడు వెట్టుకొనే నంటే నెంతదాన నేను

చ. 1: వల పెటిఁగి నీవే వచ్చి నన్నేలుట గాక
పిలిపంచఁ గలనా పెను దొరవు
తలఁపు దెలిసి మాట తగ నీ వాడుట గాక
పలికించ నోపుదునా పంతగాఁడవూ

చ. 2: వొడఁబాటు దలఁచుక వొగి నన్నేలుదు గాక
వొడి వట్టవచ్చునా వున్నతుఁడవు
బడలిక చూచి నీవే పైకొని కూడుదు గాక
అడుగఁ దగవా కౌఁగిలప్పుడే నిన్నును

చ. 3: సేవ సేయఁగాఁ జూచి సేసలు వెట్టేవు గాక
వావి చెప్పుకో వసమా దేవుఁడవూ
శ్రీ వేంకటేశ నీవే చేకొని పెండ్లాడితివి
భావించ నాకుఁ దరమా పంతగాఁడవూ

రేకు: 0432-6 తెలుఁగుకాంబోది సం: 12-192

పల్లవి: విరహాన నుండినాను వేడుకలే పుట్టే నాకు
పరగ నేఁజేసిన భాగ్య మింక నెట్టి దో

చ. 1: యెంత తడవు రాకున్నా నెదురె చూతుఁగాని
సొంత నీపై వేసట పుట్టదు నాకు
చింతలు మతి రేఁగినా సెలవి నవ్వుదుఁ గాని
చెంత నుండి నా మొగము చిన్నఁబోవ దందుకూ

చ. 2: చూడక నీ వెందున్నా నీ సుద్దులే విందుఁ గాని
యీాడుకుఁ గోపము రేఁగ దిందుకు నీపై
వీడని నా యాస లెంత వేఁడఁ బొరలించినా
వాడదు నా మేను పై పై వలపిగిరించును

చ. 3: పరాకున నీ వుండినాఁ బైకొని మొక్కుదుఁ గాని
తరితీపు సేసే వని తప్పయి తోఁచదూ
యిరవై శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
సరి నలయించే వని జడియపు రతులు

రేకు: 0433-1 సింధురామక్రియ సం: 12-193

పల్లవి: నీ వేమి సేతువు నన్నునీవు మోహించు మంటివా
వావాదు నెంచేదు నా వలపింతే కాక

చ. 1: నీ యిచ్చకాఁడవు తొల్లే నీ వెవ్వతెవద్ద నున్నా
నాయమా నిన్ను దూర నడుమ నేను
యీయడఁ బూవుటమ్ముల సేసేటిమరుని నే
చాయల నే మాడినాను సంగతెవుఁ గాక

చ. 2: చెల్లు బడి వాఁడవు నే సేసినదే చేఁత గాక
పల్లదానఁ గొంగు వట్ట భావ్యమా నాకు
మల్లాడి తమకించేటి మక్కువ నా మనసునే
మెల్లనే యెంత వొత్తినా మే లింతే కాక

చ. 3: శ్రీ వేంకటేశ నీ చేతిదే భాగ్యము గాక
వావి గద్దంటాఁ బెనఁగ వసమా నేఁడు
యీ వేళ నన్నుఁ గూర్చిన యిట్టి నా జవ్వనమునే
చేవ మీర నిట్టే సంతోసించు కొంట గాక

రేకు: 0433-2 భూపాళం సం: 12-194

పల్లవి: నాకుఁ జెప్పు కోరాదు నలినాక్షులాల మీరు
పై కొని నా వోజ విన్నపము సేయరే

చ. 1: వేడుకకు జవరాలు వెంగెమాడితే నమరు
ఆడరాదు కోపగించి అట్టే మగని
వాడికకు నతనితో వంతులకు రాఁదగు
కూడే వేళ సరివెట్టు కొని మీరఁ దగదు

చ. 2: కడు సింగారమునకుఁ గన్నుల జంకించఁ దగు
జడియుచు గర్వమున సాదించరాదు
కడ లేక సేవ సేయఁగాచుక వుండుట మేలు
బడినెందూఁ బోకుండఁ బట్ట రాదు గాని

చ. 3: చనవుతోఁ గూడిమాడి సరసమాడుట యొప్పు
పెనఁగుచు రతి వేళ బిగియ వద్దు
యెనసి శ్రీ వేంకటేశుఁ డింతలోనే నన్ను నేఁడు
మనసులో నెన్నటికి మఱవఁగ రాదు

రేకు: 0433-3 ధన్నాసి సం: 12-195

పల్లవి: నీ వెట్టు సేసినాఁజేయి నీ పాదమే గతి నాకు
యీవేళ చిత్తాన వేరే భావించకువయ్యా

చ. 1: కోరి పొందు సేసేదానఁ గోపగింతునా యేమి
ఆ రీతిఁ బాయనిదాన నలుగుదునా
గారవించి కూడేదానఁ గసరి జంకింతునా
చేరి నీకు నిచ్చకమే సేతుఁగాకా

చ. 2: యితవరి నైనదాన యెగ్గులు వట్టే నా
సతి నైన దాన నిన్ను సాదించేనా
రతికిఁ బిలిచేదాన రాయడిఁ బెట్టే నా
సతమైన నీ గుణాలే సంతోసింతుఁ గాకా

చ. 3: నీకు దేవులై నదా నేరములు వెదకేనా
చేకొని కూడినదానఁ జింత రేఁచేనా
యీకడ శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
జోకగాఁ బొగడి మేలే చూపుదుఁ గాకా

రేకు: 0433-4 ప్రతాపనాట సం: 12-196

పల్లవి: యితర సతుల మరి యేమి చెప్పేది
పతి బత్తి గలదే చెప్పరాని మేలుది

చ. 1: కలయక వుండినాను కాంతుని మొగము చూచి
చెలరేఁగి నవ్వేటి చెలి మేలుది
పిలువక మానినాను ప్రియము తోడుత వచ్చి
కొలువు సేసేదే యెక్కుడు మేలుది

చ. 2: మఱచి వూరకుండినా మక్కువ లెచ్చరించి
నెఱఁ దమి రేఁచేదే నిండు మేలుది
యెఱుఁగక పరాకైన యెడల నెదుట వచ్చి
గుఱిగా మోము చూపించుకొనేదే మేలుది

చ. 3: యింతులతో నొకమారు యెట్ట కేలకుఁ గూడినా
సంతోసించు కొనేదే యచ్చపు మేలుది
చింత దీర నేలితివి శ్రీ వేంకటేశ యీకెను
పంతపు టలమేల్మంగే పాయరాని మేలుది

రేకు: 0433-5 సామంతం సం: 12-197

పల్లవి: మఱచితే నే మాయ మగువల సందడిలో
అఱిముఱి వీడె మంపడంటా నలిగేనా

చ. 1: రమణుల నంప నేల రాయబారా లింత యాల
సముకానఁ జెప్పితేను సమ్మతించనా
తమితోఁ జింతించ నేల తాఁ బోడిఁ బడఁగ(?) నేల
క్రమమునఁ దా బత్తిగలది యెఱుఁగనా

చ. 2: వుంగర మంపఁ గ నేల వూర కానవెట్ట నేల
రంగుగఁ దాఁ బిలువఁగా రా నన నేల
అంగపుఁ జెమట లేల అట్టే తా విచ్చేయ నేల
సంగడి సరిదాననై సాదించేదాననా

చ. 3: చేరి మాటాడించ నేల చెక్కులు నొక్కఁగ నేల
గారవించి కూడఁ గాఁగా దనేనా
యీ రీతి శ్రీ వేంకటేశుఁ డెంత దయ సేసె నన్ను
కోరి తన వేడుకకు గుఱియైనదాననూ

రేకు: 0433-6 కేదారగౌళ సం: 12-198

పల్లవి: తనివి లేదు నాకైతేఁ దమకము దీరదు
తనకుఁ గానే మతిఁ దలపోసెనే

చ. 1: కడు సంతోసానఁ దన్నుఁ గౌఁగిలించుకొనే నంటే
యెడలేని నా చన్ను లెంత వొత్తునో
జడియక తనతో నే సారె మాటలాడే నంటే
అడ రెప్పు డెంతలవా టవునో తనకూ

చ. 2: చక్కని తన మొగము సారెఁ జూచే నంటే
యిక్కువైన నా చూపు లెంత నాఁటునో
తక్కక రతులఁ గూడి తన్ను మెప్పించే నంటే
నెక్కొన్న మనసెంత నీరుగాఁ గరఁగునో

చ. 3: తగఁ దన కథరామృతము చవి చుపే నంటే
చిగురు మోవి యాడఁ జిల్లులవునో
అగపడి శ్రీ వేంకటాధిపతి నన్నుఁగూడె
అగడుగాఁ దన కెన్నియాసలు రేఁగునో

రేకు: 0434-1 మాళవశ్రీ సం: 12-199

పల్లవి: నా నా విధాల తన నే నమ్మినదాన
యే నెపమూ నెఱుఁగ నిదే విన్నవించరే

చ. 1: యిందు వచ్చే ననఁ గాను యెదురు చూచు కున్నదాన
కందువ నుండు మనఁగాఁ గాచుకున్నదాన
అంది వుంగర మంపఁగా నాసతోడ నున్నదాన
ఇందు ముఖులాల పతి కిదే విన్నవించరే

చ. 2: యెడమాట లాడించఁగా నిచ్చగించి వున్నదాన
పడఁతుల నంప్పఁగాను బత్తి నున్నదాన
అడరి యంతలో రాఁగా నానందాన నున్నదాన
యెడసి పాయఁగ నోప నిదే విన్నవించరే

చ. 3: చేయి పట్టి పెనఁగఁగా సిగ్గుతోడ నున్నదాన
ఆయము లంటఁగా వెరగై వున్నదాన
వేయి విధముల శ్రీ వేంకటేశుఁడిదే కూడే
యే యెడ నెన్నటికి నిదే విన్నవించరే

రేకు: 0434-2 మలహరి సం: 12-200

పల్లవి: చెలులాల యిఁకఁ దన చిత్తము నా భాగ్యము
తలఁచిన తలఁపెల్లాఁ దానే యెఱుఁగునే

చ. 1: విన్నవించ కుండరాదు విరహానఁ బడరాదు
యెన్నికలు విభునికి నెట్టుండునో
మన్నించినాఁడు తాను మరిగితి నింత నేను
యిన్నేసి సుద్దులు మీకు నేమి చెప్పనే

చ. 2: చేయివట్ట కుండరాదు సిగ్గులు వడఁగరాదు
ఆ యెడ నేమనునో ఆతఁడు నేఁడు
చాయ చూపినాఁడు తాను సన్న యెఱిఁగితి నేను
మీ యంత నా భావములు మీరే చూచుకోరే

చ. 3: అలమ కుండఁగరాదు ఆసలు మానుపరాదు
యిల శ్రీ వేంకటేశ్వరు ఇత వేదో
కలసినాఁడు తాను కైవస మైతి నేను
తెలుకోరే ఇఁకఁ దేటతెల్లమిగను

రేకు: 0434-3 ఆహిరి సం: 12-201

పల్లవి: యేమయ్యానా మనసు నీ వెఱుఁగనిదా యేమి
దీమసపు నా మదిలో దేవరవు నీవూ

చ. 1: వింతదాననా నీకు వేఁడుకొనే విటు నన్ను
యెంతైనా నీ పట్టుకు నెగ్గు పట్టెనా
అంతే పోనే నీతో నలిగేటిదాననా
పంతముతో నా పాలిటి ప్రాణమవు నీవూ

చ. 2: పెనఁగుచు నాపై నెంత ప్రియములు చల్లేవు
అనవయ్య నీ మాటల కవుఁగా దనేనా
మనసునఁ బెట్టు కొని మచ్చరించేదాననా
తనివోని నాయింటి నిధానమవు నీవూ

చ. 3: ఆదరించి ననుఁగడు నలమి లాలించేవు
యే దెస నైనా నీకు నెదు రాడేనా
పోదితో శ్రీ వేంకటేశ పొసఁగ నన్నేలితివి
దా దాతనాయ రతి చింతామణివి నీవూ

రేకు: 0434-4 కుంతళవరాళి సం: 12-202

పల్లవి: యేమి గొసరే మయ్యా ఇఁక నిన్నును
ప్రేమ తోడ సంగడిఁ బెట్టు కొంటి వాపెను

చ. 1: ఇత్తల నత్తల నీ వెందరిఁ బెండ్లాడినా నీ
చిత్తము వచ్చినదే మించిన దేవులు
కొత్త సొమ్ములు పెట్టేలఁ గోరి యెన్ని వుండినాను
హత్తి నీమె నీపై నుండినదియే మంచిది

చ. 2: అంగనామణులు నీ యండ నెంద రుండినా నీ
సంగడిఁ గూచుండినదే చక్కని సతి
సింగారించి వాహనాలు ముంగిట నెన్ని వుండినా
సంగతి నీ వెక్కినదే సాంబ్రాణి

చ. 3: యెగి సరసమాడే ఇంతు లెందరుండినా నీ
పస నుర మెక్కినదే పట్టపురాణి
కొసరి శ్రీ వేంకటేశ కూడితివి మమ్ము నేఁడు
దెసల నీవు గట్టి నదే పీతాంబరము

రేకు: 0434-5 కొండమలహరి సం: 12-203

పల్లవి: యెవ్వరివాఁడ వౌతా నెఱుఁగరా దెవ్వరికే
నివ్వటిల్ల మా వాఁడవే నీ వంటా నున్నారము

చ. 1: యిందు ముఖు లెల్లాను యెదుట నిన్నుఁ జూడఁగా
అందరికి నన్ని రూపు లై యున్నాఁడవు
పొందుగా మతులఁ దలపోసుకొని చూచితేను
అందుకో నట్టే నీవు అక్కడా నున్నాఁడవు

చ. 2: నెమ్మది ని న్నొక్కనినే నేరుపుతోఁ బిలువఁగా
కొమ్మల నోళ్ళకు నెల్లా గుఱైనాఁడవు
చిమ్ముఁగొన గోళ్ళవారు చేతులెత్తి మొక్కితేను
పమ్మి నీవే నోముల ఫలము లై నాఁడవు

చ. 3: ముదితలు రతుల నీ మోవి చవిగొంటేను
అదివో పెక్కేండ్ల విందై వున్నాఁడవు
కదిసి శ్రీ వేంకటేశ కడు సరసాలాడఁగా
సదరాన నందరికి సంతోస మైనాఁడవు

రేకు: 0434-6 భైరవి సం: 12-204

పల్లవి: ఇంతులు పొందైన దెల్లా నీసడించే కొరకా
కాంతుని చిత్తమే కాక కదుఁ గొసరకురే

చ. 1: ఆసలఁ బొరలి పతి నట్టే రాయిడించుకంటే
వాసితోడ నుండఁగాను వచ్చినంతే మేలు
వేరించి యేమైనా వెంగెము లాడుటకంటే
మూసిన ముత్యమువంటి మోనమె మేలు

చ. 2: అట్టడితనానఁ జెప్పే చుట్టరికమున కంటే
గుట్టు తోడ నుండఁగాను కూడినంతే మేలు
పట్టి పెనఁగి పిలిచి బలిమి సేయుట కంటే
చుట్టి చుట్టి యెదురులు చూచుటే మేలు

చ. 3: జడిసి సిగ్గుపడక సారెకుఁ బై కొనుకంటే
అడఁకువ తో నుండఁగా నై నంతే మేలు
యెడయక శ్రీ వేంకటేశుఁ డిట్టే నన్నుఁగూడె
వుడివోని సంతోసాన నుండుటే మేలు

రేకు: 0435-1 అమరసింధు సం: 12-205

పల్లవి: యీా సతికి నీకే తగు నీ వేడుక
రాసి కెక్క పొనుపు పై రచనలే వేడుక

చ. 1: వెక్కసపు రతులలో వినయమే వేడుక
పిక్కటిల్లుఁ దిట్ల వోరుపే వేడుక
మక్కువ సరసాలలో మంచిమాటలే వేడుక
చొక్కపు టాసలలో చూపులే వేడుకలు

చ. 2: సందుసుడి సన్నలలో జంకెనలే వేడుక
పొందు లై నందులో పిలుపులే వేడుక
యెందుఁ దరి తీపులో యెడమాటలే వేడుక
చిందేటి నవ్వులలో సిగ్గులే వేడుక

చ. 3: జవ్వన మదములలో చలములే వేడుక
రవ్వ కౌఁగిటిలో తత్తరమే వేడుక
యివ్వల శ్రీ వేంకటేశ యింతి నిట్టే యేలితివి
మువ్వంక నింక మీలో ముచ్చటలే వేడుక

రేకు: 0435-2 హిందోళవసంతం సం: 12-206

పల్లవి: నెఱజాణలైనవారి నేరుపు లివి
మఱవక సేవ సేసి మరిగుండఁ గదవే

చ. 1: పొందైనందుకు ఫలము పొంచి యెగ్గు పట్టనిదే
విందువెట్టిన ఫలము వేడుక నాదరించేదే
అంది సరసములాడే యందుకు ఫలము నవ్వే
కందువ లెఱిఁగి పతిఁ గలయఁగఁ గదవే

చ. 2: మనసు లెనయుటకు మంచి మాటలే ఫలము
ననిచిన ఫలము చనవుతో మెలఁగేదే
తనవారైన ఫలము వినయము చూపుటే
చెనకి వీడె మతని చేతి కియ్యఁగదవే

చ. 3: కూడినందుకు ఫలము కొసరి యలుగనిదే
యీడైనందుకు ఫలము యెన్నఁడుఁ బాయనిదే
వోడక శ్రీవేంకటేశుఁ డొద్దికతో నిన్ను నేలే
పాడి యీతని గుణాలు పచారించఁ గదవే

రేకు: 0435-3 నారాయణి సం: 12-207

పల్లవి: చెప్పినట్లానె సేసి చిత్తము పట్టుదు గాక
తప్పు లెంచఁ గలనా తగులైన దానను

చ. 1: నీ మోము చూచి చూచి నిన్ను నెట్టు దూరుదు
కామించి నీ రాకకు నేఁ కరేదానను
ఆముకొని నా బొమ్మల నప్పటి నెట్టు జంకింతు
గామిడి నీ పంగెనపు కౌఁగిటిలో దానను

చ. 2: సారె నీతో నవ్వి నవ్వి జరసి యెట్ట లుగుదు
కోరి యాసపడి కాచుకున్న దానను
మేర మీఱి యెట్టు మందెమేళముతోఁ బెనఁగుదు
పూరక నీ మొగమోట నుండేటి దానను

చ. 3: గరిమ నీ వద్ద నుండి కన్నుల నెట్టదలింతు
మరిగి వలచిన నేమపుదానను
యిరవై శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
గరిసెంతునా నే నీ కరుణలో దానను

రేకు: 0435-4 ఆహిరినాట సం: 12-208

పల్లవి: అవ్వలిమో మేలయ్యే వాపె తో మాటాడవయ్య
అవ్వల నాకెకుఁ గాను ఇందవయ్య కానిక

చ. 1: పాసి వుండ లేని సతి పంతమే పనికివచ్చు
వాసికత్తె మేని గర్వ మెంతటిది
సేసపాల పెండ్లికూఁతు చేతలు కిందుపడేవే
యీసు లే దాకెకు నీపై యిందవమ్మ కానిక

చ. 2: వొక్క మంచముపై కాంత వొట్టు లెందాఁకా నుండు
దక్కిన దాని గయ్యాళి తన మేఁటిదే
లక్కవంటి మనసు లలన కేడ చలము
యిక్కువలు మఱవకు యిందవయ్య కానిక

చ. 3: నీకు నాస పడి యున్న నెలఁత కేమి బీరము
కై కొన్న విరహిణి కెక్కడి గుట్టు
చేకొంటి వీకె నింతలో శ్రీ వేంకటేశ దయతో
యీకడ సంతోసమాయ నిందవయ్య కానిక

రేకు: 0435-5 శ్రీరాగం సం: 12-209

పల్లవి: వుప్ప తిల్లీ జవ్వనము వొళ్ళి మీఁదను
యెప్పుడు మఱవరాదు యేమి సేతునే

చ. 1: చిలుకతో మాటాడితే చిమ్మి రేఁచీ వలపులు
కొలని లోపల నైతే నళుల బాద
పలు దిక్కులుఁ జూచితే పరగీ వెన్నెల వేఁడి
యెలమి నెందుఁ బోరాదు యేమి సేతునే

చ. 2: సింగారపుఁ దోఁట నుంటే చిగురులు బెదరించీ
కంగి చింతించితే మదిఁ గంతుఁ డున్నాఁడు
కొంగున విసురుకొంటే గుప్పించీఁ జల్లగాలి
యింగితము దెలియదు యేమి సేతునే

చ. 3: కత లాలకించే నంటే కలసీఁ గోవిలఁ గూత
మితి నేకతాన నుంటే మించీఁ గోరిక
గతియై యింతలో శ్రీ వేంకటేశుఁ డు నన్ను నేలే
యితని వుప కారాన కేమి సేతునే

రేకు: 0435-6 బలహంస సం: 12-210

పల్లవి: తామసించఁ బనిలేదు తగవు లెంచుకొంటేను
ప్రేమము దెలుసుకొని బెరయుట గాకా

చ. 1: విన్నపమేమి సేసేము వేగినంతా నింటికాడ
కన్నె నీవు వచ్చేవంటాఁ గాచు కున్నది
సన్నల నీ కెంతని చవులు వుట్టించేము
మన్నించి యింతిఁ గూడేదే మాట యింతే కాకా

చ. 2: కాను కెందాఁకా నిచ్చేము కమ్మటిఁ గమ్మటి నీకు
పానుపు పైని యాస పట్టు కున్నది
నానా రీతుల నిన్ను నమ్మిక లే మడిగేము
మానినిఁ గరుణించేదే మంచి దింతే కాకా

చ. 3: యిందు కెంత పొగడేము యిట్టే నీవే రాఁ గా
ముందే యాపె సంతోసమున నున్నది
కందువ నేలితి వీకెఁ గని శ్రీ వేంకటేశ్వర
పొందు పాయకుండేదే బుద్ధి యింతే కాకా

రేకు: 0436-1 దేవ గాంధారి సం: 12-211

పల్లవి: యేల మమ్ము వేఁడుకొనే వెంత అట్టు సేసేవు
వాలాయించి నీ చేతిలో వార మింతే నేము

చ. 1: చలముతో వారమా సాదించేవారమా నీపై
వలపులు చల్లేటి వారము గాక
పలుకకుండఁ గలమా పాసి వుండఁగలమా నీ
తలఁపు లోనే మెలఁగి తగిలేము గాక

చ. 2: కొసరేటి వారమా గుంపించే వారమా
వసమై నీ సేవ సేసే వారము గాకా
విసిగేమా నీ తోను వేడుకకు లోఁగేమా
సుసరాన నీ యిచ్చలోఁ జొక్కేము గాకా

చ. 3: గరిసించే వారమా కాంతాళించే వారమా
వరుస నీ దేవుళ్ళలో వారము గాక
యిరవై శ్రీ వేంకటేశ యేలితివి మమ్ము నిట్టే
పొరిఁ బొరి నీ గుణాలు పొగడేము గాకా

రేకు: 0436-2 నాగగాంధారి సం: 12-212

పల్లవి: యెంత మన్నించేవు నే నీ కేమి బాఁతి
చింతల యే నోము నోఁ చితినో తొలుతను

చ. 1: నవ్వుతా నీ పాదములు నామీఁదఁ జాఁచేవు
యెవ్వరిఁ బోలుదు నీ యింతులలోను
వువ్విళ్ళూర నప్పటిని వొడి వట్టి పెనఁగేవు
ఇవ్వల నీకును నాకు నేడ కే డంతరము

చ. 2: కందువ నా చన్ను లంటి కడు సరస మాడేవు
పొందుగ నీ కాలి గోరఁ బోలుదునా
విందుగా నా మాటలకు వేడుక పడేవు నీవు
అంది నీతో నీడు వెట్టే యంతటిదాననా

చ. 3: యేలుకొని శ్రీ వేంకటేశ నీ నీడవలెఁ
బోలించి నన్నుఁ బాయ వే పొద్దును నీవు
మేలుదాన నని ఇట్టే మెచ్చేవు లాలించి
సోలి నా గుణాలు చెప్పి చూప నే మున్నది

రేకు: 0436-3 గంభీరనాట సం: 12-213

పల్లవి: యే మని చెప్పుదునే యిఁ క మీతోను
ఆముకొన్న నా బత్తి యది తా నెఱుఁగునే

చ. 1: చల మెంత సాదించినా చవులెన్ని పుట్టించినా
తలఁపు కొలఁదే కాక తమి పుట్టీనా
యెలమీ వో చెలులాల యెడమాట లె న్నాడినా
కొలఁ ది మీఱఁ గ నిట్టే కూడినట్టయ్యీనా

చ. 2: కత లెన్ని చెప్పినాను కాఁ క లెన్ని రేఁ చినాను
యితవై నంతె కాక యెక్కు డయ్యీనా
చతురత మెఱయుచు సారె నెంత పెనఁగినా
మతి కింపై నటువలె మచ్చిక పుట్టీనా

చ. 3: వాడి కెంత చూపినాను వావు లెన్ని చెప్పినాను
వేడుక గలంతే కాక వెగ్గళ మౌనా
యీడనే శ్రీ వేంకటేశుఁడింతలో నన్నేలినాఁడు
యీడు జోడు లాయ నిఁక నెరవు లయ్యీనా

రేకు: 0436-4 సోమరాగం సం: 12-214

పల్లవి: అందుకే విచారించే నాతఁడు నా ప్రాణము
చెంది నా వలపు లైతేఁ జిమ్మి రేఁచీఁ జెలియా

చ. 1: కాటుక కన్నులఁ జూడఁగా నవి నాటవు గదా
మేటియైన కోమలపు మేను తనది
మాటలు సారె నాడఁగా మర్మాలు దాఁకవు గదా
కూటువైన దయ గల గుణములు తనవి

చ. 2: కడు మచ్చిక చూపఁగాఁ గమ్మి కరఁగదు గదా
నడుమను మెత్తని మనసు తనది
జడియఁ గౌఁగిలించఁ గాఁ జన్ను లొత్తవు గదా
వుడివోని యట్టి పురుషో త్తముఁడు తాను

చ. 3: యెదుట నుండఁగా నాపై యీ పరాకే కాదుగదా
తుద భక్తవత్సల బిరుదు తనది
యిదె నన్నేలె శ్రీ వేంకటేశుఁ డలయఁడు గదా
కదిసి చెప్ప రాని చక్కఁదనము తనది

రేకు: 0436-5 నాగవరాళి సం: 12-215

పల్లవి: తెలుసు కొమ్మనవే దేవర మాకుఁదాను
పొనుఁగక మా గుణాలు పొగడుకో నేటికే

చ. 1: ననువు గలిగినంతే నాఁటుకొన్న ప్రియములు
మనసు గలిగినంతే మంగళము
పెనఁగి నందులోనే ప్రేమము గానఁగ వచ్చు
వినక నప్పటి మరి విన్నపము లేఁటికే

చ. 2: చేకొనిన పాటే సేవలును
వాకునఁ గలపాటే వావులూ
యేకత మాడినందునే యింపు దెలుసు
పై కొన్న మోహములు పచారించ నేఁటికే

చ. 3: సేసపాలలోనివే సిగ్గులూ
ఆస పడిన యింతే అంటుఁ గౌఁగిలి
యీసు లేక శ్రీ వేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
చేసిన చేతఁలెల్లా జెప్పి చూప నేఁటికే

రేకు: 0436-6 మాళవిగౌళ సం: 12-216

పల్లవి: యిట్టి సింగారము గల యింతి నీకు దేవులాయ
నెట్టిన నాపె కోరిక నెరవేర్చవయ్యా

చ. 1: జలజాక్షి నెమ్మోము చంద్రుఁడని చెప్పవచ్చు
కళలు చెప్పే మంటే నలవి గాదు
అళులఁ బోలుచవచ్చు నాపె నెరిఁగురులను
పొలసి యామె మెఱుఁగులు పోలించి చెప్పరాదు

చ. 2: వనిత కన్నులు కలువల సరి చెప్పవచ్చు
వొనర నందలి తేట లూహింపరాదు
గొన కొన్న చన్నులతో కుండ లీడు వెట్టవచ్చు
నునువట్రువలు చెప్పెమనుకొనరాదు

చ. 3: భామ పిఱుఁదు మరుని బండి కండ్లనవచ్చు
కోమలము చెప్పే మనఁ గొలఁదిరాదు
యీ మేర శ్రీ వేంకటేశ యీకె నేలితివి పాదా
లోముచుఁ దామర లౌను వొప్పిద మెంచరాదు

రేకు: 0437-1 సాళంగనాట సం: 12-217

పల్లవి: అంతే పో తన పొందు లటువంటివా
చింత దీర నా మనసు చిత్తగించ నీవే

చ. 1: వింతవాఁడా తానేమి విచ్చేయ మనఁగదే
చెంత నుండి నాకేమి చెప్పెంపీఁ దాను
పంత గత్తైనా నేను పై పై నేమి వేఁడుకొని
యింతటికి నేనే మొక్కే నిటు చూడనీఁ గదే

చ. 2: నేఁడు గీత్తలా తనకు నిండుకొన్న నాపై బత్తి
పోఁడిమి నా కేల చూపి పొదిగీఁ దాను
వాఁడిమాట లాడేనా వచ్చి నన్నేల పొదిగీ
పేఁడుకొని వలపు రేపించెఁ జూడనీవే

చ. 3: యెరవా తనకు నాకు నియ్యకో లయిన చోట
గరిమ నెగ్గు వట్టేనా కౌఁగిలించీని
యిరవై శ్రీ వేంకటేశుఁ డిప్పుడే తా నన్నుఁగూడె
బెరసిన రతుల మెప్పించెఁ జూడనీవే

రేకు: 0437-2 నాదరామక్రియ సం: 12-218

పల్లవి: యిందుకు నీ చిత్తమున నెంత యెమ్మె లనకుమీ
చెంది నీ చుట్టరికమే చెప్పు కొంటిఁ జుమ్మీ

చ. 1: నలువంక నీ వెప్పుడు నాపై బత్తి సేతు వని
అలరి చెలులతో నే నాడుకొందును
వెలయఁగ నీవు నా విన్నపము విందువని
కలిమి మెఱసి నే గర్వమున నుందును

చ. 2: పుదుటున నీవు నాకు నుంగర మిచ్చితి వని
సుదతుల కెల్లా నేఁ జూపుదును
చెదరక నీవు నా చెప్పినట్టు సేతు వని
పది మారులును నేను పందేలు వేతును

చ. 3: నన్ను నీవు మన్నింతువు నా వాఁడవే యని
మిన్నకైనా సలిగెలు మెఱతు నేనూ
యిన్నిటా శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సన్నలా చాయలా నవ్వి సంతోసించుకొందును

రేకు: 0437-3 శుద్ధదేశి సం: 12-219

పల్లవి: ఇటువంటివాఁడు తాను యెదురాడేనా నేను
చిటుకనఁ జెప్పినట్టు సేసే నే తనకు

చ. 1: వినయము సేసే చోట వెంగెము లాడఁగరాదు
చన విచ్చిన చోటను జరయరాదు
మనసొక్కటైన చోట మంకులు చూపఁగరాదు
ననువులు గలిగితే నమ్మకుండరాదూ

చ. 2: ప్రియము చెప్పేయప్పుడు బిగిసె ననఁగరాదు
క్రియ గల పొందులు తగ్గించఁగరాదు
నయ మిచ్చి మాటాడఁగా నవ్వక మానరాదు
దయతోఁ దగులఁ గాను దాఁ గఁ గరాదు

చ. 3: పచ్చి దేరఁ గూడఁగాను పంతము లడుగరాదు
కచ్చుపెట్టి చెనకఁ గాఁ గాదనరాదు
ఇచ్చుట శ్రీ వేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
మెచ్చి సరసమాడఁ గా మితి మీఱరాదు

రేకు: 0437-4 మాళవిగౌళ సం: 12-220

పల్లవి: సేయఁగల చేఁతలు నీ చేతి వీఁకను
నాయము నీకే తెలుసు నన్నడిగే దేమీ

చ. 1: చెలియ మాటలు నీకుఁ జేరి విన్నవించితి
చెలఁగి యాపె కానుక చేతి కిచ్చితి
యెలమిఁ బలుకుఁ బంతాలిటు నీ కొప్పగించితి
నిలుచుక నీ యెదుట నే నిట్టే వున్నదానను

చ. 2: పడఁతి మారు నేనీ పాదాలకు మొక్కితి
తొడిఁ బడ నానవాలు తొల్లే చూపితి
కడ లేని వినయానఁ గమ్మటిని వేఁడుకొంటే
ఆడరి నీ వేళ గాచు కట్టే వున్నదానను

చ. 3: వువిద నీ నడుమను వున్నతెర దీసితి
అవిరళముగ సేస లంది యిచ్చితి
తవిలి శ్రీ వేంకటేశ తగ నీకెఁ గూడితివి
జవళి నీ పెండ్లి సంతోసాన నే నున్నదాననూ

రేకు: 0437-5 సాళంగనాట సం: 12-221

పల్లవి: యిద్దర నిద్దరే మిమ్ము నేమని నుతించేను
సుద్దులు వింటా మిమ్ముఁ జూచేను నేనూ

చ. 1: చెలి చక్కఁదనములు చేరి నీతోఁ జెప్పేనంటే
మలసి నీ వైతేను మరుతండ్రివి
పొలసి యీపె నేరుపులు పొగడే నంటేను
అలరి నీవు మాయానాథుఁడవూ

చ. 2: సతి నిన్ను మోహింపించఁ జతురురా లనే నంటే
రతి వలపించితి గొల్లెతల నీవూ
కతలుగా నేఁడివి కలిమి చెప్పే నంటే
సతతము నీ వైతే సర్వేశ్వరుఁడవూ

చ. 3: అంగన చనుఁగొండల నధికురా లనే నంటే
రంగున శ్రీ వేంకటాద్రిరాజవు నీవూ
అంగవించి యీపె క్షీరాబ్ధి కూతురనే నంటే
సంగడి నీకే నిచ్చిన జలధియల్లుఁడవూ

రేకు: 0437-6 కన్నడగౌళ సం: 12-222

పల్లవి: నీ కొకరైన నేరమి నేరుపులే యౌఁగాని
జోకతోడ నౌఁగా దని సోదించఁ జెల్లదూ

చ. 1: నిన్నుఁ బాసి వుండలేక నే నెంత దూరినాను
పన్ని నీకు నది యెగ్గుపట్ట మరి చెల్లదు
కన్నుల కాంక్షల నెంత కాఁడివారఁ జూచినాను
అన్నిటా దిష్టి దాఁకె నని యెంచఁ జెల్లదు

చ. 2: ఆసతో నుంటవింట నిన్నట్టే కప్రాన వేసినా
వాసితో నొచ్చిన నొవ్వివడే నెంచఁ జెల్లదు
సేసలు వెట్టే వేళ చేత నెంత పెనఁగినా
బేసబెల్లి పంతాల బీర మాడఁ జెల్లదూ

చ. 3: కామించి గుబ్బలు దాఁక కౌఁగి లెంత బిగించినా
కోమలపు మే నొత్తిన కుమ్మొ లెంచఁజెల్లదూ
ప్రేమ తోడ మోవి యెంత పేర్చినా శ్రీ వేంకటేశ
ఆముకొని అది యెంగి లాయ ననఁ జెల్లదూ

రేకు: 0438-1 శంకరాభ రణం సం: 12-223

పల్లవి: యేమి సేతు నమ్మలాల యెవ్వరితోఁ జెప్పుదును
వోముచు నో చెలులాల వూరకున్నారిపుడు

చ. 1: పిలువఁగ వచ్చి నే నే ప్రియములు చెప్పే నంటే
వెలఁదులకు సిగ్గులు విడువరాదు
చలివాసి తన దిక్కు చక్కఁగాఁ జూచే నంటే
కొలఁది ఇల్లాండ్లకు గుట్టు మూలధనము

చ. 2: వొనరఁ దనవద్దనే వూడిగాలు సేసే నంటే
వనితలకు పంతాలు వద్దా యందురు
గొనకొని నిలుచుండి కొలువులు సేసే నంటే
పెను రాణి వాసాలకు బిరుదు గంభీరము

చ. 3: మంతనాన నాతనితో మాటలు నే నాడే నంటే
యింతులకు నారజము లింత దగదు
చెంత నిట్టే వచ్చి నాతో శ్రీ వేంకటేశుఁడు గూడె
కాంతలకు నిట్టే రతి కడుఁ బెద్దరికము

రేకు: 0438-2 సౌరాష్ట్రం సం: 12-224

పల్లవి: నే ననఁగా నెంతదాన నీకుఁ దొల్లె వలచితి
దానికేమి రక్షించఁగఁ దగ నీకే భారము

చ. 1: యిమ్ముల నేమీ నేరని యెట్టి ముద్దరాలై నా
కమ్మి నీతో మాటాడితే కలికి యౌను
పమ్మి యప్పటి నెంతటి పంతగత్తె యైనాను
తెమ్మగా నీతో మాటాడితే నేలో నౌను

చ. 2: చెలరేఁగి యెటువంటి సిగ్గరిది యైనాను
నలి నీ యెదుట నుంటే నవ్వులాఁడౌను
మలసి గుణము గల మానాపతి యైనాను
కలసి నిన్నుఁగూడితే గయ్యాళి యౌను

చ. 3: యెన్ని చందముల మరి యేమీ నేరని దైనాను
నన్న లా చాయల నాడే జాణకత్తౌను
యిన్నిటా శ్రీ వేంకటేశ యేనమేలుమంగను
మన్నించి నన్నేలితివి మంచి తనమౌను

రేకు: 0438-3 లలిత సం: 12-225

పల్లవి: తా నెంత నే నెంత తగవా వో చెలులాల
వీనులార నీసుద్దులు వినరే మీరు

చ. 1: చేరి తన కూడిగాలు సేయుచు నుండే తన్ను
వూరకే మంచముపైఁ గూచుండు మనీనే
కోరి తనకుఁ బాదాలు గుద్దే యటువంటి నన్ను
ఆరజానఁ బక్కఁ బండు మనీనే తాను

చ. 2: వాడికతోఁ గూర లెల్లా వడ్డించే యట్టి నన్ను
వేడుకఁ బొత్తుకుఁ బిల్చి వేఁడుకొనీనే
వోడక తన పదాలు వుంచాన నేఁ బాడఁ గాను
వీడెము నా చేతి కిచ్చి వేమారుఁ జెనకీనే

చ. 3: కూరిమితో వద్ద నుండి కొలువు నేఁ జేయఁగాను
గోర గీరి యంత లోనే కొంగు పట్టీనే
యీ రీతి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
మేర మీఱి నన్నుఁ గూడి మెచ్చులు మెచ్చీనే

రేకు: 0438-4 సింధురామక్రియ సం: 12-226

పల్లవి: చెల్లు నయ్యా నీవు సేసే చేఁత లెల్లాను
వుల్లసమే మాడినాను వొద్దనేమా నిన్నును

చ. 1: మోము చూచితే నవ్వేవు మొక్కితే దీవించేవు
యేమయ్యా నీ జాణతనా లెన్ని గలవు
కామినుల వలపింత కాఁకాయ నీ వల్లను
గామిడితనా లివి యక్కడ నేర్చుకొంటివో

చ. 2: చేరితేనే చెనకేవు సిగ్గు పడితేఁ దిట్టేవు
నేరమయ్యా నేము నీతో నేసాలు సేయ
దూరు కెక్కిరి నీ చేత తొల్లే గొల్లెతలెల్లా
యీరీతి విద్యలు నీకు నింకా నెన్ని గలవో

చ. 3: సొలసితేఁ గూడేవు చొక్కితేనే మెచ్చేవు
నిలిచె నయ్యా నీ నెయ్యములెల్లా
అలరి శ్రీ వేంకటేశ అన్నిటా నన్నేలితివి
కలిగె నీ కీ గుణా లెక్కడఁ గాచుకుండెనో

రేకు: 0438-5 మేఁచభౌళి సం: 12-227

పల్లవి: యిద్దరి మేలూ గంటి మిన్నాళ్ళకు నేము
పొద్దు వొద్దు కేమని పొగడేమే మిమ్ముమ్మనూ

చ. 1: సెలవి నవ్వులతోడ చెక్కులఁ జెమట గార
చెలువుని కూడిగాలు సేసే వవునే
వలపు దైవారఁగాను వాసన కొప్పు వీడఁగా
అలసి పాదా లొత్తఁగా నాదరించీ నాతఁడు

చ. 2: కన్నుల చూపులు నాఁటఁ గస్తూరి వాసన మించ
మన్నన నాతని తోడ మాటాడే వౌనే
చన్నులు గదలఁగాను సారెఁ గుంచ విసరఁగా
నిన్నుఁ జూచి కరఁగీని నివ్వెఱఁ గై యాతఁ డు

చ. 3: నిట్టూరుపులు రేఁగ నీ మ్మైఁ బులకలు నిండ
బెట్టుగా గందము వూసి పెనఁగే వవునే
యిట్టే శ్రీ వేంకటేశుఁ డెనసె నిన్నూ నన్నూ
గుట్టు తోడ నిద్దరినిఁ గోరి మెచ్చీ నాతఁడు

రేకు: 0438-6 నాదరామక్రియ సం: 12-228

పల్లవి: నీరు కొలఁది తామెర నేరిచితేను వలపు
యీరీతి విన్నవించరే యింతులాల పతికీ

చ. 1: యెగసక్కెపు వారి నేమీ ననరాదు గాని
నగిన వారి తోడ నగవచ్చును
బిగియఁగా సారె సారెఁ బెనగఁగ రాదు గాని
మొగము చూచేనంటే మోము చూప వచ్చును

చ. 2: చాయపాటు పొందులకు సమ్మతించరాదు గాని
సేయించుకొంటేఁ బనులు సేయవచ్చును
నాయము చెప్ప వచ్చితే నమ్మఁగరాదు గాని
ఆయము లంటితేను అంటుకొనవచ్చును

చ. 3: యేడ కేడో కతలకు నియ్యకొనరాదు గాని
కూడితేను కౌఁగిటఁ గూడవచ్చును
యీడు జోడై శ్రీ వేంకటేశుఁడిట్టే నన్నుఁ గూడె
వేడుకైతే నిద్దరికి వేడుకలే వచ్చునూ

రేకు: 0439-1 అందోళి సం: 12-229

పల్లవి: యిదివో నా వలుపే యింత సేసే నన్నును
వెదకుతా నిందుకే విచారించే నిప్పుడు

చ. 1: హత్తి నే నవ్వుతాను ఆయము లంటినందుకు
చిత్త మెట్టుండె నోకో చెలువునికి
బత్తి తోడఁ గొంగువట్టి బలిమి సేసినందుకు
చిత్తణి నంటా గైపు సేయఁడు గదా

చ. 2: ఆన వెట్టి మేడ మీఁది కపు డెక్కించి నందుకు
మే నెంత అలసె నోకో మేటి తనకు
ఆనుక చన్నులు నాట నంటి పెనఁగినందుకు
దీనికెంత యాఁకటని తిట్టఁడు గదా

చ. 3: యెగ్గనక నేను మోవి యెంగిలి సేసినందుకు
సిగ్గు లెంత రేఁగెనోకో చేరి పతికి
అగ్గమై శ్రీ వేంకటేశుఁడట్టే తా నన్నుఁగూడె
నిగ్గుల గురుతులు మెయి నించఁడు గదా

రేకు: 0439-2 మాళవిగౌళ సం: 12-230

పల్లవి: మిక్కిలి తా నధికుఁడు మేలుదాన నేనైతి
చక్కఁగా నెట్టు సేసినా సంతోసించేఁ గాకా

చ. 1: అలుగఁగ నిఁక నేలే ఆతఁడు వీడె మియ్యఁగా
తొలఁగక చే యొగ్గి యందుకొనేఁ గాక
పలుక కుండఁగ నేలే పచారించి మాటాడఁగా
వొలిసినట్టే ల్లాను వూఁకొనేఁ గాకా

చ. 2: తప్పించు కొనఁగ నేలే తా నన్నుఁ బైకొనఁగాను
వొప్పి ఇచ్చకురాలనై వుండేఁ గాక
వుప్పతించి దూర నేలే వూరకే తా నవ్వఁగాను
రెప్ప లెత్తి చూచి ఇంపు రేఁచేఁ గాకా

చ. 3: సిగ్గులు వడఁగ నేలే సేసలు తాఁబెట్టఁ గాను
అగ్గమై సిరసు నే నొగ్గేఁ గాక
యెగ్గు లేక శ్రీ వేంకటేశుఁడిట్టే నన్నుఁగూడె
వెగ్గళపు తమితోడ వెలసేఁగాకా

రేకు: 0439-3 మంగళి కౌశిక సం: 12-231

పల్లవి: ఆతని నడిగి రారే అందు కేది బుద్ది నాకు
యీతలఁ దనకుఁ గానే యిట్టున్నదాననూ

చ. 1: మనసులోఁ దనతోను మాటలాడే నంటేను
యెనలేని నివ్వెఱఁగు లెడ మియ్యవూ
కనుచూపులే యెదురుగానైన నంపే నంటే
అనిశము నాసిగ్గులు అడ్డాలు వచ్చీని

చ. 2: కలలోనైనాఁ దన్నుఁ గౌఁగిలించుకొనే నంటే
నెలకొన్న విరహాన నిద్దుర రాదూ
చెలరేఁగి తనరూపు చేతుల వ్రాసేనంటే
తొలఁకుఁ బరవశాలు తోడు గావూ

చ. 3: వీనులఁ దన కతలు వినియైనాఁ జొక్కే నంటే
పూనిన తమకములు వుప్పతిల్లీని
ఆనుక శ్రీ వేంకటేశుఁ డంతలోనే నన్నుఁగూడె
నే నిట్టే పొగడే నంటే నిండీ సంతోమూ

రేకు: 0439-4 ముఖారి సం: 12-232

పల్లవి: యెప్పుడూ దనకు నాకు నెడసీనా యెంతైనా
ముప్పిరి సంతోస మాయ మొక్కితి నేననలే

చ. 1: యెవ్వతైనాఁ దనమతి కింపైతే జాలుఁ గాక
నవ్వుతాఁ గంటకాలాడ నా కేలే
నివ్వటిల్లు మోహములు నిండుకొంటేఁ జాలుఁ గాక
ఆవ్వల నివ్వలఁ దము నౌఁ గా దన నేలే

చ. 2: ఆపెకూఁ దనకు వావు లమరితేఁ జాలుఁ గాక
చూపించి పొంతనాలు నే సోదించ నేలే
యే పొద్దూఁ దమకోర్కు లీడేరితేఁ జాలుఁ గాక
కోపము దెచ్చుక తమ్ముఁ గొర నేలే

చ. 3: విచ్చన విడిఁ దమకు వేడుకైతేఁ జాలుఁ గాక
యెచ్చు కుందులు వెదక నిఁక నేలే
ఇచ్చట శ్రీ వేంకటేశుఁడిట్టే తా నన్ను నేలే
పచ్చిదేరెఁ బను లెల్లా పచారించ నేలే

రేకు: 0439-5 భైరవి సం: 12-233

పల్లవి: తన్నుఁ బాసి నే నెట్లా దరియింతు ననవే
విన్నవించా రాదు విన్నవించకుండా రాదే

చ. 1: మాటలఁ దన్ను నొడివి మరికొంత పొద్దు వుత్తు
కూటములు దలఁచుక కొంత పొద్దు వుత్తునే
పాటలు వాడుకొంటా నప్పటిఁ గొంతపొద్దు వుత్తు
పూఁట పూఁట కేమిటాను పొద్దు వోదే చెలియ

చ. 2: యెదురు చూచి చూచి యిట్టే కొంత పొద్దువుత్తు
కుదురై అడియాసలఁ గొంత పొద్దు వుత్తునే
వెదకుతా నింటిలోన వెసఁ గొంత పొద్దు వుత్తు
పొదలుతా నేమిటానుఁ బొద్దు వోదే చెలియ

చ. 3: అంచెల లేక లంప అట్టే కొంత పొద్దు వుత్తు
కొంచక వినుకలినే కొంతపొద్దు వుత్తునే
యెంచఁగ శ్రీ వేంకటేశుఁడిట్టే విచ్చేసి నన్నేలె
పొంచి తనియ కేమిటాఁ బొద్దు వోదే చెలియ

రేకు: 0439-6 నాట సం: 12-234

పల్లవి: నన్ను మన్నించు మనవే నా యింటికి రమ్మనవే
యెన్నరాని చుట్ట రికా లెంత లేదే తనకు

చ. 1: పొరుగు పోరచివిందు పొసఁ గించుఁ జవు లెల్లా
తరి తీపుల మాటలు తమి రేఁచును
తెరమరఁగు సన్నలు తెగని యాసలు చూపు
యెరవులవారి పొందు లెంత లేదే తనకు

చ. 2: సంగడి జాణతనాలు సరసము లాడించు
ముంగిటి నేస్తములు ముచ్చ టాడించు
అంగపు పెనఁగులాట లాయములు గరఁగించు
ఇంగితపు తాలపోఁత లెంత లేదే తనకు

చ. 3: పుమ్మగిలుఁ బ్రియములు వుబ్బుఁ జెమటలు నించు
చిమ్ముఁ జూపులు మోములు చెంగలింపించు
కమ్మి శ్రీ వేంకటేశుఁడు గక్కనఁ దా నన్నుఁగూడె
యిమ్మల వినోదాలు యెంత లేదే తనకూ

రేకు: 0440-1 మధ్యమావతి సం: 12-235

పల్లవి: నా భాగ్య మిది యని నవ్వుతా నుండుదుఁ గాక
యే బుద్ధులూ నేల చెప్పే రీతఁడే నా దేవరే

చ. 1: యెంత వలసినాఁ గద్దు యెంచుకొంటే నా యాస
చింతించితేఁ గోరికలు శానాశాన
పంతములు చూచితేను పట్టిన దెల్లా నెగ్గు
యింతటి విభుని నే నెట్టు దూరవచ్చునే

చ. 2: యెన్నైనా నాడఁగవచ్చు నెగసక్కెపు మాటలు
పన్నుకొంటే గర్వము పట్టఁగరాదు
సన్నల జంకించితేను సణఁగులు రాలుచుండు
యెన్నిటి కెన్ని యీతని నెట్టు దూరవచ్చునే

చ. 3: ఇచ్చగించి యియ్యకొంటే నింపులే మన నిండు
కొచ్చి కూడితే రతులు కొలఁది లేవు
యిచ్చట శ్రీ వేంకటేశుఁడిన్నిటాను నన్ను నేలె
నెచ్చు కుందుల నితని నెట్టు దూరవచ్చునే

రేకు: 0440-2 కుంతల వరాళి సం: 12-236

పల్లవి: అప్పటి నన్ను నేనే ఆడుకోరాదు గాక
ఇప్పుడిట్టే చెలులాల ఇదేమే నాగుణము

చ. 1: చెలిమి సేసే నంటే జిగిగొనీ సిగ్గులు
తల వంచుకుండే నంటే తమి ఘనము
కొలువున నుండే నంటే గుబ్బతిలీ వలపులు
యెలమి నో చెలులాల యేఁటిదే నాగుణము

చ. 2: కందువ మాటాడే నంటే గగ్గుత్తిక యయ్యీని
అంది సేవ సేసేనంటే చిందీఁ జెమటా
పందేలాడే నంటేఁ జూచి పరవశములు దొట్టి
ఇందరిలోఁ జెలులాల యేఁటిదే నా గుణము

చ. 3: సరుఁస గూచుండే నంటే సంతోసాలే రేఁగీని
విరుల వేసే నంటే వీడీఁ గొప్పు
యిరవుగా శ్రీ వేంకటేశుఁ డిట్టే నన్నుఁగూడె
యెరవరి చెలులాల యేఁటిదే నా గుణము

రేకు: 0440-3 పాడి సం: 12-237

పల్లవి: వేగిరించకురే వో వెలఁ దులాల
చేగదేర వేరొకటి సేసునా అతఁడు

చ. 1: తనకు మోహించే నాపై దయ తలఁచుఁ గాక
నను నిరాకరించునా నా విభుఁడు
పనులేమి గలిగి యే పసల నున్నాఁడో కాక
మనసున నాపై బత్తి మఱచునా అతఁడు

చ. 2: నంటునఁ బెండ్లాడిన నన్ను మన్నించుఁ గాక
యింటికి రా కుండునా యెప్పుడైనాను
అంటిత నాడకు వచ్చేనని వున్నాఁడోకాక
దంటయై యవ్వలిపని దలఁచునా అతఁడు

చ. 3: తానే గతై వుండే నాకు తగఁ జన విచ్చుఁ గాక
మానఁగలఁ డా కూడక మరి నాతోను
పానుపుపై శ్రీ వేంకటపతి వున్నాడో కాక
యేననఁ గా నన్ను నేలె యింతలోనె యతఁడు

రేకు: 0440-4 శ్రీరాగం సం: 12-238

పల్లవి: అందరివంటిదానా అయ్యో తనకు
మందలించి తన సేవే మన్నించీ ననవే

చ. 1: తనపై నేఁ జేసే బత్తి తగ నాకుఁ దోడై వచ్చి
వినయము నాదే నన్ను వెలయించీని
యెనసిన యిచ్చకమే యీడేరించీ నన్ను
కనుఁగొని తన్ను నింత కక్కసించ నేఁటికే

చ. 2: కమ్మి తనకుఁ గట్టిన కంకణమే మేలై వచ్చి
నమ్మిన నమ్మికలె నన్నుఁగాచీని
ఇమ్ముల నా కోరికలే యిట్టే తన్నుఁదోడి తెచ్చి
చిమ్ముచుండను బలిమి సేయవచ్చు నటవే

చ. 3: సారిది నే వినే తన సుద్దులే ఫల మిచ్చి
బెరసి నా తమకమే పెండ్లి సేసీని
యిరవై శ్రీ వేకంటేశుఁ డింతలోఁ దా నన్నుఁగూడె
సరికి బేసికిఁ దన్ను సాదించఁ దగునా

రేకు: 0440-5 గంభీరనాట సం: 12-239

పల్లవి: వలచిన యంగనల వాఁడవు గాక
తలఁచి నీ చిత్తములో దానఁ జుమ్మీ నేనూ

చ. 1: యే సతిఁ బెండ్లాడినా ని న్నెట్టు వెంగే లాడవచ్చు
వాసితో నాపెను నావంటిదే కాదా
వోసరించ కప్పటి నీ వొడి వట్ట నెట్టు వచ్చు
బాసతో నీ వొక్కతె పాలఁ జిక్కితివా

చ. 2: నీ వెవ్వతెతో నవ్వినా నిన్నెట్టు మానుపవచ్చు
ఆ వనిత నోము ఫల మట్లుండఁగా
కావించి నీ కెటువలె కంకణము గట్ట వచ్చు
చేవ మీర నీ వొకతె చేతిలోని వాఁడవా

చ. 3: యెందరిఁ దెచ్చుకొనినా యే మనఁ గవచ్చు నిన్ను
అంది నీ కింతా లాభమై యుండుఁ గాకా
యిందరిలో శ్రీ వేంకటేశ నన్నేలితివి
కందువ దొరికితి వొక్కతె కబ్బేవాఁడవా

రేకు: 0440-6 మంగళ కౌశిక సం: 12-240

పల్లవి: యెంతని కొనియాడేనే యీతని నేనూ
పొంతనే తా నెన్ని నేరుపులు నేర్చెనే

చ. 1: మంతనము లాడించేది మనసు పెడ రేఁచేది
సంతసపు తన మేని చక్కఁదనమే
పంతము లిప్పించేది భావము గరఁగించేది
మంతుకు నెక్కిన తన మంచి గుణమే

చ. 2: వేడుకలు పుట్టించేది వినోదాలు నెరిపేది
జాడతోఁ దా నాడేటి సరసములే
వాడికలు సేసేది వద్దఁ బాయ ని య్యనిది
చూడఁ గొత్తైన తన మెచ్చుల సింగారమే

చ. 3: తగ మరిగించేది తనపొందు సేయించేది
తగులైన యటువంటి తన కౌఁగిలే
జిగిఁదా నింతలో నన్ను శ్రీ వేంకటేశుఁడు గూడె
యిగిరింపించినా లిదే తన వలుపే

రేకు: 0441-1 పళవంజరం సం: 12-241

పల్లవి: విచారించవద్దు మరి విన్నపాలుఁ జేయ నేను
పచారించి రమ్మనవే బత్తి సేసే గాని

చ. 1: తత్తరించి దూరనే తనతో నలుగనే
చిత్తము రాఁదన సేవ సేసేఁ గాని
కొత్తలేమిఁ జేయనే కొసరి జంకించనే
హత్తి తన యిచ్చలోనే అలరేఁ గాని

చ. 2: వేసారించి సొలయనే వేమారు నలయించనే
నాసూటినే తనతోను నవ్వేఁ గాని
ఆసల భ్రమయించనే అఱడి నేఁ బెట్ట నే
బాసికము గట్టి తలఁ బాలు వోసేఁ గాని

చ. 3: చలము సాదించనే చండి సేసి పెనఁగనే
నెలకొని కౌఁగిటిలో నించేఁ గాని
అలరి శ్రీ వేంకటేశుఁ డంతలోనే నన్నుఁగూడె
బలిమి సేయనే తన్నుఁ బాయకుండేఁ గాని

రేకు: 0441-2 పాడి సం: 12-242

పల్లవి: నీరువట్టు గొన్నచోట నేతఁ దీరునా
సారె నాతనిపొందులే చలి మందులు నాకూ

చ. 1: కప్పి యాతఁడు నవ్వితేఁ గాఁకలు మానీఁగాక
కప్పుర మేల చల్లేరే కాంతలాల
తప్ప కాతని మోవినే దప్పులు దేరీఁ గాక
యిప్పుడింత పన్నీరు ఇచ్చిరే నాకూ

చ. 2: పొరిఁ బొరి నాతని పూర్పులఁ జెమ టారీఁ గాక
సురటేల విసరేరే సుదతులాలా
సరి నాతని మేలమే విరహ మార్చీఁ గాక
విరు లేల పోసేరే వేమారు నాపైని

చ. 3: సొగి సాతని పాదాలు సోఁకి చల్లనయ్యీఁ గాక
చిగు రేల పరచేరే చెలియలాల
నిగిడి శ్రీ వేంకట నిలయుఁడు నన్నుఁగూడె
జిగి వట్టి కత లేల చెప్పేరే యింకాను

రేకు: 0441-3 హిందోళవసంతం సం: 12-243

పల్లవి: చెలులాల యీ కన్నెకుఁ జెప్పరే బుద్ధి
చెలఁగి పయ్యద మాటు సేయ నేలే తానూ

చ. 1: పెంచి యిద్దరము బొమ్మ పెండ్లిండ్లు సేత మంటే
కొంచి నాతో తానేల సిగ్గులు వడీనే
పొంచి నా చేతికి పెద్ద పూజెకుండ లిమ్మంటేను
వంచనతో నిట్టే యాల వంచీనే శిరసు

చ. 2: ననిచే నేఁ డే పెండ్లీ నాగవల్లి సేత మంటే
యెన లేని తలపోఁత నేల నవ్వీనే
తనియ కిట్టే కంకణదారాలు గట్టుద మంటే
పెనఁగుచు నిప్పు డెంత బిగిసీనే యీకె

చ. 3: కూడ మంచివేళ కొంగులు ముళ్ళు వేత మంటే
జాడతో బొమ్మల నేల జంకించీనే
యీడై శ్రీ వేంకటేశుఁడీపె మాటలు నే నాడఁగా
జో డాయ సోబన మేమి చూచీనే నన్నును

రేకు: 0441-4 మాళవశ్రీ సం: 12-244

పల్లవి: కంటి నీవు పాయ మింక కాంతాళించి నిన్ను దూర
జంటల నీ వల్ల నింత సతమాయ వేడుక

చ. 1: యెచ్చి నీపై తలపోఁత లెన్నైనా వేడుకే
రచ్చ నీకుఁ గొన్నవిరాలి వేడుకే
అచ్చముగా నీ మీఁది ఆసలన్నీ వేడుకే
వచ్చినప్పుడు రమ్మీ నీ వల్ల నింతా వేడుకే

చ. 2: చెంది నీకుఁగాఁ బొడమే చెమటలు వేడుకే
కందువ నీ పై తమకము వేడుకే
పొందుల నీ కెదురు చూపులు నివీ వేడుకే
యెందు నున్నా నీవల్ల నింతా నాకు వేడుకే

చ. 3: దవ్వులమాటలు వినే తరితీపు వేడుకే
యివ్వల నన్నుఁ గూడితి విడీ వేడుకే
రవ్వగా శ్రీ వేంకటరమణ మన రతుల
జవ్వన మదములలో సాదింపుల వేడుకే

రేకు: 0441-5 ద్రావిడభైరవి సం: 12-245

పల్లవి: యెడమాట లాడించే నెందాఁకాను
వుడివోని మచ్చికతో నున్నదాన ననవే

చ. 1: తానే గతి యనేదాన దయ గోరు కున్నదాన
వీనులఁ దనకతలే వింటా నున్నదా
మానరాని పొందుదాన మానాపతిదానను
నా నా విధముల విన్నప మిదేయనవే

చ. 2: మొక్కుతాను వున్నదాన మోహించి యున్నదాన
చెక్కుచేతఁ దనరప చింతించేదాన
యిక్కువనే వున్నదాన యెదురు చూచేదానను
మిక్కిలియాసతోడ నమ్మి యున్నదాన ననవే

చ. 3: తగుల మిగల దాన తమకించి యున్నదాన
మగటిమితోఁ దన మన్ననదాన
జిగి నింతలోఁ దా వచ్చి శ్రీ వేంకటేశుఁడు గూడె
జగములోఁ దనకు నేఁ జనవరి ననవే

రేకు: 0441-6 శంకరాభ రణం సం: 12-246

పల్లవి: యెందరిఁ దాఁ బెండ్లాడినా నితవే కాని
పొందులు తనకు నాకు పొద్దు కొక కొత్తలూ

చ. 1: మొనపి చన్ను లెంతైనా తనకు వేసట గాదు
మన సెంత దవ్వేఁగినా మఱి యలుపే లేదు
తను వెంత భోగించినాఁ దనివి యెన్నఁడు లేదు
యెనసెఁ దనకు నాకు నెరవే లేదు

చ. 2: వల పెంత గనమైన వలదని తోయరాదు
కలి మెంత యెక్కుడైనా కడు మొగచాటు గాదు
కలిగితేఁ జక్కదనము కొలఁది పెట్టఁగ రాదు
లలిఁదా నెంత మీరినా చలము లేదు నాకు

చ. 3: కొమరేపాయ మెంత కూడినాను మోపు గాదు
తమి యెంత రేఁగినా చేతనుఁ బట్ట వస గాదు
సమరతి శ్రీ వేంకటేశ్వరుఁడు తా నన్నుఁగూడె
రమణుఁ దాయను యే నేరమీ నిఁకలేదు

రేకు: 0442-1 ముఖారి సం: 12-247

పల్లవి: యేమీ వూరకుండే వంటా యేల నన్ను నొరసీని
కామించి తన గుట్టు గాన వసమటవే

చ. 1: చక్కఁదనాలకే తన్ను సంతోసింతునో నేను
మిక్కిలి మంచి గుణాలు మెత్తునో మరి
తక్కక తన సుద్దులు దడవి పొగడుదునో
యెక్కడాఁ దన మహిమ లెంచ వసమటవే

చ. 2: తన నేరుపులే యిట్టే తలఁచి నవ్వుదునో
అనిశము నుదారత్వ మాడుకొందునో
పనివడి ప్రతాపమే పరికించి చొక్కుదునో
యెన లేని తన సేఁత లెంచ వసమటవే

చ. 3: ఆసఁ దన యీవులకు నచ్చెరు వందుదునో
సేసవెట్టి నందుకే చెలఁగుదునో
రాసి కెక్క నన్నుఁ గూడె రతి శ్రీ వేంకటేశుఁడు
యీ సరవుల మేలు యెంచ వసమటవే

రేకు:	0442-2 మేఁచభవుళి	సం:	12-248

పల్లవి:	యెరవు లే కిద్దరమూ నియ్యకోలై యుంటఁ గాక
వెరవులు సారె సారె వెదకఁగ నేలే

చ. 1:	మనసు లెనయుదాఁకా మంతనము లాడేది
చనవు గలుగు దాఁకా సాదించేది
తనివి గలుగు దాఁకాఁ దత్తరించి కొసరేది
పను లీడేరితే మరి పచరించనేలే

చ. 2:	పంతములు వచ్చుదాఁకాఁ బట్టి పట్టి పెనఁగేది
చింతలు దీరుదాఁకాఁ జెక్కు నొక్కేది
సంతోము గల దాఁకా సరసము లాడేది
వింత లేక వున్నవేళ విచారము లేలే

చ. 3:	సేసలు వెట్టిన దాఁకా సిగ్గుల తోడ నుండేది
ఆసలు ఫలించుదాఁకా నాలు డయ్యేది
బాస యిచ్చి శ్రీవేంకటపతి దానే నన్ను నేలె
వాసి నలమేల్మంగను వక్కణించ నేలే

రేకు: 0442-3 ఆహిరి సం: 12-249

పల్లవి: యెట్టు సేసినాఁ జేయనీ యింక నే నేమీ నెఱుఁ గ
చుట్టరికమునకే చొక్కితి నేనూ

చ. 1: మన సిచ్చి నా తోను మంచి మాట లాడఁగాను
ననిచి అన్నిటాఁ దన్ను నమ్మితి నేను
కనుఁగవ దెరచి యిక్కడ నన్నుఁ జూడఁ ను
చెనకి తనతో పొందు సేసితి నేనూ

చ. 2: సారె సారె నప్పటిని సరసము లాడఁగాను
ఆరయఁ దనకు లో నయితి నేను
గారవించి యందరిలోఁ గడు నాతో నవ్వఁగాను
వూరక సంతోసాన వొడఁ బడితి సేనూ

చ. 3: చిత్తగించి నా మీఁద సేస వెట్టి కూడఁగాను
హత్తి తన చెంత కిరవైతి నేనూ
యిత్తల శ్రీ వేంకటేశుఁడే నలమేలు మంగను
బత్తి సేయఁగా నాసలఁ బరగితి నేనూ

రేకు: 0442-4 సామంతం సం: 12-250

పల్లవి: పంతము లాడఁ జెల్లదు పతులకు సతులకు
ఇంతయుఁ దెలిపి పతి నింటికి రమ్మనవే

చ. 1: ఆడుకోలు మాటలు ఆయములు గరఁగించు
యీడైన వయసులు యేఁకరింపించు
చూడఁ జూడ చూపులు చుట్టరికములు సేసు
వేడుకైన సరసాలు వియ్య మందింపించును

చ. 2: తనివోని వినుకులు తలపోఁతలు రేఁచు
బెనకుల చేఁతలు సిగ్గులు నించు
పెనగొన్న కోరికలు ప్రియములు చెప్పించు
పసు పడ్డ నవ్వులు బయలీఁ దెప్పించును

చ. 3: వుడివోని మోవిపండు వూరకే నోరూరింపించు
అడియాలపు రతు లాస లెక్కించు
బడి నలమేలు మంగపతి శ్రీ వేంకటేశుఁడు
విడువక నన్నుఁ గూడి వేడుక వుట్టించును

రేకు: 0442-5 దేశాక్షి సం: 12-251

పల్లవి: తన కైతే నవ్వులు తగ మా కైతే రేసులు
వనితల కల్లా నివి వాసిపట్లు గాని

చ. 1: మంతనము లాడవచ్చు మచ్చికలు చూపవచ్చు
చెంతఁ బతితో పొందు సేయవచ్చును
పంతమున సవతులు పారి పారి కొచ్చి కొచ్చి
వింత మాట లాడఁగాను వినరాదు గాని

చ. 2: సరసము లాడవచ్చు చవులెల్లా రేఁచవచ్చు
వెరగులు వడవచ్చు విభుని తోను
సరుగ నూడిగముల సతు లీడు వెట్టుక
పరగఁ బొత్తు గూడఁగాఁ బడరాదు గాని

చ. 3: పెనఁగు లాడఁగవచ్చు ప్రియములు చెప్పవచ్చు
యెనయ వచ్చు శ్రీ వేంకటేశుని తోను
వినయపు టలమేల్మంగను నన్ను నేలెఁ దాను
కని వెలయాండ్ల సంగతి వద్దు గాని

రేకు: 0442-6 శుద్ధవసంతం సం: 12-252

పల్లవి: వూరకే దక్కు నటవే వుడివోని వలపు
గారవించి యాతనిఁ గౌగిలించఁ గదవే

చ. 1: మంచి మాట లాడితేను మరిగి నమ్మిక వుట్టు
ఇంచుకంత నవ్వినాను యియ్యకో లవును
వంచనతో మొక్కితేను వడి మొగమాట గల్గు
మించుగాఁ బొగడితేను మే లెల్లా దైవారును

చ. 2: మళ్ళి మళ్ళి చూచితేను మనసులు గరఁగును
వెల్లివిరిఁ గొసరితే వేడుక లవును
వొల్లనే వీడె మిచ్చితే వుప్పతిల్లుఁ దమకము
చెల్లు బడి గలిగితే సిగ్గు లెల్లాఁ దేరునూ

చ. 3: యిచ్చకమై వుండితేను యింపు లౌను రతు లెల్లా
పచ్చిదేరఁ గూడితేను బలుసు నాస
యిచ్చట శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తచ్చన లేక యేలెఁ దలఁపు లీడేరెనూ

రేకు: 0443-1 దేసాళం సం: 12-253

పల్లవి: నే నీకు వేరు గాను నీవు నా కెరవు గావు
యే నెపమూ వేయ నీపై నింటికి రావయ్యా

చ. 1: చెక్కునఁ బెట్టిన చేయి సేసవెట్టే నీ మీఁ ద
ముక్కుపైఁ బెట్టిన వేలు ముందే మెచ్చెను
వక్కణ లడుగనేల వలచితి నాఁ డే నీకు
యిక్కువలు చెప్పేగాని ఇంటికి రావయ్యా

చ. 2: సిగ్గువడ్డ మొగమున సెలవి నవ్వులు రేఁగె
వెగ్గళించిన కన్నులే వేడుకఁ జూచె
కగ్గి నీతో నలుగను కడు ముద్దరాలను
యెగ్గు లేమీ నెంచను యింటికి రావయ్యా

చ. 3: వాడిన కేమ్మోవిని వడిఁ దేనెలూరఁ జొచ్చె
వీడిన నెరులలోన విరులు నిండె
యీడనే శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
యీడుగాఁ గూడితి విఁక నింటికి రావయ్యా

రేకు: 0443-2 శ్రీరాగం సం: 12-254

పల్లవి: యేల నన్నుఁ బొగడీని యింతకూ నే గుఱుతంటా
తాలిమి చేఁతల కెల్లాఁ దానే గుఱుతు

చ. 1: చక్కఁదనమున కెల్లా జవ్వనమే గుఱుతు
మక్కువల కెల్లాను మనసే గుఱుతు
తక్కిన పనుల కెల్లా తనువే గుఱుతు
జక్కవ పిట్టలఁ బోల్చ చన్నులే గుఱుతు

చ. 2: మానరాని చేఁతలకు మంచితనాలే గుఱుతు
వూనిన సిగ్గుల కెల్లా నోరచూపే గుఱుతు
సేసలైన యాసలకు చేతి మొక్కులే గుఱుతు
నా నా సంతోసాలకు నవ్వులే గుఱుతు

చ. 3: వుడివోని వలపుల కొడఁ బాట్లే గుఱుతు
యెడయని కూటముల కిచ్చకములే గుఱుతు
అడరి శ్రీ వేంకటేశుఁడట్టే నన్ను నేలినాఁడు
తడయని భోగాలకు తమకమే గుఱుతు

రేకు: 0443-3 వరాళి సం: 12-255

పల్లవి: చెప్పి చూప రాదు తన చిత్తమే యెఱుఁగు నంతా
యిప్పుడు నన్ను మన్నించి యేలుకొమ్మనవే

చ. 1: చనవు గలిగితేను చలము లీడేరును
మనసు వచ్చితేను మాట లింపౌను
వినయము చూపితేను వెలయు మోహము లెల్లా
చెనక నేరిచితేను చిప్పిలుఁ దమకము

చ. 2: చుట్టరికమైన చోట చుట్టుకొని మొగమోట
పొట్టఁ బొరుగై తేను పొందు గలుగు
నెట్టుకొన్న తరితీపు నిండించు వేడుకలు
కట్టు కొన్న వలపులు కౌఁగిటఁ జొక్కించును

చ. 3: తనివోని కోరికలు తగులాయములు సేయు
మునుకొన్న తలపోఁత ముద మందించు
యెనలేని శ్రీ వేంకటేశుఁ డిట్టే నన్నుఁగూడె
వొనరిన ననుపులు వొడఁబాటు సేసును

రేకు: 0443-4 లలిత సం: 12-256

పల్లవి: యిరు మొనసుది యాయ నిదివో నీ మోహము
విరు లాపె వేసినవి వెస నాపై వేసేవు

చ. 1: కానుక యిచ్చి ఆపె కాచుక నీ కుండఁగాను
వూనుకొని నాతో నెంత పొందు సేసేవు
వీనులలోని కప్పటి విన్నపాలూఁ జేయఁగాను
మానక నా మోము చూచి మాట లాడేవు

చ. 2: చేరి చేరి యాపె నిన్నుఁ జెరఁగువట్టుకుండఁ గా
నారు కొన నాతో నీవు నవ్వు నవ్వేవు
కూరిమి గొసరి మరీఁ గొప్పు నీకు ముడువఁగా
నేరుపున నా మీఁద నెయ్యము చల్లేవూ

చ. 3: వేడుకతో నాపె నిన్ను వెసఁ గౌఁగిలించఁగాను
యీడ నాకు మోవితేనె లియ్య వచ్చేవు
జాడతో శ్రీ వేంకటేశ సరిగా మమ్మిద్దరినిఁ
గూడి మాలో మాకు నను గుణము సేసేవూ

రేకు: 0443-5 శుద్ధదేశి సం: 12-257

పల్లవి: నీ యిచ్చ మేలఁగే నంటా నిలుచున్న దూరకే
చాయల నేమేమో భావించకువయ్యా యీపెను

చ. 1: కూరిమి గలుగు కాంత కోపగించదు
వోరుపుతో గుట్టు సేసు కుండుఁ గాని
యీ రీతి వోజలదే మా యిగురుఁ బోఁడి
సారె నలుకలు గడించకువయ్యా యీపెకు

చ. 2: మంచి గుణాల మగువ మంకు చూపదు
వంచన తోనే మెలఁగి వసమౌఁ గాని
యెంచా చూడ నేరుపరి యిదె మా చెలి
అంచెల వట్టి సడి వేయకువయ్యా యీపెకు

చ. 3: తగ వెఱఁ గిన సతి తత్తరించదు
మొగ మోటతో నీకు మొక్కుఁగాని
జిగి నిట్టిది మా కన్నె శ్రీ వేంకటేశ
బగివాయదు జోలి చూపకువయ్యా యీపెకు

రేకు: 0443-6 రామక్రియ సం: 12-258

పల్లవి: వే వేలకు నే నిన్ను వేఁడు కొనేను
మా వంకఁ దప్పు గలిగితే మన్నించవయ్యా

చ. 1: మఱి నీ చిత్తము రా మాటలాడే నంటా వచ్చి
యెఱుఁగ కేమాడుదునో యెగ్గు పట్టకువయ్యా
వుఱక బత్తితోఁ బాదా లొత్తఁ గా నా కంకణాలు
వొఱసి యాడ నొత్తునో వోరుచుకోవయ్యా

చ. 2: యిచ్చకముగాఁ గౌఁగిలియ్య వచ్చి చన్నులనుఁ
గుచ్చి యెంత యొత్తుదునో కోపగించకువయ్యా
మచ్చిక తోనే నీకు మరిగి వీడె మియ్యఁ గా
యెచ్చు కుందు లెట్టుండునో యింపు సేసుకోవయ్యా

చ. 3: దప్పి దేర మోవితేనె తతి గొని యియ్య వచ్చి
చిప్పిల నేమి సేతునో చేకొనవయ్యా
యిప్పుడే శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నీ
కొప్పు ముడువఁ గా నెట్టో గుట్టు సేసుకోవయ్యా

రేకు: 0444-1 నాదరామక్రియ సం: 12-259

పల్లవి: నే నెంత తమకించినా నీ గుణము మేలు మేలు
నానాగతి నలయవు నవ్వులే కాని

చ. 1: వాసులకే పెనఁగితి వలపులు చల్లితి
వేసర వెంతైనా నీవు వీఁగి లోఁగవూ
ఆసలనే కొసరితి ఆయములు నంటితి
వీసమంతాఁ దలఁ కవు వేడుకే కాని

చ. 2: చనవున సొలసితి జంకించి చూచితి
మనసు విఱుచుకోవు మానవు తమి
కనుసన్నల దూరితి కాఁకలు పైఁ బూసితి
అనుమానించ వేమిటా నాదరణే కాని

చ. 3: కప్పురాన వేసితి కొఁగిట బిగించితి
తప్పించుకొనవు మరి తడఁ బడవూ
ముప్పిరి శ్రీ వేంకటేశ మోవితేనె లానితి
చొప్పుమాయ లేమిటాను సొంపులే కాని

రేకు: 0444-2 కేదారగౌళ సం: 12-260

పల్లవి: నీ చిత్త మెట్టున్నదో నే నెఱఁగను
చేచేత నా వలపులే చిమ్మి రేఁచీని

చ. 1: చేరి నీకు విన్నపాలు చేసుకొనే నంటేను
సారెకు నివ్వెఱఁగులు సందడించీని
కూరిమి గొసరి నీ కొంగు వట్టే నంటేను
తారుమారై నా సిగ్గులే తడఁబరచీని

చ. 2: కొంకక నిన్నే తలఁచి గుట్టున నుండే నంటే
పొంకపు చిఱునవ్వులు పొదిగొనీని
అంకె నీసుద్దులు విని అట్టే పొద్దు వుచ్చేనంటే
మంకుల పరవశాలు మరపించీని

చ. 3: కన్నులనే నిన్నుఁ జూచి కడు బత్తి చూపే నంటే
కన్నెపాయపు గుణము కప్పీ నన్ను
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
సన్నల నీ మోవితీపు చవి పుట్టించీని

రేకు: 0444-3 మాళవిగౌళ సం: 12-261

పల్లవి: అన్నిటా నేరుపరి అదే యాతఁ డెఱుఁగఁడా
విన్నవించరే యా మాట వేడుక లాతనికి

చ. 1: యెవ్వరి నేమన నేల యెడ మాట లాడ నేల
నవ్వుతా నా రమణుఁడే న న్నేలీఁ గాక
సువ్వన నా మనసు యిక పాఁతర యెంతని
తవ్వేను తానే దయ దలఁచీఁ గాకా

చ. 2: చెక్కున చేయిడ నేల చింతలఁ బొరల నేల
మక్కువ నాతఁడే వచ్చి మన్నించీఁ గాకా
గుక్కక నా దీమసము గోడవంటిది యెంతని
మక్కు వేసే తానే చూచి మమ్ముఁ గాచీఁ గాకా

చ. 3: సెలవి నవ్వఁగ నేల సిగ్గులు వడఁగ నేల
వెలయఁ గూడె నన్ను శ్రీ వేంకటేశుఁడే
చిలుక వంటిది నాలోఁ జెలఁ గే యాస యేమని
పిలిచేను నాపైఁ దానే ప్రేమ నించీఁ గాకా

రేకు: 0444-4 ధన్నాసి సం: 12-262

పల్లవి: తన చిత్తమే యెఱుఁగు దయ గలవాఁడు తాను
వొనరి యెప్పుడూఁ బాయకుండు మని యనరే

చ. 1: కన్నులఁ దన్నుఁ జూచితి కాంక్షలునుఁ దీరవు
సన్నలు సేసితి మొగబాటూఁ గాదు
విన్నపములూఁ జేతు వేడుకకు మితి లేదు
యిన్నిటా నావల పిఁక నేమి చెప్పే ననరే

చ. 2: నగుదుఁ దనతో నెంతైనానుఁ దనివి లేదు
తగిలి మోవి యానుదు దప్పిఁ బోదు
అగపడి కౌఁగిలింతు నాసలునుఁ దెగవు
యెగసక్కె మాయ వల పేమి చెప్పే ననరే

చ. 3: మంతనానఁ గూడుదు మద మెంతైనా దిగదు
వింతలుగాఁ గొసరుదు వీడదు తమి
పంతముతో శ్రీ వేంకటపతి యిట్టే నన్ను నేలే
యింత సేసె నా వలపు యేమి చెప్పే ననరే

రేకు: 0444-5 కాంబోది సం: 12-263

పల్లవి: యెందూఁ దప్పించుకో రాదు యేమిటానుఁ బొద్దు వోదు
అందే పరాకు సేసుకో నలవి గాదు

చ. 1: తలఁపునఁ బారును తన చక్కని రూపము
వెలిఁదా నాడేమాటలు వినిన ట్టౌను
కల గనినట్టౌను కన్నులు మూసుకొంటేను
యెలమి నా భావ మిది యేమి సేతునే

చ. 2: కడు సందు లదరును కౌఁగిలించుకొన్న ట్టౌను
బడి నుండినట్టౌను పై పై నీడ
వొడి వట్టి నట్టౌను వూరకే నా కోరికను
వుడివోని నా యాస కుపమ యేదే

చ. 3: చెనకినయ ట్టౌను సెలవి నవ్వులు వచ్చు
చనుగవ యంటినట్టౌ సంతోసానను
యెనసె శ్రీ వేంకటేశుఁ డింతలో విచ్చేసి నన్ను
మనసు నిర్మల మాయ మరియు నే మందునే

రేకు: 0444-6 కన్నడగౌళ సం: 12-264

పల్లవి: అడుగరే మీ రయిన నంగనలాల విభుని
యెడయవు తలపోఁత లే మందునే

చ. 1: వూరకే వుండితేను వుమ్మగిలీఁ దమకము
సారెకుఁ జెనకితే వేసట వుట్టీని
కూరిమి గొసరితేను కుప్ప వడీఁ దరితీపు
యేరీతి నుండునో చిత్త మే మందునే

చ. 2: మొగము చూచితేను మునుకొనీ యాసలు
నగితేను పంతములు నాఁ టుకొనీని
తగిలి మాటాడితేనుఁ దాఁ కీని మర్మములు
యెగసక్కెములు నేర నే మందునే

చ. 3: వరుసతోఁ బెనఁగితే వంతులు వాసులు రేఁగీ
సరసము లాడితేను చల మెక్కీని
యిరవై శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నుఁగూడె
యెరవు లే దిద్దరికి నే మందునే

రేకు: 0445-1 శంకరాభరణం సం: 12-265

పల్లవి: ఇదెవో నా గుణము యింతకంటె నేమి సేతు
పదిలానఁ దాను నేరుపఁగ వచ్చె నాకునూ

చ. 1: చలము సాదించ నేర సరసుని తోడుత
చెలరేఁగి ప్రియములు చెప్ప నేర్తును
బలిమిఁ బెనఁగఁ జాలఁ బై కొంటేఁ జేతికి
చులుకఁగా మెలఁగి మెచ్చులు మెచ్చఁజాలుదు

చ. 2: బొమ్మల జంకించ నోప పూచి తన్ను నింతలోనె
సమ్మతించి వలపులు చల్ల నోపుదు
దొమ్మిసేయ నెఱుఁగను తొడరి తాఁ గూడితేను
వుమ్మగిలుఁ దమి నూరకుండ నెఱుఁగుదును

చ. 3: బీరమాడ నియ్యకొనఁ బ్రేమ శ్రీ వేంకటేశుఁడు
కోరి నన్నుఁ గూడె నియ్యకొనెఁ గాని
నేరము లెంచఁదా నిగిడి నన్ను మన్నించె
నేరుపులే సారె సారెనె నెంచెఁ గాని

రేకు: 0445-2 పాడి సం: 12-266

పల్లవి: వట్టి పరాకు సేయఁగ వచ్చే దేమి
యేట్టె నాఁ గూడక పోదు ఇఁక నేల మఱుఁగు

చ. 1: సెలవి నవ్విన నవ్వు సిగ్గుల వెన్నెల పువ్వు
పలుకుఁ దేనెల సోన బంగారు వాన
లలితాంగి నీకు నిదే లంచమిచ్చీ యెదుటను
యెలమిఁ జేకొనవయ్య ఇఁకనేల మఱుఁగు

చ. 2: తొంగి చూపుల మొక్కులు తుమ్మిదపిండు రెక్కలు
పొంగేటి చనుఁగొనలు పూఁప మొనలు
అంగన కానుక వట్టీ నదివో నీకు నేఁడు
ఇంగితాన నియ్యకొను ఇఁక నేల మఱుఁగు

చ. 3: గట్టి గోరిరేకలు కంతు ముద్రలేకలు
తొట్టి న యీకొఁగిలి రతుల లోఁగిలి
నెట్టన శ్రీ వేంకటేశ నెలఁత సూడిదె వట్టే
యిట్టే యేలవయ్య ఇఁక నేల మఱుఁగు

రేకు: 0445-3 బౌళి సం: 12-267

పల్లవి: యెట్టు సేసినాఁ జేయనీ ఇఁకఁ దన చిత్తము
ఇట్టి దని రమణుని కెటిఁ గించరే

చ. 1: ముచ్చటెంతైనాఁ దీరచు మోహము గల వారికి
మచ్చికతో సారె సారె మాట లాడినా
వచ్చిరాని పద్యములె నుండు నడియాస
కొచ్చి కొచ్చి యెంతేసి కొసరినాను

చ. 2: తని వేమిటాఁ బొందదు తమకించేవారికి
పెనఁగి పెనఁగి యెంత ప్రియపడినా
వినియు వినని మాట విధమై యుండుఁ దలఁపు
కనుఁ గొని యెదుటనే కాచుకుండినాను

చ. 3: తగు లెంతైనాఁ బాయదు తతిఁ గూడిన వారికి
నగి యెటువలె గోరు నాటించినాను
తగ శ్రీ వేంకటేశుఁడు తానే వచ్చి నన్నుఁగూడె
చిగురుఁ జేగై వుండు చిమ్మి రేఁచినానూ

రేకు: 0445-4 సింధురామక్రియ సం: 12-268

పల్లవి: యింకనైన రావే యిదే వచ్చె రమణుఁడు
మంకు లేకుండితేను నీ మగఁ డిట్టె మెచ్చును

చ. 1: సిగ్గుగలదానికి చెల్లును పంతము లెల్లా
యెగ్గుపట్టనిదానికి నెనయుఁ బొందు
వొగ్గి వినయపు దాని కొనగూడు వేడుకలు
వెగ్గళించక నా బుద్ధి వింటెఁ బతి మెచ్చునే

చ. 2: వోరిచివున్న దానికి నొద్దికొఁ జుట్టరికము
నేరిచిన దానికి నిండు సిరులు
మేరతో నవ్వేదానికి మిక్కుటమౌ రాజసము
యీరీతి నా బుద్ధి వింటే నీ విభుఁడు మెచ్చునే

చ. 3: గుట్టున నున్న దానికి గుణము లోఁజకు వచ్చు
దిట్టయైన దానికి తేఁకువ గల్గు
నెట్టన శ్రీ వేంకటనిలయుఁడు నిన్ను నేలె
యిట్టి నా బుద్ధి వింటే నీతఁడింకా మెచ్చునే

రేకు: 0445-5 రీతిగౌళ సం: 12-269

పల్లవి: చేరి పెనఁగఁగఁ బోతే చిత్త మెట్టుండునో
కోరి తను నింతేసి కొరఁగ నేలే

చ. 1: తగిలి నా తమకమే తనకు దయ పుట్టించీ
వెగటుగా విన్నవించ నేలే
మొగము చూచినా యాసె మోహము దనకు రేఁచీ
అగడుసేసి కొసరి యలయించ నేలే

చ. 2: కిందుపడి తనకు మొక్కే మొక్కె పలమిచ్చీ
చందముగాఁ దన్నిట్టే వేసరించ నేలే
కందువ నే నంపే కానుకలే తను రప్పించి
సందడించి సారె సారె చండిపెట్ట నేలే

చ. 3: కడు నేఁ జేసే వూడిగాలే తన కెచ్చరించి
బడి బడి దైన్యము చూప నిఁ క నేలే
చిడిముడిఁ దానె వచ్చి శ్రీ వేంకటేశుఁడు గూడె
గుడిగొన సంతోషిచుకొంటెఁ జెప్ప నేలే

రేకు: 0445-6 శ్రీరాగం సం: 12-270

పల్లవి: యిదెవో నా నోము ఫలమిఁక నే వెరపు లేదు
పదిఁ బద్దై యాసలు నాపైఁ దన కున్నవి

చ. 1: యెప్పుడూ మరుబాణా లెంత వాఁడియైనా నేమి
తప్పదుగా నామీఁద తన కరుణ
వొప్పుగఁ గోవిల లెంత వొరటుతో నుండినాను
చొప్పులుగాఁ దాఁజూచిన చూపులు నా కున్నవి

చ. 2: అల చందురుని వెన్నెలంత వెట్ట యైన నేమి
కలదుగా యీ చుట్టరికము తనది
చిలుకలు కొరకొరై చిమ్మి రేఁగఁ బలికినా
చెలరేఁగి తాఁ బెట్టిన సేసలే నా కున్నవి

చ. 3: మందానిలుఁడు యెంత మందటాడినా నేమి
అందరిలోఁ దన పొందు లబ్బెఁగా నాకు
యిందు శ్రీ వేంకటేశుఁడు యిట్టే తానన్నేలినాఁడు
చందాన నా రెచ్చినట్టి చనవు నా కున్నది

రేకు: 0446-1 రామక్రియ సం: 12-271

పల్లవి: ఆకెకు నీకుఁ దెలుసు నౌభళేశా
యేకతాననే యరసి యెఱుఁగుకో రాదా

చ. 1: యెదురుఁ గొండలెక్కి యేటి కొల కే మమ్మ
అదిగో సొలసి మాటలాడీ నిన్ను
పొదిగి పొదిగి యట్టే బొమ్మల జంకించు కొంటా
తుదలేని వేడుకలఁ దొంగి చూచీని

చ. 2: చల్లని మాకులనీడ సమదిష్టితో నీకు
వొల్లని ప్రియాలు చెప్పి వొరసీ నిన్ను
తెల్లమిగా సెలవులఁ దెగ నవ్వు నవ్వుకొంటా
పల్లదాన నీపైఁ బూబంతి వేసీని

చ. 3: మిక్కుటపుఁ దమకము మించఁగా నీ తొడ యెక్కి
గక్కునఁ జన్నుల నొత్తి కలసీ నీతో
తక్కక యహోబలానఁ దగ శ్రీ వేంకటాద్రిని
వొక్కటై నిన్నుఁ బెండ్లాడి వొద్దికె చూపీని

రేకు: 0446-2 నారాయణి సం: 12-272

పల్లవి: అరయ నాపెపై నీకు నట్లానె కాఁ బోలు
గరిమ మీ గుణములు కడుఁ గొత్తలయ్యా

చ. 1: మొగము చూచి చూచి మోహములు చల్లి చల్లి
చిగురు మోవితేనె చింది చింది
పగటున మాటలాడి పచ్చి దేరఁ దమకించీ
మగువ వేడుకలు యేమని చెప్పేమయ్యా

చ. 2: చేతులు చాఁచి చాఁచి సెలవుల నవ్వు నవ్వి
పోతరపు సరసాలు పూసి పూసి
రాతిరిఁ బగలుఁ బొంచి రతులకే యాసగించీ
యీ తరుణి కోరిక లెన్ని లేవయ్యా

చ. 3: చనుఁగవ నొత్తి యొత్తి జవ్వాది మెత్తి మెత్తి
పెనఁగి పెనఁగి సిగ్గు పెంచి పెంచి
యెనసెను శ్రీ వేంకటేశ నిన్ను నింతలోనే
వనిత చందము లివి వసమా నేఁడయ్యా

రేకు: 0446-3 తెలుఁగుఁగాంబోది సం: 12-273

పల్లవి: అతివ పాలి దేవుఁడ వన్నిటాను
నతులు సేసె నీకుఁ దగ మన్నించవయ్యా

చ. 1: జలజాక్షికి నీ పేరు జపియించే మంత్రము
తలఁపులో నీ రూపుఁ సంతత ధ్యానము
అలరి చెలి నీ వద్ది కంపినదే ఆ వాహనము
వొలసి యచ్చువాసిన వురమే నీ పీఠము

చ. 2: అంగపుఁ జిఱుఁ జెమట లర్ఘ్యపాద్యాచమనాలు
సంగతిఁ బెంజ మాటలె జలకములు
పొంగటఁ జల్లఁ గా మేనిపూఁత కుంకుమే గందము
చెంగటఁ గొప్పు విరులే సేసే పూజ నీకు

చ. 3: నీరజాక్షి మోవితేనె నీకు నారగింపులు
యీ రీతిఁ బుక్కిటి వీడె లిచ్చె బాగాలూ
కూరిమి శ్రీ వేంకటేశ కూడితి వీకె నింతలో
సారపు సమరతులే సకలోపచారాలూ

రేకు: 0446-4 గుజ్జరి సం: 12-274

పల్లవి: యే మని విన్నవించేనే యిఁకఁ దనకు
చేముంచి తానే దయసేసెఁ గాకా

చ. 1: చెప్పరాని సుద్దులకు సేయరాని చేఁతలకు
వొప్పి తన కొడఁబడి వున్నదాన నేను
కుప్పలైన యాసలకు గుఱిలేని కోరికెకు
తప్పక గుఱి యైతిని తనకుఁ గా నేనూ

చ. 2: నెట్టు కొన్న మొక్కులకు నిండుకొన్న ప్రియాలకు
వొట్టు కొని కాచుక వున్నదాన నేను
కట్టిన కంకణానకు కడుఁ జుట్టరికేనకు
యిట్టే పాలుపడి తన కిర వైతిని

చ. 3: వీడరాని పొందులకు వేడుక కూటములకు
వోడక తన యెదుట నున్నదాన నేను
యీడనే శ్రీ వేంకటేశుఁడింతలోఁ దా నన్ను నేలె
తోడునీడ వలె నిట్టే దొరసితి నేను

రేకు: 0446-5 దేవగాంధారి సం: 12-275

పల్లవి: యెక్కడ పరాకు నీకు నెందు చూచేవు
పిక్కటిల్లే వలపుల ప్రియ మిట్టి దయ్యా

చ. 1: కుప్పలుఁ దెప్పలు నైన కోరికలు మదిలోన
వుప్పతిల్లుఁ జెమటలు వొళ్ళిమీఁ దను
దప్పి దేరే మాటల తరితీపు మోవిమీఁద
కప్పి వున్నది చెలికిఁ గనుఁ గొనవయ్యా

చ. 2: తనివోని తలఁపుల తమి జవ్వనముమీఁద
వినియేటి వేడుకలు వీనులమీఁద
ననిచిన పొందుల నవ్వు సెలవుల మీఁద
గనమాయ నిదెవో కనుఁ గొనవయ్యా

చ. 3: చిమ్మిరేఁ గే యటువంటి సిగ్గులు చన్నులమీఁద
కమ్ముకొన్న యడియాస కౌఁగిటిమీఁద
యిమ్ముల శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
కమ్మర మన్నించి యింకాఁ గనుఁ గొనవయ్యా

రేకు: 0446-6 భైరవి సం: 12-276

పల్లవి: యెగ్గు పట్టేవు సుమ్మీ యెఱుఁగ నేను
సిగ్గులు నీ వంటితేను చేతఁ జెనకుదును

చ. 1: నీ విచ్చిన చనవున నీ చిత్త మెఱుఁగక
వే వేగ రావైతి వని వేగిరింతును
దేవులనై యుండిన మందెమేళాన నూరకే
పూవుల నీవు వేసితే బొమ్మల జంకింతునూ

చ. 2: నాకు నీవు గల వని నమ్మిన గర్వమునను
పైకొని నిన్ను నేను గుబ్బల నొత్తుదు
రాకపోకల నీవు సరసమాడే వేడుకను
యేకాంతాలు చెవిలోన నేమైనా నాడుదును

చ. 3: నాతో నీవు సారె సారె నవ్వే వనే మదమున
రాతిరిఁ బగలు నీతో రతి సేతును
యీతల శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
పోతరించి రాకొట్టఁ బొగడుదునూ

రేకు: 0447-1 భూపాళం సం: 12-277

పల్లవి: యెఱుఁగఁడా తా నేమైనా యేల నన్ను జరసీని
మెఱసే తనగుణాలు మెచ్చుకొందుఁ గాకా

చ. 1: నగితే మారుకు మారు నగవచ్చునా తనతో
మొగము చూచి యట్టే మొక్కుదుఁగాకా
మగఁడు తా గో రూఁదితే మరి నేఁ జెనకుదునా
జిగి మీఱ సమ్మతించి సిగ్గున నుందుఁగాకా

చ. 2: యెనసి తా మాటాడితే యెదురు మాటాడుదునా
వొనర వీనుల విని వూఁకొందుఁ గాకా
చెనకి పూబంతి వేసితేఁ దప్పించు కొందునా
అనుమానించక చేత నందుకొందుఁ గాకా

చ. 3: ధరఁ దాఁ జెక్కు నొక్కితే తన చెక్కు నొక్కుదునె
వొరసి అందుకుఁ బాదా లొత్తుదుఁ గాకా
యిరవై శ్రీ వేంకటేశుఁడింతలోఁ దా నన్నుఁగూడె
గరువము చూపుదునా కౌఁగిలింతుఁ గాకా

రేకు: 0447-2 నారాయణి సం: 12-278

పల్లవి: యేఁటి కయ్యా నీవు మాతో యేలాటా లాడేవు
నాఁటకపుదాననా నవ్వేదానఁ గాకా

చ. 1: సారె నీతో బెనఁగ సరిదాననా
మేరలు మీఱఁగ నంత మేనదాననా
దూరి మాటలాడ బిరుదుల దాననా
యేరీతిఁ జేసినను నీ యిచ్చలోదానఁ గాకా

చ. 2: నిక్కి నిక్కి నిన్నుఁ జూడ నీటుదాననా
తొక్కి పాదాలఁ బెనచ దొడ్డదాననా
చిక్కి మో వెడుగ నప్పిచ్చినదాననా
మక్కువ నీ వేలితే సమ్మతించేదానఁ గాకా

చ. 3: తగవులఁ బెట్ట నేఁ బంతపుదాననా
తగిలి చేయి వట్టఁగ దంటదాననా
నిగిడి శ్రీ వేంకటేశ నీవే నన్నుఁగూడితివి
మిగులా నీ మన్ననల మెఱసేదానఁ గాకా

రేకు: 0447-3 వరాళి సం: 12-279

పల్లవి: విన్నవించరే యీ మాట విభునికిఁ జెలులాల
పన్ని తనతో నేను పంతము చూపితినా

చ. 1: చెలఁగి తన కురులు చిక్కులు దీసితిఁ గాక
బలిమి సేసి శిరసు పట్టితినా
వెలయఁ జక్కని తన్ను వేడుకఁ జూచితిఁ గాక
కలికి కన్నుల నిట్టే కడు జంకించితినా

చ. 2: గట్టిగా ముంజేతఁ గంకణము గట్టితిఁ గాక
దిట్టనై తన చేయి వట్టి తీసితినా
గుట్టు తోడ తనకు నేఁ గొలువు సేసితిఁ గాక
అట్టే తన్నుఁ బోకుండా నాఁగితినా

చ. 3: సరుగఁ దన్నుఁ గౌఁగిటఁ జన్నుల నొ త్తితిఁ గాక
బిరుదులు చూపి మోపి పెనఁగితినా
యిరవై శ్రీ వేంకటేశుఁ డిన్నిఁటా నన్ను నేలె
సరి మెచ్చితిఁ గాక యాసలఁ గొసరితినా

రేకు: 0447-4 కాంబోది సం: 12-280

పల్లవి: యేమి చెప్పేమయ్యా నీతో నింతి సుద్దులూ
కామించె నిన్ను నీకెఁ గరుణించవయ్యా

చ. 1: పడఁతి నిన్నుఁ దలఁచి బయలు గౌఁగిట నించు
బడి బడి నీ సుద్దులు భావించును
అడియాలములు చూచి ఆనందమున మించు
వుడివోని కోరికెల నుమ్మగిలును

చ. 2: తక్కక నిన్నుఁ బేర్కొని తనలోనె సిగ్గువడు
చిక్కి నీ మాటాలకించి చెమరించును
మిక్కిలి నీ గుణాలకు మెచ్చి మెచ్చి లోలో నవ్వు
వొక్కటై నీ మోవితేనె కూరకె యాకారును

చ. 3: సమరతు లూహించి సరసపు మాట లాడు
కొమరు నీ రూపు వ్రాసి గోర గీరును
తమి తో శ్రీ వేంకటేశ తగ నీ విట్టే వచ్చి
రమణిఁ గూడితివి యీ రతులే తలఁచును

రేకు: 0447-5 భైరవి సం: 12-281

పల్లవి: యిప్పుడు వచ్చితివి మా యింటికి నీవు
దప్పి దేరె నా పయి దయ దలఁచఁగ వలదా

చ. 1: తలపోఁ తలనుఁ జిక్కి తగ వెదకుదు నిన్ను
లలి నిన్నుఁ జూచేనంటా లాచి కోరుదునూ
అలమె నంటా లోలో నాసలఁ బొరలుదును
యెలమి నీ వయితేను యెక్కడ నుందువయ్యా

చ. 2: మంతనాన నుండి తమకింతు నీ రాకకు
బంతికూటివేళ నీకు వార మిత్తును
కాంతల నీ వద్ది కంపి కాచు కుండుదు వేళలు
యింత నే మోహించితి నీ వెక్కడ నుందువయ్యా

చ. 3: సరసము లాడే నంటా సారెకు వేడుక సేతు
సరుగ నీ రతు లెంచి సంతోసింతును
యిరవై శ్రీ వేంకటేశ యింతలో నన్నేలితివి
యెరవు లే దిద్దరికి నెక్కడ నుందువయ్యా

రేకు: 0447-6 దేసాళం సం: 12-282

పల్లవి: నీ చిత్తము వచ్చితిని నేఁ జేసినదే భాగ్యమో
చే చేత నీవు నన్నుఁ జెక్కులు నొక్కేవు

చ. 1: పలుకుఁదేనెల వారు బంతి భోజనాలవారు
చెలిమి కత్తెలు నీకు సేనా సేన
యెలమి నీ కెందులోను యెవ్వతెఁ బోలుదు నేను
కలికి నంటా నన్నుఁ గడుఁ బొగడేవు

చ. 2: దగ్గరఁ గూచుండేవారు తమితోఁ జెనకేవారు
సిగ్గులు వడేవారు సేనాసేన
వొగ్గి నీకు సేవ సేసి వొడఁబడ నెంతదాన
తగ్గులేని గుణములదాన నంటా మెచ్చేవు

చ. 3: మఱుఁగున నుండేవారు మంతన మాడేవారు
చిఱునవ్వు నవ్వేవారు సేనాసేన
నెఱి నీ దేవుళ్ళలోను నే నేమి నేరుతును
గుఱిగా శ్రీ వేంకటేశ కూడి గారవించేవు

రేకు: 0448-1 మాళవశ్రీ సం: 12-283

పల్లవి: చెప్పితి మిప్పుడే ఆకె సిగ్గువడును
యెప్పుడు నేర్పరి వౌదు విన్నిటాను నీవూ

చ. 1: చక్కఁ గా మగువపై సేసలు చల్లుదువు గాని
చెక్కు నొక్కేవు సుమ్మీ సిగ్గువడును
పిక్కటిల్లు చన్నుల పెండ్లికూఁతురు యీకె
కక్కసించేవు సుమ్మీ కడుఁ బువ్వువంటిది

చ. 2: కాతరించక రమణిఁ గాలు దొక్కుదువు గాని
చేతులు వట్టే వు సుమ్మీ సిగ్గువడును
నీ తరుణి బారెఁ డేసి నెరుల కొప్పుది యీకె
గాత చూపేవు సుమ్మీ బంగారు బొమ్మవంటిది

చ. 3: యెలమి శ్రీ వేంకటేశ యింతి నేలుదువు గాని
సెలవి నవ్వేవు సుమ్మీ సిగ్గు వడును
మొలనూళ్ళ బంగారు గంటల పిఱుఁదుల దీకె
అలయించేవు సుమ్మీ తలిరాకు వంటిది

రేకు: 0448-2 కురంజి సం: 12-284

పల్లవి: ఆఁటదై పుట్టి నందు కటువలెఁ గాకుండితే
యేఁ టి జన్మమయ్యా మమ్ము నేలుకొన వలదా

చ. 1: పానుపుపైఁ గూచుండి నీ పాదములు చేత నొత్తి
ఆనించి గుబ్బల మీఁద నందుకొంటాను
నానుపుఁ జెమట నీపై ననుపునఁ జిందుకొంటా
కానుకగా మోవి యిచ్చి కరఁగఁగ వలదా

చ. 2: కొనగోర నీ కురులు కూడగీరి దువ్వి దువ్వి
చెనకి చెక్కునఁ జెక్కు చేర్చుకొంటాను
పెనఁగి నీ బుజాలపై ప్రియానఁ జేతులు వేసి
తనివార మోము చూచి దైవార వలదా

చ. 3: వొయ్యనే కొఁగిట నించి వొత్తగిలి పక్కనుండి
తియ్యని నీ మోవితేనె దీసుకొంటాను
ఇయ్యెడ శ్రీ వేంకటేశ ఇదే నీ దేవుల నైతి
పయ్యదఁ గప్పి ఇట్టే తెప్పలఁ దేలవలదా

రేకు: 0448-3 గౌళ సం: 12-285

పల్లవి: యిదివో నీ కతానసే యింత లాయను
యెదురు చూచే యాస లేమి చెప్పేమయ్యా

చ. 1: జవ్వన ముప్పతిల్లి సతి చనుఁగవ యాయ
నివ్వటిల్లుఁ గోరికలే నేరు లాయను
వువ్విళ్ళూరి మోహరస మూరేటి చెమట లాయ
యివ్వల నీకీ సింగారా లేమి చెప్పేమయ్యా

చ. 2: తరితీపు లింతికి గుత్తపు మోవితేనె లాయ
గరిమనింపులు మోముకళ లాయను
సురతపుఁదమకము చూడఁ జూడఁ గొత్తలాయ
యిరవైన గురుతులు యేమి చెప్పేమయ్యా

చ. 3: కూటముల నిబ్బరము కొనగోరే వాండ్లాయ
సూటితో నడియాసలు చూపు లాయను
యీటుతో శ్రీ వేంకటేశ యీకె నిట్టే కూడితివి
యేటవెట్టే యీలాగు లేమి చెప్పేమయ్యా

రేకు: 0448-4 నాగగాంధారి సం: 12-286

పల్లవి: చెలియ భావము చూడఁ జెప్పఁ గొత్తలు
యెలమి నీ వేలవయ్య యెంత పొగడేము

చ. 1: నిండిన తమక మెల్లా నిలువునఁ దొట్టఁగాను
దండి తరితీపులు తమి రేఁచఁగా
కొండల వంటి చన్నులు కొనసాగి పెరుగఁగా
మెండగు వయసు నీకు మీఁదెత్తు కున్నది

చ. 2: తలపోఁతలు మదిలోఁ దడఁబడుచుండఁ గాను
చెలపచెమటలు పైఁ జిప్పిలఁ గాను
కలికి చూపుల కాంక్ష కడు సందడించఁగాను
వలపు నీకుఁ గాను కవడిఁ బట్టుకున్నది

చ. 3: కోటానఁ గోటి కోర్కులు కుప్పలుగఁ బడఁగాను
మాటలు పెదవులపై మల్లాడఁగాను
నీటున శ్రీ వేంకటేశ నీ వేలితి వింతలోన
కూటపు రతులు నీకు గుఱిసేసుకున్నది

రేకు: 0448-5 కుంతలవరాళి సం: 12-287

పల్లవి: యెంతని చెప్పే నేను యేమని వినేరు మీరు
సంతతము దైలువారిచల్లువెద (?) లాడీనే

చ. 1: మనసునఁ దాగే పాలు మరి లెక్కవెట్ట నేల
గొనకొని గుక్కిళ్ళు కొలవ నేల
నినుపులై యీతనికి నే వలచిన వలపు
యెనలేక చెలులాల యేల నన్నడిగేరే

చ. 2: సెలవి నవ్విన నవ్వు చేటఁ డేమి గంపెఁ డేమి
పలుకు లెన్నేయ నేమి పదర నేమి
పలుమారు నాతని పైఁ బెట్టిన యాసలు
కొలచి కొలచి యెంత గుట్టు దెలిసేరే

చ. 3: వేడుకై నరతులకు వెలలు చెప్పఁగరాదు
వాడిక మోవితేనె వడ్డించరాదు
యీడనె శ్రీ వేంకటేశుఁ డింత సేసె నన్నుఁగూడి
యీడువెట్టి మిమ్మిందరి నేలితేనే మెచ్చేరే

రేకు: 0448-6 నాదరామక్రియ సం: 12-288

పల్లవి: తగులాయఁ బొందులు తనకూ నాకూ
తగు నిద్దరి కనవే తలపోయ నెపుడూ

చ. 1: శిరసు వంచితి నెంతే సిగ్గులు రేఁగఁ గాను
గరువముగా దనవే కాంతునితోను
విరుల వేసితి నెంతే వేడుకలు గాఁగాను
విరసము లే దనవే వే వేలకు నేఁ డూ

చ. 2: యింతలో నవ్వితే నెంతే యిచ్చకము గాఁగాను
పంతము గా దనవే పలుమారును
సంతోసించుకొంటి నెంతే చవిగా మాటాడఁగాను
రంతుసేయ ననవే రవ్వగా నేనూ

చ. 3: కలసితి నెంతే రతిఁ గౌగిలించుకొనఁ గాను
అలయించ ననవే అంకెలఁ దన్ను
యెలమి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
సొలయ ననవే తానే సొంపుగా నన్నేలెనూ

రేకు: 0449-1 శుద్ధవసంతం సం: 12-289

పల్లవి: వూరకే దక్కుదువా వువిదలకు
యీరీతి నీ సేవ సేసే నేఁటికి వద్దనేవూ

చ. 1: పెదవులు మోపి నీకుఁ బ్రియములు చెప్పవలె
చెదర కిచ్చకములు సేయఁ గవలె
కదలుఁ గన్నుల నిట్టే కాంక్షతోడఁ జూడవలె
వదలుఁ బయ్యెద జార వంగి మొక్కవలెను

చ. 2: నీ వేమి చెప్పినాను నెట్టు కొని వినవలె
భావించి నీ మాట కొడఁ బడవలెను
కైవసమై వీడె మిచ్చి కౌఁగిట నించఁగవలె
వే వేలకుఁ జెక్కు నొక్కి వేఁడుకొనవలెను

చ. 3: సరసములాడితేను సమ్మతించి నవ్వవలె
ఇరవై రతిఁ గూడితే నెనయవలె
అరుదై శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
మరిగించితి విట్లా మతిఁ జొక్కవలెనూ

రేకు: 0449-2 శోకవరాళి సం: 12-290

పల్లవి: యిదివో కామిని భావ మెఱిఁగించ వచ్చితిమి
వుదుటు మనోరథాల నోలలాడుచున్నది

చ. 1: నిన్నుఁ బాసి విరహాన నీ తోడి కూటములు
తన్నుఁ దానె తలపోసి తని వందును
సన్నిధి గల్పించుకొని సారె సారె మాటలాడు
వున్నతపు కొనగోరు వూరకే వూఁదును

చ. 2: మట్టు మీఱఁ జన్నులు మలగుతో నదుమును
వొట్టు పెట్టి పోకు మను నూరకే నవ్వు
తిట్టులు భావించుకొను దీకొని సరసమాడు
బట్టబయలు కౌఁగిటఁ బట్టు వేఁడుకొనును

చ. 3: పానుపుపై నిన్నుఁగూడ భావించుఁ జెమరించు
పూనినట్టి భోగములఁ బొద్దు వుచ్చును
ఆనుక శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
యీ నెలవుననే వచ్చి యింతలోఁ గూడితివి

రేకు: 0449-3 పాడి సం: 12-291

పల్లవి: యెంచుకొంటే నిన్ను నన్ను నెంత కెంత
పంచ బాణుని బలము పంగెనల వారము

చ. 1: మన సియ్య నేరుతువు మరిగించ నేరుతువు
నినుపులుగాఁ గృప నించ నేర్తువు
వినయాన నేము సేసే విన్నపము లే మున్నవి
తనివోని కోరికలఁ దగిలేటి వారము

చ. 2: తమి రేఁచాఁ గలవు తమకించాఁ గలవు
అమరఁగఁ జనవు లియ్యఁగఁ గలవు
ప్రమదాన నేము నీకు బత్తి సే సే దేమున్నది
కొమరెపాయముతోడఁ గొసరేటివారమూ

చ. 3: వొడివట్ట నోపుదు వొనగూడా నోపుదువు
కడు శ్రీ వేంకటేశ చొక్క నోపుదువూ
అడరి యలమేల్మంగ కాపె పంత మేమున్నది
యెడయక నీ సేవకు నిరవైనవారమూ

రేకు: 0449-4 గంభీరనాట సం: 12-292

పల్లవి: యేమయ్య నీకు నాకు నెంత కెంత అంతరము
ఆముకొని నాకుఁ బ్రియము చెప్పేవయ్యా

చ. 1: యెట్టు సేసినా నిన్ను నెగ్గు లెంచేదాననా
బట్టబయ లేల వొడఁ బరచేవయ్యా
పట్టి పెనఁగఁగా నేను పంతమున బిగిసేనా
వెట్టికి నీ వెంతేసి వేఁడుకొనేవయ్యా

చ. 2: చిత్తగించు మెప్పుడూ నీ చేతిలోనిదానను
బత్తి సేసీ నన్ను నెంత పై కొనేవయ్యా
యెత్తలఁ జూచినాను ఇచ్చకురాల నీకు
పొత్తుల మాఁటల నెంత పొదిగేవయ్యా

చ. 3: యేపనులు చెప్పినాను ఇయ్యకొనేదాన నీకు
చేపట్టి సన్నలు యేమి సేసేవయ్య
రాపుల శ్రీ వేంకటేశ రతి నలమేల్మంగను
నా పాలి వాఁడవు నిన్ను నమ్మితినయ్యా

రేకు: 0449-5 అమరసింధు సం: 12-293

పల్లవి: యేమి సేతు నా తమక మిటువలె నున్నది
నేమము లెల్లా నాకు నీ కొరకే కాదా

చ. 1: వేమారు నీవు రావని వేసరించి దూరే దెల్లా
కామించి నీ పై బత్తినే కాదా నేను
ఆముకొని బొమ్మలను అట్టే మరి జంకించేది
దోమటి నీ తోడి పొందు కొరకు కాదా

చ. 2: కొనచూపులను నిన్ను గుంపంచి చూచే దెల్లా
అనిశము నీతోఁ బాయలేకే కాదా
మనసు మర్మాలు సోఁక మాటలు నిన్నాడే దెల్లా
తనివోని కోరికల దైవారుటాఁ గాదా

చ. 3: పచ్చిగా నిన్నుఁ జెనకి పంతములు చూపే దెల్లా
కొచ్చి కొచ్చి నిన్నుఁ గూడె కొరకే కాదా
యిచ్చట శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
మెచ్చి నన్నేలితివి యీమేలుకే కాదా

రేకు: 0449-6 కేదారగౌళ సం: 12-294

పల్లవి: యేప్పుడూ నన్నింతటాను యీడేర్చ నే భారము
చెప్పినట్టల్లా నీవే సేసేవు గాకా

చ. 1: వేడుకతో నే నెంత వేగిరించినా నేమి
వాడికతో మన్నించవలెఁ గా నీవూ
వాడి యెఱిఁగిన నిన్నుఁ బైకొని కొసర నేమి
జాడ తోడ నీవే నాకు చన విచ్చేవు గాకా

చ. 2: ఆసపడి నీ పాదాల కటు నే మొక్కిన నేమి
వాసితో నా దిక్కు చూడవలెఁగా నీవూ
సేస వెట్టితివి నిన్నుఁ జెక్కు నొక్క నిఁక నేమి
బాస దప్ప కిట్టే నన్నుఁ బాలించేవు గాకా

చ. 3: యెదురుగా వచ్చి నిన్ను నింటికిఁ దెచ్చితే నేమి
వదలక ఆదరించవలెఁగా నీవూ
యిదివో శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
పొదిగి కూడితి విట్టే భోగించేవు గాకా

రేకు: 0450-1 బలహంస సం: 12-295

పల్లవి: వనితలకుఁ బతికి వలుపే కీలు
ననుపు గలిగితేను నానుఁ బ్రియములూ

చ. 1: చిత్తము వచ్చిన చోట సేవ లెల్లా నీడేరు
అత్తుగ డయితే మాట లనువు లౌను
పొత్తులు గలసితేను బోజనాలు రుచులౌను
బత్తి గలిగితేను యే పనులైనా నౌను

చ. 2: చెలిమి సేసినచోట చెలఁగు మంచితనాలు
తలఁపు గలిగితేను తమి రేఁగును
బలిమిఁ బొగడితేను భావములు గరఁగును
నెలవై పాయకుండితే నిలుచు మచ్చికలూ

చ. 3: కందువ గలుగు చోట కాఁపురాలు వేడుకలౌ
చందముగాఁ బెనఁగితే సరసమౌను
యిందునే శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
పొందితివి నన్ను నిట్టే పొఁసగు మన్ననలూ

రేకు: 0450-2 ఆహిరి సం: 12-296

పల్లవి: యేమని పొగడుదునే యిటువంటి నావిభుని
యీ మేలు నే మఱవను యేప్పుడూ ననవే

చ. 1: యెంత పరాకై వుండినా నెదుటికి నే వచ్చితే
సంతోసాన మోము చూచి చనవిచ్చునే
వింతలుగా నిద్రించేవేళ నేఁ బాదా లొత్తితే
అంతలోనే లేచి నన్ను నాదరించునే

చ. 2: యే పొద్దు నే వచ్చినాను యెదురుకొని లాలించి
చేపట్టి కౌఁగిలించి సేద దేర్చునే
చాపలాన సిగ్గుతోనె సముకాన నుండినాను
చాఁపునే చేతులు నా చన్నుల మీఁదటనే

చ. 3: యెచ్చి రాజసానఁ దాను యేకతాన నుండినాను
మచ్చిక నాతో నవ్వి మన్నించునే
ఇచ్చట శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
ఇచ్చగించి నన్ను నేలె యెన్నఁడునుఁ బాయఁడే

రేకు: 0450-3 బౌళి సం: 12-297

పల్లవి: కొచ్చి నేఁ బైకొనే నంటే గోలదానను
యెచ్చిన నా వలుపే ఇంత సేసే నన్నును

చ. 1: నీ మొగము చూచితేను నీ సుద్దులు దలఁపౌను
చే ముట్టితే పులకలు చిమ్మి రేఁగును
కామించి వద్ద నుండితే కళలు దైవారును
యేమి సేతు నా వలపు లింత సేసే నన్నును

చ. 2: విన్నపము సేసేనంటే వెస నిండీ సిగ్గులు
పన్ని వేఁడఁబోతే ముంచీఁ బరవసము
సన్నలు సేసేనంటే జలజలఁ జెమరించీ
యెన్నరాని నా వలపు వింత సేసే నన్నును

చ. 3: సరసము లాడేనంటే సంతోము లెల్లఁ దొట్టీ
అరుదుగా నవ్వేనంటే నాసలు పుట్టీ
యెరవు లేని శ్రీ వేంకటేశ యలమేల్మంగను
యిరవైతి నా వలపు లింత సేసే నన్నునూ

రేకు: 0450-4 పూర్వగౌళ సం: 12-298

పల్లవి: యింకా నేల పరాకులు యింకా నేల సిగ్గులు
సంకెలన్నియునుఁ దీరె చన వియ్యవయ్యా

చ. 1: మూసిన ముత్తెము వలె ముంగిట నిలుచున్నదీ
ఆసపడ్డ చెలితో మాటాడవయ్యా
సూసకము గట్టుకొని చూచీ నీ మొగమే
సేస ముత్యాల తోడఁ జిత్తగించవయ్యా

చ. 2: సెలవి నవ్వుల తోడ శిరసు వంచుకున్నదీ
చెలరేఁగి కొనగోరఁ జెనకవయ్యా
కలయికలకు నీ కొలువులు సేసీని
లలిఁ జెక్కు నొక్కి యిట్టే లాలించవయ్యా

చ. 3: మచ్చిక నీ కౌఁ గిటికి మనసు పెట్టు కున్నది
కుచ్చి కుచ్చి కౌఁగిటఁ గూడవయ్యా
యిచ్చట శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
యిచ్చల నేలీతి విట్టే యీడేర్చవయ్యా

రేకు: 0450-5 సామంతం సం: 12-299

పల్లవి: అవధారు చిత్తగించు మంగన ప్రాణేశుఁడవు
యివల నీ కింతలోనే యెక్కడ పరాకు

చ. 1: సొలపు నిట్టూర్పుల సోబానఁ బాడీఁ జెలి
పలుకులఁ గప్పురాలు పచారించీని
వలపుల చెమటల వసంతము చల్లీని
నిలువుఁ గొలుపులను నెయ్యము నించీని

చ. 2: పగటుఁ జూపుల రాయబారుల నంపీని
చిగురుఁ జేతి మొక్కుల చిమ్మి రేఁచీని
నగవుల సరసాల నారువోసీఁ దమకము
జిగిఁ బులక ముత్తేల సేసలు వెట్టీని

చ. 3: కరగింపుఁ జెనకుల కానుకలు చేతికిచ్చి
తొరలింపు మోవుల విందులు వెట్టీని
యిరవై శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
సిరుల నీవు గూడఁగాఁ జెలఁగి మెచ్చీని

రేకు: 0450-6 శంకరాభరణం సం: 12-300

పల్లవి: యిద్దరి భావాలుఁ గంటి మిదెవో నేము
వొద్దికతోఁ జెమరించె నొరపై నీ మేనను

చ. 1: చెక్కులఁ జెమట గారీ సిగ్గులు మోమునఁ దేరీ
చొక్కపు చెలియ మోము చూడవయ్యా
మక్కువ నీపై నున్నది మహిమ లెల్లా గన్నదీ
మక్కళించి మాటలాడీ మన్నించు మిపుడు

చ. 2: చింతతోఁ గ్రుమ్మడివీడీ చిగురుమోవి వాడీ
యింతికేఁ జనవు లెల్లా నియ్యవయ్యా
సంతోసాలు మేన నుబ్బె సరసము లెల్లా నబ్బె
పొంత కిట్టే చేరి తముల మిడవయ్యా

చ. 3: గుబ్బలఁ గుంకుమ రాలీ కోరిక నీపై వాలీ
జొబ్బిలఁ గూడితి విట్టే చొక్కవయ్యా
అబ్బురపు శ్రీ వేంకటాధిప అలమేల్మంగ
నుబ్బున నేలితి వింకా నొనగూడవయ్యా

రేకు: 0461-1 కుంతలవరాళి సం: 12-301

పల్లవి: యిన్నాళ్ళు నెఱుఁ గైతి మిద్దరి మీ పొందులు
సన్నలాను చాయలాను సరి గానుపించీని

చ. 1: ఇచ్చిన చన వెట్టి దో యీపెకు నీవు నేఁడు
పచ్చి దేర నవ్వు నవ్వి పచారించీని
కచ్చు పెట్టేప్పట నుండి కాచుకున్నదో నీకు
యిచ్చలఁ దన తమక మిప్పుడే చూపీని

చ. 2: పలుమారు మీలో నొడఁ బాట్లవి యెట్టి వో
మలసి యీకె నీతో మాటలాడీని
వెలలేని వలపుల వేడుక లింకా నెన్నో
కలువ పూవుల వేసి కాంతాళించీని

చ. 3: తనివోని యాసోదము తన కెంత గద్దో కాని
చనుఁ గవఁ బెనగుతా సాము సేసీని
ననుఁ గూడితి వింతలో నమ్మించి శ్రీవేంకటేశ
నను పెంతో తాను గోరు నాఁ టించీని పైని

రేకు: 0461-2 రీతిగౌళ సం: 12-302

పల్లవి: యేల మమ్ము రేఁచేవు యేమనవచ్చును నిన్ను
యేలుకొందువు గాని యా యింటికి రావయ్యా

చ. 1: వాకుచ్చి నీతో నేను వక్కణగా మాటాడఁగా
నీకు దేవులై నవారు ని న్నేమందురో
మేకులకు నీతో నేను మేలములాడఁ గాను
కాకరి తనాల నవ్వి కమ్మటి సాదింతురో

చ. 2: చేతులు చాఁచి నీకు సేవలు నేఁ జేయఁగాను
నీ తగులు గలవారు ని న్నేమందురో
కాతరించి నీ మొగమే కనుపెట్టి చూడఁగాను
యేతులకు జంకించి యెంత అట్టు సేతురో

చ. 3: గట్టి నా చన్నుల నొత్తి కౌఁగిట బిగించఁగాను
నెట్టన నీ యింటివారు నిన్నేమందురో
ఇట్టే శ్రీ వేంకటేశ యేలితివి నన్నింతలో
దిట్టతనముల వారెంతేసి చెనకుదురో

రేకు: 0461-3 ఆరభి సం: 12-303

పల్లవి: నీకు నింపైన వారినే వేము పొగడేముగాక
పై కొలిపిన వలపు పనికి వచ్చీనా

చ. 1: మనసు వచ్చినవారే మంచి గుణములవారు
కనుపట్టినవారే చక్కని వారలు
యెనయని వనితల నెందరి నీకుఁ జెప్పినా
పెనఁగులాటే కాక ప్రియ మయ్యీనా

చ. 2: నీవు సరసమాడిన నెలఁతలే జాణలు
కావలసినవారే నిక్కపు జుట్టా లు
వే వేల నెందరి నెంత వేడుకకుఁ జూపినాను
దావతి పడుటే కాక తమి పుట్టీ నా

చ. 3: యిట్టే నీ మన్నన గల యింతులే భాగ్యవతులు
పట్టి నీ వేలినవారే బలవంతులు
నెట్టన శ్రీ వేంకటేశ నేఁ డు నన్నుఁ గూడితివి
కట్టఁ గడ వా రెరవే కాక యితవయ్యీనా

రేకు: 0461-4 భూపాళం సం: 12-304

పల్లవి: యెట్టు మఱవఁగ వచ్చు నిటువంటి నీ గుణాలు
చుట్టరికమే మాకు చొక్కపు నిధానము

చ. 1: యెనసిన రమణుఁడు యింపుతోడ నొసగిన
చనవే సామ్రాజ్యము సతులకును
తనివోక సారె సారెఁ దమి తోడఁ జూచేటి
కనుచూపులే నిత్యకల్యాణములు

చ. 2: మొగ మెత్తి నాయకుఁడు మోహముతోఁ జల్లేటి
నగవె కోటి లాభము నాతులకును
చిగిరించే యాసతోడ చేసన్న చెనకులు
నిగిడించే సరసము నిండుకొన్న సంపదా

చ. 3: పాటించి విభుఁడు తానే పై కొని కౌఁగిలించే
కూటమే నోము ఫలము కొమ్మలకును
యీటుతో శ్రీ వేంకటేశ యిట్టే నన్ను నేలితివి
చాటువైన యీ రతులే కల భోగములూ

రేకు: 0461-5 శుద్ధదేశి సం: 12-305

పల్లవి: మా మాట నమ్మదు నీ మతకానకు లోనంటా
చేముట్టి బుజ్జగించి చెక్కునొక్కవయ్యా

చ. 1: మంతనాన నీ వాపెతో మాటలాడిన మాటా
యింతలో నెవ్వరు చెప్పి రీకెకు నేఁడు
చింతించి యందుకుఁ గాను చెక్కు చేతితో నున్నది
సంతోసపడ నాన లిచ్చుటఁ బెట్టు కోవయ్యా

చ. 2: కుప్పళించి నీ వాకెఁ గూడిన దంతపుటిల్లు
యిప్పుడే యెవ్వరు చెప్పి రీపెకు నేఁడు
చెప్పరాని కాంత తోడ సిబ్బితి పడినందుకు
తప్పు దీర ముందరికేఁ దడవ ననవయ్యా

చ. 3: ఆపె చేతి వుంగరము అట్టే నీ వేల నుండఁ గా
యేపున నెవ్వ రిచ్చిరి యీపెకు నేఁ డు
యీ పొద్దు నీవు గూడఁగ నిచ్చకముతో నున్నది
చేపట్టి శ్రీ వేంకటేశ సేదలు దీర్చవయ్యా

రేకు: 0461-6 గుజ్జరి సం: 12-306

పల్లవి: రావే వో చెలియా రఱునివద్దకి
యీవల నితని నేమీ నెగ్గు లెంచఁ దగదు

చ. 1: యెంచరాని మచ్చరము లెన్నెన్ని గలిగినాను
మంచి మాట లాడితేనే మతి గరఁగు
పంచబాణు శరములు పై కొని యెంత వచ్చినా
అంచలఁ గూడుకొంటేను అంటవు విరహులా

చ. 2: చేయరాని చేఁత లేమి సేసినవి గలిగినా
చాయలకు నవ్వితేనే చవి పుట్టును
పాయక చంద్రకళ లేపాటి వేఁడి చూపినాను
చేయారఁ గూడితే నేమీఁ జేయవు విరహులా

చ. 3: తనివోని తమకము తగ నెంతఁ గలిగినా
పెనఁగినంతటి మీఁదఁ బ్రియము లౌను
మును కోవిల కూఁ తలు ముంచినా శ్రీ వేంకటేశుఁ
డెనసె తాముూఁ గూడితే నెంచవు విరహులా

రేకు: 0462-1 రామక్రియ సం: 12-307

పల్లవి: యెక్కడి కెక్కడ వల పెందెందు మోచివున్నది
చొక్కపు వేడుక లివి చూడరమ్మ చెలులూ

చ. 1: చనుఁగొండల నడుమఁ జంద్రోదయ మాయ
వెనకఁ జెక్కులవెంట వెన్నెల గాసె
మునుకొని ఇందరము మొగములు చూచుకొంటే
తన కేల సిగ్గువడఁ దరుణికినీ

చ. 2: దొరసి మోముఁ దమ్మిపై తుమ్మెదలు చెలరేఁగే
గరిమ ముక్కునఁ దావిగాలి విసరే
అరు దందె మన లోన నందుకుఁ గా మెచ్చితేను
సిర వంచుకో నేలే చెలియకును

చ. 3: వావిరి మెఱుఁగు మేన వానలు గురియఁ జొచ్చె
శ్రీ వేంకటేశుఁ డింతలోఁ జేరి కూడెను
యీా వేళఁ దమ కిందర మితవులు నెరపితే
భావించి చూడఁగ నేల పడఁతికిని

రేకు: 0462-2 సామంతం సం: 12-308

పల్లవి: యేమని విన్నవించేను యిన్నీ నాతఁడే యెఱుఁగు
వోముచుఁ దా మన్నించేది వొక్కటే గుఱుతు

చ. 1: మలసి మాటలాడితే మఱి యెన్నైనాఁ గలవు
కలసి పొందు సేసితే కాంక్ష తీరదు
చెలరేఁగి చెప్పితేను శేనాశేన ప్రియములు
వలపుల కెందుఁ గడవర లేదే చెలియా

చ. 2: కన్నులఁ జూచేనంటే కమ్ముకొనీ వేడుకలు
యెన్నుకొంటేఁ దల పోఁత లింతా మోఁతలు
వున్నతి మెఱసితేను వుడివోదు తమకము
వెన్నడించే కోరికకు వెల లేదే చెలియా

చ. 3: మంతనమాడే నంటే మతికిఁ దనివి లేదు
చెంత నెంత పాయకున్నా సిగ్గు మానదు
యింతటె శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
సంతసపుట్టి రతికి సరి లేదే చెలియా

రేకు: 0462-3 కన్నడగౌళ సం: 12-309

పల్లవి: సెలవి నవ్వులతోడఁ జింత లేలయ్యా
చెలఁగి మా మండాటాలు చేకొనరాదా

చ. 1: విరహపు చెలిలాగు వింటే దోసము గాదు
గిరిగొనఁ గొంత అలకించవయ్యా
అరుదుగా విన్నవించే నదేల పరాకు నీకు
అరసి న న్నదేమని యడుగరాదా

చ. 2: ఆసపడ్డ సతితో మాటాడితే దోసము గాదు
లేసు పెదవులు గదలించవయ్యా
చేసూటినే చూపెను సిగ్గు లిదేఁటికి నీకు
సేసపాలు వట్టు కొని శిరసెత్తరాదా

చ. 3: అండనున్న యా లేమ నంటితే దోసము గాదు
నిండుఁ గౌఁగిట నీవు నించవయ్యా
కొండల శ్రీ వేంకటేశ కోరి యలమేల్మంగను
దండిగా నేలితి విట్టే దయ సేయరాదా

రేకు: 0462-4 ముఖారి సం: 12-310

పల్లవి: యెఱుఁగమి సేసుకొని నేఁటికే నీకు
యెఱుకతోనే చనవియ్యవయ్యా

చ. 1: చిలుకుఁ జూపుల తోడ సెలవి నవ్వులతోడ
నిలుచున్న దెవ్వతో నీ ముందరను
మొలక చన్నులు గొంత మొనలు గదలఁ గాను
సొలసీ నప్పటి నిన్నుఁ జూడవయ్యా

చ. 2: తీగెమాట లాడుకొంటా తేరి సన్న సేసుకొంటా
బాగుగా నెవ్వతో నీ పక్క నున్నది
చేగదేరి మొనగోరి చిమ్ము లమరఁ గాను
సోగ చేతులు చాఁచీని చూడవయ్యా

చ. 3: విరులు గానుక యిచ్చి వేమారుఁ గొచ్చి కొచ్చి
పరగఁ గొలువు సేసెఁ బాయ కెవ్వతో
యిరవుగ శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
సొరిది నాపె మొగము చూడవయ్యా

రేకు: 0462-5 నాదరామక్రియ సం: 12-311

పల్లవి: యింక నేలే వెఱపు యింత సేసే నా విభుఁడు
లంకె లొనరేను మా లాగు లెల్లా మంచివే

చ. 1: చనవు గలుగువారి చరిత లెల్లాఁ జెల్లు
మన సొక్కటైన వారి మాట లీడేరు
తనివిఁ బొందినవారి తలఁపులు చక్కనుండు
ననిచినవారి సన్నలు చవు లవును

చ. 2: అంది పొందినవారి ఆస లిట్టే నేరవేరు
విందు వినోదపు వారి వేడుక మేలు
కందువ చుట్టపు వారి కాఁపురాలు తలకూడు
చందపు వయసు వారి సరసము మెఱయు

చ. 3: పాయక కూడిన వారి పంతములు గొనసాగు
దాయగాండ్లైనవారి తగులు మెచ్చు
యీ యెడ శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలే
చాయకు వచ్చినవారి జాడలు ఫలించును

రేకు: 0462-6 తెలుఁగుఁగాంబోది సం: 12-312

పల్లవి: నన్ను మన్నించె నాతఁడు నమ్మితి నేను
యెన్నికగా నీకఁ జెలు లేమీఁ జెప్పకురమ్మా

చ. 1: అంకించి నే నాతని నట్టే వేఁడుకొనేఁ గాని
జంకించ నోపనమ్మా సారె సారెకు
మంకుదాన నౌదుఁగాని మనసు మోకదాకిరి (?)
కొంకక యేమి సేసినాఁ గోపగించ నమ్మా

చ. 2: పొలసి విభుని తోడఁ బొందు సేయఁగలఁ గాని
అలుగనేర నమ్మా యెంతైనా నేను
చలమరి నౌదుఁగాని సాదించితి వినయము
చెలి నెందుండి వచ్చినా వెంగె మాడనమ్మా

చ. 3: శ్రీ వేంకటేశుఁ గూడి సేవ సేయఁగలఁ గాని
కావరించ నొల్ల నమ్మా కాంతాళానను
లావరి నౌదుఁ గాని లలి సిగ్గు నాసొమ్ము
యీవల నన్నేలినాఁడు యెదిరించ నమ్మా

రేకు: 0463-1 సాళంగనాట సం: 12-313

పల్లవి: కన్నులు చల్లఁ గా నేము గారవించి చూచేము
నిన్ను మెచ్చుటే మేలు నీవే బదుకవే

చ. 1: గొప్ప లెంత లై నాను గుబ్బలకే మేలు
చిప్పిలెంత రసమున్నఁ జిగురుమోవికే మేలు
కప్పెంత గలిగినా కడుఁ గొప్పునకు మేలు
నెప్పున నెఁత చూపేవు నీవే బతుకవే

చ. 2: నెమ్మిఁ గళ లెన్నియైనా నీ మొగానకే మేలు
చిమ్ము నవ్వు లెన్నియైనా సెలవులకే మేలు
పమ్మి నడ లందమైతే పాదములకే మేలు
నిమ్మలాన మెఱసేవు నీవే బతుకవే

చ. 3: పిన్ననడు మెట్టున్నా పిఱుఁ దునకే మేలు
యెన్ని సింగారాలైనా నిట్టే నీ మేనికే మేలు
వన్నెల శ్రీ వేంకటేశ్వరుఁడ నాకోరిక
నిన్ననే యీడేరించితి నీవే బతుకవే

రేకు: 0463-2 ప్రతాపనాట సం: 12-314

పల్లవి: వొక్క గరిడీ లోనే వోటపంతా లీఁక నేల
చిక్కించి యిద్దరి సరి సేసేము గాని

చ. 1: వెలఁది బొమ్మలనే విలువిద్య సాము సేసె
చిలుకుటమ్ములందుకు చిమ్ముఁ జూపులు
చలపట్టి యాపె చను సంగడా లెత్తఁగరాదా
చెలఁ యిద్దరి సరి సేసేముగాని

చ. 2: తరుణి కొనగోరనే దారకత్తి సాముసేసె
అరిది ముంజేయి కొర డందుకుఁ దోడు
సరిఁ బిబీఁది యరిగె సాదించి పట్టఁ గరాదా
సిరుల నిద్దరి సరిసేసేముగాని

చ. 3: కాంత నీతో కౌఁగిటిలో కంబముసాము సేసె
అంతటా నీవు పెన్నుద్ది వందు కైతివి
పంతపు శ్రీ వేంకటేశ ప చ్చి మోవి మోప రాదా
చెంతల నిద్దరి సరిసేసేము గాని

రేకు: 0463-3 నట్ట నారాయణి సం: 12-315

పల్లవి: నీ వేపాటి మిన్నించినా నేఁడు నాకుఁ బదివేలు
చేవ దేర మోహించితి చింత లేల నాకు

చ. 1: చిలుకుఁ జూపుల నిన్నుఁ జిమ్మి చిమ్మి చూడఁగ
చలమరి దాననా సరిదాననా
అలపులా సొలపులా ఆసలఁ బెట్టే నంటే
సలిగెలు నెరుపేనా చవులు చూపేనా

చ. 2: చాయలకు మాటలాడి సరసము పచరించ
మాయదారి దాననా మంకుదాననా
పాయపు మదాన నీతో పంతము సాదించే నంటే
నాయిచ్చల మెఱసేనా నటన సేసేనా

చ. 3: కఱకఱఁ బెట్టి నిన్ను కౌఁగిట బిగించే నంటే
మెఱ మెచ్చుదాననా మేనదాననా
యెఱఁగితి శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
మఱుఁగులు పెట్టే నా మరి కొసరేనా

రేకు: 0463-4 కేదారగౌళ సం: 12-316

పల్లవి: ఆతఁ డెంత నే నెంత అవుగదే చెలులాల
యీ తలఁపులే పతికి నిట్టే విన్నవించరే

చ. 1: చిప్పిల నవ్వఁగఁ బోతే సిగ్గులు రేఁగవా
దప్పికి మో వడిగితే దగ దొట్టదా
కొప్పు వంచి మొక్కఁబోతే కురియవా చెమటలు
అప్పుడే సరసమాడ నమరునా నాకు

చ. 2: మాటలాడఁ బోతేను మర్మాలు సోఁకవా
కాటుక కండ్లఁ జూచితే కప్పదా తమి
నీటునఁ బెనఁగఁ బోతే నిండుకోవా పులకలు
కూటమికిఁ జేయి చాఁచఁ గూడునా నాకు

చ. 3: చన్నుల నొత్తఁగఁ బోతే జడియవా మఱపులు
మిన్నక గోర నంటితే మించదా దయ
యిన్నిటా శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నుఁగూడె
సన్నల నే బత్తి చూప సంగతే నాకూ

రేకు: 0463-5 భైరవి సం: 12-317

పల్లవి: అటు గాన పతియడ కవుఁగాము లెంచరాదు
యెటువలెనై నాను యెనయుటే మంచిది

చ. 1: తలఁపులో తమకము తనివిఁ బొందఁగ లేక
అలుగఁ బోతే తాప మధిక మౌను
మొలచిన కోరికలు ముగియించుకొనలేక
చలము సాదించే నంటే చవులు గావు

చ. 2: వెక్కసపు వలపుల వేడుక చెల్లించలేక
కక్కసాన దూరఁ బోతేఁ గలఁగు మది
దక్కిన చుట్టరికము తాఁ దగులు సేసుకోక
నెక్కొన రట్టు సేసితే నేరుపు గాదు

చ. 3: కౌఁగిటి లోపలి మేలు కడఁగి భోగించక
మాఁగబెట్టి పూరకుంటే మంకు దీరదు
యేఁగి వచ్చి శ్రీ వేంకటేశుఁ డిట్టే నిన్నుఁ గూడె
చేఁగ దేర నవ్వే నంటే సిగ్గు తరి గాదూ

రేకు: 0463-6 శ్రీరాగం సం: 12-318

పల్లవి: నేనే భాగ్యమంతురాల ని న్నేమని పొగడేను
పూని నేఁ దలఁచఁగానే బోరున వచ్చితివి

చ. 1: వేడుక నా మది లోని విరహపు కాఁక మాన్పు
జాడతో నీ సెలవి పై చల్లని నవ్వు
వాడలో నిన్నెనసిన వట్టి తహతహ మాన్పు
వీడెపు నీ మోవి తోడి వింత వింత మాటలూ

చ. 2: అగపడి నీవు రాని ఆందోళ మెల్ల మాన్పు
తగిలి ననుఁ జూచే నీ దయ చూపు
చిగిరించే నా మై కన్యసిగ్గు లెల్లా మానుపు
సొగిసి నీ కొనగోరి సోఁకుల చెనకులు

చ. 3: మునుకొని నేఁ గోరే ముచ్చటెల్లా మానుపు
ననిచి నన్నుఁ గూడే మన్నన కౌఁగిలి
యెనసితి వీలాగున యిట్టే శ్రీ వేంకటేశ
దినదిన భోగాలఁ దీరవు నీ రతులూ

రేకు: 0464-1 భైరవి సం: 12-319

పల్లవి: యేఱుఁగనా నే నేమైనా యింతులాల నావిభుని
నెఱవుగా వెంగేలు నే నే లాడేనే

చ. 1: మనసురా సేవసేసి మాటలాడే యాఁటదానిఁ
గనుఁ గొంటే దయవుట్టుఁ గాక పతికి
పెనఁగి పెనఁగి వట్టి బిగువులు బిగిసితే
యెనసునా పొందులు యెరవులే కాక

చ. 2: అతి వినయాలు చూపి అండనున్నయాఁటదాని
రతి వేడుకౌఁ గాక రమణునికి
చతురతలు మెఱసి సణఁగులు చల్లితేను
తతి నియ్యకోలౌనా తడఁ బాటేకాక

చ. 3: మాఁగిన మోవి యిచ్చి మరిగిన యాఁటదాని
కౌఁగి లింపౌఁ గాక శ్రీవేంకటపతికి
చేఁగదేర నన్నుఁ గూడె చేఁత లెవ్వతె సేసినా
లోఁగక వెల్లివిరౌనా లోలోనే కాకా

రేకు: 0464-2 కాంబోది సం: 12-320

పల్లవి: చూడ నీ కెట్టున్నదో నా సొబగు నీకు
వేడుక సేసీ నాకు విభునిపై తలఁపు

చ. 1: చెక్కుపై నే చేయిగాని చిత్తము లోపలఁ దానే
యెక్కడిదే నాకుఁ జింత ఇంతలోఁ జెలి
ముక్కుపై నే వేలు గాని ముంచి నూర్పు దనకుఁగా
నెక్కొన నాపై నేదే నివ్వెఱఁగు నేఁడు

చ. 2: పానుపుపై మేను గాని పలు కాతనిపే రెంచి
ఆనుక యేడ నున్నదే అలపు నాకు
వీను లాస కొల్పీఁగాని విని కాతని గుణాలే
తానకమై మరి యేదే తడఁబాటు నేఁడు

చ. 3: చూపులే దవ్వులు గాని చుట్ట రికము చేరువ
యే పొద్దు నిఁక నేడదే యెరపు మరి
యేపున శ్రీ వేంకటేశుఁ డితఁడే తా నన్నుఁగూడె
పై పై నెందున్నదే పరాకు నేఁడు

రేకు: 0464-3 వసంతవరాళి సం: 12-321

పల్లవి: యెంత వొడఁ బరచీని యీతఁడు నన్ను
వింత యేదే యిందులోను విచారించితేను

చ. 1: తానన్ను మన్నించినాఁడు తన దేవులను నేను
యేను సేసే విన్నపము లిఁక నేఁటివే
మానఁడు నాపై బత్తి మరిగితి ముందే నేను
ఆనుకొని కొసరి నే నడిగేదేమే

చ. 2: సేసవెట్టేఁ జేతులార శిరసు నేనూ నొగ్గితి
ఆసలెల్లా నెరవేరే నడ్డ మేడదే
సేసినాఁడు నాకు మేలు చిత్తము తనకు దక్కె
యే సుద్దులు నే నిఁక నెచ్చరించే దేమే

చ. 3: మెచ్చి నన్నుఁ గౌఁగిలించె మీటు గుబ్బల నొత్తితి
అచ్చమాయఁ జుట్టమరయ నేదే
కొచ్చి శ్రీ వేంకటేశుఁడు కూడె నేనూఁ దనిసితి
యిచ్చకపు తనమన నెఱిఁగే దేమే

రేకు: 0464-4 బౌళిరామక్రియ సం: 12-322

పల్లవి: అన్నిటా సంతోసమె అందుకే మీరేవయ్య
మన్ననతో నీ వెంత మరిగించినాను

చ. 1: యెగ్గు పట్ట బుద్ది గాదు యిచ్చకురాలఁ గనక
దిగ్గన నీ వేవనితఁ దెచ్చుకొన్నను
సిగ్గువడ బుద్ది గాదు సేవకురాలఁ గనక
వొగ్గి నీ వెంత పచ్చిగ నుదుటు లాడినను

చ. 2: ఱట్టు సేయ బుద్ది గాదు చుట్టపుదానఁ గనక
తొట్టి మరి నీ వెవ్వరితోడ నవ్వినా
గుట్టు చూప బుద్ది గాదు కూడిమాడి వుందుఁగాక
నెట్టన నేడ సుద్దులు నీ వడిగినాను

చ. 3: వింత సేయ బుద్ది గాదు వేడ్కలో సతిఁగనక
సంత కూటములను వేసాలు సేసేనా
ఇంతలో శ్రీ వేంకటేశ యిట్టే నన్ను నేలితివి
పంతమాడ బుద్ది గాదు పక్కన మెచ్చినాను

రేకు: 0464-5 శుద్ధదేశి సం: 12-323

పల్లవి: యిది యేమయ్యా నీవు యీపె నేల వొరసేవు
మదిరాక్షి వొడికము మరి నీ వెఱుఁగవా

చ. 1: వేడుక కత్తెయైనది వెక్కసాన నవ్వుఁగాక
వాడికైన యిల్లాలికి వరుసా యిది
తోడ నీ కితవైతే సంతోసించు కొందుగాక
వాడ లోని సతులకు నాడికలై వుండగా

చ. 2: వెలియాలైనది నీతో వింత మాట లాడుఁగాక
కులకాంత కైతే నింత గొరబు గద్దా
చలివాసి తిరిగేటి జాణవు నీ కింపుగాక
యిలలోని కాంతలకు యెగ్గులివి గావా

చ. 3: ఆసపడి వచ్చినది అన్నిటాఁ జెనకుఁ గాక
వాసితోడ గరితెకి వేసా లేఁటికే
సేసవె ట్టికె నేలితి శ్రీ వేంకటేశుఁడ నేఁడు
రాసికెక్క నిటువంటి రతి మెచ్చు గాదా

రేకు: 0464-6 భైరవి సం: 12-324

పల్లవి: వలపెల్లా రాసివడే వనితి వేఁడుకొనీని
చలమేల సాదించేవు చన వియ్యవయ్యా

చ. 1: మాటలఁ దేనెలు గారీ మగువకు నీ యెదుట
కోటిసేయఁ బెట్టి నట్టి కొప్పు జారీని
వూటలుగాఁ బెం జెమట లూరీని మేన నెల్లా
యేఁటికి నలయించేవు యియ్యకొనవయ్యా

చ. 2: చెక్కిళ్ళ జవ్వాది చిందె చేరి నీకు మొక్కఁగాను
గక్కన గుబ్బలు రాసీ కసుగందిని
తక్కక నిన్నుఁ జూచి సంతస మంది మదిలోని
తక్కుల నేల పెట్టేవు దయసేయవయ్యా

చ. 3: నెమ్మిఁ బోఁకముడి వీడీని కొలువు సేయఁగాను
చిమ్ముఁ జెనకుల చేత సిగ్గు లూఁదీని
నెమ్మది శ్రీ వేంకటేశ నీ వింతలో నేలితివి
సమ్మతాయ నిటులానే సమకూడ వయ్యా

రేకు: 0465-1 సావేరి సం: 12-325

పల్లవి: కాంత పొరుగు పోరచి గంటివా వోయి
యింతలోన నీ చిత్త మెట్టున్నదో కాని

చ. 1: చేరి నీతో మాటాడఁగా చెక్కులెల్లాఁ జెమరించె
గారాపు నీ చెలిలాగు గంటివా వోయి
సారె సారెఁ జూడఁ గాను జారీఁ బయ్యదకొంగు
ఆరితేరి యెటువంటి ఆసోదమో కాని

చ. 2: చెలరేఁగి నిన్నుఁ జూచి చిత్త మెల్లాఁ గరఁగీని
కలికి జాణతనాలు గంటివా వోయి
నిలువునఁ జొక్కి చొక్కి నివ్వెఱఁగు నొందీని
తలపోఁత లెందు మోవఁ దలఁచేనో కాని

చ. 3: తతి నీ పాదా లొత్తి తనివోక కొసరీని
కతకారి తనములు గంటివా వోయి
యితవై శ్రీ వేంకటేశ ఇంతలో నన్నేలితివి
మతిలోనఁ దా నెంత మరిగీనో కాని

రేకు: 0465-2 హిందోళం సం: 12-326

పల్లవి: చెలియరో నీ వేల చింతించేవే
వలెనంటే నీ విభుఁడు వచ్చీఁ దా నీడకే

చ. 1: వలపు గలిగితేను వాడికలూఁ దానే వచ్చు
తలఁపు గలిగితేను తమి రేఁగును
పిలుపు గలిగితేను ప్రియములూఁ బెనగొను
చెలిమి గలిగితేను చేఁతలూ నీడేరును

చ. 2: మాటలు గలిగితేను మనసులూ సమ్మతించు
కూటమి గలిగితేను కోరిక నిండు
చోటు గలిగిన చోట సొలపులూ నింపౌను
సూటియై రాక గలిగితే సులభమే భోగము

చ. 3: ననుపు గలిగితేను నవ్వులు చందమౌను
చనవు గలిగితేను చవియౌ మోవి
యెనసీ శ్రీ వేంకటేశుఁడింతలోనే వచ్చి నిన్ను
తనివి గలిగితేను దక్కు నేర్పు లెల్లనూ

రేకు: 0465-3 అమరసింధు సం: 12-327

పల్లవి: పొంచి నీ వే లాతనికి పూనుక మాటలాడేవే
యెంచి చూడ రమణుని కిన్నియు నితవులే

చ. 1: పంతము లాడుకొందురు పడఁతులు సారె సారె
చింతలఁ జన విచ్చిన చెలువునితో
వంతులును మీఱుదురు వాసితో నొక్కొకవేళ
వింతలైన మన్ననలు వెసఁ జల్లేచోటను

చ. 2: వొడివట్టి తీతురు వుదుటున నవ్వుదురు
వొడబాటులు గలిగివుండే కాంతలు
చిడిముడి జంకింతురు చేతికి లోనైనప్పుడు
బడివాయక పొందులు పరగేటి చోటను

చ. 3: చేముంచి పెనఁగుదురు చెక్కు నొక్కి కూడుదురు
ప్రేమతో సేసవెట్టిన పెండ్లికూఁతులు
ఆముక శ్రీ వేంకటేశుఁ డాతఁ డిట్టే యీకెఁ గూడె
నేమము లెల్లా నీడేరు నిండుకొన్నచోటను

రేకు: 0465-4 ముఖారి సం: 12-328

పల్లవి: మగఁడు తన్నొల్లకుంటే మరి మమ్మేల దూరీనే
జిగి మీరైనా బుద్ధి చెప్పరే చెలులు

చ. 1: చెలరేఁగి యందరితోఁ జెప్పుకొనే సుద్దులు
చలివాసి చల్లేటి సణఁగరాలు
పలుకుఁ బంతాలలోని పచ్చి వెచ్చి వెంగేలు
వెలయించీ నీకె చేత వింటిరటే చెలులు

చ. 2: వుమ్మగిలుఁ జెమటతో నుడివోని జంకెనలు
సమ్మతించక వినేటి చండితనాలు
చిమ్ముఁ జూపుల తోడఁ జేతులు చాఁచే సన్నలు
సొమ్ముల మురిపెములుఁ జూడరే చెలులూ

చ. 3: చీటికి మాటి కింతలో చీఁదరగొన్న మొక్కులు
కాటుక కన్నుల యీకె కాంతాళాలు
మేటి శ్రీ వేంకటేశుఁడు మిక్కిలి నన్నేలినది
తేట తెల్ల మాయ మీరు తెలియరే చెలులూ

రేకు: 0465-5 పాడి సం: 12-329

పల్లవి: కోరికె లీడేరె నింకా గొసరు లేలే
యీ రీతి నితఁడు నీవు నెనయుట గాకా

చ. 1: తలఁచిన తలఁపులు దై వారి లోలోన
వలచిన వలపులు వాఁట మాయను
మొలచిన చన్నులు మోసులెత్తెఁ బయ్యదలో
యెలమిఁ దెరమఱుఁగు లింక నేలే నీకు

చ. 2: జవ్వన మదము మేన జారీఁ జెమటలై
నవ్వులు సెలవులను నారుకొనెను
పువ్వుల తోడి తురుము బుజము పై వీడుపడే
యివ్వల నీ తమి దాఁచ నిఁక నేలే నీకు

చ. 3: సురతపు టాసలు చూపులలోఁ బెనగొని
గరిమఁ బొందులు పులకలఁ జూపెను
యిరవై శ్రీ వేంకటేశుఁడింతలోన నిన్నుఁ గూడె
యెరవుల నిండు సిగ్గు లిఁక నేలే నీకు

రేకు: 0465-6 సామవరాళి సం: 12-330

పల్లవి: యెడమాట లెందాఁక నేమిటికిని
బడివాయకుండితేను ఫల మీడేరీని

చ. 1: భావించుకొనినఁ గాని పల్ల వించదు మనసు
కైవసమైనఁ గాని కాంక్ష దీరదు
మోవఁ బెనఁగినఁ గాని మొనయవు వేడుకలు
రావే వో చెలియా రమణుని కడకు

చ. 2: మొగము చూచినఁగాని మోహములు దెలియవు
నగినఁగాని తలఁపు నాఁటు కొనదు
తగిలి పిల్చినఁ గాని తనివోదు తమకము
మగువ నీ విఁక రావే మన్నించీ నీవిభుఁడు

చ. 3: సరస మాడినఁ గాని చవి వుట్టదు కూటమి
వొరసినఁ గాని పంత మొనగూడదు
యిరవై శ్రీ వేంకటేశుఁడింతలోనే నిన్ను నేలే
మరిగి యిట్టే రావే మది నుబ్బీ నితఁడూ

రేకు: 0466-1 మాళవిగౌళ సం: 12-331

పల్లవి: ఎట్టి వేసాలు సేయఁగ వద్దు గాక
చుట్టముఁ జేసుక రాఁగా సూడువట్టే నా

చ. 1: మంతనాన నాతఁడు నా మాట లోని వాఁడంటా
యెంత వుప్పతించేవే యేమే నన్ను
పంతగత్తె వంత యైతే పతిని నీ యింటికే
వంతుకుఁ బిలుచుకోఁగా వద్దనేనా నేను

చ. 2: చెలరేఁగి యీతఁడు నా చెప్పినట్టు సేసునంటా
చలపట్ట నేలే యేమి సాదించేవే
బలవంతురాల వైతే పైకొని యీతని నీవు
యెలయించి తియ్యఁగా న దేమనేనా నేను

చ. 3: కందువ నాతఁడు నన్నుఁ గౌఁగిలించుకొనే నంటా
గొంది నుండీ నన్నేఁటికిఁ గొనియాడేవే
యిందరిలో దిట్ట వైతే నిప్పుడు శ్రీ వేంకటేశు
సందుకొని కూడఁ గాను జంకించేనా నేనూ

రేకు: 0466-2 పూరిబి సం: 12-332

పల్లవి: కన్నె ముద్దరాలు కసుఁగాయవంటిదీ
వున్నతి మెల్లనే తేనె లుట్టి పడీఁగాకా

చ. 1: సిగ్గుతోఁ దలవంచఁగా చెక్కు నొక్కే వప్పటిని
అగ్గమైన పూవువంటి అబల యీకె
వెగ్గలింతురా తొల్లే వేఁడి వేఁడి వలపిదీ
బెగ్గిలక చల్లారితేఁ బేరుకొనీఁ గాకా

చ. 2: తెరమాటున నుండఁగాఁ దీసేవు చేయి వట్టి
వరుసలేఁ దీగెవంటి వనిత యీకె
గొరబు సేతురా ఇంత కొత్త కొత్త వయసిదీ
పరువాన వికసించి పరిమళించీఁ గాకా

చ. 3: పక్కనుండఁగా నప్పటి పలుమారుఁ గూడేవు
మిక్కిలిఁ జిగురు వంటి మెలఁత యీకె
చొక్కఁజేతురా రతి చూడఁ జూడ చోద్య మిదీ
నిక్కితి శ్రీ వేంకటేశ నిందుకొనీఁ గాకా

రేకు: 0466-3 మనోహరి సం: 12-333

పల్లవి: తలవాతి పను లెల్లఁ దా నెఱుఁగును
అలిమిఁ జెలులాల అడుగరే యాతని

చ. 1: తా నంపిన వుంగరము తగ నావేల నున్నది
కానుకలు నే నంపే కత లేఁటివే
తానకమై తన మీఁది తలఁపు నా కిచ్చినాఁడు
సానఁబట్టిన చూపుల సాదించే దేమే

చ. 2: చెప్పి తా నంపిన మాట చెవులలోనే వున్నదీ
ముప్పిరిఁ జేసే విన్నపములు మరేవే
చిప్పిల దొర్లే సేసలు శిరసుపైఁ బెట్టి నాఁడు
గొప్ప గొప్ప కన్నులనుఁ గొసరే దేమే

చ. 3: కూటమికి నా కౌఁగిలి గురిగాఁ జేసి వున్నదీ
పాటించి రతులలో నీపంతా లేడవే
యీటుగా శ్రీ వేంకటేశుఁడిట్టే నన్నుఁ గూడినాఁడు
కోటి సేసు నిఁక వేరే కొసరే దేమే

రేకు: 0466-4 దేసాళం సం: 12-334

పల్లవి: యింతేసి కోపను నేను ఇచ్చకమే సేసే నీకు
చెంతల నన్నలయించి సిగ్గులు రేఁచకుమీ

చ. 1: పంతము గొనే యాఁటది పై పై బిగియఁ జొచ్చు
వంతుకు వచ్చినాఁటది వాసు లెంచదు
వింతయైన యాఁటది భావించి గుట్టున నుండు
జంతయైన యాఁటది సాదించును

చ. 2: మాయదారి యాఁటది నేమములు చూపఁగవచ్చు
చాయలాఁడే యాఁటది సన్న చేసును
దాయగత్తైన యాఁటది తగిలి పెనఁగవచ్చు
పూయక దూలైనాఁటది పొంచులే వినును

చ. 3: గబ్బియైన యాఁటది గక్కనఁ గౌఁగిట నించు
వుబ్బరి యైన యాఁటది వొడివట్టును
గొబ్బున శ్రీ వేంకటేశ కూడితివి నన్ను నిట్టే
అబ్బురపు గుణమాఁట దంకెలఁ జంకించును

రేకు: 0466-5 గుమ్మకాంబోది సం: 12-335

పల్లవి: యెగ్గో తప్పో యెఱుఁగ నేమి సేతు నయ్యా నేను
సిగ్గుతో నుండక నిన్నుఁ జిమ్మి రేఁచవలసే

చ. 1: విరుల వేసినఁ గాని వేడుకలు రేఁగవు
తెరఁ దీసితేఁ గాని తెలియరాదు
సరస మాడినఁ గాని చవులు వుట్టవు నీకు
యెరవు లే కటుగాన ఇంత సేయవలసే

చ. 2: పట్టి పెనఁగక నీకు పరాకులు మానవు
చుట్టరికము చెప్పక సొంపు నిండదు
వొట్టు వెట్టి పిలువక వుదుటు నీకు మించదు
యిట్టే యిందుకుఁగా నిన్నింత సేయవలసే

చ. 3: చన్నుల నొత్తి పట్టక సమరతి బెరయదు
కన్నుల జంకించక కమ్మదు తమి
మన్నించి శ్రీ వేంకటేశ నన్ను నేఁడేలితి విట్టే
ఇన్నిటా నాకు నిన్ను నింత సేయవలసే

రేకు: 0466-6 నాదరామక్రియ సం: 12-336

పల్లవి: తలపోఁతలే గనము తనివి లేదు
పిలిచేవారెవ్వరే ప్రియుని నీడకును

చ. 1: వెన్నవంటిదీ మనసు వేఁడివంటిదీ వలపు
యెన్నరాదు తమియైతే నేమి సేతునే
చన్నులును గొప్పలాయ జవ్వనము కడువీఁగు
విన్నవించేవా రెవ్వరే విభునితోనూ

చ. 2: జిగురు వంటిది సిగ్గు జీడి వంటిది వేడుక
యిగిరించీఁ గోరికలు యేమి సేతునే
నిగిడీ నడియాసలు నిండీ నెదురుచూపులు
తగులెవ్వరు సేసేరే తగ నా కాతనికి

చ. 3: పచ్చివంటిది కౌఁగిలి పండువంటిది కెమ్మోవి
హెచ్చెను నా చక్కఁదన మేమిసేతునే
యిచ్చ యెఱిఁగి శ్రీ వేంకటేశుఁడిందు వచ్చి కూడె
మెచ్చే వారిఁక నెవ్వరే మే మిట్టే వుండఁగనూ

రేకు: 0467-1 సామంతం సం: 12-337

పల్లవి: ఔఁగా దనవచ్చునా అయినట్టయ్యీఁ గాక
కౌఁగిటికి వచ్చే పతి కరుణ యెందున్నదో

చ. 1: చెలులకు బుద్ది లేదు చిలుకలఁ దిట్ట రాదు
యెలమి నారమణుఁడు నింటికి రాఁడు
వలరాజు గుఱిగాఁడు వంకవోదు పూవుటమ్ము
చెలఁగి విరహ మెంత సేయ నున్నదో

చ. 2: మనసూఁ జుట్టము గాదు మందానిలూ ననరాదు
చన విచ్చి విభుఁడూ నాసలు చూపఁడు
జునుగ నీఁడు చంద్రుఁడు సొంపు మాయదు వెన్నెల
తనివోని మోహ మెంత దడ వేఁచ నున్నదో

చ. 3: వయసూ నణఁచరాదు వసంతుఁడూఁ దోడుగాఁడు
ప్రియుడిట్టే వచ్చెనాకు భేదమూఁ గాఁడు
దయ తో నన్నేలె నితఁడే శ్రీ వేంకటేశుఁడు
నియతి నా రతులలో నేరు పెట్టున్నదో

రేకు: 0467-2 లలిత సం: 12-338

పల్లవి: ముక్కు మీఁది వేలి తోడ ముందట నుండేఁ గాక
వక్కణగా తనతోనే వాదించ నేలే

చ. 1: సాకిరి చెప్పి నిజాలే సారెకు నెరపఁగాను
కై కొని వినేఁ గాక కా దన నేలే
జోకలుగాఁ దన మేని చొప్పులు చూపి మోపి
నాకు నాకే సెలవుల నవ్వఁగ నేలే

చ. 2: వొడివట్టు కొని నన్ను నొడఁబరచి చెప్పఁగా
వడిగా నూఁకొనేఁ గాక వద్దన నేలే
తడఁ బడే పెదవుల దప్పికిఁ బన్ని రిచ్చి
అడియాస నన్ను నడుగ నేలే

చ. 3: పక్కనఁ దన పలువరుఁ పలుమారుఁ జెప్పఁగాను
లెక్కలు వెట్టేఁ గాక లేదన నేలే
ఇక్కువతో శ్రీ వేంకటేశుఁడు తానన్నుఁ గూడె
మొక్కితిఁ దన నేరుపు ముదలించ నేలే

రేకు: 0467-3 రామక్రియ సం: 12-339

పల్లవి: యెఱుఁగ కడిగితేను యెగ్గాయనా
తఱితో సిగ్గువడేవు తగవా నీవూ

చ. 1: యెలమి నీ వద్ది యింతి కేమౌదు వంటేను
అలవోకగాఁ జెప్ప వదేరా నీవు
మలసి మీ యిద్దరికి మంచి యీ డౌ నంటేను
సెలవుల నవ్వేవు చేరి యేమీ నీవూ

చ. 2: పొంతనా లిద్దరికిని పొసఁగునా యంటేను
యింత లోనే తలవంచే వేరా నీవు
మంతనాన మీలోని మర్మము లడిగితేను
యెంత నన్నుఁ దిట్టేవు యేలరా నీవూ

చ. 3: కూడిన మీ పొనుపు పై గుఱుతులు చెప్పితేను
యీడుకు నాతోఁ బెనఁగే విదేరా నీవు
జాడతో శ్రీ వేంకటేశ సరి నన్నుఁ గూడితివి
ఆడినట్టే మాఁటాడే వవురా నీవూ

రేకు: 0467-4 భవుళి సం: 12-340

పల్లవి: తలపోఁతలనే నాకు తడఁబడీ వేడుకలు
చెలులాల యేమి సేతు చిమ్మి రేఁగీ మనసు

చ. 1: చిత్తము రా మాటలాడి చెంగలించఁ జేసీ కడు
బత్తి చూపే దెన్నఁ డొకో పతికి నేను
గుత్తపు గుబ్బల నూఁది కొనగోరు సోఁకఁ బాదా
లొత్తే దిక నెన్నఁ డొకో వుమ్మగిలీ మన

చ. 2: కళ లెల్లా రేఁగఁ దన్ను కౌఁగిలించి పట్టు కొని
వలపించే దెన్నఁ డొకో వాని నేను
మొలక నవ్వులు నవ్వి ముప్పిరిఁ జూపులు నాఁటఁ
దిలకించే దెన్నఁ డొకో తిమిరీ నామనసు

చ. 3: చెమటలు జొబ్బిలించి సిగ్గుదేర రతిఁ గూడి
తమి రేఁచే దెన్నఁడొకో తనకు నేను
సమ గతి శ్రీ వేంకటేశ్వరుఁడు వచ్చి నన్నేలె
అమరె నెన్నఁడొకో అరుదందీ మనసు

రేకు: 0467-5 ఆహిరి సం: 12-341

పల్లవి: మఱచి వుండఁగ రాదు మఱి తలఁచుకో రాదు
యెఱిఁ గెఱిఁగి నాగుణ మింత సేసీ నన్నును

చ. 1: సారెకు మాటాడే నంటే సంతోసము దొట్టు కొనీ
చేరి మోము చూచేనంటే సిగ్గులు బెట్టు
వూరక వుండేనంటే నుమ్మగిలీఁ దమకము
యీ రీతి నితని పొందు లింతసేసీ నన్నును

చ. 2: చన్నుల నొత్తే నంటే జల్లున మే చెమరించీ
వున్నతి నవ్వే నంటే నొలికీఁ దేనే
పన్ని సన్న సేసే నంటే పరవశములు నిండీ
యిన్నిటా నితని మేల మింత సేసీ నన్నునూ

చ. 3: యిట్టే కౌఁగిలించే నంటే ఇక్కువలు గరఁగీని
చుట్టమనై మొక్కే నంటే చొక్కీ మనసు
గుట్టున నన్నింతలోనే కూడె శ్రీ వేంకటేశుఁడు
యెట్ట నెదుట నా మోహ మెంత సేసీ నన్నును

రేకు: 0467-6 హిజ్జిజి సం: 12-342

పల్లవి: రావయ్య్య నావద్దికి రమణుఁడ నమ్మి నేఁడు
నీ వేమి సేసినాను నిన్ను మారు సేసేనా

చ. 1: పంతాలకు నెవ్వతైనా పై కొని పెనఁగుఁ గాక
చెంత నుండి నే బలిమి సేసేనా నిన్ను
అంత నుండే మాటలాడే వాన వెట్టు కొమ్మనేవు
యింతటి దొరవు నిన్ను నింకఁ బచ్చిసేతునా

చ. 2: నవ్వుల నెవ్వతైనా సన్నలఁ గొంగు వట్టుఁగాక
చివ్వన నీకొప్పు నేను చేతఁదీసేనా
దవ్వుల నేల లోఁ గేవు తలఁపేల పెట్టేవు
పువ్వువంటివాఁ డవు పైఁ బుప్పొడి చల్లేనా

చ. 3: యేతుల నెవ్వతైనా మోవెంగిలి నీకుఁ జేసితే
యీతల నే నటువలె నెమ్మో చూపినా
ఘాతల శ్రీ వేంకటేశ కౌఁగిట బిగించితివి
ఆతుమైనవాఁడవు ని న్నలయించ వచ్చేనా

రేకు: 0468-1 ఊదారగౌళ సం: 12-343

పల్లవి: రావయ్యా మన వలపు రచ్చల నేల పెట్టేవు
వేవేలు సరసాలకు వేళ లేదా యిఁకను

చ. 1: ఆడఁగా నాడఁగా మాట లంటు బచ్చలి వంటివి
చూడఁ జూడఁ జూపులు చూచి మరపు
యేడ గొలఁదీ యాసల నెందాఁకా వేగించవచ్చు
కూడిన కూటములే గురుతులేఁ గాకా

చ. 2: చేరఁగాఁ జేరఁగా పొందు జిగురుఁగండెవంటిది
కొరఁ గొరఁ గొరికే కొండవంటిది
యీ రీతిఁ దమకము లెటువలె నాఁప వచ్చు
వొరసేయని కౌఁగిళ్ళు నుబ్బు గలుగుఁ గాకా

చ. 3: పెంచఁగాఁ బెంచఁగాఁ దమి పెనుఁ దొడుసువంటిది
నించ నించ సిగ్గులు వన్నెలవంటివి
యెంచఁగ శ్రీ వేంకటేశ ఇట్టే నన్ను నేలితివి
ముంచిన రతులివే మునుకొనుఁ గాకా

రేకు: 0468-2 రామక్రియ సం: 12-344

పల్లవి: చక్కఁ జూడరాదా ఇంతి జాడలు నీవు
యెక్కడ లేని యాసోద మెంత గద్దో కాని

చ. 1: చెక్కులఁ జెమట గారీ నేనకొప్పు వెడ జారీ
పక్కన మగువ నీకుఁ బాదా లొత్తఁగా
నెక్కొనఁ గళలు దేరీ నివ్వెఱఁగు లుట్టిపడీ
అక్కర తో నిన్నుఁ జూచేయట్టి నిబ్బరానను

చ. 2: చన్నులు గక్కదలీని సంధులు గడునడరీ
వన్నెల నీ కీపె యాలవట్ట మిడఁగా
నెన్నడుము నసి యాడీ నిట్టూర్పులును రేఁగీ
విన్నపాలు నీకుఁ జేసె వేడుకలను

చ. 3: వేళ్ళ మట్టేలు వాగీ వెస మోవిందేనె చిందీ
కొల్లలుగా నిన్ను రతి గొసరఁగాను
అల్లదే శ్రీ వేంకటేశ హారములు నులిగొనీ
మెల్లనే నీతోఁ బెనఁగే మెలపునను

రేకు: 0468-3 పాడి సం: 12-345

పల్లవి: చెలుల మింతే నేము సిగ్గు మీ కేల
వెలనే మీ సంగాతాలు వేడుకాయ మాకు

చ. 1: మచ్చిక మాటలు నీతో మగువ నేఁ డాడఁగాను
విచ్చన విడి వీనుల వింటిమి నేము
రచ్చఁబడి వలపులు రాఁపాయ మీ తలఁపులు
పచ్చిసేసి ఇఁక నవ్వఁ బాడిగాదు మాకు

చ. 2: చనవుతో నాకె నీసంగడిఁ గూచుండఁ గా
కనుఁగవ పండుగగాఁ గంటిమి నేము
పెనగొని వేడుకలు బెరసె మీ వాడికలు
పనులివి మిమ్మడుగఁ బాడిగాదు మాకు

చ. 3: నాతిని పానుపు మీఁద ననిచి కౌఁగిలించఁగా
చేతులార నీ సేవ సేసితిమి నేము
యీతల శ్రీ వేంటేశ యిద్దరి మేనులు దాసె
పైతరవై మిమ్మొరయఁ బాడిగాదు మాకూ

రేకు: 0468-4 సామంతం సం: 12-346

పల్లవి: యింతి తో నలుగకు మీ యెన్నఁడూ నో రమణుఁడ
పొంత చెలులము గాన బుద్ధులు చెప్పేము

చ. 1: కలువలు వంటివే కన్ను లందురు గాని
సొలసి చూచితే నాఁటుఁ జూరు కనుచు
తలిరు వంటిదే మెత్తని మో వందురు గాని
పలికితే మదనుని పట్టే మై తోఁచును

చ. 2: జక్కవలు వంటివే చన్ను లందురు గాని
పక్కనఁ జూపితేనే భ్రమసు మతి
చక్కెర బొమ్మ వంటిది సతిమే నందురు గాని
వొక్కమాటు సోఁ కినాను చొక్కించు నీ మగుచు

చ. 3: తమ్మి పూల వంటివి హస్తము లందురు గాని
కమ్మి కౌఁ గిలించుకొంటే కళ రేఁచును
యిమ్ముల శ్రీ వేంకటేశ యీపె నిట్టే కూడితివి
తెమ్మ లైన రతుల నీ దేవులై వుండును

రేకు: 0468-5 శ్రీరాగం సం: 12-347

పల్లవి: విరహము మీఁదనే వేడుక వెల్లివిరిసీ
నిరతి నెండలలోనే నీడలు గలిగేనే

చ. 1: చెక్కునఁ బెట్టి న చేయి సెలవి నవ్విన నవ్వు
వొక్కమాటే నీకు నెందుండి వచ్చెనే
లక్కవంటి దీ మనసు చొక్కువంటిదీ వలపు
గక్కనఁ బతిఁ గంటేనే కల భేరుకాయనే

చ. 2: మోవి మీఁది పసివాడు మొగముపై చెంగలింపు
యీవల రెండూ జవళి నెట్టు గల్గెనే
పూవు వంటిది యాస పూఁప వంటిది పొందు
నీ విభుఁడు రాఁగాను నిండు దోమ టాయనే

చ. 3: చన్నులఁ బయ్యద జారు సరిఁ గన్నుఁగవ సిగ్గు
యెన్న నొకటొకటికి నెనయు టెట్టే
యిన్నిటా శ్రీ వేంకటేశుఁడింతలోనే నినుఁగూడె
సన్నల నితని వల్ల సరిబేసు లాయనే

రేకు: 0468-6 ఆహిరి సం: 12-348

పల్లవి: వేగిరించి యాతనికి వేసట సేయకురే
నాగుఋ తెఋఁగుఁ దానే నన్ను నేలీఁగాని

చ. 1: ఆస కొలిపిన వాఁడు ఆఱడిఁ బెట్టిన వాఁడు
సేస వెట్టి నాపై దయ సేయ నేరఁడా
వాసి యెఋఁగిన వాఁడు వలపు చల్లినవాఁడు
లాసుకొన్న నన్నుఁ గూడి లాలించీఁ గాక

చ. 2: చనవు లిచ్చిన వాఁడు చవి మరపిన వాఁడు
చెనకి సంతోసించఁ జేయ నేరఁడా
వినయ మెఋఁ నవాఁడు వేడుకకు లోనై నవాఁడు
మన సెఋఁగి నన్నిట్టే మన్నించీఁ గాక

చ. 3: చెలిమి సేసిన వాఁడు చేతికి లోనైనవాఁడు
తలఁ చినప్పుడే నా దండకు రాఁడా
యెలమి శ్రీ వేంకటేశుఁడింత లోనే నన్నుఁగూడే
పలుమారు నా రతులఁ బాయకుండీఁ గాకా

రేకు: 0469-1 సాళంగం సం: 12-349

పల్లవి: తనకు నాకును జంట తానే యెఱుఁగు నిది
అనిశముఁ జెలులాల అడుగరే యతని

చ. 1: కనుచూపులకు జంట కడలేని యాసలు
మనసుకు జంట నెమ్మదిఁ గోరిక
తనువుకు జంట కాంతాళపుఁ దమకము
ననుపులకును జంట నా నా భోగములు

చ. 2: చక్కఁదనానకు జంట సరస విహారము
అక్కరకును జంట అతిమోహము
చొక్కపు రతికి జంట సొలపుల చిరునవ్వు
జక్కవ చన్నులకును జంట నిండుఁ గౌఁగిలి

చ. 3: కలయికలకు జంట కట్టిన కంకణము
నిలుకడలకు జంట నెక్కొన్న భక్తి
యెలమి శ్రీ వేంకటేశుఁడిన్నిటాను నన్ను నేలే
తలపోఁతలకు జంట తనివోని వేడుకా

రేకు: 0469-2 ధన్నాసి సం: 12-350

పల్లవి: నీ చిత్త మెట్టున్నదో నే మేమి నెఱుఁగము
చూచి మా మనసు లైతే చొక్కి కరఁగీని

చ. 1: సిగ్గరితనాన నిట్టే చెలి తల వంచీఁ గాని
అగ్గమై నీ మోము చూచే ఆస గనము
యెగ్గు పట్టుదువో యంటా నీతల నున్నది గాని
దగ్గరి కౌఁగిలించే తమకమే గనము

చ. 2: గోలతనమున నీకె గుట్టున నున్నది గాని
తాలిమి నీతో మాటాడే తమి గనము
గేలిసేతువో యంటా కేలు చాఁచదు గాని
చాలా గుబ్బల నిన్నొత్తే చలములే గనము

చ. 3: చిన్నతనమునఁ జేఁత సేయక లొంగీఁగాని
వున్నతిని రతి రేఁచే వుబ్బు గనము
యిన్నిటా శ్రీ వేంటేశ యిట్టే యింతిఁగూడితివి
నిన్ను మెప్పించే ననే నేర్పులింకా గనము

రేకు: 0469-3 సాళంగనాట సం: 12-351

పల్లవి: నే నే నీవై వుండఁగాను నేఁడు నీకుగా నిట్టే
పూనుక రా కెటువలెఁ బొంచి వుందు నేను

చ. 1: వూరఁగల సతులు నిన్నొడివట్టి తియ్యఁగాను
దూరక నిన్నిట్టే చూతును నేను
వోరి యని కన్నదెల్లా నొకటొకటే యాడఁగ
వారక నేఁడిపు డెటువలె విందు నేను

చ. 2: వాడవారెల్లా నీ పై వసంతాలు చల్లఁగాను
వోడక నిన్నుప్పగించుకుందునా నేనూ
వేడుక కెవ్వరైనాను వెస నీ తొడ లెక్కఁగా
కూడి యెట్టు వహించుకోకుండుదు నేను

చ. 3: సంత కూటపు వారెల్లా సారె నీమే నంటఁగాను
పొంత నడ్డము రా కెట్టు పోనిత్తు నేను
యింత లో శ్రీ వేంకటేశ యిట్టే నన్ను నేలితివి
సంతోసించుకొంటి నిఁక సాదింతునా నేను

రేకు: 0469-4 శంకరాభ రణం సం: 12-352

పల్లవి: ఆనతీవయ్యె నీ వేళలవి యెట్టో యెఱుగము
వూని నిన్ను విచారించ కూరకుండరాదు

చ. 1: బత్తి తో నెవ్వతె మీఁది పరాకున నున్నాఁడవో
హత్తి నే నీ వేళ మాటలాడ వచ్చునా
కొత్తగా నే యింతిఁ బిల్చుకొనే నని వున్నాఁడవో
యెత్తి నీ తెర దీసి నిన్నిటు చూడవచ్చునా

చ. 2: మఱి యెవ్వతె కీ పొద్దు మాట యిచ్చుకున్నాఁడవో
యెఱుఁగక నీకు వీడె మియ్య వచ్చునా
గుఱిగా నేసతిరాక గోరుక నీ వున్నాఁడవో
తఱితో నిప్పుడు నీ పాదము లొత్త వచ్చునా

చ. 3: అరుదుగా నెవ్వతెకు నాసపడి వున్నాఁడవో
వరుసకు నే నీతో నవ్వఁగవచ్చునా
ఇరవై శ్రీ వేంకటేశ యిట్టే నన్ను నేలితివి
మరిగి నీ గుణములు మఱవఁగ వచ్చునా

రేకు: 0469-5 భైరవి సం: 12-353

పల్లవి: తా నేల పసివాఁడీ దగ్గర రమ్మనవే
నేనే వెజ్జరికము నేరుతు నందుకునూ

చ. 1: యెదిరి వారి చూపులు యెంత దన్ను నాఁటెనో
మదన వేద మంత్రాల మంత్రింతునటే
కదియఁ గాఁ జన్నులు కాయ మెంత వొత్తునో
గుదిగొనఁ గాంతు నటే గోరి వెచ్చ కౌఁగిటా

చ. 2: చెనకే వారి చేఁతల చిత్త మెంత మఱచెనో
మొన గోరి సంజీవి మోపుదు నటే
పెనఁగఁగా మర్మాలు ప్రేమ నెంత గరఁగెనో
తనిపి పేరింతునటే తరితీపు సిగ్గులా

చ. 3: మందవారి మాటలు మరులు గొలిపెనో
దిందుపడ వలపు ల మందిత్తునటే
అందపు శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
చెందె నన్ను నిఁక నిట్టే సేతు నటే సేవలూ

రేకు: 0469-6 ముఖారి సం: 12-354

పల్లవి: అట్టే తానెంత వాఁడైనా నాయఁగాక
వొట్టు కొన్న మగతన మూర కేలుండీనే

చ. 1: కన్నుల నింతిఁజూచితే కలుగుఁ జుట్టరికము
వన్నెల మాట లాడితే వావి గూడును
సన్నలు సేసితేనే సమ్మందము గలసు
పన్ని కాంతలతో నేల పంత మాడీనే

చ. 2: చిఱునవ్వు నవ్వితేనే సిగ్గులు దానే తేరు
మఱుఁగునఁ బొలసి నా మర్మాలంటును
గుఱుతులు వినుకొన్నాఁ గూటములు పెనగొను
యెఱుఁ గుదుఁ దననేమ మెంతని చెప్పీనే

చ. 3: కదిసి యెదుట నుంటే కౌఁగిటికిఁ జేతులంటు
మదిఁ దల పోసితేనే మరుగుఁదమీ
యిదివో శ్రీ వేంకటేశుఁడిట్టే తా నన్ను నేలె
చెదరని ప్రియ మెంత చెల్లఁబెట్టీ ని

రేకు: 0470-1 కాంబోది సం: 12-355

పల్లవి: పతి వద్ద నెటువలెఁ బండీనో కాని
కతకారితనముల కసుఁగంద దిపుడు

చ. 1: కాటుక చెదరకుండఁ గలికి చూపులు చూచి
మాటలాడీఁ బెదవులు మాఁగఁ బెట్టుక
గాట్టపుఁ గస్తూరిబొ ట్టెక్కడ మాయకుండా మొక్కె
జూటరి దీనిపగటు చూడరే వో చెలులు

చ. 2: కొప్పు జారీ నంటాను కూచున్నది కదలక
వొప్పుగఁ దమ్మ మెదుగకుండా నవ్వీని
విప్పక పయ్యద నెరివిరుగకుండాఁ గప్పె
దిప్పకాయ దీని గుట్టు తెలియరే చెలులు

చ. 3: చన్నులు వాలకుండా సారె రవికె బిగించి
సన్న సేసె సింగారము సళ్లకుండాను
ఇన్నిటా శ్రీ వేంకటేశుఁ డితఁ డే తన్నుఁగూడె
వన్నెలాఁడి దీని ఇచ్చ వత్తమే చెలులు

రేకు: 0470-2 వరాళి సం: 12-356

పల్లవి: పచ్చి చిగురు వంటిది పాయ మనవే
మచ్చికతో నన్ను నిఁక మన్నించు మనవే

చ. 1: వలచిన వారి నేప వల దనవే కడుఁ
గలసిన పొందు మానఁ గాఁగా దనవే
పిలిచి వూరకుండేది వెలి తనవే ఆస
కొలిపి కూడకుండితే కొలగాదా యనవే

చ. 2: తగులై మరి యలుగఁ దగ దనవే
జిగిఁ జెట్ట వట్టే గుట్టు చెల్ల దనవే
మొగము చూచి కొంకితే మోస మనవే
నగి చెనక కుండితే నెగు లంటు ననవే

చ. 3: యెనసేటి చోట సిగ్గు లేఁటి కనవే
గొన కొన్న రతి జాగు గూడ దనవే
ననిచి శ్రీ వేంకటాద్రిఁ దనిసితి మిద్దరము
మనసులో తమకము మానుపరా దనవే

రేకు: 0470-3 తెలుఁగుఁగాంబోది సం: 12-357

పల్లవి: చేరి మమ్ముఁ జూచి యేల సిగ్గు వడేవు
గారవించితే దోసమా కాంతను నీ విపుడు

చ. 1: పాలిండ్లు గానరాఁగా పయ్యద గొంత జారఁగా
సోలి విన్నపాలు సేసీ సుదతి
వాలుఁ గన్నులు దేలించి వడి శిరసు సెత్తి చూచి
జాలిఁ గూరిమి గొసరీ చనవియ్యవయ్యా

చ. 2: చెమటలు గారఁగాను జిగిఁ గళ లుబ్బఁగాను
జమళిఁ బాదా లొత్తీ సకియా
తమ రేఁ చఁ గా వలపు దైలువారఁ గా నవ్వి
సమరతికిఁ బెనఁ గీ సమ్మతించవయ్యా

చ. 3: కొప్పు పువ్వు లటు రాల కొంకి పోఁకముడి వీడ
నెప్పునఁ గౌఁగిట నించీ నెలఁతా
యిప్పుడే శ్రీ వేంకటేశ యీకెఁగూడి నన్నేలితి
వప్పటి నిన్నాసపడీ నాదరించవయ్యా

రేకు: 0470-4 పాడి సం: 12-358

పల్లవి: వేఁడుకోఁగాఁ దన మాట విన ననేనా
పోఁడిమితోఁ దన్ను నేను బుట్టే డిగేఁగాకా

చ. 1: బలిమిఁ జేసిన పొందు పస చాలదు
పిలువక వచ్చేరాక ప్రియము గాదు
చలాలకు నవ్వే నవ్వు చవి పుట్టదు
తెలిపి చెప్పరే యీ తెఱఁగు లాతనికి

చ. 2: మనసు రాని మాట మఱువ రాదు
ననచని సరసము నాఁటుకొనదు
పని లేని వినయాలు పాదుకొనవు
వినిపించరే యీ విధము లాతనికి

చ. 3: ఆసతోఁ జూడని చూపు అంటుకొనదు
వేసరిన రతులకు వేడుక లేదు
సేసవెట్టి నన్నుఁదానే శ్రీ వేంకటేశుఁడు గూడే
లాసి తలఁపించరే యీ లాగు లాతనికి

రేకు: 0470-5 సింధురామక్రియ సం: 12-359

పల్లవి: మాకుఁ దెలియవు మీ మర్మము లెటువంటివో
జోకతో దువ్వుల నుండే చూచి తనివాయను

చ. 1: సిరుల నవ్వుల నాకె సేసిన నిన్నపాలు
తరితీపై యవి నీ చిత్తానఁ బట్టేనా
సరుసఁ గూచుండి యాకు సారె మడి చిచ్చె నీకు
సరసపు వేడుకతో చవులాయనా

చ. 2: సిగ్గులు వడుతా నీ చేతి నెటికలు దీసె
అగ్గమై నీలోని యాయాలు ముట్టేనా
నిగ్గుల గోర గీరి ని తురుము చక్కఁబెట్టె
వొగ్గి నీ మనోరథాలు వొనగూడెనా

చ. 3: వొంటి నుండి సేయరాని పూడిగా లెల్లాఁజేసె
జంటలై చుట్టరికాలు సమకూడెనా
యింటనే శ్రీ వేంకటేశ యిటు నన్ను నేలితివి
అంటి నే చిత్తమునకు నానందమై వుండెనా

రేకు: 0470-6 ముఖారి సం: 12-360

పల్లవి: వూరకుండ నేఁటికే వువిద నీకు
చేరి చేరి చెనకితే సిగ్గుదేరుఁ గాకా

చ. 1: యెరవు లేని పతితో నెడమాట లాడ నేల
సరసము లాడితేను చవిగాకా
విరుల వేయఁగాను వెఱగులు వడ నేల
మరలఁగ వేసితేను మచ్చిక లవుఁగాకా

చ. 2: మచ్చిక సేయఁగానే మనసు సాదించ నేల
యిచ్చగించి వుండుటే యింపుఁగాకా
అచ్చలాస నవ్వఁగాను ఆనుమానించఁగ నేల
కుచ్చి కౌఁగిలించుకొంటే గుఱుతులౌఁగాకా

చ. 3: కూడి మాడి వుండఁగా నీ గుణాలు వెదక నేల
జోడైన రతులఁ బొంది చొక్కుట గాకా
యీడనే శ్రీ వేంకటేశుఁడేలె నన్ను నింతలోనె
వాడికలు సేసుకొంటే వసమౌఁగాకా

రేకు: 0471-1 హిజ్జిజి సం: 12-361

పల్లవి: ఇంత గుట్టు సేసుకొని యేమి గట్టు కొనేవే
చెంత నుండి యాస తోనెఁ జెనకఁ గాను

చ. 1: కలువ కన్నుల చూపు గాటేఁ బోసుకొనేవటే
పొలసి మోమెత్తి యిటు చూడఁ జాలవు
వలనైన చిరునవ్వు వడ్డి రెచ్చుకొనేవటే
వెలయ నీ వెంత నవ్వించినా నగవు

చ. 2: కొండల వంటి కుచాలు గూఁటఁబెట్టు కొనేవటే
దండిగాఁ బయ్యద మూసి దాఁచు కొనేవు
పండిన జవ్వన మిదె పాఁతర వేసేవటే
వుండబో ముసుఁగు వెట్టు కూరకే వున్నదానవు

చ. 3: ముచ్చట మాటలాడక మూట గట్టు కొనేవటే
తచ్చన మోసముతోఁ బెదవు లెత్తవు
ఇచ్చటఁ జుట్టమ వైతి వేను శ్రీ వేంకటేశుఁడు
మచ్చిక లన్నిటాఁ జల్లి మంతన మాడేవూ

రేకు: 0471-2 లలిత సం: 12-362

పల్లవి: ఔనయ్య మంచివాఁడ వండకు వచ్చిన దాని
పూని యలయించే వింత కోపునటవయ్యా

చ. 1: తనువెల్ల జెమరించె దప్పి దేరె మోవి మీఁద
ననుపున నింతి నెంత నవ్వించేవయ్యా
పెనగొనె హారములు బేఁట్లు రాలె గందము
చెనకి యప్పటి నేల సిగ్గు రేఁచేవయ్యా

చ. 2: వెలయఁ దురుము జారె వేడుకల దగ దొట్టె
చలాల నెంత సేసలు చల్లించేవయ్యా
పులకలు గడు నిండె పోఁక ముడి వీడెను
అలరి యెంత వసంతా లాడించేవయ్యా

చ. 3: కాటుక కప్పు దేరె గక్కనఁ బయ్యె దెడలె
సూటి నెంత చిత్తరువు చూపించేవయ్యా
గాటాన శ్రీ వేంకటేశ కౌఁగిలించుకొంటి విట్టే
మాటి మాటికి నెంత మరిగించేవయ్యా

రేకు: 0471-3 కన్నడగౌళ సం: 12-363

పల్లవి: మాన లేను నీ పొందు మరి నిన్నుఁబాయలేను
యే నెపము లెట్టుండునో యేమి సేతు నేను

చ. 1: చక్కని నీ రూపమె సారెకు నేఁ జూఁ డగాను
తక్కక నీకు దిష్టి దాఁకె నందురో
మక్కువ మాటలాడఁగా మర్మా లెందు సోఁకునో
యెక్కడని తలపోతు నేమి సేతు నేను

చ. 2: చనవుతో నెప్పుడు నీ సంగడినేఁ బడుండఁగ
చను మొనలు నిన్నెట్టు జంట నొత్తునో
పెనఁగఁగా రతులలో బిట్టు గా నీ వలతువొ
యెనగొని మతిఁజింత లేమి సేతు నేను

చ. 3: చలపట్టి నీ తోను సరసము లాడఁగాను
కలయికలకు నెంత కరఁగుదువో
అలరి శ్రీ వేంకటేశ అంతలో నన్నేలితివి
యెలమి నివ్వెఱఁ గైతి నేమి సేతు నేనూ

రేకు: 0471-4 రామక్రియ సం: 12-364

పల్లవి: యెందు వోయీ నీ మోహము యేల వేగిరించేవు
చెందిన దాన నే కానా చెనకేవు గాక

చ. 1: గుట్టున నా చన్నులు నీకు మీఁదెత్తినవే కావా
బెట్టుగాఁ బెనఁగి చేతఁబట్టే వు గాక
నెట్టన నా చూపులకు నీవే గుఱిగావా
యిట్టే నావంచిన తల యెత్తేవు గాక

చ. 2: నిరతి నా చిఱునవ్వు నీ మీఁదఁ జల్లేదే కాదా
కెరలింపు మాటల రేఁగించేవు గాక
ధర నా మనసు నీకు దక్కి వుండినదే కావా
కరఁగించి భ్రమయించి కై కొనేవు గాకా

చ. 3: వుమ్మడి నా మేను నీ సొమ్మై వుండినదే కాదా
నెమ్మది నీ కౌఁగిట నించేవు గాకా
యిమ్ముల శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
నమ్మి కెచ్చి ననుపులు నటించేవు గాకా

రేకు: 0471-5 నాగవరాళి సం: 12-365

పల్లవి: వేవేలు సతులు గల విభుఁడవు
సేవలు సేయకుండితే చిత్తగించేవా

చ. 1: విన్నపాలు సేసితే వేడుకలు రేఁగును
కన్నులెదుట నుండితేఁ గనుపట్టును
సన్నలు సేసితేను చవులెల్ల నొనగూడు
మన్నింతు వంటా రాకుంటే మాటలాడేవా

చ. 2: కతలు సారెఁ జెప్పితే కైవసమౌ నేస్తము
తతి వేళ గాచితేను దయ పుట్టునూ
రతికెక్కఁ గొలిచితే రచన లెల్లా నీడేరు
అతి రాజసాన నుంటే నంటి నవ్వేనా

చ. 3: పాదము లొత్తితేను భావములు గరఁగును
పోదితోఁ జెనకితేను పొడముఁదమి
యీ దెస శ్రీ వేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
పాదుకొని లోన నుంటే బాఁతి పడేవా

రేకు: 0471-6 నాదరామక్రియ సం: 12-366

పల్లవి: యేల వొట్లు వెట్టేవు యెంత వేగిరించేవు
యేలికవైతే నేమి యింత గద్దా నగవూ

చ. 1: అలిగి వేఁడుకొని ఆదరించవలెఁ గాని
చలానఁ బెనఁగ నేల సతి తోను
పలుక కుండితే నొడఁబరచఁగవలెఁ గాని
బలిమిఁ గొంగు వట్టితేఁ బంతము వచ్చీనా

చ. 2: చింతఁ దలవంచు కొంటే చెక్కు నొక్కవలెఁ గాని
యింత నేరుపులు చెప్ప నేల యీకెతో
పొంతఁ గన్నీరు నించితే బుజ్జగించవలెఁ గాని
యెంత బుద్దులు చెప్పినా నియ్యకోలయ్యీనా

చ. 3: కడు నుసురంటేను కౌఁగిలించవలెఁ గాని
వొడివట్టి తియ్య నేల వూర కీకెను
విడె మిచ్చి యింతలో శ్రీ వేంకటేశ కూడితివి
బడివాసి వుండితేను బత్తి వెలి తయ్యీనా

రేకు: 0472-1 ముఖారి సం: 12-367

పల్లవి: యేల బూటకాలు సేసీ యింటికి రమ్మనవే
చాలఁ దల దడిసితే చలి వాసు ననవే

చ. 1: ఆపెకు లోఁగేవాఁడు అనుమానించేవాఁడు
చేపట్టి నాఁడేల నాకు సేస వెట్టే నే
పై పై సన్న సేసేవాఁడు పరాకు చుపేవాఁడు
వోపికతోఁ దన వేలి వుంగర మేలంపెనే

చ. 2: యింత మొగమోటవాఁడు ఇంతికి వెరచే వాఁడు
రంతుల నా వలపేల రచ్చఁబెట్టే నే
మంతనపు మాటవాఁడు మరి గుట్టు తోడివాఁడు
వింతలే కతగఁ బెండ్లి వీడే లెట్టు వెట్టే నే

చ. 3: సెలవి నవ్వేవాఁడు సిగ్గులు వడేవాఁడు
కలసి నన్నేటువలెఁ గౌఁగిలించెనే
యెలమి శ్రీ వేంకటేశుఁడిందరి నేలినవాఁడు
కలసి మాలోన నొక్కటి యెట్టు సేసెనే

రేకు: 0472-2 నాదరామక్రియ సం: 12-368

పల్లవి: నీ యిచ్చ రాజవు తొల్లే నీవు మమ్మే లొరసేవు
చాయ కొత్తి నీ గుణాలు చక్కఁబెట్టేమా

చ. 1: వొద్దికైన మాటలకు వూఁకొనఁ గవచ్చుఁగాక
పొద్దువోని మాట లెల్లా బుద్దిఁ బట్టీనా
చద్దికి వేఁడికి నీవు జాణతనా లెన్నాడినా
వద్దనేమా వూరకుండేవార మింతేకాక

చ. 2: యితవైన పనులకు నియ్యకొనవచ్చుఁ గాక
రతి కెక్కని పనులు గతి గూడీనా
మతకారి తనమున మరి నీ వెంత నవ్వినా
మితిమీరేమా నీ యిచ్చ మెలఁగేము గాకా

చ. 3: కూడిన వేడుకలకు గుఱిగాఁగవచ్చుఁగాక
యేడ కేడో వేడుకల కింపు వుట్టీనా
వీడె మిచ్చి నన్ను శ్రీ వేంకటేశ యేలితివి
ఆడుకొని సొలసేమా అవు ననేము గాకా

రేకు: 0472-3 బళహంస సం: 12-369

పల్లవి: యెటువంటి వేడుకలో యిద్దరికిని
తటుకన మీ కతలు తరితీపులయ్యా

చ. 1: కలువ రేకుల వంటి కన్నుల నీవు చూచితే
చెలి యాల సిగ్గువడెఁ జెప్పవయ్యా
సెలవులఁ గొంత కొంత చిఱునవ్వు నవ్వితేను
మొలక చన్నులేల మూసుకొనే నయ్యా

చ. 2: పరువాన పూబంతి పరిమళము చూచితే
శిరసేల వంచెఁ దాను చెప్పవయ్యా
సిరుల పంజరములో చిలుకతో మాటాడితే
పరాకు సేసుక తాను భావించ నేలయ్యా

చ. 3: సముకాన నుండి నీవు సారె సింగారించుకొంటే
చెమరించఁ దనకేల చెప్పవయ్యా
అమర మమ్మేలితివి అన్నిటా శ్రీవేంకటేశ
రమణి యెన్నఁడు నీతో రతిఁగూడీనయ్యా

రేకు: 0472-4 కురంజి సం: 12-370

పల్లవి: తడఁబడె నా మది తన కౌనో నా కౌనో
చిడి ముడి నాతనికిఁ జెప్పరే యీ కతలు

చ. 1: పెనగొని మాటలాడఁ బెదవులు వేగిరించీ
తన చిత్త మెట్టున్నదో తలఁచరాదు
కనుఁగొనలఁ దనుఁ జక్కఁగఁ జూడకుండరాదు
వొనర నెంత నాఁటునో వోరువరాదు

చ. 2: కాయము తోడి లంకెలు కరములఁ దొట్టు కొనీ
ఆ యెడ నెం తలసునో అదియుఁగాదు
పాయపు మదము గుబ్బలు తన పొందు గోరీ
ఆయము లేడ సోఁకునో అంత కోప రాదు

చ. 3: జవ్వనానఁ గల సిగ్గు సమరతు లాసపడీ
నవ్వు లెట్టున్నవో నాతోఁ దనకు
యివ్వల శ్రీ వేంకటేశుఁడేలె నన్ను మెచ్చితే
రవ్వ లెంతౌనో యీరతి చెప్పరాదూ

రేకు: 0472-5 సాళంగనాట సం: 12-371

పల్లవి: యెఱుక సేసుకొందురా యీ పనులు
మఱుఁగున దాఁగితే మందలించవలెనా

చ. 1: తరుణి తన్నుఁజూచె తలవంచుకొంటి నేను
వొరసి నన్నేల తాను వొడివట్టీనే
సరసము లాడఁగాను తెరవేసుకొంటి నేను
సరుగ వచ్చి నా కెంత సమ్మతించఁ జెప్పీనే

చ. 2: సుదతి తనతో నవ్వె సురటి మాటిడుకొంటి
గుదిగొని నన్ను నేల గోర సూఁదీనే
కదిసి యాపె వుండఁగా కడ చిత్తరు చూచితి
చెదరక నన్ను నెంత చెక్కులు నొక్కీనే

చ. 3: ఇంతి దనకొప్పు దువ్వె నివ్వలిమోమైతి నేను
ఇంతలోనే తా నేల నా యిక్కు వంటీనే
చెంత నాకె పొందు చూపి శ్రీ వేంకటేశుఁడు తాను
యెంత నన్ను గూడి తాను ఇంపులు చల్లీనే

రేకు: 0472-6 పాడి సం: 12-372

పల్లవి: సతి చేతలకు నన్ను సంతోసించు కొమ్మనీని
ఇతవౌనా నా కవి యెటువంటి వాఁడే

చ. 1: సొలసి తనతో నాపె సుద్దు లెల్లాఁ జెప్పఁగాను
యెలమి నే వద్ద నుండి యెట్టు విందునే
వలపులు చల్లి యాలవట్టము తన కిడఁగా
వొలిసి యందుకు నెట్టు వోర్చుకొని వుందునే

చ. 2: కొచ్చి కొచ్చియాపె దన్ను కుచముల నొత్తఁగాను
యిచ్చగించి నే నప్పు డెట్టు చూతునే
పచ్చిదేరఁ బానుపుపై పాదా లాపె పిసుకఁగా
కచ్చుపెట్టి యెట్టు పొత్తు గలసి లో నౌదునే

చ. 3: కూరిమిఁ దనకు నాపె కొలువులు సేయఁగాను
ధీరత నే నెట్టు సమ్మతించు కొందునే
యీ రీతి శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
తేరెఁ బనులిఁక నెట్టు తెలియఁ జెప్పుదునే

రేకు: 0473-1 గౌళ సం: 12-373

పల్లవి: నాకు మొకమోడి యాకె నను పేల దాఁచేవు
జోక తోడ మాటలాడి సోదించరాదా

చ. 1: నిక్కి నిక్కి యదే చెలి నీవంక చూచీని
దిక్కుల నాపె తలఁపు దెలియరాదా
చెక్కుపైఁ బెట్టిన చేతఁ జిరునవ్వు మూసీని
అక్కఱతో నదేమని యడుగరాదా

చ. 2: ఆడుకొనీఁ జెలి తోడ నాకె నీ సుద్దులో యేమో
వేడుకతో నీ వవి వినరాదా
తోడనే నిమ్మ పండ్లు చేతులఁ బట్టు కున్నది
యీడ నీకుఁ గాను కిచ్చీనెమో అందరాదా

చ. 3: కూరిమి తోడుత నాపె కొంగు నిన్నుఁ దాఁకించీ
నేరుపుతోఁ గౌఁగిట నించరాదా
యీరీతి శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
గారవించి యాపె గుట్టు గనుకోరాదా

రేకు: 0473-2 వేళావళి సం: 12-374

పల్లవి: ఆతని కన్నియు నింపులై యుండఁగా
యీతల వెరగువడ నేలే యేవ్వరికి

చ. 1: వలసిన రమణుని వనిత సొలసితేను
వెలయ వినఁగ నేలే వేరొకతెకు
చెలరేఁగి యాతఁడాపె చేతికి లోనై వుండఁగా
వలవని వాదు లేలే వద్దివారికి

చ. 2: సిగ్గువడ కాపె పతిఁ జెరఁగువట్టి తియ్యఁగా
వొగ్గి విడిపించ నేలే వున్నవారికి
యెగ్గు లే కాతని కవి యేలాటాలై వుండఁగాను
కగ్గి కాంతాళించ నేలే కన్నవారికి

చ. 3: మక్కువ నాపె గునిసి మగని తోఁ బెనఁగఁగా
చక్కట్లు దిద్ద నేలే సవతులకు
యిక్కువ శ్రీ వేంకటేశుఁడితఁడే మనలఁగూడే
పక్కణ లడుగ నేలే వావి గలవారికి

రేకు: 0473-3 ఆహిరి సం: 12-375

పల్లవి: చెప్పితినేఁ దొలుతనే చెలులు సాకిరిగాఁగ
తప్పు లేదు నావల్లఁ దలఁచుకోరా

చ. 1: జక్కవ చన్నులు నీవు సారెఁ బట్టకురా
పక్కనను నీవురముపై కెగరీని
వుక్కుగోరిదాన నన్ను నొరసి చూడకురా
చెక్కు లేడ సోఁకినాను జీరవారీని

చ. 2: తుమ్మెద రెక్కల కొప్పు దువ్వ నీవు రాకురా
జుమ్మన రేఁగీని మైఁ జుట్టు కొనీని
తమ్మి కన్నుల నా చూప దార దడవకురా
నమ్మి పొందు సేసితేను నాఁ టుకొనీని

చ. 3: మోవి పంటి తేనెకు ముంచి నోరూరకురా
నా వాఁడవైనా నీకు నాము లెక్కీని
యీ వేళ శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
భావించి చూచుకొంటేను పచ్చిదేరీని

రేకు: 0473-4 ఆహిరి సం: 12-376

పల్లవి: యేఁటికి దూరె విటు నన్ను నీ
నాఁటకములు గని నవ్వితిఁ గాకా

చ. 1: చలమా నీతో సరి పెనఁగఁగ నీ
కొలఁదెఱుఁగక నేఁగొంకేఁ గాకా
బలిమా నే నీ పయిఁజేయి వేయఁగ
చెలిమికత్తెనై చెలఁగేఁ గాకా

చ. 2: నీటా నీతో నివ్వెఱఁ గందఁగ
జూటరి యాసలఁ జూచేఁ గాకా
సాటి వచ్చెనా చనవు నీ వియ్యఁగ
కూటువని సరిఁ గూచుండేఁ గాకా

చ. 3: యెదురా గుబ్బల నిటునే నొత్తఁగ
అదనని కౌఁగిట నలమేఁ గాకా
యిదివో శ్రీ వేంకటేశ నన్నేలితి (వి)
పొదుగఁగ నీ నేర్పు పొగడేఁ గాకా

రేకు: 0473-5 శంకరాభ రణం సం: 12-377

పల్లవి: వారిఁ జూచె దాని వలుపే చూచుట గాక
సారె నీకిచ్చుక మౌటే సంతోసము నాకూ

చ. 1: కడఁగి నీ సతు లెంత గర్వముతో నుండినాను
అడియాలమగు మాట లాడింతు నేనూ
వుడివోని నీ మన్నన నుల్లసము లాడినాను
యెడనెడ నందుకుఁగా నెగ్గుపట్ట నేనూ

చ. 2: కసరి సవతులు మొగాలు ముడుచుకొన్నాను
ముసిమి చెప్పి నవ్వించి మొక్కుదునేను
వసగాని కాంతాళాల వాదుకు వచ్చినాను
పొసఁగి చుట్టరికానఁ దొందు సేతు నేనూ

చ. 3: పక్కన నీ దేవుళ్ళెంత పంతాలు మెఱసినాను
మిక్కిలిఁ బొగడుతాను మెచ్చి చెల్లింతు
మక్కువతో నలమేలుమంగ శ్రీ వేంకటేశ్వర
యిక్కడ నన్నేలితివి యిందరిదాన నేనూ

రేకు: 0473-6 నాదరామక్రియ సం: 12-378

పల్లవి: తనమేలే నామేలు తగ నాకు ఫలియించీ
వినయానఁ బతి కిట్టే విన్నవించరమ్మా

చ. 1: చెలఁగి తనపై నాకు చింత లెంత ముంచుకొన్నా
తలఁపు లీడేరుఁగా తనకైనాను
బలువిరహాన నామై పచ్చి కాఁకఁ బొరలినా
చలువై వున్నది గదా చక్కని తన మేను

చ. 2: అట్టే నేఁ దనయడి యాసల నెర తలసినా
వొట్టుక బలిమి కాఁడై వుండుఁగా తాను
అట్టడి నావలపు లాఱడిఁ బడి వుండినాను
గుట్టు తనకుఁ గద్దుగా కొలువులో నెపుడు

చ. 3: బడలి పానుపు మీఁదఁ బయ్యద నాకు జారినా
కడఁగి పచ్చడము దాఁగప్పినాఁడుగా
యెడయక శ్రీ వేంకటశుఁడేలె నన్నింతలో
కడుఁ దానే నాపై నింత కరుణ గలఁదుగా

రేకు: 0474-1 రామక్రియ సం: 12-379

పల్లవి: యెక్కడ పరాకు నీకు నెందు చూచేవు
గక్కన నాపె తమకము చూడవయ్యా

చ. 1: గుబ్బలు గదలఁగాను కొప్పు గొంత జారఁగాను
తబ్బిబ్బుగా హారాలు తడఁబడఁగా
వుబ్బుతోడ వచ్చె నిదె వువిద నీకడకును
పబ్బిననీ మీఁది యాపె బత్తి చూడవయ్యా

చ. 2: గాట్టపుఁ జెమట తోడ గాజులు గల్లనఁగాను
మేటి కుచ్చుల మీఁగాళ్ళమీఁద వాలఁగా
వాటుఁ బరువున వచ్చె వనిత నీ కడకును
ఆఁటదాని యగ్గలిక అటుచూడవయ్యా

చ. 3: తళుకుఁ గమ్మలదర తగనిట్టూర్పులు రేఁగ
పొలుపు టుద్దాలు చప్పుడు సేయఁగా
యెలమి శ్రీ వేంకటేశ ఇంతి వచ్చి నిన్నుఁగూడె
యిల మమ్మేలితి వాపె ఇంపు చూడవయ్యా

రేకు: 0474-2 శంకరాభరణం సం: 12-380

పల్లవి: చిత్తగించవయ్య యీ కొత్త లెన్నఁ డెఱుఁగము
హత్తి యాపె వలపు లేమని చెప్పే మీఁకను

చ. 1: నిన్నుఁబాసి విరహాన నెలఁత తన మొగమే
వెన్నెల రాజని యెంచి విన్ననయ్యీని
కన్నుఁగవ చూపులు కలువ బాణములని
పన్నుక లోలోనె రెప్పలు వంచీని

చ. 2: పక్కన నినుఁ దలఁచి భ్రమసి తన చన్నులే
జక్కవ పిట్టలనుచు సారెఁ గప్పీని
నిక్కిన తన తురుము నిండుఁ దేఁటిపౌఁజని
చక్కఁబెట్టుకో ముడిచి జారివుండినాను

చ. 3: తగ నిన్నుఁబేరుకొని తడఁబడీ పెదవులు
చిగురు టడిదాల నీ చేత మూసీని
నిగిడి శ్రీ వేంకటేశ నీ వింతలోఁ గూడితివి
తగఁదా నెప్పటివలె దైవారీ వేడుకలా

రేకు: 0474-3 వరాళి సం: 12-381

పల్లవి: అల్లంతనుండే మాట లానతీవయ్యా
చెల్లఁబో నీ చెప్పినట్టు సేయ ననేనా

చ. 1: సరుసకు వచ్చి నన్ను సారె వేఁడుకోకువయ్య
నిరతిఁ గొప్పు విరులు నీపైఁ జిందీని
కరములు వట్టి యెంత గారవించ వచ్చేవయ్య
వొరసి నా మాణికాల వుంగరాలొత్తీని

చ. 2: తొడపైకిఁ దీసి యెంత తూరి బుజ్జగించేవయ్య
వడిసీ నా చెవిలో జవ్వాది నీమీఁద
వొడివట్టి నన్నింత వొడఁబరచ నేలయ్య
వుడుకు నిట్టూర్పు గాలి వొళ్ళు సోఁకీని

చ. 3: యిట్టే నన్నుఁ గౌఁగిలించి యెంత లాలించేవయ్య
గట్టి నా చన్నులమీఁది గంద మంటీని
గుట్టున శ్రీ వేంకటేశకూడి యాదరించేవయ్య
ముట్టి నామదము నిన్ను ముంచుకొనీని

రేకు: 0474-4 ఆహిరి సం: 12-382

పల్లవి: యేల మూసీ మంతనాలు యెదిరించి నా పనికి
వాలాయ మింత గలిగితే వద్దనేమా నేము

చ. 1: సందడి నుండీతని సారెకుఁ జూడఁగ నేల
ముందరికి వచ్చి యిటు మొక్కగదవే
పొందుగా సన్నల వలపులు చల్ల నీ కేల
అందుకొనీఁ గాని బాగా లంపవే నీవు

చ. 2: చెలుల మాటున నుండి సిగ్గులు వడఁగ నేల
అలరి మాట లాడుదు వండకు రావే
నిలిచి కొలువు సేసి నివెవ్వఱఁగు వడనేల
బలిమిఁ గిందఁ గూచుండి పాదా లొత్తవే

చ. 3: పయ్యద మఱఁగుననే పచ్చినవ్వు నవ్వ నేల
చయ్యనఁ గూడి మోవి చవి చూపవే
యియ్యెడ శ్రీ వేంకటేశుఁడిన్నిటాను నన్నుఁగూడె
చెయ్యార నీవు ననుపు సేసుకొనవే

రేకు: 0474-5 ప్రతాప నాట సం: 12-383

పల్లవి: పురాణ పురుషుఁడు భువి నవతరించెను
సిరుల జయంతి నేఁడు సేయరో పండుగలూ

చ. 1: శ్రావణ బహుళాష్టమిఁ జందురుఁ డుదయించెను
ఆ వేళ రోహిణిని అర్ధమ రాతిరి కాడ
దేవకి కృష్ణునిఁ గాంచె దేవతలు నుతియించ
చేవ దేరెఁ బనులెల్లా సేయరో పండుగలూ

చ. 2: నందుని మందకు నేఁగినాఁడే వసుదేవుఁడు
కందువఁ గృష్ణు నెశోదకడఁ బెట్టి మాయఁదెచ్చి
యిందమని కంసు చేతి కిచ్చితే మాయాదేవి
చెంది విడిపంచుకొనె సేయరో పండుగలూ

చ. 3: చిన్న కృష్ణుఁడై పెరిగి చేరి కంసుఁ బొరిగొని
యెన్న శ్రీ వేంకటేశుఁడై ఇందరిఁగాచీ నిటె
వున్నది యలమేల్మంగ పురమున నితనికి
చెన్నుమీఱి దాసులెల్ల సేయరో పండగలు

రేకు: 0474-6 బౌళి సం: 12-384

పల్లవి: యెటువంటి యాగడీఁడే యీ కృష్ణుఁడు
జొట జొటఁ గారఁ గానే జుట్టీ మీఁగడలు

చ. 1: కొట్టేఁ గృష్ణుఁడు వాఁడె కోలలెత్తి వుట్లపై
దట్టముగ గొల్లెతలు దాఁచిన పాలు
చుట్టిన చక్కిలములు చొక్కపు నురుగులునుఁ
బెట్టిన కాఁగులతోనే పెంచులుగఁజేసీనే

చ. 2: దొంతులు దించి దించి దొరకొనీ కృష్ణుఁడు
బంతిఁ జక్కెర వెట్టీ గోపాలుల కెల్ల
మంతనాన వద్దని మానుపఁబోతేఁదాను
కొంత వారి నోరఁ బెరుగులు చమరీనే

చ. 3: వీదు లెల్లఁ దానె శ్రీ వేంకటాద్రికృష్ణుఁడు
ఆదిగొని మెసగీని యడుకు లెల్ల
కాదని పెనఁగితేను కౌఁగిలించి గొల్లెతల
సోదించి కుచములంటి సొంపు గాఁగూడీనే

రేకు: 0475-1 శుద్ధవసంతం సం: 12-385

పల్లవి: వలపుల సొలపుల వసంతవేళ యిది
సెలవి నవ్వకువే చెమరించీ మేను

చ. 1: శిరసు వంచకువే సిగ్గులు వడకువే
పరగ నిన్నతఁడు తప్పక చూచీని
విరులు దులుపకువే వెసఁ దప్పించుకోకువే
సిరుల నీవిభుడిట్టే సేసవెట్టీని

చ. 2: చేయెత్తి యొడ్డుకోకువే చేరియాన వెట్టకువే
చాయల నాతఁడు నీ చన్నులంటీని
ఆయములు దాఁచకువే అట్టే వెరగందకువే
మోయ నాడీ సరసము మోహాన నీ విభుఁడు

చ. 3: పెనఁగులాడకువే బిగువు చూపకువే
ఘన శ్రీ వేంకటేశుఁడు కౌఁగిలించీని
అనుమానించకువే అలమేల్మంగవు నీవు
చన విచ్చి నన్ను నేలె సమ్మతించియాతఁడూ

రేకు: 0475-2 మధ్యమావతి సం: 12-386

పల్లవి: యేమయ్య వట్టికత లేల గడించుకొనేవు
నేమపు నా గుణములు నీవే యెఱుఁగవా

చ. 1: దొంతి నున్న నా వలపు తూరుపెత్తితిఁ గాక
పంతము చూపితినా పదరినీకు
చింత లెల్ల బొఁ జు చూచి చెక్కుచేత నుంటిఁగాక
అంతరంగమున నీతో నలిగి వుండితినా

చ. 2: మువ్వంక నా సిగ్గులు మూలల దాఁచితి గాక
అవ్వలి మోమైతినా అప్పటి నీతో
పువ్వు వంటి యాస ముడుపుగఁ గట్టు కొంటిఁగాక
నివ్వటిల్లు బొమ్మముడి నీపైఁ బెట్టి తినా

చ. 3: గక్కన నా జవ్వనము కానుక వట్టితిఁ గాక
వుక్కుమీఱి గుబ్బల నిన్నొరసితినా
అక్కున శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
మొక్కితిఁగాక రతుల మొనగో రూఁదితినా

రేకు: 0475-3 దేసాళం సం: 12-387

పల్లవి: మీ కెంత వేడుకలైన మేలే మాకు
మా కెలయ్యు మీలో మీకు మచ్చురాలు రేఁచను

చ. 1: మనసిచ్చి నీ దేవులు మంచి మాట లాడఁగాను
పని వూని చెలులము పంతమాడేమా
ఘనమై నీచేఁత లాపె కప్పిపెట్టు కుండఁగాను
వినయపు నేము నిన్ను వెల్లివిరి సేసేమా

చ. 2: యెఱిఁగెఱిఁగి నీ కాపె ఇచ్చకము సేయఁగాను
గుఱియైన చెలులము కోపగించేమా
మఱియు నీ సుద్దు లాపె మరపించి దాఁచఁగాను
తఱి తోడ నే మవి తారుకాణఁ బెట్టేమా

చ. 3: నీడయ్యై యలమేల్మంగ నిన్నుఁ గౌఁగిలించఁగాను
వూడిగపు చెలులము వొద్దనేమా
యీడు జోడై శ్రీ వేంకటేశ నీ వాకెఁ గూడఁగా
వేడుకై వుండేము గాక వింత సేసేమా

రేకు: 0475-4 ఆందోళి సం: 12-388

పల్లవి: యేల మాతో నీడువెట్టే వెవ్వరినైనా
గాలి ముడియ గట్టితే గట్టిపడీనా

చ. 1: కలువల వేసేవారు కాఁకలు చల్లేవారు
యెలమి నీకుఁ జుట్టా లెందరులేరు
తలఁబాలు వోసిన తరుణులే గుటిగాఁగఁ
దెలిపి చెప్పేయట్టి దేవుళ్ళు గాకా

చ. 2: పొందులు సేసేవారు పొద్దులు వుచ్చేవారు
యిందు నందు వెదకితే నెందరు లేరు
కందువ సమ్మంధపు కలయిక గుటిగాఁగ
నందముగఁ జెప్పె వారాండ్లు గాకా

చ. 3: సారెకు నవ్వేవారు సరస మాడేటివారు
యీరీతి శ్రీ వేంకటేశ యెందరు లేరు
మేరఁ గంకణదారాల మెలఁతలే గుటిగాఁగ
కోరి వేడి చెప్పే పెండ్లికూఁతులు గాకా

రేకు: 0475-5 భైరవి సం: 12-389

పల్లవి: చెప్పవమ్మ నిన్నుఁజూచి చిత్తము నివ్వెఱఁగాయ
చొప్పులు రెంటికి వచ్చుఁ జూచిన చెలులకూ

చ. 1: చెక్కుల జవ్వాది గారీ చెమటలు మేన నూరీ
ముక్కున నిట్టూరుపు ముంచీ నిదేమే
గక్కన నీ చన్నులపై గందపుఁ బేట్లు రాలె
నక్కజపు రతియో ఆతనిపై యలుకో

చ. 2: పువ్వులకొప్పు చెదరె పొందుల సందులదరె
నివ్వటిల్లు దువ్వటము నెరివిరిగే
అవ్వల నివ్వలయై హారములు దడఁబడే
నవ్వితివో పతిమాట నాఁటఁ బెనఁగితివో

చ. 3: చుక్కలు మోవిఁ బొడమె చూపులుఁ గెంపుదడమె
కిక్కిరించిన కళలు గిజ్జిడిగొనె
యిక్కువ శ్రీ వేంకటేశుఁడింతలో విచ్చేసి కూడే
మిక్కుటపు సరసమో మెలఁగిన సిగ్గులో

రేకు: 0475-6 సాళంగం సం: 12-390

పల్లవి: వేడుక గల వారికి వెంగెములే హితవౌను
పొడిపంతా లిందు నేల పచారించేవయ్యా

చ. 1: కాంతలు పతితోడుత కసరినాఁ గొసరినా
వింతతమి వుట్టుఁగాక వేసదయ్యీనా
అంతరంగపు సుద్దులు ఆకెకు నీకుఁదెలుసు
చెంతనున్న మా కేమి చెప్పేవయ్యా

చ. 2: అంగనలు వద్దనుండి అలసినా సొలసినా
సంగతులే అవుఁ గాక చవుక లయ్యీనా
యింగితపు మీభావాలెట్టుండినా నుండెఁగాక
అంగవించి మాతో నేమి ఆనతిచ్చేవయ్యా

చ. 3: వువిదలు రతి వేళ నొరసినా మెఱసినా
చవులయే వుండుఁగాక చప్పనయ్యీనా
యివల శ్రీ వేంకటేశ యింతి నిట్టే కూడితివి
తివిరి మా కిఁక నేమి దెలిపేవయ్యా

రేకు: 0476-1 సామంతం సం: 12-391

పల్లవి: వాసితో నుండుటే మేలు వనితకు
పూస గుచ్చినట్టు తన్నుఁ బొగడేదే మంచిది

చ. 1: చెప్పరాని మాటలు చెవి యొగ్గి విననేల
తిప్పరాని మనసుతో దీకొననేల
తప్పక యెట్టుండినాను తనదాననే నేను
చిప్పిలఁ దనకొలువు సేసేదే చాలునే

చ. 2: అందరాని వీడేల కటు చేయి చాఁచనేల
పొందు గాని రతులకుఁ బొదుగ నేల
సందడి యంతైనాను చనవరిదాన నేను
చెంది తనపూడిగాలు సేయుటే లాభమే

చ. 3: కూడరాని కొఁగిటను కుచముల నొత్త నేల
వీడరాని చెలుములు విడువనేల
యీడనే శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నునేలె
జోడు గూడి తనమోము చూచేదే నేరుపే

రేకు: 0476-2 ముఖారి సం: 12-392

పల్లవి: పిన్నదాన వైతే నేమి పెద్దగాదా వలపు
చన్నులపైఁ బయ్యదే సారెఁ గప్పేవూ

చ. 1: ఆడరాదా వొకమాట ఆతనితోను
యీడనుండే సిగ్గువడి యేల లోఁగేవు
చూడరాదా పతిదిక్కు సొలయుచును
వీడెము చేఁబట్టుక మా వెనక నున్నదానవూ

చ. 2: కానుక లియ్యఁ గరాదా కౌఁగిలిమ్మని
వేసలి వీడగఁ నేల వెర గందేవు
పూని పాదా లొత్తరాదా వొద్దఁగూచుండి
నానించి మా మోము చూచి నవ్వు నవ్వేవూ

చ. 3: సేయరాదా వూడిగాలు చెలువునికి
చాయలా సన్నల నేల జంపు సేసేవు
ఈయడ శ్రీ వేంకటేశుఁడిదే తానె నిన్నుఁగూడె
మాయడకు దాఁపురాలు మరి యేలసేసేవూ

రేకు: 0476-3 పాడి సం: 12-393

పల్లవి: ఎన్నెన్నిగుణాల ఇంతు లెందరు లేరు
సన్నతో నేలేవారికి జాణతన మింతేకాక

చ. 1: రమణుని సేఁతలు రచ్చల వేసితేను
రమణి ఆది జగటాఁగ గాక
సమరతి నాయకుని చాయకు రాకుండితేను
అమరిన చుట్టమా అతినిష్ఠూరి గాకా

చ. 2: నగినందుకుఁ బతితో నాఁటఁ గోపించుకొంటేను
మగువా అది మంటమారి గాక
మగవాఁడు చెనకఁగా మాటలాడ కుండితేను
ముగుదా అది రొమ్ముగఁ గుంపటే గాక

చ. 3: సరసుఁడు పైకొనఁ గా చలము సాదించితేను
తరుణి అది నొకదయ్యము గాక
సిరి నేఁ డిచ్చ యెఱఁగి శ్రీ వేంకటేశ్వరుఁగూడె
తెరచాటు వనితా దేవర గాకా

రేకు: 0476-4 తెలుఁగుఁగాంబోది సం: 12-394

పల్లవి: యెట్టు న్నదో నా భాగ్యమేమి సేతునే
చుట్టి చుట్టి నాయాసలు సుడిగొన నిపుడు

చ. 1: చెలిచే నా విన్నపాలు చిత్తగించి వినునొకో
తలఁపునఁ బెట్టు నొకో దయతోను
పిలిచితే వచ్చునొకో ప్రియముతో నాయింటికి
కలసునొకో నేఁడు కౌఁగిట నా విభుఁడు

చ. 2: కడఁగి నే నంపిన కాని కందుకొనునొకో
అడుగునొకో నన్నందరిలోన
యెడయక నాకు నట్టే యిచ్చునొకో కెమ్మో
అడరి నాకుఁ గైవస మౌనొకో నా విభుఁడు

చ. 3: తమితో నా చన్నులపై తానే చేయి చాఁచునొకో
అమరఁగ నవ్వునొకో ఆతుమఁదాను
మమకరిం చలమేలుమంగ శ్రీ వేంకటేశుఁడు
సమరతి నన్నేలె యీ జాణఁడే నా విభుఁడు

రేకు: 0476-5 భవుళి సం: 12-395

పల్లవి: చుట్టరికే లుండఁగాను సూడులు వట్టఁగ నేల
జట్టి గొనే నీతోడి సరసమే మంచిది

చ. 1: చెలులతో నీ సుద్దులు చెప్పేమంటే నెంత లేదు
యెలమి నా కోరికె లెంత లేదు
సులభుఁడవై నీవు చూచి నాతో నవ్వఁగాను
చలవాసి వలపులు చల్లుటే మంచిది

చ. 2: కూరిములు సారె నిన్నుఁ గొసరఁగ నెంత లేదు
యేరుపడ నాపంతము లెంత లేదు
గారవించి నీవు నన్నుఁ గలయఁగ రాఁగాను
చేరి నీ యిచ్చకో లందిఁ జెనకుటే మంచిది

చ. 3: పెనఁగి పెనఁగి నీతో బిగియఁగ నెంత లేదు
యెనగొన్న నాయాస లెంత లేదు
మనసిచ్చి యలమేలుమంగ శ్రీ వేంకటేశ్వర
మొనసి నన్నేలితివి మొక్కుటే మంచిది

రేకు: 0476-6 కేదారగౌళ సం: 12-396

పల్లవి: కన్నుల పండుగ లాయఁగనుఁ గొని మా కైతే
యెన్న నీ దేవుల నైనా నేమి వేడు కాయనూ

చ. 1: చనవిచ్చి నీ వాపెతో సరసము లాడఁగాను
చెనకి విన్నపా లాకె సేయఁగాను
యెనలేని సంతోసాన నెంతో నీవు చెలఁగఁగా
చను మొన లంట నాకె సారెఁ గొప్పు దువ్వఁగా

చ. 2: చేరి నీ వాకె నప్పటి చెక్కు నొక్కి వేఁడుకోఁగా
నారుకొనఁ దాను చిఱునవ్వు నవ్వఁగా
కూరిమిఁ గస్తూరిబొట్టు గోర నీవు దిద్దఁగాను
కోరి యాకు మడిచి తా నోర నీ కందిచ్చెను

చ. 3: కందువ నంతలో నాకెఁ గౌఁగిట నీవు నించఁగా
అందులోనే సిగ్గు పడి యాకె వుండఁగా
చెంది నన్నేలి యాకెను శ్రీ వేంకటేశ కూడఁగా
మందలించి యలమేలుమంగ నిన్నొరసెనూ

రేకు: 0477-1 శుద్ధదేశి సం: 12-397

పల్లవి: నాపై బత్తిగల వంటా నమ్మితి నేను
బాపు బాపు నీ కప్పటిపై కొస రెవ్వతెరా

చ. 1: తెరమరఁగున నుండి తీగెవార నెలుఁగించి
గరిమ నీవు రా నెఱుకలు సేసీని
సరుస నే నుండఁగా సన్నలా చాయలా నిన్ను
పెర రేఁచి రతులకుఁ బ్రియురాలెవ్వతెరా

చ. 2: నెమ్మి గంబము మాటున నిలుచుండి వలపులు
తమ్మి పూవులను వేసి తలఁపించీని
అమ్మరో సరసము నే నాడఁగా నీతోడన
యెమ్మెలెల్లాఁ బచరించీ నిదియూ నెవ్వతెరా

చ. 3: తలుపు దండనే వుండి తరితీపు నవ్వు నవ్వి
కలయికలకుఁ దాను కన్నులార్చీని
అలమేల్మంగను నేను అట్టే శ్రీ వేంకటేశ్వర
కలసితి విటు నన్నుఁ గామిని యెవ్వతెరా

రేకు: 0477-2 ధన్నాసి సం: 12-398

పల్లవి: అవునయ్య మంచివాఁడ వంతే కాదా
రవళిఁ బొరుగు పొరచి వెదకేవూ

చ. 1: నెలఁత యింటిలో నుండి నినుఁ బిలువ నంపితే
చెలికత్తెపై నేల చేయి చాఁచేవు
కలికి యంపినయట్టి కానుక నీ కిచ్చితేను
చలివాసి యంతేసి జాణతనాలాడేవు

చ. 2: ఆడనుండి గందము నీ కంపఁగాఁ దెచ్చితి మింతే
వూడిగపు వారి నేల వొడివట్టేవు
యీడ నీకుఁ జెవిలోన నే కాంతము చెప్పితిమి
వాడుమోవి చవిగొని వలఁబెట్టేవూ

చ. 3: నంటున నలమేల్మంగ నవ్వి నీ వురమెక్కితే
వెంట వచ్చిన మమ్మును వెసఁగూడేవూ
గొంట వై శ్రీ వేంకటేశ కూడె నాపె నీ దేవులు
అంటుకొని మమ్ము నెంత ఆదరించేవూ

రేకు: 0477-3 నట్ట నారాయణి సం: 12-399

పల్లవి: యేల మమ్ము రట్టు సేసే విందరిలోన
యేలాగులఁ బెనఁగినా నిది గబ్బియనరా

చ. 1: పందేలాడు మనేవు నీ పైఁ జేయి వేసితే
మందె మేళమ్మై యుండదా మరి చూచితే
చందముగ వాటు వేసి సారెలు నేఁదాకించితే
యిందుకు నీ పడఁతులు యెంత నిష్ఠూరనరా

చ. 2: తమ్ములము జూజానకు తగ నొడ్డు వెట్టేవు
యెమ్మె లాడే ననరా యిందరు నన్ను
నెమ్మది నే గెలిచాట నీపై నే మోపితేను
కమ్మర సవతులెల్ల కడుఁజూఁగ యనరా

చ. 3: గుబ్బలు నీ సారె లంటాఁగూడి పట్టేవౌనంటే
వుబ్బరికత్తె యనుచు నుప్పటించరా
యెబ్బిడేల శ్రీ వేంకటేశ యలమేల్మంగను
అబ్బురాన నన్నేలితి పతిజాణ ననరా

రేకు: 0477-4 దేసాళం సం: 12-400

పల్లవి: మూసీ మంతనము వద్దా ముగుద యీ జవరాలు
సేసవెట్టి యింత కాకు సేతు రటవయ్యా

చ. 1: పరాకు సేసుకొని పడఁతి వూరకుండినా
అరుదుగాఁ బచ్చిమాట లానతిచ్చేవు
శిరసు వంచుక లోలో సిగ్గులు వడఁగా నీవు
సరిఁ జన్నులపై కొంగు జార దీసేవు

చ. 2: గుట్టు తోడఁ దాను నీ కొలువులు సేయఁగానే
గట్టి కొప్పువుంట లింటఁ గడువేసేవు
యెట్ట నెదుటనే వుండి యెఱుఁగమి సేసుకొంటే
తట్టు పుణుఁగెల్లాఁ బూసి తమకించేవు

చ. 3: నెపములు వెట్టుకొని నెలఁతలతో నవ్వితే
చపలతఁ గెమ్మోవి చవిగోనేవు
యిపుడే శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
రపముగఁ గూడి కడు రవ్వసేసేవు

రేకు: 0477-5 రాళి సం: 12-401

పల్లవి: వల పాక చోట నుండ వట్టి బయలీఁద నేల
బలిమిని మాతో నేల పదరేవు నీవూ

చ. 1: కలికి నీ దేవులు గడియ వెట్టు మంటేను
చెలిమి కత్తెల నేల చేయి వట్టేవు
అలుక దేరిచి యాపె నటు వేఁడుకొంట గాక
పిలిచి మాతో నేల పెనఁగేవు నీవూ

చ. 2: యేకతాన నుండ నాకె యింటిలోని కేఁగితేను
వాకిటి దాని కొప్పిల వంచేవు
ఆకె కే ప్రియాలు చెప్పి అంపి రప్పించుకో రాదా
దాకొని మమ్మేటికిఁ దడవేవు నీవు

చ. 3: కూడ నీవు రాఁ గా నాపె తోడు చెలుల రమ్మంటే
నూడిగపు వారి నేల వొడివట్టే వు
యీడ నలమేల్మంగను యేలి శ్రీ వేంకటేశ్వర
జోడైతిరి మమ్మేమి చూచేవు నీవూ

రేకు: 0477-6 శంకరాభరణం సం: 12-402

పల్లవి: మొక్కరో పరుషలు మోహనమూర్తికి
వెక్కసమగు శ్రీ వేంకటపతికి

చ. 1: హరి రథ మదే ముందరి నొగ లవిగో
గరుడ ధ్వజ మదే ఘంట లవే
సరిఁ దిరిగేటి కాంచన చక్రము లవే
తిరు వీధుల నేతెంచేఁ గనరో

చ. 2: తేరు పడగలవే తెల్ల గొడుగులవే
తోరణంబులవే సారథి వాఁడే
ధీరతఁగట్టిన దివ్యహయములవే
మేరువు వలెనే మెరసీ నదివో

చ. 3: పసిఁడికుండ యదే పట్టు కుచ్చులవే
వెసనడుమ వాఁడే శ్రీ వేంకటేశుఁడు
యెసగి యురమునను యిదే యలమేల్మంగ
వసుధ పెండ్లితేరు వచ్చీ నిదివో

రేకు: 0478-1 శంకరాభ రణం సం: 12-403

పల్లవి: యెడ మాటల పనులికఁ నేలా
చిడి ముడి నవ్వులఁ జిమ్మీవలపూ

చ. 1: మనసులోని తన మర్మపు తలఁపులు
కనుఁగొనఁ దెలిపేఁ గామిని
తనువునఁ గలిగిన తమకములన్నియు
వినయము లోననే వివరించీని

చ. 2: చొక్కమైన తన చుట్టరికంబులు
మొక్కులలోనే ముంచీని
వెక్కసంపుఁ దన వేడుక లెల్లను
జక్కవ చన్నుల సరిఁజూపీని

చ. 3: కైకొను నీ రతిఁ గలసేటి కాంక్షలు
చే కానుకలనే చెప్పీని
జోక శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగ
నీకౌఁగిటిలో నెరపీని

రేకు: 0478-2 కన్నడగౌళ సం: 12-404

పల్లవి: యీకె విలాసము చూచి యింతట మన్నించవద్దా
జోక లైన వలపు లెచ్చు నున్నవో కాకా

చ. 1: కొసరి కొసరి నిన్నుఁ గొన చూపులనుఁ జూచి
అసురుసురై నీకుఁ బ్రియము చెప్పిని
ముసుఁగిడుకొని నీ ముందర నదిగో యింతి
వసివాడు మోముతో నీవద్ద బాయకున్నది

చ. 2: పొలసి పొలసి నీతోఁ బోరచి పొందులు చూపి
తలఁపించీ సారె నీకుఁ దన మోహము
నిలువు నివ్వెరగుతో నిలుచున్న దదివో
వులివచ్చి విరహాన నోలలాడుచున్నది

చ. 3: తగిలి తగిలి నీపైఁ దలఁబాలు చల్లి చల్లి
మొగము చూచి నీకు మొక్కు మొక్కని
జిగి నలమేల్మంగ శ్రీ వేంకటేశ్వర యీకె
సొగిసి నీ రతులలోఁ జొక్కుచుఁ దా నున్నది

రేకు: 0478-3 నాదరామక్రియ సం: 12-405

పల్లవి: నీ తలఁ పెట్టున్నదో నే మెఱఁగము
యీా తల వాకిట నుండే విదే యేమోకాని

చ. 1: సతులు విభుని మీఁద సణఁగులు రాలుతురు
మతకము వెట్టు కొని మాటాడుదురు
కతకారితనముల కాఁకలు సేతురు
పతి యందు కెగ్గు పట్టఁ బాడిగాదు గాని

చ. 2: పొట్టఁ బొరుగున నుండి బొమ్మల జంకింతురు
గుట్టు తోడ నూరకైనాఁ గొసరుదురు
చిట్టకపు వనితలు చెనకి పెనఁగుదురు
అట్టే మగని కొఁగా దనఁగాదు గాని

చ. 3: అచ్చమైన దేవుళ్ళు ఆసపడి కూడుదురు
తచ్చి తచ్చి రతులకుఁ దమకింతురు
హెచ్చి శ్రీ వేంకటేశ ని న్నెనసె నలమేల్మంగ
మచ్చికైన విభుఁడవు మానరాదు గాని

రేకు: 0478-4 నీలాంబరి సం: 12-406

పల్లవి: ప్రియము తోడుత నిన్నుఁ బిలువ నంపెను మమ్ము
రయమున నిఁకనైనా రావయ్య మావెంటను

చ. 1: మచ్చిక నీ వాడిన మాటలు దలఁచుకొని
ఇచ్చల నెదురుచూచు నింతి నీకును
పచ్చదోరణాలు గట్టి పండుగనాటి వలెనే
విచ్చేతు వంటా నీకు విందాయిత్త పెట్టేను

చ. 2: తెలివ తన వరుస దినము దలఁచుకొని
గుటిగాఁ బాన్పువఱచుకొని వున్నది
మెఱసి పెండ్లికి వలె మేలుకట్లు గట్టించి
పిటిగొన ముత్యాలు పేఁట పట్టువెట్టేను

చ. 3: కోరి నీవు గూడేటికూటమి దలఁచుకొని
గారవపు సింగారానఁ గై సేసెను
యీా రీతి శ్రీ వేంకటేశ యెనసితి వీకె నిట్టే
మేరతో నలమేల్మంగ మెడ యెక్కె నిప్పుడూ

రేకు: 0478-5 ముఖారి సం: 12-407

పల్లవి: చెలులాల యిఁక మీకుఁ జెప్పే దేమే
తలపోఁతలకు నెల్ల వలుపే మూలమే

చ. 1: కన్నులఁ జూచిన చూపు కాంక్షలకు మూలము
సన్నలు సరసాన రేఁచఁగ మూలము
విన్న వినుకులు కడు విరహానకు మూలము
విన్నపములకు నెల్ల విభుఁడే మూలము

చ. 2: సంతోషముల కెల్ల జవ్వనమే మూలము
చింతల కెల్లాఁ జెక్కు చేయి మూలము
చెంతనున్న సిగ్గులకు చిరునవ్వులే మూలము
మంతనపు కోరికెకు మనసే మూలమే

చ. 3: పెనఁగులాటలకును ప్రియములే మూలము
ననుపులకుఁ బాయని నంటు మూలము
యెనసి శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
తనివోని రతులకు తమకమే మూలమే

రేకు: 0478-6 గౌళ సం: 12-408

పల్లవి: యెంత చెలుబడో కాని ఇదివో తాను
కాంతుఁడు తన మాటకుఁగా దనేనా నేను

చ. 1: సన్నల చాయల వాఁడు సందుకొని వచ్చె నేఁడు
చన్నులు వట్టేఁ జూడవే జాజరకాఁడు
యెన్నేసి నవ్వులు నవ్వీ నెంతైనాఁ బోనీఁడు
కన్నెల గంటేఁ జాలు కాతరీఁడు

చ. 2: తనతో నలుగ లేదు తానే తీసె వాదు
పొనుఁగ నిఁక నేఁటికే పొద్దు వోదు
చెనకె నూరకే నన్ను చెప్పితే నెంత లేదు
వనితలతోఁ బోర వరుసగాదు

చ. 3: కందువతోఁ గౌఁగిలించి కడు గురుతులు నించి
యిందరిలో నా గుణాలు యెంచి యెంచి
మందలించి నన్ను నేలె మక్కువ నాపైఁ బెంచి
అందపు శ్రీ వేంకటేశుఁ డతివల మించి

రేకు: 0479-1 దేవగాంధారి సం: 12-409

పల్లవి: నావంకఁ గడమలేదు నాఁడు నేఁడు
భావించితే నీతో నేను పంతమాడే దాననా

చ. 1: కొత్తలు నేర్చుకొంటివి కొంగువట్టి పెనఁగేవు
చిత్తము వచ్చినట్టె ల్లాఁ జేయవయ్యా
బొత్తుగా నీ వాపె చేత బుద్దులు వినఁగాఁగాక
హత్తి నీతో నేఁ దొల్లి అలిగితినా

చ. 2: సంకె లేదేమిటా నీకు సారె నొడఁ బరచేవు
అంకెకు వచ్చినట్టల్లా నానతీవయ్యా
లంకెయై నీ వాపె వలలఁ జిక్కఁగాఁగాక
మంకుఁదనాన నే నీతో మారుకొనఁగలనా

చ. 3: మేను ముట్టి నాతో నీవు మేలము లాడవచ్చేవు
నానా విధాల నీవు నవ్వవయ్యా
మోనాన నన్నేలి యాపెమోము చూడఁగాఁ గాక
ఆనుక శ్రీవేంకటేశ అవుఁగా దనేనా

రేకు: 0479-2 నారాయణి సం: 12-410

పల్లవి: మేలెటిఁగి జవరాలి మెచ్చవద్దా
జాలిఁబడి నీ వేల జంకించేవయ్యా

చ. 1: చెక్కుల నీ చెమటలు చేతఁ దుడిచితేను
చక్కని రమణి నేల సాదించేవయ్యా
నెక్కొని వీడియున్న నీ తురుము ముడిచితే
నిక్కువలు మోవఁగా నేల తిట్టేవయ్యా

చ. 2: ప్రేమ తోడ నీకు దప్పికిఁ బన్నీరిచ్చితేను
కోమలపు సతినేల గుంపించేవయ్యా
నీమేని కలపు దీర నిండా గందము పూసితే
ఆముక సిగ్గున నేల అదలించేవయ్యా

చ. 3: పై కొన్న నీ నిద్దురకుఁ బానుపు వరిచితేను
శ్రీ కాంత చన్నులేల పిసికేవయ్యా
యీకడ శ్రీ వేంకటేశ యీకె నిట్టే కూడితివి
జోకైన రతుల నెంత చొక్కించేవయ్యా

రేకు: 0479-3 కన్నడబంగాళం సం: 12-411

పల్లవి: యెడ మాట లిఁక నేల యెనసిన పనులకు
గుడిగొన్న మీ లోని కోరికె వీడేరెనూ

చ. 1: వాలిక మోము వంచి వనిత నీకు మొక్కఁగా
కేల నెత్తి నీ విట్టే కౌఁగిట నించేవూ
మేలువారే మీ రిద్దరు మేను మేనుఁసోఁకెఁ గాన
తాలిమితో మీలోని తలఁపు లీడేరెను

చ. 2: తేనె గారే మోవి యెత్తి తెఱవ మాఁటాడితేను
ఆనుక తమ్ముల మిడీ యాదరించేవూ
వూనిన జాణలే మీరు వొకరొకరిఁ జూచితే
పూనుకొన్న పొందు లీడేరెను

చ. 3: చిగురుఁ జేతులు చాఁచి చెలి నీ పాదా లొత్తితే
వొగిఁ జన్ను లంట రతి నోల లార్చేవూ
తగు నాకెకు నీకీ చేఁతలు
అగపడ్డ మీరతుల యాఁకట లీడేరెనూ

రేకు: 0479-4 అమరసింధు సం: 12-412

పల్లవి: యేమిటికే చెలులాల యెవ్వరి నేమనేనే
నా మగఁడే దయ సేసి నన్ను నేలీఁగాక

చ. 1: చిత్తజుని దూర నేల చిలుకలఁ దిట్ట నేల
యిత్తల నా మనసే యింత సేయఁగా
కొత్త చంద్రుఁడేమి సేసు కోవిల కేడ నేరమి
హత్తిన నా కోరికలే ఆరడి సేయఁగను

చ. 2: చల్లగాలి ననే దేమి చందనముతోఁ బనేమి
పల్లదపు నా వలుపే పరచఁగాను
చిల్లర విరులు మేలే చెఱకు విల్లు మంచిదే
వెల్లివిరై నాయాసలే వెనుకొనఁగాను

చ. 3: మెఱుఁగుతోఁ బోరవద్దు మేఘము జంకించవద్దు
చిఱుత నా జవ్వనమే చిమ్మిరేఁచఁగా
యెఱిఁగి శ్రీ వేంకటేశుఁడింతలోనే వచ్చి కూడె
మఱి చింత లేదు నా జన్మ మీడేరఁగాను

రేకు: 0479-5 రామక్రియ సం: 12-413

పల్లవి: ఆడవే వొక మాట ఆయములు గరఁగఁగ
చూడవే శిరసు సెత్తి చూపనేల సిగ్గులూ

చ. 1: నిలువునఁ దొలఁకేవి నిండు మదనకళలు
పలుకులఁ గురిసేవి పచ్చితేనెలు
సెలవుల వడిసేవి చిఱునవ్వు వెన్నెలలు
చెలియ నీ కెవ్వరీడే సింగారవతివి

చ. 2: కన్నులను మలసేవి కారు మెఱుఁగు మించులు
చన్నులఁ దొట్టు కొన్నవి జవ్వనములు
నెన్నుదుట మురిసేవి నెఱినీలపు రంగులు
కన్నియ నీ కెవ్వరీడే కడు మోహనాంగివి

చ. 3: తొడలఁ బెనఁగొనేవి తోరంపు మెఱుఁగులు
అడుగుల నున్నది సోయగపు టీవి
కడఁగి శ్రీ వేంకటేశు కాంత ననుటే మేలు
పడఁతి నీ కెవ్వ రీడే బహువిలాసినివి

రేకు: 0479-6 సాళంగం సం: 12-414

పల్లవి: చెప్పఁగొత్తలై వున్నవి చెంది నీ మైగురుతులు
చొప్పులెత్తఁగా నీ మనసున నెట్టుండునో

చ. 1: వెన్నెల బాయిట నీవు వేఁగినంత నుండఁగానో
సన్నపుఁ జంద్రులు నీ మై జాజుకొనేను
పన్నీరు దప్పికి నీవు పలుమారుఁ గొనఁగానో
చిన్ని చెమట చెక్కులఁ జిందఁగఁ దొడఁగెను

చ. 2: పలుమారు వనములోఁ బాయక వుండఁగానో
చిలుక వొట్లు మోవిఁ జెలరేఁగెను
అల గాలిమండపమునందు నిద్దిరించగానో
పొలసి నిట్టూరుపుల బుసకొట్టే విపుడు

చ. 3: గరిడి సాములు నీవు గనముగఁ జేయఁగానో
కురులు చెదరి కడుఁగొప్పు వీడెను
యిరవై శ్రీ వేంకటేశ యీాడ నన్నుఁ గూడితివి
కరుణ నన్నేలఁగానో కళ లెల్లా నిండెనూ

రేకు: 0480-1 ఆహిరి సం: 12-415

పల్లవి: నాకు మీ నేరుపు చూచి నవ్వు వచ్చీని
చేకొని మీ కిద్దరికిఁ జెల్లుబడౌనయ్యా

చ. 1: పందెమాడి నీతోను పడఁతి చేయి వేసితే
అంది చిక్కించు కొనేవు అట్టే నీవూ
విందు వెట్టే నని చెలి వేఁడుకొన్నా మానవు
కందువకు రమ్మనేవు కడు జాణవయ్యా

చ. 2: కానుకగా నిమ్మపండ్లు కాంత నీకుఁ జూపితేను
ఆనుక చన్ను లందుక అట్టే తీసేవు
పూని నీకు మొక్కినాను పోనియ్యక పెనఁగుతా
తేనెమోవి యిమ్మనేవు దేవరవయ్యా

చ. 3: కదిసి వీడె మిచ్చితే కడుఁ దమకముతోడ
అదనఁ గౌఁగిట నించే వంతలోననే
యిదివో శ్రీ వేంకటేశ యెనసినాఁ దనియవు
పదిమారులుఁ గూడేవు పంతగాఁడవయ్యా

రేకు: 0480-2 కాంబోది సం: 12-416

పల్లవి: ఇంక నేలే నిష్ఠూరాలు యింటికి వచ్చె నాతఁడు
కంకణము గట్టుకొని కలయుట గాకా

చ. 1: పువ్వుల వేసినవారిఁ బూచికాయల వేతురా
నివ్వటిల్లఁ గప్రమైనా నించుట గాక
నవ్విన విభుని నీవు నాఁటఁ జూచి జంకింతురా
చివ్వనఁ బై వలపులు చిలుకుట గాక

చ. 2: కిన్నెర మీఁటఁగాను గిడిబిళ్ళు వాయింతురా
పన్ని నీవు సుతి గూడి పాడుటగాక
చన్ను లాతఁ డంటఁగాను సణఁగులు రాలుతురా
సన్నలనే సరసాలు చల్లుట గాకా

చ. 3: తీపులు పైఁజల్లఁ గాను వేప చేఁదు వోదురా
యేపునఁ బంచదారైనా నిచ్చుట గాక
పై పై గూడే శ్రీ వేంకటపతి నలయింతురా
చూపట్టు రతుల నిట్టే చొక్కింతురు గాకా

రేకు: 0480-3 పాడి సం: 12-417

పల్లవి: అతఁడెక్కడ నున్నాఁడో అతివలు నా కెఱుఁగించరే
రతి కెక్కెను నా తమకము రాతిట నుండియును

చ. 1: తలఁచిన నూరకు మదిలో దైవారీఁ దలపోఁతలు
పలికెద నంటే మానమే పరగీఁ బెదవులను
నిలిచెదనంటేఁ దొట్టీ నివ్వెరగులు నిలువుననే
చెలులాలా నా విరహము చెప్ప నలవిగాదే

చ. 2: చూచిన నాతని రూపే సుడిసీ దిక్కుల నెల్లను
కాచుకు వున్నవి కాంక్షలు కన్నుల మీఁదటను
లాచీనిదివో పతి మేలపు మాటలు విన వీనులు
యీ చందపు నా మోహం బెన్నఁ గొలఁది గాదే

చ. 3: తడవిన నాతని పేరే తగిటీ నాలికె మీఁదను
పిడిచిన గారీ చెమటలు పిచ్చిలి చెక్కులను
తడయక శ్రీ వేంకటేశుఁ డు తా నిటు విచ్చేసి కూడెను
యెడయక సంతోషము నా కింతం తనరాదే

రేకు: 0480-4 మాళవిగౌళ సం: 12-418

పల్లవి: యెక్కడౌతా నెఱఁగవు యిదివో నీ వైతేను
చక్కదిద్దుకొనవమ్మ సమరతి చిహ్నాలు

చ. 1: సరులు చన్నుల మీఁదఁజల్లు వెదలాడఁగాను
విరులు కొప్పున నుండి వెస రాలఁగా
వొరసి నీ పతి వద్ద నుండి నీవు రాఁగాను
తరుణులు నిన్నుఁ జూచి తమలో నవ్వేరు

చ. 2: చెక్కుల వెంటాను పెంజెమటలు గారఁగాను
ముక్కున నిట్టూర్పులు ముంచఁగాను
నెక్కొన రతి నోలాడి నీడ చూచుకొనఁగాను
చక్కఁజూచి సతులెల్లా సన్నసేసుకొనేరు

చ. 3: కన్నులను చెంగావి కడుఁ దలుకొత్తఁగాను
పన్నుగఁ గళలు మోముపైఁ దేరఁగా
యిన్నిటా శ్రీ వేంకటేశ నెనసి నీ వుండఁగాను
కన్నె లెల్లాఁ జూచి నీ గతులాడుకొనేరు

రేకు: 0480-5 సామంతం సం: 12-419

పల్లవి: అది నీ పట్టపు దేవులడిగితేఁ జెప్పితిమి
యెదుట నేల దాఁచేవు యెఱిఁగిన పనికి

చ. 1: వాలారు గోళ్ళు సోఁక వనితా నీవు సంగడిఁ
గేలుఁ గేలుఁ బెనచుక కేరి నవ్వరా
మేలిమి పొదరింటిలో మీ రిద్దరు నల్లప్పుడు
తాలిమి తోడ నేకతము లాడుకొనరా

చ. 2: అక్కజపుఁ దమి తోడ నాపె నీవుఁ జెలరేఁగి
చెక్కుఁ జెక్కుఁ జేర్చి వావి చెప్పుకొనరా
మొక్కలానఁ జీఁకటి మూఁక మాఁకులలోన
అక్కరతో సరసము లాడుకొంటా నుండరా

చ. 3: చిడిముడి నొండొరులు చిగురుఁ బానుపు మీఁద
తొడఁ దొడ నంటఁ గాలు దొక్కుకొనరా
కదు నేఁ డీకెఁ గూడితి గాక శ్రీ వేంకటేశ్వర
యెడయక తొల్లి సేఁతలెల్లాఁ జేసుకొనరా

రేకు:	0480-6 పాడి	సం:	12-420

పల్లవి:	ఇంతి వూడిగపు వార మెంతైనా గద్దు పని
అంత కలిగితే నీవే అడకు రావయ్యా

చ. 1:	వెలఁది మాటలు నీకు విన్నపము సేసితిమి
అలరి మఱచు మాట లానతీవయ్యా
నెలకొని వాకిటనే నిలుచున్నది మారాక
తలఁచి తడవైతేను తానే వచ్చునేమో

చ. 2:	అంది నీ కిచ్చితి మిప్పు డాకె వంపిన లేకలు
అందులోనే వున్నవి ఆపను లెల్లా
అందలము వట్టు మనే నప్పుడే తమకించీ
ముందుగాఁ జెప్పవలె నీ మోహము లాపెకును

చ. 3:	కానికె నీ కిచ్చితిమి కంటిమి నీ పాదాలు
తానూ వచ్చెను నీ ముందరికిఁ జెలి
ఆనుక శ్రీ వేంకటేశ ఆపే నీవూఁ గూడితిరి
పూని వచ్చిన మా సేవ పొందుగా నీడేరెనూ

రేకు: 0481-1 భవుళి సం: 12-421

పల్లవి: మొగమాట లేక యెంత మోవనాడేవయ్య
మగువ బీరము నీకు మంచిది గాదా

చ. 1: చెలికత్తెయైనది చేయి వట్టి తీసితేను
బలిమి చూపె నందురా పంతగాఁడవు
మొలక చన్నులఁ గొంత మొనలు దాఁకించితేను
కలికి తనాల దిది గబ్బి యందురా

చ. 2: బత్తి గలది గొంత పక పక నవ్వితేను
హత్తి మందె మేళ మెంత అందురా నీవు
కొత్తగొత్త మాటలను కూరిమి గొసరితేను
తత్తరపు కతకారితనము లందురా

చ. 3: పట్టపు దేవులైనది పై కొని కౌఁగిలించితే
గట్టు వా యందురా కాంతలలోను
అట్టే శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
చుట్టమై నిన్నుఁగూడె జూటరి దందురా

రేకు: 0481-2 సామంతం సం: 12-422

పల్లవి: ఆఁటది గూళయైతే నందేమున్నది
చీటికి మాటికి నింత సిగ్గులు విడుతురా

చ. 1: సవతి నంటా నాతో సణఁగులు చల్లి చల్లి
తివురుచు వచ్చి యేల తెర దీశేవే
పవళించి వున్నవాఁడు పానుపుపై రమణుఁడు
వివర మెఱఁగ కేల వేగిరించేవే

చ. 2: పరుస నా దెంటా నీవు వట్టి రొద లెల్లాఁజేసి
పరగ నేల మంచముపైఁ గూచుండేవే
నిరతిరతి నలసి నిద్దిరింపుచున్నవాఁడు
వెర వెఱఁగక యేల వేగిరించేవే

చ. 3: అంతలో నా యీాడుదాన నంటా లోను చొచ్చి వచ్చి
కాంతుని నీ వేఁటికిఁ గౌఁగిలించేవే
చెంత మేలుకొని నన్ను శ్రీవెంకటేశుఁడు గూడె
వింతదానవై యేల వేగిరించేవే

రేకు: 0481-3 లలిత సం: 12-423

పల్లవి: ఆతఁడే యెఱుఁగును అన్నిపనులు
నీతి యెంచితే తన నెలఁత నే ననవే

చ. 1: మలసి యాడఁ జొచ్చితే మాట లెన్నైనాఁ గలవు
తలఁచితే నెన్ని లేవు తలపోఁతలు
నెలకొన్న దెఱఁగవా నీరు కొలఁది తామర
చెలియరో నే నేమని చెప్పేనే నీకూ

చ. 2: మునుకొని నవ్వితేను మొగమెల్లా నవ్వు
కనుఁగొంటే నిండుకొనుఁ గనుచూపులు
పెనఁగ నేఁటికే నీవు పిండెంతే నిప్పటి
దినదినము నెంతని తెలిపేనే నీకు

చ. 3: కడు నెంత వెరిగినా కౌఁగిటిలోనే చన్నులు
బడి వాయకుండి తేను పాయదు తమి
అడరి శ్రీ వేంకటేశుఁడంతలోనే నన్నేలె యీ
యెడఁ బైఁడెంతే తూని కేమనెనే నీకూ

రేకు: 0481-4 భైరవి సం: 12-424

పల్లవి: నెలఁత నిన్నుఁ జూచితే నిలువు నూరు వండీని
యెలమి నీ పుణ్య మిఁక నెంతనఁగ వచ్చునే

చ. 1: చిత్త మెల్లఁ జిగిరించె చింత లెల్ల నొగిరించె
బత్తి తోడ నింటికి నీ పతి రాఁగాను
హత్తిన తురుము వీడె నంగజ ముద్రలు గూడె
ఇత్తల నీవు సేసిన దెంత భాగ్యమే

చ. 2: సెలవి నవ్వులు దేరె చెమటలు దైవారె
మలసి యాతఁడు నీతో మాటలాడఁగా
కళలు మోమున మించె కరఁగులు గానిపించె
యెలమి నీ నోమినవో మే మని చెప్పేమే

చ. 3: చేతికిఁ గౌఁగిలి చిక్కె చెక్కులఁ బులక లెక్కె
యీతల శ్రీ వేంకటేశుఁ డెనయఁ గాను
ఆతని కిదే తావు అలమేల్మంగవు నీవు
నీ తపము నే మెట్టు వర్ణించఁ గలమే

రేకు: 0481-5 సామంతం సం: 12-425

పల్లవి: కాదనే పాటి దాననా ఘనుఁడు తన మాటకు
ఆదరించితేఁ దన అంకెలో నుండేనే

చ. 1: చెలరేఁగి రమణుని చిత్తము వట్టుటగాక
చలపాదితన మేల సకియకును
చెలులాల నన్నేల చేరి వొడఁ బరచేరే
యెలమిఁదా విచ్చేసితే నెరుట మొక్కేనే

చ. 2: ఇయ్యకొని పతి తోడ నిచ్చకమాడుట గాక
గయ్యాళితన మేలే కామినికి
చెయ్యఁ జెక్కుఁ బట్టి యెంత చేకొని వేఁడుకొనేరే
చయ్యనఁ దా మటాడితే సమ్మతించి వినేనే

చ. 3: ఇక్కువ శ్రీ వేంకటేశుఁ డేలితేఁ గూడుట గాక
తక్కరితనము లే లే తరుణికిని
గక్కన నే నలమేల్మంగను పెనఁగెద రేలే
అక్కున నన్ను నిలిపె నన్నిటా మెచ్చేనే

రేకు: 0481-6 వరాళి సం: 12-426

పల్లవి: యేల బయ లీఁదించేరే యింతులాల
మేలిమి బత్తి గలిగితే మీ రాతనిఁ దేరే

చ. 1: తప్పక చూచినాను తనివోని యాసలు
వొప్పుగ నెడ మాటల నూరడిలీనా
ముప్పిరి నెడ మాటల ముంచుకొన్న వేడుక
చప్పు డాలించి నంతలోఁ జాలఁబోయీనా

చ. 2: సరసము లాడినాను జడియని వలపులు
తెరమాఁటు సన్నలనుఁ దీర్చవచ్చీనా
నిరతపు సన్నల నిండు కొన్నకోరికెలు
గరిమ నవ్వినంతనే కాఁక వాపీనా

చ. 3: కాయముఁ గాయముఁ గూడి కడివోని తమకము
చేయెత్తి సేసవెట్టి తే సెలవయ్యీనా
యీ యెడ శ్రీ వేంకటేశుఁ డే నలమేలుమంగను
చాయకు వచ్చి నన్నేలె జంట వాసీనా

రేకు: 0482-1 నాగవరాళి సం: 12-427

పల్లవి: విన్నవించి రమ్మనెను వెలఁది నీతో మమ్ము
వున్నదదే సిగ్గుతో నీ వొద్దనే సుమ్మీ

చ. 1: చుక్కబొట్టు వెట్టుకొని సుదతి నీ పాదాలకు
మొక్కి యంటించెను తన ముద్రగాను
నిక్కముగఁ జూచుకో నీవు దనవాఁడవని
యిక్కువ గానుఁ బెట్టిన ఇదె గుఱి సుమ్మీ

చ. 2: కొప్పు విరులు రాలఁగ కొమ్మ నీ తోడఁ బెనఁగి
చొప్పు వేసె నీవు దన సొమ్ముగాను
ముప్పిరి నెంచుకో నిన్ను ముందే తాఁ గైకొంటినని
చెప్పి చూపి పెట్టిన లచ్చెనలు సుమ్మీ

చ. 3: అలమేలుమంగ నీ యక్కుమీఁద నేపొద్దు
నెలకొనీఁ దన కదే నెలవు గాను
యెలమి శ్రీ వేంకటేశ యీకె నీ మేనికి
సలిగెతో వలపుల శాసనము సుమ్మీ

రేకు: 0482-2 శంకరాభ రణం సం: 12-428

పల్లవి: నెలఁతకు నే పొద్దూ నీ మీఁదిదే పరాకు
అలరి తడవు సేయక ఇట్టే రావయ్యా

చ. 1: సారె మా విన్నపా లెల్లాఁ జన విచ్చి వింటివి
నీరు వలెఁ గరఁగెను నీ చిత్తము
తారుకాణ చూచుకో తరుణివలపు లిఁక
చేరి మారు మాటేమని చెప్పుదుమయ్యా

చ. 2: పడఁతి యంపిన నిమ్మ పండు చే నందుకొంటివి
వుడివోని సంతోసాన నుప్పొంగితివి
బడి నాపెతో నాడిన పలుకులు దలఁచుకో
తడవి నీ కాపె పై తలఁ పెట్టి దయ్యా

చ. 3: నెమ్మది మా వెంటనే నీవు విచ్చేసి మా
యమ్మపాన్పునఁ గూచుండీ అమరితివి
యిమ్ముల నలమేల్మంగ యీకె శ్రీ వేంకటేశ్వర
సమ్మతిలఁ గూడితివి జాణ వౌదు వయ్యా

రేకు: 0482-3 హిజ్జిజి సం: 12-429

పల్లవి: యిదివో మా విన్నపము ఇంతి భాగ్య మిట మీఁద
గుదిగొన్నవేడుకలు కుప్పవడీని

చ. 1: కొత్త కొత్త సిగ్గులతో కోమలి నీకు మోహించి
చిత్తము లోని మాటలు చెప్పఁజాలదు
ముత్తరపుఁ దమకము ముంచుకోఁగా నీ మేన
వొత్తుడై చెమట లెల్ల వూరఁ జొచ్చె నిపుడు

చ. 2: వుడివోని యాసోదము లుమ్మగిలఁగా లోలో
తడఁబాటు విరహము దాఁచఁ జాలదు
బెడిదపుఁ గోరికలు పెనఁ గొనఁగా నిట్టే
కడలేని పులకలు కడు నుప్పతిల్లెను

చ. 3: సెలవిఁ జేరు నవ్వులు చిందఁగా నిన్నుఁగూడి
అలమేలుమంగ పాయఁగఁ జాలదు
యెలమి శ్రీ వేంకటేశ యీకె మన్నించఁగాను
తలపోఁత కళలతో దైవారులు వారీని

రేకు: 0482-4 నారాయణి సం: 12-430

పల్లవి: శిరసెత్తి చూడవయ్యా సిగ్గువడకా
పెరుగఁగా మీఁద మీఁదఁ బేరీఁ జుమ్మీ వలపు

చ. 1: గుబ్బలపై గందము గొప్ప వుంటసేసి యింతి
వుబ్బుచు నిన్ను వేయఁగా నూరకుండేవు
గబ్బితనమున నాపె కమ్మటి నిమ్మ పంటను
గొబ్బున వేయఁగా నీ కొప్పు దాఁకె నిదివో

చ. 2: కొప్పులోని తామెరఁగొని నిన్ను వేయఁగాను
వొప్పుగా మాటలాడ కూర కుండేవు
కప్పురపు లప్ప నిట్టే కాంత నీపై మీఁటఁ గాను
చిప్పిలుఁ జెమట తోడి చెక్కు దాకె నిదివో

చ. 3: నిగ్గునఁ జెలి సురటి నీకుఁ జూపి వీయఁగాను
వొగ్గుచు నందుకొనక వూరకుండేవు
అగ్గమై శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీాకె
దగ్గరి కూడఁ గాఁ గళ దాఁకె నీకు నిదివో

రేకు: 0482-5 దేశాక్షి సం: 12-431

పల్లవి: యెంత గట్టు వాయ యిది యేడ గలిగె నీకు
యింతి యెందుండి వచ్చెను యెవ్వతెయ్యా

చ. 1: నెలంత సారె సారెకు నీ పాదాలు పిసుకుతా
సలిగెలు చూపీ ని సవతులకు
పిలువని పేరటము పెందలకాడే వచ్చి
కొలువులు సేసి తన గుఱుతెఱిఁగించీని

చ. 2: పట్టూడిగాలు సేసి నీ వద్దనే కాచుకుండి
చుట్టరికాలు చెప్పీని సుదతులతో
చుట్టి చుట్టి నీ మొగము చూచి తానే నవ్వుతాను
యెట్ట నెదుటనే వుండి యెమ్మెలు చూపీని

చ. 3: విరులు నీకు ముడిచి విన్నపాలు సేసుకొంటా
దొరతనములు చూపీఁ దొయ్యలులకూ
పురాన నలమేల్మంగ వుండఁ గా శ్రీ వేంకటేశ
తెరవేసి వీడె మిచ్చి తేలించీ మాటలను

రేకు: 0482-6 భైరవి సం: 12-432

పల్లవి: చూడరే వో చెలులాల సుద్దు లేమి చెప్పీఁ దాను
వేడుకఁ దన చేఁతలు వెల్లా విరులాయను

చ. 1: వెలయ సారెఁ దనకు విన్నపము సేసే దేమే
తలఁపు లోపలి మాట తా నెఱుఁగును
చలములు తన తోనే సాదించేదాన నటే
కలువ పూవుల వేటు కమ్మెఁ జంటిమీఁదను

చ. 2: తగిలి తనతో నేను తారుకాణించే దేమే
నగవు తనసెలవి నానుచున్నది
పగటునఁ దనతోను పంతమాడేదాననటే
బిగువుఁ గౌఁగిట మోవి పిప్పిగట్టే నిపుడు

చ. 3: సొలసి సొలసి తన్ను సూటిగాఁ జూచే దేమే
పులకలు తన మేనఁ బొదిగొనేను
యెలమి శ్రీ వేంకటేశుఁ డే నలమేలుమంగను
మలసి వలపులను మరిగించె నన్నునూ

రేకు: 0483-1 మంగళకౌశిక సం: 12-433

పల్లవి: చెప్పినట్టు సేసేఁ గాక చేపట్టి పెనఁగ నేల
కప్పుర మిచ్చేవు నాకు కానీ లేవయ్యా

చ. 1: సలిగెలు చూపేవారు సణఁగులు చల్లేవారు
చెలిమి సేసేనతులు శేనాశేన
నిలిచి నాతో నవ్వేవు నే నేమి బాఁతి నీకు
వెలయ నా చెక్కు నొక్కి వేఁడుకో నేలయ్యా

చ. 2: తప్పక చూచేటివారు తమి నీకు రేఁచేవారు
కొప్పు దువ్వేటి కాంతలు కోటానఁ గోటి
నెప్పునఁ జన్ను లంటేవు నీ సరిదాననా నేను
ఇప్పుడే మందెమేళాలు యేల మరసేవయ్యా

చ. 3: గద్దించి కూడేవారు కానుక లిచ్చేవారు
వొద్ద నుండే చెలులు తండోప తండాలు
అద్దుక శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
పెద్దగాఁ గూడితి వింత ప్రియపడ నేలయ్యా

రేకు: 0483-2 శ్రీరాగం సం: 12-434

పల్లవి: చెప్పవే నా కా సుద్ది చెవులార వినేఁగాని
కప్పుదేరి నీ మోవి కడు నందమైనది

చ. 1: జోటునఁ జెమట గారీ చొక్కపు గుబ్బలవెంట
జాటీని వీఁపు మీఁద చక్కనికొప్పు
మీటీఁ గళలు నేఁడు మిక్కిలి నీ మొగమున
ఆటిడి నీ వేఁటి కింత యలసి వున్నదానవే

చ. 2: అడుగులు దడఁబడీ నందమైన నడవుల
చిడిముడి వదలీ ముంజేతి గాజులు
తొడిఁబడ నొసలికరి బొట్టు చెదరీని
వెడవెడగా నేఁడు వింతయై వున్నదానవే

చ. 3: కమ్మి చెంపలఁ బూసిన గందపు బేట్లు రాలీ
వుమ్మగిలుఁ బులకలు వుప్పతిల్లీని
నెమ్మి శ్రీ వేంకటేశుఁడు నీ వలమేలుమంగవు
దొమ్మిఁ గూడితిరో మీరు దొరసివున్నారు

రేకు: 0483-3 ఆహిరి సం: 12-435

పల్లవి: యివి యే సుద్దులు మరి యేమడిగే విఁక మమ్ము
తివిరి చూతువుగా నీ దిష్టము రారాదా

చ. 1: వుమ్మగిలు జవ్వనమే వుప్పతిల్లీ ఇరువంకా
కొమ్మకుఁ బెరిగి పెద్ద కొండ లాయను
పమ్మిన తమకములు పట్టరాక పిరుదులై
దిమ్ములు రేఁగి యిక దిబ్బ లాయను

చ. 2: తలపోఁత లన్నియును తలనీలాలై నించి
చెలిఁ గప్పుకొని పెనుఁ జీఁకటాయను
వలపులు పిక్కటిల్లి వాడిగోళ్ళై కొనసాగి
ములుకులై చిన్నిమల్లెమొగ్గ లాయను

చ. 3: నెఱి శ్రీ వేంకటేశుఁడ నీవు గూడఁగా మనసు
కఱఁ గెలమేల్మంగకుఁ గళ లాయను
జఱసి రతి పరవశములు మోవిమీఁది
గుఱుతులై రత్నాలకుప్ప లాయను

రేకు: 0483-4 శ్రీరాగం సం: 12-436

పల్లవి: తడఁబడీ మీ సొమ్ములు తారుమారై యిద్దరికీ
అడియాలా లివి చూచి అరుదయ్యీ మాకు

చ. 1: మెలఁత గుబ్బలమీఁద మించె నీలాల హారము
తలకొని నీ వెప్పుడూ ధరించే దిదా
వెలలేని మాణికాల వింత యైన వుంగరము
అల నీ వేల నున్నది ఆపె నీ కొసగెనా

చ. 2: మగువ పాదమున బొమ్మల పెండె మున్నది
నిగ నిగ మనీ నదే నీ విచ్చినదా
మొగపుల బాహుపురి ముంజేత నీ కున్నది
అగపడీ గుఱుతుగా నాపె నీకుఁ బెట్టే నా

చ. 3: అలమేల్మంగకు నీకు నమరెను మొలనూళ్ళు
మలసి మీరిద్దరును మార్చుకొంటిరా
యెలమి శ్రీ వేంకటేశ యీ చొప్పులు నేఁగంటి
బలిమి నాకెకు నీకుఁ బాయరానిపొందులా

రేకు: 0483-5 భైరవి సం: 12-437

పల్లవి: పట్టపు దేవులవు బలిమి గల దానవు
నెట్టు కొన్నరతుల నీ నేర్పు చూపరాదా

చ. 1: సిగ్గులు వడనేటికే చిఱునవ్వు లేటికే
వొగ్గి నీ విభుఁడు నిన్ను వొడివట్టితే
నిగ్గుల గరఁగే వేమే నివ్వెరగు వడే వేమే
వెగ్గళించి ని న్నితఁడు వేడుకోఁగాను

చ. 2: కొచ్చి చూడ నేటికే గునియఁగ నేటికే
కుచ్చి రమణుఁడు నీ కొంగు వట్టితే
ముచ్చట మఱచితటే మోసము వట్టితివటే
మచ్చిక నాతఁడు నీతో మాటలాడఁ గాను

చ. 3: వావిరిఁ గొంక నేటికే వలపు దాఁచ నేటికే
శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరి కూడఁగా
నీ వలమేల్మంగ వెంతే నేఁటి సంతోసము లెంతే
చేవ దే రేతఁ డు నిన్నుఁ జిమ్మి రేఁ చఁ గాను

రేకు: 0483-6 ముఖారి సం: 12-438

పల్లవి: చెప్పరే మీరైనా బుద్ధి చెలువునికి
ఇప్పు డెంత బుజ్జగించీ నెరవులదాననా

చ. 1: సూటి పడఁదా నెన్ని సుద్దులు చెప్పినాను
మాటల నే నూఁకొనేనా మందెమేళాన
చోటిచ్చి తన వద్దఁ గూచుండుమని పెనఁగీని
సాటి కియ్య కొనఁగ నే సరిదాననా

చ. 2: పూనిపట్టి తా నిట్టే పూవుల చెండియ్యవచ్చి
కానుక లందుకొనేనా కడు గర్వాన
తానే నా మొగ మెత్తి తనమోము చూడుమనీ
ఆనుకొని నాఁటఁ జూడనంత దిట్ట దాననా

చ. 3: ఆముకొని తా నెంత ఆయములంటినాను
సాము దనతోఁ జేసీనా సరి పంతాన
యీ మేర శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
ప్రేమ నేలెనే మొక్కి పిల్ల వింతదాననా

రేకు: 0484-1 పాడి సం: 12-439

పల్లవి: యెంతని చెప్పఁగ వచ్చు నింతి నీపై కూరిమి
వింతలాయ మాకు నెట్టి వేడుకో నీ మీఁదను

చ. 1: గుబ్బలఁ బూసిన యట్టి కుంకుమ నీ మేన నంట
నబ్బురానఁ గొప్పు దువ్వీ నంగన నీకు
వుబ్బున నీవు గోర నూఁదినది నెఱఁగదు
పబ్బినది యెటువంటి పరాకో నీ మీఁదను

చ. 2: కడుఁ జెక్కుల జవ్వాది గరఁగి నీపైఁ జింద
చిడిముడితో నిన్ను సింగారించీని
బెడఁగుఁ జన్నులు నీవు పిసికినా నెఱఁగదు
యెడయని పరవశ మెంతో నీ మీఁదను

చ. 3: తురుము విరులు నీపైఁ దొరుగ నలమేల్మంగ
సిరుల నిన్ను నలమి శ్రీ వేంకటేశ
పిరిగొనఁ గౌఁగిట బిగించినా నెఱఁగదు
సురతాన నెటువలెఁ జొక్కెనో నీ మీఁదను

రేకు: 0484-2 ఆహిరి సం: 12-440

పల్లవి: తగిలి పాయుట కంటే దవ్వుల నుండుటే మేలు
అగపడ్డ మోహము లాపలేని వారికి

చ. 1: కూడిమాడి పొందు సేసి కొసరఁగవచ్చుఁ గాని
వీడుఁవడ్డ విరహాన వేఁగరాదు
వేడుకఁ దప్పక చూచి వెలయఁగవచ్చుఁ గాని
వోడక రెప్ప మూసితే నోరువరాదు

చ. 2: గరిమ మొదల బిగ్గిఁ గౌఁగిలించవచ్చుఁ గాని
వరుస వెనక మరి వదలరాదు
సరసపు మాటలు సారె నాడవచ్చుఁ గాని
మరిగిన మీఁద మఱవఁగరాదు

చ. 3: కలసి మెలసి యట్టే కడు నవ్వవచ్చుఁ గాని
తలపునఁ గలమేలు దాఁచఁగరాదు
అలమేలుమంగ పతి యైన శ్రీ వేంకటేశుఁడు
యెలమి ని న్నేలె నిఁక నింతం తనరాదు

రేకు: 0484-3 భవుళి సం: 12-441

పల్లవి: నీ దేవుల గుణము నీవే యెఱుఁగుదువు
పోదితో నిప్పుడే వారి బుజ్జగించు కొనుమీ

చ. 1: కాంత వ్రూడిగపు వారిఁ గై కొనక నీ వుండితే
నంతయు వారు చెప్పఁగా నాకె నిన్నేమనునో
చెంత నున్నచెలులము చేరి నీకుఁ జెప్పితిమి
వింతగా మీఁ దటి యెత్తు విచారించుకొనుమీ

చ. 2: లలన కడ దారిని లాలించకుండితే వారు
కలవి లేనివి నంటే కలికి చిత్త మెట్టో
తెలిసిన వారము తలఁపించితిమి నీకు
యెలమిఁ దగవు నీవే యెంచుకొనుమీ

చ. 3: అలమేలుమంగ దూతికల మన్నించకుండితే
చల మెక్కించితే నింతిచంద మేరీ తానో
యెలమి శ్రీ వేంకటేశ యీకె నీవుఁ గూడితివి
లలి నెచ్చరించితిమి చెలిమే నెరపుమీ

రేకు: 0484-4 రామక్రియ సం: 12-442

పల్లవి: మా మాట వినఁ గదవే మంకు లేఁటికే
కామునమ్ములకు గుఱిగా నిలువ వసమా

చ. 1: చెక్కు నొక్కి వేఁడుకొని చేయి చేతఁబట్టు కొని
మక్కువ చల్లిఁ బతితో మాటలాడవే
లక్కవంటిది మనసు లాలించీ నాతఁడు నిన్ను
గక్కన నింతట నైనా గరఁగఁగ వలదా

చ. 2: వొడి వట్టి పెనఁగుతా నొడఁ బరచుకొంటాను
తొడరేటి నీ మగని తోడ నగవే
విడువ రాదు వలపు వీడె మిచ్చీ నాతఁడు
అడియాలమై చేవట్టి ఆదరించవలదా

చ. 3: వావులు నీకుఁ జెప్పీ వడి సరసము లాడీ
శ్రీ వేంకటేశుని రతిఁ జెందఁ గదవే
దేవి నలమేల్మంగవు తేరి కూడె ని న్నితఁడు
తావుకొనఁ జేరె నిట్టే తగ మెచ్చవలదా

రేకు: 0484-5 శంకరాభ రణం సం: 12-443

పల్లవి: మట్టుతో నుండుటే మేలు మగువలకు
యిట్టే విభుని తోడ నిచ్చకమే యాడవే

చ. 1: కూరిమి గల పతిని కొసరఁగఁ బోదురా
సారమైన వలపెల్లాఁ జప్పఁ జేతురా
గారవపుఁ జుట్టము తోఁ గడఁగి పెనఁగుదురా
కారుకమ్మే సరసాలు కరకరి సేతురా

చ. 2: మరిగిన చెలి కాని మనసు సోదింతురా
గరిమల వేడుకలు కాకుసేతురా
యెరవు లేని చోట యెగ్గులు వట్టుదురా
నిరతపు పొందులలో నెరు సేరఁ బోదురా

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁ గూడి చెక్కులు నొక్కుదురా
భావించలమేల్మంగవు పదరుదురా
వే వేలు రతులలో వెస నలయింతురా
చేవ దేర నవ్వు నవ్వి సిగ్గులు పడుదురా

రేకు: 0484-6 నాదరామక్రియ సం: 12-444

పల్లవి: యీ రమణి చెలువము యేమని పొగడవచ్చు
తేరకొన విభునికి దినబోగా లాయను

చ. 1: సరవి నింతి ముఖ చంద్రోదయమై యుండఁగా
గరిమ నవ్వు వెన్నెల గాయఁగాను
సొరిది మోవి కెంపులే చుక్కలు గాయఁగాను
యిరవై వొక వంక నిదే రేతి రాయను

చ. 2: సుదతి వజ్రాల బొట్టు సూర్యోదయమై వుండఁగా
యెదుటఁ గను మెఱుఁగు లెండ గాయఁగా
వుదుటుంగర కమలాలున్నతిఁ జెలఁగఁగాను
అదనఁ బట్ట పగ లాయ నొకవంకను

చ. 3: మెలఁత నెఱిఁ దురుము మేఘోదయమై వుండఁగా
నెలమిఁ జెమట వాన లెసఁగఁగాను
అలమేలుమంగ యీకె ఆతఁడు శ్రీ వేంకటేశుఁ
డిలపైఁ గూడఁగా సొమ్ములీపె వంకనాయను

రేకు: 0485-1 సౌరాష్ట్రం సం: 12-445

పల్లవి: యేమి చెప్పేరే బుద్ధు లెందాఁకా నాకు
కామించి యాతఁడు రాఁగాఁ గాదనేనా నేనూ

చ. 1: చుట్టరికమే కలిగితే సుద్దు లెల్లా నింపు తాను
వెట్టికే మాటలాడితే వేసట వుట్టు
గుట్టు తోడి చిరునవ్వు గుణానకుఁ దేవచ్చు
బట్ట బయలు నవ్వితే బాఁతి గాదు

చ. 2: ఆసలు గలిగితేనే అంటుకొను వేడుకలు
బేసబెల్లి (?) వేడుకలఁ బ్రియము లేదు
వాసితోడి సిగ్గులు వన్నె కెక్కు నన్నిటాను
పూసగొండి (?) సిగ్గులైతేఁ బోది సేయరాదు

చ. 3: సంతోసమైనప్పుడు సమ్మతౌను మొక్కులు
పంతము తోడి మొక్కులు పనికిరావు
ఇంతలో శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
వింతలుగా నన్నుఁగూడె వెసఁబాయ నోపను

రేకు: 0485-2 గౌళ సం: 12-446

పల్లవి: చెలుల కెల్లా నీవు సేసిన వుపకారము
మలసి యాపె కౌఁగిలి మఱవకుమీ

చ. 1: వేడుక నీ కతలెల్లా వీనులపండుగ గాను
ఆడుకోఁగా వింటిమి నే మందరిచేత
జోడుగా నొక్క తెను మెచ్చుగఁ దెచ్చుకొంటివట
పాడి దప్పక నీ వాకెఁ బాలించుమీ

చ. 2: కమ్మటి నీ చేఁతలు కన్నుల పండుగ గాను
పమ్మి కనుఁ గొంటిమి నీ పానుపు మీఁద
కొమ్మ యొకతె వున్నది కొత్త పెండ్లికూఁతురట
నమ్మి కిచ్చినట్లే మన్నన నేలుమీ

చ. 3: నెలకొన్న నీ రతులు నిచ్చ పండుగలు గాను
తలఁచి మెచ్చితిమి నీ తనువు సోఁకి
అలమేల్మంగ నొక్కతె నక్కునఁ గట్టు కొంటివి
ఇల శ్రీ వేంకటేశ్వర యీడేర్చుమీ

రేకు: 0485-3 దేశాక్షి సం: 12-447

పల్లవి: నేఁ డన్నిటా జాణఁడవై నీవు నన్నుఁ గలసేవు
వేఁడుకొనేము పదారువేలకు మగఁడవా

చ. 1: చెక్కులు నొక్కితే నీ సెలవులఁ బాలు చిందీ
చక్కని రేపల్లె పాలచాడే (?) దొంగవా
మొక్కి ముద్దిడుకొంటే మోవి నావులు వచ్చీని
గుక్కక నీవు దొల్లి గొల్ల మందవాఁడవా

చ. 2: వెసమాట లాడించితే వెన్నముద్దలే రాలీని
పొసఁగ గోపికలతో పొందువాఁడవా
పిసికితే నవ్వులఁ బేరి పెరుగులై
దొసఁగుల కపటపు దొడ్డివాఁడవా

చ. 3: కలిసితే మంచి తావి కొఁగిటను జిడ్డు దేరీ
పెలుచు పనులఁ గాచే పెండ్లి కొడుక
అలమేలుమంగ పతివై శ్రీ వేంకటాద్రి
నిలిచితి వేలఁగొండ నీ వెత్తిన వాఁడవా

రేకు: 0485-4 ముఖారి సం: 12-448

పల్లవి: యెంత కుచ్చితురాలంటా నేల నన్ను దూరేపు నీ
చెంత నాకె వుండఁగాను సిగ్గుపడవలదా

చ. 1: ఆకె నీవు నేకతము లాడుకొంటా నుండఁగాను
నాకిటను నిలుచుండవద్దా నాకు
చేకొని మీలో మీరు చేసన్నలు నేసుకోఁగా
దాకొని పరాకు సేయఁదగవు గాదా

చ. 2: చాయల నాకె నీవు సారె మొగాలు చూడఁగా
చేయి మాఁదువెట్టు కోను చెల్లదా నాకు
పాయక మీ రిద్దరును పచ్చడము గప్పుకోఁగా
యీ యెడ నే జాజమాడే దితవే కాదా

చ. 3: అలమేలుమంగ పురమందు నీకు నుండఁగాను
తలవంచుకొని మొక్కవలెఁగా నాకు
యెలమి శ్రీ వేంకటేశ యేలితిరి మీరిద్దరు
వెలయ మిమ్ముఁ గొలువ వేడుకే కాదా

రేకు: 0485-5 ఆహిరి సం: 12-449

పల్లవి: నీ సుద్దు లెల్లా విని నీకె మనసు పట్టీ
ఆసపడి వున్నది నీ వాకెఁ జేకొనవయ్యా

చ. 1: చందమామ వంటి మోము చక్కఁదనములపోగు
కుందనఁపు వంటి మేను కోమలపుదీ
అందపు నీలాలగని అతివకు పెనుఁగొప్పు
పొంద నీకే తగు నొక్క పొలఁతి వున్నదయ్యా

చ. 2: కొండల వంటి చన్నులు గుటియైన బటువులు
అండనే సింహపునడుమతి సన్నము
గుండుఁ దీగెలే చేతులు కొనబైన (?) సోగలు
నిండు జవ్వని వున్నది నీకే తగునయ్యా

చ. 3: వలయపు బండి కండ్లు వంటి పిఱుఁదు ఘనము
జలజపుఁ బాదములు సైకమైనవి
యెలమి శ్రీ వేంకటేశ యెనసి నీ వురముపై
అలమేల్మంగ నీ కున్న దాపె తగునయ్యా

రేకు: 0485-6 సామంతం సం: 12-450

పల్లవి: ఇన్నిటాఁ దా నాయకుఁడు ఇల్లాలి నేను
కన్నులఁ జూడఁ జూడఁగా గనమే వేడుకలు

చ. 1: వొప్పుగా నన్ను మన్నించే దొక్కటే గుఱుతు గాక
చెప్పితే నా విన్నపాలు శేనాశేన
అప్పుడు దాఁ జే పట్టిన దదియే యెన్నికగాక
చొప్పుగా నే నాసపడఁ జో టెంతైనాఁ గలదు

చ. 2: వసమై తా నాయింటికి వచ్చుటే యెక్కుడు గాక
కొరే నంటేఁ జేఁతలు కోటానఁ గోటి
యెసగి తా నాతో నవ్వే దిదే సంతోసము గాక
పొసఁగె నా తమకము పూట పూట కెక్కుడు

చ. 3: కలిసి వుండేటి తన కౌఁగిలే సతము గాక
వెలసి నా సిగ్గులైతే వేయి వేలు
యిలఁ దా శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
వలెనని నన్నేలఁగాఁ జెలిమి యీడేరెను

రేకు: 0486-1 ఛాయానాట సం: 12-451

పల్లవి: యేల సారె గరిసించే వింతిని నీవు
తాలిమి నీ తగవులు తగ నీ వెఱుఁగవా

చ. 1: చలపట్ట రాదుగాని సతులకు నీ మీఁద
వలపులఁ గొసరఁగ వచ్చు నెంతైనా
అలుగఁగరాదు గాని ఆసపడి నీతోను
సొలసి మచ్చికలెల్లాఁ జూపఁగవచ్చును

చ. 2: బిగియఁగ రాదు గాని పెనఁగి పెనఁగి నీకు
మొగము చూపి చూపి మొక్కవచ్చును
జగడించరాదుగాని చనవు మెఱసి నీతో
నగి సరసములాడి నంటు చూపవచ్చును

చ. 3: పంతమాడరాదుగాని భావ మెఱిఁగి నిన్ను
చెంతల గుబ్బల నొత్తి చెందవచ్చును
యింతటా శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
సంతసానఁ గూడి మోవి చవి చూడవచ్చును

రేకు: 0486-2 కేదారగౌళ సం: 12-452

పల్లవి: యిందరముఁ జెప్పఁగాను యేల సిగ్గులు పడేవే
విందువలె మోవి ఇచ్చి వీడె మియ్యరాదా

చ. 1: చెక్కునఁ జే యేఁటికి చిరుజెమట లేఁటికి
పెక్కుమారులు నీ పతి పిలువఁగాను
ముక్కుమీఁది వేలేఁటికే ముసి ముసి నవ్వేఁటికే
పక్కనఁ దెరలో నుండే పాదా లొత్తరాదా

చ. 2: కన్నుల నవ్వ నేఁటికే కంబము మాటేఁటికే
పన్నియాతఁడు నిన్నుఁ దప్పక చూడఁగా
చన్నులు మూయ నేఁటికే సన్నలు సేయ నేఁటికే
మన్నించిన కొలఁది నే మాటలాడరాదా

చ. 3: తలవంచుకో నేఁటికే తమక మాప నేఁటికే
చెలరేఁగి ని న్నాతఁడు చెనకఁగాను
అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీవేంకటేశుఁ
డలమి ని న్నేలె నిఁక నల పార్చరాదా

రేకు: 0486-3 లలిత సం: 12-453

పల్లవి: కడు సిగ్గులు వడితే కలసే లా గెట్లానే
చిడి ముడి నెన్నాళ్లైనాఁ జిన్నదానవా

చ. 1: కాంతుఁడు నీతోఁ దానే కదిసి మాటాడఁగాను
మంతనమాడే వేమే మాతో నీవు
చింత నాతఁడే నీపైఁ జిమ్ముఁ జూపులు చిమ్మఁగా
యింతలో మా మోము చూచే విది యేమే నీవు

చ. 2: పలుమారు నీ విభుఁడు పక పక నవ్వఁగాను
సెలవుల నవ్వే వేలే చేరి మాతోను
బలిమి నాతఁడు నీ పయ్యద కొంగంటితేను
యిల మా యండకు వచ్చే వేఁటిదే నీవు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జెంది సొమ్ము లిచ్చితేను
యీవల మా కిచ్చేవు యిదేమే నేఁడు
నీ వలిమేలుమంగవు ని న్నేలె నాతఁ డింతలో
యేవల మమ్మేలితివి యే మనేమే నేము

రేకు: 0486-4 అమరసింధు సం: 12-454

పల్లవి: యేమయ్యా నీ సుద్దు లాకె యెఱిఁగె నంటానో
యే మగువ వద్దికైనా నేఁగఁ దలఁచితివో

చ. 1: చివ్వన నీతో నాపె చిరునవ్వు నవ్వితేను
పువ్వులఁ గొని వేసేవు పూఁచి నీవు
ఇవ్వల నప్పటి నిన్ను నింటికిఁ బిలిచితేను
కువ్వలు వడఁగ నాపె కోక వట్టి తీసేవు

చ. 2: తేరకొన నిన్నాపె దిష్టించి చూచితేను
బోరన జంకించేవు బొమ్మల నీవు
నేరుపుతో నప్పటిని నీకు విందు చెప్పితేను
నోరిలోఁ దమ్ములమిడి నొక్కేవు చెక్కులు

చ. 3: వుండుండి శ్రీ వేంకటేశు వుర మాపె యెక్కితేను
నిందు నివ్వెఱఁగు తోడ నిలుచుండేవు
అండనే యలమేల్మంగ అట్టే చన్నుల నొత్తితే
కొండ లంటా మెచ్చి మెచ్చి గోర నూఁదేవూ

రేకు: 0486-5 శ్రీరాగం సం: 12-455

పల్లవి: తీపులోఁ గారము లేల తెలుపరే విభునికి
యేపునఁ జనవు లిచ్చి యేలుకొనుఁ గాకా

చ. 1: కప్పురాన వేసేవాఁ డు కాఁక లేల రేఁచీనే
దప్పి దేర మోవి యిచ్చి తనుపుఁగాక
చప్పుడుగా నవ్వేవాఁడు జాగ లేల సేసీనే
చిప్పిలఁ గౌఁగిట నించి చెలఁగించుఁ గాకా

చ. 2: సేసలు చల్లే వాఁడు సిగ్గు లేల పుట్టించీనే
ఆస దీర రతుల నోలార్చుఁ గాక
దాసితోఁ బెండ్లాడేవాఁడు వట్టి తరితీపు లేల
మూసిన ముత్తెమైనా మోము చూచుఁగాక

చ. 3: గందము పూసినవాఁడు కడు నెలయించ నేలే
అంది నా గుబ్బల నుర మంటించుఁ గాక
యిందె శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
పొందె నిఁకఁ బంతా లేలే భోగించుఁ గాక

రేకు: 0486-6 తెలుఁగుగాంబోది సం: 12-456

పల్లవి: ఆకెతో మారు వసంత మాడుదువు రావయ్య
యీకడ నాకడఁ జూచే మెవ్వరిందు బలువో

చ. 1: కన్నుల చూపుల నింతి కలువ రేకులు చల్లి
సన్నలనే కప్రాలు సారెఁ జల్లీని
చన్నుల మెఱుఁగులను సరిఁ గుంకుమలు చల్లి
ఇన్నిటా వసంతమాడీ నిదివో నీ మీఁదను

చ. 2: వేడుకనవ్వు లనే వెన్నెల లెల్లాఁజల్లి
వాడిక మాటలనే వలపు చల్లి
కూడేటి కోరికెలను కుచ్చు ముత్తెములు చల్లి
యీడుగా వసంత మాడీ నిదివో నీమీఁదను

చ. 3: సమరతి నిట్టూర్పుల జాజరగాలి చల్లి
చెమటఁ బన్నీరు మచ్చికఁ జల్లీని
అమరే శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
హీమపు వసంతమాడీ నిదివో నీమీఁదను

రేకు: 0487-1 గంభీరనాట సం: 12-457

పల్లవి: తా నాడిన సరసము తనకు వెగ్గళమైతే
నే నేమి సేతునే యాల నెపాలు వేసీనే

చ. 1: మొనలైన నా చన్నుల మొలకలు నాఁటె నంటా
కొన చూలపులఁ దా నెంత కొచ్చి చూచీనే
పెనఁగఁగా నా జడ ముప్పిరిఁ జుట్టుకొనె నంటా
వొనరఁ గఁదా నేల వురము దట్టీ నే

చ. 2: చెవిలోని నా పుణుఁ గు చెక్కులపైఁ గారె నంటా
తావురుచుఁ దా నేల తిద్ద వచ్చీనే
యివల మోవులు సోఁకి యెంగిలాయ నంటాను
జవళి బొమ్మల నేల జంకించీనే

చ. 3: కలసి కౌఁగిలించఁగా గాజు లొత్తె నంటాను
చలపట్టి తా నేల సాదించీనే
యెలమి శ్రీ వేంకటేశుఁడే నలమేలు మంగను
లలి నేలె నన్ను నెంత లాలించీనే

రేకు: 0487-2 సింధురామక్రియ సం: 12-458

పల్లవి: యివిగో మా విన్నపము లిచ్చగించి వినవమ్మ
యివల నాయకుఁడ నీ కిదే తగవయ్యా

చ. 1: పన్నుకొన్న వినయాలు పడఁతులవి
మన్నించే నేరుపులు మగవానివి
సన్నల విలాసాలు సతులవి
యెన్నికైన చిఱునవ్వు లెప్పుడూఁ బ్రియునివి

చ. 2: ఆసపడి కొసరేవి అంగనలవి
రాసి కెక్కఁ జెల్లించేవి రమణునివి
వాసులును వంతులును వనితలవి
వేసరని వోరుపులు విభునివి

చ. 3: మంతనాలుఁ బంతనాలు మానినులవి
పొంత సిగ్గు లుడిపేవి పురుషునివి
యింతలో శ్రీ వేంకటేశుఁ డేలే నలమేల్మంగవు
సంతతపు మెచ్చు నీది సరస మాతనిది

రేకు: 0487-3 మాళవిగౌళ సం: 12-459

పల్లవి: కన్నెపడుచవు గాన కతలేమీ నెఱుఁగవు
మిన్నక నా మాట వింటే మేలయ్యీ నీకు

చ. 1: వేడుకతో విభునికి వీడె మిచ్చి రమ్మంటేను
యీడనే సిగ్గు వడే విదేమే నీవు
చూడవే యాతఁ డంపెను సొమ్ములు నీ కంటేను
యేడో పరాకు సేసే విదేమే నీవు

చ. 2: కొలువై యున్నాఁడాతఁడు గోడ నిక్కి చూడుమంటే
సెలవుల నవ్వేవు చెల్లఁబో నీవు
తలుపు మాఁటుకు వచ్చి దగ్గరి మాటాడు మంటే
చెలి యండనే వుండేవు చెల్లఁబో నీవు

చ. 3: పరపుపైఁ బవళించె పాదాలు నీ వొత్తుమంటే
అరిదిఁ దొడ డిగ్గేవు అవునే నీవు
సరి నలమేల్మంగవు సరుగ శ్రీ వేంకటేశు
నరసి నేఁడు గూడితి వవునే నీవూ

రేకు: 0487-4 శుద్ధవసంతం సం: 12-460

పల్లవి: యేమాయ నిందుకు మీ రిద్దరును జాణలే
ప్రేమతో నెచ్చుకుందులఁ బెనఁగ నేమిటికే

చ. 1: మనసెనసినవారు మందెమేళాన నుందురు
చనవు గలుగువారు సాదింతురు
తనవి చాలనివారు తగిలి పై కొందురు
యెన లేని నీ చేఁతల కెగ్గుపట్టఁ దగదు

చ. 2: సమ్మతించువారు మీఁజి సరసములాడుదురు
నమ్మికైన వారెంతైనా నవ్వుదురు
యెమ్మెలు లేని వారు యేమైనా నడుగుదురు
ఇమ్ముల నిందుకుఁ గాను యెగ్గుపట్టఁ దగదు

చ. 3: కలసి వుండీన వారు కౌఁగిట బిగింతురు
వలచిన వారు గర్వాన మెత్తురు
చెలి యలమేలుమంగ శ్రీ వేంకటేశుఁడవు
యెలమిఁ గూడితి రిఁక నెగ్గుపట్టఁదగదు

రేకు: 0487-5 కురంజి సం: 12-461

పల్లవి: అంగన నిన్నడిగె రమ్మనె నీ మాట
సంగతిగ మరుమాట సరి నానతీవయ్యా

చ. 1: చెలులచే నింతి నీకు చెప్పి పంపిన మాటలు
తలఁచుకొన్నాఁడవా దయతో నీవు
తొలుతఁ గాను కంపిన దొడ్డ పూవుల బంతి
లలిమించిన పరిమళము గొంటివా

చ. 2: చాయల నాతో నాపె సారెఁ జూచిన చూపులు
ఆయములు గరఁచెనా అంటుకొనెనా
చేయెత్తి సిగ్గు తోడ చేరి మొక్కిన మొక్కులు
ఆయనా నీకు శలవు అందరిలోనా

చ. 3: బెరసి తెరమాటునఁ బెట్టిన నీపై సేసలు
శిరసుపై నిండెనా చిందెనా నీపై
అరుదై శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
గరిమ నిన్నుఁ గూడి గద్దెపైఁగూచున్నది

రేకు: 0487-6 రవి సం: 12-462

పల్లవి: కన్నులఁ జూచితేనే కడు దయ పుట్టే నాకు
చిన్ని నవ్వు నవ్వకురే సిగ్గువడు నేమో

చ. 1: గందవొడి చల్లరే కడుఁ జెమటలు గారీ
యెందుండి వచ్చినాఁడో యాడకుఁ దానూ
కందువఁ బన్నీ రియ్యరే కడు దప్పి గొన్నాఁడు
అందుక యే మేమి పను లలయఁ జేసినాఁడో

చ. 2: కొప్పు చక్కఁ బెట్టరే కురులు చెదరినవి
చిప్పిలఁగ సాములు సేసినాఁడేమో
వొప్పుగఁ బాన్పు వెయ్యరే రెప్పలను నిద్ర దేరీ
తప్పక జాగరాలు తా నెంత సేసినాఁడో

చ. 3: పిలిచి వీడె మియ్యరే పిప్పిగట్టేఁ బెదవులు
చెలులకుఁ గత లెంత చెప్పినాఁడో
అలమేల్మంగను నేను అట్టే తా శ్రీ వేంకటేశుఁ
డెలమి నన్నేలె నిట్టే యెందరి నేలినాఁడో

రేకు: 0488-1 సాళంగనాట సం: 12-463

పల్లవి: మనసు పట్టఁగరాదు మాని వూరకుండరాదు
యెన లేని తలపోఁత లెంత సేసీనే

చ. 1: అప్పుడు విభుఁడు నాతో నానతిచ్చిన మాటలు
చెప్పఁగ సిగ్గయ్యీని చెలి నీతోను
కుప్పలుఁ దెప్పలు నై గుబ్బతిల్లీ మతిలోన
యెప్పుడు గానీ రాఁడో యేమి సేతునే

చ. 2: చేపట్టి తా నేకతానఁ జేసిన చేఁతలు నీకు
చూపితేఁ బరవశాలు చుట్టు కొనీవి
దాఁపురాలై మేని మీఁద రాయక పాయకున్నవి
యేపునఁ దా నెందున్నాఁడో యేమి సేతునే

చ. 3: యీకడ శ్రీ వేంకటేశుఁడిటు నన్నేలినందుకు
నాకు నీ మోము చూచితే నవ్వువచ్చీని
మేకొని వేడుక లలమేలుమంగను నేను
యేకమాయ మోహములు యేమి సేతునే

రేకు: 0488-2 భవుళి సం: 12-464

పల్లవి: యిందుకు నవ్వుకుమీ యిట్టే నీ మంచితనము
పొందుగా నీ కీరితిగాఁ బొగడితి నేను

చ. 1: ఇంతుల ముందర నెల్లా నెమ్మె లెల్లాఁ జెప్పుకొంటి
కాంతుఁడవు నీవు నాకుఁ గలవంటాను
పంతాన మురిపెమునఁ బైపైనే మెరసితి
చెంతల నన్ను సింగారించితి వంటాను

చ. 2: చొక్కి నీవు నాకిచ్చిన సొమ్ము లెల్లాఁ జూపితి
చిక్కి నేఁడు నాకు మోహించితి వంటాను
నిక్కెపు గర్వము లెల్లా నెరపితి సబలోన
వుక్కున నా మాటలోనే వుండదు వుంటాను

చ. 3: పైకొని చెలుల చేత పాటలు పాడించుకొంటి
చేకొని పట్టపుదేవిఁ జేసితి వంటా
యీకడ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
నాకు నీడు లేరంటి నన్నే చూతు వంటాను

రేకు: 0488-3 పాడి సం: 12-465

పల్లవి: చూత మిఁకఁ దనలాగు చూపి నీకు వట్టి సిగ్గు
చేతికి లోఁజేసుక చెనకఁగ రాదా

చ. 1: చెలియ సిగ్గులతోడఁ జిత్తరువు వ్రాసి కొంకి
నిలిచి తను దట్టించీ నీవు చూడఁగా
వులివచ్చి మాటలాడీ వొడివట్టి తియ్యరాదా
చెలరేఁగి యప్పు డేమి సేసీనో కాని

చ. 2: కోమలి పరాకు సేసుకొని చెలితో మాటాడీ
వేమారు నీవు దన్ను వేఁడుకొఁగాను
చేముంచి చన్నుల మీఁదఁ జేయి చాఁచఁగా రాదా
దీమస మెంత గద్దో తేలుతుము గాని

చ. 3: నెలత వొయ్యారముతో నిమ్మవం డెగరవేసీ
లలి నీవు తమి రేఁచి లాలించఁగా
అలర శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
కలసితి వేమి నేర్పు గైకొనీనో కాని

రేకు: 0488-4 కాంబోది సం: 12-466

పల్లవి: పొందైన నీ వలపులు పులిసీ నటే
యిందరిలో నిన్ను నేలీ యేల వేగిరించేవే

చ. 1: చెక్కులిట్టే నొక్కినాఁడు సెలవుల నవ్వినాఁడు
మొక్కు లియ్యకొనెఁ గదే మొగఁడు
కక్కసించ నేమిటికే కౌఁగిలించుకొనీఁ గాక
యెక్కువ తక్కువలకు నేల వేగిరించేవే

చ. 2: నీ దిక్కే చూచినాఁడు నీతో మాటలాడినాఁడు
పొదుకొని నిమ్మపండు పై వేసినాఁడు
గోదిల నీ కిపు డేలే కొరిక చెల్లించీఁ గాక
యీదెస నింతటిలోన నేల వేగిరించేవే

చ. 3: పాను పెక్కించు కొన్నాఁడు పాదాలు పైఁ జాఁచినాఁడు
చే నంటి నీ కుచములు చెనకెఁ గదే
పూని శ్రీ వేంకటేశుఁడు పొంచి యింకాఁ గూడీఁ గాక
యీ నెలవుననే వుండి యేల వేగిరంచేవే

రేకు: 0488-5 ఆహిరి సం: 12-467

పల్లవి: యేమయ్య్య ప్రియము చెప్పే వెంతేసి నాకు
నీ మతిలోదానఁ గాక నీకు వింతదాననా

చ. 1: నేరుపుతోడ నాతో నీవు మాటలాడఁగాను
గారవించి వినేఁగాక కాదనేనా
సారె సారె నీవు నాకు చనవు లొసఁగఁ గాను
కొరి సంతోసించేఁ గాక కోపగించేనా

చ. 2: చేయి చాఁచి నీ వప్పటి చెనకఁగ రాఁగాను
కాయము నీ కొగ్గేఁ గాక కా దనేనా
ఆయములు మోవ నీవు అట్టే నాతో నవ్వఁగాను
చాయలో మెలఁగేఁ గాక సాదించేనా

చ. 3: అందము లెటిఁ గి నీవు అంతలోనే కూడఁగాను
కందువలు మెచ్చేఁగాక కాదనేనా
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
పొందులు నెరపిఁ గాక పోల దనేనా

రేకు: 0488-6 శంకరాభ రణం సం: 12-468

పల్లవి: యింత చాలదా తనకు నింతు తోడిచలము
వింత సేయకు మనుచు వేఁడుకొంటీఁ గదవే

చ. 1: నన్ను నేల చెనకీని నాతో నేల పెనఁగీని
మొన్ననే తనకు నేను మొక్కితిఁ గదే
సన్నలేల సేసీని జారుఁ బయ్య దే లంటీని
యెన్నికతోఁ బంతా లెల్లా నిచ్చితిఁ గదే

చ. 2: చొప్పు లేల యెత్తీని సొమ్ము లెన్ని యిచ్చీని
అప్పుడే తనకు నేనూఁ జెప్పితిఁ గదే
కొప్పేల దువ్వీని గోరేల సోఁకించీని
చిప్పిల నూడిగా లెల్లాఁ జేసితిఁ గదే

చ. 3: పెదవు లేల మోపిని ప్రియ మెంత చెప్పీని
యిదివో కౌఁగిలించితి నిట్టే కదే
యెదుట శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్ను నేలె
సదరాన నేమి నవ్వి సతి నైతిఁ గదవే

రేకు: 0489-1 భైరవి సం: 12-469

పల్లవి: అలిగితి నంటా నేల అట్టే నన్ను వేఁడుకొని
తలఁచే నా తలఁపులు తా నెఱుఁగఁడా

చ. 1: సతి వద్ద నుండఁగాను చాయ సేసుకొంటేఁ గాక
రతికిఁదాఁ బిలువఁగ రాకుండుదునా
కతలు చెప్పుకోఁగాను కడ నిలుచుండీఁగాక
తతి నూడిగాలకు దగ్గరక వుందునా

చ. 2: తెరవేసుకుండఁగా సందేహమున నుంటిఁగాక
అరసి తా వీడె మీఁ గా నంద కుందునా
విరుల వేట్లాడఁగా వింతలు చూచితిఁగాక
గరిమఁదా వలె నంటే కౌఁగిలించకుందునా

చ. 3: వేడుక కాఁడై వుండఁగా వేళ దెలిసితి గాక
కూడి పాదా లొత్తుమంటేఁ గొంకివుందునా
యీడనే శ్రీ వేంకటేశుఁడింతలోఁ దా నన్నునేలే
వాడిక దా నడపితే వడి మెచ్చకుందునా

రేకు: 0489-2 పాడి సం: 12-470

పల్లవి: మేలు మేలు యిందు కిట్టే మెచ్చితి నేను
వాలుక చూపుల నిన్ను వంచెఁగా విభుఁడ

చ. 1: మందెమేళమైనఁ గాని మగువ నీతొడ యెక్కి
కందువైన మాటలాడీఁగా విభుఁడ
సందడి లోనైనాఁ గానీ చవులుగ మోవి ఇచ్చి
చెంది నీకు సంతోము చేసీఁగా విభుఁడ

చ. 2: వెక్కసమైనాఁ గానీ వేడుక నీకుఁ బుట్టించి
గక్కన నీతో నవ్వేఁగా విభుఁడ
మొక్కళమైనాఁ గానీ మోహము నీపైఁ జల్లీ
అక్కరతో సరసము లాడేఁగా విభుఁడ

చ. 3: చుట్ట రికమైనాఁ గానీ సొలసి సొలసి నిన్ను
గట్టి గుబ్బలను వొత్తెఁగా విభుఁడ
ఇట్టి శ్రీ వేంకటేశ ఇటు నన్ను నేలితివి
దట్టముగా తానూఁ గూడి తనిపెఁగా విభుఁడా

రేకు: 0489-3 హిందోళం సం: 12-471

పల్లవి: వలసి నప్పుడు నీవే వచ్చేవు గానీ
మలసి యందాఁకా నిది మఱవకుండు మనే

చ. 1: వెలఁది నీ కొకమాట విన్నవించి రమ్మనె
తలఁపు లోపల నుండి దాఁగకు మని
తెలిపి రమ్మనె మరిఁ దేటతెల్లమిగాను
చలము లందులో మరీ సాదించకు మనుచు

చ. 2: యిక్కువ నింకా నొక టెఱిఁగించి రమ్మనె
అక్కడనే సరసమూ నాడుమనీ
మొక్కి యెఱుకగా కొంగు ముడివేసి రమ్మనె
గక్కన మనోరథాలఁ గౌఁగిలించు మనుచు

చ. 3: యెదుటఁ దారుకాణగా నెచ్చరించి రమ్మనే
యెదలో నైనా రతుల నెనయు మనీ
అదన శ్రీ వేంకటేశ అంతలో వచ్చికూడితి
విదివో తనతో వీ విరవైతి వనుచూ

రేకు: 0489-4 దేసాళం సం: 12-472

పల్లవి: పోఁక వెట్టి నప్పుడే పొందుగ నే నాల నైతి
సోఁ కోరిచి వుండితేనే చుట్ట మయ్యీఁగాక

చ. 1: యేమి సేసినాఁ దన కెదురాడేదాననా
మోము చూచి చేతు లెత్తి మొక్కీఁగాక
వాములైన వలపులు వడివెట్ట వచ్చునా
ప్రేమముతో తానే వచ్చి పెండ్లాడీఁ గాక

చ. 2: యెవ్వతెఁ దెచ్చుకొనినా యెగ్గుపట్టే దాననా
నవ్వుతా నెడ మాటలు నడపీఁగాక
జవ్వనము తన సొమ్ము జల్లిఁ బట్ట వచ్చునా
చివ్వనఁ దానే నాపై సేసవెట్టీఁ గాక

చ. 3: యెప్పుడు దా విచ్చేసినా యెడనుంటి వనేనా
వొప్పి కౌఁగిలించి యిట్టే వొనరేఁగాక
నెప్పున శ్రీ వేంకటనిలయుఁడు నన్నుఁగూడె
కప్పి తానే కంకణము గట్టీఁ గాకా

రేకు: 0489-5 శ్రీరాగం సం: 12-473

పల్లవి: నెలఁత సొబగు లివి నీ సొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా

చ. 1: వేమరు నవ్వుల వెన్నెల గాసీ
రామ కడకు నిటు రావయ్యా
దోమటి పలుకుల దొరిగీఁ దేనెలు
ఆమని కాలము అవధరించవయ్యా

చ. 2: వలపుల చెమటల వానలు గురిసీ
సొలవక యీకెనుఁ జూడవయ్యా
పెలుచుఁ గుచంబుల పిందెలు వొడమెను
అలరిన కానుక లందుకోవయ్యా

చ. 3: గములై మెయి మరుకళలు దొలఁకీ
తమితోఁ గౌఁగిటఁ దగులవయ్యా
జమళి శ్రీ వేంకటేశ్వర సతిఁ గూడితి
వమరె నీకు మే లవునయ్యా

రేకు: 0489-6 తెలుఁగుఁగాంబోది సం: 12-474

పల్లవి: ఆతఁడు మగఁడు నీకు నతివవు నీ వైతి
చేతికి లోనై వుండితేఁ జిత్తము వచ్చుఁగాక

చ. 1: సరసము లాడితేనే చవులు వొడముఁ గాక
విరసము లాడితేను వెగటు గాదా
మరిగి పొందుసేసితే మనసు గరఁగుఁ గాక
వెరవు లే కలిగితే వెక్కసమై యుండదా

చ. 2: ననుపులు చూపితేనే నగవులు వచ్చుఁగాక
పెనపులఁ జట్టి తేను ప్రియము లవునా
మనవులు చెప్పితేనే మచ్చికలు రేఁగుఁ గాక
అనువుకు మాటాడితే నందము లవునా

చ. 3: సంతములై కూడితేనే సమ్మతౌఁగాక మన
పంతము లాడితేను పను లింపౌనా
యింతలో శ్రీ వేంకటేశుఁ డెనసె నన్నుఁదానే
సంతోసా లిటువంటివి సంగతులే కావా

రేకు: 0490-1 సామంతం సం: 12-475

పల్లవి: అడుగరే చెలులాల ఆతనినే యీ మాట
యెడయని విన్నపము లివి నావి యనరే

చ. 1: వినయము గలిగిన వెలఁది పొందులు చవి
మనసు నమ్మిన యట్టి మాటలు చవి
తనివోని వలపుల తలపోఁతలు చవి
పెనగొన్న కౌఁగిటిలో బిగువు చవి

చ. 2: మచ్చికలు సలిపేటి మంతనంబులు చవి
ఇచ్చకము నడుపేటి యింపులు చవి
విచ్చన విళ్ళైన వేడుక చేఁతలు చవి
కొచ్చి కొచ్చి కొసరేటి కూరిమి చవి

చ. 3: మొక్కుచు సారెకుఁ జూచే మచ్చట చూపులు చవి
చొక్కేటి రతి వేళల సుద్దులు చవి
యిక్కడ శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
దక్కిన తమకముల తరితీపులు చవి

రేకు: 0490-2 కుంతలవరాళి సం: 12-476

పల్లవి: కూడిమాడి పతివద్దఁ గూచుండవే
జీడి వంటిది వలపు సిగ్గు లింకనేలే

చ. 1: మనసు రేచఁగవచ్చు మక్కువ లణఁచ రాదు
కనుఁగొన దొరకొంటే కాంక్ష దీరదు
తనువు సోఁకించవచ్చు తమి మాన్ప పసగాదు
చెనకి విభుని తోఁడ సిగ్గు లింక నేలే

చ. 2: వేమరు నవ్వఁగవచ్చు విరహము పట్టరాదు
ప్రేమము చల్లితే నాస పిరి తియ్యదు
ఆముకోఁ గదిసి మరి దీమసము పనిలేదు
చేముంచెఁ బను లెల్లాను సిగ్గు లింక నేలే

చ. 3: సరసములాడవచ్చు చవులు విడువరాదు
మరిగిన మీఁదట మఱుఁగు లేదు
వరుస తో శ్రీ వేంకటేశ్వరుఁడు నిన్నుఁగూడె
సిరులఁ బెండ్లాడితివి సిగ్గు లింక నేలే

రేకు: 0490-3 ఆహిరి సం: 12-477

పల్లవి: తరితీపు లివి వినఁ దమకించీ నా మనసు
సరుస నాకు మీరు సంతోసము సేయరే

చ. 1: యేమని చెప్పెంపునొకో యింతితోడ నా విభుఁ డు
నా మాట లెల్ల విని నవ్వునొకో
కామించి నే నంపిన కాని కందుకొనునొకో
చేముంచి యీ విచారము చెప్పరే వోచెలులు

చ. 2: వెలయ నీ పాటికి విన్నపము లందునొకో
తలఁపు లోపల దయ దలఁచునొకో
చెలరేఁగి యిప్పుడే సింగారించుకొనునొకో
యెలమి నూహించి నాతో నెంచరే యీ యెన్నికా.

చ. 3: వడిగాఁ బల్లకీ యెక్కి వాకిటికి వచ్చునొకో
తడవి ఇంటిలోఁ దొల్లి తా నున్నాఁడొకో
యెడయక శ్రీ వేంకటేశుఁ డిదె నన్నుఁగూడె
అడరి యీతని సుద్దు లబ్బురాలు గదవే

రేకు: 0490-4 నాదరామక్రియ సం: 12-478

పల్లవి: మనసూ నిలుప రాదు మగని఼ దడవరాదు
యెనలేని నా మోహాన కేమి సేతునే

చ. 1: విన్నపాలు సేసితేను వేసరించి నటు లయ్యీ
కన్నుల఼ జూచితేను కా఼క రే఼చినటు లయ్యీ
చన్నుల నే నూదితేను సాదించినటు లయ్యీ
యెన్నికె లిట్టివి నేనేమి సేతునే

చ. 2: కొలువులు సేసితేను కొసరినటుల నయ్యీ
పలికితే వలపులు పచారించినటు లయ్యీ
సెలవుల నవ్వితేను సిగ్గుపరచినట్లయ్యీ
యెలమి నా మొగమోట కేమి సేతునే

చ. 3: చేరి పాదాలొత్తితేను చెనకినటుల నయ్యీ
మేరతో఼ గౌ఼గిలించితే మీఱి పెన఼గిన ట్లయ్యీ
గారవించింతలో శ్రీ వేంకటేశు఼డు నన్ను఼గూడె
యీరీతి నా వేడుకల కేమి సేతునే

రేకు: 0490-5 ఆహిరి సం: 12-479

పల్లవి: నన్నుఁజూచి కాతరాన నవ్వులు వచ్చీఁగాక
వున్నతి నాపె వచ్చితే నొల్ల కెట్లా నుండెనే

చ. 1: తప్ప కాపె రూ పేపొద్దూ తనలోనే గుబ్బతిలు
చెప్పి పంపిన మాటలఁ జిల్లులౌ గుండె
చొప్పుల మై గురుతులు చూచుకొంటే నీరౌ మతి
యిప్పుడాపెఁ గూడక తా నెట్టో రువఁగలఁడే

చ. 2: మరిగి నాపె యెదుట మలసితేఁ జిమ్మి రేఁగు
తిరిగి చూచితేఁ దరితీపు పుట్టును
తొరలఁగ సొలసితే తూరిపారు (?) మర్మములు
యిరవైన యాపెఁ బాసి యెట్టోరువఁ గలఁడే

చ. 3: తనమొగ మాపె యైతే తమకము లుప్పతిల్లు
ననుపుల నవ్వ గంటే నాము లెక్కును
యెనసి శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్ను మెచ్చి
యెనలేని యాపెను తా నెట్టు మానఁగలఁడే

రేకు: 0490-6 పాడి సం: 12-480

పల్లవి: వలపు పై కొసరైతే వడి మొగచాటు గాదా
లలనల సిగ్గు లేల లంకెఁ బెట్టే వయ్యా

చ. 1: చిప్పిల నాపె తొడపై శిరసు మోవఁ బండుండి
అప్పటి నాతో నవ్వే వౌనయ్యా
కొప్పు నీ కాపె దువ్వఁగా కొంగు పట్టు కున్నాఁడవు
యిప్పుడు నీయాసోద మేమి చెప్పేమయ్యా

చ. 2: పొదిగొన నీవాపె బుజముపైఁ జేయి వేసి
యెదుట నా మోము చూచే విదేమయ్యా
పుదుటు గుబ్బల నాపె వొత్తఁ గా కాలుదొక్కే
వదన నీ వేడు కేమని చెప్పేమయ్యా

చ. 3: పొందు లాపెతోఁజేసి పొరచితనాన నాపై
నంది పచ్చడము గప్పే వౌనయ్యా
ముందే యాకెఁ గూడితివి మొఱఁగి శ్రీ వేంకటేశ
చెందితివి నన్నికడ చెల్లుఁ జెల్లునయ్యా

రేకు: 0491-1 కొండమలహరి సం: 12-481

పల్లవి: ఇంతి నేల వుప్పతించే వెంత కాతర మనుచు
చెంత నీపె మోహము నీ సంతోసమే కాదా

చ. 1: మొక్కలానఁ జింతతోడ మూసిన రెప్పల చూపు
గక్కన నిన్నుఁ గంటే కాఁడి పారదా
అక్కరతో విన్నాళ్ళూ నాపుకొనున్నవలపు
వెక్కసమై నీమీఁద వెల్లిగొనదా

చ. 2: వొగ్గి నీకుఁ గా లోలో నుమ్మగిలిన మాటలు
దగ్గర నీవు వచ్చితే తగులుకోవా
సిగ్గులతో నల్లంతఁ జిముడుచున్న మనసు
బెగ్గిల నిన్నుఁ గౌఁగిట బిగియించఁ జెల్లదా

చ. 3: వుప్పతిల్లి మేని మీఁద నుడివోని తమకము
చొప్పగు నీ రతులలో సుడిగొనదా
యిప్పుడే శ్రీ వేంకటేశ యీకె నేలితివి గాక
తొప్పఁ దోగిన చెమట దొమ్మి నోలలార్చదా

రేకు:	0491-2 పూర్వగౌళ	సం:	12-482

పల్లవి:	యెంత పని గలదో యేమౌనో నీ కాపె
	వింతగా నప్పటి నుండే వేళ చూచుకొన్నది

చ. 1:	మానినితో నీ విప్పుడు మరి యేకత మాడఁగా
	కానిక దెచ్చి యొకతె గాచుకున్నది
	పానుపు పై మీ రిద్దరుఁ బవ్వళించి వుండఁగాను
	పానిపట్టే నీ పదాలు పాడుకొంటా నున్నది

చ. 2:	తేరకొన మీ రిద్దరుఁ దెర వేసుకుండఁ గాను
	నీ రాక గోరుకొని నిలుచున్నది
	మేరతోడ మీలోన మీరు వీడే లందుకోఁగా
	చేరి నీకు మొక్కే నంటాఁ జేతులెత్తుకున్నది

చ. 3:	అంగవించి మీరు రతి నలయుచుండఁ గాను
	తొంగి చూపుల వాకిటఁ దొట్టు కున్నది
	సంగతిగ శ్రీ వేంకటేశ్వర నీ వింతలో వచ్చి
	సంగడిఁ దన్ను నేలితే సన్న సేయుచున్నది

రేకు: 0491-3 వరాళి సం: 12-483

పల్లవి: వొడిఁ బెట్టు కొనరాదా వువిద నేపొద్దు నీవు
కడు నేల లోఁగేవు కా దనేనా నేను

చ. 1: జలజాక్షి నీతో సరసములాడి తనివోదు
తళుకుఁ జూపులఁ జూచి తనివోదు
కొలువు లోపల నిన్నుఁ గొసరియుఁ దనివోదు
యెలమి నీమీఁద నీకె కెంత మోహమో

చ. 2: పనివడి చేయి వేసి పందే లాడి తనివోదు
తనలో నిన్ను భావించి తనివోదు
చెనకుచు నూడిగాలు చేసి చేసి తనివోదు
యెనసి నీ మీఁద నీకె కెంత మోహమో

చ. 3: మచ్చికలు చూపి నీతో మాటలాడి తనివోదు
తచ్చి సెలవుల నవ్వి తనివోదు
అచ్చమై శ్రీ వేంకటేశ అట్టే నన్ను నేలితివి
హెచ్చి యీకె నిన్నుఁ గూడె నెంత మోహమో

రేకు: 0491-4 ద్రావిడభైరవి సం: 12-484

పల్లవి: యెవ్వరు నిన్నొద్దనేరు యేల నీకు వెఱపు
యివ్వలి మోమై నీవు యీకెఁ జూడరాదా

చ. 1: చెక్కిటి చేత నున్నవి చెలియకు సిగ్గులు
చక్కని మోమునఁ దేరీ సారె నిగ్గులు
పిక్కటిల్లు నవ్వులనే పెట్టే ముగ్గులు
యెక్కడ పరాకు నీకు యీకెఁ జూడరాదా

చ. 2: సొరిదిఁ గన్నుల నవే చూపుల చిలుకులు
పరగీ చిగురు మోవిపైఁ బలుకులు
సిరుల దంతముల మించీఁ దళుకులు
యెరవు సేయక యిట్టే యీకెఁ జూడరాదా

చ. 3: సొలెవలిపె పయ్యద చన్నులమీఁది మఱుఁగు
చాలుకొన్న మెయిఁ జెమట జాలు కరఁగు
యేలితివి శ్రీ వేంకటేశ యిన్నిటాను నీవు
యీ లీలనే మన్నించి యీకెఁ జూడరాదా

రేకు: 0491-5 సౌరాష్ట్రం సం: 12-485

పల్లవి: మఱవకు నీ గుణము మనసులోదాన నేను
యెఱిఁగె లోక మెల్లా నన్నేలితి వంటాను

చ. 1: విన్నపము సేసితిఁగా వింటివిగా నా మాట
నిన్ను నే మనఁగలను నీ చిత్తము
యెన్నిక సేసుకొంటివి యింతగా మన్నించితివి
పన్నుకొన్న నీ కరుణే పదివేలు నాకు

చ. 2: కానుక నీ కిచ్చితిఁగా కంటివిగా నీవు నన్ను
సే నెంతదాన నీకు నీ చిత్తము
కానిమ్మని కైకొంటివి కంకణము గట్టి తివి
నీ నవ్వుల సరసమే నిధానము నాకు

చ. 3: కమ్మటి మొక్కితిఁ గా కౌఁగిలించుకొంటివిగా
నెమ్మదినుండే నేను నీ చిత్తము
సమ్మతించి శ్రీ వేంకటేశ్వర నన్నుఁ గూడితివి
పమ్మిన నీ వూడిగమే భాగ్యమెల్లా నాకు

రేకు: 0491-6 శ్రీరాగం సం: 12-486

పల్లవి: యేమని విన్నవించేము యింతి మోహము నీమీఁద
ఆమని వేడుకలై అంటుకొనఁ జొచ్చెను

చ. 1: తలఁపు లోపలి సిగ్గు దాఁచుకొనఁ జోటు లేక
సెలవుల నవ్వులై చిందఁ జొచ్చెను
వలపులు మూసిపెట్ట వసముగాక యవే
వులివచ్చి పలుకులై వుప్పొంగఁ జొచ్చెను

చ. 2: యెన్నరాని యడియాస లిముడుకోఁ జోటు లేక
కన్నుఁగొన చూపులై కమ్మఁ జొచ్చెను
అన్నిటాను తమకము లణఁచఁగఁ జోటు లేక
వున్నతపుఁ జెమటలై వూరఁ జొచ్చెను

చ. 3: కలసిన సంతోసము కట్టి పెట్టఁ జోటు లేక
నిలిచి మోము కళలై నిండఁ జొచ్చెను
యెలమి శ్రీ వేంకటేశ యింతిఁ గూడినరతులు
తలకొన్న సరసమై దైవారఁ జొచ్చెనూ

రేకు: 0492-1 ముఖారి సం: 12-487

పల్లవి: మాకేమి చూపేవు మగువ చేఁత లెల్లా
నీకు నితవైతేఁ జాలు నేర్చునయ్యా కతలు

చ. 1: చనవు గలదు గాన సంగడిఁ గూచున్నది
మనసు దెలుఁసు గాన మాట లాడీని
ననిచిన లేమ గాన నవ్వులు నవ్వీ నీతో
చెనకి యేమి సేసినాఁ జెల్లునయ్య ఆపెకు

చ. 2: తగులమైనది గాన తరితీపు సేసీని
బిగియ నోపుఁగాన పెనఁగీ నీతో
మొగమిచ్చిలాఁడి గాన మోహములు చల్లీని
జిగి నిన్నెంత మీఁటినాఁ జెల్లునయ్య ఆపెకు

చ. 3: కందువ లెఱుఁగుఁ గాన కౌఁగిలించుకొనె నిన్ను
మందెమేళము గనక మలసీ నీతో
అందపు శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
చెందితి నిన్నుఁ బెండ్లాడఁ జెల్లునయ్యా ఆపెకు

రేకు: 0492-2 సాళంగనాట సం: 12-488

పల్లవి: తానే నాకు రమణుఁడు తనకు నే దేవులను
పూని యెగ్గు పట్టవద్దు పొద్దున రమ్మనరే

చ. 1: చలపట్ట వద్దు గాని చనవు చేసుకొని
చెలు లెంత గొసరినాఁ జెల్లు ననరే
అలుగఁగవద్దు గాని ఆసపడ్డవారలు
చెలఁగి యేమి సేసినాఁజెల్లు ననరే

చ. 2: పంత మాడ వద్దు గాని భావించి వలపుల
చింత తో జంకించినానుఁ జెల్లు ననరే
వింత సేయవద్దు గాని వేడుకతోఁ గొనగోర
చెంతల నెంత వొత్తినాఁ జెల్లు ననరే

చ. 3: బిగియఁగవద్దు గాని పెనఁగి కూడే వేళ
జిగి నెంత మీటినానుఁ జెల్లు ననరే
నగి శ్రీ వేంకటేశుఁడు నన్ను నిటు వచ్చి కూడె
చిగురు మోవి యడుగఁ జెల్లు ననరే

రేకు: 0492-3 మాళవిగౌళ సం: 12-489

పల్లవి: వినే మానతియ్యవయ్య వేడుక లయ్యీ మాకు
పెనఁగొనెనో వావులు ప్రియముతో మీకు

చ. 1: కందువ నీ మొగమునఁ గళలు దేరీ నేఁడు
అందెనో మాట పలుకు లాపెకు నీకు
చిందు వందు లైనవి జిగి గొని తురుములు
పొందు లొకరొకరికి పొసఁగెనో తొలుతే

చ. 2: చాయలు సన్నలు మీకు సరి వచ్చి వున్నది
ఆయనో పెండ్లి సోబన మప్పుడే మీకు
దాయక పాయక లోలోఁ దగిలి నవ్వుకొనేరు
చేయి మీఁదై మీకు సిగ్గు లెల్లాఁ దేరెనో

చ. 3: చెలప చెమటలతో చిమ్మి రేఁగి వున్నవారు
అలసెనో మీ తనువు లట్టే రతుల
యెలమి శ్రీ వేంకటేశ యింతలో నన్నేలితివి
తలఁ చుక వుంటిరో యీ తగవులు మీరు

రేకు: 0492-4 నాదరామక్రియ సం: 12-490

పల్లవి: యేఁటికి దాచేవో కాక ఇపుడు నా యెదుటను
పాటించి నీ కాపె సేసే బత్తి నీ వెఱుఁగవా

చ. 1: పువ్వులను నిన్ను వేసి పొందు లెల్లా నెచ్చరించి
నవ్విన దెఱుఁగవా నాతి నీతోను
పువ్విళ్ళూర మోవి చూపి వుపచరించి సన్నలఁ
బవ్వళించే యిల్లు చూపే భావమ దెఱుఁగవా

చ. 2: యిక్కువగా నెలుఁగిచ్చి యెఱుకలు సేసి యట్టే
నిక్కి చూచె నెఱుఁగవా నెలఁత నిన్ను
అక్కరఁ గొలువు సేసి అందరిలో నీ పాదము
తొక్కిన దెఱుఁగవా తొలుతనే నీవు

చ. 3: పెదవిపై మాటలాడి ప్రియములు నీకుఁజెప్పి
కదిసిన దెఱుఁ గవా కాంత నిన్నును
అదన శ్రీ వేంకటేశ అప్పుడే నన్నేలితివి
యిదె నీకు దేవులాయ యీపెను నెఱుఁగవా

రేకు: 0492-5 కేదారగౌళ సం: 12-491

పల్లవి: చిత్తానఁ గలఁగకుమీ చెప్పితి మిప్పుడే నీకు
పొత్తుల వారము సుమీ పొలఁతికి నీకును

చ. 1: చెలికత్తెలకునైనా చెలువుని దూరవచ్చు
బలిమి నాయకురాలిఁ బాసి వుండితే
తెలిపి బుద్ధులు చెప్పే తీరుకునుఁ దేవచ్చు
వలచిన దానికి వసగా కుండితేను

చ. 2: పొరుగు వారికి నైనా పొందులు సేయఁగవచ్చు
పురుషుఁడు కాంత నేఁ పులఁ బెట్టి తే
సరుసకుఁ దోడి తెచ్చి సమ కూరుచనూ వచ్చు
సిరుల నవ్వలి మోమై సిగ్గువడితేను

చ. 3: దండనున్నవారికై నాఁ దగవులు చెప్పవచ్చు
కొండవంటి నీ వాపెఁ గూడ కుండితే
నిండుక శ్రీ వేంకటేశ నేఁడింతి నేలితి విట్టే
మెండుగా నవ్వఁగవచ్చు మీరిట్లా నుంటేను

రేకు: 0492-6 ఆహిరి సం: 12-492

పల్లవి: ఇన్నియుఁ దెలియఁ జెప్పె నేమంటా నుందువో నీవు
తిన్నని తమితో నీకె తిమురుతా నున్నది

చ. 1: తప్పక చూచి చెలి తలవంచుకొనెఁ గాని
దప్పిదేర నీ రూపు తలపోయుచున్నది
చిప్పిల నూరక నీతో సిగ్గున నున్నది గాని
కప్పురము వలె లోలోఁ గరఁగుతా నున్నది

చ. 2: నెమ్మి నొక్కమాటే యాడె నీతో మరి మానెఁగాని
కొమ్మ భావములో నిన్నుఁ గొసరుతా నున్నది
నిమ్మపండు గాను కిచ్చి నిలుచుకున్నది గాని
ముమ్మారూ మతి లోనే మొక్కుతా నీ కున్నది

చ. 3: పక్కన నీతో నవ్వి భ్రమసి వున్నది గాని
చిక్కించు కాతుమ నిన్నుఁ జెనకుతా నున్నది
యిక్కువ శ్రీ వేంకటేశ యెనసితి విట్టే నీవు
గక్కన బిగ్గి నిన్నుఁ గౌఁగిలించుకున్నది

రేకు: 0493-1 తెలుఁగుఁగాంబోది సం: 12-493

పల్లవి: పతి మీఁద నింత యేల పంతములు నెరుపేవు
యితవుగా నెప్పుడును ఇచ్చకమే మేలు

చ. 1: మొక్కలాన బొమ్మలు ముడివెట్టుకోకువే
చక్కని నీ మోమునకు సాజమే మేలు
వెక్కసానఁ బెదవులు విరిచి మాటాడకువే
చెక్కులదాఁ కాఁ బారే చిఱునవ్వే మేలు

చ. 2: మంచి నీ కరములను మఱుఁగు వెట్టుకోకువే
చుంచుల నీ మెయికళలు చూపేదే మేలు
అంచెల నీ గుబ్బలఁ బయ్యద బిగించుకోకువే
వంచన సేయక వెలయించేదే మేలు

చ. 3: మొల్లల తోడి తురుము ముసుఁగులో దాఁచకువే
మెల్లనే సింగారాల మించుటే మేలు
ఇల్లిదె శ్రీ వేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
వెల్లివిరై వలపులు చల్లేదే మేలు

రేకు: 0493-2 పాడి సం: 12-494

పల్లవి: పూరకున్నదాని నేల వుడికించేవు
కోరిక నీకుఁ గలిగితే కూడి యేలవయ్యా

చ. 1: చెలి నీ చేఁతలు విని చింతతోడ నుండఁగాను
యెలమిఁ బువ్వుల వేసే వి దేమయ్యా
చలివాసి నీ సుద్దులు సకులతోఁ జెప్పఁగాను
చిలుకునఁ బయ్యద దీసే విదేమయ్యా

చ. 2: సుదతి నీ చిన్నలు చూచి తలవంచుకోఁగా
యెదుట నొట్లు వెట్టే వి దేమయ్యా
వెదకి నీ గుణాలకు వెరగంది వుండఁగాను
చెదరఁ దీసి కొప్పు చెనకే వి దేమయ్యా

చ. 3: కాంత నీవు వేఁ డుకొంటే కడు సిగ్గుతో నుండఁగా
యెంత బలిమిఁ బెనఁ గే వేమయ్యా
యింతలోనె శ్రీ వేంకటేశ యీకెఁ గూడితివి
వింత సతిఁ దడవేవు వేరే ఇదేమయ్యా

రేకు: 0493-3 రామక్రియ సం: 12-495

పల్లవి: చెలిక త్తెలునుఁ దాను చేర వచ్చె నీకడకు
పిలిపంచితివో తానే ప్రియమున వచ్చెనో

చ. 1: కనకపు మెట్టే లు కణుంగని వాఁగఁ గాను
వనితె నీకెదురుగా వచ్చీ నెవ్వతో
మినుకుల పట్టుచీర మేలుముసుఁగు వెట్టు క
కనుచూపు దవ్వులనే కానవచ్చీ నదివో

చ. 2: ముత్తేల కంకణాలు మొరమొర వాఁగఁగాను
యెత్తి చేతులను మొక్కీ నెవ్వతో నీకు
కొత్త జవ్వాది వాసన కొలువులో నెల్లా నిండ
హత్తి నీయండకు వచ్చీ నల్లంత నదివో

చ. 3: కట్టిన గింట్టేపుఁ జీర గళబెళ మనఁగాను
యిట్టే వచ్చి కానుక నీ కిచ్చీ నెవ్వతో
గుట్టున శ్రీ వేంకటేశ కూడితి వీకెను నాకుఁ
జుట్టమై నీ రతిఁ గూర్చి చొక్కఁ జేసీ నిదివో

రేకు: 0493-4 దేవగాంధారి సం: 12-496

పల్లవి: యెందాకా మొగమోట మీతనితోడ
చెంది యాకె వలపెల్లాఁ జెప్పరే విభునికి

చ. 1: తలకొన్న తలపోఁత తతిగొన్న బయలింత
వలరా జీపెకుఁ దొల్లి వ్రాసిన వ్రాఁత
చెలువుఁడు రాఁడాయ జిగి వెన్నెల వేఁడాయ
చెలఁగి యీ మాటలే చెప్పరే విభునికి

చ. 2: యెదురు చూచే చూపు యెడలేని తరితీపు
యిదే జవ్వనమే సేసె నింత రారాఁపు
యెదిగెఁ జనుఁగొండలు యేఁచె విరహ పెండలు
చెదరక యీమాటలే చెప్పరే విభునికి

చ. 3: మోవికిఁ దేనెలు విందు ముచ్చట కిదే సందు
శ్రీ వేంకటేశుఁడీపె తోఁజేసెఁ బొందు
వావు లిద్దరికిఁ గూడె వలరాచబల మోడె
చేవమీర నీ మాటలే చెప్పరే విభునికి

రేకు: 0493-5 గంభీరనాట సం: 12-497

పల్లవి: వట్టి గజరుల (?) నెంత వలపులఁ బొరలేరు
అట్టే పెండ్లాడరాదా అనుమాన మేఁటికి

చ. 1: నిక్కము వలెనే నీతో నిట్టూర్పు రేఁగఁగాను
గక్కనఁ దా నేమి చెప్పీఁ గతలు ఆపె
అక్కరతో మొగ మెత్తి యడియాసలతోనే
వెక్కసముగా నెందాఁకా వినేవు నీవూ

చ. 2: సిగ్గులెల్ల నటువెట్టి చెమటలు గారఁగాను
దగ్గరేమి చూపీఁ జిత్తరువు నీకు
అగ్గమై శిరసు సెత్తుక ఆయము గరఁగుకొంటా
యెగ్గెఱుఁగ కాకె దిక్కే యెంత చూచేవు

చ. 3: కుమ్మరింపు నవ్వులతోఁ గొప్పు గొంత జారఁగాను
నెమ్మి జూజాలాడ నేమి నేరిపీ నీకు
యిమ్ముల శ్రీ వేంకటేశ ఇట్టే నన్నుఁగూడితివి
అమ్మరో యేమి నేరిచే వాపె చేత నీవు

రేకు: 0493-6 దేశాక్షి సం: 12-498

పల్లవి: నీ వింకఁ దప్పించుకొంటే నేఁడు మానునా
వేవేలైనా నీకు వేసరఁగ వచ్చునా

చ. 1: హత్తి మా విన్నపము లవధరించఁ గ రాదా
చిత్తము వచ్చినటులఁ జేసేవు గాకా
బత్తి సేసి రిద్దరును పడఁతులు నీ మీఁద
యిత్తల నిన్ను దూరితే నేల లోఁగే విందుకూ

చ. 2: తప్పక నీ విద్దరిని తగవు లడుగరాదా
అప్పటికి నన్ని పనులయ్యీఁ గాకా
యెప్పుడు నీకుఁ గానె యిద్దరూఁ దమకించేరు
తప్పించుక నీ వేల దాఁ గీ విందులకూ

చ. 3: కందువ నీ విద్దరినిఁ గౌఁగిలింపించఁగ రాదా
అందపు రతులు నీకు నబ్బీఁ గాకా
పొందిరి శ్రీ వేంకటేశ పొత్తుల మగఁడ నిన్ను
సందడించే రంటా నేల జడిసే విందులకూ

రేకు: 0494-1 కన్నడగౌళ సం: 12-499

పల్లవి: చెలియరో నీ వేమీఁ జింతించకువే
పలుకుఁ బంతాల నీకుఁ బంపు సేయించేనే

చ. 1: తేరకొన నాతఁడు నా దిక్కు చూచితేఁజాలు
తారుకాణ నొక్కమాటే దక్కఁ గొనేనే
వూరకే పెదవు లెత్తి వొగ్గి మాటాడితేఁ జాలు
దూరు గాకుండా వెంటఁ దోడి తెచ్చేనే

చ. 2: సేసేటి నా విన్నపాలు చెవులు సోఁకితేఁ జాలు
ఆసల నిన్నుఁ బెండ్లాడేయట్టు సేసేనే
వేసరక యే కాంతాన వేళ యిచ్చితేఁ జాలు
నీ సొమ్ముగా నాతని నేఁడే కావించేనే

చ. 3: ననిచి నీ చెలినని నాతో నవ్వితేఁజాలు
మనసు నీ పాలు సేసి మరిగించేనే
యెనసి శ్రీ వేంకటేశుఁ డింతలోనె వచ్చి నిన్ను
చనవిచ్చి పాయకుండా జంటసేసేనే

రేకు: 0494-2 మంగళకౌశిక సం: 12-500

పల్లవి: కడు మొగ మోటదాన గట్టిగాఁ దెలిసితివా
చిడిముడి వినయమే సేయవలె నాకు

చ. 1: చెప్పిన నీ మాటలు చెలియరో నేవింటి
వొప్పినా రమణుఁడు నీ వొడఁబాటులు
చిప్పిల నే నాఁటదాన సిగ్గవును పతివద్ద
అప్పుడు మీఱితే నేమి ననరాదు నాకు

చ. 2: నీ వేమి సేయు మనినా నే నిట్టే సమ్మతించితి
ఆవల నాతని కింపులై వుండునా
వే వేలైనా నిల్లాలికి వెరగవును తనవద్ద
ఆవేళఁ దా నెట్టుండినా ననరాదు నాకు

చ. 3: చేరి కూడుమనఁ గాను శ్రీ వేంకటేశుఁ గూడితి
యీ రీతి నాతని కోర్కి యీడేర్చితివా
సారె సారె దేవులను సంతోసము నా కేది
ఆరితేరెఁ బను లిఁక ననరాదు నాకు

రేకు: 0494-3 శుద్ధదేశి సం: 12-501

పల్లవి: వలచితి నంటా నాడి వట్టి సట లాతనితో
తెలిప చెప్పఁగఁ బోయె తెలివిది యేఁ టిదే

చ. 1: యే యెడా మనసులలో నెరవు లేకుంట గాక
చేయి పట్టి పెనఁగేటి చెలి మేఁటిదే
చాయలా సన్నలనే చవులు గొనుట గాక
ఆయ మెఱుఁగ కప్పణ లడిగేటి దేఁటిదే

చ. 2: కన్నుచూపులనే చూచి కళలు రేఁగుట గాక
విన్నపాలు సేయఁ బోయే వేడు కేఁటిదే
చన్నుల గుఱుతులకే సంతోసించుకొంట గాక
అన్నిటాఁ గొరఁబోయే వేడు ఆసోదా లేఁటివే

చ. 3: సురతపు సుద్దులనే చొక్కుచు నుండుట గాక
సరసము లాడేటి జాగు లేఁటివే
యిరవై శ్రీ వేంకటేశుఁ డిదెవో నన్నుఁగూడె
తరుణిరో తమలోని తగులము లేఁటివే

రేకు: 0494-4 నాగవరాళి సం: 12-502

పల్లవి: దవ్వుల కాఁకల నేల తడఁబడేవు
యివ్వల నాపెఁ గూడఁగా నేలనే మానేము

చ. 1: కలువ కన్నుల నాపె గక్కున నిన్నుఁ జూచితే
వలరాజు బాణా లంటా వసివాడేవు
వలపింత గలిగితే వద్దికిఁ బిలుచుకొని
కలయఁగా వద్దనేమా కడనుండి నేము

చ. 2: అంది వెన్నెల నవ్వుల అల్లంతఁ జల్లితే
చందమామ గుటుక లంటా జాలి గొనేవు
పొందు నీకు వేడుకైతే పొలఁతికి నుంకు విచ్చి
కందువఁ బెండ్లాడఁ గాను కాదనేమా నేము

చ. 3: ముసురుఁ దేనె పలుకు మోవి నాపె చిలికితే
వసంతుని విందు లంటా వడిఁగోరేవు
యెసగి శ్రీ వేంకటేశ యిందాఁకా నన్నేలితివి
కొసరింతిఁ దెచ్చుకొఁగా కొత్తనేమా నేము

రేకు:	0494-5 శంకరాభరణం	సం:	12-503

పల్లవి:	తగుఁ దగు నీకూ నీకు దక్కె జవ్వన ఫలము
	అగ పడ్డ సంతోస మేమని చెప్పే మిపుడూ

చ. 1:	సేయఁగఁ జేయఁగ నిక్కెఁ జెలిమి
	పాయనీదు తమకపు బలిమి
	కాయపుఁ జిక్కఁ దనాల కలిమీ
	ఆయాలు సోఁకిన మిమ్మేమని చెప్పే మిపుడూ

చ. 2:	వడిగొనె మీ యిద్దరి వలపు
	తడఁ బడీ మీలో మీతలఁపు
	పెడరేఁ చీఁ బెదవుల పిలుపు
	అడరె మీ సొబగు లేమని చెప్పే మిపుడూ

చ. 3:	ననిచిన మీ రతుల ననుపు
	పొనగొన్న కౌఁగిళ్ళ పెనపు
	మొనసె శ్రీ వేంకటేశ మునుపు
	అనువాయ మీచేత లేమని చెప్పే మిపుడూ

రేకు: 0494-6 ఛాయానాట సం: 12-504

పల్లవి: రమ్మనవే యింక నేల రారాఁపులు
నమ్మి యిచ్చక మాడేదే నాకు మంచి దనవే

చ. 1: చెల్లుబడి గల తాను సేసినదే చేఁత గాక
మల్లాడి కొసరఁగ మరి యేఁటికే
బల్లిదుఁ డు తనతోనేఁ బట్టి పెనఁగే నంటే
యెల్ల చందాలా నేఁడు యీడువచ్చె నలవే

చ. 2: విచ్చన విడైన వాని వేడుక లీడేరుఁగాక
మచ్చరాన నౌఁగా దని మాన్ప నేఁటికే
తచ్చన కాఁడు తన్నుఁ దగవులఁ బెట్టే నంటే
యిచ్చటఁ దన ముందర నెంతదాననే

చ. 3: కడు జాణయిన వాని గతులు మంచివి గాక
కొడిమె లెంచి మారుకొన నేఁ టికే
యెడయక శ్రీ వేంకటేశుఁ డిట్టే నన్నుఁగూడె
బడి బడి నుందుఁ గాక పాయఁ గల నటవే

రేకు: 0495-1 మేఘరంజి సం: 12-505

పల్లవి: అతని చిత్తము మఱి యట్టే నా భాగ్యము
నాతులాల పతికి విన్నప మిట్టే సేయరే

చ. 1: చిగురు మోవి మీఁదఁ జిప్పిలఁగాఁ దేనెలు
వొగరు మాటలాడ నొనగూడునా
మొగమోటములు నాకు ముంచుకోఁగాఁ బతితోను
తగవులు పచరించఁ దలకూడునా

చ. 2: కన్నుల నాతనిఁ జూచే కాంక్షలు నిండుండఁ గాను
సన్న బొమ్మజం కెనలు సమకూడునా
చిన్ని సెలవుల నాకు చిఱునవ్వులు రాఁగాను
కన్నెనైన నాకు నలుకలు నేఁడు దగునా

చ. 3: పక్కనఁ జన్నులమీఁ ది పయ్యద జారఁగాను
యెక్కడ లేని సిగ్గు లింక వచ్చునా
గక్కనను శ్రీ వేంకటేశుఁ డు నన్నుఁగూడె
తక్కించి తప్పు లెంచఁ దలకూడునా

రేకు: 0495-2 బౌళి సం: 12-506

పల్లవి: అందరికిఁ గల చాలే ఆఁడు వారైన వారికి
కందువల ముందరెత్తు కనుఁగొనరే

చ. 1: చెలులాల మీ తోను చెప్పి నంటే సిగ్గయీా
తలఁపులో నాఁపరావు తమకములు
వలరాజు బలములు వారించ పసగావు
తెలుసుకోరే మీరు తెగని నాకోరిక

చ. 2: చేరి మీ మోము చూచితే సెలవుల నవ్వు వచ్చి
వూరకుండితే నిట్టూర్పు లుమ్మగిలీని
నీరు వంటిది వయసు నిప్పు వంటిది వలపు
తారుకాణించఁగ రాదు తలఁచుకోరే

చ. 3: యెట్టని మీ రడిగితేఁ దొట్టీ నాలోని గుట్టు
పట్ట రావు వేడుక లుపచరించక
యిట్టే శ్రీ వేంకటేశుఁడింతలోనే నన్నుఁగూడె
చుట్టరిక మిఁక మీరే చూచుకొనరే

రేకు: 0495-3 బలహంస సం: 12-507

పల్లవి: యెక్కడ దిష్టి దాఁకునో యిందుకే చింతించి నీకు
గక్కన నేడ తొడసు గలిగెనో తాను

చ. 1: మగిడి మగిడి చూచి మతి నీ రూపు భావించి
చిగిరింపుఁ గోరికలఁ జెలఁగీ నింతి
జిగి నిట్టూర్పుల తోడ చెమటలు గారఁగాను
తగిలీ నీ వెంట వెంటఁదా నెవ్వతో యీపె

చ. 2: అట్టే నీతో మాటలాడి నాయాలు గరఁగుకొంటా
యెట్ట నెదురు కట్టున నేఁకరీ నీకె
నట్ట నడుమ నూరకే నవ్వులు నవ్వుకొంటాను
చుట్టి చుట్టి యాసలతో జొచ్చిలీఁ దా నిదివో

చ. 3: కోరి నీకు బాగా లిచ్చి కొంగు దాఁకించుకొంటాను
మేర మీఁటి చన్ను లొత్తి మేను చొక్కిని
యీ రీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
కూరిమి గొసరీఁ దాను గొబ్బున నింకాను

రేకు: 0495-4 రీతిగౌళ సం: 12-508

పల్లవి: యెవ్వరు ముంచినా వారే యెక్కు డందురు లోకులు
యివ్వల మీ ఇద్దరిలో నెక్కుడాయఁ జెలియా

చ. 1: చేయెత్తి పెండ్లి కూఁతురు సేస నీకుఁ బెట్టఁగాను
సోయగపుఁ జూపులఁ జూచేవు నీవు
దోయిలించి ముత్యాలు తొలుతే పోయఁగ వద్దా
పాయపుటింతికిఁ గిందుపడ నీకు నేఁటికే

చ. 2: తెర యెత్తి నీ మోము దిష్టించి యాపె చూడఁగా
సరుగఁ జన్నులకుఁ జేయి చాఁ చేవు నీవు
పరగ శిరసు మీఁ ద బాసికము కట్టరాదా
తరుణి మాటకు లోనై తగులైతి విపుడు

చ. 3: కోరి యాపె నిన్ను నిట్టే కూడి కెంగేలు పట్టఁగా
గారబానఁ గంకణము కట్టేవు నీవు
యీ రీతి శ్రీ వేంకటేశ ఇక్కువ లంటఁగ రాదా
వోరిచి రొమ్మునఁ బెట్టు కుండ నిట్టే వలసె

రేకు: 0495-5 నాట సం: 12-509

పల్లవి: వింటిమి ఇవిఁ గొన్ని వింతలు నేఁడు
ఇంటిలోనే వుంటిమి నే మెఱుఁగ మీ సుద్దులు

చ. 1: అద్దమ రేతిరి కాడ నట్టే తలుపు దొబ్బుక
వొద్దఁ గూచుండె నట వేరొకతె వచ్చి
నిద్దిరించఁగా మెల్లనే నీ పాదాల పైఁ జేయి వేసి
గుద్దితే లేచితి మాట గురుతౌనా విభుఁడ

చ. 2: వేళగానివేళ వచ్చి వెస నిచ్చకము సేసి
మేలమాడె నట యీ మేకులకును
చాలుకో నీ జోలి తోడ జాగరాలు సేయించఁగ
ఆలించుక వుంటి వట అవునా నీవు

చ. 3: వాకిటివా రాపొద్దు వద్దనఁగాఁ గడు మించి
నీకు వచ్చి మొక్కె నట నేరుపు తోడ
యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
లోకములోఁ దమ కెల్ల లోనయ్యేటి వాఁ డవా

రేకు: 0495-6 సామంతం సం: 12-510

పల్లవి: నే నేమనే నీతో నీ చిత్త మింతే కాక
ఔనయ్య నిన్ను నౌఁగా దన నెంతదానను

చ. 1: యెట్టి నేరుపరినైన యెంత నీవు మన్నించిన
నెట్టు కొని మాటలాడ నే నెంతదాన
చుట్టమ నే నెట్లైనా సులభుఁడవు నీ వైనా
నట్టనడిమికి వచ్చి నవ్వ నెంతదానను

చ. 2: చక్కని దాన నైనాను జవ్వని నే నైనాను
నిక్కి నిన్ను నాఁటఁ జూడ నే నెంతదాన
అక్కర తో వలచినా నాసతో నే మెరసిన
మొక్కు టింతే కాక గోరు మోప నెంతదాననూ

చ. 3: కడు జాణ నైనాను కౌఁగిట నీవు గూడిన
నిడివి సరసమాడ నే నెంతదాన
యెడయక శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
కడలేక నిన్ను నేఁ బొగడ నెంతదాననూ

రేకు: 0496-1 రామక్రియ సం: 12-511

పల్లవి: యిందుకంటె నున్న దదే యెంచఁగ మూలధనము
కందువ తలపోఁతలే కడు మూలధనము

చ. 1: వనితకుఁ బతిమీఁది వలపే మూలధనము
మునుకొన్న తమకమే మూలధనము
కనుఁగొనే నెమ్మోము కళలే మూలధనము
వినయపుఁ జేఁతలే వెస మూలధనము

చ. 2: నేసవెట్టి పెండ్లాడిన సిగ్గులే మూలధనము
మోసలైన పులకలే మూలధనము
ఆస పడి చూచే చూపే అన్నిటా మూలధనము
రాసి కెక్క చిఱునవ్వే రతి మూలధనము

చ. 3: కప్పుకొన్న వేడుకల కౌఁగిలే మూలధనము
ముప్పిరి మోవి తేనెలే మూలధనము
యిప్పుడే శ్రీ వేంకటేశుఁ డింతలోనే చెలిఁగూడె
చెప్పరాని భోగములే జిగి మూలధనము

రేకు: 0496-2 మధ్యమావతి సం: 12-512

పల్లవి: అందుకేమే మంచి మాట లాడితేను దోసమా
యిందరి లోపల నన్ను నేలేవాఁడు గాఁడా

చ. 1: ఇట్టు నట్టు వేఁడుక నన్నేల వొడఁబరచేరే
వట్టి మాట లిడ నేల వచ్చీఁగా తాను
చుట్టమైన దాన నేను సూడు వట్టేనా తన్ను
గట్టిగా నా పాలిటఁ గలఁడుగా తాను

చ. 2: పొద్దున నాతని కిట్టే బోనము సేయు మనేరు
వద్దనేనా అందుకేమి వచ్చీఁగా తాను
కొద్ది మీఱ వీడె మంపె కొమ్మని చేతికిచ్చేరు
పెద్దరిక మింత సేసి పెనఁగీఁగా తాను

చ. 3: అన్నిటా నలుక దీర్చి ఆనవెట్టించుకొంటిరి
వన్నెల నా కౌఁగిటికి వచ్చీఁగా తాను
యెన్నఁగ శ్రీ వేంకటేశుఁడింతలోనే వచ్చి కూడె
నిన్ననే మెచ్చితి నింత నేర్చీఁగా తాను

రేకు: 0496-3 వరాళి సం: 12-513

పల్లవి: కొమ్మ సింగారము లివి కొలఁది వెట్టఁగ రావు
పమ్మిన యీ సొబగులు భావించరే చెలులు

చ. 1: చెలియ పెద్ద తురుము చీఁకట్లు గాయఁ గాను
యెలమి మోముకళలు యెండ గాయఁగా
బలిసి రాతిరియుఁ బగలు వెనకముందై
కలయ కొక్కట మించీఁ గంటిరటే చెలులు

చ. 2: పొందుగ నీకె చన్నులు పొడవులై పెరుగఁగా
నందమై నెన్నడుము బయలై వుండఁగా
ఇందునే కొండలు మిన్నుఁ గిందుమీఁదై యొక్కచోనే
చెంది వున్న వివివో చూచితిరటే చెలులు

చ. 3: శ్రీ వేంకటేశు వీఁపునఁ జేతు లీకెవి గప్పఁగా
యీవల నీతని చేతు లీకెఁ గప్పఁగా
ఆవలఁ గొమ్మలుఁ దీగె ననలుఁ గొనలు నల్లి
చేవ దేరీని తిలకించితిరటే చెలులూ

రేకు: 0496-4 భైరవి సం: 12-514

పల్లవి: అగడేల సేసేవు ఆకె నింత
తగిలి పొందులు సేసి దయఁజూడ రాదా

చ. 1: చన్నులపై నసుఁ గొంగు జాఱీ నది నెఱుఁ గదు
నిన్నుఁ జూచే పరాకున నెలఁతా
విన్నపము సేసీఁ గొప్పు వీడినది నెఱుఁగదు
కన్నెను లాలన సేసి కౌఁగిలించరాదా

చ. 2: చెక్కుమీఁది చెమటలు చింౘేది నెఱుఁగదు
వెక్కసమై నీకు మొక్కే వేడుకలను
అక్కరతోఁ దనమేని అలపూ నెఱుఁగదు
మక్కువ నీపె నింతట మన్నించరాదా

చ. 3: కందువతోఁ గంకణాలు గల్లురనే దెఱుఁగదు
అంది నిన్ను రతిఁగూడే యడియాసల
అందపు శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
చెందీ నిన్నిజవరాలు చిత్తగించరాదా

రేకు: 0496-5 కొండమలహరి సం: 12-515

పల్లవి: రమ్మనవే వద్దనేనా రతి వేళకు విభుని
కుమ్మరించితే నాసలు కుప్పవడీనా

చ. 1: పూవు వంటిదాన నేను పుప్పొడి వంటి వలపు
తావి గొంటా నుండుఁ గాక తన కేమే
చేవ వంటిదీ వావి చిగురువంటిదీ తమి
వేవేలై పెరుగుఁ గాక విసుగునేలే

చ. 2: పండు వంటిదీ మోవి పలుకు తేనెవంటిదీ
వుండుఁ గాక చవిగొంటా నుపమ లేలే
కొండ వంటిదీ వేడుక కోరికె మొయిలు వంటిదీ
నిండు కొని కప్పుఁ గాక నేరము లేలే

చ. 3: గని వంటిదీ కౌఁగిలి కళ వంటిదీ వయసు
యెనయుచు నుండుఁ గాక యెరవు లేలే
నను శ్రీ వేంకటేశుఁడు నాఁడే పెండ్లాడెఁ దాను
నని చెలమేల్మంగను నవ్వ నింత యేలే

రేకు: 0496-6 సామంతం సం: 12-516

పల్లవి: అటుగనకనేఁ దన్ను నౌఁగా దనఁగలనా
నటనఁ దన కరుణే నాకు వలెఁ గాకా

చ. 1: దొంతులైన మోహములు తోదోపు లాడఁగాను
పంతము లాడవచ్చునా పడఁతులకు
మంతనాన నాతఁడు మన్నించి చేయి వట్టితే
వింతలుగా మొక్కితేనే వేడుకలౌఁ గాక

చ. 2: వెనుకొని మనసే వేడుకలు రేఁచఁగాను
పెనఁగు లాడవచ్చునా ప్రియురాండ్లకు
ననుపున నాతఁడు నా తోడ నవ్వితేను
వినయానఁ దనబుద్ధి వినవలెఁగాక

చ. 3: కగ్గు లేక యాదరించి కౌఁగిలించుకొనఁగాను
సిగ్గులు వడవచ్చునా చెలులకును
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
యెగ్గు లేక నన్నుఁ గూడె నిరవైతిఁ గాకా

రేకు: 0497-1 కాంబోది సం: 12-517

పల్లవి: యిందరిలోనా నిన్ను నింతగా మన్నించెను
చెంది మిక్కిలి నీవు సేసినదే భాగ్యమే

చ. 1: నెపమునఁ దేరకొన నిన్నుఁజూచె నాతఁడు
తపము ఫలించెఁ గా తరుణి నీకు
కృప తోడ నప్పటిని కేలు నీ మీఁద వేసె
యిప్పుడే నీ కోరికలు యీడేరెఁ గదవే

చ. 2: చెంత నీచే నూడిగము సేయించుకొనె నేఁడు
పంత మెల్ల దక్కెఁగా పడఁతి నీకు
సంతోసానఁ దమ్ములము చనవున నొసఁగెను
చింతించిన నిధానము సిద్ధించెఁ గదవే

చ. 3: చెలఁగి నీ యింటికి శ్రీ వేంకటేశుఁడు వచ్చే
వలపెల్ల దక్కెఁ గా వనిత నీకు
అలమేలుమంగవు నిన్నక్కుమీఁద నుంచుకొనె
తలఁచిన తలఁపులు దైవారెఁ గదవే

రేకు: 0497-2 రామక్రియ సం: 12-518

పల్లవి: పెక్కు సతులఁ బెండ్లాడి బెరసినవాఁడు తాను
వెక్కసము లెంతైనా వేసరకు మనవే

చ. 1: మొలచిన తమకము మోసులు వారకుండునా
కలసిన వావులు కడ నుండునా
నలిరేఁగి సారె సారె నవ్వితిఁ దనతో నేను
వెలలేని వెన్నైనా వేసరకు మనవే

చ. 2: చిగిరించిన వలపు చెట్టు కట్ట కుండునా
తగులైన పొందులు దాఁచవచ్చునా
అగపడి సరసము లాడితిఁ దనతో నేను
వెగటెంతైనా నాయ వేసరకు మనవే

చ. 3: గుదిగొన్న ననుపలు కుప్పలు గాకుండునా
చెదర నీ మోవి తీపు చెప్పవచ్చునా
అదన శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
వెదకి వచ్చి నన్నేలె వేసరకు మనవే

రేకు: 0497-3 మాళవిగౌళ సం: 12-519

పల్లవి: యిప్పు డొక్క టైతిరా యిద్దరు మీరు
అప్పసము గోర నొత్తె నని యంటి వపుడూ

చ. 1: చెక్కు నొక్కి నీతోను చెలియ విన్నవించీని
యిక్కువతో వింటివా యిన్నియు నీవు
లక్కవంటి నీ మనసు లలిఁ గరఁ గెనా నేఁ డు
అక్కరతోఁ దిట్టే నంటా నంటివి నీ వాపెను

చ. 2: చెమ్మఁ జెమట దుడిచి చేరి నిన్ను వేఁడుకొని
సమ్మతేయనా నీకు సతి ప్రియాలు
వుమ్మడి సంతోసములోనఁ గూడెనా మఱి
బొమ్మల జంకించె నంటాఁ బొరలితి వచటా

చ. 3: అలమేలుమంగ నిన్ను నదివో కౌఁగిలించీని
చెలఁగి కూడితివా శ్రీ వేంకటేశ
తలపోఁత లిద్దరికీ తారుకాణ లాయనా
కిల కిల నవ్వేనంటాఁ గెరలుతా నుంటివి

రేకు: 0497-4 ఆహిరి సం: 12-520

పల్లవి: యెంత లేదు నాయాసోద మెంచి నీతోఁ జెప్పేనంటే
యింతటి చనవు నాకు నిచ్చితివిగా

చ. 1: తలఁచితే నీ రూపు తావుకొనె నాలోన
కులుకు నాచూపులకు గుఱి యైతివి
పిలిచే నంటే నీ పేరు పెదవులపై నున్నది
యెలమి నీ వుపకార మింత చాలదా

చ. 2: చేరి పాదాలొత్తేనంటే చేతిలో నున్నాఁడవు
నేరిచి సరసమాడ నీవు గలవు
గారవించి నీవు నాకుఁ గడుఁ జుట్టమ వైతివి
యీరీతి నెంచితే గుణా లెన్నైనాఁ గలవూ

చ. 3: పొసఁగి నా వీనులకు పొందైనకత వైతివి
వెస నామోవితేనెకు విందవైతివి
పసగ శ్రీ వేంకటేశ బడి నలమేల్మంగను
యెనసి కూడితి విదె యెన్నికాయ నాకూ

రేకు: 0497-5 నాదరామక్రియ సం: 12-521

పల్లవి: పడఁతుల జాడ లివి పతి యెదుట
అడఁచుకోరాదు నీవే ఆదరించవయ్యా

చ. 1: మనసు లోపలి చింత మాటలలోఁ గొంత చూపు
కొన చూపులలోనఁ గొంత చూపును
తనరి పెదవిపై దప్పులై కొంత చూపు
వెనుకొని మొగమున వెల్లివిరై తోఁచును

చ. 2: తాపపు మేని కాఁ కలు తమకమై కొంత చూపు
కోపవు జంకెనలై కొంత చూపును
యేపునఁ జెక్కిటి చేతి యెన్నికలై కొంత చూపు
కాఁపుర మంతటి మీఁ దఁ గలదెంతాఁ జూపు ను

చ. 3: పట్టరాని మోహము బలుసిగ్గ కొంత చూపు
గుట్టు తొడి యడియాసై కొంత చూపును
యిట్టే శ్రీ వేంకటేశ యీకె నీవు గూడితివి
నెట్టుకొన్న వేడుకలై నెమ్మి నింతా నిండును

రేకు: 0497-6 మనోహరి సం: 12-522

పల్లవి: నేరుతువే యిటువంటి నెరజాణ తనములు
కోరికె లింకా నెంత కుప్పళించేవే

చ. 1: చెప్పిన నీ మాటలు చెలువుఁడు వినేఁగదే
కొప్పు జారఁగా నెంత కొసరేవే
ముప్పిరి నీ రాకకు ముచ్చటలూ నాడుఁగదే
రెప్ప లెత్తి చూచి యేమి రేఁచేవే వలపు

చ. 2: సన్నల నీమోము చూచి సమ్మతిగ నవ్వేఁగదే
చన్ను లదరఁగా నేల జంకించేవే
పన్ని నీ తొడల మీఁదఁ బాదములు చాఁచెఁ గదే
కన్ను లా ర్చేఁటికిఁ దమకము పుట్టించేవే

చ. 3: కమ్మర నీ సేవలకు కౌఁగిలించుకొనెఁ గదే
చెమ్మఁ జెమటల నెట్టు సిగ్గువడేవే
యిమ్ముల శ్రీ వేంకటేశుఁ డిరవుగా నిన్ను నేలే
బొమ్మ జంకెనల నెంత పొందు చూపేవే

రేకు: 0498-1 వరాళి సం: 12-523

పల్లవి: యింతి నీ చుట్టరికము లెటువంటివి
సంతోసము లిద్దరికి సరివచ్చెను

చ. 1: కలువ రేకుల వంటి కన్నుల నింతిఁ జూడఁగా
చెలిమోముఁ జందురుఁ డు చెంగలించెను
వలపుల మచ్చికల వసంతము చల్లఁగాను
కులుకుఁ జన్నుల పూవు గుత్తులు సొంపెక్కెను

చ. 2: అరిది పలుకుఁ దేనె లట్టే నీవు గురియఁగా
నిరతిఁ గొప్పుతేఁటులు నిండు కొనెను
వెరపుతోఁ జిఱునవ్వు వెన్నెలలు వూయఁగాను
విరహపు మబ్బు వాసి వేడుకలు రేఁగెను

చ. 3: మితి మీఱి నీ విపుడు మేఘమవై వాలఁగాను
అతివ కౌఁగిట మెఱుఁ గై మెరిసెను
ఇతవై శ్రీ వేంకటేశ యీాకె నిట్టే పెండ్లాడఁగా
చతురత నీపై సేసలు నించెను

రేకు: 0498-2 దేశాక్షి సం: 12-524

పల్లవి: నీ వెఱుఁగని పనులు నేము విన్నవించేమా
దేవులు నీకు మొక్కీని తిలకించవయ్యా

చ. 1: వొక్కొకవేళ సతులు వూరకే కోపించుకొన్నా
అక్కరతో నవ్వుదురు అంతలోననే
యెక్కువైన మగవాని కెగ్గులుగఁ బట్టరాదు
చెక్కు నొక్కి చనవులు చెల్లించవలెను

చ. 2: నెట్టుకొని వొకవేళ నిష్ఠూరము లాడినాను
అట్టే ప్రియము చెప్పుదు రంతలోననే
చుట్టమైన నాయకుఁడు సూడుఁ బాడు నెంచరాదు
జట్టిగొని సరసమే జరపఁగవలెను

చ. 3: బలిమితో నొకవేళ పంతములు చూపినాను
అలుక దేరి కూడదు రంతలోననే
యెలమి శ్రీ వేంకటేశ ఇఁక నేమి ననరాదు
కలసి యేలితి విట్టే కరుణించవలెను

రేకు: 0498-3 పాడి సం: 12-525

పల్లవి: మున్నే పులుకడిగిన ముత్తెమువంటి వాని
చన్నులపై కస్తూ రేల సారె నంటించేవే

చ. 1: సన్నలనే మోవి చూపి చవులూరక కొనేవు
యెన్నికైన పతి నెంగి లేల సేసేవే
కన్నుల కాటుక చూపు కుప్పే వాతని మీఁద
మన్నించే యాతని మేను మైలేల సేసేవే

చ. 2: పుక్కిటి తమ్మలముతోఁ బొంచి యేకాంతా లాడేవు
తక్కక నోరి ఆ వేల తాఁకించేవే
పక్కన నాతని పాద పద్మాలు నెత్తిఁ బెట్టుక
మొక్కేవు నీ తల నేల ముడిచి వేసేవే

చ. 3: అచ్చపు శ్రీ వేంకటేశు నలమి కౌఁగిటఁ బట్టి
కొచ్చి కూడే వేల అలుకుడు సేసేవే
నిచ్చలు నన్నేలినాఁ డు నీవూ గోరఁ జెనకేవు
అచ్చలాన నిఁక నేల అంటుపరచేవే

రేకు: 0498-4 వరాళి సం: 12-526

పల్లవి: వెలలేని వలపుల వెనకముల దెంచుకోవు
చెలు లెమ్మె లేడనైనాఁ జెప్పుకొందురు సుమ్మీ

చ. 1: సందడి నాపె తో నీవు సారె సారె నవ్వేవు
మందెమేళ మయ్యీఁ జుమ్మీ మగవాఁడవు
కందువ నాపె వద్దఁ గదిసి కూచుండేవు
అంది కొప్పు విరులు పై నట్టే రాలీఁ జుమ్మీ

చ. 2: చెక్కు నొక్కియాపె నిట్టే చేరి వేఁడుకొనేవు
మొక్కితి వనేరు సుమ్మీ మొగవాఁడవు
పిక్కటిల్లుఁ జనుఁ గవ ప్రియముతోఁ బట్టేవు
చిక్కని చెమటలు నీచేత నంటీఁ జుమ్మీ

చ. 3: తగిలియాపె కౌఁగిట తనియ వెంతైనాను
మొగచాటయ్యీఁ జుమ్మీ మొగవాఁడవు
నిగిడి శ్రీ వేంకటేశ నేఁ డిట్టె నన్నేలితివి
పగటున నాపె పొందు పచ్చిదేరీఁ జుమ్మీ

రేకు: 0498-5 సాళంగనాట సం: 12-527

పల్లవి: సముఖా అవధారు సర్వేశ రాఘవేంద్ర
అమరులు వారివో చిత్తావధానా

చ. 1: రాముఁడు గొలువున్నాఁడు రాజులాల కొలువుఁడు
వామదేవ సేవించు వసిష్ఠకను
సామజముల వారవో జవనాశ్వముల వార
మీమీ పొంజులతో నిరు మేలా నిలువరో

చ. 2: భరత గొడుగు వట్టు బాగాలిమ్ము శత్రుఘ్న
సరుస లక్ష్మణుఁడ వింజాము రిడుము
సొరిది నిలుచుండుడు సుగ్రీవాంగదులాల
వెరపుతో విభీషణ విన్నపాలు సేయవో

చ. 3: వానరులాల మొక్కుఁడు వాయుజ పాదము లొత్తు
నానా దేశాధీశులాల కానుక లిండు
పూని శ్రీ వేంకటాద్రిపైఁ బొంచి సీతాసమేతుఁ డై
శ్రీ నిధియై వరా లిచ్చీ చేకొనరో ప్రజలు

రేకు: 0498-6 పాడి సం: 12-528

పల్లవి: ఆసలునుఁ బెట్టు దుగా అప్పటి నందుకుఁ దోడు
కానీ లేరా దాని పైనే కన్ను లెట్టిఁజేయరా

చ. 1: అంటినవి నీ వురమునందు నెవ్వతెవో కాని
జంటల వట్రువలైన చన్నుల గురుతులు
కంటకా లాడిన నన్ను కల్లఁజేయ వత్తువుగా
వెంటనే నీవల పదే వెలివేసెఁ గదరా

చ. 2: అలరె నీ వీఁపు నను అవి యెవ్వతెవో కాని
కళుకు వ్రాసిన యట్టి కంకణాల వొత్తులు
బలిమి సాదు వలెనే పంతమాడ వత్తువుగా
యెలమి నిన్నట్టే రూఢి కెక్కించెఁ గదరా

చ. 3: యిదె నీ చెక్కుల జారె నెవ్వతె చెవిదో కాని
సదరపు బొట్లే జవ్వాది కరఁగులు
కదిసి శ్రీ వేంకటేశ కౌఁగిట నీవు గూడఁగా
యెదుట నన్నట్టే అది యెంత సేసీఁజూడరా

రేకు: 0499-1 రాగం సం: 12-529

పల్లవి: చేరువ జాణతనాలు చెప్పరమ్మా
ఆరి తేరిన పనులు అవి చెప్పరమ్మా

చ. 1: మెలుపున రమణుఁడు మెల్లనే మాటాడితేను
చెలి యాల నవ్వు నవ్వె చెప్పరమ్మా
సొలపున నప్పటి నీ సురటి విసరుకొంటే
అలరి వెంగె మేలాడె నది చెప్పరమ్మా

చ. 2: సారెకుఁ బువ్వుల బంతి సరసుఁడు మూకొనఁగ
చేరి సతి యాల మెచ్చెఁ జెప్పరమ్మా
నేరుపున నంతలోనె నెత్తమాడ రాఁగాను
ఆరసి మొక్కులు మొక్కె నది చెప్పరమ్మా

చ. 3: పక్కన శ్రీ వేంకటాదిపతి గౌఁగిలించుకొంటే
చెక్కుచే యిడనే లింతి చెప్పరమ్మా
తక్కి అప్పుడే రతిఁ దలపోసుకొంటేను
అక్కరతోఁ బొగడీని అది చెప్పరమ్మా

రేకు: 0499-2 బౌళి రామ క్రియ సం: 12-530

పల్లవి: ఇద్దరు నొక్కటే యెప్పుడును
బుద్ధులు చెప్పరే పొలఁతుకలూ

చ. 1: చలమున నూరకే సాదించీఁ జెలి
తలఁపు దెలియకే తన పతిని
కలి ముదిసి మేడిదె గాక తొలుతనె
కలఁక దేరుచరే కామినులు

చ. 2: విచ్చన విడిగా వెంగెము లాడి
గచ్చుల యలుకల కాంతునిని
హెచ్చి గోరి రేక యేరుగా నెపుడే
మచ్చిక సేయరే మానినులు

చ. 3: పనివడి కూడుచుఁ బంతము లాడి
ఘనుఁడగు శ్రీ వేంకట విభుని
ననలే విరులై నాఁటక మునుపనె
పెనఁగి మొక్కించరే ప్రియ సఖులు

రేకు: 0499-3 కేదారగౌళ సం: 12-531

పల్లవి: ఇంత కాతరించ వౌట యెఱుఁగమయ్య
మంతు కెక్కితి విన్నిటా మంచివాఁడవయ్యా

చ. 1: తరుణికి నీకును దగవులు చెప్పరాఁగ
గరిమెఁ బోరు గాపెనుఁ గౌఁగిలించేవు
సారిదిఁ జూచేవారికిఁ జూడ మెచ్చేవానివలె
మరిగించి మొఱఁగేవు మాయకాడవయ్యా

చ. 2: సంగడి మీ యిద్దరికి సాకిరులు చెప్పఁగాను
చెంగట నున్నయాపెపై సేస వెట్టేవూ
సంగతిగా దీవించి యక్షత లిడేవానివలె
అంగముగాఁ దక్కించేవు అవును జాణవయ్యా

చ. 3: శ్రీ వేంకటేశ మీలో సిగ్గులు దేరుచ రాఁగా
వావి చెప్పి చుట్ట పాపె మోవి యానేవు
కావించి మొక మిచ్చి యేకాంతమాడేవానివలె
యీవల నన్నుఁ గూడితి వేమి చెప్పేదయ్యా

రేకు: 0499-4 సౌరాష్ట్రం సం: 12-532

పల్లవి: నీవంటివారమే కామా నే మెల్లాను
పూవు వలె ముడుచుక భోగించేమటే

చ. 1: వాసులకే పెనఁగేవు వంతులకు వచ్చేవు
వీసమంత పనికైనా వేగిరానను
సేస వెట్టిన సతులు చేరి కొలిచే రింతే
పూసవలెఁ గట్టుకొని భోగించేరటే

చ. 2: పంతములే చూపేవు బత్తులకే లాసేవు
అంతలోనే తమకాన ఆసతోడను
మంతనపు చెలు లెల్ల మచ్చికలు సేసి రింతే
బొంత వలెఁ జట్టుక భోగించేరటే

చ. 3: కన్నులనే యాఁకరేవు కొఁగిటనే కూడేవు
సన్నల శ్రీ వేంకటేశుఁ జటమునను
వన్నెలతో మే మెల్లా వరుసఁ గూడితి మింతే
పున్నమ వెన్నెల వలె భోగించేరటే

రేకు: 0499-5 తెలుఁగుఁగాంబోది సం: 12-533

పల్లవి: వినఁగదవే మా విన్నపము
గొనకొని యిద్దరూఁ గూడితి రిపుడూ

చ. 1: చలములు గడకును సాదించఁగా
వలపు లెన్నటికే వనితా
అలుకల మోసము లవే పెంచఁగ
పలుకుల యమృతము పనిగొను టెపుడే

చ. 2: కఱకఱితనమే కడు నెరపఁగా
సరస మెన్నటికే సకియా
మఱిగినచోటనే మంకు చూపఁ గా
మురిపెము తనెదుట ముంచుట యెపుడే

చ. 3: వాటపు సిగ్గులే వడిగాఁ గొనఁగా
కూట మెన్నటికే కోమలి
యీటున శ్రీ వేంకటేశు నెనసితివి
మేటి గుఱుతులను మెఱయుట యెపుడే

రేకు: 0499-6 కన్నడగౌళ సం: 12-534

పల్లవి: యేల పెంచేవు చలము లెందాఁ కాను
వేళ గాచు కున్నాఁడు విన్నవించఁ గదవే

చ. 1: నవ్విన మాటకుఁగాను నాతి నీ వతని నింత
రవ్వలు సేతు రటవే రచ్చలోననూ
పువ్వులు చేతి కిచ్చేవు పుప్పొడి నీ మీఁదఁ జల్లె
మవ్వపు నీ పతి తోడ మంచి మాటలాడవే

చ. 2: సరస మాడినందుకే చెండిపెట్టి యతనితో
జరసి జంకింతురటే సముకాననూ
గరిమ నిన్నుఁబొగడి గందము మైనిండాఁబూసె
బెరసి యాతని కింకాఁ బ్రియములు చెప్పవే

చ. 3: కూరిమిఁ గూడినందుకే కోరి శ్రీ వేంకటేశ్వరు
నా రీతి నాడుదురటే అంతరంగాన
హారము నీ మెడఁబెట్టే నాకు మడిచి నీకిచ్చె
గారవించితని నిట్టే కందువఁ బాయకువే

రేకు: 0500-1 నాగవరాళి సం: 12-535

పల్లవి: యెటువలెఁ జేసినాను యిన్నియు నమరును
సట లొద్దనరే తాను సరసుఁ డిన్నిటను

చ. 1: తగ వెఱిఁ గినవాఁ డు తనకు బుద్ది చెప్పేమా
మగువల మింతే మేము మమ్మడిగిన
యెగ సక్కేలకుఁ దాను యేమేమి సేసినాను
తగు ననరే దొరతన మెల్లఁ దనదే

చ. 2: సత్తువలఁదా నెక్కుడు సాములు నేము నేర్పేమా
కొత్త పెండ్లి కూఁతులము కొచ్చి చూచినా
బిత్తరపు వాఁడు తాను బిరు దెంత నెఱపినా
చిత్తము కొల దనరే చేఁతలు నేరుచును

చ. 3: అన్నిటా దేవుఁడు తాను ఆయములు నే మంటేమా
కన్నెలము నేము తన్నుఁ గరఁగించేమా
సన్న లేల సేసెనే తా జాణ శ్రీ వేంకటేశుఁడు
మన్నించు మనవే తాను మతకారి వాఁడు

రేకు: 0500-2 శోకవరాళి సం: 12-536

పల్లవి: మొగములు చూడక ముచ్చటేల పాయును
యెగసక్కేలకు నీవు యేమి సేసే వీడనూ

చ. 1: పంతపు మాటల దాపె పాయపు మదము దాపె
ఇంతుల మాటల కెల్ల నియ్య్య కొనీనా
చెంతల నీవే విచ్చేసి చెక్కు నొక్కి బుజ్జగించు
యెంత పని గద్దు నీకు యేమి సేసే వీడనూ

చ. 2: పట్టపు దేవులాపె బలువైన దొర యాపె
యిట్టి కానికె ల కెల్ల నియ్య్య కొనీనా
జట్టి గా నీ వండనుండి చనవిచ్చి కౌఁగిలించు
ఇట్టు నట్టుఁ బరాకుల నేమి సేసే వీడనూ

చ. 3: వలపు గలిగినాపె వడిఁ దమకపుటాపె
యెలమి లేక లంపితే నియ్య్యకొనీనా
కలిసితివి శ్రీ వేంకటేశ దినము రమ్ము
యెలయింపు నవ్వులతో నేమి సేసే వీడనూ

రేకు: 0500-3 పాడి సం: 12-537

పల్లవి: కందువకు రావయ్యా కలయవయ్యా
సందడినే పొద్దులు జరపఁగఁ దగునా

చ. 1: చాయలాను సన్నలాను సతి నిన్నుఁ గొసరఁగ
నీ యంత నీవే కరుణించ వలదా
నాయము లేలడిగేవు నాలి యేల సేసేవు
పాయపు వాలి నింత పరచఁ గందగునా

చ. 2: ఆసలాను వాసులాను అతివ వేఁడుకోఁగాను
సేస వెట్టి చెప్పినట్టు సేయఁగ వద్దా
మూసి యేల నవ్వేవు మొఱఁగు లేల చూపేవు
వేసరని వారిని విసిగించఁ దగునా

చ. 3: సిగ్గులాను చేఁతలాను చెలి నీకు మొక్కఁ గాను
నిగ్గులఁ గూడితివి మన్నించఁగ వద్దా
అగ్గమై శ్రీ వేంకటేశ అలయి కేల నించేవు
వొగ్గి పెండ్లాడిన వారి నొరయఁగఁ దగునా

రేకు: 0500-4 మనోహరి సం: 12-538

పల్లవి: మామాట వినవే మగువా
చేముంచి చెనకితేను చిగిరించుఁ గోరికె

చ. 1: మొక్కలపు మాట లేలే మోహించిన పతితోడ
చిక్కని ప్రియములే చెప్పరాదా
లక్కవంటిది మనసు లావుల కొలఁది రాదు
యెక్కుడు చెలము లైతే యెంతైనాఁ గరఁగదు

చ. 2: బొమ్మల జంకించ సేలే పొందైన వాని తోడ
నమ్మిక చేసన్న చూపి నవ్వరాదా
సొమ్ముపంటిది వలపు చూచితే విడువరాదు
యెమ్మెలకుఁ బెట్టు కొంటి నెంతైనాఁ దనియదు

చ. 3: సిగ్గులు వడఁగ నేలే శ్రీ వేంకటేశ్వరుతో
వెగ్గలించి కూడితివి వీడె మీరాదా
ముగ్గువంటిది వయసు మొఱఁగి దాఁచరాదు
యెగ్గు లేక వెదకితే నెంతైనాఁ గలదు

రేకు: 0500-5 శ్రీరాగం సం: 12-539

పల్లవి: ఇక్కడను వింతవారు యెవ్వరున్నారు
గక్కనను మన్నించఁ గదవయ్య యింతిని

చ. 1: తేనెల వంటి మాటలు తెర మఱఁగు సిగ్గులు
కానుక వట్టీ నీకుఁగలికి
మైనము వంటిది నీ మనసందుకెల్లాఁ దగు
కానిమ్మని పిలుచుకోఁ గదవయ్య వద్దికి

చ. 2: కప్పురము వంటి నవ్వు కాతరపుఁ దమకము
కుప్పళించీ నీ పయిఁ గోమలి
వుప్పువంటిది నీ వల పూరఁ బెట్టి తేఁజవొ
చిప్పిలఁ గౌఁగిటఁ జేర్చి చెప్పవయ్య ప్రియమూ

చ. 3: పాలువంటి చూపులును పానుపుపై సరసాలు
మేలు చూపి నిన్నుఁ గూడె మెలఁతా
ఔలే చెఱకు వంటిది అన్నిటి కోపు నీరతి
యీ లీల శ్రీ వేంకటేశ యేలవయ్య రాజ్యమూ

రేకు: 0500-6 ప్రతాప నాట సం: 12-540

పల్లవి: మగనాండ్లము మమ్ము మన్నించవయ్య
అగడు సేయకువయ్య అప్పటిని మొక్కేము

చ. 1: దొడ్డేఁడు పనులఁ గాచి దొరవు నేఁడైతివి
జడ్డు గొల్లెతలఁ బొంది జాణ వైతివి
జిడ్డంటీ నీ మేనెల్ల చీరలు మా కియ్యవయ్య
వొడ్డారపు శ్రీ కృష్ణుఁడని వొంటి చేత మొక్కేము

చ. 2: పాలు వెన్నలు మెసఁగి పాయపువాఁడ వైతివి
రోలఁ గట్టించుక తొల్లె రూఢి కెక్కితి
వోల నీపైఁ బడె మా వొడ్డాణా లీఁగదవయ్య
గేలిసేఁ తల కృష్ణుఁడ కిందుపడి మొక్కేము

చ. 3: వోపల వలపు చల్లి వూరబాన వైతివి
కావించి మమ్ము నేలి మగఁడ వైతివి
పూవుల దండలు మావి పోఁడిమితో నియ్యవయ్య
శ్రీ వేంకటాద్రి కృష్ణుఁడ సిగ్గు తోడ మొక్కేమూ

రేకు: 0501-1 శంకరాభరణం సం: 13-001

పల్లవి: వరుసలు వెట్టుక వైపుగను
తరచు రతులచేఁ దనుపఁగ రాదా

చ. 1: వలపుల చెమటల వానలు గురియఁగ
పలుమరుఁ దడిసెను పయ్యదలు
కొలువులో సిగ్గునఁ గొంకేరింతులు
మలశొకరొకరినే మన్నించ రాదా

చ. 2: పాయపు మదముల పదనులు దొలుకరి
చాయల కొప్పులు జారీనదే
ఆయములు గరఁగి అలసేరింతులు
యీయెడ మునుముగ నెనయఁగ రాదా

చ. 3: పగటుల పులకల పదనులు నించఁగ
సొగిసి చన్నులరాసులు నెగడె
జిగిఁ గూడిరిందరు శ్రీవేంకటేశ్వర
తగిలి ఇట్లా దయ దలఁచఁగ రాదా

రేకు: 0501-2 ఆహిరి సం: 13-002

పల్లవి: వట్టి చేతలు సేయఁగ వచ్చేదేమి
చుట్టరికమేపొద్దు చూపుట గాక

చ. 1: పంతమాడ నేఁటికి బలుదొరవు నీతోడ
యెంతైనా నూరకుండేది యెక్కుడు గాక
చెంత నొరయ నేఁటికి సిగ్గులెల్ల మెఱయఁగ
మంతనానఁ దలఁచుటే మంచిది గాక

చ. 2: సారె నవ్వనేఁటికి జాణఁడవు నీతోడ
మేరలు మీఱకుండుటే మెచ్చులు గాక
ఆరీతిఁ గొసరనేల అలపులు దేరఁగాను
తారుకాణగా మెచ్చుటే తగవు గాక

చ. 3: చెనకఁగ నేఁటికి శ్రీవేంకటేశ నీతోడఁ
జొనిపి రెండుగన్నులఁ జూచుట గాక
యెనసితి విదే నన్ను నిన్నిటా మన్నించఁగాను
తనువుఁ దనువు సోఁకి తనియుట గాక

రేకు: 0501-3 నాదరామక్రియ సం: 13-002

పల్లవి: నన్నే అట్టు సేతురు నడుమ మీరు
కన్నుల నిద్దుర దేరీఁ గంటిరటే చెలులు

చ. 1: చెప్పనా నే నప్పుడే చిత్తిణివాఁ డితఁడని
చిప్పిల నెందో పొందు సేసి వచ్చెను
దప్పి దేరీఁ గెమ్మోవి తనువెల్లాఁ జెమటలే
చొప్పులెల్లను మీరే చూడరమ్మ చెలులు

చ. 2: చూపనా నే నపుడే జూటరివాఁ డితఁడని
దాపుగా మైగుఱుతులు దాఁచుకొనెను
యేపొద్దూ నిదేపని యెమ్మెలే నిలువెల్లా
కోపుల నిన్నీఁ దెలుసుకొనరమ్మ చెలులు

చ. 3: యెంచనా నేనపుడే యిచ్చకుఁడు యీతఁడని
పొంచి శ్రీ వేంకటేశుఁడు పొందెను నన్ను
వంచనలు నేరుచును వలపులే సుద్దులెల్లా
మించి నిన్నిటా మీరు మెచ్చరమ్మ చెలులు

రేకు: 0501-4 సాళంగం సం: 13-004

పల్లవి: మాతోనైతే మారు మలసేవు
ఆతలివారినే అనరాదా నీవు

చ. 1: చిగురుగుత్తిఁ గొని చేత నేను వేసితేను
మొగమేమి చూచేవు మొక్కలానను
జిగి దేరే నీ మేన జీరలు దీసి యెవ్వతో
అగడు సేసినందుకు అనరాదా నీవు

చ. 2: కదిసి నే నిమ్మపంట గక్కన నిన్ను వేసితే
పెదవినేల తిట్టేవు పెచ్చు రేఁగి
గదుములు గట్టి చనుఁగవల నూఁది యెవ్వతో
అదిమినందుకు యిట్టే అనరాదా నీవు

చ. 3: యీరీతి శ్రీవేంకటేశ యిట్టే నే నిన్నుఁ గూడితే
సారెనేల పెనఁగేవు సరసానను
పూర సతులెల్ల నిన్ను నొకతొకతే కూడి
ఆరయ నింతేఁచినందుకనరాదా నీవు

రేకు: 0501-5 తెలుఁగుఁగాంబోది సం: 13-005

పల్లవి: మా పంతము లీడేరె మరి నీ కోరికె చెల్లె
చూపుల నాతనినంటి చూచుకోవమ్మా

చ. 1: యింతి నీరమణుఁడు నీయెదుటనే వున్నాఁడు
దొంతులుగాఁ జెలులను దూరకువమ్మ
మంతన మిద్దరికి సమ్మతిగానే వొనగూడె
చెంత నీవలసినట్టు సేయవమ్మా

చ. 2: పొలసి నీకాతనికి పొందులెల్లాఁ జేసితిమి
మెలుపున నీ చెలుల మెచ్చవమ్మ
యెలమిఁ బానుపు మీఁద నిట్టే మీరపములాయ
అలమి ఆడేమాటలాడవమ్మా

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడిదె చెలరేఁగి నినుఁ గూడె
మావంటి నీచెలులను మన్నించవమ్మ
ఆవటించి మేడలో మీరాడినవే ఆటలాయ
తావుల రతులనెల్లఁ దనియవమ్మా

రేకు: 0501-6 ముఖారి సం: 13-006

పల్లవి: మెచ్చితి నీ సుద్దులు మేలువాఁడవౌదువు
యిచ్చకములాడేను యింటికి రావయ్యా

చ. 1: నయగారిమాటలెల్ల నాతో నీవాడితివి
ప్రియములెల్లాఁ జేకొంటిఁ బెనఁగినైతి
క్రియ గూడె నిన్నిటాను కిందిమీఁది పనులెల్ల
జయమాయ మాయింటికి సరుగ రావయ్యా

చ. 2: నమ్మికలెల్లాఁ జేసి నన్నిట్టే మన్నించితివి
సమ్మతించితిని నిన్ను జరయ నైతి
యెమ్మెలెల్ల దక్కె నేఁడు యేవంక చూచినాను
నెమ్మది మా యింటికి నిక్కెము రావయ్యా

చ. 3: కరుణతో బుజ్జగించి కాఁగిలించి కూడితివి
యిరవైతి నేమిటాను యెడయనైతి
దొరతనము లీడేరె తోడనే శ్రీవేంకటేశ
సిరులాయ మాయింటికి చెలఁగి రావయ్యా

రేకు: 0502-1 మధ్యమావతి సం: 13-007

పల్లవి: ఇన్నాళ్ళుదాఁకాను యెడమాటలు జరగె
పన్నిన నాభాగ్యము ప్రత్యక్షమాయనే

చ. 1: పచ్చిదేరే మేనితోడి పాయపువిభునిఁ గంటి
దిచ్చరి పనులన్నియుఁ దేరీ నేఁడు
రచ్చలో తగవు దిద్ద రామలందరు నున్నారు
తచ్చివేసినట్టు నాతలఁపు లీడేరెనే

చ. 2: వేడుకకాఁడై వచ్చి విభుఁడిదె మాటలాడె
నీడల నేఁ గోరినట్టే నిలిచె నేఁడు
కూడిన బాసలకును గుఱి మరుఁడున్నాఁడు
జాడ దప్పకుండాను నిజములేరుపడెనే

చ. 3: తానె శ్రీ వేంకటేశుఁడు తగ నన్నుఁ గాఁగిలించె
తానకమై మోహములు దాకొనె నేఁడు
పూనిన వొడఁబాటుకు వుంగరమిదె వున్నది
కానుకలై సలిగెలు కైవములాయనే

రేకు: 0502-2 శ్రీరాగం సం: 13-008

పల్లవి: ఎన్నైనాఁ గలవు పనులెప్పుడూ నీకు
కన్నియ మోహమెఱిఁగి కరుణించవయ్యా

చ. 1: మాఁటకు మాటాడితేను మాపుదాఁకాఁ బట్టి జోలి
యేఁటికి విచ్చేయవయ్య యింతికడకు
నీటుతో వాకిటనే నిలుచున్నది యప్పుడు
గాఁటముగ వేగమే సింగారించుకోవయ్యా

చ. 2: నవ్వుకు నవ్వు నవ్వితే నాలితనమే నిండు
రవ్వసేయక రావయ్య రామకడకు
దివ్వెలవెలుఁగున యీదిక్కే మొగమై యున్నది
చివ్వనఁ గైదండగా నాచెయి వట్టుకోవయ్యా

చ. 3: అడుగుకడుగిడితే నద్దమరాతిరి వట్టు
జడియక రావయ్య సతికడకు
అడరి శ్రీవేంకటేశ ఆకె ఇందు వచ్చి కూడె
బడినే నీవు వత్తువు బాసలియ్యవయ్యా

రేకు: 0502-3 శంకరాభరణం సం: 13-009

పల్లవి: ఎవ్వఁ డెఱుఁగును మీ యేతులు
మువ్వంక మెఱసె మీమురిపెమయ్యా

చ. 1: సొలపుల నిన్నాపె చూచీని
నలుగడ నీవేల నవ్వేవు
తెలియవు మాకు మీ తెఱఁగులు
బలిమిని యెట్టైయినా బ్రదుకరయ్యా

చ. 2: విరుల నాపె నిన్ను వేసీని
కెరలి బొమ్మల జంకించేవు
సరిఁ గానము మీచందములు
పరిపరి విధముల బ్రదుకరయ్యా

చ. 3: పెనఁగి ఆపె నిన్నుఁ బిలిచీని
యెనసితివి శ్రీ వేంకటేశ్వరుఁడా
నను నేలితివిటు నయమునను
పనివడి యిట్లానే బ్రదుకరయ్యా

రేకు: 0502-4 భైరవి సం: 13-010

పల్లవి: మగఁడవన్నిటి కోర్చి మన్నించరాదా
మగువలు సేసేవెల్లా మచ్చికలే కావా

చ. 1: చనవు గలిగినట్టి సతి నిన్నుఁ గొసరితే
విని నవ్వవలెఁ గాక వేగిరింతురా
చెనకి యాపె నిన్నుఁ జేసిన చేఁతలెల్లా
ననుపులింతే కాక నలినెగసక్కెమా

చ. 2: ఆసపడినయట్టి అంగన నిన్నంటితేను
సేసవెట్టవలెఁ గాక జీరదీతురా
వేసరక ఆపె నిన్ను వేఁడుకొమ్మనినదెల్లా
వాసులకింతేకాక వట్టి పంతమా

చ. 3: కడు మోహించినయట్టికాంత నిన్నుఁ గూడితేను
వొడఁబడవలెఁ గాక వూరకుందురా
అడరి శ్రీవేంకటేశ ఆపె నిన్నుఁ బొందుటెల్ల
అడియాలాలకుఁ గాక ఆటడిఁబెట్టుటకా

రేకు: 0502-5 కేదారగౌళ సం: 13-011

పల్లవి: నెలఁతచిత్తము కొద్ది నీవెఱఁగవా
కలయఁగవలెఁ గాక కాఁక సేతురా

చ. 1: ప్రియములు చెప్పఁగానే బిగిసేవు చెలితోడ
నయగారితనమున నవ్వేవు
క్రియ గూడ నాకె నీకు కెరలి బాఁతి పడఁగ
దయఁ జూడవలెఁ గాక తడవులు సేతురా

చ. 2: పలుసన్నలు సేయఁగా పరాకయ్యేవింతితోడ
చలము దొరతనాన సాదించేవు
వలచి నీకు నాపె వంచి చేతుల మొక్కఁగ
నెలకొనవలెఁ గాక నీటు సేతురా

చ. 3: వొాగిఁ గాఁగిలించుకోఁగా వొరసేవతివతోడ
పగటు శ్రీ వేంకటేశ పచ్చి సేసేవు
మొగము చూపి ఆపె ముచ్చటలు చెప్పఁగాను
చిగిరింపింతురు గాక జీరదీతురా

రేకు: 0502-6 ఆహిరి సం: 13-012

పల్లవి: వేగినంతా నీరాకకే వేడుకనెదురుచూచె
చేగలెక్కేనీగుణాలు చెల్లఁబెట్టవలదా

చ. 1: నీ మాఁట నీకు వచ్చె నిన్ననే బాసిచ్చితివి
రామతో వచ్చేనని రావైతివి
కోమల మాపెమనసు కొండవంటివాఁడవు
బూమిలోన నిజములే పోగుసేయవలదా

చ. 2: నీకొప్పగించితి మిదె నేఁడే లేకలంపితివి
చేకొని వ్రాసినట్టే సేయవైతివి
వాకుల వాసులదాపె వారిధివంటివాఁడవు
యీకడ నీ ప్రతినలు యీడేరించవలదా

చ. 3: యెచ్చరించితిమి నేము యిట్టే నీవు వచ్చితివి
పచ్చిగా మగువఁ గూడి పాయవైతివి
మెచ్చుల చక్కనిదాపె మేఘమువంటివాఁడవు
మచ్చిక శ్రీవేంకటేశ మన్నించవలదా

రేకు: 0503-1 సామంతం సం: 13-013

పల్లవి: ఔదువే తగవరివన్నిటాను
బోదించరాదా పురుషునిని

చ. 1: మలసి నీవిభుఁడు మాటలాడఁగా
పలుకఁగరాదా పడఁతులకు
బలిమిఁ జెఱఁగతఁడు పట్టి తియ్యఁగా
నిలువఁగరాదా నెలవులను

చ. 2: పాయకతఁడిపుడు పందెము వేయఁగ
చేయొగ్గరాదా చెలులకును
చాయలనప్పటి సరసములాడఁగ
సేయఁగరాదా సేవలు నేను

చ. 3: శ్రీ వేంకటేశుఁడు చేకొని కూడఁగ
మోవియ్యరాదా ముదితలకు
యీవలననుఁ దానిటు మన్నించఁగ
భావించరాదా పలుమరు రతులు

రేకు: 0503-2 శంకరాభరణం సం: 13-014

పల్లవి: ఇప్పుడే విన్నవించితి నిన్నియు నీకు
తప్పులేమిగలిగిన దయఁ జూడుమిఁకను

చ. 1: పొంతనుండి నిచ్చా నీతో పొందులు సేసేఁగాని
యింతంతని నీ చిత్తమెఱఁగ నేను
మంతనాన నెన్నైన మాయలవాఁడవు నీవు
పంతమెఱఁగను నాభావమెల్ల నీది

చ. 2: అలరి యెప్పుడు నీకు నాలనై వుండుదుఁ గాని
చెలఁగి యేమి సేసేవో తెలియ నేను
నెలకొని యిన్నిటాను నీయిచ్చరాజవు నీకు
చలమెఱఁగను నాజవ్వనము నీది

చ. 3: సారెకుఁ గాఁగిటఁ గూడి సంతోషించుకొందుఁ గాని
నేరుపు నీ గుణాలెంచ నేరను నేను
చేరువ వరములిచ్చే శ్రీ వేంకటేశుఁడవు నే
బీరము లెఱఁగను నాబిరుదెల్ల నీది

రేకు: 0503-3 నీలాంబరి సం: 13-015

పల్లవి: ఏల మమ్ము గరిసించే వెందాఁకాను
జాలువారే చెమటల జడివానే సాక్షి

చ. 1: అండనున్న సతులను అడుగనేమిటికి
నిండిన నీ చేఁతలకు నీవే సాక్షి
చండిసేసి నిన్ను నేము సారెఁ జొప్పులెత్తేమా
మెండుకొని వుండిన నీమేని గోరే సాక్షి

చ. 2: ఆసలు వెట్టుక యింత అలయఁగనేమిటికి
పూనిన నీ పొందులకు వురమే సాక్షి
మానాపతులము నీ మర్మములెత్తేమా
తానకపు నిట్టూర్పుల తఱచులే సాక్షి

చ. 3: పంతమున మమ్ము నొడఁబరచఁగ నేమిటికి
వింత సుద్దులకు నీవేడుకే సాక్షి
యింత శ్రీవెంకటేశ మమ్మేలితి వేతులెత్తేమా
కాంతి నామోమునఁ దేరే కళలే సాక్షి

రేకు: 0503-4 తెలుఁగు కాంభోధి సం: 13-016

పల్లవి: అట్టే కానీవయ్య అన్నియుఁ జక్కనయ్యీని
గట్టువాయ వాఁడవౌత కానవచ్చెను

చ. 1: కప్పురపుటింటిలో నీకతలు
చెప్పుదుమా నేఁడు నీ చెలితోను
తప్పక తెరలో నీవు దాఁచినాపెను
యిప్పుడాకె గంటే నిన్ను నేమనునో

చ. 2: సింగారపుఁదోఁటలో నీచేఁతలు
రంగుగఁ జూపుదుమా నీ రమణికి
అంగవించి తెచ్చుకొన్న ఆపెపాటలు
సంగతిగా వింటే నెంత జంకించునో

చ. 3: శ్రీ వేంకటాద్రిమీఁది చిఱునవ్వులు
భావానఁ దెలుపుదుమా పడఁతికి
ఆవటించిపెఁ గూడితి వప్పటాపెను
తావున మాటాడి యెంత దయసేసునో

రేకు: 0503-5 రీతి గౌళ సం: 13-017

పల్లవి: ఆయ లేవే నీ యేతులన్నియుఁ గంటిమి నేఁడు
చాయలా సన్నలనే జరుపేవు పొద్దులు

చ. 1: మొనసి చూచేవారి ముందరనెల్ల నీపతి-
చనవులే నెరుపేవు సారె సారెను
వినఁగలిగితేఁ జాలు వేసర కెందాఁకనైన
పనిలేని కతలెల్లఁ బచరించేవిపుడు

చ. 2: యిమ్ముల నీవద్దనుంటే యెవ్వరికైనా నీ-
సొమ్ములెల్లాఁ జూపేవు సోద్యాలుగాను
సమ్మతించితేఁ జాలు సవతులనిందరిని
పమ్మిన యీావులఁ గిందుపఱచేవు నీవు

చ. 3: చెలిమి నీతోఁ జేసితే శ్రీవేంకటేశ్వరుని
కలయికకుఁ దెచ్చేవు కమ్మటి మమ్ము
వలెనంటేఁ జాలు నీవారైన వారికెల్ల
నెలవుగ నీమహిమ నెరుపేవు మిగుల

రేకు: 0503-6 సౌరాష్టం సం: 13-018

పల్లవి: ఏలవయ్య యింతులనెందరినైనా
మేలిమివాఁడవు నీకు మేకులు బాఁతే

చ. 1: వేసాలవాఁడవు వేగిరకాఁడవు
వాసులసతులు వలవక మానేరా
వేసరక సేసేవు వినయాలెవ్వరికైనా
ఆసోదకాఁడవు నీకు నాండ్లుఁ బాతా

చ. 2: యిచ్చకము నేరుతువు యిన్నిటాఁ బరగితివి
అచ్చపుకాంతలు భ్రమయక మానేరా
పచ్చిదేర నిచ్చేవు బాసలెవ్వరికినైన
దిచ్చరివాఁడవు నీకు దేవుళ్ళు బాఁతా

చ. 3: చేరి వరాలిత్తువు శ్రీ వేంకటేశుఁడవు
గారవపు నేము మరుగక మానేమా
సారెకు నీవొసగేవు చనవులెవ్వరికైనా
బీరపువాఁడవు నీవు పెండ్లికూఁతులు బాఁతా

రేకు: 0504-1 కాంబోది సం: 13-019

పల్లవి: ఈయఁగదవే వీడెమిప్పుడే నీవిభునికి
మీయిచ్చులే గుఱిగాక మేమెల్లా గుఱే

చ. 1: మొదలనాపెకు నీకు మోహమే గుఱిగాక
మదమునఁ జిమ్మి రేఁగే మంకులు గుఱా
పొదిగొన్న లోలోని భోగములే గుఱిగాక
పెదవులమీఁదటి బీరాలు గుఱా

చ. 2: ననుపున మీలోని నవ్వులే గుఱిగాక
వొనరఁ బెట్టుకొనిన వొట్లు గుఱా
కనుచూపులఁ జూచిన కాంక్షలే గుఱిగాక
కినిసిన బొమ్మల జంకెనలు గుఱా

చ. 3: కూడిన కాఁగిటిలోని కూటములే గుఱిగాక
పాడితోడ నొండొరుల పంతాలు గుఱా
యీడై శ్రీవేంకటేశుకిటు నీవే గుఱిగాక
వోడక మేనిపై రేకలుంటేనే గుఱా

రేకు: 0504-2 శుద్ధ దేశి సం: 13-020

పల్లవి: ఇచ్చకురాలను నేను యిన్నిటాఁ దనపట్టుకు
వచ్చి వచ్చి తనతోను వాదించే వారెవ్వరే

చ. 1: మొదల సిగ్గువిడిచి మోహించినవారికి
యెదుట నెవ్వరున్నా నేమాయనే
పొదిగి యాపెకుఁ దాను పూవులు ముడిచీ నిట్టే
వదలక వొద్దనేటి వారెవ్వరే

చ. 2: వెరవుతోడుత రతివేడుకనున్న వారికి
యెరవును మొఱఁగును యేడదే మరి
అరుదుగ నాపెకు నాకు మడిచిచ్చీఁ దాను
వరుస నిందుకు నవ్వే వారెవ్వరే

చ. 3: చింతలన్నియు విడిచి సేసవెట్టేవారికి
యింతులలో నొఁగాములు యిఁకనేడవే
చెంతనుండి తానే కూడె శ్రీ వేంకటేశుఁడు నన్ను
వంతు లిందు కడిగేటి వారెవ్వరే

రేకు: 0504-3 ఆహిరి సం: 13-021

పల్లవి: నీ విచ్చిన బాసలు నిలిపి మన్నించవయ్య
కైవసమైనవారఁ గరుణించరాదా

చ. 1: వేసాల మాటలను వేగినంతాఁ గత చెప్పి
ఆసలఁ బెట్టితివట అవునయ్యా
బేసబెల్లితనమునఁ బిలిపించి యిందరిలో
సేసవెట్టి పచ్చిసేసి సిగ్గులువరతురా

చ. 2: కూరిమి నవ్వులు నవ్వి కొత్తయిన చేఁతలు చేసి
ఆరితేరి జంకింతురా అవునయ్యా
గారవించి పైఁ జేయిడి కరఁగించి కొలువులో
జీరదీసి చొక్కించి సిగ్గులువరతురా

చ. 3: చాయల సన్నలు చూపి సరసములే యాడి
ఆయితములే సేసితి వవునయ్యా
చేయిచ్చి కాఁగిటఁ గూడి శ్రీవేంకటేశ యింటిలో
సేయరానిసేవ గొని సిగ్గులువరతురా

రేకు: 0504-4 అరిభి సం: 13-022

పల్లవి: చెలి నాకు నీవు సేసేవుపకారమిది
వెలలేని గుణముల వేడుకకాఁడతఁడు

చ. 1: వచ్చినదాఁకా నీవు వద్దనే కాచుకుండు
మెచ్చినదాఁకాఁ గొలువు మిగులాను
ఇచ్చిగించినందాఁక నింపుగ సేవలు సేయ
అచ్చపుఁ బొందులు సేయుమాతనికి నాకును

చ. 2: సమ్మతించినందాఁక సారె విన్నపాలు సేయు
నెమ్మది బత్తైనదాఁకా నేర్పులు చూపు
కొమ్మని ఇచ్చినదాఁకా గుట్టునఁ జేయెత్తి మొక్కు
యిమ్ములఁ బొందులు సేయుమిద్దరికి నీవు

చ. 3: నవ్వినదాఁకా నీవు ననుపులెల్లాఁ జేయు
మివ్వలీమోమైన దాఁకా నింపులు చల్లు
రవ్వగా శ్రీ వేంకటరాయఁడిదే నన్నుఁ గూడె
మవ్వపుఁబొందులు సేయు మాకు నీవెప్పుడును

రేకు: 0504-5 సాళంగం సం: 13-023

పల్లవి: మగనితో మమ్ముఁ గొంత మాటలాడనీఁ గదవే
నిగిడి వూసుక రానేర్తువు గదే

చ. 1: అతని నేరములెల్ల నడఁచి చవులుసేసి
గతులు చెప్పఁగ నీవు గలవు గదే
సతమై మావంటివారు సారెసారెఁ గొసరఁగ
పతి మాఁటలాడ నీపాలు గదే

చ. 2: ఇక్కువఁ జేసిన చేఁతకెల్ల పంతమిప్పించి
గక్కన వంకలు దిద్దఁగలవు గదే
వొక్కరొక్కరే వచ్చి వొడివట్టి పెనఁగఁగ
చక్కటులు దిద్దేది నీజాడ గదే

చ. 3: విరులను వేసి వేసి విన్నపాలు సేసి సేసి
కరుణింపించఁగ నీవు గలవు గదే
అరుదై శ్రీ వేంకటేశుఁడాతఁడే మమ్మిపుడేలె
నిరతపు పొందొనర్చ నీవిద్య గదే

రేకు: 0504-6 ఆహిరి సం: 13-024

పల్లవి: దొరపాటివాఁడతఁడు దొమ్మిసేతురా
తరుణులాల మీరు తరవువెట్టుదురా

చ. 1: నామీఁది బత్తి గలిగితే నన్ను మన్నించీఁగాని
దోమటినాతని మీరు దూరకురే
ప్రేమములే నిజమైతే పిలువక వచ్చీఁగాని
కోమలులార మీరు కొంగు పట్టనేఁటికే

చ. 2: బాసలు నిజమయితేఁ బైకొని కూడీఁగాని
వేసరఁ బతిపైఁ దప్పు వేయకురే
ఆస పుట్టినపుడు తానండఁ బవ్వళించీఁగాని
రాసికెక్క నిందరిలో రవ్వ సేతురటవే

చ. 3: కరుణ పుట్టినపుడు కలసి నవ్వీఁగాని
సరుస శ్రీవేంకటేశు జరయకురే
యిరవుగ నన్ను నేలె యిట్టే వుండీఁగాని
నెరసి మీరు తొల్లిటి నేరములెంచకురే

రేకు: 0505-1 దేసాళం సం: 13-025

పల్లవి: ఇంకనేల వట్టి సిగ్గులిందరిలోన
పొంకపు రతులే కాక బూటకము వలెనా

చ. 1: పడఁతి నీవును నొక్కపానుపుపైఁ బవ్వళించి
యెడమాటలాడించ నిఁకనేల
వడియుఁజెమటలతో వలపులు రేఁగఁగాను
అడపక త్తెలతోడి ఆలోచన వలెనా

చ. 2: భామయు నీవును నొక్కపచ్చడములో నుండి
ఆముకొని చేకానుకలంపనేల
ఆమని పులకలలో నాసలు పెనగొనఁగ
దోమటిని వద్దివారితో నవ్వవలెనా

చ. 3: కలికి నీవును నొక్కకాఁగిటనే వుండఁగాను
పలుమారు కొత్తవొడఁబాటులేల
కలసితిరిదే శ్రీవేంకటేశ కళలు మించ
అలరి యందరిచేత అప్పణలు వలెనా

రేకు: 0505-2 సింధురామక్రియ సం: 13-026

పల్లవి: తానెప్పుడు మాకు లోనే తగవై తేను
ఆనుకొని తానెంత అందాలు చూపీని

చ. 1: చెలులందరును నీకు సేవలు సేయఁగాను
చలముల నాపె నిన్ను జంకించీని
కలకాలము మేము కాఁపిరేలు సేయఁగాను
వెలినుండి తానేల వేడుక చూపీని

చ. 2: తరుణులిందరు వసంతము నీతోనాడఁగాను
సరుగన నాపె నిన్ను సన్న చేసీని
అరుదుగ నేమిట్టే యాండ్లమై యుండఁగాను
పొరుగున తానేమి పొందులు చూపీని

చ. 3: కాంతలిందరును నీతో కలసిమెలఁగుండఁగా
చెంతఁ దానేల నవ్వీని శ్రీవేంకటేశ
సంతతము మేము నీసరి కాఁగిటఁ గూడఁగా
బంతినుండి తానెట్టు బాగాలిచ్చీని

రేకు: 0505-3 శంకరాభరణం సం: 13-027

పల్లవి: వేగిరించేవిదే నీకు వెంగెమాయనా
చేగదేర వలపులు చెప్పవలెనా

చ. 1: మొక్కితేనే చాలదా మోనమునఁ జెలి నీకు
అక్కజముగా మాటలాడవలెనా
తొక్కితేనే చాలదా తొడరి నీపాదము
పెక్కుమారులిట్టే సేసవెట్టవలెనా

చ. 2: నవ్వితేనే చాలదా నాతి నీయెదుటనుండి
చివ్వన నప్పటి సేవసేయవలెనా
పవ్వళించెఁ జాలదా పక్కన నీతోడమీఁద
పువ్విళ్లూరఁ గుచముల నొత్తవలెనా

చ. 3: కూడితేనే చాలదా కొమ్మ కాఁగిట నేఁడు
మేడెపురతుల నిన్ను మెచ్చవలెనా
వేడుకతో నీవును శ్రీవేంకటేశ యేలితివి
వీడెమిచ్చే నింత వెల్లవిరి వలెనా

రేకు: 0505-4 దేవగాంధారి సం: 13-028

పల్లవి: తరుణివి నీకింత తగవుగాదు
గరిమల నింతటఁ గాఁగిలించఁగదవే

చ. 1: పలుకఁగదవే నీపతితోను
చలములేమిటికే సారెకును
పిలువఁగానే యేల బిగిసేవే
మొలకచన్నులనాఁడే మోహించె నతఁడు

చ. 2: వెస మోవి యియ్యవే విభునికి
కొసరులింకానేల కూడపెట్టేవే
వసమై యుండఁగనేల వనరేవే నీకు
పొసఁగి కన్నెనాఁడే పొందాయ నతఁడు

చ. 3: కనుఁగొనవే శ్రీవేంకటేశ్వరుని
మనసేమి చూచేవే మాఁటిమాఁటికి
వొనరికూడె నింకేల వొల వేసేవే నినుఁ
బెనఁగి చిన్ననాఁడే పెండ్లాడె నతఁడు

రేకు: 0505-5 తెలుఁగుఁ కాంభోధి సం: 13-029

పల్లవి: ఇంక నీ చిత్తంబెట్టియిన రక్షించు
లంకెలమాటల లాలించితివి

చ. 1: వుంకునిచ్చి నను వొడఁబఱపించిటు
అంకెలఁ బెండ్లి ఆడితివి
సంకెదేరఁ గడు సరసములాడుచు
కంకణములు మరి కట్టితివి

చ. 2: ననుపుసేసుకొని నవ్వులు నవ్వుచు
చనవున సేసలు చల్లితివి
వనితలలోపల వాసితోడనే
పెనఁగుచు బువ్వానఁ బెట్టుకొంటివి

చ. 3: కలసిమెలసి నను కాఁగిట నింపుచు
తొలుతనె పాదము దొక్కితివి
యెలమిని శ్రీ వేంకటేశుఁడ నన్నేలి
మలసి రతులఁ గడు మన్నించితివి

రేకు: 0505-6 శంకరాభరణం సం: 13-030

పల్లవి: కొంత గుండెవట్టుకొని కోరికెతో నుండుఁ గాని
చెంతనుండి వొకమాఁటు చేచాఁచరాదా

చ. 1: ఆసతో నప్పటనుండి అతివ గొలువుసేసె
రాసికెక్క నింటికి రమ్మనరాదా
మోసులుగఁ జేయెత్తి మొక్కెనప్పటనుండి
సేసవెట్టేనని మాఁట చెప్పఁగరాదా

చ. 2: బత్తితో నీమేను ముట్టె పడఁతి సింగారించి
సత్తుగా మోముచూచి మెచ్చఁగరాదా
కొత్తలైన నీపొందులుగోరి సరసములాడె
పొత్తుల బువ్వములిచ్చి పొదుగఁగరాదా

చ. 3: వేడుకతో మోవితేనె విందులు సారెకుఁ బెట్టె
కూడి యిట్టే కాఁగిలించుకొనరాదా
యీడనే శ్రీవేంకటేశ యెనసి నిన్నుఁబెండ్లాడె
వోడక సమరతులనూరడించరాదా

రేకు: 0506-1 ఆహిరి సం: 13-031

పల్లవి: ఏఁటికిఁ దలవంచేవు యెందాఁకను
కాటుకకన్నులను గక్కుననుఁ జూడవే

చ. 1: మొయిలువంటివయసు ముడియగట్టఁగరాదా
నయముగ బుద్ధిచెప్ప నావసమా
బయలు పందిలివెట్టి పంతములేలాడేవు
క్రియగూడ పతితోను కెలయుచు నగవే

చ. 2: వెన్నెలవంటి వేడుక వెస గాదెఁ బోయరాదు
ఇన్నిటా జాణవు నీవే యెఱఁగవటే
చన్నుల మెఱుఁగుచూపి చవులేల కొలిపేవు
యెన్నికకెక్కె నితని ఇంపులు చేకొనవే

చ. 3: కొండవంటిది వయసు గుదిగొని తోయరాదు
గండుమీఱి యేలపొద్దు గడుపేవే
అండనే శ్రీ వెంకటేశుఁడాయాలంటి నిన్నుఁగూడె
నిండు యీతనివోజకు నీవు మెచ్చఁగదవే

రేకు:	0506-2 బౌళి	సం:	13-032

పల్లవి:	ఈ తగవులడుగుమా యెవ్వరినైనా నీవు
చేతికి లోనై ఇంతిఁ జేకొనరాదా

చ. 1:	ఆకెమోము నీవుచూచి అట్టే వూరకుడితేను
రేకలుగ వలపులు రేఁగకుండునా
చేకొని యంగన నింత చేసినవాఁడవు నేఁడు
దాకొని పెండ్లాడుటకు తగులు గాదా

చ. 2:	వొంటినొకమాటు నవ్వి వొద్దికఁ బరాకైతే
అంటుకొని చుట్టిరికమందకుండునా
వొంటెనంటా వెలఁదిపై నొల వేసినవాఁడవు
జంటై వావులకు నిదే సంచకరువు గాదా

చ. 3:	కందువఁ గాఁగిటఁ గూడి కడుసిగ్గులు వడితే
అందలి జీరలు మెఱయక వుండునా
పొంది శ్రీవేంకటేశ యీ పాలిఁతిపాలివాఁడవు
ఇందుఁ గట్టిన కంకణమిదియే కాదా

రేకు: 0506-3 మధ్యమావతి సం: 13-033

పల్లవి: ఇద్దరితమకము నిటువలెనే
పొద్దున నేమని బొంకుదమయ్యా

చ. 1: లలి నాకధరము లంచమియ్యఁగా
పలు సోఁకులయి పరగెనవే
పిలువఁగరాఁగా బెరసి నిందపడె
పొలఁతికి నేమని బొంకుదమయ్యా

చ. 2: అడుగుకొనుచు నిన్నంటి పెనఁగఁగా
తడయక నఖములు తాఁకె నవే
తొడుకొని రాఁగా దూఱు మీఁదఁబడె
పొడవుగ నేమని బొంకుదమయ్యా

చ. 3: పెక్కులు చెవిలోఁ బ్రియములు చెప్పఁగ
ముక్కువ జవ్వాది మోచె నిదే
యిక్కడ శ్రీవేంకటేశుఁడ సడివడె
పుక్కటి నేమని బొంకుదమయ్యా

రేకు: 0506-4 హిందొళవసంతం సం: 13-034

పల్లవి: నీవేల సిగ్గుపడేవు నెట్టనఁ దలవంచుక
భావించి భావించి నిన్నుఁ బైకొని మెచ్చీని

చ. 1: వాడలు దిరిగి నీవు వచ్చిన రాక చూచి
వేడుకలు వెదచల్లీ వెలఁది
జాడలతో నీ మోము చంద్రకళలు చూచి
వీడెపు నోటనే వేమారుఁ బొగడీని

చ. 2: పుదుటుఁ దమకమున వుండే నీవునికి చూచి
కదిసి నవ్వులు నవ్వీఁ గలికి
పొదిగిన నీ శిరసు పువ్వుల దండలు చూచి
యెదుట నిలుచుండి చేయెత్తి మొక్కీని

చ. 3: గక్కున వస్తా వచ్చి కాఁగిటఁ గూడఁగాఁ జూచి
చెక్కులు నొక్కీ నిన్నుఁ జెలియ
నిక్కి శ్రీవేంకటేశుఁడ నీ మన్ననలెల్లాఁ జూచి
పక్కన నీమీఁదటి పదాలు వాడీని

రేకు: 0506-5 మాళవిగౌళ సం: 13-035

పల్లవి: వింటివా వోయి నీ వీనులు చల్లఁగాను
నంటున మోములు చూచి నవ్వులు నవ్వేరు

చ. 1: మచ్చికతో నీవు నన్ను మన్నించిన సుద్దులెల్ల
అచ్చపు సవతులెల్ల నాడుకొనేరు
పచ్చిగా నీవు నాతోఁ బలికిన పలుకులు
రచ్చల నందరిలోన రాఁపు సేసేరు

చ. 2: గోరికొన నంటి నీవు కొసరి వేఁడుకొనఁగ
చేరి తమలో సన్నలు సేసుకొనేరు
సారెకు నీవు నాతో సరసములాడినవి
కోరి వెల్లావిరులుగా గురులు సేసేరు వింటి

చ. 3: కందువ నీవు నన్నుఁ గాఁగిటఁ గూడినట్టి
పొందులు యెలుఁగులెత్తి పొగడేరు
అందరి శ్రీవేంకటేశ అంకెల నీవేలినది
విందుల వేడుకలతో వెలయించేరు

రేకు: 0506-6 నాదరామక్రియ సం: 13-036

పల్లవి: కొంతవడి వుండవయ్యా కొరినట్టే అయ్యీఁగాని
కాంతుఁడవు ఇంత పెనఁగకువయ్య యిపుడు

చ. 1: కావించి పొగడేవు చక్కనిదాననంటాను
నీవాడేమాఁటలకు నేనా గురి
చేవదేరి యిందుకుఁగా సిగ్గువడి వున్నదాన
కావరించి నన్నుఁ జెనకకువయ్య యిపుడు

చ. 2: చేరి నాగుణానకు మెచ్చితినంటాఁ జేకొనేవు
నేరుపు నీకతలకు నేనా గురి
సారెకు నిందుకుఁగా వంచనతో నేనున్నదాన
ఆరీతిఁ గొంగువట్టి తియ్యకువయ్య ఇపుడు

చ. 3: అప్పటి నీ దేవుల నే నంటాఁ గాఁగిలించేవు
నెప్పున నీమన్ననకు నేనా గురి
యిప్పుడే శ్రీ వేంకటేశ యిందుఁ జొక్కి వుందాన
దప్పిదేరి నీగోర నూఁదకువయ్య యిపుడు

రేకు: 0507-1 రామక్రియ సం: 13-037

పల్లవి: పాయపు మదమో యిది పట్టినట్టి చలమో
యీయడ నింతటనైనా యెచ్చరవయ్యా

చ. 1: మాటలాడ దొరకొంటే మరేమిటా ముగియదు
యీటుతో నింతికి వీడెమియ్యవయ్యా
పాటించి గోర నొత్తినా పరాకున నెరఁగవు
చోటెల్లా నిండె బుజము చూచుకోవయ్యా

చ. 2: కేరి నవ్వఁజొచ్చితేను కిందుమీఁదు నెరఁగవు
బోరున గందమీపెకుఁ బూయవయ్యా
సారెఁ బువ్వుల వేసినా జవ్వనమదాన లోఁగ
వీ రీతిని మేన దిష్టమెరుఁగుకోవయ్యా

చ. 3: తప్పక చూడఁబోతే నెప్పుడూ రెప్ప మూయవు
చిప్పిలీపెఁ గూడితివి శ్రీ వేంకటేశ
కొప్పు వట్టినాఁ జూడవు కూడినపరవశాన
తెప్పలాయ సంతోసాలు తెలుసుకోవయ్యా

రేకు: 0507-2 శ్రీరాగం సం: 13-038

పల్లవి: చూతువు రావయ్యా సుదతిలాగు
చేతిమీఁదిచెక్కుతోడ సిగ్గువడి వున్నది

చ. 1: చెప్పరానిమాటలు చెలి విన్నవించరాక
వుప్పతిల్లువలపుల నూరకున్నది
ఇప్పుడు నీవే విచ్చేసి యేకతాన నన్నీ విను
దప్పిదేరే మోముతోడ తలవంచుకున్నది

చ. 2: భావములో కోరికలు బయలుసేయఁగ రాక
సోవలచెమటతోడ జొబ్బిలున్నది
వోవరిలోనికి వచ్చి వొరసి నీవే యడుగు
కావిరి నివ్వెరఁగులఁ గమ్ముకొని వున్నది

చ. 3: రతిలో రహస్యములు రవ్వలుసేయఁగ రాక
అతితమకముతోడ నలశున్నది
తతి శ్రీవేంకటేశుఁడ దండనుండి కూడితివి
మతి నీవే యాసపడి మంచముపై నున్నది

రేకు: 0507-3 మంగళకౌశిక సం: 13-039

పల్లవి: ఇద్దరి సరితలు యిందరూఁ జూచేరు
ముద్దులమోముకు మొక్కేము నేము

చ. 1: సళుపులమాటలు సతి నిన్నాడఁగ
కలకల నవ్వేవు కాంతుఁడవు
పెలుచుఁ దమకమునఁ బెనగఁగఁ బెనగఁగ
చలమునఁ జేతులు చాఁచేవు నీవు

చ. 2: మగుడి యాపె బొమ్మల జంకించఁగ
సొగయుచు మొగమే చూచేవు
బిగియుచు నందుకు పెదవుల గొణఁగఁగ
వెగటు లేక యిటు వేడుకొనేవు

చ. 3: పంతముతోఁ జెలి పవళించఁగా
ఇంతినిఁ గాఁగిట నెనసేవు
కొంత గొసరఁగాఁ గూడితివిదెవో
యింతటి శ్రీవేంకటేశుఁడవు

రేకు: 0507-4 బౌళి సం: 13-040

పల్లవి: చలిమీ బలిమీఁ గద్దు సలిగేఁ గద్దు
వలపుచవులుగొన్న వనితను నేను

చ. 1: వేసరించనోపము వేమారు నిన్నును
వాసితోడనుండేము వాకిలి గాచి
నేసవెట్టితివి నాఁడే చేతులెత్తి నామీఁద
దోసిటిపాల పెండ్లికూఁతురను నేను

చ. 2: సారె దూరనోపము సాటికి బేటికి నిన్ను
బీరమున నుండేము నీపీఁటవద్దను
బార చాఁచితివి నాఁడే పక్కన నాకాఁగిటికి
కూరిమిఁ గాలుదొక్కిన కొమ్మను నేను

చ. 3: కక్కసించినోపము కడు శ్రీ వేంకటేశ్వర
యిక్కువఁ గూడుండేము నీ ఇంటిలోనను
దిక్కై యేలితివి నాఁడే తిరమైన రతులను
వొక్కటైన పట్టపుదేవులను నేను

రేకు: 0507-5 సాళంగనాట సం: 13-041

పల్లవి: తూఱిపాఱి తెలియకే దొడ్డమేలు రాఁగా రాఁగా
ఆఱడిబెట్టిను నేను అంకెకత్తెఁ గానీ

చ. 1: చలము సాదించఁగాను సమ్మతించఁ జెప్పేనంటే
పలుకులు చవిగావు పతితోడను
అలిగినదాననై ఆడక వుండుట లేదు
వొలిసి నే గుట్టు సేసుకుందానఁ గానీ

చ. 2: పోరచి పంతమాడఁగఁ బొందులు సేసేనంటే
ఆరయ నవ్వులు చవుకలాతనితోను
బీరపుదాననై బిగుసుకుండుట లేదు
వూరటగా గుట్టుసేసుకుందానఁ గానీ

చ. 3: సందడిఁ గూడగాఁను సరసములాడేనంటే
విందులనే నోరూరు శ్రీవేంకటేశుతో
మందెమేళపుదాననై మఱచి వుండుట లేదు
వొందిలి గుట్టుసేసుక వుందానఁ గానీ

రేకు: 0507-6 ఆహిరి సం: 13-042

పల్లవి: మన్నించవయ్యా యీ మగువను నేఁ డిట్టే
సన్నల చాయల నిన్ను సాదించేనా

చ. 1: అడ్డము చెప్పఁగరాదు అవుఁగాదనరాదు నిన్ను
వొడ్డారపు మాటలకు నోపునా యీకె
యెడ్డఁడవు గావు చూడ యిన్నిటాను జాణఁడవు
దొడ్డివారివలె నిన్ను దూఱఁగలదా

చ. 2: కోపగించరాదు నీతో గుంపించి అలుగరాదు
తాపపు విరహనకు తగునా యీకె
తోపునూకుడు సేయవు దొరవు ఇన్నిటా నీవు
చాపలపు వారివలె జరయఁగఁ గలదా

చ. 3: కక్కసించరాదు నిన్ను కరకరిఁ బెట్టరాదు
నెక్కొన్న నీతో చలము నేర్చునా యీకె
చెక్కు నొక్కి కూడితివి శ్రీ వేంకటేశ్వరుఁడవు
తక్కినవారివలెఁ బంతములాడఁ గలదా

రేకు: 0508-1 సామంతం సం: 13-043

పల్లవి: ముందెఱఁగక కడు మురిపెము చూపేవు
సందడిఁ బెనఁగిన సమ్మతి యౌనా

చ. 1: వదలక పతిపై వలపులు చల్లుచు
యెదుటనె నవ్వే విది యేమే
పదరి యతఁడు నిను బిలిమి సేసితే
నుదుటున నందుకు నోపఁగఁగలవా

చ. 2: వోడకతనికే వుదుటులు చూపుచు
వేడుకఁ బువ్వుల వేసేవు
కూడేనని తాఁ గుచములంటితే
యీడనె నీకది యితవయ్యీనా

చ. 3: యిరవుగ శ్రీ వేంకటేశుఁ గలయుచును
సరములాడేవు సరుగనను
గొరబుగా నతఁడు గోర నూఁదితే
వొరటు లేక నీవోరువఁ గలవా

రేకు: 0508-2 ముఖారి సం: 13-044

పల్లవి: ఎంత నేరుచుకొన్నాఁడే యీతఁడు
సంతోసాలు రేఁచి మోవి చవిగొనీనితఁడు

చ. 1: కందువ నేనుండఁగానే కాఁగిలించుకొనీ ముందు
యెందరిఁ బొంది వచ్చెనో యీతఁడు
సందడించీ నూరివారి చన్నుల వాసనలెల్లా
అందాలుగా నాకుఁ జెప్పీ నడిగితే నితఁడు

చ. 2: పవ్వళించి వుండఁగాను పచ్చడము గప్పీఁ దొల్లి
యెవ్వరికిఁ గప్పినాఁడో యీతఁడు
నివ్వటిల్లీ జవ్వనుల నిండుమేని పసపులు
నవ్వీ నేనడిగితే నయముగా నితఁడు

చ. 3: పానుపుపై నుండఁగాను పసలుగా నన్నుఁ గూడె
యేనెలఁతల నేలెనో యీతఁడు
మేన నిండె గురుతులు మించి శ్రీవేంకటేశుఁడు
వీనులొగ్గీ నడిగితే వేమారుఁ దా నితఁడు

రేకు: 0508-3 పాడి సం: 13-045

పల్లవి: ఇరవాయ నుండవయ్య యేమి చెప్పేవు
సరుసఁ గూచున్నదెల్ల చనవే కాదా

చ. 1: తగులు తెలిసితిమి తరుణికి నీకును
మొగము చూచుటెల్లా మోహమే కాదా
యెగసక్కేలకు నీవు యేమిటికి దాఁచేవు
నగినదెల్లా మీమీ నంటులే కానా

చ. 2: కాయకపు మీగుట్టు కానవచ్చె నాకిట్టే
ఆయములంటినవెల్లా నాసలే కావా
చాయల మమ్మింత యేల సారె నొడఁబరచేవు
పాయక మాటలాడేది పైకొనుటే కాదా

చ. 3: యెరవులు లేక మీరిద్దరొక్క పచ్చడము
పొరిఁ గప్పుకొనుటే పొందులు గావా
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
సరసములాడుటలే చవులుగావా

రేకు: 0508-4 మంగళకౌశిక సం: 13-046

పల్లవి: పొడగించుకొందువు బూమినిందరిచేతాను
మిగులాఁ బొరుగువారి మెప్పించరాదా

చ. 1: కప్పురమే చల్లీని కన్నులనే మొక్కీని
చెప్పరాని సేవలెల్లఁ జేసీఁ జెలి
యెప్పుడు మన్నించేవు యేది నీ జాణతనము
ముప్పిరిఁ జూచేవారిని మెప్పించరాదా

చ. 2: మాటలఁ బ్రియాలు చెప్పీ మచ్చికలఁ గొసరీని
నాటుకొన సారె సారె నవ్వీఁ జెలి
కూటమెప్పు డొసగేవు గుణమెన్నఁడు చూపేవు
మేటి నీదేవుళ్ళను మెప్పించరాదా

చ. 3: చన్నుగుత్తులఁ బూజించీ చవిచూపీ మోవితేనె
వున్నతి శ్రీవేంకటేశ వొరసీఁ జెలి
వన్నె యెప్పుడు సేసేవు వలచినగుఱుతేదీ
మిన్న కేలితివాకెనే మెప్పించరాదా

రేకు: 0508-5 వరాళి సం: 13-047

పల్లవి: అడుగరే రమణుఁడు అండనిదే వున్న వాఁడు
తడఁపెఁ జెమట మేను తగునటవే

చ. 1: యేకతము చెప్పేనంటా నేటేఁటివో పలికీని
కాకుసేతురటవే కాంతలను
యీకడఁ దా మేటిదొర యిల్లాలను నేనైతి
దాకొని యిటువంటివి తగునటవే

చ. 2: పాదాలొత్తించుకొంటానే పచ్చిమానాలు దాఁకించీ
సోదింతురటే సిగ్గులు సుదతులను
పొదుగా ఘనుఁడు దాను పట్టపురాణి నే నైతి
దాదాత నింత సేయఁ దగునటవే

చ. 3: డాసి కైదండ వట్టేనంటా గోరఁ జెనకీని
రాసి నవ్వింపింతురటే రమణులను
లాసీ శ్రీవేంకటేశుఁడు సేసతోఁ గూడితి నేను
తా సుద్దులు చెప్ప నీకఁ దగునటవే

రేకు: 0508-6 పళపంజరం సం: 13-048

పల్లవి: ఎదురు గుదురుగాను యేల నవ్వీనే
యెదుగా తడవునుండి యేల నవ్వీనే

చ. 1: వరుసలు వంతులును వనితలమాడుకోఁగా
యిరవైన విభుఁడు తానేల నవ్వీనే
తరమిడి నిద్దరము తన్నుఁ దగవడిగితే
యెరవులు సేసుకొని యేల నవ్వీనే

చ. 2: వొక్కరొక్కరము సొమ్ములొనర సరిచూడఁగ
యిక్కువైన రమణుఁడు యేల నవ్వీనే
చక్కఁగా మాలోనేమమ్ము సంతము సేయిమంటాను
యిక్కడా మామోము చూచి యేల నవ్వీనే

చ. 3: మోవిమీఁదిగుఱుతులు మూసుకొనేమమ్ముఁ జూచి
యీవేళ శ్రీవేంకటేశుఁడేల నవ్వీనే
భావించి మమ్మేలితివి పాడి దిద్దుమంటేను
యేవెలఁదులతోనైన నేల నవ్వీనే

రేకు: 0509-1 కురంజి సం: 13-049

పల్లవి: దండనున్న చెలులమిందరము సాక్షి
నిండుదొర యీతనికి నేరమేమీ లేదు

చ. 1: వట్టి చలములు మాని వాకిలి దెరవరాదా
యిట్టె విభుడుఁ వచ్చి యీడనున్నాఁడు
వొట్టినట్టు కొలువై వుండినదొక్కటేకాని
నెట్టన నితనివల్ల నేరమేమీ లేదు

చ. 2: దిచ్చరి కోపము మాని తెర దియ్యరాదా
చొచ్చి వచ్చి రమణుఁడు చూచీ నిదే
అచ్చముగ సరసములాడినదొక్కటే కాని
నిచ్చలు నితనివల్ల నేరమేమీ లేదు

చ. 3: పంతపు వేసాలు మాని పయ్యెదెడలించరాదా
చెంత శ్రీవేంకటేశుఁడు చేయి చాఁచీని
యింతలోన నిన్నుఁ గూడె నిది యొక్కటే గాని
నింతము సేసలితని నేరమేమీ లేదు

రేకు: 0509-2 సాళంగనాట సం: 13-050

పల్లవి: బాపు బాపు మేలు వొ౦ఱపరివొౌదువు
చాపలాన నీవే కడు జాణవు గావోయీ

చ. 1: మొగమీకె చూడఁగానే మొనసి వేరొకతెతో
నగవులు నవ్వేవు నాలికాఁడవు
తగులఁగానే మరి తరితీపు వుట్టించేవు
జగములోపల నీవే జాణవు గావోయీ

చ. 2: మాటలీకె ఆడఁగానే మగిడి పొరుగాకెను
నీటుతోడఁ బిలిచేవు నేరుపరివి
గాటాన వలచుండఁగ కాఁకలు గడు రేఁచేవు
చాటువగా నీవే కడు జాణవు గావోయీ

చ. 3: చేరి యీకెఁ గూడఁగానే చెలిపైఁ జేయి వేసి
గారవించేవు శ్రీవేంకటేశుఁడవు
యీరీతి నన్నేలి యాపె యెదనుండఁ జొక్కించేవు
సారెసారెకును నీవే జాణవు గావోయీ

రేకు:	0509-3 శుద్ధవసంతం	సం:	13-051

పల్లవి:	నీవు మగవాఁడవు నీ వెట్టుండినాఁ జెల్లు
భావించి ఆఁటదానను పదరక వుందును

చ. 1:	మనలో నాడినమాట మగువలెట్టైటేఁగిరి
పెనుపొంద నీవే చెప్పితివి గాక
యెనలేక యిటువంటి యెమ్మెకాఁడవంటానే కా
వొనరి నే మోనముతో నూరకే వుండుదును

చ. 2:	పయ్యదలో గురుతులు పడఁతులెట్టైటేఁగిరి
కొయ్యవై నీవే యాడుకొంటివి గాక
యెయ్యెడ బగ్గడివాఁడవిటు నీవంటానే కా
కుయ్యక తెరమాటున గుట్టుసేసుకుందును

చ. 3:	వొంటిఁ గాఁగిటిలో రతులువిదలెట్టైటేఁగిరి
నంటున మచ్చికను నీ వంటివి గాక
ఇంటిలో శ్రీవేంకటేశ ఇట్టివాఁడవంటానే కా
జంటయై యే పొద్దు నీ సంగడినే వుందును

రేకు: 0509-4 గౌళ సం: 13-052

పల్లవి: శిరండ మోఁకాలికి సేసలు వెట్టఁగనేల
గరిమల నాపెనే కాఁగిలించరాదా

చ. 1: నిండిన కాఁతాళము నీమీఁద నుండఁగాను
అండవారిమాటలు ఆపె వినీనా
చండిపెట్టి వొడఁబరచకువయ్య మమ్ము నింత
దండిగా నాపెఁ గాఁగిటఁ దనుపరాదా

చ. 2: ముప్పిరిఁ జూపులు నీపై ముంచుకొని వుండఁగాను
ఇప్పుడు నీ కానుకలు యెంచీనా ఆపె
చప్పుడు సేసి మాకెంత సన్నలెల్లాఁ జూపేవు
అప్పటి నాపెచేతికి నందియ్యరాదా

చ. 3: శ్రీ వేంకటేశ కాఁగిలి చేరి నీ మై నుండఁగాను
యీ వినయాలెరుఁగునా యెంతైనానాపె
మావంటివారినెల్లా మరి యెంత మన్నించేవు
దేవులై న ఆపెనే తెలుపరాదా

రేకు: 0510-1 లలిత సం: 13-053

పల్లవి: ఎందరెందరినిట్లా నేలితివో వెనకకు
సందుసుడి నవ్వేవు జాణకాఁడవౌదువు

చ. 1: చెలియ చెక్కులవెంట చెమటలు గారఁగాను
అలరి పాదములొత్తినప్పటనుండి
తలఁచరాదా దయ దానికేమి తప్పు గాదు
చలమెల్లనీడేరె జాణకాఁడవౌదువు

చ. 2: పువిదచన్నులపై నిట్టూరుపులు నిగుడఁగా
రవళిఁ బనులు సేసీ రాతిటనుండి
ఇవల మెచ్చఁగరాదా ఇందు వంక నేమి వోదు
జవళిపంతము వచ్చె జాణకాఁడవౌదువు

చ. 3: రమణిమోవితేనె గారఁగా ముద్దుమాటలను
సమరతిఁగూడీ నిన్ను జాముటనుండి
అమరి శ్రీవేంకటేశ అన్నిటా మన్నించరాదా
సముకాన సిగ్గులేల జాణకాఁడవౌదువు

రేకు: 0510-2 తోండి సం: 13-054

పల్లవి: మెచ్చితిమి నిన్నును మెలువాఁడవౌదువు
నిచ్చలు మాకన్నిటాను నీవే గుఱిగాక

చ. 1: చేసుకొన్న మగఁగవు చేకొనక మానేవా
వాసితోడ రక్షించేదే వైపు గాక
ఆసకొలిసినవాఁడవట్టే రాక మానేవా
బాస దప్పకుండేదే పంతము గాక

చ. 2: ప్రియమైన విభుఁడవు బెరయక మానేవా
క్రియతో మన్నించుటే కీరితి గాక
నియతమైనవాఁడవు నెట్టుకొనక మానేవా
జయముగా నేలుటే సంగతి గాక

చ. 3: శ్రీ వేంకటేశుఁడవు చేరి కూడక మానేవా
కైవసమై వుండినదే ఘనత గాక
యీవల నన్నేలితివి ఇచ్చగించక మానేవా
యేవల్లాఁ జన విచ్చుటే యెక్కుడు గాక

రేకు: 0510-3 హిందొళ వసంతంసం: 13-055

పల్లవి: కాఁగిలించుకొని యెంత కదిమేవయ్యా
చేఁగ దేర గోరికొనఁ జెనకువయ్యా

చ. 1: మొనసి నీ పాదాలకు మొక్కేమయ్యా
ఘనుఁడవౌదువు అన్నీఁ గంటిమయ్యా
పొనుఁగక యిట్టే నిన్నుఁ బొగడేమయ్యా
పెనఁగను నాచన్నులు పిసుకకువయ్యా

చ. 2: చెప్పినట్టు నీసేవ సేసేమయ్యా
తప్పు వేసి సటలిఁకఁ దడవనయ్యా
ముప్పిరి నీవారము మొదలే అయ్యా
చప్పుడుగాను గిలిగించకు మిప్పుడయ్యా

చ. 3: భావించి పంతమిచ్చితిఁ బాయకువయ్యా
శ్రీవేంకటేశ తమ్మకుఁ జే చాఁచేనయ్యా
యీవేళ నన్నుఁ గూడితి విదే మేలయ్యా
కైవసమై మోవిగంటి గావించకువయ్యా

రేకు: 0510-4 ఆహిరి సం: 13-056

పల్లవి: ఏమి నెఱఁగదు బాల యిఁక నీచిత్తమెట్టో
మీ మాటలెల్లా విని మన్నించవయ్యా

చ. 1: చనవు గలుగఁగాను సారె సారెఁ గొంగు వట్టి
పెనఁగీ నిదివో నీ ప్రియురాలు
యెనసి నీ వుండఁగాను ఇట్టే మందెమేళమున
మన సెరఁగ కెదురు మాటలాడీని

చ. 2: వొడఁబాటు గలుగఁగ నొద్దికతోడుత నీ
తొడమీఁదఁ గూచున్నది తొయ్యలి
కడు నీవు నవ్వఁగాను కన్నులఁ దప్పక చూచి
జడియక బొమ్మలను జంకించీని

చ. 3: పొందులు గలుగఁగాను పాసఁగి శ్రీవేంకటేశ
అందపు రతులఁ గూడీ నతివ
కందువలు నీవంటఁగా కప్పురపుమోవి ఇచ్చి
విందులుగాఁ దమ్మలను వీడుదోడాడీని

రేకు: 0510-5 కాంబోది సం: 13-057

పల్లవి: ఎట్టు సేసినాఁ జేయి యెదురాడను
నెట్టుకొని చూచేవి నీ మహిమలిఁకను

చ. 1: మొగము నీవు చూచితే మొక్కుచును సంతోసింతు
నగితేనే నీ మేలు నమ్ముదు నేను
జిగి వీడెమిచ్చితేనే చెప్పుకొందుఁ జెలులతో
పగటు నీచిత్తము నాభాగ్యమిఁకను

చ. 2: మాటలు నీవాడితేనే మనసు గరఁగుదును
గాటానఁ జేయి వేసితేఁ గడు మెత్తును
పాటించి గోర నంటితే పలుమారుఁ జెలఁగుదు
కోటికి నీ కరుణే కోరితి నేనిఁకను

చ. 3: పచ్చడము గప్పితేను పలుమారు నిన్ను మెత్తు
మచ్చిక నీవు చూపితే మరుఁగుదును
ఇచ్చకుఁడ శ్రీవేంకటేశ నిన్నుఁ గూడితివి
పచ్చియైన నీ మన్ననే బ్రదుకు నాకిఁకను

రేకు: 0510-6 భవుళి సం: 13-058

పల్లవి: నీకు నాకెకుఁ గలదే నేఁడు గొత్తలా సరసము
కోకొమ్మనీ నదే అందుకొనవయ్య విడెము

చ. 1: చనవు గలుగువారు సాదింతురేమైన
ననుపు గలుగువారు నవ్వుదురు
కినియఁగ నేమిటికి కేలెత్తి మొక్కుచు నింతి
వినయాన విన్నవించీ వినవయ్య మాఁట

చ. 2: ప్రియము గలుగువారు పెనఁగుదు రెంతైన
క్రియ యెరిఁగినవారు గిలిగింతురు
బయలు బిగియనేల బాఁతిపడి ఆపె నీకు
దయవుట్ట సేవ సేసీ తాళవయ్య చలము

చ. 3: బలిమి గలుగువారు పంతాలు నెరపుదురు
వలచినవారు రతి నలయింతురు
యెలమి శ్రీవేంకటేశ యెడమాఁట లిఁకనేల
మెలఁగి కలసె నిన్ను మెచ్చవయ్య యీకెను

రేకు: 0511-1 నాట సం: 13-059

పల్లవి: తా నెరఁగఁడటవే యీ తారుకాణలెల్లాను
రానీవే కాదనేనా రమణుని నీడకు

చ. 1: తలఁపు సమ్మతించితే తనువు సమ్మతించును
వలపు గలిగితేనే వాడికె గలుగును
చలము విడువకున్న సాదించవచ్చుఁ బనులు
పలుకులు మంచివైతే పంతమును మంచిదే

చ. 2: తగులు దప్పకుండితే తమకముఁ దప్పదు
తెగువలు వుట్టితేను తెరఁకువాఁ బుట్టును
నగవులు నిండితేను నయము దోడన నిండు
తగవులు నిలిపితే తాలిములు నిలుచు

చ. 3: చెనకులు మొనపితే సిగ్గులును మొనపును
ననుపులు మిగిలితే నమ్మికలు మిగులును
యెనసి శ్రీవేంకటేశుఁ డీడకే తా విచ్చేసీ
చనవు సతమైతేనే సరసమూ సతము

రేకు: 0511-2 దేశాక్షి సం: 13-060

పల్లవి: పచ్చిదేరీ నీమాటలు బతుకవయ్య
విచ్చనవిడిని వూరవిందులాయ వలపు

చ. 1: సంగడి నుండేవారు సరసములాడేవారు
యెంగిలిమోవిచ్చేవా రెందరు నీకు
అంగవించి యాసపడేవప్పటి నే బాఁతైతినా
వింగడించరాక చల్లువెదలాయ వలపు

చ. 2: వూడిగాలు సేసేవారు వొరసి నవ్వేటివారు
యీడుచూపి వుండేవారు యెందరు నీకు
జోడుగా మరియు నీచూపులు నాపైఁ బారెనా
నీడలనే వసంతపు నీళ్ళాయ వలపు

చ. 3: చెలరేఁగి పాడేవారు చేసన్నలు చేసేవారు
యెలయించి పొందేవారు యెందరు నీకు
ఇల శ్రీవేంకటేశ నన్నేలితి విచ్చ గల్గెనా
తిలకించి కడుఁ దరితీపులాయ వలపు

రేకు: 0511-3 సామంతం సం: 13-061

పల్లవి: ఎంతకెంత సేసేవు ఇది యేమే
ఇంతగాఁ గొసరుదురా ఇదియేమే

చ. 1: ఇచ్చకములాడేపతి నెగసక్కెములాడేవు
హెచ్చి జవ్వనమదాన నిదియేమే
మెచ్చులాతఁడు మెచ్చఁగా మేకులు పచరించేవు
యిచ్చిన చనవునను నిది యేమే

చ. 2: మంతనాలు చెప్పఁగాను మలయుచుఁ బెనఁగేవు
యింతులలోపలనెల్లా నిదియేమే
వింతలుగా నవ్వఁగాను వెస గుట్టు సేసేవు
యెంతయినాఁ గరఁగవు యిదియేమే

చ. 3: అంగవించి కూడఁగాను అలసేవు పానుపుపై
యెంగిలిమోవితోడ నిదియేమే
రంగు శ్రీవేంకటేశుఁడు రతి సేసితే మొక్కేవు
యింగిత మెఱుఁగుదువు యిది యేమే

రేకు: 0511-4 సాళంగనాట సం: 13-062

పల్లవి: పాలుదాగిన సత్తువ పనికివచ్చెను నేఁడు
వోలిఁ బచ్చడములోన నొకతున్న దిదివో

చ. 1: పల్లదాన నీవు రేపల్లెలోఁ బెరిగేనాఁడు
గొల్లెతల మూఁకలే కొలువెల్లాను
వొల్లనే సందడికోప కొకతె నీతురుమే
యిల్లుసేసుకొని వుండె నిరవై నేఁడిదిగో

చ. 2: అంచెల వనముల నీ వావులఁ గాచేనాఁడు
చెంచులకదుపులే చెంగటెల్లాను
మించిన రొచ్చుకుఁ గాక మెలఁత వొక్కతె నేఁడు
పంచల నీబుజముపై పాదుకొనె నిదిగో

చ. 3: తనర శ్రీవేంకటేశ ద్వారక నుండేనాఁడు
వనితలు వేవేలు వాడలెల్లాను
పెనఁగి జంగిలిలోనఁ బేరుకొనవలె నని
వొనర నొక్కతె నీ వురమెక్కె నిదిగో

రేకు: 0511-5 రామక్రియ సం: 13-063

పల్లవి: చేరి ధర్మపుణ్యము నీ చేతిది గాక
యీరసాన నిందరిలో నేమనేదిరా

చ. 1: కడు మొక్కలాన నీపై కాకఁలు చల్లఁగరాదు
నడుమంతరాల నీతో నవ్వఁగరాదు
విడువ కెందుంటివని వెంగెములాడఁగ రాదు
యెడయలేని సుద్దులకేమనేదిరా

చ. 2: నిందలు వేసి నిన్ను నేరములెంచఁగ రాదు
మందెమేళమున మారుమలయ రాదు
కందువకుఁ దీసి నీపై గాతలు చూపఁగరాదు
యెందువల్ల గెలుతు నిన్నేమనేదిరా

చ. 3: కొప్పువట్టి తీసి నిన్నుఁ గూరాకు సేయఁగరాదు
యిప్పుడే కూడితి వలయించఁగ రాదు
ముప్పిరి శ్రీవేంకటేశ మొక్కితేఁ దిట్టఁగరాదు
యెప్పటి పంతాలు చెల్లె నేమనేదిరా

రేకు: 0511-6 ఆహిరి సం: 13-064

పల్లవి: చెలులెల్లా నిందుకే సిగ్గువడేరు
పలుమారు నెట్టు వొడఁబరచేవయ్యా

చ. 1: సంగడినున్నసతులు సరసములాడఁగాను
యెంగిలాయ నీమోవి ఇప్పుడిట్టే
పొంగుచు నిన్నప్పటిని భోగించేటి సతులకు
యింగితాన మోహితేనె యెట్టొసఁగేవయ్యా

చ. 2: పొందేవేళఁ బాదాలు నీబుజముపైఁ జాఁచఁగాను
కిందుపడె నీమేను కిమ్ముల నట్టే
అందముగాఁ గొత్తగాఁ బెండ్లాడేటివారికి
ఇందమని కాఁగిలెట్టు ఇంపు సేసేవయ్యా

చ. 3: వావులను తమతమవాఁడవు నీ వనఁగాను
శ్రీవేంకటేశ అందరిశేష మైతివి
యీవేళ నేలినయట్టి మావంటిసతులకెల్ల
చేవదేర నీమహిమ చెప్పేదెట్లయ్యా

రేకు: 0512-1 నారణి సం: 13-065

పల్లవి: మన్నించు నే నిలుచుండే మఱి కొలువుసేసేను
ఇన్నేసి మాటలాడ నీయీడువారమా

చ. 1: అరసి నే నలిగితినంటా వేఁడుకొనేవు
సరికి బేసికి నీతో సాటివారమా
పరగనట్టే మంచముపైకిఁ దీసుకొనేవు
సరుసఁ గూచుండ నీతో సరివారమా

చ. 2: వొట్టు వెట్టుకొంటినంటా నొడివట్టి తీసేవు
అట్టే మారువెనఁగ వియ్యపువారమా
చుట్టిరికములు సేసి సుద్దులెల్లఁ జెప్పేవు
నెట్టుకొని వూఁకొను నీయంతవారమా

చ. 3: పంతములాడితినంటా పక్కనఁ గాఁగిలించేవు
కాంతుఁడవు నేము నీకు కడవారమా
రంతుల శ్రీవేంకటేశ రతుల మేమ్మలితివి
దొంతరమెచ్చులు మెచ్చ దొడ్డవారమా

రేకు: 0512-2 ముఖారి సం: 13-066

పల్లవి: ఆయనాయ నీకింత యాచారాల గొడవేల
పాయపు మదము నీవు పట్టుకుండఁ గలవా

చ. 1: పూచినతంగేడువలెఁ బొలఁతి సింగారించుక
యేచి నిలుచున్నది నీయెదుటను
చేచేత చెరఁగుమాసి వుండితే నేమాయ
చూచిచూచి యంట కోరుచుకుండఁగలవా

చ. 2: పచ్చనిచిలుకవలెఁ బడఁతి చదువుకొంటా
మచ్చికలు చూపీ నీమంచముపొంత
మెచ్చులుగ దడిబెముమీఁద నుంటే నేమాయ
కిచ్చురేఁగి ముట్టి తమకించకుండఁగలవా

చ. 3: మూసినముత్యమువలె ముదిత కాఁగిట నిల్చి
ఆసకొల్పీ శ్రీవేంకటాధిప నిన్ను
సేసవెట్టి నాలునాళ్లు చేసితే నందుకేమాయ
వాసితోడఁ బొంది వలవకుండఁగలవా

రేకు: 0512-3 కాంభోది సం: 13-067

పల్లవి: వారేమి సేతురు వనితలింతే
దూరకువే నీవు తొయ్యలుల

చ. 1: చెలుల నాడకువే సేవ సేసేవారు
బలిమిఁ బట్టఁగఁ బాయుదురా
తలపోసి మేలు తానెఱఁగవలె
చెలువునివే యీ చేఁతలెల్లా

చ. 2: కోపగించకువే కొలువులోవారు
వోపమందురా వొరయఁగా
దాపైన విభుఁడు తానెంచుకోవలె
చూపి చెప్పవే సుద్దులెల్లా

చ. 3: యేమీ ననకువే యేలుకొన్నవారు
కామించినవేళఁ గాదందురా
యీమేర శ్రీవేంకటేశుఁడే నన్నేలె
నే మాననవే నేర్పులెల్లా

రేకు: 0512-4 దేసాళం సం: 13-068

పల్లవి: కంటిమి నీసుద్దులెల్లఁ గడపరాయ
యింటింట దారణలెక్కె నేమి చెప్పేదయ్యా

చ. 1: కొమ్మలచేతనెల్లాను కొలువు సేయించుకొంటా
కమ్మి వలపు కొటారుగాఁ బెట్టేవు
అమ్మరో పోఁకకుఁ బుట్టెఁడాయను సిగ్గులు నేఁడు
యెమ్మెల సతులభాగ్యా లేమి చెప్పేదయ్యా

చ. 2: జలజలోచనలతో సరసములాడుకొంటా
మొలకనవ్వులను వాములు వేసేవు
తలఁపులోని రతులు తరగని ధాన్యమాయ
యెలజవ్వనుల ముద మేమి చెప్పేదయ్యా

చ. 3: కందువ నింతుల నిట్టే కాఁగిటఁ బెనఁగుకొంటా
చెందుచు మోవులపై లచ్చెన వెట్టేవు
అంది శ్రీవేంకటేశ నన్నలమి మెచ్చితివిట్టే
యిందరి మురిపెములు యేమి చెప్పేదయ్యా

రేకు: 0512-5 శంకరాభరణం సం: 13-069

పల్లవి: చుట్టమువలెనే చూడవే
మెట్టుచుఁ బాదము మీఁద వేసీని

చ. 1: వొద్దఁ గూచుండితే నొడివట్టుకొని
సుద్దులు చెప్పీఁ జూడవే
బద్దకుమంటే బాసలు సేసీ
పొద్దువోనివాఁడు బొదించీనే

చ. 2: గేదంగి పూవిచ్చి కేలెత్తి మొక్కితే
జూదమాడుమనీఁ జూడవే
సాదవు గమ్మంటే సన్నలు చూపీని
వీదియెమ్మెకాఁడు వెంటవచ్చీనే

చ. 3: గక్కున నేమెచ్చి కాఁగిలించుకొంటే
చొక్కఁగ ననుఁ గూడెఁ జూడవే
యిక్కడ శ్రీవేంకటేశుఁడు మెచ్చీని
కక్కసీఁడు మోవి గంటిరేచీఁనే

రేకు: 0512-6 నాదరామక్రియ సం: 13-070

పల్లవి: ఎలయించీఁ దానిన్నిటా నేమి సేతునే
యెలుఁగెత్తి దూరరాదు ఏమి సేతునే

చ. 1: వింతగా వేఁడుకొనీని వెనకటి చేఁతలకు
యెంతైనాఁ గొల్పదు మన సేమిసేతునే
కాంతుఁడు తా నిన్నిటాను కడు మీరి వున్నవాఁడు
యింతులిందరు నున్నారు యేమి సేతునే

చ. 2: ముట్టి తా నన్నుఁ బిల్చీని మొన్ననెల్లా రానందుకు
యిట్టే కోపము మానదు యేమి సేతునే
అట్టిడి తా నింతలో నాఐడీరసము చూపీని
యెట్టికేలకుఁ గంటిని యేమి సేతునే

చ. 3: కదిసి తాఁ గాఁగిలించి కడవారిఁ బొందినందు-
కెదుట శ్రీవేంకటేశు నేమిసేతునే
అదన నన్నేలుకొనె నన్నిటాను మన్నించీ-
నిదివో నే మరిగితి నేమి సేతునే

రేకు: 0513-1 శ్రీరాగం సం: 13-071

పల్లవి: ఎఱుక చెప్పేమయ్య యిదిగో నీకు నేఁడు
మెఱసి నీవు నాకు మేలై వలతువు

చ. 1: అలరులకొప్పు నీకు నతిమోహము పుట్టించె
తలిరుమోవి తీపు దప్పిరేఁచెను
వెలిఁజెక్కులకళలు వేడుక పురికొలిపె
కలికి సింగారాలు కన్నులాస నించెను

చ. 2: తచ్చిన గుబ్బచన్నులు తమకము రేఁచె నిన్ను
మచ్చికఁ గనుచూపులు మర్మాలు నాఁటె
మెచ్చులుపేరిఁటి వొప్పు మిక్కిలిని భ్రమయించె
నెచ్చెలిచక్కఁదనము నిన్నింత చొక్కించెను

చ. 3: వాసనమోవితేనె వంతున నోరూరించె
సేసవెట్టిన చేతులు సిగ్గు దేరిచె
యీసుద్దికి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
శ్రీసతిమహిమలెల్ల చేచేత మెప్పించెను

రేకు: 0513-2 భైరవి సం: 13-072

పల్లవి: ఇంక నేమిసేసేవయ్య యింతేశాయను
సంకెలేని వలపులు జాజరాయను

చ. 1: మగువ నీతో నేఁడు మాటలాడిన ఫలము
చిగురువంటిమోవి చిల్లులాయను
తగిలి యిందాఁకా నీదండ నుండిన ఫలము
వొగరుఁజేఁతల నసురుసురాయను

చ. 2: నలినాక్షి నీతోను నవ్వు నవ్విన ఫలము
చెలఁగి కొప్పెల్ల విడి చిక్కులాయను
యెలమి నీకుఁ జేతులెత్తి మొక్కిన ఫలము
నిలువుకు నిలువే నివ్వెరగులాయను

చ. 3: సుదతి నిన్నుఁ దప్పక చూచినయట్టి ఫలము
కొదలేని రతులకు గురి యాయను
పొదలి శ్రీవేంకటేశ పొందుచేసిన ఫలము
చదురుఁదనాలు నేర్చి జాణాయను

రేకు: 0513-3 సామంతం సం: 13-073

పల్లవి: ఎఱిఁగితినిదివో మీ యిద్దరి తమకములు
మొఱఁగులు నేరుతువే మున్నిటికంటెను

చ. 1: చలివాసి యెదుటను సరసునిమోము చూచి
సెలవి నవ్వితివేలే చెలియా
కలువపువ్వుల వేసి కమ్మటి నప్పుడేమని
పలికితివే నీవు పంతములు మీరను

చ. 2: చాయలకుఁ గొలువులో సతులెల్లఁ జూడఁగాను
చేయెత్తి మొక్కితివేలే చెలియా
ఆయములు కొనగోర నంటఁగా సన్నలు నీవు
సేయ నేర్చితివి యేల సేఁతలెక్కుడుగను

చ. 3: వావిరి నోరెఁపాటి వసంతవల్లభఁడైన
శ్రీవేంకటేశునాలవే చెలియా
యీవేళ నిన్నేలినట్టే యెనసె నన్నితఁడును
వావి చెప్పనేలే యింక వరుసలతోడను

రేకు: 0513-4 దేసాళం సం: 13-074

పల్లవి: వన్నెకాఁడ వన్నిటాను వల్లభరాయ
వున్నసుద్దులేఁటికోయి వో వల్లభరాయా

చ. 1: వాడికైన వలపుల వల్లభరాయా
వాడుదేరె నీమోవి వల్లభరాయా
వాడవలపుల మెచ్చు వల్లభరాయ
వోడక నన్నేలుకొమ్మీ వో వల్లభరాయా

చ. 2: వలగొని మొక్కేము వల్లభరాయ నీ-
వలలఁ జిక్కితి మిదే వల్లభరాయా
వలెనా యింతేసి రట్టు వల్లభరాయ
వులివచ్చిమోవి యిమ్మీ వో వల్లభరాయా

చ. 3: వరునోరెఁపాటి వల్లభరాయా నేఁడు
వరుసకు రావోయి వల్లభరాయా
వరదుఁడ శ్రీవేంకట వల్లభరాయ మమ్ము-
నొరసికూడితి విట్టే వో వల్లభరాయా

రేకు: 0513-5 ఆహిరి సం: 13-075

పల్లవి: ఎట్టైనా దయదలఁచి యేలుకోవయ్యా
జట్టిగొని నిన్ను నంత సాదించనేరను

చ. 1: మన్నింతువనెడి నిండు మందెమేళమునను
యెన్నిమాటలాడితినో యెరఁగను
కన్నియఁ గనక నీతో కందువలుచూపి మోపి
విన్నపాలు చేసుకొను వివరము నేరను

చ. 2: కైపసమై నీవుండిన గబ్బితనమునను
యేవూడిగము గొరతో యెఱుఁగను
దేవులఁ గనక నీవు దిమ్మరివాఁడవని
భావించి కరకరించి బాసగొననేరను

చ. 3: దోమటి దొడికినట్టి దొరతనమునను
యేమి నావొళ్ళఁ దప్పులో యెఱఁగను
కామినిఁ గనక శ్రీవేంకటేశ నిన్నుఁగూడి
ఆముక వుందాన నిన్ను నవుఁగాదననేరను

రేకు: 0513-6 భైరవి సం: 13-076

పల్లవి: మావంటివా రేమన్నా మర్మాలు సోఁకి వచ్చు
వేవేలు మీలో మీరు విచారించుకోరయ్యా

చ. 1: మచ్చికతోడుత నీవు మాటలాడఁగాఁ జూచి
నచ్చుకొని కొంతగొంత నవ్వీనాపె
హెచ్చుకుందు లందులోన నేమి దెలిసెనో కాని
విచ్చనవిడిని నీవే విచారించుకోవయ్యా

చ. 2: గుట్టుతోడ నీవు పెద్దకొలువై వుండఁగఁజూచి
నట్టినడుమ నిలిచి నవ్వీ నాపె
ఇట్టె చేసిన చేఁతలేమేమున్నవో కాని
దట్టముగ మనసులోఁ దలపోసుకోవయ్యా

చ. 3: శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జెందినట్టి నిన్నుఁజూచి
నావెనక నిదివో నవ్వీ నాపె
యేవల నీకు వలపు లెన్నిగలవో కాని
ఆవటించి చెలులతో నాలోచించుకోవయ్యా

రేకు: 0514-1 ధన్నాశి సం: 13-077

పల్లవి: మగువ యప్పటనుండి మనికతమున నవ్వీ
అగడేల లోపలికి నంకెల రారాదా

చ. 1: యిల్లాలయినదాని నిందరిలోపల నీవు
పల్లదపు మాటలాడి పచ్చిసేతురా
చెల్లఁబో ఆఁటదానికి సిగ్గు విడువఁ దగవా
కల్లరివై యింత నీవు కాకుసేయవలదు

చ. 2: పీఁటపైఁ బెండ్లికూఁతురుఁ బేరటాండ్లలోన నెల్లా
వాఁటముగఁ బయ్యదంటి వాసిసేతురా
మేఁటి యాఁటదానికి మేరమీరఁ దగవా
గాఁటముగ నీవింత కాకుసేయవలదు

చ. 3: పట్టిపుదేవులఁ దెచ్చి పడఁతులలోన నెల్లా
జట్టిగొని మోవితేనె చవి చూపేవు
అట్టే కూడితివి మగనాలికి రట్టు దగవా
గట్టిగా శ్రీవేంకటేశ కాకుసేయవలదు

రేకు: 0514-2 శంకరాభరణం సం: 13-078

పల్లవి: నీవే యిఁకఁ గరుణించవయ్యా
భావించి కత లేర్పరచఁగఁ గలరా

చ. 1: మనసులోని నీమతకములెల్లా
కనుఁగొనఁగలరా కామినులు
వెనుకొని నీవొళ్లి వేసములింతేసి
దినదినమును నిటు తెలియఁగఁ గలరా

చ. 2: నలుగడ నీ విటు నవ్విన నవ్వులు
తలఁచఁగఁ గలరా తగు సతులు
నెలకొని నీరతినేర్పుల చేఁతలు
కొలఁదులు వెట్టుక కొసరఁగఁ గలరా

చ. 3: శ్రీవేంకటేశ్వర జిగి నీ మహిమలు
సేవించఁగలరా చిన్నెకలు
వావిరి నందరి వరుస నేలితివి
వావులు దెలుపుచు వారించఁ గలరా

రేకు: 0514-3 సాళంగనాట సం: 13-079

పల్లవి: నీ వేల పంతాలాడేవు నేఁడు మాతోను
భావించితే నాఁడువారి పగటులివి

చ. 1: చెక్కులఁ జేతులిడుక సిగ్గులతో నుండేది
చక్కనిసతులకెల్ల సహజమిది
జక్కవ చనుల మీఁద సారె బయ్యెద మూసేది
యెక్కడా మానినులకు యిక్కువలివి

చ. 2: వుదుటున నవ్వుతాను వోరచూపులు చూచేవి
చదురాఁడులైనవారి సహజమిది
పొదిగి సన్నలు చేసి బొమ్మల జంకించేది
మొదలఁ గాంతలకును మురిపేలివి

చ. 3: పలుకుల లోపలను వచ్చి దొరల నాడేది
అలమేల్మంగనైన నాకందము లివి
చెలఁగి కూడితి విట్టే శ్రీవేంకటేశ నన్ను
వలపు వనితలకు వాడికలివి

రేకు: 0514-4 దేసాళం సం: 13-080

పల్లవి: మెచ్చిరి గొల్లెతలెల్ల మీఁద మీఁదను
యిచ్చిరి చనవులు నీవిట్టే బతుకవయ్యా

చ. 1: అంగనలైతేఁ జాలు నట్టే దయ దలఁతువు
యెంగిలి మోవులని యెంచవు
కంగులే కెప్పుడు మెడఁగట్టుకొనే వుందువు
యింగితపురతులు నీకేమి గడమయ్యా

చ. 2: వెలఁదులైతేఁ జాలు వేడుకఁ బెండ్లాడుదువు
పొలసి వారేమిచ్చినాఁ బూసుకొందువు
నెలకొని యేపొద్దు నెత్తిఁ బెట్టుకొందువు
వలపులనోము నీకు ఫలియించె నయ్యా

చ. 3: మానినులైతేఁ జాలు మర్మములు చూతువు
ఆనుక వీఁపున మోచు కలరుదువు
నే నలమేలుమంగను నీవు శ్రీవేంకటేశుఁడ-
వీనిజాన నిన్నుఁ గూడితింక నేలుకోవయ్యా

రేకు: 0514-5 సామంతం సం: 13-081

పల్లవి: ఏఁటికిఁ బదరే వింతులతోడను
నేఁటనె తప్పదు నేరుపు భువిని

చ. 1: వలవ నేరుతువు వడి నీ రమణుని
వలపించఁగ నేరవలెఁ గదవే
పలికినటులనే పంతము పైపై
నిలిపినదే పో నేరుపు భువిని

చ. 2: నవ్వ నేరుతువు ననుపున నాతని
నవ్వించవలెఁగదే నటనలను
పువ్విళ్ళువలె నోరూరించి పగటుల
నివ్వటిలుట పో నేరుపు భువిని

చ. 3: చిక్క నేరుతువు శ్రీవేంకటేశ్వరుఁ
జిక్కించవలెఁగదే సేవలను
మక్కువ నీ వలమేల్మంగ వెనసితివి
నిక్కి మమ్మేలుట నేరుపు భువిని

రేకు: 0514-6 దేవగాంధారి సం: 13-082

పల్లవి: ఏడేడఁ జూచినాను యీ సుద్దులే
కోడెకాఁడవయితివి గోవిందరాజా

చ. 1: అందగారి మాటలాడి ఆయములంటి యంటి
యిందుముఖిఁ జొక్కించి యేలుకొంటివి
పొందులు మరిగి యాకెభోగములకొటకుఁ గా
గొందిఁ బవ్వళించితివి గోవిందరాజా

చ. 2: సెలవి నవ్వులు నవ్వి చేతులు చాఁచి చాఁచి
కలికిని వలపించి కై కొంటివి
కలయికలకుఁగానే కందువ పానుపుమీఁదఁ
గొలువున్నాఁడ విదివో గోవిందరాజా

చ. 3: తమ్ములము నోర నించి తమకము రేఁచి రేఁచి
కొమ్మనుఁ గాఁగిటిలోనఁ గూడితివి
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁతరతులకే
కుమ్మరించేవు మోహము గోవిందరాజా

రేకు: 0515-1 కేదారగౌళ సం: 13-083

పల్లవి: విన్నపమిది యొకటి వేవేలుమారులకును
సన్నలను చాయలను సంతమౌటే మేలు

చ. 1: చెలిమియొకరు వచ్చి చేసి పెట్టవచ్చునా
అలరి తమయంతనే అందుఁగాక
చెలులము మాకు బుద్ది చెప్పఁగా వసములా
వెసలేని లోలోని వేడుకింతే కాక

చ. 2: కూరిమి యెవ్వరైనఁ గోన వేయ వసమా
తారుకాణైన తమ తమి గాక
సారె నూడిగపువారు చవిసేయవచ్చునా
మేరమీర నప్పటిమేళములు గాక

చ. 3: శ్రీవేంకటేశ బలిమిసేయ మాకు వసమా
మీవలెఁ గూడినవి మెచ్చులు గాక
యీవిధాన నండవారు యెచ్చరించ నోపుదురా
కైవమైనయట్టి గరిమెలు గాక

రేకు: 0515-2 ముఖారి సం: 13-084

పల్లవి: ఎందాఁకా మంకుఁదనమేఁటికి నీకు
చందముగా మన్నించి చనవియ్యరాదా

చ. 1: హత్తి నిన్ను వేఁడుకొనీ నప్పటనుండియుఁ బతి
చిత్తములోపలిమాట చెప్పరాదా
కొత్త కొత్తవలపుల కొంగువట్టి నిన్నుఁదీసి
పొత్తులఁగూచుండి అట్టే పొసఁగఁగరాదా

చ. 2: పెనఁగుచు మాఁటలాడి ప్రియములు చెప్పీని
వినయములెల్లా నీవు వినరాదా
తనివి దీరక పైపైఁ దానే సరసములాడి
చెనకుచు నీవు నట్టే చెలఁగరాదా

చ. 3: కప్పురము నోరికిచ్చి కాఁగిలించుకొనీ నిన్ను
యిప్పుడు నీవియ్యకొని యెనయరాదా
అప్పటి శ్రీవేంకటేశుఁడంగవించి నిన్నుఁగూడె
దప్పిదేరి యన్నిటాను తనివందరాదా

రేకు: 0515-3 భవుళి సం: 13-085

పల్లవి: తలకొని యేల యెడతాఁకించేవు చెలులను
వెలయ మీసరితలు వింటా నుండేము

చ. 1: సముకాననే నిన్ను జంకించి చూచేటి
రమణుల నేము మేరకుఁ దెచ్చేమా
తమకించి నీవె యాకతాన వేఁడుకొనవయ్య
తమితోడ నేము తెరదండ నుండేము

చ. 2: బడిబడి నీతో నొడ్డాఁబట్టా మాటలాడేటి
పడఁతుల మేము వొడఁబరచేమా
తొడిఁబడ నీవే పొందులు చేసుకొనవయ్య
తడఁబడక మలఁగుదాపున నుండేము

చ. 3: రతివేళ నిన్నుఁ గడురాపుగా నలయించేటి
అతివల నంతేసి కాదనఁగలమా
యితవై శ్రీవేంకటేశ యిట్టే నీవెనసితివి
మతిమఱవక నీమన్నన నుండేము

రేకు: 0515-4 శ్రీరాగం సం: 13-086

పల్లవి: వెలయఁగఁ దెర యిఁక వేయఁగదే
నిలువునఁ బులకలు నిండఁగఁ దొడఁగె

చ. 1: విరులఁగొని పతిని వేయఁగ వేయఁగ
మరుని శరములై మైకొనెను
సురతపు నటనలు చూపఁగఁ జూపఁగ
పెరరేఁపులు మదిఁ బెనగొనఁ దొడఁగె

చ. 2: చక్కగఁ గప్రము చల్లఁగఁ జల్లఁగ
చొక్కుమందులై సుడిగొనెను
అక్కర మాటలు ఆడఁగ నాడఁగ
మక్కువవలపులు మలయఁగఁ దొడఁగె

చ. 3: యింపుల విడియము లియ్యఁగ నియ్యఁగ
ముంపులమదములు మునుకొనెను
అంపక శ్రీవేంకటాధిపు సెనయఁగ
సంపదతమకము జడిఁగొనఁ దొడఁగె

రేకు: 0515-5 శంకరాభరణం సం: 13-087

పల్లవి: ఆమనిపువ్వువంటిది ఆయమైన వయసు
కామించి భోగించక యా మరఁదగునా

చ. 1: చలపాదితనమేల సణఁగులాడఁగనేల
బలిమిఁ బెనఁగేయట్టి పతితోను
పలుకరాదా కప్రపుబాగా లియ్యఁగరాదా
చెలులకు నింతేసి సిగ్గువడఁదగునా

చ. 2: బిగియఁగ నింతయేల పెచ్చువెరుగఁగనేల
పగటునఁ దమకించే పతితోను
నగవులు నగరాదా నయములు చూపరాదా
చిగురుమోవితోడ సిగ్గువడఁదగునా

చ. 3: మరిగించ నింతయేల మనసులు చూడనేల
పరగ శ్రీ వేంకటపతితోను
గరిమెల మెచ్చరాదా కాఁగిటఁగూడె నతఁడు
శిరసువంచుక యట్టె సిగ్గువడఁదగునా

రేకు: 0515-6 రామక్రియ సం: 13-088

పల్లవి: మేలుమేలు నీగుణాలు మెచ్చితిమయ్యా
మైలలేక నీమనసు మణుఁగాయఁగా

చ. 1: మచ్చికతో నాపె నీకు మనవులు చెప్పినవి
యిచ్చగించి వింటివిగా ఇన్నియును
వచ్చి నీయెదుటఁ దలవంచుక వున్నందుకు
తచ్చివేసినట్టు నీకు దయవుట్టెఁగా

చ. 2: ఆసతోడ నాపె నీకు నంపిన కానికెలవి
సేసవెట్టినచేతులఁ జేకొంటివి
పూసగుచ్చినట్టు నిన్నుఁ బొంచి చూచినయందుకు
రాసినతమకము బోరన రేఁగెఁగా

చ. 3: సిగ్గుతోడ నీకునిట్టె సేవలు సేసినవి
అగ్గమై మెచ్చి కాఁగిట నలమితివి
నిగ్గుల శ్రీవేంకటేశ నేఁడు మమ్మునేలితివి
యెగ్గులేని రతులెల్ల నిరవాయఁగా

రేకు: 0516-1 సాళంగం సం: 13-089

పల్లవి: ఆతఁడు చెప్పినట్ల అండనే కూచుండఁగదే
రాతిరీఁ బగలు నింత రవ్వసేయఁదగునా

చ. 1: వలపుగలవారికి చలము సాదించరాదు
లలిఁ జెప్పినట్టు సేయవలెఁ గాని
చెలువుఁడాతఁడు నీపైఁ జేతులు చాఁచఁగాను
పెలుచుఁదనాన నింత పెనఁగఁగఁదగునా

చ. 2: తగులు గలచోటికి బిగువు చూపఁగరాదు
మొగమిచ్చలే యాడఁ దగుఁ గాని
నగుతా నాతఁడు నీకానలు గడుఁబెట్టఁగాను
జిగిమించి నీకింత సిగ్గువడఁదగునా

చ. 3: రతివేళ నన్నిటా సమ్మతించక మానరాదు
మితిమీరి కూడుటకుఁ దతిగాని
ఇతవై శ్రీవేంకటేశుఁ డేలి నిన్ను మెచ్చఁగాను
సతమై నీకింతగుట్టు జరపఁగఁదగునా

రేకు: 0516-2 దేశాక్షి సం: 13-090

పల్లవి: ఎటువంటి జాణకాఁడే యీతఁడు
చిటుకలు వేసీని సెలవినవ్వులను

చ. 1: సంగడినున్నయాపెను సాకిరి చెప్పుమనుచు
కొంగువట్టి తీసీని కొయ్యతనాన
అంగవించి మాటలాడ ననువుగావలె నంటా
నెంగిలితమ్ములము పైనిట్టె వుమిసీని

చ. 2: యెఱుకగాఁ బొరుగాపె నిట్టే పొద్దు చెప్పుమని
నెఱిఁగొప్పువట్టి తీసీ నేరుపునను
మఱియుఁ బెనఁగేవేళ మైమరువు వలెనంటా
మెఱుఁగుగోణము కొంగు మీఁదవేసీని

చ. 3: పోరచి వచ్చినాపెను బుద్ధులు చెప్పుమనుచు
గోరగీరి కాఁగిలించి కూడీనదే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిరవై వుండేనంటా
సారెకు మన్నించి నాకు చనవిచ్చీనే

రేకు: 0516-3 వరాళి సం: 13-091

పల్లవి: మొగము చూడఁగానే మొరఁగేటికే
వెగటుగా నీవేళ వేసటేఁటికే

చ. 1: సేసలు వెట్టేయప్పుడు సిగ్గులువడుట గాక
ఆసఁ గాఁపురము సేసే అప్పుడేఁటికే
వాసులు వట్టేయప్పుడే వడి జంకింతురు గాక
యీసులేక నవ్వేయప్పుడిఁక నేఁటికే

చ. 2: యెడసి వుండినవేళ యెగ్గులు వట్టుట గాక
అడరి వీడెమిచ్చే యప్పుడేఁటికే
తడవినయప్పుడే తప్పులువట్టుట గాక
వొడికమై వుండఁగాను వొరయఁగనేఁటికే

చ. 3: కంగియుండినయప్పుడు కాఁకలు చల్లుట గాక
అంగములంటి కూడిన యప్పుడేఁటికే
సంగతిగా శ్రీవేంకటేశ్వరుఁ డేలె నిన్నిన్నిటా
సంగడి మెచ్చుటగాక చలము మరేఁటికే

రేకు: 0516-4 సాళంగనాట సం: 13-092

పల్లవి: దేవతలు చెలఁగిరి దిక్కులెల్లా సంతోషించె
ఆవల నసురలెల్ల నడఁగిరి యపుడే

చ. 1: అందమై మధురలోన నదివో కృష్ణావతారఁ
మందెను శ్రావణబహుళాష్టమి నేఁడు
దిందుపడిరి దేవకీదేవి వసుదేవుఁడును
అందిరి బ్రహ్మానంద మంతరంగములను

చ. 2: నడుమరేపల్లెలోన నందగోప యశోదల
కొడుకై పెరిగెనదే గోవిందుఁడు
అడరి గోపికలును ఆవులమందలును
వుడివోనివేడుకల నుప్పొంగఁ గలిగెను

చ. 3: ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిదె తిరుపతిలోన
వుప్పతిల్లి దేవుఁడై వున్నాఁడిదే
చిప్పిలి సేవకులును శ్రీసతిదేవియును
కప్పి నానాగతులఁ బొగడఁగఁ దొడఁగిరి

రేకు: 0516-5 శ్రీరాగం సం: 13-093

పల్లవి: కంటిమి నేఁడీభాగ్యము కన్నులతుదల నేము
నంటున సంతోషించుకొంటిమి వోవిభుఁడ

చ. 1: మొలకచన్నులమీఁద మోపి నీవు కొనగోరు
వలపు కలుపుదీసేవా ఆకెకు
కిలకిల నవ్వఁగానే గిలిగించే వప్పటిని
నలువంకఁ గూరిములు నాఁటు వేసేవా

చ. 2: ఘనమైన పిరుఁదుపై కట్టేవు మొలనూళ్ళు
గలమెలు జవ్వనానకొనరించేవా
పెనఁగి సిగ్గువడఁగ బిగ్గఁ గాఁగిలించేవు
వునికిగా రతిపంట లొడుపఁగఁ జూచేవా

చ. 3: ముప్పిరిఁ దురుమునిండ ముడిచేవు పువ్వులు
తప్పకుండ ననుపు పాఁతరఁబెట్టేవా
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి మమ్మునెల్ల
అప్పటిఁ గాంతలమేలు ఆమని సేసేవా

రేకు:	0516-6 నాగ వరాళి	సం:	13-094

పల్లవి:	ఇద్దరికిదె విన్నప మెంచుకోరయ్య
	సుద్దులు చెప్పఁగానే సూటి యవును ముదము

చ. 1:	పొరుగుపొంతలనుంటే పొందులు సమకూడును
	సరసములాడితేను చవిపుట్టును
	నిరతిఁ గోరియుండితే నిగుడుఁ గోరికలు
	యెరువులు లేకుండితే నెనయును మనసు

చ. 2:	సంగడిఁ గూచుంటేనే సమ్మతి తానే కలుగు
	అంగవించి పెనఁగితే నాయములంటు
	యెంగిలిమోవు లిచ్చితే యింపులు సొంపులు రేఁగు
	జంగిలి నవ్వునవ్వితే సతమౌను పనులు

చ. 3:	వొక్కపానుపున నుంటే నుడివో వంటి రతులు
	మిక్కిలి జాణతనాల మించును మేలు
	యెక్కువ శ్రీవేంకటేశ యింతి నీవు గూడితిరి
	తక్కక యిట్టే వుంటే తమకము హెచ్చును

రేకు:	0517-1 దేశాక్షి	సం:	13-095

పల్లవి:	ఎంతయిన మమ్ము నీవు యేలినట్టివాఁడవు
పంతగత్తెనైతినంటాఁ బదరేవు సుమ్మీ

చ. 1:	కాతరాన నే నిన్నుఁ గడవనాడిమాట
జాతులు సేసేవు సుమ్మీ సతులలోను
చేతికి లోనాయనంటా చిక్కని నాచన్నులపై
ఘాతలు నించేవు సుమ్మీ ఘనుఁడ మొక్కేను

చ. 2:	మేరమీరి నే నీతో మేలుకు నవ్వినవ్వు
ఆరసి చెప్పేవు సుమ్మీ ఆండ్లతోను
కూరిమి నీతొడమీఁదఁ గూచుంటినంటాఁ బిరుఁదు
సారె నదిమేవు సుమ్మీ సరుగ మొక్కేను

చ. 3:	అగ్గలమై రతివేళ నంగములు సోఁకినందు-
కెగ్గులువట్టేవు సుమ్మీ యిందరిలోను
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయ గోవిందరాజ
వెగ్గళించేవు సుమ్మీ వేడుక మొక్కేను

రేకు: 0517-2 ఆహిరి సం: 13-096

పల్లవి: ఎవ్వరుఁ జెప్పరు నీకు నేమిసేసేది
జవ్వనపాయముగా సటలు రేచేఁది

చ. 1: పంతము నీవాడేవట పట్టరాదా యెగ్గు మేము
యెంతనేరుపరివి నిన్నేమిచెప్పేది
అంతదొరవు నీవైతే నాఁడువారు సదరమా
దొంతుల యీతగవేల తోఁచదో కాక ఎవ్వ

చ. 2: రావాడి గోరూఁదేవట రాసి నే జంకించరాదా
యేవల్ల నేర్చితివి నిన్నేమిచెప్పేది
నీవే చదువనేర్చితే నెలఁతలు తుచ్చమైర
యీవేళ నీవిచారము యేలలేదో కాని

చ. 3: తక్కక కూడితివట తమకించరాదా నేను
యెక్కడఁగలిగె బుద్ధు లేమిచెప్పేది
నిక్కి దేవరవై తేనే నీవారుగారా సతులు
ఇక్కువ శ్రీవేంకటేశ యేల మంకో కాక

రేకు: 0517-3 కాంబోది సం: 13-097

పల్లవి: మూసి దాఁపిరములేవి మునుకొనె వలపులు
బాస చేసినప్పుడే బదికితిమి

చ. 1: మచ్చికతో నీవు నాతో మాటలాడినప్పుడే
రచ్చకెక్కెఁ బనులెల్ల రాఁపైతిమి
కుచ్చికుచ్చి నీవు పొరుగున నున్నయపుడే
విచ్చనవిడిని వెల్లవిరులైతిమి

చ. 2: నంటుచేసి నీవు నాతో నవ్వు నవ్వినప్పుడే
అంటిన మనసులతో నారడైతిమి
జంటయి వద్దఁగూచుండి చనవిచ్చినపుడే
యింటనింట నాడికెలకిరవైతిమి

చ. 3: కతలుగా మోవిమీఁద గంటిచేసి నప్పుడే
రతిచేఁతలనుఁ గడు రవ్వయితిమి
యితవై శ్రీవేంకటేశ యెనసితివిపుడే
మితిమీఱి యిన్నిటాను మేలువారమైతిమి

రేకు: 0517-4 పాడి సం: 13-098

పల్లవి: ఇద్దరము మీయెదుట నిదివో వున్నారము
వొద్దికతోఁ దేర్చరే వొక్కటయ్యేము

చ. 1: మొగము తాఁ జూచితేనే నగితి నే నంతలోనే
తగవులు చెప్పరే తరుణులాల
పగటులవాఁడు తాను పంతగత్తెను నేను
జగమెల్లనెఱుఁగు మాసహజములు

చ. 2: పైకొని వొడివట్టితే పక్కన గోరనొత్తితి
సాకిరులు చెప్పరే సతులాల
కాకరిమాట తనది కందువ జంకెన నాది
చేకొన్న మావొళ్లఁ గలసేఁతలివి

చ. 3: గట్టిగాఁ జెక్కునొక్కితేఁ గాఁగిటఁ గూడితి నేను
చుట్టిరికాలు చెప్పరే సుదతులాల
యిట్టే తా శ్రీవేంకటేశుఁ డిందిరాదేవిని నేను
గుట్టున మాయందుఁగల గుణములివి

రేకు: 0517-5 ఆహిరి సం: 13-099

పల్లవి: ఎట్టోరువవచ్చు యిటువంటివెల్లఁ జూచి
పట్టపగటనుండియు బడలె నీచెలియ

చ. 1: పంతగాఁడవైనందుకు బలిమి గలయందుకు
నింతులతోఁ జూపేవా యెగసక్కేలు
యెంతదడవాకుమడిచిప్పించుకొనేవు నీవు
బంతినిట్టే నిలుచుండి బడలె నీచెలియ

చ. 2: నేరుపరివైనందుకు నిజముగల యందుకు
ఆరీతిఁ దక్కింతురా యంగనలను
కోరి తొడలపైఁ జాఁచుకొంటివి నీపాదాలు
భారము మోచుకవుండి బడలె నీచెలియ

చ. 3: యేలినందుకు శ్రీవేంకటేశుఁడవైనందుకు
జాలిఁబెట్టుదురా యింత సకియలను
వేళతోఁ గాఁగిటఁ గూడి వెలయ మన్నించితివి
ఆలరి రతులచేత నలసె నీచెలియ

రేకు: 0517-6 నాగవరాళి సం: 13-100

పల్లవి: సుదతులకితనికి సోబనవేళ
వుదుటునఁ జెలులెల్ల నూడిగాలు శాయరే

చ. 1: ఇద్దరు పెండ్లికూఁతులకితఁడు గట్టె బాసిక-
మొద్దికఁ గప్పురవీడే లొడిఁబెట్టెను
పెద్దరికాన నడుమఁ బెండ్లిపఁటపైఁ గూచుండె
వొద్దనుండి సతులెల్ల నూడిగాలు సేయరే

చ. 2: రెండుచేతుల శాసలు రెట్టించి చల్లఁ దొడఁగె
దండలిద్దరిమెడలఁ దగుల వేసె
గండుమీరి ముంజేతులఁ గంకణదారాలు గట్టె
వుండినట్టే చెలులెల్ల నూడిగాలు సేయరే

చ. 3: భూమి నలమేల్మంగను భూసతిఁ గాఁగిటఁ గూడె
దోమటిదొడికి ముందే తొక్కెఁ బాదాలు
యీమేఁటి శ్రీవేంకటేశుఁ డిన్నివిధాల మెఱసె
వోముచును చెలులెల్ల నూడిగాలు సేయరే

రేకు: 0518-1 నట్టనారాయణి సం: 13-101
పల్లవి: మీరైతే నెఱఁగరు మీలోని వేడుకలు
ఆరీతి సన్నలు చేసే రతివలిందరును
చ. 1: చిమ్ముఁజూపులతోడుత సేస మీరు వెట్టుకోఁగా
మిమ్ముఁజూచి చెలులెల్లా మెచ్చి నవ్వేరు
వుమ్మడిఁ గొంగులు ముళ్ళు వొకరొకరు వేయఁగ
సొమ్మల మొకమొకాలు చూచేరిందరును
చ. 2: కడుఁ దమకముతోడ కంకణాలు గట్టుకోఁగాఁ
నడరి ఆడుకొనేరు అంగనలెల్ల
తొడిఁబడ నిద్దరును తోడనీళ్ళాడఁ గాను
గుడిగొని లోలో సిగ్గులు వడేరిందరు
చ. 3: పేరటాండ్లకు మీరు పేరులిద్దరుఁ జెప్పఁగా
నారసి నవ్వేరు సతు లాడనీడను
చేరెలమేలుమంగను శ్రీవేంకటేశ కూడి
గారవించి పొగడుతాఁ గదిసే రిందరును

రేకు:	0518-2 ధన్నాశి	సం:	13-102
పల్లవి:	విన్నవించుమనె మమ్ము వెలఁది నీకు నీవు
	వన్నెలు చూపినఁగాని వలపులేర్పడవు
చ. 1:	మాటలాడి తనియదు మగువ నీతో నేఁడు
	తాటించి పువ్వులవేసి తనియదు
	గాటపుగుబ్బలు నిండఁ గాఁగిలించుకొన్నఁ గాని
	వాఁటమైన మీలోని వలపులేర్పడవు
చ. 2:	చిఱునవ్వులు నవ్వియు చిత్తములోఁ దనియదు
	తఱితో మొక్కులు మొక్కి తనియదు
	పిఱుదంటి తొడలపైఁ బెట్టుకవుండినఁగాని
	మఱియును మెరసి నీమచ్చికలేర్పడవు
చ. 3:	సొలసి సొలసి నిన్నుఁజూచి చూచి తనియదు
	తలఁగక సేవసేసీ తనియదు
	అలమేల్మంగఁ గూడితివట్టే లాలించినఁగాని
	చెలఁగి శ్రీవేంకటేశ వలపులేర్పడవు

రేకు: 0518-3 గౌళ సం: 13-103

పల్లవి: ఏమేమి మర్మములో ఇద్దరికే తెలును
వేమారుఁ బులకలతో విఱ్ఱవీఁగేరు

చ. 1: నిలువుఁగొప్పులతోడ నీవు నాకె మాటలాడి
సెలవుల నవ్వులతో చిమ్మిరేఁగేరు
కొలఁదికిఁ గలువలు కొప్పులనుండి జారఁగ
మెలుపున మిమ్ముమీరే మెచ్చుకొనేరు

చ. 2: సందడించే సొమ్ములతో సరసములాడుకొంటా
కందువసిగ్గులతోడఁ గడుమించేరు
గందపులప్పలు మేన గలగల పైరాలఁగ
విందులుగ నొండొరుల వేడుకల మించేరు

చ. 3: యెమ్మెలతో శ్రీవేంకటేశ యలమేల్మంగతో
వుమ్మడిరతుల నసురుసురనేరు
దొమ్మిచెమట మేనులఁ దొటతొట వడియఁగా
చిమ్ముచును ముత్తేలసేసలు చల్లేరు

రేకు: 0518-4 శ్రీరాగం సం: 13-104

పల్లవి: కనుఁగొని మొక్కరే కాంతలాల
వొనరి యిందరితోడ నున్నాఁడు దేవుఁడు

చ. 1: చిప్పిల నదివో రతిచెమటలఁ దొప్పఁదోఁగి
కప్పురదూళి మేనఁ గడుఁజాతి
దప్పిదేరి చెంగలువదండల చప్పరములో
వుప్పతిల్ల వలపుల నోలలాడీ దేవుఁడు

చ. 2: గుట్టున మిక్కిలిపెనఁగులాటనే యలసి
తట్టుపుణుఁగు మేన నంతటా నలఁది
వట్టివేళ్ళ సురట్ల వాసన సేదదేరి
వొట్టుకొని వేడుకల నోలలాడీ దేవుఁడు

చ. 3: పలుమారు నవ్వులలో పంతములనే మెరసి
మెలుపున సొమ్ములెల్ల మేన ధరించి
అలమేలుమంగ నురమందుఁ గాఁగిలించుకొని
వొలిసి శ్రీవేంకటాద్రి నోలలాడీ దేవుఁడు

రేకు: 0518-5 నాదరామక్రియ సం: 13-105

పల్లవి: ఆపెకు నీకు నెంత అరువడమో
రేపును మాపునుఁ దమి రేఁచీని

చ. 1: ప్రియమైన సేసపాల పెండ్లికూఁతురు నీతో
నయగారిమాటలాడి నవ్వించీని
రయమునఁ బానుపుపై రాతిరిఁ బగలు నుండి
క్రియగూ డారతులను కెరలించీని

చ. 2: దోమటి గలసినట్టి దొడ్డదేవులు నీతో
కోమలపు చూపుచూచి కొసరీని
కామించి పైఁడిపీఁటపై కలకాలమునుండి
చేముంచి సరసములఁ జిక్కించీని

చ. 3: అట్టే వురమెక్కినట్టి యలమేలుమంగ నీతో
రట్టిడితనానఁ గూడాఆడిఁ బెట్టీని
గట్టిగా శ్రీవేంకటేశ కాఁగిట సదా వుండి
జట్టిగొన్న సిగ్గులను చవి వుట్టించీని

రేకు: 0518-6 సింధూరామక్రియ సం: 13-106

పల్లవి: కంటిమి మిమ్మిందరిని కన్నులతుదల నేఁడు
తొంటివినుకులకు సంతోసమాయ నయ్యా

చ. 1: చూపులనే ఆకె నీకు సుద్దులెల్లాఁ జెప్పెను
ఆపనులు యింకానేమి అడిగేవయ్యా
కైపుసేయకందుకుఁగాఁ గాఁగిలించుకొంటివి
చాపలాన రెంటికిని సరియాయ నయ్యా

చ. 2: నవ్వులనే నీకు వినయములెల్లాఁ జూపె
తవ్వుచు నప్పటి నేమి దడవేవయ్యా
చివ్వన నందుకుఁగాను చెక్కులు నొక్కితివి
యివ్వల నందుకిందుకు నీడువచ్చెనయ్యా

చ. 3: మంతనాన నలమేలుమంగ నీకు మొక్కి కూడె
వంతుకు నన్నేలి యెంత వలచేవయ్యా
అంతలో శ్రీవేంకటేశ అందుకే లాలించితివి
కాంతుఁడవన్నిటాఁ దారుకాణ వచ్చెనయ్యా

రేకు: 0519-1 సాళంగనాట సం: 13-107

పల్లవి: వాఁడెవాఁడె వీఁడెవీఁడె వాడలలో మెరసీని
ఆఁడులనడుమనెంత అలరీని చూడరే

చ. 1: కనకపు రథమెక్కి కప్పురము చల్లీని
వనితలమీఁదట శ్రీవల్లభుఁడు
వినువీధి మించినట్టి వేంకటాచలముమీఁద
నినుపుఁ జందురుఁడు వెన్నెలగాసినట్లు

చ. 2: దేవాసనముమీఁదఁ దిరమై పన్నీరు చల్లీ
వేవేలు సతులమీఁద విశ్వమూరితి
చేవమీరి శేషాద్రిశిఖరము మీఁదను
భావింప మేఘము జడివట్టి మించినట్లు

చ. 3: పసిఁడిదండెల పీఁటపై నుండి పూవుల వేసీ
వెస నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు
మిసిమి నంజనగిరిమీఁద వసంతవేళను
వెసఁ గల్పవృక్షము విరులిచ్చినట్లు

రేకు: 0519-2 కన్నడగౌళ సం: 13-108

పల్లవి: మిక్కిలి నేరుపరివి మేలెల్లా నెరుఁగుదువు
తక్కక నీగుణాలెల్లఁ దలఁచుకోరాదా

చ. 1: నగితినంటా నీవు నన్నునేల జరసేవు
మొగము చూపరాదా మొక్కేఁగాని
జిగిమోవెడిగేనంటాఁ జెక్కులేల నొక్కేవు
తగు నీబాసలెల్లాఁ దలఁచుకోరాదా

చ. 2: చూచితినంటా నన్ను సుద్దులేఁటి కడిగేవు
చే చాఁచఁగరాదా చెలఁగేఁ గాని
కాచి పాదా లొత్తేనంటా కందువలేల యంటేవు
తాచి నీవంపిన లేక దలఁచుకోరాదా

చ. 3: కాఁగిలించుకొంటి నంటా కడు నేమి మెచ్చేవు
చేఁగ రతి చూపరాదా శ్రీవేంకటేశ
రేఁగె లమేల్మంగ నంటా రేకలేల నించేవు
దాఁగని నీవొడఁబాటు తలఁచుకోరాదా

రేకు: 0519-3 మంగళకౌశిక సం: 13-109

పల్లవి: సేవ చేసే బలిమింతే చెలులకెల్ల
పూవువలె నింకా నిన్నుఁ బొగడేమయ్యా

చ. 1: మొక్కఁగానే యింత యేల మొనగోర నూఁదేవు
లక్కవంటి చిత్తపు లలన నేను
యెక్కువ తక్కువ మాట లేమీననరాదు నిన్ను
పుక్కిటికొలఁది నిన్నుఁ బొగడేమయ్యా

చ. 2: ప్రియము చెప్పఁగ నేల పిసికేవు చన్నులు
నయగారి జవ్వనపు నాతిని నేను
చెయిముట్టి యంతేసి చెనకఁగరాదు నిన్ను
ముయికి ముయిగా నిన్నుఁ బొగడేమయ్యా

చ. 3: చుట్టమ ననఁగ నేల సొలసి వొడివట్టేవు
మట్టులేని యలమేలుమంగను నేను
అట్టివిడి శ్రీవేంకటేశ జాయి గిలిగించరాదు
పొట్టఁబొరుగున నిన్నుఁ బొగడేమయ్యా

రేకు: 0519-4 శంకరాభరణం సం: 13-110

పల్లవి: కైకొనవయ్యా ఘనుఁడవు
దీకొని మోహము దిగఁబోసీని

చ. 1: జంకెనచూపులు సరసపుమాఁటలు
సంకె లేక సతి చల్లీని
పొంకపుఁగొసరులు భోగపుటుసురులు
వుంకువగా నీకొనరించీని

చ. 2: సెలవులనవ్వులు సిగ్గులమొఱఁగులు
నెలకొని యంగన నించీని
చెలువపుతెక్కులు చేతులమొక్కులు
వొలిసి కప్పముగ నొసగీని

చ. 3: మొగములో కళలు ముంచినరతులును
నిగిడెలమేల్మంగ నించీని
అగపడి శ్రీవేంకటాధిప కూడితి
యిగురుమోవి నీకిచ్చీని

రేకు: 0519-5 నాదరామక్రియ సం: 13-111

పల్లవి: ఇటువంటివాని నిను నెట్టు గెలువఁగ వచ్చు
తటుకున నిన్నిటాను తప్పు లేదనేవు

చ. 1: చేరి యెందుండో రాఁగాఁ జేయి వట్టుకొని నిన్ను
తారుకాణ చేసినాఁ దప్పు లేదనేవు
మారుముద్రలు నీమేన మచ్చములు చూపినాను
దార దప్పకుండానుఁ దప్పులేదనేవు

చ. 2: పెండిలిపీఁటపై నీవు ప్రియముతోఁ గూచుండఁగా
దండములు వెట్టినాఁ దప్పు లేదనేవు
నిండు వింతవాసనలు నీవల్ల నుండఁగాను
దండి చేసుకడిగినాఁ దప్పు లేదనేవు

చ. 3: మిగులా నన్నుఁ గూడి మించాపెమోము చూడఁగా
తగవు నిన్నడిగినాఁ దప్పు లేదనేవు
నిగిడి శ్రీవేంకటాద్రినిలయ గోవిందరాజ
దగ యేలతొట్టెనంటేఁ దప్పు లేదనేవు

రేకు: 0519-6 నారాయణి సం: 13-112

పల్లవి: పంతగాఁడ విఁక మమ్ముఁ బాయకువయ్యా
బంతిఁ బెట్టుకొని మమ్ముఁ బాలార్చవయ్యా

చ. 1: జవ్వనపువారమో సముకపువారమో
యెవ్వర మే మన్నా నెగ్గులెంచకువయ్యా
నవ్వు నవ్వేవారమో ననుపైనవారమో
తవ్విన మోవి రసాల దప్పిదేర్చవయ్యా

చ. 2: సేవ చేసేవారమో చిత్తములో వారమో
కావరించినా మమ్ముఁ గైకొనవయ్యా
వూవువంటివారమో బోగించేవారమో
వేవేలు మన్ననల వెలయించవయ్యా

చ. 3: కడుమేనవారమో కప్రపుఁబడివారమో
యెడయక ఇట్టె వీడెలియ్యవయ్యా
కడగి శ్రీవేంకటేశ కలసిన నీవారమో
జడియక యిట్లానే చనవియ్యవయ్యా

రేకు: 0520-1 పాడి సం: 13-113

పల్లవి: అందుననే కనుఁగొనే నతని బత్తి
ఇందువదనరో నాకు నెరిఁగించఁగదవే

చ. 1: చెప్పిన నావిన్నపము చేకొని వినె నటవే
కప్పురమందె నటవే కానికగాను
ముప్పిరి నందుకుఁగాను మోము చెంగలించె నటే
చిప్పిలి కరఁగి యట్టే చెమరించెనటవే

చ. 2: వాలాయించి మా ఇంటికివచ్చే ననె నటవే
యేలేనని నిండుబాస లిచ్చె నటవే
మేలువాఁడై కొంత గొంత మేలమాడెనటవే
కీలెఱిఁగి మనమీఁదఁ గృపసేసె నటవే

చ. 3: ఇందాఁకా శ్రీవేంకటేశుఁ డెదుట నుండె నటవే
అందగాఁడై నాకు సతమాయ నటవే
ఇందరిలో కాఁగిట నన్నేకతానఁ గూడెనటే
చందమాయఁ బనులెల్లా సరివచ్చె నటవే

రేకు: 0520-2 కాంబోది సం: 13-114

పల్లవి: నీవే యెరఁగవలె నెరజాణవు
వేవేలు నీకు విన్నవించే వారెవ్వరయ్యా

చ. 1: నిరతి నిన్నటనుండి నీవీకెతో నుండఁగాను
వరుసకు వచ్చి యాపె వాకిటనుండీ
తరితీపు సేసేవు తరుణులిద్దరి సంది
వెరవుతో నీకు విన్నవించే వారెవ్వరయ్యా

చ. 2: పూని నీవీకెతోను భోగించుకుండఁగాను
కానుక దెచ్చుక యాపె గాచుకున్నది
తానకమై ఇద్దరికి తమకములు రేఁచేవు
వీనులంట నీకు విన్నవించే వారెవ్వరయ్యా

చ. 3: శ్రీ వేంకటేశ నీవీకెఁ జేరి కూడుండఁగాను
సేవ సేసేనంటా నాపె చెంతనున్నది
ఆవరుసల నిద్దరి నందముగా నేలితివి
వేవేగ నీకు విన్నవించే వారెవరయ్యా

రేకు: 0520-3 శుద్ధవసంతం సం: 13-115

పల్లవి: దయ దలఁచినపుడే ధర్మము నీకు
ప్రియముతోడుత నింక బెరయఁగరాదా

చ. 1: నలువంక నీతోనే నవ్వులు నవ్వీ నిదే
సొలసి సొలసి నిన్నే చూచీ నిదే
మలసి మలసి నీతో మాటలూనాడీ నిదే
కలికి నింతటనైనఁ గరుణించరాదా

చ. 2: సారె సారె నీతోనే సన్నలు చేసీ నిదే
కూరిములు పలుమారుఁ గొసరీ నిదే
నేరుపులు గలవెల్ల నీయందే నెరపీ నిదే
నారీమణికి నిట్టే నంటు చూపరాదా

చ. 3: వింతవింతలుగ నీకె వీడెము లిచ్చీ నిదే
సంతోసాన నిన్నునే జరసీ నిదే
రంతుల శ్రీవేంకటేశ రతులకు మొక్కీ నిదే
యింతిఁ గూడితి విందే యిరవుకోరాదా

రేకు: 0520-4 ఆహిరి సం: 13-116

పల్లవి: నీవే మన్నించేవు గాక నీచిత్తము వచ్చితేను
కావరించి నే నిన్ను కాఁతాళము రేఁతునా

చ. 1: సంగడి సతులు నిన్ను చన్నులు నొత్తిరంటాను
జంగిలిలో నే నిన్ను చండి సేతునా
అంగడివారెల్లా నిన్ను నంటఁ గాఁగిలించిరంటా
వుంగిటిగా నే నిన్ను నొత్తుకోలు సేతునా

చ. 2: వుద్దండపు సతులెల్ల వొడివట్టి తీసిరంటా
కొద్దిమీర నే నీపై గోరు దీతునా
గద్దరి చెలులు నిన్ను ఘాతలెల్లాఁ జేసిరంటా
అద్దుకొని నే నిన్ను నాఁబడిగాఁ జేతునా

చ. 3: ఆగడపు కాంతలు నిన్నలమి కూడిరంటా
వేగిరించి నే నిన్ను వేసరింతునా
యీగతి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
చేగ దేర నే నిన్ను చిమ్మి రేఁతునా

రేకు: 0520-5 ముఖారి సం: 13-117

పల్లవి: ఏవున నెంత వెఱతు వీయింతికి
ఆపెమాట మీర నని ఆనవెట్టుకొంటివో

చ. 1: వేగినంతా నే నీకు విన్నపాలు చేసినవి
ఆగడాలు చేసితివి ఆపెతోడను
చేగలెక్క నీపై నేను సేసవిరులు వెట్టితే
పొగులుగా ఆకెదుటఁ బోసితివి

చ. 2: యేకతానఁ గస్తూరి నీకితవుగాఁ బూసినది
ఆకెకుఁ జూపితివి నీవంతలోననే
దాకొని నీచెవినిండాఁ దట్టుపునుఁగు వెట్టితే
కైకొని యాపెకు నెట్టు కానుకిచ్చితివి

చ. 3: చనుదోయి కాఁగిట లచ్చునగా నీకు నించితే
పెనఁగకు మనుచు నాపెకుఁ జూపేవు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విద్దరిని
చనుమానాలిచ్చి మమ్ము సరిగాఁ బెంచేవు

రేకు: 0520-6 శుద్ధ దేశి సం: 13-118

పల్లవి: ఏల గుబ్బతిల్లేరు మీరింతటిలోననే
ఆలికిని మగనికి నడ్డాఁకలున్నవా

చ. 1: మాటలు సరివచ్చెనా మగువకు నీకును
యీటునఁ గనుఁగొనల నేమి నవ్వేరు
చోటు గలిగెనా మీకు సుద్దులెల్లాఁ జెప్పుకోను
ఆఁటదానికి మగవాని కడ్డాఁకలున్నవా

చ. 2: తారుకాణలాయనా తరుణికి నీకును
యీరీతిఁ బెంజెమటతో నేమి నవ్వేరు
మేర గలిగెనా మీకు మెచ్చులెల్లా మెచ్చుకోను
ఆరయ సతికిఁ బతికడ్డాఁకలున్నవా

చ. 3: రతి మర్మములంటెనా రమణికి నీకును
యితవైన చొక్కులతో నేమి నవ్వేరు
సతము గలిగెనా చవులకు శ్రీవేంకటేశ
అతివకుఁ బతివైతి వడ్డాఁకలున్నవా

రేకు: 0531-1 వరాళి సం: 13-119

పల్లవి: మీఁద మిక్కిలి సన్నలు మీరే యెఱుఁగుదురు
యీఁదా మోఁదా మొక్కు మొఁక్కేమిదివో నేము

చ. 1: తటుకున నందరితో తచ్చనలాడేటి నీఁ
నటనలు చూచే నవ్వీ నాపె
కుటిలము నెరఁగము గుంపించ నెఱఁగము
యిటువలె సేవ సేసే మిదివో నేము

చ. 2: వనితలతో నెల్లా వంతులు జరుపే నీ-
ననుపులు చూచే నవ్వీ నాపె
పెనఁగఁగ నెరఁగము బిగియఁగ నెరఁగము
యెనసి కొలువు సేసే మిదివో నేము

చ. 3: అలరి శ్రీవేంకటేశ అందరిఁ గాఁగిటఁ గూడే
నాలితనములు చూచే నవ్వీ నాపె
జాలిఁబెట్టి నెరఁగము సాదించ నెరఁగము
యీలాగులఁ గలసే మిదివో నేము

రేకు: 0531-2 సాళంగనాట సం: 13-120

పల్లవి: నీవెఱఁగవా యివి నెలఁతల నేరుపులు
వావి గలసినవారు వాసులు నెరపరా

చ. 1: పంతమాడరాదు గాక పడతికిఁ సారె సారె
యెంత సేయరాదు పతి నెలయించి
వింతదానఁ గాఁ గనక వెన్నెల నవ్వునవ్వితి
జంతలైన వారైతే జంకించరా

చ. 2: జగడించరాదు గాక సతులకు సారెసారె
పగటెంత చూపరాదు పచ్చి దోఁచను
తగినదానఁ గనక తలఁపు దాఁచనైతి
యెగసక్కెపు వారైతే నెమ్మి చూపరా

చ. 3: వాసులెంచరాదు గాక వనితకు సారె సారె
సేసలెన్ని వెట్టరాదు చిమ్మి రేఁగి
సేసుకుందానఁ గనక శ్రీవేంకటేశ పొందితి
యీ సుద్దుల కొకరైతే నెంతయినాఁ జేయరా

రేకు: 0531-3 నాదరామక్రియ సం: 13-121

పల్లవి: ఉపచరించవయ్యా వువిదలను
వుపమలతోడనే వొడలు మోపీని

చ. 1: జలజలఁ జెమటలు చన్నుల తుదలఁ గార
అలసి గందము వూసీ నతివ నీకు
మలకల నెరివేణి మఱి వీఁపునఁ బొలయ
తలపోఁత గతులఁ బాదములో త్తీని

చ. 2: వెడవెడ నిట్టూర్పులు విసర ముక్కునవెంట
జడిసి సురటి వీచీ సారెకు నేఁడు
తొడిఁబడఁ జెమటలు తొటతొటఁ బైఁ బడఁగ
జడిగొన మాటల సరసమాడీని

చ. 3: కలసి వొండొంటితో కంకణా లొరయఁగాను
చెలఁగి కాఁగిటఁగూడీ శ్రీవేంకటేశా
కులికి కులికి కొనగోరి గురులు సోఁకఁగ
పలురతుల చవులు పచారించీని

రేకు: 0531-4 శంకరాభరణం సం: 13-122

పల్లవి: ఎఱిఁగిన పనులకు నింతేలా
కలితలు నేర్తువు కాంతుఁడ నీవు

చ. 1: పన్నినమాయలు పక్కన నుండఁగ
సన్నలు సేసినఁ జమలౌనా
వన్నెల నాతో వలపులు చల్లుచు
కన్నులార్చెదవు కడగడ నీవు

చ. 2: చేసిన నేరమి చేచే నుండఁగ
సేసలు వెట్టిన సెలవవునా
బాసలు నాతో పలుమరుఁ జేయుచు
ఆసలు సేసే వవ్వల నీవు

చ. 3: కలసిన గుఱుతులు కాఁగిట నుండఁగ
వలవని మఱఁగులు వైపౌనా
యెలమిని శ్రీవేంకటేశ నన్నేనసి
పులకించేవిదె పొరుగున నీవు

రేకు: 0531-5 సింధూరామక్రియ సం: 13-123

పల్లవి: మేలు గలంతాను మెరసేను
తాలిమితో నిట్టే మాదండకు రావయ్యా

చ. 1: మనసొక్కటాయ నింక మామాట వింటివి
ననుపై నాసెలవికి నవ్వువచ్చెను
చెనకఁగానే నాకు చేయి మీఁదాయ నేఁడు
తనిసితి మింకాను మాదండకు రావయ్యా

చ. 2: చలమెల్ల నీడేరె చనవు మాకిచ్చితివి
కళలు నా మోమునఁ గడు నిండెను
కొలువులో నుండఁగానే కూటములు దైవారె
తలకొని యిపుడు మాదండకు రావయ్యా

చ. 3: నిండెను సంతోసము నెమ్మది నన్నేలితివి
మెండుగ శ్రీవేంకటేశ మెచ్చితి నిన్ను
పండుమోవితేనెతోనే ఫలమందె రతులెల్లా
దండియై యున్నాఁడవు మాదండకు రావయ్యా

రేకు:	0531-6 ముఖారి సం:	13-124

పల్లవి:	నీ వెఱఁగనివున్నవా నేరుపరివి
	వావులే గుఱిసేసి వద్దనుండవయ్యా

చ. 1:	పొలసి యేమిటికైనా బొమ్మల జంకింతుము
	చలపట్టి నిన్ను నట్టే సాదింతుము
	యెలమిఁ బొందైనవారి కెగ్గులేవి తప్పులేవి
	వలపులే గురిగావా తెలుసుకోవయ్యా

చ. 2:	వినగానె నిన్ను గడువెంగెము లాడుదము
	ననుపున నిట్టే కడు నాఁటఁ జాతుము
	చనువు గల వారికి సరి యేమి బేసేమి
	మనసులే గురిగావా మన్నించవయ్యా

చ. 3:	కందువ నేకతమైతే కడుఁ దమకింతుము
	అందపు రతుల చేత నలయింతుము
	యిందునే శ్రీవేంకటేశ యేలితివి మమ్ము మోవి
	విందులివే గురిగావా వినోదించవయ్యా

రేకు: 0532-1 కురంజి సం: 13-125

పల్లవి: చిన్నవానివలె నెంత చెప్పించుకొనేవు నీవు
యెన్నరాని రతులకు నెదురుకోవలదా

చ. 1: చెంతనుండే చెలి నిన్నుఁ జెనకిన చెనకులు
చింతతోడఁ దలవంచి సిగ్గువడేవు
వింతవాఁడవా నీవు వేడుకకాఁడవు తొల్లె
దొంతర వలపులకు దోసిలొగ్గవలదా

చ. 2: ననుపున నాతి నీతో నవ్వే నవ్వులకు
వొనరఁగ నీచేతుల నొడ్డుకొనేవు
ననుచనివాఁడవా నంటుతో దొరవు నీవు
పెనఁగే తమకానకుఁ బ్రియపడవలదా

చ. 3: కోమలి శ్రీవేంకటేశ కూడె నీ కూటములకు
మోము చూచి యంతలోనే మొక్కు మొక్కేవు
సామాన్యపువాఁడవా సర్వేశ్వరుఁడ విదె
గోమున నెంతవడైనాఁ గొసరఁగ వలదా

రేకు: 0532-2 సాళంగం సం: 13-126

పల్లవి: తలఁపు దెలియవద్దా తా నెటువంటి జాణఁడే
పిలిచే ననఁగానే ప్రియవడీఁ దాను

చ. 1: తెరలో నుండఁగా గుట్టు దెలుసుకొనుంటేను
తరకానివలె నేల తమకించీనే
దొరయంటాఁ దనకాలు దొక్కక వూరకే వుంటె
గొరబులు సేసి యేల కొసరీనే తాను

చ. 2: తప్పక చూడఁగాను తలవంచుకొంటేను
వుప్పతించి నను నేల వొడివట్టీనే
చెప్పరాని మాట గాఁగా సిగ్గువడి వుండితేను
అప్పటి నానవెట్టేల అడిగీనే తాను

చ. 3: బిగ్గెఁ గాఁగిలించుకోఁగా పెనఁగక వుంటేను
నిగ్గులఁ దానేల నాకు నేర్పవచ్చీనే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నన్ను
వొగ్గి కూడె నిఁక నేల వొరసీనే తాను

రేకు: 0532-3 భైరవి సం: 13-127

పల్లవి: ఇంకా నేఁటి సుద్దులు యెందాఁకాను
పొంకములన్నియును పొదిగున్నవి

చ. 1: చెలరేఁగి నీవు తొల్లి చెప్పిన బుద్ధులెల్లా
తలఁపులో నాతనికిఁ దగిలున్నవి
చలపట్టి సేసినట్టి సరసపుఁ జేఁతలెల్లా
నిలువునఁ జెక్కులెల్లా నిండి వున్నవి

చ. 2: నెమ్మది నీవు దొల్లి నేరిపిన నేర్పులెల్లా
సమ్మతిల్ల నాతనికి సతమైనవి
పమ్మి నీవు గరఁగించి పాడిన పాటలెల్లా
కమ్మి యాతని చెవులఁ గాఁపురములున్నవి

చ. 3: నిరతి నలమేల్మంగ నీవతనిఁ గూడఁగాను
సిరులు శ్రీవేంకటేశుఁ జెంది వున్నవి
సరి నీకాఁగిటిలోని చన్నుల వొత్తులెల్లాను
వురముపై నాతనికి వుంకువైనవి

రేకు: 0532-4 సాళంగనాట సం: 13-128

పల్లవి: సిగ్గువడఁ డిదివో చెలులాల
వెగ్గలపు సంతోసాన విఱ్ఱవీఁగీని

చ. 1: వాఁడివో గోవిందరాజు వలపులు చల్లుతాను
పోఁడిమితోఁ బవ్వళించి భోగించీని
కోఁడి కోఁడి చూపులను కొమ్మలు చూడఁగాను
నాఁడు నేఁడు వొక్కరీతి నవ్వు నవ్వీని

చ. 2: సంకుఁ జక్రములతోడ చంద్రగాని రెంటెముతో
కంకణముల చాఁచిన కరములతో
వుంకువ కానికలు వువిదలియ్యఁగాను
సంకెలేక మోవితేనె చవి చూపీని

చ. 3: బంగారు కటారమదే పానుపు శేషుఁడు వాఁడే
సింగారపు వేడుకలఁ జెలఁగీ నదే
చెంగటఁ బెండ్లాడుతాను శ్రీవేంకటేశుఁడు దానే
వుంగరపు వేలుచూపి వొద్దికయ్యీని

రేకు: 0532-5 శంకరాభరణం సం: 13-129

పల్లవి: పడఁతి నీపతికె భాగ్యములు
తొడిఁబడ దొరకెను దోమట్లు

చ. 1: తెలియకాని నీ తేనెలమాటలు
తిలకింపఁగఁ దరితీపులు
చలిమి బలిమి నీ సరసపు సన్నలు
కల నిమ్మపండ్ల కానికలు

చ. 2: ననిచిన సెలవుల నవ్వుల తేటలు
వొనరిన వలపుల వూటలు
కొనచూపుల నీ కూరిమి కొసరులు
చొనిపిన పొందుల చుట్టరికములు

చ. 3: మిక్కిలి కాఁగిట మెరయు నీ రతులు
వొక్కటఁ బెనగొను వుంకువలు
యిక్కువ శ్రీవేంకటేశు నెనసితివి
మొక్కలములేని మోహములు

రేకు: 0532-6 మాళవిగౌళ సం: 13-130

పల్లవి: దేవరవు నీవు నీదేవుల నేను
వావి గద్దు గనక నీవద్దనే వుండుదును

చ. 1: వేసరకుమీ నా వీరిడి మాటలకును
ఆసపడి యేమైనా నాడుదు నేను
వాసులెంచకుమీ నా వలపుల నవ్వులందు
రాసికెక్కనట్టే సరసములాడుదును

చ. 2: తప్పులు వట్టికుమీ నా తమకపు చేఁతలకు
కొప్పు వట్టి తీసి నిన్నుఁ గొసరుదును
వుప్పటించకుమీ నా వుదుటుఁజూపులకు
చిప్పిల మర్మాలు నాఁటఁ జిమ్ముదు నేను

చ. 3: గొరబు సేయకుమీ కూటపు నా రతులకు
అరుదులుగాఁ గూడి యలయింతును
యిరవై శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
మరిగితి నీకు నేను మఱవకు నన్నును

రేకు: 0533-1 నాట సం: 13-131

పల్లవి: ఎందరి నెలయించితో యిట్లానే బూమిలోన
సందడిలోనే మీకు సతమైతిమి

చ. 1: కొచ్చి కొచ్చి నీవిట్టే కొలువుసేయించుకోఁగా
మచ్చికతోడుత నిన్ను మరిగితిమి
పచ్చిగా నీవు మాతో పగడసాలాడఁగాను
రచ్చకెక్కి యింతేసి రవ్వయితిమి

చ. 2: మంతనాన మాచే నాకు మడిచి ఇప్పించుకోఁగా
ఇంతులమై నిన్ను నిట్టే యెనసితిమి
సంతతము నీవిట్టే సంగడిఁ బెట్టుకుండఁగా
నంతటా మందెమేళములై పెనఁగితిమి

చ. 3: కప్పురము మోవి నంటి కాఁగిలింపించుకోఁగాను
వొప్పుగా దేవుళ్ళమై వొనరితిమి
యిప్పుడే శ్రీవేంకటేశ యిన్నిటా మమ్మేలఁగాను
యెప్పుడూ నురముమీఁద నిరవైతిమి

రేకు: 0533-2 సామంతం సం: 13-132

పల్లవి: చెలి చెప్పినట్టు నీవు సేయరాదా
పెలుచుఁదనాన నేల బిగసేవు

చ. 1: సారెసారె నీతో సలిగకుఁ బెనఁగఁగా
మారుకొన నేమిటికి మగువతోను
కోరి వేఁడి నిన్నుఁ గొసరి కొంగువట్టితే
ఆరితేరి యాల అలసేవు

చ. 2: పచ్చి వచ్చి నాతో వావులు చెప్పఁగా
కుచ్చితములేమిటికి కోమలితోను
మచ్చికసేసి నీతో మాటలాడఁగాను
పచ్చి సేసి యింత యాల పదరేవు

చ. 3: కదిసి కదిసి నిన్నుఁగప్పురములడుగఁగా
వుదుటు జంకెనలేల వువిదతోను
మొదల శ్రీవేంకటేశ మొగము చూడఁగాను
అది యాల పరవశమందేవు

రేకు: 0533-3 మంగళకౌశిక సం: 13-133

పల్లవి: ఎక్కడౌతా నెఱుఁగవు యేమయ్యా
దిక్కరించనోపము తెర వేసే మయ్యా

చ. 1: చెక్కులఁ జెమట నిండె చెలియ తురుము వీడె
యిక్కువలంటి పెనఁగే వెందాఁకనయ్యా
చొక్కపు నీసతులెల్లాఁ జూచి కడు నవ్వేరు
తెక్కుల నీ కూటమికిఁ దెర వేసే నయ్యా

చ. 2: చన్నులు బయటఁబడె జవ్వనమదము రేఁగె
యెన్నేసి నవ్వులు నవ్వే వెందాఁకా నయ్యా
సన్నసేసుకొంటాను సతులెల్లా మూఁగేరు
తిన్నని నీ సిగ్గు మూయఁ దెర వేసే నయ్యా

చ. 3: మొలనూలు జారెను ముందే పోఁకముడి వీడె
యెలమిఁ గూడితి వాసలెందాఁకా నయ్యా
వలచి శ్రీవేంకటేశ వనితలు మెచ్చేరు
తెలిసితి మీ మనసు తెర వేసే నయ్యా

రేకు: 0533-4 మధ్యమావతి సం: 13-134

పల్లవి: ఇంత సేతురటవే యిందరిలోన
కాంతుడు సిగ్గువడఁగా కాంతలెల్లా దూరిరి

చ. 1: మచ్చిక నాతఁడు నిన్ను మన్నించిన మన్ననకు
పచ్చిసేతురా మోవి పడఁతి నీవు
కుచ్చి యట్టే తలవంచుకొని యాతఁడుండఁగాను
ఇచ్చకపు చెలులెల్లా నెంతో నిన్నుదూరిరి

చ. 2: చల్లఁగా నాతఁడు నీకు చనవిచ్చినందుకు
వెల్లిగా నలయింతురా వేగినంతాను
బల్లిదుఁడైనాతఁడిట్టే పవ్వళించి వుండఁగాను
తొల్లిటిసతులెల్లాను తొడిఁబడ దూరిరి

చ. 3: అట్టె శ్రీవేంకటేశుఁ డంటి నిన్నేలినందుకు
నెట్టిన బాసగొందురా నీటుతోడను
వొట్టుక నీపంపు సేయుచుండఁగా నితనిఁజూచి
నెట్టుకొన్న మగువలు నిన్నుఁ గడు దూరిరి

రేకు: 0533-5 వరాళి సం: 13-135

పల్లవి: ఇన్నాళ్ళు తానెందుండెనో యేమని చెప్పేము నేము
సన్నలు సేయఁగఁ జూచి చలము మీరేమయ్యా

చ. 1: జలజాక్షి నీతోను సారె విన్నపాలు సేసీ
యెలమి నీవెంత చనవిచ్చితో కాని
కలకల నవ్వుతాను కందువలు నీకుఁ జూపీ
వెలయ మాకు నేఁడు వెరగయ్యీనయ్యా

చ. 2: కన్నుల కలికి నీకు కానుకలందిచ్చీని
నిన్నా నేఁడే యెంత మన్నించితో కాని
చన్నుల నొరసుతాను సంగడినే కూచుండీ
వన్నెల నిందుకే మాకు వాసి పుట్టీనయ్యా

చ. 3: జవరాలు నీమోవిచవి నీకుఁ జెప్పీని
భువి నేర్పు లెంత నూరి పోసితో కాని
యివల శ్రీవేంకటేశ ఇన్నిటాను నిన్నుఁ గూడె
తవిలి నన్నేలితివి తగవాయనయ్యా

రేకు: 0533-6 కేదారగౌళ సం: 13-136

పల్లవి: అడుగరే యాతనినే అంగనలాలా
గుడిగొని తానే వట్టి గొరబాయఁ గాక

చ. 1: యెదురాడేదాననా యెంతటి పనికినైనా
పదరి తానే మారు పలికీఁ గాక
తుద మీఱేదాననా దూరై యంత దిరిగినా
మదమునఁ దానే మారుమలసీఁ గాక

చ. 2: కక్కసించేదాననా కడలెంత దొక్కినాను
వెక్కసీఁడై తానే యిటు వెలసీఁ గాక
మొక్కలపు దాననా ముందు వెనకెంచితేను
పక్కనఁ దానె ముంచి పంతమాడీఁ గాక

చ. 3: తడఁబడేదాననా తనరతివేళను
బడిబడిఁ దానే చొక్కి భ్రమసీఁగాక
అడిగేటిదాననా అందరిలో నన్నుఁ గూడి
అడరి శ్రీవేంకటేశుఁడాదరించీఁ గాక

రేకు: 0534-1 అమరసింధు సం: 13-137

పల్లవి: కాంతల నెన్నడుముల కఱవు దీర
దొంతిమోవిబోనాల జాతుర సేయవయ్యా

చ. 1: చిత్తడిచెమటివాన చెక్కులవెంటాఁ గురిసె
యెత్తిన మదములను యేరులు వారె
గుత్తపు గుబ్బల పెద్దకొండలకు గండి గట్టి
బత్తితోడ వలపుల పైరుసేయవయ్యా

చ. 2: పులకల ససులు గొబ్బున మైనిండా మొలచె
యెలమిఁ దమకముల యెన్నులు వెళ్ళె
కలికిజవ్వనముల కళ్ళముసేసి నురిపె
కొలపుల బోగాలఁ గోరు గొనవయ్యా

చ. 3: అంగజరాజ్యపదవి కామనికాలము వచ్చె
పొంగి రతులు పోఁకకుఁ బుట్టెఁడాయను
యింగితపు శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
సంగతిగా మోహనరాజ్యము లేలవయ్యా

రేకు: 0534-2 భైరవి సం: 13-138

పల్లవి: ఇంకనైనా వేడుకో నీ ఇంతిని నీవు
సంకె దేరుతురు గాక సాము సేతురా

చ. 1: చేరి చన్నులంటఁగాను సిగ్గువడ్డ యాఁటదాని
గారవించవలెఁ గాక గద్దింతురా
తేరకొనఁ జూడఁగాను తెరవేసుకొన్నదాని
సారె బుజ్జగింతు గాక సాదింతురా

చ. 2: కొప్పు వట్టి తియ్యఁగాను కొంకినట్టి యాఁటదాని
దప్పి దేరుతురు గాక తమకింతురా
ముప్పిరిఁ జెనకఁగాను మొక్కుచున్నయట్టిదాని
దుప్పటి గప్పుటగాక దొమ్మి సేతురా

చ. 3: కైవసమై కూడఁగాను కడుఁ జొక్కినాఁటదాని
మోవి యానుదురుగాక మొక్కింతురా
శ్రీవేంకటేశుఁడ వదే చెలి యలమేల్మంగ
దేవులౌటెంచేది కాక కాపరింతురా

రేకు: 0534-3 పాడి సం: 13-139

పల్లవి: ఆతనిచెలిని నా కేమనరాదు
కాతరించ నేఁటికి నుంగరమందుకొనవే

చ. 1: సిగ్గువడ నేమిటికి చెలువుఁడు కాఁగిలించె
వొగ్గి యింక నాతనితో నొనగూడవే
నిగ్గుల నామోము చూచి నీవేల నవ్వేవే
వెగ్గళించకాతఁడిచ్చే వీడెమందుకొనవే

చ. 2: పల్లదము లేమిటికే పచ్చడము గప్పెఁ బతి
చల్లఁగాఁ జెప్పినట్ల సమ్మతించవే
వొల్లనె నాకొంగువట్టి వొద్దికేల తీసేవు
బల్లిదుఁడాతని నిమ్మపండందుకొనవే

చ. 3: శిరసు వంచనేఁటికి శ్రీవేంకటేశుఁడు గూడె
తెరవేసుకొనె లోలోఁ దిరముగావే
గరిమ నలమేలుమంగవు నన్నెంత మెచ్చేవు
పొరిఁబొరి నాతని పువ్వులందుకొనవే

రేకు: 0534-4 తెలుఁగుఁగాంభోధి సం: 13-140

పల్లవి: విరతాపము మాన్పవే నీవు
సిరులతోడుత సేవసేసే నేను

చ. 1: తలపోసి తనలోనే తమకమందీఁ జెలి
పిలిచి తేఁగదవే ప్రియుని నీవు
చెలపచెమటలివే చెక్కులనే వడిసీని
వెలయ సురటిఁ గొని విసరే నేను

చ. 2: యెదురుచూపులనే యింతి పరాకై వున్నది
కదియించఁ గదవే కాంతునిని
పొదలుఁ దాపపువేఁడి పొరిఁబొరి ముంచీని
సదరానఁ బన్నీరు చల్లే నేను

చ. 3: కూడేటి రతివేడుక కొమ్మ పులకించె నిదే
యీడనే శ్రీవేంకటేశు నెచ్చరించవే
వోడక యీగోవిందుఁడే వొడయఁడై యీకె నేలె
జోడై నీవలెనే కాచుకవుండే నేను

రేకు: 0534-5 పూర్వగౌళ సం: 15-141

పల్లవి: నలువంక సతులెల్ల నవ్వేరాతని
యెలమి నింతేసి బాయిట వేయఁదగునా

చ. 1: ఘనుఁడైన మగవానిఁ గాంతలెంత వలచిన
చెనకి కడుఁ బచ్చిగఁ జేయఁదగునా
పెనఁగుచు నాతఁడు తప్పించుకొనఁగానే నీవు
కనుపట్ట మోవిమీఁద గంటి సేయఁదగునా

చ. 2: దొరతనపు విభునిఁ దొయ్యలులెంత మీఱిన
సిరులఁ గొల్వునఁ గాకుసేయఁదగునా
పొరసి యాతఁడు నిన్ను బొమ్మల జంకించఁగానే
తొరలించి సంగడిపొందులు చూపఁదగునా

చ. 3: శ్రీ వేంకటేశ్వరునిఁ జెలులెంతాసోదమైన
సేవ సేసి సిగ్గువడఁ జేయఁదగునా
యీవల నాతఁడు నిన్ను నెనసి మెప్పించఁగానే
ఆవటపు రతులను అలయించఁదగునా

రేకు: 0534-6 బౌళి సం: 13-142

పల్లవి: సిగ్గువడి మూల నేమిసేసేవు నీవు
అగ్గమైన నాయకుని అండకు రాఁగదవే

చ. 1: తలపోసి తలపోసి తమకించి నిన్నుఁ బిల్చు
చెలి వూడిగముదని చింతింపఁడు
చిలుకవలికితే నీయెలుగంటా మాటాడు
వలచిన రమణునివద్దికి రాఁగదవే

చ. 2: వుమ్మడి నీనిట్టూర్పని వూరకే దిక్కులు చూచు
యిమ్ములఁ జల్లగాలెని యెరఁగఁడు
నెమ్మి వెన్నెలగాయఁగ నీనవ్వని తానూ నవ్వీ
రమ్మనవలెనా పతి రతికి రాఁగదవే

చ. 3: పదరుచు లేచి నీపంజని యెదురేఁగు
ఉదయచందురుఁడని వూహించఁడు
యిదివో శ్రీవేంకటేశుఁ డింత సేసి నిన్నుఁ గూడె
యెద వెట్టుకోవలెనా యెప్పుడు రాఁగదవే

రేకు: 0535-1 శుద్ధవసంతం సం: 13-143

పల్లవి: ఏల కై కొనేవు నీవు యెవ్వరినిఁ దలఁచేవు
జాలిఁబెట్టే యాపెపొందు చవులాయను

చ. 1: వాలుక చూపులు నీపై వంచెఁ జెలి యవి నీకు
గాలములై నీ చిత్తము కడుఁ దగిలె
నాలిమాటలెల్ల నీతో నానవేసి యాడఁగాను
అలరి నాములై నీకు నన్ను వట్టెను

చ. 2: పరగ సిగ్గులు నీపై నిట్టే వేయఁగాను
సిరుల వలపులెల్లఁ జిమ్మి రేఁగెను
పురికొలిపే నవ్వులు పొంచిపొంచి నవ్వఁగాను
తరితీపులై నిన్ను మరిగించెను

చ. 3: సందునుడి నీకాపె సన్నలటు చూపఁగాను
విందులై నోరూరఁజేసె వేడుక నీకు
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నిన్నుఁ గూడఁగ
అంది నన్ను నేలించి ఆసలు వుట్టించెను

రేకు: 0535-2 పాడి సం: 13-144

పల్లవి: కానీవే యెందు పొయ్యేము కందము తననేమము
తానే పంతములు పొఁతరఁబెట్టకుండీనా

చ. 1: పిలిచితే రాఁ డట్టే బిగిసీ నీపాటి వాఁడు
చెలఁగి మనసు రాయి సేయకుండీనా
సెలవుల నగినాను చేరి అది యేలనఁడు
తెలిసి వూవుటమ్ములు తెగఁ గోయకుండీనా

చ. 2: కానుకిచ్చితే నొల్లఁడు కపటమంత గలితే
దీనకాన వలపు ముద్రించకుండీనా
వీనులలర నే విన్నవించినాను వూఁకొనఁడు
మానినుల జవ్వనాలు మాన్పకుండీనా

చ. 3: కదిసితేఁ బైకొనఁడు కాఁకలింత సేసేవాఁడు
కదలించి మరు నుట్టిఁగట్టకుండీనా
ఇదివో శ్రీవేంకటేశుఁ డెనసితే మన్నించె
పెదవితేనె చక్కెరబిల్ల సేయకుండీనా

రేకు: 0535-3 దేసాళం సం: 13-145

పల్లవి: ఏమిచేసినాఁ జెల్లు నీకాలము
నాములువార సెలవి నవ్వు నవ్వవే

చ. 1: సందడిలోపల నీవు సన్నచేసేవు పతికి
కుందనేల నీవూ నండఁ గూచుండవే
యెందరికైనా నోపు నితఁడు నీకోపఁడా
విందువలె చేతికి నీ విడెమియ్యవే

చ. 2: పొలసి యెచ్చరికెగా పూవుల వేసేవాతని
చలపట్టి నీవు సరసములాడవే
నెలకొన్నాసోదకాఁడు నిన్ను మానీనా యాతఁడు
కలికితనాల నట్టే కాఁగిలించవే

చ. 3: కమ్మటిఁ గమ్మటి వచ్చి కానుకిచ్చే వితనికి
వుమ్మడినీ చన్నులను వొరయఁగదే
యెమ్మె నితఁడే శ్రీవేంకటేశుఁడు నన్నూ నిన్నేలె
సమ్మతించి మోవి యట్టే చవిగొనవే

రేకు: 0535-4 కాంబోది సం: 13-146

పల్లవి: పొంచి మొకమిచ్చులకు పొద్దు గడుపేవు గాక
పంచల చిత్తాన నీకుఁ బట్టఁబోయీనా

చ. 1: కూరిమొకచో నుండఁగ కొచ్చి యెంత మాటాడిన
సారెకుఁ బరాకే కాక చవి వుట్టీనా
గారవించెప్పటనుండి కతలెల్లాఁ జెప్పె నీకు
పేరి కుచ్చుందొకటైనా బెరయఁ జెప్పేవా

చ. 2: చూపులొకచో నుండఁగ సొలసెంత పెనఁగిన
దాపులఁ బోరచే కాక తమి వుట్టీనా
యేపున నింతవడాకె యెదుటనే వుండె నీకు
రూపించి యా సింగారమేరుపఱచి చెప్పేవా

చ. 3: మాటలొకచో నుండఁగా మర్మములెంత యంటిన
పాటపాటే కాక బత్తి పాదుకొనీనా
యీటున శ్రీవేంకటేశ యేలితి వాకెను నన్ను
కూటములు తడఁబడకుండాఁ జెప్పేవా

రేకు: 0535-5 శంకరాభరణం సం: 13-147

పల్లవి: విన్నపము లింకనేల వేమారును
అన్నిటాఁ దొల్లే తనకు నాలనైతి ననవే

చ. 1: మొదలనే తనకును మొక్కితి నేననవే
వదలి తురుమందుకే వంగె ననవే
నుదురెల్లఁ జెమరించి పదనాయ ననవే
యెదిటికి వచ్చి నన్ను నిట్టేయేలుమనవే

చ. 2: యిన్నిటాఁ దనకుఁ బంత మిచ్చితి నేననవే
చన్నులపై పయ్యదట్టే జారె ననవే
వున్నవి తనముద్రలు వురముపై ననవే
సన్నలనే తనమోవి చవిచూపు మనవే

చ. 3: తనమాఁటలకు లోనై దక్కితి నేననవే
వొనరెఁ బులకలు నావొళ్ళ ననవే
యెనసె శ్రీవేంకటేశుఁ డిదె తానే యనవే
నను నిట్టే మన్నించె నవ్వుమింక ననవే

రేకు: 0535-6 శ్రీరాగం సం: 13-148

పల్లవి: ఎంత భాగ్యవంతుఁడవో యిదివో నీవు
వింత వింత సుద్దులెల్ల వినిపించీ నాపె

చ. 1: సొలసి సొలసి చూచి చొక్కంచీ నిన్ననదే
కలువరేకు లవంటి కన్నులయాకె
పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు చెప్పీనదే
మొలకనవ్వులతోడి మోవియాకె

చ. 2: తగిలి తగిలి నీతోఁ దప్పక మాఁటాడీ నదే
జిగినద్దములవంటి చెక్కులయాపె
పొగడి పొగడి నీతో పొందులు సేసీ నదే
వెగటుఁ జంద్రకళల మొగముదాపె

చ. 3: కమ్మరఁ గమ్మర నిన్నుఁ గాఁగిటఁ గూడీ నదే
కుమ్మరింపుఁ గులుకుల కుచములాపె
యిమ్ముల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
సమ్మతించె జవ్వనపు చక్కనియాపె

రేకు:	0536-1 గౌళ	సం:	13-149

పల్లవి:	ఏల సిగ్గువడేవు నీ విందరుఁ జూచేరంటా
మేలు నీకు గలిగితే మేకొనఁగ రాదా

చ. 1:	సొలసి సొలసి యాకె చుట్టిరికేలు చెప్పఁగ
చెలరేఁగి విని నీవు చెమరించేవు
కలయ వేడుక నీకుఁ గలిగితేఁ గన కిట్టే
బులియక లోనికేఁగి భోగించరాదా

చ. 2:	వద్దనుండి యప్పటి నీవాపులెల్లఁ దెలుపఁగ
కద్దనుచు సమ్మతించి కళ రేఁగేవు
పొద్దున నీకింతేసి పొందు సేయ వలసితే
పెద్దరికాలెందాఁకాను బెరయఁగ రాదా

చ. 3:	కూడినట్టి పొంతనాలు కొంకక తాఁ జెప్పఁగాను
యీడనే కాఁగిట నించి యిటు మెచ్చేవు
వోడక శ్రీవేంకటేశ వొనగూడితివి నన్ను
వీడరాదాపెను యిట్టే వెలయించ రాదా

రేకు: 0536-2 ముఖారి సం: 13-150

పల్లవి: ఎఱఁగవా ఆఁడుఁదగ వింతిరో నీవు
తఱవాతి పనులకుఁ దమకించవే

చ. 1: కొనగోర నూఁదితేనే కోపగించుకొనకువే
చనవులు చేసుకొని సమ్మతించవే
మనసు చూచీనింతే మచ్చరించవలదే
ననుపున సెలవుల నవ్వు నవ్వవే

చ. 2: గుబ్బచన్నులంటితేను గొణఁగి తిట్టకువే
అబ్బురము చేసుకొని ఆదరించవే
వుబ్బులు రేఁచీనింతే వొరటు చూపకువే
నిబ్బరాన వీడెమిచ్చి నేరుపు మెఱయవే

చ. 3: చెక్కు నొక్కి కూడితేను సిగ్గులు వడకువే
మిక్కిలి నీ తల యెత్తి మెచ్చు మెచ్చవే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డేలె నింత వీఁగకువే
చొక్కించి దప్పులు దేర్చి జోడు వాయకువే

రేకు: 0536-3 ఆహిరి సం: 13-151

పల్లవి: ఇతివే యేలికెసాని వందరికిని
నీతితో సవతులెల్ల నీకు లోనే యిఁకను

చ. 1: ఆరసి నీ కాతఁడు అరవడమచ్చునే
పేరురాన నేపొద్దూఁ బెట్టుకున్నాఁడు
సారెకు నీవు మంచి సకినాన వచ్చితివే
యీరాని చనవులెల్లా నిచ్చినాఁడు నీకు

చ. 2: పొందుల నీకాతనికి పొంతనాలు గూడునే
మందలించి నీవాడినమాట దోయఁడు
యెందును నీమొకమాయ మందు యెటువంటిదే
కందువ నీ మోవికే కాచుకున్నాఁ డిపుడు

చ. 3: చెలఁగి మంచివేళనే సేస నీవు వెట్టితివే
కలసి పాయఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
అలరి మమ్మేలెనాతఁ డప్పణ నీవిచ్చితివే
వలపించ నేరుతువే వసమాయ నతఁడు

రేకు: 0536-4 ముఖారి సం: 13-152

పల్లవి: ఎంత చెప్పినా మానఁడు యెగ్గులు వట్టీఁ దాను
వింతలు సేయక మీరు విన్నవించరే

చ. 1: కొప్పు వట్టి తియ్యఁగాను కొసరి తిట్టఁగరాదా
అప్పటి నవ్వఁగఁ జేత నంటరాదా
కుప్పించి పెనఁగఁగాను కొనగోరు మోపరాదా
చెప్పరే యీతగవులు చెలులాల మాకు

చ. 2: వొక్కటొక్కటే యాడఁగ వొట్టు వెట్టఁగరాదా
తొక్కరాఁగా మారుకొని దొబ్బరాదా
వెక్కసాన నడవఁగా విరుల వేయఁగరాదా
నిక్క మేది కల్ల యేది నెలఁతలు చెప్పరే

చ. 3: గుంపించి వొరయరాఁగా కుచముల నొత్తరాదా
సొంపున నెమ్మె సేయఁగా సొలయరాదా
యింపుల శ్రీ వేంకటేశుఁడింత సేసి నన్నుఁగూడె
జంపుసేయక చెప్పరే సతులు మాకిపుడు

రేకు: 0536-5 నీలాంబరి సం: 13-153

పల్లవి: నవ్వవే యెక్కడిసుద్ది నయముగా నతనితో
రవ్వలు చేసుకొంటేను రాఁపుకెక్కదా

చ. 1: సరసములాడఁగానే చనవులెల్లఁ బుట్టుఁ గాక
యెరవులు చేసుకొంటే నెనసుండునా
మరిగి వుండఁగానే మనసులెనసుఁ గాక
వొరటులు చూపితేను వొడఁబాటు గలదా

చ. 2: ఇచ్చకాలు సేయఁగానే ఇంపులు రేఁగుఁగాక
మచ్చరానఁ బెనఁగితే మట్టుపడునా
మచ్చికలు చూపఁగానే మర్మములు సోఁకుఁగాక
పచ్చిగాఁ గాఁతాళించితే భావాలు గరఁగునా

చ. 3: చుట్టరికాన మించితే సులభమౌఁగాక మేలు
అట్టులు చేసుకొంటే మఱఁగుసేయవచ్చునా
ఇట్టే శ్రీవేంకటేశుఁ డెనసెఁ దానే నిన్ను
గుట్టులు చూపకుండితే కొంకు దేరునా

రేకు: 0536-6 పాడి సం: 13-154

పల్లవి: కల్లరి వౌనసరాదు కాదనరాదు
చెల్లు నీవు సేసినట్టి చేఁతలెల్లా నిపుడు

చ. 1: తలఁపులో నొకటియు తనువుపై నొకటియు
కలదెల్ల నీ వల్లఁ గంటిమి నేఁడు
నలువంక సన్నలును నామీఁది మన్ననలు
పలుమారు నిందరిలోఁ బచ్చిదేరే నిపుడు

చ. 2: చెప్పేటి దొకటియు సేసేటిదొకటియు
దెప్పరాన నీ సుద్దులు తెలిసితిమి
తప్పుఁబేరి పిలుపులు తగ నాపై వలపులు
విప్పుగా నీవోజ వెల్లావిరులాయ నిపుడు

చ. 3: కొలువులో నొకటియుఁ గూటమిలో నొకటియు
యెలమి నీగుణమెల్లా నెరిఁగితిమి
అలమేలుమంగను నేనని శ్రీవేంకటేశుఁడ
కలసితి నీవలపు గట్టియాయ నిపుడు

రేకు: 0537-1 రామక్రియ సం: 13-155

పల్లవి: ఎవ్వరినైనా మన్నించి యింత సేసుకొంటివి
జవ్వనపాయ మింత సడిఁ బెట్టీని

చ. 1: చెంగట నీవు నాపై చేతులు చాఁచితి వంటా
అంగడిఁ బెట్టి నావలపులాడీ నాకె
వుంగరాలు నాకు నిచ్చి వొడఁబరచితివంటా
జంగిలిసవతులకు సరి నెచ్చరించీని

చ. 2: ముచ్చటలాడి నాకు మోవి చూపితివంటా
పచ్చిసేసి నన్ను సిగ్గువఱచీ నాపె
మెచ్చి నీకంటసరి నామెడఁ బెట్టితివంటా
చెచ్చెరఁ దోడి వారికిఁ జెప్పి చూపీని

చ. 3: లాలించి నన్నుఁ గూడి పల్లకి యెక్కితివంటా
పాలుపడి నన్ననే వుప్పతించీ నాపె
యేలితి నన్ను శ్రీవేంకటేశ యలమేల్మంగను
పోలిమి నందరెరఁగఁ బొగడి చూపీని

రేకు: 0537-2 నారాయణి సం: 13-156

పల్లవి: సతికినిఁ బతికిని చలములేల
రతివేడుకలనే రమించుట గాక

చ. 1: బింకములే తఱచైతే ప్రియములేరీతి మించు
జంకెనలెక్కుడైతేను శాంతములేవి
మంకులే మెరసితే మర్మములెట్టు గరఁగు
లంకెలై వొకరొకరు లాలించుట గాక

చ. 2: నాలితనము నేర్చితే ననుపులెక్కడ నుండు
తూలపోవ నాడితే సంతోసమేడది
కేలనే వొడ్డు కొంటేను క్రియలెట్టు సమకూరు
తాలిమితో నవ్వులను దైవారుటగాక

చ. 3: యెమ్మెలే మిక్కుటమైతే యియ్యకోలెట్ల నౌను
దొమ్ములే నెరపితే పొందులెట్లు గల్గు
కొమ్మ నిన్నలమేల్మంగ కూడె శ్రీవేంకటేశుఁడ
వుమ్మడి సరముల నోలాడుట గాక

రేకు: 0537-3 బౌళి సం: 13-157

పల్లవి: అడుగరే యీమాట ఆతనిని
తడవఁడు తాఁకఁడు తనునెట్టు నమ్మేదే

చ. 1: వలుపే కలిగితే వాడికెకు రావలదా
తలఁపునఁ దగిలితే తమకించఁడా
కలవుకోలైతేను కరుణించఁ దగదా
పిలిపించుకొనీఁ దాను ప్రియమెట్టు నమ్మేదే

చ. 2: చేతికి లోనైతేను చెప్పించుకొనునా
కాతరమే కలిగితే కై కొనఁడా
యీతల వేడుకైతే నింట నిట్టే వుండఁడా
భీతి యించుకంతా లేదు ప్రియమెట్టు నమ్మేదే

చ. 3: చెప్పినట్టు సేసితేను సెలవుల నవ్వునా
చిప్పిలఁ గరఁగితేను సిగ్గువడునా
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
పిప్పిగా నింతగాకున్న ప్రియమెట్టు నమ్మేదే

రేకు: 0537-4 దేవగాంధారి సం: 13-158

పల్లవి: ఇంతులెల్లా విని యింక నేమందురు
కాంతుఁడవు ఇటువంటి కాకు గలదా

చ. 1: అగ్గమై నీవు నా వొద్ద నాపెచన్నులంటఁగాను
సిగ్గువడి వున్నదాన చెక్కుచేతితో
యెగ్గెరఁగకొక్కపారే యిద్దరిఁ గూడవచ్చేవు
కగ్గుదేర నిటువంటి కాకుగలదా

చ. 2: పొరి నేఁ జూడఁగా నాపె పోఁకముడి జారించఁగా
శిరసు వంచుకుందాన చెక్కుచేతితో
సరుస సిబ్బితి లేక జంట రతి సేసేవు
గరిమెల నిటువంటి కాకు గలదా

చ. 3: వుమ్మడి నాకె నీవు నావొద్దనే కూడఁగాను
చిమ్మిరేఁగి వున్నదాన చెక్కుచేతితో
యెమ్మెతో శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
కమ్మరఁ గమ్మర నింత కాకు గలదా

రేకు: 0537-5 దేశాక్షి సం: 13-159

పల్లవి: రమ్మనవే యింకనేల రతికెక్కఁ దానిట్టే
దొమ్మిచేసి నేనిందుకు దూరవచ్చేనా

చ. 1: పంతమాడి నిజములు పచరించ వచ్చీని
యెంత లేదు తనసుద్దు లెఱుఁగమటే
వింతదాననా నేను విభుఁడు తా నెట్టుండినా
రంతుచేసి నేనిప్పుడే రచ్చఁ బెట్టేనా

చ. 2: పలుమారు వూరకైనా బాసలు సేయ వచ్చీని
చలపట్టి తనునింక సాదించేనా
వెలయాలనా యేమి విటుఁడు దానెట్టుండినా
బలిమిచేసి భంగపఱచ వచ్చేనా

చ. 3: వోడక కాఁగిటఁ గూడి వొడఁబరచ వచ్చీని
యేడ నుంటివని తప్పులెంచ వచ్చేనా
వేడుక కత్తెనా శ్రీవేంకటేశుఁ డెట్టుండినా
వీడెమందుకొంటి నింక విరసమాడేనా

రేకు: 0537-6 సామంతం సం: 13-160

పల్లవి: చెలులమెఱంగము చెప్పరయా
నెలకొని తమకము నిండెనొ మీకు

చ. 1: సెలవుల నగవులు చిమ్మిరేఁగెనవె
తలఁపులెపుడు సరిదాఁకునొకో
చెలవల చెమటలు చెక్కుల వడిసీ
కలగొని వలపులు కరఁగెనొ మీకు

చ. 2: సంపదపులకలు జడిసీ మేనుల
యింపుల లోలో నెసగెనొకో
ముంపుల వూర్పులు ముక్కుల విసరీ
పెంపుల మేనులు పెరిగెనో మీకు

చ. 3: నిరతపుఁ గళలవె నిగిడీ మొగముల
గరిమఁ గూటములు గలసె నొకో
యిరవుగ శ్రీవేంకటేశ యలసితిరి
సురతముల మతులు చొక్కెనొ మీకు

రేకు: 0538-1 సామంతం సం: 13-161

పల్లవి: తేవయ్య విడెమిఁక తెగువేఁటికి
వోవరిలోపలనే వొడఁబాటులాయను

చ. 1: బింకములాడినవెల్ల ప్రియము చెప్పినపుడే
సంకెలేక అన్నియునుఁ జక్కనాయను
మంకున నలిగినది మాటాడినంతలోనే
వుంకువతోడ మనసు వొక్కటాయను

చ. 2: చేతులు చాఁచినవెల్ల చేరి మొక్కినపుడే
నీతితోడఁ గోరికలు నెరవాయను
ఘాతల జంకించినవి కన్నుల నవ్వినపుడే
పోతరించి పాయరాని పొందులాయను

చ. 3: కరికరించినవెల్ల కాఁగిలించనపుడే
సరికి బేసికి లోలో జంటలాయను
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
విరసములెల్లఁ బాసి వేడుకాయను

రేకు: 0538-2 సాళంగనాట సం: 13-162

పల్లవి: ఔదువయ్యా జాణవు అన్నిటా నీవు
పొదితోఁ దమి రేఁగిన పొలుపా ఇది

చ. 1: పచ్చిమాటలాడేవు పైకొని కొలువులోన
పెచ్చుసతులఁ బొందినపెరిమా యిది
లచ్చనలు వెట్టేవు లావుగా సతులమీఁద
తచ్చి రట్టిడివయిన తగవా యిది

చ. 2: యేడనుండో వచ్చి నేఁడు యిందరితోడ నవ్వేవు
వేడుకకాఁడవైన విధమాయిది
వోడక చాఁచేవు చేతులూరకే శిరములపై
వీడెపు చొక్కులతోడి వింతా యిది

చ. 3: పొలసి నిలువుననే పోఁకముడి జారించేవు
వలపులు సందడించే వరుసా యిది
యిలలో శ్రీవేంకటేశ యేలితివి మమ్మునిట్టే
మెలుపుకాఁతాళవు మేకా యిది

రేకు: 0538-3 దేవగాంధారి సం: 13-163

పల్లవి: ధర్మముఁ బుణ్యము తనచేతిదే యిఁక
మర్మములవి తనమనసే యెఱుఁగు

చ. 1: శిరసునఁ బెట్టిన సేసవలుండఁగా
పరిపరి విధముల బాసలునా
సరిగానేమని జరసే నే నింక
ధర మీఁదిపనులు తానే యెఱుఁగు

చ. 2: వొడఁబడి యిచ్చిన వుంగరమిదిగో
బెడిదముగా యిఁకఁ బిలుపులునా
బడిబడి నిటు చలపట్టనేల యిఁక
తడవేటిసుద్దులు తానే యెఱుఁగు

చ. 3: కలసిన కాఁగిటి కందువలున్నవి
పలుమారుఁ బెనఁగు బలములునా
చెలి ననుఁగూడెను శ్రీవేంకటేశుఁడు
తలపించవె యిటు తానేయెఱుఁగు

రేకు: 0538-4 రామక్రియ సం: 13-164

పల్లవి: కంటిరా యీతనిజాడ కాంతలాల
యింటిలోననే వుండి యెంతసేసీ నితఁడు

చ. 1: బీరాన నాసవతితో బెట్టిమాటలాడి నేఁడు
కారించీని వరుస గాదంటాను
తారుకాణఁ జెలులను తగవు నే మడిగితే
సారె నెరిఁదేల పచ్చి సాక్షిచెప్పీ నితఁడు

చ. 2: అట్టడి యాపెతోఁ బతి ఆకట్టువుంగరము
యెట్టు దీసితని తప్పులెంచుకొంటాను
గట్టిగా మాలో నేమౌఁగాములు దెలుసుకొంటే
బట్టబయలు తానేల బాససేసీ నితఁడు

చ. 3: అడరి దయదలఁచి యాపెనుఁ గాఁగిటఁ గూర్చి
వొడఁబడఁ దనునేఁ గూడొద్దికైతేను
చిడుముడితో నవ్వి శ్రీవేంకటేశ్వరుఁడు
నడుమఁ దానేమిటికి నన్ను మెచ్చీ నితఁడు

రేకు: 0538-5 నట్టినారాయణి సం: 13-165

పల్లవి: కల్లగాదు నీవు మాకుఁ గలితేఁ జాలు
తొల్లిటి ఇంతినే యింకాఁ దోడుక వచ్చేను

చ. 1: తగిలి నీవెదుటను తలవంచుకుండఁగాను
నగితేను మొగమెత్తి నన్నుఁ జూచేవు
మగువ నెవ్వతె నీవు మనసునఁ దలఁచేవో
బెగడకావతీవయ్య పిలిచి తెచ్చేను

చ. 2: యెక్కడికో నీ విప్పుడెదురులు చూడఁగాను
మొక్కితే వేఁడుకొని నా చెక్కునొక్కేవు
అక్కడ నెవ్వతెమీఁది ఆస నీకు నున్నదో
తక్కకానతీవయ్య దండకుఁ దెచ్చేను

చ. 3: యెందుకో నీపాయము మీఁదెత్తుకొని వుండఁగాను
అంది నిన్నుఁ గూడితే నన్నాదరించేవు
ముందు శ్రీవేంకటేశ నీ మోహమెందు నుండునో
యిందే ఆనతీవయ్యా యింటికిఁ దెచ్చేను

రేకు: 0538-6 సామంతం సం: 13-166

పల్లవి: కడుఁ గోమలమగు కాంత యిది
అడియాలపు ముద మందించరాదా

చ. 1: మొక్కులు మొక్కుచు మోము చూడఁగా
వుక్కుగోర నటు వూఁదితివి
యిక్కడ సతి మతి నేమని వున్నదొ
చక్కఁగ నూరడించఁగరాదా

చ. 2: కలకల నవ్వుచు కానుకియ్యఁగా
బలిమిఁ బెనఁగి యటు పదరితివి
అలసి యెంత తురుమదవద లాయనొ
మలసి లాలింపుచు మన్నించరాదా

చ. 3: సేవలు సేయుచు చిడుముడి పడఁగా
కావిరిఁ గాఁగిటఁ గలసితివి
శ్రీవేంకటేశ్వర సిగ్గెటులుండెనొ
యీ విధముల నిటు యీడేర్చరాదా

రేకు: 0539-1 సాళంగనాట సం: 13-167

పల్లవి: పట్టిరాని వయసుల పంతగాఁడవు
బట్టబయలు సిగ్గులు పందేలా యేమి

చ. 1: పువిదమాటలకే వొడ్డుకొనే వింతలోనే
అవి చెఱకుసింగిణి యంపగములా
తవిలి నవ్వితే నేల తల దీసుకొనేవు
వివరింప వెన్నెలల వేఁడులా యేమి

చ. 2: వెలఁది చూపులకేల వీఁగేవంతటిలోనే
మెలుపున నవే తుమ్మిదపౌఁజులా
కొలఁదిసరసముల గోరులకేల లోఁగేవు
ములువాఁడి చేకత్తుల మొనలా యేమి

చ. 3: అంగనరతులకేల అలసే వింతటిలోనే
సంగతి మరుగరిడిసాములా యవి
రంగుగ శ్రీవేంకటేశ రమణిఁ గూడితివిట్టే
పంగించని సంసార ఫలమా యేమి

రేకు: 0539-2 శంకరాభరణం సం: 13-168

పల్లవి: కొలువై వున్నాఁడు వీఁడె గోవిందరాజు
కొలకొలనేఁగి వచ్చె గోవిందరాజు

చ. 1: గొడుగుల నీడల గోవిందరాజు
గుడిగొన్న పడగెల గోవిందరాజు
కుడియడమ కాంతల గోవిందరాజు
కొడిసాగే పవుఁజుల గోవిందరాజు

చ. 2: గొప్పగొప్ప పూదండల గోవిందరాజు
గుప్పేటి వింజామరల గోవిందరాజు
కొప్పుపై చుంగులతోడి గోవిందరాజు
కుప్పికటారముతోడి గోవిందరాజు

చ. 3: గొరబుసింగారాల గోవిందరాజు
కురులు దువ్వించుకొని గోవిందరాజు
తిరుపతిలోనను తిరమై శ్రీవేంకటాద్రిఁ
గురిసీ వరములెల్ల గోవిందరాజు

రేకు: 0539-3 నాదరామక్రియ సం: 13-169

పల్లవి: చిత్తమురా నాతనికి చేత మొక్కవే
బత్తిసేయఁగా పంతము పచరించఁ దగునా

చ. 1: చెలువుఁడు మాటలాడీ చెక్కుచేయి దియ్యఁగదే
యెలమి నీతలపోఁతలిఁక నేఁటికే
కలదెల్లా నీవితనిఁ గన్నదాఁకానే కాక
తొలుతటి సుద్దులిఁకఁ దొరలించఁ దగునా

చ. 2: తానే యాతఁడు నవ్వీని తప్పక చూడఁగదవే
మానవే వట్టిచింతలు మరి యేఁటికే
పూనిక లివన్నియును పొందినదాఁకానే కాక
కేనములు తొల్లిటివి కెరలించఁ దగునా

చ. 3: శ్రీవేంకటేశుఁడు గూడె సేవలు సేయఁగదవే
యేవియుఁ దడవనేల యెట్టయెదుట
భావములోపలి గుట్టు పైకొన్నదాఁకానే కాక
కైవసమైతివి యిఁకఁ గాదనఁగఁ దగునా

రేకు: 0539-4 దేవగాంధారి సం: 13-170

పల్లవి: నాతొ నేఁటికి నాటకము
ఘాతలనే నినుఁ గాదనేనా

చ. 1: లలనకు నీమోవి లంచమియ్యఁగా
పలికీ నిచ్చలు పలుమారు
పలు నీసుద్దులు పరుల నడుగుమా
తెలిపేరందరు తెల్లమిగాను

చ. 2: మగువచన్నుఁగవ మరి నీవంటఁగ
మొగమోటములే మొంచీనిదే
అగు నీసేతలు అందరి నడుగుమా
తగవైనట్లనె తలఁపించేరు

చ. 3: యింతిఁ గాఁగిటను యిటు నీవెనయఁగ
అంతయు నీదిక్కాడీని
యింతలో శ్రీవేంకటేశ నన్నేలితి
వింతటఁ బొగడే రిఁకనందరును

రేకు: 0539-5 శంకరాభరణం సం: 13-171

పల్లవి: ఇంతవాఁడవు గాకున్న యేది దూరతనము
వింతకు తలలూఁచేరు వీదికట్టువారలు

చ. 1: వద్ద నొకతెఁ బెట్టుక వారివీరితో మాటాడే
సుద్దులకే నవ్వేరు సుదతులెల్లా
వుద్దండాలు సేసివచ్చి వొగి సాదువలెనుండే
బుద్దులకే మెచ్చేరు పొరుగులవారలు

చ. 2: వొక్కతెపై నొరగుక వువిదలఁ బిలిచేటి
అక్కరకే వెరగందేరంగడివారు
తక్కరితనాల నుంటే తగ నానలు వెట్టేటి
చిక్కులకే బ్రమసేరు సీమసీమవారలు

చ. 3: మెడ నొకతెఁ గట్టుక మెలఁతలఁ జూచేటి
కడఁకలకే మొక్కేరు కడలవారు
విడువక నన్నేలి శ్రీవేంకటేశ నీవుండేటి
వొడికానకే చెలఁగే రూరూరి వారలు

రేకు: 0539-6 సాళంగనాట సం: 13-172

పల్లవి: కందువ నప్పటనుండి కాచుకున్నాఁడు
విందువలెఁ గాంతునికి విడెమియ్యవే

చ. 1: మనసులెనసితేను మఱఁగులేమిటికి
చనవులు గలితేను సాదింపులేలా
వొనరి యాతఁడు నిన్ను నొడివట్టి తీసీని
అనుమానమేల యిఁక నట్టే సేయవే

చ. 2: మాటలు సమ్మతమైతే మరి జాగులేమిటికే
కూటములొనగూడి తే గుట్టులవేల
యీటుతోడ నాతఁడు నిన్నింపులతోఁ జెనకీని
చాటువగాఁ బెనఁగక సమ్మతించవే

చ. 3: రతులు సరివచ్చితే రవ్వసేయనేమిటికే
తతి నొక్కచో నుండితే తమకమేలా
యితవై శ్రీవేంకటేశుఁడేలి నీతో నవ్వీని
కతల జోలిఁ బెట్టక కాఁగిలించవే

రేకు: 0540-1 మనోహరి సం: 13-173

పల్లవి: ఎఱఁగమి చేసుకొనే విదేమోయినే-
మెఱఁగినపనులే యిన్నియును నోయీ

చ. 1: చిగురుమోవిమీఁదఁ జిప్పిలేటిమాటలు
వెగటు లేకాపెచేత వింటివా వోయి
మొగముచూచితేను మొక్కేటిమొక్కులు
అగడుగాఁ గంటివా అదియును నోయి

చ. 2: కందువతో నీకుఁ జేసే కనుఁగొనసన్నలు
చెంది నీవిప్పుడే చూచితినా వోయి
అందమై సెలవుల నానుకొన్ననవ్వులు
చిందీనవే నీవు తెలిసితివా వోయీ

చ. 3: పొలుపైన రతులలో బొమ్మల జంకెనలవి
కొలఁది మీరఁగ నియ్యకొంటివా వోయి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
కలసి యాపెగుట్టులు కంటివా వోయీ

రేకు: 0540-2 వరాళి సం: 13-174

పల్లవి: రమ్మని పిలువఁగదె రమణునిని
కుమ్మరింపువలపులు గూటఁ బెట్టేవా

చ. 1: పొంతనే యాతఁడు నిన్ను పొదిగి లాలించఁగాను
పంతములాడుకొనేవు పైపై నీవు
యింత గలదానవు యిందరుఁ జూడఁగ నీవు
కంతుని యమ్ములమీఁద గాత చూపేవా

చ. 2: కాయమంటి నిన్నాతఁడు కలయఁగ రాఁగాను
చేయివట్టి దొబ్బేవు చెలఁగి నీవు
నీయంత రాజవైతే నిండుకొన్న మతిలోని
పాయపు మదములనుఁ బాయఁ దోలేవా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నీకుఁ జెంది మోవియ్యఁగ నందు
కావిగురుతులు నించి కాఁతాళించేవు
దేవులవైతే నీవు ద్రిష్టముగఁ గూడిన
కోవరపు రతులతో గుప్పించేవా

రేకు: 0540-3 బౌళి సం: 13-175

పల్లవి: ఇటువలె నుండవద్దా ఇంతుల మన్నించితేను
తటుకన మెచ్చిరి యీతరుణులు నిన్నును

చ. 1: కమ్మరఁ గమ్మర నాపెకతలే చెప్పేవు
బొమ్మల చిత్తరువాపెఁ బోలె ననేవు
పిమ్మటిచెలుల నాపెపేరంటి లాలించేవు
యిమ్ముల నాకెమీఁద నేఁడెంత గద్దో వలపు

చ. 2: నెలకొన్న యాపెమెడ నీవే సింగారించేవు
అలరులాకె కింపైనవే కోరేవు
మలసి యాపెయాడేటి మాటలే నేర్చుకొనేవు
యెలమి నాకెమీఁద నెంతగద్దో వలపు

చ. 3: అడుగులకు మడుగులాపెకిట్టే పరచేవు
యెడయకాపె కాఁగిట నెనశుండేవు
అడరి శ్రీవేంకటేశ అందుకే మమ్మేలితివి
యిడుపుల నాకెమీఁద నెంతగద్దో వలపు

రేకు: 0540-4 సౌరాష్ట్రం సం: 13-176

పల్లవి: విభుఁడవు నీవందుకు వేసరుదురా
సభలోన వలపులు చల్లక విడుతురా

చ. 1: మగవాని యఋతను మారుసతిఁ గంటేను
వెగటుగా సవతులు వెంగెమాడరా
చిగురుఁబెదవిమీఁద చేఁతలేమైనా నుంటే
అగడుసేసి పెనఁగి అలయించకుందురా

చ. 2: వొంటిఁ బొరుగులవారు వూడిగేలు సేయఁగాను
జంటలైన మగువలు సమ్మతింతురా
వెంట వెంట నీమేన వింతసొమ్ములుండితేను
సొంటులు సోదించి మరి చూడకుందురా

చ. 3: ఋట్టిడి వారకాంతలుఋక నిన్ను మెప్పించఁగ
పట్టపుదేవుళ్ళు కదుఁ బంతమాడరా
యిట్టే శ్రీవేంకటేశ యేలితివందరి నేఁడు
దిట్టలైనవారు నిన్నుఁ దెలిసి పొగడరా

రేకు: 0540-5 దేసాళం సం: 13-177

పల్లవి: కొత్తపెండ్లికూఁతురవు కోమలివి కడుఁగడు
పొత్తులకు రమ్మంటేను బులియఁగఁ దగునా

చ. 1: అలరి పతికి నిచ్చలాడనేవలెఁ గాక
చలపాదితనమేల జవరాలికి
పిలిచినప్పుడే వచ్చి పెనఁగఁగవలెఁ గాక
నిలువున గుట్టుతోడ నీటు చూపఁ దగునా

చ. 2: మగనికి వేడుకతో మనసియ్యవలెఁ గాక
జిగురుమంకులవేల చెలియకును
నగినప్పుడే మరి ననుపుఁ గావలెఁ గాక
యెగసక్కెములకును యింత సేయఁ దగునా

చ. 3: శ్రీవేంకటేశు నిట్టే చేరి కూడవలెఁ గాక
కావిరి పంతములేల దేవులకును
యీవేళ నేలె నితఁడు యిది మెచ్చవలెఁ గాక
కోవరముగా నింకాఁ గొసరఁగఁ దగునా

రేకు:	0540-6 శంకరాభరణం	సం:	13-178

పల్లవి: సిగ్గువడుదురా చెవుల వినేమిదె
బగ్గన నూరక పలుకవయ్యా

చ. 1: కలికి నీతోనిదె కతలు చెప్పఁగా
కొలకొలమని వూఁకొనరాదా
తొలఁకి నీ సుద్దులు తొరలివచ్చెనో
సెలవుల నవ్వేవు చెప్పవయ్యా

చ. 2: తరుణి మరియు నదె తగవులు చెప్పఁగ
సరసతతో మెచ్చఁగరాదా
సొరిది నీపైనవి సోఁకి వచ్చెనో
యెరపరమేలానతియ్యవయ్యా

చ. 3: సతి నీకు నిదే చదువులు చెప్పఁగ
మతి నేర్చుక యలమఁగరాదా
యితవుగ శ్రీవేంకటేశ కూడితివి
మతకము నిదో మాఁటాడవయ్యా

రేకు: 0541-1 శంకరాభరణం సం: 13-179

పల్లవి: ఎట్టు దెలుసు మా కింతేసి
దిట్టిలు మీరే తెలుసుకో రాదా

చ. 1: పలుకుల నీనేర్పు పచరించఁగా
కలకల నవ్వీఁ గామిని
అలరుచు మమ్మేమడిగేవు పతివి
తలఁపున నీవే తలఁచుకోరాదా

చ. 2: కప్పుచు నీవు సింగారించుకొనఁగాఁ
దప్పక చూచీఁ దరుణి
వొప్పుగ మమ్మేలొరసేవిటు నీ
చొప్పు నీవె తలఁచుకొనఁగ రాదా

చ. 3: యెనసి నీవు రతియింపులు చల్లఁగ
ఘనముగ మెచ్చీఁ గలికి
చెనకేవు మమ్మేల శ్రీవేంకటేశ్వర
తనియుచు నీవే తలఁచుకోరాదా

రేకు: 0541-2 కన్నడగౌళ సం: 13-180

పల్లవి: ఏమనఁగవచ్చు నిన్ను నిటువంటివానిని
చేముట్టి చెనకుతానే సిగ్గులువడేవు

చ. 1: సేసవెట్టుకున్నాపె చెంగటనే వుండఁగానే
బాస చేసేవు నాకే పతినంటాను
ఆసతో నింటికివచ్చినాపె మోముచూడఁగాను
పోసరించి నీనిజము పొగడుకొనేవు

చ. 2: వుంకువ గొనినయాకె వూడిగాలు సేయఁగాను
లంకెఁ గాఁగలించేవు వలతునంటాను
అంకె నీచేత నుంగరమందుకొన్నాపె నవ్వఁగ
బొంకుచు నీ యాచారము పొగడుకొనేవు

చ. 3: వోరచి వచ్చినయాపె పొత్తులఁ గుడువఁగాను
వారించి మోవిచ్చేవు నావాఁడనంటాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
బోరన నీగుణములు పొగడుకొనేవు

రేకు: 0541-3 రామక్రియ సం: 13-181

పల్లవి: మాకేల అంతలేసి మందెమేళాలు
మేకుసేయనీ నీతో నేమెఁలుతైనను

చ. 1: చెలఁగి నీకు నేను సేవలు సేసేదాన
యెలమి మీఁటు చూపనీ యెవ్వ రైనాను
వలచి నీయంకెకెల్ల వచ్చి యిట్టే వుండేదాన
చలము సాదించనీ యేసతియైనను

చ. 2: మొదలనే పంతమిచ్చి మొక్కులు మొక్కేదాన
యెదుటను బిగియనీ యెవ్వరైనాను
యిదివో నేనెప్పుడును యిచ్చకమాడేదాన
మదించి తిట్టినీ యేమగువైనను

చ. 3: సిగ్గుదేరఁ గూడి నీ చేతికి లోనైనదాన
యెగ్గులువట్టినీ మరి యెవ్వరైనాను
అగ్గమై శ్రీవేంకటేశ అలనై వుండేదాన
వొగ్గి వురమెక్కనీ యేవువిదైనను

రేకు: 0541-4 శుద్ధ దేశి సం: 13-182

పల్లవి: ఇచ్చకములాడరాదా యేమాయను
యిచ్చినబాసలెల్లా నేమాయను

చ. 1: రాతిరి మాఁటలకే రాము యెగ్గులువట్టెను
యీతలఁ బంతమీరాదా యేమాయను
యేతులఁ జూపినందుకే యెదుటఁ దలవంచీని
చేతఁ జెక్కు నొక్కరాదా చెలఁగి యేమాయను

చ. 2: యేకతపునవ్వులకే ఇంతి సిగ్గులనలసె
యేకమై వేఁడుకోరాదా యేమాయను
కాకరిచేఁతలకే కన్నుల జంకించేని
జోకఁ గాఁగిలించరాదా సొంపులనేమాయను

చ. 3: రతులమచ్చికలకే రమణి నివ్వెరఁగందె
యితవులు సేయరాదా యేమాయను
తతితో శ్రీవేంకటేశ తమకించి నన్నుఁ గూడి
చతురత చూపరాదా చల్లఁగా నేమాయను

రేకు: 0541-5 కాంబోది సం: 13-183

పల్లవి: ఏల మఱఁగుననుండే విటు రారాదా
మేలిమి విభుఁడవని మెత్తు నిన్నును

చ. 1: జిగి నీమోవిమీఁదటి చిల్లరచేతలు చూచి
నగుదుఁగాని నిన్నెన్నఁడు దూరను
నిగిడిన నీమేనినిండుఁజెమటలు చూచి
తగునందుఁగాని మరి తమకించను

చ. 2: చెక్కులపై నిండుకొన్న చిన్నిపులకలు చూచి
మొక్కుదుఁగాని కోపమునఁ దిట్టను
అక్కడనుండి వచ్చిన అసురుసురులు చూచి
చొక్కుదుఁగాని నిన్ను సొలశాడను

చ. 3: గుట్టుతో నాకెఁగూడిన గురుతులన్నియుఁ జూచి
యిట్టే పొగడుదుఁగాని యేమీ నన‌ను
ఱట్టై శ్రీవేంకటేశ మీఱఁగ నన్ను నేలితివి
పట్టి పాలారుతుఁగాని పచ్చిసేయను

రేకు: 0541-6 భైరవి సం: 13-184

పల్లవి: పట్టిన చలములేల పతితోడను
అట్టు సేసుకొంటే నాఁటడి గాకుండునా

చ. 1: వంచనతో మొక్కితేనే వాడికెలీడేరుఁ గాక
పొంచి బింకాలు చూపితేఁ బొందుగూడునా
కంచము పొత్తు గాఁగానే కలసుఁగాక మనసు
పెంచిన యెరవులను ప్రియము గలుగునా

చ. 2: సరసములాడఁగానే చనవులెల్ల నిండుఁగాక
తెరమరఁగైతే తరితీపు పుట్టునా
శిరసెత్తి నవ్వఁగానే చింతలెల్ల మానుఁగాక
కరికరి సేసుకొంటే కైవసములౌనా

చ. 3: తప్పక చూడఁగానే తగులాయమౌఁ గాక
రెప్పలు మూసుకొంటే రేఁగునా తమి
యిప్పుడే శ్రీవేంకటేశునెనసితి విటువలె
మెప్పించకున్న నేర్పులు మిక్కిలి మెరసునా

రేకు: 0542-1 భైరవి సం: 13-185

పల్లవి: చందమయ్యీ నన్నియు జాజరకాఁడ
విందులుగా మోవి యిచ్చి వేఁడుకోరాదా

చ. 1: అచ్చముగ చెలి నిన్ను నానవెట్టుమనఁగానే
పచ్చిదేరె నీమాటలు పంతగాఁడా
నిచ్చలు నీవు చేసిన నేరములన్నియుఁ బాయ
కొచ్చి కొచ్చి యిట్టే వేఁడుకొనరాదా

చ. 2: తనమోమప్పటి నిన్నుఁ దప్పక చూడు మంటేనే
కొనకెక్కె నీ సేఁతలు కోడెకాఁడా
తనివొంది నీవలని తప్పులివి వొప్పులుగ
ననుపుగ వేఁడుకొనఁగరాదా

చ. 3: గక్కనను తన్ను ముట్టి కాఁగిలించ మనఁగానే
చిక్కెను నీసుద్దులెల్ల శ్రీవేంకటేశ
చెక్కు నొక్కి కూడితివి చింతలెల్లఁ దీరఁగ
వెక్కసముగా నింక వేఁడుకోరాదా

రేకు: 0542-2 ముఖారి సం: 13-186

పల్లవి: ఇప్పుడే తెలుసుకో నీకెఱఁగ విన్నవించితి
కొప్పువట్టీకె దీసితే గుంపించఁ గలవా

చ. 1: పుత్తడిబొమ్మవలె పూచిన లతికవలె
చిత్తరుపతిమెవలెఁ జెలి యున్నది
మత్తిల్లి యప్పటి నేఁడు మాతో నేమినవ్వేవు
వొత్తుకాపె విలిచితేఁ బోకుండఁగలవా

చ. 2: కొసరుఁగోయిలవలె కొలనితుమ్మిదవలె
పసని చిలుకవలెఁ బలికీనాపె
నసలు సేయుచు నిట్టే నాతో మాటలాడేవు
వొసగితే విడెమాకె వొల్లననఁగలవా

చ. 3: మెత్తినగందమువలె మెడకంటసరివలె
ముత్తెమువలెనే వురమున నుందాకె
హత్తి శ్రీవేంకటేశుఁడ అట్టె నన్నుఁగూడితివి
బత్తి సేసితివాపెతోఁ బంతమాడఁగలవా

రేకు: 0542-3 వరాళి సం: 13-187

పల్లవి: ఏల సిగ్గులువడేరు యిందరుఁ జూచేరంటా
వోలిఁ దెరవేతునా మీకొనగూడె వలపు

చ. 1: శిరసుపై తలఁబాలు చెంపలవెంట జారఁగ
వొరసీఁ జన్నుల నిన్నొద్దికై చెలి
అరమోడ్పుఁగన్నులతో నాకెమీఁద నొరగేవు
తెరవేతునా మీకు తేటపడె వలపు

చ. 2: కట్టినట్టి ముంజేతికంకణము బిగియఁగ
ముట్టి నీతొడఁ బిరుదు మోపీఁ జెలి
అట్టెమతిఁ గరఁగుతా నాకెచెక్కు నొక్కేవు
గుట్టుతో తెరవేతునా గురుతాయ వలపు

చ. 3: తొక్కినట్టి నీపాదము తొడఁదొడఁ బెనఁగఁగ
గక్కన నిన్నుఁ గాఁగిట గదిమీఁజెలి
అక్కున శ్రీవేంకటేశ అదిమేవాకెను నీవు
చక్కఁగాఁ దెరవేతునా సతమాయ వలపు

రేకు: 0542-4 ద్రావిడ భైరవి సం: 13-188

పల్లవి: చెప్పిన నాబుద్ది నీకుఁ జెవిఁఐట్టదా
వుప్పతించ నంతవద్దు వూరకై నా నతని

చ. 1: పిలిచితే రాఁగదవే ప్రియునికి నీవు
చలము సాదించవద్దు సారెసారెకు
వలెనంటే నియ్యరాదా వరుసతో విడెము
మలకలఁ బెట్టవద్దు మాపుదాఁకా సొలసి

చ. 2: నగితే నవ్వఁగదవే ననుపు చేసుకతని
వెగటున మీరవద్దు వేసాలకు
తగిలితేఁ గూడరాదా తమకించి కాఁగిటను
ఆగడులు సేయవద్దు ఆఱడితో నిపుడు

చ. 3: చెప్పినట్లు సేయఁగదే శ్రీ వేంకటేశుఁడితఁడు
తప్పులు మోపవద్దు తచ్చనతోడ
యిప్పుడే యితఁడు నిన్ను నెనసె నిందరిలోన
చొప్పులు వెదకవద్దు సొరిది బింకానను

రేకు: 0542-5 శుద్ధవసంతం సం: 13-189

పల్లవి: ఔనయ్యా మంచివాఁడవు ఆఱడి యింతసేతురా
పూనినట్టి తమకము బుద్దెఱుంగునా

చ. 1: మంతనములాడఁగానే మర్మములంటేవు నీవు
యింత కాకు గలదా యిదేమయ్యా
వింతవారు నవ్వఁగాను వేళ లేదా నీకు మరి
యెంతైనా వలపు సిగ్గులెరుఁగునా భువిని

చ. 2: ఆకు మడిచియ్యఁగానే అట్టే సరసాలాడేవు
మేకులెన్ని నేర్చితివి మేలయ్యా
జోకఁ గాతరించేవు చోటు లేదా నీకు మరి
యేకడ మదము యెగ్గులెరుఁగునా భువిని

చ. 3: గందము నీకుఁ బూయఁగ కాఁగిటఁ గూడితివిట్టే
మందెమేళము సేతురా మమ్ము నీవయ్యా
విందుల శ్రీవేంకటేశ వేరె మాటు లేదా మరి
యెందును వేడుకాడికెలెఱుఁగునా భువిని

రేకు: 0542-6 పాడి సం: 13-190

పల్లవి: నీతో నేఁ బంత మాడేనా నీదాననే
యేతులు చెల్లించుకొంటి వెదురేది నీకు

చ. 1: యెలయింపుమాటలనే యెక్కుడుగా వలపించి
కొలఁదిఁ బెండ్లాడితివి గొల్లెతలను
బలిమి రుక్మిణిఁ దెచ్చి పట్టపుదేవులఁ జేసి
చలమీడేర్చుకొంటివి సరి లేదు నీకు

చ. 2: పైకొని మేనిమీఁది పాయపుమదము చూపి
కైకొంటివి మధురలో గందమూపెను
ఆకడఁ బదారువేల నందరిపైఁ దెచ్చుకొని
మేకులు మెరసితివి మితి లేదు నీకు

చ. 3: దిక్కులెల్లా సాదించి దీమసముతో గెలిచి
యెక్కువ రాచకూఁతులనేలితివి
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అక్కర దీరుచుకొంటి వడ్డమేదీ నీకు

రేకు: 0543-1 దేసాళం సం: 13-191

పల్లవి: ఆయనాయ మమ్మునేల ఆఅడిఁబెట్టేవు నీవు
చాయల నీవిచ్చినట్టి చనవులే చాలవా

చ. 1: పొగడేవు నన్ను సారెఁ బొందుసేయ నేర్తు నంటా
యెగసక్కేలేలచేసే వింతేసి మమ్ము
మగువనింతే నేను మగవాఁడవు నీవు
నిగుడి నీవు నేర్చిన నేర్పులే చాలవా

చ. 2: మెచ్చేవప్పటి నన్ను మేలుగల దాన నంటా
ఇచ్చకము లేలాడే వింతేసి మాతో
రచ్చకెక్కితివి నీవు రాణివాసమైతి నేను
నిచ్చలుఁ జేసేటి యట్టి నీమేలే చాలదా

చ. 3: కూడితివిచ్చుట నన్ను గురియైనదాన నంటా
యీడ వెట్టుకొంటిరా మమ్మెనసి నేఁడు
తోడనే శ్రీవేంకటేశ దొరసినవారము
కోడెకాఁడ నీవొళ్ళి గురుతులే చాలవా

రేకు: 0543-2 నారాయణి సం: 13-192

పల్లవి: అంగన వీడెమిచ్చిని అందుకోవయ్య
ముంగిటి అడియాసలు మోపుగట్ట వసమా

చ. 1: యెలమి నెఱిఁగియును నెఱఁగనట్టే వుంటే
తెలుపఁగ వసమా తేటలుగాను
వెలయఁ గపటానకు విరహనఁ బొరలితే
చలిమందులు సేయఁగ సతులకు వసమా

చ. 2: నేరిచి వుండియును నేరనని యంటేను
నేరుపంగ వసమా నెరువుగాను
పారితెంచి వేసాలకు బడలికె దెచ్చుకొంటే
ఆరీతి విసరుచు నలపార్చ వసమా

చ. 3: యేపున గురుతు గని యేది యని యడిగితే
చూపి చెప్పవచ్చునా సూట్లు గాను
చేపట్టెల మేల్మంగను శ్రీ వేంకటేశ కూడితి
తీపుగా వలచితివి తియ్యనిక వసమా

రేకు: 0543-3 మాళవి గౌళ సం: 13-193

పల్లవి: కాదని సాదించి నిన్ను కన్నుల జంకించేనా
ఆది గొని యిటువలె నైతిఁబో పైకొసరు

చ. 1: సుద్దులొక్కతె తోడుత చూపులొక్కతెమీఁదట
వుద్దండవు చేఁతలు వేరొకతెమేన
పెద్దరికేలకు నీవు బెరయించేవు వలపు
అద్దివో యిందరిలోన నైఁతిబో పైకొసరు

చ. 2: నవ్వులొక్కతె ముందర నమ్మికలొకతెవద్ద
వువ్విళ్ళూర నడియాస లొక్కతెకును
రవ్వలకు నిట్లా నేరము కుప్పవేసేవు
అవ్వలివ్వలివారిలో నైతిఁబో పైకొసరు

చ. 3: సిగ్గులొకతె పొంతను శిరసొకతె తొడపై
వొగ్గినచేతులు వేరొకతెపై
నిగ్గుల శ్రీవేంకటేశ నేనలమేలుమంగను
అగ్గమై కూడితివిందు నైతిఁబో పైకొసరు

రేకు: 0543-4 దేవగాంధారి సం: 13-194

పల్లవి: సరసుఁడ వన్నిటాను సర్వజాణవు
గరిమ నన్నిఁ దెలియఁ గదవయ్య నీవు

చ. 1: సన్నలు సేసీ నీకు జవరాలు
యిన్నిటాను నీకిప్పుడేడ పరాకు
కిన్నెర వాయించీ నదె కెరలుచును
విన్నపాలందే వున్నవి వినవయ్య నీవు

చ. 2: తప్పక చూచీ నదె తరుణి
యిప్పుడు నీతమకములేడ నున్నవి
చిప్పిలుఁజెమట గోరఁ జిమ్మీ నీపై
వొప్పగించి వలపిట్టే వుండవయ్య నీవు

చ. 3: మిక్కిలిఁ గొసరీ నలమేలుమంగ
యెక్కడెక్కడ నీగుండె యెటువంటిది
వొక్కటై శ్రీవేంకటేశ వొనరె నీకె
పిక్కటిల్లఁ దమ్ములము పెట్టవయ్య నీవు

రేకు: 0543-5 నాదరామక్రియ సం: 13-195

పల్లవి: వేడుకలెటువంటివో వెలఁదిఁ జూడఁగరాదా
జాడతోడ వలపులు సందడించఁ జొచ్చెను

చ. 1: సెలవుల నగవులు శిరసుపై తలఁబాలు
వొలుకుచు నున్నవొక్కమాఁటే
మొలకచన్నుల కాంతి మొక్కుల వినయములు
వులివచ్చిగాఁ జూపె నొక్కమాఁటే

చ. 2: చిప్పిలు మోవిముద్దులు చెక్కులచెమటలును
ఉప్పతిల్లఁ గురియించీ నొక్కమాటే
ముప్పిరిగొన్న సిగ్గులు ముయ్యాడు పులకలతో
వొప్పులెల్లా నెరపీని వొక్కమాఁటే

చ. 3: తొరలింపు మాటలును దొంతుల సరసములు
వొరిమతోఁ బచరించీ నొక్కమాఁటే
యిరవై శ్రీవేంకటేశ యింతి నిట్టే కలసితి
పురవడి నొరసేవు వొక్కమాఁటే

రేకు: 0543-6 ముఖారి సం: 13-196

పల్లవి: చిత్తానఁ బెట్టుక వుండు చెలఁగి నావిన్నపము
పొత్తు విడువఁగఁ జాల పొసఁగుదుఁ గాని

చ. 1: కేరి మొక్కతెవలె వెంగెములు నిన్నాడఁజాల
ఆరితేరి యిచ్చకము లాడుదుఁ గాని
సారెసారె నప్పటిని చలము సాదించఁ జాల
చేరి నీకు నూడిగాలు సేతుఁగాని

చ. 2: కడదానివలె నిన్నుఁ గాకు సేయఁగాఁ జాల
వొడికేన నవ్వుతానే వుండుదుఁ గాని
యెడనెడఁ గొసరుతా నెలయించఁగాఁ జాల
బడిబడి తమకాన బత్తిసేతుఁగాని

చ. 3: కన్నెపడుచువలెను కాఁకలు సేయఁగఁ జాల
యెన్న నలమేల్మంగనై యెనతుఁ గాని
వున్నతి శ్రీవేంకటేశ వొనగూడితివి నన్ను
సన్నల నీ మోవి యిట్టే చవిగొందుఁ గాని

రేకు: 0544-1 ధన్నాశి సం: 13-197

పల్లవి: ఇన్నాళ్ళు నెఱఁగమైతి మింతటివాఁడవౌత
తిన్నగా నిప్పుడు చూచితిమిగా యీభాగ్యము

చ. 1: వేడుకతో నాపె నీకు విన్నపాలు సేయఁగాను
సూడిదెగా సారెసారె సొలయఁగాను
వాడికెతో నీమీఁద వలపులు చల్లఁగాను
నీడనుండే ఇన్నియుఁ గంటిమిగా యీభాగ్యము

చ. 2: కన్నులఁ దప్పక చూచి కానుక నీకియ్యఁగాను
సన్నలు సేసి యిట్టే జరయఁగాను
చన్నులు మోవఁగ నీసంగడిఁ గూచుండఁగాను
నిన్నాపె మెచ్చఁగాను కంటిమిగా యీభాగ్యము

చ. 3: చేరి కూడి నీతో నాపె సిగ్గునఁ దలవంచఁగా
కోరి నన్నంతలో నీవు గూడఁగాను
గారాపు శ్రీవేంకటేశ కడపలో నిద్దరికీ
నేరుపేవు రతులు కంటిమిగా యీభాగ్యము

రేకు: 0544-2 లలిత సం: 13-198

పల్లవి: ఇద్దరికి మీకే చెల్లు నిటువంటివి
చద్ది వేఁడి సరసాలే జవళిభోగములు

చ. 1: భావము లెనసినట్టి పడఁతికి విభునకు
వేవేలు వెంగెములు వినయములే
తావుకొన్నవలపులు తారుకాణలైనచోట
కావరపు గోరొత్తులు కమ్మఁబూవుతాఁకులే

చ. 2: కనుచూపులు సోఁకిన కందువైనచుట్టాలకు
పెనఁగులాటలెన్నైనాఁ బ్రేమపు చౌలే
తనివోని తమకపు తగులాటమైతేను
ననుపు బొమ్మజంకెలు నయగారాలే

చ. 3: సెలవుల నవ్వుదేరఁ జేరి కూడినవారికి
అలయిక రతులెల్ల నలవాటులే
యెలమి శ్రీవేంకటేశ యింతి నీవు గలసితి
రలవోక మీ చేఁతలన్నియుఁ దచ్చనలే

రేకు: 0544-3 మంగళకౌశిక సం: 13-199

పల్లవి: నిన్ను నేము గాదనేమా నిండుదొరవు
సన్నతో మెలఁగేటి యిచ్చకురాల నేను

చ. 1: మొగము చూచితేను మోము వంచేవు
నగితే నీకు నీవే యానలు వెట్టేవు
మగవారికేఁటికి మరి వెరవు
అగపడ సతులను అలమఁగరాదా

చ. 2: పనివడి మెచ్చితేనే బ్రమసేవు
తనువుపైఁ జేయి వేసితే తత్తరించేవు
యెనసి పాయపువానికేల నేమాలు
కనుఁగొన్న చెలులనుఁ గలయఁగరాదా

చ. 3: వూరకే మోవి యానితే నులికేవు
ఆరసి నిన్నుఁ గూడఁగ నలసేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి
పోరచి కాంతలనెల్ల భోగించరాదా

రేకు: 0544-4 ఆహిరి సం: 13-200

పల్లవి: ఏమి గట్టుకొంటివి నీవిటువంటివెల్లాఁ జేసి
చేముట్టి కాఁకలు దేర్చి చెలఁగించరాదా

చ. 1: చెంతనే చెలియ నీతో సెలవుల నగెనంటా
వింతగాఁ బూబంతిఁ గొని వేసితివి
దొంతర పులకలట్టే తోడఁదోడఁ జిమ్మిరేఁగె
చింతదేరఁ గాఁగిలించి చెక్కు నొక్కరాదా

చ. 2: పొలుపొంద నాకె నిన్ను బొమ్మల జంకించెనంటా
చలమున పన్నీరు పైఁ జల్లితివి
చెలప చెమటలెల్లఁ జెక్కులవడియఁ జొచ్చె
బెళకక మోవి యిచ్చి ప్రేమ నించరాదా

చ. 3: గునియుచు నప్పటిని కొనగోరఁ జిమ్మెనంటా
వెనుకొని పుప్పొడి పైవేసితివి
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వీకెనిట్టే
ననుపున నాదరించి నమ్మించరాదా

రేకు: 0544-5 శ్రీరాగం సం: 13-201

పల్లవి: ఎవ్వరు చెప్పిన వినకింత చేసుకొనె నింతి
పువ్వువలె మన్ననలఁ బోదిసేయవయ్యా

చ. 1: అచ్చలాన చెలి నీయండ నుండి పొందు చేసి
పచ్చిచేసుకొనె మేను పడఁతి
విచ్చనవిడి తోడనే విడెము నీచేతికిచ్చి
మెచ్చులుగా వలపులు మెడఁ గట్టుకొనెను

చ. 2: మొగమోటములనే మోవి నీకు విందు చెప్పి
తగిలించుకొనె మేలు తరుణి
నగుతానే నీరూపు నాఁటుకొనఁ జూచి చూచి
తగినంతఁ దనుఁ దానే తమి రేఁచుకొనెను

చ. 3: అందపుఁ జన్నులనొత్తి అంటఁ గాఁగిలించి కూడి
కందువతోఁ బెండ్లాడెఁ గలికి
సందడి శ్రీవేంకటేశ సారె నీకు మొక్కి మొక్కి
అందెంది పట్టిపుదేవు లనిపించుకొనెను

రేకు: 0544-6 వరాళి సం: 13-202
పల్లవి: ఎప్పుడూ మీరొక్కటే యెలమినెంచి చూచితే
ముప్పిరి మీవూడిగాన కప్పణియ్యరయ్యా
చ. 1: చెంగట నీసుద్దులెల్లఁ జెలితో విన్నవింతుము
అంగనమాటలు నీతో నాడుదుము
యెంగిలిపొత్తువారము యిద్దరియెడకు నేము
వుంగిట నేమేమనినా నోరుచుకోరయ్యా
చ. 2: అలరి నీవిచ్చినట్టి ఆనవాలాకెకిత్తుము
నెలఁతచే కానికెలు నీకిత్తుము
వొలిసి మీకిద్దరికి నూడిగవు చుట్టాలము
తలఁచి మాచేతలు తాళుకొనరయ్యా
చ. 3: శ్రీ వేంకటేశ్వర నీకు సేస చేతికందిత్తుము
దేవులికె చెప్పితేను తెర వేతుము
యీవల మిమ్మిద్దరి నెనయించినవారము
వోవరిలో మీసేవలు వొప్పుగొనరయ్యా

రేకు: 0545-1 కురంజి సం: 13-203

పల్లవి: వేడుకలింతేకాని వెంగెము గాదు
జోడుగూడ నందులోని సొంపులు సుమ్మీ

చ. 1: సెలవులనే నవ్వఁగా చిత్తము నీకెట్టుండెనో
వలపులలోపలి వాడికె సుమ్మీ
కల చెప్పఁగాఁ దారుకాణలెందు మోచెనో
తలఁపుల లోపలి తమకము సుమ్మీ

చ. 2: నెట్టుకొని చూడఁగాను నీవేమని యంటివో
అట్టే పాయఁగరాని ఆసలు సుమ్మీ
పట్టి పెనఁగఁగా నీపంతములేడ వీఁగెనో
చిట్టికపు చేఁతలలో సిగ్గులు సుమ్మీ

చ. 3: చన్నుల నేనొత్తఁగాను చలములెంత రేఁగెనో
కన్నెపాయములోపలి గాతలు సుమ్మీ
మిన్నక శ్రీవేంకటేశ మెచ్చితేఁ జేఁగలమట్టి
చెన్నుఁడవై యేలితివి సేవ నాది సుమ్మీ

రేకు: 0545-2 నాట సం: 13-204

పల్లవి: నంటు చేసీ సిరితోడ నరసింహుఁడు
జంట సరములాడీ సారె నరసింహుఁడు

చ. 1: జవ్వనిఁ దనతొడపై సంతసాన నిడుకొని
నవ్వులు నవ్వీనిదె నరసింహుఁడు
నివ్వటిల్లుఁ జూపులు నెలఁతచన్నులమీఁద
కువ్వనిపేరులవలెఁ గుచ్చీ నరసింహుఁడు

చ. 2: ఆయంగనఁ గాఁగిట నలమి మోవి యొసగి
నాయములు నడపీ నరసింహుఁడు
కాయముపైఁ దొరిగేటి కస్తూరి చెమటలు
పూయని పూఁతలువలెఁ బూసీ నరసింహుఁడు

చ. 3: కూరిమి పట్టపుదేవిఁ గూడి శ్రీవేంకటేశుఁడై
నారు వోసీఁ బులకలు నరసింహుఁడు
వారకానఁ బ్రహ్లాద వరదుఁడు మరుముద్ర-
లూరట సొమ్ములుగాఁగ నుంచీ నరసింహుఁడు

రేకు: 0545-3 పాడి సం: 13-205

పల్లవి: మావలె నోర్వదు మంకు యీవనిత
కైవసమై పొదుగఁగవలెఁ జుమ్మీ

చ. 1: సుదతి యాసతోఁ జోటడిగీ నదె
యెదురెదురనె యెడమియ్యవయ్యా
సదరుచు నెగ్గులు వట్టిన యాపెకు
కదిసి నీవు మొక్కఁగవలెఁ జుమ్మీ

చ. 2: కలికి పచ్చడము గప్పుమనీ నదె
విలసిల్ల ముసుఁగు వేయవయ్యా
నెలఁత నిన్నుఁ గడు నేరములెంచిన
నలువున వేఁడుకొనఁగవలెఁ జుమ్మీ

చ. 3: నాతి యేకతమునకు లాసీ నదె
ఆ తెర దిగవేయఁగదయ్యా
యేతున శ్రీవేంకటేశ మమ్మేలితి
వీతతిఁ బంతములివలెఁ జుమ్మీ

రేకు: 0545-4 కాంబోది సం: 13-206

పల్లవి: ఇద్దరు జాణలే మీరు యిందరు మెచ్చేరు మిమ్ము
సుద్దులు దడవుకొంటాఁ జొక్కేరు మీరు

చ. 1: యెదురుగాఁ గూచుండి యేలాటాలాడి నీపై
చదురుల వలపులు చల్లీ నాకె
వెదచల్లు నవ్వులతో వెస గద్దెమీఁద నుండి
సదరానఁ బాదములు చాఁచేవాపెమీఁదను

చ. 2: సరికి బేసికినుండి సాటివెట్టుకొని నిన్ను
విరులఁ బూఁచి పూఁచి వేసీ నాపె
దొరతనమున నీవు తూఁగుమంచమూఁచి వూఁచి
అరిది చన్నులు దాఁక నంటించేవు గోరను

చ. 3: వేదాద్రిమీఁదనుండి విందు వెట్టి లకిమన్మ
ఆదిగొని కూడె నిన్ను నౌభళేశ
పాదుకొని గరుడాదిపై శ్రీవేంకటేశుఁడవై
సేదదేరఁ బెండ్లాడి చెలఁగేవు నీవు

రేకు: 0545-5 నాగ వరాళి సం: 13-207

పల్లవి: మేలము లమరెఁగా మీకు మీకును
కోలుముందుగా పొందు గూడె వినవయ్యా

చ. 1: పేరడిగా సొళగపు పెద్ద యెలుఁగులతోడ
కోరికెఁ జల్లలమ్మేరు గొల్లతలు
బీరానఁ బెక్కురాగాలు పిల్లఁగోవిఁ గురిసేవు
కూరిమి రెంటికి సుతి గూడె వినవయ్యా

చ. 2: మించిన బంగారపు మెట్టెల మోఁతలతోడ
కొంచక నడచేరదే గొల్లెతలు
వుంచాన గతి గతుల నూదేవు తుత్తురుఁగొమ్ము
అంచలఁ దాళము గూడె నదె వినవయ్యా

చ. 3: వొత్తి పెరుగు దచ్చేటి వూరుపు మోఁతలతోడ
కొత్తగాఁ బేరుకొనేరు గొల్లెతలు
హత్తుకొంటివి శ్రీవేంకటాద్రి చెన్నుఁడవై
గుత్తపు గొబ్బిళ్ళపాట గూడె వినవయ్యా

రేకు: 0545-6 శంకరాభరణం సం: 13-208

పల్లవి: నేమెఱఁగమా నీ పనులు
నేమములిటువలె నించెదు గాక

చ. 1: చనవరితనమున సతి నినుఁ గదిసిన
ననుపున నొల్లననఁగఁ గలవా
మనసరసేనని మగువలనంపిన
నినుపున యేతులు నెరపెదు గాక

చ. 2: చుట్టిరికంబులు సోఁకగఁ బెనకిన
అట్టుసేసి మీఱఁగఁ గలవా
కట్టుమట్టుగా కానికలంపిన
గుట్టున నూరకె గునిసెదు గాక

చ. 3: మేనరికంబున మేకొని కూడెను
నానినతమి మానఁగఁ గలవా
ఆనుక శ్రీవేంకటాధిప మొక్కిన
నానావిధముల నవ్వెదు గాక

రేకు: 0546-1 అమరసింధు సం: 13-209

పల్లవి: చెలులము నేమైనాఁ జెప్పక పోదు
తలఁపులోపలి యాస దాఁచఁ దగునటవే

చ. 1: ఇతవుగఁ జెనకఁగా నింపులెల్లాఁ జల్లఁగాను
తతిగొని పెనఁగఁగఁ దగునటవే
సతమై దండనుండఁగా సారె సారె నవ్వఁగాదు
మతకాన వెంగెమాడ మరి తగునటవే

చ. 2: కప్పురములియ్యఁగాను కన్నులను మొక్కఁగాను
తప్పులు వట్టఁగ నీకుఁ దగునటవే
దప్పిదేర విసరఁగా దయవుట్టఁ బలుకఁగా
నప్పటిఁ గాఁతాళించుటది దగునటవే

చ. 3: బత్తులు సేయఁగాను పైకొని కూడఁగాను
తత్తరాన గోరఁ జిమ్మఁ దగునటవే
హత్తి శ్రీవేంకటేశుఁ డన్నిటా మన్నించె నిన్ను
కొత్తరతులఁ బంతము గొనఁ దగునటవే

రేకు: 0546-2 బలహంస సం: 13-210

పల్లవి: వింతలేల సేసేవే విభుఁడు నీకు నితఁడు
చెంత నీమతి యాతనిచిత్తము గాదా

చ. 1: చిప్పిలమోవి ఇమ్మంటే సిగ్గువడ నేఁటికే
చొప్పున నిది యాతనిసొమ్ము గాదా
కొప్పు నీకుఁబెట్టేనంటే గొణఁగఁగ నేఁటికే
యెప్పుడూ నితనిసేస కిరవు గాదా

చ. 2: చన్నులు చూపుమంటేను జంకించనేఁటికే
పన్ని యీతనికి చేపట్లు గావా
పన్నీట నోలార్చేనంటే పలునవ్వులేఁటికే
అన్నిటా నీమేనితని కరడుతీగె గాదా

చ. 3: మొలనూలు వెట్టిరాఁగా మొక్కేవిదేఁటికే
పొలుపు శ్రీవేంకటేశు పొలముగాదా
అలరి నిన్నురమెక్కు మనఁగాఁ గొంకనేఁటికే
నెలఁత నీవే యతని నిండుసొమ్ముగాదా

రేకు: 0546-3 శంకరాభరణం సం: 13-211

పల్లవి: చలముల మానవె సరసునితో
అలుకలకంటెఁ బ్రియంబులె మేలు

చ. 1: బింకపుమాటలు పెక్కులాడఁగా
మంకులు మిగులును మగువలకు
లంకెలపొందులు లావుగఁ జేసిన
పొంకపు వలపులు పొదిగొను

చ. 2: బలిమి సరసములు పైపైనాడఁగ
తలఁపులు గరివడుఁ దరుణులకు
సెలవుల నగవులు చిమ్ముచుఁ బొదిగిన
తలకొనుఁ బైపైఁ దమకములు

చ. 3: సటలకుఁ బలుమరు జంకెన చూపిన
కుటిలత లడరును కొమ్మలకు
యిటువలె శ్రీవేంకటేశుఁ గూడితివి
తటుకున నీడేరుఁ దగుఁగోరికలు

రేకు: 0546-4 భైరవి సం: 13-212

పల్లవి: ఒకతె చెనకఁగా నొకతెనుఁ దడవేవు
యెకసక్కెపువాఁడవు యేమనేది నిన్నును

చ. 1: కందువైనమాటల కనుచూపుఁదేటలూ
సందడించి నీమీఁదఁ జల్లీనాపె
అందుకోలు మంతనాలు అడిగేటి పొంతనాలు
చందములుగా మాతోడ జరుపేవు నీవు

చ. 2: సెలవులనవ్వులూ చెట్లపై పువ్వులూ
చలపట్టి నీమీఁదఁ జల్లీనాపె
చెలుముల ప్రియములు చిమ్మిరేఁగే నయములు
తలపెట్టి మమ్ము నిట్టే తగిలేవు నీవు

చ. 3: నెట్టుకొన్నవలపులు నిండురతి యలపులు
జట్టిగొని నీమీఁదఁ జల్లీనాపె
అట్టగు మోవి విందులాఁఅడి మాతో పొందుల
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితివి నీవు

రేకు: 0546-5 కాంబోది సం: 13-213

పల్లవి: ఇప్పుడే మచ్చికలతో నిద్దరు నుండరే మీరు
చెప్పరానిచేఁత చేసి సిగ్గువడ వలెనా

చ. 1: నంటున నాతఁడు నీతో నగఁగానే వేరెవేరె
గెంటసాలాడేవేలే వెంగెములుగాను
వొంటక యాతనిఁ బాసి యొక్కింత యోరువలేక
వెంట వెంటఁ దిరిగాడి వేఁడుకొనవలెనా

చ. 2: ఆదరించి యాతఁడు మాటాడఁగాను కమ్మటిని
తోదోపులాడి పెనఁగి దూరఁగనేలే
కాదని యిప్పటికి నీకాఁ తాళాలు పెడరేఁచి
పాదుకొని పిదపను పంతమియ్యవలెనా

చ. 3: ఆసతో శ్రీవేంకటేశుఁడట్టే నిన్నుఁ గూడఁగాను
వేసాలకేల విఱ్ఱవీఁగేవు నీవు
మోసపెట్టి యిప్పటికి మోవిగంటిసేసి నీవు
వోసరించి చన్నుల గోరూఁదించు కొనవలెనా

రేకు: 0546-6 దేసాళం సం: 13-214

పల్లవి: కనకగిరిరాయ యేగతి నొడఁబరచేవో
విననయ్య సతినీకు విన్నవించుమనెను

చ. 1: చెలియకు నీవిచ్చిన చెంగలువపూవుదండ
కలికి యెవ్వతె నీకుఁగానుకిచ్చెనో
పలచఁగా నిందుమీఁదఁ బసపంటి వున్నదిదె
నెలఁత యీ గురుతులు నీకుఁ జూపుమనెను

చ. 2: కాంతకు నీవు మెడఁ గప్పినట్టి కంటసరి
చెంతల నీకెవ్వతె వుచితమిచ్చెనో
పంతాన నొకదిక్కునఁ బసిఁడిపూస వున్నది
అంతయుఁ దెలియ నిన్నునడిగి రమ్మనెను

చ. 3: భామఁగూడి నీవిచ్చిన పైఁడివ్రాఁతచీర యిది
కామించి యెవ్వతె నీకుఁ గట్నమిచ్చెనో
ఆమీఁద శ్రీవేంకటేశ అదె విలాసమున్నది
యేమతకమో యిది యెరిఁగించుమనెను

రేకు: 0547-1 భూపాళం సం: 13-215

పల్లవి: ఎవ్వరు విన్నవించేరు ఇట్టైతే నీకు
నివ్వటిల్ల నీవే కరుణించవలెఁ గాక

చ. 1: చిగురుమోవిమీఁది చిప్పిలుతేనెలతోడ
మగువ నీతోనదే మాటలాడీని
వెగటుగ నీవైతే వేరొక్కతెమోము చూచి
అగపడి యందే పరాకై వున్నాఁడవు

చ. 2: చిక్కనిచూపులతోడ సెలవినవ్వులతోడ
నెక్కువగా నీకుఁ జెయ్యెత్తి మొక్కీని
చెక్కునొక్కి నీవైతే సిగ్గులువడుచు వే
రొక్కతెచన్నులు గోర నూఁదుచునున్నాఁడవు

చ. 3: బొమ్మల జంకెనతోడ పొరచి ముద్దులతోడ
కొమ్మ శ్రీవేంకటేశ్వర కూడె నిన్నును
వుమ్మడి నీవైతే నాపె నొనగూడి యీసతికి
పమ్మిన బాసలతోడ బత్తియై వున్నాఁడవు

రేకు: 0547-2 దేశాక్షి సం: 13-216

పల్లవి: చూడఁ చిన్నవాఁడు గాని సుగుణవీఁడు
యేడఁ జూచినాఁ దానే యేమిచెప్పేదమ్మా

చ. 1: సంగతిగా గొల్లెతల చన్నులంటి చూచుకొంటా
దొంగిలీని పొరచిపొందుల కృష్ణుఁడు
ముంగిటి కన్నెల మోవి ముద్దులు వెట్టుకొంటాను
యెంగిలికి రోయఁడు యేమి చెప్పేదమ్మా

చ. 2: అప్పలప్పలనే వారి నట్టే కాఁగిలించుకొంటా
తప్పుటడుగులు వెట్టీఁదానే కృష్ణుఁడు
చిప్పల మాటలాడి సిగ్గులు వరచుకొంటా
యిప్పుడే యింత సేసీని యేమి చెప్పేదమ్మా

చ. 3: లలిఁ బొంకముడి వట్టి లాసుకొంటా నందరిని
గిలిగించీ శ్రీవేంకటగిరి కృష్ణుఁడు
తొలుత నుద్దగిరిఁ గందువ విజయనగరాన
యెలమి రతులు చూపీ నేమి చెప్పేదమ్మా

రేకు: 0547-3 ధన్నాశి సం: 13-217

పల్లవి: కాఁగిలించవే యిట్టే కనకగిరిరాయని
మాఁగినమోవి యిచ్చీని మచ్చిక దైవారఁగా

చ. 1: యెగ్గులేక పొందితేనే యింపెరఁగవచ్చుఁ గాక
సిగ్గుతోడ నుండితేను చెప్పేదేమి
దగ్గరఁ గూచుండితేను తమకము రేఁగుఁ గాక
వొగ్గి దవ్వుల నుండితే వొద్దిక చేకూరునా

చ. 2: సరసములాడితేనే చవులెల్లాఁ బుట్టుఁ గాక
తెరవేసుకుండితేను తెలిపేదేమి
నిరతి నీవు నవ్వితే నిక్కుఁగాక మోహములు
పరవశమై వుండితే పంతాలొనగూడునా

చ. 3: శ్రీవేంకటేశుఁ డితనిసేవే తగులు గాక
కావిరి నూరకుండితే కదిమేదేమి
యీవేళ నితని నిట్టే యెనసితి విదిగాక
రావాడి బింకాన నుంటే రతి సమకొనునా

రేకు: 0547-4 ముఖారి సం: 13-218

పల్లవి: తప్పక యేమి చూచేవు తగిలి నన్ను
తెప్పలుగా నీ విన్నియుఁ దెలియనివున్నవా

చ. 1: నీవు సుద్దులు చెప్పఁగా నివ్వెరనుండుట గాక
ఆవేళ నేవిననోప ననవచ్చునా
కైవసమై వున్నదానఁ గాకుసేతునా నిన్ను
దేవరవు నీవిన్నియుఁ దెలియనివున్నవా

చ. 2: చిట్టికపు చేఁతల కచ్చెరువు నొందుట గాక
పుట్టిపడి అవి యోర్వకుండవచ్చునా
పట్టిపుదేవుల నేను పచ్చిసేతునా నిన్ను
దిట్టివు నీవిన్నియునుఁ దెలియనివున్నవా

చ. 3: కగ్గుచు నీరతులకేఁకటతో నుండుట గాక
సిగ్గుతోడఁ గొంకుచు వంచించవచ్చునా
యెగ్గుల శ్రీవేంకటేశ యెరవు సేతునా నిన్ను
దిగ్గజమ విన్నియునుఁ దెలియనివున్నవా

రేకు: 0547-5 సాళంగనాట సం: 13-219

పల్లవి: ఉండవయ్య యెఱుఁగుదు నూరకే నీవు
దుండగవు సేఁతలను దొమ్మిసేసే వారమా

చ. 1: నిన్న నీవు చేసినట్టి నెరజాణ తనములు
కన్నులతుదల మాకుఁ గానవచ్చెను
పన్ని నీ వప్పటి మాతో బాసలేల చేసేవు
కన్నెలము నేము నిన్నుఁ గల్లలెంచే వారమా

చ. 2: వోడక రేపకాడ నీ వుండినట్టి వునుకులు
వేడుకతోఁ జెవులార వింటిమి నేము
జాడతోఁ దారుకాణించవలెనా మాకింతేసి
వూడిగపువారము నిన్నొరసేటి వారమా

చ. 3: ఇప్పుడు నీవు మమ్ము నెనసిన రతులెల్ల
చిప్పుల మనసులోనఁ జేకొంటిమి
ముప్పిరి శ్రీవేంకటేశ ముదులకించ వలెనా
అప్పసము నేము నిన్ను నలయించే వారమా

రేకు: 0547-6 సామంతం సం: 13-220

పల్లవి: ఎంత నీయాసోదము యేమి చెప్పేది
చెంతలనే వేడుకలు చిమ్మిరేఁచవలెనా

చ. 1: కలువలఁ బోలేటి కన్నులను నినుఁ జూచి
వలపులు వెంచీని వద్ద నీకాపె
కలయుమనుచు నన్నుఁ గాఁగిలించ వచ్చేవు
నలువంక వలపులు నారువోయవలెనా

చ. 2: పెనఁగులాటల నీతోఁ బ్రేమములు చూపి మోపి
ననుపులు సేసీని నంటున నాకె
చెనకులనే నాపైఁ జేతులు చాఁచే వప్పటి
మొనసి తమకములు మోపు గట్టవలెనా

చ. 3: మించిన రతుల నిట్టే మేలములాడి యాడి
వంచనతోఁ గూడీని వైపుగా నాపె
అంచల శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
పెంచేవుఁ గోరికలింత పేరఁబెట్టవలెనా

రేకు: 0548-1 సాళంగనాట సం: 13-221

పల్లవి: ఎవ్వరు నేమి చెప్పేరు యిద్దరముఁ గూడితిమి
ఇవ్వల నీవే నాకు నియ్యవయ్య విడెము

చ. 1: మాపుదాఁకా నీతోడ మాటకు మాటాడఁ బోతే
యేపు మీఱ యిఁకనవి యెన్నిలేవు
కోపమెల్లాఁ దీరె నాకు కొప్పు నీవు దువ్వితేనే
రాపులఁ బెట్టక ఇఁక రావయ్య లోనికి

చ. 2: బిగియుచు నీతోను పెనఁగులాడఁ జూచితే
యెగసక్కెములు మరి యెన్నిలేవు
చిగిరించె నామనసు చేయి నీవు చాఁచితేనే
అగడు సేయక వేయవయ్య తెర యిఁకను

చ. 3: రాతిరిఁ బగలు నీతో రతులు తోడుచూపితే
యేతుల యెన్నికలకు నెన్నిలేవు
యీతల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
కాతరానఁ బచ్చడము గప్పవయ్య ఇప్పుడు

రేకు: 0548-2 పాడి సం: 13-222

పల్లవి: తలఁచుకొమ్మనవె తానే నా గుణములు
వెలినేల లోనికిట్టే విచ్చేయు మనవే

చ. 1: సముకానఁ దానిచ్చిన చనవులోదానఁ గాని
తమకించే కక్కసపుదానఁ గాను
రమణిపై వినోదాన రాసికెక్కేదానఁ గాని
అమరని వొడ్డారములాడేదానఁ గాను

చ. 2: ననుపుతోఁ దానవ్వే నవ్వులలోదానఁగాని
తను నలయించే మంకుదానఁ గాను
వొనరి వుండ నేర్చిన వూడిగపుదానఁ గాని
పెనఁగి పెనఁగి సడిఁబెట్టేదానఁ గాను

చ. 3: కలసి యిటులనుండే కాఁగిటిలోదానఁ గాని
తలుపుమాటున నుండేదానఁ గాను
యెలమి శ్రీవేంకటేశుఁడేలె నన్ను నింతలోనే
కలిమిలోదానఁ గాని కడదానఁ గాను

రేకు: 0548-3 దేసాళం సం: 13-223

పల్లవి: అప్పుడాతని కిల్లాల వైతివి గదే
దప్పిదేరె నిఁకను మాదండనే వుండఁగదే

చ. 1: పెచ్చురేఁగి నిన్నాతఁడు పేరునఁ బిలిచె నిఁక
విచ్చనవిడేయఁ గదె వెలఁది నీకు
కచ్చుపెట్టి యప్పటిని కన్నులఁ జూచె నిన్ను
యిచ్చటనే నీకోరికె లీడేరెఁ గదవే

చ. 2: చిత్తగించి యింతలోనే సెలవుల నవ్వెఁ బతి
అత్తుగడలాయఁ గదే యంగన నీకు
పొత్తులకు రమ్మని పొందులు చూపె నిట్టే
బత్తిగలదానవు నీభాగ్యములాయఁ గదే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జేరి కూడి నిన్ను నేలె
వావులు గలసెఁ గదే వనిత నీకు
భావించి నాకు నీచేఁ బంతములెల్లా నిప్పించె
చేవమీఱ నిందరిలోఁ జెప్పఁగలిగెఁ గదే

రేకు: 0548-4 సౌరాష్ట్రం సం: 13-224

పల్లవి: ఎన్నఁడు నెఱఁగము మీకిటువంటివి
మన్ననలు నించేవు మరి యేలో కాని

చ. 1: చెలియ చెక్కిటిచేయి చేత నీవు పట్టితీసి
యెలమి వేఁడుకొంటివి యేఁటికో కాని
పలుకకుండఁగ నీవు బలిమిఁ జెక్కులు నొక్కి
అలుకలు దేరిచేవు అదియేమో కాని

చ. 2: ముసుగు వెట్టుకుండఁగ మొగమిట్టే తొంగిచూచి
యెసఁగి యాసలు వెట్టేవేఁటికో కాని
వుసురంటా మలఁగుపై నొరగి యుండినదాని
పిసికేవు చన్నులు నీప్రియమెంతో కాని

చ. 3: కన్నులు మూసుకుండఁగాఁ గాఁగిలించి తెరపించి
యెన్నికగా నవ్వించితి వేఁటికో కాని
సన్నల శ్రీవేంకటేశ సరసములాడఁగాను
యెన్నేసి మెచ్చులు మెచ్చేవింపులెట్టో కాని

రేకు: 0548-5 కొండమలహరి సం: 13-225

పల్లవి: ఎక్కడ పరాకు నీకు నేమయ్యా
గక్కన నాకెనిట్టే కరుణించవయ్యా

చ. 1: మక్కువ నీరూపు చూచి మనసులోఁ దలపోసి
చెక్కులునిండా నట్టే చెమరించి
పుక్కిటి వూరుపులతోఁ బొద్దులు చూచీఁ జెలి
యిక్కడఁ గొలువులు నీవేమి సేసేనయ్యా

చ. 2: కానుక నీకునంపి కాయమెల్లాఁ బులకించి
పానుపుమీఁద నట్టే పవ్వళించి
ఆనుకొన్న తమితోడ నట్టే నిన్నుఁబాడీ నదే
వీనులతుదల నీవే విందువు రావయ్యా

చ. 3: కలయఁ దానే వచ్చి కప్పురవీడెమిచ్చి
వెలలేని వెరగుల విఱ్ఱవీఁగి
యెలమి శ్రీవేంకటేశ యింతి నిన్నుఁ గూడె నిదే
తలిరుఁబోఁడి రతులు దలఁచుకోవయ్యా

రేకు: 0548-6 పాడి సం: 13-226

పల్లవి: ఏల బాసలు చేసేవు ఇప్పుడు నాతో
లాలించేటి యీ జవ్వనులను మీఱఁగలవా

చ. 1: పంతపుమాటలు నీతోఁ బలుమారు నాడియాడి
కాంతలిందరు మదనకళ రేఁచేరు
యెంతటివాఁడవైనా నెప్పుడూ నీవొక్కఁడవే
కాంతుఁడ వారికి లోను గాకుండఁ గలవా

చ. 2: ననుపు చేసుక నీతో నయముగ నవ్వినవ్వి
వనితలు వలపులు వడివెట్టేరు
ఘనుఁడవైనాఁ గాని కలవాఁడవు నీవే
మనసిచ్చి వీరితోడ మారాడఁ గలవా

చ. 3: చెంగలించి కాఁగిలించి సేవలెల్లాఁ నీకుఁ జేసి
అంగనలు రతులను ఆసచూపేరు
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశుఁడవైన
సంగడి నందరితోడ సాము సేయఁగలవా

రేకు: 0549-1 రామక్రియ సం: 13-227

పల్లవి: సందడించీ వలపు నీసముకానను
యిందరికూరిములు నీవియ్యకొనవయ్యా

చ. 1: యెలమిఁ గొలువుసేసీ నీకెఁ జిత్తగించవయ్య
సొలసి నవ్వీ నీకెఁ జూడవయ్యా
కలయఁ గానుకిచ్చీని కాంతచే నందుకోవయ్య
అలమి మొక్కీ నీకె నాదరించవయ్యా

చ. 2: యెదుట నున్నది చెలి యెఱుక చేసుకోవయ్య
అదె వీడెమిచ్చీ నాకె అందవయ్యా
పొదిగి విన్నవించీని పొలఁతిచే వినవయ్య
కదిసినదీకె వూడిగము గొనవయ్యా

చ. 3: అతివ చన్నులనొత్తీ నవధరించవయ్య
రతులు నేరిపీ నాపె రమ్మనవయ్యా
సతమై శ్రీవేంకటేశ సరి నన్ను నేలితివి
యితవరి యీకె చేఁతలెంచుకొనవయ్యా

రేకు: 0549-2 సాళంగం సం: 13-228

పల్లవి: కంటిమి మీభాగ్యము కన్నులతుదల నేము
జంటల మీసొబగులు సందడించఁ జొచ్చెను

చ. 1: తప్పక నీవు చూచితే తరుణి మేననెల్ల
ముప్పిరి గాఁ జెమటలు ముంచఁ జొచ్చెను
చిప్పిల మాటాడితేనే చెలి మారుమాటలలో
వుప్పతిల్లు మోవితేనెలూరఁ జొచ్చెను

చ. 2: ననుపుగా నవ్వితేనే నలినాక్షిచెక్కులను
నినుపులై పులకలు నిండఁ జొచ్చెను
చెనకుచు నీవంతలో చేతులు చాఁచఁగాను
వనితపోఁకముడి వదలఁగఁ జొచ్చెను

చ. 3: తొడపై నిడుకొంటేనే తొయ్యలికుచగిరులు
తడఁబడ మేలుకు నదరఁజొచ్చెను
అడరి శ్రీవేంకటేశ అంగన నిట్టే కూడితే
జడిగొన్నకళలు మించఁగఁ జొచ్చెను

రేకు: 0549-3 పాడి సం: 13-229

పల్లవి: ఘాతలు నీపైఁ జూపదు కన్నెపడుచు గనక
చూతము నీనేరుపులు చూపరాదా మేలు

చ. 1: చిలుకచే మాటాడించి సిగ్గుతోడ నున్నదిదే
పలికించరాదా నీపంతమీడేర
కలువపువ్వుల వేసి కాంత నిలుచున్నదిదే
మొలకచన్నులమీఁద మోపరాదా చెయ్యి

చ. 2: యెదురుగా హంస నంపి ఇంటిలోన నున్న దిదే
కదిసి మన్నించరాదా ఘనత మీర
గుదిగొన సేసచల్లి గుట్టుతోడ నున్నదిదే
పొదిగి మేననెల్లాఁ బూయరాదా గందము

చ. 3: పావురాలఁ గానుకిచ్చి పడఁతి కాఁగిటఁ గూడె
సేవలు మెచ్చి కలికిఁ జేయరాదా
శ్రీవేంకటేశ్వర యీకె చెలరేఁగి యున్నదిదే
యీవేళ నలపుదేర నియ్యరాదా విడెము

రేకు: 0549-4 సిందూరామక్రియ సం: 13-230

పల్లవి: ఇందరు నెఱిఁగినవే యీసుద్దులు
యెందాకా జరుపేవు యీవెడమాయలు

చ. 1: చలములేమిటికి సతితోను నిన్నుఁ
బిలువ నంపినందుకుఁ బెనఁగేదా
సెలవుల నవ్వేరు చెలులెల్లా యీ
కలికిఁ బాసి వుండఁగలవా నీవు

చ. 2: పంతములేమిటికి పతితోను నీకు
నింతియై వుండినందుకు నిది పాటా
చెంతల జాతులఁ బెట్టీఁ జిలుకలెల్లా
పొంత నాపెను మీఱ నోపుదువా యిఁకను

చ. 3: వొరయ నేమిటికి నీవువిదతోను నీ
పరపుపై యాడుటకు ఫలమా యిది
నిరతి శ్రీవేంకటేశ నీమేని గుఱుతులు
సురతవేళల యీచొప్పు మాపఁగలవా

రేకు: 0549-5 తెలుగు కాంభోధి సం: 13-231

పల్లవి: దోసము లేదనవయ్య తొక్కితి నీ పాదము
వేసారక నింద నీపై వేసితి నేను

చ. 1: వేడుకతోడి నావిరహవేదనకుఁ గా
నాడరాని కల్లలెల్ల నాడితి నిన్ను
వాడలోన నీవురాఁగా వలపుల చింతనొంది
వోడక మంచముమీఁద నుండితి నేను

చ. 2: పాయపు మదముతోడ పక్కన రాకుండఁగాను
సేయరాని సేతలెల్లఁ జేసితి నిన్ను
చేయి నీవు వేయఁగాను చిమ్మిరేఁగి వేసటతో
తోయరాని ఆనవెట్టి దూరితి నేను

చ. 3: తగులైన తమకాన దప్పిదేరుచ కుండఁగా
నగరాని నవ్వులెల్ల నవ్వితి నిన్ను
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
మొగము చూచిచూచి మొక్కితి నేను

రేకు: 0549-6 ధన్నాశి సం: 13-232

పల్లవి: చెప్పరే మీరైనా బుద్ధి చెలులాల
తప్పులేని నాగుణము తానే యెఱుఁగునే

చ. 1: చలము సాదించరాదు చప్పఁగా మాటాడరాదు
నలువంకాఁ జూచి లోలో నవ్వరాదు
కొలువులోపల నన్నుఁ గొచ్చి కొచ్చి యేలడిగీ
తలఁపులోపలిమాట తానె యెఱుఁగునే

చ. 2: మేరలు మీఱఁగరాదు మేకులు సేయఁగరాదు
కేరడములాడి తన్ను గెలువరాదు
ఆరసి నన్ను నేఁడు అంతయేల వొరసీని
తారుకాణించని మాట తానే యెఱుఁగునే

చ. 3: పగటు చూపఁగరాదు పాటిసేయ కుండరాదు
యెగసక్కేలకు నేరాలెంచఁగరాదు
నగి శ్రీవేంకటేశుఁడు నన్నుఁగూడి కాఁగిటిలో
తగులాయ నిన్నియును తానే యెఱుఁగునే

రేకు: 0550-1 గౌళ సం: 13-233

పల్లవి: ఎన్ని సేఁతలు సేసేవే యిప్పుడే నీవు
కన్నెపడుచ వప్పుడ కప్పుర మిచ్చేవు

చ. 1: కొలువులో రమణుఁడు కోరి నీతో నవ్వెనంటా
చెలరేఁగి చెలరేఁగి చేయి చాఁచేవు
వెలయఁ జెవిలో వచ్చి విన్నపాలు చేసేవు
కలికితనాలు చూపి కానుక లిచ్చేవు

చ. 2: దండనుండి నిన్నాతఁడు తప్పక చూచెనంటా
బెండుపడఁ గాతరానఁ బెనఁగేవు
మెండుకొన వీడెమిచ్చి మేకులెల్లాఁ జేసేవు
కొండవంటిదొర నిట్టే కుచాల నొత్తేవు

చ. 3: పానుపుపై శ్రీవేంకటపతి నిన్నుఁ గూడెనంటా
నానఁబెట్టి యిటులానే నంటు సేసేవు
తానకమై యాతఁడిట్టే తగనన్ను నేలినాఁడు
మోనాన నితనిమెచ్చి మొక్కులు మొక్కేవు

రేకు: 0550-2 భవుళిరామక్రియ సం: 13-234

పల్లవి: పంతమాడుదువు పలుమారు
కొంత గొంకితే కొఱఁతే సుమ్మీ

చ. 1: కొమ్మ యీఁదురుచు కొలనికి నిను దిగ
రమ్మనుచుఁ దామెరను వేసె
యెమ్మెతోడ నీవిటు దరినుండఁగ
వుమ్మడి నదియే వోటమి సుమ్మీ

చ. 2: తోపునూఁకుడుగ తొలఁగఁ జూచితే
నీపైఁ బుక్కిటి నీరుమిసె
యీపాట్టినికె యిఁకఁ బిరితీసిన
పైపైనే నగుఁబాటులు సుమ్మీ

చ. 3: చొరక లోఁగితే సుదతిచే దొబ్బించి
కెరలి నిన్నుఁ గాఁగిటఁ గలసె
యిరవై శ్రీవేంకటేశ యేమరిన
అరయ సతికి కిందగుటవుఁ జుమ్మీ

రేకు: 0550-3 నాదరామక్రియ సం: 13-235

పల్లవి: ఏడ సుద్దు లేడ మాటలెందాఁకాను
వేడుక పడేవు నీకు వేగిరమేలయ్యా

చ. 1: చెప్పరాని మాటలెల్లాఁ జెప్పుమంటాఁ జెవులొగ్గే-
వప్పటినానలు వెట్టే వందుమీఁద
యిప్పుడు చెలులు నేము నేకతమాడితిమని
విప్పుచూ నెవ్వరు నీకు విన్నవించిరయ్యా

చ. 2: మాలోని ముచ్చటలెల్లా మగుడఁ జెప్పుమనేవు
చేలకొంగు వట్టేవు చెక్కునొక్కేవు
ఆలోచించి గుజగుజలాడుకొంటిమనుచును
పోలించేవు నీవేడ పొంచువింటివయ్యా

చ. 3: మరిగి మేమాడుకొన్న మదనరహస్యములు
వొరసి చెప్పుమనేవు వొడివట్టేవు
గరిమ శ్రీవేంకటేశ కలిసితివిటు నన్ను
యిరవుగా నీవెట్టు యెఱిఁగితివయ్యా

రేకు: 0550-4 లలిత సం: 13-236

పల్లవి: వీరట నీవట యిఁక విచ్చనవిడి
కూరిములతో నిందాఁక గుట్టుతోడ నుంటివి

చ. 1: దొరవై యుండియు నీవు తొయ్యలులతో నెల్ల
సరసములాడఁగాను చలి వాసెను
వరుసఁ జన్నులమీఁద వాడికెతో నప్పటిని
విరులఁగొని వేయఁగ వెరపెల్లఁ దీరెను

చ. 2: బలు రాజసాననుండి పైపైఁ బేరుకొనుచు
చెలులఁ బిలువఁగాను సిగ్గు వాసెను
తలకొని బుజ్జగించి దండ గూచుండఁ బెట్టుక
కులికి నవ్వగ కొంకు గొసరెల్ల మానెను

చ. 3: శ్రీవేంకటేశుఁడవై చేరి కాంతలఁ గూడఁగ
భావములో నందరికిఁ బచ్చిదేరెను
యీవేళనే నన్నుఁ గూడి యిందరికిఁ జెప్పఁగాను
వేవేలకు నాలోని వేడుకెల్లా మీరెను

రేకు: 0550-5 కాంబోది సం: 13-237

పల్లవి: నీవే యాతఁడు గావా నేరమేడది
కావిరి వెరగులేల కాఁగిటిలోను

చ. 1: చెలువుఁడు మాటాడఁగాఁ జెవి యొగ్గి వినరాదా
చలపాదితనమేల సముకానను
సెలవులఁజింది నవ్వు చేతలనే పట్టరాదా
పెలుచు వొడ్డారాలేల ప్రియముల లోనను

చ. 2: ఇంత వొడఁబరచఁగ నియ్యకొని కూడరాదా
పంతము లింతేసి యేల పానుపుమీఁద
దొంతిఁబెట్టి మోవిపండు తొలఁగ కందుకోరాదా
సంతజాణతనాలేల సరసములోనను

చ. 3: గుట్టుతోడఁ గలయఁగ గుణము మెచ్చఁగరాదా
ఱట్టిడితనమేల మఱఁగైనవేళ
ముట్టీ శ్రీవేంకటేశుఁడు మొగిఁ జన్నులొగ్గరాదా
గుట్టు చూప నిఁకనేల కూరిములలోనను

రేకు: 0550-6 శ్రీరాగం సం: 13-238

పల్లవి: చిడుముడి సిగ్గునఁ జెలఁగీని
విడువక చేకొను విభుఁడవు నీవు

చ. 1: మలయుచు సొలయుచు మాటలాడఁగా
చెలిని గోరికొనఁ జెనకేవు
నిలిచె రేకలై నిండుఁ జెక్కులను
పిలిచి వేఁడుకో ప్రియుఁడవు నీవు

చ. 2: పలుమరు నెదుటను పనులు సేయఁగా
బలిమిఁ బెనంగుచుఁ బదరేవు
అలపుల చెమటలు అలరెను తనువున
కలసి మన్నించుము ఘనుఁడవు నీవు

చ. 3: గుఱుతుగఁ గాఁగిటఁ గూడి మెచ్చఁగా
నెఱిఁ బలుసోఁకులు నించేవు
మెఱసెను మోవిని మించి పురమునను
యెఱుకతో శ్రీవేంకటేశ్వర నీవు

రేకు: 0551-1 దేశాక్షి సం: 13-239

పల్లవి: ఎంతటిది నీ యాసోదమేమి చెప్పేది
వింతలుగా నవ్వేవు వెలఁదులతోడను

చ. 1: రాచిలుకపలుకుల రవళితోడి కొమ్మ
పూచినతంగేడువంటి పుత్తడిబొమ్మ
యేచి నీవురముమీఁద నిట్లానే వుండఁగాను
చాఁచేవు చేతులప్పటి జవరాండ్లమీఁదను

చ. 2: కదలుఁజూపుల తేఁటిగతి కన్నుల కలికి
పొదలిన రతిరాజు పూవుములికి
మెదలుచు నేపొద్దు నీమెడదఁడై వుండఁగాను
గుదిగొన నంటేవు గొల్లెతల చన్నులు

చ. 3: కారుమెఱుఁగులవంటి కళల చంద్రవదన
గారాపు సింగారాల పంకజసదన
యీరీతి శ్రీవేంకటేశ యీ నీకాఁగిటఁ గూడఁగా
చేరి యేలేవు మావంటి చెలుల నందరిని

రేకు: 0551-2 ఆహిరి సం: 13-240

పల్లవి: కనుకొనవయ్యా ఘనుఁడవన్నిటా నీవు
వినుకొనవయ్యా విభుఁడవు నీవు

చ. 1: సుదతి నిన్నుఁ జూచే చూపులలో నున్నది
మదిలోని నీపై తమకమెల్లాను
కొదలేని కొసరుఁబల్కులలోన నున్నవి
అదన మనసులోని యాసలెల్లాను

చ. 2: నలినాక్షి నీతో నవ్వే నవ్వులలో నున్నది
మొలకలెత్తిన తన మోహమెల్లాను
చెలరేఁగి తాఁజేసే సేవలలో నున్నది
బెళకులేని తన ప్రియమెల్లాను

చ. 3: కామిని నిన్నుఁ గూడిన కాఁగిటిలో నున్నది
నేమపు రతులలోని నేరుపెల్లాను
దీమసాన నిన్నుఁబొందే దేహమందే వున్నది
యీమేర శ్రీవేంకటేశ యిచ్చకమెల్లాను

రేకు: 0551-3 శుద్ధవసంతం సం: 13-241

పల్లవి: ఏల సిగ్గులు వడేవు యెన్నటికి నీపొందులు
ఆలనయ్యేనంటా నున్నదాదరించ రాదా

చ. 1: కొనచూపులనుఁ జూచి కొలువు చేసీ నీకు
పనులు చెప్పఁగరాదా పడఁతికిని
చొనిపి మాటలాడి చుట్టిరికాలు చూపీని
వెనుకొని నీవు నట్టే వియ్యమందరాదా

చ. 2: పూడిగాలు చేసేనంటా నొద్దఁ గాచుకున్నది
వీడె మందుకొనరాదా వెలఁదిచేత
వాడిక నవ్వులునవ్వి వలపులు చల్లీని
కూడేనని బాసయిచ్చి కొప్పు దువ్వరాదా

చ. 3: పచ్చిమోవి విందువెట్టి బదికే నంటానున్నది
మెచ్చి కాఁగిలించరాదా మెలుఁత నిఁక
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
తచ్చి యాపెతో నేకాంతము చెప్పరాదా

రేకు: 0551-4 కన్నడగౌళ సం: 13-242

పల్లవి: వెన్నెలలు గడు వేఁడి విరులు వాఁడి
యెన్నరావు తలపోఁత లెట్టోరిచేనే

చ. 1: కాతరాన సన్నచేసి కప్పురాన నన్నువేసి
చేతికి లోనైతి నంటాఁ జేరి నవ్వీనే
ఱాతిగుండెతోఁ దనకు అట్టోకటే దక్కీఁగాక
యీతల నేనాఁటదాన నెట్టోరిచేనే

చ. 2: సందడిలోఁ గాలుదొక్కి సగము మాటలు గుక్కి
పొందులెల్లా దక్కెనంటాఁ బూఁచి తిట్టీనే
అందగాఁడు గన తనకాడినదీడేరెఁ గాక
యిందరిలోఁ బిన్నదాన నెట్టోరిచేనే

చ. 3: కతలనే వావిచెప్పి కడుఁబచ్చడము గప్పి
సతమైతినంటా నన్నుసారెఁ గూడీనే
తతి శ్రీవేంకటేశుఁడు తన యిచ్చలాయఁ గాక
యితవరి గోలదాన నెట్టోరిచేనే

రేకు: 0551-5 మాళవ శ్రీ సం: 13-243

పల్లవి: ఇంకా నెల మంకుఁదన మింతితోడను
కంకణాలచేత నీపైఁ గప్పురము చల్లదా

చ. 1: తలగుచ్చి కాఁగిలించి తమిరేఁచి వేఁడుకోఁగా
చెలి చెప్పినట్టు యింకాఁ జేయవద్దా
తొలుత నిన్నెంతేసి తుటారములాడినాను
బలిమి వెనక నీకుఁ బంతమియ్యదా

చ. 2: చెక్కునొక్కి బుజ్జగించి శిరసు వంచి మొక్కఁగా
మక్కువతో నియ్యకొని మన్నించవద్దా
యెక్కువతో నిన్నప్పు డెంతచేఁత చేసినాను
వొక్కటై యిప్పుడు ప్రియమొనరించదా

చ. 3: మోవిచూపి నవ్వించి మునుకొని కూడఁగాను
పూవువలె నిట్లానే భోగించవద్దా
శ్రీవేంకటేశ యెక్కడఁ జెంది నిన్నెలయించినా
వేవేలుగా నిక్కడను వెల్లవిరిసేయదా

రేకు: 0551-6 దేసాళం సం: 13-244

పల్లవి: ఇంతకంటే నింకనేమి ఇద్దరాండ్ల మగఁడవు
వింతలాయ నీమహిమ విట్ఠలేశ్వరా

చ. 1: సరసము లాడీని సత్యభామ వొకవంక
వొరసీ రుకుమిణి నిన్నొకవంక
సిరుల రొండ్ల నీవు చేతులువెట్టుక యిట్టే
వెరవు విచారించేవు విట్ఠలేశ్వరా

చ. 2: చెలరేఁగి యాపె నిన్ను సెలవుల నవ్వఁగాను
సొలసి సొలసి యీకె చూడఁగాను
నిలువుదండలిద్దరు నెలఁతల మేనులంట
వెలయ నుబ్బేవు మేలు విట్ఠలేశ్వరా

చ. 3: కుడిబుజమానించీ గుబ్బల నీకోమలి
యెడమచెక్కునుఁ జెక్కు యింతి మోపీని
తొడఁదొడ మోపేవు దొరవు నడుమ నీవు
విడువకు శ్రీవేంకట విట్ఠలేశ్వరా

రేకు: 0552-1 శ్రీరాగం సం: 13-245

పల్లవి: ఏఁకారే యాపె నేల యేఁచేవు నీవు
వాఁకపు వలపులెల్లా వంచీని నీకు

చ. 1: పయ్యదలోపలి గుబ్బపాలిండ్లు దనివార
నెయ్యపుఁ జెలిఁ గాఁగిట నించఁగరాదా
వుయ్యాల మంచముమీఁద వొద్దనే కూచున్నది
చెయ్యరాదా చేఁతలు చెక్కులనిండాను

చ. 2: ముసిముసి నవ్వుల మోమునిండా జొబ్బిల
కొసరు నీమోవితేనె కులుకరాదా
పసలుగా నీకు నిట్టే పాదాలొత్తుచున్నది
పొసఁగరాదా రతుల పొందులకొలఁదిని

చ. 3: మదములు దొలఁకేటి మర్మములు సోఁకఁగ
మదిమదిఁ గూడితివి మన్నించరాదా
పుదుటై శ్రీవేంకటేశ పురముపై నున్నది
పొదుగరాదా నేర్పుల పూఁచినటువలెను

రేకు: 0552-2 బౌళి సం: 13-246

పల్లవి: ఏమిటికి వట్టి నేరాలెంచేవు నీవు
దామెనరతులవేళ తప్పించుకొనేవా

చ. 1: వుబ్బరితనాల నట్టే వూరకేల తిట్టేవు
గుబ్బచన్ను దాఁకితేనే కుమ్మెవోయీనా
గొబ్బునఁ గాఁగిట నీవు కూడేవేళ నిఁక మరి
తబ్బిబ్బుసేసుకొని తప్పించుకొనేవా

చ. 2: యీవల తిరిగిచూచి యేల పంతములాడేవు
మోవి మోవి సోఁకితేనే మోదుకట్టీనా
పూవువలె నిద్దరము పొందులు సేసేటివేళ
తావుదావుల మోవక తప్పించుకొనేవా

చ. 3: ఱట్టుగా నావలపాఁటిడి సేసే వింతలోనే
గట్టిగాఁ గాఁగిలించితే కళ దాఁకీనా
యిట్టే శ్రీవేంకటేశ యేలితి విప్పటివేళ
దట్టించి యింకా నీవు తప్పించుకొనేవా

రేకు: 0552-3 భైరవి సం: 13-247

పల్లవి: ఊరకే వుండఁగరాదు వోరువరాదు చూచి
నేరుపరి నీసుద్దులు నీకే తెలుసును

చ. 1: పచ్చిమాటలాడఁగాను పడఁతితో నవ్వేవు
పెచ్చురేఁగి నీకివి ప్రియమాయనా
రచ్చల నివి వింటేను రమణులు నవ్వరా
నిచ్చలు నీసుద్దులివి నీకే తెలుసును

చ. 2: కోరి మర్మాలంటఁగాను కూరిమిఁ జెంగలించేవు
పేరడిగా నీకిది ప్రియమాయనా
యీరీతి చూచినవారు యెంత లోలుఁడనరా
నీరాఁపుసుద్దులు నీకే తెలుసును

చ. 3: గట్టి చన్నుల నొత్తితే కళదాఁకి బ్రమసేవు
పెట్టువలపులు నీకుఁ బ్రియమాయనా
యిట్టే శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
నెట్టుకొన్న నీసుద్దులు నీకే తెలును

రేకు: 0552-4 ఆహిరి సం: 13-248

పల్లవి: పిలువరే యీ కాంత ప్రియునిని
కలయికలనే మేలు గలిగీఁగాక

చ. 1: తలపోఁతలచేతఁ దతిగొన్న విరహము
చలిమందులచేత జడిసీనా
పలుకుఁదేనెలచేతఁ బ్రబలిన తరితీపు
తలిరుల మూసితే దాఁగీనా

చ. 2: యెదురుచూపులనే యెసగిన తమకము
పొదిగిన విరులచేఁ బోయీనా
పొదిగొన్న యాసలఁ బొడమిన యలపులు
వుదుటు సురటులచే నుడిగీనా

చ. 3: దండనే వినుకలిఁ దగిలిన చెలుములు
పండువెన్నెలచేతఁ బరసీనా
నిండార శ్రీవేంకటనిలయుఁ డీచెలిఁ గూడె
వొండొక తావుననుంటే వొద్దిక వాసీనా

రేకు: 0552-5 నాదరామక్రియ సం: 13-249

పల్లవి: ఎవ్వరి వూడిగములు యేల నీకు
వువ్విళ్ళూర నాపెతోడ నోలలాడరాదా

చ. 1: చెక్కులనిండాఁ గారు చెమటలతోడనే
వెక్కసముగా నీకు వీడెమిచ్చీని
ముక్కున నూరుపులెల్లా ముంచఁగానే నీకు
అక్కరపడి విసరీ నది గదవయ్యా

చ. 2: జల్లన విరులురాల జారిన తురుముతోనే
తెల్లమిగా నీనెరులు తిద్దీ నదివో
వల్లెవాటు వేసుకొన్న వదలుఁబయ్యదతోడ
చల్లువెద నీసరులు చక్కఁబెట్టీని

చ. 3: బలిమి నీసమరతి బడలికతోడనే
లలిమీరి యిట్టే నీయలపు దీర్చీని
కలసి శ్రీవేంకటేశ కడుఁ బులకలతోనే
చలపట్టి నిన్ను జంటలు సేసీని

రేకు: 0552-6 దేవగాంధారి సం: 13-250

పల్లవి: మఱి యేఁటి విన్నపాలు మాపుదాఁకాను
నెఱవాదు లిన్నిటాను నేరరా మీరు

చ. 1: చెలులచే మాఁటలు సిగ్గులు దేరినదాఁకా
సొలపులు తనువులు సోఁకినదాఁకా
తలపోఁతలన్నియును దండకు వచ్చినదాఁకా
చెలుములు చనవులు చేకొన్నదాఁకానే

చ. 2: కడలేని సరసాలు కందువలబ్బినదాఁకా
వెడ మాయకోపము నవ్వినదాఁకాను
తడబాటు తమకము తనివి దీరినదాఁకా
కడివోని యాస లేకతమౌదాఁకానే

చ. 3: వింతముచ్చటలు వెల్లవిరిగా నాడినదాఁకా
పంతములన్నియు నొడఁబడినదాఁకా
ఇంతయు శ్రీవేంకటేశ యీపెతోఁ గూడినదాఁకా
సంతమైతిరి మాకోర్కె సమకూరుదాఁకా

రేకు: 0553-1 మధ్యమావతి సం: 13-251

పల్లవి: నిజమరి నంటా వచ్చి నిలుచున్నా డాతఁడు
గుజగుజ లేలాతని గుణము చూచుకోవే

చ. 1: తప్పక యేమి చూచేవే తరుణీ యాతని మోము
కప్పిన గుఱుతేమైనా గంటివా నీవు
నెప్పున నాతనినెల నిలిచి రమ్మనవే
అప్పుడే యతడెందై నా నంటువడి వచ్చెనా

చ. 2: నవ్వులేమి నవ్వేవే నాయకుని మాటలకు
రవ్వలుగా నందేమైనా రాగిదేరెనా
పువ్వులాతడిచ్చినవి పుచ్చుకొన వదియేమే
అవ్వల నొకరిచేతి వందుకొని వచ్చెనా

చ. 3: చెక్కులేమి నొక్కేవే శ్రీవేంకటేశ్వరుని
మిక్కుటపు రతులను మించి వచ్చెనా
యిక్కువగా గూడినందు కేల వెరగువడేవే
నిక్కముగా నందునుండి నేర్చుకొని వచ్చెనా

రేకు: 0553-2 దేసాళం సం: 13-252
పల్లవి: వింటి దనసుద్దులెల్ల వింతలా నాకు
దంటతనాలకు గురి తానే కాడా
చ. 1: చొప్పు మాయ దొల్లియును సుదతులయెడలను
తప్పని బొంకని వాడు తానే కాడా
వుప్పతిల్లుఁ జెమటల యుదధిలో నుండినాను
దప్పి దేరిచేవాఁడు తానే కాడా
చ. 2: గొరబుగా నింతులకు కోరిన కోరికలియ్యఁ
దరమెరిగినవాఁడు తానే కాఁడా
విరహపుటేటిలోన వెలఁదుల నీఁదించి
దరినుండి నవ్వేవాఁడు తానే కాఁడా
చ. 3: అగపడి యందరికి నన్నిరూపులై తనిపి
తగవు దేర్చినవాఁడు తానే కాఁడా
నగి శ్రీవేంకటేశుఁడు నాకాఁగిటి కొలనిలోఁ
దగ నోలలాడువాఁడు తానే కాఁడా

రేకు: 0553-3 భవుళి సం: 13-253

పల్లవి: నాకేల వెఱచేవు నడుమ నీవు
జోకతో నీయంకెకు రా జూచుకోవయ్యా

చ. 1: తేటలుగా ముక్కరముత్తె మించుక గదలఁగ
మాటలాడీ వినవయ్య మగువ నీతో
కాటుక కన్నులారిచి గక్కునఁ జూచీ నదే
నేఁటికి యాపె నేరవేర్చవయ్యా

చ. 2: గల్లుమని తనచేతి కంకణాలు మొఱయఁగ
నల్ల దే కానుకయిచ్చీ నందుకోవయ్యా
మొల్లతురుముతోడ మొక్కులు మొక్కీ నదే
చల్లగా నందుకేమాయ సమ్మతించవయ్యా

చ. 3: తళుకుగమ్మలు సందిదండలును మెరువఁగ
కలికి గాగిలించీ గలయవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటునన్ను నేలితివి
బలిమి నిద్దరి నిట్టే పాయకుండవయ్యా

రేకు: 0553-4 కాంబోది సం: 13-254

పల్లవి: అన్నిటా నే గురిగాక అవి యేమి చేసె నీకు
మన్నించరాదా వట్టి మచ్చికలు చూపక

చ. 1: వొక్కటఁ జంద్రోదయాన నుడు కెత్తి వున్నవవి
జక్కవచన్నుల నేల సారెఁ బట్టేవు
ముక్కుసంపెంగతావికి ముందే బ్రమసి వున్నవి
నిక్కి తుమ్మెదకురుల నీవేల రేఁచేవు

చ. 2: ఘనవిరహపు టెండఁ గాకరేఁగి వున్నవవి
కనుచకోరాల నేల గాసి చేసేవు
చినుకుఁ జెమటలచే చీకాకు పడినవవి
చననీక నడపుటంచల నేల యించేవు

చ. 3: బలిమి రామా యను పిలుపుల లోఁగినవి
యెలుఁగుఁగోయిలల నేలలయించేవు
కలసితి నన్ను శ్రీవేంకటేశ పాఁపసెజ్జను
పెలుచు గొప్పునెమలిపెంచె మేలంటేవు.

రేకు: 0553-5 నాగవరాళి సం: 13-255

పల్లవి: విడువు వేసాలు పదివేలు వచ్చెను
తడవకువయ్యా నీ తలఁపెల్లా గంటిమి

చ. 1: వెక్కసపు విరహాన వేఁగినచెలి విభుఁడు
చెక్కునొక్కినంతలోనె చెంగలించును
ఇక్కువ ఇదేరిఁగే కాయేమిటికీ వెరవవు
చక్కనుండవయ్య ఈ జాడలెల్లఁ గంటిమి

చ. 2: మదనబాణాలచేత మాఁగినట్టి చెలిఁ బతి
కదిసి చన్నులంటితేఁ గళ రేఁగును
యిది నేర్చుకొని కానీవింత తక్కరించేవు
వుదుటు చూపుకువయ్య వోజలెల్లాఁ గంటిమి

చ. 3: అడియాసచేతను అలసినాకె రమణుఁ
డొడఁబరచి కూడితే నొద్దికొను
గడుసవై కా శ్రీవేంకటేశ నన్నేలితివి
విడువకువయ్యా నీవిధమెల్లా గంటిమి.

రేకు: 0553-6 శంకరాభరణం సం: 13-256

పల్లవి: జమళి వలపులివి సరి దాఁకె
సముకంబుననే చందములాయ

చ. 1: యింతితో నేకాంత మేమాడితివో
చెంతల చెమటలు చిందీని
వింతగ నీవాపె విన్నపంబులకు
కాంతుఁడ పులకలఁ గడు మించితివి

చ. 2: జలజాక్షికి నేసన్న చేసితివొ
సెలవుల నగవులు జిగి మించె
పొలయుచు నీవాకె బొమ్మజంకెనల
వెలయఁగ గడు నివ్వెరగందితివి

చ. 3: యీవనితను నీవెపుడు గలసితివొ
లావుగ మోముకళలు నిండె
వోవరి నాపె నీవుర మెక్కఁగా
శ్రీవేంకటేశ్వర సిరులందితివి

రేకు: 0554-1 రీతిగౌళ సం: 13-257
పల్లవి: తరుణి నీవెఱుగని తగవున్నదా
గరిమ శృంగార మంగడిబెట్ట నేఁటికే
చ. 1: మోవితేనెకు మదనముద్రలు వెట్టె విభుఁడు
యీవల నీముద్దుమాటలేల చిందేవే
కావించి నెరిదేఁటుల కరపద్మమున దాఁచె
కావరాన ముఖచంద్రుఁ గదలించ నేఁటికే
చ. 2: చెక్కుల కళలరాశిఁ జేగోరి లచ్చెనవెట్టె
వెక్కసపు చూపులేల వెదచల్లేవే
జక్కవచన్నుల కంటసరుల దామెనఁగట్టె
పెక్కువ పులకలచే బెదరించ నేఁటికే
చ. 3: కందువైన రతులెల్లా కాఁగిట బండారించె
అందెంది పూర్పులేల బయట వేసేవే
పొంది శ్రీవేంకటేశుఁడు పుక్కిట వీడెము నించె
చెందిన చొక్కుఁజెమట చిలుకఁగ నేఁటికే

రేకు: 0554-2 దేవగాంధారి సం: 13-258

పల్లవి: ఇందరి నేలేటివాఁడు యేమి సేసునే
పొందులు మరిగితివి పొసఁగవే నీవు

చ. 1: సన్నలిట్టే యాతఁడు నీ సవతితోఁ జేసె నంటా
యెన్ని మాటలాడేవే యిప్పుడు నీవు
విన్నపము చెవులొగ్గి వినెనంటా నప్పటిని
యెన్నికగా రొమ్ముదట్టే విదియేలే నీవు

చ. 2: గక్కన నాపె నితడు కప్పురాన వేసె నంటా
మొక్కలాన బొమ్మలేల ముడివెట్టేవే
పక్కన గానుక నిమ్మపండు చేతనందె నంటా
పెక్కువగా నేలవొట్టు వెట్టేవే నీవు

చ. 3: శ్రీవేంకటేశుఁ డాపెపై జేతులు చాఁచె నంటా
రావాడి యెంత కాఁగిట రాయిడించేవే
మోవ నీపాదాలకాకె మొక్కఁగఁ జేసె నంటా
పోవులుగా నింతయేల పొగడేవు నీవు.

రేకు: 0554-3 సాళంగనాట సం: 13-259

పల్లవి: అందుకేమి దోసమా అన్నిటా దొరవు నీవు
సందడి నీవేటికి నిజాలు నెరుపేవు

చ. 1: నెలకొన్న మాటలకు నీవే గురిగాక
చెలులకేమివోదు చెప్పివారింతే
వెలయ నీవననివి వీరాడఁ గలరా
యెలమి నీ వానలెల్ల యేల పెట్టుకొనేవు

చ. 2: దినము నీ చేతలకు దేహమె గురి గాక
వనిత లెఱుగుదురా వద్దివా రింతే
మును నీవు సేయనివి ముట్టి సేయించేరా వీరు
ఘనముగ నేల తారుకాణించ వచ్చేవు

చ. 3: మంతనవు గూటమికి మనసే గురి గాక
యింతులేమిటివారు నీ యిచ్చవారింతే
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
పంతగాఁడ యాల వొడఁబరచ వచ్చేవు

రేకు: 0554-4 సామంతం సం: 13-260

పల్లవి: అలుకలేఁటికి రావే యాతనివద్దికి నీవు
బలిమైతే వలపులు పదనుకు వచ్చునా

చ. 1: సంగడినున్న సతికి చనవులు గలుగు గాక
కంగి కడనుండితేను కలదా పొందు
చెంగటనున్న రుచులు చేరి నోరూరించుఁగాక
అంగడినున్న సొమ్ములు ఆసలు పుట్టించునా

చ. 2: వినయపుటింతికిని వేడుకలీడేరు గాక
పెనఁగుచు బిగిసితే ప్రేమ పుట్టునా
తనువున బూసినగందము చల్లనౌఁగాక
వనములో తరువులు వడదేర్చ నోపునా

చ. 3: సేవ చేసేమగువకు చేతలెల్లాఁ జెల్లుఁ గాక
యీవల నొడ్డారించితే నింపు వుట్టునా
శ్రీవేంకటేశుఁ డిందు విచ్చేసి తా నిన్నుఁ గూడెను
పూవులు పిందెలౌఁగాక పొల్లు వెలవెట్టునా

రేకు: 0554-5 ముఖారి సం: 13-261

పల్లవి: చేచేత నీకుపాయాలు చెప్పవలెనా నేము
యేచి నీకు నింతేసి యెచ్చరించవలెనా

చ. 1: పంతము నీతో నాడి పవ్వళించినది చెలి
చెంత వేఁడుకోరాదా చెక్కునొక్కి
వింత లేక నీవే ముందు వీడెము చేతికీరాదా
మంతనాన మాటదీసి మచ్చిక చూపరాదా

చ. 2: మొక్కలము నీకుజూపి ముసుఁగు వెట్టుకున్నది
గక్కున మోవియ్యరాదా కాఁగిలించి
పక్కన నప్పటి నీవు పచ్చడము గప్పరాదా
చిక్కని నవ్వులు నవ్వి చెంగలించరాదా

చ. 3: తప్పకిట్టే నిన్నుఁ జూచి తలవంచుకున్నది
గొప్పచన్నులంటి యిట్టే కూడఁగరాదా
యిప్పుడే శ్రీవేంకటేశ యీకాంత నేలితివి
దప్పిదేర రతుల వింతలు సేయరాదా

రేకు: 0554-6 పాడి సం: 13-262

పల్లవి: ఎవ్వతె యెక్కుడు నీకు నిద్దరిలోన
యివ్వల నవ్వల దాము ఇద్దరు నున్నారు

చ. 1: మన రంజిలఁజేసి మాటలు నీతో నాడి
చనవు చేసుకో నాపె చదురాలు
వెనక నొక్కతి వచ్చి వేడుకలు నీకు నించి
పెనఁగులాటల మోవి పిప్పిసేసె నిపుడు

చ. 2: యిచ్చకములెల్ల జూపి యెదుటనే నిలుచుండి
పచ్చిచేసె నిన్ను నాకె పంతగత్తె
హెచ్చి నిన్ను దఱవాత నీపె వచ్చి బుజ్జగించి
తచ్చితచ్చి కమ్మటినిఁ దమకించె నిపుడు

చ. 3: సేవలెల్లా నీకుఁ జేసి శ్రీవేంకటేశ్వర కూడ
నీ వద్దనే వున్న దాకె నెరవాది
యీవల నన్నేలితివి యిదెటెఁగి తోడియాపె
తావులనే నెలకొని తనిపెఁ దానిపుడు

రేకు: 0555-1 భూపాళం సం: 13-263

పల్లవి: పంతగాఁడ వౌదువు భళిభళి మెచ్చితిమి
సంతమైతి విన్నిటాను చనవియ్యరాదా

చ. 1: విన్నవించఁ జెలినంపి వేవేలు కానుకలిచ్చి
సన్నలు సారెకుఁ జేసీ సకియ నీకు
యెన్ని పరాకులు సేసే వెవ్వరితో మాటాడేవు
మన్నించి లోనికి వచ్చి మగువఁ జూడరాదా

చ. 2: యెదురుగా విచ్చేసి యింటికిఁ దోడుకవచ్చి
పదములు నీమీఁదివి పాడి చూపీని
పెదవి నేల నవ్వేవు ప్రియములెందు దాఁచేవు
కదిసి మోవి యొసగి కైకొనఁగరాదా

చ. 3: వూడిగాలు నీకు జేసి వొద్దనే కూచుండి
వేడుకతో నిట్టే వీణె వినిపించీని
కూడితివి యికనైనా కొంకక శ్రీవేంకటేశ
మేడెపురతుల నింకా మెప్పించరాదా

రేకు: 0555-2 ఆహిరి సం: 13-264

పల్లవి: నీమనసుకొలదింతే నేమేమి విన్నవించేము
దీమసాన నీకు నీవే తెలుసుకో నేఁడు

చ. 1: చిప్పిల నాపె నీతో సెలవుల నవ్వితేను
కప్పురము చల్లెనంటాఁ గాఁతాళించేవు
వుప్పతిల్లు మనసు వేరొకచోట నుండితేను
వుప్పనున్నాఁ జప్ప నౌను వున్నసుద్దులేఁటికి

చ. 2: తళుకుఁజూపుల నాకె తప్పక చూచితేను
కలువల వేసెనంటాఁ గాతాళించేవు
వలపు వేరొకచోట వాడికె గలిగితేను
చలువైనా వేఁడౌను సాదించ నేటికి

చ. 3: కుమ్మరించి కుమ్మరించి కొసరి మాటాడితేను
కమ్మఁదేనె చిమ్మెనంటాఁ గాతాళించేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యెనసితివి చెలిని
నెమ్మిఁ దిట్టే దీవనౌను నేరమెంచ నేఁటికి

రేకు: 0555-3 శోకవరాళి సం: 13-265

పల్లవి: మగువను దయఁజూడు మగపాడి
యిగురుమోవి యిచ్చుటిది మగపాడి

చ. 1: చెక్కిటి చేతితోడి చెలి సిగ్గుదేరిచి
మక్కువ సేయించుకుంటే మగపాడి
అక్కజపు విరహన నసురుసురై యుండఁగ
ఇక్కువలంటి మన్నించుటిది మగపాడి

చ. 2: చినుకుఁ జెమట మేని చింతతోడ నున్న దాని
మనసు రంజిలించుటే మగపాడి
తనివోని కోరికతో తలవంచుకుండగాను
యెనసి నవ్వు నవ్వించుటిది మగపాడి

చ. 3: చాటుచు నీకుఁ బియాలు సారెసారె జెప్పఁగాను
మాటలాలించి వినుటే మగపాడి
ఆఁటదని చిత్తగించి అట్టే యీకెఁ గూడితివి
యీటున శ్రీవేంకటేశ యిది మగపాడి

రేకు: 0555-4 ముఖారి సం: 13-266

పల్లవి: ఎందునుఁ బోరాదు ఆతఁడేమి సేసునే
యిందునే విట్ఠలుని నీవెంత సేసేవే

చ. 1: అంగన నీమాటెల్ల నాదరించి వినఁగానే
పంగించి యాతనికేదో పరాకనేవే
ముంగిటి నీమొక్కులెల్ల మొగి నెంచుకొనఁగానే
అంగవించి యెందో మాటలాడీ ననేవే

చ. 2: నమ్మిక నీచేఁతలకు నవ్వులాతఁడు నవ్వఁగ
చిమ్మిరేఁగి అవి యేదో సిగ్గులనేవే
తమ్మిరేకుఁ గన్నులను తప్పకిట్టే చూడఁగాను
యిమ్ముల నవి గొన్ని యెమ్మెలనేవే

చ. 3: గక్కన నాతడు నిన్నుఁ గాఁగిలించి కూడఁగాను
తక్కకెవ్వతెపైదో కాతరమనేవే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్ను మెచ్చఁగ
చక్కఁగా నితఁడింతటి జాణఁడనేవే.

రేకు: 0555-5 రామక్రియ సం: 13-267

పల్లవి: అందుకేమి దోసమా అవుఁగాదనే వారెవ్వరు
చెందిమాతో బాసలేల సేసేవు నీవు

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెలి నీతో నవ్వఁగాను
మెలుపున నంతలోనే మెచ్చవా నీవు
చలపట్టి యప్పటిని సరసములాడఁగాను
వెలయఁ జేయాపెమీఁద వేయవా నీవు

చ. 2: సారెకును సారెకును చన్నుల నిన్నొరయఁగా
నేరుపుతో వలపులు నించవా నీవు
ఆరీతినే కొనగోర నాయములు ముట్టఁగాను
కోరి పచ్చడము గప్పి కూడవా నీవు

చ. 3: తతిగొని తతిగొని తగనాకె మొక్కఁ గాను
ఇతవుగా దీవెనలియ్యవా నీవు
సతమై శ్రీవేంకటేశ సరి నన్ను నేలితివి
మతకములెల్ల మాని మన్నించవా నీవు

రేకు: 0555-6 పాడి సం: 13-268

పల్లవి: ఊడిగెపువారమై నేముండుట గాక
జాడెటిఁగి నిన్నునింత జరయఁగ గలమా

చ. 1: మదము దొలఁకేయట్టి మగువల నేలితివి
సదరమా నీతోడి సంగాతాలు
పుదుటుఁ గుచగిరుల నొరసి సాము చేసితి-
విదే నీతోఁ బెనగఁగ నింతేసికిఁ గలమా

చ. 2: చిలుకుఁ జూపులలోనే సిగ్గులు దేరితివి
సులభమా నీతోడి చుట్టరికము
తలిరుఁబెదవులను దప్పులు దేరితివి
తలపెట్టి రతి సేసి తనుపఁగఁ గలమా

చ. 3: గామిడి బాహులతల కాఁగిళ్ళఁ బొదలితివి
సామాన్యమా నీతోడి చయ్యాటాలు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
దోమటి దొడికి నిన్ను దొమ్మిసేయఁ గలమా

రేకు: 0556-1 రామక్రియ సం: 13-269

పల్లవి: పాయపువాఁడు దానే పసిబాలుఁడు దానే
చాయల సన్నలచేత చనవిచ్చీ నిపుడు

చ. 1: వేడుకకాఁడై యిదివో విఠలుఁడు వీధులను
వాడికవలపు చల్లి వనితలపై
కోడెల నావులఁ గాచే గొల్లెతల యిండ్లను
వోడక వెన్నలఁ బాల నోలలాడీ నిపుడు

చ. 2: సంగడి తేరులమీఁద సత్యభామ రుక్మిణుల
చెంగట సేసలు వెట్టే శ్రీకృష్ణుఁడు
ముంగిటి వ్రేపల్లెలోన ముద్దులు గురియుచును
సింగారపుటుట్లకు చేయి చాఁచీ నిపుడు

చ. 3: అందపుమేడలెక్కి అష్టమహిషులతోడ
విందుల మోవియిచ్చి శ్రీవేంకటేశుఁడు
యెందునుఁ దుంగభద్రయేటిదరిఁ గూడి యాడి
సందడి రతులచేత సమకూడీ నిపుడు

రేకు: 0556-2 శ్రీరాగం సం: 13-270

పల్లవి: తెలుకో ఇక నీవే తేటతెల్లమిగ నివి
అలయించే కొరకా పొందయ్యే కొరకు గాక

చ. 1: నే మోహించినది యెల్ల నిన్ను దూరే కొరకా
గోమున గూడి చొక్కించే కొరకు గాక
చేముట్టి నీమేన గోర జీరదీసే కొరకా
ప్రేమాన సేసవెట్టి మెప్పించే కొరకుఁ గాక

చ. 2: ఆలనై వుండుట నే నిన్నారడి బెట్టే కొరకా
గోలనై వేడుక సేసే కొరకు గాక
వేళగాచి పిలిచేది వేసరించే కొరకా
కీలెటిగి నిన్ను మరిగించే కొరకుఁ గాక

చ. 3: చుట్టరికము చెప్పేది సొలసేటి కొరకా
గుట్టుతోడ బాయకుండే కొరకుఁ గాక
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
వెట్టిసేవకొరా నవ్వించే కొరకుఁ గాక.

రేకు: 0556-3 సామంతం సం: 13-271

పల్లవి: కలసినచోటను కడమేల
పలుకుల నిటు వొడఁబరచఁగరాదా

చ. 1: యెరవుల మాటలు యెందాఁక నాడేవు
కరుణించవయ్యా కామినిని
తెరమఱఁగేఁటికి తెలిసె నీ మనసు
యిరవగు నీచనవియ్యఁగ రాదా

చ. 2: యెలయింపులుగా నెందాఁక నవ్వేవు
అలరించవయ్యా అంగనను
పలుసిగ్గులేల పైకొనెఁ దమకము
నిలిచిన నీమేలు నెరపఁగ రాదా

చ. 3: యిక్కువలు చేత నెందాఁక నంటేవు
చొక్కించవయ్య యీసుదతి నిటు
గక్కన శ్రీవేంకటేశ కూడితి
వొక్కట మన్ననలొసగఁగ రాదా

రేకు: 0556-4 ఆహిరి సం: 13-272

పల్లవి: కందువలన్నియు నందే కానవచ్చీని
అందముగ నేఁడాకె యంకెకు రారాదా

చ. 1: చిగురు నీపెదవాపెచే గంటి సేయించకున్న
నగరాదా నీవిప్పుడు నన్నుఁ జూచి
యెగసక్కెములు నీతోనేల యిప్పటనుంటిని
మగపాడి నాపెతోను మాటలాడరాదా

చ. 2: కొనబు నీచెక్కులాకె గోర గీరించకున్న
అనరాదా నీవప్పుడు అందరితోను
పెనఁగనేటికి నీతో పెద్దరికములు చెప్పి
కనుఁగొనేవాకెతో నేక తమాడరాదా

చ. 3: కోమలపు నీమేనాపెగుబ్బల నొత్తించకున్న
యేమన్నాఁ బంగించరాదా యింతలోనే
కామించి శ్రీవేంకటేశ కలసితివీకె నిట్టే
ప్రేమతో నురముమీఁదఁ బెట్టుకొనరాదా

రేకు: 0556-5 శుద్ధదేశి సం: 13-273

పల్లవి: ఎంతటి నేరుపరివి యేమి చెప్పేది
వింత నీఁచేతలు చూచి వేడుకవుట్టీని

చ. 1: ప్రియములు చెప్పేవు పెనఁగవచ్చేవు నీ
నయగారి చేఁతలకు నవ్వువచ్చీని
దయలు వుట్టించేవు తగవులు నడుపేవు
నియతి నీసుద్దులకు నిండుకొనీ మోహము

చ. 2: తొడపైఁ దొడ వేసేవు తోడనే బుజ్జగించేవు
వెడమాయ విద్యలకు వెరగయ్యీని
పెడరేఁచేవు చిత్తము బిగువుచన్నులంటేవు
బడి నీవినయానకు బాఁతిపడీ మనసు

చ. 3: కందువ మోవియిచ్చేవు కాఁగిఁట గూడేవు నీ
చెందిన రతులు చూచి సిగ్గయ్యీని
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సందడి నీగుణాలకు చవులు వుట్టీని

రేకు: 0556-6 దేవగాంధారి సం: 13-274

పల్లవి: విన్నపములేమి సేసే వేగినంతాను
మన్నించి రక్షించే నీమహిమలే ఘనము

చ. 1: నీవంక నేరమిగద్దా నేనే యపరాధిని
దేవ నే జడుడగాన తెలుసుకోను
వావాత వగురుఁడాడే వాక్యము నీయాధీనము
పావనమైన నీపలుకెల్లా సత్యము

చ. 2: మంచితనమెల్లా నీదే మాయదారివాఁడ నేను
చంచలుఁడ గనక విచారించుకోను
అంచల నీదాసుని ఆనతి యమోఘము
యెంచ నీవిచ్చిన వర మెందుకంటే బలువు

చ. 3: కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది
నరుఁడఁ గనక అట్టె అరసుకోను
పరగ మాజనకుని ప్రతిజ్ఞయు నీపంపు
నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము.

రేకు: 0557-1 తెలుఁగుఁగాంబోది సం: 12-275

పల్లవి: ఎక్కడి పరాకులేఁటికయా
గక్కునఁ గాఁగిటఁ గలయఁగరాదా

చ. 1: ననుపునఁ జెలి యదె నవ్వులు నవ్వీ
వెనకటి పొందులు వెసఁ దలచి
చెనకుచు నీపైఁ జేతలు సేసీ
మనసులోన నీ మర్మము దలఁచి

చ. 2: తగిలిన యాసలఁ దప్పక చూచీ
పొగరుమోవి తీపులు దలఁచి
మిగులఁ దఱచుగా మేలము లాడీ
వెగటులేని రతివేడుక దలచి

చ. 3: ఘనమగు చన్నులఁ గడు నిను నొరసీ
వొనరిన నీ చనవులు దలఁచి
యెనసెను శ్రీవేంకటేశ్వర నిన్నీ కె
గొనకొను నీమంచిగుణములు దలఁచి.

రేకు: 0557-2 గుండక్రియ సం: 13-276

పల్లవి: ఆపే నేను నొక్కటే అందుకేమయ్యా
చేపట్టి యింతలో నేల సిగ్గులు వడేవు

చ. 1: విన్నపములు వింటివా వెలఁది చెప్పంపినవి
సన్నల నీకవి యెల్లా సరివచ్చెనా
నిన్నటి మీసుద్దులెల్లా నేఁడెలిసితి ననుచు
నన్నుఁ జూచి నీవేల నడుమఁ గొంకేవు

చ. 2: కానుక లందుకొంటివా కామిని నీకంపినవి
తానకమై యవి నీచిత్తానఁ బట్టెనా
నానాటి మీసరితలు నాకు దిష్ట మాయనని
నే నిప్పుడేమనఁగాను నీవింత లోఁగేవు

చ. 3: యేకతములాడితివా యింతిని రప్పించుకొని
కైకొని శ్రీవేంకటేశ కలసితివా
యీకడ నన్నేలితివి యిన్నియు నేగంటినని
నాకొరకు నెంతేసి నవ్వులు నవ్వేవు.

రేకు: 0557-3 సౌరాష్ట్రం సం: 13-277

పల్లవి: అన్నిటా జాణవు నీవు అటువంటివాఁడవా
కన్నపనులకుఁ దారుకాణలేలయ్యా

చ. 1: తెలిసె నీమాటలు తేటతెల్లమిగాను
చెలులెల్ల నాతోనుఁ జెప్పనప్పుడే
అలుకలన్నియుఁ దేరె నన్నిటా సంతోసమాయ
యెలమి నింతేసి యాస లేల పట్టేవయ్యా

చ. 2: కంటిమి నీగుణములు కన్నుల పండుగగాను
యింటికి నీవే వచ్చి యెచ్చరించఁగా
జంటలైతి మిద్దరము చక్కనాయఁ బనులెల్ల
వంటుచేసి న్నునెంత నమ్మించేవయ్యా

చ. 3: మెచ్చితి నీనేరుపులు మేనఁ బులకలు నిండ
కచ్చువెట్టి నన్ను గూడి కాఁగిలించంగా
మచ్చిక శ్రీవేంకటేశ మనసు లొక్కటులాయ
యిచ్చగించ నీ నిజాలు యెంతచెప్పేవయ్యా

రేకు: 0557-4 శంకరాభరణం సం: 13-278

పల్లవి: పొందు లిద్దరివి పొత్తున నున్నవి
కందువ లడుగరే కాంతలిటు

చ. 1: తలఁపులెనసితే తగులమి గలుగును
పలుకులొనరితేఁ బనులౌను
చెలిమి గలిగితే చెనకులు ననుచును
తెలియరె వలపుల తేటలివి

చ. 2: నయములుండితే నగవులు గలుగును
ప్రియముల జనువులు పెనఁగొనును
క్రియలు దెలిసితే కెరలుఁ దమకములు
నియతిఁ జూడరే నేర్పులివి

చ. 3: కూడినయపుడే గురుతులు నిలుచును
యీడుగఁ బెనగిన నింపౌను
యీడనే శ్రీవేంకటేశుఁడు గలసెను
వేడుక సేయరె వెలసె నివి

రేకు: 0557-5 నాదరామక్రియ సం: 13-279

పల్లవి: సరకు గొనేవా నీవు సవతులను
దొరతనపు గర్వము తొట్టీని నీకు

చ. 1: మంతనాన నాతఁడాడే మాటలవల్లనే కాదా
యింత పెచ్చుపెరిగితి వేమే నీవు
చెంతలఁ గొలువులోని సెలవినవ్వులఁ గాదా
దొంతి జవ్వనమదము దొరిగీని నీకు

చ. 2: పొందుల నాతఁడు సేసే పోదులవల్లనే కాదా
మందెమేళమునఁ గడు మట్టు మీరేవు
కందువ నప్పటప్పటి కనుసన్నలనే కాదా
యిందరిలోఁ బగటులు హెచ్చీని నీకు

చ. 3: గుట్టున శ్రీవేంకటేశు కూటమివల్లనే కాదా
పట్టిపు దేవులవై పరగితివి
యిట్టే నన్నేలినట్టి యీతనివల్లనే కాదా
చుట్టరికములకెల్ల చోటాయ నీకు

రేకు: 0557-6 కేదారగౌళ సం: 13-280

పల్లవి: నేమెఱఁగమా నీ నెరజాణతనములు
సాములేల సేసేవు చక్కనుండవయ్యా

చ. 1: పగటున నిందరిలోఁ బలుమారు నీవు నవ్వే
నగవులే కావా నమ్మరానివి
మిగులా నిచ్చకముతో మేకొని సరసమాడే
మొగమిచ్చులే కావా మోసపుచ్చేవి

చ. 2: సేదదేర నాలిచేసి చెక్కునొక్కి బుజ్జగించే
ఆదరింపులే కావా అలయించేవి
పోదిసేసి వలపుల బొరలించి వేఁడుకొనే
సాదుమాటలే కావా జాలిఁబెట్టేవి

చ. 3: మతకాన నీవు నన్ను మన్నించే పానుపుమీది
రతిచెనకులే కావా రాఁపుసేసేవి
యితవై శ్రీవేంకటేశ యింపుతో నీవొసగిన
తతిమోవితేనెలే తమి రేచేవి

రేకు: 0558-1 లలిత సం: 13-281

పల్లవి: ఎవ్వరిని మెప్పించేవే యింతిరో నీవు
నివ్వటిల్లని వెల్లాను నిలువఁబెట్టేవా

చ. 1: యేమనేవే చెలియా యెదిరించి నీవు నాతో
నేమపు వానిమాటలు నిజమనేవా
కోమలియుఁ దాను రతిఁ గూడి యుండఁగాఁ గంటి
గామిడిసేతలు యింకా గల్లలనేవా

చ. 2: వింటిలేవే మగువా వీరిడి నీవిన్న పాలు
అంటిముట్టి వానికిఁగా నానవెట్టేవా
వొంటి నిప్పుడిద్దరును వుప్పరిగెలో నున్నారు
జంట నిది లేదని సాదించేవా

చ. 3: నీవిదేమె వనితా నేఁడు శ్రీవేంకటేశుఁడు
కావించి నన్నేలెనంటా గతి గూడేవా
దేవులుఁ దాను నిందాఁకా దిష్టము జూజమాడిరి
సేవసేసే యాపె యని చెల్లఁబెట్టేవా

రేకు: 0558-2 దేసాళం సం: 13-282

పల్లవి: వేసరింతురా చెలిని విట్ఠలేశ్వరా
నీసుద్దుల కోపునా నేడు విట్ఠలేశ్వరా

చ. 1: కామిని నీతో నవ్వదా కపటమించుకా లేక
వేమారు నిందాఁకాను విట్ఠలేశ్వరా
గోముననుండి యలసి కోరి తెరవేసుకొంటే
గామిడిసేఁత సేసేవు కడు విట్ఠలేశ్వరా

చ. 2: వీడు జోడై చెనకదా విరసాలు నెరపక
వీడెము చేతికొసఁగి విట్ఠలేశ్వరా
వూడిగేలు చేసి వోవరిలో నుండితేను
ఆడుకొనే వెంతగబ్బియని విట్ఠలేశ్వరా

చ. 3: చెంత నిన్నిట్టే కూడదా శ్రీవేంకటాద్రిమీద
వింతలేని చనవుతో విట్ఠలేశ్వరా
బంతిరతులను జొక్కి పచ్చడము చొచ్చుకొంటే
పంతాన మరిఁ గూడేవు బాపు విట్ఠలేశ్వరా

రేకు: 0558-3 హిజ్జిజి సం: 13-283

పల్లవి: వాసికే బతికేవారు వనితలెల్లా
గోస నాససేతురా కొండవంటి దొరవు

చ. 1: చెలి నీమాటలువిని సిగ్గులువడీ నదే
పలుమారు నింతయేల పచ్చిసేసేవు
యెలమి యేకతమైతే నేమిసేసినాఁ జెల్లు
కొలువులో నింతగద్దా కొండవంటి దొరవు

చ. 2: భామిని నీసేఁతులకు పయ్యద మూసుకొనీని
వేమారు నింతేల వెల్లవిరి సేసేవు
దోమతెరలోన నెంత తుదమీరినాఁ జెల్లు
కోమల మెఱుగఁవద్దా కొండవంటిదొరవు

చ. 3: కొమ్మ నీనవ్వులకు గొబ్బునఁ దలవంచీని
కమ్మర నింతేల తమకము రేఁచేవు
యిమ్ముల శ్రీవేంకటేశ యిద్దరికూటమిఁ జెల్లు
కుమ్మరింతురా వేసాలు కొండవంటి దొరవు

రేకు: 0558-4 ఆహిరి సం: 13-284

పల్లవి: ఏల దరేవయ్యా యెడగలశుంటి నంటా
వోలివెట్టి పెండ్లాడఁగ నొరయఁగ వచ్చునా

చ. 1: ఇద్దరును మీరిట్టే యేకతములాడఁగాను
వొద్దికి రావచ్చునా వూరకే నేను
పెద్దరికములకును పెనగుఁలాటాడఁగాను
అదలించి మీకు నేను నడమురాఁ దగునా

చ. 2: తెగని యాసతో మీరు తెరవేసుకుండఁగాను
సొగిసి నేనిటు తొంగి చూడవచ్చునా
పగటున మీలోన పచ్చిమాటలాడఁగాను
వెగటుగా నిట్టే పొంచు విన నాకు వచ్చునా

చ. 3: కామించి మీరిద్దరును కాఁగిలించుకుండఁగాను
ఆముకొని నే వీడెమియ్యఁగ వచ్చునా
యీమేరనే శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మీమీఁదంట బంతాలు మెరయఁగ వచ్చునా.

రేకు: 0558-5 రామక్రియ సం: 13-285

పల్లవి: సతులకు నిటువంటి చండితనము గలదా
మతకాన నీవు సేసే మహిమలు గాక

చ. 1: కంచము పొత్తునను ఆ కాంత నీవు నుండఁగాను
కొంచక తానేల వచ్చి కూచుండీ నీకె
లంచముగా మోవితేనె లాలించి యాపెకియ్యఁగ
ఇంచుకించుక నోరూర నీపెకేల యిపుడు

చ. 2: కనుసన్న నాపె నీకు కతలు సారెఁ జెప్పఁగ
వొనర నడుమనేల వూఁకొనీ నీకె
గునియుచు నీవాయింతికొంగు వట్టి తీయఁగాను
తనువెల్లఁ జెమరించఁ దనకేల యిపుడు

చ. 3: రవ్వఁగాఁ బానుపుమీఁద రమణి నిన్నుఁ గూడఁగ
ఇవ్వలిపక్కఁ దానేల యెనసీ నీకె
నవ్వుతా శ్రీవేంకటేశ నన్ను నిట్టే యేలితివి
చివ్వన నేఁకరనేల చెలియకు నిపుడు

రేకు: 0558-6 పాడి సం: 13-286

పల్లవి: ఎందాఁకా సిగ్గులువడే వేమయ్యా
ఇందుముఖి కేక తాన నియ్యవయ్య చనవు

చ. 1: సొలసి సొలసి నిన్ను సుదతి గొసరఁగాను
పలుమారు నీకెక్కడ పరాకయ్యా
కలువపువ్వుల వేసి కందువలు చూపఁగాను
వలవంత నీవిట్టే యెవ్వరిఁ జూచేవయ్యా

చ. 2: తగిలి తగిలి నీతో తతిగొని నవ్వఁగాను
వొగి నీచిత్తమెక్కడ నున్నదయ్యా
మొగము చూచి నీకు మొక్కులెల్లా మొక్కఁగాను
జిగిమీర నీవేల శిరసెత్తవయ్యా

చ. 3: చెనకి చెనకి యీకె చేరి నిన్నుఁ గూడఁగాను
యెనలేని నివ్వెరఁగు లిఁకనేలయ్యా
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిలించె నీదేవులు
గొనగొన్నరతి నెంత గుట్టుచూపేవయ్యా

రేకు: 0559-1 పాడి సం: 13-287

పల్లవి: ఎంత దడవు వట్టునే యీడేరనటే వోరి
పంతమాడి చెప్పేను ఆపని ఇట్టే అయ్యీ్యారా

చ. 1: యెఱుక చెప్పఁగదవే యింతిరో నీవు-వోరి
చిఱుసేఁతొకటి దలచితివిట్టేరా
గుఱిగా నాతలఁపొనగూడు నటవే-వోరి
కొఱత లేదు కోరిన కోర్కులయ్యీ్యారా

చ. 2: మనసులోఁగల యట్టె మరియౌనటే-వోరి
పనివడి అది నీకు పైపై నుందిరా
ననుపున అదినేను నమ్ముదునటే-వోరి
అనుమానించకు నీవు అన్నట్టే అయ్యీ్యారా

చ. 3: చేయి వట్టుక చెప్పవే సిగ్గులేటికి-వోరి
ఆయములు సోఁకె నిఁక ననువాయరా
యీయెడ నేకతమాయ నేలే మఱగు-వోరి
పాయపు శ్రీవేంకటేశ పలికినట్టెయ్యీ్యారా

రేకు: 0559-2 శంకరాభరణం సం: 13-288

పల్లవి: ఇద్దరు జాణలే మీరు యెంచి చూచితే
పొద్దులు గడపుదురా పొరుగునను

చ. 1: దిగ్గన సరసమున దిట్టులెన్ని దిట్టినాను
యెగ్గులు వట్టుదురా యింతలోననే
వెగ్గళించి చనవున వెస మర్మములంటితే
సిగ్గులు వడుదురా జిగిమించను

చ. 2: జవ్వనపాయముతోడ సారె సారెఁ జెనకితే
నవ్వులు నవ్వుదురా నట్టినడుమ
నివ్వటిల్లు సన్న లెల్లా నెట్టుకొనఁ జేసితేను
రవ్వలు సేయుదురా రచ్చలోనను

చ. 3: సమ్మతించి కాఁగిళ్ళను సమరతిఁ బెనఁగితే
బొమ్మల జంకింతురా పూఁచిపట్టుక
యిమ్ముల శ్రీవేంకటేశ యిట్టె మీరు గూడితిరి
దొమ్ములు సేయుదురా తోడఁదోడను

రేకు: 0559-3 బౌళి సం: 13-289

పల్లవి: ఎక్కడ జిత్తమున్నది యెవ్వరితో మాటాడేవు
చొక్కపు మాచేతిది చూడవయ్య కానికె

చ. 1: నెలఁత వోరువలేదు నిన్నుఁ గొసరక పోదు
చెలరేఁగె విరహము చెప్పరాదు
వెలలేని విన్నపాలు వేవేలుఁ జేసితిమి
సొలసి మాచేత నిదె చూడవయ్య కానికె

చ. 2: చెమటలే ముంచీని చింతలెల్లఁ బెంచీని
జమళి తమకములు సారె నించీని
సముకాన నీతోను చనవులు చూపితిమి
సముకుఁడ మాచేతుల జూడవయ్య కానికె

చ. 3: మేడెపు రతుల జొక్కె మెలుఁత నీకాలు దొక్కె
కూడితి శ్రీవేంకటేశ కోరికె దక్కె
వేడుకచెలులమెల్లా వింతలుగా మొక్కితిమి
జోడగుమాచేతులందుఁ జూడవయ్య కానికె

రేకు: 0559-4 దేశాక్షి సం: 13-290

పల్లవి: ఇరవాయ నయ్యా మీయిద్దరి వేడుకలును
సరసములాడెగా సారె నీతో నాపె

చ. 1: తూఁగుమంచ మెక్కించుక తొడమీఁదఁ దొడ వేసి
మాఁగినమోఁవి యిచ్చెఁగా మగువ నీకు
వేఁగైన చన్నులు నీవీఁపుమీద వేసుకొని
కాగిలించుకొనెఁగా కలికి నిన్ను

చ. 2: మలగుపై నొరగించి మంతనములాడుకొంటా
కలకల నవ్వెఁగా కాంత నీతోను
చెలరేఁగి చెక్కులు నీచెక్కులతోఁ బెనగొన
వలపులు రేఁచెగా వనిత నీకు

చ. 3: పచ్చడముపైఁ గప్పి పలుకులఁ జొక్కించి
యిచ్చకానఁ గూడెఁగా ఇంతి నీతోను
ముచ్చట శ్రీవేంకటేశ ముందు నన్నుఁ గూడితివి
లచ్చనలు నించెఁగా లలన నీపైని

రేకు: 0559-5 నారాయణి సం: 13-291

పల్లవి: సందడి పెండ్లి నీకు సమకూడెను
కందువ నీవెవ్వతెనుఁ గలసేవో కాని

చ. 1: కప్పుర మొకతె యిచ్చె కస్తూరి పూసె నొకతె
చిప్పిల గందము మెత్తెఁ జేరి యొకతె
చొప్పులొత్తి వేరొకతె సురటిగొని విసరె
నెప్పున నెవ్వతెను మన్నించేవో కాని

చ. 2: వీడెమొకతె యొసఁగె విరులొకతె ముడిచె
జాడతోడ వేరొకతె చల్లెఁ బన్నీరు
వూడిగము సేసి గోరనూఁదె నిన్ను వేరొకతె
వాడికగా నెవ్వతెకు వలచేవో కాని

చ. 3: పాదములొకతె యొత్తె పచ్చడమొకతె గప్పె
ఆదిగొని తెరవేసెనట్టే యొకతె
యీదెస శ్రీవేంకటేశ యిందరి మమ్మేలితివి
నీదయ యెవ్వరిమీద నెరుపేవో కాని

రేకు: 0559-6 మేచభపుళి సం: 13-292

పల్లవి: బుద్ధు లాతనికెందాఁకా బోదించేవే
తిద్దరాని వారిమతి తిప్పనెట్టు వచ్చునే

చ. 1: ననుపుగాని వారికి నవ్వులేల వచ్చునే
చనవులేని వారికి సరసమేలే
మనసొగ్గని వారికి మంతనములేడవే
తనియని వారికి కాతరమెట్టు మానునే

చ. 2: తగులులేని వారికి తరితీపులేలుండునే
సొగియని వారికి సొంపులేడవే
మొగమోడనివారికి ముచ్చట లెటువంటివే
బిగిసేటి వారికి ప్రియములెక్కడివే

చ. 3: నంటులేని వారికి నమ్మి కెట్టు వుట్టునే
జంటగాని వారికి చనవులేడ నున్నవే
యింటిలో శ్రీవేంకటేశుఁ డితడిట్టే నన్నుఁగూడె
అంటువాయనివారికి నాసలేల తీసునే

రేకు: 0560-1 రీతిగౌళ సం: 13-293

పల్లవి: ఎంత గయ్యాళివనరా యిరుగుపొరుగువారు
పంతముతో నీవేల బలిమి సేసేవే

చ. 1: గుట్టుతో మెల్లనే పతి కొసరి మాటలాడగ
అట్టుగా దూరనేలే యాఅడిగా నీవు
చెట్టవట్టి యాతఁడు చేతికి లోనై యుండఁగ
వొట్టువెట్టి నీవేల వొడివట్టేవే

చ. 2: రమణుఁడాతఁడు నిన్ను రతికిఁ బిలువఁగాను
తమకించి నీవేల కాఁతాళించేవే
సముకానఁ దానే మరి సరసములాడఁగాను
నెమకుచు నీవేల నేర మెంచేవే

చ. 3: శ్రీవేంకటేశుఁడే చేరి నిన్నుఁ గూడగాను
వావులేల చెప్పేవే వరుసతోను
వోవరిలోఁదా నిన్ను వురమెక్కించుకొనఁగ
యీవేళ నీవేల మోవి యెంగిలిసేసేవే

రేకు: 0560-2 ధన్నాశి సం: 13-294

పల్లవి: ఊడిగేలవారమట వొద్దనే వుండగరాదా
యీడనేల సిగ్గువడే వియ్యకొనరాదా

చ. 1: సారె సారె నాపె నీతో జాణతనాలాడఁగాను
నారుకొన నేమందుకు నవ్వఁగరాదా
కూరిమిఁగొసరి నిన్నుఁ గొంగువట్టి తియ్యఁగాను
గారవించి నేమందుకు గతి గూడరాదా

చ. 2: తనివోక ఆపె నిన్నుఁ దప్పకిట్టే చూడఁగాను
మనసిచ్చి నేమును సమ్మతించరాదా
చెనకుచుఁ గమ్మటి నీచెక్కు నొక్కి వేఁడుకోఁగా
చనవున నందరము సంతోసించరాదా

చ. 3: గక్కన నాపె నిన్ను కాగిలించుకొనఁగాను
మిక్కిలి మాకు నేడు మెచ్చఁగరాదా
ఇక్కువతో శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
చిక్కని మోవితేనెలు చేకొనఁగరాదా

రేకు: 0560-3 బౌళి సం: 13-295

పల్లవి: మానవయ్య ఇటువంటి మతకము లాకెమీఁద
సానఁబట్టి చూపు నీవేజాడఁ బెనఁగితివో

చ. 1: యీయెడఁ దెరవేసుక యింటిలో నున్నది చెలి
సేయరాని సేఁతలేమి సేసితివో
చాయల సన్నల నీపై చలపట్టుకున్నది
పాయపుమదాన నెంత పంతాలు చూపితివో

చ. 2: పీడెము చేతఁబట్టుక వేసుకోక వున్నదిట్టే
అడరాని మాఁటలేమి యాడితివో
నీడనుండి యలయుచు నివ్వెరఁగుతో నున్నది
జోడుగూడేనంటా నెంత చొక్కులఁ బెట్టితివో

చ. 3: చివ్వనఁ దలవంచుక సిగ్గుతోడ నున్నది
నవ్వరాని నవ్వులేమి నవ్వితివో
రవ్వగా శ్రీవేంకటేశ రమణి మొక్కుచున్నది
కువ్వలుగా రతినెట్టు గూడితివో

రేకు: 0560-4 దేసాళం సం: 13-296

పల్లవి: ఎఱఁగ విన్నవించితి మిప్పుడే నీకు
జఱయుచు నాఁడువారు సాహసులు సుమ్మీ

చ. 1: చెంతల నీవొకతితో చేరి మాఁటలాడఁగాను
వంతుకు మాఁటలాఁడీని వాసికి నీకె
యింతట నీవు గనక యిట్టే ఆదరించకున్నా
యెంత సిగ్గువడునో యెఱఁగము సుమ్మీ

చ. 2: మరిగిన యాకెవద్ద మరి నీవు గూచుండఁగ
వరుసకుఁ గూచుండె వద్దనే యీకె
యిరవుగా నీవీవేళ నిట్టె మన్నించకున్నా
తరవాతి పనులెట్టో తలపించే సుమ్మీ

చ. 3: వేడుకకు నీవాకెను వెసఁ గాఁగిలించుకొంటే
యీడుగాఁ దా నిన్నుఁ గూడె యిప్పుడే యీకె
జాడతో శ్రీవేంకటేశ సతి నిట్టే పొందకున్న
పాడిపంతాలెట్టుండునో పచ్చిదేరుఁ జుమ్మీ

రేకు: 0560-5 గుజ్జరి సం: 13-297

పల్లవి: రమణుఁడు నాకు దాను రమణి నేను
అమరఁగ నెందాఁకా నాసవెట్టీఁ దాను

చ. 1: సెలవికి నవ్వుహెచ్చె చెక్కిటికిఁ జేయి వచ్చె
యెలమి నమ్మికలిచ్చీ నెందాఁకాఁ దాను
పులకలు మేన నిక్కె బుసకొట్టులివె దక్కె
పొలుపు మిగుల నెంత బుజ్జగించీఁ దాను

చ. 2: చిత్తములోఁ జింత నిండె సిగ్గులు మోమునఁ బండె
యిత్తల నొడఁబరచీ నెందాఁకాఁ దాను
బత్తికోరికెలఁ దొట్టె పలుకులు మోవిఁబుట్టె
కొత్తలుగా వలపెంత గురిసేసీఁ దాను

చ. 3: కన్నులఁ దేటలు వారె కాఁగిటఁ దగవు దేరె
యెన్నేసి వేసాలు సేసీ నెందాఁకాఁ దాను
అన్నిటా శ్రీవేంకటేశుఁ డట్టే తానె నన్ను నేలె
మన్ననల నన్ను నెంత మరగించీఁ దాను

రేకు: 0560-6 శ్రీరాగం సం: 13-298

పల్లవి: నీవెఱగని తగవు నెమరిఁ గేమా
కైవసమై యిటులైతే కాఁతాళము వుట్టిదా

చ. 1: ప్రియముతో వలపించి పెడవాడ వేయనేల
దయతోడ మన్నించఁ దగుఁ గాక
నయమునఁ బొందు లేనినాఁడోర్వవచ్చుఁగాక
క్రియఁచూపి పొనిఁగితే కేలిఁ గాఁక రేఁగదా

చ. 2: బత్తితోడ బిలిపించి పరాకులు చూపనేల
చిత్తగించి యాదరించఁ జెల్లుఁ గాక
హత్తి మాటలాడనినాఁ డైనట్లాయఁ గాక
పొత్తుకు వచ్చి లోఁగితే బూటకమై వుండదా

చ. 3: చెలిమితోఁ గాఁగిలించి సిగ్గులువడఁగ నేల
వలసిన చనవియ్యవలెఁ గాక
యెలమి శ్రీవేంకటేశ యిందాఁకా గుట్టు గాక
తలకొని కొసరితే తమకము నిండదా

రేకు: 0561-1 భూపాళం సం: 13-299

పల్లవి: వెన్నతోఁ బెట్టిరి నీకు వేసాలెల్లాను
పిన్ననాఁడే గొల్లెతలు పెక్కుచందములను

చ. 1: వన్నెగా సతులనెల్ల వలపించ నేరుతువు
విన్నపములు చేసితే విన నేర్తువు
సన్నల మోవితేనెలు చవిచూప నేరుతువు
మిన్నక మమ్మెల్లను నమ్మించ నేరవా

చ. 2: చుట్టరికములు చేసి చొక్కించ నోపుదువు
గట్టిగా రతుల బెనఁగ నోపుదువు
జట్టిగొని నవ్వు నవ్వి చనవియ్య నొపుదువు
మట్టుమీరి మమ్ము నిన్ను మరిగించ నోపవా

చ. 3: ప్రియముతోడుతను కాఁపిరము సేయఁగలవు
భయమెల్లఁ దీరిచి చేపట్టఁ గలవు
నియతి శ్రీవేంకటేశ నీవు మమ్ము నేలితివి
జయమాయ మాపట్టుకు జవదాఁటఁగలవా

రేకు: 0561-2 ధన్నాశి సం: 13-300

పల్లవి: ఈరీతి దయవుట్టెనా ఇన్నియుఁ జూచి
కూరిమి నిండెనా మేలుగురుతులు చూచి

చ. 1: చెప్పిన నామాటలు చెవిఁ బట్టెనా నీకు
ఇప్పుడైనా విరహపుటింతిఁ జూచి
తప్పులేని నీబాసలు తలఁచుకొంటివా నేఁడు
అప్పటి పానుపుమీఁది యలపులు చూచి

చ. 2: అందిచ్చిన కానుకలన్నియు గనుపట్టెనా
పొందులకు నేఁకారేటి పొలఁతిఁ జూచి
సందడించే వలపులు సరి వచ్చెనా నీకు
డిందువడని యాసల దిష్టములు చూచి

చ. 3: మచ్చిక నామొక్కులెల్ల మతికెక్కెనా నీకు
పచ్చిగా నిన్నుఁ గూడిన పడఁతిఁ జూచి
తచ్చి శ్రీవేంకటేశుఁడ తారుకాణాయనా నీకు
విచ్చనవిడి రతుల వేడుకలు చూచి

రేకు: 0561-3 ఆహిరి సం: 13-301

పల్లవి: ఇట్టే కరుణించవయ్యా యింతినిఁ జూచి
దట్టిమాయ వలపులు తమకమువల్లను

చ. 1: నొసలి కస్తూరిబొట్టు నునుఁజెమటఁ దడిసి
యసలాయ నిన్నుఁ బాసినందువల్లను
వుసురు నూరుపులచే నూఁగఁజొచ్చెఁబయ్యద
వెస నలయించినట్టి విరహమువల్లను

చ. 2: పూసిన గందపుఁబూఁత పులకలచేఁ జిటిలి
రాసివడెఁ బాసిన రారాఁపువల్లను
వేసటతోఁ బొరలఁగా వీడి వున్నది తురుము
పోసరించినట్టి తలపోఁతలవల్లను

చ. 3: తట్టుపునుఁగు చెక్కులఁ దతి కాఁకలఁ గరఁగె
వుట్టిపడీ నిన్నుఁ బాసి వున్నవల్లను
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి వింతలోనే
వెట్టదీరిన రతుల వేడుకలవల్లను

రేకు: 0561-4 శంకరాభరణం సం: 13-302

పల్లవి: కప్పురమందుకొంటిఁ గడపరాయ నీకుఁ
గప్పము మాజవ్వనము కడపరాయ

చ. 1: కన్నుల మొక్కేనోయి కడపరాయ నా
కన్నెచన్ను లేలంటేవు కడపరాయ
కన్నవారెల్లా నవ్వేరు కడపరాయ నాతో
సన్న లేల సేసేవు సారెఁ గడపరాయ

చ. 2: కలఁగంటిఁ గడవోయి కడపరాయ యిఁకఁ
గలఁచకు మాసిగ్గు కడపరాయ
కలువల వేసేవేల కడపరాయ నీకు
మొలకనవ్వులతోడ మొక్కేఁ గడపరాయ

చ. 3: కరుణించి నన్నేలితి కడపరాయ నీ
గరిమలెల్లాఁ గంటి కడపరాయ
గరిడిసామురతులఁ గడపరాయ నీకు
యిరవు శ్రీవేంకటాద్రి యిట్టే కడపరాయ

రేకు: 0561-5 శ్రీరాగం సం: 13-303

పల్లవి: ఏమని యానతిచ్చెనే యెదురుమాఁట
వేమారుఁ దనివి దీర వినుపించవే

చ. 1: కన్నుల మొక్కితి నని కానుక లంపతి నని
విన్నవించితివట వే విభునితోను
తన్ననే పాడినది తమకముతో నున్నది
తిన్ననై తన మనసు తెలిసెనటే

చ. 2: కడు వలచితినని కాచుకవుందాన నని
తడవితివటవే యాతనితోను
జడిగొనఁ గోరినది జాగరము సేసినది
అడరి తనకే సెలవాయనటవే

చ. 3: యెదురు చూచితినని యేఁకట నుందాన నని
ముదులకించితివటె ముందె తనతో
యిదే శ్రీవేంకటేశుడు యింతలోఁదా నన్ను గూఁడె
అదన నీవొడఁబాటు లాయనటవే

రేకు: 0561-6 సింధురామక్రియ సం: 13-304

పల్లవి: ఏకతానకు రారాదా యీడనేల కెరలేవు
చేకొని వీడెమిచ్చితే సేసలు వెట్టేవు

చ. 1: నవ్వుతా నీపై నేను నంటున గోరు మోపితే
రవ్వలు సేసేవింతలో రమణుఁడవు
పువ్వున వేసినవేటు బుజము నాఁటె నంటా
చివ్వన నేంటికి వద్దిచెలితోఁ జెప్పేవు

చ. 2: చుట్టిరికానకు నీతో సొలసి వొడివట్టితే
పట్టిపెనఁగుచు నన్నుఁ బచ్చి సేసేవు
తిట్టిన తిట్టులు నీపై తీగెలువారె నంటా
వొట్టులు వెట్టుచు నేల వొలలు వేసేవు

చ. 3: కడు వేడుకతో నిన్ను గాఁగిలించుకొంటేను
జడిగొని నా మోవి చవి చూచేవు
అడరి శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
విడువక నన్ను నెంత వేఁడుకొనేవు

రేకు: 0562-1 మలహరి సం: 13-305

పల్లవి: ఇప్పుడు విచ్చేసితివి యింటికాడకు
కుప్పలుగా వలపులు కురిసితిమయ్యా

చ. 1: నెలఁతల నెదురంపి నీకెదురులు చూచి
పెలుచన నిన్నునిట్టే పేరఁ బిలిచి
పలు సగినాలు చూచి పలుకులాలకించి
చెలరేఁగి-జాగరాలు సేసితిమయ్యా

చ. 2: పాటలు నీపైఁ బాడి పక్కన నీవేళ గాచి
కూటువ మనోరథాలు గోరి కోరి
గాటమున మొక్కుకొంటా కానికె చేతఁ బూనుక
నీటున నిందాఁకాను నిలుచుంటిమయ్యా

చ. 3: నీరూపు దలపోసి నిద్దుర కలలు గని
నేరుపుతో నీవురాగా నిన్నుఁ జేరి
యీరీతి శ్రీవేంకటేశ యింతలో నిన్నుఁ గూడితి
మేరతో నిట్టే నిన్ను మెచ్చితిమయ్యా

రేకు: 0562-2 దేశాక్షి సం: 13-306

పల్లవి: వింటివో వినవో కాని వేడుకతో నున్న దాన
జంటయై యుండఁగా నిన్ను జరయుచుందాన

చ. 1: మలసి యెప్పుడు నీతో మాటలాడుదునో యని
మొలచినట్టి తమకమున నుందాన
యెలమి నీ వూడిగెములెన్నఁడు సేతునో యని
చెలరేఁగి తపములు సేయుచుందాన

చ. 2: ననిచి యేవేళ నీతో నవ్వులు నవ్వేనో యని
కొనసాగే కోరికలు కోరుచుందాన
చనవుతో నీరూపు యెచ్చటఁ జూతువో యని
దినదినము యాసల దివురుచుందాన

చ. 3: కందువ నెచ్చోట నిన్నుఁ గాఁగిలింతునో యని
విందుల వలపు విన్నవింపుచుందాన
చెంది నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ
యిందుకే నీపై బత్తి నిట్లుందాన

రేకు: 0562-3 వరాళి సం: 13-307

పల్లవి: వేడుక మీవలపులు వెల్లవిరాయ
యీడు జోడైన పొందులు యిట్టుండవలదా

చ. 1: సెలవుల నవ్వుతాను చిప్పిలి సిగ్గులతోడ
కలువపువ్వులాకె కానుకిచ్చెను
కొలువులోపల నీవు కుందణపుటుంగరము
తలకొని నీవు వుచితముగా నిచ్చితివి

చ. 2: కన్నులను మొక్కుతాను కడలేని యాసతోడ
కన్నె సూడిదె వట్టె టెంకాయ నీకు
సన్నల మేడలోనుండి చనవునఁ గంటసరి
యెన్నికతోడ నీవు యీవిగా నిచ్చితివి

చ. 3: సరములాడుతాను చల్లని పానుపుమీఁద
గరిమె నద్దము చూపి కలసె నిన్ను
యిరవై శ్రీవేంకటేశ యేలితివాకెను నన్ను
యెరవుతో మోవిలంచ మిద్దరికిచ్చితివి

రేకు: 0562-4 సాళంగనాట సం: 13-308

పల్లవి: నీవెఱఁగవా యిది నెఱజాణవు
వోవరిలో మమ్మేల వొరసేవు నీవు

చ. 1: ఆఁడుదానికి సిగ్గులే అందపు సింగారాలు
నీటుతోడ నుండేగుట్టు నిండుసొమ్ము
కూటమిలో వొడికము గురియైన సంపద
గాటమైన వినయము ఘనరాజ్యపదవి

చ. 2: నేరుపుతో యడఁకువ నిచ్చకల్యాణము
మేరమీర నీగుణము మించైనమేలు
గారవపుటిచ్చకము కందువ నిధానము
సైరణతోడి నడక సతమైన లాభము

చ. 3: కడలేనియట్టి వాసి కమ్మిన తంగేటిజున్ను
గుడిగొన్న శీలము కొంగుపసిఁడి
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కడఁకతో మెలఁకువ కలిమిలో కలిమి

రేకు: 0562-5 చాయనాట సం: 13-309

పల్లవి: ఏల రట్టుసేసితి వింతేసి నన్ను
లోలోనే చెప్పేఁగాని లోనికి రారాదా

చ. 1: సారెకు నీవు నాతో జాణతనాలాడఁగాను
చేరి చేరి నవ్వేరు చెలియలెల్లా
గారవాన నాసరుసఁ గమ్మటిఁ గూచుండఁగాను
తారుకాణలివి యని తమలో నెంచేరు

చ. 2: చన్నులమీఁది పయ్యద జార నీవు దియ్యఁగాను
సన్నలు సేసుకొనేరు సభలోనెల్లా
పన్ని నాచేతికి పూవుబంతి యిట్టె యొసగఁగా
యిన్నిటాఁ బొందుకు గురుతిది యనేరు

చ. 3: కప్పురపు వీడెమిచ్చి కాఁగిలించుకొనఁగాను
చొప్పులెత్తి మొగములు చూచుకొనేరు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
చిప్పిలఁ గళలు రేఁగి సిగ్గులువడేరు

రేకు: 0562-6 దేసాళం సం: 13-310

పల్లవి: ఏమి సేసితివో కాని యింతికి నీవు
గామిడినేఁతల నీపై గాత సేసీనోయీ

చ. 1: పలచగా నవ్వి నీతో పంతములాడుకొంటాను
చెలి యున్న భావము చూచితివా వోయి
తలకొన్న చెలులను తగవులు చెప్పుమని
సొలసీని పలుమారు చూచితివా వోయీ

చ. 2: వోరచూపులు చూచి వొట్టువెట్టుకొంటాను
జీరలు దీసినది చూచితివా వోయి
కేరడపు సేఁతలను కేకరించి ననుపులు
జోరునఁ జెమట గారీఁ జూచితివా వోయి

చ. 3: చిక్కని చన్నులనొత్తి చేరి కాఁగిలించుకొంటా
చెక్కునొక్కి నిన్నిట్టే చూచితివా వోయి
యిక్కువతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చొక్కించి నిన్నాకె మెచ్చిఁజూచితివా వోయీ

రేకు: 0563-1 మధ్యమావతి సం: 13-311

పల్లవి: కంటిమయ్యా యీ భాగ్యము కతలుగ నిట్టే నేఁడు
జంటలాయ వేడుకలు సరికి బేసికిని

చ. 1: చెలువుఁడ నీవిట్టే చేతికి లోనై యుండఁగ
వలపులు చవులాయ వాడలోనెల్లా
యెలమి నీవు కన్నులయెదుటనే వుండఁగాను
తలపోఁతలీడేరెఁ దారుకాణలుగను

చ. 2: అమరఁ గాఁపురము నీవట్టే మాతోఁ జేయఁగాను
తమకమగ్గువాయ చెంతలనెల్లాను
మమకారమున నీవే మాటలట్టే యాడఁగాను
ప్రమదపుటాస హెచ్చె భావించినట్టెల్లాను

చ. 3: గతిగూడి నీవు నన్ను గాఁగిలించుకొనఁగాను
రతులెంతే వెలవెట్టె రాతిరెల్లాను
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
సతమాయఁ బులకలు చల్లువెదలుగను

రేకు: 0563-2 కాంబోది సం: 13-312

పల్లవి: ఈడకుఁ బిలువవయ్యా యిన్నియు నడుగుదము
జోడుగూడినట్టి తనసుద్దులెల్లాఁ గంటిమి

చ. 1: సెలవుల నవ్వీ నాపె సిగ్గులువడీ నాపె
పొలఁతికి నీకు దొల్లి పొందుగలదో
తలపించీ మాటలు తప్పక నీ మోము చూచీ
యెలమిఁ గలికితనా లెంత నేరిచినది

చ. 2: కనుసన్న సేసీ నాపె కానుకలిచ్చీ నాపె
చనవిచ్చితివో యింత సతికి నీవు
వొనరించీఁ బ్రియములు వూడిగేలు సేయవచ్చీ
తనలోనె యెంతేసి కతలఁ గఱచినది

చ. 3: చేతులు చాఁచీ నాపె చేరి కాఁగిలించీ నాపె
యీతరుణి నిల్లాలిఁగా నేలుకొంటివో
యేతుల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
గాతలఁ దానెంత నీతోఁ గడు జాణైనది

రేకు: 0563-3 సౌరాష్ట్రం సం: 13-313
పల్లవి: విన్నవించ నేమిటికి వేగినంతాను
నిన్న నేఁటి సేఁతలెల్లా నీకే సెలవు
చ. 1: సిగ్గువడ్డదానఁ గాన చెక్కునఁ జెయివెట్టితే
యెగ్గుపట్ట నేమిటికి నింతలోనే
అగ్గమైన విరహాన నలసి వుండినదాన
నిగ్గున నేనెట్టుండినా నీకే సెలవు
చ. 2: పాయపుదానఁ గనక పానుపుపై నేనుండితే
ఆయాలంటి నవ్వనేల అందుకుఁగాను
వేయిటికి నేను నీవేళ గాచుకున్న దాన
నీ యిచ్చకొలఁది యిఁక నీకే సెలవు
చ. 3: నీ మేలుదానఁ గాన నే నిన్నుఁ గాగిలించితే
చేముట్టి పెనఁగనేల చిమ్మిరేఁగుచు
ఆముక శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
నేమెంత గొసరినాను నీకే సెలవు

రేకు: 0563-4 ఆహిరి సం: 13-314

పల్లవి: ఎప్పుడయ్యా నీకరుణ యింతిమీఁదను
చిప్పిలు చెక్కులునిండాఁ జెమటలు నించెను

చ. 1: వెక్కసపు వలపులు విన్నవించరాక చెలి
లెక్కించి తమ్మి రేకుల లేకలంపెను
జక్కవ చన్నులనొత్త సారె సారె సిగ్గువడి
ముక్కరగదల ముసిముసినవ్వు నవ్వెను

చ. 2: అంతరంగములో యాస లడ్డపెట్టరాక సతి
కాంతాళమున చెలిక త్తెనంపెను
పంతపుమాటల మోవి బల్లుమోప సిగ్గువడి
చెంతలఁ గొప్పు వీడఁగ సేస నీపైఁ బెట్టెను

చ. 3: వేడుక కాఁగిటిరతి వెలవెట్టలేక యింతి
నీడ చూచే యద్దము కానికె యంపెను
యీడుగా శ్రీవేంకటేశ యీకె నిట్టే కూడితివి
జాడతోఁ బయ్యద జార సన్న నీకుజేసెను

రేకు: 0563-5 కురంజి సం: 13-315

పల్లవి: చేకాచుక రావయ్య చెలిని నీవు
చాకొని గోరఁ జిమ్మకు తమ్మిపువ్వవంటిది

చ. 1: చెక్కులవెంట వడిసీ సింగారరసములు
చుక్కలు గాసీ మోవిపై సుదతికిని
చిక్కించుక పానుపుపై సేఁతలేమి సేసితివో
మిక్కిలి యలసె నీకె మించుఁదీగెవంటిది

చ. 2: పొదిగొనీ మేననెల్లా పులకల జొంపములు
కదిమీఁ గన్నుల చెంగావితేటలు
యిదివో సరసముల నెంత పెనఁగితివో
సదమదమాయ నీకె జాజిమొగ్గవంటిది

చ. 3: చెలరేఁగీ నుదుటిపై చికురపుఁ దుమ్మిదలు
కళలు మోమున నట్టే కారుకమ్మీని
యెలమి శ్రీవేంకటేశ యీకె నెంత గూడితివో
నిలువున జడిసీ వెన్నెలబొమ్మవంటిది

రేకు: 0563-6 శుద్ధదేశి సం: 13-316

పల్లవి: ఇంతుల మంచిగుణాలు యెఱఁగవింతే కాక
కాంతుఁడవాకెమనసు గనుకొనరాదా

చ. 1: పిమ్మట దొరైన చెలి ప్రియములు చెప్పుఁగాక
యెమ్మెలాడుకొనునా యేడనై నాను
కమ్మి వలపు గలితే కానుకలంపుగాక
దొమ్మిమాట లాడిడి దరవచ్చునా

చ. 2: పాయలేనితి యిట్టే బాతిపడి నవ్వుగాక
చాయల సన్నలట్టే సాదించునా
చేయి నమ్మితే నిట్టే సేవలు సేసుఁగాక
కాయకపు సుద్దులకు కాఁతాళించఁ జూచునా

చ. 3: రతికి లోనైనయాకె రమ్మని పిలుచుఁగాక
తతిగొని పెనఁగునా తన్నుఁ దానే
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టే
సతమైన పనులకు జాడలు వేరౌనా

రేకు: 0564-1 రామక్రియ సం: 13-317

పల్లవి: ఊడిగపు వారినేల వొంటి నాసలు రేఁచేవు
తాడుపడి లోలోనే తమకించి రతికి

చ. 1: పట్టిన కాళాఁజియాపెపైఁ జేయి వేసుకొని
వొట్టుచుఁ దమ్ములమట్టే వుమిసేవు
గుట్టున నందుకు నింతి గుబగుబఁ జెమరించి
నెట్టుకొని మోహించి నివ్వెరఁగు నొందెను

చ. 2: అడపము చెలిమీఁదనట్టె పాదాలు చాఁచుక
అడరుచు నిక్కి యాకులందుకొనేవు
తడఁబడి యాచెలి తనువెల్లాఁ బులకించి
నిడువాలుఁగన్నులను నీమోముచూచెను

చ. 3: గిండివట్టే యాపె కుచగిరులపై నొరుగుక
అండనే చల్లని పన్నీ రారగించేవు
దండిగా శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
మెండుగా తానూఁ గూడి మెచ్చులెల్లా మెచ్చెను.

రేకు: 0564-2 సామంతం సం: 13-318

పల్లవి: ఏల దాఁచుకొనేవు నీవెరిఁగినదానవు
వేళ గాచుకొని వెల్లవిరి సేయరాదా

చ. 1: నెలఁత నీమోముతేట నిండుమోవి తేనెలూట
పొలసి నీరమణుఁడు పొగడీనదే
చిలికి నీవేల యిఁక సిగ్గులు వడేవింత
పలుమారు నింకాఁ గొంత పచారించరాదా

చ. 2: నెఱుల నీపెనుఁగొప్పు నిచ్చజవ్వనపుఁ జొప్పు
తఱి నీవిభుఁడు వ్రాసీ తమితోనదే
మఱఁగేల సేసేవు మర్మములుగా నింత
గుఱిగా నింకా నీవే కుప్పళించరాదా

చ. 3: భావపు నీలోకరఁగు పయ్యద జారుఁజెరఁగు
శ్రీవేంకటేశుఁడు వెల సేసీనదే
మోవనాడి మాటలేల మూటలు గట్టేవింత
యీవిధానఁ గూడితివి యేర్పరచరాదా

రేకు: 0564-3 హిందోళం సం: 13-319

పల్లవి: ఎఱిగని యాఁటదాని నెంత సేసేవు
వెఱగయ్యీ మాకు నీవిధములు చూచి

చ. 1: మట్టుమీఱ నవ్వునవ్వి మానముపైఁ జేయి వేసి
ఱట్టులు సేసేవుగా మెఱయ నింతిని
దిట్టమాటలాడి మోవితేనెల చవులు చూపి
యెట్టు బ్రమయించేవు యింతలో నీవు

చ. 2: సారె సారె గోరనూఁది జవ్వనము పెడరేఁచి
అరితేరి నవ్వేవుగా అంగనను
నేరుపులు వచరించి నెట్టుకొని కొంగువట్టి
యీరీతినేల పఱచే విదివో నీవు

చ. 3: చన్నులంట గాఁగిలించి సరసములాడి యాడి
యెన్నిరతులఁ గూడేవు యీకన్నె నీవు
నన్ను శ్రీవేంకటేశుఁడ నమ్మించి యేలితివి
మన్నించి యెంత మెచ్చేవు మమ్మునిట్టే నీవు

రేకు: 0564-4 భైరవి సం: 13-320

పల్లవి: ఏరీతి వేడుకొనేవే యిటు నీవు
నీరతికిఁ గాచుకొని నిలుచున్న వాఁడు

చ. 1: చేయివట్టుకొని నీచెక్కునొక్కే రమణుని
ఆయములు సోఁక వెంగేలాడితివి
చాయలు సన్నలుఁ జూపి సంగడినున్న యతని
సోయగపుఁ గన్నులను సొలసితివి

చ. 2: తమ్ముల మిడుచు నీ దప్పి దేరిచే విభుని
బొమ్మల జంకించి సొలపులఁ దిట్టితి
సొమ్ముల నింపుచు నిన్నుఁ జొక్కించే యాతని
దొమ్మితోఁ బాదము దొక్కి తొడపై నెక్కితివి

చ. 3: చెనకి కాఁగిటగూడి శ్రీవేంకటేశ్వరుని
ననుపున నలయించి నవ్వితివి
మనసు మర్మమెరిఁగి మన్నించే యీతని
తనివార మోవియిచ్చి దక్కఁగొంటివి

రేకు: 0564-5 సాళంగం సం: 13-321

పల్లవి: మొక్కితి ననవే తన మొక్కలపు చేఁతలకు
దిక్కుల నెంతేసి తరితీపులఁ బెట్టీని

చ. 1: తగవులన్నియునుఁ దనచేతనే వింటి
యెగసక్కేలెల్లా నిఁక నేలాడీనే
నగిన తన నవ్వులు నాఁటె నా మనసులోన
పగటునఁ దనచేత పంతము గొనేనా

చ. 2: అందికలుఁ బొందికలు నప్పుడే నేఁ గనుఁగొంటి
యిందులో తనపై నింద లేల మోపీనే
అందపుఁ దన సరసా లలవాటే నాకుఁ దొల్లి
మందెమేలమున నిఁక మంకులు చూపేనా

చ. 3: ననుపులు మన్ననలు నాకు నేఁడే తానొసఁగె
యెనలేక వలచితి నేల దూరేనే
ఘన శ్రీవేంకటేశుఁడు కాఁగిలించి ననుఁ గూడె
పనివడి యిఁక వేరే పట్టి పెనఁగేనా

రేకు:	0564-6 ముఖారి సం:	13-322
పల్లవి:	ఎరవుల దానివలె నేమి మమ్ము నడిగేవు
సరసమాడి విభుని చనవు చేకోరాదా
చ. 1:	అంకెల నాతనిమీఁద నప్పుడు నీవు చల్లిన
జంకెన చూపులే కావా చవి సేసెను
పొంకమై మారుకు మారు పూఁచి కుమ్మరించినట్టి
వంకలమాటలే కావా వలపు పుట్టించెను
చ. 2:	వెలలేక పతితోను వేడుకలు పుట్టించిన
సెలవినవ్వులే కావా చిమ్మి రేఁచెను
చలపట్టి యొండొరుల సరికి బేసికిఁ జేసే
పెలుచు సన్నలే కావా ప్రియాలు పుట్టించెను
చ. 3:	శ్రీవేంకటేశ్వరుని సిగ్గుదేరఁ గూడినట్టి
నీ వాఁడి చన్నులే కావా నెరవేర్చెను
తాపుకొని లోలోని తమకములొనరించే
భావపు రతులే కావా పంతములందించెను.

రేకు: 0565-1 అమరసింధు సం: 13-323

పల్లవి: ఏమి చూచే వింతిదిక్కు యెందాఁకాను
సాములనే చెనకుచు చనవియ్యరాదా

చ. 1: కొప్పు నీవు ముట్టితేను కుప్పవడి వెంట్రుకలు
చిప్పిల నంతలోఁ జెలి సిగ్గువడెను
వొప్పుగ జవ్వాది చేత నొక్కింత చమరుకొని
కప్పినీవైనా కీలుగంటు వేయరాదా

చ. 2: పొలసి పయ్యెదంటితే పోఁకముడి జారెను
వెలయ నంతలో నింతి వెరగందెను
బలిమిఁ బన్నీటను పదనుగాఁ జలికించి
చెలరేఁగి యిప్పుడే కుచ్చెల వోయరాదా

చ. 3: కడఁగి కాఁగిలించితే గందపుఁ బెంట్లు రాలెను
నడుమ నందుకుఁ గాంత నవ్వు నవ్వెను
అడరి శ్రీవేంకటేశ అంగపుఁ జెమట నించి
తడిపి కమ్మటి వసంతము చల్లరాదా

రేకు: 0565-2 నారాయణి సం: 13-324

పల్లవి: చిత్తగించి వినవయ్య చెలికత్తియను నేను
పొత్తుల మీఇద్దరికిఁ బొరగు మానెలవు

చ. 1: వింతలేక మాయింటికి వేగమే విచ్చేయవయ్య
కాంత నీకెదురువచ్చి కాచుకున్నది
మంతనాన వేడుకతో మన్నింతువు రావయ్య
పంతానఁ బానుపు మీఁదఁ బవ్వళించి వున్నది

చ. 2: ఇరవై మావాకిటికి నిట్టే చనుదేవయ్య
తరుణి తొంగిచూపులఁ దతిగొన్నది
సరసములాడుటకు చయ్యన నరుదేవయ్య
తరమిడి నుద్యోగము దలపోయుచున్నది

చ. 3: వొద్దిక మాలోఁగిటికి నొనగూడ రావయ్య
సుద్దులాలకించి ఇంతి చొక్కుచున్నది
గద్దరి శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితివిట్టే
ముద్దుల మాటల నీకు మొక్కుచున్నది

రేకు: 0565-3 లలిత సం: 13-325

పల్లవి: ఇరవాయ వలపులు యిద్దరికీ నీడనే
సరవితో నేలితివి చనవిమ్మీ యిపుడు

చ. 1: వొడి పట్టుకొంటి వాకె వోపనంటాఁ బెనఁగీని
వొడఁ బరచేవు చన్నులొరసుకొంటా
బడలి వున్నది యాకె బ్రమలఁ బెట్టక యిఁక
తొడపై నిడుకోరాదా తొడిఁబడును

చ. 2: చేయి పట్టుకొంటి వాపె చేరి యానలు వెట్టీని
నాయము వెట్టేవు మోవి నవ్వు కొంటాను
యీయకొని వున్న దాకె యేఁపులఁ బెట్టక యిఁక
పోయరాదా తలఁబాలు పొద్దులు గడపక

చ. 3: కొప్పువట్టుకొంటి వాకె గుచ్చి కాఁగిలించుకొనీ
చొప్పులంటించేవు రతిఁ జొక్కించుకొంటా
ఇప్పుడే శ్రీవేంకటేశ యెలయించకిఁక నాకె
దప్పిదేరిచితి వాకెదండ నుండరాదా

రేకు: 0565-4 ముఖారి సం: 12-326

పల్లవి: ఏల వొడఁబరచేవే యిప్పుడు నన్ను
మేలిమి పతి వచ్చితే మెఱయించే వలపు

చ. 1: చనవు గలవేళను సరసములాడవచ్చు
ననుచని వేళను నవ్వులేడనే
మనసులేకములై తే మర్మములు సమకూడు
పెనఁగేటి వేళను బెరయునా పొందులు

చ. 2: మొక్కేటి వేళను ముందుముందే దయగల్గు
తక్కించే వేళను తనివేడదే
వొక్కటైన వేళను వొడఁబడు మాటలు
కక్కసించే వేళను కతలు చౌలౌనా

చ. 3: కూడిన యీవేళను గురుతులెల్లా నిండు
మేడెపు రతివేళను మేరగలదా
యీడనే శ్రీవేంకటేశు డింతలోనే నన్ను నేలె
వేడుకయిన వేళను వేసటలు పుట్టునా

రేకు: 0565-5 నాదరామక్రియ సం: 13-327

పల్లవి: ఏడ నేరుచుకొంటివి యిటువంటి కొత్తలు
వేడుకలివెల్లా నీకు వెల్లావిరులాయనా

చ. 1: సమ్మతించఁ జెప్పి నాచంటిపై గోరుదీసేవు
వుమ్మడి నేమి సేసినా నొద్దంటినా
యెమ్మెల నెవ్వతై నాను యిటువలెనే నీకు
చిమ్ముచుఁ జేసే సేఁతలు చెప్పిచెప్పి చేసునా

చ. 2: గడ్డముపట్టి వేడుక గంటి సేసేవు మోవి
వొడ్డి వూరకే సేయఁగా నొద్దంటినా
వొడ్డారానా నెవ్వతైనా నొద్దనుండి నీ కిట్ల
జిడ్డుదేర ననుపులు చెప్పి చెప్పి చేసునా

చ. 3: యెలమి శ్రీవేంకటేశ యెవ్వతైనా నా నీకిట్ల
చెలరేఁగిని పెండ్లిండ్లు చెప్పిచెప్పి చేసునా
కలసి కాఁగిటఁ గూడి కంకణము గట్టేవు
వొలసి ముందే కట్టఁగా నొద్దంటినా

రేకు: 0565-6 హిందోళవసంతం సం: 13-328

పల్లవి: నీకేల కొంకను నిన్ను నాడేవారెవ్వరు
దాకొని వొరసితేనే తల వంచేవు

చ. 1: కొనచూపులను నీకు గొచ్చి కొచ్చి మొక్కఁగాను
వనితతో నింతయేల వంతులాడేవు
ననుపున సెలవుల నవ్వు నీతో నవ్వఁగాను
వొనరి యంతేసి యాల వొడ్డుకొనేవు నీకేల

చ. 2: సెలవుల నవ్వి నవ్వి చిత్తము గరఁగించఁగా
చెలియకు నింతేశాల సిగ్గు రేఁచేవు
మొలకచన్నుల నొత్తి ముద్దు నీకుఁ జూపఁగాను
తలపోసి నీ వేలింత తడఁబడేవు

చ. 3: కప్పురము మోవి నిచ్చి కాఁగిలించుకొనఁగాను
వుప్పతిల్లియేఁటి కసురుసురనేవు
యిప్పుడే శ్రీవేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
చొప్పులెత్తి యింకనేల సోద్య మనేవు

రేకు: 0566-1 దేవగాంధారి సం: 13-329

పల్లవి: భావ మెఱిఁగిన నల్లబల్లి చెన్నుఁడా
నావద్దనే వుండుమీ నల్లఁబల్లి చెన్నుఁడా

చ. 1: వేసరక నీవు నాతో వేమారుఁ జేసినట్టి
బాసలు నమ్మితి నల్లఁబల్లి చెన్నుఁడా
వాసికి వన్నెకు నీకు వలచి చొక్కితి నేను
నా సూటికే మన్నించు నల్లఁబల్లి చెన్నుఁడా

చ. 2: క్రియ గూడ నేను నీ కేలువట్టి పెండ్లాడితి
బయలీఁదించకు నల్లఁబల్లి చెన్నుఁడా
ప్రియములు రెట్టింపఁ బెనఁగితి నిందాఁకా
నయములు చూపుమీ నల్లఁబల్లి చెన్నుఁడా

చ. 3: యెనిసితి విటు నన్ను నియ్యకోలు సేసుకొని
పనుపడె రతి నల్లఁబల్లి చెన్నుఁడా
ఘనశ్రీవేంకటాద్రిపై కందువ నేలుకొంటివి
నను నిందరిలోపల నల్లఁబల్లి చెన్నుఁడా

రేకు: 0566-2 దేశాక్షి సం: 13-330

పల్లవి: నీ నేరమెంచుకోక నెలఁతను దూరేవు
మేను మేనుఁ బెనఁగితే మించు గోరంటించదా

చ. 1: సిగ్గువడ్డ చెలిమీఁద జేయి నీవు వేసితేను
దిగ్గన లేచి గొప్పతిట్టు దిట్టదా
వొగ్గి ముసుఁగు వెట్టుక వుండఁగా వీడెమిచ్చితే
బగ్గనఁ జేతిపూవుబంతిఁ గొని వేయదా

చ. 2: తలవంచుకొన్న యాపెఁ దడవి కొంగు వట్టితే
చలముతోఁ గొసరుచు జంకించదా
వొలిసి కంబము వట్టుకున్నయాపెఁ జెనకితే
బలిమిఁ జన్నుల నొత్తి పంతములు గొనదా

చ. 3: పాదాలొత్తే యాపెను పట్టి కాఁగిలించుకొంటే
కాదనక నీమోవి గంటి సేయదా
యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
పోదిసేసి అట్టె నిన్నుఁ బొగడఁగ వలదా

రేకు: 0566-3 సామంతం సం: 13-331

పల్లవి: చూడ నిన్నిటా జాణఁడు చొక్కనాథుఁడు
వీడెమిచ్చె నాకునిదె వెసఁ జొక్కనాథుఁడు

చ. 1: అట్టె నీతోమాటలాడి ఆకెతోడా మాటలాడీఁ
జుట్టమిందరికిఁ గదే చొక్కనాథుఁడు
పట్టి నీకొంగప్పటిని పరాకులాపెపై నించీ
దిట్ట యిన్నిటానుఁ గదే చొక్కనాథుఁడు

చ. 2: సెలవుల నీతో నవ్వి సిగ్గున నాకెతో నవ్వీ
సులభుఁడే యిన్నిటాను చొక్కనాథుఁడు
వలపు నీపైఁ జల్లి వంతుకాపెకునుఁ జల్లి
అలరి సందడిఁ బెండ్లాడీఁ జొక్కనాథుఁడు

చ. 3: తగ నిన్నుఁ గూడి యాకెఁ దమకించి కూడెను
సుగుడ యిన్నిటాఁ గదే చొక్కనాథుఁడు
అగపడి శ్రీవేంకటాద్రిపై నన్నునేలెను
తగవరి దానే కదే తతిఁ జొక్కనాథుఁడు

రేకు: 0566-4 శ్రీరాగం సం: 13-332

పల్లవి: ఏఁటి చక్కఁదనము యేమి బాఁతి నేము
చాటువ జవ్వనమున సడిఁబడ్డ వారము

చ. 1: పుక్కట చకోరములఁ బోలేటి మాకన్నులు
జక్కవ పిట్టిలవంటి చన్నులు మావి
పిక్కటిల్లు చందమామబిల్ల వంటి మొగము
ముక్కు నువ్వుఁబువ్వుఁ బోలే మురిపెపువారము

చ. 2: గుంపుఁ దుమ్మిదరెక్కల కొలము మాకురులు
సొంపు దొండపండువంటి చొక్కపుమోవి
సంపద లేఁత చిగురుజాతి మాపాదములు
ఇంపులఁ దీగెలవంటి వివివో మాచేతులు

చ. 3: సరిలేని సింహపు చందము మానడుము
పరగ చక్రమువంటి బటువు మాపిరుఁదు
గరిమ శ్రీవేంకటేశ కలిసితి మమ్మునిట్టే
పురిగొను బంగారుబొమ్మవంటి మేను

రేకు: 0566-5 లలిత సం: 13-333

పల్లవి: అరయ శ్రావణ బహుళాష్టమి చంద్రోదయాన
సిరులతోనుదయించె శ్రీకృష్ణుఁడిదివో

చ. 1: వసుదేవునిపాలిటి వరతపోధనము
యెసగి దేవకీదేవి యెదపై సొమ్ము
సుసరాన గొల్లెతల సొంపు మంగళసూత్రము
శిసువై వుదయించె శ్రీకృష్ణుఁ డిదివో

చ. 2: నందగోపుఁడు గన్న నమ్మిన నిధానము
పొందగు యశోదకు పూజదైవము
మందల యావులకును మంచి వజ్రపంజరము
చెంది యుదయించినాఁడు శ్రీకృష్ణుఁడిదివో

చ. 3: సేవ సేసే దాసుల చేతిలోని మాణికము
శ్రీవేంకటాద్రి నేచిన బ్రహ్మము
వోవరి నలమేల్మంగ నురముపైఁ బెట్టుకొని
చేవదేర నుదయించె శ్రీకృష్ణుఁడిదివో

రేకు: 0566-6 శంకరాభరణం సం: 13-334

పల్లవి: తేటతెల్లమాయ తిల్లగోవిందుఁడా
నీటు రాజసము నిండెను నీకు

చ. 1: చేరి నిన్నొకతె చేయి వట్టుకొనె
కూరిములు సారెఁ గొసరెనొకతె
యేరీతిఁ దనిపే విద్దరిని నీవు
ఆరీతి వలపులబ్బెను మీకు

చ. 2: చిమ్ముచు నొకతె సిగ్గులువడెను
బొమ్మల జంకించెఁ బోరచి నొకతె
యెమ్మెలకిద్దరి నెట్టు లాలించేవు
దొమ్ముల యాసలు దొరకె మీకు

చ. 3: కందువ నొకతె కాఁగిలించి కూడె
చెంది వేరొక్కతె సేసవెట్టి కూడె
యిందరు శ్రీవేంకటేశల మేల్మంగ
పొందులన్నిటాను పొసఁగె మీకు

రేకు: 0567-1 నాగవరాళి సం: 13-335

పల్లవి: మగవాని కింతయేల మరి కొంకను
అగడు సేయకు మమ్ము నందరిలో నిఁకను

చ. 1: అంగనతో నీవేకత మాడేవేళ వచ్చితేను
చెంగట నేఁడెంతేసి సిగ్గువడేవు
సంగతి నీవూడిగపు సతులలోదానఁ గానా
వెంగెము సేసుక యెంత వేరుసేసేవు

చ. 2: సరసిజాక్షితో నవ్వే సమయాన నే మొక్కితే
శిరసు వంచుక యాల సిగ్గువడేవు
అరిది నీరాణివామైనట్టి దానఁగానా
విరులమాఁటున నేల వెరగువడేవు

చ. 3: యీవేళ నింతిఁ గూడితి విట్టే నేనుఁ గూడితేను
శ్రీవేంకటేశుఁడ యేల సిగ్గువడేవు
గోవిందరాజ నిన్నుఁ గొలిచినదానఁ గానా
వేవేలు రతుల నేల వింతలు సేసేవు

రేకు: 0567-2 సాళంగనాట సం: 13-336

పల్లవి: ఏమి జూజాలాడేవు యెక్కడ చూచేవు నీవు
కామినిఁ జేకొనవయ్య కప్పురమీవయ్య

చ. 1: సేస కొప్పు వంచుకొని చెక్కునఁ జెయ్యిడుకొని
ఆసపాటుఁజూపు నీపై నట్టే చల్లీని
వాసులకు బెనఁగుచు వంతుకుఁ గాచుకున్నది
యీసుద్దులు వినవయ్య ఇంతి మన్నించవయ్యా

చ. 2: అండనిట్టే నిలుచుండి ఆయముల మాటలాడి
కొండలవంటి చన్నుల గుచ్చీ నిన్ను
నిండుకొన నవ్వుచును నీకె లాచుకున్నది
దండిగాఁజూడవయ్య తరుణిఁ గావవయ్యా

చ. 3: పానుపుపై గూచుండి పంతమునఁ గాఁగిలించి
పూనిన రతుల నిట్టే పాదిగీ నిదే
శేసగాఁ గూడీ నిదె శ్రీవేంకటేశ్వర
నానాగతి నేలవయ్య నమ్మికలీవయ్యా

రేకు: 0567-3 పాడి సం: 13-337

పల్లవి: ఆతడు బత్తిగలఁడు అన్నిటా నీపై నిదే
నీతితోడ నుండవే నీకే మేలు

చ. 1: వేసరుకొనకువే విభుఁడు దానే వచ్చీ
ఆసపడి వుండవే అన్నియు లెస్సయ్యీనీ
వాసిఁ బంతాలాడకువే వలపులు చవులయ్యీ
బాసలు దలఁచుకోవే పట్టమేలేవు

చ. 2: యెగ్గులు వట్టకువే యీతఁడే నిన్ను మన్నించీ
సిగ్గులు వడకువే చింత దీరీని
వెగ్గళపు జంకెలేలే వేడుక దానే పుట్టీ
వొగ్గి కాచుకుండవే వుర మెక్కేవు

చ. 3: సేవలింకాఁ జేయవే శ్రీవేంకటేశుఁడు గూడీ
వావులు చెప్పితి వౌనే వన్నేలుగాను
భావములోఁ గొంకకువే పచ్చి దేరీఁ దమకము
దేవులవై మెరయవే దిష్టమయ్యీ భోగము

రేకు: 0567-4 ఆహిరి సం: 13-338

పల్లవి: ఏమి సేతు నీచిత్త మెటువలె నుండునో
ఆమాటకే లోఁగితి నన్నాదరించవయ్యా

చ. 1: చాలుకొని నీతోను సరసములాడఁగాను
ఆలించి మందెమేళ మనవుగదా
నాలి సేయకప్పటిని నవ్వులెల్ల నవ్వఁగాను
ఆలరి యాఁటది యని ఆడికెలు సేతువో

చ. 2: వొడిగట్టుకొని నీకు వూడిగేలు సేయఁగాను
అడరి యిచ్చకురాల ననవు గదా
తడబడ వీడేలు దండనుండి ఇయ్యఁగాను
కొడిమలు గట్టి కొంత కొసరుదువో

చ. 3: పానుపు మీద నుండి భావములు గరఁచఁగా
ఆనుకొని గయ్యాళి ననవు గదా
పూనుక శ్రీవేంకటేశ పొంచి నన్ను గూడితివి
యీ నెపాన నన్ను నిట్టె యేలుదువో

రేకు: 0567-5 గౌళ సం: 13-339

పల్లవి: ఎంతని పొగడేమే నీయిటువంటి సుద్దులు
వంతులకు సవతులవంటిదానవా

చ. 1: తేనెలువంటి మాటలు తేటలుగా విభునికి
కానికె వట్టితివౌనే కలికి
మోనముననుండి కొంత ముగుదతనాననే
సోన గురియించితివే జోరున వలపులు

చ. 2: కప్పురమువంటి నవ్వు కందువగా నప్పటిని
కప్పము లిచ్చితివౌనే కాంతునికి
చప్పుడు సేయక కొంత సాదుఁదనాననే
లప్పలు రాలించితివే లావుగాఁ బ్రియములు

చ. 3: కుంకుమవంటి చూపు గురుతుగా నిప్పుడే
వుంకువ లిచ్చితివే నీ వొయడనికి
అంకెల శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నిటు గూడె
పొంకాన మెప్పించితివే భోగపు నీమేకులు

రేకు: 0567-6 భైరవి సం: 13-340

పల్లవి: కందువ మాతోడిపొందు గలదే నీకు
విందులెన్ని చోట్ల వెదకేవు నీవు

చ. 1: వాసులకే పెనఁగీని వంతులకే వచ్చీని
ఆసలకే లాచీన అదివో యాపె
సేసలు వెట్టేఁగరాదా చెక్కులు నొక్కఁగరాదా
రాసికెక్క నెక్కడ పరాకు సేసేవు

చ. 2: యెమ్మెలకే మలసీని యింపులకే సొలసీని
సొమ్ములకే కొసరీని చొక్కుచు నాపె
తమ్ముల మిడఁగరాదా దప్పులు దేర్చఁగరాదా
వుమ్మడి నెందాఁకా నీవు వూరకుండేవు

చ. 3: పంతానకే కూడీని బంతికే నోరూరీని
యింతటా శ్రీవేంకటేశ యిప్పుడే యీకె
మంతన మాడఁగరాదా మమ్మునిట్టే యేలితివి
వింతగా నేమిటికి నివ్వెరఁగందేవు

రేకు: 0568-1 సావేరి సం: 13-341

పల్లవి: వేవేలకు నీకు నీవే విచారించి మన్నించు
భావించి యెన్నఁడునుఁ బాయకుమీ నన్నును

చ. 1: చిగురుమోవిమాటలు చిత్తానఁ బట్టీనా
నగుతానాడినవల్లా నమ్మికయ్యీనా
మొగి విచ్చని నాలోని మోహము చూతువు గాని
తగవులఁ బెట్టికు మీ తరుణి నే నీకు

చ. 2: మునుకొన్న వినయాలు ముచ్చటలు దెలిపీనా
చనవరి వూడిగాలు చవి రేఁచీనా
అనువైన నాతగులాయములెంతువు గాని
పెనఁగించుకొనకుమీ ప్రియురాల నేను

చ. 3: జవ్వనపుమదములు సందిమాటలాడీనా
కువ్వలైన గుణములు కొంగువట్టీనా
యివ్వల శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
మవ్వమైన అలమేలుమంగఁ జూమీ నేను

రేకు: 0568-2 లలిత సం: 13-342

పల్లవి: ఏమి గావలెనో యీకె ఇంతేసి నిన్నుఁ జేసిని
చేముట్టి అట్టే యామేలు చేకొనవయ్యా

చ. 1: మురిపెముతో నవ్వీని ముసిముసి నవ్వులు
సారిది తేటచూపులఁ జూచీని
దొరతనాల వలపు తొడిఁబడఁ జల్లీని
విరులఁ గొని వేసీని వీడెమిచ్చీని

చ. 2: మచ్చిక మర్మాలు సోఁక మాటలు నిన్నాడీని
పచ్చి మోవి చూపి నీతోఁ బంతమాడీని
రచ్చలోన ముద్దుటుంగరము నీకుఁ జూపీని
ముచ్చట సన్నలుసేసి మొక్కు మొక్కీని

చ. 3: కూరిమి గొసరుతాను కొంగువట్టి తీసిని
ఆరీతిఁ గాఁగిటఁగూడి అలయించీని
సారెకు శ్రీవేంకటేశ సమ్మటూరిలో నిన్నుఁ
బేరుకొని పిలిచీని ప్రియమందీని.

రేకు: 0568-3 రామక్రియ సం: 13-343

పల్లవి: తొల్లే అన్నిటా బుద్ధిమంతురాలవమమ్మా
చల్లఁగా నితనికి నొజ్జలవైతివమ్మా

చ. 1: తొడమీఁదఁ గూచుండి దోసిలించి తలఁబాలు
విడువక చల్లేవమ్మా వేమారు నీవు
పడఁతి నీవిభుని కోపము మానుమని అవే
జడియకపెట్టే మంత్రాక్షతలాయనమ్మా

చ. 2: ముసిముసి నవ్వులతో మొగము చూచి చూచి
యెగి ఆకుమడిచి యిచ్చేవమ్మా
వెస నీ మోవితేనెల విందులారగించుటకు
ఇసుమంత డేగపదనిచ్చినట్లమ్మా

చ. 3: ఆరయ శ్రీవేంకటాద్రి ఆహోబలేశ్వరునిఁ
గూరిమితోఁ గాఁగిలించి కూడితివమ్మా
నేరుపుతో నితని నీసొమ్ముగాఁ జేసుకొని
ధారుణి పెట్టె బెట్టి దాఁచినట్లమ్మా

రేకు: 0568-4 శంకరాభరణం సం: 13-344

పల్లవి: ఔదువయ్య జాణవు ప్రహ్లాదవరద
ఆదిగొని మొక్కీని ప్రహ్లాదవరదా

చ. 1: యెదురుఁగొండలెక్కిన యిందిరఁ బెండ్లాడితివి
అది జాణతనము ప్రహ్లాదవరద
పుదుటుఁ గోపముమాని వూరకే నవ్వు నవ్వితి-
వదన నాపెఁ జూచి ప్రహ్లాదవరదా

చ. 2: మొగము చూచితేనే మోహముపైఁ జల్లితివి
అగడాయ బనులు ప్రహ్లాదవరద
తగిలి కొంగువట్టితే తమకించేవింతలో
అగవుదగవుల ప్రహ్లాదవరదా

చ. 3: చేయి చాఁచగా నాపెను సిగ్గువీడఁ గూడితివి
ఆయమెఱుఁగుదువు ప్రహ్లాదవరదా
యీయెడ నహోబలాన నిట్టే శ్రీవేంకటాద్రిని
ఆయిత్తము పెండ్లిండ్లు ప్రహ్లాదవరదా

రేకు: 0568-5 ముఖారి సం: 13-345

పల్లవి: కోమలపుమేని సతిఁ గోరకు మంతేసి
మోముచూచి కూరిమితో మొక్కీ నీకును

చ. 1: పుప్పతిల్ల మాటలాడి వూరడించి బాసలిచ్చి
అప్పుడు పెండ్డాడితి వందరిలోన
కొప్పువట్టి తీసి యట్టే కొంగుచుట్టి పట్టుకొని
పిప్పి సేసితివి యింత పిసుకకు మీపెను

చ. 2: ఆసలెల్లాఁ బుట్టించి ఆయములు చేతనంటి
సేస వెట్టితి వప్పుడు చేచేతను
గాసిగాఁ జన్నులు వట్టి కడుఁజెమటలు రేఁచి
వేసారఁ బెనఁగితివి మోసపుచ్చకిఁకను

చ. 3: వావులెల్లాఁ జెప్పిచెప్పి వాఁటముగాఁ గాఁగిలించి
చేవదీరఁ గూడితివి శ్రీవేంకటేశ
వేవేలు మన్ననలిచ్చి వింతలెల్లా నేరిపి
కైవసమైతివి యిట్టే కరుణించుమిఁకను

రేకు: 0568-6 భవుళి సం: 13-346

పల్లవి: ఇందుకే యీపాటి ఆయ నెక్కుడైతే నిఁకనెంతో
సందడి మేను సోఁకితే చనవెంత ఇత్తువో

చ. 1: కలికి యీజవరాలు కన్నుల నీకు మొక్కితే
సెలవుల నవ్వితివి చెలరేఁగి
బలిమిసేసి నీపాదాలు వట్టుకొంటే
కలసిమెలసి యెంత కాఁగిలింతువో

చ. 2: పలుకుఁదేనెలు నీకు పైపైఁ జవులు చూపితే
కళలు మోమున నించి కరఁగితివి
వెలయ మోవిరసాల విందులు నీకుఁ బెట్టితే
పిలిచి యీపెకెంత ప్రియము చెప్పుదువో

చ. 3: తొక్కుక నీతొడమీఁద దొయ్యలి గూచుండితేను
యిక్కువ శ్రీవేంకటేశ యెనసితివి
మిక్కిలి నీవురముపై మేడగట్టింపించుకొనె
అక్కరతో నిందుకెంత అలరుదువో

రేకు: 0569-1 నాగగాంధారి సం: 13-347

పల్లవి: ఎఱఁగవా నాచేత నింతేశాడించుకోనేల
మఱచిన పనులకు మగిడి చూడనేలా

చ. 1: పైకొని నాతో నీవు బాసలు సేయఁగనేల
నీకు నిజమే కలితే నిష్ఠూరమేల
యేకమైన పొందులకు యెడమాటలాడనేల
సాకిరిలేని పనికి సాదించనేల

చ. 2: కొన్నది కోలై నందుకు కొలఁది వెట్టఁగనేల
చిన్ననాటి సుద్దులకు సిగ్గులేల
అన్నిటా నేర్పరి వైతే నంతనీకు లోఁగనేల
నిన్నటి చీఁకటికి నేఁడు దీపమేలా

చ. 3: వేడుకకాఁడవు నీవు వెఱపులు మరి యేల
కూడితివి నన్ను నిఁకఁ గొసర నేల
పాడితో నడచే నీకు పంతములు మరి యాల
వాడికె శ్రీవేంకటేశ వంకలొత్తనేలా

రేకు: 0569-2 పూర్వగౌళ సం: 13-348

పల్లవి: ఏమి సేయుమనేవయ్య యిఁక నన్నును
చేముట్టి వీడెమీవయ్య సిగ్గయ్యీని

చ. 1: ఆతీల నాపె నీతో నట్టే మాటలాడఁగా
నాతో నీవు నవ్వఁగా నవ్వు వచ్చీని
రాతిరిఁ బగలు నీవు రచ్చలలో నుండి వచ్చి
చేత నా చెక్కు నొక్కఁగ సిగ్గయ్యీని

చ. 2: వున్నతి నాపె నీవొడివట్టి తియ్యఁగాను
నన్ను నీవు చేపట్టఁగానవ్వు వచ్చీని
కన్నవారినెల్లా నీవు కాఁగిలించుకొని వచ్చి
చిన్ని నా చన్నులంటఁగా సిగ్గయ్యీని

చ. 3: భావించి యాపె నీకుఁ బానుపు వరచఁగాను
నావద్ద నీవు పండఁగా నవ్వు వచ్చీని
శ్రీవేంకటేశ్వరుఁడ చేఁతలెల్లాఁ జేసి వచ్చి
చేపట్టి నన్నుఁ గూడఁగా సిగ్గయ్యీని

రేకు: 0569-3 మాళవిగౌళ సం: 13-349

పల్లవి: అల్లాడఁ బడివున్నాదా ఆడుఁదనము
పల్లదాన బదికితే పచ్చిగాదా తనువు

చ. 1: వొగ్గిన వలపులెంత వొడిఁగట్టుకొనినాను
యెగ్గు సిగ్గు లేకుండుతే నేఁటి వనిత
నిగ్గుల రమణుఁడెంత నేరవుగా మన్నించినా
వెగ్గళించి మాటాడిన విరుగదా మనసు

చ. 2: నెచ్చెలికి వయసెంత నిలువున వడిసినా-
నిచ్చకము లేకుండితే నేఁటివేడుక
మచ్చిక నాతఁడెంత మంతనాన నవ్వినాను
రచ్చల నాడుకొంటే రవ్వగావా రతులు

చ. 3: ఘనముగ నెంత సింగారించుకుండినాను
యెనయక వుండితేను యేటి నేరుపు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసి నిన్నిటె నేఁడు
పెనగించుకొంటేను పెరుగదా చలము

రేకు: 0569-4 దేసాళం సం: 13-350

పల్లవి: అందుకేమి దోసమా అట్టే కానిమ్మనవయ్య
చెంది మా మొగము చూచి సిగ్గువడ నేఁటికి

చ. 1: నెలకొని నీవెంతేసి నేమస్తుఁడ వైనాను
వలచి వచ్చినదాని వద్దనఁగవచ్చునా
తొలుత నీవెంత గుట్టుతోడివాఁడ వైనాను
కలకల నవ్వేదానిఁ గడపఁగఁగలవా

చ. 2: పట్టపుదొరలై యెంతపంతగాఁడ వై నాను
చుట్టమై వచ్చినదానిఁ దట్టి తోయవచ్చునా
గట్టిగా పెక్కుచెలులు గలవాఁడ వై నాను
వెట్టికి వచ్చినదాని విడువఁగఁగలవా

చ. 3: వుడివోని శ్రీసతి వురమెంత యెక్కినాను
తొడపై నెక్కినదానిఁ దోయఁగ వచ్చునా
కడఁగి శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
వొడివట్టిన సతితో నోప వనఁగలవా

రేకు: 0569-5 రామక్రియ సం: 13-351

పల్లవి: జడిసేవు గనక నీ సమరతి నుండి నేను
వొడివట్టుకున్న దాన వొద్దికలు మీరఁగా

చ. 1: వలపులు రేఁచితే వడిగొనీఁ దమకము
తలఁచుకొంటేఁ గడుఁ దమి యెక్కీని
మొలకచన్నులురము మోవ నిన్నుఁ గాఁగిలించి
బలిమి నుండాన నిదే పట్టరాక పాయము

చ. 2: తప్పక చూచితేను తడఁబడీఁ జిత్తము
ముప్పిరిగా నవ్వితేను ముంచీ వేడుక
నెప్పుగాఁగా నామోవి నీమోవి గదియించి
చిప్పిలి వుండాన నిట్టే చెలరేఁగీఁ దనువు

చ. 3: నెటి సరస మాడితే నిండుకొనీఁ బులకలు
చెఱఁగు గప్పితే నట్టే చెమరించీని
యెఱిగి శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
వొఱగుకుండాన నీపై నొనరె నానోములు

రేకు: 0569-6 సామంతం సం: 13-352

పల్లవి: అవునయ్య మంచివాడ వందుకు దొరకొంటివి
కవగూడే మగువలు గాతల కోపుదురా

చ. 1: చేరిచేరి నీతోను సిగ్గులు వడఁగానే
గోర గీరేవేమయ్య కోమలిని
ఆరితేరినవాడవు అన్నిటికి నోపుదువు
వూరివారి కన్నెక లోపుదురా ఇందుకు

చ. 2: తడఁబడి చేతులను తప్పించుకొనఁగానే
యెడయక చన్నులంటే విదేమయ్య
కడు సాములు సేతువు కలదు సత్తువ నీకు
వొడికపు జవ్వనులు వోపుదురా ఇందుకు

చ. 3: పొందులు చూపి దయలు వుట్ట మాటలాడఁగానే
కిందుపడ రతులఁ జొక్కించితివయ్య
విందుల శ్రీవేంకటేశ వేడుకతోఁ గూడితివి
వొందిలి మానినులెల్లా నోపుదురా ఇందుకు

రేకు: 0570-1 శుద్ధవసంతం సం: 13-353

పల్లవి: ఏల సేసేవు మాతో నిన్నిమాయలు
పోలించితే గురుతులు బూమెల్ల నిండవా

చ. 1: మలసి నీవెంత నాతో మఱఁగులు వెట్టినాను
కలికి నీతో నవ్వఁగాఁ గానరాదా
పొలుపుగ మరీఁగొన్ని బొంకులు బొంకినాను
పలు నీచేఁతలు బట్టిబయటనే పడవా

చ. 2: అందరిలో నీవు నాపై నానలెన్ని వెట్టినాను
యిందుముఖి మొక్కఁగాను యెఱఁగరాదా
గొందినెంత తలవంచుకొని నీవు వుండినాను
విందులాపె చెప్పరాఁగా వెల్లవిరి గాదా

చ. 3: పెనఁగి నాకెంత నీవు ప్రియములు చెప్పినాను
పనులాపె సేయగాను పచ్చిగాదా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
ననుపులాపె చూపఁగా పెనురట్టు గాదా

రేకు: 0570-2 సాళంగం సం: 13-354

పల్లవి: దిట్టవన్నిటాఁ దొల్లే తేరినవాఁడవు నీవు
గట్టిగా నిన్నుఁ జేపట్టుట గాక

చ. 1: అలరి నీవు రావని అలుగఁగఁ దగునా
నలుగడ సెలవుల నవ్వుట గాక
కలయవనుచు నిన్నుఁ గసరఁగఁ దగునా
మొలకసిగ్గుతోడ మొక్కుట గాక

చ. 2: కడలు దొక్కితివని కాఁతాళించఁ దగునా
మెడమెత్తి సారె నిన్ను మెచ్చుట గాక
అడియాలాలెల్లాఁ జూచి అట్టే తిట్టఁదగునా
గొడవలేక నిన్నుఁ గొలుచుట గాక

చ. 3: పాసి వుంటివని నీతోఁ బదరఁగఁ దగునా
రేసులకు నిన్నుఁ గాఁగిలించుట గాక
యీసు దీరె శ్రీవేంకటేశ నన్నేనసితివి
సేసవెట్టి యిఁకనిట్టే చెలఁగుటగాకా

రేకు: 0570-3 కన్నడగౌళ సం: 13-355

పల్లవి: భయమెల్లాఁ బాసె యిఁకఁ బనిలేదు
జయమై నీకాతఁడు సమ్మతించుండఁగను

చ. 1: ననుపై నీవతనితో నవ్వు నవ్వవలదా
చనవు నీకిచ్చినది చాలాఁ గద్దు
గునిసి నీవప్పటిని కొసరఁగ వలదా
పెనఁగి నీకాతఁడు ప్రియము చెప్పఁగను

చ. 2: బెట్టుగా నీవతనితో బిగియఁగవలదా
పట్టిపట్టి నిన్నిట్లాఁ బాలార్చఁగను
చుట్టిమవై కమ్మటిని సూడువట్ట వలదా
ఱట్టుగా నీకాతఁడు గుట్టు సేయఁగాను

చ. 3: చలపట్టి నీవాతని సాధించ వలదా
యెలమిఁదప్పని బాసలియ్యఁగాను
అలరి శ్రీవేంకటేశుఁడతఁడే నిన్నిదె కూడె
యిల నిన్నురముమీఁద నెక్కించుకుండఁగాను

రేకు: 0570-4 సాళంగనాట సం: 13-356

పల్లవి: నీకే తెలునయ్యా నేరుపరివౌదువు
వాకున నిద్దరికిని వంతువెట్టేవా

చ. 1: చాయలకు నాపెతోడ సరసములాడేవు
యీయెడ నాతోనైతే నిటు నవ్వేవు
యేయెడఁ గూరిమి నీకు యెవ్వరివాఁడవు నీవు
పాయము ఇద్దరికిని పంచి పెట్టేవా

చ. 2: మచ్చికె నాకెదిక్కు మగిడి చూచేవిట్టే
యిచ్చలు నాతో నైతే యిటులాడేవు
కచ్చుపెట్టేదెందు నీకు కాఁగిలి యెవ్వరిసొమ్ము
రిచ్చల నీమనసిద్దరికిఁ దూఁచిచ్చేవా

చ. 3: వెంట వెంట నాపెను వేమారుఁ గూడేవు
ఇంటికి వచ్చి నన్ను నిటు గూడేవు
జంట యెందు శ్రీవేంకటేశ్వర నీకుఁ బ్రియమేది
రెంటెము నేఁడు యిద్దరిపయిఁ గప్పేవా

రేకు: 0570-5 మంగళకౌశిక సం: 13-357

పల్లవి: ఇందరు నున్నారు మీతో నేమంటినే
దిందుపడి తానేల తిట్టు దిట్టీనే

చ. 1: తగవరితన మెల్లా తనదున్న దంటిఁ గాక
యెగసక్కేలకు మరి యేమంటినే
చిగురుమోవిమీఁద చిల్లులున్న వంటిఁ గాక
వెగటుగా నేనేమి వెంగెము లాడితినే

చ. 2: మొక్కలపుఁ గళలెల్ల మోము నిండె నంటిఁ గాక
యెక్కడా లేని నేరాలేమంటినే
మిక్కిలి వాసనలు నీమేన మించె నంటిఁ గాక
నిక్కమూఁ గాంతలమీఁద నిందలేమాడితినే

చ. 3: చీటికి మాటికిని మై చెమరించె నంటిఁ గాక
యేఁటికి నలసేవని యేమంటివే
గాఁటపు శ్రీవేంకటేశ కడపలో నన్నుఁ గూడి
యేఁట వెట్టేవంటిఁ గాక యేతులేమాడతినే

రేకు: 0570-6 శ్రీరాగం సం: 13-358

పల్లవి: బుజ్జగించరాదా పొలఁతి నిత్తే
అజ్జకాఁడనంటా నుంటివౌనయ్య నీవు

చ. 1: సోయగపు చూపులను చూచి యాపె దిట్టఁగానే
రాయడించి తీసేవు రతికి నీవు
నాయమా వేఁడిపాలకు నాలుక చాఁచ నీకు
యీయెడ నీకే తెలుసు వెటువంటి సుఖము

చ. 2: గుట్టున నాపె నిన్ను గోరికొన నూఁదఁగానే
బెట్టుగ మోవితేనెకుఁ బెనఁగేవు
పట్టి తీసేవు మాఁగనివంట నేది రసము
యెట్టి జాణవై తివిది యెటువంటి సుఖము

చ. 3: పొలసి యాపె నిన్ను బొమ్మల జంకించఁగాను
కులికి చన్నులువట్టి కూడితివి
కలికి శ్రీవేంకటేశ కారము తీపుసేసితి
వెలమి నీమాయలివి యెటువంటి సుఖము

రేకు: 0571-1 కాంబోది సం: 13-359

పల్లవి: ఆనతీయవయ్యు నాకు నట్టే వొక్కమనసుగా
మోనముతోడుత నీకు మొక్కేఁగాని

చ. 1: చెంతల మాటాడుమంటా చేవట్టి వేఁడుకొనేవు
పంతము నీకు వచ్చెనా పలికేఁ గాని
సంతతపు నీచేఁతలు సమ్మతించఁ జేసేవు
యింత నీకుఁ బ్రియమా ఇయ్యకొనేఁ గాని

చ. 2: వొంటి నన్ను గిలిగించి వూరకైనాఁ బెనగేవు
నంటున నీకు సెలవా నవ్వేఁ గాని
గొంటరితనాన మేని గురుతులు చూపేవు
సొంటులు నీకు నింపా చూచేఁ గాని

చ. 3: పయి జేయివేసి నన్ను బలిమిసేయ వచ్చేవు
ప్రియమా నీపై సేసవెట్టేఁ గాని
దయతో శ్రీవేంకటేశ తగిలి నన్నేలితివి
నియతాన నీకు మెచ్చా నెలకొనేఁ గాని

రేకు: 0571-2 దేవగాంధారి సం: 13-360

పల్లవి: మగువమాటలే గురుమంత్రము నీకు
వెగటుదీర నివి విన్నవించదాయనా

చ. 1: కాంతలు గోపగించితే కడుఁ బచ్చిసేతురని
చెంతల నాకె బుద్ధి చెప్పదాయనా
మంతనమైనప్పుడే మనసు గరఁతురని
వింత నీమంకుఁదనము విడిపించదాయనా

చ. 2: సరసమాడేటివేళ చలము సాదింతురని
నిరతితో నీకు నీతి నేర్పదాయనా
మరిగితేఁ దమకము మరియును రేఁతురని
పరగ నీకితవుగాఁ బట్టించదాయనా

చ. 3: కూడినట్టి రతివేళ కొప్పువట్టి తీతురని
వాడికైన నీగుణము వంచదాయనా
యీడనే శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వోడక నీకు వంకలొత్తదాయనా

రేకు: 0571-3 శుద్ధవసంతం సం: 13-361

పల్లవి: మంచితనము సేయఁగ మారుమలతు రటవే
కంచువంటి చిత్తములో కపటాలేమిటికే

చ. 1: అక్కరతో రమణుఁడు అట్టే నీపై బత్తిని
చెక్కు నొక్కఁగానే చేయి దీసేవు
మొక్కలాన వీడెమిచ్చి మొదల నాకు మడిచి
గక్కన నియ్యఁగానే కారమనేవు

చ. 2: మేలుగలవాఁడు గాన మేనదానవంటా నిన్ను
కాలు దొక్కఁగా నేల గాతలాడేవే
మేలిమి పన్నీరుచల్లి మేదించిన గందము
వేల నీపైఁ జమరఁగ వేఁడి యనేవు

చ. 3: చనవుతో శ్రీవేంకటేశ్వరుఁడు కాఁగిటఁ గూడి
చెనకఁగ నప్పటిని సిగ్గువడేవే
ననుపునఁ దురుమున నానావిరులు ముడిచి
మొనగోరు నాఁటించితే మొగచాటనేవు

రేకు: 0571-4 మంగళకౌశిక సం: 13-362

పల్లవి: నీకేల వెరపు నెలఁతకిది సమ్మతే
చేకొన్న నీయిచ్చలను చెందఁగరాదా

చ. 1: సిగ్గువడి వుంటేనేమి చెయివట్టి తియ్యరాదా
యెగ్గులు తప్పులు నాపె యెంచీనా
అగ్గలపు వలపులు ఆసల విడిచుండునా
బగ్గనఁ బువ్వు తొడమోఁ బాసి వుండునా

చ. 2: నవ్వుతా నుంటేనేమి నలి గాఁగిలించరాదా
రవ్వలుసేసి బీరము చూపీనా
మవ్వపు జవ్వనమది మదము విడిచుండునా
దివ్వెవెలుఁగు చీఁకటిఁ దెగి పాసి వుండునా

చ. 3: గుట్టుతో నుంటేనేమి కూచుండఁ బెట్టుకోరాదా
యెట్టైనా నలమేల్మంగ యెదురాడీనా
నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి వున్నదీకె
వొట్టిన కొండలు రాళ్ళనొగిఁ బాసి వుండునా

రేకు: 0571-5 శంకరాభరణం సం: 13-363

పల్లవి: ఊడిగపు వారెల్లా నొద్దనుండరో
వేడుక యేకాంతమున వెలసీని దేవుఁడు

చ. 1: నిలువుగోణము గట్టి నిలుచుండి పన్నీట
జలకమాడీ నదే సర్వేశుఁడు
తలపాగ చుట్టు చుట్టి తడిసూళ్ళు మేన వొత్తి
తొలఁగ కుత్తరియముతో నున్నాఁడు దేవుఁడు

చ. 2: కప్పురకాపు మేనఁ గలయ మెత్తించుకొంటా
చిప్పిలఁగఁ జెమరించీ శ్రీవిభుఁడు
ముప్పిరిఁ బాటలు వింటా మునులు నుతించఁగాను
దప్పిదేరి సింగారానఁ దానున్నాఁడు దేవుఁడు

చ. 3: తట్టుపుణుఁ గలఁదుక తరి సొమ్ములు నించుక
యిట్టే యలమేల్మంగ నెదఁగట్టుక
పట్టి యారగించుకొంటా పలులోకా లేలుకొంటా
మెట్టి శ్రీవేంకటాద్రిని మెఱసీని దేవుఁడు

రేకు: 0571-6 పాడి సం: 13-364

పల్లవి: చనవు గలుగుచోట చలమేఁటికి
పెనఁగఁబోతేఁ బ్రియము బెండుపడదా

చ. 1: చెక్కునొక్కి వేఁడుకొనే చెలువునివంక చూచి
మొక్కవద్దా యేమే నీవు మోము వంచేవు
తక్కుల నాతఁడు మరి తప్పు లెన్ని సేసినాను
కక్కసించితే వలపు గరివడదా

చ. 2: కొసరి మాటాడి పతిఁ గొంగువట్టి తీసుకొని
యెసఁగి నవ్వఁగవద్దా యెమ్మెలాడేవు
సుసరముగాక పతి సూటికెంత రాకుండినా
పిసికితే మనసైనాఁ బిప్పిగట్టిదా

చ. 3: కూడేటి శ్రీవేంకటేశు గొబ్బుననుఁ గాగిలించి
యీడై యిట్టే వుండవద్దా యేల మీరేవు
వోడ కలమేల్మంగవు వూరకాతఁ డుండినాను
వాడుకొంటే వయసు కావరమెచ్చదా

రేకు: 0572-1 లలిత సం: 13-365

పల్లవి: చెప్పకురే బుద్ధులిఁకఁ జెలులాల
చిప్పిల నాతనికే సెలవు నావయసు

చ. 1: చెప్పరాని మాటలకు చెవులొగ్గి విననేల
తప్పులెంచే పనులై తే తాఁ జేయనేల
వొప్పుగా నెప్పుడూఁ బతివొద్ద నిట్టే వుండఁగాను
అప్పటికప్పటి భోగమైనంతే చాలును

చ. 2: వోపలేని భారము వొడిఁగట్టుకోనేల
కైపైన వేడుకలు గైకొననేల
చేపట్టినాతనికి సేవ సేసుకుండఁగాను
చూపుల నాతఁడు దయఁ జూచినదే చాలును

చ. 3: చప్పని మాటలు మరి సారె సారె నాడనేల
వుప్పతించి పంతములు నొరయనేల
యిప్పుడు శ్రీవేంకటేశుఁ డిట్టె కూడి వుండఁగాను
కప్పి సంతోసించిన యీకందువిదే చాలును

రేకు: 0572-2 ముఖారి సం: 13-366
పల్లవి: ఇద్దరికిఁ జనవు నీవిచ్చితివి తొలుతనే
వొద్దనుండి బుద్ధిచెప్పి వొనగూర్చవయ్యా
చ. 1: నీయింతితో జగడించి నీవేమందువో యని
చేయెత్తి మొక్కే నిదె సెలవు నీకు
పాయపుదానఁ గాన పంతానకే పెనఁగుదు
మాయిద్దరి సంది దేర్చి మన్నించవయ్యా
చ. 2: అప్పటి నాపెతో నేను అన్ని యెమ్మెలాడుకొంటి
చెప్పినట్టెల్లాఁ జేసే సెలవు నీకు
తప్పరాని విరహపుదానఁ గాన కొసరితి
ఇప్పుడిద్దరి రక్షించి యేలుకొనవయ్యా
చ. 3: గరిమ బింకములాడి కడు నిన్ను వేఁడుకొంటి
సిరుల శ్రీవేంకటేశ సెలవు నీకు
వరుసదానఁ గనక వనితచేఁ జెప్పించితి
ఇరవై నన్నుఁ గూడితి విద్దరీఁ గావవయ్యా

రేకు: 0572-3 ఆహిరి సం: 13-367

పల్లవి: నేరని జీవులము నేమే మెఱుఁగుదుము
నేరిచిన నీవే మన్నించుటింతే కాక

చ. 1: చలపట్టి నిన్నును సాదించ వసమా
బలిమి చేసి చేతఁబట్ట వసమా
తలఁపులో నిన్ను నిట్టే తలఁచఁగ వసమా
సులభమై నీవే పొడచూపుటింతే కాక

చ. 2: మిక్కిలి సేవసేసి మెప్పించ వసమా
అక్కర నీపై భక్తి నంద వసమా
గక్కన నిన్ను నుతించి కడగాన వసమా
దక్కి మాకు నిట్టే ప్రత్యక్షమవుట గాక

చ. 3: సొంటులు సోదించి నిన్నుఁ జూడఁగ వసమా
అంటి ముట్టి పజించ నది వసమా
బంటనైతి నీమనసు పట్టనైనా వసమా
యింట శ్రీవేంకటేశ నీ విరవౌట గాక

రేకు: 0572-4 నారాయణి సం: 13-368

పల్లవి: రావయ్య యెక్కడి సుద్ది రవ్వ సేయక
కావరపు సతులెట్టు గద్దించేరు నన్ను

చ. 1: వలచిన నీవు నాకు వసమై వుండితేఁ జాలు
పళువు లేమాడేరు సవతు లిఁక
అలరి నీవిచ్చిన ఆస గలితేఁ జాలు
చెలుల వెంగెము లేమి సేసీ నన్ను

చ. 2: మగఁడవు నీవు నాతో మాటలాడితేఁ జాలు
యెగసక్కే లేమాడేరు యెవ్వరూ నిఁక
మొగమిచ్చి నీవు నాతో మొనసి నవ్వితేఁ జాలు
తెగి యేకాంతలు వచ్చి తేర్చేరు నన్ను

చ. 3: శ్రీవేంకటేశ నీవు చేకొని కూడితేఁ జాలు
ఆవల నేమాడేరు ఆఁడువారిఁక
సేవ యిచ్చి యేలితివి నీవు మన్నించితేఁ జాలు
సోవల నే రమణులు సొలసేరు నన్ను

రేకు: 0572-5 నాదరామక్రియ సం: 13-369

పల్లవి: బుద్ది చెప్పేవారమా పొలఁతుల మింతే నేము
నిద్దిరించ వెప్పుడును నీకే తెలుసునే

చ. 1: సిగ్గులు వడేవారిపైఁ జేతులెట్టు చాఁచేది
యెగ్గులువట్టేవారి నేమనేది
వొగ్గుచు నీ నాయకుఁడు వొడివట్టి తియ్యఁగాను
నిగ్గుల విఱ్ఱవీగేవు నీకే తెలుసునే

చ. 2: తిట్టులు దిట్టేవారి తెరువెట్టు వచ్చేదే
వొట్టువెట్టేవారి నొరసే దేమే
జట్టిగొని రమణుఁడు సారెసారె వేఁడుకోఁగా
నెట్టిన నానవెట్టేవు నీకే తెలుసునే

చ. 3: తప్పులెంచేవారికిఁ దగవులెట్టు చెప్పేదే
తిప్పరానివారి నెట్టు తెలిపేదే
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసి మన్నించఁగాను
నెప్పున నవ్వు నవ్వేవు నీకే తెలుసునే

రేకు: 0572-6 శంకరాభరణం సం: 13-370

పల్లవి: అంగన లెల్లా అదివో నేఁడు
అంగములు పులకించె నదివో నేఁడు

చ. 1: చేరి నీవు విలువగా సిగ్గువ నాపె లోఁగఁగా
ఆరితేరె వలపులు అదివో నేఁడు
గారవించఁగా నీవు కాంత నీకు మొక్కఁగాను
అరగించి వేళలేదు అదివో నేఁడు

చ. 2: అంది నీవు చెనకఁగా నాపె యిల్లు చొచ్చుకోఁగా
అందరు నెటిఁగి రీపనదివో నేఁడు
చెంది నీవు వెనగఁగా చెలి సరసమాడఁగా
అందమాయ గోరితాఁకులదివో నేఁడు

చ. 3: సేస నీవు వెట్టఁ గాను సెలవి నాపె నవ్వఁగా-
నా సుద్దులింతటా నిండె నదివో నేఁడు
శ్రీసతినిఁ గూడితివి శ్రీవేంకటేశ నేఁడు
ఆస లిద్దరికెక్కుఁడు అదివో నేఁడు

రేకు: 0573-1 వరాళి సం: 13-371

పల్లవి: ఊరకుండితే నెఱగ వొత్తుక వచ్చేవు నీవు
యేరా యింతటిలోనే యెమ్మెలాడేవు

చ. 1: సిగ్గువడరాదా నీవు చేయి మీఁద వేయఁగాను
యెగ్గుపట్టరాదా నేను యేమైనా నాడఁగాను
అగ్గలము నవ్వరాదా ఆయము లిట్టే యంటఁగా
కగ్గి యిందరిలో నేల కాకుసేసేవు

చ. 2: తలవంచుకొనరాదా తమకించి పైకొనఁగా
పులకించరాదా నీవు పొందులెల్లాఁ జూపఁగాను
కళలతో మించరాదా కప్పురముపైఁ జల్లఁగా
చెలులకింతలో నను జేత జూపేవు

చ. 3: నివ్వెరఁగు నొందరాదా నీవు కాఁగిలించఁగాను
జవ్వనాన వీఁగరాదా సమరతులఁ గూడఁగా
పువ్విళ్ళూర మొక్కరాదా వొక్కటై బుజ్జగించఁగా
రవ్వగా శ్రీవేంకటేశ రాఁపేల సేసేవు

రేకు: 0573-2 బౌళి సం: 13-372

పల్లవి: ఇద్దరికిఁ బోరువెట్టి యేమి చూచి నవ్వేవయ్య
గుద్దులాట వెలిగాను కోపగించీ నీపె

చ. 1: మొగము తప్పక చూచి మూతులు విరుచుకొని
జగడించి ఇట్టే పగచాటీ నీపె
పగటుఁజేతులు చాచి పైపై వేళ్ళు మడిచి
తగవులకు రమ్మంటా దట్టించీ వాపె

చ. 2: ఆడరాని మాటలాడి అట్టే వొట్లు వెట్టి
జాడతోడ సణఁగులు చల్లీ నీపె
వాడలో సాకిరివెట్టి వనితలకెల్లాఁ జెప్పి
తోడనే నీమీఁదఁ బెట్టి తొర్లఁదిట్టీ నాపె

చ. 3: పిరిచుట్టు చుట్టుకొని బిగువుతో నిల్లురికి
సరుస వాదులడిచి జంకించీ నీపె
యిరవై శ్రీవేంకటేశ యెడచొచ్చి నీవిద్దరి
సరిసేసి కూడఁగాను సాదులై రీపెనాపె

రేకు: 0573-3 నాట సం: 13-373

పల్లవి: ఏమే యిందరిలోన నెంతగర్వమే
నీమగఁడు మన్నించితే నీకొద్దా వినయము

చ. 1: మొక్కలానఁ బతివద్ద ముందర ముందర వచ్చి
కక్కసించి కూచుండేవు గద్దెమీఁదను
చక్కని కొలువులోని సతులిందరునుఁ జూచి
వొక్కరొక్కరి మొగాలు వొగిఁ జూచేరదివో

చ. 2: చెమటలు వెట్టఁగాను చెలువుని తొడమీఁద
నమరంగఁ బవళించే వప్పటి నీవు
కొమరె సవతులెల్లా గుజగుజ లాడుకొంటా
తమకాన జిన్నఁబోయి తలవంచే రదివో

చ. 3: సెలవుల నవ్వుకొంటా శ్రీవేంకటేశ్వరుని
తిలకించి కూడితివి తెరవేసుక
చెలులెల్లా నిద్దరికి సేవలెల్లాఁ జేసి చేసి
సొలసి మిమ్ము మెప్పించి చుట్టాలైరిదివో

రేకు: 0573-4 మాళవిగౌళ సం: 13-374

పల్లవి: తానెంత నేనెంత తరుణులాల
పూని యీతఁడెంత సేసీ పొసగఁగ వినరే

చ. 1: పలికి బొంకనివాఁడు పంతగాఁడు తానన్నిటా
నిలువు నూరు వండేటి నెరజాణఁడు
పిలిచి వీడెము వెట్టెఁ బ్రియములెల్లాఁ జెప్పె
కలసినాఁడు నేనంత ఘనురాలనా

చ. 2: కడుఁ బ్రతాపపువాఁడు కాఁకలు దేరినవాఁడు
విడువని చలముల వేడుకకాఁడు
వొడివట్టి తీసి నాకు నుంగరము వేలఁ బెట్టె
అడరి మన్నించె నేనంత నేరుపరినా

చ. 3: చక్కఁదనములవాఁడు చల్లని మాటలవాఁడు
వెక్కసపు నవ్వుల శ్రీవేంకటేశుఁడు
అక్కరతో నను నేలె నలమేలుమంగను
మిక్కిలిఁ జొక్కించె నింత మేలుదానానా

రేకు: 0573-5 కుంతలవరాళి సం: 13-375

పల్లవి: ఇంతేసి సేవలు సేయ నెందాఁకా నోపుఁ జెలి
కాంతుఁడవు మెచ్చి మెచ్చి కాఁగిలించవయ్యా

చ. 1: పయ్యెదకొంగు జారఁగ పాలిండ్లు గదలఁగ
చయ్యన గుంచ వేసీని సతి నీకు
చెయ్యెల్ల బడలంగఁ జెక్కులు చెమరించఁగ
వొయ్యనే పాదాలొత్తీ నుల్లసాన నీకు

చ. 2: గరిమఁ దురుము వీడఁ గస్తూరి బేంట్లు రాల
పరగఁగ గాళాంజి పట్టీ నీకు
సరులు చిక్కువడఁగ సందడి నూర్పులు రేఁగ
సిరుల గందము వూసీఁ జెలరేగి నీకు

చ. 3: తనువు పులకించఁగ తమకములు ముంచఁగ
యెనసి యాకు మడిచి యిచ్చీ నీకు
అనుగు శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చనవునఁ గెమ్మోవి చవిచూపీ నీకు

రేకు: 0573-6 దేసాళం సం: 13-376

పల్లవి: తమలోనఁ దామే యైతే తగిలి కోపము దీరు
క్రమముగఁ దిట్లాడి కలతురు లోననే

చ. 1: యేకతమైతేఁ జాలు యిద్దరి మంకులుఁ దేరి
చేకొని మనబుద్ధికిఁ జెవులొగ్గరు
వాకిట నుండుద మిట్టే వరుసతో నిందరము
యీకడికి రాఁగదరే యింతులాలా

చ. 2: తనువులంటితేఁ జాలు తక్కిన యలుక మాని
మనమెంత వేఁడుకొన్నా మాటలాడరు
మునుపే యిద్దరికొక్క ముసుఁగుగాఁ బెట్టుదము
వెనవెనకకే రారె వేడుకతోఁ జెలులు

చ. 3: చాటుతెర వేసితేనే చాలు నిట్టే కూడేరు
నాటుక మనెదుట మానరు సిగ్గులు
యీటున శ్రీవేంకటేశుఁడెనసె నీపె నిన్నిటా
మాటుక రారే వత్తము మరియూఁ జెలులము

రేకు: 0574-1 ఆహిరి సం: 13-377

పల్లవి: నిన్నటి యలుక దేర్చి నేఁడాతఁడే
సన్నలకు చాయలకు సమ్మతించరాదా

చ. 1: వలపులు చల్లఁగాను వాసులెంచ నేమిటికి
పిలువఁగఁ బతితోడ బిగియనేల
నెలకొని కొసరఁగ నెపము వేయనేఁటికి
కొలువు మొక్కులు మొక్కి కూచుండరాదా

చ. 2: చెక్కులు నీకు నొక్కఁగ సిగ్గువడ నేమిటికి
మక్కువలు చూపఁగాను మచ్చరమేల
అక్కరతో మాటాడఁగా నానాలువెట్ట నేఁటికి
మొక్కలాన వీడెమిచ్చి మోము చూడరాదా

చ. 3: పైకొని కాఁగిలించఁగా పంతములాడ నేఁటికి
నీకు లోనై యుండఁగాను నేరములేల
యీకడ శ్రీవేంకటేశుఁ డిరవై నిన్నిదే కూడె
యేకాలమును యిట్టే యెనయఁగరాదా

రేకు: 0574-2 రామక్రియ సం: 13-378

పల్లవి: ఎదిరివారి మనసు లెఱఁగవద్దా
యెదుగా సతులఁ-దాను యేలేవాఁడు గాఁడా

చ. 1: యెలమి నాచింతతోడ యెవ్వరి తెరువుఁ బోక
తలవంచుకుండఁగాను తడవుదురా
వలచినవాఁడు తాను వచ్చి వచ్చి రాకుండితే
నలుగరాదా అట్టే ఆఱడిఁ బెట్టుదురా

చ. 2: అగ్గలపు దమకాన నంటఁగాక వుండి నేను
సిగ్గువడి మొక్కఁగాను చెనకుదురా
వొగ్గి తా వేడుకకాఁడు వూరసుద్దులు చెప్పఁగా-
నెగ్గులు వట్టఁగరాదా ఇంతరట్టు గలదా

చ. 3: కామించిన కోరికెతో కన్నులఁ దప్పక చూచి
ప్రేమ నుండఁగాఁ జేవట్టి పెనఁగుదురా
యీమేర శ్రీవేంకటేశుఁడిట్టే తానె నన్నుఁగూడె
మోము చూడరాదా నాకుముంచి తానవ్వుదురా

రేకు: 0574-3 నాట సం: 13-379

పల్లవి: తమకించి నేఁటికే తానే వచ్చిని పతి
నెమకితే నీవలపే నీపై వచ్చీనా

చ. 1: చెఱకు సింగిణివిల్లు చిగురుటమ్ములును
మఱి మరునివి నీబొమ్మలు చూపులు
వెఱవనేలే నీకి విరహవేళ
నెఱి నీసింగారమే నీపై వచ్చీనా

చ. 2: జక్కవలుఁ దుమ్మిదలు సరి మదనుబలాలు
నిక్కిన నీ చన్నుదోయి నెఱిఁగురులు
గక్కన నాతనిఁ బాసి కలఁగ నేమిటికే
నెక్కొన్న నీయంగములు నీపై వచ్చీనా

చ. 3: తేరునుఁ డెక్కెములును ధృతి నంగజుముద్రలు
పూరులుఁ బిరుదు నీకై వొనరినది
యీరీతి శ్రీవేంకటేశుఁడెనసె నిన్నింతలోనే
నేరుపులన్నియు నీవే నీపై వచ్చీనా

రేకు: 0574-4 హిందోళవసంతం సం: 13-380

పల్లవి: ఎఱుఁగుదు నీ సుద్దు లేమి చేప్పేవు
జఱపులఁ బెట్టితే చలము రేఁగీని

చ. 1: వంచి చల్లని నీళ్ళేకావా కొచ్చి పారేవి
మంచి నీ మాటలేకావా మరిగించేవి
కొంచి నీవు నను వేఁడుకొనకంత సారెసారె
యెంచ నాచెక్కుల గోళ్ళింతలో నాఁటీని

చ. 2: ఇసుమంత చల్లే కాదా ఇన్నిపాలూఁ బేరించేది
పసని నీ నవ్వేకాదా భ్రమయించేది
ముసరి నాచన్నులివి ముట్టి యానలు వెట్టకు
వెస నీగట్టిచేతులు కసుఁగందించీని

చ. 3: మాఁగితే కాయే కాదా మంచిఫల మయ్యేది
కాఁగిటి నీపొందే కాదా కరఁగించేది
చేఁగదేర నేలితివి శ్రీవేంకటేశ నన్ను
రేఁగి రేఁగి కొసరకు రెట్టించీ వలపు

రేకు: 0574-5 రామక్రియ సం: 13-381

పల్లవి: తెలుసుకో యింకా నీవే తేట తెల్లమికాను
చలపట్టనేల నీతో సాదించేవు

చ. 1: మచ్చరించే దానఁ గాను మనసిచ్చే దానను
పచ్చిగా నాతో నేమి పచారించేవు
రచ్చవేసే దానఁ గాను రహస్యపు దానను
అచ్చలాన నన్ను నేల ఆన వెట్టేవు

చ. 2: యెదురాడే దానఁ గాను యియ్యకొనేదానను
కదిసి మరేల నీవు కాకుసేసేవు
పదరేటి దానఁగాను బత్తిగలదానను
చెదరక నన్ను నేల చెక్కు నొక్కేవు

చ. 3: పెనఁగేటిదానఁ గాను ప్రియపడేదానను
గనముగ నింత యేల కాఁతాళించేవు
యెనసితివి శ్రీవేంకటేశ యిట్టే నన్ను నీవు
చనవిచ్చి నాకెంత సారె లోఁగేవు

రేకు: 0574-6 మధ్యమావతి సం: 13-382

పల్లవి: తొయ్యలివల్ల నింక దోసమేది
చయ్యాటాలు సేయఁగాను చలపట్టెను

చ. 1: వొలిసి నొల్లని మాటలొకటొక టాడఁగాను
జలజలఁ జెమరించె సతిమేను
పిలువఁగానే నీవు బిగిసి వూరకుండగా
కెలసి కనుఁగొనల కెంపు లెక్కెను

చ. 2: యేడో సతులఁ జూపి యెగసక్కేల నవ్వఁగా
వాడె నిట్టే మోమెల్ల వనితకును
పాడిదప్పినటువంటి పనులు నీవు సేయఁగ
గాడఁబొలిది తలఁపులఁ గాఁక రేఁగెను

చ. 3: గోరికొనలటు సోఁక గుంపించి వొడికట్టఁగా
నారుకొనెఁ బులకలున్నతి జెలికి
కూరిమి శ్రీవేంకటేశ గొబ్బున నీకెఁ గూడఁగ
సారె సారె మోవితేనె చవులబ్బెను

రేకు: 0575-1 సామంతం సం: 13-383

పల్లవి: కడు దంటగాదు సతి గంభీర నాయకురాలు
చిడుముడితో నిది చిత్తగించవయ్యా

చ. 1: సెలవి నవ్విన నవ్వు సిగ్గులకు మూలము
చలములకు గురుతు జంకెనలు
వలపులకు మొదలు వద్దఁ బాయకుండుటలు
చెలియందే వున్నవివి చిత్తగించవయ్యా

చ. 2: కన్నులు మొక్కిన మొక్కు కాంక్షలకు మూలము
విన్నపాలకు గురుతు వినయములు
ఇన్ని మన్ననల మొదలిచ్చకఁపు మాటలు
చెన్నుమీఱ నీకెందే చిత్తగించవయ్యా

చ. 3: ఆసలకు మూలము ఆయము లంటుట యెల్ల
వాసివన్నెకు గురుతు వట్టిగుట్లు
వేసాలఁ గూడితివి శ్రీవేంకటాద్రి గోవిందుఁడ
శ్రీసతిని యీపె మేలు చిత్తగించవయ్యా

రేకు: 0575-2 వరాళి సం: 13-384

పల్లవి: ఎన్నడు లేని గుణము యేల వచ్చె నీకును
మొన్నటి నిన్నటిపొందు మొగచాట్లాయనో

చ. 1: బత్తి నేనెంత సేసినా భళియని మెచ్చవు
చిత్తము రాదో నీకు చెప్పుమా నాకు
వొత్తిమెంత వేఁడుకొన్న వూరకే వున్నాఁడవు
వత్తులుఁ గూకులునై వలపు విరిగెనో

చ. 2: వీడెము చేతికిచ్చితే వేగమే వేసుకొనవు
తాడుపడెనో మతి తమకములు
పాడితో నీకు మొక్కితే పక్కన దీవించవు
వేడుక రతులలోన వేసటలు వుట్టెనో

చ. 3: కాఁగిట బిగించితే బింకములాడ విప్పుడైతే
వీఁగని పరవశాలు వెల్లిగొనెనో
ఆఁగితి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
మాఁగిన మోవి చేకొంటి మన్ననలిచ్చితివో

రేకు: 0575-3 సాళంగనాట సం: 13-385

పల్లవి: మొక్కరో సేవించరో మునులాల ఋషులాల
దిక్కులు సాధించీ నదే దేవదేవుఁడు

చ. 1: ఆరదముమీఁద నెక్కి అమరులు గొలువఁగ
సిరితో వీదుల నేగీ శ్రీవిభుఁడు
గరుడ ధ్వజముతోడ ఘనచక్రాయుధముతో
దొరదైవ మదిగో పొందుగ మెరసీని

చ. 2: గొడుగులుఁ బడిగెలు కోటానఁ గోట్లాడఁగా
వెడలె వెడలె నదే విష్ణుదేవుఁడు
నడుమను రంభాదులు నాట్యములాడఁగాను
అడరి వుత్సవమందీ నాదిమూరితి

చ. 3: సారె నింటింటి విందులు చవులు చూచుకొంటాను
సారెకు రథము దోలీ సర్వేశుఁడు
ఆరీతి శ్రీవేంకటేశు డలమేలుమంగఁ గూడి
కోరిన వరములిచ్చీఁ గుంభిణీరమణుఁడు

రేకు: 0575-4 ముఖారి సం: 13-386

పల్లవి: ఎందాఁకా నోరుచుకుండే విటువంటి తమకము
అందుకొని యెడమాట లాడించరాదా

చ. 1: చెప్పరాని మాటలంటా నిగ్గులువడఁగఁ బోతే
దెప్పదాన విభునికిఁ దెలిసే దెట్టు
కుప్పళించీఁ బెంజెమట గుట్టు నీవు నడపఁగ
విప్పుచుఁ జెలులచేత విన్నవింపించరాదా

చ. 2: చిత్తమెద్దో యంటాను శిరసు వంచఁగఁ బోతే
హత్తినపతి కెచ్చరికయ్యే దెట్టు
పొత్తుల వూహలచేతఁ బులకించె మేనెల్ల
సత్తుగా లేకలు వ్రాసి చదివించరాదా

చ. 3: పంతము దప్పీనంటా పరాకుసేసుక వుంటే
ఇంతలో శ్రీవేంకటేశుడెనసె నెట్టు
కాంతవలమేల్మంగ కళలెక్కె నీమోమున
సంతతపు రతులకు సన్న సేయరాదా

రేకు: 0575-5 దేసాళం సం: 13-387

పల్లవి: చూడఁ గొత్తలాయ మీసుద్దులు నేఁడు
వాడవారెల్లా మెచ్చి వేడుకపడేరు

చ. 1: పచ్చడము మరఁగునఁ బడఁతిఁ బెట్టుకొని
యిచ్చుల వేరొక యింతి నెలయించేవు
చెచ్చెర నాపె నిన్నుఁ జెనకఁగఁ జూచితేను
పచ్చిగా నిన్నిట్టే యాపె పయ్యదఁ గప్పిని

చ. 2: కుడి దిక్కునను వొక్కకోమలిపైఁ జేయివేసి
యెడమనొక్క సతితో నిటు నవ్వేవు
జడిగొని నిన్నునాపె సన్నలు సేసితేను
కొడిసాగ నీపె ఇట్టే గోర నొత్తీని

చ. 3: అలమేలుమంగ నురమందు నీవు నెట్టుకొని
మలసి వీఁపున భూరమణిఁ బెట్టితి
కలసె శ్రీవేంకటేశ గక్కనఁ గాఁగిట నాపె
చలివాయఁ గూడి యాపె చన్నుల నొత్తీని

రేకు: 0575-6 రామక్రియ సం: 13-388

పల్లవి: దేవరవు నీవు గావా తెలిపి చెప్పఁగనేల
ఆవిద్యలు నీకే చెల్లు ననుకో నేమిటికి

చ. 1: వింతలు నన్నడిగేవు విచారాలు సేసేవు
యింతి నీకుఁ జెప్పదా యేకతానను
పంతపు నీచేఁతలను పరులాడే మాటలూ నీ
యంతరంగ మెఱఁగదా అనుకో నేమిటికి

చ. 2: సొమ్ములు వెట్టుమనేవు సోదించేవు మామనసు
కొమ్మ నీకుఁ జూపదా గురుతులెల్లా
దిమ్ముల నీవలపులు దిష్టపు నీమచ్చములు
అమ్మరో నీవు సేయవా అనుకో నేమిటికి

చ. 3: వలపు మాపైఁ జల్లేవు వద్దనే మమ్ముఁ బాయవు
అలమేలుమంగ గాదా అరత నీకు
చెలఁగి శ్రీవేంకటేశ చెలుములు బలుములు
అల నీవిద్యలు గావా అనుకో నేమిటికి

రేకు: 0576-1 ఆహిరి సం: 13-389

పల్లవి: ఆపెమాఁటే నామాటఁ అవునయ్యా
యేపొద్దూ నిట్టే చనవియ్యవయ్యా

చ. 1: నవ్వించినపుడే నాతి కోపమెల్లాఁ బాసె
రవ్వలుసేయక యిఁక రావయ్యా
దవ్వులఁ జేయి చాఁచితే తగులాయమెల్ల నాయ
వువ్విళ్ళూర సంగడిఁ గూచుండవయ్యా

చ. 2: మాటాడించినప్పుడే మగువచలము దీరె
చీటికి మాటికి నిఁకఁ జెనకవయ్యా
సూటి గాఁగాఁ జూచితేనే సొంపులెల్లా సమకూడె
గాటముగ ముందుముందే కాఁగిలించవయ్యా

చ. 3: చేరి మొక్కించినప్పుడే సిగ్గులెల్లాఁ దేరెను
జోరునఁ జెమట రతిఁ జొక్కించవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యెనసితి విన్నిటాను
నేరుపులెల్లా నిందే నెరపవయ్యా

రేకు: 0576-2 శుద్ధదేశి సం: 13-390

పల్లవి: నీవేల సిగ్గువడేవు నేడిట్టే మాముందరను
చేపట్టి యాపెచనవు చెల్లించరాదా

చ. 1: మలసి మలసి నీతో మాటలాడీ తనివోదు
తలయెత్తి నిన్నుఁ జూచీ తనివోదు
చెలరేఁగి సేవలెల్లాఁ జేసియునుఁ దనివోదు
యెలమి నాపెకోరికె యీడేరించరాదా

చ. 2: అంటి ముట్టి చదురంగాలాడియునుఁ దనివోదు
దంటతనాన జంకించీ తనివోదు
నంటునను సారెసారె నవ్వియునుఁ దనివోదు
కంటగించకాకె బత్తి గైకొనఁగరాదా

చ. 3: చేరి నీపైఁజేయి చాఁచి చెనకియుఁ దనివోదు
ధారుణిఁ జాగిలి మొక్కీ తనివోదు
యీరీతి శ్రీవేంకటేశ యెనసియుఁ దనివోదు
ఆరసి మమ్మేలితి వాపెను మెచ్చరాదా

రేకు: 0576-3 పాడి సం: 13-391

పల్లవి: నీకు నీకే యమరును నీలోననే
చౌక లేక నేమెట్టు సమ్మతించేమయ్యా

చ. 1: పచ్చిదేరే మాఁటల బయలీఁతమాటలూ
కుచ్చితపు వెంగేల కొనమాటలూ
నెచ్చులులతో నాడ నేరుతు విన్నిటా నీవు
యిచ్చగించి చెవులార నెట్టు వినేమయ్యా

చ. 2: కాకుసేసే చేఁతలూ కతకారి చేఁతలూ
లాకల సిగ్గుమీరిన లండుఁ జేఁతలూ
దీకొని యిందుకునే సాదించితివి తొల్లే నీవు
పైకొని యింతులకెట్టు పడవచ్చునయ్యా

చ. 3: కవకవ నవ్వుల కాతరపు నవ్వులు
చవులతో నెప్పుడును సాజమే నీకు
యివల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
భువిలో నిన్నెంతని పొగడేటిదయ్యా

రేకు: 0576-4 కాంబోది సం: 13-392

పల్లవి: ఉమ్మడినే యేమనినా నూరకుండను
అమ్మరో యెంతట గబ్బి యనకుమీ నన్నును

చ. 1: మాటలు నీవాడితేను మంచితేనెలు గారీని
గాటమై నీచేఁతలైతే కారమయ్యీని
యీటువెట్టితేఁ జవి యిదొకటి నదొకటి
కూటమికొ ననరాదు కోపగించ రాదు

చ. 2: కన్నుల నీవు చూచితే కడు వెన్నెల గాసీని
యెన్నబోతే నీసుద్దులు యెండ గాసీని
పన్ని నవి నీ గుణాలు వచ్చియును వెచ్చియును
అన్నీఁ జేతఁబట్టరాదు అటు దోయరాదు

చ. 3: నీవాసలు వెట్టితేను నిలువు నూరువండీని
భావించ నీ సింగారాలు పాలుకొనీని
యీవల శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
చేవదేరె ననరాదు చిగురనరాదు

రేకు: 0576-5 దేసాళం సం: 13-393

పల్లవి: వినవే యిఁకనైనా నా విన్నపములు
చెనకితే నేమిటికి సిగ్గులు వడేవే

చ. 1: చలమేల సాదించేవే సంగడి విరహమేలే
పిలిచితే రాఁడా ప్రియుఁడు నేఁడు
కలగంటి వంటా కాంతవద్ద నుండెనంటా
వెలయ నాతని నెంత వెంగెములాడేవే

చ. 2: మచ్చరమేమిటికే మరగున నేలుండేవే
ఇచ్చ యెఱిఁగి కూడఁడా యీతఁడు నిన్ను
మచ్చములు గంటి నంటా మరొకతె సేసె నంటా
కుచ్చితానఁ బతినెంత కోపగించేవే

చ. 3: అప్పటిఁ బంతములేలే అండనుండి పయ్యదఁ
గప్పితే మెచ్చఁడా శ్రీవేంకట విభుఁడు
వొప్పి నిన్నుఁ గూడె నంటా వొగి మోవి యెంగిలంటా
చొప్పున నీతని నెంత సొలయఁ జూచేవే

రేకు: 0576-6 బౌళి సం: 13-394

పల్లవి: ఇటువలెఁ జేతురా యింతిని నీవు
సటలెల్ల మాని యింకఁ జనవియ్య వలదా

చ. 1: మొగమోటముననే ముదిత యెదురాడదు
యెగసక్కేలకు నీవెంత సేసినా
నగవుల సరసాల నడురే యాయను నేఁడు
జగడాలకోప దిఁకఁ జనవియ్య వలదా

చ. 2: మిక్కిలి వాసి పట్టుకే మేర మీఱఁజాలదు
యేక్కువ తక్కువల నీవెంత నవ్వినా
తక్కుల జదురంగాలతోనే మరీఁ దెల్లవారె
చక్కని రమణికింకఁ జనవియ్యవలదా

చ. 3: నిండిన మోహమునను నిను ధూరఁజాలదు
యిండెవెట్టి బాసలు నీవెన్ని యిచ్చినా
కొండల శ్రీవేంకటేశ కూడితి వింతటిలోన
చండివెట్టికిఁక నిట్టే చనవియ్యవలదా

రేకు: 0577-1 కురంజి సం: 13-395

పల్లవి: ఊరకే బాఁతిపడి వొడివట్టీఁ గాక మమ్ము
అరీతి సతులమీఁది యాసలేలే తనకు

చ. 1: బత్తితో వలచినాకె పానుపుపై నుండఁగాను
హత్తి నన్నేల చెనకీ నప్పటిఁ దాను
యిత్తలఁ దొలుతటాపె యెదురులు చూడఁగాను
కొత్తమగువలతోడి గొడవేలే తనకు

చ. 2: సేసవెట్టిన వనిత చెంగటనే వుండఁగాను
వేసరక నాతో నవ్వీనే తాను
యీసరిఁ జేతికి లోనయిన దిట్టే వుండఁగాను
వాసు లెంచేవారితోడి వలపేలే తనకు

చ. 3: కానుకలిచ్చిన యాపె కట్టెదుట నుండఁగాను
పూని వచ్చి నన్నుఁ గూడీ పొదిగీఁ దాను
తానే శ్రీవేంకటేశుఁడు మేనముద్దరాలుండఁగా
నానా కాంతలతోడి నను పేలే తనకు

రేకు: 0577-2 బలహంస సం: 13-396

పల్లవి: ఎక్కడా నెఱఁగమమ్మ యిటువంటి బత్తి
చిక్కించే దెటువలెనే చేతిలోని కతని

చ. 1: మనసు నొచ్చీనంటా మాటలాడ వెరచేవు
చెనకే దెటువలెనే చెలువునిని
వనితరో పతికొప్పు వంగీనంటా లోఁగేవు
పెనఁగే దెటువలెనే ప్రియమైన వేళను

చ. 2: వెంగెమవునో యనుచును వెస నవ్వఁజాలవు
సంగతయ్యే దెటులనే సరసములు
యెంగిలయ్యీ నంటా మోవి యించుకంతా నడుగవు
ముంగిటిరతుల నింక ముంచే దెటువలెనే

చ. 3: సిగ్గువడీనో యంటా చెరఁగువట్టి తియ్యవు
వెగ్గళించే దెట్టే శ్రీవేంకటేశుని
యెగ్గువట్టినో యంటా నిట్టే గోరు దాఁకించవు
వొగ్గి కూడితివి యిట్టే వుబ్బు దెలిసే దెట్టే

రేకు: 0577-3 భవుళి సం: 13-397

పల్లవి: కానీవే తానాడినట్టే కైకొంటి నేను
మోనాన నూరక వుండే ముద్దరాల నేను

చ. 1: చలములవారమో సారెసారె నేము తన
సలిగెల బతికేటి సతులము
పలుకులవారమా పంతమాడి యప్పటిని
చెలిమి సేసుకవుండే చెలులము గాక

చ. 2: వెంగెములవారమో వేగినంగాఁ దనమోవి
యెంగిలిచవులు గొనే యింతులము
కొంగు వట్టేవారమో కొసరుచు నేపొద్దు
ముంగిటఁ గాచుకుండే ముదితలము

చ. 3: సాదించే వారమో జంకించి బొమ్మలను
పోదిసేసి కూడేటి పొలఁతులము
ఆదిగొని శ్రీవేంకటాధిపతి నన్నే లె
కాదనేవారమో తనకాఁగిటిలో దానను

రేకు: 0577-4 శుద్ధదేశి సం: 13-398

పల్లవి: పొద్దు వోక నీకునిట్టే బుద్ధులు చెప్పితిఁ గాక
చద్దిగట్టితే వలపు చవులవునా

చ. 1: చెప్పరాని ప్రియములు చెప్పి నీకు వేసరితి
యెప్పుడు నీవోజలివి యేల మానును
తప్పుకు బాసలనుచు దండములు వెట్టితిని
చిప్పులి నీవుద్దండాలు సేయక మానితివా

చ. 2: ఆడేవారి మాటలకు నడ్డమాడి వేసరితి
యేడనుండా నీవె కావా యెంచనేఁటికి
వీడెము చేతికిచ్చి వేఁడుకొంటి చెక్కునొక్కి
కూడేటి సతుల పైకొసరు మానితివా

చ. 3: తగిలి కాఁగిట నిన్నుఁ దనియించి వేసరితి
యెగసక్కేలకుఁ గాదా యియ్యకొంటివి
నగుతా శ్రీవేంకటేశ ననుపులు మెరసితి
మొగమోట సన్నలు ముందే మానితివా

రేకు: 0577-5 వసంతవరాళి సం: 13-399

పల్లవి: ఇన్నిటికి సెలవుగా నిదివో మొక్కే నేను
మన్నించుమింతట నన్ను మంకు నేనెరఁగను

చ. 1: చనవు గలదు గాన సరివెనఁగితి నీతో
యెనసి చన్నులొత్తుట యెరఁగనైతి
నను మన్నింతువు గాన నవ్వులెల్ల నవ్వితిని
మనసుకు వెంగెమౌత మరి నేనెఱఁగను

చ. 2: మచ్చిక గలదు గాన మాటలెల్లా నాడితిని
యెచ్చుకుందులగుట నే నెఱఁగనైతి
యిచ్చగింతువు గనక యిట్టే పాదము దొక్కితి
నిచ్చలాన మితిమీఱుటని యెంచనైతిని

చ. 3: సేస వెట్టితివి గాన చేతులు చాఁచితి నీపై
యీసిగ్గులు రేఁగుట నే నెఱఁగనైతి
రాసికెక్కించితి గాన రతులఁజొక్కించితిని
ఆసల శ్రీవేంకటేశ అలయిక చూడను

రేకు: 0577-6 ఆహిరి సం: 13-400

పల్లవి: నీవే యానతీవయ్య నేమేమీ నెఱఁగము
కావిరి నీమొకములోఁ గళలే కంటిమి

చ. 1: చిక్కువడ్డ మనసులో చింత యెవ్వఁడెరుఁగును
చిక్కునఁబెట్టిన నీచేయిఁ గంటిమి
చక్కఁగా నప్పటి నీసంతోస మెవ్వఁడెఱుఁగు
వుక్కుమీరే సెలవి నవ్వులే కంటిమి

చ. 2: తడఁబడ్డ నీరతి తమక మెవ్వఁడెఱుఁగు
అదరి నీవచ్చిన రాకదే కంటిమి
పెడరేఁటి నీవుచెప్పే ప్రియము లెవ్వఁడెఱుఁగు
విడువక నీవు చేయివేసినదే కంటిమి

చ. 3: అచ్చమైన నీలోని యానంద మెవ్వఁడెఱుఁగు
ముచ్చటలాడే సరసములే కంటిమి
విచ్చనవిడిని శ్రీవేంకటేశ కూడితివి
తచ్చన లెవ్వఁడెఱుగు దక్కినదే కంటిమి

రేకు: 0578-1 ఆహిరి సం: 13-401

పల్లవి: సేతుఁ గాక వూడిగేలు చెప్పినట్టెల్లా
చేతికి లోనైనదాన సిగ్గువడనున్నదా

చ. 1: మలసి మలసి యెన్నిమాటలు నీవాడినాను
చలములు నీతోను సాదించేనా
బలిమిసేసి నీవు పంతములు చూపితేను
వలచినదాన నాకు వాసులున్నవా

చ. 2: యెనసి యెవ్వరి నీవు యెదురులు వెట్టినాను
కొనచూపులనుఁ జూచి కోపగించేనా
పెనఁగి నీవెంతేసి తబ్బిబ్బుగా నడచినాను
ననిచినదాన నాకు నాలి వున్నదా

చ. 3: కొంకక నీమేన నెన్ని గురుతులు నించుకొన్నా
నంకెకు లోనౌదుఁ గాక యలిగేనా
కంకిగా శ్రీవేంకటేశ కలసితి వెట్టుండినా
లంకైనదానను వేరే లాగులుండీనా

రేకు: 0578-2 వరాళి సం: 13-402

పల్లవి: సిగ్గువడ కిఁక నేల చెప్పవయ్యా
తగ్గు ముగ్గు లేక నీతలఁపు లీడేరెనా

చ. 1: కాంతమోము చెమరించెఁ గళలు మోమున నిండె
మంతనాన నాపె నేఁడు మన్నించితివా
పంతములాడుదువు బాసలిత్తువు మాకైతే
వంతుల నీవూ నాపెవలకు లోనైతివా

చ. 2: సెలవుల నవ్వుదేరె చిగిరించెఁ బులకలు
కలికి చేసినసేవ గైకొంటివా
వలవ నెందూ నందువు వసమైతి నాకందువు
బలిమి నాపెకు నేఁడు బ్రమసితివా

చ. 3: మోవిపైఁ గెంపులు రేఁగె ముదము లన్నిటా మించె
యీవల నాపెను నన్ను నేలితివా
భావించి శ్రీవేంకటేశ పలుయెమ్మె లాడుదువు
చేవల్ల మాయిద్దరికీఁ జిక్కితివా

రేకు: 0578-3 పాడి సం: 13-403

పల్లవి: చెలిమోవి యెంగిలి సేసినవాఁడవు మారు
వలుక ననుచు నిట్టే బాస యిమ్మీ నాకును

చ. 1: ఆయములు ముట్టితివి అతివకు నింతలోనే
కాయమెల్లాఁ గరఁగెను కళ దాఁకెను
చేయార నీవే యింత సేసినవాఁడవు మరి
పాయక యేలేనని బాస యిమ్మీ నాకును

చ. 2: ననుచ మాటాడితివి నలినాక్షి యిప్పు డిట్టే
మనసు నీకొసఁగెను మరిగె నిన్ను
పనివడి యింతేసి బ్రమయించినవాఁడవు
పనుపు నేసే నని బాస యిమ్మీ నాకును

చ. 3: అట్టే కాఁగిలించితివి అంగన నిన్నుఁ గూడి
జట్టిగొని మోహించె సతమాయను
అట్టుగా శ్రీవేంకటేశ యిట్టె కూడినవాఁడవు
పట్టిము గట్టేనని బాస యిమ్మీ నాకును

రేకు: 0578-4 ఆహిరి సం: 13-404

పల్లవి: ఎప్పటివలెనే చెలి నేలవయ్యా
చిప్పిలుఁ జెమటతోడ సిగ్గువడనేలా

చ. 1: వేడుకగల సతులు వేవేలు నాడుదురు
పాడివెట్టి నీకు నెగ్గు పట్టనేఁటికే
వాడికెగలయింతులు వరుసలు మీరుదురు
యీాడ నిట్టే తలవంచ నేఁటికి నీకు

చ. 2: సలిగెగల కాంతలు జాగుల నెలయింతురు
అలసి యింతలో నుస్సురననేలా
వలచిన మగువలు వడిగాఁ బెనఁగుదురు
పలుమారు నీకు బెండువడ నేఁటికి

చ. 3: సేసవెట్టిన లేమలు చెక్కు గోర గీరుదురు
బేసబెల్లి తనానఁ దప్పించుకో నేలా
ఆసతో శ్రీవేంకటేశ ఆకే నీవూఁ గూడితిరి
బాసిచ్చితి నని నీవు పలుకఁగ వలెనా

రేకు: 0578-5 నాదరామక్రియ సం: 13-405

పల్లవి: ఎవ్వరు మంచివారమో యెంచుకో నీవు
జవ్వనుల మిద్దరము సవతులమే

చ. 1: మచ్చిక నీకుఁ జేసి మంతనాన నిన్ను రాసి
పెచ్చువేరిగాకె నిన్నుఁ బెండ్లాడెను
యిచ్చకములే యాడి యిన్నిపనులూఁ జేసి
మెచ్చులుమెచ్చి సేస నీమీఁద నేఁ బెట్టితిని

చ. 2: చెలులచేఁ జెప్పిపంపి చేతుల నిన్నుఁ జెనకి
అలమి బలిమి నిట్టే యాపె గూడెను
పిలిచి నీకు నేను ప్రియములెల్లాఁ జెప్పి
తలంపులు సరిదాఁక తమితోఁ గూడితిని

చ. 3: కన్నులఁ దప్పకచూచి కడు బాసగొని యాకె
సన్నసేసి నీమోవి చవిగొనెను
విన్నపాలు నేనే సేసి వేడుకొని చెక్కునొక్కి
యిన్నిటా శ్రీవేంకటేశ యెనసితి నేను

రేకు: 0578-6 శంకరాభరణం సం: 13-406

పల్లవి: మాముందర నేల సేసీ మతకములు
మోముచూచి యాపెతోడ ముచ్చటాడుఁ గాక

చ. 1: చెలిఁ బెండ్లాడిన వాఁడు సిగ్గులు వడఁగనేల
నలువంక నాపెతోనే నవ్వుఁ గాక
వలచినవాఁడు తాను వాసులెంచుకొన నేల
కెలఁకులఁ గమ్మటిని కిందుపడుఁ గాక

చ. 2: బువ్వానఁ గూచున్న వాఁడు పొంచి యెంగిలననేల
చివ్వన నారగించి చెలఁగుఁ గాక
రవ్వై వీడె మిచ్చేవాండు రాజసము లెంచనేల
మవ్వఁపు దెల్లనాకులు మడిచి యిచ్చుఁ గాక

చ. 3: పానుపుపై నున్నవాఁడు పరాకు సేయఁగ నేల
కానిమ్మని యాపె దానుఁ గలయుఁ గాక
వేనలెంట నేల శ్రీవేంకటేశుఁడై నవాఁడు
మోనానఁ గూడినట్లానె మొక్కుచుండుఁ గాక

రేకు: 0579-1 శ్రీరాగం సం: 13-407

పల్లవి: ఏనోము నోఁచితినో యింతకు మున్ను
ఆనుకొని సేవసేయ నంతదానగా

చ. 1: చనవిచ్చి నీవు నాతో సరసమాడేవు గాక
కనుఁగొన నేనంత చక్కని దానగా
పనివడి నామీఁద పాదము చాఁచేవు గాక
తనువు సోఁకుటకు నంతటి దానగా

చ. 2: నాపై మన్ననఁ గూడ నవ్వులు నవ్వేవు గాక
నీపొందు లిటుసేయ నేరుపరినా
తీపనుచు నామోవి తేనెలడిగేవు గాక
ఆపనుల కంతేసి యరుహపు దానగా

చ. 3: దయఁ జూచినవాడవై తగిలి కూడేవు గాక
క్రియతో నీచిత్తమెరిఁగిన దానగా
నియతి శ్రీవేంకటేశ నేఁడిట్టే పెండ్లాడితివి
ప్రియపడి యింతసేయ బిరుదులదానగా

రేకు: 0579-2 మంగళ కౌశిక సం: 13-408

పల్లవి: పెనఁగితే వలపులు పిప్పిగట్టీని
గొనకొన్న యప్పుడే కొంగువట్టేను

చ. 1: మునుప నేఁ బైకొంటే మొగచాటు దోఁచీని
ననిచి తాఁ గనుఁగొంటే నవ్వు నవ్వేను
వెనుకొంటే నింతలోనే వేసటలు వుట్టీని
మనసిచ్చినప్పుడే మాటలాడేను

చ. 2: బలిమి నేఁజేసితేను పలుకులు చప్పనౌను
సలిగె గలప్పుడే పిలిపించేను
చలపట్టితే మరి చండిపెట్టినట్లయీ
పలె నన్నప్పుడు తనవద్ద నుండేను

చ. 3: తోడఁదోడ నైతేను తొక్కుడువడీఁ బంతము
కూడినప్పుడే కొనగోర నూఁదేను
యీడనే శ్రీవేంకటేశుఁ డిపుడే తానన్నుఁ గూడె
జాడతోఁదనకు నిట్టే సతమయ్యేను

రేకు: 0579-3 సాళంగనాట సం: 13-409

పల్లవి: ముందరెంచి మెలఁగవే ముమ్మాటికి
మందలించి కోరికలు ముట్టిపెట్టఁ గలవా

చ. 1: సిగ్గులూ వడే వదేమే చెయిచాఁచి రమణుఁడు
వెగ్గళించి చెక్కునొక్కి వేఁడుకోఁగాను
తగ్గక చనుమొనలు తలచూపి పొదలఁగ
అగ్గమైన జవ్వనము అణఁచుకోఁ గలవా

చ. 2: తెరలోని కేఁగేవేమే దిష్టించి చూచి యాతఁడు
పరగ నీమునిగొంగు వట్టి తియ్యఁగా
పరువమై నీమోవి పండుతేనెలు గారఁగా
మురిపేన వేరే నీవు మూసి దాఁచఁ గలవా

చ. 3: నీవ్వెరఁగై నవ్వేవేమే నిన్ను శ్రీవేంకటేశుఁడు
చివ్వనఁ గాఁగిటఁగూడి చెమరించఁగా
పువ్వులై నీమేనవెల్ల పులకలు నిండఁగాను
ముప్వంక నవి నీవు మోపు గట్టఁ గలవా

రేకు: 0579-4 కొండమలహరి సం: 13-410

పల్లవి: ఇందుకు నేనేమిసేతు నెరిఁగీ నెఱఁగవు
సందడి వలపులను సారె భ్రమసితివి

చ. 1: నామనసెరుగుదువు నాకు నీవిచ్చిన బుద్ధి
ఆ మీఁద నాతో నేల ఆనవెట్టేవు
నీ మాటనే నమ్మనా నీవే చేతలెల్లాఁ జేసి
ఆముకొని నీకు నీవే అళికేవు గాక

చ. 2: యింటిదాననే నీకు నిచ్చలోన దాననే
వెంట వెంటవచ్చి యేల వేఁడుకొనేవు
కంటకము నాకున్నదా గజరుఁగాంతల బొంది
అంటుకొని నామేను అలమేవు గాక

చ. 3: చిన్న దాని నన్నుఁ దెచ్చి సేసవెట్టి కూడితివి
మన్నించి నాకేల బాసలిన్నీ నిచ్చేవు
కన్నకన్న గొల్లెతల కాపిరాలు సేసి వచ్చి
సన్నలు శ్రీవేంకటేశ సలిపేవు గాక

రేకు: 0579-5 వరాళి సం: 13-411

పల్లవి: వీడెము చేతఁ బట్టుక వీఁడె వున్నాఁడు
తోడఁ దోడ బై కొని దోసిలొగ్గఁ గదవే

చ. 1: మాఁటల దేనెలు గారీ మాఁటిమాఁటికిని నీకు
కాటుక కన్నులచూపే కాఁడి పారీని
తాటించి విభునితోడ దారా మోనా జూపితివి
యేఁటికి జాగులుసేసే విఁక నియ్యకొనవే

చ. 2: నిలువెల్ల వినయమే నిండాఁ గొనలు సాగీ
బలిమెల్లఁ జన్నులనే పొఁజు చూపీని
నెలకొని యీతనిపై నీడా నెండాఁ గాసితివి
చలము లింకనేఁటికి సమ్మతించఁగదవే

చ. 3: చేరి సేసలు వెట్టితే చిరుముత్యాలు గారీని
గోరికొన గిరితేను యేరు వారీని
యీరీతి శ్రీవేంకటేశు కింపూ సొంపూఁ జూపితివి
ఆరయ నిఁక నేఁటికి అట్టే మెచ్చఁగదవే

రేకు: 0579-6 లలిత సం: 13-412

పల్లవి: ఏఁటికి నిష్ఠూరము ఇందుకుఁగా నీతోను
నాఁటుకొన సెలవుల నవ్వు నవ్వేఁ గాక

చ. 1: యెదురాడేనా నీకు నేమేమి సేసినాను
కదిమి నీమాటల వంకలు దిద్దేమా
పదరి మరియేమైనాఁ బలుమారు సొలసేమా
సదరమనుచు నిన్ను సాదించేమా

చ. 2: తిట్టు దిట్టేమా నిన్ను దిమ్మరివై తిరిగితే
యిట్టే నీమేని మచ్చాల కీడించేమా
గుట్టునీకు లేదనుచు గుణదోషా లెంచేమా
పట్టిరాఁగా నేము నీతోఁ బంతమాడేమా

చ. 3: కాదు గూడదనేమా గబ్బితనాల నుండఁగ
వాదులడిచేమా నీవనితలతో
పోదిగా శ్రీవేంకటేశ పొందితివి నన్నునిట్టే
సాదుఁదనమే కాక జంకించేమా

రేకు: 0580-1 భైరవి సం: 13-413

పల్లవి: విన్నవించ నేమున్నది విచ్చి విచ్చి ఇందులోను
అన్నిటా నీడేరించి ఆదరించు నీవే

చ. 1: ఆసపడి వున్నదాన నట్టే నీవేమి సేసినా
వేసారుకొంటా నిన్ను వెంగెమాడేనా
నేసవెట్టి పెండ్లాడి సేసుకొన్నవాఁడవు
దోసము రాకుండ మన్నింతువుగాక నీవే

చ. 2: వలచి వచ్చినదాన వంకలు గుణాలు నుంటే
బలిమిఁ బెనఁగి నిన్ను బండుసేసేనా
చెలిమి సేసి తెచ్చి చేయి వట్టినవాఁడవు
చెలులు నవ్వకుండా రక్షింతుగాక నీవే

చ. 3: వేళ గాచుకొన్నదాన వేడుక నీవు గూడితే
చాలునంటా బొమ్మలను జంకించేనా
యేలితివి శ్రీవేంకటేశ యింతలోనే నన్ను
మేలు దప్పకుండా నిట్టే మెత్తుగాక నీవే

రేకు: 0580-2 నాదరామక్రియ సం: 13-414

పల్లవి: మగువా నీవూ నొక్కటే మమ్ము నలయించనేల
యెగసక్కేలు చెలులే యింతసేసి రందురు

చ. 1: చేయివట్టి తియ్యఁగాను చెల్లఁబో జాగుసేసేవు
వేయిటికివి చెలికి విన్నవింతుమా
ఆయెడ నెదురుచూచీ అంగన మాసుద్దులకు
పాయక ఆనతీవయ్య పరాకులేమిటికి

చ. 2: ఆనవెట్టి పిలువఁగ నంగనలతో నవ్వేవు
వైసవై నాలుగ నన్ని వ్రాసెంపుదమా
మానవతి లోననుండి మరీ దూతికం నంపె
దానికేమనే వయ్య యీతరి గుట్టేమిటికి

చ. 3: వొత్తరించుకొని రాఁగా నువిద నిట్టే కూడితి-
విత్తల శ్రీవేంకటేశ యెచ్చరింతుమా
తత్తరానఁ గమ్మటిని తరుణి సన్నలు సేసీ
చిత్తగించి యేలవయ్య సిగ్గులిప్పు డేఁటికి

రేకు: 0580-3 సౌరాష్ట్రం సం: 13-415

పల్లవి: ఇంతటివాఁడవు యిన్నీ నెఱఁగవద్దా
వింతగా నెదిరిఁ దమ్ము విచారించవద్దా

చ. 1: కక్కసమేల సేసేవు కప్పురమేల చల్లేవు
మొక్కితే నెఱఁగవద్దా ముందరెత్తు
పక్కన నేలంటేవు బాసలేల సేసేవు
వొక్కమాటాడితే నూరకుండవద్దా

చ. 2: చన్నులేల పిసికేవు చలమేల నెరపేవు
సన్ననే తెలియవద్దా జాణతనము
యెన్నిమారులు నవ్వేవు యింతయేల పెనఁగేవు
వున్నట్లానే వుండి వొద్దిక గావద్దా

చ. 3: మేరలేల మీ రేవు మెచ్చులేల మెచ్చేవు
చేరితే గరఁగవద్దా చిత్తమెల్లాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
సారెఁ గొసరితేఁ జనవియ్య వద్దా

రేకు: 0580-4 శంకరాభరణం సం: 13-416

పల్లవి: ఆసపడి వచ్చె నాఁటదానిఁ దోయ
దోసమేల యీపెఁ జేసుకోవయ్యా

చ. 1: కందువ చూపీని కానుక లిచ్చీని
విందులు చెప్పీని వెలఁది
యిందరిలో సిగ్గులేల పచరించ
పొందులు సేసుక భోగించవయ్యా

చ. 2: సన్నలు చేసీని చవులు చూపీని
కన్నుల మొక్కీని కలికి
మున్నిటి వలపు మూసి దాఁచనేల
యిన్నిట నాకెను యియ్యకోవయ్యా

చ. 3: శ్రీవేంకటేశ్వర సేవలు చేసీని
పూవుల వేసీని పొలఁతి
యీవల నన్నేలి తీఁకఁ గొంక నేల
భావించాపెఁ గూడి బదుకవయ్యా

రేకు: 0580-5 మాళవిగౌళ సం: 13-417

పల్లవి: కంటిమి వింటిమి అట్టే కానీ వయ్యా
వెంటనే యశోదకు విన్నవించే మయ్యా

చ. 1: చల్లలమ్మే గొల్లెతతో సాములెల్లాఁ జేసితివి
చెల్లునయ్యా నేఁడు నీకు చేసినవెల్లా
గొల్లు కంపు నీమెయి నంటె గోరురేక లాపె కంటె
యెల్లవారము నిన్ను నేమనే మయ్యా

చ. 2: మగనాండ్ల సిగ్గులు మానమే కొల్లలాడితి
తగునయ్య తలఁచిన తలఁపెల్లాను
తగిలెఁ బయ్యద నీకు తమక మాపెకు రేఁగె
యెగసక్కే లాడఁగా మాకేమి చలమయ్యా

చ. 3: దొడ్డివారి వావులెల్ల దోమటి దొడికితివి
అడ్డము లేదయ్య నీకు నన్నిటాను
జడ్డు నీకాఁగిట మించె సేస లాపెమీఁద నిండె
వొడ్డి శ్రీవేంకటేశ నేమొనరితి మయ్యా

రేకు: 0580-6 కన్నడగౌళ సం: 13-418

పల్లవి: తప్పులింకఁ బట్టి నిన్ను దగ్గరి కూచుండు మిట్టే
కుప్పళించు మాటలెల్లా కొంకకు నీవిఁకను

చ. 1: వీడె మింద వేసుకో వెస దప్పి దేరుచుకో
వాడు మోముతో నలసి వచ్చితివి
ఆడనుండి తెచ్చిన సొమ్మది నాయెదుటఁ బెట్టు
యేడలేని సిగ్గువడ నిపుడేల యికను

చ. 2: పన్నీరవధరించు పవ్వళించు తొడమీఁద
వన్నెల నసురుసురై వచ్చితివి
మున్ను పల్లెవాటు వేసుకొన్న పచ్చడమిదే
వెన్నెల గాసీ నదే వెరవకు మిఁకను

చ. 3: గందము మేనఁ బూసుకో కాఁగిలించు నా చన్నులు
వందనపు వంచనతో వచ్చితివి
యిందు నందు శ్రీవేంకటేశ యేలితివి నన్ను
సందడి వేడుకలకు జడియకు మిఁకను

రేకు: 0581-1 ఆహిరి సం: 13-419

పల్లవి: విరుల యమ్ములు వాఁడి వెన్నెల వేఁడి
సరవితోఁ గూడరయ్య జాముఁవోయ నిపుడు

చ. 1: వుయ్యాల మంచముమీఁద నుండినట్టి నీదిక్కు
తొయ్యలి మేడలో నుండి తొంగిచూచీని
చెయ్యెత్తి సన్న చేసి చేకొని పిలువవయ్య
చయ్యాటపు సిగ్గులనే జాముఁవోయ నిపుడు

చ. 2: నెలవై మలఁగుమీఁది నీబుజముపై నాపె
కలువకామ సోరణ గండ్లఁ జాఁచీని
చలివాసి రమ్మని ఇచ్చుట కప్పణియ్యవయ్య
చలపాది సిగ్గులనే జాముఁవోయ నిపుడు

చ. 3: చేరి దోమతెరలోని శ్రీవేంకటేశ నిన్ను
గోరనూఁది కాఁగిలించి కొసరీ నాపె
గారవించి యేలితివి గక్కన మోవియ్యవయ్య
సారెకు నొడఁబాట్ల జాముఁవోయ నిపుడు

రేకు: 0581-2 శ్రీరాగం సం: 13-420

పల్లవి: సందడిలో నెందాఁకా సారెకు గుబ్బతిల్లేవు
కందువైన చోటనే జోకగా నుండరయ్యా

చ. 1: సరసమాడినఁ గాని చవి గావు వలపులు
తెర వేసుకొన్నఁ గాని తీరదు సిగ్గు
వొరసి నవ్వినఁ గాని వొక్కటి గాదు మనసు
తరుణి నీవు నేక తాన నుండరయ్యా

చ. 2: పచ్చి మాటాడినఁ గాని భావములు గరఁగవు
యిచ్చఁ గొసరినఁ గాని ఇంపు రేఁగదు
విచ్చనవిడైనఁ గాని వెలయపు కోరికెలు
పచ్చల మేడలోనఁ బవ్వళించరయ్యా

చ. 3: బిగువుఁగాఁగిటఁ గాని ప్రియములు సమకోవు
తగులైనఁ గాని లేదు తరితీపు
మిగుల శ్రీవేంకటేశ మెలుఁత నేలితి విట్టే
నగరిలోననే వుండి నంటు చూపరయ్యా

రేకు: 0581-3 కురంజి సం: 13-421

పల్లవి: అందువల్లఁ గాని నమ్మఁడాతఁడు
అందములుగా నింకా నానవెట్టుకొనవే

చ. 1: సారె నీవు నగఁగాను సరసుఁడు తనవోళ్ళి
నేరమేదో యని మతి నెమకీని
గారవించి నీవిందుకు కప్పురవీడె మిచ్చి
ఆ రీతి నే మీరనని ఆనవెట్టుకొనవే

చ. 2: పలుమారు మొక్కఁగాను పచ్చిదేరె వెంగెమని
తలవంచుక బాసలు తలపెట్టీని
కలసి నీవీవేళ కాఁగిలించి బుజ్జగించి
అలరించి నిజముగా నానవెట్టుకొనవే

చ. 3: వొద్దఁ గాచుకుండఁగాను వొరసీ నిదోమో యని
పొద్దు వొద్దు నీతోనే భోగించీని
వొద్దిక శ్రీవేంకటేశు నొడఁబరచి నీవిట్టే
అద్దుకొని పాదములు నానవెట్టుకొనవే

రేకు: 0581-4 మనోహరి సం: 13-422

పల్లవి: నీవు చేసిన భాగ్యము నేనేమని పొగడేము
సొవలుగ నిన్నేసి నీసుద్దులెల్లా వింటిమి

చ. 1: పైకొని పాదముమీఁదఁ బాదమువేసి బిగించి
ఆకు మడిచి నోరనే అందియ్యఁగా
నీకు నీకే కడునుబ్బి నిలువెల్లఁ జెమరించి
జోకతో వెరగందిన సుద్దులెల్ల వింటిమి

చ. 2: చెక్కునుఁ జెక్కునుఁ మోపి శిరసుతోడ నదిమి
వొక్కటై గుబ్బల నురమూఁదఁగాను
తక్కక నీవంతలోనే తనువెల్లఁ బులకించ
చొక్కమై కళ రేఁగిన సుద్దులెల్లా వింటిమి

చ. 3: పానుపుపై నొత్తగిలి బంతినే రతులు చూపి
ఆనుక శ్రీవేంకటేశ ఆకెఁగూడఁగా
తానకమై మీరిద్దరు తలకొని మోవితేనె
సోనలు గురిసిన మీ సుద్దులెల్లా వింటిమి

రేకు: 0581-5 నాగవరాళి సం: 13-423

పల్లవి: లోనికి రావయ్యా లోకమెల్లా రట్టాయ
దీనికిఁగానే యింతి తెరలోనే వున్నది

చ. 1: మగువ నీతో నిట్టే మాటలెన్నో అడఁగాను
చిగురుమోవి యెల్ల జిల్లులాయను
అగడు సేతురా నీవు ఆఁటదాని నింతలోనే
తెగువలు చూపలేక తెరలోనే వున్నది

చ. 2: నలినాక్షి సారె సారె నవ్వు నీతో నవ్వఁగాను
తొలఁకి చెక్కులను చంద్రుఁడు నిండెను
పెలుచు సిగ్గు రేఁతురా ప్రియురాలి కింతలోనే
తెలిసెనంటాఁ దాను తెరలోనే వున్నది

చ. 3: కామిని యేపొద్దు నిన్నుఁ గాఁగిటనే కూడఁగాను
కామించి మేనెల్లా తీగెలు వారెను
దోమటి శ్రీవేంకటేశ తొయ్యలి నింత సేతురా
దీమసాన రతిఁ జొక్కి తెరలోనే వున్నది.

రేకు: 0581-6 గంభీర నాట సం: 13-424

పల్లవి: మాపుదాఁకా మాటలేలే మర్మము చేత నుండఁగ
యేపున మీ నేరుపులు యిట్టే చూపరాదా

చ. 1: పంతమాడ నేఁటికే పడఁతులాల మీతోను
కాంతుఁడే నన్నింతేసి గారవించఁగా
అంత గలితే మీరు ఆతనిఁ జొక్కించరాదా
యింతుల జాణతనాలు యేరుపడీఁ గాని

చ. 2: యేతులు చూప నేఁటికే యిందరి ముందర నేఁడు
ఆతఁడే నాపాలఁ జిక్కి అండ నుండఁగా
చేతనైతే మీరు పతిఁ జేకొని లోఁగొనరాదా
ఘాతల నందరి సొంపు గానవచ్చీఁ గాని

చ. 3: మరిపెము లేటికే కిమ్ముల నిట్టే పచరించ
యిరవై శ్రీవేంకటేశుఁ డెనశుండఁగా
వరుసగా వలసితే వద్దనే మీరుండరాదా
గరిమ నందుల మేలు గానవచ్చీఁ గాని

రేకు: 0582-1 హిజ్జిజి సం: 13-425

పల్లవి: ఎటువంటివాఁడవు యేమి జాణతనము
నటనఁ గేఁకరించుకొనఁగరాదా నేను

చ. 1: అగపడి యింతులు నీయండ నిలుచుండఁగా
నగరాదా నిన్నుఁ జూచి నాకు నేఁడు
తగవు చెప్పు మనుచు తామే సాకిరి గోరఁగ
మొగము చూచి నీకు మొక్కరాదా నేను

చ. 2: చేతులకొలఁది నీపై సేసలెల్లా బెట్టఁగాను
యీతల మెచ్చఁగరాదా ఇంతలో నాకు
రాతిరీఁ బగలు జాగరాలు నిన్నుఁ జేయించఁగా
ఘాతల జూడగఁరాదా కందువతో నేను

చ. 3: వొట్టుకొని నిన్నుఁ గూడి వూడిగాలు సేయఁగాను
దట్టముగ అట్టుసేయఁ దగదా నాకు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చుట్టమనై ఆనందానఁ జొక్కరాదా నేను

రేకు: 0582-2 సామంతం సం: 13-426

పల్లవి: సతులకుఁ బతులకు సాజము లీవి
యితవులు సేసుకొంటే నియ్యకోలౌనా

చ. 1: మనసురానియట్టి మాఁట లెన్నియైనా
చనవరులాడితేనే చవులౌను
పెనఁగి పెనఁగి యెంత బిగిసి కొసరినా
వనితల కోపాలు వలపులౌను

చ. 2: సేయరానియట్టి సేఁతలెన్ని యైనా
పాయని చుట్టాలై తే బాఁతౌను
రాయడింపులైన రచన లెన్నైనా
ఆయమెఱిఁగిన వారి వందములౌను

చ. 3: వాలితో నెగసక్కెపు నవ్వులెన్ని నవ్వినాను
మేలుగల వారైతే మెచ్చులౌను
యీవల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చాలుకొన్న నారతులు సతములౌను

రేకు: 0582-3 వరాళి సం: 13-427

పల్లవి: చెలియరో నీవే కరే సిష్టికర్తవు
నిలువున నీ మగఁడు నిను మెచ్చునమ్మా

చ. 1: బొమ్మల జంకించితేనే పొద్దు గుంకినట్లౌను
కమ్మి నీవు నవ్వితేనే కాయు వెన్నెల
సొమ్మల మోవి చూపితే చుక్కలు నిండుకొనును
నెమ్మది నీరమణుఁడు నిను మెచ్చెనవమ్మా

చ. 2: పొలిఁతి నీవు చూచితే పొద్దువొడుచు నప్పుడే
పొలయలుకల నెండ పొడచూపును
తిలకించి నిలిచితే దిష్టమౌను లోకమెల్ల
నెలకొని నీవిభుఁడు నిన్ను మెచ్చెనమ్మా

చ. 3: యెక్కువై నీవు గూడితే నిరుసంజలునుఁ దోఁచు
మొక్కిన నీతురుముకు మూఁగు మేఘాలు
వొక్కటై నీరతులను వోలార్చఁగా నేఁడు
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను మెచ్చెనమ్మా

రేకు: 0582-4 కేదార గౌళ సం: 13-428

పల్లవి: చెలికత్తెలము నేము సేసేదేమి
అలసితి వాకెమోవి అందుకొనవయ్యా

చ. 1: కూరిమి గొసరి పూవుగుత్తిఁ గొని ఆకె వేసె
అరయ నీకవి మరనమ్ములై తాఁకె
ఆరితేరెఁ బనులెల్ల నందుకేమి సేయవచ్చు
మారుకొని వలపుల మందు వుయ్యవయ్యా

చ. 2: బత్తితోడ నీపై నాపె పక్కనఁ బన్నీరు చల్లె
వొత్తిన విరహన నీకుడుకెత్తెను
చిత్తగించి తగవులు చెప్పేదిందులో నేమి
మత్తిలి వచ్చి మాటల మంత్రించుకోవయ్యా

చ. 3: కొమ్మ నిన్ను రతిఁ గూడి కుచముల నిన్ను నొత్తె
కమ్మి నీకు రాతికంటె గట్లాయను
యిమ్ముల శ్రీవేంకటేశ యెవ్వరూ నేమి చెప్పేరు
తమ్మికొనగోరి యంత్రము వ్రాసుకోవయ్య

రేకు: 0582-5 సాళంగ నాట సం: 13-429

పల్లవి: పండి పొల్లవోదెపుడు పనులెల్లా ముందరనే
నిండు నిధానము వలె నిలవే యింకాను

చ. 1: వొట్టు వెట్టుకొను నేవె వొడఁబరచఁగఁ బోతే
గుట్టుతో నాతనివద్దఁ గూచుండవే
పట్టి పెనఁగఁగఁ బోతే పంతాలు చూపునో యేమో
చుట్టరికముతోడనే చూడవే యింకాను

చ. 2: గడి వెట్టుకొనునేమో కదిసి పిలువఁబోతే
విడువక లోననుండి వీడె మియ్యవే
తడవి మాటలాడితే తమకించునో యేమో
చిడుముడి సేవలెల్లాఁ జేయవే యింకాను

చ. 3: సిగ్గులు వడునో యేమో చెనకులు నించఁబోతే
కగ్గుదీర చన్నులంటఁ గాఁగిలించవే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
వొగ్గి చేతులనే మొక్కి వొనరు మింకాను

రేకు: 0582-6 పాడి సం: 13-430

పల్లవి: ఎట్టి యాసోదకాఁడవు యెందరికి నోపుదువు
నెట్టుకొన్న మేలుకాపె నిలుచుక వున్నది

చ. 1: సందడి నందరితోడ సరసాలాడే వీడ
కందువకు వచ్చినాపె కాచుకున్నది
పొందుల పొరగులను పొత్తులకడందుకోఁగా
విందు చెప్పవచ్చినాపె వెరగుతో నున్నది

చ. 2: వాడవారిపై నీవు వసంతాలు చల్లేవు
వీడె మంపినాపె లోనిమేడ నున్నది
గోడ నిక్కి చూచినాపె గుబ్బలు నీ వంటఁగాను
జోడు గూడ వచ్చినాపె చూచి నవ్వుచున్నది

చ. 3: కొలువులో వారినెల్లా కూడఁగ సన్న సేసేవు
అలమి పట్టుకున్నాపె అలశున్నది
యెలమి శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
కలసిన పురమాపె కడు మెచ్చుచున్నది

రేకు: 0583-1 ముఖారి సం: 13-431

పల్లవి: కల్ల గాదు నామాట కదిసి చూడఁగదయ్య
చల్లువెద లిద్దరికి సగఁబాలు సుమ్మీ

చ. 1: దప్పిగొని వచ్చేవంటా తరుణి వాకిటనుండి
కప్పుర మిచ్చేనంటాఁ గాచుకున్నది
కప్పి నీయాదాయములో కడ నున్న నీసతికి
చప్పుడుగా కందులోన సగఁబాలు సుమ్మీ

చ. 2: బడలి వచ్చేవంటా పడఁతి మంచేనవాలు
బెడిదానఁ జల్లారఁ బెట్టుకున్నది
తడవి నీకుఁ గలితే తగ నిన్నిందాఁకఁ గూడి
జడియని యాకెకును సగఁబాలు సుమ్మీ

చ. 3: పొంతఁ గాగి వచ్చేవంటా పూజించఁగోరి నీకు
యింతేసి తామెరలు మీఁదెత్తుకున్నది
ఇంతలో శ్రీవేంకటేశ యెనసె నిన్నాకె రతి
సంతోషములాకెకును సగఁబాలు సుమ్మీ

రేకు: 0583-2 నాట సం: 13-432

పల్లవి: తొల్లెరఁగమా నీదొడ్డతనము
పల్లద మింతయును నీపాలిటిదే కాదా

చ. 1: వూని రమణుని జూచి వురము దట్టుకొనేవు
కానీవే రట్టిడివంత గావా నీవు
వీనుల వినందరు నవ్వేరంటా నుంటివి గాక
శేన తిట్టులెల్లాఁ దిట్టి చెల్లించుకోలేవా తొల్లె

చ. 2: పచ్చి దొర్ల నాతనితో పంతము లాడుకొనేవు
వొచ్చెము లేక పెనఁగనోపవా నీవు
విచ్చనవిడా డీకెకు వెరచి వుంటవి గాక
తచ్చి రాఁగతనపు చేఁతల మించలేవా

చ. 3: శ్రీవేంకటేశు రతులఁ జెంది కడుఁ జొక్కించేవు
లేవే యింత సలిగె లేదా నీకు
కోవిదుఁ డాతని నేనే కూడఁగా నుంటివి గాక
నీ వొళ్ళి గబ్బితనము నెరపఁగ లేవా

రేకు: 0583-3 కాంబోది సం: 13-433

పల్లవి: చెపరయ్య వినే నేను చెవుల పండువగాను
కుప్పళించీఁ జెమటలు కూడుకొంటిరా

చ. 1: మంతనాన నున్నాఁడవు మగువయు నీవును
అంతరంగపు మాట లాడుకొంటిరా
వింత లేక యెనసిట్టే వేడుకతో నున్నారు
చింత దీర బాసలెల్లఁ జేసుకొంటిరా

చ. 2: పానుపుపై నున్నాఁడవు పడఁతియు నీవును
మేనరికాలు దెలిసి మెయికొంటిరా
గానములు చేసుకొంటాఁ గళలతో నున్నవారు
కానీలే మీమనసులు కరఁగించు కొంటిరా

చ. 3: సన్నలు చేసుకొనేవు సతియును నీవును
యిన్నేసి రతులు మీలో నెంచుకొంటిరా
నన్నుఁ గూడితివి నేఁడు ననిచి శ్రీవేంకటేశ
వున్నతితో మీరిద్దరు నొడఁబడు కొంటిరా

రేకు: 0583-4 శుద్ధవసంతం సం: 13-434

పల్లవి: వెఱివకు నేఁ గూడి వెస నందుకూ నంపేను
తఱి నాకు మొగమోడింతలో వెరగందేవు

చ. 1: యెవ్వతెకో ఆడ వీడె మిచ్చి వచ్చి నన్నుఁ గని
అవ్వలఁ బోరాక వుపాయాలు చూచేవు
నవ్వుచు నీ కొంగువట్టి నాయింటికిఁ దీసి తేను
వువ్విళ్ళూర దిగులుతో నుస్సురనేవు

చ. 2: విందాపెకుఁ జెప్పి వచ్చి వెస నీడ నన్నుఁ గని
అంది కొంపోరాక వుపాలు చూచేవు
సందడి నే మాటలాడి జరపులఁ బెట్టితేను
పొందుగఁ జల్లారీ నంటా పొద్దులు చూచేవు

చ. 3: వొంటి నాకెఁ బెట్టి వచ్చి వొద్దికతో నన్నుఁ గని
అంటి పాయరాక వుపాయాలు చూచేవు
జంటయి శ్రీవేంకటేశ సమరతిఁ జొక్కించితే
పెంటగా నిందుంటి నంటా బిమ్మిటి గొనేవు

రేకు: 0583-5 కాంబోది సం: 13-435

పల్లవి: కాకున్న నింత లోఁగేవా గడుసరివి
కేకలు వెట్టి నవ్వితేఁ గిందువడే విపుడు

చ. 1: పక్కన మాటాడితే నీపైకి తీసుకొనేవు
చక్క దిష్టించి చూచితే జడిసేవు
మొక్కితేనే వెంగెమంటా మొగము వంచుకొనేవు
నిక్కి యెందై నా నీవు నేరమి చేసితివో

చ. 2: పేరుకొని పిలిచితే బ్రియములు చెప్పేవు
చేరి చేత నివిరితే సిగ్గువడేవు
అరసి కొంగు వట్టితే నానలు వెట్టుకొనేవు
దార దప్పి యెందైనా నిందలకు లోనైతివో

చ. 3: మెచ్చి కాఁగిలించుకొంటే మేనెల్లాఁ జెమరించేవు
పచ్చి రతులఁ గూడితే బ్రమసేవు
అచ్చపు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
విచ్చినవిడి నెందైనా వెల్లవిరులైతివో

రేకు: 0583-6 మధ్యమావతి సం: 13-436

పల్లవి: ఎక్కడికిఁ బోనందువు యెవ్వతె నంటనందువు
గుక్కక తారుకాణించుకొందు గాని రావయ్యా

చ. 1: మదిమదినుండి నీతో మాటలాడిన ఫలము
కదిసి యింతటిలోనే కంటిమయ్యా
అదివో ఆపెఁ దిట్టితినంటాఁ జెప్పితివట
కొద లేకుండాఁ దెలుపుకొందువు రావయ్యా

చ. 2: చక్కజాడ నీతోడ సరసమాడిన ఫల-
మిక్కడనే నాకు ఫలియించె నయ్యా
మొక్కలపాపెవని నీముందల వట్టితినని
అక్కడ నంటివట నీవాడుకొందు రావయ్యా

చ. 3: పొంచి నీకాఁగిటఁ గూడి పొందుసేసిన పలము
వంచన లేక సరివచ్చెనయ్యా
యెంచి శ్రీవేంకటేశ నీకిడిన తమ్ములమాకె-
కుంచుమంటి నన్నది రూపించవలె రావయ్యా

రేకు: 0584-1 దేశాక్షి సం: 13-437

పల్లవి: ఐనవని కిఁకనేల అంతగొౌరబు చేసేవు
దీని నేమివచ్చె నీకు తెలుసుకోరాదా

చ. 1: యిచ్చకమాడఁగఁ బతి నేల గద్దించి వేసేవు
అచ్చపు నీలోనికోప మాఁపఁగ రాదా
పచ్చి దేరిన పనులు బయలు సేయఁగ నేల
వచ్చెఁగా యింటికతఁడు వడిఁ గూడరాదా

చ. 2: ఇప్పుడిట్టే నవ్వేవాని నేల వొౌట్టులువెట్టేవు
తప్పు లెంచకిట్టే దయఁ దలచరాదా
చెప్పెను తనచేఁతలు చిడుముడి పడనేల
కప్పెఁగా పచ్చడమిఁకఁ గానిమ్మనరాదా

చ. 3: చెక్కునొక్కి కూడేచోట సిగ్గులేల పెంచేవు
వొౌక్కటైతివి చన్నుల నొౌరయరాదా
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను నేలె మరఁగేల
తొక్కెఁగా పాదమిట్టే సంతోసించఁగరాదా

రేకు: 0584-2 శ్రీరాగం సం: 13-438

పల్లవి: పడఁతి నీపతిఁ దెచ్చే భ్రమయకువే
యెడయని నీతమక మేమని చెప్పేదే

చ. 1: వెన్నెలబయటనుండి వేసవియండ లనేవు
అన్నిటాఁ జంద్రుని రవి యని యాడేవు
పన్నిన చిలుకలను పక్కెర గుజ్జాలనేవు
యెన్నరాదు నీవిరహ మేమి చెప్పేదే

చ. 2: తుమ్మిదలఁ గనుఁగొని దొడ్డయేనుగ లనేవు
కమ్మిన చిగురులే కత్తులనేవు
కమ్మరఁ గోయిలలను కాముని దూతలనేవు
యెమ్మెల నీవలపులు యేమి చెప్పేదే

చ. 3: వేడుకతోఁ జల్లగాలి వింతమాసటిఁ డనేవు
వీడెపు గప్రము చలి వేఁడి యనేవు
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బున నిన్నింతలోనే
యీడనే నీభాగ్యమిఁక నేమి చెప్పేదే

రేకు: 0584-3 భైరవి సం: 13-439

పల్లవి: ఇందుకే పో విచారాన నింతి వున్నది
చందమైన జవరాలు జంకెన కోరుచునా

చ. 1: గుత్తపు మనసులోని గుట్టు విడువఁగరాదు
చిత్తము లోపలి మాఁట చెప్పక పోదు
పొత్తునఁ బెట్టుకొంటివి పొలతుల నందరిని
యెత్తైన పట్టిపుదేవి యెంగిలికోరుచునా

చ. 2: ముంచిన చుట్టరికపు మొగమోటెంతైనాఁ గద్దు
యెంచవలె నీ మేకులు యీపొద్దు
మంచ మెక్కించుకొంటివి మగువల నిందరిని
అంచితపు టిల్లాలు అఱడి కోరుచునా

చ. 3: వాడికె కూటపురతి వలపులు గడువేఁడి
తోడఁ గూడిన చన్నుల తుదలు వాఁడి
వీడేలందుకొంటివి శ్రీవేంకటేశ యిందరిచే-
నీడైన మోహపుటింతి యింతేసి కోరుచునా

రేకు: 0584-4 శుద్ధదేశి సం: 13-440

పల్లవి: ఏమి జాణతనమే యెవ్వరు మెత్తురు యిది
చేముట్టి పెనఁగఁగాను జీరలు దీసేవు

చ. 1: వేడుక నవ్వులు నీచే వెలవెట్టి కొనరాఁగా
జాడెరుఁగక పతిని జంకించేవు
వీడెము చేతికియ్యఁగా విఱ్ఱవీఁగుతా నీవు
ఆడనుండి చెలికత్తె నందుకొమ్మనేవు

చ. 2: వెల్లవిరిమాటలు వెదవెట్టుకొని రాఁగా
కల్లలంటా రమణునిఁ గాకు సేసేవు
మల్లెపువ్వులియ్య రాఁగా మందెమేళమున నీవు
పల్లదాన పానుపుపై బరుచుమనేవు

చ. 3: మోదముతోఁ బంతములు మునుపే యియ్య రాఁగా
కాదంటా శ్రీవేంకటేశుఁ గాఁగిలించేవు
పోదిఁ బచ్చడము గప్పి పొదుగఁగఁ సిగ్గుతోడ
తోదోపుల చెమటలు దుడువుమనేవు

రేకు: 0584-5 దేసాళం సం: 13-441

పల్లవి: చూతువు రావయ్యా సుదతి నిట్టే
కాతరము లన్నియును గంపఁబెట్టీ నదివో

చ. 1: చెమ్మఁజెమటల చేతఁ జిప్పిలి నీపై వలపు-
లుమ్మగిలఁ బెట్టుకున్న దువిద
కుమ్మరింపుఁ బులకలఁ గోరికె లీరికెలెత్తి
దిమ్ము రేఁచి తమకము తెట్టెవెట్టీ నదివో

చ. 2: వాడికె పూర్పులచేత వడి నీపె కాఁతాళము
కూడ పోసీ నదివో కోమలి
జాడుఁ జూపుల తోడుత జవ్వన మదములెల్ల
మేడెముగాఁ బన్ని పన్ని మేడగట్టీ నదివో

చ. 3: సెలవి నవ్వులతోడ సిగ్గుల రతుల నీకు
కలయఁబెట్టీ నదె కలికి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి యింతి నిట్టే
తొలగని సంతోసాలు దొడ్డిఁబెట్టీ నదివో

రేకు: 0584-6 దేశాక్షి సం: 13-442

పల్లవి: కంటిమిగా యివి గొన్ని కారణాలు నీవల్ల
వింటిమి నిన్నా మొన్నా వేడుకాయ నేఁడు

చ. 1: వల్లెవాటుఁ బయ్యదతో వచ్చి యాపె నిలుచుండి
పల్లదపు మాటలాడీఁ బచ్చిగా నిన్ను
కల్లలంటా నుంటిమి నీకతలు యిన్నాళ్ళుదాఁకా
వెల్లవిరులుగాఁ జూచి వెరగాయ నేఁడు

చ. 2: వుద్దాలు మెట్టుక వచ్చి వురుపుఁ జూపులఁ జూచి
వుద్దండపుఁ జేఁత సేసి వొరసీ నిన్ను
సుద్దులే యంటా నుంటిమి చొక్కపు నీ మహిమలు
అద్దుక నీగుట్టెటిఁగి అరుదాయ నేఁడు

చ. 3: పుక్కిటి వీడెముతోడ పొందుల నీతొడ యెక్కి
మిక్కిలి కాఁగిటఁ గూడీ మేలుతో నిన్ను
తక్కులంటా నుంటిమి యిందాఁకా శ్రీవేంకటేశ
యిక్కువ నన్నేలితివి యిరవాయ నేఁడు

రేకు: 0585-1 సామంతం సం: 13-443

పల్లవి: కంటిమి నీమీభాగ్యము కన్నుల తుదలను నేఁడిదె
జంటలు నీకీవిద్యలు సాజమె కదవయ్యా

చ. 1: విందులమోవుల యీవులు వీఁపుననానిన కుచములు
పొందుల కొనగోరొత్తులు పొలఁతికి నీకమరె
చిందెటి సెలవుల నవ్వులుసిగ్గులమోములవంపులు
కందువ నుండెడి చెలికత్తియలకు నమరె

చ. 2: తొడఁదొడమోసిన మేలముదోమటి వీడెపు టుదుటులు
జడిగొని చూపుల ననుపులు సతికిని నీకమరె
యెడనెడఁ బయ్యెద మరఁగులు యెరఁగని సేయుపరాకులు
ఆడియాలపు మీకొలువుల అంగనలకు నమరె

చ. 3: ఆయములంటినమరపులు నడఁచియునడఁచని యూర్పులు
యీయెడ శ్రీవేంకటేశ్వర యిద్దరికిదె యమరె
చాయల సన్నల పదరులు సరిఁ దెరవాల్చిన నేర్పులు
పాయని నీయుడిగంబుల పడఁతుకలకు నమరె

రేకు: 0585-2 భైరవి సం: 13-444

పల్లవి: నీచిత్తము వచ్చినట్టు నే మెలంగేదానఁ గాక
నాచలమే పెంచితేను నగవా నీవు

చ. 1: వేసారక నే నీతో వేమారు విన్నవించఁగ
ఆసోదపుఁగత్తె యని ఆడవా నీవు
వాసుల కిందరివలె వంతులకుఁ బెనఁగితే
యీసరి వారిలో నన్ను నెంచవా నీవు

చ. 2: కొత్తలుగా నే నిన్నుఁ గోరి కొంగువట్టితేను
చిత్తిణిది యని కాకుసేయవా నీవు
వొత్తి చెలులచే నిన్ను నొడఁబరపించి తేను
తత్తరపు గుణమని తలఁచవా నీవు

చ. 3: తెరవేసి నీమోవితీపులు నేనడిగితే
బెరసి నామేలు రట్టుపెట్టివా నీవు
నిరతి శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
సరి దూఁగకుండితేను సాదించవా నీవు

రేకు: 0585-3 లలిత సం: 13-445

పల్లవి: అంపఁగానే వచ్చితిమి ఆపె నీవద్దికి మమ్ము
సంపదతో మరవక చనవులీవయ్యా

చ. 1: వొలిసీనొల్లని వలపాడిఁబెట్టి వేసరించ
చలమా మాకేమి సారెసారెకు
చెలిపై నీవే వచ్చి సేసచల్లి వచ్చితట
తలఁచుక నీవే ఆకె దండకు రావయ్యా

చ. 2: సంతవేడుకలు నీకు చవి చూచి పిలువఁగ
పంతమా మాకేమి పైపై నిట్టే
కాంతకు నీవపుడే వుంగరము వెట్టితివట
మంతనానఁ దెలుసుక మన్నించవయ్యా

చ. 3: దొమ్మికూటముల నిన్ను దొరలించి అలయించ
యెమ్మెలా మాకేమి యింతటిలోనే
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁత నేలితివట
సమ్మతాయ నిటులానే సతముగావయ్యా

రేకు: 0585-4 శంకరాభరణం సం: 13-446

పల్లవి: కంటిమి నీజాడలెల్లా గట్టిగా నేఁడు
జంటయై నీవలపులు చల్లుదువు గాక

చ. 1: చెలఁగి యాపె పలుకు చెవిసోఁకెను
మెలఁగి మరి పాదము మేను సోఁకెను
చెలువుఁడ చెప్పినట్టు సేసేవా మాకు
సొలసి నీయెమ్మెలెల్లాఁ జూపుదువు గాక

చ. 2: సతిమోవి తేనెపెర సరి వచ్చెను
రతులనే యాపెఁ గూడ తతి వచ్చెను
యితవయ్యీనా మాతో యేలాటాలు
అతిరాజసపు దొరవవుదువు గాక

చ. 3: చేకొన్న యాపెకానికె చేయి నిండెను
లాకలఁ బుక్కిలి తములము నిండెను
కైకొనేలితివి శ్రీవేంకటేశ నన్ను
వాకముగా నాకు నిట్టే వలతువు గాక

రేకు: 0585-5 పాడి సం: 13-447

పల్లవి: మాకేల గరిసించ మాటికి మాటికి నిన్ను
జోకతో మీ సరితలు చూచేదే చాలును

చ. 1: యిందరిలోన ఆపె యేతువలెత్తి యాడఁగా
అందుకు లోఁగేవు నీవంతులోననే
గొందినే నీవాపె మరఁగుఁన జేసిన పనులు
యెందుకు నెక్కనివిఁక నెన్నెన్ని గలవో

చ. 2: కానిమాటఁలాడి యాపె కన్నుల జంకించఁగాను
మోనాన నున్నాడవిదె మునివలెనే
యే నెపమున నాపెకిచ్చిన మాటపట్లు
అనుకొని చెప్పరానివవి యెటువంటివో

చ. 3: కగ్గి కాఁగిటిలో నాపె కాంతలఁ దలపించఁగా
సిగ్గులు వడేవు నీవు శిరసు వంచి
అగ్గమై శ్రీవేంకటేశ ఆపె నీవు గూడితివి
నిగ్గుల మాపై మెచ్చులు నీకెంత ప్రియమో

రేకు: 0585-6 లలిత సం: 13-448

పల్లవి: వెనకఁ జేతువుగాని వినోదాలన్నియును
తనివోక నీ మొగము తప్పక చూచీని

చ. 1: ఇందమని బాగాలు నీకిచ్చీ దోసిట నాపె
బెందడి రెండు చన్నులుఁ బిక్కిటిల్లఁగా
కందువ నీకబ్బెనంటాఁ గడుఁ బిసికే వంతలో
అందుకోవయ్యా వీడె మట్టే పట్టుకున్నది

చ. 2: సారెకు మన్నించుమని సాగిలి మొక్కీ నీకు
గారవపుఁ బిరుదులు గదలఁగాను
గోరనంటి సిగ్గులకు గొబ్బునఁ జాఁచేవు చేయి
ఆరీతి నీవెత్తవయ్య అట్టే పండి వున్నది

చ. 3: ఆలనైతి నని నిన్ను నట్టే కాఁగిలించుకొనీ
జాలువారే చెమటలు జారఁగాను
బేలవై శ్రీవేంకటేశ పెదవి తేనెలానేవు
వోలివెట్టవయ్య అట్టే వురమెక్కుకున్నది.

రేకు: 0586-1 భైరవి సం: 13-449

పల్లవి: ఎప్పుడు దయఁ జూచేవో యేమని విన్నవింతుము
దప్పిదేరే మోవితోడఁ దలపోయుచున్నది

చ. 1: వీడెమిచ్చే నంటా వచ్చి వెలఁది పానుపుమీఁద
పాడుకొంటా నున్నది నీపదము లెల్లా
గోడపై నీరూపము కోరి చిత్తరువుగాను
వేడుకతో వ్రాసుకొంటా వేగించుక వున్నది

చ. 2: యేచీ నీపాందులు సేయ నిటు వచ్చి పెట్టెలలోఁ
జూచుకొంటా నున్నది నీసొమ్ములెల్లాను
ఆచాయ కెడతాఁకే నీయవసరపు గాంతల
లాచుక నీసుద్దులే యాలకింపుచు నున్నది

చ. 3: సేవ సేసే నంటా వచ్చి చిత్తములో చెక్కుచేత
భావించుకొంటా నున్నది పనులెల్లాను
శ్రీవేంకటేశ నీవే విచ్చేసి యలమేల్మంగను
తావుకొనఁ గూడితివి తతి నలశున్నది

రేకు: 0586-2 శ్రీరాగం సం: 13-450

పల్లవి: ఇంతి నీ జవ్వనవన మీ మాధవుఁడు
పంతమునఁ జొచ్చి యిట్టే పాయక వున్నాఁడు

చ. 1: బెట్టి యెలుఁగునఁ బతిఁ బిలువఁగాఁ గోవిలలు
చుట్టి కూయఁ దొడఁగెను చుట్టాలంటా
వొట్టికతలు చెప్పఁగా నొద్దికై చిల్లుకలెల్లా
మట్టి తమవారంటా మాటలాడఁ దొడఁగె

చ. 2: పడఁతి నీకుచములు పాలార్చి చక్కఁబెట్టిఁగా
తడఁబడీ జక్కవలు తమజాతంటా
నడపులు చూచి యట్టే నానా హంసములు
బడిఁ దిరిగీఁ దమ పాలివారలనుచు

చ. 3: చెలి నీనెరిఁగురులు చిక్కుదియ్యఁగా గని
అళులు తమ మూఁకని అండ చేరీని
యెలమి శ్రీవేంకటేశుఁడీతఁడే నిన్నుఁ గూడితే
కులికి చూడఁగాను చకోరాలు వాలీని

రేకు: 0586-3 పాడి సం: 13-451

పల్లవి: చెలులు వద్దనఁగానే జీరలు దీసేవు మేన
కలకాలమును నెంత కాతరీఁడవయ్యా

చ. 1: సగము మాటాడఁగానే సతిచెక్కు నొక్కితివి
మొగిచి చేతులెత్తి మొక్కె నీకాపె
అగపడె నంటానే ఆఁటదాని బైకొంటివి
వెగటున నీకెంత వేగిరమయ్యా

చ. 2: కొంతగొంత చూడఁగానే కురులు వట్టి తీసితి-
వంతలో వేడుకొనీ నిన్నదివో యాపె
మంతనమాయ నంటానే మగువ నలయించితి-
వింతలోఁ దమకము నీకేల వచ్చెనయ్యా

చ. 3: సమ్మతించి రాఁగానే చన్నులు విసికితివి
పమ్మి పవ్వళించెఁ దొడపైని యాపె
మమ్ముఁ జూచి కన్నెయంటా మన్నించి శ్రీవేంకటేశ
నెమ్మదిఁ బదరితివి నిండువలపయ్యా

రేకు: 0586-4 నారాయణి సం: 13-452

పల్లవి: ఒద్దికై నీనగరిలో నున్న దే చాలు
అద్దుకొని పట్టితేను ఆసకత్తెనందువు

చ. 1: పలుమారు నిన్ను నేనుఁ బైకొని చెనకఁగాను
మలసీ నిదెంత చలమరి యందువు
వలచి యేపొద్దు నీవద్దఁ గాచుక వుంటేను
బలిమి నప్పటి మరి బట్టగుత్తా నందువు

చ. 2: మగిడి మగిడి నీతో మాటలెల్లా నాడఁగాను
యెగసక్కెము సేసీ నిదేఁటిదందువు
మిగులా నీకూడిగాలు మేను ముట్టి సేసితేను
వెగటుగా నిదియెంత వేసరించీనందువు

చ. 3: గక్కనను నే వచ్చి కాఁగిలించుకొంటేను
కక్కసించీ నిది యెంత కల్లరందువు
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నీవే కూడితివి
మొక్కితి నన్నిటా నన్నుఁ జొక్కించెనందువు

రేకు: 0586-5 శుద్ధవసంతం సం: 13-453

పల్లవి: మఱియేమి చెప్పేమయ్య మాటలింకాను
మెఱసి నీవే రావయ్యా మేలుఁతకడకును

చ. 1: అక్కడికి సుద్దులు చెప్పంపిన చెలుల నాపె
నెక్కొన్నతిట్లు దిట్టె నీమారంటా
పక్కన నీకమ్మ దనపాదపుఁ బెనువేలనుఁ
జిక్కించి యందుకొనె నీచేతిదంటాను

చ. 2: నీవంపిన బాగాలు నెఱిఁ దెల్లనాకులు
భావించి కాళాంజి లోపలఁ బెట్టించె
దేవులకు నీరాక తెలిప చెప్పఁగ బోతే
కావిరిఁ దలుపు మూసి గడె వెట్టుమనెను

చ. 3: బలిమి నీవు దెమ్మన్న పచ్చడము గొంటా రాఁగా
వెలి దములములోన వేసి తొక్కించె
యెలమి శ్రీవేంకటేశ యింతలో నీవే విచ్చేసి
కలికి గూడఁగానే కడు సంతోసించెను

రేకు: 0586-6 సాళంగ నాట సం: 13-454

పల్లవి: ఏమి గడించుకొనేవు యింతలో నొకటొకటె
చేముట్టికంటినా ఆలసేవంటిఁ గాక

చ. 1: యీడ నిన్ను దొబ్బితినా యింటికి రమ్మంటిఁ గాక
ఆడుకొంటినా మంచివాఁడంటిఁ గాక
పాడనోప నంటినా పని గలదంటిఁ గాక
వీడె మీకుంటినా నీకు వెగటంటిఁ గాక

చ. 2: గందము పూయనంటినా కప్రమిచ్చే నంటిఁ గాక
పందేనకాఁగితినా చేయ వట్టితిఁ గాక
అందుకోనైతినా పూవు లందరున్నా రంటిఁ గాక
నింద వేసితినా నిన్ను నేర్పరివంటిఁ గాక

చ. 3: కగ్గి సాము సేసితినా కాగిలించుకొంటిఁ గాక
సిగ్గువడితినా బ్రమసితిఁ గాక
వొగ్గి శ్రీవేంకటేశుఁడ వొగి నీవే కూడితివి
వెగ్గళించితినా పొంది వెలసితిఁ గాక

రేకు: 0587-1 రామక్రియ సం: 13-455

పల్లవి: అంగనకు మారుగమ్మ లంపవయ్యా
యింగితములోనే కంటి మేమందుమయ్యా

చ. 1: యెంతపిలిచినా రావు యెగసక్కేలాడేవు
చెంతల మాచెలికట్టే చెప్పుదుమా
ఇంతలో నేము మొక్కితే నిటు సరసాలాడేవు
యెంత కెత్తుకొంటివి నిన్నేమందుమయ్యా

చ. 2: కానుకము నందుకోవు కైదండ విడువవు
కానీ కానీ యాపె యెఱగక మానీనా
లోనికి రాఁజూచి పై గల్లునఁ బాదము చాఁచేవు
యీనెపము గాచుకుంటి వేమందుమయ్యా

చ. 3: అసలనుఁ బెట్టేవు అతివను రమ్మనేవు
వేసరి యాకె యీడకు విచ్చేసెనయ్యా
సేసవెట్టి కూడితి శ్రీవేంకటేశ నీవు
యీ సుద్దులకిఁక మరి యేమందుమయ్యా

రేకు: 0587-2 బౌళి సం: 13-456

పల్లవి: ఎంత కెంత మీ రేల యిచ్చకములాడేరే
దొంతిఁ బెట్టేరు వలపు దోసము గాదా

చ. 1: ఇంగితాన నిష్టూరా లెన్నఁడూ నాడఁడాతఁడు
అంగనలాల నామాట లటువంటివా
సంగడి మమ్మిద్దరిని సరిసేసేరేలే మీరు
పంగించకాతనికి నేఁ బంత మిచ్చేనే

చ. 2: కొప్పువట్టి తీసినాను కోపగించఁడాతఁడు
యెప్పుడు మాగుణములు యిటువంటివా
కప్పి మమ్మిద్దరి నేల కాఁగిలించఁ బెట్టేరే
చిప్పిల దిగువనుండి చేత మొక్కేనే

చ. 3: యెంతేసి కొసరినాను యేమి వేసారఁడాతఁడు
వంతుల మావోరు పటువంటిదయ్యీనా
యింతలో శ్రీవేంకటేశుఁ డెనసె నన్నిపు డిట్టే
చెంతనుండి మెచ్చి మెచ్చి సేస వెట్టేనే

రేకు: 0587-3 ఆహిరి సం: 13-457

పల్లవి: అప్పుడుగాని తేరవు అంగన కోపములెల్లా
కప్పురము చల్లవయ్య కాఁకలు చల్లారను

చ. 1: తివిరి నీవేమంటివో దేవరకే తెలుసును
పవళించి వున్నదదే పడఁతి లోన
వివరించి నీరాక విన్నవించ వెరతుము
కవగూడ నీవే యాపెకడకుఁ బోవయ్యా

చ. 2: వొగ్గి యేమి సేసితివో వూరకే తొడిఁబడ
సిగ్గువడి వున్నదదే చెలి వొంటిని
నిగ్గులను బూనుకొని నీకుఁగా రారాదు మాకు
దిగ్గన నియ్యాపె సందితెర దియ్యవయ్యా

చ. 3: ఆడకే యేమని చెప్పయంపితివో యింతలోనే
పాడుకొంటా నున్నదింతి పానుపుమీఁద
కూడితి శ్రీవేంకటాద్రి గోవిందరాజ నీవు
వోడక కాఁగిట నిట్టే వూరడించవయ్యా

రేకు: 0587-4 సాళంగనాట సం: 13-458

పల్లవి: కా దనకు నామాట కడపరాయ-నీకు
గాదెబోసే వలపులు కడపరాయ

చ. 1: కప్పుర మియ్యఁగరాదా కడపరాయా- నీకుఁ
గప్పితి నాపయ్యెదెల్లఁ గడపరాయా-వో
కప్పుమివే కుచములు కడపరాయా-వో
కప్పుమొయిలు మేనిచాయ కడపరాయ

చ. 2: కందువకు రారాదా కడపరాయా-ముందే
గందమిచ్చినవాఁడవు కడపరాయ
కందము నీమాటలిఁక గడపరాయా-వో
కందర్పగురుఁడ మొక్కేఁ గడపరాయ

చ. 3: కలసితివిటు నన్నుఁ గడపరాయా-నా
కల నేఁడు నిజమాయఁ గడపరాయ
కలదాననే నీకుఁ గడపరాయా-వో
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయా

రేకు:	0587-5 కొండమలహరి	సం:	13-459

పల్లవి:	నేనెరగఁనా తన నేరుపులెల్ల
పూని పట్టి యింతయేల బొంకు బొంకీనే

చ. 1:	కతలెన్ని చెప్పినాను కాఁగిలించినట్టు గాదు
మతకములేల తాను మరి సేసీనే
యితవు లెంతసేసినా యెనసినయట్టు గాదు
రతులఁ బెనఁగకేల రవ్వ సేసీనే

చ. 2:	నగవెంత నగినాము నన్నుఁ గూడినట్టు గాదు
యెగసక్కేలెల్ల నాతో నెంత సేసీనే
మొగమెంత చూచినాను మోహించినట్టు గాదు
అగపడి పొందకేల ఆసవెట్టీనే

చ. 3:	మొనగోరెంత సోంకినా మోవి యిచ్చినట్టు గాదు
పెనఁగి నామేనేల బెండుపెట్టీనే
చనవిచ్చి శ్రీవేంకటేశ్వరుఁడు నన్నిపుడేలె
మనసిచ్చి యెంతకెంత మన్నించీనే

రేకు: 0587-6 మంగళకౌశిక సం: 13-460

పల్లవి: ఔనయ్యా వూరకుంటే నట్టే కాదా
మానినులఁ జెనకేవు మదమా నీది

చ. 1: యెవ్వరి తెరువుఁ బోక యింటిలోన నుండేవారి
పువ్వుల వేసే వదేమి పొద్దు వోదా
నివ్వటిల్లు సిగ్గుతోడ నిలుచుండేవారిని
రవ్వగాఁ జన్నులంటేవు రాజసమా నీకు

చ. 2: గార వానఁ జక్కజాడఁ గాఁపురము సేసే వారి
వూరక గోర నొత్తేవు వుండఁబట్టదా
సారెకుఁ బానుపుమీఁదఁ జదువుకోనే వారి
నీరీతిఁ బాదాన జిమ్మే వెమ్మెలా నీకు

చ. 3: వొచ్చము లేక నీకు నూడిగము సేసే వారి
మచ్చిక నలయించేవు మన్నించరాదా
యిచ్చట శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి
పెచ్చువెరిగే వింతేసి ప్రియమా నీకు

రేకు: 0588-1 నాగవరాళి సం: 13-461

పల్లవి: ఇసుక పాంతరలు యిద్దరి మీ జవ్వనాలు
కొసరకు మనసులో గురి దాఁకీని

చ. 1: వలపు రేఁచకుమీ వద్దు వద్దు అంతేసి
మెలఁగి కలి ముదిరి మెడిదయ్యీని
చలము సాదించి నీవు జవరాలిని రతికి
పిలువకు నీమోవి పిప్పిగట్టీని

చ. 2: జఱసి చన్నులంటకు చాలుఁ జాలు మీఁద మీఁద
మఱి వుప్పు చింది యినుమడయ్యీని
కఱకరింపుచు నింతి కందువకు రమ్మని
చెఱఁగువట్టి తియ్యకు చెమరించీని

చ. 3: ఱట్టుగా నవ్వకుమీ ఆఱడి నిట్టే కూడితివి
యిట్టే గోర గీరితే నేరయ్యీని
నెట్టినఁ బంతమాడకు నీవు శ్రీవేంకటేశుఁడ
చుట్టిపు సరసములు సూడువట్టీసి

రేకు: 0588-2 ముఖారి సం: 13-462

పల్లవి: నీకేల పొద్దు వోదు నేమెంత బాఁతి పడ్డాను
దాకొని యప్పుడు నీచిత్తానఁ బట్టీనా

చ. 1: పొరుగు పోరచి యాపె పొందులు నీకుఁ జేయఁగా
సరసము నేనాడితే సంగతయ్యీనా
తరవాతి పనులాపె తలపెట్టుకుండఁగాను
బెరసి మా పిలుపులు ప్రియమయ్యీనా

చ. 2: మేడమీఁద నుండి యాకె మేకులు నీకుఁ జేయఁగా
వీడెము నేనిచ్చితేను వేడుకయ్యీనా
కూడేనంటా నిన్ను నిట్టే కోరి వేఁడి వుండఁగాను
యీడ నుండుమంటే నీకు నితవయ్యీనా

చ. 3: తానే వచ్చి యాకె నీదగ్గరఁ గూచుండఁగాను
ఆనుకొని నే నవ్వితే నందమయ్యీనా
మానక శ్రీవేంకటేశ మమ్మిందరిఁ గూడితివి
యీ నిజము లిట్టేకాక ఇక వేరయ్యీనా

రేకు: 0588-3 లలిత సం: 13-463

పల్లవి: మాకేమి పని నీ మర్మాలెత్తను
కాకుసేయఁ బనిగద్దా కమ్మటి నీసుద్దులు

చ. 1: వొప్పుగొని మోనముతో నూరకే వుండుటే మేలు
చెప్పనేల నీగుణాలు చెలులతోడ
చొప్పువట్టి కన్నులనుఁ జూచుకొంటా నుంటే మేలు
కప్పనేల నీమేని కందువ గురుతులు

చ. 2: పవ్వళించి పానుపుపై పంతాన నుండుటే మేలు
నవ్వనేల నీచేఁతకు నలుగురిలో
పువ్విళ్ళూర లోలోనే వూఁకొంటానుంటే మేలు
రవ్వ సేయనేల నీరతిలో వినయము

చ. 3: గద్దించి కాఁగిట నిన్నుఁ గలసినదే మేలు
తిద్దనేల నీనేరాలు దెచ్చి సభలో
వొద్దికై శ్రీవేంకటేశ వొడఁబాట్లివే మేలు
వద్దనఁగనేల నీవుద్దండపు సేఁతలు

రేకు: 0588-4 కాంబోది సం: 13-464

పల్లవి: ఏమాయ నీకును యింత మాకు లోఁగితేను
కామించినవారు గాని కతసేయ నేరరు

చ. 1: వలచినవారు గాని వడిఁ గొసర నేరరు
పలికేటివారు గాని పంతమియ్యరు
కలసేటివారు గాని కాఁతాళించ నేరరు
యెలమి మామటలేల యెగ్గపట్టేవయ్యా

చ. 2: చుట్టాలైనవారు గాని సొలయఁగ నేరరు
వొట్టు వెట్టేవారు గాని వొడ్డుకొనరు
తిట్టినట్టివారు గాని దీవించ నేరరు
నెట్టిన మానవ్వులేల రట్టు సేసేవయ్యా

చ. 3: పాయకుండేవారు గాని బలిమి సేయనేరరు
రాయడించేవారు గాని రతిఁ జొక్కరు
యీయెడ శ్రీవేంకటేశ యిటు నే నిన్నుఁ గూడితి
యేయెడ మాప్రియమేల యింతసేసేవయ్యా

రేకు: 0588-5 ఆహిరి సం: 13-465

పల్లవి: తప్పులేల వేసేనే తనుఁ గూడనైతి నంటా
యిప్పుడేమాయనే తాను యిరవైతేఁ జాలు

చ. 1: దవ్వుల జాణతనాలు తానాడె నింతే కాక
వువ్విళ్ళూర నట్టే వచ్చి వొడివట్టెనా
నవ్వులకందరిలోన నన్నుఁ గలపెఁ గాక
నివ్వటిల్లు రతులకు నెట్టుకొనెనా

చ. 2: అలవోకగా నన్ను నాయములంటీఁ గాక
చలపట్టి కాఁగిలించవలె ననెనా
కలపుకోలు చుట్టరికము లటు చూపీఁ గాక
చలువగా నామోవి చవిచూపు మనెనా

చ. 3: పానుపుపైఁ బండి తనపాదాలు గుద్దించెఁ గాక
తానే నాపై మోహించి తమకించెనా
యీనెపాన శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁ గూడె
అనుక ఇందాఁకా నింత అంకెలఁ జొక్కించెనా

రేకు: 0588-6 భవుళి సం: 13-466

పల్లవి: మమ్మేల వుప్పతించేవు మంచముపైకి రావయ్య
యిమ్ముల మాతరితీపు లెలయించీనా

చ. 1: చిగురుఁబెదవిమీఁద జిమ్మి రేఁగే మామాటలు
యెగసక్కేలై నీకవి యేమి సేసీని
మొగమోటగట మా మోములోని చూపులు
వగవగలను నీకు వాండ్లయ్యీనా

చ. 2: అరచందురునిఁ బోలినట్టి మానొసలి బొమ్మ-
లిరవై నిన్ను జంకించి యేమి సేసీని
సరిఁదీగెవంటి మేన జనియంచిన చన్నులు
వొరసి పెనఁగితే నీవొళ్లు నొచ్చీనా

చ. 3: ముంచి తామెరచేతుల మొలచిన కొనగోరు
ఇంచుకంత నిన్నుసోఁకి యేమి సేసీని
అంచల శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
వంచన మామొక్కు నిన్ను వంచుకొనీనా

రేకు: 0589-1 రామక్రియ సం: 13-467

పల్లవి: పదిటిలోపల నేము పదనకుండు
యెదుట నుండఁగా గాక యెంతలేదు నీకు

చ. 1: దొంగిలి వెన్నలుఁ బాలు దొడికినటులనే
యెంగిలిసేసితివి నేఁడిదె మామోవి
భంగించి పదారువేల బలిమిఁ బట్టినట్టే
చెంగట నన్నూ నీవు చేయి వట్టితివి

చ. 2: గోవుల గాచి పాలకుండలు మోచినట్లనే
మోనరాని మాచన్నులు మోఁచితివి
దేవుల రుక్మిణీదేవిఁ దెచ్చుకొనినట్లనే
వావిరిఁ దెచ్చుకొంటివి వరుస మమ్మంటికి

చ. 3: కొలనిలోవారిఁ జేరి కోకలంటినట్లనే
అలరి మా పోఁకముడి అంటితివి
యెలమి శ్రీవేంకటేశ యిందరిఁ బెండ్లాడినట్టే
కలసి నన్నుఁ బెండ్లాడి కడు మన్నించితివి

రేకు: 0589-2 హిందోళం సం: 13-468

పల్లవి: అయనయ్య నీ ప్రియములన్నియు వచ్చెను మాకు
చేయి మీఁదాయ సేవలు సేసేమయ్య నీకును

చ. 1: ఆనవెట్ట నేఁటికి నీవంతేసి నాతోను
కానవచ్చీని రేపల్లెకాడ నీ గుట్టు
వీనులెల్లఁ జిల్లులాయ విని విని నీకతలు
వూనిన నామనసెట్టు వొడఁబడీ నిఁకను

చ. 2: సాకిరి చూప నేఁటికి సారెసారె నాముందర
జోకలు కొలనికాడఁ జూచేమన్నియు
చీకాకుపడెను నాచిత్తము నీమేను చూచి
యీకడ నిఁకనట్ల యియ్యకొందు నిజము

చ. 3: చెక్కు నొక్కనేమిటికి చెలఁగని నీపొందు
తొక్కిన నీరతిలోనే తోఁచీ మాకు
గక్కన శ్రీవేంకటేశ కలసి నే బ్రమసితి
వెక్కసాలెట్ల నాడే వేవేలు నిన్నును

రేకు: 0589-3 దేశాక్షి సం: 13-469

పల్లవి: పరగ నిఁక నేఁటిది పనులు మంతుకు నెక్కె
కెరలించి వలపులు గిజిగిజి సేసెను

చ. 1: గందము తాఁబూసుకొని కాంత నిన్నుఁ గాఁగిలించి
యిందరికి దనరతి యెఱిఁగించెను
సందడి చెమటలు పచ్చడానఁ దుడుచుకొని
పొందేటి సతులకుఁ జొప్పులుగాఁ దాఁ జేసెను

చ. 2: వీడెపు మోవితోడ వేసరి చెక్కులంటించి
తోడివారి చిత్తాలకు దూరుసేసెను
వీడిన కొప్పు విరులు వెస నీపై విదిలించి
యీడఁ దనపతి వని యిక్కువలు సేసెను

చ. 3: మచ్చిక నీతోఁ బెనఁగి మదనముద్ర లంటించి
రచ్చలఁ దన సొమ్మని రవ్వసేసెను
యిచ్చట శ్రీవేంకటేశ యిన్నిటా నిన్నఁగలసి
యిచ్చల నీవారికి మాకెఱుకగాఁ జేసెను

రేకు: 0589-4 కేదారగౌళ సం: 13-470

పల్లవి: చూతమే యీ సంతోసాలు సారిదినుండి
ఐతే నేమే సవతుల మది మనమేలే

చ. 1: సతి తిట్టు లతనికి చవులై వుండఁగాను
మతిలోన వగవఁగ మనకేల
యితవై యీపెగుంపెన కితఁడు లోఁగుచుండఁగా
కుతిలకుడువ నేలే కొమ్మలాల మనము

చ. 2: ఆపె సేసే వుద్దండాలు ఆతఁడోరుచుకుండఁగా
కోపమేలే మనకును కోపులనుండి
వోపి యాలియాజ్ఞ మగఁడొట్టి జవదాటఁడు
ఆపసోపాలేలే మన మందరిలో వారము

చ. 3: కొంగాపె వట్టి తియ్యఁగాఁ గూచుండాతఁడు లోఁగాఁగా
పంగించనేలే మనము పలుమారును
యెంగిలి మోవిచ్చె నాపె యెనసి శ్రీవేంకటేశుఁ
డంగదేలే యేలిరిద్దరట్టే మనములను

రేకు: 0589-5 రామక్రియ సం: 13-471

పల్లవి: అటుచూడు సతినేర్పు లవుభళేశ
అటమటములు గావు అవుభళేశా

చ. 1: యెదురుఁ గొండలమీఁద నెక్కినట్టి లకిమమ్మ
అదివో నీతొడ యెక్కెనౌభాళేశ
వుదుటున నంతలోనే వురముపై నెలకొని
అదిమీఁ జన్నుల నిన్ను నౌభళేశా

చ. 2: ముంగోపముతోడను మొక్కలీఁడవై న నిన్ను
నంగన గద్దెపై బెట్టె నౌభళేశ
కంగక వేదాద్రి నిన్ను గరుదాద్రికిఁ దీసె
అంగాలంటె నింటిలోన నౌభళేశా

చ. 3: చేరి నీవు నవ నారసింహరూపులైతేఁ జెలి
ఆరీతుల నిన్నుఁ గూడె నౌభళేశ
గారవాన నీవు శ్రీవేంకటముపై నుండఁగాను
ఆరసి రతి మెప్పించె నౌభళేశా

రేకు: 0589-6 శంకరాభరణం సం: 13-472

పల్లవి: అన్నిటా జాణ గదవే అవుభళనారసింహుఁడు
కన్నెలాటలు చూపఁగా గతలడిగీని

చ. 1: బంతినే నవ్వులు నవ్వీ బ్రహ్లాదవరదుఁడు
చెంతనే సేవలు సేసే చెంచెతలతో
కాంతుల వారి చన్నులు కానుకలు చూపఁగాను
అంతలోఁ బారిటాకు పయ్యదలఁ గప్పుమని

చ. 2: అయములెల్లా నంటె నహోబలేశుఁడు
పాయవుటింతులు తన పాదాలొత్తఁగా
అయెడఁ గనుచూపుల యమ్ములు గానుకియ్యఁగ
చాయగాఁ బచ్చిపునుఁగు చల్లుకొమ్మనీని

చ. 3: సిగ్గులు దేరఁగఁ గూడి శ్రీసతినాయకుఁడు
వొగ్గుచుఁ గొమరెలెల్లా నొడివట్టఁగా
కగ్గక మోవిపండ్లు కానుకియ్యఁగా కూటము
లగ్గువాయ శ్రీవేంకటమందు రమ్మనీని

రేకు: 0590-1 కుంతల వరాళి సం: 13-473

పల్లవి: కాంతలకెల్లాఁ జెప్పఁ గతలాయను
చెంతనే వినేవారికి సిగ్గులాయను

చ. 1: వాడల వాడలనెల్లా వనితల మీఁద నీకు
వేడుక వలపు చల్లువెదలాయను
కూడిన కూటములను గొల్లెతలకు నీకును
యేడఁ జూచినాఁ జెమట లేరులాయను

చ. 2: ఆవుల మందలోన నాఁడువారిఁ గంటే నీకు
వావుల పొందులు పెద్ద వాములాయను
చేవ మీర రేపల్లెలో చెలుల చన్నులు నీకు
పూవుల గుత్తులవలె పూజలాయను

చ. 3: యమునానదిలోపల నంగనల జల కేలి
సమరతి మించి నీకు జాజరాయను
అమర శ్రీవేంకటేశ అట్టే నన్ను నేలితివి
తమితోడి సేసపాలు తలపోఁతలాయను

రేకు: 0590-2 ఆహిరి సం: 13-474

పల్లవి: రావయ్యా యెక్కడి సుద్ధి రచ్చలఁ బెట్టిక మమ్ము
దేవరవలె నీవుంటేఁ దిట్టఁ గలమా

చ. 1: నీ విచ్చిన చనవున నిన్ను నంటిఁ గాక
వోపఁ జాలకుంటే నిన్ను నొరసేమా
వావి గలుగఁగ నీపై వలపు చల్లితిఁ గాక
తోవ రాకుంటే నిన్ను దూరవచ్చేమా

చ. 2: చేతికి లోనై వుండఁగాఁ జెనకితి నింతేకాక
కాతరించి పెనఁగితే కక్కసించేమా
ఆతుమై నీవుండఁగా మాయాడకు రమ్మంటిఁ గాక
ఘాతలు చూపితే నిన్ను గాసి సేసేమా

చ. 3: మచ్చిక నీవు గూడఁగా మర్మము లంటితిఁ గాక
పెచ్చు వెరిగితే నిన్నుఁ బెడరేచేమా
ఇచ్చల శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
పచ్చి సేసితే నీతోఁ బంత మాడేమా

రేకు: 0590-3 మాళవి గౌళ సం: 13-475

పల్లవి: అన్నియు మరచి నీవాడిన ట్లాడుట గాక
పన్నిన పంతములేల వట్టి పెనఁగఁగను

చ. 1: వోడక నిన్నెటువలె నూరక సొలయవచ్చు
యేడలేని వినయము రెల్లాఁ జేయఁగా
పొడితో నిన్నుఁ దప్పులు పట్ట నెటువలె వచ్చు
వీడెము చేతికిచ్చి వేడుకొనఁగాను

చ. 2: చేయి చాఁచి నిన్నెట్టు చెనకకు మనవచ్చు
ఆయము గరఁగి నీవాసపడఁగా
చాయల సన్నల నిన్ను జంకించ నెట్టు వచ్చు
పాయము నాసొమ్ముసేసి బాఁతిపడఁగాను

చ. 3: తగిలి నీకాఁగిటిలో తనియంగ నెట్టువచ్చు
మిగులా నీనేరుపులు మెఱయఁగాను
అగవడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
బగివాయ నెట్టు వచ్చు పొలార్చఁగాను

రేకు: 0590-4 హిందోళవసంతం సం: 13-476

పల్లవి: ముంచుకొంటే వలపులు మొగచాటౌను
పొంచే వప్పటిని పొద్దువోదా నీకు

చ. 1: వుంగిటిగాఁ జెక్కు నొక్కి వొడఁబరచేవు నన్ను
సంగడి నున్న చెలులు చాలరా నీకు
అంగవించి నాచే మాటలాడించుకొనేవు నీవు
యెంగిలి మోవి మీఁదివి యేఁటికి నీకు

చ. 2: కొప్పువట్టి తీసి నన్నుఁ గొసరేవు ఆసలెల్లాఁ
గప్పే వూడిగాలవారు గారా నీకు
అప్పటి మాచన్నులొరయఁగ సాము సేయించేవు
యిప్పుడిట్టే చెమరించె యితవా నీకు

చ. 3: కమ్మి నన్నుఁ గూడితివి గక్కన శ్రీవేంకటేశ
రమ్మంటేఁ దొంటిఁజుట్టాలు రారా నీకు
వుమ్మడి నన్నిపుడిట్టే వురమెక్కించుకొంటివి
తమ్మిపాదాలు మోవఁగఁ దగవా నీకు

రేకు: 0590-5 నట్టనారాయణి సం: 13-477

పల్లవి: వట్టి సటలు సేసేవు వాడికె మాముందరను
వెట్టికి నిదియూ నేనే విన్నవించవలెనా

చ. 1: కూచుండ మనఁగరాదా కొమ్మను నీసంగడిని
నీచూపులకు గురై నిలుచున్నది
చేచేత మాముందరను సిగ్గువడ నేఁటికి
యీచోట నేకతమైతే నిట్టే వుండేవా

చ. 2: మాటలడుగఁగ రాదా మర్మములు సోకఁగ
మోటు పెట్టుకందుకే తిమురుచున్నది
కూటపు మాముందరను గుట్టుసేయఁ నేఁటికి
పాటించి తెరమాటైతే పలుకకుండేవా

చ. 3: కాఁగిలించుకొన రాదా కళలు సోఁకఁగ నిట్టే
రాఁగయ్యె చన్నులు నిన్నొరయుచున్నది
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ్వర నన్ను
లోఁగిట నాపె వుండఁగా లోఁగాక మానేవా

రేకు:	0590-6 పాడి	సం:	13-478

పల్లవి: ఏమి గంటి విందువంక నెమ్మెకాఁడవై
కామినుల మీఁదను నీకాఁక రేఁచవలెనా

చ. 1: గరిమ నిద్దరిసంది కైలాటాలు వెట్టితివి
వరవాత నింతేసి కావలెనా నీకు
పొరి నీకు నితవైతే భోగించవలెఁ గాక
పొరుగుల వారిలోనఁ బోరు వెట్టవలెనా

చ. 2: గుట్టున నాపె నీ పెనుగోళ్ళు రాచితివి
వట్టి నేర్పులు మెరయవలెనా నీకు
యిట్టె నీకు నితవైతే నెదఁ బెట్టుకొందు గాక
చుట్టపు సతులలోన సూడు రేఁచవలెనా

చ. 3: కూడియుండి సవతుల కోపములు వెంచితివి
వాడికె యీతరితీపు వలెనా నీకు
వేడుకై తే రతులు శ్రీవేంకటేశ పెంతు గాక
యీడ నన్ను నేలి వారి నింత సేయవలెనా

రేకు: 0591-1 నారాయణి సం: 13-479

పల్లవి: ఎట్టి వేగిరికాఁడవు యేమయ్యా నీవు
మిట్టిపడి దయ్యమైనా మెచ్చవద్దా నిన్నును

చ. 1: చలమరివాఁడవు చనవేల యిచ్చితివి
వలవఁగ నాఁడే నీవు వద్దన రాదా
యెలయించి వూరివారి నింతసేయ వ్రతమా
నలువంక నింకా నిన్ను నమ్మవద్దా చెలులు

చ. 2: కడుఁ బంతగాఁడవు కదిసేల నవ్వితివి
తడవకుమని దయ దలఁచ రాదా
పడుచులఁ దెచ్చి యింత వచ్చి సేయఁ దగవా
తొడిఁబడ నిట్టితే దోసమైనా ముట్టదా

చ. 3: బిగిసేటి వాఁడవు ప్రియము చెప్పఁగనేల
పగటున నాకె నొడఁబరచ రాదా
నిగిడి శ్రీవేంకటేశ నీవే యీపె నేలితివి
మొగచాటు వలెనా నీమోహమునకుఁ గడమా

రేకు: 0591-2 భైరవి సం: 13-480

పల్లవి: ఆన వెట్టుకొందునటే అటని నేను
తానే లోఁగీఁ గాక నేనిందరివంటి దాననా

చ. 1: కడనేల వున్నవాఁడు కాఁగిటికి రమ్మనవే
చిడుముడి నన్నుఁ గంటే సిగ్గు వచ్చెనా
పొడిఁబడఁ గావచ్చీనా పోయిన పనులు నేడు
తడవ నే యిల్లాలఁ దప్పులు వట్టేనా

చ. 2: వెఱగేల పడీఁ దాను వీడె మందుకొమ్మనవే
యెఱుకప్పుడు లేనిది ఇప్పుడేఁటికే
మఱచి సేసిన బాస మరి తలఁచుకొనీనా
గిఱిగొన తనుదానఁ గినియ వచ్చేనా

చ. 3: తల వంచీనేల తాను తగిలి కూడుమనవే
మొలచి నాపై బత్తి మోసువారెనా
కలసి శ్రీవేంకట ఘనుఁడింక విడిచీనా
అలుగ నే పట్టవు దేవులనై దూరేనా

రేకు: 0591-3 సామంతం సం: 13-481

పల్లవి: మానవుగా మాతోడ మందెమేళాలు
పానిపట్టి నీకు నాకు బాఁతచుట్టరికమా

చ. 1: కొప్పువట్టే వది యేమి గుట్టున నన్ను నీ
కుప్పెసవర మున్నదా కొయ్యకాఁడవు
అప్పటిఁ జన్నులు ముట్టే వదేమి నీవు
తప్పక నీసరులేమి దాఁచఁగ బెట్టితివా

చ. 2: కొంగువట్టే వదియేమీ కొసరుచును
ముంగిట నీ పైఁడేమైనా ముడిచితివా
సంగడిఁ జేయి వట్టేవు సారెకు నన్ను నీ
వుంగరాలు తడఁబడి వున్న వా నావేలను

చ. 3: వోడక వురమెక్కించే వొద్దికై నీవు
జోడుగా నీకయినట్టి సొమ్మునా నేను
కూడితి కందనవోలి గోపాలకృష్ణ
యీడనే శ్రీవేంకటాద్రి యిరవాయనా

రేకు: 0591-4 కాంబోది సం: 13-482

పల్లవి: చెప్పేవారి బుద్ధులు చెవిఁబెట్టరు
దెప్పరపు టలుకలు దేరుటెట్టులమ్మా

చ. 1: అపరాధిగాని విభుఁ డవ్వలి మోమై వుండఁగా
ఇపుడీపైతే నమ్మదు యివ్వలిమోమై
వుపమల నొకరొకరొట్లు వెట్టుకొన్నారు
తపముల నేఁడు కోరు తమపంతములను

చ. 2: స్వతంత్రుఁడై నాతఁడు చలముతో నుండఁగాను
హితురాలు ననే గర్వమీపె కున్నది
మితి మీఁటి తమలోన మేరలతో నున్నారు
ప్రతినతోఁ గలయరు భావపుఁగోపాలను

చ. 3: నీటు శ్రీవేంకటేశుఁడు నేర్పుతోడ నుండఁగాను
పాటించి యీపెఁ బాన్పుపైనే వుండఁగా
మాటలచిలుక వోఁగా మగడిద్దరూఁ బట్టఁగా
కోటికి నలుకదేరి కూటమబ్బెఁ గాక

రేకు: 0591-5 నాట సం: 13-483

పల్లవి: నీపాపమే కాదు ఇది నిండిన లోకముజాడ
పైపై వచ్చిన వలపు పాటించరెవ్వరును

చ. 1: అట్టే మంచిమాటలాడే అతివ బాఁతి పడఁగ
చిట్టకములాడే యింతిఁ జెనకేవు
అట్టే కాదా పంచదార అండనెంత వుండినాను
పట్టి పెనఁగేటి నిమ్మపంటికి నోరూరును

చ. 2: చేతులెత్తి మొక్కేటి చెలి గాచుకుండఁగాను
ఆతలి మోమైనవారి కాసపడేవు
జాతితోఁ బాలపండ్లు సంగడినే వుండఁగాను
ఘాతఁ బెరిగే బూరుగుఁ గాయలు చూపట్టును

చ. 3: నెట్టనఁ బెండ్లాడిన నేనే నీకుండఁగాను
అట్టు గొల్లెతలచే నాఁడిఁ బొందితి
ఇట్టే నన్నుఁ గూడితివి యిందాఁకా శ్రీవేంకటేశ
వొట్టితే పాలునుఁ జల్లా నొక్కరీతి నుండును

రేకు: 0591-6 భైరవి సం: 13-484

పల్లవి: ఏల వేగిరించ మాకు నింతలోననే
యీ లీల నీవుంగరము యీడేరించీఁ గాక

చ. 1: మొక్కలపు వాడవు మొదలనే నీవు
మొక్కి యెంత వేఁడుకొన్నా మొగమోడేవా
కక్కసించ నేమిటికి కాఁపురాలు సేయించే
తెక్కలి మరుఁడే అన్నీఁ దేరిచీఁ గాక

చ. 2: చలపాది వాఁడవు చాయకుఁ దెచ్చేనని
బలిమెంత సేసినాను బ్రమసేవా
అలమి పట్టి నేఁటికి అందరి బొందులు సేసే
అలరు బాణములే నెయ్యము రేఁచీఁ గాక

చ. 3: ఆసోదకాఁడవు అన్నిటా శ్రీవేంకటేశ
సేసవెట్టితే నన్నుఁ జెంద కుండేవా
బాసగొన నేఁటికి పై కొన్న వలపులే
రాసికెక్కఁ గూడించే రతులిచ్చీఁ గాకా

రేకు: 0592-1 కన్నడ గౌళ సం: 13-485

పల్లవి: సెలవుల నవ్వే నేఁ జేసిన చేఁతల కెల్ల
తొలుతటివలె నిఁక దూరఁ బనిలేదే

చ. 1: తప్పించ నేరనిదానఁ దల వంచితే నేమాయ
వుప్పతించీ నందుకుఁగా నూరకే తాను
చప్పని వలపులకు సాజ మిటువలె నౌనే
అప్పటిని తను నిఁక నాడఁ బనిలేదే

చ. 2: కోపంచఁ జాలనిదాన గుట్టుతో నుంటే నేమాయ
రాఁపు సేసీ నందుకుఁగా రచ్చలో నెల్లా
తోపునకుడై న వారితోడి సుద్దులిట్లానే
చాపలానఁ దను నేఁ గొసరఁ బనిలేదే

చ. 3: సాదించ నొల్లనిదానఁ జల్ల గాఁనుంటే నేమాయ
బోదించీ నందుకుఁగాను పొద్దు వోదా
యీదెసఁ గూడె శ్రీవేంకటేశుఁడు నన్నిట్లానే
కాదు గూడదనఁగ నింకాఁ బనిలేదే

రేకు: 0592-2 ఆహిరి సం: 13-486

పల్లవి: ఇంతట నైన మన్నించు యేల జోలిఁ బెట్టేవు
చెంతల నీచెప్పినట్టు సేయనట్టి దాననా

చ. 1: యేరా మమ్మే సుద్దులెందాఁకా నడిగేవు
గారవించి నీగుట్టించుకయుఁ జెప్పవు
సారెసారెకు నీతో చలపాదితనమేల
ఔరా నీవన్నట్టే అన్నిసుద్దులు

చ. 2: లేలే యెందాఁకా నన్నాలించి మనసరసేవు
యేలాగులా నీగుణా లెఱఁగనీవు
శాలామాలములై న చయ్యాటము నీతో నేల
మేలే నీసేఁతలెల్లా మెచ్చితినే

చ. 3: కాని నాచన్నులైతే గట్లంటాఁ బిసికేవు
ఆనుక గోరనూఁదితే అంటనియ్యవు
పూని శ్రీవేంకటేశ్వర పొసఁగ నన్నేలితివి
నేనే నీవైనది నిజమాయ నిప్పుడు

రేకు: 0592-3 ధన్నాశి సం: 13-487

పల్లవి: ఇన్నాళ్ళవలెఁ గావు యివిగో నీ ప్రియములు
కొన్నిగొన్ని కానుపించి గుమితాన నున్నవి

చ. 1: చెనకి నామోముచూచి సెలవుల నవ్వేవు
ననువు నీ చేఁతలెల్ల నవ్వులేకావా
వెనకటివలె నంటా వేఁడుకొన వచ్చితేను
పెనఁగేవు మతి నేమివెట్టుక వున్నాఁడవో

చ. 2: చిక్కని నామోవియని సిగ్గులు వడేవు నీవు
పక్కన నీపని సిగ్గువాటే కాదా
చిక్కితివంటా నీపైఁ జేతులు నేఁ జాఁచితేను
నిక్కి తప్పించుకొనేవు నీవోజ లింకేటివో

చ. 3: పచ్చిగా నారతిఁ జొక్కి బమసి మైమఱచేవు
మచ్చిక పంతముచూచి మఱుపే కాదా
యిచ్చట శ్రీవేంకటేశ యేనసిన నామేలు
రచ్చలఁ బెట్టేవు నీరాజ మింకేఁటిదో

రేకు: 0592-4 పూర్వగౌళ సం: 13-488

పల్లవి: తగినట్టే మెలఁగితే దైవమైనాఁ గరఁగును
వెగటుగా నడచితే విసిగించు వలపు

చ. 1: చేసినట్టే సేయవయ్య సేయకుమంటే నంత
వేసరుకొందువో ఆండ్లు వేవేలు నీకు
ఆసపడ్డదాన నేను అయినంత మేలే చాలు
వాసులెంచ బోతేను వడిఁబడు వలపు

చ. 2: ఆడినట్టే ఆడవయ్య ఆడకుమంటే నెంత
జాడ తప్పుదువో పెక్కుసతులు నీకు
తోడఁ బెండ్లికూఁతురను దొరకినంతే చాలు
పాడి పంతాలకుఁ బోతే పచ్చిదేరు వలపు

చ. 3: చూచినట్టే చూడవయ్య చూడకుమంటే నెంత
యేచి తమకింతువో నీకింతులు శాన
కాచుక శ్రీవేంకటేశ కైకొని నన్నేలితివి
వాచవి మోవడిగితే వన్నె కెక్కు వలపు

రేకు: 0592-5 అమరసింధు సం: 13-489

పల్లవి: ఏది దిష్టాంతము యిందులోనను
పోది సేసేవాఁడు నన్నుఁ బొందఁగవద్దా

చ. 1: యీయెడ నింతేసి నాతో యెగ్గువట్టేవాఁడు తోల్లే
నాయెడకు నిజముగా నడవవద్దా
పాయక వున్నాఁడనంటా బాసలు సేసేవాఁడు
చాయలకు నాపై మేలు చల్లఁగవద్దా

చ. 2: చిత్తగించి నాతో నింత సిగ్గువడేవాఁడు నాఁడే
కొత్తరేకలు సేయించుకోకుండవద్దా
బత్తిగల వాఁడనంటా పైకొనవచ్చేవాఁడు
పొత్తుల నామాటకు వుత్తరమీవద్దా

చ. 3: గక్కన నన్నిట్లాను కాఁగిలించేవాఁ డప్పుడే
చెక్కులు నొక్కుచు సన్న సేయఁగవద్దా
యిక్కువలంటి శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
మక్కళించి నన్నిట్లా మన్నించవద్దా

రేకు:	0592-6 శంకరాభరణం	సం:	13-490

పల్లవి:	అమర మాటాడితివి అవునే నీవు
	జమళి మనమాటలు సరివచ్చేవే పో

చ. 1:	అచ్చపుఁ బంతపుమాట లాడేవు మగువ నీకు
	చెచ్చెర నీమెవి యేల చిల్లులాయనే
	ముచ్చట నామని కాలమునఁ బండిన పంటకు
	లచ్చనలు వేయరా యీలాగుల నెవ్వరును

చ. 2:	సూడుఁ బాడుకుఁ జేచాఁచే సుదతి వన్నిటా నీకు
	యేడలేని జీరలు నేఁడేల వచ్చెనే
	కూడి విచ్చనవిడిని కొనసాగే తీగెలకు
	తోడనే ములుపొడిచి తుదఁ బోది సేయరా

చ. 3:	రతుల మారు మలసే రమణి నీచన్నులకు
	సతమై వొత్తిన కందుజాడ లేడవే
	యితవై నన్ను శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
	మతిలో ననురాగము మానునా పై మించక

రేకు: 0593-1 లలిత సం: 13-491

పల్లవి: దేవరవు నీసుద్దులు తెలియనివా నేము
చేవలెక్కించితి వింత చిగురుఁబోండ్లకు

చ. 1: వువిదకు నీవిచ్చిన వుపదేశమే కాదా
సవతుల నందరిని సాదించుమని
యివల మామోము చూచి యేమి నవ్వే వప్పటిని
జవదాఁటునా ఆఁటది సలిగె లేకున్నను

చ. 2: మగువకుఁ జెవిలోన మంతిరించినవే కావా
పగటున నందరినిఁ బరచుమని
అగడుగ మాపై నేల ఆనలు వెట్టుకొనేవు
తగవు దప్పునా యింతి దాపు లేకుండినను

చ. 3: నెలఁతకు నేరిపిన నీతంత్రమే కాదా
నెలకొని పంతములు నెఱపుమని
కలసి శ్రీవేంకటేశ కడు నన్నే మెచ్చేవు
చలపట్టునా యీపె నీసమ్మతి లేకున్నను

రేకు: 0593-2 దేశాక్షి సం: 13-492

పల్లవి: అన్నియు నేనెఱుఁగుదు నంత బడలకు నీవు
సన్నలు సేయఁగఁ బై పై జడిసీఁ బులకలు

చ. 1: యించుకే మాటాడవోయిటు నాతోను
పొంచిన నీమోవి గెంపులు రేఁగీని
వంచకువోయి శిరసు వడిఁ జెక్కుపై
వుంచవు నీ కొప్పు పువ్వులు రాలీని

చ. 2: చేతులు చాఁచకువోయి చేరి నాపైని
యేతలి గురుతులు బాయిటఁ బడీని
ఘాతల జూడకువోయి కన్నవారినే
రాతిరి సిగ్గులు నేఁడు రచ్చఁ బడీని

చ. 3: పెనఁగకువోయి ముట్టి బెరసి నాతో
తనువుపై వాసనలు తగిలీ నన్ను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసితి మిద్దరము
అనుమానించకువోయి అడికె వచ్చీని

రేకు: 0593-3 సాళంగ నాట సం: 13-493

పల్లవి: నిండుదొరవౌదువు నీజాణతనము మేలు
అండనే నవ్వఁగ వద్దా అన్నిటా నాతోను

చ. 1: వుద్దండాలు సేసి పచ్చి వొగిఁ జుట్టమవై నీవు
సుద్దులెల్లఁ జెప్పవద్దా సూటిగా నాకు
పెద్దరికాలకు వెంటఁ బెట్టుక ఆపెనుఁ దెచ్చి
గద్దించవద్దా నీవు కమ్మటి నాచెలుల

చ. 2: కొత్తరేకలు నించుక గుణవంతుని వలెనే
బత్తులెల్లాఁ జేయవద్దా పైపై నాకు
హత్తిన తరితీపుల నాపెసొమ్ము మేనఁబెట్టి
పొత్తునఁ గూచుండవద్దా పూని వచ్చి ఇపుడు

చ. 3: రతులఁ దనిసి వచ్చి హితవరివలెనే
తతిఁ బెడరేఁచవద్దా తమి నాకును
క్షితిఁ బరమపదేశ శ్రీవేంకటేశుఁడవై
సతమై కూడఁగవద్దా సారెనిట్టే నన్నును

రేకు: 0593-4 సింధురామక్రియ సం: 13-494

పల్లవి: ఎంత బలువే నీకు నెడగొల్లకత్తెపటే
వంతువరుసల యాపె వలచి వుండఁగను

చ. 1: ఇప్పుడిట్టే వచ్చి పతికేమి చేతులు చాఁచేవే
కప్పురమిచ్చిన యాపె గాచుకుండఁగా
చెప్పేపప్పటి నేమే చెవిలోన నేకతాలు
అప్పసము సేవసేసే యాపె వుండఁగాను

చ. 2: నలువంక సందుసుడి నవ్వులేమి నవ్వేవే
కొలువుసేసిన యాపె గూచుండఁగా
కలయవచ్చేవు పొత్తు కాతరాన నీకు నీవే
పిలిపించుకొన్నయాపె ప్రేమతోనుండఁగను

చ. 3: ఆసపడి నీవేల అట్టే కాఁగిట గూడితి
సేసవెట్టి కూడినాపె చేరి వుండఁగా
వాసిఁ బరమపదేశ్వరు శ్రీవేంకటాద్రిపై
చేసుకొంటి వురముపై శ్రీసతి వుండఁగను

రేకు: 0593-5 శ్రీరాగం సం: 13-495

పల్లవి: ఏమీనన రమ్మనవే యిక్కడికి రమణుని
ప్రేమపుదానఁ గాక బిగిసేటి దాననా

చ. 1: ఆతఁడెటువలె నున్నా నౌఁగాదనే దాననా
చేతికిలోనేకాక శీఁట దాననా
కాతరించి తనమీఁద గాతసేసే దాననా
యేతులు తనతోఁ జూప నెడ్డదాననా

చ. 2: తననేరములు మరి తడవేటి దాననా
మనసులోదానఁ గాక మంకుదాననా
చనవరికత్తె నంటా సాదించే దాననా
పనిలేని యెగ్గులెన్నఁ బడుచుదాననా

చ. 3: వలపులు పెడరేఁచి వలఁబెట్టే దాననా
తలఁపులోదానఁ గాక దంటదాననా
కలసి పరమపదఘనుఁడ శ్రీవేంకటేశ
కొలఁదెఱఁగక వుండఁ గొయ్యదాననా

రేకు: 0593-6 ఆహిరినాట సం: 13-496

పల్లవి: వద్దువద్దు దోసము వలచివచ్చినవారిఁ
దిద్దుకొని కోరికలు దీరుచకుండితేను

చ. 1: పలచఁగా నవ్వి యాపె భావించి చూచీ నిన్ను
నెలకొన్న వావులను నీకేమౌనో
తలవంచుకోకు నీవు దండనున్న దాన నేను
అలరి యెంతకైనాను ఆడుకొనే నేను

చ. 2: పట్టి పెనఁగుచు నీకుఁ బైపై విందు చెప్పీని
నెట్టనఁ జుట్టరికము నీకెంత గద్దో
దట్టించి తప్పించుకోకు దాపు నీకు నేనుందాన
అట్టే యేపనికైనా నానుకొనే నేను

చ. 3: చనవుతోఁ గాఁగిలించి సారెసారె మాటలాడీ
నెనరైన నేస్తము నీకది యెట్టో
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నీడ లోఁగ-
కనువైన వూడిగాల కడ్డమయ్యే నేను

రేకు: 0594-1 దేవగాంధారి సం: 13-497

పల్లవి: ఎవ్వరికి జెప్పేవే యీసుద్దులు
జవ్వనము కట్టిపెట్టి సాదవయ్యేవా

చ. 1: పావనము సేసాతఁడు పలుకఁగా లోఁగేవు
సేవసేసే దానికింత సిగ్గులేఁటికే
తావుకొని సతులెల్లా దండనుండఁగాఁ గాక
భావించి యేకతమైతేఁ బై కొనకుండేవా

చ. 2: వాడికగా నాతఁడు నవ్వఁగాఁ దలవంచేవు
వేడుకక త్తెవు నీకు వెరపేఁటికే
యీడఁ బట్టపు దేవుళ్ళ నిందరినిఁ జూచి కాక
కూడేవేళ నింటిలోనఁ గొంకఁ జూచేవా

చ. 3: కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిలించఁగా నవ్వేవు
యెప్పటి దానవు నీకు నెమ్మలేఁటికే
అప్పటి నేము గూడిన ఆవరుస యెంచి కాక
ముప్పిరి నీవరుసను మోసపొయ్యేవా

రేకు: 0594-2 మాళవి సం: 13-498

పల్లవి: ఇందరివలెఁ జూడకు యింకా నన్ను
మందలించి యెటువలె మన్నించినా మంచిదే

చ. 1: తత్తరించి నీమీఁద తప్పులు మోపఁగ నోప
కొత్త కొత్త మాటలను కొసర నోప
బత్తిగలదాన నీతోఁ బంతము లాడఁగ నోప
చిత్తగించి యేమి దయసేసినాను మంచిదే

చ. 2: చేయి చాఁచి కొనగోరఁ జెనకఁగ నే నోప
చాయల సన్నల నిన్ను జరయ నోప
నీ యాధీనపు దానను నిన్ను వెంగెమాడ నోప
రాయడించ కెటువలె రక్షించినా మంచిదే

చ. 3: అట్టే కాఁగిటఁ గూడితి నలయించ నే నోప
వట్టి సటలాడి నీతో వాదించ నోప
ఇట్టే శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
పట్టిముగట్టి నన్నెంత పాలార్చినా మంచిదే

రేకు: 0594-3 భవుళి సం: 13-499

పల్లవి: ఆపెనేమి యడిగేవు అప్పటి నీవు
యేపున సిగ్గువడుటే యియ్యకొనుట

చ. 1: అరసి చతురుడ నీవానతిచ్చిన మాటకు
సరి నూర కుండితేనే సమ్మతించుట
సరికి బేసికి నీవు జాణతనము లాడితే
సరసము తానాడితే చనవు చెల్లించుట

చ. 2: ఆరీతి ఘనుఁడవు నీ వాపెఁ దప్పక చూచితే
సారెఁ దిరుగఁ జూచితే సమ్మతించుట
కేరికేరి నీవట్టే కిలకిల నవ్వితేను
తారుకాణగా నవ్వితేఁ దమకించుట

చ. 3: యిన్నిటా శ్రీవేంకటేశ యిట్టే కాఁగిలించితివి
చన్నుల నాపె వొత్తుటే సమ్మతించుట
మన్నించి మోవి యిచ్చి మరుగఁగఁ జేసుకొంటే
పన్ని తాను మోవిచ్చుట పతివిందు వెట్టుట

రేకు: 0594-4 శంకరాభరణం సం: 13-500

పల్లవి: కానీవయ్య అందుకేమి కడవరాయ-నేము
కానమా నీచేతలెల్లా కడపరాయా

చ. 1: కప్పురపు నవ్వుల కడపరాయ-నాకు
గప్పవోయి పచ్చడము కడపరాయా
కప్పులు దేరీ నీ మోవిఁ గడపరాయ-యివి
కప్పముగా నెవ్వతిచ్చెఁగడపరాయ

చ. 2: గరగరని వాఁడవు కడపరాయ-నాకు
గరఁగి వలవవోయి కడపరాయా
కరుణించి నన్నంటఁగాఁ గడపరాయ-నిన్ను
గరిసించే దెవ్వతోయి కడపరాయా

చ. 3: కలువదండ నీకదె కడపరాయ-నన్ను
గలసితి వింతలోనే కడపరాయా
కలికి శ్రీవేంకటాద్రి కడపరాయ-నీకుఁ
గలదిఁక నెవ్వతోయి కడపరాయా

రేకు: 0594-5 మాళవిగౌళ సం: 13-501

పల్లవి: నాకెంత ప్రియము చెప్పీ నాఁటకీఁడు
కైకొని పొదిగీ నట్టే కాతరీఁడు

చ. 1: వన్నెలఁ జెరఁగువట్టి వద్దఁగూచుండఁ బెట్టుక
యెన్నిమాటలాడీ నాతో నెమ్మెకాఁడు
కిన్నెర నాచేతికిచ్చి కిణకిణ వాయింపించి
అన్నిటా మెచ్చీఁగదె ఆసోదకాఁడు

చ. 2: పూరకే నేనుండఁగాను వొళ్ళిమీఁదఁ జేయివేసి
సారెకెంత నవ్వీనే జాణకాఁడు
మేరమీటీ జూజాలాడి మిక్కిలి తానే వోడి
కూరిమేమి గొసరీనే కోడెకాఁడు

చ. 3: తనివిదీరక వచ్చి తనకు నే మొక్కఁగాను
పనులెన్ని చెప్పీనే పంతగాఁడు
చనవిచ్చి శ్రీవేంకటేశ్వరుఁడు తానె నన్నేలె
ననుపు తానెంత సేసీ నాలికాఁడు

రేకు: 0594-6 నాగవరాళి సం: 13-502

పల్లవి: మగవాఁడవౌదువు మరి నిన్ను మెచ్చితిని
తగవింత నేరకుంటే తతి నన్నేలుదువా

చ. 1: యేడకేడ రుకుమిణి నెలయించి యింటికి
వేడుకతోఁ దెచ్చుకొంటివిగా నీవు
జోడుగాఁ బదారువేలు సుదతులఁ దెచ్చుకొంటి-
వాడికెకు వెఱవవు అవుఁగా నీవు

చ. 2: వూరిలోని గొల్లెతల నొకతె నొకతెనే
వీరుఁడవై యంటుకొంటివిగా నీవు
బీరాన రాచకూఁతులు పెండ్లాడినట్టివారు
అరీతిఁ బట్టపు దేవుళ్ళుట కా నీకు

చ. 3: వరుస మధురలోని వారకాంతల నెల్లా
వెరసువేసి పొందితివిగా నీవు
సిరుల శ్రీవేంకటేశ శ్రీసతి నంటా నన్ను
పురమెక్కించుకొంటివి వోపికగా నీది

రేకు: 0595-1 సామంతం సం: 13-503

పల్లవి: మేలు గాదా నీభాగ్యము మెఱసె నిందరిలోనా
యేలుకోరయ్యా మమ్ము నిట్లానే ఇంకను

చ. 1: సిగ్గులెల్లా మూటగట్టి చెలి నీపై వేసినట్టు
వొగ్గి నీపై వేసెఁ బువ్వులు చెండున
అగ్గపు మరుసాముల నాయము దాఁకించినట్టు
సగ్గక పెనఁగి నీమైఁ జన్నులఁ దానొత్తెను

చ. 2: నవ్వులెల్లా నొక్కమాటే నాతి నీపై నించినట్టు
నివ్వటిల్లు గందవొడి నీపైఁ జల్లె
జవ్వనము రాసివోసి జాజరలాడినట్టు
చివ్వన సరసమాడి చెనకీని గోళ్లను

చ. 3: వేవేలు తీపులతోడ విందు నీకుఁ బెట్టినట్టు
శ్రీవేంకటేశ ఆపె మోవి ఇచ్చెను
భావించి యలమేల్మంగ పట్టము గట్టుకొన్నట్టు
నీవురముపైఁ దానే నెలకొనె నిపుడు

రేకు: 0595-2 ముఖారి సం: 13-504

పల్లవి: ఎఱఁగవా మీఁదటెత్తు ఇంతేసి వచ్చినని
తటి నాకె నీకు బుద్ది తగఁ జెప్పదాయనా

చ. 1: యిప్పుడు నామాటలకు నింత వోరిచేవాఁడవు
అప్పుడాపె రాఁగా రాకుమనరాదా
తెప్పిరిల నాయలుక దేర్చేవాఁడవు నిన్నాపె
వొప్పుగాఁ గొంగు వట్టితే నోపననరాదా

చ. 2: కోటియానలిఁకఁ బెట్టుకొనేవాఁడవటు యాపె
వూటమోవికి నోరొగ్గకుండరాదా
మూటకట్టుగా వేడుక మొక్కేవాఁడ వీచేతులు
చాటి యాపె చన్నులపైఁ జాఁచకుండరాదా

చ. 3: పరగ శ్రీవేంకటేశ బలిమి నన్నేలితివి
బెరయక యాపెతోను పెనఁగరాదా
మరిగిన అలమేలుమంగనని మన్నించితి-
విరవుగా నాపె నిట్టే యీడకుఁ దేరాదా

రేకు: 0595-3 ఆహిరి సం: 13-505

పల్లవి: నీమగఁడు కొలువులో నీపైనే చల్లీ వలపు
నేమపు వూడిగాలెల్లా నీవే సేయవమ్మా

చ. 1: తప్పక చూచి నతఁడు తతిగొని నీదిక్కు
యిప్పుడే కానుకలెల్లా నియ్యవమ్మా
కప్పురము చల్లుకొంటాఁ గమ్మటి సుద్దులడిగీ
చిప్పిల విన్నపాలెల్లా జేసుకొనవమ్మా

చ. 2: చెంగట నీవుండఁగాను సెలవి నవ్వీ నతఁడు
యింగిత మెఱిఁగి వీడె మియ్యవమ్మా
అంగమునఁ దట్టుపుణుఁగులదు కొంటాఁ జెనకీ
సంగతిఁ జేయెత్తి మొక్కి సరసమాడవమ్మా

చ. 3: అలమేలుమంగవు నిన్నక్కునఁ గట్టుకొనెను
అలమి శ్రీవేంకటేశు కాసలీవమ్మా
పలుసొమ్ము వెట్టుకొంటాఁ బయ్యదకొంగు వట్టీని
అలరి పొత్తున నిట్టే యారగించవమ్మా

రేకు: 0595-4 శ్రీరాగం సం: 13-506

పల్లవి: నీకే తెలుసునయ్య నీసుద్దులు
పైకొని నేమడిగితే బ్రమయ నేమిటికి

చ. 1: చెమటేల వచ్చెనో సిగ్గువడి యంతలోనే
చమరి కప్పురదూళి చల్లుకోనేల
సముకాన నేమింతలో సారెసారె నవ్వితేను
అమరఁ దట్టుపుణుఁగు అందుపైఁ బూసేవు

చ. 2: నీకంటేముందు కప్రము నెలఁతకు మీఁదుకట్టి
దాకొని మిగిలించేల ధరియించేవు
జోకతో నేము నీమోము చూచితేఁ బరాకుచేసి
ఆకెఁ గూడి పన్నీరు అట్టే చల్లుకొనేవు

చ. 3: తెలుపు కప్పురము నలుపు తట్టుపుణుఁగు
కలగంప రూపులేల కైకొనేవు
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు నీ-
వెలమిఁ గలసి మమ్ము నెంత మన్నించేవు

రేకు: 0595-5 భూపాళం సం: 13-507

పల్లవి: అప్పటి నీచెలులచే నాగడానఁ బడనేల
మెప్పించే గాని మేడమీఁదికి రారా

చ. 1: సంగతిగాదు నీసతులెల్లాఁ జూచేరు
కొంగువట్టి తియ్యకురా కొసరి నన్ను
దొంగిలి చేసినసేఁత తుదకెక్కించ నేఁటికి
ముంగిటి వారెరిఁగేరు మూలకు రారా

చ. 2: కన్నవారు విన్నవారుఁ గాకు సేసేరిట్టే నన్ను
చన్నులు ముట్టికురా సారెసారెకు
పన్ని చీఁకటిలో సుద్ది బయట వేయఁగనేల
మన్నించి దోమతెరమాటు కిట్టేరారా

చ. 3: అప్పసము వురముపై నలమేల్మంగ వుండఁగా
కొప్పువట్టి తియ్యకురా కొంకక నన్ను
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చప్పుడు సేయక మంచముపైకి రారా

రేకు: 0595-6 దేసాళం సం: 13-508

పల్లవి: వెఱ్ఱితనమున నిన్ను వేసరించేఁగాక నీవు
వొఱ్ఱిబాగుల వాఁడవు వొద్దికయ్యేనా

చ. 1: కాముకుఁడైన వానికి కడుఁ బరాకే ఘనము
వేమారు మా విన్నపము వీనులంటీనా
ఆమీద వీడెము నేసేయప్పుడు మదమెక్కుడు
చేముట్టి నేఁ దీసితేను చేరవచ్చేవా

చ. 2: కన్నెపాయపు వానికి గబ్బితనమే ఘనము
పన్ని నే మాటాడించితేఁ బలికేవా
వన్నెల నందుకుఁ దోడు వనితలలో నున్నాఁడ-
వెన్ని మొక్కులు మొక్కినా నెరఁగ వచ్చీనా

చ. 3: దొరతనపువానికి దొట్టి వుండు గర్వమెల్ల
గరిమ నేఁ జెనకితేఁ గైకొనేవా
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సిరులఁ బెండ్లాడితివి సిగ్గువడేవా

రేకు: 0596-1 తెలుగు కాంబోది సం: 13-509

పల్లవి: ఒకరాస పడితే నీవొకరికిఁ జేచాఁచేవు
యెకసక్కెఁడవు నిన్ను నేమందునయ్యా

చ. 1: కలువకన్నుల నిన్నుఁ గలకంటి చూచితే
నలిరేఁగి నీవిట్టే నన్నుఁ జూచేవు
మొలక చన్నుల నాపె ముంచి నిన్ను నంటించితే
కొలఁది నన్ను నీ కొనగోర నంటించేవు

చ. 2: మగిడి మగిడి యాపె మాట నీతో నాడితేను
బగివాయకిటు నన్నుఁ బలికించేవు
నగవులాపె నీతో నవ్వితేను నీవు నా
మొగమై పకపకన ముంచి నవ్వేవు

చ. 3: అలమేల్మంగ నీ వురమట్టే యెక్కుకొంటేను
నెలకొని నావురము నీవెక్కితివి
యెలమి నే శ్రీవేంకటేశ భూరమణిని
యిలనాపె కుడినుంటే యెడమ నన్నుంచితి

రేకు: 0596-2 ఆహిరి సం: 13-510

పల్లవి: మమ్మేల దూరేవు నీవు మాఁటి మాఁటికి
అమ్మరో నేమా నిన్ను నదలించే వారము

చ. 1: నీమాఁటలవల్లనే నీవు రవ్వైతివి గాక
యేమీ ననకూరకుంటే నెఱిఁగేరా
వాములైన నీ చేఁతలవల్లఁ గాకైతివి గాక
చేముంచి నేమా కాకుసేసేటి వారము

చ. 2: కోరి నవ్వి నీవే తెచ్చుకొంటివి గాక యీరట్టు
నేరుపుతో నుంటే నిన్ను నిందలాడేరా
సారె నీబెదరుఁ జూపే సందేహలెత్తించెఁ గాక
సారసాన నేమా నిన్ను చండిసేసే వారము

చ. 3: రాఁపుగఁ జెనకి నీవే రతికెక్కితివి గాక
పైపై సరసమాడితే పచ్చిసేసేరా
యేపున శ్రీవేంకటేశ యేలితివలమేల్మంగ
నీపనేకాక నేమా యింత సేసే వారము

రేకు: 0596-3 దేవగాంధారి సం: 13-511

పల్లవి: ఇందుకుగా సవతుల నేల దూరేవే
కందము నీసత్తువెల్ల కతలేల చెప్పేవే

చ. 1: వలవఁగవలె లేదా వలపించుకొనవలె
యెలమి నూరకే వుంటే నేఁటి యాఁటదే
చలమరి విభుఁడైతే సాగిటి మొక్కవే లేదా
బలిమి నీకుఁ గలితే పంపు సేయించుకోవే

చ. 2: చొక్కవలెఁ దానే లేదా చొక్కించవలెఁ బతిని
యెక్కడికెక్కక వుంటే నేఁటి యాఁటదే
కక్కసీఁ దాతఁడైతే కడుఁ బ్రియాలాడు లేదా
తక్కరిని నీవైతే నాతని వంచుకొనవే

చ. 3: నేరవలె రతి లేదా నేరుపనైనా వలె
యేరీతికి జొరకుంటే నేఁటి యాఁటదే
ఆరసి శ్రీవేంకటేశుఁడలమేల్మంగను నేను
గారవించి కూడె నీవూఁ గరుణింపించుకోవే

రేకు: 0596-4 సాళంగనాట సం: 13-512

పల్లవి: నీతలనే వచ్చెనయ్యా నేరుపెల్లాను
కాతరించి సతులపై కాఁక చూపవలెనా

చ. 1: కోమలుల తిట్టులకు కోపగించే వింతలోనే
యేమీ నీమగతన మిందుమీఁదనా
చేముట్టి గోరనూఁదితే చిదుముడికే పడేవు
సాము సేసిన బీరమిచ్చటఁ జూపవలెనా

చ. 2: సతుల యెంగిలికీట్టే జడిసేవు కమ్మటిని
యితవైన నీయాచారా లిందుకొరకా
రతివేళఁ బాదములొరసితే నెగ్గుపట్టేవు
తతి నీపెద్దరిక మింతటఁ జూపవలెనా

చ. 3: లలనల చనుఁగొండలకుఁ జేయి చాఁచేవు
బలవంతుఁడవౌత యీపాటెరఁగమా
అలమేలుమంగను నేనట్టే శ్రీవేంకటేశుఁడ
కలసితివి నీమేలిక్కడఁ జూపవలెనా

రేకు: 0596-5 బౌళిరామక్రియ సం: 13-513

పల్లవి: అందరు నెఱిఁగినవే అన్నిపనులు
అందియ్యరాదా వీడె మంత సిగ్గులేఁటికి

చ. 1: చిప్పిలి చెమటనీరు చెక్కుల వెంటాఁ గారఁగా
చెప్పరాని వూడిగాలు సేసీనాపె
దప్పిదేరే మోవితోడ దగదొట్టి మాటలాడీఁ
గప్పురమైనా నీరాదా కడు సిగ్గులేఁటికి

చ. 2: పెనుఁదురు మట్టే వీడి పిక్కలవెంటా జారఁగా
పెనఁగి నిన్నుఁ బిలిచీ ప్రియురాలు
నినుపు నిట్టూర్పులతో నిలుచుండి నవ్వు నవ్వీ
యెనసి విసరరాదా యింకా సిగ్గులేఁటికి

చ. 3: పూసిన కస్తూరిపూత పొడివొడియై రాలఁగ
అసల నలమేల్మంగ అలమీ నిన్ను
యీసులేక శ్రీవేంకటేశ యేలితివి మమ్ముఁ
జేసుకొన్నపతి వింతే సిగ్గువడనేటికి

రేకు: 0596-6 కేదారగౌళ సం: 13-514

పల్లవి: ఇందరు జాణలే మీరు యేమని విన్నవించేము
సందడి గొల్లెతలము సంతోసించే మిదివో

చ. 1: నిద్దరించేవానివలె నీవు పవ్వళించుండఁగా
నొద్దికతోఁ బాదాలొత్తే రువిదలు
వొద్దనున్న చెలులు వొండొరుల మోములు చూచి
తిద్దుకొన్న కురులతో తెరవేసే రదిగో

చ. 2: అలసినవానివలె నంబరము గప్పుకోఁగా
మలసి నీదేవుళ్ళు మర్మములంటేరు
అలరి వూడిగపు వారందరూఁ దలలు వంచి
సెలవుల నవ్వి తలపులు మూసేరదిగో

చ. 3: గుట్టుగలవానివలె కొమ్మల లోలోనె కూడి
నెట్టుకొని యిందరి లోనికిఁ బిల్వఁగా
వొట్టుక శ్రీవేంకటాద్రి నున్న గోవిందరాజనీ
చుట్టాలు కరుణఁజెంది చొక్కిమెచ్చేరదిగో

రేకు: 0597-1 ధన్నాశి సం: 13-515

పల్లవి: ఎఱుఁగుదు మన్నియును యేలమాకుఁ జూపేవు
మఱి నీవేమి సేసినా మారుమాట లాడేనా

చ. 1: మొగమిచ్చమాటలు మోరతోపు తనములు
నిగిడి తొల్లే నీవు సేరిచినవి
యెగసక్కెపు నవ్వులు యెడలేని వినయాలు
వెగటుగా చిన్నివాఁడే వెన్నతోఁ బెట్టినవి

చ. 2: కడు వట్టి సరసాలు కడగండ్ల చూపులు
యెడనెడ నీకు దయ్యమిచ్చినవి
జడిగొన్న యానలును సందుకొన్న చనవుల
పొడవకుండ వీవు పుట్టిగాఁ బుట్టినవి

చ. 3: తక్కరి పిలుపులును తనియని రతులును
గక్కున నీవు వొడిగట్టినవి
గుక్కక శ్రీవేంకటాద్రి గోవిందరాజ నన్నేలి
అక్కర దీర్చితి విది అచ్చము నీకై నది

రేకు: 0597-2 నాదరామక్రియ సం: 13-516

పల్లవి: ఇంత నిష్ఠూర మేఁటికే యెదుట నీకు
కొంత మొగమోట వద్దా కొసరేవు నీవు

చ. 1: చెప్పుడు మాటలకే చెలువుని నింతేసి
పుప్పటించఁ దగునటే వోయమ్మ నీవు
కప్పుర మాతఁడిచ్చి గారవించఁగా నిన్ను
తప్పులెంచ వచ్చునటే తమకించి నీవు

చ. 2: నగిన యంతటిలోనే ననుపు విచారించక
మొగము వంతురటవే ముదిత నీవు
అగపడి కస్తూరి నీయంగములఁ బూయఁగా
వెగటున విదిలించి వేతురటవే

చ. 3: జీర మేన నున్నందుకే శ్రీవేంకటేశ్వరుని
నేరములెంతు రటవే నెట్టుక నీవు
గారవించితఁడే నిన్నుఁ గాఁగిలించి కూడఁగాను
పేరిడి సిగ్గులు ఇంకఁ బెంతురటే నీవు

రేకు: 0597-3 నాట సం: 13-517

పల్లవి: నీవు సేసిన పనులు నిన్నే సోఁకఁగాను
ఆవటమై పవళించే వందు కోరిచేవా

చ. 1: కొంగు వట్టితివి నన్ను గోవిందరాజ నీవు
యెంగిలి మోవిదానను ఇందుకోపేవా
ముంగై మురాలు వెట్టేవు ముంచి నేఁ బాదాలొత్తఁగా
అంగాలు నిన్ను దాఁకగా నందు కోరిచేవా

చ. 2: కొసరి నవ్వేవు నాతో గోవిందరాజ నీవు
యెసఁగు చెమటదాన నిందుకోపేవా
వెస నుంగర మిచ్చే వీవేళ నే బాగాలియ్యఁగా
నెసగ నీచేయి దాఁకు నిందుకోరిచేవా

చ. 3: కూడేవు శ్రీవేంకటాద్రి గోవిందరాజ నన్ను
నీడ వాఁడిగోరిదాన నిందు కోపేవా
తోడఁ గడియాలిచ్చేవు వూడిగము నేఁ జేయఁగా
నేడేడఁ దాఁకునో నీవిందు కోరిచేవా

రేకు: 0597-4 కన్నడ గౌళ సం: 13-518

పల్లవి: ఎటువంటి వాఁడవయ్య యింటికి విచ్చేయవయ్య
ఘటన నీ దేవులదే కాచుకున్న దిపుడు

చ. 1: వలచి కాంతలు వడినట్టే తిట్టుదురు
మలసి కోపగింతురా మగవారు
పిలచితే నాఁడువారు బిగియక మానరు
అలుగుదురా నీకు అంతలోననే

చ. 2: ఒట్టిడి సతులెల్ల నాఒడి సేఁతలు సేతురు
పట్టుదురా యెగ్గులెల్లాఁ బతులేఁదైనా
ముట్టితేఁ జుట్టిపువారు ముంజేవట్టి పెనఁగుదు-
రట్టే సాదింతురా చలమంతలోననే

చ. 3: రతిలోనే వనితలు రాజసము చూపుదురు
తతిఁ బంతాలు గొందురా తమవిభులు
యితవై శ్రీవేంకటేశ యింతి నిట్టే కూడితివి
అతిబత్తి చూపుదురా అంతలోననే

రేకు: 0597-5 దేశాక్షి సం: 13-519

పల్లవి: ఉండవయ్య మమ్మునేల వుడికించేవు
బండుసేసి యాఁటదాని బతిమాలిపింతురా

చ. 1: అట్టే కాఁగిలియ్యక ఆసలెన్ని వెట్టినాను
నెట్టుకొన్నమతికిఁ దనివి వచ్చీనా
గుట్టున నీవు గూడక గోరనెంత గీరినాను
వట్టి బేఁటమేకాక వచ్చేదేమున్నది

చ. 2: తనువులు సోఁకక తతి నెత్తమాడితే
వెనకటి విరహపు వేఁడి మానీనా
చనుమొనలు నాఁటక కనుచూపులఁ జూచితే
గొనకొన నెంచుకొన్న కోరిక దీరీనా

చ. 3: నన్నిట్లాఁ గూడక నవ్వులూరక నవ్వితే
కన్నెపాయపు సిగ్గులు కడతేరీనా
మన్నించి సేసవెట్టక మాటలెన్ని యాడినాను
సన్నల శ్రీవేంకటేశ చవి గానిపించునా

రేకు: 0597-6 తెలుఁగుఁగాంబోది సం: 13-520

పల్లవి: అడుగవే యింకాను ఆతనినే
వొడివట్టే విదాతని కొడఁబాటు గాదే

చ. 1: చిత్తము వచ్చిన సతి సేవలెల్లాఁ జేయఁగాను
పొత్తుగూడ నీవేమి కొప్పు ముడిచేవే
యిత్తల మొగమోటాన నేమీ ననకున్నాఁడింతే
తత్తరాన నాపెచేఁత యితవుగాదే

చ. 2: కూరిమి సేయించుకొన్న కొమ్మ మాటలాడఁగాను
తూరి సందుచొచ్చేమి సుద్దులు చెప్పేవే
వీరువారు ననేరంటా నోరుచుకున్నాఁడింతే
యేరీతి నీవాడినాను యితవుగాదే

చ. 3: యిటెప కూడివచ్చినట్టి యింతి సరసమాడఁగా
నట్టినడుమ నీవేమి నవ్వు నవ్వేవే
గట్టిగా శ్రీవేంకటేశుఁ గలసితివాతఁడు
యెట్టుయినాఁ జేకొనీఁ గాని యితవుగాదే

రేకు: 0598-1 ద్రావిళభైరవి సం: 13-521

పల్లవి: కన్నెపడుచు గనక గయ్యాళించ నేరదు
మన్ననలు చూపి నిన్ను మరిగించవయ్యా

చ. 1: తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొని చెలి
తలపోసీ నీరూపు తనలోననే
జలజలఁ జెమరించె సరుగనఁ జెక్కులెల్లా
చెలఁగి కాఁగిట నించి నిగ్గు వాపవయ్యా

చ. 2: పుదుటున మాటలాడి వొరగి పానుపు మీఁద
యెదురుచూచీ రతికి నేక తానను
ముదురుఁబులకలెల్లా మోసులెత్తె మేన నిండా
యెదపైఁ జేవేసి యాస యీడేరించవయ్యా

చ. 3: నెట్టిన నిన్నుఁ గాగిట నించి నివ్వెరఁగునొంది
గుట్టుతోఁ గోరికలెల్లాఁ గోరీనిదే
ఇట్టె శ్రీవేంకటేశ యెనసి మొక్కులు మొక్కీ
కట్టుసేయకింక నిట్టె దిట్టఁ జేయవయ్యా

రేకు: 0598-2 పాడి సం: 13-522

పల్లవి: ఎంత సేసే విందుకుఁగా నెప్పటివారమే కామా
వంతు వరుసకు రాఁగా వద్దంటినా

చ. 1: మాటల దొంతులు వెట్టి మచ్చికలు చుట్టి పెట్టి
కూటమి కెసరువెట్టి కొంగువట్టేవు
యేఁటి కింతేసి సేసేవు ఇంటికి విచ్చేసి నీవు
వాఁటానఁ గాఁగిలించఁగా వద్దంటినా

చ. 2: వలపులఁ బంట వండి తలఁపులో గూడువండి
నిలువునూరుఁ బండి నెట్టుకుండేవు
బలిమేల సేసేవు పానుపు మీఁదికి వచ్చి
వలసినట్టు సేయఁగా వద్దంటినా

చ. 3: చూపులనే విందుచెప్పి సొంపులు పైపైఁ గప్పి
తీపుమోవితేనె గుప్పి తిప్పేవు చేయి
రాపుగ శ్రీవేంకటేశ రవ్వలేల సేసేవు
వైపుగానే కూడితివి వద్దంటినా

రేకు: 0598-3 లలిత సం: 13-523

పల్లవి: మేనవార మిద్దరము మెచ్చులాయఁ బనులు
యీ నేరుపులు గంటి నిఁక నేఁటి మరఁగు

చ. 1: నవ్వులేమి నవ్వీనే నయగారి తనమున
జవ్వన పాయమెల్లా జట్టిగొనెను
రవ్వలాయ మావలపు రమ్మనవే యింటాడకు
యెవ్వరూ నేమి చెప్పేరు యికనేఁటి మరఁగు

చ. 2: సుద్దులేమి చెప్పీనే చుట్టరికములనే
గద్దరి నామనసు తాఁ గైకొనెను
పెద్దాయ నాసలు పెనఁగి చూడుమనవే
యిద్దరము నిద్దరమే యిఁక నేఁటి మరఁగు

చ. 3: తప్ప కేమి చూచీన తన తరితీపులనే
వొప్పుగ నాకాఁగిట నొనగూడేను
చిప్పిలె నా చెమటలు శ్రీవేంకటేశుఁడు తాను
యెప్పుడూ నన్ను మన్నించు నిఁక నేఁటి మరఁగు

రేకు: 0598-4 మంగళ కౌశిక సం: 13-524

పల్లవి: ఇన్నియు నీయందే కంటి మిఁక నొకచోటఁ గాదు
సన్నల చాయల నేము సంతోసించేమయ్యా

చ. 1: మగవానికేడ సిగ్గు మగువలు వద్దనుంటే
తగిలి కాఁగలించఁగఁ దమకింతురు
యెగసక్కేలాడేవారి నెరఁగరు చెలరేఁగి
పగటు వయోమదము పచరింతురు

చ. 2: కోడెకానికేడ వేళ కొమ్మలు మాటలాడితే
యేడనైనాఁ గూడుమంటా నెచ్చరింతురు
ఆడికెకు వెరవరు అండవారిఁ జూడరు
వీడెపు మోవితేనెకు వేఁడుకొందురు

చ. 3: మొక్కలీనికేడ నీతి ముదితలఁ బొడగంటే
గక్కునఁ గాఁగిట నించి కరగింతురు
మక్కువ శ్రీవేంకటేశ మండెమురాయఁడవై
యిక్కడ నన్నేలితివి యింతా నెరుఁగుదురు

రేకు: 0598-5 గౌళ సం: 13-525

పల్లవి: నీ గుణ మిటువంటిదా నిన్నా మొన్నాను
ఆగడానఁ బడి వచ్చి అనేవు గాక

చ. 1: యెగసక్కె మేదయ్యా యింతులము నీతో
నగరాదా నీవే చనవు లియ్యఁగా
మగడి యెవ్వతోచేత మాటఁ బడిన కోపాన
పగటు బీరము మాపైఁ జూపేవు గాక

చ. 2: గబ్బితన మేదయ్యా కాలు నీవు దొక్కఁగాను
దొబ్బరాదా నొచ్చి నంటాఁ దొలఁగు మని
గుబ్బున నెవ్వతో నిన్నుఁ గూడని వుడుకునను
గుబ్బలో త్తెనని నీవు గుంపించేవు గాక

చ. 3: వుద్దండ మిందేదయ్యా వూరకే కస్తూరి బొట్టు
తిద్దరాదా జారఁ జెక్కుటద్దాల వెంట
గద్దించి నన్నేలి శ్రీవేంకటేశ యెవ్వతోకంటెఁ
బెద్దరికానకు నాతో బిగిసేవు గాక

రేకు: 0598-6 సౌరాష్ట్రం సం: 13-526

పల్లవి: మమ్ము సాకిరివెట్టేవు మాటిమాటికి
యిమ్ముల మమ్మేలితిరి యేమనేమయ్యా

చ. 1: వొద్దనుండి నీతోఁ జెలి వొట్టువెట్టుక వున్నది
గద్దించి పిలిచేవిటు కమ్మటి నీవు
వుద్దండము నీవొళ్ళిది వువిదవల్లఁ జలము
యిద్దర నిద్దరే నేము యేమనేమయ్యా

చ. 2: ముప్పిరిఁ బాన్పుపై నాపె ముసుఁగు వెట్టుకున్నది
అప్పుడే మాటాడుమని యానవెట్టేవు
తప్పులు నీగుణాలవి తరుణి వాసికత్తె
యెప్పుడు మీరు మీరే యేమనేమయ్యా

చ. 3: అంగన చెక్కుచేతితో నసురసురై వున్నది
యెంగిలిగాఁ జేసి మోవి యెనసితివి
ముంగిటనాపె నవ్వితే మొక్కేవు శ్రీవేంకటేశ
యింగితపు జాణలు మిమ్మేమనేమయ్యా

రేకు: 0599-1 కొండమలహరి సం: 13-527

పల్లవి: ఎంతవద్దన్న మాన విందుకుఁ జొచ్చితివి
మంతుకెక్కించేవు నన్ను మరియేమి సేతురా

చ. 1: చెనకకు నీవు నన్ను చేతుల చాఁచి
కొనలు వాండ్లు నీగోరు దాఁకీని
ననుఁ జూచితేఁ జెలులు నవ్వేరిఁక
యెనలేని సిగ్గు ముంచీ నేమిసేతురా

చ. 2: ముట్టికు నామెడనున్న ముత్తేలు నీవేళ్లను
గట్టులు నాచన్నులతో కంగురనీని
చుట్టిరానున్న చెలులు చూచి నవ్వేరు
యిట్టే నాకు సిగ్గు ముంచీ నేమి సేతురా

చ. 3: పోయ కెదుగా సేసలు పొంచి నీదోసిలైతే
చాయల సారెకుఁ దాఁకి జారీఁ గొప్పు
యీాయెడఁ బెండ్లాడితివి యిట్టే శ్రీవేంకటేశ
యేయెడ సిగ్గులు ముంచీ నేమి సేతురా

రేకు: 0599-2 దేసాళం సం: 13-528

పల్లవి: నన్ను నేల పొగడేవు నవ్వేరు నిన్ను
కన్నెలు నీపొందులకుఁ గాచుకిట్టేవుండఁగా

చ. 1: బలిమేల సేసేవు బాఁతిపడి నాతోను
యెలమి నావంటి చెలు లెందరు లేదు
కలకాలమును వూడిగపు కాంత నింతే నేను
చలమేల దొడ్డ దొడ్డ సతులెల్లనుండఁగా

చ. 2: చేయివట్టి తీసేవు చిఱునవ్వులు నవ్వుతా
డాయ వచ్చిరిందరుఁ జుట్టాలే నీకు
బాయిట సమ్మాళిగెలుపట్టే తొత్త నీకు
వేయకు మాపైఁ జేయి వేలయాండ్లుండఁగా

చ. 3: చన్ను లేల పిసికేవు సరి నాకాఁగిటఁ గూడి
వన్నెల నీవేళ నాఁడువారే వున్నారు
అన్నిటా నీవు భోగించినట్టి యెంగిలి నేనింతే
మన్నించు శ్రీవేంకటేశ మావారిందరుండఁగా

రేకు: 0599-3 తోండి సం: 13-529

పల్లవి: మాకేల వాదులడువ మాఁటిమాఁటికి
యీకడను నీమతకము ఇంతయు నేఁ గంటిని

చ. 1: వలతు నంటాఁ జెప్పి వారి వీరి తోడుతను
మెలుపున నీసతి యెమ్మెలు చూపీని
చలివాసి తిరిగీని సవతుల ముందరను
సలిగె నీవిచ్చినదే సతముగాఁ గంటిమి

చ. 2: నీ విచ్చిన సొమ్ము లివి నెలఁతలకెల్లఁ జూపి
దేవులతనమెల్లా నిందే నెరపీని
చేవదేరెఁ బనులెల్లా సిగ్గులు వడదిప్పుడు
భావింప నీపోలికెల్లాఁ బడఁతిపైఁ గంటిమి

చ. 3: కాఁగిట నిన్నుఁ గూడి కాంతలలో మెరసీని
రాఁగి నీవు నన్నేలితే రవ్వసేసీని
పాఁగెను శ్రీవేంకటేశ పచ్చిదేరించె నీమేను
నాఁగువారే పొందు లీకె నవ్వులలోఁగంటిమి

రేకు: 0599-4 ఛాయానాట సం: 13-530

పల్లవి: ఎఱుగనైతి నిందాఁకా నేఁటిదో యంటా నుంటి
నెఱీఁ దొరలనాడీని నేనేమందు నీఁకను

చ. 1: కొండలలో నెలకొన్న కోన చెన్నరాయఁడిదే
బొందు మల్లెల వేసెనే పూఁచి నన్నును
పండు ముత్తేల సొమ్ములప్పటి నామెడఁ బెట్టి
దుండగము సేసె నేమందు నేనీఁకను

చ. 2: గొప్పయైన యేటిదరిఁ గోన చెన్న రాయఁడిదే
దప్పికి గప్పురమంపెఁ దరుణిచేత
చెప్పరాని మాటలెల్లాఁ జెవిలోఁ దానే చెప్పి
దుప్పటి గప్పినేమందు నేనీఁకను

చ. 3: గుఱితో శ్రీవేంకటాద్రి కోన చెన్న రాయఁడిదే
చెఱఁగు వట్టి ప్రియాలు చెప్పికూడెను
జఱయుచు వచ్చి వచ్చి చనవులెల్లా నొసగి
మెఱసి తొరలనాడి మఱేమందు నీఁకను

రేకు: 0599-5 సావేరి సం: 13-531

పల్లవి: కానీవమ్మ యీపుణ్యము గట్టుకోవమ్మా
పూని యాతని కెంతేసి బుద్ధులు చెప్పేవు

చ. 1: నే కాతఁడు రాకుండఁగా నేరము లెంచినవెల్లా
కానుకగాఁ బట్టితివి కాంతునికి
మేనిపై మచ్చము చూచి మెల్లనే నే నవ్వితేను
దానికిఁగా నాతని పంతము రేఁచేవు

చ. 2: తక్కివుండిన యాతనిఁ దప్పులు వట్టినవెల్లా
అక్కునఁబోసి చూపితి వాతనికిని
వెక్కసపుఁ జెమటకు వెంగెము నేనాడితేను
వక్కణ చెప్పితనికి వాసివుట్టించేవు

చ. 3: దిమ్మరై తిరుగఁగా నేఁ దిట్లు దిట్టినవెల్లా
అమ్మరో పూగుచ్చి నట్లప్పగించితి-
వుమ్మడి శ్రీవేంకటేశుఁ డొనగడి నన్ను నంటె
ఇమ్ముల నిది చెప్పుమనెమ్మెలు సేసేవు

రేకు: 0599-6 సామంతం సం: 13-532

పల్లవి: ఎంతకుఁ జాలవు నీవిటువంటి సుద్ధులు
పంతము గొనేవి నీపనులే కావా

చ. 1: తలపోఁతలో నుండి తమిరేఁచే వెల్లాను
మలసి నీవాడిన మాటలే కావా
కలలోపలను వచ్చి కరఁగించే వెల్లాను
నలువంక నీ సెలవి నవ్వులే కావా

చ. 2: గుట్టుతోడ మనసులో గుబ్బతిలే వెల్లాను
చిట్టకపు కొనగోరి సేఁతలే కావా
గట్టిగా నామర్మములు కరఁగించేటి వెల్లాను
బెట్టుగా నీవు మన్నించే ప్రియములే కావా

చ. 3: పక్కన నాకాఁగిటిలో బ్రమయించే వెల్లాను
గక్కనఁ గూడిన సంభోగములే కావా
మక్కువ శ్రీవేంకటేశ మరచిన వెల్లాను
చిక్కని నీమేని మీఁది సింగారాలే కావా

రేకు: 0600-1 మనోహరి సం: 13-533

పల్లవి: అందుకనేఁ గాక నేను అడుగుకోనోపనా
యెందరికైనాఁ దాను ఇచ్చకములాడునే

చ. 1: ఆవేళ కక్కుర్తిమాట లాడుఁగాని వేరొకతె
కైవశము సేసుకొంటే గానిమ్మనునే
చేవట్టి నేఁదీసితే చిత్తగించి వచ్చీఁ గాని
వావి యెవ్వతె చెప్పినా వలపులు చల్లునే

చ. 2: వొద్దనున్న అంతవడి వొడఁబడి వుండుఁగాని
బుద్ధియెవ్వతె చెప్పినా నపుడే వినునే
తిద్దుకొని బాసగొంటే దిష్టముగా నిచ్చుఁగాని
బద్ధు లెవ్వతాడించినాఁ బలుమారు నాడునే

చ. 3: సరసములాడితేను చనవిచ్చుఁ గాని వేరే
తరుణి కాఁగిలించితే దక్కివుండునే
యిరవై శ్రీవేంకటేశుఁడిటు తానే నన్ను గూఁడె
యెరవుల వారినెల్లా నెనసీ నెనయఁడే

రేకు: 0600-2 బౌళి సం: 13-534

పల్లవి: కాదు గూడదంటిమా కమ్మటి నీతో నేము
పోదిసేసి నీకు నీవే పొదిగేవు గాక

చ. 1: పంతమాడేమా నీతో బలుములు చూపేమా
వింతవారమా నేము వేగినంతాను
యెంతేసి వేడుకొనేవు ఇక్కువలేలంటేవు
కాంతల నేలంపేవు కమ్మటి మాయింటికి

చ. 2: యేడనుంటి వంటిమా యెగ్గులు వట్టితిమా
వీడె మియ్యకుండితిమా వేగినంతాను
వోడకేల కొసరేవు వొడివట్టేల తీసేవు
అడకే లేకలువాసి అంపేవేల ఇంటికి

చ. 3: సేవ సేయకుండితిమా శ్రీవేంకటేశ్వర నీకు
వేవేల రతులందమా వేగినంతాను
పూవుల నేల వేసేవు పొంచి యేల నవ్వించేవు
ఆవటించి వచ్చేవు నీవప్పటి మాయింటికి

రేకు: 0600-3 ఆరిభి సం: 13-535

పల్లవి: తొల్లే నే మెరుఁగుదుము తొడిఁబడ నీసుద్దులు
కల్లగాదు నిన్నప్పటి గరిసించ నేఁటికి

చ. 1: యేతున నీవాడే మాటలిన్ని యునుఁ జెల్లివచ్చె
యీాతల మాకోపమిఁక నెందుకెక్కును
జాతితో నీ నవ్వేనవ్వు సరివచ్చె మామీఁదను
నీతి చెప్పి పెనఁగఁగ నీతో నేల ఇఁకను

చ. 2: పట్టిన నీచలములు పంతములకెల్లా నెక్కె
ఇట్టే నేవేఁడుకొనిన నేడకెక్కును
రట్టుసేసే నీవుద్దండా లిట్టే ఇంతటా నిండె
నెట్టుకొని బాసడుగ నీతోనేల ఇకఁను

చ. 3: కందువ నీకూటమి కాఁగిటికి గురుతాయ
యిందరుఁ జెప్పే బుద్ధులేడకెక్కును
సందిట శ్రీవేంకటేశ చనవిచ్చి కూడితివి
నిందలు వేయును నాడ నీతోనేల ఇఁకను

రేకు: 0600-4 పూరిభి సం: 13-536

పల్లవి: వెగ్గళించఁ జూచితేను వేసటలైను-అందు
వెగ్గళమైతే వలపు వెల్లివిరిసీని

చ. 1: సగము మాటాడవే వోసతి నీవాతనిచేత
సగము దెలుసుకొనేజాడ యెట్టిదో
తగులు గొంత చూపవే తరవాత నాతనికిఁ
దగులు గలిగితేను తమకించీ నిపుడు

చ. 2: మొదలఁ గొంత నవ్వవే మోహానకు నీకతఁడు
మొదలుఁ దుదా గలితే ముంచి నవ్వీని
యెదురు చూడవే మొక మెదురుకట్లఁ దాను
యెదురు చూచి రతికి నితవు గలితేను

చ. 3: చేయి చాఁచవే నీవు శ్రీవేంకటేశుఁడు రెండో
చేయివట్టి తీసి నీసిగ్గు వాపీని
యీాయెడనుండి కూడితి విన్నిటా నామాట విని
యీాయెడనే అతడు నిన్నిదివో మన్నించె

రేకు: 0600-5 నాగగాంధారి సం: 13-537

పల్లవి: ఎంత మన్నించెనే నన్ను నితఁడు నేఁడు
వింతలు లోకానకెల్లా వెగ్గళములే

చ. 1: యేకతానఁ దా బెట్టిన వెటువంటివో ఆనలు
వాకుచ్చేనంటే నావసము గాదే
చేకొని యప్పుడు నాకు జెప్పినట్టి ప్రియములు
దాకొని రట్టు సేయఁగఁ దగవు గాదే

చ. 2: తానే మాయింటికి వచ్చి తగనిచ్చి యీవులు
పానిపట్టి యెక్కడాఁ జూపఁగరానివే
నానావిధముల నాతో నవ్వినట్టి నవ్వులు
తానకమై మతిలోన దాఁచ వలెనే

చ. 3: యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసిన కూటములు
చిప్పిలి నా మైనుండఁగ సిగ్గులయ్యీనే
ముప్పిరి నామీఁద నిట్టే ముంచినట్టి మోహములు
వొప్పుగా నాజవ్వనాన కుంకువాయనే

రేకు: 0600-6 సామంతం సం: 13-538

పల్లవి: మగవారయినవారు మగరీతినుంట గాక
పగటులు మించి వలపక్షాలకు వత్తురా

చ. 1: ఆపే నేనూ వాదించఁగా నడ్డాలు వచ్చేవు నీవు
కాపాడే నీపొందులిందు గాన వచ్చెనా
చెపట్టినవాఁడ నంటా సిగ్గులు విడిచి నీవు
యీ పనులకు వత్తురా యిందరు నవ్వేరు

చ. 2: తగవు లిద్దరమును తమితోఁ దేరుచుకోఁగా
తెగి మాట వొరగులు దిద్దవచ్చేవు
మిగులా మోహింతునంటా మేరలు మీరి నీవు
అగడుకు లోనౌదురా అందురు నవ్వేరు

చ. 3: సవతులము మాలోన సమ్మతించొక్కటి గాఁగ
కవతో నడుమ మమ్ముఁ గాఁగిలించేవు
తవిలి శ్రీవేంకటేశ తత్తరించి కూడితివి
యివల నీసుద్దులకు నిందరు నవ్వేరు

రేకు: 0601-1 సాళంగనాట సంపుటం: 14-001

పల్లవి: వేగినంతా నేమి చెప్పేవెలుమ జోలి
వాగమై నాకు మేనవాఁ డౌనో కాఁడో

చ. 1: యెగసక్కేలకు నాతో నేమైన ననెఁగాక
అగపడి నాకు లోనౌనో కాఁడో
నగుతా నెంతైనాఁ బెనఁగినాఁ బెనఁగెఁ గాకఁ
తగవున కిపుడు నామొగఁడౌనో కాఁడో

చ. 2: యెమ్మెలకుఁ దా మరి యెట్టుండినా నుండెఁ గాక
యిమ్ముల నాకుఁ జనవిచ్చెనో లేదో
వుమ్మడితా సిగ్గుపడి వుండినా నుండెఁ గాక
కమ్మర మొదల నన్నుఁ గౌకొనెనో లేదో

చ. 3: దిమ్మరియై ఇట్టె సాదించితే సాదించెఁ గాక
నమ్మించి నన్నిట్టె యెనసెనో లేదో
పమ్మి శ్రీ వేంకటేశుఁడు పైకొంటేఁ బైకనెఁ గాక
నెమ్మదిఁ గృపారసము నించెనో లేదో

రేకు: 0601-2 పాడి సంపుటం: 14-002

పల్లవి: చెలులాల యాతనికిఁ జెప్పరే మీరు
యెలమి నెదిరివారి యింగిత మెరఁగఁడా

చ. 1: ప్రియము చెప్పెడిమాట పెదవిపై నుండఁగాను
క్రియ యెరఁగకేల వేగిరించీఁ దాను
నయములు వినయాలు నావొళ్ల నుండఁగాను
దయ యెఱఁగక యేల తమకించీనే

చ. 2: కడుఁ జల్లని చూపులు కన్నులనే వుండఁగాను
పొడిఁబడి తనకింత పొక్కనేఁటికే
చిడుముడి నవ్వులు నా సెలవులనుండఁగాను
గొడవలు తనకేలే కొసరీఁ దా నిపుడు

చ. 3: పూఁచినట్టి కాఁగిలి బుజముల నుండగాను
లోఁచి చూడఁ దనకేలే లోలో నన్ను
యేఁచక శ్రీ వేంకటేశు నిట్టె తన్ను నేఁగూడితి
పాఁచిరతులిఁక నేలే పై పై నా యెడకు

రేకు: 0601-3 సామంతం సంపుటం: 14-003

పల్లవి: తెరమరఁగేఁటికి దిష్టమువో చెలి
పురుష విరహ మిటు పొలసీని

చ. 1: వంచిన శిరనును వాలుక చూపులు
పెంచిన నెరుల యీ పెనుఁగొప్పు
మంచముపైఁ బతిమతిలోఁ దలఁచుచు
పొంచిన చెమటతోఁ బొరలీని

చ. 2: చెక్కిటిచెయి నీ సెలవుల నవ్వులు
పుక్కిటి వీడెపు భోగములు
వక్కణ నీతఁడు వాకునఁ బొగడుచు
గక్కన లోలోఁ గరఁగీని

చ. 3: మోవికెంపులును మొలకల పులకలు
సావధానమగు చనుకట్టు
భావించి కూడెను బలిమి నిన్ను నిటు
శ్రీ వేంకటేశుఁడు చెలఁగీని

రేకు: 0601-4 నీలాంబరి సంపుటం: 14-004

పల్లవి: ఆయ రావయ్య లోనికి నారగింతువు
కాయమెంత అంటినాను కరఁగీ నామనసు

చ. 1: ఏడనుండి వచ్చి సతులెందరు చెనకినాను
వేడుకకాఁడవు నీవు వేసరేవా
జాడతోడ మదనశాస్త్రము లెన్ని చదివినా
తోడనే నీవీనుల గొందులు తనిసీనా

చ. 2: తరణులెంత నీనోటఁ దములము వెట్టినాను
ధర నీనోరు నొచ్చీనా దక్కుఁగాక
దొరకొనొకరొకరి తొడమీఁదఁ గూచుండినా
గరిమ నలసీనా కాయగాచుఁ గాక

చ. 3: యెందరు కాఁగిట నిన్ను నెంగిలి సేసినాను
యెందుకైనా నొగ్గక నీ వేవగించేవా
ముందె శ్రీ వేంకటేశ ముంచి నన్ను నేలితివి
అంది యింకా నన్నే కూడకారడిఁ బెట్టేవా

రేకు: 0601-5 ఆహిరినాట సంపుటం: 14-005

పల్లవి: సేయవయ్యా ఇంకా నీకుఁ జెల్లినట్లెల్లా
యీ యెడ మేలనుచు నిన్నిట్టే మెచ్చేమయ్యా

చ. 1: మారుమాటలాడక మనసు సోదించక
చేరి నీ చెప్పినట్టెల్లాఁ జేసేమయ్యా
సారెఁ గొసరక చలము సాదించక
వూరకే చేతులు మూసుకుండేమయ్యా

చ. 2: యెగ్గులేమీఁ బట్టక యెకసక్కేలాడక
వొగ్గుచుఁ జేతులఁ బాదాలొత్తేమయ్యా
శిగ్గులునుఁ బడక శిరసు వంచుకొనక
అగ్గమై నీవు నవ్వినట్టే నవ్వేమయ్యా

చ. 3: తప్పులేమీ నెంచక తగవులఁ బెట్టక
ముప్పిరి సరసములు ముంచేమయ్యా
యిప్పుడె శ్రీ వేంకటేశ యెనసితివిటు నన్ను
తప్పకుండ వేవేలు దండాలు వెట్టేమయ్యా

రేకు: 0601-6 సావేరి సంపుటం: 14-006

పల్లవి: ఎల్లవారి ముందరను యేల కాకుసేయ నీకు
కొల్లున నవ్వితేనౌ గొల్లవారి పెండ్లి

చ. 1: ఆసుద్దులు చెప్పనేల అంగనకు నీవు మెడఁ
బూసలు గట్టినప్పుడే పొందెరిఁగెను
రాసి కన్నెపడుచును రవ్వసేయనేల నీవు
శేస వెట్టినప్పుడే సిగ్గు వుట్టెను

చ. 2: యీడకు నాడకు మరి యెడతాఁకించఁగనేల
వీడెమందుకొన్నప్పుడె విందులబ్బెను
వాడికగా నొండొరులు వావెడుగనేల చల్లఁ
చాడె దించుకొన్నప్పుడే సతమాయను

చ. 3: ఆదిగొని నీవు నేఁడు ఆస రేఁచనేల ముంచి
పాదము దొక్కినప్పుడే భాగ్యమాయను
యీదె శ్రీ వేంకటేశ యేలితివి యింతి నిట్టే
పోదులు మరిఁ జేయఁగ పొంకమాయను

రేకు: 0602-1 సోమరాగం సంపుటం: 14-007

పల్లవి: ఊరకుండుమనవే వొడఁబాటులేఁక నేలే
కోరికలు గోరుకొంటా గొణఁగేఁ గాని

చ. 1: అగపడితిమి తొల్లే ఆయను తన పొందు
యెగసక్కేలాడక తానిఁక నెన్నఁడే
జగడించ నోపము జవ్వనము మోచుకొని
మొగము చూచి చూచి మూలిగేఁ గాని

చ. 2: సేవలెల్లాఁ జేసేము చెల్లుబడి గలవాఁడు
యీవల నవ్వులు నవ్వకిఁక నెన్నఁడే
చేవట్టి తియ్యనేల సిగ్గులు పై వేసుకొని
దేవరంటా మొక్కుకొంటా దీవించేఁ గాక

చ. 3: కూడితిమి కాఁగిటను గురుతు చన్నులనంటె
యీడనే ప్రియాలు సేయకిఁక నెన్నఁడే
జోడై శ్రీ వేంకటేశ చుట్టరికపుఁదనాన
మేడెపు రతులలోన మెచ్చేము గాక

రేకు: 0602-2 కోకిల పంచమం సంపుటం: 14-008

పల్లవి: ఇంటిలోని కేఁగరయ్య ఇద్దరు మీరు
పంటలవలె నిండేల పచరించ నిపుడు

చ. 1: మాటలాడఁ బోతేను మాణికేలు రాలీని
కాటుక కన్నులనైతేఁ గారీ నీలాలు
యేఁటికి నీవు రేఁచేవు ఇంతివొళ్ళఁ గలదిది
మూటలు గట్టఁగరావు ముంగిలెల్లా నిండెను

చ. 2: చేతులెత్తి మొక్కితేను చిగురులే తొలఁకీని
ఆతల నవ్వితే మొల్లలటు మించీని
కాతరించి పట్టేవు కామిన సింగారమింతే
జాతి దండగట్టరావు సముకాన నిండెను టపఁ

చ. 3: సంగడిఁ గూచండితే చక్కెరే పుట్టిపడీని
అంగము సోఁకితే నూరీ నమృతములు
సంగతిగాఁ గూడితివి సతిని శ్రీ వెంకటేశ
కొంగునఁ గట్టఁగరాదు కోరికెల్లా నిండెను

రేకు: 0602-3 నారాయణి సంపుటం: 14-009

పల్లవి: చిత్తమెందుండెనో యంటా సిబ్బితి పడేను నేను
కొత్తలేమి గలిగినాఁ గోరి తెలుసుకొమ్మీ

చ. 1: నివ్వటిల్లి కొలువులో నీ వున్న బావము చూచి
యెవ్వతె యేమాడునో యేమిసేసునో
పువ్వువలెఁ బొదుగుదు భోగించేవేళ నేను
నవ్వుల నీ మై రేకలు నావిగావు సుమ్మీ

చ. 2: వూరివారి సొమ్ములెల్ల నొగిఁ బెట్టుక రాఁగాను
యేరీతినున్నాఁడవో నాకెట్టు దెలుసు
నేరుపుతో సింగారింతు నీమేను సోఁకేటివేళ
భారపు దండలు నాకుఁ బనిలేదు సుమ్మీ

చ. 3: సందడి నీ మోమునకు సరికళలు రేఁగెను
యెందుఁ గలదో మోహమెరుఁగుదునా
పొందితి శ్రీ వెంకటేశ పొరపొచ్చెము లేకుండ
విందుల నీ మోవితేనె వేరుసేయ సుమ్మీ

రేకు: 0602-4 శ్రీరాగం సంపుటం: 14-010

పల్లవి: రాఁగదె వోచెలియా రమణుఁడున్నాడకు
ఆఁగి నీచక్కఁదనాన కాసపడీ నిదివో

చ. 1: వలిపె పయ్యద నీవు వల్లెవాటు వేసుకోఁగా
వెలిఁబడె సిగ్గులెల్ల విచ్చనవిడి
అలవోకగా సొమ్ములట్టె నీవు నించుకోఁగ
మెలుపు జవ్వనానకు మెరుఁగెక్కెను

చ. 2: విరులు తురుమునిండ వెస నీవు ముడువఁగ
పెరిగెఁ జక్కఁదనము పెంటలుగాను
పరిమళములు నీవు పై పై నలఁదుకోఁగా
సురతగందములకు జోడుగూడెను

చ. 3: వెక్కసపు వేడుకతో విడెము నీవు సేయఁగ
యెక్కువ మోవిపండు యెఱ్ఱగా మాఁగె
అక్కరతో శ్రీ వెంకటాధిపునిఁ బెండ్లాడఁగ
తక్కక మనసుకవి తలపోఁతలాయను

రేకు: 0602-5 కురంజి సంపుటం: 14-011

పల్లవి: ఇదివో విచారము యేమందు నిన్ను
పెదవి నీవే యొసఁగి పిరితియ్యనేలా

చ. 1: మారుమాఁటలాడక మానాన నుండేటివారి
ఆరీతి వేఁడుకొంటా నంటుకోనేల
వూరకే తప్పితారి నీగోరే నిన్నుఁ దాఁకితే
బీరానఁ దప్పులువేసి బిగియనేల

చ. 2: శిరసు వంచుకొనుచు సిగ్గున నుండేటివారి
తెరలించి వొడివట్టి తియ్యఁగనేల
నిరతపు నీ చేతల నీతురుమే వీడితేను
సరుగ నెగ్గులువట్టి జంకించనేలా

చ. 3: కళవట్టి రతులలో కాఁగిటనుండినవారి
తెలిపి సారెసారెకు దీకొననేలా
కలసి శ్రీ వేంకటేశ కడు నీవే యలసితే
నలువంక నాతో నవ్వు నవ్వఁగ నేలా

రేకు: 0602-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-012

పల్లవి: తనకే తెలుసునే తరవాతి పనులు
మనకేఁటికే సవతిమచ్చరములు

చ. 1: మగువమోవి మెత్తన మాఁటలై తేఁ గడువాఁడి
మగఁడెట్లోరుచునో మర్మములంటి
మొగము చంద్రబింబము మొక్కలపుఁజూపు చీకు
యెగసక్కెపు పొందులు యెట్టు గట్టుకొనెనే

చ. 2: చెలిచేతులు చిగుళ్లు చెనకే గోరులు చేగ
చెలువుఁడెట్లాను మచ్చిక సేసెనే
సెలవినవ్వు కప్రము పలుసోఁకులు కారాలు
యెలయింపు వలపులు యెట్టు గట్టుకొనెనే

చ. 3: అంగనచన్నులు బిగు వట్టె సిగ్గుపలచన
సంగతౌనే శ్రీ వేంకటేశ్వరుకూటమి
ముంగిటిమొక్కులు పెక్కు ముంచిన గుట్టొక్కటే
యింగిత మెరిఁగి రట్టు యెట్టు గట్టుకొనెనే

రేకు: 0603-1 భూపాళం సంపుటం: 14-013

పల్లవి: అందుకేమి దోసమా అందరికీఁ గలదే
చెంది నన్నుఁజూచి యేల సిగ్గువడేవిపుడు

చ. 1: కలలోని మాటలెల్ల కలికి నీతోఁజెప్పఁగ
కల విరిచితివిట్టే కద్దో లేదో
తలుపుమాటుననుండి తప్పక వింటి నేను
యెలమి నాతో నీ సుద్దులేల దాఁచేవిపుడు

చ. 2: కోరినకోరికలెల్లఁ గొమ్మ విన్నవించఁగా
గారవించియ్యకొంటివి కద్దో లేదో
చేరి తెరమాటునను చెవులార వింటి నేను
యీరీతి నీకతలెల్ల నేల దాఁచేవిపుడు

చ. 3: రతులలో ముచ్చటలు రమణి యాడుకోఁగా
గతిఁ గూడ మెచ్చితివి కద్దో లేదో
తతి శ్రీ వేంకటేశ నీదండనుండి వింటి నేను
యితవై నన్నేలితివి యేల దాఁచేవిపుడు

రేకు: 0603-2 ధన్నాశి సంపుటం: 14-014

పల్లవి: ఎంతకు నంతేకాక యెక్కుడేలయ్యా
కాంత సేసేపని సేయఁగలమా నేమయ్యా

చ. 1: మలసి పంతమాడేవు నాతోనే నవ్వేవు
చెలియకు నీమాట చెప్పేమయ్యా
పిలువ వచ్చితి మింతే పెక్కులు నేరము నేము
యెలమి మారుమాటలు యేమనేమయ్యా

చ. 2: భావించి సిగ్గువడేవు పాదాలు గుద్దుమనేవు
వావులు ఆపె నడిగి వచ్చేమయ్యా
పూవులు దెచ్చితి మింతే పొలఁతి యప్పణలేక
సేవసేయ వెరతుము చెప్పిపంపవయ్యా

చ. 3: కరఁగి నీవే చొక్కేవు గక్కనఁ గాఁగిలించేవు
కెరలి యాపెకు నెఱిఁగించేమయ్యా
ఇరవై శ్రీ వేంకటేశ యింతి వచ్చి నిన్నుఁ గూడె
మరిగె నిన్నిటా నిన్ను మన్నించవయ్యా

రేకు: 0603-4 మలహరి సంపుటం: 14-015

పల్లవి: ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము
వంకలొత్తికేఁక మఱి వద్దు వద్దు ఇపుడు

చ. 1: వావులు నీకెంచనేల వాడల గొల్లెతలకు
దేవరవు గావా తెలిసినదే
యీవల మావంక నిట్టె యేమి చూచేవు తప్పక
మోవనాడితి మిదివో మొదలనే నేము

చ. 2: చందాలు చెప్పఁగనేల సతినెత్తుక వచ్చితి
విందుకు రాజవు గావా యెరిఁగినదే
దిందుపడి మమ్ము నేల తిట్టేవు పెదవులను
నిందవేసితి మిదివో నిన్ననే నేము

చ. 3: వెలినవ్వేల పదారువేలఁ బెండ్లాడితివి
బలిమికాఁడవు గావా భావించినదే
చెలఁగి పులివిందల శ్రీరంగదేవుఁడ వని
కలసితి మిదె శ్రీ వేంకటరాయ నేము

రేకు: 0603-4 ముఖారి సంపుటం: 14-016

పల్లవి: ఏమనేము నిన్నును యెరఁగవా నీవు
నేమాన వలపించేవి నీమాయలే కావా

చ. 1: మొగము చూడఁగానే మొలనూలు వట్టేవు
వెగటు లేనిది నీవేడుకే కాదా
సగము మాటాడఁగానే సారె నెగ్గులు వట్టేవు
నగవు రప్పించేది నీనాయమే కాదా

చ. 2: ప్రియములు చెప్పఁగానే పెదవులఁ దిట్టేవు
నయగారాలిచ్చీ నీసన్నలే కావా
క్రియ నీకుఁ జెప్పఁగానే కేలు చాఁచి పెనఁగేవు
దయదలపించేది నీ తగులే కాదా

చ. 3: సేవలు సేయఁగానే సిగ్గులు రప్పించేవు
వావులు దెలిపేది నీవలుపే కాదా
యీవల శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
మోవితేనె లూరించేవి ముచ్చటలే కావా

రేకు: 0603-6 నాదరామక్రియ సంపుటం: 14-017

పల్లవి: మమ్ము నేమియడిగేరు మాటిమాటికి
తెమ్మెన మీ పెదవుల తేనెలు చెప్పేమా

చ. 1: పలికిన పలుకులు పట్టఁ జెప్పుదుము గాక
తలఁపు చెప్పుదుమా తరుణులము
వలసినట్లు మీవావులు చెప్పేము గాక
చెలువపు మీలోని సిగ్గులు చెప్పుదుమా

చ. 2: బాసలు చేసుకొనిన పనులు చెప్పేము గాక
ఆసలు చెప్పుదుమా అంగనలము
సేసలు వెట్టుకొనిన చేఁతలు చెప్పేము గాక
రాసికెక్కినటువంటి రతులు చెప్పుదుమా

చ. 3: తగినయట్టి మీచక్కఁదనము చెప్పేము గాక
నగవు చెప్పుదుమా నాతులము
మిగుల శ్రీ వేంకటేశ మీరిద్దరు గూడితిరి
మొగమోడినట్టి మీలో ముచ్చట చెప్పుదుమా

రేకు: 0603-6 సాళంగనాట సంపుటం: 14-018

పల్లవి: చెలియవేడుక నీవు చెల్లించవయ్యా
తలఁచినట్లనే తమకించవయ్యా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెప్పీనామె మాటలెల్ల
వెలయఁగ నిచ్చగించ వినవయ్యా
సొలసి సొలసి నిన్నుఁ జూచీ తప్పక యిట్టె
నిలువున యెదుటనే నిలుచుండవయ్యా

చ. 2: కడఁగి కడఁగి నీకుఁ గానుకలిచ్చీనాపె
అడరి యెదురుకొని అందుకోవయ్యా
కడు నప్పటి నిన్ను గాతలుగాఁ జెనకీని
చిడుముడితో నన్నీఁ జేయించుకోవయ్యా

చ. 3: వొద్దనుండి వొద్దనుండి వూడిగాలు సేసీనాపె
పొద్దువొద్దునను నీవు బోగించవయ్యా
తిద్దుక ఆపెను నన్నుఁ దేకువతో నేలితిరి
గద్దరి శ్రీవేంకటేశ కరుణించవయ్యా

రేకు: 0604-1 మలహరి సంపుటం: 14-019
పల్లవి: నవ్వేవు నీ వప్పటిని నాతోడను
చివ్వన నే లోననుండి సిగ్గువడఁగాను
చ. 1: చలము సాదించకురా జాణరాయ నీకు
మొలకచన్ను లనాఁడే మొక్కితి నేను
తిలకించి వొడివట్టి తీసేవేలరా నేను
తలుపు మాటున నిట్టే దాఁగి వుండఁగాను
చ. 2: పంతాలు నెరపకురా ప్రాణనాథుఁడ నేను
ఇంతినై పట్టిననాఁడె యిరవైతిని
వింతగాఁ బువ్వుల బంతి వేసేవేలరా
కొంత పానుపు పై నొరగుచు నుండఁగాను
చ. 3: వేగిరించకురా శ్రీ వేంకటేశుఁడ నీకు
ఈగతి వావైననాఁడే యెనసితిని
చేగదేరఁ గొనగోరఁ జిమ్మేవేలరా నీపై
నాగురుతులు చూచుక నవ్వు నవ్వఁగాను

రేకు: 0604-2 దేశాక్షి సంపుటం: 14-020

పల్లవి: ఏమి చెప్పే రీబుద్ధు లెందాఁకా మీరు
నేమముమీఁదటఁ గాని నెట్టుకోదు సమ్మతి

చ. 1: మొగమిచ్చమాటలు ముంచి యెన్ని ఆడినాను
తెగువలు చూపుక తేరదెంతైనా
నగవులు సెలవుల నవ్వి యెంత కొసరిన
తగవు పట్టునఁగాని తలఁపొడఁబడదు

చ. 2: సరసపుఁ జెనకులు సారె యెంత చెనకినా
నొరసి మేనులంటక వొద్దిక గాదు
వరుసవంతుల వట్టి వలపెంత చల్లినాను
సరవి రతులఁ గాని చవిపుట్టదు

చ. 3: ఆసలె సారెకుఁ జూపి ఆయాలెంత ముట్టినాను
సేనవెట్టి పెండ్లాడక సిగ్గువాయదు
వేసరక నన్నిట్లే శ్రీవేంకటేశుఁడిదె కూడె
బాసలు సేసినఁగాని పట్టి పెనఁగరాదు

రేకు: 0604-3 వరాళి సంపుటం: 14-021

పల్లవి: నేమేమైనా ననేమంటా నీకేల వెరపు
ఆముక సరసమాడి ఆదరించరాదా

చ. 1: చనవు సేసుక నీసంగడిఁ గూచుండినాపె
నెనయక యేల లోని కేఁగుమనేవు
పనిసేయ నోపకున్నాఁ బాదాలొత్త గొరగాదా
అనువుకుఁ దెచ్చుకొని యాదరించరాదా

చ. 2: మచ్చిక సేయుచు నాకు మడిచియిచ్చినాపె
పచ్చిదేర వేరె యేల పనిచెప్పేవు
యెచ్చుకుందు గలిగినా నిందుకైనా మేలుగాదా
ఇచ్చకము సేసుకొని యీడేర్చరాదా

చ. 3: చుట్టరికము నెరపి చొక్కించి కూడె నాపె
గుట్టుమాని చెక్కులేల గోర నూఁదేవు
యెట్టు గబ్బియైనాను యిందుకు లోనుగాదా
గట్టిగా శ్రీవేంకటేశ కరుణించరాదా

రేకు: 0604-4 దేసాళం సంపుటం: 14-022

పల్లవి: కోత్తలేల సేసేవు కొసరనేల వచ్చేవు
చిత్తములో వుండినట్టి చెలినే కానా

చ. 1: యిక్కువలేలంటేవు యింత యేల సేసేవు
మొక్కితి నీకు నేను మొన్ననే కాదా
పెక్కుమాట లేలాడేవు పెనఁగ నేల వచ్చేవు
అక్కర దీరుచు తొల్లే ఆల నీకుఁ గానా

చ. 2: సన్నలేల సేసేవు సరసమేలాడేవు
నిన్ను నేవేఁడుకొంటిని నిన్ననే కాదా
చన్నులేల పిసికేవు జవ్వన మేలొరసేవు
కన్నెనాఁటనుండి నీకాంతనే కానా

చ. 3: పాదమేల తొక్కేవు పంతము లేలాడేవు
నీదయకు లోనైతి నేఁడే కాదా
యీదెస శ్రీవేంకటేశ యేలితి విన్నిటా నన్ను
భేదములేని యప్పటి ప్రియరాలఁ గానా

రేకు: 0604-5 శంకరాభరణం సంపుటం: 14-023

పల్లవి: ఇసుమంత పనికి యెంత సేసేవు
కొసరె నంటానే కొప్పు వట్టేవు

చ. 1: కలిమిగల విభుఁడు కాంతలకుఁ గొలువైతే
చలపట్టి కోపింతురా సారెసారెకు
మొలక చన్నులమీఁద మొసగోరు మోపెనంటా
పలికి నెపమువేసి పరచేవప్పటిని

చ. 2: రతి యెరిఁగినవాఁడు కామలకు నేరుపఁగా
తతిగొని తిట్టుదురా తప్పులు మోపి
చతురతలను మీతో సరిఁ బెనఁగె నంటా
మతకము వేసి నీవు మచ్చరించేవు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చెలులతో నవ్వఁగాను
కావరించి పట్టుదురా కతలు చెప్పి
యీవేళ నీతఁడు నిన్నే ఇచ్చిగించి కూడెనంటా
వావులు చెప్పుచు నీవు వలపించేవు

రేకు: 0604-6 శంకరాభరణం సంపుటం: 14-024

పల్లవి: ఏఁటికిఁ జేసేవు బాస లేల పెట్టేవానలు
నేఁటివలె నుంటేను నీవే మంచివాఁడవు

చ. 1: మగువపట్టుకు నీవు మనసున వాకునఁ
దగవు నడపితేనే తప్పు లేదు
అగపడి యాపెమాట కట్టే లోనై నడచితే
నిగిడి యెన్నటికి నీవే మంచివాఁడవు

చ. 2: వనితకు నీవూరకే వద్దఁ గాచుకుండితేను
తనసొమ్మైనట్టే నీకు తప్పులేదు
యెనసి యాపెచనవు లింతటానుఁ జెల్లించితే
నినుపు జాణతనాన నీవే మంచివాఁడవు

చ. 3: వెలఁదికాఁగిట నీకు వేరే చింత లేకుండితే
తలఁపులోపల మరి తప్పులేదు
యెలమి శ్రీవేంకటేశ యీకె నిట్టె కగూడితివి
నిలువెల్లా వలపులే నీవే మంచివాఁడవు

రేకు: 0605-1 శుద్ధవసంతం సంపుటం: 14-025

పల్లవి: వలపు కొలఁది గాదు వద్దు వద్దయ్యా
చెలి కోపగించుకొంటే సేసేదేమయ్యా

చ. 1: వూడిగపుదాన నన్ను నొడివట్టి తీసేవు
యీడ నీపట్టిపుదేవి యేమి సేసునో
వేడుక యీవేళనైతే వెనక నాపె చిక్కించుఁ
కేడనైనాఁ బరచఁగ నేమిసేసేవయ్యా

చ. 2: దూతికె నింతే నేను తొడికేవు నాచన్నులు
కాతరించి నన్నెంత నీకాంత దూరునో
యేతులిప్పుడు సేసితే నింటికాడ వచ్చి యాపె
చేతులు చాఁచవచ్చితే చేరి యేమందునయ్యా

చ. 3: పరిచారకపుదానఁ బైకొని నన్నేలితివి
యిరవైనమగువ నన్నెట్టు నవ్వునో
సరుస శ్రీవేంకటేశ చలివాసి యిఁక నాపె
గరిసించితే మరి గతి నీవే అయ్యా

రేకు: 0605-2 రామక్రియ సంపుటం: 14-026

పల్లవి: ఎంత పెనఁగినా మానఁ డేమీననరాదు మాకు
యింతటి మాముంగురులు యివి చూడఁగదవే

చ. 1: ఆతనిఁ దోడుతెమ్మనే వంగనలము నేమైతే
కాతరీడాతఁడు మమ్ముఁ గాఁగిలించీనే
యీతల నేమెఱుఁగుదు మీ సుద్దులు వెనక కే
చేతుల మెడల నివే జీరలు చూడఁగదే

చ. 2: యేకతమాడి రమ్మనే వింతులము మొదలనే
కాతరి యాతఁడు చెనకక పోనీఁడే
కైకొని నాఁడే నేము కంటిమీగుణాలెల్లా
జోకలైన మోవిమీఁది సొమ్ములు చూడఁగదే

చ. 3: కానుకిచ్చి రమ్మంటివి కాంతల మమ్ముఁ జూచి
ఆనుక శ్రీవేంకటేశుఁ డట్టె కూడెనే
తానే మావెంట విచ్చేసి తగిలి నిన్నిదె యేలె
వూనిన మాచన్నులపై వొత్తులు చూడఁగదే

రేకు: 0605-3 బౌళి సంపుటం: 14-027

పల్లవి: వేగిరించేనా నీవు వింతవాఁడవా
సాగిలి నీకు మొక్కితే చక్కనయ్యీ పనులు

చ. 1: పొందులు సేసి నిన్నుఁ బొగడుట మేలుగాక
యిందరిలో నిన్ను నేరాలెంచనేఁటికి
యిందుముఖులము నేము యిచ్చకములేయాడి
సందడి నీకు మొక్కితే చక్కనయ్యీ పనులు

చ. 2: సరసములాడి నీకే సమ్మతౌట మేలుగాక
గరిసించేయట్టి జగడమేఁటికి
తరుణులము నేము నీతలఁపులోనే మెలఁగి
సరుగ నీకు మొక్కితే చక్కనయ్యీ పనులు

చ. 3: కొల్లున నీతో నవ్వి కూడుట మేలుగాక
కెల్లురేఁగి నిన్ను విసుగించనేఁటికి
యిల్లిదె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చల్లఁగా నీకు మొక్కఁగ చక్కనయ్యీ పనులు

రేకు: 0605-4 సాళంగనాట సంపుటం: 14-028

పల్లవి: ఇంతకంటే నేరుపులు యిఁక నేవయ్యా
పంతమిచ్చే నిఁక మమ్ము బదికించవయ్యా

చ. 1: మలసి మలసి నీతో మాటలాడి చూచితి
సొలసి కన్నుల మొక్కి చూచితిని
పలుమారు వలపులు పైఁజల్లి చూచితిని
తెలుకొంటే నీవు దేవరవయ్యా

చ. 2: ఇందరి ముందరా నీకు నింపు పుట్టించి చూచితి
చిందుచెమటతో సేవ చేసి చూచితి
పొందుల చనవులెల్లా పొసగించి చూచితి
దిందు పరచుకుందాన దేవరవయ్యా

చ. 3: గక్కన బలిమి నిన్నుఁ గాఁగిలించి చూచితి
చొక్కుచు నిన్నుఁ బొగడి చూచితిని
వొక్కటై శ్రీవేంకటేశ వొడివట్టిలి విప్పుడు
దిక్కుల నిన్ను మెచ్చితి దేవరవయ్యా

రేకు: 0605-5 గౌళ సంపుటం: 14-029

పల్లవి: నీమాఁట వినినదాఁక నిలుచున్నాఁ డాతఁడు
భామ నీగుట్టెల్లా నిట్లె పచరించఁ గదవే

చ. 1: మలసిన నీమాఁటలు మరఁగులలో నున్నవి
తలఁపులు వలపులఁ దగిలున్నవి
నెలకొన్న మురిపెము నిలువున నున్నది
యెలమి మీఁదటిమాఁట యేమనేవే యిఁకను

చ. 2: చిఱుత నవ్వులు నీసెలవులలో నున్నవి
మెఱయు చెమటలు నీమేన నున్నవి
కఱితల నేరుపులు కడకన్నుల మన్నవి
యెఱఁగము నీవుపమ లేమనేవే యిఁకను

చ. 3: సందడించే సిగ్గులెల్ల చనుమొనల నున్నవి
కందువ తేనెలు మోవిఁ గప్పి వున్నవి
యిందుకే విచ్చేసి నిన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
యిందరివంటివారమే యేమనేవే యిఁకను

రేకు: 0605-6 సామంతం సంపుటం: 14-030

పల్లవి: ఏల సారెకుఁ జెప్పేవు యెడమాటలు
తాలిమి సేసుకొంటిఁ దనిసితివే

చ. 1: రానీవే ఆతఁడు మేరలు దప్పఁడనేవు
కానీవే నీవేమి కల్లలాడేవా
పోనీవు యెంతైనఁ బోయిన సుద్దులు నీవు
యీనిజమే కలితే నిన్నియు మెచ్చేనే

చ. 2: పట్టినీవే నాచెరఁగు బత్తిగలఁ డనేవు
అట్టె యవునే నీ వంతదానవు
గట్టిసేసే వప్పటిని కప్పి తొల్లిటిబాసలు
చుట్టుకొంటే వలపులు సులభ మయ్యీనే

చ. 3: చెప్పనీవే ప్రియములు సేవకు మెచ్చేననేవు
చిప్పిల నీవే మాకుఁ జెలికత్తెవు
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁ గరుణించి
వొప్పుకొంటే మనసులు వొక్కటే యయ్యీనే

రేకు: 0606-1 భైరవి సంపుటం: 14-031

పల్లవి: నీయంత వారమా నేము నెట్టుక నవ్వులు నవ్వ
యీయెడ నీవు మన్నించే ఇంతులము నేము

చ. 1: గోర గీరితే వలపు కొండలుఁ గోట్లు నగును
నేరుతుమా నీవంటి నేరుపులు
బార చాఁచితే నీకు పదివేగురు చుట్టాలు
ఆరీతివారమా నీఇల్లాండ్లము నేము

చ. 2: చూచితే నందరియాస సంకులు మోపు నీమీఁద
మాచేత నింతేసి పని మట్టుపడునా
కాచితే నీననుపులు కాయలుఁ బండ్లు నౌను
లాచేటివారమా నీలలనలము

చ. 3: మాటాడి నంతటిలోన మర్మములెల్లఁ గరఁగు
సూటిఁబడీనా మాకిట్టే సులభానను
గాఁటాన శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
దీఁటు వెట్టుకొనేమానీ దేవుళ్లము

రేకు: 0606-2 దేసాళం సంపుటం: 14-032

పల్లవి: నేమటువంటివార మా నీవెరఁగ వింతె కాక
దోమటి యెందైనానుఁ దొడికేవు గాక

చ. 1: అమ్మమాటలెల్లా నీకు నట్టే విన్నవించరాఁగా
యెమ్మెలకు నీవు నాకొంగేల పట్టేవు
దొమ్మికాఁడ గొల్లెతలఁ దొడికిన యలవాటు
ఇమ్ముల నెవ్వరిఁ గన్నా నేల మానునయ్యా

చ. 2: యేలినాపె నీకు విడెమిచ్చి రమ్మని యంపఁగా
కాలు దొక్కి నన్ను నేల కాఁగిలించేవు
ఆలరిఁడ రుక్మిణిఁ బయ్యాడించి తెచ్చినలవాటు
పోలిమి తో నంటుఁగాక పోనిచ్చునటయ్యా

చ. 3: అక్క నన్నుఁ దోడువెట్టు కట్టే నీవద్దికి రాఁగా
గక్కనఁ దోడఁ బెండ్లి గైకొంటివి
చక్కని శ్రీవేంకటేశ జమళి పెండ్లె లవాటు
తొక్కి తొక్కి నీకు వెన్నతోనే పెట్టిరయ్యా

రేకు: 0606-3 గౌళ సంపుటం: 14-033

పల్లవి: ఏమనేమయ్యా నీవే ఇంత సేయఁగా
చేముట్టి చెనకితేను చిత్తము గరఁగేవు

చ. 1: మొగము చూచితేను మొక్కేవు నీతో
నగితే నన్ను నిట్టే నమ్మితిననేవు
యెగసక్కేలాడినాను యియ్యకొనేవు
తగవు గాదంటేను తగుల నాడేవు

చ. 2: మాటలాడితేనే మరిగేవుఁనీ
చోట నిలిచితేనే సొలయ వచ్చేవు
పాటలు వాడితే బళి యనేవు నిన్ను
నాటుకొనఁ జూచితేను నయము చూపేవు

చ. 3: దగ్గరఁ గూచుండితే తమకించేవుఁ నే
సిగ్గులు వడినంతనే చేయి చాఁచేవు
కగ్గక శ్రీవేకంటేశ కలసితివి
వొగ్గి విడెమియ్య రాఁగా వొడి పట్టేవు

రేకు: 0606-4 కాంబోది సంపుటం: 14-034

పల్లవి: చెప్పినట్టు సేయవే చెలువునికి
కప్పురపు నవ్వులనే కరఁగీ నీ యెదుట

చ. 1: మాఁటాడితే వెంగెమే మగుడి చూచేచూపులు
గాఁటముగ రాలేటి కామునమ్ములు
యేఁటికి నింత సేసేవే యెంత నేరుచుకొంటివే
చోటిమ్మంటా రమణుఁడు సొలసీని నిన్నును

చ. 2: పట్టితేను తప్పులే పై పై సన్న సేసితే
జట్టిగొన్న కనుబొమ్మ జంకెనలే
రట్టుపెట్టే విదియేమే ఇట్టె రాజసముతోడ
పట్టుమంటా వీడెమిచ్చి బ్రమయించీ విభుఁడు

చ. 3: మేలమాడితే నెమ్మెలే మిగుల నేకతమైతే
కోలుముందైన రతుల కోలాహలమే
మేలుదాన వౌదువే మించుఁ బట్టపురాణివే
చాలి శ్రీవేంకటేశుఁడు చనవిచ్చీ నిపుడు

రేకు: 0606-5 ఆహిరి సంపుటం: 14-035

పల్లవి: అప్పటికోపాన నన్నీ నంటి నేను
తప్పులన్నీఁ దేరెను దండకు రమ్మనవే

చ. 1: సంకెలెల్లాఁ దీరెను సరసుఁడు తానె వచ్చె
మంకుఁదనము మానితి మాటలాడవే
ఇంకా నేడసుద్దు లేమిసేసినాఁ జెల్లె
పంకించక చేతికి బాగాలియ్యవే

చ. 2: మనసు నిర్మలమాయ మన్ననలన్నీ నిచ్చె
పెనఁగక బంగారుపీఁట వెట్టవే
పనిలేని వాదులేల పంతములన్నీ వచ్చె
పొనుఁగక గందమూనుఁ బూవు నీయవే

చ. 3: చిడుముడి సిగ్గు దేరె శ్రీవేంకటేశుఁడు గూడె
వొడఁబడితి పాదాల కొగ్గి మొక్కవే
వెడఁగు నవ్వులు నిండె వేడుకలె సమకూడె
తడవక పన్నీరు దప్పికీయవే

రేకు: 0606-6 శంకరాభారణం సంపుటం: 14-036

పల్లవి: తారుకాణించcగ నేల తతిగొని నాతోను
నేరిచి బదుకనీవే నిజమరై తేను

చ. 1: వెఱచి తనకు నాపె విన్నవించకుండితేను
తఱి నింతులలో మాట తానెఱుcగునా
గుణిమె లెల్లాc గట్టుకొనీవే తా నా పెవల్ల
చెఱcగు వట్టందరికి సేవ సేసేదానను

చ. 2: ఆతల మతకముప నాపెc దను నంపకుంటే
సూతకమైనయట్టి సుద్దెరుcగునా
గాతల తమపొందులు కవెల వాసుకొనీవే
జాతిగా తమకే నేను సాకిరయ్యే దానను

చ. 3: గక్కన నాపె తనచే కాcగిలింపించుకొంటేను
ఇక్కువ లాcడువారివి యివెరుcగునా
చిక్కి శ్రీవేంకటేశుcడు చేరి నన్ను నేcడు గూడె
నిక్కముc దనకు నేc బనికివచ్చేదానను

రేకు: 0607-1 ధన్నాశి సంపుటం: 14-037

పల్లవి: అన్నిటాఁ బరిణామైతే నదే చాలును
వున్నతపు సంతోసాన నున్నాఁడవా

చ. 1: అప్పుడాకెమేడలోన నంకెకు వచ్చినట్టెల్ల
చెప్పినట్టి బుద్దులెల్ల చెవిఁ బట్టెనా
దప్పిదేరే నిన్నుఁ జూచి దయదలఁచి మోవికి
కప్పుర మిచ్చినందున కాఁక దేరెనా

చ. 2: పఱపు పై ఆపె నిన్నుఁ బవ్వళించఁ జేయఁగాను
మెఱసి నిద్దిరించి మేలుకొంటివా
తఱి చూచి ఆడ నీకు తమ్ములము వెట్టఁగాను
వెఱపులెల్లఁ దీరి వేడుకాయనా

చ. 3: అట్టె కాఁగిటఁ గూడి నిన్నలయించి విసరఁగా
గట్టిగా నీమోమున కళదేరెనా
రట్టడి శ్రీవేంకటేశ గట్టిగా నన్నేలితివి
ఇట్టె యందునిందు యింపు లాయనా

రేకు: 0607-2 మాళవిగౌళ సంపుటం: 14-038

పల్లవి: కాదంటినా నేను కడు నానవెట్టి
సోదించితి నాఁడే జోకలాయనే

చ. 1: చల్లని మెల్లని జాజర మాఁటలు
చెల్లఁబో యెందాఁకఁ జెప్పినె
కల్లలూనుఁ గావు కావు నిజములు
తొల్లే నే వింటిని తుద కెక్కెనే

చ. 2: పూచిన కాచిన పున్నమ చేఁతలు
చేచేత నెందాఁకఁ జేసే వే
వాచవియుఁ గాదు వాఁటితీపు వోదు
ఆచాయనే వున్నవందుకోనివే

చ. 3: వెచ్చియు వేవని వేడుక రతుల
చెచ్చెర నేఁటికిఁ జెనకీనే
యిచ్చట శ్రీవేంకటేశుఁ డేలెఁ దానే
వచ్చెఁ బదివేలు వాఁటమాయనే

రేకు: 0607-3 నాదరామక్రియ సంపుటం: 14-039

పల్లవి: మమ్మేమి యాడుకొనేవు మర్మములు రేఁచేమని
చిమ్ముల మరుఁడు తొల్లే సేసినమాయలివి

చ. 1: మొక్కలానఁ బొలసితేను మురిపెము లొలికేది
చక్కని సతులకును సాజమే యిది
తెక్కుల మాఁటలాడితే తేనెలట్టే వూరేది
గక్కన జవ్వనులకుఁ గలదే యిది

చ. 2: చివ్వన నిలిచితే ను సింగారాలుట్టిపడేది
జవ్వనపుటింతులకు సాజమే యిది
రవ్వలుగ నివ్వితేను రసము లుట్టిపడేది
మవ్వపు మానినుల మతము లివి

చ. 3: తమకించి చూచితేను తళుకున మెరిచేది
సమ మోహపుటింతుల సాజమే యిది
అమర శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
కొమరెలకు సిగ్గులే గుణములివి

రేకు: 0607-4 వరాళి సంపుటం: 14-040

పల్లవి: విన్నవారు నవ్వేరు నెఱపు లిఁకేఁటికి
నిన్నటి మొన్నటిగుట్టు నేఁడు మాముందరనా

చ. 1: సిగ్గులు వడఁగనేల చింతించ నిఁకనేల
బగ్గన నితఁడు వొడివట్టి తియ్యఁగా
వెగ్గళించి మీ పొందులు వెనక కే ఆయనట
నిగ్గుల మీ మొరఁగులు నేఁడు మాముందరనా

చ. 2: చెలుల నడుగనేల చెమరించే భావాలేల
బలిమి నీతఁడు తొడపైఁబెట్టుకోఁగా
తలపడి వొకమాట తనువులు సోఁకెనట
నిలువున మీవేసాలు నేఁడు మాముందరనా

చ. 3: వేవేలు విన్నపాలేల వెనకకు వీఁగనేల
శ్రీ వేంకటేశుండితఁడే చేరి కూడఁగా
మా వలెనె నిన్నునిట్టె మన్నించి యేలెనట
నీవింతేసి పెనఁగేది నేఁడు మాముందరనా

రేకు: 0607-5 ఆహిరి సంపుటం: 14-041

పల్లవి: ఆడుగరే చెలులాల ఆతని నీసుద్ది
తడవితే నిలువెల్లఁ దడిసీఁ జెమటలు

చ. 1: యెనయక తలవంచు కింతవడి నూరకుండె
కనువిచ్చి చూచితేనే కాఁక రేఁగెను
అనయము మాటాడక అట పరాకున నుండె
చెనకి నే మాటాడితే చిమిడీ వలపులు

చ. 2: కొలువులో పరాకున కూరిమి మరచి యుండె
చెలఁగి నే నవ్వితేనే సిగ్గు రేఁగెను
వెలుపటి విచారాన వేరే బ్రమసి యుండె
తలపించి నే మొక్కితే తమకము రేఁగెను

చ. 3: సేస వెట్టి వేగిరాన చేరి నివ్వెర గైయుండె
ఆసగాఁ గానుకిచ్చితే నంటుకొనెను
యీసరి శ్రీ వేంకటేశుఁ డెనసె నన్నిటాను
పోసరించి నే గీరితే పులకించె మేను

రేకు: 0607-6 సామంతం సంపుటం: 14-042

పల్లవి: నీతితో నడచితేను నెగులే లేదు
జాతి దప్పకుండితేను చలమే ఫలము

చ. 1: వొలిసి కై కొంటేను వొగరైనాఁ దీపే
తెలిసితేఁ దనలోనే దేవుఁడున్నాఁడు
పలుకులు మంచివై తే పగవారుఁ జుట్టాలే
చెలఁగి దిష్టించితేను చీఁకటిల్లు వెలుఁగు

చ. 2: నేరిచి బతికితేను నేలెల్లా నిధానము
వొరిచితేఁ దనపంత మూరకే వచ్చు
సారెకు నుతించితేను చట్టైనాఁ గరఁగును
వూరకే గుట్టుననుంటే వూరికెల్లా నెక్కుడు

చ. 3: వాడికె సేసుకొంటేను వలపెల్లా నిలుపాను
వేడుకతో నుండితే వెనకే ముందౌ
యీడులేని శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితేను
జాడుపడ్డపనులెల్లా సఫలమౌను

రేకు: 0608-1 గుజ్జరి సంపుటం: 14-043

పల్లవి: ఎవ్వరి నేమనవచ్చు యెగ్గులెట్టు పట్టేవే
జవ్వని వీనివల్లనే చలివాసె వలపు

చ. 1: తెగువతో రమణునిఁ దిట్టఁగానే కదవె
చిగురు నీ మోవెల్లాఁ జిల్లులాయను
పగటున దట్టికొంగు పట్టఁగానే కదవె
నిగుడి చన్నులమీఁద నెలవంకలాయను

చ. 2: సారెసారెకు నితని జంకించఁగాఁ గదవె
భారపుఁదురుము చిక్కువడె నిదె
నారుకొన్న సెలవుల నవ్వఁగానే కదవె
తారితారి పయ్యెదెల్లాఁ దడిసెఁ జెమటల

చ. 3: శ్రీ వేంకటేశ్వరునిఁ జెనకఁగానే కదవె
మూవంకలా నీపోఁకముడి వీడెను
వేవేలురతులఁ గూడి వెలయఁగాఁ గదవె
కై వసమై మొగమునఁ గళలెల్లా నిండెను

రేకు: 0608-2 రామక్రియ సంపుటం: 14-044

పల్లవి: ఇటువలె నుండవద్దా యింతియై పుట్టినందుకు
అటవోయి నన్నేలితి వంతేసి నేరుతునా

చ. 1: చక్కని నీవదనము సారె సారెఁ జూచుకొంటా
నక్కరతో నట్టే మాటలాడుకొంటాను
చెక్కు నొక్కి బుజముపైఁ జేతులు వేసుకొంటా
కుక్కి కుక్కి మోహమాపె కుప్పవోసెఁగా

చ. 2: ముంగురులు చేతఁ బట్టి మోవితేనె లానుకొంటా
అంగవించి మర్మములు అంటుకొంటాను
చెంగలించి గోరనొత్తి చిరునవ్వు నవ్వుకొంటా
వెంగలిరతు లెల్లాను వెద వెట్టెఁగా

చ. 3: చల్లనైన నీవురము చన్నుల నదుముకొంటా
వొల్లనే కాఁగిటఁ గూడి వుబ్బుకొంటాను
మెల్లనె శ్రీవేంకటేశ మేలము లాడుకొంట
వెల్లవిరిగా వేడుక వెద వెట్టెఁగా

రేకు: 0608-3 పాడి సంపుటం: 14-045

పల్లవి: ఎక్కువైతే మొగచాటౌ నెందరు గావలెనయ్య
చిక్కని చన్నులమీఁదఁ జేయి చాఁచేవిపుడు

చ. 1: వెల వెట్టి కొనవద్దు వేడుకైన వలపు
కలగూరగంపవలెఁ గాచుకున్నది
చెలులు మందపట్ల చెట్టడిచితేఁ జేటఁడు
కలిగుండఁగా మామీఁదాఁ గాలుచాఁచేవిపుడు

చ. 2: పంట పండి తేవద్దు పాయని చుట్టరికము
పెంటలవలె నంతటాఁ బెరిగున్నది
గొంటరిసతుఁ పొందు కొండ్రఁ గొండ్ర వేయేసి
అంటేవు మాకుచములు అప్పటి నీవిపుడు

చ. 3: కరఁగించి సేయవద్దు కాఁగిటలోనిరతి
వొరసిన సొమ్ముమవలె వొళ్లనున్నది
తరుణుల సరసాలు మెరచినంతే మెరుఁగును
ఇరవై శ్రీవేంకటేశ యేలితి నన్నిపుడు

రేకు: 0608-4 నారాయణి సంపుటం: 14-046

పల్లవి: సేసి సేయించుకోనేల చెల్లఁబో వోరమణుఁడ
అసవెల్లాఁ జూపితెను అట్టె తొక్కెఁ బాదము

చ. 1: పంతము నెరపఁబోతే పడతి గోరు దాకించె
మంతన మాడఁగానే మర్మము లంటె
వంతులకుఁ బెనఁగితే వట్రువ చన్నుల నొత్తె
చెంతఁజెరఁగు వట్టితే చెక్కుచేత నంటెను

చ. 2: బొమ్మల జంకించితేను పుక్కిటి తమ్ముల మిడె
రమ్మని పిలచితే నురము దట్టేను
వుమ్మడిఁ బొత్తుకుఁ బోతే వొట్లెల్లాఁ బెట్టె నీకు
ముమ్మాటికిఁ దిట్టితేను మోవిగంటి సేసెను

చ. 3: గక్కనఁ గాఁగిలించితే గబ్బితనమెల్లాఁ జూపె
చొక్కించితే చెప్పరాని సుద్దులు చెప్పె
ఇక్కువెరిఁగి శ్రీ వేంకటేశ నీవు మన్నించితే
వెక్కసపు రతులను వెల్లిగాఁ గొలిపెను

రేకు: 0608-5 నాట సంపుటం: 14-047

పల్లవి: ఏల ఇంతసేసేవు యెఱఁగవా మాలాగు
చాలుకొన్నమాతో నీచల మేమున్నది

చ. 1: చిగురుఁగొమ్మ్మఁ జేఁగె చెలులలోపల నెల్ల
యెగసక్కేలాడఁ జోటు యేది నీకు
బిగువు చనుఁగొండలఁ బిరితియ్యరెప్పుడును
మగవాఁడవు నీకైతే మనసే మెత్తన

చ. 2: ననల కొనలు వాఁడే నాతులలోపల నెల్ల
యెనయక వట్టిమాట లేఁటికి నీకు
కొనగోరి కత్తులతో కొంకరెంతపనికైన
ఘనుఁడవు నీకైతే కాయమే కోమలము

చ. 3: వొగరు పూఁపలు తీపే వువిదలలో నెల్ల
యిగిలింపు నవ్వుబీరా లేల ఆడేవు
అగపడి శ్రీ వేంకటాధిప నన్నేలితివి
మగఁడవు నీవైతే మర్మమే పై పై ని

రేకు: 0608-6 దాడి సంపుటం: 14-048

పల్లవి: ఇన్నియుఁ దానే యెరుఁగు నేమనేనే
కన్నులఁ జూచితేనే కాఁక లనీని

చ. 1: యియ్యకొంటే నెందుకైన నిచ్చగించు మనసు
కయ్యమడిచితే నన్నీఁ గాదనును
ముయ్యెడ నామాటలు ముద్దుసేసు నిన్నాళ్లు
వెయ్యింటికి నేఁడైతే వెంగెము లనీని

చ. 2: వోరిచితే భోగాలకు నొడిగట్టుఁ దనువు
వూరకే వొల్లకవుంటే నోకిలించును
చేరి నాచేఁతలకెల్లా సిగ్గువడఁ డిన్నాళ్లు
ఆరసి నేఁడైతే నంటితే లోఁగీని

చ. 3: ఆస గలిగితే రతులన్నిటికిఁ దానే గురి
వేసరితే నలపులు వేళమే వచ్చు
సేసవెట్టి కాఁగిలించు శ్రీవేంకటేశుఁ డిన్నాళ్లు
వాసితో నేఁడై తేఁ గావరించి కూడీని

రేకు: 0609-1 ఆహిరి సంపుటం: 14-049

పల్లవి: వెనక నప్పటి దరి వేసరించ నేనోప
యెనసి బిగిసితేను యేమి సేతునే

చ. 1: యీతనిమాటలే రాకాసింతులను బ్రమయించె
యీతల నింకా మరియెట్టు నమ్మేదే
నీతితో వంకలొత్తుచు నీవు నన్నొడఁబరచేఁ
వేతులకు సమ్మతించి యేమి సేతునే

చ. 2: తనపొందులే గొల్లెతలను వలలఁ బెట్టె
కనియు నింకా నెట్టు కానిమ్మందునే
చెనకి చక్కట్లుగాఁ జేసి నన్నుఁ గూడించేవు
యెనలేక తగిలి మరేమి సేతునే

చ. 3: నంటున శ్రీవేంకటేశు నవ్వు శ్రీసతిఁ జొక్కించె
అంటి కూడితి నింకా నెట్టొఁ గాదందునే
జంట చవులు పుట్టించి చనవు లిప్పించితివి
ఇంటనే సంతోసమిచ్చె నేమి సేతునే

రేకు: 0609-2 నాట సంపుటం: 14-050

పల్లవి: ఊరకుండు చాలుఁ జాలు వోప నింతేసిపనికి
కూరిమి నీకొసరు లీకోమలులెరఁగరా

చ. 1: చల్లనినీళ్ళే కావా జలజలఁ బారేవి
మెల్లనిమాటలే కావా చిల్లులయ్యేవి
మల్లాడి నాతోఁ బెనఁగి మంచితనాలు చూపేవు
వెల్లవిరి నీసుద్దు లీవెలఁదులెరఁగరా

చ. 2: కప్పుర మించుక గాదా కన్నులఁ బదనయ్యేది
రెప్పల చూపులే కావా రేసు రేఁచేవి
ముప్పిరి నా కిటువచ్చి మోవితేనె లొసగేవు
వొప్పుగా నెలయింత లీవువిద లెరఁగరా

చ. 3: చిగురిప్పటిదె కాదా చేగలు మీర నయ్యేది
పగటు నవ్వులే కావా వచ్చి సేసేవి
అగపడి శ్రీ వేంకటాధిప నన్నేలితివి
తగవరి మన్నన లీతరుణు లెరఁగరా

రేకు: 0609-3 రామక్రియ సంపుటం: 14-051

పల్లవి: ఏమి నాయము చెప్పేవు ఇంతులతోను
గామిడి కన్నులయితే కరవద్దా

చ. 1: చెలి సిగ్గుతో నుండఁగ చెరఁగు నీవు వట్టితే
తిలకించి యాపె నిన్నుఁ దిట్టఁగ వద్దా
చెలఁగి యాపె లోన చీర గట్టుకొనేవేళ
కులికి చూడఁగఁ బోతే గొణఁగవద్దా

చ. 2: కొమ్మ యేమీఁ దడవక గుట్టుతోడ నుండఁగాను
దొమ్మిఁ జన్నులంటితేను దొబ్బవద్దా
సొమ్ము వెట్టుకొఁగా నెడచొచ్చి సందులవయి
కుమ్మెగా గోర నూఁదితే కోపించవద్దా

చ. 3: పడఁతి యలపుతోడ పవ్వళించి వుండఁగాను
నడుమఁ గాఁగిలించితే నవ్వవద్దా
యెడయక శ్రీవేంకటేశ నిన్నుఁ గలయఁగ
అడియాలాలు నించితే నట్టె మెచ్చవద్దా

రేకు: 0609-4 సాళంగనాట సంపుటం: 14-052

పల్లవి: వేగిరింతురటే నీవు విభునితోను
చేగదేర నీ చేతికిఁ జిక్కుదాఁకాను

చ. 1: ఆడినట్టె ఆడవే ఆతనితోను
వాడికె నీకైవశమై వచ్చుదాఁకాను
కూడినట్టె కూడవే కోమలి నీవు
జోడయి నీరతులను చొక్కుదాఁకాను

చ. 2: సేసినట్టె సేయవే సిగ్గువడక ఆతఁ
డాసపడి నీకు లోనై నదాఁకాను
వేసినట్టె వేయవే వేసరక పాశికలు
బాసయిచ్చి నీకు కిందుపడుదాఁకాను

చ. 3: నవ్వినట్టె నవ్వవే నలువంకలా ఆతఁ
డివ్వల నీకుఁ జన విచ్చుదాఁకాను
రవ్వగ శ్రీవేంకటరాయఁ డీతఁడె కూడె
వువ్విళ్లూరించకువే నిన్ను బ్బించుదాఁకాను

రేకు: 0609-5 రామక్రియ సంపుటం: 14-053

పల్లవి: కలికి నీయెదుట నివె కానుకలు వట్టీని
యెలమి నేఁడిఁక నీకు నింపవునో కావో

చ. 1: కప్పురములో పిసరు కాంతనవ్వుల కొసరు
చిప్పిలుఁ దేనెల వెగటు చెమట సొగటు
ముప్పిరిఁ బన్నీటి జాలు మొదల వలచిన మేలు
యిప్పుడు నీకివియెల్ల నితవౌనో కావో

చ. 2: పొగరు వెన్నెలవేఁడి పొలఁతి చూపులవాఁడి
చిగురు గుత్తుల మినుకు చేతిచెనకు
వొగరు వీడెపు మదము వుబ్బరి చిత్తపుమదము
బిగియ నేఁటికి నీకుఁ బ్రియమౌనో కాదో

చ. 3: విరుల దొంతరసరులు వెలఁది చనుఁగవ గురులు
సరిఁ జెఱకువిలు బలుపు సకియనిలుపు
గరిమ శ్రీ వేంకటేశ కలసితివి యీసతిని
సరసములు దొరకె నివి చవులౌనో కాదో

రేకు: 0609-6 సామంతం సంపుటం: 14-054

పల్లవి: నీ వోపిక యిఁక నేమది యెఱఁగము
చేవదేరె మాచేఁతలు సుమ్మీ

చ. 1: పంతగాఁడవై బలిమి సేసితేఁ
నింతుల మింతే యేమందుము
చెంతల మాపైఁ జేతులు వేసేవు
కాంతుఁడ చన్నులు గట్లు సుమ్మీ

చ. 2: కొనబుకాఁడవై కొంగిటు వట్టిన
వనితల మేమనవచ్చు నిఁక
చెనకుచు సాములు సేసే విటువలె
కొనగోళ్లు కడుఁ గొయ్యలు సుమ్మీ

చ. 3: కొల్లకాఁడవై కూడితి విటుమము
గొల్లెతల మేమని కొసరేము
ఇల్లిదె శ్రీవేంకటేశుఁడు నవ్వేవు
పెల్లువేఁకములు పిఱుఁదులు సుమ్మీ

రేకు: 0610-1 హిజ్జిజి సంపుటం: 14-055

పల్లవి: ముసిముసి నవ్వులతో ముసుఁగులు వెట్టుకొని
పసలుగ మేలుకొని పవ్వళించి వున్నారు

చ. 1: సిగ్గులు విడిచినట్టి సీఁటవలపులవారిఁ
కెగ్గులు దప్పులున్నవా యెవ్వరన్నాను
అగ్గమైన సతులు వచ్చి అట్టె కొలువు సేయఁగా
బగ్గన నాపేఁ దానూఁ బవళించి వున్నారు

చ. 2: వెఱపు మఱపు లేని వేడుకకాండ్లకు
మఱఁగు మొఱుఁగున్నదా మాపుదాఁకాను
తఱి మేలుకొలిపే పదము లింతులు వాడఁగ
పఱపై పై నాఁపేఁదాను పవ్వళించివున్నారు

చ. 3: గొంటరులై వుండినట్టి కోడెకాండ్లకు నెల్ల
జంట వాయనున్నదా సారెసారెను
యింటనే శ్రీ వేంకటేశుఁ డీపెఁ గూడి మనముల
బంటులఁ దొత్తులఁ జేసి పవళించి వున్నారు

రేకు: 0610-2 ఆందోళి సంపుటం: 14-056

పల్లవి: ఓపను నే నందుకెల్లా నొడ్డుకొంటా నున్నదాన
చేపట్టి నీవు నాచే సేవ గొనవయ్యా

చ. 1: పెక్కుమాట లాడించఁగ బెరసి నేనేమందునో
అక్కరతో మన్నించితి వదే చాలు
వెక్కసమై నవ్వించఁగ వెసనెందుకు వచ్చునో
చిక్కులెల్ల వని నాసేవ గొనవయ్యా

చ. 2: తొడపై నిడుకోఁగాను దొమ్మిఁ గాలు దాఁకునేమో
అడరి సేసవెట్టితి వదే చాలు
వొడలు సోఁకించఁగాను వొద్దికై యెట్టుండునో
చిడుముడి నిట్టే నాసేవ గొనవయ్యా

చ. 3: కందువఁ గాఁగిలించఁగ కళ వట్టునో యేమో
అందుక విడెమిచ్చితి వదే చాలు
పొందితి శ్రీ వేంకటేశ బోదించఁగ నదియెట్టో
చిందుఁజెమటల నాచే సేవగొనవయ్యా

రేకు: 0610-3 బౌళి సంపుటం: 14-057

పల్లవి: ఊరకుండవయ్య అంత కోపుదుమా
గోర గీరి అప్పటిని కొసరేవు గాక

చ. 1: నిగ్గుల మాటలు నీతో నేరుతుమా మమ్ము
సిగ్గులు వడఁగ నాడి చెనకేవు
దగ్గరి పైకొన నీతోఁ దగుదుమా
బెగ్గిలపు మా చన్నులు పిసికేవు గాక

చ. 2: పొంచి నీతో నవ్వ నిన్నుఁ బోలుదుమా మమ్ము
మంచముపైకి రమ్మని మన్నించేవు
చంచుల నీరతులకుఁ జాలుదుమా
పంచల నా పెద్దకొప్పు పట్టేవు గాక

చ. 3: వడి నీసతుల సరి వత్తుమా మమ్ముఁ
దడవి కాఁగిటఁగూడి తమకించేవు
యెడయక శ్రీ వేంకటేశ నీకె తగుదుమా
విడువక మాపై చొక్కు వేసేవు గాక

రేకు: 0610-4 వరాళి సంపుటం: 14-058

పల్లవి: ఇందుకుఁగాఁ దమకించ నేఁటికి మాకు
అందెందె తనిసితిమి అల్లనాఁడే నేము

చ. 1: ప్రియమెంత చెప్పినాను పెడరేఁచి యేమనిన
నియతముగ వినేవి నీచెవులే కా
క్రియ యెంత దెలిపిన కేలెంత చాఁచినాను
నయమిచ్చి తెమలేమనసు నీదే కా

చ. 2: మొక్కులెన్ని మొక్కినానుముందరనెంతవుండినా
గక్కనఁ జూచేవి నీకన్నులివే కా
పక్కన నెట్టు నవ్వినా బాఁతిపడి పైకొనిన
గుక్కక కరఁగేది నీ గుండె యింతే కా

చ. 3: పచ్చిగా నేమిసేసిన పసగా నెంత కూడిన
యిచ్చగించి లోనయ్యేది యీతనువే కా
అచ్చమై శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
మెచ్చి యెంత పొగడినా మేలు నీదే కా

రేకు: 0610-5 దేసాళం సంపుటం: 14-059

పల్లవి: పిడికిటి తలఁబాల పెండ్లికూతుర నేను
వొడివట్టి తియ్యకున్న వూరకే యేమాయెను

చ. 1: కనుఁగొన నిచ్చితివి కడుమోహ మిచ్చితివి
మనసియ్యకుండితేను మరేమాయెను
పెనఁగఁగఁ జేసితివి బెట్టు రట్టు సేసితివి
ననుఁ బొందుసేయకున్న నడుమ నేమాయెను

చ. 2: సడి నాపై వేసితి వాసలఁ గింద వేసితివి
యెడసి చేవేయకున్న నేమాయెను
వడి సటలాడితివి వట్టి మేలాలాడితివి
కడు జూజాలాడకున్న కమ్మటి నేమాయెను

చ. 3: జట్టి నొట్టు వెట్టితివి సవతులఁ బెట్టితివి
యిట్టె తమ్మ వెట్టికున్న నేమాయెను
గుట్టున శ్రీ వేంకటేశ కూడి కోపమాఁపితివి
అట్టె తమి యాఁపకున్న అందుకు నేమాయను

రేకు: 0610-6 భూపాళి సంపుటం: 14-060

పల్లవి: పొరుగుకు వెంగెమైన పొందు లేఁటికి
విరసపువారెల్ల వింత సేసేరు

చ. 1: చన్ను మొనలు నాఁటీని సారెఁ బైఁ బడకువయ్య
కన్నవిన్న వారందరు కడు దూరేరు
చిన్నిగోరు లిట్టె నాఁటీఁ జేతులు వట్టకువయ్య
నిన్నుఁ బొందే సతులెల్ల నేరాలు వేసేరు

చ. 2: కొప్పు వాడుఁబువులంటీ కుచ్చి పెనఁగకువయ్య
చొప్పులెత్తి యెవ్వరైనా సోదించేరు
గొప్ప పిఱుఁదు తొడెత్తి కూచుండఁ బెట్టికువయ్య
యెప్పటి నీదేవుళ్లెల్ల యీసడించేరు

చ. 3: మేనిచెమటలు ముంచీ మిక్కిలి రతులేలయ్య
నానఁబెట్టి సవతులు నవ్వు నవ్వేరు
యీనెపాన శ్రీ వేంకటేశ ననుఁ గూడితివి
పూని కడమవారెల్ల వుప్పటించేరు

రేకు: 0611-1 సాళంగం సంపుటం: 14-061

పల్లవి: ఎఱఁగని వానివలె నిప్పుడు విచ్చేసితివి
గుఱిగా నిన్నియుఁ గనుఁగొనవయ్యా నీవే

చ. 1: నెలకొని నీవే కావా నేరిపిన నేరుపులే
వలపులతోడి యీవసివాళ్లు
యెలమి నప్పటి మరి యిచ్చిన యీవులే కావా
చెలరేఁగి చెక్కుచేతి చింతలు

చ. 2: చిత్తగించి నీవే కావా సేసిన చేఁతలివి
చిత్తడి మేనిమీఁది చెమటలు
బత్తితోడ మీఁద మీఁదఁ బాలించినవే కావా
పొత్తుల విరహవేళ పులకలు

చ. 3: మక్కువతో నీవే కావా మన్నించిన మన్ననలు
వుక్కు మీరినట్టి అసురుసురులు
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చక్కని నీవల్లనేకా సంతసములు

రేకు: 0611-2 కాంబోది సంపుటం: 14-062

పల్లవి: నే నెగ్గులు వట్టనోప నీచిత్తమిఁకను
కానిమ్మని కైకొంటి కలదెల్లా మేలే

చ. 1: సారె సారె నవ్వఁగాను చప్ప ననేవు వలపు
వోరసేసు కూరకున్న వుప్పననేవు
నేరమి వట్టితే తననీడే తనకుఁ బగ
కూరిమి మాటలాడితే నూరెల్లాఁ జుట్టాలే

చ. 2: అగ్గలమై చూచితేను అనుకనేవు ననపు
సిగ్గులు వడితే నట్టే చిక్కననేవు
వెగ్గళించితేఁ దనవెంట్రుకలే వేఁకము
వొగ్గితేఁ బువ్వులు గంపెడొకరికిఁ జాలవు

చ. 3: తెక్కులఁ బుక్కిట నించితే నెట్టి ననేవు తమ్మ
పక్కన విడె మిచ్చితేఁ బచ్చననేవు
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
యెక్కితే యేనుఁగు గుజ్జు యెక్కకున్నఁ బొడవు

రేకు: 0611-3 నాదరామక్రియ సంపుటం: 14-063

పల్లవి: దవ్వులనుండి యేమి తరితీపు సేసేవు
జవ్వనము చిందకుండా జాళెఁ బోయరాదా

చ. 1: సిగ్గరి పెండ్లికూఁతురు చేసన్న లెఱుఁగునా
వెగ్గళించి నీవీడకు విచ్చేయరాదా
బగ్గన నక్కడ నిన్ని పనులు గలిగినాను
ముగ్గిన యీవేళకు మూటగట్టరాదా

చ. 2: కన్నెపాయపు నెలఁత కందువ మాటెరుఁగునా
పన్ని తెలియఁగ నొడఁబరచరాదా
అన్నిటా నవ్వల నీకు నాసలెన్ని గలిగినా
పెన్నిధిగా యీవేళకు పెట్టెఁ బెట్టరాదా

చ. 3: చెలువపు ముద్దరాలు చెనకు లివేమెరుఁగు
కలసి కాఁగిటఁ జేర్చి కైకొనరాదా
అలరి శ్రీవేంకటేశ అతివ నేలితి విట్టె
వలెనా నవ్వీవేళకు వామి వేయరాదా

రేకు: 0611-4 ఆహిరి సంపుటం: 14-064

పల్లవి: ఎటువలె బుజ్జగించి యీడేరించేవో కాని
తటుకన నీకు మొక్కే తతియేదో కాని

చ. 1: మత్తగజగమనకు మనవి యెంతైనాఁ గద్దు
చిత్త మెరఁగక నీతోఁ జెప్పదు గాని
హత్తి నీతో మాటలాడే ఆస యెంతైనాఁ గద్దు
తత్తరపు సిగ్గులతోఁ దలవంచీఁ గాని

చ. 2: ముసిముసి నవ్వులకు ముచ్చటెంతై నాఁ గద్దు
సుసరాన తనగుట్టు చూపదు గాని
వసివాడుతనముల వలపెంతైనాఁ గద్దు
పసురు వయసుతోడఁ బదరదు గాని

చ. 3: అట్టె నిన్నుఁ గూడె నిదె అలపెంతైనాఁ గద్దు
దిట్టతనాన వెనక తియ్యదు గాని
నెట్టన శ్రీవేంకటేశ నీవె యేలితి వాపెను
బట్టిగొన నిన్నాపె జంకించదు గాని

రేకు: 0611-5 కుంతలవరాళి సంపుటం: 14-065

పల్లవి: మాకేల యిటువంటివి మగనాండ్లము
యీకొలఁది నీకమరు నెమ్మెకాఁడవందురు

చ. 1: చెక్కు గొరనొత్తకుమీ సిగ్గుతోడిదాన నేను
యిక్కడనే నవ్వేరు నన్నెవ్వరైనాను
నిక్కముగ నివియెల్ల నీచెక్కుల నుంటే మేలు
అక్కడివారు విటుఁడవని నిన్ను నందురు

చ. 2: తుఱుము వంగఁదియ్యకు దొరపాటిదాన నేను
యెఱఁగకాడుకొనేరు యెవ్వరైనాను
నెఱి నిటువంటివి నీకేఁ గలిగితే మేలు
గుఱిగా రేపల్లెలోని కోడెకాఁడవందురు

చ. 3: మోవి గంటిసేయకుమీ మొదలి యిల్లాల నేను
శ్రీ వేంకటేశ దూరేరు చెలులెల్లాను
నీవు నన్నుఁ గూడితివి నీకే వుండితే మేలు
భావించి నిన్నెవ్వరైనా బయకాఁడవందురు

రేకు: 0611-6 లలిత సంపుటం: 14-066

పల్లవి: ఘనుఁడవు బొంకకుమీ కద్దో లేదో
చెనకి చేయిమీఁదుగాఁ జేఁత సేసెఁగా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేతులు వట్టుకొని
పిలిచి అప్పుడాపెతోఁ బెనఁగితివి
అలిగి ఆయింతి నిన్ను నట్టె బొమ్మల జంకించి
తిలకించి చెప్పరాని తిట్లు దిట్టెఁగా

చ. 2: చెక్కునొక్కి చెక్కునొక్కి చేరి ప్రియములు చెప్పి
టెక్కుల నాప వొడివట్టి తీసితివి
వెక్కసపు కోపముతో వెలఁది నిన్నావేళ
పక్కన చేతిపువ్వబంతిఁ గొని వేసెఁగా

చ. 3: కాఁగిలించి కాఁగిలించి కందువలకుఁ దీసి
ఆఁగి శ్రీవేంకటేశుఁడ అట్టె కూడితి
రాఁగిన తమకముతో రమణి నిన్నంతలోనే
చేఁగచన్నులనుఁ గుమ్మి సెలవుల నవ్వెఁగా

రేకు: 0612-1 సింధురామక్రియ సంపుటం: 14-067

పల్లవి: ఇంచుకంత సన్నెఱఁగఁ డిదేమే తాను
మంచముపై నుండితేనే మర్మము సోఁకె ననీ

చ. 1: చెవిలోమాట చెప్పితే సెలవుల నవ్వీని
తివిరి గోర నూఁదితే తిట్టు దిట్టీని
చివురున వేసితేను చిత్తగించి మిట్టిపడీ
జవళిఁ గూచుండితేను చన్నులొత్తె ననీని

చ. 2: మొగము చేతనెత్తితేను మోవి గంటిరేఁగె ననీ
తగిలి చూచితేను చేతను దొబ్బీని
పగటున మొక్కితేను పాదము లొత్తె ననీని
వొగిఁ గాలు దొక్కితేనే వొరటలనీని

చ. 3: పచ్చడము గప్పితేను పట్టి తీసితి ననీని
యిచ్చక మాడితే వెంగె మేఁటి కనీని
పచ్చిగా శ్రీవేంకటాద్రిపతి నన్ను నిటు గూడి
మెచ్చినా నప్పటి మితిమీరితి ననీని

రేకు: 0612-2 శ్రీరాగం సంపుటం: 14-068

పల్లవి: బదుకఁగలవు పెక్కుపడఁతులలోన నెల్లా
పదర వన్నిటికిని బందుగుఁడవయ్యా

చ. 1: కోరి యిందరు ముడిచే కొప్పులోని తామెరవు
గారాబుఁ జన్నులఁ బూసే గందమవు
చేరి పరిమళించే చెవిలో జవ్వాదివి
నేరుత విన్నిటా నిఁక నిన్నేమనేమయ్యా

చ. 2: కొండుక పాయపువారి కొడివేలుంగరమవు
అండనే మెడఁ దగిలే హారమవు
దండిగా వినయాన పాదాలఁ బెట్టిన యందెవు
నిండా నల్లుకొంటి విఁక నిన్నేమనేమయ్యా

చ. 3: కావలె ననేటివారి కట్టినట్టి చీరవు
మూవంక రతివేళ మేల్ముసుఁగవు
శ్రీ వేంకటేశ నన్నుఁ జెందితి వింతటిలోనే
నీవంగడిసరకవు నిన్నేమనేమయ్యా

రేకు: 0612-3 సౌరాష్ట్రం సంపుటం: 14-069

పల్లవి: ఆట్టె సేయవయ్యా యెదురాడ నేఁటికి
పట్టి యలవాటు లప్పటిఁ జేసుకొనేవా

చ. 1: తిలకించి చెప్పరాని తిట్టు నీవు దిట్టితేను
పలికినట్టే పలుక పంతమా మాకు
నెలకొని యీడనాడ నేరుచుక వచ్చి యీడ
పలుమారు గుణించుక పాటము గొనేవా

చ. 2: సేసవెట్టి సేయరాని సేఁతలేల్లా మించఁగాను
సేసినట్టే సేయ మాకుఁ జెల్లుబళ్లా
లాసి యిందరి గరిడి లలిసాము సేసి వచ్చి
మూసిపోకుండా నీడ మరి తలపోసేవా

చ. 3: నయగారితనముల నవ్వులెల్లా నవ్వేవు
మయికి మయి మళ్ళించ ముచ్చట గాదా
దయతో శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
నియతి జాణతనాలు నీవే నేర్చినవా

రేకు: 0612-4 గంభీరనాట సంపుటం: 14-070

పల్లవి: మాకు వింతలా నీమతకములు
కైకొని నీవు పుట్టఁగానే పుట్టినవి

చ. 1: వద్దు వద్దు మాతోను వట్టి సటలింకా నీకు
పొద్దువోదా ఆపె నీకు బుద్ది చెప్పదా
బద్దులును బాసలును పలుమారు వినయాలు
గద్దరి నీవు పుట్టఁగానే పుట్టినవి

చ. 2: యేల యేల సేసేవు యింతలోనే యిచ్చకాలు
వేళలేదా ఆపె నీకు విన్నవించదా
చాలుకొన్న తమకాలు సరసాలు వేసాలు
కాలమందే నీవు పుట్టఁగానే పుట్టినవి

చ. 3: మెచ్చు మెచ్చు నన్నింతలో మేకుసేసి కూడితివి
అచ్చు మోపే వాపె నిను నెచ్చరించదా
అచ్చమై శ్రీవేంకటేశ అందికలు పొందికలు
గచ్చుల నీవు పుట్టఁగానే పుట్టినవి

రేకు: 0612-5 కన్నడగౌళ సంపుటం: 14-071

పల్లవి: ఎడమాట లేఁకనేల యిద్దరునుఁ గూడితిరి
అడరి జవ్వనపాయ మాఁపలేక వచ్చెను

చ. 1: చెమటలు గారఁగాను చిరునెరులు దూలఁగ
తమకాన నీవద్దికిఁ దానే వచ్చెను
మము నీవద్దికి నంపి మనసు నిలుపలేక
ప్రమదాన నిట్టే పెద్ద పరువున వచ్చెను

చ. 2: కొప్పు గడు వీడఁగాను కుచములు గదలఁగ
నప్పసము నీవద్దికి నాపె వచ్చెను
యిప్పుడే కమ్మలు వ్రాసి యిట్టె మాచేతికి నిచ్చి
చప్పుడుగాఁ దానే యీాడ చదువఁగ వచ్చెను

చ. 3: నడపు దడఁబడఁగ నలిఁ బోఁకముడి వీడ
పడఁతి నీవెంటఁ బానుప పైకి వచ్చెను
యెడమిచ్చి శ్రీ వేంకటేశ యింతిఁ గూడితివి
జడియని రతుల నీసరి వచ్చెను

రేకు: 0612-6 ఆహిరి సంపుటం: 14-072

పల్లవి: నీతోఁ బెనఁగదు నిన్ను నౌఁగాదనదు
నీతలఁపు దెలియక నిట్టూర్పు వుచ్చీని

చ. 1: పక్కన నీవాపెను పయ్యదకొంగు వట్టితే
చెక్కునఁ జెయి వెట్టుక సిగ్గుపడీని
చక్కఁగా నప్పటి గోరు చన్నులపై నూఁదితేను
నెక్కొన్న వేడుకతోడ నివ్వెరగందీని

చ. 2: తొడిఁబడ నీవాపెను తొడపైకిఁ దీసుకొంటే
చిడుముడి మేనెల్లాఁ జెమరించీని
తడఁబడి యట్టె మోము తప్పక చూచితేను
పొడలుగాఁ జెక్కులెల్లాఁ బులకించీని

చ. 3: సారె సారె నీవాపెతో సరసములాడఁగాను
గారబాన నిన్నందుకుఁ గాఁగిలించీని
యీ రీతి శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి నీ
నేరుపులెల్లా మించ నిన్ను మెచ్చీని

రేకు: 0613-1 అమరసింధు సంపుటం: 14-073

పల్లవి: పండెఁ దెచ్చుకొనవయ్యా పైపైనె వలపులు
బండుల కొలఁదులివె పాయరాని రతులు

చ. 1: కుప్పలాయ జవ్వనము కోమలి కుచములై
ఇప్పుడే కోరుఁగొందు విందు రావయ్యా
లప్పల కస్తూరి పూఁత లచ్చన వెట్టివున్నది
దెప్పరమై కాఁగిటిగాదెనుఁ బోయవయ్యా

చ. 2: నాపపంట వచ్చె మరి నలినాక్షి మోవియై
తీపు చవిగొందువు యిందే రావయ్యా
మోపుల కొలఁది మరుముద్రలు వెట్టివున్నవి
కోపుల నీపుక్కిటి కాఁగులఁ బోయవయ్యా

చ. 3: ముదిత తమ్ములమున ముక్కారు పంట వండె
ఇది చేకొందువు గాని ఇందు రావయ్యా
పొదిగి శ్రీ వేంకటేశ భోగపు నీగురుతబ్బె
చదరాన మేనికణజాన నించవయ్యా

రేకు: 0613-2 గౌళ సంపుటం: 14-074

పల్లవి: మానాపతులతో నింతమంకులుఁ జలములేల
వూనిన నీవే బుజ్జగించి బుద్ధి నేర్పరాదా

చ. 1: సిగ్గులు చేటఁడేసి చిరునవ్వు మూటెఁడేసి
యెగ్గులుఁ దప్పులునైతే యేరాళము
వొగ్గి యాపెఁ గొలువులో నొడివట్టేల తీసెవు
తగ్గక నీవే యేకతానకు రారాదా

చ. 2: కోరికలు బారెఁడేసి గుంపెనలు మూరెఁడేసి
బీసరసములైతే మితిమీర లేదు
కూరాకుగా నీ వాపెకొప్పేల పట్టి తీసేవు
దారదప్పకిట్టే యేకతానకు రారాదా

చ. 3: సరసాలు గంపెఁడేసి సలిగెలు గుంపెఁడేసి
సిరుల రాజసములు శేనా శేన
అరిది శ్రీవేంకటేశ అలయించీకెఁ గూడితిఁ
విరవై యేకతమున కిప్పుడే రారాదా

రేకు: 0613-3 పాడి సంపుటం: 14-075

పల్లవి: నీ వెరఁగవా ఇది నేము విన్నవించనేల
వావులు గలసితేనే వశము గావలెను

చ. 1: పంతము లాడఁగనేల పడఁతులకు లోనైతే
పొంతనే ప్రియము చెప్పి పొసఁగవలె
వింతలు సేయఁగనేల వీడుదొళ్లాడితేను
యెంతైనా సరసముల నెనయఁగవలెను

చ. 2: సిగ్గులు వడఁగనేల సేసలు వెట్టినప్పుడే
బగ్గన నవ్వులు నవ్వి పైకొనవలె
యెగ్గులు పట్టఁగనేల హృదయాలు గలసితే
వెగ్గలపు సంతోసాన విఱ్ఱవీఁగవలెను

చ. 3: వెనకముందెంచనేల వేడుకతోఁ గూడితేను
చనవులు మెరసి పచారించవలెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలికి నేలితి విట్టె
ననుపు లైనపుడే మన్నన లెంచవలెను

రేకు: 0613-4 కురంజి సంపుటం: 14-076

పల్లవి: నే మెఱంగము సుమ్మీ నిలుచుండి చూచే నిట్టే
కోమలులకు నీకు గురుతాయ వలపులు

చ. 1: వింత వింతమాటలు వేడుకతో పాటలు
దొంతులు వెట్టేరు నీపై తొయ్యలులెల్లా
చింత లనేవిరులు సిగ్గులనే సరులు
బంతి కట్టుగాఁగ నీపైఁ జల్లేరదివో

చ. 2: కనుచూపు గురులు కొనగోరి గెరలు
పెనచేరు నీమీఁదఁ బ్రియురాండ్లు
చనుఁగవ కొండలు జంకెనల యండలు
ననుపులుగా నీపై నాటువేసే రదివో

చ. 3: కాతరపు పొందులు కాఁగిటిలో విందులు
యేతులఁ జేసేరు నీకు యిల్లాండ్లు
యీతల శ్రీవేంకటేశ యిందరిఁ గూడితి విట్టె
పోతరముగా మీకు పోగువోసే రదివో

రేకు: 0613-5 సామంతం సంపుటం: 14-077

పల్లవి: ఊరకున్న వానిమీఁద నుడుకులు గట్టేమా
దారదప్పక తనంత తానుండరాదా

చ. 1: చేయెత్తి మొక్కేటివాఁడు చేరి వేడుకొనేవాఁడు
సేయరాని పనులెల్లాఁ జేయనేఁటికే
ఆయాలు ముట్టేటివాఁడు ఆనలు వెట్టేటివాఁడు
పాయపు సతులతోను పందేలాడనేఁటికే

చ. 2: అలుకలు దిద్దేవాఁడు ఆసలఁ బెట్టేవాఁడు
చెలుము లెక్కడనైనా సేయనేఁటికే
పిలువ వచ్చేటివాఁడు ప్రియాలు చెప్పేటివాఁడు
చలివాసి గొల్లెతల చన్నులంట నేఁటికే

చ. 3: కప్పుర మిచ్చేటివాఁడు కాఁగిటఁ గూడేటివాఁడు
చొప్పులఁ బరకాంతలఁ జూడనేఁటికే
ఇప్పుడు శ్రీ వేంకటేశుఁ డింత నన్నేలినవాఁడు
కుప్పలుగా నింతులను కూడ పెట్టనేఁటికే

రేకు: 0613-6 లలిత సంపుటం: 14-078

పల్లవి: వేడుకొనవయ్యా ఆపెవెత దీరను
పొడిమి నాడినమాట బొంకవు గదా

చ. 1: శిరసు వంచుకొన్నది చెక్కుచేతితో నున్నది
తరుణి కిచ్చినబాస దప్పవు గదా
మరిగి కూచున్నది మారుమాటాడ కున్నది
వొరసి కొనగోర వూఁదవు గదా

చ. 2: బొమ్మ ముడితో నున్నది పొరపొచ్చాన నున్నది
చిమ్ముచు నాపెతో మేకు సేయవుగదా
సమ్మతించక వున్నది చలముతోడ నున్నది
యెమ్మెలకు సవతుల నెంచి చూపవు గదా

చ. 3: చేతుల మొక్కుచున్నది సెలవి నవ్వుచున్నది
యీతల రతుల నలయించవు గదా
గాతల శ్రీవేంకటేశ కడుఁ గొసరుచున్నది
రేతిరిఁ బగలు తమి రేఁచవు గదా

రేకు: 0614-1 దేశాక్షి సంపుటం: 14-079

పల్లవి: తగినంతే చాలుఁజాలు తమకములు
నగిన మాత్సరసములోనే ననుపయ్యీనా

చ. 1: పలుమారు నిన్నునెంత బలుములు సేసినాను
వలపు గలంతే కాక వచ్చేవా నీవు
పిలువనై తినంటా పెడరేఁగి కొసరేవు
చలము సాదించఁ బోతే చవి పుట్టీనా

చ. 2: జాడతోడ నిన్ను నెంత చనవులు నెరసినా
వేడుక గలంతేకాక వియ్యమందేవా
వీడె మియ్యనైతినంటా వెసఁదప్పులు వట్టేవు
వాడికలు చూపితేనే వయిపయ్యీనా

చ. 3: మెట్టి పట్టి నీతో నెంత మేలములాడినాను
చుట్టరిక మింతే కాక సొంపు గూడీనా
నెట్టుక శ్రీ వేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
బట్టిబయ లీఁదఁబోతే పనికి వచ్చీనా

రేకు: 0614-2 మధ్యమావతి సంపుటం: 14-080

పల్లవి: వేడుకకు వెలలేదు విభునితో ననరాదు
సూడిదెవంటి వలపు సులభాననే

చ. 1: తఱఁగు మొరఁగుమాట తలఁపులోపలితీఁట
తఱితో నాయందునుంటేఁ దనకేమే
కఱకరిఁ బెట్టఁబోతే కలిముదిరి మెడిదె
యెఱుక సేసుకోరాదు యేమందునే

చ. 2: గుట్టుతో నవ్వినవ్వు కొప్పులోపలిపువ్వు
యెట్టువలసినా వచ్చు నేమనీనే
ముట్టినదెల్లా ముయి పట్టినదెల్లా బంగారు
ఱట్టు సేయరాదు మేలాఱిడి కెక్కెనే

చ. 3: కన్నుల మొక్కిన మొక్కు కాఁగిటఁ గూడిన చొక్కు
చన్నుబంటేయ నిఁక సాదించ నేలే
యిన్నిటా శ్రీవేంకటేశ్వరుఁ డింతలోతానన్నుఁగూడె
పిన్ననాఁడే సేసవెట్ట బిగియ నేలే

రేకు: 0614-3 కేదారగౌళ సంపుటం: 14-081

పల్లవి: వేగిరించకురే మీరు వెలఁదులాల
సొగ కన్నులఁ దప్పక చూచేఁ గాక

చ. 1: సరసములాడఁగాను జంకించ వచ్చునా
తెరువేదో పతిమతిఁ దెలిసేఁగాక
శిరసు వంచుకుండఁగానుఁ జేరి తిట్టవచ్చునా
ఆరుదైన సుద్దులెల్లా నడిగేఁ గాక

చ. 2: తగ్గక కూచుండఁగాను తలమనవచ్చునా
వెగ్గళించక మాటలు వినేఁ గాక
వొగ్గి వొడివట్టఁగాను వోప ననవచ్చునా
సిగ్గు వడుచు నూరకే చేత మొక్కేఁగాక

చ. 3: యిట్టె కాఁగిలించఁగాను యీసడించ వచ్చునా
చుట్టరికము తనది చూచేఁ గాక
వొట్టుక శ్రీవేంకటేశుఁ డొద్దికతో నను నెల
నెట్టుకొన్న మోహముతో నిండుకుండేఁ గాక

రేకు: 0614-4 శుద్ధదేశి సంపుటం: 14-082

పల్లవి: అతఁడూ నీవూ నొక్కటే అండవారలే వేరు
సతులతో నీగుట్టు సారెఁ జూపేవు

చ. 1: కప్పి నీవును నతఁడు కలహించినందుకును
కొప్పు వీడిన దిదియె గురుతు గాదా
చొప్పు లెత్తుచుఁ జెలులు సోదించి యడిగితే
అప్పటి లేదనుచు నాన వెట్టేవు

చ. 2: యెలమిఁ జేపట్టులకు యిద్దరుఁ బెనఁగినందుఁ
కలసి పయ్యెడజారు టదియె గురుతు
లలి నూడిగపువారు తెలియ నిన్నడిగితే
పొలసి బొంకుచుఁ బతికి పూనుక వచ్చేవు

చ. 3: పంతములు మీలోనఁ బచరించి నందుకును
రంతులను గురుతు లధరము నిండెను
వింతగా నిన్ను శ్రీ వేంకటేశుఁడు గూడె
సంతసంబులు మాకు చవులు చూపేవు

రేకు: 0614-5 ఆహిరి సంపుటం: 14-083

పల్లవి: విరహాన బడలెను విభుఁడు యిందాఁకాను
పురుషార్థ మిందువంకఁ బొందేదేమే

చ. 1: కంతుని దీమమవై ఘనుని భ్రమయించేవు
పొంత నిందువంక నేమి పుణ్యమే నీకు
పంతమున వలపించి పలుమారు నలిగేవు
యెంత లాభము గలిగె నిందువంక నీకు

చ. 2: చెఱకు సింగిణివై చెలువుని నేఁచేవు
గుణిగా నెంతధనము గూడెనే నీకు
వెఱగు వడుచు నీవు వెంట వెంటఁ దిప్పేవు
నెఱదొరతన మెంత నేర్చితివె నీవు

చ. 3: పూవులగాలమవై పురుషునిఁ దగిలేవు
వేవే యెంతరాజ్య మేలితిదె నీవు
యీవల శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నిన్నుఁ గూడె
కైవశమై యెంతకొడిగట్టితివె నీవు

రేకు: 0614-6 మాళవిగౌళ సంపుటం: 14-084

పల్లవి: ఎఱఁగమా నీ లాగు యెన్ని విద్యల వాఁడవు
వొఱపులు సేసుకొంటా నున్నాఁడవు

చ. 1: చల్లలమ్మేగొల్లెతలు జాజరాడఁ బోలుదురు
అల్లదె నీమేన జిడ్డయి వున్నది
యిల్లిదె తట్టుపునుఁగు యిందుకుఁగాఁ బూసుకొని
వొళ్లల్లా మెఱుఁగు సేసుకున్నాఁడవు

చ. 2: సారె గోపికలెల్లా వసంతమాడఁ బోలుదురు
సారపు నీమేను బూదచరచున్నది
యేరా కప్పురధూళి యిందుకుఁగాఁ బూసుకొని
వోరిచి నెపము వేసుకున్నాఁడవు

చ. 3: సిగ్గుల మందసతులు సేసవెట్టఁ బోలుదురు
అగ్గలమై మేను కళయై వున్నది
నిగ్గుల శ్రీ వేంకటేశ నీ విందుకు నన్నుఁ గూడి
వొగ్గుచు సొమ్ములు నించు కున్నాఁడవు

రేకు: 0615-1 శ్రీరాగం సంపుటం: 14-085

పల్లవి: ఎంత రాజసపు వాఁడ వేమి చెప్పేది
పంతములే యీపెమీఁదఁ బచరించేవు

చ. 1: ఇందుముఖి ఆకుమడిచియ్యఁగా నీవిప్పుడు
అందుకొనక పరాకై వున్నాఁడవు
అందుకు నప్పటియాపె అట్టె చన్నుల నొత్తితే
సందడి సతులతోడ సరసమాడేవు

చ. 2: కప్పురపు లప్ప చెలి గక్కన నీకియ్యగాను
దప్పిదేరఁ జేకొనక తల వంచేవు
నెప్పున వాలారుగోళ్ళ నీగడ్డ మాపె యెత్తితే
దెప్పరాన వేరొకతె దిక్కు చూచేవు

చ. 3: వనిత తమ్ములము నీ వదనాన నీడఁగాను
మునుకొని అరవసమున నుండేవు
యెనసె శ్రీ వేంకటేశ యింతలోనే యాపె నిన్ను
చనవరి కాంతలకు సన్న సేసేవు

రేకు: 0615-2 ధన్నాశి సంపుటం: 14-086

పల్లవి: ఒకరి కొకరు దాపు వోపనంటేఁ బోదు యిఁక
వెకలి చన్నీళ్లకు వేనీళ్లు దోడు

చ. 1: ఆడరానిమాట లాడి ఆపె నీకుఁ జెప్పింపఁగా
నీడ నీవు వూరకుండే దిది యేఁటిది
వీడనాఁడ జాలని వెరపు నీకుఁ గలితే
తోడు వచ్చే నే నీకు దోసముగా దిందుకు

చ. 2: వొరటుగాఁ జూపి మోపి వుంట వింట వేయఁగాను
సొరిది చేత నొడ్డించుకొననేలా
ధరలోన నీకింత మొగదాకిరి గలితే
తొరల నే యెచ్చరించే దోసముగా దిందుకు

చ. 3: గొబ్బునఁ దాలేచివచ్చి కొంగువట్టి తియ్యఁగాను
సిబ్బితి పడేవు యింకాఁ జెల్లఁబో నీవు
గబ్బితనము లేకుంటే గక్కన శ్రీ వేంకటేశ
దొబ్బే నిన్ను నాపె మీఁద దోసముగా దిందుకు

రేకు: 0615-3 నాట సంపుటం: 14-087

పల్లవి: ఏమైనా నాయఁగాక ఇఁకనీతో యేమనేము
భూమిలో యెవ్వతె నిన్ను భోగించి వేసినదో

చ. 1: వలచినవారికి వాసులెంచనున్నదా
వొలిసినందుకెల్లాను వొగ్గుట గాక
పిలిచిపెట్టేవు నాకు పదవిమీఁదటితమ్మ
యెలయించి తొల్లి నీకు యెవ్వతె వెట్టినదో

చ. 2: పెండిలాడిన వారికి బిగియఁగ వున్నదా
అండ నెట్టు పరచినా నౌనంట గాక
గండుమీరి రొమ్ముమీఁది గందము వూసేవు నాకు
మెండుగ నెవ్వతె వూసి మిగిలించినదో

చ. 3: మేనరికపువారికి మేకు సేయ నున్న దా
మోనాన కాఁగిటఁ గూడి మొక్కుట గాక
కానీలే శ్రీ వేంకటేశ కలసి విరులిచ్చేవు
పూని యెవ్వతె కొప్పుననుండి వచ్చినదో

రేకు: 0615-4 నారాయణి సంపుటం: 14-088

పల్లవి: ఇంతకంటే లాభము యెట్టు గడించుకొనేవు
యెంతలేదు విచారము యేమి సేసే వీడను

చ. 1: చెలరేఁగి నవ్వుకొంటా చెలులతో నీసుద్దులే
పలుమారు నాడుకొనీ పడఁతి
తలుపుమాటుననుండి తగ విందువు రావయ్య
యెలమి మాపుదాఁకా నేమిసేసే వీడను

చ. 2: నీ కెదురే చూచుకొంటా నీపదాలె పాడుకొంటా
జోకలుగా వేగించీ సుసుదతి
వాకిటవుండే తప్పక వడిఁ జూతువు రావయ్య
యీకడ నెంత పొద్దైనా నేమి సేసే వీడను

చ. 3: నీ రూపే వ్రాసుకొంటా నీ పేరఁ బిలుచుకొంటా
ఆరసి వలపు చల్లీ నతివ
యీరీతి శ్రీ వేంకటేశ యిటు విచ్చేసి కూడితి
వీరచ్చులు సేయవచ్చే వేమిసేసే వీడను

రేకు: 0615-5 రామక్రియ సంపుటం: 14-089

పల్లవి: ఆసోదకాఁడవు అన్నిటికి నోపుదువు
మోసపోకుండా నీపై మూట గట్టేఁ జుమ్మీ

చ. 1: వెలవెట్టని వలపు వెస చల్లదుబ్బేఁడేసి
పొలసి గొల్లెతలెల్లాఁ బోసిరి నీకు
మలసి మామీఁదనట్టె మారుగొల గొలచేవు
కలిగినదెల్లా నీకే గాదేఁ బోసేఁ జుమ్మీ

చ. 2: సుంకము లేనివలపు సూటి చనుగుబ్బేఁడేసి
అంకెలఁ బదారువేలు అమ్మిరి నీకు
పొంకాన నదె తలపోసేవు నాతోను
పంకించక నీకన్నియుఁ బౌఁజు చూపేఁ జుమ్మీ

చ. 3: కొల్లవచ్చినవలపు కోరికెతో సందేఁడేసి
వల్లెవేసి యెనమండ్రు వంచిరి నీకు
యిల్లిదే యలమేలుమంగ నిదె నన్నూ నేలితివి
వొల్లనే శ్రీ వేంకటేశ వొడిగట్టే జుమ్మీ

రేకు: 0615-6 కన్నడ గౌళ సంపుటం: 14-090

పల్లవి: పట్టకు నన్నిఁకను బడలితి నన్నిటాను
చుట్టిరికమున నే సొలసేఁ గాని

చ. 1: జగడ మడువ నోప సాకిరి పట్టఁగ నోప
మొగము చూచి నీకు మొక్కే నేను
తగవులు చెప్పనోప తప్పులు వట్టఁగ నోప
జిగి నీపాదాలసేవ సేసేఁగాని

చ. 2: ఆనలు వెట్టఁగ నోప ఆఱడిఁ బడఁగ నోప
పూని మంచిదాననై పొగడే నేను
ఆనుక జంకించ నోప ఆసలు చూపఁగ నోప
కానుకిచ్చి నీచేఁతకు లోనవుండేఁ గాని

చ. 3: బొమ్మల జంకించనోప పొద్దులు గడప నోప
చిమ్ముచు సేసవెట్టి చెనకే నేను
నెమ్మది శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
సమ్మతించి నీమోవి చవిగొనేఁ గాని

రేకు: 0616-1 సాళంగనాట సంపుటం: 14-091

పల్లవి: ఏఁటికే తనకు వెరపింతలోననే
మాటెందులేని బిరుదు మగవాఁడుగదవే

చ. 1: పేరుకొని పిలువఁగఁ బ్రియమునఁ బలుకఁడు
సారె నెవ్వతై నాను సాదించీనటే
గారవించి తనకు నేఁ గానకియ్యఁగాఁ బట్టఁడు
కూరిమి మరెవ్వతైనా కోపగించీనటవే

చ. 2: ననుపున నేనెంత నవివ్వనాఁ దా నవ్వఁడు
చనవున నెవ్వతైనా జంకించీనటే
చెనకి నేఁ దనకు సేవ సేయఁగాఁ గొంకీని
తనపై మరెవ్వతైనాఁ దప్పు వెంచీనటెవే

చ. 3: ముచ్చట నేఁ జేతులెత్తి మొక్కితేఁ దలవంచీని
వచ్చి వచ్చి యెవ్వతైనా వద్దనీనటే
అచ్చపు శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగ నేను
యిచ్చ నన్నుఁ గూడె మది యెవ్వతె మీరీనే

రేకు: 0616-2 ముఖారి సంపుటం: 14-092

పల్లవి: పొత్తుల వలపు గద్దా భూమిలోనను, వాసి-
కత్తెవైతే నీ వింత గయ్యాళింతువా

చ. 1: అంగవించి నాతోనే ఆతఁడు మాటలాడఁగ
సంగడి జాణతనాలు సారె నాడేవే
చెంగట నప్పటి నాతో చేరి చేరి నవ్వఁగాను
యెంగిలి నవ్వులు నీవు యేల నవ్వేవే

చ. 2: చెలువుఁడు నామీఁద చేతులు చాఁచఁగాను
చెలరేఁగి నీవేల చేతులొడ్డేవే
తిలకించి నన్నాతఁడు దిష్టించి చూఁడఁగాను
నెలవై అడ్డమువచ్చి నిలుచుండేవేమే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నన్నుఁ గూడఁగాను
వావులు నీవేమి చెప్పవచ్చేవే యిందు
యీవల నలమేల్మంగ నిట్టె నన్ను మన్నించఁగ
కైవసమై అప్పటి చక్కట్లు చేప్పేవే

రేకు: 0616-3 రామక్రియ సంపుటం: 14-093

పల్లవి: ఇన్నిటా నీబత్తులు నే మెరిఁగినవే
పిన్నదాన నా చన్నులు పిసుకకువయ్యా

చ. 1: చెక్కులు నొక్కుచు నాకుఁ జేరి ప్రియాలు చెప్పేవు
పక్కనఁ దిట్టకుంటేనే పదివేలు
యెక్కడి సుద్దులు మమ్మునేల తడవేవు నీవు
మొక్కేముగాని మాకొంగు ముట్టకువయ్య

చ. 2: పంతమున నాకు యిన్ని బాసలేల సేసేవు
వింతవారిఁ దేకుండితే వేవేలు
యెంత లేదు నీవుమాతోనేఁటికిని నవ్వేవు
యెంతైనా సేవ సేసేము యిక్కువంటకువయ్యా

చ. 3: జట్టిగొని నన్ను నేల సారె సారెఁ బొగడేవు
గుట్టున నీ వుండితేనే కోటానఁగోటి
యిట్టె శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
బెట్టుగ మెచ్చేఁగాని పెనఁగకువయ్యా

రేకు: 0616-4 నాగవరాళి సంపుటం: 14-094

పల్లవి: చూచినవారేమందురు సుదతునెల్లా
యేచి సదమదముగా నింత పెనఁగితివి

చ. 1: ఆఁటది వలచెనంటా నంగడిఁ బెట్టేవు నీవు
నాఁటకుఁడ యెవ్వరైనా నమ్మఁగవద్దా
నీటుతోడ సిగ్గువడి నిలుచుండఁగా బయ్యద-
చాటున నున్న గుబ్బలు సారెకు గీరితివి

చ. 2: కన్నె నీతొడెక్కెనంటా కాకుసేసే విన్నిటాను
వన్నెకాఁడ వాడవారు వలవవద్దా
వున్నతిఁ దలవంచుక వుండఁగానే మోవితేనె
సన్నలఁ బరచి చప్పుచాడు సేసితివి

చ. 3: ముద్దరాలలమేల్మంగ మొక్కెనంటా నవ్వేవు నే-
మద్దో శ్రీవేంకటేశ నిన్నవునవద్దా
గద్దించి కాఁగిటిరతిఁ గలయఁగ మేనెల్ల
చద్దివేడి చెమటలఁ జౌకులు రేఁచితివి

రేకు: 0616-5 దేశాక్షి సంపుటం: 14-095

పల్లవి: కోడెకాఁడు గదవమ్మ గోవిందరాజు
వేడుక మోవులతేనె విందారగించీని

చ. 1: కొలువు కూటములోన గోవిందరాజు వాఁడే
పలుమారుఁ జెలులతోఁ బందేలాడీని
నిలువుల మేడమీఁద నిలిచి గోవిందరాజు
వలపులు చల్లుచును వసంతాలాడీని

చ. 2: కోరి కేళాకూళిలోన గోవిందరాజు వాఁడే
సారె నింతులతో నీరు చల్లులాడీని
తూరుచు సింగారపుఁ దోటలో గోవిందరాజు
సైరణ లేకందరితో జాజరలాడీని

చ. 3: గోముల శ్రీ వేంకటాద్రి గోవిందరాజు వాఁడె
రామలతోడుతను సరసమాడీని
గామిడై పాన్పుపైఁ గూడి కందువగోవిందరాజు
మోములు చూచందరితో ముచ్చటలాడీని

రేకు: 0616-6 పాడి సంపుటం: 14-096

పల్లవి: అప్పటి నెరఁగనటే ఆడనున్నాఁడు
చెప్పేఁగాని తగబుద్ధి చేరఁ బిల్వవే

చ. 1: వొట్టుక యెవ్వతో చీర కట్టి విడిచినది నాఁ
పెట్టెలోనఁ బెట్టినాఁడు పిలువఁగదే
గుట్టుతోడ రాకున్న కొమ్మలిందరుఁ జూడఁగ
అట్టె కొంగువట్టి తీసి ఆనవెట్టవే

చ. 2: బాలకి యెవ్వతో మెట్టె పాదానఁ బెట్టినది నా
వేలఁ బెట్టిపోయినాఁడు వేగఁ బిల్వవే
ఆలరి పరాకు సేసుకట్టై వుంటే నిందరిలో
వోలిఁ గొప్పువట్టి తీసి వొట్టు వెట్టివే

చ. 3: యెవ్వతో బన్నసరము ఇదె నామెడ వేసెను
చివ్వన శ్రీ వేంకటేశుఁ జేరఁ బిల్వవే
మవ్వానా నన్ని దె కూడె మతకాన రాకున్న
రవ్వగాఁ జేపట్టి తీసి రచ్చవెట్టివే

రేకు: 0617-1 దేసాళం సంపుటం: 14-097

పల్లవి: ఏమి సాకిరి వెట్టే వింతులనెల్లా
చేముంచి కొనగోరఁ జెనకుదుఁగాక

చ. 1: మంకుతోడి మానిని మాటలాడీనా నీతో
జంకించి బొమ్మల నిన్ను సాదించుఁగాక
అంకెలఁ జెరఁగు వట్టి అట్టె లోనికిఁ దీసి
కంకిగాఁ గాఁగిట నిట్టే కలతువుగాక

చ. 2: మందెమేళమైన సతి మరియుఁ గిందుపడీనా
యెందునైనా నీవుర మెక్కుఁగాక
సందడి నీవె యాపెను చన్నులంటి పాన్పుపై
చిందర వందర సేసి చేకొందువుగాక

చ. 3: గబ్బితనమైన సతి ఘాతలకు లోఁగీనా
వుబ్బున నీమేనిట్టె వొరసుఁగాక
అబ్బురమై శ్రీవేంకటాధిప కూడితి విట్టె
నిబ్బరానఁ జనవిచ్చి నెరవేర్తుగాక

రేకు: 0617-2 భైరవి సంపుటం: 14-098

పల్లవి: ఏడమాటలైనా నాడి యెలయించేవారము
జోడుగూడి నిన్నంతేసి చొక్కించఁ గలమా

చ. 1: మందెమేళమున మారు మలసేటివారము
సందడిఁ బెండ్లాడేటి సతులము
పందెపు సరసములఁ బదరేటి వారము
చెంది రతుల మెప్పించఁ జిత్తము వచ్చేమా

చ. 2: వుద్దండపుఁ జెనకుల వొరసేటి వారము
గద్దరి తనముల బింకపు వారము
పెద్దరికానకు మోవి పిప్పి సేసేవారము
వద్దనుండే యట్టి యితవరులఁ బోలేమా

చ. 3: ఇచ్చకపు సేవసేసి యింపు చల్లేవారము
కొచ్చి చనుఁగొండలను కుమ్మేవారము
మచ్చిక శ్రీ వేంకటేశ మమ్ము నిట్టె కూడితివి
తచ్చి తచ్చి నిన్నాసుద్ది తలపించ నోపేమా

రేకు: 0617-3 మధ్యమావతి సంపుటం: 14-099

పల్లవి: వేఁడుకొనఁ గదవయ్య వేగమె నీవు
వాఁడి గోరితాకులకు వడిఁ దిట్టకుండునా

చ. 1: ఆఁటది చిగురువంటి దంతగాసి కోపదు
గాఁటపు మాటాడితేనే కసుగందును
యేఁటికిఁ బిసికితివి యెగసక్కేనఁ జన్నులు
గూఁటఁ జిక్కి యిందుకాపె కోపగించకుండునా

చ. 2: జవ్వని పూవువంటిది సడిఁబడ నోపదు
నవ్వితేనే వసివాడి నాము వేసును
రవ్వగా గిలిగింతురా రచ్చలోన మర్మములు
ఇవ్వల నిందుకునాపె యెగ్గువట్టకుండునా

చ. 3: కన్నియ పూఁపవంటిది కాఁకలకు నోపదు
పన్నిచేతఁ బట్టితేనే పాలుదీసును
అన్నిటా శ్రీ వేంకటేశ అలయించితి కాఁగిట
సన్నల నిన్నిందుకాపె సాదించకుండునా

రేకు: 0617-4 గౌళ సంపుటం: 14-100

పల్లవి: దానికేమి అన్నియును తరవాత మెచ్చయ్యీని
నానఁబెట్టుకున్న దాన నవ్వకుండేదానవా

చ. 1: కోరి నిన్ను నే నిట్టే కొంగు వట్టితీసితేను
వోరి! నన్నుఁ గాదనేవా వొల్లననేవా
పారితెంచి నీలోనిబత్తి చూతామంటాఁ గాక
వూరకున్నదాన నీకు నోపకున్న దాననా

చ. 2: ముప్పిరిఁ గాఁగిట నించి మోవి గంటిసేసితేను
వొప్పి కరఁగకుండేవా వొల్లననేవా
దెప్పరపు నీబాస తెలిసేకొఱకుఁ గాక
చప్పుడు సేయకుందాన జడిసి వుందాననా

చ. 3: తగుల నీనోరిలోనఁ దమ్ములమునే నిడితే
నొగిఁ జేకొనకుండేవా వొల్లననేవా
నిగిడి శ్రీ వేంకటేశ నీవు నన్ను నేలితివి
అగపడి వున్న దాన నలసి వుందాననా

రేకు: 0617-5 ఆహిరి సంపుటం: 14-101

పల్లవి: ఏల వేగిరించేవు యెమ్మెలేల సేసేవు
తాలిమితోఁ గాని కాని దక్కేవు నీవు నాకు

చ. 1: సిగ్గుతో నేమరుండఁగాఁ జెక్కు గోర నొత్తితివి
దగ్గరుమా గోరు నిన్నుఁ దాఁకించే నేను
సగ్గక అల్లంతనుండి సాములెన్ని సేసినాను
అగ్గమై రావలెఁగా మాయండకు నీవిపుడు

చ. 2: పరాకై వుండఁగా నిమ్మపంట నీవు వేసితివి
మరల వేయిమా నిన్ను మళ్ల వేసేను
తెరాకడనుండి నీవు తిలకించి చూచేవు
విరాలిఁ బానుపు పైకి విచ్చేయవలెఁగా

చ. 3: నిద్దిరించేవేళఁగా నీవు నావురమెక్కితిఁ
వొద్దికఁ బొరలుమా నీవుర మెక్కేను
గద్దరి శ్రీ వేంకటేశ కాఁగిట బిగించేవు
వద్దు ఇంకా నావంతుఁ రావలెగా రతులకు

రేకు: 0617-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-102

పల్లవి: నేనేమిసేతునే నెలఁతలాల
పూని వెరపు దెలిపి బుద్ధి చెప్పరే

చ. 1: తనమోము చూచితేను తతిగొనీ నాకు నవ్వు
యెనయక తానేల యెగ్గుపట్టీనే
అనువుగా నేనెంత ఆనవెట్టినా నమ్మఁడు
తనచేత దలఁచుక తానే యలిగీనే

చ. 2: పలికితే తాఁ జేసేపనులు తొరలి వచ్చీ
యెలమిఁ దానేల యిందు కెగ్గుపట్టీనే
పలుమారు నిందుకుఁగా బాససేసినా నమ్మఁడు
చెలఁగి తనకుఁ దానే సిగ్గులు వడీనే

చ. 3: కూడితేను తనవొళ్లి గురుతులు రేఁగీని
యీాడనె తానేల యిందు కెగ్గువట్టీనే
ఆడ నంటే శ్రీ వేంకటాధీశుఁడు నమ్మఁడు
వేడుకఁ దనలోఁ దానే విచారించు కొనీనే

రేకు: 0618-1 హిందోళం సంపుటం: 14-103

పల్లవి: ఆలరిజాణఁడవని అంటిఁగా నేను
ఆలనైతి నింతయేఁటికంటిఁగా నేను

చ. 1: చేరిచేరి నీవు నాతో సెలవుల నవ్వఁగాను
ఆరు చేతఁ బట్టకుమనంటిఁగా నేను
నేరుపుల మాటలెల్లా నీవు నాతో నాడఁగాను
ఔరా మెచ్చితినని అంటిఁగా నేను

చ. 2: సేసవెట్టి యట్లానే చేతులు చాఁచఁగాను
ఆసలఁ బెట్టకుమని అంటిఁగా నేను
లాసి సరసముల నీలాగు లెల్లాఁ జూపఁగాను
ఆసుద్దులు యెరుఁగుదు నంటిఁగా నేను

చ. 3: కప్పురము నీ విచ్చి కాఁకలు చల్లార్చఁగాను
అప్పుడే సంతోషించి అంటిఁగా నేను
ముప్పిరి శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
అప్పణిచ్చుదాఁకానుంటి నంటిఁగా నేను

రేకు: 0618-2 బౌళి సంపుటం: 14-104

పల్లవి: ఇంత దొడ్డవాఁడవు యెరఁగని మముబోంట్ల
పొంతనే తీరుకుఁ దెచ్చి భోగించవయ్యా

చ. 1: సేవ సేయ నేరకున్నా చేయెత్తి మొక్కనేరుతు
కైవసమై మాబత్తి గైకొనవయ్యా
యే వలపించ కుండినా నింట నుండఁగల నీకు
భావముతోనుండి మమ్ము బదికించవయ్యా

చ. 2: కొనియాడ నేరకున్నా కోరి పిలువ నేరుతు
ఘనుఁడవు మామచ్చిక గైకొనవయ్యా
వొనరి పొందకుండినా వొద్ద నుండఁగల నీకు
యెనలేని మాకోరిక యీడేర్చవయ్యా

చ. 3: పైకొనఁగ నేరకున్నా పాన్పు వరచ నేరుతు
కాకు సేయక నాయాస గైకొనవయ్యా
యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీకు దేవుల నైతి మన్నించఁ గదవయ్యా

రేకు: 0618-3 నాట సంపుటం: 14-105

పల్లవి: విడె మందుకొనవయ్య వెస నంది యిచ్చీని
విడనాడ నున్న దావెలఁది యెడాటాన

చ. 1: సలిగె గలుగువారు సాదించ దొరకొంటే
కొలఁది మీరుదురు కోపగింతురు
కలసి మెలసి నట్టి ఘనుఁడవు నీవింత
చలపట్టనున్నదా సతియెడాటాన

చ. 2: ననుపు గలుగువారు నవ్వు నవ్వ దొరకొంటే
తనువులు సోఁకింతురు తమి రేఁతురు
చన విచ్చినటువంటి జాణఁడవు నీవింత
పెనఁగఁగ నున్నదా ప్రియురాలెడాటాన

చ. 3: తగవులు గలుగువారు తమకించ దొరకొంటే
పగటు నెరపుదురు పచారింతురు
మగువఁ గూడితివి నెమ్మది శ్రీ వేంకటేశుఁడ
అగడు సేయనున్నదా అంగనయడాటాన

రేకు: 0618-4 మంగళకౌశిక సంపుటం: 14-106

పల్లవి: నీ చిత్తమిఁకను నేరములెంచకు నన్ను
యేచి నీ ముందర యిఁకనేమి సేతురా

చ. 1: సిగ్గులు వడఁగఁ బోతే సెలవినవ్వులు వచ్చీ
వెగ్గళము నవ్వితేను వేడుక వుట్టీ
అగ్గలవు వేడుకకు ఆయములు గరఁగీని
యెగ్గెరఁగదు జవ్వన మేమిసేతురా

చ. 2: మాటలణఁచుకొంటేను మనసెల్లాఁ జిమ్మిరేఁగీ
పాటించి మనసొగ్గితే పట్టీఁ దమి
నీటునఁ దమి పెంచితే నెలకొనీ విరహము
యీటుమీరీ జవ్వనము యేమి సేతురా

చ. 3: పాదా లొత్తుకుండితేను పారీఁ గాఁగిటికిఁ జేయి
పోదిఁ జేతులు చాఁచితే భోగ మబ్బీని
యీదెసశ్రీ వేంకటేశ యిట్టెనన్నుఁ గూడితివి
యేదెసా మించీ జవ్వన మేమిసేతురా

రేకు: 0618-5 బౌళి సంపుటం: 14-107

పల్లవి: ఇంటిలోనే వుండేను యింపుదనకు మీఁదెత్తి
కంటకము లేక వూడిగము గొననీవే

చ. 1: నగఁగా నెట్లనో నాండ్లేలేదొరతోడ
మొగము చూడఁగా నేడ వెగట్లౌనో
బిగువుఁ జన్నుల నొత్తి పెనఁగితే నేపంతమో
అగడు సేయక బుద్ధి ఆనతిమ్మనఁగదే

చ. 2: మాటలాడఁగా నెట్టో మదించినవానితోడ
గాఁటాన విడె మియ్యఁగా కార మెంతౌనో
కాటుక కన్నులఁ జూడఁగా నేడఁ దాఁకునో
ఆఁటదాన నాకు బుద్ధి అది యిమ్మనఁగదే

చ. 3: చేరి కొలువఁగా నెట్టో శ్రీ వేంకటేశ్వరుతోడ
మేరతోఁ గూడితే మందెమేళ మెంతౌనో
గారవించి తానె నన్నుఁ గాఁగిలించి మన్నించె
కూరిమితో నింకా నిట్లఁ గూడుండుమనఁగదే

రేకు: 0618-6 పాడి సంపుటం: 14-108

పల్లవి: ఇన్నిటా దేవరవు నిన్నేమీ ననఁజాలను
తన్నుఁదానే వచ్చీ మేలు దండము నీకు

చ. 1: యెక్కడో ఆపెను నన్నునిద్దరి మాట లాడించి
తక్కులఁబెట్టకు మిదె దండము నీకు
వొక్కరిచేతివిడె మొక్కరిచేతికిచ్చి
తక్కువ సేయకు మిఁక దండము నీకు

చ. 2: వొప్పి వొరట్లు వెట్టి వూడిగాలు సేయించుక
దప్పి దేరించకు మోవి దండము నీకు
కప్పి వొక్క రొక్కరినిఁ గాఁగిలించు కొమ్మని
తప్పించుకోకుమిఁక దండము నీకు

చ. 3: యెగసక్కేల కిద్దరి నిరుమేలాఁ బెట్టుకొని
తగవులఁ బెట్ట కంత దండము నీకు
నిగిడి శ్రీ వేంకటేశ నేఁడు మమ్ము నేలితివి
తగులు విడువకిఁక దండము నీకు

రేకు: 0619-1 సౌరాష్ట్రం సంపుటం: 14-109

పల్లవి: ఈడేరె నీచలములు యిఁక రావయ్యా
యీడు మిగిలినవాఁడవిఁక రావయ్యా

చ. 1: పంతగాఁడ వౌదువు బలుదొర వౌదువు
యింతదడవు రావైతి విఁక రావయ్యా
దొంతి నున్నది వలపు దోమతెరలోపల
యింతి నీ కెదురు చూచీ నిఁక రావయ్యా

చ. 2: గట్టివాయ వౌదువు గద్దరీఁఢ వౌదువు
యిట్టె కానికిచ్చితిమి యిఁక రావయ్యా
పట్టి వున్నది బోనము పడఁతి మోవితేనెల
యెట్టనెదిటిమేడకు నిఁక రావయ్యా

చ. 3: వేడుకకాఁడ వౌదు శ్రీ వేంకటేశుఁడ వౌదువు
యీడకు రప్పించి కూడి తిఁకరావయ్యా
సూడిదె వట్టి వున్నది సుద్దు లలమేలుమంగ
యీడేరెఁ బీఁటమీఁదికి నిఁక రావయ్యా

రేకు: 0619-2 సామంతం సంపుటం: 14-110

పల్లవి: మంచిముహూర్తమున శ్రీ మంతులిద్దరు
చంచులఁ బూవుదండలు చాతుకొనే రదివో

చ. 1: సారిదిఁ బేరటాండ్లు సోబానఁ బాడఁగాను
హరియు సిరియుఁ బెండ్లియాడేరదే
తొరలి యంతటా దేవదుందుభులు మొరయఁగ
గరిమ బాసికములు గట్టుకొనే రదివో

చ. 2: మునులు మంగళాష్టకములు చదువుచుండఁగ
పెనగుచు సేసలు పెట్టేరదే
ఘనులు బ్రహ్మాదులు కట్నములు చదువఁగ
వొనరి పెండ్లిపీఁట పైనున్నారదివో

చ. 3: అమరాంగనలెల్లాను ఆరతు లియ్యఁగాను
కొమరార విడే లందుకొనే రదివో
అమరి శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
క్రమముతో వరములు గరుణించే రదివో

రేకు: 0619-3 కాంబోది సంపుటం: 14-111

పల్లవి: అంగపడితిమి నీకు నాస లాసలా
నగవు లాయఁ బనులు నవ్వవయ్యా

చ. 1: అట్టె నీమీఁద నానలెల్లాఁ బెట్టఁగాను
బట్టబయలు వచ్చితిఁ బని యేమయ్యా
రట్టు సేసితివి తొల్లే యిట్టె కడు వలపించి
చిట్టకమేమి సేసేవు సేయవయ్యా

చ. 2: పైకొని నా కొంగు వట్టి బలుములు సేయఁగాను
అకడిమోమీకడైతి నానతీవయ్యా
చీకాకు సేసితివి సేస తురుముపైఁ బెట్టి
చేకొంటివి నీ విచ్చలఁ జెనకవయ్యా

చ. 3: కందువకుఁ దీసి నన్నుఁ గాఁగిలించుకొనఁగాను
యిందుకే నిన్ను గూడితి నేమనేవయ్యా
అందపు శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
చెందితి నాపై దయ సేయవయ్యా

రేకు: 0619-4 ఛాయనాట సంపుటం: 14-112

పల్లవి: గొంటరి విన్నిటా నిన్నుఁ గొసరఁగఁ జోటేది
వింట గాక నీసుద్దులు వెఱచేవా ఇందుకు

చ. 1: పల్లదపుమాటలాడి పక్కన వేడుకొనేది
చెల్లునయ్యా నీకే యిట్టి చేఁతలెల్లాను
కల్ల నీ మీఁదనే మోపి కడవారేమనినాను
వెల్లవిరిగా నీవు వెఱచేవా ఇందుకు

చ. 2: విరులనుఁ దాఁకవేసి విడెము చేతికిచ్చేది
దొరవు నీ కలవాటు తొల్లే యిది
తరమిడి నీకింత తగవని యెవ్వరన్నా
విరివి గొందువుగాని వెఱచేవా యిందుకు

చ. 3: గక్కన గోరు దాఁకించి కాఁగిలించ కూడేది
దక్కెనయ్యా శ్రీ వేంకటోత్తముఁడ నీకు
చక్కని యలమేల్మంగ సాదించి నీవురమెక్కె
వెక్కస మౌదువుగాక వెఱచేవా యిందుకు

రేకు: 0619-5 మాళవి సంపుటం: 14-113

పల్లవి: అన్నిటా దొడ్డవాఁడవు అననేమి వున్నదిఁక
వున్నతి నెందరి నిఁక మన్నించ నున్నాఁడవో

చ. 1: బడిబడి చెప్పఁగానే పండ్లు వులిసీ నిదే
కడు నీసుద్దులు చింతకాయ వంటివి
జడియక యెప్పుడూ నీ సంగడిఁ గూచుండితేను
యెడయక ఇఁక మరి యెంత నోరూరించునో

చ. 2: సోమరించి యేపాటి సోకిఁనాఁ గాఁకలు రేఁగీ
ప్రేమ నీచేఁతలు ఆవపిండివంటిది
దోమటి నీ కంచము దొడికితే వలపలు
తామెర దంపరలై తల కెంత యెక్కునో

చ. 3: సొగిసి శ్రీ వేంకటేశ చూచితేనే ఆ వుట్టీ
తగునీనవ్వులు పంచదారవంటివి
అగడుగఁ గూడితివి అలమేలుమంగ నేను
జగతి నీ మోవితేనె చవెంత పుట్టించునో

రేకు: 0619-6 దేశాక్షి సంపుటం: 14-114

పల్లవి: మాతోనేల చెప్పేవు మాటి మాటికి
నీతో నవ్వుఁగాదన నేరము నేమెన్నఁడు

చ. 1: తప్పని బొంకని నీ తగవులేల చెప్పేవు
తప్పు నీయందేమి గల్గాఁ దడవేరా
చెప్పేరు గొల్లెతలే చేరి యడుగుకోవయ్య
నెప్పున నిన్నుఁ గాదన నేరము నేమెన్నఁడు

చ. 2: నగుచు నీ వోరుపులు నాతోనేమి చెప్పేవు
జగడించినా నిన్ను సాదించేరా
పగటు నీ దయలు చుప్పనాతికిఁ జెప్పవయ్య
నిగిడి నిష్టూరమాడనేరము నేమెన్నఁడు

చ. 3: సారెకు శ్రీ వేంకటేశ సత్యాలేల చెప్పేవు
కారులాడినా నిన్నుఁ గాదనేరా
పోర కలమేల్మంగను బొంకు దైత్యాంగనలతో
నీరతిఁ గూడనే కాని నేరము నే మెన్నఁడూ

రేకు: 0620-1 పర్వగౌళ సంపుటం: 14-115

పల్లవి: చెలి యాతనికి నీవే చెప్పవే బుద్ధి
వొలపక్షాల కింతేసి వోపుదునటే

చ. 1: కాతరించి పలికేది కమ్మటి వేడుకొనేది
ఆతనికిది సాజము ఆయలేవే
పోతరించి వున్న వాఁడు పొద్దువోక పెనఁగీని
వో తరుణి తనతో నేనోపుదునటే

చ. 2: దుండగాలు సేసేది తూరి యానలు వెట్టేది
నిండ నాతనివిద్యలు నేఁడు గొత్తలా
కండ గర్వముకలవాఁడు కైకొని చేతులు చాఁచీ
వుండవే యింతేసిపని కోపదునటే

చ. 3: కన్నుల జంకించేది కాఁగిలించి కూడేది
పన్ని శ్రీ వేంకటేశుని బయకారాలు
మన్నించె నన్నుల మేలుమంగను నే ననఁగాను
వున్నతి నెదురాడఁగ నోపుదునటే

రేకు: 0620-2 సాళంగనాట సంపుటం: 14-116

పల్లవి: నీ చేయే మీఁదుగాక నే నెంతదానను
చేచేత నింకానేమి చెక్కునొక్కేవయ్యా

చ. 1: సాదవు నీవై తేను సారె గొల్లే వాఁడి
యేదెస నెవ్వరినని యేమందును
సాదించ నీతోడిపొందు చలువయు వేఁడీ నాయ
వేద దీర నింకనేమి వేఁడుకొనేమయ్యా

చ. 2: మాట నీది చక్కనైతే మతకాలు వంకరలు
చీటికి మాటికి నెంత చింతింతును
చాటున నీ గుణములు చప్పనానుప్పనా నాయ
బూటకాన నీవెంత బుజ్జగించేవయ్యా

చ. 3: దైవికము నీదైతే తగవులు మానుషాలు
యీవల నలమేల్మంగ నేమి చెప్పేను
శ్రీవేంకటేశ నీచేతలు చిగురూఁ జేఁగా
యీవేళఁ గూడితి వింకానేమి చెప్పేవయ్యా

రేకు: 0620-3 శుద్ధవసంతం సంపుటం: 14-117

పల్లవి: నెలంత చెప్పేదెల్లా నిజమాయను
చెలుల మింతే మాకుఁ జెప్పరాదా యిపుడు

చ. 1: అలసి సొలసి యాపె యానలు వెట్టఁగా నీవు
యెలమిఁ జెవులు మూసుకొనేఁటికిపుడు
మెలఁగి యట్లైతే మేర మీరేవాఁడవే కదా
కలనీగుణమెల్లాఁ గానవచ్చెనిపుడు

చ. 2: చెనకుచు నాపైఁజేతులు చాఁచఁగానే
పెనఁగియేల ముసుఁగు వెట్టుకొనేవు
మనసు రాకిట్లైతే మండాడేవాఁడవే కద
ఘనుఁడవు నీవిద్యలు కానవచ్చెనిపుడు

చ. 3: కందువ నలమేల్మంగ కాఁగిలించి కూడఁగానే
విందవై శ్రీ వేంకటేశ వెరగందేవు
యిందులోనే యిట్లైతే ఈయకొంటివె కదా
కందులేని నీ మోహము కానవచ్చెనిపుడు

రేకు: 0620-4 నట్టనారాయణి సంపుటం: 14-118

పల్లవి: వింత నీతనిఁ జూడవే వేడుకయ్యీని
యెంతైనాఁ దనమేనియెమ్మె చూపీనిపుడే

చ. 1: చెలువునితోఁ బెనఁగి సేసకొప్పు వంచుకువే
కొలువులో శింగారించుకొనెనిప్పుడే
కలువ పూవులు వేసి కపురు మాయించకువే
పొలసి గందపుఁబూత పూసినాఁడిపుడే

చ. 2: నాయకుని పచ్చడము నలఁగఁ దొక్కకువే
వేయరాని వల్లెవాటు వేసెనిప్పుడే
చేయిచాఁచి హారములు చిక్కులు వరచుకువే
కాయకముగా నతఁడు కట్టుకొనెనిపుడే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుని సిగ్గులు వరచకువే
కోవిదుఁడై నిన్నుఁదానే కూడె నిపుడు (డే?)
వావిరిఁ గెమ్మోవెల్ల వాడఁగఁ బీరుచకువే
చేవదేర విడేలు సేసినాఁడిపుడే

రేకు: 0620-5 ముఖారి సంపుటం: 14-119

పల్లవి: మునుపే యెరఁగవద్దా ముందరెత్తులు
వెనకఁ దలఁచుకొని వెరగందేవా

చ. 1: యెట్టనెదురుకట్ల నింతి నిలుచుకుండఁగా
అట్టె తల వంచేవు అది యేమయ్యా
అట్టడివై యాపెమఱఁగున నేమైనఁ జేసి
చిట్టకాల కింతలోనే సిగ్గుపడేవా

చ. 2: మఱఁగున నుండి యాపె మాటలు విన్నదుగఁగ
చిఱునవ్వులు నవ్వి కొంచేవేమయ్యా
మెఱసి దుండగాలెల్ల మీఁద మీఁదఁ జేసి
మఱపు లిప్పుడు నేఁడు మందలించేవా

చ. 3: గక్కన నీ దేవులు కాఁగిలించుకొనఁ గానే
యెక్కుడుప్రియాలు చెప్పే విదియేమయ్యా
వొక్కటై శ్రీ వేంకటేశ వొడ్డినరతులఁ జొక్కి
మిక్కిలి చనవు లిచ్చి మెచ్చు మెచ్చేవా

రేకు: 0620-6 ధన్నాశి సంపుటం: 14-120

పల్లవి: ఆయ నాయ మమునింత ఆఅడిఁ బెట్టికువయ్యా
చేయి చాఁచితే నీవే చిక్కక మానేవా

చ. 1: సారెసారె నీతోను సలిగెలఁ బెనఁగితే
కేరడమాడేవు గాక కిందుపడేవా
గోరపడక నాయంత గుట్టున నేనుండఁగాను
చేరి దైవమైన దయ సేయకుండీనా

చ. 2: పువ్విళ్లార నినునెంత వొడఁ బరచుకొనినా
నవ్వులు నవ్వేవు గాక నన్నుఁ గూడేవా
జవ్వనపాయముతోడ చందము సేసుకుండఁగా
యివ్వల మాపుణ్యమైనా యీడేర్చకుండీనా

చ. 3: సేసలు నేఁ బెట్టినాను శ్రీ వేంకటేశ నీవు
ఆలఁ బెట్టేవు గాక అంట నిచ్చేవా
బాసగొని నిను నిట్టే బలిమిఁ గాఁగిలించఁగాను
వాసికైనా మీ మనసు వలవకుండీనా

రేకు: 0621-1 సింధురామక్రియ సంపుటం: 14-121

పల్లవి: వలపులిద్దరివిని వన్నె కెక్కెను
సళుపుల తమకము సరివచ్చెను

చ. 1: మొలక ముత్యాలవంటి మొనవాఁడి దంతముల
కలికి నీకెమ్మోవి గంటిసేసెను
బలిమి నీవు జంకించి పగడాలవంటిచూపు
చిలికించఁగానట్టే చెలిమేనఁ గప్పెను

చ. 2: మొనమాణికాలవంటి ములువాఁడిగోళ్ళ
వనిత నీ సందుల వంకలొత్తెను
చెనకఁగానీకొప్పు చెదరి యాపె పై నిండి
జినుగునీలచీరయై సిగ్గులెల్లాఁ గప్పెను

చ. 3: పసిఁడికుండలవంటి పంతపు చన్నులు నిన్ను
కొసరి యంగన కులుకుచుఁ గూడెను
యెసఁగి శ్రీ వేంకటేశ యిట్టె నీలాలనీమేను
మిసిమితోఁ బెనఁగఁగా మించులెల్లాఁ గప్పెను

రేకు: 0621-2 సాళంగం సంపుటం: 14-122

పల్లవి: ఔలే యెంతటివాఁడవయ్యా నీవు
యేలుకొమ్మని మొక్కితే నెమ్మోలాయ నీకు

చ. 1: చనవు మెరసి నిను సతి గోరుదాఁకించితే
కనలి కుచ్చితమంటాఁ గాఁతాళించేవు
యెనసి యెవ్వరిచే నేమేమి సేయించుకొనవు
వనితచేఁతకే వాసివచ్చె నీకు

చ. 2: పొందెరుఁగుదువంటాను పువ్వుల నిన్ను వేసితే
నిందుకే మచ్చరమంటా నీసడించేవు
అందరిచే సోఁకినప్పు డౌఁగాదని యనవు
యిందుముఖి చెనకులే యెరవాయ నీకు

చ. 3: చుట్టిరికానఁ జన్నులు సోఁకఁ గాఁగిలించితేను
గట్టువాయతనమంటాఁ గడుఁ దిప్పేవు
ఇట్టె శ్రీ వేంకటేశ యెందరి నీవు గూడవు
అట్టె యీపెరతులు అలవాయ నీకు

రేకు: 0621-3 శుద్ధదేశి సంపుటం: 14-123

పల్లవి: ఎఱుఁగరాదా నీకు నేఁటికింత సేసేవు
చిఱునవ్వుతోడ లోలో సిగ్గులు వడఁగను

చ. 1: మనసె కరఁగీపెను మాటలాడవలెనా
తనువులోపలి మేలు దైవారుఁగాక
పనివడి నీవెల పలుకుమనేవాపెను
తనుఁదానె మోము తప్పక చూడఁగను

చ. 2: చేరి పానుపుపైనుంటే చెనకఁగ వలెనా
తారుకాణై పులకలు దాఁచవు గాక
సారెకు నీవాపెనేల సరసమాడుమనేవు
వూరకే నీమీఁదఁ దాను వొరఁగుకుండఁగను

చ. 3: కందువ సేసవెట్టితేఁ గాఁగిలించవలెనా
చిందుచు మోవితేనెలు చిప్పిలుఁగాక
యిందునె శ్రీ వేంకటేశ యింకేమి సేయుమనేవు
ముందె కూడి నీవురమునఁ దానుండఁగను

రేకు: 0621-4 సాళంగనాట సంపుటం: 14-124

పల్లవి: పదరి నీ వేమిటికిఁ బతికిఁ బతిసేసేవు
పుదుటుఁదనము మేననుండదా ఆపెకు

చ. 1: మొక్కలాన నాపె నిన్ను మోవనాడెనంటాను
చిక్కని కన్నుల మీఁదఁ జీర దీసేవు
వెక్కసపు జవ్వనాన విఱ్ఱవీఁగేచెలి గాన
పక్కన నేమైనాఁ జేయఁ బాడిగాదు ఆపెకు

చ. 2: నగుతానాపె నిన్ను నాటఁ జూచెనంటాను
పగటు పెనుఁదురుము పట్టి తీసేవు
మిగులా మరిపెమున మించినట్టి యింతిగాన
తగిలి నీకంటె మీరఁ దగదా ఆపెకు

చ. 3: చనవుననాపె నిన్నుఁ జన్నుల నొత్తెనంటాను
కనుఁగొని యాపెమోవి గంటి సేసేవు
యెనసె నిన్ను శ్రీ వేంకటేశ నీ దేవులుగాన
చెనకి నిన్నింతసేయఁ జెల్లదా నేఁడాపెకు

రేకు: 0621-5 శంకరాభరణం సంపుటం: 14-125

పల్లవి: తగవు నీ వెఱఁగవా తమకించేవు
వొగరుఁ బ్రియములకు వోరుతురా చెలులు

చ. 1: అక్కరతో నీకునాపె ఆకుమడిచియ్యఁగాను
కక్కసించి నీవే యలుకలు రేఁచేవు
చక్కఁగా వోజతోడుత సాజాన నుండినవారి-
నొక్కటొక్కటే సేసితే నోరుతురా చెలులు

చ. 2: పనివడి యాపె నీకుఁ బాదములు విసుకగా
పెనఁగి చలములెల్లాఁ బెడరేఁచేవు
ఘనుఁడ నీతోఁ జుట్టరికమున నుండినవారి-
నొనర రాఁపుసేసితే నోరుతురా చెలులు

చ. 3: కందువతో నాపె నిన్నుఁ గాఁగిలించి కూడఁగాను
మందలించి కూడచు మైమఱపించేవు
అందపు శ్రీ వేంకటేశ ఆండ్లైవుండిన వారి-
నొందిలి గోరనంటితే వోరుతురా చెలులు

రేకు: 0621-6 సామంతం సంపుటం: 14-126

పల్లవి: చెలులచనవులెల్లాఁ జెల్లించవలెఁ గాక
యెలమి మారుమలసేదింత నీకు వలెనా

చ. 1: వలచినతమకాన వలసినట్లంటేను
చలము సాదింతురా సతితోడను
నిలువెల్లఁ జెమరించి నీమీఁద సొలసితే
పలుమారు నీకు నెగ్గుపట్టఁ దగునా

చ. 2: సేవ సేసేవేగిరానఁ జెయిగాలుఁ దాఁకితేను
కావరించి తిట్టుదురా కలికి నింత
వావిగలుగఁగఁ జూచి వచ్చి సరసమాడితే
భావించి అందుకు నీవు పంతమాడఁ దగునా

చ. 3: కూడిన నిబ్బరమున గురుతులు సోఁకితేను
సూదుకుఁ బట్టుదురా సుదతి నేఁడు
జోడై శ్రీ వేంకటేశ సొమ్ముతో నురమెక్కితే
ఆడినట్టాడుట గాక అలయఁగఁ దగునో

రేకు: 0622-1 భూపాళం సంపుటం: 14-127

పల్లవి: ఎందులోనిదానను యిప్పుడిట్టె వచ్చెఁ దాను
సందడి సరసముల జాణకాఁడు దాను

చ. 1: పవ్వళించి విరహాన బడలి వుండేదానఁ
నెవ్వరితోడి మాట లేఁటికి నాకు
నవ్వితేఁ దానవ్వనీ నా సెలవులకు రావు
అవ్వల వేడుకకాఁడు అన్నిటాను తాను

చ. 2: అచ్చలాన వేగించి అలసి వుండినదాన
యిచ్చకపు మొక్కు మొక్కనేఁటికి నాకు
హెచ్చి తా సంతోషించితే యింపు నామతిఁబుట్టదు
పచ్చిసింగారాలతోడి పంతగాఁడు తాను

చ. 3: తనకాఁగిటనె కూడి దక్కివుండినట్టిదాన
యెనలేని మెచ్చు మెచ్చనేఁటికి నాకు
యెనసె శ్రీ వేంకటేశుఁ డింతకంటె నేమి సేతు
మనసిచ్చి అందరికి మంచివాఁడు దాను

రేకు: 0622-2 మలహరి సంపుటం: 14-128

పల్లవి: నాలికాఁ డింతులలాగు నాఁడెరఁగఁడా
మేలుతోనే కిందట మీఁదటకాఁగాక

చ. 1: చనవిచ్చినట్టివాఁడు సతినేల తాఁదిట్టె
పెనఁగి యేమి సేసినాఁ బ్రియమె కాక
ననుపు గలుగువాఁడు నవ్వితే నెగ్గేలపట్టె
గునియక అట్టె వోర్చుకొనుఁగాక

చ. 2: మచ్చిక గలుగువాఁడు మారుమాట లేలాడే
కొచ్చి యేమాడినా నియ్యకొనుఁ గాక
పచ్చిగా వలచువాఁడు పంతా లేఁటికిఁ జూపె
యిచ్చకములే నెరపి యెనయుఁగాక

చ. 3: పొదిగి కూడినవాఁడు బొమ్మలనేల జంకించె
కదిసినరతులెల్లాఁ గైకొనుఁగాక
యిదివో శ్రీ వేంకటేశుఁ డిప్పుడేఁటికిఁ బదరె
యెదపై నాపెఁ బెట్టుక యిల యేలుఁగాక

రేకు: 0622-3 ఆహిరి సంపుటం: 14-129

పల్లవి: అందుకెంతసేసేవు అప్పటి నీవు
కిందుపడి మొక్కఁగాను కేలు దాఁకెనపుడు

చ. 1: వెక్కసా లాడఁగ నేల వేడుకో నప్పటి నేల
వొక్కరీతినే గుట్టున నుండనీరాదా
చక్కనిరమణికి సీచనవిచ్చి రమ్మనఁగా
చెక్కునొక్కఁ బోతేను జీరవారె నపుడు

చ. 2: సోఁక నలయించనేల సురటి విసరనేల
వూఁ కొనినమేలుతోడ నుండనీరాదా
యేఁకరి నీవే మోవియిమ్మనఁగాఁ దనపల్లు
సోఁకితేనే ముద్రలై చూపట్టెనపుడు

చ. 3: కడుఁగాక రేఁచనేల గందము వుయ్యఁగనేల
వొడికాన నీవద్ద నుండనీరాదా
అడరి శ్రీ వేంకటేశ అప్పణిచ్చి కూడఁగాను
వుడివోక పురముపై నునికాయనిపుడు

రేకు: 0622-4 హిజ్జిజి సంపుటం: 14-130

పల్లవి: మఱివేళ లేదా మనసు నిలుపరాదా
గుఱిగానిప్పుడే నన్నుఁ గూడఁగ వలెనా

చ. 1: చెఱఁగు మాసినదాన సిగ్గువడుచున్నదాన
జఱసి సరసమేల సారెనాడేవు
చిఱునవ్వుతో నుందాన చెమటచిత్తడిదాన
యెఱుఁగుదువన్నియును యేమి బాఁతి నేను

చ. 2: చెదరుఁ గురులదాన చేయెత్తి మొక్కేదాన
అదనెఱఁగక యేల అంటవచ్చేవు
మదమొలికేటిదాన మాటున నుండేదాన
యిదివో యిట్టున్న దాన నేమిబాఁతి నేను

చ. 3: మంచముపైనున్న దాన మతిలో లోఁగేదాన
యించుకంతా సిబ్బితిలేకేల కూడేవు
మంచి శ్రీవేంకటేశ నీ మనసు చూచినదాన
యేంచక నన్నేలితివి యేమిబాఁతి నేను

రేకు: 0622-5 దేవగాంధారి సంపుటం: 14-131

పల్లవి: ఇద్దరు మీరు గూడితిరిది మాకుఁ బదివేలు
చద్ది వేఁడి బాసకు నే సాకిరయ్యే మీకును

చ. 1: కోరిన కోరికలాయ కొమ్మ నీతో మాటలాడె
కూరిమి నెవ్వరితోడి గొడవేఁటికి
చీరకొంగేల పట్టేవు సిగ్గుగాఁగా మాకిఁక
ధీరతతో నుండరయ్య తెర వేసే మీకును

చ. 2: నేసినచేఁతలు చెల్లె చెలి నీకు విడెమిచ్చె
ఆసల నెవ్వరితోఁ జెల్లాటాలేఁటికి
బాసికమేల కట్టేవు పంతమా మాకేమైనా
సేస వెట్టుకోరయ్య నెచ్చెలినయ్యే మీకును

చ. 3: పట్టిన వ్రతము చెల్లె పడతి నిన్నిటు గూడె
జట్టిగా నెవ్వరితోడి సడ్డ యేఁటికి
గట్టిగా శ్రీవేంకటేశ కలసితివిటు నన్ను
యిట్టె వద్దనుండరయ్య చుట్టమ నే మీకును

రేకు: 0622-6 కన్నడగౌళ సంపుటం: 14-132

పల్లవి: చెలికత్తెలము నేము చెప్పక పోదు
యెలమి నీయేతులకు యెడమెంత లేదు

చ. 1: మగువ నీతోనిపుడు మంచిమాట లాడరాదా
యెగసక్కేలకుఁ బొద్దు యెంత లేదు
మొగము చూచి యాపెమొక్కులు చేకొనరాదా
మగతనపుబీరము మరి యెంత లేదు

చ. 2: చెలియ సేసేటి యట్టి సేవ లియ్యకొనరాదా
యెలయింపు నవ్వులకు యెంత లేదు
కలసి యాపెనిందుకు కాఁగిలించుకొనరాదా
అలమి నీలోనిగుట్టు అది యెంతలేదు

చ. 3: చనవిచ్చి యాపెతో సరసమాడఁగరాదా
యెనసిన నివ్వెరగు యెంతలేదు
పనివడి యాపెఁ దొడపై నిడుకొనరాదా
అనుఁగు శ్రీ వేంకటేశ ఆలపెంతలేదు

రేకు: 0623-1 కన్నడబంగాళం సంపుటం: 14-133

పల్లవి: ఎంతైనా నాడువారము యించుకంతగుట్టు వలె
పంతమున నొరపులు పట్టవద్దు మమ్మును

చ. 1: యెవ్వతెకు వలతువో యెరఁగము నీ మనసు
నవ్వఁగానెట్టుండునో నడుమంత్రాన
ఇవ్వలనంతే కలితే నేకతానకు రావయ్య
చివ్వన మమ్మీడఁ గాకసేయవద్దు నీవు

చ. 2: యేడయింతిఁ దలఁచితో ఇంపు నీ కెటువలెనో
వీడె మీఁగా నెట్టుండునో వేళెరఁగక
వేడుక నీకుఁ గలితే విడిదికి రావయ్య
వాడలోన రట్టుసేయవద్దు మమ్ము నీవు

చ. 3: యేసతి మీకుఁ జుట్టుమో యెంత గద్దో నీయాస
సేసవెట్టితేనెట్టో సిగ్గువడక
వాసితోడ శ్రీ వేంకటేశ్వర మమ్ము నేలితివి
వేసాలకు మాపైదూరు వేయవద్దు నీవు

రేకు: 0623-2 దేశాక్షి సంపుటం: 14-134

పల్లవి: ఔలేవయ్య యెఱఁగుదు మందరిముందర నీవు
మేలములాడితేనే యెమ్మెలు మెరసేవా

చ. 1: శిరసు వంచుకుండఁగా జిన్న బోయుందాననంటా
ఆరిదిఁ జెక్కువట్టి ఆడుమనేవు
దొరవు నీ వెఱఁగవా తొల్లిసేసినసేఁతలు
తిరిగి యాడించుకొను దేవరకు వేడుకా

చ. 2: ఆవలిమోమై వుండఁగా నలిగి వుందాననంటా
చేవట్టి తీసి నన్నుఁ జెప్పుమనేవు
నీవే యెఱఁగవా నీ నడక లన్నియును
వావాత నే విన్నవించ దేవరకు వేడుకా

చ. 3: పానుపుపై నుండఁగాను పంతాన నుందాన నంటా
సేనగా శ్రీ వేంకటేశ చెప్పుమనేవు
నీ నటనలెఱఁగవా నేఁడు నన్నుఁ గూడితివి
తేనెమోవినాడించుకో దేవరకు వేడుకా

రేకు: 0623-3 లలిత సంపుటం: 14-135

పల్లవి: నేము వచ్చి తడవాయ నీజాగెంతై నాఁగద్దు
రామవద్దికి నిప్పుడే రాఁగదవయ్యా

చ. 1: మాపుదాఁకా నీతోను మాటలాడనే పట్టె
యేపొద్దు చెలియవద్ది కేఁగేదయ్యా
చూపుల నీసింగారాలు చూడనే యిందాఁకాఁబట్టె
ఆపె వూడిగాన నెప్పుడండనుండేమయ్యా

చ. 2: కాచుకుండి నీ కిందాఁకాఁ గానుకలియ్యనే పట్టె
ఆ చెలితో మారుమాటేమనేమయ్యా
చేచేత నీ చేఁతలకు సెలవినవ్వనే పట్టె
చూచి యాపెతో నేపొద్దు జూజమాడేమయ్యా

చ. 3: రాజసపు నిన్నింటికి రప్పించనే పట్టె
తేజము లాపెకెప్పుడు తెలిపేమయ్యా
సాజాన శ్రీ వేంకటేశ సతినిట్టె గూడితివి
యీజాడ నింకనెట్టు యెచ్చరించేమయ్యా

రేకు: 0623-4 మాళవిగౌళ సంపుటం: 14-136

పల్లవి: కాదంటేఁ బోవునా ఘనుఁడు చెప్పినపని
ఆదుకొని యాడినట్టే ఆడవలెఁ గాక

చ. 1: తగవు తాఁ జెప్పునట తప్పులెంచఁ జోటేది
వెగటు లేకిద్దరము వినేముగాక
జగడాలు వెట్టి తానే సందిమాటలాడునట
పొగడి మాలో నేమే పొసఁగేము గాక

చ. 2: దోసము లేదనునట తోసి పోనాడఁగనేమి
వేసారక యిద్దరము వినేము గాక
వాసులు రేఁచి తానే వద్దని కూరుచునట
బాసలు నేమే సేసుక బతికేము గాక

చ. 3: ఇద్దరిఁ దా నేలునట యీసడించ నేమిపని
వొద్ద నిరుదిక్కులా నుండేము గాక
అద్దో శ్రీ వేంకటేశుఁడంటె బుద్ధి చెప్పునట
వుద్దండాలు మాని నేమే వొనరేము గాక

రేకు: 0623-5 శంకరాభరణం సంపుటం: 14-137

పల్లవి: ఓరుచుక యింటిలోన నుండనేరాదా
తూరనిచ్చి వలపుల దొడ్డిఁబెట్టవలెనా

చ. 1: పూరకున్న వారికేల పుడుకులు గట్టేవు
సారెసారెఁ బిలిపించి చౌక సేసేవు
కూరిమి గొసరుతానే గుట్టుతోడఁ దిట్టేవు
గారవించి మమ్మునింత కాకు సేయవలెనా

చ. 2: యేమీ నెఱఁగనివారికిట్టే యాస పుట్టించేవు
చేముట్టి సరసమాడి సిగ్గు రేఁచేవు
దోమటి దొడుకుతానే దొమ్మిసేసి చెనకేవు
సాము సేసేనంటా మమ్ముఁ జండి పెట్టవలెనా

చ. 3: సాదువై వుండినవారిఁ జలపట్టి కూడేవు
బోదించి నానారతుల బుజ్జగించేవు
ఆదిగొని శ్రీ వెంకటాద్రీశ నన్నేలితి
వీదెసనె మమ్మునింత యెచ్చరించవలెనా

రేకు: 0623-6 దన్నాశి సంపుటం: 14-138

పల్లవి: మంచితనాన వచ్చేది మచ్చరించఁగా వచ్చీనా
కంచువలె వాయించి గాసి సేతురా

చ. 1: కక్కసించి మాటలాడి కాతరాన మొక్కు మొక్కి
చెక్కు నొక్కి యేల యింత చిమ్మిరేఁచేవే
అక్కరగలఁడు నీపైనాతఁడు మొదలనే
లక్కవలెఁ గరఁచి యీలాగు సేతురా

చ. 2: వేసరించి వెడ్డు వెట్టి వెక్కసానఁ బెనఁగుచు
గోస నాసచేసి యేల గోరసేసేవే
ఆసపడి వుండు నీకునాతఁడు నీమోము చూచి
వాసె బలపమువలె వడి నింతరాతురా

చ. 3: పంతమాడి కాఁగిలించి బలిమిని గోరుదీసి
మంతనానఁ గూడి యెంత మరిగించేవే
చెంతల నీ ప్రాణము శ్రీ వేంకటేశ్వరుఁడు
బంతివలెఁ బట్టి పట్టి బడలింతురా

రేకు: 0624-1 వంతవరాళి సంపుటం: 14-139

పల్లవి: వేసరితిమన్నిటాను వేడుకొనేమిఁక నిన్ను
సేస వెట్టి మము దయసేయవయ్య యిఁకను

చ. 1: చలపాదివాఁడవు సాదెనకు లోనుగావు
గెలువ వశమా నిన్నుఁ గెరలి మాకు
మొలకనవ్వులతోనె మొక్కేము పలుమారు
చెలులము మాపై దయసేయవయ్య ఇఁకను

చ. 2: మొక్కలీఁడవెప్పుడును మొనచూపరాదు నీకు
చిక్కించ వశమా నిన్నుఁ జేచేత మాకు
పెక్కువినయములతో ప్రియములు చెప్పేవిట్టె
చెక్కు నొక్కి మాపై దయసేయవయ్య ఇఁకను

చ. 3: శ్రీవేంకటేశుఁడవు చెనకఁగరాదు నేఁడు
సేవించ వశమా నిన్నుఁ జేకొని మాకు
దేవుఁడవు నిన్నే నుతించి కూడితిమిదె
చేవదేర మాపై దయసేయవయ్య ఇఁకను

రేకు: 0624-2 గౌళ సంపుటం: 14-140

పల్లవి: పెంటలై వున్నారిదివో పేరటాండ్లిందరును
గొంటరివి యని యాడుకొనేరు గదయ్యా

చ. 1: కడుఁగొత్త పెండ్లికొడుకవు యింతిఁ జెనకేవు
అడఁగి సిగ్గువడవు అదేమోయి
వొడివట్టి తీసేవు వొద్దనిందరు నుండఁగ
తొడ యెక్కించుకొనే విందుకు నవ్వేరయ్యా

చ. 2: బాసికము గట్టుకొని పడఁతిమోమే చూచేవు
ఆసల సిగ్గువడవు ఆదేమోయి
సేసవెట్టి తనియవు చెలులచేనందుకొని
లాసి పొత్తుకుఁ బిలిచే వీలాగుకు నవ్వేరయ్యా

చ. 3: పీఁటమీఁదఁ గూచుండి ప్రియరాలిఁ గూడితివి
ఆఁటదని సిగ్గువడ వదేమోయి
కోటికి శ్రీ వేంకటాద్రి గోవిందరాజ నన్నేలి
పాటించి చెప్పేవాపెకు భామలు నవ్వేరయ్యా

రేకు: 0624-4 పాడి సంపుటం: 14-141

పల్లవి: ఏమి నేరములెంచేవు యెందాఁకాను
గామిడితనానుంటేఁ గడురేఁచుట గాదా

చ. 1: కొప్పు వట్టి తీసి నీవు గోర గీరఁగాఁ జెలికి
ముప్పిరిఁ జెక్కంటరాదా తప్పాయిది
వుప్పతిల్ల మొదల నీ వుద్దండాలు సేసితేను
అప్పుడే చేఁతకుఁ జేఁతకప్పణించుట గాదా

చ. 2: పాదాల బిగించి పట్టి పడఁతిఁ గాఁగిలించఁగ
తోదోపు లాడఁగరాదా దోసమా యిది
సాదువలెనున్న వారి సదమదము సేసితే
పాదుకొని నిన్ను సూడుపట్టుమనుట గాదా

చ. 3: పానుపుపైఁగూడి నీవు పరవశమందించఁగ
మేనిపై నొరఁగరాదా మీరుటా యిది
మేనవారిఁ బెండ్లాడితే మెచ్చగ శ్రీ వేంకటేశ
యీ నెపాన నీపుర మెక్కుమనుటగాదా

రేకు: 0624-4 భైరవి సంపుటం: 14-142

పల్లవి: ఏమని విన్నవించేము ఇన్నియు నీ చిత్తమే
నీమతకమంతయును నెరవేరెఁగా

చ. 1: గోవిందుఁడవైతివి గోపాలుఁడవైతివి
వావులెంచ కిందరిని వలపింతురా
పూవుల వేసినవారు పప్పొడి చల్లినవారు
వోవరిలోపల నీకు వొక్కసరేకా

చ. 2: రాచవాఁడవై తేనేమి రచ్చగొల్లవైతే నేమి
చూచి పాలు వెన్నలు ముచ్చులు కొందురా
కాచుక వుండినవారు గక్కన వచ్చినవారు
చేచేత సేస వెట్టితే చెలఁగి సరే కా

చ. 3: మంచిదేవుఁడవు గా మానిసి రూపైనాఁ గా
కొంచక సతుల నెత్తుకొని వత్తురా
పొంచి శ్రీ వేంకటేశ్వర పొరుగువా రిరుగువాఁ
రెంచ నీకు మంచముపైనిందరు సరేకా

రేకు: 0624-5 మేఁచభవుళి సంపుటం: 14-143

పల్లవి: అమ్మలాల అక్కలాల అతివలాల
దిమ్మరి గదవే వీఁడు తిల్ల గోవిందరాజు

చ. 1: యీవలనావల సతులిరుమేల నుండఁగాను
చేవమీర నవ్వు నవ్వ సిగ్గువడఁడు
పూవుల నొకతె వేసీ పాం చొకతెతో మాటాడి
దేవర గదవే వీఁడు తిల్ల గోవిందరాజు

చ. 2: పేరడిగా నందరును పెనఁగుచు నుండఁగాను
చేరి కొంగులు వట్టీని సిగ్గువడఁడు
మారుకొనొకతెఁ జూచి మర్మము లొకతె నంటీ
తేరినవాఁడు గదవే తిల్లగోవిందరాజు

చ. 3: యిట్టె పాదాలొత్తఁగాను ఇందిరను భూసతిని
చిట్టంటుఁ జేతలఁ గూడీ సిగ్గువడఁడు
గుట్టున శ్రీ వేంకటాద్రిఁ గూడెనిందరు సతుల
దిట్టమైనవాఁడు గదే తిల్ల గోవిందరాజు

రేకు: 0624-6 పాడి సంపుటం: 14-144

పల్లవి: ఎంత దడవై నాఁగద్దా యేలాటాలు
వింతప్రియములు చెప్పి వియ్యమందరాదా

చ. 1: ఆయములంటినప్పుడే అలు కేడదే పతి
చేయి చాఁచినప్పుడే సిగ్గులేడవే
పాయపు విభునినేల పంగించేవే యింకఁ
జాయల సన్నల మొక్కి చనవీయరాదా

చ. 2: కన్నుల నవ్వినప్పుడే కసరేడదే
చన్నులనొ త్తినప్పుడే సటలేడవే
కన్నచోటఁ బతినేల కాకుసేసేవే
విన్నపములెల్లాఁ జేసి విడెమియ్యరాదా

చ. 3: కాఁగిలించుకొన్నప్పుడే కడమేడదే
చేఁగదేర మోవియ్యఁగ చింత యాడదేఁ
యేఁగఁడు శ్రీ వేంకటేశునేల లోఁచేవే
వేఁగక శాసలు వెట్టి వేడుకొనరాదా

రేకు: 0625-1 తోండి సంపుటం: 14-145

పల్లవి: విన్నవించేమని వచ్చి వెరగంది వున్నారము
యిన్నిటాను తెమలవు యేమనేమయ్యా

చ. 1: సరసమాడఁగానే సరివొద్దువోయెను
తెరదీసేననఁగానే తెల్లవారెను
పరగనింతివలపు పండి కై వాలెను
యెరవు సేయవు నిన్ను నేమనేమయ్యా

చ. 2: మనసు చూడఁగానే మాపటిపొద్దాయెను
చనవిచ్చే ననఁగానే జామెక్కెను
వనజాక్షియాసలు వడఁబడి ముదిరెను
యెనయవద్దా నిన్ను నేమనేమయ్యా

చ. 3: పంతములాడఁగానే పడుమటజామాయ
మంతనమాడేకొద్దికి మద్దేనమాయ
చెంతల శ్రీ వేంకటేశ చెలికి బాగ్యముచేరె
యింతగా మన్నించితివి యేమనేమయ్యా

రేకు: 0625-2 సావేరి సంపుటం: 14-146

పల్లవి: కల్లలాడకు మీమాటా కద్దోలేదో
యెల్లవారిలో మాదిక్కు యేమి చూచేవయ్యా

చ. 1: సలిగె గద్దంటానాపె సారె నిన్నుఁ దిట్టెఁగాక
అలసి సొలసినా నే మంత సేసేమా
నెలకొని నీమన్ననే నీకుఁ బైకొని వచ్చె
యెలమిఁ దప్పక మమ్ము యేమి చూచేవయ్యా

చ. 2: బాసగొంటినంటా నాపె బలుములు చూపెఁగాక
వేసరించినా నీతో వెగ్గళించేమా
ఆసల నీతమకమే అంతఅట్టుగాఁజేసె
యేసచూపులను మమ్మునేమి చూచేవయ్యా

చ. 3: పట్టుపుదేవులనంటా భామ నిన్నుఁ గూడెఁగాక
యెట్టు నీవు గూడినాను ఇదేలనేమా
గుట్టున శ్రీ వేంకటాద్రి గోవిందుఁడ మమ్మేలితిఁ
విట్టె నవ్వుతా మమ్మునేమి చూచేవయ్యా

రేకు: 0625-3 బౌళి సంపుటం: 14-147

పల్లవి: ఇప్పుడిఁక నడుగరే యేమనీని
రెప్పలెత్తి చూడకుంటే రేపే మాపాయెను

చ. 1: అప్పటినుండియు విభుఁడక్కడనే వుండఁగాను
కప్పురము నోటికి కారమై తోఁచె
చిప్పిలుఁ దనమాటలు చెవులుసోఁకకుండఁగా
దప్పికిఁ గొన్నపన్నీరు తానే వుడుకాయను

చ. 2: నగుతా నాతోఁదాను నంటు చూపకుండఁగాను
పొగరుఁ గస్తూరిపోఁత పొగులాయను
పగటునఁ బాన్పుపైఁ దాఁ బవ్వళించకుండఁగాను
జిగిఁ గట్టిన చెంగావిచీరే వెట్టాయను

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేతికి లోనుగాఁగా
వేవేలు భోగములు వేడుకాయను
యీవేళఁ దా నన్నుఁ గూడి ఇన్నిటా మన్నించఁగాను
కావలసిన పనులు కడుమంచివాయను

రేకు: 0625-4 సాళంగనాట సంపుటం: 14-148

పల్లవి: ఔనయ్యా మంచివాఁడ వౌదువయ్యా
పూని పట్టి వలపులు పులియఁ బెట్టుదురా

చ. 1: సిగ్గువడ్డాపె నొయ్యనే చెక్కునొక్కుదురు గాక
బగ్గనను గిలిగించి పచ్చిసేతురా
వొగ్గి తలవంచుకుంటే నొడఁబరతురు గాక
బెగ్గిల లేఁతచన్నులు పిసుకుదురా

చ. 2: ముసుఁగు వెట్టుకుంటే మొగము చూతురు గాక
అసురుసురై పెనఁగి అలయింతురా
అసు దైవుండిన కన్నె నాదరింతురు గాక
కిసుకాటపురతుల గిజిబిజి సేతురా

చ. 3: దండనింతి గూచుండితే తమి రేఁతురు గాక
గండుమీరి మేనెల్లా రేకలు దీతురా
నిండార శ్రీ వేంకటేశ నెలఁత నిన్నుఁ గూడెను
దుండగపుసరసాన దొమ్మిసేతురా

రేకు: 0625-5 శ్రీరాగం సంపుటం: 14-149

పల్లవి: దయదలఁచఁగరాదా తరుణిపై నిఁకనైన
ప్రియములు చెప్పేనంటాఁ బెనఁగుచునలసె

చ. 1: వొగరులాడకుమంత వోపదుచెలి నీతో
నగవుల చేతనే మిన్నక యలసె
జగడాలడువకుమీ సంగతులు గావిఁక
మొగమోడి సారెసారె మొక్కి మొక్కి అలసె

చ. 2: పంతాలు చూపుకుమంత పనిలేదు యాపెతోను
వింత నీబాసలు విని విని యలసె
చింతలు రేఁచకుమిఁక సేసినట్టెల్లాఁ జెల్లె
అంతరంగముగ నిచ్చలాడి యాడి యలసె

చ. 3: అలయించుకుమంత ఆరడేల ఇల్లాలితో
కలసి కాఁగిటిలో రతులనలసె
యెలమి శ్రీ వేంకటేశ ఇంతసేసి కూడితివి
అలరిన నీమన్నన లందియంది యలసె

రేకు: 0625-6 ఆహిరి సంపుటం: 14-150

పల్లవి: మన్నించవయ్యా ఇఁక మానినికి నీవె దిక్కు
పన్నిన వలుపే నీకు పాయరానిచుట్టము

చ. 1: చెంతఁ జెక్కునఁ బెట్టినచేతితోడ నుండఁగాను
దొంతరతామెర ఆయఁ దొయ్యలిమోము
మంతనానఁ జూచితేను మనసిజబాణమది
అంతరంగానఁ దగులకది యేల వుండును

చ. 2: వొండొండఁ జన్నులు మోవనొత్తగిలి వుండఁగాను
అండ జంట బాణమాయ నతివమేను
వెండియు మరునికే విరులబంతులవి
దండితనాన నీమదిఁ దగులఁగవలదా

చ. 3: విందుగాఁ దమ్ములములు వీడుదోడులాడఁగాను
అంది చిగురుఁగుత్తులాయఁ జెలిమోవి
చెంది మరుఁడు సేసిన చిగురుఁగానుకలవి
కందువ శ్రీ వేంకటేశ కడుఁబొదులు గావా

రేకు: 0626-1 కన్నడగౌళ సంపుటం: 14-151

పల్లవి: ఇయ్యకొనవద్దా నీవేమిటికైనా
పయ్యదంటి యాతఁడు పనులు చెప్పఁగను

చ. 1: చలము సాదించకువే సారె సారెను
చెలువుఁడు వేఁడుకొని చెక్కు నొక్కిని
పెలుచవై యానలు పెట్టుదురటే
చెలరేఁగి యాతఁడు చేతులు చాఁచగను

చ. 2: మంకులు నెరపకువే మాఁటిమాఁటికి
అంకెలనాతఁడు నిన్ను నలమీని
సంకెలేక బొమ్మలను జంకింతురటే
వంకలొత్తి కొనగోర వలపు రేఁచఁగను

చ. 3: పొదిగి పెనఁగకువే పొద్దు వొద్దుకు
యిదివో శ్రీ వేంకటేశుఁడెనసె నేఁడు
సదరమనుచును కొసరుదురటే
పదిమారులును నీకు బాఁతిపడఁగాను

రేకు: 0626-2 సాళంగనాట సంపుటం: 14-152

పల్లవి: ఇంత నేరమే నేము యిచ్చకములే సేతుము
చెంతలనే కిందుపరచితివే విభుని

చ. 1: మొక్కలాన నదలించి మొనచూపులనుఁ జూచి
వెక్కసాన వంచుకొంటివే పతిని
చక్కనిగోరు మోపి చలములు సాదించి
గుక్కక యిన్నిటాఁ బనిగొంటివే విభుని

చ. 2: పొరలింపు మాటలాడి బొమ్మలను జంకించి
వెరసుగ సాదించితివే విభుని
తెరమరఁగుకుఁ దీసి దీకొని చన్నులనొత్తి
గురుసు మోవ లోఁజేకొంటివే విభుని

చ. 3: కలకల నవ్వు నవ్వి గక్కననుఁ గాఁగిలించి
కలిసితివే శ్రీ వేంకటవిభుని
అలపులెల్లాఁ దీరిచి అట్టె మర్మములంటి
కొలిపి మమ్మేలించి చేకొంటివే విభుని

రేకు: 0626-3 ఆహిరినాట సంపుటం: 14-153

పల్లవి: ఎప్పటివలెఁ గావు యేతులు
యిప్పుడింతటిలోనే యెవ్వతె నేరిపెనే

చ. 1: గురువుతోనే చూపే గుట్లు
వరుసవంతుల తన వట్టిరట్లు
తెరమరఁగు పెదవితిట్లు
యిరవుగఁ దనకిది యెవ్వతె నేరిపెనే

చ. 2: పెనఁగేటి తన మేని బిగువులు
వనితలతోఁ జెప్పే చేవతగవులు
ననుపుల సెలవుల నగవులు
యెనలేక తనకిది యెవ్వతె నేరిపెనే

చ. 3: పిక్కటిల్లుఁ గాగిటిలో బీరాలు
పక్కన సరసములోఁ బలుబేరాలు
యిక్కువై శ్రీ వేంకటేశుఁడేలెను నన్ను
యెక్కుడుగ నేఁడు తనకెవ్వతె నేరిపెనే

రేకు: 0626-4 ముఖారి సంపుటం: 14-154

పల్లవి: ఎందాఁకాఁ జేసేవు యెడలేని తరితీపు
కందువ మా విన్నపాలు గైకోనరాదా

చ. 1: ననుపు నీ సెలవికి నవ్వు లెన్నియైనా వచ్చు
అనువుగానూరకే మాటాడఁగరాదా
చెనకేవేళనే నీకు సిగ్గులెందుండైనా వచ్చు
వునికిగా నిట్టె నా వొద్దఁ గూచుండిరాదా

చ. 2: పలుమారు నీమతికి పరాకెంతైనా వచ్చు
చెలరేఁగి నీ యాతుమ చెప్పఁగరాదా
బలిమిఁ బెనఁగేవేళ పనులెందుండైనా వచ్చు
వెలయఁగ నా చేతివిడె మందుకోరాదా

చ. 3: అంకెలఁ గూడేయప్పుడే అలపెందుండైనా వచ్చు
సంకుల నీ నేరుపెల్లఁ జూపఁగరాదా
లంకెల శ్రీ వేంకటేశ లావు లెందుండైనా వచ్చు
పొంకపు నాగాఁగిటిలోఁ బొసఁగుండరాదా

రేకు: 0626-5 వరాళి సంపుటం: 14-155

పల్లవి: నిరతినెరుఁగుదుము నీ సుద్దులిన్నియును
తెరమరఁగు దీసితే దేవరవు గావా

చ. 1: పాసిక విద్యలవారి పక్షపాతివైన నీవు
బాసలెన్ని చేసినాను పాటిలేవు
ఆసపడి నిన్ను నమ్మినట్టి గొల్లెతదలెల్లా
దోసమెంచక పాసినతొంటినీవే కావా

చ. 2: గోమున రాజుకుఁ బుట్టి గొల్లవాఁడవైననీవు
నేమమెంత సేసినాను నిజమేది
ప్రేమతోడ మేనవాని పెండ్లికిఁ బోయి పడుచు
గామించి తెచ్చుకొనిన ఘనుఁడవే కావా

చ. 3: వెగటురాకాసుల వేఁటలాడినట్టినీవు
నగవెంత నవ్వినాను నమ్మరాదు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నేలి వేవేలు
మగువలఁ దెచ్చుకొన్న మగఁడవే కావా

రేకు: 0626-6 భైరవి సంపుటం: 14-156

పల్లవి: అలసితిమన్ని టాను ఆసలనే పొంది పొంది
నెలకొని యింతటా మన్నించవయ్య మమ్మును

చ. 1: సారె సారె మాటాడించి చౌక సేసేవు వలపు
ఆరీతి నవ్వుచు మరి అలయించేవు
పేరఁబెట్టి గుట్టుసేసి బేరమాడేవు వలపు
నేరుపరివౌదువు మన్నించవయ్య మమ్మును

చ. 2: సరసములాడించి చెప్పఁజేసేవు వలపు
వొరసి వొరసి కాఁక లోడిఁ బెట్టేవు
తొరలఁగ నవ్వించి దొడ్డిఁ బెట్టేవు వలపు
నెరపితివి మేలు మన్నించవయ్య మమ్మును

చ. 3: గక్కనఁ గాఁగిట నించి కళరేఁచేవు వలపు
చెక్కిట రేకలు దీసి సిగ్గు వెంచేవు
యెక్కువ శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
నిక్కమాయ నీబాస మన్నించవయ్యా మమ్మును

రేకు: 0627-1 భైరవి సంపుటం: 14-157

పల్లవి: చూడవయ్య యెంతకెంత సోద్యము నేఁడు
వాడికె వలపు రేఁచి వడిఁబెట్టేదాననా

చ. 1: పలుమారు నిన్నునింత పంగించేదాననా
తలఁగక సేవసేసేదానఁగాక
చెలఁగి నీవే రట్టు సేసుకొనేవింతే కాక
చలపట్టి నిన్ను నేను సాదించేదాననా

చ. 2: ఆసకొలిపి నిన్నింత అలయించేదాననా
తాసువలె లోనై వుండేదానఁ గాక
వాసి రేఁచుకొని నీవేవచ్చిటు దూరేవు గాక
వేసాలకు నీపై తప్పు వేసేటిదాననా

చ. 3: కాఁగిట నిన్నుఁగూడి కాఁకరేఁచేదాననా
దాఁగక రతుల మెచ్చేదానఁ గాక
వీఁగక శ్రీవెంకటేశ వేడుక నన్నేలితివి
చేఁగగోరు నాఁట నిన్నుఁ జేఁతసేసుదాననా

రేకు: 0627-2 నాదరామక్రియ సంపుటం: 14-158

పల్లవి: ఇన్నాళ్లు లేనిగుణ మేడనుండి వచ్చె నీకు
చెన్నుమీర వినేఁగాని చెప్పవయ్య నాకును

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేతులు చాఁచేవు నాపై
మలసి యిచ్చుటనే సుమాళ మెత్తెనో
పిలువదాయనో నిన్ను ప్రియురాలు యీవేళ
బలుపాయపు మదము పట్టరాదో నీకు

చ. 2: సారెసారె నాతోనే సరసములాడేవు
మేరతో వీడెపుచొక్కు మేననుబ్బెనో
చేరనీక వనితలు చేతుల నిన్ను దొబ్బిరో
ఆరీతి రతులమీఁది ఆసోదమో

చ. 3: కమ్ముకొని నన్నునిట్టె కాఁగిలించి కూడేవు
రమ్మా నాపైవలపు శిరసు కెక్కెనో
ఇమ్ముల శ్రీవేంకటేశ యెవ్వతైన నిన్నంపెనో
నెమ్మది నాపై మన్నన నిజమో యిపుడు

రేకు: 0627-3 మాళవిగౌళ సంపుటం: 14-159

పల్లవి: ఇందులోనే నీపంతమేమి దప్పెను
చెంది వినయములెల్లాఁ జేయరాదా యిఁకను

చ. 1: కప్పురగంది నిన్నుఁ గంటేనే తిట్టునని
అప్పుడే యీమాట నీతోనాడనా నేను
చెప్పరానిచేఁతలెల్లాఁ జేసినవాఁడవు నీవు
ముప్పిరి మంచిమాటాడి మొక్కరాదా యిఁకను

చ. 2: అంగన నీవు మాటలాడితేఁ గోపించునని
సంగతిగాఁ జూపి మోపి చాట నా నేను
అంగడిసతులనెల్లా నంటినవాఁడవు నీవు
చెంగక ప్రియములెల్లాఁ జెప్పరాదా ఇఁకను

చ. 3: నెలఁత నీవు గూడితేను నిన్నునిట్టె మెచ్చునని
వెలయనిప్పుడేవిన్నవించనా నేను
చెలులు పదారువేల శ్రీవేంకటేశుఁడవు
కలసితివి నీకొంగు గప్పరాదా యిఁకను

రేకు: 0627-4 నాగగాంధారి సంపుటం: 14-160

పల్లవి: పైపైనే వున్నది బత్తి మీయిద్దరికిని
దాపగు భోగముల తనియఁగనోపవు

చ. 1: సిగ్గులు వడకువే చెలువుని వద్దనింక
అగ్గలము నీజవ్వన మాఁపఁగ లేవు
యెగ్గులు పట్టకువే యేమిటికై నానిట్టే
వెగ్గళపుఁదమకము విడువనోపదు

చ. 2: పంతులు వట్టకువే వానికి నతనితోను
దొంతినున్న యాసోదాలు తోయఁగ లేవు
పంతములాడకువే పలుమారునప్పటిని
మంతనాన మొక్కక మానవోపవు

చ. 3: చేతులఁ బెనఁగకువే శ్రీవేంకటేశ్వరుతోను
కాతరపు సరసము కాదనలేవు
యీతఁడిదె నినునేలె యింక మారాడకువే
యేతులనైనా నీవు యెడయఁగనోపవు

రేకు: 0627-5 సౌరాష్ట్రం సంపుటం: 14-161

పల్లవి: దానికేమి వేగిరమా తడవకువే
కానుకగా నన్నియునుఁ గానఁబడీనీఁకను

చ. 1: వేసాలకొకమాట వేడుకతో వినెఁగాక
సేసీనా తానిట్టే చెప్పినట్టెల్లా
ఆస విడువఁగ లేక అండనున్నారము నేము
యీసటలు నిజములు నేరుపడీనీఁకను

చ. 2: యెమ్మెలకునేమో మాయింటికి విచ్చేసెఁ గాక
సమ్మతించీనా సరసములెల్లాను
కమ్మరఁ దనవేళలు గాచుకున్నారము నేము
తెమ్మలుగఁ దననేర్పు తేటపడీనీఁకను

చ. 3: కరుణించి తనుఁదానె కాఁగిలించి కూడెఁగాక
వొరుల మాటలు వినీనా వోపినట్టెల్లా
యిరవై శ్రీవేంకటేశు నెనశున్నారము నేము
సురతపు గురుతులు చూపట్టీ నీఁకను

రేకు: 0627-6 శుద్ధవసంతం సంపుటం: 14-162

పల్లవి: తలపోసి చూడరాదా తనివి మనసులో
పొలపవేడుకలెల్లాఁ బొదపానా నీకు

చ. 1: యెందరు లేరు చుట్టాలు యెక్కడనైనా నీకు
విందులు గొల్లయిండ్ల వెన్నలెల్లాను
సందడింపు వలపులు చవిగావు నీకింత
పొందులు మాతోడివి పొసఁగీనా నీకు

చ. 2: యింటింటివావులు యెన్నైనాఁ గలవు నీకు
తొంటినీ నెలవులే దొడ్డ లెల్లాను
పెంటపట్టు నగవులు పిప్పిగట్టు సారెసారె
అంటిముట్టి మాతో నవ్వులనువౌనా నీకు

చ. 3: కొల్ల పెండ్లికూఁతులే గోపికలెల్లా నీకు
చల్ల జాణతనాలే రేపల్లె యల్లాను
యెల్లగా శ్రీవేంకటేశ యేలితివి మమ్మునిట్టె
పల్లుసోఁకు మాగురుతు బాగౌనా నీకు

రేకు: 0628-1 నీలాంబరి సంపుటం: 14-163

పల్లవి: ఎదుటనే నన్నుఁ జూచి యేల లోఁగేవు
కదిమి నిన్నెప్పుడైనాఁ గాకు సేసేనా

చ. 1: చెలిమి సేసిన యాపె చెట్టవట్టి తీసితేను
బలిమిఁ బెనఁగుదురా పలుమారును
నెలఁతనింతే నేను నీకేల వట్టివెరపు
చెలఁగి యెక్కడనైనాఁ జెప్పేనా నేను

చ. 2: చుట్టిరికమైన యాపె సుద్దులు నీకుఁ జెప్పఁగా
నట్టు నిట్టుఁ బరాకులౌదురా నీవు
పట్టపువనితనింతే భావము దాఁచఁగనేల
ఇట్టు సేసేనా నిన్ను యిట్టె రచ్చలను

చ. 3: పొందులు సేసిన యాపె పొదిగి నిన్నుఁ గూడఁగ
చెంది సిగ్గువడుదురా శ్రీ వేంకటేశ
అంది నీకాఁగిటిదాన ననుమాన మిఁకనేల
నిందలాడేనా నిన్ను నీసతులలోనను

రేకు: 0628-2 కాంబోది సంపుటం: 14-164

పల్లవి: విన్నవించరే యీమాట విభునితోను
సన్నల చాయలఁ జూచే సతులే నవ్వరా

చ. 1: కొంత గొంత మాటాడి కొమ్మ దలవంచుకొంటే
యెంత వేడుకొనీ నీతఁడిదె చూడరే
పంతగాఁడిన్నిటాఁ దాను పక్కనఁ గిందుపడీని
పంతుకు తనుఁగొలిచేవనితలే నవ్వరా

చ. 2: భావించి చూచి పడఁతి పానుపుపైఁ బండితేను
యీవలఁ జేయెత్తి మొక్కీనిదె చూడరే
లావరి యిన్నిటాఁ దాను లలనకు లోఁగీని
సేవ సేయ వచ్చినట్టి చెలులే నవ్వరా

చ. 3: తొయ్యలి చేత దొబ్బి దోమ తెర వేసుకొంటే
కొయ్య శ్రీవేంకటేశుఁడు కూడెఁ జూడరే
చయ్యన దేవుఁడు దాను సతులబారికిఁ జిక్కె
యియ్యడఁ గొలువు సేసేయింతులే నవ్వరా

రేకు: 0628-3 రామక్రియ సంపుటం: 14-165

పల్లవి: వెరవుతోనింకాఁ జూచే విశేషాలు
తెరమరఁ గెటువలెఁ దీసేవయ్యా

చ. 1: పలుసన్న లేమిటికి పనులేమి గలిగిన
తెలియనానతీరాదా తెలిసేను
నిలువు నూరు వండీ నీమేనిపచ్చిచేఁతలు
నలువంక నికనెట్టు నమ్మించేవయ్యా

చ. 2: వట్టిగుట్టులేమిటికి వలపింతగలిగిన
గట్టిగాఁ జూపవయ్యా కానిమ్మనేను
పుట్టెడు పోఁకకమ్మి బొంకుల నీబాసలు
బట్టబయలెట్టు వొడఁబరచేవయ్యా

చ. 3: శిరసు వంచనేఁటికి సిగ్గులెంత కలిగినా
వొరసి కూడితివయ్యా వొడఁబడేను
కురిసేఁ దేనెలు మోవికోరి శ్రీవేంకటేశుఁడ
తరవాతి రతినెట్టుఁ దనిపేవయ్యా

రేకు: 0628-4 ద్రావిళభైరవి సంపుటం: 14-166

పల్లవి: కంటినంటే పలుమారు గరిసించేవు
వొంటినున్న వారినంత వొరయఁగ వచ్చునా

చ. 1: వొప్పుగా నెవ్వతెనో కూడుంటివని యంటేను
అప్పటి నీవేడనుంటి వనెడిగేవు
అప్పటిమాటలు వింటినంటేఁ జెప్పుమాయనేవు
చెప్పరాని సుద్దులవి చెప్పవచ్చునా

చ. 2: నలిరేఁగి పకపక నవ్వితిరిగా యంటేను
అలరి యెట్టుదెలిసె ననెడిగేవు
చెలఁగి మీచేఁతలు చూచితినంటే నడిగేవు
సొలసి మర్మములవి చూపవచ్చునా

చ. 3: శ్రీవేంకటేశుఁడ కలిసితివిగా యనెంటేను
ఆవిధాన నన్నుఁ గూడి అదెడిగేవు
చేవదేర రతులు మెచ్చితినంటేఁ గొసరేవు
ఆవేళ సుద్దులవి యీవేళ వచ్చునా

రేకు: 0628-5 అమరసింధు సంపుటం: 14-167

పల్లవి: ఇంకనేఁటిమాటలు యీడేరెఁ బనులు
సంకేదేరి యాపెతోనే సరసాలాడేవు

చ. 1: నిన్నుఁ బిలిచితేనొక్క నెలఁతఁ గైదండ వట్టె
వన్నెతోఁ జుట్టమవై వచ్చితివిట్టె
తిన్నఁగా మంచము వేసితే నందుమీఁద నాపెఁ
బెన్నిదిగాఁ గూచుండఁ బెట్టుకొంటివి

చ. 2: చేరి నీకు మొక్కితేను చెలియను సన్నచేసి
ఆరీతి నాపెచేత లెమ్మనిపించేవు
గారబాన నేఁ బువ్వులు గానుక నీకిచ్చితేను
పోరచిగా నాపువ్వులఁ బూజించే వాకెను

చ. 3: శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కాఁగిలించుకొంటే
ఆవేళ నాపెనుఁ గూడ నంటఁబట్టేవు
వేవేగ నీమోవితేనె వేడుకొంటే నీవాపె
తావితేనెలాని యీతల నాకిచ్చేవు

రేకు: 0628-6 శంకరాభరణం సంపుటం: 14-168

పల్లవి: మేలుమేలు మెచ్చితిమి మెలుఁతలము
పేలరివై యీపనికే పెరిగితివయ్యా

చ. 1: ఆలరివనితలు యేమనినా నోరుతువు
తాలిమిగలవాఁడవు తగుదువయ్యా
మూలల చనుఁగొండలు మోవఁగ నోపుదువిట్టె
వాలనట్టి దిగ్గజము వంటి వాఁడవయ్యా

చ. 2: అట్టె యంగనలు నీతో నలిగిన ములుగవు
చుట్టిరికపువాఁడవు సుగుడవయ్యా
గట్టిగాఁ దురుమల మేఘములెల్ల నానుదువు
వొట్టి కొండవంటివాఁడ వోపుదువయ్యా

చ. 3: తొయ్యలుల పాదాల తొక్కుడుకు నోరుతువు
యెయ్యెడ భారకుఁడవు యేలికెవయ్యా
వొయ్యనే శ్రీ వేంకటేశ వొనఁగూడితివి నన్ను
నెయ్యపు చింతామణి వంటి వాఁడవయ్యా

రేకు: 0629-1 కన్నడగౌళ సంపుటం: 14-169

పల్లవి: తరుణిమొగము చూచి దయవుట్టె మాకెల్ల
నిరతాన నవ్వుకొంటా నీ వద్దనే వున్నది

చ. 1: చుక్క వొడచినదాఁకా జూజాలే యాడితివి
వెక్కసపు రతులకు వేళ యేది
అక్కటా చెలియనింత అటమాటింతురా నీవు
నిక్కమంటా నాసపడి నీవద్దనే వున్నది

చ. 2: కోడి గూసినందాఁకా సొగుడుఁగతే చెప్పితివి
వీడెమిప్పించుకొనను వేళ యేది
పాడితోనే చెలినింత భ్రమయింతురా నీవు
నీడల నిన్ను నమ్మి నీవద్దనే వున్నది

చ. 3: బగ్గనఁ దెల్ల నౌదాఁకాఁ బరాకులే సేసితివి
వెగ్గళించి చొక్కుదేర వేళ యేది
తగ్గి శ్రీవేంకటేశ కాంతను మఱపించితివి
నిగ్గుల కాఁగిటఁగూడి నీవద్దనే వున్నది

రేకు: 0629-2 ఆహిరి సంపుటం: 14-170

పల్లవి: కోమలపువాఁడంటాఁ గొంకి యున్న దానఁగాక
నేమానమేమి సేసినా నెంజెరివి దీరునా

చ. 1: పలుమారు మాటలాడి పడఁతుల వలపించి
యెలయించే రమణుని నేమి సేసేది
పిలిచి పానుపుమీఁదఁ బెనఁగఁగానే చన్నుల
నెలకొనఁ గుమ్మినాను నెంజెరివి దీరునా

చ. 2: నగుతా దగ్గరఁ దీసి నాలిసేసి యేఁచెటి
యెగసక్కేపు విభుని నేమి సేసేదే
మొగము చూడఁగానే ముంగురులు చుట్టి పట్టి
నిగిడి గోర గీరినా నెంజరివి దీరునా

చ. 3: మట్టు మీరి నన్నుఁ గూడి మరులుగొలిపినట్టి
యిట్టి శ్రీవేంకటేశ్వరు నేమి సేసేదే
గట్టిగా మోవియాని గంటిసేసి పలుమారు
నెట్టుకొని కొసరక నెంజెరివి దీరునా

రేకు: 0629-3 సామంతం సంపుటం: 14-171

పల్లవి: కడమ లున్నవా యింకఁ గైకొన్నదాన
యెడయని దొరవు నీయిచ్చ యింతేకాక

చ. 1: వాసులెంచవలెనా వలచినదాన నేను
సేసినటెల్లా నీకుఁ జెల్లెఁగాక
వేసరఁగఁ దగునా నీ వేలువట్టినట్టిదాన
రాసికెక్కినట్టి నీరపమాయఁ గాక

చ. 2: వోపనవలెనా వూడిగపుదాన నేను
చేపట్టినట్టెల్లా నీకె చెల్లెఁగాక
కోపగించఁ దగునా కొలువు సేసేటిదాన
దాపుగ నీవాడినపంతము దక్కెఁగాక

చ. 3: గోర గీరవలెనా కూడినట్టిదాన నేను
చీరకొంగంటినదెల్లాఁ జెల్లెఁగాక
ధీరుఁడ శ్రీవేంకటేశ తిట్టఁదగునా నీదాన
నేరిచిన నీనేరుపు నెరవేరెఁగాక

రేకు: 0629-4 రీతిగౌళ సంపుటం: 14-172

పల్లవి: తానెంత నేనెంత తరవాతిపనులెంత
కానుక చేకొన్నదే కలిమెల్లాఁ గాదా

చ. 1: చెప్పనేలే ప్రియములు సారెసారెఁ
గొప్పు దువ్వినదే నాకుఁ గోటి గాదా
కప్పుర మియ్యఁగనేలే కమ్మటిని దోసెఁడేసి
రెప్పలెత్తి చూచుటే మీరిననిధి గాదా

చ. 2: వీసమంతపనికిఁగా వెడ్డువెట్టి వెఁడనేలే
చేసన్న సేసినదే సేనగాదా
వేసరక యేడ లేనివిరులు ముడువనేలే
సేసవెట్టినదే మేలు చేతికిచ్చుట గాదా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జెయివట్టి తియ్యనేలే
యీవల నాతో నవ్వుటే యిన్నియుఁగాదా
కావించి నామేన నిండా గంధము వూయఁగనేలే
యీవేళ నన్నిట్టే కూడె నెక్కుడు గాదా

రేకు: 0629-5 సింధురామక్రియ సంపుటం: 14-173

పల్లవి: చూతము యిదియు నొక్కసోద్యము నేఁడు
వాతులు మోచిన మనవావులేమి సేసీనో

చ. 1: నీవు చేవట్టి తియ్యఁగా నేఁ గోపగించుకోఁగా
యీవల చెలులు నవ్వేరిది చూచి
కావరము నీకుఁ బట్టె కడుఁజలము నాకంటె
లావుకై యిద్దరివలపులేమి సేసీనో

చ. 2: కప్పురము నీవియ్యఁగా కాఁకలు నేఁ జల్లఁగాను
తప్పక చిలుకలు సైతము నెంచీని
దప్పిదేరె నీమోవితనువు నాకునలసె
యిప్పుడే మదను డింకనేమి సేసీనో

చ. 3: చన్నులు నీ వంటఁగాను సమ్మతించి నే నుండఁగా
పన్నిన పంచబాణాలు పంతమిచ్చీని
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
యెన్నరాని తమకము లివి యేమి సేసీనో

రేకు: 0629-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-174

పల్లవి: చిప్పిలుఁ దేనెలమోవి చెంచెతఁ-కడుఁ
జెప్పరాదె నీచెలువు చెంచెత

చ. 1: చెఱకువింటి బొమలచెంచెతఁనిండెఁ
జిఱునవ్వు నీమోవిఁజెంచెత
చెఱఁగు మూయకువే చెంచెత-నీ
చిఱుతతనాలు మాని చెంచెత

చ. 2: చెక్కులెల్లా జీరలాయఁ జెంచెత
చిక్కుదీయవే నెరుల చెంచెత
చిక్కని చెమటగారే చెంచెత
చెక్కుకో మొగలిరేకు చెంచెత

చ. 3: శ్రీ వేంకటేశుఁడ నేఁ జెంచెత
చేవదేరఁ గూడితివి చెంచెతా
జేవురు బొట్టు నొసలి చెంచెతా
చేవల్లనుండుమా యిట్టె చెంచెతా

రేకు: 0630-1 హిందోళవసంతం సంపుటం: 14-175

పల్లవి: ఎప్పుడుఁగల సాజమె యిన్నియు మాకు
కప్పి యిందుకుఁగానెంత కాచుకుందువయ్యా

చ. 1: మబ్బులైన చూపులూ మంకుల రాజసములు
గబ్బి గబ్బి మాటలు కలవే మాకు
నిబ్బరపు దొరవూ నేరుపరివన్నిటాను
అబ్బురపడుతానేల ఆసపడేవయ్యా

చ. 2: గుట్టుతోడి సిగ్గుల కొసరుల మేకులు
గట్టి గట్టి చన్నులూ కలవే మాకు
అట్టడివి మిగులాను ఆతిగుండె వాఁడవు
పట్టి పట్టి చూచి యేల బ్రమసేవయ్యా

చ. 3: బొమ్మల జంకెనలూ పొల్లుల మందెమేలాలు
కమ్మి కమ్మి సింగారాలు కలవేమాకు
దిమ్మరి శ్రీ వేంకటేశ దిష్టమై మమ్మేలితివి
పమ్ముచు నింకానేమి బాఁతిపడేవయ్యా

రేకు: 0630-2 సాళంగనాట సంపుటం: 14-176

పల్లవి: మూపుదాఁకా నూరకే మామనసరసేవు గాక
కోపగించి నీకు బత్తి గొట్టానఁ బెట్టేమా

చ. 1: పొందైన యాపె నీకు బుద్ది చెప్పవలెఁగాక
మందలించి యితరులమాట వినేవా
సందడి నీగుణా లాపె చక్కఁ బెట్టివలెఁగాక
కందున నీలోనివంకలు దిద్దేమా

చ. 2: కూరిమియాపె నీకు కొనఁబెట్టవలెఁగాక
వూరివారెల్లా నీవొడిఁ గట్టేరా
మారుకొని యాపె నిన్ను మట్టుపెట్టవలెఁగాక
ఆరితేరి యిఁక నిన్ను నదలించేమా

చ. 3: పచ్చి సేసి కూడి యాపె బ్రమయించవలెఁగాక
వచ్చిపోయిన వారికి వసమయ్యేవా
యిచ్చగించి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నిచ్చలు నీ రతులెల్లా నీకు నేరిపేమా

రేకు: 0630-3 గంభీరనాట సంపుటం: 14-177

పల్లవి: అదియూఁ జూతము గాని అందుకేమాయ
యెదుటనే వుండేనని యిట్టె యాన వెట్టుమా

చ. 1: ఆఁపలేక గొల్లెతల నందరినిఁ జెనకేపు
కాఁపురము సేసేవారిఁ గాకు సేతురా
తీపులనే యింత సేసితివి యిఁకనైన నీవు
యేఁపక యేలేనని యిట్టె యానవెట్టుమా

చ. 2: గొరబుగా మగనాండ్లఁ గొప్పువట్టి తీసేవు
నెరుసు లేనివారిపై నిందవేతురా
వరవాత నెలయించి వలపించిన వాఁడవు
యిరవై యేలేనని యిట్టె యాన వెట్టుమా

చ. 3: సేసవెట్టి కూడితివి శ్రీ వేంకటేశ్వర మమ్ము
ఆసతోడివారి నిన్నాళ్లలయింతురా
రాసికెక్క బ్రమయించి రవ్వసేసినవాఁడవు
యీసేవ మఱవనని యిట్టెయాన వెట్టుమా

రేకు: 0630-4 శంకరాభరణం సంపుటం: 14-178

పల్లవి: చెప్పుడు బుద్ధులు చెవి సోఁకీనా
ముప్పిరి తమకము మొలఁచినది

చ. 1: సొలపుఁ జూపులను సుదతి చూడఁగా
తలఁపున నీకవి తగిలినవి
మలకలమాటలు మరియును నాడఁగ
యేలమి వలపు తలకెక్కినది

చ. 2: నారీమణి చిరునవ్వులు నవ్వఁగ
ఆరీతి నీకవి అందినవి
సారెకు సరసము చవిగా నాడఁగ
పేరడియాసలు పేరినవి

చ. 3: కొమ్మ నిన్నుపుడు గుబ్బల నొత్తఁగ
నమ్మికలైయవి నాటినవి
యిమ్ముల శ్రీ వేంకటేశ నన్నేలఁగ
నెమ్మది రతులివి నిండినవి

రేకు: 0630-5 కన్నడగౌళ సంపుటం: 14-179

పల్లవి: ఏమి పరాకై వున్నాఁడ వెందాఁకాను
కామిని నింతటనైనా గరుణించవయ్యా

చ. 1: కోలుముందుగా నాపె గోర గిలిగించఁగాను
నాలి వెట్టుకొని యేల నవ్వేవయ్యా
మేలు మేలనుచు నిన్ను మెచ్చిమెచ్చి పాడఁగా
జాలిదీర నాపెమోము చక్కఁ జూడవయ్యా

చ. 2: గరిమె నాపె చేతి కానుక నీకియ్యఁగాను
మరులేల కొలిపేవు మాటాడవయ్యా
సరసము చూపి నీతో జాణతనాలాడఁగాను
తరితీపులింకానా దగ్గరవయ్యా

చ. 3: పైకొని యట్టె కూడి పంతము నీకియ్యఁగాను
యీకె దలఁచినవెల్లా నీడేర్చవయ్యా
శ్రీకాంతుఁడవు నీవు శ్రీవేంకటేశ్వర
చేకొలఁదివాఁడవై సేవ గొనవయ్యా

రేకు: 0630-6 మధ్యమావతి సంపుటం: 14-180

పల్లవి: ఏల వొత్తడించేరే యిన్నియు నయ్యీఁగాక
పోలికలొక్కటే యెట్టు పొందు సేసేదే

చ. 1: సిరులతో మేననెల్లాఁ జెమటలు నిండఁగాను
గరిమనెట్లాఁ దన్నుఁ గాఁగిలించేదే
నిరతమై అంతకంటె నివ్వెరగు ముంచఁగాను
అరుదుగానెట్టు విడెమంది యిచ్చేదే

చ. 2: ముక్కున నూరుపులు ముంచుకొని చెలఁగఁగా
మొక్కలాన నెటువలె మోవియిచ్చేదే
లక్కవలె మనసు యీలాగునఁ గరఁగఁగ
ముక్కువతో నెటువలె మాటలాడేదే

చ. 3: జడిగొని పులకలు జాజుకొని మొలవఁగా
చిదుముడి నెటువలె సేసవెట్టేదే
యెడయక శ్రీవేంకటేశుఁడిట్టె నన్ను నేలె
కడలేని యాసలెట్టు గాదెఁ బోసేదే

రేకు: 0631-1 లలిత సంపుటం: 14-181

పల్లవి: చెప్పనేలే యింకాఁ దనచేఁతలు నాకు
కప్పురమిచ్చి నామతి కరఁగించవలెనా

చ. 1: ముందరితనలాలన మోములోనే కానరాదా
కిందుపడి యింత బుజ్జగించవలెనా
మందలించిన నిజము మాటలోనే కానరాదా
విందువలెఁ జెక్కునొక్కి వేఁడుకొనవలెనా

చ. 2: నమ్మికలు తానిచ్చేవి నవ్వులోనే కానరాదా
పిమ్మటివారిపై నాన పెట్టవలెనా
పమ్మిన తనవలపు పానుపుపైఁ గానరాదా
చిమ్ముల మోవెల్ల గంటిసేయఁగ వలెనా

చ. 3: బలుతమకము చేయిపట్టినందే కానరాదా
సొలసి తనబావము చూపవలెనా
యెలమి శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
తెలివి నయగారాలతేనె వుయ్యవలెనా

రేకు: 0631-2 మంగళకౌశిక సంపుటం: 14-182

పల్లవి: చుట్టపువరుస నన్నిఁ జూచేము గాక
యెట్టైనానాయ నిన్ను నేమనేమయ్యా

చ. 1: చెయ్యార నీసేసినట్టి చేఁతలైతేఁ జెప్పరావు
తియ్యని నీ మాటలైతే తేనె గారీని
కొయ్యతనపు విభుఁడ కొంగువట్టి తీసేవు
యియ్యెడ నీతో నిఁక నేమనేమయ్యా

చ. 2: తక్కరి నీ గుణములు తలఁచ నలవిగావు
పక్కన నీనవ్వులైతే పాలు గారీని
వెక్కసపు రమణుఁడ వేడుకకాఁడవు నీవు
యెక్కుడు పంతగాఁడవు యేమనేమయ్యా

చ. 3: చేవదేరే నీ కాఁగిటఁ జిత్తడి చెమట నిండె
కేవలమై మోవినే చక్కెర గారీని
శ్రీ వేంకటేశుఁడవు చేరి నన్నుఁ గూడితివి
యీవిధవు నిన్నుఁజూచి యేమనేమయ్యా

రేకు: 0631-3 దేసాళం సంపుటం: 14-183

పల్లవి: ఎఱఁగమా నీసుద్దులెప్పుడు నేము
నెఱవుగా మమ్ము మన్నించక మానేవా

చ. 1: చెప్పరాని మాటలకు చెవియొగ్గేవాఁడవు
కప్పి మమ్ము సుద్దలడుగక మానేవా
చిప్పిల నెందుకునైనా చేయి చాఁచేవాఁడవు
అప్పటిమాతో సరసాలాడక మానేవా

చ. 2: చూడరాని చోట్లెల్లఁ జూచేటి వాఁడవు
జాడతో మర్మాలు సోదించక మానేవా
చేడెల కందరికిని సేవలు సేసేవాఁడవు
యీడ మాకు నాకు మడిచియ్యక మానేవా

చ. 3: నగరానివారితోడ నవ్వేటివాఁడవు
మగుడ మమ్ముఁ గూడక మఱి మానేవా
యెగసక్కెపు శ్రీవేంకటేశ వూరఁజొట్టమవు
పొగిసి మమ్మేలితివి జోడుగాక మానేవా

రేకు: 0631-4 నాగవరాళి సంపుటం: 14-184

పల్లవి: ఎంత కాతరీఁడ వేమని విన్నవించేరి
వంతుకుఁ జిరునవ్వుతో వడిఁదిట్టీఁ జెలియ

చ. 1: జలకమాడేచోటికి సారెఁ జొచ్చివచ్చేవు
వెలఁదిఁ గన్గొన మరి వేళ లేదా
యెలమిఁ జీరఁగట్టిగా నింటిలోనికి వచ్చేవు
మలసి మాటలాడ మరి వేళ లేదా

చ. 2: నెఱులచిక్కుఁ దియ్యఁగా నీ వాడకు వచ్చేవు
వెఱగయ్యీ నీకు మరి వేళ లేదా
తఱి పరిమళమలఁదగా నండకు వచ్చేవు
మఱి పొందుసేయఁగ మంచివేళ లేదా

చ. 3: తోడ నద్దము చూడఁగాఁ దొక్కులాడ వచ్చేవు
వేడుకకు నీకునిట్టె మరి వేళ లేదా
కూడి శ్రీ వేంకటేశుఁడ కొలువుండ వచ్చేవు
మాడుగులోనికిని కమ్మటి వేళ లేదా

రేకు: 0631-5 బౌళిరామక్రియ సంపుటం: 14-185

పల్లవి: పొద్దువోనివాఁడవు బొమ్మల జంకించేవు
వుద్దండాలకెల్ల నీవే వోరుతువు గాక

చ. 1: చనవు గల కాంతలు జడుతురా యెందుకైన
చెనకి పతిని రట్టుసేతురు గాక
పనిమాలిన తప్పులు పట్టుదురా నీ వందుకు
ననుపులు సేసుకొని నవ్వుదురు గాక

చ. 2: వింతలేని మగువలు వెరతురా యేమైన
అంతంత నాయములు సోఁకింతురు గాక
పంతము లీపెతోనే యెంతురా నీ వందుకు
యెంతసేసినాను మన్నింతురు గాక

చ. 3: కూడినట్టి వనితలు కొంకుదురా యెప్పుడైన
వోడక కాఁగిటిలోనే వుందురు గాక
యీడుగా శ్రీవేంకటేశ యేలితివి నీ వందుకు
యేడనైనా యిట్లనే యీడేర్తురు గాక

రేకు: 0631-6 నాట సంపుటం: 14-186

పల్లవి: ఇప్పుడు మాయింటికాడ నెమ్మెలెల్లా నాడేవు
అప్పుడు చూతమువో నీఆయితము లెల్లను

చ. 1: గుఱుతులై నీమాటలు గుండెలలో నుండఁగాను
మఱతురా గొల్లెతలు మరియెంతైనా
మెఱసి రేపల్లె చొచ్చి తఱితో వెళ్లఁగ రాదా
చెఱఁగు వట్టి నిన్నేమి సేసేరో చూతువు

చ. 2: తారుకాణై నీచేఁతలు తమమేనుల మండఁగ
వూరకె చెలులు నిన్ను దూరకుందురా
మేరతో వారిముంగిళ్లు మెట్టి యటు రారాదా
కోరి నిన్ను వారెంత కొసరేరో విందువు

చ. 3: తడఁబడి నీతమ్మ దవడల నుండఁగాను
విడుతురా కాంతలు నీవెంటనే రాక
యెడయక శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
తడవరాదా వారితలఁపులు మెత్తువు

రేకు: 0632-1 ధన్నాశి సంపుటం: 14-187

పల్లవి: ఏమనేమయ్యా నీవు యెఱఁగనిపని లేదు
కోమలి కొప్పంటేవు కొంకక నాయెదుట

చ. 1: యెఱఁగమి సేసుకొని యెంతవున్నా నెఱఁగవు
వెఱవక మాటాడేవు వెలఁదితోను
వొఱిమ గలదాననై వోరిచినా నెఱఁగవు
మఱి సరసమాడేవు మలసి నాయెదుట

చ. 2: అనఁజాలక కోపమణఁచినా నెఱఁగవు
పెనఁగేవాపెచన్నుల బెడిదముగా
వెనక మొకమాటాన వేఁడుకొన్నా నెఱఁగవు
చెనకేవు కొనగోరఁ జెలితో నాయెదుట

చ. 3: ప్రియపడి కాఁగిట బిగించినా నెఱఁగవు
క్రియతోడ నాపెదిక్కే చూచేవు
నియతి శ్రీవేంకటేశ నేనలమేలుమంగను
దయఁ గూడితి వాపెకు దక్కేవునాయెదుట

రేకు: 0632-2 దేసాక్షి సంపుటం: 14-188

పల్లవి: మాటి మాటికి నానలు మరేలయ్యా
నీటుతోడికళలెల్లా నీమేననే వున్నవి

చ. 1: కాంతమేనఁ బూసినట్టి గందపుఁ బూఁతలచొప్పు
యింతలోనే మేన నిండి యిట్టెవున్నవి
చెంతలనాపె చెలఁగి సేసేవిడేలెల్లా
పొంతల నేఁడిప్పుడు నీపుక్కిటనే వున్నవి

చ. 2: పొలఁతి ముడిచినట్టి పూవులవాసన చొప్పు
మొలచినట్టు నీతురుమున నున్నవి
మలసి యాపె వెట్టిన మంచి మంచి సొమ్ములెల్లా
నెలకొని యిప్పుడు నీనిలువున నున్నవి

చ. 3: పడఁతి మైఁ జల్లుకొన్న పన్నీటి చొప్పులెల్ల
తడిసి నీపచ్చడానఁ దతిఁ గొన్నవి
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
కడఁగి నిన్నుఁ గూడితి కలలెల్లా నున్నవి

రేకు: 0632-3 మలహరి సంపుటం: 14-189

పల్లవి: పొద్దువోని విభునికి బుద్ధులు చెప్పరే మీరు
వొద్దికతోఁ దనునెట్టు వొడఁబరచేనే

చ. 1: తటీఁ దనలోని మేలు తానె యెఱుఁగుఁ గాక
యెఱుకలదానివలె నెట్టుచెప్పేనే
కలికరిఁ బెట్టి నన్నుఁ గమ్మటిఁ జెప్పుమనీని
తలచైన మొఱఁగులు దైవమే యెఱుఁగునే

చ. 2: యేల మొక్కి యడిగీని యింపు తానెరుఁగుఁగాక
వేలుపులదానివలె వినిపించేనా
చేలకొంగు వట్టి నన్ను చేఁతలెల్లనడిగీని
ఆలి మగనిసుద్దులు అతనుఁ డెరుఁగునే

చ. 3: మొగమేమి చూచీని ముందు తానెరుఁగుఁగాక
సగినాలదానివలె సారెననేనా
అగపడి నన్నుఁ గూడె అలమేల్మంగను నేను
తగు శ్రీవేంకటేశుఁడు తానె యెఱుఁగునే

రేకు: 0632-4 కొండమలహరి సంపుటం: 14-190

పల్లవి: నీ వేమి సేతువయ్య నీవంకఁ గడమేది
వేవేలు సిరులెకా వేడుకలు సేసేవి

చ. 1: తరుణిఁ గాఁగిటఁ గూడి దగదొట్టినవాఁడవు
యిరవుగా నెఱఁగవా యీపెగురుతు
ఎరవులవానివలె యిప్పుడు పేరడిగేవు
దొరతన మిదేకా యిందుల బ్రమయించేది

చ. 2: చెలరేఁగి యీపెమీఁద సేసవెట్టినవాఁడవు
తెలియవా యేమైనా మతిలో గుణము
లలిఁ గొత్తవానివలెఁ దలఁచుకొనేవు నీవు
నిలువు గర్వమేకా నిన్నింత సేసేది

చ. 3: వూని యలమేలుమంగ పురముతోడివాఁడవు
కానవా నీ వేమైనా చక్కఁదనములు
కానీలే శ్రీవేంకటేశ గరిసించేవప్పటిని
ఆనుకొన్నమనమేకా ఆయాలు సోఁకించేది

రేకు: 0632-5 సాళంగనాట సంపుటం: 14-191

పల్లవి: అందరిముందరానేల ఆడించేవు
కందువ నీమేనిపులకలు సాక్షి గాదా

చ. 1: చెప్పనా అప్పుడే నీచెవిలోన మాటలెల్లాఁ
దప్పక అట్టే నీవు తలఁచరాదా
ముప్పిరినప్పటి నామోమేమి చూచేవు
కుప్పళించే చెమటలే గురుతు గాదా

చ. 2: వొడఁబరచనా నీవొడి వట్టుకొని నాఁడె
తడఁబడక అవే తలఁచరాదా
నడుమ సెలవులను నవ్వులేమి నవ్వేవు
గుడిగొన్న కరఁగులే గురుతుగాదా

చ. 3: నేరుపనా రతిఁ గూడి నెలకొన్నకతలెల్ల
తారుకాణగానవి తలఁచరాదా
ఆరయ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
కోరిన మనచెనకులే గురుతు గాదా

రేకు: 0632-6 మనోహరి సంపుటం: 14-192

పల్లవి: చెలికత్తెలము నేము చెప్పఁగలవారమింతె
యెలమి నిన్నియును నీవియ్యకొనవయ్యా

చ. 1: నీతోడిమాటలకు నెలఁత వేడుకపడి
బాఁతిపడి వున్నదిట్టె పలుకవయ్యా
యేతరితనమునను యేల పరాకై వుండేవు
నాతో నవ్వినయట్టె నవ్వవయ్యా

చ. 2: మొగము చూచేనంటా ముదిత గాచుకున్నది
యెగసక్కేలేల తల యెత్తవయ్యా
నిగిడి రాజసమున నిట్లే చూపేవు
వొగి నన్నెరసినట్టే వొరయవయ్యా

చ. 3: అలమేల్మంగ నీ పురమందె నెలకొన్నది
కలసితివి ప్రియము గైకొనవయ్యా
వెలయ శ్రీ వేంకటేశ వింతగాఁ దమకించేవు
యిల నన్నునేలినట్టే యేలవయ్యా

రేకు: 0633-1 ముఖారి సంపుటం: 14-193

పల్లవి: అప్పుడే మెచ్చితిమి అన్నిటా నిన్ను
ఇప్పుడే నిన్నుఁ బొగడి యింత సేయవలెనా

చ. 1: చెంది యెక్కడ చూచినాఁ జెప్పరాదు నీనిజము
కందువ నీ మోవిపైనే కానరాదా
ముందే యెఱఁగుదురు ముంచి యసురసతులు
నిందించరాదు నిన్ను నే మెఱఁగవలెనా

చ. 2: ముంచి యెక్కడ చూచినా మోవరాదు నీకూరిమి
యెంచఁగ నీమోము చూచే యెఱఁగరాదా
కొంచక పాసి కూడిన గొల్లెతలే చెప్పేరు
నించి మానోరులు నిండా నేము చెప్పవలెనా

చ. 3: కూరిమెక్కడ చూచినాఁ గొసరరాదు రతిఁ
దేరిన నీకాఁగిటిలోఁ దెలియరాదా
కోరి యలమేల్మంగను గూడితి శ్రీ వేంకటేశ
నేరిపేరు నీ కందరు నేము నేర్పవలెనా

రేకు: 0673-2 నాట సంపుటం: 14-194

పల్లవి: కంటికంటి నీ గుణాలు కతలుగాను
వొటి నొడ్డించుకొంటేను వొరయక మానేవా

చ. 1: సిగ్గు వడఁగానే మరిఁ జెనకేవు సారెసారె
యెగ్గు పట్టితేఁ గనక యేమి సేతువో
దగ్గరనుండఁగానే తమకించేవప్పటిని
కగ్గి తెరవేసితేను కాతరించకుండేవా

చ. 2: వొదిగి వూరకుండఁగా నొడి వట్టి తీసేవు
యెదురుమాటాడితేను యేమి సేతువో
పొదుగుక వుండఁగానే పొంచేవు చన్నుల
వుదుటున జంకించితే నొలిసి పైకొనేవా

చ. 3: గక్కనఁ గాఁగిలించఁగాఁ గలసితి వింతలోనే
ఇక్కువ లంటితేనిఁక నేమి సేతువో
అక్కరై శ్రీ వేంకటేశ అలమేల్మంగనే నేను
చిక్కితివి నే మొక్కితేఁ జెలరేఁగదా

రేకు: 0633-3 సామంతం సంపుటం: 14-195

పల్లవి: ఇంకనేలే నిన్నుదూర నింతటిమీఁద
అంకెల నా యిచ్చకమే అమరదు గానీ

చ. 1: ముంచి నీతో నాడినట్టి ముచ్చటలెల్లా నాకెతో
కొంచక చెప్పితి పూసగుచ్చినట్టు
మంచివాఁడవే నీవు మతక మెరఁగనట్టి
నించిననావొల్లదే నేరమి గానీ

చ. 2: చేతికి నేనిచ్చినట్టిచెంగలువబంతి నాకె-
నేతులకు వేసితివి యీడనుండే
నీతి నీ వెరుఁగుదువు నేనే యిచ్చకాలు సేసి
ఘాతల నలుగనిదే కల్ల నాకుఁ గానీ

చ. 3: నిన్ను నేఁ గాఁగిలించఁగ నీకు నీకే ఆకెఁజూచి
కన్నులనే సన్న సేసి కదియించేవు
పన్నిన శ్రీ వేంకటేశ పంతగాఁడవౌదు నీవు
నన్నుఁ గూడితివి నీతో నవ్వితిఁ గానీ

రేకు: 0633-4 సౌరాష్ట్రం సంపుటం: 14-196

పల్లవి: నీ వేమి గడించుకొన్నా నీ చిత్తమయ్య
వేవేలకు మాచెరఁగు విడువవయ్యా

చ. 1: సిగ్గుపడి నేనుండితే చిన్నఁ బోయితి ననేవు
వెగ్గళించ నీ మాటకు వెఱతుమయ్యా
అగ్గమై నిద్దిరించితే నలసితి నేననేవు
యెగ్గులుఁ దప్పులింతేసి యెఱఁగమయ్యా

చ. 2: గుట్టున నే నూరకున్నఁ గోపగించితి ననేవు
వట్టి దూరులు మాకింత వలదయ్యా
కట్టఁగడ నిలుచుంటే కపటమే నెననేవు
యెట్టును బోనీవు చలమేఁటికయ్యా

చ. 3: నెచ్చెలుల నేఁ దిట్టితే నీ పైకిఁ దీసుకొనేవు
చెచ్చెర మమ్మింత అట్టు సేయకుమయ్యా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
ముచ్చటలన్నియుఁ దేరె మొక్కేమయ్యా

రేకు: 0633-5 సాళంగనాట సంపుటం: 14-197

పల్లవి: మట్టుమీరఁ జాలక నేమానితిఁ గాక-నీకు
దిట్టతన మపుడు నేఁ దెచ్చి పెట్టవచ్చునా

చ. 1: కన్నుల మొక్కఁగ నిన్నుఁ గాదనఁగ రాదుగాక
నిన్న నీవు రాకున్నదే నేరమిగాదా
అన్నిటా నేనందుకే అలిగితేఁ గనక ని-
చ్చిన్నఁబోయిన విధము చెప్పి చూపవచ్చునా

చ. 2: అట్టె నీ వానవెట్టఁగ నది దోయరాదు గాక
నెట్టన నీ మేనికాఁకే నేరమి గాదా
బెట్టుగా నీ వాడేవి పెంచితేఁ గనక నీ-
పట్టరానితమకము భావించవచ్చునా

చ. 3: వూరకే నీవు గూడఁగా నొద్దనఁగరాదు గాక
నీరచన లిన్నియును నేరమిగాదా
యేరా శ్రీవేంకటేశ యేకమైతేఁగాక నిన్ను
దూరి యాడితే మోము తొంగిచూడవచ్చునా

రేకు: 0633-6 పడవంజరం సంపుటం: 14-198

పల్లవి: చుట్టమవై వున్నాఁడవు చూచినవారికిఁ జూడ
తొట్టుదీరిచేవు యింత దోసమేల యిఁకను

చ. 1: చేరి నాపైఁ జేయి వేసి సెలవినే నవ్వు నవ్వి
మేరమీరినందుకే పో మెస్తిరా నిన్ను
వోరి నీ విందాఁక నెందోవుండి వచ్చి యిదినొక్క
దూరు గట్టేవా వట్టి దోసమేల యిఁకను

చ. 2: చల్లనిచూపులఁ జూచి సరసపుమాటలాడి
మెల్లనె వొడి వట్టేవు మెస్తిరా నిన్ను
తెల్లవారఁగా వచ్చి తెగి యానలు వెట్టేవు
తొల్లిటి బాసలే చాలు దోసమేల యిఁకను

చ. 3: వెట్టి వలపులు చల్లి విరులచెండున వేసి
మెట్టేవు నాపాదము మెస్తిరా నిన్ను
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి నన్నునిట్టె
తొట్టి నిన్ను వెంగమాడేదోసమేల యిఁకను

రేకు: 0634-1 మాళవిగౌళ సంపుటం: 14-199

పల్లవి: కంటిమి యిద్దరివంకఁ గలిగినమేలెల్లా
అంటే నననఁగరాదు అన్నిటాను జాణలు

చ. 1: వలపులు ముదిరితే వసివాడులు
తలఁపులు వూచితేను తగుఁగాఁకలు
అలపులు గనమైతే నదలింపులు
కలవే యిందరికినిఁ గాంతలాల చూడరే

చ. 2: కనుచూపు వాఁడైతే కాంతాళములు
ననుపు లొనఁగూడితే నయగారాలు
తనువులు సోఁకితేనే తమకములు
యెనయ నిందరికిని ఇతవులే చూడరే

చ. 3: భావములు గరఁగితే పరవశాలు
కైవశములై తేను కడుమోహాలు
శ్రీవేంకటేశుఁడు గూడె చెలియలమేల్మంగను
తావుల నందరికిని తారుకాణ చూడరే

రేకు: 0634-2 కేదారగౌళ సంపుటం: 14-200

పల్లవి: ఇందరుఁ దెలిసినవే యీపనులు
కందువ నీపచ్చడము గప్పఁగరాదా

చ. 1: పంతమాడవచ్చుఁ గాని పాసి వుండఁగరాదు
దొంతరమాట లెందాఁకాఁ దొరలించేవు
యింతి నిన్ను వేఁడుకోఁగా నేఁటికిఁక బిగేసేవు
పొంతఁ గూచుండఁ బెట్టుక పోదిసేయరాదా

చ. 2: జంకించవచ్చుఁగాని చలముతో నుండరాదు
పొంకపుగుట్టు లెందాఁకాఁ బోహళించేవు
లంకెనాపె వెనఁగఁగ లావులేల చూపేవు
సంకెదీర నాపెతోడ సరసమాడరాదా

చ. 3: గయ్యాళించ వచ్చుఁ గాని కలయక మానరాదు
చయ్యాటాన నెందాఁకా సాముసేసేవు
ఇయ్యెడ నలమేల్మంగ యెనసె శ్రీవేంకటేశ
నెయ్యమును నాపెతోనే నెట్టుకొనరాదా

రేకు: 0634-3 బౌళి సంపుటం: 14-201

పల్లవి: ఆడవే నేనన్నట్టే ఆతనితోడ
వేడుకకాఁడు దోసము విచారించీనటే

చ. 1: వొక్కయింతికిఁ బుట్టి వొక్కతెకొడుకననే
తక్కరికి నిజములు తనకేడవే
ముక్కు గుట్టించుక తానే మురిసి సిగ్గువడఁడు
యిక్కడ మాతిట్లకు నెగ్గులేల పట్టీనే

చ. 2: పరకాంతలఁ బొంది బ్రహ్మచారి ననుకొన్న
యెరవుల సటకాని నేడ నమ్మేదే
నిరతిఁ జన్నిచ్చుదానినెత్తురు దాగినయట్టి
యెరపరి వీనితోడ నేఁటిచుట్టరికమే

చ. 3: చెల్లెలి నెత్తుకపోను సెలవిచ్చె మరఁదికి
కొల్లతాపకాఁడు వీనిగుణమేఁటిదే
ఇల్లిదె శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
వెల్లవిరులాయ నేఁడు విచారము నేఁటికే

రేకు: 0631-4 శంకరాభరణం సంపుటం: 14-202

పల్లవి: ఏమన్నా దనకే చెల్లునింతెకాక
వోముచు నాపైనేల వొలవేసినే

చ. 1: మనసు నొచ్చీనంటాను మాటలాడకుండఁగాను
తనుఁ గోపించితినంటాఁ దమకించీని
కనుఁగొన సళుపులు కాంతలకు సహజమే
మొనసి మాపైనేల మోపు గట్టీనే

చ. 2: తలఁపు దెలియలేక తలవంచుకుండఁగాను
చలము సాదించెనంటా జంకించీని
అలపులు సొలపులు నంగనలకుఁ గలవే
తొలుతనె మాకునేల దూరు గట్టీనే

చ. 3: తానే వచ్చీనంటాఁ దఁగఁలోననుండఁగాను
నేనే పంతగత్తెనంటా నేర మెంచీని
ఆనవెట్టి శ్రీవేంకటాధిపతి నన్నుఁ గూడె
తేనె వోసి మమునేల తేలించీనె

రేకు: 0634-5 ముఖారి సంపుటం: 14-203

పల్లవి: అవులే యెంతలేదు నీ యాసోదము
చవులమీఁదాఁ జవులైతే సందడిగాదా

చ. 1: చెంతనాపె మాటాడగా చేరి నేనాడననేవు
పంతాన సరుసఁ బార బండికండ్లా
బంతిని మోహమొక్కతెపై నిలిచి వుండఁగాను
దొంతివలపు నేఁజల్ల దోసము గాదా

చ. 2: మంచమెక్కాపె వుండఁగా మరినేరాననేవు
పంచపెట్ట నిదియేమి బంతికూళ్లా
యించుకంత చనవాకె కెక్కుడిచ్చి వుండఁగాను
చంచుల నేఁ బైకొనేది చప్పనేకాదా

చ. 3: పొత్తలనాపె వుండఁగా బువ్వానకు రమ్మనేవు
కొత్తలుగా నిదియేమి గొల్లదోమటా
యిత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితివి
తత్తరించకుండ నీకఁ దగవేకాదా

రేకు: 0634-6 కురంజి సంపుటం: 14-204

పల్లవి: వచ్చి వచ్చి చెనకేవు వద్దన్నా మానవు
యిచ్చకము నేరమే నీకింతేసి వలెనా

చ. 1: ఆడేవి గొణఁగులు అమ్మేవి సణఁగులు
యీడనే మాపొందు నీకు నితవయ్యీనా
వాడుఁజూపే చూతుమూ వలలఁ బెట్టుదుమూ
వోడక మాతోడిపోరుకోపేవా నీవు

చ. 2: సెలవినే నవ్వులూ చేఁతలెల్ల రవ్వలూ
పలుమారు మాచేతఁ బడఁగలవా
చలము సాదింతుమూ చనవు మెరతుమూ
వొలసి యీరాఁపులకు నొడిఁ గట్టఁగలవా

చ. 3: కాఁగిటికి మెత్తుమూ కసరఁగఁ జొత్తుమూ
దాఁగక యీరతుల సందడికోపేవా
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
మాఁగిన మామోవితీపు మనసు వచ్చీనా

రేకు: 0635-1 సామంతం సంపుటం: 14-205

పల్లవి: ఎన్నఁడు మఱవవచ్చు యీచేఁతలు
విన్న కన్నవారికెల్ల వింతలివి కావా

చ. 1: వున్నతి నీవాపెవొద్దనుండి నాకె మోహించి
సన్న సేసి పిలుచుటే చాలదా నాకు
మన్నించి నీ వాకెతోడ మాటలాడుతా నాదిక్కు
కన్నులఁ జూచినదే కానరాదా మేలు

చ. 2: చయ్యన నాపె నీవు చదురంగమాడుతాను
పైయ్యెత్తు చెప్పుమంటివి బాపురా నన్ను
వుయ్యాలపై నాకె నీవు వుండి నన్ను రమ్మంటా
పయ్యెద వట్టి తీసితి పంతమిది గాదా

చ. 3: చలివాయ నాపె నీవు సరసములాడుతాను
సెలవి నాతో నవ్వితి చెల్లదా నీకు
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చెలిచేత మొక్కించితి చెప్పరాదు మోహము

రేకు: 0635-2 శుద్ధదేశి సంపుటం: 14-206

పల్లవి: ముక్కుననే వున్నది ముంగోపమైతేను
యెక్కువ తక్కువలంటే నేమందువో

చ. 1: వేడుకకు వెలలేదు వెన్నెలకు కొలలేదు
ఆడేటి నీ మాఁటలకు నడ్డము లేదు
వాడెనంటే నీ మోము వాదులకు వచ్చేవు
యేడనుంటివంటే నిఁక నే మందువో

చ. 2: నవ్వు సిగ్గెరఁగదు వున్నతి రాయి గరఁగదు
రవ్వల నీసేఁతలైతే రాఁపు మానదు
యివ్వల నే విసరితే నీరసానఁ జూచేవు
యెవ్వతెవాఁడంటే నిఁక నే మందువో

చ. 3: చిత్తానకు గురియేది చీఁకటికి గెర యేది
హత్తిన నీ మాయలకు నలవి యేది
యిత్తల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యెత్తి నిన్నుఁ బొగడితే నేమందువో

రేకు: 0635-3 సామవరాళి సంపుటం: 14-207

పల్లవి: అంకె వచ్చినపుడన్నీ నయ్యీఁగాక
పొంకము గానియందుకు పోరు గొంత వలెనా

చ. 1: మంచిమాటలాడితిఁబో మాపుదాఁకా నీగుణము
చంచలము మాని వోజకు వచ్చినా
కంచు గంచే పెంచు వెంచే కాలమెంత జరిపినా
పంచనుండి ఇందుకుఁగా బతిమాలవలెనా

చ. 2: చేతులెత్తి మొక్కితిఁబో చిత్తములో నీ ప్రేమ
యీతల నేనెంతన్నా నిఁక వచ్చీనా
యేతులేలా రాయి రాయే యెంతైనా గుల్ల గుల్లే
కాతరాన నిందుకుఁగా కాఁకఁ బొందవలెనా

చ. 3: ఇట్టె నిన్నుఁ గూడితిఁబో యెరవుల నీకాఁగిలి
జట్టినెంతబిగించినా చవి పుట్టీనా
నెట్టిన శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గలసితి
వెట్టికి యిందుకుఁగా వేగిరించ వలెనా

రేకు: 0635-4 ముఖారి సంపుటం: 14-208

పల్లవి: ఎప్పుడూ నీవోజ మానవేరా వోరి
చొప్పుగా నావలె నిన్నుఁ జూచుకోఁ గదవే

చ. 1: అంగవించి నే నీతోనాడినట్టల్లా నీవు
యెంగిలిమాటలాడేవు యేరా వోరి
సంగ తెరఁగ వదేమే సారెసారె నీనోటఁ
నెంగిలి గాకుండా మాట యెట్లనాడేవే

చ. 2: మొదలనే గుట్టుతోడ మొక్కులు మొక్కితే నీవు
యెదురు మొక్కులు మొక్కేవేరా వోరి
పదరి నేనే నీకు పంతమిచ్చి మొక్కితేను
యెదురు మొక్కు మొక్కక యెట్లనుండేవే

చ. 3: వంతుకు నందరివలె వద్ద నేఁ గూచుండితేను
యింతలోఁ గాఁగిలించేవు యేరా వోరి
బంతినే శ్రీవేంకటాద్రిపతి నే నండనుండఁగఁ
నెంతైనాఁ గాఁగిలీక యెట్లనుండేవే

రేకు: 0635-5 శంకరాభరణం సంపుటం: 14-209

పల్లవి: మేరకు మేరై వుండుట మేలుగాదా
కారణములేని వట్టికలఁకలేలా

చ. 1: పంతము దొలుతనాడి పలుమారు నందుకుఁగా
వంతువాసులెక్కించుక వాదు నీకేల
యింతలోఁగన్నీరునించి యెదురు మాటాడుతాను
చింతతోడఁ దలవంచే సిలుగు నాకేల

చ. 2: వనితెనొక్కతెఁ జూపి వలవనిబొంకు బొంకి
వెనక నానలు వెట్టేవెద నీకెల
తనువునఁ గాఁక రేఁగి తలఁబట్టు వెట్టుకొని
మనసు రాక యలిగేమంకులు నాకేల

చ. 3: యేకతాన నన్నుఁ గూడి యెవ్వతెఁ జెనక రాక
మైకొని వుండేటినేమము నీకేల
కైకొని శ్రీవేంకటేశ కలసితి నింతలోనే
రాక వుంటిననేటి నేరము నాకేల

రేకు: 0635-6 రామక్రియ సంపుటం: 14-210

పల్లవి: తనందు కల్లలేకున్న తానేల రాదుమానిని
మనకొలఁది వచ్చేసామన్యుఁడా వీఁడు

చ. 1: సరుస నే నన్న వెల్ల సరిరాఁగా నవ్వీఁగాక
కెరలి యింతక కోపగించఁడా వీఁడు
వొరదుయ్యక తొమ్మిది వూరకే కోపించేవాఁడు
వొరసి నాతిట్లకు వోరిచీనా వీఁడు

చ. 2: కడుఁ దనచేయిమీదు గాఁగానే వున్నాఁడు గాక
గడుసైన మాసటీఁడు గాఁడా వీఁడు
అడరి తననీడకే అలిగేటి యట్టివాఁడు
వెడఁగు నాఘాతలకు వెరచీనా వీఁడు

చ. 3: యెవ్వతో అప్పణ దనకియ్యఁగా నున్నాఁడుగాక
ఇవ్వల లోనయ్యేవాఁడా ఇంతటవీఁడు
రవ్వగా శ్రీవేంకటాద్రిరాయఁ డిట్టె నన్నుఁగూడె
పవ్వళించి నను నింకఁ బాసీనా వీఁడు

రేకు: 0367-1 లలిత సంపుటం: 14-211

పల్లవి: వట్టివేసాలీడనేల వద్దనరే యమ్మలాల
వొట్టి తానే పిలిచితేనోపనంటినా

చ. 1: కన్నులఁ దప్పక చూచి కాయము నాపై వేసి
మున్నిటివలపులేల మోపు గట్టీనే
అన్నిటాఁ దన్నుఁ దెలిసి అలసి వుండినదాని
కన్నవారెదుటనేల కాకు సేసీనే

చ. 2: ఆనలు సారెకుఁ బెట్టి అట్టె నాపైనుస్సురని
పూని తనవెదలేల వొప్పగించీనే
పూని తనమాయలలో పుట్టిపెరిగినదాన
తేనెలమాటలనేల తేలించీనే

చ. 3: మంచముపైఁ గూచుండి మన్నన నాకే యిచ్చి
యెంచరాని తన నిజమేల చూపీనే
అంచల శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
ముంచి నాతోనిప్పుడేల ముచ్చటలాడీనే

రేకు: 0636-2 శ్రీరాగం సంపుటం: 14-212

పల్లవి: వద్దు వద్దు యిస్సీ నావలపెంత నేనెంత
వొద్దనుండి నే నిన్ను వుడికించేకొరకా

చ. 1: కావించి నే నేఁడు నీకుఁగలిగిన ఫలమెల్ల
వేవేగనీతోనలిగి వెతఁ బెట్టేదా
చేవదేర నీపొందు చేసినదెల్లా నేను
రావు పోవనుచు నిన్ను రాయిడించే కొరకా

చ. 2: వున్నతి నే జవ్వనినై వున్నదెల్లా సారె నీకు
విన్నపాలు సేయించి వేసరించేదా
మన్ననఁ బొందినదెల్లా మరి నీయిచ్చరాజవై
వున్నవాని నావద్ద వుండుమనేకొరకా

చ. 3: వుమ్మగిలి కాఁకల నే వుండిన ఫల మిపుడే
అమ్మరో నీకాఁగిట నేనంటించేదా
నెమ్మది శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
యిమ్ముల నాచేఁతలెల్లానింత సేసేకొరకా

రేకు: 0636-3 దేసాళం సంపుటం: 14-213

పల్లవి: వేగిర మింతలోనేల విసుగునేల
బాగులెల్లఁ జక్కనయ్యీ పంతమాడనీవే

చ. 1: కిలకిల నవ్వుకొంటా కేఁగంటఁ జూచుకొంటా
వలపులు పైఁజల్ల వచ్చీ వాఁడే
యెలమి నిందాఁకా దానెక్కడ నుండెనోకాని
తలఁపెల్లఁ గనుకొనే దగ్గరి రానీవే

చ. 2: వారి వీరిఁ జూచుకొంటా వసివాడు వాడుకొంటా
నేరుపులు వీధి వీధి నించీ వాఁడే
ఈరీతి నాతోడనిఁక నేమని బొంకెనో కాని
తేరీనన్ని పనులు తెల్లవారనీవే

చ. 3: యిచ్చకములాడుకొంటా నెఱఁగమి సేసుకొంటా
వెచ్చనిమేను మీఁద వేసీ వాఁడే
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
బచ్చనలోకటొకటే పచరించనీవే

రేకు: 0636-4 ఆహిరి సంపుటం: 14-214

పల్లవి: వెనకటివలె నేను వెరతు వెరతునిఁక
తనవానివలెనుండి దాయఁ గూడీనా

చ. 1: కలువపువ్వులబంతి కానుకలేలంపీనే
కలువలు మరునంపగము లోయమ్మా
తలఁచి తనకుఁ గానే తాపమున నున్న నన్ను
వెలినుండి యిదికొంత వేతలు రేఁచీనా

చ. 2: యిట్టె యీపనములోనికేల రప్పించీనోయమ్మ
కట్టిడి వసంతపు కాలమిది
యిట్లైన తనరాకకు యెదురు చూచే నన్ను
కట్టఁగిగడ తానుండి కాఁకలఁ బెట్టీనా

చ. 3: చిలుకలతెర యేల చేరి కట్టించె నడుమఁ
జిలుకలు వాతరొల్లు చిమ్మిరేఁచును
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడి
పలురతులనే యింక భ్రమలఁ బెట్టీనా

రేకు: 0636-5 మధ్యమావతి సంపుటం: 14-215

పల్లవి: ఎడమాటలాడకురే యింతులాల
అడియాలములు గల వాతని నాసంది

చ. 1: మనసులొక్కటైతేను మారాడక వుండవలె
తనంతలేనికూటమి తమి రేఁచవలెనా
చనవు గల్గుచోట సాదించఁ బనిలేదు
పెనఁగఁబోతేఁ గడు బెండుపడు గుణము

చ. 2: వలపులే కలిగితే వాసి వంతు మానవలె
పొలసి మీరాతని బోదించవలెనా
అలుకలే తీరితేను ఆయము గరఁగవలె
బలిమి సేయఁగఁబోతే పచ్చిదోఁచు వయసు

చ. 3: చెల్లుబడైతేను సేసిన చేఁత దక్కవలె
మల్లాడఁబోతేను మట్టు మీరుఁ బనులు
ఇల్లిదివో శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
చిల్లరచేఁతలకెల్ల చెప్పరాదు ప్రియము

రేకు: 0636-6 కేదారగౌళ సంపుటం: 14-216

పల్లవి: వద్దె చలము విన్నవారి కెంత
కొద్దిమాలినట్టి నీ కోపమెంత

చ. 1: చెక్కునొక్కి తఁడు నీ చెయి వట్టినది యెంత
తెక్కుల నీ వాతనిఁ దిట్టేదెంత
ఇక్కువలంటి యాతఁడు ఇచ్చకమాడేదెంత
వెక్కసాన నీవందుకు విసిగేదెంత

చ. 2: కొంగువట్టెతఁడు నిన్నుఁ గూరిమి గొసరుటెంత
బెంగవలెనే వొట్లు వెట్టేదెంత
సంగతినాతఁడు నీతో చనవు మెరసేదెంత
వెంగలితనాన నీవు వీడనాడేదెంత

చ. 3: కాఁగిలించెతఁడు నీకుఁ గప్పుర మిచ్చేదెంత
మాఁగుచు నీపట్టే యనుమానించేదెంత
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడు ని న్నిట్టె కూడె
నాఁగువార నీ వప్పటి నవ్వేదెంత

రేకు: 0637-1 లలిత సంపుటం: 14-217

పల్లవి: ఇంత నీవు సేసేది యెరఁగనైతి
వింత నీవు గావంటా విఱ్ఱవీఁగితిఁగా

చ. 1: వేడుకతో మాయింటికి విచ్చేసేవంటానే
ఆడుకొంటి నిందరితో నాసలాసల
వీడెము నేనిచ్చేనంటా విందు నీకుఁ బెట్టేనంటా
యేడలేని సంబ్రమాన నెదురు చూచితిఁగా

చ. 2: పంతాన నీవు నన్ను భావించి చూచేవంటా
ఇంత సింగారించుకొంటి నిందరిలోన
మంతనమాడేనంటా మచ్చిక చూపేనంటా
సంతసాన నీకు నే జాగరాన నుంటిఁగా

చ. 3: బడలి వచ్చి నావొద్దఁ బవ్వళించేవంటాను
కడఁగి పానుపువేసి కాచుకుండితి
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
వుడివోక యిందాఁకా నొంటినే వుండితిఁగా

రేకు: 0637-2 బలహంస సంపుటం: 14-218

పల్లవి: ఎవ్వరము వద్దనున్నా నేమిసెలవు
జవ్వన మాపెవల్లనే చవులు పుట్టించెనా

చ. 1: వంతులకు నాపె వచ్చి వద్దఁ గూచుండినపుడు
అంతట నీ కోరికెల్లా నాయనా నేఁడు
పంతమువనే ముట్టి పాదము లిందాఁకానొత్తె
యింతలో నీయనుమాన మిక్కడనే పాసెనా

చ. 2: మనసిచ్చి యాపె నీతో మాటలెల్లా నాడఁగాను
చనవున నీలో ముచ్చట వాసెనా
చెనకి యాపె నిన్నుఁ జెయివట్టి తియ్యఁగాను
తనువుపై వలపుల దామెల్లానారెనా

చ. 3: పలుమారు నీకు నాపె బాగాలందియ్యఁగాను
యెలమి నామోము చూడనితవాయనా
నిలిచి శ్రీవేంకటేశ నీవు నన్నే కూడితివి
తొలుత నీవు సేసిన దోసమెల్లాఁ బాసెనా

రేకు: 0637-3 దేసాళం సంపుటం: 14-219

పల్లవి: రాయిడిఁ బెట్టక యింక రారే మీరు
చాయకు వచ్చినప్పుడు సమ్మతించీఁగాని

చ. 1: చేయిపట్టి తియ్యకురే చిత్తజుబాణాలచేత
ఆయాలు దాఁకినప్పుడే అట్టేవచ్చీని
నాయాలఁ బెట్టేవలపు నాకు నెందాఁకావచ్చీ
కాయముపైఁ గలిగితేఁ గలిగీఁగాని

చ. 2: పొంచి యాన వెట్టకురే పొంతనాలు గూడితేను
మంచముపైఁ గూచుండి మరిగీఁగాని
ఇంచుకంత రేఁచేనవ్వు యెక్కడి కెక్కఁగఁ బోయీ
అంచుమోచినవేళల నయ్యీఁగాని

చ. 3: సారెకు మొక్కకురే సరసమే చవులైతే
కోరి వేఁడి తన్నుఁ దానే కూడీఁగాని
యీరీతి శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁ గలసె
నేరుపులు మీఁదమీఁద నెరపీఁ గాని

రేకు: 0637-4 కన్నడగౌళ సంపుటం: 14-220

పల్లవి: అప్పుడు నీవేమనేవు అంతపను లైనమీఁద
రెప్పలెత్తి చూచితేను రేసు వోదు గదరా

చ. 1: జవ్వనాన వాడలోని సతులు పిలువకుంటే
యెవ్వతెనైనాఁ దిట్టేవేరా నీవు
అవ్వలనుఁ గోపకత్తె యైనది ఒకతె నిన్ను
దవ్వుల నేమిసేసినా దక్కిపోవు గదరా

చ. 2: సంగడిఁ గూచుండి నీతో సరసములాడరంటా
అంగనల పగచాటేవవురా నీవు
బంగపెట్టి వేరొకతె పగదీర సూడువట్టి
యెంగిలితమ్మ వేసితే నెట్టవునో కదరా

చ. 3: యేక తాన నీసుద్దు లెవ్వరు నెరఁగరంటా
కాకుసేసే వాడువారిఁ గానీరా వోరి
కైకొని శ్రీవేంకటేశ కలిసితివిట్టె నన్ను
లోకులెవ్వరు నవ్విన లోనౌదు గదరా

రేకు: 0637-5 కాంబోది సంపుటం: 14-221

పల్లవి: మెలుఁతలిందరుఁ గూడి మీ రేల వచ్చితిరమ్మ
కలివోసినా నుట్లకడ చూడనేలే

చ. 1: అండకు వచ్చినవేళ నపుడూరకుండి నన్ను
వుండుండి పిలువనంపె నూరకిదేలే
నిండిన యీ ప్రియములు నేరఁదాయనా అపుడు
చండిపెట్టి కూడఁబోతే చౌకే కాదా

చ. 2: పై పై మాటలాడేవేళ పరాకు సేసుకవుండి
యీపొద్దు ఆసుద్దడిగీ ఇంకా నేలే
దాపగు యీ తలపులు దాఁచుకుండెనా అపుడు
మాపులే రేపులైతే మనసులెనసునా

చ. 3: ముచ్చటలాడేటివేళ మొకము వంచుక వుండి
యిచ్చట సరసమాడీ నిదివో యేలే
యిచ్చగించి శ్రీ వేంకటేశుఁ డిదె నన్నుఁగూడె
వచ్చివచ్చి రాకున్న వాడిక లేదనరే

రేకు: 0637-6 గుజ్జరి సంపుటం: 14-222

పల్లవి: చక్కనిదానవంటాను సారెఁ బొగడేవు నన్ను
యిక్కడివారి యెదుట నేమి బాఁతి నేను

చ. 1: మంతానాన నాతోనే మాటలు నీవాడఁగానే
యెంతనెగులుండునో నీయింతుల కెల్లా
యింతేసి మమ్ము మన్నించి యేల దూరు గట్టేవు
కొంతైనా నే వారి కాలిగోరఁ బోలుదునా

చ. 2: ననుపున నీవే నాతో నవ్వులెల్ల నవ్వఁగాను
వొనర నీ సతులెంత వుస్సురందురో
చనవిచ్చిందరిలోన సడి నాకేల కట్టేవు
పెనచి నే వారికెల్లఁ బిన్నదానఁగానా

చ. 3: గక్కన నన్నిటు గూడి గడె వెట్టుకుండఁగాను
అక్కడి నీ సతు లేమనాడుకొందురో
యిక్కడ శ్రీవేంకటేశ యెక్కుడు సేసితి నన్ను
మిక్కిలి వారికి నే మేరమీరేదాననా

రేకు: 0638-1 ధన్నాశి సంపుటం: 14-223

పల్లవి: నాకు నాకే పొగడుకొనను(బాడి గాదు గాక
మేకులకిందరిలోన మెప్పించుకో నేరనా

చ. 1: తీపుల నీమాటలకు తేలితే(దేలుదు(గాక
యేపున జాణతనాన నెక్కుడు గానా
పై పై నీకు మోహించి పరవశమౌదు(గాక
కోపగించి నిన్ను నొక్కకొలికికి(దెత్తు(దేనిత్తు?)నా

చ. 2: వలచి నీయ్యెడకే నే వాసి వంతులెంచ(గాక
చలివాయ నిన్ను(గడు సాదించలేనా
కలసి వుండి నీకొక్కనికే వెరతు(గాక
తెలిసి నీ దిక్కొకతె(దేరిచూడనిత్తునా

చ. 3: మనసు నీపై(బెట్టి మారాడజాల(గాక
పనివడి నిన్ను నిట్టె బ్రమయించనా
ఘనుడ శ్రీవేంకటేశ కా(గిట(బాయవు గాక
వెనకటివలె నైతే వెల్లవిరి సేయనా

రేకు: 0638-2 శుద్ధవసంతం సంపుటం: 14-224

పల్లవి: ఏమి సేసితివో నీవే యెరుఁగుదువు
ఆమాటే యింకొక్కమాటు అడుగఁగ రాదా

చ. 1: మొగము దప్పక చూచి మోనమునఁ దలవంచె
నగదాయ నేమోకాని నాధుఁడ నిన్ను
తెగ దెంతైనా మాట తెలియరాదెవ్వరికి
జగడముఁ గానరాదు సమ్మతించలేదు

చ. 2: కదిసి వద్దఁ గూచుండి కాంత యెవ్వలిమోమై
యదన విడె మీదాయ నదేమోకానీ
వెదకినఁ గానరాదు వేవేగ నీ గుట్టు
చెదరినచిత్తమో సిగ్గో తెలియదు

చ. 3: నీ మీఁదఁ జెయి వేసి నెలఁత గొబ్బునఁ దీసె
యేమి దలఁచెనో కాని ఇంతటిలోన
కామించి శ్రీ వేంకటేశ కలసితి వటునీవు
యీమగువ, నీ వలపులెట్టుండెనో కానీ

రేకు: 0638-3 సౌరాష్ట్రం సంపుటం: 14-225

పల్లవి: ఇట్టే విచ్చేసీనతఁడేలే యింత
వొట్టి వూరకున్న వారి నుడికించనేఁటికే

చ. 1: కప్పుర మంపెఁగదే కాంతుఁడు తారానిఁ
కప్పురము వేఁడిచల్లీఁ గదవే నాకు
దప్పికిఁ బన్నీరంపెఁ దమితో నీకు
నిప్పులను బొరలించి నీకు చల్లనేఁటికే

చ. 2: గంద మంపెఁగదె నీకు ఘనుఁడు తా రానిఁ
గందమా అది పెద్దగండము గాక
ముందరనే పువ్వులంపె ముడుచుకోవే
విందుగాఁ గాఁకలు చల్లి విసరఁగనేఁటికే

చ. 3: వుంగర మంపెఁగదవే వువిద, తా రాకున్న
వుంగరమా అది నాకు వుంకువగాక
కంగి కూడె శ్రీ వెంకటఘనుఁడు కడపలోన
నింగు(?)నెండలోనఁ బెట్టి నీడకుఁ దియ్యనేలే

రేకు: 0638-4 సామంతం సంపుటం: 14-226

పల్లవి: ఎప్పుడు మానవు కోపమేమే నీవు
రెప్పలెత్తి చూచితేనే రేసు పుట్టీనా

చ. 1: పుప్పొడి నీమీఁదఁ జల్లె పూవులచెండున వేసె
అప్పటి నాతఁడలిగెననే నదేమే
కప్పిన యీవేట్లకు కళదాఁకె నింతెకాక
చిప్పిలు నీమనసేమి చిల్లులాయనా

చ. 2: పాదము నీపైఁ జూఁచె పట్టెమంచముపైఁ బండె
ఆదరించఁడాయ ననేవదేమే నీవు
సోదించి మేనంటఁగాను సొమ్ములొత్తె నింతెకాక
పాదుగా నీకాతఁడేమి పగ సేసెనా

చ. 3: గక్కన నీచెక్కు నొక్కె కాఁగిటను బిగియించె
అక్కర దీరదనేవు అదేమే నీవు
యేక్కువతో శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
తక్కక నీ కింకానేమి తనివారదా

రేకు: 0638-5 సామంతం సంపుటం: 14-227

పల్లవి: తానెంత నేనెంత తమకించీ నింతెకాక
వూని తనచేఁతలకే పులకించీ మేను

చ. 1: తప్పక చూచె వాఁడే తానె యిందు వచ్చెవీఁడే
కొప్పు దువ్వె నిదె వీఁడే కొలువులోన
యెప్పుడు నావంటివారు యెందరు లేరు తనకు
కప్పిన యీమన్ననకే కరఁగీ నామనసు

చ. 2: సరిమాటలాడీ వాఁడే సారెఁ జెనకీ వీఁడే
మురిపెపు చన్నులు చేముట్టీ వాఁడే
నిరతి జాణ తానైతే నేనేమి బాఁతి తనకు
యిరవై యిందుకే తలకెక్కీ నావలపు

చ. 3: వెంట వెంట వచ్చీ వాఁడే వేసాలు సేసీ వాఁడే
నంటు మంచానకుఁ దీసి నవ్వీ వీఁడే
వొంటినే శ్రీవేంకటాద్రినుండి వచ్చి నూఁడుకూర
అంటీ కేశవరాయఁడై అరుదైతి నేను

రేకు: 0638-6 రామక్రియ సంపుటం: 14-228

పల్లవి: ఏమి దప్పిపోయ నీకు నింతలోనను
చేముట్టి కూచుండుమని చెక్కు నొక్కరాదా

చ. 1: గద్దెపీఁటమీఁదనుండి గక్కన లేచి నిలిచె
నిద్దురకన్నులచెలి నీవు రాఁగాను
అద్దో నీపాదాలు గుద్ది అలసి వచ్చెనిందాఁకా
అద్దలించి వుండుమని ఆనవెట్టిరాదా

చ. 2: చెలిమిఁద నొరగుండి చేయి దీసుక నిలిచె
నెలఁత వెరపుతోడ నీవు చూడఁగా
కొలువు సేసి సేసి గోడమరఁగుకు వచ్చె
బలిమిఁ బట్టుక పోయి పవ్వళించరాదా

చ. 3: తూఁగుమంచ మూగి యూగి దుమికి కయిలాగిచ్చె
చేఁగదేర నీవాపెకుఁ జేయి చాఁచఁగా
మాఁగిన మోవియిచ్చి మగువనిట్టే కూడితి
వీఁగక శ్రీవేంకటేశ వీడెమియ్యరాదా

రేకు: 0639-1 సామంతం సంపుటం: 14-229

పల్లవి: ఏమి మొగసిరిమందో యెంతనేరుపరో కాని
నామనసు గరఁగించి నవ్వించెనే

చ. 1: యెదుటఁ దనకు నాకు నేఁటిపొందులంటానుంటే
పదకము మెడఁ బెట్టి బ్రమయించెనే
మొదలఁ దనకు నే మొక్కనోపనంటానుంటే
పదరి పాదము నాపైఁ జాఁచెనే

చ. 2: వోపనంటా నోరుమూసుక వూరకే వుండేదాని
పాపట దువ్వి దువ్వి పలికించెనే
రాపుగ నితనితో వెరతునంటా నేనుంటే
మూపున గడ్డము మోపి మొసగోర నూఁదెనే

చ. 3: నమ్మని తనమాటలు నాలి కాఁడంటా వుంటే
సొమ్ములెల్లా మెడఁ బెట్టి చొక్కించెనే
వుమ్మడి శ్రీవేంకటాద్రినుండి వచ్చి మాదుకూరఁ
గమ్మర చెన్నరాయఁడై కాఁగిలించెనే

రేకు: 0639-2 శంకరాభరణం సంపుటం: 14-230

పల్లవి: ఇతవెరఁగవద్దా యిస్సీ నీవు
అతిజాణవిన్నిటాను అది నీవెరఁగవా

చ. 1: చిమ్మేటి చూపులతోడ చెంగావి మోవితోడ
కొమ్మనీతో మాటలాడి కొసరీనదే
కుమ్మరింపువలపుతో గుబ్బల మెరుఁగు చూపి
అమ్మే నీకు దేహమెల్లానది చాలదా

చ. 2: సారెఁబన్నసరాలతో చల్లేటి నిట్టూర్పుతోడ
వూరకే నీమాటలెల్లా నూఁకొనీనదే
భారపుతురుముతోడ పయ్యదజారుతోడ
ఆరని చెమటలూఁది నదె చాలదా

చ. 3: నామ్ముఁ బులకలతోడ నాటిన చిత్తముతోడ
వేమారు నీ మీఁద మేను వేసీనిదె
బూమెల శ్రీవేంకటేశ పొలఁతిఁగూడితివిట్టె
ఆమగువ నిన్ను మెచ్చెనది చాలదా

రేకు: 0639-3 రామక్రియ సంపుటం: 14-231

పల్లవి: నిక్కము బొంకులు రెండ నీవేకావ
నిక్కి చూచేవప్పటిని నీవే కావా

చ. 1: నారుకొని యాతఁడు నాతో మాటలాడకుండ
నేరిపితి బుద్దులు నీవే కావ
దూరితేను నీవాతనిఁ దోడుక పొమ్మనేవు
నీరువంకతుంగవైతి నీవే కావా

చ. 2: కమ్మి యాతనివద్దను కాచుకుండి యరచేతి
నిమ్మపండవైతివి నీవే కావ
వుమ్మడి వాదడిచితే వూరకే మొకమోడి
నెమ్మిచాయకు వచ్చేవు నీవే కావా

చ. 3: కావించి యాతఁడు నేను కాఁగిలించుకుండఁగాను
నీవద్దికి బిలిచేవు నీవే కావ
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యిద్దరిఁ గూడఁగ
నీవే నేననేదానవు నీవే కావా

రేకు: 0639-4 శంకరాభరణం సంపుటం: 14-232

పల్లవి: చెల్లుఁజెల్లు నీచేఁత చెన్న కేశవా
చిల్లరసుద్దులింకేల చెన్న కేశవా

చ. 1: రమ్మనుచుఁ బిలిచేవు రాజసాన వీఁగేవు
చిమ్ముఁజెమటలఁ జెక్కులచెన్న కేశవా
కమ్మరఁ గమ్మర నీవు కన్నులనే సొలయఁగ
చిమ్మిరేఁగె మేనెల్లా చెన్న కేశవా

చ. 2: మొగము చూచి నీవు మొక్కవచ్చి లోఁగేవు
చిగురుఁ బెదవి వాడె చెన్నకేశవా
అగపడి నీవు నాపై నానలెల్లాఁ బెట్టఁగాను
జిగిమించె నివ్వెరగు చెన్నకేశవా

చ. 3: దగ్గరితివిదె నన్ను తప్పక చూచితేను
సిగ్గుదేరె నీమోమున చెన్న కేశవా
వొగ్గుచు శ్రీవేంకటాద్రినుండి వచ్చి మాఁడుకూర
సెగ్గెముదేరఁ గూడితి చెన్న కేశవా

రేకు: 0639-5 సామంతం సంపుటం: 14-233

పల్లవి: ఇంకాలేదని బొంకే వేలరా నాతో
సంకుల సోరణగండ్లఁ జూడనా నేను

చ. 1: వొయ్యారి బాగుననుండి వోరగంట నిన్నుఁ జూచి
తొయ్యలి నవ్వు నవ్వె తొలుతే కాదా
పయ్యద ముంజేతఁ జుట్టి పడఁతి పై నొరఁగుక
అయ్యెడ నెందుంటివని అడుగదా నిన్నును

చ. 2: బంగారు పాములు మెట్టి పాదముపైఁ బాదమూఁది
అంగన నీతో సొలసెనప్పుడే కాదా
ముంగురులు కొనగోళ్ళ ముట్టి ముట్టి చెరుగుతా
వుంగరము నీకిచ్చె నుంకువ గాదా

చ. 3: వొడివట్టి నిన్నుఁ దీని వుయ్యాల చేరులు వట్టి
పడఁతి నిన్నానవెట్టి పైకొనెఁగాదా
బడినె శ్రీ వేంకటేశ పారితెంచి మూఁడుకూర
తడవి యింత సేసితి దక్కెఁగా నీపనులు

రేకు: 0639-6 పాడి సంపుటం: 14-234

పల్లవి: ఈమాటకేమి నాకిందరిలో వెరగయ్యీ
నామాట వినకున్న నాకు సిగ్గుగాదా

చ. 1: మన్నించి చేపట్టఁగా నే మాటలాడేఁ గాని నీతో
సన్నతోనే మెలఁగితే చక్కనుండనా
వున్నతి యెక్కువ సేసి వూరివారి వలెనే
నన్ను సరిగాఁ జూచితే నాకు సిగ్గుగాదా

చ. 2: కమ్మటి నీవు నవ్వఁగఁ గదియ వచ్చితిఁ గాని
యెమ్మెల నీ వూరకున్న నింటనుండనా
సమ్మతించఁ జేసి నాకె సారెఁ గపటములైతే
నమ్మవని నిన్నునాడ నాకు సిగ్గుగాదా

చ. 3: కలయ వేఁడుకోఁగానే కానిమ్మంటిఁగాని నీతో
చలమున నూరకున్న సమ్మతించేనా
మెలఁగి శ్రీవేంకటేశ మించ నన్నుఁ గూడితివి
నలినింతలేకున్న నాకు సిగ్గుగాదా

రేకు: 0640-1 శ్రీరాగం సంపుటం: 14-235

పల్లవి: కన్నదాఁక విన్నదాఁక కడమే కాదా
నన్నువంటిదానితోడ నాఁటకము వలెనా

చ. 1: ఇంత నాపై బత్తియైతే యెడమాట లేఁకనేల
వంతుకు మాఇంటికే తా వచ్చుఁగాక
వింతవారు తాఁ గాకున్న వేరె యెగ్గుఁదప్పునేల
చెంతనేఁ జేసినట్టెల్లఁ జేయించుకొనుఁగాక

చ. 2: తగవరిఁ దానైతే తానె నామగఁడైతే
తెగక నడుమఁ గొంత తెర యేల
జగడమే తీరితేను చనవే నాకిచ్చితేను
అగడు సేయక ముచ్చటాడుఁగాక

చ. 3: తానే జాణఁడైతే నాతలఁపు దెలుసుఁగాక
పూని తన ఇచ్చలనే పొరలనేల
కానిమ్మని శ్రీవేంకటఘనుఁ డిట్టె నన్నుఁ గూడె
మానక నన్నిందరిలో మన్నించుట గాక

రేకు: 0640-2 వరాళి సంపుటం: 14-236

పల్లవి: ఎఱఁగక కొసరితి నెడ్డనయ్యా
తఱవాత నన్నియును తానే వచ్చీనయ్యా

చ. 1: తనివి చాలక నిన్నుఁ దగులనాడితిఁ గాక
మనసురానిపనేల మానవయ్యా
చనవు గలిగి నిన్ను సాదించ వచ్చితిఁ గాక
యెనయనిపొందులింకా నేఁటికయ్యా

చ. 2: నీవే నేనంటాను నేరములెంచితిఁ గాక
వావాత దూరేపనైతే వద్దయ్యా
చేవదేరెఁ బనులంటా చెక్కులు ముట్టితిఁగాక
కైవసము గాకున్న కడమ నాదయ్యా

చ. 3: మంచివాఁడవంటా నీతో మంతనమాడితిఁ గాక
మంచమెక్కి వాదులేల మానవయ్యా
అంచల శ్రీవేంకటేశ ఆయమంటి కూడితివి
కంచపు మోవిఫలము గంటిమయ్యా

రేకు: 0640-3 దేసాళం సంపుటం: 14-237

పల్లవి: మంచివాఁడవంతేపో మాధవరాయా
మంచుమాయ మాఁడుకూరి మాధవరాయా

చ. 1: మోనాననుండిననన్ను ముట్టి వేఁడుకొనేనంటా
మానమేలంటివోయి మాధవరాయా
నేనా సారెకు వచ్చి నీతో నెదురాడేదాన
మానవుగా మాఁడుకూరి మాధవరాయా

చ. 2: యెగసక్యానకే మా ఇల్లుచొచ్చి వచ్చేవు
మగనాలిఁ గదవోయి మాధవరాయా
బగి వాయక కూచుండి పైఁ దొడవేసేవు నీ-
మగువనా మాఁడుకూరి మాధవరాయా

చ. 3: వోపనన్నాఁ బోనీవు వొడివట్టి తీసేవు
మాపుదాఁకానేలోయి మాధవరాయా
కోపుగా శ్రీవేంకటాద్రిఁ గూడి చూపేవా నీయెమ్మె
మాపైనే మాఁడుకూరి మాధవరాయా

రేకు: 0640-4 దేసాళం సంపుటం: 14-238

పల్లవి: ఎంతైనా నమ్మదు చిత్తమేమోకాని
యింతటి నీమాయలిఁక నేమోకాని

చ. 1: సరుగననెంత నాతో సరసములాడినాను
యెరవెరవైతోఁచీ నేమోకాని
వరుస వంతులు నీవు వలపెంత చల్లినాను
యిరవై మరపు ముంచీ నేమోకాని

చ. 2: నగుతా నీవెంత నాతో నయగారాలు సేసినా
నెగసక్యాలే తోఁచీ నేమోకాని
మొగము చూచి నీవు ముచ్చటలెంతాడినాను
యిగిరించీ ననుమాన మేమోకాని

చ. 3: కదిసి నీవెంత నన్ను కాఁగిలించుకోనినాను
యిదెనామై పులకించ దేమోకాని
అదన శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెదుటనే భ్రమసితి నేమోకాని

రేకు: 0640-5 నాదరామక్రియ సంపుటం: 14-239

పల్లవి: చుట్టమవంటా నిన్నుఁ జూచితిఁ గాక యీఁ
వెట్టిమోహ మెరిఁగితే వెలుపుతోనుండనా

చ. 1: పంతమిచ్చేఁ గోరా పదరి నిన్నిందరిలో
అంతలేసిమాటలు నే నాడినందుకు
యింతలోనే నీవింది నెగ్గుపట్టేదెరిఁగితే
మంతనాన దీవించి మాయింటనే వుండనా

చ. 2: మిక్కిలి మొక్కేలేరా మెరయ నీకాలు దొక్కి
చిక్కించి నిన్నుఁ దుచ్చము సేసినందుకు
వెక్కసమై నీకిది వేసటయ్యే దెరిఁగితే
తక్కక నాలో నేనే తలవంచుకుండనా

చ. 3: కాఁగిలించే లేరా కమ్మవిరులచెండున
వీఁగకు నీమేను దాఁక వేసినందుకు
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
పాఁగి యీతమకమైతే పైపైనే వుందునా

రేకు: 0640-6 సాళంగనాట సంపుటం: 14-240

పల్లవి: శ్రీవేంకటేశ్వరుఁడు శ్రీయలమేల్మంగతోడ
కోవిదుఁడై విహరించీ కోడతిరుణాళ్లు

చ. 1: వెల్లవిరిగా వీదుల వెన్నెలలు గాయఁగా
చల్లని పూవులవాన జడి మించఁగా
వొల్లనే సతులు దన్ను వుగ్గళించి పొగడఁగా
కొల్లలాడీ వలపలు కోడతిరుణాళ్లు

చ. 2: ఆటల పాటలవాఁడు అండనే వినిపించఁగా
పాటించి యారగింపులు పైపైఁ జేయఁగా
గాఁటముగ వీడెములు గందములు నందుకొంటా
కోటి భోగాలు భోగించీ కోడతిరుణాళ్లు

చ. 3: చేరి పన్నీరు కప్రము శిరసునఁ గులుకఁగా
వూరక యిందరు కొలువులు సేయఁగా
యీరీతి శ్రీవేంకటేశుఁడిందరుసతులఁ గూడి
కోరికలు వెదచల్లీ కోడతిరుణాళ్లు

రేకు: 0641-1 బౌళి సంపుటం: 14-241

పల్లవి: మగవాఁడవు నీతో మల్లువోరేమా
చిగురువంటిమమ్ము చేఁగ రేఁచేవా

చ. 1: ఆఁటదానికోపమెంత అదే నెపము సేసి
మాటి మాటికిని నీవు మారలిగేవా
సూటికిఁ బతి రాకున్న సొలతురు మలతురు
తోటకూరవంటినన్ను దూరు సేసేవా

చ. 2: పిన్నదానిగుంపెనెంత పెద్ద సేసి నీవందుకు
సన్నల చాయలఁ దిద్ది సాదించేవా
మన్ననలెచ్చుకుంద్దైతే మందెమేళాలాడుదురు
వెన్నవంటినన్ను నీవు వెగట్లాడేవా

చ. 3: లక్కవంటి సతియెంత లావునఁ బెనఁగెనంటా
కక్కసించి రతులలో ఘాత సేసేవు
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చక్కెరవంటినన్ను చవులడిగేవా

రేకు: 0641-2 ఆహిరి సంపుటం: 14-242

పల్లవి: ఏమినెఱఁగని నన్నునింత సేసితి
నీమనసుకొలఁదిక నేనేమినెఱఁగ

చ. 1: నిన్నుఁ బాసి వుండలేను నీమొగము చూచిచూచి
కన్ను రెప్ప మూయలేను కరఁగుతాను
యెన్నికె నీవంతలో నాయెదలోన నెలకొని
మన్నించఁగనట్టె మేను మరచితిఁ గాని

చ. 2: తలఁచక మానలేను తమకాననప్పటిని
వొలిసి నీతో నవ్వకోరువలేను
వెలయ నీ వంతలోనే వెంట వెంట రాఁగాను
చలివలపులనే నే సమ్మతైతిఁ గాని

చ. 3: చేయి చాఁచక మానను చేరి నీ మోవితీపులు
యేయెడఁ జవిచూడక యిటు మానను
ఆయమై శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నాయండ నీవు గూడఁగా నమ్మితిఁ గాని

రేకు: 0641-3 రామక్రియ సంపుటం: 14-243

పల్లవి: పట్టి దూరులు దూరీ వద్దన్న మానఁడు నన్ను
యిట్టే తనకు నే యెరవులదాననా

చ. 1: తగవా తనతో నేను దంటతనాలఁ దిరుగ
నగితే తా నవ్వేఁగాక నాకేఁటికే
మగువ తాఁ బలుకఁగ మాటలాడనైతిననీ
మొగము చూచితేనిట్టే మొక్కనైతినా

చ. 2: అదననిప్పుడే నన్నునండనే కూచుండుమనీ
యిదివో మగనాలికినింత చెల్లునా
పదరి నేను చలము పట్టుకున్న దాననని
వొదిగి తాఁ జెనకఁగా నూరకుండనైతినా

చ. 3: కడమా తనమోము కాఁగిలించీ నన్నింతలో
జడిసేనా నే నేమైనా సమరతికి
బడినే శ్రీవేంకటాద్రిపతి నేనలమేల్మంగఁ
గడఁగిఁ తాఁ గలయఁగ కానిమ్మననైతినా

రేకు: 0641-4 కొండమలహరి సంపుటం: 14-244

పల్లవి: ఎప్పుడు నీవొలపక్షాలేల మానేవు
దప్పివలపుల నేనే తగిలేఁ గాన

చ. 1: కాయము నీపై వేసి కన్నులు దేలించితేను
ఆయడనే భ్రమసితివాపెకు నీవు
చేయి పట్టుక నేనెంత చెక్కు నిన్ను నొక్కినాను
చాయకు రావెప్పుడు నీసటలే కానీ

చ. 2: వేసాలకు మాటలాడి వెడనవ్వు నవ్వితేను
ఆసల వెంటఁ దిరిగేవాపెకు నీవు
వాసికిఁ జన్నులు మోపి వద్దనెంత గూచుండిన
రాసికెక్కదీవలపు రవ్వే కాన

చ. 3: యిట్టునట్టు కొంగు వట్టి యింటిలోనికిఁ దీసితేను
అట్టే లోనైతివి ఆపెకు నీవు
నెట్టన శ్రీవేంకటేశ నిన్ను నేఁగూడితినిదె
వొట్టి నీతనివి దీరదుడుగుటే కానీ

రేకు: 0641-5 పాడి సంపుటం: 14-245

పల్లవి: పొంచి నాకు నాకే పొగడుకోఁ జాలఁ గాక
యెంచఁబోతే నీ గుణాలు యెవ్వరైనా మెత్తురా

చ. 1: వోసరించకాపెయింట నుండఁగాఁ జూచి నిన్ను
సేసినట్టల్లాఁ జేయఁ జెల్లదా నాకు
బాసదప్పి నీవలె పదర నే నోపఁ గాక
వీసమంత పొల్లగల్లా విడుతువా నీవు

చ. 2: తగ నేఁ జూడఁగానాకె తమ్ముల మందుకొంటివి
తగవులఁ బెట్టనింకఁ దగదా నాకు
తెగువ నీవలె నాకు దేవరియ్యఁడాయఁ గాక
పగిడి వెట్టి నవ్వితేఁ బదరవా నీవు

చ. 3: వొద్దనుండి యాకెమీఁదనొరఁగఁగాఁ జూచి నిన్ను
వుద్దండపు మచ్చరములుండవా నాకు
గద్దరి శ్రీవేంకటేశ గక్కనఁ గూడితి నన్ను
వద్దన్నా మానక యింత వలతువా నీవు

రేకు: 0641-6 శ్రీరాగం సంపుటం: 14-246

పల్లవి: చెప్పరాదు చూపురాదు చెలికి నీపై యాస
యిప్పుడే మోహము చల్లీ యిఁకమీఁదనెట్లో

చ. 1: కన్నులనే నిన్నుఁ జూచి కరఁగుతా సొలసీని
చన్నులపై నునుఁగొంగు జారఁగను
వున్నతి మాటలాడి వుస్సురంటాఁ దమకించీ
యెన్ని కలీయింతి మతినెట్టున్నవో కానీ

చ. 2: యిట్టునట్టు నవ్వుకొంటానెదుట నిలుచున్నది
గుట్టున మనోరథాలు గోరుకొంటాను
తొట్టిన మదము పైపైఁ దొలకఁగాఁ జెమరించీ
యిట్టే కాంత జవ్వనమెంత సేయఁగలదో

చ. 3: వచ్చి వచ్చి చెయివట్టి వడిలోనికిఁ దీసీని
విచ్చనవిడిఁ దురుము వీడఁగను
మచ్చిక శ్రీవేంకటేశ మగువఁ గూడితివిట్టె
యెచ్చినయీపె తనివి యింకానెంత గలదో

రేకు: 0642-1 సాళంగనాట సంపుటం: 14-247

పల్లవి: అప్పటిమానరుబీరాలంతే కాదా
యిప్పటి మీవొట్లు యెందాఁకా విందుము

చ. 1: తమ్మిపూవులవాట్లే తప్పించుకోఁ బట్టె మాకు
యిమ్ములనలిగిన మీయిద్దరిచేత
నమ్మరెంతైనా మాట నడుమ చెలులమింతే
యెమ్మెల మీ ముంగోపమెందాఁకాఁ జాతుము

చ. 2: వద్దనుండి మీమాటల వంకలు దిద్దనే పట్టె
యిద్దరుఁ బట్టేటి మీ యెగ్గులలోన
గద్దించేరు నేము మీకు కలిమిలో వారమైతే
యిద్దివో మీ పంతాల కెందాఁకా లోనౌదుము

చ. 3: చేతులుఁ జేతులు వట్టి చేరఁ దియ్యఁ బట్టె మాకు
యీతల మీరు గలసే రేసులలోన
రాతిరి శ్రీవేంకటేశ రమణిఁ గూడితిరిదె
యీ తగవు లీతలఁపు లెందాఁకా మెత్తుము

రేకు: 0642-2 భౌళి సంపుటం: 14-248

పల్లవి: చలి వాసె జగడాలు చాలునే నీకు
కలిసినయిందుమీఁదఁ గడమేలే నీకు

చ. 1: దగ్గర వచ్చి యతఁడు తమకించి వేఁడుకోఁగా
సిగ్గులుఁ జింతలు నింకఁ జెల్లదే నీకు
వెగ్గళించి యప్పటిని వేమారు నవ్వఁగాను
యెగ్గులునెమ్మెలుఁ జూపనేఁటికే నీకు

చ. 2: కన్నులఁ దప్పక చూచి కడుఁ బ్రియము చెప్పఁగా
వన్నెలఁ జలము చూపవద్దే నీకు
సన్నలఁ జాయల నిన్ను సమ్మతిలఁ జేయఁగాను
నిన్నటిపంతములు నేఁడేల నీకు

చ. 3: కడునానలు వెట్టుచు కాఁగిలించనందుమీఁద
తడఁబాటు గుంపెనలు తగదే నీకు
యెడయకు శ్రీవేంకటేశుఁడిట్టె నిన్నుఁ గూడె
వెడఁగు నీకపటపు విసువేలే నీకు

రేకు: 0642-3 శంకరాభరణం సంపుటం: 14-249

పల్లవి: పడతీ నీవూఁ గూడుక బదుకరయ్యా
చిడుముడియాపె లోను సేసుకొనెఁగా

చ. 1: పగటుకు చాలనొత్తి భావము గరఁగఁ జేసి
చిగురుమోవిపైనాకె చేఁత సేసెఁగా
నగవులు నవ్వి నీతో ననుపులు పచరించి
తగిలి తగిలి నిన్ను దక్కఁగొనెఁగా

చ. 2: పచ్చి వెచ్చి మాటలాడి పలువలపులు రేఁచి
యిచ్చకాన నీకాపె యేలికాయఁగా
మచ్చికలు నటియించి మంతనాలు సారెనాడి
కుచ్చిన కాఁగిట నిన్ను గురిసేసెఁగా

చ. 3: పాదముపైఁ జెయి వేసి పక్కన మర్మములంటి
సేదదేరఁ గూడి యాపె సేవ సేసెఁగా
యీదెస శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పోదిసేసి నిన్నిందుకు బోధించెఁగా

రేకు: 0642-4 శంకరాభరణం సంపుటం: 14-250

పల్లవి: పొద్దువోనివారు గాక పోరే మీరు
యిద్దరముఁ గూడినపుడీడకు రాఁగదరే

చ. 1: చింతతోడినన్ను మీరు చేతులేల పట్టేరే
అంతేబత్తి గలిగితేనాతఁడే రాఁడా
కాంతలు మీరు మాపుదాఁకా నాతోఁ బెనఁగితే-
నింతలో మా మనసులకింపు పుట్టీనా

చ. 2: అలిగివుండిన నన్ను నాడకేల పిలిచేరే
తలఁపు గలిగితేను తానే రాఁడా
చెలు లిందరును గూడి సేసలు నూపైఁ జల్లితే
వలపులు మాలోను వన్నె కెక్కీనా

చ. 3: సిగ్గుపడి వున్న నన్ను శిరనేల యెత్తేరే
దగ్గరున్నాఁ డంతెయైతే తానే రాఁడా
అగ్గమై శ్రీవేంకటేశుఁడందుకే నన్నుఁ గూడె
వెగ్గళించి యేమన్నా వేరయ్యేమా

రేకు: 0642-5 దేశాక్షి సంపుటం: 14-251

పల్లవి: ఎంత లేదు నీవేసాలేమన్నా నే నమ్మలేను
అంతగలవాఁడైతే నాతఁడే రాఁడా

చ. 1: యీతల నొక్కొక్కమాటే యెందో నేరుచుకవచ్చి
ఆతఁడాడెనంటా నాతోనాడేవు
పై తరవు వేవేలు పడఁతులు గలవాఁడు
మాతోడి గొడవేల మమ్ముఁ దలఁచీనా

చ. 2: యేడ పనిగలిగో మీరెక్కడో పోతా వచ్చి
యీడకాతఁడంపెనంటా యిచ్చలాడేరు
వాడికెనింతుల నీడ వచ్చేవాఁడతనికి
యీడ నేమేమి బాఁతి యెంత లేదీసుద్దులు

చ. 3: పొరుగుననుండి మీకు పొద్దువోక యిటు వచ్చి
మురిపేన వానిమారు మొక్కేరు నాకు
అరుదై శ్రీవేంకటేశుఁడాతఁడె విచ్చేసి కూడె
ధరలోనిన్నాళ్ళదాఁకా తడవెనా మమ్మును

రేకు: 0642-6 శ్రీరాగం సంపుటం: 14-252

పల్లవి: ఏమని చెప్పుదునమ్మా ఇట్టి నాప్రాణవిభుఁడు
నామీఁదఁ జేసేమన్నన నాదేహమెరుఁగును

చ. 1: తప్పక చూచినచూపు తగులనాడినమాట
యెప్పటికి మరవరాదేమి సేతునే
ముప్పిరి నవ్విన నవ్వు మొక్కలపుఁ జెనకులు
తిప్పరాని మోహమాయ తెగదే యిద్దరికిని

చ. 2: కొనవేలనూఁదినది కొంగువట్టి తీసినది
మనసులోనెన్నటికి మరవరాదే
చనవు నాకిచ్చినది జారుఁగొప్పు దువ్వినది
తనివోనియాసలకు తరవాయఁ గదవే

చ. 3: దగ్గరి వచ్చినరాక తమితోఁజేసినచేఁత
సిగ్గువెల్లఁ బెడఁ బాపె చెప్పనేఁటికే
అగ్గమై శ్రీ వేంకటేశుఁడాయమంటి నన్నుఁ గూడె
తగ్గులేని గతులకు తతులాయ నిదివో

రేకు: 0643-1 సామంతం సంపుటం: 14-253

పల్లవి: ఊరకుంటేనెరఁగవు వూరివారియెదుటనే
బీరములే నెరుపేవు పెద్దరికమౌరా

చ. 1: కూరిమి గొసరి నిన్నుఁ గోపగించినంతలోనే
మేరమీరి తిట్టేవు మేలురా నీవు
వారి వీరితోడ నీవాదులు చెప్పఁగఁ బోతే
సారెనొత్తుక వచ్చేవు జాణవు నీవౌదురా

చ. 2: సరసమాడేటివేళ చనుమొనలనొత్తితే
అరిది గోరనూఁదేవు అవురా నీవు
సరుగ వద్దివారిని సాకిరి వెట్టఁగఁబోతే
గరిమెఁ బగచాటేవు కానీరా నీవు

చ. 3: కానిమ్మని నీచేఁతలు కడుఁ జెల్లఁబెట్టితేను
మేనరికమే పెంచేవు మెస్తిరా నిన్ను
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
నానాఁడే నీగుణాలకు నవ్వితిరా నేను

రేకు: 0643-2 ఆహిరినాట సంపుటం: 14-254

పల్లవి: ఏల నాతోఁ బోరేవు యింత నీకుఁ జలమేల
నీలాగులెల్లఁ జూచి నేనే పిలువనా

చ. 1: పంతానకే నీవు నన్నుఁ బగ చాటి పిలిచేవు
యెంత లేదు నే నీకునెదురా వోరీ
యింతి నేనొకతెనింతె ఇంటిమూలనుండరాదా
కాంతుఁడ రతికి నేనే కడమైతినా

చ. 2: మాటలాడనై తినంటా మచ్చరాలకే వచ్చేవు
ఆఁటదాని నాడించేదరుదా నీకు
నీటున నీయాధీనమై నీవద్దనుంటేఁ జాలదా
మేటివి నేఁ గూడకున్న మెచ్చరా నిన్నును

చ. 3: యెగసక్కేలకే నన్నునిట్టె కాఁగిలించేవు
మగువలపై మరులు మానవా నేఁడు
తగిలి శ్రీవేంకటేశ తరి నన్నుఁ గూడితివి
నగవెల్ల నామీఁదనే నారుగాఁ బోసేవా

రేకు: 0643-3 మాళవిగౌళ సంపుటం: 14-255

పల్లవి: ఎంత గలదే యింకా నీమోహము
యింతిరో నీకే చెల్లునీమోహము

చ. 1: నిక్కి నిక్కి చూచేవు నెయ్యములే తాచేవు
చక్కనిరమణునితో సారె సారెకు
చెక్కునఁ జెయి వెట్టేవు చెమటలే నించేవు
యెక్కడ నేరిచితివి యింతమోహము

చ. 2: కన్నులు దేలించేవు కాఁకలు పైఁజల్లేవు
యిన్నిటాను నీ విభునియెదురెదుర
చన్నులకొంగు జారేవు జంటలేక పెనఁగేవు
యెన్నికలతుద మీరె యీమోహము

చ. 3: కడుఁగడు నవ్వేవు కాఁగిట బిగించేవు
యెడయక శ్రీవేంకటేశ్వరుని
తొడిఁబడఁ గూడితివి దొమ్మిరతిఁ దేలితివి
యిడుపునఁ జేర్చితి యీ మోహము

రేకు: 0643-4 సాళంగం సంపుటం: 14-256

పల్లవి: ఊరు మెచ్చు బతుకవే వొడ్డారమేల
సారెకును బిగిసితే సరుస మంకందురు

చ. 1: పలుకఁ గదవే నీవు పై పై సిగ్గులివేల
చలి వాసె వలపులు సరసాననే
తలయెత్తి చూడఁగదె తగవు గాదెవ్వరైన
చలపాది యిదియెంత సణఁగులాడెందురు

చ. 2: నగఁ గదవె నాతో నాలిగోలతనమేల
చిగిరించెఁ గోరికలు చేచేఁతనే
బిగియక రాఁగదవె బీరాన నిన్నిదిచూచి
వెగటున నెవ్వరైన విటుకులాడెందురు

చ. 3: కాఁగిలించఁ గదె నన్ను కమ్మటి నీవెరపేల
యేఁగి వచ్చి కూడితిమి యిందాఁకానే
పొఁగిన శ్రీవేంకటాధిపతి నన్ను నేమన్నాఁ
గాఁగాదు యిదియెంత కరతలాడెందురు

రేకు: 0644-1 పడవంజరం సంపుటం: 14-257

పల్లవి: తొలుత నిన్నుఁ దిట్టే దోసకారిని
పలుమారు మాకేల బాఁతి పడేవయ్యా

చ. 1: నిచ్చ నిచ్చ నీమీఁద నేరములు యెంచి యెంచి
పచ్చిసేసే నేనెంత పాపజాతిని
మచ్చరపువారమింతే మంచివారమా నీకు
యిచ్చగించి మాచెరఁగు యేల పట్టేవయ్యా

చ. 2: యెవ్వతెఁ జూచేవో యంటానెంతైన నిన్ను నమ్మక
రవ్వసేసే నేనెంత రాఁపుదాననో
దవ్వుల పంతాలే కాక దయ పుట్టీనా మాకు
నవ్వులు మాతోనేల నటియించేవయ్యా

చ. 3: పట్టి నీవే పెనఁగ బలిమిఁ దప్పించుకొనే
నెట్టన నే నెటువంటి నిష్టూరినో
దిట్టవై శ్రీవేంకటేశ తేజాన నన్నుఁ గూడితి-
విట్టె కడపలోననేల మొక్కేవయ్యా

రేకు: 0643-6 అమరసింధు సంపుటం: 14-258

పల్లవి: ఒక్క మనసుతో నన్ను నుండనీయరా
యెక్కువ తక్కువ చేఁత లేమిటికి నాకు

చ. 1: పంతము నీతోనాడి పంచబాణములకోడి
చింతతో నీమోము చూడ సిగ్గయ్యీ నాకు
కొంతగొంత మొదలనే గుట్టుననుండేదానఁ
నింతేసి సందులు దూరనేమిటికి నాకు

చ. 2: యిప్పటికి నిన్ను మెచ్చి యెడసితేఁ గడుఁగొచ్చి
చిప్పిల నీతో నవ్వ సిగ్గయ్యీ నాకు
తప్పక బొంకక నేనే తాలిమితోనుండేదాన
యిప్పుడింతేశనుమానాలేమిటికి నాకు

చ. 3: నెఱి నీపైఁ జెయి వేసి నిద్దరకన్నులు మూసి
చెఱఁగు వట్టి తియ్యఁగ సిగ్గయ్యీ నాకు
నెఱవై శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
యెఱుకలు మఱవులు యేమిటికి నాకు

రేకు: 0644-1 నాగవరాళి సంపుటం: 14-259

పల్లవి: అప్పటినుండి చూచేమాపెనే నీయెదుటను
కుప్పళించె పెంజెమట కుచములవెంటను

చ. 1: రెప్పలెత్తి నిన్నుఁ జూచు రేసు లేక సిగ్గుతోను
కప్పిన పయ్యదకొంగు కడు బిగించు
చెప్పునొకమాట నీతో చెలియమాటుకుఁ బోవు
ఇప్పటి యీసతి మోహమేమందుమిఁకను

చ. 2: సెలవులఁ గొంత నవ్వు చెక్కునఁ జెయి చేర్చు
అలివేణి నీమాటే ఆలకించును
తలఁపులో నిన్ను నించు దగ్గరి నీవొద్దఁ బొంచు
వలపు లీపెకునాఁప వశముగాదిప్పుడు

చ. 3: సన్న సేసు నీతోడ చనవులే పచరించు
కన్నె నీకాఁగిటికిఁ బొంకము చూచును
అన్నిటా శ్రీవేంకటేశ అంతలో నీవు గూడితి-
విన్నేసి యీపెరతులకెన్నిక లేదిదివో

రేకు: 0644-2 దేశాక్షి సంపుటం: 14-260

పల్లవి: వదలవు నాకొంగు యెవ్వతెను నేను
యెదుటనే నిలుచుండ నెవ్వతెను నేను

చ. 1: తనువుపైఁ జెయి వేసి దగ్గరఁ బిలిచేవు నీ-
వనితలలోన నెవ్వతెను నేను
మనసులరసి వేరేమాటలకుఁ దీసేవు
యెనలేక యింతదానికెవ్వతెను నేను

చ. 2: పచ్చిగా నవ్వేవు నాతోఁ బైపై నీ కొలువుకు
వచ్చిన సతులలో నెవ్వతెను నేను
మచ్చిక నటించి నన్ను మాపుదాఁకాఁ బొగడేవు
హెచ్చిన సవతులలో నెవ్వతెను నేను

చ. 3: చద్దికి వేఁడికి నాతో సరసాలే యాడేవు
వద్దనుండే వారిలో నెవ్వతెను నేను
కొద్దితో శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టే
యిద్దరమే యెక్కుడనే వెవ్వతెరా నేను

రేకు: 0644-3 శుద్ధవసంతం సంపుటం: 14-261

పల్లవి: ఇంతా నే నెరఁగనా యేరా నీవు
వింతలు చూపి నన్ను వెఱ్ఱిఁ జేసేకొరకా

చ. 1: నిండు రాజసముతోడ నీకు నీకే వచ్చి నా-
యండనే కూచుండేవు అవురా నీవు
చండిపెట్టి నీ తొల్లిటి సతులకునిది చూపి
దిండుకట్ట నన్ను నీవు తిట్టించేటికొరకా

చ. 2: బత్తిగల వానివలె పడఁతులలోననెల్ల
హత్తి నాకుఁ గొప్పు వెట్టేవవురా నీవు
కొత్తసతులెల్లఁ జూచి గుట్టులే దీయాఁటది
చిత్తిణిగుణముదంటా చీయనేటికొరకా

చ. 3: వెక్కసపుఁ దమకాన వేగిరించి కాలు దొక్కి
యిక్కువలంటఁగ వచ్చేవేరా నీవు
మిక్కిలి శ్రీవేంకటేశ మించి నన్నుఁ గూడితివి
తక్కిన సవతులెల్లాఁ దలవంచేకొరకా

రేకు: 0644-4 ముఖారి సంపుటం: 14-262

పల్లవి: నావలెనే నీవంటా నమ్ముదుఁ గాక
పూవువంటి నీ గుణాలు పూఁపలయ్యీనా

చ. 1: యెప్పటి నీవే కావా యెరఁగక మోహించి
చెప్పినట్టెల్లా నేనే సేతుఁ గాక
తప్పులెల్లా నీపాలు తాలిములే నాపాలు
నెప్పున నీవోజ యిఁక నీవు మానేవా

చ. 2: నీ మాయలే కావా నిండుకొన్నవింతటాను
యేమిటాఁ దెలియలేక యిట్లైతిఁ గాక
కామించేది నాపాలు కపటాలు నీపాలు
సామాన నీచేఁతలు చక్కనయ్యీనా

చ. 3: తక్కరివి నీవు గావా తారుకాణలిటు చూపి
వుక్కు మీరి నవ్వు నవ్వనోపఁ గాక
యెక్కువ శ్రీవేంకటేశ యేకమౌటే మనపాలు
నిక్కిన నీయాసలిఁక నేఁడు విడిచీనా

రేకు: 0644-5 నట్టనారాయణి సంపుటం: 14-263

పల్లవి: విందము దనసుద్దులు వేగిరి మేలే
అందికలుఁ బొందికలు అణఁగీనా యిఁకను

చ. 1: నాననీవే వలపులు నవ్వితేనెందు వొయ్యీని
తానే వచ్చీఁ గాక తరవేఁటికి
కానీలేవే అందుకేమి కడురతులఁ దనిసి
మానుపడి వున్నాఁడేమో మరచీనా నన్నును

చ. 2: పెంచనీవే గర్వములు బిగిసితేనేమాయ
వంచుకొనేఁ గాక మీరు వద్దననేలే
కొంచక సతులలోనఁ గొలువై వుండినవేళ
మించినపరాకేమో మీమాట వినఁడా

చ. 3: సేయనీవే తరితీపు చెనకితేనేమాయ
యీయెడ నేనుండేఁ గాక యీరసాలేలే
వేయిటికి శ్రీవేంకటేశుఁడిదె కూడె
పాయపు వినోదమేమో బాఁతయ్యీననేను

రేకు: 0644-6 సామంతం సంపుటం: 14-264

పల్లవి: నీవునిట్లనైతే నేఁడిఁక జాణలు వేరీ
చేవదేరెఁ బనులెల్ల చేచేఁత నిపుడు

చ. 1: నిండుఁబరితాపమున నిన్నుఁ జెలి గొసరితే
అండనే యెగ్గులు వట్టేవయ్యో నీవు
వండ వండనట్లాయ వనితల వలపులు
చండిపెట్టేమగవారి సరవుల చేతను

చ. 2: కలయని కాఁతాళాన కలికి నీకలిగితే
అలరి మారలిగేవు అయ్యో నీవు
యిలనెండపసపాయ యింతుల ప్రియములెల్ల
నలువంకఁ బురుషుల నడవడిచేతను

చ. 3: మందెమేళమున నిన్ను మానినిచేయి మోపితే
అందరి సాకిరి వెట్టేవయ్యో నీవు
కందువ శ్రీవేంకటేశ కమ్మటిఁ గూడితివిట్టే
కందుదేరె నీవంటి ఘనులచేతను

రేకు: 0645-1 సామంతం సంపుటం: 14-265

పల్లవి: అక్కలాల చూడరే వీనటమటాలు
యెక్కడోవారిచేతలే యితవాయనా

చ. 1: చిన్నఁబోయి వుండఁగాను చెక్కు నొక్కి వేఁడుకొంటే
నన్నుఁ దిట్టీ కొనగోరు నాఁటెనంటాను
కన్నవారెల్లా వీఁపు గాఁడిపారఁ దమ తమ
చన్నులనొత్తేయప్పుడు సాదించలేఁడాయనా

చ. 2: పవ్వళించి వుండఁగాను పాదములు గుద్దితేను
నొవ్వులఁ బొరలీ మేను నొచ్చెనంటాను
మవ్వపుఁ గాంతలు కాలి మర్దనలు సేయఁగాను
నెవ్వగనట్టే మూలుగ నేరఁడాయనా

చ. 3: కడుబడలుండఁగాను కాఁగిటనే నించితేను
తడఁబడీ రతికళ దాఁకెనంటాను
అడరి శ్రీవేంకటేశుఁ డందరికాఁగిళ్లలోన
వడఁబడేయప్పుడేమి వాసి నేరఁడాయనా

రేకు: 0645-2 శుద్ధవసంతం సంపుటం: 14-266

పల్లవి: అప్పుడు నీగుణమెంచనైతిఁ గాక
తప్పని నీచేఁతలెల్ల దక్కెఁగా నీకు

చ. 1: ముచ్చటగానొకమాట ముందట నేనాడితేను
యెచ్చరించి ఆకెకు నాకీసు రేఁచేవు
తచ్చనకాఁడవు వోరి తలరా ఇంకా నాతో
యిచ్చకాలు సేయ వచ్చేవెరఁగనా ఇఁకను

చ. 2: వలచి నీకేకతాన వడిఁ జేసిన సేవలు
బలిమి ఆకెకుఁ జెప్పి పచ్చిసేసేవు
నిలువరా యెమ్మెకాఁడ నీవు మమ్ముఁ జెనకక
కలసేవు వట్టి పొత్తు కాననా నిన్నును

చ. 3: కదిసి నే నిన్ను రతిఁ గాఁగిలించుకుండఁగాను
యెదిటికాపెఁ బిలిచి యింత నవ్వేవు
మొదల శ్రీవేంకటేశ మొక్కలీఁడవౌదువు
తుదకెక్కెఁ బనులెల్ల దొమ్మి యిఁకనేఁటికి

రేకు: 0645-3 శంకరాభరణం సంపుటం: 14-267

పల్లవి: కంటివో కానవో కాని కాంతమనసు
దంటతనమంతయును తగులే సుమ్మీ

చ. 1: దవ్వులనే నిన్నుఁ జూచి తల వంచుకొనెఁ గాని
నివ్వటిల్లీఁ దలపులో నీరూపే
మవ్వపుటాసలతోడ మరియును నిన్నుఁ జూచి
నవ్వేఁగాని అదియంతా ననుపే సుమ్మీ

చ. 2: చెలి నీతో మాటలాడి సిగ్గువడెనింతే కాని
నిలువెల్లాఁ దమకమే నిండి వున్నది
చెలఁగె(గ)ట్టే తనివోక చేరిపాట పాడెఁ గాని
వెలసినదదియెల్లా విరహమే సుమ్మీ

చ. 3: కూరిమినొద్దఁగూచుండి గుట్టుసేసుకుంది గాని
పారితెంచె కోరికలు పై పై నదే
యీరీతి శ్రీవేంకటేశ యింతిని నీవు గూడితి-
వీరాని చనవు నీకె యిచ్చినది సుమ్మీ

రేకు: 0645-4 ధన్నాశి సంపుటం: 14-268

పల్లవి: ఎదిరిఁ దన్నెరుఁగఁడు యెవ్వఁడే వీఁడు
గుది గుచ్చీ వలపు కూళటవే వీఁడు

చ. 1: వొళ్లు నొచ్చీననఁగానే వొడి వట్టితీసీని
యెల్లవారుఁ జూడఁగాను యెడ్డఁడా వీఁడు
పల్లదాన నేఁ దిట్టిన పకపక నవ్వీని
వెల్లవిరిగాఁ గడు వెఱ్ఱటవే వీఁడు

చ. 2: పనిగలదనఁగానే పయ్యదలోఁ జెయి చాఁచీ
తనుఁదానె చలపాదితనమా వీఁడు
కినిసి యాన వెట్టిన కిందుపడి మొక్కీని
మనిమని పెనుగొల్లమంకటవే వీఁడు

చ. 3: వద్దని ములుగఁగానే వచ్చి తాఁ గాఁగిటఁ గూడీ
గద్దరి శ్రీవేంకటాద్రి ఘనుఁడే వీఁడు
పొద్దువోయ చాలునన్నఁ బోనీక పెనఁగీని
సుద్దులనే బ్రమయించేజూటటవే వీఁడు

రేకు: 0645-5 భూపాళి సంపుటం: 14-269

పల్లవి: తనవలెనే చూచీ తరుణులను
ఘనులు మానాపతులఁ గాకు సేయవలెనా

చ. 1: సిగ్గుతో నేనుండఁగాను చింతతోనుందాననంటా
వొగ్గి నన్నేలాడీనే వొక్కటొక్కటే
అగ్గమైన ఆడువారు అణఁకువతోనుండఁగాఁ
నెగ్గులెంచేమగవాఁడు యేడనైనాఁ గలఁడా

చ. 2: అవ్వలిమోమైన దానినలిగి వుందాననంటా
రవ్వలుగనాడుకొనీ రచ్చలోను
పువ్వువంటి మగనాలు పొంచి గుట్టుననుండఁగ
మవ్వపుఁగోపము చూపేమంకువాఁడు గలఁడా

చ. 3: దండ నే నిలుచుండఁగా తన్ను నేఁ బిలిచేనంటా
బెండుపడ నాతోనేల పెనఁగీనే
వెండియు శ్రీవేంకటాద్రి విభుఁడిట్టె నన్నుఁ గూడె
దండితోడనిటువంటి తత్తరీఁడు గలఁడా

రేకు: 0645-6 శ్రీరాగం సంపుటం: 14-270

పల్లవి: నెలఁతకు నేఁటికంటె నిన్ననే మేలాయ
తలపోసి తలపోసి తన్నుఁ దానె మఱచె

చ. 1: చింతాజలధి యింకె చెలివిరహాగ్నిచే
చెంతనున్న యట్టి చెక్కుఁచేయి జారె
వంతల వ్రాసేటి నేలవ్రాఁతలునట్టే నిలిచె
వింతలైనవెల్లిమీఁద వెల్లి దోఁచెనదివో

చ. 2: పులకలు వాడె నిట్టూర్పుల గాలిచేతను
సొలసి యిప్పటి ఆపసోపము వాసె
తలఁకక యిందాఁకా దైవము దూరేదిఁ బోయ
వలపులు రేఁగి రేఁగి వడిఁ బడెనదివో

చ. 3: చొక్కుఁదేరె కన్నులను చూచేటి ఆసలచేఁత
నిక్కి లేచి కూచుండె నీవు రాఁగాను
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నీవు గూడితివి
చిక్కులు సిగ్గులుఁ బాసి చిమ్మిరేఁగెనదివో

రేకు: 0646-1 ముఖారి సంపుటం: 14-271

పల్లవి: సూడుబంటునే బలాలు చూపించ వచ్చితిమిదె
యీడ మనమే కూళల మీతఁడేమి సేసునే

చ. 1: నగ నేరిచినవాఁడు నాలికాఁడు మనవాఁడు
తెగనీఁడు యెంతైనాఁ దేరనీఁడు
వెగటున మనమే వెఱ్ఱివారమై యిందాఁక
జగడించితిమి గాక చాలుఁ జాలుఁ బదవే

చ. 2: కడురాజసపువాఁడు గామిడివాఁడు మనల-
నొడఁ బరచఁడు మాటకుత్తరమీఁడు
అడియాసలనూరకే అండనుంటిమింతె కాక
గొడవకాఁడితఁడు కూడనీఁడు పదవే

చ. 3: ఇద్దరినడిమివాఁడు ఇచ్చకుఁడు మనమంకు
తిద్దలేఁడు లోపలికి తెగిపోనీఁడు
గద్దరీఁడు శ్రీవేంకటఘనుఁడొకరొకరినే
వొద్దికతోఁ గూడెనింక నొక్కటైతిఁ బదవే

రేకు: 0646-2 గుండక్రియ సంపుటం: 14-272

పల్లవి: మాటలేల మూటలేల మాపుదాఁకా జోలియేల
కూటువ చేక త్తిగోరి గురుతుకు రారా

చ. 1: వోరి నాపలుకుఁ బంత మొక్కటిగాఁ జేయకున్న
పేరుకొని నీవు వొట్టు పెట్టరా నన్ను
యీరసానమేమనిన యీడ నీతో నాకేల
గారవాన మదనునిగరిడికి రారా

చ. 2: చలము సాదించి నిన్నే సమ్మతించఁ జేయకున్న
నలువురిలో నన్ను నవ్వరా నీవు
పిలిచి నీకు నాకు పెంటపట్టుబీరమేల
కలతము వలపుల కలినికి రారా

చ. 3: చేరి నిన్నే యెందుకైనఁ జేయి చాఁపించకవుంటే
ఆరసి నన్నే వెంగేలాడరా నీవు
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చూరలుగా నాచన్నుల సూటికిఁక రారా

రేకు: 0646-3 లలిత సంపుటం: 14-273

పల్లవి: అన్నిటా వివేకివని అందురు నిన్ను
కన్నులఁ జూచినప్పుడే కాఁక చల్లఁ దగునా

చ. 1: అందరు మెచ్చఁగ నే నౌననేఁ గాదనేఁ గాని
అందము నీకయినట్టెల్ల నాడరాదా
ముందుముందే వొట్లేల ముంగోపమిది యాల
నిందలకే నామీఁద నీకింతఁ దగునా

చ. 2: కల్లలు నిజాలు నేనే గక్కనఁ దెలిపేఁ గాని
చెల్లినట్టెల్లా నీవు సేయరాదా
పల్లదపుఁదిట్లేల పగచాటనింత యేల
వెల్లవిరి గాక తొల్లే విరుగఁగఁ దగునా

చ. 3: సరవితో నీమనసు సంతసించఁ జేసేఁ గాని
తరవాతి పనులెల్లఁ దడవ రాదా
గరిమ శ్రీవేంకటాద్రి ఘనుఁడ నేఁ గూడితిని
తిరముగ గోరనూఁది గొణఁగఁ దగునా

రేకు: 0646-4 శంకరాభరణం సంపుటం: 14-274

పల్లవి: సిగ్గువడనికనేల చెప్పరాదా
వెగ్గళించ నీవలపు విభుఁడు నీకెవ్వఁడే

చ. 1: ప్రేమమున వేగుదాఁకా పిప్పి సేసినట్టిమోవి
కామతంత్రముల చొక్కుకన్నుల కావి
మోములోఁ గళలు దేరెమోనముతో వసివాడు
యేమే నీకెక్కడిదే యెవ్వఁడు భోగించెనే

చ. 2: ననల విరులకొప్పు నలఁగిన జోకలు
చనుఁగవ మీఁదటి శశిరేకలు
పెనఁగిన రతికేళి పెంజెమటజారులు
పెనగొని యెక్కడివే ప్రియుఁడు నీకెవ్వఁడే

చ. 3: మేర మీరె ముక్కునను మిక్కిలి నిటూరుపులు
తేరెను మేఁదిఁగె కొత్తతీరుపులు
యీరీతి నిన్ను శ్రీవేంకటేశుఁడు గూడెననేవు
కారణమెట్టు గలిగె ఘనుఁడితఁడెవ్వఁడే

రేకు: 0646-5 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-275

పల్లవి: అంగనభావము చూడవయ్య నీవు
యింగితాన నిన్నుఁ జూచి యిట్టె పులకించె

చ. 1: సిగ్గుననూరకె వుండె చెలి యంతలో నీవు
దగ్గరఁగా నవ్వు నవ్వె తనలోనే
వెగ్గళించి యట్టె నీవు వెసఁ గాఁగిలించుకోఁగా
నిగ్గులఁ గరఁగుకొంటా నిట్టూరుపు నించెను

చ. 2: కన్నులు తొలుత మూసె కామినినట్టె నీవు
చన్నులు విసుకఁగాను చలి వాసెను
మన్నించి యిప్పటి నీవు మంచముపైకిఁ దియ్యఁగా
చిన్ని చెమటలఁ బొంగి చిత్తము మరచెను

చ. 3: చింతతోడనుండి వుండి చేరి నిన్నుఁ గూడఁగాను
కాంతనెమ్మోమున కళ దేరెను
యింతలో శ్రీవేంకటేశ యింకా నీవు రమ్మనఁగా
సంతసాన విఱ్ఱవీఁగి చనవు మెరసెను

రేకు: 0646-6 గౌళ సంపుటం: 14-276

పల్లవి: కంటివో కానవో నీవు ఘనుఁడవు మీఁదటెత్తు
జంటవలపులు నీపైఁ జల్లువెదలాడును

చ. 1: వాసులెక్కించి యెక్కించి వాదులాట వెట్టి వెట్టి
యీసుల రేఁచేవు మాయిద్దరిసంది
తాసువలెనున్న నేము తగ్గేటి వారము గాము
నీసముకము మాటలు నిన్నే మోఁచి వచ్చును

చ. 2: తగవులు చెప్పి చెప్పి తారుకాణ చూపి చూపి
యెగసక్కేలు సేసేవు యిద్దరిసంది
చిగురువంటి వారము చివికే వారము గాము
పగ నీమీఁదనే వచ్చి పళియై నిలుచును

చ. 3: కన్నులు గీటి గీటి గడ్డములు వట్టి వట్టి
యిన్నిటానొక్కటి సేసేవిద్దరిసంది
యెన్నిక శ్రీవేంకటేశ యిట్టె మమ్ముఁ గూడితివి
మున్నిటిసుద్దులు నీకే ముచ్చటలైయుండును

రేకు: 0647-1 వంతవరాళి సంపుటం: 14-277

పల్లవి: ఎంత నేరుచుకొంటివి ఇట్టే రాఁగా రాఁగా
పంతగానివలె పై పై బిగిసేవు

చ. 1: కాదురా నామాట నీకుఁ గడుచెవులు చొరవా
యేదెసో చూచేవు నన్ను నేమీననవు
వాదులడిచి నిన్నిట్టె వలసినట్టు తిట్టఁగా
సాదుఁగొయ్య తనముతో సారెకు నవ్వేవు

చ. 2: యేలరా నేనింత నీకు యెగసక్కెపుదాననా
ఓలి దగ్గరఁ బిలిచి వూరకుండేవు
నీలాగు లెరిఁగియు నిన్నుఁ జేత దొబ్బినాను
గోలవలెనే వుండి కొంగు వట్టేవు

చ. 3: మేలురా నామాట నీకు మెచ్చుఁ జోటు గలిగెనా
తాలిమితోనూఁకొంటాఁ దల వంచేవు
ఆలించి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యేలాటపువానివలెనిట్టె పెనఁగేవు

రేకు: 0647-2 లలిత సంపుటం: 14-278

పల్లవి: ఇంకా నీకుఁ జెల్లదా యెవ్వరినేమి సేసినా
కొంకనేల యిదివో నాకొంగు నీచేనున్నది

చ. 1: కోరినట్టె చెల్లెఁగా కొమారికములెల్ల
సారెకు రేపల్లెవాడ సందులలోను
ఆరసి నీవుద్దండాలన్నియును జెల్లెఁగా
కూరిమి సేసిన గోపికలవద్దను

చ. 2: సేసినట్టె చెల్లెఁగా చేరి రుకుమిణిఁ దెచ్చి
బేసబెల్లి తనపునీ పెండ్లిలోన
యీసు లేక నీవు మాటలేమాడినాఁ జెల్లెఁగా
బాస సేసి నీవు బాలబమ్మచారినన్నవి

చ. 3: నంటున నీకుఁ జెల్లెఁగా నరకాసురునిఁ దుంచి
వెంటఁ దెచ్చిన పదారువేలవలపు
యింటనె శ్రీవేంకటేశ యిదె నీకుఁ జెల్లెఁగా
జంటల నారతులలో సామ్రాజ్యము

రేకు: 0647-3 సామంతం సంపుటం: 14-279

పల్లవి: ఇంతట మన్నించరాదా యేరా నీవు
మంతుకెక్కెనా నీ మగతనమిపుడే

చ. 1: మౌనాననుండినవారి మాటలాడించ వచ్చేవు
కానవు మాలోని చింత కట్టా నీవు
వూని నీకునిప్పుడింత వుల్లాసమెత్తితేను
మానినులకుఁ బండెనా మరియు నీచేతను

చ. 2: వూరకే వుండిన వారినొడలు ముట్ట వచ్చేవు
యేరా నన్నడుగవు యించుకంతాను
భారపు నీజవ్వనము పట్టరాక వుండితేను
యీరీతినింతుల మీఁద నిటు చూపువలెనా

చ. 3: వొద్దికి వచ్చినవారినొడివట్టి తీసేవు
పొద్దెరఁగవిటు నన్నుఁ గొసరుతాను
అద్దిరా శ్రీవేంకటేశ అంతలోనే గూడితివి
వుద్దండపు నీవలపు వువిదల భాగ్యమా

రేకు: 0647-4 ముఖారి సంపుటం: 14-280

పల్లవి: ఆఁటదానిగోడు చూడరయ్యో యీమగవారిఁ
కేఁటిబుద్ధి వుట్టించె నీసడపుఁ గర్మము

చ. 1: యిరవెరఁగము మమ్మునింత సేసేవని నీకే
కరఁగుదు నీమోము గన్నదాఁకాను
మరిగినయాకెఁ దెచ్చి మాటలాడింపుచు నాకు
సరిగాఁగఁ జేసితివి సంగతాయఁ బనులు

చ. 2: యెంచనైతి నీగుణము ఇటువంటిదయ్యీనని
వంచనలేకాడుకొందు వలతువంటా
ఇంచుకంత చలివాసి యెదుటికి దీనిఁ దెచ్చి
మంచమెక్కించుకొంటివి మంచివాయఁ బనులు

చ. 3: మోసపోయి నమ్మితి నీమోహమిది నిజమంటా
ఆసపడి నవ్వుదు నీవలమేవంటా
వాసికి శ్రీవేంకటేశ వడి నన్నుఁ గూడితివి
వేసాలకాకెనంపితి వేడుకాయఁ బనులు

రేకు: 0647-5 లలిత సంపుటం: 14-281

పల్లవి: వేడుకకాఁడవౌదువు విట్ఠలేశా నాకు
వీడెమిచ్చేవప్పటిని విట్ఠలేశా

చ. 1: వాసితో నీవద్దఁ దలవంచుకొంటేనంతలోనే
వేసేవు పూవులఁ గొని విట్ఠలేశా
ఆసపడి నీమీఁద నాకానలేల పెట్టేవు
వీసమంత పనికైన విట్ఠలేశా

చ. 2: సన్నల నీవద్ద నేను సమ్మతించకుండఁగానే
వెన్నెలనవ్వు నవ్వేవు విట్ఠలేశా
చన్నులంటి వూరకైనా సరసములాడేవు
విన్న కన్న సుద్దిగాదు విట్ఠలేశా

చ. 3: పలుకకుండితే నాతో బండుఁబూతుఁ గెలసేవు
వెలయ శ్రీవేంకటాద్రి విట్ఠలేశా
బలిమి నన్ను గూడఁగాఁ బనులెల్లాఁ జక్కనాయ
వెలుపలే లోనాయ విట్ఠలేశా

రేకు: 0647-6 సామంతం సంపుటం: 14-282

పల్లవి: నీవే వేఁడుకొనవయ్య నీవు సేసినసేఁతకు
మావంటివారిచేతి మాటలేఁటివయ్యా

చ. 1: సిగ్గులు దేరీనో చింతఁ బొరలీనో
దగ్గరి యుండియునింతి తల యెత్తదు
అగ్గలమై నేమేమన్న అట్టే కసరుకొనీ
యెగ్గు నీవేమి సేసితో యెఱఁగమయ్యా

చ. 2: చనవు నెరసీనో చలము సాదించీనో
ననిచి నీతోఁ గొంత నవ్వు నవ్వదు
కనుఁగొని మాకు మాకే కానుకిచ్చినవొల్లదు
కొనమాట నీవె యెఱఁగుదువయ్యా

చ. 3: కోపము మతినున్నదో గుట్టుసేసుకున్నదో
పై పై నివ్వెరగుల బ్రమశున్నది
యేపున శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
తీపుల యీవెడమాయ తెలియదయ్యా

రేకు: 0648-1 మాళవశ్రీ సంపుటం: 14-283

పల్లవి: ఏల నాతోనే నీకు యింతవలెనా
తాలిమితో నాచేఁతలు దక్కించుకోలేనా

చ. 1: రాకపోకలనే నన్ను రాఁపుసేసి నీవింత
పైకొని నవ్వు నవ్వేవు పంతమా యిది
జోకల నీ సరితలు చూతమని వుంటిఁగాక
చీకాకుపరచి నిన్నుఁ జిక్కించలేనా

చ. 2: ఇచ్చకమాడినమాట యెగసక్కెముగఁ జేసి
పచ్చి సేసేవిందరిలోఁ బంతమా యిది
వచ్చీరాక తొల్లే నీతో వాదొల్లకుందానఁ గాక
రచ్చకెక్కించి నిన్నిట్టె రవ్వ సేయనోపనా

చ. 3: చనవిచ్చి కాఁగిలించి సారెసారెఁ గూడేవు
పనులెల్ల చక్కనైన పంతమా యిది
యెనలేక శ్రీవేంకటేశ నన్నేలితివి
వెనకముందెల్ల నీతో విన్నవించకుందునా

రేకు: 0648-2 లలిత సంపుటం: 14-284

పల్లవి: చేరి నీకుఁ బలుమారుఁ జెప్పేదేమి
వూరకే నిన్నుఁ జూచుక వుండేదే మాకిఁకను

చ. 1: రవ్వలుగనల్లనాఁడు రాజసాననుండి నాతో
నవ్వినట్టే సేసితిగా నామాట
నివ్వటిల్ల నీగుణము నేనెరిఁగి తెలిసేనా
దవ్వులనుండి మొక్కేదే తగవు మాకిఁకను

చ. 2: పల్లదాన నీవు నాపైఁ బంతములు నెరపుచు
చెల్లినట్టె సేసితిగా చేకొని నన్ను
యెల్లవారుఁ జూడఁగాను యిఁక నిన్న నేదేమి
చల్లఁగానిచ్చలాడుటే సరవి మాకిఁకను

చ. 3: గక్కన నీవు విచ్చేసి కాఁగిట బిగించినదే
దక్కెఁగా నాతో నీవు తమకానను
ఇక్కువ శ్రీవేంకటేశ యేఁటి విన్నపములిఁక
వెక్కసపు సంతసాన విఱ్ఱవీఁగుటిఁకను

రేకు: 0648-3 ముఖారి సంపుటం: 14-285

పల్లవి: పంతము నెరప వచ్చి పలచనైతివి నీవు
దొంతివలపులలోని దొమ్మిఁ జిక్కవు గదా

చ. 1: కోపగించి చూడఁ బోయి కొనలు సాగ నవ్వితి-
వేపనికో కాని నేనెరఁగ లేదా
చేపట్టి నేఁ దియ్యఁబోతేఁ జేతిగోరు దాఁకెనింతే
యేపునాయముచోటు యిదె కాదు గదా

చ. 2: చలము సాదించ వచ్చి చనవు చేసుకొనేవు
తలఁపిది యేఁటిదో తడవలేరా
చెలఁగి పైనొరగితే చెమట మైసోఁకెనింతె
యెలమి నీవొడలిట్టె యెంగిలిగాదు గదా

చ. 3: కడు సూడుకుఁ బెనఁగి కన్నులు మూసుకొనేవు
తొడరి నీకరుణకుఁ దుదలేదురా
విడువక యిదివో శ్రీవేంకటేశ కూడితివి
బడిబడినిదె నీకు బలుపుగాదు గదా

రేకు: 0648-4 శంకరాభరణం సంపుటం: 14-286

పల్లవి: ఘనుఁడాతఁడేమన్నాఁ గాదందురా
వెనకటిసుద్దులేల వేవేలై నాను

చ. 1: సిగ్గుదేరనాతఁడు చెయి నీపై వేసితేను
యెగ్గులుఁ దప్పులు వట్టేవేలే యింత
వుగ్గడించి యాతఁడు వొంటి నిన్నుఁ బొగడఁగ
అగ్గలమై వాదడిచేవవునే నీవు

చ. 2: చనవిచ్చి యాతఁడు సరసములాడఁగాను
పెనఁగేవు సారెసారెఁ బెద్దరికమా
మనసు గలయ నీతో మాటలిట్టె యాడఁగాను
వినియు వినవు యీవిదమేలే నీకు

చ. 3: అడరి శ్రీవేంకటేశుఁడట్టె నిన్నుఁ గూడఁగాను
చిడుముడి వడి నవ్వఁ జెల్లునే నీకు
బడిబడి నీకతఁడు పంతములియ్యఁగాను
జడిసి కన్నుబొమ్మల జంకించనేఁటికే

రేకు: 0648-5 బౌళి సంపుటం: 14-287

పల్లవి: పడఁతుల బ్రమయించే పంతగాఁడా నిన్ను
విడువఁజాలకే యీవిధమైతిరా

చ. 1: వన్నెల నీమాటల వలవని తేటలూ
విన్నప్పటినుండి నీకు వెట్టిగొంటిరా
కన్నులచూపుల కడుఁదరితీపులూ
యిన్నిటాఁ దగిలి నేనిట్టయితిరా

చ. 2: ముసిముసినవ్వులు ముంగిటిలో దవ్వులు, నీ
పసలకుఁజిక్కి నేను పాయలేనురా
కోసరేనటనలూ కూరిమినటనలూ
విసువక చూచి యింత వీరిడినైతిరా

చ. 3: కలసే నీయాసలూ కమ్మటి నీబాసలూ
తలఁచి తలఁచి యిట్టె తగిలితిరా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కలకాలమునునిదే కైకొంటిరా

రేకు: 0648-6 బౌళిరామక్రియ సంపుటం: 14-288

పల్లవి: అంతకునోపితేఁ జాలునందుకు నేఁ గాదనేనా
చెంతలనే వూరకున్నఁ జిమ్మిరేఁగుఁ బనులు

చ. 1: వొడివట్టి తీసేవు వూరకే యానవెట్టేవు
అడరి నీయింటికి రమ్మనుచు నీవు
వడిగానాడనున్న వారు వాదులడిచితే
గొడవ మానుపలేవు కొద్దిమీరుఁ బనులు

చ. 2: చెక్కు గడు నొక్కేవు చేతులెత్తి మొక్కేవు
అక్కరఁబొత్తు బోసేతమనుచు నీవు
కక్కసించి నీసతులు కైదప్పు సేయవచ్చితే
చిక్కక నేనే ముందు చేముంతునపుడు

చ. 3: కన్నులారిచేవు నాకు కాఁగిట బిగించేవు
అన్నిటా నన్ను మన్నించేననుచు నీవు
నన్ను నీవు గూడితివి నగుతా శ్రీవేంకటేశ
మిన్నక నీసతులను మెట్టి యెలఁబడును

రేకు: 0649-1 బౌళి సంపుటం: 14-289

పల్లవి: ఏఁటి జాణతనము నీవే మయ్యా
ఆఁటదానిమీఁద నీవదేమయ్యా

చ. 1: చిత్తరు ప్రతిమవలెఁ బేరి నిలుచుండఁగాను
హత్తి రమ్మని పిలువవదేమయ్యా
కొత్తకొత్త సిగ్గుతోడ కురులు దువ్వుకోఁగాను
యిత్తల మాటలాడించేవిదేమయ్యా

చ. 2: మూసిన ముత్తెమువలె ముసుగు వెట్టుకుండఁగా-
నాసఁ గూచుండఁ బెట్టుకోవదేమయ్యా
సేసకొప్పు వంచుకొని చింతతోడనుండఁగాను
యీసుదీరఁ జెక్కు నొక్కవిదేమయ్యా

చ. 3: తనియని తమకాన తప్పక నిన్నుఁ జూడఁగా
అనుగు సరసమాడవదేమయ్యా
యెనసితి శ్రీవేంకటేశ యింతి నీవిట్టే
యినుమడించె వలపులిదేమయ్యా

రేకు: 0649-2 సామంతం సంపుటం: 14-290

పల్లవి: ఆతనితోనీమాటే అనరే మీరు
చేతికి లో నైనమీఁదఁ జెప్పేఁగాని

చ. 1: తప్పక చూచినచూపు తగులనాడినమాట
యెప్పుడుఁ బాయదు నాయెదలోనను
కప్పురమే అంపెఁ గాని కటకట యింతసేసి
యిప్పుడు యీవేళనైన యేల రాఁడే తాను

చ. 2: కన్నుల మొక్కినమొక్కు గక్కనఁ జూపిన సన్న
యెన్నుకొంటి నాలోనే యిందాఁకాను
మన్ననలే మించెఁ గాని మాటలాడఁ బొద్దు లేదు
యిన్నిటాఁ దా నేరుపరి యేమనీనే తాను

చ. 3: కొంగువట్టి తీసినది కొనగోరు మోసినది
సంగతాయనిందరిలో సారెసారెకు
ఇంగితమెరిఁగి కూడెనిదె శ్రీవేంకటేశుఁడు
వుంగిటి నేనేమన్నా నోరుచుకొమ్మనవే

రేకు: 0649-3 కాంబోది సంపుటం: 14-291

పల్లవి: ఆడఁగల మాటలెల్లానాడితి నేను
వేడుకలిన్నియుఁ జెల్లె విచారములేఁటికి

చ. 1: కంటిమి నీగుణములు కన్నులఁ జూచినపుడే
వింటిమి నీసుద్దులెల్ల వేగుదాఁకాను
తొంటివలెఁ గాదు నీవు దొరవైతివిఁకనేమి
అంటేఁ జవులు గావు ఆయనాయఁ బనులు

చ. 2: పట్టితినంగముచ్చెము భావించి చూచినపుడె
పెట్టితి నీమీఁదనొక్క పెనునేరమి
దిట్టవైతివిన్నిటాను తెరవలకాఁగిటను
యెట్టుననరాదు నిన్నునిఁక నేల కొసర

చ. 3: చేకొంటి నీచేఁతలు చేయి ముంచినప్పుడే
దాకొంటి నీరతులలో దగ్గరి నేఁడు
యీకడ శ్రీవేంకటేశ యిరవైన మోహముల-
నేకమైతిమిద్దరము నిఁకనేల మరఁగు

రేకు: 0649-4 మేఁచబౌళి సంపుటం: 14-292

పల్లవి: మాపుదాఁకా రేపకాడ మాయలేల
తీపు చేఁదుల గలపితే తినఁ జవులవునా

చ. 1: నిద్దురకన్ను లతోడ నీవు మాటలాడనేల
పొద్దునఁ బవ్వళింతువు పోరాదా
అద్దో దిట్టకూళతనమప్పటిని నెరుపేవు
గద్దించి యెంతచూచినఁ గల్ల నిజమౌనా

చ. 2: యెక్కడో పరాకుతోడనీడ నాతో నవ్వనేల
మక్కువగల చోటికే మగుడరాదా
పుక్కటవలపుతోడి పూసగొండి తనమేల
పక్కన మొఱఁగితేను పగలు రేయౌనా

చ. 3: అసురుసురులతోడ ఆయములంటఁగనేల
కొసరు దీరఁగ నన్నుఁ గూడఁగరాదా
పొసఁగ శ్రీవేంకటేశ భోగించితివిదె నన్ను
యెఁగ నీళ్లడిచితే నెప్పుడు రెండౌనా

రేకు: 0649-5 మనోహరి సంపుటం: 14-293

పల్లవి: విరహమే కూడైనవెట్టివారము
యిరవై తినింకా మమ్ము నేమి సేసేవో

చ. 1: యెదురు చూపించుకొంటివిందాఁకా నాచేత
వెదకింపించుకొంటివి వేగుదాఁకాను
కొదదీర మాయింటికి కోరి యిట్టే విచ్చేసితిఁ
విదివో ఇంకా మమ్ము నేమిసేసేవో

చ. 2: వలపించుకొంటివిదె వాడలలో మాచేతఁ
బిలిపించుకొంటివిట్టె బిగియుచును
తలఁ పెరిఁగి యంతలో దగ్గర విచ్చేసితివి
యెలయింపులనె యింకానేమిసేసేవో

చ. 3: మొక్కించుకొంటివి ముందరనే మాచేత
దక్కించుకొంటిమి మాతమకములు
గక్కునఁ గూడితివిదె కమ్మటి శ్రీవేంకటేశ
యిక్కువలంటేవింకా నేమిసేసేవో

రేకు: 0649-6 సామంతం సంపుటం: 14-294

పల్లవి: వేడుకకాఁడు గదమ్మ విజనగరములోన
వేడె వెట్టీ సతులను వెన్నముద్దకృష్ణుఁడు

చ. 1: ఇంటిలో నామగఁడు నేనిద్దరమునున్న వేళ
వొంటినే తాఁ జొచ్చి వచ్చీనోయమ్మలాల
దంట తనమున నేను తనకన్నులు మూసితే
చంటికి చేతులు చాఁచీ జాణఁడే యీకృష్ణుఁడు

చ. 2: కమ్మర మాయాతఁడు నేఁ గాఁగిలించుకుండఁగాను
వుమ్మడిఁ దా మోవియిచ్చీనోయమ్మలాల
చిమ్ముచు నేనంతలోన సిగ్గుపడితే నాపక్కఁ
నిమ్మసేసుకొని పండీనిదివో యీకృష్ణుఁడు

చ. 3: పేరుకొని నావిభునిఁ బిలిచితేనూఁకొని
వూరకె తా వచ్చికూడె నోయమ్మలాల
యీరీతి శ్రీవేంకటాద్రినిరవై యీడా నాడ
కూరిములు వెదచల్లీ గోపాలకృష్ణుఁడు

రేకు: 0650-1 బౌళిరామక్రియ సంపుటం: 14-295

పల్లవి: ఇంకా నీచలమెందాఁకాను
మంకుఁదనములు మానఁగరాదా

చ. 1: కాటుక కన్నుల గసరీఁ గొసరీ
చాటువ వలపుల జవరాలు
యేఁటికి నీపరాకెందాఁకఁ జేసేవు
కూటపుసరసము గులుకఁగ రాదా

చ. 2: సురతపుఁగళలటు చూపీ మోపీ
సరికి బేసికి నీపై జవరాలు
పొరలింపుమాటల పొద్దేల జరపేవు
తరుణినింతటనైన దయఁ జూడరాదా

చ. 3: వెలయనొాల నీపై వేసీ మోసీ
చలివాసె యిపుడిట్టే జవరాలు
బలిమి శ్రీవేంకటపతి నీవు గలసితి-
నలివేణి అన్నట్టె అవుననరాదొ

రేకు: 0650-2 శంకరాభరణం సంపుటం: 14-296

పల్లవి: ఆఁటది కూళయిననూ మరి అడ్డపెట్టరాదు
చీటికి మాటికి విన్నవించనేల చెప్ప సిగ్గయ్యీని

చ. 1: చలివాసి నిన్నుసారె నాయెదుట
పిలిచీనెవ్వతెరా దీనిబీరమింకేమందును
యిలు చొచ్చివచ్చి యెంగిలిరతికి
తలకొని చూచేతరుణిఁ గలదా

చ. 2: మొగము చూచితే ముందుగానే నీతో
నగినదెవ్వతెరా దీనినటనలేమందును
పగలు చాటుచు పాసిన మోహము
మగవానిమీఁద మగుడించఁ దగునా

చ. 3: యిట్టి నన్నుఁగూడి యెనసిననిన్నుఁ
దిట్టీనెవ్వతెరా దీనిదీమసమేమందును
వెట్టి శ్రీవేంకట వెన్నముద్ద కృష్ణ
గుట్టు విడువఁగ కొమ్మకునేల

రేకు: 0650-3 శంకరాభరణం సంపుటం: 14-297

పల్లవి: నీవెంత సేసినాను నీకమరును
యీవల మావంటివారికితవౌనా నేఁడు

చ. 1: విడువక ఆపె నీతో విన్నపాలు సేయఁగాను
నడుమ నే మాటాడితే నవ్వరా నన్ను
యెడమిచ్చి నీవె నన్నుయిట్టె మన్నించఁ జూచేవు
పడఁతులతోనవెల్ల పచ్చిగాదా నాకు

చ. 2: సరినుండి యాపె నీతో సరసమాడేటి వేళ
వరుస వంతడుగంగ వైపా నాకు
తరలక కొంగువట్టి దగ్గర నన్నుఁదీసేవు
తరుణులపై కొసరు తగవా నాకు

చ. 3: వొంటినుండి యాపె నీకునూడిగాలు సేయరాఁగా
జంటై నేఁ దిరిగేది సరవా నాకు
వెంటనే శ్రీవేంకటాద్రి వెన్నముద్ద క్రిష్ణరాయ
అంటి నన్నుఁ గూడితివి అరుదాయ నాకు

రేకు: 0650-4 ముఖారి సంపుటం: 14-298

పల్లవి: వట్టి దూరు మాకేల వద్దయ్యా
చిట్టికాలిట్లా నీవు సేసేటికొరకా

చ. 1: యెరవై సవతులిఁక నేమందురో మాయింటికి
వరుస దప్పి రానేల వద్దయ్యా
తరువాతవారు నేము దగ్గరి వాదడువఁగా
వొరసి నీవు నవ్వుతానుండేటికొరకా

చ. 2: ఆరసి నీకు బిగువైన వుంగరమిచ్చేవు
వారి సొమ్ము నాకేల వద్దయ్యా
గార వాననాపె యిది కని నన్నడుగ రాఁగా
నారుకొన నీవప్పుడు నవ్వేటికొరకా

చ. 3: ముచ్చటనిందరు మోచి దించవలెనంటా
వచ్చి నాకొంగు వట్టేవు వద్దయ్యా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
పచ్చిగా నన్నురమునఁ బాయకుండేకొరకా

రేకు: 0650-5 రామక్రియ సంపుటం: 14-299

పల్లవి: ఎరపరికపు పొందులిపుడేఁటికే
కరుణ గలప్పుడే కనుపట్టీఁగాక

చ. 1: రాక వుండినవిభుని రమ్మనిపిలువఁ బోతే
కూకులు వత్తులే కాక కూరిమంటీనా
దాకొని తానే వచ్చి తగిలినప్పటివేళ
చౌకలిన్నియును బాసి చవి వుట్టీఁగాక

చ. 2: చిత్తము రానివానితో చిట్టకాలు సేయఁబోతే
రిత్తకు రిత్తే కాక రీతి వచ్చీనా
మొత్తమినాతఁడె వచ్చి మోహము సేసినవేళ
బత్తి గలిగి నాతోడఁ బాయకుండీఁగాక

చ. 3: వొలసీనొల్లనినాని నొడివట్టి తియ్యఁబోతే
బలవంతములే కాక బాగు వచ్చీనా
అలరి శ్రీవేంకటేశుఁడాతఁడే నన్నుఁగూడె
కలకాలమునునిట్టే కైకొనీఁగాక

రేకు: 0650-6 ముఖారి సంపుటం: 14-300

పల్లవి: ఇరువు దెలియ లేరు యింతేసిజాణలు మీరు
యిరుగు పొరుగువారు యింకా మిమ్ము నగరా

చ. 1: సంకె లేక యాపెతోడ సరసములాడఁగాను
యింక నేఁ గొసరుదునా యేడసుద్దులు
వంకలొత్తి మీరాతని వలపు చెల్లఁబెట్టేరు
మంకుల వోచెలులాల మరి మిమ్ము నగరొ

చ. 2: మోము చూడఁగా నాకెచే మొక్కించ నాకు రాఁగాఁ
నేమని నే మాటలాడేనేడ సుద్దులు
యీమాటలకే మీరు యిచ్చకములాడేరు
దోమటి మీతగవుకు దూరి మిమ్ము నగరా

చ. 3: ఆపె నన్ను సరిచేసి అట్టె కాఁగిటించుకోఁగాఁ
నేపనులునిఁకనేల యేడ సుద్దులు
చేపట్టి నన్ను వింతతో శ్రీవేంకటేశుఁడు గూడె
యీపనికొడఁబరచేరిట్టె మిమ్ము నగరా

రేకు: 0651-1 దేసాళం సంపుటం: 14-301

పల్లవి: ఎవ్వరేమి చెప్పినా నీకిదేమాఁట
యివ్వల నేనిట్లైతి నిదేమాట

చ. 1: చెప్పఁగానే లోనయితి చెయి నీకు మీఁదాయ
యిప్పటికి నీవాడేదిదేమాట
తప్పులేదు నీకయితే తమకము పసలేదు
యెప్పుడు నేమే వెఱ్ఱులమిదేమాఁట

చ. 2: కదిసితి మిద్దరము కాదు కూడదనరాదు
యెదురు గుదురుగా నీ కిదేమాట
మొదలనే మోసపోతి ముచ్చటకుఁ బనిలేదు
యెద వెట్టుకోనోప నిదేమాట

చ. 3: కాంతలిందరు నెరఁగఁ గాలు దొక్కితివి నన్ను
యింతటివాఁడవు నీ కిదేమాట
అంతలోనె శ్రీవేంకటేశ ఆదరించి కూడితివి
యెంతైన విడువవు నీ కిదే మాట

రేకు: 0651-2 సామంతం సంపుటం: 14-302

పల్లవి: ఇంకా రోయదు నాకునేఁటిమనసు
కొంకులేని నావంటి కూళలూఁ గలరుగా

చ. 1: వంతులకు రావంటా వాదులడచి నీతోను
యింత మన నొప్పించేదేఁటిబదుకు
కాంతలు నావంటివారు గలరెందరై నా నీకుఁ
నింత వలచి తిరిగే యెడ్డ లేదు గాని

చ. 2: అప్పటి వొలిసీనొల్లనట్టివలపు నీమీఁద-
నిప్పుడె కొనవేసేది యేఁటిబదుకు
కప్పిన తమకములు కలపు గంపలకొద్ది
విప్పుచు నవ్వేనావంటి వెఱ్ఱి లేదు గాని

చ. 3: మందలించి నీ వాడినమాట కల్లలాయనంటా
నిందరితోఁ జెప్పేది నాదేఁటిబదుకు
అందుకె శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి
పొందులేదా నావంటిభోగి లేదు గాని

రేకు: 0651-3 ముఖారి సంపుటం: 14-303

పల్లవి: ఎందు వొయ్యేవందుకేమి యేమి దప్పెనింతలోనె
కందువ నీ సరితలు కనుకొనేరా

చ. 1: చెక్కు నొక్కినంతలోనె చెల్లఁబో కోపగించేవు
తక్కక నాకొనగోరు తాఁకెనంటాను
కక్కసించి నీమేను గాజున గీరితే నీకు
దిక్కు వచ్చేదెవ్వతో నేఁ దెలిసేరా యిఁకను

చ. 2: ముద్దు వెట్టినంతలోనె మొక్కలానఁ బగ చాటి
అద్దలించేవు నాయెంగిలంటెనంటాను
వుద్దండాన నా తమ్ములమోరి నీ నోరనిడితే
పెద్దరికము చూచేరా బీరపు నిన్నపుడు

చ. 3: అట్టె కాఁగిలించుకొంటే నానలువెట్టి వచ్చేవు
వొట్టుక నాగుబ్బలు నిన్నొత్తెనంటాను
నెట్ట శ్రీవేంకటేశ నీవె నన్నుఁ గూడితివి
తొట్టిన నీమదమెల్లా తుదకెక్కించేరా

రేకు: 0651-4 సామంతం సంపుటం: 14-304

పల్లవి: వెల్లివిరిసీ వలపు వెంట వెంట రాఁగాను
యిల్లిదివో తలవంచే వికనేఁటిచింతలు

చ. 1: గయ్యాళిమాటలాడి కన్నులు దేలవేయుచు
వొయ్యన నీమీఁదనిట్టె వొళ్లు వేసీని
పయ్యద జారఁగఁ జెలి పకపక నవ్వఁ జొచ్చె
ఇయ్యెడఁ దేరెఁ బనులు ఇఁకనేఁటిమాటలు

చ. 2: గద్దించి నిన్నుఁ జూచి కాయమెల్లఁ జెమరించి
కొద్దిమీరఁ దొడమీఁదఁ గూచుండి
వుద్దండానఁ జెవిలోన వూరకె యేకతమాడీ
ఇద్దరిబాగులుఁ గంటినిఁక నేఁటి సుద్దులు

చ. 3: మందెమేళాలు నెరపి మచ్చికతోఁ గాఁగిలించి
చిందేటిమోవితేనెలు చిప్పిలించి
కందువ శ్రీవేంకటేశ కలికి నిన్నుఁ గలిసీ
ఇందరి మోములు చూచి ఇఁకనేల సిగ్గులు

రేకు: 0651-5 ఆహిరి సంపుటం: 14-305

పల్లవి: వెలఁదిఁ జూతువు గాని విచ్చేయవయ్యా
తలఁచినంతము నీకుఁ దలకూడె నేఁడు

చ. 1: పట్టిన విరహమే పడఁతిమేనిమీఁద
ఇట్టునట్టు చందురుఁడే యెండ గాసెను
పుట్టుచు సాదు రేఁగితే పొలమేర నిలువఁడు
నెట్టిన ననేటిమాట నిజమాయ నేఁడు

చ. 2: వొల్లనే నీతోనలిగివున్న వేళనే యీ-
పల్లదపురమణుఁడు బాదపెట్టెను
చల్లజంపు భువిలోన చాపకింది వెల్లువని
యెల్ల వారునాడేది యెన్నికకు వచ్చెను

చ. 3: కూడిన కాఁగిటివేళ గుంపుగూడి కోవిలలు
పాడి పాడి యింతిరతి వచ్చిసేసెను
వాడిక శ్రీవేంకటేశ వనితఁ గూడితి విట్టె
చాడికాండ్ల బ్రతుకు సతములయ్యీనా

రేకు: 0651-6 బౌళి సంపుటం: 14-306

పల్లవి: మేలుమేలు జాణవౌదు మెస్తిరా నిన్ను
నాలికాఁడవై నన్ను నవ్వు నవ్వించితివి

చ. 1: ఘనుఁడ నినుఁ గనులఁ గన్నప్పటనుండి నాకు
వెనక నేరములెంచ వెరపయ్యీని
మొనసి నీకిదియేమి మొగసిరిమందు గద్దో
వనితలు నన్ను నవ్వ వాకట్టు గట్టితివి

చ. 2: బత్తితో నీవినయాలాపస విన్నప్పటనుండి
చిత్తము చెదరనాడ సిబ్బితయ్యీని
చిత్తజుఁడు నీకిఁక చేతికి వసమైనాఁడో
వత్తివలె వాడించి వలపు రేఁచితివి

చ. 3: కాఁగిటికి నీవు నన్నుఁ గదిసినప్పటనుండి
వేసనాడఁ గొలుపదు వేడుకయ్యీని
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ్వర నన్ను
మూఁగిన మూఁకలో నీకు మొక్కఁగఁ జేసితివి

రేకు: 0652-1 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-307

పల్లవి: అప్పటినేల దూరేరే అతనినోచెలులాల
కుప్పళించె వలపెల్ల గురుతిదే కాదా

చ. 1: కన్నులనే నవ్వినాఁడు కడు బుజ్జగించినాఁడు
అన్నిటానెంచిచూచితే నాతఁడే నేను
మన్నన కడమ లేదు మనసు వెలితిలేదు
ఉన్నదాన రాజువలె నొరులు నాసరియా

చ. 2: చేయిసన్న చేసినాఁడు చెట్టవట్టి తీసినాఁడు
ఆయనాయఁ బనులెల్లనప్పుడే నాకు
పాయములునొక్కసరే భావములుఁ దారుకాణే
యీయెడ నాకోరికాయ నెదురేదే నాకు

చ. 3: కళలెల్ల రేఁచినాఁడు కాఁగిటనే కూడినాఁడు
పలుకుఁ బంతము చెల్లెఁ బై పై నేఁడు
యెలమి శ్రీవేంకటేశుఁడింత నన్నెక్కుడు సేసె
బలువాయ నామాట పట్టరాదు మదము

రేకు: 0652-2 సౌరాష్ట్రం సంపుటం: 14-308

పల్లవి: వలసినప్పుడు మేము వచ్చేముగాని
మలసి మమ్మీవేళ మన్నించరయ్యా

చ. 1: తరుణిచిత్తము నీతలఁపు కొలఁదే కాక
యెరవుల మామాట యేఁటికయ్యా
వొరసి బుద్ధులు చెప్పి వొకరి వారముగాము
మరిగి వుండేరు మీరే మరి మేమేలయ్యా

చ. 2: అంగన చలము మీ అలుకకోలఁదే కాక
సంగతిగాని నూపొందు చాలునయ్యా
వెంగలిచేఁతల మొక్కి విదిలింపించుకొంటిమి
ముంగిటనుండేము మాతో మొగమోటేలయ్యా

చ. 3: వనితప్రియము నీవలపు కొలఁదే కాక
తనిసితిమి మానీటు దక్కెనయ్యా
చనవున మీకు మీకే చక్కనై కూడితిరిదే
ననిచి శ్రీవేంకటేశ నవ్వు నవ్వేమయ్యా

రేకు: 0652-3 సామంతం సంపుటం: 14-309

పల్లవి: నామొగమాటములే నన్ను నింత సేసీఁగాక
యేమి సేసినా నీవు యిన్నిటికిఁ దగవా

చ. 1: అందరునిదెంత కల్లరనేరంటా నాకు నాకే
విందుల నీమాటలెల్లా వింటిఁగాక
మందలించి నీవు నిన్న మాయింటికి రానప్పుడే
సందడి నే నిన్నుఁ బగ సాదించఁ జెల్లదా

చ. 2: ఆఁటదానికింతయేల అని నే విచారించి
గాఁటపు నీ వినయాలు కైకొంటిఁగాక
వాఁటపు నీమేని చిందువందులు చూచినపుడే
యీటున నిన్నిన్నిటాను యేఁప నాకుఁ జెల్లదా

చ. 3: కూడినచోటనింకేల గోరపెట్టనని నేనే
వోడక నిన్నుఁ గలసి వుంటిఁ గాక
యీడనే శ్రీవేంకటేశ యింత నీవు సేసినందు-
కాడనీడన సుద్దులన్నీఁ జెప్పఁ జెల్లదా

రేకు: 0652-4 బౌళి సంపుటం: 14-310

పల్లవి: ఎమ్మెలిన్నియునుఁ జేసి యేల లోఁగేవు
సమ్మతించఁ జేసి యట్టె జట్టి గొనరాదా

చ. 1: కాటుకకన్నులనాపె కాఁకలఁ గోపించెనంటా
యేఁటికి నీవు వెరచే వీడనుండే
ఆఁటదానికోపమెంత ఆయమెంత నీవు చేరి
నాఁటిన మాటలాడి నవ్వు నవ్వరాదా

చ. 2: తప్పు నీపై వేసి యాపె తల వంచుకొనెనంటా
వొప్పుగ నీవు మోనాన నుస్సురనేవు
యిప్పుడాపె చలమెంత యియ్యకొలిపేదెంత
కొప్పు దువ్వి గుబ్బలపై కొనగోరు మోఁపరాదా

చ. 3: మంతనానవాపె నీతో మంకులు నెరపెనంటా
చింతతోడ నీకు నీకే సిగ్గు వడేవు
యింతలోనె శ్రీవేంకటేశ యాపెఁ గూడితివి
పంతములెల్లా నెరపె పచ్చి సేయరాదా

రేకు: 0652-5 కుంతలవరాళి సంపుటం: 14-311

పల్లవి: ఇంతకు వచ్చినమీఁదనిఁకనేల మొగమోట
చింతదీర నిన్ను నేమి సేసినానుఁజెల్లదా

చ. 1: యీగతి నిద్దిరించేవు యిట్టె నావద్దికి వచ్చి
వేగుదాఁకా నీ పొందు వెగటా నీకు
చేగదేరనిని ఆడఁ జేయ మరచి వచ్చితా
ఆగడపునిన్ను దూరనట్టె నాకుఁ ఖల్లదా

చ. 2: పన్ని తల నొచ్చినంటాఁ బైపైనిట్టె మూలిగేవు
విన్నవించే నామాట వేసటా నీకు
యిన్నేసి మాయలు సేయనీడనే నేరిచితివా
కన్నచోట నీగుణాలు కాకుసేయఁ జెల్లదా

చ. 3: చెల్లినంతాఁ జేసి వచ్చి చేయివట్టి పెనఁగేవు
పల్లదాన నే నేఁడు బాఁతే నీకు
వొల్లనే శ్రీవేంకటేశ వూరడించి కూడితివి
చల్లజంపులను నిన్ను జంకించఁ జెల్లదా

రేకు: 0652-6 నాదరామక్రియ సంపుటం: 14-312

పల్లవి: కటకట యిఁకనేల కాఁక రేఁచేవు
అటమటములు చాలునప్పటి నామాఁటలు

చ. 1: నేరుపు మెరసి వచ్చి నేఁడు నన్నుఁ బిలిచేవు
వూరివారిముందరనే, వోరీ పోరా
యేరా నే నిన్నెరఁగనా యింతబత్తిగలవాఁడ-
వారసి నన్నేల పట్టేవప్పటి నామాఁటలు

చ. 2: తొడిఁబడ నీకెవ్వతే దొరకకుంటే వచ్చి
వొడివట్టి తీసేవు వోరీ పోరా
తడఁబడ నీవల్ల తనిసితిమన్నిటాను
అడియాలమిదే కంటిమప్పటి నామాటలు

చ. 3: ముక్కుతిక్కులకుఁ దెచ్చి మోము చూచినవ్వినాతో
వొక్కటైతివింతలోనే వోరీ పోరా
చక్కని శ్రీవేంకటేశ జాణవవుదువిన్నిటాను
అక్కరదీరఁ గూడితివప్పటి నామాఁటలు

రేకు: 0653-1 భైరవి సంపుటం: 14-313

పల్లవి: ఇంత నీకు వేఁగా యిటు నే వలచినది
పంతాన నీసుద్ది వింటే పరులెల్ల మెత్తురా

చ. 1: బలిమిలో నే నీకు పట్టపుదేవులనై
చెలులకెల్లఁ బ్రియము చెప్పఁ గలనా
చిలుకలతో కాకుల చెంది మాటలాడించితే
వలవంతఁ జూచినవారెల్ల నగరా

చ. 2: వొక్కగద్దెమీఁద నీవొద్దనే కూచుండి
మొక్కలపుసతులను మొక్కఁగలనా
గక్కున మాణికము గాజు భరణిఁ బెట్టితే
తక్కువవునా అది నీ తప్పందురు గాక

చ. 3: యివల శ్రీవేంకటేశ యిటు నీకాఁగిటఁ గూడి
సవతుల సరియై యెంచఁగఁ గలనా
భువినేనుఁగ దోమను పూఁచి లంకెఁ బెట్టితేను
వివరించనది నీ వెలితే కాదా

రేకు: 0653-2 భవుళి సంపుటం: 14-314

పల్లవి: ఏమయ్యా ఆఁడుజన్మము యింత పలచనాయనా
నేమము దప్పనివాఁడే నెరజాణ మహిని

చ. 1: పొంది నీ కాఁగిటిలోనే పొలయలుకలు సేసి
కందువలంటనీవంటా కాఁక రేఁచేవు
మందలించి వనితల మనసు వచ్చినట్టే
పొంద నేరిచినవాఁడే పురుషుఁడు మహిని

చ. 2: వొయ్యనే నీకాఁగిటిలో వుపరిసురతానకు
ఇయ్యకొననై తినంటా నెగ్గు వట్టేవు
చయ్యన కాములుల చనవులే చెల్లించి
నెయ్యము సలిపేవాఁడే నెరజాణఁడిపుడు

చ. 3: సురతవేళను మేను చొక్కించి పేరఁ బిలిచి
యెరవై వుందాననంటానేల నవ్వేవు
సిరుల శ్రీవేంకటేశ సేసవెట్టి పెండ్లాడితి-
వరుదు నీవంటివాఁడు అరసి చూడఁగను

రేకు: 0653-3 శంకరాభరణం సంపుటం: 14-315

పల్లవి: నీవటువంటివాఁడవా నేనే కాక
వేవేలకు నావలని వేగిరము గాక

చ. 1: పిలిపించినవాఁడవు ప్రియమాడక మానేవా
కలఁగినట్టి నాతమకము గాక
వలచినవాఁడవు వద్దనుండక మానేవా
నిలువుమనేటి నానేరమింతే కాక

చ. 2: కనుఁగొన్నవాఁడవు కాఁగిలించక మానేవా
చనవు మెరసిన నాచలము గాక
ననుపైనవాఁడవు నగక నీవు మానేవా
తనివోక కొసరే నాతప్పులింతే కాక

చ. 3: సేస వెట్టినవాఁడవు చెనక నీవు మానేవా
గాసి నిన్నుఁ బెట్టిననాకడమే కాక
యీసుదీర శ్రీవేంకటేశ నన్నుఁగూడితివి
రాసికెక్క మెచ్చిన నారాజసము గాక

రేకు: 0653-4 శంకరాభరణం సంపుటం: 14-316

పల్లవి: అప్పటి కాఁతాళాన నంటిఁగా నిన్ను
అప్పగించేవా వలపులంటిఁగా నిన్ను

చ. 1: వీడిన నీనాసంది విరహతాపుపు వేళ
ఆడరాని మాటలెల్లనంటిఁగా నిన్ను
యీడనే నీవు మన్నించేదించుకానెరఁగ లేక
ఆడుకోలు మాట దప్పెనంటిఁగా నిన్ను

చ. 2: మంకుల నాకోరికతో మనసు పట్టఁగలేక
అంకెకు వచ్చినట్టెల్లానంటిఁగా నిన్ను
పొంకపు నీకృప నేఁ బొసగఁ దెలియలేక
అంకగానివలెనే అంటిఁగా నిన్ను

చ. 3: పాయక నీవు నన్నుఁబై కొంట దెలియలేక
ఆయాలు సోఁకిన వెంగెమంటిఁగా నిన్ను
యీయెడ శ్రీవేంకటేశ యిట్టె నీవు గూడఁగాను
ఆయఁబోయ నిఁకనేల అంటిఁగా నిన్ను

రేకు: 0653-5 సామంతం సంపుటం: 14-317

పల్లవి: నెరజాణ యాఁటదైతే నిన్నునింత గొసరునా
వెరవెరఁగక నేనే వేసరించేఁ గాక

చ. 1: యేర నీ వూరకుండఁగానింతట విరుగవద్దా
చేరి వట్టాడిగాలింకాఁ జేసేఁ గాక
యీరీతి నీవుండఁగానింటికిఁ బోవద్దా నేను
వేరై యేమోనీకు విన్నవించేఁ గాక

చ. 2: పిలువక వుండఁగాను బిరాన నేనుండవద్దా
వలవనిజాలిఁ బడి వచ్చితిఁ గాక
చలముతో నీవుండఁగా చనవులు మానవద్దా
తలఁపులో కాఁతాళాన దగిలేఁ గాక

చ. 3: పాసి నీవిప్పుడు రాఁగా బలిమి చూపవలదా
ఆసల నిన్నుఁ గాఁగిటనలమేఁ గాక
యీసుదీర శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వేసరి యలయవద్దా వేగిరించేఁ గాక

రేకు: 0653-6 హిందోళవసంతం సంపుటం: 14-318

పల్లవి: మీ యిద్దరి విభవాలు మేము చూడవలదా
యీయెడ మమ్ము మన్నించి యింత సేయవయ్యా

చ. 1: తలమోఁచి యెవ్వరైనఁ దమవారయ్యిన వారిఁ
బిలువక తాము దామే పెండ్లాడేరా
అలరి శ్రీవేంకటేశ ఆడకు మమ్ము రప్పించి
వలసినట్టు గరుడధ్వజమెత్తవయ్యా

చ. 2: చెంది ఊడిగపువారు సేవ సేయకెవ్వరైన
అందముగ నేఁగుఁబెండ్లికంగవించేరా
అందపు శ్రీవేంకటేశ ఆడకు మమ్ము రప్పించి
విందులతోనిట్టే తిరువీదులేఁగవయ్యా

చ. 3: పేరుకొని తమవద్దఁ బేరటాండ్లు పాడఁగాను
సారెకుఁ బెండ్లాడకున్న సంతసమౌనా
యీరీతి శ్రీవేంకటేశ యిద్దరు మమ్ము రప్పించి
ఆరితేరి బువ్వములు అవధరించివయ్యా

రేకు: 0654-1 బౌళి సంపుటం: 14-319

పల్లవి: ఇంత నీమోహము నేనెరఁగనైతిఁ గాక
సంతసము నీకెపుడు సహజమే కాదా

చ. 1: చెంగటనే నిలుచుండి చెక్కునొక్కేవిదే నన్ను
పొంగుచు నీకెంతదయ పుట్టెనో నేఁడు
కొంగువట్టి తీసి నన్నుఁ గూచుండఁ బెట్టుకొంటివి
పంగెనల నాపైనెంత పారెనో మనసు

చ. 2: ఇందరిలోపల నన్ను నెక్కుడుగా మన్నించితి
కందువ నాతలఁపెట్టు గంటివో నీవు
పొందుల సరసమాడి బుజ్జగించేవట్టేనన్ను
చందముగ నెటువంటి జాణవో నీవు

చ. 3: శిరసు నాపై మోపి సెలవి నవ్వేవు నీవు
ధర నాపైనీకెంత తగులో నేఁడు
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తరలకెంత మన్నించి దక్కితివో నీవు

రేకు: 0654-2 ముఖారి సంపుటం: 14-320

పల్లవి: ఇద్దరినెట్టు గూరుతమేమి సేతమమ్మలాల
వద్దనే సణఁగులాడీ వద్దన్నమానదు

చ. 1: మంతనాననాతనితో మాటలాడి చూడరమ్మ
యింతిపై కోపమున నేఁడేమనీనో
చెంతలఁ దా రానందుకు చెలి మొదలనలిగి
వంతలనాతనిఁ దిట్టీ వద్దన్న మానదు

చ. 2: నంటుననాతని మీరు నవ్వించి చూడరమ్మ
కంటకమాపెమీఁదఁ గలదో లేదో
యింటికి వచ్చినవానినీపె దానే వాదుదీసి
వొంటినే సన్నలు సేసీనొద్దన్నా మానదు

చ. 3: తారుకాణగా దగ్గరి పోఁగదరమ్మ
కూరిమితోనిపుడాకెఁ గూడఁ బోలును
నేరిచి శ్రీవేంకటాద్రి నిలయుని కాఁగిటిలోఁ
నూరకే మొక్కులు మొక్కీనొద్దన్నా మానదు

రేకు: 0654-3 దేవగాంధారి సంపుటం: 14-321

పల్లవి: ఎరఁగని వారికైతే నేదోసమును లేదు
గురుతైన నీకే పో కొఱతెల్ల విభుఁడా

చ. 1: మచ్చికె నిన్నుఁ గూడి మఱచిన నామేను
యిచ్చలనేమిసేతువో యెట్టు దెలుసు
నచ్చులఁ బరులు చూచి నన్ను నవ్వినది యెల్ల
వొచ్చెము నీకే సుమ్మీ వోయి విభుఁడా

చ. 2: మొగమోడియున్న నన్ను మొరఁగి యవ్వలనేమి
యెగసక్యము సేతువో యెటు దెలుసు
మగవాని కపటాలు మానుపలేవనియేటి
అగడెల్ల నీదే సుమీ అయ్యా విభుఁడ

చ. 3: పలు నీరతులలోన బ్రమసి వుండిన నన్ను
యెలయించేమిసేతువో యెట్టు దెలుసు
అలర శ్రీవేంకటేశ అన్నిటా నన్నుఁ గూడితి
తలవంపు నీదే సుమ్మీ తగదంటే విభుఁడా

రేకు: 0654-4 కాంభోది సంపుటం: 14-322

పల్లవి: ఏమి చెప్పేది నాబ్రదుకిట్టాయఁగా
నామతిలో సిగ్గులేక నవ్వు నవ్వేఁగా

చ. 1: యెన్నఁడు బాసి యుండనెరఁగని నావలపు
యిన్నిటా నేఁడెంచుకొంటే యిట్టాయఁగా
కన్నులఁ జూడక వుంటే కళవళించే నేను
మన్నన నీచెలులతో మాటలాడేఁగా

చ. 2: చక్కని నీమేనిమీఁదఁ జాఁచేటి నాచేయి
చెక్కుకిందికిటు వచ్చి చింతాయఁగా
అక్కరతో నిన్నుఁ గూడి అలరేటి యీదినాలు
నిక్కి నిక్కి చూపులకు నెలవాయఁగా

చ. 3: దూరమైతిన నిన్ను దూరేటి నానోరు
వోరి నీమోవి యానఁగ నొద్దికాయఁగా
నేరిచి శ్రీవేంకటేశ నేఁడు నన్ను మన్నించఁగ
కోరిన నాకోరికలు కొనసాగెఁగా

రేకు: 0654-5 శుద్ధదేశి సంపుటం: 14-323

పల్లవి: మీకుఁ గొత్తలింతే కాక మించిన వీనిసుద్దులు
చౌకలైనమీఁద వీని చనవులు గలవా

చ. 1: పాటించి నవ్వులలోనే పగలు చాటఁగనీఁకఁ
నేఁటి మంచితనమే తానెవ్వఁడే వీఁడు
కూటమినూరకే మీరు కొనఁబెట్టేరింతె కాక
నాటకీఁడు వీనిమాట నమ్మనెట్టు వచ్చునే

చ. 2: తోడనే కూచుండి పట్టిదూరులు దూరీ నన్ను-
నేడ చుట్టరికమే తానెవ్వఁడే వీఁడు
జాడలవలపు మీరే చవులు సేసేరుగాక
కోడెకాఁడు వీఁడు చేసేకూరుములూఁ గలవా

చ. 3: చెక్కు నన్ను నొక్కుతానే చేఁతలు సేసీఁదాను
యెక్కడిమేలు చల్లీఁ దానెవ్వఁడే వీఁడు
యిక్కువలంటి శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁగూడె
తక్కరీఁడు వీనితోడి తగవులఁ గలవా

రేకు: 0654-6 సామంతం సంపుటం: 14-324

పల్లవి: మాకేఁటికోపములు మగ వారితోడ నేఁడు
చేకొని నీవు నాచెక్కు నొక్కఁగను

చ. 1: చిత్తము చీఁకటి వాసె సెలవి నీవు నవ్వి
పొత్తుకుఁ బిలిచి బుజ్జగించఁగా
వత్తికి నూనెకు నొక్కవరుసాయ నలుకలు
హత్తి నీవే సేసవెట్టితల్లనాఁడే నాకు

చ. 2: చలములన్నియుఁ దీరె సరసము నీవాడి
పలుకులనాదరించి పంతమీయఁగా
చలుములు బలుములు సరికి బేసికి ముంచె
నిలిచిన నిలువుకే నీవు మన్నించితివి

చ. 3: తనువుపై కాఁకమానె దగ్గరఁ బెట్టుక నీవు
కనుచూపులఁ దేలించి కాఁగిలించఁగా
వినయాలు వేడుకలు వీడుదోళ్లాడె నిదె
యెనసితివి శ్రీవేంకటేశ నన్నిపుడు

రేకు: 0655-1 సాళంగం సంపుటం: 14-325

పల్లవి: ఇంక నేల తొంటిసుద్దు లిందాఁకా నింతెకాక
వుంకువైన నీగుణాలె వొక్కటిగాఁ జేసెను

చ. 1: చిగురునవ్వుల నీ చిరుతమోవిగా
అగడైననాకోప మారఁజేసెను
పగటున నీవు సేసే పలువినయాలుగా
తగులుగా నీవున్నదండకు రప్పించెను

చ. 2: కడకన్నుల నీకందువచూపులేకా యీ-
యెడనే వంచిన తల యెత్తించెను
బడి బడి నీవు వచ్చేపాయని మోహమే కా
అడఁగిననామతిలో ఆసలెల్లా రేఁచెను

చ. 3: కమలపు నీచేతుల కాఁగిలి యిప్పుడేకా
సమరతి నాకాఁకలు చల్లఁజేసెను
తమితో శ్రీవేంకటేశ దయ నీవుసేయఁగాఁ గా
ప్రమదపునాకూటమి పరిణామ మాయను

రేకు: 0655-2 సౌరాష్ట్రం సంపుటం: 14-326

పల్లవి: మావల్ల మంచితనాలు మరి చూడఁగలవా
నీవే నన్నుఁ దగులఁగా నేఁ డనేఁ గాక

చ. 1: మచ్చరమె కూడైన మానినుల మింతే
యిచ్చకము నేరిచేమా యెన్నటికైనా
ముచ్చటతో నీవే మమ్ము ముందు ముందే బుజ్జగించి
హెచ్చుసేసి మన్నించఁగా నెనసితిఁ గాక

చ. 2: చంచలపుఁ జూపుల జవ్వనుల మింతే
ఇంచుకంత తాలిమి నేఁడింక వచ్చీనా
వంచనతో నీవే మమ్ము వాడుదేర నాదరించి
మించఁ జేయఁగా నేఁడు మెరసితిఁ గాక

చ. 3: రతికి వేగిరపడే రమణులమింతే నీ-
ఇతవు దెలియుదాఁకా నెడశుండీనా
పతివి శ్రీవేంకటేశ పైపై నన్నుఁ గూడితివి
మతి నీ వియ్యఁగానే మరిగితిఁ గాక

రేకు: 0655-3 దేసాళం సంపుటం: 14-327

పల్లవి: ఆసగా నెవ్వరికైన నడ్డపెట్టరానిది
పోసరించె నావలపు పొంచి పొంచి నిన్నును

చ. 1: తీపులనీమాటలనే తేలి తేలి చొక్కి చొక్కి
మాపుదాఁకా నీవద్ద మరిగుంటిని
యేపొద్దు గరుణించేవో యింటి కెన్నఁడు వచ్చేవో
మూపులు మూఁడాయి నీమోము చూచి నాకు

చ. 2: వేడుక నీపసలకే వెంట వెంటఁ గాచి కాచి
తోడు నీడై నే నీతో దొరసితిని
కూడేటివేళ యెప్పుడో గురి యిందు మోఁచినో
వాడు దేరితిమి నీవారమైనయపుడే

చ. 3: చేత నీవంటినందుకే చిక్కి చిక్కి మొక్కి మొక్కి
కాతరపు నీకాఁగిటఁ గలసితిని
యీతల శ్రీవేంకటేశ యిఁక నీచిత్తమెట్లో
పోతరించి నీరతుల పొందులనే మెచ్చితిని

రేకు: 0655-4 లలిత సంపుటం: 14-328

పల్లవి: మక్కువ నామీఁదఁ గల మాయలవాఁడు
వెక్కసాలు మాని యిందే వెదకరే చెలులు

చ. 1: తనకు నెదురు చూచి తా రాకుండఁగా నంపిన
వనిత కెదురు చూడ వలసె నేఁడు
మనసు చూడవలసే మరగున నున్నవాఁడో
వెనక నెరఁగరాదు వెదకరే చెలులు

చ. 2: పతిని దూరి దూరి పతి నావద్ది కంపిన-
సతిని దూరవలసె సారెకు నాకు
మతకాలు సేసుక యే మంచముపై నున్న వాఁడో
వెతదీర నాతని వెదకరే చెలులు

చ. 3: ఆతనిఁ జూచి మొక్కి ఆతనిఁ దోడితెచ్చిన-
దూతికకు మొక్కినదే దొడ్డాయ నాకు
కాతరానఁ గూడే శ్రీవేంకటపతిపై భారము
వేత మిప్పు డీడనుండే వెదకరే చెలులు

రేకు: 0655-5 ముఖారి సంపుటం: 14-329

పల్లవి: పోనిమ్మని వూరకున్నాఁ బొద్దు వొద్దు నన్ను రేఁచీ
తానే నిజమరియైతేఁ దనకేలే వెఱపు

చ. 1: తప్పని బొంకనివాఁడు తానేలాన వెట్టుకొనీ
చిప్పిలు పెంజెమటలు చెక్కులఁ గార
యిప్పు డింతేసివాసు లెక్కించుక వచ్చేవాఁడు
తప్పక చూడనేలే దానివంక నపుడు

చ. 2: తారుకాణించేవాఁడు తానేల తలవంచీని
నారుకొన్న ముసిముసి నవ్వుల తోడ
బీరమున నిప్పుడింత పెనఁగేటి వాఁడైతే
నేరుపుతో దానివద్ద నిలుచుండ నేలే

చ. 3: తానే కాఁగిలించేవాఁడు తతి నుస్సురన నేలే
ఆనుక లోలోనే తా నలసుకొంటా
యీనయాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
కానకుండా దానితోడఁ గన్నుసన్న లేలే

రేకు: 0655-6 మంగళకౌశిక సంపుటం: 14-330

పల్లవి: మాపుదాఁకా నేల నీ మనసు వచ్చితేఁ జాలు
చేపట్టినపని నీ చిత్తమే యెఱుఁగును

చ. 1: మంతనాన నీ వాడినమాటలుగా నామతిలో
యెంతైనా నీపైకోపము హెచ్చనీనివి
పంతము నాకేమి దప్పెఁ బదవయ్య నీవు నన్ను
యింత వేడుకొనఁగా నే నియ్యకొన కుండీనా

చ. 2: అప్పుడు నీవు చూచిన ఆసల చూపులే కా
దెప్పరమై నీమీఁదఁ దెగనీనివి
యిప్పుడె వేగిరమేల యింత నీవు బాఁతి పడి
చెప్పేటి నీప్రియములు చేకొనకుండేనా

చ. 3: పెక్కురతులను నన్నుఁ బెనచే యీ కాఁగిలే కా
తక్కక నీపై వలపు తమి రేఁచేది
యిక్కువలంటి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
దక్కితి నిఁక నీమేలు తలఁచకుండేనా

రేకు: 0656-1 బౌళి సంపుటం: 14-331

పల్లవి: నీవే నావాఁడవైతే నిలువునఁ గానరాదా
భావించి అప్పటినాతోఁ బచరించవలెనా

చ. 1: ప్రియమే నీకుఁ గలిగితే పిలువ నంపకుండే వాఁడవా
దయకుఁ దగినపాటె తగులు గాక
నియతాన నట్టె నాపై నీవేల ఆన వెట్టేవు
క్రియ యెరఁగనా నేను కిందుపడవలెనా

చ. 2: నేనే నీకు వలసితే నీవిందాఁకా రాకుందువా
పాని పట్టి యాపాటికాపాటే గాక
నానఁ బెట్టి నీవేల నన్ను నవ్వించ వచ్చేవు
కాననా నీవలపులు గట్టిసేయవలెనా

చ. 3: చిత్తమే నాపైనుండితే చేపట్టి తియ్యకుండేవా
యిత్తల నీ నాటకము లేఁటివో కాక
హత్తి శ్రీవేంకటేశ్వర అట్టె నన్నుఁ గూడితివి
పొత్తుకు నే రాకుండేనా పొదుగఁగ వలెనా

రేకు: 0656-2 శంకరాభరణం సంపుటం: 14-332

పల్లవి: నీవిన్నిటా జాణవౌత నేనెరఁగనా
వేవేలు నాతమకాన విన్నవించేఁగాక

చ. 1: ముందు నన్ను మన్నించి వెహించు టెరఁగనా
అందరు నెరఁగవలెనని కాక
కందువ నీవు నాపైనే కన్నులౌతెరఁగనా
సందడి నున్నదాననై చవిరేఁచేఁగాక

చ. 2: చనవు నాకిచ్చినట్టి సరవు లెరఁగనా
ననుపు మెరసి కొంత నవ్వేఁగాక
మనలోన నాడుకన్నమంతన లెరఁగనా
తనివి చాలక నేనే తత్తరించేఁగాక

చ. 3: కొంకు లేక నీవు నన్నుఁగూడేదెరఁగనా
పొంకపు నీదయ నాపైఁబుట్టించేఁ గాక
అంకెల శ్రీవేంకటేశ అట్టె నన్నుఁగూడితివి
లంకెలౌతెరఁగనా నీలాగు చూచేఁ గాక

రేకు: 0656-3 మనోహరి సంపుటం: 14-333

పల్లవి: కొల్లున నవ్వేరు నిన్ను గొవిందుఁడా
గొల్లెతల నేమనేవు గోవిందుఁడా

చ. 1: యేపున నీసుద్దులెల్ల యిట్టె యశోదతోడ
గోపిక లాడుకొనేరు గోవిందుఁడా
తీపుల నీచేఁతలెల్ల తేట తెల్లమాయనిదే
కోపగించఁ జెల్లదిఁక గోవిందుఁడా

చ. 2: సిసువవై యాఁడువారి చీరలు దీసినందుకు
కొసరి తిట్టేరు నిన్ను గోవిందుఁడా
పసులఁగాచేచోట భామలు విందు దెచ్చిరి
కుసిగుంపు సేయకుమీ గోవిందుఁడా

చ. 3: వాడలసతుల నొక్కవావిగానే సేసితివి
కోడెల నావులఁ గాచేగోవిందుఁడా
యీడనే శ్రీవేంకటాద్రి నిరవై శ్రీ సతితోడఁ
గూడి లోలుఁడ వైతివి గోవిందుఁడా

రేకు: 0656-4 బౌళరామక్రియ సంపుటం: 14-334

పల్లవి: అతివ నీ చిత్తము ఆతనిభాగ్యము నేఁడు
తతిఁ బేదవానికి నిధానము చేరుటలు

చ. 1: నిండురాజసపు నీనివ్వెరగుపాటె పో
కొండవంటిపతిమది కొల్లగొనెను
అండ నిందుమీఁద నేపాటైన నీవు నవ్వితేను
నిండు చెఱకునఁ బండునిలుచుట గాదా

చ. 2: కడు నీమురిపెములకడకన్నుల చూపు వో
బడిబడి విభునిఁ దాపము రేఁచెను
యెడయ కిందుపై నీవు యేపాటి మాటలాడిన
వడి వాడినపైరుకు వానవచ్చినట్టు పో

చ. 3: దగ్గరి కూచున్న నీతమక మిదియ పో
అగ్గమై శ్రీవేంకటేశు కనువాయను
నిగ్గుల నిందుమీఁద నీవె పైకొని కూడితి
బగ్గన బంగారానఁ బరిమళ మాయను

రేకు: 0656-5 సామంతం సంపుటం: 14-335

పల్లవి: అప్పుడే నన్నియుఁ జెప్పే నాతనితోడ
వొప్పుగు మీమాటలెల్ల నూఁకొనఁగ వలెఁగా

చ. 1: తేనెలవంటిమాటలు తేటపడెఁగా నేఁడు
తానె యాపె వెంట వెంటఁ దగులఁగాను
కానిలేవే యందు కేమి కంటిని తనగుణాలు
యే నెపాననైఁనా దానే యీడకు రావలెఁగా

చ. 2: కందువ తననిజాలు కానవచ్చెఁగా నేఁడు
కిందుపడాకెకుఁ గన్నుగిరుపఁగాను
సందడించనేలె నాకు చక్క నాయఁ బనులెల్ల
ముందరికిఁ దానె నామోము చూడవలెఁగా

చ. 3: రచ్చలతనవలపు రతికెక్కెఁగా నేఁడు
వొచ్చెము దీరఁ దానే నావొద్దికి రాఁగా
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
మచ్చరా లిన్నియుఁ బాసె మరుగఁగవలెఁగా

రేకు: 0656-6 మాళవి సంపుటం: 14-336

పల్లవి: ఎడపులవారము నేమే మెరుఁగుదుము మీ-
తడఁబాట్లేమి గల్లా తనువు లెరుఁగును

చ. 1: చెలియ నీరాకలెంచి చెక్కులెల్లాఁ జెమరించి
తలఁపు మీరిమీరి తలవంచె
తెలుసుకో నీవునీవే తెగి విన్నవించలేము
వలపులు వలపులే వడిఁ దారుకాణలు

చ. 2: మగువ నిన్నుఁ గూడి మంచముపై వసివాడి
వెగటుగఁ జెలులతో వెంగెమాడె
నగకు నీవంత మాతో నానవు మామనసులు
తగులమిఁ దగులమీఁ దరవు లయ్యీని

చ. 3: యింతి నీవురాఁగా జూచి యెదురెదుర నేలేచి
సంతోసపుఁ బులకల సారెఁ బూచె
యింతలో శ్రీవేంకటేశ యీపె నీవు గూడితివి
మంతనాలూ మంతనాలే మచ్చిక రేఁచీని

రేకు: 0657-1 పడవంజరం సంపుటం: 14-337

పల్లవి: ఎట్టు సేసిననుఁజెల్లు నిఁకనేల నిన్నుదూర
వట్టియారడి నేనె వలచి వుండఁగను

చ. 1: జగడించి నేనలిగి చలముతోఁ దలవంచి
వగలతో వసివాడు వాడఁగాను
నగనేల ననుఁజూచి నయమునన నీవింత
పగసేయ వచ్చి ననుఁ బరచేవు గాక

చ. 2: జఱసి నీతో నేను సరివొట్టు వెట్టుకొని
పుఱవేదనలతోడఁ బొగులఁ గాను
మఱపించి నామీఁద నొఱగేవు నీకెంత
చెఱదాన నైతినో చెనకేవు గాక

చ. 3: కడుమదమున నిన్నుఁగన్నులనె జంకించి
పొడిఁబడి పానుపుపైఁ బొరలఁగాను
యెడ మిచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వడి నాకు నెంతకైవశమైతో కాక

రేకు: 0657-2 దేవగాంధారి సంపుటం: 14-338

పల్లవి: విరహాన నిన్నుఁ బాసి వేగిరించె నిందాఁకా
సరుసకు వచ్చి యిఁక నటవట లేలే

చ. 1: పచ్చి చిగురుఁబానుపుపైఁ బొరలేటి పతితో
వెచ్చివేవనిమాటల వెంగెము లేలే
మచ్చిక నీమీఁదిది మరొకతెపై వేసి
గచ్చులకొడిమెలేల కట్టేవే ఆతనికి

చ. 2: పండువెన్నెల బాయిట బడలేటిరమణుపై
యెండలనీడలచూపు లేల చల్లేవే
అండ నీకేదురుచూచే యవ్వలివారిపైఁదోసి
చండిసేశాతనికేల జాలి రేఁచేవే

చ. 3: చిత్తడి చెమటల యీ శ్రీవేంకటేశ్వరుని
మొత్తపుఁ జింతాజలధి ముంచనేఁటికే
యిత్తలను నీవు గడి యెవ్వతెనో పేరుకొనేఁ
వెత్తినచలాన నింకనేల నవ్వేవే

రేకు: 0657-3 కొండమలహరి సంపుటం: 14-339

పల్లవి: నీచేయి మీఁదాయ నీ కేమయ్య
నాచేతిచెక్కుతో నాకే నవ్వునవ్వ వలసె

చ. 1: నీవల్లఁ గడమేది నిన్ను నమ్మఁజాలని
నావొళ్లి నేరమే నాది గాక
కావరించేనన్ను నీవు గక్కున మన్నించఁగాను
చేవదేరి నాకు నాకే సిగ్గువడ వలసె

చ. 2: నీతగవు దప్పునా నిన్నుఁదెలియఁగ లేక
కాతరించినదె నాకల్లగాక
యీతలనటువంటి నన్నిట్టె నీవాదరించఁగా
రాతిరినుంటిందుకే కరఁగ నాకు వలసె

చ. 3: నీగుణ మటువంటిదా నిన్ను మెచ్చకుండినయీ-
యాగడవు నాకోపమే యాఉడి గాక
యీగతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
భోగపు నీరతులకే పొందు సేయవలసె

రేకు: 0657-4 కాంబోది సంపుటం: 14-340

పల్లవి: మోముతో మోములోని కళలవే ముచ్చటలుమించెనవే
కామిని గోరినయట్టే కలుగఁగఁబోలును

చ. 1: కన్నుల లేనవ్వులవే గజరుఁబులకలవే
కన్నెకు విభునిపొందు గలుగఁబోలు
సన్నపుఁజెమటలవే సరుల చెదురులవే
చిన్నలతోడి రతులు చేకొనఁగఁ బోలును

చ. 2: నిట్టూరుపుగములవే నెరులు జారినవవే
ఇట్టె పతికడకుఁ దానేఁగఁ బోలును
తెట్టెలైన సిగ్గులవే తేలింపుఁ గన్నులవే
వొట్టిన మరుముద్రలు వొళ్లనుండఁ బోలును

చ. 3: బడలికనడపదే పయ్యదజారులవే
పడఁతి శ్రీవేంకటేశుఁ బైకొనఁబోలు
యెడయని సంతసము లిద్దరికి ముంచెనవే
జడిగొన్న కూటములు సతము గాఁబోలును

రేకు: 0657-5 రీతిగౌళ సంపుటం: 14-341

పల్లవి: తలఁచుకొమ్మనవే తానె నన్నునింతసేసె
వలపు దిగవిడువ వసము గాదనరే

చ. 1: కన్నుల మొక్కేటి వారు కానుకలిచ్చేటివారు
యెన్నికసతులు దనకెందరు లేరు
నన్నువలెఁ దనమన్ననఁ బొంది దిక్కులను
వన్నె కెక్కఁ బేరుపడ్డవారు మరికలరా

చ. 2: సేసలు వెట్టేటివారు చేతులు చాఁచేటివారు
యీ సరసములవారు యెందరు లేరు
దాసి యిట్టె నన్నువలెఁ దనపాదములు సోఁకి
రాసికెక్కినట్టివారు రాజ్యములోఁ గలరా

చ. 3: మిక్కిలి సేవలవారు మించి నడచేటివారు
యెక్కడఁ జూచినఁ దనకెందరు లేరు
యెక్కువ శ్రీవేంకటేశుఁడిటు నావంటినీచుఁ
బక్కనఁగాచెను యిట్టి పరులూఁ గలరా

రేకు: 0657-6 రామక్రియ సంపుటం: 14-342

పల్లవి: నడుమఁ గాఁకలు చల్ల నాకేఁటికే
వెడ చనవులుసేయ వెఱ్ఱిదాననా

చ. 1: తెగి తామోహించినట్టి తెరవతో సారె సారె
నగుఁగాక కోపగించ నాకేఁటికే
మొగము చూచి యాపెకే మొక్కుఁగాక కమ్మటిని
వెగటు వెంగెములాడ వెఱ్ఱిదాననా

చ. 2: యేమగువయింటికైన నేఁగుగాక యిందుకుఁగా
నామోము చిన్నఁబోను నాకేఁటికే
మేము చూడఁగా నాకెను మెడఁ గట్టుకొనుఁగాక
వేమరుఁగాఁతాళించ వెఱ్ఱిదాననా

చ. 3: ఘనుఁడై పెండ్లాడినట్టికాంతఁ గాఁగిలించుకోఁగా
ననుపు లిప్పుడు సేయ నాకేఁటికే
యేనసి శ్రీవేంకటేశుఁ డింతలో నన్నాదరించీ
వెనకటిసుద్దు లెంచ వెఱ్ఱిదాననా

రేకు: 0658-1 సామంతం సంపుటం: 14-343

పల్లవి: చెలియా ఆమేలుసుద్ది చెప్పవే నాకు
వెలకా వేగు నిండాఁక వేగించితినే

చ. 1: ఆఁపరానితమకాన నాడకే వచ్చేనంటి
రాఁపుతోడ నే నద్దమరాతిరికాడ
కాఁపురపువారేమన్నాఁ గసరుకొంటా నుంటి
నీపలుకు విన్నదాఁకా నిలుచుంటినే

చ. 2: వలపు నిలుపలేక వాకిటనె కాచుకున్నా
తెలతెలవారేటి తెరువు కాడ
చలపట్టి యీతనికె సగినాలు గోరుకొంటి
వెలయ నాతనియిల్లే వెదకితినే

చ. 3: ఆతని నాతొంటి పొందు లన్నియుఁ దలఁచుకొంటి
జాతిగుండెతోడఁ దనఁబట్టినచోట
యేతుల శ్రీవేంకటేశుఁ డింటికిఁ బిలిచి కూడె
నాతమకాన మరచి నవ్వులు నవ్వితినే

రేకు: 0658-2 ఆహిరి సంపుటం: 14-344

పల్లవి: ఉన్నమాట లిఁకనేల వూరకే యెందాఁకనైనా
విన్నపాలు సేసేము వేడుకిదే చాలదా

చ. 1: సేస వెట్టినప్పుడే చేకొనుటాయ నన్ను
వాసులవరుసవంతు వలెనా నాకు
రాసికెక్కనప్పుడే రమ్మని పిలిచె నన్ను
నాసరివారిలోన నాకుఁ జాలదా

చ. 2: కన్నులఁ జూచినప్పుడే కైవస మైతిఁ దనకు
వన్నెల నన్నాదరించవలెనా నాకు
యిన్నిటా నాభాగ్యమాయ నింతలో నన్నాదరించె
కన్నెనై పుట్టినందుకు ఘనతిదే చాలదా

చ. 3: చెక్కునొక్కినప్పుడే సిరులెల్లఁ జేరెనాకు
వక్కణించి సొమ్ములియ్యవలెనా నాకు
యిక్కువంటి శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁ గూడె
మిక్కిలి నవ్విన యీసమేళమె చాలదా

రేకు: 0658-3 ముఖారి సంపుటం: 14-345

పల్లవి: ఉమ్మగిలేవారి నేల పుడికించీనే
తమ్మిమోము చూచి నాపైదయ వెట్టఁదగదా

చ. 1: చెక్కుచేతఁ దనకుఁగా చింతతో నేనుండఁగాను
యెక్కడనుండో వచ్చి యేల నవ్వీనే
ముక్కున నూర్పులతోడ ములుగుచు నుండఁగాను
పొక్కక తానేల నన్ను పువ్వుల వేసీనే

చ. 2: నేరక నే తనుఁ బాసి నేలలు వ్రాయఁగాను
సారెఁ దా వచ్చి అదేమి చదివీనే
వేరులేక పానుపు పై వెతలఁబొరలఁగాను
యీరీతి నింకా సన్నలేమిసేసీనే

చ. 3: దిమ్మ రేఁగి కాఁకలతో దేహమెల్ల వాడ గాఁను
యెమ్మెలఁ గాఁగిట నన్ను నేల పట్టీనే
కమ్మి శ్రీవేంకటపతి గక్కున నన్నుఁ గూడి
చెమ్మఁజెమటలఁ నన్నుఁ జెక్కులేల నొక్కీనే

రేకు: 0658-4 సాళంగం సంపుటం: 14-346

పల్లవి: ఇందాఁకా నేడనుండె నివి యెల్లాను
యిందుముఖి నేఁడు దైవమిచ్చెఁగా నీకు

చ. 1: కలకల నవ్వులును కందువలమాటలును
నిలువుననే కలిగె నేఁడుగా నీకు
మొలకల సిగ్గులును మోములోని కళలును
చెలువుఁడు రాఁగానే చెల్లెఁగా నీకు

చ. 2: తేటల తెలిఁగన్నులు తెగుదెంపువీడేలు
నీటుమీఁదనే కలిగె నేఁడుగా నీకు
కూటపు సరసములు కొంకులేని సంతసాలు
తాటించి యాతఁడంటఁగా దక్కెఁగానీకు

చ. 3: చెక్కుల చెమటలును చెదరినకురులును
నిక్కిచూడఁగాఁ గలిగె నేఁడుగా నీకు
గక్కన శ్రీవేంకటాద్రిఘనుఁడు గాఁగిలించఁగా
యెక్కువ వీరతి తుదకెక్కెఁగా నీకు

రేకు: 0658-5 శంకరాభరణం సంపుటం: 14-347

పల్లవి: ఇప్పుడుగా మాకెల్ల నేక చిత్తమాయ నేఁడు
తప్పులెల్ల వొప్పులాయఁ దరవాతి పనులు

చ. 1: మంతనాన నేమంటివో మనసునఁ బెట్టుకొని
చింతతోనుండె నిందాఁకాఁ జెక్కుచేతితో
అంతలో నీవు విచ్చేసి ఆకెఁ గాఁగిలించుకోఁగా
సంతసానఁబొందెఁ జెలి చక్కనాయఁ బనులు

చ. 2: నిన్నటిరేతిరిలోనే నీవేమి సేసితివో
పన్నిన ముసుఁగుతోడఁ బవళించెను
మన్నించి నీ వింతలోనే మగువను వేడుకోఁగా
యెన్నికలు సరివచ్చి యీడేరెఁ బనులు

చ. 3: యెరపరికపుఁ జూపులెట్లాఁ జూచితో కాని
అరమరపున నుస్సురంటా నుండెను
యిరవుగ శ్రీవేంకటేశ యింతలోఁ గూడితి-
వరుదంది చెలి మెచ్చెననువాయఁ బనులు

రేకు: 0658-6 సామంతం సంపుటం: 14-348

పల్లవి: నిరతి నాభారమెల్ల నీవు మోఁచుకుండఁగాను
యిరవై యెరఁగనైతి నేమందు నేను

చ. 1: చెక్కుచేయి నాకేల చిన్నఁబోయి వుండనేల
గక్కన నాలో నీవు గలిగుండఁగా
నిక్కి నిక్కి చూచితివి నీవు రావంటా నిందాఁకఁ
నిక్కడ నా వెట్టితన మేమందు నేను

చ. 2: వట్టిజాలి నాకేల వారి వీరి దూరనేల
అట్టె నీవు నాకుఁ బతివై వుండఁగా
నెట్టిన నేఁబదరితి నీవు విచారించవంటా
యిట్టి నా యెడ్డతనాన నేమందు నేను

చ. 3: చెప్పిపంప నాకేల సిగ్గుతోడ బొంకనేల
కప్పి నీవే వచ్చి నన్నుఁగాఁ గిలించఁగా
వొప్పుగా శ్రీవేంకటేశ వొత్తితి రతుల నిన్ను
యిప్పటి నా గబ్బితన మేమందు నేను

రేకు: 0659-1 లలిత సంపుటం: 14-349

పల్లవి: చెలులాల మీ రతఁడు సేసినట్టే సేయనీరె
అలుక లన్నియుఁ బాసె నడ్డమిఁక రాకురే

చ. 1: చిన్నఁబోయి నే నుండఁగఁ జెయివట్టి తీసెఁబతి
అన్ని నేరములుఁ బాసె నందువంకనే
యెన్నియైనాఁ జేయనీవే యింత చాలదా నాకు
నున్నఁగా నూఁటికి నొక్కనూలిపోగే కాదా

చ. 2: పుప్పతిల్లు మదనాగ్ని నున్నఁ నన్నుఁ గాఁగిలించె
అప్పటి తాపము మానె నందువంకనే
యెప్పటికప్పుడే కాక యిఁక నేలే తొల్లిటివి
తప్పులెల్ల దీరు నొకదండ ననే కాదా

చ. 3: కడుఁబాసి వున్న నన్నుఁగరుణించి తాఁ గూడె
అడరి సంతోసించితి నందువంకనే
యెడయఁడు శ్రీవేంకటేశుఁడు నన్నునేలె
నుడుగులలోనే కాదా నోముల ఫలములు

రేకు: 0659-2 గౌళ సంపుటం: 14-350

పల్లవి: నీ చిత్తము కొలఁది నే నడచుటింతే కాక
యేచి సిగ్గు విడువఁగ నిల్లాలికి సంగతా

చ. 1: కొంకక నేనే నీకొంగు వట్టి తీసితేను
అంకెల నిదెంతగయ్యా ళనకుండేవా
మంకుల నెన్ని సేసినా మగవాని కమరును
జంకించి యాటదానికి చలివాయఁ జెల్లునా

చ. 2: వొద్దనుండి నిన్నుఁజూచి వూరకే నే నవ్వితేను
అద్దో యిదెంతగబ్బి యనకుండేవా
కొద్ది మీరి యెట్టుండినాఁ గోడెకాఁడ నీ కమరు
చద్ది బింకము రాణివాసములకుఁ దగునా

చ. 3: ముంచి నేనే నీకాఁగిలి మోరఁగకడిగితేను
అంచెల నిదెంతదిట్ట యనకుండేవా
కొంచక శ్రీవేంకటేశ కూడితి వింతలో నీవె
మించిన పట్టపుదేవి మేర మీరఁ జెల్లునా

రేకు: 0659-3 శుద్ధవసంతం సంపుటం: 14-351

పల్లవి: ఎంతజాణ వీచేతలకేమని నుతింతునయ్య
వింత వింత వేడుకల వెలసె మీవలపు

చ. 1: కాఁకలతో వసివాడి గక్కన నిన్నుఁ జూచి
పోఁకముడి వీడి యింతి పొంచి లోలో నవ్వెన
యేఁకట నీవవి చూచి ఇంతలో నీపచ్చడము
తేఁకువగాఁ గప్పితివి తేరె నన్ని పనులు

చ. 2: వెదకి వెదకి నిన్ను వెలఁది కెంగేలు వట్టి
మదనరసము చింది మరి సిగ్గు వడెను
అది యెరిఁగి నీవు ఆకెకన్ను మొరఁగి
పదనుఁ బదనుఁ గూడఁ బన్నీరు చల్లితివి

చ. 3: మక్కువఁ గాఁగిటఁ గూడి మగువ నిన్ను మరిగి
యిక్కువ నందలాన నీయింటి కేఁగెను
అక్కరై శ్రీవేంకటేశ ఆకెఅందలముపైనే
యెక్కుక యేఁగుఁబెండ్లి యింతటా నేఁగితిరి

రేకు: 0659-4 సామంతం సంపుటం: 14-352

పల్లవి: ఎదురైతి మిద్దరము ఇంకేలయ్యా
కొదవెల్లాఁదీరఁ జేకొనవయ్యా

చ. 1: వట్టి నేరా లెంచితిని వద్దిఁక మాయింటిదాఁకాఁ
బట్టిన చలము మాని పదవయ్యా
తొట్టిన యానలకెల్లా దోసము లేదనేఁగాని
అట్టె మాతో మాటలాడవయ్యా

చ. 2: సేసినగుంపెనలకు చేతుల మొక్కేఁగాని
ఆసలఁ గప్పురవీడె మందుకోవయ్యా
బాస నిన్నుఁగొన్నందుకు పంతము లిచ్చేఁగాని
వేసాల నీనొప్పులెల్లా వీడవయ్యా

చ. 3: వేమారు దూరినందుకు వేరేచెక్కు నొక్కేఁగాని
నామోము చూచి కొంత నవ్వవయ్యా
కామించి శ్రీవేంకటేశ కైకొని నన్నుఁగూడితి-
నామాటే చెల్లించి అంకెకు రావయ్యా

రేకు: 0659-5 సామంతం సంపుటం: 14-353

పల్లవి: నే నెరఁగనపుడు నానేరము లెంచఁగ వద్దు
తానే నన్నింత సేయఁదగదో వోయమ్మా

చ. 1: కన్నుల నిద్దురవచ్చీఁ గాఁకల నే బడలితి
యెన్నికనగవు లింకా నెంతదడవే
పన్నినతనయానలు పలుమారు నేఁ జెవుల
విన్నదానఁ గాను మీరే వినరోయమ్మా

చ. 2: పూరకే నావొళ్లునొచ్చీ వుమ్మచెమటలునిండె
యీరీతిఁ దనమాట లెంతదడవే
భారమేల తా నన్నుఁబట్టి పెనఁగఁగ లోనై
వోరిచిన దానఁగాను వొగిఁ జూడరమ్మా

చ. 3: నివ్వెరగు లివె ముంచె నిట్టూర్పు నిగుడెను
యివ్వలఁ దనవినయా లెంతదడవే
నవ్వుతా శ్రీవేంకటనాథుఁడిట్టె నన్నుఁగూడె
రవ్వ సేసేదానఁగాను రతికెక్కేనమ్మా

రేకు: 0659-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-354

పల్లవి: అందుకే పో వెరగయ్యీ్యా నమ్మలాల
అందరిలో నన్నే మెచ్చినట్టే కాదా

చ. 1: వేడుకకాఁడు గదవే వీడెము చేతికిచ్చితే
ఆడకు రమ్మని తీసీ నట్టే కాదా
పాడితోడ నిందుకుఁగా పక్కన నే నవ్వితేను
ఆడరానిమాటలాడీ నట్టే కాదా

చ. 2: మోసలేని జాణగదే మొక్కినంతలోనే నన్ను
ఆసవెట్టి వెళ్లఁదీసె నట్టేకాదా
గాసికోపక సిగ్గుతోఁగదలితే వెంట వెంట
ఆసుకోనివలె వచ్చీ నట్టేకాదా

చ. 3: నేరుపరిగదె వీఁడు నేనొ్కకమాటాడితేను
ఆరసి తాఁ గాఁగిలించీ నట్టేకాదా
వేరులేక యిందుకే శ్రీవేంకటేశుఁ గూడితిని
హరములు నాకు నిచ్చె నట్టే కాదా

రేకు: 0660-1 బౌళి సంపుటం: 14-355

పల్లవి: మొక్కేము నీకు నిదె మొగిఁ బదివేలు వచ్చె
చక్కఁజూచి నీవు నాకుఁ జనవీయరాదా

చ. 1: కోపగించకుమీ నీవు గొబ్బున నేఁ బోతినంటా
యీపొద్దుదాఁకా నుండి యేమి సేతును
మాపుదాఁకా నిందరితో మాటలాడ నీకుఁబట్టె
చేపట్టి నీవు నన్నుఁ జేకొనుట యెపుడో

చ. 2: పెనఁగకుమీ నాతో బిగిసివుందాననంటా
యినుమడించెను గాఁక లేమి సేతును
చనవరులతో నీకు సరసమాడనే పట్టె
తనివోనినావొళ్లఁ దప్పులేదు సుమీ

చ. 3: పిదపఁ జింతించకుమీ బీరానఁ దెగితినంటా
యెదురు చూచలసితి నేమి సేతును
యిదివో శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కదిసిన మీఁద మరి కలదా తాలిములు

రేకు: 0660-2 దేశాక్షి సంపుటం: 14-356

పల్లవి: నీకుఁబోదు నాకుఁబోదు నీతోడిదిలోకము
ఆకడనెవ్వరు నిన్నునాడకున్నఁజాలును

చ. 1: తొల్లె నీకు వలచితిఁ దుద మీర
యెల్లగా నాఁడే నీకె యెక్కెనీమేను
చెల్లఁబో మరుఁడేమైనాఁ జేయనీ నన్ను
మొల్లమి నాదూరు నిన్ను మోయకున్నఁజాలును

చ. 2: వచ్చితి సాహసాన నీ వద్దికి నేను
పచ్చిగా నావయసు నీపాలు సేసితి
చెచ్చెర నెవ్వరేమైనాఁ జేయనీ నన్ను
ముచ్చట దోసము నిన్ను ముట్టకున్నఁ జాలును

చ. 3: గక్కునఁ గలసితి నీకాఁగిట నేను
దక్కితి శ్రీవేంకటేశ దయ గంటిని
చిక్కుఁ జీరు నింటివారు సేయనీ నన్ను
మొక్కలానఁ గీడు నిన్ను ముట్టకున్నఁజాలును

రేకు: 0660-3 లలిత సంపుటం: 14-357

పల్లవి: అన్నియు వేడుకలై యప్పటికి నుండుఁగాక
యెన్నికలు వెనకముందేకముగాకుండునా

చ. 1: నిన్ను నేఁ జూచినపిప్పుడె నివ్వెరగాయ మేను
యెన్నఁగ నీవప్పుడు నన్నేమి సేసితో
పన్ని యెరఁగనివారి బలిమిఁ దడవితేను
మన్నన నాఫలము తమకు రాక మానునా

చ. 2: కదిసి నీవద్దనే కళదాఁకి వున్నవేళ
యెదుట నాచెవిలోన నేమంటివో
నిదిరించే వారిని నీవెంత దిట్టినాను
మదియించి నీచెవుల మగుడక వుండునా

చ. 3: తీరని నీరతివేళ దిమ్ముపట్టి వుండఁగాను
యీరీతిని గురుతులేడ నించితో
చేరి నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశ నీవు
కారణము నే నిన్నుఁగలయక పోదునా

రేకు: 0660-4 శంకరాభరణం సంపుటం: 14-358

పల్లవి: అంచెల నీతోఁ బెనఁగి యలసితిని
చంచలము లెల్లఁ బాపి చనవీయవయ్యా

చ. 1: వీడెను నాతురుము వెనకదిక్కునుండి
వీడెము చేతఁ బట్టుక వెంటఁ బారఁగా
వేడుకఁ గాఁగిలించితి వేగమే నిన్నంతలోన
యీడ నాపంతము చెల్లె నింటికి రావయ్యా

చ. 2: చెదరెఁ గస్తూరిబొట్టు చెమట నుదుట నిండి
వెదకి పువ్వుల నిన్ను వేయఁగాను
పదరి నే నదెల్లా నీపచ్చడానఁ దుడిచితి
కొదువ లిన్నియుఁబాసెఁ గూచుండవయ్యా

చ. 3: నిండె నామైఁ బులకలు నిన్నుఁ గరఁగించేనంటా
నండ నే నొక్కొక మాటలాడఁగాను
దండిగా శ్రీవేంకటేశ తగ నిన్నుఁ గూడితి
కొండగొంటి నిఁక నాకుఁ గొప్పువెట్టవయ్యా

రేకు: 0660-5 రామక్రియ సంపుటం: 14-359

పల్లవి: వెస నిటమీఁదిమాట విచారించవయ్యా నీవే
వుసురని తనలోనే వొగిఁ దల వూఁచెను

చ. 1: అలిగి పోయిపోయి అతివ నీమోము చూచి
బలిమిఁ జల్లగా నిన్ను బతుకు మనె
యెలమిఁ గసరుకొని యేమి విచారించుకొనో
చెలరేఁగి చెలరేఁగి చేతులెత్తి మొక్కెను

చ. 2: వొట్టు వెట్టుకొని వుండి వువిద తెగువతోని-
న్నుట్టిపడి చెలులకు నొప్పగించెను
పట్టకు నన్నని తిట్టి భావించి చూచుకొని
అట్టె నిన్నిపుడె పెండ్లాడు మనెను

చ. 3: సారె నిన్ను నేరమెంచి చలము గొబ్బన మాని
గారవించి నిన్నింతలోఁ గాఁగిలించెను
కూరిమి శ్రీవేంకటేశ కూడి నీపానుపుమీఁద
నేరుపుతోఁ బవళించి నిన్నుఁజూచి మెచ్చెను

రేకు: 0660-6 ఆహిరి సంపుటం: 14-360

పల్లవి: నీవంటిగుండె లేదు నిరుమోహి నేఁగాను
కావరించి చూచియింకాఁ గన్నులకాఁకారదు

చ. 1: నిన్నుఁబాసి నాకెట్టు నిదుర వచ్చీ నేఁడు
వెన్నెలవాయిటనే వేగింతుఁగాక
నిన్న మాపటంత నే నీమీఁద సేసవెట్టి
చెన్నలర నింకాను చేతులతడారదు

చ. 2: మాట నీతో నాడక మనసెట్టుండీరా నాకు
తూఁటనిలుతునిఁ గొంత దూరుదుఁగాక
మేఁటినై నీతో నేను మేనవావులు దెలిపి
నాఁటినమోవులలోని నవ్వులింకా మానవు

చ. 3: మచ్చిక నిన్ను మరిగి మరపెట్టయ్యీర నాకు
అచ్చపు నీతో సరసమాడుదుఁ గాక
యిచ్చలు శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడి మేని-
పచ్చిచెమటలింకవు పైపైనే నాకు

రేకు: 0661-1 లలిత సంపుటం: 14-361

పల్లవి: ఎక్కడివాదులు నీకు నిద్దరికినేల పోవు
ముక్కుపై వేలిడుకొంటే ముచ్చటలు మానునా

చ. 1: పలుకకకుండఁగ నీతోఁ బలుమారుఁ గొసరుచు
సొలసేటి పతిదిక్కు చూడరాదా
తలయెత్తకుండినా తలఁపులో నాతని
నిలువెల్ల ధ్యానమై నీలోనఁ బాసునా

చ. 2: చెనకి కోపించఁగాను చెరఁగువట్టి తీసేటఁ
ననుపులపతితోడ నవ్వవద్దా
తనువు ముట్టనీకున్న తగనాతనిసొమ్ములు
పెనగొని నీమేనఁ బెట్టితివి గాదా

చ. 3: చెక్కు చేతనుండఁగానె చెలి కాఁగిలించెనిదె
పక్కన శ్రీవేంకటేశుఁ బైకొనరాదా
అక్కర నీవూరకున్న నాతఁడే నినుఁగూడె
మక్కువలు దాఁచినాను మర్మములు రేఁచవా

రేకు: 0661-2 ముఖారి సంపుటం: 14-362

పల్లవి: ఏకతాన నీవు నన్ను నేమి సేసినా మేలు
కాకుసేసి కొలువులో కాఁకలఁ బెట్టకురా

చ. 1: శిరసు ముడువఁగానే చెయివట్టి తీసేవు
దొరవైతే నౌదుగాని తొలరా నీవు
సరివారు నీవాడేసరసమౌతెరఁగరు
నెరులంటెనందురు నేనోపఁ జుమ్మీ

చ. 2: సొమ్ములు నించుకోఁగానే సొలయుచుఁ దిట్టేవు
దొమ్మివాఁడవౌదుగాని తొలరా నీవు
నెమ్మది నీవు నాపై నెయ్యమౌతిదెరఁగరు
దిమ్ముల వాదులందురు తిద్దరాదు సుమ్మీ

చ. 3: వల్లెవాటు వేసుకోఁగా వచ్చివచ్చి పెనఁగేవు
తొల్లేనీకు లోనైతి తొలరా నీవు
చెల్లురా శ్రీవెంకటేశ చెక్కునొక్కి కూడితివి
అల్లదివో గోరంటానందురు వొద్దు సుమ్మీ

రేకు: 0661-3 కురంజి సంపుటం: 14-363

పల్లవి: రాఁగదే యింటిలోనికి రాఁపు సేయక
చేఁగచూపుల మమ్మేల చిమ్మిరేఁచేవే

చ. 1: కూరిమి నెసరువెట్టి గుజ్జనగూళ్లు వండి
వేరులేని మాటలనే విందువెట్టేవే
నేరకే కా యింతేసి నీపాలఁ జిక్కితి నేను
యీరీతిచేఁతల మమ్మునేల బ్రమయించేవే

చ. 2: నగవుల వలవేసి నయముల ముద్దు చూపి
వెగటుఁగాఁకలనేల వేఁటలాడేవే
మొగమోటలనె కా నేమోసపోతి నీవల్ల
చిగురుఁజింతలనేల చివికించేవే

చ. 3: మరుతంత్రములనే మారువెల వెట్టి నన్ను
ధరలోన నింతయేల దక్కఁగొనేవే
యిరవై శ్రీవేంకటేశుఁడ నేఁ గూడితి
పెరరేఁచి యింకానేల పెనఁగించేవే

రేకు: 0661-4 నారాయణి సంపుటం: 14-364

పల్లవి: వట్టి పారుపత్యములు వదలక చేయఁజొచ్చె
యెట్టుండితిమేమి తనకేలే యీ పనులు

చ. 1: కొప్పు ముడువఁగాఁ జూచి గోరుసేసి నానెరులు
యిప్పుడెన్ని గలవంటానేఁకరీ వీఁడు
చిప్పలవంటి కన్నులు చేరఁడేసి కలవంటా
వుప్పటించీఁ దనకేమి వుండఁబట్టదా

చ. 2: కోక గట్టుకోఁగాఁ జూచి గొప్పలు నాచన్నులంటా
యీకడఁ జేతులు చాఁచీనేలే వీఁడు
దాకొన్న పలువరుస దంతములఁ బోలునంటా
చేకొని పొగడఁజొచ్చె చెల్లునా తనకు

చ. 3: ఆకు మడుచుకొఁగాను అట్టె గోళ్లు వాఁడెంటా
సాకిరి నా తన గోళ్ళు సరి వెట్టేనే
శ్రీకాంతనిదె నేను శ్రీవేంకటేశుఁడు దాను
యేకాలము నన్నుఁగూడె నేమందునే

రేకు: 0661-5 సాళంగం సంపుటం: 14-365

పల్లవి: అదె శ్రీవేంకటపతి అలిమేలు మంగయును
కదిసివున్నారు తమకమునఁ బెండ్లికిని

చ. 1: బాసికములు గట్టరో పై పై దంపతులకు
శేసపాలందియ్యరో చేతులకును
సూసకాల పేరటాండ్లు సోబానఁబాడరో
మోసపోక యిట్టే ముహూర్తమడుగరో

చ. 2: గక్కునను మంగళాష్టకములు చదువరో
తక్కక జేఁగట వేసి తప్పకుండాను
నిక్కి నిక్కి చూచేరదే నెరిఁ దెర దియ్యరో
వొక్కటైరి కొంగుముళ్లు వొనరఁగ వేయరో

చ. 3: కంకణదారములను కట్టరో యిద్దరికిని
సుంకులఁ బెండ్లిపీఁటఁ గూచుండఁ బెట్టరో
లంకె శ్రీవేంకటేశు నలమేల్మంగను దీవించి
అంకెలఁ బానుపుమీఁద నమరించరో

రేకు: 0661-6 దేసాళం సంపుటం: 14-366

పల్లవి: ఎట్టు దరించెనో యిందాఁకాను
దట్టమై యిప్పుడే తమకించీని

చ. 1: కన్నులకలికి కాఁకలు చల్లీ
మన్నన చూపుల మగనిపయి
వెన్నెల నవ్వులు వెదలువెట్టీ
పన్నినమోహాన బ్రాణేశుమీఁద

చ. 2: చిలుకలకొలికి చేతులు చాఁచీ
వెలయు సిగ్గుల విభునిపై
చలివేఁడివూర్పు సారెకుఁజల్లీ
కలిమి మెరసి కాంతునిమీఁద

చ. 3: అలిమేలుమంగ ఆయాలు మోపీ
యెలమి శ్రీవేంకటేశునిపై
నిలువున ముద్దు నేఁడే గునిసీ
యిలఁ దనపతి యీతనిఁ గూడి

రేకు: 0662-1 ఆహిరి సంపుటం: 14-367

పల్లవి: ఆఁకలెరఁగరు అప్పటినుండియు
తేఁకువ బోనాలు దెచ్చితిమిదివో

చ. 1: మచ్చిక చూపులు మంతనాలాడేరు
యిచ్చుటనే తామిద్దరును
హెచ్చి నిన్న మొన్ననేమి సేసిరొకో
పొచ్చపుచేఁతల పొద్దులువోయ

చ. 2: చనవు మెరసి సన్నలు సేసేరు
యెనసి లోలోనె యిద్దరును
మనసులిందాఁకా మరచి యెట్టుండిరొ
వినేసతులకు వేసటలాయ

చ. 3: నిండుఁగాఁగిటనె నివ్వెరగందేరు
యెండ నీడెరఁగక యిద్దరును
పండి శ్రీవెంకటపతి యలమేల్ మంగ
వుండనుండ భోగమొద్దికలాయ

రేకు: 0662-2 సామంతం సంపుటం: 14-368

పల్లవి: మలఘునినిన్న పెరుమాళ్ళు వీఁడే
వెలయ రాజసమున విఱ్ఱవీఁగీ వాఁడే

చ. 1: నాలినిద్దరు దేవుళ్ళ నడుమ నిలుచుండి
కైలాటాలు చల్లీనదె కనుఁగొనల
వేళ వేళఁ బొత్తులను విందులారగించుకొంటా
వాలి కొలువుండీఁ దిరువాముడి మంటపాన

చ. 2: ఆటలుఁ బాటలుఁ జూచి అంగరంగవైభవముల
నీటుతోడ సొమ్ములెల్లా నిండాఁ బెట్టుక
గాఁటపు పూదండలతోఁ గస్తూరినామములతో
మేఁటి సింహాసనముపై మించేరు కళల

చ. 3: తామెరకొలనువలెఁ దగఁ దిరుచేల చాతి
కోమలులిద్దరుఁ దాను కుచ్చుళ్ళువోసి
ప్రేమఁ గరకజడలు పిరిఁది దిండ్లు దీరిచి
కామించి నవ్వీ వాఁడే కల్యాణవేదికను

చ. 4: ముత్తేల చొల్లెపుచుట్టు ముంగురులపైఁ గప్పి
మెత్తిన గందపుఁబూఁత మేన నిండఁగా
హత్తిన పూవుదండలమర జల్లులలోనిఁ
కొత్తమేలుకట్లలోను గూచున్నాఁడు వీఁడె

చ. 5: కుడియడమకొప్పుల కుళ్ళాయి పాగచుంగుల
బెడిదపు దంపతులు పెండ్లిచవికెలో
అడరి శ్రీవేంకటేశుఁ డల మేలుమంగఁ దాను
పుడమిఁ గూడున్నవారు భోగపురతులను

రేకు: 0662-3 దేసాళం సంపుటం: 14-369

పల్లవి: కూడిన మీఁదను కోసరెలే
ఆడకు నిష్టూర మప్పటివలెను

చ. 1: నెలువుఁడదివొ నిన్నుఁ జేరి వేఁడుకొనె
వలపని జోలిఁక వద్దేలే
పలుకవె యిఁక నీపంతము దీరెను
అలుకలు చెల్లవు అప్పటివలెను

చ. 2: కాంతుఁడదివొ నిన్నుఁ గమ్మరఁ బిలిచీ
వంతులు వాసులు వద్దేలే
చెంతల నిలువవె చేఁతలు దక్కెను
అంత గొణఁగకువె అప్పటివలెను

చ. 3: శ్రీవేంకటపతి చేతులు చాఁచీ
వావులడుగలనిఁక వద్దేలే
ఆవటించితి ఆలమేల్ మంగవు
ఆవెరపేఁటికి అప్పటివలెను

రేకు: 0662-4 ముఖారి సంపుటం: 14-370

పల్లవి: మొదలనె యెరఁగవా మొగి నీపాటివాఁడు
చెదరి చింతించఁబోతే సిగ్గుగాదా నాకు

చ. 1: అలిగినవాఁడవు అట్టె వుండక నన్ను
పిలిచేవు చేయివట్టి పెనఁగేవు
యెలమినింతటివాఁడు యెంత దమకించీనంటా
చెలులెల్లనాడుకొంటే సిగ్గుగాదా నీకు

చ. 2: వొట్టువెట్టుకొన్నవాఁడవు వున్నతిఁ జెల్లించుకోక
పట్టేవు నాకొంగు పచ్చిదేరను
పట్టిలేక నీవాడిన పంతము దప్పినాడంటే
చిట్టికపు కాంతలలో సిగ్గుగాదా నీకు

చ. 3: ఆవలి మోమైనవాఁడ వలమేల్ మంగనంటా
శ్రీవెంకటేశ నన్నుఁ జేకొంటివిట్టే
భావమెరఁగక నిన్ను పరులెల్లా నవ్వితేను
సేవసేసేవారివద్ద సిగ్గుగాదా నీకు

రేకు: 0662-5 లలిత సంపుటం: 14-371

పల్లవి: ఏకతాన నేనింక నేమిసేసినాఁ జెల్లె
సాకిరివెట్టి నన్నిఁక సాదించఁగలదా

చ. 1: పీఁటమీఁదఁ గూచుండి పెనువేలనే మొక్కె
ఆఁటదాని గర్వమెంత అదె చూడరే
మాటలు నేనాడిన మగిడి చూడదు తాను
నీటు నాతో నిటువలె నిలుపంగఁ గలదా

చ. 2: మలగుపై నొరగుండి మారుమోముతో లేచె
చెలియ రాజసమెంత చేరిచూడరే
మలసి నే నవ్వినాను మచ్చికకు లోనుగాదు
చలము నాతోనింక సాదించఁగలదా

చ. 3: గందము పూయుచునుండి కాఁగిలించుకొనె నన్ను
యిందుముఖితమి యెంత యిదె చూడరే
అంది శ్రీవెంకటేశుఁడ నలమేలుమంగ తాను
పందెమాడి నన్నుఁ గూడె బడి వాయఁగలదా

రేకు: 0662-6 బౌళిరామక్రియ సంపుటం: 14-372

పల్లవి: ఊరకే మీరేలమ్మ వొద్దనాతని సాదించ
ఆరయ ముందెరఁగ నేనందరిశాంతములు

చ. 1: అమ్మరో మిమ్మింతమాట ఆడకుండఁగానే కాక
వుమ్మడి మీరోరిచేరా ఓసోసి నేఁడు
యెమ్మెల నాకుఁ గాఁగానే యింతేసి బుద్ధి చెప్పేరు
మిమ్ము సోఁకి వచ్చితేఁగా మీరాతనినందురు

చ. 2: చెనకి మిమ్మింత చేఁత సేయకుండఁగానే కాక
పనివడి యాతని వెంబడేరా మీరు
తనిసి నాకుఁ గాఁగానే తగవులు నెరపేరు
కనలి మీవరుసైతేఁగా పతినందురు

చ. 3: బలిమి మిమ్మింత యెడవాయకుండాఁగానే కాక
వలపు చల్లకుండేరా వానిపై మీరు
అలమేలుమంగ నేను ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డలరి కూడితిమి మిమ్మంటేఁగానందురు

రేకు: 0663-1 పాడి సంపుటం: 14-373

పల్లవి: పట్టిన చలమేకాక పంతమిచ్చేనా
తిట్టితేఁ దిట్టుదుఁగాక దీవించేనా

చ. 1: నన్నుఁ దానట్టే చూడఁగ నవ్వితేనేమాయ
విన్నకన్నచెలులాల వెంగెమా యిది
పిన్నదాననంటానే పిలిచి వాదుకు వచ్చి
యెన్ని చెప్పినాఁ దనకు యింక లోఁగేనా

చ. 2: వొడివట్టి తియ్యఁగాను వోపనంటేనేమాయ
కడనున్న సతులాల కానిదా యిది
బడలినవేళనే పట్టి పెనఁగవలెనా
వడఁబడుఁగాక తనవద్దకి వచ్చేనా

చ. 3: తావుకుఁ దా రాఁగాను తలవంచితేనేమాయ
వోవో పొరుగువార వొరటా యిది
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి తానె నన్నుఁగూడె
యీవల నలమేల్మంగ నెదురాడేనా

రేకు: 0663-2 సాళంగనాట సంపుటం: 14-374

పల్లవి: కడునేము చేతఁ జాలుకనివారము
తడవకు మమ్మునిట్టే దయఁజూడవయ్యా

చ. 1: చెక్కునొక్కినంతలో చేరి వాదుకు వచ్చేవు
యిక్కువ గోరు దాఁకితే నేమందువో
ముక్కుననుండుఁ గోపము ముంచి నీవంటివానికి
నిక్కిమాతో నవ్వరాకు నీవెన్నఁడునయ్యా

చ. 2: మోము చూచినంతలోనే మొక్కలానఁ గసరేవు
యేమని నిన్నుఁ దిట్టినా నెంతసేతువో
దీమసమింతలేదు తేరి నీవంటి వానికి
కామించి మమ్ముఁ బట్టకు కైదప్పులౌనయ్యా

చ. 3: దగ్గరికి వచ్చినంతలో తమకించి దూరేవు
యెగ్గులు నిన్నెంచితేను యేమందువో
నిగ్గులు శ్రీవేంకటేశ నేఁడే నన్నుఁ గూడితివి
అగ్గపుటలమేల్మంగ నదెంచుకోవయ్యా

రేకు: 0663-3 బౌళి సంపుటం: 14-375

పల్లవి: దొడ్డవాఁడు దొరకొంటే తుదిమొదలెరఁగఁడు
యెడ్డలము మాబోఁటి కిఁకనేఁటిదయ్యా

చ. 1: చెలులిద్దరిమీఁదను చేతులు చాఁచుకవుండి
యెలమి నాతో నవ్వేవిదేమయ్యా
వలపు సిగ్గెరఁగదు వడిననేమాటలు
యెలమి నీయందె కంటిమిఁక నేఁటిదయ్యా

చ. 2: మాటొక్కసతితోనాడి మనసొక్క కాంతకిచ్చి
యేఁటికి నాకు మోహించే విదేమయ్యా
పాటిలేనిది వయసు పట్టరాదనేటిమాట
యీాటునఁ జెల్లబెట్టితి వికనేఁటిదయ్యా

చ. 3: కౌఁగిటనిద్దరిఁ బట్టి కతలు నాకుఁ జెప్పేవు
యేఁగక శ్రీవేంకటేశ యిదేమయ్యా
కాఁగిన యలమేల్మంగఁ గనక నన్నుఁ గూడితి-
వేఁగుబెండ్లి నీకుఁ జెల్లె నింకనేఁటిదయ్యా

రేకు: 0663-4 కాంబోది సంపుటం: 14-376

పల్లవి: సతితోడ సారెసారెకు సరసములాడుకొంటా
తతితోడనారగించీ తగునె యీదేవుఁడు

చ. 1: ఒక్కమాటె వంటలెల్లా నొద్దనుండి వడ్డించి
మిక్కిలినలసె నలమేలుమంగ
చెక్కులఁ జెమటగారఁ జేరి యీపె వడ్డించఁగా
చొక్కి చొక్కి యారగించీఁ జూడరె యీదేవుఁడు

చ. 2: పాటి పాటి బంగారుపళ్ళెములు వెట్టించి
మీటి బుసకొట్టె నలమేలుమంగ
జాటిన తురుముతోడఁ జవులాకె యడుగఁగ
ఆటిడి గూరలు మెచ్చీనంతలో నీదేవుఁడు

చ. 3: వాలిన రాజసముతో వంటసాలలోననే
మేలిమిఁ గూచున్న దలమేలుమంగ
యీలోనె శ్రీవేంకటేశుఁడీపెఁ దానునారగించి
తాలమిఁ గాఁగిటఁగూడె దక్కక యీదేవుండు

రేకు: 0663-5 గౌళ సంపుటం: 14-377

పల్లవి: ఏమీననఁ జాలము యెట్లైనఁ జేయుము
నీమనసే వచ్చీఁగాక నేఁడే వేగిరమా

చ. 1: మన్ననగలుగువారి మాటలెల్లాఁ జక్కనే
వున్నవారి మాటలెల్ల నూసివాసులే
పన్ని మగఁడు చేపట్టి పాటించినదే యాఁటది
సన్నలెంత సేసినాను సంతవారు సతమా

చ. 2: చెల్లుబడిగలవారి చేఁతలెల్లా హితవే
చిల్లరవారి చేఁతలు చిరుచేఁదులే
బల్లిదునిచేతనుంటే పచ్చఁబూస మాణికమే
కల్లమాడ దొడ్డముద్ర కతకుఁ గాళ్ళున్నవా

చ. 3: యిచ్చయెఁరిగినచోటి యెమ్మెలెల్ల సమ్మతే
తచ్చనైనచోటిపొందు తడతాఁకులే
అచ్చపు శ్రీవేంకటేశ అలు మేలుమంగను నేఁ
నిచ్చగించి కూడితిరి యిఁక మోసమున్నదా

రేకు: 0663-6 హిందోళం సంపుటం: 14-378

పల్లవి: ఎందరులేరు నీకు నేనేమి బాఁతెయ్యా
అంది నాపైఁ జెయివేసేవు అట్టెకానీవయ్యా

చ. 1: అలిగి నేరాఁగానే అట్టె నావెంట విచ్చేసి
యెలమిఁ బైకొనేవు నేనేమి బాఁతెయ్యా
పలుకకకుండఁగ నన్నుఁ బచరించి పచరించి
యెలుఁగిచ్చి మాటాడేవెంత సేసేవయ్యా

చ. 2: ముసుఁగు వెట్టుకుండఁగ ముచ్చటతోఁ గొంగుదీసి
యిసుమంత నవ్వేవు నేనేమి బాఁతెయ్యా
విసుగుచునున్న నన్ను వేఁడుకొని నీవు నాకే
వసమై పాయవు ఇంతవలెనా నాకయ్యా

చ. 3: ఆదననేఁ బండుండఁగ నండ నీవూఁ బవళించి
యిదె కాఁగిలించేవు నేనేమి బాఁతెయ్యా
పుదుటు శ్రీవేంకటేశ వొగినలమేలుమంగఁ
నిదివో నన్ను గూడితి వెంతవాఁడవయ్యా

రేకు: 0664-1 భైరవి సంపుటం: 14-379

పల్లవి: ముచ్చటాడేనంటే ముంచేవు పరవశాలు
వచ్చిరాకతొల్లే వలెనా నీమాయలు

చ. 1: తమకాన నే నిన్ను దగ్గరి కూచుండితేను
కమలాన వేసి నన్నుఁ గరగించేవు
ప్రమదానఁ దొలుతనే బ్రమసినయాఁటదాని
తిమురు వలపుచల్లి దిమ్ము రేఁచవలెనా

చ. 2: మాటలాడేనంటా నీతో మనసై వచ్చివుండఁగా
నీటుననిప్పుడే మోవి నీవానేవు
ఆఁటదానియాస వేరే అంతరంగాననుండఁగా
తాఁటలఁ దూఁటలఁ బెట్టి తనియించవలెనా

చ. 3: ఆసపడి నీమోము అట్టె నేఁ జూడఁగానే
వేసానఁ గళ దాఁకించి వేగిరించితి
నీసరి సేసవెట్టితి నేనలమేల్మంగనిదె
రాసికి శ్రీవేంకటేశ రతులిన్నివలెనా

రేకు: 0664-2 కన్నడగౌళ సంపుటం: 14-380

పల్లవి: చెప్పఁబోతే నవ్వువచ్చీఁ జెల్లబో నాకు
తప్పులౌనో వొప్పులౌనో తడవఁగనోపనే

చ. 1: యెన్ని మారులు చెప్పెంపీ నేకతము గలదంటా
నిన్నటి మాటలే కా నేఁడాడేవి
తన్నుఁదానే యాడుకొని తనిసితి నన్నిటాను
విన్నదానఁ దొల్లే తనవిచారములెల్లను

చ. 2: గొడవ లడువఁగానే కొంగువట్టి తీసీని
వడిఁ దొల్లి తీసినవి వడ్డివారీని
నడుమ నడుమనేల నయములుఁ బ్రియములు
వడిఁబడు నిఁకమీఁద వలపు చల్లినను

చ. 3: కదిసి కదిసి నన్నుఁ గాఁగిటినె బిగియించి
మది గలిగీనింతే కా మంగళమిది
అదన శ్రీవెంకటేశుఁ డలమేలుమంగను న-
న్నుదుటను గూడెఁ దలఁపొక్కటాయనిపుడు

రేకు: 0664-3 సామవరాళి సంపుటం: 14-381

పల్లవి: ముందుముందె యింకనైన మోపపోకవయ్య నీవు
మందయాన వాసికోడీ మనసెరంగదా

చ. 1: సిగ్గుగలయా౦టది చేరఁ బిలువక యుంటే
యెగ్గులెంచక విభునినేల మానునే
దగ్గరి యంతలో వచ్చి తానెంత వేఁడుకొనిన
కగ్గినట్టి తనలోని కపటాలు మానునా

చ. 2: ననుపు గలుగుదాని నవ్వుతో మాటాడకున్న
యినుమడి గోపగించకేల మానును
వినయాలిప్పుడు వచ్చి వేవేలు సేసినాను
నినుపుల పెదవిపై నిష్టూరాలు మానునా

చ. 3: మరిగిన కాంతను మరఁగువెట్టేనంటే
యిరవై పైకొనుఁగాక యేల మానును
అరుదై శ్రీవెంకటేశ అతివఁ గూడితివిట్టె
సిరులంటుఁగాక సేసినమేలు దాఁగునా

రేకు: 0664-4 ఆహిరి సంపుటం: 14-382

పల్లవి: పాముకాటు చీరఁ దోమఁ బాసునా నేఁడు
యీమతక మెరఁగమా యేమయ్య విభుఁడా

చ. 1: చక్కని యింతి యొకతె సారెసారె నీమీఁద
మక్కళించీ వలపులు మాటలలోనే
చెక్కుచేత నెరఁగమి సేసుక నీవిందరిలో
యెక్కడో చూచి నవ్వేవు యేమయ్య విభుఁడా

చ. 2: కిమ్ములనుండి యాపె గిరుపుతాఁ గన్నులనే
చిమ్ముచు లోనికి సన్న సేయఁగాను
నెమ్మదినందరిలోన నిన్నుఁగానివానివలె
యెమ్మెతోఁ బరాకు సేసేవేమయ్య విభుఁడా

చ. 3: చలివాసి యాపె నీతో సరసములాడఁగాను
తలవంచి నీవేల దాఁగఁ జూచేవు
అలమేలు మంగను నేననుచు శ్రీవేంకటేశ
యెలమిఁ గూడితి వింకనేమయ్య విభుఁడా

రేకు: 0664-5 కేదారగౌళ సంపుటం: 14-383

పల్లవి: తనకే వేడుకగాక తగునా నాకు
నను(జూచి చెలులెల్ల నవ్వరా యిప్పుడు

చ. 1: చల్లనిచూపులు నాపై(జల్లిచల్లి కప్పురము
వొళ్ళు(బూసీనిదె వీ(డు వోపనన్నాను
పల్లదాన(దనచేతిబాదకు(జాలక కొ(ంగు
వల్లెవాటు వేసుకొంటే వద్దనీనే తాను

చ. 2: చేముట్టి సరసమాడి చిక్కుదీసి కొప్పునను
తామరలు ముడిచీని తలమన్నాను
యేమీననవెరచి నేనింటిలోనికి(బో(బోతే
ఆమేరకు(బోకుమంటా నానవెట్టీ(దాను

చ. 3: చెవిలోన మాటాడి చేతికి(గిన్నర యిచ్చి
నివిరి నాచెక్కు నొక్కీ నేరనన్నాను
అవునె శ్రీవేంకటేశు(డలమేలు మంగను న-
న్నివల(గూడి మెచ్చినెంతకెంతే వీ(డు

రేకు: 0664-6 నాదరామక్రియ సంపుటం: 14-384

పల్లవి: ఏమే నీచలము నేఁడెంత కెంతే
దీమసాన మొక్కఁగానే తిట్టుకొనేవు

చ. 1: పానుపుమీఁదనే వుండి పలికేవు నేఁడు
పేని పట్టాతడు నిన్నుఁ బిలువఁగాను
మోనాన వేసాలకు ములిగేవు యిట్టె
నానఁ బెట్టాతఁడు నీతో నవ్వు నవ్వఁగాను

చ. 2: నిండా ముసుఁగు వెట్టుక నిద్దిరించేవు ఆతఁ-
డండనే కూచుండి నిన్ను నలమఁగాను
వుండుండి చెలులఁ బిలిచే వొద్దికి నీవు
దండిగా నాతఁడు తానె తలుపు మూయఁగను

చ. 3: మరిగి మాటున యాకు మడి చిచ్చేవు
కరఁగి యాతఁడు నీ మొగము చూడఁగా
అరసి శ్రీవేంకటేశుఁ డలమేలమంగ నిన్నుఁ
గెరలి కూడినమీఁద గేలిసేసేవు

రేకు: 0665-1 శ్రీరాగం సంపుటం: 14-385

పల్లవి: ఎవ్వర మేమైతి మేమి యేలే తనకు
నవ్వుతా నుండీఁ దనకు నయ మిదే కాదా

చ. 1: చింతతో నుందాననంటాఁ జెక్కుచేయిడితినంటా
కొంత గొంత నన్ను నేల గోర సేసీనే
యింతులై నవారిఁ దెచ్చి యింత సేసితి వనేటి-
పంతము చెల్లెఁ దనకు ఫల మిదే చాలదా

చ. 2: వేడెము నేఁ జేయనంటా విచారాలే హెచ్చెనంటా
యీడ నాడ వారితోడ నేల చెప్పీనే
వూడిగము సేయఁగానే వొద్దఁ గూచుండు మనీని
వాడు దేరి తానుండితే వంతు మాకుఁ జెల్లునా

చ. 3: తలవంచుకొంటినంటా తాపాన నుందానవంటా
పలికించి నన్ను నేల బాద పెట్టీనే
యెలమి శ్రీవేంకటేశుఁడిట్టె తానె నన్నుఁ గూడెఁ
నలమేలుమంగను నే నదేమేలు గాదా

రేకు: 0665-2 దేసాక్షి సంపుటం: 14-386

పల్లవి: నమ్మినవారిపాలిటి నచ్చిన చింతామణి
నమ్మి వరాలిచ్చే విదే పదవేమి గడమా

చ. 1: పూచినతంగెడువంటి పాలిఁతి నీవురమునఁ
నేచినది నీసింగార మేమి చెప్పేది
కాచి పండినకల్పవృక్షమువలె నీమేను
చేచేత దొరకెనిదె సిరులేమి గడమా

చ. 2: అరచేతిమాణ్యిమై యాపె నీపొత్తున
యెరుక సే శారగించీ నేమి చెప్పేది
గురుతైన నీలాల కొండవలె నీవు నీవు
జరగుచు నున్నారు జయమేమి గడమా

చ. 3: ముంగిట నిధానమైన మోహపుటలమేల్మంగ
అంగమందే కొలువున్న దదివో నీకు
సంగతి శ్రీవేంకటేశ సరిఁ బరుసవేదివై
సంగడినున్నారు మాకు చనమేమి గడమా

రేకు: 0665-3 కన్నడగౌళ సంపుటం: 14-387

పల్లవి: తన్నుఁ బాసి వుండలేను తా నన్ను విడువలేఁడు
యిన్నియు నిందులో నున్న వెడ తాఁకనేలే

చ. 1: మాయలు నేఁజేయనేర మతకాలు నేనేర
చేయిచేత నూడిగాలు సేయనేరుతు
చాయల నాడవలదు సణఁగు లంత వలదు
సాయము దనకిచ్చితి పలుక లింకేలే

చ. 2: చలము సాదించఁ జాల జంకించ నేఁ జాల
పిలిచితే దగ్గరేటి ప్రియమే కాని
ములుగుచు నుండనోప ముంగోపాన కంత వోప
తలఁపెల్లఁ దనసొమ్మే తారుకాణ లేలే

చ. 3: నమ్మికడుగ వెరతు నాటకాలకు వెరతు
యిమ్ములఁ దనకు నే మోహించితి నిదే
అమ్మరో శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
సమ్మతించి నన్నుఁ గూడె సారెఁ జెప్పనేలే

రేకు: 0665-4 నాగవరాళి సంపుటం: 14-388

పల్లవి: ఇంచుకంత నే నేమన్నా నింతసేసేవు
వుంచపుకోవెల కూఁత కోరి చెట్టుంటివిరా

చ. 1: చెక్కు నొక్క రాఁగాను జీరవారెనో యేమో
యెక్కువ నొచ్చె ననేవు యేమాయరా
కక్కసించి మరుఁ డేసేగంటిలేనిపోట్లకు
తక్కక ఇందాఁక నెట్టు ధరియించితివిరా

చ. 2: తమ్మరస ముమియఁగ తప్పి నీపైఁబడె నేమో
యెమ్మెలకో కోపగించె వేమాయరా
యిమ్ముల నాచెలులాడే యెంగిలిమాటలకెల్ల
అమ్మరో నీవెట్లను అలుగ వైతివిరా

చ. 3: కొప్పు నీకుఁ బెట్టఁగాను కుచములు సోఁకె నేమో
ఇప్పుడే మైమరచే వేమాయరా
అప్పణ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
దప్పికి నీమో వానితి తాలిమి నెట్టుంటివో

రేకు: 0665-5 పాడి సంపుటం: 14-389

పల్లవి: ఇద్దరి నడిమిబాస లెవ్వరిఁ దాఁకునో యంటా
అద్ది చెక్కుఁచేయిడితి నందుకే వోయమ్మ

చ. 1: కంటే నొకమాటయుఁ గానకుంటే నొకమాటా-
నింటివాఁడై యాడేవాని కేది వాటో
నంటున నే నెంతైన నాకుఁగా పగవ నీ-
గొంటు చందమునకే గొదిలే నమ్మా

చ. 2: మంచముపై నొకకాలు మరినేల నొకకాలు
యెంచుకొంటా మోపేవాని కేది వాటో
అంచెల నావిరహాన కందుకేమీ ననఁ గాని
కొంచించేను వానిలోని కుచ్చితాన కమ్మా

చ. 3: కనుచూపులనే కొంత కాఁగిటి లోపలఁ గొంత
యెనసి చొక్కేవాని కేది వాటో
అనుఁగు శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
పనివడి యిందుకే కా బ్రమసితి నమ్మా

రేకు: 0665-6 లలిత సంపుటం: 14-390

పల్లవి: ఆపె నీకుఁ దగు నీవు నాపెకే తగుదు వయ్య
చేపట్టి మీ యిద్దరికిఁ జెప్పరాదు మోహము

చ. 1: తామెరరేకులవంటి తగునీకన్ను లనుచుఁ
దామెరలే చేతఁబట్టెఁ దరుణి
కామించి పాలజలధికడఁ బవ్వళింతు వని
కోమలి పాలజలధి కూతురాయ నదివో

చ. 2: బంగారు పచ్చడము నీపైఁ గప్పితి వంచు
బంగారుపతిమాయఁ బడఁతి
అంగవించె నీపాద మాకాశ మంటాను
అంగన తననడుము ఆకసముఁ బోలెను

చ. 3: కొండపై శ్రీవేంకటేశ కోరి నీ వెక్కితి వని
కొండవంటి నీవురము కొమ్మ యెక్కెను
అండనలమేలుమంగ ఆపె నీకుఁ గలుగఁగా
నండ నీదాసులకు నీ వాపె యూ గలిగితిరి

రేకు: 0666-1 శుద్ధవసంతం సంపుటం: 14-391

పల్లవి: మెల్లనె మెల్లనె వచ్చి మేర మీరేవు
చెల్లునంటా గొల్లెతలఁ జేకొంటివిగా వోరి

చ. 1: తొలుతనే నీవు నన్ను తొంగలిచూపులఁ జూచి
పలికిం చెప్పటిఁ జేయ పయి వేసేవు
బలువుఁడవు గనక పాయపువారి నిందరి
చెలఁగి కన్నెరికాలు చేకొంటివిగా వోరి

చ. 2: వచ్చి వచ్చి నవ్వు వవ్వి వలపులు నాకు రేఁచి
పచ్చిగాఁగ నాకొంగు పట్టఁ జూచేవు
హెచ్చి వువ్విాఁడవుగన యెఱఁగని వారిని
చెచ్చెర లోనుసేయక చేకొంటివిగా వోరి

చ. 3: పెరరేఁచి నామీఁదఁ బ్రియములు చల్లి చల్లి
కరఁగించి నన్నుఁగూడి కాఁగిలించితి
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
సిరుల నందరి నిట్టె చేకొంటివిగా వోరీ

రేకు: 0666-2 మాళవిగౌళ సంపుటం: 14-392

పల్లవి: చొల్లెపుఁజుట్లతోడి చుంగులరాజసముతో
వెల్లవిరిగా నేఁగేరు వీడెపుమోవులను

చ. 1: అంగనకుఁ దనపాదా లంకవన్నెలు సేసుక
రంగుగాఁ దొడఁదొడయు రాయఁగాను
సింగారపు సొమ్ములతో చెంగావి ముఁసుగుతోడ-
నంగవించీ యాపె దన కాసలు రేఁచఁగను

చ. 2: కదలు కదలుకును కాంత వాలారుగోళ్ళ
నదిమి యదిమి తన్ను నంటఁబట్టఁగ
ముదిత యాకు మడిచి మోవినె అందీయఁగాను
మదనపరవశాన మలసీని వీఁడిదివో

చ. 3: కలకలనవ్వులతోడ కస్తూరి నామముతోడ
అలమేలుమంగ దన్ను నట్టే మెచ్చఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డేతులు నెరపుతాను
బలిమి నంకుశమునఁ బట్టి వొత్తీనదివో

రేకు: 0666-3 నాట సంపుటం: 14-393

పల్లవి: నీవెంత దాఁచిన నవి నేఁడు దాఁగీనా
చేవదేరిఁ దొల్లిటట్టే సేయరాదా పనులు

చ. 1: వనిత నిన్నుఁ బిలిచి వలపులు చల్లఁగాను
నినుఁ గానివానివలె నిలుచున్నాఁడవు యీడ
యెనసి నే నెరిఁగితే నిఁక నేల నీకుఁ గొంక
చెనకి వెల్లవిరిగాఁ జేయరాదా పనులు

చ. 2: తమకించు యాకె నిన్ను దగ్గరి చే వట్టఁగాను
భ్రమసిన వానివలెఁ బరాకు సేసుకొనేవు
అమరఁగ నేనా కంటి నడ్డము లేదిఁక మేను
చెమరించ నేల మీరి సేయరాదా పనులు

చ. 3: ఇంతి నీవు లోనఁ గూడి యిట్టె నన్నుఁ గనివచ్చి
వంతుకు నాకాఁగిటిలో వాడుదేరేవు
అంతటి శ్రీవేంకటేశ యలమేలుమంగ నేను
చింతదీరఁ గూడితిమి సేయరాదా పనులు

రేకు: 0666-4 గుండక్రియ సంపుటం: 14-394

పల్లవి: ఎప్పుడు నీవోజ లివి యేల మానేవు
ముప్పిరి నీచేఁత లిట్టే మూసి దాఁచవలెనా

చ. 1: చేయి మాటు సేసుక యాచెలి దిక్కే చూచేవు
యీయెడఁ గొలువుకాంత లిందరిలోన
ఆయాలు దాఁక సందడి నాకెపాదాలే తొక్కేవు
మాయకాఁడ ఇంతేసి నీమతక మెరఁగమా

చ. 2: అద్దలించేవానివలె నాపెతోనే పలికేవు
వొద్దికై నసతులెల్ల వొద్ద నుండఁగా
బద్దుల బడలికతోఁ బట్టే వాపెకైదండ
కద్దులేరా నీవొళ్ళికపటా లెరఁగనా

చ. 3: యెగసక్కేనివలెనే యీపెతోనే నవ్వేవు
సొగసి తోడిసతులు చూడఁగానే
అగపడి కూడితివి అలమేలుమంగ నేను
తగు శ్రీవేంకటేశ నీ తమక మెరఁగనా

రేకు: 0666-5 ముఖారి సంపుటం: 14-395

పల్లవి: ఉండనీరా యీపాటి వూరకే నన్ను
కొండెగోడి తనాలకుఁ గోపమెల్లా వచ్చును

చ. 1: చుట్టమవౌతా నెరఁగ సూడు బంటవో యెరఁగ
అట్టె నాతో నాపెసుద్దు లాడుకొనేవు
ముట్టి ముట్టి నేము నీతో ముచ్చటలు చెప్పుకొఁగా
యెట్టు వచ్చునో యెరఁగ మేమీ ననవొల్లము

చ. 2: నగవౌతా నెరఁగము నాటకమో యెరఁగము
తగవు నన్నడిగే వాతరుణిమాట
నిగిడి పోపో చాలు నిన్ను నెవ్వఁ డెరుఁగును
యెగసక్కెఁడవు తొల్లే యేమీ ననసోపము

చ. 3: నెపమౌతా నెరఁగము నెయ్యమౌతా నెరఁగము
ఇపుడు వచ్చితిరి మాయింటికి మీరు
అపడె శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చపలతఁ గూడితి సాదించ నే నోపను

రేకు: 0666-6 సామంతం సంపుటం: 14-396

పల్లవి: పువ్వుఁబోణులకొలువే పుష్పయాగము
పువ్వక వూచె నీకిట్టే పుష్పయాగము

చ. 1: కలువరేకులవంటి ఘనమైన కన్నుల
పొలఁతులచూపులే నీ పుష్పయాగము
తలఁచి తలఁచి నిన్నుఁ దమమేనులఁ బొడమే
పులక జొంపములే నీ పుష్పయాగము

చ. 2: కరకమలములను కందువ గోపికలెల్లా
పొరసి నిన్నుఁ జూపుటే పుష్పయాగము
సరసపుమాటలే సారె నాడి తమ నవ్వు
పొరి నీపైఁ జల్లుటే పుష్పయాగము

చ. 3: గాఁటపుఁగొలనిదండఁ గాంతలు సిగ్గున నిన్ను
బూటకానకుఁ దిట్టుటే పుష్పయాగము
యీటువ శ్రీవేంకటేశ యిట్టె యలమేలుమంగ
పూఁట పూట రతు లివి పుష్పయాగము

రేకు: 0667-1 ధన్నాశి సంపుటం: 14-397

పల్లవి: చెప్పరా నీకు నాతోడు సిగ్గు లింకేల
రెప్పల తుదల నేఁడు రిచ్చవడి వున్నది

చ. 1: యెవ్వతికో మేలువాడ విటు నీవు గాఁబోలు
అవ్వల నీచేయి వెచ్చనై వున్నది
దవ్వుల నున్నయాకెఁ దలఁపునఁ బారఁబోలు
పువ్వువంటిమోపు చిన్నఁబోయి వున్నది

చ. 2: యిక్కువ చెప్పెంపి యాకె యీసుద్దికి రాఁబోలు
చెక్కుచేతితో నీకు చింత వున్నది
దక్కి ఈపెవలపు నీ తలకెక్కి వుండఁబోలు
పిక్కటిల్లి మాటల తబ్బిబ్బులై వున్నది

చ. 3: తొయ్యలి గొన్న బాసలు తోయరాకుండఁగఁ బోలు
కొయ్యతనాలకు మతిఁ గొంకి వున్నది
నెయ్యపు శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యియ్యెడ నన్నుఁగూడితి వెందు నాపె వున్నది

రేకు: 0667-2 మాళవశ్రీ సంపుటం: 14-398

పల్లవి: నీతలఁ పెట్టున్నదో నే మెరఁగము
రాతిరెల్ల నేము జాగరములే సేసితిమి

చ. 1: చింతదీర నీతోడ చేరి మాటాడిన దాఁకా
కాంతకుఁ దనలోని కాఁక మానదు
మంతనాన తానే నీ మనసు దెలియుదాఁకా
యింతట నంతటినుండి యెదురు చూచీని

చ. 2: దగ్గరి కూచుండి నీతోఁ దగిలి నవ్వినదాఁకా
అగ్గమైన తన ఆస దీరదు
సిగ్గుదీర నీకుఁ దానే సేవసేసేనంటే
వొగ్గి నీవొద్దికిఁ దనవువిదల నంపెను

చ. 3: గక్కన నీమోముఁ దనకన్నులఁ జూచినదాఁకా
మొక్కలపుఁ దనలోని ముచ్చట వోదు
యిక్కు వెరిఁగి శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి
వెక్కసపునంతసాల విఱ్ఱవీఁగీ నిదివో

రేకు: 0667-3 కన్నడగౌళ సంపుటం: 14-399

పల్లవి: ఎట్టుసేసినా నీకు నెదురాడేనా
మట్టునఁ జెప్ప ననేటిమాట కింతేకాక

చ. 1: చెప్పవలశొకమాట చెప్పితి నింతెకాక
నెప్పున నా ఆయమెంత నే నెంత
యిప్పుడు నీసతినై యిట్టుండఁగఁ జూచినవాఁ
రుప్పటించే రనేమాట కొక్కటికె కాక

చ. 2: సారిది నామేనికాఁక చూపితి నింతెకాక
నిరతి నాయలుకెంత నే నెంత
దొరవు నీవు చేపట్టి తుదఁ జింతించీ ననేటి-
పరులమాటలకు నేఁ బడఁ జాలఁ గాక

చ. 3: చెలఁగి నీమనసు రాఁజేరి నేఁ గూడితిఁ గాక
నిలువు నావలపెంత నే నెంత
నెలవై శ్రీవేంకటేశ నీవు మన్నించిన నేను
బలవంతురాలననే పంతానకె కాక

రేకు: 0667-4 రామక్రియ సంపుటం: 14-400

పల్లవి: తతిఁ దానె దొరయ్యైతే తనంత బదుకుఁగాక
సతులము మమ్మునేల జంకించీనే తాను

చ. 1: పాయపువిభుఁడు కొంగు వట్టితే రానై తినంటా
చాయల సన్నలఁ దిట్టీ సారెసారెకు
మాయంతనే అప్పటిని మాటలాడ మైతిమంటా
రాయడించీ నూరకైనా రాజసమా తాను

చ. 2: ననిచి తా దగ్గరితే నవ్వనైతి నంటాను
కనుఁగొనల గోపించీఁ గడకూఁ దాను
మునుపనే తనకు నే మొక్కనైతి నంటాను
యెనలేక పగ చాటీ నేతులా తాను

చ. 3: చెక్కు నొక్కి కూడఁగాను సిగ్గుతో నే నుంటినంటా
మిక్కిలి బుజ్జగించీని మీఁద మీఁదను
యిక్కడ శ్రీవేంకటేశుఁ డిచ్చెరిఁగి నన్నుఁ గూడె
దక్కితి నంటాఁ బొగడీ తగవా తాను

రేకు: 0667-5 మంగళకౌశిక సంపుటం: 14-401

పల్లవి: ఎందాఁకా నీ సరసాలు యింత గలదా
కందువ నలపుదీరఁ గరుణించరాదా

చ. 1: చెక్కులెల్లఁ జెమరించె చేరి నీవు నవ్వించఁగా
వొక్కమాటే యింతైతే వోపునా చెలి
కక్కసించే వెంత నీవు కఠినచిత్తుఁడవో
నిక్కి మాకైతేఁ జూచి నీరాయ మనసు

చ. 2: ఆరగించ నెరఁగదు అట్టె కతలు చెప్పఁగా-
నీరీతి దినమునైతే యింతి వోపునా
దూరినా మానవు యెంత దోసానకు వెరవవో
సారె మాకైతేఁ జూచి జడిసీని దనువు

చ. 3: కడుదప్పి గొనె నిదె కాగిఁట నీవు గూడఁగ
కడగి పాయపుసతి కాఁక కోపునా
అడరి శ్రీవేంకటేశ ఆడికె కెంతోపుదువో
బడినున్న మాకైతేఁ బచ్చి దోఁచెఁబనులు

రేకు: 0667-6 గుండక్రియ సంపుటం: 14-402

పల్లవి: ఏల నన్ను వేడుకొనే వేమి బాఁతి నేను
ఆలి మగని వరుసలంత నాకుఁ జాలదా

చ. 1: సారె సారె నీమీఁద సణఁగులే చల్లితిని
మేరలు మీరి నవ్వితి మేనవావిని
యీరీతి నా యాడుజన్మ మింత దూరు గట్టె నాకు
చేరి నీ మొగము చూడ సిగ్గు గాదా నాకు

చ. 2: కన్నులనే తిట్టితిని కాఁకలనే జంకించితి
మిన్నక కొసరితిని మేనవావిని
నన్ను నింతేసి సేసెను నా జవ్వనమదము
అన్నిటా నీతో నాకు నప్పటి నామాటలు

చ. 3: కలసినరతివేళఁ గాలు చేయి దాకించితి
మెలఁగి మోవెంగిలంటె మేనవావిని
యెలమి శ్రీవేంకటేశ యింత సేసె నాపొందు
పిలిచి మొక్కుట గాక బిగియఁ జోటేది

రేకు: 0668-1 గుజ్జరి సంపుటం: 14-403

పల్లవి: దేవుఁడవుగా ఆపె దేవులు నీకై నాఁగాని
చేవదేరిన బుద్దులు చెప్పితి మోయయ్యా

చ. 1: కాంత గోపించి చూచితే కామునియమ్ములై తాఁకు
సంతసించి చూచితేనే చకోరాలౌను
శాంతుఁడవు నీవెట్టు సాము సేసే వీపెతోడ
పంతము లాడక కిందుపడి వుండవయ్యా

చ. 2: చెలి నిన్నుఁ దిట్టితేనే చిరు చెండులై తోఁచుఁ
నిల నిన్నుఁ బొగడితే నివె తేనెలౌ
చలపట్టి నీవెట్టు సరిదూఁగే వాపెతోడ
యెలమి యేప్రొద్దు నీవు ఇచ్చలాడవయ్యా

చ. 3: వనితకాఁగిలి నీకు వలపులవలలౌను
తనిసి చేపట్టితేనే తమ్మి పూజలౌ
యెనసి శ్రీవేంకటేశ యాపెతో నెట్టు మీ రేపు
మొనసి కూడితి విట్టె మొక్కు మొక్కవయ్యా

రేకు: 0668-2 లలిత సంపుటం: 14-404

పల్లవి: మొక్కే నిదివో నీకు ముందు ముందే వట్టి-
లెక్కలెల్లా నెంచుకోక లేవరాదా

చ. 1: పలుకులెల్లా వింటి భావములెల్లాఁ గంటి
చలము నాలోఁదీరదు సటలేలా
నిలుచున్నాఁడ విదివో నీవు వచ్చి తడవాయ
పొలసి యెందు వోయేవో పోయి రారాదా

చ. 2: మనసెల్లాఁ దెలిసితి మంతనాలఁ దనిసితి
నిను నేమీ ననఁజాల నెగు లేలా
పనులు నీకుఁ గలవు పడఁతులు విలిచేరు
నను పెక్కడ నున్నదో నవ్వి రారాదా

చ. 3: కాయమెల్లా నొరసితి కాఁగిటను గలసితి
పాయపు శ్రీవేంకటేశ బాస లింకేల
నాయము నీ వెరుఁగుదు నాకు సరి గలరేమో
ఆయెడ నెవ్వరినైనా నడిగి రారాదా

రేకు: 0668-3 బౌళి సంపుటం: 14-405

పల్లవి: వేళ రానీ మీకు నిట్టే వేగిర మేలే
కూళఁ గాను మీరింతలోఁ గొండెము చెప్పకురే

చ. 1: ఆత డెంత సేసినాను అట్టె వోరుచుక వుంటే
నాతోడి చెలులే నన్ను నవ్వేరే
చేతఁగానిదానఁ గాను చెలువుని సరితలు
చూతమంటా నున్నదాన సుద్దులు చెప్పకురే

చ. 2: వివరించి రమణుని వేసాలు దెలుసుకొంటే
సవతులుమీలో నేల సన్న సేసేరే
తివిరేటిదానఁ గాను దిట్టతన మితనిది
జవకట్టే నింతే మీకు జాణతనా లేలే

చ. 3: కొచ్చి శ్రీవేంకటేశుఁడు కూడఁగా నేఁ బైకొంటే
ముచ్చటగా సతులేల మోము చూచేరే
పచ్చి సేసేదానఁ గాను బలువుఁ డాతనిమేలు
కచ్చు పెట్టుకున్న దాన కాఁక రేఁచ నేలే

రేకు: 0668-4 కురంజి సంపుటం: 14-406

పల్లవి: నీవల్లనే వచ్చెఁ గాక నేఁ డింతేసిపనులు
పూవువలె నూరకుంటే పోరువెట్ట వచ్చేనా

చ. 1: యియ్యరాని మాట నాకు నిచ్చితివి గనక నీఁ
వెయ్యడ నుంటివనంటి నిందాఁకాను
అయ్యయ్యో నీయిచ్చ నీవు అట్టే వుండితేఁ గనక
కయ్య మడువఁగ నీతోఁ గారణము గలదా

చ. 2: అక్కడ నెవ్వతె నొల్ల ననుకొందువు గనక
చెక్కు రేక లేడవని చెప్పితి నింతే
చక్కని కొయ్యతనాల సహజాన నీవుంటే
కక్కసించి రట్టు సేయఁ గారణము గలదా

చ. 3: ముందే నాపై మోహము మోపు గట్టుదువు గాన
చెంది వేరొకతె పొందు సేయనీనైతి
కందువ శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
కందు గుందు నిఁకనేల కారణము గలదా

రేకు: 0668-5 భైరవి సంపుటం: 14-407

పల్లవి: ఇన్నిటికి నిన్నడిగే దిదే యయ్యా
యెన్నికలు మాకు దాఁచ నీక నేఁటికయ్యా

చ. 1: వనితల నంపఁగాను వత్తువో రావో యంటా
నినుఁ బిలువఁగ నేఁడు నేనే వచ్చితి
కనుసన్నలనే కాని కడుఁ దమకించరాదు
మనసులోపలిమాట మాకుఁ జెప్పవయ్యా

చ. 2: ఆకులు వాశంపఁగాను అనుమానింతువో యంటా
చేకొని నేనే విన్నవించితి నింతాను
వాకు ప్రియమే కాని వడిఁ గొపించఁగ రాదు
యేకొలఁది నీమోహ మెరిఁగించవయ్యా

చ. 3: కానుక లిచ్చి యంపగా కందువో కానవో యంటా
ఆనుక నే నిలుచుంటి నాయాలు సోక
నేను సేసినభాగ్యాన నీవె నన్నుఁ గూడితివి
కానిలే శ్రీవేంకటేశ కరుణించవయ్యా

రేకు: 0668-6 రామక్రియ సంపుటం: 14-408

పల్లవి: తలచిన పనులెల్లఁ దలకూడెను
తలిరిఁ బోడికి నీకుఁ దగునయ్యా

చ. 1: వింతగా చెలినవ్వులే వెన్నెల బాయలు నీకు
పొంత నధరామృతమే పులుఁగాలు
దొంతివెట్టి వలపులు తోడఁ దొడ నీ కెదురు
చింతతోఁ జూడఁ దొడఁగె చేకొనవయ్యా

చ. 2: చిక్కని జవ్వన మిదె సింగారపుఁదోఁట నీకు
పుక్కిటివీడేలు వనభోజనాలు
మక్కువఁ బానుపుమీఁది మాటలప్రియాలతోనే
యెక్కువ విందులు చెప్పి నియ్యకొనవయ్యా

చ. 3: యాపెకాఁగిలే నీకు నెసఁగఁ బెండ్లిచవికె
పూపఁబలుకుఁ దేనెలే బువ్వాలు
యేపొద్దు శ్రీవేంకటేశ యెనసి రతుల నిన్ను
తీపులు పుట్టించె నన్నీఁ దెలుసుకోవయ్యా

రేకు: 0669-1 ముఖారి సంపుటం: 14-409

పల్లవి: నీవే యెరుఁగుదువు నీగుణము కొలఁదులు
చేవదేర నెందరినిఁ జేసితివో యిట్లా

చ. 1: కప్పురపు మాటలనే కరఁగించి యిందాఁకానీ-
నొప్పి దీరిచితివౌరా నొడలఁ బెట్టి
రెప్పలచూపుల రేసు రేఁచి యేఁచే నంటా వుంటి
యిప్పుడేమీ ననఁజాల యేఁటిదో నీమాయ

చ. 2: ఆసలచూపులు చూచి అట్టె నన్ను బ్రమయించి
సేసిన నీచేఁతలెల్లాఁ జెల్లించు కొంటి
యీసుల నిందాఁక నుంటి యింతలోనే నిన్నుఁగని
మూసినముత్యమనైతి ముందరేదో కానీ

చ. 3: కనుమాయ రతి సేసి కాఁగిటనె నన్నుఁ గూడి
మొనసి నీమేలు నాపై మూఁట గట్టితి
ఘనుఁడ శ్రీవేంకటేశ కడుఁదమకించి వుంటి
తనిసితి నన్నిటాను దట్టమాయ వలపు

రేకు: 0669-2 వేళావళి సంపుటం: 14-410

పల్లవి: ఏమయ్య నీసతినఁట యింత వలెనా నాకు
నేమము దప్పకు నేఁడు నీకు నే వెగ్గళమా

చ. 1: చెప్పినట్టి నీమాట చెవియొగ్గి వింటినిదె
యిప్పుడే నన్నుఁ దీయకు మింటిలోనికి
ముప్పిరిఁ గస్తూరిబొట్టు ముంజేతుల నంటుదాఁకా
అప్పటి మొక్కకు నీకు నడ్డము లాడేనా

చ. 2: సారిది నీవిచ్చినట్టి సొమ్ములెల్లాఁ బెట్టుకొంటి
పోరిఁ జెంపల గందాలు పుయ్యకు నాకు
శిరసు విడినదాఁకా చెక్కు చెమరించుదాఁకా
సరివెనఁగకు నీతో చలము సేసేనా

చ. 3: వలపులు రేఁచఁ గాని వద్దనే కూచున్నదాన
తలుపు ముయ్యకు రతితమకానను
యెలమి శ్రీవేంకటేశ యిట్టె కూడితి విందాఁకఁ
కొలదిఁ మీరితివి నాగుణము మానేనా

రేకు: 0669-3 రామక్రియ సంపుటం: 14-411

పల్లవి: ఏఁటికి నాతని దూరే రేమమ్మ
మాటలాడి నప్పుడే సమ్మతి గదవమ్మా

చ. 1: యెనసి ఆతఁడు నేఁ డెందుండి వచ్చినాను నీ-
కనుచూపులకు లోను గదవమ్మ
వెనక కాతఁడు యేవెలఁదింట నుండినా నీ-
మనసునకు నడ్డమా మరి యాతఁడమ్మా

చ. 2: యేమగువతో సరసమెంతాడి వచ్చినాను
కామించిన నీమగఁడు గదవమ్మ
వేమరు నెవ్వరియింట విందారగించినాను
వోముచు నిద్దరిమేను లొక్కటే కదవమ్మా

చ. 3: చేఁగదేర నాతఁడెంతచేఁత సేసి వచ్చినాను
కాఁగిట నాతఁడు గూడెఁ గదవమ్మా
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁ డిట్టె వున్న వాఁడు
దాఁగక ని న్నురమున ధరించెఁ గదవమ్మా

రేకు: 0669-4 బౌళి సంపుటం: 14-412

పల్లవి: రాజసమే ఘనమాయ రాఁగా రాఁగా
వోజ దప్పవచ్చునా నీ వువిదల యెడకు

చ. 1: చెక్కుల చెమట గారె సేసకొప్పు వెడ జారె
వెక్కసాన యింతిని నవ్వించఁగాను
లక్కవలెఁ గరగె యీలాగు చూచి నామనసు
క్కకసీఁడ వయితివిగా కాంతల యెడకు-

చ. 2: కాయమెల్లాఁ బులకించె గడు నివ్వెరగు ముంచె
చేయి చేయిఁ బట్టి చెలి చెనకఁగాను
యీ యతివఁ జూచి నీపై నెంతైనాఁ గోపము వచ్చె
మాయదారి వైతివిగా మగువల యెడకు

చ. 3: కన్నులకుఁ గెంపలెక్కె కాంత నీపాలిటఁ జిక్కె
వున్నతిఁ గాఁగిటఁ గూడి వుండఁగాను
మన్నన శ్రీవేంకటేశ మాకు నొక్క మనసాయ
అన్నిట జాణవైతిగా అతివల యెడకు

రేకు: 0669-5 సామంతం సంపుటం: 14-413

పల్లవి: మలసి వాదు లడువ మాకేఁటికే
యిలయెల్లాఁ దా నేలితే నింకా బతుకనీవే

చ. 1: పంతమాడ నోపము బలువుని తోడను మా-
యంతనుండఁగా నైనపాటదె చాలదా
యెంత లేదు తనబీరా లెవ్వరు నెరఁగరా
అంతటి వాఁడౌఁగాక అట్టె బతుకనీవే

చ. 2: చలపట్ట నోపము సారెకు దొరలతోడ
కలపాటి రాజసము గైకొ నుండేము
వలవనిసటలేల వారి వీరి తోడను
నెలకొన్న జాణఁడైతే నిక్కి బతకనీవే

చ. 3: చేరి నవ్వ నోపము శ్రీవేంకటేశ్వరుతోడ
కూరిమితోఁ దాఁ గూడినకూటమే చాలు
యీరీతి వినయములు యెవ్వరి ముందరఁ జేసీ
వేరు లేదు తా నేను వెస బతుక నీవే

రేకు: 0669-6 శంకరాభరణం సంపుటం: 14-414

పల్లవి: మించి నాచేఁతకు నన్నే మెచ్చుట గాక
కొంచెపడి చెలులను గొసర నేల

చ. 1: యీకడ నీవలుపే యింత యారడిఁ బెట్టఁగ
చేకొని వుండుట గాక చింతలేలా
నీకపటాలతోడనే నీవు వద్దనుండఁగాను
చీకాకుగాఁ బరులకుఁ జెప్పనేలా

చ. 2: మనలో కాఁతాళమే మమ్మునింత సేయఁగాను
అనుభవించుట గాక అడ్డమేలా
చెనకినవాఁడవే చెక్కు నొక్కి వేఁడుకొఁగా
యెనయుట గాక మాటలింకానేలా

చ. 3: వేడుక నారతులే నీవెంట వెంటఁ దిప్పఁగాను
యీడుతో నవ్వుట గాక ఇంతేసి యేలా
కూడితివి నన్నుఁ నేఁడు గొబ్బున శ్రీవేంకటేశ
జోడయితి మిద్దరము సొలయనేలా

రేకు: 0670-1 పాడి సంపుటం: 14-415

పల్లవి: నిన్నుఁ జూచి నవ్వఁగానే నిష్ఠూర మేలే
వన్నెల నతని మెచ్చవద్దా నీవు

చ. 1: కూడిన మీఁదట నేలే గొణఁగు ఆతఁ-
డీడనే వున్నాఁడు యింకా నేలే సణఁగు
వీడెము నిన్నడిగీని వెస నీపేరు నుడిగీ
వాడుదేరిచి కలయవద్దా నీవు

చ. 2: ఇద్దరుఁ గూచుండి యేలె యెరవు- నేఁడు
బద్దులేనివాని కేలే పయి తరవు
బుద్ధి చెప్పి చెక్కు నొక్కి పూఁచి నీకుఁ జేత మొక్కీ
వద్దు వద్దని పలుకవద్దా నీవు

చ. 3: పరుపుమీఁదనే యాలే పగటు - నీ
విరవై శ్రీవేంకటేశు కేలే వెగటు
అరుదై యలమేల్మంగ వటు నీవు గూడితివి
వరుస లిట్టే నెరపవద్దా నీవు

రేకు: 0670-2 నాదరామక్రియ సంపుటం: 14-416

పల్లవి: కపటా లూరకే మాతో కప్పేపు నే మెరఁగమా
యిపు డాకె నీవొద్ద నిట్టే వుండదా

చ. 1: ముంగిట నాతోడ నీవు మొరగులాడేవు గాక
అంగన నీవును గూడి ఆడ నుండరా
సంగతి నాతోనే ఆచారములు నెరుపేవు
యెంగిలి నీమోవి అంట కిట్టే వుండేనా

చ. 2: చలపట్టి నేఁడే నాకు చన విచ్చితివి గాక
నలిరేఁగి యిందాఁకా నవ్వు చుండరా
అలిగె నంటా నన్ను నానలు వెట్టేవు గాక
తలుపు మాటు చెలి తానే కాదా

చ. 3: కాయము నాపై వేసి కాఁగిటఁ గూడితి గాక
పాయక యీపెయు నీవుఁ బవ్వళించరా
యీయెడ శ్రీవేంకటేశ యిటు నాకె దక్కితివి
చాయల నాపెయు నీకు సతమే కాదా

రేకు: 0670-3 శంకరాభరణం సంపుటం: 14-417

పల్లవి: మంచి తనాలకే లోను మరి సటలకుఁ గాము
వుంచవు నీ జంకెనల వొరయకు మమ్మును

చ. 1: చిగురువంటి వారు చెలులు - యింత
వొగరు వలపులకు నోపుదురా
మగవాఁడు రాతివంటి మనసువాఁడు - యీ
తగవు నీ వెరఁగవా తడవకు మమ్మును

చ. 2: నిండి తొలఁకనివారు నెలఁతలు - యింత
చండి సరసములకుఁ జాలుదురా
రండు నాడేటివారు రమణులు
అండ నీవే కనుకొనే వడుగకు మమ్మును

చ. 3: కప్పురము వంటివారలు కాంతలు - వట్టి
దప్పి విరహములకుఁ దగుదురా
తెప్పల శ్రీవేంకటేశ దేవుఁడవు - నేఁడు
కప్పుకొని కూడితివి కరుణించు మమ్మును

రేకు: 0670-4 లలిత సంపుటం: 14-418

పల్లవి: బాపు బాపు నీమేలు పక్కన నన్నంటుకొనె
కైపగుపుణుఁగు పువ్వు గట్టినట్టే ఆయను

చ. 1: పనిలేని పనికైనఁ బదరి కోపగింతు
వెనకనే నీవు నన్ను వేడుకొందువు
తలవోని నీమంచితనమె నావీరిడి-
తనమెల్లఁ బాపి లోలో తమి నాకు రేఁచెను

చ. 2: యెప్పుడు నే నాడేవి యీసడపు పలుకులే
కప్పురపు నవ్వు నీవే కలపుదువు
యిప్పటి నానేరమికే యింతేసి నీ నేరుపులు
చొప్పు మాపి నిన్ను నన్ను చుట్టాలఁగా జేసెను

చ. 3: చీటికి మాటికి నీతో సిగ్గులు నేఁ బచరింతు
కూటపుఁ గాఁగిట నీవే కూడుదువు
యీటున శ్రీవేంకటేశ యిప్పటి నీరతులే
వోటమి దీర నన్ను నీ పుర మెక్కఁజేసెను

రేకు: 0670-5 ముఖారి సంపుటం: 14-419

పల్లవి: చేసినవారికి సేఁత చేతనఁ బెట్టుగాదా
యీసున నిన్నుఁ జూచేను యెందువొయ్యే విఁకను

చ. 1: చెలఁగి నామోము చూచి సెలవినే నవ్వేవు నే
వలచి నీవెంట వెంట వచ్చే నంటానా
యిల నాకొలఁదివారా యేమి సేయ వచ్చు నీకుఁ
గలిగీలే యీఫలము కడచెనా వయసు

చ. 2: కూరిమి నూరకుండఁగా గోరికొన నూఁదేవు
చేరి నినుఁ జూచి బ్రమసితి నంటానా
యీరీతివారిలోన నెవ్వరిఁ బోలుదు నేను
చేరీలే నీకీపుణ్యము చిత్తగించే వికను

చ. 3: మిక్కిలి కాఁగిట నన్ను మితిమీరఁ గూడితివి
తెక్కుల నాతని వెందుఁ దీరదంటానా
ఇక్కడ శ్రీవేంకటేశ యిటు లోనైతివి నాకు
యెక్కెలే తనకు వల పేమిసేసే విఁకను

రేకు: 0670-6 నాగవరాళి సంపుటం: 14-420

పల్లవి: అంతటికి నితవరి ఆపె గలిగితేఁ జాలు
సంతసాన నే నుండే చాలు మమ్ము నంపరా

చ. 1: మచ్చిక నాతో నీవు మాట లాడఁగాఁ గదా
కొచ్చి కొచ్చి యాపె నిన్నుఁ గోపగించెను
రచ్చల నేను నీతో రాయడించ దొరకొంటే
వొచ్చము నీపై వుండ వొద్దు మమ్ము నంపరా

చ. 2: యిన్నేసి నీవు నాకు నిచ్చకాలు సేయఁగాఁ గా
సన్నల చాయల నాపె జంకించెను
యిన్నిటా నేను నీతో యెగసక్కేలు సేసితే
యెన్నినట్టే రాదు మమ్ము నింటిలోని కంపరా

చ. 3: కందువ నాకు మోహించి కాఁగిటఁ గూడఁగఁ గదా
అందాలు సేసుక నిన్ను నాపె మెచ్చెను
యిందుకే శ్రీవేంకటేశ యిద్దర మొక్కటైతిమి
విందు చెప్పితి నాపెను విడిదికి నంపరా

రేకు: 0671-1 గౌళ సంపుటం: 14-421

పల్లవి: వద్దు నీకు వగవఁగ వడి నలసితి వని
చద్దికి వేఁడికి నీకుఁ జలి వాసెఁగా

చ. 1: చిత్తడి చెమటలు నీచెక్కులనే వెడ జారె
యెత్తలఁ గొండలు నీవెంద్కొకి వచ్చితో
హత్తి నీకు నవులే తొల్లి ఆవులఁ గాచిననాఁడే
చిత్తగించి అలవాటు సేసుకొంటిగా

చ. 2: ముక్కున నూరుపు లవే ముంచి బుసకొట్టేవు
పెక్కుమారు లెవ్వరితోఁ బెనఁగితివో
గుక్కక నీ కవులే తొల్లి గొల్లెతలతోఁ బెనఁగి
చిక్కించుక అలవాటు సేసుకొంటిగా

చ. 3: కాయమున నీకు నీదే కడు బడలిక దేరీ
సేయరానిపను లేమి సేసి వచ్చితో
యీయెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితి
చేయార నీయలవాటు సేసుకొంటిగా

రేకు: 0671-2 సామంతం సంపుటం: 14-422

పల్లవి: ఏమి సేతునే నేను యేదౌతాఁ దా నెరఁగఁడు
దీమసము లేదు నాకు తెగి మీర లేను

చ. 1: దప్పితో నావిరహపుతలఁపులో తెగువలు
చెప్పుమంటా నాన వెట్టీఁ జెల్లఁబో వీఁడు
అప్పటి నేఁడేమి సేతు నవె వెళ్లనాడఁ బోతే
కుప్పళించీఁ బెంజెమట గుండె వక్కలాయను

చ. 2: కలలోనఁ దాను నేనుఁ గలసిన చేఁతలు
పలుకు మనుచుఁ గొంగు వట్టీ వీఁడు
యెలమి నే నేమి సేతు నేపాటి వాకుచ్చినాను
సెలవుల నవ్వు వచ్చి సిగ్గు ముంచీ నాకు

చ. 3: వడి నాకాఁగిట నెటువలెఁ గూడుదు ననుచు
నడువు మనుచు నన్ను నాదరించీని
కడు శ్రీవేంకటేశుఁడు కాఁగిటఁ గూడిన సుద్ది
వెడల నాడఁగ లేను వెరగయ్యీ నాకు

రేకు: 0671-3 శంకరాభరణం సంపుటం: 14-423

పల్లవి: మొగమాటదానవు మొదలనే నీవు
వగలెల్ల నుడుపంగ వచ్చె నాతఁ డదివో

చ. 1: పట్టినదే పంతమా పడఁతి నీ వాతనితో
అట్టు సేయనంటే మెఱయించ రాదా
గుట్టు నీతోఁ జెప్పనా కోరి పై పై నున్నాఁడని
వట్టి కోపా లిఁకనేల వచ్చె నాతఁ డదివో

చ. 2: చెల్లునంటాఁ జేతురా చెలులు విభునితోడ
కల్లగా దాతనిమాఁట కైకొనరాదా
అల్లప్పుడె మొక్కనా ఆతనిమారు నేనని
వల్లెవాటుతో దగ్గరి వచ్చె నాతఁ డదివో

చ. 3: ఇంత నీకుఁ దగునా యిట్టి శ్రీవేంకటేశుతో
చెంత నానలు పెట్టఁగాఁ జేకొనరాదా
వింతలుగఁ గూడి నేఁడు విడెము దా నిచ్చేనంటా
వంతుకు నీయంకె కెల్ల వచ్చె నాతఁ డదివో

రేకు: 0671-4 రామక్రియ సంపుటం: 14-424

పల్లవి: చెనకకువయ్య మమ్ము సిగ్గుతోడివారము
కొన కెక్కించి దించకు కుసిగుంపు లోపము

చ. 1: చేరి తిట్టినోపము చేచేత మొక్కనోపము
వోరి నీకే యలవాటై యుండుఁ గాని
గారవాన మేలుమీఁదికాంతల మింతే నేము
కూర పండి కస వేరఁ గూడదు మాచేతను

చ. 2: బాస సేయనోపము పాడిదప్ప నోపము
ఆసకాఁడ నీకే తగు నన్నియుఁ గాని
వాసికి నొడిగట్టినవనితల మింతే నేము
సేస వెట్టి కుల మెంచఁ జెల్లదు మాకిఁకను

చ. 3: కాకు సేయనోపము గారవించ నోపము
ఆకడ నీకడ నీకే యమరుఁ గాని
యేకమై కూడితి నన్ను నిట్టై శ్రీవేంకటేశ
కైకొని పండినపండు కాయసేయ నోపము

రేకు: 0671-5 భైరవి సంపుటం: 14-425

పల్లవి: అవ్వలివారికే నీ వన్నియు నేరుపవయ్య
రవ్వగానివారి నేల రచ్చనఁ బెట్టేవు

చ. 1: కాటుక కన్నుల నిన్నుఁ గసరఁగఁ జాలఁగాని
నాటఁజూచి కొంత గొంత నవ్వు నవ్వేరా
తేటలుగాఁ బేరు గుచ్చి తిట్టుమనే వప్పటిని
గాఁటిసిగ్గయ్యీ నాకు కమ్మటి నేనోపరా

చ. 2: అంకెకు రావని నీతో నలుగఁగ నోపఁ గాని
వుంకువగాఁ గుచముల నొత్తఁగలరా
సంకె లేక నీమీఁదఁ జాఁచుమనేవు పాదాలు
అంకెల సిగ్గయ్యీ నాకు నందుకు నేనోపరా

చ. 3: కాఁగిట నీవు గూడఁగ గయ్యాళించఁజాలఁగాని
మాఁగిననామోని గొంత మచ్చు వేసేరా
చేఁగదేర నప్పటిని శ్రీవేంకటేశ యేలితి
దాఁగితే సిగ్గయ్యీ నాకు తలఁగ నేనోపరా

రేకు: 0671-6 వరాళి సంపుటం: 14-426

పల్లవి: ఎంతకు వచ్చెఁ బనులు యేమి సేసుకొంటి నేను
వింతగా నీతోడిపొందు వెక్కసము లాయరా

చ. 1: తనివోక నీమోము తప్ప కిట్టే చూచి చూచి
కనురెప్ప వేయఁబోతే కాఁక రేఁగీనా
మనసిచ్చి నీతోడ మాటలాడి మాటలాడి
కొన నూరకుండఁబోతే గుబ్బతిలీ వలపు

చ. 2: వద్ద నిట్టె కూచుండి వాకిటికి లేచి పోతే
చద్దికి వేఁడికి గుండె జల్లురనీరా
యిద్దర మెదురై వుండి యివ్వలి మోమైతేను
వొద్దనినా మానదు నిట్టూరుపు రేఁగీనా

చ. 3: మచ్చికతో నిన్నుఁ గూడి మంచము దిగేనంటే
చెచ్చెర నాకోరికలు చిమ్మి రేఁచీరా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పచ్చిగా నీమేలు చూచి బ్రమసితిరా

రేకు: 0672-1 ధన్నాశి సంపుటం: 14-427

పల్లవి: ఏల మమ్ముఁ బరచీనే యెవ్వఁడే తాను
నాలిచేఁత చేసుకొంటా నవ్వు నవ్వీ మమ్మును

చ. 1: చన్నుల నొరసుకొంటాఁ సంగడి నిలుచుకొంటా
సన్నలు సేసి పిలిచీ సారెకుఁ దాను
కిన్నెర మీటుకొంటాఁ గేలు మీఁదఁ జాఁచుకొంటా
వున్నవారి నెరఁగఁడు వుడికించీఁ దాను

చ. 2: అంగములు ముట్టుకొంటా నడ్డాలు నడచుకొంటా
వుంగిటి నానలు వెట్టీ నూరకే తాను
తొంగలించి చూచుకొంటా దూరుచు గొణఁగుకొంటా
చెంగట సిగ్గు విడచి చిమ్మిరేఁచీ మమ్మును

చ. 3: చనవులు సేసికొంటా సరసము లాడుకొంటా-
నెనసి కాఁగిట నించీ నిప్పుడేతాను
వెనుకొని కలసె శ్రీవేంకటేశుఁ డిదె నన్ను
తనివోని కూటముల తతిగోనీ మమ్మును

రేకు: 0672-2 ఆహిరి సంపుటం: 14-428

పల్లవి: చెప్పరమ్మ సతులాల చెలులకోపములకు
తప్పు లెంచేవాఁడు మరి తనకేఁటి మాటే

చ. 1: సిగ్గు వడ్డ ఆఁటదానిఁ జేకొని పచ్చి సేసేటి-
నిగ్గులమగవాఁడెపో నిండుఁ గూళ
దగ్గిర రాకుండితే తరుణుల నెల్ల నంపె
బగ్గనఁ బదరేవాఁడు పాటిగలవాఁడా

చ. 2: గుట్టుతోడి ఆఁటదాని గుణ మెరఁగక సారె
అట్టు పట్టే వానికంటే ఱాయి మేలు
దిట్టినై మారాడకుంటే తిట్టి తిట్టించుకొనేటి-
వట్టిసటకానితోడ వసమా గెలువను

చ. 3: దయదలఁచి కలయఁ దానే వచ్చినదాని-
ప్రియ మెరఁగనివాఁడే పెనుమంకు
నయ మిచ్చి శ్రీవేంకటనాథుఁ డిట్టె నన్నుఁ గూడె
జయమాయ నీఁకమీఁద సరసుఁడే కాఁడా

రేకు: 0672-3 బౌళి సంపుటం: 14-429

పల్లవి: ఊరకున్న వారికేల వుడుకులు గట్టేవు
నేరుపు లాడనే చూపు నే వెరతు నిందుకు

చ. 1: సేయవయ్య నీవు నీచేతికి లోనైనట్టెల్ల
ఆయములు సోకగ నీ వాపె వొద్దనే
మాయవల పొకచోట మన్నన నీకొకచోట
వోయయ్య పచరించేవు వోప నోప నేను

చ. 2: నగవయ్య నీవు వోయి నాటిన ప్రియముతోడ
అగపడి నీతో నవ్వే ఆపె తోడనే
జిగి నుప్పమ్మఁ గొందరు చిట్లు మోయఁ గొందురు-
నగునీతో సరస మరగదు మాకును

చ. 3: చెప్పవయ్య నీవు నేనుఁ జేకొని కూడిన సుద్ది
అప్పసము యెమ్మెలకు నాపెతోడను
యిప్పుడె శ్రీవేంకటేశ యీడఁ గొంత నాడఁ గొంతఁ
నప్పటిఁ దిరిగాడితే నది నేను మెచ్చును

రేకు: 0672-4 మేఁచబౌళి సంపుటం: 14-430

పల్లవి: ఏమయ్య్య చిత్తగించ వింకా నీవు
దామెనకాఁకలు నీపైఁ దగిలించీ నిదివో

చ. 1: మలయు మదిలోఁ గొంత మాటలలోపలఁ గొంత
చెలి నీపై గుమ్మరించీఁ జేరి చేరి
అలిగినదియుఁ గాదు అట్టె కూడినదీఁ గాదు
తలుపుమాటున నుండి తడఁబడీ నదివో

చ. 2: ముంచి విరహపుతేట మొక్కలపుఁ గన్నీట
యించుకించుకే చిమ్మీ నింత నీమీఁద
మంచము మీఁదికి రాదు మరఁగుకైనాఁబోదు
అంచెల మొకమెదుట నానుకున్న దదివో

చ. 3: జవ్వనములోనిపచ్చి చనవులనే కొచ్చి
రవ్వగా నీ కొప్పగించీ రమణి నేఁడు
యివ్వల శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
కువ్వనిపేరై నీకు గురుతాయి నదివో

రేకు: 0672-5 ఆహిరి సంపుటం: 14-431

పల్లవి: ఇంతయును నామేలే యెందు వీఁచుక వచ్చిన
పంతము నెరపఁబోతే బయలే పందిలిరా

చ. 1: నేనే నీతో నలిగిన నీవు నాతోఁ గోపించిన
నానిన విరహమెల్లా నాదే కాదా
యీనెపాన నే నిట్లే యీకె నెంత గొసరిన
కానీరా అదియును నొక్కటికి రెండవురా

చ. 2: వొట్టు నేనే పెట్టుకొన్న వొల్లక నీవుండినాను
నట్టుకున్న జాగరాలు నాసొమ్మే కాదా
అట్టుగ నిందుకు ని న్నాఱడి యెంత సేసినాను
కట్టినముడియ నాకు కలకాల మిదిరా

చ. 3: నిచ్చ నే సిగ్గు వడినా నీవు నన్ను మరచినా
నచ్చుల తమకమెల్లా నాపాలిదే
యిచ్చల శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి
తచ్చి వేసిదియె నాకు దాచిన ధనమురా

రేకు: 0672-6 రామక్రియ సంపుటం: 14-432

పల్లవి: ఆఁడువారి గోర సేసి అందురా నీవు
నేఁడు నీ మేలుకుఁ జొక్కి నెమ్మది నుండితిని

చ. 1: యిన్నిటా జాణఁడ వని యిచ్చకుఁడ వౌదు వని
మొన్ననే చూచి నీకు మొక్కనా నేను
నన్ను నేల దూరేవు నగి నిన్ను మెచ్చనంటా
పన్నిన నీరతిచేతఁ బరవశ మైతిని

చ. 2: తప్పవు నీమాఁట లని తగు మంచివాఁడ వని
అప్పుడె నీచెక్కు గోర నంట నానేను
తప్పులేల యెంచేవు తగిలి పొగడనంటా
నెప్పున నీ ప్రియానకు నివ్వెర గందితిని

చ. 3: కత కరచితి వని కాఁగిటఁ గూడితి వని
యితవుతో నీవుర మెక్కనా నేను
గతియై శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
తతి నీ గుణాలఁ జిక్కి తమక మందితిని

రేకు: 0673-1 నాగగాంధారి సంపుటం: 14-433

పల్లవి: ఇల్లాలి కేటికే యిటువంటి పనులు
పల్లదాన నాతఁడే బతుక నీరే

చ. 1: పంత మాడెదానఁగాను పతితోడ సారె సారె
యెంతైనా నిచ్చకురాల నింతే కానీ
వంతులకుఁ జెలు లేల వాసులు రేఁచేరే నాకు
కాంతుఁ డేపుణ్యమైనఁ గట్టుకోనీరే

చ. 2: వేసరించేదానఁగాను వెతసేసి యాతనికి
ఆసల నాతఁడే నేనై వుందుఁ గాని
సేస వెట్టించినమీరే చెప్పకురే కొండేలు
బాస దప్పి యాతఁడే ఆఫల మందనీరే

చ. 3: చెనకేటిదానఁగాను శ్రీవేంకటేశ్వరుని
తనుఁ దానె కూడితేనే దక్కుదుఁ గాని
మనసిచ్చె నాకు నేఁడు మన్నించె నాతఁ డెందు
వెనకటిచేఁత తానే విచారించుకోనీరే

రేకు: 0673-2 కొండమలహరి సంపుటం: 14-434

పల్లవి: ఎడమాట లాడించ నిఁక నేలా
పడఁతి నీరమణుని భావము లోనాయను

చ. 1: చన్నులనే వొరసేది సంగడి నిలుచుండేది
కన్నులనే సొలసేది గలిగె నీకు
మన్ననలఁ గరఁగేది మలఁగుపై నొరగేది
అన్నిటా నీరమణుని కలవా ట్లాయను

చ. 2: సారె సారె నవ్వేది జంకెనల గొణఁగేది
ఆరీతి నాసలు సేసే దమరె నీకు
కోరికల మొరసేది గురుతులే అరసేది
యీరీతి నీపతి కిదేప నాయను

చ. 3: వట్టిమాఁట లాడేది వలపులే చల్లేది
చుట్టమవై పొందేది సూటాయ నీకు
యిట్టి శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గలసెను
పట్టిపగ లాతనికి పరిణామ మాయను

రేకు: 0673-3 నాదరామక్రియ సంపుటం: 14-435

పల్లవి: ఇంతేసివారిలోన యెవ్వతె నేను
పంతె గత్తె లుండఁగాను పైకొసరా నేను

చ. 1: నిన్ను మెచ్చకుందునా నీవు సేసేచేఁతలకు
విన్నవారు నవ్వేరంటా వెఱచి కాక
మన్నించిన నీసతులు మాకంటె ముందరను
సన్నుతించి పొగడేరు చాలదా నీకయ్యా

చ. 2: దగ్గరక నే నుందునా తగిలేటి నన్నుఁ జూచి
సిగ్గువడ్డదాననై చింతించేఁ గాక
వొగ్గి నీ పొరుగువారు వూరికంటె ముందరను
అగ్గమై కదిసినారు అప్పటినాసతులు

చ. 3: కొంకు వాపకుందునా కూరిమి నీకాఁగిటను
వంక నీమనసు చూడవలసి కాక
బింకపు శ్రీవేంకటేశ పెనఁగి నన్నుఁ గూడితి-
వింకఁ దొల్లిటి సత్తుల కెట్టు బొంకేమయ్యా

రేకు: 0673-4 సామంతం సంపుటం: 14-436

పల్లవి: వాఁడె బీర మాడఁగా వలదు మాను మనదు
ఆఁడు వారిబతుకు లివే అన్నియు వినరమ్మా

చ. 1: తానే ననుఁ దొలుత తగుల నాడినాఁడు
నే నావెనక నలిగితే నేర మిందు గలదా
కానీ చెలులాల కల్లలాడ వలదే
పూని తగదన్న వారికి బుద్ధి చెప్పరమ్మా

చ. 2: చేరి నను నిపుడేజీరవారఁ దీసెఁ దాను
మేర నే నందుకుఁ దా మీకుఁ జెప్పరాదా
సారె మిము నేను సాకి రడుగఁ గాను
దూరు మీకుఁ గట్టుకో దోస మేఁటికమ్మా

చ. 3: కూడి నామోము కొసరి చూడఁగాను
యీాడు వెట్టుక నాకును యింత నవ్వరాదా
తోడి వేంకటపతి దొమ్మిసేసి కలసె
పాడిగలసతు లిందరు పంత మడుగరమ్మా

రేకు: 0673-5 ఆహిరి సంపుటం: 14-437

పల్లవి: ఏమి సేసేవో చూత మిఁక మీఁదను
వేమరు నీమాయలనే వేగుఁబొద్దులాయను

చ. 1: యెదురు చూచేను మాయింటికి విచ్చేసేవంటా
అదన వేరొక తదే అట్టె యెదురు చూచీ
పొదిగిన మా యిద్దరికిఁ బొత్తుల నీ వాడ నుంటే
యిదివో వలపు చల్లే వెరఁగనా నేను

చ. 2: పిలువ నంపితి నిన్నుఁబెడరేఁచి చెలిచేత
నిలిచి ఆపెయునొక్క నెలఁత నీకడ కంపె
చెలు లిద్దరిపై రెండుచేతులు వేసుక నీవు
యెలమి నవ్వులు నవ్వే వెఱఁగనా నేను

చ. 3: రమ్మని పిలువఁగాను రతికి నే దగ్గరితి
పిమ్మట నాపెయుఁదన్ను బిలిచే రనుచు వచ్చె
యిమ్ముల శ్రీవేంకటేశ యిద్దరిఁ గాఁగిటఁ గూడి
యెమ్మెలే నీ వింత సేసే వెరఁగనా నేను

రేకు: 0673-6 దేశాక్షి సంపుటం: 14-438

పల్లవి: ఇందుమీఁద మనమాట లింపు లయ్యీనా
డిందుపడఁ బతిఁ దోడితెత్తము రారే

చ. 1: మాటలెంత వేసటో మగువ చెలులతోడ
గాఁటపుఁ బెదవులే కదలించీని
నీటున విభుఁడు దానినెగులెల్లా నొకమాఁటే
కూటువగాఁ జెమటలు గుమ్మరించీని

చ. 2: నవ్వు లెంతబరువో నాతోడసైతమును
జవ్వని సెలవులనే జారఁ దోసీని
యివ్వల మరునిమీఁది యీసులెల్లాఁ దనకొప్పు
పువ్వులమీఁదటఁ జూపి పూఁచి దులిపీని

చ. 3: చూపు లెంతవేసటో సారిది నద్దము చూడ
నోపనంటాఁ దలవంచి వూరకున్నది
యీపొద్దు శ్రీవేంకటేశుఁ డింతలోఁ గూడినందుకు
తీవుల పెదవులనే ద్రిష్టము చూపీని

రేకు: 0674-1 శ్రీరాగం సంపుటం: 14-439

పల్లవి: ఇంకా నప్పటి నీతో నెదురాడేనా
మంకుదానఁ గాను నిన్నే మరిగితి నేను

చ. 1: చింతలెల్ల బెడఁ బాసె చెక్కు నీవు నొక్కఁగాను
యింత ప్రియము చెప్ప నే నేమి బాఁతి
యింతులచే మొక్కించి యేల దోసాలు గట్టేవు
చెంతల నేమి చెప్పిన సేసేనయ్య నీకు

చ. 2: కోపమెల్లాఁ జల్లనాయ కొప్పు నీవు ముడువఁగా
యేపనులు సేసేవు నే నేమి బాఁతి
యీపొద్దు యింటికి వచ్చి యేల రవ్వలు సేసేవు
కోపుల నీమాట లియ్యకొంటినయ్య యిపుడే

చ. 3: కాయమెల్లాఁ బులకించెఁ గాఁగిట నీవు గూడఁగ-
నీయెడ నిందరిలో నే నేమి బాఁతి
యీయరానిబాస లిచ్చి యేల మోపు గట్టేవు
నాయపు శ్రీవేంకటేశ నమ్మేనయ్య నిన్ను

రేకు: 0674-2 రీతిగౌళ సంపుటం: 14-440

పల్లవి: ఏల నాతో నాన వెట్టే వెవ్వ రేమనిరి నిన్ను
నీతో నే నొకతెనై నిండుకుండనైతినా

చ. 1: యింతితో నవ్వితి వేమి యీడ నూరకుంటి వేమి
యింత నీతో వాదడువ నేల నాకు
చెంతల నాఁడే నీకు సేస వెట్టి నీలోని-
కాంతలలో నొకతెనై కాఁపురము సేయనో

చ. 2: యిందాఁకా నెందుంటి వేమి ఇందు నిద్దురించితేమి
ఇందుకుఁగాఁ గోపగించ నేల నాకు
చెంది నీకొలువు సేసేచెలియనై నీవద్ద
సందడించు కొంటా నుండి సరసము లాడనా

చ. 3: ఆపనే మెచ్చితి వేమి అట్టె వొరగితి వేమి
యీపొద్దు నిన్ను సాదించ నేల నాకు
కాపాడి శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
చేపట్టి యిన్నిటికిఁగా చేత మొక్కనైతినా

రేకు: 0674-3 కాంబోది సంపుటం: 14-441

పల్లవి: అంటే నిన్ననరాదు ఆడకున్నఁ బోదు నేఁడు
యింటి కేఁగినవాఁడ వింత చేసి వత్తురా

చ. 1: వాసులకు నోరు మూసీ వలపులఁ జలి గాసీ
యీసులకు మాటాడ వెవ్వరి తోడి
కాసు సేయనిపనికి కాంత నే మంటివో గాని
దోసానకు రోయవు నీ తోడి దేఁటిమాటలు

చ. 2: గుట్టుతోడఁ దల వంచీ కోపములఁ జిగిరించీ
కట్టిడితనాలు చల్లీ కాంతలమీఁద
చిట్టికా లాపెతో నేమి చేసితివొ చలాలకు
ముట్టి వచ్చె నీకు దూరు ముందర నెరఁగవు

చ. 3: పంతానకుఁ గాలు మెట్టీ పాయముల మీఁదుకట్టీ
బంతి నండవారి నెల్లఁ బంగించీని
యింతలోనె శ్రీవేంకటేశ నీ వింతిఁ గూడితి-
వంతరంగమున మేలు అది నీ కింకెట్టిదో

రేకు: 0674-4 అమరసింధు సంపుటం: 14-442

పల్లవి: ఇందరిలో నిన్ను రవ్వ లిఁకఁ జేసేనా
నిందల మాటలకుఁగా నీకేల వెఱవ

చ. 1: ఉద్దండాన నే నిన్ను వుప్పటించ వచ్చేనా నా-
పెద్దరికేనకే నేఁ బెనఁగేఁ గాక
చద్దికి వేఁడికి నిన్ను సాదించ వచ్చేనా
అద్దుకొన్ననాలోని మోహము చూపేఁ గాక

చ. 2: పైకొని నే నీమీఁద బలిమి చూప వచ్చేనా
చేకొని నీ వన్నమాట చెప్పేఁ గాక
రాకపోకలను నిన్ను రవ్వ సేసేదాననా
దీకొని నామేనవావి దెలిపేఁ గాక

చ. 3: కన్నుల జంకించి నిన్నుఁ గాఁగిలించే దాననా
తిన్నని నీనాసిగ్గు తీరిచేఁ గాక
యిన్నిటా శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితవి
కన్నుల నవ్వేదాననా కని మొక్కేఁ గాక

రేకు: 0674-5 బౌళిరామక్రియ సంపుటం: 14-443

పల్లవి: ఎవ్వరిమొగము చూచి యేమనేను నాలోనే
నవ్వుతా నే మోనమున నన్ను మెచ్చేఁ గాక

చ. 1: సిగ్గువడ్డ చిత్తమిది చెలువుని దూరీనా
దగ్గరి గుబ్బతిలుచు దాఁగుఁ గాక
బెగ్గిలాన చెలులై నాఁ బిలుచుక రాఁబోయేరా
అగ్గమై వాని కిచ్చలు ఆడు చుండేరు గాక

చ. 2: కాఁకఁ బొందినమే నిదే కాంతునితోఁ బెనఁగీనా
ఆఁకదీర వుస్సు రస్సు రనుఁ గాక
యేఁకట మరుఁడై నాను ఇద్దరినిఁ గూరిచీనా
వూఁకొనక దుర్బలుల కోపు నింతే కాక

చ. 3: ఆసలఁ బొందినచూపు ఆతనిఁ గోపగించీనా
వేసరక మొకమోడి వీఁగుఁ గాక
యీసరినె శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
రాసి కెక్క నాతఁడే రక్షించుఁ గాక

రేకు: 0674-6 నాట సంపుటం: 14-444

పల్లవి: మేలు గలచోటఁ గాని మెత్తఁ బడవు మా-
కాలు దాఁకి నంతలోనే కసరేవు నీవు

చ. 1: మంచముపై నుండే ఆపె మాటలాడఁగా నీవు
అంచెల దిగువ నుంటి వప్పుడే కాదా
యెంచఁగ మాతోనైతే యెమ్మెలెల్లఁ జేసి మా-
కంచముకూ డిందమంటే గబ్బితనా లాడేవు

చ. 2: జలక మాడుచు నాపె సారెఁ బనులు చెప్పఁగ
అలరి యాపెకుఁ జీర లందియ్యవా
పలుకుల నేనైతేఁ బచ్చితిట్లు దిట్టితేను
వలసినట్ల నాతో వాదు లడిచేవు

చ. 3: దవ్వులనుండి యాపె తమ్ముల ముమియఁ బోతే
చివ్వన నీవు దగ్గరి చేయి చాఁచేవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
నివ్వటిల్లి మొక్కుమంటే నే నోప ననేవు

రేకు: 0675-1 సాళంగనాట సంపుటం: 14-445

పల్లవి: మేలయ్యా నీనేరుపు మెస్తిమి నేము
యీలీల నెందరిఁ బెండ్లి యిటు నీవాడితివో

చ. 1: వేడుకకు నొకమాట వెలఁది నీతో నవ్వితే
వాడిక సేసుక కూడి వచ్చేవు నీవు
వీడెము చేతికిచ్చి వినయాన మొక్కితేను
ఆడనె కాఁగిటఁ జేర్చే వదే సందుగాను

చ. 2: తెరలోనే వేగించి తియ్యని మోవితేనె
గురిసీ సారె సారెఁ గొమ్మ నీపైని
సురతపుఁగాంక్ష లెంతో చూపి చెప్పరానిమాట-
లరుదుగా గుబ్బతిల్లీ నదివో లోలోనను

చ. 3: పానుపుపైఁ బవ్వళించి పచ్చిచేఁతలఁ జన్నులు
కానుకిచ్చి బత్తిసేసీఁ గాంత నీపైని
పూని శ్రీవేంకటేశ నేర్పులెట్టొ తరితీపు
నాని పెక్కు భావములు ననిచీ లోలోనను

రేకు: 0675-2 కన్నడగౌళ సంపుటం: 14-446

పల్లవి: చేరి నన్నేల నోపితే చెనకవోయి
ఆరీతిఁ బెనఁగవచ్చు నౌఁగా దనరాదు

చ. 1: తలఁచవచ్చు నీరూపు తమక మాఁపఁగరాదు
వలవఁగవచ్చు మరి వదలరాదు
కొలువు సేయఁగవచ్చు కూటమి మఱవరాదు
కలయఁగవచ్చు వేడుకలు పట్టరాదు

చ. 2: చిప్పిల మాటాడవచ్చు సిగ్గులు వడఁగరాదు
తప్పక చూడగవచ్చు తనియరాదు
కప్పురాన వేయవచ్చు కాఁకల కోరువరాదు
వొప్పుగాఁ బాడఁగవచ్చు వోరుచుకోరాదు

చ. 3: పంతముతో నవ్వవచ్చు భావము చెప్పఁగరాదు
మంతన మాడుగవచ్చు మానరాదు
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వింతరతి చూపువచ్చు విసుగరాదు

రేకు: 0675-3 పాడి సంపుటం: 14-447

పల్లవి: ఏఁటికిఁ బరాకు సేసే వెక్కడ చూచెవు నీవు
ఆఁటదాని నంతేసి అలయించకువయ్యా

చ. 1: మోవితేనె గారఁగాను ముందరనే నిలుచుండి
వావులు దెలుపుకొనీ వనిత నీతో
దేవులా యిది నీకు తెలియ యెన్నఁడు నేము
వోవరిలో సంగతిఁ గూచుండఁ బెట్టుకోవయ్యా

చ. 2: సెలవి నవ్వులు చింద చేత నీకు విడెమిచ్చి
చెలుములు సేసీని చెలియ నీతో
నెలకొన్న ప్రియురాలా నేఁడు నేము చూచితిమి
కలతువు గాని ఇట్టె కౌఁగిలించుకోవయ్యా

చ. 3: ఘనకుచములకాంతి కడు నీపైఁ దొలఁకఁగా
వినయానఁ బెనఁగీని వెలఁది నీతో
యెనసితి విటు నన్ను యీకె నీకొకతె గద్దా
వొనర శ్రీవేంకటేశ వొప్పుకొనవయ్యా

రేకు: 0675-4 ద్రావిళభైరవి సంపుటం: 14-448

పల్లవి: ఇంతట లాలించవయ్యా ఇంతిఁ గాఁగిలించుకొని
చింతతోడి వేడుకలఁ జెలఁగీ లోలోనను

చ. 1: సముకాన నిలుచుండి చాయాలా సన్నలాఁ జూచి
చెమట గోరఁ జిమ్మీ చెలి నీపైని
తమక మెటువంటిదో తలపోఁతవలపులు
వుమురుకూటములై వున్నవి లోలోనను

చ. 2: తెరలోనే వేగించి తియ్యనిమోవితేనె
గురిసీ సారె సారెఁ గొమ్మ నీపైని
సురతపుఁగాంక్ష లెంతో చూపు చెప్పరానిమాట
లరుదుగా గుబ్బతిల్లీ నదివో లోలోనను

చ. 3: పానుపుపైఁ బవ్వళించి పచ్చిచేఁతలఁ జన్నులు
కానుకిచ్చి బత్తిసేసీఁ గాంత నీపైని
పూని శ్రీవేంకటేశ నేర్పులెట్టో తరితీపు
నాని పెక్కుభావములు ననిచీ లోలోనను

రేకు: 0675-5 శ్రీరాగం సంపుటం: 14-449

పల్లవి: ఇప్పుడే విచారించుక ఇంతిఁ గరుణించవయ్యా
వుప్పతించితే నెట్లుండునో నీమనసు

చ. 1: అంగన నిన్నేమైనా నౌఁగా దనఁగలదా
చెంగట నేమి సేసినాఁ జేతువు గాక
కొంగు వట్టి తీసి మరి కొసరగఁ జూచితేను
యెంగిలి పెదవి సోఁకి యేరీతౌనో మనసు

చ. 2: మగువ నీగుణములు మానుపఁగఁ గలదా
జిగి నాకెభాగ్యము నీచేతిదిగాక
పగటును నిందుకుఁగా పట్టి పెనఁగఁబోతే
చిగురుఁబాదాలు దాఁకి సిగ్గౌనో మనసు

చ. 3: వెలఁది నిన్నిటు గూడి వేసరించఁ గలదా
వలపు గలిగినంతే వాడికెగాక
అల కడపరాయఁడవై శ్రీవేంకటేశ్వర
బలిమి మన్నించితి వేభావమౌనో మనసు

రేకు: 0675-6 కాంబోది సంపుటం: 14-450
పల్లవి: మాపుదాఁకా జోలి యేల మనసొక్కటాయ నేఁడు
యేపొద్దుదాఁకాఁ జెప్పే వియ్యకొంటి రావయ్యా
చ. 1: చెలరేఁగి రమణుఁడు చెక్కు నొక్కి వేఁడుకోఁగా
చలపాదితన మేల ,సకియకును
అలుకలెల్లాఁ దీరి ఆసతోడఁ బెనఁగఁగ
కలిగినపాటే మేలు కైకొంటి రావయ్యా
చ. 2: సేనలు వెట్టినవాఁడు చేరి వొడఁబరచఁగ
వాసితోఁ గొసరనేల వనితకును
వేసరక వూడిగాలు వెస నేపొద్దుఁ జేయఁగా
యేసేఁతలై నా మేలు యెదురాడవయ్యా
చ. 3: శ్రీవెంటేశ్వర చిత్తగించి నీవేలఁగా
వావు లడుగనేల నావంటిదానికి
భావములోపల నమ్మి పైకొని భోగించఁగాను
దేవులనౌటే మేలు తెలిసితి రావయ్యా

రేకు: 0676-1 దేవగాంధారి సంపుటం: 14-451

పల్లవి: ఏమి గావలెనో కాని యీయింతి నీకు
చేముంచి నీయెడలఁ జేసీ నిదె మేకు

చ. 1: కానుకలు నీకిచ్చి కామిని నీలోను చొచ్చి
కౌను నిక్కించి నిన్నుఁ గాఁగిఁట గుచ్చి
ఆనుకొని చనుఁగవ నాయములు గొచ్చి
యీనేరుపు చూడవయ్యా యీకె నిన్ను మెచ్చి

చ. 2: వీడెము చేతఁ బట్టి వింతగా నాకులు చుట్టి
వాడిక నీముంగొంగు వంచి పట్టి
వేడుకలమాటలఁ దిట్టి వెసఁ బాదమున మెట్టి
వాడికెలు చూపు నీపై వలపులఁ దొట్టి

చ. 3: కూరిమి నీపై ముంచి గుట్టుతోడ సిగ్గు నించి
చేరి చిరినవ్వు నవ్వు శిరసు వంచి
యీరీతి శ్రీవేంకటేశ యెనసీ నలమేల్ మంగ
గారవించవయ్య యీకెగతులెల్లా నెంచి

రేకు: 0676-2 నారాయణి సంపుటం: 14-452

పల్లవి: ఇన్నాళ్లుఁ బిన్నదాన వెరఁగవంటా నుంటిమి
నిన్నా మొన్నాఁ గతలెల్లా నేరుచుకొంటివే

చ. 1: సరసము లాడుతానే చనవులు మెరసేవు
శిరసు వంచి నవ్వుతాఁ జేయి చాఁచేవు
తెర వేసుకొంటానే తీగె సాగ మాటాడేవు
అరుదుగ మాలో నీవు నైతివె జాణవు

చ. 2: సన్నలలోనే మోవిచవులెల్లాఁ జూపేవు
కన్ను లార్చుకొంటానే బింకము చూపేవు
విన్నపాలు చేసి చేసి వేడుకలు రేఁచేవు
అన్నిటాఁ బరగి నేఁడే అయితివే జాణవు

చ. 3: పాదాలు గుద్దుతానే పానుపుపైఁ గూచుండేవు
సాదువలె నుండుతా సేసలు చల్లేవు
యీదె శ్రీవేంకటేశుఁ డితఁడె నన్నిటు గూడె
ఆదిగొని నీవు మెచ్చే వౌదువే జాణవు

రేకు: 0676-3 సాళంగనాట సంపుటం: 14-453

పల్లవి: సతులాల చూడరే శ్రావణబహుళాష్టమిఁ
గతలాయ నడురేయిఁ గలిగె శ్రీకృష్ణుఁడు

చ. 1: పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖుచక్రాలు
యెట్టు ధరియించెనే యీ కృష్ణుఁడు
అట్టె కిరీటము నాభరణాలు ధరించి
యెట్ట నెదుట నున్నాఁడు యీ కృష్ణుఁడు

చ. 2: వచ్చి బ్రహ్మయు రుద్రుఁడు వాకిట నుతించఁగాను
యిచ్చగించి వినుచున్నాఁ డీకృష్ణుఁడు
ముచ్చటాడీ దేవకితో ముంచి వసుదేవునితో
హెచ్చినమహిమలతో యీ కృష్ణుఁడు

చ. 3: కొద దీర మరి నందగోపునకు యశోదకు
ఇదిగో తా బిడ్డఁడాయ నీకృష్ణుఁడు
అదన శ్రీవేంకటేశుఁడై యలమేల్మంగఁగూడి
యెదుటనే నిలుచున్నాఁ డీకృష్ణుఁడు

రేకు: 0676-4 శంకరాభరణము సంపుటం: 14-454

పల్లవి: మే మేమి సేతుము మాకు మీరే దిక్కు
చేముట్టరా దితనిఁ జిత్తగించవమ్మా

చ. 1: వోయశోద నీకొడుకు వూరిపడుచులఁ దాను
ఖోయని వుట్లు గొట్టీఁ గోలలఁ గొని
చాయల జోరునఁ గారీ చమరుఁ బాలుఁ బెరుగు
సోయగపు నీకన్నులఁ జూతువు రావమ్మా

చ. 2: కొత్తజవ్వను లైనకొమ్మలచన్నులు తేనె-
దుత్తలంటా పొందించ దొరకొనీని
మొత్తములై యున్నారు ముంగిళ్ళనెల్లాఁ దామే
గుత్తముగ నీవే కనుఁగొందువు రావమ్మా

చ. 3: చే రలమేల్మంగఁ గూడి శ్రీవేంకటాద్రిమీఁద
వీరుఁడె వాఁడె యేఁగీని వీది వీథుల
కూరిమి మేము నవ్వితే గుట్టున సన్నలు సేసీ
తేరకొన యిది నీవే తిలకించవమ్మా

రేకు: 0676-5 దేసాక్షి సంపుటం: 14-455

పల్లవి: ఎలయించి బిడ్డవోజ యింత సేసితిరె మీరే
సొలసి మమ్ము దూరఁగఁ జోటేది మీకును

చ. 1: పూరఁ గలపాలెల్లా నుట్లఁ బెట్టు కుండఁగాను
చేరువ నూరకుండునా శ్రీకృష్ణుఁడు
సారె సారె జవ్వనాన జడియుచు నుండఁగాను
కోరకు వూరకుండునా గొల్లెతలను

చ. 2: కడలేనిదూడలను గాడి గట్టు కుండఁ గాను
విడిచి తోలకుండునా వీదుల వెంట
అడుకులుఁ జక్కిలాలు అట్టుకలు నిండుండఁగా
తొడికి కొల్లలాడ దొరకొన కుండునా

చ. 3: దరిఁ జీరలు వెట్టి బిత్తలే నీళ్ళాడఁగాను
సరస మాడకుండునా చంకఁ బెట్టుక
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
బెరసి మిమ్ము మరిగీఁ బెరచోట నుండునా

రేకు: 0676-6 దేసాళం సంపుటం: 14-456

పల్లవి: భామలు చూడరే తిరుపతి గోవిందుఁడు వాఁడే
ప్రేమతోఁ జన్నులఁ బాలు పిండీ నవ్వులకు

చ. 1: అట్టులెల్లాఁ దిని తిని అదివో యెవ్వరివాఁడే
పుట్టులపైఁ బిల్లఁగోవు లూదుచున్నాఁడు
పట్టపగలే కొందరు పడుచులఁ గూడుకొని
అట్టుగపైఁ బిల్లగొ ట్లాడుచున్నాఁడు

చ. 2: కతలుగా పన్నారుకాఁగులలో బియ్యాలు
సతులపై సేసలు చల్లీ వాఁడే
తతి వారింటివెన్నే తాఁదిని యిల్లాండ్లనోళ
చతురత బువ్వమంటాఁ జమరీ వాఁడే

చ. 3: గక్కన నావుఁ బిదికేకాంతమెడ నెక్కుకొని
యెక్కిరింత ఆటలాడీ వాఁడే
అక్కజపు శ్రీవేంకటాద్రిమీఁద నిలుచుండి
చక్కఁగా వినోదాలు సలిపీ వాఁడే

రేకు: 0677-1 మంగళకౌశిక సంపుటం: 14-457

పల్లవి: పెనగొన్నకాఁగిళ్ళ పెండ్లాడవయ్యా
అనిశముఁ బాయలేని అలమేలు మంగను

చ. 1: అంకెల మంచిగుణము లనేటినూలున నీకు
కంకణదారాలు గట్టెఁ గలికి
లంకెలుగా నీపై వలపు లనేబంగారుతో
కొంకులేనిమనసుల కొంగుముళ్లు వేసెను

చ. 2: ఆసల నిండుఁజూపు లనేటిమేటిమొగ్గల
బాసికము గట్టె నీకుఁ బడఁతి
వాసితో నవ్వుల నేవలువముత్యాలనే
సేసపాలు సిగ్గున దోసిట నీపై నించెను

చ. 3: వెరసి మనోరథము పెండ్లిపీఁటమీఁద
మరిగి నిన్నుఁ గూడె మగువ
ఆరుదై శ్రీవేంకటేశ అధరామృత బువ్వ-
మెరవు లేనిరతులయింట విందు వెట్టెను

రేకు: 0677-2 శంకరాభరణం సంపుటం: 14-458

పల్లవి: ఈలాగుసతి గలిగె నేమి చెప్పేది
యేలితివి నీభాగ్య మేమి చెప్పేది

చ. 1: అచ్చలపు నీచేఁతకు నలుగక జవరాలు
యిచ్చకము లాడీని యేమి చెప్పేది
పచ్చిదేరేనీమోవియప్పటిఁ గని పదరక
యెచ్చరించీ రతులకు నేమి చెప్పేది

చ. 2: సుదతితో మాటాడఁగాఁ జూచి నిన్నుఁ గసరక
యెదుటనే నవ్వు నవ్వీ నేమి చెప్పేది
అదన నీవేళ్ల నాపెవుంగరా లుండఁగా
యిది నీకుఁ గైలాగిచ్చీ నేమి చెప్పేది

చ. 3: వొసర నిందాకా నెందో వున్న నిన్ను దూరక
యెనసె నలమేల్మంగ నేమి చెప్పేది
మనికై శ్రీవేంకటేశ మన్నించఁగా బిగియక
యెనలేనిమెచ్చు మెచ్చీ నేమి చెప్పేది

రేకు: 0677-3 ఆహిరినాట సంపుటం: 14-459

పల్లవి: ఏఁటికి వేడుకొనేవు యిప్పుడే యిన్నిఁ దెలిసె
నేఁటి కేమి రావయ్యా నీవే యెరుఁగుదువు

చ. 1: కొనగోరిచెనకులు గురుతై మైనుండుఁ గాని
మనసులో నాటేది మాటలే కావా
పెనగొన్న తేనెలు పెదవిపై నుండుఁగాని
కనుఁగొంటే తరితీపు కాంక్షలెల్లాఁ దీర్చదా

చ. 2: చెంతల నవ్వేనవ్వు సెలవుల నుండుఁ గాని
చింతఁ దల వంపించేది సిగ్గేకాదా
మంతనపుటలుకలు మరఁగునఁ బెట్టుఁగాని
అంతరంగపుతమక మండకు రప్పించదా

చ. 3: విందులరతిభేదాలు వేరులైతే నాయఁ గాని
కందువలు గరఁచేది కాఁగిలేకాదా
అంది శ్రీవేంకటేశ్వర అలమేల్మంగపతివి
పొందిన నీనేస్తము భువి నన్నిడేర్చదా

రేకు: 0677-4 కాంబోది సంపుటం: 14-460

పల్లవి: నన్ను నింతగా మనిపె నాకేల వేగిరించ
యిన్నిటా నావల పాతఁ డీడేర్చీఁ గాక

చ. 1: చిత్తగించి పిలిచితే సేవలు సేయుట గాక
వొత్తిపతిఁ గొంగు వట్టు టుచితమౌనా
బత్తి గలవారు వొకపరి మరచి వుంటేను
హత్తి మరొకపరైనా నట్టే మన్నించీఁ గాక

చ. 2: నెట్టుకొని చూచితేను నిలిచి మొక్కుట గాక
వొట్టుక తనుఁ గొసర నుచితమౌనా
యెట్టూ నన్ను నేలినాఁడు యీవేళ నవ్వకుండినా
అట్టె వేరొకవేళ ఆదరించీఁ గాక

చ. 3: సరుసఁ గూచుండితేను సరసమాడుట గాక
వొరయ శ్రీవేంకటేశు నుచితమౌనా
అరుదైన దేవినైతి నలమేల్మంగను నేను
నిరతి నాఁడట్లుంటే నేఁడు గూడీఁ గాక

రేకు: 0677-5 హిందోళవసంతం సంపుటం: 14-461

పల్లవి: తగవు నీవెరఁగవా తరుణి నేల దూరేవు
నగుతా నాటకములు నడుపేవు గాక

చ. 1: మాఁటాడించి రమణుఁడు మరిగించుకొనుఁ గాక
అఁటది సిగ్గుపడదా అందరిలోన
పాటించి లోనికి వచ్చి పవ్వళింతువు గాక
పీఁట వెట్టి రమ్మని పిలుతురా రతికి

చ. 2: కొద్దితోఁ బ్రియుఁడు మతికొంకు దేర్చవలెఁ గాక
ముద్దరా లెరుఁగునా మునుపె నవ్వ
వొద్దఁ బెట్టికొని నీవె వొడి వట్టుదువు గాక
సుద్దు లడిగి చన్నులు చూపుదురా చెలులు

చ. 3: మన్నించి కాఁగిటఁ జేర్చి మగఁ డన్ని నేర్పుఁ గాక
కన్నియ పైకొనునా కాఁతాళానను
యెన్నిక శ్రీవేంకటేశ యేలి మోవి యడిగేవు
సన్నల నలమేల్మంగ చాఁచునా సారెకును

రేకు: 0677-6 లలిత సంపుటం: 14-462

పల్లవి: బలవంతుఁడవు తొల్లే పతి వందుమీఁదట
చలపట్టి నిన్నుఁ గడు జరయంగఁ గలనా

చ. 1: పంతములు నావంటి పడఁతులతోఁ గాక
కాంతుడవు నీతో నాడఁగలనా నేను
పొంతనుండి నీవెవ్వరిఁ బోలించినా నందుకెల్లా
సంతోసించుకొందుఁ గాక సాదించఁ గలనా

చ. 2: యెగసక్కే లెల్లాను నాయీడువారితోఁ గాక
మగఁడవు నీతోఁ జేయ మందెమేళమా
తగ వెరఁగ కెవ్వతెదండ నీవు వెట్టినాను
నగుచుండుదుఁ గాక మిన్నక దూరఁ గలనా

చ. 3: లావులెల్ల నాసవతిలలనల తోనే కాక
శ్రీవేంకటేశ నీపైఁ జేయ వచ్చునా
ఆవటించి నీదేవిని అలమేల్మంగనే నేను
వావి దెలుపుదుఁ గాక వదలఁగఁ గలనా

రేకు: 0678-1 మధ్యమావతి సంపుటం: 14-463

పల్లవి: కొసరి కొసరి నీవే కొంచేవు గాక
పసలు మీరఁగ నొడఁ బరచేవు నన్నును

చ. 1: సారె మోవేమి చూపేవు చవులేల చెప్పేవు
గారవించి నీవియ్యఁగాఁ గాదంటినా
కేరి నవ్వుతా నాచన్ను గిరు లెంత పొగడేవు
యేరీతులా నీకవి మీఁదెత్తినవే కావా

చ. 2: సన్న లేమి సేసేవు చనవెంత యిచ్చేవు
వన్నెతో నన్నుఁ గూడగా వలదంటినా
మన్నించి వద్దఁ గూచుండి మచ్చికలు నెరుపేవు
అన్నిటా తొల్లే నీ కిల్లాల నౌ తెరఁగవా

చ. 3: సాములేల చేసేవు సందు లేల వెదకేవు
ప్రేమతో నీ వేలితివి బిగిసితినా
ఆముక శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
నే మొక్కితే మెచ్చేవు నేఁడు నీకుఁ గొత్తలా

రేకు: 0678-2 శుద్ధవసంతం సంపుటం: 14-464

పల్లవి: పతినేల సాదించేవు పలుమారును
అతిరాజసపువాఁడు అవుఁగాము లెరుఁగునా

చ. 1: మగవానిసాజము మానినులఁ గంటేను
నగఁ జూచుఁ గాని యెంతైనాఁ దనియఁడు
నిగిడి తొంటిపొందుల నేస్తగత్తె చెనకితే
మొగమోటఁ గూడుఁగాక ముందువెన కెంచునా

చ. 2: పాయపువానివోజ పడఁతులు పైకొంటే
చేయి చాఁచుఁ గాని మరి సిగ్గు వడఁడు
రాయడించి వదినె మరదలైన దంటితేను
ఆయాలు గరఁగుఁ గాని అందుకుఁ గాదనఁడు

చ. 3: విటుఁడైనవానివిద్య వెలఁదులు వద్దనుంటే
తటుకునఁ గూడుఁ గాని తడ వోర్వఁడు
యిటువలె శ్రీవేంకటేశుఁడు నిన్నూ నేలె
ఘటనతోఁ జనవిచ్చుఁ గాని బడి వాయఁడు

రేకు: 0678-3 భైరవి సంపుటం: 14-465

పల్లవి: ఆకెకు నీకుఁ దెలుసు నాముకొన్నతగవుల
దాకొన్నసిగ్గును మతి దలఁచ దేమియును

చ. 1: ఇంతి కెంతచనవు నీ విచ్చితివో కాని నీతో
మంతనానఁ దానొక్కతే మాటలాడీని
వంతుల సవతులెల్లా వాకిటనే వుండఁగాను
వింతలుగాఁ దమిరేఁచి వీడె మిచ్చీని

చ. 2: మగువ నెట్ల నీవు మరిగించుకొంటివో
బగి వాయ దెపుడు నీపానుపుమీఁద
నగుతా నూడిగానకు నాతులు గాచుకుండఁగా
పగటుఁ జప్పుడుతోడ పాదము లొత్తీని

చ. 3: మానినికి నెటువంటి మాట పట్టు సేసితివో
తానకమై నిన్ను లోన దాఁచుకున్నది
పూని దయతోడ నిన్ను నొనఁగూర్చె నందరిని
ఆనుక శ్రీవేంకటేశ అట్టె తానూఁ గూడీని

రేకు: 0678-4 మాళవి సంపుటం: 14-466

పల్లవి: తారుమారు వలపుల దాయగాఁడా
యీరీతి నూరకున్నాఁడ వెంతదూరినాను

చ. 1: కాంత నీకు నొసఁగిన కానికె పువ్వులబంతి
చెంత నీపారుగాపెచేత నున్నది
వంతుకు నా పెచేతి వైడూర్యపుంగరము
యింతి కిచ్చితివి నిన్ను నేమనేది యిఁకను

చ. 2: మగువ నీకు నంపిన మంచివాసనజవ్వాది
జిగి నీకొలువలేమచెవి నున్నది
తగునంటా నాపెపాదముల నున్న పెండెము
పగటున నీపె కిచ్చి పచ్చిగా నవ్వేవు

చ. 3: చెలి నీయింటఁ బెట్టినచిత్తరు వాతపటము
కొలఁదితో నాపెమునిగోడ నున్నది
కలికి కాఁగిట నీకుఁ గప్పినపయ్యదకొంగు
కలయ శ్రీవేంకటేశ కప్పితివి సతికి

రేకు: 0678-5 సామవరాళి సంపుటం: 14-467

పల్లవి: ఇంతేసి నిన్నుఁగొసర నెంతదానను
అంతా నీవద్దిచెలుల నడుగరాదా

చ. 1: యెన్న నీతో మాటాడేది యెంతటిది గావలె
నిన్ను నొడఁబరచఁగ నే నేర్తునా
యెన్నికతో నీవు తొల్లి యిచ్చిన నమ్మిక లివి
అన్నియుఁ జెలుల నీవే అడుగఁగరాదా

చ. 2: యెదిరించి దీకొనగ నెంత గుండెది గావలె
వదలక మట్టు పెట్ట వసమా నిన్ను
మొదలఁ బెండ్లాడేనాటి మోహపు చేఁత లవి
అదె సాకిరిచెలుల నడుగఁగరాదా

చ. 3: యిచ్చకములాడ నీకు నెటువంటిది గావలె
పచ్చిసేసి తడవఁగఁ బంతకత్తెనా
యిచ్చలు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
అచ్చపుచెలులఁ దిగ వడుగఁగరాదా

రేకు: 0678-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 14-468

పల్లవి: ఎంత పొగడేవు నన్ను యేమిటికి బాఁతి నేను
కాంతల నింత సేసితే గర్వము పెరుగదా

చ. 1: నడుమే సన్నముగాని నాకు నీతోఁబొందుసేసేఁ
యెడలేని యాసోద మెంతైనాఁ గద్దు
జడిగొన్న నాసిగ్గే చలియించకుండుఁగాని
వుడివోనితమకము లుబ్బ్బాత లూఁగును

చ. 2: మనసే మెత్తనగాని మరిగిన నీపైబత్తి
అనిశము సోదించితే నన్నిటా గట్టి
నినుఁ జూచేచూపులు నీలవర్ణములు గాని
ననుపైన సెలవుల నవ్వులు తెలుపులు

చ. 3: చెలరేఁగి నామోవిచిగురే వొగరు గాని
పలుకులు నీకైతే పచ్చి తేనెలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మొలకలు నాచన్నులు ముదురు వలపులు

రేకు: 0679-1 భూపాలం సంపుటం: 14-469

పల్లవి: ఆపె నాదరించరాదా అందుకు నీవు
యేపునఁ బొందులు దక్కె నిఁకనేల మరఁగు

చ. 1: కన్నుల నీకాపె మొక్కె కంటివో లేదో నీవు
సన్నలనే తెలిసి వంచన సేసేవో
పన్నుకొన్న సిగ్గుతోడ పరాకులు చూపేవో
యిన్నియు నేనెరిఁగితి నిఁకనేల మరఁగు

చ. 2: పిసి పిసి మాటలాడెఁ బ్రేమతో వింటివో లేదో
వెస నందుకుఁ జొక్కి నివ్వెరగైతివో
కొసరి దొరతనాన గుట్టుసేసు కున్నాఁడవొ
యెసఁగె నీకోరికలు యిఁకనేల మరఁగు

చ. 3: ఇంచుకంత నవ్వు నవ్వె యెరిఁగితివో లేదో
పొంచి యిప్పుడే కూడి పొద్దు పుచ్చేవో
మంచితనములు సేసి మరియు నన్నేలితివి
యెంచఁగ శ్రీవేంకటేశ యిఁకనేల మరఁగు

రేకు: 0679-2 దేసాక్షి సంపుటం: 14-470

పల్లవి: ఇంతా నీపై మోహమే యెరఁగ విన్నవించితి
పంతముతో నెగ్గుగాను పట్టవద్దు సుమ్మీ

చ. 1: నెలకొని నీమీఁద నేరము లేకుండినాను
వెలఁదిఁ గనక నిన్ను వెంగె మాడుదు
యెలమి నీవు నీకు యెంత చనవిచ్చినాను
కొలఁది మీర నప్పటిఁ గొసరుదును

చ. 2: బడి వాయ కెప్పుడును పక్క నీవు వుండినాను
వొడలెల్లా సోదింతు నూరకె నిన్ను
జడియక నీవెంత సారెఁ గూడినాను
తడయక చెయి చాఁతుఁ దనియక నేను

చ. 3: యెనసినసరసము లెంత నీవు నెరపినా
చెనకుదు నీమేను చిరునవ్వుతో
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
వినయములే సేతు వేమారు నీకు

రేకు: 0679-3 దేవగాంధారి సంపుటం: 14-471

పల్లవి: ఇన్నిగుణాలవాఁడ వేమని నుతింతు నిన్ను
వన్నెకెక్క నేలితివి వలచితి నీకును

చ. 1: మారుసవతులు రానిమను వొకటే మంచిది
గోరు దాఁకకుండాఁ గూడేకూటమి మేలు
బీరాలు పచరించని ప్రియముల మాట లెస్స
యీరీతి నేలేరమణుఁ డిన్నిటాను జాణ

చ. 2: సొలసి యెగ్గుపట్టని చుట్టిరిక మెక్కుడు
అలుగని సంగాత మది యరుదు
చలము సాదించని సరసమే యబ్బురము
కలసి యిట్టున్న యట్టి కాంతుఁడే జాణ

చ. 3: మాట మీరకుండేటి మచ్చిక చెప్పరానిది
యీటు వెట్టని కొండాట మిన్నిటా మెచ్చు
గాఁటాన శ్రీవేంకటేశ గక్కన నన్నేలితివి
వాఁటముగ నెప్పుడూ నీవంటి వాఁడే జాణ

రేకు: 0679-4 కేదారగౌళ సంపుటం: 14-472

పల్లవి: ఈడా నింతు లున్నారు యెవ్వరై రేమి తనకు
ఆడరే యీమాట నే నంటినని చెలులు

చ. 1: అప్పటినుండీఁ గొలువై వున్నాఁడు రమణుఁడు
అప్పసమై కాంతలెల్లా నండ నుండఁగా
కప్పి బోనగత్తె లెల్లాఁ గాచుకున్నా రిక్కడ
చెప్పరే యాఁకలిగొనే చెలులాల పతికి

చ. 2: యెంత వొద్దా తాఁ జూడఁడు యేకతము లాడీఁదాను
జంత సతులెల్లా సరసము లాడఁగా
కాంతలేల్లా నిట్టే జలకము వట్టుకున్నారు
చెంతల నెచ్చరిమచరే చెలులాల పతికి

చ. 3: వొక్కి చొక్కి తా నిట్టే చూచీ నాటకసాలలు
యెక్కడలేని జవ్వను లెలయించఁగా
యిక్కడ నన్నేలినాఁడు యింకా దేవుళ్లున్న వారు
చిక్కించుక చూపరే శ్రీవేంకటపతికి

రేకు: 0679-5 వరాళి సంపుటం: 14-473

పల్లవి: తానే నాకు మాట యిచ్చెఁ దనచిత్తము
మోనముతో నలిగేనా ముద్దరాల నేను

చ. 1: మనసు వచ్చినాపెను మన్నించుమనవే
తనను వొద్దనేనా పంతమున నేను
ననిచి యెవ్వతెతోనైనా నవ్వుమనవె
పెనఁగి కోపగించేనా ప్రియురాల నేను

చ. 2: యేకాంతకైనాను యిచ్చక మాడుమనవే
కాకు సేసేనా తన్నుఁ గడవారితో
మేకుల కండసతిని మెచ్చు మెచ్చుమనవే
దీకొని వాదించేనా దేవులను నేను

చ. 3: వలసినవారిని వలపించుకొమ్మనవే
చలమునఁ గాదనేనా సారెకు నేను
అలమి శ్రీవేంటేశుఁ డాదరించి నన్నుఁగూడె
యెలమి నిఁక దూరేనా ఇల్లాల నేను

రేకు: 0679-6 మంగళకౌశిక సంపుటం: 14-474

పల్లవి: ఎంతసిగ్గులు వడేవు ఇందుకు నీవు
వంతఁ బొరల కెప్పటివలె నుండవయ్యా

చ. 1: యింటికి వచ్చి యాపె నీయెదుట నిలుచుండఁగా
అంటెఁ గాక మోహము నీ వాసపడేవా
వొంటినుండి సారె నీకు వూడిగాలు సేయఁగాను
నంటు సేసెఁ గాక నీమనసూ నటువంటిదా

చ. 2: మలయుచు నీతో నాపె మాటలెల్లా నాడఁగాను
కలసెఁ గాక పొత్తు గలదా తొల్లి
చలపట్టి పైకొని సరసము నెరపఁగా
పులకించెఁ గాక వట్టి పొందు సేసేవాఁడవా

చ. 3: పానుపై నిన్ను నాపె పచ్చిగాఁ గాఁగిలించఁగా
మేను చెమరించెఁగాక మించి కూడేవా
అనుక శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
కానుకాపె యియ్యఁగానేకాక చేత నంటేవా

రేకు: 0680-1 ధన్నాశి సంపుటం: 14-475

పల్లవి: తనకొద్దివారా నిన్నుఁ దగిలి యుండినవారు
చనవున యీపె నిన్ను సాదించీఁ గాక

చ. 1: వలనని జోలియేల వాసులఁ బెనఁగనేల
పిలిచితే రావద్దా ప్రియముతోడ
తలవంచుకొననేల తరితీపు సేయనేల
పలికితే నీతో మారుపలుకఁగ వలదా

చ. 2: యెడమాటాడించనేల యెమ్మెలు నెరపనేల
వొడివట్టితే లోఁగావద్దా తాను
కడు నడియాసలేల కాఁతాళించఁగనేల
విడెమతిగితే నిచ్చి వెసఁ గూడవలదా

చ. 3: చిఱునవ్వు నవ్వనేల సిగ్గులు వడఁగనేల
తఱితోఁ గాఁగిటఁ దానే తగులవలదా
యెఱుకతో శ్రీవెంకటేశ నన్ను నేలితివి
మఱి తానిది యెఱిఁగి మరుఁగంగవలదా

రేకు: 0680-2 మలహరి సంపుటం: 14-476

పల్లవి: పతితోడఁ జెలియా పంతమాడే దాననా
ఇతవుతో నేమనినా నియ్యకొనేననవే

చ. 1: తెగరానివానితోడ యెగసక్కె మాడనేల
మొగమిచ్చలే నెరపి మొక్కుట గాక
నగి తానూరకే యెంతనమ్మికలు సేసినాను
వెగటు లేకూరకుండే వింతసేయ ననవే

చ. 2: యేలినవానితోడ యెగసక్కె మాడనేల
నోలిగాను తప్పక చూచుట గాక
వాలాయించి తానెంత వద్దఁ గూచుండవచ్చినా
మేలుదాననై తన్ను మెచ్చు మెచ్చేననవే

చ. 3: పాయరానివానితోడ పగటులు చూపనేల
ఆయము లెరిఁగి విడె మందుట గాక
యీయెడ శ్రీవేంకటేశుఁడితఁ డిట్టె నన్నునేలె
చేయి చాఁచి పాదాలసేవ సేసేననవే

రేకు: 0680-3 నట్టనారాయణి సంపుటం: 14-477

పల్లవి: ఎప్పుడూ నావాఁడవే యెంత వొడఁబరచేవు
తప్పు లేదు నీవల్ల తగవు నీచేతిది

చ. 1: వాసి గలుగఁగ నావద్దనే వుండేననుచు
ఆసలేల చూపేవు అందుకేమయ్యా
బాస నీవెవ్వతెకైనాఁ బరగనిచ్చితేఁ బాయ
దోసము నీవెఱఁగవా తోయరాదు కాంతల

చ. 2: నంటున నెంతైనా నీవు నామాట దోయనని
అంటి నన్ను బుజ్జగించే వందుకేమయ్యా
జంటతోడఁ బెండ్లాడినసతు లింట నుండఁగా
వొంటి వేగించరాదు వూరడించువారిని

చ. 3: దిట్టవై శ్రీవెంకటేశ దేవుళ్ళలోనెల్లానీడ
అట్టె నన్నుఁ గూడితివి అందుకేమయ్యా
కట్టుకొన్న కాఁపురపుకామినుల నేలవలె
గుట్టునఁ దొలఁగరాదు కూడితే నేమాయను

రేకు: 0680-4 శ్రీరాగం సంపుటం: 14-478

పల్లవి: ఏల తలవంచుకొనీ నేఁటికి సిగ్గువడీని
వాలాయమైనప్పుడు నావద్ద నుండనీవే

చ. 1: వినయమే నేఁజేసే వెంగెము లేమీ నాడ
మనసు వచ్చినపుడు మన్నించనీవే
ననుపున నవ్వేను నమ్మిక లేమీ నడుగ
పని గలప్పుడు నన్నుఁ బాలించనీవే

చ. 2: వలపులే పైఁజల్లే వాసివంతు లేమీ నెంచ
తలఁపు లోఁగలితేను తానే రానీవే
కొలువులు సేసేను కోపగించ నెంతైనను
మలసి తా వచ్చినవాఁడు మాటలాడనీవే

చ. 3: జంపైన గుబ్బలనొత్తే సాదించి నేఁ దను దూర-
నింటికాడ ననుఁ గూడె నిట్టె కానీవే
నంటున మొక్కేను నేను నాటించఁ గొనగోరు
దంట శ్రీవేంకటేశుఁడు తగులనీవే

రేకు: 0680-5 శుద్ధవసంతం సంపుటం: 14-479

పల్లవి: చూడరే యీతనిమాట సుదతులాల
పాడి పాడి నాతోనెంత పతిజ్ఞ లాడీని

చ. 1: మగవాఁడు తానైనది మగువలకే కాక
తగుల నెందూనంటాఁ దా నేలనీనే
చిగురుఁబెదవితేనె చెలువలకే కాక
యెగసక్కేలకు నది యెందు వోసీనే

చ. 2: జవ్వనముగలదెల్లా సతులఁ బొందనే కాక
యెవ్వతేఁ గూడనంటా నే లిచ్చ లాడీనే
నవ్వులు సరసములు నాతులతోనే కాక
మువ్వంకాఁ దానెటువలె మూటగట్టీనే

చ. 3: కోరి తా జాణఁ డైనది గొల్లెతల నంటఁ గాక
వూరకే యాచారలెల్లా నొడిగట్టీనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
సారె నావాఁడనే యంటా సమ్మతిసేసీనే

రేకు: 0680-6 కన్నడగౌళ సంపుటం: 14-480

పల్లవి: ఇట్టే నాయాసోదము యేమని చెప్పుదునే
నెట్టన విన్నవించరే నేఁడు మీరాతనికి

చ. 1: కాంతునిఁ జూచినచూపు గక్కన మనసు చొచ్చి
మంతనాన నిదే నామర్మము రేఁచీనే
వింతగా నాతనిమాట వీనుల విన్నవినికి
బంతినే నారోమకూపములఁ జొచ్చీనే

చ. 2: పతితోఁ జేసినపొందు పరగ మేనెల్లా నిండి
సతతము నుప్పతిల్లీఁ జనుఁగవల
అతనిమోవిచవి అట్టె నాలిక మరిగి
రతికెక్కి గుక్కిళ్ళై రసము లుబ్బీనే

చ. 3: శ్రీవేంకటేశుకూటమి సిగ్గులెల్లాఁ దొప్పఁదోఁగి
వేవేలు కోరికలై వినోదించీనే
భావించి యాతని తలఁబాలు శిరసుననుండి
తావులపానుపుమీఁద దయిలువారీనే

రేకు: 0681-1 ఛాయనాట సంపుటం: 14-481

పల్లవి: మీరెంత బ్రమయించేరే మీతోఁ బొందు సేసెనంటా
వూరివారితోనెల్లా వొకఁ డోపఁగలఁడా

చ. 1: పందెమాడుతానున్నాఁడు పతివీఁపునఁ జన్నులు
సందడి నేల వొత్తేరే సతులెల్లా
మందలించి పరాకైతే మనసెందుపైఁ బారునో
ముందువెనకల రెంటా మోసపుచ్చ నేఁటికి

చ. 2: సారె చేతఁ బట్టినాఁడు సారెఁ గానుక గొమ్మంటా
గోరులేల తాఁకించేరే కొమ్మలెల్లాను
యీరీతి దొమ్మిసేసితే నెందుఁ దగులాయమౌనో
పేరడి నింతేసి పిరువీకు సేయనేఁటికి

చ. 3: తడవుగా నాడినాఁడు తగిలి శ్రీవేంకటేశు-
వొడిపై నేల కూచుండే రువిదలెల్లా
అడరి పైకొంటేను ఆస యెందుఁ బుట్టునో
తడఁబాటు సేసి ఇంత తమకించనేఁటికి

రేకు: 0681-2 సౌరాష్ట్రం సంపుటం: 14-482

పల్లవి: అవిగో నావిన్నపము లన్నియు నందె వున్నవి
తివిరి యేలడిగేరు తెలుసుకోరే

చ. 1: పూనుక ఆతనికిఁగా బుద్ధి నాకెంత చెప్పేరు
వీనుల నన్ని సుద్దులు వింటినే నేను
కానుక యిచ్చితి నని కాంతునికి పూవుదండ
మోనతోఁ జేతి కిచ్చి మొక్కరే నామారు

చ. 2: యీరీతి నిందరు నన్ను నేల వొడఁబరచేరు
కూరిమి నివెల్లా నెరుఁగుదునే నేను
పూరకే నాకుంచెను నావూడిగముగ విసరి
గారవించి మేలని పొగడరే నామారు

చ. 3: తలపోసి నాకేమి తారుకాణించ వచ్చేరు
కలదెల్లా నాకన్నులఁ గంటి నేను
యెలమి శ్రీవేంకటేశుఁ డీడ వచ్చి నన్ను నేలె
నిలువున సేసలు నించరే నామారు

రేకు: 0681-3 సాళంగనాట సంపుటం: 14-483

పల్లవి: వొద్దనేమా నిన్ను నేము వూరకే యేల లోఁగేవు
బుద్ధులెల్లా నేరిపి బుజ్జగించరాదా

చ. 1: నీ మొగము చూచి చెలి నిలువెల్లాఁ జెమరించె
వేమరు సురటిఁ గొని విసరరాదా
చేముట్టి నీకు మొక్కి చిత్తమెల్లాఁ గరఁగెను
ఆమని నీమోవియిచ్చి అలపార్చరాదా

చ. 2: సన్నలనే మాటలాడి సతి పరవశమందె
చన్నులపైఁ బన్నీరు చల్లఁగరాదా
నిన్నుఁ గొల్చి తానుండి నిట్టూరుపులు నించె
వున్నతిఁ గాఁగిటఁ గూడి వూరడించరాదా

చ. 3: సెలవుల యింతి నవ్వి సిగ్గులలో నోలలాడీ
పిలిచి నీతొడమీఁదఁ బెట్టుకోరాదా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
లలి రతులెల్లా నేర్పి లాలించరాదా

రేకు: 0681-4 శ్రీరాగం సంపుటం: 14-484

పల్లవి: సేవ లెప్పుడూఁ జేసి నే చెప్పితిఁగాక
వేవేలైనా నిద్దరికి వింత కానటే

చ. 1: ననుపు గలిగితేనే నవ్వులింపు లౌఁగాక
మన సొకచోటనుంటే మరి యేఁటికే
కనుఁగొని చే చాఁచితే కానుకియ్య వచ్చుఁ గాక
పెనఁగులాడితేను ప్రియ మౌనటే

చ. 2: మక్కువతో వింటేను మాట లాడ వచ్చుఁ గాక
యెక్కడో పరాకైతే యెనయునటే
చక్క వద్దనుంటే మోవిచవి చూపువచ్చుఁగాక
అక్కడా నిక్కడానుంటే నను వౌనటే

చ. 3: వొట్టి కాఁగిలించుకొంటే నొద్దిక దనివౌఁగాక
గుట్టున నుండితేను కూడుట యెట్టే
అట్టె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
దిట్టయై నన్ను నేలె తెలిపితిఁగాక

రేకు: 0681-5 శంకరాభరణం సంపుటం: 14-485

పల్లవి: చేపట్టి నన్నేలి చేకొంటి వీకాంతను
మీపొందులు చూచి చూచి మెచ్చేరు యీచెలులు

చ. 1: వారక వేరొకయింతివద్దికి నీ వేగఁగాను
కూరిమితోఁ బారి తెచ్చి కొంగువట్టి
గోరు చెక్కిటపైఁ దీసి గుబ్బలు వీఁపున నూఁది
చేరఁదీసె పొన్పునకు చెప్పరాదు మోహము

చ. 2: పొరుగు మేడపై సతిఁ బొంచి నీవు చూడఁగాను
తెరవేసి నీమోవితీపు లాని
నిరతిఁ దనపాదము నీపాదముతోఁ గీలించి
సిరుల నిన్నుఁ జొక్కించె చెప్పరాదు మోహము

చ. 3: సంగడి నున్న చెలితో సన్న నీవు సేయఁగాను
రంగుగఁ బయ్యద గప్పి రతి సేసి
చెంగట నలమేల్మంగ శ్రీవేంకటేశ్వర కూడి
సింగారాన మెరసి చెప్పరాదు మోహము

రేకు: 0681-6 రామక్రియ సంపుటం: 14-486

పల్లవి: ఎందాఁకాఁ గొలువు సేసే రెన్ని లేవు పనులు
అంది ముచ్చటలు మీలో నాడరయ్యా ఇఁకను

చ. 1: కప్పురవిడెము నదే కస్తూరి పూసుకో నదే
దప్పికిఁ బన్నీరదే దండ నున్నది
చెప్పినవూడిగాలకు చెంతనె కాచుకుండేము
వొప్పుగ నేకతమున నుండరయ్యా యిఁకను

చ. 2: విరులదండ లివిగో విసరుకో సురటిదే
పరగఁ బరచితిమి పానుపూ నిదే
అరసి యేమైనా మీ రానతిచ్చితేఁ జేసేము
వొరిమెతోఁ బవ్వళించి వుండరయ్యా యిఁకను

చ. 3: ఆరగించఁ గజ్జాయము అదిగో పానకము
కోరి యలమేల్మంగతోఁ గూడిననీకు
ఈరీతి శ్రీవేంకటేశ యిక్కడనే వున్నారము
కూరిమి మీయలపార్చుకొనరయ్యా యిఁకను

రేకు: 0682-1 ముఖారి సంపుటం: 14-487

పల్లవి: మందెమేళ మైనమీఁద మరి చెప్ప నేఁటికి
అందెవ్వతెతో నవ్వినా అదలించీ నిన్నును

చ. 1: చెనకి నీవు నవ్వఁగా సిగ్గువడెఁ గాక చెలి
మునుపటివలె నుంటే మొక్కదా నీకు
చనవు నీవియ్యఁగానె సంగడిఁ గూచుండెఁ గాక
పనులు సేయించుకొంటే బత్తితోడఁ జేయదా

చ. 2: మట్టులేక వలవఁగా మంచముపై నుండెఁ గాక
గుట్టున నుండితే నీకుఁ గొలువు సేయదా
నెట్టన నొడి వట్టఁగా ని న్నింత జంకించెఁ గాక
అట్టే వోరచుకుంటేఁ బ్రియము నీకుఁ జెప్పదా

చ. 3: పైపైఁ గూడఁగా నీమై పచ్చిసేసెఁ గాక తరి-
తీపు సేసితే వడఁదేర్చదా నిన్ను
యేపున శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
చేపట్టి నన్నేలి తాపె చేరి బుద్ది చెప్పదా

రేకు: 0682-2 భైరవి సంపుటం: 14-488

పల్లవి: సేయఁగల వూడిగాలు సేసేము గాక
యీయెడ నిన్ను నేము ఇట్టిట్టన వచ్చునా

చ. 1: పొంతనుండి యాకె నీకు బుద్దులెల్లా నేరుపఁగా
సంతతము మాతో మాట చవుల లయ్యీనా
పంతమాడేయాపె నీపై బత్తు లిట్టే చూపఁగాను
కాంతుఁడ నీ వినయాలు కాన వచ్చీనా

చ. 2: నంటు సేసుకొని నీతో నవ్వు లాపె నవ్వఁగాను
ఇంటికిరమ్మనఁగా నీ కితవయ్యీనా
జంటై నీ ముందరఁ దాఁ జనవులు మెరయఁగా-
నంటి సరసము లీడ నాఁడ గొలిపీనా

చ. 3: వరుస వెట్టుక యాపె వలపులు చల్లఁగాను
సరస నాకుఁ గూచుండ సంగతయ్యీనా
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
ధర నన్నేలితి విది దలఁచుకొనేవా

రేకు: 0682-3 సామంతం సంపుటం: 14-489

పల్లవి: ఏఁటికి సిగ్గులు వడే వెవ్వరున్నా రీడను
పాటించి నీభాగ్యమాయఁ బైకొనవయ్యా

చ. 1: మొగమునఁ జిరునవ్వు మొలచె నింతికిని
తెగని వలపులనుఁ దీగెలు సాగె
చిగిరించి కోరికలఁజెలఁగి గుత్తులు గట్టె
జిగి జవ్వనవనానఁ జిత్తగించవయ్యా

చ. 2: ముంచినపులక లనుమొగ్గలెల్లా నిండుకొనె
మంచికాపు వట్టెను చెమటముత్యాల
దించరానిమోవిపంటి తీపు లనేఫలమందె
పొంచి జవ్వనవనాన భోగించవయ్యా

చ. 3: సమరతి వూర్పులచల్లగాలి విసరెను
కొమరె గుబ్బలమేలు కుప్పలాయను
అమరె శ్రీవేంకటేశ అలమేలుమంగగూడె
తమి జవ్వనవనానఁ దని వొందవయ్యా

రేకు: 0682-4 దేవగాంధారి సంపుటం: 14-490

పల్లవి: ఎన్నిటికై నా వచ్చు నిచ్చకపు నీచేఁతలు
మన్నన నాకిచ్చితివో మహిమ చూపెవో

చ. 1: మనసు చూడవలసి మచ్చిక నాకుఁజేసేవో
యెనయ నిజాలకును యింపు గలదో
పని గలిగి నాతోను పలుమారు బలికేవో
అనిశము నూరకే ఆసలు చూపేవో

చ. 2: ప్రియము గలిగి నాతోఁ బెనఁగాడ వచ్చేవో
బయకారములు నాతోఁ బచారించేవో
నయాన బత్తి గలిగి నవ్వులు నవ్వేవో
క్రియ దెలిసినదాఁకా గేలిసేసేవో

చ. 3: కరుణ గలిగి ననుఁ గాఁగిలించి కూడితివో
తరుణుల కిది చూపి తమి రేఁచేవో
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యిరవై నన్నేలితివో యిది నీ వినోదమో

రేకు: 0682-5 నారాయణి సంపుటం: 14-491

పల్లవి: ఆపె నాచెల్లెలు గాదా అందుకేమి
నాపొందు విడువ నని నమ్మించేవు నీవు

చ. 1: ప్రేమము గలిగినాపె ప్రియపడి మాటాడఁగా
నామోము చూచి యేమి నవ్వేవు నీవు
వేమరు గడ్డము వట్టి వేడుకొని పిలువఁగా
ఆముకొని నన్నే లప్పుణడిగేవు నీవు

చ. 2: వావి గలసిన యాపె వలపులు చల్లఁగాను
సోవలుగా నాకేఁటికిఁ జూపేవు నీవు
కావరించి యిక్కువకు గనుసన్న సేయఁగా
భావించి నన్నెంత వొడఁబరచేవు నీవు

చ. 3: పొరుగున నున్నయాపె భుజముపైఁ జెయి వేయఁగా
అరసి నన్నిట్టుగూడే వప్పటి నీవు
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సిరుల నిచ్చకా లెన్ని సేసేవు నీవు

రేకు: 0682-6 రీతిగౌళ సంపుటం: 14-492

పల్లవి: వాకిటఁ గాచుకున్నది వచ్చినదాఁకా నీవు
జోకతోడుత నెదురు చూచీ రావయ్యా

చ. 1: విందుగాఁ దనయింటికి విచ్చేయు మనె నిన్ను
అందుకోవయ్యా కానికె అంపె నీకాపె
చెంది నిన్నుఁ దోడుకొని చేరి కొల్చి రమ్మనె
అందలము పుత్తెంచె నదిగో రావయ్యా

చ. 2: దండిగా నొసల నక్షంతలు నీకుఁ బెట్టుమనె
దండము వెట్టుమనెను తనమారుగా
యెండ గాకుండా గొడుగు యిదే పట్టుక రమ్మనె
అండనే ముద్దుటుంగర మంపెను రావయ్యా

చ. 3: కోరి పైడి పీఁటమీఁదఁ గూచుండఁ బెట్టుమనె
చేరె నీసంగడికిఁ దాఁ జేకొను మిఁక
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
కూరిమితోఁ గూడితివి గుట్టున రావయ్యా

రేకు: 0683-1 వరాళి సంపుటం: 14-493

పల్లవి: కోపగించుకొనకు మీకొమ్మ బత్తిసేసె నింతే
వోపికగలదొరకు వోర్వఁగ వలెను

చ. 1: తరుణి నీమేన గందము వూసేపరాకున
నిరతి గట్టిచన్నులు నిన్నుఁ దాఁకెను
సరస నీకుఁ గొప్పు చక్కఁబెట్టేపరాకున
అరుదుగా నీచెక్కున నటు గోరంటెను

చ. 2: యింతి నీకు వీడెము లిచ్చేపరాకున-
నంతలోఁ జెమట నీపై నటు చిందెను
చెంతనుండి వూడిగాలు సేసేపరాకున
బంతినే నిట్టూర్పులు నీపై విసరఁ జొచ్చెను

చ. 3: అలమేలు మంగ నిన్ను నలమేపరాకున
నెలవై యాపెపాదము నిన్ను సోఁకెను
నలి శ్రీవేంకటేశ్వర నవ్వేపరాకున
కలికి తమ్ములము నీకాయమెల్లా నిండెను

రేకు: 0683-2 గుండక్రియ సంపుటం: 14-494

పల్లవి: నీ చిత్త మెట్టున్నదో నే నెరఁగను
చూచి నాకైతేఁ గడుసోద్యము లయ్యీని

చ. 1: చనవు గల దంటాను సరసము నీతో నాడీ
వనిత కొలువులో నీవద్దఁ గూచుండి
యెనసి నీదొరతన మెంచవద్దా యిందుకుఁగా
విని సవతులెల్లా నివ్వెరగుతో నున్నారు

చ. 2: అత్తి పెండ్లాడితినంటా నట్టె ముందే కడియెత్తీ
పొత్తులవా రుండఁగాను పొలిఁతి
తత్తరిచీఁ దన నీయంతరము భావించవద్దా
చిత్తగించి నీదేవుళ్లు సిగ్గులు వడేరు

చ. 3: అలమేలుమంగ నేఁడట్టే నీవుర మెక్కీని
చెలులెల్లా వూడిగాలు సేయఁగాను
నిలిచి శ్రీవేంకటేశ నీగుట్టు దలఁచవద్దా
అల నీచుట్టపుఁగాంత లందర నవ్వేరు

రేకు: 0683-3 సాళంగనాట సంపుటం: 14-495

పల్లవి: కూడేవేళ లేనిసిగ్గు కొలులో వచ్చెనా
వేడుక వలపు వెల్లవిరి సేయరాదా

చ. 1: యెదట నున్నది చెలి యెక్కడ పరాకు నీకు
అదివో వద్దఁ గూచుండు మనఁగరాదా
పెదవుల గదలించీ ప్రియము చెప్పీనేవమో
అదనుగా వీను లొగ్గి ఆలకించరాదా

చ. 2: చేతికి వీడె మియ్యఁగా శిరసేల వంచేవు
కాతరాన నందుకొని కలయరాదా
యీతల నిన్నే చూచీ యెంతపని గలిగెనో
ఆతలుపేఁటిదో నీ వడుగఁగరాదా

చ. 3: మొక్కీ నీకు సారె నాపె మోహ మేల దాఁచేవు
చిక్కి శ్రీవేంకటేశ్వర చేకొనరాదా
అక్కన నలమేల్మంగనైన నన్నుఁ గూడితివి
దక్కితివి నీవు నాకు తన్నుఁ బిలువరాదా

రేకు: 0683-4 ముఖారి సంపుటం: 14-496

పల్లవి: అంతెకాదా వుప్పు వేసి అట్టె పొత్తు గలసేవు
వింతలాయ నీవు నొక వినోదకత్తెవు

చ. 1: వారక నాయిల్లు చొచ్చి వచ్చి రమణునితోడ
సారెకు నవ్వే వౌనే జాణకత్తెవు
కూరిమి నామంచముపైఁ గూచుండఁగా విడెము
తారి తారి యిచ్చేవేమే తాలిమికత్తెవు

చ. 2: మగని నే దూరితేను మరి పూసుక వచ్చేవు
జిగి నీవు గలితిగా చెలికత్తెవు
పగటున నాకాఁగిటి సతిపాదాలు గుద్దేవు
వెగటులే కిపుడైతివే వూడిగకత్తెవు

చ. 3: అలమేలుమంగ నేను అతఁడు శ్రీవేంకటేశుఁ
డెలమి నవ్వులు నవ్వే వెమ్మెకత్తెవు
కలసె నాతఁడు నన్ను కాంతుని నీవూఁ గూడేవు
తెలిసితి నీగుణము తేరకత్తెవు

రేకు: 0683-5 దేసాళం సంపుటం: 14-497

పల్లవి: ఏకాంతము గద్దు మన కిద్దరికిని
దాకొని యామేలు నీవు తలఁచుకోవయ్యా

చ. 1: కోమలి పెట్టి పంపిన గురుతు కానిక నీకు
యీమరఁగున నిచ్చే నిటు రావయ్యా
నీమేనఁ గస్తూరి యిది నిండా నన్నే పూయి మనె
దీమసము నెరపక తెర వేయించవయ్యా

చ. 2: వొట్టి తనమారు పాదా లొత్తుతా నన్నుండుమనె
పట్టె మంచము మీఁదఁ బండుండవయ్యా
జట్టిగా నీమోవిపండు చవి చూచి రమ్మనె
యెట్టిదో చూతము మొగ మెత్తఁ గదవయ్యా

చ. 3: యెలయింపించె శ్రీవేంకటేశ నాచే నీదేవులు
అలమేల్మంగ మతక మంతా నయ్యా
అలరి కాఁగిలించితి మందుకేమి మెచ్చాయ
చలపట్ట కేలికసానిఁ గూడవయ్యా

రేకు: 0683-6 లలిత సంపుటం: 14-498

పల్లవి: ఇటువలె నున్నవి మీ యేలాటాలు
తటుకునఁ జెప్పితేను తగ సంతోసించేము

చ. 1: పొలిఁతి నవ్వితే నీవు బొమ్మల జంకించేవు
మలసి యేమైనా నాపె మర్మ మెత్తెనో
చెలరేఁగి మాటాడితే సిగ్గులు వడేవు నీవు
కలదో అందేమైనాను కారణములు

చ. 2: తప్పక చూచితేను తలవంచుకొంటివి
చెప్పరానిచేఁత లాడఁ జేసితివో
కప్పురాన వేసితేను గక్కన సన్న సేసేవు
చొప్పు లెత్తి గుఱుతులు చూపెనో నీమేను

చ. 3: వేళ యెరిఁగి మెచ్చితేవేడుక పడేవు నీవు
కోలుముందైరతు లియ్యకో లాయెనో
ఆలరి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
తాలిమి నన్నేలితివి తగనాపె చెప్పెనో

రేకు: 0684-1 ఆహిరి సంపుటం: 14-499

పల్లవి: నీవె నన్నుఁ జూచి కరుణించేవు గాక
కావరించి వేసరించఁ గలనా నేను

చ. 1: నెయ్యమున నెవ్వతెతో నీవు పొందుసేసినాను
గయ్యాళిమాటలాడే కాంతనా నేను
చయ్యన విటుఁడవై యేజాడలఁ దిరిగినాను
కొయ్యవు నీవని దూరేగుణమా నాది

చ. 2: వింత పెండ్లికొడుకవై వేడుకతో వచ్చితేను
పంతాన సాదించ నీతో బలిమా నేను
ఇంతలో వేరొకతె నీవింటికిఁ దెచ్చుకొంటేను
సంతల నీసుద్దులెల్లా చాటఁగ నోపుదునా

చ. 3: వలచి నీ వెవ్వరివాకిటఁ గాచుకుండినా
కొలఁదిమీరి నిన్నాడుకొనేనా నేను
అలమేల్ మంగను నేను అట్టె శ్రీవెంకటేశ్వర
కలసితి విటు నన్ను కరకరించేనా

రేకు: 0684-2 దేసాళం సంపుటం: 14-500

పల్లవి: ఎంతలేదు మీమాటలు యేమి చెప్పేరే చెలులు
కాంతుల డీడకు వచ్చితేఁ గాదు గూడదనేనా

చ. 1: వలుపే నిజమైతే వనితలతోడుత
చలము లెవ్వరైనాను సాదింతురా
వెలలేనిరాత్రుల వెన్నెల గాయునట
యెలమి నక్కడ వచ్చి యెండలుండునా

చ. 2: పొందు సేయవలసితే పొలఁతుల యడాటాన
యిందుముఖలను జూపి యెలయింతురా
కందువైన వసంతకాలమునందును
పొందుగానిజాజిపొదఁ బువ్వులుండునా

చ. 3: అట్టె శ్రీవెంకటేశుఁ డలమేల్ మంగను నేను
గుట్టున నన్నేలె నిఁక గురుతున్నదా
పట్టె కొలనిలో హంస పరగఁ జూపట్టినట్టు
యేట్టి పక్షులుండినాను యెన్నిక కెక్కీనా

రేకు: 0684-3 వరాళి సంపుటం: 14-501

పల్లవి: అటువంటిసతికిఁ గాకయ్యో నీవు లోనయ్యేవా
ఘటన నే నీకు నిచ్చకము లాడేదానను

చ. 1: చెంతల నందరిలోన సిగ్గుపడి మండితేను
కాంతునిఁ జెనకవచ్చు గబ్బియైనది
యెంత వోరుచుకుండినా నెరఁగదు మోహించి
పంతములాడఁ జూచు భయము మాలినది

చ. 2: తక్కక యంతేసిదొరతనాన విభుఁడుండినా
మిక్కిలి నవ్వు మందెమేళమైనది
వొక్కటై పాన్పున నెట్టు వొనగూడి వుండినాను
కక్కసించు రతులకు గయ్యాళియైనది

చ. 3: గారవించి మగవాఁడు కాతరానఁ బెనఁగితే
మారుకొనుఁ గడుఁ జలమరియైనది
చేరి యలమేల్మంగను శ్రీవెంకటేశ కూడితి-
వీరీతిఁ బ్రియము చెప్పు నిచ్చకమైనది

రేకు: 0684-4 సామంతం సంపుటం: 14-502

పల్లవి: చూచి చూచి మాకిందుకు సోద్యమయ్యీని
చేచేత నిన్నింత నేను సేయఁజాలఁగా

చ. 1: నెలఁత గూచుండఁగాను నిలుచుండి మాటాడేవు
యెలమి నీ దొరతన మేమి చెప్పేది
కలువల వేయఁగాను కడు నొడ్డించుకొనేవు
వలపు నిన్నింత సేసి వంచుకొనేఁగా

చ. 2: అడపములోనివీడె మాపెకు నీవందిచ్చేవు
కడలేని నీ పంతము కానవచ్చెను
అడరి చేయి చాఁచితేను అంది కైలాగిచ్చేవు
వెడయాస నీసిగ్గు విడిపించెఁగా

చ. 3: చెమరించె నంటాను చెక్కుచేతఁ దుడిచేవు
తమితోఁ బెద్దరిక మింతకు వచ్చెను
అమర శ్రీవెంకటేశ ఆలమేల్మంగఁ గూడితి
జమళి నన్నేలితి వాసతి చెప్పెఁగా

రేకు: 0684-5 సౌరాష్ట్రం సంపుటం: 14-503

పల్లవి: తాఁ గలడు నాకు యేమీఁ దడవలెను
చేఁగదేరె మనసెల్లా చెప్పి చూపునేఁటికి

చ. 1: యెలయించవద్దుగాని యెట్లైనా నుండుమనవే
వలతుఁ గనక యిఁక వద్దన నేను
తొలుతనే యెరుఁగుదు దూరితే వెరవఁడు
చలివాసి తిరిగీని చండిపార నోపను

చ. 2: యీడు వెట్ట వద్దుగాని యెవ్వతైనాఁ దేనీవే
ఆడుకోఁగాఁ దనవోజ లట్టె మానీనా
ఆడనే గడుసు పడె నలయించఁగా నేమి
కూడి వుండినచోటను కోపగించఁ దగదు

చ. 3: యెడయఁగ వద్దుగాని యెప్పుడైనాఁ గూడనీలే
విడువరానియెడకు విసువేఁటికి
అడరి శ్రీవెంటేశుఁ డలమేల్‌మంగను నేను
కడలేక నన్ను నేలె కన్నుల మొక్కేను

రేకు: 0685-6 మంగళకౌశిక సంపుటం: 14-504

పల్లవి: ధరలో నాకుఁ గొత్తలా తనచేఁతలు
సిరులతోఁ గాఁపురము సేయుమని యనవే

చ. 1: కొత్త పెండ్లికూఁతురంటా కోరి నాకేమి చూపీనే
యెత్తి యింటఁ బెట్టుకొనుమనవే తాను
యెత్తి యాపెచక్కఁదనా లీడనేల పొగడీనే
బత్తితోఁ దానె సంతోసపడి వుండుమనవే

చ. 2: బువ్వమంటా నాపెంగిలిపొత్తుకేల పిలచీనే
రవ్వగాఁ దానారగించి రమ్మనవే
యివ్వల నాపెకులము యింతయేల చెప్పీనే
పవ్వళించి తానే యెంచి పాటముగొమ్మనవే

చ. 3: చెల్లెలంటా నాకునేల చెప్పి యప్పగించీనే
బల్లిదుఁడు తనాలాయ బదుకుఁ గాక
చెల్లు నలమేల్ మంగను శ్రీవెంకటేశుఁడు తాను
కొల్లగాఁ దన్నునేలెఁ గూడి వుండుమనవే

రేకు: 0685-1 మాళవిశ్రీ సంపుటం: 14-505

పల్లవి: ఎందుండి తెచ్చుకొంటివి యీపెను నీవు
అందమాయఁ జేఁతలు నేఁడాపె నీకుఁ దగును

చ. 1: శిరసు వంచుకొంటా సిగ్గులు వడుకొంటా
సరసము లేమాడీ సతి నీతోను
సరులు దిద్దుకొంటా సారె నిన్నుఁ జూచుకొంటా
విరుల నేల వేసీ వేమరు నీపైని

చ. 2: పాటలు వాడుకొంటా పాపట దువ్వకొంటా
నీటులేమి చూపీని నెలఁత నీకు
మాటల సొలసుకొంటా మర్మము లంటుకొంటా
చీటికి మాటికినేల చెక్కులు నొక్కీని

చ. 3: చేతులెత్తి మొక్కుకొంటా చేరి కాఁగిలించుకొంటా
కాతరించి యెట్టుగూడీఁ గాంత నిన్ను
నీతితో శ్రీవేంకటేశ నేనలమేలుమంగను
యీతల నన్నేలి తీపె యిప్పుడె మెచ్చీని

రేకు: 0685-2 సామంతం సంపుటం: 14-506

పల్లవి: నీవంక దోసము లేదు నేఁడాపెవంకనే కాక
రావయ్య నీవేల ఆవలిమో మయ్యేవు

చ. 1: నెలఁత నీతో నవ్వితే నీవూ నవ్వితివి గాక
తలకొని నీవంకఁ దప్పులున్నవా
వలపు లాపె చల్లగా వలచితి వింతే కాక
బలిమి నంతక తొల్లి పైకొంటివా

చ. 2: ఆకెవిడె మియ్యఁగాను అందుకొంటి వింతే కాక
కాకుసేయ నీవంకఁ గడమున్నదా
నీకు మొక్కఁగాఁ గాఁగిట నించుకొంటివి గాక
దాకొని రతికి నీవు తమకించితివా

చ. 3: సంగతిఁ బండుండఁగాను సతిఁ గూడితివి కాక
చెంగట నిన్ను దూరి చెప్పనున్నదా
రంగుగ నేనలమేలుమంగను శ్రీవేంకటేశ
సంగతిగాఁ గూడితివి జాగులు సేసితివా

రేకు: 0685-3 కాంబోది సంపుటం: 14-507

పల్లవి: నివ్వెరగుతోడుత నీదిక్కు చూతుఁగాక
అవ్వలివారి దూర నరుహము నాకు

చ. 1: గరిమ నీవెవ్వతె నక్కడఁ బొందు సేసుకొన్నా
సరివెట్టు కాపెతో జగడించేనా
నిరతి నేఁజూడఁగానె నీవు నాపె నవ్వినాను
యెరవులు సేసుకొని యెగసక్కె మాడేనా

చ. 2: యెలమి నెవ్వతె నాకు నెదురుగాఁ బెట్టినాను
మలసి సరకుసేసి మాటలాడేనా
నలిరేఁగి మీలో సన్నలు సేసుకొన్నాను
చలపట్టి నేనది సడ్డసేసేనా

చ. 3: కందువ నెవ్వతెచేతికానుక నీవందుకొన్నా
చెందియది గురిసేసి చెప్పవచ్చేనా
అంది శ్రీవెంకటేశ్వర అలమేలుమంగను నేను
అందముగా నన్నేలితి వాపె నిఁక మెచ్చేనా

రేకు: 0685-4 హిందోళవసంతం సంపుటం: 14-508

పల్లవి: మగవారితోడుత మగువకును
నిగిడ యెంతైనా మేలే నెరపుట గాక

చ. 1: మొగము చూచితేను మొక్కి వుండుట దగు
నగితేను కలసి పెనఁగఁ దగును
తగులు గలిగితేను దండనె కూచుండఁ దగు
యెగసక్కె మైతేను యేమి సేయవచ్చునే

చ. 2: మనసొగ్గి వింటేను మాటలాడఁగఁ దగు
ననుపు నడపితేను నవ్వఁగఁ దగు
చనవు లొసఁగితేను సరసము చూపఁదగు
తనంతఁ దానుంటే తమి యెట్టు రేఁచేదే

చ. 3: తడయక కూడితేను తరితీపు సేయఁదగు
జడియని పొందైతే సాదించఁదగు
అడరి శ్రీవెంకటేశుఁ డలమేల్మంగను నేను
కడఁగి నన్నేలె నిఁకఁ గాదనే దేఁటికే

రేకు: 0685-5 దేసాక్షి సంపుటం: 14-509

పల్లవి: ఏల సిగ్గులు వడేవు యెవ్వరు నిన్ను నవ్వేరు
యీలీల నేఁ జెలికత్తె నెవ్వరితోఁ జెప్పనే

చ. 1: పొంతనె యప్పటినుండి పొత్తునఁ గూచుండుమనీ
ఇంతిరో విభునిమాట యియ్యకొనవే
యెంత వేడుకో కాని యిట్టె కూడి చేతికిచ్చీ
సంతోసానఁ గైకొని చవిగొనవే

చ. 2: మించి తననోరిపాలమీఁగడ నీకొసగీని
అంచెల నీ మోవితేనె అందుకొనవే
నించిన రసాయనము నీకు పుక్కిటినె చూపీ
పొంచి పావురమువలెఁ బూని యారగించవే

చ. 3: వేడుక బువ్వాలలోనె వేవేలు రతులు సేసీ
వీడక నీవూ నెదురు విందు వెట్టవే
యీడనె శ్రీవెంకటేశుఁ డీతఁ డలమేల్మంగవు
కూడితివి తనిసి యిక్కువ నుండఁగదవే

రేకు: 0685-6 రామక్రియ సంపుటం: 14-510

పల్లవి: నంటున నాతనిచేఁతో నావోజ ఇట్లాయనో
కంటిరా వోచెలులాల కారుకమ్మీ వలపు

చ. 1: సిగ్గుల మాటలాడితే చిరునవ్వు వచ్చుఁగాక
కగ్గి మతిఁ గోపముకాఁ గారణమేమే
అగ్గలమై చెనకితే నాస పుట్టవలెఁ గాక
యెగ్గుపట్టి బొమముడి యేల పాంచీనే

చ. 2: చేరి పెనఁగులాడితే చెమటలు రేఁగుఁగాక
పోరచి మెయికాఁకలు పొడమనేలే
సారెఁ దప్పక చూచితే సంతోసించవలెఁ గాక
మారుకొన్న పంతములు మలయఁగ నేఁటికే

చ. 3: తతిఁ గూడితే రతిఁ దనివందవలెఁ గాక
మితిలేని తమకము మెరయనేలే
అతఁడు శ్రీవెంకటేశుఁ డలమేల్మంగను నేను
చతురతఁ గూడితిమి చల మిఁక నేఁటికే

రేకు: 0686-1 కన్నడబంగాళం సంపుటం: 14-511

పల్లవి: మెచ్చితి నే నిన్నిందుకు మేలు నీవు పాయములు
వొచ్చెము మానఁగ సొమ్ము లొసఁగేవు నాకును

చ. 1: ఇక్కడ నే దూరేనంటా నిందాఁకా నీవాపె-
పక్కనుండి వచ్చి నాపై బత్తిసేసేవు
నిక్కి మోవియెంగిలైన నేర మెంచకుండాను
మక్కువలు చల్ల నాతో మాటలాడేవు

చ. 2: ఆకెయింట నారగించి అందు కేమీ ననకుండా
చేకొని వీడే లిక్కడఁ జేయవచ్చేవు
జోకతో మేని మచ్చము చూచి నేఁ గోపించకుండా
కైకొని గక్కన నన్నుఁ గాఁగిలించుకొనెవు

చ. 3: కలసి యాపె యిచ్చిన కప్పురము నాకిచ్చి
చలపట్టి నాకాఁక చల్లార్చేవు
నిలిచి శ్రీవెంకటేశ నేనలమేలుమంగను
యెలమితో ననుఁ గూడి యింపులు రేఁచేవు

రేకు: 0686-2 రామక్రియ సంపుటం: 14-512

పల్లవి: నీవాపె పై బత్తియౌత నేనెరఁగను
చేవమీరఁ దొల్లే బుద్ది చెప్పవద్దా నాకు

చ. 1: నలువంకా నీతోనే నవ్విన నవ్వులెల్లా
యెలమి నాపెతో నీవు యేల చెప్పేవు
కలవరించి నీసతిఁ గాఁతాళించి నేఁ దిట్టితే
చెలరేఁగి నీవేల చిన్నఁబోయేవు

చ. 2: పెనఁగఁగా నాగోరు బెరసి నిన్ను సోఁకితే
యెనసి యాపెకు నీవేమి చూపేవు
కని తా నీవద్ద నుండఁగా మరిచి నే దొబ్బితే
తనివి లేక నీవెంత తలవంచేవు

చ. 3: తమకించి నాచన్నులఁ దగ నిన్ను నొత్తితేను
సముకాన నాపెకేల సన్న సేసేవు
అమర శ్రీవెంకటేశ అలమేల్ మంగనే నేను
సమరతి నిద్దరికిఁ జనవు లిచ్చేవు

రేకు: 0686-3 నాదరామక్రియ సంపుటం: 14-513

పల్లవి: కతలేల చెప్పేవు కడు నిజమరినంటా
పతివి నీచేఁతలెల్లాఁ బచారించవలెనా

చ. 1: చూచితేనే తెలియదా చొక్కమైన మోహము
చేచేత నంతేసి గరిసించవలెనా
కాచుక వేగించేయందే కానదారా నీసుద్దులు
యీచాయ నింద నీపైనింకా మోపవలెనా

చ. 2: మాటాడితేఁ దెలియదా మనసులోపలిచింత
గాఁటాన వేరే నిన్నడుగఁగవలెనా
తేటగా నూరకే నవ్వితేనే కానరాదా కీలు
పాటించి నేరమి నీపై వేయవలేనా

చ. 3: నిలిచితేఁ దెలియదా నీలోనివుద్యోగము
చెలరేఁగి నిన్ను రట్టుసేయవలెనా
అలమేలుమంగను నేను అట్టె శ్రీవేంకటేశ
కలసితివి నన్ను నీగతు లెంచవలెనా

రేకు: 0686-4 ఆహిరినాట సంపుటం: 14-514

పల్లవి: రమ్మనరే చెలులాల రమణుని నీడకు
తమ్మివాట్లకు నేలే తనివోని సిగ్గులు

చ. 1: చేయిమీఁదుగా లోలోఁ జేసినదే చేఁతగాక
పాయపువారికినేలే పాడిపంతాలు
ఆయములు సోఁక నాడినదే దక్కేఁగాక
కాయజతంత్రాన కేలే కడునోఁబాటులు

చ. 2: కోలుముందుగా రతిఁ గొన్న దే కోలుగాక
ఆలిమగని కేలే అవుఁగాములు
కేలు గేలు మోవఁ బెనఁగినదే మంచిదిగాక
మేలు గలచోటనేలే మెదకతనములు

చ. 3: మనసునఁ గలట్టెల్లా మచ్చికఁ గూడుతగాక
తనకు నాకూనేలే తలపోఁతలు
యెనసె శ్రీవెంకటేశుఁ డే నలమేలు మంగను
ననుపైతే మరియేలే నానావిచారాలు

రేకు: 0686-5 శంకరాభరణం సంపుటం: 14-515

పల్లవి: ఎగ్గుపట్టరాదు మరి యెరిఁగిన జాణఁడవు
సిగ్గరిది నీదేవులు చిత్తగించవయ్యా

చ. 1: కాంతలకు నొయ్యారపుగర్వమే బంగారము
వింతలైన మాటలవెంగేలు చవి
సంతోసపుఁజూపులసళుపులే మోహనము
మంతనాననుండి చల్లేమచ్చికలే యింపులు

చ. 2: తగుఁ బయ్యెదచన్నులదాఁపరాలే తరితీపు
మొగములో చిరునవ్వు మొలకే ఆస
సొగసైన కరములసోఁకులే ఆనందాలు
పగటు బొమ్మజంకెలే భావజునిసిరులు

చ. 3: సందడిచెనకులు సంసారఫలములు
కందువమోవిసన్నలు కడుఁ బండుగ
అందపు శ్రీవెంకటేశ అలమేల్ మంగకు నీకు
మందెమేళాలు రతులమర్మపు ముచ్చటలు

రేకు: 0686-6 గౌళ సంపుటం: 14-516

పల్లవి: సవతులైనవారు సడ్డసేతురా
రవళితో నీవేల రాఁపుసేసేవే

చ. 1: మాట లెన్ని యాడినాను మరి సేసినట్టుగాదు
నీటు లెంత చూపినాను నేర్పురాదు
యేఁటికిఁ బంతాలాడేవే యీతఁడు నాకు వలచు
కాటుకన్నుల నెంత కాఁడఁ జూచేవే

చ. 2: గయ్యాళితనాలవంకఁ గట్టుకొనే దేమున్నది
సయ్యాటలఁ బెనఁగితే సాదించేదేమి
కొయ్యతనాలు నీకేల కోరి నామగఁ డితఁడు
చేయత్తి చూపియేల చెలులకుఁ జెప్పవే

చ. 3: పంతాలకు బిగిసేవు ఫలమేమి గంటివే
వంతులకుఁ దగిలితే వాసి వచ్చునా
చెంత నలమేల్ మంగను శ్రీవేంకటేశుఁ డితఁడు
బంతినే నన్నేలినాఁడు బయలేల యీఁదేవే

రేకు: 0687-1 భూపాళం సంపుటం: 14-517

పల్లవి: ఆతఁడు నీమోము చూచీ నప్పటినుండి
చేతులెత్తి మొక్కి యిట్టె సేవ సేయఁగదవే

చ. 1: పంతములాడఁ దగదు పతితోడ నింతులకు
యెంతైనా నిచ్చలాడుటే యెన్నికగాని
చింతలోనిది వలపు చేకొన్నది జవ్వనము
వింత సేయ కాతనికి విడె మియ్యఁగదవే

చ. 2: పొరపొచ్చె మేఁటికి పొందైనచో నెవ్వరికి
వరుసతో నవ్వు నవ్వవలెఁ గాని
పొరిఁ బువ్వులే యమ్ములు బొమ్మలే మరుని విండ్లు
విరసము లేఁటికి విడె మియ్యఁగదవే

చ. 3: సిగ్గుపడ నీఁకేల శ్రీవేంకటేశుతోడ
వొగ్గిరతిఁ గూడినదె వొద్దికగాని
అగ్గమై వురమెక్కితి వలమేల్ మంగవు నీవు
వెగ్గళించె నీ నేరుపు విడెమియ్యఁగదవే

రేకు: 0682-2 దేవగాంధారి సంపుటం: 14-518

పల్లవి: ఒక్క మనసునఁ గూడి వుండరాదా
యిక్కడ దొల్లిటిసుద్దు లెంచనేల మీకు

చ. 1: పడతికి నీకును పాయకుండా బుద్ధిచెప్పే
యెడమాటలాడితిమి యిందాఁకా నేము
తడఁబాటు గాకుండా తారుకాణాలుగాను
అడియాలాలు దెచ్చితి మిప్పుడే మీకు

చ. 2: దట్టపు వినయాలతోఁ దప్పులన్నీఁ దేరిచి
ఇట్టే కాఁగిలింపించితి మిద్దరి నేము
వొట్టుక సమ్మతిచేసి వొండొరులచే విడేలు
పెట్టించితి మిందరము ప్రియముతోడ మీకు

చ. 3: నగవులు నగింపించి నమ్మికలు సమకూర్చి
తగవులు సేసితిమి దండనే నేము
నిగిడి శ్రీ వేంకటేశ నిన్ను నలమేల్ మంగను
మిగులా మెప్పించితిమి మేలేకద మీకు

రేకు: 0687-3 కురంజి సంపుటం: 14-519

పల్లవి: నిన్నటి సుద్దులకుఁగా నేఁడేల తడవేవు
కన్నుల నాతనిఁ జూచి కడు నవ్వఁగదవే

చ. 1: సారెకు నాడేనంటే జాణతనా లెన్నిలేవు
మేర మీర నెంతలేదు మేటిగర్వము
నేరములు వేసేనంటే నెపము లెన్ని లేవు
చేరి నీవిభుఁడు వీఁడె సేవ సేయఁ గదవే

చ. 2: వాసులే పెంచేనంటే వైపు లెన్నేసి లేవు
యీసు రేగేనంటే బింక మెంతలేదు
వేసాల సాలసేనంటే వేడుక లెంతలేదు
ఆసపడీ నిదే పతి అట్టె కూడఁగదవే

చ. 3: ఆతల సాదించేనంటే అట్టె చల మెంతలేదు
చేతుల నొడ్డించుకొంటే సిగ్గెంత లేదు
ఆతఁడు శ్రీవెంకటేశుఁ డలమేల్మంగవు నీవు
యేతుల నిన్నిదె కూడె నిఁక మెచ్చఁగదవే

రేకు: 0687-4 రామక్రియ సంపుటం: 14-520

పల్లవి: ఔనయ్య ఆఁటదానిఅంతర మెరఁగవు
మానాపతి యౌత నీమనసే యెరఁగదా

చ. 1: సిగ్గుపడి వున్నపతి చిత్తమెరఁగక నీవు
అగ్గలంపు గర్వియంటా నాడుకొనేవు
యెగ్గెరఁగనిముద్దరా లెదిటికి రాకుండితే
కగ్గి యలిగినదంటాఁ గాఁతాలించేవు

చ. 2: గుట్టుతోడ నున్న దానిగుణము విచారించక
నెట్టినఁ జలపాదంటా నేరమెంచేవు
వొట్టి కొలువులోపల నోజతోఁ దలవంచితే
యెట్టిమాయలాఁడి యంటా నెంచుకొనేవు

చ. 3: నడుమ సారెకు నీతో నవ్వలోఁగి వుండితేను
కడు రాజసము దంటాఁ గమ్మి తిట్టేవు
అడరి శ్రీవెంకటేశ అలమేలుమంగ ఆకె
కడఁకతో నిన్నుఁ గూడఁగాఁ దమకించేవు

రేకు: 0687-5 సామంతం సంపుటం: 14-521

పల్లవి: చెప్పవయ్యా ఆసుద్దులు చెవులపండుగగాను
యిప్పు డివి యాడుకొనే రిందరూ నిజమా

చ. 1: కప్పురము నీకా కె కానికగా నిచ్చెనా
దప్పి దేరెనా నేఁడు దానివంకను
కప్పెనా తనపయ్యద గక్కన నీమీఁదను
అప్పుడు చలివాసెనా అందువల్ల నీకు

చ. 2: నీ సిరసుకెత్తుగా నెలఁత తొడ చాఁచెనా
ఆసలు ఫలించెనా అందువంకను
లాసి పాదాలొత్తెనా లలి నీతొడలు సోఁక
రాసికెక్కి నీవపుడు రతిఁ గరఁగితివా

చ. 3: చనుఁగవ దాఁక నీతో సరసానఁ బెనఁగెనా
వినయపుమాటల వేడుఁకొంటివా
తనర శ్రీ వెంకటేశ దక్కె నీకలమేల్ మంగ
నను నేలితివి దయ నాపై నీకుఁ బుట్టెనా

రేకు: 0687-6 హిజ్జిజి సంపుటం: 14-522

పల్లవి: నాకుఁ దెలుసుఁగా నీనాటకాలెల్లా
యీకడ నేమి సేసేవు యింటికి రావయ్యా

చ. 1: తలపోఁత లోకతెపైఁ దగిలి నీకుండఁగాను
పిలిచితేఁ బలికేవా ప్రియముతోను
యెలమి నీమాయలు యెరఁగని సతులెల్లా
అలిగి వున్నాఁడవంటా నటు వేఁడుకొందురు

చ. 2: యెడయ కెవ్వతో యింటికేఁగఁ గాచుకుండఁగాను
వొడి వట్టితే వచ్చేవా వూరకే నీవు
అడరి నీవోజ దెలియనివనితలెల్లాను
కడుఁ బంతగాఁడవంటా కాళ్ళకు మొక్కుదురు

చ. 3: అక్కున నలమేల్మంగ ఆలై నీకునుండఁగాను
దక్కేవా శ్రీవెంకటేశ తరుణులకు
యిక్కడ నన్నేలతివి యేడనైనా వింత వారు
చొక్కి తగవరివంటా సుద్దులు చెప్పుదురు

రేకు: 0688-1 సామవరాళి సంపుటం: 14-523

పల్లవి: చెలికత్తెలము నేము చెలికి నీవు పతివి
యెలయింపులేమిటికి నింటికి రావయ్యా

చ. 1: యేమని విన్నవింతుము యెందాఁకా గోలతనము
కామిని నీ రాకకుఁ గాచుకున్నది
చేముట్టి పిలువరాదు సిగ్గువడితేఁ బోదు
కాముఁ డెడ నున్నవాఁడు గతియేది మాకు

చ. 2: వచ్చినపని యేఁటిది వైపులెటువలె వచ్చు
పచ్చిదేర నాపె యాసపడి వున్నది
రచ్చ కెక్కెను వలపు రవ్వ నినుఁ జేయరాదు
ముచ్చ టేమిటను బాసు ముందర యేలాగు

చ. 3: తలఁపించ నిఁకనేల తమకము నీసొమ్ము
అలమేల్మంగ నీవురమందె వున్నది
కలసితివి కాఁగిట ఘనుఁడ శ్రీవేంకటేశ
ఫలియించె మాతపము పంతమేమి చెప్పేము

రేకు: 0688-2 ఆరిబి సంపుటం: 14-524

పల్లవి: పొలఁతులు పుట్టఁగానే వుట్టినవాదు లివి
నెలకొని కలఁగదు నేరుపరి యైనది

చ. 1: మగవాఁ డొకతిని మన్నించితే సవతులు
యెగసక్కే లాడుదురు యీసడింతురు
మొగమొగాలు చూతురు ముసగసలాడుదురు
పగటున నవ్వుదురు పంతము లాడుదురు

చ. 2: వలచినాతఁ డొక తెవద్దనుంటేఁ దోడివారు
కెలతురు వెంగేలకుఁ గేఁకరింతురు
చెలఁగి వుప్పతింతురు చేతులు పైఁజాఁతురు
తలకొని దూరుదురు తప్పక చూతురు

చ. 3: యేలిన వాఁడొకతెపాలిండ్లు ముట్టితే నందరు
తాలిమితోఁ బొందఁగ తమకింతురు
ఆ లీల శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగ నీవు
వాలాయించి కూడితిరి వద్దివారు మెత్తురు

రేకు: 0688-3 పాడి సంపుటం: 14-525

పల్లవి: ఐనట్టాయఁ గాని ఆలనైన నీకుఁ బోదు
దానకేమి నన్నుఁజూచి దయపుట్టీ నీకును

చ. 1: వేడుకై వున్నదా నీకు విన్నవించేనామాట
వీడనాడఁ జాలక వినేవు గాక
యీడనే పాదాలు గుద్దే దితివా నీకేమైనా
వోడక యేటికో వోర్చుకున్నాఁడవు గాక

చ. 2: నీటున నేఁ జెనకఁగా నీ చిత్తము వచ్చున్నదా
నాటకాలకు నూరికే నవ్వేవుగాక
పాటలు నేఁ బాడఁగాను భావించి నీవు చొక్కేవా
మేటివై కార్యవశాన మెచ్చేవుగాక

చ. 3: అట్టే నా కాఁగిటపై నాస నీకున్నదా
గుట్టు మానఁజాలక కూడేవుగాక
నెట్టన శ్రీవేంకటేశ నే నలవేల్ మంగను
చుట్టమవై మన్నించ జూచితివిగాక

రేకు: 0688-4 కొండమలహరి సంపుటం: 14-526

పల్లవి: చిన్నతనమో యిది సిగ్గరితనమందమో
కన్నులఁ జూచి యెంత కాతరించీఁ దాను

చ. 1: చనవున నే నీతో జాణతనా లాడఁగాను
విని విని యీకె యేల వేసరీఁ దాను
పని వూని నే నీకు పాదములు పిసుకఁగా
మొనసి యెందుకు నేల మోము వంచీఁ దాను

చ. 2: పెచ్చు రేఁగి నీవు నేనుఁ బెనఁగులాడఁగాను
వచ్చి వచ్చి యీపె యేల వద్దనీఁ దాను
మెచ్చులుగాఁ గస్తూరి మేన నేనె పూయఁగాను
అచ్చపుఁ జన్నుల నిన్ను నద్దుకొనీఁ దాను

చ. 3: వూడిగాలు నేను నీకు వొద్దనుండి సేయఁగాను
కూడి కూడి యీకె యేల కొసరీఁ దాను
యీడ నే నలమేల్ మంగ నిదె శ్రీవేకంటేశ్వర
వేడుక నన్నేలితివి విందుచెప్పీఁ దాను

రేకు: 0688-5 ఆహిరి సంపుటం: 14-527

పల్లవి: నన్ను మఱచి వుండునా నా విభుఁడు
యిన్నటా నో చెలులాల మన్నించీఁగాక

చ. 1: చలపట్టి పిలుతురా జాణఁడైన రమణుని
వలపు దెలిసి తానే వచ్చీఁగాక
యెలమిఁ గొసరుదురా యెదుట నిలుచుండగా
అలరి యాతఁడె మాటలాడీఁ గాక

చ. 2: సంగతిఁ గక్కసింతురా సరిగానుఁ జిక్కి తేను
యింగితాకారము తానే యెరీఁగీఁ గాక
చెంగటఁ బెనఁగుదురా చేతులెత్తి మొక్కితేను
కంగుదేర నన్నుఁ జూచి కరుణించీఁ గాక

చ. 3: సారెకు వేసరింతురా జంట వాయకుండఁగాను
గారవించి కాఁగిటఁ గలసీఁ గాక
ఆ రీతి శ్రీ వెంటేశుఁ డలమేల్ మంగను నేను
చేరి నన్ను నేలే నింకాఁ జిత్తగించీఁగాక

రేకు: 0688-6 కేదారగౌళ సంపుటం: 14-528

పల్లవి: సుదతి భావము నేఁడు చూడవయ్యా
యెదుట నీకె నేర్పున నిన్నిటా గెలిచేను

చ. 1: అలసి విరహవేళ నటు చంద్రోదయమైతే
కలువలు ముడిచెను కలికి
తలఁపులోపలఁ బరితాప సూర్యుఁ డెసఁగితే
జలజాలు చేతఁబట్టె జవరాలు

చ. 2: సరి నొంటి నుండఁగాను చల్లగాలి విసరితే
గరిమ గందము వూసెఁ గామిని
వరుస నంతటిలోన వసంతుఁడు వొడమితే
పొరిఁబొరిఁ జిగురుఁబాన్పునఁ బండెఁ జెలియ

చ. 3: వినుకలిఁ జొక్కఁగాను వెస మరుఁ డేఁచితేను
ఘనమకరాలచీర గట్టె నతివ
యెనసి శ్రీ వెంకటేశ యీకె యలమేలుమంగ
నినుఁ గాఁగిటను నించి నెలకొనెఁ దరుణి

రేకు: 0689-1 సాళింగనాట సంపుటం: 14-529

పల్లవి: ఎంత తపము చేసితో యీకెకుఁ గాను
మంతుకెక్క నీకుఁ గల్గె మంచిపెండ్లికూతురు

చ. 1: చన్నులే చిన్నలుగాని సతిమోహము ఘనము
కన్నులు గొప్పలు నవ్వు కడుఁగొంచెము
కన్నెపడు చింతెకాని కడలేని చేఁతలు
ఇన్నిటా నీకు గలిగె నిదె పెండ్లికూఁతురు

చ. 2: చేరఁడే మొగముగాని సిగ్గయితేఁ చేటఁడు
బారెడేసి నెరులు చెప్పరాదు గుట్టు
యీరీతి ముగుదగాని యెమ్మెలు కోటానఁగోటి
కోరినట్టే కలిగె నీకునుఁ బెండ్లికూఁతురు

చ. 3: పాదాలే చిగురుగాని భావమెల్లా నిండుఁజేగ
భేదాలు మోవులు మాట ప్రియ మొక్కటే
యీ దెస శ్రీ వెంకటేశ యీకె యలమేల్‌మంగ
నీ దేవులై నినుఁగూడె నిచ్చఁ బెండ్లికూఁతురు

రేకు: 0689-2 ఆహిరి సంపుటం: 14-530

పల్లవి: తామేల వెంగే లాడేరు దవ్వులనుండి
నాముంజేత నీవు గట్టినకంకణ మున్నది

చ. 1: నివ్వటిల్ల నాఁమీద నీ మోహము గలిగితే
యెవ్వతె యీసడించినా నేమౌను
నవ్వుతాఁ గైదండతోడ నన్ను నీవు చేపట్టితే
వువ్విళ్ళూరి సవతులువొద్దనఁగఁ గలరా

చ. 2: సేసవెట్టి నీవు నాకిచ్చిన చనవు గలిగితే
యేసతి పంతమాడినా నేమౌను
బాస యిచ్చి నీవు నాపైఁ బాదాలు చాఁచుకుండితే
వేసాల చెలు లీపొందు విడిపించఁ గలరా

చ. 3: కాతరాన నీవు నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
యేతుల మాట్లాడుకొంటే నేమౌను
నీతితో శ్రీ వెంకటేశ నే నలమేలుమంగను
ఆతలీతలివార లౌఁగాదనఁ గలరా

రేకు: 0689-3 శ్రీరాగం సంపుటం: 14-531

పల్లవి: ఇంకనేల యేలవయ్య యింతిని నీవు
సంకె లేక పెనఁగఁగా సంతోసము లాయను

చ. 1: పలుమారు నూడిగాలు బత్తితోడఁ జేయఁగాను
చెలియకు వలపులు చిమ్మిరేఁగెను
కలసి మెలసి నీకు గతులెల్లఁ జెప్పగాను
అలవోకచుట్టరిక మంటుకొనెను

చ. 2: సరిక బేసికి నీతోఁ జదురంగా లాడఁగాను
తరుణిమనసు నీకుఁ దగులాయను
తరితీపుతో నిన్నుఁ దప్పక చూడఁగాను
పరగ జవ్వనము నీపాలాయను

చ. 3: మితిమీరి నీతోను మేలము లాడఁగాను
సతిమోవి నీకు విందై చవులాయను
యితవై శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
సతతము కాఁగిట జంటయ్యై నిలిచెను

రేకు: 0689-4 మాళవిగౌళ సంపుటం: 14-532

పల్లవి: ఏడలేని తగవులు నెంత పెంచేవు
వీడెమియ్యఁగా నీతో వేసరీనా చెలియ

చ. 1: ఆకె నీవు నేకతాన నాడుకొన్నమాటలు
యీకడఁ దారుకాణించ నెట్టువచ్చును
దాకొని యిచ్చనబాస తప్పని దొక్కటేకాక
కాకు సేసేనంటే నిన్నుఁ గాదనీనా చెలియ

చ. 2: రతిలోన మీలోన రహస్యపుచెనకులు
యితరు లెరిఁగి చూప నెట్టువచ్చును
మతిలో దయదలఁచి మన్నించే దొక్కటే కాక
తతి సిగ్గువరచితే దండించీనా చెలియ

చ. 3: అలమేల్మంగకు నీకు నాసలు శ్రీ వెంకటేశ
యెలమి లెక్కించి చెప్ప నెట్టువచ్చును
వెలయ నీవు గూడిన వేడుక వొక్కటే కాక
వల పారడిఁ బెట్టితే వద్దనీనా చెలియ

రేకు: 0689-5 శంకరాభరణం సంపుటం: 14-533

పల్లవి: అటుగాన పతితోడ నలుగకు నీవు
కుటిలుఁడుగాఁ డతినిగుణ మెరుఁగుదును

చ. 1: వలచినకాంత తనవల్లభుఁడు రాకుండితే
తలపోయుచుండుఁ గాని తప్పు లెంచదు
పలుమారు నాతఁ డెంతపరాకై వుండినాను
కొలువులు సేసుఁగాని కోపగించదు

చ. 2: అతిరాజసాన మాటలాడ వెరచి వుండితే
తతి గాచుకుండుఁ గాని తత్తరించదు
మతిఁ దనవారని మందెమేళాన నుండినా
యితవే నెరవుఁ గాని యీసడించదు

చ. 3: తరితీపు సిగ్గుతోడఁ దప్పక చూడకుండినా
సరసము లాడుఁ గాని సాదించదు
సిరులలమేల్‌మంగవు శ్రీవేంకటేశుఁ డతఁడు
సరి నీవంటిది గూడీ చలము సేయదు

రేకు: 0689-6 దేసాళం సంపుటం: 14-534

పల్లవి: బావంటాఁ జూడ వచ్చినఫల మాకెకుఁ గలిగె
యీవలఁ జెలికత్తెల మే మనేము నిన్నును

చ. 1: తొడల సందికిఁ దీసి తొయ్యలిఁ బెనచుకొని
జడియఁ బయ్యదకొంగు జారఁ దీసి
వొడిసి కుచగిరుల నురమున నప్పళించి
కడు నలయించితివి కటకటా చెలిని

చ. 2: కుమ్ముడి వట్టి వెనకకూను వంచి మొగమెత్తి
చిమ్ముచును నొకచేతఁ జెక్కు నొక్కి
తమ్ములము నోరిలోన తమకముతోఁ బెట్టి
చిమ్మి రేఁచితి వింతేసి చెల్లఁబో చెలిని

చ. 3: వువిద కాఁగిట నించి వొత్తికిల పానుపుపై
జవళిఁ గూడితివి పచ్చడము గప్పి
యివల శ్రీవెంకటేశ యీకె యలమేలుమంగ
తవిలి పెండ్లాడితివి తగునయ్యా చెలిని

రేకు: 0690-1 భైరవి సంపుటం: 14-535

పల్లవి: అటుగాన నీకు మొక్కే మంగనఁ జేకొనవయ్య
ఇటునటు మాపుదాఁకా నేమి చెప్పే మిఁకను

చ. 1: తరుణి యెంత విరహతాపమునఁ బొరలినా
మరుసంకల్పానఁ గాని మట్టుపడదు
మరుని నేమిందరము మరి వేఁడుకొనేమంటే
సరుసకు నీవు రాక చందము గాదు

చ. 2: ఆరామ నిన్నెంత పెండ్లాడే నని తలఁచినా
కోరి బ్రహ్మవ్రాఁతఁ గాని కూటమి లేదు
పేరుకొని బ్రహ్మకుఁ బ్రియము చెప్పేమంటే
నీరాక గలితేఁగాని నెరవేర నేరదు

చ. 3: అలమేలుమంగ యెంత అట్టె కాఁగిలించేనన్నా
జలధి ధారవోయక సంగతి గాదు
జలధిని వేఁడుకొంటే సారె మామాటాలకించి
యేలమి శ్రీవేంకటేశ యేలుకొంటి వీకెను

రేకు: 0690-2 ఆహిరి సంపుటం: 14-536

పల్లవి: ఇంతట వరమీవయ్యా ఇంతిపాలి దేవరవు
మంతనాన నీకుఁగా నేమరునోము నోమెను

చ. 1: తలపోఁతవలపులు తనకు ఫలించుదాఁకా
మెలుఁత చన్నులు నీకు మీఁదుగట్టెను
తొలుతనే విరహానఁ దురుము వీడెఁ గనక
తలకిందుగా నెరులఁ దపము సేయించెను

చ. 2: వెలయఁగ వలరాచవిద్యలు నేరుపుమని
పలుకుఁదేనియ నీకు వార మిచ్చెను
పలుచెమట లేరులు పై పై నుబ్బెఁ గనక
నలిఁ దనువల్లి పుణ్యనదుల నోలార్చెను

చ. 3: కాతరాన నీకాఁగిట గరిడిసాము చేసి
చేతులెత్తి నీకు మొక్కు చెల్లించెను
యీతల శ్రీవేంకటేశ యీ కెలమేల్‌మంగ గన
ఆతుమారా నీయధరామృతము గొనెను

రేకు: 0690-3 దేసాళం సంపుటం: 14-537

పల్లవి: ఇంత యిచ్చకము లేని దేఁటియాఁటది
అంతటికిఁ దగుదువు అవునే యీతనికి

చ. 1: దవ్వులనుండి విభుఁడు తమలము చూపితేను
అవ్వల నోరొగ్గితివి అవునే నీవు
చివ్వన వచ్చి యతఁడు చేపట్టి నిన్నుఁ దీసితే
పువ్వువలె సులభానఁ బోతి వౌనే వెంటను

చ. 2: నెప్పునఁ దామరఁ గొని నిన్నువేసితేఁ గొప్పున-
నప్పుడే ముడుచుకొంటి వౌనే నీవు
చొప్పులుగాఁ గొనగోరు చూపుతే నీచన్నులపైఁ
గప్పిన పయ్యెద దీసి కడు నొడ్డేవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నీకుచ్చెలపైఁ జేయి వేసితే
ఆవేళఁ గాఁగిట నించే వౌనే నీవు
మోవిగంటి సేయఁగాను ముదమునఁ జెలఁగేవు
ఆవేళ నలమేల్మంగ వమరునే నీకును

రేకు: 0690-4 రామక్రియ సంపుటం: 14-538

పల్లవి: నాపాలిటిదేవులవా నడుమ నీవు
యేపున నలమేల్మంగ నెరుఁగవా నన్నును

చ. 1: కాంతుఁడు మోహించెనంటా కప్రము నీకు నంపెనంటా
ఎంత యెమ్మెలు చెప్పేవే యిందరితోను
బంతి నేలేవాఁడు వొలపక్షము సేయఁగ రాక
వంతు వరుస లిచ్చితే వచ్చెనటే పగటు

చ. 2: సారె నిన్నుఁ జూచెనంటా చన్నులంటె నంటాను
యీరీతి నెంత నవ్వేవె యిందరిలోన
వూరకే పొత్తులమగఁ డొద్దనుండఁగా బొరుగు-
పొరచి నిన్నొరసితే పొందెనటే సిరులు

చ. 3: వూడిగము గొనెనంటా వొగిఁ గాఁగిలించెనంటా
వేడుక నెంత చూపేవే వెస మాతోను
యీడనె శ్రీవేంకటేశుఁడేవె నన్ను నిన్నూ నేలీ
తోడఁ బెండ్లికూఁతురంటే తొర్లెనటే వావులు

రేకు: 0690-5 బౌళి సంపుటం: 14-539

పల్లవి: అంతర మెరఁగనివారంటే నందు కేమాయ
యింతి సింగారాన కివియీాడు వచ్చీనా

చ. 1: కలువలవంటి వంటా కన్నులఁ బోల్తురు గాక
కలికి చూపులవలె గాడి పారీనా
తలకొన్నకొప్పు తుమ్మిదల యీాడందురు గాక
చెలఁగి విభునిమతి జీఁకటై కప్పీనా

చ. 2: జక్కవ లీమెచన్నులచంద మనెంతురు గాక
చొక్కపుఁ గొండలవలెఁ జూపట్టీనా
చక్కఁగాఁ బిరుదు మరుచక్రముసరెంట గాక
యిక్కువ గడచి పతి కింపు వుట్టించీనా

చ. 3: పాదాలు తామరలంటా భావించుకొంట గాక
ఆదెన శ్రీవేంకటేశు ధ్యానింపించీనా
మేదిని నలమేల్మంగ మెరుఁగో యనుట గాక
పోదితో యీాతనిఁ గూడి పొత్తుకు వచ్చీనా

రేకు: 0690-6 సాళంగం సంపుటం: 14-540

పల్లవి: ప్రియములు చెప్పి నిన్నుఁ బిలిచీ నీకె
రయమున నూఁకొని రావయ్య్య లోనికి

చ. 1: చనవె కలిగితేను సాదించితే నేమౌను
మన సెరిఁగిన యింతి మగవానిని
యెనసి వుండితేఁ జాలు నెంత చెనకినాఁ జెల్లు
ఘనుఁడవు రావయ్య్య గక్కన లోనికి

చ. 2: చుట్టరిక మైనచోట సొలసితే నేమౌను
పట్టపుదేవి తనప్రాణేశ్వరుని
నెట్టుకొని వుండేచోట నెపము వేయఁగ వద్దు
అట్టె రట్టు సేయక రావయ్య్య లోనికిని

చ. 3: ఇచ్చకమైతే మేలు యెంతనవ్వినా నేమౌను
కచ్చు వుట్టి పెండ్లాడినకాంతునిని
అచ్చపు శ్రీవేంకటేశ అలమేల్మంగ యీకె
రచ్చ కెక్కఁ గూడితివి రావయ్యా లోనికి

రేకు: 0691-2 పూర్వగౌళ సంపుటం: 14-541

పల్లవి: సారె నెట్టు మెచ్చేము నీజాణతనాలు
ఆరీతుల నవ్వుతానే ఆస రేఁచేవు

చ. 1: వొద్ద నిలుచుండఁగానే వూరకే ఆపెతోడ
సుద్దులు చెప్పుతానే సోఁక నాడేవు
అద్దో నిమ్మపండు కాను కందుకొంటాఁ జెయి చాఁచి
పెద్దరికములు చూపి పెనఁగులాడేవు

చ. 2: తివిరి వడ్డించఁగానే తేరకొన నాకెఁ జూచి
చవుల డుగుతాఁ గడు సన్న సేసేవు
అవునయ్యా చేతికి నీళ్ళందిచ్చితే మీఁదఁ జల్లి
చివురుమోవియడిగి సిగ్గు రేఁచేవు

చ. 3: కొలువు సేయఁగానే కుచ్చి కాఁగిలించుకొని
బలుములు చూపుతానే పచ్చి సేసేవు
అలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చెలరేఁగి మొక్కఁగానే చెక్కులు నొక్కేవు

రేకు: 0691-2 ధన్నాశి సంపుటం: 14-542

పల్లవి: నీ కితవై వుండఁగాను నేను నవ్వుదుఁగాక
కాకు సేసి యిందరిలోఁ గాదనఁగ నేలా

చ. 1: చనవుగలాపె నీతో సరసము లాడఁగాను
నినుఁ జూచి మాకేల నేర మెంచను
వినయముతో నప్పటి వెస నీకొప్పు దువ్వఁగా
చెనకి యడ్డాలు వచ్చి చేరి మాన్పనేలా

చ. 2: కడుఁ బనిగలయాపె కదిపి పాదా లొత్తఁగా
విడిపించి మాకేల వెంగెములాడ
తొడఁ దొడా మోవ సందునఁ దానుఁగూచుండఁగా
వడిసీఁ జెమటలంటా వద్దన నాకేలా

చ. 3: బత్తిగలయాపె నీకు బాగా లొసఁగఁగాను
యెత్తి యందులో నొఁగాము లెంచ మాకేల
హత్తితి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
చిత్తగించి కూడితి వాచెలి నాడ నేలా

రేకు: 0691-3 సామంతం సంపుటం: 14-543

పల్లవి: ఇందుకొరకే సుమ్మీ యింటిలో నున్నది సతి
కందువకు వచ్చి నీవే కాంత నేలవయ్యా

చ. 1: నోరికిఁ దోఁచినట్టెల్లా నుడుగఁగఁ బోతేను
నేరుపుతోడ గుట్టు మానిసి యనరు
కారు కమ్మి చూపులను కన్నదెల్లాఁ జూచితేను
యీరీతి మిక్కిలి ప్రౌఢ యీకె యనరు

చ. 2: మోము చూచినపుడెల్లా మునుకొని నవ్వితేను
కామించి మిక్కిలి సిగ్గు గల దనరు
వేమారు నెదుటను వేడుకఁ బొలసితేను
అనుకొని కడు జాణయైన దీకె యనరు

చ. 3: చలివాసి కొలువులో సంగడిఁ గూచుండితేను
లలి వినయపుగుణాలది యనరు
యెలిమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కలసితి వింతటిది గాకున్న నౌ ననరు

రేకు: 0691-4 మాళవిగౌళ సంపుటం: 14-544

పల్లవి: మేలురా నీ వుపాయాలు మెచ్చితి నేను
సోలినాపెను వాసినసురటిఁ దెమ్మనేవు

చ. 1: యేరా నీ వూడిగము సేయించుకొనేయందులోనే
ఆరమణి యద్దము న న్నందిమ్మనేవు
సారె నన్ను నీవు వుపచరించేవానివలెనే
కోరి యాపెచే వీడేము కొమ్మని యిచ్చేవు

చ. 2: కైకొని నీ కెంతో పనిగలవానివలెనే
ఆకెపేరిటాపెఁ బిలువు మనేవు నన్ను
జోక నన్ను సింగారించిఁ జూచేవానివలెనే
ఆకాంతపెట్టెలో మెట్టె లంటి తెమ్మనేవు

చ. 3: సొలసి చుట్టరికము చూపేవానివలెనే
అలమేల్మంగకు మ్రొక్కు మనేవు నన్ను
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
అలరి యాపె చెల్లెలవై వుండు మనేవు

రేకు: 0691-5 కన్నడగౌళ సంపుటం: 14-545

పల్లవి: మిగులాఁ గామినులెల్లా మేలిలోనివారు గాక
పగపాడే యేమైనా పంతము నెరపను

చ. 1: వలచినకాంతను వడదేర్చవలెఁగాని
మలసి పరాకు సేయ మరి తగదు
సొలసి యాసపడితేఁ జోటియ్యవలెఁ గాని
అలరిఁ గుట్టుతో నుండు టది నీతి గాదు

చ. 2: చుట్టమై వచ్చినిదానిఁ జూచి కూడవలెఁ గాని
వట్టి జాగులు సేసేది వైపుగాదు
నెట్టుకొన్న మాటాడితే నిలిచి వినవలెఁ గాని
బట్టబయ లిదించితే బనికిరాదు

చ. 3: లలిఁ గాఁగిలించేదాని లాలించవలెఁ గాని
పలుసుద్దు లడుగను బాడిగాదు
అలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యెలమి నేలితి వీఁక నెంచఁ బనిలేదు

రేకు: 0691-6 శంకరాభరణం సంపుటం: 14-546

పల్లవి: భావించ రహస్యమైనపనులు లేవా బూమిలో
యీవేళ నాతని కోర్కి యీడేర్చఁగదవే

చ. 1: చివ్వున నాతఁడు నిన్నుఁ జెయివట్టి తీసితెను
రవ్వగానేల చెప్పేవే రమణులతో
నివ్వటిల్ల నేకతాన నిన్నుఁగోర నూఁదితేను
పువ్విళ్లూరఁ జూపుదురా పూరివారి కల్లాను

చ. 2: తమకింటి నీకతఁడు తమ్ములము వెట్టితేను
తిమురుచుఁ గోపింతురా దేవుళ్లవొద్ద
అమర నీరతి కాతఁడాసపడి నవ్వితేను
సముకపువారినల్లా సాకిరి వెట్టుదురా

చ. 3: మొగి శ్రీ వేంకటేశుఁడు ముంచి నిన్నుఁ గూడితేను
తగవు లడుగుదురా దండవారిని
మగటిమి నలమేలుమంగవిభుఁ డీతఁడు
అగడు సేయవచ్చునా అప్పటి నాతోను

రేకు: 0692-1 వరాళి సంపుటం: 14-547

పల్లవి: ఏల వూరకుందానవే యెదుట నున్నాఁడతఁడు
వాలాయించి నవ్వితేఁ గైవసమౌను పనులు

చ. 1: తరుణికిఁ బతికిని తతి మాటలాడేటి
తరితీపు గలితేనే తమిరేఁగును
వొరసి అడియాసల నొకరొకరిమొగాలు
తిరిగి తిరిగి చూచితే వలపు నాటును

చ. 2: రవళి మగవానితో రారాపులఁ బొందుసేసే-
సవతి గలిగితేనే చలివుట్టును
జవళిఁ గూచుండఁగాను సందుసుడి వేరొకతె
అవలఁ బయ్యాడితే నటు చల మెక్కును

చ. 3: యెనసి వొందురులకు నిచ్చగించి రతులపై
మనసులు గలిగితేను మర్మాలంటును
చెనకి యలమేల్మంగ శ్రీవేంకటేశుఁ డితఁడు
వినసఁ గొసరితే వేడుకలు వుట్టును

రేకు: 0692-2 ఆహిరి సంపుటం: 14-548

పల్లవి: ఏమి చెప్పుదుఁ గాఁతాళమిట్లాయ నావలపు
కామించినదాన నీకు కరుణించు మిఁకను

చ. 1: కుప్పళించి నిన్న రానికోపమే చూపుతిఁగాని
చొప్పుగా నెదుట నిన్నుఁ జూడనైతిని
చెప్పకు బుద్ధులనుచు చెలికి మొక్కితిఁ గాని
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కనైతి నీకును

చ. 2: తత్తరించి నీవు సేసే తప్పులే పట్టితిఁ గాని
బత్తి నీ విచ్చేబాగాలు పట్టనైతిని
యిత్తల సవతులతో నెమ్మెలు చెప్పితిఁగాని
హత్తి నీతో నవ్వుచుఁ బ్రియములు చెప్పనైతి

చ. 3: వెక్కసపుమాటాడఁగా వీఁగ నొత్తితిఁ గాని
తక్కక చాఁచిన నీపాదా లొత్తనైతి
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నేనలమేలు మంగను
మక్కువ నేర్చితిఁగాని మంకు నేరనైతిని

రేకు: 0692-3 ముఖారి సంపుటం: 14-549

పల్లవి: ఎంతలేదు తనసుద్దు లెరఁగమా నేమెల్లా
ఇంతులా చూడరమ్మ యిటువంటి కొత్తలు

చ. 1: వాసిగల సతియైతే వలపు చెప్పుకొనునా
వేసా లింతేకాక విభునితోను
పాసి వుండలేనిదైతే పంతములు నెరపునా
ఆసతో వేళ గాచుక అట్టె వుండుఁగాక

చ. 2: ఇంతబత్తి గలిగితే నెడమాట లాడించునా
వంతుల నింటికిఁ దానే వచ్చుఁగాక
చెంతఁ దొల్లిటి పొందైతే సిగ్గులూఁ దాఁబడునా
బంతినున్న సవతుల బ్రమయించీఁ గాక

చ. 3: యితవరి యైతేను యెగ్గులు దాఁబట్టునా
మతకమేమోకాక మాటి మాటికి
అతఁడు శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగను నేను
సతమై నన్నుఁ గూడఁగా సమ్మతించితిఁగాక

రేకు: 0692-4 సామంతం సంపుటం: 14-550

పల్లవి: సిగ్గువడ కింకానేల చెలువునిఁ దడవీని
దగ్గరి పైకొనీ బేలుఁదనము గాదా

చ. 1: చేసుకొన్న రమణుఁడు చేతికి లోఁగాకుండితే
వేసరించి కొరేది వీరిడి గాదా
ఆసలు చూపినవాఁడు అవ్వలి పరాకైతే
యీసడించక నవ్వేది యెడ్డతనము గాదా

చ. 2: కోరి తెచ్చుకొన్న వాఁడే కుశిగుంపు సేసితేను
కూరిమికిఁ బెనఁగేది కూళగాదా
మేరతో నవ్వనివాఁడే మించి పొందు సేసితేను
మోరతోపున దూరేది మొక్కలముగాదా

చ. 3: శ్రీవేంకటేశుఁడే చెనకక వుండితేను
కావిరిఁ గాఁగి లించేది గయ్యాళిగాదా
ఆవిభుఁడె నన్ను నేలె నలమేల్మంగను నేను
భావించెప్పటిఁ జూచేది బయకారముగాదా

రేకు: 0692-5 రామక్రియ సంపుటం: 14-551

పల్లవి: నీతో బలిమి చూపు నేరుతుమా యేమైనా
యేతులూ నెమ్మొలూ మరియేమి చెప్పేమిఁకను

చ. 1: వలపు మదిలో నుండు వాకున సొలపులుండు
కలిగిన కాంక్షలెల్లా కన్నులనుండు
చలము గుణాలనుండు చవులు రతులనుండు
యెలమి మావిన్నపము లేమిచెప్పే మిఁకను

చ. 2: నవ్వులు సెలవినుండు నయాలు చేతల నుండు
జవ్వనము నిలువెల్లా సతమై వుండు
రవ్వలు కాఁకలనుండు రాజసమిచ్చలనుండు
యెవ్వరమూఁ దమకించి యేమి చెప్పేమిఁకను

చ. 3: పంతాలు వాసులనుండు భావము గర్వాననుండు
చింతలెల్లా లోలోని సిగ్గులనుండు
అంతటా శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
ఇంతలో నన్నేలితివి యేమి చెప్పేదిఁకను

రేకు: 0692-6 నాట సంపుటం: 14-552

పల్లవి: మదించిన యేనిగెకు వవటీఁడువంటి దాపె
సదరాన నిన్నిటు వసము చేసుకొనెను

చ. 1: కప్పురానఁ గొనివేసి కామిని నిన్నిపు డిట్టే
చిప్పిలఁ దనమొకము చేసుకొనెను
ముప్పిరి నంతటిమీఁద ముంచి చేతులెత్తి మొక్కి
అప్పసము చుట్టముగా నటు సేసుకొనెను

చ. 2: తొడమీఁదఁ గూచుండి తొయ్యలి చన్నుల నొత్తి
చిడుముడితోఁ గిందు సేసుకొనెను
జడిగొన మోవితేనె చవిచూపి నిన్నింతలో
కడలేక తనసొమ్ముగాఁ జేసుకొనెను

చ. 3: సేస వెట్టి పెండ్లాడి చేరి నిన్నలమేల్మంగ
చేసూటి మగనిగాఁ జేసుకొనెను
ఆల శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁగూడి
పోసరించి పాయరాని పొందు సేసుకొనెను

రేకు: 0693-1 దేసాక్షి సంపుటం: 14-553

పల్లవి: సిగ్గులువడ నేఁటికి చెంది నా మొగము చూచి
వొగ్గి నీవు లాలించఁగా నొద్దనేనా నేను

చ. 1: సరిఁ జెమటలుగార సతి నీకడకు వచ్చె
సురటి విసరరాదా చోటియ్యరాదా
దురదురఁ బారితేఁగా తురుమెల్లానిదె జారె
గరిమల నిట్టే కీలుగంటు వేయరాదా

చ. 2: కడుదగ దొట్టుకొంటా కానుక చేతి కిచ్చీని
వెడ దప్పి దేర్చరాదా వీడె మీరాదా
జడిసి నీకు మొక్కఁగా చన్నులు బయటఁ బడె
కడగి నీపచ్చడము గప్పి పెట్టరాదా

చ. 3: అలపులు దేరఁగాను అట్టె ప్రియములు చెప్పె
లలి నూఁకొనఁగరాదా లాలించరాదా
అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
కలసితి వాపె నింకాఁ గైకొనరాదా

రేకు: 0693-2 లలిత సంపుటం: 14-554

పల్లవి: మేఁడుకొనవయ్యా యీపె వెల్లవిరి సేయకుండా
ఆఁడుదాని కెంత పంతమైనా నియ్యవచ్చును

చ. 1: కొలువులోఁ దప్పక యేకొమ్మనో చూచితివంటా
కలకల నవ్వి యీకె కాకు సేసీని
మలసి యందుకు నేము మాట మరపించితే
చలపాదితనాన సాదించీని

చ. 2: సంగడి రాఁగా నెవ్వతచన్నులో తాఁకితివంటా
పంగించి యీపె నిన్నుఁ బచ్చిసేసీని
సంగతి గాదని నేము చాయ సేకుండితేను
అంగడి వేసి తానే ఆన వెట్టుకొనీని

చ. 3: గందమిచ్చేయాపెనేమో కాఁగిలించుకొంటివంటా
నిందవేసి యీపె నిన్ను నేరమెంచీని
యిందుకే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అంది నన్ను నేలితివి అప్పటిఁ దావచ్చీని

రేకు: 0693-3 ధన్నాశి సంపుటం: 14-555

పల్లవి: ఆపె నెంతయలయించే వయ్యా నన్ని పనులు
యీపొద్దుకాడ మరి యిఁకనేలమాటలు

చ. 1: పయ్యద నిండాఁ గప్పుక పవ్వళించి వున్న చెలి-
నియ్యెడకు వచ్చి నీవదేల లేపేవు
చయ్యన నద్దమరేయి చనుదెంచినవాఁడవు
వొయ్యనె పవ్వళించు మొకవంక నీవును

చ. 2: కన్నులు మూసుక నీకేకాఁ గలలు గనఁగాను
చన్నులేల పట్టేవు సటలంటాను
వున్నతి వరుసపద్య మొప్పగించ వచ్చితిని
మిన్నక కూచుండుము మేలుకొనీ నిపుడు

చ. 3: అండ నీవున్నాఁడవంటా అటు గాఁగిలించుకొంటే
వుండతివి నిజాలకు నొద్దికై నీవు
దండిగా శ్రీవేంకటేశ దక్కె నలమేలుమంగ
నిండుకొనఁ గూడితి నిన్నుఁ జూచి నవ్వెను

రేకు: 0693-4 అమరసింధు సంపుటం: 14-556

పల్లవి: చుట్టరికము సేయఁగా సూడువట్ట నీకనేల
గట్టిగాను ప్రియమెల్లాఁ గైకొందుఁగాక

చ. 1: మొగము చూచి చూచి ముంచి యిందరిలోనాను
యెగసక్కెపుమాటలు యెట్టాడే నిన్ను
నగుతా నీవుండఁగాను నావొద్దికి రావనుచు
తెగువతో దూరి దూరి తిట్టి నెట్టువచ్చును

చ. 2: నీవద్దనే కూచుండి నేరమిసేసితివంటా
కావరించి యెటువలెఁగసరే నిన్ను
చేవమీర నీవు నాపై సేసలు చల్లఁగానే
యీవలఁ దప్పించుకొంటా యేఁగనెట్టువచ్చును

చ. 3: చెప్పినట్టు సేయఁగాను చిత్తములోఁ గరఁగక
చొప్పలెత్తి యెటువలె సొలతు నిన్ను
అప్పుడె శ్రీవేంకటేశ అలమేల్మంగ నాకుఁ
జెప్పి కూడితివి రట్టుసేయ నెట్టువచ్చును

రేకు: 0693-5 సింధురామక్రియ సంపుటం: 14-557

పల్లవి: అట్టు సేయక రావె యిట్టె నీవు
గట్టిగా వచ్చేవంటాఁ గాచుకున్నవాఁడు

చ. 1: చెలిమి సేసినవారు చేతికిలోను గావలె
చలములు సాదించ సంగతిగాదు
వలచిన వారలు వద్దఁ బాయకుండవలె
పొలయలుకలు చూపఁ బొసఁగ దెప్పుడును

చ. 2: సరస మాడేటివారు సమ్మతించి వుండవలె
నెరసులు పట్టేది నేరుపుగాదు
మరుతంత్రములవారు మంతనాన నుండవలె
విరసాన రచ్చలుంటే వేడుక గాదు

చ. 3: వొడఁబాటు గలవారు వొద్దికతో నుండవలె
అడియాసలఁ బొరలే దందము గాదు
అడరి శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
తడయక కూడితివి తగులాయ మోహము

రేకు: 0693-6 శ్రీరాగం సంపుటం: 14-558

పల్లవి: నీకుఁ జూడ వేడుకలై నేటి కున్నవి గాక
దాకొని వెనకకు మరి తలపోఁత గాదా

చ. 1: బాసలు సేసి సేసి బయలు యీదించితివి
ఆసల నోరూరించితి వప్పటి నీవు
వాసులెక్కించి మెప్పించి వలలఁ జిక్కించితివి
దోసముగాదా యిట్టె తొయ్యలుల తోడను

చ. 2: బెట్టుగా నవ్వి నవ్వి బేరి జోకొట్టితివి
గుట్టున బయకారాలే కుమ్మరించితి
గట్టువాయతనమున గాలి ముడె గట్టితివి
వట్టి యపకీర్తి గద్దా వనితల తోడను

చ. 3: నన్నేలి పైడికి వాసనలు పుట్టిపంచితివి
సన్నలనే కొండలు సాదించితివి
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మన్నించుటే మేలుగాదా మగువల తోడను

రేకు: 0694-1 భూపాళం సంపుటం: 14-559

పల్లవి: మగనితో నేమిటికి ముచ్చరములు
జిగిమించ నిచ్చకము సేయవలెఁ గాక

చ. 1: సమ్మతించఁ జెప్పితేను సరి నియ్యకొనవద్దా
కమ్మటిని సాదింతురా కాంతుని నీవు
తమ్మివిరుల వేసితే తాఁకి నొచ్చినందురా
దొమ్మిసేఁతలనుచు సంతోసింతురు గాక

చ. 2: వినయము చూపితేను వేడుక పడవద్దా
పెనుఁగులాడుదురా బిగిసి నీవు
కొనగోరనూఁదితేను గురుతాయ నందురా
ఘనత మర్మాలు కరఁగఁగవలెఁ గాక

చ. 3: బెరసిసేస చల్లితే పెండ్లియాడవద్దా
సరసమున నేపొద్దు జరపుదురా
అరిది శ్రీ వేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
నిరతి నిన్నే లెఁ బ్రేమనించ వలెఁ గాక

రేకు: 0694-2 ధన్నాశి సంపుటం: 14-560

పల్లవి: నేనేమిటిదానను నేరుపరి విన్నిటాను
కానీవయ్యా నీమాటకుఁ గాదంటినా నేను

చ. 1: సారె సారె నవ్వితేనే చవుకలవును వలపు
కూరిమి గొసరితేనే గుట్టు గందురు
చేరి చెనకఁ జూచితే సిగ్గులు బయటఁబడు
యీరీతి నీవెరగవా ఇందవయ్య కానికె

చ. 2: అసలు వుట్టించితేనే అంగడిఁబడుఁ బంతాలు
వేసాలఁ బొరలితేనే వెగటౌఁ దమి
బాసలు సేసితేనే పరిసిపోవు నిజము
యీసు నీపై నాకు లేదు ఇందవయ్య కానికె

చ. 3: మంతనాన వేగించితే మర్మములు సరిదాఁకు
సంతోసాలు రేఁచితేను చనివుట్టును
అంతట శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
ఇంతలోనే కూడితివి ఇందవయ్య కానికె

రేకు: 0694-3 పాడి సంపుటం: 14-561

పల్లవి: నిన్నడిగితినటవే నీకేమి గారణము
పన్ని యాతనికి నీకుఁ బనియేమే చెలియా

చ. 1: చెంది యాతఁడు చేసినసేఁతలు నేఁ దడవితే
అందాలు సేసి చెప్పే వవునే నీవు
యిందాఁకా నెందుంటివని ఇతని నే నడిగితే
అందే నిద్రించెనంటా నానలు వెట్టేవు

చ. 2: వొద్దుకొఁగా మేనిమచ్చా లొరసి నేఁ జూచితేను
అడ్డాలు వచ్చేవు పతి కవునే నీవు
వొడ్డి యెవ్వతెపై వలపున్నది మతి నంటేను
యెడ్డవై నాకొప్పగించే వేమవుదువే నీవు

చ. 3: నిండుఁ గాఁగిటఁ గలసి నేఁజెమట రేఁచితేను
అండ నీవు విసరేవు అవునే నీవు
దండి యలమేల్మంగను తాను శ్రీవేంకటేశుఁడు
పండే వీమగనివొద్ద బాఁతైతివే నీవు

రేకు: 0694-4 గుండక్రియ సంపుటం: 14-562

పల్లవి: వినుకలిమాటలకు విభుని వేల దూరేవే
యెనసి యాతనితోడ నిచ్చకమే యాడవే

చ. 1: జాము వోయి వచ్చెనంటా చప్పనాయ మోవియంటా
యేమిటి కాతని నేరాలెంచేవే నీవు
నీ మొగమే చూచీని నీతోనే మాటలాడీని
ప్రేమపు సతిని వొడిఁ బెట్టుకొని వచ్చెనా

చ. 2: వుద్దండీఁడై వున్నాఁడంటా వొగరాయ వలపంటా
గద్దించి పతినేల కాఁతాళించేవే
వద్దనే తానున్న వాఁడు వడి నీతో నవ్వు నవ్వీ
కొద్దిలేని సతులను కుచ్చి కట్టుకొనెనా

చ. 3: తచ్చనలు సేసీనంటా తరితీపాయఁ బొందంటా
హెచ్చి శ్రీవేంకటేశ్వరు నెంత లోఁచేవే
అచ్చపుటల మేల్మంగ వతఁడు నిన్నుఁ గూడె
బచ్చెన సతుల వేరే బండిఁ బెట్టుకున్నాఁడా

రేకు: 0694-5 శంకరాభరణం సంపుటం: 14-563

పల్లవి: మీకే తెలుసును మీమీసన్నలు
వాకుచ్చి యడుగఁగ వసమా మాకు

చ. 1: చీటికి మాటికి సిగ్గులు వడఁగా
నాఁటఁగఁ జెలి నిను నవ్వీని
గాఁటాన రెంటెము గప్పుకొనఁగా
సూటిగా నీదిక్కు చూచీ నదివో

చ. 2: సరికి బేసికిని బెడిసి యలయఁగా
విరుల నింతి నిను వేసీని
పరిమళములు నీపైఁ బూసుకొనఁగ
వెరవెంచి ముక్కుపై వేలిడుకొనెను

చ. 3: కలసియు మలసియు కాఁగిలడుగఁగా
మెలుపున సతి నిన్ను మెచ్చీని
అలమేల్మంగ నేనని శ్రీవేంకట-
నిలయ కూడితివి నెలకొనెఁ దాను

రేకు: 0694-6 దేసాళం సంపుటం: 14-564

పల్లవి: చిత్తములోనివలపు చిగురుఁ జేఁగ
యిత్తల వట్టిజాగు లిఁకనేఁటికయ్యా

చ. 1: శిరసు వంపులలోనే సిగ్గులు గానిపించె
తరితీపులఁ బొడమె తమకములు
సరిఁ బులకలతోడ సంతోసము లుప్పతిల్లె
తరుణి కాఁగిటికి దగ్గర రావయ్యా

చ. 2: అల్లార్చి చూచేచూపుల నాసలెల్లాఁ జిమ్మిరేఁగె
పల్లదపు సరసానఁ బైకొనె నవ్వు
వెల్లవిరి సొలపుల వేడుకలు దై వారె
కొల్లలుగా రతులను గూడుదువు రావయ్యా

చ. 3: తలపోఁతలవల్లఁ దగిలెను మర్మములు
పిలుపులఁ జవులు ముప్పిరిగొనెను
అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగకు నీకుఁ
గలిగె కూటములిట్టె గక్కనరావయ్యా

రేకు: 0695-1 వరాళి సంపుటం: 14-565

పల్లవి: ఏల రట్టుసేసేవు యిదేరా నీవు
కాలు దొక్కినదానితోఁ గాఁతాళించ నేఁటికి

చ. 1: పెలుచుమాటల నొట్టు వెట్టుకొన్న దానితోడ
చలములు సాదించ సంగతిగాదు
చలివాసి సారె సారె జంకించె దానితోడ
బలిమితోఁ బెనఁగఁగఁ బనిలేదు

చ. 2: బాసలు దప్పితివంటా పంతమాడే దానితోడ
రాసికెక్కఁ జేఁత సేయ నానగాదు
ఆసల నెదురు చూచి అలసినదానితోను
గాసిఁ బెట్టి నవ్వ నెక్కడా నీతిగాదు

చ. 3: చెమటలు మేననిండాఁ జిమ్మిరేఁగిని దానితో
తమకించి కాఁకరేఁచఁ దగవుగాదు
సమరతిఁ గూడితి విచ్చట శ్రీవేంకటేశ్వర
సముకపుదాన నాతో జాగుసేయరాదు

రేకు: 0695-2 సామంతం సంపుటం: 14-566

పల్లవి: కాదంటిఁ బో నిన్నుఁ బాయఁగలనా నేను
ఆది గొని సారె దూరేదది యెడ్డతనము

చ. 1: నగుతూ విచ్చేసి నీవు నన్ను నేఁడు చెనకఁగా
బిగియుచు నుండే దేమి పెద్దరికము
తగవరివైన నీవు తమ్ములము వెట్ట రాఁగా
మొగమీయ కుండేది మొక్కలపుగుణము

చ. 2: పరగ నొద్దనుండి నాపైఁ జేయివేయఁగాను
యెరవు చేసుకవుండే దేఁటి నేరుపు
సరసమాడి నాదిక్కు చక్క నీవు చూడఁగాను
అరుదంది సిగ్గువడే దదియేఁటి చెలిమి

చ. 3: కందువల నన్ను నీవు కాగిలించుకొనఁగాను
పొందుసేయకుండే దేఁటిబుద్దిలోనిది
అంది శ్రీవేంకటేశ్వర అలమితి విటు నన్ను
యిందుకే నే మెచ్చితి నిదే జాణతనము

రేకు: 0695-3 ఆహిరి సంపుటం: 14-567

పల్లవి: చెలులాల వినరె యీచెలువునిసుద్ది నేఁడు
తిలకించి తానే అన్నీఁ దెలుసుకొనుఁ గాక

చ. 1: మగువలకు దనకు మరి సాక్షి నన్నడిగీ
తగవులు చెప్పేనా తమకు నేను
మగఁడు తాను వారికి మచ్చిక దేవుళ్లు వారు
సొగిసి వలసినట్టు చూచుకొనుఁ గాక

చ. 2: చేరి తమతమలోనిచేఁతలు నాకుఁ జూపీ
గారవానఁ దమకెల్లా కర్తనా నేను
మేరతో బాసిచ్చెఁ దాను మెలుఁతలు నమ్మినారు
నేరుపుతో నిజములు నిలుపుఁ గాక

చ. 3: గట్టిగాఁ దమవద్దనే కాచుక వుండుమనీ
దట్టమైన అడ్డికపుదాననా నేను
అట్టె శ్రీవేంకటేశుఁడు అలమేలుమంగ నేను
రట్టుగ నన్నేలెఁ దానే చుట్టము గాక

రేకు: 0695-4 మంగళకౌశిక సంపుటం: 14-568

పల్లవి: చేరి నీకు వినయాలు సేతుఁ గాక
మేరతో మేలమాడఁగా మితిమీర వచ్చునా

చ. 1: వరుసతో నిన్నెంత వలపించ నేర్చినాను
అరసి పంతాలు నే నాడవచ్చునా
దొరఁ జేసి నీవెంత దొడ్డగా మన్నించినాను
పరగ గర్వము నీతోఁ బచారించ వచ్చునా

చ. 2: నెమ్మి నూడిగాలు సేసి నిన్నెంతమెప్పించినాను
చిమ్ములు మందెమేళాలు సేయవచ్చునా
కమ్ముకొని నీవెంత కాఁగిటఁ బెనఁగినాను
యెమ్మెలకు నిన్ను నెలయించ వచ్చునా

చ. 3: కలికినై నిన్నెంత కైవసము చేసుకొన్నా
కెలయుచు నిన్ను జంకించవచ్చునా
అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
పలుమారు నీమేను పచ్చిసేయవచ్చునా

రేకు: 0695-5 ధన్నాశి సంపుటం: 14-569

పల్లవి: నీవు సేసినమేలుకు నేను దూరరాదు
యీవల నాతమకము యేమని చెప్పుదుము

చ. 1: మొగము చూచి నీవు మోహములు వెదచల్లి
జిగిమించ వలపించి చేకొంటివి
పగటున నీవెక్కడో పరాకై వుండఁగాను
యెగసక్కేలాడితి యెట్టున్నదో మనసు

చ. 2: చనుఁగవ గోరనంటి చనవులెల్లా నొసఁగి
యెనలేని వేడుక నన్నేలితివి
ననుపున నెవ్వతెతో నవ్వితివంటా నేను
పెనఁగితి నీలోని ప్రియము లెట్టున్నవో

చ. 3: కందువకు నీవు వచ్చి కాఁగిట నన్నుఁ బొదిగి
పొంది శ్రీవేంకటేశ్వర భోగించితివి
మందెమేళమై అలమేల్మంగని నే నీవేళను
అందితి నీమోవి నీకు ఆస యెట్లున్నదో

రేకు: 0695-6 దేసాళం సంపుటం: 14-570

పల్లవి: ఏమయ్యా నా మనసు నీ వెరఁగనిదా
కామించితి వలపులఁ గడమేమీ లేదు

చ. 1: మచ్చిక గలుగు సతి మాటలెన్ని యాడినాను
యిచ్చకమే కాని మరి యెగ్గు దోఁచదు
అచ్చముగాను సరస మాడితేను తనలోన
విచ్చనవిడముగాని వెగటు దోఁచదు

చ. 2: చుట్టరికమైనవారు సారిది నెంత చూచినా
దట్టపు వేడుకే కాని తప్పులెంచరు
అట్టడితనాలఁ దాను జాయివలె నుండినా
అట్టె మేనులుబ్బుఁ గాని అలయికగాదు

చ. 3: చనవుగలిగినాపె జంకించి కూడితేను
మనసు రంజిల్లుఁ గాని మరపుగాదు
యెనసితివి శ్రీ వేంకటేశ నన్ను నింతలోనే
యినుమడౌఁగాని తమి యిఁకఁ గొంకులేదు

రేకు: 0696-1 తెలుఁగుకాంబోది సంపుటం: 14-571

పల్లవి: చిత్తగించఁ గదరె వోచెలులాల
కొత్త కొత్త వినోదాలు గూడినట్టు మెరసె

చ. 1: మోమున కెగరేటి మొనవాఁడిగుబ్బలు
కామినికి నమరెను కంటి రటవె
ఆమని చనుజక్కవ లట్టె వదనచంద్రుని
వేమరుఁ బొంచినయట్టి వేడుకలై మెరసె

చ. 2: సారెఁ జెంపలమీఁద జారి వుండిన తురుము
యీ రమణికి నమరె నిటు చూడరే
ఆ రీతిఁ దుమ్మిదగమి అధరామృతమునకు
బోరునఁ బొంచుకుండిన పోలికై మెరసెను

చ. 3: తనుపై మెరుఁగులు తరుణికి నమరికై
గొనకొనె నిదే కనుఁగొంటి రఁటవే
యెనసె శ్రీవేంకటేశుఁ డీకె యలమేల్మంగ
కనకము వన్నెలూ నొక్కటైనట్టు మెరసె

రేకు: 0696-2 శుద్ధదేశి సంపుటం: 14-572

పల్లవి: ఎగ్గు పట్టేవు గనక యెగసెక్కెము లాడ నీతో
వెగ్గళించి పంతాలాడ వేడుకా నీతోను

చ. 1: గోరు దాఁకి మేనిమీఁద కుమ్మెలు గాఁగాఁ గాక
సారె సారె జంకించఁ జలమా నీతోను
మారుకొని నీసుద్దులు మన నాటఁగాఁ గాక
కూరుములు గొసరఁగ కోపమా నీతోను

చ. 2: తెగడఁగా మోవిదాఁకి తేనె చిందఁగాఁ గాక
పగలు సాదించ నాకుఁ బగటా నీతో
నిగిడి నా పయ్యెద నీచేచుట్టుకోఁగాఁ గాక
అగడు చేసి మొరయ నదేపనే నీతోను

చ. 3: దొమ్మి నీవు చేసితే నాతురుము జారఁగాఁ గాక
నిమ్మపంట వేయఁగ నేరుపా నీతో
ఇమ్ముల శ్రీ వేంకటేశ యేలితివి నీవు నన్ను
కమ్మరఁ గమ్మర నవ్వ గర్వమా నీతోను

రేకు: 0696-3 లలిత సంపుటం: 14-573

పల్లవి: ఊరకున్న సతి నిఁక నొరసి అడుగవద్దు
వూరడించి సంతోసాన నొలలార్చవలెను

చ. 1: వుప్పతించరాక మొగమాట గలవారికి
తప్పులెంచఁ బనిలేదు తమ పతిని
చిప్పిలఁగఁ బ్రియము చెప్పేటివారికి
యెప్పుడూ నలుగరాదు యేమి చేసినాను

చ. 2: గట్టిగాఁ జుట్టరికము గలిగినవారికి
అట్టు సేయఁగఁ దగదు అట్టె పతిని
యిట్టె మనసు మర్మము లెరిఁగినవారికి
వట్టినేరా లెంచవద్దు వసము గాకున్నాను

చ. 3: యిచ్చకము నెరుపేటి యితవైనవారికి
పచ్చిసేసి దూరరాదు ప్రాణనాధుని
యిచ్చల శ్రీవేంకటేశ యేలితి వీకాంతను
కొచ్చి కొసరఁగవద్దు గుట్టుతోనున్నాను

రేకు: 0696-4 ముఖారి సంపుటం: 14-574

పల్లవి: మమ్ము నేల తడవేవు మాటి మాటికి
పమ్మి రతులకు నీకు బాఁలై తి నిపుడు

చ. 1: చనవు గలిగినాపె జాణతనా లాడితేను
వినవింపులై యుండు విభునికిని
ననుపున సారె సారె నవ్వులు నవ్వితేను
మనసున నిండుకొని మర్మములు గరఁగు

చ. 2: బాసలు గొనినయాపె పంతానఁ గొసరితేను
ఆసలు రేఁగు మగఁడైన వానికి
సేసలు చల్లి చల్లి చెక్కులు నొక్కితేను
పోసరించినవలపు లుప్పొంగఁగఁ దొడఁగును

చ. 3: పట్టపుదేవులై నాపె పై కొని కూడితేను
గుట్టుతో రమణునికి కొంకు దేరును
యిట్టె శ్రీవేంకటేశ్వర యేలితివి నన్ను నేఁడు
రట్టడి కాంతల పొందు యిట్టె రచ్చకెక్కును

రేకు: 0696-5 హిందోళవసంతం సంపుటం: 14-575

పల్లవి: నీ కెంత యితవో నెలఁత సేసే చేఁత
కాకు సేసేవారి నెరఁగదు సిగ్గువడదు

చ. 1: వనిత లిందరుఁ దలవంచు కుండఁగా నీకె
చనవరితనమున సాదించీ నిన్ను
గొనకొని యప్పటిని కొలువులోపల నెల్లా
ననుపుల సంగాతాన నవ్వీ నీతోను

చ. 2: వెల్లవిరై గద్దెమీఁద వెస నీవుండఁగా నాపె
చెల్లుబడితనమునఁ జెనకీ నిన్ను
పల్లదపురాజసానఁ బంతములో నీవుండఁగా
మెల్లనె మందెమేళాలు మెరసీ నీయెదుట

చ. 3: కూరిమిఁ గాఁగిట నీవు కూడేటి వేళ యాపె
గారాపుతనమునఁ గలసీ నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
నేరుపరియై కడునిక్కి చూచీ నిదివో

రేకు: 0696-6 మధ్యమావళి సంపుటం: 14-576

పల్లవి: ఇంతకంటే నే మరి యేమి సేతును
వింతవై వుండఁగాను వేఁడుకొంటి నేను

చ. 1: కామించి పెంజెమటలు గారఁగా నీవు వచ్చి
నామొగము చూడఁగాను నవ్వితి నేను
చేముంచి బేంట్లు రాలేచిట్లుగందాలతోడ
ప్రేమమున నన్నంటఁగాఁ బెనఁగితి నేను

చ. 2: అందుఁ జేయరాని చేఁత లన్నియునుఁ జేసి వచ్చి
ముందే మాటాడఁగాను మొక్కితి నేను
సందడించి దప్పిగొని సారె నామోవి యానఁగా
గొంది సిగ్గునఁ దప్పించుకొని వుంటి నేను

చ. 3: తగ నీ పుక్కిళ్ల రెంటఁ దమ్ములము నిండుండఁగా
మిగులా నాకియ్యరాఁగా మెచ్చితి నేను
పగటున శ్రీవేంకటపతివి నన్నేలితివి
మగఁడవు నీఁకాఁగిలి మరిగితి నేను

రేకు: 0697-1 భైరవి సంపుటం: 14-577

పల్లవి: ఎటువంటివాడవయ్య యేమి చెప్పేది
కటకటా వలపు లంగడిఁ బెట్టఁదగునా

చ. 1: సేసతోఁ బెండ్లాడినాపె చేతులు చాఁచఁగవద్దా
ఆసలఁ బొరవినాపె అలయవద్దా
నీసుద్దులు వినినాపె నివ్వెరగు నొందవద్దా
యీ సతినేల సాదించే విందుకుఁగా నీవు

చ. 2: విన్నపాలు సేసేయాపె వేమారుఁ గొసరవద్దా
కన్నులారఁ గనినాపె కసరవద్దా
చన్నులు దాఁకినయాపె సరసము లాడవద్దా
కన్నె నేల జంకించేవు కాఁతాళాన నీవు

చ. 3: కూటమికి వచ్చినాపె గోర నెచ్చరించవద్దా
చోటు చేకొన్నాపె కూడి చొక్కవద్దా
నీటున శ్రీవేంకటేశ నీయాలట మొక్కవద్దా
మేటి కాంతనేల కదిమేవు పై పై నీవు

రేకు: 0697-2 సౌరాష్ట్రం సంపుటం: 14-578
పల్లవి: ఎటువలె మన్నించినా నియ్యకొందుఁగాక నేను
తటుకున నిన్ను మరి తగవులఁ బెట్టేనా
చ. 1: వలపు నీవు చల్లగా వద్దని నే వారించి
చలములు సాదించేనా సారెసారెకు
కలువల నీవు వేసి కన్నులను నవ్వఁగాను
మలసి సొలపి నీతో మారుమలసేనా
చ. 2: చేతులు చాఁచి నీవు చెనకిమన్నించఁగాను
గాతల జంకించేనా కాదంటాను
రాతిరిఁ బగలు మోవిరసాలు నాకియ్యఁగాను
యేతులకు నే నిన్ను యెగసెక్కాలాడేనా
చ. 3: పచ్చడము గప్పి నాగుబ్బలు నీవు ముట్టుఁగాను
పెచ్చువెరుగుచు నేఁ దప్పించుకొనేనా
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యిచ్చగించి వుందుఁగాక యిఁక నేలోఁగేనా

రేకు: 0697-3 బౌళి సంపుటం: 14-579

పల్లవి: ఎఱఁగవా నీవేమైనా యిన్నిటా నేరుపరివి
జఱయుచు నవ్వఁగాను సాదింతు రటవే

చ. 1: సముకాన నాతడు సన్నలు సేయఁగానే
తమకించి మాటాడఁ దగవౌ నటే
చెమరించు కొంటాను చేరి ప్రియాలు చెప్పఁగా
బొమముడి జంకెనలు పొందౌనటే

చ. 2: యియ్యకోలుగా నీకు నిచ్చకము సేయఁగానే
సయ్యాటానఁ బెనఁగఁగ సంగతౌనటే
నెయ్యముతో గాసిపడి నీదిక్కు చూడగాను
కొయ్యతనానఁ గొసరు గూడునటవే

చ. 3: మంతనాల నాతఁడు మర్మములు ముట్టఁగాను
పంతములు నెరఁపగ బాగౌనటే
యింతలోనె శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గూడె
చెంతనుండి సిగ్గువడఁ జెల్లునటవే

రేకు: 0697-4 మాళవిగౌళ సంపుటం: 14-580

పల్లవి: ఇంటివారిచేఁతలు యింపు వుట్టీనా
గొంటుతనమున యేల కొసరేవు నీవు

చ. 1: పన్ని నీవు వలచినపడఁతి నీకు యేమాట
విన్నపముసేసినాను విందువు గాక
మన్నన గలిగినాపె మరియెంత జంకించి
సన్నలు చేసినానుఁ జవువౌఁ గాక

చ. 2: బాస చేయించుకొన్నాపె పనులెంత చెప్పినాను
చేసూటికి లోనై చేతువుగాక
ఆసకొలిపి రప్పించినాపె యేమిసేసినాను
వోసరించి అన్నిటికి నోర్తువుగాక

చ. 3: నీవుగాఁగిలించినాపె నీటులెంత చూపినాను
కైవసమై మెచ్చి మెచ్చి కందువుగాక
యీ వల శ్రీవేంకటేశ యేలితివి నన్నునేఁడు
సేవ చేసి నే నెట్టున్నాఁ జేకొందువు గాక

రేకు: 0697-5 ముఖారి సంపుటం: 14-581

పల్లవి: నీవేల కొంకేవు నిన్ను నేవద్దనేనా
భావించి నీ మేనెల్లా నాపాలిదేకాదా

చ. 1: చెక్కులఁ జెమటగారఁ జెప్పీ సుద్దులు నీతో
అక్కరఁ జెలియమాట లాలించరాదా
ముక్కున నూర్పులు రేఁగ ముందరఁ బనులు చేసీ
చక్కఁగా నాపెను నీవు సంతోసించరాదా

చ. 2: పాలిండ్లు గదలఁగాను పాదాలు నీకొత్తుతాను
తాలిమితో నవ్వీఁ జిత్తగించరాదా
వాలుకచూపులఁ గొచ్చి వాటముగా నిన్నుఁజూచి
చేలకొంగు వట్టి తీసీఁ జెనకఁగరాదా

చ. 3: కప్పురము నోరికిచ్చి కాఁగిట నిన్నునించి
కప్పుకొనీఁ బడ్చుడము కలయరాదా
యిప్పుడె శ్రీవేంకటేశ యీపె నిన్నుఁ బెండ్లాడె
వొప్పుగా నన్నేలితివి వొద్దనుండరాదా

రేకు: 0697-6 వరాళి సంపుటం: 14-582

పల్లవి: నీమగఁ డాతఁడె వచ్చి నిలుచున్నాఁ డెదుటను
గోమున నిద్దరు మీరే కూడివుండఁ గదరే

చ. 1: మొగమెత్తి చూచితేను మోహము దెలియవచ్చు
నగితేను మాటలాడి నమ్మించవచ్చు
తగవులు నడపితేఁ దప్పులు దేరుచవచ్చు
యెగసక్కేల నుండఁగా నెట్టు బుద్ధి చెప్పేమే

చ. 2: చుట్టరికమే చూపితే సుద్దులడుగఁగవచ్చు
నెట్టనఁ బైకొంటేఁ బ్రేమ నెరపవచ్చు
గుట్టెరఁగ మెలఁగితే గుణము దెలియవచ్చు
వొట్టు వెట్టుకోఁగా నెట్టు వొడఁబరచేదే

చ. 3: కలపుకోలు గలితే కానుక లియ్యఁగవచ్చు
మెలుపున నియ్యకొంటే మెచ్చఁగవచ్చు
యేలమి శ్రీవేంకటేశ యిదివో నిన్నుఁ గూడె
చలపట్టితే నెట్టు చవులు వుట్టించేమే

రేకు: 0698-1 రీతిగౌళ సంపుటం: 14-583

పల్లవి: చెలిమరఁగున నేమి చేసితివి చెప్పవయ్య
పలుమారు లోఁగఁగఁ బనియేమి నీకు

చ. 1: నాతిమోముఁ జందురుఁడు నవ్వువెన్నెల గాసీ
నీతెరఁగి సిగ్గువడ నీకేఁటికి
చేతిమీఁద మెరచీ నీ చెక్కుటద్ద మిదె నేఁడు
యీతలఁ దలవంచే విది యేమి నీవు

చ. 2: సుదతి నేత్రపుమీలు చూపుఁదుమ్మిదల రేఁచీ
కదిసి నీవేల మేను గప్పుకొనేవు
కదలీ నీయధరపు కమ్మనిమోవిపండు
పదపడి చిన్నఁబోవఁ బనియేమి నీకు

చ. 3: కొమ్మకరపల్లవాలు గోరపై వాండ్లు చూపీ
పిమ్మటికి వీఁగి తప్పించుకోనేల
యిమ్ముల శ్రీవేంకటేశ యిన్నిటా నిన్నికె గూడె
సమ్మతించితివి ఇఁక జయమే యిన్నిటాను

రేకు: 0698-2 బౌళి సంపుటం: 14-584

పల్లవి: ఈతని నేల సొలసే వెందాఁకా నీవు
యేతులు నెమ్మెలుఁ జూప నిఁక నేలే చెలియా

చ. 1: పనిలేని మాటలు బయలీఁతలు
ననుపులేని పొందులు నగుఁబాటులు
యెనయని జాగరాలు యెదురాఁకలు
కనుఁగొంటిని నీవిఁక రాఁగదవె వోచెలియా

చ. 2: యేడ లేనియాసలు యెండమావులు
వేడుక లేని సొమ్ములు వెట్టిమోపులు
మేడమీఁది సరసాలు మేకతాఁకులు
జాడ లెరుఁగుదు దూరఁ జవిగాదె చెలియా

చ. 3: అమరని సింగారాలు అదవదలు
తమిలేని కాఁగిళ్లు తలపోఁతలు
సమరతి శ్రీవేంకటేశ్వరుఁ డిదె నన్నుఁ గూడె
సముకాన నున్నదానఁ జలమేలె చెలియా

రేకు: 0698-3 సామంతం సంపుటం: 14-585

పల్లవి: పొద్దువోక నేను నీతో పూఁచి పెనఁగేఁగాక
తిద్దుకొంటే నేఁడు నీవు తీరుకు వచ్చేవా

చ. 1: పున్నమవెన్నెల నెట్టు పోగులు వోయఁగవచ్చు
సన్నలఁ గొండల నెట్టు జరప వచ్చు
కిన్నరకాయల నెట్టు గిలిగింత సేయవచ్చు
నిన్నెంత కరఁగించినా నీవు గరఁగేవా

చ. 2: తేలించి బయలఁ బందిలి యెట్టు వెట్ట వచ్చు
గాలి ముడియఁగా నెట్టు గట్ట వచ్చును
లోలత సముద్రము లోఁతెట్టు గానఁగవచ్చు
చాలాబుద్ధి నే చెప్పితే చాయకు వచ్చేవా

చ. 3: యిలలోని చింతాకు లెట్టు లెక్కవెట్ట వచ్చు
వలపు గంపలఁ బట్టవచ్చుట యెట్టు
అలమేలుమంగ నేను అన్నిటా శ్రీవేంకటేశ
కలసితి విఁక నీవు కడమ లెంచేవా

రేకు: 0698-4 గౌళ సంపుటం: 14-586

పల్లవి: ఇచ్చకము నేర దీకె నేమి సేయవచ్చు నిఁక
మచ్చిక దలఁచి నీవు మన్నించు సతిని

చ. 1: చెంతల నేమి సేసినా చెలుల దూరుట గాక
పంతము లాడుదురా పతితోను
వింతదానితో నవ్వితే వెంగెము లాడుట గాక
అంతలోనే ముంగురులు అంటఁ దరమౌనా

చ. 2: నగుతాఁ జెనకితేను ననిచి వోర్చుట గాక
పగలు చాటుదురా పతితోను
చిగురుమోవిగంటి సేసితే మెచ్చుటగాక
తగవులఁ బెట్టి నీపైఁ దప్పుమోపవచ్చునా

చ. 3: ఆదనఁ జన్నులంటితే నాస చెల్లింతురు గాక
పదరి పెనఁగుదురా పతితోను
యిదివో శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
పదిమారులు నిన్నుఁ బంగించఁ దగునా

రేకు: 0698-5 దేవగాంధారి సంపుటం: 14-587

పల్లవి: ఇంత రట్టు సేసేమా యిప్పుడు నే మెల్లాను
పంతగత్తెయై నీతోఁ బలిమిఁ బెనఁగీని

చ. 1: పలుమారు నవ్వుకొంటాఁ బగటులు చూపుకొంటా
చెలుములు సేసీని చెలి నీతోను
కొలువులు సేయుచును కూరిమి గొసరుచు
వలపులు చల్లి నీవద్దఁ గాచుకున్నది

చ. 2: తప్పక చూచుకొంటా తరితీపు చేసుకొంటా
అప్పటి మేకులు సేసీ నంగన నీతో
కప్పురాన వేయుచును కానుక లొసఁగుచును
ముప్పిరి నాసాసల మోవి చూపీ నీకును

చ. 3: శిర సూచి మెచ్చుకొంటా చేతులు పైఁ జాచుకొంటా
మురిపెము వచరించీ ముదిత నీతో
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
సరుగ నీరతులలో సాము సేసీఁ దాను

రేకు: 0698-6 దేసాళం సంపుటం: 14-588

పల్లవి: చెప్పవయ్య నేము గొంత చెవుల వినేముగాని
చొప్పుల నీసంతోసము చూడ వేడుకయ్యీని

చ. 1: తలఁపులో నెవ్వతెను తలఁచుకొంటివో కాని
చెలరేఁగి నీమోవి చెంగలించెను
పలుమారు నేమేమి భావించుకొంటివో
సెలవుల నీకు నిట్టె చిరునవ్వు వచ్చెను

చ. 2: యెకతాన నెవ్వతె నిన్నే సేఁత చేసెనోకాని
దాకొని సిగ్గులు నీకు తరచాయను
మైకొని యప్పటి నీమన సెందెందుఁ బారెనో
ఆకుమడిచి పట్టుక అట్టె వున్నాఁడవు

చ. 3: అవ్వల నెవ్వతెమీఁది ఆస వున్నదో కాని
నివ్వటిల్లుఁదమకము నిండుకొనెను
రవ్వల శ్రీవేంకటేశ రతి నలమేల్మంగను
చివ్వల నన్నేలితివి చెమటలు మించెను

రేకు: 0699-1 సాళంగనాట సంపుటం: 14-589

పల్లవి: ఎంత గట్టువాయవాఁడ వేమి చెప్పేది
కాంతసేవలల్లా నీవు కనుఁగొనరాదా

చ. 1: పొలిఁతి నీ కిందాఁకాను బోనము వడ్డించెను
పిలిచి యాకెఁ బొత్తునఁ బెట్టుకోరాదా
పలుమారు నిందాఁకాఁ బాదాలు విసికెను
అలసి పక్కఁ బండంగ నప్పణీయరాదా

చ. 2: అప్పటినుండిఁ దాను ఆకుమడిచి యిచ్చెను
వొప్పుగఁ దమ్ముల మాకె కొసఁగరాదా
చొప్పులెత్తి వూరిలోనిసుద్దులెల్లా నీకుఁ జెప్పె
కప్పి పచ్చడములోనఁ గాగిలించరాదా

చ. 3: సరుసఁ గూచుండి నీతో జాగరాలు సేసెను
నిరతితో రతులెల్లా నేరుపరాదా
యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
సరవి నేలితి విట్టె చనవియ్యరాదా

రేకు: 0699-2 రామక్రియ సంపుటం: 14-590

పల్లవి: వేడుకకాఁ డితఁడు విట్ఠలేశుఁడు
వీడని పొందులు సేసీ విట్ఠలేశుఁడు

చ. 1: వెన్నదిన్న మదమున వెలఁదులుఁ దానును
వెన్నెలలో నాడీ నిదె విట్ఠలేశుఁడు
పన్ని రతుల కింతులఁ బాంచజన్యరవమున
సన్న సేసి పిలిచీని సారె విట్ఠలేశుఁడు

చ. 2: ఆసపడి కొలువులో నాడువారి మీఁదట
వేసీ విరులఁ గొని విట్ఠలేశుఁడు
వేసరక పదారువేలు సతులయిండ్లా
సేసవెట్టి పెండ్లాడీఁ జేరి విట్ఠలేశుఁడు

చ. 3: మెల్లనె గందమిచ్చేటి మెలుతను గాఁగిలించి
వెల్లవిరిగాఁ గూడె విట్ఠలేశుఁడు
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డితఁడె తానైవుండి
యెల్లగాఁ గోనేట వరా లిచ్చె విట్ఠలేశుఁడు

రేకు: 0699-3 భైరవి సంపుటం: 14-591

పల్లవి: ఏమి సేతునే చెలియా యింత నీకు వలచితి
ఆముకొన్ననీచేఁతలు ఆసలు వుట్టించీనే

చ. 1: తియ్యని నీమాటలఁ దేనెలు గారీఁగాని
గయ్యాళి జంకెనలఁ గాఁక రేఁగీనే
పయ్యదజారులవల్ల భావము గరఁగీఁగాని
చెయ్యరాని చెనకుల సిగ్గులు ముంచీనే

చ. 2: ననుపు నీచూపులు నమ్మికలు సేసీఁగాని
కనుచూపులై తేను కాఁడిపారీనే
వినయపు నీగుణాలు వేడుకలు చూపీఁగాని
కనకపుమైసోఁకులు కళలు దాఁకించీనె

చ. 3: యిచ్చకవు నీకాఁగిలి యింపు గెరలించీఁగాని
హెచ్చిన రతులెల్లాను యెలయించీనే
నిచ్చ శ్రీవేంకటేశుఁడ నేను నాకుదక్కితివి
తచ్చి చన్నులు మతఁగ పర్వతము మించీనే

రేకు: 0699-4 ముఖారి సంపుటం: 14-592

పల్లవి: నగుఁబాట్లాయఁగా నలుగురిలోననెల్లా
తగవులు నీలోనే తలఁచుకో యిఁకను

చ. 1: యేకతాన నీవొక్కడ వింటిలోఁ బవ్వళించితే
ఆకడకెవ్వతో రాఁగా నలమితివి
చేకొని యెంతలో నాకె చెరఁగు మాసి వుండితే
సైకముగా శిరసు మజ్జనము సేసితివి

చ. 2: సింగారించుకొనేవేళ చెలి యటు పొలసితే
అంగవించి కూడి మోవి యానితివి
చెంగట నాపె యెంగిలిచేతితో నుండుట గని
సంగతిగాఁ గేళాకూళి జలక మాడితివి

చ. 3: తెరలో నుండినపుడు తెరవ తొంగి చూచితే
సరిఁ గూడితివి భూపతిచెరువు కాడ
అరసి శ్రీవేంకటేశ ఆపె చెమటలఁ దోఁగి
వొరసి నారతులలో నోలలాడితివి

రేకు: 0699-5 ఆహిరి సంపుటం: 14-593

పల్లవి: ఎట్టు వలపించితివో యేమని చెప్పేది నిన్ను
చుట్టమ వన్నిటా నీవు సుదతికి నైతివి

చ. 1: చెలువపు నీయెలుఁగు చెవుల విన్నప్పుడే
జల జలఁ జెమరించె సకియ
వెలయ నీపంజుల వెలుఁగు చూచి అంతలో
పులకాంకురాలచేతఁ బొదలుచు నున్నది

చ. 2: ఇప్పుడు నీవు విచ్చేసి యెదుట నుండఁగానే
వుప్పతిల్లు సంసాన నోల లాడీని
నెప్పున మంచముమీఁద నీవు గూచుండితేనే
చిప్పిలుఁ గళలతోడ చిమ్మిరేఁగీని

చ. 3: గక్కననుఁ దన్ను నీవు కాఁగిలించుకొనఁగానే
చొక్కుచుఁ దురుము వీడి సొలసీఁ దాను
యిక్కడ శ్రీవేంకటేశ యేలితి వీపెను నేఁడు
పిక్కటిల్లుఁ జన్నులను పెనచీ నీమేను

రేకు: 0699-6 శ్రీరాగం సంపుటం: 14-594

పల్లవి: ఓయమ్మ నిన్ను గెలువ నోపునటే యీతఁడు
నాయముచేతఁ జెప్పితే నాఁటె గోరనేవే

చ. 1: నవ్వుతా నాడెను మాట నాయకుఁడు నీతో
రవ్వలు సేసి యెంత రచ్చ వేసేవే
నివ్వటిల్ల సరసము నీతో సలుపుతాను
పువ్వుల వేసిన నిట్టే పొక్కెననేవే

చ. 2: వేడుకకుఁ బెనఁగెను వెస నితఁ డిందాఁకా
వూడెఁ గుచ్చెలంటా నెల వుప్పతించేవే
జాడతోడఁ దేనెలు చవులు చూచె నింతే
వాడె మోవియంటా మాకు వచ్చి యేమి చూపేవే

చ. 3: చెలరేఁగి కూడెను శ్రీవేంకటేశుఁడు నిన్ను
చలపాది యంటానేల సాదించేవే
వలపులు రేఁచె నిదే వాడికైన రతులను
అలయించెనంటా నేఁటి కప్పటిఁ జెనకేవే

రేకు: 0700-1 శుద్ధవసంతం సంపుటం: 14-595

పల్లవి: ఊరకే గడించుకొని వొద్దు వెట్టే నాపెను
చేరి నీవు గూడఁగాను చెట్టవట్టి తీసెనా

చ. 1: మనసారా నీవే నేఁడు మాయింటికి వచ్చేనంటే
వొనర నొద్దని యాకె వొట్టు పెట్టెనా
చన విచ్చి నీవు నాకు సరవి నడుపే నంటే
ననచకుండా నపుడు నడుమఁ దాఁ దుమ్మెనా

చ. 2: పచ్చిగా నీవె నాతో పకపక నవ్వఁగాను
రచ్చల నాపె మరఁగు వచ్చెనా నీకు
విచ్చనవిడై నీవు విడెము చేతి కియ్యఁగా
తచ్చి నిన్నాకె యేమైనాఁ దగవుకుఁ దీసెనా

చ. 3: గక్కన నీవుఁ గాఁగిలించుకొనఁగాను
చక్కఁగా నాకె నడుమ సందు చొచ్చెనా
యిక్కడ శ్రీవేకంటేశ యేలితివి నన్ను నిదె
వెక్కసాన నాపె మరి వింత సేసెనా

రేకు: 0700-2 సామంతం సంపుటం: 14-596

పల్లవి: ఎక్కడి కెక్కడ మేకు లేమి చెప్పేది
చక్కఁదనములు వెదఁజల్లీ నీయెదుట

చ. 1: సెలవి నున్నది నవ్వు చేతిపై నున్నది చెక్కు
కలికితనాలు చూపీఁ గాంత నీకు
పిలుపు పెదవిపై ప్రియము మనసులోన
సొలసి వలపు పొజు చూపీ నీయెదుట

చ. 2: చెమటలు చెంపలను సిగ్గులు నిలువునను
తమకమె కుప్పళించీ తరుణి నీకు
జమళిచూపు కన్నుల జంకెనలు బొమ్మల
తిమురుఁ గోరికలెల్లాఁ దెలిపీ నీయెదుట

చ. 3: అసురుసురు కాఁగిట నడియాస రతులను
పొసఁగ నప్పణ సేసీఁ బొలఁత నీకు
యెసఁగ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కొసరి తానూ ముద్దు గురిసీ నీయెదుట

రేకు: 0700-3 లలిత సంపుటం: 14-597

పల్లవి: లేవయ్య యేమి చెప్పేవు లెక్కలేని సుద్దులెల్లా
కాలు దొక్కఁగా నేఁ గసరేనా నీతోను

చ. 1: చేరి చేరి నీకు నేను సేవ సేయఁగలఁ గాక
ఆరి తేరి కడుదూరే అందుకోపేనా
కోరి నేఁ బ్రియము చెప్పి కొసర నోపుదు గాక
బీరానఁ జెనకఁగా నేఁ బెనఁగేనా నీతోను

చ. 2: కాయము నీపై మోపి కళలు రేఁతుఁగాక
చాయల సన్నల నిన్ను సాదింతునా
పాయక నీవొద్దనుండి పాదము లొత్తుదుఁ గాక
వేయిటికైనాఁ గడు వేసరింతునా

చ. 3: చెక్కులు నీకు నొక్కి సేలు చల్లుట(గాక
కక్కసించి గోరగీరి కాఁతాళింతునా
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వొక్కటె నిన్ను రతుల నోడించ వచ్చునా

రేకు: 0700-4 దేశాక్షి సంపుటం: 14-598

పల్లవి: మెచ్చవద్దా నీవిందుకు మెలుఁత వోజ
కొచ్చి నిన్నుఁ గొసరదు గుట్టుతోడను

చ. 1: వెలఁదులచేతనే విన్నవింపించీఁ గాని
చెలి నీతో మాటాడదు సిగ్గుతోడను
కలువపూవులు నీకుఁ గానుక యిచ్చీఁ గాని
తలయెత్తదు నీవొద్దఁ దన యణఁకువను

చ. 2: వుల్లములో దయపుట్ట నూడిగాలు సేసీఁగాని
వెల్లవిరిఁ దమకము వెదచల్లదు
వొల్లనే నీపదముల వొద్దికఁ బాడీఁ గాని
పెల్లున నిన్నుఁ బేర్కొని పిలువఁగఁ జాలదు

చ. 3: గక్కన నదరిపాటు కాఁగిలించుకొనీఁ గాని
తక్కి వోరువఁగ లేదు తమితోడను
యిక్కడ శ్రీవేంకటేశ యీకెను నీవేలితివి
వెక్కసాన నలయదు వేవేలరతులను

రేకు: 0700-5 నాగవరాళి సంపుటం: 14-599

పల్లవి: ఎఱఁగ మెన్నఁడు నేము ఇటువంటివి
జరపునివెల్లాఁ జూచి సంతోసము లాయను

చ. 1: చెనకి యొకతె నిన్నుఁ జెయి వట్టి తియ్యఁగాను
ననచి యొకతెకు సన్నలు సేసేవు
వనిత జాణతనమో వడి నీజాణతనమో
అనుమానమెల్లాఁ దీర నానతీవయ్యా

చ. 2: యిచ్చలఁ దొల్లిటి యాపె యిటు నీతో మాటాడఁగా
మచ్చిక నవ్వనియాపె మర్మా లంటేవు
నెచ్చెలివలపుజాడో నీవలపుజాడో యిది
అచ్చలాన నాతో నీవు ఆనతీవయ్యా

చ. 3: చేరి పెండ్లికూఁతురు సేసలు వెట్టఁగాను
సారెఁ జేతు లిద్దరిపైఁ జాచ వచ్చేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఆరసి నేఁ జేసేపను లానతీవయ్యా

రేకు: 0700-6 కాంబోది సంపుటం: 14-600

పల్లవి: నడుమ నే మిమ్ముఁ జూచి నవ్వుదుఁ గాని
పడఁతి సవతి నీవు పతివి నాకు

చ. 1: సారె మీకిద్దరికి సంగాతాలు చేసేనా
చేరి యాపెకు బుద్ధులు చెప్పమనేవు
తారుకాణగా మీకుఁ దగవులు దేర్చేనా
మేరతో వినుమనేవు మీ మాటలు

చ. 2: వొద్దనుండి మీకు నేను వూడిగాలు సేసేనా
కొద్దిమీర విడే లిచ్చి కూర్చు మనేవు
పెద్దగా నే వొజ్జలనై పెండ్లి మీకుఁ జేసేనా
పొద్దులు వేళలు నన్నే వూఁచి యడిగేవు

చ. 3: విందువలె నే మిమ్ము వియ్యము లందించేనా
కందువఁ జుట్టరికాలు కడుఁజెప్పేవు
అందపు శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
సందడి గిలిగించేనా సారెకూ నవ్వేవు

పె.అ.రేకు: 0001-01 దేవగాంధారి సం: 15-001

పల్లవి: అందులకుఁగాదు నిన్నడిగేది
ముందరి పనులకే మొక్కేఁ గాని

చ. 1: సకలలోకములకు స్వామివైన నీవు
వొకని నన్నేల లేక వొల్ల ననేవా
మొకరివై భూమెల్ల మోచి యుండిన నీవు
ఆకట నాపరభారా లాఁప ననేవా

చ. 2: పలుజీవులకు నెల్ల ప్రాణమవైన నీవు
వొలసి నాలో నుండ నొల్ల ననేవా
కలిగి బ్రహ్మాదులను కనిపెంచిన నీవు
పెలుచనైన నన్నుఁ బెంచ ననేవా

చ. 3: వరుస నందరికిని వరదుఁడైన నీవు
యిరవై వరము నాకు నియ్య ననేవా
యెరపు లేక శ్రీ వేంకటేశ నాకు నిహమెల్ల
కరుణతో నిచ్చితివి కడమలు గలవా

పె.అ.రేకు: 0001-02 గుండక్రియ సం: 15-002

పల్లవి: నీవే ఘనుఁడవు నే నొక దేహిని
యేవలఁ గాచుట యెన్నిక నీకు

చ. 1: మొక్కినఁ దీరును మోచిన తప్పులు, అని
మొక్కెద నీ పాదములకు నిదే
చిక్కినవారిపై చేరి దయ గలుగు, అని
చిక్కితి నిటు నీ చేతికి నేను

చ. 2: చెప్పినఁ బాయును నేసిన పాపము, అని
చెప్పెద నా దుష్టుచేఁత లివే
యెప్పుడు చనవరి యెంగిలి దిన్నను
చిప్పిలుఁ బ్రసాద జీవిని నేను

చ. 3: కొలిచిన పతి చేకొని రక్షించును అని
కొలిచితి నీ డాగులు మోచి
యెలమి శ్రీవేంకటేశ్వర నే నీకు
బలువగు సూత్రపు ప్రతిమను నేను

పె.అ.రేకు: 0001-03 బేళి సం: 15-003

పల్లవి: కరుణించి నీవు గాఁగాఁ గాచితివి గాక
శరణని విన్నవించ సంగతులా నాకు

చ. 1: దిట్టనై నేఁ జేసిన దిమ్మరిచేఁతలకును
జట్టిగా నీ నరకాలు చాలునా నాకు
పుట్టిన నా జన్మములు పొసగఁగ వ్రాయఁబోతే
అట్టె వనముల తాటియాకు లెల్లాఁ జాలునా

చ. 2: కదిసి నే నాడేటి కల్ల లెంచి చూచితేను
మొదల యీ భూమియైనా మోచునా నన్ను
ఆదన నే నాచరించే అనాచారపు టెంగిలి
నదులజలాలు పావనము సేయఁగలవా

చ. 3: తొలుత నేఁ దలఁచిన ద్రోహాలకు మాఁకు లెల్లా
యిలఁ గొఱ్ఱులు సేసినా యిందుఁ బాయునా
అలరి మరి దిక్కు లేరని శ్రీవేంకటేశ్వర
తెలిసి నీవే నాకు దిక్కై కాచితివి

పె.అ.రేకు: 0001-04 మంగళకౌశిక సం: 15-004

పల్లవి: ఈ దేహికి నింకాను
సాదించిన సకలము జయము

చ. 1: ఏది తుద యెన్నఁడు ముగుసును
ఆదికి ననాది హరిమాయ
సాదించి సుజ్ఞాని యైతే
యీదెస వెదకిన యిహమే పరమూ

చ. 2: బలిమేది భవములఁ బాయఁగ
కలిగి నట్లెల్లాఁ గర్మంబు
నిలుకడలో నిర్మలుఁడైతే
వలసిన చోటనే వాఁడికి సుఖము

చ. 3: తని వేది తగుభోగములకు
తనలోపలనే దైవికము
చనవుననూ శరణు చొచ్చితే
వెనుకొనె నిదె శ్రీ వేంకట విభుఁడు

పె.అ.రేకు: 0001-05 గుజ్జరి సం: 15-005

పల్లవి: బలవంతుఁడవు నీవు పట్టినదే యాడేరును
యిల మీ దాసుఁడ నైతి యిఁకఁబోదు సుమ్మీ

చ. 1: స్వామి నాలోని చంచల గుణము లివి
యేమీ మానవు యెంతైనాను
నీ మాయ మహిమో నీకుఁ బరాకైనదో
నా మనసులోఁ గొంత నలుసున్నదో

చ. 2: దేవా పంచేంద్రియాలు తీదీపులనుఁ బెట్టే
నీవే నా యెదలోను నిండుకుండఁగా
యీవేళఁ దరిగాదో యిది నీ వినోదమో
నా వొళ్లి మంద బుద్ధి నయ మియ్యదో

చ. 3: అప్పా నేఁ దొల్లి అజ్ఞాని నైనదే
తప్పా నేఁడు గావ తగదా నన్ను
చెప్పే నామాట విను శ్రీ వేంకటేశ్వర నీకు
వొప్పినదే యాత్మ వొల్ల ననరాదు

పె.అ.రేకు: 0001-06 బౌళి సం: 15-006

పల్లవి: అయ్యో యేమరి నే నాఁ డప్పు డేమై వుంటినో
అయ్యెడ నీ దాసి నైతే ఆదరింతుగా

చ. 1: అల్లనాఁడు బాలుఁడవై ఆవులఁగాచేవేళ
చిల్లర దూడనైతే చేరి కాతువుగా
వల్లెగా విటుఁడవై రేపల్లెలో నుండే నాఁడు
గొల్లెత నయినా నన్ను కూడుకొందుగా

చ. 2: మేలిమి రామావతారవేళ రాయి రప్ప నైనా
కాలు మోపి బదికించి కాతువుగా
వాలి సుగ్రీవులవద్ద వానరమై వుండినాను
యేలి నన్నుఁ బనిగొని యీడేర్తువుగా

చ. 3: వారిధిలో మచ్చ కూర్మావతారములైన నాఁడు
నీరులో జంతువునైనా నీవు గాతువుగా
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
మోరతోపున నిన్నాళ్ళు మోసపోతిఁగా

పె.అ.రేకు: 0001-07 సాళంగనాట సం: 15-007

పల్లవి: ఎక్కడి పురాకృతము యేమి సేసీని
యెక్కడా బలువు నీ బంట్లెట్టుండినాఁ జెల్లును

చ. 1: నీ వల్లఁ బుట్టెను బ్రహ్మ నీవు సేసినదే మాయ
భావించి నీ కుక్షిలోనే బ్రహ్మాండాలూ
కావింప నీ వేలికవు కమ్మని నట్టాఁ బనులు
దైవమా యిది యెఱిఁగి నీ దాసుఁడనేనైతిని

చ. 2: భూమి నీ దేవులు నీవు పుట్టించిన దమృతము
శ్రీమంతుఁడ విన్నిటా నీ సేసినట్టవును
యేమిటివాఁడు యముఁడు యెక్కడి మృత్యువు మరి
సామజవరద మీ శరణు చొచ్చితిని

చ. 3: ఏడఁ జూచినా నీ దాసు లెక్కడాఁ జెడుట లేదు
యీాడు లేదు శ్రీ వేంకటేశ నీకును
యేడ విధి యేడ స్వర్గ మెక్కడిది నరకము
జాడతో నీముద్ర నా భుజముల ధరించితి

పె.అ.రేకు: 0002-01 మాళవిగౌళ సం: 15-008

పల్లవి: కర్మ మంటా మాకు మాయ గప్పేవు గాక
కర్మము ధర్మము నీ కల్పితమే కాదా

చ. 1: బ్రతుకు మంటేఁ జచ్చిన పరీక్షిత్తు బ్రతుకఁడా
మతి నారాయణాస్త్రము మానుమంటే మానదా
కతలుగా జలధులు కమ్మంటే రాళ్ళు గావా
యితవు నీకు నైతే యేపని యైనా నౌను

చ. 2: మలసి బ్రహ్మ మాయకు మారుమాయ సేయవా
అల ద్రౌపదికిఁ జీర లక్షయ మంటేఁ గావా
కులగిరులు నేలతో కుంగు మంటేఁ గుంగవా
యిల నీకు వలసితే యేపనియైనా నౌను

చ. 3: యిట్టిది విధి యనరా దిది యోఁగా దనరాదు
పట్టి నీవు దలఁచిన యట్టోఁగాన
యిట్టే శ్రీ వేంకటేశ యిందరిలోననుఁ గావు
యెట్టు నీకు వలసిన యేపనియైనా నాకు

పె.అ.రేకు: 0002-02 సాళంగనాట సం: 15-009

పల్లవి: అట్టివాఁడఁ గనకనే హరి నీదాసుఁడ నైతి
వొట్టిన యపరాధము లొడ్డించుకో వశమా

చ. 1: యెన్ని నేరాలైనఁ జేసి యేమిటాఁ దీరని తప్పు
వున్నతి నీ లెంక నైతే వూరకె పోవు
పన్ని పగసేసి వచ్చి బలవంతుని మరుఁగు
తన్ను దానే చొచ్చితేను దక్కిపోవుఁ బనులూ

చ. 2: వొడ్డిన సొమ్మెల్లాఁ దిని వూనిన ఋణమునకు
బిడ్డపేరు వెట్టితేను బీతి వాసును
అడ్డమై జగడగాని ఆడరానిమాట లాడి
ముడ్డిమీది కెత్తుకొని మొక్కితేనే పోవును

చ. 3: పాపమే కూడుగ నుండి పట్టి నారా యంటేను
చేపట్టి వైకుంఠ మిచ్చి చేరి కాచితి
యేపున శ్రీ వేంకటేశ యిదీ వినే పో నేను
మూఁపున నీ యచ్చు మోచి ముందర నిలిచితి

పె.అ.రేకు: 0002-03 గుజ్జరి సం: 15-010

పల్లవి: ఇన్ని యుపాయము లింక నేడ కెక్కు శ్రీహరి
పన్ని నీ మఱఁగు చొచ్చి పాయకుండీఁ గాక

చ. 1: అనంతకోటి జన్మములందుఁ జేసినపాపములు
మొనసి నేనొక జన్మమున నీఁగినా
ననిచి కర్మానుష్టానము నేఁడు సేయఁబోతే
పనివడి ముంతనీట బడబాగ్ని ఆరునా

చ. 2: పెక్కు కవిలెలవ్రాఁత కుంభీపాకరౌరవాలు
వొక్క దేహాననే పొంది వుత్తరించేనా
తక్కక నేఁడీ ఘోరతపములు సేయఁబోతే
గక్కన జలధి బుజ్జకాయ నిండేనా

చ. 3: బలువై అనాది వేళ్లు వారిన సంసారము
తలమోచి నేఁ డింతలో తవ్వివేసేనా
నెలవై శ్రీ వేంకటేశ నే నేఁడు పుణ్య మంటితే
చెలఁగి పెను గాలికి చింపి చేటలడ్డమా

పె.అ.రేకు: 0002-04 గుజ్జరి సం: 15-011

పల్లవి: ఎటువలె సిద్ధించు నీ పనులు యెవ్వరు విన్నానవ్వుదురు
తటుకున నుండుట దాలిగుంతయట తలఁపులు మేడామాడుగులు

చ. 1: నీవే బ్రహ్మాండనాథుఁడవు నే నొక మశకమను
యీావల నీ ప్రత్యక్షము గోరెద నెక్కడి కెక్కడ అసంగతం
ఆవటించి నేఁజేసిన వైతే నపరాధంబులు వేవేలు
కావ వనుచు నే నిన్నుఁ బలికెదను కడు సాహసుఁడఁగా నేను

చ. 2: నిక్కము నీవు స్వతంత్రుఁడవు నేమాయాపరతంత్రుఁడనూ
యిక్కువ నీపై భక్తి నేసెదను యెక్కడికెక్కడ అసంగతం
యిక్కడ నే మోచినది కన్గొనఁగ నేడుజానలది శరీరము
కక్కసించి నిను ధ్యానము సేసెద కడుసాహసుఁడఁగా నేను

చ. 3: హెచ్చిన నీ చిత్తము గానా యేచిన నా భాగ్యము దెలియా
యిచ్చలనే బయలకు మొరవెట్టెద యెక్కడి కెక్కడ అసంగతం
కచ్చు పెట్టి శ్రీవేంకటనాయక కరుణించితి విటు నను నీవే
గచ్చుల వూరకె నిన్నుఁ బొగడెదను కడుసాహసుఁడగా నేను

పె.అ.రేకు: 0002-05 మంగళకౌశిక సం: 15-012

పల్లవి: దేవ నావలన గుణము తెలిసి కాచే ననేటి
యీ వెఱ్ఱితనము మాని యిట్టే నన్నుఁ గావవే

చ. 1: నేరుపే నాకుఁ గలిగితే నెట్టన నింద్రియముల
బారిఁబడి బంటనై పంపుసేతునా
ఆరీతి నేనే వివేకి నైతే హేయపుమేను
కోరి బ్రహ్మ మని నమ్మి కొంకక గర్వింతునా

చ. 2: నాలో బుద్ధి గలిగితే నలిఁ గామక్రోధములు
యీ లీల నాసొమ్ము లని యెన్నుకొందునా
తాలిమి నాయందు మంచితనములు గలిగితే
మూల నున్న నా కర్మములే కట్టివేసునా

చ. 3: చిత్తమే కైవసమైతే చేరి సుఖదుఃఖముల
మత్తుఁడనై మఱచి యేమరివుందునా
అత్తిన శ్రీ వేంకటేశ అంతర్యామిని నీవు
తత్తరపు నా పసనీ వెఱుఁగవా

పె.అ.రేకు: 0002-06 బేళి సం: 15-013

పల్లవి: చదివేవి వేదము లాచారము మదిఁ బట్టదు
మదనాతురుఁడ నాకు మంచి తన మేది

చ. 1: ముట్ట యోగ్యము గానివి మోచితిఁ దోలు నెమ్ములు
అట్టె బ్రతికేననే ఆసలు బెట్టు
జట్టిగాఁ బ్రాణము తీపు చావంటే వెలుతు నేను
యిట్టి యజ్ఞానికి జ్ఞాన మెట్టు గలిగీని

చ. 2: కావలె ననుచుఁ గోరి కడుపు నించిన రుచి
యీపల హేయమై వెళ్లీ యేఁ జూడగానే
దావతి మనసందుకే తగిలీఁ గాని రోయదు
భావించి నన్నెంఱుఁగని భావ మెఱిఁగీనా

చ. 3: యోని గతుఁడనై పుట్టి యోనికి మగ్నుఁడనైతి
పూని లోకబండఁ డనే బుద్దెఱిఁగీ
నేనా యెంత సిగ్గెఱుఁగ నీవే విచారించి కావు
శ్రీనిధి శ్రీ వేంకటేశ చేతిలోని వాఁడను

పె.అ.రేకు: 0003-01 దేసాళం సం: 15-014

పల్లవి: నన్నునింతగా గడించి నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించుకోవె అంతర్యామీ

చ. 1: సొమ్ము వోవేసినవాఁడు చుట్టి చుట్టి వీధులెల్లా
కమ్మర వెదకీనట కన్న దాఁకాను
నమ్మిన ఆజ్ఞానములో నన్నుఁ బడ వేసికొని
అమ్మరో వూరకుందురా అంతర్యామీ

చ. 2: వోడబేరమాడేవాఁడు వొక్కదరి చేరిచి
కూడిన యర్థము గాచికొనీనట
యీడనే ప్రపంచములో యిట్టే నన్ను దరి చేర్చి
వోడక కావఁగరాదా వోయంతర్యామీ

చ. 3: చేరి వుప్పమ్మేవాఁడు చిట్లు వేఁ గనఁడట
వూరకే శ్రీ వేంకటేశ వోపికతోడ
ఆరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నా
భార మేరీతినైన మోపు మింక నంతర్యామీ

పె.అ.రేకు: 0003-02 లలిత సం: 15-015

పల్లవి: ఇచ్చితివి తొల్లే నాకు యియ్యఁగల వన్నియును
మచ్చిక నీ శరణన్న మాత్రమే చాలూ

చ. 1: సామీప్యము నడుగ సారూప్యము నడుగ
కామించి సాయుజ్యసాలోక్యము లడుగ
భూమిఁ గాని పాతాళంబునఁ గాని దివిఁ గాని
సామాన నీదాసులతో సహవాస మియ్యవే

చ. 2: కాయసిద్ధి నడుగ కర్మఫల మడుగ
ఆయడ దేవ పట్టము లవి యడుగ
యీాయడ నేఁడే కాని యింకొక్కనాఁడైనాఁగాని
చేయూర నీ దాసులసేవ నాకు నియ్యవే

చ. 3: దేవుఁడవు నీవే మాకుఁ దెలిపె యాచార్యులు
శ్రీ వైష్ణవులే గతి చిక్కినవేళ
శ్రీ వేంకటేశ్వర జీవము బారము నీది
పావన మైతి మింక పలు చింత లేల

పె.అ.రేకు: 0003-03 బౌళి సం: 15-016

పల్లవి: నాగుణాలు దలఁచక నీగుణాలే తలఁచుకో
యేగతినీ మానరాదు యింకనైనాను

చ. 1: తెచ్చి నా గురుఁడు నిన్ను తిరువారాధన సేయ
నిచ్చినాఁడు తలఁచుకో యింకనైనాను
అచ్చుమోపి దాసునిఁగా నంగవించిరి నీ దాసు
లిచ్చల నన్నుఁ జేపట్టు మిందులకు నైననాను

చ. 2: శరణాగతరక్షణ చాటితి నీ భక్తులకుఁగా
యిరవుగాఁ దలఁచుకో యిదియైనాను
తిరుమంత్రమే నన్నుఁ దెచ్చి నీ సొమ్ముగఁ జేసె
యెరవు లేక కాచుకో యిందులకైనాను

చ. 3: యిట్టె అభయ హస్త మెత్తితి వెవ్వరికిఁగా
యెట్టనెదుటఁ దలఁచు మిదియైనాను
గట్టిగా శ్రీ వేంకటేశ కడు నీ నాస మందమే
యెట్టయినాఁ దలఁచుకో యింకనైనాను

పె.అ.రేకు: 0003-04 బౌళి సం: 15-017

పల్లవి: హరి నీవు నాకు లంచ మేమిచ్చేవు అన్నిమర్మములు చెప్పుదునా
దొరవంటా మొక్కి నీ దాసులతోడ తుచ్చపు నీ చేఁతచెప్పుదునా

చ. 1: ఆల్లనాఁడు నీవు మైలన్న చొక్కయ్య నంటుకొన్నసుద్దిచెప్పుదునా
గొల్లెతలవాడ చీఁకటి నీ తప్పు కోరి చేసినది చెప్పుదునా
వెల్లివిరిగా రేపల్లెలోపలి వెన్నముచ్చిమలు చెప్పుదునా
తల్లిబిడ్డ నొక్కవానిగఁ జేసిన ధర్మపుతగవు చెప్పుదునా

చ. 2: మేటి మీనవై ఆఁకటికిఁ జిన్నమీలఁ దిన్నసుద్ది చెప్పుదునా
పాటించి నీ సరిబావమరఁదికి బండి రొప్పినది చెప్పుదునా
గాటపు టసురకామినులతోడ కల్ల లాడినది చెప్పుదునా
యీటువెట్టుకొని నీవు బోయదాని యెంగిలి దిన్నది చెప్పుదునా

చ. 3: దీనవృత్తిఁ బోయి బలిచక్రవర్తిఁ దిరిసికొన్నది చెప్పుదునా
ఆనించి శ్రీపతిపాదాలు నీమెడ నంట గట్టుకొంట చెప్పుదునా
దానవాంతక శ్రీ వేంకటేశ్వర దైవమని నిన్నుఁజెప్పుదునా
పానిపట్టి శరణంటేఁ గాచేట పర మేకాంతము చెప్పుదునా

పె.అ.రేకు: 0003-05 శుద్ధవసంతం సం: 15-018

పల్లవి: మఱిది యనుచు ధర్మజుఁడు భ్రమసునట
యెఱుకతోడి వివేక మెవ్వరియ దున్నది

చ. 1: గరుడవాహన మెక్కి ఘనబాణుని నరికి
తిరిగినా నమ్మరైరి దేవుఁడవని
నరకాసురునిఁజంపి నాతులఁ బదారువేల
వెరసి పెండ్లాడినది వివేకించరైరి

చ. 2: బలుశంఖచక్రములు పట్టి బాలకులఁ దెచ్చి
తెలిపినా నమ్మరైరి దేవుఁడవని
సొలసి విశ్వరూపము చూపి అగ్రపూజగొని
వెలయ నీ మహిమలు వివేకించరైరి

చ. 3: పక్కన ద్రౌపదిఁ గాచి బ్రహ్మచే మొక్కించుకొని
దిక్కైనా నమ్మరైరి దేవుఁడవని
దక్కి శ్రీ వేంకటేశ యిందరికి వరము లిచ్చి
వెక్కస మైతివి నాఁడు వివేకించరైరి

పె.అ.రేకు: 0003-06 శుద్ధవసంతం సం: 15-019

పల్లవి: నేము నీ కన్యులమా నీవు మాలో లేవా
యీ మేరలనే మమ్ము యేలుకొందు గాకా

చ. 1: ధర విభీషణుఁడు మీ తల్లి కడవాఁడా
నిరతి ఘంటాకర్ణుఁడు నీ తండ్రివాఁడా
యిరవై ధృవుఁడు మీ యిల్లాలి కడవాఁడా
శరణన్న మాటలోనే సరుగఁ గాచితివి

చ. 2: మున్నిటి శబరి నీకు ముమ్మనుమరాలా
మిన్నక వుద్ధవుఁడు మీ మేనమామా
పన్నిన వుడుత నీకు పాయరానిచుట్టమా
యెన్నఁగ వీరల నెల్ల నింతలో మెచ్చితివి

చ. 3: అహల్య నీ కూతురా అక్రూరుఁడు గొడుకా
విహరించ నీకు శ్రీ వేంకటేశుఁడా
వహి ముత్తాతలా నీచే వరములు గొన్నవారు
మహి నిందులకెపో నీ మఱుఁగు చొచ్చితిని

పె.అ.రేకు: 0004-01 బౌళి సం: 15-020

పల్లవి: వెన్నలు దొంగిలు నాటి వెట్టివా నీవు
విన్న కన్న జాడ గాదు వెట్టివా నీవు

చ. 1: మీటి యజ్ఞానంబున మిమ్మొల్లని జీవుల
వీటిడివై మోచేవు వెట్టివా నీవు
వేటే నారపేరు నుడివితే నీ పేరనీవు
వేఱులేని చుట్టమవై వెట్టివా నీవు

చ. 2: బంటులైన వారికెల్లాఁ బరతంత్రుఁడవై
వెంట వెంటఁ దిరిగేవు వెట్టివా నీవు
అంటి రెండు కుచేలుని యడుకులకే మెచ్చేవు
వింటే మాకు నవ్వు వచ్చీ వెట్టివా నీవు

చ. 3: పావనమై లోకులెల్లా బదుకుఁడంటాఁ బేరులు
వేవేలు వెట్టుకొంటివి వెట్టివా నీవు
శ్రీ వేంకటేశుఁడవై చేరి వరము లిచ్చేవు
వేవేగ నెవ్వరికైనా వెట్టివా నీవు

పె.అ.రేకు: 0004-02 లలిత సం: 15-021

పల్లవి: సర్వేశ్వరుఁడవు స్వతంత్రుఁడవు నీవు
సర్వోత్తముఁడ నన్నిచ్చటఁ గావవే

చ. 1: శక్తి కలిగితే నీ సరుస దేవుఁడఁగానా
యుక్తి కలిగితే నే నొడలు మోతునా
యుక్తియు శక్తియు నొకటి లేక నీ
భక్తుఁడ నైతి నన్నుఁ బాలించవే

చ. 2: బహు పుణ్యుఁడ నైతే బ్రహ్మపట్ల మేలనా
సహజవిజ్ఞాని నైతే సంసారి నౌదునా
విహితపుణ్యజ్ఞాన విముఖుఁడఁ గనకనే
నహిశయనుఁడ శరణంటిఁ గావవే

చ. 3: శ్రీ వేంకటేశ నీవు చేసిన ప్రతిమ నింతే
నీ వెఱుఁగనిది లేదు నేరుపు నా యందు నీదే
భావము లోపల నీవే పైకొని బుద్ధి యియ్యఁగా
నీవాఁడ ననుకొంటి నేఁడు గావవే

పె.అ.రేకు: 0004-03 హిజ్జిజి సం: 15-022

పల్లవి: నేనైతే నీడేరుదు నీకు లీలా మాత్ర మింతే
మానక నన్నేలు కొమ్మి మాధవ గోవింధా

చ. 1: నీవు నన్ను మన్నించితే నీ మహిమలోఁ గొంత
యీావల వెలితి యౌనా యీా లోఁభ మేలా
కావించి పాలజలధికడ నొక్క తుంపురు
వేవేగ విదలించితే వెలితి యెందులకు

చ. 2: వెడకర్మినైనా నన్ను వెనక వేసుకొంటేను
గొడవ నీకు వచ్చీనా కొంక నేఁటికి
గడుసు దొంగైన వాఁడొకఁడు కొండలో దాఁగితే
యెడ మిచ్చినకొండకు హీన మయ్యీనా

చ. 3: కందువ శ్రీ వేంకటేశ కరుణారసము నాపై
చిందరాదా అనుమాన చింత లేఁటికి
యిందరిపై సూర్యుఁడు యెండలు గాసితేను
అందుకొన్ని కిరణాలు ఆరగిపోయీనా

పె.అ.రేకు: 0004-04 పాడి సం: 15-023

పల్లవి: రామచంద్రా రామభద్రా రఘువీరా
నీ మహిమ దెలినేరా నేఁటి వారు

చ. 1: అరయ జటాయువున కట్టె మోక్ష మిచ్చితివి
హరునివిల్లు విరిచి అలరితివి
యిరవై రాతికిఁ బ్రాణ మిచ్చితి వింతటి నిన్ను
నరుఁ డంటా నుండిరిగా నాఁటి వారు

చ. 2: నెమ్మది సరయువులో నించితి వైకుంఠము
పమ్మి మారుతికి బ్రహ్మపట్ట మిచ్చితి
దుమ్ములుగ రాక్షసులఁ దుత్తుమురు సేసితివి
నమ్మిరిగా రాజవంటా నాఁటివారు

చ. 3: యెందునుఁ జెడని పట్ట మిచ్చితి విబీషణుని
కంది పరశురాముని నంగవించితి
యిందునే శ్రీ వేంకటేశ యెఱుఁగక దశరథ
నందనుఁడే యనిరిగా నాఁటివారు

పె.అ.రేకు: 0004-05 శుద్ధవసంతం సం: 15-024

పల్లవి: ఏమీ నడుగ నొల్ల నెచ్చుకొందు లన నొల్ల
కామించి నీ విచ్చితి కైవల్యపదము

చ. 1: పుట్టుగులకు వెరవ భూమిలోన హరి నీకు
అట్టె నీ దాసుఁడ నేనైతేఁ జాలు
వెట్టికి నేజాతినైనా వెరవ నీనామములు
వొట్టి నా నాలికమీఁద నుండితేఁ జాలు

చ. 2: వెఱవఁ బాపములకు వేయైనా హరి నీ
యఱలేని కైంకర్యమిచ్చితేఁ జాలు
వెఱవ నింద్రియముల వెతలకు నీ వాత్మ
నుఱక బోధనుండవై వుండితేఁ జాలు

చ. 3: ఏ లోకమైన వెరవ యెక్కు శ్రీ వేంకటేశ
పాలించి నీకృప నాపఁ బారితేఁ జాలు
కాల మెట్లైన వెరవ కర్మ మెట్లైన వెరవ
యేలిన నీదాలు నన్నియ్యకొంటేఁ జాలు

పె.అ.రేకు: 0004-06 భూపాళం సం: 15-025

పల్లవి: భారము నీపైవేసి బ్రదికియుండుటే మేలు
నారాయణుఁడ నీవే నాకుఁ గలవనుచూ

చ. 1: శరణన వెరపయ్యీ సామజముఁ గాచినట్టు
వరుస దావతిపడి వచ్చేవంటా
హరి కృష్ణ యన వెరపయ్యీ ద్రౌపదివర
మిరవుగ నిచ్చినట్టు యిచ్చేవో యనుచు

చ. 2: చేత మొక్క వెరపయ్యీ చీర లిచ్చి యింతులకు
బాఁతిపడ్డట్టే నన్నుఁ బైకొనే వంటా
ఆతల నమ్మఁగ వెరపయ్యీఁ బాండవులవలెఁ
గాతరాన వెంట వెంటఁ గాచియుండే వనుచు

చ. 3: ఆరగించుమన వెరపయ్యీ శబరివలె
ఆరయ నెంగిలి యన కంటే వంటా
యేరీతి నన వెఱతు యిచ్చైనట్లఁ గావు
కూరిమి శ్రీ వేంకటేశ గోవులఁ గాచినట్లు

పె.అ.రేకు: 0005-01 బౌళి సం: 15-026

పల్లవి: రామ రామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటిబంట ననే తేజమే నాది

చ. 1: వారిధి దాఁటి మెప్పించ వాయుజుఁడ నేఁ గాను
సారెఁ జవుల మెప్పించ శబరిఁగాను
బీరాన సీత నిచ్చి మెప్పించ జనకుఁడఁగాను
యేరీతి మెప్పింతు నన్ను యెట్లఁ గాచేవో

చ. 2: ఘనమై మోచి మోప్పించ గరుడుఁడ నేఁ గాను
కొనఁ గామసుఖ మిచ్చు గోపికఁ గాను
వినుతించి మెప్పించ వేయినోళ్ల భోగిఁ గాను
నినునెట్లు మెప్పింతు ననుఁగాచేదెట్లా

చ. 3: నవ్వుచుఁ బాడి మెప్పించ నారదుఁడ నేఁగాను
అవ్వలఁ బ్రాణ మియ్య జటాయువు గాను
యివ్వల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
రవ్వల నా తెరు విదె రక్షించే దెట్లో

పె.అ.రేకు: 0005-02 లలిత సం: 15-027

పల్లవి: ఉన్నమాట లిక నేల వో దేవా
యెన్నటి కిదేమాట యింకా నింకాను

చ. 1: కొంత నా కర్మఫలము కొంత నీ రక్ష కత్వము
యింతలో రెండు గలవా యేమో దేవా
అంతర్యామివి నీవు ఆడేటిబొమ్మను నేను
చెంతఁ గాచుట నీపని సేవసేయ నాపని

చ. 2: నే నపరాధి నయ్యేది నీవు వహించు కొనేది
యీ నెపాలు రెండూ నేల యేమో దేవా
మానక యిట్లయితే నీ మహిమకు గురుతేది
ఆని చింతించే నందుల కపకీర్తి యనుచు

చ. 3: మెదలే నా యధమము మీ ఘనత యెంచి కావు
యిదియే నా విన్నపము యేమో దేవా
యెదుట శ్రీవేంకటేశ యిన్నిటా నీ బంటు బంట
పదివేలు నా నేరాలు పట్టకుమీ యిఁకను

పె.అ.రేకు: 0005-03 నాళంగనాట సం: 15-028

పల్లవి: నీ వాఁడనై నేను నిచ్చలు సంసారము
యేవిధి నుండిన నీకే యింతా శలవు

చ. 1: కొమ్మ రాణివాసమై కోరి మూల నుండినాను
నెమ్మది దినాలు మగనికి శలవు
కమ్మి వడ్డించినయట్టి కంచములోని కూర లెల్లా
దొమ్మి విందారగించేది దొరకే శలవు

చ. 2: పంట కొలుచు కొటారున పాఁతరలోఁ బెట్టినాను
అంటక రాచముద్రకు ఆదే శలవు
యింటివాఁడి జన్నె వట్టి యెంత వుద్దిఁ బెట్టినాను
వెంట వెంటఁ దన యిలువేల్పులకే శలవు

చ. 3: పెక్కువ సొమ్ములు దాఁచి పెట్టిలోన నుండినాను
నిక్కము సొమ్ముగలవానికే శలవు
అక్కజపు శ్రీ వేంకటాధిప నీ శరణంటి
మిక్కుటపు నా జన్మము మీకే శలవు

పె.అ.రేకు: 0005-04 శుద్ధవసంతం సం: 15-029

పల్లవి: ఎంతపరమబంధుఁడవు యేమని నుతింతు మిమ్ము
అంత నిన్ను మఱచి నే నపరాధి నైతిని

చ. 1: దురితములే నేఁజేసి దుఃఖముఁబొందేనాఁడు
తొరలి నన్ను రోసి తొలఁగ వైతి
నరకము చొచ్చేనాఁడు నాకు నంతర్యామివై
పరుఁడు వీఁడేల యని పాయవైతివిగా

చ. 2: జనని గర్భమునందు చరిఁ బడి వుండేనాఁడు
వెనుబలమవై నన్ను విడువ వైతి
పెనఁగి పంచేంద్రియాల పిరువీఁకుల య్యేనాఁడు
అనుభవింపఁగఁ జేసి అందుకు లోనైతివి

చ. 3: యెట్టు నేఁగోరిన అది యిచ్చి పరతంత్రుఁడవై
మెట్టుకొని నా యిచ్చలో మెలఁగితివి
యిట్టి యీ జన్మమున నన్నేలి శ్రీవేంకటేశ
పట్టి నీ దాసులలోఁ దప్పక మన్నించితివి

పె.అ.రేకు: 0005-05 దేసాళం సం: 15-030

పల్లవి: ఏ యాజ్ఞ అయినఁ బెట్టు యిదివో నా దుర్జనము
యే యపరాధమో కాని యింతేసి సేసితిని

చ. 1: ఆముకొని నీ దాసుఁడ ననేటి సలిగలను
వేమారుఁ బాపములకు వెరవ నైతిని
నీ మఱుఁగు చొచ్చినట్టి నిజగర్వమే నమ్మి
నేమపు పుణ్యములు మానితి నేను

చ. 2: తగిలి నీ ముద్ర మేన ధరించిన చనవున
పగటున దేవతల పంపు సేయను
నగుతా నీ నామము నాలికనున్న బీరాన
జగతి నిత్య కర్మము జారి పోఁదోసితిని

చ. 3: హత్తి నాకుఁగలవు నీ వంతర్యామి వనుచు
వుత్తమోపాయము లెల్ల నొల్ల నైతివి
యిత్తల శ్రీ వేంకటేశ యేలికవు నీ వని
మత్తుఁడనై అన్యచింత మఱచితిని

పె.అ.రేకు: 0005-06 దేవగాంధారి సం: 15-031

పల్లవి: శరణాగతినే యెంచఁగ నిత్యులైరి గాక
పరమపురుష నీ పరికర మెల్లను

చ. 1: కర్మాచరణఁ గొని కలుగవు నీ వంటే
కర్మ మేమి సేయఁగాను కరిఁగాచితి
ధర్మతపమునఁ గాని తగులవు నీ వంటే
ధర్మమే మెఱుఁగునయ్య తగ నజామిడుఁడూ

చ. 2: వేదము చదివి నిన్ను వెదకి కనే మంటే
వేదమే మెఱుఁగు నీచవిధి గుహుఁడు
ఆదిమతమునఁ గాని అటు నిన్నుఁగాన మంటే
యే దెస ఘంటాకరుణ్మఁడే మతమువాఁడు

చ. 3: వర్ణాశ్రీమమునఁ గాని వడి నిన్నుఁ గనేమంటే
వర్ణా శ్రమము లేవి వాల్మీకికి
పూర్ణ శ్రీ వేంకట పురుషోత్తమ నిన్ను
వర్ణించి ఘనులైరి వరనారదాదులూ

పె.అ.రేకు: 0006-01 గుజ్జరి సం: 15-032

పల్లవి: ఇది నీకు నుపకార మింతగా నేఁ జేసితి
కదిసి యీ మే లెంచి కావుమీ నన్ను

చ. 1: భూమి నే నొక్కనీచుఁడఁ బుట్టఁగాఁ గదా మీ దయ
వేమారు నా మీఁదఁ బారి వెల లెట్టెను
నేమపుఁ బుణ్యుఁడ నైతే నీ దయకుఁ బాత్రమేది
యేమిటికి రాక మూల నిట వృధావుండుఁగా

చ. 2: పుట్టుదరిద్రవు నాకు పొంచి సంపదలియ్యఁగా
యిట్టె నీ లక్ష్మిపతిత్వ మెన్నికె కెక్కె
నెట్టన శ్రీవేంకటేశ నీ దాసుల కతాననే
రట్టు కెక్కె పంతము మీఱఁగ రాజ వైతివి

చ. 3: చిక్కి నే దోషాలు గడుఁ జేయఁగాఁ గా నీ నామము
రొక్కముగా నన్నుఁ గాచి రూఢి కెక్కెను
దిక్కుల మా వంటి వారి తెగువ సేయ కుండితే
యెక్కడ నుండు నీ నామ మే మందునకు వచ్చు

పె.అ.రేకు: 0006-02 సారాష్ట్రం సం: 15-033

పల్లవి: ఏలిన వారికిఁ బోదు యీడేరించఁ దమసొమ్ము
కాలకాసు సేయకున్న ఘనముగాఁ జేతురు

చ. 1: పసు లే మెఱుఁగఁగా పట్టి కట్టి మేపు మేసి
దెసలఁ బనులు సేయ దిద్దుకొందురు
వసుధ నన్నటు వంటి వానిఁ దెచ్చి మీ సేవకు
నెసఁగ మెదిపి కావు యేమి నే నెఱుఁగ

చ. 2: బిడ్డ లేమి యియ్యఁగాను ప్రేమముతోఁ గన్నతల్లి
వెడ్డువెట్టి చన్నిచ్చి వెసఁ బెంచును
యెడ్డనైనా నే నీకు యెందునుఁ గొరక్రాకున్న
వొడ్డిన జ్ఞాన మొసఁగి వూరడించి కావవే

చ. 3: బానిలే దొడ్డు గాన పరులు దడవితేను
దానికై వహించుకొని తాము వత్తురు
నేను నీ దాసుఁడ నింతే నెమ్మది శ్రీ వేంకటేశ
పూనుకొని వచ్చి నన్నేపడు గావవే

పె.అ.రేకు: 0006-03 పాళంగనాట సం: 15-034

పల్లవి: మీరు సేసే పనులకు మేము గోరే పను లేమి
వేరుపు నీ దైవికమే నెరపుదు గాకా

చ. 1: ఎవ్వరు నీకుఁ జెప్పఁగా నిల నపాండవ మంటే
అవ్వలఁ గాకుండుఁ గాక అని యంటివి
నెవ్వగ విభీషణుఁడు నిన్నేమి వేఁడుకొనఁగా
రవ్వగా నట్టే లంకారాజ్య మొసంగితివి

చ. 2: రమ్మని యెవ్వరనఁగా రాముఁడవై విచ్చేసి
యిమ్ముల నహల్య శాప మిటు దీర్చితి
దొమ్మిలో నేమి చెప్పఁగా దూరి విజయునికై
కమ్మర భీష్మునిపై జక్ర మేల యెత్తిలివి

చ. 3: చెలఁగి ధ్రువుని కెల్ల చెక్కుల నీ శంఖ మూఁది
పలునుతులు చేకొని పట్ట మిచ్చితి
యెలమి శ్రీ వేంకటేశ యేమీ నెఱుఁగము
యిల నిరుహేతుకాన నెట్లైనఁ గావవే

పె.అ.రేకు: 0006-04 దేసాళం సం: 15-035

పల్లవి: ఇదివో మా యజ్ఞాన మెప్పుడును సహజమే
కదివి నీవేనన్నుఁ గరుణిఁచవయ్యా

చ. 1: తల్లి చంకనున్న బిడ్డ తమతోఁ జన్ను దాగుతా
వొల్లఁడు తండ్రి యెత్తుకో నొగిఁబోతేను
మల్లడ నీ మాయలో మరిగిన జీవముల
మెల్లనే మీ సేవసేసి మిమ్ముఁ జేరఁ జాలము

చ. 2: రెక్కల మరుఁగుపక్షి రెక్కల కిందనే కాని
యెక్కదు వద్దనే మేడ యెంత వున్నాను
పక్కన జన్మమెత్తిన ప్రపంచపు జీవులము
యెక్కుడైన వైకుంఠ మిది గోరఁ జాలమూ

చ. 3: నీరులో నుండేటి కప్పనీటిలోనే వుండుఁగాని
వూరకే పరపుమీద నుండ దెంతైనాను
ఆరయ సంసారములో అజ్ఞానపు జీవులము
బోరన శ్రీ వేంకటేశ బుద్ధి చెప్పి కావవే

పె.అ.రేకు: 0006-05 శంకరాభరణం సం: 15-036

పల్లవి: అందుకే వెఱఁగయ్యీని ఆహా నాకు
విందుల నీ చేఁత లివె విచారించవయ్య

చ. 1: నిగమాంతవిదు లెల్ల నీవు పసులఁ గావఁగా
వెగటుగా నాఁడెందు వెదకిరో
జగతి యోగీశ్వరులు సరి నీవు గొల్లెతల
తగిలినవేళ నెట్టు ధ్యానము సేసిరో

చ. 2: పరమగురువు లెల్లా పాలు నీవు దొంగిలఁగా
అరసి నీమహిమ లేమని చెప్పిరో
సురలు నీవు రేపల్లెచొచ్చి పొరియాడఁగాను
ఇరవై నీవెంట వెంట నెట్లా దిరిగిరో

చ. 3: కోరి మునులెల్లా నీవు గోపాళులతో నాడఁగ
సారెఁబొగడి యేమని చదువుదురో
యీరీతి శ్రీ వేంకటేశ యెదుట నీవుండఁగాను
నేరిచి నీ దాసులెల్ల నిన్నెట్లా మెచ్చిరో

పె.అ.రేకు: 0006-06 రామక్రియ సం: 15-037

పల్లవి: పురుషోత్తమ నీవే బుద్ధిచ్చి కాచుట గాక
శిర సెత్తుకొని నవ్వ సిగ్గుగాదా నాకు

చ. 1: పొసఁగ పంచేంద్రియాలు పుట్టిన దేహమే మోచి
యెసఁగ జితేంద్రియుఁడ నెట్టయ్యే నేను
వసగాని కోరికల వలలోనఁ జిక్కుకొని
యిసుమంతలో ముక్తుఁడ నెట్టయ్యే నేను

చ. 2: తొల్లిటి కర్మముచేత దొడ్డయైన పుట్టు పుట్టి
యెల్లవారిలో జ్ఞాని నెట్టయ్యే నేను
మల్లడి సంసారము మరగువాఁడవై యుండి
యిల్లిదివో విరక్తుఁడ నెట్టయ్యే నేను

చ. 3: పాపపుణ్యపు లోకులపంక్తిలోన నేవుండి
యేపున నీ భక్తివాఁడ నెట్లయ్యే నేను
రాపుల శ్రీ వేంకటేశ రక్షించి కీరితిఁ బొందు
యీపాటి వాఁడ ధీరుఁడ నెట్టయ్యే నేను

పె.అ.రేకు: 0007-01 బౌళి సం: 15-038

పల్లవి: ఎక్కడి మానుషజన్మం బెత్తిన ఫలమే మున్నది
నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తం బికనూ

చ. 1: మఱవను ఆహారంబును మఱవను సంసారసుఖము
మఱవను యింద్రియభోగము మాధవ నీ మాయా
మఱచెద సుజ్ఞానంబును మఱచెద తత్వరహస్యము
మఱచెద నురువును దైవము మాధవ నీ మాయా

చ. 2: విడువనుఁ బాపము పుణ్యము విడువను నా దుర్గుణములు
విడువను మిక్కిలి యాసలు విష్ణుఁడ నీ మాయా
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెద నాచారంబును విష్ణుఁడ నీ మాయా

చ. 3: తగిలెద బహులంపటముల తగిలెద బహుబంధంబుల
తగులను మోక్షపుమార్గము తలఁపున యెంతైనా
అగపడి శ్రీ వేంకటేశ్వర అంతర్యామివై
నగి నగి నను నీ వేలితి నాకా యీ మాయా

పె.అ.రేకు: 0007-02 బౌళి సం: 15-039

పల్లవి: కొత్తబంట పాఁతబంట కోరినాఁడు నేఁడు నీకు
యిత్తల జీతము సేసే యేలుకోవే శ్రీహరీ

చ. 1: యిరువదినలుగురి కిటునే గమికాఁడ
అరిదిదేహపుటూరి అమరగాఁడా
నరయక నరసేటి నల్ల తెల్లజల్లివాఁడ
యిరవై జీతము సేసి యేలుకోవే శ్రీహరీ

చ. 2: కామునిగరిడిలోని కటారిసామువాఁడ
లేమచూపుల పగలు దివ్వెలవాఁడా
గోమున నేకాంగి నారుగురితో నొఱటువాఁడ
యీమేటినైన నన్ను నేలుకో శ్రీహరీ

చ. 3: యేడునేడు లోకముల యెక్కి దిగినట్టివాఁడ
మేడెపు సంసారమున మించినవాఁడ
వోడక వెదకితి నీ వొక్కఁడవే రాజ వీఁక
యీడనే శ్రీ వేంకటేశ యేలుకోవే శ్రీహరీ

పె.అ.రేకు: 0007-03 ధన్నాసి సం: 15-040

పల్లవి: హరినీ దాస్యమునకు నది యేమి సరిగావు
ఆరయ శుకుడు నిన్ను నఁటి నీయం తాయను

చ. 1: వగలఁ దపము సేసి వసిష్ట నయ్యే నంటే
వొగి వసిష్టుఁడు మింట నొక్క చుక్కే
యెగువ యజ్ఞాలు సేసి యింద్రుఁడ నయ్యే నంటే
దిగువ నా యింద్రుఁ డొక్క దిక్పాలుఁడే

చ. 2: ఘనమైన యీవు లిచ్చి కర్ణుఁడ నయ్యే నంటే
వొనర నాతఁడు భువి నొక్క రాజే
అనువై దానాలు సేసి అమరత్వ మందే నంటే
కొన నది మేరువు కొండమీఁది బ్రదుకే

చ. 3: అదిగాన యే యుపాయములు నే నొల్లక
కదిసి నీ శరణనే గతి గంటిని
యెదుట శ్రీ వేంకటేశ యిట్టె నా దెస చూచి
సదయుఁడవై మమ్ము చక్కఁగ నేలితివి

పె.అ.రేకు: 0007-04 సాళంగనాట సం: 15-041

పల్లవి: శునక సూకరాదులు సుక మందే పొందినట్లు
ఘనము గానక మసి కస్తూరాయ నాకు

చ. 1: యేపున బ్రహ్మానంద మెఱుఁగని వాఁడఁ గనఁ
బాపపు హేయసుఖమె బాఁతి నాకును
చూపుల వైకుంఠము చూడనివాఁడఁగన
తీపులు ప్రపంచమందు తిరమాయ నాకూ

చ. 2: చాయల శ్రీహరి భక్తి చాలనివాఁడఁగనక
తోయరాని కర్మములు దొడ్డాయ నాకు
నాయంత నా జ్ఞానము నమ్మనివాఁడఁ గనక
మాయపు సంసారమే మనసాయ నాకు

చ. 3: శ్రీ వేంకటేశు ధ్యానము సేయనివాఁడఁ గనక
అవలఁ బరదేవత లరుదు నాకు
ఈవల యితఁడె నన్ను యింతగా మన్నించెఁ గన
పావనమై జన్న మిది వచ్చి దోఁచె నాకు

పె.అ.రేకు: 0007-05 ధన్నాసి సం: 15-042

పల్లవి: పరము వేరొకచోటఁ బొఁతి యున్నదా
తిరమైన యీమాయ తెలియరుగాని

చ. 1: యెప్పుడు దేహాత్మ లెరవులుగాఁ జూచు
యెప్పు డహంకార మిటు మానును
అప్పుడు దైవము అఱచేతిలోనివాఁడు
కప్పినది కీలు గానరు గాని

చ. 2: యెన్నఁడు సమబుద్ధి నెందఱఁ దాఁ జూచు
నెన్నఁ డాసల మీఁదనిటు రోయును
అన్ని పుణ్యములు అండనే సమకూడు
యిన్నిటా నిది విచారించరు గాని

చ. 3: యెచ్చోట హరి భక్తి యిరవుగా మతి కబ్బు
యెచ్చోట సంశయ మిటు మానును
అచ్చోట శ్రీ వేంకటాద్రీశు కృప యుండు
మచ్చికె నిది గంటి మానరు గాని

పె.అ.రేకు: 0007-06 సాళంగనాట సం: 15-043

పల్లవి: జపించయించరె సర్వజనులు యీ నామము తమ
రసమునో పుణ్యాలకు రామనామము

చ. 1: శాంతికరము రామచంద్ర నామము
భ్రాంతు లణచు రామభద్ర నామము
వింతసుఖ మిచ్చు రఘువీర నామమూ, భూమి
చింత దీర్చునదివో శ్రీరామనామము

చ. 2: కలిదోషహరము రాఘవనామము సర్వ
ఫలదము సీతాపతి నామము
కులక శోభనము కాకుత్థ్సనామము అని
రలమైన దిదివో రామనామము

చ. 3: గుమిత మైనది రఘుకులనామము అతి
సుముఖము దశరథసుత నామము
అమితమై శ్రీవేంకటాద్రి నాయకుండై
రమియించె యీతని రామనామము

పె.అ.రేకు: 0008-01 బౌళి సం: 15-044

పల్లవి: దైవమా నన్నిందులోతగు మానిసిఁగాఁ జేసి
యీవల రక్షించే మేలు యిది చాలదా

చ. 1: అవ్వలఁ దిరిపెములై అంగలార్చే జీవులలో
యెవ్వరిఁ బోలుదు నే నెంచి చూచితే
రవ్వగాఁ గ్రిమికీటాలై రమియించే జంతువులలో
యెవ్విధి నే సరి గాక యెంతవాఁడ నేను

చ. 2: పాపము సేసి నరకబాధలఁ బడే వారిలో
యేపున నన్నుఁ జూచితే యే నేమి బాఁతి
పై పైనజ్ఞానపు పశుపక్షిమృగాలలో
తోపునూకుడే కాక దొరనా నేను

చ. 3: యేమిటివాఁడనై నిన్ను ఇంకా నేఁ గొసరుదు
పామరుని నన్నింత పాలించితి
యేమని కొనియాడుదు యే నిన్ను శ్రీవేంకటేశ
ఆమంచి నీ దాసులలో ఆరుహమా నేను

పె.అ.రేకు: 0008-02 సాళంగనాట సం: 15-045

పల్లవి: ఇదియే కామనిదాన మిదియే మూలధనము
యిదియే నమ్ముట గాక యితరము లేలా

చ. 1: 'న మే భక్తః ప్రణస్యతి' యనుమాట
అమోఘమై నీ వానతియ్యఁగా
రమారమణుఁడ రతి నీ దాసుల కెల్ల
నమో హి నితరవిచారము లేలా

చ. 2: నాఁడు 'మా మేకం శరణం వ్రజ' యనుమాట
పోడిమి దిక్కుల నీ వెప్పుడు చాటఁగా
నేఁడు నీ దాసులమై నెరవేరితిమి గాక
వేఁడి వేఁడి కర్మవువిధులిడ నేలా

చ. 3: ఆల 'యెగక్షేమం వహమ్యహ' మ్మనుమాట
అలరుచు తుదిపదమై వుండఁగా
నెలవై శ్రీవేంకటేశ నిన్నుఁ గొలిచినమాకుఁ
గలిగె నీ కరుణ యే కథలు నేలా

పె.అ.రేకు: 0008-03 బౌళి సం: 15-046

పల్లవి: పరమ సుజ్ఞానులకు ప్రపన్నులకు
మరుగురుని మీఁదట మనసుండవలదా

చ. 1: ఆఁకలిగొన్నవానికి నన్నముపై నుండినట్టు
యేఁకట వుండవలదా యీశ్వరునిపై
కాఁకల విటులచూపు కాంతలపై నుండినట్టు
తేఁకువ నుండవలదా దేవునిమీఁదటను

చ. 2: పసిబిడ్డలకు నాస పాలచంటిపై నున్నట్లు
కొసరే భక్తి వలదా గోవిందునిపై
వెసఁ దెరువరి తమి విడిదలపై నునట్టు
వసియించ వలదా శ్రీ వల్లభుమీఁదను

చ. 3: నెప్పున ధనవంతుఁడు నిధి గాచియుండినట్టు
తప్పక శ్రీ వేంకటేశుఁ దగులవద్దా
అప్పసమైన భ్రమ ఆలజాలాలకున్నట్టు
యిప్పుడే వుండవలదా యీతని మీఁదనూ

పె.అ.రేకు: 0008-04 సాళంగనాట సం: 15-047

పల్లవి: ఎట్టు గడించె దైవము యిందరికిని సుఖము
పట్టిన భ్రమవంటిది పంచేంద్రియ సుఖము

చ. 1: పచ్చివలెనో తోఁచు పండ్లు ముక్కలు వోవు
మచ్చికఁ గాంతలతోడి మదిన సుఖము
వచ్చి నట్ట నేవుండు పండ పండ నట్లౌను
తచ్చి తా తొల్లి చేసిన దాన ఫలసుఖము

చ. 2: మోవని యట్లే వుండు ములిగేపాటిభారము
భావించి యెత్తుకొన్న సంపద సుఖము
కైవసమైనట్లుండు కడదాఁకా వళకులే
తేవల ననుభవించే దేహభోగసుఖము

చ. 3: మిక్కిలి తీపై వుండు మీసాల మీఁదట తేనె
చక్కటి నానాఁటి సంసారసుఖము
తక్కక శ్రీవేంకటేశదాసులకు చిక్కివుండు
అక్కడ నిక్కడను బ్రహ్మానందసుఖము

పె.అ.రేకు: 0008-05 కొండమలహరి సం: 15-048

పల్లవి: ఎన్నఁడు దేవుని గనే మెన్నఁడు బుద్దెఱిఁగేము
తన్నుఁదానే హరి మమ్ము దయఁ జూచెఁ గాకా

చ. 1: మాటాడు టొక్కటే కాని మాకునుఁ బసులకు
చాటువఁ బంచేంద్రియాలు సర్వసమమే
గాటానఁ జరియించుటే కాని రాళ్ళకును మాకు
యీటులేని భవబంధా లెన్నియును సమమే

చ. 2: దొడ్డదేహ మింతే కాని దోమలకు మాకును
జడ్డు లేని జీవాత్మ సర్వసమమే
ఒడ్డిన రుచు లెఱుఁగు దొడ్డవిశేషమే కాని
యెడ్డెతనము మాకైతే నీజంతుసమమే

చ. 3: చేరి చదువుటేకాని చిలుకలకు మాకును
సారెకు నక్షరములు సర్వసమమే
యీరీతి శ్రీ వేంకటేశుఁడిటు నన్నుఁ గాచెఁ గాక
నేరమి యిన్నాళ్ళు నాడేనే నిందరి సమమే

పె.అ.రేకు: 0008-06 గుండక్రియ సం: 15-049

పల్లవి: వివరించి చూడఁబోతే వెఱఁగయ్యీ నాకు నేఁడు
తవిరి పుట్టని నాఁడు తనువు లెందుండెనో

చ. 1: జనని గర్భములోని సరినే నుండే నాఁడు
యేనసి యోడ నుండెనో యీ యాస
మునుప నంతకు తొల్లి మునిఁగి పరలోకము
కొనలనుండెడినాఁడు కోపము లెందుండెనో

చ. 2: పొత్తులలోపల నేను పొడలు పెట్టేనాఁడు
యిత్తల జవ్వనమద మెందుండెనో
నిత్తెము నిదురలోన నేఁగలలు గనేనాఁడు
యెత్తి యీ కాఁపురము లివి యెందు నుండెనో

చ. 3: మానక పంచేంద్రియమత్తుఁడనై వున్నానాఁడు
యీ నేటి బ్రహ్మానంద మెందుండెనో
తానే శ్రీ వేంకటేశుఁడు దయఁ జూచెఁ గాక నన్ను
ఆనుకొన్నకర్మము యేమంటాఁ దా నుండెనో

పె.అ.రేకు: 0009-01 గుజ్జరి సం: 15-050

పల్లవి: పాపము చేరువ ప్రాణునికి
యేపునఁ బుణ్యం బేదో కాని

చ. 1: ముక్కున నున్నది ముంగోపం బిది
యెక్కువ శాంతం బిందున్నదో
చిక్కని యాసలు చేతిలో నున్నవి
గక్కున విరతే కానము గాని

చ. 2: కన్నుల నున్నది కామాంధకారము
యెన్నిక విజ్ఞాన మెందున్నదో
వున్నది నాలుక నూరక దైన్యము
యిన్నిట ధైర్యం బెఱుఁగము గాని

చ. 3: అవిగో తనువున ననాచారములు
యివల సద్ధర్మం బెందున్నదో
వివరి మొసఁగి శ్రీవేంకటేశ నా
భవ మీడేర్చఁగ బ్రదికితిఁ గాని

పె.అ.రేకు: 0009-02 శుద్ధవసంతం సం: 15-051

పల్లవి: కలకాల మెవ్వరికిఁగాఁ బాటువడె దేహి
వలలఁ బడి తుద నొకరివాఁడుఁ గాఁడాయ

చ. 1: పాపకర్మపు మనసు పంచేంద్రియములకె
చూపిచ్చెఁ గాని దయఁ జూడ దాయ
దీపనపుటన్యాయ దేహంబు రుచులకె
వాపించె నను మొకము వడిఁ దనుప దాయా

చ. 2: సిగ్గుమాలిన వయసు చెలుల యెంగిలిమోవి
కొగ్గించి దొరతనం బొసఁగ దాయ
నుగ్గెన యీ యాస నూరుగురిఁ గొలిపించి
తగ్గించి గర్వంబు దరిచేర్ప దాయ

చ. 3: మాలు గలసిన బదుకు మాయలోనె కలపి
యేలకో ఘనసుఖం బియ్య దాయ
యీలోన శ్రీవేంకటేశ్వరుఁడు ననుఁ గాచె
నాలోని పొందికలు నాకు నరు చాయా

పె.అ.రేకు: 0009-03 గుజ్జరి సం: 15-052

పల్లవి: తెలిసి బదుకరో దేహులాల
వలెనని తలఁచినవారివాఁడే దేవుఁడు

చ. 1: తనుఁ గొలువకూడితే తారము వెట్టఁ డేలిక
పెనఁగి కొలువకున్నఁ బెట్టు దేవుఁడు
జీనుగుచు విడుతురు చుట్టాలు దరిద్రులైతే
వెనువెంటా నెంతయినా విడువఁడు దేవుఁడూ

చ. 2: అంతట ముదిసితేను అంగనలు రోతురు
అంతరాత్మ యెన్నఁడు రోయఁడు దేవుఁడు
వింతగా నన్నఁ దమ్ములు విసాన కలుగుదురు
పొంతనే తా నలుగుఁడు పుట్టించిన దేవుఁడు

చ. 3: వొదిగి మూల నుండితే వూరివారు మఱతురు
వదల కెందున్నా మఱవఁడు దేవుఁడు
తుదిముట్ట రక్షించు దుఃఖము లెల్ల నణఁచు
యెదుట శ్రీవేంకటేశుఁ డితఁడె పోదేవుఁడు

పె.అ.రేకు: 0009-04 గుజ్జరి సం: 15-053

పల్లవి: సిగ్గుమాలిన జీవుఁడు దా
మొగ్గినచోటనే మొలుగుఁ గాక

చ. 1: ఆలు బిడ్డలకునై యెల్లకాలము
పాలుమాలక పాటువడి
తీలుగా వచ్చితే దేవుని దూరును
యేలో నాఁడే యిది యెఱుఁగఁడా

చ. 2: కిమ్ముల విషయ కింకరుఁడై తా
నమ్ముడు వోయె నందులకే
కమ్ముకోవచ్చిన కర్మము దూరును
యిమ్ముల నాఁడిది యెఱుఁగఁడా

చ. 3: బ్రతికి యెన్నాళ్ళు భ్రమసి దేహమె
మితి లేక వోమి మిఁదటా
గతి యని శ్రీ వేంకటపతి జేరు
హితవని నాఁడె యెఱుఁగఁడా

పె.అ.రేకు: 0009-05 గౌళ సం: 15-054

పల్లవి: అప్పుడే కృతార్థుఁడు అప్పుడే లోకపూజ్యుఁడు
తప్పు లేదు ముప్పు లేదు దైవమే గురుతు

చ. 1: ఎవ్వఁడు పుణ్యుఁడు గాఁడు యెవ్వఁడు పాతకి గాఁడు
యివ్వలఁ దొంటి జన్మము లెంచి చూచితే
నెవ్వగనీ జీవునికీ నేరుపేది నేర మేది
అవ్వల శ్రీహరి శరణన్నదే గురుతు

చ. 2: పుట్టని కులము లేవి భుజించని వస్తువేది
యిట్టే యీ జీవుల నెల్లా యెంచి చూచితే
గుట్టు దెలిసితి మిందు కొంచమేది దొడ్డ యేది
అట్టు నిట్టు హరిదాసుఁ డైనదే గురుతు

చ. 3: ఎఱిఁగి సేసు టేది యెఱుఁగక మానుటేది
తఱిఁ బ్రపంచమునందుఁ దలపోసితే
మెఱయ పరుస మంటే మఱి పైఁడే మిను మేమి
గుఱిగా శ్రీ వేంకటేశుఁ గొలుచుటే గురుతు

పె.అ.రేకు: 0009-06 శుద్ధవసంతం సం: 15-055

పల్లవి: ఏది యిందులో సుఖ మెవ్వరు మంచివారలు
పాదు దెలియని ప్రాణిభ్రమ యింతే కాక

చ. 1: భోగింపుచు పిండి పిండి పూచి రక్తమాంసము
లాగతిఁ బుత్రదారాదు లలయింతురు
చేగదేర వెట్టిగొనే చేతుల యిడుమలెల్ల
సాగిన సభలలోన సంసారము

చ. 2: పుఱక మేనిలోఁ జొచ్చి వొగి నింద్రియాల కేఁచి
అఱమఱపించఁ జచ్చె నన్నపానములు
యెఱిఁగెఱిఁగి యుండగా నేలినవాని కమ్మించె
తటిఁ దనజన్మ మెల్ల ధనధాన్యములు

చ. 3: వొప్పి గుఱిగాక వూరకున్నవాని నతిథుల
కప్పన మప్పించెను గృహారామములు
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డేలి మమ్ముఁ గాచెఁ గాక
పుప్పిగాఁ దినె నిన్నాళ్ళు పుణ్యపాపములు

పె.అ.రేకు: 0010-01 శుద్ధవసంతం సం: 15-056

పల్లవి: హరిభక్తి గలిగితే అన్నియు ముఖ్యము గాక
విరసాచారము లెల్ల వృథావృథా

చ. 1: మిక్కిలి నీట మునిఁగే మీను కది స్నానమా
కొక్కెరధ్యానము సేసుకొరే అది యోగమా
నిక్కి మేక ఆకు మేయు నిండ నదే తపమా
చిక్కి తలకిందు వేలే జిబ్బడాయి సిద్ధుఁడా

చ. 2: పులులు గుహ నుంటే పోలింప ఋషులా
యెలుపు గడ్డము వేచు నింతలోనే యోగ్యుఁడా
యిలఁబక్షు లాకాశాన కేఁగితే దేవతలా
వొలసి కోఁతి యడవి నుంటే వనవాసమా

చ. 3: మాకులు మాట లాడవు మౌనవ్రతములా
కోక గట్టను బాలులు కోరి దిగంబరులా
పై కొని శ్రీవేంకటేశు భక్తఁ డేమి సేసినాను
చేకొని లోకములోని చెల్లుబడులే

పె.అ.రేకు: 0010-02 గుజ్జరి సం: 15-057

పల్లవి: చెప్పఁబోతేఁ బస లేదు శ్రీపతిదాసులు నన్ను
తప్పక చేపట్టితేనే ధన్యుఁడ నే నైతిని

చ. 1: భ్రమసి పొరలదోలు పై వేసుకొన్నవాఁడ
యెముకల యింటిలో ఇరవైనాఁడ
తమితోడ మలమూత్రతిత్తులఁ బాయనివాఁడ
అమర మా కులగ్ర్రోత మడుగ నేమిటికి

చ. 2: పుట్టిన చోటడిగితే పూఁచి చెప్పరానివాఁడ
ముట్టరానిచోటనే మునిఁగేవాఁడ
చుట్టుకొన్న వెంట్రుకల జూబులకొప్పువాఁడ
లెట్టి మా యిల్లువరు వెదక నేమిటికి

చ. 3: నానుచున్న నోరిలోని నరాల నాలికవాఁడ
యే నిజమూ నెఱుఁగని యెడ్డవాఁడనూ
లోనుండి శ్రీవేంకటాద్రి లోకేశుఁడు నన్ను నేలె
తానకపు మా గుట్టు తలఁచ నేమిటికి

పె.అ.రేకు: 0010-03 బౌళి సం: 15-058

పల్లవి: ఎవ్వరు నన్నుద్ధరించే రింతట వెఱవకు మని
అవ్వల నివ్వల శ్రీహరియే కాక

చ. 1: రాపులఁ బంచేంద్రియపు రాచపైరు మేయఁగాను
పాపపుణ్యమనేటి బందెఁ జిక్కితి
వోపి సంసారమనే వొందముపై నడవఁగాను
కూపపు జన్మముపాలై కూయుచు నున్నాఁడను

చ. 2: ఆసలనేటి పెద్ద అంగిటిగాలాల మింగి
కోనేటి మాయ వంటింటికుందేలు నైతి
బాస దప్పి చిత్తమనే బండారము గొల్లలాడి
లాసి కామాదులనే తలారుల చేపడితి

చ. 3: కాంతల మోహమనేటి కారడవిలోఁ జిక్కి
అంతట విజ్ఞానమార్గ మటు దప్పితి
యింతలో శ్రీవేంకటేశు నెఱిఁగించె మా గురుఁడు
మంతు కెక్కించఁగ నేను మంచి మేలు గంటి

పె.అ.రేకు: 0010-04 సాళంగనాట సం: 15-059

పల్లవి: నేఁడే హరిసేవ లయితే నిత్యభోగములు
పోఁడిమి దెలుసుకోవో బుద్దెటిఁగి జీవుఁడా

చ. 1: పక్కన మనసులోన పాలు దాగినటనే
చక్కని మాయలలో సంసారభోగములు
నిక్కి నిక్కి నీళ్లలో నీడ చూచనట్లానే
దిక్కుల కర్మఫలము దిచ్చభోగములు

చ. 2: కన్నులు మూసి మదిలోఁ గలలు గని నట్లానే
పన్ని లోకముల ప్రపంచభోగములు
అన్నిటాఁ దెరలో బొమ్మలాట లాడినట్లానే
నన్నుల బుట్ట పెరిగే జన్మభోగములు

చ. 3: కడుఁ జందమామ గుటుకలు మింగినట్లానే
తడవి మోహించు చిత్తజభోగములు
యెడయక శ్రీవేంకటేశుఁడు గరుణించితే
అడియాలపు టీవులు ఆత్మభోగములు

పె.అ.రేకు: 0010-05 బౌళి సం: 15-060

పల్లవి: తెలిసిన వారికి తెరు విది మరి లేదు
నలినాక్షుఁ బొగడెడి నామములో నున్నది

చ. 1: ఆకసాన లేదు మోక్ష మటు పాతాళమున లే
దీకడ భూలోకమందు యెందు లేదు
పైకొని ఆసలెల్ల పారఁదోలి వెదకితే
శ్రీకాంతుఁ బొగడేటి చిత్తములో నున్నది

చ. 2: సురలవద్ద లేదు సోదించ నమృతము
సరి దిక్కులందు లేదు జలధిలో లేదు
శరణాగతుల పాతజలములు చేర్చికొనే
హరిదాసులఁ బూజించే అరచేత నున్నది

చ. 3: రాజసాన సుఖమేది రాసి కర్మమందు నేది
వోజతోడ నియతుఁడై వుండేవానిది
సాజాని శ్రీవేంకటేశు సరిముద్రలు ధరించే
తేజముతో విజ్ఞానదేహములో వున్నది

పె.అ.రేకు: 0010-06 భైరవి సం: 15-061

పల్లవి: హరిశరణాగతి యందుల కౌషధ
మిరవుగ నెఱిఁగిన నెక్కుదు విషము

చ. 1: చంచున నొడిసేటి సర్పము వంటిది
కంచములో తన కర్మము
అంచే జననమరణాదులే కోరలు
పంచల నాడును పట్టఁగరాదు

చ. 2: బలుసంసారము పడిగె దీనికిని
పొలసి దేహ మనుపుట్టఁ బడి
నలి నహలూరాత్రపు నాలికలు గోరలు
బలిమి నూరకే పట్టఁగరాదు

e చ. 3: మహి సుఖదుఃఖములు మలకలు
సహజపుఁ బొరలే సంపదలు
యిహమున శ్రీవేంకటేశుఁ డాడించీ
బహుగతి నేమిటఁ బట్టఁగరాదు

పె.అ.రేకు: 0012-01 సాళంగనాట సం: 15-062

పల్లవి: వట్టియాసల జిక్కి వడిఁబడుటే కాక
కట్టుకొనేటి దేదీ కడ యేది

చ. 1: జనన మరణశీలి జంతువు
కనుఁగొనఁ దన కేది కాణాచి
తనువు కర్మమునకుఁ దా కట్టు
తనకు వేరే స్వతంత్రము లేవి

చ. 2: లలిఁ జిత్త మింద్రియముల లగ్గస్తుడూ
తొలఁగఁ దోయఁగ నేది దొరతనమూ
అలమి కాలము సంసారాధీనము
కొలఁదీ వెట్ట దనకు గురి యేది

చ. 3: బతుకెల్లా లోకాను బంధము
గతి గనఁ దన కిఁక గారణమేదీ
యితవై శ్రీవేంకటేశుఁ డేలెఁ గాక
మితిమీరి యిన్నాళ్ళు మెరయ నేదీ

పె.అ.రేకు: 0012-02 లలిత సం: 15-063

పల్లవి: ఎందలివాఁడనో యెఱుఁగను
కందువ నీవే కావవే దేవ

చ. 1: తలఁతు నూరకే దైవము నొకపరి
తలఁతును సంసారధర్మము నొకపరి
వెలయఁగ సాలీఁడు వేసిన కండెయై
పొలసీఁ గాలము పొద్దుకుఁ బొద్దు

చ. 2: ఒకపరి యెక్కుదు వుబ్బునఁ బొడవునకు
వొకపరి దిగుదును వూరకే కిందికి
యెకదిగఁగ కృషికుఁడెత్తు యేఁతమై
అకటా కర్మము లాడించీని

చ. 3: ఆవల నన్నిట నహంకరించితి
శ్రీవేంకటేశ్వర సేవించితి నిన్ను
చేవ లేక యిటు చెఱకునఁ బండై
భావం బిటువలె పరిగెను నేఁడు

పె.అ.రేకు: 0012-03 గుజ్జరి సం: 15-064

పల్లవి: రాజు బొజుఁగ్గై గాజుఁగడియ మాట రామ రామకడుసోద్యములూ
తేజముతోడుత దీపము పట్టుక తెలియక చీఁకటి దవ్వెదరు

చ. 1: దైవము గలఁడట తానె నమ్మెనట తనకు పురాకృత మెక్కడి
భావములోపల నమ్మని కడమల సాపమింతే కాక
యేవలఁ జూచిన స్వతంత్రుఁడగు హరి యెట్టు సేసినా నట్టేను
ఆపల నాతనిమఱఁగు జొచ్చితిని అపరాధంబులు మఱి కలవా

చ. 2: పురుషోత్తముఁడట తన్ను నేవీనట పుణ్యము లింకా వెదకెడిదా
యిరవుగ నెఱుఁగని అజ్ఞానపు తన యెడ్డతనము గాక
ఆరయఁగ నాతఁడు సర్వేశ్వరుఁడట అన్నిటికినిఁ దా నేరఁడా
విరసపుటనుమానము లేఁకనేటికి వెఱపులుమెఱపులు మఱికలవా

చ. 3: శ్రీవేంకటపతి అంతరాత్మ యట చింతలుసిలుగులు యెక్కడివి
ఆవటించి మతిఁదెలియనికడమల ఆజ్ఞానము గాక
శ్రీ విభుడీతఁడె యెంచి చూచినను సృష్టి కెల్ల రక్షకుఁడు
కైవసమాయను మాకు నితఁడిదె కడమలు దొడమలు మఱి కలవా

పె.అ.రేకు: 0012-04 గుజ్జరి సం: 15-065

పల్లవి: ఏఁటికి నీ కితరమార్గములు యేల తవ్వెదవు చిత్తమా
యీటునఁ బ్రయాసపడి నీ వంతకంటే మరి తెచ్చేవా

చ. 1: నానావిధు లేటికీ మును నారదాదు లెఱిఁగిన తెరువు చాలదా
తూనుచఁ బొయ్యెదవు మతములు తొలుత శుకుఁడువోయినలోకంబులు చాలదా
మానక చదువులె వెదకెదవు మరి ప్రహ్లాదుఁడు కన్నగతి చాలదా
కానక కర్మములే చూచెదవు గజేంద్రుబడుకది చాలదా

చ. 2: ఇంకానీ వెఱుఁగవా ఈతఁడు లక్ష్మీకాంతుఁడు యితనిఁగొలుచుట చాలదా
శంకలు యింకా నేటికి శరణాగతబిరు దితనిది యీతనిఁగొలుచుట చాలదా
పొంకపు సృష్టికి మూలపు బ్రహ్మను బొడ్డునఁ బుట్టించె నితఁడూ
అంకెల శ్రీవేంకటేశ్వరుఁ డీతఁడు అనాది వైకుంఠంబిఁది చాలదా

పె.అ.రేకు: 0012-05 బౌళి సం: 15-066

పల్లవి: ఊరకే పాట్లఁ బడి వొడలే నిత్య మనుచు
ఆరిడి వృథా తిరిగీ నయ్యో ప్రాణి

చ. 1: నరుఁడు నూరేండ్లవాఁడై నాఁడు చొచ్చె లోకము
నరకమో స్వర్గమో నవిఁ గానఁడు
పొరిఁదనుఁ బొదిగిన పుత్రమిత్రకళత్రాదులు
అరసి యెన్నటివారో అదియూ నెంచఁడు

చ. 2: పనితో యిడుమ పాటువడి గడించిన సొమ్ము
తనకో వొరులకో తా నెఱుఁగఁడు
అనుభవించవలసె అన్నిట కర్మఫలాలు
వెనకో ముందరో యిది విచారించఁడు

చ. 3: నుదుట వ్రాసిన వ్రాలు నోరఁ జేతఁ జుట్టుకొని
తుదకో మొదలికో తొంగి చూడఁడు
యిదివో శ్రీ వేంకటేశుఁ డెదుటనే వున్నాఁడు
కదిసి శరణంటేఁ గాచీనతఁడు

పె.అ.రేకు: 0012-06 సాళంగనాట సం: 15-067

పల్లవి: బుద్ధిమంతుఁడవుటెన్నఁడు భూమెల్లా వెఱ్ఱులు గాక
తిద్దుకొనక సాత్తించి తిరిగేరు గాక

చ. 1: బాలుఁడై బిత్తలే వీధి బరువులు వెట్టేనాఁడు
వీల నీ జీవున కది వెఱ్ఱి గాదా
జాలివట్టి తిరిగేటి జవ్వనమదముచేత
తాలిమి లేకున్నది మదనవెఱ్ఱి గాదా

చ. 2: యెడ యెఱిఁగి యామీఁద యిల్లు ముంగి లెఱుఁగక
వెడగచ్చుకాయలాట వెఱ్ఱి గాదా
పుడుకు వేఁదుఱువలె (?) పాడిఁబడి యాసల
యిడుమపాటు వడేటి దిది వెఱ్ఱి గాదా

చ. 3: తల మొల యెఱుఁగక తఱి నిద్రించేవేళ
వెలి నోళ్ళెఱఁగనిది వెఱ్ఱి గాదా
అలరి శ్రీవేంకటేశుఁ డాత్మలో నుండఁగాను
అల ముదిమది తప్పుటది వెఱ్ఱి గాదా

పె.అ.రేకు: 0013-01 దేసాళం సం: 15-068

పల్లవి: మాయలోఁ బడి మాపాటు మఱచితి మెంతయును
పోయినది మాకుఁ దెచ్చి పోగు సేయఁగలరా

చ. 1: మెట్టిన కిందెడు మీఁదెడు లోకములాల
యిట్టే నా జన్మము లెన్ని యెఱుఁగుదురా
చట్టెడు జలధులాల సప్త మారుతములాల
వొట్టి నా కర్మఫలము లున్నవా మీచేతను

చ. 2: నడచే యుగములాల నానాదేవతలాల
చెడని నా భక్తియేదో చెప్పగలరా
జడియని దిక్కులాల సరిఁగులగిరులాల
విడిదల నాపట్లు వివరించఁ గలరా

చ. 3: వెలసిన మునులాల వేదశాస్త్రములాల
సొలసి నాలోని హరినిఁ జూపగలరా
యెలమి శ్రీవేంకటేశుఁ డెదుట నున్నాఁడు వీఁడే
తెలిపి మన్నించఁగాను తేటతెల్ల మాయను

పె.అ.రేకు: 0013-02 మలహరిసం: 15-069

పల్లవి: దాఁటలేను యీ మాయ దైవమా నేను
నీటునఁ జేసేవాఁడవు నీవే నీవే కా

చ. 1: యీ మురికిదేహమే కా యెంతకాలమైన నేను
వోముకొని భూమిమీఁద నుండఁ గోరేది
దోమటి యింద్రియాలే నా తోడునీడై యుండి నన్ను
వేమరు బోగించఁ జేసే వేనుబామైనది

చ. 2: పొంచి నాకర్మము లేకా పుట్టించి పుట్టించి
పంచల నా జన్మములపాలు సేసేది
అంచల యీ చిత్తమెకా ఆసలాసలఁ జిక్కి
సంచితమై నా కీ పొద్దు చనివరి యైనది

చ. 3: చుట్టుకొన్న సంపదేకా సూదియై నానాఁటికి
జట్టిగొని లోలోనే చవి సేసేది
అట్టే శ్రీ వేంకటేశ అంతరంగాన నీవెకా
పట్టు గొమ్మవై యుండఁగ బదికితి నేను

పె.అ.రేకు: 0013-03 శుద్ధవసంతం సం: 15-070

పల్లవి: ఏమిటఁ గడమ యిఁక హరిదాసులకు
కామధేనువంటి ఘనముక్తి గలిగె

చ. 1: భగవన్నామ నిజపారిజాతము గలుగ
గగనఁపు మా కోరికలు ఫలించె
జగదేక పతిరూప చంద్రచంద్రికలు గలుగ
మొగిఁ జకోరపునేత్రములు తనవిఁబొందె

చ. 2: పరమాత్మ చింతనపు భానుఁ డుదయించఁగా
సరుస మా చిత్తజలజంబు లలరే
హరికథాశ్రుతి వసంతాగమము చెలఁగఁగా
వరుసతో విజ్ఞాన వనమెల్ల ననిచె

చ. 3: చాల శ్రీ వేంకటేశ స్పురుశవేధిచే
కాలజన్మపు టినుము కనక మాయ
వల నాతని కృపాజాలజలనిధి చేత
ఆలోల భక్తియను నమృతంబు వొడమె

పె.అ.రేకు: 0013-04 రామక్రియ సం: 15-071

పల్లవి: అక్కటా లోకోన్నతుఁడు హరిఁజేరి యిట్లయితి
యెక్కువ స్వర్గాని కెక్కి యేకులు వడుకుటా

చ. 1: హరికి మొక్కిన మొక్కు లల్పసుఖమునకు
వెరవెఱుఁగక తావెచ్చ పెట్టుటా
గరిమఁ గొండంతపైఁడి కలగూరకు మూఢ
నరుఁడు విలువ యిచ్చి ,సరిఁగొనుకొనుటా

చ. 2: తలఁచే హరిమంత్రము తనభోగములకై
నెలవు సేసికొని తాఁ జెనటి యవుట
పలి బందివేఁట వోయి పూరేడుఁ బట్టి తెచ్చి
ములుచ మానవుఁడు ముదమందుటా

చ. 3: శ్రీ వేంకటేశ్వరుని సేవించి యితరులచే
భావించి యిప్పించుమని పనిగొనుటా
కావించి కల్పవృక్షము గాడిగుంజగాఁ బాఁతి
ఆవల దుర్మదదేహి అజ్ఞాని యవుటా

పె.అ.రేకు: 0013-05 బౌళి సం: 15-072

పల్లవి: నన్ను నేనే ఆహహా నవ్వుకొనవలదా
యిన్ని వెలుతుల నేను యెదురి నాడేదుట

చ. 1: చేరి దిగంబరి యట చీరల దిండ్లటా
సారెను విరతి యట సంసార మటా
పేరు మౌన వ్రతి యట బిరుదువాదము లటా
యీరీతి నే దొర నట యిందరి వేఁడేదటా

చ. 2: చప్పిడయ్యఁగా రట వుప్పుపెరికలు నట
గొప్పయిన తపసి నట కొలువూ నట
అప్పటి నిరాహారి నట ఆరంభము లట
చిప్పిలి మనసు ముడి సింగారా లట

చ. 3: పెంపు జితేంద్రియుఁ డట పెండ్లిశోభనమట
ముంపున మోక్షార్థి యట లంపట మట
యింపుల శ్రీవేంకటేశ యిన్నిభావములఁ బొంది
తెంపున నీ శరణని తెలిసితి నటా

పె.అ.రేకు: 0013-06 లలిత సం: 15-073

పల్లవి: చాలుఁ జాలుఁ దొలఁగవో జాలికోపమా
సోలుచు హరిమఱుఁగు చొచ్చితినోకోపమా

చ. 1: నీననుఁ బరులు దిట్టితే నాకు వాసు లెక్కించి
వెనకనే వత్తువుగా వెట్టికోపమా
ధనము కొఱకుగాఁ దగవులఁ బెట్టి పెట్టి
ఘనుల నెఱుఁగనీవుగా కోపమా

చ. 2: తనివి నవ్వుచు వచ్చి తల మొల విడఁగాను
శివ మెత్తించితిగా ముంచిన కోపమా
జవళిఁ జదివినట్టి సారవువిజ్ఞాని నైనా
వివరము చెఱుతుగా వేఁదుఱు కోపమా

చ. 3: బుద్ధులు వినఁగనీక బూతుబండు గెలయించి
పెద్దరికము చెరచే బేలు కోపమా
అద్దో శ్రీవేంకటేశుఁ డాదరించి నన్ను నేలె
వుద్దండాలు చెల్లవిఁక వుడుగవో కోపమా

పె.అ.రేకు: 0014-01 మలహరిసం: 15-074

పల్లవి: పుట్టఁగఁ బుట్టఁగ పొద్దొక వింతే
యెట్టు గడచే మీ విష్ణుమాయా

చ. 1: యెత్తిన దేహాల యెమ్ములు చివికే
చిత్తమొక్కటే చివుకదు
మొత్తముఁ బుట్టించి ముదిసె బ్రహ్మయు
పొత్తుల జీవుఁడేపో ముదియఁడు

చ. 2: వ్రాసే చిత్రగుప్తవరుఁడు వేసారె
వేసారెఁ బాపపువిధి నేఁడు
గాసిఁ బెరరేఁచే కాముఁడు సమసె
యీసుల సమయ వింద్రియాదులు

చ. 3: వినుకనివంక విజ్ఞానము పుట్టె
కనుకనే యిఁకఁ గైవాలదు
అనుగు శ్రీ వేంకటాధీశుమన్నన
తనిసినబుద్ధిఁ తప్ప దిఁక

పె.అ.రేకు: 0014-02 లలిత సం: 15-075

పల్లవి: ఇంతే మరేమి లేదు యిందుమీఁదను
దొంతులకర్మములెల్ల దుమ్ము దూరుపెత్తుటా

చ. 1: పుల్లములోఁ బాయకయుండి రక్షించే హరి
నొల్లకుండుట తన్నుఁ దా నొల్లకుండుట
బల్లిదుఁ డాతని మాని పరుల వేఁడే దెల్లా
పొల్లకట్టు దంచి దంచి పోగువేసుకొనుట

చ. 2: యియ్యేడఁ బుణ్యపాపములే మిగిలిన హరి
కియ్యకుండుటది దైవమియ్య కుండుట
చెయ్యార నాతని కొప్పునేయని భోగములెల్ల
చయ్యనఁ జెఱకుపిప్పి చవిగొనుటా

చ. 3: శ్రీకాంతుఁడై నట్టి శ్రీ వేంకటేశ్వరునిఁ
జేకొంటే సిరులెల్లాఁ జేకొనుట
జేకొని హరినామమే నుడుగుచు భక్తిఁ
గైకొనుట అమృతము గైకొనుటా

పె.అ.రేకు: 0014-03 బౌళి సం: 15-076

పల్లవి: గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో
వోవల నీపాలఁ జిక్క దోహో నామనసు

చ. 1: వొకటిపైఁ గాంక్షించు వొకటిపై వేసారు
వొకవేళ దుర్మాన మొడిగట్టును
వికలుఁడై యంతలోనే విషయపు బారిఁ జిక్కు
ఆకటా యిన్నిటాఁ దుమురాయఁబో నామనసు

చ. 2: తలపోసు నొకవేళ తమకించు నొకవేళ
వొలుకుఁగోపము చల మొకవేళ
కలగించు నొకవేళ గర్వించు నొకవేళ
పొలసి యిన్నిటా వీదిఁ బోయఁబో నా మనసూ

చ. 3: సంతసించు నొకవేళ జయమందు నొకవేళ
పంతమాడు నొకమట్టు పడినవేళ
యింతలో నీవు శ్రీ వేంకటేశ కావకయుండితే
రంతుల నేమీఁ జెప్పరాదువో నామనసూ

పె.అ.రేకు: 0014-04 శుద్ధదేశి సం: 15-077

పల్లవి: తక్కిన వెల్లాఁ దహతహలే
నిక్కపు శ్రీహరి నిజమగు తెలివీ

చ. 1: ధరణి సమస్తము దైవాధీనము
పోరిఁ బ్రాణుల నేర్పులఁ బడవు
వరుసఁ దమంతనే వచ్చిన వెల్లా
హరికరుణని ముద మందుట తెలివీ

చ. 2: కావలసినపని కర్మాధీనము
వావిరి నది గడవఁగ రాదు
దావతి కుడువక తప్పులఁ బొరలక
భావము సంతస పఱచుట తెలివీ

చ. 3: పుట్టిన తనువులు భోగాధీనము
లట్టిట్టని తెలియఁగ రాదు
గట్టిగ శ్రీవేంకటపతి నేవే
నెట్టన నమ్ముట నిజమగు తెలివీ

పె.అ.రేకు: 0014-05 లలిత సం: 15-078

పల్లవి: హరిబంట హరిబంట హరిబంటను మాపై
దర వేల మమ్ము నికఁ దడవకురో

చ. 1: పంచేంద్రియములాల బడి బడి మీ పంపు
కొంచక సేసితి నిక గొలువ నోప
వంచన లేక హరివారకము లందుకొంటి
యించుకంత గడి చిది యియ్యఁగదరో

చ. 2: కట్టిడి యాసలాల కలకాలము మీకు
వెట్టి సేసి వెట్టి సేసి వేసరితిని
గుట్టుతో నే హరిచేతికొంగుబత్య మందుకొంటి
గట్టిగాఁగ నుత్తరువు కల దించరో

చ. 3: అనుగుఁ బ్రాయపు మోహములాల యిన్నాళ్ళు
చనవరినై మీసరి నుంటిని
ఘనుఁడైన శ్రీవేంకటపతిఁ గొలిచితి
వెనకకు వీడుకోలువీడె మియ్యరో

పె.అ.రేకు: 0014-06 గుండక్రియ సం: 15-079

పల్లవి: అటమీఁద మరి యేమి నావలలేదు సర్వ
ఘటన లన్నియు హరిఁ గన్నదాఁకానే

చ. 1: సరవితో వేదములు చదివేటి వెల్లాను
హరినామరుచి గన్నయందాఁకనే
సిరులతో యజ్ఞాలు సేసేటివెల్లాను
హరిసేవపరుఁడు దా నై నదాఁకానే

చ. 2: చలపట్టి తీర్థాలు చరియించు టెల్లాను
వెలయఁగఁ గర్మాలు బడుదాఁకానే
మొలచిన తపముతో మునులై వుండే దెల్లా
తలఁపులో హరిరూపు తగులుదాఁకానే

చ. 3: వేవేలుచందాల విజ్ఞాన మెల్లాను
కావించి హరిభక్తి కనుదాఁకానే
భావించే సకలోపాయము లెల్లాను
శ్రీవేంకటేశ్వరుఁ జేరుదాఁకనే

పె.అ.రేకు: 0014-07 గుజ్జరి సం: 15-080

పల్లవి: ఏమని వున్నదో యీ మనసు
కోమల మెప్పుడు కొరతే మనసు

చ. 1: ముదిసేటివారల ములిగేటివారల
కదిసిచూచి కలఁగదు మనసు
వదలక యింద్రియవర్గంబులకే
వెదకీ నిదివో వీఁటిడి మనసూ

చ. 2: జననమరణముల చరాచరములను
కనియును మీఁ దెఱఁగదు మనసూ
ఘనసంసారపు కాణాచులకే
దినదినకాంక్షల దిరిగీ మనసూ

చ. 3: కలగని యటు మేల్కని చూచి తెలిసి
చెలఁగి రెంట నడచీ మనసు
బలిమి శ్రీవేంకటపతి రక్షింపఁగ
కొలిచి యాతనికి కొసరీ మనసూ

పె.అ.రేకు: 0015-01 లలిత సం: 15-081

పల్లవి: ఆతుమ సంతోసపెట్టు టది యెఱుక తా
నే తెరువు వొల్లకుండు టిదియె యెఱుక

చ. 1: ముంచిన బంధముల మునుఁగువడక తా
నంచల విడఁ దన్నుటది యెఱుక
చంచలపు విషయాల సగ్గుడు ముగ్గుడు గాక
యెంచి హరిఁ దలపోయు టిదియె యెఱుక

చ. 2: పాయని యర్థములకు బంటుబంటై తిరుగక
ఆయితమై మోసపోని దది యెఱుక
పాయపు కామినులతో పలుమారుఁ జేయుపొందు
హేమముగఁ దలపోయు టిదియె యెఱుక

చ. 3: ధరమీఁదఁ గల ప్రాణితతుల నొప్పించక
అరయఁగ సముఁడవుట అది యెఱుక
గరిమిల శ్రీవేంకటపతి దాసుఁడై
యిరవొంద సుఖియించు టిదియె యెఱుక

పె.అ.రేకు: 0015-02 మలహరిసం: 15-082

పల్లవి: కలకాలము యిందుఁ గల దింతె హరిఁ
దలఁపులోఁ దలఁచని తప్పె కలిగి

చ. 1: ఎన్నిలేవు పనులు యెంచుకొని సేసేమంటే
పన్నిన జంత్రముల యీ ప్రాణికి
యిన్నిటాఁ దొల్లేమి గంటి మింకాఁ గనే దేమి
అన్నిటా దురాశల ఆలపే కలిగె

చ. 2: లంపటి మెంత లేదు లలిఁ గట్టుకొనే మంటే
తెంపుల తెఱఁగులేని దేహికిని
యింతాల నిన్నాళ్లాయ యీ పాటెన్వరి కెక్కె
జంపుల మాయలలోని సటలే కలిగె

చ. 3: యెంత యెడ లేదు యింత కీ సంసారములోన
మంతనపుఁ గోరికలు మనుజునికి
యింతలోనే శ్రీవేంకటేశునిఁ గొలిచి తేను
సంతోసము లెల్లఁ జేరి జయమే కలిగె

పె.అ.రేకు: 0015-03 శంకరాభరణం సం: 15-083

పల్లవి: హరిఁ గొలువనిఫల నునుభవించుట గాక
యిరుసందిఁ బడ్డదేహి కేఁటిసుఖమయ్య

చ. 1: తూడరి మోచినమోపు తొమ్మిదిగంతులమేను
కడుసందిఁ గట్టినది కర్మపుఁదాడు
శడిఁ బంచేద్రియములపై తరవులుఁ బెట్టు
యెడపు సంసారికే నేఁటి సుఖమయ్యా

చ. 2: వేచి లేచి సేసెది విషయములకు వెట్టి
పేగులలో తీఁట రతిపెరరేఁపులూ
ఆగడుపుఁ దనలోనిఁ యాకలి ఆరని చిచ్చు
యీగతి నుండేదేహి కేఁటిసుఖమయ్యా

పె.అ.రేకు: 0015-04 సామంతం సం: 15-084

పల్లవి: నారాయణుని దివ్యనామము దలఁచలేక
వూరకిళ్లఁ దేరకిళ్ల కొడిగట్టుఁ బ్రాణి

చ. 1: వెనక జన్మించేనాఁడు వీసమైనఁ గొనిరాఁడు
తనువు విడుచునాఁడు తారముఁ గొంపోఁడు
మొనచూపి నడుమంత్రమునఁ దిరుగాడేటి
కనకముకు సొమ్మని కాచుకుండుఁ బ్రాణి

చ. 2: వుండక పొయ్యేటి వెల్లా వొకఁడు నిలుపలేఁడు
అండనె వచ్చేటి వెల్లా అడ్డగించలేఁడు
బండు బండై యిందుకుఁగాఁ బరులు రక్షకులంటా
గుండె లేకెవ్వరికైనాఁ గొంచపడుఁ బ్రాణి

చ. 3: వడి నిట్టే పనులకు వగవఁగ బని లేదు
జడియు సంసారక మొక్క సరవి గాదు
విడువని విభుఁడు శ్రీవేంకటేశుఁ డుండఁగాను
తడవి లే పట్టలేక తమకించుఁ బ్రాణి

పె.అ.రేకు: 0015-05 సామంతం సం: 15-085

పల్లవి: పలుయోనులందు పుట్టి బ్రమసితిని
అలర నే నేజాతి ననుకొందునయ్యా

చ. 1: వెనక జన్మముల నా వేడుకైన కాపురాల
యెనయు సతులు సుతులెంద రెందరో
మునుకొని యీ జన్మమునఁ గొందరున్నారు
మనసున నెవ్వరి మా వారందునయ్యా

చ. 2: ఆదికాలముననుండి ఆయా దేహాలు మోచి
ఆదెస యేమేలు నాసొమ్మని వుంటినో
నారించి యిప్పుడు గొన్ని నావి యనుచు నున్నాఁడ
యేది సతమని వుందు యెఱిఁగించవయ్యా

చ. 3: అన్నిటా నాబాము చూచి అంతలో శ్రీవేంకటేశ
యెన్నరాని విజ్ఞాన మిచ్చితి విట్టె
పన్నిన నా మునుపటి పాట్లెల్లా నెంచుకొంటె
నన్నుఁ జూచి నాలోనే నవ్వు వచ్చీనయా

పె.అ.రేకు: 0015-06 ముఖారి సం: 15-086

పల్లవి: చీచీ నరుల దేఁటి జీవనము
కాచుకొని హరి నీవే కరుణింతు గాకా

చ. 1: అడవిలో మృగజాతియైనాఁ గావచ్చుఁ గాక
వడి నితరులఁ గొలువఁగ వచ్చునా
వుడివోని పక్షియై వుండనైనా వచ్చుఁ గాక
విడువ కెవ్వరినైనా వేఁడవచ్చునా

చ. 2: పసరమై వెతలేని పాటువడవచ్చు గాక
కసటు వొనరులఁ బొగడవచ్చునా
వుసురు మానై పుట్టివుండనైనావచ్చుఁ గాక
దెసల నెక్కడనైనాఁ దిరుగవచ్చునా

చ. 3: యెమ్మెల పుణ్యాలు సేసి యిల నేలవచ్చుఁ గాక
కమ్మి హరి దాసుఁడు గావచ్చునా
నెమ్మది శ్రీ వేంకటేశ నీ చిత్తమె కాని
దొమ్ముల కర్మము లివి తోయవచ్చునా

పె.అ.రేకు: 0016-01 గుండక్రియ సం: 15-087

పల్లవి: పరులసేవలు సేసి బ్రదికిరట
సిరివరుదాసులై సిరులందుటరుదా

చ. 1: కోరి వొకనరునిఁ గొలిచిన వారలు
దీరులై సలిఁగలఁ దిరిగేరటా
కూరిమి బ్రహ్మాండ కోట్లేలెడివాని
వార లిన్నిటాఁ జనవరు లౌటరుదా

చ. 2: చేకొన్న తుమ్మెద చేపడ్డ కీటము
లాకడ తుమ్మెద లయ్యీనట
శ్రీకాంతుని పాదసేవకు లగువార
లేకులజుల యిన యెక్కు డౌ టరుదా

చ. 3: ధరణీశు నాజ్ఞల తమ దేశములందు
సిరుల నాణెపుముద్ర చెల్లీనటా
తిరువెంకటాద్రి శ్రీ దేవునిముద్రములు
ధరియింపఁగ వింతటఁ జెల్లు టరుదా

పె.అ.రేకు: 0016-02 లలిత సం: 15-088

పల్లవి: ఏవుపాయములు యెక్కడి కెక్కసు
శ్రీ వల్లభ నీసేవే ఘనము

చ. 1: చదివిన బుద్ధులు శాస్త్రపు యుక్తులే
వెదకును జ్ఞానము వెదకను
తుదఁబుణ్యవిధులు దొడ్డపుణ్యములే
యెదుగాఁ జేయించు యెనయదు విరతి

చ. 2: చెవిలోన కతలు చెప్పినంతవడె
తవిలి జ్ఞానము దాఁటదు
భువి శివములు పుబ్బులంబరవశములె
భవహరమగు నీ భక్తికిఁ జొరదు

చ. 3: నరసురులసేవ నామధారికమే
దురిత హరంబై తూరదు
యిరవగు శ్రీ వేంకటేశ్వర నీవే
కరుణించి మముఁ గాతువు గాక

పె.అ.రేకు: 0016-03 సాళంగనాట సం: 15-089

పల్లవి: నెమ్మది నిన్నే గొలిచి నిశ్చింతులమె కాక
దొమ్మిఁ దొంటి చేఁతకంటు దొడ్డాయితి

చ. 1: శ్రీపతి నీనామ ముచ్చరించి కృతార్థులై సర్వ
పాపవిముక్తు లైనట్టి ప్రపన్నులకు
యేపునఁ గాల దోషములేవి కర్మదోషమేది
కోపుల లోకముల శకునదోషము లేవి

చ. 2: నారాయణ నీదాసులై నరకము లుత్తరించి
వైరములు దాఁటిన శ్రీవైష్ణవులకు
యీరీతి మంత్రలోపము లేవి క్రియాలోపమేది
భారమైన ఆచారలోపము మరేది

చ. 3: మించి శ్రీ వేంకటేశ్వర మిమ్ముఁ గొల్చి భవములు
తెంచిన శరణాగత దేహులకు
యెంచి చూడ మాయ లేని యిలఁ గనిబాధ లేని
అంచల నెందుచూచిన అడ్డాఁక లేవి

పె.అ.రేకు: 0016-04 శుద్ధవసంతం సం: 15-090

పల్లవి: పరమలాభము శ్రీపతిభక్తి యుండఁగాను
యిరవైన యెఱుక లే దెవ్వరి నష్టి యయ్యా

చ. 1: జడియ కప్పుడు సంసారజలధిలోన
వొడ లనియేటి పెద్దవోడ యెక్కి
బడిబడి సరకుగా పాపపుణ్యములు నించి
యెడతాఁకేరు జీవులు యిందుల కందులకు

చ. 2: మదమచ్చరములనే మకరమీనములఁదోని
వెదకి వూరుపుగాలి విసరంగాను
పదియైన యింద్రియ పరివారము దొడుక
పొదిగి కోర్కులు గూడపోనేరు జీవులు

చ. 3: మనసనియేటి మంచి మాలిమి నడపఁగాను
ఘనయహంకారమను కంబమెత్తి
మనుపు శ్రీవేంకటేశు మాయ చాపగా నెత్తి
తనియక చేరమునిఁ దగిలేరు జీవులూ

పె.అ.రేకు: 0016-05 ముఖారి సం: 15-091

పల్లవి: ఏలిక బంటువరుస కిది చెల్లునా
ఆలరినై తిరిగెద నపరాధమా

చ. 1: నీవు దేహ మియ్యఁగాను నంబరము గోరెను
ఆవల నా కిది యొక్క అపరాధము
చేవదేర సంసారిఁ జేయఁగా విజ్ఞాని నయ్యే
ఆవటించి నిదియొక అపరాధము

చ. 2: పంచేంద్రియముల నాపైపంపు నీవు వెట్టఁగా
అంచనేఁ దోసి ననేది అపరాధము
కంచములోఁ బెట్టి నీవు కర్మము సేయించఁగాను
అంచున దొచ్చి విడిచె నది యపరాధమూ

చ. 3: సన్నిధై నీవుండఁగాను సంతోషానందమున
నన్ను వట్టియున్నాఁడ నపరాధము
యెన్నిక శ్రీ వేంకటేశ యెదురాడ నీకు నేను
అన్నిటాఁ గాచితివి నా యపరాధమూ

పె.అ.రేకు: 0016-06 లలిత సం: 15-092

పల్లవి: దేవుఁడు గలఁడుగా దీనికేమి
కైవసమయ్యేరుగాక కానీ కానీ

చ. 1: పంచేంద్రియములాల పాపపుణ్యకర్మమా
చంచల చిత్తమా అరిషడ్వర్గమా
యించుకంత జీవుఁడింతై యిందరు దొమ్మిసేసి
పంచుకొంటి రింతట మీ పంత మెక్కెనా

చ. 2: యిలఁ దాపత్రయమా యీషణత్రములాల
బలుసంసారమ అనుబంధములాల
కలిగిన దేహ మిదె కాణాచి మీ రందరు
నెలకొంటి రిందేమీ తనివిఁ బొందెనా

చ. 3: సకలతత్వములాల జన్మకోట్లాలవో
ప్రకటపు నిజమాయ భాగ్యఫలమా
వొకట శ్రీవేంకటేశు నొద్దికిఁ దీసితిరిమీ
రకలంకమైన మీ కృతము చెల్లెనా

పె.అ.రేకు: 0017-01 గుండక్రియ సం: 15-093

పల్లవి: రెంటికినిఁ గొరగాని రేవనికత గా కిట్టి
సొంటులు సోదించి నీవు చూచుకో వో జీవుఁడా

చ. 1: విచారించి చూచితేను విశ్వము కిందనే నూయి
పచరించితే మీఁదు పరబ్రహ్మము
రచించి యీ రెంటికి నిరవు మన సాకటి
సుచారిత్రుఁడవై నీవు చూచుకో వో జీవుఁడాఁ

చ. 2: తట్టి పాఁకఁబోతేను బయలెల్ల బందిలే
కొట్టగొన కెక్కితేను కొండిపీట
అట్టుగాని రెంటికి నెఱయ దేహమే గుఱి
మట్టెల్ల మాని నీవు చూచుకో వో జీవుఁడా

చ. 3: మఱచి వూరకుండితే మాయలే జన్మము లెల్ల
యెఱిఁగితే శ్రీవేంకటేశుఁడే
తఱితోఁ దాఁగైకొంటే తానే రెంటికి మూలము
చుఱుకు గలిగి నీవే చూచుకో వో జీవుఁడా

పె.అ.రేకు: 0017-02 కాంబోజిసం: 15-094

పల్లవి: ముందరఁ బారెడి దేరు ముంచి వెనకా పులి
యిందిరావిభుఁడే దిక్కు యింకఁ జేసేదేమి

చ. 1: దేహము మోచితేను త్రిజగములకులోను
యీహల విరక్తుఁడుగా నెట్టు వచ్చును
సాహసించక లోనైతే సరుస మోక్షము లేదు
శ్రీహరి యెఱుఁగుఁ గాక సేసెది దేమి

చ. 2: బలుసంసారి యయితే పాపపుణ్యములకు లో
నెలమి నిర్మలుఁడుగా నెట్టు వచ్చును
తలఁచి మానకుండితే తనకు సుఖము లేదు
యిలధరుఁడే యెఱుఁగు యిఁకఁ జేసేదేమి

చ. 3: దైవమువాఁ డైతేను ధర్మములకెల్లలోను
యీవలఁ దప్పులు దారు లెట్టువచ్చును
భావించి తోయకుండితే పనులు తుద కెక్కవు
శ్రీవేంకటేశుఁ డెఱుఁగు సేసేటి దేమి

పె.అ.రేకు: 0017-03 బౌళి సం: 15-095

పల్లవి: అతిసులభుడవు నీ వవి నిన్నుఁ గొలిచి
తతి మేలే కొందుఁ గాని తప్పు మాకులేదు

చ. 1: తిట్టే శిశుపాలనకు దివ్యపద మిచ్చితివి
ముట్టి కొలుచువారికి మోక్ష మియ్యవా
వెట్టి బండి రొప్పించిన విజయునిఁ గాచితివి
నెట్టిన నీ కింకరుల నీవు గావ కుందువా

చ. 2: తన్నినభృగువు నటు తగ సంతోషించితివి
అన్నిటాఁ బూజించువారి నాదరించవా
నిన్ను రోషిఁచు కాళింగు నెమ్మి గరుణించితివి
వున్నతిఁ గొల్చినవారి నొగిఁ గరుణించవా

చ. 3: అమ్ముమొనకుఁ జిక్కిన అంబుధి మొరాలించితి
నమ్మినవారిమాట వినవా నీవు
యిమ్ముల శ్రీవేంకటేశ యిఁక సరిలేదు నీకు
పమ్మి శరణాగతులఁ బాలించకుందువా

పె.అ.రేకు: 0017-04 నాట సం: 15-096

పల్లవి: వేవేలు విన్నపాలేల వేగినంతాను
నీవి దయాధర్మములు నీచిత్త మికను

చ. 1: అరసి చూడక నే శతాపరాధములు చేసి
శరణు నీకుఁ జొచ్చితి సర్వేశ్వరా
సరి శరణాగతరక్షకబిరుదది నీది
నిరతి నా భాగ్యము నీ చిత్త మిఁకను

చ. 2: అహరహిమును సహస్రాపరాధములు చేసి
వహి కెక్కి నీ లెంకపాఁడ నైతిని
బహుగతి భక్తపరిపాలన బిరుదు నీది
నిహితపు నా గతి నీ చిత్త మిఁకను

చ. 3: సన్నిది శ్రీవేంకటేశ సర్వాపరాధముల్ చేసి
అన్నిటికి శలవు నీ యచ్చు మోచితి
పున్నతి నా ర్తత్రాణవుద్యోగబిరుదు నీది
నిన్ను నన్ను విచారించు నీ చిత్త మిఁకను

పె.అ.రేకు: 0017-05 సాళంగనాట సం: 15-097

పల్లవి: నీపల్లఁ గడమ లేదు నిజమూర్తివి
వావిరి సుఖించ నేర్చేవారివారి పుణ్యమూ

చ. 1: కొలిచే మనేవారికి కోరినయేలికవు
తలఁచే మనేవారికి దైవమవూ
సొలనే మనేవారికి చుట్టమవు నీవు
వలసి నందు భావించేవారివారి పుణ్యము

చ. 2: తగిలే మనేవారికి ధనధాన్యమవు నీవు
పగటు కృషికులకు పాఁడిపంటవూ
తగిలిన యోగీంద్రులకు తత్త్వరహస్యము నీవు
వగలఁ దెలుసుకొనేవారివారి పుణ్యము

చ. 3: చదివే మనేవారికి సర్వశాస్త్రములు నీవు
మొదల నందరికిని మూలమవు
కదిసి శ్రీవేంకటేశ గతి నా కైతే నీవు
వదలక చేపట్టేవారివారి పుణ్యము

పె.అ.రేకు: 0017-06 గుండక్రియ సం: 15-098

పల్లవి: తల్లికిఁ గలుగు ముద్దు దాది కున్నదా
చిల్లరప్రియము లేలో చెప్పేముగాకా

చ. 1: బహు విశ్వకుటుంబవి ప్రాణులెల్ల నీ వారు
యిహ మిచ్చి రక్షింప నీ కిదే పని
నిహితపు నీ సొమ్ము నీవు వీక్షింపచేవా
బహు విన్నపాలూరకే పైపైఁ జేసేఁ గాకా

చ. 2: సర్వవిధ బంధుఁడవు సకల కృత్యాలు నీవి
నిర్వహించ నన్నిటాను నీ కిదే పని
పుర్విపై నీకార్యములు వుద్ధరించక మానేవా
చర్వితచర్వణాల వేసరించేము గాకా

చ. 3: నీవు లోకేశ్వరుఁడవు నేమెల్లా నీ బంట్లము
యీవలఁ గాచుటకు నీ కిదే పని
శ్రీవేంకటేశ మీ పెట్టుఁ జెట్ల దయఁ జూడవా
దైవమవు విన్నారకే తలఁ బంచేఁగాకా

పె.అ.రేకు: 0018-01 నాట సం: 15-099

పల్లవి: ముందరి కేది తెరువు ముకుందా యీనతీవయ్యా
అందరిలో నీకు శరణా గతుఁడ నైతిని

చ. 1: తొల్లి నిన్నుఁ గొలువని ద్రోహముననే కదా
మెల్లమి నానాజన్మములఁ బుట్టితి
చల్లని నీ నామ ముచ్చరించిన ద్రోహననే
వొల్లనే సంసారవార్ధి నోలలాడెను

చ. 2: వెన నిన్నుఁ బూజించి సేవించని ద్రోహననేకా
పసలేని పంచేంద్రియ బద్ధుఁడనైతి
కొసరి నిన్నే పొద్దు కొలవని ద్రోహననె
వనము గాని కర్మపు వలఁబడినాఁడను

చ. 3: మని మని నిన్ను నమ్మని ద్రోహమునఁ గదా
అనిశము నిటు నీ మాయకు లోనైతి
యెనలేని శ్రీ వేంకటేశ సర్వ ద్రోహిని
నినుఁ దలఁచి తలఁచి నీకే మొరవెట్టితి

పె.అ.రేకు: 0018-02 బౌళి సం: 15-100

పల్లవి: తమ తమ యంతటికి తమవారె
గుమిగూడు కొను టింతె కొసర నేలయ్యా

చ. 1: తల్లి శ్రీ మహాదేవి తండ్రి పురుషోత్తముఁడు
తొల్లె దేవత లెల్ల తోడఁబుట్లూ
పొల్లగారు జీవు లెల్ల పుట్టి పోదురు వత్తురు
చెల్లఁబో యిందులకుఁగా చింత లేఁటికయ్యా

చ. 2: హరిభక్తు లేలికలు ఆచార్యుఁడొక్కఁడే దాత
పరమాత్మ నామములే బంధువులు
సరవి జంతువులకు సంసారమే ధర్మము
పరులకెల్లా నింతేసి భ్రమత లేలయ్యా

చ. 3: హితులు వేదరాసులు యిల్లాలు వివేకము
సుతుఁడు తనలోపలి సుజ్ఞానము
గతి శ్రీ వేంకటేశుఁడె కలవాఁడుప్రాణులకు
మతిమంతుల కిందులో మఱపు లేదయ్యా

పె.అ.రేకు: 0018-03 దేశాక్షి సం: 15-101

పల్లవి: ఏమిటికి వట్టి చింత యెక్కడివి దుఃఖములు
శ్రీమంతుఁడే మా యరచేత నున్నాఁడు

చ. 1: సకలలోకేశ్వరుఁడు సర్వాంతరాత్మకుఁడు
అకలఁకుఁ డిదివో మా యందు నున్నాఁడు
ప్రకటించి యోలికయ్యై బహు సంపదలై
మొకరిబంధువుఁడై ముందర నున్నాఁడు

చ. 2: పరమపురుషుఁడు భవరోగవైద్యుఁడు
యిరవైన దేవుఁడు మా యింట నున్నాఁడు
పొరుగు పోరచి భువనరక్షకుఁడై
దరిచేర్చి రక్షించ మాదండ నున్నాఁడు

చ. 3: శ్రీ వేంకటేశుఁడే శ్రీ మహాలక్ష్మియై
కైవసపు సుఖమునై కల్గి యున్నాఁడు
వేవేలు సుజ్ఞానములై వింత వింత వేడుకలై
దేవుఁడై మాపాలిటఁ దిరమై యున్నాఁడు

పె.అ.రేకు: 0018-04 దేవగాంధారి సం: 15-102

పల్లవి: నీ దయాధర్మమునకు నీ చిత్తమిఁక
యీదెస మానేర్చు లిఁక యెంచఁగలదా

చ. 1: యీవల నా యపరాథ మెఱుకతో నీకుఁ జేసి
గావు మని మిమ్మన సంగతులా నాకు
కైవసమై నీకు వేళ గాచి యుండి కొలువక
సేవించ చేయెత్తి మొక్క సిగ్గు గాదా నాకు

చ. 2: మన్నించిన నీ మన్నన మఱచి మత్తుఁడనై
యిన్నిటా నీవాఁడ నంటే యే మందువో
యెన్నిక ద్రోహినై యిప్పుడిచ్చకాలు సేయఁబోతే
నన్నుఁ జూచి పరులెల్లా నవ్వరా యింకాను

చ. 3: కొంత సంసారభక్తితో కోరి నీ భక్తుఁడనైతి
వంతుల విజ్ఞాన మెటువలె నుండునో
యింతట శ్రీ వేంకటేశ యిట్టె నన్ను రక్షించితి
వంతర్యామివి నీవు అది నా విన్నపము

పె.అ.రేకు: 0018-05 గుజ్జరి సం: 15-103

పల్లవి: ఇటువంటి దుర్గుణి నన్నెట్టు గాచితవో గాని
సటలాడేవానికి సత్య మెందు లేదు

చ. 1: మదనాతురునికిని మరి వివేకము లేదు
కదిసి అలసునికి కర్మము లేదు
పొదిగి యా శకునికే పుణ్యపాపము లేదు
మొదలనె మూర్ఖునకు మొగ మోఁట లేదు

చ. 2: కొంచెపు నాస్తికునికి గురుఁడు దైవము లేఁడు
పొంచిన లోభివానికి భోగమే లేదు
యించుకంత దరిద్రున కియ్యా గొన శక్తి లేదు
చంచల చిత్తునికి నిశ్చయ మెందు లేదు

చ. 3: మత్తుఁడైనవానికి మరి పనులే లేవు
హత్తి వేంటకానికి దయలు లేవు
సత్తుగ శ్రీ వేంకటేశ శరణాగతుఁడ నీకు
యిత్తలఁ దాల్లిటి చింత లిఁక నేమి లేవు

పె.అ.రేకు: 0018-06 ముఖారి సం: 15-104

పల్లవి: తెలిసినవారికి తేటాయె
తొలఁగక సిరితో తుద నొకటాయె

చ. 1: పరమబ్రహ్మము ప్రకృతియునుఁ గూడి
సరివితో మెలఁగ జగ మాయె
ఆరయఁగ నిరువది అయిదు తత్త్వముల
పెరుగుచు జీవుల భేదం బాయె

చ. 2: జీవులు దేవుఁడు సృష్టియునుఁ గూడి
కావించు కర్మపుగతు లాయె
దేవతల మునుల తెఱఁగుల నడకల
వేవేలు విధుల వేదం బాయె

చ. 3: క్రీడలు గాలము క్రియలుఁ జుట్టుగులు
కూడి మాయలకు గురు తాయె
యీడనే శ్రీ వేంకటేశ్వరు శరణము
జాడల నిహపరసాధన మాయె

పె.అ.రేకు: 0019-01 శంకరాభరణం సం: 15-105

పల్లవి: ఏఁటి వివేకము యెరవుల చిత్త మిదె
తాఁటలు దూఁటలలోనె తగిలి యుఁడుఁ గాకా

చ. 1: తను నెఱిఁగి రక్షింప దైవమే నేరుచుఁ గాక
మనుజుఁ డే మెఱుఁగు వున్మత్తుడే
పెనఁగి పంచేంద్రియపు పెంపుడుఁ గుఱ్ఱ దాను
పొనుగ కందులోననే పొరలాడుఁ గాకా

చ. 2: కాల మెఱిఁగి పోఁ పొందను కర్మమె నేరుచుఁ గాక
కూళజీవుఁ డేమెఱుఁగు గుణబద్ధుఁడు
ఆలరి కామాదులకు నరిఁగాపై వుండుఁ దాను
పొలుమాలి వానికి పనిసేయుఁ గాకా

చ. 3: కొలఁ దెఱిఁగి బోధించ గురుఁడే యెఱుఁగుఁ గాక
యిల దేహి యేమెఱుఁగు హీనశక్తుఁడు
బలిమి శ్రీ వేంకటేశు పరతంత్రుఁడు దాను
చలపట్టి యాతనికి శరణనుఁ గాక

పె.అ.రేకు: 0019-02 మంగళకౌశిక సం: 15-106

పల్లవి: ఇది గాదు తెరువు యీడేరేవారికి
అదన విజ్ఞాని యైతే అతఁడే రక్షించును

చ. 1: తలఁపులు చక్కఁగాక దైవముఁ దలఁచఁబోతే
వెలి దున్నని నేలను విత్తిన యట్లు
పొలసి దాసుఁడుగాక పూజించఁ బోవు టెల్ల
బలిమి దేవునిఁ బట్టి బంటకు నాఁగుటా

చ. 2: తనవైరాగ్యము లేక తత్త్వము వెదకేనంటే
తనియ కిసుక పాఁతర దవ్వుటా
కొనభక్తిలేక హరిఁగోరి మొక్కు టెల్ల
మొనసి దేవుని సొమ్ము ముచ్చిలించుకొనుటా

చ. 3: వెస గురుఁడు లేక శ్రీ వేంకటేశు సాధించితే
అసదై (?) యందనిపంటి కఱ్ఱు చాఁచుట
పసగా నితనిఁ దనపనికిఁగాఁ బొగడుట
యిసుమంత చెలమకు యేతము లెత్తుటా

పె.అ.రేకు: 0019-03 నాట సం: 15-107

పల్లవి: అనాది జగములు అనాది దేవుఁడు
వినోదములు గని వినుకదు మాయ

చ. 1: పుట్టేటి జీవులు పోయిన జీవులు
వొట్టిన జీవులు వున్నారు
చుట్టేరు దినములు సూర్యచంద్రాదులు
తెట్ట దెరువుననె తెగడు కాలము

చ. 2: కలఁడు బ్రహ్మయును కల రింద్రాదులు
కల వనేకములు కార్యములు
ఫలబోగంబులు పై పై నున్నవి
కలియుఁ గర్మముఁ గడవఁగ లేదూ

చ. 3: శ్రీ వేంకటేశుఁడు చిత్తములో వీఁడె
భావములోపల భక్తి యిదే
భావించి బ్రదుకుట ప్రపన్నులు వీరిదె
యేవలఁ జూచిన యిహమే పరము

పె.అ.రేకు: 0019-04 బౌళి సం: 15-108

పల్లవి: తపముల బడలఁగ తమ కేల మునులకు
నెప మిదె సాధించ నియ్యెడకు నింకను

చ. 1: అడుకులు వెట్టి నీచే నందెను సిరు లొకఁడు
కడు గంపఁ గమ్మి దాఁచి కైవల్య మందె నొకఁడు
కుడువఁ గూడు దెచ్చి కొందరు నీ వారైరి
వడి నిట్టే యణకించవచ్చుఁబో నిన్నింకను

చ. 2: నీ తల పువ్వులు చుట్టి నిత్యుఁ డాయె నొకఁడు
కాతరాన గంద మిచ్చి కలసె నిన్నొక తె
చేత బలుసాకు వెట్టి సిరులు గనె నొకఁడు
యీతల నిన్ను చెల్లించే దేమి దొడ్డ యింకను

చ. 3: మంద గోపికల కడ మాటాడి మించె నొకఁడు
కందువ నీకు దాసుఁడై కరుణఁ బొందె నొకఁడు
యిందరు వరము లందిరిదె శ్రీ వేంకటేశుఁడ
సందడి నిన్ను సేవించే సర విదె యింకను

పె.అ.రేకు: 0019-05 సాళంగనాట సం: 15-109

పల్లవి: విచారించుకోని వారి వెఱ్ఱితన మింతె కాని
పచారించి నీ కృపను బ్రతికితి నేను

చ. 1: శ్రీ మహలక్ష్మి యుండఁ బొంచి దరిద్రమేలయుండు
కామధేను వున్నచోట కరవేల యుండు
కామించి నారాయణ నీ ఘననామ మున్నచోట
తామసాలుఁ బాతకాలు దగ్గరి యేల యుండు

చ. 2: చెంగట సూర్యుఁ డున్నచో చీఁకట్లేల యుండు
భంగించి గరుఁడుడుండఁ బాము లేల యుండు
ముంగిట గోవిందుఁడ నీ ముద్రలు మేన నుండఁగా
అంగవికారములయిన అజ్ఞాన మేల యుండు

చ. 3: తానే నిజమై వున్న చెంతఁ జంచల మేలయుండు
కానఁబడి భక్తి యుండ కలఁక యేల యుండు
ఔ నవు శ్రీ వేంకటేశ అంతరాత్మ నీ వున్నచో
ఆనుక శుభము లుండ నల పేల యుండు

పె.అ.రేకు: 0019-06 సామంతం సం: 15-110

పల్లవి: అతఁడే గతి యంటి నన్నిటా మాన్యుఁడే
యితరములు మానఁగా నితనికే శలవు

చ. 1: మీఱి శ్రీ రమణుని మెప్పించు సేవకులకు
వీఱిడి కర్మముల వెట్టి మాన్యము
ఆఱడి యితని భక్తులైన చనవరులకు
ఆటితేరి పుణ్యపాపా లడ్డపాటి లేదు

చ. 2: తక్కక యితని ముద్ర ధరించే దాసులకు
చొక్కుల భవబంధపు సుంకమాన్యము
లెక్కించి యితనికైన లెంకలకు జోడు కల
కొక్కట విధినిషేధా లూహింప లేవు

చ. 3: సరుస శ్రీ వేంకటేశు శరణాగతులకును
పరగ మాయల దొడ్డి బందె మాన్యము
పరమైన యీతని పళ్లెము కూటివారికి
తరితో జగములోని తప్పొప్పులే లేవు

పె.అ.రేకు: 0020-01 ముఖారి సం: 15-111

పల్లవి: నారాయణ నీవే నాథుఁడ వైతి నాకు
గారవించి రక్షించి కరుణించవయ్యా

చ. 1: అంచట నా కర్మమనే అలుగు బండారించితి
పెంచి యింద్రియాలఁ బంపు వెట్టకుమయ్య
వంచి పుణ్యముల మేఁడి వారము మీ కిచ్చితిమి
మించిన కామాదులనే మేర గాండ్లేలయ్య

చ. 2: మునుసే ఆసలనేటి మొదలు గడమ చెల్లె
పనివూని పాతకపు పనులేలయ్య
మనసనే మోపు నెమ్మది నీకు నప్పగించితి
ఘన దుఃఖముల తర కాండ్లేలయ్యా

చ. 3: శ్రీ వేంకటేశ నీ భక్తిసీమకు నే నేలికైతి
తావుల చింతల దరిద్రము లేలయ్య
నీవు నాకుఁ గాణాచి నే నీ యాధీనము
వోవల పరధర్మపు దొత్తు కాండ్లేలయ్య

పె.అ.రేకు: 0020-02 రామక్రియ సం: 15-112

పల్లవి: వాదమేల సారె సారె వడి ముక్తి లేదంటె
వేదాంత శ్రవణము వెట్టికిఁ జేసేరా

చ. 1: అరయ ప్రపంచమెల్ల నభేద మయితే
గురుఁడు శిష్యుడు లేఁడు కూడ దర్థము
సొరిది నాత్మలోన సోహంభావన యయితే
సరి మును దేవ పూజలు చెల్లవు

చ. 2: సహజలీలావిభూతి సర్వం మిథ్య యయితే
బహు యాగాదికర్మము పనిలేదు
మహిలోని జననము మరణము మాయ యయితే
విహితాచారము సేయ విధిలేదు

చ. 3: ఘటన బ్రహ్మము నిరాకార మయితేఁ బఠియింప
యిటు పురుషసూక్తాదు లివి నీకేల
అటు శ్రీ వేంకటేశు ద్యానము లేక బిగిసితే
సటలాడుకొనేటి రాక్షమత మవును

పె.అ.రేకు: 0020-03 గుజ్జరి సం: 15-113

పల్లవి: హరిముద్ర ధరించక అర్చించఁ బాత్రుఁడు గాఁడు
వెరవుగా సోదించి వినుకొండో

చ. 1: ఆరసి చక్రాంకిత మనిన మాట
ద్వారకలో కృష్ణు డన్న ధర్మము గాదా
భారతములో నున్నదే పంచమవేద మిది
సూరలుగా సోదించి చూచుకొండో

చ. 2: తేటగా భుజచక్రద్విజాతి నవని
తాటించి వై ఖానసులు ధరించే ధర్మమిది
నూటొక్క ఋషులిడిన నూటొక్క సంతలందు
ఘాటముగా సోదించి కనుకొండో

చ. 3: యెంచఁ దాపపుడ్రనామహిత మంత్ర యాగమని
పంచసంస్కారము చెప్పే పాంచరాత్ర ధర్మ మిది
అంచల శ్రీ వేంకటేశు ఆనతి నయిదు లక్షలు
సంచితమైన శాస్త్రము చదువు కొండో

పె.అ.రేకు: 0020-04 గుండక్రియ సం: 15-114

పల్లవి: ఇన్నాళ్లు నందు నిందు యేమి గంటిని
అన్నిటా శరణు చొచ్చి హరి నిన్నుఁ గంటిని

చ. 1: అంగనల పసఁ జిక్కి అలయికలే కంటి
బంగారువెంటఁ దగిలి భ్రమ గంటిని
ముంగిటి క్షేత్రము లంటి ముంచి వెట్టి సేయఁ గంటి
అంగవించి నేఁ జూచి అంతరాత్మ గంటిని

చ. 2: చుట్టాలఁ జేరి చూచి సుద్దుల వావులు గంటి
మట్టులేని వయసుతో మదము గంటి
వట్టి కామ్యములు సేసి వరుస మాయలు గంటి
పట్టి నారాయణ యని భక్తి నిన్నుఁ గంటిని

చ. 3: వింత చదువులవల్ల వేరే మతములు గంటి
పంతపు కర్మమువల్ల పాపము గంటి
యింతట శ్రీ వేంకటేశ యిటునా జీవభావము
చింతించి అందులో నీ శ్రీపాదములు గంటి

పె.అ.రేకు: 0020-05 బౌళి సం: 15-115

పల్లవి: ఇతనిచందము హరిహరి యేమి చెప్పఁ గొలఁది హరిహరి
అతిరహస్యముల హరిహరి అదిగో మనకుఁ జిక్కె హరిహరి

చ. 1: ఆదివిష్ణుఁ డితఁడు హరిహరి అదె యశోదకొడుకు హరిహరి
వేదమూర్తి ఇతఁడె హరిహరి వెన్నదొంగిలించె హరిహరి
సాదుబండి విఱిచె హరిహరి చంటివిషము చెరిచె హరిహరి

చ. 2: పరమపురుషుఁ డితఁడు హరిహరి పసులఁ గాచె నిదివో హరిహరి
సిరికి మగఁడు దాను హరిహరి చెలఁగి రోలఁ దగిలె హరిహరి
పరగఁ జూడరోయి హరిహరి బదుకరోయి కొలిచి హరిహరి

చ. 3: అమరవంద్యుఁ డితఁడు హరిహరి అణఁచెఁ గంసుని హరిహరి
వినుత దానవారి హరిహరి వించె మద్దులు హరిహరి
అమరె నిదివో హరిహరి శ్రీ వేంకటాద్రిమీఁద హరిహరి
జమళి రామకృష్ణుఁడు హరిహరి సర్వమితఁడు హరిహరి

పె.అ.రేకు: 0020-06 రామక్రియ సం: 15-116

పల్లవి: నీ మహిమ లిన్నిటికి నీలకంఠుడు సాక్షి
దామోదర మమ్ముఁ గావు దాసులము మీకు

చ. 1: కాలకూటవిషమైన గక్కున నరగుటకు
తాలిమితో నీ నామత్రయ మంత్రము
సోలిఁ బాముల వాయి కట్టే సొమ్ముగా ధరించుటకు
ఆలరి గరుడవాహనాయుధ ధారణము

చ. 2: పట్టిన బ్రహ్మహత్య ప్రాయశ్చిత్తమునకు
వొట్టినట్టి తారక బ్రహ్మోపదేశము
అట్టకపాల భోజనా శుచి పరిహారము
గట్టిగ నీ పాదతీర్థపు గంగానది

చ. 3: చెలఁగి భూతపిశాచసేవ నివారించుటకు
తలఁచేటి నీ మహాతత్త్వ యోగము
బలిమి సర్వమంగళాస్పదమై నిలుచుటకు
యిలపై శ్రీ వేంకటేశ యిదె నీ సాకారము

పె.అ.రేకు: 0021-01 సామంతం సం: 15-117

పల్లవి: ఎందును బొందని యెడకాట మిదె యని
యిందిర నాథుని సేవించు మనసు

చ. 1: కూడితే సంసారము కొనకెక్క జేయవలె
కూడకుండితే విరతి నెక్కుడు గావలె
తాడుపడి వొక్కడు తగు లేమి చేకూడితే
వాడీవాడని పైరువలె నవు మనసూ

చ. 2: వొండె యిమువాడై వున్నతి బ్రదుకవలె
వొండె పరముగోరే వుపమవలె
రెండు విడువలేక రీతులు వేరేయయితే
వండీవడని కూడువలె నవు మనసూ

చ. 3: తను నెఱుగగవలె తనలోన నే పొద్దు
యెనయ శ్రీ వేంకటేశు నెఱుగవలె
మనసు విలుపవలె మరి యెన్ని చదివినా
వనధిలో గురిసిన వానవు మనసూ

పె.అ.రేకు: 0021-02 రామక్రియ సం: 15-118

పల్లవి: ఓహోహో యనరో పారి
సాహసానఁ దిరుగరో జంటపారి

చ. 1: కోనేటిరాయఁడు కోరి నిద్రించీ వాఁడే
ఆనకమ్మై జాలీయరో ఆఁడు బారీ
పేనిపట్టి వాకిళ్ళ బీగముద్రలాయ నిడి
కానిమ్మని వాయించరో గంట పారి

చ. 2: తిరుపణి మణఁగెను తిరుగరా దెవ్వరికి
మరల నెలుగియ్యరో మగపారి
పరగ దేవత లెల్ల బడకెళ మున్నారు
యిరవాయ సూర్యచంద్రు లెదురు పారి

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చిత్తగించీ లోననదె
కోవర మెన్నికెరో కోటిపారి
ఆవల బంగారుగుదియలు ఘల్లు రనఁగా
తావుల హనుమంతునితలారి పారి

పె.అ.రేకు: 0021-03 నాట సం: 15-119

పల్లవి: నానామహిమల శ్రీ నారసింహము
పూని మమ్ము రక్షించీ పొగడెద నిదిగో

చ. 1: కొండవంటి వేదాద్రిగుహలలో సింహము
దండి భవనాశి యేటిదరి సింహము
అండ నారుశాస్త్రముల అడవిలో సింహము
నిండి అహోబలముపై నిక్కిచూచీ నదిగో

చ. 2: దిట్టయోగీంద్రుల మతితెర మఱుఁగు సింహము
జట్టిగొన్న శ్రీసతితో జంటసింహము
పట్టి దైత్యుల వేఁటాడే బలుదీము సింహము
మెట్టి అహోబలముపై మెఱసీఁదా నదిగో

చ. 3: పలుదేవతల వెనుబలమైన సింహము
కెలసి కంబానఁ జెనఁగిన సింహము
అలరి శ్రీ వేంకటేశుఁ డైనట్టి సింహము
కొలువై అహోబలాన గురుతాయ నిదిగో

పె.అ.రేకు: 0021-04 లలిత సం: 15-120

పల్లవి: శిర సుండ మోకాల నేసవెట్టినయట్లు
పరమధర్మము మాని పరచుగా వలసె

చ. 1: కోరి కఠారము మాని కోల చేతఁ బట్టుకొని
బీరానఁ బోటుకుఁ బోయి పెట్టు డ్డట్టు
యీరీతి ప్రపత్తి మాని యితరకర్మము సేసి
సారె పుణ్యపాపములసందిఁ జిక్కవలసె

చ. 2: వై పైన వోడవిడిచి వదరు చేపట్టుకొని
వైపుగాక యీఁది యీఁది వడిఁ బడ్డట్లు
యేపున దాస్యము మాని యితరోపాయములు
పూపస్వర్గభోగముల పుంగుడు గావలసె

చ. 3: ఘనమాణిక్యము మాని గాజుఁబూస గట్టుకొని
వెనక జాణలచే నవ్వించుకొన్నట్లు
యెనసిన శ్రీ వేంకటేశు శరణనలేక
మును జన్మాదులలోన మునుగఁగ వలసె

పె.అ.రేకు: 0021-05 లలిత సం: 15-121

పల్లవి: ఆనాది సంసారి వటుగాన
మనోవికార మిది మాన దెంతయినా

చ. 1: కడు చంచలమేకాని కాయములో నిజబుద్ధి
తొడరదు దుర్బుద్ధి తోఁచి నాకు
దిడువై (?) శ్రీహరి నీవు తిద్దితే నేమోకాని
వెడఁగు నా గుణ మిది విడువ దెంతయినా

చ. 2: పలుచింతలే కాని పట్టిన నీపై భక్తి
కలుగ దజ్ఞానమే కప్పీ నాకు
బలిమి బందాలు నీవు నాపితే నేమో కాని
తొలఁకు నా మన సిది తొలఁగ దెంతయినా

చ. 3: పట్టిన చలమే కాని పై పై విరక్తి నాకు
నెట్టుకోదు నీ కృప నిలిచీ నాకు
యిట్టే శ్రీ వేంకటేశ యేలిన వాఁడవు నీవు
యెట్టైన నీకుఁ బోదు యెఱుఁగ నెంతయినా

పె.అ.రేకు: 0021-06 సామంతం సం: 15-122

పల్లవి: కత గాదు దృష్ట మిది కలిగె మాకు
సతమంటా నిట్టె ఘొద్దు జరపఁగవలసె

చ. 1: కాయమనేటి మోహినీగజ మెక్కినారము
పాయపుమోహమదము పట్టెను మమ్ము
తీయరాని బందుపు తీగె తెంచివేయ లేము
యేయెడ విజ్ఞాన మిఁక యెఱిఁగేమా మేము

చ. 2: విచ్చల సంసారమునేనిధి దొక్కినారము
పచ్చి మదనభూతము పట్టెను మమ్ము
గచ్చుల యహంకారగర్వము మానఁగ లేము
అచ్చపు మోక్షపుతెరు వచ్చీనా మాకు

చ. 3: రామలరతి కొల్లాపురము చొచ్చినారము
యేమైనా యెగ్గు సిగ్గు లెంచము నేము
శ్రీమంతుఁడై నట్టి శ్రీ వేంకటేశుఁడే నన్ను
యేమరి యుండఁగ మమ్ము యేలినాఁడు వీఁడెవో

పె.అ.రేకు: 0022-01 దేశాక్షి సం: 15-123

పల్లవి: జూడఁగఁ జూడఁగ సుడిగొనె మాయలు
వేడుకతో నిన్ను వెదకే దెపుడో

చ. 1: కడపఁగఁ గడపఁగఁ గాలము గడచెను
జడిసిన వెనకటి జన్మముల
నడవఁగ నడవఁగ నడచె సంసారము
యెడయక హరి నిన్ను యెఱఁగే దెపుడో

చ. 2: కోరఁగఁ గోరఁగఁ గూడె లంపటము
గారవమగు నిజకర్మముల
మేరలు మీఱఁగ మించెను మమతలు
కూరిమి హరి నిన్నుఁ గొలిచే దెపుడో

చ. 3: నిలుపఁగ నిలుపఁగ నిండెను జ్ఞానము
అలరఁగ శ్రీహరి అనుజ్ఞను
యిలలో శ్రీ వేంకటేశ నీమఱఁ
గలరి చొచ్చి కొనియాడితి మిపుడు

పె.అ.రేకు: 0022-02 బౌళి సం: 15-124

పల్లవి: అజ్ఞానజంతువ నేనైతిఁ గాక
సుజ్ఞానమూర్తివి నీవు చూచుట తగవా

చ. 1: కోరితే రావలెఁ గాన కోరనివి రానేల
కోరితిమా దుఃఖములు గోవింద నిన్ను
ఆరయ పాపఫలము లవి యంటివా నీవు
యేరీతి నాత్మవు నీవు యిఁక దోషమున్నదా

చ. 2: అనాథనాథుఁడవు ఆతురబంధుఁడవు
సనాథుఁడను నేను సరి నుండఁగా
వినోద మిది నీకు విశ్వప్రపంచము
మనోధర్మముల నీ మాయ దాఁటఁగలనా

చ. 3: సరి గజదంతపరీక్షలు చూడ నెంతవాఁడ
ధర శ్రీ వేంకటేశుఁడ దాసుఁడ నీకు
గురువు నీ కొప్పగించె కోరి నీకు శరణంటి
నిరతిఁ జేకొంట గాక నేర్పు నేరాలున్నవా

పె.అ.రేకు: 0022-03 ధన్నాసి సం: 15-125

పల్లవి: బ్రహ్మ పూజించే రఘుపతి విభీషణు కిచ్చె
బ్రహ్మణ్యుఁడీ రంగపతిఁ గొలువరో

చ. 1: కావేరి మధ్య రంగక్షేత్ర మల్లదిగో
శ్రీవిమాన మదిగో శేషపర్యంక మిదె
దేవుఁ డల్లదె వాఁడే దేవి శ్రీలక్ష్మి యదె
సేవించరో నాభిఁ జిగురించె నతఁడూ

చ. 2: యేడు గోడలు నవిగో యెసఁగు పూఁదోఁపు లవె
కూడి దామోదరపుర గోపురమదె
తోడ వేయిగంబాల దొడ్డమంటప మదిగో
చూడరో పసిఁడిమించులకంబ మదిగో

చ. 3: ఆళువారలు వారే యంగరంగవిభవ మదే
వాలు శ్రీ వైష్ణవపు వాడ లవిగో
ఆలీల శ్రీ వేంకటేశుఁడై వర మిచ్చిని
తాలిముల శ్రీరంగ దైవముఁ గొలువరో

పె.అ.రేకు: 0022-03 మలహరిసం: 15-126

పల్లవి: పట్టిన వారల భాగ్యమిదే
గుట్టు తెలిసితే గురుతు లివీ

చ. 1: కామధేనువును కల్పవృక్షమును
దామోదర నీ దర్శనము
భూమీశత్వము భువనేశత్వము
సామజవరద నీ శరణ్యము

చ. 2: పరుసవేదియును పరమైశ్వర్యము
హరి నిన్నుఁ గొలిచే అనుభవము
నిరతభోగములు నిధినిధానములు
గరిమ మెఱయు మీ కైంకర్యములూ

చ. 3: నిండు భోగములు నిత్యశోభనము
కొండలయ్య నీ గుణకథలు
అండనె శ్రీ వేంకటాధిప సర్వము
మెండుకొన్న దిదె మీ కరుణా

పె.అ.రేకు: 0022-04 భూపాళం సం: 15-127

పల్లవి: కాయ పండు సేయఁబోతే కడు పులుసే కాక
యేయెడ తీపుగాదు యిటువంటిదే

చ. 1: కోప మెల్లా నొకవంకకూడవేసి మఱికదా
పైపై హరిఁ దలఁప పాత్రుఁ డయ్యేది
కైపు గాక రుచులపై కాంక్షి మాని మఱి కదా
వోపి లోకముల సడ్డ వొల్లకుండేది

చ. 2: పంచేంద్రియముల నెల్ల పారఁదోలి మఱి కదా
వుంచపువిరక్తి కెల్ల వొడి గట్టేది
కొంచెపు కోరికెల్ల కోరకుండి మఱికదా
వంచి హరిదాసులలో వహి కెక్కేదీ

చ. 3: వేవేలు పనులెల్ల విడిచిన మఱికదా
శ్రీవేంకటేశ్వరునిఁ జింతించేది
భావించి యితని దాసపరికరమై కదా
త్రోవ చూచి మోక్షము తుది కెక్కేది

పె.అ.రేకు: 0022-05 దేశాక్షి సం: 15-128

పల్లవి: కాఁపులము నేము నీకు కర్తవు నీవు మాకు
దాపుదండై బదికించి దయఁ జూడవయ్యా

చ. 1: గుట్టున అయిదు ప్రాణాలకు డాగు వెట్టేము
పట్టి దేహముల విడుఁబట్టు లివిగో
అట్టె కర్మములనేటి అరిగోరులు వెట్టేము
నుట్టుకొట్టి జీవులకు నరకము లేలయ్యా

చ. 2: మించిన పితాళ్లకు మేర లేలఁబెట్టేము
పొంచి సంసారములలోఁ గాఁపుర మున్నాము
పంచేంద్రియపు పొలాలపైరు లెల్లాఁ జేసితిమి
అంచె దేహులకెల్ల ఆజ్ఞలేడ వయ్యా

చ. 3: కూరిమి విషయముల కొట్నములు దంచేము
చేరి నీచైతన్యమున సేవసేసేము
యీాతి శ్రీ వేంకటేశ యిటు నీకే దాసులము
ఆరయఁ గాచితివి నీయాధీనులమయ్యా

పె.అ.రేకు: 0023-01 భూపాళం సం: 15-129

పల్లవి: పోయిన బంధము లటు పోవుఁ గాక
చీ యని రోసి యెంగిలి చేకొనేదా

చ. 1: తొల్లి చేసినకర్మాలు తొలఁగఁజేసె గురుఁడు
చెల్లఁబో యింకా నవి సేసేదా
వొల్లక విత్తులు తమ వుముకఁ బాసినమీఁద
మొల్లమిఁ గ్రమ్మఱ నవి మొలచీనా

చ. 2: వెడజాతిధర్మముల వెళ్ల దీనేటిగురుఁడు
ముడిఁగి అందునే మఱి మునిఁగేదా
వొడిసి తొడమ వండి వూడిన ఫలములు
అడరి క్రమ్మర నందు నంటఁబోయీనా

చ. 3: శ్రీ వేంకటేశ్వరునిఁ జేరఁ జూపె గురుఁడు
దావతి యితరులఁ దడవేదా
భావించి పరుసవేది పసిఁడియైన లోహము
వేవేలైన తొల్లిటి విధ మయ్యీనా

పె.అ.రేకు: 0023-02 మలహరిసం: 15-130

పల్లవి: బళి బళి దేవుఁడా బాపు బాపు మాయా
యెలమి యింతేసి సేసి యేమి సేసుకొంటివి

చ. 1: కలిమి యొక్కనికి కడు లేమి యొక్కనికి
యిల నిందరు జీవులే యేల వచ్చెను
బలవంతుఁడొకఁడూ బలహీనుఁడొకఁడూ
మొలపించి భ్రమ నేల ముంచేరు మీరు

చ. 2: వొకచోట రాజసము వొకచోట బంటరికము
అకటా దేహాలు మోచినంతలోననే
పకపక నవ్వులు బయములు వేరెవేరె
సకల జీవులమీఁద చల్లేరు మీరు

చ. 3: శరణు నీకంటేనె జారె నా పాపములు
సరవుల రెండు నీ జగములోన
గరిమ శ్రీ వేంకటేశ కరుణించితివి నన్ను
దరి చేర్చి నీ మాయ దాసుఁడ నేఁగనక

పె.అ.రేకు: 0023-03 దేశాక్షి సం: 15-131

పల్లవి: వేదములే నీ నివాసమట విమలనారసింహా
నాదప్రియ సకలలోకపతి నమో నమో నరసింహా

చ. 1: ఘోరపాతక నిర్హరణా కుటిలదైత్యదమనా
నారాయణ రమాధినాయక నగధర నరసింహా
నీరూపం బింత యంత యని నిజము దెలియరాదు
యీరీతిఁ ద్రివిక్రమాకృతి నేచితి నరసింహా

చ. 2: గోవిందా గుణగుణరహితా కోటిసూర్యతేజా
శ్రీ వల్లభ పురాణపురుషా శితనఖ నరసింహా
దేవ మిము బ్రహ్మాదులకును తెలియ నలవిగాదు
భావించఁగ ప్రహ్లాదు నెదుటఁ బరగితి నరసింహా

చ. 3: దానపరికరసులభ తపనచంద్రనేతా
వాసవరసురముఖముని సేవిత వందిత నరసింహా
భాసురముగ శ్రీ వేంకట గిరిఁ బాయనిదైవము వటుగానా
వోసర కిపు డేగితి విట్ల నహోబల నరసింహా

పె.అ.రేకు: 0023-04 నాట సం: 15-132

పల్లవి: చేరి మొక్కరో నరులు శ్రీమంతుఁడీతఁడు
కోరి వరము లిచ్చు కొండవంటి సింహము

చ. 1: గద్దెమీఁదఁ గూరుచుండి కనకకసిపుఁ జెండీ
గద్దరి ప్రహ్లాదునిపై కరుణనిండీ
వొద్దనె మారుగొండల వువిదయుఁ దాను నుండీ
తిద్దుకొనె మీసాలు దివ్యనారసింహుఁడు

చ. 2: భవనాశిదరి దొక్కి బ్రహ్మాదులలోన నిక్కి
తివిరి ప్రతాపమున దిక్కుల కెక్కి
రవళి నారదాదుల రంగుపాటలకుఁ జొక్కి
చెవు లాలించీ నుతులు శ్రీనారసింహుఁడు

చ. 3: అదె కంబములోఁ బుట్టి ఆయుధాలు చేతఁ బట్టి
వెదకి అహోబలాన వేడుకఁ బుట్టి
కదిసి శ్రీ వేంకటాద్రికాంతలలో గుంపుగట్టి
వెదచల్లు మహిమల వీరనారసింహుఁడు

పె.అ.రేకు: 0023-05 సామంతం సం: 15-133

పల్లవి: అందులోనె వున్నవాఁడు ఆదిమూరితి
అందరాని పదవియైన నందిచ్చు నతఁడు

చ. 1: ఘను లిండ్ల వాకిళ్ళు కావఁ బొయ్యే జీవుఁడా
కని నీ యాత్మ వాకిలి కావరాదా
యెనసి పరులరాజ్య మేలఁబొయ్యే జీవుఁడా
అనిశము నీ మనోరాజ్యము నేలరాదా

చ. 2: చెలుల రూపము లెల్ల చింతించే జీవుఁడా
చెలఁగి నీ రూప మేదో చింతించ రాదా
కెలన సుఖములు భోగించేటి జీవుఁడౌ
పొలసి సుజ్ఞానము భోగించరాదా

చ. 3: చేవ సంసారాన బలిసిన యట్టి జీవుఁడా
భావపుటానందాన బలియరాదా
కోవరపు సంపదల కోరేటి జీవుఁడా
శ్రీ వేంకటేశుని సేవ గోరరాదా

పె.అ.రేకు: 0023-06 సాళంగనాట సం: 15-134

పల్లవి: శరణంటేఁ జాలు సర్వేశ్వరునికి
అరయ నిందరిఁ గొట్టి అర్జునుఁ గావఁడా

చ. 1: చేతెఁడు దవ్వే సుఁడీ చేరి మొక్కేవారి కెల్ల
రాతిరిఁ బగలు హరి రక్షించేచోటు
కాతరాన జీవులాల కానలేరు నమ్మలేరు
ఘాతతో శిశువునకై కంబములో వెళ్లఁడా

చ. 2: కూఁతవెట్టు దవ్వే సుఁడీ కోరి పిలువ నేర్చితే
బాఁతి హరినామముండి పాలించేచోటు
లోఁతు గాదు వాఁతు గాదు లోలోన శ్రీపతిపేరు
నాతి మొరాలించి యీతఁడు నాఁడు గావఁడా

చ. 3: కనుచూపు దవ్వే సుఁడీ కప్పి శ్రీ వేంకటపతి
మనసులో అందరిని మన్నించేచోటు
ననిచి యేడనుండి ధ్యానము సేసికొనినాను
వనజాక్షుఁ డీతఁడే పో వరము లొసఁగఁడా

పె.అ.రేకు: 0024-01 శంకరాభరణం సం: 15-135

పల్లవి: కోరి ధర్మము చాలు కుక్కఁబట్టు మన్నరీతి
యీరీతి నింత సేసితి వింత చాలదా

చ. 1: చక్కఁగా నన్నొక హీనజంతువుఁగాఁ బుట్టించక
యెక్కువ నరునిఁ జేసి తింత చాలదా
దిక్కుల నిది చాలక దివ్యభోగముగోర
అక్కర నా కొక ఆసోదమా

చ. 2: పాతకాలు సేసేటి పరుల బంటుఁ జేయక
యీతల నీ బంటుఁ జేసి తిది చాలదా
ఆతల నీవద్ది సనకాదుల పదవి గోర
ఆతుమలో నా కొక ఆసోదమా

చ. 3: నరక మనుభవించ నన్ను నందు నిలుపక
యిరవై యిహ మిచ్చి తిది చాలదా
ధర శ్రీ వేంకటపతి తగ నీకు శరణంటి
పరము గోరను యింకా నప్పటి నాసోదమా

పె.అ.రేకు: 0024-02 సామంతం సం: 15-136

పల్లవి: తాముఁ దెలియరూ తగఁ జెప్పిన వినరూ
పామరపుఁ దమ కర్మఫలమో హరిమాయయో

చ. 1: చీఁకటిఁ బెడబాపేటి చేరువ సూర్యోదయము
చీకటి కూబలకైతే చిమ్మి రేఁచును
యాఁకటతో విజ్ఞానము నందిచ్చే శ్రీ హరిభక్తి
కాఁకల దుర్మార్గులకుఁ గాన నీదూ

చ. 2: అందరు రుచిగొనేటి అన్నము బహురోగికి
కందువ నజీర్ణమై కారించును
యెందును శ్రీహరి దైవ మెక్కుడన్న చదువులు
మందమైన జడునికి మఱఁగులై తోఁచును

చ. 3: ధరఁ గొందరు మూర్ఖులు తగ నొక్కరాజుఁ గొల్చి
పరిచారకునిఁ దిట్టి భంగ పడ్డట్టు
యిరవుగ శ్రీ వేంకటేశుఁ గొల్చి వారివారి
విరసాలాడుచుఁ దామె విఫలులై పోదురు

పె.అ.రేకు: 0024-03 సామంతం సం: 15-137

పల్లవి: భోగము నాయందు నీకు భోగివి నీవు
శ్రీగురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును

చ. 1: చక్కని జన్మపు సంసారవృక్షమునకు
పక్కున ఫలము నీవు భావించఁగా
మక్కువ కర్మమనేటి మత్తగజమునకును
యెక్కువ మావటీఁడవు యెంచఁగ నీవు

చ. 2: నెట్టన దేహమనేటి నిర్మల రాజ్యమునకు
పట్టమేలు చుండిన భూపతివి నీవే
దిట్టయిన మనసనేటి తేజి గుఱ్ఱమునకు
వొట్టిన రేవంతుఁడవు వుపమింప నీవు

చ. 3: సంతసమైన భక్తి చంద్రోదయమునకు
రంతులఁ జెలఁగు సముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనే మేడలోన
అంతర్యామివి నీవు అంకెల జూడఁగను

పె.అ.రేకు: 0024-04 శ్రీరాగం సం: 15-138

పల్లవి: శ్రీపతియె రక్షించుఁ గాక మరి
యేపున జంతువుల మే మెఱుఁగుదుము

చ. 1: జలధుల లోఁతును హరి భువి వేఁగుసు
అలరించిన శ్రీహరి యెఱుఁగు
పొలసిన జ్ఞానము పుణ్యపాపములు
యిలపై జీవుల మే మెఱుఁగుదుము

చ. 2: అనలము తేజము నాకసము విరివి
అనిశము నారాయణుఁ డెఱుఁగు
మునుకొన్న కాలము మొదలి జన్మములు
యెనయఁగఁ బ్రాణుల మే మెఱుఁగుదుము

చ. 3: విసరే గాలియు విశ్వములోపలి
పస శ్రీ వేంకటపతి యెఱుఁగు
సుసరివై శరణము చొచ్చుట యతనికి
యెసఁగిన దేహుల మే మెఱుఁగుదుము

పె.అ.రేకు: 0024-05 పాడి సం: 15-139

పల్లవి: ఎవ్వ రేమి సాదించే రెవ్వరు నే మెఱిఁగేరు
అవ్వల నివ్వల శ్రీహరియే దైవము

చ. 1: జగములోపల హరి సాత్విక దైవమని
భృగువె సోదించినాఁడు పృధివిఁ దొల్లె
ముగురువేలుపులలో మొరవెట్టిరితనికె
జిగి మించ దేవతలు క్షీరాబ్ధికాడనే

చ. 2: ధరఁ గాశిలోన హరి తారకబ్రహ్మమని
హరుఁడే బోధించఁ జొచ్చె నందరికిని
అరుదుగా రామనామ మతని పట్టపురాణి
గిరిసుత పార్వతి కీర్తింపఁ దొడఁగే

చ. 3: అదిగో శ్రీ వేంకటాద్రి హరి పరతత్త్వమని
యెదుటనె బ్రహ్మ పుట్టె యితని నాభిని
యిదిగో మన మిందర మతనినే కొల్చి
బ్రదుకుద మిటు రారో ప్రాణులాల మీరు

పె.అ.రేకు: 0024-06 గౌళ సం: 15-140

పల్లవి: వోవో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో

చ. 1: జగములో రాముఁడై జనియించె విష్ణుఁ డిదె
అగపడి లక్ష్మి సీత యయి పుట్టెను
తగు శేషశంఖచక్ర దైవసాధనము లెల్ల
తగిలి లక్ష్మణ భరత శతృఘ్నులయిరి

చ. 2: సురలు వానరు లైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగి రుద్రుఁడు హనుమంతుఁడాయెను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁ డైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి

చ. 3: కట్టిరి సేతు వప్పుడే ఘను లెల్లా దాఁటిరి
ముట్టిరి లంకా నగరము దళము
అట్టి శ్రీ వేంకటేశుఁ డాతఁడే యీతఁడై
వొట్టుచు వరము లిచ్చె వొనర దాసులకు

పె.అ.రేకు: 0025-01 లలిత సం: 15-141

పల్లవి: కానని యజ్ఞానులాల కర్మజాతులాల మీరు
మానక కర్మములు సేసి మాయఁ జిక్కవలెనా

చ. 1: తపము సేసితమంటా దాఁటరాని గర్వ మేల
తపము రావణాదులు తగఁ జేయరా
అపురూపమైన నారాయణనామ ముచ్చరించే
ప్రపన్నులతోడి సరియా బ్రహ్మాదులు

చ. 2: మహిలోఁ బుణ్యములంటా మదియించగ మీ కేల
మహిలోఁ బుణ్యులు గారా నహుషాదులు
సహజపుద్వయానుసంధాన పరులైన
వహి కేక్కే వైష్ణవులవంటివారా సురలూ

చ. 3: అందేము స్వర్గలోకమంటా రాజస మేల
అందఁడా స్వర్గము నరకాసురుఁడు
చందపు శ్రీ వేంకటేశు చక్రలాంఛనులతో
పొంది జీవన్ముక్తులకు పురుఁడా సోమపులు

పె.అ.రేకు: 0025-02 పాడి సం: 15-142

పల్లవి: వేరొక్కరూ లేరు విశ్వ మింతా నీమహిమే
యేరీతి నీవే కలవు యితరములేదు

చ. 1: తల్లివై రక్షింతువు తండ్రివై పోషింతువు
యిల్లాలివై మోహమిత్తువు నాకు
వొళ్లై పెరుగుదువు వొగిఁ బురాకృత మౌదు
యిల్లు ముంగిలై వుందువింతా నీ మహిమే

చ. 2: గురుఁడవై బోధింతువు కొడుకవై యీడేర్తువు
అరుదై నిధానము వౌదు నీవే
దొరవై నన్నేలుదువు దూతవై పని సేతువు
యిరవైన సిరు లిత్తు వింతా నీ మహిమే

చ. 3: దేవుఁడవై పూజ గొందు దిక్కు ప్రాణ మౌదువు
కావలసిన ట్టౌదు కామించినట్లు
శ్రీ వేంకటేశ నీవే చిత్తములోపల నుండి
యీవల వైకుంఠ మిత్తు వింతా నీమహిమే

పె.అ.రేకు: 0025-03 ముఖారి సం: 15-143

పల్లవి: ఎక్కువ తక్కువ లేవి యిందరిలోపల నేను
చిక్కి హరి నీవు పెద్ద సేసితివి గాక

చ. 1: తెలియ నిందరివంటి దేహమే యిది గాదా
పొలసి దొరతనము పొదిగీఁ గాక
మలమూత్రములు రక్తమాంసము లొక్కటె కావా
కలిమి లేములు ముందు కాననియ్యవు గాక

చ. 2: చేపట్టి యిందరివంటి జీవుఁడ నేఁ గానా
పాపపుణ్యములు నన్ను బరచీఁ గాక
యేపొద్దు లోకములోని యింద్రియము లివే కావా
తీపులు మరపి నన్ను దిమ్మరేఁచీఁ గాక

చ. 3: కైకొని యిందరివంటి కర్మమే సేయఁగఁ గాదా
యీకడ సంపదలు నన్నేఁ బంచీఁ గాక
పైకొని శ్రీవేంకటేశ భక్తి యొక్కటె కాదా
యేకడనైనా నన్ను యీడేర్చుఁ గాకా

పె.అ.రేకు: 0025-04 భూపాళం సం: 15-144

పల్లవి: సర్వశక్తివి నీవే సకల లోకేశ్వరా
నిర్వహించి నన్ను రక్షించఁగ నీవే

చ. 1: తండ్రిపైఁ జేసిన భక్తి దైవమా నీకే శెలవు
తండ్రికి తండ్రివి నీ వంతర్యామివి
మండ్రాడి తల్లిపైఁ జేసే మచ్చి కెల్లా నీది
నిండ్రుఁ దల్లిలో వాఁడవు నీవె కనక

చ. 2: పెండ్లాముపై జేసిను ప్రేమ లెల్లా నీ సొమ్మే
పెండ్లాములో భావన నీ పెంపే కనక
వెండ్లకై బంగారులకై వెలసే తపసు నీదె
యిండ్లిండ సంపదలు నీ వింతాఁ గనక

చ. 3: కిమ్ముల దేహానకు భోగించిన బోగము నీదె
నెమ్మది నంతర్యామివి నీవు గనక
యిమ్ముల శ్రీ వేంకటేశ యిన్నియు విన్నవించితి
కమ్మి నా కన్నిటికీ కర్తవు నీవే కాన

పె.అ.రేకు: 0025-05 మలరి సం: 15-145

పల్లవి: హరిదాసుఁ డగుటే యది తపము
పరమార్గములను ఫలమే లేదు

చ. 1: తిట్టినయప్పుడు దీవించినప్పుడు
అట్టె సమ మగునది తపము
వెట్టి నేమములు వేవేలు సేసిన
బట్ట బయలే కాని ఫలమే లేదు

చ. 2: యిచ్చినయప్పుడు యియ్యనియప్పుడు
అచ్చుగ నవ్విన దది తపము
యిచ్చలఁ బుణ్యము లెన్ని సేసినా
బచ్చన లింతే ఫలమే లేదు

చ. 3: కూడినయప్పుడు గొణగినయప్పుడు
ఆడిక విడిచిన యది తపము
యీడనె శ్రీ వేంకటేశుఁడే శరణము
పాడి పంతముల ఫలమే లేదు

 పె.అ.రేకు: 0025-06 దేశాక్షి సం: 15-146

పల్లవి: సులభము యిదియే చూచిన దుర్లభ మిదే
అలరు సుజ్ఞానులకు అజ్ఞానులకు

చ. 1: తీఋఁ గొన్నాళ్ళకు తెగిన దానఫలము
తీఋవు హరిదాసుల దివ్యభోగాలు
జాఋఁ గొన్నాళ్ళకు సకల దేవత్వములు
జాఋదు వైకుంఠుని సాలోక్య మోక్షము

చ. 2: యింతింతనఁగవచ్చు నింద్రాదుల సంపదలు
యింతనరాదు నీ దాసుల యీ మహామహిమ
పంతాన సాధించవచ్చు బహుకర్మతపములు
యెంతైన సాధించరాదు యీ హరిభక్తి

చ. 3: వుండు తామస గుణము లొక్కొక్క సమయములు
వుండవు శ్రీవైష్ణవులవద్ద నెన్నఁడు
అండనె శ్రీ వేంకటేశుఁ డన్ని మాయలుఁ జూపు
నిండు తనదాసులకు నిజమాయె మాకు

పె.అ.రేకు: 0026-01 శ్రీరాగం సం: 15-147

పల్లవి: అదియెపో శ్రీహరినామము
తుదిపద మిదియె ధృవమై కలిగె

చ. 1: తొడరి చిత్రకేతుఁడే నామము
తడవి లోకమంతయు గెలిచె
విడువక బ్రహ్మయు వెస నే నామము
బడిబడి నుడుగుచు ప్రభుడై నిలిచె

చ. 2: హరుఁడే నామము అదె తారకముగ
నిరతిఁ దడవి యెన్నిక మీఱె
ధర నేనామము దలఁచి నారదుఁడు
సురమునియై సంస్తుతులకు నెక్కె

చ. 3: ధృవుఁడేనామము దొరకొని నుతియించి
ధృవపట్టంబున తుద బ్రదికె
జవళి శ్రీ వేంకటేశ్వరుదాసు లెల్లాను
భువి నేనామము భోగించి మనిరి

పె.అ.రేకు: 0026-02 దేశాక్షి సం: 15-148

పల్లవి: ఇద్దరు దేహసంబంధ మిదిగో మాయ
గద్దించి యేడ నుండునో కడసారి తాను

చ. 1: తోడఁ బుట్టిన మమత తొడఁగి కొన్నాళ్లకు
వాడిక పుత్రులమీఁదవలె నుండదూ
వేడుక వారెవ్వరొ వీరెవ్వరొ కాని
కూడ పెట్టి వీరికి కొట్లాడి వారికి

చ. 2: తల్లిమీఁదఁ గల భక్తి తనకె కొన్నాళ్లకు
యిల్లాలిమీఁదవలె యింత వుండదు
వెల్లిలిరి నిది గొంత విచారించనిది గొంత
యిల్లు ముంగి లొక్కరిది యెరవు వొక్కరిది

చ. 3: నీతితో శ్రీ వేంకటేశు నిత్యసేవ కొన్నాళ్లకు
యీతల సంసారమెంత యితవు గాదు
ఆతఁ డెట్టు యిదియెట్టు అందరూ నెఱిఁగినదె
చేతులొక్కరియందు చిత్త మొక్కరియందు

పె.అ.రేకు: 0026-03 సామంతం సం: 15-149

పల్లవి: కాదని వేరే సేయఁగలవాఁడా తాను
సాదువలె నుండుఁగాక స్వతంత్రుఁడా తాను

చ. 1: దైవము పై భారము తనపైఁ బెట్టు కోనేల
మోవలేక సంసారాన ములుగనేల
జీవుఁడై పుట్టితే నేమి శ్రీపతి నీవాఁడ నని
సేవ సేయుచుండఁగానే చేరి కాచీ నతఁడే

చ. 2: యేలిక గూచుండే గద్దె యెక్కఁ దన కది యేల
వీలి అపరాధనకు వెఱవ నేల
ఆలు బిడ్డలకు గుటి యవుటకు హరిఁజేరి
కాలము గోరుకుండఁగ కరుణించీ నతఁడే

చ. 3: శ్రీ వేంకటేశు మాయకు చేరి యడ్డాలు రానేల
తోవ గానక యాతని దూఱఁగ నేల
శ్రీవైష్ణవుఁ డవుటకు చిత్తములో విష్ణు నమ్మి
భావించు కొనఁగా దయ పాలించీ నతఁడే

పె.అ.రేకు:	0026-04	పాడి	సం:	15-150

పల్లవి: ఎంత లేదు లోకము యెచ్చేది కుందేది
పంతపు శ్రీహరిభక్తి పట్టవలెఁగాక

చ. 1: తనువులు మోచేది ధనములు దాఁచేది
ఘనజీవులకు నెల్లఁ గలిగినది
మనసులు రోసేది మమతలఁ బాసేది
వనజాక్షుఁ గొలిచేది వలె నింతె కాక

చ. 2: కాఁపురాలు సేసేది కపటాల లాసేది
తాపపు జీవుల కెల్లాఁ దగిలినదె
కోపములఁ దుంచేది కోరికలఁ దెంచేది
శ్రీపతి కరుణలోనఁ జిక్కవలెఁగాక

చ. 3: ఆఁకటికి బడలేది అన్నములు గొనియేది
తేఁకువ జీవుల కెల్ల ద్రిష్టమైనదె
యేఁకటతో శ్రీవేంకటేశ్వరు శరణని
కాఁకదేర సుఖియించఁగా వలెఁగాక

పె.అ.రేకు: 0026-05 పాడి సం: 15-151

పల్లవి: వేగిర మేఁటికిని వేసట లేఁటికని విష్ణుని సొలయఁగ నేల
సాగిలి మొక్క నతఁడు మన్ననలు జరపినపాటి జరపీఁగాక

చ. 1: తనవేలే తనకన్ను దాఁకినను తాన నెవ్వనిఁ గోపించీని
తనకర్మమే తన్నుఁ జేయఁగదైవము దూరఁగ నేల
అనుభవింపుచును హరినే కొలచిన అలమట లన్నియు హరిచూచి
పొనుఁగక తమలో దుర్దోషంబులు పొమ్మనపుడే పోయీఁగాక

చ. 2: కడుపులోపలికి మింగినరత్నము కడుచోట్ల వెదకిఁగ నేల
బడిఁ దన యంతర్యామి దా మఱచి పలువేల్పులఁ గొలువఁగ నేల
విడువక శ్రీపతినామమంత్రమే వేడుకఁ దలఁచఁగఁ దలఁచఁగను
చెడకుండా నతఁడు పావనము సేసినప్పుడే సేసీఁగాక

చ. 3: కర్మము నతఁడే కార్యము నతఁడే కడఁగిన శ్రీ వేంకటవిభుఁడూ
నిర్మించినట్లవు నిన్నియు మరి నేఁ డనుమానము లేల
ధర్మం బితనికి యేకాలంబున దాసుల రక్షించే బిరుదు
అర్మిలి యితనిఁ గొలిచినఁ జాలునుఅందని పదవులు నందీఁగాక

పె.అ.రేకు: 0026-06 గుజ్జరి సం: 15-152

పల్లవి: ఏమి సేయుదును నే నేమి సేయుదును
స్వామిదోహమె జరగీని

చ. 1: నీ యాధీనమై నెగడిన యాత్మకు
నీ యందె బుద్ది నిలువదు
కాయపుటింద్రియ కల్పిత దేహము
కాయపు విషయాలె కడుఁ గోరీని

చ. 2: నీ సంకల్పమున నెగడిన జగ మిది
నీ సేవారతి నేరదు
ఆసల నీ మాయ నంటిన మన సిది
ఆసలాసలనే అలసీని

చ. 3: హరి నీవే నాలోన నణచిన జ్ఞానము
హరి నీవె చూపక అందదూ
సిరుల నా పాలిటి శ్రీ వేంకటేశ్వర
కరుణానిధి నన్నుఁ గావవే

పె.అ.రేకు: 0027-01 శంకరాభరణం సం: 15-153

పల్లవి: ఇందు నందు నెంచ భేద మెంతైనఁ గలదు
చిందరవందరగాక చేతికి లో నయ్యీనా

చ. 1: దేవునిఁ గొలుచువాఁడు దేవునికి కొఱగాక
యీవల సంసారుల కేమి బాఁతి
కావరపు మనుజుల కని కొలిచేవారికి
దైవికము విచారించ తలఁ పున్నదా

చ. 2: పరము గోరేటివాఁడు పరమునకె కొఱగా
కిరవై యింద్రియముల కేమి బాఁతి
వొరసి భోగములలో నోలలాడే వానికి
అరిది మోక్షసుఖము లాసపడనున్నదా

చ. 3: పనిగొన్న భక్తివాఁడు భక్తికి కొఱగాక
యెనసి కర్మవిధుల కేమి బాఁతి
మని శ్రీవేంకటేశు మాయఁ జిక్కిన వానికి
తనిసి భవబంధముల దాఁటఁగఁ జోటున్నదా

పె.అ.రేకు: 0027-02 శంకరాభరణం సం: 15-154

పల్లవి: ఎఱుగుకోలేని జీవి యెడ్డగాక
గుటి నెంతయినాఁ గోఁతికొమ్ము దప్పఁ బారునా

చ. 1: దగ్గర నుండిన మాయఁ దలపించుఁ గాని మది
తగ్గి దవ్వుల జ్ఞానము తడవనీదు
కగ్గు లేక గుల్ల గుల్లె కాక మరి రాయవునా
అగ్గమై తవుడుదిండి కడబాల లేల

చ. 2: మక్కువ భోగములనే మరిగించుఁ గాని మేను
అక్కజపు వైరాగ్య మంద నియ్యదు
చిక్కి విత్తొకటి వెట్ట చెట్టొకటి మొలచునా
అక్కర చానపి చవి అడుగ నేమున్నది

చ. 3: శ్రీ వేంకటేశు పంపున చిక్కించుఁ గాని కర్మము
దావతి ఆతని యాజ్ఞ దాఁట నియ్యదు
భావింప కాయ పండేలౌ పండు కాయయేలవును
వావిరి ముందికి మరివాడి వెట్టవలెనా

పె.అ.రేకు: 0027-03 భూపాళం సం: 15-155

పల్లవి: వట్టి లంపటము వదల నేరదు గాన
పుట్టించిన హరి బుద్ధిలోనె కాఁడా

చ. 1: దేహాభిమానములు తెగి విడిచినఁ గాని
యీహల దేవుఁడు తన్ను నేల మెచ్చీనీ
సాహసించి కోరికెల సంగము మానకుండితే
వోహో పరమపద మూర కేల కలుగు

చ. 2: నిచ్చలును వైరాగ్యనిష్ఠుడు గాకుండితేను
యెచ్చిన జన్మాదు లెల్ల యేల కడచు
కొచ్చి కొచ్చి తనలోని కోపముడుగ కుండితే
అచ్చపు బ్రహ్మానంద మది యేల కలుగు

చ. 3: శ్రీ వేంకటాద్రి మీఁది శ్రీపతిఁ గొల్వకుండితే
సోవల నా దేవుఁ డిట్టె సులభుఁడవునా
భావించి తనలోని భక్తి నిలుపకుండితే
తావుల నన్నిటాను సంతత పుణ్యుఁ డవునా

పె.అ.రేకు: 0027-04 సాళంగనాట సం: 15-156

పల్లవి: ఈతని కెదురు లేరు యెక్కడ చూచిన నిదె
చేతనే ప్రతాపముతో చెలరేఁగీ నితఁడు

చ. 1: దిక్కులు సాధించుటకు దేవదేవోత్తముఁ డదె
యెక్కెను తేరుమీఁద యెచ్చరికతో
చక్కాడి దనుజులను సమరములు గెలిచి
యిక్కువతో వీధి వీధి నేఁగీ నిదిగో

చ. 2: సకలాయుధములునుఁ జక్రము చేతులఁ బట్టి
వెకలియై శంఖము వేవేగ నాడించె
వికలులై రాక్షసులు వీఁగి లోఁగి హతులైరి
అకలంకుఁ డీ హరి అన్నిటాను మించెను

చ. 3: విజయధ్వజము నదె వీఁడె శ్రీవేంకటేశుఁడు
భజన నలమేలుమంగ పలుమారు మెచ్చె నదె
త్రిజగములు నితఁడె దిక్కై కాచీ నిదె
గజబిజ లింక నుడుగరో రాక్షసులు

పె.అ.రేకు: 0027-05 మలహరిసం: 15-157

పల్లవి: వాదము లేఁటికి వలసిన వారికి
వేదము గలుగఁగ వెల్లివిరాయ

చ. 1: దైవం బొకఁడె తత్త్వ జ్ఞానికి
భావింపఁ బలువురు భ్రాంతునికి
వేవేలకు మరి విత్తు వొక్కటే ఆది
కావఁగఁ బూవఁగ ఘనమైనట్లు

చ. 2: భువి సాకారము పూర్ణ జ్ఞానికి
ఆవల నిరవయవ మధమునికి
అవళు గలిగికా అష్టపుత్రులును
భవములు శ్రీహరిపాలనె కలిగె

చ. 3: శరణాగతియే శాస్త్రజ్ఞానికి
సరవిఁ గర్మమె జడునికిని
నిరతి శ్రీవేంకటనిలయు మాయ లివి
యిర వెఱుఁగు వారి కిహమే పరము

పె.అ.రేకు: 0027-06 బౌళి సం: 15-158

పల్లవి: అనుచు రావణుసేన లటు భ్రమయుచు వీఁగె
యినకులచంద్ర నేఁ డిదిగో నీమహిమ

చ. 1: దదదద దదదద దశరథ తనయా
కదిసితిఁ గకకక కావవే
అదె వచ్చె బాణాలు హా నాథ హా నాథ
పదపద పదపద పారరో పవుంజులూ

చ. 2: మమమమ్మ మమమమ్మ మన్నించుఁడు కపులార
సమరాన చచచచ్చు చావకుండా
మెమెమెమ్మె మెమెమెమ్మె మేము నీ వారమె
మొమొమొమ్మొ మొమొమొమ్మొ మొక్కేము మీకు

చ. 3: తెతెతెత్తె తెతెతెత్తె తెరు వేది లంకకు
తతతత్త తలమని దాఁగుదురూ
గతియైన శ్రీ వేంకటగిరి రఘునాథ
సతమై మమ్మింక నేలు జయ జయ నీకు

పె.అ.రేకు: 0028-01 బౌళి సం: 15-159

పల్లవి: విదురుని విందా విజయీభవ
హృదయేశ్వర విజయీభవ

చ. 1: దైవశిఖామణి దానవమర్ధన
వేవేలకు నీకు విజయీభవ
శ్రీ వల్లభగుణ చింతాసాగర
యీవల నిదె విజయీ భవ

చ. 2: జగదేకవిభుఁడ శతమఖవందిత
వెగటు విజయముల విజయీ భవ
నిగమవినుత సర్వనిలయ నారాయణ
యిగిరించెఁ గృప విజయీ భవ

చ. 3: జలధిమథన సర్వజంతువిహారక
వెలసె నీ మహిమలు విజయీ భవ
కలిత శ్రీ వేంకట కామితవరద నిత్య
యిలధర నీకు విజయీ భవ

పె.అ.రేకు: 0028-02 సాళంగనాట సం: 15-160

పల్లవి: నమామ్యహం మానవసింహం
ప్రమదాఁ క మహోబల నరసింహం

చ. 1: దానవదైత్య విదారణసింహం
నానాయుధకర నరసింహం
భూనభోంతరాపూరిత సింహం
ఆనన వహ్నిలయాంతక సింహం

చ. 2: ప్రళయ నృసింహం బహు ముఖ సింహం
సలలిత గరుడాచల సింహం
కులిశనఖర ముఖ ఘోషిత సింహం
తిలకిత బహురవి దీపిత సింహం

చ. 3: శాంత నృసింహం శౌర్య నృసింహం
సంతత కరుణాజయ సింహం
కాంతం శ్రీ వేంకటగిరి సింహం
చింతతఘన సంసిద్ధి నృసింహం

పె.అ.రేకు: 0028-03 భూపాళం సం: 15-161

పల్లవి: హరి విశ్వాత్మకుఁడు అందరిలో నున్న వాఁడు
దరిసించి బ్రదుకరో తప్పు లేదు యింకను

చ. 1: దారుపాషాణములందు దైవముగా భావించి
కూరిమితో మీకు మీకె కొలిచేవారా
చేరి ప్రాణప్రతిష్టలు సేసేనాఁడు దేవుఁడే
కోరిక వైష్ణవులందు కొలువరో మీరు

చ. 2: వేదపురాణార్థమందు విశ్వాసము వెట్టుకొని
సోదించి తెలుసుకొనే సుగుడులాల
వేదమె మాటలుగాను వివరించే వైష్ణవులు
ఆదిగురువులు వీరి నడుగరో మీరు

చ. 3: దేవుఁడె పెక్కురూపులై తేరి యెదుట నుండఁగా
ఆవల వెదకఁబొయ్యే ఆసక్తులాల
శ్రీ వేంకటేశుఁడె మతిఁ జిక్కినాఁడు దాసులకు
తావుకొని హరినాత్మఁ దలఁచరో మీరు

పె.అ.రేకు: 0028-04 శంకరాభరణం సం: 15-162

పల్లవి: తమవుద్యోగము లేల తమకము లేల
సముద్డై పుణ్యపాపాలు సాధించనేరఁడా

చ. 1: పుట్టించ నేర్చిన హరి పూఁచి రక్షింప నేరఁడా
వట్టి చింతతో జీవులు వగవ నేల
జట్టిగొని పదునాల్గు జగము లేలెడి వాఁడు
గట్టిగా నందరిఁ దానె కావ నేరఁడా

చ. 2: అంతరాత్మైనవాఁడు అన్నియుఁదా నేరఁడా
వింతలుగా వేరె విన్నవించ నేల
సంతతమై గుణములు జవకట్టినట్టివాఁడు
కొంతనేర్పు నేరాలు కోరి తిద్ద నేరఁడా

చ. 3: యేలికై దాసులనెల్ల యేల నేర్చినవాఁడు
యీలీల సంపదలెల్ల యియ్య నేరఁడా
వాలించి శ్రీవేంకటాద్రి ప్రత్యక్షమయినవాఁడు
సోలిఁ దన మహిమలు చూప నేరఁడా

పె.అ.రేకు: 0028-05 రామక్రియ సం: 15-163

పల్లవి: చేతులెత్తి మొక్కరో జీవకోట్లాల యిదె
యీతలాతల నిండిరిదె నారదాదులు

చ. 1: దిక్కులు సాధించ హరి తిరుతే రెక్కఁగాను
యిక్కడ రతికెక్కిరి యింద్రాదులు
వెక్కసపు శార్ఙము వెస చేతఁ బట్టఁ గాను
పక్కున గుండె వట్టిరి బ్రహ్మాదులు

చ. 2: యెడమచేత శంఖ మెత్తినప్పుడు వేదము
కడఁగి మొదలెత్తిరి గౌతమాదులు
కుడిచేతి చక్రము గక్కున మెఱిపించఁగాను
సుడిసియు మెఱసేరు సూర్యచంద్రాదులు

చ. 3: లలి శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగయుఁ బెండ్లి
నలరఁగ నమరిరి అమరాదులు
వెలయ నితఁ డింతట విశ్వరూపము చూపఁగ
సలిగఁ బొడచూపిరి సనకాదులు

పె.అ.రేకు: 0028-06 భూపాళం సం: 15-164

పల్లవి: నీదాఁక వలెనా నిఖిలము వారికెల్ల
ఆది నీ దాసుఁడె చాలు నందరి రక్షించ

చ. 1: నీ పాదమూలముల నిలిచిన జలములు
మోపుగా మోఁచె రుద్రుఁడు ముందు ముందె
కాపాడు నీ నామమునఁ గలిగిన మహిమచే
పై పై మునులు యిహపరములు గనిరి

చ. 2: పండేటి పాలవెల్లి నీ ప్రసాదమునఁ గాదె
దండిగా దేవతలెల్లా ధన్యులైరి
అండనె నీ సాకార మాతుమఁ దలఁచి గాదె
నిండిన యోగీంద్రులు నిత్యముక్తు లైరి

చ. 3: చేరి నీ విహారమైన శ్రీ వేంకటాద్రి గాదె
కోరివరము లందరు కొల్లగొనిరి
ఆరీతిఁ దాళ్లపాక అన్నమయ్య ఘనుఁడాయ
వారివారమైన నేము వహికి నెక్కితిమి

పె.అ.రేకు: 0029-01 గుజ్జరి సం: 15-165

పల్లవి: కరుణానిధివిగాఁగ కాచేవు గాక
యిరవై నావంటివాని కిది యసంగతము

చ. 1: నేర నే పుణ్యము సేయ నిత్యానిత్య మెఱఁగి
నేరుతు రిత్తచేతుల నీకు మొక్కేది
యేరీతిఁ బరమిచ్చేవొ యేమి గలదు నాయందు
కారణములేని యీవి కడు నసంగతము

చ. 2: లేదు విజ్ఞానము గొంత లేశమైన నాయందు
సాదించఁ గద్దొకటి మీ శరణనేది
ఆదిగొని నన్నుఁ బాయ వంతరాత్మవై నీవు
వీదరవెల్లి పొందులు విన నసంగతము

చ. 3: కాను నే నరుహుఁడను కదిసి పనులకు
నే నవుదు నొకటికి నిన్నుఁ బాడను
యీ నెపాన శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
దానికిఁ దగ్గంతె కాక దాఁట నసంగతము

పె.అ.రేకు: 0029-02 శంకరాభరణం సం: 15-166

పల్లవి: ఇదియె నాకు మత మిది వ్రతము
వుదుట్ల కర్మము వొల్లా నిఁకను

చ. 1: నిపుణత హరి నే నిను శరణునుటె
తపములు జపములు ధర్మములు
నేపమున సకలము నీవే చేకొను
వుపమల పుణ్యము లొల్లా నే యింకను

చ. 2: హరి నీ దాసుఁడ నను కొనుటే నా
పరమును యిహమును భాగ్యమును
ధర నీ మాయల తప్పుఁదెరువులను
వొరగి సుకృతము లొల్లా నే యింకను

చ. 3: నారాయణ నీ నామము దలఁచుట
సారపుఁ జదువులు శాస్త్రములు
యీరీతి శ్రీ వేంకటేశ నిన్నుఁ గొలిచితి
వూరక యితరము లొల్లా నే యింకను

పె.అ.రేకు: 0029-03 సామంతం సం: 15-167

పల్లవి: అచ్చముగా శ్రీహరింక అడ్డమాడ వెఱతు
తెచ్చి నన్ను తిద్దుకొమ్మీ దేవుఁడ వీవు

చ. 1: నెరుసు లెంచేనంటే నేనా నీకు నెదురు
కరుణించి వొకరీతిఁ గాతువు గాక
వొరగంట బంగారు వొరతురు గాని మరి
సరిగాఁ బెం కొరసితే సాటి వచ్చీనా

చ. 2: మనసు సోదించేనంటే మంచివాఁడవా నేను
ఘనుఁడవు నీవు నన్నుఁ గాతువు గాక
పనికి వజ్రము సానఁ బట్టితే మిం చెక్కుఁ గాక
పెనుఁ బిడుక రాచితే పిప్పి గట్టదా

చ. 3: మొక్కఁగా రక్షించేనంటే మొదల సుజ్ఞానినా
గక్కున శ్రీ వేంకటేశ కాతువు గాక
నిక్కి అద్దము దోమితే నీడ గానవచ్చుఁ గాక
ముక్కమూఁకుడు దోమితే మోము గానవచ్చునా

పె.అ.రేకు: 0029-04 బౌళి సం: 15-168

పల్లవి: మచ్చ కూర్మ వరాహ మనుష్యసింహ వామనా
యిచ్చ రామ రామ రామ హితబుద్ధి కలికీ

చ. 1: నన్నుఁ గావు కేశవ నారాయణ మాధవ
మన్నించు గోవింద విష్ణు మధుసూదన
వన్నెల త్రివిక్రమ వామనా శ్రీధరా
సన్నుతించే హృషీకేశ సారకు పద్మనాభ

చ. 2: కంటిమి దామోదర సంకరుషణ వాసుదేవ
అంటేజాలు ప్రద్యుమ్నుఁడా అనిరుద్ధుఁడా
తొంటే పురుషోత్తమ అధోక్షజ నారసింహమా
జంటవాయకు మచ్యుత జనార్దన

చ. 3: మొక్కేము వుపేంద్ర హరి మోహన శ్రీ కృష్ణరాయ
యెక్కితి శ్రీ వేంకట మిందిరానాథ
యిక్కువ నీ నామములు యివియే నా జపములు
చక్కఁగా నీ దాసులము సర్వేశ అనంత

పె.అ.రేకు: 0029-05 బౌళి సం: 15-169

పల్లవి: శంకమ నీవు సాక్షి చక్రమ నీవు సాక్షి
వంకలాడ భుజముల వ్రాసుకొంటి మిమ్మును

చ. 1: నారాయణా యని యిట్టే నరకములు తరించితి
శ్రీరామా అని పొందితి జీవన్ముక్తి
దూరించి గోవిందా యని తోలితి పాపములెల్ల
ధీరుఁడనై వళుకెల్ల తిద్దుకొంటి నిదిగో

చ. 2: దామోదరా అని తొల్లి దాఁటితి దుఃఖము లెల్ల
వామనా అని కర్మములు వంగఁ దొక్కితి
భూమిరమణా యని పుటుగులు గెలిచితి
వేమరు నితరులకు వెరవ నే నింకను

చ. 3: హరి యచ్చుతా యని ఆపదల నణఁచితి
పురుషోత్తమా యని పుణ్యములెల్లా మీఁటితి
అరుదైనా శ్రీ వేంకటేశ యని లోకముల మించితి
తొరలి సంసారపుదూరు చక్కఁ బెట్టితి

పె.అ.రేకు: 0029-06 దేశాక్షి సం: 15-170

పల్లవి: శరణాగతుఁడను విచార మింత వలెనా నన్ను
నిరుహేతుకానఁ గావనేరవా యేమి

చ. 1: నన్నునొక జంతువు నున్నతిఁ గాచుటకుఁగా
పన్నినట్టి కర్మములబారిఁ దోయవలెనా
మన్నన లక్ష్మీపతిని మహి నెల్ల నేలేవు
వెన్నుఁడ నన్నుఁ గావ వేఁగా యేమి

చ. 2: పుట్టించినయట్టి నీవు పూరి మేప వెప్పుడును
కట్టిడిపరులఁ జూపి కాకు సేయవలెనా
అట్టి బ్రహ్మ గన్నతండ్రి వదె లోకములు కుక్షి
బెట్టుకున్నాఁడవు నన్నుఁ బెనుపవా నీవు

చ. 3: అపరాధినైతిఁ బో నీ వన్నిటా న న్నేలితివి
చపలపు టాసలలో సడిఁ బెట్టవలెనా
యిపుడు శ్రీ వేంకటేశ యిన్నిటా న న్నేలితివి
కపురైన మా నుతులు ఘనము గాదయ్యా

పె.అ.రేకు: 0031-01 పాడి సం: 15-171

పల్లవి: గోవిందా నే నిట్టివాఁడ గురుతు నిన్నెఱిఁగీనా
యీ విన్నప మిది నాది యింకా నీ చిత్తము

చ. 1: పొలఁతుల భావ మనేభూతము సోఁకినవాఁడు
తలఁకక తనమేను తా నెఱిఁగీనా
మలసి యౌవనపు వున్మాద మెత్తినట్టివాఁడు
వెలయ సన్మార్గము వివేకించీనా

చ. 2: మించుల సంపదల వుమ్మెత్తకాయఁ దిన్నవాఁడు
అంచల గురువు దైవమని యెంచీనా
పంచల కర్మమనేటి బలునావెక్కినవాఁడు
చంచలానఁ బొందక చక్క నడచీనా

చ. 3: మాయల సంసారమనే మంకు వట్టినట్టివాఁడు
చాయకు బుద్ధి చెప్పితే సమ్మతించీనా
యీయెడ శ్రీవేంకటేశ యింతట నన్నుఁ గాచితి
నీ యాధీనమైనవాఁడు నేరమి సేసీనా

పె.అ.రేకు: 0031-02 ముఖారి సం: 15-172

పల్లవి: నీవే తెలుసు కొమ్మి నీ సుద్దులు
రావిచిగురంటుకొంటే రాఁ బోను వచ్చునా

చ. 1: పొందుగాని గొల్లెతల పొందు నీవు సేసితేను
నింద రాక మానునా నీకైనాను
అందముగ నిన్ను వారియంగములు సోఁకితేను
విందువలె గొల్లముంజు వేయకుండీనా

చ. 2: కూడగొట్టు వనితల కోరి పెండ్లాడితేను
ఆడుకోకుండుదురా అంగళ్ల నెల్ల
ఆడవారు తమతమ అధరములు మోవీఁగా
యీడులేని నీ మోవి యెంగిలి గాకుండునా

చ. 3: యియ్యని రాచకూఁతు నెత్తుకొని వచ్చితేను
నెయ్యపు శ్రీవేంకటేశ నిన్ను నవ్వరా
యియ్యెడ నన్నుఁ గూడే వీపె నింత సేసితేను
వుయ్యాలగా రొమ్ముదొక్కి వుండ కిట్టే మానునా

పె.అ.రేకు: 0031-03 దేశాక్షి సం: 15-173

పల్లవి: దైవమా నిన్ను దూర దగవు గాదు నా
భావములో నున్నాఁడ వీ పరిపాటి చాలదా

చ. 1: పుట్టించిన దైవమవు పూరి మేపేవా
నెట్టన నిహము తొల్లే నీ సంకల్పమూ
పట్టులేక నా మనసు పరువులు వెట్టి నిన్ను
గట్టిగాఁ గొలువని నా కర్మ మింతే కాక

చ. 2: యిచ్చితివి దేహము యింద్రియములఁ బూంచితి
నిచ్చలు నా బ్రదు కెల్ల నీ సూత్రము
యిచ్చ నా స్వతంత్రమంటా యిందు నందుఁ బొరలుచు
కచ్చి నిన్నుఁ దలఁచని కల్ల యింతే కాక

చ. 3: ముందరిజన్మ మానె మున్నిటిపాపము దీరె
సందడి నీ దాసులకు శరణనఁగా
అంది శ్రీ వేంకటేశ్వర ఆచార్యునానుమతి
కందువ దెలిసె పుణ్యకర్మ మింతే కాక

పె.అ.రేకు: 0031-04 శంకరాభరణం సం: 15-174

పల్లవి: నీవే బోధించి నన్ను నీవే యీడేర్తు గాక
నావంక నేమి గలరు నమో నారాయణా

చ. 1: పంచిన నా కర్మములు పనులే బోధించుఁ గాక
పొంచిన శ్రీహరి నిన్ను బోధించీనా
తెంచరాని ఆసలివి తిమ్మటే బోధించుఁ గాక
కంచపు నీ దివ్యనామ కతలు బోధించీనా

చ. 2: పొరలు యింద్రియములు భోగమే భోధించుఁ గాక
పురుషోత్తముఁడ నిన్ను బోధీంచీనా
సరుస నా యాకలిది చవులే బోదించుఁ గాక
నిరతి నీ కైంకర్యము నేఁడు బోధించీనా

చ. 3: గాసిల్ల నామతి యహంకారమే భోధించుఁ గాక
భూసతీశ నిన్నుఁ గాన బోధించీనా
యీసుదీర శ్రీ వేంకటేశ నీకు నా గురుఁడు
దాసి బోధించుఁ గాక తప్పఁగా బోధించునా

పె.అ.రేకు: 0031-05 సాళంగనాట సం: 15-175

పల్లవి: నేవే భావే శ్రీ బృందం
శ్రీవల్లభ చింతానందం

చ. 1: పటుకుతర్కనగ భంజన దీక్షం
కుటిల దురితహరగుణ దక్షం
ఘటితమహాఫల కల్పకవృక్షం
చటుల రామానుజ శమదమభిక్షం

చ. 2: కృద్ధమృషామత కుంతన కుంతం
బౌద్ధాంధకార భాస్వంతం
శుద్ధవేదమణి సుసరస్వంతం
సిద్ధాంతీకృత చిన్మయకాంతం

చ. 3: చార్వాకగహన చండకుఠారం
సర్వాపశాస్త్ర శతధారం
నిర్వికారగుణ నిబిడ శ్రీవేంక
టోర్వీధర సంయోగ గంభీరం

పె.అ.రేకు: 0031-06 సామంతం సం: 15-176

పల్లవి: ఎంచఁ బోతే మావల్ల నీ కే మున్నది
నించిన యీ పుణ్యమెల్ల నీ దింతే కాక

చ. 1: పోయిన జన్మ మెఱఁగ పుట్టిన పుట్టు గెఱఁగ
కాయము గరఁగేది యెక్కడో యెఱఁగ
యీయెడ నేమి దలఁచే నెట్టి ధ్యానము సేసేను
నీయంత రక్షించే మేలు నీదింతే కాక

చ. 2: రేపటిసుద్ధు లెఱఁగ రేతిరిసుద్దు లెఱఁగ
పై పై సంసారముల భ్రమయెఱఁగ
చేపట్టి యెట్టు పూజించే సేవ నీ కేమి సేసేను
నీ పెఁపున గాచేమేలు నీ దింతే కాక

చ. 3: నే నెడెవ్వఁడనో యెఱఁగ నిలుక డేదో యెఱఁగ
ఆనుకొన్న యీ జగము అంతా నెఱఁగ
కోనల శ్రీ వేంకటేశ కొలువ నే మెఱఁగుదు
నే నని కై కొన్నమేలు నీ దింతే కాక

పె.అ.రేకు: 0032-01 లలిత సం: 15-177

పల్లవి: ఇట్టివాని నన్ను దైవ మెట్టుగాచెను
నట్టనడుమ నిదియే నాకు వెఱగాయెను

చ. 1: పరసతి పరధన పరనిందలకు రోయ
యిరవై పెద్దలలోన యెట్టున్నాఁడనో
హరి సేవ గురుసేవ అవియుఁ జేయుట లేదు
సరవి నింకా నేమి చదివేనో

చ. 2: పాపమును కోపమును పట్టిన చలము మాన
యేపున విజ్ఞాని నంటా యేమి సేసేనో
పై పై సన్మార్గము పట్టదు నా మతిలోన
దాపగు తత్త్వము నెట్టు తలపోసెనో

చ. 3: మోహమును దాహమును ముందు వెనకా నెఱఁగ
ఆహా విరక్తుఁడ నే ననుట యెట్టు
వోహో శ్రీ వేంకటేశుఁ డొలిసి మన్నించెఁ గాక
సాహసించి నే నెట్టు శరణంటినో

పె.అ.రేకు: 0032-02 లలిత సం: 15-178

పల్లవి: కైకొనవయ్యా కరివరదా
నీకే శరణము నిలింపవరదా

చ. 1: పాండవవరదా పద్మజుని యజ్ఞ
గుండములో నున్న గురువరదా
మెండుగ ధ్రువునిని మెచ్చినవరదా
దండము నీ కిదె ద్రౌపది వరదా

చ. 2: బలివరదా యంబరీషవరదా
వలనగు నక్రూరవదరా
బలిమి నటించిన ప్రహ్లాదవరదా
కొలిచెద మిదె నిన్నుఁ గుచేలుని వరదా

చ. 3: నారదవరదా నమో శుకవరదా
సారస గుణ విభీషణవరదా
కారుణ్య శ్రీవేంకటగిరివరదా
చేరి నుతించెద శ్రీపతి వరదా

పె.అ.రేకు: 0032-03 శంకరాభరణం సం: 15-179

పల్లవి: పని లేదు పాట లేదు భ్రమించి వీఁడు మా
మనసెల్ల దక్కఁగొనె మాధవ గోవిందుఁడూ

చ. 1: పూచిన మానికింద పోఁటి వెట్టుక తా నుండీ
యేచి పిల్లంగోవి యూదీ యేఁటికే వీఁడు
తాచి తన రాగాలకు తానే చొక్కి రేపల్లె
చూచి చూచి బొమ్మలార్చి చూడవే వీఁడు

చ. 2: కాలిపై గాలు వేసి కడు మువ్వంక నొరఁగి
వేలివుంగరాలు చూపీ వేసాల వీఁడు
నీలమేఘపు వర్ణుఁడై నెమలిచుంగులపాగ
తూలియాడఁ దల వూచీ దొడ్డవాఁడే వీఁడు

చ. 3: పీతాంబరము గట్టి పెను సొమ్ము లెల్లఁ బెట్టి
చేతుల శంఖుచక్రాల చెలఁగీ వీఁడు
యీతల శ్రీవేంకటేశుఁ డిందరి కిన్ని రూపు
కాతరానఁ గూడీవాఁడు గబ్బిగదె వీఁడు

పె.అ.రేకు: 0032-04 దేసాళం సం: 15-180

పల్లవి: ఏవిచారములు వొద్దు యీతఁడు రక్షకుఁడు
శ్రీవల్లభుండె వీఁడు చేకొని కాచీని

చ. 1: పలుమారు బొడ్డునను బ్రహ్మఁ గన్నతండ్రి పేరు
దలఁచిన వారికి సంతాన మిచ్చీని
కలిగి పాదములను గంగపుట్టించినవాని
కొలువరో యీతఁడు కోరిక లిచ్చీని

చ. 2: మొదల నెన్నికతో కాముని గన్నవానినే
కదిసి పూజించరో కరుణించీని
కదలక బ్రహ్మాండము గర్భమున మోచిన
యెదుటి హరికి మ్రొక్కు డిన్నియును నిచ్చీని

చ. 3: గరుడగంభము వద్దగల శ్రీ వేంకటపతి
వరుస సేవించరో వరమిచ్చీని
ఆరిది విశ్వకుటుంబియైన వీనికి మొక్కరో
పరగ దామరదంపముగాఁ జేసీని

పె.అ.రేకు: 0032-05 శుద్ధవసంతం సం: 15-181

పల్లవి: నీకు నీవే వలసితే నీవునన్నుఁ గాచుకొమ్ము
నాకు వసగానివెల్ల నన్నుఁ బాసీనయ్య

చ. 1: పాపములతోడఁ బుట్టె పైకొన్న దేహము
పాపము సేయకుమంటే పక్కున నేల మానును
కోపమే కూడుగాఁ గడిచినయట్టి బుద్ధి
కోపము విడువమంటే గుణమేల మానును

చ. 2: అప్పు డేర్పించవచ్చిన యట్టి యీసంసారము
అప్పు దీర్చుకోకుమంటే నది యేల మానును
తప్పు వేయ వచ్చి నన్ను తగిలె నీ కర్మము
తప్పులు వేయక సారె తా మేల మానును

చ. 3: పంచమహాపాతక భోగపుటింద్రియములు
పంచమహాపాతకపు బారిఁ దోయ కేల మాను
అంచ శ్రీవేంకటేశ నీవాతుమలో నుండఁగాను
పొంచి నీ కరుణ నన్ను పొదుగ కేల మానును

పె.అ.రేకు: 0032-06 దేశాక్షి సం: 15-182

పల్లవి: తగులు వీరికి గుఱి తాఁ దానే
తగు జీవుఁడు మఱి తాఁ దానే

చ. 1: పలువుపమలచే బ్రహ్మాండకోట్లు
తలఁచే తలఁపులు తనలోనే
వులుకక నానాయోనిబంధముల
తలఁగనియ్య దిది తనలోనే

చ. 2: సతతము భువిపై చవులు సారములు
తతి నిండు కొనెను తనలోనే
రతుల కామినుల రచన లెల్లను స
తతమును భోగించేఁడి దనలోనే

చ. 3: ధనధాన్యము లెంతయు నార్జించిన
తనయఁ డింతైన తనలోనే
ఘనుఁడగు శ్రీవేంకటపతి యున్నాఁడు
తనువు దాల్చుకొని తనలోనే

పె.అ.రేకు: 0033-01 దేవగాంధారి సం: 15-183

పల్లవి: నీకేమిటికే గడమ నీకొఱకు నింత యేల
కైకొన్న నీ దాసులకే గడించేవు దేవుఁడ

చ. 1: బ్రతుకేటి బ్రతుకెల్ల పై పై నాలుబిడ్డలకే
గతిగా సంసారులు గడియింతురు
యితవై జగత్తు లెల్ల యేలెడివిధ మెల్ల
తతి నీదాసులకేతలఁ పెల్ల దేవుఁడ

చ. 2: యెదుటనే తమరాజ్య మెక్కుడుగా నేలుటెల్ల
పదపడి తొత్తులకు బంట్లకేకా
పొదిగి లక్ష్మీపతివై భూపతివై యుండుటెల్ల
కొదలేని నీ దాసులకొఱకే దేవుఁడా

చ. 3: బలిమిఁ గైదువ పట్టి పదిలమై కాచే దెల్ల
యిలఁ దనవారు సుఖియించుటకే కా
లలి చక్రముపట్టిన లావు లెల్లా నీ దాసులు
వెలసేటి కొఱకు శ్రీ వేంకటాద్రిదేవుఁడ

పె.అ.రేకు: 0033-01 మలహరిసం: 15-184

పల్లవి: హరి నారాయణ ఆదిమపురుషుఁడు
సరవి నీ నామమె జనరక్షణము

చ. 1: భవసాగరమునఁ బడిన జీవునికి
యివల నీ నామం బది దేప
తవిలి క్రోధ మనుతాపపు టెండ్లకు
జవళి నీ నామస్మరణే నీడ

చ. 2: నెట్టన మాయల నిరాదారులకు
పట్టుగొమ్మ నీ పరనామము
అట్టె దురాసలను పెను గాలికి
గట్టిగా నీ నామకతలె చాటు

చ. 3: పండిన సంసారబహురాజ్యమునకు
అండనె నీ నామ మటు దిక్కు
నిండు శ్రీవేంకటనిలయ మాకు నీ
దండి నామకీర్తనమే ఫలము

పె.అ.రేకు: 0033-02 లలిత సం: 15-185

పల్లవి: చిత్తజగురుఁడ నీకు శ్రీమంగళం నా
చిత్తములో హరి నీకు శ్రీమంగళం

చ. 1: బంగారుబొమ్మవంటి పణతి నీ యురముపై
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీఱఁ బీతాంబరము మొలఁ గట్టుకొని
చెంగలించే హరి నీకు శ్రీమంగళం

చ. 2: అంత నీలములవంటి వెలఁదిని పాదముల
చెంతఁ బుట్టించిన నీకు శ్రీమంగళం

చ. 3: అరిది పచ్చలవంటియాకుల అంగననీ
శిరసుపై నున్న నీకు శ్రీమంగళం
గరిమ శ్రీ వేంకటేశ ఘన సంపదలతోడి
సిరివర నీకు నిదె శ్రీమంగళం

పె.అ.రేకు: 0033-03 ముఖారి సం: 15-186

పల్లవి: గోవింద ముకుంద కృష్ణ గోపీనాథ నరహరి
పూవు గలుగఁగ పిందె పుట్టె నింతే కాక

చ. 1: బూమిలో నిద్రించువాఁడు పొద్దువేళ యేఁటిఁగినా
నీమాయలో మునిఁగి నన్ను నెఱిఁగినా
కామించి నీవు నన్నుఁ గరుణించి యేలుకోఁగా
నీమఱఁగువాఁడ నని నేఁ డంటిఁ గాక

చ. 2: సరి చంటి బిడ్డఁడు సంసార చింత లెంచీనా
గరిమ నజ్ఞానుఁడు కైంకర్య మెంచీనా
నిరతి దయ దలఁచి నీవు పెర రేపఁగా
కెరలి నే నీకు మొక్కితిఁ గాక

చ. 3: తుద కెక్క సన్యాసి తొంటి కర్మము సేసిన
యిదివో నిన్నుఁ దలఁచి యీతలఁ దడవేనా
యెదుట శ్రీ వేంకటేశ యిహపరములు నీవై
పొదిగి పాలార్చఁగాను పొడవైతిఁ గాక

పె.అ.రేకు: 0033-04 పాడి సం: 15-187

పల్లవి: ఇందుఁగల పస యెల్ల యింతే నుండీ
బొందితోనే హరిఁ గొల్చి పొడ వెక్కరో

చ. 1: లోపలికి వెలికిని లోఁగి యెడ తాఁకేటి
పూపెల ముక్కుకన వుసు రింతే తనవు
రూపులేని ప్రాయపు రుచి చిక్కి బ్రతికేటి
పైపూత వయసునఁ బచ్చియైన తనువు

చ. 2: నిచ్చలు మాపు రేపు నిదిరించి మేలుకొంటి
దిచ్చరి చావుఁ బుట్టు తెలిపె తనువు
తచ్చి మలమూత్రముల దాఁ పరపు పుట్టినిల్లు
ఆచ్చపు హేయములచే అంటరానితనువు

చ. 3: తుంచి సగ మటు వొంగ తోడనే లోనికి వచ్చు
పంచి లోనికి వెలికీ ప్రాణ మొక్కటి
కొంచక శ్రీ వేంకటేశుఁ గొల్చి నేను శరణంటి
మంచిదాయె పను లెల్లా మమ్ముఁ గాచె నితఁడూ

పె.అ.రేకు: 0033-05 శుద్ధవసంతం సం: 15-188

పల్లవి: చెల్లుబడీ కల్లలటచేఁత లివి నీవియట
బల్లిదుఁడ హరి మమ్ము భ్రమ దెలుపవయ్యా

చ. 1: వొకసస్యమునఁ బంట వొకకోటి కొండ లట
వొకపశువునందు పాలూరేదట
ఆకట కొందరవి అంతలో చవిగొనిన
సకలంబు దీరు నట నటకు నిజ మేదీ

చ. 2: అన్నంబు గొనెడిదట యప్పటి నాఁకలి యట
తిన్ననై కొంతదడవు తృప్తి నటా
కన్నులనే నిద్ర లట కడఁగి మేల్కనుట యట
యిన్ని బొంకుల జగము యెట్ల నమ్మెడిది

చ. 3: కాయమట ప్రాయమట కాంతలట పురుషులట
రాయడింపులె మతికి రతిసుఖ మటా
యేయెడల శ్రీవేంకటేశ నీ మాయలివి
పాయునట నీ దాసపరికరములకును

పె.అ.రేకు: 0034-01 భూపాళం సం: 15-189

పల్లవి: దేవునిపస్రాదము తెరళ లందుకోరో
యీవేళ నారగించె యీశ్వరేశ్వరుఁడు

చ. 1: వేగు జామునను లేచి వేద విప్ర లెల్లఁ గూడి
ఆగపు ధనుర్మాసమందు పూజించి
రాగమునఁ దేర్పాముడి రంతుసేసి చదువఁగ
జాగుతోడ నారగించె సర్వలోకేశ్వరుఁడు

చ. 2: దిన సంభ్రమములతో దేవదుందుభులు మ్రోయ
తన చెరపులు పై పై దాసులు సేయ
సనకాదు లిరువంక సంకీర్తన వాడఁగా
వినుకొంటా నారగించె విశ్వలోకేశ్వరుఁడు

చ. 3: హత్తుకొని వైష్ణవులు అనుష్ఠానములు దీర్చి
యెత్తిచేతుల పుష్పాంజ లియ్యఁగాను
పొత్తుల నలమేలుమంగ బోనము దొడుకఁగాను
చిత్తగించి ఆరగించె శ్రీ వేంకటేశ్వరుఁడూ

పె.అ.రేకు: 0034-02 దేవగాంధారి సం: 15-190

పల్లవి: తప్పు జదువులవార తర్కవాదములవార
యెప్పుడు నింతట దైవ మింకఁ దెచ్చేరా

చ. 1: కోరి సప్త ఋషులును కొలిచేదైవ మితఁడు
చేరి మహాశేషుఁడు మోచిన దైవము
గారవపు టాదిలక్ష్మి కైకొన్న దైవ మితఁడు
మేరతో నింతదైవము మీరు దెచ్చేరా

చ. 2: అల బ్రహ్మకునుఁ దండ్రియైన దైవ మితఁడె
తలప రుద్రునికిన తాత యితఁడె
వెలయ వేదములెల్ల వెదకే దైవ మితఁడు
యిల నింతటిదైవ మింకఁ దెచ్చేరా

చ. 3: నారదశుకాదులెల్ల నమ్మినదైవ మితఁడు
కూరిమి భూకాంతకు కులదైవము
ఆరీతి శ్రీ వేంకటాద్రిమీఁది దైవము
నేరితి యింతదైవము నెమకి తెచ్చేరా

పె.అ.రేకు: 0034-03 నాట సం: 15-191

పల్లవి: జనించె నిదిగో శ్రావణబహుళాష్టమిని
ఘన చంద్రోదయవేళ కన్నులపండువగా

చ. 1: కాళింగుపాలిటి వైరి కంసుని నెత్తిపిడుగు
చాలిన పూతన ప్రాణసంహారమూర్తి
గాలి తృణావర్తునికి కాలయమదండము
పేలరి మద్దులకును బిరుదుకుఠారము

చ. 2: శకటాసురుని దెత్తి బాణూరుని మెడగత్తి
బకాసురునిఁ జెండేటి బలుఱంపము
వికటధేనుకాసురు వెసఁ జంపే మెడతాడు
మొకరికుక్కుటదైత్యు మోదేటి భూతము

చ. 3: గోపికల నిధానము గోకుల కల్పవృక్షము
పాపరాని అక్రూరుని ఫలసారమూ
యేపొద్దు శ్రీ వేంకటాద్రి నిరవై దాసుల కెల్ల
చేపట్టు కుంచమైనట్టి చిన్మయానందము

పె.అ.రేకు: 0034-04 సాళంగనాట సం: 15-192

పల్లవి: మునులాల జనులాల ముంచిన దేవతలాల
పనివూని మొక్కరో పరమాత్మునికి

చ. 1: కనకాచలమువంటి ఘనదివ్యరథముపై
వనజాక్షుఁ డెక్కి వీధి వచ్చీ వాఁడె
వెనుదళమై నడచె విష్వక్సేనుఁ డిదె దేవిడి
కని మని సేవించరో కన్నులపండుగలు

చ. 2: గగనవాహినివంటి గరుడధ్వజముతోడ
అగడై వీధి నేఁగే చక్రాయుధుఁడు
పగటు విజయముతో పాంచజన్యము వట్టీని
నిగిడికొని యాడరొ నిచ్చకల్యాణములు

చ. 3: వరుస భాగ్యదేవతవంటి యలమేలుమంగ
వురమెక్కఁగ శ్రీ వేంకటోత్తముఁడు
తిరమై నెలవుకొనె దివ్యనగరులోనను
శరణని బదుకరో సాక్షాత్కరమున

పె.అ.రేకు: 0034-05 మలహరిసం: 15-193

పల్లవి: ఆనాథులఁ గాచుట అలవాటే తొల్లే నీకు
వినోదములు గావు విభీషణవరదా

చ. 1: మలసి నా చిత్తమనే మదమునేనుగ యిదె
జలజావాసపు సంసారములోని
అలయరాజద్వారమను మొసలిచే పడె
కలిగి కావఁగదె కరిరాజవరద

చ. 2: తుద పంచప్రాణములతోడఁ బుట్టువు లెగురు
కదిసి దేహమనేటికాంతఁ బెండ్లియాడి
అదె దుస్సంగము అనే అడవులఁ దిరిగాడి
పదరెగు కావవే పాండవవరద

చ. 3: పరికించ జీవుఁడనే పాషాణ మొకటి
సరుగఁ గర్మమనే శాపము నొంది
నిరతి శ్రీ వేంకటేశ నీపాదధూళి మోపి
అరుదుగా నన్నుఁ గావు మహల్యవరదా

పె.అ.రేకు: 0034-06 శ్రీరాగం సం: 15-194

పల్లవి: ఏమిటివాఁడ నేను యిందులోను దైవమా
కామించి నీ మాయ లింతే కానవచ్చీ నాకు

చ. 1: సాలీఁడనే పురువు జటరముపొంగువలె
చాలుకొని వచ్చీని సంసారబంధము
కాలము కొలఁది వచ్చి గ్రహచక్రమువలె
పాలుపడి జన్మములు బడీఁ దిరిగి

చ. 2: పారి నడవిమృగము పుట్టుతానే చన్నుదాగే
స్మరణవలెనే నా విషయభోగాలు
పరగ నీరు వందడి పారే నీరువలె
సిరుల వెంటఁ బారీ నా చిత్తవికారాలు

చ. 3: మొదల నీచేఁత లివి మోచు టింతే కాక
పదరి తలఁచరాదు పలుకరాదు
పాదిటి శ్రీ వేంకటేశ పూఁచి నీకే శరణని
యెదుట నున్నాఁడ నింతే యింకా నీచిత్తము

పె.అ.రేకు: 0035-01 దేవగాంధారి సం: 15-195

పల్లవి: ఓపికగలవారికి వొడి నుండు నవి రెండు
పై పైఁ జేకొనేటివారిభాగ్యము కొలఁదులు

చ. 1: సేసినంతపుణ్యము సృష్టిలోనివారి కెల్ల
ఆసల బహుఫలము హరిదాస్యము
త్రాసువంటిది కర్మము దైవముపై భక్తియైతే
బాస దప్పక పండినపంటవంటిది

చ. 2: గడించినంతే ధనము కైకొనేటివారికెల్ల
అడరి విజ్ఞానధన మక్షయం
సుడివంటిది సంపద చుట్టఁ బెట్టుచునుండు
అడఁచి నిరాశ బ్రహ్మానందమువంటిది

చ. 3: ధర నాడినంతే వట తగు నక్షరజ్ఞులకు
హరినామోచ్చారణ మక్షయం
యిరవై శ్రీ వేంకటేశుఁ డిందుల కధిదేవత
నిరతి నితనికృప నిధానమువంటిది

పె.అ.రేకు: 0035-02 మలహరిసం: 15-196

పల్లవి: మఱిగితి మిదె బ్రహ్మానందము
తెర మఱుఁ గింతె తెలుపఁ గదయ్యా

చ. 1: మంచము మీఁదట మఱపు నిద్దురలు
కంచములోపలి కలగూళ్ళు
పొంచిన కాంతల భోగపు సుఖములు
మంచవనుచు నివి మరిగితి నయ్యా

చ. 2: భావములోపలి బయలు గోరికలు
ఆవలఁ బంచేద్రియపు శివము
మోవక మోపగు మొఱుఁగుల దేహము
నావి యనుచు నివి నిమ్మతి నయ్యా

చ. 3: పొత్తుల కర్మము పొరుగుల పోరచి
హత్తిన సంసారమగు సంత
యిత్తల శ్రీ వేంకటేశ నీ వియ్యగా
బత్తి సేసుకొని బ్రతికితి నయ్యా

పె.అ.రేకు: 0035-03 సామంతం సం: 15-197

పల్లవి: దైవమూ నొక్కఁడె తాను నెప్పటివాఁడె
సేవించినకొలఁదినే చేకూడు శుభము

చ. 1: మింట సూర్యుఁ డొక్కఁడై మించి యుాఁడు గాలముల
అంటి గుణములు వేరులై తోఁచీని
దంట కిరణము లేమీ దాఁచఁడు కొన్ని దేఁడు
వెంట దగ్గరినపాటి వెలుఁగిచ్చు నతఁడు

చ. 2: అంది దేహ మొక్కటే ఆఁకటి భోజనమున
అందపు రెండు భావములై తోఁచీని
పొందిన ఆఁకలి యెందుఁ బోదు కొత్తగా రాదు
అంది భుజించినపాటి యానందము

చ. 3: తలఁపులోని నాడె తగ శ్రీ వేంకటేశుఁడు
కలఁడంటేఁ గలిగి గక్కనఁ దోఁచీని
పిలువ నెందునుఁ బోఁడు పిలువకుండితే రాఁడు
తెలిసిన కొలఁదినే దిక్కయి నిలుచును

పె.అ.రేకు: 0035-04 దేశాక్షి సం: 15-198

పల్లవి: దానికిఁగల గుణము తప్ప దెంతయిన
పూనిన నిర్విషమే పో హరినామము

చ. 1: మాయవిషయపు నంజు మనుజుల నెల్లాను
యేయెడ ధర్మాధర్మ మెఱుఁగనీదు
కాయపు నిద్రయు ముంచు కన్నులునుఁ దెరపించు
బాయట బహులీలలై భ్రమియింపించును

చ. 2: యింద్రియభూతశివము యిందరి మేనును సోఁకి
మంద్రపు సంసారమున మాల్లాడిపించు
అంద్రించి కామాదులు యంకణాలాడింపించు
తంద్ర నహంకారమున తన్నుఁగాన నియ్యఁడు

చ. 3: యౌవనపు వెఱ్ఱి వట్టి అందరుసతులతోఁడ
నవ్వి నవ్వి యాసలను నటింపించు
యివ్వల శ్రీ వేంకటేశుఁ డిన్నిటా మాకుఁ గలఁడు
రవ్వల నాతఁడే మమ్ము రక్షించు నెపుడు

పె.అ.రేకు: 0035-05 దేపాళం సం: 15-199

పల్లవి: మోపు మోయనే కాని మూలుగఁగఁ బొద్దు లేదు
శ్రీపతి మాపాటు లివి చిత్తగించవయ్యా

చ. 1: మన సెంత్తైనాఁ గద్దు మాయలెల్లఁ జింతించ
చొనిపి విరక్తి కైతే చోటు లేదు
తను వెంత్తైనాఁ గద్దు దప్పికి నాఁకటికిని
యెనసి విజ్ఞానమున కెడ లేదు

చ. 2: నాలి కెంత్తైనాఁ గద్దు నాండ్ల సుద్దులు చెప్ప
తాలిమి గోవిందా యన తావు లేదు
కాల మెంత్తైనాఁ గద్దు కర్మములే పచరించ
వేళమె సంకిర్తనకు వేళ లేదు

చ. 3: బలి మెంత్తైనాఁ గద్దు షాపములు సేయఁగా
చలపట్టి పుణ్యాలకు సత్వ లేదు
యెలమి శ్రీ వేంకటేశ యిదిగో నీ మాయ నీ వే
తెలిపినప్పుడే కాని తెగువ లేదు

పె.అ.రేకు: 0035-06 భూపాళం సం: 15-200

పల్లవి: మేలుకొనవే నీలమేఘవర్ణుఁడా
వేళ దప్పకుండాను శ్రీ వేంకటేశుఁడా

చ. 1: మంచముపై నిద్ర దేఱ మల్లెల వేసేరు
ముంచి తురుము ముడువ మొల్లల వేసేరు
కంచము పొత్తారగించ కలువల వేసేరు
పించెపు చిక్కుదేఱ సంపెంగల వేసేరు

చ. 2: కలసిన కాఁక దేఱ గన్నేరుల వేసేరు
వలపులు రేఁగి విరజాజుల వేసేరు
చలువగా వాడుదేఱ జాజుల వేసేరు
పులకించ గురువిందపూవుల వేసేరు

చ. 3: తమి రేఁగ గోపికలు తామరల వేసేరు
చెమటార మంచి తులసిని వేసేరు
అమర శ్రీ వేంకటేశ యలమేలుమంగ నీకు
మమత పన్నీటితో చేమంతుల వేసేరు

పె.అ.రేకు: 0036-01 భూపాళం సం: 15-201

పల్లవి: దేవశిఖామణి కామధేను వేకబల నీకు
వేవేగ సంధ్యాదివిధుల వేళాయె లేవే

చ. 1: మంచి జలధులే మొగమజ్జనీమున కాయితమా
కాంచనపు మేరవే గదెపీఁట
అంచ తుంబురు నారదు లదె మంగళపాటకులు
వుంచానఁ బాడేరు సూర్యుఁ డుదయంచె లేవే

చ. 2: వుదయరాగపు మేఘ మొగిఁ గుంకుమగంనము
చదలపైఁడి మణుఁగు జాంబూనది
అదన కాంతల చూపు లనిగొ మంత్రాక్షతలు
యెదురు చల్లేరు పొద్దెక్కినదె లేవే

చ. 3: కల్పవృషపుటాకులు కాయటా మంచి విడాలూ
కల్పించే పారిజాతమె కమ్మఁబూవులు
పొల్పఁగ శ్రీ వేంకటాద్రి పురుషోత్తముఁడ భోగి
తల్ప కొలువువేళాయెఁ దగ లేవయ్యా

పె.అ.రేకు: 0036-02 మలహరిసం: 15-202

పల్లవి: నీవే నను@ గరుణింతువు గాక
వేవేలకును నాకు విన్నపం బిదియే

చ. 1: మొదల నాశక్తి యిమ్ములఁ బరీక్షించి మరి
చెదర కిటు రక్షించెద నంటివా
అదె యశక్తుఁడ నేను అజాగళస్తనము
అదియె పనికివచ్చు నంతియె నేను

చ. 2: పలు నా స్వరూప స్వభావంబు లెఱిఁగి మరి
చెలఁగి నను రక్షించెద నంటివా
వెలిఁ గప్పు చిప్పందు వెండిభావన మించు
కలిగినంతే నా కల గుణంబు

చ. 3: శ్రీ వేంకటేశ నీసేవ సేయఁగ మరి
జీవంబు నేలి పెంచెద నంటివా
మోపకె గోపురము మోచే ప్రతిమరీతి
తావులను నా స్వతంత్రము నిట్టిదే

పె.అ.రేకు: 0036-03 మలహరిసం: 15-203

పల్లవి: నన్ను నెంచుకొన నయ్యా నగుఁబాట్ల నేను
కన్నవారి విన్నవారిఁ గాకు సేసేనే

చ. 1: మలసి నా గుణములు మంచివై నప్పుడు గదా
యెలమి నెదిరి నేరము లెంచేది
చెలఁగి నే పాపములు సేయకుండె మరి కదా
తొలఁగి పరుల నే దూషించేది

చ. 2: నడవడి నే లెన్స నడిచినప్పుడు గదా
పొడవై యన్యులకు నే బుద్ధి చెప్పేది
వెడఁగై యితరుల నే వేఁడనియప్పుడు గదా
కడవారి విరక్తి గాదనేది

చ. 3: కామినుల సంగమము కాదని నే మరి కదా
నేమమై యితరుల నే నిందించేది
నామదిలో నన్ను నేను నవ్వుకొని సిగ్గుపడి
నీ మఱఁగు చొచ్చితి నేఁడు శ్రీ వేంకటేశ

పె.అ.రేకు: 0036-04 దేపాళం సం: 15-204

పల్లవి: నుంచి వయసుకాలము మాయతో నేమరి వుండి
పంచేంద్రియసుఖము పాలాయె బ్రదుకు

చ. 1: ముదిసే కాలమునాఁడు మోక్షము సాధించే నంటా
మదించి నూరేండ్ల ముది మది దప్పును
కదలలే కంతటను కన్నుల పొరలు గప్పి
అదెవ్వ రిదెవ్వరంటా నడుగుచు నుండును

చ. 2: జవ్వనపాయము వోఁగా సన్యాసి నయ్యే నంటాను
నవ్వుతానే నరసి వణఁకఁ జొచ్చును
చివ్వన నెముక వంగి చేత నూతకోల పట్టి
వువ్విళ్లూర నెంగిలిలో నోలలాఁడఁ జొచ్చును

చ. 3: యింక మీఁదట శ్రీ వేంకటేశ్వరు సేవించే నంటా
సంకె లేక వుండఁగాను సత్వవోపును
అంకెల వీఁడు వెట్టియైనా నంతరాత్మగాన
మంకు దేర నీమాటకే మంచిగతి వెట్టును

పె.అ.రేకు: 0036-05 భూపాళం సం: 15-205

పల్లవి: శరణంటే నీవు దిక్కు సర్వేశ్వరా
నిరతి మాయావికిని నిజమేది

చ. 1: యిన్నిటాఁ బుట్టిన దేహి కింక కులశీల మేది
చన్నుఁబాలకాని కాచార మేది
పన్నిన సంసారికి పరమాత్మచింత యేది
వున్నతి జంతరపు బొమ్మ కుద్యోగ మేది

చ. 2: పంచేంద్రియబద్ధునికి పట్టి స్వతంత్రమేది
చంచలచిత్తునికి విజ్ఞాన మేది
యెంచ భూతావాసుని కింకఁ జేసే ధర్మ మేది
నించి మలమూత్రకాయునికి భోగ మేది

చ. 3: కామాతురునకును కర్మానుష్ఠాన మేది
వాముల నిత్యలోభికి వైరాగ్య మేది
శ్రీమంతుఁడైనయట్టి శ్రీ వేంకటేశ్వర నీవే
కామించి కాచితి గాక గతి యేది

పె.అ.రేకు: 0036-06 శంకరాభరణం సం: 15-206

పల్లవి: తలఁపులోననే దైవము వీఁడిగో
సులభము సులభము సోధించరో

చ. 1: యిదే హరినామము యిదే కొననాలికె
వదలక తలఁచితే వైకుంఠము
వెదకఁగ నేఁటికి వెడపుణ్యము లింక
సదరము సదరము సాధించరో

చ. 2: కలదు దేహమిదె కలవివె ముద్రలు
వలెనని చేకొన్న వైకుంఠము
వొలసి కర్మములఁ బొరలఁగ నేఁటికి
కలిగెను కలిగెను కైకొనరో

చ. 3: శ్రీ వేంకట మదె శ్రీపతి వీఁడిగో
వావిరిఁ గొలిచిన వైకుంఠము
భావించి చూచిన బ్రహ్మాదులకును
త్రోవయిదె త్రోవయిదె తొలఁగకురో

పె.అ.రేకు: 0037-01 దేవగాంధారి సం: 15-207

పల్లవి: ఇందులో నే నెవ్వఁడను యెంచి నిన్నుఁ బొగడఁగ
కందువ యింతంతని కానరాదు మహిమ

చ. 1: యేచి నీ రోమరంధ్రాల నిటువంటి బ్రహ్మాండకోట్లు
కాచినట్లున్నవి నీ కాయమునందు
వూచిన నీ బొడ్డుఁదమ్మి బుట్టిన బహ్మ లెందరో
చేచేత రుద్రు లెందరో చెప్పరాదు మహిమ

చ. 2: నారువోసినట్లాను నానాదేవకోట్లు
కారుకమ్మీ నిదెనీ సంకల్పమునందు
యీరీతి మును లెందరో యిక వేదరాసు లెన్నో
చేరన జీవు లెందరో చెప్పరాదు మహిమ

చ. 3: అనలులుఁ జంద్రులు నాదిత్యకోట్లు
జనియింపుచున్నవి నీ జలజాక్షుల
యెనయి శ్రీ వేంకటేశ యిన్నిటా నీ దాసుఁడను
చెనక నలవి గాదు చెప్పరాదు మహిమ

పె.అ.రేకు: 0037-02 సాళంగనాట సం: 15-208

పల్లవి: మిన్ను నేల మోచె నదె మేటి దైవము
కన్నులెదుటనే శ్రీ వేంకటరాయఁడు

చ. 1: యెత్తినాఁడు గోవర్ధన మింద్రాదిసురలెదుట
వొత్తినాఁడు శంఖము దైత్యుల గెలిచి
మెత్తినాఁడు హిరణ్యుని మెదడు చందనముగా
మెత్తినాఁడు మల్లులను మొగ తిరుగఁగను

చ. 2: పట్టినాఁడు చక్రము వుబ్బరి కాలనేమిమీఁద
మెట్టినాఁడు కాళింగుని మెడలమీఁద
వెట్టినాఁడు యేకదాడి పెనుసముద్రదాఁట
కొట్టినాఁడు పౌండ్రకుని కోలాహలముగా

చ. 3: తుంచినాఁడు సోమకుని తోయములు చొచ్చిచొచ్చి
దంచినాఁడు జరాంధు దండిపవుఁజుల
యెంచఁగ శ్రీ వేంకటాద్రి నిందిరయుఁ దానుఁ గూడి
మించినాఁడు దాసులను మెచ్చి వరములను

పె.అ.రేకు: 0037-03 పాడి సం: 15-209

పల్లవి: ధన మెంత గలిగినా తగు సంరక్షణ లేక
కనుఁగొని తనదంటే కైవసము గాదు

చ. 1: యేరీతి భయభక్తి యెంత గలిగినాను
చేరి ముద్రాధారి గాక సిద్ధింపదు
తేరిపారి తా నెంత పతివ్రత యైనాను
కోరి పుస్తెగట్టకున్న గురుతు గాదు

చ. 2: యిరవై దేవుఁడు తనయెదుట నెంత యుండినా
గురువనుమతి లేక కొనసాగదు
ధరలోఁ బుట్టినప్పుడు తా నెంత బ్రహ్మణుఁడైన
పరగ జంద్యము లేక పాత్రుఁడు గాఁడు

చ. 3: వావిరిఁ దాఁ గడు వైష్ణవుఁడ ననుకొన్న
దేవతాంతర ముడుగక తిరము గాదు
శ్రీ వేంకటేశ్వర నీ సేవకులైనవారికి
వేవేలు విధులైన వెలితి లేదు

పె.అ.రేకు: 0037-04 గౌళ సం: 15-210

పల్లవి: ఘన నంసారులకెల్ల కర్మమై పొడచూపు
నసిచి యింతకు గురి నరహరి వొక్కఁడు

చ. 1: యెలమిఁ బుణ్యము లెల్ల యింద్రలోకమై తోఁచు
నలుఁడ పాపములే నరకలోకమై తోఁచు
పొలసి రెండు సరియైతే భూలోకమై తోఁచు
కలవాఁ డొక్కఁడే గుఱి కమలావిభుఁడు

చ. 2: పరగ రాజసులకు బ్రహ్మయై పొడచూపు
గరిమ తామసులకు కఱకంఠుడై యుండు
సిరుల సాత్వికులకు శ్రీకాంతుఁడై మించు
నిరవైనవాఁడు శ్రీహరి యొక్కఁడే

చ. 3: ఆయమెఱిఁగినవారి కంతరాత్మయై యుండు
చాయ గన్నవారికి జగమెల్ల నై తోఁచు
చేయ గన్నవారికి శ్రీ వేంకటేశుఁడై తోఁచు
యేయెడ వారికి యీదేవుఁ డొక్కఁడే

పె.అ.రేకు: 0037-05 సాళంగనాట సం: 15-211

పల్లవి: ఏలచెప్పేని సుద్దు లెందాఁకా నీతోను
పాలుమాలక యింతలో బ్రహ్మచారివైతివి

చ. 1: యెలమి గొల్లెతలను యిన్నాళ్లు పొంది పొంది
తొలఁగి మథురలోన దొర వైతివి
కొలఁది యావులఁ గాచి గొల్లవాఁడవై యుండి
వలవంత నేఁడు రాచవాఁడ వైతివి

చ. 2: వేడుకలకు నింటింటి వెన్నలు దొంగిలి
ఆడ ద్వారకలో సోమయాజి వైతివి
పోడక రుక్మిణిదేవి నూరకే యెత్తుకవచ్చి
పాడితో నగ్రపూజకుఁ బాత్రుఁడ వైతివి

చ. 3: రక్కసుల కాఁపురాలు రచ్చల కెక్కఁ జెఱిచి
పెక్కు ధర్మములు నిలిపి పెద్దవైతివి
చిక్కువాసి నన్నుఁ గూడి శ్రీ వేంకటాద్రిమీఁద
దిక్కులనిందరిపాలి దేవార వైతివి

పె.అ.రేకు: 0037-06 గుజ్జరి సం: 15-212

పల్లవి: ఆట యెవ్వరికిఁ గౌర నేను అంతర్యామికి కాక
తటుకున నితఁడే గతి యని యున్నాఁడ తప్పకననుమన్నించీఁగాక

చ. 1: హరిదాసానుదాఁసుడ నట నా కాచార్యత్వము సంగతులా
అరుదుగ విష్ణుయచ్చు మోచుకొని యన్యులఁ గౌలిచిననమ్ముదురా
విరతి బొంది యిఁక విషయము గోౕరిన వెనకటి పగ లివి సాధించవా
యిరవున నే మొరవెట్టఁగ నిటు నా యేలిక దానే కాచీఁ గాక

చ. 2: సకలపుణ్యముల ఫలము లొల్ల నని స్వర్గము చౌరనీకఁ బాడి యౌనా
ఆకటా తిరుమంత్రము నుడువునోరధములఁ బొగడఁగజవి యౌనా
వికటపు మోహమున నరకెద నని భావించి పారితే వెను కొనదా
మొకమెదుటనె వేలుచు నుండఁగ మురహరుఁడే దయఁజూచీఁగాక

చ. 3: శ్రీవైష్ణవధర్మము చేపట్టి జిగిఁ బిరికితిన మిది యేల
దేవతాంతరము మాని కమ్మటి తెరువు దప్పహీనము గాదా
వేవేలు చదువులు చదివి ప్రాకృతుల వేఁడుచుఁ దిరిగినను నవ్వరా
శ్రీవేంకటేశుఁడే గతియని యుండఁగ చేరితఁడే రక్షించీఁ గాక

పె.అ.రేకు: 0038-01 సాళంగనాట సం: 15-213

పల్లవి: ఎదురా రఘుపతికి నీ విటు రావణా నేఁ
డిదేమి బుద్ధి దలఁచి తిట్లాయె బ్రదుకు

చ. 1: హరుని పూజలు నమ్మి హరితో మార్కొనఁగ
విరసమై కూలితివి వెఱ్ఱి రావణా
వరుసతోడ బ్రహ్మవరము నమ్మి రాము
శరణనకుండఁగానే సమసెఁగా కులము

చ. 2: జపతములు నమ్మి సర్వేశు విడువఁగా
విపరీత మాయెఁగా వెఱ్ఱిరావణా
వుపమలన గడు తా నున్న జలనిధి నమ్మి
కపులపాలై తివిగా కదనరంగమున

చ. 3: బంటతనము నమ్మి పైకొన్న రాఘవు
వింటఁ బొలిసితివిగా వెఱ్ఱిరావణా
యింటనే శ్రీ వేంకటేశ్వరునిఁ గొలిచి
వెంటనే సుఖియాయె విభీషణుఁడు

పె.అ.రేకు: 0038-02 గౌళ సం: 15-214

పల్లవి: నీకు సరి లే రీనిఖిలలోకములలో
కాకాసురుని నట్లఁ గాచితివి నీవు

చ. 1: హరి పరమపురుషా యచ్చుతానంతా
కరివరద మురహరా కరుణానిధీ
ధర యాకసము బలి తలయు మూఁ డడుగులను
పరగఁ గైకొన్నయట్టి బలువుఁడవు నీవు

చ. 2: మాధవా భూధవా మధుసూదనా కృష్ణ
శ్రీధరా శ్రీపతీ శ్రీనివాస
శోధించి జలధులు చొచ్చి చదువులు దెచ్చి
ఆ ధాత కిచ్చితివి అధికుఁడవు నీవు

చ. 3: వామన కేశవ వాసుదేవ ముకుంద
రామ గోవింద చక్రకరాంబుజా
ఆ మహిమ శ్రీ వేంకటాద్రిమీఁదట నెక్కి
కామితఫలముల నిచ్చు ఘనుఁడవు నీవు

పె.అ.రేకు: 0038-03 భూపాళం సం: 15-215

పల్లవి: మేలుకో శృంగారరాయ మేటిమదనగోపాలా
మేలుకోవే నా పాల మించిననిధానమా

చ. 1: సందడించే గోపికల జవ్వన వనములోన
కందువఁ దిరిగే మదగజమవు
యిందుముఖి సత్య భామహృదయపద్మములోని
గందము మరిగినట్టి గండుఁదుమ్మిదా

చ. 2: గతి గూడి రుకిమిణికౌఁగిటపంజరములో
రతి ముద్దుగురిసేటి రాచిలుకా
సతులు పదారువేల జంటకన్నుఁగలువల
కితవై పొడమిన నా యిందు బింబమా

చ. 3: వరుసఁ గొలనిలోనివారి చన్నుఁగొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరినురమున మోచి శ్రీవేంకటాద్రిమీఁద
గరిమ వరము లిచ్చే కల్పతరువా

పె.అ.రేకు: 0038-04 భూపాళం సం: 15-216

పల్లవి: ఏమి చిత్రం బేమి మహిమలు యేమి నీ మాయావినోదము
వామనాచ్యుత నిన్నుఁ దెలియఁగ వసుధలో మాతరములా

చ. 1: సకలలోక నివాసనాయక శౌరి మురహర నరహరీ
ప్రకటమాయెను నీ గుణంబులు పాలముచ్చ వటంచును
వికటముగ నినుఁ గన్నతల్లి వేల నీ వదనంబు మీఁటిన
అకట హో యని నోరు దెరచిన యందు లోకము లుండెను

చ. 2: శ్రీసతీపతి దైత్యదానవశిక్ష కామర రక్షక
రాసి కెక్కెను బండిరొప్పిన రవ్వలా నీ సేఁతలు
మోసమున నర్జునుఁడు నీలో ముందు గానక మాటలాడిన
వాసవార్చిత విశ్వరూపము వసుధఁ జూపితి వవుదువు

చ. 3: నమోనమో శ్రీ వేంకటేశ్వర నారదప్రియ భక్తవత్సల
విమలమగు నీ దాసు లిదె నీ విద్య లెల్లాఁ జూచిరి
సుముఖులై కరి శబరి బలియును శుకధ్రువాదులు నిన్నుఁ గొలువఁగ
సమత వున్నతపదము లొసఁగితి సర్వమిందునుఁ గంటిమి

పె.అ.రేకు: 0038-05 ముఖారి సం: 15-217

పల్లవి: నడచీ లోకము బ్రహ్మనాఁటనుండి సహజము
యెడయక శరణని యియ్యకొంటి సుఖము

చ. 1: ఉదయాస్తమయములు వొక రన్నట్టయ్యీనా
చెదరి మేలునుఁ గీడు చెప్పినట్టు సేసీనా
యిది దైవకల్పితము యెవ్వరి నేమన వచ్చు
కదిసి యైనది యయ్యీ కాని దెన్నఁడుఁ గాదు

చ. 2: జననములు మరణములు జంతువుల యిచ్చలా
వొనర కలిమిలేము లొక రన్న దౌనా
ఘనమైన హరిమాయకల్పితము లివి తొల్లె
పొనిఁగి పొయ్యే లీఁ బోవు పోని వెన్నఁడుఁ బోవు

చ. 3: శ్రీవేంకటేశ నీవు సేసినసేఁతలోన
భావించి తెలియలేక భ్రమసితి మిన్నాళ్ళు
సావధానమున నిందు శరణంటిమి నీకు
యేవేళ మమ్ముఁ గాచితి విన్నిటా గెలిచితివి

పె.అ.రేకు: 0038-06 నాట సం: 15-218

పల్లవి: సురలకు నరులకు శుభమాయె
హరి నీ చేఁతలు ఆనంద మాయె

చ. 1: కినిసి రావణుని గెలిచిన గెలుపులు
చెనకి బాణుని గెలిచిన గెలుపు
పొనిఁగి హేమకశిపుని గెలిచినగెలుపు
వెనక ముందరికి వేదము లాయె

చ. 2: కలన కంసునటు గెలిచినగెలుపులు
చెలఁగి బలిని గెలిచినగెలుపు
అలశిశుపాలుని గెలిచినగెలుపులు
బలుపుణ్యకథా భారతమాయె

చ. 3: కెరలి యసురలను గెలిచినగెలుపులు
సిరుల నందరి గెలిచినగెలుపు
యిరవగు శ్రీవేంకటేశ నీ మహిమలు
సరవితోఁ బురాణము లాయె

పె.అ.రేకు: 0039-01 రామక్రియ సం: 15-219

పల్లవి: శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ
శరణాగతే దిక్కు సామజవరదా

చ. 1: వేయిశిరసులతోడి విశ్వరూపమా
బాయట నీ పరంజ్యోతి పరబ్రహ్మమా
మ్రోయుచున్న వేదముల మోహనాంగమా
చేయి చేత అనంతపు శ్రీమూరితి

చ. 2: ముగురు వేలుపులకు మూలకందమా
వొగి మునుల ఋషుల వోంకారమా
పగటు దేవతలకు ప్రాణబంధుఁడా
జగమెల్లాఁ గన్నులైన సాకారమా

చ. 3: వెలయు సచ్చిదానందవినోదమా
అలరు పంచవింశతి యాత్మతత్వమా
కలిగిన దాసులకు కరుణానిధీ
చెలఁగి వరములిచ్చే శ్రీవేంకటేశుఁడా

పె.అ.రేకు: 0039-02 సామంతం సం: 15-220

పల్లవి: ఉన్నతోన్నతుఁడు వుడయవరు
యెన్న ననంతుఁడే యీ యుడయవరు

చ. 1: సర్వలోకముల శాస్త్రరహస్యము
లుర్విఁ బొడమె నీ యుడయవరు
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు
నిర్వహించె నన్నిటా నుడయవరు

చ. 2: వెక్కసపు శ్రీవిష్ణుభక్తియే
వొక్కరూపమే వుడయవరు
చక్కనైన సుజ్ఞానమున కిరవై
వుక్కు మీఱె నిదె వుడయవరు

చ. 3: కదిసె మోక్షసాకారము దానై
వుదుటున నిలిచె నీ యుడయవరు
యిదిగో శ్రీవేంకటేశ్వరు యీడై
పొదలుచు నున్నాఁడు భువి నుడయవరు

పె.అ.రేకు: 0039-03 బౌళి సం: 15-221

పల్లవి: మొక్కేటి గోపాంగనల మోహనాకారము
చిక్కని నవ్వులు నవ్వీ శ్రీవేంకటేశ్వరుఁడు

చ. 1: సత్యభామపురముపై చల్లని కస్తూరిపూఁత
తత్తరించే రుక్మిణిచేతామరపూవు
హత్తిన భూకాంతకు యంగపు పయ్యదకొంగు
చిత్తగించరమ్మ వీఁడే శ్రీవేంకటేశుఁడు

చ. 2: పంతపు వదారువేలబంగారువుంగరము
బంతికే కుబ్జగట్టిన పసిఁడితాళి
వింతగా రాధాదేవి వేసిన కలువదండ
చెంతలను వీఁడే యమ్మ శ్రీవేంకటేశుఁడు

చ. 3: ఆసల తులసీదేవియఅచేతిలో యద్దము
బాసరపు యిళాదేవి పట్టుగొమ్ము
శ్రీసతి యెక్కినయట్టి సింహాసనపు గద్దె
సేస వెట్టించుకున్నాఁడు శ్రీవేంకటేశుఁడు

పె.అ.రేకు: 0039-04 రామక్రియ సం: 15-222

పల్లవి: ఎట్టు రక్షించేవో కాని యిందిరారమణ నన్ను
దట్టపు నీ దాసానుదాసుఁడ నేను

చ. 1: గాటపు వైరాగ్యము కందువ సుజ్ఞానము
మాటలలోననే కాని మతి నుండదు
నీటున నహంకారపు నీరసగుణములు
మాటునఁ దిరుగు దుర్మానుఁడ నేను

చ. 2: నవనవవిధముల నానాపుణ్యము
చెవుల వినుటే కాక సేయుట లేదు
భవజలధులలోన పడి పొరలి మునిఁగి
చవి మరిగిన నిత్యచపలుఁడ నేను

చ. 3: శ్రీవేంకటేశ్వర నీ సేవకుఁడ ననియేటి
భావ మొక్కటె కాని భక్తి యెఱుగ
యేవిధులఁ బడలేక యిటు నీకె శరణని
దేవులతో విఱ్ఱవీఁగే డింగరీఁడను

పె.అ.రేకు: 0039-05 వరాళి సం: 15-223

పల్లవి: వైకుంఠపతి నిన్ను వడిఁ గానవలెఁ గాక
పైకొని తద్విష్ణోఃపరమ్మైయుండఁగను

చ. 1: కాయ మేల బడలీని కడుపునించుకొఱకు
ఆయు రన్నం ప్రయచ్ఛతి యనఁగాను
ప్రాయ మేల తమకించీ పడఁతులకొఱకుఁగా
బాయట రుణానుబంధపశుపత్ని యనఁగా

చ. 2: తలఁపేల చిక్కుపడీ ధనముకొఱకుఁగాను
అలమి ప్రాప్తవ్య మర్థ మనఁగాను
వెలసి యాతుమ యేల వెఱచీ దోషములకై
మలసి నిర్దోషము సమంబ్రహ్మ మనఁగా

చ. 3: ధర నిన్ని సుద్దు లేల దరి చర్చఁ గూడువెట
నిరతి శ్రీవేంకటేశ నీవుండఁగా
శరణంటి నే నిట్టే జన్మము లెల్లఁ జింతించ
హరి నీ నామము భవహరమ్మై యుండఁగను

పె.అ.రేకు: 0039-06 గుండక్రియ సం: 15-224

పల్లవి: నన్ను నిన్ను నెంచుకోవో నారాయణా
అన్నియు నీ చేతినే అదివో నారాయణా

చ. 1: నా మన సెఱుఁగవా నారాయణా నేఁడు
నాము లాయె వయసులు నారాయణా
నామధారికపు మొక్కు నారాయణా
ఆముకొని నీ ప్రియము లందునే నారాయణా

చ. 2: నగుతా నే నంటి నింతే నారాయణా యిదె
నగ రెటిఁగినపని నారాయణా
నగవులు మాకుఁ జాలు నారాయణా
అగడుసేయకు మిఁక నప్పటి నారాయణా

చ. 3: ననలు నీ వినయాలు నారాయణా, మంచి
నను పంటి మిదివో నారాయణా
ఘనుఁడ శ్రీవేంకటాద్రిఁ గలసితి విట్లెనను
అనుమాన మెల్లాఁ బాసె నందు నారాయణా

పె.అ.రేకు: 0040-01 బౌళి సం: 15-225

పల్లవి: ఒండె లౌకికమూ వొండె వైదికము
రెండోడలఁ జాఁచ నుండునా పాదములు

చ. 1: తెగి మోక్షమార్గము తెరువైన దేహికి
మగిడి లోకముచింత మఱి యేల
సగము విత్తులకును సగము పాకమునకు
తగునా వొక్కటె కాయ తరిగిపెట్టినను

చ. 2: నలువంక దైవము నమ్మిన యట్టివారికి
మలయ మనుష్యబుద్ధి మరి యేలా
తులఁదూఁగు నొసలు బత్తుఁడు నోరు దోఁడేలు
మెలఁగిన యట్టయితే మెచ్చునా దేవుఁడు

చ. 3: తక్కక శ్రీవేంకటేశు దాసానుదాసుఁడైతే
మక్కువ నవుఁగాములు మఱి యేలా
దిక్కుల యేనుగు నెక్కి దిడ్డి దూరఁ బోతేను
వెక్కసమౌఁ గాక యిది వినసంగతి యౌనా

పె.అ.రేకు: 0040-02 గుజ్జరి సం: 15-226

పల్లవి: నాకొఱకే గడించెనో నగి యీలోకము హరి
లాకలై యెటు చూచినా లంపటా లిట్లున్నవి

చ. 1: తీరనిమాయ నా వొక దేహసంబంధానకే కా
వూరఁ గూటపు సంసార మొగిఁ జేసేము
ధారుణిలో నాయొక్కతగు బ్రదుకున కే కా
యీరీతి సీమలో యిండ్లు యెక్కడ చూచినను

చ. 2: బంతినే నాకు నానాఁటి పట్టెఁడు గూటికే కా
వంతఁ గృషిగోరక్షవాణిజ్యాదులు
వంతుల నూరేండ్లుండే వట్టియాసలకునే కా
పంతపు బ్రహ్మాండము పిఱుఁదుకొనేది

చ. 3: కొంచెపు దేవరకును కొండంత పత్తిరివలె
ముంచుకొని వున్న దిదె మోచి గర్వము
అంచల శ్రీవేంకటేశుఁ డన్నిటి కొక్కటే కీలు
యెంచి నీ శరణనఁగా నితఁడే మన్నించెను

పె.అ.రేకు: 0040-02 శ్రీరాగం సం: 15-227

పల్లవి: చిత్తగించు మా మాటలు శ్రీనరసింహ
చిత్తజజనక వో శ్రీనరసింహ

చ. 1: చెలరేఁగి యున్నాఁడవు శ్రీనరసింహ నీకు
చెలు లెల్లా మొక్కేరు శ్రీనరసింహ
సెలవుల నవ్వే రిట్టె శ్రీనరసింహ నీకె
సెలవు మా వలపు శ్రీనారసింహ

చ. 2: చిందీని చెమటలు శ్రీనరసింహ నినుఁ
జెందీ నది కడుజాణ శ్రీనరసింహా
చెందమ్మిరేకుగోళ్ల శ్రీనరసింహ నీపై
చిందు లెల్లఁ బాడేము శ్రీనారసింహ

చ. 3: సిరి నెరగౌఁగిటి శ్రీనరసింహ మంచి
సిరుల యహోబల శ్రీనరసింహ
సిర నెత్తు శ్రీవేంకట శ్రీనారసింహ నీ
నెర బడివారము శ్రీనారసింహా

పె.అ.రేకు: 0040-03 సామంతం సం: 15-228

పల్లవి: ఇందే కలిగె నీకు నిన్ని భోగాలు
అందముగాఁ జిత్తగించు మౌభళేశ్వరా

చ. 1: భవనాశి యే రనేటి పడఁతి యాలు నీకు
యివల నెదురుగొండ లీపెచన్నులు
జవళి నీపెకౌఁగిలి సరినుండే పెద్దగుహ
యవధరించఁగదయ్య అవుభళేశ్వరా

చ. 2: నీడదిరుగని మేరువు నెలఁత కంబుకంఠము
ఆడనే నిచ్చవానలు ఆపె చెమట
వాడనియట్టి శృంగారవనము యీ జవ్వనము
ఆడుకో నీకుఁ జెల్లె నవుభళేశ్వరా

చ. 3: వున్నతి యిందిరపొందు యోగానందము నీకు
కన్నుల కాపె చిత్తము గద్దెరాయి
తిన్నని మోవి నీకు తేనెల యారగింపు
అన్నిటా శ్రీవేంకటాద్రి యవుభళేశా

పె.అ.రేకు: 0040-04 గౌళ సం: 15-229

పల్లవి: నీదాసులపంచ నీడ నుండితేఁ జాలు
ఆదినారాయణ నాకు నదియెపో వ్రతము

చ. 1: హరి నిన్నుఁ బాసినట్టి యమరేంద్రలోక మొల్ల
గరిమ నీవు గూడని కర్మము నొల్ల
పరగ నీ నుతిలేని పలుచదువులు నొల్ల
హరి నీ కథ వినని సభ చొరనొల్ల

చ. 2: దేవ నీ దాస్యములేని దేవసంభాషణ యొల్ల
భావించి నీకు మొక్కని ఫలము నొల్ల
ఆవల నీ వారగించని యమృతపానము నొల్ల
శ్రీవిభుఁడ నీవులేని చింత నే నొల్ల

చ. 3: అంది నీ సేవ సేయని యగ్రజన్మమైన నొల్ల
పొంది నీ కొప్పనగాని భోగము నొల్ల
యిందునే శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
అందితి జీవన్ముక్తి యావ లేమి నొల్లా

పె.అ.రేకు: 0040-05 మలహరిసం: 15-230

పల్లవి: మునుకొని పయిఁడికి ముద్ర వాసిగతి
పనివడి యివి యేర్పరచఁగ వలెను

చ. 1: నానాత్ములలో నారాయణుఁడే
హీనాధికములు యిం దేవి
జ్ఞానాధిక లెంచఁగ నిందధికము
యీా నిజ మొకటి యెఱుఁగఁగ వలెను

చ. 2: అన్నిచోటులును యచ్యుతపదమే
యెన్నఁగ విశేష మిందేది
సన్నిధిగల యర్చావతారమిది
వున్నతి ఘన మని వుండఁగవలెను

చ. 3: పలుకు లెల్ల శ్రీపతినామములే
యిలఁ గా దనియెడి దిందేది
యెలమితో శ్రీవేంకటేశ్వరునుతియే
తలఁపున ఘనమని తడవఁగవలెను

పె.అ.రేకు: 0041-01 మాళవిగౌళ సం: 15-231

పల్లవి: ఇది యొక్కటి వివేకులకు యెంచి చూచి తెలియఁగలది
అదన నిన్నంటినవారల నీ యంతలఁ జేతువు గాన

చ. 1: బ్రహ్మాదిదివిజులకంటె నీ భక్తుఁడధికుఁడని చాటుట గాదా
బ్రహ్మలోకమునకంటెఁ బొడవున పట్టము గట్టితి ధృవునిని
బ్రహ్మ నీకంటెను నీదాస పరికరమె ఘనమను టిది గాదా
బ్రాహ్మణుఁడగు దుర్వాసుఁడంబరీషు పాదములకు మొక్కఁగఁజేసితివి

చ. 2: కర్మమార్గములనుండే ఋషులకు కడయోగ్యుఁడు నీదాఁసుఁడనుచు
నర్మిలి ముందరి బ్రహ్మపట్ట మిది హనుమంతునికి కట్టితివి
ధర్మములోపల నెక్కుడు వైష్ణవ ధర్మమధిక మని తెలుపట గాదా
మర్మపు రాక్షసుఁడగు నా బలికిని మహిఁజెడని భోగము లిచ్చితివి

చ. 3: నిఖిలవేదములకంటె నెక్కుడు నీ దాసునిమాటే యనుచు
శిఖరప్రతిష్ఠగా ప్రహ్లాదుని చేచేతనె పొడచూపితిని
సుఖులలోన నీ దాసుఁడే సుఖి యని శుకునకు మోక్షం బొసగితివి
మఖమూరితి శ్రీవేంకటేశ్వరుఁడ మాపాలిటనే దక్కితివి

పె.అ.రేకు: 0041-02 కన్నడగౌళ సం: 15-232

పల్లవి: అప్పటప్పటివేలలు నన్నియు వివేకించి
తప్పకుండా దైవమునే తలఁచపోయి జీవుఁడా

చ. 1: తచ్చిన యాహారము తరవాతనే నిద్ర
వచ్చు సురతాంతమున వైరాగ్యఁము
గచ్చుల కర్మాంతమునఁ గానవచ్చు నల పెల్లా
మెచ్చుల సత్యము కొన మించి యుండుధర్మము

చ. 2: పసిఁడి వెచ్చించునాఁడె పట్టును లోభము లెల్లా
ముసలితనాన వచ్చు విసు వెల్లాను
వెస సంసారపు వేళనే యాసలు పుట్టు
పొసఁగి యిట్టె జ్ఞానముపొంత నుండు సుఖము

చ. 3: కోపము దేరినమీఁద కూడవచ్చు శాంతము
చేపట్టి భక్తి గలిగితే చేరు మోక్షము
యేపొద్దు శ్రీవేంకటేశు నెడయక శరణంటె
కాపాడి యతఁడే యిచ్చు ఘనబ్రహ్మానందము

పె.అ.రేకు: 0041-03 బౌళి సం: 15-233

పల్లవి: కిందుపడి మొక్కకుమీ కేశవా
కెందమ్మిరేకుఁగన్నుల కేశవా

చ. 1: కేలు చాఁచే వింతలోనే కేశవా రతి
కేలికి మాయాడకే రా కేశవా
గేలి సేసేవేల మమ్ము కేశవా నీ
కేలు నా చేత నున్నది కేశవా

చ. 2: గెరసు దాఁటకు వోయి కేశవా మంకుఁ
గెరలించేవు వలపు కేశవా
గిరికుచము లివిగో కేశవా నీకు
గిరపు వెట్టు కున్నదాన కేశవా

చ. 3: కిలకిల నవ్వనేల కేశవా నీకు
కెలనివారమా నేము కేశవా
గిలిగించి కూడితివి కేశవా నాతోఁ
గెలసేవు శ్రీవేంకటకేశవా

పె.అ.రేకు: 0041-04 శంకరాభరణం సం: 15-234

పల్లవి: తలఁచి చూడ పరతత్త్వం బితఁడు
వలసినవారికి వరదుఁ డితఁడు

చ. 1: సిరికి మగఁ డమృతసింధువునకు నల్లుఁడు
సరుస పార్వతికి సయిదోడు
గరిమెల బ్రహ్మకుఁ గన్నతండ్రి యితఁడు
పరగి శివునకు బావ యితఁడు

చ. 2: అల దేవేంద్రుని యనుజుఁ డితఁడు
మలసి చంద్రుని మఱఁ దితఁడు
కులమున నదితికి కొడుకూ నితఁడు
తలఁప సురాసురలతాతయు నితఁడు

చ. 3: ప్రాణుల కెల్లా బంధుఁ డితఁడు
వాణికి మామగు వావి యితఁడు
జాణ శ్రీవేంకటాచలరమణుఁ డితఁడు
మాణికపు మన్మథుఁ డితఁడు

పె.అ.రేకు: 0041-05 బౌళి సం: 15-235

పల్లవి: వందేహం జగద్వల్లభం దుర్లభం
మందరధరం గురుం మాధవం భూధవం

చ. 1: నరహరిం మురహరం నారాయణం పరం
హరి మచ్యుతం ఘనవింహగవాహం
పురుషోత్తమం పరం పుండరీకేక్షణం
కరుణాభరణం కలయామి శరణం

చ. 2: నందనిజనందనం నందకగదాధరం
యిందిరానాథ మరవిందనాభం
యిందురవిలోచనం హితదాసవరదం, ము
కుందం యదుకులం గోపగోవిందం

చ. 3: రామనామం యజ్ఞరక్షణం లక్షణం
వామనం కామినం వాసుదేవం
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం
శ్యామలం కోమలం శాంతమూర్తిం

పె.అ.రేకు: 0041-06 ఆహిరి సం: 15-236

పల్లవి: మాయింటికి రావోయి మాధవా, నీ
మాయలెల్లాఁ గంటి మిదె మాధవా

చ. 1: మచ్చు చల్లేవు వలపు మాధవా నేను
మచ్చిక లెల్లాఁ జేసితి మాధవా
మచ్చెము నీపై నిదె మాధవా యింక
మచ్చరపు చూపు నలో మాధవా

చ. 2: మఱుఁ గేల యింక నీకు మాధవా
మఱి నాకు దక్కితివి మాధవా
మఱచేవానిచేఁతలు మాధవా మాతో
మఱచు మాటే మనేవు మాధవా

చ. 3: మట్టులేని శ్రీవేంకట మాధవా కట్టు
మట్టుతో మమ్ముఁ గూడితి మాధవా
మట్టేవు మా కాళ్లప్పటి మాధవా
మట్టె లియ్యఁగద వోయి మాధవా

పె.అ.రేకు: 0042-01 గౌళ సం: 15-237

పల్లవి: లేరా దేవతలూ లేరా లావరులూ - ఆరీతి నాఁ డెందు వోయి రధికులే కలిగితే

చ. 1: మొదల సృష్టికి నెల్ల మూలమైన బ్రహ్మదేవుని - యదె నాభిఁ బొడమించే నచ్యుతుఁడే
తుదఁ బ్రళయమునందు దొంతులుగా జగములు - వుదరమునందు నించె నొక్కఁడే నిలిచి

చ. 2: మోవలేక దేవతలు ములుగఁగ మందరము - తోవ మోచి తెచ్చినట్టి దొరవిష్ణువే
వేవేగ జలధిలోన వేసితే కుంగిన కొండ - ఆవల వీఁపున నెత్తె నాదికూర్మ మితఁడే

చ. 3: తనబంటు శేషుని తరితాడు గావించి - కొననాధారమై నిలిచె గోవిందుఁడే
దనుజులు దేవతలు తచ్చి తచ్చి యలనితె - వెనక నంతయుఁ దచ్చె విశ్వరూపుఁడితఁడే

చ. 4: కాలకూటమున కీశుఁ గంచముగాఁ జేసి మింగి - చాలి నీలవర్ణుఁ డాయె శశివర్ణుఁడే
కాలకంఠుడాయెను శంకరుఁడు పాత్రయిన వంక - పోలింప ఋగ్వేద మిదె పొగడీ నితనిని

చ. 5: అమరఁ తనయిచ్చ నమృతము పంచిపెట్టె - నమరుల కెల్లా నారాయణుఁ డితఁడె
నెమకి తా నసువైన నిర్మల కౌస్తుభము - కమలము పై లక్ష్మిఁ గైకొనె నీ ఘనుఁడె

చ. 6: మూలమని నుడిగితే మోచివచ్చి కరిఁగాచె - కోలుముందై యిందరిలో గోవిందుఁడే
తూలిన శ్రుతులు దెచ్చి తుంగిన భూమియెత్తె - అలరి భస్మాసురుని నడఁచె నీ దేవుఁడే

చ. 7: యిందు మౌళిపై నేసి యింద్రియములఁ గట్టిన- కందర్పజనకుఁడైన కమలాక్షుఁడే
కందువ పాదతీర్థపు గంగ హరు శిర మెక్కె - యెందును దైవ మితఁడే యిందిరానాథుఁడు

చ. 8: మాయలెల్లా నితనివె మహిలో సంకల్పములు - యేయెడ 'శ్రీవిష్ణురాజ్ఞ, యీతనిదే
తోయరాని చక్రముచే దుర్వాసు వారఁగాను - దాయి దండై బ్రదికించె తనబంటు చేత

చ. 9: సంది నన్నిమతముల సన్యాసులకు గతియై - అందరి నోళ్లకు నారాయణు నామమే
ముందు సంధ్యాజపముల మూలపు టాచమనము - అందుల కితని కేశవాది నామములె

చ. 10: వాదుల 'నదైవం కేశవాత్సర ' మని తొల్లి- వేదవ్యాసులనిన విభుఁడీ హరి
సోదించి వశిష్టుడును శుకనారదాదులు - పోదితోడ దాసులైరి పురుషోత్తమునికి

చ. 11: బాణాసురుని నటికి భంగపడఁగా విడిచె-వేణునాదప్రియుడైన విఠ్ఠలుఁడే
బాణమై త్రిపురములు భస్మీకరము చేసె - ప్రాణుల రక్షించే నీ పరమాత్ముఁడే

చ. 12: ఆపదలందినవేళ యసురబాధలు మాన్ప- చేపట్టిలోకము గాచే శ్రీపతియే
పై పై నింద్రాదులకు పారిజాతాదిసిరులు- వైపుగాఁ గాయించిన వరదుఁడు నితఁడే

చ. 13: భూమి యీతనిసతి యంబుదు లితని పరపు - సోమ సూసాదు లితని చూపుఁగన్నులు
వేమరు నూర్పులే గాలి విష్ణుపద మాకాశము - వాములైన హరి నీ వాసుదేవుఁడే

చ. 14: హరువిఁ బూజించవలె నంటె నర్జుననక - సిరులఁ బాదము చాఁచె శ్రీకృష్ణుఁడే
అరిది మార్కండేయుఁ డతని మహిమ చూచి - వరదైవా మితఁ డని వాదించి కొలిచె

చ. 15: ధృవపట్ట మితఁ డిచ్చె దొరకొని శరణంటే - వివరింప నిదివో శ్రీవేంకటేశుఁడే
యివల నితనిఁ జెప్పనెవ్వరివశము లింక - భువిఁ బార్వతి హరినిఁ బొగడేటినాఁడు

పె.అ.రేకు: 0042-02 లలిత సం: 15-238

పల్లవి: అసలు చెరుచకుమీ యచ్యుత ఆ సుద్దులె యీ సుద్దులు అచ్యుతా

చ. 1: అలవాటే తొల్లే నీకు నచ్యుతా అలుగము ఇంక నీతో నచ్యుతా
ఆలయకు మింక నీవు అచ్యుతా నిన్ను నలమి పట్టెఁగాని యచ్యుతా

చ. 2: ఆలసించఁ బనిలేదు అచ్యుతా ఆలిమగని సంధి నచ్యుతా
ఔలే నీ విట్టే యచ్యుతా ఆలించి మమ్మేలితివి ఆచ్యుతా

చ. 3: ఆసము దించకు మింక నచ్యుతా అసురుసురై చిక్కితి మచ్యుతా
ఆసలు చెమటఁ గడి యచ్యుతారతి యసుదా శ్రీవేంకటాద్రి యచ్యుతా

పె.అ.రేకు: 0042-03 వరాళి సం: 15-239

పల్లవి: చతురుఁడ వన్నిటాను జనార్దనా మమ్ము
సతముగా నేలితివి జనార్దనా

చ. 1: సమమోహాలు మనవి జనార్దనా యిట్టె
జమళి నున్నార మిదె జనార్దనా
సమకూడెఁగా లెస్స జనార్దనా నీ
సముక మెవ్వరి కబ్బు జనార్దనా

చ. 2: చవులాయె సరసాలు జనార్దనా పెండ్లి
చవికెలో మనకు జనార్ధనా
సవరని వాఁడవు జనార్దనా మరి
సవతు లేరు నీకు జనార్దనా

చ. 3: సంకె దీరఁ గూడితివి జనార్దనా నీకు
చంక లెత్తి మొక్కేము జనార్దనా
జంకించకు శ్రీవేంకట జనార్దనా
శంకుఁజక్రములచేతి జనార్దనా

పె.అ.రేకు: 0043-01 దేపాళం సం: 15-240

పల్లవి: కొల్లవలపులు చల్లే గోవిందరాజ నిన్ను
గొల్లెతలు నవ్వేరు గోవిందరాజ

చ. 1: గొప్పలు మా చన్ను లివి గోవిందరాజ నిన్ను
కుప్పెలవలె నొత్తీని గోవిందరాజు
కుప్పించి బిగించకు వో గోవిందరాజ మేనఁ
గుప్పళించీ పెంజెమట గోవిందరాజ

చ. 2: కొనగోరి సతులము గోవిందరాజ పై
కొనిపాదాలు చాఁచేవు గోవిందరాజ
కొనబు మాట లేలోయి గోవిందరాజ నీతో
గునిసి మానే మింక గోవిందరాజ

చ. 3: కోడెమనసువారము గోవిందరాజ మాపై
గూడలఁ జల్లేవు సిగ్గు గోవిందరాజ
కూడితి శ్రీవేంకటాద్రి గోవిందరాజ యిట్టె
కోడి గూసెఁ దెల్లవారె గోవిందరాజ

పె.అ.రేకు: 0043-02 శ్రీరాగం సం: 15-241

పల్లవి: వెట్టి వలపుచల్లకు విష్ణు మూరితి నాతో
వెట్టి దేర మాటాడు విష్ణుమూరితి

చ. 1: వినయము నేసేవు విష్ణుమూరితిఁ నీవు
వెనకటివాఁడవే కా విష్ణుమూరితి
వినవయ్య మామాఁట విష్ణుమూరతి మమ్ము
వెనుకొని పట్టకుమీ విష్ణుమూరితి

చ. 2: వెరవు గలవాఁడవు విష్ణుమూరితి నేఁడు
వెరగైతి నిన్నుఁ జూచి విష్ణుమూరితి
విరివాయ నీ మాయలు విష్ణుమూరితి నాకు
విరు లిచ్చేవప్పటిని విష్ణుమూరితి

చ. 3: వెలసె నీ సేఁతలెల్లా విష్ణుమూరితి మా
వెలువలలోన నివె విష్ణుమూరితి
వెలలేని శ్రీ వేంకట విష్ణుమూరితి కూడి
విలసిల్లితివి నాతో విష్ణు మూరితి

పె.అ.రేకు: 0043-03 రామక్రియ సం: 15-242

పల్లవి: మానరాని చుట్టమవు మధుసుదనా నీ
మానినిఁ జుమ్మీ నేను మధుసూదనా

చ. 1: మఱువకుమీ మా పొందు మధుసూదనా యింకా
మఱుఁగులేని మనకు మధుసూదనా
మఱి యేమి చెప్పేవు మధుసూదనా యే
మఱక మ మ్మేలుమీ మధుసూదనా

చ. 2: మడచి యా కిచ్చె నింద మధుసూదనా మేన
మడుగులాయె చెమట మధుసూదనా
మడిదొంసకులు గావు మధుసూదనా నాకు
మడుక పన్నాయె మేలు మధుసూదనా

చ. 3: మందెమేళ మాయె రతి మధుసూదనా గొల్ల
మంద లెల్ల నీ సుద్దులే మధుసూదనా
మందు చల్లి కూడితివి మధుసూదనా మా
మందిరము శ్రీవేంకటమధుసూదనా

పె.అ.రేకు: 0043-04 ముఖారి సం: 15-243

పల్లవి: వేగిరించ కంతేసి త్రివిక్రము
సేగుఁజుక్క రానీ త్రివిక్రమ

చ. 1: వేసరించఁ జుమ్మీ త్రివిక్రమ నిన్ను
వీసమంతపనికే త్రివిక్రమ
వేసేవు పూవులను త్రివిక్రమా మేని
వేసురుఁ జెమటల త్రివిక్రమ

చ. 2: వెన్నెలలో నవ్వకు త్రివిక్రమా కన్న
విన్నవారేమందురో త్రివిక్రమా
విన్నాణపుచేఁతల త్రివిక్రమా
వెన్నగారీ నీ మోవి త్రివిక్రమా

చ. 3: వెడజారెఁ దురుము త్రివిక్రమా నన్ను
విడిదిలోఁ గూడితి త్రివిక్రమా
విడువ శ్రీవేంకటత్రివిక్రమా నీ
విడియుడి మెచ్చితి త్రివిక్రమా

పె.అ.రేకు: 0043-05 పాడి సం: 15-244

పల్లవి: వద్దు వద్దు సట లింక వామనా నీ
వద్దనే వున్నార మిదె వామనా

చ. 1: వరుసలు వెదకేవు వామనా నీవు
వరుఁడ విందరికిని వామనా
వరవాత వలపంచి వామనా దే
వరవలె నున్నాఁడవు వామనా

చ. 2: వనము కోఁగిల వైతి వామనా నీకు
వనితలు బాఁతి వామనా
వనలేరు గొల్లెతలు వామనా కా
వను వేళ చూచుకోమీ వామనా

చ. 3: వాడవారు మొక్కేరు వామనా నీకు
వాడుదేరె కెమ్మోవి వామనా
వాడికె శ్రీవేంకటాద్రివామనా
వాడేచెలమవు నీవు వామనా

పె.అ.రేకు: 0043-06 శ్రీరాగం సం: 15-245

పల్లవి: చెప్పరానిమహిమల శ్రీధరా నీవు
చెప్పినట్టు చేసేము శ్రీధరా

చ. 1: చేరఁ దీని నా కన్నుల శ్రీధరా నీ
జీరల మేను చూచితి శ్రీధరా
చేరువ సంతోష మబ్బె శ్రీధరా
చీరుమూరాడీఁదమి శ్రీధరా

చ. 2: చెల్లు నన్నియును నీకు శ్రీధరా నీ
చిల్లరసతులు వారే శ్రీధరా
చెల్లఁబో ఆసుద్ది విని శ్రీధరా నాకు
చిల్లులాయె వీనులెల్లా శ్రీధరా

చ. 3: సేవలు సేసేము నీకు శ్రీధరా మమ్ముఁ
జేవదేరఁ గూడితివి శ్రీధరా
చేవల్లకు రావోయి శ్రీధరా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీధరా

పె.అ.రేకు: 0043-07 సామంతం సం: 15-246

పల్లవి: ఇద్దరము నిద్దరమె హృషీకేశ
యిద్దె సనకాన వచ్చె హృషీకేశా

చ. 1: ఏఁటికోయి మాతో హృషీ కేశ
యీటువెట్టేవు సతుల హృషీ కేశ
యీటారదు మాపొందు హృషీ కేశ నీపై
యేటి దియ్యమింక నేము హృషీ కేశ

చ. 2: ఇచ్చకురాలను నేను హృషీకేశ నిన్ను
నెచ్చుకుందులాడఁ జాల హృషీకేశ
ఇచ్చితి వింత చనవు హృషీకేశ నీకు
నెచ్చరించే మరవకు హృషీకేశ

చ. 3: యేల నీకు మఱుఁగులు హృషీకేశ నన్ను
నీలాగునఁ గూడితివి హృషీకేశ
యేలితి శ్రీవేంకటాద్రి హృషీకేశ
యీలీలనే వుండుమీ హృషీకేశ

పె.అ.రేకు: 0044-01 శంకరాభరణం సం: 15-247

పల్లవి: బందుగుఁడ వన్నిటాను పదుమనాభ వట్టి
బందెలు గట్టకు మమ్ము పదుమనాభ

చ. 1: పట్టిన చలపాదివి పదుమనాభ మమ్ము
బట్టబయ లీఁదించేవు పదుమనాభ
పట్టితి బలిమి నన్నుఁ బదుమనాభ యింకా
బట్టము గట్టుకొనేవు పదుమనాభ

చ. 2: పాటలు వాడేవు యీడ పదుమనాభ ఆ
పాటివారమా విన పదుమనాభ
పాటిగంప నీళ్ళు నించేవు పదుమనాభ బండి
బాటలాయె నీగుట్టు పదుమనాభ

చ. 3: పలికినట్టే యాయె పదుమనాభ
బలవంతుఁడవు నీవు పదుమనాభ
పలుమారుఁ గూడితివి పదుమనాభ యిదె
పలమా శ్రీవేంకట పదుమనాభ

పె.అ.రేకు: 0044-02 భైరవి సం: 15-248

పల్లవి: తప్పని బొంకని యట్టి దామోదర నాకు
దప్పిదేర మో వియ్యవో దామోదరా

చ. 1: తరితీపుమాట లెల్ల దామోదరా నీకు
తరుణులు వేరిపిరా దామోదరా
దరిచేరె సంకు నీచే దామోదరా నీవు
తరగరివె తగు దామోదరా

చ. 2: తగులు వీరి పందేల దామోదరా నీ
తగవు లేల చెప్పేవు దామోదరా
దగదొట్టి పలికేవు దామోదరా వెను
తగిలితి విందాఁక దామోదరా

చ. 3: తల యెత్తు మా ముందర దామోదరా నీ
తళుకుమోవి చూచి దామోదరా
తలకొని కూడితివి దామోదరా యింక
తలఁగకు శ్రీవేంకటదామోదరా

పె.అ.రేకు: 0044-03 గౌళ సం: 15-249

పల్లవి: వాడిక లాయె నీ పొందు వాసుదేవుఁడా
వాడుదేరెఁ గెమ్మోవి వాసుదేవుఁడా

చ. 1: వాలుకచూపులు మావి వాసుదేవుఁడా మమ్ము
వాలాయించితివి నీవు వాసుదేవుఁడా
వాలారుగోళ్ల నొత్తకు వాసుదేవుఁడా నీకు
వైళమె నవ్వు వచ్చును వాసుదేవుఁడా

చ. 2: పలపెల్లా మా సొమ్ము వాసుదేవుఁడా యింత
వలెనా మాతోడి రట్టు వాసుదేవుఁడా
వలుములు చన్నులంటా వాసుదేవుఁడా వట్టి
వళుకులఁ బెట్టకుమీ వాసుదేవుఁడా

చ. 3: వడదేరె శ్రీవేంకటవాదేవుఁడా యేల
వడిసేవు తరితీపు వాసుదేవుఁడా
వడిగొనఁ గూడితివి వాసుదేవుఁడా మన
వడు వెవ్వరికిఁ గద్దు వాసుదేవుఁడా

పె.అ.రేకు: 0045-04 సాళంగనాట సం: 15-250

పల్లవి: పంతము దప్పదు నీకు ప్రద్యుమ్నా వొక్క
బంతిఁ గూడేవు సతుల ప్రద్యుమ్నా

చ. 1: బలబలఁ దెల్లవారె ప్రద్యుమ్నా యింకా
బలిమిసేయ వచ్చేవు ప్రద్యుమ్నా
పలచనాయె సిగ్గులు ప్రద్యుమ్నా నీ
పలుసోకులవలెనే ప్రద్యుమ్నా

చ. 2: పచ్చలాయ కట్టేవు ప్రద్యుమ్నా
బచ్చెన ప్రియాలు చూపి ప్రద్యుమ్నా
బచ్చుబేరాలసటల ప్రద్యుమ్నా నీ
పచ్చడ మంటించేవు ప్రద్యుమ్నా

చ. 3: పదరకు మింక నీవు ప్రద్యుమ్నా మా
బదుకు నీచేతిది ప్రద్యుమ్నా
పదనై శ్రీవేంకటాద్రి ప్రద్యుమ్నా నన్నుఁ
బదిమారులు గూడితి ప్రద్యుమ్నా

పె.అ.రేకు: 0045-05 నాట సం: 15-251

పల్లవి: అంతా నీకు లోనే అనిరుద్ధా మన
యంతరంగ మొక్క టాయె ననిరుద్ధా

చ. 1: అడ్డమాడఁ జాలము నీ కనిరుద్ధా
అడ్డేఁ డమ్మీనాఁడుఁ బోడి యనిరుద్ధా
అడ్డివెట్ట నింక నేల యనిరుద్ధా
అడ్డాఁక లెంచకుమీ యనిరుద్ధా

చ. 2: అప్పటి వేఁడుకొనేవా అనిరుద్ధ నీకు
నప్పణ నే నిచ్చేనా యనిరుద్ధా
అప్పుడే విన్నవించనా అనిరుద్ధ వొద్ద
నప్పసమై వున్నదాన ననిరుద్ధా

చ. 3: ఆయ మెఱుఁగుదువోయి అనిరుద్ధా
ఆయెడను డి వచ్చితి వనిరుద్ధా
ఆయితమై కూడితివి అనిరుద్ధా
ఆయనాయ శ్రీవేంకట యనిరుద్ధా

పె.అ.రేకు: 0045-06 బంగాళం సం: 15-252

పల్లవి: పోకు పోకు మంత నీవు పురుషోత్తమా వట్టి
బూకలు మే మెఱుఁగమా పురుషోత్తమా

చ. 1: పొలసులాడకు నీవు పురుషోత్తమా నీ
పొల జాణతనాలు పురుషోత్తమా
పులుసువేసి నీ చెంత పురుషోత్తమా నేము
పులు గరసితి మింత పురుషోత్తమా

చ. 2: పొడవాటి సటకాఁడ పురుషోత్తమా
పొడమె నీ మోవినవ్వు పురుషోత్తమా
పుడిశెఁడే నీ సిగ్గు పురుషోత్తమా
పొడిరాలి రతులలో పురుషోత్తమా

చ. 3: పొద్దువొద్దు కొత్త లేల పురుషోత్తమా నీవు
బుద్దెఱింగినప్పు డయ్యో పురుషోత్తమా
అద్దుకొని శ్రీవేంకటాద్రి పురుషోత్తమా నీది
బొద్దువంటి యుంగరము పురుషో'త్తమా

పె.అ.రేకు: 0045-01 మాళవి సం: 15-253

పల్లవి: అల్లనాఁడే కంటి వింటి నధోక్షజా
అల్లుకొంటి విని చెలుల నధోక్షజా

చ. 1: అందు నిందు నీ యిర వధోక్షజా
అందాలు చెప్ప వచ్చే వధోక్షజా
అందరు నెఱుఁగుదురు యధోక్షజా మాకు
నందుకొని బా సిచ్చే వధోక్షజా

చ. 2: అంగడి మొక్కువారమా అధోక్షజా నీకే
యంగము యీా నడవడి యధోక్షజా
అంగజముద్రలు నించే వధోక్షజా నీ
యంగనలు గాదనేరా యధోక్షజా

చ. 3: అసరాదు గాక నిన్ను నధోక్షజా కడు
ననుకాయెఁ బ్రియములు అధోక్షజా
అనుఁగు శ్రీవేంకటాద్రి యధోక్షజా మమ్ము
నవిశముఁ గూడితివి యధోక్షజా

పె.అ.రేకు: 0045-01 భూపాళం సం: 15-254

పల్లవి: శిర సెత్తఁగదవయ్య శ్రీనారసింహ నీ
సిరులెల్లా నేనే కానా శ్రీనారసింహ

చ. 1: చెలుల నంపితివేల శ్రీనారసింహ నాకు
సెలవుల నవ్వు వచ్చె శ్రీనారసింహ
చెలువపు నిన్నుఁ జూచి శ్రీనారసింహ నీపై
చిలికితి మోహమెల్ల శ్రీనారసింహ

చ. 2: చిత్తాన నిన్నుఁ దలఁచి శ్రీనారసింహ నే
చిత్తరు పతిమ నైతి శ్రీనారసింహ
చిత్తవాన చెమటల శ్రీనారసింహ యేల
చిత్తిణిగుణము నీకు శ్రీనారసింహ

చ. 3: శ్రీసతి నీ తొడ యెక్కె శ్రీనారసింహ నీవు
సేసవెట్టితి వాపెపై శ్రీనారసింహ
చేసన్న శ్రీవేంకటాద్రి శ్రీనారసింహ యింత
సేసినన్నుఁ గూడితివి శ్రీనారసింహ

పె.అ.రేకు: 0045-02 శంకరాభరణం సం: 15-255

పల్లవి: ఏమిటాఁ బోరాదు దేహి కిందిరా నాథుఁడే
ఆముకొ నితని శరణనుటే వుపాయము

చ. 1: అట్టె కోపగించ నంటేనా నాజ్ఞ నడవదు
పట్టి శిక్షించే నంటే పాపము హింస
తొట్టి యేమీ నొల్ల నంటే తోయదు సంసారము
కట్టు కొంటే బంధము మోక్షమునకు దూరము

చ. 2: వొకరి రక్షించఁబోతే నొకరి కపకారము
సకలము మానితేను జన్మము వృథా
ఆకట దానము సేసే నంటే ధనము లేదు
సుకరపు ధనకాంక్ష సుజ్ఞానరహితము

చ. 3: తనువు పోషించనంటే తగులు నింద్రియములు
ఘనవిరక్తుఁడైతే లోకము మెచ్చదు
మనసు గెలిచేనంటే మర్మము శ్రీవేంకటేశుఁ
డొనర వివేకించక వుడుగుదు మదము

పె.అ.రేకు: 0045-03 ఆహిరి సం: 15-256

పల్లవి: ఎక్కడి జాలి యేఁటికి నీకు యెవ్వరివంకా నేమిఁకఁ గలదు
తక్కిన వెల్లా దడవక మాని ధర్మమెటిఁగి బ్రదుకవో మనసా

చ. 1: పుట్టినయపుడే తమకర్మములు పొదుగకపోవు జీవుల నెల్లా
నెట్టనవిధినిఁ గడచేనంటే నేర్పునఁ బడదు బ్రహ్మకునైనా
అట్టిట్టనకా హృదయములోని హరికే శరణు చొచ్చితి నంటే
గట్టిగ నతఁడే దిక్కయి నిలిచి కావఁగఁ గలఁడు వెఱవకు మనసా

చ. 2: సొంపున నీ సంసారంబునకు చొచ్చినయపుడే తగిలెను తొడుసు
దింపఁగరాని మోపులు సుమ్మీ తీపులు రేఁచీ సంపద లెల్లా
రంపపుటాన దీనికిఁ దోడు రాతిరిఁ బగలు పెట్టని తరవు
యింపున గోవిందా యని నొడుగు యితఁడే దయరక్షించును మనసా

చ. 3: కావలెనని తాఁ గోరినయపుడే కప్పునుమాయ తోయఁగరాదు
కేవలమైన వుపమలచేత గెలువఁగరాదు తెలియని చిక్కు
ఆవల నేమీఁ దడవఁగ నేలా యఖిలంబునకు నేలికెయైనా
శ్రీవేంకటేశుపాదములెపుడూ సేవింపుచునుచెలఁగవో మనసా

పె.అ.రేకు: 0045-04 లలిత సం: 15-257

పల్లవి: ఏమని చెప్పుట మా యజ్ఞానము యెఱఁగి యెఱఁగి తెలియఁగలేము
శ్రీమాధవనీ మఱుఁగు చొచ్చితిమి చిత్తగించి దయఁచూడఁగదే

చ. 1: నీవు రక్షకుఁడవై భువి నుండఁగ నే గడియించే దిఁక నేమీ
జీవాంతరాత్ముఁడవై యుండుదువట చేకొని కావక మానేవా
వేవేలుగఁ బుట్టించఁ గర్తవట వెలయించఁగ నీ భారము గాదా
భావించనేరక వట్టి స్వతంత్రము పయివేసికొనుచుఁ బరగేము

చ. 2: పలుదెఱఁగుల నీ నామము లుండఁగ పాపములకు వెఱవఁగనేలా
బలిమినీముద్రలు యంతటఁ జెల్లఁగ పై కొనునా యింక నరకముల
తలఁక కభయహస్తము నీ వెత్తఁగ దాసుల కిఁక నెక్కటి భీతి
నిలుపఁగ నేరక మనసు వెంబడినే నిచ్చనిచ్చలునుఁ బొరలేము

చ. 3: అది నీరూపము తిరువారాధన య్యైయుండఁగ వెదకఁగ నేలా
పదిలపుటాచార్యుఁడు గలుగఁగ నిహ పరముల త్రోవడుగఁగ నేలా
వుదుటున వరములు శ్రీవేంకటేశుఁ డొసగఁగ నే కోరఁగ నేలా
తుదమొద లెంచక యిన్నాళ్లు నేమటి దొరకొని యింకనుతియించేము

పె.అ.రేకు: 0046-01 శుద్ధదేశి సం: 15-258

పల్లవి: అటుగానా యేమి సేసినా యధికుల దూషింపఁగ జనదు
పటుగతి వారల మహాత్మ్యంబులు పరికింపఁగా ననంతములు

చ. 1: ధరలో దుర్వాసుఁడు గోపియైన తపమునకు భంగ మనఁ దగునా
పరాశరుఁడు మత్స్యగంధిఁ గోరిన పాపమంటునా యాతనికి
అరసి వాయుజుఁడు బ్రహ్మపట్టమున కాసగించితే లాఘవమా
సరి జనకుఁడు రాజ్యఁబు చేసితే సద్గతిఁ బొందక తొలంగెనా

చ. 2: అనలుఁ డెప్పుడు సర్వభక్షకుఁడైతే నశుచిత్వము గలదా
దినకరుకిరణము హేయము లంటిన దినదీప్తికి నిగడ మగునా
వొనర చంద్రునకు కళంకు గలిగిన నుడుగక శైత్యము మానీనా
ఘనుఁడగు శేషుఁడు విషధరుఁడైతే కడుఁ బాండిత్యము దరగీనా

చ. 3: అల ప్రహ్లదుడు రాక్షస జన్మంబైనంతనె భక్తికిఁ గొదువా
కులముగల హరిశ్చంద్రుఁడంత్యజునిఁ గొలిచిన సత్యము కడ మగునా
కలహప్రియుఁడైనా నారదునకుఁ గలిగిన సాత్వికమునఁ గొఱతా
యెలమి శ్రీవేంకటేశుఁడు తనదాసుల యిండ్లనున్న నధికుఁడే కాఁడా

పె.అ.రేకు: 0046-02 బౌళి సం: 15-259

పల్లవి: ఎంత గాల మైనా నిట్టె యీ జీవులకు నెల్లా
పొంతనుండి కావవయ్యా పుట్టించిన దేవుఁడా

చ. 1: పండును సస్యము లెల్లా పరగ నేఁటేఁటన
పండదు మనసు వొకపరియైనాను
నిండును తటాకములు నెలకొన్న వానలను
నిండ దొకరి నడిగే నిరతపు నోరు

చ. 2: వికసించు విరు లెల్లా వెసఁ దతి వచ్చితేను
వికసించ దెంతైనా విజ్ఞానము
వొకచోట నిలుచును వొద్దికతోఁ గొండ లెల్లా
వొకచోటా నుండవు వొంటి విశ్వాములు

చ. 3: వస మౌను మదించిన వనగజ మైనాను
వసము గా దెంతైనా వయోమదము
యెసగ శ్రీవేంకటేశ యేలికవు నీవు మాకు
యెసగదు నీ కృపచే నిఁకఁ బూర్వకర్మము

పె.అ.రేకు: 0046-03 లలిత సం: 15-260

పల్లవి: గోవిందా శ్రితగోకులబృందా
పావన జయ జయ పరమానందా

చ. 1: జగదభిరామ సహస్రనామా
సుగుణధామ సంస్తుతనామా
గగనశ్యామా ఘనరిపుభీమా
అగణితరఘు వంశాంబుధి సోమా

చ. 2: జననుతచరణా శరణ్యశరణా
దనుజహరణ లలితస్ఫురణా
అనుఘాచర ణాయత భూభరణా
దినకరసన్నిభదివ్యాభరణా

చ. 3: గరుడతురంగా కారోత్తుంగా
శరధిభంగా ఫణిశయనంగా
కరుణాపాంగా కమలాసంగా
వర శ్రీవేంకటగిరిపతి రంగా

పె.అ.రేకు: 0046-04 గౌళ సం: 15-261

పల్లవి: తరితీపులఁ బెట్టీని తనముందర నిప్పుడు
హరిమాయ యింకా నెంత ఆసల ముంచీనో

చ. 1: అన్ని వేడుకలు గల యఖిల ప్రపంచము
కన్నులు మూసితే నెక్కడ నుండునో
చెన్నుమీఱ గృహారామక్షేత్రాదు లవి యెల్లా
యెన్నఁగా నిద్రించేవేళ యేడ నుండునో

చ. 2: వొసఁగ తా భోగించిన భోగోపకరణములు
యెసగఁ గౌన కెక్కితే నేమి సేసునో
వసమైన పుత్రమిత్ర వర్గంబు లెల్లాను
వెసన వేరొక్క జన్మపువేళ నెట్టు లుందురో

చ. 3: పరగఁ దాఁ జేసిన పాపము శ్రీవేంకటేశు
శరణాతుఁడైతే నే చందమగునో
అరుదైన తనతొంటి యజ్ఞానము లన్నియును
గురుకృపగలవేళ కొంచి యెందు దాఁగునో

పె.అ.రేకు: 0046-05 భైరవి సం: 15-262

పల్లవి: అక్కటా ప్రాణికిని అహంబ్రహ్మత్వమే కాని
దిక్కుదెస యైనవానిఁ దెలుసుకో నోపఁడు

చ. 1: కలలోన సృజియించుఁ గర్తయై యంతర్యామి
లలిఁబ్రపంచ మింద్రజాలములవలె
తలపోయు జీవుఁడు తనకృత్యములు గావు
వెలి నెందుఁ బుట్టె నని విచారించుకోఁడు

చ. 2: యెదుటనే పొడమించు యీరూపు లాత్మేశుఁడు
కదిసి పురాణముల కతలవలె
వదలక జీవుఁ డెవ్వరిని నేమించలేఁడు
పదరక మూలముట్టు భావించుకోఁడు

చ. 3: కనిపించు మోక్ష మిక్కడ శ్రీవేంకటేశుఁడు
పనివడి తన తపఃఫలమువలె
ఘనతఁ బొందుజీవుఁడే కర్మమువాఁడుగాఁడు
గొనకొన్న మహిమల గుఱు తెంచుకొనఁడు

పె.అ.రేకు: 0046-06 సాళంగనాట సం: 15-263

పల్లవి: తమసత్వ మెఱిఁగియ దాఁచిరి గాకా
తము నేలే రాము స్వతంత్రము చూపవలసి

చ. 1: హనుమంతునితోఁక నసురులందరుఁ గూడి
ముని లంకలో నగ్ని ముట్టించే వేళను
'అనలము శీతో భవ' యన నేరిచిన సీత
పనివి 'రావణ హతో భవ' యన నేరదా

చ. 2: అంకెల జలధి దాఁటి యట రాముని ముద్రిక
సంకె లేక చేతఁ బట్టి సాహసమునా
లంకాధిదేవతయైన లంకిణిఁ గొట్టినవాఁడు
వుంకించి రావణుఁ జంప నోపఁడా వాయుజుఁడు

చ. 3: శ్రీవేంకటేశుఁడైన శ్రీరాఘవుని పంపున
వావిరి నంగదముఖ్యవానరులెల్లా
ఆవేళ హేమపాత్ర లగ్నిలో వేసినవారు
రావణునందులో వేసి రా నోపరా

పె.అ.రేకు: 0047-01 కాంబోది సం: 15-264

పల్లవి: కాదు వివేకము యిది కాదు యవివేకము
సోదించి నీకు శరణు చొరవలెఁ గాని

చ. 1: కందువఁ దొల్లిటి జన్మకథ యేమి నెఱుఁగఁడు
ముందరిజన్మమునకు ముంచి పుణ్యము సేసును
యిందేమి గనెనో దేహి యెవ్వరి నమ్మెనో తాను
సందడి భోగములలో సాములు సేసీని

చ. 2: గరిమ భూమండలము కడపల గానఁడు
పరము గావలెనని పాట్లఁబడి దేహి
యిరవు దనకు నేదో యెఱిఁగిన యెఱుకేదో
పరగిన యాసలకే పట్టి పెనఁగీని

చ. 3: తగ నిదరించేవేళ తన స్వతంత్రము లేదు
మిగులా నుద్యోగించు మేలుకొనేవేళ
నిగిడి శ్రీవేంకటేశ నీ వంతరాత్మ వనక
వెగటుఁ జదువులలో వెదకఁ జూచీని

పె.అ.రేకు: 0047-02 మధ్యవవతి సం: 15-265

పల్లవి: ఇప్పుడు నమ్మినవారి కింతకంటె సులభుఁడు
తప్పక తలఁచుకోరో దైవజ్ఞులాలా

చ. 1: సీతావిరహ మోర్చి శ్రీరామచంద్రుడు
భ్రాతయైన లక్ష్మణునిఁ బాయలేఁ డాయ
ఆతుమ బంధువులకంటె నండఁ బాయక కొలిచె
నీతికైంకర్యపరుఁడే నిజబంధుఁ డాయెను

చ. 2: వడి దశరథుఁ బాసి వచ్చిన రాఘవునికి
కడు సుగ్రీవుచుట్టరికము గలిగె
తడయక కనిపించె తల్లిదండ్రులకంటె
నడరిన సేవకుఁడె యంతరంగుఁ డాయెను

చ. 3: మచ్చికతో భరతునిమాట మీఱినరాముఁడు
మెచ్చి విభీషణు భక్తి మీఱలేఁ డాయె
అచ్చపు శ్రీవేంకటేశు అన్నదమ్ములకంటెను
తచ్చి శరణాగతుఁడె తగ నిష్టు డాయెను

పె.అ.రేకు: 0047-03 భైరవి సం: 15-266

పల్లవి: వానివాని భావము వద్దనరాదు
తానందుఁ దొరల నంటే తప్పులు లేవు

చ. 1: సొరిది చింతపులుసు చూచితే నోరూరును
వరుసలం జవిగొన్నవాఁడు గాఁడు
పరగ దేహప్రకృతి పదార్థగుణము లవి
తొరల కెఱఁగుకొంటె దోషము లేదు

చ. 2: నెలకొన్న యింతుల వర్ణించితె బుద్ధి చలించు
వలసి యంటి ముట్టిన వాఁడు గాఁడు
తలఁపు లక్ష్యము గుఱి దాఁకిన భావము లవి
తలఁకక తెలిసితే తగు లేమి లేదు

చ. 3: రీతితో సర్పమును మంత్రించితే కరవదు
వాత సూత్రము గట్టినవాఁడు గాఁడు
యీతల శ్రీవేంకటాద్రి యీశ్వరు మహిమ లివి
యేతులఁ గొలిచితేను యేకర్మము లేదు

పె.అ.రేకు: 0047-04 బౌళి సం: 15-267

పల్లవి: ఏమఱఁ జనదు బ్రదికేటి కాలము యెఱిఁగిన మహాత్ములకును
శ్రీమంతుఁడగు హరినేతలఁచిన చీఁకటు లన్నియుఁ బెడఁబాయు

చ. 1: చేరి వుండెడిది బ్రహ్మలోకమటశ్వేతుఁ డను రాజట భువిమీఁదకి
కారణమున నేతెంచి నిత్యమును కళేబరంబట తన కాహారము
ఆరయ సంపదలే పనికివచ్చునట లో కాంతరగతి నే మున్నది
శ్రీరమణునికే శరణు చొచ్చినను చెడనిభోగములు చేచేతఁ గలుగు

చ. 2: చేసన క్రతువులు నూఱట నహుషుఁడు చెలఁగుచు దేవేంద్రపట్ట మేలె నట
దోస మించుకంతకుఁగా భువిపైఁ దలుచుఁ బామై పడియె నటా
ఆసలఁ గర్మము నెట్టు నమ్మెడిది అమరత్వము ఫలమది యెట్లెంచుట
వాసుదేవునిఁ గొలిచి తా నతనివాఁడై యుండిననెలకొను శుభము

చ. 3: వెలయఁగ త్రిశంకు డనియెడి రాజట విశ్వామిత్రుని పరిగ్రహం బట
అలరిన చండాలత్వ మొందె నట యంతరిక్షమున నుండెనటా
బలుములు యెందాఁక వెంటవచ్చును పాయంబులుమఱి చెప్పఁగనేలా
యిలధరుఁడగు శ్రీవేంకటేశ్వరుని నెఱిఁగి దాసుఁడగుటే సత్ఫలము

పె.అ.రేకు: 0047-05 బౌళి సం: 15-268

పల్లవి: కాదని తోయఁగ నెంతటివారలుఘనసంసారులు నరులునుసురలును
నీ దాసులతో సంగతి సేయఁగనిర్మలచిత్తం బయ్యీఁగాక

చ. 1: హరి నీ మాయె విజృంభించునట నడఁచే మన నెవ్వరితరము
దరిగొని నీకె మొక్కఁగ తానే మన్నించీఁ గాక
నిరతి నీ యాజ్ఞ జగతిఁ జెల్లునట నెట్టిన నిది గడచేవా రెవ్వరు
ధరణిలోని వారమని యాదుకొనఁగ తప్పులు వట్టక కాచీఁగాకా

చ. 2: ధాత నీసుతుఁడు పుట్టించువాఁడట తగదని తోయఁగ సెవ్వఁ డోపు నిఁక
ఆతుమలో నిను ధ్యానము సేయఁగ నతఁడే మొగమోడీఁ గాక
ఘాతలమదనుఁడు మదము రేఁచునట కాదని గెలువఁగఁ గలరాయెవ్వరు
రాతిరిఁ బగలును నిన్నె జపించఁగ రతిఁ గైవస మయ్యీఁ గాకా

చ. 3: నీ కల్పితమగు కర్మమంటు నట నెఱి విడిపించఁగ సమర్థు లెవ్వరు
చేకొని నీవే గతి యని యుండఁగ చిక్కులఁ బెట్టుక చనుఁగాక
యీకడ శ్రీవేంకటేశ్వర నీవే యెందుఁజూచినా నంతరాత్మ వట
పైకొని నిన్నే నమ్మి వుండఁగాఁ బ్రసన్నుఁడవు నీ వయ్యేవుగాక

పె.అ.రేకు: 0048-01 గుండక్రియ సం: 15-269

పల్లవి: శ్రీసతికరుణే దిక్కు జీవుల కెల్లా
వాసుదేవుఁడా రమణీవశమైయుండఁగను

చ. 1: సీతవద్దనుండ రాముచేఁ గాకాసురునకు
నాతలఁ బ్రాణము నిల్చె నపరాధియైనాను
యేతుల రావణాసురుఁ డిటువంటివాఁడే కాఁడా
కాతరాన నొంటిఁ జిక్కి పిండతుండా లాయెను

చ. 2: కదిసి రుక్మిణి యుండఁగాఁ గృష్ణునిచే రుక్మికి
అదన బ్రదుకు గల్గె నతిద్రోహి యైనాను
యెదుటనే శిశుపాలుఁ డీరీతివాఁడే కాఁడా
తుద సభలో పదరి తునకలై పడెను

చ. 3: సిరితోడ పైనుండఁగ శ్రీనరసింహుచే దైత్య
గురుపుత్రులు నిలిచిరి క్రూరకర్ము లైనాను
పరగ శ్రీవేంకటేశుపగ గాఁడా హిరణ్యుఁడు
గరిమ నదరిపాటుగాఁగాఁ బొలిసెను

పె.అ.రేకు: 0048-02 శుద్ధవసంతం సం: 15-270

పల్లవి: ఏమఱకు జీవుఁడా యే కాలమూ
నేమముతో నుండితేనే నిలుచును కాలము

చ. 1: కడఁగి జూజమాడితేఁ గడచీన కాలము
నడుమ వేఁటలాడితే నడచీని కాలము
జడియుచు నిద్రించితే జరడీని కాలము
నిడివి హరిఁ గొల్చితే నిండుకుండుఁ గాలము

చ. 2: సతులసంగడి నున్న సమసీని కాలము
వెతలఁ బొరలినాను వెళ్ళీని కాలము
సతతము దొంగిలినా చనిపోయీఁ గాలము
వ్రతియై యుండితేను వసమౌను కాలము

చ. 3: పాలుమాని వుండినాను పరివోవుఁ గాలము
కూళగోష్ఠినుండినాను కొంచపడుఁ గాలము
మేలులో శ్రీవేంకటేశు మేటికతలు వినుచు
తాలిమితో నుండినాను దక్కియుండుఁ గాలము

పె.అ.రేకు: 0048-03 రామక్రియ సం: 15-271

పల్లవి: కోరి నీ యీవికి దొడ్డఁ గొంచెము లేదు
ధారుణిలో నీ సరి దాతలు వేరీ

చ. 1: వుత్తానపాదునికొడుకొగి నుతియించు టెంత
బత్తితో నీ విచ్చు ధ్రువపట్టమెంతా
హత్తి పిలువవచ్చిన యక్రూరుపని యెంత
సత్తుగా నీ రూపు చూపి చన విచ్చు టెంతా

చ. 2: వొట్టి యంబరీషుడున్న వుపవాసమది యెంత
అట్టె చక్రము రక్షగా నంపు టెంతా
గుట్టునఁ గాముకులైన గోపికలు గూడు టెంత
నెట్టన నిహపరాలు నీ విచ్చు టెంతా

చ. 3: తలఁచి గుహుఁడు వోడ దాఁటించినమాత్ర మెంత
సులభాన నిందుఁ గృపఁజూచుట యెంతా
బలిమి శ్రీవేంకటేశ పరుషలకా నీ కెంత
వలసినట్టు నీ విచ్చు వరము లివి యెంతా

పె.అ.రేకు: 0048-04 గుజ్జరి సం: 15-272

పల్లవి: ఒకటి కొకటి లంకెయి వుండు నర్థముల కెల్ల
సకలమున కితరసంగమే కారణము

చ. 1: కోరు నేదైనా తనకు కొసరుచు నీ మనసు
కోరినది రాకుండితే కోపము వుట్టు
ఆరయఁ గోపమువల్ల నజ్ఞానము ముంచుకొను
పోరచి నజ్ఞానమునఁ బూర్వ మెల్లా మఱచు

చ. 2: చూచు నేదియైనాను సారిదిఁ గన్నులెదుట
చూచినంతటిలోనే సుడిఁబెట్టు నాసలు
యేచిన యాసలవల్ల యేమియైనా వేఁడఁజూచు
యాచకము కడు దైన్య మందఁజేయు నపుడు

చ. 3: సేసు నూర కేమియైనా చెలరేఁగి కర్మములు
సేసిన యాకర్మములు చేరి జన్మము నెత్తించు
వేసారక జన్మము శ్రీవేంకటేశుఁ గొలిపించు
రాసి కెక్క నితఁడే రక్షించు జీవుని

పె.అ.రేకు: 0048-05 పాడి సం: 15-273

పల్లవి: ఇందు సాధించని యర్థ మెందున సాధింపరాదు
పొందుగా పంచాశత్కోటిభూమండలమునా

చ. 1: యెక్కుడు పాపమైతేను హీనజంతువై హితము
మిక్కిలి పుణ్యమైతేను మించి దేవుఁడై జనించు
దిక్కుల రెండు సరియైతే మనుష్యజన్మమౌను
చక్కగా నిందునే ముక్తి సాధించవలయు

చ. 2: మెఱసి బాల్యమునందు మిక్కిలి బుద్ధి పుట్టదు
మఱి వార్ధకమైతేను మందబుద్ధితో నుండు
తఱిఁ బ్రౌఢవయసున తగు వివేకము పుట్టు
నెఱి నిండేసుజ్ఞానము నిశ్చయింపవలయు

చ. 3: కాంతల భ్రమ బడితే కడు మత్తుఁడై యుండు
అంత ధనకాంక్షలైతే నలమట నలసు
సంతతవిరక్తియైతే సర్వార్థములుఁ జేరు
యెంతైనా యిందే శ్రీవేంకటేశుఁ గొల్వవలయు

పె.అ.రేకు: 0048-06 కన్నడగౌళ సం: 15-274

పల్లవి: నే నెంత నీచుఁడనైనా నీకుఁ బోవునా
తానకమై నాలోనుండి తప్పించుకో వచ్చునా

చ. 1: సేసవెట్టి పెండ్లాడినచెలి యేరూపుది యైనా
వాసితోఁ బతికి విడువఁగ వచ్చునా
కాసుకుఁ గొంచ్చినయట్టి కడుఁ బేదబంటు నైనా
వోసరించి వొకరికి నొప్పగించ వచ్చునా

చ. 2: చేరి తనవాకిలి గాచే శునకమున కైనా
వూర కాహారము వెట్టకుండ వచ్చునా
ఆరయఁ దాఁ గన్నబిడ్డ అంకె కెంత రాకుండినా
కూరిమి జేకొనక తాఁ గోపగించ వచ్చునా

చ. 3: పెంచినచిలుక యెంత పేరు కుచ్చి తిట్టినాను
ముంచి ముద్దాడుట గాక మొత్త వచ్చునా
నించి శ్రీవేంకటేశుఁడ నీ దాసులందు నేరమి
యించుక గలిగినా మన్నించకుండ వచ్చునా

పె.అ.రేకు: 0049-01 దేవగాంధారి సం: 15-275

పల్లవి: ఎంతగాలంబైనఁ దప్పదు యెవ్వరికి నేమనఁగ వచ్చును
దొంతికడవలోని కొలుచులు తొలుత పుణ్యములు

చ. 1: కలిమి గలదని వుబ్బ వలవదు కడఁగి లేదని సగ్గ వలవదు
కలసి కలలోఁ గన్న సుఖదుఃఖముల చందములు
వలనుగా రాట్నంపు గుండ్రలవరుస లీ జన్మంబు లెల్లను
చెలఁగి దైవము మున్నె సృష్టించినది యీవిధము

చ. 2: నేరనని దైన్యం బదేటికి నేర్తు నని గర్వం బదేటికి
నారుకొను వడగండ్లగుళ్లవి నమ్మనే రాదు
కోరి మనసునఁ బాలు దాగినగుఱుతు లీ భోగంబు లెల్లను
వారివారికి నాత్మగుణములు వసుధ నిలిచినవి

చ. 3: పెద్దదొర నని మీఱఁ దగదు పేద నని తా దాఁగఁదగదు
పొద్దువొద్దును చంద్రబింబముపోల్కి వెలసినది
అద్దుకొని శ్రీవేంకటేశ్వరుఁ డన్నిటికిఁ దను నేలి కావఁగ
బుద్ధి యెఱుఁగుచు లోకపూజ్యతఁ బొసఁగుటే శుభము

పె.అ.రేకు: 0049-02 శుద్ధవసంతం సం: 15-276

పల్లవి: పనిగొన నేర్చువారి భాగ్యముకోలఁది యిది
తనకు నెదిరికి నీదైవమే గుఱి

చ. 1: దిట్టుదిట్టేయందులకు దీవించేయందులకు
నట్టనడుమను వొక్కనాలికే గుఱి
అట్టే సంతోషమునకు నలిగివున్నందులకు
మట్టు మీఱియున్న తన మనసే గుఱి

చ. 2: పాపకర్మమునకు బలుపుణ్యమునకును
దీపంచ రెంటికి నొక్క దేహమే గుఱి
వోపి కొండెము వినఁగ నొగి ధర్మము వినఁగ
యేపునఁ దమ వీనులు యివియే గుఱి

చ. 3: పూవుల వాసనలకు పొంచి దుర్గంధములకు
చేవమీఱ నొక్కట నాసికమే గుఱి
శ్రీవేంకటేశు సేవించ జీవులను దర్శించ
కైవసమైయున్నతమ కన్నులే గుఱి

పె.అ.రేకు: 0049-03 పాడి సం: 15-277

పల్లవి: ఏమని తలఁచవచ్చు నెవ్వరిఁ గా దనవచ్చు
కామించే వారివారి కర్మఫలమహిమ

చ. 1: చల్లనే చందురుఁడు సర్వమైన వారికి
వెల్లివిరి విరహికి వెట్టయ్యైతోఁచు
యెల్లవారికి నన్న మిలఁ బ్రాణమై వుండు
నల్లన రోగికిఁ దానే యరుచియై తోఁచును

చ. 2: పమ్మిన సంపంగిపూవు పరిమళ మందరికి
తుమ్మిదకే విరసమై తోఁచుఁ గాని
వుమ్మడి సూర్యుఁ డెప్పుడు నొగి లోకబాంధవుఁడు
కమ్మి కలువలకే కడుఁ బగయి తోఁచును

చ. 3: శ్రీవేంకటేశుఁడు శిష్టు కెల్లాఁ బ్రియుఁడు
భావింపఁగ దుష్టు కే భయంకరుఁడు
పావనపు హరినామపఠనపుణ్యుల మెచ్చు
యీవలావలి మూర్ఖుల కెరవయి తోఁచును

పె.అ.రేకు: 0049-04 గుండక్రియ సం: 15-278

పల్లవి: తెలిసి చూచినవేళ దేవుఁ డొక్కఁడే నిలిచి
నలువంక రక్షించఁగ నవ్వీ నీ జీవుఁడు

చ. 1: నెలవై తండ్రితొడపై నిద్రవోయేటి బాలుఁడు
కలలోనఁ బులిఁ గని కడు మొఱవెట్టినట్టు
లలరి హరి యాధారమై యుండఁగ మాయఁ జిక్కి
బలుసంసారబాధను భ్రమసీని జీవుఁడు

చ. 2: తటుకున రాజుఁగొల్చి దండనుండే మనుజుఁడు
ఆట యింద్రజాలము చూచి యంబుధి యీఁదినట్టు
ఘటన హరి తనకు కర్తయై యుండఁగాను
కుటిలపుట జ్ఞానానఁ గుందీని జీవుఁడు

చ. 3: దరిద్రుఁడైనవాఁడు తక్కక కన్నులు మూసి
నిరుపమాంజనముచే నిధానము గన్నయట్టు
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టే కరుణించఁగాను
యెరవులేని భక్తిచే నీడేరీ జీవుఁడు

పె.అ.రేకు: 0049-05 భైరవి సం: 15-279

పల్లవి: పరిపూర్ణుఁడవు నీకుఁ బరాకున్నదా నిన్ను
మరిగి వుండనిదే మావల్లఁ దప్పు గాకా

చ. 1: వినవా నీ వేమియైనా విశ్వమెల్లా వీనులే
యెనసి విన్నవించని యెడ్డతన మింతే కాక
కనవా నీ విన్నియు నీ కన్నులే యెందు చూచినా
పనితో నాభావము చూపని నేరమి గాకా

చ. 2: పలుకవా నీ వేమియైనా బహుశబ్దమయుఁడవు
అలరి పిలువని నా యవివేక మింతే కాక
నిలువవా నా ముందర నిఖిలస్వరూపుఁడవు
తెలిసి చూడలేని సందేహ మింతేకాక

చ. 3: మన్నించవా నీ వేమి మఱఁగు చొచ్చితి నంటే
పన్ని మత్తుఁడనై యున్న నా కర్మము గాక
యిన్నిట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యిన్నాళ్ళెఱుఁగని భాగ్యమి ట్టుండెఁ గాకా

పె.అ.రేకు: 0049-06 లలిత సం: 15-280

పల్లవి: తనివి లేక చీఁకటి దవ్వీ దేహి
ఘనుఁడై హరిఁ గొల్చితే కైకొని రక్షించఁడా

చ. 1: అంది రసవాదమున కాసపడేటి మనసు
గొంది బిలములు చొచ్చి కూడపెట్టేటి మనసు
సందించి మంత్రవాదాన సాదించేటి మనసు
యిందిరేశుపైఁ బెట్టితే నిన్నియు నొసఁగఁడా

చ. 2: నెట్టన నంజనగాఁడై నేల దవ్వించే మనసు
అట్టే కాయసిద్ధికిఁగా నాసపడేటి మనసు
పట్టి సిద్ధమూలికలవసఁ జిక్కేటి మనసు
దిట్టయై కృష్ణుని మీఁదఁ బెట్టితే మన్నించఁడా

చ. 3: చేరి యక్షిణుల పంపు సేయించుకొనే మనసు
ఆరయ రాక్షసమాయ నభ్యసించేటి మనసు
యీరీతి శ్రీవేంకటేశు హృదయములోఁ దలఁచి
పేరుకొని నుతించితే పెంపున నీడేర్చఁడా

పె.అ.రేకు: 0050-01 ధన్నాసి సం: 15-281

పల్లవి: తతిగొని యేమఱక తలఁచఁగవలెఁ గాక
హితవై నీ నామ మున్న దిఁక నేల చింతా

చ. 1: దప్పిగొన్నవానికి శీతలోదకమువలె
కప్పి పతివ్రతకు మంగళసూత్రమువలె
ముప్పిరి దరిద్రునకు ముంగిటిధనమువలె
నెప్పుడు నీ నామ మున్న దిఁక నేల చింతా

చ. 2: నలిరేఁగి విషదగ్ధునకు నిర్విషమువలె
యిల నెండ దాఁకినదేహికి మంచి నీడవలె
చెలఁగి జాత్యంధునికి సిద్ధాంజనమువలె
నెలమి నీ నామ మున్న దిఁక నేల చింతా

చ. 3: పట్టభద్రునోరికి గప్రఁపుఁబలుకువలె
గుట్టునఁ దండ్రికి ముద్దుఁగొడుకువలె
గట్టిగా శ్రీవేంకటేశ కడఁగి నా నాలికెకు
యిట్టే నీ నామ మున్న దిఁక నేల చింతా

పె.అ.రేకు: 0050-02 సామంతం సం: 15-282

పల్లవి: ఇట్టే నా సేవలును యిచ్చేటి నీ యీవులను
గట్టిగా నే నల్పుఁడను ఘనుఁడవు నీవు

చ. 1: చిన్ననిమ్మపండే కాదా చేతి కిచ్చి రాజులచే
యెన్న రాని భూములకు నేలికయ్యేది
పన్ని పేరుకొని యొకపద్యము చెప్పేకాదా
సన్నల సర్వార్థములు భాగము గొనేది

చ. 2: గవ్వవేసి తూచి కాదా ఘనమైనవజ్రము
చివ్వనను విలువలు చేసుకొనేది
అవ్వల జుట్టెడు తాఁటియాకువాసి వేసి కాదా
యెవ్వరిచే ధనమైనా నిప్పించుకొనేది

చ. 3: కసవుకట్టలు వేసి కాదా గోవులచేత
కొసరుచుఁ బాలిప్పించుకొనియెడిది
యెసఁగ శ్రీవేంకటేశ యిట్టే నేను మొక్కి కాదా
పసగల నీ కృపకుఁబాత్రుఁడ నైనది

పె.అ.రేకు: 0050-03 కాంభోది సం: 15-283

పల్లవి: ఈపాట సుఖమూ యిలలోని జీవునికి
చేపట్టి యింత నేసిన శ్రీపతి నెఱుఁగఁడు

చ. 1: నిరతిఁ గట్టివేసినవాని విడిచి మోపెత్తితే
పరువువారి సంతోషపడినయట్లు
దరిద్రుఁడయినవాని తగు రాజుఁగాఁ జేసితే
మురిసి వేడుకె కాని ముందర యెఱుఁగడు

చ. 2: గుండు మోచేయట్టివాని గొప్ప యేఁత మెత్తించితే
అందనే పాడుచు నలపార్చుకొన్నట్లు
పండని తపసిఁ దెచ్చి బలుసంసారిఁ జేసితే
దండితనమే కాని యందలి పాట్లెంచఁడు

చ. 3: పట్టి దున్నేయెద్దుఁ దెచ్చి బంతి గట్టి నురిపితే
నట్టే గవుక మేసి మల్లాడినయట్లు
గట్టిగా శ్రీవేంకటేశ కష్టునిఁ బుణ్యుఁ జేసితే
వట్టియహంకారియై యెవ్వరినిఁ గైకొనఁడు

పె.అ.రేకు: 0050-04 గుజ్జరి సం: 15-284

పల్లవి: ఎవ్వరు నాకు దిక్కు యేమని చెప్పుదు నిఁక
అవ్వలికి నివ్వలికి హరి నీవే కాకా

చ. 1: యెన్నటిప్రతిబంధమో యెంచఁ గామక్రోధములు
వెన్నాడి నేఁ బుట్టితేనే వెంటఁ బుట్టీని
మున్నిటికొల మెట్టిదో మొగి మదమత్సరము
లన్నిలోకములఁ జొచ్చి నందుఁ జొచ్చీని

చ. 2: యెక్కడి ఋణమో నాకు నీ దేహభోగములు
పక్కన నేడనుండినా బడివాయవు
తక్క కేనాటికర్మమో తగఁ బుణ్యపాపములు
చిక్కులై కలలోనఁ జిమ్మి రేఁచీని

చ. 3: యెందరిపగో కాని యీ తమోరాజసములు
సందడించి చలములు సాదించీని
యిందునే శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
కిందుపడి యీవే నన్ను గెలిపించీని

పె.అ.రేకు: 0050-05 శ్రీరాగం సం: 15-285

పల్లవి: తలమేల కులమేల తపమే కారణము
యెలమి హరిదాసులు యే జాతి యైన నేమి

చ. 1: కాకమువల్లఁ బుట్టదా ఘనమైన యశ్వత్థము
దాకొని గుల్లలోఁ బుట్టదా ముత్తెము
చౌకైన విషలతనే జన్మించదా నిర్విషము
యేకడ మహానుభావు లెందు పుట్టి రేమి

చ. 2: బిడిపిరాళ్ళఁ బుట్టవా చెలువైన వజ్రములు
పుడమి నీఁగలవల్లఁ బుట్టదా తేనె
వెడఁగుఁ బిల్లి మేనను వెల్లదాయెనా జవ్వాది
వుడివోని పుణ్యు లెందు నుదయించి రేమి

చ. 3: పంకములోఁ బుట్టదా పరిమళపుఁ దామెర
పొంకపుఁ గీటకములందు పుట్టదా పట్టు
కొంకక శ్రీవేంకటేశుఁ గొలిచినదాసులు
సంకలేని జ్ఞాన లెందు జనియించి రేమి

పె.అ.రేకు: 0050-06 కాంభోది సం: 15-286

పల్లవి: చూచేవారికిఁ గలిమి సుఖమే తోఁచుఁ గాని
యేచి కావడి మోచేవాఁ డెఱుఁగునా వేఁగు

చ. 1: పక్కెరగుఱ్ఱముఁ గంటే పరులకే సింగారము
గుక్కక దానికే మోపు గుడ్డకొలఁది
కిక్కిఱిసి యధికువాకిట నుండు సిరు లెల్లా
వెక్కసమై యానుకొన వేసటేను నాతనికి

చ. 2: గడా టాడేవానిఁ గంటే కన్నవారికి వేడుక
అడుగడుగు ప్రయాస మటు వానికి
బడినుండుఁ జతురంగబలములుదొరకును
చిడిముడి శత్రులపై చింతే యాతనికి

చ. 3: పాములవానిఁ గంటే పడుచుల కానందము
వోముచుఁ బ్రాణము వట్టుకుండు నాతఁడు
యీమేర శ్రీవేంకటేశ యిల్లెల్లాఁ బైఁడి ఘనున
కామెయి భోగించ దీర దాతని కేపొద్దును

పె.అ.రేకు: 0051-01 లలిత సం: 15-287

పల్లవి: అట్టె నీ సుకృతము ఆపన్నుని రక్షించితే
చుట్టమవు నీవే కృపఁ జూడఁగదవయ్యా

చ. 1: వఱత మునిఁగేవాని దరి నుండేవాఁడు
వెఱవక చే యిచ్చి వెళ్లఁదీసును
మఱచి యజ్ఞానములో మగ్గుచు నుండేటి నన్ను
యెఱిఁగిన సర్వేశ్వర యెత్తి కావవయ్యా

చ. 2: చులుకఁగాని వానికి సుఖియైన వైద్యుఁడు
బలువైన మం దిచ్చి బ్రదికించును
కొలయైన పాపములఁ గుంగుచు నుండేటి నన్ను
యిలధరనామామృత మిచ్చి కావవయ్యా

చ. 3: నిరుఁబేద యైనవాని నిండిన ధనవంతుఁడు
ఆరసి లేములు మాన్పి యాదరించును
సరి ననాథుఁడనై శరణు చొచ్చితి నిన్ను
హరి శ్రీవేంకటేశ మే లందిచ్చి కావవయ్యా

పె.అ.రేకు: 0051-02 లలిత సం: 15-288

పల్లవి: నే నన్నిటాఁ గ్రూరుఁడ నీవేగతిగా వచ్చితి
మానక నన్నేలుకొని మన్నించవలెను

చ. 1: నేరమి సేసినవాఁడు నెమ్మి యింటికి వచ్చితే
మారుకొన కన్నియును మఱవవలె
కారులు వల్కినవాఁడు గక్కునఁ బంత మిచ్చితే
నేరుపుల నేస్తములే నెరపఁగవలెను

చ. 2: పగవాఁడైనవాఁడు బంట నని మొక్కితే
సొగిసి లోఁ గొని కృపఁ జూడవలెను
వెగటున నాన దోసి వెఱపుమాలినవాఁడు
అగపడి యాజ్ఞ వెట్టు మంటే మానవలెను

చ. 3: ధన మెత్తుకొన్నవాఁడు తానే వచ్చి పనివేళ
ననిమొన నిల్చితేఁ జేకొనవలెను
వనరి యజ్ఞానపువాఁడ నిన్ను నుతించితి
ఘనుఁడ శ్రీ వేంకటేశ కావవలె నన్నును

పె.అ.రేకు: 0051-03 పాడి సం: 15-289

పల్లవి: నీవే నియామకుఁడవు నీవుదయానిధివి
జీవులకు స్వతంత్ర మిచ్చితి విందుకొరకా

చ. 1: అసురులకుఁ బాపము అమరులకుఁ బుణ్యము
పసగానే పంచిపెట్టి పనిగొనేవు
వసుధ నీ లీల కింతవలెనా తొల్లేకర్మము
పొసగ మంచిదిగానే బుద్ధి పుట్టించరాదా

చ. 2: కౌరవులకు నోటమి కౌంతేయులకు జయము
యేరుపరచి చూచితివి యిరుదెసలా
సారెకు భూభారము దించఁగ నింతవలెనా
పోరు లేనివారినే పుట్టించరాదా

చ. 3: జడుల కజ్ఞానము సజ్జనులకు విజ్ఞానము
అదరించి యేలితివి యందు నిందును
బడి శ్రీవేంకటేశ పాపపణ్యముల కింతేల
కడకూ మంచిదిగానే కరుణించరాదా

పె.అ.రేకు: 0051-04 బౌళి సం: 15-290

పల్లవి: జీవుఁడు ప్రకృతియును శ్రీపతియుఁ గలఁడని
భావించుకొంటే నిహపరములు గలుగు

చ. 1: నీటికడవలో చంద్రునీడ దృష్టాంత మయితే
తాటించి కర్మము దేహిఁ దగుల నేలా
సాటి ప్రతిబింబమైతే చైతన్యము రా నేల
మాటున నప్పటి నీ జన్మములు రా నేలా

చ. 2: జగము కప్పచిప్పరజతభ్రాంతివలె నైతే
నిగమము లీ యర్థము నిలుపనేలా
పగటున సత్యముపనికిఁ దెచ్చుకొ నేల
అగణితమైన సృష్ట్యాదులు రా నేలా

చ. 3: చినుమయపు బ్రహ్మము చిక్కించి మాయ గప్పితే
ననుపమ పరిశుద్ధ మనఁగ నేలా
యెనసి శ్రీవేంకటేశుఁ డితనినే శరణని
ఘనుఁడౌట గాక పట్టి కలఁక లేలా

పె.అ.రేకు: 0051-05 నాట సం: 15-291

పల్లవి: కంటి మిదె యీ యర్థము ఘనవిధానమువలె
నంటెను నీ కృపవల్ల నాతుమలో నాకును

చ. 1: కన్నులెదిటే జగము కాణాచి గడించేమంటే
నెన్ని బ్రహ్మాండము లేగె నింతక తొల్లి
పన్నిన కాణాచి నీ పాదములందు గడించి
యున్నవారు సనకాదియోగీంద్రవర్యులు

చ. 2: గొందినే బ్రహ్మపట్టము గోరి జపియించు మంటే
నెందరు బ్రహ్మలు చని రింతక తొల్లి
యిందు నందు నీ లోకమే యిరవుగా జపియించి
అందిరి నీపదము ప్రహ్లాదనారదాదులు

చ. 3: కాంతులు మించినయట్టి కాయసిద్ధి గోరే మంటే
నెంత సృష్టి చనెనో యింతక తొల్లి
చెంత శ్రీవేంకటేశ్వరు సేవాసిద్ధి యడిగి
సంతోషమునఁ బొందిరి సర్వనిత్యముక్తులు

పె.అ.రేకు: 0051-06 నాట సం: 15-292

పల్లవి: నిన్నుఁగొలిచితేఁ జాలు నీయంతవానిఁ జేతువు
పన్ని నారాయణ నీవు బ్రహ్మాదివంద్యుఁడవు

చ. 1: భూపతిఁ జేరితేఁ గొంత భూ మియ్యనోపుఁ గాని
యేపున నున్నతపద మియ్యలేఁడు
తీపుల నింద్రుని నారాధించితే స్వర్గమే కాని
యేపొద్దుఁ జెడని భోగ మియ్యలేఁడు

చ. 2: గరళకంఠు గొల్చితే కైలాస మీ నోపుఁ గాని
గరిమ ధ్రువపట్టము గట్టలేఁడు
సరి విరించిఁ గొల్చితే సత్యలోకమే కాని
విరజానది దాఁటఁగ వెళ్ళవేయలేఁడు

చ. 3: అన్నిటా మాయాశక్తి నాశ్రయించి చూచితేను
నిన్ను నాశ్రయించక కాన్పించనీదు
కన్నులెదుట శ్రీవేంకటేశ నీ శరణంటే
యెన్నఁగా నీ విచ్చే యీవి యెవ్వఁడూ నీలేఁడు

పె.అ.రేకు: 0052-01 బౌళి సం: 15-293

పల్లవి: నాలోనే నీ వున్నాఁడవు నన్నేల భ్రమయించేవు
యీలీల చూచి మఱపై యిటువలె నున్నది

చ. 1: దైవమా నిన్నెఱఁగుదు తప్పక కొలువ నోప
భావించుకొందు ధర్మము పట్టగ నోప
కావలెనందు విరక్తి కడకూ నడప నోప
కావరానఁ బగలు చీఁకటి దవ్వేమిటిదో

చ. 2: యెఱుఁగుదు సుజ్ఞాన మిట్టే మదిలో నుండదు
వెఱతు సంసార మట్టే విడువలేను
మఱవను నీపై భక్తి మట్టుపెట్టరాదు బుద్ధి
తటిలో నీటిలో నుండే దప్పిగొనే మిదివో

చ. 3: చదువుదు శాస్త్రములు సార మందు గ్రహించను
వెదకుదు మోక్షచింత విస్తరించను
యెదుట శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
సదరానఁబైఁడికి వాసన వచ్చె నిదివో

పె.అ.రేకు: 0052-02 బౌళి సం: 15-294

పల్లవి: విచారించుకొనేవారి వెట్టితన మింతేకాక
యెచట బంగారుతోడ యినుము సరి యౌనా

చ. 1: బహు జన సమ్మతపు పనులే యీడేరుఁ గాక
మహికి వేఁగైన పని మనఁబోయీనా
విహితపు టగ్రపూజ విష్ణునికి చెల్లెఁగాక
సహజపు శిశుపాలు చలములు చెల్లెనా

చ. 2: సర్వజన హితుఁడైన జనుఁడే వర్ధిల్లుఁ గాక
గర్వియైన కంటకుఁడు కడతేరీనా
పూర్వమందు ధర్మజుఁడు భూమికి రాజాయెఁ గాక
నిర్వహించి కౌరవుఁడు నెరవేరెనా

చ. 3: పొందుగాఁ జేసినయట్టి పుణ్యామే మే లిచ్చుఁగాక
కందుకొన్నపాపము సుఖము నిచ్చీనా
చెంది శ్రీ వేంకటేశ్వరు సేవించి గెల్చెఁ బ్రహ్మాదుఁ
డిందరిలోన హిరణ్యుఁ డీడేరఁ గలిగెనా

పె.అ.రేకు: 0052-03 శుద్ధవసంతం సం: 15-295

పల్లవి: అన్నిటికి మూలము శ్రీహరియె సుండి
విన్నవార కన్నవార విచారించు కొనుఁడీ

చ. 1: దైవమునుఁ దలఁచక తత్వమును నెఱుఁగక
భావించుధ్యానము బట్టబయలు సుండీ
తోవ దెలుసుకొనక దొడ్డమతస్థుడు గాక
కావలెనంటే మోక్షము కలుగదు సుండీ

చ. 2: అతిభక్తి నిలుపక హరిఁ గొనియాడక
వెతకేటి చదువులు వృథా సుండీ
యితరము లుడుగక యిన్నిటిపైరోయక
జాతకాముఁడు గాఁబోతే చిక్కదు సుండీ

చ. 3: పాపములు విడువక పరిశుద్ధుఁడు గాక
యేపున జన్మఫల మీడేరదు సుండీ
దాపుగా శ్రీవేంకటేశుదాసుఁడ నంటేఁ గాక
తీపుల బ్రహ్మానందము తిరము గాదు సుండీ

పె.అ.రేకు: 0052-04 సామంతం సం: 15-296

పల్లవి: ఎచ్చరి బ్రదుకవలె యెఱిఁగినవారికి
తెచ్చుకొనేమంటే బట్టి తేరాదు కాలము

చ. 1: చేసినపుణ్యము దక్కు చెల్లుబడి గల నాఁడే
వేసాల సంపద లెల్ల వెంట రావు
ఆసలాసలనుఁ జిక్కి యవి దనవిగాఁ జూచి
మోసపోతే మఱి లేదు మొనయదు జన్మము

చ. 2: కైకొన్నవ్రత మీడేరు కాయముతో నున్నప్పుడే
కాకరిసంసార మిది కాణాచి గాదు
లోకమువారలఁ జూచి లోలుఁడై చవులకు లాచి
కాకైతే మఱి లేద గరిపడు జన్మము

చ. 3: సర్వము సాధించవచ్చు జ్ఞానముతో నున్నవాఁడే
నిర్వహించఁబోతే మఱి నిలుపరాదు
పుర్వి శ్రీవేంకటేశ్వర వూహించ నేరక
గర్వియైతే మఱి లేదు కడ మవును జన్మము

పె.అ.రేకు: 0052-05 దేశాక్షి సం: 15-297

పల్లవి: ఇంతేసివారలకంటే నెక్కుడా తాము
సంతతము గోవిందుదాస్యమే మూలధనము

చ. 1: అరసి యెఱుఁగఁడా బ్రహ్మ జ్ఞాన మింద్రుఁడు
సరిలేని వేదాంతము చదువఁడా
హరినే ప్రార్థన చేసి యాపద గడచినాఁడు
యిరవై స్వతంత్రమున యింతా మిథ్య యనెనా

చ. 2: కమలజుఁ డెఱుఁగఁడా కడు బ్రహ్మజ్ఞానము
నెమకి శాస్త్రార్థము నిశ్చయింపఁడా
విమలపు విష్ణు గొల్చి వేదములు వడయఁడా
తమితో నాతఁ డేమైనాఁ దానె బ్రహ్మమనెనా

చ. 3: శివునకు లేదా మించిన బ్రహ్మజ్ఞానము
తవిలి పరతత్వము దలపోయఁడా
జవళి శ్రీవేంకటేశు జపించి వారణాశిలో
రవళి తాఁజెప్పేమంత్రము గల్ల యనెనా

పె.అ.రేకు: 0052-06 గుజ్జరి సం: 15-298

పల్లవి: ఇన్నిఁ దమ కల్పితము లితరసమ్మతు లౌనా
వున్నది వున్నటువలె నొనరింపపలదా

చ. 1: చెప్పు గాక ప్రకృతిని చేరి నాల్గువేదముఁల
గప్పి యనిర్వాచ్య మని కద్దా కొంత
అప్పటి వుపనిషత్తు లన్ని ముఖ్యము గాక
తప్పి కొన్ని యతత్వావేదకము లున్నదా

చ. 2: దేవతాయజ్ఞములు బోధించుఁ గాక శాస్త్రములు
వ్యావహారికనిత్యత్వ మందు నున్నదా
భావింప జగత్తు లెల్లా బ్రహ్మమయ మండ్రు గాక
ఆవలఁ బురాణాల మిథ్యావాచక మున్నదా

చ. 3: మోక్షఫలాశక్తులని మునులు వున్నారు గాక
వీక్షింప విఫలు లని వింటిమా ధాత్రి
రక్షించి శ్రీవేంకటేశ రమణతో జీవులను
కుక్షిఁ బెట్టుకొన్నాఁ డది గుణము సత్యమా

పె.అ.రేకు: 0053-01 గౌళ సం: 15-299

పల్లవి: నాయంత జ్ఞానము లేదు నాకు మావారు చెప్పిన
చాయపాటుబుద్దులకే శరణంటి నిన్నును

చ. 1: విన్నపము సేసేనంటే వేళ నీ కేదో యెఱుఁగ
మన్నించుకొలఁదీ నీ మన సెఱుఁగ
సన్నుతించే నంటేను చక్కనిమాట లెఱుఁగ
నన్ను నెట్టు రక్షించేవో నమ్మితి నే మిమ్మును

చ. 2: సేవచేసి నిన్ను మెప్పించేనంటే భక్తి నేర
నీవాఁడనై కొల్చేనంటే నేమము నేర
పూవులఁ బూజించేనంటే పొందగు మంత్రము నేర
దైవమా నీవే దిక్కు ధరించితి ముద్రలు

చ. 3: హితవరి నయ్యేనంటే నేకాంతము దెలియ
మతిఁ దలఁచేనంటే మర్మము దెలియ
సతమై శ్రీవేంకటేశ్వర నీవే నాకు
గతి యని మొక్కితిఁ గరుణించే దెట్లో

పె.అ.రేకు: 0053-02 కేదారగౌళ సం: 15-300

పల్లవి: ఒరుల కొప్పించరాదు వోపనంటే నప కీర్తి
మరలక రక్షించుటే మగపాడి యిఁకను

చ. 1: సేయరాని తప్పులెల్లాఁ జేసి పచ్చి నిన్నుఁ గొల్చి
యేయెడా బలువుఁడనై యెసగితిని
రాయడి నరకము చొఱక నీ మఱఁగు చొచ్చి
తోయరాని వెల్లాఁ దోసి దొర నైతిని

చ. 2: వెడమాయ మరునికి వీఁగి వచ్చి నీకు మొక్కి
కడు బిరుదుబంటనై గర్వించితి
వడిఁ బుట్ట బతిమాలి వచ్చి నీ నామధారినై
బడిఁ బాపముల గెలిచి పంతగాఁడ నైతిని

చ. 3: వొట్టిన కర్మములకు నోడి వచ్చి నీ వాఁడనై
దిట్ట నీ దాసులఁ గూడి ధీరుఁడ నైతి
యిట్టె శ్రీవేంకటేశ యేలితి విందే నన్ను
నెట్టుకొని నిన్నుఁ బాడి నిర్మలుఁడ నైతిని

పె.అ.రేకు: 0053-03 ముఖారి సం: 15-301

పల్లవి: నేనిఁక వెఱపను నీవు నాకుఁ గలవు
శ్రీనాథ ని న్నెటిఁగితి చేకొని రక్షింతువు

చ. 1: మొల్లమి నే నొకజన్మమున నిన్నుఁ గొలువఁగా
తొల్లి జన్మము లెత్తిన దుఃఖము వాసె
యిల్లిదే యీ దేహమున యిటు నీ యచ్చు మోపఁగా
చిల్లరదేహములు మోచినచింత లుడిగె

చ. 2: యిల నిన్నొకనిమిష మిటు ధ్యానము సేయఁగా
గలిఁ బోయిన కాలము నష్టి దీరెను
చలపట్టి నీ దాసులసహవాసము గల్గగా
నల మాయలో నీఁదిన యల పెల్లఁ బొలిసె

చ. 3: కనుఁగొని వేడ్కతో నీ కన్నులెదుటఁ బడఁగా
ఘననరక మందిన కాఁక మానెను
యెనలేక శ్రీవేంకటేశ నిన్నుఁ దలఁచగా
వెనకటి యజ్ఞానపు వెగ టెల్లాఁ గడచె

పె.అ.రేకు: 0053-04 మలహరిసం: 15-302

పల్లవి: ఎక్కడిమాటలు యేఁటి విచారము
చిక్కక హరినే సేవించవలదా

చ. 1: బొందితోఁ జేసినపుణ్యము లన్నియు
గొందిఁ జచ్చి మఱి కుడిచేదటా
కంది కుంది తా గడియించిన ధన
మంది సుతులపా లయ్యేదటా

చ. 2: బిరుదుశాస్త్రమునఁ బెండ్లియాడినసతి
మరలిపుట్టువున మఱి వేరట
పెరిమ బహుగతులఁ బెంచుకొన్న తను
వరయఁగఁ దనవెంట నరుగదట

చ. 3: చెలఁగి యిచ్చి యార్జించిన కీరితి
పిలిచే యాజన్మపుపేరిది యట
బలిమి శ్రీవేంకటపతి యంత కాత్మ
గలఁడని కొలిచినఁ గలుగును ఫలము

పె.అ.రేకు: 0053-05 సాళంగనాట సం: 15-303

పల్లవి: హరి నీవే దిక్కు గాని యట వుపాయము లేదు
కరుణానిధివి నన్నుఁ గావవే యిఁకను

చ. 1: కర్మము లనుభవించి కడతేర దాయెను
ధర్మములు సేసియుఁ గ్రోధము వోదాయె
నర్మిలి బొందులు మోచి యలయిక లేదాయె
నిర్మల మౌట యెన్నఁడు నెట్టన నా బ్రదుకు

చ. 2: చుట్టి నానాలోకములు చొచ్చి సిగ్గుగాదాయె
పొట్టు వొర్లె చదివి నొబ్బుద్ది గాదాయె
వొట్టిన రాత్రుల నిద్ర నొందియుఁ దనియదాయె
గట్టియై నిల్చుట యేకాలము నాబ్రదుకు

చ. 3: తపముల బడలినా దర్పము విడువదాయె
వుపను నెందరిఁ గొల్చి వొప్పు గాదాయె
యిప్పుడు శ్రీవేంకటేశ యిటు నీకు మొక్కఁగాను
కృపచేసితి వీడేరెఁ గిందటి నా బదుకు

పె.అ.రేకు: 0053-06 సాళంగనాట సం: 15-304

పల్లవి: కాలమందే నీ దాసులై కడు ధీరులౌట గాక
యీలాగున మోసపోతి నేమిటా నే మున్నది

చ. 1: పొనిఁగి యింద్రునినై నాఁ బోనీదు కోపము
మునుకొని రుద్రునైనా ముంచుఁ గోపము
వెనుకొని బ్రహ్మనైనా విడువదు కోపము
మనికియైన దేవత్వమహిమ యే మున్నది

చ. 2: పడి విశ్వామిత్రునంతవానికి రేఁగెఁ గోపము
కెడపి దుర్వాసునిఁ జక్కించెఁ గోపము
యెడనెడ మునులను యేమరించుఁ గోపము
బడిఁ దపనుల బల్మి పలుక నే మున్నది

చ. 3: కచ్చు పెట్టి ధర్మజునిఁ గనలించెఁ గోపము
కొచ్చి కార్తవీర్యుఁ బురికొల్పెఁ గోపము
నిచ్చలు శ్రీవేంకటేశ నీవే శాంత మిచ్చితి గా
కిచ్చల రాజ్యపదవి యెంచ నే మున్నది

పె.అ.రేకు: 0054-01 భైరవి సం: 15-305

పల్లవి: ఏమి చెప్పేది నీ సుద్దు లిటువంటివి
గోమున లోకరక్షణకొఱకు నిట్లైతివి

చ. 1: అట్టె నాఁడు వేదచోరు నద టడంచిన నీవు
నెట్టన నేఁడెట్టు నవనీత చోరుఁడ వైతివి
జట్టిగా బ్రహ్మాదులకు జనకుఁడవైన నీవు
గుట్టున వసుదేవున కొడుక వెట్లైతివి

చ. 2: చేముంచి జితకాములచేతికి లోనైన నీవు
యేమీ రేపల్లె జారుఁడ వేలైతివి
ఆమీఁద జగద్గురుఁడవై వుండిన యట్టి నీవు
సీమలో సాందీపనికి శిష్యుడ వెట్లైతివి

చ. 3: కోటుల బ్రహ్మాండములు కుక్షి నిడుకొన్న నీవు
ఆటలకు బలి నేల యాచించితివి
వాటమై శ్రీవేంకటేశ వరము లిందరి కిచ్చి
నీటునఁ బరుషల కానికె లేల కొంటివి

పె.అ.రేకు: 0054-02 పాడి సం: 15-306

పల్లవి: ఇవి నమ్మి గర్వించ నేమిటికి
వివేకించి కొలిచితే విష్ణుఁడే సతము

చ. 1: కల రిందరుఁ జుట్టాలు కాయముతో నున్నవాళ్లు
వెలయ నంతటిమీఁద వింతవారే
నిలుచును విద్యలెల్లా నేరుపు గలన్నాళ్లు
తలఁపు మఱచితేను తనలోనే యడఁగు

చ. 2: యెక్కుడుగా నుతియింతు రీవి గలయన్నాళ్లు
చక్కఁగా నూరకుండితే చప్ప చప్పనే
గక్కనఁ బంపుసేతురు కలిమి గలన్నాళ్లు
కక్కసానఁ బేదయైతే కొకైన రెవ్వరును

చ. 3: పసు లేమైనాఁ జెల్లు బలిమి గలన్నాళ్లు
తన లా వుడిగితేను తడఁబాట్లే
వెనుకొని కొల్చితే శ్రీవేంకటేశుఁడే రక్షించు
మినుకుల భోగములు మీసాలపై తేనెలు

పె.అ.రేకు: 0054-03 కేదారగౌళ సం: 15-307

పల్లవి: సులభమున నున్నది సుజ్ఞానము
కలఁ దన్నవారికి కామనిధానమవు

చ. 1: విరసించి వెఱచితే వెంటఁ బెట్టు భూతములు
పరగ నీవైతే నభయ మిత్తువు
కెరలి భక్తి సేసితేఁ గిందుపరతు రింతులు
అరసి నీవైతే నీయంతవానిఁ జేతువు

చ. 2: బంటులైనవారిఁ గంటే పనిసేయింతు రేలికె
లంటివారి భారము నీవైతే మోతువు
జంట మొక్కేవారిఁ గంటే చౌక సేతు రితరులు
కంటులేక నీవైతే ఘనులఁగాఁ జేతువు

చ. 3: వినయపువారిఁ గంటే వేసరుదురు దొరలు
అనిశము నీ రయితే నాదరింతువు
వొనర శ్రీవేంకటేశ వొద్దిక నీ దాసులు
కనుఁగొని నమ్మితేను కరుణింతువు

పె.అ.రేకు: 0054-04 సాళంగనాట సం: 15-308

పల్లవి: అనంత మద్భుత మాశ్చర్యం బిది
సనాతనుఁడ నను సరవిఁ గావవే

చ. 1: బలిమి నసురలకు భయంకరుఁడవు
అలరి యమరులకు నానందకరుఁడవు
తలకొని ఋషులకు తపఃఫలదుఁడవు
పలు నీ మహిమలు పలుకఁగ వశమా

చ. 2: అరయ వేదముల కాధారంబవు
పరగఁగ జీవుల ప్రాణనాథుఁడవు
పరమయోగులకు పరబ్రహ్మమవు
తిరముగ నీమూర్తి దెలియఁగ వశమా

చ. 3: జగముల కెల్లను సర్వబంధుఁడవు
తగిలిన శ్రీకాంతకు నివాసమవు
జిగి శ్రీవైష్ణవులకు శ్రీవేంకటపతివి
తగు నీ కత లివి తలఁచఁగ వశమా

పె.అ.రేకు: 0054-05 సామంతం సం: 15-309

పల్లవి: నీయంతవాఁడనా నేను నేరము లే మెంచేవు
యీయెడ నిరుహేతుకకృపఁ జూడు నన్నును

చ. 1: నిరతి నిన్నెఱుఁగను నీవు నన్నెఱుఁగుదువు
ధర యాచకుఁడ నేను దాతవు నీవు
వరుస నీచుఁడ నేను వైకుంఠపతివి నీన
నరుఁడ నేను నీవు నారాయణుఁడవు

చ. 2: సారె నలసుఁడ నేను సర్వశక్తివి నీవు
ధీరుఁడవు నీవతి దీనుఁడ నేను
కారుణ్యమూర్తివి నీవు కఠినచిత్తుఁడ నేను
మేరతో నీ వేలికవు మీ దాసుఁడ నేను

చ. 3: జననశీలుఁడ నేను జనకుఁడవు నీవు
ఘనవేదాంతనిధివి కర్మిని నేను
అనిశము శ్రీవేంకటాచలేంద్రుఁడవు నీవు
పనుల నీ సంకీర్తనపరుఁడ నేను

పె.అ.రేకు: 0054-06 నాట సం: 15-310

పల్లవి: ఆచార్యుఁ డొక్కఁడే యదె నీకు నొప్పగించె
నేచి నన్ను రక్షించేది యిఁక నీ చేతిది

చ. 1: వరుసఁ బుణ్యము లెల్లా స్వర్గమున కొప్పగించు
సరుసనే చదువులు సంశయముల కొప్పించు
సురలఁ బూజించుపూజ క్షుద్రవిద్యల కొప్పించు
కెరలి నీ కృప కొప్పగించ నెవ్వరు లేరు

చ. 2: ఘనసంకల్పములు భోగములకు నొప్పగించు
పొనిగి కర్మము లెల్లా పుట్టుగుల కొప్పగించు
ధనము లంపటముల తగులున కొప్పగించు
కినిసి నీ సేవ కొప్పగించ నెవ్వరు లేరు

చ. 3: సారె నేర్చిన నేర్పులు సంసారమున కొప్పించు
అరయఁ గోరికె లెల్లా నజ్ఞానమున కొప్పించు
ధారుణి శ్రీవేంకటేశ తగ నన్ను నేలితివి
కేరి నీ దాస్యాన కొప్పగించ నెవ్వరు లేరు

పె.అ.రేకు: 0055-01 భైరవి సం: 15-311

పల్లవి: కంటి మన్నిటి సత్వలు కమలాక్ష యిఁక నీవే
యింటి వేలుపవై మమ్ము నీడేర్తువు గాకా

చ. 1: తొల్లి లేదా జ్ఞానము తొడరి యాతుమలోన
అల్లన మోక్షము చూపదాయఁ గాక
చల్లఁగా మనసె కాదా చవు లెల్లాఁ జూపినది
వెల్లిగా బ్రహ్మానందము వెదకదు గాకా

చ. 2: యిరవై యారుశాస్త్రము లివే కావా చదివేవి
హరి నిన్ను బోధింప వాయఁ గాక
గరిమ నీలోకములే కావా చొచ్చి వెళ్ళేవి
విరక్తుఁ జేసి కర్మము విడ్చదాయఁ గాకా

చ. 3: చెప్పుడు బుద్ధులే కావా చెవులలో నిండినవి
చిప్పిల నీ భక్తునిఁగాఁ జేయవు గాక
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యెప్పటి నేనే కాదా యిఁకఁ బాయఁ గాకా

పె.అ.రేకు: 0055-02 రామక్రియ సం: 15-312

పల్లవి: పరతంత్రులు జీవులు బహుస్వతంత్రుఁడవు నీ
వరయ నీ కరుణే యటు మూలధనము

చ. 1: కడు ననంతాయుష్యము గలిగినఁ గదా నీ దృష్టి
సుడిగొని వొక్కొక్కటె చూడవచ్చును
వడిఁ బెక్కుపాదములవాఁడైనఁ గదా నీ మూర్తి
చిడిముడిఁ బ్రదక్షిణఁ జేయవచ్చును

చ. 2: కప్పి వేవేలు చేతులు గలిగినఁ గదా నిన్ను
నప్పసము పూజలు సేయఁగ వచ్చును
అప్పటి వేవేలు నోరులైనఁ గా మీగుణములు
కుప్పలుగా సారె సారెఁ గొనియాడవచ్చును

చ. 3: యెదుట ననంతుఁడవు ఇటు నే నణుమాత్రము
యిదివో యెట్టు గూడీని యీ యర్థము
అదన నీవే యెఱిఁగి యనంతశక్తి నాకిచ్చి
చెదరక సేవగొను శ్రీవేంకటేశ

పె.అ.రేకు: 0055-03 రామక్రియ సం: 15-313

పల్లవి: ననుఁ దెలుపఁ గదవే నారాయణ నీ మహిమ
జనయంతి యని చాటుచు నున్నది

చ. 1: తలపోసి చూడ మొదలఁ బ్రకృతి జడము
యెలమితో గుణత్రయ మేల వచ్చెను
మలసి యందరికిని మనసై నిలువ నేలఁ
యిల నింద్రియవ్యాపార మేమిటికి

చ. 2: ప్రకృతి జడమైతే బహుభాష లు రా నేల
అకట సంసారభోగ మది గా నేల
ప్రకటించి బ్రహ్మాదులపట్టము గానేల
సకలధర్మాధర్మస్వరూప మెట్టాయ

చ. 3: జడమైన ప్రకృతికి జన్మపరంపర లేల
అడియాలాలందు నందు నదెట్టెటిఁగె
యెడ చొచ్చిని ప్రేరణ లన్నిటానని యెంచితే
విడివి శ్రీవేంకటేశ నీవు నిష్క్రియుఁడవు

పె.అ.రేకు: 0054-04 సాళంగనాట సం: 15-314

పల్లవి: సర్వశబ్దవాచ్యుఁడవు సర్వేశ యిన్నిటా నీవే
పూర్వమందునుండి క్రతు భోక్తవు నీవే

చ. 1: వెస వరుణునిఁ గూర్చి వేలుతు రాహుతులు
వసుధలోపలి విప్రవరు లెల్లాను
యెసగ నావరుణుఁడు యెవ్వరిఁగూర్చి వేల్చు
మసలక తానే మంత్రము లుచ్చరించు

చ. 2: యెందైనాఁ గ్రతువులు యింద్రునిఁగూర్చి సేతురు
పొందుగ నానాద్విజపుంగవు లెల్లా
చెంది యెవ్వరిఁగూరిచి సేయుఁ గ్రతువు లింద్రుఁడు
మందలించి తానే మంత్రములు నొడువు

చ. 3: భూమిసుర లెజ్ఞములు పూని సేయుదురు బ్రహ్మ
కేమంత్రాలఁ జేయు నతఁ డెవ్వరిఁగూర్చి
శ్రీమంతుఁడవై నయట్టి శ్రీవేంకటేశఁడ నీవే
నామమునఁ దొల్లే యజ్ఞనారాయణుఁడవు

పె.అ.రేకు: 0054-05 సామంతం సం: 15-315

పల్లవి: ఎంతపుణ్యమో నీకు హీనుని రక్షించితివి
యింత సేసితివి భాగ్య మేమి చెప్పే నింకను

చ. 1: సరుగ నానోర నీవు సంకీర్తన విన్నపుడే
ఆరసి మోక్ష మిత్తువని నే నమ్మితి
పరుల బంటుఁగా జేయక యప్పటి నన్నేలి నపుడే
నరకమందుఁ బెట్టవు నమ్మితి నేను

చ. 2: కిమ్ముల నిఁక విన నీ కీర్తి గట్టినపుడె
నెమ్మి రక్షింతు వనుచు నే నమ్మితి
పమ్మి నా మదిలో నీ రూపము చూసినపుడే
క్రమ్మరఁ బుట్ట ననుచు గక్కన నే నమ్మితి

చ. 3: యిట్టె యోగక్షేమము వహించుకొని యున్నపుడె
నెట్టుకొనె నీ కృపని నే నమ్మితి
గట్టి శ్రీవేంకటేశ లోకదృష్టాంతమైనపుడే
వొట్టి సకలకర్మము లూడె నని నమ్మితి

పె.అ.రేకు: 0054-06 గుజ్జరి సం: 15-316

పల్లవి: ఎక్కడి వుపాయముల నే మున్నది
మొక్కె నీ కొక్కనికే మూలము నీవే

చ. 1: పరులను శిక్షించి పనిగొనియెద నా
సిరుల నా శరీరము శిక్షించ లేను
వరుస లోకమింతాను వసముచేసుకొనేనా
పరగ నా మతి స్వస్థపరచుకో లేను

చ. 2: నిక్కము నన్యదేము నే ననుభవించేనా
పక్కన నా యాత్మ ననుభవించ లేను
అక్కడా నిక్కడా ధన మడిగి కూడపెట్టెనా
అక్కటా నా విజ్ఞాన మార్జించ లేను

చ. 3: బట్టబాయిట నే దేవపట్టములు సాధించేనా
యిట్టి తపోరాజ్య మేలఁగ లేను
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
పుట్టుగు లందేనా నీపై బుద్ధి మాన లేను

పె.అ.రేకు: 0056-01 శుద్ధవసంతం సం: 15-317

పల్లవి: ఎన్నిలేవు యీ యింద్రజాలములు యెట్టు నమ్మెడిది వో సర్వేశ్వర
మన్నించి నన్నిటు భోధింపఁ గదవె మాయాతీతుఁడ విన్నిటను

చ. 1: తామసునకుఁ బుట్టిన సుజ్ఞానము తత్త్వవాదమునకే మొదలు
కాముకునకుఁ దోఁచిన వివేకము కాంతాళములకే శెల వవును
పామరునకుఁ బొడమిన వైరాగ్యము పరదూషణకే పని యవును
సామాన్యున కటు వచ్చిన చదువులు సాధింపవు మోక్షముతెరువు

చ. 2: జగతి నాస్తికున కొదవిన సత్యము శపథంబులకే గుఱి యౌను
మగటిమి దుర్జనుఁ డెఱిఁగిన మంత్రము మారణాదులకే సాధనము
పగటున లోభి యొనర్చిన పుణ్యము ప్రత్యవాయముల కాలయము
వెగటుఁన క్రూరుఁడు చేసిన తపమది వీరిడితనముల కాకరము

చ. 3: సరిఁ బాపికిఁ గల దాక్షిణ్యము జారచోరులకు సహాయము
విరసవర్తనున కాచార మబ్బిన విపరీతఁబులే దొరకొనును
దురితచిత్తునకుఁ జిక్కిన యుక్తులు తుచ్ఛంబులపాలుగఁ జేయు
చిరముగ శ్రీవేంకటేశ మిమ్ముఁగొలి చినవారలే యిల నతిఘనులు

పె.అ.రేకు: 0056-01 గౌళ సం: 15-318

పల్లవి: ఇదె నీ చిత్తం బింక నాభాగ్యము యిన్ని విన్నపము లిందునేవున్నది
హృదయములోపల నీ వున్నాఁడవు యెఱుఁగని యర్థం బించుక లేదు

చ. 1: మొగినా యుష్యము నూరేండ్లు ఇంక ముందరఁ జేసెదఁ బుణ్యము లనుచును
తగనా యిచ్చల వలసినట్లనేఁ దప్పె ననక భోగించితిని
జిగి నొకదేవత ననుచరించను సేసిన ధర్మం బొకటీఁ గానను
నిగిడి వృద్ధు నైతి నింతలోనను నీ ముందర నే నిలిచితిని

చ. 2: అనేక కాలము బ్రహ్మకల్పము నడల యందు నే జన్మించి ముక్తిపడతు నని
పొనుఁగుచు నిహమే కోరుచు నాసల పుట్టుగులకు నొడి గట్టితిని
అనిశము మునులను అవలింబించను ఆధారమొక్కటి సంపాదించను
తనిసి యిదివో దుర్బలుఁడ నైతినీ దయాదృష్టినే తగిలితిని

చ. 3: శ్రీవేంకటగిరి పరమపావనము చేరి యందు నీ సేవ సేతు నని
త్రోవ చూచుకొని యిన్నాళ్ల(?) దనేక దొరకొని వేడ్కల మెలఁగితిని
భావములోనొక యుక్తియు వెదకనుపరులు నాకు రక్షకులని తలఁచను
చేవమీఱి నిర్భరుఁడ నైతిని శ్రీసంకల్పాశ్రితుఁడ నైతిని

పె.అ.రేకు: 0056-01 శుద్ధవసంతం సం: 15-319

పల్లవి: నమ్మి కొలువఁగదరో నరులాల శ్రీహరిని
కమ్మి యీతఁడే బ్రహ్మగన్నతండ్రి గాఁడా

చ. 1: దోసిట మడ్డెత్తేవేళ తోడై వచ్చే దైవము
రాసికెక్కఁ గొలిచితే రక్షింపఁడా
బాసలఁ బాము మంత్రము పంపు సెయించే దేవుఁ
డాసఁ దన్నుఁ దలఁచితే నటు పంపు సేయఁడా

చ. 2: నాలిక గోసి పెట్టితే నలి మొలపించే దైవ
మేలికని కొలిచితే నీడేర్చఁడా
ఆలించి దారు శిలలఁ దా వహించే దేవుఁడు
వొలిఁ దనమనసులో నూహించితే లేఁడా

చ. 3: పడినెడ మొక్కుకొన్నా వర మిచ్చే దేవుఁడు
కడు గరుడగంబముకాడ నియ్యఁడా
వెడ తీర్థయాత్రలకు వెస మెచ్చే దేవుఁడు
అడరి శ్రీవేంకటేశుఁ డండ నుంటే మెచ్చఁడా

పె.అ.రేకు: 0056-02 సాళంగనాట సం: 15-320

పల్లవి: ఏలినవాఁడవు గన యెప్పుడు రక్షించేవే
వేళతోఁ గొలువని వెల్లా లెస నోర్చుకొనవే

చ. 1: అండ నూరకే ముదిసి యపచార మౌనో యని
దండములెట్ట నోపక దగ్గరి రాను
చండి పోరి ముదిమి మాన్చఁగ వలెనని కాదు
దండము వెట్టని నా తప్పు సహించుకోవే

చ. 2: నిలుచుండ సత్వలేక నేరమి వచ్చునో యని
కొలువు సేయక మఱఁగున నుంటిని
చలపట్టి నిన్ను నిట్టి సత్వ యిమ్మని కాదు
కొలువని నేరమి కెగ్గులుగాఁ బట్టకువే

చ. 3: పాట రంజకములేక పక్కన నవ్వేవో యని
మాటలనే పొగడితి మాపటిదాఁకా
నీటున శ్రీవేంకటేశ నే వేసరించుట గాదు
పాటించి పాడని నా యపరాధ మెంచకువే

పె.అ.రేకు: 0056-03 శంకరాభరణం సం: 15-321

పల్లవి: చూడ నొక్కఁడవు గాని సుద్దు లెన్నైనాఁ గలవు
వేడుకలు దైవారె వెలఁదు లిందరికి

చ. 1: వొక్కని రూపమేకాదా వూరి వా రెల్లాఁ జూచితే
పెక్కులై మనసులోఁ బెనగొనేది
వుక్కున నీ వాడిన మాటొక్కటి కాదా యిందరి
వెక్కసపు వీనులలో వింత వింతలైనది

చ. 2: చేసిన నీ సన్నే కాదా చెలుల మర్మములకు
నాస కొలుపుచు మోహ మంటించినది
పొసరించి నీ మోని తీపులే కావా గొల్లెతల
వాసుల నోరులూరించి వలలఁ బెట్టినవి

చ. 3: సెలవి నవ్వే కాదా చిమ్మిరేఁచి యింతులకు
వులకలు మేనులఁ బొడమించేది
వెలయ నన్నేలితి శ్రీవేంకటేశ యిదె కాదా
కలయిక లిందరికి కాంక్షలు రేఁచినవి

పె.అ.రేకు: 0057-01 దేసాక్షి సం: 15-322

పల్లవి: ఇతరము లేమియును నెంచవలదు
తతిఁ దానే మేలువాఁడై తలకొనవలయు

చ. 1: అన్ని పదార్థము లమ్ము నంగళ్లలోపల
తిన్నఁగా మంచివే కొని తెచ్చుకొన్నట్టు
పన్ని నానా ధర్మములు ప్రాణుల కెల్లాఁ గలవు
అన్నిటా మంచితనాన కానందించవలయు

చ. 2: తెరువు లెన్ని గలవు దేశములమీఁదికి
హరిఁ బుణ్యతీర్థముల కరగినట్టు
వొరసితే విప్రులందు నుండు బహుగుణములు
నిరుల మంచితనాలే చేపట్టగవలయు

చ. 3: పెక్కు మతములు చెప్పు బెరసి వేదములందు
దక్క శ్రీవేంకటేశుమతము గన్నట్టు
వక్కణింప ఘను లెటువలెనైనా నడతురు
చక్కని మంచితనమే సంతోషించవలయు

పె.అ.రేకు: 0057-02 నాట సం: 15-323

పల్లవి: చూతముగా యిఁకఁ దమ సుద్దు లెల్లాను
యీతల శ్రీపతిదయ నిరవైతి మిపుడు

చ. 1: కమలాక్షు ప్రతాపము గలిగినయన్నాళ్ళకు
విమతపు వర్గము లే విట నుండీని
సమతతో నితని నామములు మెఱయఁగాను
గములై పాపములు యెక్కడనుండీ నిఁకను

చ. 2: వాసుదేవుకై దువుల వాఁడి గలంత గాలము
నీసుల యమభటుల కేది దిక్కు
దాసులై యీతనివారు దండి పొఁజులై యుండఁగా
లాసిభవము లేవంకఁ దలలు చూపీ నిఁకను

చ. 3: మచ్చిక శ్రీవేంకటేశుమహిమ గలంతవడి
బచ్చెనబంధములు యేపాటు వడీని
యిచ్చట న న్నేలి యీతఁ డెదలోన నుండఁగాను
తుచ్ఛపు దుర్గుణాలకు తూరఁగఁ జోటేది

పె.అ.రేకు: 0058-03 ముఖారి సం: 15-324

పల్లవి: ప్రయాసపడవద్దు బయలు వెదక వద్దు
క్రియ యెఱిఁగినఁ జాలు గెలుతు మిందుననే

చ. 1: శ్రీపతిసులభుడు చింతించ నేర్చిన
దీపించుమనసు కొని తేవలదు
చేపట్టు గుంచము కడు జిహ్వకుఁ దిరుమంత్రము
దాపగు తులసితీర్థము నఱచేతిది

చ. 2: అదే వీనులపండుగ ఆచార్యోపదేశము
ముదమున నొసలనే మొక్కు లున్నవి
హృదయము నిక్షేపము యెఱిఁగితే సుజ్ఞానము
సదరము భుజములఁ జక్రలాంఛనములు

చ. 3: తావుగ దేహమందు ద్వాదశనామములకు
సావివోని సంకల్పమే శరణాగతి
శ్రీవేంకటేశుఁడే దిక్కు జీవులకు నెల్లాను
దేవుఁ డితఁడే మనకుఁ దెలుసుకోరో

పె.అ.రేకు: 0058-04 సామంతం సం: 15-325

పల్లవి: పట్టరాని సంసారము బయలువందిలి యిది
మట్టుతో నీ జీవుం డెట్టు మాయ గడచీని

చ. 1: నేతిబీరకాయ నెట్టనఁ గర్మబంధము
బూతుచిల్లినేస్త మెప్పుడు మనసు
జాతితో గిలిగింత యాఁజడిసతుల పొందులు
యేతులను యీ జీవుం డెట్టు వేఁగించీని

చ. 2: గొంగడిఁ గట్టిన చద్ది గుఱిలేని భోగము
బంగారు గట్టిన పాంత పాయని యాస
అంగడిగట్టిన యద్ద మాగడమైన బదుకు
పొంగుచు నీ జీవుం డెట్టు బుద్ది యెఱిఁగీని

చ. 3: పున్నిమ వెన్నెల పోగు పోలించిరానిసంపద
వన్నె నద్దినట్టి బాయ వలపురతి
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డేలెఁ గాక యిన్నాళ్లు
మిన్నక యీ జీవుం డెట్టు మేర దెలిసీని

పె.అ.రేకు: 0058-05 మంగళకౌశిక సం: 15-326

పల్లవి: దేవదేవోత్తమ నాకు దిక్కు నీవే యెప్పుడును
యేవివరముఁ దెలియ నేమి సేతునయ్యా

చ. 1: పాపముడిగినఁ గాని ఫలియించదు పుణ్యము
కోపము మానినఁ గాని కూడదు శాంతి
చాపల మడఁచక నిశ్చల బుద్ధి గలుగదు
యేపున నా వసము గా దేమి సేతు నయ్యా

చ. 2: ఆస విడిచినఁ గాని యంకెకు రాదు విరతి
రోసినఁ గాని సుజ్ఞానరుచి పుట్టదు
వేసాలు దొలఁగించక వివేకా లెల్లా మెచ్చరు
యీ సుద్దు లేమియు నేర నేమి సేతు నయ్యా

చ. 3: కల్లలాడకున్నఁ గాని కడతేరదు సత్యము
వొల్ల నన్నఁ గాని సుఖ మొనఁ గూడదు
యిల్లిదె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
యెల్లకాల మీ మేలున కేమి సేతు నయ్యా

పె.అ.రేకు: 0058-06 దేసాక్షి సం: 15-327

పల్లవి: దృష్టాంత మిది దప్పదు తెలుసుకోవలెఁ గాని
సృష్టికి మూలమైన శ్రీపతిదాసులకు

చ. 1: పుటము వెట్టిన పైఁడి పొందుగా నెత్తు దరిగి
తటుకున వన్నె కెక్కినటువలెనే
చిటుకన హరిభక్తిచేత మలినము మాని
ఘటన జీవాత్ముఁడు ఘనుఁడై వెలయును

చ. 2: ఆరయ చిట్టము గట్టినటువంటి మాణికము
సారసానఁ బట్టితే నుజ్జ్వలమైనట్టు
బోరున నాచార్యునిబోధచేత నిశ్చలుఁడై
ధారుణిలో శిష్యుఁడు సంతత పుణ్యుఁడౌను

చ. 3: అట్టే మాఁగుడు గప్పిన యద్దము దోమితేను
గట్టిగా విశ్వ మెల్లాఁ బ్రకాశించినట్టు
గుట్టున శ్రీవేంకటేశుఁ గొలిచి కృతకృత్యుఁడై
దట్టపు హరి భక్తుఁడు ధర్మచిత్తుఁ డౌను

పె.అ.రేకు: 0058-01 దేపాళం సం: 15-328

పల్లవి: కన్నవారి కెల్లా నేల కలుగు వైష్ణవము
వెన్నుని నమ్మఁగవలె వీరవైష్ణవునకు

చ. 1: పరగఁ బాపముఁ గంటే భయము నొందఁగవలె
నరయ సంసారమందు నరుచి వుట్టఁగవలె
విరివి భోగములందు వెసటు వుట్టఁగవలె
విరతి గలుగవలె వీరవైష్ణవునకు

చ. 2: తలపోసి సుజ్ఞానము ధనమని వుండవలె
పొలసి తన నేరా లెప్పుడుఁ దలఁచఁగవలె
కలకాల మాచార్యుఁడే గతి యని యుండవలె
వెలిఁ గోర కుండవలె వీరవైష్ణవునకు

చ. 3: ఘనమోక్ష మార్గమందు కడు రుచి గల్గవలె
పెనఁగీ భాగవతులఁలు ప్రేమ గలుగఁగవలె
తనర శ్రీవేంకటేశుదాసుడై బ్రదుకవలె
వినయము గల్లవలె వీరవైష్ణవునకు

పె.అ.రేకు: 0058-02 నాట సం: 15-329

పల్లవి: నీవు లక్ష్మీపతివి నిన్ను నమ్మినవారికి
యేవల నిహపరము లిచ్చు టేమరుదు

చ. 1: శునక మొకటి ధర్మజునివెంటఁ దిరిగితేఁ
దన పుణ్యగతి యిచ్చె దాని కందురు
మనికి నేకలవ్యుఁడు మంటిబొమ్మఁ గొలిచితే
నెనలేని విలువిద్య విన్ని నిచ్చె నందురు

చ. 2: శరనిధికి విప్రుఁ డక్షతలు నిత్య మిడితే
సరిలేని మాణిక మొసగె నందురు
ధరఁ బాముున కొకఁడు తాఁ బంచాంగము చెప్పితే
దరిద్ర మణఁగను రత్నము నిచ్చె నందురు

చ. 3: చెచ్చెరను వొక గువ్వ శిబిమఱఁగు చొచ్చితే
కచ్చుపెట్టి యంతలోనే కాచి నందురు
యిచ్చల శ్రీవేంకటేశ యిట్టే విభీషణుఁడు
మచ్చిక నీ శరణంటే మన్నించితి వందురు

పె.అ.రేకు: 0058-03 బౌళి సం: 15-330

పల్లవి: కాదని వాదింప నోప కలఁగ నోప
శ్రీదేవుఁడ నీవే దిక్కయి చేకొంటేఁ జాలును

చ. 1: వరుస నా నాగతులు వారివారి జ్ఞానములు
యిరవైన గురుతు నీ విం దొక్కఁడవే
పరగఁ జదువు లైతే బహువిధమతములు
నిరతి భక్తి యొక్కటే నిన్ను సాధించేది

చ. 2: తలఁపఁ బెక్కు మూర్తులు ధ్యానము సేసేవారికి
ఫల మిచ్చేయట్టి నీ భావ మొక్కటే
పలుదెఱఁగులై యుండు భజించేటి భజనలు
తలకొని నీవు మెచ్చే దయ వొక్కటే

చ. 3: పాటించ సేయఁబోతే తపము లెన్నేఁ గలవు
చాటి రక్షించేడి నీ దాస్యం బొక్కటే
గాటపు శ్రీవేంకటేశ కల వన్ని వుపాయాలు
నీటున నాకై తేను నీ శ్రీపాదములే

పె.అ.రేకు: 0058-04 దేసాక్షి సం: 15-331

పల్లవి: నినుఁ గొలువనిదెల్లా నీ భాగ్యము
సనకాదు లెటిఁగిరి సర్వమైన పుణ్యము

చ. 1: వలెనని పేరుకొంటే వాకున సులభుండవు
తలఁచితే మది కెంతే సులభుండవు
చెలఁగి పూజించితేను చేతికి సులభుండవు
వలసితేఁ జేకొనేటి వారి వారి పుణ్యము

చ. 2: లాచి వింటేఁ జాలు వీనులకు సులభుండవు
చూచితేఁ గన్నుల కెంతే సులభుండవు
యేచి మొక్కితే మేనికి నెంతైనా సులభుండవు
కాచి యుండి సేవించేటి ఘనులదే పుణ్యము

చ. 3: నమ్మి శరణంటే యీ జన్మమున సులభుండవు
కిమ్ములఁ గోరితే దేహికి సులభుండవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యిన్నియునుఁ దా మెటిఁగి
పమ్మిన కృపఁ జేరిన భక్తులదే పుణ్యము

పె.అ.రేకు: 0058-05 దేసాళం సం: 15-332

పల్లవి: విరతి గలుగవలె విష్ణుక్తుఁడు గావలె
సరవితోనుండవలె సహజయోగికిని

చ. 1: మంతనాన నుండవలె మనసు శోధించవలె
చింతించవలె హరిని చెలఁగవలె
అంతరంగుఁడు గావలె నాసలు మానఁగవలె
సంతోసాన మించవలె సహజయోగికిని

చ. 2: వెరవు గలుగవలె వెఱవు లుడుగవలె
యిరవై యెఱుకవలె యెచ్చరవలె
విరసము మానవలె వివేకించుకొనవలె
సరుగ మౌని గావలె సహజయోగికిని

చ. 3: భావించుకొనవలె పదరకుండఁగవలె
కావలెఁ బరిపూర్ణుఁడు కరుణవలె
శ్రీవేంకటేశ్వరుని సేవే కలుగవలె
సావధానుఁడు గావలె సహజయోగికిని

పె.అ.రేకు: 0058-06 ముఖారి సం: 15-333

పల్లవి: వేదాంతవిదులాల వివేకులాల
పోదితోడ నే మింక బుద్ధు లడిగేమయ్యా

చ. 1: తిత్తిలోని కాఁపురపు దేహి నేను నా
చిత్తములోపలివాఁడు శ్రీవిభుఁడు
పొత్తులనా దాఁపరము పూర్వకర్మము
విత్తి విత్తి మొలపించీ వినరయ్యా

చ. 2: పొదిఁ బంచభూతముల పుర మేలెను నేను
కదిసి నన్నేలేవాఁడు గదాధరుఁడు
యెదిటి నా మై సొమ్ము లింద్రియములు
గుదిగొని మించీ నిదిగో చూడరయ్యా

చ. 3: కొలఁది జన్మమునకు గుటి నేను
వెలయ నాకు గుటి శ్రీవేంకటేశుఁడు
సులభపు నాగుణము సుజ్ఞానము
చెలరేఁగి చెలరేఁగి చిత్తగించవయ్యా

పె.అ.రేకు: 0059-01 బౌళి సం: 15-334

పల్లవి: దేవుఁ డొక్కఁడే మఱి జీవులు వేరు
వావాతఁ దెలిసేది వారి వారి భాగ్యము

చ. 1: పొడమినవారికిఁ బోయినవారికి
గడియ లొక్కటే వారి గతులు వేరు
బడిఁ బుణ్యములు సేయఁ బాపములు సేయఁగ
కడఁగి కాల మొక్కటే కర్మములే వేరు

చ. 2: కాకములు సంచరించె కలహంసలు దిరిగె
ఆకాశ మొక్కటే విహారాలు వేరు
మేకొని యెండలు గాయ మించి చీఁకటులు రాయ
లోకపు బయ లొక్కటే జోకలే వేరు

చ. 3: అట్టే యేలే రాజులకు నడిగేటి దీనులకు
పట్టి భూమి యొక్కటే బాగులు వేరు
గుట్టున శ్రీవేంకటేశుఁ గొలువఁగఁ దలఁచఁగ
నెట్టన దేహ మొక్కటే నేరుపులే వేరు

పె.అ.రేకు: 0059-02 లలిత సం: 15-335

పల్లవి: ఏమీఁ జదువ నేల యెవ్వరి నడుగ నేల
వేమారుఁ దనలోఁ దానే విచారించవలెను

చ. 1: కలలోనఁ జూచినవి కల్ల లౌతా నిజ మౌతాఁ
దెలిసితే నదె వుపదేశము గాదా
ములిగినాఁ బోనిక మోపించే సంసారము
తిలకించితే నుపదేశము గాదా

చ. 2: నినుపైరాత్రిఁ బగలు నిద్దిరించి మేలుకొనే
దినదినములే వుపదేశము గాదా
కనుమూసి తెఱచితే కలిగీ లేని మాయఁ బొం
దిన జగ మిదే వుపదేశము గాదా

చ. 3: చేవదేర వర మిచ్చే శ్రీవేంకటాద్రిమీఁది
దేవునిఁ గనుటే వుపదేశము గాదా
భావించి వేదము లెల్లాఁ బలుమారుఁ జాటఁగాను
దేవదేవుఁ డితఁ డుపదేశము గాదా

పె.అ.రేకు: 0059-03 మలహరిసం: 15-336

పల్లవి: పట్టరాని యాసోదము పాలువొంగినట్టు వొంగి
పట్టి పుట్టి విసిగినాఁ బోనీదు మాయ

చ. 1: కన్నులెదుట నున్నవి కావలసిన వెల్లాను
యెన్ని గట్టు కొనఁగలఁ డీ జీవుఁడు
వెన్నాడి తిరిగితే విశ్వ మెల్లా మనుజులే
యెన్నఁగఁ జుట్టము లెవ్వ రిందు దనకు

చ. 2: వింత వింత రుచులై వెలసిఁ బదార్థములు
యెంతని వొట్టు కొనీని యీ ప్రాణి
మంతనానఁ దలఁచితే మనసెల్లాఁ గోరికలే
యింత సేసి పెనఁగఁగా నేమి నిజ మాయెను

చ. 3: ఆముకొని జగమెల్లా నంగజవికారములే
యేమని భోగించీని యీ దేహి
నేమపు శ్రీవేంకటేశ నీవే నాకు గతి యిఁక
పామర బుదులవంకఁ బని యే మున్నది

పె.అ.రేకు: 0059-04 నాట సం: 15-337

పల్లవి: నిన్నడిగే నాన తీవే నే నీ పుట్టుగులకు
పన్నుకొన్న నేరమి నాపై నెట్టు గలిగె

చ. 1: పూర్వపు నీవు పురాణపురుషుడవు గనక
పుర్విపై నీ వెఱుఁగని దొకటి లేదు
పర్విన కోటిసూర్యప్రకాశుఁడవు గనక
సర్వజ్ఞ నీవు గానని చంద మేమీ లేదు

చ. 2: వినుతించ నీవు వేదవేద్యుఁడవు గనక
మనసులో నీ కెక్కడ మఱవు లేదు
అనిశము నీవు సర్వవ్యాపకుఁడవు గనక
యెనయఁగ నీకు విరహిత మెందూ లేదు

చ. 3: పొంత నీవు పంచమహాభూతేశుఁడవు గనక
పంతాన నీవు లేని ప్రపంచము లేదు
అంతర్యామివి శ్రీవేంకటాధిపతివి గనక
చింతాకంత నీవు లేని చేష్ట లేడా లేవు

పె.అ.రేకు: 0059-05 నాట సం: 15-338

పల్లవి: వెదకితే నీవంటి వేల్పు లెవ్వ రున్నారు
అదన నీ దాసుఁడైన యతఁడె పుణ్యుఁడయ్యా

చ. 1: యేలేది పరమపద మీశ్వరుఁడ విందరికి
మేలిమి శ్రీభూమీసమేతుఁడవు
పాలింతువు లోక మెల్ల బ్రహ్మాంతవాఁడు గొడుకు
వాలాయించి నిన్నుఁ గొల్చువాఁడే ధన్యుఁ డయ్యా

చ. 2: పండేది పాలజలధి పంపు సేసేది చక్రము
నిండువన్నెపైఁడికోక నీ మేనది
వుండుదు వందరిలోన యోగమాయ నీ మహిమ
అండ నిన్ను నమ్మినవాఁ డన్నిటాఁ బూజ్యుఁ డయ్యా

చ. 3: సూరలు నీ యాజ్ఞవారు సూర్యచంద్రులు కన్నులు
బిరుదు టెక్కెములు చూపే వేదములు
పురమున నలమేల్మంగ యొప్పెను శ్రీవేంకటేశ
గరిమ నీ శరణన్న ఘనుఁడే నేర్పరయ్యా

పె.అ.రేకు: 0059-06 నాట సం: 15-339

పల్లవి: చూచేవారికి ధర్మము సులభమువలె నుండు
కాచి నమ్మి చేకొంటే ఘనువిఁగాఁ జేసును

చ. 1: అరియ శ్రీపాదతీర్థ మల్పమువలె నుండు
వరుసఁ బాపములను వక్కలించును
వొరసి నీ నామ మొక్క మాటవలె నుండును
నరకములు తరించి నంటున రక్షించును

చ. 2: మహి నీ పూజ తులసీదళమాత్రమువలె నుండును
యిహపరములు దానే యియ్య నోవును
అహరహము నీ చింత ఆందోళమువలె నుండును
విహితమై నీ కృపకు వెసఁ బాత్రుఁ జేసును

చ. 3: చేరి నీకు మొక్కే మొక్కులు చేష్టలువలె నుండు
దారుణిలో భవవార్ధి దాఁటించును
వూరకే నీ కిచ్చే కానుక వొక కాసువలె నుండును
యీరీతి శ్రీవేంకటేశ యే వరమైనా నొసఁగును

పె.అ.రేకు: 0060-01 నాట సం: 15-340

పల్లవి: ఇందులో నే నెవ్వఁడనో యేమేమి సేసితినో
ముందు వెనుక లెఱుఁగ మురహర కావవే

చ. 1: పరదూషకునకు పరమనాస్తికునకు
కరుణ లేనివానికి గతి లేదని యందురు
సరవిఁ గ్రూరునకు సంశయచిత్తునకు
దురితవర్తనునకు దుర్గతియె యందురు

చ. 2: అతినిష్టూరభాషికి నన్యకాంతాలోలునకు
యితరాసూయపరున కిహమే లేదని యందురు
పతితుం డైనవానికి బ్రహ్మణనిందకునకును
తతి ననాచారికిని దైవము లేఁడని యందురు

చ. 3: అనృతవాదికిని అర్థచోరకునకు
ఘనహింసకునకు లోకము లేదని యందురు
విని నే నిందులకుఁగా వెఱచి నీకు శరణంటిని
వెనక వేసుకొని శ్రీవేంకటేశ యేలవే

పె.అ.రేకు: 0060-02 నాట సం: 15-341

పల్లవి: చెల్లునయ్యా యీ మాట శ్రీహరి
యెల్లవారికి నిది విన నింపౌఁ గాదో

చ. 1: చేచేత నిన్ను ధ్యానము సేయు కంటెఁ బెద్ద లెల్లా
యేచి నీ గుణానుభవమే యెక్కుడందురు
పూచిన శాఖలతోడఁ బొదలు వృక్షము కంటెను
కాచి పండిన ఫలము ఘనమౌఁ గాదో

చ. 2: యిన్నిటాను నీకంటేను యెంచి చూచి పెద్ద లెల్లా
చెన్నుగాని దాసులె విశేష మందురు
మిన్నక వనములలో మెఱయుఁ గోవిలకంటెను
వున్నతంబైన నాదమొప్పిదమౌఁ గాదో

చ. 3: మనసారని నాముతోడి మంత్రముకంటెఁ బెద్దలెల్లా
మునుప నాచార్యుఁడే ముఖ్యమందురు
వొనరి శ్రీవేంకటేశ పుర్వి నిక్షేపముకంటె
కనిపంచే యంజనమే వెగ్గలమౌఁ గాదో

పె.అ.రేకు: 0060-03 ఛాయనాట సం: 15-342

పల్లవి: ఏల లోకులకుఁ జూపే వింద్రాదులఁ బితరుల
యీలీల నిన్నుఁ బూజించే దెక్కుడుగాఁ బోలును

చ. 1: యిక్కువ గొల్లలు చేసే యింద్రయాగము మాన్పి
నిక్కి కొండకుఁ జేయించి నీవే భుజించితివి
వెక్కసమై కిరీటి గావించే శివపూజ మాన్పి
గక్కన మోఁకాలఁ బూజ గావింపించుకొంటివి

చ. 2: ముంచి మీఁదుగాఁ జేసిన మునుల యజ్ఞాన్నములు
కొంచక నీవు దెప్పించుకొంటి వా సతులచేత
పొంచి దూర్వా సడిగిన భోజనము లటు మాన్పి
అంచెఁ బాండవుల బలుసాకునాఁ దృప్తైతివి

చ. 3: సారె గోపికలిండ్ల జన్నె వట్టినది మాన్పి
నేరుపుతోఁ బాలు వెన్న నీవే యారగించితివి
ధారుణిలో వేదోక్తధర్మము నీవే నిలిపి
కారణ మింతకు శ్రీవేంకటేశ నీ వైతివి

పె.అ.రేకు: 0060-04 మాళవిగౌళ సం: 15-343

పల్లవి: వెదకెద నిను నే వేదము చెప్పఁగ
హృదయములోననే యిరవు నీ కటా

చ. 1: శ్రీనాథా పిలిచితిఁ బలుకఁగదే
పూని యన్నిటా నుందువట
మానితముగ నామాట వినఁగదే
వీనుల సర్వము విందువటా

చ. 2: పరమాత్మా తప్పక పొడచూపవే
తరుణవయసు మరుతండ్రివటా
పరగ మొక్కెదను పాదము చాఁచవే
సిరుల బ్రహ్మ పూజించినదే యటా

చ. 3: గోవిందా నీ గుణు తెలిఁగించవే
వేవేలు మహిమల విభుఁడవటా
శ్రీవేంకటేశా జిగి నలమేల్మంగ
కైవసమై మముఁ గాతువటా

పె.అ.రేకు: 0060-05 మాళవిగౌళ సం: 15-344

పల్లవి: పరాకు సేయక నన్ను భావించి చిత్తానఁ బెట్టు
సిరివంతుఁడు దీనుని జేరితేను రక్షించుఁ గదా

చ. 1: నాకూ వీఁడే యనక నాకేమి వచ్చీ ననక
దాకొని వీనివంటి దాసు లెంత లేదనకా
యీకడనే నెటువంటి హీనుఁడనైనా ఘనుఁడు
కైకొని మెట్టిన పాదుకలు సంరక్షణ సేయవలదా

చ. 2: నన్నుఁ దప్పులు వట్టక నాతోడ వేసరక
మన్నిఁచఁ గారణమేమి మఱి యింకా ననకా
కన్నులకుఁజూడ బాఁతిగా నీవాఁడ నైనాను
పన్నిన జూదరిసారె పదిలముగాను దాఁచఁడా

చ. 3: నావోజ చూడక నగుఁబాట్లు సేయక
వేవేలై నానా నేరాలు విచారించకా
శ్రీవేంకటేశ నీకు సేవ సేయకుండినాను
దేవర పూజారితప్పు దేరుచఁడా మొక్కితేను

పె.అ.రేకు: 0060-06 మావళవిగౌళ సం: 15-345

పల్లవి: భావింప నీ వొక్కఁడవే బహురూపాల నుండుదువు
దేవదేవ నీ మహిమ దెలియఁగ వశమా

చ. 1: నిన్నుఁ దలఁచేవారిలో నిజరూపుతో నుండుదువు
అన్ని జంతువులలోన నంతరాత్మవై వుండుదువు
పన్ని పంచభూతములలోపల నాధారమై వుండుదువు
వున్న మూఢులలో మాయ నొనగూడి వుండుదువు

చ. 2: సరుస తరువులలో చైతన్యమవై వుండుదువు
గరిమె రాక్షసులలోన కానరాక వుండుదువు
సురలందు యీశ్వరసూచనతో నుండుదువు
అరయ ముక్తులలోన ఆనందమవై వుండుదువు

చ. 3: జగము లన్నిటిలోన సాక్షివై వుండుదువు
తగిలి వేదములలోన అర్థమై వుండుదు
జిగి మించ సర్వదాను శ్రీవేంకటగిరి నుండుదు
సగుణమై దాసులకు సాకారమవై వుండుదువు

పె.అ.రేకు: 0061-01 మాళవిగౌళ సం: 15-346

పల్లవి: నీవు చేసినపనులు నీకే చెల్లెఁ గాక
యీవల నింతేసి చేయ నెవ్వరికీఁ జెల్లదు

చ. 1: దొడ్డ లేల బ్రహ్మాండము తూఁటవోఁ బొడిచితివి
సడ్డసేయ కొత్తితివి సముద్రమును
అడ్డము లే దంటాను హరివిల్లు విఱిచితివి
వొడ్డారాలే నీ కతలు వొద్దనే వా రెవ్వరు

చ. 2: నీరు చట్టు చేసితివి నీవే నీ యాజ్ఞ మీఱి
ధారుణి చక్రవాళము దాఁటితివి
ఆరయ లోకములు మూఁ డడుగులు సేసితివి
దూరులే యివెల్లా నీసుద్దులు చెప్పేనేఁటికి

చ. 3: నిక్కిన కులగిరులు నేలమట్టు చేసితివి
పక్కనఁ దెచ్చితి వింద్రుపారిజాతము
గుక్కక శ్రీవేంకటేశ గొల్లెతలఁ గైకొంటివి
వెక్కసపు నీ వోజలు విచారించవైతివి

పె.అ.రేకు: 0061-02 మాళవిగౌళ సం: 15-347

పల్లవి: నే విన్నవించే దేమి నీవే యెఱుఁగుట గాక
శ్రీవల్లభుఁడవు దయసేయవే నామీఁదను

చ. 1: తన మలిన మద్దము తాఁ దోముకొనునా
కనుఁగొనేటి యద్దము గలవాఁడు దోముఁ గాక
పనివడి నా దోషములు పాపుకొన శక్తుఁడనా
విను నాలో నుండిన నీవే పాపుట గాకా

చ. 2: మహి వెట్టివాఁడు వెట్టి మాన మందు తాఁ గొనునా
వహి కెక్క మం దిచ్చేటి వైద్యుఁడు మానుపుఁ గాక
బహుచంచలుఁడను నా భక్తి నీపైఁ బెట్టేనా
మహిమచేతను నీవే మరపుట గాకా

చ. 3: ధరలోనఁ బెట్టు జెట్టు తా నీరు వోసుకొనునా
బొరిఁ బెంచేవాఁడు నీరు వోసి పెంచుఁ గాక
నిరతి శ్రీవేంకటేశ నేనే నన్ను బోషించేనా
హరి నీవు వుట్టించితి నటు రక్షింతు గాకా

పె.అ.రేకు: 0061-03 సాళంగనాట సం: 15-348

పల్లవి: ఇన్నాళ్లు నా యహంకార మెఱుఁగని దాయె నన్ను
సన్నుతించేను నేరమి క్షమియించవే హరి

చ. 1: దాసుఁడ నంటేఁ గొంత దయ దలఁతువుగాక
నీ సరివాఁడ నంటే నీవు గాచేవా
వేసరక కొలిచితే వెస మన్నింతువు గాక
వాసి వంతు లెంచుకొంటే వశ మయ్యేవా

చ. 2: నుతియించితేఁ గొంత పూనుక రక్షింతువు గాక
ప్రతి ఘటించితేఁ జలపట్టవా నీవు
గతి నీవే యంటేఁ గొంత కైవస మౌదువు గాక
యితరుల వేఁడుకొంటే నియ్యకొందువా

చ. 3: మొక్కితేనుఁ గొంత నీవు మొగమోడుదువు గాక
నిక్కి గర్వాన నుండితే నీవు మెచ్చేవా
దిక్కై యలమేల్మంగపతివి శ్రీవేంకటేశ్వర
చిక్కి యిట్టె మఱుఁగ చొచ్చితేఁ గావ కుందువా

పె.అ.రేకు: 0061-04 సాళంగనాట సం: 15-349

పల్లవి: ఐనాఁ గాని నే నోపినంత నిన్నుఁ బొగడేను
వీనుల నీ సంకీర్తన వినవే నారాయణా

చ. 1: ముప్పదిమూఁడు గోటులై ముంచిన సురల నోళ్లు
విప్పిన శేషుని రెండువేల జిహ్వలు
తప్పులేని యనంతవేదంబుల శబ్దములు
వొప్పుగా నిన్ను నుతించ నోపవు నే నెంతా

చ. 2: రమణ నష్టాదశ పురాణములలో వాక్యములు
తిమురుచుండే సనకాదిమునుల యుక్తులు
అమరిన వ్యాస వాల్మికాది కవివుపమలు
నెమకి నిన్ను నుతించనేరవు నే నెంతా

చ. 3: మట్టులేని సప్త కోటిమంత్రముల యర్థములు
అట్టె యాఁబదియారు అక్షరాల గుణితాలు
నెట్టన శ్రీవేంకటేశ నీ గుణ కథనాలు
జట్టిగా నిన్ను నుతించఁ జాలవు నే నెంతా

పె.అ.రేకు: 0061-05 సాళంగనాట సం: 15-350

పల్లవి: సాదించరాని దొక్కటే సత్యమైన మోక్షము
సోదించితే శ్రీ హరి దాసులకే సులభము

చ. 1: బొందితో స్వర్గమునకుఁ బొయ్యేది యరుదు గాదు
అంది యర్జునుఁ డుండఁడా అయిదేండ్లు
అందరాదు బ్రహ్మపద మదెవ్వరి కనరాదు
పొందుగా రైవతుఁడదె పోయి వుండి రాఁడా

చ. 2: జనులు సూర్యునొద్దకు చనరా దనఁగ రాదు
ఘనవిక్రమార్కుఁ డేఁగి కని రాఁడా
జునిఁగి మీఁదిలోకాలు చూచివచ్చే దేమి దొడ్డు
యెనలేక యయాతి యిన్నిఁ జూచి రాఁడా

చ. 3: విరజానది దాఁటి విష్ణుపద మంది రాను
సురలందు నరులందుఁ జూచితే నెవ్వరు లేరు
యిరవైన శ్రీవేంకటేశుని మహిమ లివి
గరిమె నితనినే కని కొల్వవలయు

పె.అ.రేకు: 0061-06 సాళంగనాట సం: 15-351

పల్లవి: వలసినట్టు సేయు నావల్లఁ గల గుణ మిది
నలినాక్ష నీ తలఁపు నాకేమిఁ దెలియదు

చ. 1: యెన్నఁగా నా పురాకృత మెఱుఁగఁ గాని యొక్కట
నిన్ను నేఁ గొలిచితి ననే గర్వ మెఱుఁగుదు
మున్ను నే నుండే స్వభావము దలఁచఁ గాని నీవు
మన్నించే యహంకారము మదిలోఁ దలఁతును

చ. 2: నేరని నా చేఁతలు నే నెంతైనా నెంచఁ గాని
పేరిటివాఁడ ననేటి పెద్దఱిక మెంతును
మోరతోపున నా మర్మములు చెప్పుకొనఁ గాని
సారె వైష్ణవుఁడ ననే సలిగ చెప్పుదును

చ. 3: యిమ్ముల నేఁ గొంచపడే దెవ్వరికిఁ జూపఁ గాని
నమ్మి నీ మఱుఁగు చొచ్చిన బలిమి చూపుదు
పమ్మి న న్నింతసేసిన పాపముఁ బొగడఁ గాని
నెమ్మది శ్రీవేంకటేశ నిన్నే పొగడుదును

పె.అ.రేకు: 0062-01 సాళంగనాట సం: 15-352

పల్లవి: నేర మెల్లా నాదే కాక నీకుఁ గడమ వున్నదా
సారెనమ్మితే రక్షించఁ జాలుదువు మఱి యేలుదువు గాకా

చ. 1: నీ వెత్తిన వెట్టి మోపునే నడవిఁ బార వేసి
వేవేలు విన్నవించినా విందువా కా దందువు గాక
కావించి నీవు చెప్పిన కర్మఫలము నీ కిచ్చి
యేవి ని న్నడిగినా నీ విత్తువు మఱి మెత్తువు గాక

చ. 2: చెలఁగి నీవు నియమించిన యానాజ్ఞ దోసి
కొలువుకు వచ్చితేఁ జేకొందువా పొ మ్మందువు గాకా
అల నీవు గల్పించిన యాశ్రమధర్మముననే
కెలన నుండిన బ్రదికింతువూ కృప నింతువు గాకా

చ. 3: నేరక నీ బంట్లను నిరాకరించి వచ్చి
కూరిమి మొక్కితేఁ గనుఁగొందువా వల దందువు గాక
కోరి పెద్దల సేవించుకొని వారిచేఁ జెప్పించి
చేరితే శ్రీవేంకటేశ చిక్కుదువు మఱి దక్కుదువు గాకా

పె.అ.రేకు: 0062-02 సాళంగనాట సం: 15-353

పల్లవి: నీ వున్నచోటే నిత్యము నిఖిలమైనవారికి
శ్రీవల్లభ కోరి నిలిచిరి సనకాదులు

చ. 1: పట్టపగలులోననే పద్నలుగురు దేవేంద్రు
లెట్టు గాఁపురము సేసే దింద్రలోకమున
తెట్ట దెరువుననే దిక్కులవారు చూడంగ
చుట్టుకుండు టెట్లు చంద్రసూర్యలోకములా

చ. 2: యెంచి చూడ బ్రహ్మదేవుఁ డేండ్లు నూరిటివాండ్లు
పంచల నెట్లుండేది బ్రహ్మలోకమున
పొంచి వుండఁగోరితే నెప్పుడుఁ బాములతోఁ బొత్తు
వంచనఁ బాతళలోకవాస మేమి బాఁతి

చ. 3: యీటువెట్టితే వితరు లిందుకంటె దిగ్గుడి
నాటుకొని యెట్టుండేది నానాలోకములా
మేటివి శ్రీవేంకటేశ మేమెల్లా నీ బంట్లము
చాటువఁగొనేటి దండ సత మైతి విపుడు

పె.అ.రేకు: 0062-03 బౌళ సం: 15-354

పల్లవి: మఱియు మఱియుఁ బలుమారు నీకే శరణు
అఱిముఱి సకలాంతర్యామీ శరణు

చ. 1: సరుస మూర్తిత్రయ శరీరానికి శరణు
నిరుపమ పంచభూతనిలయా శరణు
పురిగొన్న చతుర్దశ భువనాధారా శరణు
గరిమె నింతకు మూలకారణమా శరణు

చ. 2: పలుకఁగరాని పరబ్రహ్మమా నీకే శరణు
అలవి మీఱినట్టి కాలాత్మకా శరణు
విలసిల్లఁ బొడ చూపే విశ్వరూపమా శరణు
సలలిత బ్రహ్మాండజనకా శరణు

చ. 3: దినకరకోటికోటి తేజమా నీకే శరణు
సనకాదియోగీంద్ర సన్నుతా శరణు
మనికైన యలమేలుమంగ విభుఁడా శరణు
ననుఁగాచే శ్రీవేంకటనాయకా శరణు

పె.అ.రేకు: 0062-04 బౌళి సం: 15-355

పల్లవి: నెట్టున నంతమాత్రాన నీ వాఁడె వాఁడు
యెట్టైనాఁ గావకపోదు యీ సంబధమునను

చ. 1: చిలుకను రామ తమ్మా పలుకు మను నొక్కఁడు
పిలుచుఁ దిమ్మా యని నీ పేరిటివాని నొక్కఁడు
వెలయ గోవిందా యని వెఱగువడు నొక్కఁడు
అలసినవేళ హరి హరి యను నొక్కఁడు

చ. 2: సింగారానకు నొక్కఁడు చిన్ని తిరుమణి వెట్టు
వెంగొంగ నామము వెట్టు వెక్కిరింపుచు నొక్కఁడు
పంగనామముగఁ బెట్టు బహురూపగాఁడొక్కఁడు
సంగాతాలకుఁ బెట్టు వేసాల నామ మొక్కఁడు

చ. 3: సరుగ నీ గుడిలోన సాగిలి పండు నొక్కఁడు
వరుస నూరకే తల వంచు సారె నొక్కఁడు
యిరవై శ్రీవేంకటేశ యిన్నీ నీ మొక్కులుగానే
అరసి చేకొందువు నీ వంత సులభుఁడవు

పె.అ.రేకు: 0062-05 కన్నడగౌళ సం: 15-356

పల్లవి: నీ మహిమ దలఁచుకొని నీవే రక్షించుట గాక
స్వామివి మామీఁద నీవు సడి వేయ నేలా

చ. 1: నే నొక్క యణుమాత్రము నీవు మహద్రూపుఁడవు
కానీలే నీ ముందర నా కథ యేమి
పూచి చిత్రగుప్తులచే పుణ్యపాపము వ్రాయించి
ఆని లోకాల కెక్కించి ఆఁబడిఁ బెట్ట నేలా

చ. 2: నేర నేఁ బరతంత్రుఁడ నీవు స్వతంత్రుఁడవు
యీరీతివాఁడ నను నెంచ నేది
సారెకు రవిచంద్రులసాక్షిగా మా కిటు లెట్టి
కోరి పనులు సేయించి గొరబు సేయ నేలా

చ. 3: యెందు నే లక్ష్యము గాను యిన్న నీవు లక్ష్యము
పొందుగా ని న్నెంచే చోట భువి నే నెంతా
విందుగ నలమేల్మంగ విభుఁడ శ్రీవేంకటేశ
కందువ నా యాత్మ వింత గరిసించ నేలా

పె.అ.రేకు: 0062-06 కన్నడగౌళ సం: 15-357

పల్లవి: నిన్ను నమ్మి విశ్వాము నీపై నిలుపు కొని
వున్నవాఁడ నిఁక వేరే వుపాయ మేమిటికి

చ. 1: గతియై రక్షింతువో కాక రక్షించవో యని
మతిలోని సంశయము మఱి విడిచి
యితరులచే ముందర నిఁక నెట్టౌదునో యని
వెతతోడఁ దలఁచేటి వెఱ పెల్లా విడిచి

చ. 2: తిరమైన నీ మహిమ తెలిసేవాఁడ ననే
గరువముతోడి వుద్యోగము విడిచి
వెరవున నీ రూపము వెదకి కాన లే ననే
గరిమ నలపు నాస్తికత్వమును విడిచి

చ. 3: ధ్రువమైన చేఁతలకు తోడు దెచ్చు కొనే ననే
అవల నన్యుల మీఁది యాస విడిచి
వివరించి యలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తవిలి నా పుణ్యమంతయు నీకు విడిచి

పె.అ.రేకు: 0063-01 దీపకం సం: 15-358

పల్లవి: చెల్లఁబో యేమి చెప్పేది జీవుని యజ్ఞానము
తెల్లమైన పను లెల్లా దెలిసీఁ దెలియఁడు

చ. 1: అప్పిచ్చి వడ్డీలాభాన కా దినము లెంచుఁ గాని
కప్పి సరివచ్చే గతకాల మెంచఁడు
యెప్పుడు నింతులఁ గూడి యింపులే తలఁచుఁ గాని
చిప్పిలి దేహము సమసేది దలఁచఁడు

చ. 2: పంతముతో వేఁటలాడి ప్రతాపమే చూచుఁ గాని
బంతినే చుట్టుకొనే పాపము చూడఁడు
వింతవారి సొమ్ము వేడుక వూహించుఁ గాని
వంతలఁ దిరుగ దిద్దవలయు టూహించఁడు

చ. 3: అన్నిటాఁ గర్తననే యహంకార మెఱుఁగు గాని
తన్నుఁ బ్రేరించే దైవము తా నెఱుఁగఁడు
యెన్నఁగ శ్రీవేంకటేశ యివి యెల్లా నీమాయలే
మన్నించి బుద్ధి యొసఁగి మనుప నీ భారము

పె.అ.రేకు: 0063-02 రామక్రియ సం: 15-359

పల్లవి: కంబములో వెడలితివి కరిరాజుఁ గాచితివి
పంచి యిన్నిటా నీ కిది పనియటే శ్రీహరీ

చ. 1: యెవ్వఁడూ మొఱవెట్టునో యిట్టె రక్షించే ననుచు
యెవ్వఁడూ ననుఁబేర్కొనునో యింతటాఁ బలికేననుచు
యెవ్వఁడూ మదిఁ దలఁచునో యిక్కువఁబొడచూపేననుచు
వువ్విళ్లూరఁ గాచుకొని వుందు వటే శ్రీహరీ

చ. 2: ఆపన్నుఁడు శరణంటే నడ్డము వచ్చే ననుచు
యేపొద్దు ధ్యానించువానికి యెదుట నుండే ననుచు
పై పైఁ బూజించేవానికి పాదములు చాఁచే ననుచు
వోపి యెప్పుడు గాచుకొని వుందు వటే శ్రీహరీ

చ. 3: అడిగి బొగడేవానికి నప్పుడే నొసఁగే ననుచు
చిడిముడి నీ దాసునికి చెప్పినట్టు సేసే ననుచు
బడినే శ్రీవేంకటేశ భక్తి సేసే వానికిని
వుడివోక కాచుకొని వుందు వటే శ్రీహరీ

పె.అ.రేకు: 0063-03 రామక్రియ సం: 15-360

పల్లవి: ఇది తుద మొదలని యెఱుఁగ రెవ్వరును
యెదుట నీ మహిమ యెంతని తలఁతు

చ. 1: తరణిచంద్రుల రథంబుల వెంటను
గరిమలఁ దిరిగీ కాలమూ
పురవడిఁ బ్రాణుల నూర్పులవెంబడి
నరుదుగ మెఱసీ నాయుష్యములు

చ. 2: నెలకొని యెండల నీడల దండనె
తెలుపుచుఁ బొదలే దినములు
వెలయఁగఁ జీకటి వెన్నెలమాటున
మలసీ సారెకు మాసములు

చ. 3: వానలశీతున వాయుమార్గమున
యీనుచు నున్నవి యేండ్లు
తానక మైనది తలఁపఁగ నీయందు
శ్రీనిధి చూడవే శ్రీవేంకటేశ

పె.అ.రేకు: 0063-04 దేసాళం సం: 15-361

పల్లవి: నీవు లోకోన్నతుఁడవు ని న్నెఱుఁగరా యిందరు
వేవేలు నేఁ గెలసిన వెలితా నీకు

చ. 1: గుట్టునఁ బుట్టుతా బొడ్డు గోయించుకొన్నవాఁడు
యిట్టే జారుఁడవంటే యెగ్గా నీకు
బట్టబయలు సంసార భ్రమ వట్టి
వొట్టి నాటకుఁడ వంటే వొచ్చెమా నీకు

చ. 2: అంది యధరపానాన అన్ను వట్టినట్టి వాఁడ
చెందిన కపటి వంటే సిగ్గా నీకు
ముందే మాయాశక్తి శివమునఁ బొరలేవాఁడ
నిందఁ బడ్డవాఁడ వంటే నేరమా నీకు

చ. 3: పలుకులప్రల్లదపు బహుభాషివాఁడను
యిల వెన్నదొంగ వంటే హీనమా నీకు
అలరి శ్రీవేంకటేశ అన్నిటా నీ దాసుఁడను
బలుదైత్య హంత వంటే భారమా నీకు

పె.అ.రేకు: 0063-05 వరాళి సం: 15-362

పల్లవి: వేవేలు తప్పులు గల్లావెనక వేసుకొనుమీ
నీవాఁడ నైనందులకు నీవే దయఁ జూడుమీ

చ. 1: మగనికి నేప్రొద్దుఁ బ్రేమపుటాల నైనట్లు
పగటున నేలికెకు బంట నైనట్టు
నిగిడి యట్టే తండ్రికి నిజపుత్రుఁడ నైనట్టు
తగులాయ మైతిఁ జుమ్మీ దైవమా నీకు

చ. 2: అన్నిటా భూమేలేవాని కరిగాఁప నైనట్టు
వున్నతి గురునికి శిష్యుడ నైనట్టు
కొన్న యజమానునికి కోరి దాసి నైనట్టు
పన్నిన లంకెనేఁ జుమ్మీ పరమాత్మ నీకు

చ. 3: పెంచుకొన్నవారికి పెంపుడుఁగుబ్బ నైనట్టు
చంచుల దేవతకుఁ బూజరి నైనట్టు
యెంచఁగ శ్రీవేంకటేశ యెందుఁ జూచినా నేను
అంచితానుబంది సుమ్మీఆదిమూర్తి నీకు

పె.అ.రేకు: 0063-06 భైరవి సం: 15-363

పల్లవి: నీకే సెలవని నెపమువేయుట యింతే
కైకొని కాచే నీవుపకారమే దక్కినది

చ. 1: వొట్టి నీ కొలుకుఁగా వుపవాసా లుండేనంటే
అట్టె నీకు లాభము అం దేమున్నది
జట్టిగా నిన్నుఁ గూరిచి సన్యాసి నయ్యే నంటే
చుట్టుకొని నీకు గల్గే సుఖమం దేమున్నది

చ. 2: కడు నీ పాదతీర్థపు గంగలో నానే నంటే
అడరిన తనివి నీ కందేమున్నది
అడవిలో ఘోరతప మంది నీకుఁ జేసే నంటే
అడియాలమైన ఫల మందు నీ కేమున్నది

చ. 3: నిన్నుఁ గనుఁగొన్నదాఁకానే గడ్డము వెంచే నంటే
అన్నిటా నీకుఁ గూడేది అందేమున్నది
వున్నతి శ్రీవేంకటేశ వూరకే నీ వాఁడ నైతి
యెన్న నీకుఁ గాక యిఁక నం దేమున్నది

పె.అ.రేకు: 0064-01 పాడి సం: 15-364

పల్లవి: ఏకాలము నామనే యెఱిఁగిన దాసులకు
దాకొనీ శ్రీహరిభక్తి దారణ గలిగితేను

చ. 1: వుడివొడేకాలము వొక్క తతి రావద్దు
చెడని శ్రీహరిభక్తిచెట్టుకట్టితే
తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ బొల్లు వోదు
బడినే శ్రీహరిభక్తి పంట వండితేను

చ. 2: పలువ దీసితేఁ బోదు వాడుకొంటే వెల్తి గాదు
కొలచి శ్రీహరిభక్తి కుప్ప చేసితే
యెలుకకు దినరాదు యెన్నాళ్ళున్నాఁ జివుకదు
తలఁచి హరిభక్తి చిత్తపుగాదెఁ బెట్టితే

చ. 3: కఱవుకు లోఁ గాదు సుంకరవానికి నబ్బదు
యెఱుకతో హరిభక్తి యిల్లు నిండితే
నెఱవై శ్రీవేంకటేశ నీకృపగలవారికి
గుఱిగాఁగ హరిభక్తి కూడపెట్టుకొంటేను

పె.అ.రేకు: 0064-02 కాంబోధి సం: 15-365

పల్లవి: ఏమిసేసే దిఁకను యెట్టు నిన్నుఁ దలఁచేది
నీమతకమే కాఁబోలు నీరజనాభా

చ. 1: ఉఱక మనుజులకు నొక్కొక్కవేళ గుణము
మఱపుఁ దెలివి నేను మరులు గాదు
మఱియు నెంచి చూచితే మనసు నొక్కొక్కవేళ
గుఱి గడవఁగఁ బారు గుఱ్ఱముఁ గాదుఁ

చ. 2: పన్నుక వొక్కొక్కవేళ పరులపై మచ్చరము
తన్నుఁ దానే వచ్చి పట్టు దయ్యముఁ గాదు
తిన్ననై బత్తెము గొని దీపన మొక్కొక్కవేళ
వన్నెకెక్కిన యప్పుల వాఁడుఁ దాఁ గాఁడు

చ. 3: ముంచుకొను మోహము మొనసి యొక్కొక్కవేళ
పొంచి ముందు వెనకల మంచుఁ గాదు
యెంచఁగ శ్రీవేంకటేశ యిందరికి దిక్కు నీవే
నించితి నీ కృప అది నీ కడ్డము గాదు

పె.అ.రేకు: 0064-03 బౌళిరామక్రియ సం: 15-366

పల్లవి: అనాథుల రక్షించేది అన్నిటాఁ బుణ్యము గాదా
పెనఁగి నూతికట్ట బిడ్డఁ బట్టవలదా

చ. 1: నావలె మత్తుఁడవా నానా భోగలోలుఁడవా
కావించి బుద్ధి యెఱుఁగనివాఁడవా
భావించి నే జీవుండను ప్రకృతి యిట్టైతేనేమి
దేవుఁడవు నాలోనుండి తెలుపఁగ వలదా

చ. 2: చంచలచిత్తుఁడవా సంసారబద్ధుఁడవా
పొంచి నావలెనే నీ వకించనుఁడవా
ముంచి తెరువెఱుఁగని మూఢుఁడ నైతి నేమి
యెంచి సంగడీఁడవు యెచ్చరించవలదా

చ. 3: యేమటేటివాఁడవా హీనగుణమువాఁడవా
పామరపు నేఁతల బాగువాఁడవా
నే మానిసి నైతే నేమి నీవు శ్రీవేంకటేశ్వర
దోమటిచుట్టమవు పొందుగాఁ గావ వలదా

పె.అ.రేకు: 0064-04 శ్రీరాగం సం: 15-367

పల్లవి: నీవే వచ్చి ప్రత్యక్షమై నిలుతువు గాక మాకు
భావించి నిన్ను రూపించి పట్ట నెట్ట వచ్చును

చ. 1: పాలజలనిధిలోన పండేది నీ కొకచోటు
వోలి జీవులలో నెల్లా వుండేది నీ కొకచోటు
తేలగిల సూర్యునిలో తిమ్మట నీ కొకచోటు
తాలిమి ని న్నెందని వెదకఁ గల మిఁకను

చ. 2: అనలునిలోపల నారగించే దొకచేటు
గొనకొని వైకుంఠానఁ గొలువుండేదొక చోటు
పొనుఁగక దాసులిండ్లఁ బూజఁగొనే దొకచోటు
ఘనుఁడ నిన్ను సోదించి కన నెట్టు వచ్చును

చ. 3: రతిఁ దులసివనాన రచ్చ సేసే దొకచోటు
కతలుగా లక్ష్మితోడ కాఁపురము లొకచోటు
తతి శ్రీవేంకటాద్రిపై దగఁ గాణాచొకచోటు
యితవుగా నీ చొప్పు లెత్తఁగ మాతరమా

పె.అ.రేకు: 0064-05 శ్రీరాగం సం: 15-368

పల్లవి: వామన నృసింహ వాసుదేవ హరి
నీ మహిమఁ గదా నిర్మలు లైరి

చ. 1: సనకసనందన సనత్కుమారులు
సనత్సుజాతాది సంయములు
వినయముతో ధ్రువ విభీషణాదులు
నినుఁ గొలిచి కదా నిర్మలు లైరి

చ. 2: నారదశుక శౌనకహనుమంతులు
పారాశర్య ప్రముఖులును
ధారుణి రుక్మాంగద ప్రహ్లాదులు
నీ రచనఁ గదా నిర్మలు లైరి

చ. 3: కరిపుండరీక గాంగేయవసిష్ఠు
లరిది నంబరీషార్జునులు
యిరవుగ శ్రీవేంకటేశ నీ పాదములు
నిరతిఁ గని కదా నిర్మలు లైరి

పె.అ.రేకు: 0064-06 రామక్రియ సం: 15-369

పల్లవి: వెఱవకుఁడీ యిందుకుఁగా విశ్వహితుఁడ నేను
అఱిముఱి నన్ను నమ్ముట మేలు హరిదాసుఁడ నేఁ గాన

చ. 1: పరమపదనాథునే భావించి తపము సేసే
వొొరులలోకము నే నడుగ వో సురలాల
ధరలో లక్ష్మీపతిదాసుఁడ నేనైతిఁ గాని
సిరులకై మిము వేసరించ చింతించకుఁడీ మీరు

చ. 2: పరగ చక్రాయుధుని బంట నేనై తపము సేసే
వొొరులఁ బీడించఁ గాదు వో సురలాల
గరుడవాహనుని కడు నుతియించేఁ గాని
తరలి భీతిల్లి యమృతము దాఁచుకోకుఁడీ మీరు

చ. 3: ఆముకొని యజ్ఞేశ్వరుఁ డని నేఁ బూజించేఁ గాని
మీమీ భాగము లడుగుట లేదు సుమీ సురలార
యేమఱక శ్రీవేంకటేశుని శరణము జొచ్చితి
కామించినట్లనే నన్నుకరుణించుఁడీ మీరు

పె.అ.రేకు: 0065-01 శంకరాభరణం సం: 15-370

పల్లవి: నానావుపాయముల నన్నుఁ గాచేది పాడి
దీన రక్షకుఁడ నాకు దిక్కయి నిలువవే

చ. 1: శరణు చొచ్చినవాఁడు సర్వాపరాధి యైనాను
పరగఁ దప్పులు మఱి పట్టఁ దగదు
సరవిఁ బాఁతవాఁ డెంత సలిగలఁ బొరలినా
అరసి యందుకుఁగా నలుగఁగఁ దగదు

చ. 2: పంచ చేరి వున్నవాఁడు పనికిరాకుండినాను
వంచనతో వాని విడువఁగఁ దగదు
కొంచెపడి మొక్కేవాఁడు గుణహీనుఁ డైనాను
అంచెల మొగమాడక అదలించఁ దగదు

చ. 3: మన్నన బంటైనవాఁడు మందెమేళాన నుండినా
పన్ని మనసున యెగ్గుపట్టఁ దగదు
యిన్ని విధములవాఁడ నిటు నే శ్రీవేంకటేశ
నన్నుఁ గాచుట గాని మిన్నక దూరఁ దగదు

పె.అ.రేకు: 0065-02 గుండక్రియ సం: 15-371

పల్లవి: పోలఁ జెప్ప నేమున్నది పుణ్యమువాఁడవు నీవు
యేలే నంటేఁ గానిమ్మని యియ్యకొంట గాక

చ. 1: బట్టబయ లున్నాఁడ యేపని సేసి వచ్చితి
అట్టే పరమపద మడుగ నో రేది
నెట్టన నీ వొసఁగితే నీ పంగెనవాఁడనై
దిట్ట కూళతనముఁ దీసుకొంట గాక

చ. 2: వొడలు మోచు కున్నాఁడ వొక్కనాఁడుఁ దడవను
బడలి కొలువు సేయఁ బ్రాప్తి నా కేది
చిడిముడితో నీ చెరు గొందినాఁడ నై
బుడిబుడి నటు నిట్టు పొలయుట గాకా

చ. 3: యిలపైఁ బుట్టు చున్నాఁడ యెవ్వఁడను నీకు నేను
తలఁచి నిన్నుఁ గొసర తగవు నా కేది
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
చెలఁగి నీ వాఁడ నని చెప్పుకొంట గాకా

పె.అ.రేకు: 0065-03 సామంతం సం: 15-372

పల్లవి: ఇన్నిటికి మూలము యిందిరానాయక నీవే
సన్నల నే నెటువలె సాధింతు నయ్యా

చ. 1: యెందును బలవంతము యింతుల చుట్టరికము
అందునకంటే వాలాయ మాహారవాంఛ
అందిన పిసిఁడితన మారెంటికంటె నిష్టతి
కందున నే నెవ్వరినిఁ గాద నీ తొత్తునయ్యా

చ. 2: వీడని సమ్మంధము వెస దేహానకు నాకు
ఆడి కూడిన సంగాత మహంకారము
తోడిలంకె యెపుడును దురభిమానములు
వాడికేయ నెవ్వరి నీవల కందు నయ్యా

చ. 3: మిక్కిలి నేస్తముతొల్లె మించులబంగారము
నిక్కముగా ననుబంధి నిర్దయత్వము
వొక్కటై కనుఁగొనుచు వున్నాఁడవు నాలో నీవే
యిక్కడ శ్రీవేంకటేశ యెవ్వరి రోతు వయ్యా

పె.అ.రేకు: 0065-04 నారాయణగౌళ సం: 15-373

పల్లవి: అటువలెనే వుండవలదా హరిపై భక్తియును
పటువై భాగవతుల భాగ్యఫలము గానా

చ. 1: పడిపోయిన యర్థము పక్కనఁ గనినపుడు
వడిఁ బ్రాయము మగుడఁగఁ దావచ్చినయపుడు
బిడిసిన కార్యము పొంది చేకూరినయపుడు
అడరిన సంతన మింతంతనవచ్చునే మతికి

చ. 2: అట్టే దేశాంతరగతుడగు సుతుఁ గని నపుడు
నెట్టనఁ బొయ్యే ప్రాణము నిలిచినయపుడు
దట్టమై మఱచిన పద్యము దలఁపయిన యపుడు
వొట్టిన సంతస మెంతని వొనగూడును మతికి

చ. 3: అలిగిన యేలికె తనుఁగ గడు నాదరించినపుడు
చెలఁగుచు దూరపు కాంతను చేరినయపుడు
బలు శ్రీవేంకటగిరిపతి ప్రత్యక్ష మైనపుడు
నెలకొని సంతస మెంతని నిండుకుండు మతికి

పె.అ.రేకు: 0065-05 రామక్రియ సం: 15-374

పల్లవి: తన పాటెంచు కోఁడు దైవమా యీ యాతుమ గాచి
ఘనవివేకంబొసఁగి కాణాచిగా నేలఁ గదే

చ. 1: బలుకాంక్షలు ముందల పట్టి తియ్యఁగా దుఃఖించఁడు
తొలఁగ క్రోధము రొమ్ముఁ చొక్కఁగా దుఃఖించుఁడు
బలిమితో లోభము తన్ను బాధించఁగా దుఃఖించఁడు
వలవంత దేహి చన్నవారికి దుఃఖించును

చ. 2: తను నీషణత్రయము దండించఁగా దుఃఖించఁడు
మన సేడకైనాఁ బోయి మరుగఁగా దుఃఖించఁడు
ఘనమోహాంధకారము కలఁచఁగా దుఃఖించఁడు
మును చన్నవారికిఁగా మొనసి దుఃఖించును

చ. 3: పట్టి జవ్వనమదము పఱచఁగా దుఃఖించఁడు
అట్టే తాను జన్మించినయందుకు దుఃఖించడు
నెట్టన శ్రీవేంకటేశ నీ బంటుఁగాఁ జేసుకొని
గట్టిగా దుఃఖ ముడిపితే కాచుకొని సుఖించును

పె.అ.రేకు: 0065-05 శ్రీరాగం సం: 15-375

పల్లవి: ఎవ్వరివంకా నే మున్నది
నవ్వుచు నీశ్వర నను(గావ(గదే

చ. 1: ప్రతిబంధములకు(బంత మిచ్చితిని
రతి నా తెరు వి(క రాకు మని
గతిమాలి మాయకు కడు వీ(పొగ్గితి
మతి నను నేపక మన్నించు మనుచు

చ. 2: చెప్పితి(బ్రియములు చిత్రగుప్తునకు
తప్పక కవెలలు దాచు మని
ముప్పిరి మొక్కితి మునుపనే మనసుకు
యెప్పుడు(గదలకు నేగకు మనుచు

చ. 3: వూరడించితిని వొడ(బరచి నిద్రను
సారె నేమరించకు మనుచు
యీరీతి శ్రీవేంకటేశ యలసితిని
చేరి నన్ను(గృప సేయ(గదే

పె.అ.రేకు: 0066-01 బౌళి సం: 15-376

పల్లవి: ఆటవానికివలెఁ దో డయ్యీఁ బ్రకృతి
గాటపు జీవుని కెంత కైవసమో ప్రకృతి

చ. 1: చాటి చదివినవెల్లా సారెఁ దలంపించి యిచ్చు
పాటించి యక్షిణి విద్య ప్రకృతి
తేటగాఁ దొల్లిఁటి జన్మము దెచ్చి యీ జన్మాన నిచ్చు
చీటికి మాటికి యిచ్చిన దిచ్చుఁ బ్రకృతి

చ. 2: వొక్కచో నుండినవాని నొక్కచోఁ బొడచూపించును
పక్కన పాసికవిద్య ప్రకృతి
దుక్కినేలఁ జల్లిన విత్తులు కొటారు కెక్కించు
వొక్కటే యనేకముగా నొనరించుఁ బ్రకృతి

చ. 3: మనసులోఁ దలఁచితే మర్మములు గరఁగించు
పనివడి యింద్రజాలమై ప్రకృతి ప్రకృతి
యేనలేని శ్రీవేంకటేశ యీ జీవులకు
పనిగొంటివి సంసారఫలము యీ ప్రకృతి

పె.అ.రేకు: 0066-02 భౌళి సం: 15-377

పల్లవి: అప్పుడుగాని తలఁపు అలవాటై వుండదు
వుప్పతిల్లు తత్త్వజ్ఞానికి వూహింపుచు నుండఁగవలెను

చ. 1: సాలీని మతి పడుగు చరిసేసే యందే యుండు
గాలిపు బెండుపై వేఁటకాని కుండును
వాలాయించి దృష్టి వింటివానికి గుఱిపై నుండు
యీ లీల తత్త్వజ్ఞానికి యెచ్చరికై యుండవలెను

చ. 2: దున్నేవానికి మనసు తొలుతఁ జాలుపై నుండు
పన్ని జూజరికి నాటపై నుండును
సన్నలఁ గోమటిచూపు సరకులపై నుండు
యెన్నఁగాఁ దత్త్వజ్ఞానికి యెచ్చరికై యుండవలెను

చ. 3: భూమిలో దొంగకు చింత పొద్దు పైనే వుండు
కాముకుని తలపోఁత కాంతపై నుండు
ఆముకొని శ్రీవేంకటేశుఁ డంతరాత్మయై యుండును
సాముగా తత్త్వజ్ఞానికి సాధింపుచు నుండవలెను

పె.అ.రేకు: 0066-03 బౌళి సం: 15-378

పల్లవి: ఇటువంటివారల నెట్టు బోధించఁగ వచ్చు
కుటిలపు బుద్ధులచే కుందుదురు తాము

చ. 1: పాపపుణ్యకర్మదేహి పసిరికాయపురువు
కూపములోనికప్ప దుర్గుణబద్ధుఁడు
దీపము వేఁటమృగము తెగని యాసోదకాఁడు
దూపము కాకి భక్తి యెందును లేని వాఁడు

చ. 2: మతిచంచలపువాఁడు మద్దెలలోని యెలుక
ప్రతియై కోరెడువాఁడు వలలో మీను
కుతిలపు టహంకారి గుండెమీఁది చింబోతు
అతికాముకుఁడు జిగు రంటుకొన్న పికిలి

చ. 3: దేవతాంతరపరుఁడు తేనెలోఁ బడిన యీఁగ
భావించి కావనివాఁడు బెసి కొక్కెర
శ్రీవేంకటాధీశ్వరు సేవించక మోక్షానకుఁ
బోవల ననేటివాఁడు బూరగుపై చిలుకా

పె.అ.రేకు: 0066-04 లలిత సం: 15-379

పల్లవి: విచారపరులాల వివేకులాల
పచరించి తెలిసి యాపగిది నడవుఁడీ

చ. 1: చేసినపుణ్యమువల్ల చెలఁగి దేవత లైరి
ఆసరిఁ బాపమువల్ల నసుర లైరి
దాసరితనమువల్లఁ దగ నారదాదులైరి
వాసి నిందెవ్వ రెక్కుడొ వడి నెంచు కొనుఁడీ

చ. 2: ఘనరాజసగుణాన కలుగు నిహలోకము
అనిశముఁ దామసాన నధోగతి
మొనసి సాత్త్వికమున మోక్షము సిద్ధించు
ననుపమ పదమేదొ అది యెంచుకొనుఁడీ

చ. 3: పరగ దేహమూలము ప్రాకృతమయిన మాయ
అరాసి యాత్మ నీడేర్చు నలమేల్మంగ
సిరుల నంతర్యామి శ్రీవేంకటేశ్వరుఁడు
సరి నిందు మీ బ్రదుకుజాడ యెంచుకొనుఁడీ

పె.అ.రేకు: 0066-05 గుజ్జరి సం: 15-380

పల్లవి: దైవము చేసిన సేఁత తప్పించ రాదు
కావలసిన పనులు కాక మానవు

చ. 1: పొంకము గానివానికి బుద్ధు లెన్ని నేరిపినా
వంకర కొంకరే కాని వశము గాఁడు
సంకుఁ బూస దెచ్చి యెంతసానఁబట్టి తోమినాను
సుంకించి ముత్యముతోడి సూటికి రాదు

చ. 2: యెలమితోఁ గురూపి నెంత సింగారించినాను
అలయికలే కాని అందము గాదు
మలసి యిత్తడి దెచ్చి మాడలుగాఁ జేసితేను
కల సహజమే కాని కనకము గాదు

చ. 3: యిరవుగా నిగ్గడికి నెంత పెండ్లి సేసినాను
పొరపొచ్చెమె కాని పొందఁగ రాదు
సరుగ శ్రీవేంకటేశ్వరు దాసుఁడైతేఁ గాని
సరి నేమిటా జ్ఞానము సమకొనరాదు

పె.అ.రేకు: 0066-06 దేసాక్షి సం: 15-381

పల్లవి: నీ యుపకారమే మాకు నిలిచే దింతే కాక
యేయెడా నీ యుదారత్వ మేమని నుతింతును

చ. 1: నీ కరుణ నాకే పనికివచ్చుఁ గాక మఱి
యీాకడ నా భక్తి నీకు నెందు కెక్కును
కైకొని నాకు నీ రక్షకత్వము ఫలించుఁ గాక
నీకు నా సేవల వంక నిండే దేమీ

చ. 2: నీవు నన్ను వెదకి మన్నించేదే యెక్కుప గాక
భావించి నేఁ దలఁచే లాభము నీకేమి
దేవ నీవు చన విచ్చేదే నాకు గుఱి గాక
పూవులనేఁ బూజించఁగ పొందేది నీ కేమి

చ. 3: యిట్టే నీవు నాకు వర మిచ్చేదే ఘనత గాక
నెట్టన నేఁ గొలువఁగ నీ కయ్యే దెంతా
గుట్టున శ్రీవేంకటేశ కోరి నీకు శరణంటి
వట్టిన వినయమే కాక వచ్చేది నీ కేమీ

పె.అ.రేకు: 0067-01 గుజ్జరి సం: 15-382

పల్లవి: అంతరంగములో నున్న హరియే గతి గాక
చింతించి మొక్కితేఁ దానే చేకొని రక్షించును

చ. 1: పుట్టించిన కర్మమే పోషించకుండు నట
బెట్టుగా మనసే మరపించు నట
పట్టయిన దేహమే బతిమాలింపించు నట
చుట్టము లెవ్వరు యెంచి చూచినఁ బ్రాణికిని

చ. 2: పక్కన విత్తినభూమి పంట వండకుండు నట
యెక్కడా మాయే భ్రమయింపించు నట
అక్కరతోఁ జేసిన పుణ్యమే కట్టివేసు నట
దిక్కుదెస యెవ్వరు యీ దేహిఁ గరుణించను

చ. 3: ఆసలఁ బెట్టే పాయమే అటమట మౌనట
చేసే సంసార మజ్ఞానిఁ జేయు నట
వేసారక యింతకూ శ్రీవేంకటేశుఁ డేలికట
మోసపుచ్చే వారెవ్వరు ముదమే జీవునికి

పె.అ.రేకు: 0067-02 శుద్ధవసంతం సం: 15-383

పల్లవి: ఓడలు బండ్ల వచ్చు నోగి బండ్లోడ లెక్కు
యేడా నహంకార మేల యెఱిఁగినవారికి

చ. 1: సులువునఁ గొన్నాళ్లకు నరులే సుర లౌదురు
అల సురలే నరులౌదురు మీఁద
జలమయమై యుండు జగమెల్లా నొకవేళ
జలమందే భూమి పుట్టి జగము గాన్పించు

చ. 2: యీరీతి నొకానొకప్పు డేనుగు దోమయై పుట్టు
ఆరయఁగా దోమ యేనుగై పుట్టును
చేరి కాలగతులను చీఁకటి వెన్నెల నొత్తు
పేరి వెన్నెల చీఁకటిఁ బెడఁబాయఁజేసును

చ. 3: పరగ భాగ్యవశాన బంట్లే దొర లౌదురు
అరుదుగ దొరలే బంట్లౌదురు మీఁద
యిరవై శ్రీవేంకటేశుఁ డేలికని కొల్చితేను
పరము నిహము నొక్కపగిది కలుగును

పె.అ.రేకు: 0067-03 నాట సం: 15-384

పల్లవి: అలసితిని పుణ్యపాపముల ఆకలిఁబడి నేను
గెలిచితిని నిన్నుఁ గొలిచి యింకఁ గీర్తింపుచు నిర్మలుఁడనైతిని

చ. 1: యింక నేను యీ పదునాలుగు లోకముల చొచ్చి యెన్నాళ్ళు దప్పించుకొనువాఁడ
యింక నేను నేఁ జేసిన దానంబులు చూపి యెందాఁకాఁ బెనఁగెడువాఁడ
యింక నేను నా పుత్రమిత్రుల నడుమ నెట్టు దాఁగఁ గలవాడ
యింక నేను యిల దివ్యతీర్థముల వెంటవెంట నెక్కడని పారేడఁ గలవాఁడ

చ. 2: యింక నేను నానాదేవతల మఱుఁగునను యేది గొలది దొబ్బఁ గలవాఁడ
యింక నేను బహు జంతురూపములు గైకొని యేపగిదిని బొంకఁగలవాఁడ
యింక నేను మంత్రములు జపంచి యేరీతి మాయల గెలిచేటివాఁడ
యింక నేను సంసారము చూపి యేమని నమ్మించఁ గలవాఁడ

చ. 3: యింక నేను నీ దాసుఁడనై ఇటువలె నుండఁ గలవాఁడ
యింక నేను నీవే గతి యని యిహముఁ బరముఁ జేకొనువాఁడ
యింక నేను అలమేలుమంగకు యీశ్వరుఁడవైన శ్రీవేంకటేశా
యింక నేను ఆచార్యననుమతి హృదయములోపలఁ దలఁచువాఁడ

పె.అ.రేకు: 0067-04 బౌళి సం: 15-385

పల్లవి: పురుషోత్తమా అన్నిటిలో పూసలలో దారమవూ
వెరవెఱిఁగి ని న్నేపొద్దును సేవించఁగవలెఁగాని

చ. 1: కదలును గాలి నీవు కదలించితే
పొదలును సస్యములు నీవు పొదలించితే
వెదకితే కీలు నీవే విశ్వంబునకు
పదిలముగా నిను వెదకి పట్టఁగవలెఁ గాని

చ. 2: కాలముఁ గర్మములో నీవు కానరాక వుండి
నేలయు మిన్నును నీవే పాలింపుచున్నాఁడవూ
నీ లీలలైన బొమ్మలాట లివి నీచేత నాడీని
కోలుముందుగా నీ సాకారము కోరి చూడవలెఁ గాని

చ. 3: యిత్తువు వరములు నీవే యిటు శ్రీవేంకటగిరిని
మొత్తమై యలమేల్మంగతో ముద మలరఁగాను
బత్తితో నినుఁ గొలిచినవారికి పరుసవేదివి నీవే
కొత్తలుగా నిన్నే నమ్మి కొలిచి బ్రదుకవలెఁ గాని

పె.అ.రేకు: 0067-05 సౌరాష్ట్రం సం: 15-386

పల్లవి: మానరాదు నేఁ దప్పులు మఱి యెన్ని చేసినాను
కానిమ్మని నీకు నిట్టే కరుణించవలెను

చ. 1: వేడుకైన నీ దేవుల విన్నపము విని కాని
యీడులేని నీ బిరుదు లెంచి కాని
పాడికొని నామముల ప్రభావాన నైనఁగాని
యేడనై నా నీ దాసుఁడ నెంచి కావవలెను

చ. 2: నమ్మి నిన్నుఁ గొల్చిన నా గురునిఁ జూచి కాని
కమ్మకొని నాదైన్యము కనైనఁ గాని
వుమ్మడి నీకుఁ గలుగు నుదారత్వమునఁ గాని
పమ్మి నన్ను రక్షించి బ్రదికించవలెను

చ. 3: హరి నాలోపల నున్న సమ్మంధమునఁ గాని
నిరతి నేలికలైన నెపానఁ గాని
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ
హరి నాకుఁ బ్రత్యక్షమై ఆదరించవలెను

పె.అ.రేకు: 0067-06 భూపాళం సం: 15-387

పల్లవి: ఏమి సేయుదును నా యుద్యోగముయెంతో నా యాసోదము
కామింతుఁ గాని యిందులో నొకటిఁగలుగదు వృధా మనోరాజ్యము

చ. 1: ఆకరుషించఁ దలంతును అప్సరోగణములను
కైకొని దేవతాసమితినిఁ గనుఁగొనఁ దలఁతును
యేకముగా బ్రహ్మాదిలోకము లేలఁ దలఁతును
దాకొని నిద్రింతు నంతలోన హరిఁ దలఁచినవాఁడఁగానైతి

చ. 2: ఒకపరి యీశ్వరుఁడ నౌదును వూహాపోహలను
ప్రకటపు పట్టణగోపురప్రాకారంబులు సృజింతును
సకలము భోగించినవాఁడ నౌదు చవు లూరకే కొందును
అకటా అంతలో భిక్షాన కేఁగుదు హరిఁ గొలిచినవాఁడగానైతి

చ. 3: తలఁచినచోటికి నేఁగఁ దలఁతును తగఁ జన్నవారిని బ్రదికింతును
మలసి యంతలోఁ బనులకుఁ బిలిచిన మఱియన్నియు నేమఱతును
చెలఁగుచు నలమేల్మంగ విభుఁడ వో శ్రీవేంకటగిరి నిలయా
నెలకొని నన్నిటు రక్షించఁగదవే నిను సేవించేవాఁడఁగానైతి

పె.అ.రేకు: 0068-01 గుండక్రియ సం: 15-388

పల్లవి: ఎంత బలిమి సేసినా నేమి పనికి వచ్చీని
మంతు కెక్క భాగవతమహిమనే కాక

చ. 1: భవపాశబంధములు పక్కుననుఁ దెగునా
వివరించి హరి గొల్చి విన్నవించకా
ధ్రువమైన యనాది దురితములు వాసునా
చవిగాను తిరుమంత్రము జపియించకా

చ. 2: అక్కజపు కామక్రోధము లంతలోనే మానునా
మ్రొక్కుచు గోవిందునకు మొఱవెట్టకా
వెక్కసపు కర్మములు విడిచి తానే పోవునా
మక్కువతో శ్రీవైష్ణవమతము గైకొనకా

చ. 3: కదిమి నా యజ్ఞానాంధకార మడఁగునా
యెదలోన శ్రీవేంకటేశుఁ గానకా
సదరానఁ బొదిగిన చంచల ముడుగునా
మొదల నలమేల్మంగ ముదలనే కాకా

పె.అ.రేకు: 0068-02 నాట సం: 15-389

పల్లవి: ఎక్కడ దాఁగఁగ వచ్చు నింక నీకును
పక్కన నీ దాసు లెల్లా బ్రదికిరి యింకను

చ. 1: పంతాన నెక్కడాఁ జిక్కువడని యట్టివాఁడవు
చింతల నీ కథలలోఁ జిక్కుకొంటివి
యెంతైనా నీ మహిమల నెంచరానివాఁడవు
దొంతర సహస్రనామాదుల నెన్ని కైతివి

చ. 2: సరుగ నెవ్వరిచేత సాధింపరానివాఁడవు
వొరసి నీ భక్తిచే సాధ్యుండ వైతివి
సురలకు నీ గుఱుతు చూపరానివాఁడవు
బిరుదులచే గుఱుతు పెట్టించుకొంటివి

చ. 3: వేదములచే నీరూపు వెదకరానివాఁడవు
పోదితో శ్రీవేంకటాద్రిఁ బొడచూపేవు
యేదెస నీ వొక్కఁడవే యేలికైన వాఁడవు
మేదిని యలమేల్మంగ మెడఁ గట్టుకొంటివి

పె.అ.రేకు: 0068-03 సాళంగనాట సం: 15-390

పల్లవి: దేవ దేవ నీ దివ్యమహిమ లివి
నీ వొక్కఁడవే నిఖిలక ర్తవూ

చ. 1: అనిశము సురలకు నటు రక్షకుఁడవు
దనుజులకు లయాంతకుఁడవూ
దినముఁ బితాళ్లకు తృప్తికరుండవు
జనుల కెల్ల సంసారసుఖమవూ

చ. 2: మునులకు సంతత మోక్షప్రదుఁడవు
ఘనగ్రహములకు కాలమవూ
అనయము సిద్ధుల కక్షయ ఘుటికవు
నినుఁ గనువారికి నిధానమవూ

చ. 3: బహువేదములకు పరమార్థంబవు
సహజ జగములకు శరీరివీ
మహిమల నలమేల్మంగకు మగఁడవు
యిహమునకు శ్రీవేంకటేశ వరదుఁడవూ

పె.అ.రేకు: 0068-04 రామక్రియ సం: 15-391

పల్లవి: పంతముతోడుత మెఱసీ నిదివో ప్రకృతిమూలమైయీా సంసారము
యెంతటివారము నేమిటి గెలువఁగయీశ్వరుఁడే దయఁ జూచీఁగాక

చ. 1: అనాదికాల ప్రవాహము అఖిలజీవులకు యీా సంసారము
వినోదమై జరుగుచున్న దిదె విష్ణులీలయై యీా సంసారము
పనివడి యప్పుడు కల్పకల్పమున బ్రహ్మసృష్టియగు యీాసంసారము
పెనగొని పలు చుట్టరికంబులతోఁ బెరుగుచు నుండును సంసారము

చ. 2: మాయలకెల్లను వునికిపట్టగుచు మరిగించీనిదె యీాసంసారము
కాయజుచేతను నానావికార కల్పితమైనది యీా సంసారము
పాయము ముదిసినఁ బోనీక సంతానపరంపరైనది యీా సంసారము
మోయనిమోపై అంటుకొన్నదిదెముందు వెనకలను యీా సంసారము

చ. 3: చిమ్మి రేఁగుచునుఁ బురాకృతంబునఁ జిగిరి చీనిదె యీా సంసారము
తెమ్మలుగా ముందరి కోరికెలను తీఁగెలు వారీ నీ సంసారము
పమ్మి యింతలోనలమేల్మంగకు పతియగు శ్రీవేంకటేశ్వరుకరుణను
నెమ్మది నితని దాసునిఁగాఁ జేసి నెరవేరిచే నీ సంసారము

పె.అ.రేకు: 0065-05 ధన్నాసి సం: 15-392

పల్లవి: ఏ వుపాయము నెఱుఁగ యిదె నీకు విన్నపము
శ్రీవల్లభ నీవే రక్షించుకోనీ బంటను

చ. 1: కొందరు తపోమహిమఁ గోరి దొడ్డవా రవుదురు
పొందఁ జదివి కొందరు పూజ్యు లౌదురు
కందువ పుణ్యమున స్వర్గ మేలుదురు కొందరు
ముందే నేనైతే నీ ధర్మమున నుండేవాఁడను

చ. 2: తమ యాత్మనే తలఁచి ధన్యు లౌదురు గొందరు
తిమిరి దానాలు చేసి దివ్యు లౌదురు గొందరు
నెమకి కాయసిద్ధిచే నిత్యు లౌదురు గొందరు
ప్రమదాన నేనైతే నీ ప్రభావమువాఁడను

చ. 3: గట్టిగా సత్యమే ఆడి ఘను లౌదురు గొందరు
పట్టిన వ్రతములను బ్రదుకుదురు గొందరు
యిట్టె యలమేలుమంగ నేలిన శ్రీవేంకటేశ
పట్టి నేనైతే నిన్నుఁ బాడేటివాఁడను

పె.అ.రేకు: 0065-06 లలిత సం: 15-393

పల్లవి: ఎంతప్రతాపమో నిధి యెంచి చూచితే
వింతలేల నిన్ను సేవించు టింతె కాక

చ. 1: ముప్పిరి నీ సంకల్పము ముంచి బ్రహ్మేంద్రాదులైన
తప్పించలేరు మఱి దాఁటా లేరు
యెప్పుడైనా దైత్యులపై యెత్తిన నీ చే చక్రము
తిప్పలేరు నీ మహిమ తెలియా లేరు

చ. 2: అముక నీవు మన్నించే నంటే ననాది కర్మాలు
యేమిటా మానుప లేవు యిప్పించా లేవు
నేమించక లోకాలపై నీవు పరాకై వుండితే
ప్రేమం బెడరేచలేవు పెనఁగా లేవు

చ. 3: చేరి నీవు మమ్మేలితే చేసిన యపరాధాలు
మారుకొన లేవు మఱి మలయా లేవు
గారవాన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ
యీ రీతి నీవే కాక యితరులు లేరూ

పె.అ.రేకు: 0069-01 సాళంగనాట సం: 15-394

పల్లవి: నిన్ను వేసారించ నేల నీ దాఁకా నేల
మన్నించని వారికి నీ మహిమలే చాలు

చ. 1: హరి నీ నామమే చాలు నందరిపాపాలు మాన్ప
సరి నాపద లడంచ చక్రమే చాలు
అరులఁ దెగటారుచునట్టి నీ స్మరణే చాలు
పర మొసఁగను నీపై భక్తియే చాలు

చ. 2: దేవ నీ కథలే చాలు తెగి దుర్గుణాలు మాన్ప
మూ వంక కర్మము దీర్చ ముద్రలే చాలు
భావించి దుఃఖ ముడుప పాదతీర్థమే చాలు
కైవసమై రక్షించ నీ కైంకర్యమే చాలు

చ. 3: సంతతసుఖ మియ్య నీ శరణాగతియే చాలు
చింత లెల్ల మానుప నీ సేవే చాలు
బంతినే యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అంతటికి నీ యభయహస్తమే చాలును

పె.అ.రేకు: 0069-02 గౌళ సం: 15-395

పల్లవి: ఇంత సేసినవాఁడవు యిఁక న న్నేలక పోదు
చింత దీర నీవే రక్షించుకొంట గాకా

చ. 1: మక్కువ నీతో నేను మాటాడి యెఱుఁగుదునా
చొక్కపు నీవైన రూపు చూపితివా
నిక్కము నీ వుండేటి నెలవు దెలిసితినా
చిక్కి నీవే నా మది నిల్చితి వింతే కాక

చ. 2: కోరి నీ యవతారాల కూడిమాడి యాడితినా
యేరీతి నైనా సేవ సేయించుకొంటివా
నేరిచి వొకనాఁడైనా నిన్ను నేఁ దలఁచితినా
వూరకే నీ కృప నాపై నుంచితివి గాకా

చ. 3: యెన్నఁడైనా నిన్ను నేను యెనసి కొలిచితినా
నిన్న దేవ రనుచు నెమకితినా
పన్నుగా నలమేల్మంగపతి శ్రీవేంకటేశ
తిన్నఁగా న న్నుద్ధరించితివి నీవే కాక

పె.అ.రేకు: 0069-03 లలిత సం: 15-396

పల్లవి: అందుకే నాపై దయ దలఁచు మాతురబంధుఁడవు
యిందరిలో నా దైన్య మేమని చెప్పే నీఁకను

చ. 1: నేరని వచ్చినచోట నీ మొగమే చూతుఁ గాని
యేరీతిఁ బరిహరింప నే నోపను
తీరని పాపము లంటితే నారాయణ యందుఁ గాని
పేరుకొని యది విడిపించుకొన నెఱుఁగ

చ. 2: పరులు నాఫయిఁ గినిసితే భావింతుఁగాని నిన్నే
బిరుద నేనై మలసి తప్పించుకో లేను
సరి నాపదైతే నీకే శరణంబు చొత్తుఁగాని
వొరులకుఁ జెప్పియట్టే వొడ్డించుకోఁజాలను

చ. 3: కడుఁ జింతైతే నీవు గలవని వుందుఁ గాని
దిడముగా నా బుద్ధి తిప్పఁగ లేను
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగపతి
బడివాయకుందుగాని బయపడనేనికను

పె.అ.రేకు: 0069-04 మధ్యవవతి సం: 15-397

పల్లవి: ఏపాటివారికి నాపాటివాఁడవు
చేపట్టినవారిని చేకొని రక్షింతువు

చ. 1: విన్నపములు సేయువారి విన్నపములు విందువు
సన్నుతించే వారిని సార మెంతువు
కన్నులఁ జూచేవారిఁ గడఁగి నీవు చూతువు
వున్నవారి కెల్లా నీవు వూరకే వుందువు

చ. 2: కొలిచినవారల కొలువు లీడేరింతువు
తలఁచినవారల దండ నుందువు
వలసినవారికి వరము లొసఁగుదువు
తెలియనివారల తెరువు నీ వొల్లవు

చ. 3: శరణు చొచ్చినవారి సరవితోఁ గాతువు
సరుగ నీ వారికిఁ జన విత్తువు
యిరవై యలమేల్మంగ నేలిన శ్రీవేంకటేశ
మడుగనివారికి మట్టుతో నుండుదువు

పె.అ.రేకు: 0069-05 మాళవిగౌళ సం: 15-398

పల్లవి: ఈశ్వరా నా భావ మిది యెట్టున్నదో నీ తలఁపు
శాశ్వతుఁడ నీ చిత్త మేసంగతో నా భాగ్యము

చ. 1: కతలలో నినుఁ జెప్పఁగా వినుటే కాని
క్షితి నెట్టివాఁడ వౌతా చేరి తెలియఁగ లేదు
గతి నీవు గలవనఁగా వెదకుదుఁ గాని
తతితోడ నీ మూర్తి దరిసించ లేదు

చ. 2: గంగ నీ తీర్థ మనఁగా మునిఁగి తేలు గాని
ముంగురులు నీ పాదము మోవఁగా మోపుట లేదు
అంగపు వేదము నీ మా టనఁగాఁ జదివేఁగాని
కంగున నీవు మాటాడఁగా వినుట లేదు

చ. 3: అల వైకుంఠము గల దనఁగాఁ గోరుట గాని
యిల నీ వేంకటాద్రిపై వలె మెలఁగుట లేదు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలిగె నీ కృప నాకుఁ గడమ లేదు

పె.అ.రేకు: 0069-06 గుండక్రియ సం: 15-399

పల్లవి: ఎంత మందెమేళము యే మనఁగ వచ్చు నాకు
చెంత నీవు నాకుఁ బని చెప్పవలెఁ గాక

చ. 1: నే నీకు బంటను నీవు నా కేలికవు
ఆనుకొని హద్దు నుండుమని యెట్టు నియమింతు
నానాఁటికిఁ బేరుకొని నంటున నే రీతిఁ బిలుతు
కానీలే నీ వేళ లెఱుఁగక యెట్టు దలఁతు

చ. 2: యేదైనా నాసపడి యెట్టు ని న్నడుగవచ్చు
సోదించి నీ భావ మెట్టు జూడవచ్చును
పాదుగా సంపదలకై పను లెట్టు గొనవచ్చు
యేదెసఁ జిత్త మెఱుఁగ కేగతి విన్నవింతు

చ. 3: యెప్పుడైనా నెట్టు వచ్చి యెదుట నిలువవచ్చు
చిప్పిల ని న్నంటి యెట్టు సేవ సేతును
అప్పుఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగపతి
కప్పి న న్నేలితివి కాదన నెట్టువచ్చు

పె.అ.రేకు: 0070-01 గుండక్రియ సం: 15-400

పల్లవి: ఇంచుకంత ధర్మములో నున్నది యిందరి మేలునుఁగీడును
వంచనతోడుతఁ గైకొనఁ దలఁచిన వారలనేరవు లింతేకాని

చ. 1: నరకము లనుభవించితి నని తలఁచిన నలిఁజెడుఁబ్రారబ్ధ కర్మములు
పరదారాదులఁ గలయఁ దలఁచిన పాపములెల్లనుఁ జుట్టుకొను
సురల చరిత్రము విననయంతలో సుకృతియై వెలయుఁ బురుషుడు
దురితచిత్తుల విధంబులు వింటే దుష్కృత్యములకును గుఱియిగును

చ. 2: చచ్చినభావమె బ్రతికిన యప్పుడు శరీరసుఖములు మఱచిన ముక్తుఁడు
యిచ్చల మృతునకు విభవము సేసిన యేడకు నెక్కుదువృథా వృథా
మెచ్చుగ నొరులకు నిచ్చిన యర్థము మీఁదమీఁద ఫలియించు
తెచ్చి లోభమున దాఁచిన ధనములు తీరక భూగతమైయుండు

చ. 3: యిలువేలుపైన శ్రీవేంకటేశ్వరు నెఱిఁగికొలిచినను భవమీడేరును
పలుకర్మంబుల నెంత దొరలినా ప్రయాసములే కడు ఘనము
అలమేల్మంగ పురుషాకారమున ఆచార్యుననుమతి మెలఁగును
వలవని లావుల వశగతుఁడై నను వానిచందములు హరియే

పె.అ.రేకు: 0070-02 మంగళకౌశిక సం: 15-401

పల్లవి: ఇంతకంటె మఱి నీవు యేమి సేతువు
పంత మారుకో రాదు నా భావము నీ చేతిది

చ. 1: పిలిచితే నాలికపైఁ బెనగొని వున్నాఁడవు
తలఁచితే మదిలోన దక్కి వుందువు
యెలమిఁ జూచితే కన్నులెదుటనే వున్నాఁడవు
కొలచి బ్రతికేవారికొలఁది భాగ్య మిఁకను

చ. 2: చేరి నిన్నుఁబూజించితే చేతిలో నున్నాఁడవు
ఆరగించుమంటే కళ్లందుకొందువు
నేరుపుతో మొక్కుకొంటే నీపై భక్తి చేకొందువు
కూరిమిఁ గొలిచే వివేకుల భాగ్య మిఁకను

చ. 3: సత్తుగాఁ జదివితేను చదువలందున్నాఁడవు
వొత్తి నిన్నుఁ బొగడితే వొద్ద నుందువు
హత్తి శ్రీవేంకటేశ అలమేల్మంగపతిని
చిత్తము రా సేవించే జీవుల భాగ్య మిఁకను

పె.అ.రేకు: 0070-03 గుండక్రియ సం: 15-402

పల్లవి: జగమెల్లాఁ జూచితిని చనవరులై యున్నారు
అగపడి యెవ్వరిఁ గా దనవచ్చును మాకును

చ. 1: అందరి భ్రమయించేది అదిగో నీ విష్ణుమాయ
పొందుగా సృష్టి యెల్లా నీ పుత్రుఁడైన బ్రహ్మదే
యెందును సంసారము సేయించేవాఁడు మన్మథుఁడు
చెంది యెవ్వరిఁ గా దని చెప్పవచ్చు మాకును

చ. 2: సర్వము నీ యాజ్ఞ యని సంకల్పము చెప్పేరు
పుర్వి నెత్తిఁ బెట్టుకొని వున్నాఁడు నీ శేషుఁడు
పర్వి నీ మహిమ విష్ణుపాద మట ఆకాశము
నిర్వహించి యెవ్వరితో నెట్టు కొనే మిఁకను

చ. 3: జలధి పాన్పు రవిచంద్రులు కన్నులు
నెలవు బ్రహ్మాండము నీ కింతా నటే
యెలమి శ్రీవేంకటేశ యలమేల్మంగపతిని
తలఁప నెవ్వరు నీ చిత్తము పట్టి రిఁకను

పె.అ.రేకు: 0070-04 భూపాళం సం: 15-403

పల్లవి: జగన్నాథా నీ కొక్కనికి శరణు చొచ్చితిమి కావఁ గదే
అగపడి మాలో నున్నాఁడ వనుచు నానతి యిచ్చెను మాగురుఁడు

చ. 1: కలదు వొకానొక యదృష్ట మందురు కనుఁగొనలే రెవ్వరును
తొలుత జనించిన జన్మము లెంతురు తెలియ నశక్యములు
యెలమిని స్వర్గము గలదట ముందర కెక్కడ నున్నదొ మిన్నులపై
వెలుపల నిట్టి విశేషంబులు నే వెతకఁగ నా తరమా

చ. 2: పొదుగుకొన్న దిదే కర్మమె యందురు పొడచూపుటలే దెక్కడను
యెదిటిది మాయాకల్పితమే యట యెట్లు గురుతుపడు మాకును
కదిసి చరాచరములకు నెప్పుడును కాచుకొన్నది విధియని చెప్పేరు
విదితములై నవి యెక్కడెక్క డని వెతకఁగ నా తరమా

చ. 3: అనుభవించువాఁ డాత్ముఁడే యందురు అణురూపం బనితలఁచఁగరాదు
తనువు సాధనము సర్వంబున కట తగు లిదె కంటిమి దృష్టముగా
ననయంబును శ్రీవేంకటేశ్వరా యలమేల్మంగ విభుఁడా
నిన్నుఁ గొలిచితి నిన్నిటికీ నెలవుగా నీ మహి మెఱుఁగఁగ నాతరమా

పె.అ.రేకు: 0070-05 దేసాళం సం: 15-404

పల్లవి: అతనిఁ బాడెదను అది వ్రతము
చతురుని శేషాచలనివాసుని

చ. 1: సనకాదులు యే సర్వేశుఁ గొలిచిరి
అనిశము శుకుఁ డెవ్వనిఁ దలఁచె
మును ధ్రువుఁ డేదేవుని సన్నుతించె
ఘననారదుఁ డేఘనునిఁ బొగడెను

చ. 2: యెలమి విభీషణుఁ డేదేవు శరణనె
తలఁచె భీష్ము డేదైవమును
బలు ప్రహ్లాదుని ప్రాణేశుఁ డెవ్వఁడు
యిలలో వసిష్ఠుఁ డేమూర్తిఁ దెలిసె

చ. 3: పురిగొని వ్యాసుడేపురుషునిఁ జెప్పెను
తిరముగ నర్జుని దిక్కెవ్వఁడు
మరిగిని యలమేల్మంగపతి యెవ్వఁడు
గరిమల శ్రీవేంకటేశుఁ డీతఁడు

పె.అ.రేకు: 0070-06 మేచబౌళి సం: 15-405

పల్లవి: సేవించుఁడీ మొక్కుఁడీ శ్రీపతి యితఁడు
భావించుఁడీ మదిలోసఁ బట్టుఁడీ యీరూపు

చ. 1: అదివో గంగ పుట్టినయిల్లు అహల్యాశాపవిమోచనము
యెదుట నీతనిపాదము లివె వున్నవి
సదరాన నూర్వశికి జన్మభూమి భూకాంతకును
కుదురై కూచుండే నెలవు కోమలంపుఁ దొడలు

చ. 2: అలరఁగా గమలమున అందునే పితామహుని
కలిగించిన నాభిబిల మదివో
అలమేలుమంగకు నటు కౌస్తుభమునకు
నెలవై సొమ్ములచేత నిండుకొన్న వురమూ

చ. 3: వరము లిచ్చే హస్తము వరుసఁ గటిహస్తము
అరుదయిన శంఖచక్రహస్తా లవిగో
సరి మకరపత్రాలు శశిసూర్యనేత్రములు
శిరసుపైఁ గిరీట మదే శ్రీవేంకటపతికి

పె.అ.రేకు: 0071-01 కేదారగౌళ సం: 15-406

పల్లవి: నీ వున్నచోటే వైకుంఠము నెరసులుమఱి చొరరాదు
పావన మది చెప్పేది వేదము పాటింపఁగవలెను

చ. 1: దేవుఁడా నా దేహమె నీకు తిరుమలగిరిపట్టణము
భావింప హృదయకమలమె బంగారపు మేడ
వేవేలు నా విజ్ఞానాదులు వేడుకపరిచారకులు
శ్రీవల్లభా యిందులో నితరచింతలు వెట్టకువే

చ. 2: పరమాత్మా నా మనసే బహురత్నంబుల మంచము
గరిమల నా యాత్మే నీకు కడు మెత్తని పఱుపు
తిరముగ నుజ్ఞానదీప మున్నది దివ్యభోగమె ఆనందము
మరిగితి నీ వున్నయెడల నిఁక మాయలు గప్పకువే

చ. 3: ననిచిన నా పూరుపులే నీకు నారదాదుల పాటలు
వినయపు నా భక్తియె నీకును వినోదమగు పాత్ర
అనిశము శ్రీవేంకటేశ్వర అలమేల్మంగకుఁ బతివి
ఘనుఁడవు నన్నేలితి విఁక కర్మము లెంచకువే

పె.అ.రేకు: 0071-02 రామక్రియ సం: 15-407

పల్లవి: మఱి నేనేమి సేయఁగలనుమాధవ నాశక్తిగలదిదియే
నెఱవుగ భువిలోఁ గలిగిన వెల్లా నీ సొమ్మేలే కలవి

చ. 1: ధరణిధరా నా తపమనఁగా నేఁటిది
యిరవుగ నా మనసు మీఁదెత్తుట యింతే నీకు
పరగఁగ నాలోని భక్తి యనఁగా నేఁటిది
సరుగన నా యాతుమ నీకు సమర్పణ యనుటే

చ. 2: సుడిగొని నీపై నా స్తుతి యనఁగా నేఁటిది
నుడిగిన నా నుడుగులు నీకు నోరనే యర్పించితి ననుటే
వడిగా నేఁ గైకొన్న వ్రత మనఁగా నేఁటిది
జడియక నీవాఁడ ననుకొనుచు శరణనుటే కలది

చ. 3: శ్రీవేంకటేశ నా శీలం బనఁగా నేఁటిది
దావతిపడక నీ దాసులకు దాఁడ నే నను టింతే
వేవేలుగ నేఁ బూజించే విధ మనఁగా నేఁటిది
భావమున నలమేలుమంగపతివి నీపాదములకు మొక్కుటయింతే

పె.అ.రేకు: 0071-03 బౌళి సం: 15-408

పల్లవి: నే నెంతవాఁడను నిన్ను నడిగే నంటే
వీనుల నీ కత లెల్లా వినుటే కాకా

చ. 1: అడిగిన నలుగక యన్యులు మఱి తూరఁ
బలికినాను మారువలుకకా
కలఁచినఁ గలఁగక కసరికొట్టినాను
ములుగనివాఁడు గదా ముక్తికి నర్హుఁడు

చ. 2: నగిననుఁ దా నగక నాతు లెవ్వరైనాఁ
దగిలి పెనఁగినాఁ దగులకా
వగచినా వగవక వ్రతము చెఱిచే మంటే
మొగమోడకున్నవాఁడే ముక్తికి నర్హుఁడు

చ. 3: విఱిచినా విఱుగక విష్ణుభక్తి యెడాటాస
వెఱపించినా మఱివెఱవకా
నెఱవై శ్రీవేంకటేశ నీ పాదములే నమ్మి
మొఱఁగు లేనివాఁడే ముక్తికి నర్హుఁడు

పె.అ.రేకు: 0071-04 రామక్రియ సం: 15-409

పల్లవి: సకల దేవతలు నీ శరీరమని సర్వేశ్వర నిను దలఁచుట మేలు
వికట మేల నిను యేకాగ్రబుద్ధిని వేడుకతో సేవించే నిఁకను

చ. 1: శివదుర్గారవిగణాధిప క్షేత్రపాలక సహితముగా
భువిలో మిమ్మును పంచపూజగాఁ బూజింతురు కొందరు
తివిరి యిందరును బంతినే పొత్తుల దేవరలై పోరి చూపు సేతు రని
వివరముగా నిన్నేఁ గొలిచితి నీ వే వహించుకొని రక్షించవే

చ. 2: బహు విద్యాధరభేతాళ బ్రహ్మరాక్షసగణాదుల
సహచరుఁగా మిమ్ముఁ గామ్యకర్మముల సారెభజింతురు కొందరు
మహిమలు చూపుచు వేల్పులదండై మనసులవంతులు వెదకుదురనుచును
విహితధర్మమని నిను శరణంటిని వెలయఁగ నను దయఁజూడఁ గదే

చ. 3: అతిమాయాయంత్రతంత్రమం త్రాంతర సాధనయుక్తముగా
యితరులు గొందరు చిల్లర తెరువుల యెనయించి మిమ్ము నర్చింతురు
తతినివి తమలో నన్యోన్యవిరుద్ధము లనియపాయసహితము లనియును
గతి యంటిని యలమేలుమంగకును పతి శ్రీవేంకటేశుఁడ కావవే

పె.అ.రేకు: 0071-05 దేసాక్షి సం: 15-410

పల్లవి: ఇది నీ మాయో యింద్రజాలమో యేమియు నెఱుఁగను
సదరపు నా కర్మవశంబున నే సంకల్పించెదనో యెఱుఁగను

చ. 1: నరకము లనుభవించే యప్పుడు నా యాతనాదేహంబు
నరములతో నఱకుదురు యమభటులు నలియ దప్పటిఁ జరుగును
సరి నసిపత్రములు నాఁటు నమయ దెంతైనాఁ జిగిరింపుచుండు
వరుసఁ దప్తలోహ తైలంబులలో వైతురు పోవదు వెను తగులు

చ. 2: అంతట నొకతల్లికడుపునఁ బుట్టుదు అతికోమలమగు మేను మోచుకొని
వంతుల బాల్య కౌమారయౌవన వయసులఁ బెక్కు భావము కాదు
కాంతలఁ గవయుదు రక్తమాంసములుఁ గమ్మటి నూరునుయేమిటాఁ
వింతగా నాహారంబులు గొందును వెన నాఁకలియునుఁ దీరదు

చ. 3: మెఱయఁగఁ గలలోన నన్నియుఁ గందును మేలుకాంచితే సటలౌను
మఱచితిఁ దలఁచతి సర్వాపరాధములు మతి యన్నియునేఁ జేసితిని
తఱితో శ్రీవేంకటేశ నాపాలిటి దైవమ యలమేల్మంగపతి
గుఱిగా నా విన్నప మవధరించు గోవింద గోవింద గోవిందా

పె.అ.రేకు: 0072-01 సాళంగనాట సం: 15-411

పల్లవి: వెదకి వెదకి చొప్పు లెత్తుచును విచారించితి నిన్నాళ్లు
యిదివో కంటిని శ్రీవేంకటగిరి యెదుటనే నీ శ్రీపాదములు

చ. 1: ఘనతులసీకాననంబులో కాఁపురము సేతు వనఁగాను
అనిశమ్ముఁ బద్మవనంబునను ఆడుచు నుండుదు వనఁగాను
నిను నీ దాసులు పాడేచోట్ల నెలవై లింతు వనఁగాను
యినమండలమున నుండుదు వనఁగా యీవట విని నేను

చ. 2: పైకొని క్షీరాంబుధిలో నెప్పుడు పవళించి వుందు వనఁగాను
వైకుంఠంబున వెలుఁగొందుచు సర్వము భావించే వనఁగాను
దాకొని జీవులలో నెప్పుడు నంతర్యామివై వుందు వనఁగాను
లోకము నీవై వుండుదు వనఁగా లోలత నీమాట విని నేను

చ. 3: పరమయోగీంద్రులు తలపోయుచునున్న భావముతో నుందు వనఁగాను
పరిపరివిధముల పుణ్యకర్మము పాయక చరింతు వనఁగాను
గరిమల నెప్పుడు అలమేల్మంగ కౌఁగిటిలోవాఁడ వనఁగాను
యిరవుగ శ్రీవేంకటేశుఁడ వనఁగా యీమాట విని నేను

పె.అ.రేకు: 0072-02 లలిత సం: 15-412

పల్లవి: ఎంతటివాఁడవు నిన్ను నేమని నుతింతును
చింతలు నీ కమరకుండఁగా విచారించే నేను

చ. 1: పాలసముద్రములోనఁ బవళించివుండే నీకు
బాలుఁడవైతేనే వెన్న బాఁతాయెనా
కాలమెల్లను శ్రీకాంత కౌఁగిటనుండే నీకు
గోలవైతే గొల్లెతలఁ గడ వేడు కాయెనా

చ. 2: పరమపదమునందు బ్రహ్మమై వుండే నీకు
పెరిగి రేపల్లె నాడఁ బ్రియమాయెనా
సురల నెల్లాఁ గావ సులభుండవైన నీకు
గరిమెతోడఁ బసులఁ గాన వేడు కాయెనా

చ. 3: యేపొద్దు నిత్యముక్తుల నెనసివుండే నీకు
గోపాలులతోఁ గూడుండఁ గోరి కాయెనా
బాపురే యలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర
యేపొద్దు నిట్టి లీలలె యితవాయెనా

పె.అ.రేకు: 0072-03 శ్రీరాగం సం: 15-413

పల్లవి: తెలియదు నీ మనసు దేవోత్తమా
సులభుండవని విని చొరఁబారీ మనసు

చ. 1: చూతును నీ మూరితిని చొప్పుగాఁ గన్నులెదుట
ఆతుమలోఁ దలపోనే ననుచును అలవరచుకొందును
నీతి యెంచి చూచితేను నీ వెంత నే నెంత
యీతల నా యగ్గలికెకు నే మనుచున్నాఁడవో

చ. 2: నెట్టుకొనఁ బూజింతు నీవు నా వాఁడవే యంటా
పెట్టెలోన నుంచి చక్కఁ బెట్టుకొందును
యెట్టిది నా సాహసంబు యేమిటి నిన్ను మెప్పించితి
నట్టనడుమ నన్నెట్టు నవ్వుతా వున్నాఁడవో

చ. 3: నొడిగి నిన్నుఁ బిలుతు నోరునిండాఁ బేరుకొని
యెడయ కెందున్నాఁడవొ యెక్కడెక్కడ
అడరి శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
వడి నన్నేలితి వెటువంటి సుకృతివో

పె.అ.రేకు: 0072-04 పాడి సం: 15-414

పల్లవి: సందేహ మెక్కడా లేదు సంతోషించు కొంటి నేను
కందువ బ్రహ్మానందము గైకొంటి నేను

చ. 1: నున్నఁగా సంకీర్తన నా నోరి కిచ్చితి గనక
నన్ను రక్షింతువే యనుచు నమ్మితి నేను
పిన్ననాఁడె నీవు నన్నుఁ బేరుకొంటివి గనక
యెన్నఁగ నీడేర్తు వని యియ్యకొంటి నేను

చ. 2: శ్రీకాంతుఁడ నీ మూర్తి నా చిత్తములో నిల్పఁగాను
నాకు నీవు గలవని నమ్మితి నేను
దాకొని లోకములో నీ దాసుఁడనిపించఁగా
యీకడ నేలితివని యెఱిఁగితి నేను

చ. 3: కైవసమై నీవు నాకు కలలో నానతియ్యఁగా
నావద్ద నున్నాఁడ వని నమ్మితి నేను
యేవేళా శ్రీవేంకటేశ యెదుటనే వుండఁగాను
పావనమైయిన్నిటాను ప్రబలితి నేను

పె.అ.రేకు: 0072-05 సాళంగనాట సం: 15-415

పల్లవి: గెలిచితి భవముల గెలిచితిఁ గామాదుల
యిల నీ వేలికవైతి వింక నేడ వెఱపు

చ. 1: హరి నీకు నే దాసుఁడ ననే దొక సలిగ
వొరసి యచ్చు మోచిన దొక సలిగ
అరయఁ బ్రసాదజీవి ననేటి దొక సలిగ
యిరవాయ నన్నిటా నా కింక నేడ వెఱపు

చ. 2: అట్టే నాలోన నున్నాఁడవనేటి దొక బలిమి
వొట్టి నిన్నుఁ బాడేటి దొక బలిమి
గట్టిగా నీ భాగవతకరుణ యొక్క బలిమి
యెట్టు నే నేమి సేసినా యింక నేడ వెఱపు

చ. 3: వొట్టి నీవే గతి యని వుండే నేమ మొక్క దాపు
వుప్పతిల్లు నీపై భక్తి వొక్క దాపు
నెప్పున శ్రీవేంకటేశ నీ సేవ లొక దాపు
యెప్పుడు నీవే దిక్కు యింక నేడ వెఱపు

పె.అ.రేకు: 0072-06 కుంతలవరాళి సం: 15-416

పల్లవి: మానరాదు నీ కింక మముఁ గావవలెను
పేనిపట్టి నీకు నీవే బిరుదులై వున్నవి

చ. 1: సరవి నిన్ను భక్తరక్షకుఁ డని నారదుఁడు
పరువడి లోకములఁ బాడి పాడి చాటినాఁడు
సరగ నీ యర్థములకు శాసనాలై వేదములు
మొరయుచు బ్రహ్మనాల్గు మొగముల నున్నవి

చ. 2: శరణాగతవజ్రపంజరుఁ డని వాల్మీకి
సురలకు రామకథ చూపి చెప్పె గుఱిగాను
పొరి నీ సుద్దు లివే పురాణపత్రికలై
పెరుగుచు వ్యాసుల పెట్టెలలో నున్నవి

చ. 3: తారకబ్రహ్మ మవని తగఁ గాశిలో శివుఁడు
యేరుపరచి ప్రాణుల కెప్పుడుఁ జెప్పుచున్నాఁడు
యీ రీతి శ్రీవేంకటేశ యిందులకు సాక్షులు నీ వరాలు
ఆరూఢి గరుడగంభ మండ నేఁ డున్నవి

పె.అ.రేకు: 0073-01 లలిత సం: 15-417

పల్లవి: పురాణపురుషా నా మనోరథము పొందుగ నీడేర్చవే
నిరుహేతుకదయానిధివి నీ వనఁగా విందూ

చ. 1: యెపుడు ప్రసన్నుఁడ వౌదువొ యనుచు యెదురుచూతు నీకు
అపురూపంబగు నీ సూక్తులు విన నాలింతు లీనులను
వుపమల నిన్నును వశముచేసుకొన నూహింపు చుండుదును
చపలుఁడనై నీ మన్ననలే యిటు సారెకుఁ గోరుదును

చ. 2: సతతము నీ భావము దెలుసుకొనఁగ చదువులలో వెదకుదును
తతి నీ శ్రీపాదతీర్థము గొనఁగ తమకింతు నేను
హితవరులగు నీ దాసులలో నన్నెంచుకొనఁగఁ దగుదును
అతిమోదంబున నిన్ను నుతించే యందులకే నే నోరూరుదును

చ. 3: యేడనైన నీభక్తి గలుగుటకు యేప్రొద్దును నేఁ బ్రార్థింతు
వేడుకతో నీ సేవ సేయుటకు వేళ గాచి యుందు
జోడుగా నలమేల్మంగకుఁ బతివై చూపట్టిన శ్రీవేంకటేశ్వర
జాడతోడ మము రక్షించేవని సంతస మందుచు నుండుదును

పె.అ.రేకు: 0073-02 సామంతం సం: 15-418

పల్లవి: ఆహా యేమి చెప్పేది హరి నీ చిక్కు
ఊహా పోహలచేత వుడివోవు వయసు

చ. 1: చేతఁ జిక్కినట్లుండు చెప్పినదాఁకా జ్ఞానము
ఆతలఁ గడచితేను అట్టటు వోవు
జాతఁ జేసినట్టుండు నాఁటిడి దేహ మాయుష్యముతో
ఆతుమ యెడసితేను అదవదలవును

చ. 2: నిక్కమువలెనే వుండు నిద్రించుదాఁకాఁ గల
పక్కన మేలుకొంటేను బట్టబయలు
దక్కిన యట్లనే వుండు ధనధాన్యములు యింట
చక్క ననుభవించితే సరికి సరి యౌను

చ. 3: సులభమువలె నుండు చూచేటి యీ లోకము
యిలఁ జేకొనఁ గోరితే నెల యించును
యెలమి శ్రీవేంకటేశ యిది నీ కల్పితమే
తలపోసి మెలఁగ నీదాసు లెఱుఁగుదురు

పె.అ.రేకు: 0073-03 శుద్ధవసంతం సం: 15-419

పల్లవి: కాదని తొలఁగ రాదు కరుణించఁ బాడి నీకు
వేదములు చాటి చెప్పే విశ్వవ్యాపకుఁడవు

చ. 1: కాచేనన్న చరమశ్లోకము నాకుఁ బూఁట కాఁపు
చూచి నీ వేడనుండినాఁ జూపి ఇచ్చీని
కాచి నమ్మించే యభయకరమే నాకుఁ బూఁటకాఁపు
యేచిన నాలోని భయ మెల్లాఁ దేర్చీని

చ. 2: నీవు నన్నుఁ బుట్టించిన నిమిత్తమే పూఁటకాఁపు
పోవక రక్షించు మని బుద్ధి చెప్పీని
దేవుఁడవై నిలిచిన నీ దీమసమే పూఁటకాఁపు
కేవలమై బిరుదు లెక్కించి రక్షింపించీని

చ. 3: పోనీక నీ బంట్లు చెప్పే బోధే నాకు పూఁటకాఁపు
యే నెపాన నైనా నిన్ను యింటఁ బెట్టీని
పూని శ్రీవేంకటేశ్వర పూఁటకాఁపు లిందరును
వీనులతో నీకుఁ దామే విన్నవించేరు

పె.అ.రేకు: 0073-04 వరాళి సం: 15-420

పల్లవి: అట్టే పెంచితేఁ బెరుగునడఁచితే నడఁగును
దిట్టలై వివేకులాల తెలుసుకోరో

చ. 1: తగలకుండఁగవలె తలఁచితేఁ గామాదులు
పొలుచు నిప్పుల నేయి పోసినట్లూ
కలఁగకుండఁగవలె కలఁగితేను మనసు
చెలఁగి చీమలపుట్ట చిమ్మి రేఁగిన ట్టుండు

చ. 2: యెడ మియ్యకుండవలె యెడమిచ్చితేఁ గోపము
విడివడ్డకోఁతికి వెట్టెత్తినట్లు
వొడిగట్టకుండవలె వొడిగట్టితే నాసలు
కడళ్లతో సముద్రము కడతేరనట్లు

చ. 3: తగలకుండఁగవలె తగిలితే భోగములు
జిగురుగండెఁ బక్షులు చిక్కినట్లు
తగు శ్రీవేంకటేశ్వరు దాసు లిందు భ్రమయరు
జిగి మించే నమృతము చేతి కబ్బినట్లు

పె.అ.రేకు: 0073-05 శ్రీరాగం సం: 15-421

పల్లవి: ఇంత సేయకుండితే నే సేడ నుందును
యెంతపుణ్యమో నీకు యేమి చెప్పే దింకను

చ. 1: అట్టె నన్నుద్ధరించినయదె నీ ప్రతాపము
వొట్టి సంపన్నుఁ జేసె నీ వుదారత్వము
గుట్టున వెనకవేసుకొనెను నీ పంతము
యిట్టి నా భాగ్యము నేఁడు యేమి చెప్పే దింకను

చ. 2: నరకము వెళ్లఁ దీసె నన్ను నీ సాహసము
సరగ జ్ఞానిఁ జేసె నీ చాతుర్యము
మరిగించుకొనె నన్ను మఱి నీ వాత్సల్యము
యిరవాయె నా వేడుక యేమి చెప్పే దింకను

చ. 3: నన్ను లోకపూజ్యుఁ జేసె నాఁడే నీ దొరతనము
విన్నపము లాలించే నీ విచారము
మన్నించె శ్రీవేంకటేశ మమ్ము నీ పట్టపుదేవి
యిన్నిటా బ్రదికించితి వేమి చెప్పే దింకను

పె.అ.రేకు: 0073-06 రామక్రియ సం: 15-422

పల్లవి: నేనే తలంచ నిన్ను నేరమి యేమి చెప్పేది
శ్రీనాథ నన్నుఁ గృపసేసి వోర్చుకొనవే

చ. 1: పరగఁ గన్నులకు రెప్పలు దాపై వుండినట్టు
దరిదాపై వున్నాఁడ వింతటా నాకు
అరసి దేహానకు ముంజేయి అడ్డమై వున్నయట్టు
వరుస నాకు సహాయమై వత్తువు నీవు

చ. 2: వీనులకు నెప్పుడు వినికే లంకై వున్నట్టు
పూనుకొని చుట్టమవై పోషింతువు
మానక జీవునికి మనసు దోడై వున్నట్టు
ఆనుకొనెప్పుడుఁ దగులై నీ వున్నాఁడవు

చ. 3: మలసి నాలికెకు నీ మంత్రము ఫలమైనట్టు
అలరి నా కిటు దాతవై వున్నాఁడవు
తలకొన్న బిడ్డలకు తలిదండ్రివై వున్నట్టు
సులభవు శ్రీవేంకటేశుఁడవై వున్నాఁడవు

పె.అ.రేకు: 0074-01 మధ్యవవతి సం: 15-423

పల్లవి: నాయంతనే వుద్దండంబున నీ నగరు చొొచ్చి సోదించఁగ లేదు
పాయక నను మన్నించి యేలుకో నీ ప్రకాశ మౌొట మేలు

చ. 1: ధరలో నీ రూపము నీవే దాఁచుకొని యుండఁగను
గరుడధ్వజమే నీ గుఱుతు కనుపించెను నాకు
బిరుదులు వొొగడే శృతులచేతనే పరరేఁగితి నేను
పరగిన నీ ప్రతాపతేజమె బయలుసేసె నిన్ను

చ. 2: యెవ్వరికి నసాధ్యుఁడవై నీవు యేకతమున నుండఁగాను
రవ్వసేసి నిను నాకుఁ దెలిపెను రచనల నీ మహిమె
చువ్వన నీ విచ్చు వరదహస్తమె చొొప్పుచూపఁగాఁ గంటిని
నివ్వటిల్లు నీ కరుణ యిందరికి ని న్నిటువలెనే ముంగిటఁ బెట్టె

చ. 3: శ్రీవేంకటగిరిపై రహస్యమునఁ జెలఁగుచు నుండఁగాను
భావింప నలమేల్మంగ సంపదలె పట్టిచ్చెను నీ ప్రభావము
దైవికమునఁ బ్రకటించిన తొొంటివుదారగుణము వినిశరణుచొొచ్చితిమి
యీవల నావల మీ చిహ్నములే యింత సేసె మిమ్ము

పె.అ.రేకు: 0074-02 శంకరా'రణం సం: 15-424

పల్లవి: అటువలెనె సుజ్ఞాని యన్ని పుణ్యములుఁ జేసి
తటుకున హరి కిచ్చి తా నుండవలెను

చ. 1: వూరి పసులను మేపి వొప్పగించి యిండ్లకు
చేరి జంగిలివాఁడు నిశ్చింతుఁడై వుండు
తేరకాఁడు మోసి మోచి తెచ్చి నగరి కొప్పించి
నేరుపుతో వెట్టి వాఁడు నెమ్మది నిద్రించును

చ. 2: అంటి బూరెలు వండినయాపె చేతులట చూపి
యింటివారి కొప్పగించి యేఁగినయట్టు
నంటుతోడఁ బేరటాలు నాగవల్లియైనమీఁద
వొంటిఁ దన నెలవున నూరకున్నయట్టు

చ. 3: కూటమి వచ్చినవాఁడు గుంపులెల్లా విచ్చిపోతే
యేఁటివాఁడుఁ గాక తన యిచ్చనే వుండు
పాటించి శ్రీవేంకటేశుబంటు యేలికెపనులు
గాటాన నన్నిఁ జేయుఁ గర్త యేమీ గాఁడు

పె.అ.రేకు: 0074-03 సౌరాష్ట్రం సం: 15-425

పల్లవి: ఇందరికంటె నెక్కుడు యెంచఁగ యోగీశ్వరుఁడు
అంది కనుఁగొను తన యంతరాత్మ నెపుడు

చ. 1: చూడఁగల వన్నియును చూడని యోగీశ్వరుఁడు
బూడిదెలో గచ్చకాయై పొరయఁ డెందు
యేడనైనా నుండనీ యిచ్చైన యోగీశ్వరుఁడు
వాడలో కుమ్మరిపురువువలె నెందు నంటఁడు

చ. 2: చేనంటి యే పుణ్యమైనాఁ జేయని యోగీశ్వరుఁడు
నూనె గొల్చిన కుంచమై నుశికేలును
వీనుల నేమైనాను వినని యోగీశ్వరుఁడు
నానేటి తామరపాకై నడుమఁ దా నుండును

చ. 3: వొడ్డి చవులుగొనని ఉత్తమయోగీశ్వరుఁడు
జిడ్డంటని నాలికై నిశ్చింతాన నుండు
యెడ్డవలె మెలఁగని యెదలో యోగీశ్వరుఁడు
దొడ్డ శ్రీవేంకటేశ్వరుతోనే రమించును

పె.అ.రేకు: 0074-04 పాడి సం: 15-426

పల్లవి: ఏమిటివంకసుఖము యెంచి చెప్పఁగా వచ్చు
కామించక మానుటే అక్షయసుఖము గాకా

చ. 1: వెలలేని పదార్థాలు వేడుకవలెనే వచ్చు
చెలఁగి నాశమునొంది చింత పుట్టించు
పలు లంపటము లెల్లా పనికివచ్చినట్టుండి
తలఁచినట్టు వడక తడఁబాటు సేసును

చ. 2: సరి నాహారనిద్రలు సహజమువలె నుండి
అరుదై వేళలఁ దప్పి యలయించును
పరుల సంగాతములు భక్తితోనే వొనగూడి
పెరిగి తగులములై పెనఁపులఁ బెట్టును

చ. 3: వుపకారి దానధర్మా లొడఁ బాట్లై మించి
విపరీతమై బలసి వేసరింపించు
యెపుడు శ్రీవేంకటేశ యివి యెల్లా నీ చేష్టలు
వుపమించి తెలిసితే వొద్దికతో నుందును

పె.అ.రేకు:	0074-05	మలహరిసం:	15-427

పల్లవి: పరమాత్ముఁడవు నీవు పరతంత్రుఁడ నేను
హరి నీవు సర్వజ్ఞుఁడవు జ్ఞానము దెల్పవే

చ. 1: సంతతము సర్వలోకసాక్షివి నీవు గనక
యెంతనే నెఱుఁగకున్నా నెఱిఁగింపవే
యింతటా నింద్రియముల నేలేవాఁడవు గనక
చెంతనే లోలుఁడనైనా చేరి బుద్ధి చెప్పవే

చ. 2: జడియని బంధమోచనుఁడవు నీవు నే
విడువకున్నా మమత విడిపించవే
తడయక నీవే సూత్రధారివి గనక నే
నడుమఁ దెరువు దప్పినాఁ దప్ప నీకువే

చ. 3: ఆని విశ్వలోచనుఁడ వైనాఁడవు గనక నేఁ
గానని యర్థము లెల్లాఁ గనిపించవే
జానుగ శ్రీవేంకటేశ జగత్కుటుంబివి గనక
నానావిధములను నన్నేలి పోషించవే

పె.అ.రేకు: 0074-06 సాళంగం సం: 15-428

పల్లవి: ఇవియే తొల్లిటివారు యెంచి నడచిన శాంతి
వివరించి కొలిచితే విష్ణుఁడే శాంతి

చ. 1: సకలవుద్యోగములుఁ జాలించుటే శాంతి
సుకదుఃఖములు విడుచుటే శాంతి
వొక రేమి యిచ్చినాను వొల్లకుండుట శాంతి
ప్రకటించి రచ్చలకుఁ బాయుటే శాంతి

చ. 2: మహిమీఁది పనులెల్లా మానియుండుటే శాంతి
సహజబాంధవములు జారుటే శాంతి
బహుకుతర్కములకుఁ బారకుండుటే శాంతి
విహితవిషయముల విడుపాటే శాంతి

చ. 3: వూరకే నిశ్చింతమున నుండఁగలదే శాంతి
కోరకుండే సాత్వికగుణమే శాంతి
భారము శ్రీవేంకటేశుపై బెట్టుటే శాంతి
ధీరతతోడుత గుణాతీతుఁ డౌటే శాంతి

పె.అ.రేకు: 0075-01 సామంతం సం: 15-429

పల్లవి: భక్తవత్సలుఁడవుగా భావించ నీ కిది దగు
శక్తి నీ కెంతైనాఁ గద్దు సర్వేశ్వరా

చ. 1: నా వాఁడవే యని వుందు నని నీ వెవ్వరికైనా
ఆవల నందరివాఁడవై వుండుదువు
భావించనిందుకొరకా బహురూపుఁడ వైతివి
వేవేలు శిరసులతో విశ్వమూరితీ

చ. 2: నీ పేరు నా నాలికపై నెలకొనె యీ రీతినే
దాపై యందరినోళ్ల దగి లున్నవి
యేపునఁ బెక్కు నామము లిందుకా పెట్టుకొంటివి
వోపి నానాశబ్దములతో నుర్వీదరా

చ. 3: యేలికెపు నాకని యెంచుకొందు నేపొద్దు
యీలీల నందరికీ నేలిక నట
తాలిచితి వనంతావతారాలు నీ వీ పనికా
వేళతో నానాగతి శ్రీవేంకటేశ్వరా

పె.అ.రేకు: 0075-02 సామంతం సం: 15-430

పల్లవి: భావించ నేర్చినవారి భాగ్యముకొలది ముక్తి
శ్రీవల్లభుఁడే జీవన్ముక్తి

చ. 1: చూచి తలఁచేవారికి సులభాన నుండు ముక్తి
కాచుకున్నవారికిఁ గలదు ముక్తి
చేచేత నందుకొంటే చేరువనే వుండు ముక్తి
యేచి కొలిచితేఁ దనయింట నుండు ముక్తి

చ. 2: తగిలి సాము సేసితేఁ దనలో నున్నవి ముక్తి
పగ లేకుండితే భూమిపై దే ముక్తి
నొగులక నుడిగితే నోరనే వున్నది ముక్తి
బగివాయకుండితే బట్టబయటనే ముక్తి

చ. 3: ధరియించకుండితేను తనువుపై నుండు ముక్తి
అరసితే గురుస్మరణందుండు ముక్తి
యిరవై శ్రీవేంకటేశు నెప్పుడు సేవించితేను
దొరకి పుణ్యులకు నెదుట నుండు ముక్తి

పె.అ.రేకు: 0075-03 గుజ్జరి సం: 15-431

పల్లవి: ఈ యీా యీా యీా యీా యీా
యీా యీా యీారీతి నాగుణము నాయందే తగిలెను

చ. 1: మనస్సుననే నినుఁ దలఁచి మాటలఁ గొసరుదును వొక్కొకపరి
వినయముతో నీకు వేవేలు మొక్కులు మొక్కుదును వొక్కొకపరి
ఘనంబగు భక్తిని బయలుకౌఁగిట నలముదును వొక్కొకపరి
తనియక వేడుకతోను దైవమా నినుఁ బొగడుదును

చ. 2: జగత్తున నే నిను వెదకి సారెకు నవ్వుదును వొక్కొకపరి
పగటున నీ నామములు పాడుచుఁ జెలఁగుదును
తగులుచు నినుఁ బూజించి తగఁ బ్రియమునఁ జొక్కుదును వొక్కొకపరి
నిగమములను నిన్ను విని నీరజనాభా వెఱగందుదును

చ. 3: అంతట నీ మహిమ గని అటు నీ దాస్యమె కొరుదును వొక్కొకపరి
చెంతల నీ దాసులఁ జూచి సేవ సేసి నిను నడుగుదును వొక్కొకపరి
అంతరంగము శ్రీవేంకటేశ అలమేల్మంగతోఁ బొడచూపితివి
సంతసమున నే నీ పాదములకు శరణుచొచ్చి నేబ్రదికితిని

పె.అ.రేకు: 0075-04 లలిత సం: 15-432

పల్లవి: కొసరి నీతోఁ బెనఁగి గునిసి మోక్ష మడుగ
వెస నీబంట నింతే నీవే దిక్కు నాకు

చ. 1: బలిమి నీ బిడ్డఁడైన బ్రహ్మంతవాఁడనా
అల సముద్రుఁడు మామ యంత వాఁడనా
చలువైన నీ మఱది చంద్రునంతవాఁడనా
యెలమి నీతోఁ బుట్టిన యింద్రునంతవాఁడనా

చ. 2: చనువున మీ తండ్రి కశ్యపునంతవాఁడనా
అనుజుఁడైన లక్ష్మణునంతవాఁడనా
మనవికి మీ బావ ధర్మజునంతవాఁడనా
అనుఁగు దాతయైన భీష్మునంతవాఁడనా

చ. 3: మనికైన యల్లుఁ డభిమన్యునంతవాఁడనా
అనిరుద్ధుఁడు మనుమఁడంతవాఁడనా
ఘనుఁడ శ్రీవేంకటేశ కల్పించి నీ వాడించఁగా
పనిపూని మెలఁగేటి పత్రిమను నేను

పె.అ.రేకు: 0075-05 సాళంగనాట సం: 15-433

పల్లవి: కావకుంటే నేదీ గతి కమలాక్షా యిందరికి
నీవు వుపకారివై నిలిచితి గాకా

చ. 1: జీవు వీడేరే కొఱకు శ్రీరంగవెంకటాద్రి
దేవభూములందు నీ దివ్యమూర్తులు చూపి
వేవేలు నీ గుణములు వేదశాస్త్రములఁ దెల్పి
యీవలా రక్షించేవు నిన్నేమని నుతింతుము

చ. 2: అంతటాఁ బాదతీర్థములైన గంగాదినదులు
పొంతనే యాడాడకు పుణ్యపురుషుల నిల్పి
వంత దీర నేకాదశివ్రతాచారాలు గల్పించి
యెంతెంత ప్రయాసపడే విదే పనై నీవు

చ. 3: నానావిధమంత్రపు నీ నామజపము గల్పించి
ధ్యానము యజ్ఞము మొదలైన పూజలు గడించి
యీ నెపాన శ్రీవేంకటేశ బ్రదుకు మనుచు
కానుకగొని యిచ్చేవు ఘనవరములను

పె.అ.రేకు: 0075-06 గౌళ సం: 15-434

పల్లవి: వెడవిచారాలు వద్దు విష్ణు డితఁడే
యెడయని వరము లిచ్చీ నీ దేవుఁడే

చ. 1: మున్ను బలభద్రునికి మూర్తియై నిల్చినవాఁడు
సన్నిధై మునులచేఁ బూజ గొన్నవాఁడు
చెన్నుమీరు శేషాద్రిశిఖరమై యున్నవాఁడు
యిన్నిటి కెక్కుడైనవాఁడీ దేవుఁడే

చ. 2: చదువులలోఁ జెప్పి స్వయంవ్యక్తమైనవాఁడు
కదిసి గుహునిసేవ గైకొన్నవాఁడు
వెదకఁగా సురలకు విశ్వరూపై యున్నవాఁడు
యెదుట గానఁగవచ్చీ నీ దేవుఁడే

చ. 3: తొండమాంజక్రవర్తితో మాటలాడినవాఁడు
నిండుకొని పెద్దలకు నిధైనవాఁడు
అండనే శ్రీవేంకటేశుఁ డలమేలుమంగతోడ
యెండనీడకన్నులవాఁడీ దేవుఁడే

పె.అ.రేకు: 0076-01 కాంబోది సం: 15-435

పల్లవి: అటుగాన శరణంటి నపరాధము లెందుకు
తటుకున బ్రదికించి దయఁ జూడవే

చ. 1: యెంచరాని నేరములు యిన్నిఁ జేసి యేలికకు
వంచనతో మొక్కితే భావము గరఁగు
పొంచి పొంచి వెగటుగాఁ బోరినవాఁడై నాను
మంచిమాట లాడితే సమ్మతి హితుఁ డౌను

చ. 2: ఆనాజ్ఞ దోసినట్టే యాతఁడైనా యేలికకు
కానిక చేతి కిచ్చితేఁ గురుణ పుట్టు
మోసముతో సొమ్మెల్లా ముచ్చిలించి తిని వచ్చి
దీనతతో లెంక యైతే దిగులెల్లాఁ బోవును

చ. 3: వాలాయించి దూరుచేసి వచ్చియైనా యేలికెకు
వేళ గాచి కొలిచితే వేడుక పుట్టు
యీలీల శ్రీవేంకటేశ యేజాతివాఁ డైనాను
మూల నీముద్ర మోచితే మునుపే రక్షింతువు

పె.అ.రేకు: 0076-02 బౌళి సం: 15-436

పల్లవి: ఇతఁడే బ్రహ్మస్వరూప మితఁడే పరతత్వము
యితఁడే స్వయంవక్త మిటని తలఁచుఁడీ

చ. 1: హరి వేంకటాద్రి నుండు నని పురాణములు చెప్పు
పరమేష్టికి విశ్వరూపము చూపినందుకు
సరుసనే జనులకు స్వప్నములో మాటలాడి
పరుషలకు పరాలు పై పై నిచ్చీని

చ. 2: మునులు పూజించి రట మున్నే యీ మూర్తిని
సనకాదియోగీంద్రు లిచ్చటనే వెదకిరటా
యెనలేని మహిమలు యెప్పుడునుఁ గలవట
ఘనదివ్య జ్ఞానసిద్ధిగలవాఁడట

చ. 3: అలమేల్మంగ పురమందుఁ గాఁపుర మున్నది
యిల శ్రీవేంకటేశుఁ డితఁడై వున్నాఁడు
తలఁప నితనిపేరే ధరించిరి లోకు లెల్లా
తెలుసుకొంటేఁ దానే దృష్టదేవుఁడు

పె.అ.రేకు: 0076-03 గుజ్జరి సం: 15-437

పల్లవి: ఎక్కడ వోయెనో జాతస్మరత్వము యేమి సేయఁగలవాఁడను నేను
దిక్కు నీవే హరి నన్నుఁ గాచుటకు దేవదేవ యిఁకబోధించవే

చ. 1: తిరముగ జన్మాంతరమున సంపాదించిన సుజ్ఞానంబున
స్మరించి యీ పుట్టుగునఁ గడమ నే సాధించెద నని యంటివా
అరయఁ దల్లి గర్భంబున వెడలినయపుడే అన్నియు మఱచితిని
ధరలోపల నే విడువక ద్రావిన మరులుఁ బాలు నను మంకుఁజేసెను

చ. 2: అంతట నేఁ బెద్ద వెరిగి బుద్ధెఱిఁగి అటు నీ మాయా ప్రపంచమునను
చెంతల బహువిధసృష్టిలోఁ దగిలి చిక్కువడుచు నే భ్రమసితిని
చింతించినేమటీ పెక్కులు చదువుచు చిత్తములో బహుసంశయములఁబడి
అంతట నంతట జరగి జరగి కడు నజ్ఞానముపాలైతిని

చ. 3: ముదిసినపిమ్మట లోభమోహములు ముంచుకొనఁగ నటు లోలుఁడనైతి
వదలక భువిపై బ్రహ్మదేవుఁ డటు వ్రాసిన వ్రాతలు నిజమాయె
చెదరక యలమేల్మంగ విన్నపము చేకొని శ్రీవేంకటేశ కాచితివి
బ్రదికితి నిఁక నాచార్యునియానతి ఫలియించెను నా భాగ్యమువలన

పె.అ.రేకు: 0076-04 బౌళి సం: 15-438

పల్లవి: సంగరహితుఁడైనఁ కాక శాంత మాత్మ కేల కలుగు
నంగ తెఱుగనట్టివారి జాడ లూరకుండునా

చ. 1: వెలయ నగ్ని పొంతనున్న వెన్న గరఁగ కేల మాను
పెలుచఁ జల్లతోడిపాలు పేరకుండునా
అలరి యరడు(?) వద్ది తీగె అంటఁబావ కేలమాను
చెలులసరస నున్నవారిచిత్త మూరకుండునా

చ. 2: బెరసి యినుముతోడియగ్ని పెట్టువడక యేలమాను
విరులతేనె చూచి తేఁటి విడువ నేర్చునా
వొరసి యుల్లిఁ గూడి కప్ర ముగ్రగంధ మేల మాను
సిరులతోడ మెలఁగువారు చింత లేక వుందురా

చ. 3: వూరిచవుటనేల జలము లుప్ప నుండ కేల మాను
వూరుగాయకడవ బేఁట్లు వురుల కుండునా
కోరి శ్రీవేంకటేకొమ్మ యలమేలుమంగఁ
జేరకున్నవారికతలు చెప్ప నెట్టువచ్చును

పె.అ.రేకు: 0076-05 మలహరిసం: 15-439

పల్లవి: మఱవఁగ నియ్యదు రేఁచును మాయాప్రపంచమిదివో
తెఱఁ గిఁక నేదో తెలియదు దేహము మోచినను

చ. 1: యెక్కడి మనోరథంబులు యెన్నో తలఁపునఁ బారును
తక్కక భుజించి యేకాంతంబున నున్నపుడు
చొక్కపు చుట్టరికంబులు చుట్టుక యింటికి వచ్చును
గక్కన సంసారబంధము కట్టుకొనినయంతా

చ. 2: పెనగొని పంతపుమాటలు వెక్కులు నోరను వెడలును
గొనకొని నలుగురిలోపలఁ గూచుండిన వేళ
వనితలు వద్దనె వుండిన తావులు తానే కూడును
మన సొడఁబడి తనలోఁ గామము మిక్కుటమైనా

చ. 3: చేతులఁ బెనగొని కర్మము చేతఁలు యేమో సేయించు
యేతుల రాజ్యమదంబున నెనసిన సమయమునా
యీతల శ్రీవేంకటేశ్వర యేలితి విటు నను నీవే
కౌతుకముగ శరణాగతి కాచును మమ్మెపుడు

పె.అ.రేకు: 0076-06 సామంత సం: 15-440

పల్లవి: నే నే భాగ్యవంతుఁడను నీ కృప గలిగె నాకు
జ్ఞాన మిచ్చితివి నే సంసారము సేయఁగాను

చ. 1: వుట్టుదరిద్రుఁడై వున్నప్పుడు వచ్చిన సంపద
లట్టే వేపచేదు దాగెయప్పటి తీపు
దట్టమై యాకలిగొన్నతఱిఁ గల యాహారము
గట్టిగాఁ జవియైనట్టు గలిగె నీ భక్తి

చ. 2: చిక్కులేక భీతివాసినమీఁది సంతోషము
నిక్కపు రోగము మానిన సౌఖ్యము
మిక్కలి యప్పులు దీని మెఱనే దొరతనము
గక్కన నా కబ్బినట్టు గలిగె నీ భక్తి

చ. 3: జడిసి యెండదాఁకిని సమయమందలి నీడ
అడవిలోపల సహాయమైన తోడు
అడరి దొరకినట్టు లట్టే శ్రీవేంకటేశ
కడఁగి నీ కృపవల్లఁ గలిగె నీ భక్తి

పె.అ.రేకు: 0077-01 వరాళి సం: 15-441

పల్లవి: ఆ మూరితియే యీ మూరితి అందు నిందు భేదము లేదు
సోమర్కనేత్రుఁడ విశ్వరూపములు చూచినవారమే మును నేము

చ. 1: బలిమితోడ వత్సాపహరణమున బ్రహ్మకు నీ మాయ చూపితివి
విలసిల్లఁగ రణభూమిని నరునకు విశ్వరూప మటు చూపితివి
అలరిన నీ రూపు జలమధ్యంబున ఆక్రూరున కటు చూపితివి
చెలఁగి కుమారస్వామికి నా రూపు శ్రీవేంకటగిరిఁ జూపితివి

చ. 2: దైవికముగ దుర్యోధను సభను ప్రతాపము నీ రూపు చూపితివి
ఆ విధముననే నీరూపు ముదంకు నా శ్రమమున నీటు చూపితివి
నీవిధ మెఱుఁగని భీష్మకునకు మఱి నిర్మలరూపము చూపితివి
శ్రీవేంకటగిరి నారూపంబే చేరి పరుషలకుఁ జూపితివి

చ. 3: పుట్టినప్పుడే వసుదేవునకు చతుర్భుజముల నీ రూపు చూపితివి
జట్టిగ గొల్లెతలకు రూపము రా సక్రీడలలోఁ జూపితివి
యిట్టే నారదునకు ద్వారకలొ యింటింట నీ రూపు చూపితివి
పట్టుగ శ్రీవేంకటేవ్వర ఆ రూపమె మాకిప్పుడు చూపితివి

పె.అ.రేకు: 0077-02 సామంతం సం: 15-442

పల్లవి: దైవమా నీతప్పు లేదు తలఁచేవారి భాగ్యమే
వేవేలుగా మతియించీ వేదములే నిన్నును

చ. 1: నీవు గలవనేచోట నీ గుణములు గలవే
నీవు లేని చోట నిర్గుణ మౌను
భావించితే మనసులోఁ బరగు నీ సాకారము
ఆవల నిన్నుఁ గానని దది నిరాకారము

చ. 2: యెఱిఁగి కనుఁగొంటేను యీ జగ మెల్లా నిజము
యెఱుఁగక మఱచితే నింతా మిథ్యా
పుఱక భక్తి సేసితే నుండు నందు భేదము
నెఱయా నొల్లకుండితే నిలుచు నభేదము

చ. 3: తపము ఫలించెనంటే దండ నుండు మోక్షము
యెపుడు నిష్ఫలమంటే యెన్నఁడు లేదు
కృప నలమేల్మంగ కధిప శ్రీవేంకటేశ్వర
కపటము లేక నేల కావవే యిందఱిని

పె.అ.రేకు: 0077-03 లలిత సం: 15-443

పల్లవి: కటకటా యీ యాత్మ లేగతి నీడేరఁ గలరు
యిటు నీకు శరణంటే యిట్టే రక్షింతువు

చ. 1: చేరి నీ మహిమ చిరజీవుల నడిగే మంటే
ఆ రీతి జీవులు బ్రహ్మదిదేవత లింతే
వారఁ దమపుట్టిన యవ్వలగాని తొల్లింటి
నీ రూప మింతింతని నిశ్చయింప లేరు

చ. 2: అందరికి శ్రుతులే ఆధార మనాదినుండి
పొందుగా నడిగే మంటే పొడచూప వదియును
కందువ ఋషులపారక్రమముల వచ్చె నింతే
అందరియర్థములు నిశ్చయము సేయ లేరు

చ. 3: అదిగాన యెంచి సనకాదులు శుకాదులును
మొదలనే నినుఁ గొల్చి ముక్తు లనిపించుకొనిరి
అదనఁ దక్కిన వుపాయముల నింత వున్నదా
పదిల మలమేల్మంగపతి శ్రీవేంకటేశా

పె.అ.రేకు: 0077-04 బౌళిరామక్రియ సం: 15-444

పల్లవి: ఇంత మాత్రము మా నేమ మిందు నీ కేమి గూడీని
చెంత ధర్మమునకు రక్షించేవు నీవు నన్ను

చ. 1: పిడికెఁడు బియ్యమే పెద్దరికంబగు చెలిమి
తొడిఁబడ సంధ్య మూఁడుదోసిళ్లు నీళ్లు
నుడిగే జపము వేళ్ల నూఁటయెనిమి దెంచేది
తడుపుకొనేది తీర్థస్నానము లన్నియును

చ. 2: పూరక యాకలి గొని వుండేది మా వ్రతములు
నీరసపు టాహారాలు నిష్టలెల్లాను
పూరఁ దోఁటల పువ్వు లొగి దేవపూజలు
గోరమైన బతుకులు కోరేటి తపములు

చ. 3: బలసాకు తిలలు దర్భలు పితృపూజలు
పలుకకుండేది మా బలు మోసము
యిలపై శ్రీవేంకటేశ యిందు నిన్న మెప్పించే మా
కలిగినది మాకు నిఁక మణి కాకా

పె.అ.రేకు: 0077-05 సామంతం సం: 15-445

పల్లవి: ఎట్టు దోయవచ్చు వీని నెంతటివాని కైనాను
పట్టి నీకు శరణంటే బ్రతికింతువు గాక

చ. 1: మాలతనముపంటిది మదిఁ దగులుఁ గామము
ఆలరి ముట్టువంటిది యంటుఁ గ్రోధము
కేలి నొదిగించు నెంగిలివంటిది లోభము
వాలాయించి యెందుండైనా వచ్చును లోకులకు

చ. 2: చుట్టి మద్యమువంటిది చొక్కించు మోహము
దట్టి మాంసమువంటిది వయోమదము
పుట్టిన భ్రమవంటిది పొదిగిన మచ్చరము
వుట్టిపడి నోహరించు నూరకే ప్రాణులను

చ. 3: గోడమఱఁగువంటిది గుట్టుతోడి సంసారము
వీడని కట్టువంటిది వేడుక యాసా
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నీ దాసుల
జాడ దప్ప నియ్యవు యీ చందము జీవులది

పె.అ.రేకు: 0077-06 శంకరాభరణం సం: 15-446

పల్లవి: తనమనసే తనకు తారుకాణవచ్చుఁ గాక
విసుకలి పరబుద్ధివినులఁబట్టీనా

చ. 1: చుట్టమైనవాఁడు తనచోటికి నమ్మికె గాక
వెట్టివాఁడు సత మౌనా వేగినంతతాను
అట్టే తనయింటి యన్నమాఁకటి కొదగుఁ గాక
పొట్టఁబొరుగు విందులు పొద్దు దప్పకుండునా

చ. 2: వాడియైన యిల్లాలు వంశమున కెక్కుఁగాక
కూడగొట్టుకాంత తనకుల మయ్యీనా
వాడలో మంచిగుణము వాసి వన్నెఁ దెచ్చుఁగాక
యేడనైనా యపకీర్తి హీనమే కాదా

చ. 3: యెక్కువ హరిఁ గొల్చితే నిహపరము నిచ్చుఁ గాక
తక్కిన దేవత లింతటి కోపేరా
చక్కని శ్రీవేంకటేశుఁడు సర్వాంతురాత్మకుఁడు
తక్కక మనుజులాల తలఁచి బ్రదుకరో

పె.శ్రీ.అ.రేకు: 0078-1 సాళంగనాట సం: 15-447

పల్లవి: ఆదినారాయణ నాకు నభయ మీవె
కాదని తప్పులెంచక కరుణానిధీ

చ. 1: తుదకెక్క నింద్రియపు దొంగలకుఁ దాపిచ్చితి
యెదుటికి రాఁగా నీ వే మందువో
మదించి నాలో నుండఁగా మఱచితి నే నిన్ను
యిదె కాను కియ్యఁగా నీ వేమందువో

చ. 2: పక్కన నీ యాజ్ఞ దోసి పాపము లెల్లాఁ జేసితి
యిక్కడనే మొక్కఁగా నీ వేమందువో
దిక్కు నీ వుండఁగాఁ బరదేవతలఁ గొలిచితి
నెక్కొని రక్షించు మంటే నీ విఁక నేమందువో

చ. 3: తొట్టి కామక్రోధాలతో దూరు లెల్లాఁ గట్టుకొంటి
యిట్టె ముద్ర మోచే నంటే నేమందువో
నెట్టన శ్రీవేంకటేశ నీకు నలమేల్మంగకు
గట్టిగా నే లెంక నైతి కరుణిం చేమందువో

పె.శ్రీ.అ.రేకు: 0078-2 దేసాళం సం: 15-448

పల్లవి: నీ వెంత నే మెంత నీ కృప యెంచుట గాక
భావింప స్వతంత్రుఁడవు పరమేశ్వరుఁడవు

చ. 1: సాదించరానివాఁడవు సకలోపాయములను
సాదించరానివాఁడవు చొచ్చి వెదకి
సాదించరానివాఁడవు వాకుచ్చి యెవ్వరికిని
పాదుకొనఁ గొలిచితే భక్తసులభుఁడవు

చ. 2: మించరానివాఁడవు మేటిసురలకు నైనా
యెంచరానివాఁడవు యిట్టట్టనుచు
వంచరాని వాఁడవువడిఁ బ్రతాపములను
పంచనుండి నుతించితే భక్తలసులభుఁడవు

చ. 3: పట్టరానివాఁడవు బలిమి నేరుపులను
ముట్టరానివాఁడవు మొక్కలానను
నెట్టన శ్రీవేంకటేశ నీ వెదుట నున్నాఁడవు
బట్టబయలు మొక్కితే భక్తసులభుఁడవు

పె.శ్రీ.అ.రేకు: 0078-3 రామక్రియ సం: 15-449

పల్లవి: ఎట్టు మన్నించేవో నన్ను యిటువంటి వాఁడను
దట్టపుటాసల నిన్నుఁ దడవుచున్నాఁడను

చ. 1: పలుమారు మొక్కఁగాను పరాకు సేసిన ట్టౌనో
మలసి జపించఁగాను మతి యెంత గరఁగునో
కొలువఁగా గొలువఁగా కొసరిన ట్టౌనో
తల పెటుఁగక నిన్నుఁ దగులుచున్నాఁడను

చ. 2: చేరి పూజించఁగా నిన్నుఁ జిక్కించు కొన్న ట్టౌనో
సారె నారగింపంచగా చవి మరపిన ట్టౌనో
పూరకే సేవ సేయఁగా వొలవేసినట్టౌనో
నోరఁగొలఁదుల నిన్ను నుతింపుచున్నాఁడను

చ. 3: ఆటలాడి నవ్వించఁగా నలయించి నట్టౌనో
పాటించి శరణనఁగా పట్టి పెనఁగిన ట్టౌనో
వాటమై శ్రీవేంకటేశ వరదుఁడవు నీ వైతే
మేటి నా యాసల నిన్ను మెప్పించుచున్నాఁడను

పె.అ.రేకు: 0078-4 గుజ్జరి సం: 15-450

పల్లవి: విన్నప మిదియే వేవేలకు గోవిందా గోవిందా
సన్నుతించెదను నావలనఁ గలుగు సర్వాపరాధము లెంచకుమీ

చ. 1: యెఱఁగమినాది యెఱుక నీపని యేమరి సంసారినైన యిన్నాళ్ళును
మఱతును నేను మఱవవు నీవు మదమున సిరు లుప్పతిల్లఁగా
కొఱగాను నేను కొఱగలవు నీవు కొమ్మలవలపులఁ దగిలితిఁ గనక
మఱి నీవే గతి రక్షింపుము నా మర్మము నీచేతనున్నది సుమ్మీ

చ. 2: నేరమి నాది నేరుపు నీది నేఁబుట్టుగులకు లోనైనయపుడే
కోరుదు నేను కోరవు నీవు గొనకొని యాపదలు పైకొనఁగా
దూరుదు నేను దూరవు నీవు తొరలి పురాకృతకర్మము లప్పుడు
యేరీతినైనా నీవే దిక్కింక యిదె నీకు శరణు చొచ్చితిఁ జుమ్మీ

చ. 3: తలఁచమి నాది తలఁపు నీది యిటు తగ నంతర్యామివి గలకాలము
కొలుచుట నాది కొలువుగొనుట నీది కూరిమితో నే నీకు మొక్కఁగా
ఫలము నాది నా ఫలదుఁడవు నీవు పరికింపఁగా శ్రీవేంకటేశ్వర
బలువుఁడవు నీవు నన్ను నేలునాపాలిదై వమవు నీవే సుమ్మీ

పె.శ్రీ.అ.రేకు: 8020-06 సాళంగనాట సం: 15-451

పల్లవి: హరిదాసుల మహి మల్లదివో
నరులు యిదే నమ్ముట గాక

చ. 1: పెక్కు తపస్యులు పెద్దలు ఋషులు
చుక్కలై యున్నారు చూచితిరా
యెక్కడి ముగితి యెవ్వరి కున్నది
వొక్కశుకునకే యొనరెఁ గాక

చ. 2: తీరని యమృతపు దేవత లిందరు
మేరువం దున్నారు మెచ్చితిరా
యీరీతి వైకుంఠ మెవ్వరి కున్నది
నారదాదులకే ననిచెఁ గాక

చ. 3: అందు నీకాకాతమసటి బ్రహ్మముఁ
బొంది యెవ్వరైనఁ బొడగంటిరా
విందువలెనే శ్రీవేంకటేశ్వరునిఁ
జెంది పరమ్ములు చేకొంటిరా

పె.శ్రీ.అ.రేకు: 8020-18 వరాళి సం: 15-452

పల్లవి: బుద్ధి చెప్పగదవే పురుషోత్తమా
శుద్ధముగా నీ శరణు చొచ్చితిమి నేము

చ. 1: చదివినాఁ దెలుపని శాస్త్రముఁ గోపించరాదా
కొదవెట్టుక రేఁచేటి కోపముఁ గోపించరాదా
పదరి తొల్లి సేసిన పాపాలఁ గోపించరాదా
యెదటివారిపై జీవుఁ డేల కోపగించీనో

చ. 2: పలుమారు వచ్చే కోపమునే కోపంచరాదా
మ.............. మట్టుపడని మనఁ గోపించరాదా
అలయించి తన్నుఁ దిప్పే ఆసలఁ గోపించరాదా
తలఁపక జీవుఁ డేల తాఁ గోపగించీనో

చ. 3: వేఁడుకొన్నా డాఁగి పొయ్యే విరతిఁ గోపించరాదా
వాఁడిమి సంగాతవోష వర్గముఁ గోపించరాదా
పోఁడిమి శ్రీవేంకటేశ పొంచి నాలో నున్నాఁడవు
నేఁ డెవ్వరితో జీవుఁడు నిక్కి కోపగించీనో

పె.అ.రేకు: 8007-09 గుండక్రియ సం: 15-453

పల్లవి: జీవాత్ముని దీమముగాఁ జేసుక యిందరిఁ గూడుక
కావలి దిరిగెద రిందుకుఁ గర్తలి దెవ్వరొకో

చ. 1: పంచేంద్రియము లిదెవ్వరు పంచభూతము లెవ్వరు
పంచప్రాణములనియెడు ప్రభువు లి దెవ్వరొకో
పంచమహాపాతకములఁ బాట్లఁబడువా రెవ్వరు
పంచత్వంబునఁ బొండఁగ భారకు లెవ్వరొకో

చ. 2: తప్పక తిరువేంకటపతిఁ దలఁచెడివా రది యెవ్వరు
వొప్పగు సౌఖ్యము వొడగవ యోగ్యు లి దెవ్వరొకో
వొప్పుల తప్పుల చేఁతల నొడఁబడ నొల్లక సకలముఁ
దప్పించుక పుణ్యులు గాఁదగు వా రెవ్వరొకో

పె.శ్రీ.అ.రేకు: 8007-10 కాంభోజి సం: 15-454

పల్లవి: మక్కు వలర జేరులైన మంచిపండు చూచి నోరు
గుక్కిళ్ళు మింగఁ జొచ్చె కొమ్మ యేమి సేతమే

చ. 1: పేరులేని రూపులేని పెద్దగురువు నొకనిఁ దలఁచి
వూరులేని యింటిలోన నుండఁ దలపఁగా
కూరలేని కూడు మిగులఁ గుడువఁ దలచి యాసపడెడు
నీరజాక్షి యొకతె దీని నెలఁత యేమి సేతమే

చ. 2: అడుగులేని కడువలోన నధికమైన నీట నగ్గి
కడఁగి రవులుకొలిపి లోన గాలి చేతఁ గాఁగఁగా
పుడుకుదెరఁగ కందులోన నుడుకకుండు టెఱుఁగ రాచు
వెడలిపోవు టెఱుఁగరాదు వెలది యేమి సేతమే

చ. 3: మాఁకులేని పువ్వులందు మంచిమంచి రేకు లెల్ల
వేఁక పడక చేకొనియ వేంకటాద్రినాథుఁడు
తోఁకపంక పెద్దతెరువు తోప గానరాక వోయె
కాఁకదేర దీ తలఁపు కాఁత యేమి సేతమే

పె.శ్రీ.అ.రేకు: 8007-11 సామంతం సం: 15-455

పల్లవి: మంచం బెక్కినపిమ్మట మరి వావియు లేదు
చంచల ముడిగినపిమ్మట శంకకుఁ బనిలేదు

చ. 1: పదిలంబుగ సర్వాత్మకభావము దెలిసిన పిమ్మట
ముదమున నెవ్వరిఁ జూచిన మొక్కక పోరాదు
హృదయము పరమేశ్వరునకు నిరవైపోయిన పిమ్మట
యెదిరిని కెలఁకులఁ జూడను ఇతరము పనిలేదు

చ. 2: సకలేంద్రియములు హరిపై చయ్యనఁ బెట్టిన పిమ్మట
వొకటియు నోరికిఁ జవియను వొద్దిక పనిలేదు
వికసించిన పరిణామము వెల్లువ ముంచిన పిమ్మట
చికురము ముడువనుఁ గట్టును చీరకుఁ బనిలేదు

చ. 3: పరమాత్ముఁడు తిరువేంకటపతియనితెలిసినపిమ్మట
పరిపరి చదువుల లంపటములఁ బడఁ బనిలేదు
హరియే చైతన్యాత్మకుఁ డని తెలిసినపిమ్మట
దురితములకుఁ బుణ్యములకు త్రోవే బనిలేదు

పె.శ్రీ.అ.రేకు: 8007-19 సామంతం సం: 15-456

పల్లవి: మానని పుండ్లు మానిన
అనుమానము తన కేమీ

చ. 1: పడరానిపాట్ల నెల్లఁ బరచి పోయిన తవులు
విడిచి యెవ్వరిఁ బట్టి వెంచినఁ దన కేమి
కడఁగి తన్నుఁ బట్టి గాసి సేసిన భూత
మెడప కెవ్వరిఁ బట్టి యేఁచినఁ దన కేమి

చ. 2: కాడువద్ద తన కాలి సంకెల కీలు
వూడి యెవ్వరికాల నుండినఁ దన కేమి
పాడు వరచి తన్నుఁబట్టి కట్టిన పెద్ద
తాడు యెవ్వరిమెడఁ దగిలినఁ దన కేమి

చ. 3: తిరువేంకటాచలాధీశుని కృపచేత
దురిత కంటకములు దొలఁగినఁ దన కేమి
పరివోని దురితకూపములైన దుష్ట
పరవశములు దన్నుఁ బాసినఁ దనకేమి

పె.శ్రీ.అ.రేకు: 8008-02 బౌళి సం: 15-457

పల్లవి: నిలువు నా నుడిలోన నిజముగా నిపుడు
తలఁగఁ జెల్లదు నీ దాసుల యెడలను

చ. 1: బలిమి గద్దని మిట్టిపడినఁ బోనియ్యు
తల దూర్చుకొని లోన దాఁగినఁ బోనియ్యు
పెలుచుఁదనము గీపెట్టినఁ బోనియ్యు
చెలఁగి నూరు మోముసేసినఁ బోనియ్యు

చ. 2: కొంచెపడి యెంత వేఁడుకొనినాఁ బోనియ్యు
పించెపుఁ గైదువ జళిపించినఁ బోనియ్యు
వంచించి రాజవైన నవ్వలికిఁ బోనియ్యు
మించిన ముసలిపై మీఁటినఁ బోనియ్యు

చ. 3: పడఁతులలోన భంగపడినఁ బోనియ్యు
కడుఁ గరాళించిన కదలి పోనియ్యు
విడువ నీ పాదారవిందము నా తలపై
నిడుకొందు వేంకటేశ యేమైనాఁ బోనియ్యా

పె.శ్రీ.అ.రేకు: 8008-03 సాళంగనాట సం: 15-458

పల్లవి: కామక్రోధవికార జలనిధికి కలశభవుఁడు మీ నామము
భీమగుణత్రయ బిసకాండములకు బిరుదుహంస మీ నామము

చ. 1: బహుళదురిత పటుపటల మను ఘన
గహన దావశిఖి గణుతింపఁగ మీ నామము
సహజ కలుషతమిస్రము దొలగింపఁగ నహ
రహముల వెలిఁగెడి రవి బింబమైనది మీ నామము

చ. 2: జననబంధదోషములను గిరులకు
ననుపమ మగు నిష్ఠుర నిర్ఘాతం బరయఁగ మీ నామము
ఘనసంసారం బను పెనుసర్పం
బునకును ముదమున గరుడుఁడు మీ నామము

చ. 3: తీరని పంచేంద్రియ మేఘములకు
ఘోరమారుతవిహారం బైనది మీ నామము
శ్రీరమణీశ్వర శ్రీవేంకటపతి
ధారుణిఁ బొగడఁగఁ దగినది మీ నామము

పె.శ్రీ.అ.రేకు: 8008-04 శంకరాభరణం సం: 15-459

పల్లవి: ఏమి చెప్పెడి దిందు నేమి గలదు
సామజముతోఁ బెనఁగ సమకొనెడు మనికి

చ. 1: బొంతవలపులతోడఁ బొరలాడు మనికి
దొంతి యాపదలె తనతొడవైన మనికి
ముంతలోపలినీట మునిఁగేటి మనికి
సంతలో కూటములె చవియైన మనికి

చ. 2: కొనకొన్న దురితములె కూడైన మనికి
కను మాయ సంపదలఁ గాఁగేటి మనికి
పనిలేని విషయముల బంటైన మనికి
వెనక ముందర చూడ వెఱపైన మనికి

చ. 3: యేవగింతల యాట నెదురీఁదు మనికి
చావుతో సరియైన జగడంపు మనికి
శ్రీవేంకటేశునిఁ జింతసేయని మనికి
యీవలావలఁ దిరిగి యిట్లైన మనికి

పె.శ్రీ.అ.రేకు: 8009-01 భూపాళం సం: 15-460

పల్లవి: కొండా చూతము రారో కొండుక తిరుమలకొండా
కొండని యడిగిన వరము లొసఁగు మా కొండలతిమ్మయ కొండా

చ. 1: మేరువు మును స్తుతియింపఁగను వారిజసంభవుఁడా
పేరు కలుగు నవరత్నంబులు బంగారము కల్పతరువూ
మేరకు మీఱఁ గని నెలవున నారుగ నిడెనొకో యనఁగా
ధారుణి బ్రహ్మాండములకు నాధారంబగు మా కొండా

చ. 2: గరుడాచలం బనఁగా శ్రీవేంకటశైలం బనఁగా
గిరులకు నేలికె యగు ననంతగిరి దా నీ గిరి యనఁగా
సిరులాయఁ జనమగు యంజనశబరి యనెడినామములా
పరగఁగ నాలుగు యుగముల వెలసిన ప్రబలంబగు మా కొండా

చ. 3: పొదలూ సొంపగు నింపుల పూబొదలూ వాసననదులూ
కొదలూ గల తామరకొలఁకులపై మెదలుఁ దుమ్మెదలూ
కదలి మలయానిలు వలపులపన కదళీవనములునూ
మొదలు గా నెల్లప్పుడు నీ సంపదలు గల మా కొండా

చ. 4: జంతువు లెల్లను మునులూ సకలమైన దేవతలూ
జంతువుల యెలుఁగులు వేదసారంబగు హరినుతులూ
చింతామణులట రాళ్లెల్లను సిరులనెలవు లా గుహలూ
సంతతసౌభాగ్యంబుల నొప్పెడు సందడిగల మా కొండా

చ. 5: వొకచో బ్రహ్మాదులు మునులును వొకచో నింద్రాదులునూ
వొకచో భాగవతులు యతులు శ్రుతులువొకచోఁ జంద్రార్కులు
వొకచో తీర్థంబులు గిరులును వొకచో యోగీశ్వరులూ
అకలంకత తనుఁ గోరి తపముసేయ నాస లెఱుఁగు మా కొండా

చ. 6: శుకములతోఁ జదువుదురా శుకబ్రహ్మాదులు శ్రుతులూ
తకదిమ్మని యాడించు మయూరతతిని యోగీశ్వరులూ
సకలపురాణంబులు విందురు మఱి పికశారికలచే మునులూ
ప్రకటితముగ నీ విద్యల నొప్పెడు భాగ్యముకల మాకొండా

చ. 7: స్వామితీర్థములకును స్వామిపుష్కరణియునూ
పామరులా యమరులఁ జేయును పాపవినాశనమూ
తా మహిఁ గోరిక లిచ్చుఁ గుమారధారయు పాండవసరసీ
కామితఫలదాయిని ఆకాశగంగయుఁ గల మా కొండా

చ. 8: యిదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు
యిదియె నందవ్రజ మనుచును మరి యిది దా నయోధ్య యనుచూ
యిదియె వైకుంఠం బనుచును యిది పరతత్త్వంబనుచు
యిదియె పరమపదం బనుచు వేదములు యెన్నఁగఁ గల మా కొండా

చ. 9: తలఁచిన శుకశౌనకాదులకు తలఁచిన తలఁ పొసఁగినా
తలఁపు లోపల నెలకొన్నా దయతో నన్నేలినా
చెలువుఁడు మావెంకటరాయఁడు సిరులనెలవు చేకొన్నా
కలియుగవైకుంఠం బనునామము గలిగి వెలయు మా కొండా

పె.శ్రీ.అ.రేకు: 8009-05 సామంతం సం: 15-461

పల్లవి: తరి నిధానము గన్నదాఁకా దరిద్రంబు
స్థిరముగా కివి గనిన సిరు లేమి బ్రాఁతి

చ. 1: మొదల గోవింద యను మూడక్షరంబులును
పదిలముగ నోరఁ బనుపడు దాఁకానె
కదియుఁగా కాపదలు కలుషములు జీవులకు
చెదరుగా కివి గనిన సిరు లేమి బ్రాతి

చ. 2: నారాయణా యనెడి నాలుగక్షరములు
పేరుకొని నోరి కచ్చిన దాఁకానె
భూరిదుఃఖములు నలపులు సదా జీవులకు
చేరినా యవి గనిన సిరు లేమి బ్రాతి

చ. 3: వేంకటేశ్వర యనెడి వేదపంచాక్షరము
అంకురంబయి నోరి కవుదాఁకానె
జంకెనలు నలవు నలజడి గాక జీవులకు
యింక నివి గనిన సిరు లవి యేమి బ్రాతి

పె.శ్రీ.అ.రేకు: 8009-08 బౌళి సం: 15-462

పల్లవి: విడువదు తన్ను విడువఁ జూచిన తన్ను
విడిచినఁ గాని విడువ దెన్నఁడును

చ. 1: మానని పుంటికి మందు మంతరము లేని సంది
గోనెఁ బట్టినట్టి బంక గోడమీఁది మన్ను
జ్ఞానము లేని యెఱుక సందుగెందు లేని యిల్లు
రానిపోనిచోటి రాజులేని కొలువు

చ. 2: చిత్తములోపలివాఁడు చిత్తములవెలివాఁడు
చిత్తము మేన గూడఁ జేసినవాఁడు
చిత్తజజనకుఁడైన శ్రీవేంకటాద్రీశుఁడు మద
మెత్తినమోహముఁ దన్ను నెడ ఇయ్యఁడైనా

పె.శ్రీ.అ.రేకు: 8009-13 శ్రీరాగం సం: 15-463

పల్లవి: ఘనసుఖము జీవుఁ డెఱుఁగఁడు గాకయెఱిఁగినను
అనవరతవిభవంబు లప్పుడే రావా

చ. 1: విసుగ కెవ్వరినైన వేఁడ నేర్చిననోరు
దెసలకునుఁ బలుమారుఁ దెరచునోరు
వసుధాకళత్రుఁ దడవదుగాక తడవినను
యెసఁగఁ గోరికలు తన కిప్పుడే రావా

చ. 2: ముద మంది యెవ్వరికి మొక్క నేర్చినచేయి
పొదిగి యధముల నడుగఁ బూనుచేయి
ఆదన హరిఁ బూజసేయదు గాక సేసినను
యెదురెదురఁ గోరికలు యిప్పుడే రావా

చ. 3: తడయ కేమిటికైనఁ దమక మందెడిమనసు
అడియాస కోరికల నలయు మనసు
వడి వేంకటేశుఁ గొలువదు గాక కొలిచినను
బడిబడినే చెడనిసంపద లిట్లు రావా

పె శృ రేకు: 01-1 సాళంగనాట సం: 17-001

పల్లవి: ఎటువంటి మోహమో యింతినీపై నతనికి
తటుకన నురమున ధరియించె నిన్నును

చ. 1: కామిని నీ నడపులు గజగమనము లని
కామించి నీ పతి కరిఁ గాచెను
కోమలపు నీ పిరుఁదు చక్రభావ మని
నేమమై చక్రము చేత నిలిపినాఁ డతఁడు

చ. 2: నెలఁత నీ నిలయము నీరజ మనుచుఁ బ్రియ
మలరి జలజనాభుఁ డాయ నతఁడు
కలికి నీ గళము శంఖముఁ బోలునని తాఁ
దలఁచి పాంచజన్యధరుఁ డాయ నతఁడు

చ. 3: నిరతి నలమేల్మంగ నీ కురులు నలు పని
అరుదార నీలవర్ణుఁ డాయ నతఁడు
గిరికుచవని నిన్నుఁ గెరలి కౌఁగిటఁ గూడె
పరగ శ్రీ వేంకటపతి యాయ నతఁడు

పె శృ రేకు: 01-2 శంకరాభరణం సం: 17-002

పల్లవి: ఈపాటి కీపాటి యెంత సేసేవే
చేపట్టితే నది గొఁటసేయక మానేవా

చ. 1: నగుతా నీ తురుము మిన్నక జారఁ దీసితేను
సగము చూపులఁ జూచి సాదించేవే
పగటున నిఁక నిన్నుఁ బట్టి పెనఁగేటి వేళ
జిగిని వీర రసాలు చిందక ఉండేవా

చ. 2: తప్పితారి నీ చన్నులు తగ నా చేయి దాఁకితే
ముప్పిరి నాపై బొమ్మలు ముడి వెట్టేవే
ప్పిప్పిగాఁ గౌఁగిటఁ బట్టి బిగియించే యట్టివేళ
చొప్పుల నీ మొన లెల్లాఁ జూపక వుండేవా

చ. 3: మనసు మర్మము సోఁక మంతనానఁ గూడితేను
వొసరి పైకొని నాపై వొళ్లు లేసేవే
ఘన శ్రీ వేంకటేశుఁడ గన నేఁ గొసరేవేళ
తనిసి వుపరిసురతాన మించ కుండేవా

పె శృ రేకు: 01-3 సామంతం సం: 17-003

పల్లవి: ఇంత సేసె నని యాపె నేల దూరేవు
రంతు సేసి నిన్నుఁ గడు రవ్వసేయఁ జెల్లదాఁ

చ. 1: చెప్పిన నీమాట లెల్లా చెవి యొగ్గి వినఁబోతే
కప్పురపులప్పకైనాఁ గాఁక రేఁగుఁబో
దప్పిదేర నాపె చేతి తామర విసరెఁ గాని
చెప్పరాని చేఁత లేమి సేసినానుఁ జెల్లదా

చ. 2: నెట్టనఁ బచ్చియైయున్న నీ మేను సోఁగితేను
పెట్టిన వెన్నెలకైనా వుడుకెత్తుఁబో
పెట్టిన తనపాదపు పెండెమున వేసెఁ గాని
యట్టె తరవాతిపను లాపె సేయఁ జెల్లదా

చ. 3: కందువ నీ కౌఁగిటిగాలి మీఁదఁ బారితేను
అంది యాఁడు బొమ్మకైనా నాస పుట్టుఁబో
యిందుకే శ్రీవేంకటేశ యీపె నిన్నుఁ గూడెఁ గాని
యెందులకు నైనా యిట్టే యేలయించఁ జెల్లదా

పె శృ రేకు: 01-4 శంకరాభరణం సం: 17-004

పల్లవి: నిప్పుల మీఁదటఁ దెచ్చి నీ ళ్లెంత చల్లినాను
వొప్పుగా నంతటిలోనే వుడు కారునా

చ. 1: మనసు నొచ్చినదాన మాటలాడు మంటేను
వనితరో నా కెట్టు వాకు వెళ్లీనే
యెనయక విరహన యేఁచి యిప్పు డిట్టె వచ్చి
చన విచ్చి కూడితేనే చవు లౌనా రతులు

చ. 2: సవతులు గలదాన సారెకును నవ్వు మంటే
యివల నా కెటువలె యితవయ్యీనే
తివిరి కోపము రేఁచి తిరుగ బుజ్జగించితే
సవరనిదొరయైతే చల్ల నౌనా నామేను

చ. 3: వాసికి బదికేదాన వద్ది కిట్టె రమ్మంటే
యీసు దేరఁ దా రాక నే నెట్టు వచ్చేనే
ఆసల శ్రీ వేంకటేశుఁ డంతలోన నన్నుఁ గలసె
పోసరించి కూడితేనే పోవుగా తమకము

పె శృ రేకు: 01-5 హిజ్జిజి సం: 17-005

పల్లవి: మానరాని మాయలు
కానీ యందు కేమి కలసీఁ గాని

చ. 1: చాలురా నీ సన్నలు నా
కాలు దాఁకీఁ గదియకు
కాలమందె యిన్నిఁ గంటిమి నా
చేల విడువరా చెప్పీఁ గాని

చ. 2: వద్దురా చల్లువలపూ యింత
ముద్దు లేల పల్లు మోఁచీని
అద్దొ కాలు దొక్కే వప్పటి వొక
కొద్ది నుండరా కూడీఁ గాని

చ. 3: చెల్లురా నీచేఁతలు నా
వొళ్లి చెమ టంటీ నొరయకు
తొల్లి కడపలో దొరసితి నా
వుల్లపు శ్రీవేంకటోత్తముఁడా

పె శృ రేకు: 02-1 శంకరాభరణం సం: 17-006

పల్లవి: తప్పక చెప్పరా వోరి దాఁచక నీవు
యెప్పుడు నీవద్దఁ గాక యెడసి వుండెనా

చ. 1: సందెకాడ రమ్మనఁగా జాముపోయి వచ్చితివి
విందువలె నెవ్వతెకు వెచ్చ మైతివో
అందుకు వగవ నే నాపె నంటిన కౌఁగిలి
యిందుఁ గలుపే వంటా యింత లోఁగేను

చ. 2: పిలువనంపినచెలిఁ బెట్టు కూడితి విందాక
తలఁపు నీ కక్కడనే తమకించెనో
చలము నీతోఁ గాదు చవి దప్పినందుమీఁద
బలిమిఁ గలయఁబోతే పస లేవు పనులు

చ. 3: కప్పురమే యంపు మంటే గందవొడి యంపితివి
అప్పు డెక్కడికిఁ బరాకై వుండితివో
యిప్పుడు శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నెప్పున నే కడమయినా నీకే సెలవూ

పె శృ రేకు: 02-2 నాదరామక్రియ సం: 17-007

పల్లవి: ఇన్నిటా నేరుపరివి యి దెఱుఁగ వయితివి
విన్నవారెల్లా నవ్వేరు విడువ నీ మాటా

చ. 1: దగ్గరి వచ్చినదే తప్పు సేసి నీవు నాతో
కగ్గి కాలు దాఁకె నంటా గడియించేవు
యెగ్గనక ఆడుకొనే విదొక పెద్దరికమా
సిగ్గువడ కిందరిలో చీచీ యీ మాటా

చ. 2: అట్టె నీతో మాటాడినదే యపరాధముగాఁ జేసి
తిట్టితినంటా నానలు తెగి పెట్టేవు
గుట్టున నుండక నలుగురి సాకిరి వెట్టేవు
అట్టె అణఁచుకోవైతి వయ్యో యీమాట

చ. 3: నెమ్మది నవ్వినదే నెపము చేసినా
తమ్మ మీఁదఁ బడె నంటాఁ దమకించేవు
యిమ్ముల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెమ్మెల పంతము లాడే వేలరా యీ మాటా

పె శృ రేకు: 02-3 ముఖారి సం: 17-008

పల్లవి: ఆయ నాయ నీడ సరి యాఁక లేఁటికి నీ
వే యింతికి వలచిన యీడకే తెచ్చే నయ్యా

చ. 1: చిత్తమొకవంకఁ బెట్టి చేరి నీవు నాకు వట్టి
బత్తు లెంత సేసినాను ఫల మేది
హత్తి నీకు నేనెంత ఆయములు ముట్టినాను
కత్తిఁ గోసి నట్టే కాక కరఁగీనా మనసు

చ. 2: చూపు లొకతెపైఁ బెట్టి సొరిది నాతోఁ బెదవి
పైపయిమాట లాడితే పస లేదు
మాపుదాఁకా ని న్నెంత మంచానకుఁ దీసినాను
కోపము వేసటే కాని కూటమి చాలదయ్యా

చ. 3: కాఁక లొకతెకుఁ జేసి కాయము నాపై వేసితే
మాఁకువలె నుండుఁ గాక మర్మ మంటీనా
యేఁకటతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
ఆఁకటిరతి వేళకు ఆపెనే నే నయ్యా

పె శృ రేకు: 02-4 భైరవి సం: 17-009

పల్లవి: ఏమైనాఁ జేతువు గాక యింత సేతురా
బూమిలోనివారి నన్నుఁ బురుఁడు వెట్టుదురా

చ. 1: చిత్తము రాకుండితేను చేర రాకు మందు గాక
పొత్తులయాకె చేఁతలు పొగడింతురా
వొత్తి నాతోఁ గోపమైతే వూరక తిట్టుత గాక
మెత్తిన యాడో గందము మేనఁ బూయవలెనా

చ. 2: అంత వొల్లకుండితే నా ఆయాలు దాఁకింతు గాక
వింతసతిపొత్తునకు వేడుకఁ బిలుతురా
చెంతల నా కలిగితే సెలవు వెట్టుత గాక
పొంతవారి నాయెదుట పోది సేయవలెనా

చ. 3: యీయకోలై తే నా యింటికి విచ్చేతు గాక
రాయడివారిండ్లకు రమ్మందురా
చాయల శ్రీ వేంకటేశ చన విచ్చి కూడితివి
మాయలు తొల్లిటి వెల్లా మరపింతురా

పె శృ రేకు: 02-5 కేదారగౌళ సం: 17-010

పల్లవి: ఇన్నియును నాయెఁ బోయె యిందుకా నేను
వెన్నెలలో విరహపు వేదనకా నేను

చ. 1: పిలువ వచ్చేవు నీ ప్రియురాండ్ల చేతి
వులివచ్చి మాట లోర్చి యుండనా సేను
పలుక వచ్చేవు నాతో పలుమారు నీ వాడే
చలివేఁడి సటలకు సాకిరా నేను

చ. 2: పట్టఁ జూచేవు బలిమి పడఁతుల బొంది పొంది
వెట్టయిన నీ మేని వేఁడికా నేను
చుట్టమవై దగ్గరేవు సారిది నీ వొక మాటు
ముట్టిన దేవుళ్ళలోని మూఁకకా నేను

చ. 3: నగవచ్చేవు నాతోను నాలిసేసి వేగినంతా
వెగటు జాగరమున వీఁగనా నేను
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
మొగము చూచి చూచి మొక్కనా నేను

పె శృ రేకు: 02-6 పాడి సం: 17-011

పల్లవి: చెల్లఁబో నీ గుండె రాతఁ జేసిరా వోయి
యెల్లవారుఁ గన్నపని కిఁక నేఁటి కోయీ

చ. 1: మాటలాడ వలదా మా యింటికి రాకుండినా
పోటి దొరవై తేనే పొందు వోయెనా
కోటులాయ నీ చలము కొండలాయ నా చన్నులు
యేటి కిఁక నలుకలు యెందాఁకా నోయి

చ. 2: చూడనైనా వలదా సుద్దుల చెప్పకుండినా
వాడలు దవ్వయితేనే వావి వోయెనా
నీడ నీమెయి చెమరించె నిక్కి నామెయిపులకించె
యేడకేడకొ నీవొ ట్లెందాఁకా నోయి

చ. 3: మేలమాడ వలదా మెరమెచ్చునకునైనా
కాలు దొక్కినంతలోనె కళ దాఁకెనా
జాలువాగె మోవిఁదేనే సరి నీవు గూడఁగాను
యేల శ్రీవేంకటపతి యెందాఁకా నోయి

పె శృ రేకు: 03-1 సామంతం సం: 17-012

పల్లవి: సిగ్గుగల యాంటదైతేఁ జేర వచ్చునా
వొగ్గి నేఁ గా నీతో నొక్కటైతిఁ గాకా

చ. 1: వొంటి వేగించఁగా లేక వొద్దికి వచ్చితిఁ గాక
యింటికివచ్చిన మోహ మితవయ్యీనా
మంట దేర నీతోను మాటల నాడేఁ గాక
కంటకపు నీతో పొందు కానిదే కాదా

చ. 2: చిత్తము నిలుపలేక సెలవి నవ్వితిఁ గాక
బత్తి సేయ నీమీఁద పాపము గాదా
తత్తర మాపఁగలేక తప్పక చూచితిఁ గాక
హత్తి నీతో మొగమోట మారడి కాదా

చ. 3: పొందు మరిగితిఁ గాన పొత్తుకు వచ్చితిఁ గాక
చెంది వేగిరించ నీతోఁ జెల్లునా నాకు
కందువఁ గూడితివి చాఁగలమట్టి చెన్నుఁడవై
అందపు శ్రీవేంకటేశ అరుదా నాకు

పె శృ రేకు: 03-2 దేసాళం సం: 17-013

పల్లవి: ఏఁటికి నిన్నుఁ గొసరే మింకా నేల
ఆటల నీయిచ్చ రాజవై బదుకవయ్యా

చ. 1: కన్నులనే నిన్ను నవ్వి కాఁకల వలపు చల్లి
చన్నుల నొరసి యాపె చలి నాపెను
కన్నచోట్లఁ దెగినగాలిపడగవై నీవు
పన్ని మా దీవెన నిట్టె బదుకవయ్యా

చ. 2: ముద్దుటుంగరము చూపి మోవిమీఁద మాటలాడి
బద్దులు ని న్నాపె నేరుపరిఁ జేసెను
వుద్దండాన నీ విఁక వూరువాడే చెలమవై
తిద్దుబడి నిట్టే ఆరితేరి బదుకవయ్యా

చ. 3: కందువ మర్మములంటి కౌఁగిటనే చిమ్మి రేఁచి
సందడినే నిన్ను నాపె జట్టిగొనెను
యిందె కూడితి శ్రీ వేంకటేశ యలమేల్మంగను
కందువాసి నద్దమవై కని బదుకవయ్యా

పె శృ రేకు: 03-3 దేసాళం సం: 17-014

పల్లవి: ఎప్పుడు నీవోజ లిఁక యేల మానేవు
తప్పు లెంచ నీకు నిట్టే దయ్య మిచ్చెఁగా

చ. 1: వెట్టి జాగరాలు నీతో వేగినంతాఁ జేసి చేసి
అట్టే పవ్వళించితే నపరాధమా
తిట్టేవు నీ వప్పటిని దీని కింత గర్వమని
బట్టబయలాడుకొని పాలఁ బోయఁగా

చ. 2: దవ్వుల నీతో నవ్వి తనిసి యిన్నిటా నాపె
అవ్వలిమోమైనదే యపరాధమా
రవ్వగాఁ బగ చాదేవు రాజము చూపె నని
నెవ్వగలు గడియించ నీవు దేవరవుగా

చ. 3: కాయజ కేలిని నీకత వెల్లాఁ గని కని
ఆయములు గరఁగితే నపరాధమా
యీయెడ శ్రీవేంకటేశ యింతి నిట్టే కూడితివి
చాయల మెచ్చులు మెచ్చ స్వామివే కావా

రేకు: 03-4 వరాళి సం: 17-015

పల్లవి: చాలురా నీపొందులు సటలకు వచ్చెనా
జాలువారేఁగన్నీళ్లు చక్కనీవుఁ జూడరా

చ. 1: నేను నీవుఁ గూచుండఁగా నిక్కి చూచి జగడించి
నీ నెలఁత యేమన్నా నీవంట గాదా
కానికాని వొట్లతో కదిసితి మిద్దరము
మోనాన నూరకుండితే మొత్తు మంట గాదా

చ. 2: హితవై సరసము నే నిటు నీతో నాడఁగా
సతి జంకించినది నీ సలిగ గాదా
పతిగా సాకిరిమాట పలుకు మంటే నవ్వేవు
మతకానఁ బగ దీర్చేమాయ నీది గాదా

చ. 3: యెకసక్కేనకు నాపై యీటి చూపు చూడఁగాను
మొకమోటాన నుంటే నీ ముద్దులే కాదా
వెకలివై యిద్దరి శ్రీవేంకటేశ కూడఁబట్టి
వొకటఁ గౌఁగిలించితి వొడఁబాటు గాదా

పె శృ రేకు: 03-5 ఆహిరి సం: 17-016

పల్లవి: అంతేపో మంచివాఁడ వౌదు వయ్యా
యింత నీ పంచెను బూతా లెఱుఁగవా అయ్యా

చ. 1: చిత్తజకేలికి నిన్నుఁ జేవట్టి తీసిన తప్పు
కత్తిగోరు దాఁకె నంటా గడించవయ్యా
బత్తితోఁ బానుపుమీఁదఁ బవళింపించిన తప్పు
హత్తి నే దొబ్బితి నంటా నాడుకొనవయ్యా

చ. 2: అంది పువ్వులు ముడిచి అంగము లంటిన తప్పు
ముందల వట్టితి నంటా మొరయవయ్యా
విందుగాఁ బొత్తునకు నే వేడుక రమ్మన్నతప్పు
చెంది నిన్ను నెంగిలి సేసితి ననుకోవయ్యా

చ. 3: బిగ్గెఁ గౌఁగిలించుకొని పెనఁగిన యాతప్పు
దిగ్గన నే గబ్బి నంటాఁ దిట్టవయ్యా
సిగ్గుదేరఁ గూడితిని శ్రీ వేంకటేశ్వర నిన్ను
యెగ్గొ తప్పో యిందుకు నేమైనాఁ జేయవయ్యా

పె శృ రేకు: 03-6 ఆహిరి సం: 17-017

పల్లవి: అంతే నీ వేమైనా నంటివి గాని
జంటయ్యై మీరుండఁగాను సరిఁ జూడరాదుగా

చ. 1: పోపో నీ వాపె నెంత పొడవు లెక్కించినాను
రాపుల నాపెకు మొక్కరాదుగా నాకు
కోపగించి నిన్ను నాపె గొణఁగి తిట్టె నంటా
యేపున నే వెఱవఁగ యింత పని లేదుగా

చ. 2: అవులే నీతో నాకె అలిగివుండిన దంటా
రవళిప్రియాలు చెప్పరాదుగా నాకు
జవదాఁట కాపెపంపు సారె నీవు సేసే వంటా
యివల నే నందులకు నిచ్చగించఁ జాలఁ గా

చ. 3: కాతరాన నాకె నీవు కదసి పెండ్లాడే వంటా
రాతిరెల్లా వేగించరాదుగా నాకు
యీతల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
తోతో నిన్నిఁక నేను దొమ్మి సేయరాదుగా

పె శృ రేకు: 04-1 శంకరాభరణం సం: 17-018

పల్లవి: అయినప్పు డయ్యీఁ గాని యిన్నిపనులును మీఁద
దయలేనివానితోడఁ దగవా నాకు

చ. 1: రెప్ప లెత్తి చూచితేనే రేసులు పుట్టె నీతో
తప్పు లెంచి కొసరఁగ తగవా నాకు
చప్పని వలపుతోడ చవిగానివేళ నిన్ను
తప్పని బాస లడుగఁ దగవా నాకు

చ. 2: భ్రమసి యెక్కడనో పరాకైవున్న నీపై
తమకించి చేయి చాఁచఁ దగవా నాకు
చెమటలమేనితోడ చిందువందయి రాఁగాను
తమల మడుగనైనఁ దగనా నాకు

చ. 3: సారె సారె నీవు నాతో సమ్మతి నాన వెట్టఁగా
తారుకాణకుఁ బిలువఁ దగవా నాకు
కూరిమి శ్రీ వేంకటేశ కూడితివి నన్ను నిట్టె
దార దప్పఁ బెనఁగఁగఁ దగవా నాకు

పె శృ రేకు: 04-2 బౌళి సం: 17-019

పల్లవి: మేలుగాని మేకులు నీ
వాలుఁజూపు లట్టె వంచేవు

చ. 1: చెంది ని న్నాతఁడు చెనకఁగా నేమె
కందువ లంటక కసరేవు
యిందులోనే కొన్ని యెమ్మెలా, వీడె
మంది యిమ్మనఁగానే అలసేవు

చ. 2: పేరుకొని నిన్నుఁ బిలువఁగా నవునే
కూరిమిఁ బలుకక కొంకేవు
నేరుచుకొంటివే నిట్లు పతి
గోర గీరితేనే గొణఁగేవు

చ. 3: నిండుఁగౌఁగిటనే నించఁగా చనుఁ
గొండల నొ త్తక గునిసేవు
అండనే శ్రీవేంకటాధీశుఁడు గూడి
మెండుకొనఁగానే మించేవు

పె శృ రేకు: 04-3 వరాళి సం: 17-020

పల్లవి: నెలఁకిఁబాసి వుండలేను నిమిషమెందు నేఁడు నాకు
తలఁపులో నీవలెనే రతుల తరుణిఁ గలయు టెన్నఁడే

చ. 1: ముదిత నాయెదుట నిలిచి మోసులువార నవ్వునవ్వి
కదలుఁజూపులఁ జూచి నాకు కన్ను లార్చు టెన్నఁడే
వదలుఁబయ్యద సవదరించి వలపుతేట చవులు చూపి
కొదలు మాటల ముద్దు గునిసి కూరిమి గొసరు టెన్నఁడే

చ. 2: చెలియ సిగ్గున మోము వంచి చెక్కునఁజేయి మాటు సేసి
మలసి వీడె మిచ్చి ఆకు మడిచి యిచ్చు టెన్నఁడే
వలుద చన్ను లురము మోప వాసన యూర్పు చల్లిచల్లి
కలయ మోవితేనె లొఁసగు కంచము పొత్తు లెన్నఁడే

చ. 3: యింతి నన్నుఁ జేరఁ బిలిచి యింటిలోని పరపు మీఁద
దొంతికళలు రేఁగ నంటి దొమ్మి సేయు టెన్నఁడే
వింత లేక యిపుడె శ్రీ వేంకటేశ్వరుఁడనైన
పొంతనున్న నన్నుఁ గూడ పొద్దు దెలియు టెన్నఁడే

పె శృ రేకు: 04-4 పాడి సం: 17-021

పల్లవి: ఈపెతోడి సాటికి నీ వేల పెనఁగేవు నేఁడు
మోపుదాఁకా గాజు గాజే మాణికెము వేరే

చ. 1: ఆఁటదిది గోపగించితే అంతా నంత వలుపే
తేటలు మగవానిని తేలిపొయ్యేవే
మేటి కస్తూరి నూరితే మిక్కిలిఁ బరిమళించు
గాటానఁబువ్వులు పిసుకఁగఁ బసురయ్యేదే

చ. 2: అంగనలు దిట్టితేను ఆయములు గరఁగేవే
కంగి మగవానితిట్టు గాలిఁ బొయ్యేదే
బంగారు గరఁగితేను పైపై వన్నె యెక్కేదే
వంగుచు నిత్తడి కాఁక నన్నె దీసేదే

చ. 3: మగువ లలిగితేను మచ్చికల కెక్కేవే
మగవానియలుక కమ్మటి లోఁగేదే
జిగి నలమేల్మంగను శ్రీ వేంకటేశ కూడితి
తగినవెన్నెలయుఁ జందమామయు నొకటే

పె శృ రేకు: 04-5 ఆహిరి సం: 17-022

పల్లవి: అయ్యో మంచితగవరు లౌదురే మీరు
దయ్యమునైనా దూరఁ దగదా నాకు

చ. 1: తలఁచినప్పుడు రాక తడసి వున్నందుకు
తలవంచుకొననైనాఁ దగదా నాకు
చలివాసి యాపెఁ దాను సంగడినున్నందుకు
తలుపుమాటునకుఁ బోఁ దగదా నాకు

చ. 2: చిప్పిలి తానెక్కడో పెంజెమటతో నుండఁగాను
తప్పక చూడనైనాఁ దగదా నాకు
ముప్పిరిఁ గాఁగినచేత ముట్ట నన్ను రాఁగాను
తప్పించుకోనైనాను తగదా నాకు

చ. 3: వుమ్మగిలికాని మాట లొండొకటి యాడఁగా
తమ్ముల ముమియ లేవఁ దగదా నాకు
కమ్మర శ్రీ వేంకటాద్రి ఘనుఁ డిట్టె నన్నుఁ గూడె
తమ్మిమోము విచ్చి నవ్వఁ దగదా నాకు

రేకు: 0004-6 శంకరాభరణం సం: 17-023

పల్లవి: అంటుముట్టుకు నే నోప నంతే కాని
యింటింటఁ దనకే యివి యితవవుఁ గాని

చ. 1: పుక్కిటితమ్ముల మటుపో నుమిసి రమ్మనవే
యెక్కడిదో వీడెము నే నిచ్చేఁ గాని
అక్కడ నేడవో పుద్దా ల టూడిచి రమ్మనవే
గక్కునఁ బాదాలు నేఁ గడిగేఁ గాని

చ. 2: అవలఁ జెంగావిరెంటె మటు వెట్టి రమ్మనవే
యీవిగాఁ బచ్చడము నే నిచ్చేఁగాని
పూవులు తురుము లెల్లాఁ బో దులిపి రమ్మనవే
యీవలఁ గమ్మని జాజు లిచ్చేఁ గాని

చ. 3: తోఁగుఁ జెమ టెక్కడిదో తుడుచుకో రమ్మనవే
కౌఁగిటఁ గమ్మర నేనే కమ్మించేఁ గాని
వీఁగక శ్రీ వేంకటాద్రివిభుఁడిట్టే నన్నుఁ గూడె
పొఁగిన తమకమునఁ బదరకు మనవే

పె శృ రేకు: 05-1 ముఖారి సం: 17-024

పల్లవి: ఆతని నన్ను నన్నటే యనరాదా
తోతో వలపక్షము దోము గాదా

చ. 1: ఉప్పటించి యాతఁడు నన్నొకటొకటె యాడఁగా
అప్పటి నన్నే కోపించే వవునే నీవు
రెప్పుచూపుల వాఁడే రేసులు పుట్టించఁగాను
చెప్పేవు నాకే బుద్ధి చెల్లునా నీకు

చ. 2: చలము సాదించి వాఁడే చెంతకు వచ్చి యుండఁగా
తలవంచుకొమ్మనేవు తగునేనీవు
మలసి నవ్వులు నవ్వి మన నుడికించఁగాను
కలయు మనేవు నన్ను కటకటా నీవు

చ. 3: వింతవానలతోడ వీఁడె వద్దఁ గూచుండఁగా
యెంతయినా నలుగనీవు యేమే నీవు
వంతపు శ్రీవేంకటాద్రిపతి నన్నుఁ గూడ గాను
కొంత వెఱఁ గంద నీవు గొణఁగ నేలే నీకు

పె శృ రేకు: 05-2 సామంతం సం: 17-025

పల్లవి: ఏమి సేతు నాతనికే యెదవెట్టుకొనఁ బట్టె
నామేనివెద గాదు నన్ను నే నేమందునే

చ. 1: కన్నీరు వెట్ట వెఱతు కాంతునిఁ బాసినందుకు
నన్నిటానాతని దూరే రందరు నంటా
చిన్నఁ బోయి వుండఁ జాల చెలు లాకోపానఁబోయి
తిన్ననిమాటల వాదు దీశే రంటాను

చ. 2: నిట్టూర్పు నించ వెఱతు నేఁ డాతఁడు రా నందుకు
దట్టమైన వుసు రట్టె తాఁకె నంటా
వెట్టఁ బొరలఁగఁ జాల వేఁడె నా మే నాతఁడు
ముట్టి చూచితే కాఁక ముంచునో యంటాను

చ. 3: మొత్తానఁ బానుపుమీఁదమూలఁ బండఁగ వెఱతు
చిత్తమునొచ్చి పతికి సిగ్గానో యంటా
ఇత్తల శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
కొత్తలు సేయ వెఱతు కొంకువో యంటాను

పె శృ రేకు: 05-3 బౌళి సం: 17-026

పల్లవి: నిక్కము గల్లతోడ నిజ మోవ దన్నమాట
యిక్కడనే చెల్లఁ బెట్టె నిఁక నేఁటికే

చ. 1: తననోరే ఘనమే తగవరిఁ దానే
అనువుగా నన్ను మాటలాడ నీఁడే
అనక తొలుతే మీతో నాన లెన్నియైనాఁ బెట్టి
కినిసి నే నితనితో గెలువఁగఁ గలనా

చ. 2: జగడగాఁడూఁ దానే సాకిరిమానిసీఁ దానే
పగటున నే నాతని ప్రతివాదినా
మగువలాల మీవద్ద మంచి వాఁడై యున్నాఁడు
బిగిసి నే నితనితో పెనఁగఁ గలనా

చ. 3: సేసినచేఁతాఁ దనదే చెల్లుబడీఁ దనదే
దోసము నా కోప మిఁక తుద కెక్కేనా
ఆసల శ్రీవేంకటేశుఁ డంకెల నన్నుఁ గూడె
వేసాల నితని వోజ విడిపించఁ గలనా

పె శృ రేకు: 05-4 మంగళ కౌశిక సం: 17-027

పల్లవి: మొక్కే లేవయ్యి నీ వేల ముసుఁగు వెట్టుకొంటివి
చిక్కించి యాపెనంటేను చింత గాదా నీకును

చ. 1: యెంత కెంత చూడవో నే నెదురాడ వచ్చునా
జంతలైన నీ మోహపు సతుల తోడ
పంతాన వారు వరచే పాట్లనే పడే నీకు
సంతోసము సేయనైతి చాలు నాదే నేరమి

చ. 2: అయ్యయ్యా పాపము గాక ఆదరించ వచ్చునా
గయ్యాళిని వూడిగాకాంతల నెందు
చెయ్యార నోరిచి వారిచేత మాటఁ బడే నిన్ను
నెయ్యాన నవ్వించ నైతి నీ వలుగ వలదా

చ. 3: చెల్లఁ బో నీవు గూడఁగా చేరి దూర వచ్చునా
కల్ల రులయిన నీ భోగపు టింతులా
మిల్లనే యా ముసుఁగు నామీఁదఁ వేసి కూడితివి
యెల్లగా శ్రీవేంకటేశ యిది యెఱుఁగనైతి

రేకు: 0005-5 నాదరామక్రియ సం: 17-028

పల్లవి: అయ్యో యింకా నేలే అన్నియుఁగాన వచ్చెను
నెయ్యములేనిచోట నేరుపులు గలవా

చ. 1: వలపుగలుగుచోట వడిఁ గొసరుట గాక
చలము సాదించుచోట సలి గేఁటికే
పిలువనంపినచోట బిగియవచ్చుఁ గాక
వలసి నొల్లనిచోట వాసు లెంచ నేఁటికే

చ. 2: యేకతమై వున్నచోట నేమన్నానమరుఁ గాక
సాకిరివెట్టేటిచోట సాదించ నేలే
రాకపోకగలచోట రతి సమకూడుఁ గాక
కూకులు వత్తులు నైతే కూటములు గలవా

చ. 3: మొగమోడేవానితోడ ముచ్చటాడవచ్చుఁ గాక
తెగనాడేవానితోటి తెరు వేఁటికే
అగపడి శ్రీవేంకటాధిపతి నన్నుఁ గూడె
తగులాయ సారె సారె తప్పులెంచ నేఁటికే

రేకు: 0005-6 సామంతం సం: 17-029

పల్లవి: పెనఁగకురే మీ రింత ప్రియునితోఁ బలుమారు
తనకు నిచ్చయినవేళ తలఁపు గలిగీని

చ. 1: వలచి యలిగిన యలుక వడిఁ దేర్చవచ్చుఁ గాక
వొలసి నొల్లని యలుక లొకరి వశమా
మెలఁగి నిద్రించు విభుని మేలుకొలపవచ్చుఁ గాక
తెలసి వుండిన నిదుర తెగి లేపవశమా

చ. 2: చనవుగలిగినమాట చవిసేయవచ్చుఁ గాక
మనసు లెనయనిచోట మరుప వశమా
వినరే యాఁకటిపతికి విందు చెప్పవచ్చుఁ గాక
తనిసివుండినయపుడు తమ రేఁచ వశమా

చ. 3: పాయరాని చుట్టరికము పట్టి పెనఁగవచ్చుఁ గాక
కాయకపు వావులకుఁ గలయ వశమా
యీాయెడల శ్రీవేంకటేశుఁ డిటు ననుఁ గూడె
చాయలనాతనిమేలు జవకట్ట వశమా

పె శృ రేకు: 06-1 ముఖారి సం: 17-030

పల్లవి: కాంతునిఁ దప్పక చూచి కన్నులెల్లా యఱ్ఱనాయ
యెంతయినా మానదు కాఁక యిఁక నేమి సేతునే

చ. 1: తా నిందాఁకా రానెందుకు దగ్గరి నే వాదు సేసి
వూని యంత దిట్టినాను పోదు గోపము
ఆనవెట్టి రమణునియంగము పచ్చిసేసినా
మానదు నా చల మిఁక మఱి యేమి సేతునే

చ. 2: సారె బొంకినందుకు సంగడివా రెల్లాఁ జూడ
చేరి పాదానఁ జిమ్మినా చింత వాయదు
కూరిమి నాపతి నిట్టె కుచములఁ గుమ్మినాను
తీరదు నా నెంజెరిలి దీని కేమి సేతునే

చ. 3: ఆకడఁ దాఁ బరాకైనయందుకు నెగడవెట్టి
వాకిటఁ దన్ను నాఁగినా వగపు పోదు
కైకొని శ్రీవేంకటాద్రికడపరాయఁడు గూడె
వాకున నాడక మానవదె నేమి సేతునే

పె శృ రేకు: 06-2 పాడి సం: 17-031

పల్లవి: ఆఁడువారు కడుఁ గోపు లవుట నీ వెఱుఁగవా
నేఁడు గొత్తలుగా బూమి నేర్చుక వచ్చేరా

చ. 1: వలచినఁడువారు వాదులాటకు వచ్చిన
చలము సాదించువాఁడు జాణఁడా వాఁడు
కలయ నీరాకతోడ కమ్మటి నీలిగి పోఁగా
పిలిచి మాటాడకున్న ప్రియుడా వాఁడు

చ. 2: చనవు గలుగువారు సణఁగులఁ దిట్టఁ గాను
కనలి యెగ్గువట్టితే ఘనుఁడా వాఁడు
గునిసి సవతులపై కోపాన పతి నంటేను
విని నవ్వకుండేవాఁడు విభుఁడా వాఁడు

చ. 3: పాయరానియట్టివారు బలుములు చూసితేను
నాయాలఁ బెట్టెడివాఁడు నాథుఁడా వాఁడు
యీాయెడ శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
చాయకు రాకుండువాఁడు సరసుఁడా వాఁడు

పె శృ రేకు: 06-3 పాడి సం: 17-032

పల్లవి: మగువలాలా సందిమాట లేలే యింకా
తగిలేయట్టి మేలు తడవూ గాదే

చ. 1: మనసు మనసుఁ గూడె మచ్చికయితేఁ జాలు
తనువుఁ దనువుఁ దానె తగుల మౌనె
చనవు విచ్చి తామే జాణ లైతేఁ జాలు
పొనుఁగ నిండు మరుఁడు పూటకాఁపే

చ. 2: పెలువూ నిలుపూఁ దమకే ప్రియములైతేఁ జాలు
చలిమి బలిమీ నట్టే సతము లౌనే
అలుకలేనికూట మమరి వుంటేఁ జాలు
తలిరువంటి వయసు తరవుకాఁడే

చ. 3: అదనూఁ బదనూ నెటికేఁగి అండ నుంటేఁ జాలు
చదురుఁ బదురు నొక్క సమ్మ తౌనే
కదిసి కూడె శ్రీవేంకటవిభుఁడూఁనన్ను
చెదరెకుండే యాస సేసపాలే

పె శృ రేకు: 06-4 రామక్రియ సం: 17-033

పల్లవి: ఇతవుసేసినవారి కిది వాటా యమ్మలాల
కతలు చెప్పఁగఁ బోతే కాఁక రేఁగీ నితఁడు

చ. 1: కడు దప్పిదేరఁగాను కప్పుర మియ్యఁగఁ బోతే
వుడికి తిట్టఁగవచ్చీ నో యమ్మవీఁడు
వడియుఁ జెమట తుడువఁగఁబోతే పయ్యదను
తడిపాఁత మెడ గొంత తలమనీ నితఁడు

చ. 2: కురులు చెదరినవి కూడఁ జెరుగఁగఁ బోతే
విరసాల విదలించివేసీనే వీఁడు
సరుగఁ గస్తూరిబొట్టు చక్కతిద్దఁ బోతేను
వురిసీ నందుకుఁ దో డుప్పని నితఁడు

చ. 3: సిగ్గుతో విజనగరసింగారవనములోన
వెగ్గళించి కొనేటి శ్రీవేంకటేశుఁడు
నిగ్గుల నన్నుఁ గూడఁగా నిజాన మెచ్చఁగఁ బోతే
వొగ్గి మాటలబెల్లాల కొడిగట్టీ నితఁడు

పె శృ రేకు: 06-5 ఆహిరి సం: 17-034

పల్లవి: వద్దికి నేనిట్టే రావలె నంటాను
కొద్దిమీర యెమ్మెలకే కొలవాయ నితఁడు

చ. 1: వొల్లనే వాకిట నన్ను వొరసుకొంటాఁబోయి
యిల్లు చొచ్చి పవళించీ నెంతచనవే
పల్ల దాననాకప్రపుబరణి దీసి చెలుల
నెల్లాఁ బిలిచి పెట్టీ యెమ్మెలకే యితఁడు

చ. 2: బెట్టి మాటలాడుమంటా పెంపుడు నా గోరవంకఁ
గొట్టఁ బోయీ బోఁదెకోలఁ గుచ్చితానను
అట్టె అదియునుఁ గాక ఆకు చుట్టి యిచ్చేచెలి
వొట్టు వెట్టి పిలిచీని పూరకే తా నితఁడు

చ. 3: కాఁకలు నిలుపలేక కడపమీఁదికివచ్చి
చేకట లెస్సాయ నంటాఁజేయివట్టీని
సోఁకఁగ శ్రీవేంకటేశుఁ జూచి నే నే కలసితి
మాఁకుపడి కమ్మటిని మంచమెక్కీ నితఁడు

పె శృ రేకు: 06-6 నాదరామక్రియ సం: 17-035

పల్లవి: నీ వేమి సేతువే ని న్నింత సేసె నతఁడు
రావిఁ జూచెదో బొమ్మరాకాశిఁ జూతురో

చ. 1: చెప్పుకువే ని న్నాతఁడు చేరి పెద్ద సేయఁగాను
వుప్పుగప్పురము లాయ నో యమ్మ
ముప్పిరి నేమి చూచేవే ముందరిచెవులకంటే
గొప్పలై వెనకవచ్చే కొమ్ములు వాఁడాయనే

చ. 2: నగకువే నీ కతఁడు నంటునఁ జన వియ్యఁగా
చిగురున కెక్కెఁ జాగ చెల్లు నమ్మా
తగుఁ దగ దన నేల దాని కేమి పైఁడితో
జగములో గురిగింజ సరిఁ దూఁగెఁ గదవే

చ. 3: నిలువు రాజస మేలే ని న్నాతఁడు గూడఁగాను
కలి దచ్చ వెన్నాయఁ గదవమ్మా
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గలసె
మలసి మయిలవోయి మణుఁగాయఁ గదవే

రేకు: 0007-1 హిజ్జజి సం: 17-036

పల్లవి: లేవే యెంత లేదు యీా లేఁతమాయలు
వావు లేల చెప్పవచ్చీ వద్దు వద్దు యింకను

చ. 1: మానిని వానితో మాటలాడే వప్పటిని
పూని నిన్న వచ్చెనా పో పో తాను
తానే పనికి వచ్చీ తలవాకిట మొక్కవే
ఆన లెన్ని వెట్టుకొన్నా నవి నేఁడు నిజమా

చ. 2: పిలిచి వానికే పీఁట వెట్టే వప్పటిని
సొలసి వాఁ డున్నజాడచూడవా నీవు
నిలిచి పోకుండితేనే నీ కేల దయ వుట్టీనే
కులసాజమే వానికి గామిడితనములు

చ. 3: అట్టే వాఁడు చెనక నడ్డమురా వప్పటిని
గుట్టున నేఁ డింతలోనే కూడెఁగా తాను
యిట్టే శ్రీవేంకటేశు నిందుల కింక మెచ్చవే
శుట్టినచలము చెల్ల పైకొనెఁగా నన్నును

రేకు: 0007-2 శ్రీరాగం సం: 17-037

పల్లవి: తన కౌను నా కౌను తగులు దాఁకాఁ బోదు
యినుమడించెను వల పేమి చెప్పరే

చ. 1: మనసులో కాంతాళము మాటలాడక పోదు
తనువుమీఁదటికాఁక దగ్గరక పోదు
మునుకొన్న కన్నులాస మోము చూడక పోదు
యెనలేని యడమాట లేమి చెప్పరే

చ. 2: పెదవులపై తీఁట పిలుచుదాఁకాఁ బోదు
కొదలు బీరము గోరికొనఁగాని పోదు
గుదికొన్న తమకము కూడినదాఁకాఁ బోదు
యెదు రైతి మింక బుద్దు లేమి చెప్పరే

చ. 3: వేడుక సెలవినవ్వు వెల్లివిరి గాక పోదు
మేడెవు రతులమేలు మెచ్చక పోదు
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గలసె
యేడలేని వినయాలు యేమి చెప్పరే

పె శృ రేకు: 07-3 పాడి సం: 17-038

పల్లవి: చవిగాని పనులకు చాయ సేసుకొంటే మేలు
తివిరి వో రమణుఁడ తెలుసుకో నీవే

చ. 1: కూరిమి గొసరుకంటే గట్టున నుండుటే మేలు
చేరి వేరేయొకకాంతఁ గోరేవానితో
యీరసానఁ దిట్టుకంటే యిచ్చక మాడుటే మేలు
నీరువంక తుంగవంటి నిను బోఁటితోను

చ. 2: పట్టి పెనఁగుటకంటే పరాకు సేయుటే మేలు
కట్టకడ కెందో పొయ్యేఘనునితోడ
దిట్టయై పెనఁగుకంటె దీమసాన నుంటే మేలు
పట్టరాని మొయిలువంటి బలిమి తోను

చ. 3: కొఁగిటఁ బెనఁగుకంటే కన్నుల మొక్కుటే మేలు
రాగి యేమో తలపోయు రమణునితో
యేగి వచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చేగలో చిగురువంటి సిగ్గరి నీతోను

రేకు: 07-4 వరాళి సం: 17-039

పల్లవి: ఏమి నెఱుఁగని నన్ను నింత సేసీనే వీఁడు
సాములు నేరిపె నంటా చవులు వుట్టించీనే

చ. 1: గందము వూసే నంటా కపురమిచ్చే నంటా
కందువ లంటి మనలు గరగించీనే
పందెము వేసే నంటా పాపట దువ్వే నంటా
చిందరవందర చేసి సిగ్గు విడిపించీనే

చ. 2: సంగడిఁ గూచుండే నంటా సరులు దిద్దే నంటా
చెంగటనే వలపులు చిమ్మి రేఁచీనే
సంగాతము నేర్తు నంటా జవ్వనపుదాన నంటా
నంగవించి పొగడి న న్నాసలఁ బెట్టీనే

చ. 3: యేకత మాడే నంటా యిందరినీ యంపు మంటా
పైకొని న న్నిటు గూడి భమ్రయించీనే
ఆకు చుట్టి యిచ్చే నంటా అందల మెక్కించే నంటా
యీకడ శ్రీవేంకటేశుఁ డిల్లాలిఁ జేసీనే

పె శృ రేకు: 07-5 రీతిగౌళ సం: 17-040

పల్లవి: తానే యెఱుఁగును రమణుఁడు తన కెదు రాడేనా
నానెనుఁ జెమటలఁ బులకలు నటనకుఁ బనిలేదే

చ. 1: కోపమూ కనుల నున్నది కూరిమి మదిలో నున్నది
యేపునఁ బతి కింక నుత్తర మేమని చెప్పుదునే
తీపులు మాటల నున్నవి తెగువలు కాఁకల నున్నవి
రాపుగఁ బతివద్దికి నే రాకుండుట మేలే

చ. 2: జంకెల బొమ్మల నున్నవి చనవులు మొక్కుల నున్నవి
బింకముతోఁ బేర్కొని తనుఁ బిలువఁగఁ జో టేదే
మంకులు వొట్టుల నున్నవి మర్మము పైపై నున్నది
యింకా బుద్ధులు మి రిఁక నేమని చెప్పేరే

చ. 3: వలపులూ కౌఁగిట నున్నవి వాసులు సిగ్గుల నున్నవి
తల దడిసెను చలి వాసెను తా నేమనఁ గలఁడే
వలె నని శ్రీవేంకటపతి వడదేరిచి ననుఁ గూడెను
నిలువున ముంచెను మరపులు నేరములెంచకురే

పె శృ రేకు: 07-6 సామంతం సం: 17-041

పల్లవి: ఎదురైనమాత్రమున యెన్ని గడించుకొనీనే
యిదె మారుమాట నీతో నేమని నే నందునే

చ. 1: కాంత మగవానెదుట కనురెప్ప వేసినాను
చెంతల నదినో సన్నసేసే నందురు
అంతఁ దప్పక చూచితే నాసపడే నందురు
చింతతోనూరకుండితే చిమ్మిరేఁగె నందురు

చ. 2: ముంచి చెలితోఁ జెలిముచ్చట లాడితేను
కొంచక తమ్మునే ఆడుకొనీ నందురు
చంచున నూరకుండితే సమ్మతించె నందురు
వంచినచే యెత్తితేను వచ్చే ననే నందురు

చ. 3: మగువ వేరొకకసతి మాటున నిలిచితేను
జిగిఁదొల్లిటి పొందులసిగ్గు లందురు
అగడై శ్రీవేంకటేశఁ డందులకే నన్నుఁ గూడె
నగుతా ముసుఁ గిడితే ననుపుది యందురు

పె శృ రేకు: 08-1 శ్రీరాగం సం: 17-042

పల్లవి: ఇంత నేరకుండిన నదేఁటి యింతి
వింతచెలులనెరపు విడిపించే దింతి

చ. 1: తనిసిన మగవాని తమిరేఁ చినదే యింతి
కొనగోరిసోఁకు లియ్యకొనఁ జేసినదే యింతి
కనుమూయించి నిద్దురకలలోఁ గూడిన దింతి
తననేరుపుపిమ్మటఁ దలఁపించే దింతి

చ. 2: కూడి తెల్లవారుటకు గుండె బెదరించే దింతి
ఆడఁ జేయరాని వినయాలు సేయించే దింతి
వాడుమోముతనుఁ గంటివడిఁగళ రేఁచే దింతి
జోడువాసినఁ గన్నీరు జొబ్బిలించే దింతి

చ. 3: వన్నెప్రాయము తనకే వ్రతము పట్టించే దింతి
యెన్నికె నిక్కువనుండి యెదురు చూపించే దింతి
యిన్నిటా శ్రీవేంకటేశు నిట్లానే చేసి కూడె
నెన్నఁగ నలమేల్మంగ యీకెపో యింతి

పె శృ రేకు: 08-2 కొండమలహరి సం: 17-043

పల్లవి: ఆతఁ డంపిననే గాక నందాఁకాఁబదర నేల
నీతి గాదు మొదలనే నీకుఁ గోప మేటికీ

చ. 1: మొక్కితే నేమాయనే మోహపుఁ బతికీవేళ
మొక్కిన చేయిగోరిమీఁద ముక్క పోయీనా
నిక్కి ప్రియముచెప్పితే నేఁటిలో నేమాయనే
దిక్కన కప్రపునోరఁ దినరాదా కారము

చ. 2: కన్నుల నవ్వితే నేమే కపటాలు గంటేను ఆ
కన్నులచే కాఁక చల్లఁ గా దనేరా
సన్నల మెచ్చితే నేమే సరవి దప్పినవేళ
సన్నసేసినపతిని జంకించరాదా

చ. 3: కౌఁగిట నించితే నేమే గర్వము చూపినవేళ
కౌఁగిటి రతులలోనే కరఁచ రాదా
పాఁగిన శ్రీవేంకటాద్రిపతి నన్ను నిట్టే కూడె
వీఁగ నలమేల్మంగను వెఱగంద రాదా

పె శృ రేకు: 08-3 దేసాళం సం: 17-044

పల్లవి: ఏలే తనకు నాకు నేటిమాటలే నన్ను
దేలించి యెడమాటాడేతెరవతోడఁ గాకా

చ. 1: లేవే నేఁ బిలిచితే లెక్క సేసీనా తాను
సావివోయి వుమినాకి చవుతమా యింక
వావాతఁ దాను నేను వాదించితే నవ్వరా
వేవేలునాయఁ బోయ వెనకకే పనుల

చ. 2: ఔనే తనకూ నాకు నంతపొందా తిట్టీని
మానిపండ్లు రాలితేను మానికిందనే
తా నొకటీ నే నొకటీ తలపోఁతలా యింక
నానాఁటిమోహము లెల్లా నాముపేసీఁ గాకా

చ. 3: వద్దే నాతో నింక వట్టి వట్టి సరసము
అద్దో ముంజేతికంకణాన కద్దమా యింక
గద్దించి శ్రీవేంకటాద్రికడపరాయఁడు గూడె
పొద్దు వొద్దు వింతలును భోగములే కాకా

పె శృ రేకు: 08-4 కొండమలహరి సం: 17-045

పల్లవి: కంటిమి నీగుణమెల్లా కానీలేరా నిన్ను
నంటుకోనిచ్చినదాని కది వద్దలా

చ. 1: యెక్కడెక్కడో కోప మెవ్వరిమీఁదనో వేసి
యిక్కువ లంటితే నన్ను యీసడించేవు
గుక్కుచు కూడు వేఁడెయితే కూరపై చేఁ చాచినట్టు
మక్కళింపువెడమాయ మామీఁదనో వోరి

చ. 2: మనసులోపలిచింత మాటలలోనఁ బొదిగీ
చెనకితే నామీఁద చిమ్మి రేఁగేవు
గొనకొన్నజవ్వనము కుచములై వెళ్ళినట్లు
మని మని నేరుపు మామీఁదనా వోరి

చ. 3: కాయముమీఁదటికాఁక కనుఁగొనల కెక్కించి
చాయల నేఁ గూడఁ గానే చల్ల నయ్యేవు
పాయపు శ్రీవేంకటేశ పరుసము సోఁకినట్టు
మాయని నీ మహిమలు మామీఁదనా వోరి

పె శృ రేకు: 08-5 హిజ్జిజి సం: 17-046

పల్లవి: అంటె తా ననేఁ గాక అవునే తాను
దంటయై తనగుణాలు తడవితినా

చ. 1: చెప్పనీవే నావంక సేసినకల్ల లేమయినా
నిప్పంటే నోరు వొక్కనేరదు గదే
తప్పు గాదు దాని కేమి తనమీఁదనేఁ దొలుత
నెప్పున నలిగీ నదీ నిజమా యడుగరే

చ. 2: యిదినో తనతగవే యిందరితోఁ జెప్ప వచ్చి
యెదురులేనిమాట కదురు గదే
వొదిగి యూరకుండితే వొకటొకటే రేఁచి
తుద నావంటిసతులు దొరకేరు తనకు

చ. 3: సారె సారె తానే నాతో సరసములాడఁగాను
గోర గీరినవి యెల్లా యేరు లాయనే
మేరతో శ్రీవేంకటాద్రిమేటి నన్ను నిదె కూడె
తారుకాణ లైనవి తానే యెఱుఁగునే

రేకు: 0008-6 శ్రీరాగం సం: 17-047

పల్లవి: హరి యెమనెనే హరి యేమనెనే అలిగెనో
విరహినై నే వేగించఁగా వేగించఁగా యాల రాఁడాయ యాల రాఁడాయ

చ. 1: మఱచీ తప్పీ తను మాటాడితినా
యెఱుకగలవిభుఁడు యేమనెనే
తెలువలే వచ్చిరి తెరలుచుఁ దా రాఁడు
యెఱిగితిఁ దనకత లేమనెనే

చ. 2: వాకిటి కిందాఁక వచ్చి తిరిగె నట
యేకారణ మిదీ యేమనెనే
రాకలఁబోకల రాతి రాయ నిదే
యీకడ తుదమా టేమనెనే

చ. 3: తలఁపులో ప్రియము తానే యెఱుఁగును
యెలుగెత్తి యొకమాటు యేమనెనే
బలిమి శ్రీవేంకటపతి దా విచ్చేసి
యిల ననుఁగూడెను యేమనెనే

పె శృ రేకు: 09-1 శ్రీరాగం సం: 17-048

పల్లవి: వచ్చేనని రాకుందురా యేమే నీవు
అచ్చల మేమి గల్లాను అప్పుడే యాడరాదా

చ. 1: యీడనుండే యింత సేతురా పూవుటింతి
వాడఁబెట్టి ముడిచితే వాసన గద్దా
వేడుకలు వెతసేతురా పతి
నాడ నెదురు చూపించినది పెద్దరికమా

చ. 2: ఆసలనే యలయింతురా గాలి దెచ్చి
మూసిపట్టి తెరచితే మూల నుండునా
పాసి కూడి పగ లౌదురా యేమే యిఁక
వేసాలు మాని యాడకే విచ్చేయఁగదవే

చ. 3: డగ్గరియుఁ దల వంతురా యీ నీరు
బుగ్గవంటిపాయ మిది పొల్లు సేతురా
కగ్గి శ్రీవేంకటవిభుఁడు నిన్నుఁగూడె
యెగ్గులెల్లా మఱచితి వెడమాట లేఁటికే

పె శృ రేకు: 09-2 పాడి సం: 17-049

పల్లవి: లోకులు మెచ్చవలసి లోఁగితిఁగాని ఆతఁ
డేకడ నీపతి యౌాట యెఱుఁగమే నేము

చ. 1: కోప మేలే తాప మేలే కొమ్మ నీకు నతఁడు న
న్నేపున యేమే యంటి యేమంటినే
పోపో చిల్లో యంటెపొల్లో యనేవు నీవు
యీపాటిదానవౌట యెఱుఁగమే నేము

చ. 2: మాట లేలే మూట లేలే మగువ యాతఁడునిను
యేటికో పిలిచితే నే నియ్యకొంటిని
గాటమున కయ్యి మంటే కాలు దవ్వే వింతకుఁగా
యేటమోట్టే నీ వుండే దెఱుఁగమేనేము

చ. 3: సన్న లేలే చాయ లేలే సతి శ్రీవేంకటపతి
వున్నతిఁగూడఁగనే వొద్ది కైతినే
యెన్నికె నాతఁడు నీవు నే మౌదురో తొల్లి
యిన్నేసి వెడమాయ లెఱుఁగమే నేము

పె శృ రేకు: 09-3 నాదరామక్రియ సం: 17-050

పల్లవి: ఇంతిరో నీ కేల చింత యింతలో పనికిఁగా
వింతగా మరేమనినా వినఁబొయ్యేరా

చ. 1: పచ్చిగా వలచినట్టి పతికినీ సతికిని
విచ్చనవిళ్ళే కాక వెఱ పున్నదా
యెచ్చుకుందులైన బుద్ధు లెవ్వ రెంత చెప్పినాను
మచ్చరమ్మై తోఁచుఁ గాకఁమానఁ బొయ్యేరా

చ. 2: జవ్వనభారముచేత జడిసేటి విరహులు
యివ్వల నెగ్గులు సిగ్గు లెఱుఁగుదురా
రవ్వలుగా నింటివారు రాయ డెంత చేసినాను
మవ్వపు తెగుమో కాక మానఁబొయ్యేరా

చ. 3: యెక్కువ శ్రీవేంకటేశుఁడెవ్వరిఁ జేపట్టి నాను
గక్కన మన్నించుఁ గాక కడ మయ్యీనా
నిక్కి నీకడకు వచ్చి నిన్నుఁగరఁగించి కూడె
చక్కని మీరిద్దరిలో జవదాఁటేరా

రేకు: 09-4 ముఖారి సం: 17-051

పల్లవి: వాకిట రమణుఁ డేవచ్చి యున్నాఁడు
జోకలెల్లా వారు వారే చూచుకొనే రిఁకను

చ. 1: ఆలిగి లోని కేఁగియట్టె గడెవెట్టు కొని
పలుకదు పిలిచినా పతితోను
తలుపు దెరవరే దండనున్న వూడిగపు
చెలులాల మన కేల చెల్లదు నిష్ఠూరము

చ. 2: తిద్దరానిజగడాన తెఅవ మేడపై నెక్కె
మిద్దెమీఁదికిఁదీయించె మె ట్లెల్లాను
వొద్దు నిచ్చెను వేయరే వూడిగపుచెలులము
యిద్దరికి సమమే యేఁటికి నిష్ఠూరము

చ. 3: ఆడకే శ్రీవేంకటేశుఁ డానలెట్టి రప్పించి
కూడె నీ సతిని మన కొరత లేల
వూడిగపు చెలులము వొకరొక రేమనినా
యీడకు నిచ్చలాడరే యేఁటికి నిష్ఠూరము

పె శృ రేకు: 09-5 పాడి సం: 17-052

పల్లవి: వెడ్డువెట్టి కంత నీవు వెఱితు నేను
యెడ్డనా నేమయినా యింతలోనిపనికి

చ. 1: రమ్మనవే చెలియా రమణుని నీడకే
యిమ్ములనే నాడ కేల యెవ్వ రుందురో
నెమ్మదిఁ జన్నులు రాసి నీవు నేనుఁ బెనఁగఁగా
అమ్మరో నన్నుఁదియ్యకు ఆడనున్నాఁ డతఁడు

చ. 2: అదన నేమాటయినా నాడు మనవే తానే
యెదురుమాట నా కేల యే మందునో
పెదవుల తీఁటె పో పిలువఁగఁ బిలువఁగ
అదివో నాతోఁ జెప్పకు మంతేసి కే నోపను

చ. 3: మొక్కకు మనవే తాను మొదలనే నన్నుఁ గూడె
యెక్కుడు నేనే మొక్కే యేపనికైనా
అక్కరో శ్రీవేంకటేశుఁ డరచేతిమాణికము
యిక్కువలు గరఁగించే వింతే పో మాటా

రేకు: 09-6 వరాళి సం: 17-053

పల్లవి: రారాదా యింకనైనా రవ్వలు మేలా
ఆరితేరి యడమాట లాఱడి మేలా

చ. 1: వేఁటే యలిగి యొకచో వేగించినాఁ గొంత కాక
తఁటి దవ్వులనుండే తుందుడుకు మేలా
తేటిచూచి వొండొరుల తిట్లయినాఁ గొంత కాక
మాఱుమోములై వుండేటి మంకులు మేలా

చ. 2: కదిసి మచ్చరములకాఁకలైనాఁ గొంత గాక
యెదురుచూచే యాసల యేఁపులు మేలా
కొదలుచుఁ గనుకలిఁ గొసరినాఁ గొంత గాక
యెదలోన గుబ్బతిలే యీసులు మేలా

చ. 3: కొంతపుచేకత్తి గోరి కుమ్మెలయినాఁ గొంత గాక
చెంతలఁ జేరకుండేటిసిగ్గులు మేలా
ఇంతలో శ్రీవేంకటేశ యీ కూటమె మేలు గాక
చింతతోఁ బానుపుమీఁదివేరులు మేలా

పె శృ రేకు: 10-1 సాళంగం సం: 17-054

పల్లవి: మచ్చి కెఱుఁగుదుఁగాని మన సెఱుఁగ, నన్ను
మెచ్చు టెఱుఁగుదుఁ గాని మీఁదేమీనెఱుఁగా

చ. 1: కామించి పతిరూపే కను టెఱుఁగుదుఁ గాని
ఆమీఁదటిపను లవి యెఱుఁగా
నా మో మతఁడు చచి నవ్వు టెఱుఁగుదుఁ గాని
యేమని పలికెనో యేమియు నే నెఱుఁగ

చ. 2: కదిసి నే నతని దగ్గరు టెఱుఁగుదుఁ గాని
నిదురో పరవశమో నే నెఱుఁగ
కొదలేక యతఁడు పైకొను టెఱుఁగుదుఁ గాని
యిది యది యని నే నేమియు నెఱుఁగ

చ. 3: వన్నెల నామోవి చవిగొన్న దెఱుఁగుదుఁ గాని
యున్నువ చిలుకవోట్లవు టెఱుఁగ
వున్నతి కౌఁగిటఁ గూడి వుండు టెఱుఁగుదుఁ గాని
యెన్నఁడు శ్రీవేంకటేశు నెడసి నే నెఱుఁగ

పె శృ రేకు: 10-2 కాంబోది సం: 17-055

పల్లవి: ఇందరిచే నారడిపో యిందువంకను, తొల్లి
యెందరి నేఁచితివి నీ విందువంకను

చ. 1: కోమలిని వలపించి గుట్టునఁ బాయఁ గ నీ
కేమి వెద్దరిక మాయ యిందువంకను
ప్రేమమునఁ జెలిచేతఁ బిలువనంపినా రావు
యేమేలు నీకుఁ జేరె యిందువంకను

చ. 2: మన్ననలు చెలి కిచ్చి మరి వేరేసతిఁ దెచ్చి
యెన్ని కేమి సేసుకొంటి విందువంకను
నిన్న నేఁటి పొందు గాదు నీకు నాపెకు, నేఁడు
యెన్నరానితలపోఁతే యిందువంకను

చ. 3: మంతనాన చెలిఁజేరి మాటలజోలిఁ బెట్టఁగ
నెంత నేరుపరి వైతి విందువంకను
పంతపు శ్రీవేంకటేశ వడఁతిఁ గూడఁగ వేఁ
డెంతయు నమరె నీ కిందువంకను

పె శృ రేకు: 10-3 సాళంగనాట సం: 17-056

పల్లవి: ఏమిటి కేమి సేసితి నిస్సీ నేను
యీా మతకము ముందరి కెఱు కాయ నాకు

చ. 1: అద్దో యెవ్వతెనో నీ వండఁ బెట్టుకొని యుండి
పెద్దరికానకు నన్నుఁ బిలిపించితి
కద్దు లేరా నీవంక కల్ల నీవు దొరవంటా
వొద్దికివచ్చినతప్పువొక్కటే నాకు

చ. 2: చెల్లఁబో నాచేత నాకు చేరి మడిపించుకొని
వొల్లనే యాకె కిచ్చితి వోరి నీవు
చెల్లులేరా నీ వేమి సేతువు నా నేర మింతే
మొల్లమి వీడె మిచ్చుటే మోస మాయ నాకు

చ. 3: పో పో నాతో బొంకి పొలఁతిఁ దెరలో దాఁచి
పై పై న న్నిటు గూడి భ్రమయించితి
బాపుర శ్రీవేంకటేశ పంతగాఁడ నీ మోవి
తీపులు మరిగినదె దృష్టమాయ నాకు

పె శృ రేకు: 10-4 నాదరామక్రియ సం: 17-057

పల్లవి: ఎదురు రానైతి నంటా యేల దూరేవు
వెదకి తిరుగఁ బోతే వెఱ్ఱిదాన ననరా

చ. 1: తలఁపు దెలిసి కాక దగ్గరి నీతో నాకు
వలసినట్టు పెనఁగ వచ్చునా యీడ
బలిమినె మగవాఁడు పైకొనఁగఁ జెల్లు గాక
చెలి యింత సేయఁ బోతే సిగ్గు లేని దనరా

చ. 2: తెరమరఁ గుండఁగానె తెగ నీ వలపు చల్లి
వరుస దప్పి నవ్వఁగవచ్చునా నాకు
తరుణితో రమణుఁడు తమకించఁ జెల్లుఁ గాక
మరల నంటె నాఁటది మందెమేళ మనరా

చ. 3: యీవల నావలనుండి కిట్టె వచ్చే నంటా
వావులు దెలుప నీతో వచ్చునా నాకు
శ్రీవేంకటేశ్వర నీవే చెలిఁ గూడితివి గాక
చేవ మీఱితే నాఁటది చేఁతలాఁడి యనరా

ప్రె శృ రేకు: 10-5 పాడి సం: 17-058

పల్లవి: ఈ చనవు లీ వలపు లెందుఁ గన్నవి గావు
చేచేతఁ దప మెంత చేసెనో చెలియా

చ. 1: పడఁతి తనవదనమున బాగాలు నించిఁ నీ
వెడనెడల నాకు మడిచి యియ్యఁగాను
తొడమీఁదఁ దొడ వేసి తొదలు మాటాడి, నీ
కడ చూచె నిది యెంత కలికియో కాని

చ. 2: బంగారుమేడలో వరపుపై చెలికి, నీ
వంగములఁ గస్తూరి యలఁదఁగాను
ముంగయి మురువులు నీ ముంజేత నిడి, మోవి
యెంగిలిగాఁ జేసె నిది యెంతటిదో కాని

చ. 3: నిండు రాజసముతో నీమీఁద నొరగుకొని
అండనే నీవు తను నలమఁగాను
బెండుపడి రతి నిన్నుఁ బెనఁగె శ్రీవేంకటేశ
కొండగొనె నిది యెంత కూర్మియో కాని

పె శృ రేకు: 10-6 శంకరాభరణం సం: 17-059

పల్లవి: నే నొకతె నంటా నుంటి నేఁడు నీ కాపె గలిగె
మోనాన నుండక నీతో ముచ్చటలాడితిని

చ. 1: అట్టె నాతో మాటలాడి యాడి నడుమనడుమ
ముట్టి వచ్చితే నాకెమొము చూచేవు
దట్టిమై చుట్టాలు నీకు దండ నుండు టెఱుఁగము
వెట్టికే మాటలాడితి వేగినంతా నేను

చ. 2: నంటున నన్ను నవ్వించి నవ్వించి యంతలోనే
కంటకానఁ గన్నుసన్న గావించేవూ
వెంట నీకె తవరులు వేరే వచ్చు టెఱుఁగము
యింటికిఁ బిలుచుకొంటి యేడ కేడో నేను

చ. 3: కూరిమిఁ గౌఁగిట నన్ను కుచ్చి కుచ్చియెడనెడ
చేరి చేరి యాకెవిఁద చేయి వేసేవు
పూరట శ్రీవేంకటేశ పూడిగాలవారి నింత
గారవించు టెఱుఁగను కలసితి నేను

రేకు: 11-1 కేదారగౌళ సం: 17-060

పల్లవి: ఎంత లేదు తలపోఁత యెంచి చూడ నెవ్వరికి
యింతటే నీసతి ననే దిది చాలదా

చ. 1: చూపుల దవ్వుల నిన్నుఁ జూచితేనే నవ్వితివి
యీపాటికీపాటి యింత చాలదా
వోపి కొండశిలవలె నో యంటే నో యంటివి
ఆ పలుకు కీ పలుకు అంత చాలదా

చ. 2: సోవలఁ దాపపు నన్నుఁ జూడఁ జెలి నంపితివి
యీవాడ కావాడ యింత చాలదా
నీవు వీది నుండఁగాను నిక్కి నిన్నుఁ జూచితేనే
ఆవలిమోఁ మీఁవ లైతి వంత చాలదా

చ. 3: ప్రేమము నీవే యెఱిఁగి పిలిచి నన్నుఁ గూడితి
నీ మేలు కా మేలు యింత చాలదా
నేమపు శ్రీవేంకటేశ నీ రతియు నా రతియు
ఆమనిపై నామ నాయ నంత చాలదా

రేకు: 0011-2 ముఖారి సం: 17-061

పల్లవి: వలవనేరుతుఁగాని వాదించ నేరరా
మెలఁగి నీ వెట్టుండినా మెచ్చ కుండలేను రా

చ. 1: బిగిసి నీవు రాకున్నా పిలువ రా నేర్తుఁ గాని
తెగి నీతో నలిగి సాదించ నేరరా
వొగి నిన్నుఁ గానకున్నా వుసురన నేర్తుఁ గాని
వెగటై యెందుంటి వని వెంగెమాడ నేరరా

చ. 2: నీటున నీ వుండితేఁ గన్నీరు నించ నేర్తుఁ గాని
తేటల నేమి సేసినాఁ దిట్ట నేరరా
నాఁటి నీ సుద్దులు విని నవ్వుకొన నేర్తుఁ గాని
మాటల నీ పొందు లిఁక మాన లేను రా

చ. 3: చీఱి చేయి వేసితే సిగ్గువడ నేర్తుఁ గాని
మాఱుమోము చేసుకో మరి నేర రా
ఆఱడి శ్రీవేంకటేశ అన్నిటాఁ గూడితి నన్ను
వూఱడించితివి నిన్ను వొంటిఁ బాయ లేను రా

పె శృ రేకు: 11-3 ఆహిరి సం: 17-062

పల్లవి: ఏమి సేతు రమణుఁడ యెవ్వరి నేమనఁ జాల
కామించి నీవు గన్నదే కాను పింతే కాకా

చ. 1: నాటకపు నినుఁ జూచి నగవు రావలదా
పాటించి నా కోప మడ్డపడీఁగాకా
కూటమై నోరికి మాట కొంత దోఁచవలదా
యేఁటికో గగ్గుత్తిక నన్నింత సేసీఁగాకా

చ. 2: యెదుట నే నిన్నుఁ గని యెదురుకో వలదా
వదలని నా చలము వద్దనీఁ గాకా
పొదిగి నీ వలమితేఁ బులకించ వలదా
వదరు నా వొట్టు నన్ను వాసి రేఁచీఁ గాకా

చ. 3: నిరతపు నీ రతికి నిన్ను మెచ్చ వలదా
పరవశములు నన్నుఁ బరచీఁ గాకా
గరిమె శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
వొరయఁగ వలదా నే నొక్క టయితిఁ గాకా

పె శృ రేకు: 11-4 శంకరాభరణం సం: 17-063

పల్లవి: అప్పటి సరసాలాడే రాపె నీవు నిస్సిరో
యెప్పటివలెనే వున్నా రిద్దరుఁ దక్కరులే

చ. 1: కందువఁగన్నులు గంటే కౌఁగిలించవలెఁ గాక
ముందువెనక లెంచితే మోహమా యది
పొందుల మాటలాడితే పులకించవలెఁ గాక
యిందరివలె నుండితే యెగవులే కావా

చ. 2: పక్కన నవ్వు నవ్వితే భ్రమయఁగవలెఁ గాక
వక్కణ లడుగఁబోతే వలపా యది
చిక్కని యెలుఁగు వింటే చెమరించవలెఁ గాక
చొక్క కుండితే వెలితి చూపుటే కాదా

చ. 3: మేలమాడినంతలోనె మే మరువవలెఁ గాక
తాలిమి చేసుకొంటే తగులా యది
ఆలించి శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి
వీ లీలఁ గాక వుండితే యీాడు జోడే కాదా

పె శృ రేకు: 11-5 మంగళకౌశిక సం: 17-064

పల్లవి: దోము లేదను తొయ్యలిని
వాసుల సిగ్గులు వంచెద నీకు

చ. 1: నిక్కల గంటిని నిను నా పాదము
తక్కక యేఁటికో తాఁకె నని
యిక్కడ మేల్కొని యింతలో వరగై
మొక్కె నిదివో మునుకొని నీకు

చ. 2: నెమ్మది నే నట నీ వదనమును
యిమ్ముల దమ్ముల మిడితి నటా
కమ్మి యందులకే కడిగెదఁ బన్నీట
చిమ్ముల పంతము చేరును నీకు

చ. 3: చెందినకౌఁగిటి చే తలలో నట
కిందు పరచి జంకింతు నటా
యిందుకే శ్రీవేంకటేశ్వర నిజముగ
పొందితి విచ్చులఁ బొస గితి నీకు

పె శృ రేకు: 11-6 ముఖారి సం: 17-065

పల్లవి: ఇంతియయినఫలము యింతటిది గావలదా
పంతపు నిన్నుఁ దనబంబుఁ జేసినది

చ. 1: తెలిగన్ను లరమోడ్చి తేరకొన నినుఁ జూచి
చలిమోవి యటు చూపి సన్న చేసి
యెలయించి పానుపున కింతలో నినుఁ దీసె
నలరుఁ గాంతలలోన నదియ పో జాణా

చ. 2: చిఱుఁజెమట నొసలితో సెలవిఁ బారఁగ నవ్వి
కఱకుమర్మము గొంతుకాడఁ బలికి
తఱి నీ మనసు గరఁచి తనమీఁద నొరగించె
నెఱతనం బిది యెంత నేర్చెనో చెలియా

చ. 3: సారె జాఁరు దురుము నిలిపి చనుమొనలఁదాఁకించి
వోరి కోట్లఁదనవుదుటు చూపి
యీరీతి శ్రీవేంకటేశ నినుఁ గలసెఁ జెలి
యీ రమణి కీఁక సరి యెంచ మరి కలదా

పె శృ రేకు: 12-1 కొండమలహరి సం: 17-066

పల్లవి: ఇద్దరి మీ జగడాలు యింకమాకా పనిగాదు
తిద్దలేము నిను నాపె తిట్టకుండేనా

చ. 1: పెట్టిరాని యానలెల్లాఁ బెట్టుకొని వచ్చితిని
యిట్టె కలసెనని యింతి తోడను
చుట్టి చుట్టి చెలులతో జూజమీద నాడేవు
రట్టుసేయ నీడ కాపె ఇట్టె రాకుండేనా

చ. 2: చెప్పరాని యాకతాలు చెప్పితి వంతటిలోన
యిప్పుడువచ్చెనని యింతి తోడను
అప్పటి వసంతమాడే వతివలతోడ నీడ
చొప్పు లాపె మేడలెక్కి చూడకుండేనా

చ. 3: అక్కరఁ గాఁపురమెల్ల అండఁబెట్టి వచ్చితివి
యిక్కడనే వుండెనని యింతి తోడను
యిక్కువ శ్రీవేంకటేశ యేమి దలఁచోయీపెను
మిక్కుటమై కూడితివి మెచ్చకుండేనా

పె శృ రేకు: 12-2 రామక్రియ సం: 17-067

పల్లవి: ఇన్నిటా దొరవు నీవు యిందరు నున్నారీడ
పన్నినీకతలు బట్టి బాయిట వేయింతునా

చ. 1: నీవేమి సేసినాను నిన్ను మెచ్చఁగలఁ గాక
కావి కన్నులను నిన్నుఁ గసరఁగఁ గలనా
యీవేళ నీవు బొంకితే యిది నిజమందుఁ గాక
భావించి నిన్నుఁ గల్ల పరచఁగఁ గలనా

చ. 2: వొద్ద నీవు గూచుండితే వోరుచుకోఁగల గాక
అద్దలించి నిన్ను వెంగెమాడఁ గలనా
పొద్దువోయి వచ్చినాను పొదిగి చేకొందుఁ గాక
వద్దువద్దనుచు నీతో వాదించఁ గలనా

చ. 3: కొంగువట్టి తీసినాను కూరిమిఁ జేకొందుఁ గాక
చెంగిచెంగి పానుపుపై సిగ్గువడఁ గలనా
రంగుగా శ్రీవేంకటేశ రతులఁ గడపలోన
అంగవించితివి ముద మణఁచుకోఁ గలనా

పె శృ రేకు: 12-3 సామంతం సం: 17-068

పల్లవి: ఇందరి మెచ్చించరాదా యిదెవో మాటా
అందుకే కోపించితి నదివో మాటా

చ. 1: గొప్ప గొప్ప కన్ను లానె కొమ్మ నీతో మాటలాడె
యిప్పుడు లేదని బొంకే విదివో మాటా
ముప్పిరి నీ వల పెల్లా మోవిమీఁదనుండఁగాను
అప్పటి మానవు నాతో నదివో వటా

చ. 2: యింతిపాదము లత్తుక యిదెవో నీమేన నంటె
నింతలోనే మొఱఁగేవు యిదివో మాటా
వింతగాఁ గస్తూరిబొట్టు వెసఁ జెక్కుమీఁద నదే
అంత చెల్ల దింక నీకు నదెవో మాటా

చ. 3: శ్రీవేంకటేశ నీవు సేసిన దెల్లాఁ జేసి
యీవల పంత మిచ్చే విదివో మాటా
భావపు నీ రతులలో పరవశమై నే
నావ లెల్లా మఱచితి నదివో మాటా

పె శృ రేకు: 12-4 శంకరాభరణం సం: 17-069

పల్లవి: అన్నియు మఱచితిఁబో అందుకే నేను
యెన్నుకొందు నీ గుణము లిందుకే నేను

చ. 1: పట్టి నేఁ గోపగించితే పైపై వేఁడుకొనేవు
అట్టెఁ వలచితి బో అందుకే నేను
దిట్టినై వెంగె మాడితే తేటగా నవ్వేవు నీవు
యెట్టు నిన్ను మానఁగల యిందుకే నేను

చ. 2: అలిగి పూరకుండితే ఆయము లంటుదు నీవు
అలరి పాయఁగ లేను అందుకే నేను
మలసి పల్కకుండితే మాటలాడింతువు నీవు
యెలమిఁ గరఁగుదుఁబో యిందుకే నేను

చ. 3: నే నాడకు రాకుండితే నీవే విచ్చేతువు
ఆనందాన నుండుదుఁబో అందుకే నేను
ఆనకపు శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితి
నీ నిజము మెచ్చితిఁబో యిందుకే నేను

పె శృ రేకు: 12-5 రామక్రియ సం: 17-070

పల్లవి: ఇప్పటికాలమువారు యేవి నేరరు
అప్పటనుండియు మఱఁగందితిఁబో నేను

చ. 1: కన్నుసన్నలనే నిన్ను కైవశము చేకొనే
కన్నెపడుచా యిది కలికి గాక
వన్నెల మాటలే ఆడి వద్ద నుండి మీతోను
యెన్ని కతలు గరచె యింతలోనే తాను

చ. 2: యిక్కువ చెప్పి యంపి ని న్నింటికి రప్పిం చుకొనె
దిక్కుల యింతిమాత్ర మా దేవర గాక
పక్కన తా నవ్వి నీవు పైకొంటే జంకించీని
యెక్కడిమాయలు వన్ని యేమందు నేను

చ. 3: కప్పురముమోవి నిచ్చి కౌఁగిట నిన్ను బిగించె
యిప్పుడు నీకుఁ దక్కువా యెక్కుడే కాక
ముప్పిరి శ్రీవేంకటేశ మొగి నన్నుఁ గూడితివి
తప్పు లెంచి నన్ను నాపెదంటతన మెట్టిదో

పె శృ రేకు: 12-6 భైరవి సం: 17-071

పల్లవి: ఇందుకా తొల్లిమాటలనే నిన్ను యియ్యకొలిపినది నీవు
కందువా నీవుసేసినగురుతు ఘాతలై మాయ దిదివో

చ. 1: అంతవొద్దున నిన్నుఁ బిలువ నంపఁగా రావైతివి గాక
యింతులు పైకొని వలచితే నింతకంటె నవురా
యెంతసేసిన నీ చిత్తమే కాని యెప్పుడ నేఁ గోపగించరా
చెంతల నామేనికాఁక చేతనైనా ముట్టిరా నీవు

చ. 2: దొరవైతే మా యింటికి రా దోసమా యాలో వొల్లవుఁగాక
వొరసి తనుఁ దానే వచ్చినది వొల్లనాఁ బెట్టులురా
యిర వెఱఁగి నీవు న న్నిట్ల యెంచి యిచ్చకము మానరా నీవు
కరఁగిన నా యరురులు కంటనైనాఁ జూడరా నీవు

చ. 3: కిమ్మరా నా మోహము నీవే కనవా యేలో దాఁచేవు గాక
సమ్మతించి నా మేనవారివాని చవుకలై యుండురా
నెమ్మది శ్రీవేంకటేశ్వర నీవేఁ నన్నుఁ గూడితివి నేఁడు
యిమ్ముల నీవే మేరవమీఱితివి యివి మరవకురా నీవు

పె శృ రేకు: 13-1 సామంతం సం: 17-072

పల్లవి: ఎంత చనవరో కాని యెవ్వతెరా
యింత గయ్యాళి చేఁతల దెవ్వతెరా

చ. 1: వల్లెవాటుఁ బయ్యదతో వచ్చి నన్ను సన్నసేసీ
యెల్లవారుఁ జూడఁగా నెవ్వతెరా
తొల్లి నీకు పొందు గద్దో తొడిఁబడఁ బానుపుపై
యిల్లు చొచ్చి పవ్వళించె నెవ్వతెరా

చ. 2: వాడుఁ జూపుల కన్నుల వలపులు చల్లి నీతో
యీడనే నవ్వులు నవ్వీ నెవ్వతెరా
ఆడరానిమాట లాడి ఆయాలు దాఁక సంగడి
వీడుగాఁ గూచుండ వచ్చీ నెవ్వతెరా

చ. 3: కప్పురము మోవి నిచ్చి కాఁకలతోఁ దమకించి
యిప్పుడె యాఁకారీని నెవ్వతెరా
ముప్పిరి శ్రీవేంకటేశ ముందర నన్నుఁ గూడితి
వెప్పుడాకె నిన్నుఁ గూడె నెవ్వతెరా

రేకు: 13-2 సంపుటము: 17-073

పల్లవి: ఇద్దర మాడువారమె యెన్నీ రొంత
వొద్దిక మాలో నేమే వొత్తి నవ్వితిమిరా

చ. 1: పవ్వళించి నీవు నేనుఁ బానుపుపై నుండఁగాను
యెవ్వతో నీవంటా నన్ను నిటు లేపరా
రవ్వగా నీవే నన్ను రతికిఁ బిలిచేవంటా
నెవ్వగఁ గౌఁగిలించితి నిదురకన్నులను

చ. 2: కదిసి నీవును నేను కౌఁగిలించుకుండఁగానె
సుదతి నీ వంటా నన్ను చో టడిగెరా
మదనపరవశాన మఱి నీ వంటా నాపె
వదనమున వీడెము వడి నే నిడితిరా

చ. 3: ముచ్చట నీవును నేను ముసుగు వెట్టుకుండఁగా
మచ్చికె నీవంటా నాతో మాట చెప్పెరా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశుఁడ నీవంటా నాపె
నచ్చి నన్నుఁ గూడఁగా నడుమ నీ వుంటివి

పె శ్రృ రేకు: 13-3 కాంబోది సం: 17-074

పల్లవి: ఇందాఁకా నేడ నుంటి వేరా వోరి
నిందల నీ సుద్దు లెల్లా నే నెఱుఁగనా

చ. 1: కవ్వ కవ నవ్వుకొంటా కన్నులు దేలించుకొంటా
అవ్వల నొక్కతె చేత నా కందు కొంటా
జవ్వనపమదముతో సంపతిలిఁసారెతిలి
యివ్వల నిప్పుడుగా మా యింటికి విచ్చేసితి

చ. 2: పై పయి మలసుకొంటా బంగారుపావాలు మెట్టి
చాపలోన పూవుబంతి సారెఁ దిప్పుతా
రాపుగా చెమటలతో రాజసాన వీఁగుకొంటా
యీపొద్దుగా నీవు మా యింటికి విచ్చేసితి

చ. 3: మీసాలా దీరుచుకొంటా మీఁదుఁ గిందుఁ జూచుకొంటా
వేసాలకు నన్ను నిట్టె వే డుకొంటాను
ఆల శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
యీ సిరులతోనే మా యింటికి విచ్చేసితి

పె శృ రేకు: 13-4 వరాళి సం: 17-075

పల్లవి: ఇందుకుఁగాఁ గోపించ నేల నీకు
ముందుగల కోపమెల్లా ముగిసెఁ బోరా

చ. 1: కొమ్మ నీ కుచము లివి కొనవాండ్లా యింత
యెమ్మె లేల నీకునందు కేమి వోదురా
అమ్ముడు జక్కనలంటా నడిగితినే వోరి
కమ్మర మానవు నే మంగడివారమా

చ. 2: పొలఁతి నీ మోవిపండు పుల్లనో తీపో వోరి
తొలరా నీ కే లందుతోడి చింత
వెలవెట్టె యందు కేమి వెలిపాయనా నీకు
వలపుగంపల నమ్మ వచ్చితినా నేను

చ. 3: వనిత నా కౌఁగిలి వదలకువే యిట్టె
తనిసితి మిద్దరికిఁ దగులాయను
వినవె శ్రీవేంకటవిభుఁడ నేను అన్నిఁ
గనుఁగొంటి నిఁక నేమి కడ మాయరా

పె శృ రేకు: 13-5 ఆహిరి సం: 17-076

పల్లవి: సాగిన సబలలోని సరివారిలోన నెల్లా
యీగతి మన్నించితివి యీపెదెపో బ్రదుకు

చ. 1: చేయి వట్టి తీసి యింతిఁ జేరఁ బిలుచుకొంటివి
చాయల నిందరూఁ జూడఁ జాలదా యింత
పాయనిమోహ మెఱఁగి పై జేయి వేసి నేఁడు
యీ యెడ మన్నించితివి యీపెదెపో బ్రదుకు

చ. 2: పంచిన చెలిశిరసు పడి నెత్తి పలికించి
చంచలించక నవ్వితి చాలదా యింత
కొంచ కాపెగుణములు కొనియాడి కొలువులో
యెంచి మన్నించితి విట్టె యీపెదెపో బ్రదుకు

చ. 3: చెక్కు నొక్కి నిమ్మపండు చేతి కిచ్చి బుజ్జగించి
చక్కసరస మాడితి చాలదా యింత
దక్కిబి శ్రీవేంకటేశ తరుణి కౌఁగిటనే
యెక్కుడు మన్నించితివి యీపెదెపో బ్రదుకు

పె శృ రేకు:	13-6	సామంతం	సం:	17-077

పల్లవి:	సరుస దిష ములకు సాకి రేలరా
	మరుతంత్రములలోన మఱుఁగులు గలవా

చ. 1:	యేకతాన ఆకె నిన్ను నిద్దరినేఁ బొడగంటి
	నాకు చుట్టి యిచ్చె నింతే యని బొంకేవు
	మేకొని పువ్వులలోన మెదలే తుమ్మెదదా
	నాకడఁ బరిమళము లంట నంటే నిజమా

చ. 2:	యీాదె మంచముమీఁద ఇంతి నీకు యాడ దంటే
	పాద మొత్తేచెలి యంటా బాస సేసేవు
	పోదితోడ గుంపు మాని పొంత నున్న పూవుఁ దీగె
	ఆదిగొని కొమ్మ గొమ్మ నలమక వుండునా

చ. 3:	పురముపైని కొమ్మ వున్న దిది యాడ దంటే
	గరిమ బంగారులో సింగార మనేవు
	నిరతి శ్రీవేంకటేశ నీకు భూమిదేవి నేను
	దొరసితి నిందిరయు తోడు నీకు వలెఁగా

పె శృ రేకు: 14-1 మాళవిగౌళ సం: 17-078

పల్లవి: కుచ్చితాలే నీ వైతే కూడపెట్టుకొందు గాని
యిచ్చకురాల నే నైతే యింతపని కోపరా

చ. 1: మాట గోరువోయీ నంట మౌనాన నుందువు గాని
నీటున ముచ్చటాడక నే మానరా
సూటి దప్పిపోయీ నంటా చూడను లోఁగేవు గాని
గాటమున నిన్నుఁ జూచి కన్ను మూయఁ జాలరా

చ. 2: చల మంతా దేరీ నంటా సరలమాడవు గాని
మలసి నేఁ బైకొనక మాన లేనురా
వెలిఁబడే నవ్వంటా వెస నణఁతువు గాని
వొలసి నే నైతే నవ్వకుండ లేనురా

చ. 3: కాయ మరగీ నంటా కౌఁగిలించ కుందు గాని
ఆయ మంటి కౌఁగిలించ కాఁ ప లేనురా
చేయార శ్రీవేంకటేశ సిగ్గునఁ గూడితి గాని
వేయైనా నా నీవురముపై వెల్లివిరి యైతిరా

పె శృ రేకు: 14-2 భైరవి సం: 17-079

పల్లవి: నేఁడుగా నా నుడిమాట నీవల్ల నిజ మాయ
వేఁడి యంటేఁ జల్ల నీవు వెస నూదుకోరురా

చ. 1: వన్నెల నే వాడలోనివనితల నాడుకొంటే
నిన్ను సోఁకి రాదు గదా నీ వేల నవ్వేవు
అన్నిటా గుమ్మడికాయ లన్న సుద్ది దడవితే
పన్ని నేఁడు నీ బుజాలు పట్టి చూచుకోకురా

చ. 2: మోము లొకరొకర మిమ్ముల నేము చూచుకొంటే
నీ మైఁ దప్పులేదు గదా నీ వేల నవ్వేవు
వోముచు నే నుప్పంటే వుపతాపానఁ బడేవు
యేమిరా నీకు నీకే యింత వెఱపేలరా

చ. 3: ఆవల నలసినవా రట్టె విసరించుకొంటే
నీ వలసిరావు గదా నీ వేల నవ్వేవు
భావించి శ్రీవేంకటేశ పట్టి నన్నుఁ గూడితివి
చేవలు దేరిన మీఁద చిగురు గా నేలరా

పె శృ రేకు: 14-3 శుద్ధవసంతం సం: 17-080

పల్లవి: ఎమ్మెకాఁడవై తిరుగ నింత దొర కేఁటికి
దిమ్మరిమాటల నాచేఁ దిట్టించుకోవలెనాఁ

చ. 1: వూరకున్న నన్నుఁ దెచ్చి వోరి నీవు వలచిన
వూరసతులఁ జూపి న న్నుడికించేవు
మేరతో నీ కితవైతే మెడఁ గట్టుకొందు గాక
వారి నన్ను సరిచేసి వాదువెట్టవలెనా

చ. 2: దవ్వులఁ గూచున్న నన్నుఁ దలఁపించి వారిచేత
యెవ్వతెంటా నడిగించి యీసు రేఁచేవు
యెవ్వతె మన్నించినా నీ వేమైనా నిత్తువు గాక
రవ్వగాని యాఁడువారి రాఁపుసేయవలెనా

చ. 3: తతి నిన్ను నేఁ గూడి తనిసితే నీ తోటి
సతులచే మొక్కించి జంట సేసేవు
సతమై శ్రీవేంకటేశ సవతులయినవారిఁ
బతివెట్టవలెఁ గాక పచ్చి సేయవలెనా

రేకు: 14-4 శ్రీరాగం సం: 17-081

పల్లవి: మంచ మదె యిల్లదె మాట లేటికే
నించినవేడుకతోడ నిద్దిరించు లోనను

చ. 1: యింటికిఁ జెప్పి యంపితి నిందాఁకా నేల రావైతి
వంటఁ గాక తొలఁగితి నట్టె వుండరా
వెంట వచ్చినచెలిచే వింటిమి నీ సుద్దు లెల్లా
వొంటినైనాఁ బవ్వళించు వొక్కఁడవే లోనను

చ. 2: చూచియైనాఁ బొమ్మంటిఁగా సుద్దులు చెప్పి యంపితి
వీ చాయకు రాకు మంచ మెక్కి వున్నదాన
నీచేఁత లన్నియును నీ వెంటనే వచ్చె
కూచుండరా యిఁకనైనా కుదురయి లోనను

చ. 3: యెదురు చూచితిఁగా నీ వేడ నుంటివో కాని
పదరకురా యిది పంతము గాదు
పొదిగి శ్రీవేంకటేశ పోనీక నన్నుఁ గూడితి
పుదుటై యెందునుఁ బోక వుండరా యీలోనను

పె శృ రేకు: 14-5 సామంతం సం: 17-082

పల్లవి: ఆన లేల పెట్టుకొనే వప్పటి నీవు
లోని కేల తీసేవు లోకమెల్లా నుండఁగా

చ. 1: యింటికి నే రాఁగానే యెదురు విచ్చేసితివి
యింటిలో నెవ్వతెనైనా నిడుకొంటివో
పెంటగా నిద్దరము నీ పెండ్లి చవికెలోన
వుంటిమిగా ఆడ కేల వొద్దయ్య సోదించను

చ. 2: తప్పక నేఁ జూచితేను తలవంచుకొంటివి
తప్పు నీమీఁద నేమైనాఁ దగిలినదో
వొప్పుగ మేడ యెక్కుద మూరకే తెర దియ్యఁగ
నప్పు డేమి బయలౌనో అంతేసికి నోపను

చ. 3: కౌఁగిట నేఁ గూడఁగనే కడు నెఱఁగందితివి
కౌఁగిటిలో నాపెరతి గంటివో నీవు
చేగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ్వర యిట్టె
ఆగేవు రతుల నన్ను ఆస యంతో నీకు

పె శృ రేకు: 14-6 శ్రీరాగం సం: 17-083

పల్లవి: అంతటిది గాకుండితే అది ని న్నిందరిలోన
నింతకు దెచ్చెను చాలు నిందుకే మెచ్చితిని

చ. 1: సమ్మాళిగెలు మెట్టి సతి రాజసముతోడ
కమ్మి యొకచెలిమీదఁ గరము చాఁచి
తమ్మిమోము విచ్చి నీతో తలవాకిటనే వుండి
యెమ్మెలకే మాటలాడి యేమనేరా నిన్నును

చ. 2: పుక్కిటివీడెముతోడ బోలుఁ గొప్పువెడ జార
వొక్కింత వజ్రాలకమ్మ లొగిఁ గదల
పక్కన నీడకు రాఁగా బారితెంచి చేచేత
జిక్కించి లోన నేరీతిఁ జొక్కించెరా నిన్నును

చ. 3: చిగురుఁబెదవి మోపి శ్రీవేంకటేశ నిన్ను
మొగపుల మొలనూలు మోఁ బంచెను
బిగువు గౌఁగిటఁ గూడి పిప్పి సేసె నీ మేను
యెగసక్కాలకు నేఁడు యెవ్వతెరా నిన్నును

రేకు: 15-1 పాడి సం: 17-084

పల్లవి: మమ్ము నేల చెనకేవు మాటి మాటికి
కమ్మర నిట్టే బండి కాలఁ దన్నవయ్యా

చ. 1: పొద్దు వోకుండితే దొడ్డిపొంత కయినాఁ బోవయ్యా
వొద్ద నుండి మమ్ము నొకటొక టాడక
వుద్దండాన మొన్నదిన్నవుబ్బు నీకు గలిగితే
కొద్దిమాలి నీవు పెద్దకొండ లెత్తవయ్యా

చ. 2: చే యూరకుండ కుండితే చీరలు దొంగిలవయ్యా
యీ యెడ మాపై గోళ్ళల చిమ్మేవు
సేయరానిపనులకు చెల్లుబడి గలిగితే
పాయపు గొల్లెతలనే పట్టుకొనవయ్యా

చ. 3: మనసు దనియ దంటే మడుగులు చొరవయ్య
పెనఁ గీనా చెమటలే ప్రియ మనక
యెనసితివి శ్రీవేంకటేశ్వరుఁడ నారతి
అనువై నీ కొక్క మనసాయఁ గదవయ్యా

రేకు: 15-2 శ్రీరాగం సం: 17-085

పల్లవి: చెలువుఁడ వింక నీ చిత్తము గాక
వలవంత నే నొకరివంటిదాననా

చ. 1: కులుకుఁ జూపుల నిన్నుఁ గొసరు టింతే కాక
అలుగ నీతోనే నంత దాననా
మలసీ సొలసీ నిన్ను మాటల దూరట గాక
అలరి నీ కెదురాడే యంతదాననా

చ. 2: నిండినకాఁకలతోడ నివ్వెఱఁగందుట గాక
అండ నిన్నుఁ గైకొనేయంతదాననా
దండియైన తమకాన తలవంచుకొంట గాక
నిండుదొరవైన నీతో నీటుదాననా

చ. 3: శ్రీవేంకటేశ నీతో సిగ్గున నుండుట గాక
ఆవలిమోమై వుండేయంతదాననా
ఆవటించి కూడితివి అలమేలుమంగ నింతే
వేవేలైనా నీకు వింతదాననా

పె శృ రేకు: 15-3 శ్రీరాగం సం: 17-086

పల్లవి: అందరుఁ జూడఁగ నీవురా నీవు
అందుకోలు జాణ వేరా నీవు

చ. 1: చాయల కొలువు సందడిలోనే
ఆయము లంటేవు అవురా నీవు
రాయడి మద్దెల రవళి లోనే
కాయజువేదము గల్పించే వేరా

చ. 2: నిలువుటద్దము నీడలలోనే
అల మోవి యానే వౌరా నీవు
సొలసి యాడే జజాలలోనే
యలమేవు చన్ను లౌరా నీవు

చ. 3: చెందమ్మిపాదాలు చే నొత్తఁ గానే
అందందే కూడేవు అవురా నీవు
విందువలెనే శ్రీవేంకటేరాయ
అందుకే మెచ్చే వేరా నీవు

పె శృ రేకు: 15-4 బౌళి సం: 17-087

పల్లవి: ఎంత వోరిచిన నెఋంగడు తన
వింత సుద్దు లెల్లా విడిపింతునా

చ. 1: చూడరే వీని సుద్దు లెల్లా చను
జోడు నుంచి మొనచూపెనటా
యేడ నేరిచెనే యింతేసి తన
వీడెపు మోవి వెలయింతునా

చ. 2: మానఁడె తనమాటల నా
సోన చూపు తను సోఁకె నట
యేనెపమునేసీ నిందుకు తను
గాని తిట్ల నే కరగింతుని

చ. 3: వినరే వీనివైనాలు తనుఁ
ననిచి నామోము నవ్వె నటా
యెనసి శ్రీవేంకటేశ్వరుఁడు యిట్టె
చన విచ్చె యింక సాదింతునా

పె శృ రేకు: 15-5 బౌళి సం: 17-088

పల్లవి: చెప్పితిఁ జెప్పితిని మాతోఁ జెల్లదు నీ కింకను
ముప్పిరి నున్నది ముందర నిదివో ముసళ్ళపండుగరా

చ. 1: అంతేసి నవ్వకురా వోరి అదె నిజమయ్యీని గొల్ల
దొంతులవావులదోమటి దొడుక దోసము నీ కేలరా
యింతుకు నే నోపను నీకు యిచ్చకాలు నేరరా
కంతుని దీమపు కంచుఁ బదనులకామిని నింతేరా

చ. 2: కాఁకలు సేయకురా కైతప్పు లే మవునో
పోఁకకుఁ బుట్టెఁ డు యెక్కడ చూచిన పాల తులమోహము
వేఁకపుజవ్వనిని నీ వేసాలు మోసాలురా
మాఁకులమీఁదట ననలవాఁడికి మారుమలతుమురా

చ. 3: కడు బిగించకురా నీ కందున కౌఁగిటను
వెడగు నాకుచగిరులు నీకును వీఁపున వెడలురా
తడిసెఁజెమటలా మనతనువు లిద్దరికి
తడవిడిచితి శ్రీవేంకటేశ్వర దక్కితి నే నీకురా

పె శృ రేకు: 15-6 వరాళి సం: 17-089

పల్లవి: ఆఁటదాని బదుకింత ఆరడి గద్దా
కూటములలో పనులు గుట్టు సేయవలదా

చ. 1: దేవునే విన్నవించిన తియ్యముచ్చట లెల్లా
ఆవల నానతిత్తురా ఆకెతోడను
చేవ మీరి నీకు నేఁజేసినసేవలెల్లా
యేవలనైనా రచ్చ కెక్కేటివా

చ. 2: చిత్తగించ నవధరించిన నాతో పొందు లెల్లా
నిత్తెమును నాటి కవి నేరువుదురా
హత్తి నీ కతలకు లోనైన రహస్యము లెల్లా
కొత్తగాఁ బరులకు వూఁకొనవచ్చేవా

చ. 3: కూడేవేళ నేఁ జేసిన గుఱుతైన వూడిగాలు
సూడిదెగా నాపె కవి చూపవచ్చునా
యీడనే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
వేడుకపడేదే కాక వెనకతీ సేవా

పె శృ రేకు: 15-7 ఆహిరి సం: 17-090

పల్లవి: ఇట్టే పొద్దు గడపీ నెంత మోహమో
పట్టి యేకాంతము లాడీ పై నెంతమోహమో

చ. 1: పొలఁతి ని న్నంపు తానే పుక్కిటివీడెపు చద్ది
యెలమిఁ బెట్టి న దిది యెంత మోహమో
చెలఁగి తాఁ గప్పుకొన్నచెంగావి దుప్పటము
నిలువుఁగాసె వోసెను నీ కిదెంత మోహమో

చ. 2: నిన్నుఁ బొమ్మనఁగ లేక నిలుచుండి కౌఁగిలించి
యెన్నికగా మోవి యిచ్చె నెంత మోహమో
కన్నులఁ దప్పక చూచి కంటసరి మెడలోఁబెట్టి
పన్నితలవంచుకొన్నభావమెంత మోహమో

చ. 3: పొంచి తనచెవి తట్టుపుణుఁగు నీ చెక్కులను
ఇంచు కించుకే చమరె నెంత మోహమో
కొంచక శ్రీవేంకటేశ కోమలి గూడితి విట్టే
ముంచి వేగమే రమ్మని మొక్కె నెంత మోహమో

పె శృ రేకు: 16-1 కేదారగౌళ సం: 17-091

పల్లవి: అనరే యిట్టే యెనసి దోసమనరే చెల్ల దనరే విరాతనితోనేఁడు, నా మనసెల్లఁ దనవెంట వెంటనే మరపె నే నెట్టు మఱతునే

చ. 1: యేల రాఁడే రమణుఁడు తన కేమి సేసితినే
వేళతోఁ దా నిన్నా ళ్లింతకు విచ్చేసుఁ దా నీడకు
మేలునా యది వలచినవారి మేకులఁ బెట్టేది
నాలికాఁడు నాచన్నులు కొనగోర నాఁటించె నే నింక నేమిసేతునే

చ. 2: నాఁడు నాఁడే యీ సుద్ది చెప్పిన నాయంత నే నుందును
వేఁడివేఁడి కాఁకలు రేఁచి వెతలు సేయింతురా
ఆఁడుదానవై మూల నుండితే నాసలెల్లా మానునా
నేఁడు తనమోవి యిచ్చి కత లెల్ల నేరిపె నే నెట్టు విడుతునే

చ. 3: చాలదా యింతతడవు నాతో సరసము దనకు
ఆలించి యాడఁ బొంచు వినీనో అంత మాయకాఁడు
తాళ మంటి నట్టు శ్రీవేంకటేశుఁడు దగ్గరి నన్నుగూడెను
యేలో నాకు నవ్వులివే ముంచుకొనె నేడ నుంటి వని యడుగరే

పె శృ రేకు: 16-2 శ్రీరాగం సం: 17-092

పల్లవి: వేళ గాదు పోకురే వెలఁదులు లోపలికి
మేలిమిఁ దా మిద్దరే మేడపై నున్నారు

చ. 1: వాడుఁ బువ్వులకొప్పుతో వన్నెల మోవులతోడ
తోడఁ జిట్లు గందాల దుమ్ములతోడ
వీడెపు సెలవులతో విభుఁడు తాను నద్దపు
నీడలు చూచుకొంటా నిలుచున్నా రదివో

చ. 2: చిఱుఁ జెమటలు గార సిగ్గుల నవుల దేర
నెఱుల చిక్కులు దీసి నివురుకొంటా
గిఱుకుఁ గన్నుల నిద్రకేఁ గేలఁబులుముకొంటా
మొఱఁగుల నవ్వులతో ముచ్చటాడే రదివో

చ. 3: తిమిరి వొక్కరొక్కరు తేటలమోములు చూచి
సమమోహములు పైపై జల్లుకొంటాను
అమర శ్రీవేంకటేశుఁ డలమేల్మంగయుఁ దాను
తమిఁ గూడి లోలోన దైవారే రదివో

రేకు: 0016-3 సామంతం సం: 17-093

పల్లవి: నన్ను వాఁడెఱుఁగు వాని నసుపు నే నెఱుఁగుదు
యెన్నికలు వేరే యాల యెంచీరే చెలులు

చ. 1: తొలుతే మోహపురతి తోడుకరా నంపనేల
తలఁపులే తమకమే తరవు గాదా
మలసి మలసి లోలో మర్మములు సళుపఁగా
యెలమి నిందుకు రా కెటుండనే వాఁడు

చ. 2: యేకమైన దేహములు యెక్కడ నుండినా నేమి
దాకొన్నప్రాణము లొక్కతగులే కాదా
పైకొనీ గుండెలు మోఁచి పంచబాణము లుండఁగా
చేకొని విరహములు చిమ్మిరేఁచ కుండునా

చ. 3: యిద్దరముఁ గూడినప్పు డెవ్వరిఁ గొసర నేల
సుద్దులముచ్చటలే సూళ్లు గావా
వొద్దికాయ శ్రీవేంకటోత్తముఁడు విచ్చేసి
పొద్దు వొద్దున కన్నిటా భోగములే కావా

రేకు: 0016-4 రామక్రియ సం: 17-094

పల్లవి: గబ్బిగొల్లెతలముద్దు ఘనమాయ మాకు నేఁడు
వుబ్బుచు నే చేఁతకైనా నూరకుండే బాలుని

చ. 1: యెంగిలి తమ్ములమంటే నెవ్వతె ముద్దాడెనే
బంగారువంటిచెక్కుల పసిబాలుని
బొంగగార మోవితేనె సోఁ కించె నెవ్వతే
ముంగిటనిధానమై ముద్దుగారే బాలుని

చ. 2: అండఁ జెమటచన్నుల నద్దు కొన్న దెవ్వతే
దండిగా నీరార్చిన తగుబాలుని
నిండుబూతు బండుం డిట్టు నేరిపిన దెవ్వతే
వొండేమి నెఱుఁగక వూరకుండే బాలుని

చ. 3: కొప్పుపువ్వు మెడదండ గుచ్చి కట్టె నెవ్వతే
వొప్పుగ దేవరవలె నున్న బాలుని
తిప్పితిప్పి వీధులెల్లాఁ దిరిగించె నెవ్వతే
ముప్పిరి శ్రీవేంకటాద్రి మూలనున్నబాలుని

పె శ్రృ రేకు: 16-5 శుద్ధవసంతం సం: 17-095

పల్లవి: కొత్తలు గదే వీని కొండుకబాలముద్దులు
చిత్తరుబొమ్మలవద్ద జేరి యాడెఁ గృష్ణుఁడు

చ. 1: నీరాటిలోనఁ దన నీడచూచి బాలుఁ డంటా
రా రమ్మని పిలిచి రాకుండఁగా
కారించి కడవనీరు కలఁచి చేత వెదకి
వూరకె కానక పొంచివున్నాఁడు కృష్ణుఁడు

చ. 2: నీలపుఁ గంటసరులు నేరేడుబం డ్లంటా
గోలయ్యై నమలఁబోయి కొరుక రాక
వోలి మెత్తగాను వొలిచి యిమ్మని తల్లి
చేలకొంగువట్టి తీసి చెప్పరాని కృష్ణుఁడు

చ. 3: ఆకసముచందురుని నదె వెన్నముద్ద యంటా
ఆకడ చేయి చాఁచి యందఁగ రాక
శ్రీకాంతతోడఁ గడి శ్రీవేంకటాద్రి యెక్కి
పైకొని పెచ్చుపెరిగి ప్రౌఢాయఁ గృష్ణుఁడు

రేకు: 16-6 ఆహిరి సం: 17-096

పల్లవి: ఒక్కరీతి వుండినట్టే వుండనియ్యరా నీవు
చక్కనుండ లేవు నేను సమ్మతించఁ జాలను

చ. 1: అలిగి వుండినజాడ నటునే వుండేఁ గాని
బలిమిఁ బట్టికురా సొగిలి మొక్కేను
వెలయ నీ సుద్దు లెల్లా వినినప్పు డెల్లాను
పలుమారుఁ దాపమున బడల నేఁ జాలను

చ. 2: పాసివున్నతమకానఁ బచ్చివొట్టు వెట్టుకొంటే
దోసము గట్టకురా నీ తొత్త నయ్యేను
ఆసల నెవ్వతనైనా నంటక నీ వుండ లేవు
గోసనానచేసి నిన్నుఁ గోపగించఁ జాలను

చ. 3: అంతే వేడుకైతే నీ కేమైనాఁ జేసేఁ గాని
కొంత వూరకుండరా నీ కొమ్మ నయ్యేను
చెంతలఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ్వర
యింతటివాడవుఁ నీకు యెదురాడఁ జాలను

రేకు:	0017-1 నాదరామక్రియ	సం:	17-097
పల్లవి:	చూడనిచ్చినంతలోనే సుక్కురారమా
యేడ కేడ తనకు నా కిది యేమే విందు
చ. 1:	మిక్కిలి బడలే నీ మేనిది యేమంటే
చిక్కితి నీ పాల నంటా చేత మొక్కీనే
వొక్కటంటె వొకకాడి వుండఁ బట్టిదో కాని
యెక్కడి కెక్కడి సుద్దు లిది యేమే వీఁడు
చ. 2:	చెదరె నీ యలకలు చిన్నఁబోయె మొగమంటే
అది నీకే సెలవంటా నప్పగించీనే
పొదిగి నావెంట వెంట పొద్దువోదో కాని, నే
నెదురంటె కదురనీ నిది యేమే వీఁడు
చ. 3:	చెంతల శ్రీవేంకటేశ చేయి వట్టే వేమంటే
కొంత గొంత సన్నచేసి గోర నొత్తీనే
యింత జాణ గాకుండితే యిన్ని వుపమల నన్ను
యెంత కెంత సేసి కూడె యిది యేమే వీఁడు

పె శృ రేకు: 17-2 ఆహిరి సం: 17-098

పల్లవి: ఇంకా నేఁటికి జోలి యేల సేసే విటునాతో
సంకుల యెంతటిజాణో చూపరా నాకు

చ. 1: కొప్పున సంపెంగలు కోరి నీకు ముడిచితి
నప్పటి సేమంతు లున్నవవి యేడవి
యిప్పుడు యెవ్వతో నాపై యీరసాన కింత చేసి
చొప్పు మార్చిన జాణను చూపరా నాకు

చ. 2: సరిఁబదకము నీకు చక్కఁగా నేఁ బెట్టితి
నరుదై యున్నది కంఠహార మేడది
వరుస నెవ్వతో నా వలపు తడఁబరచి
చౌరువకు వచ్చి నాపఁ జూపరానాకు

చ. 3: చెలఁగి కస్తూరి నీ చెక్కిటఁ బూసితి నింతే
యెలమి నీ తట్టుపుణుఁ గేల వచ్చెను
నెలవై శ్రీవేంకటేశ నిన్నుఁ గూడితి నాచే
సొలయింపించిన జాణఁ జూపరా నాకు

పె శ్రృ రేకు: 17-3 కాంబోదిసం: 17-099

పల్లవి: తలివాతిమాట లెల్లా దయ్యా మెఱుఁగు
యెఱుఁగనిదానఁ గాను యేమందు నేను

చ. 1: మంతనము లాడుకొంటా మంచముపై గేరుకొంటా
యింతదడవు నుండరా యిద్దరు మీరు
అంతలో నే రా గానుఁఆపెఁ జూప యెవ్వ తెంటా
యెంత కెంత న న్నడిగే వేమందు నేను

చ. 2: అంగము లురసుకొంటా నాయములు ముట్టుకొంటా
యెంగిలిపొత్తందుకోరా యిద్దరు మీరు
సంగడి నేఁ గూచుండఁగా సతి నా చెలి యనుచు
యింగితానఁ బే రడిగే వేమందు నేను

చ. 3: కమ్మి కౌఁగిలించుకొంటా కాయము లుబ్బించుకొంటా
యిమ్ములఁ గూడి యుండరా యిద్దరు మీరు
పమ్మి నే దగ్గరఁ గాను పైకొని కూడితి విట్టె
యెమ్మెల శ్రీవేంకటేశ యేమందు నేను

పె శృ రేకు: 17-4 శంకరాభరణం సం: 17-100

పల్లవి: ఇప్పు డేల పండఁ బడి వేడ బాద నీకు నాపై
గప్పిన యింపు గలిగితే కరుణింతు గాని

చ. 1: నవ్వులనే యిందాఁక నాతో వేగించితివి
దివ్వెల వెలుఁగుననే తెల్లవారెను
రవ్వగా నదియుఁ గాక రతి సేసి వచ్చితివి
మువ్వంకఁ బన్నీరు చల్లేమోము చూపవయ్యా

చ. 2: యిచ్చకము నాతో నాడి యెంత నోరు నొచ్చెనో
కొచ్చి యుండవయ్యా నీ చెక్కులు నొక్కెను
ముచ్చటలాడి వచ్చితి మొదల నందరితోడ
పిచ్చుగా ముద్రలు వెట్టెఁ బెదవి యేదయ్యా

చ. 3: కన్నులిఁ జూచి చూచి కౌఁగిట నన్ను నించితి
వెన్న నున్న నూరఁగా వేడు కాయను
యిన్నిఁ జేసి శ్రీవేంకటేశ నన్ను మన్నించితి
వన్నువఁ బాదము దొక్కె నప్ప ణియ్యవయ్యా

పె శృ రేకు: 17-5 బౌళి సం: 17-101

పల్లవి: రంగ రంగ రంగపతి రంగనాథ, నీ
సింగారాలే తఱవాయ శ్రీరంగనాథ

చ. 1: పట్ట్టిపగలే మాతోఁ బలచఁగా నవ్వేవు
వొట్టు లేల పెట్టుకొనే వో రంగనాథ
వట్టిమాకు లిగిరించు వడి నీ మాటలు వింటే
ఱట్టిడి వీమేర మీఱకు రంగనాథ

చ. 2: చేతులు చాఁచేవు నీవు చేరి నా చన్నులమీఁద
రాతిరి మాయింటికి రా రంగనాథ
యీతల నీ నవ్వులకే యిక్కువలు గరఁగితి
బూతులఁ దిట్టకుమీ పోపో రంగనాథ

చ. 3: కావేరీరంగమున కాంతపై పాదాలు చాఁచి
రావు పోవు యెక్కడికోయి రంగనాథ
శ్రీవేంకటాద్రిమీఁద చేరి నన్నుఁ గూడితివి
యేవలచచిన నీవే యిటు రంగనాథ

పె శృ రేకు: 17-6 శంకరాభరణం సం: 17-102

పల్లవి: ఎదురు గొసరితే యేది వలపు
యెదలోఁ గపట ముంటే యిఁక నేది వలపూ

చ. 1: కాంత నీతో నలిగితే కడుఁ బ్రియము చెప్పక
యింతలో మా రలిగితే నేది వలపూ
పంతానకు చెలి నీతో పలుకక వుండితేను
వంతుల కూరకుండితే యేది వలపూ

చ. 2: వొంటి నీ మనసు చూడ వువిద యిందు రానంటే
యింటికి నేఁగకుండితే యేది వలపూ
అంటకు మంటాఁ జెలి అదలించు కొంటాఁ బోతే
వెంటఁ దగులకుండితే నెస నేది వలపూ

చ. 3: సటలకు నినుఁ జూచి జలజాక్షి తిట్టితేను
యిటులా మొక్క కుండితే నేది వలపూ
ఘటన శ్రీవేంకటేశ కౌఁగిటఁ గూడితి వాకె
తటుకున మీకె కాక ధరనేది వలపూ

పె శృ రేకు: 18-1 శ్రీరాగం సం: 17-103

పల్లవి: ఎరపరికము లింక నేటికయ్య
పొరుగు వొంతలనే పొసఁగఁగ వలదా

చ. 1: నగవున నీతో నసుపు నటించఁగ
మగువతోఁ బరాకు మానవయ్య
సగముదెగువతో సరసము లాడఁగ
నిగిడి రాజసము నెరపఁగ వలెనా

చ. 2: వంతుకు నీపై వలపులు చల్లే
యింతితోడ బిగు విడేలయ్య
మంతనమున నిను మర్మము లంటఁగ
సంతకూటములు జరపఁగ వలెనా

చ. 3: చెక్కు నొక్కి పై సేసలు చల్లఁగ
మక్కువ వెఱగులు మానవయ్య
యెక్కువ శ్రీవేంకటేశ కూడితివి
తక్కక రతిఁ జెలిఁ దరమఁగ వలెనా

పె శృ రేకు: 18-2 మాళవిగౌళ సం: 17-104

పల్లవి: మాపై నింత కరుణైతే మంచి దాయను
చూపుల నీ పాటి నన్నుఁ జూచితివిగా

చ. 1: నీవు గలిగియుండఁగా నివ్వెఱఁగేల
చేవ దేరి యుండఁగాను చిన్నఁబో నేల
కావరాన న న్నేల గరిసించేవు
యీ విధి బుజ్జగించ నీ కేమౌదు నేను

చ. 2: చేరి నీవుఁవే డుకోఁగా చెక్కు చే యాల
గారవించఁగా నాకు కన్నీ రేల
పూరకే న న్నేల యింక వొడి వట్టేవు
నారుకొన్నసతులు శానలు గారా నీకు

చ. 3: కౌఁగిట నీవు గూడ గా కాంతాళ మేల
మాఁగినమో వియ్యఁగా మారాడ నేల
దాఁగినఁ బోనీక నన్ను దక్కఁ గొంటివి
పాఁగిన శ్రీవేంకటేశ పంతమింత వలెనా

రేకు: 18-3 ఆహిరి సం: 17-105

పల్లవి: ఏఁటికి నీ మనికితా లింతేసి నీకు
జోటికి నీ వజ్రాంగి జోడవై వుండరాదా

చ. 1: మాట లాడనేర దంటా మగువనుఁ బొగడేవు
నీటున నీవైనాఁ గొన్ని నేరుపరాదా
చాటువతో చిన్ననాఁడు చదువని కడమలు
నేటనే యాపెమారు నీవే చదువరాదా

చ. 2: కడు ముద్దరాలు చెలి కన్నె యంటాఁ బొగడేవు
చిడిముడి నీవు ప్రౌఢఁ జేయఁగరాదా
పొడవుగా వారివారు బోధించేబోధలెల్లా
వడిగా నీ వవి యెల్ల వ్రాసుకొనరాదా

చ. 3: కపటము నేరదంటా కౌఁగి లించే వాపెను
వుపమ లాపెకుఁ జెప్పి వొనరరాదా
యిపుడే శ్రీవేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
రపమాయ నాపెనిందు రప్పించ రాదా

రేకు: 0018-4 సామంతం సం: 17-106

పల్లవి: ఔనయ్య మరి యడుగ నేఁటికి
నా నీ వయసులు నయము లిచ్చే

చ. 1: కొలువులోపలికొమ్మ మాటాడితే
నిలువెల్ల నిదె నీకుఁ జెమరించె
చెలు లవి చూచి సిగ్గులు వడిరి
చలివాపె నేఁడు జంటవలపు

చ. 2: సరసము నీతో సతి ఆడితే
ఆరయఁగ గురులాయఁ జెనకులు
పొరుగువారెల్ల పొరచి చూచిరి
తెరదీసి నిదె తెగ నాసలు

చ. 3: కౌఁగిటిలో నిన్ను కాంత గూడితేను
మూఁగి నీ మోవిని మంచితేనె చిందెను
ఆఁగిరి శ్రీవేంకటాధిప సతులు
యేఁగుఁ బెండ్లి సేసె నీడనే రతులు

పె శృ రేకు: 18-5 శ్రీరాగం సం: 17-107

పల్లవి: బోన మెల్లా చల్ల నారి పొద్దు వోయను
పూని నేము నీకు నిట్టె బుద్ధి చెప్పవలెనా

చ. 1: పొత్తుకుఁ బిలిచితేను పొలఁతి దా సిగ్గువడి
చిత్తములోఁ గొంకి చెక్కు చేతఁ బెట్టీని
హత్తి యాపెకు నీమీఁది యాసలెల్లాఁ బెట్టేవు
బత్తి గలిగితే చెయ్యిఁవట్టి తియ్యరాదా

చ. 2: కడి చేసి చేతి కియ్య గా నింతి నవ్వుకొంటా
చిడిముడి మారుమోము సేసుకొనీని
అడరి రాదాయ నంటా నాపెతో నలుక లేల
కడు నీకు వేడుకైతే కమ్మి మొక్కరాదా

చ. 3: సతిఁ గౌఁగిలించి పట్టి చవులు నోరి కియ్యఁగ
రతి బువ్వ మారగించి రమణి మెచ్చె
యితవై శ్రీవేంకటేశ యీ యలమేలుమంగను
మతకానఁ గూడితివి మరి వేళ లేదా

ఆ శృ రేకు: 18-6 ఆహిరి సం: 17-108

పల్లవి: ఇంతలో నిట్లనైతే యింతి గేలిసేయదా
చింత దీర నాపె కిట్టె చెప్పరాదా ప్రియము

చ. 1: తురుము నలఁగను నీతొడ మీఁదఁ బవ్వళించి
తరుణి నీ కెమ్మోవి తప్పక చూచి
సిరిమించ నవ్వితేనే చెక్కులెల్లాఁ జెమరించె
నరగన్ను మోడ్చి చూచే వాడరాదా మాటా

చ. 2: గక్కన వాలారుగోళ్ళ గడ్డము వట్టి యూఁచి
మిక్కిలి కామిని నీతో మేలమాడఁగా
నిక్కి నీకడకు వచ్చి నివ్వెఱఁగె కరఁగుచు
యెక్కువ మై పులకించె వియ్యరాదా విడెము

చ. 3: వీఁపునఁజన్నులు మోపి వెలఁది కౌఁగిటఁ గూడి
యేపునఁబెక్కు చేఁతల నెలయించఁగా
ఆఁపలేక శ్రీవేంకటాధిప నీవే యాకె
పైపైనే కూడేవు పట్టరాదా మనసు

పె శృ రేకు: 18-7 భైరవి సం: 17-109

పల్లవి: ఏ వలపుదానవే యిందులో నీవు
యీవల నావలనునీ యెమ్మె లేమి చెప్పినే

చ. 1: చెప్పరాదే నీ వలపు సిగ్గు విడిచి యేమైనా
గొప్పలుగా నచ్చు వ్రాసుకొన్నదానవా
అప్పటి మానవే నీవు అతనిఁ గానని వేళ
వుపరా అగ్గళ్లు వురికినదానవా

చ. 2: ఆయ లేవే నీ వలపు అతనికి సెలవుగా
చేయార ముంగురు లందిచ్చిన దానవా
వేయి నేల చెప్పేవే విభునికి సొమ్మెల్లా
పాయక యెదురు వెట్టి పనిగొన్నదానవా

చ. 3: యింత యేలే నీ వలపు యింటివారి మఱపించి
పొంతఁ దప్పు పైఁడివట్టి పొందేదానవా
యింతలో శ్రీవేంకటేశుఁ డితఁడిట్టె నన్నుఁ గూడె
చెంతఁ దప మిందుకే సేసినదానవా

పె శృ రేకు: 19-1 హిజ్జిజి సం: 17-110

పల్లవి: అప్పటి నాకు మోహించే వదియుఁ జాలక నీవు
ముప్పిరిగొనె నిట నీముందరఁ గోరికలు

చ. 1: యివ్వల నావల నీకు నిద్దరు సతులపొందు
వువ్విళ్ళూరఁ గలిగెఁగా వొక్కమాటే
పువ్వులు దొంతరలై పూఁచుఁ గాక తనువులు
కువ్వని పేరులవలె గూడేది యరుదు

చ. 2: ముద్దుముద్దు వలె నీకు మూఁకగొల్లితలపొందు
వొద్దనుండఁ గలిగెఁగా వొక్కమాటే
యెద్దులబంతి గట్టుదు రెండైనా మగువల
కొద్ది మీఁఱ బంతిగట్టి కూడేదే యరుదు

చ. 3: బలిమి నన్నుఁ గలసి పదారువేలసతుల
వొలిసి కూడితివిగా వొక్కమాటే
కలగూరగంప గద్దు గాక శ్రీవేంకటేశ్వర
కులములొక్కటిగాఁ గూడేదే యరుదు

రేకు: 0019-2 రాయగౌళ సం: 17-111

పల్లవి: ఏల నీకు జాణతనా లింతలో నాతో
కోలుముంద్దై తియ్యఁబోతే గోడపై సున్నాలు

చ. 1: మగనాలిమాటలు మంచినీటితేటలు
తెగనాడ రట్టే మోవితేనెవూటలు
సొగసి కొలనిదరిఁ జూచితివి తొల్లి నీవు
నగ నేల నీ వలపు నానని సనిగెలు

చ. 2: వెలయాలిచేఁతలు వింతబయలింతలు
కొలదిఁవెట్టిరు కొనగోరిగీఁతలు
కలుగుఁబో యింకా నీవు గడియించుకొంటెను
పిలిచిపెట్టఁగఁ బోతే బియ్యపుఁబణ్యారము

చ. 3: జవరాలిపొందులు చలివేఁడివిందులు
నవకపుచన్నులు గొనాలగొందులు
యివల శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
కనగూడకున్న చింతకాయలకజ్జా యమూ

రేకు: 19-3 రామక్రియ సం: 17-112

పల్లవి: ఏమిటికి నింతేసి యింత కోపగలనా
వోముచుఁ దాఁగలఁడని వుండేదే చాలదా

చ. 1: యెగసక్కేలకు నేము యిద్దరమూ దగ్గరతే
తగవు దేరిచేవాఁడు తానే కదే
తెగువలు నెరపఁగా తియ్యనిమాట లాడి
వగపులు దీర్చేటివాఁడు దానే కదవే

చ. 2: చయముగ నేను వారు జగడాల నలసితే
దయఁ దలఁచేవాఁడు తానే కదే
నయ మెఱుఁగనిమమ్ము నంటునఁ జూటాలఁ జేసి
ప్రియముచెప్పేటివా డుఁబెరసి తానే కదవే

చ. 3: ఆలరి కోపముతోడ నాపె నేను గొసరితే
తాలిమితో నుండేవాఁడు తానే కదే
యీవల శ్రీవేంకటేశుఁ డిటు మమ్ముఁ గలసెను
వాలాయించి పంత మిచ్చేవాఁడు తానే కదవే

పె శృ రేకు: 19-4 ముఖారి సం: 17-113

పల్లవి: ఇంతకంటెనెమి సెతు నింకా నానతియ్యవయ్య
కాంత లిందరూ మెచ్చఁ గడమా జేసెను

చ. 1: చేకొని నీ వదనము చెంగలించవలె నంటా
నీ కాంతఁ బొగడుదు నీ ముందరనే
ఆక డీకడ నీ మేనుబ్బై యుండవలె నంటా
జోకల నీదేవులసుద్దు లే బొగడుదు

చ. 2: సారెకు నాతో నీ విచ్చకమై నవ్వుదు వంటా
ఆరయ నీయాండ్లపై నాసవెట్టుదు
ఆరీతి నీ విట్టె మాయండ నుండవలె నంటా
యేరా నీ మోహపువారి నింటికి నేఁ దెత్తును

చ. 3: గక్కున నా రతివేళ కరఁగుదువో యంటా
తక్కి నీ లేమల నేర్పు దలఁపింతును
యెక్కు వెటిఁగి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మక్కువ ప్రాణసతులమారై నేఁ జొక్కింతును

పె శృ రేకు: 19-5 రామక్రియ సం: 17-114

పల్లవి: ఎన్నటి కెన్నటి పొందు లేమే తాను
సన్నల తా వద్ద నీని సాదా తాను

చ. 1: మొక్కలాన నీవు నేను మోరతాపు లాడఁగాను
చక్కట్లు చెప్పవచ్చీ సవతే తాను
వుక్కుమీరి నే నిన్ను వుద్దండాలు సేయఁగాను
దిక్కై వచ్చీ నీపాలి దేవరా తాను

చ. 2: కొలఁది మీ రిద్దరము కొంగులు వట్టి తియ్యఁగా
సొలసి యడ్డాలు వచ్చీఁ జుట్టమా తాను
బలిమి నీచేత నేను బాసలు సేయించుకోఁగా
యెలమి ని న్నదలించీ యేలికా తాను

చ. 3: జట్టిగొని మనలోన సరసము లాడఁగాను
అట్టే యందులకు వచ్చీ నాలా తాను
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడఁగాను
గుట్టున బుద్దులు చెప్పేగురువా తాను

పె శృ రేకు: 19-6 సామంతం సం: 17-115

పల్లవి: సారిది మీ సరితలు చూతము గాక
అరిది మమ్మేల సాకి రడిగేరు మీరు

చ. 1: చెలిమికాఁడ వు గాన చెలి నీకు వెట్టెఁ దమ్మ
మలసి నవ్వులు నవ్వ మాకేల
బలిమికాఁడవు గాన పట్టి నిన్నుఁ దియ్య గాను
అలరి యడ్డాలు రా నంత మా కేలా

చ. 2: చేకొద్దివాఁడవు గాన చెప్పె నీకుఁ బను లెల్లా
మాకు నిన్ను గేలిసేయ మఱి యేలా
పైకొన్నవాఁడవు గాన పడతి రాకొట్టు గొట్టె
కైకొని మీమాటలు వంకలు దిద్ద నేలా

చ. 3: మేనఁవాడ వటు గాన మెడఁగట్టుకో నిచ్చె
తానే యలమేలుమంగ తమక మేలా
పూని శ్రీవేంకటేశుఁడ పొందుగా మ మ్మేలితివి
కానీలే మి మ్మెఁఱిగితి కడమ లింకేలా

పె శృ రేకు: 20-1 ముఖారి సం: 17-116

పల్లవి: అంగన నీపతి రప మాయఁ గదవే
ముంగిటి సిగ్గులు పెద్ద మోపాయఁ గదవే

చ. 1: నగవుకొలఁది గాదు నాలి నీ చెక్కుచెమట
దగదొట్టి పయ్య దంతాఁ దడిసెఁ గదే
పగటు నీ చన్ను లంటి బట్టిబాయటఁ బడెను
వొగి నొకటి సేయంగ నొకటాయఁ గదవే

చ. 2: పెనఁగేకొలఁది గాదు పెట్టుకొన్న నీ తురుము
పనివడి విడువా ముడువా బట్టె గదవే
ననుపున నందు వంక నా టి కొనగోరి వాఁడి
గునిసీ కలకాలము గుఱుతాయఁ గదవే

చ. 3: కూడినకొలఁది గాదు గుంపులైన పులకలు
ఆడనే సొమ్ములు బిగువాయఁ గదవే
తోడ శ్రీవేంకటేశుఁడు దొమ్మిరతులఁ గలసె
చూడఁ జూడ నవ్వు లెల్లా సూడిదాయఁ గదవే

పె శృ రేకు: 20-2 పాడి సం: 17-117

పల్లవి: నెట్టన యీ మాటలకు నేనా నీకు
యెట్ట నెదురుకట్ల నింక నేటి యానలు

చ. 1: అండ నున్నచెలు లెల్లా అట్టే చుట్టాలై వుండఁ గా
నిండుకొన్న లాఁతిదాన నేనా నీకు
వండవండనట్లుగా వారిఁ జూచి నవ్వేవు
యెండ లెల్లా నీడ లాయ నింక నేటి యానలు

చ. 2: యిరుగుపొరుగువారు ఇచ్చకము లాడఁగాను
నెరవుగా నిష్ఠూరిని నేనా నీకు
కరఁగి ఱచేవె వా కతలెల్లా నీసొమ్ము
యెరవు సతములాయ నింక నేటి యానలు

చ. 3: దొమ్మి డిగపువారు తొల్లే నీకు లోనుగాఁగ
నెమ్మినందుకుఁ దోడు నేనా నీకు
కమ్మర శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
యెమ్మె లెల్లా నెరవేరె నింక నేటి యానలు

పె శృ రేకు: 20-3 శ్రీరాగం సం: 17-118

పల్లవి: మగవాఁడు ధీరుఁడు మనసు విప్పఁగ మోపు
నగవయ్యీ ఆపతోను నాథుఁడవు నీవు

చ. 1: నేరుపరియైనదే నిండుకొని యుండ నేర్చు
నారీతి నాఅడికత్తె ఆడు వెంగేలు
మేరతోఁ గోపించ వద్దు మెచ్చ వద్దు అంతలోనే
ఆరితేరి నీచేతిది ఆఁటదానిగుణము

చ. 2: చనవరియైనది సమ్మతించు నన్నిటికి
పెనఁగి మంకువోజది పెచ్చువెరుగు
కినియఁగ వద్దు మఱి కిందుపడి మొక్కవద్దు
అనయము నీచేతిది ఆఁటదానిగుణము

చ. 3: వలపు గలిగి వడివడిఁ దా నింటికి వచ్చు
పెలుచుపంతాలది పిలిపించును
యెలమి శ్రీవేంకటేశ యింతి నిట్టే కూడితివి
అలరఁగ నీచేతిది ఆఁటదానిగుణమా

పె శృ రేకు: 20-4 ఆహిరి సం: 17-119

పల్లవి: నీవే యెఱుఁగుదువయ్యా నే నేమీ నెఱుఁగను
చేవదేరి యేమి మేలు సేయఁ గోరినాఁడవో

చ. 1: చెక్కిటిచేతితోడ చెఱఁగు మాసియుండఁగా
మొక్కలానఁ బైకొని ముట్టఁ జూచేవు
దిక్కుల నీలో నింత తెగువ గలవాఁడవు
యెక్కడ నెవ్వతెవొద్ద నేమి సేసితివో

చ. 2: మంతనాన యింటిలోన మఱచి నే నుండఁగాన
చెంత నావొద్ది బాగాలు చేతఁ దీసేవు
యింతేసి పనులకు నేవగించనివాఁడవు
వింతవారివొద్ద నెంత వెరవు మాలితివో

చ. 3: సిగ్గుతో నెపా లూరకే సేసుకని నే నుండఁగా
దగ్గరి న న్నిట్టే కూడి తమకించేవు
యెగ్గనక శ్రీవేంకటేశ యింతటివాఁడవు
వెగ్గళించి యెందెందు వెల్లివిరి యైతివో

పె శృ రేకు: 20-5 సామంతం సం: 17-120

పల్లవి: ఇందరును(జూడ(గా నీ కెంతబలువు
విందువెట్టె మోవితేనె విడు విడవోయి

చ. 1: పవ్వళించి నా వీది పయ్యదకు(బెనగేవు
యెవ్వతెనీకు(జెప్పె నీ బుద్ధులు
దువ్వటపుచీర యిది తొల్లే కడు నునుపు
పువ్వువలె జారీ నిట్టే పో పో విడవోయి

చ. 2: వింతవుంగరము వెట్టి వేలు వట్టి తీసేవు
యెంతతడవు నే నుండి యెంచుకొంటివో
చెంతల నా గో రున్నది చేయమ్ముకంటె వా(డి
పంతములు మాతోను(జెప్పక విడవోయి

చ. 3: వొడివట్టి తీసి నన్ను వొక్కటై కౌగిలించితి
వడరి(శ్రీవేంకటేశ అప్పుడే నీవు
జడియ గొండలవంటి చన్నులు మిక్కిలి నెత్తే
వెడ(గు నీయాసోదాలు విడువడవోయి

పె శృ రేకు: 20-6 ఆహిరి సం: 17-121

పల్లవి: అందుకే లోఁగేఁ గాక అలిగితినా నేను
అందముగా నీమాట లడుగరే విభుని

చ. 1: కోమలపు మేనివాఁడు కొండలవంటిచన్నుల
నేమని వొత్తుదునే న న్నేల పట్టీనే
దీమసపుతోడితాను దేవరవంటివాఁడు
యీమేరఁ దనమోవియెంగి లేమి సేతునే

చ. 2: పూని నల్లఁ గలు వలపోగువంటి తనమీఁద
యేనిగెనడపుపాదా లెట్టు వేతునే
పానఁబట్టినచూపుల జగములేలేటివాని
కొనలుకొనలుగాఁగఁగుచ్చి యె ట్టెత్తుదునే

చ. 3: శ్రీవేంకటేశ్వరుని చిగురు నా చేతులు
కావరించి నే నెట్టు కౌఁగిలింతునే
ఆవటించి తానే కూడినటువంటి చెమట
వావిరి తనపై నెట్టు వడియింతునే

పె శృ రేకు: 21-1 శ్రీరాగం సం: 17-122

పల్లవి: ఇందర మున్నారము యెవ్వతె యేచూపు చూచె
అందముగా నీవే నా కానతియ్యవయ్యా

చ. 1: సిగ్గు వడ్డ చూపులు చిఱుతలై మీఁద బారు
దిగ్గన లోనైనచూపు తీగెసాగును
యేగ్గువట్టినచూపులు యీడా నాడా మలసును
దగ్గరి పైకొన్నచూపు తగులై నిలుచును

చ. 2: ఆసపడ్డ చూపులు అంచలంచలై వచ్చు
వేసారుకొన్నచూపు వేళమే మళ్ళు
రోసపుచూపులు మించురూఢిఁ గడకండ్లను
వాసులచూపులు తమవద్దనే వుండును

చ. 3: వొలసీ నొల్లనిచూపు వోరలై కడఁబారు
వలసినచూపు పరవశ మందించు
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
తెలుసు నన్నియు నీకే దిమ్మరివి గనక

రేకు: 21-2 పాడి సం: 17-123

పల్లవి: ఏమిరా నన్ను నే లనేవు నీవు
కామించినట్లానే కా దనేనా

చ. 1: పిలువనా నిలువనా ప్రియముతో నీయెదుట
చెలులచే నప్పటిఁ జెప్పి యంపనా

చ. 2: పెనఁగఁగ నేలరా బిగిసేవు నాతో
వినయముల నే నిన్ను వేఁడుకొననా

చ. 3: శ్రీవేంకటేశ నన్నుఁ జెలరేఁగి కూడితివి
దేవుఁడవు నీకు నే దేవులనే కానా

పె శృ రేకు: 21-3 కన్నడబంగాళం సం: 17-124

పల్లవి: వాఁడే నీపతి వాఁడే సరసుఁడు వాఁడే చతురుఁడు
నేడు నీ కీ సిరులు దొరకెను నీవుసేసినభాగ్యమే

చ. 1: తమక మేటికే యాతఁడే యీడకు తానే రాఁగాను
రమణి నీవే విన్నవించవే రతిరహస్యములు
జమళి సిగ్గుల నాడఁజాలక సతుల నంపుదురా
కొమెర వయసిదే చేతి కబ్బెను కొంక నేమిటికే

చ. 2: వినయ మేటికి ఆతఁడే నిన్నును వేఁడుకొనఁగాను
మనసు నీవే కరఁచఁ గదవే మర్మములు రేఁచి
చెనకువేళల నీవు లోఁగుచు చెలుల నంపుదురా
వినవే నేర్పులు నీకుఁగలుగఁగ వెనకతియ్యకువే

చ. 3: నగవు లేటికే శ్రీవేంకటనాథుఁ డొరయఁగను
అగడు నీవే సేయఁ గదవే అతనిఁ గుచములను
మగఁడు నీవునుఁ గూడి తగవులు మమ్ము నడుగుదురా
నిగిడి నీకే తెలునింకను నీవు లోఁగకువే

పె శృ రేకు: 21-4 ముఖారి సం: 17-125

పల్లవి: బాపు బాపు నీ వింతపనివా డవైతిగా
తీపుల నాఁటదానిచే తీరుకువచ్చితివి

చ. 1: కందువ నీచేతు లెల్లా గట్టులై వున్నవి వే
గందము దీసిత్తు వా కాంతకు నీవు
అందమ్మై వాచకపుమాట లాడేవు సారె నాపె
పొందులఁ జదివించునా పొస్తకములు నిన్ను

చ. 2: యేకడనుఁ జూచినాను యెట్టినాయ నీ గోళ్ళు
ఆకు మడిచి యిత్తువా ఆమెకు నీవు
చేకొని నీ తురుమెల్లా చెదరి వున్నది నేఁడు
పోకుమని నీ నెత్తి పూవులు మోపించెనా

చ. 3: ఆనుకొని నీపచ్చడ మదే పసపై వున్నది
పానుపుగా బరతువా పడఁతికిని
మోనాన శ్రీవేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
కానిమ్మని వలపులు కలయఁ బెట్టించెనా

రేకు: 0021-5 భైరవి సం: 17-126

పల్లవి: తమక మేలే యింకను నీతలఁపు లాతఁ డెఱుఁగు
సముకమందు నేఁడు నీ చలములెల్లాఁ దీరీని

చ. 1: సేయరాని బా లతఁడే సేసెఁ గదవే నీకు
మాయదారియలుక యిటు మఱవఁ గదవే నీవు
ఆయ నాయ రావే అతఁ డదివో వున్నవాఁడు
కాయ మంటినప్పుడే నీ కపటమెల్లాఁ బాసీని

చ. 2: కన్నెనాఁడే యతఁడ నీకుఁ గన్నువేసినాఁడూ
యెన్నరాని బిగువు యింక యేల సేయ నీవు
తన్నుఁదానే యిటకుఁ దగులఁదీసినపుడే
నిన్నమొన్నఁ గలవి తన నింద లెల్లఁ బాసీని

చ. 3: చిందనూరిలోన నీకు చేయి చాఁచె నితఁడూ
మందెమేళ మేలే వాని మానలేవు నీవు
కందు వలర నగుతా యిట్టె కనకరాయఁ డిపుడా
విందువలెనే యెనసె శ్రీవేంకటేశుఁ డితఁడు

పె శృ రేకు: 21-6 లలిత సం: 17-127

పల్లవి: సాలు సాలు మాటలు సక్కనుండవు
జోలికాఁడ మమ్ము నేల సొలసేవు నీవు

చ. 1: వుట్ల మీఁదటి సుద్దు లో హో యిన్ని యాసారాలు
సెట్లు శామలలోని సేఁతలు మావి
వుట్లు వూరువా లెత్తి పొగడుదునో వుండేవో
గట్టు మా సన్ను లేల కదిసేవు నీవు

చ. 2: మందగోసుటాలలోనిమనికి నీవుండేది
పందిటిగవులలోని పడుక మాది
చిందరవందరపని చెప్పుదునో వుండేవో
అందనిపండ్ల కేల యఱ్ఱు చాఁచే విపుడు

చ. 3: పిల్లఁగోవి రాగాలు పెలుసు నీ మాటలు
కొల్లగా మఱి పిక కూఁతలు మావి
యెల్లగా శ్రీవేంకటేశ యిట్టే మమ్ముఁ గూడితివి
సెల్లు నీకు నేమయినా సేయవయ్య యింకను

పె శృ రేకు: 22-1 సామంతం సం: 17-128

పల్లవి: దొమ్మిసరసాలాడితే దొరతనాలు సెల్లునా
వుమ్మడినే సక్కనాయ నుండవయ్య నాయఁడా

చ. 1: వోసోసి నీవనఁగా వోరోరినేననఁగా
బేసిసరి మాట లివి బెరసి గారా
కాసు సేయని పనికి కల్లలు గారులు నీపై
మోసి రాఁగా మళ్ళీ మళ్ళీ మొక్కవద్దు నాయఁడా

చ. 2: సేయి నీవు లేయఁగా సెనకి కాలుఁదాఁకగా
నాయము వెంటవెంటనే నడసి గారా
ఆయములు సోఁక నాడి అలిగి నే నుండఁ గాను
కాయకమ్మై మా వేళ గాయముద్దు నాయఁడా

చ. 3: కౌఁగిట నీ వంటఁగా సక్కని నాగోరు దాఁకఁగా
సేగలెక్కి వలపులు సిమిడి గారా
యేగి వచ్చి శ్రీవేంకటేశుఁడవై కూడితివి
బాగుగా యింతేసి కిందుపడవద్దు నాయఁడా

పె శృ రేకు: 22-2 రామక్రియ సం: 17-129

పల్లవి: ఇన్నిటా నాకుఁ జుట్టా లింక నెవ్వరు
మన్నించితివి వేళ మరి చెప్ప నున్నదా

చ. 1: వెక్కసపుఁ గోరికల విరహమే నాది గాక
నెక్కొన్న తనువు కాఁక నీది గాదా
చెక్కునఁ బెట్టిన యట్టి చేయి నా డింతె కాక
చిక్కి దయదల చేటి చింత నీది గాదా

చ. 2: చిమ్మిరేఁగేయట్టి చిఱుఁ జెమటలే నాది గాక
నెమ్మది నింతా మోఁత నీది గాదా
కమ్మి కాటుక కన్నుల కాలువలు నావి గాక
తమ్మిచేతఁ దుడిచేటి తడి నీది గాదా

చ. 3: దగ్గరి నిన్నుఁ గూడేటి తమకమే నాది గాక
నిగ్గులరతియలపు నీది గాదా
మొగ్గళపు నిట్టూర్పు శ్రీవేంకటేశ నాది గాక
బగ్గన నవ్విన నవ్వు పైపై నీది గాదా

పె శృ రేకు: 22-3 సామంతం సం: 17-130

పల్లవి: కలగంప వలపాయ కాదా మరి
కల దెచ్చి పై వేసేవు కాదా మరి

చ. 1: యెక్కడో యెవ్వతెసుద్దు లిటు నీమతిఁ బారితే
గక్కన నాతో నవ్వేవు కాదా మరి
దక్కియున్నయాపె మీఁది తమక మిట్టె తలఁచి
కక్కసించేవు రతికి కాదా మరి

చ. 2: యిరవైన నీమోహ మిట్టె పైఁ గుమ్మరించి
కరఁగి చెమరించేవు కాదా మరి
యెరవుల కాతరాన యెదిరి ని న్నెఱుఁగక
గరువపు మా టాడేవు కాదా మరి

చ. 3: చలివాసి ఆపెనీడ సరిచేసు లాడుకొంటా
కలసితి విటు నన్ను కాదా మరి
చెలులెల్లా నొక్కటె శ్రీవేంకటేశ్వర నీకు
కలిగె నిద్దరి మేలు కాదా మరి

రేకు: 0022-4 దేసాళం సం: 17-131

పల్లవి: పెట్టినవి నీ సొమ్ములు కట్టినది నీ రెంటెము
యిట్టిదాన నేను యేమి చూచేవయ్యా

చ. 1: కతలు చెప్పితి నీకు కైకొని వేగినంతాను
వెతల చెమట లార విసరితిని
మతిలో నున్నపనులు మఱి నే నేమి నెఱుఁగ
సతుల నాయింటి కేల సారె నంపేవయ్యా

చ. 2: నిద్దుర వోకుండఁగాను నీ వొద్దనే కూచుండితి
గద్దించి నీ కాఁక దేర కప్ర మిచ్చితి
సుద్దులే కాని యింకా చుట్టరికా లెఱుఁగను
పెద్దరికాలకు నేల పిలిపించేవయ్యా

చ. 3: పానుపుపై బోరలఁగా పడఁతి నీకుఁ దోడుగా
కానిమ్మని వెలయఁగాఁ గౌఁగిలించితి
మౌనాన నుండితి గాని మరి నిన్ను బాసదుగ
పూని శ్రీవేంకటేశుఁడ పొగడ నేలయ్యా

రేకు: 0022-5 ముఖారి సం: 17-132

పల్లవి: ఆసోదకాఁడవు నీ వన్నిటాను
ఆ సుద్దులే యడిగి నీ వానతియ్యవయ్యా

చ. 1: చిడిముడి నాచేయి చేత బిగ్గెఁ బట్టుకొని
కడు నాపెచెవిలో నేకత మాడేవు
తడఁబడి వలపులు దండనుండి యిద్దరిలో
వడిసెఁ జెమటలు యెవ్వతెకుఁగా నయ్యా

చ. 2: పంతమున నావమీదఁ పాదములు చాఁచుకొనే
పొంత నాపె చన్నులపైఁ బొరలేవు
బంతి నున్నారము నేము పచ్చిపులకలు మీకు
దొంతులాయ చెక్కులనే తొయ్యలికి నయ్యా

చ. 3: కనుసన్నలనే నన్ను కందువ కౌఁగిటఁ గూడి
వెనక నాపెనుఁ గూడి వెస నవ్వేవు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలగల పాయ మేలు
ఘనమాయ కళలు యేకతలకు నయ్యా

పె శృ రేకు: 22-6 భైరవి సం: 17-133

పల్లవి: మేలే యిన్నియును నామీఁద మోపేవు
వాలాయించి నిన్ను మోచి వచ్చినమో కావా

చ. 1: చెక్కు లేల చెమరించెఁ జెలియా
అక్కడ నీపతి కడ కంపఁగానే పో
పొక్కి నేలే నీమోవి పొలఁతి
నిక్కి వేఁడిమాట లెల్లా నీ వాడు మనవా

చ. 2: కన్ను లేల యఱ్ఱనాయ కలికి
పన్ని కస్తూరి నాచేతఁ బతి కంపవా
మిన్నక బుసకొట్ల మెఱసే వేలే
యిన్నిటా నాతనికడ కెడతాఁకించఁగఁబో

చ. 3: కొప్పేల వెడ జాఱెఁ గోమలి
ముప్పిరి నీ వతనికి మొక్కు మనవా
యిప్పు డబ్బే శ్రీవేంకటేశు పొందులే
అప్పుడే నీవల్ల నాకు నందెనే యిన్నియును

పె శృ రేకు: 23-1 గౌళ సం: 17-134

పల్లవి: ఇంతలోనే వేగిరమా యిదివో నీవు
పంత మిచ్చి యిప్పుడే పదరితి వయ్యా

చ. 1: సిగ్గువడ్డ దానికే చెలరేఁగుఁ బ్రియములు
వెగ్గళించినది యే వేళమే కింద పడును
యెగ్గులు వట్టిన దిది యియ్యకోలుకువచ్చు
తగ్గి యాపె కేల లోఁగి తమకించేవయ్యా

చ. 2: కోపగించుకొన్నదే కోరి శాంతానకు వచ్చు
చేపట్లకు వచ్చినదే సేవ లన్నియుఁజేసును
పైపై కొట్లాడినదే పలుకుఁ దేనెలు చిందు
యీపాటికి నిట్టే యీపె కేల లోఁగేవయ్యా

చ. 3: బొమ్మల జంకించినదే పూచిఁ చిఱునవ్వు నవ్వు
నమ్మిక బాస గొన్నదే నంటున నుండు
యెమ్మెల శ్రీవేంకటేశ యీపె యలమేలుమంగ
కమ్మి కూడే వింక నేకడ లోఁగేవయ్యా

రేకు: 0023-2 సాళంగనాట సం: 17-135

పల్లవి: అందు కేమి దోసము అంతవాఁడ వౌదువయ్య
గందము పూసినయట్టి కపురా యిది

చ. 1: అప్పుడే నాతో మాటలాడి యాపెతో నాడేవు
కప్పురముదిన్ననోరి కపురా యిది
యిప్పటి నీ మేనిరేక లిటు నటు చాఁచేవు
తప్పునిరచ్చల దొరతనమా యిది

చ. 2: చాయల సన్నల రెంటా సరిఁదూఁగఁ దిరిగేవు
పాయపు మదముతోడి వంతమా యిది
చేయి చాఁచి వొండొరుల చేతులకు మొక్కించేవు
నీయంకెకు వంచుకొనే నేరుపా యిది

చ. 3: గక్కున నిద్దరి నిట్టె కౌఁగిలించుకొంటి విదె
పక్కునఁ బాలుదాగిన బలిమా యిది
మక్కువ శ్రీవేంకటేశ మమ్ము మెచ్చే వప్పటిని
మొక్కలపు రతులలో మోహమా యిది

పె శృ రేకు: 23-3 పాడి సం: 17-136

పల్లవి: ఏమి సేసితివో యయ్యా యిందుఁ గాని పొద్దు వోదా
రాముసు వేఁడుకొందువు రావయ్యా లోనికి

చ. 1: వుండుండి దిగ్గన లేచి వువిద లోని కేఁగి
పండఁబదె చింతతోడ పానుపుమీఁద
అండనే మేనిసొమ్ములు అవే పెట్టెలోనఁ బెట్టి
చండి సేసి యడిగిన చక్క మాకుఁ జెప్పదు

చ. 2: అప్పటి నంతటఁ బోక అంగన తెరలోనుండి
విప్పుచు నీపచ్చడము వెలివేసెను
తొప్పుఁ దోఁగేఁ జెమటక కస్తూరిబొట్టు పట్టుగాఁగ
యిప్పుడే తా దిద్దుకొని యేఁటి కన్నా మానదు

చ. 3: నీ వింతలో మొక్కఁ గాను నెలఁత చిఱునవ్వుతో
సేవచేసి కౌఁగిలించె శ్రీవేంకటేశా
వేవేలు వచ్చెఁ గోపము వేగిరమే తీరె మీకు
దేవరలే మీరిద్దరు దిష్టమాయ మాకును

పె శృ రేకు: 23-4 పాడి సం: 17-137

పల్లవి: మగరూపు గైకొన్న మగువ వంటి వాఁడవు
నిగుడి నిన్ను గెలువ నేఁడు మాతరమా

చ. 1: మాటలునీవాడఁగానే మచ్చికలు నోరూరి
తేటల నీచేఁత లెంత తియ్యు నుండునో
ఆఁటదాన నే నింత అన్నిటానుఁ జొక్కితిని
పాటించి పురుష లెంత భ్రమతురో యింకాను

చ. 2: పొంచి నీవు నవ్వఁగానే పులకించె నామేను
చంచున నీ కౌఁగి లెంత చలిగొనునో
మంచిదే యిల్లాలను మరిగితి ని న్నింత
అంచల వెలయాండ్లకు నాస యెంత పుట్టునో

చ. 3: గక్కనఁ గౌఁగిలించఁగాఁ గడుఁ దరితీపు పుట్టె
చక్కని నీమోవి యెంత చవిపుట్టునో
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
దిక్కులవా రెంత నిన్ను తేలి పొందవత్తురో

పె శృ రేకు: 23-5 సామంతం సం: 17-138

పల్లవి: కాతరపువాఁడవు గజరు నీకుఁ బట్టితే
నీతి యెఱిఁగినదాన నిన్నుఁ గా దనేనా

చ. 1: చనవరికాంతతో సరసము లాడఁగాను
కొనమాట లందుకొనే కూళాఁ గద్దా
వినేటి విభుఁడవు వివరించుకో కుండితే
పనియెఱిఁగినదాన పలికేనా నేను

చ. 2: మెఱసి వరుసకున మెలుఁత గాచుకుండఁగా
యెఱుకలు సేసుకొనే యెడ్డాఁ గద్దా
మొఱఁగుల మగఁడవు ముంద రెంచకుండితేను
వఱటులు వట్టేదాన వొరసేనా నేను

చ. 3: నిన్నుఁ గూడినచెలి నివ్వెఱఁగుతో నుండఁగా
కన్నుమొఱఁగి కలిసే గబ్బీఁ గద్దా
నన్నుఁ గూడి శ్రీవేంకటనాయక నీవు నవ్వితే
మన్నింపించుకొన్నదాన మఱచేనా నేను

పె శృ రేకు: 23-6 దేసాళం సం: 17-139

పల్లవి: నాటకపు నిన్నుఁ జూచి నవ్వు వచ్చీని
యేఁటికి వచ్చితి నేను యెంత సేసేవు

చ. 1: నిద్దిరించనలెనంటా నీ కురులు దువ్వితేను
వొద్దిఁ బండు మని యాల వొడి వట్టేవు
అద్దొ నీ పదాలు వాడి అట్టె నిన్ను జోకొట్టితే
కొద్ది మీఱ వలపులు గుప్పళించేవు

చ. 2: బడలక దీరుమని పాదములు నే నొత్తితే
బడినే పచ్చడము నాపైఁ గుప్పేవు
కడవారు రాకుండా గడియ నేఁ బెట్టితేను
విడిముడి తమకాన చిమ్మి రేఁగేవు

చ. 3: ముందరిజడను వాయ ముసుఁగు నేఁ బెట్టితేను
అందులోనే నన్నుఁ గూడి అట్టె మెచ్చేవు
కందువ శ్రీవేంకటేశ కన్నులు నే మూసి తేను
చందముగా రెప్ప లెత్తి సన్న సేసేవూ

పె శ్రు రేకు: 24-1 శంకరాభరణం సం: 17-140

పల్లవి: ఏసతిఁ బొందవలసో యిదొక నెపము వేసి
రాసి కెక్క వట్టే యాచారాలు సేసేవ్రూ

చ. 1: చివ్వనఁ దమ్మరసము చీరపై నీవే వుమిసి
అవ్వలఁ జెఱఁగు మాసె నని యాడేవు
జవ్వనమదము నీకు జాటీఁ జెంపలవెంటా
నవ్వు లెల్లా నేఁడే నీవు నవ్వఁగ వొద్దా

చ. 2: స్వామిని నిమ్మపంటిరసము పానుపుపైఁ బిండి
ఆముకొని కళరేఁ గెనని యాడేవు
కామాంధకారము నీకుఁ గన్నులఁ గప్పి వున్నది
చేముంచి నీ వుద్దండానఁ జెనక వద్దా

చ. 3: సరుస శ్రీవేంకటేశ జారించి నా పోఁకముడి
తెరవేయు మని సిగ్గు దేర నాడేవు
దొరతనపుగర్వము తొట్టీని నిలువెల్లా
నిరతి బలిమితోడ నిన్నుఁ గూడ వద్దా

పె శృ రేకు: 24-2 పాడి సం: 17-141

పల్లవి: కానీవయ్యా దాని కేమి కలది గల ట్టియాని
ఆనుకొని యింకా నెంత ఆసోదమో

చ. 1: పొలఁతి నంపు మంటేను పూఁటలు న న్నడిగేవు
తెలిసి నిరతి యప్పు దిద్దఁ గలనా
యెలమి నాపెవలపు యెరవు నాపైఁ బెట్టేవు
చెలుల కింకా నెంత సిగ్గు వాట్లో

చ. 2: వాడికెయింతికి కుదువగా న న్నుండు మనేవు
కూడి వావి విడిపించుకొనీ వశమా
మాడలవలె సతుల మారుపె ళ్ళాడేవు
తోడ నిట్టె యెందరిని దొడ్డిఁ బెట్టేవో

చ. 3: కొమ్మను కౌఁగిటఁ గూడి కొసరు న న్నడిగేవు
కమ్మరఁ దగులు నేను కావలెనా
దొమ్మి శ్రీవేంకటేశుఁడ తోడఁ బెండ్లాడేవు
మ మ్మిందరిని ఇక్కడ మండెమురాయఁడవై

పె శృ రేకు: 24-3 కాంబోదిసం: 17-142

పల్లవి: ఇందరికి నీవే గుటి యిదివో దిష్టాంతము
కందువతోఁ జేయవయ్య కాఁపురములూ

చ. 1: చేతికి లోనైనయట్టి చెలువుఁడు గలిగితే
యేతులకు రమణు లేమేమి సేయరు
గాతల నీ శిర సెక్కెఁ గామిని యొకతె దొల్లి
యీతలఁ దమవారు యేమి సేతురో

చ. 2: మగవాఁడు వలచితే మగువలయినవారు
యెగసక్కేలకును యేమేమి సేయరు
వెగటుగ నొక లేమ వీఁపున మోఁపించె నిన్ను
యెగువదిగువసతు లేమి సేతురో

చ. 3: శ్రీవేంకటేశ నీవు చిత్తగించి కూడితేను
యేవనితలై నా నేమేమి సేయరు
శ్రీవనిత వురముపైఁ జేకొని నిలిచె నీకు
యీవల మాబోంటెల్లా నేమి సేతురో

పె శృ రేకు: 24-4 రామక్రియ సం: 17-143

పల్లవి: నీవల్లనే వచ్చె నివి నేరమి యాపెకు నేది
వేవేగ నింక నయినా వేఁడుకో నీ విపుడూ

చ. 1: ఆకెతోడ మాటాడితి వంటానే పో, యింతి
దాకతోడఁ గంకణానఁ దాకచేసెను
మేకొని ఆపెసొమ్ము నీ మేన నుండఁగానే పో
కాకుసేసి వద్ద నున్న కాంతలతోఁ దిట్టెను

చ. 2: నగరానివారితోడ నవ్వితి నంటానే పో
పగదేర రొమ్ము దట్టి పంతమాడెను
అగడుఁ జెమట చూచి అంటుకొనే వంటానే పో
వెగటుఁ దామెరఁ గొని విసరె ని న్నిచటా

చ. 3: చెనకి యెందో సన్నసేసితి వంటానే పో
వొనరి పైకొని నీకు నొట్టు వెట్టెను
యెనసితివి శ్రీవేంకటేశ బలిమి నింతలో
అనుమాన మెల్లాఁ బాయ నందుకే తా మెచ్చెను

పె శృ రేకు: 24-5 సాళంగనాట సం: 17-144

పల్లవి: అవతారమందె నిదె అద్దమరేతిరికాడ
భవహరుఁడు శ్రావణబహుళాష్టమిని

చ. 1: వసుదేవుఁడు సేసిన వర తపము ఫలము
పసల దేవకిపాలి భాగ్యరేఖ
దెసల సజ్జనులకు తిరమైన పుణ్యము
కొరికె కంసుని గుండెదిగులు

చ. 2: నందగోపుని యెదుటి నమ్మిన యైశ్వర్యము
కందువ యశోదకు కనకనిధి
ముందరి గొల్లెతలకు మోహపుఁ బాలజలధి
సందడి శిశుపాలుని సంహరము

చ. 3: దేవతలమునులకు దివ్యమైన పరంజ్యోతి
భావించుదాసుల వజ్రపంజరము
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగే కృష్ణుఁడిదివో
దావతి నరకాసురు తలగుండుగండఁడు

పె శృ రేకు: 24-6 కాంబోది సం: 17-145

పల్లవి: వెరగుపడి చూచీ విభుడుఁ ని న్నందుకే
అరసినీ వలపు అందరిపైఁ బూతురా

చ. 1: నిగ్గుల నీ రమణుఁడు నిన్ను నటు దిట్టితేను
యెగ్గులు వేరొకతెపై నేల పెట్టేవే
వొగ్గుచు ని న్నాతఁడు వొడివట్టి తీసితేను
బగ్గన నాపెకొంగు పట్టించే వదేమే

చ. 2: తమకించి ని న్నాతఁడు తప్పక చూచితే నేఁడు
రమణినిఁ దెచ్చి ముందరనుఁ దోసేవే
సముకాన కొనగోర నాకె నొత్తవచ్చితేను
అమర వేరొకతె మే నటు దాఁకించేవే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడితేను
వావిరి నాపెకు నేల వంతువెట్టేవే
నీ వలమేల్మంగవు ని న్నురమెక్కించుకొంటే
భూవనితఁ దెచ్చి యట్టె భుజ మెక్కించేవే

పె శృ రేకు: 25-1 పాడి సం: 17-146

పల్లవి: ఇందాఁకా విరహమున యింతి బడలివుండెను
కందువ వలపుదేర కౌఁగిలించవయ్యా

చ. 1: మంచముమీఁదనుండి మఱి నీవు రాఁగా లేచి
నించి సెలవిని నవ్వె నీ నెలఁత
అంచెల నీ వందుకు నావవెట్టినా మానదు
కొంచక వేగమే వచ్చి కూచుండవయ్యా

చ. 2: వుద్దాలతో నిలుచుండి వూడఁ జిమ్మె నిన్నుఁ గని
వొద్దికతో తల వంచుకున్నదే చెలి
గద్దించి నీ వంతలోన కదిసి మెట్టు మనిన
వొద్దని నాపెపాదాల నొనరింపించవయ్యా

చ. 3: ముందరనినుఁ గని తమ్ముల ముమిసి తా మొక్కె
చెందె నలమేలుమంగ శ్రీవేంకటేశ
అందుకు మారుకు మారు అట్టె బాగాలు నీ విచ్చి
మందలించి ఆకు నీవు మడిచి యియ్యవయ్యా

పె శృ రేకు: 25-2 కాంబోది సం: 17-147

పల్లవి: పతిఁ బాసి విరహన భ్రమయకువే నిన్ను
మతకాన తమి రేఁచి మన్నించే నతఁడు

చ. 1: నిండుఁ జందురుఁడు గడే నీ మోము, నేఁ
డెండ లేఁటికి నాయ నీ వెన్నెల
కొండలే కదవే బాగుల చన్నులు, ఆ
గండుఁగోవెలకూఁత కారించె నలవే

చ. 2: కలికి బింబఫలము గదె నీ మోవి
పలుకుచిలుకలేల పగ లాయనే
అలులతురుము గదే అది నీకు
వలరాజు విలునారి వడిఁ బెట్టె నటవే

చ. 3: మెఱుఁగుల తీగెగదె మేను నీది
వెఱపుటమ్ము లేఁటికి వెగటాయనే
గుఱి శ్రీవేంకటేశుఁడు కూడె నిన్ను
తఱితో మున్నిటివెల్లా తలంపించె నటవే

పె శృ రేకు: 25-3 పాడి సం: 17-148

పల్లవి: ఎంత గట్టు వాయవే యేమే నీవు వోరి
పంతాన నందులో నీవు పంచుకోరా సగము

చ. 1: పట్టుకోవే కొంగు జారీఁ గామిని, నీకు
గట్టి తమ్మ చెక్కులంటెఁ గడుగుకోరా
తొట్టి పెంజెమటలు తుడుచుకోవే నీవే
బెట్టాయ కెంపులతోడిపెదవి మూసుకోరా

చ. 2: చన్నులకు దిష్టి దాఁకీ తి మూయవే, యాడో
కన్నెమేని పస పంటె కప్పించుకోరా
పన్ని నోర పచ్చి గారీ పలుకకువే, మేలు
నున్న నీ సిగ్గులు నీ కన్నులనే పడెరా

చ. 3: బెరయఁ బిఱుఁదువేఁగు పీఁటయెక్కవే, మంచి
వురము నీకుఁ వేలవు వోరుతువురా
సరుస గూచుంటి వౌనే సరసతలా నన్ను
గరిమ శ్రీవేంకటేశ కలసితి వవురా

పె శృ రేకు: 25-4 పాడి సం: 17-149

పల్లవి: ఇంతటఁ గాని గురుతు యిందరు నెఱుఁగరా
చెంతల నీవే యింత సేసేటివాఁడవు

చ. 1: పిప్పియై మేని కస్తూరి బేఁట్లెల్లా రాలఁగాను
యిప్పుడే మేకాంత మాడీ నింతి నీతోను
చప్పటై నీ వీఁపుమీఁద చన్ను లట్టె వొరయఁగా
కొప్పు నీ కేమి దువ్వీని కొలువులోను

చ. 2: నిగ్గుల నీమీఁదనే నిట్టూర్పులు వారఁగాను
దగ్గర నేల కూచుండీ తరుణి నేఁడు
బగ్గన చేతి చెమట పలుమారు నంటఁగాను
తగ్గక పాదాలు గుద్దీ తా నదేమె ఇప్పుడు

చ. 3: కొనగోర నీ మోవి గుఱుతుగా నాఁటఁగా
అనువుగా నాకు చుట్టి యందిచ్చీ నీకు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
తనివోని నవ్వులను తా నేమి మెచ్చీని

పె శృ రేకు: 25-5 కన్నడగౌళ సం: 17-150

పల్లవి: మా కేల మోఱపు మగఁడవు నీ వుండఁగా
యే కొలఁది కా కొలఁది యెనసేము గాకా

చ. 1: హత్తి నీ వేమి సేసినా నటు వూరకుండఁగ
చిత్తరువు వ్రాసిన చెలులమా
మత్తిలి నీ మాటలకు మారు మాటాడ కుండఁగ
పుత్తడిఁ జేసినయట్టి బొమ్మలమా

చ. 2: మెలుపున నీ విట్టె మెలఁగినట్లా మెలఁగి
నిలుచుండఁగ నీతోడి నీడలమా
అలరి పెరసతుల నంటఁగా నివ్వెఱఁ గంద
బలువైన గోడచేర్పు ప్రతిమలమా

చ. 3: అంచెలఁ జెనకఁగా నే మట్టే సిగ్గువడ నీవు
కంచునఁ గట్టి పోసిన కరుగులమా
కొంచక శ్రీవేంకటేశ కూడి నన్ను నవ్వించేవు
పొంచి ప్రాణమువోసిన బొమ్మలమా

రేకు: 0025-6 వరాళి సం: 17-151

పల్లవి: ఎఱుఁగమైతి మయ్య యెట్టయిన నోరుచుకో
గిఱిగొన్న మాచేఁతలు గిలిగింత లవును

చ. 1: బత్తితోడనే నీకు పాదము లొత్తఁగఁ బోతే
వొత్తీ నుంగరా లంటా నొద్దుకొనేవు
చిత్తమురాని సతి సేవలు సేయఁగఁబోతే
హత్తిన రమణునికి నపరాధా లవును

చ. 2: నెప్పున వేడుకతోడ నీకు నేఁ గుంచె వేసితే
కొప్పుఁదా కీ వంగె నంటా కొంకి వీఁగేవు
తప్పి యింపుగా నీ చెలి దగ్గరి కొలువఁబోతే
చెప్పరాని నేరములు చేచేతనే అవును

చ. 3: కడుఁ దమకాన నిన్ను కౌఁగిలించుకొంటేను
నడుముచన్నులు నిన్ను నాఁటె ననేవు
యెడయక శ్రీవేంకటేశ నే నిన్నుఁ గూడితే
సడియెందునుండో వచ్చి సమరతు లవును

పె శృ రేకు: 26-1 మంగళకౌశిక సం: 17-152

పల్లవి: చెప్పరాదు నీ సిగ్గ రితనము
ముప్పిరి గొంటె మోపెఁడు గాదా

చ. 1: ఆనపడి ని న్నంటి చెనకితే
దోసమా మమ్ము దూరఁగఁ జూచేవు
వేసా లింతే కాక వెలఁదులు నీ మెయిఁ
జేసిన చేఁతలు చేటఁడు గావా

చ. 2: నగుతా నిన్ను నాఁటఁగఁ దిట్టఁ గ
తగవా యేమి తప్పక చూచేవు
బిగిసేవు గాక ప్రియురాండ్లు నిన్ను
వొగరు లాడేది వోదెఁడు గావా

చ. 3: గారవించి రతిఁ గాలుచాఁచితే
నేరమా యిది నీ వనేవు గాకా
యీరీతి శ్రీవేంకటేశ నెల్లూరిలోఁ
గోరినసతులు కోట్లు గారా

పె శృ రేకు: 26-2 దేసాళం సం: 17-153

పల్లవి: ఎఱఁగఁ డనవచ్చునా యిదివో తాను
చెఱఁగు మూసుకొనఁగాఁ జెక్కు నొక్కీ నిదివో

చ. 1: నూటికి మొక్కిన చేయి నొసలిపై నుండఁగా
యేటికి నొడఁబరచీ నిప్పుడే తాను
కాటుకకన్నుల నీరు కడలనే వుండఁగా
నాటకపుమాట లాడి నవ్వించీ నదివో

చ. 2: కుమ్మరించేటి సిగ్గులు గుబ్బలపై నుండఁగా
యెమ్మెలకుఁ గౌఁగిలించీ నిదివో తాను
అమ్మరో శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
సమ్మతించ ననుఁ గూడి చన విచ్చె నదివో

పె శ్రృ రేకు: 26-3 పారాయణి సం: 17-154

పల్లవి: చెవులారా వినేఁగాని చెప్పమా నా కీ సుద్ది
జవళి వలపు లిట్టే చల్లుదురా

చ. 1: యిరవై నన్నె తలఁతు నెప్పుడు నంటా నాడేవు
తరుణులఁ బొందేవేళ తలఁతువా
యెరవు లేక నాకే యెదురు చూతు ననేవు
కరఁగి చొక్కేవేళ కను విచ్చి చూతువా

చ. 2: వనజాక్ష నారూపువాసి చూతు ననేవు
వనితలచన్నులపై వ్రాతువా
చనవున నాపెకే జపియింతు ననేవు
అనుగుఁగాంతఁబిలచేయప్పుడూ జపింతువా

చ. 3: యెమ్మెలతో నా నేరుపు లెంతు నంటా నాడేవు
కొమ్మలతోడుత నిట్టే కొనిడుదువా
మమ్ము శ్రీవేంకటేశుఁడ మండెమురాయఁడవై
సమ్మతి గూడే విట్టే చన విత్తువా

పె శృ రేకు: 26-4 హిజ్జిజి సం: 17-155

పల్లవి: వట్టి యాఖడిఁ బడేవు వలపు లోనఁ బెట్టుక
నెట్టన నేఁడు నీకు నిద్ర వచ్చీనా

చ. 1: చెలియను నీ నెరులచిక్కు దియ్యీ మంటాను
పలికి యామెతొడపై బవళించేవు
మలసి నీ మే నాపె మర్మములు సోఁకఁగాను
నెలకొని నీకు నేడు నిద్ర వచ్చీనా

చ. 2: పడఁతి నప్పటి నీదుపాదాలు గుద్దు మంటాను
బడివాయ కింటిలోనఁ బవ్వళించేవు
చిడిముడితో నాపె చేతులు నిన్ను సోఁకఁగా
నిడువాలుఁగన్నులకు నిద్ర వచ్చీనా

చ. 3: తొయ్యలిని నీవద్ద తోడు వుండు మంటాను
పయ్యదపై కేలు చాఁచి పవ్వళించేవు
చయ్యన శ్రీవేంకటేశ సమరతు లాయ మీకు
నెయ్యపు మీ కిందువల్ల నిద్ర వచ్చీనా

పె శృ రేకు: 26-5 ముఖారి సం: 17-156

పల్లవి: నేరము లెంచక రావే ని న్నాతఁడు బిలిచీని
వూరకైనవలపులు వుమురఁ బెట్టేవు

చ. 1: మగవాఁడెంత చక్కని మగువ గలిగినాను
మిగుల వేరొకతెతో మేలమాడును
తొగరుఁదామెరలలో తుమ్మిదవంటివాఁడు
వెగటున నీ వేల వెంగెము లాడేవే

చ. 2: చెలువుఁ డెంతటి సతి చేఁతలఁదనిపినాను
చెలులచన్నులమీఁద చేయి చాఁచును
చెలఁగి వనములలో చిలుకవంటివాఁడు
కొలఁదిమీర నేల కోపగించేవు

చ. 3: శ్రీవేంకటేశుఁడు శ్రీపతి వుర మెక్కినా
బూనానకుఁ బిలుచు భూరమణిని
భావించఁగ నటు గూడే పావురమువంటివాఁడు
తాపుకొంటి విలక నేల తమక మందేవే

పె శృ రేకు: 26-6 భైరవి సం: 17-157

పల్లవి: అంత వెల్లివిరిగా నాడింతురా యీ
మంతనపువిభుఁడనీ మాటలు మానేవా

చ. 1: మింటిమీఁదిచందురునిమేని కందింతురు గాక
కంటిలోనినలుపులు కానఁ బొయ్యేరా
గొంటరివై నా మదిలో కోపమే యెంచేవు గాక
దంట నీ చేఁతలలోనితప్పు లెంచేవా

చ. 2: వాలిన చెఱకువింటివంకలే యెంచేవు గాక
నాలుకలో మలక లెన్నఁగ బోయేవా
వాలాయించి నీవు నా వాదులే యెంచేవు గాక
యీలాగు నీ గుణము లింక మానేవా

చ. 3: మరిగి యడవితేనె మధుర మెంతురు గాక
సరి మోవితేనెతీపుసాటి వచ్చునా
యిరవైన శ్రీవేంకటేశ నీ కౌఁగిట నన్ను
నిరతి న న్నేలితివి నీవు మఱచేవా

పె శృ రేకు: 27-1 కాంబోది సం: 17-158

పల్లవి: ఆడనుం డేమి తగవు అంది చెప్పేవే
వాడిక లిన్నియు నాయ వలపు నీకడమే

చ. 1: పలికించ నేరుతువు పాదా లొత్త నేరుతువు
సొలసి వాకిలి దీసి చొచ్చి రా గదే
అలుక దీర్చఁగలవు ఆయము లంటఁ గలవు
బలిమి నీ పతితోడఁ బవళించఁగదవే

చ. 2: పగడసా లాడుదువు పక్కన నవ్వింతువు
మొగము చూ పితనికి మొక్కఁగదవే
పొగడుదు విచ్చకమ్మై పొద్దులు గొంత పుత్తువు
మగనిముఁసుగు చొచ్చి మంతనమాడఁగదే

చ. 3: వీడెము చేతి కిత్తువు వెటపులు పాపుదువు
తోడఁ బెండ్లి కూఁతురవై తొక్కవే కాలు
యీడనే శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టే నన్ను గూడె
జాడలనే అంతరంగసరస మాడఁగదే

పె శృ రేకు: 27-2 భైరవి సం: 17-159

పల్లవి: కలికి అదివో కన్ను గిఱిపీని
పొలుపుతామెరలచేపూజసేసినట్లు

చ. 1: యేమి గావలెనో కాని యింతి తనచెలులకు
వేమారు నిన్నుఁ దనవేలఁ జూపీని
కాముని యమ్ములకు చక్కని గుఱి నీ వని
చూమరల నిందరికీఁ జూపీ చెప్పినట్లు

చ. 2: యెంత పనికో కాని యిటు నిన్ను రమ్మని
సంతసాన తనచేత సన్న సేసేని
యింతలోనే తాను నీ యౌవనరాజ్య మెల్ల
రంతులోఁ జిగురున తోరణకట్టినట్లు

చ. 3: యీవేళఁ గూడినందుల కిటు ని న్నాకి మెచ్చి
శ్రీవేంకటేశ నీ చెక్కు నొక్కీని
కోవిలకూఁతలు నీకుత్తి కెలో కులుకఁగాను
యేవిధి మానుప రాక యిటు సేసి నట్లు

రేకు: 0027-3 మేచబౌళి సం: 17-160

పల్లవి: నే గడించినవి గావు నీ సుద్దులు
వాగమై నీవెంట వెంట వచ్చిన యీసుద్దులు

చ. 1: చేరి నే విన్నవించఁగా చిత్తము నొవ్వదుగదా
కోరి యిందరును నాడుకొన్న సుద్దులు
యీరీతి నేనే గడియించితి ననవు గదా
బోరన నూరిలో నెల్లాఁ బుట్టిన వీ సుద్దులు

చ. 2: వెల్లివిరిసేయఁగానె వెంగెమై తోఁచదు గదా
చల్లిలమ్మేచోటి జాజరసుద్దులు
యెల్లవారికిని యిదె యెత్తిచ్చె ననవు గదా
కల్లరితనమున చీఁకటిలోని సుద్దులు

చ. 3: అందరిలోన నిట్టే ఆయాలు సోఁకవు గదా
నందుని మందలలోని నంటుసుద్దులు
యిందుకే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
నిందలే కావు గదా నిన్న మొన్న సుద్దులు

పె శృ రేకు: 27-4 శంకరాభరణం సం: 17-161

పల్లవి: వలెఁగా యివి గొన్ని వైతాళాలు
చెలిమి సేసేయందుకు చెప్పింపవలెనా

చ. 1: తన కేలే వెరపు తరుణి నింతే నేను
చెనకగానే వద్దని చేయి వట్టేనా
అనుమాన మెల్లఁ బోసిఅలుక లిన్నియుఁ దేరే
మొనసి కూటమికి నా ముదల గావలెనా

చ. 2: యింక నేలే కొంకను యిదె నే చేతిలో దాన
కంకణాలచే నంటఁగాఁ గసరితినా
పొంకమాయఁ దనకు పొరుగుకు నే వచ్చితి
అంకెల సేసవెట్టి నా యప్పణ గావలెనా

చ. 3: ఆయ లేవే అగడు ఆలనై వున్నదాన నేను
యీయెడ దా నన్ను గూడ నేటి కంటినా
యేయెడా శ్రీవేంకటేశుఁ డిరవాయ తానే నాకు
పాయనరతుల కొడఁబరచఁగ వలెనా

పె శృ రేకు: 27-5 ముఖారి సం: 17-162

పల్లవి: వరుస నెఱుఁగనట్లా వచ్చి యీాడ నున్నాఁడవు
యెరవులవారికి మా యింటికినీఁ దెత్తురా

చ. 1: కందువ నీ పానుపుపై కంకణము వడి యుండె
యిందవయ్యా నీ కాంతది యెవ్వతెదో
చిందిన తట్టు పుణుఁగు చేయెల్లా నంటె నిదె
పొందుగా నీ మేన నిట్టే పూసుకొనవయ్యా

చ. 2: చిట్టంటుఁజెమట దోఁగి చెంగావిచీర యుండె
పట్టరాదా, యేవనిత గట్టుకొన్నదో
పట్టి చూచితే కప్పురపుబాగాలు మిగిలి యుండె
వెట్ట దేర నీవే, యివే వేసుకొనవయ్యా

చ. 3: అచ్చుట పువ్వులచెండు లదిగో నలఁగి యుండె
పుచ్చుకోవయ్య యెవ్వతె భోగించినదో
అచ్చుగా శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
మచ్చెము లిద్దరిని నీ మది నెంచుకోవయ్యా

పె శృ రేకు: 27-6 శ్రీరాగం సం: 17-163

పల్లవి: ఇంటిదాన నేఁ దనకునేలినాఁడు నన్నుఁ దాను
దంటతనమున నేల తతిగొనీ నీతఁడు

చ. 1: వల పెంత గలిగినా వడ్డి కిచ్చుకొమ్మనవే
పొలవ నవ్వులు గాదెఁ బోయి మనవే
చలము బలిమిఁ గలిగితే సాము సేయు మనవే
యెలమి నాతో నిట్టే యేమి చెప్పీ నీతఁడు

చ. 2: నేరు పెంత గలిగినా నేలఁ బాఁతుకొమ్మ నవే
కోరికె లెల్లా వెలకుఁ గొను మనవే
వోరు పెంత గలిగినా వొడిఁ గట్టుకొమ్మనవే
యీరీతి నెందాఁకా నాతో నేమి చెప్పీ నీతఁడు

చ. 3: బాసలెన్ని గలిగినాఁ బచరించు మనవే
వాసు లిద్దరికీ సరివంతుల నవే
యీసు లేక శ్రీవేంకటేశుఁడే తా నన్నుఁ గూడె
యే సుద్దు లప్పుటి నాతో నేమి చెప్పీ నీతఁడు

పె శృ రేకు: 28-1 పాడి సం: 17-164

పల్లవి: ఇద్దరము నిద్దరమే యేలే తనకు వెఱవు
దిద్దినగుణము మఱి తిప్పవచ్చినా

చ. 1: మన లెవ్వఁ డెఱుఁ గుమాటలే గుఱిగాక
తన నా సందింత యేల తవ్వి చూచీనే
పెనచినపెదవులే ప్రియములె చెప్పఁగాను
కొనచూపు లింకా వేరే కోపగించీనా

చ. 2: వలపు లెవ్వఁ డెఱుఁగు వద్దనుంటే గుఱిగాక
చలపట్టి యింత యేల సాదించీనే
చెలఁగి నాచేతులే చెక్కు వేట్టి వేఁ డుకోగా
కెలసినా బొమ్మలు జంకెన చూపీనా

చ. 3: యిచ్చక మెవ్వఁ డెఱుఁగు యెనయుట గుఱిగాక
పచ్చిచెనకులు యేల పాడు సేసేనే
యెచ్చె శ్రీవేంకటేశ్వరు నెనసిన రతు లివి
కుచ్చితపు సిగ్గు లింగ గుంపుగూడీనా

పె శృ రేకు: 28-2 ఆహిరి సం: 17-165

పల్లవి: లక్ష్మీకల్యాణము లీలతోఁ బాడే మిదే నేము
లక్ష్మీనారాయణులే లలనయు నీవును

చ. 1: చూపులు చూపులు మీకు సూసకము బాసికము
పూపుచన్నుగుబ్బ లివి బూజగుండలు
తీపులమోవితేనెలు తీరని మధుపర్కము
దాపుగఁ బెండ్లి యాడరయ్య తగుఁ దగు మీకును

చ. 2: మాటలమీ కిద్దరికి మదనమంత్రములు
మేటితలఁబాలు మీలో మించు నవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటునఁ బెండ్లాడరయ్య నెరవేరె మీకును

చ. 3: కౌఁగిటి కౌఁగిలి మీకు కందువ పెండ్లి చవికె
పాఁగిన కోరికలే పావ కోళ్లు
ఆఁగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
వీఁగక పెండ్లాడడయ్య వేడుకాయ మీకును

రేకు: 0028-3 రామక్రియ సం: 17-166

పల్లవి: ఇదివో నీ వొళ్లమేలు యింకా నేమి వున్నదో
యెదుట నిలుచుండితే నే నేమి సేతువో

చ. 1: చక్కనివాఁడ వంటేను జాణతనా లాడేవు
ఇక్కువ లంటితేను యేమేమి సేతువో
మొక్కవీఁడ వంటేనే మోవితేనె లడిగేవు
అక్కరతోఁ బొగడితే నపు డెంత సేతువో

చ. 2: నేరుపరి వంటేను నీటు లెల్లాఁ జూపేవు
గోరఁ జీరితే నెంత కొండ సేతువో
ఆరయ నాఅడికాఁడ వంటేనే పెనఁగేవు
సారె చన్నుల నొత్తితే చల మెంత సేతువో

చ. 3: చెలిమికాఁడ వంటేనే చేయి మీఁద వేసేవు
కలిసితే నీ వెంత కరఁగుదువో
యెలమి శ్రీవేంకటేశ యిందుండే నన్నుఁ గూడితి
అలమి పెనఁగితే ని న్నపు డెంత సేతువో

పె శృ రేకు: 28-4 శంకరాభరణం సం: 17-167

పల్లవి: ఇంతి నేలుకొంటి వింక నెడయరాదు
చెంత నా విన్నపమిట్టే చేకొనవయ్యా

చ. 1: చెలిమి సేయఁగరాదు చెలి విడువఁగరాదు
తలఁచి బాస వీరాదు తప్పఁగ రాదు
మలసి మన్నించరాదు మన్నించి చెరుపరాదు
వలవరాదు వలచి వదలరాదు

చ. 2: చన వియ్యరాదు యిచ్చి జాలిఁ బెట్టి యెంచరాదు
కొనల కెక్కించరాదు కుంగించరాదు
చెనకరాదు చెనకి సిగ్గులు వడఁగ రాదు
మన సియ్యరాదు యిచ్చి మఱవరాదు

చ. 3: ఆస వెట్టరాదు పెట్టి యపలపించఁగరాదు
పోసరించఁ జేయరాదు పోరాడరాదు
నేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ కాంతను
వాసిఁ బొందుసేసి మటి వంచించరాదు

రేకు: 28-5 నాదరామక్రియ సం: 17-168

పల్లవి: చెల్లు నీకే యిటువంటిసేఁత లెల్లాను
యెల్లవారుఁ జూడఁగానే యిక్కువ లంటేవు

చ. 1: వొడ్డుకొనఁగానే చెలి నొడివట్టి తీసేవు
యెడ్డతన మనరా యెవ్వరైనాను
వడ్డికిచ్చితివా నీవు వలపు లాపెకును
అడ్డగించుకొని వచ్చి అంగడిఁ బెట్టేవు

చ. 2: నెట్టిన సిగ్గు వడఁగానే చన్ను లంటేవు
గుట్టువాయ వీఁడన కా కడ వారెల్లా
జట్టి సేసికొంటివా సతితోడివేడుకలు
పెట్టినవొట్లఁ బెట్టి పెనఁగు లాడేవు

చ. 3: అండ నిట్టే మొక్కఁగానే అలయించి కూడేవు
దుండగ మిది యనరా తోడివారె ల్లా
దండిగానింతి నేలి దయతో శ్రీవేంకటేశ
కొండ సేసుకొంటివా యీ గురుతైన రతులు

రేకు: 0028-6 రామక్రియ సం: 17-169

పల్లవి: నిక్కముగా నవ్వు వచ్చీ నీ మోము చూచితేను
దిక్కు లెల్లా నిండె మేలు తేవయ్య వీడెము

చ. 1: గద్దె మీఁదఁ గూచుండి కాంత నండ కుఁ బిలిచి
సుద్దు లెల్లాఁ జెప్పితివి చుట్టమువలెనే
బద్దు లింత నేరకుండితే భ్రమతురా కామినులు
తిద్దనేల నీ గుణము తేవయ్య వీడెము

చ. 2: చేముట్టి సరులు దిద్ది చెక్కుల జవ్వాది మెత్తి
నేమ మెల్లాఁ జూపితివి నేర్పరివలెనే
గామిడివింత గాకుండితే కరఁగుదురా సతులు
దీమసము నీకుఁ గద్దు తేవయ్య వీడెము

చ. 3: పరపుపైఁ బవ్వళించి పలుమారుఁ గౌఁగిలించి
యిరవైతి వింటిలోన హితునివలెనే
గరిమ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
తెరమరఁ గింక నేల తేవయ్య వీడెము

పె శృ రేకు: 29-1 కేదారగౌళ సం: 17-170

పల్లవి: సిగ్గరి కాంతల నింత చిమ్మి రేఁతురా
కగ్గు లేనివారి నేల కాకుసేసే విపుడు

చ. 1: మా నెక్కి పువ్వులుగోసేమగువలఁ జూచి, మోవి
తేనె లడిగేవు నీవు దిగువనుండి
తేనెలైతేఁ పూవులపై తేఁటుల నడుగవలె
మానని తరితీపులే మావల్లఁ గలవు

చ. 2: సరసిలో నీఁదులాడే సతులనుఁ జూచి, నీవు
విరు లడిగేవు నేఁడు దరినే వుండి
విరులు గావలసితే వెస వసంతము రానీ
మరిగించే తావులే మాయందుఁ గలవు

చ. 3: వొప్పుగు శ్రీవేంకటేశ వున్నవారి మమ్ముఁ గూడి
కప్పురము లడిగేవు కౌఁగిటనుండి
కప్పుర మెంతైనాఁ గద్దు కనకపుఁబెట్టెలను
దప్పిదీర్చేపలుకు విత్తరి మాకుఁ గలవూ

పె శృ రేకు: 29-2 సౌరాష్ట్రం సం: 17-171

పల్లవి: ఎట్టు గెలువఁగఁ గల వీకెను నీవు
యిట్టె మాటపట్లు నీ విచ్చితి విందరికి

చ. 1: మచ్చిక నీ వాకెతోడ మాటలాడ దొరకొంటే
పచ్చిగా నడుమ నీకె పాట వాడీని
యిచ్చగించి నీ వప్పటి నింతివద్ద గూచుండితే
తచ్చనతోఁ గొలువుకాంతలఁ బిలిచీని

చ. 2: తప్పక నీ వాకెదిక్కు తమకించి చూడఁబోతే
కప్పి సురటి మరఁగునా విసరీని
చొప్పు లెత్తి యందుకు సొలసి నవ్వఁ బూనితే
అప్పుడే కప్రము నోరి కందిచ్చీని

చ. 3: అక్కువ శ్రీవేంకటేశ ఆకెఁ గౌఁగిలించితేను
మొక్కుచుఁ బదకమురమునఁ బెట్టీని
యిక్కువతో నీపె నేలి యిందరి మ మ్మేలితివి
తక్కరీడఁ వాపెకంటె తా నిన్ను మెచ్చీని

పె శృ రేకు: 29-3 మధ్యమావతి సం: 17-172

పల్లవి: ఎటువంటి మచ్చికలో యిద్దరికిని
జొటజొట మోవితేనె జొబ్బిలి నీ కిపుడు

చ. 1: పల్లకిమీఁదటనుండి పడతి చనుమొనలు
వొల్లనే బొటనవేల నొత్తితివి
మొల్లమి నందుల కాపె మోము దప్పక చూచితే
జల్లన మైఁ బులకలు జాజుకొనె నిపుడు

చ. 2: రవ్వగా గుఱ్ఱము నెక్కి రాజసాన నీపాదము
జవ్వని వొడిలోపలఁ జాఁచితివి
పువ్విళ్లూర నాపె నిన్ను వొయ్యనే జంకించితేను
నివ్వటిల్ల నీ చెక్కుల నిండెను చెమటలు

చ. 3: మేడమీద నెక్కుతాను మెడమీఁదఁ జేయి వెసి
వేడుకతోఁ గూడితివి వెలఁదిని
యీడుతో శ్రీవేంకటేశ యిందు కాపె నవ్వితేను
జాడతో నిట్టూర్పులు చల్లితివి రతులా

రేకు: 0029-4 మంగళకౌశిక సం: 17-173

పల్లవి: ఇంతేసి కాకు సేసీ నేమి సేతునే
కాంతలఁ దమి రేఁచీని కడు సాదా వీఁడు

చ. 1: కొచ్చినా బొడ్డు దమ్మిని గుంతపోఁక లాడే నంటా
పచ్చావి వేఁడుకొనీని బాలుఁడా వీఁడు
రచ్చ నా చన్నులు బొమ్మరాలు తా నాడే నంటా
పెచ్చురేఁగి కొంగు వట్టీ పిన్నవాఁడా వీఁడు

చ. 2: అరసి నా పిరుఁ దిది ఆడే చక్రపు బి ల్లంటా
సరస బట్టి నిమ్మనీ సన్నమా వీఁడు
గరిమఁ దొడలు ముట్టి కంబాలాట లాడే నంటా
పరగ నొడఁబరచీ పడుచా వీఁడు

చ. 3: అలరి నా కౌఁగిట నప్పలప్పలాడే నంటా
పిలిచి కూడీని పిన్నబిడ్డ డా వీఁడు
అలమిశ్రీవేంకటేశుఁ డాలిమగనాట లంటా
చెలరే గి మోవెడిగీ చిఱుతా వీఁడు

రేకు: 29-5 వరాళి సం: 17-174

పల్లవి: వింత వింత మాట లివి వింటిమి నేము
పంతగాఁడ వింతేసి భ్రమతురా వోయి

చ. 1: నడుమ నెవ్వతోఁజూచి నావలె నున్నది యంటా
బడిఁ దిరిగితి వట బాపురే నీవు
అడరి నాపేరఁ బిల్చిఆవెకొంగు వట్టి తేను
కడు నవ్వె నట నిన్నుఁ గద్దా వోయి

చ. 2: నిద్దరింపుచున్న యాఁడో నెలఁత నే నంటాఁ జూచి
వొద్దఁ బండుండితి వట వోహో నీవు
సుద్దులు నాతోవలె సూచించి చన్నులంటి
అద్దలించి మెచ్చె నట అవునా వోయి

చ. 3: నిలువుటద్దములో నా నీడ చూచి నే నంటా
అలరి పై కొంటివట అవురా నీవు
యెలమి శ్రీవేంకటేశ యిట్టే న న్నేలితివి
యిల నాపెఁ గూడెనట యితవా వోయి

రేకు: 29-6 సౌరాష్ట్రం సం: 17-175

పల్లవి: నే నెఱుఁగనా విభుఁడ నీ సుద్దులు
నీ నయగారితనాల నెపాలు సేసేవు

చ. 1: ఆనవెట్టి న న్నెక్కించి అట్టే తూఁగుమంచ మూఁచి
ఆనడుమ నాపెతో మాటాడేవు నీవు
పూని యప్పటి నీవు పువ్వచెండున వేసి
మోనాన నంతలో నాపెమోవి యానితివి

చ. 2: చెక్కునొక్కి వేడుక నా చిక్కు దియ్యుచు
వుక్కునూఱ నీ వాపె వొడి వట్టేవు
వెక్కసాన నింటిలోన విందు నాకుఁ బెట్టించి
గక్కన నాపెను నీవు కౌఁగిలించేవు

చ. 3: పరగ నిద్రించు మని పచ్చడము గప్పి పెట్టి
సరవితో నేలితివి సంగడిదాని
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
సరునే ఆపె దెచ్చి సంతసము సేసేవు

పె శృ రేకు: 30-1 గౌళ సం: 17-176

పల్లవి: పాయపువనిత నింత పచ్చి సేతురా
మూయక మూసీని చలముల నింతివలపు

చ. 1: కుప్పుగాఁ గుచ్చెలవిడఁ గొంగు వట్టి తీసితేను
కొప్పునెరులఁ జెలి మైఁ గప్పుకొనెను
తప్పక వాలుఁజూపులతరుణిమోము చూచితే
రెప్పలు మూయుచు సిగ్గు రేఁగ నీక దాఁచెను

చ. 2: సారెకుఁ జేతులు చాఁచి చన్నులు నీ వంటఁగాను
కూరిమిఁ జేతుల మూసుకొనే నవ్వుచు
బీరాన నాపె మోవిఁ బెదవి నంటించఁబోతే
దార దప్పకుండ తన తమ్ములానఁ గప్పెను

చ. 3: బంగారు వొడ్డాణము పట్టి నీ వెడలించితే
అంగమున నీ రెంటె మంగలించెను
సంగతి శ్రీవేంకటేశ సకియ నీవు గూడితే
ముంగిటిమదనకళ ముప్పిరిగొలిపెను

పె శృ రేకు: 30-2 హిందోళవసంతం సం: 17-177

పల్లవి: ఆఁటదాని యాసోదాన కలవి లేదనియేటి
మాట నీవల్లఁ గంటిమి మతక మేమిటికి

చ. 1: మోవిపండుతీపులతో ముంచి తేనెలు గారఁగా
రావిపండుచవు లౌనా రతివేళను
కైవమ్మై నా కితఁడు కామించి తా నుండఁగాను
యీవల నీ వేల యెలయించఁగ వచ్చేవే

చ. 2: తమ్మిపూవు తేఁటికి నితావులై తా నుండఁగాను
తుమ్మిపూవు చెప్పి దోసము గాదా
నమ్మించి యీ రమణుఁడు నావద్దనే వుండఁగాను
యిమ్ముల సన్న లితని కేల సేసేవే

చ. 3: అంచకల్పకముపై నమరి క్రీడింపఁగాను
కొంచయేతెంచి తా నందఁ గూచుండినట్లు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడఁగాను
పంచ నీవుఁ గూడి యెంత బాఁతిపడేవే

పె శ్రృ రేకు: 30-3 శంకరాభరణం సం: 17-178

పల్లవి: అంత నీకు వేడు కైతే నటు సేస చల్ల రాదా
మంతనాన నున్నవారి మఱి కాఁకుసేతురా

చ. 1: మరుతంత్రానఁ జెలితో మరిగి యాతఁడుండఁగా
తెర యేల తీసేవే తెల్లమిగాను
నిరతి నిద్దరుఁ జొక్కి నిద్దురింపుచుండఁగాను
విరుల నేల వేసేవే వెక్కసానను

చ. 2: యేపున గొనాల గొంది నిద్దరు మేలమాడఁగ
దీప మేల తెచ్చేవే దిష్టము చూడ
పైపై నిద్దరు లోలో బాగాలు చేసుకోఁగా
యీా పొద్దేల తొంగి చూచే వెగసక్కేలకును

చ. 3: మంచముపై నిద్దరును మర్మములు చెప్పుకోఁగా
పొంచు లేల వినేవే చప్పుడు సేయకా
అంచుల శ్రీవేంకటేశుఁ డాకె నిన్ను గూడినాఁడు
మించి యేల నవ్వేవే మే లెల్లాఁ గలిగెను

పె శృ రేకు: 30-4 కాంబోది సం: 17-179

పల్లవి: నెఱజాణఁడవు నీవు నేరుపరివి
యెఱుఁగ నింకాఁ జేఁత లేమేమి నేరుతువో

చ. 1: చెలఁగి పెక్కుచెలుల చీఁకటిమేడలోఁ బెట్టి
కలగంపగా విభుఁడ కలసితివి
వెలువడి వచ్చి వెలఁదులు నవ్వఁగాను
తెలిసితి గాక నీవే తలఁచుకోఁగలవా

చ. 2: దామెరకొలనిలోన దప్పిదేర నీఁదుతాను
దోమటిరతుల లోలో దొరసితివి
యీమతకములు మీరే యెఱుఁగుదు రింతే కాక
గామిడి మీగు ట్టొరులు కనుఁగొనఁ గలరా

చ. 3: వనకేలి సేయుచోట వడి మంచు గప్పితేను
యెనసితివి శ్రీవేంకటేశ యింతుల
నను గూడితివి యిట్టే నావంటివారే కాక
పనివూని యితరులు భావించఁ గలరా

పె శృ రేకు: 30-5 ఆహిరి సం: 17-180

పల్లవి: చూడఁగొత్తలై వున్నవి సారిది నీ గుణములు
యీడుజోడై నాకుఁ జన విప్పుడే యిచ్చేవు

చ. 1: ఆపె నిన్నుఁ దమి రేఁచి యంపెనో ని న్నీడకు
యీపొద్దు విచ్చేసితివి యిన్నాళ్లకు
తీపులు నీమోవిఁ బూసి తిట్టెనో ని న్నింతేసి
పైపైఁ దేనెలు గార బలికేవు నేఁడు

చ. 2: బోదించి యెట్లా నాపె బుద్దులు నూరిపోసెనో
సాదువలె నేమని నా సమ్మతించేవు
కా దనక రతి నుబ్బుఁగవణము మేపెనో
నాదెస చూచి నీవు నవ్వులు నవ్వేవు

చ. 3: చుట్టిరిక మెల్లా నీకు సూటిగాఁ దెలిపెనో
గట్టిగా నిట్టే నన్నుఁ గౌఁగిలించేవు
దిట్ట శ్రీవేంకటేశ్వర దిద్దెనో రతు లాపె
జట్టిగా నన్నందులోనే సాము సేయించేవు

పె శృ రేకు: 30-6 సౌరాష్ట్రం సం: 17-181

పల్లవి: ఎంత తమకమో చెలి కేమి చెప్పేది
వింత వింత వేడుకలు వెల్లి విరిసీని

చ. 1: సారె జారుఁబయ్యెదతో సగముచన్నులు చూపి
నేరుపుల మాట లాడీ నెలఁత నీతో
కూరుములు గొసరుతా గోరఁ జెమట చిమ్ముతా
తారుమారై వలపుల తన్నుఁ దా నెఱుఁగదు

చ. 2: కడు గొప్పు దువ్వుకొంటా కరమూలములు చూపి
వెడయాస నవ్వు నవ్వీ వెలఁది నీతో
నిడువాలుఁజూపులతో నిన్నుఁ దా నొరసుకొంటా
తడబాటుచిత్తముతో తన్నుఁ దా నెఱుఁగదు

చ. 3: బిగ్గె నొడ్డాణము గట్టి పిఱుదిబటువు చూపి
అగ్గలమై కాలు దొక్కీ నతివ నీతో
నిగ్గుల శ్రీవేంకటేశ నిన్నుఁ గూడీ మొక్కు మొక్కి
తగ్గని కోర్కులతోడ తన్నుఁ దా నెఱుఁగదు

పె శృ రేకు: 31-1 సౌరాష్ట్రం సం: 17-182

పల్లవి: నీవు సేసినపనులే నీకేల భ్రమయను
కావించి కల గంటేనే కతలై నిలువవా

చ. 1: జలజాక్షిచన్నులపై చందురులఁ బెట్టివేసీ
నెలవై కౌఁగిలించితే నిన్నే యంటేను
కలికి నా చేఁతు లని కాంతాళించే వప్పటిని
యిలపై నుప్పు చిందితే యినుమడి గాదా

చ. 2: కాంతమోవిమీఁదటను కంతునిముద్రలు వెట్టె
బంతికిఁ బోతే నీ మోవిపై నంటెను
పంతమున నివి యాకెపను లంటేఁ గెరలేవు
పొంతనేపూవులలోనేపూఁపలుఁ బొడమవా

చ. 3: యీ రమణికౌఁగిటిలో యిరవై నీవే కూడి
వూరటగా నవ్వితే నీ వుర మెక్కెను
ఆరయ శ్రీవేంకటేశ ఆపె నిట్టే మెచ్చేవు
సారెకు నేళ్లవెంటనే బాళ్లునుఁ గావా

పె శృ రేకు: 31-2 రామక్రియ సం: 17-183

పల్లవి: ఇట్టివే తనగుణాలు యేల వొడఁబరపించీ
ముట్టి కట్టితే వెన్నెల మోపు లయ్యీనా

చ. 1: పరగఁ గప్పురములో పరిమళ మింతే కాక
సరిఁ జవిగొనఁబోతే చప్పనే కాదా
ధరలోఁ దనవలపు తరితీపు లింతే కాక
బెరసి ముద్ద సేసితే బెల్ల మయ్యీనా

చ. 2: మించైన బంగారము మెఱుఁగై తా నుండుఁ గాక
కంచానఁ బెట్టుకొంటే నాఁకలి దీరునా
పంచలఁ దనమాటలు బయలింత లింతే కాక
నించి వాడుకొనఁబోతే నీ రా డయ్యీనా

చ. 3: మాయలపూపుటమ్ములు మర్మము నాటు నింతేకాక
కాయము మీఁదట గంటి గానవచ్చీనా
మా యలమేల్మంగఁ గూడి మరిగె నింతే కాక
యే యెడ శ్రీవేంకటేశుఁ డిచ్చకుఁ డయ్యీనా

రేకు: 0031-3 ముఖారి సం: 17-184

పల్లవి: ఇంతవాఁడవు గాకుండితే నిటు సేతువా
వింతలుగా నిట్టే విఱ్ఱవీఁ గేవు గాకా

చ. 1: అట్టే నేఁ జూడఁగా నీ వాపెతో మాటలాడవా
వొట్టు వెట్టుకొనేవు గా కూరకే నీవు
చుట్టిరికపుఁ దనాన సొమ్ములు మెడఁ బెట్టివా
చట్టువలె వెఱఁగంది సాదించేవు గాక

చ. 2: ననుపుతో చెలితోడ నవ్వు లెల్లా నవ్వవా
పెనఁగుచు వట్టి సిగ్గు పెంచేవు గాక
తనివోక అప్పటి నీ తమ్ముల మొసఁగవా
చెనకి దొరతనాలు సేసేవు గాకా

చ. 3: గరిమె నప్పుడే ఆకెఁ గౌఁగిలించుకొనవా
విరసానఁ బందెములు వేసేవు గాక
యిరవై శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడవా
మరిగి న న్నందుకే మన్నించేవు గాకా

పె శృ రేకు: 31-4 శ్రీరాగం సం: 17-185

పల్లవి: ఇరవుగ నెఱుఁగుదు నెన్నికలు
సరికి బేసికిని జంకింతువుగా

చ. 1: పలుకులు నీతోఁ బచరించఁగా
చెలఁగుచు గయ్యాళిఁ జేతువుగా
కొలువులు తరచుగ గోరి సేయఁగా
చలమరి నని రచ్చల వేతువుగా

చ. 2: వాసితోడ సేవలు సేయఁగా
ఆసోదకత్తెని యందువుగా
సేసనెట్టి పైఁ జేయి చాఁచఁగా
వేసాలది యని వెలయింతువుగా

చ. 3: యిట్టె శ్రీవేంకటేశ కూడఁగా
దిట్ట యనుచు సాదింతువుగా
గుట్టున నిటు నిను గోర నంటఁగా
అట్టడి యని యాఁబడి నవ్వుదుగా

పె శృ రేకు: 31-5 శ్రీరాగం సం: 17-186

పల్లవి: నేఁ డింత జాఁగతనము నేరిచినదానవు
నాఁడె యెచ్చరికెతోడ నడపఁగ వలదా

చ. 1: యెందు వోతి వని పతి నిట్టే సాదించేదానవు
ముందేయాతనిపాయము ముద్రించరాదా
సందడి నాతనిపై మచ్చుము సోదించే దానవు
తందుడు కేల వజ్రాంగి దొడుగఁగవలదా

చ. 2: గట్టిగాఁ జెలుల నట్టికము వెట్టేదానవు
దిట్టివై నీవే వెంటఁ దిరుగరాదా
బట్టిబయలు చేఁతలు బావించేదానవు
పెట్టెలో నాతని మతి కట్టి పెట్టవలదా

చ. 3: పొలసి యాతని మోవిఁ జొప్పు లెత్తేదానవు
వెలయ నీ శాసనము వెయ్యఁగరాదా
యెలమి శ్రీవేంకటేశఁ డిట్టే నిన్ను నన్నుఁ గూడె
కలిగినరతు లెల్లా గాదెఁ బోయ వలదా

పె శృ రేకు: 31-6 మేఁచబౌళి సం: 17-187

పల్లవి: తనకే తెలుఁ గాక తఱవాతి పను లెల్లా
చనవు మనవు లింకా సారెఁ జెప్ప నేఁటికే

చ. 1: చెవి కింపుగానిమాట చిందరగొనేటిపాట
చవిగాని జాగరాలు సరియాఁకలు
ఆవలిమోమైన నవ్వు అడవిఁగాసే వెన్నెల
తనివి యాతని నెంతదడవు సాదించేనే

చ. 2: అందీనందనిబొందులు ఆమనికాలపుఁ బొల్ల
చెంది యుండని రతి చిత్తరువ్రాఁత
సందడిలో సరసము జలదిలోపలివాన
యిందుకై రమణుని యాలే దూరను

చ. 3: తనివోనితమకము తవ్వక కన్నధనము
కినయని వలపు తంగేటిజున్ను
యెనసి శ్రీవేంకటేశుఁడే యిప్పుడే నన్ను
మన సొక్కటాయను మచ్చిక లీడేరెనే

రేకు: 0032-1 కన్నడగౌళ సం: 17-188

పల్లవి: అంగడివేతురా వల పందరుఁ జూడఁగను
చెంగట నాపెకునైనా సిగ్గు గొంత వలదా

చ. 1: తా నింత నేర్పరి యౌట తరుణు లెఱుఁగరా
అనిపట్టి ఆపెకు నాట నేర్పీని
వీనుల నిందాక నేను విని తల యూఁచనా
తానాలు దిద్దీని యట్టే దండ నిడికొనుచు

చ. 2: కన్నెపై బత్తి గలుగుత కానరా వూరివారెల్లా
చన్నులొత్తుగాఁ గిన్నెర సాదింపించీని
సన్నలదాశాలు వాయించ జేయఁగమెచ్చనా
చిన్నిచేతులు వట్టి తా సిగ్గులు వడుచును

చ. 3: దిక్కుల తనసొమ్మువుట తెలియరా చెలు లెల్లా
చక్క మెడఁకు గట్టుకొని చదివించీని
చెక్కు నొక్కి నన్నుఁ గూడి శ్రీవేంకటేశుఁ డాపె
వక్కణలు చెప్పి చెప్పి వ్రాఁతలు వాయించీని

పె శృ రేకు: 32-2 వరాళి సం: 17-189

పల్లవి: ఏల సత్యములు సేసే వెట్టు నమ్మేది
తాలిమి నీకుఁ గద్దా తరుణులయెడను

చ. 1: సముకాననుండి యాపె సారె వలపించఁగాను
భ్రమయకుండుదువా పలుమారును
చెమటలు సోఁక నటు చే వట్టి పెనఁగఁగా
తమకించకుండుదువా తతిఁ గూడను

చ. 2: రాతిరిఁ బగలు నీకు రమణి వీడె మియ్యఁగా
కాతరించకుండుదువా కందువలను
పోతరించి యప్పటి నీ పొందులమాట లాడఁగా
యేతులఁ గూడ కుండేవా యెంతైన

చ. 3: పానుపువద్దనుండి పాదము లాపె వొత్తఁగ
కానిమ్మనకుండుదువా కౌఁగిటికి
పూని శ్రీవేంకటేశ్వర పొందితివి నన్ను నిట్టే
మానినితోఁ జెప్పక మానుదువా నీవు

పె శృ రేకు: 32-3 కేదారగౌళ సం: 17-190

పల్లవి: ఈరీతి రతి గొనెను యింతికి నీపై వలపు
యేరీతిఁ బొద్దు గడపు నింటికీ రావయ్యా

చ. 1: చిత్తరువు వ్రాయఁ బోతే చెలియకు నంతలోనే
హత్తి నీ రూపే తొరలీ హస్తములకు
మత్తిలి యెవ్వరితోడ మాటాడఁబూనినాను
బత్తితో నీ పేరే వచ్చీ పరగ నోరికిని

చ. 2: ఆలకించి వింటేను అన్నియు నీ పలుకులై
వేల సంఖ్యలై తోఁచీ వీనులకు
తాలిమి నిట్టూరుపు మొత్తములఁ జెలఁగితేను
మేలిమినీ వాసనే మెఱసీ ముక్కునను

చ. 3: పక్కన శ్రీవేంకటేశ బయలు కౌఁగిలించితే
అక్కున నీవే నిలిచే వంగములకు
యిక్కువలఁ దలపోసి యెటువలె భావించినా
మక్కువలై చవి పుట్టే మనసు నాకు

పె శృ రేకు: 32-4 శంకరాభరణం సం: 17-191

పల్లవి: తెలిసితి మింక నెంత తేలించేవే
కలికివి పతి నెంత కారించేవే

చ. 1: తరితీపులే కావా తమకము వెంచేవీని
శిరసుమొక్కులే కావా చిమ్మి రేఁచేవి
సరసములే కావా చవులు వుట్టించేవీని
తెరలో చూపులే కావా తెమలించేవి

చ. 2: మంచి మాటలే కావా మక్కువలు వుట్టించేవి
పొంచిన సిగ్గులే కావా పొడి సేసేవి
మించుమురిపేలే కావా మిగులఁ జొక్కించేవి
కొంచని బీరాలే కావా గుట్టు సేసేవి

చ. 3: తనువుసోఁకులే కావా తగులమి సేసేవి
ననుపురతులే కావా నమ్మించేవి
యెరసి శ్రీవేంకటేశుఁ డిదె ని న్నలమేల్మంగ
నినువు నీటులే కావా నెయ్యము సేసేవి

పె శృ రేకు: 32-5 సామంతం సం: 17-192

పల్లవి: సుదతికి రాజసము చూపవలెనా
యెదురుగ నీవే చన వియ్యఁగ వలదా

చ. 1: పడతి నీతో నిట్టే పందెము వేయఁగాను
వుడుగక నీవు చెయ్యి వొగ్గ వలదా
జడియక నీతోను సరసమాడఁగాను
నడుమ నీ వింతలోనే నవ్వఁగ వలదా

చ. 2: కలపుకోలుగ నీకు కన్నుల మొక్కఁగాను
వెలయ వలపులు దీవించి వలదా
చలివాయఁ గెమ్మోవి చవి నీకుఁ జూపఁగాను
సొలసి నీ వందుకే చొక్కఁగ వలదా

చ. 3: అంకెల రతుల నిన్ను అలమి కూడఁగాను
పొంకముగ మెచ్చి మెచ్చి పొదుగవద్దా
కొంకక యలమేల్మంగ కోరి శ్రీవేంకటేశుఁడ
లంకెలాయ నింక నీ లీలలు నించవలదా

రేకు: 0032-6 ముఖారి సం: 17-193

పల్లవి: ఇటువంటి యాగడీని నేమి సేతునే
నటన నాపె బాసకు నాపై వానవెట్టినే

చ. 1: నమ్మి యడమాటలాడే, నామోవి ముట్టి నేలంటే
కొమ్మమాటకు నా మోవి గుఱి యనీనే
చిమ్మి కానుక లియ్యఁగా చెయ్యాల పట్టే వంటే
వుమ్మడి నాపెకానిక కొడిగట్టె ననీనే

చ. 2: దూతికనై మొక్కే నాతురు మేల పట్టే వంటే
రీతి నాపెమొక్కులే ధరించే ననీవే
నాతిఁ జెనకఁ బిలిచె, నా మర్మమే లంటే వంటే
యేతుల నాపెమర్మాలే యీాడ నున్న ననీనే

చ. 3: పూడిగ మిద్దరికిని వొసరఁ బాన్పు వేసితే
వేడుక నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడే
జోడుగాఁ గూడే వాకెకు సుద్ది చెప్పి వచ్చే నంటే
జాడతోఁ దానె సుద్దులు సకియకుఁ జెప్పినే

పె శృ రేకు: 33-1 ఆహిరి సం: 17-194

పల్లవి: వెల్లివిరు లాయనోయి వేడుకలు నీకు నేఁడు
గొల్లదోమటి సేసిరి గొల్లెత లిందరను

చ. 1: కలికి యొక్కతె నిన్నుఁ గైకొని పెండ్లి యాడఁగా
తలఁబాలు తోడువోసీ తాను నొకతె
యెలమిఁ బెండ్లిపీఁటపై నిద్దరు గూచుండఁగాను
చలపట్టి పారుగాలు సంగడిఁ గూచుండీని

చ. 2: హత్తి నీబువ్వాన నొక్క యంగన గాచుకుండఁగా
పొత్తులకు వేరొక్క పొలఁతి వచ్చె
బత్తితోడ మరొకతె బాగాలు చేతి కియ్యఁగా
మత్తిలి యంతలో నాకు మడిచి యిచ్చిని

చ. 3: కొసరి యొక్కతె నిన్ను గోరి తెర వేసితేను
యెసగఁ బాన్పు వరచె నింతి యొకతె
పసగా శ్రీవేంకటేశ పాదా లొకతె వొత్తఁగ
యెసగి యలమేల్మంగ యిటు నిన్నుఁ గూడెను

పె శృ రేకు: 33-2 పాడి సం: 17-195

పల్లవి: తమకపుతడఁబా టింతకు వచ్చెను
అమర గద్దెపై నీకు నటు నవ్వు వచ్చెను

చ. 1: తరుణి నీశిరసునఁదట్టుపుణు గంటఁగాను
సరి నీచెక్కులు దనచన్నులు దాఁకె
పరగ బొంకి పయ్యెద బాహుమూలములఁ జెక్క
దొరకొంటే మోవి మోవి దోమటిగల నేను

చ. 2: కొమ్మ నీ వీఁపునను కుంకుమనలఁగు వెట్టఁగ
వుమ్మడిఁ గుబ్బెల సోఁకె నురమునను
చిమ్ముల నందుకుఁగా సిగ్గువడి కూచుండితే
కమ్మి తొడయుఁ దొడయుఁ గడు జంట లాయను

చ. 3: ఆలమేలుమంగ నీ మై నదె గంద మలఁదఁగా
కలయికకుఁజేతులు కౌఁగిట నంటె
బలిమిఁ బెనఁగఁబోతే పక్కన శ్రీవేంకటేశ
పలురతిభావములై పాదుకొని వుండెను

పె శృ రేకు: 33-3 పాడి సం: 17-196

పల్లవి: మా కేమి మీ కెట్టున్నా మంచిదే నేఁడు
పైకొని మీ వారమై బ్రదికేము నేము

చ. 1: చెప్పినట్టు సేసేటి చేకొలది మగఁడాయ
అప్పుడే సలిగగల ఆల వైతివి
చెప్పరానిసంతోసాల చెలు లెల్లాఁ బొగడేరు
చిప్పిలఁగ నవ్వవమ్మా సెలవుల నింకను

చ. 2: కచ్చుపెట్టి నీ కతఁడు కాఁపురము సేసీని
యిచ్చకురాలవు తొల్లే యితనికిని
వచ్చి వచ్చి చూచేరు వాడవా రెల్లా మిమ్ము
ముచ్చట లాడవమ్మా ముదితలతోడను

చ. 3: దక్కి శ్రీవేంకటేశుఁడు తమ్ముల మిడెను నీకు
తక్కక నీ కట్టే మదన మెత్తెను
అక్కరతో నీ విభుని అంతలోనే కూడితిమి
చొక్కుచుఁ బాడవమ్మాసోబానపాటలు

పె శృ రేకు: 33-4 వరాళి సం: 17-197

పల్లవి: తెలుసునో తెలియవో తెల్లమిగా మీకు నివి
కలికిచేఁతలు చూచి కాంత లెల్లా మెచ్చేరు

చ. 1: చెలి నీయెడకు వెలుపలనే సిగ్గులు గాని
తలఁపులోఁ బిక్కటిల్లీ తమకములే
వలిపెపుఁ బయ్యదను వట్టి ముసుఁ గిడెఁ గాని
వెలి కురికినవే వింతవింత చూపులు

చ. 2: తరుణికొలువులోన తల వంచుకొనుఁ గాని
సిరుల నవ్వు దొలఁకీ సెలవులను
తెరమాటు సేసుకొని దీమసము చూపీఁ గాని
సరవులమాట లెల్లా చల్లీ వీనులకు

చ. 3: యిందుముఖిని కౌఁగిట యిట్టే గుట్టు చూపీఁ గాని
చిందేటిచెమట లెల్లా చెక్కు లనవే
కందువ శ్రీవేంకటేశ కలసితి వీకెను
మందెమేళ మింతే కాని మరిగె నీ దేవులు

రేకు: 0033-5 బౌళి సం: 17-198

పల్లవి: ఎంత నేరుపరి యీపె నేమి చెప్పేది
కాంతకు నీకు వలపు గాడిఁ గట్టీని

చ. 1: కొమ్మా నీవు గూచుండఁగా కొంగులు ముళ్ళువేసీ
నెమ్మది నీకె చేయి వట్టి నిన్ను దీసీని
దొమ్మి నాకె వెంట వచ్చి తోడఁ బెండ్లికూతురై
చిమ్మి రేఁగి లోలోఁ దానే సిగ్గులు వడీని

చ. 2: చదరంగ మాడఁగాను జంటగా జిగు రంటించి
కదిమి తెరలోనికిఁ బద మనీని
సుదతి వెంటనే వచ్చి సూదివెంట దారమై
అదివో నివ్వెఱఁగంది అట్టే నవ్వీని

చ. 3: కైదండ యియ్యఁగా మొలక ట్టిద్దరిఁ దగిలించి
ఆదిగొని తన్నుఁ గూడుమని వట్టీని
పోదితో శ్రీవేంకటేశ పొలఁతితోడినీడయై
యీదె నన్నేలుటకు నిచ్చక మాడీని

పె శృ రేకు: 33-6 రామక్రియ సం: 17-199

పల్లవి: ఇప్పుడే యేల పెనఁగే వీకెతోను
లప్పల కప్పు మిచ్చి యలపు దీర్చవయ్యా

చ. 1: కలకల నవ్వుతాను కాంత పరువున వచ్చి
బలిమిఁ గౌఁగిట నిన్ను నలమఁగాను
వెలయఁ గొప్పు వీడి విరులు జల్లన రాలె
ములువాఁడి గోళ్ళ దువ్వి ముడువవయ్యా

చ. 2: వొట్టు వెట్టి పోకు మని వొడివట్టుకొని నిన్ను
దిట్టయై తెరలోనికిఁ దియ్యఁ గాను
గుట్టునఁ బయ్య దెడలి కుచములు గానవచ్చె
జట్టిగొని పూరడించి చక్కఁ బెట్టవయ్యా

చ. 3: గయ్యాళితనము చేసి కళ లంటి రతిసేసి
నెయ్యపు మోవితేనెలు నించఁగాను
చయ్యన శ్రీవేంకటేశ సరులెల్లాఁ బెనఁగొనె
యియ్యెడఁ జిక్కు దీరిచి యేలుకొనవయ్యా

రేకు: 0034-1 శ్రీరాగం సం: 17-200

పల్లవి: వాడవారి మెప్పించవలెఁగా నీకు
వాడుదేరి మాటలాడవలెఁగా నీకు

చ. 1: చెలియవలపు నీ చిత్తానఁ బట్టకుండినా
వలరాచపాది చూడవలెఁగా నీకు
సెలవులనగవులు జిగి మించకుండినాను
బలిమిఁ దెచ్చుకొనైనా వలెఁగా నీకు

చ. 2: యీ వనితవూడిగాలు యింపులు గాకుండినాను
వావికి సరస మాడవలెఁగా నీకు
చేవదేరియాసలు చిమ్మి రేఁగ కుండినాను
వావాత మొగమోట వలెఁగా నీకు

చ. 3: తరుణిపై తలఁపు లాతల నీకు నుండినాను
వరునకుఁ గౌఁగిలించవలెఁగా నీకు
యిరవై శ్రీవేంకటేశ యింత సేసి కూడితివి
వరుఁడవైన కీర్తి వలెఁగా నీకు

పె శృ రేకు: 34-2 పాడి సం: 17-201

పల్లవి: చూతము నీ నిజ మెల్లా సొరిది నేఁ డందులోనే
ఆతల నాలికెను ముక్కంటుకొనరాదా

చ. 1: కామించి యాపెచన్నులు కరముల నంటనని
నా మోము దప్పక చూచి నగరాదా
ఆమనిమోవితేనెల కాసపడ నని నీవు
ప్రేమపు టాపెపై నాన పెట్టుకోరాదా

చ. 2: అంగనపొత్తున నీవు ఆరగించ నని వుమి
మింగక యే డడుగులు మెట్టరాదా
సంగతి నాకె కౌఁగిలి సమరతి సేయనని
చెంగట మరునికినీ చెయ్యెత్తరాదా

చ. 3: పైకొని మీ రిద్దరు బాసలు సేసుకోమని
యీకడ లావణ్యావార్ధి నీఁదరాదా
చేకొని న న్నేలితివి శ్రీవేంకటేశుఁడ
తూకొన్న వలపులను తులఁదూఁగరాదా

పె శృ రేకు: 34-3 భైరవి సం: 17-202

పల్లవి: అప్పుడేమీ ననకుమీ ఆయము లెందు మోచునో
చొప్పులెత్తీ నిదిగో యే చుట్టరికమో కాని

చ. 1: నెలఁత యిదెవ్వతే నీవంటిదే మొగము
అలరు నీ చెల్లెలో అక్కో కాని
కొలచి చూచితే నీ గుబ్బలవంటివే యీకె
బలిమి చన్నుల కొక్కవడి యచ్చో కాని

చ. 2: తరుణి యెందుండి వచ్చె తగు నీ పోలికెలది
గరిమ నీ ప్రతిరూపో కరుగో కాని
సరసఁ బెట్టి చూచితే చాయ లొక్కరీతివే
సరిఁ గనుఁగల్వ లొక్కసరసివో కాని

చ. 3: వువిద యెట్టు వొడిమె వొక్కట నీ బాగులది
ఆవలమేనినీదో అమడో కాని
తవిలి కూడితి రిట్టే తానె శ్రీవేంకటేశుఁడ
యివల మీ వలపు లొక్క యెత్తువో కాని

రేకు: 0034-4 భౌళి సం: 17-203

పల్లవి: వొగ్గి నామాట వినవే వో వదినె
సిగ్గరిమఱఁది వవి చెవులు సోఁకవురా

చ. 1: వొద్దికి వత్త నటవే వో వదినే వోరి
పొద్దువోని మఱఁదివి పొసఁగదురా
గద్దించకువే సందేకాడవదినే
ముద్దుల మఱఁది వింత మొక్కల మేఁటికిలా

చ. 2: వొల్లవదే వీడెవో వదినె వోరి
కల్లరిమఱదిఁవది కారము లేరా
మెల్లనె గొణఁగకువే మేనవదినె
పల్లదపుమఱఁదివి పచ్చిగా నవ్వకురా

చ. 3: వోవరిలో వొడివట్టెనో వదినె వోరి
కైవపుమఱఁదివి కైకొంటిరా
లావులు చూపకువే మేలుపు వదినె
శ్రీవేంకటాద్రిమఱఁది చిమ్మి రేఁచ నేలరా

రేకు: 0034-5 సామంతం సం: 17-204

పల్లవి: ఔనే యిది జాణతన మందుకే నే మెచ్చితిని
నా నోరఁ బలికే నంటే నవ్వు వచ్చీఁ గాని

చ. 1: కానుకగాఁ దనకు నేఁ గప్పుర మంపితి నని
ఆనవాలు చెప్పింపే న న్నందు కేమే
పూని తా వలచినట్టి పాలఁతి దోడి తెమ్మంటే
దీనికే నే నియ్యకొని తేరాదు గాని

చ. 2: అడరి సొమ్ము లిద్దర మట్టె మార్చుకొంటి మని
అడియాల మిచ్చి పంపీ నందు కేమే
తడవి యేమైనాను తనకును నాపెకును
యడ మిచ్చి పండఁ జోటియ్యరాదు గాని

చ. 3: రంగున నేఁ గూడినట్టి రహస్యపువేళ దన
అంగపు గుఱుతు చూపినందు కేమే
యింగితాన శ్రీవేంకటేశుఁ డాకె తనపొందు
లంగవించి సాకిరైనా కనరాదు గాని

రేకు: 0034-6 ముఖారి సం: 17-205

పల్లవి: ఏల బుద్ది చెప్పేరే యెన్నిమారులైనా నాకు
వేళతోడ వానిపొందు విడువఁగ లేనే

చ. 1: తలపోసి తలపోసి తనలో గుబ్బతిల్లితే
వలపు చల్లారఁబెట్ట వసమౌనటే
యిల నెదురుచూపుల నేచిన కాంక్షలు
కెలసి నీళఁ గడిగిన మానునటవే

చ. 2: తడఁబాటు తమకము తనువునఁ బెరిగితే
వడి విరహము దాఁచ వసమౌనటే
బడివాయకుండఁగాను పరగిన నసుపులు
తొడికిపట్టి చీరఁ దుడువవచ్చునటే

చ. 3: సంతతము కౌఁగిటిలో సారెఁ బెనఁగులాడితే
వంతులకు సిగ్గు దాఁచ వసమౌనటే
యింతలో శ్రీవేంకటేశుఁ డెన్నికగా నన్నుఁ గూడె
పంతములు పిడికిటఁ బట్టి వచ్చునటవే

రేకు: 0035-1 రామక్రియ సం: 17-206

పల్లవి: బాపురే యెంతటి జాణ బాలకృష్ణుఁడు చూడఁ
బాపనివలె నున్నాఁడు బలరామకృష్ణుఁడు

చ. 1: వొంటి గోపికలచన్ను లుట్లపై కుండ లంటా
అంటుచుఁ జేతులు చాఁచీ నదే కృష్ణుఁడు
వెంటనే ఆధరములు వెస మోవిపండ్లంటా
గొంటరియై అడిగీని గోవిందకృష్ణుఁడు

చ. 2: సతుల పెద్ద కొప్పులు చక్కిలాలగంప లంటా
బతిమాలి వేఁడీ నప్పటిఁ గృష్ణుఁడు
చతురతఁ బిరుఁదులు చక్కెరదీబ లంటా
తతిగొని యంటీని దామోదరకృష్ణుఁడు

చ. 3: అంగనలవొడికట్లు అరఁటిపండ్లంటా
సంగతిఁ గౌఁగిలించీ వేసాలకృష్ణుఁడు
అంగడి నింతులెల్లాను అలమేలుమంగ యంటా
చెంగలించి కూడీని శ్రీవేంకటకృష్ణుఁడు

రేకు: 0035-2 శ్రీరాగం సం: 17-207

పల్లవి: ఇది యేమి నీభావము యింతి చెప్పఁగదవే
మది నీ కిచ్చిన బాస మఱ పాయనా

చ. 1: వెన్నెలఁగాయఁగా జూచి వెంబాలవెల్లి యనేవు
తన్నుఁ దానే పతిరాక తడసెనటే
పన్నుగాఁ గోవిలఁ జూచి పంపుడుభూత మనేవు
పన్ని యాతఁ డెక్కడికో పరా కాయెనా

చ. 2: మానిపై చిగుళ్ళు చూచి మంట లంటా బెదరేవు
ఆనుకొని యాన చెప్పి అంపఁడటవే
పూని యలుల నాళవుంటుంట లంటాఁ గసరేవు
లోనికి వచ్చి యతఁడు లోను గాఁ డాయవా

చ. 3: హత్తి మల్లెమొగ్గ చూచి అదె పెట్లుగుం డనేవు
చిత్తజగురుఁడు యింత సేసెనటవే
అత్తల శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
కొత్తగా ని న్నేలెఁ దనకూరిమి దలఁచేనా

పె శృ రేకు: 35-3 ఆహిరి సం: 17-208

పల్లవి: దోసము లే దిందు కేమి దొడ్డవాఁడవు
ఆసల నెవ్వరైనా ని న్నాడుకొనేరా

చ. 1: చెలరేఁగి యాపె నీపై సేసలు వెట్టఁగ వచ్చె
వలనుగా నీ శిరసు వంచవయ్యా
నలువంక నామాటకు నవ్వులు నవ్వేవు నీవు
కెలనివా రింతలో మొక్కితి వనేరా

చ. 2: కడఁగి అప్పటి నాపై కంకణము గట్ట వచ్చె
జడియక నీవు చేయి చాఁచవయ్యా
సిడిముడి యింతలో సిబ్బితిపడేవు నీవు
వొడికానఁ దమ్ములాన కొగ్గితి వనేరా

చ. 3: కూరిమి నలమేల్మంగ గుబ్బ లొత్తఁగ వచె
ఆరితేరి వురమున నానుకోవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యెనసియు లోఁగేవు
భారాన ని న్నిందరు మోపరి వనేరా

పె శృ రేకు: 35-4 నాదరామక్రియ సం: 17-209

పల్లవి: ఏఁటికిఁ బంతాలు చూపే వింతితోను
ఆఁటదానిపలుకులు ఆదరించరాదా

చ. 1: బింకా లాడవచ్చుఁ గాని పెనఁగుచు వనితల
మంకులు దేర్చఁగ రాదు మగవానికి
బొంకు లాడవచ్చుఁగాని పొదిగి యానవెట్టితే
పొంకానకుఁ దేరాదు పొసఁగనిమాట

చ. 2: యెగ్గు లెంచవచ్చుఁ గాని యెంతైనా జవరాండ్ల
సిగ్గులు దేరుచరాదు చెలువునికి
వెగ్గలించవచ్చుఁ గాని వేసటపుట్టినవేళ
వొగ్గి కొనవేయరాదు వొఱ్ఱబాగుగుణము

చ. 3: బాస లియ్యవచ్చుఁగాని పైకొని రతిఁ గూడితే
ఆస మానుపరాదు అతివలకు
సేసతో నలమేల్మంగ శ్రీవేంకటేశ కూడె
వ్రాసి చూపరాదు లోలో వలపు లిద్దరికి

పె శృ రేకు: 35-5 సామంతం సం: 17-210

పల్లవి: ఏ మనీనే రమణుఁడు యింతితో నేఁడు
నేమము దప్పకుండితే నిజమౌఁ గాకా

చ. 1: మతకారివలపులు మనసునఁ బట్టునా
తతితో నాస గలిసితే తగుతాఁ గాక
రతికెక్కనిమాటలు రసము లొలుకునా
సతముగా నాడితేను చవులేఁ గాకా

చ. 2: పుక్కిటిలేఁత నవ్వులు పొందులకు వచ్చునా
అక్కర గలిగితే వేడుకై యుండుఁ గాకా
లక్కకపురు ప్రియాలు లాలనకు వచ్చునా
వొక్కజాడనే వుండితే వొద్దికలౌఁ గాకా

చ. 3: వేసాల ఆన లెల్లా వెస నమ్మిక లౌనా
బాసలు దప్పకుండితే బలిమౌఁ గాకా
సేసవెట్టి ననుఁ గూడె శ్రీవేంకటేశుఁ డిట్టె
యీసరినే వుండితేను యెన్నిక లౌఁగాకా

పె శృ రేకు: 35-6 రామక్రియ సం: 17-211

పల్లవి: వద్దు వద్దు మాతోను వట్టిమాయలు యీ
సుద్దులకే నవ్వేరు సుదతు లిందరును

చ. 1: పెలుచవై ఆపెతోడఁ బెనఁగులాడ ననేవు
మలసినమేనఁ జెమట యేడది
తలపుఁలోన విరహతాపము బొంద ననేవు
నెలకొన్ననిట్టూరపు నీకు నేడదే

చ. 2: తక్కినవారిపొందులు తలఁచ నని యాడేవు
చెక్కుచేతితోడ యీ చింత యాడదే
వక్కణించి యవ్వరికి వలవ నని చెప్పేవు
చిక్కని నవ్వులతోడ సిగ్గు లేడవి

చ. 3: రట్టుగాఁ బెరసతి నెఱుఁగ నని పలికేవు
గట్టిగా నీ మొగముకళ రేడవి
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
రెట్టియైన నీ మేని రేక లేడవి

పె శృ రేకు: 36-1 ఆహిరి సం: 17-212

పల్లవి: చెలులాల విభునికిఁ జెప్పరే బుద్ది
యెలమి మీరిందరు న న్నేల బాదించేరే

చ. 1: కల్లనిదురలు వోఁగా కౌఁగిలించుకొందురటే
మల్లాడఁగా మోవిచవి మనసానటే
వుల్లాసము లేకుండఁగా వొడివట్టి
యెల్లవారుఁ గూడి యిప్పు డేల బోదించేరే

చ. 2: బొమ్మల జంకించఁగాను పూఁచి విన్నవింతురటే
యెమ్మెఁ బెనఁగఁగా వీడె మిత్తురటవే
కమ్మి చప్పఁగా జూడఁగా కానుక లింపొందురటే
యిమ్ముల న న్నిందుకుఁగా యేల బోదించేరే

చ. 3: సగ్గి నవ్వకుండగానుఁసరస మాడుదురటే
సిగ్గునఁ దప్పించుకోఁగా చే చాఁతురటే
అగ్గ మై శ్రీవేంకటేశుఁ డాతఁడే యిదె కూడె
యెగ్గు లేదు యింకా మరి యేల బోదించేరే

పె శృ రేకు: 36-2 నాదరామక్రియ సం: 17-213

పల్లవి: చెలులాల మీ లేల చెలువుని డూరేరే
తలఁపులో నతనికి దయవుట్టీఁ గాకా

చ. 1: మనసురానిపని మాపుదాఁకాఁ జెప్పినాను
వినేటిటోలే కాని వేడుక లేదు
యెనయని చుట్టరిక మెటువలేఁ బొడిగినా
పెనగులాటే కాని ప్రియ మొనకూడదు

చ. 2: పలిసి నొల్లని యట్టి వలపు లొడిగట్టిఁ గట్టితే
బలవంతకోలె కాని పాదుకొనదు
చలపట్టినచో నెంత సారె గిలిగించినాను
ఆలయికే కాని యించుకంత నవ్వురాదు

చ. 3: తమిలేని కౌఁగిలి తా నెంత బిగించినాను
చెమటలే నిండు గాని సెలవు గాదు
అనుర శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్ను గూడె
సమరతులౌఁగాని చవి దప్పదింకను

పె శ్రృ రేకు: 36-3 కాంబోదిసం: 17-214

పల్లవి: అంతర మెఱుఁగవు ఆల నైతే నేమాయ
చెంతలఁ బనిగొనేవు చేకొలఁదిదాననా

చ. 1: మగువకు నాచేత మాటలు చెప్పి పంపేవు
పగటున నిటు రాయబారినా నేను
మిగులా నాపెగుణాలు మెచ్చి బొగడు మనేవు
బగివాయక కొచ్చినబట్టుదాననా

చ. 2: పొత్తుల నాకెతోనుండి పూఁచి వడ్డించు మనేవు
హత్తి మీకు నిద్దరికి నడబాలనా
చిత్తమురా నేఁ డీకెను సింగారించి తెమ్మనేవు
యిత్తల నీపెకుఁ జెలికత్తెనా నేను

చ. 3: హరి నిద్దరికిని పచ్చడము గప్పుమనేవు
తరుణికి నూడిగెపుదాననా నేను
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
పరగ నే నేమైనా బైకొనరుదాననా

పె శృ రేకు: 36-4 శంకరాభరణం సం: 17-215

పల్లవి: నీ వెఱుఁగవా వోయి నెఱజాణ విన్నిటాను
చేవ దేర నిందుకే నే సిగ్గుతో నున్నదానను

చ. 1: మగఁ డేమి సేసినాను మగువల కియ్యకోలే
వొగి సవతుల చేఁత కోరువరాదు
నగినవారితో మారు నగఁ బాడి యెవ్వరికి
జగడించేవారితోడ చవి గాదు గాని

చ. 2: కాముఁడెటు సేసినాను కాముకులనుఁ బోదు
ఆసని కోయిలలచే నలయరాదు
దోమటిదొడుకువారితోఁ బొత్తు గలయఁ జెల్లు
యేమిటా లాఁతివారితో నీడు గాదు గాని

చ. 3: శ్రీవేంకటేశుఁడ నీతో చెంది నేఁ బెండ్లాడఁగా
వేవేలు కాఁకల కెల్లా వేసరరాదు
వావాత మాటాడేటివారితో మాటాడవచ్చు
తోవరానివారితో సుద్దులు గావు గాని

పె శృ రేకు: 36-5 సామంతం సం: 17-216

పల్లవి: ఇంతలో నన్నుఁ జూచి యేల దాఁగేవు
అంతయు నే నెఱుఁగుదు నీవుఁగా దనేనా

చ. 1: నిక్కముగా రమణుడుఁనెలఁతకుఁ జెప్పేమాట
వక్కణ లడుగవే వ్రాసుకోవే
అక్కడనుండి వచ్చితి నా సుద్దు లెల్లాఁ జెప్పీ
మొక్కవే చెలికత్తెవు ముంచి యాపెమారు

చ. 2: కానీవే యాల లోఁగేవు కాంతునిచే వుంగరము
ఆనవాలిప్పించుకోవే ఆకేఁ దేవే
పూనుకొని వున్నదానవు పోరానిచుట్టమవు
కానికెగానీమో టెంకాయ నీ వాపెమారు

చ. 3: వేళ యేమి చూచేవే శ్రీవేంకటేశుచెవిలోన
తాలిమితోడుత యాకాంతము లాడవే
యేలినాఁడు నన్నితఁడిట్టే యింతి నీతనికి
ఆలిఁగాఁ జేసితి వీడె మందవే ఆకె మారు

పె శృ రేకు: 36-6 ముఖారి సం: 17-217

పల్లవి: ఆపె సేసేమేలుకు నమరునా నీసేఁతలు
మోపులు గట్టేవు యింతి మునుకొన్నసిగ్గులు

చ. 1: చుట్ట్టపువరుస నాకె సుద్దులు ని న్నడిగీ
అట్టె కప్పురము నోరి కంది యిచ్చెను
ముట్టి పయ్యెదకొంగు నీ ముంజేతఁ జుట్టుకొని
బట్టబయఁలీఁదించేవు పడతిచన్నులను

చ. 2: మంచితనముననే మచ్చికలు నీకుఁ జెప్పి
అంచగమన బాగాలు అంది యిచ్చెను
ముంచినవేడుకతోడ మునివేళ్ళ శిర సెత్తి
అంచలఁ దేలించేవు అంగనచూపులను

చ. 3: వొడఁబాటుతోఁ గూడి ని న్నొరసి యలమేల్మంగ
అడియాలమగు సొమ్ము లంది యిచ్చెను
తొడతొడ మోయఁ గాలు దొక్కి శ్రీవేంకటేశ్వర
వడియించేవు చెమట వనితదేహమునా

పె శృ రేకు: 37-1 కన్నడగౌళ సం: 17-218

పల్లవి: లోకపు నీ చేఁతులకు లోనే కాదా
నీకు మారుకొనియుండ నేరుపా నాకు

చ. 1: వుడివోని జవ్వనము వొడిఁగట్టుకొని నీతో
సడిఁబెట్టి యలుగఁగ సంగతే నాకు
చిడిముడి కోరికలు చిత్తములో నుండఁగాను
తడసి నిన్నుఁ బాయఁగ తగునా నాకు

చ. 2: వుప్పతిల్లుఁ జన్నులు వురమున మోచుకొని
చిప్పిల నీనేరా లెంచఁ జెల్లునా నాకు
ముప్పిరి మొగమోటలు మోముమీఁద నుండఁగాను
అప్పుడే నిన్నణకించ ననువా నాకు

చ. 3: నిండుకొన్నజవ్వనము నిలువునఁ బెట్టుకొని
చండసేసి పెన గఁగ సరవే నాకు
అండనే శ్రీవేంకటేశ అంతలో న న్నేలితివి
అందు కాచి దూరఁ దగ వవునా నాకు

పె శృ రేకు: 37-2 వరాళి సం: 17-219

పల్లవి: ఈకె నేల పొమ్మనేవు యింటిలోనికి
నీకుగాను కట్టెదుట నిలుచుండుఁగాక

చ. 1: వూడిగము సేసేచెలి నొద్దనఁగ వచ్చునా
వేడుక గలంతఁ జేసి వెలయుఁ గాక
నీడనుండి యందులకు నింద నీపై వేసీనా
వాడికై నదాఁకాను వలపించుఁ గాక

చ. 2: మంతనమాడేదాని మాను మనవచ్చునా
సంతసుద్దు లెల్లాఁ జెప్పి జరయుఁ గాక
వింతలుగా ని న్నిందుకు వెంగేలు ని న్నాడీనా
చింతవాయఁ జెనకుతా చిమ్మి రేఁచుఁ గాక

చ. 3: పానుపుపై నున్నదాని బడివాప వచ్చునా
మేను చెమరించఁ జేసి మెఱయుఁ గాక
పూని శ్రీవేంకటేశ్వర పొందితి వాకెను నన్ను
తా నిన్ను రతులచేఁ దనియంచుఁ గాకా

పె శృ రేకు: 37-3 భైరవి సం: 17-220

పల్లవి: పతిమీఁదటిమోహము సతి కిట్టుండ వద్దా
సతతము నీ హితవే సారెఁ గోరీఁ దాను

చ. 1: బలిమిఁ బయ్యెదకొంగు పట్టి నీవు దీసితేను
నెలఁతకొప్పువిరులు నీపై రాలెను
అల మరుఁ డందులకు నమ్ములు గురిసె నంటా
కలికి భ్రమసి నిన్నుఁ గౌఁగిలించుకొనెను

చ. 2: వొట్టి నీ వాపెతోను వొరసి పెనఁగితేను
తొట్టి నా మైకప్పురపుధూళి ని న్నంటె
నెట్టనఁ జందురుఁడు వెన్నెలచొక్కు చల్లె నంటా
గట్టిగాఁ దెలియలేక కౌఁగిలించుకొనెను

చ. 3: యిమ్మల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే
నెమ్మి జెమటబొట్టులు నీమై నిండెను
చిమ్మియందు నించిన సేసలు పైకొనె నంటా
కమ్మర నచ్చెరు వంది కౌఁగిలించుకొనెను

పె శృ రేకు: 37-4 సామంతం సం: 17-221

పల్లవి: నీ కాపె గావలె నొండె నేనే కావలెఁ గాక
చేకొని యిద్దరు నైతే సిగ్గులెల్లా రేఁగవా

చ. 1: చనవరివలె నాపె సంగడిఁ గూచుండఁగాను
ననుపున నాతో నేల నవ్వ వచ్చేవు
వొనర దా నప్పటిని వొడివట్టుకుండఁగాను
చెనకుతా నాపై నేల చెయి చాఁచేవు

చ. 2: వదినెవలెనే చేర వచ్చి సరస మాడఁగా
కదిసి నీవు న న్నేల కాలు దొక్కేవు
అదిమి నిన్నుఁ గౌఁగిట నట్టేకౌఁగిలించుకుండఁగాను
పెదవితేనెకు నేల పెనగేవుఁనీవు

చ. 3: బత్తిగలదానివలె బాగాలు నీ కియ్యఁగాను
పొత్తుల నాతో నేల పొందు సేసేవు
తత్తరానఁ దెరలోన దాయక తా నుండఁగాను
యిత్తల శ్రీవేంకటేశ యెట్టు న న్నేలితివి

పె శృ రేకు: 37-5 భైరవి సం: 17-222

పల్లవి: ఆపెపై బత్తి గలుత అందరు నెఋఁగరా
యేపున మాకుఁ దోడై యిటు చెప్పరాదా

చ. 1: చెలి నెత్తవడి వోడి చిన్నఁబోయి వున్న దంటా
అలరి నీ వేల వుసు రనే విపుడు
వెలయఁ బాసిక చక్కవేయ నేరదంటాను
పొలుపు మిగిలి యాల పొగిలేవు నీవు

చ. 2: తరుణి సారెలుదాఁకి తల వంచుకొనె నంటా
బెరసి నీ వేల కడు బెండుపడేవు
పరగ నాపెమీఁద పందెము మోచె నంటా
సొరిది నీ వేల వచ్చి సూడువట్టే విపుడు

చ. 3: సకి యాటసరి వచ్చి సంతోసించుకొనే నంటా
మొకమున చిరునవ్వు మొలపించేవు
వెకలివై యిద్దరి శ్రీవేంకటేశ గెలిపించి
వొకరొకరిఁ గౌఁగిట నొనరించుకొనేవు

పె శృ రేకు: 37-6 లలిత సం: 17-223

పల్లవి: ఇల్లాలఁ గనక నీ యిచ్చలోనే మెలఁగేను
వెల్లి విరియై వుండగా వెస నేమిసేతును

చ. 1: వద్ద నుండి వూఁకొనేటివారు గలితే నీవు
సుద్దు లెన్నైనాఁ జెప్పేవు సూటిపడను
అద్దుకొని యెవత్తై పై యాసాసలనో నీకు
నిద్దుర రాకుండితేను నే నేమి సేతును

చ. 2: పవ్వళించి నీవద్ద పాయకుండేవారు గలితే
నవ్వు లెన్నైనా నవ్వేవు నడుమ నీవు
జవ్వనులఁ గూడి యాడి సంతోసాలు దలపోసి
యివ్వల సుమాళ మైతే యింక నే నేమి సేతును

చ. 3: లోకములో సారె నీకు లోనయ్యేవారు గలితే
పైకొని రతి సేసేవు పంతాన నీవు
యీకడ శ్రీవేంకటేశ యింతలో న న్నేలితివి
మైకొని బత్తి సేసేవు మఱి యేమి సేతును

పె శృ రేకు: 38-1 నాదరామక్రియ సం: 17-224

పల్లవి: మాతో నేల పంతపుమాట లాడేవు
యేతు లెల్లాఁ జూపఁగా యేలనేమా నేము

చ. 1: దాయక పాయక పొందు తనకు నీకుఁ గద్దని
నీయెదుట నాపె యాడె నీవు వింటివి
యేయెడా మీచుట్టరికా లెఱుఁగుదుమా తొల్లి
వో యయ్య తెలుపుకోఁగా వొద్దనేమా నేము

చ. 2: రావుగాఁగా ముద్దుటుంగరము తనవేలను
చూపి నా గురుతుగాఁ జూచుకొంటివి
మాపుదాఁకా మీకతలు మాచేత నున్నవా
వోపి బాసచేసుకోఁగా వొద్దనేమా నేము

చ. 3: అట్టే యాపె నీకు నాల నైతి నంటా నీకొంగు
పట్టి తీసితే సిగ్గు వడితివి
మెట్టి పిండిసేసేమా మిమ్ము శ్రీవేంకటేశుఁడ
వొట్టుక మమ్మేలితివి వొద్దనేమా నేము

పె శృ రేకు: 38-2 గౌళ సం: 17-225

పల్లవి: ఇందుకు నీ వాపెను యెట్టు లాలించేవో కాని
పొందులు నెరపి సతిఁ బొదుగఁగవలెను

చ. 1: మగువ నిన్ను దూరి మనసు నొచ్చెనో యని
పొగులుచు నటు చిన్నఁబోయి వున్నది
నిగిడి నిన్ను జంకించి నీకు లాఘవమో యని
వగలఁ బొరలి తల వంచుకొని వున్నది

చ. 2: భామిని నీతోఁ జెనఁగి పాదము దాఁకెనో యని
ఆముకొని అసురుసురయి వున్నది
చేముంచి వెంగెము లాడి సిగ్గు వడితివో యని
యేమి సేతు నని మది నిట్టే చింత నున్నది

చ. 3: పడఁతి రతి గెలిచి నీ పంతము దప్పెనో యని
అడరి తనలో వెరగంది వున్నది
యడయక శ్రీవేంకటేశుఁడ నీ వుర మెక్కి
చిడిముడి వినయాన చేత మొక్కుచున్నది

పె శృ రేకు: 38-3 సామంతం సం: 17-226

పల్లవి: ఏమి సేయవచ్చునే యింతులభాగ్యము గాక
నేమ మాతఁడు దప్పితే నిండుకుండుటే మేలు

చ. 1: తగవెఱుఁగనివాఁడు దయదలఁచనివాఁడు
మొగఁడైతే మారాడక మొక్కేదే మేలు
మొగమోట లేనివాఁడు మునివలె నుండేవాఁడు
బిగిసితే నోర్చుకొని నగుటే మేలు

చ. 2: చే సూటికి రానివాఁడు సిగ్గు విడిచినవాఁడు
వాసి యంచకున్నఁ దలవంచుటే మేలు
ఆస విడిచినవాఁడు ఆడికె కోడనివాఁడు
దోము సేసితేను సంతోసించుటే మేలు

చ. 3: కక్కసీఁ డైనవాఁడు కడు నిష్టూరైనవాఁడు
చిక్కకున్నా నాతనిపై చింతే మేలు
అక్కరో శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
అక్కడ న న్నేలినాఁడు అన్నియును మేలు

పె శృ రేకు: 38-4 గౌళ సం: 17-227

పల్లవి: ఇటు గాని వొడఁబాటు లేమి బాఁతి అట
మటము లేల నన్ను మన్నించు మనవే

చ. 1: నగవు రప్పించినదే నయమైన సరసము
మగఁడు మన్నించినదే మగువ
జగడము దీర్చినదే సమ్మతించిన తగవు
మొగ మోడించినదే మునుకొన్న చెలిమి

చ. 2: యెరవు లేకుండినదే యింపైన చుట్టరికము
సరవి దప్పనిదే దొరతనము
విరసము లేనిదే వేడుకతోడిబ్రదుకు
తరితీపై వుండినదే తమకపువలపు

చ. 3: మనసు గరఁచినదే మచ్చికైన కౌఁగిలి
తనివిఁ బొదించినదే తగినవిందు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నన్ను నేఁడు
వినయముతో నున్నదే వెలలేని గుణము

పె శృ రేకు: 38-5 సామంతం సం: 17-228

పల్లవి: ఆయలేరా యిప్పు డన్నీ నాడేవు గాక
యే యెడనైనా నీ తగ విట్టే నడుపేవా

చ. 1: అక్కడ వేరొకతెపై నాసలఁ బొరలే నీవు
చక్కెరవంటి నా మోవి సడ్డ సేసేవా
మక్కువ జవ్వనమదమత్తుఁడవై వున్నాఁడవు
తక్కక నా పొందులు తలఁపయ్యీనా

చ. 2: చండతో నెవ్వతెయైనా సాటి వెట్టి యడిగితే
కొండలంత నా చన్నులు కొనియాడేవా
గండుమీరి మిక్కుటవు కాంక్షల నున్నాఁడవు
దండియైన నా రతులు తనివి యయ్యీనా

చ. 3: సిగ్గులు వడుతా నాపెచెంగట నుండినీవు
యెగ్గు లేని నా మాటల కియ్యకొనేవా
అగ్గమై శ్రీవేంకటేశ అంతలో న న్నేలితివి
వొగ్గిన చేఁతల కెల్లా వొడి గట్టేవా

పె శృ రేకు: 38-6 సామంతం సం: 17-229

పల్లవి: నిన్ను నిందుకుఁగా వట్టి నేరము లెంచఁగ నేల
మన్నించి నీ వివియైనా మానుపఁగా రాదుగా

చ. 1: పూరకే న న్నొల్లక నీ వుండినా నీ యాలి నని
పేరు చెప్పఁ గద్దుగా నేఁ బ్రేమతోడను
తేరకొన నీవు నాదిక్కు చూడకుండినాను
దూరాన నిన్నుఁ జూచి సంతోసించ గద్దుగా

చ. 2: మాని నీవు సముకాన మాటలాడకుండినాను
వీనుల నీ చరితలు విందుఁగా నేను
చే నంటి పాదాలు సేద సేయ నియ్యకుండినాను
దానికి నా మనసులోఁ దలపోయఁ గద్దుగా

చ. 3: గట్టిగా నే మొక్కితేను కరుణించకున్నా నీవు
గట్టినతాళి నామెడ గద్దుగా నాకు
యిట్టే శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
యెట్టయినా జుట్టిరిక మెపుడునుఁ గద్దుగా

పె శ్రృ రేకు: 39-1 బౌళి సం: 17-230

పల్లవి: లకిమినాయకురాలి లలిమీఁదఁ బెండ్లాడి
వికవిక నవ్వీని విందు గదమ్మా

చ. 1: పసుపువన్నెచీర బలుకాశగాఁ గట్టి
పసురాకుదండ తలపై సుట్టి
మొసలిమొకముసొమ్ములు సెవులనుఁ బెట్టి
విసవిస నవ్వీని వీఁడు గదమ్మా

చ. 2: వాఁడిబిల్ల కత్తి వలచేతఁ బరిజించి
పోఁడిమి బాలసంకుపోఁచి నాడించి
ఆఁడుదానిపేరి మచ్చు అరుతనే సవరించి
వేఁడిన వరము లిచ్చీ వీఁడు గదమ్మా

చ. 3: కావరపు పెనుఁబాము గట్టు మీఁద నెక్కి
కావిరెక్కబొల్లిపిట్టఁ గైకొని యెక్కి
శ్రీవేంకటేశుఁడు సేసవెట్టి కూడెను
వేవేలు వేసాలవాఁడు వీఁడు గదమ్మా

పె శృ రేకు: 39-2 సాళంగనాట సం: 17-231

పల్లవి: వొడివట్టే వేమోయి వో బావ యింత
వడిగా మాతో నవ్వవలెఁగా వో బావ

చ. 1: వొద్దఁ గూచుండే వేమోయి వో బావ నీ
వుద్దండాలు మానవుగా వో బావ
వొద్దు సుమీ జాణతనా లో బావ నీ
సుద్దు లెల్లా విని విని చొక్కితి నో బావ

చ. 2: వొల్లనే లోనికి వచ్చి వో బావ నా
వుల్ల మెల్లాఁ గరఁగించేవు వో బావ
వొల్ల ననరాదు పొందులో బావ
వెల్లివిరేల సేసేవు వేడుక లో బావ

చ. 3: వుట్టి పడి న న్నేలితి వో బావ యంత
వొట్టు వెట్టిన మానవు వో బావ
వుట్టి కెక్కె నీ సిగ్గులు వో బావ యిక
గట్టి యాయ ప్రేమ శ్రీవేంకటగిరిబావా

పె శృ రేకు: 39-3 దేసాక్షి సం: 17-232

పల్లవి: వొద్దివా రెల్లా సాక్షి ఉపేంద్రుఁడా మన
వొద్దిక నీ వెఱుఁగవా ఉపేంద్రుఁడా

చ. 1: వుడివోని వేడుకల ఉపేంద్రుఁడా యింత
వొడఁబరచవలెనా నుపేంద్రుఁడా
వొడిగట్టితిమి నీకు నుపేంద్రుఁడా మా
వొడలిపై సొమ్ము నీవె ఉపేంద్రుఁడా

చ. 2: వోడఁ గట్టినదూలమవై ఉపేంద్రుఁడా నీకు
నూడిగాలు సేసేము ఉపేంద్రుఁడా
వోడకుమీ రతికేలి నుపేంద్రుఁడా యింత
నూడదు నీ నా లంకె ఉపేంద్రుఁడా

చ. 3: వొల్లనే నన్నుఁ గూడితి ఉపేంద్రుఁడా నా
వుల్లములో నీవే కావా ఉపేంద్రుఁడా
వుల్లనపు శ్రీవేంకట ఉపేంద్రుఁడా యిమ్మా
వుల్లునుకు తేనెమోవి ఉపేంద్రుఁడా

పె శృ రేకు: 39-4 ధన్నాశి సం: 17-233

పల్లవి: గోవింద నందనందన గోపాలకృష్ణ నీ
భావము మాకుఁ జిక్కె గోపాలకృష్ణ

చ. 1: కొంగువట్టే వదేమోయి గోపాలకృష్ణ మా
పంగెన కోపుదువా గోపాలకృష్ణ
గొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ
బంగారుకాశతోడి గోపాలకృష్ణ

చ. 2: కొమ్మల చీర లంటిన గోపాలకృష్ణ
పమ్మి నిన్ను దిట్టము గోపాలకృష్ణ
కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ
బమ్మెర పో కిందుల గోపాలకృష్ణ

చ. 3: కొసరకు మంత నీవు గోపాలకృష్ణ నీ
పస నీ నెఱుఁగనా గోపాల కృష్ణ
పొసఁగ శ్రీవేంకటాద్రిఁ బొందితి నన్ను
పసి మెక్కె మొగము గోపాలకృష్ణ

పె శృ రేకు: 39-5 మలహరిసం: 17-234

పల్లవి: కేరక మా చీర లీవోయి కృష్ణరాయ వే
గీర లేడవోయి నీకు కృష్ణరాయ

చ. 1: కే లెత్తి మొక్కేమయ్య కృష్ణరాయ మా
కీలు నీచేత నున్నది కృష్ణరాయ
గేలిసేసే వేల మమ్ముఁ గృష్ణరాయ నీకు
కేళికాయ మా సిగ్గులు కృష్ణరాయ

చ. 2: గిరగిర గోర గీరే కృషరాయ మాకుఁ
గెరలించేవు వలపు కృష్ణరాయ
గిరికుచము లివిగో కృష్ణరాయ నీకు
గిరవు లెట్టు కుందాన కృష్ణరాయ

చ. 3: గెలిచితి విందరిని కృష్ణరాయ మమ్మీ
కెలఁకులఁ గూడితివి కృష్ణరాయ
కెలయకు వెన్నముద్ద కృష్ణరాయ మి
క్కిలి శ్రీవేంకటాదిపై కృష్ణరాయ

పె శృ రేకు: 39-6 మధ్యమావతి సం: 17-235

పల్లవి: సాదించితివి విద్యలు సంకరుషణా మంచి
సాదువలె నుండే నీవు సంకరుషణా

చ. 1: సన్న లింకఁ దెలుసుకో సంకరుషణా మా
చన్నులపై కొంగు జారె సంకరుషణా
జన్నెవలపు చల్లేవు సంకరుషణా యింక
సన్న యేమి దొడ్డ యేమి సంకరుషణా

చ. 2: జాజరకాఁడవా నీవు సంకరుషణా కొప్పు
జాజులు పై రాలించేవు సంకరుషణా
జాజుకో నంబుల రేఁచే సంకరుషణా మా
సాజము నీకుఁ జెప్పేము సంకరుషణా

చ. 3: సాములు మాతోడనా సంకరుషణా
జాము జాము కొకపరి సంకరుషణా
స్వామివి శ్రీవేంకటాద్రి సంకరుషణా
సామాన నన్నుఁ గూడితి సంకరుషణా

పె శృ రేకు: 40-1 నాదరామక్రియ సం: 17-236

పల్లవి: చిత్తములో రమణుఁడు చింతించీఁ జూమ్మీ
యిత్తలఁ దనపై భక్తి యీడేర్చీ ననవే

చ. 1: వొగిఁ జల్లగాలిఁ దన వూర్పుగా భావింతు
నగవుగాఁ దలఁతు చిన్నారివెన్నెలా
చిగురాకుఁ జూచి మోవిచెలువుగాఁ జింతింతు
మెగుల నా విరహము నొప్పించ దనవే

చ. 2: కలువలఁ గని తనకన్నులుగా విచారింతు
అలికులములు నెరులని నమ్ముదు
చెలరేఁగి తామెరలు చేతు లని నెడుగుదు
బలు విరహము నన్ను బడలించ దనవే

చ. 3: సోలి మెఱుఁగులు తనసొంపుగళ లని యెంతు
ఆలించి నాప్రాణము తా నని పోల్తును
యీలీల శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
యేలేఁ దొంటివిరహము యేమిఁ జేయ దనవే

పె శృ రేకు: 40-2 భైరవి సం: 17-237

పల్లవి: విన్నప మేమి జేయకు విభుఁడు తానే యెఱిఁగి
తన్నుఁ దానే యీడకు రాఁదలఁపయ్యీఁగాని

చ. 1: జవళి నిమ్మపండ్లు సరిఁ గాను కియ్యవే
అవి నాచన్నులఁ బోలు నని తలఁపయ్యీ గాని
తివురుచు నిటు జుంటితేనె గాను కియ్యనే
తవిలి నామోవితీపు తలఁపయ్యీఁ గాని

చ. 2: పొగడొందుఁ దామెరపువ్వు గాను కియ్యవే
నిగనిగని నామోము నేఁడు దలఁపయ్యీఁ గాని
మొగి బచ్చెనచక్ర మిమ్ముల గాను కియ్యవే
తగ నాపిఱుఁదు మదిఁ దలఁపయ్యీఁ గాని

చ. 3: పొలసి వేరొక్క పైఁడిబొమ్మఁ గాను కియ్యవే
పలు వన్నెల నారూపము దలఁపయ్యీఁగాని
అలమి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
తలిరు చూపరే నన్నే తలఁపయ్యీఁ గాని

రేకు: 40-3 ఆహిరి సం: 17-238

పల్లవి: విన్నవించే మిద్దరికి వినవయ్య చెలులము
నిన్ననే కంటిమి వి నిండుమోహము

చ. 1: సారెకు నెంతేసి యాసల నెంచినాను
నేరము లెంచనిదే నిండుమోహము
గారవించి యేపాటి కౌఁగిలించినను
నీరువలెఁ గరఁగేదే నిండుమోహము

చ. 2: పిలిచితేఁ బలుకక బిగిసి వూరకుండితే
నిలిచి వేఁడుకొన్నదే నిండుమోహము
చలము సాదించినను చవిసేసుకో మనసు
నిలుకడఁ బొగడేదే నిండు మోహము

చ. 3: తక్కక పరాకైతే తరితీపుతోడుత
నిక్కి నిక్కి చూచినదే నిండుమోహము
ఇక్కడ శ్రీవేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
నెక్కొనె మీయందే నిండుమోహము

పె శృ రేకు: 40-4 భైరవి సం: 17-239

పల్లవి: ఎటువంటి మోహమో యింతిపై నీకు
విటరాయతనమున వినోదించేవూ

చ. 1: చెక్కుటద్దములనీడ చేరి నీవు చూచుకొంటా
తక్కక యాకెతో నేకతము లాడేవు
ముక్కునను తియ్యని మోవితావి గోలుకొంటా
మక్కువలు చల్లి చల్లి మాట లాడించేవూ

చ. 2: పొదితో నునుఁజన్నులు బుజము లొరసుకొంటా
కైదండ వట్టుకొని దగ్గరఁ దీసేవు
ఆదిగొని మెల్లనే మాట లాలకించుకొంటా
సాదించి చేయి చాఁచి సరసము చూపేవు

చ. 3: కందువనుండి బిగ్గెఁ గౌఁగిలించుకొంటా
చందముగా రతులనే సాము సేసేవు
పందెము వేసుకొంటా పక్కన శ్రీవేంకటేశ
మందలించి పానుపుపై మన్నించేవూ

పె శృ రేకు: 40-5 ఆహిరి సం: 17-240

పల్లవి: ఇద్దరి చుట్టిరికేలు యెంచి యెంచి పోలుచరే
సుద్దులనే మోహము సూటీపడుఁ గాని

చ. 1: సతివదనముపూర్ణ చంద్రునిఁ బోలుచరే
అతనికన్నులఁ గలువ లలరుఁ గాని
మితిలేని తురుము తుమ్మెదలఁ బోలుచరే
తతిఁ బతిమోవిఁదేనె దైలువారుఁ గాని

చ. 2: మించుఁజన్ను లీకెవి తామెరలఁ బోలుచరే
ముంచివిభుచూపుఁదేంట్లు మూఁగుఁ గాని
పెంచి యిసుక దిబ్బగాఁ బిఱుఁదు వోలుచరే
అంచల నీతనిమనోహంస వాలుఁ గాని

చ. 3: తక్కక యాకెపాదాలుతాఁబేళ్లఁ బోలుచరే
ని క్కీతని చెమటేరు నిండుఁగాని
అక్కున నలమేల్మంగ యట్టే శ్రీవేంకటేశుఁడు
చక్కఁదనాలు వోల్చరే సమములౌఁ గాని

పె శృ రేకు: 40-6 కాంబోది సం: 17-241

పల్లవి: పతియే దైవము తనపతియె భాగ్యఫలము
వెతలేల చెలులాల విభుని దూరకురే

చ. 1: చిత్తమురాఁ బతిమాట చేసితే వేడుక గాక
కత్తికోఁతఁ గోరితే కాంత యింపేనా
పత్తి యిచ్చకురాలైతే నాతఁడే మన్నించుఁ గాక
మొత్తానఁ దప్పు లెంచితే మోహము నిలుచునా

చ. 2: సమ్మతిగాఁ బెనఁగితే పతిఁ బాయకుండుఁ గాక
రొమ్మునఁ గుంపటియైతే రుచి వుట్టునా
పమ్మి ప్రియము చెప్పితే భావముఁగరఁగు గాక
యెమ్మెల విఱ్ఱవీఁగితే నెనయునా పొందులు

చ. 3: చాయపాటు చెవి నేలఁ జనుఁగాక గుమ్మడి
కాయంత ముత్తెమైతే గట్ట వచ్చునా
యీయెడ శ్రీవేంకటేశుఁడే నలమేల్మంగను
పాయక న న్నేలెఁ గాక పరులెల్లాఁ జుట్టాలా

రేకు: 41-1 ఆహిరి సం: 17-242

పల్లవి: ఏమని చెప్పుదునే యిటువంటి వేడుకలు
కామించి యాతఁడు నాకు కడుఁ జవి చూపెను

చ. 1: తెరదీసి యాసలతో దిష్టించి చూచిన చూపు
వరుస నవ్వనిమో మివ్వలైననవ్వు
పరువము దప్పకుండా పాసి కూడినకూటమి
సరుగ నిండునిగ్గులు జారినప్పటిరీతి

చ. 2: కొంచక వొట్లువెట్టుకోఁగా వేఁడుకొనుటలు
మించి యలుకదీరినమీఁదిమాటలు
అంచవసంతము వేట్లాడేకౌఁగిలి
యెంచి నాలునాళ్లు చేసి యెనయునాఁటితమి

చ. 3: జడియక సురతము సలిపినమీఁదినిద్ర
యెడమాట లాడించే వొడఁబాట్లు
అడరి శ్రీవేంకటేశుఁ డన్నిటా నన్ను నేలి
యెడయని వలపుల యింపులు వుట్టించెనే

పె శృ రేకు: 41-2 భైరవి సం: 17-243

పల్లవి: నా కేల నేరుపవచ్చినాఁడు తాను
చేకొని యెప్పుడుఁ దనచిత్తములోదానను

చ. 1: తగవులఁ బెట్టేది తరితీపు సేసేది
మగనాలిసేఁతలా మాపుదాఁకాను
వెగటుగా నవ్వేది వెంగెముతో నుండేది
అగడు సేసేటివెలయాండ్లకుఁ గాక

చ. 2: పల్లదాన సొలసేది పంతములు మెరసేది
యీల్లాలివిద్యలు యివి యల్లాను
వెల్లివిరై చెనకేది వేమారుఁ బెనఁగేది
చిల్లరసాధారణపుచెలులకుఁ గాక

చ. 3: వరుసకు బిలిచేది వాడికేలు చూపేది
గరితెలగుణమా కను గొంటేను
యిరవై శ్రీవేంకటేశు డే నలమేల్మంగను
సరి గూడె నితరాలు జారులే కాకా

పె శృ రేకు: 41-3 కాంబోది సం: 17-244

పల్లవి: తొయ్యలికిఁ బతికిని దోసము లే దెట్లుండినా
చయ్యాటాలు వద్దు గాని సరసము మంచిదే

చ. 1: చలములు వద్దు గాని సతి రమణుతోడ
నెలఁగి యంతేసి సొలసిన మంచిదే
కలఁగి కోపించవద్దు గాని మొగము చూచి
చలివాయ బొమలను జంకించినా మంచిదే

చ. 2: జాలిఁబెట్టవద్దు గాని సరిగెతో నాయకుని
కేల నంది యెంత పెనఁగిన మంచిదే
వోలవేసి మాటాడక వూరకుండవద్దు గాని
పేలరియ్యై యంత వొట్టువెట్టినాను మంచిదే

చ. 3: గబ్బితనమే వద్దు గాని శ్రీవేంకటేశుఁడు
గొబ్బునఁ జెఱఁగు పట్టుకొన్నాను మంచిదే
అబ్బురానఁ గూడితివి యలమేల్మంగవు నీవు
సిబ్బితే వద్దు గాని చెలఁగినా మంచిదే

పె శృ రేకు: 41-4 శంకరాభరణం సం: 17-245

పల్లవి: ఏమి సేతు నాభాగ్యము యెఱిఁగీ నెఱుఁగ నీదు
నామోహమే మిక్కుటమై నన్నుఁ దడఁబరచెను

చ. 1: భావించి నిన్నుఁ జూచితే పరవశమౌదుఁ గాని
ఆవేళ నీతో సరసమాడ మఱతు
చేవమీఱఁ దలఁచితే చిత్తము గరఁగుఁగాని
వోవరిలో గుబ్బల నిన్నొత్తి పట్ట మఱతు

చ. 2: గక్క నీ వెదురైతే కడు సిగ్గు రేఁగుఁగాని
పెక్కు వుపచారాల మెప్పించ మఱతు
తక్కక నీ వంటితేను తమకమే నిండుఁగాని
చొక్కించి నాచేఁతలు చూపఁగ మఱతు

చ. 3: జట్టిగా నిన్నుఁ గూడితే సంతోసమే నిండుఁగాని
గుట్టున నీమోవి చవిగొన మఱతు
యిట్టె శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
నెట్టన నీగుణాలు వర్ణించ మఱతు

పె శ్రు రేకు: 41-5 వరాళి సం: 17-246

పల్లవి: ఆతనిచిత్త మెటిఁగీ అని విన్నవించవే
కాతరించి కొరితే కడుఁ జవు లౌనా

చ. 1: చనవుగలపాటినే సరలమాడుత గాక
వినవే వెగ్గళమ్మైతే వెగటు గాదా
మనసువచ్చినరీతి మచ్చికె చల్లుత గాక
ననచని సుద్దు లెల్లా నగుఁబాటు గాదా

చ. 2: తగవు నడపితేనే తడవుటా మేలు గాక
అగడైతే వలపు వాయకు వచ్చునా
మొగము చూచితేను మొక్కఁగ నమరుఁ గాక
నొగియనిచోటను చోట్లు వెదకుదురా

చ. 3: కమ్మి చేతికి లోనైతే కౌఁగిలించుకొంట గాక
వుమ్మడి నూరకుండితే వొగరు గాదా
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
సమ్మతించ నన్ను నేలే సాదించవచ్చును

రేకు: 41-6 హిజ్జిజి సం: 17-247

పల్లవి: రామనుఁ గనుఁగొంటేఁ గరఁగుజాయి యైనాను
ఆముకొని సేవ సేసి నాదరించవలదా

చ. 1: సరిఁ జెక్కుచెమటలు చన్నులపైఁ జిందఁగాను
తరుణి నీ కిందాఁకాఁ బాదము లొత్తెను
పొరిఁబొరి నిట్టూర్పులు పుక్కిళ్ళ నించుకొంటాను
యిరవుగాఁ జామరము లిందాఁకా విసరెను

చ. 2: వింతగాఁ గొప్పువిరులు వీఁపువెంటా రాలఁగాను
యింతవడి నాలవట్ట మిడె నీకును
కొంత గొంత పోఁకముడి కుచ్చులతో జాఱఁగాను
వంతుకు నీమేన జవ్వాది పూసె నీడను

చ. 3: కాంచి తనతనువునఁబులకలు నిండఁగాను
మంచముపై నీకు నాకు మడిచి చ్చెను
యెంచఁగ శ్రీవేంకటేశ యీ యలమేలుమంగను
మించి నన్నూఁ గూడితివి మెచ్చీఁ దా నిపుడు

పె శృ రేకు: 42-1 రామక్రియ సం: 17-248

పల్లవి: ఏమి సేతుమయ్య నీవు యింతటి నాయకుఁడవు
మోము చూచి తొల్లే నీకు మోహించినదానను

చ. 1: వలపించవలె నొండె వశము గాకుండితేను
చెలరేఁగి ప్రియమైనాఁ జెప్పవలెను
పిలువ నంపఁగవలె బిగిసి రాకుండితేను
కొలువుకు వచ్చి కొంత గొసరఁగా వలెను

చ. 2: మెప్పించుకోవలె నొండె మించి కరఁగకుండితే
వుప్పతించ కోర్పుతోడ నుండవలెను
చిప్పిలఁ బెనఁగ గవలె చెలికి లోఁ గాకుండితే
చెప్పినట్టే వూడిగాలు సేయఁగవలెను

చ. 3: వంచుకొనవలె నొండె వహమానమున నుంటే
కొంచక పంతము లిచ్చి కూడవలెను
యెంచఁగ శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
పొంచి నన్ను నేలితివి పొగడఁగవలెను

పె శృ రేకు: 42-2 పాడి సం: 17-249

పల్లవి: అటువంటికాంత యీ యలమేల్మంగా
తటుకున సతులార తలఁచరే యీ మోహము

చ. 1: సారెఁ జెలిచేఁ బతికి దూరి విన్నవింపించకా
మారుకొని పలుమారు మాట లాడక
యీరసపు సవతిపోలిక నీపై జూపక
నేరుతోపు నున్నాపెకు నెఱవేఱు మోహము

చ. 2: అడఁకువ లేక యెందుకైనా అడ్డాలు రాక
అడుగఁగరానిసుద్దు లడుగక
కడుఁ బరాకైతేఁ బతికపటాలు దలఁచక
బడివాయకున్నాపెకు పాదుకొను మోహము

చ. 3: తమకించి యతనిచిత్తము గలఁగించక
సమరతి నలసినఁ దమి మానక
అమర శ్రీవేంకటేశు నన్నిటాఁ జొక్కించి కూడి
తెమలకున్నాపెకు తిరమౌను మోహము

పె శృ రేకు: 42-3 ఆహిరి సం: 17-250

పల్లవి: దివ్వె యెత్తిఫలము దేవర దింతే కదవే
యెవ్వతైనా నాయకుఁడు యేలేటివాఁడుఁ గదవే

చ. 1: మతిలో సవతి వని మచ్చరము రేఁగినాను
అతనిఁ జూడవలెఁగా అవునే కదే
కతకారి నిన్నుఁ జూచి కడుఁ జలము లెక్కినాను
పతిబత్తి సేయఁగాను పదరరాదు గదవే

చ. 2: వాలిననీసేఁత చూచి వాసి యెంత వుట్టినాను
లాలించి యతనిమాట చెల్లవలెఁ గదే
పొలుపడి నీ జాడకు పంతము నాకు నెక్కినాను
తాలిమితో నా గుణము దలఁచవలెఁ గదవే

చ. 3: జోడై నీ వున్నందుకు సూడెంత గలిగినాను
వేడుక నాతనిబుద్ధి వినేదే కదే
యీడనే శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
కూడె నిన్నుఁ జెల్లెలిఁగాఁ గూర్చుకోవలెఁ గదవే

రేకు: 42-4 వరాళి సం: 17-251

పల్లవి: మగవాఁడు భ్రమసిన మరి తెలుపఁగరాదు
నగుఁబాటు చూడరమ్మ నాటకీఁడు కృష్ణుఁడు

చ. 1: కోవిల గుయ్యఁగాను గోపిక పిలిచె నంటా
ఆవల దగ్గరఁ బోయి అందుఁ గానక
ఆవేళ నొక్కనెమలి యాడ నేగఁగాఁ జూచి
బావించి చెలి యనుచుఁ బట్టఁబోయెఁ గృష్ణుఁడు

చ. 2: తీగె యల్లాడఁగాఁ జూచి తెఱవచేసన్న లివి
నాగతి ననుచుఁ జేరి యటు గానక
సోగల నందుఁ గొలనిసొంపుఁ దామెరను జూచి
భాగులఁ జెవిమో మని పట్టఁ బోయెఁ గృష్ణుఁడు

చ. 3: చెట్టుపైఁ బూవులు రాల చెలి సేసవెట్టె నంటా
అట్టె శ్రీవేంకటేశుఁ డాలకించఁగా
కట్టఁగడ నింతి యది గని నిజముగ వచ్చి
యెట్ట యెదుటనే వుండె నేచి కూడెఁ గృష్ణుఁడు

పె శృ రేకు: 42-5 శ్రీరాగం సం: 17-252

పల్లవి: నీ రమణు డిదె వచ్చీ నెరి నీ విరహ మేలే
కూరిమిగలుగుచోటఁ గొసరేలే

చ. 1: పులకమోసులు గాని పువ్వుబాణములు గావు
పలుమారు చెలి యేల భ్రమసేవే
కలయ నిట్టూర్పు గానిఁకడు జల్లగాలి గాదు
అలికి అలికి యేల అలసేవే

చ. 2: మక్కుఁ జెమటలు గాని మదనరసాలు గావు
వెక్కసమై యింతి యేల వెఱచేవే
చెక్కులకాఁకలు గాని చిత్తజుమంటలు గావు
వొక్కమాటే యింత యేల వులికేవే

చ. 3: కూడినరతులు గాని గుంపెనవాదులు గావు
యేడ కేడ వో చెలి యెంచి చూచేవే
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
వేడుకల నింతలోనే విఱ్ఱవీ గేవే

రేకు: 42-6 పాడి సం: 17-253

పల్లవి: మెరసి చెప్పఁగఁ బోలే మేడిపంటిబోన మౌన
యెరనేల సతమౌను యేతు లింతే కాక

చ. 1: అతనిఁ బిలువఁ బోతే యంగన నీ మోవి పొక్కె
వెతల నీ కది యెంత వేఁడో కాని
అతనికి వూవు లంప నవే నీ మీఁ జేయినాఁటె
అతఁడే గతుల నీచే నందుకొనెనో

చ. 2: గందము నీ వియ్యఁ బోతే కాఁక నీ మై చెమరించె
యిందు నీవేళ గుణము యెట్టిదో కాని
కందువ వీడె మంపితే కన్నుల నీకుఁ గెం పెక్కె
అందు నిందు నాము లెక్కి ఆయ మెట్టు దాఁకెనో

చ. 3: తోవ కెదురంపితేను తొయ్యలి నీ కొప్పు వీడె
చేవదేర నాత డేమి సేసెనో కాని
శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యిదె నన్నుఁ గూడె
భావములు నీ యంద బయలాయఁ గాని

పె శృ రేకు: 43-1 సామంతం సం: 17-254

పల్లవి: తా నేమి సేసునే తనవోజ లింతే కాక
నే నే వలచినదాననేఁ దన్ను దూరేనా

చ. 1: వుప్పతించి యాఁటదాని వొలిసీ నొల్లనివాఁడు
చప్పఁగా మాటలాడి సాదించును
చిప్పలఁగ నిమ్మపండు చేతికిఁ గాను కిచ్చితే
చొప్పులెత్తి పులుసంటా సోదించవచ్చును

చ. 2: గక్కనఁ జేతికి లోనుగానియట్టి రమణుఁడు
తక్కి వట్టి వలపులు తవ్వించును
చిక్కించుకొని యప్పటిచేతికి వీడె మిచ్చితే
కక్కసించి యంతలోనె కార మాయ నన్నును

చ. 3: జూటుఁ దనములవాఁడు సుదతులు నవ్వితేను
పాటించి యారజమని పచ్చిసేసును
యీటున శ్రీవేంకటేశుఁ డితఁడే నన్నుఁ గూడె
గాటపు నామోవితేనె కడుఁ దీపు లనును

పె శృ రేకు: 43-2 సామంతం సం: 17-255

పల్లవి: అటుగాన వుత్తమురాలైనది వోజతో నుండు
కిటుకులాఁడైనది కిందుపడి మెలఁగు

చ. 1: పొందు సేయఁగఁ జేయఁగఁ బురిగొను మోహము
మందెమేళమైతేను మనసు రోసు
ముందర నెపుడు నుంటే ముంచి ఆయాలుగరఁగు
గొందినే యలుగఁ బోతే కొనసాగ వాసలు

చ. 2: మాట లాడఁగ నాడఁగ మచ్చికెలు నాటుకొను
నీటున గర్వాన నుంటే నిండదు తమ
పాటించి కొల్చితేను పైపై గరుణ వుట్టు
గాటాన సాదించితేను కడు జల మెక్కును

చ. 3: సారె గూడఁగ గూడఁగ చవులు వుట్టు రతులు
చేరక సిగ్గు వడితేను చింత రేఁగును
యీరీతి శ్రీవేంకటేశ యెరిఁగి యలమేల్మంగ
కోరి నీ వుర మెక్కెను కోటిసేసు గుణము

పె శృ రేకు: 43-3 దేసాళం సం: 17-256

పల్లవి: సిగ్గుతో నున్న దాన నంటా చేరి యా లానతిచ్చేవే
వొగ్గి గర్వమేలన్ని వున్నదానఁ గాకా

చ. 1: చనవుగలదంటాను సరిఁ బెనఁగులాడేదా
తనుఁ గూడి మెప్పించుకోఁ దగుఁ గాక
మన సెఱుఁగుదు నంటా మర్మము లెత్తి నవ్వేదా
వినయాన నే రతికి వేఁడుకొంట గాకా

చ. 2: తా నన్ను మన్నించే నంటా తమకించి కొసరేదా
పూని తనకే వేడుక వుట్టింతుఁ గాక
కానిమ్మని వినీ నంటా కన్నదెల్లాఁ జెప్పేదా
మోనానఁ గొలువు సేసి మొనయుట గాక

చ. 3: నా కెంత నేరిపె నంటా నటనలు చూపేదా
జోకగాఁ దనకౌఁగిటఁ జొక్కింతుఁ గాక
యీకడ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చేకొనేవు మే లెల్లాఁ జింతింతుఁ గాకా

పె శృ రేకు: 43-4 శంకరాభరణం సం: 17-257

పల్లవి: ఇట్టి గుణవంతురాలు యీా యలమేల్మంగ
గుట్టు గలదానికి కోరికె ఫలించును

చ. 1: వోరుపు గలదానికి వొనరు దొరతనము
నేరుపు గలదానికి నిండు సిరులు
మేరతో నున్నదానికి మిక్కిలి కీర్తి గలుగు
భారీతనముదానికి పరు లెల్లాఁ జుట్టాలే

చ. 2: ప్రియము గలదానికి పెనగొను సౌఖ్యములు
నయము గలదానికి నమ్ము లోకము
దయ గలదానికి దైవమైనాఁ దోడౌను
నియతి గలదానికి నెఱవేఱుఁ బనులు

చ. 3: తగవరైనదానికి తగులై యుండు జయము
మొగమోటదానికి మోహించుఁ బతి
నిగిడి శ్రీవేంకటేశ నీ కిన్నిటా నీకె గలిగె
తగులైనదానికి తప్పదు నీ కరుణ

పె శృ రేకు: 43-5 శంకరాభరణం సం: 17-258

పల్లవి: ఆయడ నేమరితి నే నంటిపట్టి నిలుప నైతి
కాయ మిదె ప్రాయ మిదె ఘనుఁ డెం దున్నాఁడో

చ. 1: కాంతుని నేఁ గలలోనఁ గౌఁగిలించిన ట్లాయ
నంతలోనే పులకించిన ట్లాయను
చెంతల నా చెక్కు లెల్లాఁ జెమరించిన ట్లాయ
వింత లెల్లా మేనఁ గంటి విభుఁడెందున్నాఁడో

చ. 2: మనసిచ్చి వానితోనే మాటలాడిన ట్లాయ
ననుపై సెలవులనే నవ్విన ట్లాయ
కినిసి నే నాతనికి కిందుపడిన ట్లాయ
పను లెల్లా మేనఁ గంటి పతి యెందున్నాఁడో

చ. 3: చక్కఁగా నాతనిమోవి చవిగొన్న యట్లాయ
సుక్కుదీర మై మఱచి చొక్కిన ట్లాయ
నిక్కి శ్రీవేంకటపతి నిక్కలగా నన్నుఁ గూడె
దక్కి నే సుర మెక్కితి తా నెందున్నాఁడో

పె శృ రేకు: 43-6 కాంబోది సం: 17-259

పల్లవి: చెలియచిత్త మెఱిఁగి సేయవయ్యా అట్టే నీవు
నలరు జాణఁడవు నీ కాకెకునే తగును

చ. 1: కాంత నీతో సన్నచేసి కన్నులకాటికె చూపె
రంతు మాని నిన్ను రాత్రి రమ్మనఁ బోలు
కాంతులచెంపలమీఁదిగందము నలఁచి వేసె
వంత నిక్కువ సింగారవనము గాఁబోలును

చ. 2: తరుణి సన్నలు సేసి తామెరలు ముడిచెను
అరయ పద్మినీజాతి ననఁ బోలును
సరుగఁ జెమటనీరు సారె గోరఁ జిమ్మె నదే
యిరవై తొలఁగి నాల్నాళ్ళిటు సేయఁబోలును

చ. 3: ఆరయ నింత కంటహార మిదె కట్టుకొనె
హారమై తా నీకు నుండె ననఁబోలును
యీరీతి శ్రీవేంకటేశుఁ డింత సేసి నిన్నుఁ గూడె
గారవపు శ్రీరమణి గాఁబోలును

పె శృ రేకు: 44-1 ఆహిరి సం: 17-260

పల్లవి: ఎంత చనవరియైన యిచ్చకమే పలెఁ గాని
వింత వింత నేర్పుల వేసారుకోఁ దగదు

చ. 1: పతితోడ సతికినీ పంతము లాడఁ దగదు
మితిమీరి గర్వమున మించఁ దగదు
తతితోడఁ గాతరించి తప్పులు వేయఁ దగదు
చతురత సారె సారె సాదించఁగఁ దగదు

చ. 2: సలిగె గల దంటాను సభలో నవ్వఁ దగదు
యెలమిఁ జెనకి యలయించఁ దగదు
చలములఁ గాఁక రేఁచి చండి పోరఁ దగదు
సొలసి యానలు వెట్టించుకొనఁగ దగదు

చ. 3: మక్కు వెంత సేసినాను మందెమేళము దగదు
కక్కసించి ముట్టి చెనకఁగఁ దగదు
యిక్కడ శ్రీవేంకటేశుని యలమేల్మంగ గూడె
తక్కిన సతు లేఁకారఁ దమ కింకఁ దగదు

పె శృ రేకు: 44-2 హిందోళవసంతం సం: 17-261

పల్లవి: ఎన్ని నేరుచుకొంటివి యెంత వొడఁబరచేవు
నిన్నటనుంటి వింటి నీ మాటలే కావా

చ. 1: యెచ్చరించి యెచ్చరించి యెటువంటివారికైనా
మచ్చికె లూరించే వీ మాటలే కావా
పచ్చివొట్టు వెట్టుకొని పాసి వుండినవారి
నిచ్చకమ్మై కలిపేవి యీా మాటలే కావా

చ. 2: తలపించి తలపించి తనివి దీరఁగనీక
మలసి నాటుకొనే వీ మాటలే కావా
చలపట్టినాఁ బోనీక సాదించి తెచ్చి కౌఁగిటి
కెలయించి తగిలించే వీ మాటలే కావా

చ. 3: కరఁగించి కరఁగించి కడుఁ జవులు వుట్టించి
మరిగించే విందరి కీ మాటలే కావా
నిరతి శ్రీవేంకటేశ నే నలమేల్మంగను
యిరవుగాఁ బెండ్లి సేసే వీ మాటలే కావా

పె శృ రేకు: 44-3 నాదరామక్రియ సం: 17-262

పల్లవి: ఏమయ్యా నా సేవ లెస్స యీడేరెనా
ఆముకొన్న నీ తలఁపు లానతియ్యవయ్యా

చ. 1: నిద్దిరించవలె నంటా నేఁ బాదము లొత్తితే
సుద్దు లేమి యడిగేవు సారిది నీవు
వొద్దిక నల పారఁగ నెయ్య నే విసరితే
కొద్దిమీఱఁ జెమటలు కురిసేవు నీవు

చ. 2: యెత్తుగా బటువుబిల్ల లిరువంకలాఁ బెట్టితే
హత్తి చన్ను లంటె వప్పటి నీవు
బత్తితోఁ బచ్చడము నీపై నిండాఁ గప్పితే
మొత్తమి నేల నవ్వేవు ముసుఁగులో నీవు

చ. 3: చేరి రంతు సేయకుండా చెలుల రానీకుండితే
ఆరయఁ గౌఁగిలించేవు అంతలో నీవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
కోరికె లింపొందెఁ దొల్లే కూడవద్దా నీవు

పె శృ రేకు: 44-4 శంకరాభరణం సం: 17-263

పల్లవి: ముయికి ము యాయ నిదే ముచ్చట లిద్దరికిని
నయముల మీ యెడకు నవ్వు లేమి నవ్వము

చ. 1: చింతాజలధిలోన చెలి పవళించె నాడ
పంతమునఁ బాలవెల్లిఁ బవ్వళించితివి నీవు
వంతునకు వంతాయ వగవఁగాఁ బని లేదు
యెంత కెంత యిఁక మీతో యెడమాట లాడము

చ. 2: విరహనలములోన వెలఁదికి నిరవాయ
అరిది రవిమండల మదే నీకు నిరవాయ
సరికి సరి యాయ మిమ్ము సాధింపఁ బనిలేదు
తరమిడి నిక మిమ్ము తగుఁ దగ దనము

చ. 3: రచనల యింతి మనోరథములకొండ లెక్కె
నిచట శ్రీవేంకటాద్రి యెక్కితి వీవు
పచరించ సమరతిబంధము లిద్దరి కాయ
యెచటా దేవుఁడవు నిన్ను యెన్నడును దూరము

రేకు: 44-5 ఆహిరి సం: 17-264

పల్లవి: పచ్చు నట పోవు నట వాసి దప్పినా
యెచ్చరించు టింతే కాక యిందరుఁ జూడఁగాను

చ. 1: పట్టిన చలమే కాక పంతము వే రొకటా
చిట్టికా లేమైనాఁ దానే సేసుఁ గాక
కుట్టి చడ దోసపిందా కోరి మన సెవ్వరికి
యెటె నా నాయఁ గాక యిఁక నేలే పనులు

చ. 2: ఆడినదే మాట గాక అప్పటి వే రొకటా
వోడక తా నేడనైనా నుండుఁ గాక
ఆడ నీడా గొల్లచల్లా అక్కునఁ బోసిచూడఁగ
జాడ దెలుసుట గాక సట లేలే యిఁకను

చ. 3: కొన్నదే కోలు గాక కొంకు గొస రున్నదా
మున్నిటివలె నేనే మొక్కుట గాక
పన్నుగ శ్రీవేంకటాద్రిపతి నన్ను నిటు గూడె
అన్నమాట నాకు నెంచ నుచితమా యిఁకను

పె శృ రేకు: 44-6 భౌళి సం: 17-265

పల్లవి: ఇంకానా నాతో నినుమా రేఁటికి నీకు
కొంకు గొస రేమి గల్లాగోర దీర్చేఁ గాని

చ. 1: నిక్కి నిక్కి చూడకురా నీవు దొల్లి బలివద్ద
నిక్కి చూచినట్టి నీటె చాలు
చక్క మాటలాడకురా సరి నమృతము పంచే
చక్కటి నాడినయట్టి సటలేచాలు

చ. 2: నవ్వకురా నీవు నాతో నాఁడు హిరణ్యకశిపు
నవ్వుతోఁ జీరినయట్టి నటనే చాలు
రవ్వఁ గాలఁ జిమ్మకురా రచ్చలోన బండికాల
నవ్వులఁ దుమురు సేసినదియే చాలు

చ. 3: సిగ్గు వడకురా నీవు చేరి పురసతులతో
సిగ్గు విడిచిన నీ చెలువే చాలు
వొగ్గి కూడి పాయకరా వొంటినే శ్రీవేంకటేశ
యెగ్గు లల్లా మఱచితి నింత నీకుఁ జాలు

పె శృ రేకు: 45-1 మాళవశ్రీ సం: 17-266

పల్లవి: ఏమని చెప్పుదుఁ జెలి యిటవలె నున్నది తమకము
కాముకులకు మరుఁ డెటువలె గల్పించెనో కాని

చ. 1: తలఁపునఁ బారును కౌఁగిట తా ననుఁ గూడినకూటమి
కలపలెఁ దోఁచును యేరీతి కళవళమో కాని
పిలిచినయటువలె నుండును పేర్కొని నే నాలకించిన
వలపులు నాఁటిన నా భావము తగులో కాని

చ. 2: వినినటువలెనే వుండును వీనులకునుఁ దనమాటలు
చెనకిన విధమౌ నా మచ్చికమరులో కాని
కనినటువలె నౌఁ దను నెక్కడ మొగమై చూచిన
అనిశము నేమును మరిగియాందోళమో కాని

చ. 3: పక్కనే వున్నటు లుండును పానుపుపైఁ దా నెప్పుడు
అక్కున నలమే యప్పటి యలవాటో కాని
నిక్కము శ్రీవేంకటేశుఁడు నేనే యలమేల్మంగను
దక్కెను నా నోముఫలము తా నాయనో కాని

పె శృ రేకు: 45-2 ముఖారి సం: 17-267

పల్లవి: ఏమయయా రావయయా యెదురుచూచీఁ జెలియ
భామలము నిన్ను నొడఁబరచఁగఁ గలమా

చ. 1: సొలతురా యిల్లాండ్లు సారిది రమణునిఁ జేర
బిలుతురా రమ్మనుచుఁ బ్రియుని రతికి
తలఁతురా యిటువంటి తగవు నీ వేమైనాఁ
గలఁతురా సతిమనసు కరుణింతు గాక

చ. 2: ఆసలా సారె నిను నదరి తప్పక చూడ
వాసులా నీతోడ వడిఁ బెనఁగను
రాసు లాయను వలపు రమణి కొనఁగినతొంటి
బాన లాలించి యిటు పైకొందు గాక

చ. 3: కలసెనా కొఁగిటను కదిసి యలమేల్మంగ
వెలసెనా నగవు శ్రీవేంకటేశ
తెలిసెనా మా మాట తేటపడ నింకాను
వలసెనా యీకెకై వస మౌదు గాకా

పె శృ రేకు: 45-3 రామక్రియ సం: 17-268

పల్లవి: ఎంత వేసాలు సేసేవు యెలయింపుసేఁతలను
సంతోసించుకొంటి నిఁకఁ జనవియ్యరాదా

చ. 1: మచ్చికెమాట లాడితే మనసులోఁ దనియునా
కుచ్చి బిగ్గఁ గౌఁగిలించుకొంటేఁ గాక
మెచ్చి మెచ్చి పొగడితే మేనులు గదుసునా
పిచ్చిలఁ జెమటరేఁగఁ బెనఁగితేఁ గాక

చ. 2: తప్పక చూచితేను తనిసినట్టే వుండునా
అప్పసపురతుల నోలలాడితేఁ గాక
కప్పురవీడె మిచ్చితే కడు నాస దీరునా
దప్పిదేర మోవి యిచ్చి తనిపితేఁ గాక

చ. 3: కనుఁగొని పచ్చడము గప్పినఁ బంత మెక్కునా
ననుపునఁగొనగోళ్ళు నాఁటితే గాక
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
చన విచ్చి కూడితే చవులే నావి గాకా

పె శృ రేకు: 45-4 సామంతం సం: 17-269

పల్లవి: చేఁత లొకట యుండఁగ చిత్త మొకరి దూరీని
మోఁతలు నీఁడలుఁ జెలిమోహ మింతే కాక

చ. 1: మదనుఁ డెక్కడ నేసె మర్మము లెక్కడఁ గాఁడె
సుదతిచూపులే వాఁడై చొచ్చి వెళ్ళీవి
పొదల పూఁదూపు లేడ భూమిఁ జెఱకువి ల్లేడ
పదర మీ యింతిబొమ్మజంకెనలే కాక

చ. 2: కోవిలకూఁత లేడ గుండెబెదరింపు లేడ
యీవలఁ జెలియెలుఁగు లింతే కాక
తావిఁ జల్లగాలి యేడ తాపము వెంచే దేడ
తేవలఁ జెవినిట్టూర్పు దిష్ట మింతే కాక

చ. 3: పున్నమచందురుఁ డేడ పొదికాఁడై వచ్చు టేడ
మన్నన చెలిమోముమహిమ కాక
యిన్నిటా శ్రీవేంకటేశ యిది నీకే తెలుసును
సన్నల నాకె చేసినజాడ లింతే కాక

పె శృ రేకు: 45-5 శంకరాభరణం సం: 17-270

పల్లవి: ఏమి చెప్పే మమ్మా మన మిద్దరి కిఁక బుద్దులు
తాముఁ దాము నేకమే తమకములు వేరు

చ. 1: తనువులే వేరు గాని తలఁపు లొక్కటే పో
అనుఁగు రమణునికి నంగనకును
కనుఁగొనలే రెండు కనుచూపూ లొక్కటే పో
పెనఁగొన్న భావనలే భేద మింతే కాని

చ. 2: పాయములే వేరు గాని ప్రాణము లొక్కటే పో
చాయల విభునికిని సతికిని
ఆయెడఁ జేతులు రెండు అంటుఁగౌఁగిలొక్కటే పో
యీయెడ వినయములే యిన్నేసి కాని

చ. 3: భావపురతులే వేరు పరవశ మొక్కటే పో
శ్రీవేంకటపతికిఁ జెలియకును
ఆవల మోవులే వేరు ఆధరామృత మొక్కటే
కావిరిఁ గళలు పెక్కై కమ్ముకొనెఁ గాని

పె శృ రేకు: 45-6 నాదరామక్రియ సం: 17-271

పల్లవి: ఇది యెగ్గని చూడకు మింతిపై నీవు
వెదకే మీ యిద్దరికి వినోదము గాకా

చ. 1: జలజాక్షిగన నీవు చంద్రగావి గట్టఁ గాను
వలనై చూడక తలవంచెఁ గాకా
కులికి నీమీఁద నంత కోపమా చెలియకు
వొలిసి యొండొకటికి నొంటదని కాకా

చ. 2: కోకిలవాణిగనక కోరి మేఘవర్ణ మైతే
నాకె నీతో మాటలాడ దాయఁ గాక
జోకల మీయిద్దరిలో సూడుఁబాడుపగలా
సైకమై యీరెంటికిఁ బొసగదని కాక

చ. 3: జక్కవకుచగనక చంద్రాభరణవు ని
న్నిక్కడ జూచి కొంకీ నింతే కాక
చొక్కపు శ్రీవేంకటేశ సూర్యునిలో నుండే నిన్ను
తక్కక వుండనిదే తగ లౌనే కాకా

పె శృ రేకు: 46-1 ముఖారి సం: 17-272

పల్లవి: ఎక్కడి కెక్కడి సుద్దు లే మనేవు రా
వొక్కమారే యింతేసి యనొద్దు వొద్దురా

చ. 1: మాటలనే కరఁగితి మన్ననకే పెరిగితి
యీటునఁ గోపించనేర నేమి సేతురా
నీటున నివ్వెఱఁగైతి నెయ్యానకే పొరుగైతి
నేటికి న న్నేరసేవు యేడ కేడరా

చ. 2: చింతలనే జానిఁగితి సిగ్గులనే మునిఁగితి
యింతలోనే పిలిచేవు యేమందురా
పంతానకే పాలైతిఁ బాయనకే వోలైతి
యెంత కెంత సారె నిన్ను వెచ్చరింతురా

చ. 3: కాఁకలనే తనిసితి కొఁగిటనే నెనసితి
వాకున నన్నుఁ బొగడవలె నటరా
పైకొని శ్రీవేంకటేశ పలురతులఁ జొక్కితి
యేకచిత్త మాయ పను లియ్యకొంటిరా

పె శృ రేకు: 46-2 బౌళి సం: 17-273

పల్లవి: ఇంతకోపఁ గలనా యిటు నీతోఁ బొందుసేసి
మంతనాలు చాలుఁ జాలు మాయలు నీ విద్య

చ. 1: మూలఁ బుడిసెడునీట మునిఁగేది నీ విద్య
తాలిమి వీఁపు గానరా దాఁగేది నీ విద్య
జోలి దవ్వి యెడలేని సూకరాలు నీ విద్య
పాలఁసుడవై మానుపడేది నీవిద్య

చ. 2: కొంకక వేలు వె ట్టిమ్ముగొనేది నీ విద్య
జంకెతో సారెకుఁ బగ చాటేది నీ విద్య
తెంకిబెండ్లు ముంచి గుండ్లు దేలించేది నీ విద్య
వంక లొత్తి యాఁటదాని వంచేదే నీ విద్య

చ. 3: బుద్ధుల పరియాచకాల బూతు లల్లా నీ విద్య
బద్ధుల జాతిగుఱ్ఱాలఁబరుపేది నీ విద్య
అద్దివో శ్రీవేంకటేశ అన్నిటాను నన్నుఁ గూడి
ముద్దుల న న్నురమున మోఁచేది నీ విద్య

పె శృ రేకు: 46-3 సామంతం సం: 17-274

పల్లవి: నీవు నాకెఁ గూడితెనే యెఱుఁగము గాక
యేవల మావశముగా దింతట నీ చిత్తము

చ. 1: మాటలాడి నీతో నే మౌనాన వుండితే కాని
కోటికైనా చెలి మాతో గు ట్టియ్యదు
గాట్టపు నిన్నుఁ జూచుటే కన్నులు మూసుటే కాని
తేటల మ మ్మోమక మరి ద్రిష్టింపదు

చ. 2: చింత నిన్నుఁ దలఁచుటే చెక్కునఁ జెయ్యే కాని
చెంత మా విన్నపములు చిత్తగించదు
కాంత నీ పానుపునిద్రఁ గలవరించుటే కాని
యెంత మేలుకొలిపినా నెఱుఁగదు

చ. 3: చేరి నిన్నుఁ జెనకుట సిగ్గువడుటే కాని
కూరిమి మా బుద్దు లిఁకఁ గొలుపవు
యీరీతి శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి నీవు
సారె మీలో బాస మాకు సమ్మతిఁ దెలియదు

పె శృ రేకు: 46-3 శ్రీరాగం సం: 17-275

పల్లవి: చెప్పదు మనతో నించుక చెలి విరహపువెట్టిది యని
యెప్పటివలె నని చూడఁగ నింతే శాయ నయో

చ. 1: శిరసునఁ బువ్వులు ముడిచినఁ జెమరించెను మేనెల్లా
తరుణికి మరుబాణము లని తలఁచమైతిమవియు
విరులటు దులుపుచు గందము వెలఁదికి మెత్తితి మెఱుఁగక
తరువుల ననలం బుండే తాపము రేఁచె నయో

చ. 2: కపురపువీడెం బిచ్చిన కాఁకలు రేఁగెను కుచముల
తపియించెడు శశి విష మని తలఁచమైతి మయ్యో
నెపమునఁ బన్నీ రీకెకు నిండఁగఁ జల్లితి మెఱుఁగక
అపుడే నీళ్ళు చల్లన అద్రులు గరఁచు నయో

చ. 3: కలికికిఁ జిగురులు వరచినఁ గన్నులఁ గెంపులు గప్పెను
తలఁగక చిగురే చేగని తలఁచమైతి మదియూ
యెలమిని శ్రీవేంకటపతి యింతటనే చెలిఁ గూడెను
చలమున నిద్దరివయసులు సఫలం బాయ నయో

పె శృ రేకు: 46-4 సామంతం సం: 17-276

పల్లవి: రేపయ్యీ మాపయ్యీ రేసులు వోనివే
చేపట్టినదే చాలు సిగ్గులు వోనివే

చ. 1: రమ్మని పిలిచే విప్పుడే రాజసములపతివద్దకు
చిమ్ముల నా మతి చింతల చీఁకటి వోనివో
నెమ్మదిఁ దనతో నవ్వక నే నే లూరకయుండే
సమ్మతి నా నిట్టూర్పుల సందడి వోనివే

చ. 2: ఘనుఁడదే చూచెను మొక్కుము కడమెడఁ దని చూపెదు
చినికెడుచేతుల చెమటలచిత్తడి వోనివే
ననుపులఁ దను నే నంటక నా మన సెటువలె నిలిచీ
యెనయఁగఁ జెఱఁ గిటు మాసిన యెంగిలి వోనివే

చ. 3: శ్రీవేంకటపతి పానుపు చేరె ననుచుఁ దమకించెదు
భావములోపలిమరుఁ డొకపనికే పో నివే
కావిరిఁదా ననుఁ గూడెను కరఁచక నే నేలుండే
వావుల తన నా లోపలివాసులు వోనివే

పె శృ రేకు: 46-5 ముఖారి సం: 17-277

పల్లవి: నేఁ గాఁగానే కాక నీకు వేరొక తైతే
పోఁగు వోఁగుఁ బొందకుండాఁ బొగడించదా

చ. 1: నవ్వుతా నీ వన్నవట నమ్మితిఁ గనక నేను
నెవ్వగ నీ విరహన నీరుగా నయితి
అవ్వల వేరొక్క తైతే నాఁపలేక నీ యెదుట
జవ్వనపు గోలతో దోసము గట్టదా

చ. 2: అప్పుడు నిక్కి చూచిన ఆస గలదు గనక
కప్పి మరుబాణముల గాలిఁ బోనైతి
నెప్పున నేరొక తైతే నీవు సేసే చేఁతులకు
చెప్ప నేల పేరుఁ గీర్తిఁ జేయ నోపదా

చ. 3: చనవై నీ మోవితేనె చవి యిట్టే కొంటిఁ గాన
తనిసి తొల్లిటి వెల్లాఁ దల చ నైతి
వనిత వేరొక తైతే వాసికే శ్రీవేంకటేశ
తనువు నీపై వేసి తమకించదా

పె శృ రేకు: 46-6 ఆహిరి సం: 17-278

పల్లవి: వెనక ముం దెంచఁబోతే వేడుక నీ గుణములు
మనసంతే మంగళము మంతనాలు వలెనా

చ. 1: చెప్పఁగానే తనిసితి చేసి చూపవలెనా
కప్పురపునోటఁ గులుకకురా మాట
కుప్పలాయఁ బులకలు గు ట్లింకా వలెనా
కొప్పున పువ్వులు రాలీఁ గొసరకురా మోహము

చ. 2: చూచినట్టే తనిసితి సూడుఁబాడువలెనా
లాచినకన్నులనే చల్లకురా నవ్వు
వాచవు లాయ నొట్లు వాసు లింకా వలెనా
యేచి వాఁగేఁగంకణము లెంచ నింకా నెమ్మెలు

చ. 3: కూడినట్టే తనిసితి గోరితాఁ కువలెనా
జాడతో మిక్కిలి పెంచకురా సిగ్గు
యీడనే శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
వేడుకెల్లా జెల్లె నిదె వీడకురా కౌఁగిలి

రేకు: 47-1 శ్రీరాగం సం: 17-279

పల్లవి: సుదతులాల చూడరమ్మ సోద్య మిదియే కాఁబోలు
అదరి బెదరి కరఁగె గోరు ఆయ మంటఁ బోలును

చ. 1: పలికి పలికి వూరకుండె పడఁతి నీతోఁ గొంతతడవు
సొలసె మరునియమ్ము దాఁకి చొక్కు దాఁకఁ బోలును
కులికి కులికి నవ్వు నవ్వి కొంచి కడమవెట్టీ నపుడే
నిలిచి పరవశముల మునిఁగి నిద్దిరించఁ బోలును

చ. 2: పదరి పదరి సన్నసేసీ పైకొని నను విడనాడె
యెదుట జవ్వనంపుమదము యెఱుక మాన్పఁ బోలును
పెదవిగదల గొణఁగి గొణఁగి పెద్దగాఁగ వలపు చల్లె
మదనసర్పవిషము దిండ మంతిరించఁ బోలును

చ. 3: తిరిగి తిరిగి కౌఁగిలించి తెమలి తనువు చెమటఁ దోఁగె
అరిది సురతభావరసము లలుగువారఁ బోలును
మరిగి మరిగి కూడెఁ జెలియ మగుడ శ్రీవేంకటేశుఁ
డెరవు లేక యీకె సేయు యెమ్మెగాఁ బోలును

పె శృ రేకు: 47-2 సాళంగం సం: 17-280

పల్లవి: ఎంతటి వివేకులైనా యిమ్ము దెప్పరము లైతే
చెంత నీ చెలివలెనే చీకాకుపడుఁ బో

చ. 1: కన్నుల చెంగావి గట్టెఁ గలికి
యిన్ని నొలసీ నొల్లమి కిట్లానె పో
వెన్నెల మోమునఁ బూనె వెలఁది
చిన్నివిరహన మతి చిక్కువడుఁబో

చ. 2: చెక్కుల ముత్తేలు వెట్టీఁ జెలియా
యెక్కువఁ జవి దప్పితే నిట్లానే పో
ముక్కున సురటి వీచీ ముదిత
పక్కనఁ బతిఁ బాసితే భ్రమ యిట్టే పో

చ. 3: పెదవిఁ గారాలు నించె బెరసి యింతి
యిదె పతి నొరసితి నిట్లానే పో
నిదురై శ్రీవేంకటేశు నెలఁత గూడె
వదలని వలపయితే వడీ నిట్టే పో

పె శృ రేకు: 47-3 వరాళి సం: 17-281

పల్లవి: ఇంతిదే పో దీమసము యెవ్వరు నేమి చెప్పేరు
యెంత సేసినా విరస మింతయుఁ గడచెను

చ. 1: ఘనుఁడవు నీవు చంద్రగావి గట్టుకుండఁగాను
వనజాక్షి యయ్యు నిన్నే వడిఁ జూచెను
మునుసంపెంగవిరులు ముడుచుక నీవు రాఁగా
వనితలివేణి యయ్యు వాడికె మాటాడెను

చ. 2: సరఁసుడ నీవు సింహాసనముపైనుండఁగాను
కరిగమనయ్యు నీ దగ్గర వచ్చెను
సొరిది నీవు వజ్రపుసొమ్ములు నించుకుండఁగాను
గిరికుచయయ్యు నిన్ను గిలిగించ వచ్చెను

చ. 3: కామించి నీవు నెమలిగతి రతి నాటలాడ
పాముపంటి యారుగలపడఁతి గూడె
దోమటి శ్రీవేంకటేశ తొలుతటి మీలోని
బూమెలవైరాలు దీరఁ బొందొకటి సేసెను

పె శృ రేకు: 47-4 సామంతం సం: 17-282

పల్లవి: ఆపాటి చుట్టరికె మదే చాలు
కోప మేల కొంత మేల గుట్టున నుండెను

చ. 1: జాగుల కోపుదునా సమ్మతించఁ గలఁ గాక
వేగెఁ బొద్దు మాటలన్నీ విడు విడరే
బాగుగఁ దా నేడనైనా బతికితేఁ జాలుఁ గాక
చేగదేర దవ్వులఁ జూచెఁ దనమేలు

చ. 2: యెమ్మెల కోపుదునా యియ్యకొనఁ గలఁ గాక
నెమ్మి రాజసమే మీఱె నేరు పేటికే
చిమ్ముల నే చేఁతలై నాఁ జేసితేఁ జాలుఁగాక
తెమ్మగా వీనుల వినే తేజమే చాలునే

చ. 3: కాఁకల కోపుదునా కలయఁగఁ గలఁ గాక
వేఁకపు మరుఁడే సాక్షి వేసా లేటికే
యేఁకటి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
సోఁకుల నేనే మెచ్చె సారిది లోలోనను

పె శృ రేకు: 47-5 శంకరాభరణం సం: 17-283

పల్లవి: ఏఁటిమాట లాడేవే యింతటిలోనే
యీటుకే గోర గీరితే యేరయ్యీఁ బనులు

చ. 1: చివ్వన నలిగే వేలే చెలియా, నే
నెవ్వరితోడ నలిగే యేడ కేడయ్య
దవ్వుగా మాటలాడేవే తగునటవే జోలి
దవ్వుకు నూతిలోనే బేతాళాలు పుట్టీని

చ. 2: కన్నీరు నించే వేలే కలికి, నా
కన్నీట నెవ్వరిమతి గరఁగీనయ్యా
వన్నెగా నీ బుద్ది నీ కెవ్వరు చెప్పిరే, నే
బిన్నదాన యీారు దియ్యం బేను వచ్చీఁ జాలును

చ. 3: చెక్కుచేయి యింకా నేలే చెలియా
చెక్కులపై నీవు సేసే సేఁతల కయ్యా
గుక్కక శ్రీవేంకటాద్రిఁ గూడితిఁ గదే
మక్కువల మయిల దీర మణుఁ గాయఁ జాలును

పె శృ రేకు: 48-1 పాడి సం: 17-284

పల్లవి: అమ్మే దొకటియును నసిమిలో దొకటియు
నమ్మిన నీ మోహ మింతా కానరాదా నాకును

చ. 1: కొప్పు జారె నిఁక నేలే కోపము లంటేఁ
దప్పక చూచే వదేమే తగదా మాట
చెప్పక చేప్పి నదే సిగ్గు నెగ్గును నీ
కప్పిన మోహ మిందే కానరాదా నాకును

చ. 2: చెమరించె నిఁక నేలే చిమ్ముఁ గాఁకలూ అంటే
తమకించి పలికేవు తగదా మాట
అమరీనమరదు నీ యావభావాలు
గమి నీ వలపు లిందే కానరాదా నాకును

చ. 3: పులకించె నిఁక నేలే బులుపులు
తల వంచే వది యేమే తగదా మాట
యెలమి శ్రీవేంకటేశు నిటు గూడితి
కలికి నీ కూరి మిందే కానరాదా నాకును

పె శృ రేకు: 48-2 గుండక్రియ సం: 17-285

పల్లవి: పంతపు గుట్టే చాలుఁ బతివద్దను
చెంత జలధివంటిది చెలి నీ లావణ్యము

చ. 1: ముంచి ముంచి నవ్వకువే మోమెల్లాఁ దెల్లన యీ
వంచనల బంగారువంటిదీ మోము
వంచి వంచి పలుకకు వదనము రుత్తయీా
నించిన తేనెలదీ నీ నినుపువదనము

చ. 2: చిమ్మి చిమ్మి చూడకువే చెక్కు లెల్లా నల్లన యీ
నెమ్మది నద్దాలవంటి నీ చెక్కులు
కమ్మి కమ్మి నడవకు కాఁక పుట్టీ మే నెల్లా
వమ్ములేని లేఁజిగురువంటిది నీ మేను

చ. 3: పొంది పొంది జంకించకు బొమ్మ లట్టే ముడివడీ
సందీఁ గస్తూరిరేఖలజాడబొమ్మలు
యిందులోనే శ్రీవేంకటేశునిఁ గూడితి విట్టే
వందు లేని మాణిక్యమువంటిది నీ గుణము

పె శృ రేకు: 48-3 రామక్రియ సం: 17-286

పల్లవి: నా రమణుఁడేలీఁ గాక నా వల పేటి కెంచీనే
తారుకొన నిద్దరిఁ దా దగ్గరించఁ బొయ్యీనా

చ. 1: కాంతుఁడు రాకుండితేఁ గన్నీ రేల వచ్చీనే
దొంతి నాతనిఁ దా నేమి తోడితెచ్చీనా
చింత నేకతనాన నుంటే చెక్కు లేల చెమరించీ
వంతున నాతఁ డీడకు వచ్చేటట్టు సేసీనా

చ. 2: పతి యిందు రాకుండితే ప్రాణ మేల కలఁగీనే
గతియై యాతని న న్నొక్కటి సేసీనా
చతురుఁడు చూడకుంటే జాలిమా లేల వుట్టీనే
యితవై యాతనిని మా యింటికిఁ దెచ్చీనా

చ. 3: వీనుల నాయకుమాట వింటే మే నేల వొక్కీనే
తా నాతని నాకిట్టే దక్కఁజేసీనా
పానుపుపై నాతఁ డుంటే పైకొనీఁ దమక మేలే
పూని శ్రీవేంకటపతిఁ బోకుండాఁ జేసీనా

పె శృ రేకు: 48-4 లలిత సం: 17-287

పల్లవి: మాధవునకు మంగళము
సాధుప్రియునకు జయమంగళమూ

చ. 1: మదనగురునకును మంగళమూ, మా
మదిలో హరికిని మంగళము
మదరిపుహరునకు మంగళము
చదువులమూర్తికి జయమంగళమూ

చ. 2: మహిమాధికునకు మంగళమూ
మహమహునకు మంగళమూ
మహీధవునకు మంగళము
సహజతేజునకు జయమంగళమూ

చ. 3: మాయరహితునికి మంగళము
మా యింటిపతికిని మంగళము
యీయెడ శ్రీవేంకటేశ్వరుఁ డీతని
చాయ శ్రీపతికి జయమంగళమూ

రేకు: 48-5 గుండక్రియ సం: 17-288

పల్లవి: వెఱవకు చెప్పవయ్యా వెనక వేసుకొనేను
పఱచుఁజేతల వో పండరంగివిట్టలా

చ. 1: పీలిపాగవన్నెలవి ప్రేమపు నీ కామినుల
కాలిగోరిలత్తుకలు గమ్మినటువలె నుండే
మూలల నీ వేటికైనా మొక్కితివో వారిచూపు
కోలుముందై నీవు రాఁగా కోలలై తగిలెను

చ. 2: మెడని తులసిదండ మెలఁతల కోరికలు
పొడమి చిగురులై పొందినటువలె నుండె
అడరి వారితనువు లచ్చుగా ధరించితివో
కడు నిన్నుఁ జెనకేటి కరపల్లవములో

చ. 3: కట్టిన పీతాంబరము కామినుల కుంకు మెల్లా
అట్టే అద్ది నవన్నె లైనటువలె నుండె
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
అట్టే వారివలపో నా యనురాగమో

పె శృ రేకు: 48-6 లలిత సం: 17-289

పల్లవి: వేడుకకాఁడు గదమ్మ విట్టలుఁడు
ఆడా నీడా నేగి వచ్చి నదె విట్టలుఁడు

చ. 1: తుంగభద్రనీటిలోన తొయ్యలులుఁ దాను నీఁదీ
వెంగలిరతులఁ దోఁగీ విట్టలుఁడు
నింగి మోచినతోపులనీడల వినోదించి
నంగనలతో నవ్వుచు నదే విట్టలుఁడు

చ. 2: తేరువీది నల్ల వాఁడే దిమ్మరై సతులఁ బిల్చి
వే రమ్మనీ చీఁకటింట్లో విట్టలుఁడు
కూరిమి నిలుపలేక కొండలపడవలలో
నారగించీ నూరవిందు లదే విట్టలుఁడు

చ. 3: అదివో విజనగరమందు వాడల వాడల
వెదచల్లీ వరములు విట్టలుఁడు
ఉదుటు శ్రీవేంకటాద్రినుండి వచ్చి గుడిలోన
నదన రుక్మిణి దాను నదే విట్టలుఁడు

పె శృ రేకు: 49-1 ముఖారి సం: 17-290

పల్లవి: ఎంత వేగిరకాఁడ వేమోయి
పంతగాఁడ వింతలోనే పదరకువోయీ

చ. 1: చెక్కు నొక్కఁ బొద్దు లేదో చేఁత సేయఁ బొద్దు లేదో
అక్కర దీరఁగ మాటలాడవోయి
యిక్కు వంటఁ బొద్దు లేదో యేఁటికైనా బొద్దు లేదో
యెక్కువ కప్పురవీడె మిందవోయి

చ. 2: చేయి చాఁచఁ బొద్దు లేదో సేస వెట్టఁ బొద్దు లేదో
సోయగపు నీ మోము చూపవోయి
మోయ నవ్వఁ బొద్దు లేదో మోవి యానఁ బొద్దు లేదో
నీ యలపు దీరఁ గొంత నెత్తమాడవోయి

చ. 3: పచ్చిసేయఁ బొద్దు లేదో పైకొనఁగఁ బొద్దు లేదో
యిచ్చగాఁగఁ గిన్నెర వాయించవోయి
కుచ్చి నన్నుఁ గౌఁగిటనుఁ గూడితి శ్రీవేంకటేశ
మచ్చికె యీ ప్రేమ మిట్టే మఱవకువోయి

పె శృ రేకు: 49-2 లలిత సం: 17-291

పల్లవి: చెల్లఁబో యింతేసి పని సేతురా నీవు
కల్ల లంటేఁ బో నిను కమ్మిరింతుఁ గాని

చ. 1: కంటి నొక్క కల నేను కాముఁడట నిన్ను నన్ను
వింటఁ బూఁచి విరులనే వేసునటా
గొంటరివై నీవు నన్ను గోర గీరితట మేన
గంటి లే దప్పటి నేవ్వి గనమాయఁ గాని

చ. 2: అందులోనే వేరొకటి ఆకపుచందురుఁడు
చిందేటికళలు రేచి చిక్కించు నట
దిందుపడ మానముపై తిట్టుదువట సాకిరి
యెందును లేదు కోపమె యెక్కివచ్చీఁ గాని

చ. 3: చాయల శ్రీవేంకటేశ చల్లగాలి మనలోన
నాయమున కుంటెనలు నడపు నట
ఆయెడఁ గాలు దొక్కితి వట కూడితి వట
మాయ లాయ నవి లే సీ మరి నిక్కటాయను

పె శృ రేకు: 49-3 వరాళి సం: 17-292

పల్లవి: ఇప్పుడేల తమకము యింటికి వత్తువు గాని
చిప్పిలె వలపు మీదఁ సెల విచ్చేఁ గాని

చ. 1: సారె సారెఁ బొగడకు నందు లెల్లా నదరీని
కూరిమి నీలోన నిందు కొందువు గాని
పారి పారి మెచ్చకుమీ బారగించీ పులకలు
కోరికె లేమి గల్లాను గుక్కుకొందు గాని

చ. 2: నిక్కి నిక్కి చూడకుమీ నిలువెల్లాఁ జెమరించీ
యిక్కువకు మన మీఁదెత్తుదు గాని
నక్కువడ నవ్వకుమీ నడుమెల్ల బడగయ్యీని
వుక్కున రేపటి కిందు కునుతువు గాని

చ. 3: కన్నులనే మొక్కకుమీ కాలిగోరు వణఁకీని
అన్నువ పిడికిటిలో నణఁతువు గాని
యిన్నిటా శ్రీవేంకటేశ యింత సేసి కూడితివి
కన్నచోటఁ జెపకుమీ గారవింతు గాని

పె శృ రేకు: 49-4 సాళంగం సం: 17-293

పల్లవి: మేలు మేలు జాణఁడవు మెచ్చితి నిన్ను
నాలిసేసినందులకు నవ్వుటిది తగదా

చ. 1: ముంచి నీ తేనెమాటల మొగచాటాయ నాకు
పొంచి నిమ్మపంట వేయఁ బొసఁగు నీవు
అంచలఁ దాఁకిన నొప్పియది వొక్కటైనాఁ గాని
యెంచఁ దీపువెగటుక యీ వులుసు దగదా

చ. 2: చల్లని నీ ప్రియముల చలిమిరించెను మేను
యిల్లిదె కారపువీడె మియ్యఁ దగదా
మొల్లమి నా వేఁడికి మోవి పొక్కినాఁ బొక్కనీ
కల్ల గా దీ చలువకు కాఁక లిది దగదా

చ. 3: మదము నీకూటమికి మఱపాయ మతి నాకు
పుదుటు గోరి యెఱుక వొసరె నేఁడు
అదన శ్రీవేంకటేశ అప్పుడే కూడితి నన్ను
యెదిటి పరాకులకు యెచ్చరికె దగదా

పె శృ రేకు: 49-5 ఆహిరి సం: 17-294

పల్లవి: జరపులనే పొద్దు వోయ చాలదా యింక
సరుస గడపరాయ చాలదా యింకా

చ. 1: కేరి కేరి చెలి నీవు కిలకిల నవ్వించఁగ
సారెకుఁ జెమట జారె చాలదా యింక
గారవించి యాకెచేతఁ గతలు చెప్పించుకోఁగా
సారవు బెదవు లెండె చాలదా యింకా

చ. 2: సాజపుఁ బచ్చిమాటలు సతితోడ నాడఁ గాను
జాజుకొనఁ బులకించె చాలదా యింకా
తేజమునఁ బానుపుపై తెగి సరసమాడఁగా
జాజుల కొప్పెల్లా వీడె చాలదా యింకా

చ. 3: నిరతిఁ జన్నులపై కిన్నెర వాయింపించఁగాను
సరి నిట్టూర్పులు రేఁగె చాలదా యింకా
పరవశమై కూడగాఁ భామను శ్రీవేంకటేశ
సరుగఁ బంతము చెల్లె చాలదా యింక

పె శృ రేకు: 49-6 మాళవిగౌళ సం: 17-295

పల్లవి: ఏరా యిప్పుడు నా యెదుటఁ గడపరాయ
నారీ నేను నిన్నెఱుఁగుదు నను నీ వెఱుఁగుదువు

చ. 1: పలుకులఁ బదరకురా కడుఁ బగటుచెలియ నేను
చెలఁగి యేపనులు మనసునఁ గలిగినఁ జేసి చూపుదువు గాని

చ. 2: తనిసితి నీకతలా మఱి తగవు చెప్ప నేలా
వెనకటివలెనే కద నీబాసలు వింటిఁ గంటి నలనాడే

చ. 3: నగవులఁ బని లేదు యింక నాకుఁ నీకుబోదు
వెగటువాయఁ నను గడపరాయ శ్రీవేంకటగిరిపై గూడితివి

పె శృ రేకు: 49-7 రామక్రియ సం: 17-296

పల్లవి: కాంతగలనాడుఁ యేకాంతములమాట, శ్రీ
కాంతుఁడవు నీవు యిందుకొఱకు నా కాఁక లేల కడపరాయ

చ. 1: మానవతి నీవు చనుమానమనఁ బెంచితి నేఁడు
పూని నే మెంత పిలిచిన రా వనుమాన మేల కడపరాయ

చ. 2: మారుఁ డంతలోనే నీ కుమారుఁ డయ్యండి
మారుకొనె జూడు సారె సారె నెడమాట లేల కడపరాయ

చ. 3: ఆడఁ జెలిఁ జూచి మారాడలేక నీవు
కూడితివి శ్రీవేంకటగిరిపైఁ గోరికమీఱఁ గడపరాయ

పె శృ రేకు: 50-1 శంకరాభరణం సం: 17-297

పల్లవి: గుట్టు గొంత రట్టు గొంతఁ గులికీఁ గదే
చుట్టమువలెనే యీ చొక్కనాథుఁడు

చ. 1: జగడాలమాటలు చల్లఁ జూపుతేటలూ
నగుతానే యీరెండు నడపెఁ గదే
మొగమోట సిగ్గులు ముచ్చటల యెగ్గలు
సొగటులు మానఁ డిదె చొక్కనాథుఁడు

చ. 2: పనిలేని పంతము పైకొంటే పంతమూ
నినుపుల యివి రెండు నెరపెఁ గదే
తనివోని యాసలు తబ్బిబ్బుల బాసలు
చొనిపీ నూరకె నాతో చొక్కనాథుఁడు

చ. 3: పానుపుపై జోడులు పలురతివాడులు
నానాఁట యివి రెండు నడపీ గదే
పూనిన శ్రీవెంకటాద్రినుండి వచ్చి ననుఁ గూడె
సూనాస్త్రగురుఁడైన చొక్కనాథుఁడు

రేకు: 50-3 పాడి సం: 17-298

పల్లవి: మానెఁ బోరా మాటల కిఁక నేలా, నీకు
దీన నెగ్గవుత తెలియుము గాకా

చ. 1: సారె సారె సాదించ నేటికి రా, నీవు
గోర గీరినఁ గోపించఁ దగదా
నేర మేమైన నే నీకుఁ జేసితినా, నీవు
బీరమాడినఁ బెనఁగితిఁ గాకా

చ. 2: చాలుఁ జాలు జంకించ నేఁటికిరా, నీవు
నాలినేసిన నవ్వఁగఁ దగదా
నీలవర్ణుఁడ నే నీకుఁ బగదాననా, నీ
పోలికెలు చూచి పొమ్మంటిఁ గాకా

చ. 3: నీకు నీకే నిజబాస లేఁటికిరా, నీ
కాఁకమే నంటి కరుణించఁ దగదా
చేకొనరా రతి శ్రీవేంకటేశ్వరుఁడా, నీవు
జోక గూడఁగఁ జొక్కితిఁ గాకా

పె శృ రేకు: 50-4 ముఖారి సం: 17-299

పల్లవి: చెప్పిన ట్టెల్లా వింటేఁ జేసుఁబో తాను
యిప్పటనుంటీ నేల యిఁకమీఁదఁ గాకా

చ. 1: కానీ లేవే యందు కేమి కైతలకు వచ్చెనా, నే
నానుపుమాట లాడితే నవ్వుఁబో, తాను
మాన నీవే యేరుపడ మానితే నేఁగా దనేనా
కోనలఁ గమ్మర వేఁడుకొనవద్దు గాకా

చ. 2: చాలు లేవే యింతలోనే సన్నలకు వచ్చెనా, నేఁ
బోలిక లెఱుఁగకున్న బొంకుఁబో, తాను
మేలులే తా నం దెవ్వరిమే నంటినాఁ గాఁదనేనా
వాలి యా యెంగలితో రావద్దనేఁ గాకా

చ. 3: ఆడనే వినయము లందులకు వచ్చెనా
మేడలో నేనొంటి నుంటే మీఱుఁ బో, తాను
వేడుకల యింతలో శ్రీవేంకటేశుఁ డిట్లు గూడె
పాడి పంతా లెంచ నేల బడినుండుఁ గాకా

పె శృ రేకు: 50-5 పాడి సం: 17-300

పల్లవి: మగువ నీ కెదు రేదీ మాటలాడఁబోతేను
పగటుచిలుకలను పలుకులు దరిగే

చ. 1: చక్కని వదన మది సారెకు నీ వెత్తఁ గాను
చుక్కలరాయని సూటి దరిగె
యెక్కడో నీవు చూడఁగ ఇంచువిలుతునితూపు
వుక్కుమీరి కొట్టఁ గొనను వాఁడి దరిగే

చ. 2: పయ్యదే బయలు చేసి పగటులు నెరపఁగా
కొయ్యజక్కవలలోనే గుట్టు దరిగే
వొయ్యనే నీ బొమ్మ లార్చి వొరపులు చూపఁగాను
తియ్యవిలుతునివింటితీపు దరిగే

చ. 3: తళుకున నవ్వు నవ్వి తమ్ములము సేయఁగాను
తెలుపు వెన్నెలలోనితేట దరిగే
వొలిసి శ్రీవేంకటేశు వురముపై నెక్కఁ గాను
కలికి మెఱుఁగులు కళ లెల్లాఁ దరిగే

పె శృ రేకు: 50-6 రామక్రియ సం: 17-301

పల్లవి: వద్దు వద్దు కొంత గుట్టు వలె నింకాను
పెద్దరికేలపతిని పేరణివెట్టకురే

చ. 1: తలఁపే కలిగితేను తా నిందు రాఁడా
అలరి చెలుల సారె నంప నేలా
నలుగడ నాటకము నడపీ నింతే కాక
తెలిసె తెలిసెఁ బని తెగ నాడించకురే

చ. 2: పలుకులే నిజమైతే పక్కన తా నాగడాల
చలివేఁడిచూపుఁ గన్నుసన్న లేలే
వలవనిజోలి దవ్వి వంతలఁబెట్టీఁ గాక
నిలు నిలు చాలుఁ జాలు నింద వేయించకురే

చ. 3: తారుకాణ లైతేను తగఁ గౌఁగిలించఁడా
నేరుపుల కొంతవడి నిలువ నేలా
యీ రీతి శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
కూరిమితోఁ దక్కఁ గొంటి కొలఁది వెట్టకురే

పె శృ రేకు: 50-7 శంకరాభరణం సం: 17-302

పల్లవి: రంగ రంగ రంగపతి రంగనాథా, నీ
సింగారాలే తలచాయ శ్రీరంగనాథా

చ. 1: యేపొద్దుఁ బవ్వళించి యింతులబోగము నీకు
రాఁపు గొలు వెప్పు డోయి రంగనాథ
పాఁపసెజ్జమీఁదనుండి పచ్చివిరహము నీకు
పో పో వయ్యాళి యెప్పుడో రంగనాథా

చ. 2: తతి నేడుగోటలలో తగు సన్నలే నీకు
రతి జలకే లెప్పుడు రంగనాథ
కుతిలపు నగరిలో కుంటెనమాటలే నీకు
హితవై వీదివసంత మెన్నడో రంగనాథ

చ. 3: కోనేటిరంగమున కాంతపై పాదాలు చాఁచి
రావు పో వెక్కడికిని రంగనాథ
శ్రీవేంకటాద్రిమీఁద చేకొని నిల్చితివి
యేవేళ చూచిన నీవే యిటు రంగనాథా

రేకు: 61-1 సంపుటము: 17-303

పల్లవి: ఆయ లేరే యేమి చెప్పే రాతనిసుద్దులు నాకు
తాయి మక్కళాలే కాక దయ గద్దా తనకు

చ. 1: కన్నులఁజూడనే పట్టె కాఁకలు సేయనే పట్టె
యిన్నిటా తా నన్నుఁ గూడే దెప్పుడో కాని
సన్నలు సేయనే పట్టె చవులు చూపనే పట్టె
వెన్నెల బాయిటికి రా వేళ లేదు తనకు

చ. 2: నవ్వులు నవ్వనే పట్టె నాలి సేయనే పట్టె
యివ్వల నన్నుఁ గూడేది యెన్నఁడే తాను
పువ్వుల వేయనే పట్టె బుజ్జగించనే పట్టె
పవ్వళంచఁ బొద్దు లేదు పను లే లే తనకు

చ. 3: మాటలాడనే పట్టె మనసు చూడనే పట్టె
యీాటునఁ గాలు దొక్కేది యెన్నఁడే తాను
పాటించి శ్రీవేంకటాద్రిపతి నన్ను నురముపై
తేటలుగా నెక్కించుక దించ నెడ లేదు

పె శృ రేకు: 61-2 ముఖారి సం: 17-304

పల్లవి: పట్టరైరి గా మిమ్ము బడఁతులు వద్దనుండే
వొట్టి చేముట్టి సరసా లొద్దంటిఁ గా

చ. 1: పువ్వులచెండున వేసి పుప్పొడివాయల బడ
నొవ్వి బడే వేలే కన్నుల దిట్టుతా
అవ్వలివ్వలిమోములై యలిగితి రిద్దరు
నవ్వి నవ్వి జగడాలు నడుమనే వచ్చె గా

చ. 2: పక్కన నాతని నాడి పతి మాటాడించుకొని
చెక్కుచేతిచింత లేలే సిగ్గుపడుతా
మక్కళంపు మంకులతో మాటలాడ రిద్దరును
వొక్కటై యుండుండి మీకు నోరటులు వచ్చె గా

చ. 3: కుచ్చి కొనగొంగు వట్టికొప్పు జాఱ ది య్యంచుక
పచ్చిగా గోపించే వేలే పగ చాటుతా
యిచ్చకు డై శ్రీవేంకటేశు డిట్టే నిన్ను గూడె
మచ్చరము లిందా కా మానకుండె గా

రేకు: 61-3 ముఖారి సం: 17-305

పల్లవి: చెలియ ప్రాణనాథ నాకుఁ జెప్ప నేమి మాపుదాఁక
తలఁపు దలఁపు నేకమాయి తమక మింక నిదె పో

చ. 1: ఆయ మెఱింగి మాటలాడి అతివమనము గరఁచె
కాయ మంటి కళలు రేఁచుకడమ నీదే పో
చాయ చూపి చనవు లిచ్చి సరవు లెల్ల నీకు నడపె
చేయి చాఁచి కౌగిలించుచేఁత యింక నిదె పో

చ. 2: వేళెఱింగి నవ్వు నవ్వి వెలఁది నిన్ను మరుగఁ జేసె
తాలి మలరఁ జెక్కు నొక్కు తగవు నీదె పో
కేలు గేలఁ గీలుకొలిపి కెరలి యాకె ప్రియము చెప్పె
మేలు చూచి యాగుణములు మెచ్చవలయు నీవె పో

చ. 3: చవి యెఱింగి సరసమాడి సకియ నీదుమీదఁనెరగె
యివల రతులఁ దనుపవలయునెఱుక నీదె పో
జవళి శ్రీవేంకటేశ సరుగ నాపె నిన్నుఁ గూడె
తివిరి యాకెయలపు దీర్చుతెలివి యెల్ల నీదె పో

పె శృ రేకు: 61-4 దేసాళం సం: 17-306

పల్లవి: దరలో నెఱుఁగ మమ్మ తగవు లిటువంటివి
తరుణికే తెలుసును తఱవాతిపనులు

చ. 1: చెలిమది మదినుండి చెక్కు లేమిటికి గిల్లె
కెలసిఁ యాతఁడు గోపగించుకొనఁగా
వొలిసి త న్ననరాదు పూరకున్నమగవాని
తలఁచి తడవ నెల తా నలుగ నేలా

చ. 2: అట్టే నవ్వి నవ్వి పతి నాన లేమిటికిఁ బెట్టె
దిట్టతనాన నాతఁడు దిట్టఁగాను
వొట్టి తన కింతైతే వొద్దనుండ పతితోఁ జేయి
ముట్టి సరసము లేల ముంగోప మేలా

చ. 3: కౌఁగిట శ్రీవేంకటేశుఁ గళ లేల తాఁకించె
పీఁగుచు నాతఁడు వొట్టు వెట్టుకోఁగాను
రాఁగిన రతులలోన రాజువలె నున్నవాని
వీఁగి యెలయించ నేల వేఁడుకొన నేలా

పె శృ రేకు: 61-5 పాడి సం: 17-307

పల్లవి: ఎంత వేడుకో మోహ మెటువంటిదో
చెంతలను తనరాక చెప్పకు మనీని

చ. 1: వెన్నెలబాయిటనుండి విభునిపైఁ బదములు
సన్నపు టెలుఁగునను సతి వాడఁగా
కన్నులను నప్పుకొంటాగక్కననాతఁడువచ్చి
సన్న సేసీనే చెలుల చాటున వింటాను

చ. 2: శింగారవనములోన చెలులతో రమణుఁడు
అంగవించిన ముచ్చట లాడుకోఁగాను
యింగితానఁ దానె వచ్చి యింకా నడుగుమంటా
అంగనల నెచ్చరించి ఆడనే దాఁగీని

చ. 3: తరుణి శ్రీవేంకటేశుఁ దలఁచి కప్పురవీడె
నురిది నుపార మిచ్చి యందుకోఁగాను
గరిమె నాతఁడే వచ్చి కని కౌఁగిలించి కూడె
పొరి నాకెగుణములే పొగడుకొంటాను

పె శృ రేకు: 61-6 ధన్నాశి సం: 17-308

పల్లవి: చేరి తాఁ జెప్పినట్టెల్లా జేసీఁ గాని
పేరు కుచ్చి మా యింటికిఁ బిలువకే యాతని

చ. 1: యెవ్వరింటఁ జూచినాను యేరూపై వున్నాఁడో
యివ్వలఁ గమలాసతియింట నున్నాఁడో
మవ్వపు పాలజలధి మామయింట నున్నవాఁడొ
రవ్వగా వెదకి తేరే రమ్మని మా యింటికి

చ. 2: గక్కన ప్రహ్లదుకుఁగా కంబములో నున్నవాఁడో
పుక్కట కావులఁ గావఁ బోయి వున్నాఁడో
చిక్కించుక గోపికలచీర లంట బోయినాఁడో
దిక్కుల వెదకి తోడి తేరే మా యింటికి

చ. 3: అల్లదే రేపల్లెలోన నాడఁబోయి వున్నాఁడో
యిల్లిదె సీతఁ బెండ్లాడ నేగినాఁడో
వొల్లనే శ్రీవేంకటాద్రినుండేటి దైవము నేఁడు
వుల్లసాన విచ్చేసెనే వున్నతి మా యింటికి

పె శృ రేకు: 62-1 పాడి సం: 17-309

పల్లవి: అడిగితే నేమనునో అడుగకున్నాఁ బోదు
వుడివోని తలఁపోఁత నున్న దేకారణమో

చ. 1: బంగారుమేడకంబము కౌఁగిలించి పట్టి
అంగన తా నిలుచున్న దప్పటనుండి
తొంగి చూచినమాతో మాటలాడ దిదే
అంగవించినట్టి పరా కది యెటువంటిదో

చ. 2: గోడలపై చిత్తరువు కోరి కోరి చూచుకొంటా
వాడుదేరి శిర సట్టే వంచి వంచి
వీడెము చేతి కిచ్చిన వెలఁది యందుకో దిదే
యేడ నున్నదో చిత్త మెన్నఁడు నెఱుఁగము

చ. 3: చేతిలోఁ దామెరపవ్వు చెలి గోర నెత్తుతాను
ఘాతఁ దన లోలోనే కరఁగఁగాను
యీతల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
చేతనె ఆతని మెచ్చీఁ జెలికే తెలుసును

పె శృ రేకు: 62-2 రామక్రియ సం: 17-310

పల్లవి: వద్దన్న మాన వైతి వాని నిట్టె చెనకితి
చద్దిజగడాలు నేఁడు సరివచ్చె గా

చ. 1: అప్పుడే నే నంటిఁగా ఆతని మన మేమన్న
చెప్పినవారినే తిట్టి చెనకీ నని
తప్పు తనవొళ్ళఁ గలా తగ దన్నవారి నెల్లా
దెప్పదాన నాయాలకుఁ దీసీనని

చ. 2: తారుకాణ వద్దంటిఁగా తానే వాఁడు కల్లకైనా
కోరి నాపై నాన వెట్టుకొనీ నని
దారి దప్పక వుండినా తనమాటె గెల్చుదాఁకా
పొరి పొరి యాడనైనా బొంకీ నని

చ. 3: కోపగించకు మంటిఁగా గుటియ్యై నిలిచితేనే
చేపట్టి వాడఁ బలిమి సేసీ నని
యేపున శ్రీవేంకటేశుఁడెందుబో నిక కూడె
యేపొద్దూఁ బాయ మింక నిద్దరము నొక్కటే

రేకు: 62-3 ముఖారి సం: 17-311

పల్లవి: ఏమీ నెఱుఁగనివారి నెంత కెంత సేసేవు
నేమ మేమి దప్పినాను నీది గాదా దోసము

చ. 1: చెలియ మాటున నుండి సిగ్గువడియున్న యింతి
అలరి రమ్మని నీపై నానవెట్టేవు
మొలకవయసుతోడి ముద్దరా లే మెఱుఁగును
నెలకొని రా దిఁక నీది గాదా దోసము

చ. 2: మగువతల వంచుక మంచముపై నుండఁగాను
దిగువ నిలుచుండి బోధించ వచ్చేవు
చిగురుఁగాఁకలతోడిచిన్నది యే మెఱుఁగును
నిగిడి యేమి సేసినా నీది గాదా దోసము

చ. 3: మాటలాడఁ గొంకి సతి మౌనముతో నుండఁగాను
తేటల నాకె నీపయికిఁ దీసుకొంటివి
గాటపు శ్రీవేంకటేశ కాలు దాఁకుఁ జేయి దాఁకు
నీటునఁ గిందుపడితే నీది గాదా దోసము

పె శృ రేకు: 62-4 పాడి సం: 17-312

పల్లవి: ఇంత యెఱుఁగకవున్న వేఁటి పొందులు
చింతామణులు నుండి చెలులకరుణలు

చ. 1: యెడసిన ప్రియురాలు యింటికివచ్చుటే పో
తొడరి వలపునకుఁ దుదిపదము
కడఁగి యప్పటి నాకె కన్నులఁ జూచుటే పో
వడిఁ దనపాయము వన్నె కిక్కుటా

చ. 2: మచ్చికైన తనకాంత మాటలాడినదే పో
వచ్చిరతులసొబగు పంట వండుటా
గచ్చుల నాకె దగ్గరి కౌఁగిలించుటే పో
ముచ్చటల మొగజన్మమునకు శేఖరము

చ. 3: ముంచినట్టి తనసతి మోవితీపు లిచ్చుటే పో
నించినకోరికలకు నిచ్చవిందులు
యెంచఁగ శ్రీవేంకటేశు నీపె యిట్టె కలసెను
మించినతమకముల మేలు మీఁది మేలులూ

పె శృ రేకు: 62-5 సామంతం సం: 17-313

పల్లవి: ఇంతులము నేమా మి మ్మిద్దరి గూరుచఁ బూఁట
వంతుకెక్కినట్టి మీ మీ వయసులే పూఁట

చ. 1: పాయరాని మోహముల బలువై నిలుపుటకు
సోయగపు మీలోని చూపులే పూఁట
కాయముఁ గాయము సోఁకి కరఁచేయందుకు నెల్లా
ఆయములై లంకెలైన ఆధరములే పూఁట

చ. 2: గచ్చులై యెదలోఁ దమకములు రేఁచుటకు
మచ్చికె మీలోని యెడమాటలే పూఁట
యెచ్చిన యెదిటి సిగ్గు యించుకంతాఁ బోవుటకు
ముచ్చటలాడేటి మీముదములే పూఁట

చ. 3: ప్రియముతో రతి మిమ్ముఁ బెనఁగఁజేయుటకు
నయగారితనముల నవ్వులే పూఁట
నియతి శ్రీవేంకటేశ నెలఁత నీ కూటమికి
భయములేని సరసభావములే పూఁట

పె శృ రేకు: 62-6 కేదారగౌళ సం: 17-314

పల్లవి: ఇద్దరిజాణతనము లేమి చెప్పుద మమ్మ
గద్దరి యీ సేత లెందుఁ గన్నవి కావు

చ. 1: చెలి దనపతిరూపు చిత్తరున వ్రాసి మోవి
బలుసోఁకు లటు వ్రాసి పకపక నవ్వఁగా
చెలువుఁ డంతటిలోన చేతి కడ్డి దీసుకొని
తలిరుఁబోఁడిరూపు తగులుగా వ్రాసె

చ. 2: అంగన విభుని పేరి యాఁటదానిఁ జూచి చూచి
సంగతిగాని తుచ్చాలు నాకె నాడఁగా
ముంగిటరమణుఁ డా ముదిత చెలులమీఁద
యెంగిలితమ్ములము వేయించెఁ గదరమ్మా

చ. 3: పడఁతి శ్రీవేంకటేశుపావురముఁ బాదమునఁ
జిడిముడిఁ దాఁకించి చెనకఁగాను
కడఁగి యాకె నతఁడు కలసి యింతిచిలుక
బడిసివేసి తనపంతము చేకొనెను

పె శృ రేకు: 63-1 శుద్ధవసంతం సం: 17-315

పల్లవి: మేలు మేలు యిద్దరై మేకులకే సేవచేసి
గోలతనము మానితి గోవిందనాంచారి

చ. 1: చప్పుడుగా దేవునికే సారెఁ బాదములొత్తఁగా
కొప్పు జారెఁ గదవమ్మ గోవిందనాంచారి
ముప్పురి నాతఁడు నీమోము చూచి నవ్వితేను
కుప్పళించె పెంజెమట గోవిందనాంచారి

చ. 2: సంగతి నాతనితోడ సరసము లాడఁగాను
కొంగు జాఱెఁ గదవమ్మ గోవిందనాంచారి
అంగవించి పాదముల నాతఁ డెంత యదిమినా
కుంగవుగా నీ చన్నులు గోవిందనాంచారి

చ. 3: యెడయక పాఁపసెజ్జ నిద్దరునుఁ బెనఁగుచు
కొడుకుఁ గంటివిగా గోవిందనాంచారి
అడరి శ్రీవేంకటాద్రి నదె గోవిందరాజుతో
గొడుగులనీడ నేగె గోవిందనాంచారి

పె శృ రేకు: 63-2 లలిత సం: 17-316

పల్లవి: అదె వంటశాలలోన అలమేలుమంగనాంచా
రెదుట శ్రీవేంకటేశు కితవైనయట్లు

చ. 1: వెండిపైఁడిచట్లలో వేరె వేరె కూర లెల్ల
వండించి దొంతి వెట్టించి వద్ధ నుండి
కొండలపాడవుగాఁగ కోటిబోనా లపరంజి
కుండలఁ గుమ్మరింపించి కొలువై కూచుండీ

చ. 2: పానకాలు శిఖరులు పటికంపఁ గొప్పెరల
పూని వాసనలుగాఁగ పువ్వు గట్టించి
వానినే నీలపుఁ జట్టువములనే నించి నించి
ఆనించుకొని వడ్డించ నాయత్తపడీని

చ. 3: అందాలు గల్లు రసఁగా నడుగులు పెట్టి పెట్టి
విందు లలమెలుమంగ వేళ వేళను
చెంది శ్రీవేంకటపతికి చేతులకుఁ గడిగడి
అందియిచ్చి పొత్తునఁ దా నారగించి నదివో

రేకు: 63-3 లలిత సం: 17-317

పల్లవి: అప్పటి లేదని బొంకే వా సుద్ది నీవు
చెప్ప నేల నీకు నివి చెల్లుబడి గావా

చ. 1: మక్కువతో నాపెతొడ మాటలాడవా యప్పుడు
చెక్కుచెమట నీ గోరఁ జిమ్ముతా నీవు
అక్కడ నేమో సుద్దు లడుగుతా నుండవా
తిక్కుముత్యాలచిక్కు దిద్దుకొంటా నీవు

చ. 2: ఆదరించి యాకెమోము అప్పుడు చూచి నగవా
గాదిలి పయ్యదకొంగు గప్పుతా నీవు
సేదదేర బుజముపైఁ జేయి వేయవా నీవు
ఆదెసఁ బచ్చిమాట లాడుకొంటా నీవు

చ. 3: నిలుచుండే కౌఁగిలించి నీవు మోవి యియ్యవా
పలుమారు నాకె చేయి పట్టుతా నీవు
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
అలమేలుమంగ నని యంగవించి నీవూ

పె శృ రేకు: 63-4 మంగళకౌశిక సం: 17-318

పల్లవి: ముంచిన సంతసమున మోహించు టింతే కాక
యెంచి వీని గుణములు యేమని పొగడుదు

చ. 1: యిట్టేనేఁ బొయ్యేనంటే నింటిదాఁకా నంప వచ్చె
యెట్టు మఱవవచ్చునే యీతని మేలు
పట్టి తానే నన్ను పల్లకి యెక్కించెఁ దాను
నెట్టనఁ దనబుణ మెన్నిటఁ బాయు నాకు

చ. 2: చేరి నేను మొక్కగాను చేతు లెత్తి కౌఁగిలించె
వూరకే వీనిఁ బాసి యెట్టుండుదు నేను
గారవాన నే రాఁగా కలసొమ్ము లెల్లా నిచ్చె
మేరతో వీని మన్నన మెచ్చ కెట్టుండుదునే

చ. 3: అంతలోనే నంపవచ్చే నంటే నా యింటనే వుండె
యింత వాని కుపచార మేమి సేసేనే
మంతనాన నలమేలుమంగను న న్నిదె కూడె
బంతి శ్రీవేంకటాద్రిపతి నెంత మెత్తునే

రేకు: 63-5 ముఖారి సం: 17-319

పల్లవి: మామాట సరకు గాదు మగువ నీకు
కామించినాతఁడే నిన్నుఁ గరఁగించీ లేవే

చ. 1: పొత్తుకుఁ బిలిచీ వాఁడే పోవే పతివద్దికి
అత్తల నీవు రాక ఆరగించఁడు
వొత్తి బుద్ది చెప్పితేను వొద్దివారిఁ గోపించేవు
బత్తి గలాతఁడె వచ్చి పట్టి తీసీ లేవే

చ. 2: తనమీఁద నానవెట్టి దగ్గరి మాటాడనే
నిను నూరడించుదాఁకా నిలుచున్నాఁడే
యెనయించి చెలులతో నెక్కుడు పంత మాడేవు
చనవు గలాతఁడే నీ చలివాపీ లేవే

చ. 3: కొంగు వట్టి తీసీని కూచుండవే వొద్ద
చెంగట నీవు రాకున్న చిన్నఁ బోయీని
ముంగిట మామోము చూచి ముసిముసి నవ్వు నవ్వే
నెంగిలిమోవి శ్రీవేంకటేశుఁ డిచ్చే లేవే

పె శృ రేకు: 63-6 సాళంగం సం: 17-320

పల్లవి: ఇందాఁకా నెఱుఁగమ్మెమీ సుద్దులు
విందువలె నితనికి వేడుక లివి

చ. 1: కప్పురకాపు చాతేరు కడఁగి యీ దేవునిపె
దెప్పర మీతనిమేను తెల్ల బారదా
చెప్పఁగ నవ్వు నితఁడు శ్వేతద్వీపాననుండే
యప్పటి గురుతులకు నమరు నిధి

చ. 2: యేలే తట్టుపుణుఁగు యీతనిపై నించేరు
వాలి మబ్బులు కవిశీ వన్నె మేనను
ఔలే చీఁకటితప్పుఅల్ల రేపల్లెవాడల
ఆలరై చేసేనాఁటి కమరు నిది

చ. 3: అలమేలుమంగఁ దెచ్చి అరతఁ గట్టే రితని
కెలమి మే నెల్ల సొమ్ము లిరవాయను
బలిమి శ్రీవేంకటాద్రిపతి యీతఁడు గనక
చెలఁగి సింగారములు చెల్లు నమ్మా యీప్పుడూ

పె శృ రేకు: 64-1 భౌళి సం: 17-321

పల్లవి: ఇంచుకంత పతిఁ బాసి యెంత సేసేవే
మంచముపై నుండఁగా మంకుఁదనమునను

చ. 1: యించువిలుతుబాణము లింతి నీ కన్నులలోన
నించుకొనె సారె నేల నిటఁ దొక్కేవే
పంచనున్న జక్కవలు పయ్యదలో నుండఁగానే
కంచపుటూర్పుల నేలగాలిఁ బుచ్చేవే

చ. 2: తోరపు నీ కొప్పులోని తుమ్మిదబలగముల
సారె జాఱఁదోసి యేల సడిఁబెట్టేవే
నారుకొన్న చింతతోడ నడపుల హంసలను
నేరుపునఁ గాళ్ళ నేల నేలఁ బామేవే

చ. 3: గుత్తపుఁ దీగెవంటి కోమలపు నీ మేన
ముత్తెపుఁ బులక లేల మోపుగట్టేవే
హత్తిన శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్నుఁ గూడె
కుత్తికమాట కోవిలగు ట్టేల సేసేవే

రేకు: 64-2 పాడి సం: 17-322

పల్లవి: ఎక్కడి మాయమృగ మేల తెమ్మంటి నేను
అక్కడ నా వల్లనే యపరాధ మనుమీ

చ. 1: రాముఁడెన్నఁ డిందు వచ్చు రావణు నెన్నఁడు చంపు
నీమాట హనుమంత నిజమా యిది
యేమని నన్నుఁ దలఁచు యెట్ల నున్నాఁడు తాను
ఆమాటే యింకొక్కపరి అడిగేఁ జెప్పుమా

చ. 2: యెటువలెఁ బొద్దు వేగు నినకులేశ్వరునకు
నీటున నన్నుఁ బాసిననాటనుండి
కటకట తన్నుఁ బాసి కంటి నే నిన్నియును
యిటువలె దైవ మాయ యింత నన్నుఁ జేసెఁగా

చ. 3: వుంగరము పుత్తెంచెను వున్నదిగా కృప నాపై
కంగిన పగెల్లా నీఁగి కైకొనె నన్ను
కంగుగ శ్రీవేంకటాద్రి రఘుపతి నన్నుఁ గూడె
యింగితాన నయోధ్య యేలెఁగా యిప్పుడు

పె శృ రేకు: 64-3 సాళంగం సం: 17-323

పల్లవి: పదుగురు నింటిలోన బలవంతులే
యెదురు మాటాడ రాదు యేమి సేయవచ్చును

చ. 1: తప్పక చూచేటివారు తల దీసుకొనేవారు
యెప్పుడు నావొద్దివారు యింద రిందరే
తిప్పిటిమూతులవారు దేహము దాఁచేటివారు
చెప్పబోతే పస లేదు చెల్లఁబో సంసారమా

చ. 2: చేతులు చాఁచేటివారు చెప్పితే నలిగేవారు
పోతరించి మావారు పోటుబంట్లే
జాతిరాజనాలవారు సతుల వెదకేవారు
జీతమింతా రొక్కమాయ సేయవో సంసారమా

చ. 3: సిగ్గు విడిచినవారు చెంగి సకళించేవారు
దగ్గరివారికి వారు తమంతవారే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతా విచారించుకొని
తగ్గు మొగ్గు లెల్లాఁ బాపి తగునే సంసారమా

పె శృ రేకు: 64-4 వరాళి సం: 17-324

పల్లవి: ఇంతిరో నీ వున్నభావ మెట్టు చూతునే
పంతపు నీ తప సింక పండు టెన్నఁడే

చ. 1: చెలిమీఁద నొరగుండి చెక్కుమీఁదఁ జేయివెట్టి
వలపువేదన నేల వసివాడవే
యెలమిఁ జెఱకువిల్లు యెక్కువెట్టి యేయఁ జొచ్చే
వలరాచపగ యెటువలె నీఁగెనె

చ. 2: తమ్మిమోము గడు వంచి తత్తరాలే పచరించి
వుమ్మచెమటల నేల వుస్సు రనేవే
దిమ్మల యాసలు రేఁచి తేనెలు మోవి నూరించె
యెమ్మెల జవ్వనభార మెట్టు మోచేవే

చ. 3: పొంది కలువల పోసి భోగించేపానుపు చూచి
యిందరిలో నీకు నీకే యేల వుబ్బేవే
బెంది యలమేలుమంగ శ్రీవేంకటేశుఁ గూడితి
విందు నీ కళలసొంపు లెందు దాఁచేవే

పె శృ రేకు: 64-5 సామంతం సం: 17-325

పల్లవి: నిందలు వేసేవు గాక నిజమా యిది
అందుకేమి వోరి నీకు అయినపాటి చాలదా

చ. 1: చలివలపులు నాపైఁ జల్లే వదేమే వోరి
వెలవెట్ట నీవలపు వేడుక గాదా
పలుమారు నామీఁద పయిఁ జేయి వేయకువే
పిలిచి బిడ్డ నిచ్చితే బిగుతురా వోరి

చ. 2: వావిరిఁ గొప్పు పూవులవాన చూపె నదేమే
పూనక పూచినపూవు పొందులే కాదా
భావించి చన్నుల నిమ్మపండ్ల నొత్తకువే
కావక కాచేకాయల కా పందునా

చ. 3: లతమేనఁ గూడితి వీలాగు లవునే వోరి నీవు
వెతకఁబోయిన తీగె వేవేలు గాదా
రతి శ్రీవేంకటేశుఁడ రచ్చ కెక్కించితి నన్ను
రతిరాజవిభవాలు రచ్చనే కాదా

పె శృ రేకు: 64-6 సాళంగం సం: 17-326

పల్లవి: నాకు నీకు నొక్కరీతే నటనలే వేరు గాని
మేకొన్న నా మన సయితే మిక్కిలి మెత్తనరా

చ. 1: అంగనల రతుల నీ యసురుసురులు చూచి
వుంగిట నేనూ నసురుసు రైతిరా
చెంగటి నీ చెక్కుల చెమటలు నేఁ జూచి
అంగ మెల్లాఁ జెమరించి యందుకే కరఁగితి

చ. 2: కందువచేఁతల నీ కన్నుల యెఱ్ఱిన చచి
యిందునే నా కన్నులును యెఱ్ఱి నాయరా
వందులేని నీమేని వసివాడు లటు చూచి
అందపు నా దేహము తా నప్పటిని వాడెరా

చ. 3: పంతపు నీ యాగడపు పరవశములు చూచి
వంతుకు నేఁ గోపపరవశమైతి రా
యింతట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడఁగాను
సంతసాన నేనూఁ గూడిన సరికి సరి యైతిరా

పె శృ రేకు: 65-1 శంకరాభరణం సం: 17-327

పల్లవి: చెల్లఁబో ఆఁటదానికి చెల్లునా యింత
పల్లదమాడే వాతఁడు పంత మిచ్చినాను

చ. 1: నగుతా నాడినమాట నలి నెగ్గు సేసుకొని
తెగనాడే విది యేమే తెల్లవారదు
వెగటుఁ గోపము నీకు వెన్నతోడఁ బెట్టి రదె
బిగిసే వాతఁడు నిన్నుఁ బిలిచినా రాకా

చ. 2: పొలసి చేయి వేసితే చుఱుకనె నంటాను
అలిగి పొయ్యే విదేమే అట్టే లోనికి
చలమే దైవము నీకు సరి నొసల వ్రాసెనా
ములిగే వాతఁడు నీపై మోపము చల్లినను

చ. 3: బిగ్గఁ గౌఁగిలించుకొంటే పిసికివేసె నంటాను
వొగ్గి మొరవెట్టే వేమే వొద్దివారికి
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయుఁడు నిన్నుఁ గూడె
సిగ్గువడే వాఁతడు నీ చెఱఁగు వట్టినను

పె శృ రేకు: 65-2 సాళంగం సం: 17-328

పల్లవి: పట్టి పెనఁగకురమ్మా పతితోడ చెలు లెల
చుట్టపు సూడుబంటును సూటికిఁ దేరాదు

చ. 1: చెలిమి సేయఁగ వచ్చుఁ జేకొని వలవుమంటా
బలిమి సేయఁగరాదు పైపైఁ బడి
వలవు మనఁగవచ్చు వలెనన్నచోటికి
చలము సాదించేవానిఁ జాయకుఁ దేరాదు

చ. 2: మాటలాడ వచ్చుఁ గాని మన సెందుఁ బారకుండా
మూట గట్ట రా దతనిముందు ముందే
గాటపు మనసు మూట గట్టవచ్చు నందులోన
నాటుకొని ప్రియములు నారు వోయరాదు

చ. 3: చనపు నెఱపఁగ వచ్చు సమ్మతించినచోటికే
మనవి చెప్పఁగ రాదు మాయవారితో
మనవి చెప్పఁగ వచ్చు మక్కువ శ్రీవేంకటేశుఁ
డెనసె నను నింక నే నెదురాడ రాదు

పె శృ రేకు: 65-3 ముఖారి సం: 17-329

పల్లవి: ఎగసక్కేలకే వచ్చి నెంత బలువు
తగనిచేతఁలు చేసి తమకించీఁ దాను

చ. 1: వేళగాని వేళ వచ్చి వేలఁ దలుపు మీటుచు
లే లెమ్మని పేరునఁ బిలిచీనే తాను
పాలుమాలి నిద్దురతో పవళించి నే నుండఁగా
వోలి సోరణగండ్ల నుంట వింట వేసీనే

చ. 2: వాడలు దిరిగి వచ్చి వాకిటఁ దాఁ గూచుండి
ఆడకు నన్ను రమ్మంటా నానవెట్టీనే
వోడక నే నూరకుంటే వొద్దనున్న చెలులచే
వీడెము దెప్పించుక వే వేగ లోను చొచ్చేనే

చ. 3: వింతవాసనలతోడ విచ్చేసి నన్నుఁ గౌఁగిట
యెంత వొల్లా నన్న మానఁ డెటు గూడెనే
పంతపు శ్రీవేంకటాద్రిపతి నన్ను భ్రమయించి
మంతనానఁ గోప మెల్ల మఱపించె నిదివో

పె శృ రేకు: 65-4 పాడి సం: 17-330

పల్లవి: సిగ్గు వడ కేఁటి పని సేసే నేను
వెగ్గళంచఁ దగునా వెట్టి నింతే కాకా

చ. 1: యేడకో నీ వేగఁగాను యింటికి రమ్మనుచును
కోడెకాఁడ యెఱుఁగక కొసరే నేను
గోడమీఁది సున్నముల గోర నొలువఁగాఁ బోతే
వీడేనకు నను వవునా వెర్రి నింతేకాకా

చ. 2: అదె నీ చక్కదనాన కాసపడి మోహించి
పదరుచు నీ కొంగుపట్టి నేను
కదిసి చెఱకు పోలికకు వెదురు దింటేను
వెదురు దీపౌనా వెర్రి నింతే కాకా

చ. 3: చిత్తము దెలియ లేక శ్రీవేంకటేశుఁడ నిన్ను
కొత్తరతు లెల్లా రేఁచి కూడితి నిన్ను
బత్తిగల నీయందు బలిమివై నా వలపు
విత్తితేఁ బొల్లవొయ్యీ్యానా వెర్రి నింతే కాకా

పె శృ రేకు: 65-5 ఆహిరి సం: 17-331

పల్లవి: పుక్కిటివీడెము నదె చెక్కిటిచేయి నిదె
యెక్కువ తక్కువలు నీ కేల వచ్చె నమ్మా

చ. 1: వాసనఁగుబ్బలమీఁద వంకలచంద్రులు పుట్టీ
రాసెక్కి కొల దరిగె రమణి నీ వలపు
వోసరించి నీ విభుఁడు వొద్దనే వున్నాఁ డిదె
యీసుతోడ నలుక నీ కేల వచ్చెనమ్మా

చ. 2: ముంచిన దేహలతపై ముత్తెపురాసులు పుట్టీ
యెంచరాదు పంచరాదు యింతి నీ జవ్వనము
మంచముపై దిగఁ డదే మలసీని రమణుఁడ
యించుకంతలోనే బిగు వేల వచ్చెనమ్మా

చ. 3: కన్నులకొలకులనే కప్పురపుతేట పుట్టీ
చిన్ననాడే చేవదేరె చెలిసింగారము
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
యెన్నరాని నివ్వెఱగు లేల వచ్చెనమ్మా

రేకు: 0065-6 సామంతం సం: 17-332

పల్లవి: నీకు నీకే చెప్పకో రా నియ్యనా
నాకుఁ జూడ నిన్ను నెట్టు నమ్మ వచ్చు రా

చ. 1: చిత్తరుపటాన వ్రాసి చిక్కించితి నీ రూపు
అత్తించి మనసులోన నచ్చొత్తితి
యిత్తల నెంతయినా మాన వెందు నైనాఁ దిరిగేవు
నిత్తెము నీ చేఁతలకు నిజ మేదిరా

చ. 2: మాటలలో నీ పేరు మంత్రముగాఁ బట్టుకొని
కాటుకకన్నుల నీకుఁ గావ లిడితి
పాటించి నీవు మానవుపలువంచలఁ బడక
కూటపు నీ రాకలకు గుఱు తేదిరా

చ. 3: నించిన కౌఁగిటిలో నిన్ను రతిఁ గూడుకొంటి
కంచపు మోవిపొత్తు గలసు కొంటి
యెంచఁగ శ్రీవేంకటేశ యేలో మ్మై మఱచేవు
పొంచి వెంట వెంట రాక పో నట్టు వచ్చురా

పె శృ రేకు: 66-1 ఆహిరి సం: 17-333

పల్లవి: ఎంత లేదు తన సుద్దు లేమి చెప్పేది
చెంత నున్న చెలులకుఁ జేయి చాఁచకుందునా

చ. 1: మగువ కెవ్వతెకో మా టిచ్చి వచ్చినవాఁడై
నగ నెఱచీఁ గాక నాతోఁ దాను
వొగరు మాటల కెల్లా వోరిచేవాఁడా తొల్లి
నిగిడి సాదుఁదనాలు నెరపీ నే డీడనే

చ. 2: వనిత కెవ్వతెకో వలచి వచ్చినవాఁడై
మనసురాదు గాక మాటలాడను
చెనకిన యాఁటదాని చేకొను కుండఁగలఁడా
పనిమాలిన బిగువు పచరించీ నీడనే

చ. 3: పడఁతి యెవ్వతెతోనో పంత మాడినవాఁడై
తడవ వచ్చీఁ గాక తనంత నన్ను
అడరి శ్రీవేంకటేశుఁ డంగవించి నన్నుఁ గూడె
యెడసి నాతో నిన్నాళ్ళటువలె నుండునా

రేకు: 66-2 పాడి సం: 17-334

పల్లవి: ఇంతకంటె నే మయ్యీ నింకా నాకు
వింతసతులపొందులు విడువవు పోరా

చ. 1: మాటలే పోట్లయితే మందులు చేటెఁడు గావా
యేటికి పగలు చాటే వేరా నీవు
చీటికి మాటికి నీవు సేసినట్టు సేతు గాని
వాటు లేక పందె మాడ వద్దు వద్దు పోరా

చ. 2: చీలకు చీల వెట్టితే చిక్కి యడవి చాలదు
యేలమాతోఁ బోరేవు యేరా నీవు
నాలిసేసి మమ్ము నిట్టే నవ్వితే నవ్వుదు గాని
జాళె లేక బొమ్మరము సారె వేయ నేలరా

చ. 3: కతకుఁ గాళ్లు గలితే కలవు ముంతకుఁ జెవులు
వెతలఁ బెట్టక కొంగు వీడరా నీవు
యితవుగ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
బతిమి సుఖము దక్కెఁ బంత మిచ్చెఁ బోరా

పె శృ రేకు: 66-3 సామంతం సం: 17-335

పల్లవి: ఊరకున్నవారి కేల వుదుకులు గట్టేవు
సారె సారె నీతోడిజగడాలదానవా

చ. 1: కోవిలకూఁతలకుఁగా గొణఁగుకొంటిఁ గాక
ఆనల ని న్నేడనైనా నాడుకొంటినా
వావాతఁ జిలుకలతో వాదు లడిచితి గాక
భావించి ని న్నొకటైనాఁ బలికితినా

చ. 2: దవ్వుల నుండినలేటిఁ దప్పక చూచితిఁ గాక
రవ్వల నీ వంటఁగాఁ బరారైతినా
పువ్వుటమ్ములు నాటఁ బోఁ దోసితిఁ గాక
కొవ్వి పలు నీ వియ్యఁగా కొంగుచాఁచకుందునా

చ. 3: పచ్చిగాలి వేఁడిఁ గాఁగ పానుపు చేరితిఁ గాక
యిచ్చట నీ వుండినది యెఱుఁగుదునా
గచ్చుల శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మెచ్చి గో రూఁదితిఁ గాకఁ మేరలు మీఱితినా

పె శృ రేకు: 66-4 కాంబోది సం: 17-336

పల్లవి: వద్దని మానుపరమ్మ వలదాఁక పాలము
సుద్దులూనానలు వాఁడిచూపేటివేళను

చ. 1: చింత లెక్కి చిగురులు చెలియ గోయఁ దొడఁగె
వింతగాఁ బతిఁ బాసినవిరహవేళ
మంతుకు వలపు పూసి మఱి నేరేడు లమ్మీని
సంతసపు టిసుకలో చద్దివేఁడిపండులు

చ. 2: రేఁగు లెక్కి పూఁప లెల్లా రెమ్మి మాఁగవేయ జొచ్చె
పాఁగినతమకములు పట్టఁగ లేక
జాఁగయ్యై చెలులఁ గొట్టె రావికాయ లేరఁ జొచ్చె
తోఁగిన చెల్లుబడి నీతోడివారిలోనను

చ. 3: కొమ్మ యశోకము లెక్కి గుత్తులు గోయఁ దొడఁగె
కమ్మర శ్రీవేంకటేశుఁ గలసేవేళ
నెమ్మది నోరూరఁగ నిమ్మలు ముంగిట వేసె
యెమ్మెలఁ గూడిన రతి యేకాంతవేళను

పె శృ రేకు: 66-5 వరాళి సం: 17-337

పల్లవి: కొండవంటిది వలపు కోరి యెందుకైనా వచ్చు
దండివయసున నీవు తల కేవు సుమ్మీ

చ. 1: దగ్గరియున్న వలపు తరితీపులై యుండు
కగ్గి పాసినవలపు కారమై తోఁచు
వొగ్గిన పొత్తులవల పులివెచ్చలై వుండు
బగ్గన నిందుకు నీవు భ్రమసేవు సుమ్మీ

చ. 2: మొల్లమిఁ గొత్తవలపు మునిముంగిటనే వుండు
తొల్లిటి పాఁతవలపు దొంతులై వుండు
పెల్లగు రాచవలపు పెదవులపై నుండు
వెల్లివిరు లిందు కెల్లా వేసరేవు సుమ్మీ

చ. 3: తల కెక్కినవలపు దట్టపుఁజీ కటై వుండు
మొలకవలపు వాఁడిముల్లయి వుండు
యెలమితో శ్రీవేంకటేశు డు గలసె నిన్ను
చలివాసె నిందుకుఁగా జడిసేవు సుమ్మీ

పె శృ రేకు: 66-6 ముఖారి సం: 17-338

పల్లవి: ఏమి చెప్పే దమ్మా యిద్దరుఁ గూడినరతి
దోమటిమరుబలము దొమ్మి న ట్లున్నది

చ. 1: కొమ్మకుచములమీఁది గోరికొన గుఱుతులు
చిమ్ముల నమరె నేఁడు చెల్లుబడులై
కమ్ముకొని యింద్రుఁడు రెక్కలు గల కొండలపై
వుమ్మడి వజ్రాయుధ మూఁదిన ట్లున్నది

చ. 2: అందపుఁ జెలియతురు మటు నిలువున వీడి
పొందుమాలి వేరొక్క పోలి కాయను
ముందరఁ జంద్రుఁడు వచ్చి మోహరించితేఁ జీఁకటి
పందయ్యె వెనక తీసి పారినయ ట్లున్నది

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చెలిఁ గూడఁగా మేన
వావిరిఁ బులక లెల్ల వాము లాయను
సావిగాక చెమటలు జడివట్టి కురియఁగా
మోవరాని పయిరు లెల్ల మొలచిన ట్లుండెను

పె శృ రేకు: 67-1 ముఖారి సం: 17-339

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యేరా నీవు
యింతులతోనే బలిమి యేలరా నీవు

చ. 1: నొచ్చినోవని మాట నోరిలోనే వుండఁగాను
యెచ్చుకొందు లాడవచ్చే వేరా నీవు
మచ్చికతోడికోపము మనసులో నుండఁగాను
వచ్చేవు వాదులకు వద్దురా నీవు

చ. 2: చిఱుచేఁదులయిన నవ్వు సెలవినే వుండఁగాను
యెఱఁగెఱఁగి తిట్టేవు యేరా నీవు
పొఱలేని జంకెనలు బొమ్మలనే వుండఁగాను
అఱు కమ్మి పెనఁగేవు అద్దిరా నీవూ

చ. 3: కాఁకలపొందుచూపు కన్నులనే వుండఁగాను
యేఁకటఁ దమకించేవు యేరా నీవు
వాఁకల శ్రీవేంకటేశ వద్ద నిన్నుఁ గూడఁగాను
పూకొని మై మఱచేవు వుండుండే నీవు

పె శృ రేకు: 67-2 సామంతం సం: 17-340

పల్లవి: కతకారి వయితివి కానీ లేవే నీ
గతులెల్లా రతులయ్యీఁ గానీ లేవే

చ. 1: సన్నసేసి పిలిచితే సారె సారె నాడనుండే
కన్నుల నవ్వేవు అట్టే కానీ లేవే
యెన్ని పూవుల వేసినా నెఱుఁగనట్టే వుండేవు
కన్నెవుగా అందుకేమి కానీ లేవే

చ. 2: జడిగొన మొక్కితేను చనుమొన లిటు చూసి
కడు బీరా లాడేవు కానీ లేవే
వడిఁ గొంగు వట్టితేను వట్టి యాసలే పెట్టి
కడుపేవు కాలము కానీ లేవే

చ. 3: చిప్పిలు వెఱ వడిగితే చెడ్డతిట్టు లెల్లాఁ దిట్టి
కప్పురవీడె మిచ్చేవు కానీ లేవే
యిప్పు డిట్టే శ్రీవేంకటేశుఁ డ నిన్నుఁ గూడితి
కుప్పేవు నీ మోహములు కానీ లేవే

పె శృ రేకు: 67-3 సామంతం సం: 17-341

పల్లవి: ఎవ్వతెకు మోహించినా యిట్టివే నీ చేఁతలు
యివ్వల నింతేసి చన విచ్చితివా నీవు

చ. 1: పట్టంచు దుప్పటము బాగుగాఁ గుచ్చెలవోసి
పెట్టెను వొడ్డాణము బిల్లలనూలు
మెట్టిన చమ్మాళిగెలమీఁదనుండే మాటలాడి
తెట్టఁదెరువున నిదె తేఁకువా నీకు

చ. 2: రంగుమాణికపుటుంగరములచేయి చెక్కు మోపి
అంగన కైదండతో నొయ్యన వొరగి
ముంగిట నీ మోము చూచి ముసిముసి నవ్వు నవ్వె
అంగడివలపు నీకు నంతప్రియమా

చ. 3: కమ్మఁబూవులకొప్పుతో కన్నులు వేలవేయుచు
దొమ్మిగా ని న్నింతలోనె తొడికి పట్టి
చెమ్మఁజెమట కుచాలఁ జిందరవందర సేసి
యెమ్మెల శ్రీవేంకటేశ యిందుకు వచ్చితివా

పె శృ రేకు: 67-4 సామంతం సం: 17-342

పల్లవి: తెగరానిచోటికి దీమసంబులే మేలు
మొగమొగము చూచితే ముందువెన కౌను

చ. 1: తప్పక చూచుటకంటె తల వంచుకొంట మేలు
యిప్పటి యలుకలు మీఁద నిట్లుండునా
ఉప్పటించి దూరుకంటె నూరకుండుట మేలు
నెప్పునఁ గలసినమీఁద నేరంబు లౌను

చ. 2: దగ్గరి గొణఁగుటకంటెఁ దలఁగి పోవుట మేలు
కగ్గుదేరీ నప్పటికి కడమ లౌను
వెగ్గలించి తెగుకంటె వెడఁగు దైన్యమే మేలు
అగ్గపుఁ బంతపువేళ నటు బొంక బరవు

చ. 3: మంకుఁదనములకంటె మంచితనమే మేలు
వంక లొత్తేటివేళ వాండ్లౌను
అంకెలనే శ్రీవేంకటాద్రీశుఁ గూడితివి
పొంకమగు చెలియ తలపోఁత లపు డౌను

పె శృ రేకు: 67-5 సామంతం సం: 17-343

పల్లవి: మనసు లేకములైన మనలోని వలపులకు
తనివి దీరుచుకొనఁగ తరి నేఁడు గదరా

చ. 1: యేకతంబునఁ గూడి యిద్దరము నొకరొకరు
జోక నెమ్మెము లటు చూచి చూచి
వాకుచ్చి గుటిదాఁక వలపు పైఁ జల్లినను
కైకొనుచు లోలోనె కరఁగంగవలెరా

చ. 2: బుజముపైఁ జేయి వేసి పొంచి మర్మము లంటి
గజరుఁగోరికలచేఁ గరఁచి కరఁగి
భజనఁ గొనగోరఁబైపైఁ గొప్పు గడు దువ్వి
గుజగుజలఁ దుదమాట గొణఁగంగవలెరా

చ. 3: చెలఁగి విజనగరపు సింగారవనములో
వెలయుఁ గోనేటిఁ శ్రీవేంకటేశ
కొలఁది మీరినవేడ్కఁ గూడితిమి యిద్దరము
యిల మీఁద మనభాగ్య మెంచంగవలెరా

పె శృ రేకు: 67-6 సామంతం సం: 17-344

పల్లవి: ఆకెనేపో నే నడిగే నందరిలోన
యేకతాన నిన్ను భ్రమ్రయించెఁగా విభుఁడా

చ. 1: సారెఁ దురుమొకచేతఁ జక్కఁ బెట్టుకొంటానే
వోరగండ్లనే చూచె నొకలేమ
గీరుఁ దిరుమణి గోరఁ గెరలి దిద్దుకొంటానే
ఆరయ నీతో మాటలాడెఁగా విభుఁడా

చ. 2: చెచ్చెర నుద్దాలు మెట్టి చెలిపై నొరగుకొని
అచ్చనాడె నిమ్మపండ్లు ఆ యింతి
కుచ్చుముత్యాలపయ్యదకొంగు ముంజేతఁ జుట్టుక
వెచ్చనూరుపుల నిన్ను విసరెఁగా విభుఁడా

చ. 3: ఆడపచెలు లిచ్చేటి ఆకు చేత నందుకొంటా
వెడవెడగా నవ్వె వెలఁది నీతో
నడుమ శ్రీవేంకటేశ ననుఁ గూడితివి యీడ
నోడిగించ నా పేరు మోచ్చెఁగా విభుఁడా

పె శృ రేకు: 68-1 శంకరాభరణం సం: 17-345

పల్లవి: తెలిసితిమి నీసుద్ది దేవరవు గదరా
అలవాటు లేదు మాకు నంతటనే చాలును

చ. 1: పై కొనేవు తమకించి బత్తి నాపై నెంత లేదు
యేకడకో పోఁ దలఁచి యింతే కాకా
కోక గప్పేవు నా మీదఁ కూరిమి గలట్లానే
చేకొని నన్ను నిద్రవుచ్చెకొరకే కాదా

చ. 2: యిదె వీడె మిచ్చేవు యేవి ననకుండా నన్ను
మదన మెత్తించేటి మందదిగాదా
యెదురుగా సొమ్ములు వెట్టే వీవిగలవానివలె
మొదల నాపైఁ బెద్ద మోపు గట్టఁ గాదా

చ. 3: కౌఁగిట బిగించేవు కద్దులే నీ పగ నీఁగి
ఆగి వేరొకతెఁ బెండ్లి యాడనే కాకా
వీఁగక శ్రీవేంకటేశ వేడుకఁ గూడితి నన్ను
రాగి నా కోపముడిపి రక్షించనే కాదా

పె శృ రేకు: 68-2 సామంతం సం: 17-346

పల్లవి: నీ వెంత సేసినాను నే విడువలే గాక
పూవులోపలిపిందె పొసఁగి పండవునా

చ. 1: చిగురు చేగవుఁ గాక చేగేల చిగురవురా
నిగిడి నే వలతుఁగాక నీ వేల వలతువురా
సగము మంచితనాన చవి చేసుకొందుఁ గాక
తగిలి నేయి దాగినను దప్పి దేరీనా

చ. 2: నీరు కొలఁది తమ్మి గాక నీరు తామెరకొల దవునా
యేరా నీకుఁ జిక్కితిఁ గాక యిటు నాకుఁజిక్కవురా
నీరువంకతుంగనై నీమనసు గయికొంటి
కూరవండి కస వేర కొలది నుండీనా

చ. 3: నువ్వులలో నూనె గాక నూనెలో నువ్వు లేవి
రవ్వలనే నీవు గాక రతులు నీ కెంత లేదు
యివ్వల శ్రీవేంకటేశ యిచ్చట నన్నుఁ గూడితివి
నవ్విన మీఁదట నలుక నాటకము గాదా

పె శృ రేకు: 68-3 శంకరాభరణం సం: 17-347

పల్లవి: దవ్వులనే వొకచింత దగ్గరితే నొకచింత
జవ్వనమే తరవులై సడిబెట్టీ నన్నును

చ. 1: కందునో వొకవేళఁ గన్నుల నా రమణుని
విందునొకో వాని సుద్ది వీనుల నేను
అందునొకో వొకమాట అంత నేరుపరి వని
సందడించీ నావలపు జాలిఁబెట్టి నన్నును

చ. 2: నగుదునొకో నేను నా సెలవిఁ బతితోను
జగడింతునొకో బొమ్మజంకెనలను
మొగిఁ జేయి వేతునొకో ముంచి వానికౌఁగిటికి
చిగిరించీ వలపులు చిత్తములో నాకును

చ. 3: మోవితేనె చిందునొకో ముంచి నావదనమున
వోవల వాఁడిచన్నుల నొత్తుదునొకో
యీవల శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
చేవదేరి నావలపు చిమ్మిరేచీ నిపుడు

పె శ్రు రేకు: 68-4 సామంతం సం: 17-348

పల్లవి: దయ నాపైఁ గొంతైనాఁ దలఁచితే నేమాయ
ప్రియురాలుఁ గోప మింత పెడరేఁచ నేలరా

చ. 1: వేఁకమైన విరహన విసిగితి నిందాఁకా
కాఁకమేను నాపై వేసి కాఁక రేఁచ నేలరా
మాఁకువలె నున్నదాన మతి నివ్వెఱగులచే
ఊఁకొను మనుచు గోర నూఁదే వదేలరా

చ. 2: జవ్వనపు సడిచేత జడిసేటి నాతోను
రవ్వగా నవ్వులు నవ్వి రవ్వ సేయ నేలరా
పువ్వువలె వాడితి నేఁ బొద్దుగడపులచేత
నివ్వలిమోము గ మ్మంటా నింతే శాన లేల రా

చ. 3: దగ్గరిన సంతసానఁ దల వంచుకున్న నన్ను
సిగ్గరి పెండ్లికొడుక సిగ్గు లందే వేలరా
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
వొగ్గి వీడె మిందమంటా నుప్పతించే వేలరా

పె శృ రేకు: 68-5 ఆహిరి సం: 17-349

పల్లవి: కాంతలాల కంటిరటే కతకుఁ గాళ్ళు మొలచె
యింతసేసేపతికంటే యిట్టే నేనే వెగటు

చ. 1: విరహతాపానకంటే విసువే ఘన మాయె
గరిమెఁ బెరకెంపులకంటే పెద్దాయెఁ గన్నీరు
ధర నిట్టూర్పులకంటే తమకమే యెక్కు డాయె
వరుసవానకంటే వంగుడే ఘనము

చ. 2: చిత్తములో చింతకంటె చెక్కుచేయే దిష్టము
మొత్తపువయసుకంటే మొనచన్నులే బరవు
జొత్తులమైకాఁకాకంటే చూపులరేసులు మించె
కొత్తచేనివానికంటే కుప్పీకాఁడే బలువు

చ. 3: కౌఁగిటిరతులకంటే కమ్మఁజెమటే బలిమి
మాఁగిన యీ మోవికంటె మంచిమాటలే తీపు
వీఁగుచు శ్రీవేంకటాద్రివిభుఁడిట్టే నను: గూడె
చేగకంటె కొననున్న చిగురే పొడవు

పె శృ రేకు: 68-6 ఆహిరి సం: 17-350

పల్లవి: ఇందు వేరైనా దెల్లా నేఁటి మోహము
కందువతో మనలోనే కలిగెఁగా మోహము

చ. 1: వనఁదగనిమాట వీనుటెపో మోహము
పొనిఁగి యంపినాను పోలె నిది మోహము
ననుచ నీ వొట్లకు నచ్చినది మోహము
కనుమూసినంతలోనే కాఁగుటే మోహము

చ. 2: తగిలి మాటాడి యాడి తనియనిది మోహము
మగుడి యెగ్గును సిగ్గు మఱచుటే మోహము
జగడాలకును గుండెజల్లనుటే మోహము
తెగి వెఱపెఱుఁగనిదే మోహము

చ. 3: బయలు మెఱసి కడుఁ బచ్చి వొంచుట మోహము
నయమున మంతనాలు నాటుకొంటే మోహము
జయమై శ్రీవేంకటేశ సమరతి మతములే
క్రియలతో వోలలాడి కెరలుటే మోహము

పె శృ రేకు: 69-1 సాళంగం సం: 17-351

పల్లవి: ఇది విచారించవద్దా యేల మానితివో కాక
వదరీవో రమణుఁడ పరాకైతి గాకా

చ. 1: నీమేనిచెమటనీట నిండిన నావిరహగ్ని
ఆముకొని యారవద్దా ఆరదు గాక
మోముచంద్రకళలకు ముంచీ నా మతి చీఁకటి
యేమైనాఁ బాయఁ గద్దా యెక్కుడయ్యీఁ గాకా

చ. 2: మోవిపై చుక్కలు చూచి ముంచీ కన్నుఁ గలువలు
వేవేగఁవిచ్చుఁగవద్దా విచ్చవు గాక
తావినీవూర్పుగాలికిఁ దగునా కన్నీటినీరు
యీవేళ నింకవలదా యింకదాయఁ గాకా

చ. 3: గందపు నీమేని మీఁద గమ్మీ నా బాహులతలు
అందిప్పై బారఁగవద్దా అందపు గాఁక
యిందులోనే శ్రీవేంకటేశ నన్ను గూడితివి
ముందు బాసగొనవద్దా మొకమోట గాకా

పె శృ రేకు: 69-2 శంకరాభరణం సం: 17-352

పల్లవి: నేనే యిందుకు నోచితి తానే అందుకు నోచెను
ఆనలు సారెకు నేటికి అందే చనుమనవే

చ. 1: చెక్కునఁబెట్టినచేయి నీ చెంపల జారిన తురుమును
దక్కిన దిదివో నాకును తనతో కూటమిని
చుక్కలలెక్కలమోవియు సొలపులనిద్దుర కన్నులు
చక్కగ నమరెను తనకది సంతోషంబునకే

చ. 2: తనువునఁ బొడమేటికాఁకలు దప్పులుదేరేటిమోమును
పనివడి నా పాలాయెను పతితో సరసములా
మనసుల సంతోషంబులు మఱుఁగుల యేకాంతంబులు
తనకే అలవాటాయెను తప్పిఁక లే దనకే

చ. 3: పరవశములలో నెలవులు బచ్చనకూటమి కలలును
పరగెను శ్రీవేంకటగిరిపతి ననుఁ గూడఁగను
సురతపువాన పూర్పులు చొక్కేటి సమరతినేర్పులు
యిరవాయెను యిలఁ గొరతలు యిఁక మరి లే వనకే

పె శృ రేకు: 69-3 రామక్రియ సం: 17-353

పల్లవి: కంటే సుంకము నీకు కానకుంటే బింకము
వొంటదు నాతోడిపొందు వొలసీ నొల్లములు

చ. 1: కదిసి నే నెదురైతే గక్కన వచ్చితి గాక
యిదే నీ వూరకవుంటే యెందువోదు
పదరి నేఁ బలుకఁగ పతిమాటాడితిఁ గాక
మదిలో గుట్టుననుండేవట నీకు లాభము

చ. 2: యిటు నే నెచ్చరించఁగా యిక్కడఁ జూచితిఁగాక
కటకటా లేకున్న యెక్కడ చూతువో
నటనకు నేఁ గాఁగా నవ్వితి వింతే కాక
యిటు గాకుండితే నవ్వు లివే నీకు లాభము

చ. 3: ముంచి నేఁ గౌఁగిలించఁగ మోవి యిచ్చితివి గాక
వంచన నే రాకున్న నెవ్వతే కిత్తువో
చంచుల శ్రీవేంకటేశ సమరతి మన కందె
యెంచరాని పరవశాలివే నీకు లాభము

పె శృ రేకు: 69-4 శంకరాభరణం సం: 17-354

పల్లవి: మొదలనే మాతోఁ జెప్పిన మొక్కే మిదె నీకు
మదనుని నిటు వాకట్టే మంత్రం బిఁక నేదో

చ. 1: చెలియకు చిత్తరువ్రాఁతలు సిగ్గులలోపలి యీఁతలు
నిలువుకు నిలువే వెఱగులు నీకతమునఁ గలిగె
సెలవుల నవ్వులు యింతికి చిందగ మామతివెఱపులు
తెలుపఁగ నేరిచి కాచిన దేవర యెవ్వరొకో

చ. 2: కన్నులచేవలు దేరెను కాఁకలు చన్నులు మీఁటెను
నిన్నటనుండియు సతికిని నీకతమున నిదివో
అన్నువ ముచ్చటమాటలు ఆడఁగ బిలిచే నేమిఁక
మన్ననతో విని యడిపెను మందిక నెట్టిదొకో

చ. 3: వలపులు శిరసుకు నెక్కెను వావులు పాదము దొక్కెను
నిలువున శ్రీవేంకపటతి నీ విటు గూడఁగను
కలసి మెలంగితి విటు మా కన్నులయెదుటనెయీసతి
చలములు సాదించిన యీ జాణవు నీవె యొకో

పె శృ రేకు: 69-5 ముఖారి సం: 17-355

పల్లవి: పట్టరా దీ వలపు పతులకును సతులకును
యెట్టు వలసినవచ్చు నేటికి చెలియా

చ. 1: దోస మెఱుఁగదు వలపు దొరతనం బెడలించు
బాస దలఁచదు వలపు బతిమి చెఱుచు
తాసువంటిది వలపు తగిలితేఁ గుంగించు
యీసులకు మొదలు యిది యేటికే చెలియా

చ. 2: కన్నుల నుండు వలపు కప్పు కామాంధంబు
పన్ని పైకొను వలపు భయ మెఱుఁగదు
వెన్నవంటిది వలపు వెచ్చ నైతేఁ గరఁగు
యిన్ని విధముల నీకు నేటికే చెలియ

చ. 3: కలిమి చూడదు వలపు కడు నెమ్మిలే రేఁచు
చలువమేడౌ వలపు సరసములను
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో నినుఁ గూడె
యిల నిట్లాఁ గాకున్న నేటికే చెలియా

పె శృ రేకు: 69-6 కాంబోది సం: 17-356

పల్లవి: ఆసగదా మోసపుచ్చె నయ్యా న న్నింతగాను
వాసుల వలపుల నేవలలఁ జిక్కితిని

చ. 1: యెనసి లోనికిఁ బోక యెప్పుడు వత్తువో యంట
కనురెప్ప వెట్ట కట్టె కాచుకుండితి
నినువుచంద్రోదయము నీ పంజువెలుఁ గంటాఁ
గని యంతలోఁ దెలిసి కళవళించితిని

చ. 2: చీమ చిటు కననీక చెలి పిలుతువో యంటా
ఆముకొని దిక్కులెల్లా నాలకించితి
ప్రేమపు నెమలికూఁత పిలిచేవు నీ వంటా
దీమసాన నూఁకొని తెలిసి లోఁగితిని

చ. 3: మనసు నీవద్ది కంపి మాఁకువలెఁ బానుపుపై
చెనకె శ్రీవేంకటేశ చెంది కూడితి
తనివోక నా నీడ తగు నీచెక్కునఁ జూచి
కొనగోర నూఁదిపట్టి గొబ్బునఁ దీసితిని

పె శృ రేకు: 70-1 శంకరాభరణం సం: 17-357

పల్లవి: మాతో దాఁచే వింకా మగువరో యిఁక నేలే
యీతలి ఆతలి ముచ్చట యిరవులు దెలిపెడిని

చ. 1: చెక్కునఁ బెట్టినచేయిని చెలిపై నొరగిన మేనుగు
ముక్కునఁ బెట్టిన వేలును మోహము దెలిపెడిని
తొక్కెడిపాదపు వ్రాతల తొడిఁబడ జారిన తురుమును
వెక్కసమగు నిట్టూర్పులు విరహము దెలిపెడిని

చ. 2: రెప్పలు వేయనిచూపులు రేసుల వాడిన మోవియు
అప్పసమగు పెంజెమటలు ఆసలు దెలిపెడిని
యెప్పుడు నేకాంతంబులు యెక్కువలగు పరవశములు
తిప్పఁగరాని పరాకులు తెగువలు దెలిపెడిని

చ. 3: మోమున నిండిన కళలును మోనపు సెలవుల నవ్వులు
కామించిన సంభోగపు కత లివె తెలిపెడిని
దోమటి దొడికెటిసిగ్గులు తోరపు సంతోషంబులు
కోమలి శ్రీవేంకటపతి కూటమి దెలిపెడిని

పె శృ రేకు: 70-2 వరాళి సం: 17-358

పల్లవి: వద్దు వద్దు నీ కేల వట్టిభయము
యిద్దరము మనలోన నేక మౌత గాక

చ. 1: యెడమాట లీఁక నేల యెదిరించిన వెనక
కడు రేఁగ నిఁక నేల కన్న వెనక
వెడమాయ లీఁక నేల వెల్లివిరైన వెనక
వొడలిలో నిముడుక వూరకుండుట గాక

చ. 2: తలపోఁత లీఁక నేల దగ్గరి వచ్చిన మీఁద
సొలపు లేల మోము చూచిన మీఁద
చలపట్టి నిఁక నేల చవిసేసికొన్నమీఁద
లంక దేరుచుకొని కైకొనుట గాక

చ. 3: నివ్వెఱఁగు లీఁక నేల నీవే నేనైనమీఁద
నవ్వు లేల నీ వలపు నమ్మినమీఁద
యివ్వల శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
పువ్వులపులకలతో పొద్దు వోత గాకా

పె శృ రేకు: 70-3 శంకరాభరణం సం: 17-359

పల్లవి: పట్టినదే చలము యీపడఁతి యిదే నోఁచెనో
వొట్టిచెలుల మే మన్నా వూఁకొనదో రమణి

చ. 1: చెక్కుచేయి యీ సతి చింతకే కాచుకుండెనో
తెక్కుల నెంత దీమన్నాఁ దియ్య దిది
చిక్కనిమోము నవ్వులు సిగ్గుకే కాచుకుండెనో
యెక్కువఁ దలెత్తుమంటె నెత్తదు యీ చెలియ

చ. 2: రమణివిరహము వెఱగుకే కాచుకుండెనో
తెమలి యెంత దెల్పినాఁ దెలియదు
చిముడువలపు లింతిచెమటకే కాచుకుండెనో
తమ నెంత విసరినా తనువున నింకవు

చ. 3: వెలఁదివూర్పులు రతివేళకే కాచుకుండెనో
వలదని మానిపినా వసముగాదు
యెలమి శ్రీవేంకటేశుఁ డింత సేసి కాంతఁ గూడె
తలఁపు లిద్దరికిని తమకించెనో

పె శృ రేకు: 70-4 భైరవి సం: 17-360

పల్లవి: గుట్టు మాతోఁ జేసేవుగా కొండలరాయా
వట్టిజోలి యిఁక నేల వద్దు కొండలరాయా

చ. 1: కొమ్మదిక్కు చూడరాదా కొండలరాయా, నీపైఁ
గుమ్మరించీ వలపులు కొండలరాయా
కుమ్మెలాయె గోరితాఁకు కొండలరాయా
నమ్మిక లిచ్చితివిగా నా డే కొండలరాయా

చ. 2: కుప్పెసవర మేడది కొండలరాయా, కడుఁ
గుప్పళించకు సిగ్గులు కొండలరాయా
కొప్పువంచి ఇంతి మొక్కె కొండలరాయా
అప్పటి నూరకున్నాఁడవయ్యా కొండలరాయా

చ. 3: గోడమీఁదిసున్న మైతి కొండలరాయా
కోడెవయసు వో నీకు కొండలరాయా
కూడితివి మా సతిని కొండలరాయా
మేడెపు శ్రీవేంకటేశ మేలు కొండలరాయా

పె శృ రేకు: 70-5 తెలుఁగుకాంబోది సం: 17-361

పల్లవి: ఏమిటఁ దక్కున నాకు యెదలోనిభావరతి
కామించి మేను మేను గలయదు గాని

చ. 1: తలఁపు లోపల నుండు దగ్గరి నీ రూపమ
పిలిచితేఁ బలుకని వెలితే కాని
కలసినట్ల నుండు కలలోన నీరతి
తెలిసినప్పుడు గుండె దిగులొందుఁ గాని

చ. 2: మాటలాడిన ట్లుండు మరిగి నీపై తవి
గాటమై వినరాని దొక్కటే కాని
నాటినట్లనే వుండు నవ్వుల నీచూపు నాపె
జూటరి నీ కిదే చెప్పి చూపరాదు గాని

చ. 3: నిద్దిరించిన ట్లుండు నీ కౌఁగిటిలోనిసొంపు
పొద్దుగుంకుఁ బొడపులు పోదు గాని
వొద్దనే శ్రీవేంకటేశ వొక్క టైతి నింతలోనే
పెద్దరికమే నాకు పెనగొనీఁ గాని

పె శృ రేకు: 70-6 ముఖారి సం: 17-362

పల్లవి: ఇంత కోపకే పో నే నిట్లైతిని
యెంత కెంత మనసు నీ కిచ్చినదే సుమ్మీ

చ. 1: కోపగించ నేరిచితే కోరి నీకు మొక్కుదునా
చాపలపు బొమ్మల నే జంకింతుఁ గాకా
చూపుల నిన్ను సాధించ నోపితే నవ్వుదునా
చేపట్టి నా కొనగోరఁ జిమ్మిరేఁతుఁ గాకా

చ. 2: నిన్ను దూర నేరిచితే నెలఁతల నంపుదునా
తిన్ననిమాటల నేనే తిట్టుదుఁ గాకా
యెన్న నీతో నలిగేది యెఱఁగితేఁ బిలుతునా
యెన్నిక నన్ను ముట్టితే యీసడింతుఁ గాకా

చ. 3: యిట్టే నీకుఁ బగ యైతే యిచ్చకము లాడుదునా
వొట్టి మరుబాణముల కొప్పింతుఁ గాకా
నెట్టిన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
గట్టిగా నీవొద్ద నింకఁ గాచుకుందుఁ గాకా

పె శృ రేకు: 71-1 రామక్రియ సం: 17-363

పల్లవి: ఇన్నియు నొక్కటొక్కటే యేరరమ్మా
యెన్నికతోఁ గప్పముగా నిత్తము గాని

చ. 1: తొయ్యలి రెప్పలతుద దోసెఁడేసి ముత్యాలు
పయ్యదపై రాలీని పట్టరమ్మా
యియ్యెడఁ జెలియఁ బాసి యింతఁగాఁ జేసినయీ
నెయ్యపు విభునిమీఁద నింతము గాని

చ. 2: కలికి తురుమునను గంపెఁడేసి నీలాలు
నిలువునఁ జెదరీని నిలుపరమ్మా
తలపెల్ల దక్కఁగొని తరుణి నింత చేసిన
యెలయింపు బతికి మీఁదెత్తుదము గాని

చ. 3: ముదితపలుకులను మూటెఁడేసి వజ్రాలు
యెదురెదురనే చిందీ నెత్తరమ్మా
వెదచల్లుఁ గరిమి శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడె
పొదిగి తలఁబాలుగఁ బోతము గాని

పె శృ రేకు: 71-2 రామక్రియ సం: 17-364

పల్లవి: ఏమరిపాటాయె నింక నేమి సేసేవే
ఆమని నీ కుచగిరు లడ్డ మయ్యీనా

చ. 1: కొమ్మ నీవు జవ్వనివి కొంకక వొంటి నున్నదాన
విమ్ములనేఁ జెనకితే నేమి సేసేవే
చిమ్ముల మరునిచేఁతే చెల్లెఁ గాక యీవేళ
పమ్మి జూపు నీపంతాలు పై వచ్చీనా

చ. 2: దిట్టవై వనములోనఁ దిరిగే వేపొద్దె నా
యిట్టెనేఁ జేయి వట్టితే నేమి సేసేవే
నెట్టినఁ గోరిక లెల్ల నెరవేరెఁ గాక నీ
దట్టపు బొమ్మల జంకె తప్పు గొనినా

చ. 3: యేకతాన శ్రీవేంకటేశుఁడ నేఁ బానుపుపై
యీకడ నిన్నుఁ గూడితే నేమి సేసెవె
దాకొని నీచిత్త మెల్ల దక్కఁగొంటేఁ గొంటిఁ గాక
లాకల నీ పెనపులు లగ్గ పెట్టీనా

పె శ్రు రేకు: 71-3 రామక్రియ సం: 17-365

పల్లవి: ఆడఁగల మాట లెల్లా నాడరాదా, నీ
కూడినవేడుకలకుఁ గొలఁ దున్నదా

చ. 1: ఆనతియ్యరాదా న న్నాడుమన్న మాట లెల్లా
మానినిరో విభుఁ జూచి మఱచితివా
మోనమున నుండ నేల మొక మిదె యద్ద మిదె
యీ నీ విభునిసంది నేరు వారీనా

చ. 2: యెచ్చరించరాదా నీ కిచ్చిన బాస లెల్లా
ముచ్చట నీ విభుఁ జూచి మొకమోటమా
యెచ్చిన మీమీలోని యింపులవే సొంపులవే
రచ్చల సముఖముల రాయబారాలా

చ. 3: జట్టి గొనరాదా సతమై నీవద్దనుండ
గట్టిగా శ్రీతిరువేంకట విభుని
నెట్టుకొన్న కౌఁగి లిదె నీకు నీకు మరుఁడు చే
ముట్టి మీ వదనములు ముద్దిరించెనా

పె శృ రేకు: 71-4 ఆహిరి సం: 17-366

పల్లవి: ఎఱుకమఱపు లేదా యెవ్వరికైనా
వొఱపున నెగ్గు లెంచకుండవలదా

చ. 1: నెయ్యమున నిన్నుఁ బాసి నివ్వెఱఁగై వుంటిఁ గాక
అయ్యో నే నీతో మాటలాడ కుందునా
వొయ్యనే నీ వైనా నావొద్దనుండి యీవేళ
పయ్యదపైఁ జేయి వేసి పలికించవలదా

చ. 2: వుల్లము దెలియుదాఁకా నూరకే నే నుంటిఁ గాక
చెల్లఁబో నీకుఁ బ్రియము చెప్ప కుందునా
తెల్లమిగా నావెఱపు తెలిపి బుద్ధులు చెప్పి
కొల్లలుగా నీవు నన్నుఁ గూడవలదా

చ. 3: కూడినపరవశాన గోరికొన దాఁకెఁ గాక
వోడక నీమేన రేక లొనరింతునా
వేడుకతో నపుడే శ్రీవేంకటేశ మరురతి
మేడెములోఁ దప్పించుక మించవలదా

పె శృ రేకు: 71-5 ముఖారి సం: 17-367

పల్లవి: ఏల మమ్ము రట్టు సేసే వేఁటి కంటిని
ఆలరి వో రమణుఁడు ఆన్నియు నే నంటిను

చ. 1: పలు నీ చేఁతల నెల్లఁ బచ్చిసేయ లేకే కా
చలిమి దవ్వుల పొంచే చాలు నంటిని
అలరి నీ మాటలకు వడ్డ మాడలేకే కా
వలవంతఁ బదివేలూ వచ్చె నంటిని

చ. 2: నిన్నుఁ జూచి నీగుణాలు నేర మెంచలేకే కా
అన్నిటా జాణఁడవు నీ వౌదు వంటిని
మన్నన నీసతులతో మచ్చరించలేకే కా
వున్నతి నీ చెనకులు వొద్దంటిని

చ. 3: మునుప నీ కూటముల మొకమోటములకే కా
యెనసి కన్నుల మొక్కు లియ్యకొంటిని
అనయము శ్రీవేంకటాధిప నీ మన్ననల
తనిసి యింతకు నీవే దైవమ వంటిని

పె శృ రేకు: 71-6 పాడి సం: 17-368

పల్లవి: ఇందరుఁ దెలిసినవే యీ సుద్దులు, వోరి
యందపు జాణతనా లని యెట్టొ కాని

చ. 1: యేకతమాడఁ బిలిచే వెఱుఁగుదు నే నాపని
నీకు నీకే యాడుకోరా నే నేఁటికి
యేకత మంటే నొక్కరే యిద్ద రుంటే రెండు గాదా
యీాకడ విచారించవు యిది యేమో కాని

చ. 2: నెత్తమాడ రమ్మనేవు నే నేమి యెఱఁగుదు
బొత్తుల నా మారు నీవే పూఁబాడకా
నెత్తమంటేఁ బాటిమీఁదినేలపేరు నీ వేల
తిత్తిఁ గట్టుకొని యేల తిరిగేవో కాని

చ. 3: మెచ్చితిఁబో బాపు బాపు మేలనుచు నీకౌఁగిటఁ
గుచ్చే లిదె సందుగాఁగఁ గొరికక నన్ను
మెచ్చుగాదా నా కూటమి మేకుల శ్రీవేంకటేశ
కచ్చుపెట్టి యిందు కెంత కాచితివో కాని

పె శృ రేకు: 72-1 ఆహిరి సం: 17-369

పల్లవి: ఔరా నీవలె నే నంత సేయ నేరఁగా
పోరాటముల మంచిపొందులు సేసేవూ

చ. 1: యెప్పటి కప్పటిమాట యెదలోనఁ బెట్టుకొని
కప్పురాలమీఁదఁ దెచ్చి కారాలు పూసేవు
కప్పి నీకు వలసితే గాజు మాణిక మనేవు
దెప్పర మెవ్వతెనైనా దేవులఁ జేసేవు

చ. 2: నవ్వు టెంత నే నెంత నాలిసేసి సాదించి
పువ్వు లెల్లా వాండ్లంటాఁ బూఁచి వేసేవు
రవ్వల నీకు వలస్తే రాత్రి పగలు సేతువు
దవ్వుల నెవ్వతెకైనా దండము వెట్టుదువు

చ. 3: చల మేది పల మేది చనవులే మన వంటా
చలి గొనఁగాఁ గలువలు సారెఁ జల్లేవు
అలమి శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
నెలవై నీ కితవైతే నీవే నే నవుదువూ

రేకు: 72-2 దేసాళం సం: 17-370

పల్లవి: నీ చేతిలో వార మిదే నిలుపఁగ నిలిచితి మింతే
చూచేటిచూపులవాండ్లు సో కించకు వయ్యా

చ. 1: పిడికెఁడు నడుమున నడఁగుచు బెరసేటివారము నే మిదె
కొడిదేఁడు గన్నులవారము కోపం బేడదయా
బెడిదపు నీ సుద్దులకే పెంచితి మిదె మా వీనులు
బడలిక దోఁచి మము నిఁక బడలించకు వయ్యా

చ. 2: జుట్టెఁడు పాదంబులనే సొంపగు మా నడవ ళ్లివె
పట్టెఁడు గుచములవారము పంతం బేడదయా
నెట్టన శిరసునఁ బెంచితిని మోహము నా తురుమున
నట్టనడుమ నూరక నను నవ్వించకు వయ్యా

చ. 3: సందిటిలోపలనే నీ సరసపు కౌఁగిటివారము
జందెపుఁ బయ్యెద దొలఁగెను చల మిఁక నేడదయా
యిందునే శ్రీవేంకటేశ్వర యిటు ననుఁ గూడితి విదివో
కెందమ్మిచేతుల సారెకు గిలిగించకు వయ్యా

పె శృ రేకు: 72-3 సామంతం సం: 17-371

పల్లవి: తా నేడ నే నేడ తడవి నన్ను
నానఁబెట్టి వట్టిమాట నయగారి గదవే

చ. 1: వచ్చి వచ్చి చూచేది వలపు మోచేది
బచ్చనల సటకాఁడు పాయఁడే నన్ను
కొచ్చి నడుము దూరేది గోరనే గీరేది
నిచ్చలు మానఁడు వీఁడు నేరుపరి గదవే

చ. 2: ఆసలనే పొనిఁగేది ఆచ్చలాన మునిఁగే ది
వాసులకు వెంట వెంట వచ్చీనే తాను
బాస లెల్ల నెరుపేది పను లెల్లా మరిపేది
కాసిఁ గూరిమియెండ కడు జాణ గదవే

చ. 3: కడు సిగ్గు విడిచేది కలికియై నడచేది
నడుమంత్రమున వీఁడు నవ్వీనే నన్ను
యెడలేక శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
అడియాలా లెల్ల నిచ్చె నందగాఁడు గదవే

పె శృ రేకు: 72-4 రామక్రియ సం: 17-372

పల్లవి: ఈ రీతి రాముఁడు కృష్ణుడు యశోద యెదుట నుండి
కోరి ముద్దు గునియంగ కొమ్మలు నవ్వేరు

చ. 1: పానిపట్టి వుమిసెనే పాలలోన గృష్ణుడు
నేనా రాము డుమిసెఁ దానే కాక
కానఁగానే యింత చేసి కల్లలాడేఁ జూడవే
ఆనవెట్టు మనవే తా నది నిజమనుచు

చ. 2: సారెఁ బిల్లఁ దీపు లాడి లాడి జారిపడెఁ గృష్ణుడు
వూరకే గడించ నేల వో యమ్మ తాను
వూరివారి నడుగవే వుద్దాండాలు వీనిని
యీరీతి నాపై గడించి యిన్నియుఁ దాఁ జేసెను

చ. 3: వెంటనే విని ద్దులు వెళ్లవేతు నటనే
వొంటి నన్ను వెఱపించె వుదుటై తాను
దంటనై శ్రీవేంకటాద్రి తాను నే నాడితి మమ్ము
నింటఁ బొత్తు గలుపేవు యిద్దరము నొకటే

పె శృ రేకు: 72-5 ఆహిరి సం: 17-373

పల్లవి: పోపో యిదేడేసుద్ది పొద్ది వోదో
చేపట్టి యిందుకుఁగా చిన్నఁబోకువయ్యా

చ. 1: ఆకసాన నున్నచంద్రు నఌచేతఁ బట్టెఁ గాక
చేకొని చేతికి చెక్కుచేయా ఆది
మై కొని చిలుకలకు మాటలు నేరెపెఁ గాక
నాకు నిష్టూరాన నిన్ను వనిత దూరీనా

చ. 2: జక్కవల సేద దీర చల్లఁగా విసరెఁ గాక
వుక్కుఁదమకమున నిట్టూర్పులా అవి
నిక్కిన కలువలకు నిండ నీరు గట్టెఁ గాక
గక్కున సతికి నవి కన్నీటివరదలా

చ. 3: వేడుకకు సెలవుల వెన్నెలలు గాసెఁ గాక
జాడల నీతోడి యెకసక్కెమా ఇది
యీడనే శ్రీవేంకటేశ యీకాంతఁ గూడితివి
తోడనే ని న్నాకె మెచ్చె దోసమా యిది

పె శృ రేకు: 72-6 సాళంగం సం: 17-374

పల్లవి: తవ్వఁబోతే వట్టి జోలి తగు లేఁటికే
పువ్విళ్లూర నేఁటికే వూరకున్న మేల

చ. 1: మక్కువలేనిచోటి మాట లేమిటికే
చొక్కుచు నిద్దిరించిన సుకము గాక
కక్కసించి పిలిచేటి కలయి కేమిటికే
పుక్కట నెత్తమాడిన పొద్దు వోవుఁ గాక

చ. 2: తెచ్చుకోలుఁదన మన్న తెలిసి నవ్వు లేఁటికే
గచ్చుఁ జిత్తరువు చచిన ఘనత గాకా
వచ్చి రాని చప్పునయిన వల పది యేఁటికే
చెచ్చెర యేకతముల చింత మేలు గాకా

చ. 3: కడుఁ బరాకై వుండే కౌఁగిలది యేమిటికే
విడిచి వొంటి నుండినా వేవేలు గాకా
చిడిముడి నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁ డిట్టె
యెడయఁగ నేమిటికే యియ్యకింటి గాకా

పె శృ రేకు: 73-1 ఆహిరి సం: 17-375

పల్లవి: ఆడకే విచ్చేయు మనె అంగన నిన్ను
ఆడుకోలుమాటలే నీ కానవాలు

చ. 1: పొలఁతి నిన్నంపుతానే పుక్కిటివీడెపుచద్దీ
అలరి పెట్టిన దొక్క టానవాలు
చెలఁగి తాఁ గట్టినది చెంగావిదుప్పటము
నిలువు గాశవోయుటే నీ కానవాలు

చ. 2: నిన్నుఁ బొమ్మన లేక నిలుచుండి కౌఁగిలించి
అన్నువ మో విచ్చినది ఆనవాలు
కన్నులఁ దప్పక చూచి కంటమాల యెడఁ బెట్టి
పన్ని తల వంచుకొన్న భావ మానవాలు

చ. 3: పొంచి తన చెవి తట్టుపుణుఁగు చెక్కులనే
అంచలఁ జమరీ వదే ఆనవాలు
కొంచక శ్రీవేంకటేశ కొమ్మఁ గూడితి విట్టే
ముంచి వేగమె రమ్మన్న మోహ మానవాలు

పె శృ రేకు: 73-2 సామంతం సం: 17-376

పల్లవి: మఱి యేమనునే నన్ను మాటిమాటికి
మఱచె నంటా నుంటి మామీఁదివలపు

చ. 1: యెనసి తానును నేను యెప్పుడైనా నాదుకొన్న
తనివోని మాట లెల్లాఁ దలఁచునా
మనసు ముట్టినయట్టి మర్మములు చెప్పరాక
ఘనుఁడు లోలోనే తాను కరఁగునా

చ. 2: ఆరగించేటివేళల అద్దము చూచేటివేళ
తారుకాణగా నన్నుఁ దలఁచునా
సారెకుఁ గిన్నెర మీఁటిఁ సంగడిచెలులతోడ
చేరి చేరి నాసుద్దులు చెప్పి మెచ్చునా

చ. 3: యితవై తాఁ జెప్పినట్టు యిచ్చకములే చేసి
తతి నేఁ జేసినమేలు దలఁచునా
యితఁడే శ్రీవేంకటేశుఁ డేడనుండో వచ్చి నాకు
పతి దానై కూడి వాఁడే పవళించినాఁడు

పె శృ రేకు: 73-3 సాళంగం సం: 17-377

పల్లవి: ఏకాంత మిటు దొరకె నిఁక నేలే వో వదినె
పోకు వేమరు నీ కెడ వొద్దాయ వదినే

చ. 1: యిదె చూడు మాయిల్లు యీడనే వదినె
గుదిగొన్న యల పార్చుకొనఁగదవె వదినే
యెదిరించె మన వావు లెఱుఁగవా వదినె
తుదవలపు దిగఁదోయ దోసమే వదినే

చ. 2: యిద్దరికి నొక్కవయ సీడవునె వదినే
పెద్దరికమా యింత పెనఁగకువే వదినే
కొద్ది నీ వుంగరము గుఱుతు నాకేదే వదినే
బద్దులమాటలకుఁ బనిలేదే వదినే

చ. 3: నీ మనసుకొల దింక నే నెఱుఁగనే వదినె
కై మీరి కౌఁగిటికిఁ గలసితినె వదినే
యీమేర శ్రీవేంకటేశుఁ డనెవో వదినె
వేమరును నీవెంట విడువనే వదినే

పె శ్రృ రేకు: 73-4 సామంతం సం: 17-378

పల్లవి: ఇంతటి నీ చక్క దన మీలాగు నేరుపులు
చెంతల నేమని యింకఁ జెప్పుదుమే చెలియా

చ. 1: ముత్తెపుఁబలువరుస మొగిఁ దెల్లఁ గాఁ దోమి
జొత్తుల వీడెలు సేసి సొమ్ములతోడ
హత్తి చిఱునవ్వు నవ్వి అప్పుడే విభునివేలి
కొత్తవుంగరము దీసుకొంటి వౌనె చెలియా

చ. 2: తిద్దిన నొసలిగీరుఁదిరుమణి గానరాగా
కొద్దిఁ జిగుళ్ళు వెళ్ళినకొప్పుతోడ
అద్ద పునెమ్మోము చూపి అతనిమై గరఁగించి
ముద్దుమో మిచ్చి మోహము ముంచితిమో చెలి

చ. 3: వలుదచన్నులమీఁది వలిపెము చెమటలఁ
బలుచఁగా నంటినభావముతోడి
చలివాయఁ గౌఁగిలించి సమరతులనే నీవు
కులికి శ్రీవేంకటేశుఁ గూడితివె చెలి

పె శృ రేకు: 73-5 సామంతం సం: 17-379

పల్లవి: వెడకూటములకంటె విరహమే మేలు
విడువక యాడఁబోతే వేసటౌరా మాటలు

చ. 1: కోరి దవ్వులనుండఁగఁ గొండలు నున్నన గాని
చేరితేను చెట్లునుఁ జేమ లింతేరా
వారక కొక్కకవేళ వచ్చి పోవుటే చవి
నారి నిన్నుఁ గొసరితేఁ జప్పనౌరా రతులు

చ. 2: వొక్కటై పసపు నీడ నుండఁగాఁ బచ్చనఁ గాని
పక్కన నెండ నుండితేఁ బస లేదురా
తక్కక యడమాటలే తరితీపై వుండుఁ గాని
మిక్కిలి దగ్గరుపొందుమీఁద మొగచాటురా

చ. 3: వొనరుఁ గోవిల కాకి నొక్కవన్నె వుండుఁ గాని
యెనసి వసంతవేళ నేరుపడురా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
తనువులే వేరు గాని తలఁపు లొక్కటేరా

పె శ్రృ రేకు: 73-6 పాడి సం: 17-380

పల్లవి: అంత చుట్టములా నీకు నవి యెల్లాను
సంతసమే కాక నీకు జాలిమాలి యేలే

చ. 1: ఆకసపుచందురుఁడు అఱచేతిలోనఁ జిక్కె
చేకొని రమణి యింకాఁ జింత యేలే
దాకొన్న తుమ్మిదలును తన్నుఁ దానె వెడ జారె
నీ కేల చిన్నఁబోను నెలతరో నేఁడు

చ. 2: ముంచినట్టి చల్లగాలి ముక్కుననే వెళ్లఁ జొచ్చె
వంచిన శిరసుతోడ వాఁడ నేటికి
పంచశరునియమ్ములు పక్కనఁ గన్నులు మలసె
యెంచరాని యలపులు యిపు డేలే నీకు

చ. 3: నిరతిఁ జిలుకపల్కు నీ మోనమునఁ జిక్కె
పరగ నివ్వెఱగులు పై నేలే
గరిమ శ్రీవేంకటేశుఁ గలసితి విదివో
అరిది యలమేల్మంగ వన్నియుఁ జేకూడెనే

రేకు: 74-1 వరాళి సం: 17-381

పల్లవి: కలకలనవ్వుతోడ కలికిచూపులతోడ
అలబలములు చేసీ నలమేలుమంగ

చ. 1: బోన మింటిలోననుండి పొద్దు వొద్దు హరికిని
సేనగా వింతచవులు సేయించి
తానే వడ్డించేవంటా తగఁ గీలుగంటుతోడ
ఆనిపట్టి కాచుకున్న దలమేలుమంగ

చ. 2: పెక్కు సొమ్ములు నించుక పెద్ద పైఁడిపీఁటమీఁద
చక్కఁగఁ గూర్చుండి పరిచారకులతో
ఉక్కుమీరఁ బనులెల్లా వూడిగేలవారిచేత
నక్కరతోఁ జేయించీ నలమేలుమంగ

చ. 3: శ్రీవేంకటపతికి చేసురటి విసరుతా
వావిరిఁ దనచెలుల వడ్డించు మని
దేవుఁడు తన చేయి వట్టి తియ్యగాఁ బొత్తుననుండి
యావిదాన నారగించె నలమేలుమంగ

పె శృ రేకు: 74-2 ఆహిరి సం: 17-382

పల్లవి: వినవే చెలియ నేఁడు విభుని నా చందములు
ముసుప నేనే వాని మోవఁగా నాడితినే

చ. 1: అలిగిపోయేటివాని నలమి పానుపుమీఁద
బలిమిఁ బడవేసి నేఁ బైకొంటినే
అలసి విడువు మంటా నానవెట్ట రాఁగాను
నులివేఁడి తమ్ములము నోరిలో నించితినే

చ. 2: పులకి శిరసు వంచుకుండఁగా నా వాఁడిగోర
గుటిగా గడ్డము వట్టి కొసరితినే
చులుకి నే నని వాఁడు చూచి నన్నుఁ దిట్ట రాఁగా
మొలిగి వాని కెమ్మోవి మోవిఁ బెనచితినే

చ. 3: ఆకడిమోమె యుండఁగా నడ్డగించుకొని నేనే
జోకగాఁ గౌఁగిటిలోనఁ జొచ్చుకొంటినే
యీకడ శ్రీవేంకటేశుఁ డిందుకే మెచ్చి నాతోఁ
గెకొన్న అలుక దేరి గక్కనఁ గూడెనే

పె శృ రేకు: 74-3 కాంబోది సం: 17-383

పల్లవి: అప్పటనుండి మనసు అన్నువట్టి తల కెక్కె
చెప్పనదాఁకా నీ చెఱఁగు విడువరా

చ. 1: మోము చూచి నవ్వి నీవు మోవి గదలంచితివి
ఆమని మోహనమంత్ర మటురా వోరి
కామించి నా మర్మ మంటి కస్తూరి పూసితివి
యేమిరా వలపుమందు యిది కాఁబోలు రా

చ. 2: మంచివానివలెఁ గంటమాల మెడఁ బెట్టితివి
పొంచి నన్ను మరగించే పూసలో వోరి
కొంచక నా కొప్పులోన కురువేరు ముడిచితివి
వంచి నన్ను లోను సేసే వాకట్టు గాఁబోలు రా

చ. 3: కొంకక న న్నిటు గూడి గోర నేమో గీరితివి
అంకె నన్నుఁ బాయని నీయంత్రమో వోరి
పొంకపు శ్రీవేంకటేశ పాదిగి కూడితి విటే
కింకలేని రతులలో క్రియలు గాఁబోలు రా

పె శృ రేకు: 74-4 మంగళకౌశిక సం: 17-384

పల్లవి: కుచ్చితమే నీ వైతేఁ గూడపెట్టుకొందు గాని
యిచ్చకురాలు నే నైతే నింత వని కోపరా

చ. 1: చలమంతాఁ దీరీ నంటా సరసమాడవు గాని
మలసి నేఁ బై కొనక మానలేను రా
వెలిఁబడి నవ్వంటా వెసన నోఁతువు గాని
వొలసి నే నైతే నవ్వ కుండలేను రా

చ. 2: మాట గోరువోయీ నంటా మౌనాన నుందును గాని
నీటున ముచ్చటాడక నే మానరా
సూటి వెచ్చ మయ్యీ నంటాఁ జూడను లోఁగేవు గాని
గాటమున నిన్నుఁ జూచి కన్ను మూయఁ జాల రా

చ. 3: కాయ మరగీ నంటాఁ గౌఁగిలించ కుందు గాని
ఆయ మంటి కౌఁగిలించ కాఁపలేను రా
చేయార శ్రీవేంకటేశ సిగ్గునఁ గూడితి గాని
వేయైనా నీ వురాన వెల్లివిరి యైతిరా

పె శృ రేకు: 74-5 ముఖారి సం: 17-385

పల్లవి: ఇందు రమ్మంటేఁ జాలు నింటిలోనికే వత్తువు
సందడిఁ గాలు దొక్క జాణవు గానీవు

చ. 1: కానీరా ని న్నెవ్వతె దగ్గరినాను వేగిరిమే
మేనబావ వవుదువు మేలుగా నీవు
మోనమున నూరకైనా మోము చూచితేఁ జాలు
మేనిపైఁ జేయి వేసేవు మేలుగా నీవు

చ. 2: మొక్కలాన నెవ్వతైనా మొకమోడితేఁ జాలు
మిక్కిలి నవ్వ వత్తువు మేలుగా నీవు
గుక్కక ని న్నేపాటైనాఁ గూచుండు మంటేఁ జాలు
మిక్కుటమై తొ డెక్కుదు మేలుగా నీవు

చ. 3: చాటువ నిన్ను మెచ్చితేఁ జాలు నదే సందుగాఁగ
మీటుగాఁ గౌఁగిలింతువు మేలుగా నీవు
నీటున శ్రీవేంకటేశ నే నలమేల్మంగను
మేటివై కలసితివి మేలుగా నీవు

పె శృ రేకు: 74-6 రామక్రియ సం: 17-386

పల్లవి: ఏమి నీ కింత బలువు యెవ్వ రిచ్చిరి
మామీఁదిచలములు మాను మన్నా మానవు

చ. 1: వాడుమోము వంటి నీతో వలపు చెప్పితినో
కూడు మని బత్తి నీకు గొట్టానఁ బెట్టితనో
యేడనుండో వచ్చి నీవు యిచ్చకము లెల్ల నాడి
వోడక వేఁడుకొనేవు వొపనన్నామానవు

చ. 2: వట్టి చనవు సేసుక వద్దికి వచ్చితినో
రట్టుతోడ రమ్మని యాఁడిఁ బెట్టేనో
గుట్టుతో నుండక నన్ను కొంగువట్టి తీసినీవే
తట్టువడఁ బెనఁగేవు తగ దన్నా మానవు

చ. 3: కన్ను లార్చి నీమీఁద కాఁకలు చల్లితినో
తిన్ననిమాటల తరితీపులు సేసితినో
కన్నచో శ్రీవేంకటాద్రికడపరాయఁడవై
సన్నలఁ గూడితి వింకాఁ జాలు నన్నా మానవు

పె శృ రేకు: 75-1 రామక్రియ సం: 17-387

పల్లవి: నీ వేల దాచేవు నాకు నే నెఱుఁగనా
ఆవేళనే వేగువెట్టు కండనే ఉన్నదానను

చ. 1: వేగి లేచి నిన్నుఁ జూచి వీడెము చేతి కిచ్చి
చేగలై రాత్రి రతి చెప్పి చెప్పి నవ్వి
సోగకన్నుల నిద్దుర చోపె నిను నాపి లేపి
ఆగడాలు సేసే యప్పు డండనే ఉన్నదానను

చ. 2: చేతఁ దట్టి నిన్ను లేపి చెమట లెల్లాఁ దుడిచి
ఘాతల నీ మర్మములు కడుఁ దడవి
కాతరాన నిన్ను నాపె కౌఁగిలించుకొన్నపుడు
ఆతలి కంబమే మాటు అండనే వున్నదానను

చ. 3: దండె మీటి పాట వాడి తరుణి నిన్ను లేపి
నిండుఁగూరిముల నాపె నిన్నుఁ గూడెను
అండనే శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
అందుకొని యిప్పు డూని యండనే వున్నదానను

పె శృ రేకు: 75-2 శంకరాభరణం సం: 17-388

పల్లవి: నీకుఁ బోదు నాకుఁ బోదు నీ వెట్టు సేసినా జేయి
సాకిరివంటిది నా జవ్వన మిందుకును

చ. 1: చిగురువంటిది నా చిత్త మిదె నీమీఁదఁ
దగిలి విడువదు నీ తగురూపు
తగరువంటిది నా తమకము మీఁద మీఁద
అగడు సేయుచు నీ యాయాలు దాకీని

చ. 2: లచ్చనవంటిది నా పలుకు నీ యెడకును
అచ్చమై చూడఁ జూడఁగ నందమై యుండు
నిచ్చెనల వంటివి నా నిండుఁగోరికలు నీకు
హెచ్చినవలపు తల కెక్కఁ జేసె యందుకు

చ. 3: గాలమువంటిది నా కౌఁగిటికూటమి నీకు
తలి మఱి యెందుకును తొలఁగ రాదు
తాలమువంటిది నా తగులమి నీమీఁద
మేలిమి శ్రీవేంకటేశ మాఁదాఁ గిందాఁ బాయదు

పె శృ రేకు: 75-3 సాళంగం సం: 17-389

పల్లవి: అందుకే పో నిన్నుఁ జూచి అలసేము నే మైతే
విందుల నీ మతిలోని వేడు కెట్టిదో కాని

చ. 1: తనువు నిండినసిరి తరుణి నీ కుచములు
మొనసి నీకు పెద్ద మోపాయెఁ గాని
ఘనమైన నీ తురుము కప్పునీలముల కుప్ప
వెనక దిక్కునకే వేఁగాయెఁ గాని

చ. 2: పాయము పండినపంట పడఁతి నీ తేనెమోవి
ఆయము చిలుక వోట్లు ఆయెఁ గాని
సోయగపు నీ నడుము చుక్కలు మోచిన మిన్ను
బాయటఁ జూచిన పట్టఁ బస లేదు గాని

చ. 3: కాముని యమ్ములు నీ కనుసోగ లివి రెండు
కామించి మదరాగము కక్కీఁ గాని
యీమేర శ్రీవేంకటేశుఁడ నన్నుఁ గూడితి
ఆమనిరతుల నీ యాస వోదు గాని

పె శృ రేకు: 75-4 శంకరాభరణం సం: 17-390

పల్లవి: చెప్పఁగ రా దీ వలపులు చెలివల నెవ్వరిఁ గానము
ముప్పిరిజవ్వనభారపు ముంభారము గాఁబోలు

చ. 1: కన్నుల నిద్దుర దొట్టి కాయము విరివిరిఁ బోయీా
పన్నిన సతిరతి రాతిరి బడలికె గాఁబోలు
కిన్నెర మీటిన నులికి కిమ్ముల నూరకె పలికి
వన్నెల నాతనితో కళవళ మిది గాఁబోలు

చ. 2: చెక్కులఁ జెమటలు గారి చింతలు మనసునఁ బేరి
గక్కున మర్మము లంటిన కరఁగులు గాఁబోలు
తక్కక నివ్వెఱఁగంది తలఁచుక తలఁచుక నవ్వి
పక్కన నాతనిఁ బొందినభ్రమ యిది గాఁబోలు

చ. 3: దావతి నూర్పులు నించి తలగడ గౌఁగిటఁ జేర్చి
భావజుగరిడిని సాములభ్రమ యిది గాఁబోలు
రే వగ లిది యని యెఱుఁగదిరెట్టించెను కళ లిన్నిటా
శ్రీవేంకటేశుఁడు గూడిన చెలువము గాఁబోలు

పె శృ రేకు: 75-5 సామంతం సం: 17-391

పల్లవి: ఏమి సేతు నమ్మలాల యెఱుఁగక నేరిచితి
కామించీ నిది సంగతి గాదన్నా మానఁడు

చ. 1: పండఁ బడి పానుపుపై పాడుమంటా నాచేతికి
దండె ఇచ్చీఁ జూడరే తన కెంతో
అండనే నే నోప నంటే ఆనవెట్టి తనమీఁద
దుండగపు నవ్వులతో దోస మన్నా మానఁడు

చ. 2: నెత్తమాడఁదనకు నే నేరుపు మంటా సారెలు
యెత్తి నాచేతికి నిచ్చీ నిదేమే తాను
కొత్తగాఁగా సిగ్గువడి కొంకితేఁ జేతులు వట్టి
మొత్తాన మారుకు మారు మొక్కే నన్నా మానఁడు

చ. 3: పట్టెమంచ మెక్కించుక పసలుగా గుద్దు మంటా
తొట్టి పాదాలు చాఁచీనే తొడలమీఁద
అట్టె శ్రీవేంకటేశుఁ డానపడి నన్నుఁ గూడె
జట్టిగాఁ బ్రియము చెప్పి చాలు నన్నా మానఁడు

పె శృ రేకు: 75-6 ముఖారి సం: 17-392

పల్లవి: పూవుల వేసినవారిఁ బూఁచి రాత వేతురటే
కావలసిన ట్లయ్యీ గర్వ మేలే నీకు

చ. 1: మంచిమాటల నాతఁడుమచ్చిక చల్లఁగానే
వంచుకొనేవు శిరసు వద్దే యింత
మంచముపై జేతి కాకు మడి చియ్యఁగానే
తుంచి తుంచి వేసేవు తుచ్చ మేలే నీకు

చ. 2: నమ్మిక లిచ్చి యాతఁడు నవ్వు నవ్వఁగానే
బొమ్మల జంకించేవు పొసఁగునటే
కమ్మర నట్టే నీపైఁ గప్పురము చల్లరాగా
యిమ్ముల నానలు వెట్టే వెమ్మె లేలే నీకు

చ. 3: యిక్కువ లంటి శ్రీవేంకటేశుఁ డిట్టె కూడఁగానే
పిక్కటిల్లఁ బెనఁగేవు బీర మింతేలే
కక్కసించి యాతఁడే కౌఁగిట బలిమిఁ గూడె
వొక్కటై పంత మాడేవు వొర టేలే నీకు

పె శృ రేకు: 76-1 ముఖారి సం: 17-393

పల్లవి: ఒకటి కొక టెక్కుడు వొరసిన
మొకమోట లేల తుద మొద లెల్ల చెప్పరే

చ. 1: విరులు కొప్పున రాల వేగి లేచి నిలుచుండి
తరుణి విభుని మోము తప్పక చూచె
సరుస నాతని కింతి చవి చూపెఁ దమ్ములము
యిరవైన మోహము లిందెవ్వరివి చెప్పరే

చ. 2: నీరెండలు గాయుచును నేరుపున చిక్కు దీసి
సారెకు నాతనికిని జలజాక్షి
కోరి కోరి యాతఁడును కుచముల వీఁపు మోపి
మేర మీఱ వలపులు మించిన దిం దేదే

చ. 3: పలచఁగా నవ్వు నవ్వి పయ్యద జారఁగాను
కలికి శ్రీవేంకటేశుఁ గౌఁగిలించెను
అల యంచు పచ్చడము ఆతఁ డట్టె పయిఁ గప్పె
తలకొన్నకూరిముల తగ వింకఁ జెప్పరే

పె శృ రేకు: 76-2 గుండక్రియ సం: 17-394

పల్లవి: వలపు గొరబు సేయ వద్దే యింత
యెలమిఁ జలపోరేవు యేమే నీవు

చ. 1: సంకె లేక యాతఁడు సారెఁ జేసేచేఁతలకు
వంకలొత్త వచ్చేవు వద్దే యింత
వుంకున నాపెనే వెంట నూడిగానకుఁ దిప్పఁగా
యింకాన న్నదియేవు యేమే నీవు

చ. 2: కాదని యాతనిఁ దారుకాణకు వేఁ బిలిచితే
వాదులాటకు వచ్చేవు వద్దే యింత
గోదిలి నావద్దఁ బేరుకొని యాపెఁ బిలువఁగ
యీదెస విను మనేవు యేమే నివు

చ. 3: శ్రీవేంకటేశ్వరుతోడఁ జేయి వట్టి పెనఁగఁగ
వావి దెలుప వచ్చేవు వద్దే యింత
కావించి యాతఁడూ నేనుఁ గలసితే నాపెచేత
నీవేళ మొక్కించ వచ్చే వేమే నీవు

పె శృ రేకు: 76-3 శంకరాభరణం సం: 17-395

పల్లవి: ఓపము నీతోఁ బెనఁగ వోబళేశుఁడ
ఆపనినేనెఱుఁగనా అయ్యో వోబుళేశుఁడా

చ. 1: చేయి నీవు ముట్టఁగాను సెలవినవ్వులు ముంచె
వోయయ్య తలవయ్యా వోబుళేశుఁడా
నీ యిచ్చలోన మెలఁగ నే మంత నేరుతుమా
ఆయము లంట వచ్చేవు అట్టే వోబుళేశుఁడా

చ. 2: కోరి పువ్వుల వేయఁగ కొప్పు కడు వెడ జారె
వూరకుండు చాలు నోయి వోబుళేశుఁడా
సారె నిన్ను మచ్చరాన జరయఁగఁ బాలము
వోరచూపులఁ జూడకు వోబుళేశుఁడా

చ. 3: గద్దించి నీవు కూడఁగ కాయ మెల్లాఁ బులకించె
వొద్దఁ బాయకుండవయ్య వోబుళేశుఁడా
అద్దొ శ్రీవేంకటాద్రి నహెబలమునందు
తిద్దితివి నన్ననే రతికి వోబుళేశుఁడా

పె శృ రేకు: 76-4 రామక్రియ సం: 17-396

పల్లవి: ఒయ్యన చేరి పాదా లొత్తవమ్మ
తియ్యని నోరనే మాట తియ్యవమ్మా

చ. 1: పదియారువన్నెబొమ్మ పట్టుపు వొలుకేమమ్మ
యెదురుగొండ లెక్కితి వేమమ్మ
పెదవిపై వాదులనే బేట్లు రాలి తమ్మ
యిదివో నీపతితోడ నింత వద్దా అమ్మా

చ. 2: అతనునిఁ గన్నకొమ్మ హరియఱచేతి నిమ్మ
యితని యలుక దేర్చ వేమమ్మ
మతకాలే నెరుపేవు మదము చెక్కులఁ గమ్మ
యితవరి పతితోడ నింత గద్దా అమ్మ

చ. 3: యీవిఁ గల్పకపు రెమ్మ యింటిలో దాఁచిన సొమ్మ
యీవిభుఁ దప్పక చూచే వేమమ్మ
శ్రీవేంకటేశుఁడైన శ్రీనరసింహునితోడ
యీవేళనే యెక్కుకొంటి వింత గద్దా అమ్మా

పె శృ రేకు: 76-5 సాళంగం సం: 17-397

పల్లవి: ఇంతసేయించేవాఁడ వెల్లా నీవే కాక
సంతత మేడ గొడవ సవతులచేతను

చ. 1: మచ్చిక నాతో నీవు మాటలాడితి వంటాను
అచ్చలానఁ గోపగించీ నాకె నామీఁద
యిచ్చగించి నీవు నాయింటికి వచ్చితి వంటా
కొచ్చి కొచ్చి నన్నునే గొరబు సేసేని

చ. 2: మొదల వీడెము నాకు మోహానఁ బెట్టితి వంటా
ఆదిగో న న్నాడుకొనీ నందరితోడ
యెదుగా సొమ్ములు నీ విప్పుడే యిచ్చితి వంటా
కొదలుఁ దిట్ల లోలో గొణఁగీఁ బెదవులా

చ. 3: యిద్దరముఁ బానుపుపై యేకత మున్నార మంటా
గుద్దిరాన వాకిటనే కూచున్నది
తిద్దితివి జగడము తేరిచి శ్రీవేంకటేశ
అద్దొ మొదల మమ్ము నార డింత సేతురా

పె శృ రేకు: 76-6 సామంతం సం: 17-398

పల్లవి: ఆతనిపై పరాకే ఆతివకు ఘన మాయె
చేతుల నాకెకు సన్న సేయరే చెలులూ

చ. 1: తూఁగుమంచముపై నుండి తొయ్యలి పతిరాకకు
కాఁగిన తమకముతో గక్కన లేచె
వేఁగుగుఁ దురుము జారి విరు లొక్కొక్కటే రాలి
మూఁగీఁ దుమ్మిదలు చక్క ముడువరే చెలులు

చ. 2: అంగన ఉయ్యేలమీఁదఁ నంతలో నాతనిఁ బెట్టి
బంగారుచేరులు చేతఁ బట్టి వూఁచీని
జంగాళమై చేలదూఁగి జడిగొనీఁ జెమటలు
చెంగట నెచ్చరికగాఁ జెప్పరే చెలులు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడే చేయి వట్టి తీసుకోఁగా
కైవసమై యాతనిసంగడిఁ గూచుండె
భావము లొక్కటే యాయెఁ బతికిని సతికిని
యీవేళ వాకిట నుంద మిటు రారే చెలులు

పె శృ రేకు: 77-1 భైరవి సం: 17-399

పల్లవి: ఆతనిమాటకు మీరు నందాలు చెప్పేరు గాక
దాతుమా తెటిఁగి యింకా తగ వేఁటి తగవే

చ. 1: కూరిమే కలిగితేను కొసరి తిట్టిన తిట్టు
కోరినట్టే యిద్దరికిఁ గొౕటి సేసును
యీరసమైనవేళ యెంత చేయెత్తి మొక్కినా
తారముఁ జేయదు దీని తగ వేఁటి తగవే

చ. 2: చనవే కలిగితేను చవిదప్పిన పనైనా
పనికివచ్చి యప్పుడే ఫలియించును
ననుపు చాలనిచోట నగఁబోయినా నది
తనవి చాలదు దీని తగ వేఁటి తగవే

చ. 3: కలసినప్పటికిని కడమ దొడమ లేక
తలపోఁత వలపులు తల కెక్కును
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనన్నుఁ గలసె
తలిరుఁబోండ్లు మీ తగ వేటిఁ తగవే

పె శృ రేకు: 77-2 దేసాళం సం: 17-400

పల్లవి: సారె వేసరించ నేల చప్పని వలపు లేల
మేరతో నీవు సేసినమేలు నాకు జాలదా

చ. 1: దిక్కు లెల్లాఁ దిరిగాడి దీనింటికి రానని
అక్కరతో వత్తువుగా అదె చాలును
గక్కన నన్ను మఱచి కన్నపుడే నా యెడకు
యిక్కడ మొకమోడుదు విది చాలదా

చ. 2: యిందరికి సొమ్ము లెల్లా నిచ్చి నన్నుఁ దలఁచుక
అంది నన్ను వెద కిత్తు వది చాలును
ముందువారితోడ నవ్వి ముంచి నాతో నవ్వ నని
యిందు నన్ను దయఁ జూతు విది చాలదా

చ. 3: కాంతల నందరిఁ గడి కడు మానాపతి నని
అంతలో నన్నుఁ గూడితి వది చాలును
యింతటి శ్రీవేంకటేశ యిప్పుడు నేనే నీవై
యెంత కెంత బుజ్జగించే విది చాలదా

పె శృ రేకు: 77-3 పాడి సం: 17-401

పల్లవి: ఎగక్కెములు గావు యేల నవ్వే విందుకుఁ గా
మగువ యింతకలోన మంచ మెక్కు కుండును

చ. 1: చెలి యొక్కమాట నీతోఁ జెప్ప మఱచితి ననె
అలరి యింటిదాఁకా రమ్మను మనె
తలఁచి తా వచ్చె నంటా తలవాకిటికి వచ్చె
చెలువుఁడ మాతో నది చెప్పరాని దనెను

చ. 2: ప్రేమ నీమై నెట్టొ సొమ్ము వెట్టి మఱచితి ననె
దీమసాన నీకె అది తెలుసు ననె
మేమూఁ గాక పావురముమెడఁ జీటిఁగట్టి యంపె
ఆమేఁ లు నీకుఁ దానే అందించె ననెను

చ. 3: అడ నుంటేఁదనమీఁది ఆన నీకుఁ బెట్టు మనే
యీడనే నీకన్ను దని యించె ననె
కూడితి వింతలో నాపెఁ గోరి శ్రీవేంకటేశుఁడ
జోడై నీవునుఁ దానే చొక్కినార మనెను

పె శృ రేకు: 77-4 సామంతం సం: 17-402

పల్లవి: మంచిదాయె దాని కేరా మాను మన్నదానఁ గాను
కొంచకు నీ సాజపుగుణము చెప్పితిని

చ. 1: ననుపై నీమాటలు నాకుఁ బ్రియములు గాని
అనువై నీకుఁ బ్రియము ఆకెమాటలు
విను నేఁ దలఁతు నాకు నీవు దేవరవు గాని
అనిశము నీపాలిటి కాపెపో దేవర

చ. 2: నిండార నామొక్కులకు నీవు గుఱి యింతే కాని
అండ నీమొక్కుల కైతే నాపె గుఱి
పండినవలపు లెల్ల పదివేలు నీకు నత్తు
కొండవంటి వలపులు కోటి యాపె కత్తువు

చ. 3: మించి నాకన్నులు నీమీఁదనే వుండుఁ గాని
అంచు మోచి నీకన్నులు ఆపెమీఁదివే
కొంచక శ్రీవేంకటేశ కూడితి నే నిన్ను నీవు
యెంచి యాపెఁ గూడితివి యిద్దరు మావారే

పె శృ రేకు: 77-5 దేసాళం సం: 17-403

పల్లవి: ఎంతకు వచ్చెఁ బనులు యిదేమయ్య
వంతువాసి సవతులవారము గామా

చ. 1: చలి దీర నాపె నీవు సరసము లాడఁగాను
నిలిచి కొలువు సేయ నేమా నీకు
అలిగి యెదురు మంచాలందు మీ రెక్కు కుండఁగా
నెలవై సంది మాటాడ నేమా నీకు

చ. 2: పువ్వులచెండున మీరు వూఁచి వేట్లాడఁ గాను
నివ్వటిల్ల నందియ్య నేమా నీకు
రవ్వగా జూదము లాడి రతిఁ దిట్లాడఁ గాను
నెవ్వగ దీర మానుప నేమా నీకు

చ. 3: యెమ్మెల పంతములు మీ రిద్దరును నాడుకోఁగా
నెమ్మది సాకిరి విన నేమా నీకు
కొమ్మను శ్రీవేంకటేశ కూడిన వెనకఁ గూడి
నిమ్మపం డ్లిచ్చి మొక్క నేమా నీకు

రేకు: 77-6 సామంతం సం: 17-404

పల్లవి: బేరి జోకొట్టుచు మాతోఁ బెసఁగే వప్పటి నీవు
నేరిచినంతా మాతో నేరుపుదువు గాక

చ. 1: అట్టే నీ వేమి సేసినా నడ్డమాడేనా నీకు
వట్టి యాసలు వెట్టుకో వద్దంటిఁ గాక
మట్టు మీరిన దొరవు మాకేల యింత వెఱవ
పట్టిన చలముతోనే బతుకుదువు గాకా

చ. 2: తెలిపి నీగుణములు తిద్ద వచ్చేమా నేము
వలపు మాతోఁ జెప్ప వద్దంటిఁ గాక
పెలుచు మగవాఁడవు పిలువ మమ్మిఁక నేల
తిలకించి నీ యిచ్చఁదిరుగుదువు గాకా

చ. 3: కొంకక నాతో నవ్వఁగాఁ గోపగించితినా నేను
వంక లొత్తి మాటలాడ వద్దంటిఁ గాక
అంకెల శ్రీవేంకటేశ అట్టె ననుఁ గూడితివి
మంకు దీరె నిట్లానే మన్నింతువు గాకా

పె శృ రేకు: 78-1 దేసాళం సం: 17-405

పల్లవి: తీరె నీయలుక లెల్లా తిరుమాళారు
తీరని మోములోడి తిరుమాళారు

చ. 1: వీనుల పండువగా వేఁడుకొనీ నీవిభుఁడు
తేనెమోవి మాటాడవో తిరుమాళారు
పూనిపట్టి యప్పటిని పొద్దు గడపఁగ నేల
దీన నేమి వచ్చె నీకు తిరుమాళారు

చ. 2: చక్కని నీచన్నులపైఁ జాఁచీ నాతఁడు చేయి
తక్కని నగవు లేలో తిరుమాళారు
మొక్కేవానివలెనే ముందర నిలుచున్నాఁడు, ఆ
దిక్కు చూడఁగదవమ్మ తిరుమాళారు

చ. 3: కులికి శ్రీవేంకటాద్రి గోవిందరాజు నేప్రొద్దు
తిలకించి కూడె నట్టె తిరుమాళారు
పలుకుఁ బంతము చెల్లఁ బైపై మీ కిద్దరికి
తెలిసితిమి మీగుట్టు తిరుమాళారు

పె శృ రేకు: 78-2 శంకరాభరణం సం: 17-406

పల్లవి: కటకటా యెటువంటి కట్టిడి చిత్తమో కాక
యెటువలెఁ గరఁగదు యెంత రాయో కాక

చ. 1: మన సిచ్చి మాతోడ మాటలాడ వద్దు గాక
ననిచి సెలవినైనా నవ్వరాదా
వనితరో నీవు నేను వాదు లడిచి నప్పుడే
పొనిగి యింతేసి సేయ బోయ పగా మనకు

చ. 2: సమ్మతించి నామోము చక్కఁ జూడ వద్దు గాక
వుమ్మడి నాకతలకు వూఁకొన వద్దా
పమ్మి మన మిద్దరము పంతము లాడుకొంటేనే
కమ్మర నింత చలము కట్టు గుత్తా మనకు

చ. 3: పెట్టిన దండ దియ్యక పేరుకొనవద్దు గాక
గుట్టునఁ గౌఁగిట నించి కూడవద్దా
అట్టే శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
జట్టిగాఁ గలసితిమి సట లేల మనకు

పె శృ రేకు: 78-3 శంకరాభరణం సం: 17-407

పల్లవి: వెలఁదిరచనలకు విసుగకుమీ
చెలువుఁడ చింతలే సిగ్గులు నాయె

చ. 1: నలుగడఁ జెలి నిను నవ్విన నవ్వులు
దలఁచిన జంద్రోదయ మాయె
సొలసేటి కోపపుఁ జూపుల నంతలో
తళుకున సూర్యోదయ మాయె

చ. 2: పడఁతి నీ యెదుటఁ బలికినపలుకులు
కడఁగి వసంతాగమ మాయె
పొడవగు నీపై బొమ్మజంకెనల
జడివాన కింద్రచాపము లాయె

చ. 3: కాంత నిన్ను రతిఁ గలసినకౌఁగిలి
కంతుని సాముల గరి డాయె
యింతట శ్రీవేంకటేశ మీకరుణ
బంతి మీకు సరిపంతము లాయె

రేకు: 78-4 శ్రీరాగం సం: 17-408

పల్లవి: ఇన్ని సగినములు యింతికి మేలు
విన్న కన్న చెలు లెల్లా వెఱవకు రమ్మా

చ. 1: విరహతాపముచేత విసిగిన చెలియకు
వెరవునఁ జల్లగాలి వీపు గాపు
సరుస నిండుమనసు చంచల మైనందుకు
యిరవైన కోవిలల యెలుపే నిలుపు

చ. 2: వలపుల చింతచేత వడి బడ్డఁ మగువకు
చెలఁగి మోన్నెలజేని చిచ్చేసిరి
నిలిచి విభునివద్ద నెయ్యము చల్లేవేళ
తెలిఁజన్నుజక్కవల తీరే మిక్కిలి

చ. 3: గక్కనఁగూడిన శ్రీవేంకటపతి రతివేళ
గుక్కని చిలుకపలుకులే దిక్కు
పక్కన నితనిమీఁది పాటలు వాడుటకు
వొక్కటఁ దుమ్మెదమోఁత వుపశ్రుతులు

పె శృ రేకు: 78-5 శ్రీరాగం సం: 17-409

పల్లవి: సిగ్గులు వడుదువు నే మివి చెప్పిన ని న్నాళ్ల తే
అగ్గలమై కలిగెఁగా అన్నియు నీయంతనే

చ. 1: తురుమునరాలెడి పువ్వుల తొరిగేటి సెలవుల నవ్వుల
అరవిరియై వచ్చే విదె ఆతనికడనుండి
గరిమల నీయందే యివి కంటిమిగా నేఁడైనా
సురతాంతపుసింగారము చూపేవా మాకు

చ. 2: చెక్కులచెమటలజారుల చింద్రికమోపుల తీరుల
అక్కరదేరుచు వచ్చే వాతనికడనుండి
చక్కని నీయంద మరఁగ సంతస మైతిమిగా యిటు
మిక్కిలి మరు సామ్రాజ్యము మెఱసేవా యిపుడు

చ. 3: రతులనే చొక్కిన మరపుల రచనల సరసపు టొరపుల
అతివేడుకతో వచ్చే వాతని కడనుండి
అతఁడదే శ్రీవేంకటేశుఁడు అటు నినుఁ గూ డిటు వచ్చెను
గతులను మామీఁదట మీకరుణలు చల్లేరా

పె శృ రేకు: 78-6 సామంతం సం: 17-410

పల్లవి: అంతట నాజన్మఫల మబ్బుట గాదా
చెంతల నిన్నియు నీకే సెలవుగాదా

చ. 1: మఱి పొరుగున నున్నతఱి నొక్క మాటైనా
నెఱవుగా నీవు నన్ను నిక్కి చూడవా
గుఱిగా దినమూ నీకొలువుకు రాఁగాను
మఱచి తప్పియైనాను మాటాడవా

చ. 2: చెలితో నావిరహము చెప్పి చెప్పి పుత్తేఁ గా
అలరి యేపాటైనా నాలకించనా
నెలకొని యిందరితో నీవార మను కోఁగా
తలఁచి నీవే నన్ను దయ జూడవా

చ. 3: చెక్కుచేయి దీసి నీకు సిగ్గువాసి మొక్క గాన
గక్కన నట్టే నీవు కౌఁగిలించవా
యిక్కు వంటి శ్రీవేంకటేశ యిట్టె కూడితివి
మిక్కిలి యింతట నన్ను మెఱయించవా

పె శృ రేకు: 79-1 శ్రీరాగం సం: 17-411

పల్లవి: పంతము చెల్లెను బదఁగదరా
యింతలోనఁ దప్పు లెంచక పదరా

చ. 1: రాని కోపమున రవ్వ సేసితి నింతే
పానుపు మీఁదికిఁ బదఁ గదరా
సోనలచెమటల సొలసితి నింతే
తేనెమోవి దప్పి దేర్చేఁ బదరా

చ. 2: అనుమానానీకు నలిగితి నింతే
పని గల దిక నటు పదఁ గదరా
నను నిటు చూడఁగ నవ్వితి నింతే
తనిపే నీమతి తావుకుఁ బదరా

చ. 3: పాసిన కాఁకల బలికితి నింతే
బాసలు నమ్మితిఁ బద గదరా
ఆసల శ్రీవేంకటాధిప కూడితి
వేసారపురతి వెనకకుఁ బదరా

పె శృ రేకు: 89-2 ముఖారి సం: 17-412

పల్లవి: ఏల మానుఁ దొల్లి చెలి యేమేమి సేసిన దెల్ల
కాలముతో రమణుఁడు కనిపించుఁ గాకా

చ. 1: దొంతరపువ్వుల మరుఁ దొల్లి పూజించఁగఁ బోలు
కాంత చెక్కుచేత నేఁడు గదియించెను
పొంతనే కమ్మర పైఁడిపువ్వులఁ బూజించఁ బోలు
కాంతలతో విరహాగ్నిఁ గరఁగీ లోలోనే

చ. 2: మొదల మాణిక్యముల ముగ్గులు వెట్టఁగఁ బోల
వెదచల్లి నేరు లెల్ల వీఁపుపై నేఁడు
కదిసి వ్రాఁత చీరలు గట్టఁ బోలు మేలు కట్టు
వదలి నేలల వ్రాఁత వ్రాసీఁ బాదానను

చ. 3: తగఁబన్నీరుచెంబులు దానము లియ్యఁగఁ బోలు
మగువపై చెమట లుమ్మగిలీ నేఁడు
పగటు శ్రీవేంకటాద్రిపతి యిట్టే విచ్చేసి
అగడుగా నిటు గూడె నటు నోమఁ బోలునే

పె శృ రేకు: 79-3 సామంత సం: 17-413

పల్లవి: ఎదురు గొసరితేను యేది వలపు
యెదలోఁ గపట ముంటె నిక నేది వలపు

చ. 1: కాంత నీతో నలిగితే గడుఁ బ్రియము చెప్పక
యింతలో మా రగలితే నేది వలపు
సంతానకుఁ జెలి నీతోఁ బలుకక వుండితే
వంతుకు నీవూరకున్న వడి నేది వలపు

చ. 2: వొంటి మనసు చూడ నువిద రాకుండితేను
యింటికి నీవేఁగకున్న నేది వలపు
అంటకు మంటాఁ జెలి యదలించుకొంటాఁ బోతే
వెంటనే నీవేఁగకున్న వెస సేది వలపు

చ. 3: సటనలకు నిన్నుఁ జూచి జలజాక్షి దిద్దితేన
యిటు వడి మొక్కుకున్న నేది వలపు
ఘటన శ్రీవేంకటేశ కొఁగిట గూడితి నాకెఁ
దటుకున మీదే కాక ధర నేది నేది వలపు

పె శృ రేకు: 79-4 ముఖారి సం: 17-414

పల్లవి: కంటిఁబో మీచేఁత లెల్లాఁ గన్నులారను
అంటకు నీ విఁక మమ్ము నది వింత గాదా

చ. 1: వుంగరాలవేళ్లఁ దలు పూఁది యొక్కచెలి నీతో
తొంగి చూచి మాటలాడె తొలుతే కాదా
ముంగిట నిన్ను నలమి మూఁపుపై గడ్డము మోపి
అంగవించి కనుచొక్కె నప్పుడే కాదా

చ. 2: ముంచిన నీ కొనగొంగు ముంజేతఁ జుట్టి పట్టి
అంచెల ని న్నానవెట్టె నాకె కాదా
కంచపు మోవి వీ కిచ్చి గంటి సేసే నీ మోవి
యించుక నవ్వించె నిన్ను నిది వింతగాదా

చ. 3: కొప్పు వీడఁ బెనఁగుచు కొమ్మ నిన్నుఁ బిలువఁగ
అప్పుడే లోనికిఁ బోతి వందుకే కాదా
యిప్పుడు శ్రీవేంకటేశ యిదే నన్నుఁ గూడితివి
చెప్పఁ బోతే నీకు నవి సిగ్గువాటు గాదా

పె శృ రేకు: 79-5 శంకరాభరణం సం: 17-415

పల్లవి: చెల్లఁ బో యి దేఁటిపని సేసితివయ్యా, నీ
చిల్లర సుద్దులు విని సిగ్గయ్యీ నాకు

చ. 1: నవ్వుచుఁ జాళికుఁడు తనాచారి ముడిచి
పువ్వు లెట్టు ముడిచితి పొంది దొరవు
యివ్వల నీసతులెల్లా నెంతకుఁ జొచ్చె ననుచు
చివ్వన నాడఁగ విని సిగ్గయ్యీ నాకు

చ. 2: నలువంక నాకెమేన నలఁచిన పసుపు, నీ
వెలమి నలఁదుకొంటి వింతవాఁడవు
నలుపు నీ మేని కేలే నగుఁబాటు పస పని
చెలు లాడఁగా విని సిగ్గయ్యీ నాకు

చ. 3: మట్టు లేని యలమేలుమంగ నేను నీ నాకె
గట్టిన చీరె నాకుఁ గప్పే విదివో
యిట్టె శ్రీవేంకటేశ యిద్దరి మ మ్మొక్కమాటె
చెట్ట వట్టి కూడఁగాను సిగ్గయ్యీ నాకు

పె శృ రేకు: 79-6 ఆహిరి సం: 17-416

పల్లవి: జాటెఁ గొప్పు యింకా నేల జంపుమాటలు, నే
నాబడైతి నీకుఁగానే ఆరేఁ దేరేఁ బడరోరి

చ. 1: ఆడరాదు దొరవని ఆడకున్నఁ బోదు నిన్ను
చూడఁ జూడ నీ మో వేల చుక్క లాయెరా
తోడనే గోరితి వెంట తొడుకు లైనట్లా యని
జాడలెల్లఁ గంటి వింటిఁ జాలుఁ జాలుఁ బదరోరి

చ. 2: మొదల నే నెఱుఁగక మోసపోతి గాక నేఁ
గదిసి యేపొద్దు వద్దఁ గాచుకుండనా
యిదె మింగినకడికి నిఁకఁ జవు లెంచ నేల
చెదరని పంతమెల్లాఁ జెల్లెఁ జెల్లెఁ బదరోరి

చ. 3: సిగ్గు లెల్లాఁ దీరె దీరె శ్రీవేంకటేశుఁడ నేను
వెగ్గళమై నీ నా సంది వింత లేలరా
దగ్గరి కూడిన మీఁద తలపోఁత లిఁక నేల
యగ్గలమై నీనా కోప మారెఁ దీరెఁ బదరోరి

పె శృ రేకు: 80-1 భౌళి సం: 17-417

పల్లవి: ఇదివో మననేరుపులు యే మున్నవి
నిదుల మమ్ము నిలువ నీచేతిదే కాదా

చ. 1: చెనకి నీవే నన్ను సిగ్గు దేరుచఁగ బట్టె
ననుపుచేసుక నీతో నవ్వితిఁ గాకాఁ
కొనదాఁకా నీవు నాతో గుట్టుచేసుక వుండితే
చనవున వేగుదాఁకా జాగరాలే కాదా

చ. 2: కొండవలెఁ జేయి వట్టి కొంకుఁ దీరుచఁగఁ బట్టె
అండనుండి నీతో మాటలాడితిఁ గాక
నిండుకొన్న రాజసాన నీ వెంత దడవున్నఁ
జండిపట్టి జవ్వనము సరి యాఁక గాదా

చ. 3: రమ్మని ఇట్టె నన్ను రతులఁ గూడఁగఁ బట్టె
బిమ్మటిగా నిన్ను నే మెప్పించితిఁ గాక
వుమ్మడి శ్రీవేంకటేశ వూరకే నీ వుండితేను
వుమ్మగిలు నాసల నోరూటలే కాదా

పె శృ రేకు: 80-2 సామంతం సం: 17-418

పల్లవి: ఇంతలో నీ రమణుఁడు యీడకే విచ్చేసెను
వింత లాయెఁ బనులెల్లా వెఱ పేలే యిఁకను

చ. 1: మరుని యమ్ములకును మరుని బలఁగమైన
గరిమలఁ దుమ్మెదమూఁకలేపగ
తరుణిరో యిందులోనే తమలో విఱివోటాయె
విరహిజనులకెల్ల వెఱుపేలే యిఁకను

చ. 2: కాముని కైదువలకు కామునిపంపులైన
ఆమని కోమోలలెల్ల నవియేపగ
కామినిరో తమలోనే కలఁక లెప్పుడుఁ బోవు
వేమరు నిందుకుఁగాను వేఱుపేలే యికను

చ. 3: మదను జక్కవలకు మదనుని చుట్టమైన
తుదమీరి వున్నమ చందురుఁడే పగ
యెదుట శ్రీవేంకటేశుఁ డిదె నిన్ను నిట్టె కూడె
వెదకి తెలుకొంటె వెఱుపేలే యిఁకను

పె శృ రేకు: 80-3 శంకరాభరణం సం: 17-419

పల్లవి: నెలంత భాగ్యము గాక నీకే మయ్య్య
నెలకొక్క వరుసయిన నీకే మయ్యా

చ. 1: చెలియఁ గాఁకల ముంచి చిఱునవ్వు నవ్వేవు
నెలకొన్న విటుఁడవు నీకేమయ్యా
చలిమి దూతికలతో జాణతనా లాడేవు
నిలువుఁ గప్పు దొరవు నీకేమయ్యా

చ. 2: ప్రేమము చెలియకిచ్చి పిలిచినఁ బలుకవు
నేమే కూళల మింతే నీకేమయ్యా
బూమెల మాటల నిట్టె పొద్దు గడుపేవు, నీ
నేమపుఁ బంతము చెల్లె నీకేమయ్యా

చ. 3: మచ్చికమా యలమేలుమంగఁ గౌఁగిలించేవు
నిచ్చలు శ్రీవేంకటేశ నీకే మయ్యా
అచ్చలపుఁ దత్తరాన నలసిపాలసి నిన్ను
నెచ్చెలుల మేమనా నీకేమయ్యా

పె శృ రేకు: 80-4 శంకరాభరణం సం: 17-420

పల్లవి: అప్పుడు నే నెంత గబ్బి ననవద్దు
తప్పదు లగ్గము నీపైఁ దగిలింతుఁ జుమ్మీ

చ. 1: భారపు నాకుచములు పట్టరాని వేఁ గంటా
వూరకైనా సారె సారె వుప్పటించేవు
వోరి నీ సాపెన దాఁకి వొగిఁ బిక్కటిల్లుఁ జేసు
చేరి చేరి నీమీఁది చేయి దియ్యఁ జుమ్మీ

చ. 2: యెలమి నాతురుమిది యెంత ఘనమాయెనంటా
పలుమారుఁ జూచి చూచి పచ్చారేవు
వెలయు నీ దృష్ఠి దాఁకె వీడుఁ జేసు నీ వెంత
పొలసి దాఁగిన నిన్నుఁ బోనియ్య జుమ్మీ

చ. 3: యిప్పు డిట్టె శ్రీవేంకటేశుఁడ నన్నుఁ గూడి
పిప్పిగా నామోవి గడు బిందువుచ్చేవు
చిప్పిలు నీ పలు సోఁకి చిల్లివోవుఁ జేసు నేఁ
జెప్పితి నీ చేఁతలకు చేఁత సేతుఁ జుమ్మీ

పె శృ రేకు: 80-5 రామక్రియ సం: 17-421

పల్లవి: ఏమనఁగ నే మవునో యెన్నిక లెట్టో
నా మనసులోననే నవ్వితిఁ బో నేను

చ. 1: ఆకెకుఁగా నొత్తి మాటలాడితే నీ చిత్త మెటో
కాక యేమీ ననకున్నఁ గాంత యెట్టో
యీకడ నాకడ నే నిద్దరి నే మన లేక
నాకు నాకే వెఱగై నవ్వితి బో నేను

చ. 2: నెమ్మది మీ యిద్దరిలో నిజ మాడఁగా నెటొ
వుమ్మడి నూరక నే నుండితే నెట్టొ
చిమ్ముల మీ యలుకలు చిమ్మిరేఁగిన వొట్లు
నమ్మ లేక నాలోనే నవ్వితిఁ బో నేను

చ. 3: తలపోసి మీలోని తమకము లవి యెట్టో
కొలఁది మీఱిన యింతికోరిక లెట్టో
చెలిఁ గూడితివి నేఁడు శ్రీవేంకటేశ్వర
నిలువున మిమ్ముఁ జూచి నవ్వితిఁ బో నేను

పె శృ రేకు: 80-6 శంకరాభరణం సం: 17-422

పల్లవి: తనిసితి నీఁకఁ దలఁగరే
కనుఁగొనచూపు కానరాదా

చ. 1: చాలుఁజాలు మాటలు చాలించరే
యేలే వొడఁబా ట్లింకానా
నాలుక తుదలే నయములు తన
యీలకూర కుప్పులింతే లే

చ. 2: ఆయె నాయెఁ బను లల్ల నాఁడేనే
రాయడిఁ దనకే రవ్వయితిని
పోయినదే పొల్లు పోని రేవడ
మాయల నొప్పికి మందే లేదు

చ. 3: చెల్లెఁ జెల్లెఁ దనసేఁత లెల్లానేఁ
డిల్లిటే శ్రీవేంకటేశ్వరుఁడు
బల్లిదుఁడై కూడెఁబంతమునా తన
చల్లువలపులే చవులు గావా

పె శృ రేకు: 80-7 సామంతం సం: 17-423

పల్లవి: ఎఱుఁగక నిను సొలసితిఁ గాక
నెఱవు గాజు మాణిక మయ్యీనా

చ. 1: మడిదొసకుల నీమాటలనే పో
పడిపడి నడుమిది బడగాయె
విడువిడు నా తోప సా లేఁటికి
జడిగొను చిలుకలు జక్కవ లౌనా

చ. 2: చెనకుల నీ యిటు చేఁతలనే పో
కని కని కన్నులు గనమాయె
చనవులు మనవులుఁచాలు జాలు నిఁక
యిన మినుమే పసిఁడిఁక నయ్యీనా

చ. 3: గుటుకల నీరతి కూటమినే పో
కటకట నామై గరుపారె
యిటువలె శ్రీవేంకటేశ కూడితివి
నటనల పులకలు నన లయ్యీనా

పె శృ రేకు: 81-1 సామంతం సం: 17-424

పల్లవి: ఎఱుకో మఱపో యెట్టి కళవళమో
నెఱి జెమటలు చూచి నిజమంటా జొక్కెను

చ. 1: కలలోన దనమోవి గంటి చేసె నని చెలి
తలఁకక పతి దిట్టి తడవి చూచె
నిలువున రమణుడుఁ నీవి వదలించె నని
చిలుకు కుచ్చెలమీద చేయి చా చె నపుడు

చ. 2: ననుపున గలలోన నాయకుఁడు సేసవెట్టె
నని తెలిసి తురుము లంటి చూచెను
కొనబు చన్నులమీద కుంకుమ పూసె నంటా
తనపయ్యెద దెరచి తలపోసి చూచెను

చ. 3: రమణుఁడు కలలోన రతి సేసె నని కని
అమరఁ గౌ గిటిలోన నలమి చూచె
తమి శ్రీవేంకటపతి తా నింతలో విచ్చేసి
కమలాక్షి గూడగాను కన్నులు దెఱచెను

పె శృ రేకు: 81-2 సామంతం సం: 17-425

పల్లవి: నిన్ననే పతి నిను గూడెను నీ కదే చాలదటే
అన్నిట నింకా విడువని యాసోదం బేలే

చ. 1: చక్కని చన్నుల మీదట చంద్రోదయమ్మై వుండగ
చిక్కని నీమతి చింతలచీఁకటి యిఁక నేలే
దిక్కుల నీపతి మాటల తేనెలు చెలిచే నంపెను
తక్కక యెండినపెదవుల దప్పులు యిఁక నేలే

చ. 2: జల్లన జెమటల వానల జడిగొని కురియుచునుండఁగ
వెల్లాయపు విరహంబుల వేసవి యిఁక నేలే
గల్లన నీపతిచూపులకలువలు నీ కందియ్యఁగ
మల్లడి మరుశరములకును మారుకొన వదేలే

చ. 3: కందువఁ దలపోసినపతి కౌఁగిటిలోపల నుండఁగ
యిందును నందును నడుముల యెడమాట లవేలే
అందపు శ్రీవేంకటపతి యాతఁడే నిను మన్నించఁగ
గొందుల సందుల కూరిమి కొసరులు నీ కేలే

పె శృ రేకు: 81-3 పాడి సం: 17-426

పల్లవి: నగనివాఁడవా నీవు నంటునను వద్దనుండి
మొగినే గిలిగించనిమోస మింతే కాక

చ. 1: తలఁచని వాఁడవా నీ తలఁపులో నడ్డమై
నిలుచుండ నిది నా నేరమే కాక
పలుకనివాఁడవా నీ పలికెడివేళ నేను
కొలువునఁ గాచుక వూఁకొన నైతిఁ గాకా

చ. 2: చూచిచూడనివాఁడవా సొరిది నీ వెందైనా
కాచి నే నాడ నుండనికల్లే కాక
రాచతనాన నింటికి రానివాఁడవా నీవు
ఆచాయ మాయిల్లు గట్ట నైతి నింతెకాక

చ. 3: కౌఁగిలించనివాఁడవా కడు నీ చేతుల సంది
కౌఁగిన నా మేను లోనుగాదాయెఁ గాక
ఆఁగి శ్రీవేంకటేశుడ అంతలో నన్నుఁ గూడితి
రాఁగి యిందాఁకా నింత నెఱుఁగనైతిఁ గాకా

పె శృ రేకు: 81-4 శ్రీరాగం సం: 17-427

పల్లవి: విరహిణి మొదలనే వీరి వొట్లిఁక నేల
తరుణికి శృంగారాలు తగినవే సేయరే

చ. 1: అలినీలవేణికి నది యేలే సంపెంగలు
అలరుదామెరవిరు లగుఁ గాక
పొలసి పికవాణికి పుయ్యకురే జవ్వాది
చిలుకు చిగురు బంతి చేతి కియ్యరే

చ. 2: దంతియానకు సింహలఁ దగ వ్రాసిన చీరేలే
చెంతలనే లతల మంజిష్టి గాక
రంతుఁ గలువకంటికి రవిపదక మిదేలే
పంతముతోడ చంద్రాభరణము లిడరే

చ. 3: వడి నీపె గిరికుచవజ్రాల సేస లేలే
అడరుఁ బూవులసేసే అమరుఁ గాక
బడి శ్రీవేంకటేశుఁడు పడఁతినిఁ గూడె నింక
కడుఁ గుంకుమపూతేలే గందవొడి చల్లరే

పె శృ రేకు: 81-5 కాంబోది సం: 17-428

పల్లవి: తానే యింత జాణ గాని తలఁప నే మెడ్డెలమా
ఆనుకయూరకుండితే అరసత్తి దానవా

చ. 1: సిగ్గు వడి యుండఁగానే చీర యేల పట్టీనే
వెగ్గళించ కుండితే నేవుట్టివారమా
కగ్గి మాయింటికిఁ బోఁగా గంద మేల పూసీనే
యెగ్గులఁ దిట్టకుండితే యియ్యకొన్నదానవా

చ. 2: మాటలాడఁకుండ గానే మమ్ము నేల తడవీనే
వీట మావారు లేకున్న వెలయాలనా
నీటున నే నుండఁగానే నిలి చేల నవ్వీనే
గీటి గోరఁ జించకున్నకిందుపడ్డ దానవా

చ. 3: కన్నులు మూసుకుండఁగ కౌఁగిట నేల నించీనే
పిన్నతనాన నే నుంటే పెట్టుఁ జెట్టనా
వున్నతి శ్రీవేంకటేశుఁ డిక్కటై యేల మెచ్చీనే
సన్నలు సేయకుండితే చలపట్టేదానవా

రేకు: 81-6 ఆహిరి సం: 17-429

పల్లవి: తనవార లెంతైనా తనకుఁ బగటరే
మనసులోని మరుఁడు మగువకే తోడు

చ. 1: కలువల చెలికాని కాంతలు దూరకురే
కలువల చెలికాఁడే కాంతకు మోము
చలిగాలి నూరకైనా సారె జరయకురే
చలిగాలి యీ యింతి చల్లని నిటూర్పు

చ. 2: తెగి తుమ్మెదల నేల తిట్టకురే సతులు
పగటుఁ దుమ్మెద లింతిపాపటికొప్పు
మిగులఁ జిలుకలను మెఱసి కోపించకురే
పగవు చిలుకకూఁతే పడఁతి పలుకులు

చ. 3: వెన్నెలలపై నంత వేసరకురే మీరు
వెన్నెలలు యిన్నయును వెలఁదినవ్వు
యిన్నిటాను శ్రీవేంకటేశుఁడు యీ కాంతఁ గూడె
పన్ని యీతఁడే యింతి ప్రాణబందుగుఁడు

పె శృ రేకు: 82-1 సామంతం సం: 17-430

పల్లవి: అన్ని సింగారాలు నీకు నమరివున్నవి నేఁడు
సన్నల మేరకు మేర సరసమే చాలు

చ. 1: మాటలాడకువయ్య మదనముద్రలు రాగీ
చాటువగా నాకు నీ చేనన్నలే చాలు
గాటపు మై యంటకు గందపు బేఁటులు రాలీ
జూటరిపనేమి గల్లచూపులనే మెలఁగు

చ. 2: లాగుల మొక్కకువయ్య లత్తుక నుదుట మాసీ
ఆగతిఁ జెలియ నయమునలే చాలు
నాగమై బెట్టు నగకు వాడుఁబువ్వు లవే రాలీ
మూగిన మూఁకలలోన మోనమే చాలు

చ. 3: మేను మేను సోఁకకు మించుఁ జెమటలు దేరీ
పూని సంగడి గూచున్న పొందులే చాలు
మానక యెంత చెప్పినా మచ్చిక నన్నుఁ గూడితి
వానుక శ్రీవేంకటేశ అందుకదేచాలు

పె శృ రేకు: 82-2 భైరవి సం: 17-431

పల్లవి: ఇన్నియు నుండఁగ దమ కేమి గడమ
వున్నవాఁడు సిరి పురుషోత్తమరాజు

చ. 1: వీలుచు నీ రావటించీ వేదమరాజు
కూలికి గుండ్లు మోచీఁ గూర్మరాజు
పోలిమి నేలలు దవ్వీఁ బొలమురాజు
నాలి బడుచాట లాడీ నరసింగరాజు

చ. 2: చేకొని చేతులు చాఁచీఁ జిక్కరాజు
రాకపోక దపసాయె రామరాజు
రాకట్నములే కట్టీ రాఘవరాజు
రేకలఁ బసులఁ గాచీ కృష్ణరాజు

చ. 3: మగువల కిచ్చలాడీ మాకరాజు
జగమెల్లాఁ దిరిగీని జక్కరాజు
నగుఁబాటుదీర శ్రీవేంకటనగముపయి
వెగటై లోకము లేలే వెంగళరాజు

పె శృ రేకు: 82-3 రామక్రియ సం: 17-432

పల్లవి: బాపు బాపు మెచ్చితిమి బాలసిద్ధుఁడా
రాపుల సింగారపు రససిద్ధుఁడా

చ. 1: నీరధిలో విహరించు నిజసిద్ధుఁడా
తారి తారి మెలఁగే పాతాళసిద్ధుఁడా
భారపు భూమి మోచేటి బలుసిద్ధుఁడా
తోరపు కంబము మీఁది దొడ్డసిద్ధుఁడా

చ. 2: మింటిపొడవై నట్టి మేటి సిద్ధుఁడా
గెంటినతల్లి బదికించు సిద్ధుఁడా
పెంటిరాకాసిఁ జంపిన పెనుసిద్ధుఁడా
దంటభూతమునెత్తురు దాగితి సిద్ధుఁడా

చ. 3: మచ్చి వూళ్లు చెరిచిన మాయసిద్ధుఁడా
రచ్చలోని జాతిగుఱ్ఱపు సిద్ధుఁడా
కొచ్చన శ్రీవేంకటాద్రిగుహ సిద్ధుఁడా
అచ్చపు లోకము లేలే ఆది సిద్ధుఁడా

పె శృ రేకు: 82-4 కాంబోది సం: 17-433

పల్లవి: చెప్పరాదు చూపరాదు చేరి యీవలపు నేఁడు
కప్పురపుగంధిమీఁది కరుణ నీకెట్టిదో

చ. 1: చెలియ నీవదనము చిత్తరుపటాన వ్రాసి
తెలిగన్ను లేడవంటా తెగి వేంగేలాడును
నెలవై చేతప్పి రేక భుజానఁ బారితేను
తలపూఁచి మెచ్చి మెచ్చితనలోనే నవ్వును

చ. 2: అంది నీకంఠమున జంద్రాభరణము వ్రాసి
సందేహించి చూడఁ జాలక పొగులును
పొందుగా నీవురము బూచి తనరూపు వ్రాసి
నిందల వేరొకతేని నివ్వెఱఁగుఁ బొందును

చ. 3: శ్రీవేంకటేశ నీచెలువుఁ దొడలు వ్రాసి
భావపు సిగ్గున దనపయ్యెద పైఁ గప్పున
సావధానమున నీసర్వాంగములు వ్రాసి
యీవల నిన్నిటు గూడి యిందు సరి చూచెను

రేకు: 82-5 దేశాక్షి సం: 17-434

పల్లవి: నే నంటే నేమాయె నేఁడు తన కెగ్గా
దాని కేమే నాటివాఁడు తాఁ దానే కాఁడా

చ. 1: తిట్టితే నేమాయెనే తెగి శిశుపాలుచేత
తిట్టులి బడినయట్టి దేవరేకాఁడా
ముట్టితే నేమాయెఁ దనముంగురులు రోలితోడ
ముట్టి కట్టు వడ్డపోల ముద్దులాఁడుగాఁడా

చ. 2: కాలు దాఁకితే నేమాయె కమ్మర భృగువుచేత
కాలఁ దన్నించుకొనిన ఘనుఁడే కాఁడా
పేలవానఁ బొత్తుకు నేఁ బిలిచితే నేమాయె
కోలల గొల్లల పొత్తు కుడవఁడా తాను

చ. 3: మొన నా చనుఁగొండలు మోపితే నేమాయె
ననిచి వేలఁ గొండ నాఁడు మోవఁడా
యెనసి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
వెనకకుఁ గూడిన నా విభుఁడే కాఁడా

పె శృ రేకు: 82-6 వరాళి సం: 17-435

పల్లవి: ఆయె నాయెఁ జాలుఁ జాలు నట్టే కాదా
ఆయెడ నీ మాట గన మట్టే కాదా

చ. 1: కందువనేఁ జూడఁగాను కాంతమోము చూచి నవ్వి
అందాలు చెప్పఁగ వచ్చే వట్టే కాదా
ముందు వెనకై యాకె మోవినే యా కందుకొని
అందుకు నానలు వెట్టే వట్టే కాదా

చ. 2: యింతవడి దాఁకా నీ వేడ నుంటివని యంటే
నంతలోనే వుస్సు రనేవు అట్టే కాదా
వంతువాసులకు తోడివనితనేఁ దిట్టితేను
అంతకుఁ బూనుక వచ్చేవు అట్టే కాదా

చ. 3: తప్పులు నీయందు మోపి తారుకాణించిన నన్ను
నప్పుడే కౌఁగిట నించే వట్టే కాదా
వొప్పగు శ్రీవేంకటేశ వుదుటు నీ మోహ మెల్లా
నప్పగించితివి నాకు నట్టే కాదా

పె శృ రేకు: 8 3-1 లలిత సం: 17-436

పల్లవి: ఉంగరము సీతవొద్ది కొగి నంపినవానికి
వుంగరాలు వేళ్లనిండా మెనరించరే

చ. 1: మద్దులు విఱిచిన మనపిన్నక్రిష్ణునికి
మద్దికాయ లమరు నెమ్మదిఁ బెట్టరే
గద్దించి రావిమానై కాంతలఁ బొందేవానికి
ముద్దుగారే రావిరేక ముంగురులఁ గట్టరే

చ. 2: ఘంటాకర్ణునిభక్తి గైకొనేటివానికి
ఘంటలు మొలనూళ్లుఁ గట్టరమ్మా
గెంటక గోరనే దైత్యుగీరి చంపినవీనికి
జంట పులిగోరు మెడఁజక్క గట్టరే

చ. 3: పాదముననే బండి పడఁ దన్నినవీనికి
పాదపుగజ్జలందెలు వాని యిడరే
గోదిలి గోవర్ధనపుఁగొండ యెత్తినవానికి
యీదెస శ్రీవేంకటాద్రి యెక్కి యాడఁదగునే

పె శృ రేకు: 8 3-2 నాదరామక్రియ సం: 17-437

పల్లవి: ముట్టితినో ముట్టనో ముక్కుననే కోపగించి
చిట్టికాల కేమైనాఁ జేయు మనరాదా

చ. 1: ఆయము లంటకు మని అంటినో అననో
దాయవలె ననుఁ జూచి తప్పక మోము
వోయమ్మ తా నిదేమే వూరకే సాదించవచ్చి
సేయవలసినవెల్లాఁ జేయు మనరాదా

చ. 2: బింకమాడకుండ నానవెట్టితినో వెట్టనో
అంకగానివలె నన్ను నట్టిదిమాని
యింకా మానడోఁ యమ్మ యేడనైనా దమకించి
అంకె వచ్చినట్టు నన్ను నను మనరాదా

చ. 3: నాటుకొన్నరతివేళ నవ్వితినో నవ్వనొ
పోటుబంటువలె గోర బుజ వేసీని
యేటి కింక నోయమ్మ యిదె శ్రీవేంకటపతి
చాటువగ ననుఁ గూడెఁ జోలు ననరాదా

పె శృ రేకు: 8 3-3 సామంతం సం: 17-438

పల్లవి: మద్దకాసిన్నెకా మనకు నేమి బాఁతి యింక
తిద్దుతీరు లేని మంచి దేవరటవే వీఁడు

చ. 1: గొల్లనందగోపుఁగారికొడుకు నేఁడు మనము చూడ
బొల్లి మోరగద్ద నెక్కి పోవునాఁ డదే
గుల్లసేతఁ బట్టి నుట్టికుదురువంటికత్తి వట్టి
తెల్లనల్లసూపువాఁడు దేవరటవే వీఁడు

చ. 2: పచ్చఁబూస అరతఁ గట్టి పసపువన్నె చీర గట్టి
పచ్చనలము నెత్తిఁ బెట్టి వచ్చువాఁ డదే
పచ్చిపాలు దాగ మరిగి పసుల గాసె నిన్నాళ్లు
దిచ్చరీఁడు వీడు మంచి దేవరటవే వీఁడూ

చ. 3: బిరుదు లెక్కి లక్కిమమ్మఁ బెండ్లి యాడి యేకతాన
వొరిమ శ్రీవేంకటాద్రి నుండువాడఁదే
వరము లెల్ల సారెఁ గన్నవారి కెల్ల నిచ్చి యిచ్చి
తిరముకొనెను బలిమితోడ దేవరటవె వీఁడు

పె శృ రేకు: 8 3-4 కాంబోదిసం: 17-439

పల్లవి: మానినిజోలి మాని నేఁడు వాని
బూని నీ విట్టే భోగించుమీ

చ. 1: వెన్నెలా చూపు వేమారుఁ జల్లుచు
కన్నులా నిన్ను గమ్మర నవ్వీని
సన్నలాఁ దిట్ట సారెకు మొలక
చన్నులా నొత్తి జంకించుమీ

చ. 2: నిండినా ప్రేమ నీమీఁద నెట్టిదో
అండనే కాని యవ్వలఁ బాయఁడు
పండిన వంట పాయపువిభుని
మెండునాఁ గూడి మెప్పించుమీ

చ. 3: చిన్నెకా యిట్టె శ్రీవేంకటేశ్వరుఁ
డున్నకాంతల నొల్లఁడు వీఁడివో
నిన్నె కౌఁగిట నించెను నీలి
వన్నెకానిని వదలకుమీ

పె శృ రేకు: 8 3-5 ముఖారి సం: 17-440

పల్లవి: విఱిగినట్టిబండివారు వెట్టివారు గాక నీ
వెఱఁగి సతము చేసుకొంటి వేమి సేతువే

చ. 1: పొలఁతి నీవు అతనిఁ బిలువఁబోయినట్టిపొద్దు లేడ
నిలువుఁ జెమటతోడి యలపు నీ కిదేడదే
వెలుఁగుచేను మేసినట్టి విధము దోఁచె నీయందు
అలసి సొలసి నిన్ను నింక నాడ నేఁటికే

చ. 2: యింతి నేను విరహమునను యెదురుచూచు టేడ నీవు
వింతపులకగముల విఱ్ఱవీఁగు టేఁటిదే
కంతుసంచకారులోనఁ గల్లఁ దోఁచెనీయందు
మంతనమున నీతోడిమాట లేఁటికే

చ. 3: వనిత శ్రీవేంకటేశ్వరుఁడు దానె నన్నుఁ గూడె
చనవి మనవి నతనిని సన్న లేఁటికే
తనరి వీఁపు గానరాఁగాఁదాగినట్టి చందమాయ
వెనక నాకుఁ బ్రియము చెప్పి వేఁడ నేటికే

పె శ్రు రేకు: 8 3-6 సామంతం సం: 17-441

పల్లవి: నేటనే తెలుసునో నీచందము మాకు
నాటివారు గాన రైరి నవ్వుల నీచందము

చ. 1: సరుగ నావులఁ గాచేచంద మేఁటిచందము నీవు
తిరిగి గోవర్ధన మెత్తిన దేఁటిచందము
సరి రోల గట్టువడ్డచంద మేఁటిచందము అట్టె
తొరలి మద్దులు గూలదొబ్బిన దేచందము

చ. 2: జాతిగొల్లవాఁడవైనచంద మేఁటిచందము ని
న్నీతల బ్రహ్మ నుతియించిన దేటిచందము
జాతకపు పసిబాలచంద మేఁటిచందము అట్టే
బూతకిఁ జంపిన నీపొందు లేటిచందము

చ. 3: తచ్చన గోపికలన్న తగులు నీ చందము
మెచ్చుల శ్రీవేంకటేశ మెఱసె నీ చందము
రచ్చల ద్వారకలోన రాజవైనచందమూ నేఁడు
యిచ్చల దేవుఁడవయిన యెక్కుడు నీ చందమూ

రేకు: 84-1 సం: 17-442

పల్లవి: పోయినాఁ బోనీడమ్మాఁ పోయినా బోసి డమ్మా
పాయక కొంగువట్టీ వీఁడు

చ. 1: యెదురైతే మొక్కేఁ నెవ్వాఁడమ్మా
అదనెఱుఁగఁడు అవునే వీఁడు

చ. 2: మగనాలి నన్నా మావా డమ్మా
నగీ నేడనైనా నాతో వీఁడు

చ. 3: యింతలో శ్రీవేంకటేశుఁడమ్మా
యెంత సేసి కూడె నేమే వీఁడు

పె శృ రేకు: 84-2 ఆహిరి సం: 17-443

పల్లవి: ధారుణీపతికినిఁ దలఁబాలో, బహు
దారారతునకుఁ దలఁబాలో

చ. 1: హేమవర్ణునకు నిందిరాపతికి
దామోదరునకుఁ దలఁబాలో
సామజభయరక్షకునకు దులసీ
ధామునకు హరికిఁ దలఁబాలో

చ. 2: కలికిరుకిమిణికిఁ గడుఁ దమకించి
తలదైవమునకుఁ దలఁబాలో
మలసి సత్యభామకు బతిపంకజ
దళనేత్రునకునుఁ దలఁబాలో

చ. 3: తిరువేంకటమున దినపెండ్లిగల
తరుణులపతికినిఁ దలఁబాలో
యిరవుగ బాయక యిందిర నురమున
ధరియించుహరికిఁ దలఁబాలో

పె శృ రేకు: 94-3 పాడి సం: 17-444

పల్లవి: కొమ్మల జవ్వనములు కోరువట్టేవా
కమ్మర మా కోరికెలు గాదె బోసినా

చ. 1: నామనసు అడుగ నేల నమ్మించ నీ కేల
కోమలపు మాగుణాలు కొలవట్టేవా
యేవి మాకుచగిరు లెంత లెంత లాయ నేమి
లేమల చక్కఁదనాలు లెక్క వ్రాసేనా

చ. 2: యెక్కువ మా కనుఁగవ లెంత ఘన మాయ నేమి
కక్కసించి యిందులో సుంకము గొనేవా
చక్కని మాగోళ్ళివి సరి గానీ బేసి గానీ
పక్కన వినియు నాతో పందె మాడేవా

చ. 3: మంతనాలు నెరుపేవు మరురాజ్యపదవికి
యింతటికీ నన్నుఁ బట్ట మేలించేవా
చెంతలఁ గడితి విదె శ్రీవేంకటేశ నీవు
సంతనాన గోరి లచ్చన వెట్టేవా

పె శృ రేకు: 84-5 దేసాళం సం: 17-445

పల్లవి: దేవుఁడట యీతఁడు దేవులట మహలక్ష్మి
దేవుని దేవిని నగి తెగడరో హరిని

చ. 1: రోలఁ గట్టువడె నని రోకలి చేఁ బట్టె నని
రోలా రోఁకటఁ బాడరోఁ హరిని
కాల బండి దన్నె నని కైకొనె మానము లని
కాలనే మానమున కాడఁ గదరో హరికి

చ. 2: సుద్దులే దొంగరికాలు మద్దులు విఱిచినాఁడు
సుద్దులు మద్దులుఁ జెప్పి చూపరో హరిని
చద్దులు చిక్కానఁ గట్టే చాలఁ జిచ్చువేఁడి మింగె
చద్దికి వేఁడికి మీరు సతులెల్ల నగరో

చ. 3: చేతనే చీరలు దీసె వాతఁ బిల్లఁ గోలు వూదె
చేత వాత బ్రియములు చెప్పరో హరికి
యేతుల శ్రీవేంకటాద్రికృష్ణుడు మనలఁ గూడె
యీతల నాతలఁ బంత మియ్యరో హరికి

పె శృ రేకు: 84-6 ముఖారి సం: 17-446

పల్లవి: ఎంత వొద్దు లేదు నీకు నేమి సేయరాదు నన్ను
మంతనమ్మైనదాఁకా మన్నించరాదా

చ. 1: నగి నగి యలపయ్యీ నవ్వుల నీ మాటలకు
మగటిమిఁ గొంతవడి మానరా యింక
చిగురించఁ జెనకఁగ సిగ్గయ్యీఁ గడుంగడు
వెగటు మానినదాఁకా విడువరాదా

చ. 2: చూచి చూచి సొడగిలి సొంపుల నీ చేఁతలెల్ల
తాచి తెరమాఁటుకైనా దలఁగరాదా
వాచవిమాటలాడఁగ వాడె నిదె నా మోవి
చేచేత దగ్గరుదాఁకా సెలవియ్యరాదా

చ. 3: కూడి కూడి నిద్ర వచ్చీఁ గూరిమి నీ రతులను
వూడనికౌఁగిట గొంత వుండఁగరాదా
జాడతో శ్రీవేంకటేశ సరుఁస బెండ్లాడితివి
యీడుజోడాడినదా కా నియ్యకొనరాదా

పె శృ రేకు: 84-7 రామక్రియ సం: 17-447

పల్లవి: ఏల మాను నిద్దరికి నిటువంటి పొందులు
వేళాయఁ జెలికడకు విచ్చేయవయ్యా

చ. 1: చెలికన్నుల నంటెను సింగారపు నీరూపు
నిలిచెఁ బాదములందు నీపై తమి
వలపు శిరసు కెక్కె వనితకు నీకుఁగానే
కలిగె నెన్నడుమను కందువ నీగుణము

చ. 2: యింతిమదిలోఁ బెరిగీ నిదె నీపై కోరికెలు
పంతము చన్నుఁగొండలపై నాటెను
వంతుకు నీవుంగరము వనితవేల నున్నది
వింతాయ నీ విలువిద్య వెలఁదిబొమ్మలను

చ. 3: మగువ నీబుద్ధు లెల్లా మనసాయ రతివేళ
తగె నీ ప్రేమ కలికితనమునను
నగుతా శ్రీవేంకటేశ నాతి గలసితి విట్టె
పగటు లిద్దరికిని పాయమున నిలిచె

పె శృ రేకు: 84-8 సామంతం సం: 17-448

పల్లవి: వావి లేనిదానవా వాసిదాన నింతే కాక
నీవు నేను నెటిఁగిన నిజ మింతే కాకా

చ. 1: మాటిమాటికి నవ్వేవు మఱఁదలనా నేను
వాటపుఁ జుట్టరికపు వనిత నింతే
నాటించేవు కనుచూపు నాలితోడిదననా
యీటు నీపొరుగువార మింతే కాకా

చ. 2: సారె సారెఁ బిలిచేవు సరి నీమేనదాననా
వూరకె ముంగిట నుండే వువిదఁ గాక
గోరికొన దాఁకించేవు కోరి నీ యాఁకదాననా
గారవానఁ బేరటపుకాంత నింతే కాకా

చ. 3: పచ్చిగాఁ గౌఁగిలించేవు పట్టపుదేవులనా
తచ్చనకు మెలఁగేటితరుణిఁ గాక
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్ను నేలితివి
రచ్చకెక్కేదాననా నీ రతిదానఁ గాకా

పె శృ రేకు: 85-1 రామక్రియ సం: 17-449

పల్లవి: పతిని సొలయ నోప బడల నోప
కతుకుఁ గాళ్ళేడఁ జెప్పి కలుచపెట్టకురే

చ. 1: చెలువుఁడు దా నాడఁ జేసినచేఁతకు దోడు
పలుకనేఁ గమ్మరానుఁ బయికొనరా
కొలచీ నంటే కొలవఁ గొనకెక్కె లెక్క లెల్లా
వలపు నాపాలఁ బడె వాటము సేయకురే

చ. 2: నన్నుఁ జూచి రమణుఁడు నవ్వీ నంతే చాలు
మన్నించి నేనూ నవ్వ మారుకు మారా
వెన్న నున్నఁగా నూరఁగ వెట్టి దెలిసె నింతట
వెన్నెల గాదెఁబోసెనా వేట సేయకురే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి కూడె నదె నేఁడు
వేవేలు నంటి నేను వింతదాననా
పూవఁ బూవఁ గోరికలు పూప లాయఁ బిందెలాయ
వావిదేర మందు గద్దా వాకున నాడకురే

పె శృ రేకు: 85-2 పాడి సం: 17-450

పల్లవి: కానీలేవే అందుకేమి కనుకొనే నన్నియును
సానఁబట్టేచూపు లేలే సలిపీ నిద్దరికి

చ. 1: ఆడినవి గొన్నియు నాడనివి గొన్నియు
కూడనిచోటికి నన్నీఁ గొరకొరలే
యీడుగాని జగడాన కింత యేమి అంత యేమి
తోడ నాకు నీకు గుఱి దొరయైనవిభుఁడే

చ. 2: చేసినది గొంత చేయనిది గొంతచేఁత
యీసుగలచోటికి నింతా యెరవెరవే
వాసిగల వనితకు వద్ద నున్న లేకున్న
ఆస వొక్కటే గుఱి యంకెల నిద్దరికి

చ. 3: కౌఁగిటికరఁగులును కందువచెరఁగులును
మాఁగ వలచినవారిమచ్చిక లవి
దాఁగక యిద్దరిఁ గూడె తగు శ్రీవేంకటపతి
చేగదేరె పంతము చెంగట నిద్దరికి

పె శృ రేకు: 85-3 నాదరామక్రియ సం: 17-451

పల్లవి: ఏల నన్ను వేఁడుకొనే వేమందు నే నిందుకు
గాలినిట్టూర్పుల మోత కానరాదా నీకు

చ. 1: మనసు దిప్పుక నీతో మాటలాడేఁ గాని నా
తనువుపై కాఁకలైతే తలఁచరాదు
చనవు సేసుక నీతో సరసమాడేఁ గాని
కనుఁగొని లోనికెంపు కానరాదా నీకు

చ. 2: నటన సేసుక నీతో నవ్వు నవ్వేఁగాని నేను
సటల నీ మాటలివి చవిగావు
తటుకునఁ బిలువఁగ దగ్గరి వచ్చితిఁ గాని
కటకటా నాగుణము గానరాదా నీకు

చ. 3: కడు బలిమిసేయఁగాఁ గౌఁగిలించేఁ గాని నిన్ను
వడిసేచెమటలు వశము గావు
యెడలేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కడలేని నా రతులు గానరాదా నీకు

రేకు: 85-4 పాడి సం: 17-452

పల్లవి: తొయ్యలిఁ జూచినంతనే దోసము గాదు
వొయ్యన యిన్నియుఁ దన్ను వొప్పునఁ గొను మనవే

చ. 1: చెలియ చిత్తములోన జింతాలతలు వెంచె
కలువలు కన్నీళ్ళఁ గడుఁ బెంచెను
వెలలేని కాఁకలను వేగి మాఁకులు వేంచె
చల మేల పతి నింతి జక్క జూడుమనవే

చ. 2: కందువ చెక్కిటిచేత కడు దామెరలు వెంచె
గందపుమాకులు వూర్పుగాలిచేఁ బెంచె
చిందేటిసిగ్గుల మంచి సేమంతిపొదలు వెంచె
విందువలెఁ బతి నిందు విచ్చేయు మనవే

చ. 3: అంగన తన్నుఁ బాడి అశోకవనము వెంచె
ముంగిటిముద్దుల మంచి మోపులు వెంచె
యింగితాన శ్రీవేంకటేశుఁ డిటు విచ్చేసి
అంగనఁ గూడెను యిదె అలవాటు సేయరే

పె శృ రేకు: 85-5 శంకరాభరణం సం: 17-453

పల్లవి: ఇందుకే వెరగయ్యీ నిట్టి నీమాయలు చూచి
విందుల నీ సుద్దులెల్లా వేడుకాయను

చ. 1: కన్నుల నిన్నుఁ జూడక కా కరేగినట్టమేను
సన్న నీవు సేసితేనే చల్లనాయరా
వెన్నెల వేడికి గాక విసిగేటినామనసు
చిన్ననవ్వుల కట్టే చెలరేఁగెరా

చ. 2: ఊరకేచల్లగాలికి ఉస్సురనే నిట్టూర్పు
ఆరసి నీతావిచే పయ్యరవారెను
జోరున మేఘము చూచి జొబ్బిలేటిచెమటలు
తారి నీకరుణ నిట దప్పిదేరెను

చ. 3: గుట్టున కోవెలకూఁతకును జల్లురనే గుండె
ముట్టి నిన్నుఁ గౌఁగిలించి మోహించేరా
యిట్టే శ్రీవేంకటేశ యింత సేసి కూడితివి
అట్టు పడ్డ నావయ సాలుడి కెక్కెను

రేకు: 85-6 నాదరామక్రియ సం: 17-454

పల్లవి: ఆపాటి కాపాటి అంతేపో విభుఁడ
చేపట్టి కొరఁగఁ జెల్లునా మాకు

చ. 1: వలచినకొలఁ దింతే వనితలచనవు
చలము సాధించఁబోతే చవిపుట్టీనా
పిలిచినకొలఁదినే బెరసి నేఁ బలికితి
చెలఁగి యింత కెక్కుడు చెల్లునా మాకు

చ. 2: నవిచినకొలఁ దింతే నగవూఁ దగవూ
పెనఁగి పైపడఁబోతే బ్రియ మయ్యీనా
మనసిచ్చినకొలఁదే మాటలు నే నాడితి
చెనకఁగ దొరతోడఁ జెల్లునా మాకు

చ. 3: దగ్గరి కూడినయంతే తమకపుకౌఁగిలి
వెగ్గళము సేయఁబోతే వేసట గాదా
నిగ్గుల శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడఁగాను
సిగ్గుదీరెఁ గాక యింత చెల్లునా మాకు

పె శృ రేకు: 86-1 శంకరాభరణం సం: 17-455

పల్లవి: ఏలకో తలఁ పెక్కడ నుందో
నాలినే పోయ నడుమ మాటా యేలకో

చ. 1: మొక్కులే మొక్కీ మొన్నటనుంటి
యిక్కడికి రాఁడు యిది యేమే తాను యాలకో
యెక్కె నా చల మిందయినఁ గొంత
పక్కన నే నవ్వఁ బాడిగాదూ యాలకో

చ. 2: చెప్పరే మాట చెలులు మీరు
చిప్పిలిఁ దమ్మిచిత్తములోనా యాలకో
తప్పినో నాతోఁ దా నన్న బాసా
తిప్పరాదు కడుఁదీపాయ వలపూ

చ. 3: దగ్గరి వచ్చెఁ దా నింతలోనా
సిగ్గులు వీడె సెలవినవ్వి యాలకో
వెగ్గళించి శ్రీవేంకటవిభుఁడు
నిగ్గుదేరఁ గూడ నిట్టూర్పు నించీ యాలకో

పె శృ రేకు: 86-2 వరాళి సం: 17-456

పల్లవి: నిన్నుఁ బాసియు నీపతి నీవొద్ద నున్నాఁడ నంటా
పన్ని నీరూపు దలఁచి భావరతి సేయును

చ. 1: పట్టెమంచముకోటిగుబ్బలు చన్నులంటా
పట్టి పట్టి చూచి మోమప్పళించుకొను
అట్టె చిన్నిమలగు అదియే నీ మేనంటా
బెట్టి కౌఁగిళించుకొని బిగియించు సారెకు

చ. 2: మడిచి యిచ్చిన యాకు మగువ నీమోవి యంటా
పడఁతిచే నందుక చప్పరించును
ముడిచినమేలుకట్టు మొల్లలదండలు నీ
కడకంటి చూపులంటా ఘూతంబై పైఁ జూచును

చ. 3: కప్పినదుప్పటికొంగు కాంత నీ పయ్యద యంటా
తప్పి తారి బలిమిని తన్నుఁ దానే తీసును
చెప్పరానిమోహముతో శ్రీవేంకటేశుఁడు గూడె
యిప్పుడిట్టె నీవు రాగా యిదె నిజమాయను

పె శృ రేకు: 86-3 ఆహిరి సం: 17-457

పల్లవి: తగులువిరి మోహలదాయగాఁడా
చిగురుఁజెక్కిటిమీఁది చే యాల నీకును

చ. 1: చూచితిమో చూడనో సొలసి ని న్నొకమాటు
యేచి నన్నుఁ గొంగువట్టే విదేరా నీవు
ఆచాయ నీపేరిటి దంటినో అననో
వాచవిమాటలకే వలచేవు నాకును

చ. 2: సెలవివెన్నెలనవ్వు చిందితినో చిందనో
పలుమారు సరసాలే పచరించేవు
నిలిచితినో నిలువనో నీ యెదుట నిటువచ్చి
కలవి లేనివి గొన్ని కాఁకలు చల్లేవు

చ. 3: మూవంకల దొరవంటా మొక్కితినో మొక్కనో నీ
దేవులవు గమ్మంటా దీవించేవు
ఆవేళ శ్రీవేంకటేశ అలమేలుమంగ నంటే
వావిగూడె నని నన్ను వన్నెగాఁ గూడితివి

పె శృ రేకు: 86-4 పాడి సం: 17-458

పల్లవి: సేసిరా నేను నీవు చెప్పిన ట్టెల్లా
ఆల నా విరహగ్ని ఆరనీరా యించుకా

చ. 1: యిట్టే నీమాటలకు యెదురాడేదాననా
పట్టి నన్ను దియ్యకురా బలిమిఁ నీవు
గుట్టున నే వచ్చినది కూడేకొరకే కాదా
తెట్టెవై కలఁగె మతి తేరనీరా యించుకా

చ. 2: కాదురా నీ వంటఁగానేఁ గాదనేటిదాననా
సోదించకు నా పయ్యద జూటరి నీవు
ఆదిగొని నే వలచు టందుకొరకు కాదా
పాదుకొన్న నా కోపము పాయనీరా యించుకా

చ. 3: వొక్కటై నన్నుఁ గూడఁగ నోల్ల ననేదాననా
కిక్కిరిసె గుబ్బలు బిగించకు నీవు
గక్కున శ్రీవేంకటుశ కౌఁగిటఁ గలసితివి
అక్కున నా చెమటలు ఆరనీరా యించుకా

రేకు: 86-5 భైరవి సం: 17-459

పల్లవి: చాలుఁ జాలు నున్నదెల్లాఁ జాలదా యిది
జాలెల్లా నిందునే పాసెఁ జాలదా యిది

చ. 1: పరగ నే నవ్వితేఁ గోపగించుకొనకా యిట్టే
సరిగా నీవు నవ్వితి చాలదా యిది
ధరనేఁ గొంగువట్టితేఁ దప్పించుకొనకా
సరవి నూరకుండితి చాలదా యిది

చ. 2: కన్నులనేఁ బిలిచితే కమ్మర జంకించకా
సన్నలకే వచ్చితివి చాలదా యిది
నిన్నుఁ దప్పక చూచితే నిలిచి వాదుకు రాక
జన్నెవలపు చల్లితి చాలదా యిది

చ. 3: తమితో నిన్నుఁ గూడఁగ దప్పులఁ బొరలకా
సమరతిఁ జొక్కితివి చాలదా యిది
అమరె శ్రీవేంకటేశ యనుమాన మెంచకా
జమళిఁ గూచుంటి విట్టె చాలదా యిది

పె శృ రేకు: 86-6 శ్రీరాగం సం: 17-460

పల్లవి: కానరాదా నీకు నాకుఁ గలమోహము
దాని కేమి నాతోనే దాఁచకురా మోహము

చ. 1: చూచినచూపు మగుడఁ జూచినదే మోహము
యేచి వచ్చినందువచ్చు టిది మోహమూ
లాచి లాచి ముంగిట మెలఁగినదే మోహమూ
కాచుకుండి వేళవేళఁ గదియుటే మోహము

చ. 2: పలికి కమ్మర నట్టే పలుకుటే మోహము
తలఁచి మదియు నదే తలఁపవుట మోహము
పలుమారు పెలవురఁ బారనవ్వుటే మోహము
నిలువునఁ బులకించి నీలుగుటే మోహము

చ. 3: నిట్టూర్పుతో వెరగు నిండుకొంట మోహము
తెట్టలైన సిగ్గులెల్లాఁ దీరుటే మోహము
యిట్టె శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
మట్టు లేక చూపఁ జెప్పమనదేపో మోహము

పె శృ రేకు: 87-1 వరాళి సం: 17-461

పల్లవి: ఎక్కడ నున్నదో యెప్పుడు వచ్చినో చెలి
దక్కి నాలోఁ జేరి తలపోఁ తాయా

చ. 1: పడఁతి విలిచె నని పలుకఁబోతే నవి
గొడవల కోవిలకూఁతాయా
నడపులు పతివని నంటునఁ గదిసిన
నిడివిని యది యొకనెమలాయ

చ. 2: తరుణిచూపు లని తప్పక చూచిన
నిరతపు మెఱుఁగులనిధి యాయ
సరిఁ జెలిమేనను సరసిలోఁ దొడిరిన
పొరి నది తామెరపువ్వాయా

చ. 3: కలఁగి వెరగుతో కాఁకలఁ బొందిన
అలమేల్మంగే అరత నిదే
యెలమిని శ్రీవేంకటేశుఁడ నే నిదె
వొలసి కూడితి నిదెవో దరిలోనా

పె శృ రేకు: 87-2 ముఖారి సం: 17-462

పల్లవి: సగము గర్వము నీకు సగము ప్రియము నాకు
యెగసక్కెములు సేసే వేలే యిది

చ. 1: చెక్కునఁబెట్టినచేయి చేచేత నుండఁగాను
వొక్కచేతనే మొక్కేవు వొద్దే యిది
ముక్కునమోపినవేలు ముందరనే వుండఁగాను
గక్కున నవ్వు నవ్వేవు కాదే యిది

చ. 2: కన్నులఁ దొట్టిననిద్ర కన్నులనే వుండఁగాను
సన్నసేసి పిలిచేవు చాలునే యిది
చన్నులజారుఁబయ్యెద జారినట్టే వుండఁగాను
చిన్ని తిట్లు దిట్టేవు చెల్లునే యిది

చ. 3: పానుపుమీఁదటిమేను పానుపుపై నుండఁగాను
ఆని నన్నుఁ గౌఁగిలించే వౌనే యిది
పైనే శ్రీవేంకటాదిపతినేఁ గూడితి నిన్ను
కాని కాని మనసుకంటెనే యిది

పె శృ రేకు: 87-3 ముఖారి సం: 17-463

పల్లవి: తనియ దెంతైనానుఁ దమకమే పెంచును
వనితకు నేయివంటివలపో యితనిపై

చ. 1: కౌఁగిలించువిభునికిఁగప్పురవీడెమిచ్చు
మాఁగినమోవియానుమాటలాడును
ఱాఁగి రేఁగి గోర నూఁదు రతికిఁ బిలుచు విఱ్ఱి
వీఁగుచుఁ బైనొరగు వెలఁది యాతనిపై

చ. 2: కన్నులఁ దప్పక చూచుఁ గందువ తిట్లు దిట్టు
కిన్నెరగుబ్బల నూఁదు గిలిగించును
చిన్నిచేయి మీఁద వేసు చెక్కు గదియించు
పన్ని నిమ్మపంట వేసుఁ బకపక నగును

చ. 3: కదియుచు కొప్పు దువ్వు కమ్మటి సరసమాడు
తుదచేఁ తడుగు నదే దొమ్మి సేసును
యెదుట శ్రీవేంకటేశు నిటువలెఁ గూడె నింతి
మదిలో కోరికె యెంతో మగువే యెఱుఁగును

పె శృ రేకు: 87-4 ముఖారి సం: 17-464

పల్లవి: రంటికి నొక్కటి యయా రాఁపుల యీభావాలు
పెంటలై యిదె నన్ను పెర రేఁచీ నేలే

చ. 1: అతనికౌఁగిటిలోన నందేటి పెంజెమటలు
పతిఁ బాసివుండఁగాను పైకొనీ నేలే
రతివేళ నలయించి రాఁగేటి నిట్టూర్పులు
అతివిరహపువేళ నవి నిండీ నేలే

చ. 2: జంటయై విభునిఁ బొంది జారేటి నా తురు మిది
వొంటినే చెదరె నెరు లూరకే యేలే
అంటి ముట్టి పరవశమంటేటి నివ్వెఱగులు
యింటిలోఁ జింతించే నన్ను నింత ముంచ నేలే

చ. 3: నగుతా సరసవేళ నవ్వేటి మోవినవ్వుల
తగఁ జింతించేవేళ తా రా నేలే
అగపడి శ్రీవేంకటాదిపుఁ డప్పుడే కూడె
చిగురు దేనెమోవికి చేఁగదేర నేలే

పె శృ రేకు: 87-5 ఆహిరి సం: 17-465

పల్లవి: అక్కడివారినే నీవు అటు చెందుకోరాదా
మక్కవతో నీ వేల మాకు మొక్కేవయ్యా

చ. 1: రానిచేత లివి చూచి కన్నులెత్తిఁ గారాదా
తేనెమోవి యెంగిలయితేఁ దిట్టుకోరాదా
ఆనిన మచ్చా లుండఁగ నటుమోము గారాదా
మానవుగా నీ వేల వకు మొక్కేవయ్యా

చ. 2: మొగి వింతవాసనకు ముక్కు మూసుకోరాదా
నొగరుమాటలు వింటె నొడ్డుకో రాదా
అగడయి బాస దప్పితే నటు లేచి పోరాదా
మగిడి మగిడి యాల మారు మొక్కేవయ్యా

చ. 3: తారుకాణ లయితేను తల వంచుకోరాదా
మేర దప్పినపనికి మెచ్చరాదా
యేరా శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
నారుకొని యిఁక నేల నాకు మొక్కేవయ్యా

పె శృ రేకు: 87-6 కాంబోది సం: 17-466

పల్లవి: ఏమన్న వాదుకు వచ్చే వెంత గర్వము
ఆముకొని మలసేవు అది యేరా నీవు

చ. 1: పొరచి నీవెందుకైనాఁ బోతేఁ బోదువు గాక
యేరా కాలు దొక్కేవు యెంత గర్వము
పేరుకొని తిట్టితే నాపెదవులు గదలితే
ఆరసి తప్పక చూచే వది యేరా నీవు

చ. 2: చిట్టకపుచేఁత లెల్లాఁ జేసితేఁ జేతువు గాక
యిట్టే నాపై విరిగేవు యెంత గర్వము
పట్టి నిన్నుఁ దోసితి నాపైఁ బడఁగఁ జే యెత్తితి
అట్టే వొత్తుక వచ్చే వది యేరా నీవూ

చ. 3: బలిమిఁ గౌఁగిట నన్నుఁ బట్టితేఁ బట్టుదువుగాక
యెలమి సెలవి నవ్వేఁ వెంత గర్వము
నిలిచి శ్రీవేంకటేశ నిన్ను నిటు గూడితి నేను
ఆలిసితేఁ బంతమాడే వది యేరా నీవూ

పె శృ రేకు: 88-1 భైరవి సం: 17-467

పల్లవి: ఇంత చాలదా నీకు యిసుకమీఁదు లేలరా
చింతతోడ నుండఁగాను చిముడఁజేయ నేలరా

చ. 1: కొసరి కొసరి నిన్నుఁ జూచి కోపగించఁ జాలకా
విసువుతోడ గొణఁగి పెదవి విఱుచుకొనఁగఁ జాలదా
పసలురేఁచి నీదుమేను పచ్చిసేయఁ జాలకా
ముసుగు వెట్టుకున్నదాన ముందు చెనక రాకురా

చ. 2: నాలిసేసి గేలిసేసి నవ్వ నిన్నుఁ జాలకా
వేళ వేళ నిన్నుఁ గినిసి వేసరించఁ జాలకా
నేల వ్రాత వ్రాసి నిన్ను నిందలాడఁ జాలకా
మూల నుండఁగాను నన్ను ముంగిట వేయ నేలరా

చ. 3: కదిసి మొక్కి నీదు మోవి గంటిసేయఁ జాలకా
మోదకి నిన్నుఁ జెలులయెదుట వెంగెమాడఁ జాలకా
అదన శ్రీవేంకటేశ ఆయ మంటి నిన్నుఁ గూడి
యెదుట నున్నదాన నన్ను యెమ్మె చూప నేలరా

పె శృ రేకు: 88-2 సాళంగం సం: 17-468

పల్లవి: చెప్పనీవే తనసుద్ది చెలులతో నెల్లాను
చప్పనౌతాఁ దియ్యనౌతా చవిగొనే నిదివో

చ. 1: రానీవే అందుకేమి రమణుఁ డిందాఁకా
నేనేకా దీకొని నిలిచేదానా
కానీవే పువ్వువలెఁ గప్పురము నుండదా
తేనెవుతా నూనెవుతాఁ దేటపడీ నపుడే

చ. 2: నవ్వ నీవే తా నన్ను నయమైనరీతి నెల్లా
అవ్వల నేనేకా గుఱియ్యేదానా
తవ్వనీనే యంతైనా తగ నిసుకపాఁతర
పువ్వులయి పిందెలయ్యీ పొద్దుగూఁకేకొందికి

చ. 3: చల్లనీవే కూరిములు సారె సారె నామీఁద
మొల్లమి నేనేకా మోహపుదానా
కొల్ల శ్రీవేంకటపతి కూడె నాకౌఁగిటిలోన
అల్లమవుతా బెల్లమవుతా అడిగేఁబో యిఁకనూ

పె శృ రేకు: 88-3 బౌళి సం: 17-469

పల్లవి: ఎంచి చూడవైతిగాక యింతి నీ కిన్నియుఁ గాదా
మంచిదాయ యిఁకనైనా మఱవకువయ్యా

చ. 1: పొంగేటి జలధి దచ్చి పుట్టించితి వమృతము
అంగనమోవినే కాదా అమృతము
చెంగి పోయి వైకుంఠాన శేషునిపై బండితివి
చెంగఁట నీచెలి యారు శేషుఁడే కాఁడా

చ. 2: ఆకాసాన నొకడుగు అడిగితివి బలిని
ఆకసము చెలినడుమందునే కాదా
మేకొని వేదాలకుఁగా మీనవై పాడమితివి
కైకొని సతికన్నులే గండుమీలు గావా

చ. 3: కోరి శ్రీవేంకటమనేకొండ యెక్కితివి నీవు
కూరిమి చెలికుచాలు కొండలే కావా
చేరి సర్వజీవులచిత్తములో నిలిచితి
తేరి యాకె నీ వురానఁ దిరమాయఁ గాదా

రేకు: 88-4 సాళంగనాట సం: 17-470

పల్లవి: మాయమానుషమహిమ యిది
యేయెడ నీతఁడె యీశ్వరుఁడు

చ. 1: మొదల యశోదకు ముద్దులబాలుఁడు
అదె మునులకుఁ బరమాత్ముఁడు
మది గోపికలకు మన్మథమన్మథుఁ
డెదుటనె తిరిగీ నీశ్వరుఁడు

చ. 2: గోపబాలులకు గొల్లఁడు నాఁడే
చేపట్టెను లక్ష్మికి మగఁడు
కోపపుటసురలకు మృత్యు వీతఁడు
యేపున మెఱసీ నీశ్వరుఁడు

చ. 3: పాండవులకుఁ దా బావయు మఱఁదియు
వొండొకవసుదేవునికొడుకు
అండనె శ్రీవేంకటాద్రికిఁ గృష్ణుఁడు
యిందుల ముంగిళ్ళ నీశ్వరుఁడు

పె శృ రేకు: 88-5 దేసాళం సం: 17-471

పల్లవి: మంచివానివలెనే మాటలాడీనే
యించుకంతా నెఱుఁగడు యేడవాఁడే తాను

చ. 1: తీపులపెదవి వంచి తిట్టినా మానఁ డే నేఁ
గోపగించుకొనఁగానే కొల్లున నవ్వీనే
రాపుగా నాసలువెట్టి రాకుమన్నా మానఁడే
వోపనని రాఁగా నావొద్దికి వచ్చీనే

చ. 2: గొణఁగి గొణఁగి లోలో గుంపించినా మానఁడే
అణఁగి నిద్దిరించఁగా నాయ మంటీనే
వొణకెవేసుక నే నూరకున్నా మానఁడే
సణఁగులాడఁగ వేరే సాకిరివెట్టీనే

చ. 3: వెఱతు మనుచు మొక్కి వేసరినా మానఁడే
కఱకులాడేవేళ కౌఁగిలించీనే
వుఱక శ్రీవేంకటాద్రినుండి వచ్చి నన్నుఁ గూడె
మొఱఁగి వావిలిపాటి ముద్దురామచంద్రుఁడే

పె శృ రేకు: 88-6 శంకరాభరణం సం: 17-472

పల్లవి: నీవు చల్లఁగా బదుకు నీ కేల యీ గొడవ
నీవలపులకు నెల్లా నేనే గుఱి

చ. 1: చెక్కు నొక్కకురా నా చెమట నీచేత నంటీ
గక్కన నీకుఁగానైన కరఁగు లివి
యెక్కువ నాతాపము నీవేల కట్టుకొనేవు నే
బుక్కట నాలో నెట్టయినాఁ బొరలేఁ గానీ

చ. 2: కౌఁగిలించకురా నాకాఁకల నీమేను వాడీ
తీఁగెల నీవల్లనైన తేజము లివి
నీఁగని నా మరు లిదె నీవు చుట్టుకొన నేల
ఆఁగి నేనే పొట్టువొరు లియ్యేఁ గాని

చ. 3: నామోవి యడుగకురా నానలేదు కడు నెండే
వేమరు నీవల్లనైన వెట్టలవి
ఆముకొని శ్రీవేంకటాధిప కూడితి వింక
సోమరినై నాలోనే చొక్కేఁ గాని

పె శృ రేకు: 89-1 ముఖారి సం: 17-473

పల్లవి: ఎంత తమకపడేవు యింతలో నేమీ
వింతచవి వుట్టించితే వెఱపా యేమీ

చ. 1: కౌఁగిలించి రతి నిన్నుఁగరఁగించి నీమోము
తోఁగి చూచి నవ్వేవు దోసమా యేమి
మాఁగిన నీమోవి యిచ్చి మాటలు ని న్నా డించితే
కాఁగి బూతులఁ దిట్టేవు కాదా యేమీ

చ. 2: మదనయుద్ధపువేళ మనసు చూడవలసి
కదిలితే జంకించేవు కడమా యేమి
అదన నీ బుసకొట్టు అలకించి విన బోతే
యిదివో పరాకయ్యేవు యెఱుఁగవా యేమి

చ. 3: వుండుండి శ్రీవేంకటేశ వుసరిసురతవేళ
నండనే కన్నులు మూసినందుకా యేమి
నిండుదేహపురసాలు నీమీఁదఁ జిందితేను
దండిగా సిగ్గు వడేవు నగవా యేమి

పె శృ రేకు: 89-2 రామక్రియ సం: 17-474

పల్లవి: ఎందు కెందు బోలిచే విది యేటిదే
కందు వొక్క మేతకేరా కడివెఁడుగూటికి

చ. 1: యేకిటి నే నవ్వినను యేల నవ్వేవే అల్ల
నాటి హిరణ్యాక్షుతో నవ్వరా పోయి
మాటాడిననాతోడ మాటాడ వేమే నీ
మాటల సురతులు మరిగిరి చాలదా

చ. 2: యేపున నేఁ జూచినా నీ వేల చూడవే కొలనిలో
చూపట్టు గొల్లెతలనే చూడరా పోయి
తేపల నే మొక్కినా దీవించ వేమే వొరినీ
తీపు శిశుపాలు తిట్లే దీవెనలు గావా

చ. 3: అలమేల్మంగవు నీ వేదుగదే వోరి నీవు
బలిమి శ్రీవేంకటపతివి గావా
కొలఁది మిగుల నన్నుఁ గూడితిగదె నాపై
కులుకుమన్నన లిట్టే కూటములు గావా

పె శృ రేకు: 89-3 ఆహిరి సం: 17-475

పల్లవి: ఇంకా నెందాఁకా మాట లిటువంటివే కాదా
తెంకి నీగుణాలు నేఁడు తేటతెల్లమాయరా

చ. 1: కొప్పున సంపెంగలు కోరి నీకు ముడిచితి
యిప్పుడే సేవంతు లున్నవి వేడవిరా
నెప్పున విత్తులలోన నిండెమల్లె లన్నట్లా
చెప్పఁ గొత్తలాయ దానిచేఁతలు నా కిదివో

చ. 2: నిరతిలో పదకము నీ మెడఁ బెట్టితి నింతే
అరిధిఁ గంటమాలున్న దదేడదిరా
ధర విత్తొకటి వెట్టఁ దా జెట్టొక టైనట్టు
యిరవైన నీచేఁత లిందే కంటిమిరా

చ. 3: చెలరేఁగి కస్తూరి చెక్కిటఁ బూసితి నింతే
యెలమిఁ దట్టుపుణుఁగు యేల వచ్చెరా
కలసి కల్ల నిజము గాడిఁగట్టినట్లాయ
నెలవై శ్రీవేంకటేశ నిను నేఁ గూడితిరా

పె శృ రేకు: 89-4 వరాళి సం: 17-476

పల్లవి: ఎక్కడ నెఱుఁగమమ్మ యిటువంటి మోహము
అక్కరతో దూతి కేల నాదరించీ నిపుడు

చ. 1: సురటి విసరుకొంటా జొబ్బిలుఁజెమటతోడ
అరుదుగ పతిసుద్దు లడిగీఁ జెలి
తరమిడి మాటలు తనలోఁ దలఁచుకొంటా
వొరసి తానే సారెకు నూఁకొనీ నదివో

చ. 2: కప్పురమువేసుకొంటా కాఁకలతో వడదేరి
అప్పటి విభునిరాక లడిగి
తప్పక చూచుకొంటా తలవాకిటిదిక్కు
చెప్పి పంపీ నాతనికి చెప్పరానిమాటలు

చ. 3: కొంచ కట్టే నిమ్మపండు గోరికొన నూఁదుకొంటా
అంచెలఁ దా వత్తునంటా నడిగీని
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
మంచము దిగనియ్యక మరిగించే నితని

పె శృ రేకు: 89-5 శంకరాభరణం సం: 17-477

పల్లవి: నెఱజాణతనమైతే నీవలె నుండవలదా
అటిముటి గొప్పు దువ్వే వట్టుండవలదా

చ. 1: సిగ్గువడియున్నచెలిఁ జేయివట్టి తీసుకొని
వొగ్గి తొడపై నిడుక వొడఁబరచి
నిగ్గుల చెలియమోము నీ విట్టే తప్పక చూచి
అగ్గలమై బుజ్జగించే వట్టుండవలదా

చ. 2: తలవంచుక మాటాడేతరుణివదన మెత్తి
చలివాపి వీడె మిచ్చి సరసమాడీ
మొలకనవ్వులు నవ్వి మోవి యిచ్చి గుబ్బలపై
అలరు సరులు దిద్దే వట్టుండవలదా

చ. 3: పాదానఁ దలుపు మీఁటి భావించుకొనె చెలి
పాదుకొనఁ గౌఁగిలించి పచ్చిసేసి
సేదదేర మన్నించి శ్రీవేంకటేశ కూడి
ఆదరించి చెక్కు నొక్కే వట్టుండవలదా

పె శృ రేకు: 89-6 ముఖారి సం: 17-478

పల్లవి: ఏమని చెప్పుదమే యిద్దరిభావములును
ప్రేమము లీరూపములై పెనఁగఁజొచ్చినవి

చ. 1: కోపగించుకొని రాఁగా కొంగువట్టి రమణుఁడు
వోప నంటే పెనఁగీనే వొయ్యనే చెలి
పై పైఁ గౌఁగిటఁ బెట్టి బలిమిసేయఁగఁ బోఁగా
తీపులపెదవి వంచి తిట్టీ నతనిని

చ. 2: పెదవి గొణఁగుకోంగా ప్రియుఁ డాకెఁ జెక్కు నొక్కి
చెదర నాడుక లోనై చిక్కెఁ జెలి
మొదలఁ గోలుముందుగ మోవి గంటి సేసే నాతఁ
డదివో చురుకుఁ జూపు లాకె చల్లీ మీఁదను

చ. 3: పక్కన నానవెట్టఁగ పానుప్పైఁ బడవేసి
చొక్కుచుఁ గరఁగుతానే సొలసీఁ జెలి
యిక్కువైన శ్రీవేంకటేశుఁడు గూడె నిట్టే
ముక్కుమీఁదివేలితోన మోనమున నున్నది

పె శృ రేకు: 90-1 శంకరాభరణం సం: 17-479

పల్లవి: ఎవ్వరికి వలతువే చెలియా
యివ్వలఁ బిలిచిన నెఱుఁగవే చెలియా

చ. 1: చక్కఁగఁ బయ్యద జాఱిన దెఱుఁగవు
యెక్కడ చూచేవే యిటు చెలియా
చెక్కులవెంటాఁ జెమటలు వడియఁగ
ముక్కున మార్పులు ముంచేవే చెలియా

చ. 2: తోరంబగు నీతురుమును ముడువవు
యీరీతి పరాకు లివె చెలియా
నేరుపుమాటలు నీ విపు డాడవు
తీరక లో వెలిఁ దిరిగేవే చెలియా

చ. 3: వెలయు పాదములు వెనకకు వేసితి
తలఁ పెందున్నదె తగఁ జెలియ
కలసెను శ్రీవేంకటపతి నిను నిటు
కులికి యతనిఁ బేర్కొనవే చెలియా

పె శృ రేకు: 90-2 సామంతం సం: 17-480

పల్లవి: అందే తెలియరాదా అంగన నేరుపు లెల్లా
కందువ తారుకాణలు గలిగె మీ కిపుడు

చ. 1: నిద్దపు నొసలిమీఁద నిలువుఁ గస్తూరిబొట్టు
అద్దము చూచి గోర నటు దిద్దఁగా
వొద్దిక వెనకవంకనుండి నీ నీడగని
ముద్దుచూపి సన్నసేసే మొరఁగు లేలయ్యా

చ. 2: గుబ్బలపై మాణికాలఁ గుచ్చిన హరములు
అబ్బురానఁ దలవంచి యమరించఁగా
నిబ్బరాన నీ వెదుట నిలిచితే నీ నీడ
గబ్బితనమునఁ గని కౌఁగిలించె నదివో

చ. 3: మించుబంగారు వావాలు మెట్టఁగా శ్రీవేంకటేశ
చంచల నీవునుఁ దన సరి నుండఁగా
నించి గోరిమెఱుఁగులో నీరూపు వొడగని
అంచల నిన్నుఁ గలసె నదే మెచ్చరాదా

పె శృ రేకు: 90-3 గౌళ సం: 17-481

పల్లవి: ఈవనితవాఁడవో నీ వావనితవాఁడవో
చేవదేర నొకమాట చెప్పరాదా మాకు

చ. 1: చెక్కు వట్టి కదలించి చిఱునవ్వు నవ్వుతాను
మక్కువ నొక్కతెతోడ మాటలాడఁగా
అక్కడ విభుని నిన్ను నది చూచి వేరొకతె
పక్కనఁ గళలు దాఁకీ భావరతి గరఁగే

చ. 2: తేలగిలఁ జూచి చొక్కుఁడే నెల్లా కెమ్మోవి నిచ్చి
కాలిమీఁదఁ గాలు వేసి కరఁగించఁగా
ఆలకించి వేరొకతె అద్దరిపాటునవచ్చి
మేలుగల మిమ్ముఁ జూచి మేను పులకించెను

చ. 3: చెవిలో నేకాంతవడి సిగ్గుదేరఁ గౌఁగిలించి
పవళిం చొక్కతెతోఁ దెప్పలఁదేలఁగా
యివల శ్రీవేంకటేశ యిద్దరికి నూడిగము
తవిలి సేసి యొకతె తమకించి కూడెను

పె శృ రేకు: 90-4 రామక్రియ సం: 17-482

పల్లవి: ఇంతటి హరికిఁ గాకఁ యేల నీవు పంపు సేతు
వెంత కెంత నీకు నాకె కిద్దరికే తగురా

చ. 1: కొమ్మ నిలువుఁదురుముకురులు వేళ్ళ ముడిచి
సొమ్ములలో నిలుచుండి సొలసి నిన్ను
కమ్మి నిడుదమాటల కడకంటిచూపులతో
పమ్మి సణఁగులు చల్లి పచ్చిసేసీ నౌరా

చ. 2: యింతి నిమ్మపండ్లు చేత నెగరవేసుకొంటా
దొంతరమాటల నేమో దూరీ నిన్ను
రంతుగా నవ్వులు నవ్వి రాజసాన వీఁగుకొంటా
మంతనాన గొణఁగుతా మచ్చుచల్లీ నవురా

చ. 3: పొలఁతి కళలు దేరి పుక్కిటివీడెముతోడ
చెలిచే నా కందుకొంటా చెనకీ నిన్ను
నిలువుఁగస్తూరిబొట్టు నిడుచెమటఁ గరఁగ
కులికి శ్రీవేంకటేశ కూడె నిదె యవురా

పె శృ రేకు: 90-5 శంకరాభరణం సం: 17-483

పల్లవి: పలుమాట లిఁక నేల బతుకనీవే
బలిమికాఁ డాయఁ దాను బతుకనీవే

చ. 1: వొట్టువెట్టుకుండ నన్ను వుద్దండము సేసి కూడె
పట్టినపంతముఁ దాను బతుకనీవే
తిట్టితేను తనుఁ జూచి దీవించ నోపను
పట్టుపుచెలులుఁ దాను బతుకనీవే

చ. 2: కోపము దీరకతొల్లె కుసిగుంపు సేసి కూడె
పాపపణ్యము తనది బతుకనీవే
పోపో మ్మనఁగాలేను పూఁచి నే రమ్మనలేను
పై పూఁతవలపుతో బతుకనీవే

చ. 3: వొల్ల వొల్ల ననఁగానే వొడివట్టి తీసి కూడె
పల్లదముతోఁ దానే బతుక నీవే
యెల్లగా శ్రీవేంకటేశు నిఁక నేమీ ననలేను
పల్లవించఁ జేసి నన్ను బతుకనీవే

పె శృ రేకు:	90-6	ఆహిరి	సం:	17-484

పల్లవి: ఎందుకైనా నిచ్చగించీ నిదె విభుఁడు
అంది ప్రియములు చెప్పీనట్టిరావలపా

చ. 1: తీపులమాటలఁ దిట్టేతెఱవఁ దప్పక చూచి
ఆపలేక మోవి నీ నదే విభుడు
యీపొద్దు దాఁకా రావంటా నింతి గోపగించుకొంటే
పైపైనే కొఁగిలించెను బాపురే వలపా

చ. 2: కలికిగద్దెపై నుండి కడు సుద్దు లడుగఁగ
నిలుచుండే నవ్వు నవ్వీ నేఁడుఁవిభుఁడు
అలుకలే పచరించి యానలు వెట్టుకోఁబోఁగా
మెలుపున నోరు మూసి మేలు మేలు వలపా

చ. 3: అపుడే దయదలఁచి అంగన దగ్గరి రాఁగా
కప్పెఁ బచ్చడము శ్రీవేంకటవిభుఁడు
చెప్పరాని రతిఁ గూడి చెమరించేసతి కీత
డప్పటి విసరఁ జొచ్చె నయ్యా వలపా

పె శృ రేకు: 91-1 శ్రీరాగం సం: 17-485

పల్లవి: ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమునఁ గళలెల్లా మొలచిన ట్లుండె

చ. 1: జగదేకపతిమేనఁ జల్లిన కర్పూరధూళి
జిగిగొని నలువంకఁ జిందఁగాను
మొగిఁ జంద్రముఖి నురమున నిలిపెఁ గనక
పొగరువెన్నెల దీగఁబోసిన ట్లుండె

చ. 2: పొరి మెఱుఁగుఁజెక్కులఁ బూసిన తట్టుపుణుఁగు
కరఁగి యిరుదెసలఁ గారఁగాను
కరిగమనవిభుఁడు గనక మోహమదము
తొరిగి సామజసిరి దొలఁకినట్లుండె

చ. 3: మెఱయ శ్రీవేంకటేశుమేన సింగారముగాను
తఱచయిన సొమ్ములు ధరియించఁగా
మెఱుఁగుఁబోణి యలమేలుమంగయుఁ దాను
మెఱుపుమేఘము గూడి మెఱసిన ట్లుండె

పె శృ రేకు: 91-2 సామంతం సం: 17-486

పల్లవి: ఎట్టు వలసినా వచ్చు నింతులమాట
నెట్టుకొన్నవారివారినేరుపులింతే

చ. 1: కప్పురపుధూళి మేనఁగలయ నలఁదినప్పు
డప్పుడే పో బలభద్రుఁ డని యందురు
కుప్పలైన తట్టుపుణుఁగునఁ దొప్పఁదోఁగీ నంటా
తప్పటి చెలులే క్రిష్ణుఁడని యందురు

చ. 2: నీలవర్ణుఁ డితఁడు పన్నీరు జలకమాడె
యాలో సాలగ్రామరూపు మని యందురు
తాలిమి నిర్వాణాన తడిసూళ్లొత్తువేళ
పోలిచి నీ సతులెల్లా బుద్ధుఁ డందురు

చ. 3: మించిన సొమ్ములతోన మిన్నుముట్టినవేళ
లంచలఁ ద్రివిక్రముఁ డని యుందురు
కొంచక యలమేలుమంగ కోరి మెడఁ గట్టుకొంటే
యెంచి శ్రీవేంకటపతి యితఁ డందురు

పె శృ రేకు: 91-3 శంకరాభరణం సం: 17-487

పల్లవి: ఇవి గొన్ని నగుఁబా ట్లిఁక వలెనా
కవగూడి నీవు నీవే కావా యెపుడు

చ. 1: నించినతట్టుపుణుఁగు నీ వెంత పూసినాను
ముంచినరేపల్లెగొల్లముంజు వొయ్యీనా
పొంచి నీవు మేనఁ గప్పుర మెంత చల్లుకొన్నా
అంచల వెన్నలజిడ్డవి విడిచీనా

చ. 2: కులికి కులికి యెంత కుంకుమ నీ వలఁదిన
యెలమి నలుపే కాక యెఱ్ఱన య్యేవా
చలువఁ బన్నీట నీవు జలక మెంతాడినాను
సొలపుల నీమనసు సుద్ధమయ్యీనా

చ. 3: చొక్కపు శ్రీవేంకటేశ సొమ్ములెన్ని నించుకొన్నా
అక్కున నలమేల్మంగ నవి మించీనా
నిక్కపు నీ వేచేఁత నీలోనే చేసినాను
దిక్కులందుఁ గత లయి తిరుగకుండీనా

పె శృ రేకు: 91-4 సాళంగనాట సం: 17-488

పల్లవి: ఏమని పొగడవచ్చు నిటువంటి చెలువము
కామితార్థముల నిచ్చే కల్ప వృక్ష మితఁడు

చ. 1: పలువేదఘోషములతో బంగారుబిందెల నించి
జలకవర్చే రదె శౌరికి
మెలుపు వనము మీద మేఘము లురుములతో
జలజల వరుషించేచంద మాయ నిదివో

చ. 2: పటికపుగిన్నెలను పచ్చకప్పురము దెచ్చి
ఘటనఁ జాఁతేరు శ్రీకాంతునికి
తటుకనఁ దనభావఁ దగఁ బెక్కుచంద్రులెల్లా
నటన నమృతకిరణాలు నలి నించినట్లు

చ. 3: అందుపైఁ దట్టుపుణుఁ గలఁది యలమేల్మంగ
నిందరు శ్రీవేంకటేశు యెదఁ గట్టిరి
చందమై బ్రహ్మాండము సర్వంపదలతోడ
కందువ మెరసినట్టు కానిపించె నిదివో

పె శృ రేకు: 91-5 సాళంగం సం: 17-489

పల్లవి: ఏమని కొనాడవచ్చు నితనిచక్కఁదనము
మోము చూచినంతలోనే మోహింపించీ నితఁడు

చ. 1: మదనజనకుఁ కిట్టే మజ్జనమాడేటివేళ
కదిసి హస్తలుఁ దానుఁ గారుకమ్ముచు
చదలఁ గడళ్ళుతోడిసముద్రమె రూపై
యెదుట నిలుచున్నట్లు యిదె వున్నాఁ డీఁతడు

చ. 2: హరి కప్పురపుధూళి యలఁదుకొనినవేళ
సిరులు మించఁగను చూచినవారికి
అరిది శరత్కాలమందలితెల్ల నిమేఘ
మిరవై రూపై వున్న ట్టెన్నికాయ నీతఁడు

చ. 3: కావింపఁ బుళుగు వూసి కడునల్లనై సొమ్ముల
యీవల నలమేల్మంగ నెదఁ గట్టుక
కావిరి నింద్రనీలపుగనిరూపై వుండినట్టు
శ్రీవేంకటేశ్వరుఁడు చెలవొందె నీతఁడు

పె శృ రేకు: 91-6 ముఖారి సం: 17-490

పల్లవి: అన్నిసింగారాలకుఁ దా నమరినాఁడు
వన్నెలఁ బొ దొద్దకచాయవాఁ డాయ నితఁడూ

చ. 1: జలజాక్షుఁ డటుగాన జలకమాడేటివేళ
జలజాకరమువలె సరి నున్నాఁడు
చలివాసి సిగ్గులతో జవ్వనులు గొలువఁగ
నిలుచున్నాఁ డదివో నిచ్చలాన నీతఁడు

చ. 2: ఘనశంఖపాణి గాన కప్పురకాపువేళ
తనమేను నిధానమై తగి యున్నాఁడు
మనసిజగరిడిలో మఱి సాము సేసి వచ్చి
అనుఁగుఁ బుప్పొడిఁ దోఁగి యట్టే వున్నా డీతఁడూ

చ. 3: నీలవర్ణు డటు గాన నించినపుళుగువేళ
తాలిచేందుకు భరణి తానై వున్నాఁడు
ఆలరి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగమెడ
తాళిగాఁ గట్టుక లోలో దక్కియున్నాఁ డీతఁడూ

పె శృ రేకు: 92-1 సామంతం సం: 17-491

పల్లవి: నిన్నుఁ జూచి వెంగేలు నే నాడఁ జూమ్మీ
విన్న కన్న మాటలకే వేరొకతె యాడేను

చ. 1: పన్నీట మజ్జనమాడి పైపై తడిసూ ళ్ళొత్తి
వున్నతి నీవు నిలుచుండఁగాఁ జూచి
మున్నే నీ వెవ్వతెనో ముట్టుదానిఁ బొందివచ్చి
విన్నాణాలు చూపేవంటా వేరొకతె నవ్వెను

చ. 2: కప్పురధూళిమేన కడు నిండా మెత్తుకొని
చిప్పిలఁ దెల్లనిరూపై చెలువొందఁగా
చొప్పున వెన్నముచ్చిమి సొకె నిట్టె మచ్చెమంటా
విప్పుచు నీ కొంగు వట్టి వేరొకతె దీసెను

చ. 3: వొట్టుక పుళుగు పూసి వురాన నలమేల్మంగ
గట్టుక శ్రీవేంకటేశ కడు మించఁగా
యిట్టె చీకటితప్పు సే సిటు నల్లవైతి వంటా
వెట్టికి నీ నా పొందులు వేరొకతె మెచ్చెను

పె శృ రేకు: 92-2 ముఖారి సం: 17-492

పల్లవి: పొద్దొకచాయలవాఁడు పురుషోత్తముఁ డితఁడు
కొద్దిలేని మెఱుఁగులే కుప్పయైన ట్టాయనూ

చ. 1: చక్కని దేవుఁ డదే జంకములాడఁ గాను
వెక్కసపు తిరుమేన వెల్లులాయను
చొక్కపు గోపికలెల్లాఁ జూచినతేటలమాపు
తక్కక యీతనిమేన దై వారిన ట్టాయ

చ. 2: కప్పురకాపుమేనఁ గడు నిండా మెత్తుకోఁగా
నెప్పున వెన్నెలవన్నె నిండుకొనెను
అప్పటి బదారువేలు అందరును నవ్వఁగాను
ముప్పిరి నీతని మేన ముంచినయ ట్టాయను

చ. 3: చెలఁగి పుళుగుకాపు శ్రీవేంకటేశుఁడు వూసి
పలురత్నాలసొమ్ములఁ బరగీని
అలమేలుమంగకొప్పునందలినీల వర్ణము
యెలమిఁ దిరుమేనను యిరవైన ట్టాయ

పె శృ రేకు: 92-3 దేసాళం సం: 17-493

పల్లవి: ఏమని తలఁతమమ్మ నింకా నీదేవుని
ఆముకొన్న పరబ్రహ్మమై వున్నవాఁడు

చ. 1: నెప్పున నీళ్ళతోడి నీలమేఘమై వున్నాఁడు
చప్పుడుగాక పన్నీట జలకమాడి
కప్పురపుమాఁకువలె కడు మించివున్నవాఁడు
ముప్పిరిఁ బచ్చకర్పరమునఁ దొప్పఁదోఁగీ

చ. 2: తట్టుపుణుఁగుభరణి తానైన ట్టున్నవాఁడు
గట్టిగాఁ బుణుఁగు మేనఁ గడు నించుకా
పెట్టినసొమ్ములతోడి పెట్టెవలె నున్నవాఁడు
వొట్టుకొన్న భూషణాలు వొడలెల్లా నిండఁగా

చ. 3: కళలతో లక్ష్మీకాంతుఁడై వున్నవాఁడు
అలమేలుమంగ వురమందు నుండఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డేలికై తా నున్నావాఁడు
నలువంక సర్వలోకనాయకుఁడు గనక

పె శృ రేకు: 92-4 పాడి సం: 17-494

పల్లవి: కోటిమన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీమహిమలే పరబ్రహ్మ మాయ

చ. 1: ఆకాశమువంటిమేను నమరేమూర్తివి గాన
ఆకాశనదియె నీకు నభిషేకము
మేకొని నీవే నిండుమేఘవర్ణు డవు గాన
నీకు మేఘపుష్పాలే పన్నీరుకాపు

చ. 2: చంద్రుఁడు నీమనసులో జనియించె నటుగాన
చంద్రికలు కప్రకాపై సరి నిండెను
యింద్రనీలపుగనులు యిలధరుఁడవు గాన
తంద్ర లేక యాపె చూపే తట్టుపుణుఁ గాయను

చ. 3: లక్ష్మీపతివి గాన లాగుల నీ వురముపై
లక్ష్మి యలమేలుమంగే లలి నీతాళి
సూక్ష్మమై శ్రీవేంకటేశ చుక్కలపొడవు గాఁగ
పక్ష్మనక్షత్రములే యాభరణహరములు

పె శృ రేకు: 92-4 ఆహిరి సం: 17-495

పల్లవి: కోనే ఉద్దండను నీకు కోరికె లెల్లాఁ జెల్లె
పూని సర్వసంపదల పురుషోత్తమా

చ. 1: అదనఁ గప్పురకాపు అవధరించేవేళ
అదివో నారాయణత్వ మమరె నీకు
నిదుల నేకోదకము నీరూపమే కనక
పొదలుచు నిదివల్లఁ బుట్టే నీజగము

చ. 2: ఆరీతిఁ గప్పురకాపు అవధరించేవేళ
క్షీరాబ్ధిశాయి వనుటఁ జెల్లెను నీకు
తేరిపాలఁ బుట్టెను నీదేవులమహిమ గన
ఆరయఁ బాలే జీవుల కాధార మాయను

చ. 3: నీతట్టు పుణుఁగువేళ నీలవర్ణనామ మబ్బె
ఘత నల్లనిరాత్రిఁ బగలునీమేను
ఆతుమ శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
నీతి నుర మెక్కిఁ గన నిండె సొమ్ము లెల్లను

పె శృ రేకు: 92-6 మలహరిసం: 17-496

పల్లవి: కన్నులపండుగలుగా కని మొక్కుదురు నీకు
యిన్నిటా మరునితండ్రి యీతఁడేపో యనుచు

చ. 1: చాలఁ బన్నీట మజ్జనమాడేటివేళ నిన్ను
పోలంచి పొగడుదురు బుదులెల్లాను
నీలవర్ణమే వచ్చి నిలిచి పురుషాకార
మీలీలఁ దాలిచె నేఁడు యిదివో యనుచు

చ. 2: నిగిడి కప్పురధూళి నిండా నీమేన నించఁగాఁ
దగ నానందింతురు నీదాసు లెల్లాను
వొగిఁ బాలజలధికి వొడ్డినసప్తాంగాలు
జిగి మొలిచె నిదివో చెలువుగా ననుచు

చ. 3: అంచఁ దట్టువుణుఁగు పూఁసెలమేలుమంగ నెద
నుంచుకొంటేనే మెత్తురు యోగీంద్రు లెల్లా
కాంచనపుగనులతోఁ గలయ శేషాచలము
ముంచి శ్రీవేంకటేశ్వరమూర్తి యాయ ననుచు

పె శృ రేకు: 93-1 శ్రీరాగం సం: 17-497

పల్లవి: మున్నే వేదాలు భూమి మోచుక వున్నాఁడవు
మొన్న నిన్నటి మాటలు మోవఁగలవా

చ. 1: పన్నీరే చల్లుకొనేవు పదనెక్కీ వలపులు
పిన్నపిన్న ననులొత్తి పెరిగీఁ జుమ్మీ
కన్నెలు పదారువేలు గలవాఁడవు మొదల
చన్నులపంటరాసులు సరి మోవఁగలవా

చ. 2: పూసేవు కప్పురధూళి పొది యెక్కీఁ గోరికలు
ఆసలఁ దీగెలువారి యలమీఁ జుమ్మీ
బేసబెల్లి గొల్లెతలు పెక్కులు గలవాఁడవు
సేసపంట పిడికెళ్లు చేరి మోవఁగలవా

చ. 3: తట్టుపుణుఁ గలదుక తాళిగా నలమేల్మంగఁ
గట్టుకొంటి బంతిరతే కంకేయఁ జుమ్మీ
యిట్టే శ్రీవేంకటేశ యెనమండ్రమగఁడవు
చెట్టడువఁ జేటఁడేసి సిగ్గు మోవఁగలవా

పె శృ రేకు: 93-2 బౌళి సం: 17-498

పల్లవి: చూడరమ్మ యిదె నేఁడు సుక్కురారము
వేడుక చక్క దనాలు వేవేలైనాఁడు

చ. 1: చప్పుడుతోఁ బన్నీటిమజ్జనముతో నున్నవాఁడు
అప్పుడే ఆదినారాయణునివలె
కప్పురకా పామీఁదఁ గడుఁ బూసుకొన్నవాఁడు
ముప్పిరిఁ బులుకడిగేముత్యమువలె

చ. 2: పొసఁగ నప్పటిఁ దట్టుపుణుఁ గలఁదుకొన్నాఁడు
కసుగందని కాలమేఘమువలెను
సుసరాన మేనునిండా సొమ్ముపెట్టుకొన్నవాఁడు
పసలఁ బదారువన్నె బంగారువలెను

చ. 3: అలమేలుమంగ నురమందు నిడుకొన్నవాఁడు
యెలమి సంపదలకు నిల్లువలెను
అలరుచు శ్రీవేంకటాద్రిమీఁద నున్నవాఁడు
తలపోసి చూడఁగ దొంతరకొండవలెను

పె శ్రు రేకు: 93-3 రామక్రియ సం: 17-499

పల్లవి: ఏమైనాఁగా నేరుచు నీ దేవుఁడు
కామించిన వారి వారి కల్పవృక్షము

చ. 1: చప్పుడుగాఁ బన్నీటను జలకములాడేవేళ
గొప్పనవరసముల గుళి గైనాఁడు
దెప్పరమై కప్రకాపు దేహనఁ బూసినవేళ
తప్పకుండ ఘనసారతరు వైనాఁడు

చ. 2: అంచలఁ దట్టుపుణుఁగు అలఁదుకొనినవేళ
మించినట్టి చమరీమృగ మైనాఁడు
కాంచనపు సొమ్ములు అంగముల ధరియించువేళ
కొంచని సంపంగిపువ్వుగుత్తి యైనాఁడు

చ. 3: మిక్కిలి యలమేల్మంగ మెడఁగట్టుకొన్నవేళ
దక్కినట్టి ముంగిటినిధాన మైనాఁడు
యెక్కువై శ్రీవేంకటేశుఁ డిట్టే కొలువున్నవేళ
పక్కన నన్నిటాఁ బరబ్రహ్మమైనా డు

పె శృ రేకు: 93-4 లలిత సం: 17-500

పల్లవి: ఎన్నిరూపులైనాఁ జూప నితడేఁ నేర్చు
మున్నే యనంతావతారములవాఁడు గనక

చ. 1: పన్నీటిమజ్జనవేళ భావించి చూచితేను
మిన్నక నాభికిఁ గిందు మీనుసోగయై
మిన్నేరుపైఁ దొరుగఁగా మించి యెదురెక్కి నిలు
చున్నమచ్చావతారమై వున్నాఁడు దేవుఁడు

చ. 2: మిక్కిలి కప్రకా పామీఁద నిండాఁ జాఁతఁగాను
చక్క నాల్గు చేతులతో సర్వేశ్వరుఁడు
తక్కక శుక్లాంబరధరుఁడైన విష్ణుఁడే
పక్కనఁ దా నని చెప్పి ప్రత్యక్షమై వుండెను

చ. 3: సొసగఁగఁ బుళుకాపున నల్లనగుమేన
పసిఁడి యలమేల్మంగపైఁ గటుక
అసమున రుక్మిణిఁ బెండ్లాడే గోవిందునివలె
వెస శ్రీవేంకటేశుఁడు వెలయించె నిపుడు

పె శ్రృ రేకు: 93-5 రామక్రియ సం: 17-501

పల్లవి: ఈదేవదేవునికి నిందిరారమణునికి
సాదించినటువలె సర్వమూ నమరే

చ. 1: అడరి రామునికిఁ బట్టాభిషేకమైనట్టు
కడలేని పన్నీటికా నమరెను
పొడవై యందె సురలు పుష్పవృష్టి నించినట్టు
కడుఁ గడుఁ గర్పూరకా పమరెను

చ. 2: పాలజలధిపై నీలిపట్టు నిండాఁ గప్పినట్టు
కాళిమతోడ పులుగుకా పమరెను
కేలినందు పసిఁడితీఁగెలు నిండఁ బాఁకినట్టు
సోలిఁ బెట్టినటువంటి సొమ్ములు నమరెను

చ. 3: చంచుల శ్రీవేంకటేశు జంట పెనఁ బెట్టినట్టు
యెంచ నలమేలుమంగ యెద నమరె
అంచెల జవ్వనవనా లట్టే వికసించినటు
పొంచి ఇద్దరిమేనుల పువ్వుదండ లమరెను

పె శృ రేకు: 93-6 పాడి సం: 17-502

పల్లవి: ఊడిగపు చెలులార వొద్దనుండి సేవించరో
వేడుక లన్నియు నేఁడు వెల్లి విరులాయ

చ. 1: గోవర్ధనగిరెత్తిన గోవిందుని మీఁదటను
వావిరిఁ గురిసే జడివానలవలే
ఆవేళఁ బన్నీట నభిషేకము సేయఁగ
వేవేలు దెరఁగుల విభవము లమరె

చ. 2: క్షీరాబ్ధిలోపలి శ్రీవల్లభునిమీఁదట
చేరి సేసే అమృతాభిషేకమువలె
గారవానఁ జేసేటి కప్పురకాపమరెను
నేరుపులు హరికిని నిబిడము లమరె

చ. 3: చీఁకటి దెగమ్రింగిన శ్రీకృష్ణుని మీఁదటను
ఆఁకలఁ దట్టుపుణుఁగమరె నిదే
కాఁకల శ్రీవేంకటేశు కౌఁగిట నలమేల్మంగ
యేఁకటతో గూఁడ గాను యిరవాయ సిరులు

పె శృ రేకు: 94-1 ధన్నాశి సం: 17-503

పల్లవి: నానారూపధరుఁడు నారాయణుఁడు వీఁడె
పూనినవుపనులెల్లాఁ బొసఁగె నితనికి

చ. 1: గరిమ నేరులు వానకాలమునఁ బెనగొని
సారిది సముద్రము చొచ్చినయట్లు
పురుషసూక్తమున విప్రులు సేసే మజ్జనము
అరుదుగఁ బన్నీరెల్లా నమరే నీహరికి

చ. 2: అట్టే వెల్లమొయిళ్లు ఆకసాన నిండినట్టు
గట్టిగా మేన నిండెను కప్పురకాపు
వొట్టి తన విష్ణుమాయ వొడలిపై వాలినట్టు
తట్టుపుణుఁ గమరెను దైవాలరాయనికి

చ. 3: నిలువున సంపదలు నిలిచి రూపైనట్టు
తెలివి సొమ్ములపెట్టె దెరచినట్టు
అలమేలుమంగ వురమున నెలకొనె నిదే
చెలరేఁగి శృంగారాల శ్రీవేంకటేశునకు

పె శృ రేకు: 94-2 శుద్ధవసంతం సం: 17-504

పల్లవి: పొద్దొకవన్నెలవలెఁ బొదలీని చడఁగానే
వద్దనుండీఁ దలపోయవచ్చునా యీదేవుని

చ. 1: అల్ల వాఁడే జలకము లాడీని దేవుఁడు
చల్లని పన్నీటివాసన మించఁగా
తొల్లిటి జడివానలతోడి యశోకమువలె
వెల్లివిరై వున్నవాఁడు వింత వింతరీతుల

చ. 2: తొప్పఁదోఁగి తిరుమేనుతో మించుకొనీ నితఁడు
కప్పురపు బిండిచేతఁ గాఁక దీరఁగా
వుప్పొడిఁ దోఁగిన కల్పభూజము కొలువువలె
ముప్పిరి నిలుచున్నాఁడు మోహనాకారము

చ. 3: తట్టుపుణుఁ గలఁదీని తగు శ్రీవేంకటేశుఁడు
వొట్టిన యలమేల్మంగ వుర మెక్కఁగా
తొట్టిన బంగారుయేరుతోడి సముద్రునివలె
గట్టియై సంపదలను గంభీరమునను

పె శృ రేకు: 94-3 దేసాళం సం: 17-505

పల్లవి: మదనగురుని మంచి మజ్జనవేళ
పొదిగొన్న సింగారాల పోగాయ నితఁడు

చ. 1: తేరకొవ బంగారుబిందెల నించి పన్నీట
శ్రీరమణునకు నభిషేకము సేయగా
తోరమైన పూదేనెలతోడి యంజనాచలము
కారుకమ్మినటువలెఁ గనుపట్టె నిపుడు

చ. 2: కప్పురకాపుమేనఁ గలయఁగ మెత్తి మెత్తి
అప్పని కేకాంతాన నంగముల నించఁగాను
ముప్పిరి నేనుగకును ముత్యాలజల్లులనే
గుప్పె సింగారించినట్టు గుఱుతాయ నిపుడు

చ. 3: శ్రీవేంకటేశనకు చేరి యలమేల్మంగకు
ఆవటించి తట్టుపుణుఁ గన్నిటా నలఁదఁగాను
భావించఁ గల్పవృక్షముపై నీలమేఘములు
వేవేలుగా నిండినట్టి విధమాయ నిపుడు

పె శృ రేకు: 94-4 శ్రీరాగం సం: 17-506

పల్లవి: పులుకడిగినయట్టి పురుషోత్తముఁడు వాఁడె
యెలమి నారతులు మీరెత్తరే దేవునికి

చ. 1: గొప్పయింద్రనీలాల కొండ మంచు గప్పినట్టు
నెప్పు మింట పాలవెల్లి వెరసినట్టు
విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు
కప్పురధూళిమేనఁ గప్పిరి దేవునికి

చ. 2: నిండు నై రావతముపై నీలిజగ గప్పినట్టు
వెండిమేడపైఁ జీఁకటి విడిసినట్టు
వుండరీకపుఁ గొలను పారిఁ దేం ట్లాగినట్టు
మెండగు తట్టుపుణుఁగు మెత్తిరి దేవునికి

చ. 3: అదె నల్లఁ గలువలన కరువు లుండినట్టు
మెదిగి కస్తూరిభూమి మేరు వున్నట్టు
యెదుట శ్రీవేంకటేశుయెద నలమేల్మంగను
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి

రేకు: 94-5 శుద్ధవసంతం సం: 17-507

పల్లవి: ఎన్ని మహిమలవాఁడే యీ దేవుడుఁ
కన్నులపండువ లెల్లాఁ గదిసిన ట్లుండెను

చ. 1: పోలింప కప్పురకాపు పురుషోత్తమునికి
యేలీల నుండునని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవ్వళింపఁగా మేన
మేలిమి మీ గడంటినమెలుపుతో నుండెను

చ. 2: తట్టుపుణుఁగుకాపు దైవశిఖామణికి
యెట్టుండెనని మఱి యెంచి చూచితే
చిట్టకాన రేపల్లెలోఁ జేసినరాసక్రీడల
నట్టే రాత్రులు మేన నంటినట్టుండెను

చ. 3: అలమేల్మంగతోడ నట్టె సొమ్ముధరించఁగా
యెలమి శ్రీవేంకటేశు నెంచి చూచితే
కలిమిగల యీ కొంత కౌఁగిటఁ బెనఁగఁగాను
నిలువెల్లా సిరులయి నిండినయ ట్లుండెనూ

పె శృ రేకు: 94-6 శంకరాభరణం సం: 17-508

పల్లవి: ఏమని చెప్పుదమమ్మ యీతని సౌభాగ్యము
కోమలపు జవ్వనము గుఱుతైన ట్లుండె

చ. 1: వొట్టుచుఁ గప్పురకాపు వూడిగపుఁవారెల్లా
అట్టే దేవునికి నలఁదఁగాను
దట్టముగ మంచి తెల్లఁ దామెరపవ్వునకు
ముట్టి అవయవములు మొలచిన ట్టుండె

చ. 2: తనివొంద గిన్నెలతోఁ దట్టుపుణుఁగులు దెచ్చి
పొనుపొందఁ దిరుమేనఁ బుయ్యఁగాను
పనివడి గొప్ప నిడుపాటి నేరేడుఁబండు
కనుపట్ట పురుషాకారమైన ట్లుండె

చ. 3: అలమేలుమంగ నురమందుఁ బెట్టి సొమ్ము లెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁడనెడి పుష్పాడి రాసి
వెలయు మరుఁడు ముద్ర వేసిన ట్లుండె

రేకు: 95-1 భౌళి సం: 17-509

పల్లవి: విన్నదాఁకా వేగిర మిదె నాకుఁ
గన్నదాఁకాఁ గారింపులు

చ. 1: కాయో పండోకలికి నీ వందుఁ
బోయివచ్చినట్టి పొరుగుపని
రేయిఁ బగలు నన్ను రేసుల నేఁచిన
పాయపువిభునికిఁ బరిణామా

చ. 2: మేడోమాడుగో మెలఁత నీతోడ
నీడుగఁ జెప్పిన యిక్కువలు
వీడని విభుఁడు విన్నప మాలించి
వేడుక నిందాఁకా విచ్చేసెనా

చ. 3: చేవో చిగురో చెందిన కౌఁగిట
శ్రీవేంకటేశ్వరు చేఁతలివి
యీవేళ నారతి నెనసి నట్లానె
తావుల నాపొందు దలఁచునా

పె శృ రేకు: 95-2 బౌళి సం: 17-510

పల్లవి: ఆదిమలక్ష్మి యతనికిఁ గలుగఁగ
యీదెన సంపద లిఁక నేమి చెప్పేదమ్మా

చ. 1: నెలఁత నీ తురు మిది నిండు నీలపుగని
పలచని నీ మేను పసిఁడిగని
మొలక నీ కనుచూపు ముత్యపురాసులగని
యెలమి నీ పతి కింక నేమి గడమమ్మా

చ. 2: వనిత నీ దంతములు వజ్రాలపుట్టుగని
నినుపు నీ గోళ్ళు మాణికపుగని
పెనపు నీ కుచములు పెన్నిధానములగని
యెనము నీ పతి కింక నేమి భాగ్యమమ్మా

చ. 3: అతివ నీ కెమ్మోవి అదె పగడాలగని
రతి నీ కౌఁగిలి పెద్ద రసముగని
యితవైన శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గలసె
అతనిరాజ మెల్లా నమరెఁ గదమ్మా

పె శృ రేకు: 95-3 శంకరాభరణం సం: 17-511

పల్లవి: తలఁపులో విరహమో తరుణిపై మోహమో
చెలియసింగారమో చెప్పరమ్మ చెలుల

చ. 1: చిత్తరుపటముమీఁద జెలయనెమ్మోము వ్రాసి
గుత్తపుఁ జందురుఁ డని గుండె వగిలె
కొత్తగాఁ గ్రమ్మర నాకె కుచమండలము వ్రాసి
బిత్తరి జక్కవ లని ప్రియు డట్టే భ్రమసే

చ. 2: ప్రేమపురమణిమేఁటి పిఱుఁదు దానే వ్రాసి
కామునితే రనుచుఁ గలఁగ బారే
కాముకుఁడై పతి యింతికరపద్మములు వ్రాసి
ఆమనిజలజబాణా లని చూచి వెఱచె

చ. 3: అనుఁగుఁ దురుము వ్రాసి అలులంటా వెఱ గందే
ఘనుఁడయిన శ్రీవేంకటవిభుఁడు
వనిత నింతా వ్రాసి వనితకౌఁగిటిలోన
తనరూపు వ్రాసుకొని తాపమెల్లా నడఁచే

పె శృ రేకు: 95-4 హిందోళం సం: 17-512

పల్లవి: కాంత నీ కతముననే ఘనుఁ డాతఁడు
యింతవడి బ్రహ్మమై యెఱుకపడఁ డతఁడు

చ. 1: లలన నీ కొనగోరి లక్షణంబులఁ గదా
తొలుత నీ పతి యచ్యుతుఁ డైనది
జలజాక్ష నీ కటాక్షపుఁ గరుణనే కదా
అలరి పీతాంబరుఁడై వెలసె నతఁడు

చ. 2: వువిద నీ జనియించు వుదయఫలమునఁ గదా
జవళి నసురల గెలిచి శౌరి యాయ
భువి నీవు దేవివై పొలుపు మిగులఁగఁ గదా
అవల బ్రహ్మకుఁ దండ్రియై వెలసె నతఁడు

చ. 3: ముదిత నీ వెపుడు నురమున నుండఁగా గదా
కదనఁ గౌస్తుభవక్షుఁ డాయ నతఁడు
కదిసి యలమేలుమంగ నీ వగుటకుఁ గదా
చదల శ్రీవేంకటేశ్వరుఁ డాయ నతఁడు

పె శృ రేకు: 95-5 ఆహిరి సం: 17-513

పల్లవి: ఈరీతి వలపు లొక టినుమడాయ విభుఁడ
కోరికలు గోటానఁగోటి సతి కాయ

చ. 1: సుదతి నీ రాక కెదురుచూచేటి యాసలను
కదిసి నగుమో మెల్లఁ గన్ను లాయ
యిదె నీ కడకు నాకె యేతెంచు తమకమునే
ఆదనము నీ ముంగి లెల్లా నడుగులే యాయ

చ. 2: వెలఁది నీ సుద్దు లెల్ల వినియెడి వేడుకల
వెలలేనిపులకలే వీను లాయ
పలుమారు నీతోడి పలికేటి కాంక్షలను
నిలువెల్ల నంగనకు నివ్వెఱఁగు లాయ

చ. 3: కమలముఖి నిను రతులఁ గలయు నిబ్బరమునను
కొమరైన చన్నుఁగవ కొండ లాయ
చెమటనే నిద్దరికి శ్రీవేంకటేశ్వరుఁడ
తమకములు తనుపులును తడఁబా ట్లాయ

పె శృ రేకు: 95-6 బౌళి సం: 17-514

పల్లవి: మగువలు చూడరమ్మా మరుఁడు సేసినమాయ
యిగిరించెఁ జక్కఁదన మేమి చెప్పేదే

చ. 1: కందులేని చందురులోఁ గలువరేకులు పుట్టె
అందులోనే మల్లెదండ లవి మించెను
కందువఁ గమ్మర నవే కాయజునియమ్ము లాయ
యిందుముఖిచెలు వింక నేమి చెప్పేదే

చ. 2: ఆకసముమీఁదఁ గొండ లాదరువు లేక పుట్టె
ఆకడ నాపొంతఁ దీగె లవి మించెను
కైకొని యా తుదలనే కమలము లుదయించే
యీకాంత భావ మిది యేమి చెప్పేదే

చ. 3: పాయపుమెఱుఁగు దీగెఁ బగడపు బండు వండె
చాయ శ్రీవేంకటపతి చవిగొనెను
మోయుచు నిద్దరిలోన ముత్యాలవాన పుట్టే
యీయతివసొబ గింక నేమి చెప్పేదే

పె శృ రేకు: 96-1 మాళవిగౌళ సం: 17-515

పల్లవి: ఎవ్వరిసాకిరి నేమిటికి యిటు
నవ్వక చూచిన నమ్ముదుఁబో

చ. 1: పయ్యదలోనివే భారపుగుబ్బలు
తియ్యవిలుతు దళ దిబ్బెములు
నెయ్యమిఁ దొడికినని కల్ల నిజము
లియ్యడ నిన్నియు నేర్పడుఁబో

చ. 2: అట్టడి విపు డాఅడి నా యారిది
పట్టరాని బలుపామిదివో
యిట్టే యితరము లెఱుఁగ ననుచు వా
కట్టక ముట్టినఁ గందమువో

చ. 3: శ్రీవేంకటపతి సిరుల నీవిముడి
చేవలనే వేసిన ముడి యా
యీవలఁ గూడుచు నెత్తితి నిఁక నా
భావములో నిజపట్టితిఁబో

పె శృ రేకు: 96-2 ఆహిరి సం: 17-516

పల్లవి: సారెకు మగనాలి సంగాత మిది అట్టు చందమామా, నీవు
చేరి దగ్గరితే చీఁకటితప్పవును చందమామా

చ. 1: సందెకాడ నీ చాయలు చూపేవు చందమామా, బూమి
నిందలు గట్టేరు నిన్నుఁ జూచితేను చందమామా,
విందుల నీ రాక వెల్లివిరాయను చందమామా, నీవు
ముందు నానాటికి మోసపోకువయ్య చందమామా,

చ. 2: సరి నేల నీ మేను చంద్రవంక లాయ చందమామా, నీ
తిరిగే తిమ్మట లెల్లా దిక్కుల కెక్కెను చందమామా,
వెరవున నీ వాకె వేగుఁజుక్క లైరె చందమామా, నీ
యిరవు కొండమీఁది యిక్కువ నుండ వో చందమామా,

చ. 3: కళలైన నీ మోము కందువాడ నేల చందమామా, మావా
రలిగి ని న్నొకటి పదారుగఁ జెప్పేరు చందమామా
పొలుపు నీ భావము పులు గరయఁగఁ జిక్కె చందమామా, నిన్ను
నిలువునఁ బట్టిచ్చే నీటిలోపలిచొప్పుచందమామా

చ. 4: కౌఁగిట శ్రీవేంకటతివైనట్టి చందమామా, నన్నుఁ
గాఁగి కూడితివి కదలనీకవో చందమామా,
పొఁగిన చెమటల పాలజలనిధి చందమామా, యింక
దాఁగ నేల నీవు దక్కితి విదె నాకు చందమామా

పె శృ రేకు: 96-3 శంకరాభరణం సం: 17-517

పల్లవి: కాంతలకుఁ బురుషులకుఁ గలదెల్ల నిందాఁక
వింత మీ టిపుడేల వేసటందాఁకా

చ. 1: తాలిములు మేలిములు దగ్గరిన యందాఁక
చాలైన కుంటెనలు సతమైనదాఁకా
వాలుఁజూపుల సొలపువలలఁ జిక్కినదా క
జోలిమాటలు తమకు సొలసినందాఁకా

చ. 2: అడఁకువలు మోనములు అలుక దీరినదాఁక
వడిగొన్న కోరికెలు వలసినందాఁకా
కడలేని జంకెనలు కైవసం బౌదాఁక
వుడివొని పంతములు వోపినందాఁకా

చ. 3: రతివేళ మోహములు రాకొట్టి నందాఁక
అతనుభోగములు మే నలసి నందాఁకా
యితవైన శ్రీవేంకటేశ నీకును సతికి
తతి నిట్లఁ గూడ సంతము లయినదాఁకా

పె శృ రేకు: 96-4 శ్రీరాగం సం: 17-518

పల్లవి: అలని మీఱినజాణ లతివ లెల్లా
మెలఁతభావము లివి మెచ్చవలెఁ గాక

చ. 1: యెదుటఁ గన్నులు సేసె నింతే కాక చూపులలో
కదలు గడించెనా కమలజుఁడు
పొదిగి యాతని నేమి పొగడే రందరూఁ గూడి
సుదతినేరుపులకే చొక్కవలెఁ గాకా

చ. 2: నివ్వటిల్లు మెఱుఁగల నెమ్మోము సేసేఁ గాక
నవ్వులు గడించెనా నలినజుఁడు
యివ్వల నిదేమి చూచే రిది యంతటాఁ గలదే
జవ్వనివిలాసము లెంచఁగవలెఁ గాకా

చ. 3: రంగగుఁ జక్కఁదనము రాసి సేసేఁ గాక యీకె
సింగారము నించెనా చేరి యజుఁడు
ముంగిట శ్రీవేంకటేశు మోహించఁ జేసినట్టి
అంగన నింకా గొనియాడవలెఁ గాకా

పె శృ రేకు: 96-5 ముఖారి సం: 17-519

పల్లవి: నవ్వవద్దా నాకు నాకే నాయకుఁడ నిన్నుఁ జూచి
నవ్వులే కేరడములై నాఁటుకొనీఁ గాకా

చ. 1: మెచ్చవద్దా నీ మేని మించుఁ జెమటలు చూచి
మెచ్చఁబోతే వెంగెములై మెఱసీఁ గాకా
కుచ్చవద్దా కౌఁగిట నీ కుంకుమ చెక్కులు చూచి
కుచ్చిన నీ కిది నీకుఁ గోపమయ్యీ గాకా

చ. 2: తిద్దవద్దా నీ కురులు దిమ్ముఁజెదరులు చూచి
తిద్దఁబోతే మోము సిగ్గుదేరీఁ గాకా
వొద్దనఁగా వలదా వుస్సురసురులు చూచి
వొద్దంటే నీకు నది వొచ్చమయ్యీఁ గాకా

చ. 3: మొక్కవద్దా నీవు సేసేమొరఁగు రతుల కెల్లా
మొక్కితేనే మర్మములు ముట్టీఁ గాకా
చెక్కు నొక్క వలదా శ్రీవేంకటేశ నా
చెక్కు ముట్టితే మఱపు చిమ్మిరేఁగీఁ గాకా

పె శృ రేకు: 96-6 సామంతం సం: 17-520

పల్లవి: సారె నాచే వెళ్ళనాడించఁగ నేల
మేరతో నిలుపవయ్య మేటి నీ గుణములు

చ. 1: కన్నవారిమానములు గనుగొన్న చూపులనే
పన్ని నన్నుఁ జూడకురా పచ్చిరోఁతలు
యిన్నిటా నీ కితవైతే నివి యింకఁ గొలనిలో
కన్నెలకు నీకుఁ దగుఁగాకరి యీ పనులు

చ. 2: సంగతి నెంగిలిమోవి చవిగొన్న నీ నోట
అంగవించి మాతో మాటలాడకువయ్య
వెంగలి యీపను లెల్ల వేడుకైతే నల్లనాటి
అంగడి కుబ్జకు నీకు నమరు నీచేఁతలు

చ. 3: అందరివలెనే గోరి నంటకుర నీవు నన్ను
విందవై కూడితివి శ్రీవేంకటేశుఁడ
కెందమ్మిరేకులలోనిగీరలు రుకుమిణిచే
నందుకొన్న యీ నీకు నాకెకునే తగునూ

రేకు: 97-1 సామంతం సం: 17-521

పల్లవి: ఏమి సేతు నెంత సేసే నిదేమే వీఁడు
నామోము వంచుకొని నవ్వుతా నుందాననే

చ. 1: జవ్వనముమీఁదుకట్టి జాజఱనే నోముఁగాను
యెవ్వఁడే వీఁడు నామోవి యెంగిలి సేసెని
యివ్వల నా మొకమోట మేమీ ననఁజాల కిట్టే
నివ్వెఱఁగుపడి యీడ నిలుచున్నదాననే

చ. 2: నిక్కుఁగుచగిరులను నిండు బోనాలు వోయఁగ
యిక్కువ లంటుకొనీ నేఁడేవ్వఁడే వీఁడు
యెక్కువ కళలు సోఁకి యిచ్చకము మానలేక
చెక్కిటిచేతితోడ సిగ్గున నుందాననే

చ. 3: సింగారము మేనఁ బూని చేరి తపము సేయఁగ
నంగవించి చెట్టవట్టీ నదేమే వీఁడు
యింగితపు శ్రీవేంకటేశుఁడే వీఁ డనఁగాను
చెంగటనే సంతసించి చెలువై యున్నదానను

రేకు: 97-2 ముఖారి సం: 17-522

పల్లవి: ఇంతేపో కలిగినది యే కాలము
కంతుఁడు సేసినమాయ కలకాలము

చ. 1: కాటుక నీ కన్నుచూపు కలికిపైఁ జల్లితేనే
గాటము విభునికి జీఁకటికాలము
పాటపాట నవ్వు మోవిఁ బాడ నటు నవ్వితేను
నీటున నీపతికి వెన్నెలకాలము

చ. 2: కాంత పొలయలుకఁ గాఁక లటు చిమ్మితేను
సంతమైన ప్రియునికి వేసవికాలము
అంతలో రమణుని నీ వాదరించి దగ్గరిన
వంతల నీ చెమటల వానకాలమూ

చ. 3: రతుల శ్రీవేంకటేశు రమణి నీ వుండితే
మితిలేని జవ్వనపు మేలుగాలము
సతి నీ మోవితేనె చవి చూపితేనే స
మ్మతుల నాతనికి నామనికాలమూ

పె శృ రేకు: 97-3 సామంతం సం: 17-523

పల్లవి: ఎవ్వ రెవ్వ రేమనినా నేమాయనే
పువ్వు బువ్వే కాయ గాయే పూప దప్పీనా

చ. 1: కొండలకు మారుకొన్న కుచములు పైఁడి
కుండలంటే కడుంగడు కొంచము గాదా
అండ నుండే చెలు లెల్లా నంతర మెఱుఁగకున్న
నుండరమ్మా వాని కేమి వొచ్చ మయ్యీనా

చ. 2: వొద్దికఁ జందురుకంటే నుదుటైన నెమ్మోము
అద్దమంటా నాడుకొంటే నందము తానా
పొద్దువోక చెలు లెందుఁ బోలిచిన తమలోని
సుద్దు లింతే కాక వానిసొంపు దప్పీనా

చ. 3: పుత్తడిబొమ్మవంటి పొలిఁతి నిందరు జూచి
చిత్తరువు పతిమంటే జిగి దప్పీనా
చిత్తగించి చెలిఁ గూడె శ్రీవేంకటపతి
గుత్తపుసింగారాలు కొత్త లయ్యీనా

రేకు: 97-4 ఆహిరి సం: 17-524

పల్లవి: కలలోన నీ రూపే కాయములో నీరూపే
వెలి నిన్నుఁ బాసి నను వేగించు టెట్టురా

చ. 1: ముంచి నీ మొగమునఁ గట్టిన ట్టయ్యీ
మించు నాలుగుచేతుల మెఱుఁగులు దలఁ పయ్యీ
మంచి నీ పాదము లివె మతిలోనఁ బాయ వివే
యించుకంతా మఱవలె నెట్టు ధరియించేరా

చ. 2: కట్టిన చంద్రగావి కఠారిమొలకట్టు
పెట్టిన వొడ్డాణము ప్రేమములు రేఁచీని
మట్టు నీ చక్కదనాలు మర్మములు గలఁచీని
నెట్టన నే నిన్నుఁ బాసి నిలుచుట యెట్టురా

చ. 3: వుదరబంధము నాభి వొప్పునున్నఁ దిరుమేను
తుద నలమేలుమంగతోడివురము
యిదే శ్రీవేంకటేశ నిన్నెగపోసి దిగపోసి
పొదిగి యిట్టే కూడకపోవ నెట్టువచ్చురా

పె శృ రేకు: 97-5 ముఖారి సం: 17-525

పల్లవి: అంగన విభుఁగూడే దది యేకాలమో కాక
అంగజుని కిది గాల మాయనో కాక

చ. 1: చెలియచెంపలనుండి సేవంతిరేకులే రాలె
అలరువసంతకాల మాయనో కాక
కలికికన్నులనుండి కన్నీటిబొట్లు రాలె
యెలమి వానకాల మిదియో కాక

చ. 2: కాంతవిరహపుమేనఁ గాఁకలయెండలు గాసె
యింతలో వేసవికాల మిదియో కాక
వింతపులకమొగము వెన్నెలతేటలు గాసె
యింతట శరత్కాల మిదియో కాక

చ. 3: శ్రీవేంకటేశుఁ జూచి సిగ్గు లీ కామిని చిందె
యీవేళ హిమంతకాల మిదియో కాక
భావించి యీతనిఁ గూడ పయ్యెద మేనఁ గప్పె
ఆవటించు చలికాల మదియో కాకా

పె శృ రేకు: 97-6 శంకరాభరణం సం: 17-526

పల్లవి: చూడఁ జూడ నింతలోనే సుక్కురారమునాఁడు
ఆడ నీడ విభవాలే అమరే దేవునికి

చ. 1: మేటిపాలజలధిలో మీఁగడ లంటెనో కాని
వీటనే దొంగిలినట్టి వెన్న లంటెనో
నూటుక యాకాశగంగమరు గంటెనో యనఁగ
ఆటలఁ గర్పూరకాపు అమరె దేవునికి

చ. 2: శిసువులఁ దెచ్చునాఁడు చీఁకటి యంటెనో కాని
మసలక కరిఁ గాచేనుద మంటెనో
సుసరాన నీలి కాసెసొగ టంటెనో యనఁగ
అద్దై పుణుఁగుకాపు అమరె దేవునికి

చ. 3: పరమతేజంబైన ప్రభలు చల్లెనో కాని
పురము శ్రీసతియున్న వొరపు లివి
అరిది శ్రీవేంకటేశు కలమెలుమంగతోడ
అరలేక సొమ్ము లెల్ల నమరె దేవునికి

పె శృ రేకు: 98-1 సామంతం సం: 17-527

పల్లవి: ఇన్నిటికి మూలము యీతనిరూపు
యెన్నఁగనుపమలకు నిరవైన ట్లుండె

చ. 1: కమలనాభునికి కప్పురకాపు మేన
సముచితముగఁ బై పై చాఁతినపుడు
అమృతము దచ్చేవేళ నట్టే మేనఁ దుంపుర్లు
తమితోడ నిండుకొని దట్టమైన ట్లుండె

చ. 2: దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను
చేవమీఱ నించి సేవ సేసేయప్పుడు
వేవేలుగా యమునలో వేమారు నీఁదులాడఁగా
కావిరి కాళిమ నిండాఁ గప్పినయ ట్లుండే

చ. 3: అలమేలుమంగతోడ నట్టే శ్రీవేంకటపతి
కెలమితో సొమ్ము వెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడఁగా గుబ్బలమీఁదఁ
గల పసలెల్లా వచ్చి కమ్ముకొన్న ట్లుండే

పె శృ రేకు: 98-2 దేసాళం సం: 17-528

పల్లవి: ఇందుకే కాఁబోలు నీవు యిట్టే యవధరించేవు
కందువ లన్నియు నీమై గనియైన ట్లుండే

చ. 1: హరి నీవు కప్పురకా పవధరించేవేళ
విరివిగా నిందరు భావించి చూచితే
తరుణుల నవ్వు లెల్లా దట్టిమై నీ మేనిమీఁద
పెరిగి పెరిగి యట్టే పేరినయ ట్లుండే

చ. 2: భువనేశ నీవు తట్టుపుణుఁగు చాఁతుకొనఁగ
యివల నాదాసు లెల్లా నెంచి చూచితే
కవగూడె నీ సతుల కనుచూపు లెల్లాను
తివిరి ఈమేనిమీఁద తిరమైన ట్లుండే

చ. 3: శ్రీవేంకటేశ నీచెలి యలమేల్మంగతో
తావున మెఱసేది నేఁ దలఁచితేను
కోవరపు గొల్లెతల గుబ్బలకుంకుమనిగ్గు
వేవేలయి నీయందచ్చువేసినయట్లుండే

పె శృ రేకు: 98-3 శంకరాభరణం సం: 17-529

పల్లవి: చేతు లెత్తి మొక్కరమ్మ చేరి యార తెత్తరమ్మ
యేతులే బూమెల్లా నిండె నీ దేవదేవునికి

చ. 1: తతిగొని పన్నీటిధారలు పై నించి నించి
సతముగాఁ బెద్దలు మజ్జన మార్చఁగా
అతివలచనుఁగొండ లంగము లొత్తినందుకు
యితవులై తోఁచె నేఁడు యిందిరాపతికి

చ. 2: కప్పురపుధూళి మేనఁ గలయఁగ గంపెఁడేసి
నెప్పన సందుసందుల నిగిడించఁగా
చొప్పులెత్తి గొల్లెతల చూపులు దాఁకినీ కుమ్మె
లప్పు డన్నియునుఁ గప్పినందువల్ల హరికి

చ. 3: తట్టుపుణుఁ గలఁది యందపు టలమేలుమంగ
నట్టే వురముమీఁద నమరించఁగా
నెట్టనఁ బచ్చిసేనెలఁతల చేఁతలలో
చిట్టకము లెల్లాఁగప్పె శ్రీవేంకటపతికి

పె శృ రేకు: 98-4 బౌళి సం: 17-530

పల్లవి: ముగురువేలుపులకు మూల మీతఁడు
జిగిమీఱి నెదుటను సేవించరే

చ. 1: అంచలఁ బన్నీటిబిందె లందుకొని యిందరును
నించి మజ్జనము దేవునికిఁ జేయఁగా
వంచి సముద్రము మీఁద వానలు గురిసినట్టు
పొంచి యన్నిటాను ఉప్పొంగుచు నున్నాఁడు

చ. 2: పచ్చకప్పురము మేనఁ బలుమారు మెత్తఁగాను
తచ్చి పున్నమచంద్రుఁడే తానై వున్నాఁడు
అచ్చపుఁ దట్టుపుణుఁగు ఆమీఁదఁ బుయ్యఁగాను
నిచ్చఁ గల్పకతరువునీడయ్యె వున్నాఁడు

చ. 3: అలమేలుమంగతోడ నన్ని సొమ్ములు నించఁగా
పలు పంచవన్నెల సంపద యైనాఁడు
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ బ్రతాపించి
కులికి పుణ్యాల కెల్లా గురియైనాఁడు

పె శృ రేకు: 98-5 లలిత సం: 17-531

పల్లవి: మహి మెల్లాఁ దొప్పఁ దోఁగె మజ్జనవేళ
సహజ శృంగారాలు జడిసె శ్రీపతికి

చ. 1: ముత్తేలవాన లెల్ల ముంచి కురిసినయట్టు
హత్తి పన్నీట జలకమాయ హరికి
తత్తరానఁ దెల్ల మొయిలు తనుఁ బొదిగినయటు
కొత్తగాఁ గప్పురకాపు గుప్పిరి దేవునికి

చ. 2: నీలపుఁ బేరు లెల్లా నిండాఁ గట్టినయట్టు
తేలఁ దట్టుపుణుఁగు మెత్తిరి పతికి
ఆతరి మెఱుఁగుఁ దీగె లలముకొనినయట్టు
కోలుముందై సొమ్ములెల్లా గుప్పిరి విష్ణునికి

చ. 3: పెక్కు నవరత్నములు పెద్దరాసి వోసినట్టు
యెక్కువ దండలు గట్టిరి మూరితికి
వొక్కట నలమేలుమంగ నురమునఁ గట్టి రిదె
చిక్కని నవ్వులు మించె శ్రీవేంకటేశునకు

రేకు: 0098-6 మలహరి సం: 17-532

పల్లవి: ఏకతాన వున్నవాఁడు యిదివో వీఁడె
చేకొని మొక్కరో మీరు చేతులెత్తి యిపుడు

చ. 1: మంచి మంచి పన్నీట మజ్జన మవధరించి
పంచమహావాద్యాలతో పరమాత్ముఁడు
అందలఁ గప్పురకాపు అంగముల మెత్తుకొని
కొంచక నిలుచున్నాఁడు గోణాముతోడను

చ. 2: తట్టుపుణుఁ గామీఁద దట్టముగ నించుకొని
తెట్టలై వేదనాదాల దేవదేవుఁడు
గుట్టుతోడ సొమ్ములెల్లా గుచ్చి కుచ్చి కట్టుకొని
వెట్టదీర సురట్ల విసరించుకొంటాను

చ. 3: తనిసి యలమేల్మంగఁ దాళిగాఁ గట్టుకొనె
వెనుకొని యిదెవో శ్రీవేంకటేశుఁడు
మునుకొని యారగించి మూఁడులోకములుమెచ్చ
చనవరినసతులతో సరసమాడుతాను

పె శృ రేకు: 99-1 దేసాళం సం: 17-533

పల్లవి: చిక్కని సింగారరాయ శ్రీవేంకటేశ నీకు
అక్కున నున్న తరుణి యన్నియునుఁ గాదా

చ. 1: యింతిచూపువెన్నెలలు యిటు నీపైఁ బోసితేనే
కాంతి నీ కదే కప్పురకాపు గాదా
పంతాన గిన్నెలతోడి పచ్చకప్పురపుధూళి
యింతయు నీమై నలఁదే విది గొంతవలెనా

చ. 2: చెలిబొమ్మజంకెనల చీఁకటిపైఁ బోసితేనే
కలిమి నదే పుణుఁగుకాపు గాదా
పలు భరణులతోడిపచ్చితట్టుపుణుఁ గెల్లా
నిలువున నలఁదేవు నీకు నిది వలెనా

చ. 3: వనిత మేనికాంతులు వడి నీపైఁ జిమ్మితేనే
సునిసి నీ కవే పెక్కుసొమ్ములు గావా
అనుగు శ్రీవేంకటేశ అలమేలుమంగఁ గూడి
తనియ సొమ్ము వెట్టితి తగు నిది నీక

పె శృ రేకు: 99-2 రామక్రియ సం: 17-534

పల్లవి: ఏమి సేతు నామనసు యెందుకు నొడఁబడదు
కామునికంటికి నింత ఘనమైతిఁ గా

చ. 1: ఆడుదుఁబో వెంగెము లాతని మొగము చూచి
ఆడలేఁ బో వానిచిత్త మది నొచ్చుఁగా
కూడుదునో పానుపుపై కొంగువట్టి తీవతని
కూడితే నామతిలోనిగుట్టు గనుఁగా

చ. 2: అలుగుదునో నేను అతఁడు పైకొని రాఁగా
అలుగఁబో వానిఆయము సోఁకుఁగా
పిలుతునో ఆతని పేరుకొని నే నిట్టె
పిలిచితే నాలోని బీరమెల్లాఁ బోవుఁగా

చ. 3: చిమ్ముదునో కొనగోర శ్రీవేంకటేశ్వరుని
చిమ్మలేఁబో ఆతనిమై చిల్లులౌఁగా
వుమ్మడి నూరకుందునో వుడివోని రతులలో
ఉమ్మగిలి యట్లయితే వోటమి పైఁ బడుఁగా

పె శృ రేకు: 99-3 రామక్రియ సం: 17-535

పల్లవి: అంపఁగల వెల్లా నంపె నతనిరాకకుఁ జెలి
చెంపజాఱుఁదురుముల చిఱునవ్వు లంపె

చ. 1: కాంత దనరమణునికడకుఁ జెలియ నంపె
వింతకనుచూపులు వెంటనే యంపె
మంతనాన నెదురుగా మనోరథము లంపె
పంతపుఁ గన్నీట యర్ఘ్యపాద్యము లంపె

చ. 2: పిలిచి తెమ్మని పతిపేరిట లేఖ లంప
వెలిఁ దనయడుగులు వెంటనే యంపె
నెలవయి వేగిరాన నిట్టూర్పుగాలి నంపె
అలర నాందోళపు టందలము లంపె

చ. 3: కౌఁగిటికిఁ గరములఁ గైకోలు వీడె మంపె
వీఁగిన గోరిచంద్రుల వెంటనే యంపె
రాఁగి శ్రీవేంకటపతి రతిఁ గూడి యీ చెలి
లోఁగిన సిగ్గుల నెల్లా లోలోనే యంపె

పె శృ రేకు: 99-4 రామక్రియ సం: 17-536

పల్లవి: ఇంతి నీపై మోహ మెటువంటిదో కాని
కాంతుఁడవు నీ మనసు గరఁగించె నిపుడు

చ. 1: సుదతి ని న్నల్లార్చి చూచె నొకచూపు
అదనఁ దేలించి చూచె నది యొకచూపు
పుదుటు నాటఁగఁ జూచె నొరసి వొకచూపు
వెదచల్లి చూచె నొకతి వేగిరపుచూపు

చ. 2: సొగసి నిను జంకించి చూచె నొకచూపు
అగలించి చూచె నొక అందపుఁ జూపు
తగిలి వెంటనే గోర్చి తగఁ జూచె నొక చూపు
జిగిదీర సొలసి చూచెను వొక్కచూపు

చ. 3: సొరిదిఁ దోరణముగాఁ జూచె నొకచూపు
అరమోడ్చి చూచెనొక అనువగుఁ జూపు
సొరిది నూరక కులికి చూచె నొకచూపు
సిరులపైఁ బార నటు చిమ్మె నొకచూపు

చ. 4: చొనిపి నినుఁ జట్టుగాఁ జూచె నొక చూపు
చెనకి మగిడించి చూచె నొకచూపు
జునిగి సిగ్గున వంచి చూచె నొకచూపు
పెనఁగుచునే మిగుల జళిపించె నొకచూపు

చ. 5: చొక్కముగ మగిడించి చూచె నొకచూపు
లెక్కించి మై నివాళించె నొకచూపు
ఇక్కువల శ్రీవేంకటేశుకౌఁగిటఁ గూడి
కక్కసపుఁ తమకములఁ గదిసె నొకచూపు

పె శృ రేకు: 99-5 శ్రీరాగం సం: 17-537

పల్లవి: నేఁడే పెండ్లివేళ నేఁడే నాగవల్లి
ఆడుచు సోబానఁ బాడు మనరే చెలులూ

చ. 1: కకాంబరుఁ డతఁడు కనకకుచగిరి యీాకె
కొొనబుగల యిద్దరికిఁ గూడెఁ బొంతనము
వనజనాభుఁ డతఁడు వనజలోచన యీాకె
ఘనమైన కంకణము గట్టరే చెలులు

చ. 2: నీలవరుఁ డతఁడు నీలకుంతలి యీాకె
చాలుకొని యిద్దరికి జంట దగును
ఆలరైన శంఖధరుఁ డతఁ డీకె కంబుకంఠి
యీా లీల నారతులు యెత్తరే చెలులు

చ. 3: జలధిశాయిని యతఁడు జలధికన్నెక యీాకె
కలిగె నిద్దరికి నొొక్క కైవాడము
అలరు శ్రీవేంకటేశుఁ డతఁ డీకె మహలక్ష్మి
వెలయఁగల సిరి దీవించరే చెలులు

పె శృ రేకు: 99-6 రామక్రియ సం: 17-538

పల్లవి: ఎగ్గు లేల తప్పు లేల యిందులోనే రమణుఁడ
నిగ్గుల మెఱుఁగులలోన నెర సున్నదా

చ. 1: చిగురుమోవి గనక జిగి నల్లాడెనో కాక
మగువ నిను గొణఁగి మాటాడెనా
వొగిఁ గన్నుఁగలువలు మొగి విరియవో కాక
సొగసి నీతో నలిగి చూడ దాయనా

చ. 2: తతిగాక ముఖచంద్రోదయము గాదో గాక
అతివ నీ కవ్వలిమోమై యుండెనా
సతి నవ్వువెన్నెలలు చకోరాలంటెనో కాక
పతి నీవు నవ్వఁగాను నవ్వకుండెనా

చ. 3: బాహులత లటుగాను పైఁ బారెనో కాక
సాహసించి నీరతిలివి జవ మీరేనా
యీహల శ్రీవేంకటేశు యిటు నీవు గూడఁగాను
మోహపుగో రంటెను మొన చూసెనా

పె శృ రేకు: 100-1 హిజ్జిజి సం: 17-539

పల్లవి: వెగ టాయనో కాక విరసమో తమలోన
చిగురుఁ గైదువవాఁడు చేసినట్టి మాయలో

చ. 1: వెన్నెలలు గోలుఁ గాక వేడుకఁ జకోరాలు
వెన్నెల లుమియఁజొచ్చే విధ మేఁటిదే
సన్నపుఁ దుమ్మెద లెల్లా జలజమే చేరుఁ గాక
సన్నల నొకటొకటి జారిన దేఁటిదే

చ. 2: జలమును లత లెల్లా సరి దాఁ జేకొనుఁ గాక
జలము తాఁ గుమ్మరించే జాడలేఁటికే
మెలుపు సంపంగె వుమీఁదగాలి మించుఁ గాక
పొలసి సంపెంగలోనఁ బొడమునాగాలి

చ. 3: జక్కవలుజంట గూడిసమ్మతించుఁగాక నేఁడు
జక్కవ లొండొకటితో జరసీ నేమే
యెక్కువ శ్రీవేంకటేశుఁ డింతితోఁ గూడఁగ నేఁడు
వక్కణించుఁ దొల్లింటివలె నాయఁ గాలమూ

పె శృ రేకు: 100-2 రామక్రియ సం: 17-540

పల్లవి: నీకు నిచ్చకమాడనేర్తుఁ గాక యిట్లయినఁ
గాక నీ కెదురాడఁగలనా నేను

చ. 1: చలివిడిచి నాయకుని సాదించుఁ గడు నొకతె
అలరి తను నెడసితే నలుగు నొకతె
వొలసి నొల్లమియైన వొగిఁ గోపగించు నొకతె
నిలిచి యింతటికి నేర్తునా నేను

చ. 2: సరవి దప్పిన విభుని జంకించుఁ గడు నొకతె
సరసంబు లాడితే జరయు నొకతె
వరుస వంతెడలినను వాదించు మఱి యొకతె
పరగ నింతేసి కొడఁబడుదునా నేను

చ. 3: అంకంపు రతులలో నలయించుఁ బతి నొకతె
మంకుమర్మపుఁ గళల మఱచు నొకతె
యింకేల శ్రీవేంకటేశ కూడితివి నను
వుంకువల వెనకఁ దడవుదునా నేను

పె శృ రేకు: 100-3 నాదరామక్రియ సం: 17-541

పల్లవి: వలసి నొల్లమి గాదు వనిత మోహం బిదియే
అలుక గాదొ విభుఁడ అతివఁ జేకొనుమీ

చ. 1: కప్పురము నీ వంపఁగా జూచి మా రమణి
దపతో గాలిమంటపము దూరె
అప్పటి దవ్వులనే అద్దంబు గని మోము
దిప్పి ముత్యాలపందిలి కేఁగెను

చ. 2: చలివేఁడి తేనియలు సతికి నీ వంపఁగా
నెలమితోఁ బువ్వుఁబొదరింటి కేఁగె
ములువాఁడి ననవిరులు మొగి మఱియు నంపఁగా
దెలిసి నీలపుదోమతెర మాటు కేఁగె

చ. 3: యింతలో శ్రీవేంకటేశ చిగురుఁ గిల్లాకు
కాంత కియ్యఁగా మదనుగరిడి చేరి
దొంతి తామెరలు తోడుతనే చూపఁగా
సంతసంబున చంద్రశాలలో నిలిచె

పె శృ రేకు: 100-4 వరాళి సం: 17-542

పల్లవి: దినదినము నిట్ల నెడతెగకుండ సన్న సేసే
యెనయు నాయకు నింక నెట్టు దెలిసేదే

చ. 1: కనుఁగొనల నొకదినము కాంత యిక్కువ చెప్పె
దిన మొకటి మోమునను తిరుగఁ జెప్పె
వొనర నధరమున వేరొకదినము గుఱి చెప్పె
పొనిగి రమణునిఁ జెలియ పొద్దులే కడపె

చ. 2: నడుమ నొకదినము చిన్నాణమునఁ బొందు చెప్పె
దిడువుఁగుచముల నొక్కదినము చెప్పె
తొడరి కొనగోరికాంతుల నొకదినము చెప్పెఁ
గడుఁజెలియ పతి కిట్లఁ గాలమే జరపె

చ. 3: గమనముల నొకదినము కలయుపా ద్దెఱిగించె
అమర నిదే శ్రీవేంకటాధిపునకు
సమరతుల సరసముల సకలరతిబంధముల
కమలముఖి యీతనికిఁ గందువలే తెలిపె

పె శృ రేకు: 100-5 ఆహిరి సం: 17-543

పల్లవి: సేసే దే మిక మన మిటు చెలియకు నుపచారంబులు
సేసల రమణునిచిత్తమే శేఖర మిఁక నేమే

చ. 1: కప్పుర మిచ్చిన నంటదు కామిని దన మదనాగ్నుల
నిప్పులమీఁదటఁ గప్పిన నిగురదే యంటాను
పుప్పొడిచల్లిన నులికి పువ్విలుతుని వెడదాడికి
వుప్పర మెగసి దుమ్మనీ వొ చెలి యిది యేమే

చ. 2: కాంతకు కస్తూరి యిచ్చిన కలఁగి తనమది ముంచిన
చింతల చీఁకటి లోపలి సిలు గిది యంటాను
వింతగు వెలివము గప్పిన వేసవి వెన్నెల నురుగులు
పొంతట పైఁ గప్పె ననచు పొగిలీ నిది యేమే

చ. 3: చందన మిచ్చిన నొల్లదు సతి యిటు వలపులనూఁదిన
మందులు ముద్దగఁ జేసిన మాయ లి వంటాను
యిందునే శ్రీవేంకటపతి యీసతి నింతటఁ గూడఁగ
ముందును వెనకయుఁ దెలిసెను మోహం బిది యేమే

పె శృ రేకు: 100-6 ముఖారి సం: 17-544

పల్లవి: ఇల నట్టినే కదా యెక్కువలుఁ దక్కువలు
కలవెల్ల భువి నిందు ఘనతలే కలిగే

చ. 1: నడుము సన్నంబైన నలిఁ బిఱుఁదు ఘన మాయ
జడిసి కలిమికి లేమి సరికి సరియే
అడుగులే చిగురు గోళ్లందువే చేఁ గాయ
పడఁతి చలిమికి బలిమి పైపైనే కలిగే

చ. 2: కొనచూపుదెలు పైన కొప్పు గడు నలుపాయ
నినుపుఁ జీఁకటికి వెన్నెలకు సరియే
వనితమోవియే చిగురు వజ్రాలే పలువరుస
ననిచి ముద్దువుకు వాడి నవ్వుచునే కలిగే

చ. 3: చెలియ మతిమఱపైన చేఁత లధికం బాయ
కలయికలు వెలయికలు గడఁగి సరియే
వలచి శ్రీవేంకటేశ్వరుఁ డింతిఁ గూడఁగా
తలఁపునకుఁ దలఁపునకు తగులంబుగలిగే

రేకు: 0801-1 కన్నడగౌళ సం: 18-001

పల్లవి: ఏమని పొగడవచ్చు నిదివో నీ దేవులను
కామించి నీచిత్త మెంత గరఁగెనో కాని

చ. 1: పలచని కెమ్మోవిఁ బలువరుసల కెంపు
దొలఁక మాఁటలాడీఁ దొయ్యలి
కలువరేకుఁ గన్నులఁ దళుకులు మెరువఁగా
సొలసీ నిన్నుఁ జూచి సొబగులు దేరును

చ. 2: ముసిముసి నవ్వులతో మోమునఁ జంద్రకళలు
విసరుతా సిగ్గువడీ వెలఁ ది
పసిఁడి వన్నెల గుబ్బపాలిండ్లు గదలఁగా-
నొసగీ బాగాలు నీకు నుడివోనియాసల

చ. 3: సొగకరములగోళ్ళు సోఁకకుండా నీకు నిట్టె
బాగుగఁ బాదాలొత్తీఁ బడఁతి
లాగుగ శ్రీవేంకటేశ లలితాంగిఁ గూడితివి
యీగతి రతిఁ జొక్కించీ నిట్టే నిన్ను నింపుల

రేకు: 0801-2 ధన్నాసి సం: 18-002

పల్లవి: చెలికత్తెలతో నేల చేరి సరసమాడేవు
వలపించితినా నీ వద్ద నుంటిఁ గాక

చ. 1: పలుకుఁదేనెల నిన్ను భ్రమయించ వచ్చితినా
చెలియమాటలు నీకుఁ జెప్పితిఁ గాక
కలికితనాల నీకుఁ గడుగుట్టు సేసితినా
వెలి నిన్నుఁ జూచి చూచి వెరగందితిఁ గాక

చ. 2: అక్కరతో నీకు నడియాసలు చూపితినా
యిక్కున లంటఁగాఁ గాను కిచ్చితిఁ గాక
మక్కువ సేయుమనుచు మర్మము లంటితినా
చేతులు నోక్కఁగఁ జేత మొక్కితిఁ గాక

చ. 3: యొనయుమనుచు నీతో నెరుక సేసితినా
వోనర నే నీపాదా లొత్తితిఁ గాక
ఘనుఁడ శ్రీ వేంకటేశ కాఁగిట నన్నేలితివి
మనసు సోదించితినా మరిగితిఁ గాక

రేకు: 0801-3 దేశాక్షి సం: 18-003

పల్లవి: తడవాయ నీవద్దికి తానే వచ్చునో యేమో
యెడయక నీవునీవే యెరుఁగుదువయ్యా

చ. 1: విందువలె నాకెమాఁట విన్నవించితిమి నీకు
అందుకు మారుమాఁట లానతీవయ్యా
సందడికోలువు నీకు సతులెందరో కలరు
మందలిం చాకెకిచ్చినమాఁట దలఁ చవయ్యా

చ. 2: గక్కన నాపెయంపినకాను కిచ్చితిమి నీకు
యిక్కువైన ఆనవాలు యియ్యివయ్యా
పెక్కుపనులవాఁడవు ప్రేమ నీ కెందునుండునో
యెక్కువ నీచుట్టరిక మెంచుకొనవయ్యా

చ. 3: చెలఁగి యాకెమారు చేయెత్తి మొక్కితిమి
తిలకించి నీవిందుకు దీవించవయ్యా
యెలమి శ్రీ వేంకటేశ యిట్టెవచ్చి కూడితివి
మలసి యీననుపులు మరువకువయ్యా

రేకు: 0801-4 మాళవశ్రీ సం: 18-004

పల్లవి: కంటిమి కొత్తలు గొన్ని కన్నులపండుగగాను
అంటితివో లేదో నాతో నానతీవయ్యా

చ. 1: చనవరిమాటలు సారెకు నీతో నాడి
చెనకీ నెవ్వతో కాని చెలి నిన్ను
తనివోనియాసలతో తగులువిరితనాన
పెనఁగులాడుతా నీపైఁ బ్రేమము చల్లీని

చ. 2: సందడిఁ దానేమౌనో సరసనే కూచుండి
అంది విడేలియ్యనవచ్చీ నప్పటి నీకు
మందెమేళాలు సేసుక మలసి సొలసి నవ్వి
సందుసుడిఁ దనమోవిచౌలు చూపీని

చ. 3: పచ్చిదేర నాడానీడా పంచలఁ బొలసుకొంటా
యెచ్చరిక లేల సేసీ నేమీ యాపె
యిచ్చట శ్రీ వేంకటేశ యేలితిని నన్ను నేఁడు
నచ్చుకొట్టుతాఁ గొంత నవ్వఁ గ లాచీని

రేకు: 0801-5 దేవగాంధారి సం: 18-005

పల్లవి: చక్కనివాఁడ వన్నిటా జాణవు నీవు
మక్కువ నీకుఁ జేయుటే మాభాగ్యము గాదా

చ. 1: వన్నె కెక్క నీకు నేను వలవ నావసమా
కన్నులనే చూచి చొక్కఁ గలఁ గాక
చన్నుల నొత్తి కాఁగిలించఁగ నావసములా
సన్నలనే నీమోవి చవిగొంట గాక

చ. 2: ఆయమెరిఁగి పెనఁగ నప్పటి నావసమా
కాయమంటి సంతోసించఁగలఁ గాక
చేయిముట్టి నే నిన్నుఁ జెనకఁగ వసమా
చాయలకు నీతో సరసమాడుట గాక

చ. 3: పిలిచి నిన్ను రతులఁ గలయఁ గ వసమా
చెలరేఁ గి నీసేవ సేయుట గాక
యెలమి శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
తలఁ చ నిన్ను వసమా తగులుట గాక

రేకు: 0801-6 శుద్ధవసంతం సం: 18-006

పల్లవి: విభునితో నీఁకనేలే వేసాలు
శుభశోభనములెల్లాఁ జూపవలెఁ గాని

చ. 1: చేరి సంగడిఁ గూచుండి సిగ్గులువడితేఁ బోదు
పూరకే తలవంచుక వుండఁ గరాదు
గోరగీరఁగా నొద్దుకొంటే సంగతి గాదు
కూరిమితో రతి కియ్యకొనవలెఁ గాని

చ. 2: తప్పక మొగాలు చూచి తలవంచుకొంటేఁ బోదు
ముప్పిరిఁ జిరునవ్వులు ముయ్యఁగరాదు
పిప్పిగా మోవి యానఁ బెనఁగేది బుద్ధిగాదు
కుప్పలు దెప్పలుగాఁ గూడవలెఁ గాని

చ. 3: జిగిఁ జన్నులు సోఁకించి చెమరించితేఁ బోదు
అగపడి కాఁగిలించి యలయరాదు
వెగటు లేక యేలె శ్రీ వేంకటేశుఁ డిట్టె నిన్ను
తగులై యిట్లానే పొందఁగవలెఁ గాని

రేకు: 0802-1 కాంబోది సం: 18-007

పల్లవి: నీ వేల సిగ్గువడేవే నెలఁతా
యీవలఁ జెలికతైల మెగసక్కె మాడేమా

చ. 1: చుక్కలవలె నీమోవి సూదివాటు లుండఁ గాను
యిక్కున నీకెంగేల నేల మూసేవే
తక్కక గజరుఁజేఁతలవాఁ డు నీ మగడు
యెక్కడా లేనిదా యందుకేమాయనే

చ. 2: నాటుకోని చెక్కుల పై నవచంద్రకళ లుండఁ గాను
గాటవుఁ గస్తూ రెంతకడు మెత్తేవే
మేటియైన నీ విభుఁడు మిక్కిలి నారజకాఁడు
ఆఁటదానికిఁ గలదే యందుకేమాయనే

చ. 3: తగ నీమెయి నాడాడ తమ్మచదురు లుండఁగ
పొగరుఁగుంకుమలేల పూసుకొనేవే
జగములో శ్రీ వేంకటేశ్వరుఁడె జాజరకాఁడు
అగపడి నిన్ను నేలె నందుకు నేమాయనే

రేకు: 0802-2 శంకరాభరణం సం: 18-008

పల్లవి: పోలించి చూచితేను పొఽసగు నిద్దరికిని
మేలువారు తొల్లె మీరు వోలలాడరయ్య

చ. 1: కదిసి యింతి నీతో కడు మాఽటలాడఁ గాను
అదె మోవిచిగురులు యల్లాడఁ జొచ్చె
యిదె వసంతకాలము యెదిరించె నీకు నేఁడు
సదరాన వలపులు చల్లులాడరయ్యా

చ. 2: కందువఁ గాంత నిన్నుఁ గాఁగిలినిచుకొనఁగాను
అందమై బాహులతలు అల్లుకోఁ జొచ్చె
వింతజాజరకాలము వేడుకతోఁ దలఁపించె
సంతోసపుచిరునవ్వు చల్లులాడరయ్యా

చ. 3: ఆంచెల రతివేళల నంగన నిన్నుఁ గూడఁ గా
మించి గుబ్బలపూగుత్తులు మెరయఁ జొచ్చె
కొంచక శ్రీవేంకటేశ కూడె నామనికాలము
చంచలించక యింపులు చల్లులాడరయ్య

రేకు: 0802-3 బౌళిరామక్రియ సం: 18-009

పల్లవి: ఇంతటిమీఁదిపనులు యింక నీ చేతిలోనివి
పంతమున మోహము నీపై వేసుకోన్నది

చ. 1: వెలయఁ గ నీకు నన్ని విన్నపములునుఁ జేసి
తల వంచుక వున్నది తరుణి
కలయ నీమేనెల్లా కందువచూపులఁ జూచి
తలఁచుకొంటా నున్నది తనలోనను

చ. 2: పనివడి తెచ్చి నిమ్మపండు నీచేతికిచ్చి
నినుపుసిగ్గులతోడ నిలుచున్నది
నన్నుపునఁ గొంత చిరునవ్వు నీముందర నవ్వి
తనియక చెమటల దైవారీని

చ. 3: కడునిచ్చకముగాఁగ గక్కన నీపాదా లొత్తి
వుడివోని బత్తితోడ నోలలాడీని
యెడయక శ్రీ వేంకటేశ నీవు గూడఁ గాను
చిడుముడిఁ జెలులతోఁ జెప్పి మెచ్చీని

రేకు: 0802-4 నీలాంబరి సం: 18-010

పల్లవి: ఎంత వేడుకో నీకు యీపెమీఁదను
వింతలెల్లా జూచి మాకు వెరగయ్యీ నిపుడు

చ. 1: ప్రియమున నీతోడ ప్రియురాలు మాఁటాడఁగ
ఆముకొని వినేవు నీ వప్పటనుండి
గోమున నేపొద్దు నీకుఁ గొలువులు సేయఁగాను
జామటనుండి యిట్టె సంతోసించేవు

చ. 2: అప్పటిని బాగాలిచ్చి ఆకుమడిచియ్యఁగాను
వుప్పతిల్లుఁ గళలతో నుబ్బేవు నీవు
చిప్పిలఁగ నిన్నుఁ జూచి సెలవుల నవ్వఁగాను
చెప్పరానితమకానఁ జిమ్మిరేఁగేవు

చ. 3: నేరుపులెల్లా మెరసి నీకు బాదా లొత్తఁగాను
బోరున నీనిలువెల్ల బులకించేవు
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నీదేవుల
గారవపురతులనుఁ గడుఁజొక్కేవు

రేకు: 0802-5 నాదరామక్రియ సం: 18-011

పల్లవి: ఎంత వలతువో కాని యీతనికిని
చింతలెల్లఁ జిగిరించి చిమ్మిరేఁగెనే

చ. 1: చక్కనినీరమణుఁడు సరసము లాడితేను
లక్కవంటినీమనసు లలిఁ గరఁగి
చెక్కులపై చెమటలు చీరుమోవితేనెలు
వొక్కమాటే చెలరేఁగి వూట్లైత్తెనే

చ. 2: మచ్చికతో నీమగఁడు మాఁటలాడీనంతలోనె
పచ్చినీజవ్వనమెల్ల పదనెక్కి
పచ్చని మెయిపులకలు బాగుగా మోముకళలు
విచ్చనవిడిఁ దోడుతో వెదలై మొలచెనే

చ. 3: యెన్నఁగ శ్రీ వేంకటేశుఁడిట్టె నిన్నుఁ గూడఁగాను
చన్నులై నీవురమున నెన్నులు వెళ్ళి
కన్నులఁ జూచేకాంక్షలు కాఁగిటిలోనిరతులు
పన్ని యిరువంక నొక్కపరే రాసులాయనే

రేకు: 0802-6 తెలుఁగుఁగాఁబోది సం: 18-012

పల్లవి: వెంగెములు నిన్నాడను వేసరించను
సంగతిగ నీకు నిచ్చకమే సేసేను

చ. 1: తలపోఁత లెన్ని లేవు తమకము లెన్ని లేవు
వలచినయటువంటివనితకును
కలువల వేసి నన్నుఁ గమ్ముక యెంతడిగేవు
నెలకొన్ననీచేఁతలు నీవెరఁగవా

చ. 2: వాడుమోవైతే నేమి వంచినతలైతే నేమి
వోడక విరహముతో నున్న దానికి
యీడకు వచ్చితివిగా యిప్పుడు వేఁడుకోనేల
వేడుకకాఁడవు నీకు వెలితున్నదా

చ. 3: నివ్వెరగులు గడమా నిండునవ్వులు గడమా
వువ్విళ్లూర నిన్నుఁగూడి వున్ననాకును
యివ్వల శ్రీ వేంకటేశ యెంత నన్ను లాలించేవు
నివ్వటిల్లు నేర్పరివి నీకు నేఁడు గొత్తలా

రేకు: 0803-1 హిందోళం సం: 18-013

పల్లవి: ఎదిరిఁ దన్నెరఁగని దేఁటియాఁటది
కది సేవు వలపులకలగంప గలఁదా

చ. 1: కూరమి నావద్ద వచ్చి కూచుండినపతితోను
సారెసారెఁ గొసరితే చవి వుట్టునా
నారుకొన నాతోను నవ్వు లితఁడు నవ్వఁగ
చేరి చెనకే వెంత చిత్తణివే నీవు

చ. 2: మందలించి నాతోను మాఁటలాడఁగానే నీవు
సందుసుడిఁ గత చెప్ప సంగతే యిది
కందువ నాతఁడు నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
అంది విడేలిచ్చే వెంతాయాసోదకత్తెవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నేనూఁ జేరి తెరలో నుండఁగా
సేవలకు దగ్గరేవు చెల్లదే నీకు
కైవశమై నాకితఁడు గలసిమెలఁగుండఁగా
నీవుఁ జెప్పుకొనే వేఁటినేరుపరివే

రేకు: 0803-2 దేసాళం సం: 18-014

పల్లవి: వలచి వచ్చితి నేను వానికిఁగాను
నెలవై మీ గొల్లవాడనే తానుండు నఁటా

చ. 1: చెందమ్మి కన్నులవాఁడు చేతిపిల్లఁగోవివాఁడు
యిందు వచ్చెఁగంటిరా యేమిరే యమ్మా
మందలపసువులవాఁడు మకరాంకములవాఁడు
యెందు నున్నాఁడు చెప్పరే యేల దాఁచేరమ్మా

చ. 2: నెమలి పింఛెమువాఁడు నీలమేఘకాంతివాఁడు
రమణుఁడాతఁడు మొక్కె రమ్మనరమ్మా
జమళి చేతులవాఁడు సంకుఁజక్రములవాఁడు
అమర మీపాలఁ జిక్కునట చూపరమ్మా

చ. 3: పచ్చఁబైఁడి దట్టివాఁడు పక్షివాహనపువాఁడు
యిచ్చినాఁడు నా కుంగర మిదివో యమ్మా
చెచ్చెరఁ గొనేటివాఁడు శ్రీ వేంకటేశ్వరుఁడు
వచ్చి నన్నుఁ గూడినాఁడు వాఁడువో యమ్మా

రేకు: 0803-3 కౌశి సం: 18-015

పల్లవి: నీకు బాఁతై నీముందర నిలుచున్నది
దాకొరి నిన్నెటువలెఁ దగిలీనో కాని

చ. 1: చెలరేఁగి చెలరేఁగి సేవలు సేసీ నాపె
వలచి తానెందుండి వచ్చెనో కాని
వెలలేని సింగారాల వింత మొగము దాపె
కలయ నెన్నాళ్ళనుండి కలిగెనో కాని

చ. 2: నిట్టచూపులతోడ నీ మొగము చూచీ నాపె
వొట్టి నీవేవూరో తానేవూరో కాని
బట్టబయలు నీతోను పై కొని నవ్వీ నాపె
చుట్టరికము నీకుఁ దా నెట్టాయనో కాని

చ. 3: పొంచి నీవద్దఁ గూచుండి పువ్వులు ముడిచీ నాపె
అంచెలఁదా నెన్నఁడు పెండ్లాడెనో కాని
యెంచఁగ నన్ను శ్రీ వేంకటేశ నేఁడు గూడితివి
పంచలపాలై తానేల పదరీనో కాని

రేకు: 0803-4 కన్నడ గౌళ సం: 18-016

పల్లవి: ఏమి చెప్పేది నీసుద్దులు యెంతవాఁడవు
చేముట్టి నామీఁద నిట్టె సేసలు చల్లేవు

చ. 1: ముచ్చట నెవ్వతైనా నీమోము చూచితేఁ జాలు
చెచ్చెర మేనవాని చెప్పుకొందువు
మచ్చికతో నొకమారు మాఁటాడితేఁ జాలు
గచ్చుల నంతటిలో కంకణము గట్టుదువు

చ. 2: చెంగట మగవాఁడని సిగ్గువడితేఁ జాలు
సంగడి నందుకే సరసమాడుదువు
ముంగిటికి నీవు రాఁగా మొనసి మొక్కితేఁ జాలు
కొంగువట్టి పెనఁగి గక్కునఁ గాఁగిలింతువు

చ. 3: చిప్పిలు నీసేఁతలకు సెలవి నవ్వితేఁ జాలు
దప్పి దేర మోవి యాని తగులుదువు
యిప్పుడిట్టే శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వొప్పుగ రేయిఁబగలు వొనగూడి యుందువు

రేకు: 0803-5 సామంతం సం: 18-017

పల్లవి: చూడఁబిన్నవు గాని నీసుద్దు లెన్నైనాఁ గలవు
వేడుకకత్తెకుఁ గాని వేసాలింత రావే

చ. 1: తేలగిల రమణుని దిష్టించి సారెఁ జూచేవు
చేలకొంగాతఁ డంటితే సిగ్గువడేవు
నాలితనాన సెలవి నవ్వ్వాఁ గొంత నవ్వేవు
యీలీల తరితీపులు యెన్ని నేర్చుకొంటివే

చ. 2: మునుకొని మగవాని ముందరనూఁ బొలసేవు
పెనఁగి పైకొంటేఁ దప్పించుకొనేవు
మనసిచ్చి యంతలోనె మంచిమాఁట లాడేవు
యెనలేనియడియాస లెన్ని నేర్చుకొంటివే

చ. 3: సేవ సేసే దానివలె చేరి వద్దనే వుండవు
శ్రీ వేంకటేశుఁ డేలితే జీరదీసేవు
భావించాడతఁడు నన్నేలె పాదాలకు మొక్కేవు
యీవిధాన నిట్టిబూమె లేమి నేర్చుకొంటివే

రేకు: 0803-6 ముఖారి సం: 18-018

పల్లవి: ఎఱఁగ గొల్లపడుచ నిల్లు గాచుకుండగాను
మఱి కృష్ణుఁడు వచ్చి నామయి చెమరింపించెనే

చ. 1: పాపట దువ్వేనంటా బాసికము గట్టినాఁడే
చాఁపేనంటాఁ జేత సేసలు చల్లేనే
కాఁపురాలు సేతమని కాఁగిటించుకొనెనే
మాపుదాఁకా నేమో సేసి మనసు గరఁచెనే

చ. 2: కై దండ వట్టేనంటా కంకణము గట్టెనే
జూదాలాడేనంటా రొమ్ముచొటు గీరెనే
సోదించేనంటా వొడి చూపుమని పట్టెనే
పోదిసేసి వేగినంతా పులకలు రేఁచెనే

చ. 3: మొగము చూపు మనుచు మోవిపొత్తు గలసెనే
నగేనంటా బిగ్గెఁబట్టి నా మెక్కించెనే
చిగురుఁబడుకమీఁద శ్రీ వేంకటేశుఁడు
తగురువలె మాఁటాడి తలఁపు చొక్కించెనే

రేకు: 0804-1 సౌరాష్ట్రం సం: 18-019

పల్లవి: అంతే పో వోయమ్మ ఔనయ్య మంచివాఁడవు
పంతాన నీతోఁ బేనఁగేపాటిదా యీమగువ

చ. 1: కన్నె పడుచైనదానిఁ గాఁగిట బిగింతురా
పన్ని పూవువలెఁ జేతఁ బట్టుట గాక
చిన్నిచన్ను లొక్కమాఁటే చిప్పిలఁ బిసుకుదురా
మన్ననలనే రతుల మరపుట గాక

చ. 2: సిగ్గరి పెండ్లికూఁతురుఁ జింధు వందు గాఁ దీతురా
వొగ్గి రొమ్ము మీఁదఁ బెట్టుకుండుట గాక
కగ్గులేని కెమ్మోవి కడుఁ బిప్పి సేతురా
తగ్గుకుండాఁ గాఁగిటఁ దమిరేఁచుటగాక

చ. 3: కొత్త వయసుపడుచు గోరికొన సోఁకింతురా
పొత్తుగ లాలన సేసి పొందుటగాక
యిత్తల శ్రీ వేంకటేశ యిన్నిటా నీవేలితివి
నిత్తెము నీ సేవలెల్లా నేరుపుటగాక

రేకు: 0804-2 దేసాళం సం: 18-020

పల్లవి: ఇదివో నీపొందు లెట్టనరాదు
కదిసితే నంటురాయిగతివంటివాఁడవు

చ. 1: సూటిగా నీసింగారము చూడఁగవచ్చుఁగాని
నాటినచూపు దిప్పుకొనఁగరాదు
మాటలు నీతో నాడి మలయఁగవచ్చుఁగాని
మాటికి నీసల్లాపము మరవఁగరాదు

చ. 2: ననుపు సేసుక నీతో నవ్వఁగవచ్చుఁగాని
వెనక నది యణఁచుకొనఁగరాదు
చెనకి సరసమున చేత నంటవచ్చుఁగాని
పెనగొన్న కేలు విడిపించఁగరాదు

చ. 3: కలయికరతి నిన్నుఁ గాఁగిలించవచ్చుఁగాని
వలవంతఁ గొంతైనా వదలరాదు
చెలరేఁగి నీవె నన్ను శ్రీ వేంకటేశ కూడితివి
యిల మెచ్చవచ్చుఁగాని యేమి ననరాదు

రేకు: 0804-3 మేఘరంజి సం: 18-021

పల్లవి: మొదల నిన్నుఁ జూచితే మొగమోటము గనము
యెదరు గుదురుగా నిన్నేమి సేతుమయ్యా

చ. 1: కొంచక నీవు సేసేవి గొప్పగొప్ప చేఁతలు
మంచిమాట లాడేవు మాతో నైతే
పొంచి చెవులారా వింటే పొసఁగ నీప్రియాలు
యెంచారావు పంచారావు యేమి సేతుమయ్యా

చ. 2: యెక్కడ నైనా నీచల మెంతవలసినాఁ గద్దు
పక్కన నవ్వేవు మాతో పలుమారును
యిక్కడనే కంటిమి నీయిచ్చలు కోటికొండలు
యెక్కారావు దిగారావు యేమి సేతుమయ్యా

చ. 3: హత్తిననీదేవుళ్ళు అంతటా నిండి వున్నారు
గుత్తముగా నాకాఁగిటఁ గూడితి విందు
నిత్తెము శ్రీవేంకటేశ నీవలపు మోపులాయ
యెత్తారావు దించారావు యేమి సేతుమయ్యా

రేకు: 0804-4 శ్రీరాగం సం: 18-022

పల్లవి: నవ్వుగాదు నే నిన్ను నమ్మితిఁ జుమ్మీ
యివ్వల నా మోవి లంచ మిచ్చితిఁజుమ్మీ

చ. 1: మంతనాన నీవాడినమాటలు మఱవకుమీ
కాంత లెందరైనా నీకుఁ గలవాఁడవు
వింతలేకుండా నిప్పుడే విన్నవించుకొంటి నేను
అంతలోనే ఇది బాస యడిగె ననకుమీ

చ. 2: గట్టిగాబిగించుకొన్న నాకాఁగిలిఁ దలఁచుకొమ్మీ
గుట్టునఁ బెక్కుసతులఁ గూడేవాఁడవు
వొట్టి సేవలెల్లాఁ జేసి వొడఁబాటు సేసుకొంటి
నెట్టనే నిన్ను మీఁదుకట్టితి ననకుమీ

చ. 3: పుక్కిటితమ్మ వెట్టినపొందు విడువకుమీ
మిక్కిలివనితలకు మేలువాఁడవు
నెక్కొని శ్రీవేంకటేశ నిన్ను నిందుకే కూడితి
చొక్కించి నాసొమ్ముగాఁ జేసుకొనె ననకుమీ

రేకు: 0804-5 ఆహిరి సం: 18-023

పల్లవి: ఆఁపలేక కొసరితి నంతియకాక
పైపై నిన్నింత వొడఁబరచఁగవలెనా

చ. 1: తలఁపులో తమకము దాఁచ నలవిగాక
చెలరేఁగి విన్నపము చేసితిఁగాక
మలసి నీయంత నీవు మన్నించవా నన్ను
నెలకొన్న నావలపు నీ వెరఁగనిదా

చ. 2: తనువు పై జవ్వనమదము వారించఁగరాక
వొనర నాచన్నుల నిన్నొ త్తితిఁగాక
ననుపుతో చనవులు నాఁడే నాకియ్యవా
నిను పైననావునికి చూడనిదా

చ. 3: వెసఁ గాఁగిటిలో రతివేడుక వసముగాక
పసలుగా నిన్నుఁ గూడి పై కొంటిఁగాక
పొఁసగ శ్రీ వేంకటేశ భోగము నాకియ్యవా
యెసగ నా గుణము నీవిటు సోదించనిదా

రేకు: 0804-6 గౌళ సం: 18-024

పల్లవి: ఎందరిఁ బెండ్లాడినా నీకేమాయను
అందుకుఁగానే నిన్ను నౌఁగాదనేనా

చ. 1: వలచి వచ్చితినని వనిత వేఁడుకొనఁగా
చెలిమి సేయక యేల సిగ్గువడేవు
సొలపుఁ జూపుల నిన్నుఁ జూచిచూచి కొసరఁగా
తలవంచుకొని యేల తప్పించుకొనేవు

చ. 2: కాఁపురము సేయవచ్చి కాచుకొని యాపె వుండఁగా
యేపున నీవు నెలవి నేల నవ్వేవు
పైపై నీతమ్ములానకు భామ చేయిచాఁచఁగాను
రాఁపుజాణతనా లేల రచ్చలో నాడేవు

చ. 3: వేడుకతో నాపె నీకు వెసఁ బాదాలొత్తరాఁగా
కూడుదువు గాక యేల గుట్టుచూపేవు
యీడనె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వీడెమిచ్చేసతి నేల వింతసేసేవు

రేకు: 0805-1 భైరవి సం: 18-025

పల్లవి: చెలులము మాచేతఁ జెప్పించరాదు
వెలయ నాతఁడు నీవు విచారించుకొనవే

చ. 1: సిగ్గువడ నేమిటికి చిత్తములోనివేడుక
యెగ్గుగాదు రమణుని కెరిఁగించవే
తగ్గించి దాఁచవచ్చునా తలఁపులోనివలవు
వొగ్గి యాకతానకు నీవు వొనరిక దీయవే

చ. 2: ముసిముసినవ్వులేల ముంచిననీకోరికలు
వెస నాతడుఁ చెల్లించీ వేఁడుకొనవే
వసగాని చన్నులజవ్వన మొద్దంటేఁ బోవునా
కొసరి చూపుదుగాని కూడి తెరవేయవే

చ. 3: సన్నలుఁ జాయలు నేల చలమున నీయాస
పన్ని యితఁ డీడేరిచీ విన్నవించవే
నిన్న నే తాఁ గూడినాఁడు నీవేల మొరఁగేవు
యెన్నిక శ్రీ వేంకటేశు నింకాఁ గాఁగిలించవే

రేకు: 0805-2 శ్రీరాగం సం: 18-026

పల్లవి: ఎంత సింగారించుకొంటి విప్పుడు నీవు
చింతించఁ జక్కఁదనమే సింగారము గాదా

చ. 1: కాంత నీవు నిమ్మపండ్లు గాను కియ్యవలెనా
బంతి నీచన్నులే నిమ్మ పండ్లుగావా
పొంత నందుకుఁ దామరపూవుల వేయవలెనా
చెంతఁజూచేనీకన్నులే చెందామరలు గావా

చ. 2: కలికి నీవప్పటిని కప్ర మంపవలెనా
కలగొన్న నవ్వులే కప్రాలు గావా
తెలిసి నీమాఁటల తీపులు చల్లవలెనా
తిలకింప మోవితేనే తీపులు గావా

చ. 3: వనిత యింటికిఁ బిలువఁగ నింతవలెనా
యెనసితే నీపయ్యదే యిల్లుగాదా
చెనకి యలమేల్మంగ శ్రీవేంకటేశుఁడఁ దాను
కని మొక్కవలెనా నీకాఁగిలే మొక్కు గాదా

రేకు: 0805-3 పళవంజరం సం: 18-027

పల్లవి: వింటిరటే చెలులాల వేడుక సంతోసవార్త
యింట నింట వూరనెల్ల యిదే సుద్ది

చ. 1: కోమలి దేవకిదేవి కొడుకుఁ గంటే రేపల్లెఁ
బ్రేమతో వసుదేవుఁడు పెంచఁబెట్టి వచ్చెనట
గామిడై యశోదకూఁతుఁ గంసునికిఁ జూపెనట
ఆమగువ కంసుని నద్దలించినదట

చ. 2: శ్రావణ బహుళాష్టమి సవరేతిరికాడను
ఆవేళ రోహిణి మంచిదైనపొద్దానట
కావింప మేనమామకు గండమట యీతఁడే
దేవరట బాప లెల్లా దిక్కులఁ జెప్పిరి

చ. 3: యిటమీఁద రాకాసుల నిందరిఁ గొట్టెనట
ఘటన సాధులనెల్లాఁ గరుణ రక్షించెనట
పటుగతి వీఁడు శ్రీ వేంకటగిరికృష్ణుఁడట
నటించునల మేల్మంగనాయఁకుడు దానట

రేకు: 0805-4 సామంతం సం: 18-028

పల్లవి: సందుసుడికత్తెలజాణతనా లిట్టివౌనె
పొందులేని పొందులేల పొదువ వచ్చేవే

చ. 1: బట్టబయలాతఁడు నీబావంటా నందరితో
చుట్టరికా లంతేసి చూపి చెప్పేవే
మెట్టిపట్టు కప్పటి నీమేనత్తకొడుకంటాను
జట్టిగొని యాతనితో సరసాలాడేవే

చ. 2: బెరసి యాతఁడు నీపెండ్లి కొడుకవునంటా
సొరిదిఁ గంకణ మెట్టు చూపవచ్చేవే
గరిమ నాతఁడు నికాలు దొక్కినాఁడంటా
పరువుపై నింటిలోనఁ బవళించేవే

చ. 3: వూరకె యిప్పుడు నీవొడివట్టె నీతఁడంటా
నోరమాటలాడి చన్నుల నొత్తేవే
యీరీతి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
నారమణుఁడేలె నన్ను నవ్వులేల నవ్వేవే

రేకు: 0805-5 ముఖారి సం: 18-029

పల్లవి: కాఁగిలించి పట్టుకోరే కల్లరి వీఁడు
మాఁగినమోవి చూపి మరిగించీ వీతడు

చ. 1: కోడెకాండ్లుఁ దాను కోలలెత్తుకొని
వాడవాడల నుట్లు వడిఁ గొట్టీని
వేడుక కాఁడమ్మ వెఁస గృష్ణుఁ డిటువంటి
జాడలు వద్దంటేను చన్నులంటీని

చ. 2: వీదివీదిఁ బాలువెన్న వెఁస గొల్లలాడినాఁడు
ఆదెఁస జాడెలు నిండి అట్టెవున్నవి
పాడుకొని చక్కిలాలబాన విడువుమని
పాదులకు మొక్కితేను పయ్యద దెరచీని

చ. 3: వోసరించక యిదివో వుట్లపండుగ సేసి
వేసరక పెక్కిండ్లవిందైనాఁడు
సేసవెట్టె నిందరిపై శ్రీ వెంకటాద్రిమీఁద
బాసతో నలమేల్ మంగపతియైనకృష్ణుఁడు

రేకు: 0805-6 రామక్రియ సం: 18-030

పల్లవి: చిత్తగించి చూడవయ్య సిగ్గువడ నీకేఁటికి
బత్తిసేసీ నాకె నీ పై భావించవయ్యా

చ. 1: సెలవుల నవ్వుతాను చేరి మాఁటలాడుతాను
పలువరుసలు చూపీఁ బడఁతి నీకు
నిలుగునివ్వెరగుతో నిండుసింగారములెల్లాఁ
బలుమారు నీముందరఁ బచరించీని

చ. 2: కొప్పు చక్కఁబెట్టుకొంటా కొలువులు సేసుకొంటా
నెప్పునఁ జన్నుల నొత్తీ నెలఁత నిన్ను
వుప్పతిల్లుఁగళలతో నుడివోనిజవ్వనాన
కుప్పళించి వలపులు గురిసీ నీయెదుట

చ. 3: సరులు దిద్దుకొనుచు చవులెల్లా మోవిఁ జూపి
మరిగించీ నల మేలుమంగ నిన్నును
ఇరవై శ్రీ వేంకటేశ యిటు నన్ను నేలితివి
పురముపై నుండి యాపె పుబ్బించీ నీమనసు

రేకు: 0806-1 శంకరాభరణం సం: 18-031

పల్లవి: అలమేలుమంగను నేనైతేనయితిఁగాక
నిలుచుండి నన్నుఁ జూచి నీకేల లోఁగను

చ. 1: చేరి విన్నవించవే సిగ్గువడ నీకేఁటికి
చీరుమూరుగా వలచినదానవు
వేరులే కప్పటనుండి వేళగాచుకుందానవు
నేరుపుతో నన్నుఁ జూచి నీవేల లోఁగేవు

చ. 2: గట్టిగాను నవ్వవే కడుదాఁచనేఁటికి
తొట్టినట్టి తమకము తోడిదానవు
నట్టున నందులుఁగానే కోరి లాచివుందానవు
నెట్టన నేనుండఁగాను నీవేల లోఁగేవు

చ. 3: యెనసి కాఁగిలించవేఁ యేఁకరఁగ నీకేఁటికి
పనివడి యట్టె యాసపడదానవు
మునుపె నన్నుఁ గూడె నిమ్ముల శ్రీవేంకటేశుఁడు
నిను నాతఁడే కూడీ నీవేల లోఁగేవు

రేకు: 0806-2 రామక్రియ సం: 18-032

పల్లవి: విచారించవలె నాకు వేడుక కత్తెవు నీవు
పచారించి యతనిఁ జేపట్టవు గదా

చ. 1: చెక్కులవెంట నేలే చెమట గారీ
తెక్కులఁ గన్నుల నేలే తేటలు వారీ
యెక్కడనుండి వచ్చేవే యింతిరో నీవు
మక్కువ నామగనితో మాఁటాడవు గదా

చ. 2: యెన్నఁగ నీపోఁకముడి యేల వీడీ
వన్నెలఁ గెమ్మోవి యాల వసివాడీ
చెన్నుమీర రతి యెందుఁ జేసి వచ్చేవే
అన్నిటా నారమణుని నంటవుగదా

చ. 3: చాలై మేనఁబులకసనులు నిండీ
మేలు నీమేనివలపు మిక్కిలి పండీ
ఆలకించి యెవ్వరిఁ బెండ్లాడి వచ్చేవే
యేలిననా శ్రీ వేంకటేశుఁ గూడవుగదా

రేకు: 0806-3 నాదరామక్రియ సం: 18-033

పల్లవి: వేరే నిన్నుఁ బాసినట్టి విరహమే యరఁగదు
ఆరీతిఁ గూడివుందాననంటానే వున్నది

చ. 1: తలఁపులో నీరూపు తలపోసి మదిరాక్షి
సొలసి మాఁటలాడి చొక్కచు నుండు
వలపు లూరకే చల్లు వాడికలు చేకొని
వులివచ్చిరతులలో నోలలాడును

చ. 2: నెట్టనఁ జేతిబాగాలు నీకు సమర్పణ చేసి
అట్టె తంమ్ములమ్ము నిన్నుడుగుచుండు
గట్టిగా నీవిచ్చిన వుంగరము చన్నులంటించి
తొట్టుకొన్నయట్టిసిగ్గుతోడఁ గడునవ్వును

చ. 3: పైపై నీభావచిత్రపలక కాఁగిటఁ జేర్చి
దీపించు వేడుకతో తెరవేసును
యేపున శ్రీ వేంకటేశ యింతలో నీవు గూడఁగా
వోపికతోనాఁడు నేఁడు నొక్కరీతిం నున్నది

రేకు: 0806-4 లలిత సం: 18-034

పల్లవి: అట్టె నీకాఁగిటి కాపె యాసపడి వచ్చెనేమో
దట్టముగ నిఁక దయదలఁచఁగ రాదా

చ. 1: మోవితేనే లుట్టిపడ ముచ్చటలాడీఁ జెలి
వోవరిలోఁ గూచుండి వూఁ కొనరాదా
చేవమీరఁ గొనగోళ్ళఁ జిక్కుదీసీని నెరులు
సేవలకు మెచ్చి యిట్టె చిత్తగించరాదా

చ. 2: కొనచూపులనే నీపైఁ గుమ్మరించీ వలపులు
పెనఁగక కాఁగిటికిఁ బిలువగాదా
తనివోనితమకానఁ దడఁ బడి నీకు మొక్కీ
చనవు చేకొని సరసములాడరాదా

చ. 3: సెలవుల నవ్వులనే సేసలు నీపైఁ బెట్టీ
లలిఁ గంకణము గట్టి లాలించరాదా
యెలమి శ్రీ వేంకటేశ యేలితి వీకె నింతలో
వెలసె నీకోరికలు విడెమియ్యరాదా

రేకు: 0806-5 సాళంగం సం: 18-035

పల్లవి: నా వల్లఁ దప్పు లేదు నేనా చాటిచెప్పితిని
నాయము మీరు చెప్పరే నాకూ నాతనికీ

చ. 1: పాయపువాఁడు గనక పంతములే యాడీని
చాయల నేనూ నిట్టే జవ్వనిఁగదే
చేయి మీఁదాయనంటాను చెనకఁ గవచ్చీని
ఆయములు నేనూఁ గొంత అట్టె సొఁకింతుఁ గదే

చ. 2: వేడుకకాఁడు గనక వేసీఁ బూవులచెండున
వాడిక నాతమి తనవంటిదే కదే
వీడెమిచ్చితింటాను వెసఁ గొంగువట్టీని
తోడనే నేనూఁ గాలుదొక్కి పైకొందుఁగదే

చ. 3: బలిమికాఁడు గనక పట్టీ నాచనుఁగన
నలి నేనూఁ గాఁగిటఁ బెనఁగుదుఁగదే
యెలమి శ్రీ వేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
కెలసి తనమోవి యెంగిలి సేతుఁ గదవే

రేకు: 0806-6 మధ్యమావతి సం: 18-036

పల్లవి: వెలయ ముందటెత్తు విచారించుకొనవయ్య
కలసేవు నాకాఁగిటఁ గాదనేనా నేను

చ. 1: బచ్చెనమాట లాడి భామ నిన్ను వలపించె
యిచ్చకములే సేసి యిల్లుమరపె
లచ్చనగా మోవిమీఁద లకముద్రలునుఁ బెట్టె
యిచ్చటికి విచ్చేసితి వేమనునో ఆపె

చ. 2: గక్కన తనసొమ్మని కంకణము చేతఁ గట్టె
తక్కన సేవలుసేసి తమిరేఁచెను
పక్కనఁ బూవులదండ పై వేసె గురుతుగా
ఇక్కడ నన్నుఁ జెనకే వేమనునో ఆపె

చ. 3: నెలకొని పాదాలొత్తి నిన్ను నిట్టె పెండ్లాడె
లలి గంటలనూలు నీమొలఁ గట్టెను
చెలఁగి నాకు వలచి శ్రీ వేంకటేశకూడితి....
వెలమి నిట్టె విని యేమనునో ఆపె

రేకు: 0807-1 సాళంగనాట సం: 18-037

పల్లవి: ఈఁదుకరమ్మనవే యిటు నన్నుఁ జూచుఁగాని
యీఁదాడంటేఁ గోదాఁడనేయెడమాట లేఁటికి

చ. 1: వలవు లీఁతలబంటి వడి నాకు నైతేను
తలపోఁతలకునైతే తలబంటి
కలువల కైతేను కాముపింటి తెగబంటి
చిలుకల కెల్లాను మచ్చికఁ బుక్కిళ్లబంటి

చ. 2: పాయము మోపులకొద్ది పైపై నా కైతేను
కాయపుగుబ్బలకైతే గంపలకొద్ది
చాయ వెన్నెలలకైతే చంద్రుడు గాసినకొద్ది
కోయిలలకై తేను కుత్తిక కొద్ది

చ. 3: సారమైనవేడుకలు సందేఁడేసి నాకై తేను
కోరికలకైతేను గుంపెఁడేసి
యీరీతి శ్రీ వేంకటేశుఁ డిట్టెవచ్చి నన్నుఁ గూడె
శేరికల నోరిరోద చెప్పఁ జేటఁ డేసి

రేకు: 0807-2 ఆహిరి సం: 18-038

పల్లవి: మగఁ డట ఆలట మాఁటలెన్నైనా నాడితే
తగు తగదన నేలే తరుణులాలా

చ. 1: పాయపువారికి నెల్లా పట్టపురాదు తమకము
ఆయాలు సోఁకఁ బతితో నాడకుందురా
చేయిమీఁదుగా నీతనిఁ జెనకెనంటా సతికి
నాయము లేమిచెప్పరే నాతులాలా

చ. 2: వలచినవారికి వడియుచుండు మదము
బలిమి బ్రియునికొంగు పట్టకుందురా
పెలుచుఁదనాన నీకె పెనఁగెనంటా మీరు
పలుకనేలే సారికి పడఁతులాలా

చ. 3: తతి గూడినవారికి దాఁచరాదు గర్వము
మితులు రతులలోన మీరకుందురా
ఇతవై శ్రీవేంకటేశునెద నీపె వున్నదంటా
కత లేమాడుకొనేరే కాంతలాలా

రేకు: 0807-3 కాంబోది సం: 18-039

పల్లవి: చెల్లబో యెన్నాళ్లైనాఁ జిన్న దానవా
వెల్ల విరి నీతనికి వినయాలు సేయవే

చ. 1: యీపొద్దు నీపతి వచ్చె నేల సిగ్గులువడేవే
చూపుల నివాళ్లీవే సుదతి
తీ పైననీ మోవివిందు తెల్లమిగ జెప్పవే
యేపున నీవేడుకల నెదురుకొనఁ గదే

చ. 2: నలుగడ సెలవులనవ్వుల ముగ్గువెట్టవే
నిలువుఁ జెమటల పన్నీళ్లియ్యవే
పలుకులకప్పురాల బాగా లొసఁగవే
వెలయఁగ నీమేను విడిదేల సేయవే

చ. 3: పట్టగునీకాఁగిటఁ బానువు వరచవే
గట్టినీ చన్నులఁ దలగడ వెట్టవే
యిట్టె శ్రీవేంకటేశు డిన్నిటా నిన్నుఁ గూడె
జట్టిగొన్నరతి నుపచారాలు సేయవే

రేకు: 0807-4 మాళవి సం: 18-040

పల్లవి: ఈతడు గుట్టుమానిసి యీతఁడు గంభీరుడు
కాఁతరీఁడు గాఁడు యేల కాఁకలు సేసేవే

చ. 1: చెక్కు చేతఁబెట్టుకొని సెలవుల నవ్వుకొంటా
మక్కువ నీతనితోడ మాటలాడేవు
జక్కవచన్నుల మీఁది చంద్రకావి పయ్యద
పక్కన జారించి యెంత భ్రమలఁబెట్టేవే

చ. 2: తలిరుమోవి చూపి తములము సేసుకొంటా
పలుమారు నీతనిఁ దప్పకచూచేవు
చెలులమాఁటుననుండి సిగ్గులు నెరపుకొంటా
వలపులు చల్లి యెంత వలలఁ బెట్టేవే

చ. 3: చిమ్ముఁ జెమటలతోడ సేసకొప్పు గదలఁగ
కమ్ముక శ్రీవేంకటేశుఁ గాఁగిలించేవు
పమ్మి నన్నుఁ గూడినాఁడు బయలుసింగారాల
యెమ్మెలు సేసి యెలఇంచేవే

రేకు: 0807-5 బౌళి సం: 18-041

పల్లవి: ఆతఁ డు నీకు మోహించీ నన్నిటా బ త్తిసేసీని
చేతికి లోనై వుండవే చేప్పితినే బుద్దులు

చ. 1: వినయములే సేసి వేడుకలు చూపవే
మనసురాఁ బతితోను మాటలాడవే
తనివోవ కేపొద్దు దండఁ గాచుకుండవే
ననువు సేసుకొని నవ్వులెల్లా నవ్వవే

చ. 2: యెగ్గులు పట్టకువే ఇచ్చకము సేయవే
సిగ్గులివడకువే చెనకితేను
వెగ్గళించి రతులలో వేసట సేయకువే
ఆగ్గమై చన్నుల నొత్తి యట్టె పెనఁగవే

చ. 3: మొగమెత్తి చూడవే మోహములు చల్లవే
చిగమెవి చూపి చెలఁగించవే
జిగిమించ నంతలోనె శ్రీ వేంకటేశుఁడు గూడె
తగిలి పాయకువే తముల మడుగనే

రేకు: 0807-6 రామక్రియ సం: 18-042

పల్లవి: తనచిత్త మెఱఁగము తగుల నెట్టు వచ్చునే
చెనకేఁ గానీ ముందే సేసవెట్టు మనవే

చ. 1: ననుపు గలసతులు నవ్వితే నమరుఁ గాక
పెనఁగితే వింతవారు ప్రియమయ్యేరా
చనవు గలిగితేను సరసమాడుట గాక
మనసెనయనిచోట మచ్చిక గలుగునా

చ. 2: పిలిచితేఁ గొంతగొంత బిగియఁగవచ్చుఁ గాక
తలఁచకుండఁగ వచ్చి తమిరేఁతురా
వలపుగలుగుచోట వాడిక సేతురుగాక
కెలనిచుట్టాలు రతికేలి సేయఁ దగునా

చ. 3: చెక్కునొక్కి వేఁడుకొంటే సిగ్గువడవచ్చుఁ గాక
అక్కడిమోమై యుండఁ గా నంటవచ్చునా
యిక్కు వెరిఁగి శ్రీ వేంకటేశుఁ డే నంన్నేలెఁ గాక
తక్కినవారికినెల్లాఁ దడవఁ గ పచ్చునా

రేకు: 0808-1 కాంబోది సం: 18-043

పల్లవి: అంగన నీతోఁ బెనఁగదంటా నేలసాదించేవు
చెంగలువవంటిదిది చెనక నిన్నోపునా

చ. 1: నెలవుల నవ్వేది సిగ్గుతోడ నుండేది
వలపులసాల పాఁడువారిసాజము
చనివాయ లాలించేది చనవులు చెల్లించేది
నెలకొని మన్నంచేది నీచేతి దిఁకను

చ. 2: తనినోవక చూచేది దండనే నిలుచుండేది
గనమైనవినయమే కాంతలవోజ
మనసిచ్చి మాఁటాడేది మచ్చికతోఁ గలసేది
నిను సేవించనిచ్చేది నీచేత దిఁ కననీ

చ. 3: గుట్టుతోడ నుండేది నుండేది కొసరుచు మొక్కేది
దటపుటాసలు వనితలగుణము
యిట్టె శ్రీ వేంకటేశ యీకె నేలుకొంటివి
నెట్టనఁ బాయకుండేది నీచేతి దిఁకను

రేకు: 0808-2 బౌళరామక్రియ సం: 18-044

పల్లవి: నెఱజాణ విన్నిటాను నీవెఱఁగవా
మఱి నీచిత్తముకొద్ది మమ్ము మన్నించవయ్యా

చ. 1: చెలిమికొలఁదియే చెల్లుబడి
కలిమికొఁలదియే కాఁపురము
వలపుకొలఁదియే వాడిక
తలపుకొలఁదియే తాలిమి

చ. 2: పట్టిన కొలఁదియే పంతము
చుట్టరికముకొలఁదే సోబనము
దిట్టతనముకొలఁదే తేఁకువ
నెట్టుకున్న కొలఁదే నిటుకడ

చ. 3: కూడినకొలఁదియే కూటమి
వేడుకకొలఁదియే విందులు
యీడనెశ్రీ వేంకటేశ యెనసితివి
యీడుజోడైనకొలఁదే యంపలు

రేకు: 0808-3 పాడి సం: 18-045

పల్లవి: కాంతలకుఁ బతులకు గడవరా దీమాయ
యెంతని చెప్పుదుఁ దానే యెరుఁగు నావలపు

చ. 1: వదినె మరఁది యనే వావులే యాసలు రేఁచు
కదిసి పాయకుండితే కాఁక వుట్టించు
చెదరనిచూపులే చింతకు మూలములవు
పొదలునేకాంతాలు పొందులెల్లాఁ జేయును

చ. 2: పచ్చిదేరే సిగ్గులే భావములు గరఁగించు
ముచ్చట నవ్వులే కడుమోహము నించు
కచ్చు పెట్టి సరససాలు కాయము లంటింపించు
యిచ్చకము వినయము నింపులు వుట్టించును

చ. 3: పాయపుమదములు గొబ్బన రతులకుఁ దీసు
చాయలు సన్నలు మోవిచవులు చూపు
యీయెడ శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆయమైనమాటలు అన్నిటాఁ జొక్కించును

రేకు: 0808-4 మంగళ కౌశిక సం: 18-046

పల్లవి: విన్నవించవే యీమాఁట విభునికిని
కప్పులారాఁ దానే వచ్చి కనుఁగొనుమనవే

చ. 1: తన్నుఁ దలంచు కొంటేను తలపోఁతలు
విన్నవినుకలి రేఁచీ వేడుకలు
చన్నులపైఁ జేసినాడు చంద్రవంకలు
యెన్నఁగానినామోహ మేమని చెప్పుదునే

చ. 2: దిట్టనై నే నొంటినుండితే విరహము
ఆట్టె తొంగి చూచితేను ఆడియాసలు
కట్టినాఁడు ముంజేతఁ గంకణము
యెట్టు వేగించఁగవచ్చు నేమి నేతునే

చ. 3: నేనే మాటాడేనంటే నిండీ నిగ్గు
మోనమున నుండి తేను మంచీఁ రమి
తానే శ్రీవేంకటేశుఁడు తగ నన్నేలె
యీనెపాలెల్లా నాకు నేమిటికి వచ్చునే

రేకు: 0808-5 దేసాళం సం: 18-047

పల్లవి: ఏమని చెప్పుదుమయ్య యిదివో నీభాగ్యము
భామవేడుకలు నీకు నామనై నిలిచెను

చ. 1: చెలి మేనఁ గురిసేటి చెమటల వానకు
మొలచెఁ జిరునవ్వులు మోసులెత్తి
చలువమంచితనాలు జవ్వనము పంట వండి
కొలఁదిలేనిచన్నుల గొప్పరాసులాయను

చ. 2: కలికిమోమునను్న కారు మెఱుఁగులకును
జలజలఁ బల్కుఁదేనె జడివట్టెను
యెలమి సింగార రసమేరులు నిండాఁ బారి
తలపోఁతచెరువుల దైవారె మరవలు

చ. 3: ఆలమేలుమంగమోహమనేసోనలు ముంచి
పలువిధములరతుల పదనెక్కెను
యెలమి శ్రీ వేంకటేశ యెదురీతఁకాగిఁట
పులివచ్చి యానందాన నూటులెత్తును

రేకు: 0808-6 శుద్ధవసంతం సం: 18-048

పల్లవి: ఇంకా నెంత నేసునో యీపెకు నీతోడిపొందు
పొంకమైన కొత్తవలపులది యీ మగువ

చ. 1: చెమటలు మేననిండె సిగ్గులెల్లా ముంచుకొనె
రమణి నీతో సరసములాడఁగా
తమకము లుప్పతిల్లె తగ నిట్టూర్పులు రేఁగె
తిమురుచు సారెకు నీదిక్కు చూడఁగాను

చ. 2: సెలవుల నవ్వుదేరె సేసకొప్పు వెడజారె
నెలఁత నీకొలువులో నిలుచుండఁగా
పులకలు మేన నిండె పొదిగె నడియాసలు
నెలకొన్న వేడుకతో నీవద్ద నుండఁగాను

చ. 3: కమ్ముకొనెఁ గోరికలు కళలు మోహమునఁ దేరె
నెమ్మదిఁ జేతులెత్తి నీకు మొక్కఁగా
యిమ్ముల శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
చిమ్మిరేఁగె వలపులు సేవ సేయఁగాను

రేకు: 0809-1 కేదారగౌళ సం: 18-049

పల్లవి: ఇంత వేగిరకతైనా యెఱఁగనా నేనేమైనా
మంతనాన నన్నతఁడే మన్నించీఁగాక

చ. 1: పతినేల దూరేనే పడఁతీ
తతిగొన్ననావలపుఁ దడవేఁ గాక
రతిరా జేమిచేయునే రచ్చలోనను
ఇతవరి నావయసే ఇంతసేసీఁగాక

చ. 2: సవతుల నననేలే సకియా
జవళినాచూపునే సాధించేఁగాక
నవకపుచంద్రునితో నాకేడ పగే
తివురుచు నావయసే దిమ్మురేఁచుఁగాక

చ. 3: విరహముఁ దిట్టనేలే వెలఁది
తిరమైన నాబుద్ధినే తెలిపేఁగాక
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నేలె
సరససల్లాపముల సతమయ్యేఁగాక

రేకు: 0809-2 ఆహిరి సం: 18-050

పల్లవి: తప్పించుకొనఁగలఁడా దాఁటవచ్చునా తనకు
మెప్పించేఁ గాని పానుపుమీఁదికి రమ్మనవే

చ. 1: మగువలమాఁటలు మంచిచక్కెరతీపులు
నగువు లందులోనికి నానఁబాలు
వెగటుగా దేఁటైనా వేగినంతా నాడినాను
చిగిరించి చిగిరించి చిమ్మిరేఁచు ననవే

చ. 2: పొదలుగుబ్బలు వలపులబోనపుదొంతులు
కదలుకను చూపులు కప్రవిడేలు
అదనఁ బెనఁగితేను ఆసలాసలు పుట్టించు
పొదిగిపొదిగి కడుఁబోది సేసు ననవే

చ. 3: కలసినకాఁగిలి కమ్మపూవుచప్పరము
బలిమి మోవిరసాలు పానకాలు
యెలమి శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తలపించి తలపించి తగిలించుననవే

రేకు: 0809-3 కాంబోది సం: 18-051

పల్లవి: చేరి వూరకేల రట్టు సేసేవు నన్ను
సారె నాతో నవ్వేవు నీసరిదాననా

చ. 1: వెలయ నాచెక్కునొక్కి వేఁడుకొనే విందరిలో
అలుగ నీతో నే నంతదాననా
మలసి యప్పటి నన్ను మాఁటలాడించవచ్చేవు
పలుకకుండఁగ నీతోఁ బంతగతైనా

చ. 2: జట్టిగొని చేయివట్టి సంగడికిఁ దీసేవు
అట్టె పెనఁగ నీతో వియ్యపుదాననా
గుట్టున నాపట్టుచీరకొంగు వట్టుకున్నాఁడవు
తొట్టిన గర్వమున నీతో బలిమిదాననా

చ. 3: జక్కవచన్నులంటి సమరతి లాలించేవు
పక్కన నీతో మొచ్చపాటిదాననా
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెక్కొని నీవలె నన్నీ నేరిచినదాననా

రేకు: 0809-4 సౌరాష్ణం సం: 18-052

పల్లవి: సొలసితే పాయరానిచుట్టమవు నీవు నాకు
నెలకొంటివి నామతి నీవే యొఱుఁగుదువు

చ. 1: పిలిచి చేపట్టితేను బెళకి తప్పించుకోకు
వలపులు చల్లితేను వంచకు తల
మొలనూలు వట్టఁగానే మోరతోపుఁదనమేల
చెలువుఁడ మారుమోము సేసుక నవ్వేవు

చ. 2: పొందులు సేయఁగాను పొడవు దాఁచకు మిఁక
కందువనే పతినలు కడుఁజూపేవు
మందలించి చెనకితే మల సేవు రాజసాన
విందువలె మేనంటితే వెలవెలఁబారేవు

చ. 3: సారె బుద్ధులడిగితే చల్లేవు సిగ్గులెలా
కోరి చూచితే పాడేవు గుబ్బముమీఁద
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తారుకాణ సేసేవు దశావస్థలూను

రేకు: 0809-5 మాళవి సం: 18-053

పల్లవి: పిలువక వచ్చితిమి పేరటాండ్లము
సొలసి సొలసి మీపైన సోబానఁ బాడేము

చ. 1: చుక్కబొట్టు వెట్టుకొని సూసరము గట్టుకొని
నిక్కినిక్కి చూచీ నాపె నీదిక్కు
పిక్కటిల్ల నీకు నాపె పెండ్లికూఁతురాయనో
చొక్కముగఁ జెప్పవయ్య సోబానఁ బాడేము

చ. 2: ముప్పిరినవ్వులతోడ ముఁజేతి కంకణముతో
చిప్పిల నీ యెదుటను సిగ్గువడీని
దెప్పరమై తానుఁ గొత్తదేవులు నీకాయనో
చొప్పులెత్తి చెప్పవయ్య సోబానఁ బాడేము

చ. 3: తాళి మెడఁ గట్టుకొని దైవారాఁ బసపు పూసి
ఆలాయనో తాను అప్పుడే నీకు
యేలితివి వేంకటేశ నన్ను నింతలోనే
సోలి నింకాఁ జెప్పవయ్య సోబానఁ బాడేము

రేకు: 0809-6 వరాళి సం: 18-054

పల్లవి: ఏమని చెప్పేమయ్యా యివిగో మాభాగ్యాలు
నీమన్ననలే మాకు నిండునిధానాలు

చ. 1: పలుకుఁ బంతముతోను పతిచిత్తము వచ్చితే
వలపు కామధేనువు వనితలకు
పిలిచి మాఁటాడినప్రియము తంగేటిజున్ను
సెలవులనవ్వులు చేనిపంటలు

చ. 2: దయతోఁ దనమగఁడు తనవద్దనుండి తేను
వయసు కల్పవృక్షము వనితలకు
నయమునఁ జూచేచూపు నమ్మినటువంటిసొమ్ము
రయమునఁ జెనకులే రత్నాభిషేకములు

చ. 3: చనవిచ్చి శ్రీ వేంకటేశ నీవు గూడితేను
మనసే పరుసవేది మగువలకు
ననువు నటించి నేఁడు నన్ను నిట్టె యేలితిని
నినుపులరతులివి నిచ్చకల్యాణములు

రేకు: 0810-1 దేశాక్షి సం: 18-055

పల్లవి: ఎట్టు సేసినాఁ జేయు మొన్న నెఱజాణవు నీ-
చుట్టరికమే గురి సుదతిచేఁతలకు

చ. 1: జలజాక్షిచూపులకు చక్కనినీమేను గురి
పిలిచేనోరికిని నీ పేరే గురి
తలపోఁతలకు నీతగినగుణాలే గురి
చెలులము నేమింత చెప్ప నేమున్నది

చ. 2: కాంతచన్నులకు నీకందువకాఁగిలి గురి
బంతి నాపెచేతికి నీపాదాలే గురి
చెంత శిరసుపైకి నీసేపాలెప్పుడు గురి
వింతలుగా నీకు విన్నవించ నేమిటికి

చ. 3: అతివరతులకు నీయధరామృతము గురి
మతిలోనియాసలకు మన్ననే గురి
ఇతవై శ్రీ వేంకటేశ యీపె నిట్టె యేలితివి
మితిలేని మీమహిమ మెచ్చఁగ మావసమా

రేకు: 0810-2 గౌళ సం: 18-056

పల్లవి: నా మొగము చూచి యేమి నవ్వేవే ఇందుకుఁగాను
నీమగనియెదుటను నిలుచుండఁగదవే

చ. 1: కన్నులు గొప్పలైతే చక్కఁదనాలకు మేలు
చన్నులు బలిసితేను జవ్వనమునకు మేలు
నిన్ను నీవే యెంచుకొని నీవే సిగ్గువడితే
కన్నెరో నీపతి వచ్చె గక్కన రావే

చ. 2: ముక్కు గొప్పదైతేను మోమునకు సింగారము
నిక్కినకొప్పయితేను నిలువునకు సింగారము
చెక్కు చేతఁబెట్టుకొని శిరసేల వంచేవే
మక్కువ నీవిభునితో మాటలాడఁగదవే

చ. 3: నిండుఁ బిరుదైతేను నెన్నడిమి కాదరువు
దండియైన మీఁగాళ్లు తనువు కాదరువు
అండనే శ్రీవేంకటేశుఁడంతలోనె నిన్నుఁగూడె
పండె నీతపము లింకఁ బాదాలకు మొక్కవే

రేకు: 0810-3 సామంతం సం: 18-057

పల్లవి: ఎడయ నీచుట్టరిక మెప్పుడు మాకుఁ గలదు
తడవితే నానందము దైవారునే

చ. 1: ననిచినచోటను నాఁటుకొను నేస్తము
తనిసినచోట నుండు తాలిములు
కనుఁగొనేచోట నిండు కడలేనియాసలు
పెనఁగఁబోతే వలపు పిప్పిగట్టునే

చ. 2: తగులుగలుగుచోట తమకము లుప్పతిల్లు
సొగసినవావులైతే సొంపురేఁగును
మొగమోటగలచోట నగవులు తానే వచ్చు
యెగసక్కెమైతే మన సెరవులౌనే

చ. 3: చెలఁగి కూడేటిచోట సిగ్గులు తానే విడు
వలెనని కాచితేనే వాడికలౌను
యెలమి శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నుఁగూడె
బలిమి నేసితే రతి పచ్చిదేరునే

రేకు: 0810-4 కాంబోది సం: 18-058

పల్లవి: ఏమిదపము సేసెనో యీతఁడు నీకుఁగాఁ దొల్లి
ప్రేమతోడ నురమునఁ బెట్టుకున్నాఁ డిపుడు

చ. 1: పండు వెన్నెల బయలు పడఁతి నీనవ్వుమోము
కొండల వేఁటపాలము గొప్పచన్నులు
పండెడిపూఁబొదవిల్లు బాహులతలకాఁగిలి
అండ నీపతిభాగ్య మేమని చెప్పేమే

చ. 2: పొత్తులబోజనసాల పొలఁతి నీవదనము
హత్తినకొలువుకూటాలాయఁదొడలు
గుత్తపు సాముకంబము కోమలమైనగళము
ఇత్తల నీరమణుఁడు ఇన్నిటాను ఘనుఁడే

చ. 3: వాటపుఁ బెండ్లిచవికె వనిత నీపిరుఁదు
మేఁటిరాజ్యపదవి నీ మేనల్లాను
యీటున శ్రీ వేంకటేశుఁడింతలోనె నిన్నుఁగూడె
బోఁటి నీవిభుఁ డీతనిఁ బొగడఁగ వసమా

రేకు: 0810-5 కురంజి సం: 18-059

పల్లవి: వాకిలి గాచుకొనివుండే వనితలము నేమెల్లా
చేకొని వేళయ్యైతేఁ జెప్పేము గాని

చ. 1: మేడలో దేవులుఁ దాము మెరసి మాటలాడేరు
వేడుకతో సవతులు వినఁబోకురే
కూడిమాడి నవ్వుకుంటాఁ గూచున్నాఁడు నాయకుఁడు
చూడకురే యీదిక్కు సుదతులాల

చ. 2: పానుపుపైనుండి వారే బాగాలు వేసుకునేరు
కానుక లిచ్చేమంటా దగ్గరఁ బోకురే
ఆనుక పూవుల వేట్లాడేదు కొప్పులు జార
పానిపట్టి రొదసేసి పరాకు సేయకురే

చ. 3: లలి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగాఁ గూడున్నారు
బలిమితో లోనికు గొబ్బనఁ బోకురే
పిలిచే రదివో మిమ్ముఁ బ్రియములతోఁ దామే
సలిగె గల వారలు సందడించకురే

రేకు: 0810-6 దేసాళం సం: 18-060

పల్లవి: నేనేమి యెఱుఁగుదు నీసేవ సేసేదాన
మోనముతోనే పొగడి మొక్కేమయ్యా

చ. 1: చెప్పరానిమాటలు చెవులొగ్గి వినరాదు
విప్పరానిముడియలు విడువరాదు
చొప్పులెత్తరానిసుద్దులు నీకే తెలుసు
అప్పటి నాతో నేమి ఆనతిచ్చేవయ్యా

చ. 2: చూపరానిసొమ్ముల మించుకన్నులఁ జూడరాదు
ఆఁపరానిగుణముల నణఁచరాదు
నీపొందుల వేడుకలు నెమ్మది నీకే తెలుసు
యీపొద్దు నాకానతిచ్చే విది యేమయ్యా

చ. 3: పట్టరాని నీచిత్తము పైకొని చెయిచాఁచరాదు
ముట్టరాని నీనవ్వు ముదువరాదు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గుట్టెల్లా నానతిచ్చేవు కొంక కిదేమయ్యా

రేకు: 0811-1 దేసాళం సం: 18-061

పల్లవి: అప్పుడుగాని నీయాసోదము దీరదు
ముప్పిరి నీవు కొంగులు ముళ్లువేసుకేవయ్యా

చ. 1: వినేవు విన్నపములు వేడుకతో మఱవక
వనితమాటలు నీవు వాఁసుకోవయ్యా
యెనలేక చూచేవు యేపొద్దు నాపెమోము
గొనకొని లక్కఁబడెచ్చున వేసుకోవయ్యా

చ. 2: వొప్పుగ నాపెచన్నులు వూరక పట్టిచూచేవు
గొప్పలెంతలేశో కొల్చుకోవయ్యా
యెప్పుడు నాపెగుణాలే యెంచేవు సారెసారె
తప్పక నీమనసులో దాఁచుకోవయ్యా

చ. 3: చేరి పాదా లాపెచేత గుద్దించుకోనేవు
కోరి యట్టె కాఁగిలించుకొనవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సారపునామోవితేనే చవిచూడవయ్యా

రేకు: 0811-2 హిందోళం సం: 18-062

పల్లవి: ఎటువంటిజాణతన మిది మేలయ్యా
మటమాయచేతలనే మచ్చిక చూపేవు

చ. 1: తేరకొనఁ జూచితేనే దిష్టిదాఁకెనంటాను
కోరి కొంగువట్టేవు కొమ్మను నీవు
మేరతో నవ్వుకొంటేను మీఁదఁజల్లె వలపంటా
గోరవంటి చెక్కునొక్కి గురుతు సేసేవు

చ. 2: సంగడికి వచ్చితేనే చన్నులు దాఁకించెనంటా
యెంగిలి సేసేవు మోవి ఇంతలో నీవు
చెంగట మాటాడితేనే చిత్తము గరఁచెనంటా
కెంగేల సంగములు గిలిగించేవు

చ. 3: ఆకుమడిచిచ్చితేనే ఆసలు రేఁచెనంటా
కైకొని నీపచ్చడము గప్పేవు నీవు
యీకడ శ్రీవేంకటేశ యింతి నిట్టె యేలితివి
దీకొని మొక్కితే నీకు దేవులంటా మెచ్చేవు

రేకు: 0811-3 నట్టనారాయణి సం: 18-063

పల్లవి: ఏమి సేయవచ్చునయ్య యేల సిగ్గులువడేవు
కామినుల కేమిచ్చినా ఘనమౌను ఫలము

చ. 1: కమ్మి యెవ్వతెచన్నులఁ గస్తూరి వూసితివొ
వుమ్మడి నీ మేన నంటివున్నది నేఁడు
ఇమ్ముల నింతలోఁ జాచి యేల తుడుచుకొనేవు
నెమ్మి నీచేసినచేఁత నిన్నే తగిలెను

చ. 2: పడఁతి కెవ్వతెకును బాగా లొసఁగితివో
వుడివోని నీవుక్కిట నున్నది నేఁడు
అడరి తలఁచుకొని యట్టే వుమియఁజూచేవు
నడుమ నీవిచ్చినపుణ్యమే నిన్నంటెను

చ. 3: శ్రీవేంకటేశ యెవ్వతెఁ జేరి వురమెక్కితివో
వోవల నీవురముపై నున్నది నేఁడు
ఆవిధాన నన్నేలితి వన్నిటికి మెచ్చేవు
కావించిన వినోదము కడు నినుమడించె

రేకు: 0811-4 రామక్రియ సం: 18-064

పల్లవి: ఆయ నాయ నీయెమ్మె లటుండనీవే
నీయంత నీవెఱఁగవు నేనైనాఁ జెప్పేను

చ. 1: వంతులకే వచ్చేవు వాసులెల్ల నెరుపేవు
వంతములు చూపఁగ నాపాటిదానవా
మంతనాన నప్పటి నామగనితో నవ్వేవు
యెంతలేదే నీపగటు యేమి చెప్పేదే

చ. 2: పురుండ్లకుఁ జేరువు పొత్తుల మాటడేవు
సరుసఁ గూచుండఁగ నాసరిదానవా
తెరమాఁటుననే వుండి తేలించేవు రమణుని
తొరలినంతటిలోనే దొరవయ్యేవా

చ. 3: సలిగెలు మెరసేవు సాటి కిట్టె పెనఁగేవు
అలమేలమంగను నాయంతదానవా
కలసెను నన్ను శ్రీ వేంకటేశుఁడు నీవు మెచ్చే-
వెలమి నీకుఁ గారణ మేమైనాఁ గలదా

రేకు: 0811-5 బౌళి సం: 18-065

పల్లవి: ఆపెకేల సన్న సేసే వంతటిలోనెనే....
నేపున నీసుద్దులకు యెగ్గువట్టేనా

చ. 1: తొల్లిటియలవాటున తొయ్యలి పిలిచెఁగాక
యెల్లవారు నుండుట యెఱుఁగునా
చల్లఁగా నీవిచ్చినచనవు మెరసెఁగాక
చిల్లరనీసేఁత గుట్టు సేయఁగ నేర్చునా

చ. 2: యెప్పటివలెనంటానే యెదురుగా వచ్చెఁగాక
చొప్పులెత్తేసవతుల జూడవచ్చెనా
కప్పిమగఁడవుగాగా గాఁగిలించుకొనెఁగాక
తప్పకుండా నీమర్మాలు దాఁచి పెట్టనేర్చునా

చ. 3: దోమతెర మరఁగంటా తూరి ఇంతి గూడెఁగాక
నీమై నలమేల్మంగ చెందిన దెంచెనా
ఆముక శ్రీవేంకటేశ ఆమాఁటాడెఁ గాక నిన్ను
నేమెల్లా నీయాండ్ల మవుత నిన్న మొన్న వినెనా

రేకు: 0811-6 శంకరాభరణం సం: 18-066

పల్లవి: ఇట్టే పిలిపించవయ్యా ఇందరముఁ జూచేము
గుట్టు సేసి మాముందర కొంచకు నీవింకను

చ. 1: యేమనిచెప్పి యంపెనో ఇంతి నీకుఁ జెలులచే
నీమోమునఁ గళలు నిండుకొనెను
ఆముకొని చెలులతో నాడేవు యేకాంతలు
ప్రేమము నీకాపెమీఁదఁ బెరుగఁగఁబోలును

చ. 2: ఆనవా లేమి యంపెనొ యప్పటిని యాకె నీకు
ఆనుక పిడికిలి గొప్పయి వున్నది
పానుపుపై నేఁడిదేవనై కాచుకవున్నాఁడవు
తానకపు వలపులు తగులఁగఁబోలును

చ. 3: ఆస యేమి వెట్టింపెనో అలమేలుమంగ నీకు
సేసవెట్టుకున్నాఁడవు శ్రీవేంకటేశ
పోసరించి మమ్ముఁ గూడి పొందు లాపెవి చేప్పేవు
లాసి నీవుర మాపెకు లంకెలుగా బోలును

రేకు: 812-1 భైరవి సం: 18-67

పల్లవి: చిత్తగించు నాగుణము చెప్పితి నీకు
బత్తిసేసి నీకు మీఁదెత్తితి నావయసు

చ. 1: రారాఁపులదానఁ గాను రాతిగుండెదానఁ గాను
కోరి నీకు మోహించినకొమ్మను నేను
బీరము లాడుకోను; నీపేరు చెవుల వింటేను
నీరువలెఁ గరఁగును నెమ్మది నామనసు

చ. 2: కుచ్చితపుదానఁ గాను కొసరేటిదానఁ గాను
ఇచ్చకమే నీకుఁ జేసే యింతిని నేను
చెచ్చెర మందెమేళాలు సేయను నిన్నుఁ జూచితే
పచ్చిమదన కళలఁ బరగు నామొగము

చ. 3: యెరవులదానఁ గాను యెగ్గుపట్టేదానఁ గాను
మరిగిన యల మేలుమంగను నేను
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
బెరసి నీకాఁగిటనే పెరుగు నాచన్నులు

రేకు: 812-1 పాడి సం: 18-68

పల్లవి: ఎఱఁగమా నీజాడ లింతక తొల్లి
మెఱసితి విట్టె యలమేలుమంగతనము

చ. 1: సరసమెంతాడేవే చవులెంత చూపేవే
విరులేల చల్లేవే విభునిమీఁద
వరుసకు వచ్చిన వనితలెల్లా నుండఁగా
దొరవైతి విందరిలో తొయ్యలి నీవు

చ. 2: నవ్వులెందాఁకా నవ్వేవే నాఁట నెంతచూచేవే
రవ్వగాఁ బెనఁగనేలే రమణునితో
జవ్వనపువేడుకతో సవతులెల్లాఁ జూడఁగా
వువ్విళ్లూర నీవితని వుర మెక్కుకొంటివే

చ .3: వావులేమి చెప్పేవే వడిగా నెట్టు గూడేవే
యేవేళైనా శ్రీవేంకటేశ్వరుని
సేవసేసి నేమెల్లా సేసవెట్టి పెండ్లాడఁగా
దేవరవలె పట్టపుదేవులవైతివే

రేకు: 0812-3 రామక్రియ సం: 18-069

పల్లవి: చెప్పవే నీసుద్దులు చెవులారా నేము వినేము
వుప్పతిల్లీఁ దమకము ఉల్లములో మాకును

చ. 1: వెన్నెలగాసీ మొగాన వేడుక నీనవ్వులనే
సన్నలనే సంతోసాలు చాలామించీని
చెన్ను మీర నీపతి నీచేతికి లోనాయనా
పన్ని నేఁడు నీతపము పంలియించెనా

చ. 2: చెక్కులఁ జెమటగారీ సిగ్గులు కన్నులఁ దేరీ
తక్కక నిండుఁగళలు దైవారీని
చక్కనినీపతి నీకు చనవులెల్లా నిచ్చెనా
మిక్కిలి నీవువేసిన మేలెల్లా నీడేరెనా

చ .3: మోవితేనె లుట్టిపడీ ముంచినతీపులతోడ
భావించితే నీకు మేనఁ బచ్చిదేరీని
నీవల మేలుమంగవు నెమ్మది శ్రీవేంకటేశుఁ -
డీవేళ నిన్నుఁ గూడెనా యీడకు విచ్చేసెనా

రేకు: 0812-4 వరాళి సం: 18-070

పల్లవి: ఎదురుకొంటి వలపు లిరుమేలా నితనికిఁ
బొదిగితే సరిచేసి భోగములై మించెనే

చ. 1: నంటున నాతనితో నే నవ్వితే నీవందుకుఁగా
గొంటరివై పతినేల కొచ్చి చూచేవే
జంటల నిద్దరివిని జాజులుఁ గలువలనై
పెంటలపూజలై కడుఁబిక్కటిల్లీ మేనను

చ. 2: మక్కువల పతికి నే మరి పాదాలొ త్తితేను
మొక్కలాన నాతనికి మొక్కవచ్చేవే
చిక్కనితామరలునుఁ జిగురులుఁ గూడ పెట్టి
వొక్కట గుదిగుచ్చితే నోపునా యీతఁడు

చ. 3: యెలమి శ్రీవేంకటేశు నిట్టె నేఁ గాఁగిలించితే
నులివచ్చితోనేల చన్నుల నొత్తేవే
అలమేలుమంగను నేనై నీవు భూసతివై
కలసితేఁ జెప్పఁగొత్తై కతలై నిలిచెనే

రేకు: 0812-5 నారాయణి సం: 18-071

పల్లవి: చెలరేఁగి కొలువులు సేతువుగాక
మలసి నీకు తెరమఱఁగు లేమిటికే

చ. 1: అగ్గలపుమోమున నతఁడు నీ మోము చూచీ
సిగ్గులువడకువే చెలియా
వెగ్గళపుఁ దమకము వెదచల్లీ నీమీఁద
తగ్గి నీవందుకుఁగాను తలవంచనేఁటికే

చ. 2: మనసిచ్చి యప్పటిని మాటలు నీతో నాడీ
వెనకతియ్యకువె వెలఁదీ
ననుపునఁ జన్నులపై నగుతానే చేయిచాఁచీ
పెనఁగి నీవంతేసి బిగియఁగ నేఁటికే

చ. 3: ఆఱఢై శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గాఁగిలించీ
మీఱకువే యిఁక నలమేలుమంగా
కాఱుకమ్మినరతులఁ గలసె నిన్నీతఁడు
ఆఱితేరెఁ బనులెల్లా నలయించనేఁటికే

రేకు: 0812-6 మాళవిగౌళ సం: 18-072

పల్లవి: ఏమి చెప్పేది మోహము యెంతోకాని
కామిని నింతట నిట్టె కరుణించవయ్యా

చ. 1: చెలి నిన్నుఁ జూచి చూచి చిమ్మిరేఁగీ నాసలను
యెలమిఁ బయ్యదఁ జారు టెఱఁగదు
వెలలేని మాఁటలెల్లా వేడుకతో నాడీఁగాని
లలిఁ బెదవిమీఁది కెంపులు దాఁచనేరదు

చ. 2: మొగమెత్తి చేతులెత్తి, మొక్కిలోలోఁ జొక్కీ
జిగిఁ చన్నులు గానవచ్చేది యెంచదు
మిగులా సెలవులను మిక్కిలి నవ్వీఁగాని
చిగురుమోవిరసాలు చిందేది దలఁచదు

చ. 3: తక్కక కొలువుసేసేతమినే నిలిచున్నది
పక్కన మైసోఁకులు భావించదు
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
అక్కరతోఁ గూడీఁగాని అలయఁగ నేరదు

రేకు: 0813-1 సాళంగనాట సం: 18-073

పల్లవి: సిగ్గరిపెండ్లికొడుకు చెలులముందరనెల్లా
యెగ్గెరఁగక మెరసీ నిదివో యనుచు

చ. 1: జంటతేరులమీఁద సతులు నీవును నెక్కి
యింటింట వీదివీది నేఁగిరాఁగాను
పెంటలగోపకలెల్లా పెదపెదమేడ లెక్కి
నంటునఁ జూచి సిగ్గుతో నవ్వులు నవ్వేరు

చ. 2: గొడుగులనీడను కోలుపడిగెలతోడ
యెడనెడవాడల నోవేఁగిరాఁగాను
మెడలెత్తి నీపొందుల మెలుఁత లబ్బురమంది
జడిగొని తోఁగిచూచి జాణతనాలాడేరు

చ. 3: విరులదండలలోన వింజామరలలోన
యిరవై దేవుళ్ళు నీవు నేఁగిరాఁగాను
పరగ నల మేల్మంగపతివి శ్రీవేంకటేశ
సొరిదిఁ బురసతులు చూచి పొగడేరు

రేకు: 0813-2 బౌళి సం: 18-074

పల్లవి: ఈకెనీ చుట్టరికము లెఱుఁగుదుము
మాకు నీవు లోఁగుదురా మరఁగు లింతేల

చ. 1: కలువపూవుల వేసి కప్పురము మొవిఁజూపీ
పొలఁతికి నీ కెన్నటిపొందులోకాని
పిలిచీ మెల్లనె నిన్నుఁ బేరుకొని యంతలోనే
పలుకవయ్యా యేల పరాకు సేసేవు

చ. 2: సిగ్గు గొంత చల్లి చల్లి సెలవుల నవ్వు నవ్వి
వెగ్గళించీఁ జేత లెంతవేడుకోకాని
వొగ్గిఁ దమ్ములానకు వూరకే చేతిసన్నల
యెగ్గులేదు చూడవయ్యా యేల దాఁచేవు తమి

చ. 3: చన్ను మొనలు దాఁకించి సారెకు సేవలు సేసీ
యెన్నఁడు గూడితివో యింతకతొల్లి
యిన్నిటా శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
నన్నుఁ గూడితిని యెంత నాఁటకము సేసేవు

రేకు: 0813-3 సామవరాళి సం: 18-075

పల్లవి: ఎందాఁకా బుజ్జగించే వేమయ్యా
మందెమేళ మయ్యీ మరి నే మొక్కేనయ్యా

చ. 1: యీడు వెట్టుకొని నన్ను యెంతవొడఁబరచేవు
వేడుకతో నీమాటలు వింటినయ్యా
నీడకుఁ దీసి నన్ను నిమిరేవు నాచెక్కులు
తోడనే యిందుకు నే సంతోసించుకొంటినయ్యా

చ. 2: సరుస నన్నుఁ బెట్టుక చన్ను లెంతపుడికేవు
గరిమ నీమన్ననలు గై కొంటినయ్యా
విరులు ముడిచి నన్ను వెస నెంతలాలించేవు
సరవులన్నిటా నాకు సమ్మతాయనయ్యా

చ. 3: చనవిచ్చి నన్ను నెంత సారెకు గాఁగిలించేవు
నినుపురతులను తనిసితినయ్యా
యెనసితివి శ్రీవేంకటేశ యల మేల్మంగను
మనసున నీపొందులు మరిగితినయ్యా

రేకు: 0813-4 ధన్నాసి సం: 18-076

పల్లవి: ఎవ్వరి నేరుపు లెంచే మిందు లోనను
వువ్విళ్లూరి మీలో మీకు నొనగూడె వలపు

చ. 1: చిమ్ముఁజూపులనుఁ జూచీ సిగ్గరిపెండ్లికూఁతురు
నిమ్మపంట వేసేవు నీవాపెను
తమ్మిమోములు వంచేరు దండనున్న పేరటాండ్లు
సమ్మతించి మీలో మీకు చలివాసె వలపు

చ. 2: కుప్పళించీఁ జెమటలు కొత్త పెండ్లి కూఁతురు
నెప్పున మెయిసోఁకించేవు నీవాపెను
వొప్పుగ మోములు చూచే రూడిగపువారలు
చెప్పరాక మీలో మీకు చిమ్మిరేఁగె వలపు

చ. 3: మొక్కీ నలమేలుమంగ ముద్దుల పెండ్లి కూఁతురు
నెక్కోని కాఁగిలించేవు నీవాపెను
చొక్కపు శ్రీవేంకటేశ చుట్టాలెల్లా మెచ్చేరు
వుక్కుమీరి మీలో మీకు నుమ్మగిలీ వలపు

రేకు: 0813-5 ముఖారి సం: 18-077

పల్లవి: సారె సారె మన్నించేవు చనువు లిచ్చేవు నాకు
యీరీతి నీసతులలో నెవ్వరిఁ బోలుదును

చ. 1: చక్కెరమాఁటలాడి సాదించు నిన్ను నాపె
మిక్కిలి సేవలు సేసి మెప్పించును
చిక్కనిచన్నులు చూపి చిత్తమెల్లాఁగరగించు
ఇక్కడ నన్నుఁ జెనకే వేమిబాఁతి నేను

చ. 2: సన్నలనే మోవిచూపు చవులు రేఁచు నాపె
వన్నెలుగా నవ్వునవ్వి వలపించును
కన్నుల మొక్కులు మొక్కి కళలెల్లాఁ బుట్చించు
ఇన్నిటా నన్నుఁ బొగడే వెంతదాన నేను

చ. 3: ఆయములంటు నిన్ను నలమేలుమంగ యాపె
చాయల నీవురమెక్కి జట్టిగొనును
పాయకుండు నిన్నేపొద్దు బత్తితో శ్రీ వేంకటేశ
యీయెడ నన్నేలితివి యితవైతి నేను

రేకు: 0813-6 మంగళకౌశిక సం: 18-078

పల్లవి: నేరుపరివి నీవైతే నెలఁతై తే ముద్దరాలు
పేరునఁ బిలిచి నీవే పెనఁగఁగరాదా

చ. 1: చిన్నదిగనక యింతి సిగ్గుతోడ నున్నది
అన్నిటా రట్టడివి మాటాడించరాదా
తన్నుఁదానె నీపై ప్రేమ దాఁచుకొని వున్నది
సన్నలనే నీమోవి చవిచూపరాదా

చ. 2: జవరాలుగనక ఆసలఁ బొంచుకవున్నది
నవకపుజాణవు నవ్వించరాదా
వివరించి బత్తి వెల్లవిరి సేయకున్నది
చివురుకెంగేలు చాఁచి చిమ్మిరేఁచరాదా

చ. 3: కొమరెగనక కడుగుట్టుఁతోడ నున్నది
నెమకి దిట్టవు మేలు నెరపరాదా
అమర శ్రీవేంకటేశ అండ వాయకున్నది
సమరతి నిట్లానే చనవియ్యరాదా

రేకు: 0814-1 దేవగాంధారి సం: 18-079

పల్లవి: పొలఁతీ నీనటనలు పొగడ నలవిగాదు
నిలువున వలపులు నివ్వటిల్లఁజేయునే

చ. 1: కందువై ననీమాటలు కప్పురపుబేంట్లు
పొందుల నీపతికి దప్పులు దీర్చునే
అందిననీసొలపు మోహములకలగలవు
సందడించీ యతనికి సంతోసము రేఁచునే

చ. 2: సూటియైననీచూపులు సొంపగుఁదరితీపులు
గాఁటయై యీతనికి నక్కర దీర్చునే
కూటపునీనవ్వులు గుదిగుచ్చిన పువ్వులు
పాటించి యీతనిమతిఁ బరిమళించునే

చ. 3: మతనపుఁజెనకులు మాణాకపుమినుకులు
చెంతల నీసొమ్ములై సింగారించుకునే
యింతలోనె శ్రీ వేంకటేశుఁడు నిన్నిదెకూడె
వింతలగు నీరతులు వేడుక పుట్టించునే

రేకు: 0814-2 భూపాళం సం: 18-080

పల్లవి: చిత్తగింతువు రావయ్యా చిల్లరపరాకు మాని
హత్తి తారుకాణవచ్చీ నప్పుడే నీకు

చ. 1: చిగురాకు మోవిమీఁదఁ జెలి యీడేమాఁటలు
మిగులాఁ దేనెలకంటే మించుఁదీపులు
జిగిమించ నీతోడఁ జేసేటిచెలుములు
చిగురుఁగండెలకంటెఁ జిక్కించేబందనలు

చ. 2: తమ్మిరేకుఁగన్నులలోఁ దళుకనేచూపులు
తుమ్మిదపాఁజులకంటేఁ దూరిపారును
వుమ్మగిలుఁబయ్యదలో నుండేటికుచములు
నిమ్మపండ్లు కంటేను నీకుఁ గానుకలౌను

చ. 3: లతలచేతులు చాఁచి లాచేటికాఁగిలి
రతిఁ బెండ్లిచవికకంటే రమ్యమైనది
యితివై శ్రీవేంకటేశ యేలితివి నీమోహపుఁ
సతికంటే నెక్కుడు జాణతనాలు

రేకు: 0814-3 గౌళ సం: 18-081

పల్లవి: నావాఁడనేయంటా నమ్మించేవు నన్ను నేఁడు
చేవల నిన్నాపె చూచి సిగ్గువడేనేలయ్యా

చ. 1: మంతనాన నీవు నేను మాటలాడుకొన్న వెల్లా
ఇంతలోనె యాపె వినుటెట్లయ్యా
వింతలైననా మట్టెలు వేలఁ బెట్టుకొంటివి
వంతుల నాపె చేతికి వచ్చుటెట్లయ్యా

చ. 2: పొందుగా నీవును నేనుఁ బూసుకొన్న పరిమళఁ
మందముగా నాపెమేన నంటు టెట్లయ్యా
కిందట మాయింట నారగించినకూరలచవులు
మందలించి యాపె చెప్పీ మర్మమేఁటిదయ్యా

చ. 3: చెలరేఁగి నీరతులఁ జేసిననానేర్పులకు
నలువంక నాపె నిన్ను నగుటెట్లయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితివి
మెలుపున నిన్ను నాపె మెచ్చుటెట్లయ్యా

రేకు: 0814-4 సామంతం సం: 18-082

పల్లవి: ఆతనిఁజూపవె మాకు నదెంతచక్కనివాఁడొ
ఆతటి నిన్నుఁ గలసినంతటిజాణఁ డెవ్వఁడె

చ. 1: జక్కవచన్నులమీఁద చంద్రోదయము లాయ
చుక్కలు నీమోవిమీఁదఁ జూపట్టెను
మిక్కిలి శిరసుమీఁద మేఘములు గారుకొనె
యెక్కడనుండి వచ్చేవే యెవ్వఁడే నీమగఁడు

చ. 2: సరిఁ గన్ను కలువల సంధ్యాకాలము వచ్చె
అరిది సంపెంగముక్కం దాయిటి రేఁగె
తొరిగి చుక్కమీఁదఁ దొలుకరించెఁ జెమట
యిరవై యేడనుంటివే యెవ్వఁడే నీమగఁడు

చ. 3: నాటుకొని సెలవుల నవ్వుల వెన్నెల గాసె
తేటలచూపులనే తెల్లవారెను
మేటిశ్రీవేంకటాద్రి దేవుఁడఁటా నీవు
యేట వెట్టుకుండెనాతఁ డెవ్వఁడే నీమగఁడు

రేకు: 0814-5 వరాళి సం: 18-083

పల్లవి: ఇంతలో విచ్చేసితి నీకెభావమిదె చూడు
ఇంతి గోడపైరూపే యీరూపనుచును

చ. 1: జిగిమించునీరూపు చిత్తరువులోఁ జూచి
నగు నింతి తనతోను నవ్వితివంటా
మొగము చూచేవంటా ముచ్చటతోఁ దలవంచు
చిగురుమోవి చూచి సిగ్గువడును

చ. 2: చేరి మాటలాడెనంటా జెప్ప నీకుఁ బ్రియములు
కోరికతో దండనుండి కొలువు నేను
సారెకుఁ బానుపుపైకి సన్నలు నేసి పిలుచు
నేరుపుతోఁ దములము నిన్నట్టె యడుగును

చ. 3: నివ్వెర గైతివంటా నిన్నుఁ గొనగోర నంటు
పవ్వళించుమని చేతఁ బట్టఁబూనును
నివ్వటిల్ల నంతలోనె నీవె వచ్చి కూడితివి
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె వోలలాడును

రేకు: 0814-6 ఆహిరి సం: 18-084

పల్లవి: మరుతంత్రములలోన మరఁగేఁటికి
శిరసు వంచి మొక్కేను చెప్పరే యాతనికి

చ. 1: తమి యేలరేఁచినే తరితీపేల సేసీనే
సముకాన నున్నదానఁ జనవరిని
కొమరె వయసుదానఁ గుదురుకొనె వలపు
చెమటలు మేననిండెఁ జెప్పరే యాతనికి

చ. 2: సెలవినేల నవ్వీనే సిగ్గులేల నెరపీనే
చెలిమి చేసినదాన సేవచేసేను
నలుగడ నివ్వెరగై నామనసు తనకె
సెలవు సేసితినని చెప్పరే యాతనికి

చ. 3: సన్నలేల సేసీనే చన్నులేల పిసికీనే
వున్నతిఁ దనకాఁగిట కున్నదానను
యిన్నిటా శ్రీ వేంకటాశుఁ డింత లోఁదా నన్నునేలె
చెన్నగునాసంతోసము చెప్పరే యాతనికి

రేకు: 0815-1 గుండక్రియ సం: 18-085

పల్లవి: ఏల సిగ్గువడేవు ఇందరముఁ జూచేమని
చాలవలచేవలపు చల్లించుకోవయ్యా

చ. 1: చేకొని విడెము చేతికిచ్చి జవరాలు
ఆకుమడిచియ్యఁజూచీ నందుకోవయ్యా
మేకొని గందము నీమేనఁ బూసేనంటా వచ్చె
యీకడ నాట్టె పూయించుకొనవయ్యా

చ. 2: చేరి పువ్వులసరులు చేతఁబట్టుక వున్నది
కోరా యట్టె ముడుపించుకొనవయ్యా
గారవానఁ బాదాలొత్తఁగడువేడుకపడీని
పూరాడించి పాదాలు నీ వొత్తించుకొనవయ్యా

చ. 3: పలిచి నీగరిడీలోఁబెనఁగేనఁటా నున్నది
చెలఁగి యాపెతో సాము నేయవయ్యా
యెలమి శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
సొలసీ నాపె నిన్ను సొలయించుకోవయ్యా

రేకు: 0815-2 దేసాళం సం: 18-086

పల్లవి: తప్పించుకొనరాదు తలఁగా రాదు
చెప్పితి నిట్టె మన్నించి చిత్తానఁబెట్టుమీ

చ. 1: నాతలఁపుకొడి సాగి నంటు నంటునఁ దీగెవంటిది
ఆతలనీతల నీమై నల్లుకున్నదా
కాతరపునాచూపు గబ్బి తుమ్మిదవంటిది
గాతల నీయందే గూఁడుగాఁబెట్టుకున్నది

చ. 2: వేడుక నాయాస ఇది వేఁటమెకమువంటిది
కూడి నీపాదాలఁ దగులుకున్నది
వోడక నావలపు నీవొళ్లినీడవంటిది
వీడక నీవెంటవెంట వేసఁ బాయకున్నది

చ. 3: దాఁగక నాచన్నులివి తమ్మి మొగ్గలవంటిది
కాఁగిటిలో నీకుఁబూజై కాచుకున్నది
చేఁగదేర నేలితివి శ్రీ వేంకటేశ నన్ను
మాఁగిననామోవితేనె మంచివిందై వున్నది

రేకు: 0815-3 మాళవిగౌళ సం: 18-087

పల్లవి: లలనల సంతలోని లాబగాఁడవు
తలఁచనితలఁపులు దైలువారె నిపుడు

చ. 1: వేడుకతో నీవాపెపై వేసినపూవులచెండ్లు
తోడువచ్చి నిలుచున్నతొయ్యలిఁ దాఁకె
కూడాఁబట్టి యిద్దరిని గొబ్బునఁబెండ్లాడవయ్య
యీడనే నీబేర మొకటినుమడి యాయను

చ. 2: చెలరేఁగి యాపెమీఁదఁ జిమ్మినట్టి పన్నీరు
మెలుపునఁ జెలికతైమీఁదఁ నిండెను
కలసి నీవిద్దరినిఁ గాఁగిలించుకొనవయ్య
వలపు లినుమడించి వడ్డి వచ్చె నీకును

చ. 3: పిక్కటిల్ల నీవాపెపైఁ బెట్టినలువంటిసేస
పక్కన నూడిగపుతిపైఁ జిందెను
యిక్కువ శ్రీ వేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మొక్కలాన నీమేలు ముయ్యెడ నాఁగాయను

రేకు: 0815-4 భైరవి సం: 18-088

పల్లవి: అన్నిటా నెరజాణఁడైననాయకుఁడు తాను
సన్నల చాయలఁ దానే సరిచూడుమనవే

చ. 1: మనసులోని వలపు మాటలలోనే తోఁచు
తనువుపై వేడుకలు తమియై రేఁగు
కనుచూపులలో యాస కడఁగు జాగరములై
తనకు నేఁ జెప్పనేల తలఁచుకొమ్మనవే

చ. 2: మొలచినసిగ్గులు ముసిముసినవ్వుల లౌను
నెలకొన్నతలపోఁత నిట్టూర్పు లగును
చెలఁగి యెడమాటలు చిగిరించుఁ గోరికలై
తిలకించి నాభావము తెలుసుకోమ్మనవే

చ. 3: చిప్పిలుఁ గళలతేట చిందు మోవితేనియలై
చెప్పరాని సంతోసము చెమటలౌను
యిప్పుడె నన్నేలినాఁడు ఇదె శ్రీవేంకటేశుఁడు
యెప్పటికి నిదేమాట యెరుఁగకొమ్మనవే

రేకు: 0815-5 నాట సం: 18-089

పల్లవి: ఊరకే గుట్టుతోడ నుందువు గాక
మేరమీరి ఇంత మందెమేళ మేఁటికే

చ. 1: వేరొకతెమీఁ దఁ బెట్టి విభుఁడు నవ్వినందుకు
సారె సారె నీ వేల జంకించేవే
చేరి నీరతిసుద్దులు చెలులతోఁ జెప్పితేను
గీరుచు గోర నీవెంత గిలిగించేవే

చ. 2: నెట్టన నెవ్వతెసామ్మో నీమేనఁ బెట్టినందుకు
ఇట్టె వాఁడిచూపుల నీవేల చూచేవే
జట్టిగొని పెదవులసనన్నలనే తిట్టితేను
గట్టిగాఁ బెదవి యేల గంటినేసేవే

చ. 3: కాంతలు చూడఁ గ నిన్నుఁగాఁగిలించుకొన్నందుకు
చెంతనుండి నీవేల సిగ్గుపడేవే
ఇంతలో శ్రీవేంకటేశుఁ డేకతాన నిన్నుఁ గూడె
పంతమున నీవెంత పచ్చి సేసేవే

రేకు: 0815-6 తెలుఁగుఁ గాంబోది సం: 18-090

పల్లవి: చక్కనిదానవు నీవు జవరాలను
మక్కువ నీపైఁ జేయక మానవచ్చునా

చ. 1: కన్నులఁ జూచినచూపు గండుతుమ్మిదల పూఁవు
సన్నల నవ్విన నవ్వు జాజిపువ్వు
పన్ని నీమోములో సిగ్గు వెన్నెల తేటనిగ్గు
వన్నెలనీరమణుఁడు వలచు టేమరుదే

చ. 2: మలయ నీ పలుకులు మరునంపచిలుకులు
కలికికొప్పుజారు మేఘపుఁ దీరు
నిలువుఁ జక్కఁదనము నిండుజవ్వనవనము
బలిమి నాతఁడు నీకు భ్రమయు టేమరుదే

చ. 3: వాఁ డిగోరిచెనకులు వజ్రాలమినుకులు
పోఁడిమి నీకెమ్మోవి పొగరుఁ గావి
నేఁడు శ్రీవేంకటేశుఁడు నిన్ను నింతలోనె కూడె
నాఁడే యీతఁడు నీకు ననుపౌటేమరిదే

రేకు: 0816-1 దేశాక్షి సం: 18-091

పల్లవి: ఎలయించీ సారెకు నిన్నెవ్వతో కాని
వలపులు చల్లీని వాడుదేరిచీని

చ. 1: కలువల వేసి సతి గక్కన నీవు చూచితే
మొలకసన్నలనే మోవి చూపీని
అలరి చదురంగములాడేపరాకున నుంటే
యెలుఁ గెత్తి పాటపాడి యెచ్చరించీని

చ. 2: యింతి చన్నుల నిన్నొత్తి ఇవ్వలిమోము నీవైతే
అంతలోనే కన్నుల నీకటు మొక్కీని
పంతానఁ బానుపుమీఁ దఁ బవ్వళించి నీవుండితే
చెంతనుండి యెరుకలు సేయుచు నవ్వీని

చ. 3: నిమ్మపండు గానుకిచ్చి నీవు చేతనుందికొంటే
కమ్మక నిన్నింతలోనే కాఁగిలించీని
నెమ్మది శ్రీవేంకటేశ నే నల మేలుమంగను
కమ్మర ననుఁ గూడితే కందువ చెప్పీని

రేకు: 0816-2 ధన్నాశి సం: 18-092

పల్లవి: ఇంతులచేఁ తకు లోనే యెప్పుడును మగవాఁ డు
యింతేసిపంతాలు మాతో నేలాడేవయ్యా

చ. 1: కన్నులఁ జూచినయాస కాఁగిటికిఁ బెనఁ గించు
సన్నలు సేసినయాస సంగడిఁ బెట్టు
చన్నులుసోఁకినయాస సమరతి కొనగూర్చు
యిన్నేసి మాతో నేరా లేలాడేవయ్యా

చ. 2: మాటలాడించిన యాస మర్మములు గరఁగించు
చోటిచ్చిన యాస రతిఁ జొక్కించును
నాటించిన గోరి యాస ననుపులు వెడరేఁ చు
యీటున నీయాచారాల యెంత చెప్పేవయ్యా

చ. 3: సరసమాడిన యాస జంట లప్పుడే సేయు
సరుగ నవ్విన యాస చవులు రేచు
ఇరవై శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యెరవుల వెడమాయ లేల సేసేవయ్యా

రేకు: 0816-3 లలిత సం: 18-093

పల్లవి: నీయందు నేమైనా నెరసు లెంచితిమా
చేయెత్తి మొక్కితేనేల సిగ్గుపడేవు

చ. 1: మంతనాన నిద్దరము మాటలాడుకొంటేను
అంతలోఁ బెట్టుకొనేవు ఆనలు నీవు
సంతోసాన నీమోము సారె సారెఁ జూచితేను
యెంతకెంత నీవేల యెగ్గుపట్టేవు

చ. 2: జవ్వనులము మాలోనే సన్నలు సేసుకొంటేను
యివ్వల సుద్దులు మమ్ము నేలడిగేవు
వువ్విళ్లూర నీమేనంటి వూడిగాలు సేసితేను
చువ్వన నీవెంత మాకు సోదనిచ్చేవు

చ. 3: కొమ్మల నిందరిని కొలువుకుఁ బిలిచితే
కమ్మి యెంత మమ్ము నిట్టె కాఁగిలించేవు
యిమ్ముల శ్రీవేంకటేశ యెనసితి విన్నిటాను
తెమ్మలుగా మమ్ము నేమి తెలుపవచ్చేవు

రేకు: 0816-4 రామక్రియ సం: 18-094

పల్లవి: పడఁతులఁ గంటేనే పట్టలేవు తమకము
నడుమంత్రపుచెలులు నవ్వరా నిన్నును

చ. 1: చల్లువెదమాట లాడి సంగడినే గూచుండి
చిల్లరచేఁ తలు సేసి చెక్కునొక్కేవు
యెల్లవారిలోన నన్ను నేల సిగ్గువరచేవు
కొల్లలుగ యేకతానఁ గూడఁగరాదా

చ. 2: పగటున నగి నీ వాదము నామీఁ ద వేసి
మొగము చూచి నన్ను మొక్కుమనేవు
నిగిడి నిన్నింతలోనే నీవేల పచ్చి సేసేవు
వెగటేల మాయింటికి విచ్చేయరాదా

చ. 3: చన్నులపైఁ జేయివేసి సరుగనఁ గాఁగిలించి
కన్నులఁ జొక్కించి మోవి గంటిసేసేవు
యిన్నిటా శ్రీవేంకటేశ యేల చిమ్మిరేఁ చేవు
మన్నించితి విట్లానే నెంమది నుండరాదా

రేకు: 0816-5 కాంబోది సం: 18-095

పల్లవి: ముద్దరాలవై తేనేమి మోహము చూపఁగవద్దా
కొద్దిమీర పతివద్దఁ గూచుండవే

చ. 1: చెక్కుచేయేల పెట్టేవే సిగ్గులేల నెరుపేవే
చిక్కనిచెమటలేల చిందేవే
నిక్కిచూచి రమణుఁ డు నిమ్మపండు చేతికిచ్చీ
మక్కువతో నందుకొని మాడలాడవే

చ. 2: దప్పులఁ బొరలేవేలే తలవంచుకొననేలే
ముప్పిరి నీగుబ్బలేల మూసిదాఁచవే
కప్పురముఁ మోవిఁ జూపి కాంతుఁడు నిన్ను లాలించీ
వొప్పుగఁ జేకొని నీవూ నుపచరించవే

చ. 3: నీవి వదలగనేలే నివ్వెరగు చూపనేలే
కావికన్నులకేల కడుబొక్కేవే
యీవల శ్రీవేంకటేశు డింతలోనె నిన్ను గూడె
వేవేగ నీప్రియములు వెలయించవే

రేకు: 0816-6 నాదరామక్రియ సం: 18-096

పల్లవి: ఔనయ్యు తగవు నేఁడట్టిదె కాదా
మోనముతోడుత నీకు మొక్క మొక్కేను

చ. 1: చెక్కునొక్కి జవరాలు చేరి నిన్ను వేఁడుకొని
వుక్కుమీరి గుబ్బలు నిన్నొరయఁ గాను
యిక్కువలఁ దొలుత నిన్నేమని తిట్టెనోకాని
పక్కన నింతటిలోనే పంతమిచ్చెను

చ. 2: కమ్మటిఁ గాఁగిట నించి కడు నిన్ను లాలించి
సమ్మతి మోవితేనెలు చవిచూపుతా
యిమ్ములఁ దొలుత నిన్ను యేమి సేనెనో కాని
ముమ్మాటికి నీకుఁ బ్రియములు చెప్పెను

చ. 3: తమకించి నిన్నుఁ గూడి తమ్ములానకు నోరొగ్గి
ప్రమదానఁ దురుము నీపై నొరగఁ గా
అమర శ్రీవేంకటేశ యంతలో నన్నేలితివి
సమమోహాలని యాపె సారె సారె మెచ్చెను

రేకు: 0817-1 ముఖారి సం: 18-097

పల్లవి: తానే యెఱుఁగుఁ గాక దండనున్నాఁ డు విభుఁడు
యీనేరుపు లీకత లేమని చెప్పుదునే

చ. 1: చిత్తములోపలిసిగ్గు చెప్పరాదు
బత్తితోడి తలపోఁత భావించరాదు
గుత్తపు గుబ్బలవుబ్బు గురి లేదు
యిత్తల నోచెలులాల యేమని చెప్పుదునే

చ. 2: వాడికనాకోరిక వశగాదు
వేడుకకు నెంతైనాను వెలలేదు
వోడక నాతమకము వోరువరాదు
యీడనె నాయడియాస లేమని చెప్పుదునే

చ. 3: తొట్టుకున్న జవ్వనము దొబ్బితేఁ బోదు
చుట్టుకున్ననావలపు చూపరాదు
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
యెట్టనెదిటి సంతోస మేమని చెప్పుదునే

రేకు: 0817-2 శ్రీరాగం సం: 18-098

పల్లవి: అంగనా నీవును మాటలాడుకోరయ్యా
చెంగటనున్న చెలులు నేసేవని యేదయ్యా

చ. 1: వలపు లినుమడించె వాడికె లెదిరించె
చెలికి నీకు వావులు చిగిరించెను
తలఁపులు దైవారె తమకములు సందించె
యెలమి సుద్దులు మమ్ము నేమడిగేవయ్యా

చ. 2: కొనచూపులు గదిసె కోరిక లల్లులొనె
మన లిద్దరివిని మర్మము లంటె
ననుపులు సరిదాఁకె నవ్వులు వియ్యములందె
యెనలేనివిచారము లిఁక నేఁటికయ్యా

చ. 3: మోవు లొక్కమరె మాఁగె మోహము లొండొంటి ముట్టె
భావించ సమరతులు బంతికి వచ్చె
శ్రీవేంకటేశ యింతిఁ జేకొని కూడితి విట్టె
యీవేళ నీసంతోసము లెంత చుపేవయ్యా

రేకు: 0817-3 లలిత సం: 18-099

పల్లవి: ఇటువలె నుండవద్దా యిద్దరిపొందు
తటుకన నీడేరెఁ దనకు నాకిపుడి

చ. 1: నేరుపు గలిగితేను నేస్తము లౌనగూడు
మేరతోనే వుండితేను మించు వేడుక
వోరుచుకొంటేను వొద్దికౌను సరసము
తారుకాణలాయ నాకుఁ దనకు నేఁడిపుడు

చ. 2: చనవులు నెరపితేఁ జవులువుట్టుఁ గాఁపురము
ననువులు జరిపితే నవ్వులురేఁగు
చెనకులు బలిసితే సిగ్గులు మొదలౌను
మనసులు సరిదాఁ కెఁ దనకు నాకిపుడు

చ. 3: అంటిముట్టి పెనఁగితే నాయములు గరఁగును
జంటవాయకుండితేను సతమౌ మేలు
ఇంటిలోన శ్రీవెంకటేశుఁడు తా నన్నుఁ గూడె
దంటతనా లుప్పతిల్లెఁ దనకు నాకిపుడు

రేకు: 0817-4 భైరవి సం: 18-100

పల్లవి: పడఁతి నెప్పుడు నీవు పాయనివాఁ డవె కాక
నిడి సాగిలె నీపెకు నీమీఁ దిచింత

చ. 1: నెలఁతకొప్పుపై నవే నీవువెట్టినసేసలు
తలఁచుకున్నది నీతగుబాసలు
వలపులలో నున్నది వడి నడి యాసలు
యెలమి నీవెందుండినా నిఁకనేల చింత

చ. 2: చన్నులపైనే వున్నవి చక్కనినీరేకలు
సన్నల నవ్వేనవ్వులసమజోకలు
కన్నులెదుట నున్నవి గక్కన నీరాకలు
మన్నిం చెప్పుడు వచ్చినా మరియేల చింత

చ. 3: కూడినకాఁగిట మించె గురుతైననీ పొందులు
వాడికెమోవితేనెల వచ్చె విందులు
యీడనె శ్రీవేంకటేశ యేలితి వీకె నిట్టె
జోడుగా ఫలించె నీకుఁ జూపనేల చింత

రేకు: 0817-5 ముఖారి సం: 18-101

పల్లవి: చేయివట్టి తియ్యనేలే చెలులాలా
యీయెడనే వున్నవాఁ డు యేలుకొనీఁ గాక

చ. 1: సరసమాడెడువాఁడు సంగాతము సేయఁడా
మరిగినవాఁడు నన్ను మన్నించఁడా
వరుసకువచ్చేవాఁడు వలపులు చల్లఁడా
వెరవెఱఁగక యేల వేగిరించేరే

చ. 2: చనవులిచ్చినవాఁడు సంగడి గూచుండఁడా
మనసెరిఁగినవాడుఁ మాటలాడఁడా
కనుఁగొన్నవాఁడు యిఁకఁ గాఁగిలించుకొనఁ డా
తనివిఁ బొందక యేల తమికించేరే

చ. 3: కూడిమాడినవాఁడు గుట్టు నాకుఁ జెప్పఁడా
వాడికెక్కినవాఁడు నావసమేకాఁడా
యీడనే శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
జాడదెలియక యెంత సారెఁ బెనఁ గేరే

రేకు: 0817-6 శుద్ధవసంతం సం: 18-102

పల్లవి: ఏమి సేతుమయ్య నిన్ను నేమిటా గెలువరాదు
ఆముకొనఁ జనవిచ్చి యాసలు రేచేవు

చ. 1: పెనఁగితే బెళికి తప్పించుకొనఁ జూచేవు
చెనకితేఁ దలవంచి సిగ్గుపడేవు
మొనసి సన్న నేసితే మూతులు గిరిపేవు
ననుపు నటించితేను నవ్వులు నవ్వేవు

చ. 2: నుడిగితే నెంతయినాఁ బొడవులు సూపేవు
తడవితే రాచపంతాలు మీరేవు
బడివాయకుండఁ గానే బాస లడుగ వచ్చేవు
వొడివట్టితే జలధి నెడము గొనేవు

చ. 3: పొంచి మోము చూచితే పొందులే బోధించేవు
అంచల మొక్కితేనే వయ్యాళి చూపేవు
మంచితనాలనే నన్ను మన్నించితి విటు కూడి
ముంచి శ్రీవేంకటేశుఁడ మోవి లంచమిచ్చేవు

రేకు: 0818-1 పాడి సం: 18-103

పల్లవి: ఎంతనోము నోఁచితినో యేమిచెప్పేది
మంతుకెక్క నింకా చింత మన్నించేవుగాక

చ. 1: మేకొని నీ వాడేటిమేలములు కావా
లాకలై నామోమునఁ గళలు రేఁచేవి
జోకతోడ నీతోడిచుట్టరికమే కాదా
యేకాలమును నిన్ను నెడయనియ్యనిది

చ. 2: ననుపున నీవు నాతో నవ్వినవ్వులే కావా
తనివిదీరకుండాఁ దలపించేవి
పెనఁగి కొప్పుపై నీవు పెట్టిన సేసలే కావా
యెనసి నీకాఁగిటిలో నింతకుఁ దెచ్చినవి

చ. 3: చన్నులపై నీవు చేయిచాఁచిన రతులే కావా
పన్నిన వలపులై పాదుకొన్నవి
యిన్నిటా శ్రీవెంకటేశ యేలితివి నన్ను నేఁడు
కన్నులచూపులేకావా కామించఁ జేసినవి

రేకు: 0818-2 గౌళ సం: 18-104

పల్లవి: ఊరకే విఱ్ఱవీఁగేవు పువిదలలోనెల్లా
యీరీతి నుండితేను నాయీడుదానవై తివా

చ. 1: పంతముతో బిగిసితే పగటుదానవైతివా
సంతసుద్దులు చెప్పితే జాణవైతివా
బంతిఁ గూచుండితేనే పట్టపుదేవి వైతివా
వంతుతోడ వలపించవలెఁ గాక విభుని

చ. 2: సారె సారె నవ్వితేనే చనవరివైతివా
తోరపుఁ గొప్పు వెట్టితే దొరవైతివా
చేరి యంటుకొంటేనే చేఁతలాడి వైతివా
దారకాన దక్కఁ గొనఁదగుఁ గాక పతిని

చ. 3: పెనఁగి దండఁ గూచుంటే పెండ్లికూఁతుర వైతివా
పనులు సేసితే నేరువరివైతివా
యెనసి శ్రీవేంకటేశుఁ డేలె నన్నిందుకు, నీవు
చెనకి మెచ్చేది మంచిదిగాక ఇతనిని

రేకు: 0818-3 హిందోళవసంతం సం: 18-105

పల్లవి: ఏమని చెప్పుదునే వీఁడెమ్మెకాఁడు
చేముట్టి వేఁడుకొనీనే చెలిమికాఁడు

చ. 1: చలపాదిసరసాల జాజరకాఁడు
వలపులు చల్లీఁ బెక్కువలపుకాఁడు
తలఁపించీఁ దనపొందు దాయగాఁడు
వెలయించీ నన్ను నింత వేడుకకాఁడు

చ. 2: బచ్చన పరాకుల పంతగాఁడు
కొచ్చికొచ్చి చెనకీని కోడెకాఁడు
అచ్చుగా నాసరులంటి నాసోదకాఁడు
యిచ్చుటనే కాచుకున్నాఁ డెలయింపుకాఁడు

చ. 3: వద్దనుండే యెలయించీ వన్నెకాఁడు
ఆద్దుకొనీఁ గాఁగిట నందగాఁడు
వొద్దికై శ్రీవెంకటేశుఁ డుబ్బరికాఁడు
పెద్దరికపు లాబాల బేరగాఁడు

రేకు: 0818-4 భైరవి సం: 18-106

పల్లవి: ఎప్పుడు చిత్తగించేవో యేగతి మన్నించేవో
వొప్పన సేసితి నుడివోనివయసు

చ. 1: పంతమాడి వలచితి పైకొని నే నీకు
సంతోసానఁ బొగడితి సారెకు నిన్ను
చింతదీర మొక్కితి చెలగఁ నీపాదాలపై
ఇంతకంటే మరి నే నేమి సేతు నీకను

చ. 2: సన్నలనే చవిగొంటి సరసపునీమోవి
కన్నుల ను సొలసితి గక్కన నిన్ను
చన్నుమొనల నొత్తితి సంగడికి వచ్చి నీమై
యెన్నికలు నెరవేరె నేమిసేతు నీకను

చ. 3: విరుల సేస వెట్టితి వేడుక నీకొప్పుమీఁ ద
నిరతిమైఁ గాఁగిట నించితి నిన్ను
సిరుల నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
యిరువైతి నూడిగాన కేమిసేతు నీకను

రేకు: 0818-5 నాగగాంధారి సం: 18-107

పల్లవి: మేలుకు మేలేకాక మిక్కుటమేటా
కోలుముందై మీఁద గుట్టుసేయనేలా

చ. 1: పచ్చిగా మగువ నీతోఁ బలుకఁ గాను
అచ్చగా నూఁకొందు గాక అలయనేలా
ముచ్చట నాపె నీకు మొక్కఁ గాను
యిచ్చగించుకొంటగాక యిఁక సిగ్గులేలా

చ. 2: ననుపున నాకె నీతో నవ్వఁ గాను
చనువు లిచ్చుటగాక జాగులేలా
వినయముతో నిన్ను వేఁడుకోఁ గాను
యెనుయుటగాక మరి యెలయింపులేలా

చ. 3: ప్రియమున నీతో నాపె పెనఁగఁగాను
దయతోఁ గూడుటగాక తాలిములేలా
క్రియతోఁ గాఁగలించఁగా శ్రీ వేంకటేశా
నయమే మంచిదిగాక నాలితనములేలా

రేకు: 0818-6 నాదరామక్రియ సం: 18-108

పల్లవి: నెలఁత చక్కఁదనమే నిండుబండారము నీకుఁ
గలిగెఁ గనుకలక్ష్మీ కాంతుఁడవైతివి

చ. 1: పడఁతి నెమ్మోమునకు బంగారుకళలు దేరీ
వెడలేసెలవినవ్వే వెండిగనులు
ఆడియాలమగుమోవి నఁదె పగడపుఁ దీగె
నిడువాలుఁ దురుమే నీలములరాశి

చ. 2: తరుణిపాదపుగోళ్లు తళువులవజ్రములు
పరుగుఁ జేతిగోళ్లె పద్మరాగాలు
అరిదికన్నుల తేట లాణిముత్తె పుసరులు
సరిఁ బచ్చలకొండలు చనుమొనలు

చ. 3: చెలితేనెమాటలు జిగిఁ బుష్యరాగాలు
వలపుతెరసిగ్గులు వైడూర్యాలు
తొలఁకుననురాగాలే దొడ్డగోమేధికములు
కలసి తీకెను శ్రీవేంకటేశ కాఁగిటను

రేకు: 0818-6 నాగవరాళి సం: 18-109

పల్లవి: వీడుదోడాయ వలపు వెలఁదికి నీకును
చూడఁజూడ వేడుకాయ చూచువారికిని

చ. 1: సిగ్గుతోడ బాగాలు చెలి నీకు నందియ్యఁ గా
వొగ్గుచు నందికొంటివి వొయ్యన నీవు
నిగ్గులు దేరే యట్టి నీ పుక్కిటితములము
అగ్గలపుమోహమున నాపెకుఁ బెట్టితివి

చ. 2: చన్నులు బటువులుగ సతి నీకు నానించితే
వున్నతి నొరగుకొంటివి వొద్దికై నీవు
యెన్నికఁ జేతులు రెండు నీపెమేని కాదారుగ
చెన్నుమీర మెడదండనేసి కాఁగిలించితి

చ. 3: పడఁతి నీకు దప్పికిఁ బన్నీ రందియ్యఁ గా
కడఁగి శ్రీవేంకటేశ కైకొంటివి
తడయక అధరామృతపుపానకము నేఁ డు
యెడనెడ మారుకుమారిచ్చితివి నీవు

రేకు: 0819-1 దేసాళం సం: 18-110

పల్లవి: చిత్తగించి చూడవయ్య చెలిలాగు
బిత్తరపుజవ్వనము పెచ్చుపెరిగీని

చ. 1: చెలివీనులజవ్వాది చెక్కులఁ గరఁగి జారీ
వెలి నిన్నుఁ బాసినవిరహానను
మలసిన కోరికలు మతిలోఁ దీఁ గెలువారీ
వలపుల చెమటలవానలను

చ. 2: వేవేగఁ బెట్టినకొప్పు వెడజారీ మూఁపుమీఁ ద
నీవొద్దికి వచ్చేటి నిబ్బరానను
పూవుల దండలో నిపుప్పాడి దుమ్ములురేఁ గీ
కావరపునిట్టూర్పుల గాలిచేతను

చ. 3: మునుకొని మొరసీని ముంజేతికంకణములు
తనివార నిన్నుఁ గూడేతమకమున
యెనసితివి శ్రీవేంకటేశ యింతలోనె యీకెను
వినయాన నీకు మొక్కీ వేడుకలను

రేకు: 0819-2 సింధురామక్రియ సం: 18-111

పల్లవి: ఎంతలేదు పరాకు నీకేపొద్దును
వింతొకచూపు మరి వేడొకచ వెందురు

చ. 1: వేడుకతోడుత నీకు విన్నపాలు సేయవచ్చె
ఆడరాదా కతము లాపెతోడను
తోడనే సింగారించుక తొంగిచూచీ నల్లదివో
చూడరాదా యాదిక్కు జోడుగా నీవు

చ. 2: విందుగాఁ బయ్యెదలోన వెస నేమో మూసితెచ్చెఁ-
నందుకోరాదా లోన నాపెచేతను
పొందుగాఁ గొలువుసేసి పూనుకొని యెదుటనె
చెంది వూడిగ మేమైనాఁ జేయించుకొనరాదా

చ. 3: వినోదానఁ దా నేర్చిన విద్యలు చూపఁ గడఁగీ
మనసారఁ జూడరాదా మాఁటున నుండి
యెనసితివి శ్రీ వేంకటేశ యిన్నిటా నన్ను
పెనఁగి యాపెవలపుఁ బెడరేఁ చరాదా

రేకు: 0819-3 పాడి సం: 18-112

పల్లవి: ఎంత యెడగొల్లకత్తె వేమే నీవు
జంతవై వలపు లిట్టిచవులుగొనేవు

చ. 1: కురులు దువ్వేనంటా గుబ్బల నొత్తుకొనేవు
సరులు గట్టేనంటా సారెకుఁ గాఁగిలించేవు
శిరసంటేనానంటాను చెక్కుఁ జెక్కు మోపించేవు
బెరసి విభుని నెంత పిప్పిసేసేవే

చ. 2: కైదండ యిచ్చేనంటా కాయము సోఁకించేవు
పాదాలొత్తేనంటాఁ దొడపైకిఁ దీసుకొనేవు
ఆదట జలకమార్చేనంటా నొరసుకొనేవు
గోదిలిమోహన నెంతగుబ్బతిలేవే

చ. 3: తములాన కొగ్గేనంటా తగ మోవి దాఁకించేవు
చెమట దుడిచేనంటా సిగ్గులంటి పెనఁగేవు
అమర శ్రీ వేంకటేశుఁ డన్నిటాను నన్నుఁ గూడె
భ్రమసి నీవెందాఁ కాను బాఁతిపడేవే

రేకు: 0819-4 శ్రీరాగం సం: 18-113

పల్లవి: తానే యెఱుఁగుఁ బతి తలఁపించరే
యీనెలఁ త మేలు దాయ నెట్టోర్వ వచ్చునే

చ. 1: కొమ్మతలపోఁతలేడ కోవిలకూఁ తలేడ
నిమ్మలపుమనసేడ నివ్వెరగేడ
పమ్ముకొన్నసిగ్గులేడ పట్టరానితమి యేడ
ఇమ్ముల నిట్టివలపు లెట్టోర్వవచ్చునే

చ. 2: కలయవేడుకలేడ కంతునిబాణములేడ
నెలకొన్న యాసలేడ నిట్టూర్పులేడ
చెలిచక్కఁ దనమేడ చెక్కిటిచేయిచింతలేడ
ఇల నిట్టివలపులు యెట్టోర్వవచ్చునే

చ. 3: మంతనాన నుండిటేడ మలయుకోరికలేడ
సంతసపుమాటలేడ జాగులేడ
ఇంతలో శ్రీవేంటేశుఁ డిట్టె వచ్చి యాకె నేలె
యెంతయినా నీవలపు లెట్టోర్వవచ్చునే

రేకు: 0819-5 తెలుఁగుఁగాఁబోది సం: 18-114

పల్లవి: విరహమునకు నీవు వెరవవద్దు
గరిమ నేపొద్దూ నీవే కాపులు నీకును

చ. 1: చెంగలువబంతి నీవు చేతఁ బట్టుకొనవే
సంగతి నాతనిమేనిచాయల దది
ముంగిటితామర లురమున నొత్తుకోవే
రంగుగాఁ జెలువుని నేత్రములఁ బోలు నవి

చ. 2: కనకపు సొమ్ములెల్లా కాయముపై నించుకోవే
ఘనుని పీతాంబరపుకాంతులఁ బోలు
పెనచి మాణికములుపేరు మెడ వేసుకోవే
కనుఁ గొంటే నాతనికౌస్తుభముజాతివి

చ. 3: చేవమీర ముంజేతిచిలుకతో మాఁటాడవే
భావింప నాతఁ డెక్కేపక్షికులము
కోవరపు నీచనుఁ గొండ లిట్టె చూపవే
యీవేళ శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును

రేకు: 0819-6 ఆహిరి సం: 18-115

పల్లవి: తలఁపులో కోరికలు దైవారీని
యెలమిఁ గానుక లిచ్చి యీడకు రమ్మనవే

చ. 1: చెప్పరే యాతనిరాక చెలులాల
వుప్పతిల్లుఁ గాఁకలకు నోపనే నేను
కుప్పలుఁ దెప్పలునాయ కోరికలు
ఇప్పుడు కొలువులోఁ దా నేమిసేసినే

చ. 2: చూపరే తనిమోము సుదతులాల
పైపై నాతమకము పట్టఁ గరాదు
మోపాయ జవ్వనము మొగి నామేన
యేపునఁ దనకు నన్ను నీడేర్చఁ దగును

చ. 3: పొందుసేయరే యాతనిఁ బొలఁతులాల
విందువలెఁ దానె శ్రీవేంకటేశుఁడు
యిందుకే వచ్చి కలసె నిదివో నన్ను
అందమైన యిల్లాల నే నలమేలుమంగను

రేకు: 0820-1 సాళంగనాట సం: 18-116

పల్లవి: అన్నిటాను నెరజాణ వౌదువే నీవు
మన్నన లందితివే మగనిచే నీవు

చ. 1: చొక్కపుఁ జూపులఁ బతిఁ జూడనేర్తువే
మొక్కుతానే కొనగోరు మోపనేర్తువే
చిక్కనినవ్వులతోడ సిగ్గుపడనేర్తువే
చెక్కు నొక్కి ప్రియముల చెప్పనేర్తువే

చ. 2: చెప్పక పడిగాలెల్లాఁ జేయనేర్తువే
చెప్పరానిసన్నలు సేయనేర్తువే
చొప్పులుగా చనుఁగవసోఁకించనేర్తువే
దప్పిదేర మోవి చూపి తమిరేఁచనేర్తువే

చ. 3: ననుపులు సేసుక పెనఁగనేరుతువే
యెనసి బాగాలు నీ వియ్యనేర్తువే
అనుఁగు శ్రీ వేంకటేశునలమేలుమంగవు నీవు
తనియఁగఁ గూడితివి తలఁ పించనేర్తువే

రేకు: 0820-2 మంగళకౌశిక సం: 18-117

పల్లవి: వీడెమిత్తువు రావమ్మా వీఁడె పానుపుపై నున్నాఁడు
జోడైనవయసులే సొంపులు వుట్టించీని

చ. 1: సొలసి నీవుచూచినచూపులెల్లాఁ బతికిని
కలువపూవుదండలై కమ్ముకొనెను
నెలఁత నీవు చక్కనినెమ్మోము చూపితేను
వలుదచంద్రబింబమై వలపులు రేఁచెను

చ. 2: అరిది నాతనితోడ నాడిన మెల్లనిమాట
తరితీపుతేనెలై దైలువారెను
సరుగ నీవప్పుడు సన్న నేసిన సన్న
సురతపులతలై చుట్టుకొనెను

చ. 3: యెనసి శ్రీవెంకటేశుయెదుట నవ్వినవ్వు
చెనకి పైఁ జల్లినసేస లాయను
పెనఁగి చేతులువట్టి పిలిచినపిలుపులు
తనివోనికంకణదారా లాయను

రేకు: 0820-3 వరాళి సం: 18-118

పల్లవి: వినోదించవయ్యా ఇందు వేడుక సేసీ నీకు
ఘనసింగారవనము కామిని వెంచెనయ్యా

చ. 1: తెగరానియాసలు తీగెలువారఁ గాను
జిగిమించి చింతలు చిగిరించఁ గా
నిగిడి నివ్వెరగులు నీడలు గప్పఁగాను
తగుసింగారవనము తరుణి వెంచెనయ్యా

చ. 2: చిత్తమే జొంపాలుగట్టి చీఁకట్లుగొనఁ గాను
హత్తి కోరికవిరులు గుత్తులై మించెఁ
బొత్తుగాఁ బెంజెమటల పూవుఁ దేనెల గురియ
కొత్తసింగారవనము కోమలి వెంచెనయ్యా

చ. 3: నెయ్యముతోఁ జన్నుల నిమ్మపండ్లు వండఁ గాను
పయ్యదవెలుఁగు చుట్టిబయలు గాఁగా
ఇయ్యెడ శ్రీవేంకటేశ యీకె నేలితివి
వొయ్యనె సింగారవన మువిద వెంచెనయ్యా

రేకు: 0820-4 పాడి సం: 18-119

పల్లవి: నన్నెంత వొగడేవయ్యా నాగుణాలు మంచివంటా
చిన్నదాన నే నీవు నేసినమానిసిని

చ. 1: తనుకుబాంతియైన తరుణులెల్లా నింపులే
మనసెనసినవారిమాట లింపులే
నునుపు గలుగుచోటినవ్వులెల్లా నింపులే
పెనఁగి పైకొనేవారి ప్రియములు నింపులే

చ. 2: సేవలు సేసేవారిసేఁ తలెల్లా నింపులే
కైవమైనవారిగతు లింపులే
వావిగలసినవారివాడికలెల్లా నింపులే
నీవద్దఁ బాయని వారినిండు సిగ్గు లింపులే

చ. 3: సరసములాడే వారి సంగాతాలెల్ల నింపులే
సురతవేళల మేనిసోఁ కు లింపులే
ఇరవై శ్రీవెంకటేశ యిన్నిటా నన్నేలితివి
మరిగినయడాటాన మంతనము లింపులే

రేకు: 0820-5 దేవగాంధరి సం: 18-120

పల్లవి: చూడరే వోచెలులాల సుదతిసింగారము
వేడుకతోడఁ దోడ విలాసము మించెను

చ. 1: అలరిననెమ్మోము అద్దమయినకతన
మెలుపునఁ గళల నేమించులు మించె
లలిఁ దురుమెల్లా నీలపురాలైనకతన
కలికిచూపులు నిండుఁ గాంతు లిట్టె మించెను

చ. 2: పగటున మోవి బింబఫలమైయున్న కతన
పొగడొందుమాటలతీపులు మించెను
తగునాభి సరసియై తనరినకతమున
సిగిడి మొక్కలకరనీరజములు మించె

చ. 3: నెట్టన మేను లతై నెగడినకతమున
కిట్టి శ్రీ వేంకటేశుకాఁగిటఁ బాఁకెను
అట్టె చన్నులు నిమ్మపండ్లయి వుండినకతన
పట్ట నితనిచేతులఁ బాదుకొని మించెను

రేకు: 0821-1 నారాయణి సం: 18-121

పల్లవి: ఆడనుండే చూచి వెరగందితి నేను
యీడ నన్నుఁ గాఁగిలించే వేఁటిదో యెఱఁగను

చ. 1: సొలపుఁ జూపులఁ జూచి సుద్దులు నీతోఁ జెప్పి
వలపులు చల్లెఁ నాపె వాడికగాను
కలువల యేసి కందువకు రమ్మని
పిలిచితి వెటువంటి ప్రియమో నీకును

చ. 2: చనుఁగవపై పయ్యద చక్కఁ బెట్టుకొంటాను
వినయాన మొక్కి నాపె వేడుకగాను
ననిచి కై దండవట్టి నగరిలోనికిఁ దీసి
పెనఁగితి వాపె యెంతప్రియమో నీకును

చ. 3: చేరి జాఱుఁ గొప్పు చేతఁ జెక్కుకొంటా మోముచూపి
సారె సన్న నేసి నాకె సమ్మతిగాను
గారవించి నన్నేలితివి గక్కన శ్రీ వేంకటేశ
బీరాన నాపె నెంతప్రియమో నీకును

రేకు: 0820-6 పాడి సం: 18-122

పల్లవి: వెగరించకరే మీరు వెలఁదులాలా
పోగైన మంచిగుణాలబుద్దులవాఁ డతఁడు

చ. 1: వలపించనేర్చునట వద్దికి రానేరఁడా
తలఁ పెందున్నదోకాక తనకు నేఁడు
మొలయించఁ గలఁడట యెనయఁ గలేఁడా
కలిగినతనబత్తి కందము గాక

చ. 2: కొరి తెచ్చుకొన్నవాడు కూడుకొననేరఁడా
వూరికే పనిగలిగి వున్నాఁ డో కాక
వేరులేనిచుట్టరికమట విడెమంప మరిచీనా
తారుకాణలై మనకుఁ దానె వచ్చీఁ గాక

చ. 3: మంచముపై కిట్టె వచ్చి మాఁటాలాడ నేరఁడా
యెంచుక నన్నెంతగా మన్నించీనోకాక
అంచెల శ్రీవేంకటేశుఁ డన్నిటాను నన్నుఁ గూడె
నించినయీపొందు లిట్టె నెరవేరీఁ గాక

రేకు: 0821-1 బౌళి సం: 18-123

పల్లవి: ఎట్టునేసినా నీచిత్త మెదురాడేదానఁ గాను
పట్టి నీపాదాలసేవే పదివేలు నాకు

చ. 1: ఆసపడి మోహించిన అతివను నే నీతో
వాసులు వంతులు నెంచవచ్చునా మరి
పోసరించి జవ్వనమే పోగై వున్నదానను
వేసరఁ జెల్లునా నిన్నే వేఁడుకొనేఁ గాక

చ. 2: యెప్పుడు వత్తువోయని యెదురుచూచే నేను
తప్పులుఁ దారులుఁ బట్టఁ దగవా నిన్ను
వుప్పతిల్లి సేసపాలు వొడిఁగట్టుకుందానను
నెప్పున నే నలిగేనా నీతో నవ్వేఁగాక

చ. 3: నెమ్మది నీ కాఁగాలి నీకే మీఁదెత్తుకుండి
యెమ్మెలు నేతులుఁ జూపనేలా ఇఁక
నమ్మించి శ్రీవేంకటేశ నన్నిట్టె యేలుకొంటివి
కమ్మటి నే మరచేనా కడుమెచ్చేఁ గాక

రేకు: 0821-2 గౌళ సం: 18-124

పల్లవి: ఓయమ్మ తానెంత వొడఁబరచీనే నన్ను
చేయి మీఁదాయఁ దనకుఁ జేతిలోని దాననే

చ. 1: చెంతనుండి వూడిగము సేసే యిల్లాలఁగాక
పంతమాడే యిల్లాలనా పతితోను
వింతలేక తనమాట విననేరుతుఁ గాక
యెంతైనా తనకు నేనెదురాడనేర్తునా

చ. 2: సిగ్గుతోడఁ బాదాలొత్తి చిమ్మిరేఁగే దానఁగాక
యెగ్గుపట్టే దాననా యెంతైనాను
వొగ్గి తనచేఁతలెల్లా వొడిఁగట్టుకొందుఁగాక
వెగ్గళించి యేమైనా వేసారుకొందునా

చ. 3: ఇచ్చకమై నెరుపేటిదిది నాగుణము గాక
నచ్చుకొట్టి కొసరేదా నాగుణమా
అచ్చపుశ్రీ వేంకటేశుఁడంతలోనె నన్నుఁ గూడె
కొచ్చి తనగుణాలు చేఁగొ నాడ నావసమా

రేకు: 0821-3 పాడి సం: 18-125

పల్లవి: చెప్పితి మిప్పుడే నీకు చెలులము బుద్ధులెల్లా
ముప్పిరిఁ జేత మొక్కవే మోసపోతిననక

చ. 1: మనసార నాతనితో మాటలెల్లా నాడవే
చెనకవే ఇప్పుడేల సిగ్గువడేవు
పెనఁగవే చేయివట్టి పిలువవే యింటికి
వెనక మరచివచ్చి విచారము సేయక

చ. 2: తలయెత్తి చూడవే తనియ నాతనిదిక్కు
నిలువనే ముందటను నీకేల కొంక
వెలయఁగ నవ్వవే విడెము చేతి కివ్వవే
మలసి యింకొకమారు మరచితిననక

చ. 3: పానుపుపై గూచుండవే పాదాలొత్తఁ గదవే
మౌనముతో నిఁకఁ దెఱమఱఁ గేఁటికి
పూని శ్రీ వేంకటేశుడు పొందుసేసి నిన్నుఁ గూడె
కానుక మోవి చేకోవే కడమాయననక

రేకు: 0821-3 శుద్ధదేశి సం: 18-126

పల్లవి: కానవచ్చె నాపై నీపైఁ గలమోహమెల్లాను
ఆనుకొన్న వవి యెట్టియడియాసలో

చ. 1: చిత్తగించి చూడవయ్య చిరునవ్వు నవ్వీ నాపె
యిత్తల నీయాపె సఁది నెంత వనిలో
కొత్తకొత్తచెమటలు గోర నీపైఁ జిమ్మీని
తత్తరాన నది యెట్టి తడఁబాటులో

చ. 2: వేడుకతో వినవయ్య విన్న వించఁబూనీ నాపె
వోడక నీకాపె కెంత వొడఁబాటులో
వాడిక సన్నలవే వలపులు నీపైఁ జల్లీ
యీడుజోడయిన సుద్దు లెటువంటివో

చ. 3: అఁది కాఁగిలించుకొనవయ్య నీకు మొక్కీ నాపె
విందుల నీకాపె కెట్టివేడుకలో
యిందునె శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
సందడి సేఁత లేరీతి సరసములో

రేకు: 0821-4 కాంబోది సం: 18-127

పల్లవి: ఊరకే వుండేనంటే వుమ్మగిలీ వలపులు
యేరీతి మన్నించేవో ఇఁక నీచి త్తము

చ. 1: తలెత్తి చూడకుండితే తనివియుఁ దీరదు
సొలసితేఁగాని వాసులు మించవు
తెలియమాటాడకుండితే నొక్కమనసు గాదు
చెలఁగి విన్నపాలెల్లాఁ జేసితి నీచిత్తము

చ. 2: సరసమాడితే గానీ చవులెల్లా రేగవు
సొరదిఁ గూచుండక సొంపులు వుట్టదు
తెరలోనికిఁ దియ్యక తీర దెంతైనా సిగ్గు
సరవి నివెల్లా జాడలు నీచిత్తము

చ. 3: తనువులు సోఁకక తనివో దెంతైనాను
ననువునఁ బెనఁగక నాఁటదు ప్రేమ
యెనసితివి శ్రీ వేంకటేశ ఇంతలో నన్ను
కనుఁగొంటి నీమేలు గట్టిగా నీచిత్తము

రేకు: 0821-5 ఆహిరి సం: 18-128

పల్లవి: నీదిక్కే చూచి వాడే నీమగఁడు
సాదించీ మీమోహములు సందడించీఁ జుమ్మీ

చ. 1: చక్కని నీవదనము సారెనేల వంచేవే
చిక్కని నీనగవులు చిందీఁ జుమ్మీ
చెక్కిటి మీఁద నటు చేయి యేల పెట్టేవే
అక్కజపు మోముకళ లంటుకొనీఁ జుమ్మీ

చ. 2: సన్నలనే నీ బొమ్మల వంకెన లేల చూపేవే
మిన్నక వజ్రాల బొట్టు మెరచీఁ జుమ్మీ
చన్నుల మీఁది పయ్యద చక్కబిగించుకొనే
మున్నే జక్కవ పిల్లలు మూఁతులెత్తీ జుమ్మీ

చ. 3: సిగ్గుతో నేల ముంజేతి చిలుకతో మాటాడేవే
వొగ్గి తరితీపులెల్లా నూరీఁ జుమ్మీ
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
తగ్గక యీసింగారము దైవారీఁ జుమ్మీ

రేకు: 0821-6 బౌళి సం: 18-129

పల్లవి: కానీవయ్యా చుట్టాలమై కలిగితివి మిదె నీ
వీనులకు చవులు నీవేడుకలే కావా

చ. 1: తగవులు చేప్పేవు తరుణికి నాకును
మగడవు నీవేకావా మాకిద్దరికి
వెగటు దీర సరిగా విడెములు వెట్టేవు
జిగిమించ నిన్నియు నీచేఁతలే కావా

చ. 2: వొడివట్టి మొక్కించేవు వొకరొకరిని మాలో
నడుమ నీవే కావా నాయఁగాడవు
తొడిఁబడ నీవిట్టె పొత్తులఁ గూచుండు మనేవు
జడిగొన్న నీగుణాల సహజమే కాదా

చ. 3: వొగ్గి కాఁగిటిలో మమ్ము నొద్దికతోఁ గూడేవు
సిగ్గులు నీవే కావా శ్రీవేంకటేశా
తగ్గులేకుండా మమ్ము దయతో మన్నించితివి
వెగ్గళమై నీకుఁ గల విద్య లివే కావా

రేకు: 0822-1 సామవరాళి సం: 18-130

పల్లవి: చెప్పవయ్య వినేఁగాని చెవుల పండుగగాను
యిప్పుడే మొక్కులు మొక్కీ నెంత చుట్టరికమో

చ. 1: కొమ్మ గేఁదగి రేకులు కొప్పున జెరుగు కొని
యెమ్మెలు పచరించీ నీయెదుట వదె
నెమ్మది వద్ద గూచుండి నీతో మాటలాడీని
యిమ్ముల మీకిద్దరికి నెంత చుట్టకిరమో

చ. 2: సింగారించుకొని వచ్చి చీరునవ్వు నవ్వుకొంటా
కొంగు నిన్ను దాఁకించి కొసరీనదె
సంగతిగా నప్పటిని సారె విడెమిచ్చుకొంటా-
నెంగిలిపొత్తు గలసీ నెంతచుట్టరికమో

చ. 3: ఆదిగొని కంకణాలు అట్టె గల్లుగల్లనఁగా
పాదాలు గుద్దీ నీకు పాన్పుపై నిదె
పాదితో శ్రీవేంకటేశ పొంచి నన్నుఁ గూడితివి
యీదెసఁ దనకు నీకు నెంతచుట్టరికమో

రేకు: 0822-2 హిజ్జిజి సం: 18-131

పల్లవి: ఏల మూసి దాఁచేవు యిదేమయ్యా
ఆలుగాదా నీకు నాపె అదేమయ్యా

చ. 1: బత్తితోడ నిన్నుఁ జూచి పడఁతి మాటలాడఁగా
యిత్తల సిగ్గువడేవు యిదేమయ్యా
బొత్తుగాఁ బువ్వులచెండు పూఁచి కానుకియ్యఁగాను
హత్తిచేతి నందుకొన వదేమయ్యా

చ. 2: ముందరనే నిలుచుండి మోహ మాపె చల్లఁగాను
ఇందుకు రమ్మనరాదా ఇదేమయ్యా
విందువలెఁ జెవిలోన విన్నపాలు సేయఁగాను
అందుకు నేమీనన వదేమయ్యా

చ. 3: నెఱతనమున వచ్చి నీపాదము దొక్కఁగాని
యెఱఁగనట్టే వున్నాఁడ విదేమయ్యా
మఱి నన్నుఁ గూడితివి మరిగి శ్రీవేంకటేశ
అఱమఱచే వాపెను అదేమయ్యా

రేకు: 0822-3 రామక్రియ సం: 18-132

పల్లవి: సందుసుడికత్తెవు జాణవు నీవు
యిందరు నుండఁగా నీ వెంతలాచేవే

చ. 1: వుంగరము నీదంటా వూరకే వేలువట్టేవు
కొంగు దాఁకించకుమంటా కోరఁ జిమ్మేవు
సింగారించనేర్తునంటా చేరి వద్దఁ గూచుండేవు
ఇంగితము చూపి పతి కెంతలాచేవే

చ. 2: మన్నము వెట్టుమంటా చుట్టరికాలు సేసేవు
వున్నదా నిమ్మపండంటా నొడివట్టేవు
చన్నులు చూచితిలంటా సారెఁ దగులనాడేవు
యెన్నికతో రతులకు నెంతలాచేవే

చ. 3: కోవిల గూసీనంటా కుచ్చి కాఁగిలించేవు
దేవులనైతినంటాఁ దెరవేసేవు
చేవమీర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
యీవేళ నీవాసపడి యెంతలాచేవే

రేకు: 0823-1 వరళి సం: 18-133

పల్లవి: దండనున్నసతులెల్లా తలలు వంచుకొనేరు
కొండవంటిదొరవు సిగ్గులు దేర్చరాదా

చ. 1: పచ్చడములోననే పాదాలొత్తీ నాపె నీకు
గచ్చుఁజేఁతల నీవాపెఁ గరఁగించేవు
పచ్చిదేరి మోవెల్ల భావపుఁ గళలు దాఁకీ
ఇచ్చటనే ఆఁటదాని నింతసేతురా

చ. 2: దోమతెరమాటుననే తూరి యాపె సేవ సేసీ
చేముట్టి మర్మములంటి చిమ్మిరేఁచేవు
మోమునఁ జొక్కులుదేరె మూసీ మంతనపురతిఁ
గామిని నిందరిలోనఁ గడుఁగాకుసేతురా

చ. 3: పూదండల సందినే పాదిగి కూడీ నాపె
ఆదెసఁ జెమట నోలలార్చేవు నీవు
తోదోపులనే వీడెఁ దురుము శ్రీవేంకటేశ
సాదువంటిజవరాలి సారెఁ గాకుసేతురా

రేకు: 0823-2 బౌళి సం: 18-134

పల్లవి: ఎఁదుకని సిగ్గువడే వేమే నీవు
కందువ నాపచ్చడము గప్పుకోవే యిపుడు

చ. 1: ముదిత జారినకొప్పు ముడుచుకోఁగడఁగితే
వదలి పయ్యెద కానవచ్చెఁ జన్నులు
అది చక్కబెట్టుకొనేనంటాఁ గొంగు బిగించితే
పొదిగి కట్టిన యట్టి పోఁకముడి వీడెను

చ. 2: సరుగ నావలిపెమే చక్కఁగట్టు కొనఁగాను
గరిమఁ దొడలనిగ్గు గానవచ్చేను
పరగ నందుకు లోఁగి పాపట దువ్వుకొంటే
కరమూలములసొంపు గడుబయలాయను

చ. 3: చెలరేఁగి యందుకు నవ్వి చేత విడెమిచ్చి తేను
పులకలే నీమర్మములు దెలిపె
అలమితి నందుకుఁగా నట్టై శ్రీవేంకటేశుఁడ
చెలపలచెమటలు చెమరించె నీకును

రేకు: 0823-3 లలిత సం: 18-135

పల్లవి: అందుకేమి దోసముగా దానతీవయ్యా
విందులుగా వీనులను వినే నేను

చ. 1: మగువలతోనెల్లా మాఁటలు నీ వాడఁగానో
చిగురాకు నీమోవి చేగయెక్కెను
మొగి వారితోడ సాములు నీవు సేయఁగానో
జాగిమించు చెక్కులెల్లాఁ జెమరించెను

చ. 2: సారె సారెఁ జెలరేఁగి సరసములాడఁగానో
చీరుమూర్తై మేనెల్ల జీరలాయను
చేరి చేరి లోలోను సేసలు చల్లుకోఁగానో
కూరిములు చూపట్టఁ గురులు చెదరెను

చ. 3: ననుపులు సేసుకొని నవ్వులు నవ్వఁగానో
నినుపుగా నిట్టూర్పులు నిగుడఁజొచ్చె
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
కనుపట్టి నీమోమునఁ గళలు దైవారెను

రేకు: 0823-4 మంగళకౌశిక సం: 18-136

పల్లవి: అనేక పంతగాఁడవు అందగాఁడవు
ముసుకొన్న మావెంగేలు ముంచుకొనీనా

చ. 1: కొసరితే నేమాయ కొంగువట్టితే నేమాయ
మసలక తగులైన మగవానిని
యెసఁగ నేఁ జెనకితే నేలతప్పించుకొనేవు
కసుఁగందనిచన్నులు కాఁడీనా నిన్నును

చ. 2: సారె నంటించితే నేమాయ జంకించితే నేమాయ
వేరులేని చుట్టరికమైన విటరాయని
వూరక నవ్వితేను వొడ్డించుకో నీకేఁటికి
ఆరితేరి నాచూపులు ఆయములు రేఁచీనా

చ. 3: చెక్కు నొక్కితే నేమాయ చిక్కించుకొంటే నేమాయ
అక్కరతో నాయకుఁడైనవానిని
యిక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిక్కిలి నారతులివి మేరమీరీనా

రేకు: 0823-5 పాడి సం: 18-137

పల్లవి: ఏమాయ నందుకునేల వేగిరించేవు
నీమాటలన్నియును నిజమయ్యీఁగాక

చ. 1: సందడిలో నిన్ను నాచన్నులు దాఁకితేను
కందువల నిది యెంతగబ్బి యనేవు
గందవొడి చల్లుకోఁగా గాలి నీపైఁ బారితే
కెందమ్మిపువ్వులనేల కెరలి వేసేవు

చ. 2: కురులు దువ్వుకోఁగా కొప్పు నీపై జారెనంటా
గొరబు సేసి నన్ను గోర గీరేవు
పరగ మేడ యెక్కఁగా పైఁజిందెఁ జెమటలంటా
సరుగఁ గప్పురమేల చల్లేవు నామీఁదను

చ. 3: యిట్టె బంతిఁ గూచుండఁగ నెంగిలి సోఁకెనంటాను
బెట్టుగఁ గాగిట గుచ్చి బిగియించేవు
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టమవై నన్ను నెంత చొక్కులఁ బెట్టేవు

రేకు: 0823-6 మాళవి సం: 18-138

పల్లవి: ఎంతజాణలే వీరు యింతులాల
వింతలుగ వీదివీది వినోదించేరు

చ. 1: ఇద్దరు దేవుళ్లుఁ దాము నెదురు దేరులమీఁద
కొద్దిమీర నిమ్మపండ్లఁ గుచ్చి చిమ్మేరు
వొద్దికతో నవ్వుకొంటా నుంటవింట గందపు-
ముద్దలు దాఁకవేసి మోదములు చూచేరు

చ. 2: వెనకాముందరాను వేడుకతోఁ దేరులు
అనువుగా వెంటవెంట నంటఁ దోలేరు
తనువులు సోఁకఁ జేతి తామరనాళముల
పెనఁగి పైఁబారఁ జాఁచి పిలిచేరు మోవులు

చ. 3: సందడిలోపలనే సంగడిఁ దేరులు నిల్పి
కందువతోఁ జౌకళించి కాఁగిలించేరు
పొంది శ్రీ వేంకటేశుఁడు భూదేవి నలమేల్మంగా
పెందలికాడనే పెండ్లిపీఁటపై నున్నారు

రేకు: 0824-1 సౌరాష్ట్రం సం: 18-139

పల్లవి: ఎంత మోహమో నీకీ ఇంతి మీఁదను
వింత వింత వేడుకల విఱ్ఱవీఁగేవు

చ. 1: తరుణిగుబ్బలు నీకుఁ దలగడబిల్లలుగా-
నొరగుకొన్నాఁడవు వుబ్బున నీవు
దొరవై పయ్యదకొంగు దోమతెరబాగుగ
సరుగ మాఁటు సేసుక జాణవై వున్నాఁడవు

చ. 2: భామినితొడలు నీకు పట్టెమంచములాగున-
నాముకొని పవ్వళించే వప్పటి నీవు
గోముతోడ పట్టుచీర కుచ్చెల పరుపుగాఁగ
కామించి ఇట్టె కోడెకాఁడవై వున్నాఁడవు

చ. 3: వనితకాఁగిలి నీకు వాసన చప్పరముగ-
నునికి సేసుకున్నాఁడ వొద్దికై నీవు
యెనసితివి శ్రీ వేంకటేశ యలమేల్మంగను
అనిశము సింగారరాయఁడవై వున్నాఁడవు

రేకు: 0824-2 బౌళి సం: 18-140

పల్లవి: మేలు మేలు నీకతలు మెచ్చితిమయ్యా
యేలుకొంటి విందరిని యెంతవాఁడవయ్యా

చ. 1: చల్లువెడమాట లాడి సతులవలపులెల్ల
కొల్లగాఁ గలయఁ బెట్టి ఆలు గుంపు సేసేవు
అల్లి బిల్లి సేసి కూడి ఆలు మోపులుగట్టి
యెల్లవారిమీఁద వేసే వెంతవాఁడవయ్యా

చ. 2: వాడికనవ్వులు నవ్వి వనితల మానములు
కూడపెట్టి లోలోనే గుది గుచ్చేవు
యీడుజోడుగాఁ బెనఁగి యింపులు మచ్చులువేసి
యీడేరించితివి మమ్ము నెంతవాఁడవయ్యా

చ. 3: మోవితీపులు మరపి ముదితల జవ్వనాలు
భావముల వడివెట్టి పచ్చిరేఁచేవు
శ్రీ వేంకటేశ నాపై సిగ్గులు నానఁబెట్టి
యీవల నన్నుఁగూడితి వెంతవాఁడవయ్యా

రేకు: 0824-3 పాడి సం: 18-141

పల్లవి: ఎంత వేడుకకాఁడ వేమిచెప్పేది
అంతేపో నేరుపరివౌదువయ్యా నీవు

చ. 1: చిక్కనివి నవ్వులు చిమ్మిరేఁగేవి సిగ్గులు
చక్కఁగ మాతోనేల జాణతనాలు
లక్కబుఱ్ఱవంటినోరు లలిఁ బగడపుమోవి
పిక్కటిల్ల గంటిసేయఁ బెనఁగేవు నీవు

చ. 2: గట్టులివి చన్నులు కడుబయలు నడుము
నెట్టన మాతోనేల నెరతనాలు
దట్టపు మేఘము కొప్పు దంతికుంభాలు పిరుఁదు
ముట్టి సరసములాడ మొనసేవు నీవు

చ. 3: పసని తీగె మేను పాయరానివి యాసలు
యెసగి మాతోనేల యేలాటాలు
వసమై నన్నేలితివి వాసితో శ్రీవేంకటేశ
పొసఁగె నన్నిటా నన్ను బొదిగేవు నీవు

రేకు: 0824-4 గుజ్జరి సం: 18-142

పల్లవి: నేసినట్టు సేయవయ్యా చిత్తము వచ్చినట్టల్లా
నాసివంతు లెంచుకొని వద్దన నేఁ జాలను

చ. 1: పిలిపించినవాఁడవు ప్రియముగలవాఁడవు
చెలఁగి యెంతనవ్వినాఁ జెల్లు నీకు
వలపించినవాఁడవు వనమైననాఁడవు
అల మెంతభోగించినా నమరు నీకు

చ. 2: వొడివట్టినవాఁడవు వొద్దఁభాయనివాఁడవు
తడవి యెంతపై కొన్నాఁ దగు నీకు
విడెమిచ్చినవాఁడవు వేడుక పడ్డవాఁడవు
కడఁగి చన్నులు విసుకఁదగవే నీకు

చ. 3: పెనఁగేటివాఁడవు పెండ్లాడినవాఁడవు
ననిచి మోవి యానఁగ నాయమే నీకు
యెనసితివి శ్రీ వేంకటేశ యిన్నిటా నన్ను-
నొనగూడి మన్నించిను నుచితమే నీకు

రేకు: 0824-5 పాడి సం: 18-143

పల్లవి: ఎంత బత్తి సేసి నీపై ఇదె సందుగాఁ దాను
వింతలేక సేవ సేసీ వేడుకెంతో తనకు

చ. 1: చన్ను లురమున నాని చక్కదిద్దీ నీ నామము
మన్నించితే నేమి యెంతమందెమేళము
చిన్నిపెదవులు దాఁక చెవిలోనే మాటలాడీ
యెన్నరాదు చూడు దీని కెంతగర్వము

చ. 2: తొడమీఁదఁ దొడవేసి దొరతనమున నీ-
యదుగులొత్తీ నెంత అహంకారము
వెడదగోళ్లు సోఁక విడెము నీకిచ్చీని
తడిచెమటలతోనే తన కెంతపగటు

చ. 3: జమళిచంకలు రాయ జవ్వాది నీమేనఁ బూసి
తమకించీ నెటువంటి దంటతనము
అమర శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
సముకాన నీకె కెంత సంగడిదాక్షీకము

రేకు: 0824-6 రామక్రియ సం: 18-144

పల్లవి: ఏమే సేసినమేలు ఇయ్యకోవద్దా
సాములేలే గందవొడి చల్లేనంటేను

చ. 1: మెక్కేవేమే వద్దంటాను మోహాన నీరమణుఁడు
యిక్కువతో నాకుమడిచి యిచ్చేనంటేను
పిక్కటిల్లుచన్నులతోఁ బెనఁగులాడేవేమే
చుక్కబొట్టు నొసలఁ జక్కఁబెట్టే నంటేను

చ. 2: అందుకాచే వదియేమే అదరించి యాతఁడు
పెండెము నీపాదమునఁ బెట్టేనంటేను
వెండియు నాతని వెనవెనక కేఁగేవేమే
కొండవలెఁ దొడమీఁదఁ గూచుండుమంటేను

చ. 3: వేవేలుచందముల వేఁడుకొనే వదియేమే
శ్రీ వేంకటేశుఁ డక్కునఁ జేర్చేనంటేను
భావించి వినయాలే పచరించే వదియేమే
యీవేళ నిన్నెనసి మోవిమ్మని యంటేను

రేకు: 0825-1 లలిత సం: 18-145

పల్లవి: తేరిచూడ నిన్నీ నాకు దిష్టమాయను
రారాఁపు లిఁకనేల రమ్మనవే పతిని

చ. 1: ఆడఁగనాడఁగ సరసాలాసలు వుట్టించును
చూడఁబోతే మోహములు చుట్టుకొనును
వాడిక దరచైతేఁ గైవశముగాఁ జేసును
యీడనే పంతము లాడనేలే నాకిఁకను

చ. 2: వినఁగ వినఁగ మాట వేడుకలు వొడమించు
పెనఁగితేఁ దనువులు ప్రేమరేఁచును
మనిమని యేకతాలు మర్మములు గరఁగించు
యెనసి పంతములాడనేలే నాకిఁకను

చ. 3: సేయఁ జేయఁ జెలుములు చిత్తములు మరిగించు
రాయడింపుఁ జెనకులు రతి వుట్టించు
పాయక శ్రీ వేంకటపతి నన్నుఁగూడినాఁడు
యేయెడఁ బంతములాడనేలే నాకిఁకను

రేకు: 0825-2 అహిరి సం: 18-146

పల్లవి: ఎదురుచూచి చూచి యేఁకరినట్టయ్యీని
నిదుర గంటికి రాదు నేనిఁక నేమందునే

చ. 1: వొప్పఁజెప్ప నా చేతివుంగరము తానే యిచ్చె
అప్పటి వచ్చేనంటా నానవెట్టెను
కప్పురపుఁదమ్ములము కందువగా నోర నించె
యెప్పుడుగాని రాఁడో యేమి సేతుఁజెలియా

చ. 2: కూరిమితో జారిన నాకొప్పు తానె చక్కఁబెట్టె
గారవించి నమ్మించి కాఁగిలించెను
వూరడించి వొకతె నా వద్ద నప్పసము వెట్టె
చేర నెప్పుడు వచ్చీనో చెప్పఁగదే చెలియా

చ. 3: ఆదరించి చిక్కువడ్డహారములు తానె దిద్ది
పోది సేసి మోవియిచ్చి బుజ్జిగించెను
యీదెస శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యేదస నుండెనోకాని ఇందాఁకా జెలియా

రేకు: 0825-3 ముఖారి సం: 18-147

పల్లవి: ఏలే ఆఁటదానికి యెమ్మెలింతేసి
వోలిఁ గడుగుట్టుతోడ నుండవలెఁగాక

చ. 1: జవ్వాది యెంతవూసేవే చన్నులేల మూసేవే
చివ్వన నెన్నిచేఁతలు సేసేవే
నవ్వులేమి నవ్వేవే నలిఁ గొప్పేమి దువ్వేవే
రవ్వలాయ నీ వలపు రమణుని యెదుట

చ. 2: సిగ్గులేల విడిచేవే చెమటేల తుడిచేవే
మొగ్గవిరు లిన్నేల ముడిచేవే
వొగ్గి కాలేల తొక్కేవే వూరకేల మొక్కేవే
యెగ్గులుఁ దప్పు లెవ్వరి నెంచని వాఁడతఁడు

చ. 3: మఱి యెందాఁకాఁ బాడేవే మాటలెన్ని యాడేవే
గుఱిగాఁ గాఁగిట నెంత కూడేవే
యెఱుకతో శ్రీ వేంకటేశుఁడు నన్నిటు గూడె
మెఱసి యాతనికేల మేకులు సేసేవే

రేకు: 0825-4 శంకరాభరణం సం: 18-148

పల్లవి: ఇందవె యాతఁడు నీకిచ్చినసొమ్ము
కందువ నీమేలు లోని కాంతలము గదవే

చ. 1: చిప్పిలుఁ జెమటలేలే సిగ్గులు వడఁగనేలే
తప్పక వినరాదా యాతని సుద్దులు
రెప్పలు మూసుకొనేవు రిచ్చ లోలో నన్వేవు
వొప్పుగాఁ బెండ్లికూఁతుర విప్పుడే యైతివా

చ. 2: పయ్యద మరఁగులేలే భావపుఁగరఁగులేలే
ఇయ్యకొనవే చనవులిచ్చినాఁడు
వొయ్యనే మాటాడేవు వొగిఁ బాపట దువ్వేవు
ఇయ్యెడఁ గన్నెపడుచ విందుకే యైతివా

చ. 3: బట్టబయలీఁ దనేలే పరాకు లిఁకనేలే
అట్టె వద్దకి రారాదా యాతఁడు వచ్చె
చుట్టమై శ్రీ వేంకటేశుఁడు తానె నిన్నుఁ గూడె
ఇట్టె పట్టపుదేవి వింతలో నయితివా

రేకు: 0825-5 భైరవి సం: 18-149

పల్లవి: ఇప్పుడే విన్నవించితి నెంచుకో మీఁదటియెత్తు
వొప్పుగ ధీరుఁడవైతే నొనరు నాకాఁగిట

చ. 1: నాతో మాటాడఁగ నీనాతు లేమందురో నిన్ను
చేతులెత్తి యేమేమి సేతురో
యీతలనాతల నిన్ను నెక్కడనుండి చూచేరో
బీతి లేనివాఁడవైతే పెనఁగు నాతోను

చ. 2: నీవు నాచన్న లంటఁగ నిన్నేమందురో వారు
వావాత నెన్నేసి నీకు రేఁతురో
యీవేళ మనమాఁటలు యేడ వింటానున్నారో
ఆవుద్దండాల కోపితే నండకు రా నీవు

చ. 3: యీడ నిట్టె వుండఁగా నెంత సాదింతురో తాము
కూడితి శ్రీ వేంకటేశ కోరి నన్నును
వీడే లియ్య నేడు నిన్ను వెదుకుతానున్నారో
నీడాక చూపనోపితే నెట్టుకో మాయింటను

రేకు: 0825-6 సాళంగనాట సం: 18-150

పల్లవి: ఇట్టె నామోము చూచి యేమినవ్వేవు
చుట్టమవై వూరికెల్లాఁ జూపట్టినవాఁడవు

చ. 1: ఆసపడేవారి నెంత అలయించేవు పెండ్లి
సేసుకోరాదాయేల సిగ్గువడేవు
దోసముగా దెందరైన దొడ్డిఁ బెట్టుకొనవచ్చు
బేసబెల్లి రేపల్లెఁ బెరిగినవాఁడవు

చ. 2: తోడనే మాటాడేవారిఁ దోయనేల సరసముఁ
లాడరాదా యేఁటికి నీవందుకాచేవు
వాడికగా వలపువల్లెలు వేయఁ గవచ్చు
కోడెల నావులఁ గాచేగొల్లమందవాఁడవు

చ. 3: ననిచి చుట్టాలై మొక్కినవారిఁ గాఁగిలించుఁ-
కొనరాదా మరియేమి గుట్టునేనేవు
పెనఁగులాడఁగవచ్చు బెట్టుగా శ్రీవేంకటేశ
యెనసితి గోవర్ధనమెత్తినట్టివాఁడవు

రేకు: 0826-1 శుద్ధవసంతం సం: 18-151

పల్లవి: వేడుకకాఁడవు నీకు వెఱుపేఁటికి
యేడ నీవేమినేసినా నెగ్గులున్నవా

చ. 1: నిలుచుండి నిన్నుఁ దప్పకచూచితే
చెలరేఁగి సిగ్గులతోడఁ జిమ్మిరేఁగేవు
కలపనసేసి నీకు గందము వూయరాఁ గా
బలిమిఁ బచ్చడమేల పైఁగుప్పేవు

చ. 2: చెంగట నుండి నీసతి చేఁతలెల్లాఁ బొగడితే
వెంగమంటా నీవేల వింతసేసేవు
వుంగరము చూతమని వొయ్యనే వేలువట్టితే
కొంగువట్టి యాపెనెంత కొచ్చిచేచూపు

చ. 3: విడెమిచ్చి తమ్ములము వెలఁది వుమియుమంటే
నడుమ నీవేమిటికి నవ్వునవ్వేవు
యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితేను
తడఁబాటులెల్లా మాని దయదలఁ చేవు

రేకు: 0826-2 దేశాక్షి సం: 18-152

పల్లవి: చెలియమేనే నీకుసింగారపుఁ దోఁటాయ
యెలమితో వినోదింతు విప్పుడిట్టె రావయ్య

చ. 1: వేసవియండలు గాసె వెలఁదివిరహమున
వాసికెక్కఁ జెమటలవాన గురిసె
మోసులెత్తేపులకలుఁ మోలచెఁ బైరులెల్ల
యీసతినీమనోరాజ్య మేలుదువు రావయ్య

చ. 2: కమ్మటిచన్నుల నారికచముపుఁ గాయలు గాచె
పమ్మి మోవితేనెల పంటలు వండెను
వుమ్మగిలునూరుపుల నొనరె నాయిటిగాలి
తమ్మికంటిజవ్వనపుఁదతి వచ్చె రావయ్య

చ. 3: మఱి తోఁగిచూపుల మంచిచంద్రోదయమాయ
నెఱియ నవ్వులనేవెన్నెల గాసెను
యెఱిఁగి శ్రీ వేంకటేశ యిటు వచ్చి కూడితిని
తెఱవ నేలఁగ దినదినము రావయ్య

రేకు: 0826-3 ముఖారి సం: 18-153

పల్లవి: వాకిలిగా చేయట్టివనితల మిదె నేము
జోకదప్పకురే మీరు సుదతులాలా

చ. 1: మచ్చిక నాతఁడు నాకె మాటలాడుకొనఁ గాను
అచ్చముగ మీరేల ఆలకించేరే
యిచ్చగించి వేడుకతో నేకతాన నుండఁ గాను
కొచ్చి తెరయెత్తే రేలే కొమ్మలాలా

చ. 2: కొత్తగా నద్దాలు చూచుకొని వారు నవ్వఁ గాను
చిత్తిణి చేఁతల నేల చేరవచ్చేరే
హత్తి పందేలతోడుత నటు చదురంగమాడే-
రెత్తులేల చెప్పేరే యింతులాలా

చ. 3: శ్రీ వేంటేశుఁడు లోన దేవులఁ జెనకఁ గాను
యీవేళఁ గానుకలేల యియ్యవచ్చేరే
వేవేలురతులఁ గూడి వెసఁ బీఁటపై నుండఁ గా
బావంటాఁ బై కొనేరేలే పడఁతులాలా

రేకు: 0826-4 గౌళ సం: 18-154

పల్లవి: చెలులాల నేనతని చెంగటనే వుండేఁ గాని
పిలిచి బంగారము పీఁట వెట్టరే

చ. 1: మొగమోటదాన నేను మోహించినదాన నేను
అగడుగాఁ బతి నేమీ నాడఁ జాలనే
నగవు వచ్చు నాకు నంటున మాటలాడితే
మిగులాఁ దనతలఁపు మీరే యడుగరే

చ. 2: యెమ్మెలేనిదాన నేను ఇచ్చకపుదాన నేను
వుమ్మడిదంటతనాన నొరయఁజాల
కమ్ముకొనీ సిగ్గు నాకుఁ గానుకిచ్చేనంటేను
నిమ్మపండ్లివే రెండు నేఁడు మీరె యియ్యరే

చ. 3: దేవులైనదాన నేను తేజపుదాన నేను
శ్రీవేంకటేశ్వరు గోరఁ జెనకంజాల
కావించి నన్నేలె మతిగరఁగీ గొసరేనంటే
యీవల నాపొందు మీరే యీడేరించమనరే

రేకు: 0826-5 ఆహిరి సం: 18-155

పల్లవి: ఏమి సేతు జెప్పవయ్య యేది నాకు నూడిగము
కామించి వచ్చితివి నాకడకు నేఁడిపుడు

చ. 1: నిదుర గన్నుల దేరీ నిమ్మపండు దెత్తనా
చెదరినవి కురులు చిక్కుదీతునా
పెదవి గెంపులు నిండెఁ బేంట్లు రాలుతునా
మదమువలెఁ గారీఁ జెమటలు దుడుతునా

చ. 2: బడలివున్నాఁడవు పన్నీరు చల్లుదునా
వెడలీ నిట్టూర్పులు విసరుదునా
తడఁబడి నడపు కై దండ నీకు నిత్తునా
కడువారె మేము బాగాలు చేతికిత్తునా

చ. 3: భావ మెందో వున్నది పానుపు వరతునా
దైవారీఁ గళలు నీకద్దము దెత్తునా
శ్రీవేంకటేశ్వర నాసేవ మెచ్చి కూడితివి
నావు వొంటినున్నాఁడవు నేఁ దోడు వండుదునా

రేకు: 0826-6 రామక్రియ సం: 18-156

పల్లవి: ఏల సరసములాడే వెవ్వరితోనై నాను
కాలుదాఁకినాపెతోనే కావలెఁగాక

చ. 1: చెలిమికతైలకెల్లాఁ జెనకఁగవచ్చునా
వొలిసి నీపట్టపుదేవులకుఁగాక
పిలిచి పేరటాండ్లు పెండ్లిబండెక్కుదురా
అల సేసవెట్టినయాపె గాక

చ. 2: వద్దన్నవారెల్లవలపులు చల్లుదురా
వద్దికై మేనమరఁదుఁ లొరయుఁ గాక
పొద్దువోనిచుట్టాలు బువ్వానకు వత్తురా
అద్ది కంకణముగట్టినాపె వచ్చుఁ గాక

చ. 3: పొరుగు పోరచివారు భోగించవత్తురా
గరిమఁ గాఁగిటిలోని కాంత కౌఁగాక
యిరవై శ్రీవెంకటేశ యేలితి విందుకె నమ్మ
అరసి నీవుమన్నించినాపె యాలౌఁ గాక

రేకు: 0827-1 సామంతం సం: 18-157

పల్లవి: ఏమిసేతు నమ్మలాల యెందుకౌను నాయకుఁడు
బూమిలోఁ జెప్పఁ గొత్త యీపురుషవిరహము

చ. 1: తొయ్యలిరాకకుఁ బతి తొంగిచూడఁ బోతేను
దయ్యమువలెఁ జంద్రుఁడు తలచూపెను
చయ్యన నందు కతఁడు జడిసి తలవంచితే
నుయ్యివలెనే తోఁ చె నూలుకొని మనసు

చ. 2: మగువయెలుఁగు విన మతి నాలకించితేను
పగవానిరీతినే పల్కెఁ గోవిల
వెగటై యందు కతఁడు వీనులు మూసుకొంటే
మొగులువలెనే కప్పె ముంచుక విరహము

చ. 3: నలినాక్షి రూపు మనసునఁ దలఁచఁబోతే
చిలుకుగాలమై తోఁచెను మరుఁడు
అలసె శ్రీవెంకటేశుఁ డంతలోన సతి గూడె
నెలకొని కొండవలె నిలిచె సంతోము

రేకు: 0827-2 భైరవి సం: 18-158

పల్లవి: ఏమని చెప్పుదునే మీకింతులాల
చేముంచి నాకు వలపు చిమ్మిరేఁచె నతఁడు

చ. 1: మలసి నాపతిరూపు మతి నెంతదలఁచినా
తలపోఁతనే కాని తమివోదు
కలలోన నెటువలెఁ గాఁగిలించుకొనినాను
వెలినున్న మేనిమీఁదివిరహము దీరదు

చ. 2: యేలినవానిగుణాలు యెంత వీనుల వినినా
ఆలకింపులే కాని ఆసలు వోవు
పాలుపడి యాతఁడుఁ డే పానుపుపైఁ బడినాను
తాలిమితో నావేడుక తనివొందదు

చ. 3: ముంగిటఁ దనరాకకు మొగమెత్తు కుండినాను
తొంగిచూపులే కాని తుందుడుకు వోదు
చెంగట నంతలో వచ్చి శ్రీవేంకటేశుఁ డె కూడె
కుంగనినాసంతోసము గురుతువెట్టరాదు

రేకు: 0827-3 పాడి సం: 18-159

పల్లవి: కరఁగి యిందు కతఁడు కాఁగిలించు కొనవద్దా
ఇరవెటింగేల యలఇంచెనోకాక

చ. 1: మోమునఁ జెమటగారీ మొక్కితేనే కొప్పు జారీ
యేమని వినయాలు పతి కెంతసేసేవే
కోమలపుదానవు సిగ్గులు నీకిఁకా నానపు
గోమున నేపొద్దుదాఁకాఁ గొలువునేసేవే

చ. 2: చిగురాకు నీమోవి చెదరీఁ గమ్మనితావి
పొగడి పొగడి యెంత పొందుచూపేవే
దగదొట్టీ నూరుపులు దయరేఁ చీ నేరుపులు
నగవు లెందాఁకా నవ్వి నయములు చూసేవే

చ. 3: సారెఁ బయ్యెద వదలీ చనుఁగవ గదలీని
చేరి చేరి యెంతవడి సేవ సేసేవే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
తారుచు నెం తాతనిచేఁతలకు లోనయ్యేవే

రేకు: 0827-4 బౌళి సం: 18-160

పల్లవి: ఎగసక్కేలే సేసీ నిదే మీతఁడు
నగవు వచ్చీఁ దననాఁ టకములకును

చ. 1: కోరి నేఁ గానుకిచ్చిన గొప్పతమ్మిపువ్వందుక
వేరొకతెచన్ను దాఁ కవేసీనే తాను
సారెకు నెవ్వతో మేనిజవ్వాదిపై వడిసితే
మేరమీరి యది నా మేనఁ దుడిచీనే

చ. 2: చేతికిచ్చినవిడెము సేసి పుక్కిటఁ బెట్టుక
కాతరానఁ బెట్టీఁ దమ్మకడఁ దానికి
రాతిరెల్లా జాగారాలు రతి నెందోసేసి వచ్చి
యీతల నిద్రించీ మాయింటిలోనను

చ. 3: అద్దమునాచేఁ దెప్పించి యండనున్నసతిమోము
నిద్దమై తనమోమునీడ చూచీనే
అద్దుక శ్రీవేంకటేశుఁ డల్లాకెమేనిగందము
ఉద్దండాన నాకాఁగిట నొనర నంటించీనే

రేకు: 0827-5 సాళంగనాట సం: 18-161

పల్లవి: సిగ్గుతోడ గొంకితేను చిక్కునా మగవాఁడు
బిగ్గఁ గాఁగిలించుకొని పెనఁగినఁగాక

చ. 1: పెదవిపై మాటలు బ్రియములు వుట్టునా
వుదుటుగుబ్బలఁ బతి నూఁదినఁగాక
సదరపుఁ జెనకుల చవులు వుట్టీనా
సదమదముగ రతి సలిపినఁగాక

చ. 2: సెలపుల నవ్వితేనే చిత్తము గరఁగునా
సొలయుచు మోవిచవి చూపినఁగాక
ములువాఁడిచూపుల మోములు వుట్టునా
లలిఁ దమ్ములముపొత్తు గలసినగాక

చ. 3: సరసములాడితేనే సంగతా లెనయునా
సరుసఁ దనువు లొక్కజంటైన గాక
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
పరపుపైనే చాలునా వురమెక్కినఁగాక

రేకు: 0827-6 సౌరాష్ట్రం సం: 18-162

పల్లవి: ఏమిచెప్పేవే మాతో నింపులైన నీ సుద్దులు
ప్రేమము గలవారికి పెనఁగులా టరుదా

చ. 1: నవ్వుతా మాటలాడేవు నయగారాలే సేసేవు
యివ్వల నీకతఁడు మోహించు టరుదా
వువ్విళ్లూర నేపొద్దు నొద్దనే కాచుకుండేవు
నివ్వటిల్ల చనవులు నీకు నిచ్చుటరుదా

చ. 2: తేలించి చూచేవు తేనేలమోవి చూపేవు
కోలుముంద్దై పతి మరుగుట యరుదా
తాలిమితో సన్నలనే తరితీపులే చల్లేవు
వాలాయించి నీకతఁడు వసమవు టరుదా

చ. 3: ఇచ్చకములే సేసేవు యిన్నిటా మెప్పించేవు
కొచ్చి శ్రీవేంకటేశుఁడు గూడుటరుదా
నిచ్చలు నన్నేలించేవు నీ వలమేలుమంగవు
యిచ్చట నీకితఁ డిట్టె యిరవౌటరుదా

రేకు: 0828-1 శ్రీరాగం సం: 18-163

పల్లవి: రాఁడంటా నుంటివి రమణుఁడు నీవద్దికి
పోఁడిమి నీసకినా లిప్పుడు నిజమాయను

చ. 1: చెక్కిటిచెయ్యేఁటికే చిత్తపునుయ్యేఁటికే
నిక్కిచూడవే పతి నిలుచున్నాఁడు
మొక్కవే చేతులెత్తి మొగము చూచీ నతఁడు
నిక్కలలాయ నేఁడు నీవుగన్నకలలు

చ. 2: సిగ్గులకరఁగులేలే చెలులమరఁగులేలే
వొగ్గి కొలువసేయవే వొంటినున్నాడు
దగ్గరి యెదురుకోవే తానే వచ్చీ నతఁడు
బగ్గన నీనోములెల్ల ఫలియించె నవిగొ

చ. 3: నెలవాఁత లిదియేమే నీతలపోఁత లిదేమే
యేలుమనవే శ్రీవేంకటేశుఁ డున్నాఁడు
మేలమాడవే అలమేలుమంగ వాతఁ డేలె
కోలుముంద్దై తలకూడె కోరిన కోరికలు

రేకు: 0828-2 దేశాక్షి సం: 18-164

పల్లవి: చూచి వచ్చితి నీవున్న చోటికిఁ దోడితెచ్చితి
చేచేతఁ బెండ్లాడు చిత్తగించవయ్యా

చ. 1: లలితాంగి జవరాలు లావణ్యవతి యీకె
కలువకంటి మంచికంబుకంఠి
జలజవదన చక్రజఘన సింహమధ్య
తలిరుంబోడిచక్కఁదన మిట్టిదయ్యా

చ. 2: అలివేణి మిగులనీలాలక శశిభాల
మలయజగంధి మహమానిని యీకె
పెలుచుమరునివిండ్లబొమ్మలది చారుబింబోష్ఠి
కనితకుందరద చక్కందన మిట్టిదయ్యా

చ. 3: చెక్కుటద్దముల దిది శ్రీకారకర్ణములది
నిక్కుఁజనులరంబోరు నిర్మలపాద
గక్కన శ్రీవేంకటేశ కదిసె లతాహస్త
దక్కె నీ కీలేమచక్కందన మిట్టిదయ్యా

రేకు: 0828-3 ఆహిరి సం: 18-165

పల్లవి: తలపోసి తలపోసి తమకించీ నామనసు
చెలులాల ఆతఁ డేమి సేసీనొకో

చ. 1: యెలయించినవాఁడు ఇంటికి రాఁడొకొ
చెలుల నంపితి మాఁట చేకొనెనొకొ
కలువల వేసినాఁడు కరుణించకుండునొకొ
సొలసి చూచినవాఁడు చుట్టమై చిక్కఁడొకొ

చ. 2: మచ్చికచల్లినవాఁడు మంతనములాడొఁకొ
ఇచ్చగించినాఁడు చనవియ్యఁడొకొ
కచ్చు పెట్టినవ్వేవాఁడు కప్పురవిడె మీఁడొకొ
వచ్చినవాఁడికను నావద్దనే వుండీనొకొ

చ. 3: వేడుక సేసినవాఁడు వీడుజోడై చొక్కఁడొకొ
వాడిచూపినవాఁడు వసమౌనొకొ
యీడనె శ్రీ వేంకటేశుఁడిన్నిటాను నన్ను నేల
కూడినవాఁడు నాబత్తి గొబ్బన మెచ్చునొకొ

రేకు: 0828-4 కేదారగౌళ సం: 18-166

పల్లవి: అతిరాజసపువాఁడు ఆతఁడు దొల్లె
మతకమున నిన్నెంత మన్నించునో సుమ్మీ

చ. 1: చిగురుల వేసేవు చెనకేవు కొనగోర
మగవానితో నెంతమారుకొనేవే
యెగసక్కేలకు నాతఁ డేమి సేసునో నిన్ను
ఇగురుఁబోడివి నేము యెఱఁగముసుమ్మీ

చ. 2: చేరి పంతాలాడేవు చెయివట్టి పెనఁగేవు
సారెఁ బతితో నెంత చయ్యాటాలే
మారుకుమా రాతఁడు మరియెంత సాదించునో
నారీమణి యిందరిలో నగుఁబాటుసుమ్మీ

చ. 3: జంకించేవు బొమ్మలను చలాలకే నవ్వేవు
యింక శ్రీ వేంకటేశుతో నింత యేఁటికే
అంకేల నిన్నాతఁ డేలె నటు వొంటిఁ జిక్కించుక
చింకచూపులాడి వీని చిత్తము సుమ్మీ

రేకు: 0828-5 సామంతం సం: 18-167

పల్లవి: తరుణి జవ్వనపుఁ దపము సేయఁగను
వరుసతోడ జాతివైరము లుడుగె

చ. 1: జక్కవపులుగులు జంటవాయవివె
గక్కన వెన్నెలగాసినను
యెక్కడఁ గోవిల యెలుఁగులు చెదరవు
గుక్కక వానలు గురిసినను

చ. 2: గుంపుఁదుమ్మెదలు గొబ్బున బెదరవు
సంపెఁగతావులు చల్లినను
ముంపునఁ జకోరములు వసివాడవు
సొంపుఁగళలు పెనుసూర్యుఁ డుండఁగను

చ. 3: చిలుకలు సందడి సేసినఁ దొలఁగవు
కలసిన సమరతికయ్యమున
యెలమిని శ్రీ వేంకటేశుఁడు గూడఁగ
చెలియంగములని చెప్పఁగఁ బొసఁగె

రేకు: 0828-6 మధ్యమావతి సం: 18-168

పల్లవి: మిమ్మే యలుగనిచ్చు మీవలపులు
చిమ్మరేఁగ రట్టు పెట్టి చెనకించుగాక

చ. 1: వొట్టులు వెట్టుకొంటిరి వొకరొక రిందాఁకా
అట్టె యింతలో నొక్కటైతిరా మీరు
దిట్టవై కాఁతాళించి దీకొంటి రప్పటిని
గుట్టుతోడ లోలోనే కూడుకొంటిరా

చ. 2: తగవుచెప్పుమంటిరి తరుణుల నింతవడి
మెగమోడి మీరుమీరే మొక్కుకొంటిరా
బిగియుచుఁ గొంతవడి పెనఁగుకొంటా నుంటిరి
జిగిఁగూడి బాసలెల్లాఁ జేసుకొంటిరా

చ. 3: వెక్కసాన మంచాలపై వేరేవుంటి రింతవడి
చొక్కపుమీ మొగములు చూచుకొంటిరా
పక్కన మీరిద్దరూను బలిమిఁ బై కొంటిరి
చక్కని శ్రీ వేంకటేశ జాణలైతిరా

రేకు: 0828-1 దేసాళం సం: 18-169

పల్లవి: ఒయ్యనే లాలించి చన వొసఁగవయ్యా
నెయ్యపుసాము సేసిన నీచేతుల కోపునా

చ. 1: మొలకసిగ్గులతోడిములువాఁడి గుబ్బలది
బలిమినేసి యేల పైకొనేవయ్యా
చిలుకపలుకుల లేఁజిగురాకుమోవిలేమ-
నెలయింపులను నేఁటి కలయంచే వయ్యా

చ. 2: కడుఁబచ్చివయసుతోఁ గారుకొన్నమానిని
నొడివట్టి తీసి యెంత వొరసేవయ్యా
చిడుముడినగవులచిఱుతతనాలబాల
నడుమ నెందాఁకాఁ బెనఁగులాడేవయ్యా

చ. 3: పసురుఁబాయమునఁ బరగినజవరాలు
పిసికి కాఁగిట నెంతబిగించేవయ్యా
కొసరి శ్రీ వేంకటేశ కొత్తపెండ్లికూఁతురు
యెసఁగి కూడితి విందు కెంతమేచ్చేవయ్యా

రేకు: 0828-2 శుద్ధదేశి సం: 18-170

పల్లవి: ఏలికసానికి నేము యింతవరులము తొల్లె
నీలీలకు లోనై తే నీవేపాటి వట్టేవా

చ. 1: బలిమి మాయక్కవిన్నపములు నేతుముగాక
చెలికత్తెల కేఁటికి సిగ్గువడను
తలకొన్ననీచేఁతలు తారుకాణింతుముగాక
యెలమి నీతో మాకు నేల మొకదాకిరి

చ. 2: కొద్దిమీర నా కెమార్రై కొసరుదు మింతేకాక
వద్దనున్న వారికేల వట్టినేస్తాలు
సుద్దులతో నీగుణాలు సోదించి కందుముగాక
కద్దులేదని మాకేల కప్పి పెట్టి దాఁచను

చ. 3: యీడ నిన్నలమేల్మంగతోడఁ గూరుతుము గాక
వూడిగపువారికేల వొడ్డారాలు
కూడితి వింతలో నింతఁ గోరి శ్రీవేంకటేశ నీ
వేడుక మెత్తుము గాక వింతలేల సేయను

రేకు: 0828-3 కేటిఁవరాళి సం: 18-171

పల్లవి: కాముకునికేల తగవులు విచారించి
ప్రేమగలచోట మేలుపెంచు టింతేకాక

చ. 1: పున్నమవెన్నెలవలె పొలఁతి నీతో నవ్వితే
సన్నలనేల తిట్టేవు చందురువిని
కన్నులకలువలను గక్కన నిన్నుఁ జూచితే
పన్ని మరునితోనేల సంతమాడేవయ్యా

చ. 2: ముక్కులైనచన్నుల మొనల నిన్నొత్తితేను
జక్కవపిట్టలనేల సాదించేవు
నిక్కినకొనగోరను నీ మేను దాఁకించితేను
దక్కక మొగలిరేకు కొన రాచనేలయ్యా

చ .3: పలుకుల వెంగేలు పలుమారు నిన్నాడితే
చిలుకలనేల జంకించేవయ్యా
అలమి శ్రీవేంకటేశ ఆకె రతి మించితే
చెలికత్తెల నెంతసంతోసించేవయ్యా

రేకు: 0828-4 ముఖారి సం: 18-172

పల్లవి: మేలు నీజాణతనము మెచ్చిరి సతులిందరు
యేలికవంటాఁ జేరితే నిక్కువ లంటేవు

చ. 1: నిమ్మపండ్లు గానుకగా నెలత నీ కియ్యరాఁగా
ఇమ్ముల నాపెచన్నులు యేల పట్టేవు
నెమ్మి మొకదాకిరితో నిన్నేమీ ననకుండితే
సమ్మతించెనంటా నెంత సంతోసించుకొనేవు

చ. 2: తరుణి సూడిదెగాను తామర నీ కియ్య రాగా
కరకమలమేల గక్కనఁ బట్టేవు
శిరుసువంచు కందుకు సిగ్గుతోడ నుండితేను
కరఁగియున్నదంటాను కాఁగిలించుకొనేవు

చ. 3: పచ్చిపగడము నీచేపట్టుగా జెలియ్యరాఁగా
ముచ్చటతో సందుసుడి మోవి యానేవు
అచ్చమై శ్రీవేంకటేశ అందు కోరుచుకుండితే
ఇచ్చెరిఁగి కూడెనంటా నెంత గారవించేవు

రేకు: 0828-5 పాడి సం: 18-173

పల్లవి: చెప్పేదేమి ఇఁకను నీచిత్తము గాక
తప్పులెంచి నే నిన్నుఁ దడవఁగఁగలనా

చ. 1: తూకొని మాటలెల్లాను దొంతులు వెట్టేవు గాక
ఆకెతోడ నేకతములాడవా నీవు
సాకిరిచెప్పేవారిని సన్నలేల సేసేవు
దీకొని నీ చేఁతలు నేఁ దెలుపఁగఁగలనా

చ. 2: పాటించి నవ్వులు నవ్వి భ్రమయించె వింతేకాక
సూటిగా నాపెమొగము చూడవా నీవు
నీటున నీకన్నులలో నిద్దురేలణఁచేవు
జూటరినీమహిమలు సోదరించఁగఁగలనా

చ. 3: వేసదారివినయాలు రాసులు వోసేవు గాక
ఆసపడి యాపెచన్ను లంటవా నీకు
లాసి శ్రీ వేంకటేశ మెల్లనె యేల చొక్కించేవు
నీసుద్దు లెన్నఁటికిని నే మఱవఁగలనా

రేకు: 0828-6 కన్నడగౌళ సం: 18-174

పల్లవి: పెంచితి నిన్ను నేము పెద్దవైతి వింతలోనె
యెంచిచూడ నీకతలు యెవ్వరు నేరిపిరే

చ. 1: చిత్తడిచెమలేల చిందీనే
వత్తివలె మేనేల పసివాడీనే
చిత్తణివిద్యలనేల చిమిడేవే
యిత్తల నేఁడిఁ తేసి యెక్కడఁ గలిగెనే

చ. 2: నెమ్మది నివ్వెరగులు నీకేఁటికే
వుమ్మగిలు నిట్టూర్పు లెందుండివచ్చెనే
కుమ్మరింపుఁ జింతలేల గుబ్బతిలీ నే
యిమ్ముల నీ చేఁతలకు నేరీతి నోమితివే

చ. 3: చెక్కునఁబెట్టినచేతిసిగ్గు లేఁటికే
ముక్కర గదల నవ్వి మొఱఁగనేలే
యిక్కడ శ్రీ వేంకటేశుఁ డేలెనా నిన్ను
యెక్కె మోమునఁ గళలు యిన్నిటా మేలే

రేకు: 0829-1 గుజ్జరి సం: 18-175

పల్లవి: అందులోనే కానవచ్చె నన్నిపనులు
మందలించి యాపెతోడిమాటలు మానుమా

చ. 1: మనసిచ్చి నీవు నన్ను మన్నించేవాఁడవైతే
ననిచిన యాకెతోడ నవ్వకుండుమా
యొనసి యేపొద్దూ నన్ను నెడయనివాఁడవైతే
పొనిఁగి యాపెయింటికిఁ బోక ఇట్టె వుండుమా

చ. 2: చేకొని నాచెప్పినట్టు సేసేటివాఁడవైతే
జోకలుగా నాపెదిక్కు చూడకుండుమా
నాకిచ్చినబాసతోడ నమ్మించినవాఁడవైతే
దాకొని యాపెపొందులు తలచక వుండుమా

చ. 3: మిక్కిలి నామీదను మేలుగలవాఁడవైతే
అక్కరతో నాపెకాని కందకుండుమా
యిక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అక్కున నన్నుఁ బెట్టితి వాకె నంటకుండుమా

రేకు: 0829-2 బౌళి సం: 18-176

పల్లవి: ఈకె గలిగివుండఁగా నింకా నొకరా నీకు
పైకొని పెండ్లాడితిని పదారువేలను

చ. 1: కలికితనాల నాపె కతలుచెప్పనేరుచు
వలపులుచ ల్లుతా నవ్వఁగ నేరుచు
మెలుపున వద్దనుండి మేను విసుకనేరుచు
తిలకించి చిటుకలు దియ్యనేరుచు

చ. 2: చక్కనిది జవరాలు సరసమాడనేరుచు
పక్కన మదిగరఁగఁ బాడనేరుచు
చక్కెరమోవి చూపి చవిపుట్టించనేరుచు
మిక్కిలిరతుల నిన్ను మెప్పించనేరుచు

చ. 3: పొందినచిత్తమురాఁ గాఁపురము సేయనేరుచు
ముందుముందే వేడుకొని మొక్కనేరుచు
అందపుశ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యిందె నిన్నుఁగూడె నన్ను సేవించాఁదా నేరుచు

రేకు: 0829-3 వరాళి సం: 18-177
పల్లవి: నీవే ఇంతసేయఁ గాను నే మాపెను దూరేదేమి
వోవలఁ బెట్టఁగా నాపెవోజ చక్కనయ్యీనా
చ. 1: సంగడిఁ బెట్టుక నీవు సరసములాడఁగాను
కంగి యాపె సవతులఁ గైకొనీనా
అంగవించి మూలనుంచు కాపె నీవు పూజించఁ గా
సంగతి నెవ్వరినైనా సరకుగొనీనా
చ. 2: ప్రియపడి నీవే ఇంత పెద్దరికానఁ బెంచఁగా
నయాన వినయా లాపె నాకుఁ జేసీనా
దయతో నాపెగుణాలు తగ నీవు వొగడఁ గా
నియతాన వంచనలు నేరఁ బోయీనాఁ
చ. 3: వలచి యాపెకు నీవు వసమై వుండఁ గాను
తిలకించి మొక్కినా తేరిచూచీనా
అలమేలుమంగపతివైనశ్రీ వేంకటేశ్వర
యిల నన్నుఁ గూడితివి యీకె మెచ్చుకుండీనా

రేకు:	0829-4 కురంజి సం:	18-178

పల్లవి:	ఎణిఁగించవయ్య నాకునేల దాఁ చేవు
	మెఱసి యాపెకు నీకు మేనవావై యున్నది

చ. 1:	ముంగిట మొక్కులు మొక్కి మోహము నీపైఁ జల్లి
	చెంగలిచూపులఁ జూచీఁ జెలియ నిన్ను
	చెంగటఁ దొల్లిటిపొందో నేసేఇప్పటినేస్తమా
	ఇంగితాకారమైతే నిటువలె నున్నది

చ. 2:	సెలవుల నవ్వు నవ్వి సిగ్గుతోఁ దలవంచి
	కలువపూవుల వేసీఁ గమ్మటి నిన్ను
	చలపట్టి చెనకీనో సలిగ నీవిచ్చితివో
	తలఁచుకొంటే మీలో తగుల మిట్లున్నది

చ. 3:	మాఁగినమోవి చూపి మఱఁగున సన్న సేసి
	కాఁగిటింలించుకొని శ్రీ వేంకటేశ నిన్ను
	దాఁగక యలమేల్మంగతమకమో నీయింపో
	వీఁగక నన్నేలితి మీవేడుక యిట్లున్నది

రేకు: 0829-5 దేశాక్షి సం: 18-179

పల్లవి: ఏల పొద్దులుగడుపే వింతికడకు రావయ్యా
నాలిసేయ నీకవద్దు నమ్మి యాపె వున్నది

చ. 1: చక్కనిసతిమోమున చంద్రోదయంబాయ
వెక్కసపునవ్వుల వెన్నెల గానె
చొక్కపుకొప్పువిరుల చుక్కలు గానుపించె
పక్కన నెంచితే పట్టపగలు రేయౌను

చ. 2: సతికుచగిరులనేజక్కవలు జోడుగూడె
తతి వికసించెఁ గన్నులఁ దామరలు
మితిలేనిరత్న కాంతి మించె సూర్యోదయము
మతి నెంచుకొంటేను మాపే రేపౌను

చ. 3: కలికిమెయి చెమటల గడియారపు నీరెక్కె
తెలిసిగ్గులనే పెండ్లితెర వేసెను
అలమె శ్రీవేంకటేశ అంతలో నీవు రాఁగాను
నెలవై యిట్టె వుండితే నిచ్చ కల్యాణమవును

రేకు: 0829-6 పాడి సం: 18-180

పల్లవి: కనుఁగొనేఁ గానీలేవే కామిని నీజాడలు
మనసే తమకించితే మఱి యేమిసేసేవో

చ. 1: కలువల వేసితేనే కాఁతాళించేదానవు
యెలమి మరునమ్ముల కేమినేతువో
సెలవుల నవ్వితేనే చీఁదరరేఁగే దానవు
లలి వెన్నెలకు నెంతలావుగా రేఁగుదువో

చ. 2: నెమ్మి నేమాఁటలాడితే నేరుపులెంచేదానవు
తుమ్మిదమోతల నెంతదూరుదువో
చిమ్ముఁ జూపులఁ జూచితే చేత నొడ్డేదానవు
యిమ్ముల మెఱుఁగులకు నెంత వొడ్డుకొనేవో

చ. 3: గట్టిచన్నులు నేనంటఁగా సిగ్గువడేదానవు
అట్టె తమ్మిమొగ్గల నెంతాడుకొందువో
నెట్టన నన్నుఁ గూడితి నేను శ్రీ వేంకటేశుఁడ
మట్టున నింకా నన్ను మతి నెట్టు గూడేవో

రేకు: 0831-1 రామక్రియ సం: 18-181

పల్లవి: కొత్తగా నాతో పొందుగూడి నిన్ను భ్రమయించి
ఇత్తల నిన్నొకటై యెలయించీఁ గాక

చ. 1: కన్నులనాచూపు నిన్నుఁ గాఁడిపారెనటవే
వున్నతి నీమోహ మటువున్నది గాక
సన్నలు నేఁ జేసితేనే జల్లనీనా నీగుండె
కన్నెరో నీమతి నిన్నే కరఁగించీఁగాక

చ. 2: వేడుక నానవ్వు నిన్ను వెన్నెలై వేఁచీనటవే
కూడుదాఁకా విరహము గొసరీఁ గాక
ఆడిననామాట జిగురై నిన్ను నంటించీనా
యేడలేనినీకోరిక లింతసేసీఁ గాక

చ. 3: యిట్టె నాతో పొందు బయలీఁదించెనటవే
చుట్టుకొన్ననీకాఁగిలే చొక్కించెఁగాక
దిట్ట శ్రీ వేంకటేశుఁడు రట్టు సేసెనా నిన్ను
చుట్టరికపు నీమేలే జట్టిగొనెఁ గాక

రేకు: 0831-2 కాంబోది సం: 18-182

పల్లవి: ఏల సిగ్గులువడేవే యెలయించినట్టయ్యీని
వాలాయించి నీకుఁ గానే వలచినాఁ డతఁడు

చ. 1: పాడి చూపఁగదవే నీపతి వేడుకపడీని
వీడఁ మందుకొనవే వేవేగమే
చూడవే యాతనిదిక్కు సుద్దు లడుగఁ బూఁచీని
కూడేటికూటములకు గుబ్బతిల్లీ నతఁడు

చ. 2: అట్టె పాదాలొత్తవే అందుకే తమకించీ
పెట్టుకోవే తానిచ్చిన పెనుసొమ్ములు
గుట్టుతోడఁ గూచుండవే కొంగువట్టి వేఁడుకొనీ
గట్టిగా నీ పొందులే కడుఁగోరీ నతఁడు

చ. 3: నెలవుల నవ్వవే శ్రీ వేంకటేశుఁడు నవ్వి
పిలిచి నూఁకొనవే ప్రియముతోడ
లలి గుబ్బలనొత్తవే లాలననేసీ నిన్ను
తలఁపించి నీరతికే తమకించీ నతఁడు

రేకు:	0831-3 భైరవి	సం:	18-183
పల్లవి:	ఏమాయనే రమణుని నీ వెంతదూరినాను
నేమమున నీపైనేల నేర మెంచుకొనీనే
చ. 1:	వేడుక వెగ్గళమైతే విసువు గొంత గలుగు
వీడెములోనే కారము వెదకితేను
నీడములోనే వుండినాను నిందింపించు జలువను
కూడిన వారొకవేళ గుంపించు టేమరుదు
చ. 2:	సరసమాడేయందే చలమూఁ గొంత గలుగు
వీడేములోనే కారము మరుబాణాలు
సురతము సేయఁ గానే చొక్కి మేను మరపించు
సరినున్నదంపతులు జంకించు టేమరుదు
చ. 3:	కలసినకాఁగిటిలో కడువలపు గలుగు
వెలసితేఁ దురుమందే వేఁకము నుండు
యెలమి శ్రీ వేంకటేశుఁ డేలె నీ వొక్కటైతివి
వలచినవారు గొంతసొలయు టేమరుదు

రేకు: 0831-4 మాళవిగౌళి సం: 18-184

పల్లవి: వసుధలో నిటువంటివారూఁ గొందరు గలరు
కొసరక రమణుఁడు గుట్టుతో నోరుచునే

చ. 1: సిగ్గరికత్తెకుఁ గాని చెక్కుటి చెయ్యమరదు
యెగ్గులాఁడిగాని మరి యీసునేరదు
బగ్గడికిఁగాని వట్టిపంతము లీడేరవు
వెగ్గళించి నీతలనే వేగెనటవే

చ. 2: కతలకారికిఁ గాని కాఁతాళము గలుగదు
మతకరిగాని మర్మము లంటదు
ఆతిగర్వికిఁగాని గయ్యాళితనము రాదు
గతిమాలి కొసర నీకడమాయనటవే

చ. 3: మాయ దారికిఁగాని మాటలు నోరికి రావు
కాయాటుదిగాని రతికాఁక కోర్వదు
యీయెడ శ్రీ వేంకటేశుఁడిన్నిటా నన్నుఁ గూడే
చాయసేసుకొని నీవే జాణ వైతివటవే

రేకు: 0831-5 బౌళి సం: 18-185

పల్లవి: ఇన్నిటా దొరవు నీవు యేమి నేసినాఁ జెల్లు
యెన్ని చూచితే నే నీయిచ్చలోనిదానను

చ. 1: మంతనాన నీవు నాపె మాటలాడుకొన్న వెల్లా
వింతగా మాటుననుండి వింటిమి నేము
చెంత నామొగము చూచి సిగ్గువడ నిఁక నేల
అంతటా సంతోసము నీకై తేనే మంచిది

చ. 2: సరసాన మీరిద్దరు సన్నలు సేసుకొన్నవి
గరిమతోఁ గన్నులారఁ గంటిమి నేము
శిరసెత్తి నీవందుకు చిఱునవ్వు నవ్వనేల
సుసర నీకవియెల్లా, చవులై తే మంచిది

చ. 3: సులభాన మీరింతలో చుట్టాలై నందుకు
కొలువువోఁ జూచి ఇయ్యకొంటిమి నేము
వెలియ శ్రీవేంకటేశ వేఁడుకొన నింత యాల
యిల నన్నుఁ గూడితివి యెట్టున్నా మంచిది

రేకు: 0831-6 నాట సం: 18-186

పల్లవి: మేలురా నీకతలకు మెచ్చితి నేను
మేలములాడితి నీవు మెచ్చులాఁడివంటానే

చ. 1: వెన్నలేల తీసేవురా చిన్నవాఁడా నీ
చన్నులపై పయ్యదేల జారెనె నీకు
యెన్నిక నేమాటకు నీవేమాడేవు అది
జన్నెపాలువట్టినమాచాడెలంటానే

చ. 2: పుట్టులేల యెక్కేవురా వుద్దండీఁడా చక్కఁ-
గట్టుకోవె పోఁకముడి కదలె నీకు
వొట్టుక నేనొకటంటే నొకటాడేవు అది
తొట్టి రతులసిగ్గులదొడ్డియంటానే

చ. 3: చేరి యిల్లు చొచ్చేవేరా శ్రీవేంకటేశ నీవు
తారసిల్లి వొంటినే వుందానవంటానె
కోరి నన్ను గాగిలించి కొత్తలుగా నాడేవు
దూరనేలే గొల్లవారి దోమటంటానే

రేకు: 0832-1 రామక్రియ సం: 18-187

పల్లవి: కన్నె గొల్లపడుచులఁ గాకుసేతురా ఇంత
మిన్నకే వయసులెల్లా మీఁగడలుగట్టెను

చ. 1: వుమ్మడివలపులు నీవువిదలపైఁ జల్లఁగ
పమ్ముచుఁ గుచములై కుప్పలుగట్టెను
తెమ్మలుగా సారెఁ దరితీపుల మాటలాడఁగ
దిమ్మురేఁగి మోవులను తేనె లూరఁజొచ్చెను

చ. 2: అప్పటి దాఁగిలిముచ్చటలాడి సతులనంటఁగా
కొప్పులై చీఁకట్లు గుంపుగూడెను
తప్పక నఖచంద్రులు తనువులపై నించఁగా
విప్పుచు చిరునవ్వుల వెన్నెలలుగాసెను

చ. 3: కారుకమ్మినరతులఁ గరగించి కూడఁగాను
యేరులై చెమటలు యీఁతలఁ బారె
యీరీతి శ్రీ వేంకటేశ ఇంతచనవియ్యఁగాను
కోరినకోరికలెల్లా గొబ్బున నీడేరెను

రేకు: 0832-2 వరాళి సం: 18-188

పల్లవి: చెప్పనరుదాయఁగదె చెలిసింగారము నేఁడు
నొప్పగుమరుబండార మొనగూర్చినట్లు

చ. 1: తొడిఁబడ సేమంతులు దురిమెఁ గొప్పునఁజెలి
కడుఁజీఁకటి వెన్నెలాఁ గలసినట్లు
గుడిగొన నొసలఁ గుంకేమతిలకమువెట్టె
యెడయక సూర్యచంద్రు లేకత మాడినట్టు

చ. 2: నెమ్మదిఁ జన్నులమీఁద నీలహారముల్ వేనె
తుమ్మిదలు జక్కవలు దొరలినట్టు
వుమ్మడి నడుమఁ బైఁడి వొడ్డాణము గట్టుకొనె
నెమ్మది మెరుపు మిన్ను నేస్తము నేసినట్టు

చ. 3: అంచితపుఁ జేకట్లు హస్తముల ధరియించె
యెంచఁ జిగుళ్లుఁ దామెర లెనసినట్టు
పొంచి శ్రీ వేంకటేశుతోఁ బొసఁగె సమరతులఁ
నంచల బొమ్మ పెండ్లి యమరినయట్టు

రేకు: 0832-3 హిజ్జిజి సం: 18-189

పల్లవి: మఱచి వూరకుండితే మనసే కఱకుపడు
యెఱుకc దలపెట్టితే నీడేరుc బనులు

చ. 1: మొగములు చూడcగాను మోములు గడుcబుట్టు
నగcగానే పాయరానినపు లౌను
తగిలి మాటలాడcగా తమకము లుప్పతిల్లు
బగివాయ కెప్పుడూc బతివద్ద నుండవే

చ. 2: చేరి జూజాలాడcగానే చిమ్మిరేcగు వేడుకలు
సారే సన్నలు సేయcగ చవులు వుట్టు
నేరుపుతోc జెనకcగా నిండుకొను మచ్చికలు
వూరికే యాతనివద్ద నూడిగాలు సేయవే

చ. 3: కందువc బాదాలొత్తcగా కాగిళ్లు సమకూడు
అంది విడెమియ్యcగానే ఆసలు మించు
చెందె నిన్ను నింతలోనే శ్రీ వేంకటేశ్వరుcడు
ముందుగా నింపులతోడ మోవితేనె లియ్యవే

రేకు: 0832-4 మేఁచబౌళి సం: 18-190

పల్లవి: నన్ను నేల దూరేవు నడుమ నీవు
యెన్నిలేవు నీవేసాలు యెంతసేసేవే

చ. 1: చలపట్టి నీవతని సాదించి నేరుపుతో
వలపించుకోఁగాను వద్దంటినా
మొలకనవ్వులు నవ్వి ముందె యాతనిచిత్తఁ
మలర వలపించఁగా నడ్డము వచ్చితినా

చ. 2: గొంటరితనాన నీవు కొంగువట్టుకొని పతిఁ
నింటికి రప్పించుకోగా నేలంటినా
జంపునీచన్నులనొత్తి సమరతులకుఁ దీసి
అంటి దక్కఁగొనఁగా నేనందుకుఁ గాదంటినా

చ. 3: ఇరవుగ నప్పటి నీయెంగిలిమోవి చూపి
మరపుకోగాఁ బెట్టిమాటాడితినా
గరిమ నింతలో శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ గూడె
వొరసి నీవూఁ గూడఁగా నొడివట్టితినా

రేకు: 0832-5 నారాయణి సం: 18-191

పల్లవి: ఇంతులకు బతులకు నివే తారుకాణలు
వింతలేక మెలగేటి వేడుకలే మేలు

చ. 1: పెక్కుమాట లాడితేను ప్రియములు చప్పనౌను
కక్కసించితే వలపు గడుసుపడు
వెక్కసానఁ జెనకితే విరుగు నట్టె మనసు
యెక్కువ తక్కువ లేని యిచ్చకమే మేలు

చ. 2: వట్టిపంతా లాడితేను వడిఁబడుఁ జలములు
వెట్టగాఁగ నవ్వితేను వేసటలౌను
బెట్టుగాఁ గొసరితేను బెండుపడుఁ దమకము
గుట్టుతోడఁ బొందుసేసేగుణమే మేలు

చ. 3: కడువెంగే లాడితేను కాఁతాళము లెసఁగు
యెడయనిసిగ్గులైతే నింపు పుట్టదు
అడరి శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
విడువకు చెలి నీకు వినయమే మేలు

రేకు: 0832-6 అహిరి సం: 18-192

పల్లవి: పాసివున్న విరహపు బడలికేల చూచేవు
వేసరక ఇచ్చకమే వేమారుఁ జేయవే

చ. 1: చెక్కునొక్కి బుజ్జగించి చెలువుఁడు వేఁడుకొనీ
మొక్కవే పాదాలకు మొగమెత్తి
అక్కరతో నవ్వుమని ఆనవెట్టీఁ దనమీఁద
మక్కళించి యతనితో మాటలాడవే

చ. 2: కొంచక తొడపై నిన్నుఁ గూచుండఁ బెట్టుకొనీ
ముంచి వినయానఁ బ్రియములు చెప్పవే
పొంచి తములమెల్లా నీపుక్కిటనిండాఁ బెట్టీ
వంచనలెల్లాఁజేసి వలపులు చల్లవే

చ. 3: సారె శ్రీవేంకటేశుఁడు చన్నులపైఁ జేయిచాఁచీ
గారవించి మోవితేనె కప్పమియ్యవే
యీరీతి నిన్నుఁ గూడి యితవులెల్లాఁ జేసీ
వూరడించి రతులను వోలలాడఁ జేయవే

రేకు: 0833-1 సామంతం సం: 18-193

పల్లవి: తానైతే నన్నిటా నుత్తమగుణవంతుఁడు
నేనెంతటిదానను నేరిచి పెనఁగను

చ. 1: పలుకుల నెంతవొడఁబరచీనే తా నన్ను
చలముకొనిఁ తనతో సరిదాననా
యెలమిఁ దొడపైనేల ఇడుకొనీవే నన్ను
ఇలఁ దనకేమిచాఁతే ఇందరిలో నేను

చ. 2: మన్నించి నాపైనెంత మచ్చికచల్లీనే తాను
తన్ను మెచ్చ సేవ సేసేదాననా నేను
చన్నులంటి నన్ను నెంత సరకు సేసి నవ్వీనే
కన్నులఁ జూడ నంతచక్కనిదానా

చ. 3: చనవిచ్చి ననునెంత సమరతికి నీసీనే
ననిచిన మేనదాననా తనకు
చెనకి నన్నిట్టె కూడె శ్రీ వేంకటేశుడు తాను
వినయాల వేఁడుకొని విన్నవించనేర్తునా

రేకు: 0833-2 దేసాళం సం: 18-194

పల్లవి: చెలికతైలము నేను చెనకవచ్చేవు మమ్ము
చెలిమి చెట్టడిచితే చేటఁడవునయ్యా

చ. 1: కోరి నిన్నుఁబిలువఁగ కొమ్మ వంపఁగా వచ్చితి
వూరకే సుద్దులడిగే వొట్టుక నన్ను
మారుకు మాటాడఁబోతే మాటలెంనైనాఁ గలవు
గోర గీరితే నేరు కొచ్చి పారునయ్యా

చ. 2: గందము నాచే నంపఁగా కానుక దెచ్చితి నీకు
అంది నాతో నవ్వవచ్చే వప్పుడే నీవు
చిందిచింది యెత్తఁబోతే చేరి మాపుదాఁకాఁబట్టు
చెందితేఁ జిగురుఁగొమ్మ చేఁగలవునయ్యా

చ. 3: తనమారు నన్నంపఁగా దండమువెట్టితి నీకు
యెనసి కాఁగిటఁగుచ్చియెత్తే వేమయ్యా
వెనక నాపె రాఁగా శ్రీవేంకటేశ కూడితివి
ననిచి పై కొంటేను నవ్వు నిజమవునయ్యా

రేకు: 0833-3 గౌళ సం: 18-195

పల్లవి: నీ వేమి సేసినాను నీకుఁ జెల్లును
మోపులు గిరుపనేల మోహించినదానికి

చ. 1: చెలఁగి పతి ముట్టితే చేతికి లోనౌటగాక
చలపాదితమేల జవరాలికి
పిలిచి పేరుకొంటే బెరసి వూఁకొంటగాక
వలనబిగువేల వలచినదానికి

చ. 2: వొగ్గి విడెమిచ్చితేను వొడి నించుకొంటగాక
సిగ్గులు వడఁగనేల చిన్నదానికి
దిగ్గన సరసమాడితేఁ జెనకుట గాక
యెగ్గులుపట్టఁగనేల యిచ్చకపుదానికి

చ. 3: చనుఁగవ లంటితేను సమ్మతించుకొంట గాక
పెనఁగులాడఁగనేల ప్రియురాలికి
యెనసితివి శ్రీ వేంకటేశ యింతలో నన్ను
తనిసితిఁ గొంకనేల తమకపుదానికి

రేకు: 0833-4 ధన్నాశి సం: 18-196

పల్లవి: ఎవ్వ రెఱుఁగుదురయ్య ఇటువంటినీమనసు
పువ్వువంటియాఁటదాన బుద్ధిచెప్పవయ్యా

చ. 1: ఇందమని విడెమిచ్చే విప్పుడు నీవు
అందుకొంటి నాసకత్తైనని యందునో
పందెము వేసీఁ జెయిపట్టుమనేవు
సందడిఁ జేయొగ్గితేను సాహసురా లందువో

చ. 2: పైకొని పాదములు నాపై వేసేవు
చేకొని యొత్తఁగ నెంతచిత్తిణందువో
ఆకుమడిచిమ్మనుచు నానవెట్టేవు
యీకడ నియ్యకొంటే నిదెంత లాచీనందువో

చ. 3: గుట్టుతోడఁ గాఁగిలించుకొమ్మనేవు
గట్టిచన్నులు నాఁటించఁగా నేమందువో
యిట్టె శ్రీ వేంకటేశ నన్నేలితివి
నెట్టన మొక్కఁగా నెంతనేరుపతి నందువో

రేకు: 0833-5 శంకరాభరణం సం: 18-197

పల్లవి: పిలువాఁగదరే ప్రియునిని
చలువా లాతఁడు చల్లీఁగాని

చ. 1: తలఁపారా దింతి తమకము రేఁగి
చెలపాచెమటాయ చెక్కులను
పొలపా వెన్నెలపోగులకు మతి-
గొలుపా దీకె కెక్కుడువిరహమునా

చ. 2: కెరలి మును మరిగినపొందూ లోలో
మరలీ కాఁకలై మనసుననూ
పొరలీఁ బూఁబానుపున నీపెకు వాడు-
దొరలీఁ దియ్యరె తొలువిరులెల్లా

చ. 3: అలసె మోహపుటాసల కడు
బలిసెఁ జన్నులు పైపైనే
కలసె శ్రీ వేంకటపతి మారు-
మలసే విదివో మరుబలములకూ

రేకు: 0833-6 దేవగాందారి సం: 18-198

పల్లవి: కాదనగవచ్చునా ఘనుఁడ నీతోడిపొందు
యేదైనా నియ్యకొంటె నెక్కుడేకాదా

చ. 1: నీకు సెలవైతేఁజాలు నీమోహపుసతులకు
చేకొని ప్రియము లెల్లా జెప్పేమయ్యా
యీకడ నాకడ నీకు హితవైతేఁ జాలుఁగాక
మాకేమి వారినేరాలు మరచేవయ్యా

చ. 2: నట్టనడుమను నీకు నవ్వువచ్చితేజాలు
వొట్టి వారిచేఁతలకు నోరిచేమయ్యా
మట్టుమీర నేఁడు నీమనసు వచ్చితేఁజాలు
గట్టిగా నెంగిలిపొత్తు గలసేమయ్యా

చ. 3: చక్కఁగ నీకే పొందు సంతోసమైతేఁ జాలు
వొక్కచోట నిద్దరము నుండేమయ్యా
యిక్కువతో శ్రీ వేంకటేశ మమ్ముఁ గూడితివి
చిక్కించుక నీపాదాలసేవ సేసేమయ్యా

రేకు: 0834-1 పాడి సం: 18-199

పల్లవి: ఆపెనేల వుప్పతించే రమ్మలాల
యేపున వయసువచ్చి యెదుట నుండగను

చ. 1: యెలమి నెవ్వరిభాగ్య మెట్టు దెలియఁగవచ్చు
మొలకచన్నులెకావా మోపులయ్యేది
కలిగినయట్టికాలగతు లెట్టు చెప్పఁగవచ్చు
పలచనిమోవిఁగాదా పండి తేనె లూరేది

చ. 2: యెఱిఁగి యెవ్వరికొలఁ దెట్టు గురివెట్టవచ్చు
నెఱులు పెరిగికాదా నిడుపయ్యేవి
మెఱసి దొరతనముమితి యెట్టు వెట్టవచ్చు
పిఱుఁదు బలిసిగాదా పిక్కటిల్లేది

చ. 3: యెన్నఁగ నెవ్వరిబిర మేరుపరచే దెట్టు
కన్నులచూపులేకావా కాఁడిపారేవి
యిన్నిటా శ్రీ వేంకటేశుఁ డీకెను నన్నును గూడె
వున్నతిఁ జేదోయేకాదా వొక్కకాఁగి లయ్యేది

రేకు: 0834-2 బౌళి సం: 18-200

పల్లవి: సేసవెట్టి పెండ్లాడె చెనకి తొల్లే నన్ను
దోసముగా కుండా బతిఁ దోడుకరారే

చ. 1: పట్టరానిది వయసు పాయరానిది నేస్తము
గుట్టుతోఁ దిప్పరానిది గుణము
మట్టుపెట్టరానిది మనసులో దలపోఁత
యిట్టె విభుఁడు రాఁడు యెట్టుసేతునే

చ. 2: ఆఁపరానిది వలపు అణచరానిది చూపు
దాఁపరానిది లోలో తమకము
రూపించరానిది రుచులైనతరితీపు
యిపోద్దే రమణుని కెఱఁగించిరే

చ. 3: తుంచరానిది యాస తొలఁగరానిది వాని
కొంచించరానిది కూడినరతి
అంచెల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
ముంచి నాకు సిగ్గులు మొక్కితిననరే

రేకు: 0834-3 శ్రీరాగం సం: 18-201

పల్లవి: ఆఁడువారిగుణ మిది యటువంటిదాన గాను
నేఁడు నన్నేలుకో వారు నిన్ను దూరఁజూతురు

చ. 1: మట మాయతనమున మగువలు మగవారి
సటకారితనమున సాదింతురు
తటుకన వలచితేఁ దగిలించుకొని యట్టె
యిటునటు భ్రమయించి యెలయించఁ జూతురు

చ. 2: వేసదావరినితలు వెంగెము లప్పటిఁ జూపి
కాసువీసములకుఁగా గరఁగింతురు
ఆసపడి లోనైతే నందవాయకుండాఁ జేసి
బాసగొని మోసపుచ్చి పంతమాడఁ జూతురు

చ. 3: యేతులాఁడికాంతలు యెందునైనా సందుచూచి
వాతరొట్టుమాట లాడి వంచుకొందురు
యీతల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చేతఁ జిక్కుకున్న వారు సిగ్గువడఁ జూతురు

రేకు: 0834-4 వరాళి సం: 18-202

పల్లవి: ఏమినేరనినంగ వెంతవేసాలు సేసేవు
యీమేరనే రతివేళా నిట్టే వుండేవా

చ. 1: ముసిముసినవ్వులతో ముందర నిలిచి చెలులఁ
బిసిపిసియెలుఁగులఁ బిలిచేవు
కసుగాటు మాటలు కఱచి కఱచి యాడే-
వెసఁగి ప్రియునియొద్ద నెంతగోలవే

చ. 2: చిన్నిచిన్నిసిగ్గులతో చెలువునివద్ద నుండి
సన్నలెల్లాఁ జేసేవు సతులతోను
చన్నులపై పయ్యద సాఁచి బిగించుకొంటాను
కన్నెవలె నొదిగేవు కడునెంతగోలవే

చ. 3: జలజల చెమటలుజార నింతులమాఁటున
నిలుచుండి పతిమోము నిక్కిచూచేవు
వెలయు నన్నుఁ గూడె శ్రీవెంకటేశుఁడు తొలుతె
వోలిసి యితనిపాదా లొత్తే వెంతగోలవే

రేకు: 0834-5 దేసాళం సం: 18-203

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యేమయ్యా నీవు
చెంతనుండి వూడిగాలు సేయనియ్యవా

చ. 1: సముకాన మొక్కఁ గానే సరసపుమాట లాడి
చెమరించఁ జేసేవు చెక్కులెల్లాను
తమితో వీడినకొప్పు తగ నే ముడువఁ గానే
కొమరెనాచన్ను లంటి భ్రమయించేవు

చ. 2: వొత్తఁ గానే పాదాలు నావొడిమీఁ ద నీవు వేసి
చిత్తమెల్లాఁ గరఁగించి చిమ్మిరేఁచేవు
హత్తి బాగా లందిచ్చి ఆకుమడిచియ్యఁ గానే
తత్తరాన మోవి యాని తమకింపించేవు

చ. 3: కలయఁ గ నీమేనఁ గస్తూరి వూయఁ గానే
బలిమిఁ గాఁగిట నించి పచ్చిసేసేవు
నిలిచి శ్రీవేంకటేశ నీకుఁ గప్రమియ్యఁ గానే
వెలయ వింతరతుల వెరగందించేవు

రేకు: 0834-6 దేసాక్షి సం: 18-204

పల్లవి: పాయరానిచుట్టమవు పడఁతికిని
సోయగపు నీకన్నులఁ జూతువు రావయ్యా

చ. 1: వినయపుకాఁగిలి వీడుఁ బట్టునేసి నీకు
వొరిసమోవితేనే వులుప వట్టె
ఘనకుచములు నీకు కానుక లెత్తుకున్నది
పెనఁగక చెలి నిన్నుఁ బిలిచీని రావయ్యా

చ. 2: పలుకుల కప్పురాలబాగా లొసగీ నీకు
మలసి మైతావి పరిమళ మున్నది
బలుచెమటపన్నీటఁ బాదారు గడిగి నీకు
తలిరుఁ బోడి ఇదె దగ్గరీ రావయ్యా

చ. 3: చొక్కపుఁ దనకన్నులచూపుల నెదురుకొనె
పక్కన వలపులనే పాన్పు పరచె
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యిక్కడఁ గూడితివి నీ వెపుపడు రావయ్యా

రేకు: 0835-1 ఆహిరి సం: 18-205

పల్లవి: ఎన్ని చేఁతలదానవే ఇన్నిటా నీవు
విన్నకన్నజాడ గాదు వెరగయ్యీ మాకు

చ. 1: మొక్కి కొలువుసేసేవు ముందటనుండి పతితో
మక్కళించి మక్కళించి మాటలాడేవు
ఒక్కవచన్ను లొరయ సారెఁ బాదాలొత్తేవు
నిక్కి వలపులు చల్లనేరుతువే నీవు

చ. 2: సెలవుల నవ్వేవు సిగ్గువడ కాతనితో
సొలసి సొలసి మేను సోఁకించేవు
తళుకుఁ జూపులఁ జూచి దండఁ గూచుండవచ్చేవు
యెలయింప జాణవైతి విపుడే నీవు

చ. 3: కూరిమి శ్రీవేంకటేశుఁ గొనచూపులనుఁ జూచి
చేరి చేరి వూడిగాలు సేయవచ్చేవు
యీరీతి నన్నీతఁ డేలె యే నలమేల్మంగను
తారుకాణలాయ మంచిదానవే నీవు

రేకు: 0835-2 వరాళి సం: 18-206

పల్లవి: మంచిదయ్యా వలపులు మారుబేరా లాడేవు
పొంచి నెట్టువడినది పొరుగాపెమీఁ దను

చ. 1: కచ్చుపెట్టి యాపె నిన్నుఁ గతలెల్లా నడుగఁగా
మచ్చిక నీ వెవ్వరితో మాటలాడేవు
అచ్చముగ నీ మొగము అట్టె తప్పకచూడఁ గా
ఇచ్చకము సేసుకొని యెక్కడ చూచేవు

చ. 2: చెలరేఁగి యాపె నీతో సెలవుల నవ్వఁగాను
నలువంక నెవ్వతెతో నవ్వులు నవ్వేవు
సలిగెతో నిట్టె నిన్ను సారె సారెఁ జెనఁకఁగా
వెలినున్న యాపెనేల వెలిగోర నూఁచేవు

చ. 3: కప్పురపు విడెము కలికి నీకు నొసఁగఁగా
దప్పిదేర నాపెకేల తమ్మ వెట్టేవు
అప్పుడె శ్రీవేంకటేశ అలమేలుమంగ గూడె
చొప్పుననే యాపె కెంతచుట్టమయేవు

రేకు: 0835-3 సామంతం సం: 18-207

పల్లవి: కానీలేవే యందుకేమి కందము నీసరితలు
నానఁ గానే వలపులు నయమిచ్చీని

చ. 1: నెలకొని రమణుఁడు నీపై బత్తిగలఁడంటా
సలిగెలు చూపేవు సవతులకు
బలిమినే మంచమెక్కి పాదాలు పైఁ దీసుకొని
వలవని దొరతనములు సేసేవు

చ. 2: చేరి నిన్ను మెచ్చీనంటా చేకొని నీ ప్రియునికి
నేరుపుతో నూడిగాలు సారెఁ జేసేవు
కోరి చిటికలుదీసి కొత్తగా వచ్చితినంటా
వూరకే చుట్టరికము లొనర నవ్వేవు

చ. 3: యేపున శ్రీ వేంకటేశు నెన్నడో కూడితినంటా
కాఁపురాలు సేసిసేసి కడ గానవు
వోపిక నలమేల్మంగ నురము పై నున్నదాన
పైపైఁ జాయ సేసుక పక్కన మెచ్చేవు

రేకు: 0835-4 దన్నాశి సం: 18-208

పల్లవి: ఏల తలవంచుకొనే వెదురుకట్టుకు రావే
నాలితో సిగ్గుపడితే ననుపులయ్యీనా

చ. 1: సరసములాడఁగానే చవులుపట్టీఁగాక
విరసాన నుండితేను వేడుకయ్యీనా
సరుసఁ గూచుండఁగానే సమేళము లౌఁగాక
యెరవై మాఁటుననుంటే ఇంపులు వుట్టీనా

చ. 2: వొనర మాటాడితేనే మనసు గరఁగుఁగాక
మునుపే వెంగెమాడితె ముచ్చటారునా
చెనకి పైకొంటేను చెల్లుబడి యౌఁగాక
పెనఁగి బిగిసితేను ప్రియములయ్యీనా

చ. 3: కలకల నవ్వఁగానే ఘనత లీడేరుఁగాక
చలము సాదించితేను సమ్మతమయ్యీనా
యెలమి శ్రీ వేంకటేశుఁ డింతలో నిన్ను నేలె
కలసీఁగాక చుట్టరికము లిఁక వీడునా

రేకు: 0835-5 నాట సం: 18-209

పల్లవి: సగము మానిసిరూపు సగము మెగమురూపు
అగణితప్రతాపుఁ డహోబలేశుఁడు

చ. 1: గద్దెమీఁదఁ గూచున్నాఁడు కంబములోఁ బుట్టినాఁడు
కొద్దిమీరఁ గడునవ్వుకొంటా నున్నాఁడు
వొద్దనె శ్రీ సతిచన్ను లొరయుచు నున్నవాఁడు
అద్దివో చూడరమ్మ అహోబలేశుఁడు

చ. 2: పెనుమీసాలవాఁడు పెదపెదగోళ్లవాఁడు
ఘనునిఁగాఁ బ్రహ్లాదునిగాఁ గాచుకున్నాఁడు
మనసిచ్చినసురలతో మాటలాడుచున్నవాఁడు
అనుపమతేజుఁడమ్మ అహోబలేశుఁడు

చ. 3: వేవేలుచేతులవాఁడు వెన్నెలచాయలవాఁడు
భావించి కొల్లినవారిపాలిటివాఁడు
శ్రీ వేంకటగిరిమీఁదఁ జేరి భవనాశిదండ
నావల నీవల మించె నహోబలేశుఁడు

రేకు: 0835-6 మాళవి సం: 18-210

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిద్దరిజాణతనాలు
కామించి చూడరే కడుఁగన్నులపండుగలు

చ. 1: యెదురుగొండలెక్కి ఇందిరా నౌభళేశుఁడు
మదము చెక్కిళ్ళఁ గార మాటలాడేరు
పొదిగొన్న వేడుకెంతో పూవులఁ దమలోఁ దాము
చెదరనియాసలతో సేసలు చల్లేరు

చ. 2: రేఁగి రేఁగి భవనాశి రెండుదరులా నుండి
మాఁగినమోవులు చూపి మతిఁ జొక్కేరు
తోఁగి తోఁగి చూచుకొంటా తొడిఁబడి రతులకు
దాఁగని ముచ్చటలతో దమకించేరు

చ. 3: సమదిష్టి నొండురులు సంగడివనాలనీడ
జమళి కాఁగిళ్లకు సమకూడేరు
ఆమర శ్రీ వేంకటాద్రి నందనిందూఁ దావుకొని
చెమటమేనులతోడ సెలవుల నవ్వేరు

రేకు: 0836-1 కాంబోది సం: 18-211

పల్లవి: మానాపతినైఁ వుండఁ గా మన్నింతువుగాక నీవే
నానారీతులఁ గెలసి నవ్వ నాకుఁ దగునా

చ. 1: కొత్తకొత్త మాట లాడి గుట్టుదెలుసుక నీపై
బత్తిచూసి వలపులు పైఁ జల్లీ నాకె
పొత్తుల నీడువెట్టేవు పొరుగాపెతో నన్ను
ఇత్తల నే నిల్లాల నింతసేయఁ దగునా

చ. 2: మేసోఁక సేవలు సేసి మెప్పించుక నీకుఁ గడు-
నాసరేఁచి వీడెము లందిచ్చీ నాకె
ఆనేఁ తలు నేరుచుకొమ్మనేవు నీవు నన్ను
సేసపెండ్లి కూఁతురను సిగ్గువడఁ దగనా

చ. 3: కన్నుచూపులు నాఁటించు కైవసముగాఁ జేసుక
చన్నులద్ది కూచ్చున్నది సంగడి నాకె
ఇన్నిటా శ్రీ వేంకటేశ ఇంతలో నన్నేలితివి
కన్నెదాన నాపెవలె గర్వించవచ్చునా

రేకు: 0836-2 రామక్రియ సం: 18-212

పల్లవి: ఈపనికి నేము వచ్చి యెంతవడైనాఁ గద్దు
కాపాడి ఇంతటను కరుణివయ్యా

చ. 1: వాకున నేగతినైనా వలపుల చెప్పఁగవచ్చు
పైకొని వెలిఁ దచ్చిచూపఁగరాదు
చీకాకుపడినట్టిచిత్తమే యెఱుఁగును
ఆకె నీకెదురుచూచీ నండకురావయ్యా

చ. 2: వేడుకతొ నాపెచెప్పేవిందుకు రమ్మనవచ్చు
వాడిక నందలిరుచి వర్ణించరాదు
కూడిమాడి యారగించేకోరికలే యెఱుఁగును
జాడతో నాపె చెప్పెంపెఁ జనవియ్యనయ్యా

చ. 3: పొలఁ తికి నీపైఁ గలపొందు లెరిఁగించవచ్చు
చెలిమి కాఁగిటఁదెచ్చి చిక్కించరాదు
వొలసి కూడితిరి మీవొడఁబా ట్లెరుఁగును
అలరి శ్రీవేంకటేశ ఆదరించవయ్యా

రేకు: 0836-3 సాళంగం సం: 18-213

పల్లవి: ఇద్దరును మేనవారే ఇయ్యకోలే ఇందరికి
పొద్దువొద్దుకు నిచ్చల భోగింతురుగారా

చ. 1: మెలుఁతకు నీవైతే మేలువాఁడవు తొల్లె
నెలకొని యాపెయును నీకు వలచు
యెలమిఁ జెలికత్తె లెడమాట లేమాడేరు
తలఁచుక మీరే రతిఁ దగులుట గాక

చ. 2: ఆకెమనసుమర్మము లన్నిటా నీవెరుఁగుదు
దాకొని నీమన సాకె తా నెరుఁగును
యీకడాకడిచుట్టాలు యేమిబుద్దులుచెప్పేరు
మేకొని సరసములు మీరే యాడుట గాక

చ. 3: నీదేవులమంచముపై నీవు పాదాలు చాఁచితే
ఆదటఁ జేయి నీమంచాన నా పో చాఁచెను
యీదెస శ్రీవేంకటేశ యేమని యెచ్చరించేము
పోదితోఁ గూడితి రిట్టె పొఁసగుట గాక

రేకు: 0836-4 శ్రీరాగం సం: 18-214

పల్లవి: ఇంపు గలిగినతోట నెగ్గులు పట్టఁగనేల
గుంపించి మీరేల ఆడుకొనేరే సవతులు

చ. 1: కూరిమితో రమణునిఁ గొంత సొలసినసతి
వేరులేనిమాటల వేఁడుకొనును
బీరముతో రతివేళ బిగిసి పెనఁగులాడి
చేరి యంతతోఁ గరఁగి చెక్కునొక్కును

చ. 2: చనవున బొమ్మలను జంకించినకాంత
మునకొని యాసరేఁచి మోవి చూపును
కొనగోరఁ జిమ్మిచిమ్మి గుట్టుతో నొట్టువెట్టి
తనివారాఁ గాఁగిలించి దప్పిదేర్చును

చ. 3: శిరసువంచుక లోలో సిగ్గులువడినలేమ
సరికిబేసికి సరసములాడును
ఇరవై శ్రీ వేంకటేశుఁ డిన్నిటాఁ గూడెఁ గనక
పరగఁ బెండ్లిపీఁటపైఁ గొలువుండును

రేకు: 0836-5 సౌరాష్ట్రం సం: 18-215

పల్లవి: ఔనయ్యా మంచివాఁడ వాకెచిత్త మెఱఁగవు
మానాపతైనదాని మరి రట్టు సేతురా

చ. 1: సిగ్గరి పెండ్లి కూఁతురై శిరసువంచుకుండఁగ
దిగ్గన నొడివట్టేల తీసేవు నీవు
తగ్గి చెలిమఱఁగునఁ దప్పించుకొనఁగానే
వెగ్గళించి గోరుసోఁక వేఁడుకొనేవు

చ. 2: కడలేనిముద్దరాలై కంబమువట్టుకుండఁగా
అడరి కూచుండుమంటా నానవెట్టేవు
చిడుముడితోడ నీకుఁ జేతులెత్తి మొక్కఁగానే
గుడిగొనఁ బయ్యదకొంగు జారించేవు

చ. 3: పట్టపుదేవులై బడివాయకుండఁగానే
జట్టిగొని తొడమీఁదఁ బెట్టుకొనేవు
ఇట్టె శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడఁగానె
చుట్టరికాలెల్లాఁ జెప్పి చొక్కించేవు

రేకు: 0836-6 శంకరాభరణం సం: 18-216

పల్లవి: వెరగయ్యీ నీచేతకు విట్ఠలేశ్వరా
విరులుచల్లే వప్పటి విట్ఠలేశ్వరా

చ. 1: వేడుకకాఁడవు నీవు విట్ఠలేశ్వరా మాకు
వీడె మియ్యఁ గదవోయి విట్ఠలేశ్వరా
వీడవు మనపొందులు విట్ఠలేశ్వరా
వీడుదోడాడి వలపు విట్ఠలేశ్వరా

చ. 2: వెన్న దిన్న నోరి తోడి విట్ఠలేశ్వరా
వెన్నెలనవ్వు నవ్వేవు విట్ఠలేశ్వరా
వెన్నుఁడ నీకు మొక్కేము విట్ఠలేశ్వరా మా-
విన్నపము లాలించు విట్ఠలేశ్వరా

చ. 3: విచ్చేయు మాయింటికి విట్ఠలేశ్వరా యెంత
విచ్చి చెప్పేవు కతలు విట్ఠలేశ్వరా
కుచ్చి శ్రీ వేంకటాద్రిపైఁ గూడితివి నన్ను
విచ్చనవిడాయ నిఁక విట్ఠలేశ్వరా

రేకు: 0837-1 రీతిగౌళ సం: 18-217

పల్లవి: ఎందరు లేరు సతులు యెన్నెన్నిచందాలవారు
చెంది నీనాపొందువలెఁ జెప్పరాదు గాని

చ. 1: వేడుకమాట లెన్నైనా వేవేలు నాడఁగవచ్చు
కూడిమాడివుండేది గురుతుగాని
చూడఁజూడ వినయాలు సూడిదెలు వట్టవచ్చు
యీడఁ జోడైన వలపు లెక్కుడు గాని

చ. 2: ననిచి యెంతవడైనా నవ్వులు నవ్వఁగవచ్చు
మనసెనసి వుండుటే మర్మము గాని
చెనకి వినోదపుచేఁతలు సేయఁ గనచ్చు
కొనసాగెడుకూటమే కొరయౌఁగాని

చ. 3: యెదురుబడి నుండి ఇంపులు చల్లఁగవచ్చు
వదలనికాఁగిళ్లే వైపులు గాని
ఇదివో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొదిగొన్న సంతోసాలే పోదులౌ గాని

రేకు: 0837-2 లలిత సం: 18-218

పల్లవి: కడుఁగడు ముద్దరాలు కామిని నీకు మేలుది
ఆడుగవయ్యా నీవేయైనా నాపెమనవి

చ. 1: పడఁతి సిగ్గున విన్నపము సేయకున్న దేమో
వడి నిన్నంటికిఁ బిలువఁగ వచ్చెను
వొడికాన వేళ చూచుకున్నభావమో యేమో
చిడుముడి చెక్కుచేతఁ జిమ్మి రేఁగుచున్నది

చ. 2: అట్టె మానాపతి గాన అడఁకువ నున్నదేమో
గుట్టునఁ గానుక చేతఁ బట్టుకున్నది
దిట్టయై నీతలఁపులు దెలియవలసియేమో
యెట్టయెదుటనుఁ జేతులెత్తి మొక్కుచున్నది

చ. 3: యేకతాన నూడిగాలు ఇట్టె సేసేనంటానేమో
దాకొని నీపానుపుదండ నున్నది
యీకె నింతలో శ్రీ వేంకటేశుఁడ కూడితివి
మేకొని నిన్నన్నిటాను మెచ్చుకొంటా నున్నది

రేకు: 0837-3 గౌళ సం: 18-219

పల్లవి: ఇంతులాల చూడరమ్మ యెన్నఁ గొత్తలు
సంతతము నీపె జవ్వనవనమందు

చ. 1: చెలియమోవినే సింగారము చిగిరించె
అలకల ననలుఁ గొనలు సాగెను
మలసి కరములను మారాకులు వెట్టె
వలపల యీపె జవ్వనవనమందును

చ. 2: మచ్చికతోడుత మంచిమాటలనే నీడలొత్తె
పెచ్చు రేఁగి చన్నులను పిందెలు వుట్టె
విచ్చనవిడి నవ్వుల వెన్నెలపంటలు వండె
వచ్చె నామని యీపెజవ్వనవనమందును

చ. 3: పిఱిఁదిచక్కఁ దనము పెద్ద పెద్దరాసులాయ
కొఱిగలతొడలే కొమ్మలాయను
చిఱుఁ జెమటలతోడ శ్రీ వేంకటేశుడు గూడి
వఱలుచు మించె నీజవ్వనవనమందును

రేకు: 0837-4 శుద్ధవసంతం సం: 18-220

పల్లవి: కలిగెఁగా నీకు నాపె కామనిధానమువలె
యెలమి నీభాగ్య మింక నేమిచెప్పేదయ్యా

చ. 1: వొద్దిక నెట్టనెదుర నుంచుకొని కొలువులో-
నద్దమువలెఁ జూచేవు ఆపెమొగము
గద్దించి తానిచ్చినబాగాలు పుక్కిటఁ బెట్టుక
చద్దివలె దాఁచుకొని చవులుగొనేవు

చ. 2: ఆతిముదమున నాపె నడుగుకొంటాఁ బురాణ-
కతలువలె వినేవు కాంతమాటలు
తతి నాపెచూపలు పూదండలువలెనే నీమై
సతము భావించుక సంతోసించుకొనేవు

చ. 3: నీకుఁ గానుక వచ్చిన నిమ్మపండ్లవలెనే
పైకొని సారెనంటే వాభామచన్నులు
యీకడ శ్రీ వేంకటేశ యిట్టె నన్నురతిఁ గూడి
సాకిరిగాఁ బెట్టుకొని జంటపెండ్లాడేవు

రేకు: 0837-5 పాడి సం: 18-221

పల్లవి: చెల్లఁ బో ఆఁటదానికి సిగ్గు దలఁచుకోవద్దా
చెల్లుబడి గాని చోట చెనకఁగవచ్చునా

చ. 1: ఆతఁడూ నేనూ మాటనాడుతా నుండఁగానే
యీతల నీవేల కానుకియ్యవచ్చేవే
రాతిరిఁ బగలు నాకు రమణుఁడై వుండఁ గా
చేతులె త్తి నీవేల సేసలుచల్లేవే

చ. 2: పొదలి నే మిద్దరముఁ బొత్తుల నుండఁగానే
సదరాన నీవేల కొసరవచ్చేవే
ముదమున మాలో నేము మొగములు చూచుకోఁగా
అదన నీకు నిఁక నడ్డాలు రాఁదగునా

చ. 3: కలిసి నే మింతలోనే కాఁగిలించుకొనఁగాను
సొలసి మమ్ముఁ దప్పకచూచే విదేమే
యెలమి శ్రీ వేంకటేశుఁ డిటు నన్నుఁ గూడినాఁడు
వెలి నుండి నీ వెంత వెరగందేవే

రేకు: 0837-6 హిందోళం సం: 18-222

పల్లవి: ఎందాఁకా సరసమాడే వేమయ్యా
పొందుగా నలపుదీర్చి భోగించరాదా

చ. 1: చక్కనిజవ్వని నీవు సారెకు నవ్వించఁ గాను
చెక్కులునిండాఁ గడుఁ జెమరించెను
ఇక్కువ లంటుకొనుచు నీవు యిట్టె పెనఁగులాడఁగా
ముక్కున నిట్టూర్పులు ముంచుకొనెను

చ. 2: గారాపుదానిచేతఁ గతలు చెప్పించుకోఁగా
పేరి పెదవిపైఁ దమ్మబేంట్లు రాలెను
గోరనంటి పయ్యదలో గుబ్బలు గదలించఁగా
జారి కొప్పుతో విరులు జల్లనరాలీని

చ. 3: కోమలి నింతలో నీవు కొసరి కాఁగిలించగా
అముక విరిబాగులాయ మేనెల్లా
కామించి శ్రీ వేంకటేశ కలికిని నీ వేలఁగా
వేమారు మోవితేనెలు వేడుకలు రేఁచెను

రేకు: 0838-1 రామక్రియ సం: 18-223

పల్లవి: ఔనయ్యా మంచివాఁడు వతివ నింత సేసితి
కానీవయ్యా యీకె నిట్టె కరుణించు మిఁకను

చ. 1: మనసిచ్చినీ వాపెతో మాటలాడఁగానేపో
తనివోనివలపులతమి వుట్టెను
కనుచూపు లటు నీవు కాఁడిపారించఁగాఁబో
కొనసాగి వొక్కొకటె కోరికలు రేఁగెను

చ. 2: నాముగొన నీ వూరకె నవ్వులు నవ్వఁగాఁబో
మోమున రతికళలు మొలవఁ జొచ్చె
చేముంచి నీవు సారెఁ జెనకఁ గానే పో
యేమినెఱఁగనిబాల ఇంత రట్టుకెక్కెను

చ. 3: ఇంటికే వచ్చి నీవు ఇట్లాఁ గూడఁగాఁబో
దంటయై ఇంతేసికతలఁ గరఁచె
జంటయై శ్రీవేంకటేశ సరసమాడఁగాఁ బో
పెంటయైన సంతోసాలఁ బెనగొనె నిపుడు

రేకు: 0838-2 హిందోళం సం: 18-224

పల్లవి: అచ్చివచ్చు నీ కెప్పుడు నంగనతోడిపొందు
కొచ్చి కొచ్చి ఇందు కెంతకోరుకొంటా నుంటివో

చ. 1: సరుస నిలుచుండఁగా సతితురుములోనుండి
విరులు నీ మీఁద రాలె వింతలుగాన
గరిమఁ దమకమునఁ గమ్మిననిట్టూర్పులు
వరుసతో నీకు నాలవట్టములాయను

చ. 2: మాటలాడుకొనఁ గాను మనసులేకమై లోలో
వాటములై తగిలెను వావులుగాను
సూటిదప్పకుండా నిన్నుఁ జూడఁగఁ జూడఁ గాను
కోటికొండలై వలపు గుదిగొనె నీకును

చ. 3: ముట్టి కొలువుసేయఁగ మునుకొని నీపూజకు
గుట్టునఁ జన్నులు పూవుగుత్తులాయను
ఇట్టె శ్రీవెంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
తొట్టి యాపెకూటమి దోమటాయను

రేకు: 0838-3 పాడి సం: 18-225

పల్లవి: వలపులకు గురైనవాఁడే మన్నించీఁ గాక
చెలులతో దూరి దూరి చెప్పఁగనేమిటికి

చ. 1: తలపోఁతలే నాకు తమకమురేఁచఁ గాను
వెలినున్న చిలుకతో విసుగనేలే
పలునాచూపులె నన్ను భ్రమయించఁ జేయఁ గాను
కలువల నిటు దూరఁ గారణమేమిటికి

చ. 2: జవ్వనమదమె నాకు చవులు పుట్టించఁ గాను
ఇవ్వలఁ బున్నమచంద్రుఁడేమి సేసునే
నివ్వటిల్ల నాయాసలే నివ్వెరగు నొందించఁ గా
పువ్వువిలుతునితోడఁ బోరాడవలెనా

చ. 3: కమ్మి శ్రీవేంకటేశుఁడే కాఁగిటిలో నుండఁగాను
కొమ్మలాల చలిగాలిఁ గొసరేదేమే
నిమ్మపండ్లంతలై నిక్కి చన్నులు రాఁగా-
నిమ్ముల నాభాగ్యము నెంచిచెప్పవలెనా

రేకు: 0838-4 నాగవరళి సం: 18-226

పల్లవి: నీ కెంతపరాకైనా నెలంత మరవలేదు
చేకొన్ననీమీఁ దిబత్తి చిగిరించుఁ గాక

చ. 1: వేడుకగలవారలు వేసర రెంతైనాను
చూడఁ జూడ వలపులు జొబ్బిలుఁ గాని
వాడికైనపొందులు వదల వెన్నటికిని
యీడు జోడై మీఁదమీఁద హెచ్చుఁ గాని

చ. 2: యెనసివుండినవారు యెగ్గుపట్ట రేమిటికి
వెనుకొన్న ముచ్చటలు వెలయుఁ గాని
మనసువచ్చినచోట మానవు తీరతీవులు
వినయపుఁ బ్రియములు వెగ(గ్గ)ళించుఁ గాని

చ. 3: సమ్మతించినవారు జడియ రేపనికిని
పుమ్మగిలుకాఁగిళ్లు వొద్దికౌఁ గాని
యిమ్ముల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
చిమ్ముసరసము లింకాఁ జెలరేఁగుఁ గాని

రేకు: 0838-5 ధన్నాసి సం: 18-227

పల్లవి: చెప్పరాదు చూపరాదు చిత్తగించవయ్యా నీవు
ముప్పిరి నింకా నెంత మోపుగట్టీనో

చ. 1: కానుకపట్టీఁ జూపులు కలికి నీయెదుటను
వానలుగఁ జెమటలు వడిసీ మేన
నానఁ బెట్టి సెలవులు నవ్వులు నవ్వీ నీతో
పూని మోహ మింకానెంత పోగువోసినో

చ. 2: వెదవెట్టీ మాటలు వేడుకతో నీ ముందర
గుదిగుచ్చీ సిగ్గులు నీకొలువునను
పొదిగొన్నతమకము పొంచి నీపై దిగఁ బోసీ
యెదుటఁ దనకోరిక లింకానెంత చూపీనో

చ. 3: విందువెట్టీ మోవితేనె వింతలుగా నిందరిలో
అందిచ్చీ కాఁగిలి నీకు నటు చేతుల
కందున శ్రీవేంకటేశ కైకొని కూడితివి
పొంది రతు లింకానెంత భోగించీనో

రేకు: 0838-6 నాదరామక్రియ సం: 18-228

పల్లవి: ఏమని చెప్పుదునే యిదివో నావలపు
దోమటి మోవితేనెలఁ దొట్టుకొనె వలపు

చ. 1: తలపోఁతలచేత దట్టమవును వలపు
సొలపులు నెరపితేఁ జుట్టుకొను వలపు
పలుకులఁ గొసరితేఁ బదనెక్కు వలపు
నెలకొని నవ్వితేను నిలుకడౌ వలపు

చ. 2: చెనకులు గనమైతే చిమ్మిరేఁగు వలపు
తనువుసోఁకులను తగులౌను వలపు
పెనఁగఁగాఁ బెనఁగఁగా బెచ్చురేఁగు వలపు
మనసురా మెలఁ గితే మక్కళించు వలపు

చ. 3: తప్పక చూచితేనే తలకొను వలపు
ముప్పిరివినయముల ముంచుకొను వలపు
అప్పఁడు శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
చెప్పరానిరతులను చెట్టుకట్టు వలపు

రేకు: 0839-1 సాళంగనాట సం: 18-229

పల్లవి: వీఁడె చూడరే యెంతవేడుకకాఁడు
తీఁడుకొనీ మీసాలు తిరువేంగళేశుఁడు

చ. 1: భూపతిచెరువుకాడ పువ్వులమాకులనీడ
రాపైనమిక్కిలిసింగారాలతోడ
చూపట్టుఁ గాంతలనెల్లాఁ జొక్కించి తరి-
తీపులఁ బెట్టీ నిదే తిరువేంగళేశుఁడు

చ. 2: కట్టుఁ గాలువదండ కడుమచ్చికలు నిండ
మట్టుక వున్నదే తిరుమలకొండ
జట్టిగొని సతులతో సరసములాడుకొంటా
దిట్టయై నవ్వులు నవ్వీఁ దిరువెంగళేశుఁడు

చ. 3: ముప్పిరిగొన్నవీదుల ముంచి మోహముపోదుల
విప్పుచుఁ బైఁజల్లేటివిరివాదుల
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డితఁడె ఇంతులఁ గంటేఁ
దెప్పరము పెండ్లాడీఁ దిరువేంగళేశుఁడు

రేకు:	0839-2 బౌళి	సం:	18-230

పల్లవి:	చూడఁ జిన్నవాఁడు గాని జూటుఁదనాలు తనవి
	యేడఁ జూచినాఁ దానే యేమని చెప్పుదునే

చ. 1:	దొంగాడుఁ గృష్ణుఁడు తొయ్యలుల మొగములు
	తొంగిచూచీ ముంగురులు దూలాడఁగా
	ముంగిట ముద్దులువెట్టి మోవితేనె లానుకొంటా
	యెంగిలిసేసి నిదె యిందరి నొక్కమాఁటె

చ. 2:	వెన్నముద్దుకృష్ణుఁడు వేడుకతో జవరాండ్ల-
	చన్నులంటి సారె సారె సాముసేసీని
	చిన్నిచేతు లటుచాఁచి సిగ్గులురేఁచి చెనకి
	సన్నలు సేసి పిలిచి సరసములాడీని

చ. 3:	వుద్దగిరికృష్ణుఁడు వొడిపట్టి మానినుల
	అద్దుకొని కాఁగిలించి ఆసలురేఁచీ
	వొద్దిక శ్రీవేంకటాద్రి నొనగూడి మాచేఁతలు
	సుద్దులుగాఁ జెప్పి చెప్పి సొలసి నవ్వీనే

రేకు: 0839-3 పాడి సం: 18-231

పల్లవి: నీవు సరసుఁడవు నే నీవూడిగవుదాన
భావించి నీ చిత్తము పట్టరాక కాక

చ. 1: వొడివట్టితియ్యఁగా నే నోపననేదానా
అడరి మందెమేళము లౌనని కాక
తడవి చెనకఁ గాను తప్పించుకొనేనా
సుడిసి కొనగో రెందుసోఁకునో యనికాక

చ. 2: తగిలి నీవు చూడఁగాఁ దలవంచేదానా
వొగి నీతో గర్వమని వుందానఁ గాక
పగటున నవ్వఁ గాను పరాకయ్యేదానా
చిగిరించేనా లోని సిగ్గులకుఁ గాక

చ. 3: సరసములాడఁ గాను సమ్మతించనిదానా
సరికి బేసికి నీతో జరయఁ గాక
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వొరసి నానీమన్నన నొద్దికయ్యేఁ గాక

రేకు: 0839-4 గౌళ సం: 18-232

పల్లవి: ఒకటి కినుమడాయ నొద్దిక నీవలపులు
మొకమిచ్చులనాపొందు ముమ్మడించె నిపుడు

చ. 1: వీడెమిచ్చినాపె నీపై వేడుకలు సేయఁ గాన
వాడవారిపైఁ జల్లేవు వసంతము
వోడఁ గట్టినదూలమై వొకతె నీకుండఁ గాను
ఆడనే వేరేకతెకు నంటుబచ్చలైతివి

చ. 2: పాదాలొత్తే యాపె నిన్నుఁ బలుకులఁ గొసరఁగ
వీదివారితో నాడేవు వెడమాటలు
తోదోపుల వేరొకతె తోడునీడై వుండఁ గాను
సోదించి వేరొకతెకు సూదిరాయి వైతివి

చ. 3: కాఁగిలించుకొన్న యాపె కందువలఁ గరఁగఁగా
లోఁగిటి లోనియాపెకు లోనైతివి
చేఁగదేరొకతె నీకు జిగురుఁ గండై వుండఁ గా
పొఁగి శ్రీవేంకటేశ నాపాలిభాగ్యమైతివి

రేకు: 0839-5 లలిత సం: 18-233

పల్లవి: ఏడకుఁ బోనేల నీకు నిందు రావయ్యా
వాడుదేర నామోము చూడవయ్యా

చ. 1: చుట్టమవైనవాఁడవు సుద్దులు చెప్పవాఁడవు
ఇట్టె మాయింటికి వచ్చి యెనయవయ్యా
దిట్టవైనవాఁడవు తీరనిపంతగాఁడవు
బెట్టగునాచన్నులతోఁ బెనఁగవయ్యా

చ. 2: వలచినవాఁడవు వసమైనవాఁడవు
ఇల నాచేసేసేవలు సేయించుకోవయ్యా
సెలవి నవ్వేవాఁడవు చెందినమేనవాఁ డవు
వలసినట్లఁ గూడి వద్దనుండవయ్యా

చ. 3: నమ్మికిచ్చినవాఁడవు నాపాలివాఁడవు
ఇమ్ముల నాకిట్టె కాఁగి లియ్యవయ్యా
నెమ్మది శ్రీవేంకటేశ నేఁడు నామేలువాఁడవు
కమ్మటి నన్నుఁ గూడి కరుణించవయ్యా

రేకు: 0839-6 ఛాయనాట సం: 18-234

పల్లవి: చేరి నన్నుఁ జూచి యేల సిగ్గుపడేవు
గారవిం చందుకోవయ్యా కప్పురమిచ్చీని

చ. 1: ముదిత, చన్నుదోయి మొనలు నిన్నుసోఁకఁగా
చెదరిననీనెరుల చిక్కుదీసిని
పెదవులపై తమ్మబేంట్లు రాలఁ గాను
కదిసి నీకప్పటి నీకత చెప్పీని

చ. 2: పొంచి తనకొప్పులోనిపూవులు నీపై రాలఁ గా
కుంచెవేసి నిలుచుండి కొలిచీ నిన్ను
కంచు వాఁగినట్టు పైఁడిగాజులు రవళించఁ గా
మంచముపైఁ బాదాలొత్తి మనసు మెప్పించీని

చ. 3: పొదిగి బాహులతలె పూవులదండలు గాఁగ
కదిసి నీపై వేసి కాఁగిలించీని
యెదుట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీ-
పెదవితేనెల కాపె పెనఁ గీ నీతోను

రేకు: 0840-1 ఆహిరి సం: 18-235

పల్లవి: నీకు నాకు సరి వాలై నిండె వలపు
కైకొందము రావయ్యా కందువైనవలపు

చ. 1: యెదురుచూడఁ గానే ఇంటికి విచ్చేసితివి
పదనుదప్పకుండాను పండె వలపు
వదలుఁ బయ్యెదలోనివట్టువగుబ్బ లంటేవు
యెదుటనే కొటారుకు నెక్కెనిదె వలపు

చ. 2: అట్టె తలవంచఁ గానే ఆసమాట లాడితివి
నెట్టుకొన్నకణఁ జాల నిండె వలపు
తెట్టఁ దెరువున మోవితేనెలు చవిచూపేవు
గుట్టుతోడుత నామనిగుంపులాయ వలపు

చ. 3: కవకవనవ్వఁగానే కాఁగిలించుకొంటివి
చివురులో చేఁగలై చిక్కె వలపు
యివల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
జవళిసోబనముల జంటలాయ వలపు

రేకు: 0840-2 ముఖారి సం: 18-236

పల్లవి: నామనసెందాఁ కాఁ జూచినాఁ డే నావిభుఁడు తాను
యీమాట గురుతుచెప్పి ఇంటికిఁ బిలువవే

చ. 1: చెల్లుబడిమాటకు సిగ్గుపడ నేమిటికి
వెల్లవిరైనపనికి వెగటుగాదు
వుల్లము గలసినందు కొడఁబాటు మరివద్దు
యెల్లవారు నెఱిఁగిరి ఇంటికిఁ బిలువవే

చ. 2: పక్కన నవ్వినమీఁద పంతమాడ నేమిటికి
మొక్కినవెనక గర్వములు దగదు
నిక్కిచూచినప్పుడే నిండుకొనె నడియాస
ఇక్కువలు సరివచ్చె నింటికిఁ బిలువవే

చ. 3: చుట్టరికమైనయందు చొప్పులె త్తనేమిటికి
నెట్టుకొంటే వలపులో నెరుసేడది
గుట్టుతోడ నన్నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడు
యెట్టయెదుటనే వున్నాఁ డింటికిఁ బిలువవే

రేకు: 0840-3 కుంతలవరాళి సం: 18-237

పల్లవి: పతులకు సతులకుఁ బాయరానిజాడ లివి
ఇతవుసేసుకొంటే నేమీ నెంచనేఁ టికి

చ. 1: వయసే చక్కఁదనము వర్ణించి చూచితేను
ప్రియమే వలపులకుఁ బెనుఁబోది
నయగారితనములే ననుపులకు మూలము
చెయిఁ జెయిసోఁకుటే చెలిమికి గురుతు

చ. 2: మనసే పొంతనము మచ్చికలు సేసుకొంటే
పెనగొన్న చూపులే పెడరేఁపులు
వినయపుమాటలే వేడుకతగులాలు
వినుకలియానందమే వియ్యపుసమ్మందము

చ. 3: సెలవులనవ్వులే సిగ్గులలోనిచవులు
వులివచ్చిచెనకులే వొడఁ బాటులు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలేనె నన్నుఁ గూడె
వెలయ మోవితేనెలు వెలలేనివిందులు

రేకు: 0840-4 దేవగాంధారి సం: 18-238

పల్లవి: తప్పు లెంచకుము దండము వెట్టెద
చొప్పుగ నను దయఁ జూడుము నీవు

చ. 1: చనవున నీతో సరసములాడితి
పెనఁగితిఁ గాఁగిటఁ బ్రియమునను
ననుపున నూరక నవ్వులు నవ్వితి
నెనయఁ గ నాగర్వ మేమనఁగలదు

చ. 2: మరుగవలసి నీమనసు గరంచితి
నరుదుగ మర్మము లంటితిని
సురత వేళలను చొక్కించితీ నిను
యిరవుగ నాగుణ మిటువలె నుండె

చ. 3: సంగడిఁ గూచుండి చన్నుల నొత్తితి
నెంగిలి పెదవులు నెదిరితిని
అంగపు శ్రీవేంకటాదిప యలమేల్-
మంగపతివి నను మన్నించు మిఁ కను

రేకు: 0840-5 రామక్రియ సం: 18-239

పల్లవి: అన్నియుఁ గూడఁగాను ఆలమేలుమంగయాయ
కన్నుల నిట్టికొత్తలు కనుఁగొనవయ్యా

చ. 1: చిగురుమరుకాళెలు జిగిగలయరఁటులు
సొగసైనయట్టి యిసుకదిబ్బలు
తగినబిలము మంచితరఁగలు సింహము
మొగిచినచక్రవాళములపిల్లలు

చ. 2: జవళితామరతూండ్లు చక్కనిశంఖము పోఁక
పవడాలు వజ్రాలు పసిడియద్దాలు
నువుఁ బూవు కలువలు నూలుకొన్న శ్రీకారాలు
అవిరళమైనవిండ్లు అరచంద్రుఁడూ

చ. 3: తమ్మివిరి నీలాలు తళుకుమెఱుఁగులు
తమ్మిదలుఁ బెదరనితోరపుగుంపు
ఇమ్ముల శ్రీ వేంకటేశ యిదె నీవురముమీఁద
నెమ్మదిఁ దాపుకొని నిండెను యీసిరులు

రేకు: 0840-5 సాళంగం సం: 18-240

పల్లవి: మఱి తరువాతఁ దానే మన్నించీ నన్ను
యెఱిఁగించి రమణుని నీడకుఁ దోడితేరే

చ. 1: వేడుకలు తనుపేరు వీనుల వింటేఁ గలుగు
సూడిదె కోరిక తన్నుఁ జూచితేఁ గల్గు
అడుకొన్నబాసమాట లాడుకొనఁ గానే కలుగు
వాడిక తనకాఁగిటఁ గూడితేఁ గలుగును

చ. 2: జమళిసిగ్గులు దన్ను చన్నుల నొత్తితేఁ గల్గు
తమకము దనపొందు దక్కితేఁ గల్గు
సమరతులెల్లా మోవి చవిగొంటేనే కలుగు
చెమటలసాములు చెనకితేఁ గలుగు

చ. 3: మన మచ్చిక తాను మన్నించితేఁ గలుగు
ననుపులు నటనలు నవ్వితేఁ గల్గు
యెనసె శ్రీవేంకటేశుఁడే నలమేల్మంగను
పను నీడేరెను తనుఁ బాయకుండాఁ గలుగు

రేకు: 0840-6 రామక్రియ సం: 18-241

పల్లవి: మేరమీరకువె యలమేలుమంగను నేను
యేరీతిఁ బెనఁగనేలే యీతఁడు నామగఁడు

చ. 1: చెక్కుల జవ్వాది వడిసీఁ దుడుచుకొనవే
అక్కర నేమిచూచేవు అతనిదిక్కు
వెక్కసపువలపుల వేడుకకత్తె వౌదువు
ఇక్కువ లంటకువే యీతఁడు నామగఁడ

చ. 2: కోరి జారినపయ్యదకొంగు చక్కఁబెట్టుకోవే
కూరి మేమిగొసరేవు కొంక కాతని
చేరుగొండి తనములు చెలిమికత్తె వౌదువు
యీరుదియ్యఁ బేను వచ్చు నితఁ డు నామగఁడు

చ. 3: కుఁమ్ముడి వీడె నిదె కొప్పుముడుచుకొనవే
యెమ్మెల కాతనితోడ నేమినవ్వేవు
నెమ్మది నన్నేలె నిట్టె నీవూఁ జుట్టమ వౌదువు
ఇమ్ముల శ్రీ వేంకటేశుఁ డితఁడు నామగఁడు

రేకు: 0841-1 భైరవి సం: 18-242

పల్లవి: మాయింటికిఁ దానే వచ్చి మన్నించుఁ గాక
సేయఁగల విన్నపాలు సేసేదేమే

చ. 1: సేసవెట్టి యేలినాఁ డు చేరి బాసలిచ్చినాడు
లాసి మాటలాడినాఁడు లాలించినాఁడు
ఆసలెల్లాఁ జూపినాఁడు ఆలిఁ జేసుకొన్నవాఁడు
వేసరించి ఇఁకనేమి వేఁడుకొనేదేమే

చ. 2: మనసుమర్మా లెఱుఁ గు మరి నావలపెరుఁగు
తనువుపైతఁ(త్య) మెరుఁగు తగవెరుఁగు
ననిచినపొందెరుఁగు నాఁటుకొన్నచూ పెరుఁగు
పెనఁగి యింకా నేను ప్రేమ రేఁచేదేమే

చ. 3: మనుపనే ననుఁ జూచె మొక్కినమొక్కులు చూచె
తనగురుతులు చూచె దయఁ జూచె
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చెనకి ఇంకాఁ దనకుఁ జెప్పేటిదేమే

రేకు: 0841-2 సామంతం సం: 18-243

పల్లవి: చెలులాల యెట్టిదో యీచెలివలపు
మొలకలపులకలు మోపులాయ మేనను

చ. 1: మొగమెల్లఁ గన్నులై ముంచుకొనెఁ జూడరే
వెగటుగఁ బతిఁ జూచేవేడుకలను
నగవెల్లాఁ గప్పురాలై నలుగడఁ జిందెనదే
పగటుల నీకెదిక్కు భావించగదరే

చ. 2: నిలువెల్లాఁ గళలై నిండుకొనెఁ జూడరే
లలి నాతఁడిచ్చిన తమ్ములమువల్ల
పలుకులెల్లాఁ దేనెలై పై పైఁ గురిసీ నదే
నెలఁత యెంతనేరిచె నెట్టుకొని వినరే

చ. 3: వురమెల్లఁ జన్నులై వుదుటెక్కెఁ జూడరే
పొరి శ్రీ వేంకటేశుఁ బొందినందున
సరులెల్లా గుంపుగట్టె సారె నలమేల్మంగకు
సురతచిన్నలు మించెఁ జొక్కిచొక్కి మెచ్చరే

రేకు: 0841-3 నాగవరాళి సం: 18-244

పల్లవి: ఇందరిలో సిగ్గయ్యా నీమాట నాకు
అంది ఇది యెంతజాటు అనేవుసుమ్మీ

చ. 1: వలచిననీతో వడిగా మాటలాడుదు
తళుకుఁగన్నుల నిన్నుఁ దప్పక చూతు
బలిమి సేసి యట్టె పాదాలఁ బెనఁగుదు
అలరి ఇదెంత రట్టడనేవు సుమ్మీ

చ. 2: నలిరేఁగి వేడుకలో నవ్వు నీతో నవ్వుదు
చలపట్టి నీమోవి చవిగొందును
కలువల వేసి నిన్నుఁ గాఁగిలించుకొందును
అలరి ఇదెంతదంటయని నన్ననుకుమీ

చ. 3: సారె సారె నీ మేను చనుఁగవ నొత్తుదును
కూరిమి రతుల నిన్నుఁ గూడుదును
యీరీతి శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
గారవించి నన్నాసోదకత్తె యిదనుకుమీ

రేకు: 0841-4 నారాయణి సం: 18-245

పల్లవి: కన్నుల నీసంతోసము గంటిమయ్యా
సన్నల నివెల్ల మాకు సారెఁ జూపవయ్యా

చ. 1: సెలవుల నవ్వులు చెక్కిళ్ళు చెమటలు
కలిగెఁగా నేఁడు నీకుఁ గడుమేల్లయ్యా
మొలక కెంపులు మోవి, మోమున నిండుఁగళలు
తొలఁకీ నీ వన్నిన టాను దొడ్డవాఁడవయ్యా

చ. 2: కడగన్నుల నిద్దుర కాయమునఁ బులకలు
తడఁబడీ నీకు నేఁడు తగునయ్యా
అడియాలాలు సందున నక్కుఁన జనులొత్తులు
ఆడరె జాణఁడవు నీ వౌదువయ్యా

చ. 3: శిరసుపై సేసలు కురుల చెదరులును
పరగె నీయందు నేఁడు బాపురే యయ్యా
యిరవై శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
సరుగ నన్నేలితివి సరసుఁడవయ్యా

రేకు: 0841-5 హిజ్జిజి సం: 18-246

పల్లవి: ఎచ్చట చూచినాను యివిగో నీసుద్దులే
అచ్చుగ నీదాసులే భాగ్యవంతు లందరు

చ. 1: అన్నిటాఁ జక్కనివాఁడవని నిన్ను నందరుఁ
నెన్న నీదేవుల సిరు లెక్కుడందురు
సన్నుతి నీసుతుల నెంచఁగ లోకేశు లందురు
పన్ని నీకూఁతురు లోకపావని యందురు

చ. 2: అట్టె నీ చేతిచక్రము అతిప్రతాప యందురు
పట్టినసంకు వేదాలపాఠ మందురు
జట్టిగ నీ పానుపు సర్వాదార మందురు
వొట్టి నీవాహనము దేవో పకారి యందురు

చ. 3: పరగ నీవున్న చోటే పరమపద మందురు
యిరవై శ్రీవేంకటాద్రి యిక్కువందురు
మరిగి యలమేలుమంగమగఁడవు నీవందురు
ధర నన్ను నీదాసాన దాసుడందురు

రేకు: 0842-1 మంగళ కౌశిక సం: 18-247

పల్లవి: తగ వెఱఁగవద్దా తమకించి చెనకేవు
మగువలతలనేల మహిఁ బూరిగట్టేవే

చ. 1: కందువ నాతఁడు నాతోఁ గతలు చెప్పఁగాను
సందుడినీమాటలు చవులౌనటే
యెందును మావలపులు యేకములై యుండగాఁను
మందమిరియాలు చల్ల మరియేఁటికే

చ. 2: ఇంగితాన నిద్దరము నేకతములాడఁగాను
తొంగి చూచి యెవ్వతెకుఁ దొరలనేలే
చెంగటనే మాపొందు చెట్టుకట్టి వుండఁగాను
పొంగి పొంగి వుప్పు వేసి పొత్తుగలయనేలే

చ. 3: చేరి శ్రీ వేంకటేశుఁడు కోరి నాకు విడెమీఁగా
పొరచివారు చెయిచాఁచఁ బొసఁగునటే
మేరతో నన్నేలే నలమేలుమంగనైనదాన
సారె నడుమఁ బసపు నూర నీకేఁటికే

రేకు:	0842-2 బౌళి	సం:	18-248

పల్లవి:	నేరుపరినంటాను నిక్కే విందరిలోన
గారవించి రమణునిఁ గరఁగించవలదా

చ. 1:	మలసి మలసి కడుమాటలాడ నేర్తునంటా
సొలనే వాతని సారె జూటుఁదనాన
వలచి ఇంతేసి బత్తిగలిగినదానవు
యెలమి నాతనియిచ్చ యెఱఁగఁగవలదా

చ. 2:	చేరి చేరి నీవప్పటి చెనకఁగనేర్తునంటా
గోరు దాఁకించవచ్చేవు గుట్టుతోడను
కూరిమితో నింతేసికూటమిగలదానవు
బోరున నాతని నిట్టె బుజ్జగించవలదా

చ. 3:	ననిచి ననిచి నీవు నవ్వఁగనేరుతునంటా
చనుఁగవ దాఁకించేవు సమరతుల
యెనసీ శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
ననువలెఁ గాఁగిటఁ బెనఁగఁగవలదా

రేకు: 0842-3 బౌళి సం: 18-249

పల్లవి: సారె నిన్నలమేల్మంగ జవ్వనవనమునను
చేరి యవధరింతు విచ్చేవయ్య జాజర

చ. 1: వసంతకాలము వచ్చే వనితమోవి ఇగిర్చె
కొసరేయెలుఁగులను కోవిల గూసె
ముసరీఁ జూపులతేంట్లు మోతుగై వలపు పూచె
రసికత నాడుదువు రావయ్య జాజర

చ. 2: పున్నమవెన్నలగానె కనుఁగలువలు విచ్చె
పిన్నలై చన్నుల నేటిపిందెలు వుట్టె
సన్నపుఁ జెమటాలను జాలువారెఁ బన్నీరు
చెన్నమీర నాడుదు విచ్చేయవయ్య జాజర

చ. 3: మరుఁడు విల్లందుకొనె మచ్చికలు గూడఁజేసె
పారి పారి సిగ్గులనేపుప్పొడి రాలె
ఇరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
సరుగ మీమీఁద మీరే చల్లరయ్య జాజర

రేకు: 0842-4 గుండక్రియ సం: 18-250

పల్లవి: కొత్త కొత్త వలపుల కోడె చేఁతలవాఁడు
హత్తి ఇచ్చకములనే అట్టె లోఁగొనెనె

చ. 1: ననిచితే నామగని నవ్వించెను
పెఁగులాడఁగలితే బెల్లించెను
మనసిచ్చి మాటాడితే మతి గరఁగించెను
చెనకఁగ వచ్చితేను చిక్కించుకొనెనె

చ. 2: అగపడితేఁజాలు నాసలెల్లా రేఁచెను
నగ నివె పాయరానినంటు సేసెను
మొగము చూచితేను మోహములు వుట్టించెను
తగులుగా నియ్యివె తలఁపించుకొనెను

చ. 3: సముకముగా నివె చవులెల్లా నించెను
జమలిఁ గూచుండితేనే సాదించెను
అమర శ్రీ వేంకటేశుఁడల మేలుమంగను నేను
సమరతిఁ గూడె నింకా సరసములాడీనే

రేకు: 0842-5 కురంజి సం: 18-251

పల్లవి: ఇద్దరికిఁ జొట్టరిక మీరీతిఁ గలిగె మీకు
చద్దికి వేఁడికి సరసమూలాడరె

చ. 1: కలువ రేకులవంటికన్ను లాతఁడు నీపతి
తొలుతనే నీమోముఁజందురుఁ జూపవే
బెళుకులేనియట్టిబింబాధరుఁ డాతఁడు
చిలుక పలుకుల రంజిలఁజేయవే

చ. 2: మించుల నీలమేఘము మేనిచాయవాఁడతఁడు
కొంచక నీచూపు మెరుఁగులు చల్లవే
పొంచి తామరపువ్వులఁబోలిన పాదాలాతఁడు
వంచి తుమ్మిదల కొప్పు వడి సోఁక మొక్కవే

చ. 3: గందపుమాని కొమ్మల చేతులతఁడు
అందుకొని లతాంగివి అలముకోవే
అందపు శ్రీ వేంకటేశుఁ డలమేల్ మంగవు నీవు
చెందితి రిన్నిటా నిఁక సేసచల్లుకొనరే

రేకు: 0842-6 కన్నడగౌళ సం: 18-252

పల్లవి: ఏమీ నెఱఁగని నన్ను నింత సేసెను
నామగఁడై యిట్లానే నన్ను నేలమనవే

చ. 1: నవ్వులునవ్వి నన్ను నమ్మించెను
పువ్వులు వేసి కొంత బుజ్జగించెను
చివ్వనఁ జెనకి మేను చిమ్మిరేచెను
తవ్వి తవ్వి వలపులు తలఁపించెను

చ. 2: లాసిలాసి మెల్లనే మేలములాడెను
వాసికెక్క నాచే సేవలుగొనెను
ఆసలు పుట్టించి విడెమంది యిచ్చెను
సేసచల్లి నన్ను నిట్టె సిగ్గుల నోలార్చను

చ. 3: వాడాక సేసి నాకు వరుసిచ్చెను
వీడుదోడుగానే మోవివిందు చెప్పెను
కూడె శ్రీ వేంకటగిరి గోవిందరాజు
వేడుకల నన్నుఁ గడు వెలయించెను

రేకు: 0843-1 సౌరాష్ట్రం సం: 18-253

పల్లవి: గుట్టుతోడ మరిగించుకొని కూడుటే మేలు
మట్టుమీరఁ బెనఁగితే మరి రట్టుపెట్టవా

చ. 1: జలజాక్షిచన్నులతో సాములెంత సేసేవు
కొలఁదిమీరినయట్టి కొండలు గావా
నలువంక పిడికిట నడుమేమి గొలచేవు
చెలరేఁగేయటువంటిసింహము గాదా

చ. 2: కొమ్మ చూపులనేల గుఱియై పొలసేవు
పమ్ముకొన్న పువ్వులబాణాలు గావా
ఇమ్ముల నొరశొరసి యేల పలికించేవు
కొమ్మఁ మీఁది మదనుని గుఱ్ఱాలు గావా

చ. 3: యీకె యల మేల్మంగ నెట్టు గాఁగిటఁ గూడితి
దీకొని చుట్టుకొనేటితీగే గాదా
యీకడ శ్రీవేంకటేశ యేల తురుమందితివి
చేకొన్న వలపుల చీఁకటే గాదా

రేకు: 0843-2 కాంబోది సం: 18-254

పల్లవి: రావయ్య ఇఁకనైనా రమణి యల మేల్మంగ
మోవని పాదాలమీఁద మొక్కీ నీకు

చ. 1: వదలుఁబయ్యెదతోడ వాడికచేఁతలతోడ
కదలుఁగన్నులఁ జూచె కలికి నిన్ను
వుదుటుగుబ్బలతోడ నొరసి వేఁడుకొంటాను
పెదవులెత్తి ఇంటికిఁ బిలిచీ నిన్ను

చ. 2: సెలవినవ్వులతోడ చెక్కిటిచేతితోడ
కొలువుసేసె నీకుఁ గోమలి నేఁడు
మొలకసిగ్గులతోడ మొహములు చల్లి చల్లి
వెలయ నిందరిలోన విందుచెప్పీ నీకు

చ. 3: చెంపచెమటలతోడ చిప్పిలుఁగళలతోడ
ఇంపువుట్ట సేవసేసె నిదె నీ వొద్ద
దింపని కాఁగిటితోడ తిరమై శ్రీవేంకటేశ
సంపదల విఱ్ఱవీఁగీ సమరతి నీయందు

రేకు: 0843-3 లలిత సం: 18-255

పల్లవి: మఱియేల చెప్పవే మాతో నీవు
గుఱుతుగా సంతోసించుకొంటిమే నేము

చ. 1: సంతతము రమణునిచనవు గలిగితేను
పంతమాడఁ జెల్లునే పడఁతీ నీకు
చెంతనుండి యాతఁడే నీచెప్పినట్టు సేసితేమ
వంతులకు గర్వింపవచ్చునే నీకు

చ. 2: గారవించి పతి నీకుఁ గైవశమై వుండఁగాను
చేరి యంతనవ్వినాను చెల్లునే నీకు
మేరమీరి నిన్నే పొద్దూ మెడఁగట్టుకుండఁగాను
ఆరితేరి బిగిసినా నందమౌనే నీకు

చ. 3: అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీవేంకటేశుఁ
డలరి నిన్నేలెఁదగు నన్నియు నీకు
చెలులము నిన్నతఁడు చేకొని మన్నించఁగాను
మెలుపునఁ జూచితిమి మేలే నీకు

రేకు:	0843-4 గౌళ	సం:	18-256

పల్లవి:	ఎంత నీవు మెహించినా ఇల్లాల నేను
చెంత నీయానతి నేను సేసేనయ్యా

చ. 1:	పాయక నీవు మన్నించి పలుమారు బోధించినా
సేయరానివిన్నపాలు సేయనచ్చునా
వేయిమారులు నన్ను వేఁడుకొంటివంటాను
నాయముగానిరతులు నడపఁగవచ్చునా

చ. 2:	వొయ్యన నీవెటువలె నూరడించి పెనఁగినా
నియ్యరానియీవులు ఇయ్యవచ్చునా
నెయ్యాన బెద్దరికము నీవెంత సేసినాను
చయ్యనా మందెమేళాలు జరపఁగవచ్చునా

చ. 3:	నగుతాఁ జనవులిచ్చి నన్నింత నీవు గూడినా
తగునీచేఁతలను పొందఁగవచ్చునా
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
తగులై ఇఁక నీవేడ తప్పించుకొనవచ్చునా

రేకు: 0843-5 రామక్రియ సం: 18-257

పల్లవి: పిన్నది యిది కన్నెపిన్నది
మన్నించి యెట్లయినా మరిగించుకోవయ్యా

చ. 1: జలజాక్షి నీపై సేసచల్లినవెనకనె
మొలచినచన్నుల మొలకలవి
సొలసి కన్నుల నిన్నుఁజూచినవెనకనె
కళలు నెమ్మోమునఁ గలిగినవి

చ. 2: వరుసకు నీవొద్దికి వచ్చినవెనకనె
నిరతపు సిగ్గులెల్లా నేరిచినవి
అరుదుగ నీతో మాటలాడినవెనకనె
గరిమ లేఁతనవ్వులు గడించినవి

చ. 3: యీయల మేలుమంగ నిన్నెనసినవెనకనె
పాయమువచ్చి యీరీతిఁ బరగినది
చాయల శ్రీవేంకటేశ నీయింతై నవెనకనె
కాయపు విలాసాలగని యైనది

రేకు: 0843-6 దేవగాంధారి సం: 18-258

పల్లవి: నీవైనాఁజేరఁగవచ్చి నేరుపవయ్య చేఁతలు
యీవేళ నా కనరాదు యే నలయేల్ మంగను

చ. 1: మొక్కలపుటాసలతో మొగమెత్తి నిన్నుఁజూఁచి
చెక్కుచేతితో నింతి సిగ్గువడీని
మక్కువలు చల్లుకొంటా మాఁటలాడఁ బూఁచిపూఁచి
తొక్కుమెట్టుచెమటలఁదొప్పఁదోఁగీని

చ. 2: జంటనిమ్మపండ్లు నీకు సతి గానుకియ్యవచ్చి
నంటుఁజన్నులు ఘూచుక నవ్వుకొనీని
ఇంటికి రమ్మని నిన్ను నిట్టె పిలువఁగవచ్చి
దంటతనముచాలక తలవంచీని

చ. 3: గట్టిగా నీకాఁగిటఁగలయఁగఁ దమకించి
గుట్టుతోడ వలపుల గుబ్బతిలీని
యిట్టె శ్రీవేంకటేశ యిద్దరి మమ్ముఁగూడితివి
నిట్టూరుపులతో నాపె నివ్వెరగందీని

రేకు: 0844-1 మాళవ శ్రీ సం: 18-259

పల్లవి: ఒడఁబాటు సేసుకొమ్మీ వొప్పుగా వెనకనైనా
యెడయక వారెంతమోహించినివారో

చ. 1: ఇత్తల నేను నిన్ను నేకతానకుఁ దీయఁగ
చిత్తము లెట్టుండునో నీచెలులకును
బత్తిసేసి యేపొద్న్రా(ద్దా) నీపాదాలు నే నొత్తఁగాను
హత్తి వారివారియాసలవి యేమైవుండునో

చ. 2: నెమ్మది నీమన్ననలు నేనే చేకొనఁగాను
కొమ్మలిందరూ నేమనుకొంటా నుందురో
కమ్మి నీకాఁగిలి మీఁదుకట్టుక నేనుండఁగాను
ఇమ్ములఁ దమకము లెట్టోరుచుకొందురో

చ. 3: శ్రీవేంకటేశుఁడ నిన్నుఁజేరి నేనే కూడఁగాను
కావిరి వారెంతవేళ గాచుకున్నారో
దేవి నలమేల్మంగను నావిన్నపమే విని
యివలఁ గూడితివి వారెంత మెచ్చుకొన్నారో

రేకు: 0844-2 పాడి సం: 18-260

పల్లవి: అటువలెఁ జూతమా అదీ నొక్కవేడుక
కుటిల కుంతలు లెంతకూరిమి గొసరేరో

చ. 1: చిక్కించుక నీమేనఁ జెనకులు నించితేను
ఇక్కువనున్ననీసతు లేమందురో
అక్కున నాచన్నులు నీకచ్చులుగా నొత్తితేను
తెక్కులుగా నిన్ను నెంతదిసంతు లాడుదురో

చ. 2: వన్నె నారూపులు వ్రాసి వలువ నీకుఁ గప్పితే-
నెన్నిక నీచెలులెల్లా నేమందురో
పన్నినీమోవి యెంగిలిపరచి పిప్పిసేసితే
కన్నులు జూచి వారెంత కాఁతాళింతురో

చ. 3: చిమ్మిరేఁగఁ గూడి నీమై చెమరించఁ జేసితేను
యెమ్మెలనీకాంతలు యేమందురో
నెమ్మి శ్రీవేంకటేశుఁడ నే నలమేల్మంగను నీ
తమ్ములు మిప్పించుకొంటిఁ దామేమిసేతురో

రేకు: 0844-3 గౌళ సం: 18-261

పల్లవి: ఇంతటగాని నీపగ టిందరూ నెరఁగరా
వింతవారు చూచి యిది యెంతరాఁగనరా

చ. 1: చిక్కనితేనెలు గార చెలువుఁడు నోరూర
మక్కళించి యెటువంటి మాటలాడేవే
జక్కవ చన్నులు నీవు సారెఁ గదలించుకొంటా
నుక్కుమీర నెంతేసిపూఁడిగాలు సేసేవే

చ. 2: కొప్పులో పువ్వులు రాల కుచ్చులపయ్యద వేల
ఇప్పుడే యీతనికొలు వేమిసేసేవే
చప్పుడుగా మీఁదమీఁదఁ జవులుగా సెలవుల-
నప్పటి వేసటలేక యదేల నవ్వేవే

చ. 3: చెమట చెక్కుల మించ శ్రీవేంకటేశుఁ డాలించ
భ్రమయించి యెందాఁకాఁ బాటవాడేవే
అమరఁ గూడితి నేనే అలమేల్మంగ నాపేరు
తమి నాతని నీవెంత తతిఁ గాఁగిలించేవే

రేకు: 0844-4 ధన్నాశి సం: 18-262

పల్లవి: రాజసపువాని నింతరవ్వసేతురా
వోజతో గుట్టుసేసుక వుండవలెఁగాక

చ. 1: కెలసి నీవిభుఁడు నీకే వలచునంటాను
చెలులతోనెల్లాను చెప్పుకొనేవే
తొలుత నతఁడు నీపొత్తున నారగించెనంటా
చెలరేఁగి సంతోసానఁ జిమ్మిరేఁగేవే

చ. 2: వొగ్గి యాతఁడప్పటి నీవొడివట్టి తీసెనంటా
సిగ్గువిడిచాతనిపైఁ జేయివేతురా
యెగ్గుపట్ట కెప్పుడూ నీయిచ్చలోనే వచ్చునంటా
వెగ్గళించి సరసము వేమారు నాడుదురా

చ. 3: యీతఁడు శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
నాతో నవ్వెనంటాను నీలుగనేలే
ఆతుమగా నన్నునేలె ఆ నీకు నిచ్చెనంటా
కాతరించి యిటువలెఁగాకు సేయనేలే

రేకు: 0844-5 పాడి సం: 18-263

పల్లవి: అద్దమ రేతిరి కాడ నౌలే తాను
అద్దో నీకింత చుట్టు మాయఁబో తాను

చ. 1: వీడెము చేతఁ బట్టుక వేళగాచుకొని వుండి
వాడికమాఁట లాడవచ్చేఁబో యీకె
వోడక వేఁడిచెమట నూనిన చేఁతఁ గానిక
తీఁడుకొంటా నిమ్మపండ్లు తెచ్చేఁబో నీకు

చ. 2: దొరతనము సేసుక తోడువెట్టుక యీపొద్దు
వరుసకు నీతో నవ్వవచ్చేఁబో యీకె
గరిమఁ దననిట్టూర్పు గాలిచేఁ గడివోయిన
సురవొన్నలు సూడిదె చూపించెఁబో నీకు

చ. 3: కలుపు కోలుఁదనాన కడుఁదమి రేఁచుకోంటా
వలపుల నిన్నుఁ గూడవచ్చేఁబో యీకె
యెలమి శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
కలసితిఁ దానొకత గలిగెఁబో నీకు

రేకు: 0844-6 సామవరాళి సం: 18-264

పల్లవి: ఎన్నటి చుట్టమో యాకె నెఱఁగ నేను
అన్నిటా నేనే నీకు నాలనంటా నుందును

చ. 1: నెలఁత యెవ్వతోకాని నిన్నుఁ బొడఁగన వచ్చె
చెలప చెమటలతో సిగ్గులతోడ
చెలులఁ జెప్పు మనుచుఁ జేరి వాకిట నున్నది
తొలుత నీవాపె మోహము తోఁగి చూడవయ్యా

చ. 2: వావి నీకెమౌనోకాని, వలపుల మాఁటలాడి
వేవేగఁ దురుముజార విరులురాల
దేవులవలెఁ దలుపు దెరచి లోనికేతెంచె
భావించి యాపె గురుతు పరికించవయ్యా

చ. 3: యెంతవనికోగాని యేకతము గద్దనీని
సంతోసాలు గడునిండఁ జవులు రేఁగ
యింతలో శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చెంత నన్నేలితి వాకెఁ జిత్తగించవయ్యా

రేకు: 0845-1 ఆహిరి సం: 18-265

పల్లవి: చేరి కరుణించుమంటాఁ జేతులెత్తి మొక్కేవు
యీరీతి నాతఁడు నిన్ను నేమిసేసేనే

చ. 1: సన్నపు టెలుఁగునను సళుపుమాట లాడేవు
కన్నులు దేలించుకొంటాఁ గమ్మిచూచేవు
వున్నతిఁజెక్కుచెమట లూరిచి కడఁజల్లేవు
యెన్నఁగ నాతఁడు నిన్ను నేమి సేసెనే

చ. 2: దప్పి దేరఁ బెదవులపై దైన్యములు చూపేవు
కొప్పు వీడఁజేసుకొని గుబ్బతిలేవు
చిప్పలి విడెమిమ్మంటే చెలిచేత నంపేవు
యిప్పుడే యీతఁడు నీకు నేమి సేసెనే

చ. 3: వొడివట్టి తీసితేను వుసురంటా నలసేవు
వెడమాయలాడివి శ్రీ వేంకటేశుతో
అడరి నన్నితఁ డేలె నలమేల్ మంగను నేను
యెడనెడ నిన్నుఁగూడీ నేమి సేసెనే

రేకు: 0845-2 ఆహిరీ సం: 18-266

పల్లవి: కొత్తపెండ్లికూఁతురవై గుట్టుసేసుకోవుగాక
మత్తిలి, నీమగఁడట మరియేమి సేసునే

చ. 1: పంతమాడి యాతఁడు నీపాదము దొక్కినంటాను
చెంతనున్న చెలులతోఁ జెప్పుదురటె
మంతనాన నీచన్నులు మళ్లిమళ్లి చూచీనంటాఁ
నింతలో సాకిరివెట్టే విదియేమే నీవు

చ. 2: నేరుపుతోఁ దానప్పటి నీతో నవ్వీనంటా
పేరుకొని నీదాదిఁ బిలుతురటే
చేరిచేరి చేయిముట్టి చెనకవచ్చీనంటా
బీరముతో నానలు పెట్టేవేమే నీవు

చ. 3: అరుదై శ్రీ వేంకటేశుఁ డట్టే నిన్నుఁ గూడీనంటా
సారిది చిలుకలకుఁ జూపుదురటే
పురముపై నేపొద్దునుండే యలమేల్మంగవు
బెరసి మాకు విడేలు పెట్టేవేమే నీవు

రేకు: 0845-3 నాదరామక్రియ సం: 18-267

పల్లవి: మునిముచ్చువలపుల ముసగస లేమిటికి
పెనఁగి యచ్చుమై యిట్టె బెరయఁగరాదా

చ. 1: సందడి గొలువు సేసి సన్నలు మోవినే చూపి
చిందుకొనేవు చెమట చెక్కులవెంట
పొందు లింత గలిగితే బోరున సేసలు చల్లి
పెండలకాడే నీవూఁ బెండ్లాడరాదా

చ. 2: చిఱునవ్వు నవ్వుతాను సిగ్గులువడుకొంటాను
కఱఁగేవు లోలోనే కాంతునిఁ జూచి
మొఱగుఁలింత నీకేల మోహించినదానవైతే
మెఱసి కాలుదొక్కి మేలమాడరాదా

చ. 3: పేరటాలపై వచ్చి బిగ్గెఁ బసవు నలఁచి
కోరి చన్నులనొరసుకొనే వాతని
యీరీతి శ్రీవేంకటేశుఁడే నల మేలుమంగను
చేరి నన్ను గూడె నీవూ సేవ సేయరాదా

రేకు: 0845-4 సౌరాష్ణం సం: 18-268

పల్లవి: ఏ పొద్దూ గొలువు సేసీ నింతులతోను
యేపున మేడలోనికి యిట్టె రమ్మనవే

చ. 1: వింతవారిమాటలైతే వినవేడుకలై యుండు
సంతవారి జూడనై తే జరగు మతి
చింతలపులుసులకు చెలరేగి నోరూరు
యెంతలేదు రమణుని నీడకు రమ్మనవే

చ. 2: నవ్వేవారి వద్దనుంటే ననుపుల బొద్దు లెక్కు
దవ్వుల సన్నలకైతేఁ దమివుట్టును
పువ్వులవాసనగాలి పొలసితే నాసవుట్టు
వువ్విళ్లూర నెంతలేదు వొద్దికిరమ్మనవే

చ. 3: మేనవారివావులకు మేలములు పెచ్చురేఁగు
కానికనిమ్మపండ్లకుఁ గడఁగుఁజేయి
యే నలమేలుమంగను యిట్టె తా శ్రీవేంకటేశుఁ-
డానుక నన్నేలె నిట్టే అప్పటి రమ్మనవే

రేకు: 0845-5 లలిత సం: 18-269

పల్లవి: తానేల సిగ్గువడీని దండకిట్టె వచ్చుఁగాక
యేనెపమూవేయఁ దనకేమిటికే కొంకను

చ. 1: చేరి చేఁత సేయక చేతులెత్తి మొక్కితి
మేరతోడ శిరసె త్తి మెచ్చితి దన్ను
నేరము లెంచనేరక నెట్టుకొని పొగడితి
యీారసించేదాన గాను యిఁకనేమి సేతునే

చ. 2: కమ్మి కోపగించక కన్నులనే చూచితి
నమ్మిక లడుగక నవ్వు నవ్వితి
పిమ్మట నలుగక పెనఁగి పాదాలొత్తితి
యెమ్మెలదానఁగాను యేమి సేతునే

చ. 3: తనకెదురాడక తమ్ముల మడిగితిని
మనసు నొప్పించక మర్మమంటితి
యెనసె శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
యినుమడించె వలవు లేమి సేతునే

రేకు: 0845-6 తెలుగు గాంబోది సం: 18-270

పల్లవి: ఇంతిసేసినభాగ్యమో యిట్టిది నీకరుణో
యెంతకెంత చెలులము యేమని పొగడెదము

చ. 1: తలపోఁతలు రేఁచేవు తగ విడే లిప్పించేవు
నెలతకు నీకొలువు నిధానము
చలివాయ నవ్వేవు చదురఁ(రం)గా లాడేవు
చెలఁగి నీమన్ననలు చిగురులో చేఁగలో

చ. 2: మొగ మెప్పుడఁ జూచేవు మోహములు చల్లేవు
మగువకు నీ పొందు లామనివంటలు
తగుల మాటలాడేవు తనివి బొందించేవు
వెగటులేనిమేలాలు వెన్నెలపులుఁగాలు

చ. 3: చన్ను లేపొద్దూ ముట్టేవు సరసములాడేవు
కన్నెకు నీరతి తరగనిధాన్యము
యెన్నఁగ శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
యిన్నిటా బోగములు యింటిలోనిసిరులు

రేకు: 0846-1 కన్నడబంగాళం సం: 18-271

పల్లవి: వేవేగఁ బ్రియాలు చెప్పి వేఁడుకొనీఁ గాక నన్ను
చేవమీరి విన్నపాలు సేసేనా నేను

చ. 1: చెక్కులే నొక్కితిఁ గాని చేతిగోర నూఁదనైతి
మొక్కితిఁగాని కాఁకల మొరయనైతి
నిక్కి చూచితిఁ గాని నెరుసు వెదకనైతి
చికిం(క్కిం)చుక విన్నపాలు సేసేనా నేను

చ. 2: విరులవేసితిఁ గాని వెట్టగాఁ జెనకనైతి
సరుగ నవ్వితిగాని జంకించనైతి
తిరి గిచూచితిఁగాని దీకొని మాటాడనైతి
సిరిమించి విన్నపాలు సేసేనా నేను

చ. 3: అలమితిఁగాని నే నదలించి దూరనైతి
పిలిచితిఁ గానీ మరి బిగియనైతి
యెలమి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
చెలఁరేగి విన్నపాలు సేసేనా నేను

రేకు: 0846-2 రామక్రియ సం: 18-272

పల్లవి: కాంత నీపై ప్రేమగాని గర్వముగాదు
మంతనాన నెచ్చరించి మన్నించు మీకెను

చ. 1: సందడిలోఁ గాఁగాను సాగిలి మొక్కమరచె
పందెమాడుతాఁ గానుకపట్ట మరచె
విందువెట్టి వేడుకను విడెమియ్యఁ గ మరచె
నిందుముఖితమకము లింత సేసె నిపుడు

చ. 2: సేసపట్టి నిబ్బరాన సిగ్గులువడ మఱచె
ఆసల నవ్వుతా వినయము మఱచె
పాసికూడే సంతోసాన పాదములొత్త మఱచె
యీసతివుల్లాసము లింతసేసె నిపుడు

చ. 3: నీ మొగము చూచి చూచి నేరుపులెల్లా మఱచె
చేముంచి కాగిటి నించి చింత మఱచె
వేమరు నలమేల్మంగ విభుఁడ శ్రీవేంకటేశ
యీమగువ వేగిరము లింతసేసె నిపుడు

రేకు: 0846-3 గౌళ సం: 18-273

పల్లవి: పట్టరానివయసుతో పచ్చియై వున్నాఁ డవు
నెట్టుకొన్న గుట్టు నీకు నేర్పదాయనా

చ. 1: కందువ నీతో నిందాకాఁ గాఁపురము సేసినది
దిందుపడ నీగుణము దిద్దదాయనా
సందడి నందరిలోన చనవుగలిగినది
పొందుగా నాచారాలు బోదించదాయనా

చ. 2: కఱఁగించి నిన్నునింత కడువలపంచినది
మఱి యితరచింతలు మాన్పదాయనా
మెఱయ నీతో నేపొద్దు మేలములే యాడేది
జఱసి నీతులు నిన్నుఁ జదివించదాయనా

చ. 3: యెలమి నీకిన్నిటాను ఇచ్చకురాలై నది
యిల నన్ను నీవేలిన దెంచదాయనా
అలమేలగమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసిన దిట్టై జలకము లార్చదాయనా

రేకు: 0846-4 దేసాళం సం: 18-274

పల్లవి: అట్టె తెరవేసుకోరే యాతఁడు నీవు
యెట్టయెదుట సతులు యెవ్వరున్నానేమి

చ. 1: నిగ్గులచన్నులు గాఁగ నిన్ను నాతఁడు నొగడె
సిగ్గులెంత నెరుపేవే చెలియా
వొగ్గి జవ్వనివిగాఁ గా నుప్పతించి నీతో నవ్వె
యెగ్గులెంచ నేమిటికి ఇచ్చకము నేయవే

చ. 2: తురుము గొప్పదిగాఁ గా దోసిటి సేసలువె ట్టె
విరుల నేల వేసేవే వెలఁదీ
సరులు పెనగొనఁగ చక్కదిద్దె నాతఁడు
సరిఁ బయ్యద ముయ్యక చక్కనుండఁ గదవే

చ. 3: మేలిమి నీమోవిగాఁ గా మెచ్చి మెచ్చి చేరవచ్చె
మేలము లాడవే యలమేలుమంగ
యీలీల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
పోలును మీకిద్దరికి భోగించఁగదవే

రేకు: 0846-5 నాట సం: 18-275

పల్లవి: ఇట్టివట్టి వేసాలు యెంతసేసేవే
పట్టితే బలువుకొద్ది పంతమౌ తెఱఁగవా

చ. 1: నీ మగని వద్ద నేను నిలుచుండితినంటాను
యేమే సాదించవచ్చే వెంతపగటే
ఆముకొని యేపొద్దూ నీతనినీపై మోహము
మే మెఱఁగకుండా నీకే మీఁదుకట్టి వున్నదా

చ. 2: మనసిచ్చి యాతనితో మాటలాడితినంటా
కనువిచ్చి చూచే వెంతకాఁ తాళమే
యెనయ నాతనికాఁగి లిందరులుఁ జూడఁగాను
తనివార నీకుఁ గానే దాఁచఁ బెట్టి వున్నదా

చ. 3: యెలమి నేను శ్రీవేంకటేశుఁ గూడితినంటా
అలరి సోదించే వెంత ఆసకత్తెవే
అలమేలుమంగపతి యతనిచుట్టరికము
పలుమారు నీకెప్పుడుఁ బాలువెట్టివున్నదా

రేకు: 0846-6 వరాళి సం: 18-276

పల్లవి: ఎవ్వరిఁ బోలుదు నేను యిందరిలోన
నివ్వటిల్ల నాభాగ్యము నీచిత్తముగాక

చ. 1: కందువఁ బెక్కుసతులు గలుగఁగా నీమీఁద
సందడిఁ బడె వలపు సారెసారెకు
అందరు నీతో మాఁటలాడఁ గా నాడఁ గాను
అందందె గుత్తులుగట్టె నాడీ ముచ్చటలు

చ. 2: చెలరేఁగి వారు వారిచేతులు చాఁచఁ గాను
కలగూరవలె నాయ కాఁగిటిరతి
సొలసి యప్పటిఁ దాము చూడఁగఁ జూడఁ గాను
పిలువనిపేరటమ్మై పిరిగొనె వేడుక

చ. 3: సరి నిన్నిందరుఁ గూడి జాణతనాలాడఁ గాను
గరివడె నవ్వులెల్లాఁ గడుఁ గడును
పరగ నలమేల్ మంగపతివి శ్రీవేంకటేశ
నిరతి నన్నేలఁ గాను నిండెను సొబనము

రేకు: 0847-1 భూపాళం సం: 18-277

పల్లవి: ఏమని విన్నవించేనే యిటఁకఁదనతో నేను
నేమాన వచ్చెఁ గా నన్నుఁ జిత్తగింపు మనవే

చ. 1: ముక్కువఁ దనపై నామతి తలపోఁతలకు
చెక్కుపై నిడుకొన్ననాచెయ్యే సాక్షి
అక్కరతో విరహపుటసురుసురులకును
ముక్కునఁ బెట్టిన నాముత్తెమే సాక్షి

చ. 2: తన్నుఁ బాసి నిద్రలేక తగ వేగించినందుకు
కన్నుల నుండిన యట్టి కాటుకే సాక్షి
వున్నతపుఁ గోరికల నుమ్మగిలినందుకు
పన్నీటి చెమటల పయ్యదే సాక్షి

చ. 3: నిబ్బరపుఁ బరపుపై నేఁ బోరలాడినందుకు
గుబ్బల గందపు బేంట్ల గురుఁతులే సాక్షి
పబ్బి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
ఆబ్బురాన నన్నుఁ గూడేయానందమే సాక్షి

రేకు: 0847-2 దేశాక్షి సం: 18-278

పల్లవి: పరుసవేది వంటిది భామలకు నీకరుణ
మరిగిన నాచిత్తమే మరవనీదు గాక

చ. 1: చేతులెత్తి నాపై నీవు సేసవట్టితేఁ జాలదా
రీతితో నాయస కొసరించీఁ గాక
నాతో నీవొకమాటు నవ్వితేనే చాలదా
కాతరపునాగుణము కడిమించీఁగాక

చ. 2: మనసిచ్చి నీవించుక మాటాడితేఁ జాలదా
యెననేవేడుక సొలయించీఁ గాక
చెనకి నీవు నన్నుఁ జూచితేనే చాలదా
తనియని నావలపు తగిలించీఁ గాక

చ. 3: వొబ్బిడిగా నాయింట నీవుండితేనే చాలదా
గుబ్బలగర్వము నినుఁ గూడించీఁ గాక
అబ్బిన శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
వుబ్బించే విది చాలదా వొరసేఁ గాక

రేకు: 0847-3 నట్టనారాయణి సం: 18-279

పల్లవి: చెక్కిటిచే యికనేల చింతలేల
అక్కరతో నాపె నీయలపారిచీఁగాక

చ. 1: జవ్వనపు సతి తోడి సరసము
చివ్వన నీ మేనెల్లా జెమరింపించె
పువ్వుల వంతాలు పొలయాటలూ
నవ్వినవ్వి నీమనసు నాము లెక్కింపించె

చ. 2: చక్కెరబొమ్మ వంటి యీసతి పొందులు
చిక్కించి నీకు వలపు చిమ్మి రేఁగించె
నిక్కినిక్కి యాపెఁ జూచె నీవేడుకలు
చెక్కుల చెనకులయి సిగ్గువిడిపించె

చ. 3: అలమేలుమంగతో నెయ్యపురతులు
నిలువెల్ల సింగారమై నీకునమరె
నెలవై శ్రీవేంకటేశ నీతమకము
అలరినచుట్టరికమై తగిలించె

రేకు: 0847-4 సిందురామక్రియ సం: 18-280

పల్లవి: ఏల తప్పించుకొనేవు ఇట్టె నాకాఁగిటి నుండి
యేలితివి నే నీకిటు మొక్కరాదా

చ. 1: పంతమాడరాదుగాక బ త్తితోడ నే నీకు
చెంతనుండి వూడిగాలు సేయఁగరాదా
రంతుతోడఁ గడుదూరరాదుగాక వేడుకతో
సంతతము నీమేను చన్నుల నొత్తరాదా

చ. 2: జంకించవలదుగాక సరుసఁ బానుపుమీఁద
కొంకక నీపాదములు గుద్దఁగరాదా
మంకు చూపవద్దుగాక మంతనాన సారెసారె
కింకలేక నీమోవియెంగిలి యానరాదా

చ. 3: అలుగఁదగదుగాక ఆసల నీతో గూడి
సొలసి నిన్ను రతులఁ జొక్కించరాదా
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
బెళకకేపొద్దూఁ బ్రేమఁ బెనఁగఁగరాదా

రేకు: 0847-5 సామంతం సం: 18-281

పల్లవి: అప్పుడు వేంకటరాయ డలమేలుమంగ గూడి
కుప్పలుగా భోగించీఁ గోడతిరునాళ్లు

చ. 1: చీనిచీనాంబరముల సింగారపు మేడనుండి
వీనుల సన్నగాళెలు వినుకొంటాను
పూని విహరించి వచ్చి పొందుగా నుయ్యాలలూఁగి
కోనేటిదరి మెరసీ గోడతిరుణాళ్లు

చ. 2: ఆముకొన్నపన్నీట నద్దినదుప్పటితోడ
దోమటి పూవుదండలు దూలాడఁగా
కోమలపు టెలుఁగులకొమ్మలు లావులువాడ
గోమున నవధరించీఁ గోడతిరుణాళ్లు

చ. 3: అడుగడుగుకు విడేలందుకొంటా సంకీర్తన
లెడయక భాగవతు లెచ్చిపాడఁగా
గొడుగులు బడగలు కోరి చామరము లిడ
గుడిగొన వినోదించీఁ గోడతిరుణాళ్లు

చ. 4: నానావాద్యాలతో సట్టువలు గడించఁగా
పానిపట్టి మంచిమంచి పాత్ర లాడఁ గా
ఆనుక కోలాటములు అంత నింతఁ జూచుకొంటా
కోనేటిరాయఁడు మెచ్చీఁ గోడతిరుణాళ్లు

చ. 5: వరుసతో విణ్ణాపఁజివారు తాళము లొత్తుచు
పొరిఁదొరి ద్రావిడానఁ బొగడఁగాను
విరులు యేకాంగులు వినువీధిఁ జల్లఁగాను
గురుతరముగ మించీఁ గోడతిరుణాళ్లు

చ. 6: పప్పులు నిడ్డెనలును పానకాలు ఫలములు
ఆప్పటప్పటికిఁ బైపై నారగింపుచు
చెప్పరాని మహిమల శ్రీ వేంకటేశ్వరుఁడు
కుప్పళించీ వాసనలఁ గోడతిరుణాళ్లు

రేకు: 0848-1 పడవంజరం సం: 18-282

పల్లవి: నీతలనే వేగెనా నెలఁ తలసాజ మిది
చేతులెత్తి మొక్కి యేమే సెలవుల నవ్వేవు

చ. 1: చెమరించె మేనంటా సిగ్గుల నేల లోఁగేవే
తమిరేఁగె మతినంటా తల యేలవంచేవే
తిమిరీ వలపులంటా తెరయేల చొచ్చేవే
రమణునిఁ జూచితేఁ గరఁ గరా మానినులు

చ. 2: కడునుబ్బేఁ జన్నులంటా కప్పనేలే పయ్యదను
అడరీ నిట్టూర్పులంటా నవేల నీవణఁ చేవే
పొడమీఁ బులకలంటా పొందులేల దాచేవే
బడినే మగఁడంటేను భ్రమయరా చెలులు

చ. 3: భావము దెలిసీనంటా పరాకులేల సేసేవే
దేవు లనేరంటా నెంత తేరి సింగారించేవే
నీ వలమేల్మంగవు నిన్నితఁడే రతిఁగూడె
శ్రీ వేంకటేశ్వరుఁ బొంది చెలఁగరా సతులు

రేకు: 0848-2 వరాళి సం: 18-283

పల్లవి: తలవంచుకొననేల దండవే వున్నాఁ డాతఁ డు
చెలెఁగి నోరార నీవే సేయవే విన్నపాలు

చ. 1: తలపోఁ త లెక్కుడైతే తాలిమి గలుగునా
చలము సాదించఁ బోతే సరసమౌనా
సొలపులే తరచైతే సొగయునా నేస్తాలు
పిలిచి మాటాడఁగదే ప్రియునితో నీవు

చ. 2: వట్టిగుట్టున నుంటేను వాడిక లొనగూడునా
దిట్టతనమే పెంచితేఁ బుట్టునా దయ
నెట్టుకొన్న సిగ్గులైతే నిలుచునా మచ్చికలు
చుట్టరికము లెల్లాను చూపవే మగనికి

చ. 3: పంతములె నెరపితే భావములు గరఁగునా
వంతువాసు లెంచితేనే వలపంటునా
వింతగా నలమేల్మంగ విభుఁడు శ్రీవేంకటేశుఁ -
డింతలో నిన్నేలె మెచ్చి ఇచ్చకములాడవే

రేకు: 0848-3 సామంతం సం: 18-284

పల్లవి: ఎట్టు గల్గెనయ్య యీ యెమ్మెలాఁ డి నీకు నేఁ డు
చుట్టపుపవరుసలనే సూడువట్టీ నిన్నును

చ. 1: సన్నలనే నినుఁ గొంత సాదించీని
కిన్నెరమీఁటులనే గిలిగించీని
చన్నుల మొనలనే జాడచూపీని
యెన్నేసి చేఁతలు సేసీ నీపె నీఎదుటను

చ. 2: నవ్వులనే తలఁపులు నారువోసీని
రవ్వలమాటలనే కరఁగఁ జేసిని
జవ్వనపుమే నంటించి చవిరేఁచీని
యెవ్వరు నేరిపిరో యీయింతికి నేరుపులు

చ. 3: పూని పూని చూపులనే పొందుసేసీని
నానఁ బెట్టి నయాలనే నమ్మించీని
యే నలమేల్మంగను నన్నేలితి శ్రీ వేంకటేశ
కానుకిచ్చి తా నెన్నఁ డు కలసీనో నిన్నును

రేకు: 0848-4 సాళంగం సం: 18-285

పల్లవి: ఏలినపతివి నీవు ఇల్లాల నేను
తాలిమితో నుందుఁ గాక తమకించేనా

చ. 1: మంతనాన బుజ్జగించి మంచిమాట లాడేవు
వింతదాననా నేను విచారించితే
యెంతవడి రాకుండినా నెక్కడెక్కడ నుండినా
పంతము తోడుత నిన్ను బాస లడిగేనా

చ. 2: వీడెము చేతికిచ్చి వేఁడుకొనేవు
ఆడుకొనేదాననా నిన్నందరిలోన
యేడోసతుల నంటినా యెన్ని చేఁతలు సేసినా
జాడ దెలియక నిన్ను సాదించేనా

చ. 3: కలసి రతుల నిన్ను గారవించేవు
చలమరిదాననా నీ సముకమున
యెలమి శ్రీ వేంకటేశ యె నలమేలు మంగను
కలసితి మిఁక నిన్నుఁ గమ్మటి నవ్వేనా

రేకు: 0848-5 బౌళి సం: 18-286

పల్లవి: చేసినట్టల్లాఁ జేయవే చెల్లునే నీకు
యేసుద్దులునేల కత లిఁకనేమి చెప్పేమే

చ. 1: వచ్చెఁగా రమణుఁడు నీవద్దికి నేఁడు
హెచ్చిన నీతలఁ పోత లీడేరెఁగా
యిచ్చెఁగా నీకు జనవు లింతటిలోనే నీ-
యిచ్చకములు ఫలియించె నిఁక నేమి చెప్పేమే

చ. 2: వున్నాఁడుఁగా యితఁడు నీవొద్దఁబాయక
తన్నుఁదానే నీ కోరిక తలకూడెఁగా
విన్నపాలెల్ల వినెఁగా వేడుక తోడ
యెన్నికలు సరివచ్చె నిఁకనేమి చెప్పేమే

చ. 3: కలసెఁగా నిన్ను శ్రీవేంకటవిభుఁడు
అలమేలుమంగవు నిన్నాదరించెఁగా
అలరి మమ్మేలెఁగా నీయప్పణచేత
యిల నీవే జాణవైతి విఁకనేమి చెప్పేమే

రేకు: 0848-6 తెలుఁగుఁగాంబోది సం: 18-287

పల్లవి: ఎంతని పొగడేము నే మింతిభావములు నీతో
చెంతఁ దెరలో నున్నది చిత్తగించు మీకెను

చ. 1: విన్నవించనేమిటికి వెలఁదిజవ్వనములు
చన్నులే చెప్పీఁగాక సారె సారెకు
పన్ని చక్కఁ దనములు పచారించనేమిటికి
కన్నులతీరులోనే కానవచ్చీ నీకును

చ. 2: వ్రాసిచూపనేమిటికి వనితవొడ్డుఁ బొడవు
సేసనెట్టఁ గానే నీవు చేరి మేచ్చేవు
ఆసపుట్టించనేఁటికి ఆపెగుణా లిట్టివని
చేసేపూడిగాలకు సంతోసించేవు నీవు

చ. 3: తెలపఁ గనేమిటికి తెలివమోహము నీకు
తలిరుఁ బోడిఁ జూచితే దయవుట్టీని
అల మేలుమంగపతివయిన శ్రీవేంకటేశ్వర
కలసితి వెంచనేల కాఁగిట నీకున్నది

రేకు: 0849-1 ఆహిరి సం: 18-288

పల్లవి: అప్పుడు చూతముగాక ఆఁటదాని బిగువెల్లా-
నిప్పుడేమి చెప్పేవే ఇందరిలోఁ గతలు

చ. 1: కూరిమితో రమణునిఁ గొసరి యాడేనంటే
సారె సారె నెన్నిలేవే జాణతనాలు
కోరికోరి నీవాతని గొబ్బునవే వలపించి
నీరువలెఁ గరఁగించ నేరవలెఁ గాక

చ. 2: నగినగి మగవాని నాఁటఁ జెనకేనంటే
తగఁ జేయ నెన్నిలేవే తరితీపులు
మొగము చూపి విభుని మునుకొని తమి రేఁచి
బిగిసి యింటికిని రప్పించవలెఁ గాక

చ. 3: శ్రీ వేంకటేశుఁ గూడి చెలఁగి మెప్పించేనంటే
వేవేగ నెన్నిలేవే వింతరతులు
యీవేళ నన్నేలినాఁడు యే నలమేలుమంగను
చేవల నీవూ నతనిఁ జెందవలెఁ గాక

రేకు: 0849-2 సామంతం సం: 18-289

పల్లవి: చిత్తమురానే మెలఁ గి సేవలు సేయుటగాక
బచ్చిగల యీకె నిట్టె పాలించవయ్యా

చ. 1: మగవాని మరిగిన మానవతులకు మరి
పగచాటఁ జోటేది పంతమేడది
నగుతానే సరసము నటియించేవారికి
తెగువలెట్ల జెల్లు దీకొనుట యెట్లు

చ. 2: పతివంతలై న యట్టి పడతులకును భువి
నతికడుచుట యెట్టు అలిగేదేమి
రతిసేసి వలపుల రమియించేవారికి
మితిమీరఁ బనియేమి మేకుసేయనేల

చ. 3: పెనిమిటివద్దనున్న ప్రియురాండ్లకును
కినియఁ గ నెట్టువచ్చు కెరలవేది
యెనసితి శ్రీ వేంటేశయలఁమేల్మంగను
చెనకికొసరుటెంత సిగ్గులువడుటేడ

రేకు: 0849-3 పాడి సం: 18-290

పల్లవి: ఏల సిగ్గులువడేవు యెదుటికి రాఁగదవే
సోలిగా నీసింగారాలు చూచిఁగాని యీతఁడు

చ. 1: కొప్పువెట్టుకొంటివిగా కుప్పెసవరముతోడ
కప్పితివిగా పయ్యద కడుఁ బోలుగా
చిప్పిలఁ బూసితీవిగా చెంపలునిండా జవ్వాది
యిప్పుడె గక్కనఁ బతి నిఁక వలపించవే

చ. 2: కట్టుకొంటివిగా చీర కళ బెళమనఁ గాను
వొట్టుకొంటివిగా సొమ్ము లొళ్లునిండాను
గట్టిగా నిడుకొంటిగా కన్నులనుఁ గాటుక
దట్టముగా నీతనికి తమిరేఁచఁ గదవే

చ. 3: సేసితిగా విడేలు చెంగావిమోవెల్లాఁ గప్పు
వేసితివిగా మెడను విరిదండలు
వేసర కలమేల్మంగవిభుఁడు శ్రీ వేంకటేశుఁ
డాసతో నన్నేలె నీవూ నంటవే యీతనిని

రేకు: 0849-4 ముఖారి సం: 18-291

పల్లవి: నీవేల దాఁచేవు నీకెంత సంపదైనాను
సోవలుగాఁ గన్నులారఁ జూచేము గాక

చ. 1: పొద్దుననే వచ్చి యాపె పొందులెల్లఁ జెప్పుఁగాను
గద్దించి యేలసేసేవు కనుసన్నలు
వొద్దనేమా నేము నిన్ను వూరల్లాఁ జూట్టాలైతే
వొద్దికతో వలపులు వుట్టిఁ బట్టవచ్చును

చ. 2: కొలువులో దెచ్చి నీగురుతు లాపె చూపఁ గా
కెలన నీగోరనేల గీఁటుకొనేవు
మలసి నిన్ను దూరెదమా మనసు నీ కందుండితే
కలగూరవేడుకలు గంపఁ బెట్టవచ్చును

చ. 3: తఱితోడ నాపె నీపాదములకు మొక్కఁ గా
చిఱునవ్వేల దాఁచేవు శ్రీ వేంకటేశ
యెఱఁగమా నీవావులు యే నలమేలుమంగను
గుఱిగాఁ గూడితి నేర్పు గూఁటఁ బెట్టవచ్చును

రేకు: 0849-5 భైరవి సం: 18-292

పల్లవి: ఎన్ని చందాలదాననే ఇంతిరో నీవు
ఇన్నేసి నేరుచుకొంటి విందరిలో నీవు

చ. 1: నిక్కించేవు నీవురము నేఁడు నీపతి యెదుట
పిక్కటిల్లి చన్నులిట్టె పెరిగీనటే
పక్కనఁ జెమట పూవుబంతినే అద్దుకొనేవు
చిక్కనినీసింగారము చిందీనటే

చ. 2: పొడవుగ నేడలేనిబోలుఁ గొప్పు వెట్టితివి
నిడుపులు సాగీనటే నీనెరులు
మడుగుఁ జీర మడిచిమడిచి కట్టుకొంటివి
తొడిఁ బడఁ బిరుఁ దిది దొడ్డాయనటవే

చ. 3: వెరగుమాడి యీతని వేమారుఁ జూచేవు
బెరసి నీకన్ను లింకాఁ బెద్దవౌనటే
పరగ నలమేల్మంగపతి శ్రీ వేంకటేశుఁ డు
మరిగి నన్నేలె నీకూ మగఁడయ్యీ నటవే

రేకు: 0849-6 నాగవరాళి సం: 18-293

పల్లవి: ఊరివారిగుణములు వొడ్డి మాకేల చెప్పేవు
నేరిచిన ట్టూడిగాలు నేఁ జేసేఁ గాక

చ. 1: యెవ్వరికైనాఁ జనవు లిత్తువు నీవు
నవ్వుతాఁ జుట్టరికము నానవేతువు
పువిళ్లూరఁ జేయుదువు వొద్దివారిని
నివ్వటిల్లే నీకతలు నేమెఱఁగమా

చ. 2: పొరుగువారి పొందులు పొగడుదువు
తలమెటిఁగి సేతువు తరితీపులు
వొరసి మాఁటలనే నోరూరింతువు
గరిమ నీవోజలు కన్నవేకావా

చ. 3: మెత్తు వేమిటికినైనా మెలుఁతలను
హత్తి కౌఁగిలించుకొందు వంతలోననే
యిత్తల శ్రీ వేనికటేశ యేనలమేలుమంగను
పొత్తుల నన్నేలితివి కొత్తలు గావా

రేకు: 0850-1 మనోహరి సం: 18-294

పల్లవి: సతులకుఁ బతులకు సహజమిది
తతెరిఁగి యెవ్వరికిఁ దప్పించుకోవసమా

చ. 1: వలపే చక్కఁ దనము వర్ణించి చూచితేను
వలపే సింగారమై వన్నె కెక్కును
వలపే చుట్టరికమై వాడిక సేయుచు నుండు
వలుపే చవులు సేయు వడిఁ దరితీపులు

చ. 2: జవ్వనమే చెలువమై సరసములాడించు
జవ్వనమే భోగమై యాసలురేఁచును
జవ్వనమే పొంతనాలై జంటలుగాఁ బెనఁగించు
జవ్వనమే వేడుకలై సారెఁ దగిలించును

చ. 3: ఇచ్చకమే మూలధన మెడయని పొందులకు
ఇచ్చకమే రతులకు నెలయింపులు
ఇచ్చల నలమేల్మంగ నేలిన శ్రీవేంకటేశ
ఇచ్చకమే మోహనమై ఇంపులు పుట్టించును

రేకు: 0850-2 భైరవి సం: 18-295

పల్లవి: ఏమీ నెఱఁగనిబాల నింతసేతురా
నామోము చూచి ఇట్టె నవ్వులు నవ్వీని

చ. 1: కొత్తలుగా వనిత నీకొలవుకు వచ్చి తేను
హత్తి చెనకితివట యప్పుడే నీవు
బత్తిసేసి యప్పటి నీపాదాలొత్తవచ్చితేను
చిత్తగించి మోవి గంటిసేసితివట

చ. 2: మొకము చూచి నీకు మొక్కేనంటా వచ్చితేను
వొకటొకటే నేరిపి వొరసితివి
వెకలియై మచ్చికతో విందుచెప్పవచ్చి తేను
వికవిక నవ్వి సిగ్గు వెసరేఁ చితివట

చ. 3: నీకు నలమేలుమంగ నివాళియ్య వచ్చితేను
యీకడ శ్రీ వేంకటేశ యేలుకొంటివి
జోకతోడ వేడుకకు జూజమాడ వచ్చితేను
మేకొని నీచేతఁలెల్లా మెరఇంచితివట

రేకు: 0850-3 కాంబోది సం: 18-296

పల్లవి: తొల్లి నీవుచేసుకొన్న దొరతోడినేస్తమిది
యిల్లిదె యీతఁడే వచ్చి యీడేర్చీఁగాక

చ. 1: చిగిరించినవలపు చేగలెక్కకుండునా
తగులైనపొందులు తప్పిపోవునా
నగినచిరునవ్వులు నాముచారకుండునా
వెగటువిరహమున వేఁగనేలే యిపుడు

చ. 2: మేనిమీఁది జవ్వనము మేరమీరకుండునా
తానకపుకోరికలు దాఁగనిచ్చునా
పూని చూచిన చూపులు బుద్ధిపుట్టించకుండునా
సూనాస్త్రములకేల జోడించేవే ఇపుడు

చ. 3: సిగ్గరినీ వేడుకలు చిమ్మిరేఁచకుండునా
అగ్గలపు చక్కఁదన మడఁగించునా
వెగ్గళిం చెలమేల్మంగవిభుఁడి శ్రీ వేంకటేశు
డగ్గమై నిన్నేలె నీయాస లూరకుండునా

రేకు: 0850-4 ఊదారగౌళ సం: 18-297

పల్లవి: ఊరకున్న వారినేల వోకటొక టడిగేవు
చేరి నీదూతికలు చెప్పేరుగాక

చ. 1: పనివడి నీతో మాటపలు కాడుదుముగాక
యెనలేని నీపొందు లెరుఁగుదుమా
చనవున నీసేవలు సారెకుఁ జేసేము యిఁక
మనసులోనిమర్మాలు మాకుఁ దెలుసునా

చ. 2: బంతినుండి నీకు నేము పాదాలొత్తుదుముగాక
వింత నీవలపులెల్లా విచారించేమా
చెంతనుండి నీమీఁద సేసలు చల్లేముగాక
వంతు నీచుట్టరికాలు వాఁసుకొనేమాది

చ. 3: వొట్టి రాణివాసాలమై వొద్దనే వుందుముగాక
దిట్టనీగుణములెల్ల దిద్దవచ్చేమా
అట్టె శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
యెట్టయినా నీరతులు యెంచుకోవచ్చేమా

రేకు: 0850-5 సౌరాష్ట్రం సం: 18-298

పల్లవి: ఎంతతమకమే నీకు నీతఁ డిట్టే కూడీఁగాక
పంతపు నీభావమేల పచ్చిచేకొనేవే

చ. 1: మలయుచుఁ బతితోడ మాటలు నాడఁగానే
చెలియరో నీమేనెంత చెమరించీనే
చలివాసి యతఁడు నీసంగడి నుండఁగానే
చెలఁగి నిట్టూర్పులఁ జిమ్మిరేఁగీనే

చ. 2: ననిచి యాతనితోడ నవ్వులు నవ్వుతానే
వనిత నీవింతలోనే వావిచెప్పవే
కొనచూపుల నాతఁడు కొచ్చి నిన్నుఁ జూడఁగానే
ఇనుమడించినమోహమెంత యాఁపేవే

చ. 3: వొలిసి శ్రీవేంకటేశునురమున నుండఁగానే
అలమేలుమంగవు నీవాసవెంచేవే
పలురతుల నాతఁడు బలిమితోఁ గూడఁగానే
కలికితనము లెంత కడుమెరనేవే

రేకు: 0850-6 సామంతం సం: 18-299

పల్లవి: కమ్మి నీవొకటొకటె గడించుకొనేవు గాక
నమ్మితిఁ దొల్లె నిన్ను నవ్వు లేఁటికయ్యా

చ. 1: తీరనియాసలతోడ దిష్టించి చూచితిఁ గాక
నేరమెంచి కోపగించ నీ వేమి సేసితివయ్యా
నేరుపుతోఁ గస్తూరి నీమేనఁ బూసితిఁగాక
కారుకొని సోదించఁ గారణమేమయ్యా

చ. 2: మన్నించఁగాఁ గతలు వేమారు నేఁ జెప్పితిఁగాక
నిన్ను వెంగెములాడఁగ నీవల్లఁ గల్ల యేడయ్యా
యెన్న నామగఁడవని యెరక సేసితిఁగాక
పన్ని మోవి గంటిసేయఁ బనియేమయ్యా

చ. 3: గుట్టునఁ గాఁగిటఁగూడి గుబ్బల నొత్తితిఁగాక
నెట్టుకొని సాదించ నీయందు వెలితేదయ్యా
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
చుట్టరిక మిఁకఁ జెప్పిచూప నేఁటికయ్యా

రేకు: 0851-1 సాళంగనాట సం: 18-300

పల్లవి: అంబుజాక్ష నమో ప్రహ్లాద వరద పీ-
తాంబరదర ప్రహ్లాద వరద

చ. 1: హరివేషావతార ప్రహ్లాద వరద
హరి(ర) విరించినుత ప్రహ్లాద వరద
అరిదానవాంతక ప్రహ్లాద వరద
పరమపురుష నమో ప్రహ్లాద వరద

చ. 2: అమితగుణాకర ప్రహ్లాద వరద
అమరవందిత ప్రహ్లాద వరద
అమృతమయరూప ప్రహ్లాద వరద
ప్రమదాంక నమో ప్రహ్లాద వరద

చ. 3: అహిరాజశయన ప్రహ్లాద వరద
అహోబలేశ ప్రహ్లాద వరద
సహజ శ్రీవేంకటాచలనివాస నిత్య
బహురవితేజ నమో ప్రహ్లాద వరద

రేకు: 0851-2 మాళవి సం: 18-301

పల్లవి: వినోదకాఁడై నాఁడు విట్ఠలేశుఁడు
అనాదిదేవుఁడనే యాతఁ డీతఁడా

చ. 1: మాయరోలఁ గట్టువడి మద్దులు విరిచివేసి
ఆయతమైయున్న యట్టియాతఁ డీతఁడా
పేయలఁ గాచినాఁడు పెరుగువంటకములు
ఆయెడ నారగించినయాతఁ డీతఁడా

చ. 2: తల్లిబిడ్డ లైన గొల్ల తరుణులనెల్లాఁ గూడి
అల్లుకొనఁజేసె వావు లాతఁ డీతఁడా
తొల్లి గోవర్ధనమెత్తి దొరతనాలెల్లాఁజేసి
అల్లవాఁడె నిలుచున్నాఁడాతఁ డీతఁడా

చ. 3: చందముగ రుకుమిణి సత్యభామాదిసతుల-
నందంద పెండ్లాడిన ఆతఁ డీతఁడా
ఇందిరయుఁ దానుఁ గూడి ఇదె శ్రీవేంకటాద్రిపై-
నందరికి వరాలిచ్చీ నాతఁడీతఁడా

రేకు: 0851-3 రామక్రియ సం: 18-302

పల్లవి: బలవంతుఁడితనిబంట్లమై బ్రతుకుదుము
కిలకిలనవ్వీ సుగ్రీవనరసింహుఁడు

చ. 1: దేవదేవుఁ డితఁడు తేజోరాశి యితఁడు
భావించ నలవిగానిబహ్మ మీతఁడు
శ్రీవల్లభుఁ డితఁడు జీవరక్షకుఁ డితఁడు
కేవలమయిన సుగ్రీవనరసింహుఁడు

చ. 2: పరమాత్ముఁడితఁడు భయహరుఁ డితఁడు
నిరుపమగుణముల నిత్యుఁ డితఁడు
వరదుఁ డితఁడు సర్వవంద్యుఁడు నీతఁడు
గిరిగుహలోనిసుగ్రీవనరసింహుఁడు

చ. 3: కాలరూపుఁ డితఁడు కరుణానిధి ఇతఁడు
మేలిమిజగత్తులకు మేఁటి యీతఁడు
మూలమై శ్రీవేంకటేశై లనిలయుఁ డితఁడు
కీలక మిన్నిటికి సుగ్రీవనరసింహుఁడు

రేకు: 0851-4 దేశాక్షి సం: 18-303

పల్లవి: ఇదివో నీరమణుఁడు యెనయవమ్మా
పొదిగి కాఁగిట నిట్టె భోగించవమ్మా

చ. 1: వనితరో కొత్తగాఁగ వంచినశిర సెత్తవు
ననుపాయ నిఁక నీవు నవ్వవమ్మా
మునుపనెల్లా కొంకి మోనాననే వుంటివి
మన గంటివి ఇఁక మాటాడవమ్మా

చ. 2: గుట్టుతోడ ముసుఁగిడుకొని వుండితివి తొల్లి
చుట్టమవైతివి చక్కఁ జూడవమ్మా
చిట్టకపు సేఁతలతో సిగ్గులు నెరపితివి
అట్టె ఇంతట సరస మాడవమ్మా

చ. 3: వాసిఁ బెండ్లికూఁతురవై వంతులిట్టె కోరితివి
ఆసతోడ మోవితేనె లానవమ్మా
బాసడిగి కూడితివి పాయ కలమేల్మంగవు
లాసి శ్రీవేంకటేశ్వరు లాలించవమ్మా

రేకు: 0851-5 ముఖారి సం: 18-304

పల్లవి: తానేల విట్టువీఁగీవే తరుణలిందరిలోన
నేనెఱిఁగినవే తననేరుపు లన్నియును

చ. 1: పంతమాడవచ్చుఁగాక పదనెరిఁగి విభుని-
చెంత నుండి యిచ్చకము సేయవచ్చునా
వంతులకు జలకించవచ్చుఁగాక లోలోన
అంతరంగమెల్లాఁ దానై వుండవచ్చునా

చ. 2: పెనఁగవచ్చుఁగాక ప్రియము గై కొని నిండుఁ-
జనవుతో వలపులు చల్లవచ్చునా
చెనకఁగ వచ్చుఁగాక చెల్లుబడి సేసుకొని
పనిగొని కూరిములు పచారించవచ్చునా

చ. 3: నాటఁజూడవచ్చుఁగాక నంటున శ్రీవేంకటేశుఁ-
కూటపురతులెల్లాఁ జేకొనవచ్చునా
నీటు చూపవచ్చుఁగాక నిక్కముగా నావలెనే
సాటికి బేటికి మోవి చవిగొనవచ్చునా

రేకు: 0851-6 శ్రీరాగం సం: 18-305

పల్లవి: చెప్పరాదు చూపరాదు చిత్తములో తమకము
కప్పినజవ్వనమిది గంపఁ గమ్మవచ్చునా

చ. 1: సెలవి నవ్వఁగరాదు చేతులు చాఁచఁగరాదు
యెలమిఁ దనపొందులు యెట్టుసేతునే
బలిమిఁ బెనఁగరాదు పై గోరుసోఁకించరాదు
మొలకవలపు లెట్టు మూఁటగట్టవసమే

చ. 2: దగ్గరఁ గూచుండకాదు తాఁకించరాదు పాదము
వెగ్గళించి నేనెట్టు వీడె మిత్తునే
సిగ్గులువడఁగరాదు చెయ్యెత్తి మొక్కఁగరాదు
వొగ్గి నా నేర్పులు వొడిఁబెట్టుకుందునా

చ. 3: మో వెంగిలిసేయరాదు మోనాన నుండఁగరాదు
వోవరిలో నెటువలె నూరకుందునే
శ్రీవేంకటేశుఁడు తానే చేకొని నన్నిటు గూడె
సోవలుగా రతులెల్లాఁ జొప్పులెత్తఁదగవా

రేకు: 0852-1 దేవగాంధారి సం: 18-306

పల్లవి: గద్దెమీఁద నుందానవు కాఁపురము సేసేవు
పెద్దరికము చూపక పిరితీసేవా

చ. 1: సేవచేసేదానవు చేరి నవ్వేదానవు
నీవేకా ఆతనికి నేరుపుతోడ
చేవదేరి వుందానవు సిగ్గులెల్లా నారితేరి
మావంటిసవతుల మదిఁ దలచేవా

చ. 2: యేకతమాడేదానవు ఇంపు చల్లేదానవు
జోకతోడ నీవేకా చుట్టమవు
చేకొని నీకిన్నిటాను చెల్లుబడి గలిగెను
దీకొని నీతోడివారిదిక్కు చూచేవా

చ. 3: కలిసినదానవు కందువ నున్న దానవు
ఇల నీవేకా యితని ఇంపుదానవు
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే మమ్మేల్ల నేలె
నెలవై నీచెల్లెండ్ల మన్నించక మానేవా

రేకు: 0852-2 పాడి సం: 18-307

పల్లవి: చూచినవారికిఁ జూడ సోద్యములై తోఁచు నివి
కాచుక తిరుగఁగాను కాఁతాళ మవుఁ జుమ్మీ

చ. 1: నీమాటలోనిదాన నీవు నాకుఁ గూరుతువు
యేమిటికి వేఁడుకొనే వింతెరఁగనా
కోమలము నామనసు గుట్టుతో దొరవు నీవు
చేముట్టి పెనఁగఁగాను జీరవారీఁ జుమ్మీ

చ. 2: పట్టపుదేవులభావమెల్లా నీసొమ్ము
వొట్టేల పెట్టుకొనేవు వుండఁబట్టదా
మట్టులేదు నాయాస మగఁడవు నీవు నాకు
గట్టిచన్ను లంటఁగాను కాఁకరేగీఁ జుమ్మీ

చ. 3: ఇచ్చకురాలను నీకు ఇట్టె నన్నుఁ గూడితివి
పచ్చిగానేలనవ్వేవు పంతగాఁడవా
నిచ్చపెండ్లికూఁతురను నీకు శ్రీవేంకటేశుఁడ
మెచ్చి మెచ్చి మోవానఁగా మిక్కుటమౌఁ జుమ్మీ

రేకు: 0852-3 సామంతం సం: 18-308

పల్లవి: కనుఁగొనవయ్యా కలికిని
కొలువునఁ జిలుకలకొలికిని

చ. 1: వదనకమల మటువంచి
పొదిగొనుచూపులఁ బొంచి
మెదలేటికళలను మించి
అదె నీపయిఁ జెలి యాసలునించీ

చ. 2: మునుకొని చేతుల మొక్కి
నినుపుఁ దమకముల నిక్కి
తనియనిమాఁటల దక్కి
పనివడి నీపాదము దొక్కి

చ. 3: పలురాగంబులఁ బాడి
వలవంతల వసివాడి
యెలమిని శ్రీవేంకటేశ పై యాడి
అలమేల్మంగ నిన్నంకెలఁగూడీ

రేకు: 0852-4 మధ్యమావతి సం: 18-309

పల్లవి: ఎందాకా సిగ్గువడే రిద్దరు మీరు
సందడింపువలపులె చవులు గాక

చ. 1: చలమరితనమేల సరి నాలిమగనికి
వెలలేనికూటమే వేడుకగాక
తలవంచుకొని లోలో తడఁబాట్లిఁక నేల
సొలపుఁ జూపులు నేఁడు సొంపులు గాక

చ. 2: పెట్టనిబిగువులేల ప్రియముగలవారికి
నెట్టుకొన్న నవ్వులే నేర్పులు గాక
రట్టుతో యెడమాఁట వట్టిరాఁపు లవియేల
దట్టపుఁ గాఁగిళ్లు శుభదములై యుండుఁగాక

చ. 3: తచ్చనలు చూపనేల తమకించేవారికి
పచ్చిమోవు లొనఁగుటే పంతాలుగాక
యిచ్చగించి శ్రీ వేంకటేశ కూడితిరి మీరు
విచ్చలవిడిపొందులే వేడుకలుగాక

రేకు: 0852-5 కురంజి సం: 18-310

పల్లవి: ఇన్నేసి నేరకుండితే నింతులు వలతురా
మన్నించె నన్నింతలోనే మతకము లేఁటికి

చ. 1: చూడనేర్చునట లోను చొచ్చి రానేరఁడా తాను
ఆడనుండే అప్పణ లేలడి గంపీని
పాడనేర్చునట తనపదాలు రాకున్నవా
వేడుకయ్యీ నేర్పుమని వేఁడనేలే నన్నును

చ. 2: సేసవెట్ట నేర్చునట చెలిమి సేయ నేరఁడా
ఆసవెట్టి నామన సేమరసీఁదాను
బాససేయనేర్చుట పాయక వుండనేరఁడా
వాసితో బిలిపించుకొనవలెనా తానిపుడు

చ. 3: తమకించనేర్చునట తనివందించనేరఁడా
సముకాన వలపు రేచఁగ నేఁటికి
కొమరెనై నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడు
సముఖుండై ఇంకానేమి సుద్దులడిగేనే

రేకు: 0852-6 మాళవిగౌళ సం: 18-311

పల్లవి: ఆపెనేమీ ననరాదు అందములు చేసుకోనీ
యీపాటిచనవు చెలికియ్యవయ్య ఇఁకను

చ. 1: చేరి చేరి యింతి నీకు సేవలెల్లాఁ జేయఁగాను
గోరు దాఁకించెనంటాను కొచ్చి చూచేవు
ఆరసి దూరవచ్చునో అవ్వలఁ జెప్పవచ్చునో
వోరుచుక గుట్టుతోడ నుండవయ్య యిఁకను

చ. 2: అంగన నీవద్దనుండి ఆకుమడిచియ్యఁగాను
యెంగిలిసేసిచ్చెనంటా నీసడించేవు
ముంగిటఁ జూపవచ్చునో ముంచి కడుగవచ్చునో
చెంగలించి విడెము సేయవయ్య ఇఁకను

చ. 3: వురముపై నుండి నిన్ను వువిద గాఁగిలించఁగా
సరిఁ బాదాలూఁ దెనంటా సారె నవ్వేవు
మరిగి పాయవచ్చునో మచ్చిక శ్రీవేంకటేశ
సారిది మోవిచవుల చూపవయ్య యిఁకను

రేకు: 0853-1 ముఖారి సం: 18-312

పల్లవి: నీవే పాడిపంతాలకు నేరుపరివి
కైవసము చేసుకొని కలుపే విద్దరిని

చ. 1: మొగము చూచి చూచి మోవిలంచా లొడఁ బడి
తగవులుదిద్దేవు తరుణులకు
బిగిసి నీ విక్కువ చెప్పించుకొని వొండొరుల
జగడాలు దీర్చి తీర్చి సంతసముచేసేవు

చ. 2: పొంచి చనుజక్కవల పొందులపూఁటలు గొని
కంచముపొత్తు సేసేవు కాంతలను
మంచముపై నెక్కించుక మరి తారిఁ దమికించి
అంచెల నొక్కటిచేసి ఆదరించేవు

చ. 3: వేడుకనవ్వులు నవ్వి విడే లిప్పించుకొని
జోడుగాఁ గాఁగిటఁ గూడి చొక్కించేవు
వోడక శ్రీ వేంకటేశ వురమున వీఁపునను
చేడెల నిలుపుకొని చెలుములు సేసేవు

రేకు: 0853-2 బౌళి సం: 18-313

పల్లవి: ఎప్పటి కప్పుడే కాక ఇఁకనేఁటికే
చొప్పులెత్తి చూచేమంటే సుద్దులెన్ని లేవే

చ. 1: చన్నుల నొత్తఁగరాదా సారెకు నవ్వఁగరాదా
చిన్నఁ బోయి వుండనేలే చెలియ నీకు
సన్నలు సేసి యతఁడు సరసము లాడీని
నిన్న నెల్లా రాకుండినా నేఁడు వచ్చెఁగదవే

చ. 2: కలకలనవ్వరాదా కాఁగిలించుకొనరాదా
తలవంచుకొననేలే తరుణి నీకు
బలిమి నేసి యతఁడు పంతమిచ్చి బుజ్జగించీ
పలుకకుండినవాడు బత్తి సేసెఁగదవే

చ. 3: పువ్వులు ముడువరాదా పొందులుచూపఁగరాదా
నివ్వెరగందఁగనేలే నెలఁత నీకు
ఇవ్వల శ్రీ వేంకటేశుఁ డిప్పు డిట్టె నిన్నుఁ గూడె
యెవ్వరిఁ బెండ్లాడినా నీ కిరవాయఁ గదవే

రేకు: 0853-3 వరాళి సం: 18-314

పల్లవి: ఎదుట నూరకే వుండి యేమి గట్టుకొంటివి
సదరాన వలపులు చవిచూపరాదా

చ. 1: పూనిననీచన్నులె పోఁడైన నిమ్మపండ్లు
కానుక వట్టఁగరాదా కాంతునికి
తేనెగారేపెదవిపై తీయనినీమాటలు
వీనులలరఁగ నిట్టె విందు సేయఁగరాదా

చ. 2: సెలవులనవ్వులే చేరఁ డేసికప్పురాలు
వులుపా వట్టఁగరాదా వొగిఁ బతికి
తలకొన్న నీచేతులు తామరలవంటివి
పొలుపొందఁ బాదాలొత్తి పూజసేయరాదా

చ. 3: ముప్పిరినీకాఁగిలే ముంగిటనిధానము
కప్ప మియ్యరాదా శ్రీ వేంకటపతికి
అప్పసము నీచెక్కులే అద్దములవంటివి
తప్పక చూపి కూడితి తమిరేఁచరాదా

రేకు: 0853-4 కేదారగౌళ సం: 18-315

పల్లవి: కానవచ్చె మీసుద్దులు కన్నుల పండువగాను
తానకమైనపనులు దాఁచనేల ఇఁకను

చ. 1: చెలి నీకొప్పు దువ్వఁ గా చిన్నిగోరు సోఁకఁబోలు
పులకలు మేన నిండెఁ బొదిగొనుచు
చెలరేఁగిన మాటలు చెవులు నిండఁగఁ బోలు
సెలవుల నవ్వులిట్టె చిమ్మిరేఁగీని

చ. 2: సతి వీడెమియ్యఁ గాను చన్నులు నిన్నొత్తఁబోలు
తతిగొని చెమటలు దైవారీని
మతకానఁ గరములు మర్మము లంటఁగఁ బోలు
కతలుగా సిగ్గు నీకుఁ గడుమించీని

చ. 3: వెలఁది మోవితేనెల విందులు వెట్టఁగఁబోలు
కళలు నీమోమునఁ గానుపించీని
యెలమి శ్రీవేంకటేశ యీకెఁ గలసితి విట్టె
పలుమారు నీరతులు పచ్చి దేరీని

రేకు: 0853-5 రామక్రియ సం: 18-316

పల్లవి: ఇంతేసి కొయ్యతనాలు యేఁటికి నీకు
సంతము గావలెఁ గాక చలపట్టవచ్చునా

చ. 1: చనవరితనమున సతి నీతోఁ బెనఁగఁగ
యెనలేనిపంతమున నేలతిట్టేవు
మనసిచ్చి యాపె నిన్ను మారుకు మారాడితేను
వినవలెఁగాక నీకు వెగ్గళించవచ్చునా

చ. 2: నవ్వుచేసుకొని నీపై నాతి చేతులు చాఁచఁగా
పువ్వులచెండుననేల పూఁచివేసేవు
చివ్వన నాకె నిన్ను చేఁతకుఁజేఁత సేసితే
నివ్వటిల్లవలెంగాక నేరమెంచవచ్చునా

చ. 3: కలపకోలున నిన్ను కాంత గాఁగిలించగాను
అలయించి యాపె నెంత యాసరేఁచేవు
అలరి శ్రీ వేంకటేశ ఆపెనిన్నుఁ గొసరితే
చెలరేఁగవచ్చుగాక సిగ్గువడవచ్చునా

రేకు: 0853-6 నాదరామక్రియ సం: 18-317

పల్లవి: ఏమిసేయవచ్చు నిక నెరిఁగినపనులకు
నామనసు నమ్మికగా నడవుమీ యిఁకను

చ. 1: మగువతో నిండాఁగా మాఁటలాడి మాఁటలాడి
నగేవు యింతటిలోనే నాదిక్కు చూచి
వొగి మొదల నేనీడ వుండుట తెలియవద్దా
పగటు నీగుట్టెల్లా పచ్చిదేరె నిపుడు

చ. 2: చెలి నీవు నేడాలేనిచేఁతలెల్లా జేసుకొని
తలఁకే వింటిలో నన్నుఁ దలఁచుకొని
యెలమి నామెలఁకువ యింతుల నడుగవద్దా
కలిగిననీగుణాలు కానవచ్చె నిపుడు

చ. 3: కాంతఁ గూడి తెరదండఁ గాచుకున్ననన్ను ముట్టి
చెంతఁ గాఁగిలించితివి శ్రీ వేంకటేశ
వింతలుగా నావునికి విచారించుకోవద్దా
సంతమై నీనేర్పులెల్లా సరివచ్చె నిపుడు

రేకు: 0854-1 నాగవరాళి సం: 18-318

పల్లవి: చెలపచెమటలతో చింత యేఁటికే
పిలిచి ప్రియముచెప్పి పెనఁగఁగరాదా

చ. 1: యేలే తలపోతలు యెదుటఁ బతివుండఁగ
వాలుఁజూపులఁ జూచి నవ్వఁగరాదా
జాలిఁ బడ నీఁకనేలే చనవితఁ డియ్యఁ గాను
మేలమాడి సారె సారె మెప్పించరాదా

చ. 2: హత్తి వుండి మోనమేలే ఆయములు సోఁకఁగ
చిత్తగించి మాటలాడి చేకొనరాదా
కొత్తకొత్తసిగ్గులేలే కొంగువట్టి యీతనిఁ
బత్తిసేసి రతులను పనిగొనరాదా

చ. 3: మేటివి తలవంచనేటికే యలమేల్మంగ
సూటిగ శ్రీ వేంకటేశుఁ జూడఁగరాదా
నీటులేమిటికి మీరు నెట్టనఁ గూడితిరిట్టె
యీటుతో మదనరాజ్య మేలఁ గరాదా

రేకు: 0854-2 దేశి సం: 18-319

పల్లవి: ఊరకే దూరేవుగాక వొద్దనున్న వారిని
సారె సారె నీవేల జంకించేవయ్యా

చ. 1: మరిగించి మరగునుఁ మాట లాకె యాడఁ గాను
గరిమఁ బంజరాల చిలుకలు నేర్చెను
సారిదినీకామినులు సుద్దులెల్లాను వినిరి
ఇరవై నీచెలిక త్తె లేమి సేయరయ్య

చ. 2: మోవితేనె చెలియ నీమోవికి నందియ్యఁగాను
పావురాలు నేరుచుక పచ్చి సేసెను
యీవలావలానున్న ఇంతులెల్లాఁ దెలిసిరి
వావిరి నూడిగములవా రేలచెప్పేరయ్యా

చ. 3: అలమేలుమంగ నీపైనటు పాటలువాడఁ గా
యెలమి గోవిల నేర్చె నీపాటలు
కలసినమీకూటమి కాంతలెల్లా నెరిఁగిరి
మెలగి శ్రీ వేంకటేశ మేమేమి సేతుమయ్యా

రేకు: 0854-3 సాళంగనాట సం: 18-320

పల్లవి: పలువేడుకలతోడ బ్రహ్మాదులు గొలువ
కెలని విందులె ఆరగించీ వీథులను

చ. 1: పన్నీట మజ్జనమాడి పట్టుదట్టి గట్టుకొని
వున్నతపుతేరెక్కి వుంటవింటను
కన్నెలచన్నులు దాఁక కస్తూరివుంటల వేసి
మిన్నక దేవుఁడు నేఁడు మెరసీ వీథులను

చ. 2: తట్టుపుణుగు మైం బూసి తగుసొమ్ములు నించుక
దట్టపు సింగారాలతో తమ్మిపువ్వుల
జట్టిగొని యిరుమేలగా సతులపై సేసచల్లి
ఇట్టె పెండ్లికి దేవుఁ డేఁగీ వీథులను

చ. 3: అలమేలుమంగ నురమందుఁ గట్టుకొని నిల్చి
యెలమితో శ్రీ వేంకటేశ్వరుఁడు
మలసి దేవుళ్లుఁ దాను మారుదేరు లెక్కుకొని
వలపులతో దేవుఁడు వచ్చీ వీథులను

రేకు: 0854-4 మధ్యమావతి సం: 18-321

పల్లవి: ఎటువంటివేడుకలో యెలమితో మాకివి
తటుకున మీసుద్దలు తలచే రిందరును

చ. 1: అందలముమీఁదనుండి అతివమోము చూచి
పందేలువేసుకొంటాఁ బలుమారును
సందడిఁ గొలిచివచ్చేసతులతో నవ్వుకొంటా
పొందుగ నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును

చ. 2: మలఁగుపై నొరగుండి మాటలాడి దేవులతో
వలపులు చల్లుకొంటా వాడవాడల
లలి నూడిగపుకాంతలను సన్న సేసుకొంటా
పొలసి నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును

చ. 3: అంకె పరపుపై నుండి ఆలమేల్మంగఁ బెండ్లాడి
లంకెలై శ్రీ వేంకటేశ లాలించుకొంటా
పుంకువ నాటపాటలవువిదల మెచ్చుకొంటా
పొంకమున నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును

రేకు: 0854-5 పాడి సం: 18-322

పల్లవి: ఏఁటికి మీగుజగుజ లెరఁగరాదు
తేటపరచఁ గారాదా దిద్దేము తగవు

చ. 1: సొలపులమాటలాడి చూపుల నిన్నుఁ గొసరి
తలుపుమాటున నుండి తమకించీని
చెలియ నేమిటి కింతసేసితివి యిటువలె
తెలియఁ జెప్పఁగరాదా దిద్దేము తగవు

చ. 2: వెక్కసాలు నీకుఁ జూపి వేడుకలు నీపైఁ జల్లి
వక్కణలు నిన్నడిగి వద్దనే వుండీ
అక్కరపడ్డకాంతలనే అలయించే విటువలె
దిక్కయి మమ్మడుగరాదా దిద్దేము తగవు

చ. 3: తరితీపు నీకుఁ జేసి తడవి యలమేల్మంగ
వరుస నిన్నుఁ గూడి నీవద్దనే వుండీ
సరి శ్రీ వేంకటేశుఁడ సతి నెంత వొరనేవు
తెరవేసుకొనరాదా దిద్దేము తగవు

రేకు: 0854-6 శంకరాభరణం సం: 18-323

పల్లవి: నిజము నెరపరాదా నేఁడు మాతోను
గజరులు దెలిసితే కాఁతాళించేవు

చ. 1: శిరసుపై తలఁబాలు చెంపల వెంటఁ గారి
తరుణిపేరడిగితే దాఁచేవు నాతో
గొరబైనవుంగరాలు కొంకక నీ వేళ్ల నివె
యిరవాయఁ బనులెల్లా నేలలోఁ గేవు

చ. 2: కుంకుమగుబ్బలొత్తులు కుమ్మెలై రొమ్మున మించె
వుంకు వేమిచ్చితివంటే నూరకుండేవు
అంకెఁ బగడాలదండ అటె నీమొల నున్నది
లంకెలఁ బట్టఁబేతే నేలపెనఁ గేవు

చ. 3: మెడఁ గట్టుకొంటి వలమేలుమంగ నింతలోనే
వొడి నెవ్వరున్నారంటే వొట్టు వెట్టేవు
నడుమ శ్రీ వేంకటేశ నన్నేలితి విపు డిట్టె
చిడుముడిఁ గదిమితే సిగ్గువడేవు

రేకు: 0855-1 పడవంజరం సం: 18-324

పల్లవి: బడలివుందాన నేను పైపై నడియాసల
జడిగొన్న కరుణతోఁ జనవియ్యరాదా

చ. 1: యెగసక్కే లేలసేసే వేల బయలీఁ దించేవు
మగువ నింతే నన్ను మన్నించరాదా
నగవు లేమినవ్వేవు నాలిసేయ నేమిటికి
తగనీవిచ్చినబాస దలఁ చుకోరాదా

చ. 2: చిత్తమేమి సోదించేవు చీఁకటేల తవ్వించేవు
బత్తిగలదాన నింతే పాలించరాదా
కొత్తలేల సేసేవు గుట్టువెట్టే వేమిటికి
యిత్తల నీదొరతన మెంచుకోరాదా

చ. 3: చెక్కులేల నొక్కేవు సిగ్గులేలాయకట్టేవు
లక్కవంటిదాన నింతే లాలించరాదా
ఇక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
చొక్కించినరతు లెంచిచూచుకొనరాదా

రేకు: 0855-2 సాళంగం సం: 18-325

పల్లవి: ఏమని విన్నవించేను ఇదివో నీకు
ఆమనివలపులను ఆరడైతి నేను

చ. 1: నవ్వులు నీవు నవ్వఁ గా నమ్మివుంటివి
పువ్వులను వోయఁగానుఁ బోఁదైఁ తిని
యివ్వల నీదయ నాపై నెట్టున్నదో
నివ్వటిల్లుఁ గోర్కులకు నెలవైతి నేను

చ. 2: పైపైఁ జేయివేయఁ గాను భ్రమసితిని
తీపుమోవి చూపఁ గా నందితి ముదము
యేపున నిన్నెటువలె నేలేవో నీవు
మాపురేపు నీసుద్దులే మరిగితి నేను

చ. 3: పక్కన నీవు గూడఁగా బతికితిని
చెక్కునొక్కి వేఁడుకోఁ గాఁ జెలఁగితిని
యిక్కువ శ్రీ వేంకటేశ యెట్టు మెచ్చేవో
తక్కక నీమన్ననల దాకొంటి నేను

రేకు: 0855-3 రీతిగౌళ సం: 18-326

పల్లవి: తెలిపి చెప్పేనంటే తేటతెల్లమి నాగుట్టు
కలసినవాఁడవు కరుణించవయ్యా

చ. 1: మోముచూచినవాఁడవు మోహించక మానేవా
కోమలపుదాననై కొసరేఁ గాక
చేముట్టినవాఁడవు సేవగొనక మానేవా
దామెనకోరికలతోఁ దమకించేఁ గాక

చ. 2: సేసవెట్టినవాఁ డవు చెనకక మానేవా
ఆసపడ్డదాననై యడిగేఁ గాక
బాసయిచ్చినవాఁ డవు పైకొనక మానేవా
చేసూటి వలపులఁ జిమ్మిరేఁగేఁ గాక

చ. 3: యీడ నన్నేలినవాఁడ వింటికిరాక మానేవా
జోడైనదాననయి సొలసేఁ గాక
కూడితి విట్టె నన్ను గొబ్బున శ్రీ వేంకటేశ
జాడెఱఁగక మానేవా చాటిచెప్పేఁగాక

రేకు: 0855-4 హిజ్జిజి సం: 18-327

పల్లవి: ఏల నన్ను నొరసేవు యిందరిలోన
కేలి నిన్నిటా నూడిగెపుదాన నేను

చ. 1: పంతమాడఁ గలవా పతివి నీతో నేను
కాంతను ఇచ్చకమాడఁ గలఁ గాక
చెంత నీతో బలిమిసేసి చూపవచ్చునా
మంతనాన నోర్చుకుండే మనవచ్చునా

చ. 2: జంకిచేదాననా సరసుఁడవైన నిన్ను
అంకెల నవ్వులు నవ్వేయందుకుఁ గాక
సంకెలేక విన్ను మరి సాదించఁ దగవా
వుంక నీవు చెప్పినట్టోడఁ బడేఁ గాక

చ. 3: జీరదీసేదాననా ఏ వేంకటేశ నీకు
మేరతోడ నిన్నుఁ గూడి మించితిఁ గాక
ఆరజము సేసి నిన్ను అవుఁ గాదనఁ గలనా
చేరి నీమన్ననలనే చెలఁ గుదుఁ గాక

రేకు: 0855-5 మంగళకౌశిక సం: 18-328

పల్లవి: గయ్యాళితనము నాది కడుశాంతము నీది
ఇయ్యెడ నీమంచితన మేమని పొగడుదు

చ. 1: మిక్కిలిదొరవు నీవు మేనదాననంటా నేను
చిక్కఁగా నవ్వితిని సెలవులను
మక్కువతో నందుకును మన్నించితివి నన్ను
యెక్కువ నీగుణములు యేమని పొగడుదు

చ. 2: అన్నిటా జాణవు నీవు ఆలనైతినంటా నేను
కన్నుల జంకించితిఁ గాఁతాళానను
వున్నతి నూరకే మెచ్చి వుంగర మొసగితివి
యెన్నికైన నీకరుణ కేమనిపొగడుదు

చ. 3: గుట్టుతోవాఁడవు నీవు కూడితివంటా నేను
రట్టు సేసితివి మోవి నెట్టున నిన్ను
జట్టిగా శ్రీ వేంకటేశ చనవిచ్చితివి నాకు
యిట్టె సేసిననీ మేలు కేమని పొగడుదు

రేకు: 0855-6 దేవగాంధారి సం: 18-329

పల్లవి: నవ్వుగాదు నీచిత్తము నాభాగ్యము
దవ్వుల నిన్నుఁ గొసరఁ దగవా నాకు

చ. 1: జంకించితి బొమ్మలను సణఁగులు రాలించితి
మంకుఁదనమున నీతో మచ్చరించితి
యింక నీవు నన్ను నేఁడు యెట్టు లాలించేవోకాని
సంకెలేక నిన్ను దూర సంగతే నాకు

చ. 2: కక్కసించి పిలిచితి గబ్బితనాలు చూపితి
చిక్కించుక కొనగోరఁ జెనకితిని
పక్కన నీవెట్లాను పాలించేవోకాని
వుక్కన బలిమిసేయ నుచితిమా నాకు

చ. 3: చన్నుల నిన్ను నొత్తితి సమరతిఁ గూడితి
అన్నిటాను రతుల నిన్నలయించితి
యెన్నఁగ శ్రీ వేంకటేశ యెట్టు మెప్పించేవోకాని
నిన్ను వరుసలడుగ నేరుపా నాకు

రేకు: 0856-1 భైరవి సం: 18-330

పల్లవి: నెట్టన నెప్పుడు నాకు నీవే దిక్కు
గుట్టుతోడ నుండఁ గానే గురుతాయ వలపు

చ. 1: నంటున నీవాకెతో నవ్వులెల్ల నవ్వఁ గాను
ఇంటికిఁ బిలిచే నిన్ను నిదివో నేను
గొంటరిని పరాకుతోఁ గూడేనాతమకము
జంటసేసి పెనచఁగా సకులు నవ్వేరు

చ. 2: తొడిఁబడ వేరొకతె తొడపై నీకుండఁగ
వొడివట్టి తీసేను వూరకే నిన్ను
అడరి నీయెమ్మెతో నట్టె నాయడియాస
కడఁగి సంకెఁ బెట్టఁగా కాంతలు నవ్వేరు

చ. 3: పొరుగింతితో పొసఁగ మాఁటలాడఁ గా-
నరుదుగాఁ గాఁగిలించే నప్పటి నిన్ను
యీరవై శ్రీ వేంకటేశ యిద్దరిభావములు
సరివెట్టి చూడఁగాను సతులు నవ్వేరు

రేకు: 0856-2 సామంతం సం: 18-331

పల్లవి: వీదులనెల్లాఁ దానే గోవిందరాజు
ఆదిగొని సేసచల్లీ నదె గోవిందరాజు

చ. 1: చెక్కుటద్దము లిద్దరు చెలులకుఁ జూపుతాను
వెక్కసమై మెరసీ గోవిందరాజు
చిక్కనివెన్నెలతేట సెలవులఁ జిందుతాను
అక్కరతో మాఁటలాడీ నదె గోవిందరాజు

చ. 2: కదిసి చనుమొనలఁ గాయ మొరుసుకుంటాను
వెదచల్లీ వలపు గోవిందరాజు
వదనాంబుజము మోవివాసనలు చూపుతాను
అదిమీఁ దొడలు చేత నదె గోంవిదరాజు

చ. 3: పరిమళములు చూచి పడఁతుల తురుములు
విరుల వేసీని గోవిందరాజు
సురతమర్మములెల్లాఁ జూపి కాఁగిళ్లనుఁ గూడీ-
నరుదై శ్రీ వేంకటాద్రి నదె గోవిందరాజు

రేకు: 0856-3 ఆహిరి సం: 18-332

పల్లవి: ఎట్టు మన్నించేవోకాని ఇదివో నీచిత్తము
మెట్టిపట్టుకొని నవ్వ మేనదాననా

చ. 1: కొలువు సేసి నిన్నుఁ గొసరుదు నింతేకాక
చలపట్టి దూరఁగ నీసరిదాననా
పిలిచి నీ కప్పటిని ప్రియము చెప్పుదుఁ గాక
బలిమి సేయఁ గ నీతోఁ బంతగత్తెనా

చ. 2: కైకొమ్మనుచు నీకుఁగా నీకొసఁగుదుఁ గాక
దీకొని మాఁటలాడఁగ దిట్టదాననా
మేకొని సేవలు సేసి మెప్పించఁ గలఁ గాక
కాకుసెయ నేమైనాఁ గడదాననా

చ. 3: దేవులనై నీచేతఁ దేజము చేకొందుఁ గాక
వావాత నానవెట్ట వంతు దాననా
శ్రీ వేంకటేశ యిట్టే చేరి నన్నుఁ గూడితివి
సేవతో మొక్కుదుఁ గాక జీరదీసేదాననా

రేకు: 0856-4 దేసాళం సం: 18-333

పల్లవి: చేతికి లోనైతే నీవు సేయకుందువా
నీ తెరుపువచ్చేవారినేర మింతేకాక

చ. 1: మగువలు విన్నవించేమాటలు వినకతొల్లె
తగవులు చెప్పేవు తలవిళ్ళనె
యెగసక్కెఁడ విన్నిటా నేమిచేప్పేదిటు నిన్ను
తగిలేటివారియెడ్డతన మింతికాక

చ. 2: పడఁతుల పూఁడిగాలు పచ్చిదేరకతొల్లె
పుడుగర లిచ్చేవు పూరకైనాను
గడుసు కాఁడవు నిన్నుఁ గాదనేవారెవ్వరు
బడిఁ దిరిగేటి వారిభాగ్య మింతేకాక

చ. 3: చెలుల మేపులతేనె చేరికొనకతొల్లె
కలసేపు కాఁగిళ్ళ కందువలనే
యిల శ్రీ వేంకటేశుఁడ వెదురాడేవారెవ్వరు
వలచినమావంటివారితమి గాక

రేకు: 0856-5 ముఖారి సం: 18-334

పల్లవి: చాటిచెప్పితిమి నీకు జడియరాదు
మాటలివి నాయకుఁ డ మఱవరాదు

చ. 1: సరసమెంతాడినాను చన్నుల నెంత వొత్తినా
తరుణి కిచ్చినబాస తప్పఁగరాదు
విరులనెంత వేసిన వెంగములెన్నాడినాను
తిరమై చల్లినసేస తియ్యఁ గారాదు

చ. 2: మునిగోర గీరెనంటా ముప్పిరిఁ బెనఁగెనంటా
వనితపొందులు ఇఁక వదలరాదు
కనుఁ గోన నవ్వెనంటా కడునెలయించెనంటా
యెనసి కూడుండి మరి యెడయరాదు

చ. 3: మంకులు చూపినందుకు మర్మము లంటినందుకు
కంకణము గట్టి అతికడవరాదు
లంకెలై శ్రీ వేంకటేశ్వర లలనఁ గూడితి విట్టె
అంకెలవలపు లిఁక నడఁచరాదు

రేకు: 0856-6 మాళవిగౌళ సం: 18-335

పల్లవి: ఎవ్వరికి దొరకును యీభాగ్యము
జవ్వనికి మోవితేనే చవిచూపరాదా

చ. 1: జక్కవచన్నులమీఁ ద జారినపయ్యదతోడ
చెక్కులపైఁ దొరిగోటి చెమటతోడ
మొక్కిమొక్కి నీకుఁ దనమేహమెల్లా విన్నవించీ
అక్కరగలచెలియ నాదరించరాదా

చ. 2: వాసననపువ్వులతోడివదలుఁ దురుముతోడ
ఆసలనిట్టూర్పులయలపులతోడ
పోసరించఁ బాదాలొత్తి పొందులెల్లాఁ దెలిపీని
వాసితోడిసతికిఁ గైవసముగారాదా

చ. 3: జడికొన్న పులకలుజాజికొన్న మేనితోడిఁ
కడలేనిరతి నిండుఁ గళలతోడ
అడరి శ్రీ వేంకటేశ ఆకె నిన్నుఁ గూడీని
యెడయనికాంతను నీవిట్టె మెప్పించరాదా

రేకు: 0857-1 తెలుఁగుఁ గాంబోది సం: 18-336

పల్లవి: ఇదివో నానోముఫల మేమిచెప్పేది
కదిసి వోరమణుఁడ కలవుగా నాకు

చ. 1: సొరిది నామీఁదను నీచూపులు నిండెఁ గనక
విరహవేదనచేత వేఁగనైతి
అరుదై యప్పటి మాటలాడితివిగనక
మరుబాణముల యలమటఁ బొందనైతి

చ. 2: నగవువెన్నెల నీది నాపై వారెఁ గనక
తగిలి చీఁకటిచింతఁ దలఁకనైతి
నిగిడి నీమనసుకు నేనే గుఱైతిఁ గనక
జిగిఁ గన్నీటివానలఁ జిక్కువడనైతి

చ. 3: నెలవై శ్రీ వేంకటేశ నీకౌఁగి లబ్బెఁ గనక
పలుమారు నలపుల బడలనైతి
చలువ నీమోవితేనెచవి దొరకెఁ గనక
పెలుచుఁ దమకముల బిరితియ్యనైతి

రేకు: 0857-2 ముఖారి సం: 18-337

పల్లవి: ఎంచిచూచితే నావల్ల నేమున్నది గుణము
పంచల నాపాలన గడపవయ్య ఇఁకను

చ. 1: పిలిపించుకొందురా ప్రియుఁడవు నిన్ను నేఁ
దలఁ చినప్పుడె రాఁ దగవుగాదా
వలపించితివి తొల్లె వద్దఁ బాయకుండాఁ జేసి
నిలుకడగాఁ గరుణించవయ్య యిఁకను

చ. 2: గుట్టుచేసుకొందురా కోరి నేనీకు మొక్కఁ గా
నెట్టన నీవే నవ్వుట నేరుపుగాదా
చుట్టమవు నాకు నీవు సుద్దులు నాతోనే చెప్పి
యిట్టె నావ్రత మీడేర్చి యేలవయ్య యిఁకను

చ. 3: మనసు సోదింతురా మర్మము నాకు నీవు
ఘనుఁడ శ్రీ వేంకటేశ్వర కలయరాదా
మునుపే నీయాలను నాముచ్చటెల్లా నీవు విని
యెనసి నాకిట్టె చనవియ్యవయ్య ఇఁకను

రేకు: 0857-3 బౌళి సం: 18-338

పల్లవి: మొక్కే నిదివో నేను ముమ్మాటికి
నిక్కము నీప్రియములే నేరపుమీ విభుఁడు

చ. 1: యెఱుకగలవాఁడవు యెవ్వరు బత్తిసేసినా
మఱవ వందరి నిట్టె మన్నింతువు
జఱసి నిన్ను నెంత చండిపరచితినో
యెఱఁగనైతి నాతప్పు లెంచకుమీ విభుఁడ

చ. 2: ఇచ్చకమే ఆడుదువు యేసతితోనై నాను
పచ్చిదేర నవ్వుదువు పంతమిత్తువు
కొొచ్చి కొచ్చి నే నెంత కుచముల నొత్తితినో
మచ్చరపుచేఁత లిఁక మానుమీ విభుఁడ

చ. 3: కడు మెచ్చనేరుతువు కదిసినవారిని
విడువక చనవిచ్చి వెలయింతువు
యెడయక నిన్ను రతి నెంత బడలించితినో
కడఁగి యేలుమీ శ్రీ వేంకటగిరివిభుఁడ

రేకు: 0857-4 కాంబోది సం: 18-339

పల్లవి: ఏమి సేతు నావోజ ఇటువంటిది
కోమలపుగానఁ గానఁ గొసరేఁ గాక

చ. 1: నిరతి నెఱఁగనా నీవు నన్ను లాలించేది
కెరలి మోహనఁ దమకించేఁ గాక
సరినెంచిచూడనా సతమైన నీగుణము
తరవాయి వచ్చుదాఁకాఁ దగిలేఁ గాక

చ. 2: తలఁచనా తొల్లి నీవు దక్కినన్ను నేలినది
అలసినవిరహాన నాడేఁ గాక
తెలియనా నీనిజము తేటతెల్లమిగా నేను
తిలకించి చూచి వేడ్కఁ దివిరేఁ గాక

చ. 3: ననుచనా నిన్నుఁ గూడి నాఁటనుండి కాఁగిట
మనసు చొక్కించినదాఁ కా మరిగేఁ గాక
యెనసితి విటు నన్ను నిదివో శ్రీ వేంకటేశ
తనిసి మందెమేళానఁ దడవేఁ గాక

రేకు: 0857-5 నట్టనారాయణి సం: 18-340

పల్లవి: పాయపుమదమునను భావించి చూడవుగాక
ఆయమెరిఁగిన సతి యట్టె నవ్వవలదా

చ. 1: పరగ నాపె వద్దఁ బవళించి వుండఁగాను
సరసములాడేవు సారె నాతోను
మరిగియున్న దాన మాటాడ సిగ్గువడితే
సరినున్నజవరాలు సాదించకుండునా

చ. 2: తోలుతే వచ్చినయాపె తొడమీఁదఁ గూచుండఁగా
పలుమారు నామీఁద బత్తి సేసేవు
తలుపుమాటుదాన తలవంచుకుండితేను
బలిమిగలదేవులు పంతములు మానునా

చ. 3: గట్టిగా నాపె నిన్నుఁ గాఁగిలించుకుండఁ గాను
ఇట్టె చేతులు చాఁచే నిటు నాపైని
దిట్టవై శ్రీ వేంకటేశ తెరవేసి నేఁ గూడితే
పట్టపుదేవులు నిన్నుఁ బంగించఁ దగదా

రేకు:	0857-6 శంకరాభరణం	సం:	18-341

పల్లవి:	ఇయ్యకొంటి రావయ్య ఇంటికి నీవు
	నెయ్యముగలచోటికి నేరము లెక్కడివి

చ. 1:	సిగ్గుపడి నీయెదుట చెక్కుపైఁ జెయ్యిడుకొంటే
	దిగ్గన నీ వంతలోనే తీసి వేసేవు
	యెగ్గులెంచఁ దప్పులెంచ నేలసిబ్బితిపడేవు
	సిగ్గుల నింత గలిగితే నేరము లెక్కడివి

చ. 2:	ముక్కుపై వేలిడుకొని ముందర నిలిచితేను
	చక్కనుండుమని వేలు సారెఁ బట్టేవు
	కక్కసించితినా నిన్ను కమ్మటి నేలలోఁగేవు
	నిక్కపుఁ జుట్టములైతే నేరము లెక్కడివి

చ. 3:	తఱితోఁ జన్నులుమోవఁ దలవంచుకొంటేను
	గుఱిగాఁ గాఁగిలించేవు కొప్పువట్టెత్తి
	యెఱఁగవా శ్రీ వేంకటేశ నన్నేలితివి
	నెఱజాణతనములే నేరము లెక్కడివి

రేకు: 0858-1 భైరవి సం: 18-342

పల్లవి: కాకున నేఁ బొరలితి కాతరాన బడలితి
నీకు మొక్కే నాకు బుద్ది నేరుపఁగఁ గలవా

చ. 1: అడ్డమాడఁ జాలను అవుఁగాదనఁ జాలను
దొడ్డదొరవు నీమాట తోయఁ జాలను
వెడ్డువెట్టి తొల్లి నీవే వేసాలు నేర్పితివి
యెడ్డతన మిఁక నాకు నెట్టు మానిపేవు

చ. 2: మనసులోదానను మచ్చికైన దానను
ఘనుఁడవు నీతో నేను గయ్యాళించను
చనవిచ్చి అన్నింటాను చవులుమరపితివి
యెనలేక నన్ను నెట్టు యీడేర్చేవో

చ. 3: వేవేలకు దూర నేను వేడుక చెల్లింతు నేను
శ్రీ వేంకటేశుఁడవు చెలఁగింతును
వావులు దెలిపి నాఁడే వలపులు చల్లితివి
కైవసమై నన్ను నెట్టు గరుణించేవో

రేకు: 0858-2 శుద్ధవసంతం సం: 18-343

పల్లవి: ఎంత గుట్టుగలవాఁడ విదివో నీవు నీ -
యంతరంగురాల నాతో నానతియ్యరాదా

చ. 1: వలచితినని నాతో వాకున నాడవు గాని
చెలపచెమట లుబ్బీఁ జెక్కున నీకు
నెలకొన్నతమకము నీలోనే దాఁచేవుగాని
వెలయ నిట్టూర్పు వెల్లవిరి సేసీని

చ. 2: చెనకి నన్నుఁగలయ సిగ్గులువడేవు గాని
మనసులో గుబ్బతిల్లీ మచ్చికలెల్లా
గొనకొన్న చూపులు గురులు సేయవుగాని
తనువునఁ బులకలు తతిగొనీని

చ. 3: పచ్చి దేరే యాసలు బయలు సేయవుగాని
నిచ్చలపు వెరగులే నిలువెల్లాను
ఇచ్చకపు శ్రీ వేంకటేశ నన్నుఁగూడితివి
అచ్చకపు మదనకళ లవిగో మోమునను

రేకు: 0858-3 సాళంగనాట సం: 18-344

పల్లవి: ఇంతదానవౌత నేఁ డే యెఱిఁగితిమే
కాంతుని కిన్నిటా నీవే కలిగితివే

చ. 1: పచ్చిదేరే మోవిమీఁది పలుకుఁదేనె లొసగ
యిచ్చకురాలవు నీవు యెఱుఁగుదువే
ముచ్చట సెలవినవ్వు ముత్యాలదండలుగట్ట
నిచ్చలానఁ జిన్ననాఁడే నేరిచితివే

చ. 2: సరుస కనుచూపుల చల్లువెన్నెల గాయించి
తరితీపు చూప నీవే దంట వౌదువే
నిరతి గుబ్బచన్నుల నిమ్మపండ్ల సూడిదెలు
సరవితో నియ్య నీవే జాణవవుదువే

చ. 3: జిగిమించుంగరముల శ్రీ వేంకటేశు నలమి
మిగులా వలపించఁగ మేఁటివౌదువే
మగఁడు నీవును గూడి మన్నన లిచ్చితి రిట్టె
జగములో మాకేలికసానివిగదవే

రేకు: 0858-4 సామంతం సం: 18-345

పల్లవి: ఎఱఁగనివానివలె నేమి చూచేవు
జఱియక కెమ్మోవి చవిచూపఁ దగదా

చ. 1: యెదురుగా నిలుచుండి ఇంతి ప్రియములు చెప్పి
వదలుఁ దురుము కడువంచి మొక్కీని
సదరానఁ గొంగువట్టి జాణతనాలెల్ల నాడి
కదిసి యాకెమనసు గరఁగించఁదగదా

చ. 2: కొలువు లట్టె చేసి కూరిములు పైనించి
చలువగాఁ బువ్వుల సేసలువెట్టీని
తలకొన నవ్వునవ్వి తతిఁ గుచగిరులంటి
లలిమీర మదనకళలు రేచఁదగదా

చ. 3: అండ నుండి చెక్కు నొక్కి అంకెల సన్నలుచేసి
మెండుకొన్న వూడిగాన మెప్పించీని
దండితో నలమేల్మంగఁ దగిలి శ్రీ వేంకటేశ
నిండుకొనఁ గూడితివి నీవు మెచ్చఁదగదా

రేకు: 0858-5 దేశి సం: 18-346

పల్లవి: ఇచ్చక మెఱఁగవద్దా ఇంతవాఁ డవు
కచ్చు పెట్టుకున్న దానిఁ గాకుసేతురా

చ. 1: చెలియను నవ్వించఁగా చిరుచెమటలు గారీ
అలయింతురా నీవు ఆఁటదానిని
సెలవులనవ్వులతో సిగ్గులు వడియఁ గాను
బలిమి నాపెచన్నులు పట్టవచ్చునా

చ. 2: అట్టె మాటలాడించఁ గా నదరము వసివాడీ
పెట్టుదురా గాసి నింత ప్రియురాలిని
చుట్టరికములెల్లాను చూపులనే తెలుపఁగా
గుట్టులేక కొప్పువీడఁ గొంగువట్టితీతురా

చ. 3: సారెఁ గాఁగిటఁ గూడఁగా జడిసీ మైఁబులకలు
మేరమీరుదురా యలమేలుమంగను
యీరీతి శ్రీ వేంకటేశ యీకె నిన్నుఁ గూడఁగాను
పేరెడిసరసములఁ బెనఁగ సంగతులా

రేకు: 0858-6 పాడి సం: 18-347

పల్లవి: ఎదురాడరాదు నాకు ఇల్లాల నేను
అదన నెన్నఁడు జాణవయ్యేవో యిఁకను

చ. 1: కాఁపురము సేసి యాకె కతలెల్లాఁ జెప్పఁగాను
యేపుమీర వింటివి నీవిందాఁ కాను
రేపుమాపు నిట్లానే యేపురేఁగి తిరుగఁగ
చేపట్టి బుద్దు లెవ్వరు చెప్పేరు నీ కిఁకను

చ. 2: చెలరేఁగి జవరాలు చేరి నిన్ను నవ్వించఁ గా
యెలమి సుకించితివి ఇందాఁకాను
వెలయఁ గ నీవిట్లా వేడుకకాఁడవు గాఁ గా
చెలఁగి సంసారము సేయు టెన్నఁడిఁకను

చ. 3: విచ్చనవిడి గలికి వేవేలుగాఁ గూడఁ గాను
ఇచ్చగించి నేర్చితివి ఇందాఁ కాను
మచ్చిక శ్రీ వేంకటేశ మరి నన్ను నేలితివి
తచ్చివే సిద్దరిమేలు తలఁచేవు యిఁకను

రేకు: 0859-1 ధన్నాసి సం: 18-348

పల్లవి: తనమర్మ మొకరితోఁ దడవేవారు గలరా
పనిలేనివారికేల పచరించేవయ్యా

చ. 1: చెల్లుబడిగలచెలి చెప్పినదెల్లా మాట
యెల్లచోటఁ బతికిఁ దోయఁగరాదు
పల్లదాన నిన్ను నాకె పలికినందుకుఁ గాను
చెల్లఁబో సతులకేల చెప్పేవయ్యా

చ. 2: సేసవెట్టిన మగువ సేసిన దెల్లాఁ జేఁత
వాసిఁ బెండ్లికొడుకు వద్దనరాదు
చేసూటి కొనగోరఁ జెనకినంతటిలోనె
యీసరిత లౌరులకు నేలచూపేవయ్యా

చ. 3: ననిచికూడినకాంత నవ్వినదెల్లా నవ్వు
వొనరి ప్రాణేశ్వరున కొడ్డుకోరాదు
యెనసి శ్రీ వేంకటేశ యీకె నిన్నుఁ గేరెనంటా
తనిసినవారికేల తలపించేవయ్యా

రేకు: 0859-2 సాళంగం సం: 18-349

పల్లవి: ఎఱఁగరా దేవులౌత యేల దాఁచేవు
మెఱయ నాకెమనసు మెప్పించరాదా

చ. 1: ముచ్చటాడవలెనంటా ముంగిటికి వచ్చె నాకె-
నెచ్చరించి యేల లోనియింటి కంపేవు
వచ్చివచ్చి తొంగిచూచి వాఁటముగా నవ్వీ నీతో
పచ్చడమేల కప్పేవు పై పై నీవు

చ. 2: వూడిగము సేసేనంటా వొద్దనే కూచుండె నాకె
పాడితోడ నీవేఁటికిఁ బని చెప్పేవు
వీడెము చేతఁ బట్టుక వేళలుగాచుకున్నది
వాడికెఁ దెరలో నెంతవడి మూనేవు

చ. 3: కందువఁ గూడేనంటా కైదండ ఇచ్చె నా కె
ఆందముగా మెచ్చి యంత ఆసవెట్టేవు
గందమిచ్చి శ్రీ వేంకటేశ పెండ్లాడె నిన్ను
యిందె నన్నేలితివి యేకాంత మేలాడేవు

రేకు: 0859-3 ఆహిరి సం: 18-350

పల్లవి: ఘనుఁడవు నీవొళ్ళఁ గపట మేది
ననిచి నీప్రియములు నమ్మివున్నదానను

చ. 1: తలపోసి నీనిజాలు తారుకాణించనేఁ టికి
సెలవినవ్వులలోనే చేఁగదేరీని
వొలిసినట్ల నీవు వొట్టువెట్టుకోకు మింక
నలుగడ నీసుద్దులు నమ్మివున్నదానను

చ. 2: పనివడి నన్ను నొడఁ బరచఁగ నేమిటికి
కనుసన్నలనే మేలు గానిపించీని
చెనకి పొందులు చూపి చేతులు చాఁచకు మిఁక
నను నెంత పొదిగేవు నమ్మివున్నదానను

చ. 3: పైకొని నీవల పింత పచరించనేఁటికి
యీకడ నీకూటమిలో నేరుపడీని
జోకల శ్రీ వేంకటేశ చొక్కించితివి నన్నిఁక
నాకడవాఁడవని నే నమ్మివున్న దానను

రేకు: 0859-4 శుద్ధవసంతం సం: 18-351

పల్లవి: ఏలోయి సటకాఁడ యెఱఁగనా నీసుద్దులు
పోలించి యాపెవలపు పూసేవు నా మీఁదను

చ. 1: పువ్వుల చెండున వేసెఁ బొరుగున నుండి చెలి
ఇవ్వల నాదిక్కు చూచే వేమీ నీవు
నవ్వేవు నీకితవైతే నాచేతి కిటు చూపు
నివ్వటిల్ల నిజాలకు నే వేసేఁగాని

చ. 2: కుంకుమ నీపైఁ జల్లె కొలువునున్నకాంత
అంకెల నాచేయి దట్టే వప్పటి నీవు
జంకించే వంతగలితే నింకా నదే నాకు నిమ్మా
కొంకుగొసరెల్లాఁ దేర కోరి చల్లే నిపుడు

చ. 3: మెచ్చి నిమ్మపంటఁ జిమ్మె మేడమీఁదనున్నసతి
కొచ్చి యడిగి కాఁగిటఁ గూడేవు నన్ను
పచ్చిగా శ్రీవేంకటేశ బత్తి నాపైఁ గలిగితే
మచ్చిక నదె ఇచ్చితే మరివేసే నిన్నును

రేకు: 0859-5 భైరవి సం: 18-352

పల్లవి: ఇట్టిదివో నాగుణము యెరిఁగివుందువు గాని
గుట్టుతోడ నుందుఁగాని కొసర నిన్నెపుడు

చ. 1: యీసడించనోపఁగాని ఇచ్చలాడఁ జాలుదును
సేసిన రేపల్లెలోని సేఁతలకును
ఆసగించవచ్చుఁగాని ఆదరించరాదు నిన్ను
వేసాలగందమువారి వెలఁదిపొందులకు

చ. 2: నిందలాడఁజాలఁగాని నిన్ను మెప్పించఁగలను
అందపునీమధురలో ఆసుద్దులకు
మందటాడ నేమిటికి మచ్చిక సేయఁదగును
అంది పదురువేలఁ బెండ్లాడినందుకు

చ. 3: కాదననేరఁగాని కలయఁగనేర్తును
సోదించి నీకొలనిలోసుద్దులు విని
సాదించి శ్రీవేంకటేశ చనవిచ్చి నన్నే లితి-
వాదరించు టొప్పుఁగాని అలఇంచ కిఁకను

రేకు: 0859-6 సౌరాష్ట్రం సం: 18-353

పల్లవి: ఎరపరిక మున్నదా యిద్దరిలోన
తరుణిపంతము నీపెద్దరికము గాదా

చ. 1: పవ్వళించి నీతొడపై నింతి యున్న దంటా
రవ్వలేల సేసేవు రమణులతో
నివ్వటిల్ల నింతగా మన్నించినవాఁడవు నీవె
జవ్వనివేడుకలకు సమ్మతించఁదగదా

చ. 2: కలికి నీయెదుటను గద్దెమీఁద నెక్కెనంటా
కొలువులో నిటులాడుకొందురా నీవు
చెలఁగి వేడుకచెల్లించినవాఁడ విటు నీవె
చెలిదొరతనము నీసింగారము గాదా

చ. 3: రతుల నీదేవులు పురముమీఁద మించెనంటా
కతగాఁ జెప్పేవు పూడిగపువారికి
యితవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
సతివినోదము నీవు సారె మెచ్చవలదా

రేకు: 0860-1 రీతిగౌళ సం: 18-354

పల్లవి: ఎట్టు నేరుచుకొంటిరి ఇద్దరు మీరు
దట్టమైన మీసుద్దు లిందరు మెచ్చేరయ్యా

చ. 1: సన్నపు గుబ్బలమీఁద చంద్రవంకలుగా నొత్తి
వెన్నెలపులుఁగాలాడే వేడుకకాఁడా
కిన్నెర వాయించేనంటా కెరలిన సిగ్గుతోడ
కన్నే మూసుకొనెను నీకంటే జాణయ్యా

చ. 2: మమతఁ జెక్కులమీఁద మళ్లుగా గోరను గీరి
చెమట నీళ్లు గట్టే సేదెగాఁడ
తమిఁ బాదాలో త్తేనంటా తనబుజాల నిడుక
కొమరె చెంపల నొత్తుకొనె మేలయ్యా

చ. 3: చొక్కపుమోవిపైఁ గస్తూరి నిగరాలు నించి
పెక్కు వలపు లమ్మేటి బేరగాఁడ
నెక్కొని శ్రీవేంకటేశ నిన్నుఁ గాఁగిటఁ గూడీకె
మొక్కలాన నీతమ్ములానఁ గప్పెనయ్యా

రేకు: 0860-2 బౌళి సం: 18-355

పల్లవి: కంటిమిగా నీసేఁతలు కన్నులపండువగాను
దంటతన మిన్ని టాను తగునే నీకిపుడు

చ. 1: చెప్పినటు సేసితఁడు చేతికి లోనై వుండఁగాఁ
నిప్పుడు గాక నీపగ టిఁక నెన్నఁడే
కొప్పువట్టితీసేవు కొంగువట్టి పెనఁగేవు
చిప్పిలీ నీగర్వ మేమిచెప్పేదే ఇపుడు

చ. 2: నెమ్మది నింటిలోఁ బతి నీసొమ్మయి వుండఁగాను
యెమ్మెలు చూపుదువుగా కిఁక నెన్నడే
చిమ్మేవు కొనగోర చేతులు పైఁజాఁచేవు
కమ్ముకొనీ నీమదము కడలేదే ఇపుడు

చ. 3: ఇచ్చలఁ గూడి శ్రీ వేంకటేశుడు మన్నించఁగా
హెచ్చినీపంతములెల్లా నిఁక నెన్నఁడె
మెచ్చుగా నన్ను నేలించి మేలములాడించేవు
రచ్చల నీసంపదలు రాఁగదవే ఇపుడు

రేకు: 0860-3 లలిత సం: 18-356

పల్లవి: కొత్తపెండ్లి కూతురవా కోమలి నీవు
పొత్తుకు బిలువఁ గాను పొద్దు గడపుదురా

చ. 1: చిత్తములోపలిమాట సిగ్గులువడక పతి-
కొత్తివిన్నవించగదే వువిద నీవు
హత్తి చేయివట్టుకొని యతఁ డు పెనఁగఁ గాను
ఇత్తల నీవెంతకెంత గుట్టుసేసేవే

చ. 2: చేసినసేఁతలకెల్లా జేరి మొగమోడితేను
వ్రాసి చూపఁగదవే వనిత నీవు
సేసవెట్టి నీమగఁడు చెంది తప్పక చూడఁ గా
రాసికెక్కె ఇంకాను శిరసు వంతురటవే

చ. 3: తగిలి వేడుకైతే తతి శ్రీ వేంకటేశునితో
నగవే యలమేల్మంగ ననిచి నీవు
జిగి నిన్ను నీతఁడే చెలరేఁగి కూడఁగాను
మిగులా సన్నలు సేసి మేలమాడేవటవే

రేకు: 0860-4 దేశాక్షి సం: 18-357

పల్లవి: అప్పుడే యెఱఁగనైతి ననవద్దు
తప్పక రక్షించేట్టి పెద్దరికము సుమ్మీ

చ. 1: పట్టిన చలము తోడి పంతగాఁడవు నీవు
రట్టుసేయకుమీ రతిదిట్టను నేను
ఇట్టిదొరఁ గాఁ జేసి యేలుకొంటివి
నెట్టన బేరుఁగీరితి నీదేసుమ్మీ

చ. 2: ఇన్నిటా బలిమిచూపే యెమ్మెగాడవు నీవు
చన్నుల జీర దియ్యకు సతిని నేను
పిన్ననాడే మరిగించి పెండ్లాడితివి
ఇన్నిటా మన్నించుటే యెక్కుడుసుమ్మీ

చ. 3: వెఱపు లేని పొందుల వేడుకకాఁడవు నీవు
మఱవకుమీ యలమేల్మంగను నేను
గుఱిగా శ్రీ వేంకటేశ కూడితివి
మెఱయ నాపైకరుణ మేలేసుమ్మీ

రేకు: 0860-5 రామక్రియ సం: 18-358

పల్లవి: అంగడిమావలపు నీకనువాయను
వుంగరము వెట్టవయ్య వొక్కమనసాయను

చ. 1: తమకించి నీవు ముందే తగవులు చెప్పఁగాను
అమర సాకిరెవ్వరి నడిగేము
రమణుల మిద్దరము రతికి లోనైతిమి
జమళిఁ బెండ్లాడవయ్య చలము లీడేరెను

చ. 2: పొదగి నీవే మాకు బుద్ధులు నేరుపఁ గాను
కదిసి మాకిఁక నేల కాఁతాళాలు
సదరాన నీకు నేము చనవరుల మైతిమి
ఇదె సేసవెట్టవయ్య యెంచినటు లాయను

చ. 3: శ్రీ వేంకటేశ నీవు చేరి మమ్ముఁ గూడఁగాను
చేవదేరె నెవ్వరేమి చెప్పే రింక
భూవనిత యాకె నెప్పుడూ నలమేల్మంగను
నీవే కాఁగలించవయ్య నిండెను వేడుకలు

రేకు:	0860-6 చాయనాట	సం:	18-359

పల్లవి:	నిన్నటిపంతాలకు నేఁడేఁటికే
మన్ననలు చేకొనుటే మంచిదివో చెలియా

చ. 1:	వొడివట్టి తియ్యఁగాను వోపననేఁటికే
బడిబడి దిరుఁగఁగాఁ బాయ నేఁటికే
అడియాలా లొసఁగఁగా నానవెట్టనేఁటికే
వొడఁబాటు సేసుకొను టుచిత మే వనిత

చ. 2:	సెలవుల నవ్వఁ గాను సిగ్గులింకానేఁటికే
మలసి పెనఁగఁగాను మంకులేటికే
వలపులు చల్లఁ గాను వాసు లింతయేఁటికే
కలపుకోలుదనమె కందువ వోమగునా

చ. 3:	కాఁగలించుకొనఁగాను కడపఁగనేఁటికే
మాఁగినమో వియ్యఁగాను మఱఁగేఁటికే
చేఁగదేరఁ గూడె నిదె శ్రీవేంకటేశ్వరుఁడు
వీఁగనిరతులఁ గడువెలయవే సకియ

రేకు: 0861-1 నాగగాంధారి సం: 18-360

పల్లవి: ఏఁటికి సిగ్గులువడే వెదుటను నన్నుఁ గని
కూటము లిద్దరికీఁ గైకొలుపుదునా

చ. 1: సముకాన నుండఁగాను సతిమోము చూచి చూచి
తమకించి లోలోనే తడఁబడేవు
చెమరించె జెక్కులెల్లా చిత్తడాయ పచ్చడము
తిమిరేవు ఇద్దరికిఁ దెరవేతునా

చ. 2: ఎంతగా మాటలాడఁగ వీనులను విని విని
దొంతరయాసలచేతఁ దొక్కులాడేవు
చింత నిట్టూర్పులు రేఁగి జిగిమించెఁ బులకలు
బంతినే మీ ఇద్దరికి బాగా లొసఁగుదునా

చ. 3: సారెసారె నవ్వఁగాను సవర నీమోవి సోఁకి
మేరమీరి వేడుకతో నోరూరేవు
యీరీతి శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
చేరితి రిద్దరికిని నేసలందిఇత్తునా

రేకు: 0861-2 పాడి సం: 18-361

పల్లవి: చూడవయ్య ఇవి ఇంతిసొంపులెల్లాను
తోడనే కూచుడవయ్య తొయ్యలిసంగడిని

చ. 1: నీవు విచ్చే సేవనుచు నేలఁతతో జెప్పితేను
చేవదేరి మిగులానుఁ జెంగలించేను
లేవె గని పవ్వళించే నోవరి సింగారించె
ఆవటించి పరిమళా లాయిత్తము సేసేను

చ. 2: తను బెండ్లాడేవనుచు తరుణి కెరిఁగించితే
ఘనమైన సంతోషాన కలరేఁగెను
మునుకొని ముంగిటను ముత్యాలముగ్గులు వెట్టి
యెనలేని ఆరతు లాఇత్తముగఁ జేసేను

చ. 3: నెలకొని తెరలోన నీదిక్కు చూపితేను
నలువంక సెలవులు నవ్వు నవ్వేను
యెలమి శ్రీవేంకటేశ ఇదె నీవు గూడితివి
అలరిన మోవివిందు లాయిత్తము సేసేను

రేకు:	0861-3 వరాళి	సం:	18-362

పల్లవి:	నమ్మితిఁ దనచిత్తము నాభాగ్యమే
	తెమ్మలుగాఁ దనలోనే తెలుసుకొమ్మనవే

చ. 1:	మనసు మర్మ మెరుఁగు మాటలసంగ తెరుఁగు
	యెనసి విన్నపములు ఇఁకనేఁటికే
	చెనకులు నా మేనివి చేఁతలు తనకు దక్కె
	నొనరఁ దనసొమ్మయి వున్నదాననే

చ. 2:	చదివించివాఁ డు దానె చనవు దా నిచ్చినదే
	యిదె నామతి సోదించే దెందాఁ కనే
	మొదలఁ బెండ్లాడినాఁ డు మోహము సేయించుకొనె
	కదిసి కంకణ మిదె కట్టుకొంటినే

చ. 3:	కాయముపైఁ జెయివేసి కళలంటి కూడినాఁడు
	యీయెడ నొడఁ బరచే దెంతటిపనే
	పాయఁడు శ్రీ వేంకటాద్రిపతి దా నన్నెప్పుడును
	పాయమెల్లాఁ గానుకగాఁ బట్టితి నేఁ గదవే

రేకు: 0861-4 శ్రీ రాగం సం: 18-363

పల్లవి: మగువరో ఇందుకే నీ మగఁడు మోహించినాఁడు
పగటున రాఁ గదవే బాఁతిపడీని

చ. 1: కప్పురాల వంటినీ కందువ పలుకులనే
దప్పిదేరి తమకము ద్రై లువారీని
రెప్పలచూపులలో మీరిన మెరుఁగులనే
కుప్పళింపు వలపులు గురులయ్యీని

చ. 2: బంగారు నిగ్గులు దేరే బాహు మూలపు కాంతుల
కంగవించి వొడిగట్టి యాసగించీని
కుంగని నీవురము పై కుచదుర్గములనే
సంగతిఁ దాపు సేసుక సంతోసించీని

చ. 3: తేటలై ననీమోవితేనెలవిందుల కే
వాటముగ నోరూరి వచ్చియున్నాఁడు
మేటి శ్రీ వేంకటేశుఁ డు మెచ్చి నీకాఁగిటఁ గూడి
కోటికోటిరతులఁ జొక్కుచు నవ్వీని

రేకు: 0861-5 కాంబోది సం: 18-364

పల్లవి: మాపుదాఁకా నొడఁ బాటమాటలు గద్దా
యీపని తోల్లే తానెఱుఁగు రమ్మనవే

చ. 1: కూరిమిగలుగుచోట కోప మేమిసేయునే
నేరిచినవారికి నేరమేడదే
ఆరితేరినపొందులు ఐతే వేసటెక్కడిదే
ఆరజము సేయ కింటి కాతని రమ్మనవే

చ. 2: వేడుకలే సతమైతే విసువు లెందుండునే
పాడితో నడచితేను భయమేఁటికే
వాడికైతే వలపులు వద్దంటే మానునా
యేడసుద్దులు చెప్పిని ఇంటికి రమ్మనవే

చ. 3: చేతికిలోనై వుండఁ గా చేసన్న లమరునా
కాతరమే కలిగితేఁ గసటు లేదు
యేతుల శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్ను నేలె
యీతగవు తా నడపె నింటికి రమ్మనవే

రేకు: 0861-6 వంతవరాళి సం: 18-365

పల్లవి: ఏఁటికి నెంచేవు మమ్ము నితవరివలెనే
నాటకపు నీగుణము నానఁ బోయీనా

చ. 1: అగపడి కొలువులో నతివలెల్లా నుండఁగా-
నెగసక్కెమువలె నన్నేమి చూచేవు
మగఁడవైనా మెత్తని మనసు వాఁడవు నీవు
నగుబాటు నీవలపు నాటుకొనీనా

చ. 2: కతలుచెప్పీన సతులు కాచుకుండఁగా నాతోనే
మతకమువలె నేమి మాటలాడేవు
పతివై నాఁ గాని యఁటుబచ్చులివంటివాఁ డవు
పతివై నీకొకవంక చవివుట్టీనా

చ. 3: కొమరెలు వరుసకు కోరివేఁ వేఁడివుండఁ గాను
భ్రమసినట్టె నా కెంత బత్తిసేసేవు
రమణుఁడవైనా మీరవు శ్రీ వేంకటేశుఁడ
తమకపు నీరతులకు దారదప్పీనా

రేకు: 0862-1 శుద్ధవసంతం సం: 18-366

పల్లవి: ఆసుద్దు లన్నియుఁ జెలి నడుగరాదా
సేసవెట్టితివి నీచేతిదాయ వలపు

చ. 1: పొంకముగా నెవ్వతెతో పొందుసేసి వచ్చితివో
జంకెన చూపుల నీకె సాదించీని
లంకెల నప్పటి మరి లచ్చన లేమిగనెనో
వుంకువ మోవెంటించితే వొడ్డుకొనీని

చ. 2: మేరమీర వింతసొమ్ము మేన నీ కెంత వున్నదో
నారుకొన సెలవుల నవ్వు నవ్వీని
పేరుకొని యేవనిత పిలువఁ గ వినెనో
వూరకే మాటాడఁ గాఁ జెవులు మూసుకొనీని

చ. 3: వురము గందమెవ్వరి వొడల మెత్తినదో
గరిమఁ గాఁగిలించితే కడులోఁ గీని
మరిగి శ్రీ వేంకటేశ మనసెట్టు దెలిసెనో
సరుగ నిన్నుఁ గూడి సన్న సేసీని

రేకు: 0862-2 సామంతం సం: 18-367

పల్లవి: చేపట్టుఁ గుంచమవై చేరి ఇట్టె నాతోను
కాఁపురము సేయవోయి గండికోటకేశవా

చ. 1: మన్ననలనే చొక్కి మంతనాన నీవొద్ద
కిన్నెర వాయించితిఁ గెల్లురేఁగి
చన్నులపై నీవు లేఁతచందురుల నించితివి
కన్నుల మెచ్చితినోయి గండిగోటకేశవా

చ. 2: జంటవాయలేక మోవిచవి చూపి నిన్ను నిమ్మ-
పంటఁ గొని వేసితిఁ బంతముతోను
నంటుచేసి పువ్వుదండ నాపై వేసితివి
కంటిమెయి నీజాడలు గండిగోటకేశవా

చ. 3: కడుమంచితనములఁ గాఁగిట నిన్నెలయించి
అడరి పెండ్లాడితి నన్నిటా నిన్ను
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కడలేదు నీమోహము గండిగోటకేశవా

రేకు: 0862-3 లలిత సం: 18-368

పల్లవి: ఈ గుణాలు మీకె కల విద్దరికిని
చేగదేరఁ బొగడేరు చెలులెల్లా మిమ్మును

చ. 1: యెగసక్కేలకు బతి యేమేమి సేసినాను
వొగరులాడక వూరకున్నదే సతి
సొగసేయాఁటది యెంత సోఁక సరసమాడినా
వెగటులేకున్న యట్టివిభుఁడే జాణఁడు

చ. 2: అవల రమణుఁ డెంత యగ్గలికఁ దిరిగినా
చవి సేసుకుండేది సకియ
జవరాలు తను నెంతచలము సాదించినాను
అవుఁగాదననివాఁడే అందపురమణుఁడు

చ. 3: కమ్ముకొని ప్రియుఁడెంత కాఁగిట నలయించినా
సమ్మతించి వుండేది అచ్చపుదేవులు
నెమ్మి శ్రీ వేంకటేశ నెలఁత రతి మించినా
నెమ్మది మన్నించితిటు నీవే నాయకుఁడవు

రేకు: 0862-4 సాళంగనాట సం: 18-369

పల్లవి: మొక్కలీఁడవయ్య నీవు ముద్దు విట్ఠలా మా-
పక్కవాయ వెప్పుడును పండరంగివిట్ఠలా

చ. 1: చిక్కని చల్లలమ్మఁ గాఁ జేరి విట్ఠలా మా-
జక్కవచన్నులంటేవు సారె విట్ఠలా
తొక్కేవు మాపాదాలు దొమ్మివిట్ఠలా
పక్కన మై చెమరించెఁ బండరంగివిట్ఠలా

చ. 2: వేళగాచి వచ్చేవు మావెంట విట్ఠలా కడు-
మేలములాడఁ జేరేవు మేటివిట్ఠలా
కోలుముందై చెనకేవు గొంటువిట్ఠలా
పాలుగాంచి(చే) వేళనే పండరంగివిట్ఠలా

చ. 3: సారిది గచ్చకాయలు చూప విట్ఠలా
సరిబేసు లాడేవు జాణవిట్ఠలా
గొరబై శ్రీ వేంకటాద్రిఁ గూడి విట్ఠలా
పరగ మావద్ద నుంటి పండరంగివిట్ఠలా

రేకు: 0862-5 మౌళవిగౌళ సం: 18-370

పల్లవి: చక్కఁ దనాల మించీ నిచ్చుటఁ గృష్ణుఁడు
వెక్కసీఁడు గదవమ్మ వెన్నముద్దకృష్ణుఁడు

చ. 1: గొల్లెతలఁ గొంగువట్టీఁ గోరి కోరి కృష్ణుఁడు
వెల్లివిరిగా నవ్వీ వేడుకతోఁ గృష్ణుఁడు
పల్లదపుమదమునఁ బచ్చిదేరీఁ గృష్ణుఁడు
వెల్లివలపులు చల్లీ వెన్నముద్దకృష్ణుఁడు

చ. 2: మంతనము లాడుతానే మరిగించీఁ గృష్ణుఁడు
బంతిమోవు లడిగీని బాలకృష్ణుఁడు
దొంతివెట్టి ముద్దులెల్ల దొరకొని గృష్ణుఁడు
వింతనేర్పులెల్లాఁ జూపీ వెన్నముద్దకృష్ణుఁడు

చ. 3: బలిమిఁ గాఁగిట నించీ పాయకిదే కృష్ణుఁడు
తిలకించి చూపు చూచీ దిట్టకృష్ణుఁడు
కలసి మన్నించె విదే కైవసమై కృష్ణుఁడు
వెలసె శ్రీ వేంకటాద్రి వెన్నముద్దకృష్ణుఁడు

రేకు: 0862-6 బౌళి సం: 18-371

పల్లవి: చేవదేరె వలపులు చేతిలోని వీడెము
తేవోయి భూపతిచెర్వు తిరువెంగళప్పఁడా

చ. 1: బీరములాడఁ గ నీతోఁ బెనఁగులాడేమా
చేరి నీవు నవ్వఁ గానే చెనకేఁ గాక
రారాదా ఇంకనైన రంతులేల మాయింటికి
ధీరుఁడ విన్నిటా నీవు తిరువెంగళప్పఁడా

చ. 2: గుట్టుతోడ నుండఁగాను కొంగువట్టి తీసేమా
జట్టిగొని పెండ్లాడఁగా జరసేఁ గాక
పొట్టఁ బొరుగబ్బె నీకు పొత్తునఁ గూచుండవోయి
దిట్టవౌదు వన్నిటాను తిరువెంగళప్పఁడా

చ. 3: చలపట్టితే నీతో సారె బలిమిసేసేమా
ఆలరి కాఁగిలించఁగా నలమేఁ గాక
సులభమాయఁగదోయి చొక్కపునా తోడి రతి
తెలసి శ్రీవేంకటాద్రి తిరువెంగళప్పఁడా

రేకు: 0863-1 ధన్నాసి సం: 18-372

పల్లవి: నీవేల సిగ్గువడేవు నీకు మోహించె నితఁడు
చేవదేర పొందుసేసి సేసచల్లఁగదవే

చ. 1: పరగ నీదిక్కు తప్పకచూచీ నితఁడు
గరిమ నీవేళనే కానుకియ్యవే
సరసము లప్పటిని సారె సారె నాడీని
తెరలోనికిఁ బిలిచి తేనేమో వొసగవే

చ. 2: ననువునఁ దమి రేఁచి నవ్వులు నవ్వీ నితఁడు
మనసు రంజిల్ల మర్మము లంటవే
పెనఁగుచు నింతలోనే ప్రియములు వచరించీ
చనుఁగన నప్పళించి జట్టిగొనఁనదవే

చ. 3: వూరకే నీవొడిపట్టి వుంకువవెట్టీ నితఁడు
గారవపుఁ గాఁగిటను కళరేఁచవే
కోరి విజనగరపుకోనేటి శ్రీ వేంకటేశుఁ
డీరీతి నిన్ను గూడె నిన్నిటాను మెచ్చవే

రేకు: 0863-2 నారయణి సం: 18-373

పల్లవి: నమ్మిక గావలె నిన్ను ననిచినదాఁకాను
కొమ్మనీపాలఁ గలిగె కొత్తపెండ్లికూఁతురు

చ. 1: మచ్చిక నప్పుడాకెతో మాటలేమేమాడితివో
యెచ్చుటా మఱవకుమీ యెదలోనను
నిచ్చ నీవొద్దిచెలుల నీవోజ యెఱుఁగుదురు
కొచ్చి యానెలఁత నీకు కొత్తపెండ్లికూఁతురు

చ. 2: సరవి నేకతమున చనవు లేమిచ్చితివో
తరవాతఁ జెల్లించుమీ తప్పకుండాను
పొరుగిరుగువారు నీబూటకాన కోపుదురు
గొరబుల నీవనిత కొత్త పెండ్లికూఁతురు

చ. 3: కట్టిగా నన్ను నేలి సరి నాపెఁ గూడితివి
ఇట్టె మన్నించుమీ యెన్నికగాను
నెట్టన శ్రీ వేంకటేశ నీదేవుళ్లెల్లా దిట్టలు
గుటున నీకన్నెయైతే కొత్తపెండ్లికూఁతురు

రేకు: 0863-3 దేసాళం సం: 18-374

పల్లవి: తనంత నెఱఁగడు తా నీకెమాయ
ఇనుమడిగా మీరే యెచ్చరించరే

చ. 1: పువ్వులవాట్లు మేనఁ బుప్పొడిచొప్పులె త్తిచ్చి
యివ్వల నూరకే నిజాలేల చేసీనే
చివ్వనఁ దలమై తానే జగిఁ జూచుకోఁడో యేమో
యివ్వల మీరైనాఁ జెలు లెచ్చరించరే

చ. 2: పన్నీరువసంతాలు పైచారలు చూపిచ్చి
చెన్నుమీర సాకిరేల చెప్పించీనే
అన్నిటా దనసింగారా లద్దములోఁ జూడఁడేమో
యిన్నిటా మీరైనాఁ జెలు లెచ్చరించరే

చ. 3: కూడినచన్నులతాఁ కులకుమ్మలే పట్టియిచ్చి
యీడనే శ్రీ వేంకటేశుఁ డేల దాఁచీనే
యీడగా నన్నేలె నాయెఱుక దెలియఁడేమో
యీడేరె మీరైనాఁ జెలు లెచ్చరించరే

రేకు: 0863-4 శ్రీ రాగం సం: 18-375

పల్లవి: కడలేనికీరితి గట్టుకొంటివి
చిడుముడి నింకా సంతోసించేము నిన్నును

చ. 1: బలిమికాఁడ వౌదువు పంతమెల్లా నీకుఁ జెల్లె
చలము లింతులనే సాదించితివి
చెలియ భావము నీవు చిత్తగించి మన్నించు
పొలుపుమిగుల నేము పొగడేము నిన్నును

చ. 2: నేరుపరి వౌదువు నేమాన నడచితివి
యీరీతిఁ గాంతల గెల్చి యీడేరితివి
సారెకు నీవనితకు చనవిచ్చి దయఁ జూడు
మేరమీర బ త్తిసేసి మెచ్చేము నిన్నును

చ. 3: తగవరి వౌదువు తప్పు దేరుచుకొంటివి
తగలి చొక్కించితివి తరుణులను
నగుతా శ్రీ వేంకటేశ నలినాక్షిఁ గూడితివి
జగములో జాణవని చాటేము నిన్నును

రేకు: 0863-5 మధ్యమావతి సం: 18-376

పల్లవి: చూతము నీనేరుపు సుదతియెదుట నేఁడు
కాతరీఁడ వీగుట్టు కనుకొనవయ్యా

చ. 1: పడఁతి మాఁటలనే బయలువందిలి వెట్టె
జడియక నీవది విచారించవయ్యా
వెడఁగు నవ్వులనే వెన్నెలలు వెదవెట్టె
కడలేక పోదిసేయఁ గదవయ్యా

చ. 2: కుమ్మరింపుఁ జూపులనే కుచ్చె నీలాలుపేరులు
కమ్మి యిట్టె నీవు మెడఁ గట్టుకోవయ్యా
బొమ్మల జంకెనలనే పొదిగె ముసుఁగువెట్టె
పిమ్మటఁ దెలిసి తప్పించుకొనవయ్యా

చ. 3: జవ్వనమదములు సరుస రాసులువోసె
చివ్వన నింతటనై నా చేపట్టవయ్యా
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ గూడితి విటు
ఇవ్వల మమ్మేలితివి ఇట్టె మెచ్చవయ్యా

రేకు: 0863-6 పాడి సం: 18-377

పల్లవి: ఇంతులాల చూడరే యీతనియెగసక్కేలు
రంతుసేసి వీఁపుగానరాఁగాఁ దాఁగీని

చ. 1: ఆనలువెట్టఁగనేలే ఆనోరి పెదవుల
కానుకలై లచ్చనలు గానరాఁగాను
మోనాన నుండఁగనేలే ముంచినయాగుట్టుతోనే
ధ్యాన మాపెమీఁదట తగలై యుండఁ గను

చ. 2: బొమ్మల జంకించనేలే పూఁచి యానొసలనె
కమ్మి లత్తుక చిహ్నలు గానరాఁ గాను
ఇమ్ములను నిట్టచూపులేలే యాకన్నుల
కమ్మినమదరాగము గప్పియుండఁగను

చ. 3: అప్పటిఁ బెనఁగనేలే ఆయురముమీఁ దనే
ముప్పిరిఁ జన్నులంటినముద్ర లుండఁగను
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డిటు తానె నన్నుఁ గూడె
యెప్పుడ నాపెఁ దాను యెనసి వుండఁ గను

రేకు: 0864-1 నాగవళి సం: 18-378

పల్లవి: నడుమ వలసితేను నవ్వేము నేము
చిడుముడి నిఁక మీరు సేసినట్టె చెల్లును

చ. 1: మగువ కన్నుల మొక్కె మనసున దీవించు
యెగసక్కెమాడెనా యేమిచూచేవు
తగవరి యాపె నీవు తలఁపు కొద్దివాఁడవు
జిగిమీర మీరిఁకఁ జేసినట్టె చెల్లును

చ. 2: కొమ్మ నవ్వు గానుకిచ్చె గుట్టుననే అందుకో
పమ్మి నిన్ను దూరెనా భయమేఁటికి
వుమ్మడిఁ జెప్పించె నాపె వొడఁబడితివి నీవు
చిమ్మిరేఁగి మీరిఁకఁ జేసినట్టె చెల్లును

చ. 3: దేవులై కలలోఁ గూడె దిష్టమిట్టె సేవ చల్లు
మోవనాడెనా నన్ను ముట్టికూడేవు
వావులు చెప్పెనాకె వసమయితివి నీవు
శ్రీ వేంకటేశ మీకుఁ జేసినట్టె చెల్లును

రేకు:	0864-2 కురంజి సం:	18-379

పల్లవి:	ఎవ్వరి నేమడిగేవు యెందాఁకాను
	రవ్వలేల సేసేవు రతిఁ గూడరాదా

చ. 1:	చిగిరించె వలపులు చేగదేరె సిగ్గులు
	నగవు సెలవి నిండె నలినాక్షికి
	అగడేల సేసేవు ఆసలేల దాఁచేవు
	తగు మీకిద్దరికిని తలఁచుకోరాదా

చ. 2:	పచ్చిదేరే కళలు బలువాయఁ దమకము
	రచ్చకెక్కె విన్నపాలు రమణికిని
	కొచ్చి యెంతపెనఁ గేవు కోరికలెట్టుడి పేవు
	హెచ్చుఁ గుందు లేదు మీకు నెనయఁగరాదా

చ. 3:	తారుకాణాయఁ జూపులు తతిగొనెఁ బాయము
	మేరుతో నీపొందు లబ్బె మెలుఁతకును
	యీరీతి శ్రీ వేంకటేశ యీగురు లెట్టు మూసేవు
	యీరసములేదు మీకు యిచ్చనుండరాదా

రేకు: 0864-3 ఆహిరినాట సం: 18-380

పల్లవి: బాపురే యింత గాకుంటె భ్రమతురా గొల్లెతలు
యేపున జాణతనాలు యింతేసి నేర్చితివి

చ. 1: ప్రియురాలనై నీకు పెక్కుసేవలు సేయఁగా
నయగారిమాటలాడి నవ్వించేవు
బయకారివాఁడవని పడఁతులచే వింటి
నియతితో సరివచ్చె నీగుణములెల్లను

చ. 2: అచ్చలాన నే నీకు నాలనై వుండఁ గాను
యిచ్చకములెల్లాఁ జేసి యెలయించేవు
తచ్చనకాఁడవని తగుల నిన్నాడుదురు
వచ్చెఁ దారుకాణలు వరుస నీసుద్దులు

చ. 3: యేకతాన నే నిన్ను యెలమిఁ గూడుండఁ గాను
కాకరితనాలఁ దమి కడురేఁచేవు
మేకులవాఁడవని మెత్తురు శ్రీ వేంకటేశ
జోకలతో నీడువచ్చె సారిది నీకతలు

రేకు: 0864-4 కాంబోది సం: 18-381

పల్లవి: విన్నవించరే పతికి వెలఁదులాల
సన్నయెరిఁగితేఁ దానే సమ్మతించుఁగాక

చ. 1: దిట్టయైనయట్టివాఁడు తిట్టితేఁ గోపించునా
నట్టనడుమ సెలవి నవ్వుఁగాక
ఆట్టడైనవాఁడు యాఁటడి కట్టె లోఁ గునా
జట్టిగొని పైపైని సంతసించుఁ గాక

చ. 2: కడుజాణఁ డైనవాఁ డు కదిమితే దూరునా
తడయక పిలిచి యాదరించుఁ గాక
చిడుముడి పంతగాఁడు సిగ్గులకు లోనౌనా
విడువని రతులకు వేగిరించుఁ గాక

చ. 3: వలచినయట్టివాఁడు వాసులెల్లా నెంచునా
కలసి కాఁగిట నించి కైకొనుఁ గాక
యెలమి శ్రీ వేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁ గూడె
తలఁపెల్లా నీడేర్చి దక్కియుండుఁ గాక

రేకు: 0864-5 పాడి సం: 18-382

పల్లవి: ఊరకుండవయ్యు నాకు నొక్క మనసాయ
ధీరత నీగుణము సోదించినదే కాదా

చ. 1: దతి నాకేమైనా చుట్టముగాదా తొల్లి
యెదిరించి మాటాడితే నేమాయను
పుదుటున నన్ను నెంచ వొడఁ బరచవచ్చేవు
కదిసి నీమనసు నేఁ గన్నదేకాదా

చ. 2: పొలఁతి యెప్పుడు నీపొరుగింటిదే కాదా
యెలమి నిక్కిచూచితే నేమాయను
కలగొన నిందుకేల కారణాలు దెలిపేవు
వెలయఁ గ నీసుద్ది నే విన్నదే కాదా

చ. 3: వనిత నీ కెప్పుడును వావి నీవదినే గాదా
యెనసి సేసవెట్టితే నేమాయను
ననుపై శ్రీ వేంకటేశ నన్ను నమ్మించి కూడితి
చెనకి నీవోజ తెలిసినదే కాదా

రేకు: 0864-6 రామక్రియ సం: 18-383

పల్లవి: మెచ్చితిమి తొలుతే నీమేకులెల్లాను నీ-
యిచ్చకమే చాలదా యింపులు వుట్టించను

చ. 1: తీపులు పుట్టించ నీతియ్యనిమోవె చాలదా
మాపురేపుఁ జెలులకు మంతనానను
కోపున నాటలు చూప కొనచూపులే కావా
యేపొద్దు నాసలు చూపి యెలయించను

చ. 2: గొరబై వలపించ నీ కొనగోరే చాలదా
సరికిబేసికిని జవరాండ్లకు
సిరుల సేసలు చల్ల చిరునవ్వులే కావా
తెరలోనిరతులను తీగెలువారించను

చ. 3: కడువేడుకలు రేచ కాఁగిలిదే చాలదా
అడరిన మావంటి అతివలకు
బడినె శ్రీ వేంకటేశ పలునీసుద్దులే కావా
వుడివోనిరతులను వోలలాడించఁ గను

రేకు: 0865-1 సాళంగనాట సం: 18-384

పల్లవి: ఔనయ్యా మంచివాఁ డ వన్నిటా నీవు
యీనవ్వులవంక నీకు నేమి గూడె నిపుడు

చ. 1: తచ్చనకాఁడవై నీవు తరుణుల నెగపోసి
అచ్చలాన యెచ్చుగుందు లాడుమనేవు
ఇచ్చకురాండ్లు నీకు నిద్దరు సరేకాదా
కచ్చుపెట్టి యిందు నేమిగట్టుకొనే విపుడు

చ. 2: వినోదకాఁ డవై నీవు వీరీ వారి సన్నసేసి
పెనఁగులాటకుఁ బెట్టి పెచ్చురేఁచేవు
యెనయ నీకీపెనాపె నితవరులే కారా
పవివడి యిందు నెంతఫల మబ్బె నీకు

చ. 3: యెమ్మెకాఁడవై నీవు యిరుమేలా నిడుకొని
వుమ్మడిఁ గాఁగిటఁ గూడి వుబ్బించేవు
కమ్మి యక్కచెల్లెండ్లు గారా శ్రీ వేంకటేశ
సమ్మతి నీ కెటువంటిచవివుట్టె నిపుడు

రేకు: 0865-2 సామంతం సం: 18-385

పల్లవి: ఆనతీవయ్యా నాకు నది వినవేడుకయ్యీా
సోనగాఁ గురిసీ నీమై సొరదిఁ బెంజెమట

చ. 1: పొట్టం బొరుగున నీవు పొందులు సేసేయందుకు
నెట్టన నే నవ్వినదే నెపమాయను
ఇట్టె గుట్టుననుండితే నేమనఁ గలవాఁడవు
పుట్టిపడీ వలపులవుద్యేగాలెల్లను

చ. 2: సిరులనాపై నీవు సేసలు వెట్టేయందుకు
సరసము నేనాడుటే సందాయను
తెరలో నుండితే నెట్టు ద్రిష్టించఁ గలవాఁడవు
పెరిగీని యడియాసప్రియము లన్నియును

చ. 3: మలయుచు నీవు నన్ను మన్నించేయందుకు
సొలసి నేఁ గూడినదే చొప్పాయను
తలవంచితే నెవ్వరిఁ దడవఁ గలవాఁడవు
మొలచీ శ్రీ వేంకటేశ మోహనములెల్లను

రేకు: 0865-3 వేళావళి సం: 18-386

పల్లవి: వేగి లేచి సేసేదెల్లా వెలఁదుల తోడిపొందే
ఆగడపుతలపోత లాఁప నెట్టు వచ్చును

చ. 1: ఆసోదాన జవరాలు ఆపొద్దటనుండియును
వేసరక చేసీని విన్నపములు
వాసుకో పొస్తకాన నివ్వల మఱవకుండాను
యేసుద్దులకైనాను యెచ్చరిక వలెను

చ. 2: సారె సారె నీదేవులు సముకాననే వుండి
వూరటలేక చేసీని వూడిగములు
గారవించి రేపటికి కణఁ జాలనిండాఁ బెట్టు
దారదప్పకుండాఁ గొంత దాఁపిరికము వలెను

చ. 3: తొలఁగక పెండ్లికూఁతురు నిన్నుఁ గలయచు
గిలిగింపుచుఁ బెంచీ కాఁగిట రతులు
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలకొన్న నవ్వులకు నేరుపులు వలెను

రేకు: 0865-4 శ్రీరాగం సం: 18-387

పల్లవి: దయఁ జూచి రక్షించేదే తగవు నీకు
ప్రియములు చెప్పఁగాను పెనఁగఁగనేఁటికి

చ. 1: జంకెన లెంతచూపినా చలమెంత సాదించినా
అంకెల నీచేపట్టిన ఆఁటదే కదా
వుంకువఁ బెండ్లాడితివి వూడిగము గైకొంటివి
బింక మెంత నెరపినా పిన్నదే కదా

చ. 2: వెక్కసాలెన్నాడినాను వేమారు సొలసినాను
మిక్కిలి నీవు మన్నించేమేనదే కదా
పక్కన నవ్వితి విట్టె బాసలెల్లా నిచ్చితివి
చొక్కిక యెంత మీరినా జోడుదే కదా

చ. 3: పైపై నెంతగొసరినా పంతా లెట్టు నొడిగినా
యేపొద్దు నిన్నుఁ బాయనిఇంటిదే కదా
రాఁపుగా శ్రీ వేంకటెశ రమణి నేలితి విట్టె
యేపనులు చెప్పినా నీయింపుదే కదా

రేకు: 0865-5 దేసాళం సం: 18-388

పల్లవి: ఏఁకరీని మిమ్ముఁ జూచి ఇదెవ్వరోయి
తాఁకించీఁ దనచన్నులఁదా నెవ్వరోయి

చ. 1: దేవులు నీవును నిట్టే తెరవేసుకుండఁగాను
యీవల తోంగి చూచీని ఇదెవ్వరోయి
పూవులదండలు మీరు పూఁచి వేసుకోఁగాను
తావి మూరుకొనవచ్చీఁ దా నెవ్వరోయి

చ. 2: చెప్పరాని మాటలెల్లా చేరి మీరాడుకొనఁగా
యిప్పుడే పొంచులు వినీ నిదెవ్వరోయి
విప్పుచు సురటి మీరు వేమారు విసరుకోఁ గా
దప్పిదేరీ నడుమను తా నెవ్వరొయి

చ. 3: కలసి మీరిద్దరును కాఁగిటనే కూడఁగాను
యెలుఁ గెత్తి పాటవాడీ నిదెవ్వరోయి
అలరి శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
తలఁపించీ రతులెల్లాఁ దా నెవ్వరోయి

రేకు: 0865-6 హిందోళం సం: 18-389

పల్లవి: ఆడవయ్య సరిగా నీ వాపెతో వసంతము
వేడుక నవ్వులలోని వెన్నెల వసంతము

చ. 1: యెడయక నీమీఁద నింతి కొనచూపుల
వడిఁ జల్లీ వలపుల వసంతము
వుడుకుఁ జెమటలనే వూర్చి కొనగోరఁ జిమ్మీ
కొడిసాగ బట్టిటకొముులవసంతము

చ. 2: గొరబైన మాటలు కుమ్మరించి కుమ్మరించీ
వరుస జిరు సిగ్గుల వంతము
సొరిది సరసములఁ జూపి మోపి పెనఁగుచు
సరుగ జాచీ గుబ్బచన్నుల వసంతము

చ. 3: పొంచి పొంచి కలయుచు బుసకొట్టుసేఁతలనే
వంచీ కౌఁగిటిరతుల వసంతము
యెంచి శ్రీవేంకటేశ నన్నేలితివి ఆకె నీపయి
నించీఁ గలయికలనే నెయ్యపువసంతము

రేకు: 0866-1 మాళవశ్రీ సం: 18-390

పల్లవి: మగవాఁడు వలచితేను మగువలజాడ లిట్టె
అగడుగానేల అడియాసలఁ బెట్టేవే

చ. 1: ఇచ్చకముతోడఁ బతి ఇంటికిఁ బిలువఁగాను
పెచ్చురేఁగి నీవేల పెనఁగేనే
కచ్చుపెట్టి రతులకుఁ గాచుకుండితి నిందాఁకా
తెచ్చుకోలై యేల తరితీపునేసేవే

చ. 2: ననుపు చూపి యతఁడు నవ్వులు నవ్వఁగాను
గునియుచుఁ దలవంచుకొననేఁటికే
వొనరఁ గానుకలు నీవొసఁగితి విందాకా
పనివూని నీ వెంత బయలీఁదించేవే

చ. 3: శ్రీవేంకటేశుఁడు చేరి నిన్నుఁ గూడఁగాను
చేవదేర నీవేల సిగ్గువడేవే
యీవల నన్నితఁడే యేలి మన్నించినాఁడు
భావ మెఱిఁగికనేల భ్రమయించేవే

రేకు: 0866-2 దేశాక్షి సం: 18-391

పల్లవి: చెప్పినట్టెల్లాఁ జేసి చేకొని మన్నించుఁగాక
వొప్పుగ నీపొందు మాని వూరకుండఁగలఁడా

చ. 1: కామించి నీపై వలవు గలిగిన రమణుఁడు
యేమే నీమాటకు యెదురాడీనా
గోమున నీరాకలే కోరుక వుండె నిందాఁకా
భామరో యీవేళను పరాకుసేసీనా

చ. 2: పలుమారు నీకును బాసలిచ్చిన విభుఁడు
తలఁచుకొనక యిట్టె తక్కించీనా
యెలమి నీకాఁగిటికి యెదురు చూచె నిందాఁ కా
తలకొని యేలుఁ గాకా తామరచీనా

చ. 3: చిత్తగించి నీపాలిటి శ్రీ వేంకటేశుఁడు
కొత్తగా భోగించుఁ గాక గుట్టు చూపీనా
బత్తినేసి బాగాలిచ్చె నిందాఁకా
హత్తి రతిఁ జొక్కించుఁగా కారడి బెట్టినా

రేకు: 0866-3 బౌళి సం: 18-392

పల్లవి: నేసవెట్టి పెండ్లాడిన చెలియ నేను
వేసరక నీవెంత వేఁడుకొనేవయ్యా

చ. 1: పైపైఁ జన్నులమీఁది పయ్యదేల తీసేవు
రాపుగా నొండొకటితో రాసినవి
మోపులుగా జవ్వనము మూటగట్టుకున్నదాన
చూపెట్టుక మమ్ము నెంత సోదించేవయ్యా

చ. 2: చెలరేఁగి చెలరేఁగి చేతులేల పట్టేవు
చలివాసి తీగెలుసాగీనవి
మెలుపుఁ గాఁగిటి కివే మీఁదెత్తు కున్నదాన
పెలుచుఁజేఁతల నేల పెనఁగాడేవయ్యా

చ. 3: ఆఁడనె నాపిరుఁదుల కాసలేల సేసేవు
బండికండ్లవలెనే బలము లవి
నిండుక శ్రీ వేంకటేశ నీ సొమ్ములు సేసితి
దుండగపురతి నెంత దొమ్మి సేసేవయ్యా

రేకు: 0866-4 ముఖారి సం: 18-393

పల్లవి: కంటి నీమనసు నేను కడమలేనివాఁడవు
అంటి ముట్టి పెనఁగేవు అలపు లేదెపుడు

చ. 1: యెంతయినా మన్నింతువు ఇటు నీకు వలచిన-
కాంతలను మొగమోటఁ గాదనఁబోవు
పంతములైనా నిత్తువు బత్తిసేసినవారికి
చెంతఁ బెండ్లికొడుకవై సిగ్గువడ వెపుడు

చ. 2: చెప్పినట్టు సేతువు చెలిమికత్తెలకును
వుప్పతిల్లు నేస్తమున నోపననవు
కుప్పళింతువు ప్రియము కూటమిగలవారికి
చిప్పిలు మేలువాడవై సిగ్గువడ విపుడు

చ. 3: కందువల గూడుదువు కామించినమావంటి
ఇందుముఖుల మేలాన నీడేర్తువు
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చెందినతమకముల సిగ్గువడ వెపుడు

రేకు: 0866-5 బౌళి సం: 18-394

పల్లవి: ఏకరాజ్య మయ్యె నీకు నింపులాయ నిదే నాకు
రాకవెన్నెలలు వచ్చె రావయ్య లోనికి

చ. 1: విచ్చనవిడాయ నీకు వేడుకలెల్లా జెల్లె
పచ్చిదేరె నామోవి ఫలమందెను
కచ్చుపెట్టి నెచ్చెలులు కందువఁ బొందుసేసిరి
రచ్చల నిండె వలపు రావయ్య లోనికి

చ. 2: నవ్వులు నిజములాయ నారుకొనెఁ బంతములు
ఇవ్వల నాజవ్వనము యీడుఁజోడాయ
వువ్విళ్లూరె మనసులు వొద్దికఁ బెండ్లిసేసె
రవ్వసేసెఁ దమకము రావయ్య లోనికి

చ. 3: కతలాయ నీమాటలు కాఁపురము సతమాయ
తతిఁ గూడె నాకూటమి తనివిచ్చెను
యితవై శ్రీవేంకటేశ యింపులు పొత్తుగలసె
రతు లిట్టె వొనగూడె రావయ్య లోనికి

రేకు: 0866-6 తోండి సం: 18-395

పల్లవి: తరుణులసహజాలు తలఁచుకో వోయి నీవు
సరసుఁడవు బుద్దు లిచ్చుట నేము చెప్పేమా

చ. 1: ఆసలఁ బెట్టుదురు అట్టె లోనయినదాఁకా
వాసుల మీరుదురు వలచితేను
బేసబెల్లిచేఁతలఁ బెనఁగుదు రేడనైనా
బాసలు గొందురు తముఁ బాయకుండాను

చ. 2: కాఁపురాలు సేతురు కాణాచయినదాఁ కా
తీపులఁ బెట్టుదురు దిక్కుచూచితే
మాపు రేపుఁ బైకొందురు మనసు నమ్మికలను
రాఁపుగా నవ్వుదురట్టె రతుల కొరకును

చ. 3: పచ్చిగాఁ జెనకుదురు పరాకు మానినదాఁకా
తచ్చనలు సేతురు తగిలితేను
ఇచ్చట శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
ఇచ్చకపునసతులు తా మెదురై కలతురు

రేకు: 0867-1 సామంతం సం: 18-396

పల్లవి: మొక్కవే చెలువునికి ముమ్మాటికి
వెక్కసమైతే సిగ్గులు వెల్లులై నిగుడును

చ. 1: పంతమాడవలెనా పతితోడ సతికిని
వంతుకుఁ బ్రియము చెప్పవలెఁగాక
దొంతులు పేరుచఁబోతే తుద కెక్కుఁ జలములు
సంతోసించితే వలపు చవులై నిలుచును

చ. 2: బిగియఁగవలెనా పెనగేటివిభుఁనితో
జిగిమించ నూడిగాలు సేయుట గాక
చిగిరింపించఁగబోతే చిమ్మిరేగును మంకులు
నగితే మచ్చికలతో నాటుకొను మనసు

చ. 3: గుట్టుచూపవలెనా కోరి శ్రీవేంకటేశుతో
ఇట్టె కలుయుటే యెన్నికగాక
రట్టుసేయఁబోతే రతులిట్టె పెచ్చుపెరుగు
చుట్టరికమున నుంటే సులభమౌ భోగము

రేకు: 0867-2 ఆహిరి సం: 18-397

పల్లవి: పతిఁ బాసి విరహానఁ బడనేలే
మతిలో నున్నాఁ డతడు మక్కువఁ దలచవే

చ. 1: పున్నమవెన్నెలలవే పూచినవనాలవిగో
కన్నెరో నీవేల యింతకాఁక బొందేవే
వన్నిటియేరులు వారీ పచ్చకప్రము రాలీ
వన్నెలతో నింత వసివాడు లేఁటికే

చ. 2: చలిగాలి విసరీని జడిముంచె మేఘము
అలయుచు దప్పిబడనదేలే నీవు
మొలకపైరులు నిండెఁ బొదలె నిసుకదిబ్బలు
వలవంత నిపుడేల వడఁబడేవే

చ. 3: గందవొడిదుమ్ము రేఁగె కదిసె విరులతావి
అందముగనేల పుస్సురస్సురనేవే
పొందె శ్రీవేంకటేశుఁడు పొంచి ఇంతలోనే వచ్చి
విందు మోవితేనె నెట్టు వెరగందేవే

రేకు: 0867-3 లలిత సం: 18-398

పల్లవి: ఎదురు మెచ్చ నీసుద్దులేమి చెప్పేది
కదిసి కొసరఁ గాను కాకుసేతురా

చ. 1: యింతి నీవు మచ్చికతో నేకతములాఁడగాఁ బూ-
బంతిఁగొని వేసి యాకె పంతమాడెను
చెంతనుండి నీవందుకు సిగ్గువడవలెఁగాక
బంతి నుండి నీవు నిమ్మ పంట వేతురా

చ. 2: బడినే మీరిద్దరును బాసలు చేసుకొనఁగ
నడుమఁ బన్నీరు చల్లి నవ్వీ నాపె
తడబడి నీ వందుకు తల వంచవలెఁ గాక
జడిగొని గందవొడి చల్లఁజొత్తురా

చ. 3: కమ్మి వొండొరులు మీరు కాఁగిలించుకొనఁగాను
దొమ్మి నాపె నిన్ను గూడి తొక్కెఁ బాదము
యెంమ్మెఁ తో నన్నేలే వందు కిచ్చగించవలెగాక
వుమ్మడి శ్రీవేంకటేశ వుర మెక్కుకుందురా

రేకు: 0867-4 దేసాళం సం: 18-399

పల్లవి: అవునే భాగ్యమంతురాల వైతివే నీవు
వివరించి నీసుద్దులు వింటిమే నేము

చ. 1: తలఁపులో మెలఁగేటి తగినపతి గలితే
వలుపే ధనము గాదా వనితలకు
యెలమిఁ జక్కఁదనాన నిన్నిటాను మించితేను
నిలువు నూరువండుట నిజము గాదా

చ. 2: సరవి సింగారాలతో జవ్వనము సతమైతే
సుమరతమే సంపదగా సుదతులకు
ఇరవై ఇన్నిటాఁదన కేకచిత్తమైతేను
వరుస వేయిట్టిపై జవ్వాదికొమ్ము గాదా

చ. 3: తతితోడఁ గాఁగిటఁ దగిలి పాయకుండితే
రతియే సామ్రాజ్యము రమణులకు
ఇతవై శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నిట్టయితే
మితిఁ గోటికిఁ బడగె మించెత్తుట గాదా

రేకు: 0867-5 ఆహిరి సం: 18-400

పల్లవి: వలచినవలవెల్లా వడి నీకే నెలవు
వలెనని యెచ్చరించవలెనా ఇంకాను

చ. 1: కన్నులయెదుట నీకుఁ గాచుకవున్నదానను
విన్నవించవలెనా వేమారు నీకు
చన్నులు మీఁదెత్తుక యాసలతోడ నున్నదాన
వన్నెలఁ గానుకలియ్యవలెనా ఇంకాను

చ. 2: అంది మోవితేనెలు నీకని దాఁచుకున్నదాన
విందుచెప్పవలెనా వింతగా నీకు
పొంది నీపాదాలపైఁ జూపులు నిలిపినదాన
వందనములు సేయఁగవలెనా యింకాను

చ. 3: కలసి మెలసి నీకాఁగిటలో నున్నదాన
తలఁపించవలెనా తగవు నీకు
వెలయ శ్రీ వేంకటేశ వేడుకైన యట్టిదాన
వలనుగాఁ గడునవ్వవలెనా యింకాను

రేకు: 0867-6 రామక్రియ సం: 18-401

పల్లవి: ఏరుపడే నింతలోనే యిదివో నీనిజమెల్లా
వూరకే బుజ్జగింపుచు నొరసేవు గాక

చ. 1: అవునయ్య నీగుణాలు ఆడేమంటే నెన్నిలేవు
వువిదలు మొగమోట నున్నారుగాక
తవిలి నవ్వుతా వచ్చి తారుకాణించుమనుచు
కవిసి యేకతమునఁ గదిమేవుగాక

చ. 2: మేలయ్య మచ్చములు నామేనఁ జూపు నెన్నిలేవు
కోల గాచి పందెమాడఁ గొంకేరు గాక
వేలఁ జూపి యిట్టె వెల్లవిరిగాఁ జేయుమనుచు
చేలకొంగంటుచు నన్నుఁ జెనకేవు గాక

చ. 3: కానీవయ్య రతులు వింగడించఁగ నెన్నిలేవు
ఆనందించి నివ్వెరగు లందేరుగాక
మోనాన శ్రీవేంకటేశ మొక్కుచు మెచ్చుమనుచు
గోనాలగొందుల నన్నుఁ గూడేవు గాక

రేకు: 0868-1 భైరవి సం: 18-402

పల్లవి: ననిచి నీమాటలు నమ్మితి నేను
చెనకనేమిటికి నీచిత్తము నాభాగ్యము

చ. 1: యెంచిచూచితేఁ గోరిక లెంతైనాఁ గలవు
అంచెఁ గడువలచినయట్టివారికి
పెంచి నాతమకము పిక్కటిల్లె యీమనసు
చించిచెప్పరాదు నీ చిత్తము నాభాగ్యము

చ. 2: సేయించుకొంటే బాసలు చేటలకొలఁదులు
చాయలఁ బొందులుసేసేసరసులకు
పాయరానిజవ్వనము పట్టరాదు కానికెగా
చేయెత్తి మొక్కేను నీచిత్తము నాభాగ్యము

చ. 3: కుమ్మరించితే రతులు కోటానఁగోట్లు
నెమ్మనము గలిసిన నీకు నాకును
ఇమ్ముల శ్రీవేంకటేశ ఇఁక నీపై సిగ్గు గొంత
చిమ్మరాదు సారెకు నీచిత్తము నాభాగ్యము

రేకు: 0868-2 పాడి సం: 18-403

పల్లవి: కంటిని మన్ననలెల్లాఁ గడపరాయ మొలఁ
గంట లెంతవాయించేవు కడపరాయ

చ. 1: కప్పుర మీఁగదవోయి కడపరాయ మోవిఁ
కప్పు లేల రేఁచేవు కడపరాయ
కప్పవోయి పచ్చడము కడపరాయ నీకుఁ
గప్పము నావలపులు కడపరాయ

చ. 2: గరిసించకు రతిఁ గడపరాయ నీఁ
కరుణెల్లా నాసొమ్ము కడపరాయ
కరఁగించకు మనసు కడపరాయ నాకు
గరిడీ నీకాఁగిలి కడపరాయ

చ. 3: కలసి కాఁగిట నిట్టె కడపరాయ నన్నుఁ
గలికిఁ జేసితి వింత కడపరాయ
కలకాలమును మాకుఁ గడపరాయ
కలవు శ్రీవేంకటాద్రి కడపరాయ

రేకు: 0868-3 మాళవిగౌళ సం: 18-404

పల్లవి: ఎమ్మెలు మాముందర నీ వెంత చూపేవే
బొమ్మల జింకించి రతిఁ బొదిగేవు నీవు

చ. 1: చనవరి వౌదువే సరిఁ బతిబుజముపైఁ
నొనరఁగఁ జెయివేసుకుందానవు
ననుపు గలదె నీకు నంటున నీతని నిట్టె
కొనగోరఁ జెనుకుచుఁ గొసరేవు నీవు

చ. 2: చుట్టమ వౌదువె కాంతుఁ జొక్కించి మెడసంది నీఁ
వొట్టుక గడ్డ మానించుకుందానవు
జట్టిగొంటివె యీతనిజంటఁ బాదము పాదాన
మెట్టి బలిమి చూపుచు మేలములాడేవు

చ. 3: దేవులవౌదువె నీవు తెప్పలఁ దేలఁగఁ గూడి
శ్రీ వేంకటేశుపొత్తునఁ జెలరేగేవు
తావు కొంటివే నేఁడితని నన్నుఁ బెండ్లి సేసి
వేవేలువేడుకలతో వినోదాలాడేవు

రేకు: 0868-4 గంభీరనాట సం: 18-405

పల్లవి: ఎమ్మెలునేతులు నేఁడు యీకెతోడనా
యిమ్మల నీసుద్దులా నే మెఱఁగనివా

చ. 1: ముచ్చటైన గుట్టుతోడి ముదితను ఇంతేసి-
పచ్చిదేర నవ్వేవు పంతమా నీకు
అచ్చులాన సిగ్గువడేయాఁటదానితో నింత-
పెచ్చువెరిగేది నీకుఁ బెద్దరికమా

చ. 2: సాదుఁదనాన నిల్లాలై సంగడినే వుండఁగాను
వీదిలోనఁ జెనకేవు వేడుకా యిది
ఆదరించి ఇచ్చకములాడేదానితో నింత-
తోదోపులాడేది దోరతనమా

చ. 3: వొడికాననుండేటి వువిదపయ్యద దీసి
కడుఁ జన్ను లంటేవు గర్వమా నీకు
అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగఁ గూడి
జడిగొని మెచ్చేదే జాణతనమా

రేకు: 0868-5 కుంతలవరాళి సం: 18-406

పల్లవి: ఎంత లేదు నీసుద్దు లేమిచెప్పేది
వింతవానివలెనే నివ్వెరగందేవు

చ. 1: బలురాణివాసమై లోపలనే వున్నది గాక
చలము సాదించెనా సతి నీతోను
వెలినుండి నీవే వచ్చి వేఁడుకొనఁగా వద్దనెనా
అలరి యీడనుండే యీాఁజిడిఁబెట్టేవు

చ. 2: యిల్లాలుగనక తా నిలువనున్నది గాక
కల్లరివని కొంకెనా కాంత నీతోను
వొల్లనే నీవు వద్దఁ గూచుండఁగా వద్దనెనా
వుల్లము దెలియ నీవు వొరసి చూచేవు

చ. 3: యిచ్చ నీదేవులుగన కెదుట జంకించెఁ గాక
మచ్చరమా అలమేలుమంగ నీతోను
కొచ్చి శ్రీ వేంకటేశుఁడ కూడితివి వద్దనెనా
మెచ్చుచు నీలోనే నీవు మేకులఁ బెట్టేవు

రేకు: 0868-6 తెలుఁగు కాంబోదిసం: 18-407

పల్లవి: మగవాఁడ విన్నిటాను మరిలేదు వెరపు
సొగిసి యేడఁ జూచినా చుట్టపములే నీకు

చ. 1: పలచనియెలుఁగునఁ బాడీ నెవ్వతో కాని
కెలన నుండి ఆలకించేవు నీవు
పిలిపించుకొనరాదా ప్రియమైతే నీకడకు
మలసి యీడానాడ మఱఁగేల నీకు

చ. 2: పొరుగిరుగుల నుండి పొలసీ నెవ్వతోకాని
సొరిది నీమేడలెక్కి చూచేవు నీవు
అరసి మాఁటాడరాదా ఆస నీకుఁ గలితేను
సిరులనవ్వుల వట్టిసిగ్గులేల నీకు

చ. 3: యిదివో సన్నలు సేసీ నింటిలో నెవ్వతొకాని
కదియ నూఁకించేవు కంమ్మటి నీవు
అదన శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
వదలక కూడితివి వంతులేల నీకు

రేకు: 0869-1 ఆహిరి సం: 18-408

పల్లవి: చెలులాల యేమి సేతుఁ జెప్పఁగదరె
తలపోఁతలే చిత్తము తడఁబరచీని

చ. 1: మాటాడునొకో పతి మనసిచ్చి నొకపరి
యీటునఁ జేతికి విడె మిచ్చునొకో
గాఁటపు నాచన్ను లంటి కందువఁ జెనకునొకో
వాటపు నాకోరికలు వలలఁ బెట్టీనే

చ. 2: తప్పకచూచునొకో తతిగొని రమణుఁడు
కప్పురము నోరికిచ్చి కలసునొకో
దప్పిదేర నవ్వు నవ్వి దండకు వచ్చునొకో
చిప్పిలుఁ దమకములు చిమ్మిరేఁచీనే

చ. 3: చెలఁగి మోవిచ్చునొకో శ్రీ వేంకటేశ్వరుఁడు
అలమేల్మంగనైన నన్నలము నొకో
కలపుకోలుగ నుఁడి కతలు చెప్పునొకో
నలి నింతలోనె విచ్చేసి నన్నుఁదానె కూడెనే

రేకు: 0869-2 ముఖారి సం: 18-409

పల్లవి: కొమ్మ నీచక్కఁదనము కోటిసేసును
ఇమ్ముల నీపతిభాగ్య మెంతని చెప్పేదే

చ. 1: సెలవి నవ్వినవ్వు చెక్కిటఁ బెట్టినచెయ్యి
చెలి నీమొగమునకు సింగారమాయ
తిలకించి చూచేచూపు తేనెగారే మోవిమాట
కలికితనాల కెల్లా కందువలై తోఁచెను

చ. 2: మొనచన్నుల కదలు మొగిఁ గమ్మలతళుకు
వనిత నీవయసుకు వన్నెవచ్చెను
పొనుగులేఁత సిగ్గులు బొమ్మముడి జంకెనలు
తనివోనియాసలకుఁ దగినగురుతులు

చ. 3: బలుపిరుఁదులసొంపు పాదపుమట్టెలరొద
అలమేల్మంగ నీరతి కడియాలము
లలి శ్రీ వేంకటేశుఁ గలయు నీచేతులగోళ్లఁ
దలకొన్నరాఁకులు తారుకాణలు

రేకు: 0869-3 సామంతం సం: 18-410

పల్లవి: మాటాలేల రావయ్య మాయింటికి
యీటువెట్టి కొసరితే నిందరును నగరా

చ. 1: కూర వండి కసవేరఁగూడునా నిన్ననేల
గోరగీరితే నేరౌను కూచుండవయ్యా
చేరలాను దోసిటాను సేసవెట్టి పెండ్లాడి
ఆరజము సేయఁబోతే నందరును నగరా

చ. 2: మంచమెక్కి వావులెంచ మరేల జంకించ నిన్ను
కంచుఁ బెంచు సరిగాదు కానీవయ్యా
కొంచనేల యెంచనేల కుసుమాస్త్రుబారిఁ జిక్కి
అంచెలఁ గాఁతాళించితే నందరును నగరా

చ. 3: నానఁ బెట్టితే గొడ్డలి నయమౌనా బలిమేల
తేనెమోవి తీపుగాదా తెలిసే నీవయ్యా
నే నలమేల్మంగను నీవు శ్రీ వేంకటేశుఁడ-
వాన దోసి కూడితివి అందరును నగరా

రేకు: 0869-4 రీతిగౌళ సం: 18-411

పల్లవి: వేడుకయ్యీ మీయిద్దరి వినోదాలుఁ జూడ మాకు
తోడనే మోవిపై గురుతులు నించరాదా

చ. 1: బలిమి చూతము గాని పతిచెక్కులమీఁదట
ములువాఁడి కొసగోరు మోపరాదా
మలసి నీవతనిమర్మ మెరుఁగురు నందువు
కిలకిలనవ్వే అట్టు గిలిగించరాదా

చ. 2: యెట్టిదో నీచనవు నే నెరిఁగేఁ గాని యతని
దిట్టవై పచ్చితిట్లు తిట్టఁగరాదా
ముట్టిన మీజాణతనములు గానవచ్చీఁ గాని
గుట్టుతోడ పూబంతిఁ గొని వేయరాదా

చ. 3: మెచ్చును నీపగటు యెమ్మెలకు శ్రీ వేంకటేశు
యెచ్చరికగాఁ బాదాన లచ్చించరాదా
యిచ్చ నలమేల్మంగనయుననన్నుఁ గూడే నాతఁ
డిచ్చకుఁడై నిన్ను నేలె నెమ్మె చూపరాదా

రేకు: 0869-5 కాంబోది సం: 18-412

పల్లవి: ఏమయ్య నీవు దొల్లి యెఱఁగనితగవా
చేముంచి మావిన్నపము చిత్తగింతువు గాక

చ. 1: నమ్మినట్టివారిని నగుఁ బాటు సేతురా
నెమ్మది నందరిలో మన్నింతురు గాక
సమ్మతించి వుండఁ గాను జరుపేవా వినోదాలు
యిమ్ముల లాలించి కీర్తి కెక్కింతువు గాక

చ. 2: మరిగి కొల్చినవారి మంకులఁ జేయుదురా
పొరి మంచిగుణాలు నేర్పుదురు గాక
సరివలచినవారిఁ జలము సాదింతురా
పరగ లోలో నొడఁ బరతురు గాక

చ. 3: కైవసమయినవారిఁ గాకుసేయఁ జెల్లునా
నీవే యెరిఁగి కరుణింతువు గాక
యీవేళ శ్రీ వేంకటేశ యీకె యలమేలుమంగ
దేవులై నీకు మొక్కు దీవింతురు గాక

రేకు: 0869-6 దేవగాంధారి సం: 18-413

పల్లవి: తెలుసునో తెలియదో దిష్టముగ రమణుఁడ
పిలుతుఁ జుమ్మీ కృపవెట్టేవని కాని

చ. 1: మునివేళ్లు సోఁక నీకు మొక్కుదుఁ జుమ్మీ నేను
కొనగోరు దాఁకీనంటాఁ గొంకేఁ గాని
ననుపుచేసుక నీతో నవ్వుదుఁ జుమ్మీ ఇట్టె
వొనరఁ దగిలీనని వూరకుండితిఁ గాని

చ. 2: పచ్చిదేరఁ బెండ్లాడి పాదము దొక్కుదుఁ జుమ్మీ
వొచ్చెమనేవని వూరకుందానఁ గాని
ముచ్చటదీర నీమోవి చవిచూతుఁ జుమ్మీ
మచ్చమంటేనని యనుమానించితిఁ గాని

చ. 3: చెలరేఁగి కతలెల్లాఁ జెప్పుదుసుమ్మీ యెవ్వతేఁ
దలఁచుకొందువో యని తక్కితిఁ గాని
లలి శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
కలసితి విందుకె నేఁ గానిమ్మంటిఁ గాని

రేకు: 0870-1 శంకరాభరణం సం: 18-414

పల్లవి: గోవులఁ గాచి యలసీ గోవిందుఁడు
గోవాళితనాలు సేసి గోవిందుఁడు

చ. 1: పానుపు మీఁ దటఁ దాను పవళించి వున్నవాఁడు
గోనాలగొంది నిదె గోవిందుఁడు
ఆనుక చేతులు చాఁచీ నట్టె చన్నులమీఁద
పూని యేదోనుండి వచ్చి భోగించీ గోవిందుఁడు

చ. 2: బట్టబాయిట నింతులఁ బాదాలు విసుకుమనీ
గుట్టు సేయఁ డించుకంతా గోవిందుఁడు
జట్టిగొని మోవితేనే సారెకు నియ్యఁగ వచ్చి
చుట్టమువలెనే వచ్చి సొలసీ గోవిందుఁడు

చ. 3: యెలమిఁ దెరవేసుక ఇద్దరిఁ గాఁగిటఁ గూడీ
కొలువు లోపలనే గోవిందుఁడు
వెయ గొల్లెతలము వేడుకతో మమ్ము నేలె
అలరిన శ్రీవేంకటాద్రి గోవిందుఁడు

రేకు: 0870-2 పాడి సం: 18-415

పల్లవి: ఇంకనేల మరఁగులు ఇన్నియు బాఇటఁబడె
సంకెలేక ఇంతలోనే చన్నులంటఁ గాను

చ. 1: రవ్వలాయ నావలపు రామలెల్లా నెరిఁగిరి
నవ్వు లీడనే నీవు నాతో నవ్వఁ గా
జవ్వనులు తమలోన సన్నలు చేసుకొనిరి
పువ్వులవాట్ల నీవు పొంచి వేయఁ గాను

చ. 2: పచ్చిదేరె నావయసు పనులు వెల్లవిరాయ
విచ్చనవిడిని నీవు విడెమియ్యఁగా
కచ్చు పెట్టి సవతులు కడువెంగే లాడేరు
మచ్చికల నీవు నాతో మాటలాడఁ గాను

చ. 3: తగులాయ నీకు నాకు తలపోఁత లీడేరే
తగవుతో నీవు నన్ను దయఁ జూడఁ గా
మిగులా నాతోడివారు మెచ్చేరు శ్రీవేంకటేశ
మగఁడవై పలుమారు మన్నించఁ గాను

రేకు: 0870-3 బౌళి సం: 18-416

పల్లవి: ఇందుకె నవ్వు వచ్చీ నిదివో మాకు
కందువ నుండి తానేల కన్నుల మొక్కీని

చ. 1: ముంగిట నుండి నీవు మోము దప్పక చూచితే
అంగడి నుండిన చెలి యాసచేసెను
ఇంగిత మెరిఁగి తేను ఇద్దరికిఁ దగవే కా
సంగడినున్నయాకేల సరసమాడీని

చ. 2: గొరబుగా నీవు వీది గుబ్బమునెక్కి యాడితే
పొరగుననున్న యాకె పొందు గోరీని
అరసితే నిద్దరికి నమరుఁగా యీసేఁతలు
విరులుగొసేయాకేల వేడుకపడీని

చ. 3: వొంటి నీవు పానుపుపై నూరకె పవ్వళించితే
వెంటవచ్చేయాకె నిన్ను వెసఁ గూడీని
అంటేఁ జెల్లుఁ గా యుద్దరి కందమౌ శ్రీ వేంకటేశ
యింట నన్నేలితి వేడోయాకె తా మెచ్చీని

రేకు: 0870-4 వేళావళి సం: 18-417

పల్లవి: ఘనుఁడ నీనేరుపులు కనే మిందులోననే
పనిమాలినపని పంతము లేలాడేవు

చ. 1: తెరమఱఁగున నుండే తేనెలమాటలాడీ
ఇరవై యెదుట నెంత యెలయించునో
తరుణి తరితీపులఁ దగులకుండేవా నీవు
యెరవుల నీమనసు యెట్టున్నదో

చ. 2: మోము వంచుకొని వుండే ముత్యపునవ్వులు నవ్వీ
సాము సేసితే నీకెంత చవిరేఁచునో
భామవిలాసములకు భ్రమయకుండేవా నీవు
నీమహిమ దెలియదు నెట్టుకొనె వలపు

చ. 3: కాఁగిలించుకొని వుండే కరఁగించీ నిక్కువలు
మాఁగినమోవిస్తే నీమర్మ మెట్టుంటునో
చేఁగదేరి యాపె నన్ను శ్రీ వేంకటేశ యేలితి
దాఁగదు నీతమకము తతి చెప్పఁ గొత్తలు

రేకు: 0870-5 భైరవి సం: 18-418

పల్లవి: ఎడమాట లేమిటికి నెందాఁ కాను
బడివాయకుండరయ్య పడఁతియు నీవును

చ. 1: తెలియ నింతికి నీకు దేహములు రెండైతే
తలఁ పొక్కటే కాదా తగులైనది
పిలిచితే మీకిఁ యిద్దరిపేరులు వేరులైతే
వల పొక్కటే కాదా వర్ణింపను

చ. 2: చక్కఁదనా లిద్దరికి సరికిబేసికినైతే
చొక్కఁ జేసే పొందికలు జోడే కావా
ఇక్కువైనచూపులు యెదురుబడి నైతే
యెక్కువతమకములు యీటడైనవే కావా

చ. 3: పేరడిమీసుద్దులు పెన్నుద్దులై వుండినాను
యీరసములేనిరతి యేకమే కాదా
యీరీతి శ్రీ వేంకటేశ యెనసితి రీపె నీవు
పోరచి మోవితీపులు పొత్తులవే కావా

రేకు: 0870-6 ముఖారి సం: 18-419

పల్లవి: నవ్వవే సెలవులను నంటుతోడను
చివ్వనఁ దమకమునఁ జిమిఁరేఁగీ నితఁడు

చ. 1: రంతు సేసి పతిని నేరము లెంతురటవే
అంతరంగమెఱిఁగినయాఁటదానవు
వింతదానవా నీవు విడె మందుకొనవే
దొంతరప్రియములెల్లా దొరలించీ నితఁడు

చ. 2: బలిమిని మగరాని బాసగొందురటవే
అలరినచుట్టరికపాఁటదానవు
లలిఁ బోరచిదానవా లాచి దండఁ గూచుండవే
వెలలేని వేడుకలు వెదవెట్టీ నితఁడు

చ. 3: శ్రీ వేంకటేశ్వరుని సిగ్గువరతురటవే
ఆవటించి కాఁగిటిలో ఆఁటదానవు
వావి నెరవులదానవా మోవి చవిచూపవే
చేవమీర వేఁడుకొని చెక్కునొక్కీ నితఁడు

రేకు: 0871-1 ముఖారి సం: 18-420

పల్లవి: కరుణించవయ్య మమ్ముఁ గంభమురాయ
పెరదేవుని కాలువపెద్దకంభము రాయ

చ. 1: కలకలనవ్వు దేరేఁ గంభమురాయ ఇంతి-
కలికితనాలు చూడు కంభమురాయ
కలిమికాంత తొడెక్కెఁ గంభమురాయ నీపైఁ
గలువదండలు వేసెఁ గంభమురాయ

చ. 2: కనకపువన్నె మేనికంభమురాయ ఇంతి
కనుఁగవలనే మొక్కీఁ గంభమురాయ
ఘనుఁడ వన్నిటా నీవు కంభమురాయ
కనుకో వలపులెల్లాఁ గంభమురాయ

చ. 3: కందర్ప కోటిరూప కంభమురాయ ఇంతిఁ
గందువలఁ గూడితివి కంభమురాయ
గంద మిచ్చి నన్నేలితి కంభమురాయ మేలు
గందము శ్రీ వేంకటాద్రి కంభమురాయ

రేకు: 0871-2 భౌళి సం: 18-421

పల్లవి: నీవు సేసినచేఁతలు నీవే తెలుసుకోరాదా
కావరపుచలములు గాత సేసుఁ గాక

చ. 1: పంతమాడఁదగదా పడఁతి నీతోడుత
వింతదానితో నీవు వెస నవ్వఁ గా
దొంతులై నవలపులు దొరతనా లెరుగుగా
బంతిఁ దగ వెంచమికిఁ బచ్చి సేసుఁగాక

చ. 2: జంకించఁ దగదా సకియకు నిన్నుఁ జూచి
పొంకముగ వింతవారిపొందు సేయఁగా
సంకెలేనితమకము సత్తువ లెరుఁగునా
లంకె పరాకై నందుకు లలి రేఁచుగాక

చ. 3: కొసరఁగఁదగదా కొమ్మ శ్రీ వేంకటేశుఁడ
వెసఁ బొరుగాపెఁ గూడి విందియ్యకోఁగా
వసగానిజవ్వనము వంచన చూచునా తను
యెసగికూడినమేలు కిచ్చగించుఁ గాక

రేకు: 0871-3 పాడి సం: 18-422

పల్లవి: ఎప్పుడు వత్తువోయంటా యెదురుచూచె నీకు
కప్పురవిడెము గక్కన నియ్యవయ్యా

చ. 1: బయలుపందిలివెట్టె పడఁతి నెన్నడు మను
ప్రియమున నీపై సేసపెట్టే నంటాను
నయమునఁ బచ్చతోరణము గట్టెఁ గరముల
రయమున నింటి కిట్టె రావయ్య నీవు

చ. 2: పొందైనకుచములనుబూజగుండలు దెచ్చె
అందముగఁ గాగిలించేనంటా నిన్ను
విందాయితము సేసె వేడుకఁ దనమోవిని
కుందణఁపు మంచముపైఁ గూచుండవయ్యా

చ. 3: తోరపుఁబెండ్లిపీఁటగా తొడలనే పొసఁగించె
ఆరసి రతి కాయితమంటాను నీకు
చేరి కూడితి వీకెను శ్రీవేంకటేశుఁడ నేడు
గారవించవయ్య ఇఁక గనముగా నీవు

రేకు: 0871-4 కొండమలహరి సం: 18-423

పల్లవి: ఇల్లాలయినదాని కిది గురుతు
చెల్లుబడి నాది నీచిత్తము నాభాగ్యము

చ. 1: పంతువెట్టుకొని నీకు వలచిదానను
పంతమాడవచ్చునా బలిమితోను
చింతదీర నెప్పుడు నీసేవలెల్లా జేయఁ గాను
చెంత నుంటి ఇఁకను నీచి త్తము నాభాగ్యము

చ. 2: యెనయ జవ్వనము మీ దెత్తుకున్నదానను
పెనఁగఁగవచ్చునా బింకాన నీతో
మనసిచ్చి యెప్పుడు నీమాటలోనిదాననై
చెనకఁగా నిఁక నీచిత్తము నాభాగ్యము

చ. 3: దిట్టతనమున నీకు దేవులనైనదానను
రట్టు సేయవచ్చునా యిట్టి నీతోను
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితిని: నీవు రాఁగా
చిట్టకము లేలిఁక నీచిత్తము నాభాగ్యము

రేకు: 0871-5 రామక్రియ సం: 18-424

పల్లవి: తానే తేరీఁగాని తరవాతిపనులెల్లా
మోనముతోడుతనే మోము చూపుమనవే

చ. 1: సరసమాడఁగాఁ దన్ను సమ్మతిఁ జేకొందుఁ గాక
గరిమలఁ బెనఁగుచుఁ గాదనేనా
మరిగితి నెన్నిమాట లాడించీనే
మురిపెపుఁ జూపులను మోము చూపు మనవే

చ. 2: నగవులు నగఁ గాను నంటున మొక్కుదు గాక
వెగటులు వచరించ వింతదాననా
అగడున నెంతేసియాసలు రేఁచీనే
మొగి విచ్చక మన్నించి మోము చూపుమనవే

చ. 3: మాటలు తానాడఁ గాను మక్కువఁ గూడుదుఁ గాక
చీటికిమాటికిఁ గొచ్చి సిగ్గరేఁచేనా
యీటున శ్రీ వేంకటేశుఁ డేలెఁ గతలేమిటికే
మూటవలపుల నాకు మోము చూపుమనవే

రేకు: 0871-6 నట్టనారాయణి సం: 18-425

పల్లవి: ఎంత యిచ్చకురాలో యేమి చేప్పేది
బంతినే నీ కెరుకగా పాటవాడీ నొకతె

చ. 1: యెన్నికతో నాకె నీవూ నేకతమాడఁగాను
కన్నులనే సన్న నేసీ కాంత యొకతె
వెన్నెలబయట మీరు వేడుకలు జరుపఁగా-
నున్నతితో నీపైఁ బువ్వుల వేసీ నొకతె

చ. 2: గుట్టున వీ వాకెవద్దఁ గూచుండఁ గా నెచ్చరించి
అట్టుగాఁ జన్నులనే జఱసీ నొకతె
పట్టెమంచముమీఁద బాగాలు మీ రందుగోఁగా
చుట్టుక నిన్నెలయించి చూచీ నొకతె

చ. 3: పచ్చగా నీ వాకెఁ గూడి పరవశమై చొక్కఁగా
కుచ్చి నిన్ను గోర నూఁది కూడె నొకతె
మెచ్చి శ్రీ వేంకటేశుఁడ మేడలో మీరుండుఁ గాను
తచ్చి బాసలు గొని ముందర నున్న దొకతె

రేకు: 0872-1 సాళంగం సం: 18-426

పల్లవి: చిత్తిగించవయ్య యీపెచేఁతలెల్లాను
గుత్తపు రతులు చూడ కొత్తలాయ నిపుడు

చ. 1: సెలవుల నగవులు చిప్పిలులేఁతసిగ్గులు
మొలకవలపు నీపై ముంచీఁ జెలి
పిలుపులకొసరులు పెనగేటి సరసాలు
పలుమారు నీమీఁదఁ బచరించీని

చ. 2: బొమ్మముడిజంకెనలు పొద్దువోనిఅలపులు
చిమ్ములకనుచూపులు చిలికీఁ జెలియ
వుమ్మగిలుకోరికలు వుసురసురుఁగాఁకలు
కుమ్మరించి నీయెదుట కుప్పలువోసీని

చ. 3: సన్నలలో మాటలు జవళిఅడియాసలు
వన్నెలుగా నీమీఁద వంచీ జెలి
యెన్నఁగ శ్రీ వేంకటేశ యెనసితి వింతలోనె
కన్నె వేడుకలు నీకుఁ గానుక వట్టీని

రేకు: 0872-2 నాట సం: 18-427

పల్లవి: చండిసేసి పెనఁగకు సతమౌ నిట్టె
నిండుక వుండినదే నేరుపువో చెలి

చ. 1: తారుకాణగాఁగ నాతనికి విన్నవించవే
వూరకుండినా అది వొడఁ బడ్డట్టే
వోరలేక నేరుపున నొడఁ బరచవే చేరి
గారవించి చూచినాను కై కొన్నట్టే

చ. 2: కొలువులో నాతనిఁ గూరిములు గొసరవే
తెలిసి నవ్వినా సమ్మతించినయట్టే
పలుమారు పేరుకొని బత్తితోడఁ బిలువవే
యెలమి నూఁకొనినాను ఇయ్యకొన్నయట్టే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుని చేతికిఁ గానుకియ్యవే
వావిరి నందుకొనినా వచ్చినయట్టే
యీవేళ నన్నుఁ గూడె యీడకుఁ దానె విచ్చేసి
వావులు చెప్పించుకోవే వలచివయట్టే

రేకు: 0872-3 కన్నడగౌళ సం: 18-428

పల్లవి: ఇన్నియు నీకు నేరిపె నీతఁడే కదే
కన్నెతనము వెలసెఁ గాఁగిలించఁగాను

చ. 1: శిరసేల వంచేవే సిగ్గులేల పెంచేవే
సిరులనవ్వుతోఁ బతి సేసవెట్టఁగా
తెర యేల వేసేవే గురులేల వాసేవే
పొరిఁ బువ్వులు ముడిచి పూజించఁ గాను

చ. 2: వొట్టులేల పెట్టేవే వూరకేల తిట్టేవే
జట్టిగొని యీతఁడు చన్నుంటఁగా
గుట్టులేల పెట్టేవే కొసరేల కలపేవే
చుట్టరికాన నిన్నుఁ జొక్కించఁ గాను

చ. 3: పాదమేల తొక్కేవే పైపైనేల మొక్కేవే
యీదెస శ్రీ వేంకటేశుఁ డేలుకోఁ గాను
పోదులేల నెరుపేవే పొందులెన్ని గరుపేవే
ఆదిగొని నన్నేలి నీకప్పగించఁ గాను

రేకు: 0872-4 రామక్రియ సం: 18-429

పల్లవి: కంటివయ్య యీభాగ్యము కన్నులతుదల నేఁడు
జంటమాటలు మోవుల చవులా ఇవి

చ. 1: చెలరేఁగి నవ్వేవు చెలికి వీడె మిచ్చేవు
వలపుల పెడరేఁపు వాడికా ఇది
పిలిచేవు పేరుకొని ప్రియములు చెప్పేవు
తలపోఁత మచ్చికల తగులా ఇది

చ. 2: చనవాపె కొసగేవు సంగడినే కూచుండేవు
మనసులు గలసినమర్మమా యిది
మొనగోర నూఁదేవు ముచ్చటలు జరుపేవు
తనియనిజవ్వనమదములా యివి

చ. 3: కడుఁ దమకించేవు కాఁగిలించి కూడేవు
జడియనిరతులలో చలమా యిది
యెడనెడ శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
గుడిగొన్న వేడుకలగురుతా యిది

రేకు: 0872-5 సారాష్ణం సం: 18-430

పల్లవి: వివేకించుకొనవయ్యా వింతవింతలాగులు
కవగూడినగుట్టిది గర్వానకా

చ. 1: చెలి బొమ్మల జంకెన సింగారాన కింతేకాక
చలములు నీతోడ సాదించుటకా
మొలచినచిరునవ్వు మురిపేన కింతేకాక
సొలసిన కోపము చూపుటకా

చ. 2: అంగననివ్వెరగులు అణఁకువ కింతేకాక
పంగించి నీతో సరిపంతమునకా
ముంగినిట్టూర్పులు మోహమున కింతేకాక
వెంగెములు నీమై భావించి సోదించుటకా

చ. 3: వనితచెనకులెల్లా వలపించుటకుఁ గాక
కినిసి నిన్నింతలోనే గెలుచుటకా
యెనసె నీకె శ్రీవేంకటేశ నీచనవే కాక
అనుఁగురతుల నిన్నలయించుటకా

రేకు: 0872-6 శంకరాభరణం సం: 18-431

పల్లవి: ఔనె భాగ్యవంతురాల వన్నిటా నీవు
దీననే తలఁపెల్లాఁ దెలిసె మాకు

చ. 1: చనవులు నెరుపేవు సలిగెలు మెరసేవు
గొనకొని పతితోడ కొలువులోనె
ననుపులు సేసేవు నవ్వులు నవ్వేవు
ఘనమైన నీ యెమ్మెలు కంటిమే నేము

చ. 2: పలుమారు మురిసేవు పంతములు చూపేవు
సొలిసి యాతఁడు మోము చూడఁగానే
కళల విఱ్ఱవీఁగేవు కనుసన్నలు సేసేవు
చెలియ నిన్నిట్టె సంతిసించితిమే నేము

చ. 3: చుట్టమవై కలసేవు సుద్దులెల్లాఁ జెప్పేవు
గట్టిగా శ్రీ వేంకటేశుకాఁగిటనే
మెట్టేవు పాదములు మేనరికమే పెంచేవు
గుట్టున నన్నితఁడేలె కోరితిమే నేము

రేకు: 0873-1 వరాళి సం: 18-432

పల్లవి: ఆలిమగనిసందికి నడ్డమున్నదా
మేలములాడఁ గదవె మేకు లేఁ టికి

చ. 1: తలవంచుకొననేల దండనే కూచున్నవాఁడు
చెలువునిఁ జూడఁగదే సిగ్గులేఁటికి
వలవనిమోనమేల వచ్చీ తా వేడుకపడి
పలుకఁ గదవే వట్టి పంతమేఁటికి

చ. 2: సన్నలుఁ జాయలునేల సమ్మతించి వున్నవాఁ డు
విన్నవించఁ గదవే నివ్వెర గేఁటికి
యెన్నిక లింతేనేల యింటిలోనికిఁ బిలిచి
చన్నుల నొ త్తఁగదవే జాగు లేఁటికి

చ. 3: వొరయఁగ నిఁకనేలే వొడివట్టుకున్నవాఁడు
గొరబుగా నవ్వఁగదే కొసరేఁటికి
ఇరవై శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సరిమో వియ్యఁ గదవె సాములేఁటికి

రేకు: 0873-2 కన్నడగౌళ సం: 18-433

పల్లవి: వేగిరించ నాకేల వేసరనేల
చేగదేర మొక్కఁగా నీచి త్తము నాబాగ్యము

చ. 1: నిన్నుఁ జూచి చూచి నేను నేరము లెంచనేర
సన్నలనే చలములు సాదించనేర
కిన్నెరమీటుచు నిన్ను గిలిగించి పాడిపాడి
విన్నపము సేసుకోఁగా వెసఁ గరుణించేవు

చ. 2: తఱివులు పెట్టి పెట్టి తమి నలయించనోప
గుఱిలేనిమాటలకుఁ గొసరనోప
అఱిముఱి నీపై వల పాకులలో వాఁసి వాఁసి
యెఱుకసేసి యంపఁగా నిట్టె నన్నేలేవు

చ. 3: పొలసి పొలసి సారె బొమ్మల జంకించఁజాల
బలిమి సేసి నిన్నుఁ బంగించఁజాల
యెలమి శ్రీ వేంకటేశ ఇదె నీకాఁగిటఁ గూడి
నిలుచున్నదాన నిఁక నీవే మెచ్చేవు

రేకు: 0873-3 దేశాక్షి సం: 18-434

పల్లవి: చేరి నీమొగము చూచి సిగ్గయ్యె నాకు
తారుకాణలాయ అన్నీఁ దలఁచుకోరా

చ. 1: నెలఁతను లాలించేవు నెరులచిక్కు దీసేవు
వలపులు రేఁచేవు వద్దఁ గూచుండి
పిలిచినాఁ బలుకవు పిక్కటిల్లుఁ బరాకుతో
చెలులెల్లా నవ్వేరు చిత్తగించరాదా

చ. 2: పూవులదండ వేసేవు పొంచి వొడివట్టేవు
వావులు చెప్పిచూపేవు వద్దఁ గూచుండి
చేవట్టితీసినా రావు చెంతనే నివ్వెరగంది
దేవుళ్లే నిన్ను నవ్వేరు తెలుసుకోరాదా

చ. 3: కన్నులనే సొలసేవు కాఁగిలించి కూడేవు
వన్నెలమోవి యిచ్చేవు వద్దఁ గూచుండి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితి వాకెను నన్ను
కన్నెలె నిన్ను నవ్వేరు కనుకొఁనరాదా

రేకు: 0873-4 సాళంగనాట సం: 18-435

పల్లవి: తోడఁ బెండ్లియాడవద్దా దోమటి దొడుకవద్దా
జోడు గూడి వుండవద్దా సుద్దులేమి చెప్పేవే

చ. 1: సంతమాట లాడేవు సణఁగులు రాలిచేవు
యెంత లేదు నీపగటు యేమిచెప్పేదే
పంతాలాడేవు విభుఁడు బత్తి నాపైఁ జేసెనంటా
నింతగలదానవు నాఁడేడనుంటివే

చ. 2: సన్నలనే సొలసేవు చలములు మెరసేవు
ఇన్నిటా నీదొరతన మేమి చెప్పేదే
కన్నులనే జంకించేవు కాంతుఁడు నావాఁడంటా
యెన్నికగలదానవు యేమరఁదగునా

చ. 3: సందడి శ్రీవేంకటేశు సారె సారెఁ గూడేవు
ఇందరిలో నీనేర్పు లేమిచెప్పేదే
మందలించేవు యీతఁడు మచ్చిక నన్నేలెనంటా
పొందైనదాన విట్టె బుద్ధి చెప్పవలదా

రేకు: 0873-5 బౌళి సం: 18-436
పల్లవి: పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికిని వెలసెఁ జూడరే
చ. 1: కొండలే పీఁటలుగాఁ గూచున్నా రెదురుబడి-
నండఁనే నారసింహుఁడు నాదిలక్ష్మియు
వెండిఁబైఁడి నిండుకొన్న వేదాద్రి గరుడాద్రుల
పెండిలాడే రిద్దరును ప్రియములఁజూడరే
చ. 2: భవనాశిజలములఁ బాయక తోడ నీళ్లాడి-
రివలా నవలాఁ దాము యేటిదరుల
జవళి మంచిపూవుల సరి సేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తానఁ దప్పక చూచేరు
చ. 3: పొందుగఁ గనకావతి భోగావతినదుల
సందడివసంతముగాఁ జల్లులాడుచు
అందమై శ్రీ వేంకటాద్రి నహోబలాన నొకఁ
చందమునఁ గూడి కూడి సరసములాడేరు

రేకు: 0873-6 ఆహిరి సం: 18-437

పల్లవి: మఱఁగులేఁటి కింతట మన్నించవయ్యా
చిఱుతనీసేసలు చిత్తగించవయ్యా

చ. 1: మచ్చువేసి మాటలాడి మగువను వలపించి
రచ్చలఁ బెట్టితి వింక రావయ్యా
యిచ్చకములే సేసి యీవిగా మోవి యొసఁగి
లచ్చనలు నించితి వెల్లవారు నెరిఁగిరి

చ. 2: నయగారాలెల్లాఁ జూపి నంటున నవ్వులు నవ్వి
దయతోఁ బెండ్లాడితివి తలఁచవయ్యా
ప్రియములు పచరించి బిగువుఁజన్నులు ముట్టి
క్రియలు మరిపి సిగ్గు బయలుసేసితివి

చ. 3: చూపులనే యాసరేఁచి సొమ్ములు మేనఁ బెట్టి
తీపులనే కూడితివి తెలియవయ్యా
యేపున శ్రీ వేంకటేశ యిన్నిటా నేర్పరిఁ జేసి
చేపట్టితి విందుకు నీచెలులు మెచ్చేరు

రేకు: 0874-1 శుద్ధవసంతం సం: 18-438

పల్లవి: ఆయనాయఁ దనిసితి మన్నిటాను
యీయెడ నీవోజలు యెఱఁగమా తొల్లి

చ. 1: యెన్నిసుద్దులు చెప్పేవు ఇచ్చక మెంత సేసేవు
వున్నతి నిందాఁకా నెందోవుండి వచ్చి
సన్నలేల చూపేవు సరస మేమాడేవు
యిన్నేసి నీవేసాలు యెరఁగమా నేము

చ. 2: నవ్వు లెందాఁకా నవ్వేవు నయ మెట్టు గురిసేవు
యెవ్వరెవ్వరికో కాఁగిలిచ్చి వచ్చి
పువ్వు లెక్కడి విచ్చేవు పూసేవు గంద మప్పటిఁ
నివ్వల నీమతకము లెఱఁగమా నేము

చ. 3: కుచము లేలంటేవు గోరెంత దీసేవు
పచరించే వెవ్వతెతోనో పలికి వచ్చి
రుచులుగాఁ గూడితివి రొక్కము శ్రీ వేంకటేశ
ఇచట నీవినోదాలు యెఱఁగమా నేము

రేకు: 0874-2 దేశాక్షి సం: 18-439

పల్లవి: నెట్టుకొని మన్నించేది నీచేతి దింతేకాక
బట్టబయ లీఁదించఁగా భ్రమసే దేమరుదు

చ. 1: వెలలేనిమాటలు వేవేలు నీ వాడఁ గాను
వలవకుందురా యెట్టివనితలై నా
యెలమిఁ జక్కఁదనాలు యెదుటనే చూపఁగాను
బలిమి జవ్వనులెల్లా భ్రమసే దేమరుదు

చ. 2: పురిగొని నీ వేపొద్దు పొరుగున నుండఁగాను
మరుగకుందురా గొల్లమంకులై నా
ఇరవైనచుట్టమవు ఇక్కువలు ముట్టగాను
పరిపరివిధముల భ్రమసే దేమరుదు

చ. 3: కడు నీవు బుజ్జగించి కాగిలించుకొనఁగాను
అడరి చొక్కకుందురా అచ్చరవైనా
నడుచు శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
బడి నిన్నుఁ జూచేవారు భ్రమసే దేమరుదు

రేకు: 0874-3 లలిత సం: 18-440

పల్లవి: నీతి విచారించుకోవే నీలో నీవే
కాతరించి దూరుదురా కలికిరో నీవు

చ. 1: సారె బతిసముకాన సతులతో నవ్వఁగాను
వూరకే వండుదురా వొద్దివారెల్లా
కోరి నీ వందుకుఁగాను కొడిమెలు గట్టేవు
ఆరజకతైవుగదే అంగనరో నీవు

చ. 2: గద్దెమీఁదనుండాతడు కప్పురము లియ్యఁగాను
గద్దించి వొల్లమందురా కామినులెల్లా
వద్దనుండి ఇందుకుఁగా వావు లేరుపరచేవు
సుద్దులకత్తెవుగదే సుదతిరో నీవు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు మెచ్చి చేరి కాఁగిలించఁ గాను
దేవుళ్ళఁ గామందురా పొందినవారెల్లా
నీవుఁ గూడి యిందుకుఁ గా నిండుఁజుట్టాలఁ జేసేవు
వోవలకతైవుగదే వువిదరో నీవు

రేకు: 0874-4 నారాయణి సం: 18-441

పల్లవి: ఇరుగుపొరుగు వింటే నిఁక నేమందురో కాని
సరి నూడిగపువారు శిరసులు వంచిరి

చ. 1: నిలుచుండి మోవి యిచ్చి నెలఁతనుఁ గాఁగిలించి
అలరించేవు రతుల నందగాఁడవై
చెలులు మి మ్మిటు చూచి సిగ్గులువడుచు లోలో
తెలిఁగన్నులతోడుత తెరవేసుకొనిరి

చ. 2: తొడలపై నెక్కించుక తొయ్యలితో దోమట్లు
దొడికేవు కూటములఁ దోడుతోడనె
బడినన్ను పేరటాండ్లు భావములెల్లాఁ దెలిసి
తడఁబాటుతో నవ్వు దాఁచి గుక్కుకొనిరి

చ. 3: వొత్తగిలి పవ్వళించి వువిదఁ బైపైఁ గలసి
పొత్తారగించితివి బువ్వముగాను
ఇత్తల శ్రీవేంకటేశ యెరిఁగి నన్ను గూడఁగా
సత్తుగా సవతులెల్లా సన్నలు గావించిరి

రేకు: 0874-5 దేసాళం సం: 18-442

పల్లవి: వేడుకయ్యీ నాకు నేఁడు వెరవ మీకేఁటికి
కూడుక వుండఁగరాదా గుట్టు దెలిసేను

చ. 1: అద్దమరేతిరి నీవు ఆపెతో మాటలాడఁగా
వొద్దికి నే వచ్చితేనే వూరకుంటిరి
వద్దనేనా నే మిమ్ము వలపుగలంత మీలో
సుద్దులు చెప్పకోరాదా సొరిది నే వినేను

చ. 2: అంకెలుగా సన్నలు మీరట్టె సేసుకోఁగా నే మీ-
వంక చూచితే తల వంచుకొంటిరి
కొంకనేల నాయడకు కోరినట్టెల్లా మీకు
పొంకము లెంచుకోరాదా పొసఁగ నే మెచ్చేను

చ. 3: కందువ మీరిద్దరును కాఁగిటిలో నవ్వుకోఁగా
సందడిలో నే మొక్కితే జట్టిగొంటిరి
అందుకేమి శ్రీవేంకటాధిప నన్నేలితివి
పందేలు వేసుకోరాదా బలిమి నే చూచేను

రేకు: 0874-6 పాడి సం: 18-443

పల్లవి: నే నేమందునోయంటా నీ వనుమానించనేల
పూని అప్పణ ఇచ్చేను పొందవయ్య సతిని

చ. 1: సరి పరపుపై నుండి సతి తెరవేసుక
పెరరేఁచీ వలపులు బెట్టి మాటాడి
యిరవిదె నీకు దండ కిట్టె విచ్చేయవయ్య
పరగఁ బాఘుండితేను పట్టలేవు మనసు

చ. 2: పుక్కిటవిడెముతోనే పొలఁతి మలగుపొంతి
కిక్కిరించీఁ దమకము కేరినవ్వుతా
అక్కరగలవు నీవు అట్టె కాఁగిలించవయ్య
అక్కున నిడుకో కిటు ఆఁపలేవు వయసు

చ. 3: పచ్చడములోను చొచ్చి భామ కుచముల నొత్తి
యిచ్చకపుసన్న సేసి యెనసీ లోలో
కుచ్చి శ్రీ వేంకటేశ కూడితి విట్టె నన్ను
విచ్చనవిడి గాకుంటే విడువలే వాసను

రేకు: 0875-1 నానాగవరాళి సం: 18-444

పల్లవి: కంటిమి నీగుణమెల్లా కన్నుల తుదల నేఁడు
గొంటరిచేఁతలెల్లాను కుమ్మరించే విపుడు

చ. 1: సాదించేవానివలెనే సతిమోము చూచేవు
తోదోపులాడి యట్టే కందువలంటేవు
సోదించేబాగుననే చొచ్చే వేకతానకు
పాదుగా నెన్నిమాయలు పచరించే విపుడు

చ. 2: సారెఁ దిట్టేవానివలె పొలఁతితో మాటాడేవు
వొరటుచూపేయట్టు వొడివట్టేవు
సొరిది గద్దించేరీతి సొమ్ములు గొని వేసేవు
గరిమ నెన్నిసటలు కల్పించే విపుడు

చ. 3: మెచ్చేటివానివలెనే మెలుఁతఁ గాఁగిఁలించేవు
లచ్చనలు నించేయట్టే లాలించేవు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యిచ్చకపుబయకారా లెన్ని సేసే విపుడు

రేకు: 0875-2 ఆహిరి సం: 18-445

పల్లవి: ఎప్పుడు భేదము లేదు ఇద్దరికిని
చప్పుడు సేయకుండితే చనవిచ్చీ నతఁడు

చ. 1: పెలుచైనవానికిఁ బ్రియములు చెప్పితేను
కలుచపడుఁ గాక సంగతెరుఁగునా
తలఁచుకొనీఁ దానే తరి నాకిచ్చినబాస
మలసి వూరకుండితే మంకుదేరీ నతఁడు

చ. 2: గడుసైనవానికిఁ గానుక లిచ్చితేను
బెడసరమే కాక వొడఁబడీనా
తడవీఁ గాక తానే తగిననాసేవలు
బడివాయకుండితేను పంతమిచ్చీ నతఁడు

చ. 3: నాలియైనవానికి నవ్వులు నవ్వితేను
పేలరితనమే కాక పెంపురుఁగునా
వేళెరిఁగి తా నన్ను శ్రీవేంకటేశుఁడిటు గూడె
తాలిమితో నుండితేను దయఁజూచీ నతఁడు

రేకు: 0875-3 దేసాళం సం: 18-446

పల్లవి: ఏల నన్నొడఁబరచే విటు నిన్నుఁ గాదనేనా
మేలమెరిఁగినవారి మెప్పించరాదా

చ. 1: జాడల నాతో నీవు సమ్మతించఁ జెప్పేవు
ఆడరాదా తగవు నీ వాపెతోను
వేడుక కాఁడవు నీవు వెలఁదు లొద్దనున్నారు
పాడిపంతములెల్లాఁ బచరించరాదా

చ. 2: గుట్టున నన్నెంత వేఁడుకొనేవు సారె సారెకు
అట్టె పెనఁగరాదా ఆపెతోను
చుట్టరికము నేర్తువు చూచే రూడిగపువారు
నెట్టుకొన్నసంతోసాలు నెరపఁగరాదా

చ. 3: పోదిసేసి నన్ను నెంతపాదిగే విందుకుఁగాను
ఆదరించి కూడరాదా ఆపెతోను
యీదెస శ్రీవేంకటేశ యేలితి వాపెను నన్ను
పాదుగా సవతులలోఁ బాలించరాదా

రేకు: 0875-4 శ్రీరాగం సం: 18-447

పల్లవి: సంగడికి రాఁగదవే సరిచూచేను
యింగిత మెరుఁగుకొంటే నిద్దరికిఁ గూడెను

చ. 1: తుంమిదలు వ్రాయఁబోతే తొయ్యలి నీతురుమాయ
నెమ్మిఁ జందురు వాఁసితే నీమోమాయనే
వుమ్మడి సంపెంగ వ్రాయ నున్నతి నాసికమాయ
కమ్మఁగలువలు వ్రాయఁ గన్నులాయను

చ. 2: గక్కన శంఖము వ్రాయఁ గన్నెరో నీగళమాయ
జక్కవల వ్రాయఁగా నీచన్నులాయను
అక్కరఁ దామరలు వ్రాయఁగ నీకరములాయ
నిక్కి సింహము వ్రాయఁగా నీనడుమాయను

చ. 3: పులిసము వ్రాయఁగాను పొలఁతి నీపిరుఁదాయ
తెలియ నరఁటులు వ్రాసితేఁ దొడలాయ
కలసితివి శ్రీవేంకటేశ్వరుఁడనుఁ దాను
బలుచిగురులు వ్రాయఁ బాదాలాయను

రేకు: 0875-5 పాడి సం: 18-448

పల్లవి: ఒద్దికతోఁ గూడిమాడి వుండరాదా
సుద్దు లేమి చెప్పేవే సులభాన నీవు

చ. 1: ఇప్పుడే యెవ్వతెతోనో యీవిభుఁడు నవ్వెనంటా
చెప్పుడుమాటలకేల చెవియొగ్గేవే
కొప్పు జారివున్నదంటా కొంగు పసపాయనంటా
చొప్పులేల యేత్తేవే సొలయుచు నీవు

చ. 2: కోడెవనితలతోడ గుట్టునఁ బెనఁగెనంటా
వేడుకచేఁతల కేల వెరగందేవే
వాడినది మోవియంటా వడిసీఁ జెమటంటా
ఆడిక లేలాడేవే అందరిలో నీవు

చ. 3: కన్నె పెండ్లి కూతురు కై దండ వట్టెనంటా
సన్నల రతుల కేల సాదించేవే
ఇన్నిటా శ్రీ వేంకటుశుఁ డేలెనంటా మెచ్చెనంటా
నిన్ను నేల పొగడేవే నెట్టుకొని నీవు

రేకు: 0875-6 వరాళి సం: 18-449

పల్లవి: కొనియాడేమే నిన్ను కొత్తలుగాను
చనవరి వైనందుకు సరివచ్చె నిపుడు

చ. 1: ఇప్పుడేమాయనే ఇదిగో ఆతఁడున్నాఁడు
చిప్పిల నీపంతము చెల్లించుకోవే
చెప్పుకొన నేఁటికే చెలరేఁగి నీయెమ్మెలు
తప్పక చూచినందే తారుకాణ గంటిమే

చ. 2: కాదనేనటవే కదిసెను రమణుఁడు
పాదుగా నీయిచ్చలను బాసగొనవే
తోదోపు లేఁటికే తొక్కితివి పాదము
ఆదరించినప్పుడే ఆయాలు గరఁగెనే

చ. 3: చెల్లదటవే నీవుచేసినచేఁతలెల్లా
యిల్లిదె శ్రీవేంకటేశు నిట్టె కూడవే
పల్లదాలేఁటికే నన్ను బైకొని యీతఁడె కూడె
వొల్లనే నే నవ్వితేనే వొడఁబాటులాయనే

రేకు: 0876-1 మంగళకౌశిక సం: 18-450

పల్లవి: భామల చయ్యాటాలు నీభాగ్య మాయను
యేమరక నీమే లొక టినుమడి సేసెను

చ. 1: ఇద్దరుసవతులును యెదిరించి పెనఁగఁగా
వద్దని నడుము చొచ్చి వారించితివి
కొద్దితో నాలుగుచనుగుబ్బలు నీమేనను
చద్దికి వేఁడికి నొత్తి సమరతి సేసెను

చ. 2: చెలు లొకరొకరిపై చేతులు చాఁచుకోఁగా
తొలఁగకడ్డమై మాన్ప దొరకొంటివి
కెలఁకుల నెదురుగాఁగిళ్లు నీ మెడఁ దగిలి
వెలలేనివలపులు వేడుకలు సేసెను

చ. 3: కన్నుల నీకె నాకె కడుజంకించి చూడఁగా
కన్నెలకు గుఱై నిల్చి కలసితివి
నన్నేలి శ్రీ వేంకటేశ నడుచు నీ వుండఁగాను
అన్నిటాఁ గల్వలై నిన్ను నవే పూజసేసెను

రేకు: 0876-2 హిందోళం సం: 18-451

పల్లవి: చెలి నిన్ను దూరీని చెప్పవయ్య యీతగవు
తలఁపించఁగలఁ గాక తమిరేఁచవచ్చునా

చ. 1: వెలఁదిమాటలు నీకు విన్నవించఁగలఁ గాక
వలపించ నావసమా వరుసతోను
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పఁగ నేఁ గలఁ గాక
బలిమిసేసి నిన్నుఁ బిలువఁగవచ్చునా

చ. 2: కాంత ఇచ్చెనని నీకు గాను కియ్యఁగలఁ గాక
వంతులకు మెడఁగట్టవచ్చునా నిన్ను
మంతనాన నీకెఁ దెచ్చి మాటాడించఁగలఁ గాక
వింతలుగా నిన్ను వెంటవెంటఁ దిప్పవచ్చునా

చ. 3: తరుణికి నీకుఁ దెర తగ వేయఁగలఁగాక
సరిఁ బెట్టి కాఁగిలింపించఁగవచ్చునా
గొ౦రబై శ్రీవేంకటేశ కూడితి విట్టె యీకెను
యిరవై మెచ్చఁగలఁగా కెదురాడవచ్చునా

రేకు: 0876-3 లలిత సం: 18-452

పల్లవి: కానవచ్చీ మీవోపికలు మాకెల్లా
నానఁబెట్టేరు వలపు నంటున నిందరును

చ. 1: వొళజొత్తుమాటలు వొకరొక రాడుకొని
జలజాక్షులు నీపై వసంతమాడేరు
పలుమారు నందరును బాసలు చేసుకొని
సొలసి సొలసి నీతో జూజాలాడేరు

చ. 2: సరినుండి తమలోన సన్నలుసేసుకొని
మొరయుచు నీతో సాములుసేసేరు
తొరలింపు మాటలు తొలుతే పదరుకొని
వరుసవంతులకు రవ్వలుసేసేరు

చ. 3: ముసిముసినగవులతో మొగములు చూచుకొని
అసము డించక కూడి ఆయాలంటేరు
యెసగి శ్రీ వేంకటేశ యింతలో నన్నేలితివి
పొసఁగ నందరు నీకుఁ బొందులు చూపేరు

రేకు: 0876-4 బౌళి సం: 18-453

పల్లవి: తమకించి నిన్నేమైనాఁ దడవితినా
అమరించుకొని నీవే ఆడుకొనేవు గాక

చ. 1: పొగడిననోరనే పూఁచిపట్టి నేనిఁక
యెగసక్కే లాడేనా ఇప్పుడే నిన్ను
వెగటుఁజేఁతలు సేసి విచారించుకొని నీవే
పగటున వెంగేలుగా భావించేవుగాక

చ. 2: సేవ సేసినచేతనే చెలరేఁగి నే నేఁడు
లావు చూపి పెనఁగేనా లలి నీతోను
కావరించి యాడోవారి కాఁగిట నలసి వచ్చి
వోవరిలో నీచొప్పులే వూహించేవుగాక

చ. 3: సమ్మతించి కూడిన నాచన్నులనే వొత్తివొత్తి
నెమ్మది నీకు దాఁచేనా నేరుపు నేను
వుమ్మడి శ్రీ వేంకటేశ వూరఁబొత్తుల వాఁడవై
కుమ్మరింపుటాసలను కొసరేవు గాక

రేకు: 0876-5 ధన్నాసి సం: 18-454

పల్లవి: రమణుఁడ చిత్తగించు రతికెక్కె నీదేవులు
సముకపు మాటలు సమ్మదములాయను

చ. 1: అదే నీచక్కఁదనాన కద్దము చూపినట్టు
పొదిగొని మెరసీని పొలఁతి మోము
కదిసి నీలాల బంతి కానుకగాఁ బట్టినట్టు
యెదుట నీకెతురుము యెక్కుడై కాన్పించెను

చ. 2: బడి నీ సింగారానకు పైఁడికుండ లెత్తినట్టు
కడుమించీ నివిగో కాంత గుబ్బలు
వెడ నీకోరికలు తీవెలు వారి వుండినట్టు
కడిఁగి యీకె చేతులు కనుపట్టి వున్నవి

చ. 3: చుట్టుగా నీవలపు రాసులుగాఁ బోసిన యట్టు
వొట్టి యీకె పిరుఁదులు వొనరినవి
యిట్టె శ్రీవేంకటేశ యీకెతో ననిచినట్టు
జట్టిగా నీమెపాదాల జంట చిగురున్నది

రేకు: 0876-6 మాళవిగౌళ సం: 18-455

పల్లవి: ఎంత మోహించినాఁడే నే నేమిబాఁతే తనకు
మంతనములాడీని మాఁటికి మాఁటికిని

చ. 1: బలిమి నాగుబ్బల పై బన్న సరికంఠమాల
పలుమారు లెక్కవెట్టీ పయ్యద దీసి
మెలుపు తోడ నొసలి మీఁది కస్తూరిబొట్టు
కొలఁదికి దిద్దీ తనకొనగోరను

చ. 2: చందపునా కొప్పులోని సంపెంగ పూవులు
చెంది వాసన చూచీని ముందల వట్టి
ముందరి నాకుచ్చెలపై మొలనూలి మొగపులు
అందములు చూచీఁ దనహస్తమునను

చ. 3: పరగ నాముంజేతుల పగడాల చేఁకట్టు
గొరబై విలువ సేసీ కొంగు పైఁ గప్పి
యిరవై శ్రీ వేంకటేశుఁ డేలి నన్నుఁ జెలులార
అరదీఁ దమ్ముల మిది యట్టె నాపుక్కిటను

రేకు: 0877-1 భైరవి సం: 18-456

పల్లవి: చిత్తగించవయ్యా నీసింగారపు దేవులను
హత్తి కరుణించ రాదా ఆసపడీని

చ. 1: నిండారాఁ దన మీఁద నీవు బత్తిగలవని-
యండనున్న చెలితోడ నానతిచ్చీని
పండఁబడి నీవుండిన పర పిది తనదని
వెండియును తన పెను వేలఁ జూపీని

చ. 2: చనవున నిద్దరికి సమద్రిష్టాయనని
తనపొరుగాపె తోడఁ దలపోసీని
ననిచిన యట్టి ప్రాణనాథుడవు నీవని
వొనరఁ జేకావికలు వొడిఁబెట్టి పంపీని

చ. 3: బెట్టినీనోరను తన పేరు నుడిగేవని
చుట్టపు వనితతోఁ బొంచు లాలించీని
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి మగువను
గుట్టుతోడఁ దనకు నిన్నే గురిసేసీని

రేకు: 0877-2 సాళంగనాట సం: 18-457

పల్లవి: ఎందరు చెప్పినా విన వేమిచెప్పేది
యిందె తగవు దేరె నేమిచెప్పేదే

చ. 1: వంతువరుసలు గాక వద్దఁ గాచుకుందానవు
యెంతలేదు నీయాసోద యేమిచెప్పేదే
మంతనములాడితివి మరి మాటలాడేవు
యింత గద్దా యేఁకట యేమిచెప్పేదే

చ. 2: వుమ్మడిఁ బెండ్లాడియును వొడివట్టి తీసేవు
యెమ్మెలు చూపవలెనా యేమిచెప్పేదే
నమ్మికలు గైకొంటివి నవ్వుతానే కొసరేవు
యిమ్ముల నీడేరెఁ బంత మేమిచెప్పేదే

చ. 3: పట్టపుదేవివై యుండీఁ బలుమారుఁ దనియవు
యిట్టె పెంచేవు మేలు యేమిచెప్పేదే
చుట్టమైననన్ను నేలే నచ్చుగ శ్రీవేంకటేశుఁడు
యిట్టె నీనామంచితన మేమిచెప్పేదే

రేకు: 0877-3 సింధురామక్రియ సం: 18-458

పల్లవి: మెచ్చేరయ్యా నాయకుఁడ మెలుఁత లీవేళ నిను
నిచ్చలును వలవఁగ నీవే నేర్తువయ్యా

చ. 1: యిట్టుండవలదా యింతిమీఁదిమోహము
వొట్టుగా నాకుమడిచి యొసఁగితివి
చుట్టమవై నందుకు సుద్దులిన్ని చెప్పవద్దా
గుట్టుసేయ కింత నిండుఁ గొలువులోను

చ. 2: ననుపింత గావలదా నలినాక్షితోడుత
యెనయుచుఁ దోడమీఁద నిడుకొంటివి
చనవిచ్చినయందుక సరసమింతాడవద్దా
పనిపడి యూకెయీాడుభామలముందరను

చ. 3: యీారీతి నవ్వవలదా యేణాక్షితోడుత
గారవించి కాఁగిటఁ గలసితివి
ఆరయ శ్రీ వేంకటేశ అందమిటు చూపవద్దా
సారెకు మోవిచ్చితి విచ్చుటఁ బాన్పుమీఁదను

రేకు: 0877-4 తెలుఁగుఁగాంబోది సం: 18-459

పల్లవి: నావల్లఁ గడమ లేదు నమ్మితి నిన్ను
కైవసమై యీచెలినిఁ గరుణించు మిపుడు

చ. 1: అలివేణి నిన్నుఁ బాసి అలసినఅలయిక
తెలిపి చెప్పితిఁ జుమ్మీ తెల్లమిగాను
చెలరేఁగి మీరు తొల్లి సేసుకొన్నబాసలు
తలఁపించితిఁ జుమ్మీ నేను తారుకాణగాను

చ. 2: యేపున విరహవేళ నింతిపాన్పుపై చిగురు
చూపితిఁ జుమ్మీ నేను సూడిదెగాను
తీపులనీమోవి యిచ్చి తేకువ మన్నించుమని
చేపట్టి మొక్కితిఁ జుమ్మీ సెలవుగాను

చ. 3: పోడిమి నిద్దరికిని పొందు సేసి కూడించి
వేఁడుకొంటిఁ జుమ్మీ నిన్ను వేడుకగాను
నేఁడు శ్రీ వేంకటేశుఁడ నీవే దయఁ గాచితివి
పేఁడితిఁ జుమ్మీ వలపు పెక్కువగాను

రేకు: 0877-5 శంకరాభరణం సం: 18-460

పల్లవి: లెస్సాయఁగా నేఁడు నీలెక్కలేనిసరసాలు
అస్సారముగా వలపు లారడిఁ బేట్టేవు

చ. 1: నమ్మికిచ్చి తెచ్చి నేఁడు నలినాక్షిఁ బెండ్లాడి
వుమ్మడి జాజాలాడేవు వూరిలోనెల్లా
సమ్మతిగాఁ జన్నులంటి జవ్వనము పెడరేఁచి
పమ్మి పరాకుసేసుక పాటలువాడేవు

చ. 2: ఆసలెల్లాఁ బెట్టి పెట్టి ఆయములు గరఁగించి
తోసిపార గుజ్జాల వీదులఁ దోలేవు
బాససేసి యేకతాన పలురతులెల్లా నేర్పి
వేసాలకు సాములు వేమారుఁ జేసేవు

చ. 3: తేటమాటలాడి మోవితేనియ చవిమరపి
పాటించి పానుపుమీఁదఁ బవళించేవు
గాఁటాన శ్రీ వేంకటేశ కలికి నేలితి విట్టె
నాటకపుసిగ్గులను నవ్వులు నవ్వేవు

రేకు: 0877-6 నాదరామక్రియ సం: 18-461

పల్లవి: వోజకు వచ్చినవాని నొడికానఁ గూడరాదా
సాజము దెలుసుకోవే చలపట్టనేఁ టికి

చ. 1: కలసిమెలసి నీతోఁ గాఁపురము సేసేవాని
తొలుతటిచేఁత లెంచి దూరనేఁటికి
చెలరేఁగి నీకు నిట్టె చెప్పినట్టు సేసేవాని
బలిమిని చొప్పులెత్తి పత్తిసేయనేఁటికి

చ. 2: నవ్వుతాఁ దెగడుతాను నసుపై వుండెడివాని
వువ్విళూర్ల మర్మాలెత్తి వొరయనేలే
చివ్వన నిచ్చకములే సేసుక నడచేవాని
రవ్వగా సిగ్గువరచి రచ్చ వేయనేఁటికె

చ. 3: కన్నుసన్నలనే నిన్నుఁ గాఁగిట నేలినవాని
పిన్ననాఁటిసుద్దు లవి పేరుకోనేలే
యిన్నిటా శ్రీ వేంకటేశుఁ డీతఁడే మన్నించె నేఁడు
కిన్నెర మీఁట గోర గిలిగించ నేఁటికే

రేకు: 0878-1 పడ పంజరము సం: 18-462

పల్లవి: కన్నువిన్నకొత్త గాదు కలికితన మీకెది
మన్ననలెల్లా నిచ్చి మందలించవయ్యా

చ. 1: నానఁ బెట్టి సెలవుల నవ్వు నాముందరఁ బోసి
కానుకలు వట్టీఁ గనకపుగుబ్బలు
సానఁ బట్టినచూపుల జాజరలాడీని నీపై
పూనిననీయింతినేరుపులు చూడవయ్యా

చ. 2: వొడిఁ గట్టుకొని సిగ్గు లూరక నీపైఁ జల్లి
ముడుపులు గట్టిచ్చీని ముద్దుమాటలు
కడలేనిమురిపేల కందువముగ్గులు వెట్టీ
తడయక యీకెజాణతన మెంచవయ్యా

చ. 3: గాడిఁ గట్టి మోము చంద్రకళలెల్లాఁ దోడుచూపి
సూడిదెవట్టీఁ దనసొంపురతులు
యీడుగా శ్రీ వేంకటేశ యెవసె విన్నిటా నిన్ను
వేడుకచుట్టరికము వెలయించవయ్యా

రేకు: 0878-2 బలహంస సం: 18-463

పల్లవి: బలిమి సేయకు మిఁక పచ్చిదేరీని
తిలకించి చూచితే నే దీకొనేనా

చ. 1: కడుఁ బెనఁగకు మేనిగందపుబేంట్లు రాలీ
వొడివట్టి తియ్యకు నవ్వులు వచ్చీని
పిడికిటితలఁ బాల పెండ్లికూఁతురను నేను
యెడయక నీ వెట్టున్నా యెగ్గులెంచేనా

చ. 2: బెట్టిమాట లాడకు పెదవి కెంపులు రేఁగీ
మట్టుమీరి చూడకు మర్మము లంటీని
పట్టపుదేవులనైన పాయరానిసతి నేను
చుట్టము వెందరికైనా సూడువట్టేనా

చ. 3: పందెములు వేయకు పైపై సందు లదరీ
సందు లంత దూర కలసత లుబ్బీని
కందుల శ్రీ వేంకటేశ కలసినసతి నేను
విందు లెందు చేకొనినా వెంగెములాడేనా

రేకు: 0878-3 సామంతం సం: 18-464

పల్లవి: ఏఁటికిఁ జింతించేవు యెఱఁగవా నామనసు
చీటికిమాటికి లోలో సిగ్గులు నాసాజము

చ. 1: మొగమోటగలదాన ముందుముందే దూరనేర
నగుతానుండేదిది నాసాజము
తగవు దప్పనిదాన తబ్బిబ్బులకు నోపను
అగపడి మెచ్చు మెచ్చే దదియు నాపాజము

చ. 2: వినయముగలదాన వెంగెములాడఁగనేర
ననిచి మాటలాడేది నాసాజము
మనసు నమ్మినదాన మర్మము లెత్తఁగ నోప
చనవులు మెరసేది చక్కనినాసాజము

చ. 3: కడు బత్తిగలదాన కాఁతాళించుకొననేర
నడుమఁ గాఁగిలించేది నాసాజము
అడరి నన్నేలితివి అంతలో శ్రీ వేంకటేశ
యెడసి పాయఁగనోప యిదే నాసాజము

రేకు: 0878-4 నాట సం: 18-465

పల్లవి: ఎవ్వరు నిన్నేమనేరు ఇంత దొడ్డవాఁడవు
చివ్వన నాపెచే సేవచేయించుకోరాదా

చ. 1: జూటరితనము నేర్చు సుద్దులు చెప్పఁగనేర్చు
కూటమికి నాపె నిన్నుఁ గొసరనేర్చు
యేఁటికి బాఁతి నేను ఇచ్చకమాడేదానను
చోటిచ్చి యాపె నొద్దఁ గూచుండఁ బెట్టుకోరాదా

చ. 2: సరసమాడఁగనోపు సన్నలు సేయఁగ నోపు
ఇరవుగా నాపె యెలయించఁగ నోపు
వొరయ నిందేమున్నది వూడిగపుదాన నేను
తెరవేసి నీసూటికి తిద్దుకొనరాదా

చ. 3: వలపించ తానెరుఁగు వాడికలెల్లా నెరుఁగు
కలసి నిన్నాపె పొసఁగఁగ నెరుఁగు
యెలమి నన్నేలితివి యిప్పుడే శ్రీ వేంకటేశ
కలికి యాపెఁ బెద్దరికము సేయరాదా

రేకు: 0878-5 వరాళి సం: 18-466

పల్లవి: ఏల గడించుకొనేవు యేమి నీవు దూరేవు
వాలుకచూపులు గాక వాండ్లా ఇవి

చ. 1: మంతానాన నేనాడేమాట సహజమే కాక
అంతలోనే నిన్ను వెంగెమాడుటా ఇది
చెంత నాకన్ను బొమ్మలసింగార మిట్టే కాక
పంతాన నిన్ను జంకించేపగటా ఇది

చ. 2: నటనల నాసెలి నవ్వేజాడే కాక
సటలకు నీతో నెగసక్కెమా ఇది
ఘటన నే నిలుచుండేకట్టడే ఇదికాక
మటమాయవొడ్డారాల మారుకొనుటా ఇది

చ. 3: నెలవై నాకాఁగిటలో నేరుపు లివే కాక
అలయించేనని పెనఁగాడుటా ఇది
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కలపుకో లిది గాక కడుసాదింపా ఇది

రేకు: 0878-6 మధ్యమావతి సం: 18-467

పల్లవి: ఎటువంటిజాణతన మేమి నేరుచుకొంటివి
సట లేల సేసేవు చలమా యిది

చ. 1: నిలుచుండి పాదముల నిన్ను నింతి పెనఁచఁగా
కలయకానవెట్టేది గర్వమా నీకు
చెలరేఁగి గోర నొత్తి చేరి సన్న సేయఁ గాను
పలుజీరలు సేసేది పంతమా యిది

చ. 2: ముప్పిరి నాకుమడిచి మోవితేనే లందియ్యఁ గాను
తప్పించుకొనేది దొరతనమా నీకు
కొప్పువట్టి తీసి నిండుఁ గ్రొవ్విరులు ముడువఁ గా
వుప్పతించి తిట్టేది వుదుటా యిది

చ. 3: వుపరిసురతమున వూడిగము సేయఁ గాను
వుపమించి నీవు గూడేవొరపా నీకు
యిప్పుడె శ్రీ వేంకటేశ యీచెలి నీకు మొక్కఁ గా
నెపముగా దీవించేవు నేరుపా యిది

రేకు: 0879-1 ధన్నాసి సం: 18-468
పల్లవి: కంటిమమ్మ యిన్నాళ్లకు కతలుగా మీసుద్దులు
జంటలైన ఇటువంటిచనవు గలిగెనా
చ. 1: చేయిమీఁదఁ జేయివేసి చెక్కునొక్కేవు విభుని
చాయల నాతఁ డింతేసి చనవిచ్చెనా
ఆయములంటి యాతని నప్పటి గొరనూఁదేవు
పాయక ఇద్దరికిని పాటి(త)చుట్టరికమా
చ. 2: మంతనాన నాతనిని మాటలోనే తిప్పేవు
పంతన నీకిటువంటిబాస సేసెనా
బంతినే మీపై మీరు పాదాలు చాఁచుకొనేరు
సంతతము మీ కిట్టిసంగాతాలా
చ. 3: చేరి శ్రీ వేంకటేశ్వరు చెలరేఁగి కూడేవు
నేరుపు లీతఁ డిన్నేసి నీకు నేర్పెనా
యీరీతిఁ దా నన్ను నేలె ఇందుకే నీవు మెచ్చేవు
కారణాలు మీకు మీకుఁ గలిగినవా

రేకు: 0879-2 నారాయణి సం: 18-469

పల్లవి: ఓరుపే నేరుపందురు వువిదలకు
తారుకాణించేఁ గాని తడవకురే

చ. 1: మొగముచూచినవాఁడు ముచ్చటాడక మానీనా
నగినవాఁ డిందురాక నాలిసేసీనా
మగువలాల మనమనసు చూచీ నతఁడు
వెగటుగా మీ రింక వెంగెములాడకురే

చ. 2: చేసన్న చేసినవాఁడు చెప్పకుండీనా ప్రియము
ఆసకొనినవాఁడు అదరించఁడా
యీసులేలే చెలులాల యేఁటికొ వున్నాఁడతఁ డు
రాసి కెక్కించి మీరిఁక రాఁపులు సేయకురే

చ. 3: చేయిచాఁచినవాఁడు సే చల్లక లోఁగీనా
కాయము ముట్టినవాఁడు కళ రేచఁడా
యీయెడ శ్రీ వేంకటేశుఁ డేలే నన్ను నింతలోనె
చాయల సన్నల నింక సాదించకురే

రేకు: 0879-3 పాడి సం: 18-470

పల్లవి: ఎటువంటిమర్మములో ఇంతికి నీకు
తటుకున నడిగినఁ దలఁపేమీఁ జెప్పదు

చ. 1: పొంతనున్న చేలిమీఁదఁ బొరలి పొరలి నవ్వీ
మంతానాన నీవాడినమాటఁ దలఁ చి
దొంతిపులకలు రేఁగఁ దోడతోడ వెరగందీ
చెంత నీవు సేసినట్టిచేసన్నలు దలఁచి

చ. 2: సొలసి ముంజేతిచిల్కఁ జూచి సిగ్గువడీ
బలిమి నీవిచ్చినబాసలు దలఁచి
నిలువెల్లాఁ జెమరించ నిట్టూర్పు నిగుడించీ
మలసి మన్నించినమన్ననలు దలఁచి

చ. 3: కమ్మవిరిపాన్పుపై కరఁగి కరఁగి చొక్కీ
చిమ్ముల నీవుసేసినచేతఁ దలఁచి
నెమ్మది శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడి మొక్కు మొక్కీ
కమ్మినరతులలో కందువలు దలఁ చి

రేకు: 0879-4 భైరవి సం: 18-471

పల్లవి: వేఁడుకొని వేఁడుకొని వేసరితి మిద్దరిని
నేఁడు గరుణించఁడొకొ నేరుపులమరుఁడు

చ. 1: చెక్కు లెంతనొక్కినాను సేవ లెంతచేసినాను
మక్కువ గలుగుదాఁ కా మన సొగ్గదు
మొక్కులెన్ని మొక్కినానుముచ్చటలెంతాడినాను
అక్కర గలుగుదాఁ కా నందవు పొందికలు

చ. 2: సన్నలెన్ని చేసినాను చవులెన్ని పుట్టించినా
యెన్నిక లొనరుదాఁ కా నింపు పుట్టదు
విన్నప మెంతసేసినా వేడుక లెంతచూపినా
కన్నుల కింపవుదాఁకా కలుగదు ప్రియము

చ. 3: కతలెన్ని చెప్పినాను కప్పుర మెంతిచ్చినాను
రతి సమకొనుదాఁకా రాఁపు మానదు
ఇతవై శ్రీ వేంకటేశుఁ డింతియును నెనసిరి
పతివచ్చునందాఁ కాఁ దప్పవు పంతములు

రేకు: 0879-5 సామంతం సం: 18-472

పల్లవి: కన్నుల మొక్కేము నీకుఁ గడపరాయ నన్నుఁ
గన్నెనాఁడె యేలితివి కడపరాయ

చ. 1: కందర్పగురుఁడ వోకడపరాయ మాకు
గంద మీయఁ గదవోయి కడపరాయా
కందము నీగుణములు కడపరాయా తొంటి-
కందువకు రాఁ గదోయి కడపరాయా

చ. 2: కలువపూవుల వేసి కడపరాయా నేఁ
గలికి నంటా మెచ్చేవు కడపరాయా
కలకాలముఁ బాయకు కడపరాయా నీ-
కలపుకో లెరుఁగుదుఁ గడపరాయా

చ. 3: గరిమ శ్రీ వేంకటాద్రి కడపరాయా నన్నుఁ
గరుణించి కూడితివి కడపరాయా
గరిమేలు నేరుతువు కడపరాయా నా-
గరువ మీడేర్చితివి కడపరాయా

రేకు: 0879-6 గౌళ సం: 18-473

పల్లవి: వట్టిసిగ్గులు వడనేల వనితలలోననెల్లా
జట్టిగొని కెమ్మోవి చవిచూపవయ్యా

చ. 1: వొరసేచన్నులతోడ వొడివట్టితీసీ నాకె
గరిమ నీవిందుకుఁ బెనఁ గకువయ్యా
పరగఁ బయ్యెద జారఁ బరువున వచ్చె విదె
యిరువుగా విందుకుచెప్పీ నియ్యకొనవయ్యా

చ. 2: వీడినతురుముతోడ విన్నపాలుసేసీ నాకె
తోడఁ దోడ నీవిట్టే తోయకువయ్యా
వేఁడుకఁబెంజెమటతో విడెమియ్యవచ్చె నిడె
జాడతోడ నీవు చేయిచాఁచి యందుకోవయ్యా

చ. 3: బుసకొట్టునూర్పులతోఁ బూవులు గొమ్మనీ నాకె
కొసరుఁ గూరిమితోఁ జేకొనవయ్యా
యెసగ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొసఁగ నిద్దరుఁ దలపోసి చూడరయ్యా

రేకు: 0880-1 సాళంగం సం: 18-474

పల్లవి: వీఁపు గానరాఁగా దాఁగేవిధము నేర్చుకొంటివి
మాపుదాఁకా నిందులోన మఱపున్నదా

చ. 1: చొక్కపునీవూరిలోనిచుట్టరికా లడిగితే-
నెక్కడెక్కడో మాటలెల్లా నాడేవు
పక్కన నీ వెంతేసిపరాకులు సేసీనాను
మక్కళించి మాకింతలో మరపయ్యీనా

చ. 2: గుట్టున నీ మేనిసొమ్ముగురుతు లడిగితేను
చుట్టి చుట్టి జూజాలు చూపేవు మాకు
గట్టువాయ వై మతకము లెంతసేసినాను
నెట్టన నీ పాటికి నేము భ్రమసేమా

చ. 3: కూడితివి రతినేర్పు యాడ నేర్చితివంటేను
చూడఁ జూడఁ గళలంటి చొక్కించేవు
యీడనె శ్రీ వేంకటేశ యెన్ని వేసాలు సేసినా
జాడల నీసటలకు సమ్మతించేమా

రేకు: 0880-2 కన్నడగౌళ సం: 18-475

పల్లవి: ఎంత గారవించేవు యేమిబాఁతి నే నీకు
దొంతరబత్తి సేయఁగ దొరనైతిని

చ. 1: భావించి చూచితేఁ దొల్లి పడచుదానను నేను
నీవు మన్నించి యేలాఁగా నెలఁత నైతి
వావి దెలుసుకొంటేను వదినమాత్రము నేను
దేవుల జేసుకొనఁగ దిట్ట నైతిని

చ. 2: గట్టిగా విచారించితే కడుముద్దరాల నేను
నెట్టన బుద్ధిచెప్పఁగా నేర్పరినైతి
చుట్టరిక మెంచితే మెచ్చుగ మరఁదల నేను
పట్టముగట్టఁగ నింతప్రౌఢనైతి

చ. 3: చెంగటఁ బాలజలధి సేరి నీవురమున-
నంగవించఁగా నలమేల్మంగనై తిని
రంగగు శ్రీ వేంకటేశ రతి గూడే మేనదాన
ముంగిటినీకృపచేత మోహవతి నైతి

రేకు: 0880-3 శ్రీరాగం సం: 18-476

పల్లవి: ఏటికి దూరేవు చెలి నింతలో నీవు
కోటికిఁ బడగెత్తిన గురుతులు గావా

చ. 1: మచ్చికగలిగినట్టిమగువ గనక గోర-
నెచ్చరించి గీరితే నేమాయను
ముచ్చట నీయందుగలమోహపురాసుల కెల్లా-
నచ్చముగఁ బెట్టినట్టిలచ్చనలు గావా

చ. 2: తీపులు మరిగినట్టితెఱవ గనక మోవి-
నేపున గంటిసేసితే నేమాయను
పై పై నీజవ్వనపు బండారమున కెల్ల
కాపుగాఁ బెట్టినమాణికపుముద్ర గాదా

చ. 3: అట్టె చనవరియైన యలమేల్మంగ గనక
యెట్టు పాదాలఁ జిమ్మినా నేమాయను
దిట్ట శ్రీవేంకటేశ రతిమహోత్సవానకు
కట్టినతోరణపుసింగారాలు గావా

రేకు: 0880-4 నాగావరాళి సం: 18-477

పల్లవి: ఎవ్వరు నెరగరంటా యేల బొంకేరు
నవ్వేరు మిమ్ముఁ జూచి నలినాక్షులెల్లను

చ. 1: చెలియనుదుటిమీఁది చిన్నారికస్తూరిబొట్టు
చెలువుమీరఁగ నీచెక్కుల నంటె
నిలువునామము నీది నెలఁతనుదుట నంటె
తలకొన్నగురుతులు తారుమారులాయను

చ. 2: కాంతకన్నులఁ బెట్టినకాటుకెల్లా నీమోవి-
వింతబాగులై నేఁడు వెలశున్నది
రంతుల నీబాహుపురి రమణిసందిటఁ జిక్కె
యింతలోనే మీచేఁత లివ్వ లవ్వలాయను

చ. 3: సరి నలమేల్మంగ చరణముల లత్తుక
సొరిది నీవురమునఁ జూపట్టెను
గరిమ శ్రీ వేంకటేశ కౌస్తుభ మింతికి సొమ్మె
దొరసె మీవలపులు తోడునీడలాయను

రేకు: 0880-5 భవుళి సం: 18-478

పల్లవి: ఇందాఁకా సరివచ్చె నింపులెల్లాను
కందున నీజాడ లిఁకఁ గనుఁ గొనేఁ గాని

చ. 1: నెమ్మిఁ బెండ్లాడినదాఁకా నీచేయి మీఁదైనదాఁ కా
నమ్మిక లిచ్చితి విట్టె నాకు నీవు
దొమ్మిసతులు గూడిరి దొరతనమెక్కె నేఁడు
యెమ్మెల నీతలపోఁత లీడ నెట్టోకాని

చ. 2: చివ్వనఁ గరఁగుదాఁకా సిగ్గులువీడినదాఁ కా
నవ్వులు నవ్వితివిగా నాతో నీవు
జవ్వనము నాకు నిండె జాణఁడవైతి విపుడు
ఇవ్వల నీపొందులెట్లా నీడేరీనో కాని

చ. 3: కళలు రేఁగినదాఁకా కైవసమైనదాఁకా
నలుగడఁ గూడితివి నన్ను నీవు
అలమేలుమంగను నీవదె శ్రీ వేంకటేశుఁడఁ
విల నీరతు లేరీతి హెచ్చీనో కాని

రేకు: 0880-6 సాళంగనాట సం: 18-479

పల్లవి: కోడెకాఁడు వీఁడుగదె గోవిందరాజు
జోడైన సకులుఁ దాను చొక్కుచున్నాఁడు

చ. 1: పరగఁగ మేలుకొని పవ్వళించివున్నవాఁ డు
సొరిది దేవుళ్లకు చోటిచ్చినాఁడు
యిరవై మోవివిందుల కెదురుచూచున్నాఁ డు
తరుణులరతులెల్లాఁ దలపోయుచున్నాఁ డు

చ. 2: చెప్పరానిసిరులతో సింగారించుకున్నాఁడు
వుప్పతిల్లుఁ దమకాన నుబ్బుచున్నాఁడు
కుప్పెఁడుజవ్వాది మేనఁ గుప్పళించుకున్నవాఁడు
అప్పసము సరసములాడుచున్నాఁడు

చ. 3: సారె సారె వలపులు చల్లుకొంటా నున్నవాఁడు
వూరడిం చందరిఁ గలయుచునున్నాఁడు
యీరీతి శ్రీ వేంకటాద్రి నిరవై తిరుపతిలో
కూరిములు నెరపుచు కొలువున్నాఁడు

రేకు: 0881-1 ముఖారి సం: 18-480

పల్లవి: ఏఁటికి దాఁచేవు మాకు నిందు కిట్టె వద్దనేమా
జూటరివలపులు మెయి చొక్కించీని

చ. 1: ఇన్నిటా నాపెనీసంది యెరుకగలందుకు
కన్నులచూపులలోనే కానవచ్చెను
పన్ని యాపెచే నీమాటపట్టు వుచ్చుకొన్నందుకు
మన్నించినందులోనే మాకల్లాఁ దెలిసెను

చ. 2: అంగవించి మీరు చుట్టాలై వుండినయందుకు
యెంగిలిపొత్తు గూడిన నెరిఁగితిమి
అంగము లొకరొకరి అంటి పెనఁగినందుకు
వుంగరాలు నీడు జోడై వుండఁగానే కంటిమి

చ. 3: వొగ్గి ఆలుమగఁడు నై వొద్దికై వుండినందుకు
సిగ్గులు వడినయందే చిమ్మిరేఁగెను
అగ్గమై యలమేల్మంగనైనందుకు నన్నేలితి
తగ్గక శ్రీ వేంకటేశు తమి చొప్పులెత్తెను

రేకు: 0881-2 లలిత సం: 18-481

పల్లవి: అందు లోనే కానవచ్చీ నన్ని పనులు మాకు
సందడి నేమి చెప్పినా సమ్మతి గా దెపుడు

చ. 1: పడఁతి మీఁద నీకు బత్తే గలిగితేను
ఉడుగ కాపె పాదాలు వొత్తుమా చూతము
బడిబడి నీవిచ్చిన బాసలే నిజమైతే
గుడిగొని వీఁ పెక్కించుకొమ్మా నేఁడు చూతము

చ. 2: సొగసి మీ యిద్దరికి చుట్టరికమే కలితే-
నొగి నెంగిలి పొత్తుకు నొగ్గుమా చూతము
మగువ చేఁతలకు నీమర్మములు గరఁగితే
తెగువతో గోళ్ల నొత్తించుకొమ్మా చూతము

చ. 3: యెలమి నాపెకు నీకు నెరవులు లేకుండితే
బెళకకుండా నుద్దాలు పెట్టుమా చూతము
అలమేలుమంగ నేను ఆపె నీకుఁ బ్రియమైతే
కలసి శ్రీవేంకటేశ కైకొనుమా చూతము

రేకు: 0881-3 పాడి సం: 18-482

పల్లవి: ఇంతులాల చూడరమ్మ యెటువంటి తమకమో
ఇంతలేకుండితే నిది యేఁటి జాణతనమే

చ. 1: పొలఁతి రూప మితఁడు బొమ్మ చేసి మోము చూచి
తలపోసి గోడ చిత్తరువు వ్రాసి
పలుమారు నప్పటిని బయలులో భావించి
అలరి అట్టె భ్రమసి కలలోనఁ గనీని

చ. 2: వనిత చక్కదనము వర్ణించి నవ్వు నవ్వి
తనలోనే మాటలాడి తప్పక చూచి
వెనుకొని చప్పుడైతే వీనుల నాలకించి
వినయాన మూలమూల వెదకి చేఁచాచీని

చ. 3: వావి దానే యేర్పరచి వలపు పై జల్లుకొని
మోవి తేనెకు నోరూరి ముంచు గుక్కిళ్లు
శ్రీ వేంకటేశుఁడే తాను చెలి యలమేలుమంగ
వేవేగ నురమెక్కఁగా వేమారు గూడీని

రేకు: 0881-4 నారాయణి సం: 18-483

పల్లవి: ఊరకేల దూరేవు వూరి వారిని
బీరములాడితిఁ గాక పెనఁగితినా

చ. 1: రవ్వలు సేసితినా రచ్చల వేసితినా
నవ్వినవాఁడవు నీవే నాతితోను
ఇవ్వల నేఁడిది చూచి ఇంతులెల్లా నాడుకొంటే
దవ్వులనే వింటిఁ గాక తడవితినా

చ. 2: పల్లదీఁడవంటినా పచ్చిచేఁత చూపితినా
చల్లినవాఁడవు నీవే సతి సేస
చల్లఁగా విందుకిందరు సన్నలు సేసుకోఁగా
వొల్లనే చూచితిఁ గాక వొరయవచ్చితినా

చ. 3: యీడులు వెట్టితినా యెరుక నేసుకొంటినా
కూడినవాఁడవు నీవే కోమలాంగిని
తోడనె శ్రీ వేంకటేశ తొల్లె యలమేల్మంగను
వీడె మందుకొంటిఁ గాక వేగులు వెట్టితినా

రేకు: 0881-5 బౌళి సం: 18-484

పల్లవి: ఏల తమకించేవే యెరఁగవా యీకతలు
కోలుముందై తిట్టు నొండె గోరనైనా గీరును

చ. 1: మగవానితోఁ బలుమరు మాటలాడఁ బోతే
వొగరులాడును వొండె వొడివట్టును
నగవులు వచరించి ననుపు నటించఁ బోతే
మొగిఁ బరాకౌ నొండె మోనాన నుండును

చ. 2: వచ్చి వచ్చి నిజముగా వలపులు చల్లఁ బోతే
రచ్చ నాడుకొను నొండె రాఁపుసేసును
ఇచ్చకము సేసి కడునింపులు చూపఁగబోతే
తచ్చనలు చూపు నొండ తరితీపుసేసును

చ. 3: బలిమిఁ గాఁగిట నించి పట్టి పెనఁగఁగబోతే
చలమైనా రేఁచు నొండె సన్నైనాఁ జేసు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వెలయ మన్నించు నొండె వేడుకైనా వించును

రేకు: 0881-6 ఆహిరి సం: 18-485

పల్లవి: చక్కఁ గా నానతీవయ్య సమ్మతించేఁ గాని నేను
పిక్కటిల్లుఁ గోరికలు పెనగొనెనా

చ. 1: యెలమి మీరిద్దరును యేకతాన నుండితిరి
చెలియ విన్నపములు చెవిఁ బట్టెనా
నలువంక మీలోనే నవ్వుకొంటా నుండితిరి
తలకొన్నవలపులు తారుకాణలాయనా

చ. 2: పరగ నిద్దరు నుండి పందేలు వేసుకొంటిరి
తరుణీసరసము చిత్తమువచ్చెనా
మరుగుచు నొడఁబాటుమాట లాడుకొంటిరి
యెరవులేనిపొందు లియ్యకొంటిరా

చ. 3: వేడుకతో నీవునాకె విడేలందుకొంటిరి
చేడెకు నీకాఁగిటిలో సిగ్గుదేరెనా
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడుతో నీననుపులు యిరవాయనా

రేకు: 0882-1 ముఖారి సం: 18-486

పల్లవి: అనుకొనఁ గాని నీతో నందరివలె
వినయములేనిది వెలఁదా యది

చ. 1: పంతములాడుకొనేది పలుమారు నవ్వేది
అంతరువెరిఁగినట్టి యాఁటదా యది
వంతులకుఁ బెనఁగేది వాసులకుఁ దిరిగేది
కాంతుని ఇచ్చయెరిఁగేకామినా యది

చ. 2: వేసాలఁ బొరలేది వెంగెములు నెరుపేది
నేసవెట్టి పెండ్లాడిన చెలియా యది
బాస సేయించుకొనేది బలుములు చూపేది
దోసానకు వెరచిన తొయ్యలా యది

చ. 3: ఱట్టడియై మెరసేది పట్టి రచ్చకుఁ దీసేది
గుట్టుగలిగినయట్టికోమలా యది
ఇట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మట్టె ఇఁక మెచ్చుకుంటే మగువా యది

రేకు: 0882-2 రామక్రియ సం: 18-487

పల్లవి: అదరిపాటున వచ్చి ఆయములంటీఁ దాను
వుదుటున ముందుముందె వుంగరము వెట్టెనా

చ. 1: పువ్వుల వేసీ నూరకే పుప్పొడి చల్లీఁ దాను
చివ్వనఁ జుట్టరికముఁ జెప్పుమనవే
నవ్వులు నవ్వీ నింతలో నమ్మికలిచ్చీఁ గమ్మటి
మవ్వముగాఁ దొల్లి పెండ్లిమాట లాడించెనా

చ. 2: కొంగువట్టీ నప్పటిని కుచములంటీ నిదివో
అంగిడిఁ బైడి ముడిచి అంపెనా నేఁడు
యెంగిలిపొత్తుకు వచ్చీ యేడనైనాఁ దమకించీ
అంగవించి సోబనపుటక్షత లిప్పించెనా

చ. 3: తప్పక చూచీ నదివో తతిగొని పొందుసేసి
అప్పుడే పొంకవెట్టెనా అవునా తాను
కప్పి శ్రీ వేంకటేశుఁడు కందువఁదానె పెండ్లాడీ
చొప్పుగా నింతులచేత సోబనఁ బాడించెనా

రేకు: 0882-3 వరాళి సం: 18-488

పల్లవి: రమణుఁడవు నీవు రమణి నేను
తమితోడ నీవు నాకు దక్కివుండవయ్యా

చ. 1: తలఁచి నీవె నన్ను దయఁజూచుట గాక
చెలరేఁగి విన్నపాలు సేసేదాననా
నెలకొన్నబుద్ధి నీవే నేరువు టింతేకాక
చలపట్టి నీతోను సాము సేసేదాననా

చ. 2: మంతనానఁ జనవిచ్చి మన్నించుట గాక
చెంతల చుట్టరికము చెప్పేదాననా
వంతులకు నీవె నాపై వలపు చల్లుట కాక
పంతాననిన్నుఁ జెనకి పచరించేదాననా

చ. 3: నిక్కముగా నన్ను నేలి నీవు మెచ్చుట గాక
చెక్కునొక్కి యెమ్మె మెరసేటిదాననా
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
మొక్కేదానఁ గాక నీతో మొనచూపేదాననా

రేకు: 0882-4 సామంతం సం: 18-489

పల్లవి: ప్రియము గలిగినట్టి పెండ్లికొడుకవు నీవు
నయముతో మొక్కు మొక్కి నవ్వు నవ్వరాదా

చ. 1: రెప్పలెత్తి చూచి నీతో రెట్టింపుమాట లాడి
చిప్పిలుఁ జెమట చిందీ చెక్కులవెంట
వుప్పతించి తిట్టరాదు వొడివట్టి తియ్యరాదు
కప్పురగందికి మచ్చికలు చూపరాదు

చ. 2: చిగురుమోవి వంచి చేయిఁ జేయి నప్పళించి
జిగిమించేవలపులు చిమ్మిరేఁచీని
తగవులఁ బెట్టరాదు తరితీపుసేయరాదు
మగవుకు జనవిచ్చి మన్నించరాదా

చ. 3: కందువతోఁ జన్నులంటి కడుబిగ్గఁ గాఁగిలించి
సందడి మర్మములంటి చల్లీ నూర్పులు
ఇందులో శ్రీవేంకటేశ యెంచరాదు పంచరాదు
మందగజగమనకు మనసియ్యరాదా

రేకు: 0882-5 నాట సం: 18-490

పల్లవి: ఆయనాయ నీమాటే యనరే ఆతనితోను
యేయెడాఁ దనవిద్యలు నిందరుఁ జూడనివా

చ. 1: పుదుటున నానతియ్యకుండితే మానెఁ గాక
యెదలోనితనయెన్ని కెరఁగనిదా
చెదరక తాఁగొత్తలు సేసితేఁ జేసెఁగాక
మొదలనే తనతో సాములు నేఁ జేయనివా

చ. 2: ఇక్కడఁ దా నమ్మిక నాకిచ్చితే నిచ్చెఁ గాక
చొక్కపుఁ దనగుణము సోదించనిదా
అక్కరతో నాచన్నులంటితే నంటెఁ గాక
మక్కువఁ దనగోరితో మారుమలయనివా

చ. 3: బెట్టియానలెల్లా నేఁడు పెట్టితేఁ బెట్టెఁ గాక
నెట్టనఁ దనసుద్దులు నే విననివా
ఇట్టె తా శ్రీ వేంకటేశుఁ డేలితే నేలెఁ గాక
చుట్టపుతనమేలు నేఁ జూడనిదా

రేకు: 0882-6 తెలుఁగుకాంబోది సం: 18-491

పల్లవి: ఎవ్వరు నేమి సేతురు యేల దూరేవు చెలుల
జవ్వన మిదెకద చవులు పుట్టించేది

చ. 1: కనుచూపులేకద కమ్మరఁ గమ్మర లోలో
పొనుగకుండా నాలు పుట్టించేవి
వినుకలి యిదెకద వెక్కసమై వలపించి
తనవోనితమకము దైలువారించేది

చ. 2: ఆడేటిమాటలేకద ఆయములు సోఁకించి
వేడుకలు మీఁదమీఁద వెలఇంచేవి
కూడినకూటమేకద గుణములు పెడఁ రేచి
వాడికలు నెలకొల్పి వసముచేసేవి

చ. 3: సరసములివేకద సమ్మతులుగాఁ జేసి
బిరుదుకాఁగిటిలోనఁ బెనఁగించేవి
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతతోనె
గొరబుగుఋలేకద కొనలు సాగించేవి

రేకు: 0883-1 నాగవరాళి సం: 18-492

పల్లవి: చిత్తగించవయ్య్య నన్ను చెలువుఁడవు
బత్తిసేయఁ గా వలపు పైకొనీని

చ. 1: అడరి యెడమాటాడ నటు చెలి నంపేనంటే
తడవనీయదు సిగ్గు తతిగొనీని
వొడఁబరచ నీయింటి కొగి నే వచ్చేనంటే
తడఁబడీ నడుగులు తమకానను

చ. 2: గక్కన నిన్ను నేఁ గాఁ గిలించుకొనేనంటే
అక్కజపు హారములు అడ్డమయ్యీని
చిక్కించుక నీకు నేఁడు చేతులెత్తి మొక్కేనంటే
పక్కనఁ జన్నులమీఁద పయ్యద జారీని

చ. 3: దిట్టనై నీమోవితెనేతీపు చవిగొనేనంటే
అట్టె కడుఁ బరవశమందీ మనసు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను , నిట్టె
చుట్టరిక మెంచెనంటే సొంపులెత్తీఁ గళలు

రేకు: 0883-2 ఆహిరినాట సం: 18-493

పల్లవి: నీవెఱఁగనితగవు నే విన్నవించేనా
వేవేలై నాఁ దమలోన వేసరింతురా

చ. 1: కడువలచినవారు కదియవత్తురు గాక
యెడమాట లాడింతురా యింతులచేత
యెడయలేనివారు యింపులు సేతురు గాక
జడియక బొమ్మలను జంకింతురా

చ. 2: పాయరానియట్టివారు పైపై నవ్వుదురు గాక
చాయలా సన్నలా నింత సాదింతురా
ఆయమెఱిఁగినవారు అట్టె మెప్పింతురు గాక
కామకపుచేఁతలను కాకుసేతురా

చ. 3: తగులాయమ్మైనవారు తతిగోనుందురు గాక
పగటున కాఁతాళించి పచ్చిసేతురా
నిగిడి శ్రీ వేంకటేశ నెలఁతఁ గూడితి విట్టె
అగడుగా రతులలో నలయింతురా

రేకు: 0883-3 ముఖారి సం: 18-494

పల్లవి: ఎట్టు దెలియఁగవచ్చు నెదలోనిమీసుద్దులు
జట్టిగొన్న లోలోనిజాణతనా లేఁటివో

చ. 1: పవళించి నీ వుండఁగా పానుపువద్దఁ గూచుండి
చెవిలో విన్నప మేమిసేసీ నీకాపె
తవిలి నీ మొగము తప్పకచూచి యప్పటి
నవముగా సన్న సేసినవ్వీ నది యేఁటిదో

చ. 2: పైకొని నీవింతులచే పాటలు వినకొనఁగా
ఆకుమీఁద నేమి వాఁసియంపీ నీకాపె
జోకతో నంతటిలోనే సొరిది నాయములంటి
రేకలు దీసి యెచ్చరించి నది యేఁటిదో

చ. 3: కొలువుకూటములోన గుట్టుగా విచారించుకోఁగా
చెలిచే నీకేమి బుద్ధిచెప్పించె నాపె
యెలిమి శ్రీ వేంకటేశ యిట్టె నన్ను నేలితివి
తలుపుమాఁటున నాకె తలపించె నేఁటిదో

రేకు: 0883-4 పాడి సం: 18-495

పల్లవి: ఈతఁడు చలమరౌత యెఱఁగవా తొల్లి నీవు
చేతులెత్తి మొక్కి ఇట్టె సేవసేయరాదా

చ. 1: తడఁబడువిభుఁడు తనపై నానవెట్టి
వొడివట్టి తియ్యఁగాను వోపనందురా
జడిసి వొడ్డాణము జారెఁ గుచ్చుల వీడె
కడఁగీతనిదుప్పటి గప్పుకొనరాదా

చ. 2: రాఁపుల నింటికి వచ్చి రమణుఁడు నీతోను
కాఁపురము సేయఁగాను కాదందురా
పైపైఁ గొప్పు వదలె భావము నివ్వెర గందె
తీపులమోవి యెసగి తెరవెయ్యరాదా

చ. 3: యెన్నిక శ్రీ వేంకటేశుఁ డేకతాన నిన్నుఁ దీసి
చన్నులంటి కూడఁగాను చాలునందురా
కన్నులఁ దేటలుమించెఁ గళలు మోమున నిండె
అన్నువ గోర నూఁది యాదరించరాదా

రేకు: 0883-5 దేసాళం సం: 18-496

పల్లవి: మగవానితో నింత మారుకొందురా
తగవులేలడిగేవే తతిగొని నీవు

చ. 1: గొప్పలైననీచన్నులు కోరి పిసికెనంటా
తప్పులేల యెంచెవే సందడిఁ బతిని
ముప్పిరిగా లచ్చెనలు మోవిమీఁద నున్నవంటా
చొప్పులేల యెత్తేవే సోదించి నీవు

చ. 2: చెంత నుండి యీతఁడే చేరి కొంగువట్టెనంటా
పంతాలేల దుస్సేవే పలుమారును
మంతనాన నాతఁడు మర్మములు ముట్టెనంటా
రంతులేల సేసేవే రచ్చలోనను

చ. 3: కగ్గులేక యీతఁడిట్టె కాఁగిలించుకొనెనంటా
సిగ్గులేల నెరుపేవే చెలులఁ జూచి
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డదె తానె నన్నుఁ గూడె
అగ్గలపురతి నెంత అలయించేవే

రేకు: 0883-6 శంకరాభరణం సం: 18-497

పల్లవి: ఔనయ్యా నీదేవులంటా నలయి కెఱఁగవద్దా
తానకమై నేమెల్లా నింతకు నోపఁగలమా

చ. 1: బత్తితోడ నీకుఁ జెలి పాదములు గుద్దఁ గాను
గుత్తపుచనుగుబ్బలు గునిసీనవె
తత్తరానఁ జేసురటి తడఁబడ విసరఁ గా
చిత్తడిచెమట గారీఁ జెక్కులవెంటను

చ. 2: అంది యంది యప్పటి నీ కాకుమడి చియ్యఁ గాను
కందువలఁ గంకణాలు గల్లనీ నీవె
సందడి వింజామర సారెసారె వేయఁ గాను
పొంది నిట్టూర్పులు రేఁగీ పుక్కిటిబంటిగను

చ. 3: కడఁగి నీమేన నిండాఁ గస్తూరి యలఁదఁ గాను
మెడనున్న మాణిక్యాలు మెరిచీ నవె
తడవి శ్రీ వేంకటేశ తగ నన్ను నేలితివి
పడఁతి నివ్వెరగందీఁ బరవశమునను

రేకు: 0884-1 ధన్నాసి సం: 18-498

పల్లవి: పాయరానిమగఁడవు పట్టపుదేవుల నేను
రాయిడి సేయకుమీ రవ్వ సేసి యిఁకను

చ. 1: మాఱుకొని నినుఁ బిల్చి మాటలాడితిని
ఆఱడిఁ బెట్టకుమీ అందరిలోన
వేఱులేక నీకు మొక్కి వేఁడుకొంటిఁ గమ్మటిని
వీటిడిఁ జేయకుమీ వేగిరించి నన్నును

చ. 2: సెలవుల నవ్వి నీకు చేసన్న సేసితి
వెలుపలఁ జెప్పకుమీ వెక్కసానను
మొలకచన్నుల నొత్తి ముచ్చట మాటాడితి
చలానఁ బెనఁగకుమీ సారెసారె నిపుడు

చ. 3: కచ్చుపెట్టి మోవి యిచ్చి కాఁగిలించుకొంటిని
పచ్చి సేయకుమీ నన్ను పంతముననను
అచ్చపలమేలుమంగనైననన్ను నేలితివి
ఇచ్చపు శ్రీ వేంకటేశ ఇమ్మి చనపు

రేకు: 0884-2 రామక్రియ సం: 18-499

పల్లవి: మగువగుంపెన నీకు మంచిదాయను
తగవులఁ బెట్టఁగానే తమి రేఁగెను

చ. 1: చలము సాదించేనంటా సతి నిన్ను జంకించితే
చెలరేఁగి లోలోనిసిగ్గు దేరెను
బలిమి నీవు సేయఁ గాఁ బట్టిపెనఁగఁ జూచితే
యెలమిఁ జన్నులపై పయ్యద జారెను

చ. 2: తరితీపు సేసేనంటా తగుల మాటలాడితే
గొరబైనవలపు లుంకువలాయను
కెరలించేనంటా నిన్ను కెంగేలు వట్టితేను
సురతకాంక్షలకును చోటాయను

చ. 3: కడునలయించేనంటా కాఁగిట బిగించితేను
జడిగొన్న వేడుకలు సతమాయను
అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగ యిట్టె
కడఁగి పురమెక్కితేఁ గాణాచి ఆయను

రేకు: 0884-3 నాదరామక్రియ సం: 18-500
పల్లవి: పోరానిచుట్టరికము పొంచి యాతనికి నీకు
సారెఁ బ్రియము చెప్పగా సాదింతురటవే
చ. 1: చిప్పిలఁ బతి నవ్వఁగా చెలి యేల జంకించేవే
కప్పురాన వేయఁ గాను కాఁకలేల చల్లేవే
కుప్పళించి మొక్కఁ గాను గొణఁగి యేల తిట్టేవే
వొప్పుగు విడెమియ్యఁ గా నొల్లనందురటవే
చ. 2: తగిలి నిన్నుఁ జూడఁ గా తలవంచుకొననేలే
సొగిసి గోర నూఁదగా సొలయనేలే
చిగురు మోవి ఇయ్యఁ గా సిగ్గులువడఁ గనేలే
తగవు సడపఁ గాను తమకింతురటవే
చ. 3: పాపటకు దువ్వఁ గాను పంతములాడఁ గనేలే
చేపట్టి మన్నించఁగాను చిమ్మిరేఁగ నీకేలే
యేపున శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వోప రతిఁ జొక్కించఁగా నొడ్డుకొందురటవే

రేకు: 0884-4 సామంతం సం: 18-501

పల్లవి: నీవైనా నానతీవయ్యు నీకేల యింతేసిసిగ్గు
భావించ నలవిగాదు పంత మదియేఁ టిదో

చ. 1: చేతిమీఁదఁ జేయివేసి చెలి నిన్ను మెచ్చిమెచ్చి
యేతులకు నవ్వు నవ్వె నేఁటికోకాని
దూతిక మొగము చూచి తోడనే సన్నలు సేసి
కాతరపుమాట లేమికారణాన నాడెనో

చ. 2: గుబ్బలు నీమేన నూఁది కొసరి కొసరి ఇంతి
వుబ్బున మొక్కులు మొక్కి నూహ యేఁటిదో
గబ్బియై ముంజేతిచిలుకతో నేకతము చెప్పి
అబ్బురాన నంది పండు అది యేఁటికిచ్చెనో

చ. 3: వురముపైఁ గూచుండి వొగి నలమేలుమంగ
అరుదుగాఁ గానుకిచ్చె నదియేఁటికో
ఇరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సరిగా నేపని కాపె చవులు వుట్టించెనో

రేకు: 0884-5 బౌళి సం: 18-502

పల్లవి: మగవాఁడు మెత్తనైతే మరి యపకీర్తి గాదా
తగవు నెరపకుంటే తరుణులు మెత్తురా

చ. 1: నీపదాలు వాడి ఇంతి నిన్నుఁ గాఁగిలించెనంటా
కోపగించి నీదేవులు కొంగువట్టెను
చూపెట్టుక వున్నాఁడవు చొక్కి విడిపించవద్దా
యీపాటివాఁడవైతే యెవ్వరు నమ్మేరు

చ. 2: సేవసేసే ఆఁటది చేరి పాదాల లొత్తైనంటా
వోవరిలోఁ దనవద్ద నుంచుకొన్నది
నీవద్దకి నంపుమని నేఁ డాపకుఁ జెప్పకుంటే
యీవలావలి పొందు లెట్టు జరగీని

చ. 3: నాటక్కఁ సొలమగున నవ్వి నిన్నుఁ గూడెనంటా
మేటియలమేల్మంగ మీరనియ్యదు
నీటున శ్రీ వేంకటేశ నీవె తెచ్చుకొనవలె
మాటపట్టు లెటువలె మచ్చిక రేఁచీని

రేకు: 0884-6 కన్నడ గౌళ సం: 18-503

పల్లవి: ఇప్పుడేమి వేగిరము యిన్నియు నయ్యీఁ గాక
కప్పుర మవదరించు కానుక వట్టినది

చ. 1: అలసివచ్చిన నిన్నునంత మాటాడించనేల
వెలయఁగఁ బవళించు విసరే నేను
వలపులదిష్టిదాఁకి వాడివున్నది నీమోము
బలిమినైనా నిద్రించు పాదాలు గుద్దేను

చ. 2: చెమటవెట్టినమేను చేతుల నంటఁగనేల
తమితో నూరుకుండు గందము పూసెను
సమరతి నోలలాడి జారివున్న దిదె కొప్పు
అమర నాతొడపైఁ బెట్టలరులు నించేను

చ. 3: పచ్చిపులకలచెక్కుపై గోర నూఁదనేల
గచ్చులముసుఁ గిడుకో కాఁగిలించేను
కుచ్చి శ్రీ వేంకటేశుఁడ కూడితివి నన్ను నిట్టె
తచ్చి నాకు మో వొసఁగు దప్పులు దీర్చేను

రేకు: 0885-1 దేశాక్షి సం: 18-504

పల్లవి: నాపంతము లీడేరె నన్ను మన్నించితివి
వోపిక నీవేమిచ్చినా వొల్లనన నికను

చ. 1: మాయింటికి వచ్చితివి మాచే మొక్కించుకొంటివి
నీయింతు లేమైనాననీ యికను
చేయి నీపై వేసితివి చెప్పినట్టు సేసితిని
వేయి చెప్పినా నీసుద్దులు వినే నే నికను

చ. 2: విందు లారగించితివి వీడె మందుకొంటివి
అందులకే నే నవ్వేను అట్టే ఇకను
గందము మైఁ బూసితివి కంకణము గట్టితివి
యెందుకైనా నీ సేఁతకు ఇయ్యకొనే నికను

చ. 3: నమ్మించితివి నన్ను నాపై సేస వెట్టితివి
వుమ్మడి నొకమనసై వుండే నికను
నెమ్మది శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సమ్మతి మో విచ్చితివి చవిగొనే నికను

రేకు: 0885-2 గౌళ సం: 18-505

పల్లవి: ఇయ్యఁగదె కానుక నీయెదుట నున్నాఁ డతఁడు
నెయ్యపుమాట లాడఁగా నేనోపనందురా

చ. 1: దవ్వులనుండి యాతఁడు తగుల నిన్నుఁ జూచితే
నవ్వుదురుగాక వదనము వంతురా
పువ్వులచెండున నిట్టె పూఁచి నిన్ను వేసితేను
వువ్విళ్ళూర మొక్కుకటగా కూరకవుండుదురా

చ. 2: మలసి సొలసి నీతో మాట లాతఁ డాడఁగాను
చెలిమిసేతురు గాక చేరకుందురా
పిలిచి నిన్నుఁ బేర్కొని ప్రియములు చెప్పఁగాను
కొలువుసేతురుగాక గుట్టునఁ గొంకుదురా

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జిత్తగించి కూడఁగాను
భావించలమేల్మంగవు పదరుదురా
చేవమీరి నీకతఁడు సేసలిట్టె పెట్టఁగాను
వేవేలై మెత్తురుగాక వెంగెము లాడుదురా

రేకు: 0885-3 ఆహిరి సం: 18-506

పల్లవి: ఇటని విన్నవించరే ఇంతులాల పతితోను
తటుకున నిపైతే దండకు రమ్మనరే

చ. 1: మనవచ్చినయంతే మాఁటలు
కనుచూపు నాఁటినంతె కాంక్షలు
తనువులు సోఁకినంతె తమకములు
వినయములు గలయంతె వేడుకలు

చ. 2: సరసములాడినంతె సంగాతాలు
సరుసఁ గొలిచినంతె సలిగెలు
మరిగియుండినంతె మంతనాలు
హరుషమైనయంతె ఆదరింపులు

చ. 3: సముకముగలయంతె చనవులును
సుముఖత్వమైనయంతె చుట్టరికము
రమణుఁడు శ్రీవేంకటరాయుఁడు దాను
అమర నన్నేలె నేను అలమేలుమంగను

రేకు: 0885-4 వరాళి సం: 18-507

పల్లవి: నిగిడి నేఁ గంటిఁగా నీసరితలెల్లాను
ముగురెరిఁగినపని మూఁడులోకా లెఱుఁగు

చ. 1: వరుస నాపెఇంటికి వచ్చేనని నీవు రాఁగా
గొరబుగా నొకతే నీకొంగు వట్టెను
యెరువులవాఁడవై యేమని బొంకఁగలవు
వెరవున నాకె ఇందు వెదక వచ్చినను

చ. 2: వింతగాఁ దొల్లిటాపెకు విడెము నీవంపఁగాను
అంతలోనే యీకె వచ్చి అందుకొనెను
బంతి నుండి యెట్టు వొడఁబరచఁగ నేరుతువు
యింతలో నాకె దెలిసి యీడకు వచ్చినను

చ. 3: అప్పటాపెఁ బేరుకొని అట్టె నీవు విలువఁగా
వొప్పుగా నడుమ నీకె వూఁకొనెను
చిప్పి లలమేల్మంగను శ్రీ వేంకటేశ యేలితిఁ
విప్పు డాకె వచ్చితేను యిందరిఁ గూడితివి

రేకు: 0885-5 లలిత సం: 18-508

పల్లవి: కాంతకు నీకును నేల కాఁతాళాలు
వింతవారెల్లా నీకు వెక్క సమయ్యేరా

చ. 1: సారెసారె నీదేవులై జింకించ వచ్చేఁగాక
తేరసతులెల్ల నినుఁ దెమలించేరా
నేరుపరిగనక తా నిన్ను వెంగేలాడెఁగాక
వూరివారెల్లా నిట్టె వొరయవచ్చేరా

చ. 2: వడి నామోహపుటింతి వట్టినేరా లెంచెఁగాక
కడవారెల్లా నిన్నుఁ గక్కసించేరా
అడియాలమైనయాపె ఆనలెల్లాఁ బెట్టెఁగాక
బడిబడివారెల్లా వొడివట్టెరా

చ. 3: నెట్టన నలమేల్మంగ నీవురాన నిల్చెఁగాక
పొట్టఁబొరుగువారెల్లా బోదించేరా
ఇట్టె శ్రీ వేంకటేశ ఇటు నే మొక్కితిఁగాక
చుట్టపువారెల్లా నింతసోదించేరా

రేకు: 0885-6 కేదారగౌళ సం: 18-509

పల్లవి: ఇంతి నీతో నవ్వఁగాను యెదురుగా ననుపులు
దొంతివెట్టి వలపులు దోమటి దొడికేవు

చ. 1: వావి నిన్ననడిగేటివనితఁ జూచి నీవు
మోవితేనె లడిగేవు మొక్కలీఁడవై
కావికన్నులఁ జూచి కడుఁజొక్కఁగాఁ బిల్లఁ-
గోవిరాగాల నప్పటిఁ గొచ్చి కరఁగించేవు

చ. 2: పేరు చెప్పుమని నీతోఁ బెనఁగఁగా నాపెచెక్కు
గోరు దాఁకించేవు నీవు కోడెకాఁడవై
పూరుఁజెమటలతోడ వొగి మొక్కఁగా ముత్తేలఁ
పేరులెల్లా మెడవేసి ప్రేమము రేఁచేవు

చ. 3: ఆటలాడ రమ్మనుచు నలమేల్మంగ దూరఁగా
పాటలు పాడుమనేవు పల్లదీఁడవై
గాఁటపు శ్రీ వేంకటేశ కలయఁగా సమరతిఁ
తేటలనే మెప్పించి తీపు పుట్టించేవు

రేకు: 0886-1 దేశాక్షి సం: 18-510

పల్లవి: ఇదివో నీమహిమలు యెవ్వ రెరుఁగుదురయ్యా
మందనతంత్రములు మరపతి వేమో

చ. 1: చెలిచేత నే నీకుఁ జెప్పియంపినమాటలు
మలసి నీమోము చూచి మరిచెనేమో
యెలమి నాపైనైనా నీడకు నంపవైతివి
పలుకులనే నీవు భ్రమయించితివేమో

చ. 2: పొందుకు నాపెచే నీకుఁ బుత్తెంచినవిడెము నీ-
సందడిపరాకునఁ దా నందెనో యేమో
ఇందుకైనా మారుసుద్ది మెరిఁగించవైతివి
గొంది నిట్టె తలఁపించుకొంటివో యేమో

చ. 3: శ్రీ వేంకటేశుఁడ నీకుఁ జేయెత్తి మొక్కమంటే
భావించి నీవు గూడఁగా భ్రమసె నేమో
యీవల నలమేల్మంగని ఇటు నన్ను నేలితివి
మావతఁ దెచ్చితివి మన్నించితివేమో

రేకు: 0886-2 గౌళ సం: 18-511

పల్లవి: వింటిరటే చెలులార వింతసుద్ది ఇదొకటి
వొంటినీచేఁతలు చూచుకుందాన నేను

చ. 1: శిరసు మజ్జనమాడి చిక్కుదీసుకొనఁ గాను
సరుసనున్నాకెఁ దాఁకె సన్నపుగోరు
సిరుల నితఁడు సన్న సేసెనంటా నాకె వచ్చి
సొరిదిఁ గాఁగిలించితే చూచి నవ్వె నితడు

చ. 2: బలుసొమ్ములు నించుక పరిమళాలు పూయఁ గ
చెలియొకతెపై బొట్టు చిమ్మిపడెను
కలయకకు గురుతు గావించెనంటా వచ్చి
మలసి మోము చూచితే మరినవ్వెనితఁ డు

చ. 3: అట్టె శ్రీ వేంకటేశుడు అలమేల్మంగఁ గూడఁగా
కట్టఁగడాకెఁ దాఁకె గక్కనఁ బాదము
ఇట్టె తానుఁ బెండ్లాడ యెచ్చరించెనంటా వచ్చి
యెట్టయెదుట నిల్చితే యెనసి తా నవ్వెను

రేకు: 0886-3 పాడి సం: 18-512

పల్లవి: ఏమి చెప్పేవు నీసుద్దు లెరఁగమటే
నేము నీవలన కామా నెట్టన విభునికి

చ. 1: పంతమాడేదానవు పడఁతులఁ బెట్టి పంపి
కాంతుని రప్పించుకొనఁ గారణమేమే
ఇంత యెమ్మెలదానవు యెదురుగాఁ బో యతని
కఁతకంతకును వినలు సేయనేలే

చ. 2: కడువాసికత్తెవు కందువ నాతనిఁ జేరి
ఆడియాలమైనసొమ్ము లడుగనేలే
వొడఁబడనిదానవు వూడిగాలెల్లాఁ జేసి
జడిగొన్న కెమ్మోవి చవిచూపనేలే

చ. 3: దొరతనాల దానవు దొరసి శ్రీ వేంకటేశుఁ
గరగించి కూడితివి కతలేఁటికే
నిరతి నన్నేలినాఁడు నేనలమేలుమంగను
మరిగా యప్పటి నీవు మలయనేమిటికే

రేకు: 0886-4 దేసాళం సం: 18-513

పల్లవి: ఆతనికి నీకుఁ బొందులౌత నేనెఱఁగనే
నీతితోఁ జెలులలాగు నేఁడు గంటినే

చ. 1: యెగసక్కేలకు విభుఁడిటువలెఁ జేయఁగాను
తగవు లేమిచెప్పేవే తరుణి నీవు
మగవాఁడంటా నేఁడు మరి వొలపక్షాలాడి
మగువలతోనేల మాయలుసేసేవే

చ. 2: కడునొడ్డారా లాడకు కాంతుఁడు నవ్వఁగా నన్ను
వొడఁబరచేవదేమే వువిద నీవు
అడరి రమణుఁడంటా నాతనివంకలు దిద్ది
పడఁతుల నింతయేల భ్రమలఁబెట్టేవే

చ. 3: చలాలకు శ్రీ వేంకటేశ్వరుఁడే నన్నుఁగూడఁగా
అలుక లెంత దీర్చేవే అంగన నీవు
బలువుఁడంటా నతనిఁ బాలార్చే వలమేల్మంగ
చెలులమంటానేల సిగ్గులు రేఁచేవే

రేకు: 0886-5 నీలాంబరి సం: 18-514

పల్లవి: ఎందువోయి వలపులు ఇల్లాల నేను
ముందర నిలువవయ్య మొక్కేము నీకు

చ. 1: జిగినూడిగపు వారు సేవలెల్లాఁ జేయఁగాను
తగినయిల్లాండ్ల పైఁ దలఁపున్నదా
మగఁడు గలవనే మాట గలిగితేఁ జాలు
మొగము చూపవయ్య మొక్కేము నీకు

చ. 2: ఆసవెట్టి మగనాండ్లు అట్టె కానుక లంపఁగా
సేసవెట్టినాండ్లపైఁ జిత్తమున్నదా
యీసులేక నీవు నవ్వేయీపెద్దరికమే చాలు
మోసములేదు రావయ్య మొక్కేము నీకు

చ. 3: పొట్టబొరుగుసతులు పొంచి సేవసేయఁగా
పట్టపుదేవులమీఁద బాఁతి వున్నదా
అట్టె శ్రీ వేంకటేశ అలమేలుమంగను నేను
ముట్టి నన్నుఁ గూడితివి మొక్కేము నీకు

రేకు: 0886-6 కన్నడగౌళ సం: 18-515

పల్లవి: నీవు నేను గురిగాక నెలంత లెందరు లేరు
కైవసమైనమీఁదఁ గల్లలాడేవా

చ. 1: చేసినచేఁతలెల్లా చెలిచేత వింటిమి
రాసితో నీవానతియ్యవలెనా మాకు
వోసరించి యేడలేనివొట్టులు వెట్టుకోనేల
కాసుచేయనిపనికి కల్లలాడేవా

చ. 2: కమ్మటి నీపనులెల్లా కన్నులెదుటఁ గంటిమి
యెమ్మెలు నాకుఁ జూపనేఁటికి నీవు
నమ్ముమని చేయిచ్చి నన్ను భ్రమయించనేల
కమ్ముక యింతదొరవు కల్లలాడేవా

చ. 3: ననుపైననీవలపు నాకునాకే యెఱిఁగితి
యెనసి తలఁపించఁగ లా నీకు
అనుఁగు శ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
ఘనత నన్నేలితివి కల్లలాడేవా

రేకు: 0887-1 లలిత సం: 18-516

పల్లవి: నీతో నవ్వఁగలమా నెరజాణవు
గాతసేయ కెట్టైనాఁ గరుణించవయ్యా

చ. 1: గోవులనెల్లాఁ గాచి గొల్లెతలపొందు సేసి
కోవిదుఁడ వైతివి గోవిందరాజా
వావు లొక్కటిగాఁ జేసి వన్నకాఁడవై తిరిగి
గొవాళుఁడ వైతివి గోవిందరాజ

చ. 2: దూడలఁ గొనాళ్లు గాచి తూలేటివుట్లు గొట్టి
కూడుకొంటివి బాలుల గోవిందరాజ
వేడుకకాఁడ వేవేలు సేఁతలు సేసి
కోడెకాఁడ వైతివి గోవిందరాజ

చ. 3: చిఱుతవాఁడవై నీవు చీరలు దొంగిలుకొని
కొఱతలు మాన్పితివి గోవిందరాజ
యెఱిఁగి శ్రీ వేంకటాద్రి నిందరినిఁ బెండ్లాడి
గుఱిగా నిలిచితివి గోవిందరాజ

రేకు: 0887-2 హిందోళం సం: 18-517

పల్లవి: చేరి వూరకుంటే తానే సిగ్గువడును
నేర మెంచకు మనరే నే నంటఁగాకుందాన

చ. 1: పచ్చడ మందుకోరే పాదాలు గడుగరే
రచ్చసేసి వచ్చినాఁడు రమణుఁడు
గచ్చుల దూరకురే గక్కనఁ బీఁటవెట్టరే
నెచ్చెలులకై దండతో నిలిచియున్నాఁడు

చ. 2: వీడెము చేతికియ్యరే విసరరే సురటిని
ఆడానీడాఁ దిరిగాడి అలసినాఁడు
వాడెననకురే మోవి వడిఁబానుపు వేయరే
వేడుకఁ బండేఇల్లు వెదకుచున్నాఁడు

చ. 3: పువ్వులు ముడువరే పూయరే మేనఁ గస్తూరి
వువ్విళ్లూరఁ జెమటతో నున్నవాఁడు
యివ్వల శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గాఁగిలించె
చివ్వన నాలునాళ్లు సేసిన దెటిఁగినాఁడు

రేకు: 0887-3 మంగళ కౌశిక సం: 18-518

పల్లవి: ఇతవరిఁ గనక నీ కెరుఁగించితి
కతలేర్పడకుండితే కాంతలు నవ్వేరు

చ. 1: చెలితో నేకతమాడి చెప్పుతానుండె నీతి
కలవెల్లా నీసుద్దులే కాఁబోలును
అలివేణితో నీవు ఆడుకొని రావయ్య
తెలుపుకొనకుండితే తెరవలు నవ్వేరు

చ. 2: సుదతికి నిన్ను వేలఁ జూపుతానుండె నీతి
అదన నీప్రసంగమే అది గాఁబోలు
పదిలాన నీనేరాలు పాపుకొని రావయ్య
ముదులకించ కుండితే ముదితలు నవ్వేరు

చ. 3: నడుమ శ్రీ వేంకటేశ నవ్వుతానుండు నీసతి
కడుఁగడు నిన్నుఁ జూచేకాఁబోలును
అడరి నన్నేలితివి అమాఁటడిగి రావయ్య
తడవ కూరకుండితే తరుణులు నవ్వేరు

రేకు: 0887-4 సౌరాష్ట్రం సం: 18-519

పల్లవి: ఎవ్వరు నిన్నాడుకొనే రిక్కడ నే నుండఁగాను
అవ్వల నీమనోరథా లడిగి రావయ్యా

చ. 1: పొలిఁతి మాటాలాడఁగా పోచిళ్లు చల్లితినంటా
వెలి నాలకించుకొంటా వినేవు నీవు
తలఁపు కొలఁది నాకె తారుకాణలే చెప్పె
ఫలించె సగినము లోపలికిఁ బోవయ్యా

చ. 2: సరసా లాపేడఁగా సగినాలు చూచెనంటా
గొరబై పలుకు లెంచుకొనేవు నీవు
అరుదుగ నీవు గోరినటువలెనే కలసె
సరివచ్చె సగినము సంగడికిఁ బోవయ్యా

చ. 3: ఆపెకతలు చెప్పఁగా నర్చించుకున్నాఁడంటా
జోకఁ బాటము సేసుక చొక్కేవు నీవు
యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యేకమాయ సగినము యింటికిఁ బోవయ్యా

రేకు: 0887-5 తోండి సం: 18-520

పల్లవి: ఇచ్చకురాలు గనక యేమీననదు గాక
పచ్చి చేఁతల కెల్లాను పడతి వోపినదా

చ. 1: కొమ్మ జెఇవట్టి తీసి కొసరేవు తొలుతనె
రమ్మని పిలువఁగాను రాననెనా
యెమ్మెల కిందరుఁ జూడ నింత సేసితివి గాక
దిమ్మరి నీ గుంపెనకు తెరవ వోపినదా

చ. 2: బలిమిఁ జేయి వట్టించి పైపై దమ్మ వుమిసేవు
చెలి కప్పుడే చెప్పఁగా సేయదాయనా
చలము లిందరిలోన సాదించితివి గాక
వలవనిసటలకు వనిత వోపినదా

చ. 3: యీడఁ జన్నుల విసికే వింతి పానుపు మీఁదట
కూడినట్టెల్లా నియ్యకొనదాయనా
వేడుక కిందరిలో శ్రీవేంకటేశ నవ్వేవు గా-
కేడలేని బీరాలకు నీకాంత వోపనదా

రేకు: 0887-6 నాదరామక్రియ సం: 18-521

పల్లవి: ఎవ్వరిది నేర్పు మన యిద్దరిలోనా
జవ్వను లిందరు జూచి సంతోసించేరు

చ. 1: వొడిలోని నిమ్మపండు వొగిఁ జేతఁ దియ్యఁగానే
పిడికిటఁ బట్టి యట్టె పెనఁగేవు
తొడిఁ బడ నంతలోనే దొడ్డకుచ్చెల వీడితే
కడఁగి నీపచ్చడము గప్పుకొనవలదా

చ. 2: పయ్యెదలోని విడెము పట్టి నీకియ్యరాఁగానే
కొయ్యవై పొదిగి పట్టి గుంపించితివి
చయ్యన బయలుగాఁగా చన్నులకు నీకుళ్ళాయి
వొయ్యనే మాటుగా నొనర్చుకోవలదా

చ. 3: కొప్పుపూవు బంతి దీసుకొని కానుకియ్యరాఁగా
అప్పళించి నీకాఁగిట నలమితివి
యిప్పుడే శ్రీ వేంకటేశ యింతలో సిగ్గు విడఁగా
విప్పుచు గక్కనఁ దెరవేసుకోవలదా

రేకు: 0888-1 భైరవి సం: 18-522

పల్లవి: వీనులారా నీవే ఇటు విందువు రావే
ఆనవెట్టి పిలువఁగనంపీఁ జెలులను

చ. 1: పవళించి యున్నవాఁడు బాగా లియ్యవే పతికి-
నివల జాజ మేమాడే వింతులతోను
జవళిని చలములు సాదించేవేళ గాదిది
తివిరి పిలువుమంటాఁ దిట్టీఁ జెలులను

చ. 2: ముందే మేలుకన్నవాఁడు మోము చూపవే పతికి
చెంది యేమిమాటాడేవు చిలుకతోను
గొందినే కాఁకలు రేఁచి కొసరేవేళ గాదిది
కందువకు నంపుమని కసరీఁ జెలులను

చ. 3: చెనకి సేసవెట్టవే శ్రీ వేంకటపతికి
గునిసేవేమే ముద్దులు కోవిలతోను
యెనసితి విఁక బయలీఁదించేవేళ గాదిది
పెనఁగించుమనుచుఁ గుప్పించీఁ జెలులను

రేకు: 0888-2 ముఖారి సం: 18-523

పల్లవి: సేసినదెల్లాఁ జేఁత చెల్లుఁబడాయ మీకు
మోసులుగా నవ్వరాదా మోహమెల్లాఁ గంటిమి

చ. 1: దగ్గరనుంటే మీకు తమకము పుట్టుఁగాక
సిగ్గువ డెల్లంతనుంటే చింతరేఁగదా
యెగ్గులేదు పతితొడ యెక్కుక కూచుండఁగదే
వెగ్గళించి కాదనేమా వెరుపేల ఇఁకను

చ. 2: మొగములు చూచుకొంటే ముచ్చట లీడేరుఁగాక
నిగిడి తలవంచితే నిండదా కాఁక
తగవౌమగనితోను దట్టించి మాటాడఁగదే
జగడించేవా రున్నారా సటలేల ఇఁకను

చ. 3: ఇట్టె కాఁగిలించుకొంటే నితవులై వుండుఁగాక
గుట్టుననుంటే చెమట గుబులుకోదా
జట్టిగొని శ్రీ వేంకటేశ్వరుఁడు నన్నిటు గూడె
అట్టు కొత్తగా నయ్యెరా గుట్టేల ఇఁకను

రేకు: 0888-3 శ్రీ రాగం సం: 18-524

పల్లవి: ఎప్పుడు దలఁచే వీకెపై నీవు
అప్పుడే కూడఁగవద్దా అయ్యో నీవు

చ. 1: అక్కరతో నాసపడి అట్టె మోము చూచేచెలిఁ
జెక్కు నొక్కవైతివిగా చెల్లఁబో నీవు
మక్కళించి వీనుల నీమాట లాలకించేదాని
గక్కనఁ బిలువవద్దా కటకటా నీవు

చ. 2: సెలవుల నవ్వుదేర చెంగలించి మొక్కేసతి
అలమి మెచ్చఁగవద్దా ఆహా నీవు
కొలువుసేయుచు నిన్నుఁ గూరిమి గొసరేదాని
అలరి లాలించవద్దా అవునయ్యా నీవు

చ. 3: నిండు జవ్వనముతోడ నిన్నుఁ గోరుచున్న యింతి-
నండఁ బెట్టుకొనవద్దాఁ సమ్మరో నీవు
దండిగా శ్రీ వేంకటేశ తగ నిన్నుఁగూడె నిట్టె
పఁ(పం)డు మోవి యియ్యవద్దా బాపురే నీవు

రేకు: 0888-4 సామంతం సం: 18-525

పల్లవి: ఊరకేల దూరేవు వూరివారినెల్లాను
చేరినామోము చూచితే చేయెత్తి మొక్కితినే

చ. 1: చింతదీర నతఁడు నీచేతికి లోనై వుండఁగా
పంతములాడుకోనేలే పలుమారును
వింతవారిఁ గూడకుండా వేడుకైతే నింకా నీవు
కాంతుని నీమొలఁ గుచ్చి కట్టుకొనఁగదవే

చ. 2: చెలువుఁ డీత డిదె నీకుఁ జెప్పినట్టు సేయఁగాను
యెలమి నీరపము గా కిఁక నెన్నఁడే
కలసి నీ వొక్కతవే కైకొన నాసగలితే
తలమీఁదఁ బెట్టుకొని దాఁచుకొనఁగదవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁజేరి పెద్దసేయఁగాను
సేవలు సేతేవుగాక సిగ్గులేడవే
యీవల నన్నితఁ డేలె నింకా నీకు వలసితే
భావించి కాఁగిలించుక బడివాయనీకువే

రేకు: 0888-5 బౌళి సం: 18-526

పల్లవి: మగువలాల బుద్ధు లీమానినికిఁ జెప్పరే
యెగసక్కెములయాపె యేల వచ్చె నీడకు

చ. 1: మంతనాన విభుఁడు నామర్మములు చెనకితే
చెంతనున్న తానేల సిగ్గువడీనే
వంతులకు మాలోన వలపులు చల్లుకొంటే
ఇంత కతకారియాపె యేలవచ్చె నీడకు

చ. 2: జడిగొని పతి నాతో సరసము లాడఁగాను
నడుమనుండి తానేల నవ్వు నవ్వీనే
తడఁబడి మాలో నేము తమకానఁ బెనఁగితే
యెడపులరట్టడాపె యేలవచ్చె నీడకు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జేరి కాఁగిలించఁగాను
ఆవల నుండి తానేల అంటవచ్చీనే
చేవమీర మాలో నేము సేసలువెట్టుకోఁగా
యీవేళ బిత్తరియాపె యేలవచ్చె నీడకు

రేకు: 0888-6 ఆహిరి సం: 18-527

పల్లవి: ఎంత నన్నుఁ బొగడేవు యిందరిలోన
సంతతవు మోహములు చల్లఁగలఁ గాక

చ. 1: నిన్ను మెప్పించఁగ నేను నేరుతునా యేమైనాను
కన్నులనే మొక్కనేర్తుఁగాక నీకు
సన్నలుసేసి వట్టియాసల ముంచఁగలనా
చిన్నదాననై సేవలు సేయఁగలఁగాక

చ. 2: సరసములాడి నీతో సాటికి రానోపుదునా
వొరసి యిచ్చకమాడ నోపుదుఁగాక
తరితీపు చూపి కొత్తలు సేయఁగలవా
పెరరేచి కోరికలే పెంచఁగలఁగాక

చ. 3: మించి నీకంటె పంతాన మెరసేటిదాననా
పొంచి మేనదాననై భోగింతుఁగాక
అంచెల శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెంచఁగలనారతులు నించఁగలఁగాక

రేకు: 0890-1 లలిత సం: 18-528

పల్లవి: నిన్నుఁ బాయఁ గలనా నీకెదురాడేనా
సన్నల చాయల నిన్ను జరసితిఁగాక

చ. 1: వొడివట్టి పెనఁగఁగా నోపనంటే నేమందువు
అడరి మాయింటికి రావయ్యా నీవు
వెడ వెడ సతులను వెంటఁబెట్టుక రాఁగాను
తొడిఁబడ నే నూరకే దూరితిఁగాక

చ. 2: చెక్కు నొక్కి వేఁడుకోఁగా సేయనంటే నేమందువు
అక్కరతో గూచుండవయ్యా నీవు
చొక్కుచుఁ బెరకాంతల సుద్దులు చెప్పుకొనఁగా
చక్కఁగా బొమ్మల నిన్ను జంకించితిఁగాక

చ. 3: పొంచి కాఁగిటఁ గూడఁగా పొనిగితే నేమందువు
అంచెల నిట్టె మన్నించవయ్యా నీవు
యెంచఁగ నన్నేలి యేడో ఇంతులతోఁ జెప్పుకోఁగా
కొంచక శ్రీ వేంకటేశ కొసరితిఁగాక

రేకు: 0890-2 పాడి సం: 18-529

పల్లవి: ఉండవయ్య ఇఁక నీవు వొబ్బుద్దితోను
నిండుకొనె నవ్వులెల్లా నేఁడు నాసెలవుల

చ. 1: బొంకక చెప్పితివిగా పొందుల నీసుద్దు లెల్లా
కొంకక నామనసులో కోపము మానె
అంకెల నేఁ బెట్టుమన్న ఆన వెట్టుకొంటివిగా
మంకునాచలములెల్లా మట్టుపడీనిపుడు

చ. 2: తగ నియ్యకొంటివిగా తారుకాణించినవెల్లా
యెగసక్కెములవుడు కెంతయుఁ బాసె
తగవరులు చెప్పితే తల వంచుకొంటివిగా
వెగటులన్నీ నుడిగి వేడుకలాయను

చ. 3: సిగ్గులువడితివిగా చేఁతలు దలపంచి
వెగ్గళించిన తొల్లిటివెత దీరెను
నిగ్గుల శ్రీ వేంకటేశ నీవు నన్నేలితివిగా
తగ్గనిభోగముల సంతసము లీడేరేను

రేకు: 0890-3 వరాళి సం: 18-530

పల్లవి: మాకుఁ దెలియవు మీలో మర్మము లివి
వాకున నాడఁగరాదు వర్ణించుకో నీవే

చ. 1: దాకొని యొక ఇద్దరు తరుణులు నిన్నుఁ జూచి
యేకతము లాడుకొనే రేఁటికోకాని
కైకొని నీవు సేసినకల్లలేమైనాఁ గలితే
చేకోని తలఁచుకొమ్మా చిత్తములో నీవే

చ. 2: యెన్నికతో తమ్ముఁదామె ఇట్టె నీ భావములకు
సన్నలుసేకోనే రాచందమేఁటిదో
కన్న విన్న నీమతకములేమైనాఁగలికే
వున్నతిఁ దెలుసుకొమ్మా వూహించి నీవే

చ. 3: వువ్విళ్లూరఁ గూడి నిన్నొందురులు శ్రీ వేంకటేశ
నవ్వుకొనేరు రతులనను పెట్టిదో
ఇవ్వల నన్నేలితివి ఇంకా నీగుట్టు గలితే
రవ్వగాఁ దెలుసుకొమ్మా రపముగా నీవే

రేకు: 0890-4 శంకరాభరణం సం: 18-531

పల్లవి: దూరనేల ఇఁక నిన్ను తోడఁదోడను
వారికివారే మెచ్చేరు వాడవాడను

చ. 1: నటనల నీమాటలు నయగారాలు
ఘటనల మోము లంగడిబేరాలు
యెటువటె నిన్ను నెంచే దిఁక నేరాలు
తటుకున నాడరాదు తగవరిబీరాలు

చ. 2: పేరడైన నీ నవ్వులు పెండ్లి సేసలు
వారక మంచితనాలు పట్టియాసలు
చేరిచేరి యేఁటికిఁ జేసేవు బాసలు
నారుకొనఁ గట్టితివి నాకు నల్లఁబూసలు

చ. 3: తలకొని సేసేవు తరితీపులు
కలసితి వేఁటికి నింకా రాఁపులు
చలువాయ నాకు నీచల్లఁజూపులు
కలిగి శ్రీవేంకటేశ కాఁగిటి నీదాపులు

రేకు: 0890-5 మాళవిగౌళ సం: 18-532

పల్లవి: చిత్తగించు రమణుఁడ చెలిమొగమై నీవు
చిత్తజు కేలికిని సింగారించుకొన్నది

చ. 1: నిమ్మపండ్లంతలేసి నిక్కినచన్నులు నీకు
వుమ్మడిఁ గానుక పట్టుకున్నదిచెలి
తమ్మిదపౌఁజుల కొప్పు తోడుచూపేనంటాను
పమ్మి పచారించుకొని పనివడి యున్నది

చ. 2: తేనెపెరవంటిది తియ్యనిమోవి నీకు
వూనివిందువెట్టేనని వున్నది చెలి
వూనికనుఁ గలువలు పూజసేసేనంటా నీకు
ఆనుకొని నీరాకకు అదె కాచుకున్నది

చ. 3: కరికుంభఘనపు గజరాజలక్ష్మిని
వొరసి నీసొమ్ము చేకున్నది చెలి
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
గొరబు కాఁగిటి కింకాఁ గోరుచున్నది

రేకు: 0890-6 తెలుఁగుఁగాంబోది సం: 18-533

పల్లవి: సెలవుల నవ్వులాడ సిగ్గులువడఁగనేల
చలువగాఁ గెమ్మోవి చవిచూపరాదా

చ. 1: నేరుపెల్లా మెరయుచు నీతో మాటలాడీఁజెలి
వూరటలు సేసుకొని వూఁకొనవయ్యా
ఆరయ వీడెమిచ్చి ఆకులు చుట్టిచ్చీని
ఆరీతి చేతులు మార్చి అందుకొనరాదా

చ. 2: తమకమెల్లాఁ యెంచి తప్పక చూచీఁజెలి
సుముఖుఁడవై మోము చూపవయ్యా
అమర సింగారించి యట్టె విరులు ముడిచీ
రమణితొడపై నీశిరసు మోపరాదా

చ. 3: గొరబు లెల్లాఁ జేసి కుచముల నొత్తీఁ జెలి
వుర మాపె కొప్పగించి వుండవయ్యా
యిరవై శ్రీవేంకటేశ యేవితివి నన్ను నిట్టె
మరిగి యాపెను నీవు మన్నించరాదా

రేకు: 0891-1 వసంతవరాళి సం: 18-534

పల్లవి: అన్నియు నీవెరుఁగుదువనే దిఁక నేమున్నది
కన్నులె గొప్పలుగాని కడుఁజిన్ని మొగము

చ. 1: దండనే వుండఁగాను దయఁ.జూడవలెఁ గాక
చండివెట్టి పెనఁగుతా సాముసేతురా
పండుమోవిపసే కాని పలుచనిదాన నేను
అందుకొని కొసరేవు అలయఁగనోపను

చ. 2: సేవలు నీకుఁజేయగా చేరి మెచ్చవలెఁకాక
రావాడి చెనకుతా రవ్వసేతురా
యీవలఁ జన్నులే గొప్ప లించుకంతె నెన్నడుము
వోవలఁ బెట్టితే నంత వోరుచుకోనోపను

చ. 3: నీసతినై వుండఁగానే నెమ్మది నుంతువు గాక
ఆస చూపి తరితీపు లడరింతురా
వాసితో శ్రీ వేంకటేశ వడి నన్నుఁ గూడితివి
పోసరించె బిరు దురమునఁ బాయనోపను

రేకు: 0891-2 హిజ్జిజి సం: 18-535

పల్లవి: ఊరకే నీవు లోగివున్నాడ వింతెకాక
చేరి నీవేమి సేసినా చెల్లదా నీకు

చ. 1: పడంతి పొడగంటేను బాగా లిచ్చితివి గాని
తొడపై నిడుకొంటేను దోసమా నీకు
చిడుముడి నిలిచితే చేయివట్టితివి గాని
వొడివట్టి తీసితేను వొద్దనేరా నిన్నును

చ. 2: కొలువుసేసెనంటా కొప్పుదువ్వితివి గాని
ఇలఁగాగిలించుకొంటే హీనమా నీకు
అలరి మాటాడితేను ఆసచూపితివిగాని
కలసి పెండ్లాడితేను కాదనేరా నిన్నును

చ. 3: చెంతఁ బాయకున్న దంటా చెక్కునొక్కితివిగాని
యెంత వంచనసేసినా నెగ్గా నీకు
ఇంతలో నన్నేలి యాకె నేలేవు శ్రీ వేంకటేశ
బంతి నెంతమన్నించినా పంగించేరా నిన్నును

రేకు: 0891-3 నాగగాందాఁరి సం: 18-536

పల్లవి: ప్రియురాలు నీకెదురు వెట్టివలపులు నించె
నియతాన నీవును మన్నించగదయ్యా

చ. 1: వనజాక్షిపయ్యెదలో వట్రువచన్నులు నీకు
ననుపున నుంకువధనము బిందెలు:
పెనగొన్నసింగారపుఁబిరుఁదు బటువుదిండు-
తనరారుమంచిరత్నాల పెండ్లిపీఁట:

చ. 2: తరుణితురుములోనితగుమల్లెమొగ్గలు
తిరమైన సేసకు నెత్తినముత్యాలు:
పరిపరిచవులతోఁ బరగుతేనెలమోవి
వరుసఁ బెట్టినట్టిబువ్వపుఁ బళ్ళెము:

చ. 3: పడఁతి కాఁగిటిలోని బాహులతలు నీకు
తొడిఁబడ నొనరించేతోరణాలు:
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
కడలే కెప్పుడు మెడఁగట్టినతాళి

రేకు: 0891-4 దేసాళం సం: 18-537

పల్లవి: ఊడిగపువారము వొద్దనుండేవారము నే-
మీడుజోడైనవారు మీరెరఁగరా తగవు

చ. 1: పంతము లాకెకుఁ జెల్లు పై కొనఁగ నీకుఁ జెల్లు
పొంతనే యిద్దరికిని బువ్వము చెల్లు
కాంతల నేమడిగేరు గరిసించి గరిసించి
ఇంతేసివారు మీకెరఁగరా తగవు

చ. 2: వెస గుట్టాపె కమరు వినయము నీకమరు
వసుధ నిద్దరికిని వల పమరు
అసురుసురగుచును అందరి కేమిచెప్పేరు
యెసగినదొరలు మీ రెరఁగరా తగవు

చ. 3: శ్రీ వేంకటేశుఁడవు చెలి యలమేలుమంగ
దేవర లిద్దరుఁ గూడితి మీలోనే
భావించి పచ్చిగా నేమినవ్వేరు
యీవల మీరే జాణలు యెరఁగరా తగవు

రేకు: 0891-5 శంకరాభరణం సం: 18-538

పల్లవి: ఏమని పొగడుదు మే యిఁ క నిన్నును
ఆమనిసొబగుల అలమేల్మంగ

చ. 1: తెలిఁ గన్నుల నీతేటలేకదవే
వెలయఁగ విభునికి వెన్నెలలు
పులకల మొలకలపొదు లివిగదవే
పలుమరుఁ బువ్వుల పానుపులు

చ. 2: తియ్యనినీమోవితేనెలే కదవే
వియ్యపురమణుని విందు లివి
ముయ్యక మూసిన మొలకనవ్వుగదె
నెయ్యపుఁగప్రపునెరిబాగాలు

చ. 3: కైవసమగు నీకాఁగిలే కదవే
శ్రీ వేంకటేశ్వరుసిరినగరు
తావుకొన్న మీతమకములేకదే
కావించిన మీకల్యాణములు

రేకు: 0891-6 కన్నడగౌళ సం: 18-539

పల్లవి: కరుణింతువు గాని కాంతను నేను
అరమరపుల నిఁక నలయకుమీ

చ. 1: జిగురువంటిది నాచిత్తములోనివలపు
తగరువంటిది నీపై దాకొన్న యాస
తగిలి తగిలి నిన్నుఁ దరవులువెట్టఁగాను
వెగటులు సేసుకొని వేసరకుమీ

చ. 2: సూదిరాయివలె నంటు సారిది నాతోపొందు
దూదివలె మెత్తన కందువకాఁగిలి
ఆదిగొని నేను నీయాయములు ముట్టఁగాను
ఆదరింతువు గాని మారాడకుమీ

చ. 3: చిగురునఁ బోలు నాచేచేతివూడిగము
పగటునిందులఁ బోలు బహురతులు
అగపడి కూడితి నిన్నల మేలుమంగ నే నీకుఁ
జిగి శ్రీ వేంకటేశుఁడ చెదరకుమీ

రేకు: 0892-1 సౌరాష్ణం సం: 18-540

పల్లవి: చెవిలో నేకత మేమిచెప్పేవయ్యా
కవగూడి నీవద్దనే కాచుకున్నదానను

చ. 1: యేపున నీగురుత నేమేలెఱఁగమయ్యా
చూపులసాములు సేసేసూడుకాఁడవు
తీపులనీసుద్దులెల్లా తెలిసితిమయ్యా
ఆపనులకే తిరిగే అందగాఁడవు

చ. 2: వలయ నీసరితలు వినమటవయ్యా
పలుకుల సానఁ బట్టేపంతగాఁడవు
నిలువునీసింగారము నేఁడు గంటిమయ్యా
మొలకనవ్వుల పెనుమొత్తగాఁడవు

చ. 3: అంది నిన్నుఁ బొగడితి నౌఁ గదవయ్యా
పొందులరతుల మంచిపోదికాఁడవు
ఇందుకె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
విందులమోవితేనెల వేడుకకాఁడవు

రేకు: 0892-2 అమరసింధు సం: 18-541

పల్లవి: విన్నపము సేయమనె వేడుకతె నీకు మమ్ము
చెన్నుమీరిన ట్టాయింతిచెలలను సుమ్మీ

చ. 1: చిత్తమురా నీకు నాకె సేవలు సేయనేరుచు
మొత్తముగాఁ బాదాలకు మొక్కనేరుచు
పొత్తుకుఁ దీసి నిన్ను పొగడఁగనేరుచు
ఇత్తల నేమిసేసేవు ఇంటికి రారాదా

చ. 2: ఇచ్చకము సేసి నిన్ను నియ్యకొలుపనేరుచు
నచ్చుదీర నీతోను నవ్వనేరుచు
పచ్చిసేఁతలను నిన్ను పనిగొననేరుచు
ఇచ్చితివి చనవులు యింటికి రారాదా

చ. 3: అలమేలుమంగ యీకె అకెఁగూడఁగనేరుచు
పొలఁతి శ్రీ వేంకటేశ భోగించనేర్చు
అలరితి రింతలోనె ఆకె నీవు నిద్దరును
యెలమితో నిట్లానే యింటికి రారాదా

రేకు: 0892-3 నాదరామక్రియ సం: 18-542

పల్లవి: అందులోనే కానవచ్చీ నన్నిభావాలు
విందులు వెట్టఁగరాదా వెలఁదికి మోవి

చ. 1: కొప్పు దువ్వి యాకె నిట్టె కోరి వొడఁ బరచేవు
కప్పిననీమాఁటలు కాదనీనా
చిప్పిల నింతటిలోనే చెక్కులెల్లాఁ జెమరించె
తప్పక చూడరాదా తరుణినెమ్మోము

చ. 2: సెలవుల నవ్వుతానే సిగ్గు విడిపించేవు
చెలరేఁగి చెప్పినట్టు సేయకుండీనా
తలఁపులు దైవారి తనువెల్లాఁ బులకించె
సొలయుచు నీ వంటిచూడరాదా యింతి

చ. 3: కూడితి వలమేల్మంగ గొంకక శ్రీ వేంకటేశ
పాడిపంతా లింకా నీతోఁ బచరించీనా
వేడుకకళలతోడ విఱ్ఱవీఁగి రతులకు
జోడై యిట్టె చూడరాదా సొబగు లిన్నియును

రేకు: 0892-4 శంకరాభరణం సం: 18-543

పల్లవి: ఎమ్మెకాఁడు గదె యీదేవుఁడు
కుమ్మరించీ మేలు గోవిందరాజు

చ. 1: గొల్లెత లిందరు కొలువు సేయఁగ
నల్లదె సరసమాడుచును
తెల్లని కన్నుల తేట చూపులతో
కొల్లున నవ్వీని గోవిందరాజు

చ. 2: పడఁతు లిద్దరు పాదా లొత్తఁగాను
అడరి కుచము లంటుచును
వెడగుమాటలు వేవే లాడుతాను
కొడుకుఁ గనెను గోవిందరాజు

చ. 3: వూడిగపువారు వొద్దనే వుండఁగ
జూడువలపులు చల్లుచును
వేడుకతో శ్రీవేంకటాద్రిమీఁదఁ
గూడీ నిందరిని గోవిందరాజు

రేకు: 0892-5 కన్నడగౌళ సం: 18-544

పల్లవి: నీదేవులు సేసేసేత నేము సేసేమా
యీదెస నిద్దరు నున్నా రాఁకనేఁటిసుద్దులు

చ. 1: వూడిగాలవారము వొరసేమా నిన్ను నంత
ఆడానీడా నిచ్చకములాడేము గాక
పాడిపంతాలతో నీచే బాససేయించుకొనేమా
జోడుగూడ బుద్ధిచెప్పి చొక్కించేము గాక

చ. 2: చెలికత్తెలము నేము చెరఁగుపట్టి తీసేమా
చెలగి మీ కొడఁబాటు సేసేము గాక
చలపట్టి నిన్ను మరి సారె సారె దూరేమా
పొలసి మీ నేర్పులు పొగడేము గాక

చ. 3: చుట్టపువారమట రేసున బలిమిసేసేమా
మెట్టిపట్టి మీరతులు మెచ్చేము గాక
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి రింతలోనె
గుట్టున మీ మేళ్లెల్లా గోరెము గాక

రేకు: 0892-6 రీతిగౌళ సం: 18-545

పల్లవి: చెల్లుఁగదె యాతఁడేమి సేసినా నీయెడకును
పల్లదాన నింతేసి పఱచకువే

చ. 1: వొగ్గి యాతఁడిట్టె నీవొడివట్టెనంటాను
సిగ్గులువడకువే చెలియా
తగ్గక అట్టె బలిమిఁ దమ్ములమిడెనంటాను
దిగ్గనఁ దొదలుమాఁటఁ దిట్టకువే నీవు

చ. 2: సారె కొనగోళ్ళను నీచన్నులు దాఁకించెనంటా
బీరాన జంకించకువే ప్రియురాలా
కోరి నవ్వుతా నీకొప్పు వట్టి తీసెనంటా
మేర మీరకువే మందెమేళమునను

చ. 3: కప్పి శ్రీ వేంకటేశుఁడు కాఁగిలించి కూడెనంటా
తప్పులువట్టకువే తరుణి
చిప్పిలు నీమోవితేనె చేకొని నీ కిచ్చెనంటా
వుప్పటించకువే యింత వుదుటునను

రేకు: 0893-1 పడవంజరం సం: 18-546

పల్లవి: ఏమిటికి మాతోనే యెగసక్కేలు
చేముట్టి యాతని నీవే చెనకఁగరాదా

చ. 1: మలసి యాతనితోను మాటలాడితినంటాను
వెలఁదిరో నీవేల వెంగమాడేవే
వలచి వచ్చి విభుఁడు వద్దనే కాచుకున్నాఁడు
చలము లాతనితోనే సాదించరాదా

చ. 2: ననుపున నాతనితో నవ్వులు నవ్వితినంటా
కనుఁగొని నీ వెంత కాఁతాళించేవే
చనవున నాతఁడు చన్ను లంటుకున్నాఁడు
తనిసి యాతని నీవే తప్పులెంచరాదా

చ. 3: కందువ శ్రీ వేంకటేశుకాఁగిట నుందానసంటా
చెంది కాలుదొక్కి యేల చెనురించేవే
మందెమేళాన నీతఁడే మనసిచ్చుకున్నాఁడు
పొందు సేసుక నీవును పొగడఁగరాదా

రేకు: 0893-2 సాళంగం సం: 18-547

పల్లవి: ఏమాయ నింతలోను ఇట్టె చెప్పినట్టు సేసి
భామకు నీ వొకమాటు పంతమియ్యరాదా

చ. 1: బలిమిఁ బానుపుమీఁ దఁ బవళించి వున్న దదె
వెలఁదిని వొకమాటు వేఁడుకొనరాదా
చెలులము బుద్ధులెల్లాఁ జెప్పి వేసరితి మిదె
ములువాఁడి గోరిచేత మొక్కఁగరాదా

చ. 2: దీమసాన నేకతానఁ దెరవేసుకొన్న దిదె
కోమలి తొడమీఁదఁ గూచుండరాదా
నేమెల్లాఁ బ్రియముచెప్ప నేరపితి మిందాఁకా
వేమారుఁ జెక్కులు నొక్కి విడెమియ్యరాదా

చ. 3: తమకాన నీ యెదుటఁ దలవంచుకున్న దిదె
కొమరెఁ గాఁగిట నిట్టె కూడఁగరాదా
మముఁ జూచి నీకె నిట్టె మన్నించి శ్రీ వేంకటేశ
సముకాన నీమోవి చవిచూపరాదా

రేకు: 0893-3 పాడి సం: 18-548

పల్లవి: అన్నిటికి నోపుఁ దాను ఆఁటదాన నేను
వెన్న వట్టుకొని నెయ్యి వెదకఁగఁదుగునా

చ. 1: ఆసతోడ నేఁ దన్ను ఆయము లంటఁ గాను
వేసారకు మనవే వేమారును
సేసవెట్టి పెండ్లాడె చేత కంకణము గట్టె
బేసబెల్లితనమున పెనఁగఁగఁదగునా

చ. 2: భావించి సరసములు పలుమారు నాడఁ గా
నేవంక పరాకు తనకేఁటికే యది
వావు లౌనగూడఁ జెప్పె వలపులు పెడరేఁచె
చేవమీరినపనికి సిగ్గువడఁదగునా

చ. 3: కాఁగిలించుకొని తన్నుఁ గందువలఁ గూడఁగాను
వీఁగఁ జెల్లునా శ్రీ వేంకటేశుఁడు
తోఁగించె చెమటనీరు తోక్కినాఁడు పాదము
మాఁగినమోవి యొసఁగి మచ్చువేయఁదగునా

రేకు: 0893-4 మాళవి సం: 18-549

పల్లవి: ఉండవయ్య చాలుఁ జాలు వొరయకు మమ్ము నింత
నిందువావులు చెప్పేది నీసాజము

చ. 1: యెక్కడనుండి వచ్చి ఇంతులు పొలసినాను
నిక్కినిక్కి చూచేది నీ సాజము
చక్కనివారిఁ గంటే సరికి బేసికి నీవు
నెక్కొని నవ్వునవ్వేది నీ సాజము

చ. 2: తేరకే వచ్చినయట్టితెరవలతోడుత
నేరుపుమాట లాడేది నీ సాజము
పోరచి నీ యిరుగుపొరుగుల వారితో
నీరతులు చెప్పేది నీ సాజము

చ. 3: అచ్చలాన నే పొద్దూ నండనుండి పనిసేసే-
నెచ్చెలులఁ గూడేది నీ సాజము
పచ్చిగా శ్రీ వేంకటేశ పలుమారు మన్నించి
నిచ్చలు మమ్ము నేలేది నీ సాజము

రేకు: 0893-5 నాదరామక్రియ సం: 18-550

పల్లవి: ఇచ్చకము నెరపితే నేమాయనే
పచ్చిమాట లాడితేనే పదర నేమిటికే

చ. 1: కుచ్చులపై వొడ్డాణము కొనచూపులఁ జూచితే
కొచ్చి కొచ్చి యేమిటికి గొణఁగేవే
ముచ్చట నీకంకణము ముట్టి చూచినంతలోనే
రిచ్చల నింతటిలోనే రేఁగనేఁటికే

చ. 2: కొప్పుపై మొగలిరేకు కూడఁగఁ జెరిగితేను
తప్పులేల యెంచేవే తమకించి
చిప్పిలఁ బయ్యదకొంగు చేరి చక్కఁ బెట్టితేను
వుప్పతించి యెంతేసి వొట్లువెట్టేవే

చ. 3: అమమేల్మంగవు నిన్ను నక్కునఁ బెట్టుకొంటేను
నలువంక నీవేమి నవ్వు నవ్వేవే
యెలమిని శ్రీ వేంకటేశుఁడనేఁ బొగడితే
మెలుపున నెంతేసిమెచ్చు మెచ్చేవే

రేకు: 0893-6 కుంతలవరాళి సం: 18-551

పల్లవి: ఇద్దరు నిద్దరే మీరు యిన్నిటాను జాణలు
పొద్దు వొద్దునకు నిట్టె పొందుసేయవయ్యా

చ. 1: వాడికెకు మాటలాడి వన్నెలకుఁ బొడచూపి
వేడుకలు సేసీని వెలఁది నీకు
యేడనుండో వచ్చి నీవు యెమ్మెలకు నలసేవు
నీడనుండి వగరించ నేరుచుకోవయ్యా

చ. 2: సటలకు నవ్వు నవ్వి చవులకు మోవి చూపి
గుటుకల నోరూరించీఁ గోమలి నీకు
మటమాయలకు నీవు మరి వలపు చల్లేవు
తటుకున చెమటలతడి చూపవయ్యా

చ. 3: పురముపై నెలకొని వుదుటునఁ గాఁగిలించి
మరిగెఁ గూడి యలమేలుమంగ నీకు
యెరవు లేక మన్నించి యిద్దరు మమ్మేలితిరి
యిరవై శ్రీ వేంకటేశ యిట్టె మెచ్చవయ్యా

రేకు: 0894-1 వేళావళి సం: 18-552

పల్లవి: ఎఱుఁగుదు నీమనసు ఇంతా నేను
జఱయ కానతీవయ్యా చలములు సేయక

చ. 1: యేమేమి సేవసేసెనో యేకతాన నీకుఁ జెలి
ఆముకొని బాఁతిపడే వందుకే నీవు
చేముంచి అందుకంటెఁ జేసే నే నూడిగము
కామించి యానతీవయ్యా కడమలు వెట్టక

చ. 2: యేరీతి మొక్కుకొనెనో ఇచ్చకము సేసి యాకె
కోరి అవే తలఁచేవు కొంకక నీవు
సారె నాలాగుననే వేసారక నేఁ బెనఁగేను
నేరుపవయ్యా నాకు నీవే అన్నియును

చ. 3: యెటువలెఁ గూడెనో ఇట్టె యలమేలుమంగ
తటుకున నవ్వేవు దానికే నీవు
ఘటన శ్రీ వేంకటేశ కైకొంటి నిన్నట్లానే
గుటుకల మోనీవయ్యా కొసరుగా నీవు

రేకు: 0894-2 కురంజి సం: 18-553

పల్లవి: కంటిమయ్యా యీభాగ్యము కన్నులతుదల నేము
జంటలై బదుకరయ్యా చల్లగా నిద్దరును

చ. 1: పెదవితేనియ లాని పిరుఁదుపైఁ జెయివేసి
వదలించితివి నీవి వనితకు
పొదిగి చన్నుల నూఁది బుగబుగఁ జెమరించి
మదము గురియఁ జోచ్చె మానిని నీమీఁదను

చ. 2: పుక్కిటివిడియ మిచ్చి పొందుగాఁ గాఁగిలించి
చెక్కుఁ జెక్కు మోపితివి చెలియకు
తొక్కిన పాదముతోడ తొడఁ దొడఁ గీలించి
ముక్కున నూర్పు విసరీ ముదిత నీమీఁ దను

చ. 3: పచ్చడము పైఁగప్పి పలురతులనుఁ గూడి
మెచ్చితి వలమేలుమంగకు
అచ్చమై శ్రీ వేంకటేశ అన్నిటా నిన్నుఁ జొక్కించి
లచ్చనలు నించఁ జొచ్చె లలన నీమీఁ దను

రేకు: 0894-3 శ్రీ రాగం సం: 18-554
పల్లవి: మాపొందు సేయుమా మచ్చికలతోడ
ఆపనిఁ దిరుగఁగా నదవదలాయ
చ. 1: మందమగువలు మాటలాడుకోఁగా
కందువల నీకుఁ గతలాయ
సందడించి పైఁ పైఁ జల్ల లమ్మఁగా
చిందుచు నీమేన జిరుకులాయ
చ. 2: నటన నందరును నవ్వులు నవ్వఁగా
గుటుక నీమోవి గురులాయ
తటకున లోలోఁ దనువు లంటఁ గా
జొటజొటఁ జెమటలు చొతుకులాయ
చ. 3: చెలరేఁగి యందరు సేవలు సేయఁగ
కలిమాయ శ్రీ వేంకటవిభుఁడా
అలమేలుమంగనై ఆయము లంటఁగా
బలిమి వేడుకల గొబ్బనఁ బదనాయ

రేకు: 0894-4 మేఁచబౌళి సం: 18-555

పల్లవి: ఆతఁడు నీకంటె జాణఁడ దెఱఁగవా
యేతుల కిన్నిటానేల యెలయించేవే

చ. 1: చెక్కునఁ జేయువెట్టుక సెలవుల నవ్వుకొంటా
వెక్కుసము లేమాడేవే విభునిని
చిక్కనిచెమట గార సిగ్గులనుఁ దొప్పఁ దోఁగి
చక్కనిమోమున నేమి సన్న సేసేవే

చ. 2: పొదిగి తప్పక చూచి బొమ్మల జంకిచుకొంటా
కది మెంతవొరసేవే కాంతునిని
మదమున నుప్పొంగి మచ్చికల వెరగంది
పొదలుఁ జన్నుల నెంత పూఁచి మదిమేవే

చ. 3: బిగువుఁ గాఁగిటఁ గూడి పిప్పిగాఁ బెనఁగుకొంటా
వెగటునేతురటె శ్రీ వేంకటేశుని
అగపడి చొక్కించి అలమేలుమంగవు నీవు
చిగురుమోవితేనె చిందించేవే

రేకు: 0894-5 ముఖారి సం: 18-556

పల్లవి: వేసరక సారె నన్ను వేఁడుకొనే విందరిలో
ఆసతోడ నేమి సేయుమనేవయ్యా యిపుడు

చ. 1: వెగ్గళించక నీచేత విడె మందుకొంటి నిట్టె
సిగ్గువడకుమనవే చెప్పితి నేను
కగ్గులేక యప్పటిని కాఁపురములు సేసితి-
నగ్గమైతి నేమి సేయుమనేవయ్యా యిపుడు

చ. 2: పంతములాడక నీపనులెల్లాఁ జేసితి
వంతులువెట్టక నేనే వలచితిని
వింతలు సేయక మోవివిందులు చవిగొంటివి
అంతరంగ మేమి సేయమనేవయ్యా యిపుడు

చ. 3: వేసాలు చెప్పక నిన్ను విచ్చనవిడిఁ గూడితి
బాసగొనక దేవినై పట్టమేలితి
నీసరి శ్రీ వేంకటేశ నే నల మేలుమంగను
ఆసుద్దుల కేమి సేయుమనేవయ్యా యిపుడు

రేకు: 0894-6 ఆహిరినాట సం: 18-557

పల్లవి: చూతము నీబలుములు సుద్ద లింతే సేమిటికి
పోతరము చూపరాదా పొరుగువారిపయిని

చ. 1: పలుమారు నవ్వేవు పైఁ జెయ్యివేసేవు
చలములే సేసేవు సారెసారెకు
వలపు నీకు బాఁతైతే వద్దనున్న కాంతలఁ
మొలకచన్నులమీఁద మోపరాదా గోరు

చ. 2: భావించి చూచేవు పంతములాడుకొనేవు
కావరించి పెనఁగేవు గర్వాన ను
లా వింత నీకుఁ గలితే లలితో వారసతులఁ
మోవులపైఁ బల్లుమోపి ముట్టరాదా కొప్పులు

చ. 3: సరసమూలాడేవు చనవిచ్చి కూడేవు
విరుల వేసేవు శ్రీ వేంకటేశుఁడా
మరిగెతి నలమేలుమంగను నేనూవూడిగపుఁ
తరుణులతొడలపై తాచరాదా పాదాలు

రేకు: 0895-1 సామంతం సం: 18-558

పల్లవి: చొక్కపునీపెండ్లి నేఁడె సుక్కురారము
అక్కరతో నిన్నియు నవధరించవయ్యా

చ. 1: పడఁతిచెమటలే పన్నీటిజలకము
వెడగుముద్దుమాటలు వేదమంత్రాలు
యెడమని యాకెపయ్యదకొంగే తడియొత్తు
అడియాలపుమజ్జన మవధరించవయ్యా

చ. 2: తరుణిసెలవినవ్వు తగినకప్పురకాపు
తరమైనకనుచూపు తట్టుపుణుఁగు
విరులతావిపూర్పులే విసరేటిచల్లగాలి
అరుదైనవుపచార మవధరించవయ్యా

చ. 3: అలమేలుమంగకాఁగి లంటుదామెరల పూజ
పొలివోనిమేనికాంతి భూషణములు
యెలమి శ్రీ వేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
అలవడె విభవము లవధరించవయ్యా

రేకు: 0895-2 శ్రీ రాగం సం: 18-559

పల్లవి: ఎదుటనే వున్నది యింతి గడుఁబిన్నది
ఇదివో మావిన్నపాలిచ్చుగించవయ్యా

చ. 1: సెలవుల నవ్వుగారీ చెక్కులఁ జెమట జారీ
నిలువెల్లా సిగ్గుదేరీ నెలఁతకు
పలుకులఁ దేనె లూరీ భావములోఁ దమి మీరీ
కలిసి మెలసి యీకెఁ గాఁగిలించవయ్యా

చ. 2: కన్నుల వెరగుమించీ కళలు మోమునఁ బొంచీ
చన్నులపైఁ బులకలు సారెకు ముంచీ
సన్నలు బొమ్మల వంచీ చవు లాసలనుఁ బెంచీ
మన్ననల నీకెను మరిగించవయ్యా

చ. 3: మోవి నమృతము చిందీ మూఁపునఁ దురుము చెందీ
సేవలుగా చెనకులు చేతికి నందీ
యీవేళ నలమేల్మంగ ఇన్నిటాను నిన్నుఁ బొందీ
శ్రీవేంకటేశ యీకెఁ జేకొంటివేలవయ్యా

రేకు: 0895-3 లలిత సం: 18-560

పల్లవి: చూడరే వోచెలులాల సుగుణతనాలు తాను
ఆడరే మీరిందరును ఆయములు సోఁకను

చ. 1: వలసినమానినుల వద్ద నుండఁడా తాను
చెలఁగి చెప్పినట్టెల్లాఁ జేయఁడా తాను
తిలకించి సారెసారె దీప్పించుకోఁడా తాను
నెలవై పెద్దరికాలు నెరపీఁ దా నీడను

చ. 2: కెరలినకాంతలకు కిందుపడఁడా తాను
ఇరవుగ చనవెల్లా నియ్యఁడా తాను
గొరబుగాఁ గుచముల కుమ్మించుకోఁడా తాను
దొరతనాలన్నియును దొడ్డివెట్టీ నీడను

చ. 3: యెనసినసతులకు నెంగిలిపడఁడా తాను
ఘనుఁడై అన్నిటా లోనుగాఁడా తాను
యెనలేని శ్రీవేంకటేశుఁడు తా నను గూడి
ననిచి తగవులెల్లా నడపీఁదా నీడను

రేకు: 0895-4 దేశాక్షి సం: 18-561

పల్లవి: ఈతఁడు పంతము నీకు నిచ్చీఁగాని
యీతల నాతోనైనా నెచ్చరించరాదా

చ. 1: హత్తుకువుండియు నీకు నలుక లంతేసి యేల
చిత్తములోపలిమాట చెప్పరాదా
బత్తిగలదానవు పట్టినమోనములేల
తత్తిరించక కలట్టై తారుకాణించరాదా

చ. 2: పూఁతసిగ్గుతో నగవు పొదిగిపట్ట నేఁటికి
చేఁతలెల్లా వెల్లవిరి సేయరాదా
పూఁతచెక్కుచేతులతో నుమ్మగిల నేమిటికి
పాఁతసుద్దులెల్లా బట్టబాయిట వేయరాదా

చ. 3: వుదుటుబీరముతోడ నోరచూపు లేమిటికి
పదరి మేగురుతు చూపఁగరాదా
యెదుట శ్రీవేంకటేశ యెనసితి రిద్దరును
ముదముతో నన్నిటికి మొక్కఁగరాదా

రేకు: 0895-5 కాంబోది సం: 18-562

పల్లవి: చిత్తమువచ్చినట్టెల్లాఁ జేయుమనవే
పొత్తులకూరిమితోడ బోదించవలెనా

చ. 1: మనసుమర్మ మెఱఁగు మరిగినవాఁడు తాను
యెనలేనివిన్నపము లేమిసేసేవే
వెనకకె బాసలెల్లా వేవేలుఁ జేసె నాకు
పెనఁగి బలిమిసేసి పిలువఁగవలెనా

చ. 2: పిన్ననాఁడె సేసవెట్టి పెండ్లాడె నన్నుఁ దాను
వన్నెల నింకా నేమివావి చెప్పీనే
పన్ని దేవుళ్లలోనెల్లాఁ బుట్టముగట్టె తాను
యిన్నిటా నాసుద్దులెల్లా నెచ్చరించవలెనా

చ. 3: చెలఁగుమేనరికపుశ్రీవేంకటేశుఁడు దాను
కలసీ నప్పటి నేమి గడునవ్వీనే
యెలమి నెప్పుడుఁ బాయ కింటనే వున్నాఁడు తాను
వలపులు చల్లి ఇంకా వాసిరేఁచవలెనా

రేకు: 0895-6 నాదరామక్రియ సం: 18-563

పల్లవి: చూడవయ్యా ఆఁడువారిసుద్దు లిటువంటివి
వాడికగా నాడనుండే వాసులు రేఁచీని

చ. 1: వెలయ నీతో నేను వేడుకకు నవ్వఁగాను
నలినాక్షి యెవ్వతో సన్నలుసేసీని
నిలిచి నీవు నాతో నెయ్యములు చూపఁగాను
కెలన నుండి తాను కేఁకరించీవి

చ. 2: అరుదుగ నీవొద్దను ఆసతోఁ గూచుండఁగాను
కెరలుచుఁ దా కిలకిలనవ్వీవి
సరసము నీవు నాతో సారె సారె నాడఁగాను
యిరవుగా నేతువ లెత్తిపెట్టీవి

చ. 3: వొనరి నీకు నేను వూడిగాలు సేయఁగాను
వెనకనుండి తాను వెంగెమాడీని
యెనసితివి శ్రీ వేంతటేశ నన్ను వింతలోనె
వినయముతోఁ దాను వేఁడుకొనీని

రేకు: 0896-1 రీతిగౌళ సం: 18-564

పల్లవి: తేవయ్య వీడెము తేఁకువ నీయాలనైతి
దేవర వౌదువు తరితీపు తింకా వలెనా

చ. 1: నీటుతోడ నాయెదుర నిలుచుండి వేరె వేరెఁ
మాటలాడే వవునయ్యా మతకానను
మూటవలపుల నీకు మొగమెల్లాఁ జెమరించె
యేఁటికిఁ జేసేవు నీవు యెమ్మెలు మాముందర

చ. 2: రవ్వలుగా మాతోను రాజసము చూసి మోవిఁ
నవ్వులు నవ్వేవయ్యా నాలితనాన
చివ్వన నీతమకము చిగిరించెఁ బులకలై
నివ్వటిల్ల వేసాలేల నించేవు పంతానను

చ. 3: చేపట్టి నన్నిటు గూడి చెలరేగి గుట్టు సేసి
చూపు లేమిచూచేవు సొలపులను
నాపాలిశ్రీవేంకటేశ నన్నుఁ గృపనేలితిని
ఆపని కిచ్చకా లెన్నియాడేవు తగిలి

రేకు: 0896-2 శంకరాభరణం సం: 18-565

పల్లవి: కరుణించుము నీకామినిని
యిరవుగ కడుఁ జన వియ్యవయ్యా

చ. 1: పెలుచుఁదనపు నీబీరంబులకే
చలములు నెరపితి సారెకును
నెలవుగ నేనన్నిటికి సెలవుగా
మొలకవలపులను మొక్కేమయ్యా

చ. 2: బంతి నీవాడేటిపంతంబులకే
వంతునఁ బెనఁగితి వాసికిని
మంతనమున నీమన సొక్కటిగా
చెంతలఁ బ్రియములు చెప్పేమయ్యా

చ. 3: వెగ్గలమగు నీవేసంబులకే
సిగ్గున నవ్వితి సెలవులను
అగ్గపుశ్రీవేంకటాధిప కూడితి-
వొగ్గుచుఁ జన్నుల నొరసేమయ్యా

రేకు: 0896-3 మాళవశ్రీ సం: 18-566

పల్లవి: ఏఁటికిఁ దమకించేవు యింతలోననే
ఆఁటదాని కిట్టె వసమయి వుండవయ్యా

చ. 1: సిగ్గుతోడనున్నచెలిఁ జేయివట్టి పెనఁగుచు-
నగ్గలపువేడుకతో నలయింతురా
వొగ్గి విడెమిచ్చి మరి వొడఁబరచి మెల్లనె
యెగ్గుసేయక నీ వీపెయిచ్చలో రావయ్యా

చ. 2: గుట్టుతోడనున్న యింతిఁ గొలువులోఁ జెనకుచు
తొట్టినమదముతోడ దొమ్మిసేతురా
మట్టుతోనే మోవి చూపి మన్ననలు పచరించి
బట్టబయ లీఁదించక పనుపు సేయవయ్యా

చ. 3: మేలుతోనున్నకాంతను మేకొని వచ్చి మన్నించి
యీలీలఁ గూడినవాఁడ వెమ్మెసేతురా
తాలిమితో బుజ్జగించి తనిపి శ్రీవేంకటేశ
యేలుకొంటి వెడయక యింట నుండవయ్యా

రేకు: 0896-4 గుండక్రియ సం: 18-567

పల్లవి: ఎక్కడి పరాకు నీకు నెందాఁకాను
చక్కనిరమణి కిట్టు చనవియ్యవయ్యా

చ. 1: సానఁబట్టినచూపులు చల్లఁగా నీపైఁ జల్లి
తేనెలమాటలెల్లా నొద్దికతో ముంచె
కానుక సెలవినవ్వు కప్పురముగా నిచ్చె
మానవతి నిఁకనైన మన్నించవయ్యా

చ. 2: సరి చన్నులు మీఁదెత్తి సమ్మతిఁ గాచుకున్నది
యిరవై చెమటపన్నీ రిదివో నించె
మురిపెపుసిగ్గులనే ముగ్గులు నీకుఁ బెట్టె
తరుణి నింతట నిట్టె దయఁజూడవయ్యా

చ. 3: నిండుజవ్వనపాయమే నిలువు సేసలు వెట్టి
దండిసరసపుఁదమి దయిలువోసె
అండనె శ్రీవేంకటేశ అన్నిటా నేలితివి
మెండైనవనిత నింకా మెప్పించవయ్యా

రేకు: 0896-5 దేవక్రియ సం: 18-568

పల్లవి: చెలులము నీకు నేము చెప్పకపోదు
చెలరేఁగి యీతనికి సేవసేయరాదా

చ. 1: చెలి నీపెదవిపై చేయి చేర్చితివి నేఁడు
యిలఁ జిగురులుగదే యివిరెండును
పలుకుఁ దేనెలు నీపతి కేలదాఁచేవే
చలివాయ నీతనికి చవిచూపరాదా

చ. 2: చూపులకు నద్దాలు సానిపేవు కురులను
యేపునఁ దేటులేకదే యివిరెండును
ఆపనేలే వెన్నెలన వ్వాతనియెదుట నీవు
రాఁపులుగా ముందటను రాశివోయరాదా

చ. 3: చన్నులకుఁ గరములు సరినడ్డాలు పెట్టేవు
యెన్నఁ దామెరలేకదే యివి రెండును
కన్నెరో కాఁగిట శ్రీవేంకటేశుఁ గూడితివి
అన్నిటా నీముచ్చటలు ఆనతియ్యరాదా

రేకు: 0896-6 శుద్ధవసంతం సం: 18-569

పల్లవి: ఏడనుండి వచ్చెనో యీడకు నీకె
నీడనుండి కదలదు నిర్మలాన నీకె

చ. 1: మంతనాన నీవు నేను మాటలాడుకొనఁగాను
యింతలోఁ బొంచులువినీ నిదివో యీకె
వింతలుగ లోలోన వేడుకకు నవ్వఁగాను
పంతమున నప్పటిఁ దప్పకచూచీ నీకె

చ. 2: జఱసి జఱసి మీరు సరసములాడఁగాను
గుఱుతులు వెట్టుకొనీ గుట్టున నీకె
మొఱఁగులు మఱఁగుల మోవు లందుకోఁగాను
అఱిముఱిఁ జెలులతో నాడుకొనీ నీకె

చ. 3: శ్రీవేంకటేశ్వర చేరి నీవు గూడఁగాను
వోవలఁ దెరమాఁటున నున్నది యీకె
చేవదేర నీవు నన్ను చెంతల మన్నించఁగాను
వావిచెప్పి పెండ్లాడవచ్చీ నీకె

రేకు: 0897-1 మంగళకౌశిక సం: 18-570

పల్లవి: ఇద్దరినడుమ నుండీ ఇదివో తాను
తిద్దుచు జగడములు తేరీచీఁగాక

చ. 1: వొక్కరికి బుద్ధిచెప్పీ నొక్కరికి చెక్కు నొక్కి
చక్కనినాయకుఁడు సవతులకు
అక్కరతో నింత సేసినట్టివాఁడు తానే కాఁడా
వుక్కటతో రేచుకొని పొడిఁబడిఁగాక

చ. 2: వొడివట్టీ నాకెను వొడఁబరచి నీకెను
కడుజాణరమణుఁడు కామినులకు
ముడికాఁడైనవాఁడు మొదలఁ దానేకాఁడా
యెడమాటలాడి బయలీఁదుకొనీఁ గాక

చ. 3: కలసీని జవరాలిఁ గాఁగిలించీ కన్నియను
లలి శ్రీవేంకటేశుఁడు లలనలకు
యెలమి నన్నును నేలె నిన్నిటాఁ దానే కాఁడా
వలపులు పెడరేఁచి వసమయ్యీఁగాక

రేకు: 0897-2 ఆహిరి సం: 18-571

పల్లవి: చిత్తము లెరిఁగి సేవసేయరమ్మా
పొత్తులబువ్వానకు పొసగించరమ్మా

చ. 1: పీఁటమీఁదఁ గూచుండి పెండ్లాడి రిద్దరును
చీటికిమాటికి నట్టె సిగ్గుపడేరు
మాటలాడించి చూచితే మంతనమాడుకొనేరు
తేటలుగా నింతలోనె తెరవేయరమ్మా

చ. 2: చేతు లొగ్గించుకొంటాను సేసలు వెట్టుకొనేరు
పోతరించి సెలవులఁ బూఁచి నవ్వేరు
ఘాతల నొకరొకరిఁ గడకన్నులఁ జూచేరు
నీతెరిఁగి పచ్చడము నిండఁ గప్పరమ్మా

చ. 3: కడుఁ దలలువంచుక కాఁగిట నించుకొనేరు
అడరి లోలోనే విడె మందుకొనేరు
యెడయక శ్రీవేంకటేశుఁ డింతయుఁ గూడిరి
బడిఁబడి దలుపు గొబ్బన మూయరమ్మా

రేకు: 0897-3 భైరవి సం: 18-572

పల్లవి: పంతము దప్పదు నీకుఁ బడఁతితోను
యింతటిలోనే చనవిచ్చేవుగాక

చ. 1: యేచి యీకెను నీశిరసెత్తి చూడరాదా
నీచిత్తము వచ్చితే మన్నించేవుగాక
కాచుకున్నది గొబ్బునఁ గప్పుర మీరాదా
చేచేతఁ జెప్పినట్టు సేసేవుగాక

చ. 2: నంటున సెలవులను నవ్వరాదా
యింటికివచ్చినప్పు డేలేవుగాక
అంటి ముట్టి యిప్పుడిట్టె యాదరించరాదా
పెంటగా నేకతమునఁ బెనఁగేవుగాక

చ. 3: కందువల మెచ్చిమెచ్చి కాఁగిలించరాదా
సందడిరతిఁ బాదాలు చాఁచేవుగాక
విందుగా నీకాంతను శ్రీవేంకటేశ కూడితివి
పొంది మోవియ్యరాదా బోదించేవుగాక

రేకు: 0897-4 బౌళిరామక్రియ సం: 18-573

పల్లవి: నేరుతువయ్యా నేరుపులు
పోరచిపొందులె బోగములు

చ. 1: నలుగడ సెలవుల నవ్వు లివి
వలచినసతులకు వాడికలు
తలఁచినయప్పుడె తగులములు
పెలుచగునీతో పెనఁగులాటలు

చ. 2: పరమమైననీపలుకు లివి
మరిగినవారికి మర్మములు
దొరకినయప్పుడె దోమటులు
పరగ నిండుకొనుపలు చూపరలుఁ

చ. 3: వీడెపునీమోవివిందు లివి
కూడినమాకును కోరికలు
యీడుగ శ్రీవేంకటేశ్వరుఁడా
వేడుకరతు లివి వెల్లావిరులు

రేకు: 0897-5 హిందోళవసంతం సం: 18-574

పల్లవి: పట్టినచలములేల పలుకరాదా
యెట్టు చెప్పినా నిట్టే యియ్యకొనరాదా

చ. 1: ములువాఁడి గురుతుల మోవి నీకుఁ జూపితేను
నెలవుల నవ్వనేల చెప్పరాదా
తలుపుమూల నుండఁగ తగఁ గొంగువట్టితేను
కలువల వేయనేల కానిమ్మనరాదా

చ. 2: చిక్కనిచెమటతోడి చేతులు పైఁ జాఁచితేను
దిక్కన జంకించనేల తెలుపరాదా
ముక్కువ సిగ్గువడఁగ మంచముపై నిడుకొంటే
మొక్కులు మొక్కఁగనేల ముచ్చటాడరాదా

చ. 3: కప్పురపుఁ దావి మేనఁ గాఁగిలించుకొంటేను
చొప్పులెత్తనేల కల్ల చూపరాదా
చిప్పిలఁ గూడితిఁ గదే శ్రీ వేంకటేశుఁడ నేను
దప్పులఁ బొరలనేల తనియఁ గరాదా

రేకు: 0897-6 శ్రీరాగం సం: 18-575

పల్లవి: మేలయ్య మిమ్ముఁ జూచి మెచ్చితి నేను
మేలములాడేరు మీరు మేళ్ళెట్టివో

చ. 1: వెలఁది నీకుఁ జెవిలో విన్నపాలు సేయఁగాను
పులకించె నీమేను పొందు లెట్టివో
కులికి యట్టె విరులఁగొప్పు నీకు ముడువఁగ
జలజలఁ జెమరించె చవులెట్టివో

చ. 2: సరినుండి వీడెమిచ్చి చన్నుల నిన్నొత్తఁగాను
తరవాత సిగ్గు రేఁగె తములెట్టివో
తెర వేసుకొని నీదో తేటలుగా నవ్వఁగాను
గొరబుచేఁతలు నిండె గుణా లెట్టివో

చ. 3: కామించి ఇంతలో నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
మోమునఁ గళలు రేఁగె మోహాలెట్టివో
ప్రేమపు శ్రీవేంకటేశ బెరసి నిన్నుఁ జూచితే
ఆమనాయ మోవితేనె లాస లెట్టివో

రేకు: 0898-1 సింధురామక్రియ సం: 18-576

పల్లవి: ఏఁటికి సిగ్గుపడేవు యిందరిలోన
మాఁటు కరుగక ఇంక మాటలాడవమ్మా

చ. 1: పొసఁగ నిన్ను నతఁడు పుత్తడబొమ్మవంటా
కొసరుచుఁ బొగడీని కొలువులోన
వసముచేసుకొని వలపించుకొంటివి
అసుదవుగావు వీడె మందుకొనవమ్మా

చ. 2: సారెసారెకును నీవె చక్కనిదానవంటా
ఆరీతి నట్టె చూపీ నంగనలకు
మేరమీరి యిందరిలో మెప్పించుకొంటివి
కోరికతో సంగడిని కూచుండవమ్మా

చ. 3: యీడైన యలమేల్మంగ విన్నిటా నేర్పరివంటా
వేడుకఁ గొసరీని శ్రీ వేంకటేశుఁడు
కూడితిరి మీరిద్దరు కొంకక మమ్మేలితిరి
వాడికలాయను మీవారము నేమమ్మా

రేకు: 0898-2 ఆహిరి సం: 18-577

పల్లవి: కందువ నీప్రియములు కైకొనేఁ గాక
సందడి నిన్నెటువలె జరసేమయ్యా

చ. 1: నంటున నాపె నీపై నవ్వులపువ్వులు వేసె
జంటచూపులఁ గస్తూరి సారెకుఁ జల్లె
పెంటసన్నల బువ్వానఁ బెదవి యెంగిలిసేసె
యింటివారము నేము నిన్నేమనేమయ్యా

చ. 2: చెలరేఁ గె సరసపుసిగ్గుల గందము పూసె
వలపులచెమటల వంచెఁ బన్నీరు
నిలువుఁ జక్కఁదనాల నిన్ను బంటుగా నేలె
కులమువాండ్లము నిన్నుఁ గొసరనేలయ్యా

చ. 3: వెంగెపుమాటలనే వీడెము లొసగె నేఁడు
అంగపుసోఁకులనే పెండ్లాడె నిన్నును
చెంగట నలమేల్మంగ శ్రీ వేంకటేశ నిన్నంటె
అంగపుఁ గాఁగిటివార మారడులేలయ్యా

రేకు: 0898-3 కొండమలహరి సం: 18-578

పల్లవి: ఏమే యొఱఁగవా యేకతపుసరసము
కామించినాతని నించకాకుసేతురా

చ. 1: చెంతనుండి యాతఁడు నీచెఱఁగువట్టి తీసితే
పంతములాడుదురా పతితోను
అంతరంగ మనుచు నీయండ నిట్టె కూచుండితే
రంతుసేసి మాటలాడి రవ్వసేతురా

చ. 2: సన్నలకు నీకొప్పు జార నాతఁ డు దీసితే
కన్నుల జంకింతురా కాంతునిని
మన్ననల సిగ్గులమాటలు దడవితేను
పన్ని సతులలో నెల్లాఁ బచ్చిసేతురా

చ. 3: అలమేలుమంగవు నీవు నిన్నట్టె కాఁగిటఁ గూడితే
యెలయింతురా శ్రీ వేంకటేశ్వరుని
వలపులు రేఁచి రతి వక్కణ నీకుఁ జెప్పితే
వెలయ నంతటా వెల్లవిరి సేతురా

రేకు:	0898-4 వరాళి	సం:	18-579
పల్లవి:	నేరుతుము నీకంటె నే మిందరము
	ఆరీతిఁ బెనఁగకుంటే నందువు గాని
చ. 1:	యేడలేనిమాటలు నీవిన్ని నేరుచుక వచ్చి
	ఆడేవు సిగ్గుపడక ఆఁడువారిలో
	వోడక యేకతమున నొరసి నిలువరాదా
	జోడగు మాసరితలు చూతువు గావి
చ. 2:	కన్న కన్న చోటులను కతలెల్లాఁ జూచి వచ్చి
	సన్నలనే చూపేవు సబలలోన
	యిన్నేసి తడవనేల ఇంటిలోనికి రారాదా
	కన్నెలము మాసేఁతలు కందువు గాని
చ. 3:	తలఁపులో నొక్కొక్కటే తలఁచుక నీవు వచ్చి
	అలమేపు కాఁగిట నన్నాడా నీడాను
	అలమేలుమంగను పాయకు శ్రీ వేంకటేశుఁడ
	తిలకించి మాగుణాలు తెలిసేవు గాని

రేకు: 0898-5 సౌరాష్ట్రం సం: 18-580

పల్లవి: ఆతనిఁ జూడవలెఁగా అన్నిటా నేము
చేతులొగ్గి చెప్పినట్టు సేసేమే యిఁ కను

చ. 1: సారిది నాతనితోడ జోడుగూడుక వచ్చి
సిరులనెమ్మెలచేత చెలరేఁగేవే
దొరవౌదువంటాను తోడిసతులు మెచ్చేరు
మురిపెములు గంటిమి మొక్కేమే నీకు

చ. 2: పొలయుచు రాజసాన పురుషుని సలిగెల
నలువంక నిట్టవీఁగి నవ్వునవ్వేవే
బలువురాలవంటాను పడఁతులు పొగడేరు
తెలిసితిమి పట్టపుదేవులవే నీవు

చ. 3: కూరిమిశ్రీ వేంకటేశుఁ గూడినసంతోసాన
మేరమీరి యందరికి మేలు చూపేవే
యీరీతి నీతనిచేత నేలించితనే రిందరు
ఆరయ నలమేల్మంగ వౌదువే మన్ననల

రేకు: 0898-6 పాడి సం: 18-581

పల్లవి: కాని అందు కేమాయఁ గడవారమా
పూని యీకరుణ యెట్టాఁ బుట్టెనో నీకు

చ. 1: చేతికిఁ గానుకిచ్చితే సిగ్గువడే వేమయ్య
ఆతల నీ కేమితలఁ పాయనో నేఁడు
యీతల మొక్కఁగా శిరనేల వంచేవేమయ్య
కాతరపునేర మెట్టుగలిగెనో నీకు

చ. 2: నంటున వీడెమిచ్చితే నవ్వు నవ్వే వేమయ్య
జంటల నేమిటివంక సరిదాఁకెనో
అంటి సేవసేసితేనే అలసే విదేమయ్య
యింటిలో నాచన్నులవేఁ గెట్టుండెనో నీకు

చ. 3: వొద్దికఁ బెనఁగితే నిట్టూర్పు నించేవేమయ్య
గద్దరిచిత్త మెట్టులఁ గరఁగినదో
ముద్దులశ్రీవేంకటేశ ముంచి కూడితి వొనయ్య
పొద్దు వొద్దు కాస లెట్టు పొసఁగెనో నీకు

రేకు: 0899-1 శుద్ధవసంతం సం: 18-582

పల్లవి: పంతపుసుద్దులు చెప్పేబయకాఁడవు
వంతులకు నీవు నట్టే వలవరాదా

చ. 1: పలచఁగా నవ్వు నవ్వి పలుమారు సిగ్గువడి
వెలఁది మాటలాడీని వినరాదా
వలిపెపయ్యదకొంగు వల్లెవాటు వేసుకొని
చెలరేఁగి మొక్కీని చేకొనరాదా

చ. 2: కడుమురిపెము చూపి కారపువీడెములిచ్చి
పడఁతి నిలుచున్నది భావించరాదా
కడఁగి తురుము కీలుగంటుగొన బిగియించి
జడియక పెనఁగిని సమ్మతించరాదా

చ. 3: మచ్చికఁ జన్నులనొత్తి మనసురా మోవి యిచ్చి
నెచ్చెలి గాఁగిలించీ మన్నించరాదా
యిచ్చట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తచ్చి తచ్చి సొలసీని దయఁ జూడరాదా

రేకు: 0899-2 నాగవరాళి సం: 18-583

పల్లవి: ఇప్పుడే యిన్నియుఁ గాక యిఁక నెన్నఁడు
చెప్పరాని సేఁతలెల్లాఁ జేకొనవయ్యా

చ. 1: వెలఁది విన్నపములు వింటివా నీవు
పలుమారు చిత్తమునఁ బట్టెనా నీకు
అలరినసంతోస మబ్బెనా నేఁడు
కలిగె నీకు లాభము కట్టుకొనవయ్యా

చ. 2: కొమ్మచేతికాను కందుకొంటివా నీవు
చిమ్ముల నీచేతికిఁ జిక్కెనా నీకు
దిమ్మరి నీకోరికే సిద్ధించెనా నేఁడు
వుమ్మడిఁ జేరే మేళ్లు వొప్పుకొనవయ్యా

చ. 3: కొమలి మోవిచవి గొంటివా నీవు
దామెనరతులు యిట్టె దక్కెనా నీకు
నేమపు శ్రీ వేంకటేశ నేఁడు నన్నేలితివి
కామతంత్రసంపద గనుకొనవయ్యా

రేకు: 0899-3 దేసాళం సం: 18-584

పల్లవి: ఎదురుబడి సొలయ నికనేలయ్యా
ముదముచోడ నీకు మొక్కేమయ్యా

చ. 1: వనితల నందరిని వలపించ నేరుతువు
పెనుపెట్టి మచ్చికలు పెంచనేర్తువు
మనసురా నన్నిటాను మాటలాడ నేరుతువు
పనితోడ నేమెల్లా బదికితిమయ్యా

చ. 2: క్రియలు దెలిపి తమి కెరలించ నేరుతువు
నయములుగా కడునవ్వనేర్తువు
ప్రియములు చూపి యాస పెచ్చురేచ నేరుతువు
నియతాన నీ కృపను నెలకొంటిమయ్యా

చ. 3: విందు చెప్పి మోవియిచ్చి వెలయించ నేరుతువు
అంది కాగిలించి కళ లంటనేర్తువు
చెందితివి నన్ను నిట్టె శ్రీ వేంకటేశ్వర
మందలించి నిన్ను నేము మరగితిమయ్యా

రేకు: 0899-4 శంకరాభరణం సం: 18-585

పల్లవి: తేట తెల్లములు తెలిసినవి
యేఁటికి మఱుఁగులు యిదివో మాట

చ. 1: ననుపుగలిగితేనే నవ్వులు
మనసువచ్చితేనే మంతనాలు
తనవారితనమైతే తగవులు
యెనలేని రమణుఁడ ఇదివో మాట

చ. 2: సమ్మతించితే సరసములు
నమ్మికలైతే నంటులు
పమ్మినవలపులె బలుములు
యిమ్ములఁ గనుఁగొంటే యిదివో మాట

చ. 3: కైవసమైతే కడఁకలు
మోవులయీవులె ముదములు
శ్రీ వేంకటేశ్వర చెలఁగి నన్ను
యీవలఁ గూడితి విదివో మాట

రేకు: 0899-5 సాళంగనాట సం: 18-586

పల్లవి: నీకొలఁది దానవా నేనిన్నిటా
జోకలెల్లా మీఁదమీఁదఁ జూడరాదా యిఁకను

చ. 1: నవ్వులెన్ని నవ్వేవే నయ మెంతచూపేవే
రవ్వలుగా వలచిరమణునికి
యివ్వల నీతని నేఁడే యింటికి రప్పించుకొంటే
చివ్వన నీవు నన్ను మెచ్చేవటవే యిపుడు

చ. 2: పంతమెంతనెరుపేవే పనులెన్ని చెప్పేవే
వింతలుగాఁ జొక్కినట్టివిభునికిని
చెంతనుండి నేను నట్టే చేతికి లోఁ జేసుకొంటే
సంతసించి పొగడేవా సారెసారె నన్నును

చ. 3: చవులెన్ని చూపేవే చనవెంత నెరుపేవే
యివలను శ్రీ వేంకటేశ్వరునికి
జవళి నితని నేను సంగడిఁ బెండ్లాడితి
వివరానఁ బందెమువేయరాదా యిందుకు

రేకు: 0899-6 నాదరామక్రియ సం: 18-587

పల్లవి: అందరివలెనే చూచే వప్పటి నన్ను
నిందలు నిన్నాడుదునా నేఁ బొగడుచుఁ గాక

చ. 1: చలమరినా నీతో సారెసారెఁ బెనఁగను
చెలరేఁగి చెప్పినట్టు సేతుఁ గాక
పెలుచుదాననా నీతోఁ బెడసరాలాడను
మెలఁగి ప్రియాలు చెప్పి మెప్పింతుఁ గాక

చ. 2: కోపకతైనా నిన్ను కొసరుచు జంకించఁగ
వోపి నీతో నవ్వుతానే వుండుదుఁ గాక
రాఁపులదాననా నిను రచ్చల నాఱడిసేయ
చూపులనే తమిరేఁచి చొక్కింతుఁ గాక

చ. 3: కొత్తదాననా నిన్నుఁ గోరి మనసుచూడఁగ
బత్తిసేసి కాఁగిలించి పైకొందుఁ గాక
యిత్తల శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
గుత్తపుగుబ్బల నొత్తి కొసరుదుఁ గాక

రేకు: 0900-1 దేవగాంధారి సం: 18-588

పల్లవి: ఏమని దూరే మెందాఁకా నిను
కామితఫలములు గలిగెను మాకు

చ. 1: పలుకు లేమిటికిఁ బలుమారు
అలర నీరపములాయ నిఁక
కొలఁదిమీరి రదె గొల్లెతలు
మలసి వారలకు మగఁడవు నీవు

చ. 2: తడవ నేమిటికి తతిగొనుచు
చిడుముడి నీసేఁత చెల్లెనిఁక
అడరిరి పెండ్లికి నచ్చరలు
యెడయక వారల నేలితివి

చ. 3: వెంగము లేఁటికి వెక్కసమై
కంగుదేర మముఁ గలసితివి
యింగితమెఱిఁగిన యిల్లాండ్లము
చెంగటఁ గూడితి శ్రీ వేంకటేశ

రేకు: 0900-2 భూపాళం సం: 18-589

పల్లవి: మఱచితిననక యేమఱివుంటిననక
యెఱుకగా గుఱుతు నాకిమ్మని యడుగవే

చ. 1: యెలమితోడుత మాయింటికెపుడు విచ్చేసీ
అలివేణి యాతని నీవడిగి రావే
పొలుపారఁ గూటమికి పొందుగా మాటలాడి
అలరినరతులకు నానవాలు దేవే

చ. 2: అందుకోలు పెండ్లికి నట్టై సమ్మతించితేను
పెందలకాడ విడె మిప్పించుకరావే
కందువతో వలపులు కడుఁ జవులై తేను
చెంజి యానవెట్టించుక చేకొనిరావే

చ. 3: చిమ్ముచు నన్నింతలోనె శ్రీ వేంకటేశుఁడు గూడె
పిమ్మటిసేఁతలు దలఁపించిరావే
వుమ్మడి నలమేల్మంగ నొనరితిఁ గాఁగిట
నమ్మికాయ నాకుఁగా విన్నపములు సేయవే

రేకు: 0900-3 సింధురామక్రియ సం: 18-590

పల్లవి: చెప్పినట్టెల్లా నేఁడు సేతురుగాక
దుప్పటి గప్పఁగా నీవు దూరుదురా

చ. 1: సరసపు మాటలెల్లా చవి సేసుకొంటగాక
వెరవుగా నెరసులు వెదుకుదురా
పరగ నన్నిటా నీవు పట్టపు దేవులవు
వొరసి పిలువఁగాను వూరకుందురా

చ. 2: నవ్వినవ్వుల కెల్లా ననిచి వోర్చుటగాక
రవ్వగా నెగ్గులు వట్టి రచ్చవేతురా
మువ్వురలోపల నీవు మోహపు గామినివి
పవ్వళించు మనఁగాను పరాకుసేతురా

చ. 3: చెనకి నిన్నుఁ గూడఁగా చెలరేఁగుదురు గాక
పెనఁగుచు సిగ్గులింత పెంచఁ జూతురా
అనిశముఁ బాయరాని అలమేల్మంగవు నీవు
యెనసె శ్రీ వేంకటేశుఁ డేతువ వెత్తుదురా

రేకు: 0900-4 కన్నడ గౌళ సం: 18-591

పల్లవి: చెలువుఁడ నీకు నేము చెప్పవలెనా
మలసి సొలసి యిట్టె మన్నించవలదా

చ. 1: చిగురుఁబోడి నీకు జెప్పిన ప్రియములకు
నిగిడి ఇంతటఁ గరుణించ వలదా
మొగముచూచి నీకు మొక్కినట్టి మొక్కులకు
అగపడి నీవు గడు నాదరించవలదా

చ. 2: యెదురుగా నీకు నింతి యిచ్చిన కానుకలకు
సదరాననే లాలించఁగవలదా
కొదలేక నీవద్దఁ గొలువు సేసినందుకు
మది సంతోసములతో మన్నించ వలదా

చ. 3: అలమేలుమంగ నీయంకెలఁ గూడినందుకు
మెలఁగి శ్రీవేంకటేశ మెచ్చవలదా
చలపట్టి నీమోవి చవిగొన్న యందుకు
వెలలేని వేడుకల వెలయించ వలదా

రేకు: 0900-5 బౌళి సం: 18-592

పల్లవి: కానవచ్చె నీగుణాలు కాంతలకు నిందరికి
యీనేరుపు లేకుండితే నెమ్మలింత సేతువా

చ. 1: పంతగాఁడ వౌదువు బలిమి సేసి చెలని
వింత ముద్రలు మోవి పై వెలఇంచితి
ఇంత వాఁడవు గాకుంటే నెరవుల గొల్లెతల
చెంతఁ గూడి కాకు సేసి చిమ్మిరేఁతువా

చ. 2: శూరుఁడవు నౌదువు సోయగపుఁ జెక్కులపై
గోరు దీసి జవ్వనము కొల్లగొంటివి
ధీరత ఇంత లేకుంటే దిక్కులఁ బదారువేల
కూరిమి సతుల దెచ్చుకొ పెండ్లాడుదువా

చ. 3: అన్నిటా గబ్బివౌదువే అలమేలుమంగఁ గూడి
పిన్ననాడే వురమునఁ బెట్టుకొంటివి
యెన్నఁగ శ్రీ వేంకటేశ యీ బిగు వుండకుండితే
వన్నెలుగా నందరిని వలపింతువా

రేకు: 0900-6 వరాళి సం: 18-593

పల్లవి: బలువాఁడవయ్యా భామల రొచ్చు కోర్చితి
పలువై యెందరి పాలఁ బరగె నీ మేను

చ. 1: కందువ సతుల నీకుఁ గడుఁ గడు మొక్కఁ గాను
యెందరితలలు మోచె నీపాదాలు
అంది వూడిగాలు నీకు నందరునుఁ జేయఁగాను
సందడి కెట్టోరిచె నీచక్కని మేను

చ. 2: కన్నెలెవ్వరైనా నిన్నుఁ గాఁగిలించు కొనఁగాను
యెన్ని చన్నులు సోఁకెను యీచేతులు
సన్నల మాటలాడి సారెఁ దమ్ములా లిడఁగ
వున్నతి నెంగలి కెట్టు వొనరె నీమోవి

చ. 3: ఱట్టడి కామినుల యాఱడి పసలనుఁ జొక్కి
యెట్టు తగులు వడెను యీ మనసు
అట్టె శ్రీవేంకటేశుడ వలమేల్మంగను నన్ను
గట్టిగా నేలుకొంటివి ఘనుఁడవు నీవు

రేకు: 0901-1 దేసాళం సం: 19-001

పల్లవి: అండకు రావయ్యా అన్నియుఁ దెలిసెను
నిండి నోసలిలత్తుక నీరువలె నున్నది

చ. 1: ముసుఁగు వెట్టుకొని మూల నేమి సేసేవు
సుసరానఁ బెదవులు చూపవయ్యా
యెసఁగి రెప్పలమీఁది కేలవచ్చోఁ దమ్ములము
కొసరితేను చెక్కిట గోరువలె నున్నది

చ. 2: కాయమెల్లా గప్పుకొని కడులోన నున్నాఁడవు
సోయగపు నీవురము చూపవయ్యా
చాయలకెంపు లెడవిసరీ బాహుమూలముల
నీయందుఁ గళలు నేఁడు నెలకొన్నట్లున్నవి

చ. 3: తెరవేసు కేలితి వొద్దిక నలమేల్మంగను
సారిది నీనెమ్మొగము చూపవయ్యా
ఇరవై నన్ను శ్రీవేంకటేశుఁడ యేలితివి
వెరవుతో నీపుక్కిట విడె మున్నట్లున్నది

రేకు: 0901-2 మాళవి సం: 19-002

పల్లవి: ఇయ్యకొంటి నిఁక నీయిచ్చాయను
కొయ్యతనాలదాననా కొసరితిఁ గాక

చ. 1: యెనయక నీతోను యెదురాడేదాననా
అనవల శొకమాట అడితిఁ గాక
పెనఁగుచు నీతోను బిగిసేటిదాననా
చనవు మెఱసి కొంతజంకించితిఁ గాక

చ. 2: యెడచొచ్చి నీపట్టుకు నెగసక్కెపుదాననా
నడుమ నూరకే నీతో నవ్వితిఁ గాక
జడిగొని నిన్ను మీరి సాదించేదాననా
వుడివోని చన్నుల నొత్తితిఁ గాక

చ. 3: సారిది గబ్బితనము చూపేటిదాననా
కెరలి కాఁగిటను బిగించితిఁ గాక
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
జరగేదాననా మోవి చవిగొంటిఁ గాక

రేకు: 0901-3 సాళంగనాట సం: 19-003

పల్లవి: తొలుత నెఱఁగవా తొయ్యలిలాగు
బలిమి చూపఁగనేల పంతమియ్యనేల

చ. 1: వొడివట్టి తీసి నీవువొడఁబరచఁగ నిటె
కొడిమెలు నిన్ను నెంచి కొసరీనాపె
అడరి యప్పటి నీవు అవుఁగాము లాడుకోఁగా
బెడిదపుబెదవులు పిప్పి గట్టీ నిదివో

చ. 2: కక్కసించి పెనఁగుచు కాఁగిలించి వేఁడుకోఁగా
చక్కఁ గిందవేసుకొని జరసీ నాపె
వెక్కసమై నీవందుకు వినయాలు నేయఁగాను
పక్కన నీసేఁతలెల్లాఁ బచ్చిదేరీ నిదివో

చ. 3: శ్రీ వేంకటేశుఁడ యిట్టె చేరి నీవు గూడఁగాను
భావించి నీవురముపై నెక్కీ నాపె
వేవేగ నిప్పుడే నీవు విడెము చేతి కియ్యగా
చేవదేరి నీవలపు చిమ్మిరేగె నిదివో

రేకు: 0901-4 దేవగాంధారి సం: 19-004

పల్లవి: దేవరగుణములు దెలియవు
నీవే మాకును నేరుపవయ్యా

చ. 1: వదలక నీతో వాసికిఁ బెనఁగిన
యెదుటనె నీమనసెట్టుండునో
కదిసి నీరతికిఁ గడుదమకించిన
యిది వేసాలని యెంతువో నీవు

చ. 2: చెనకఁగ నీయెడ సిగ్గులు నెరపిన
పనులవి యేమని భావింతువో
ననిచి నీయెదుట నవ్వులు నవ్విన
తనివిలేనిదని తగ నాడుదువొ

చ. 3: కూడుచు నిన్నిటు గుబ్బల నొత్తిన
వోడ దనుచు గో రూఁదుదువో
యీడనె శ్రీవేంకటేశ యేలితివి
వీడె మిచ్చితే వెరగందుదువో

రేకు: 0901-5 కన్నడగౌళ సం: 19-005

పల్లవి: సేసతోఁ బెండ్లాడితివి చెల్లుబడి కాకపోదు
గాసిఁ బెట్ట కిట్టె నన్ను గరుణించరాదా

చ. 1: చెన్నుమీర చిత్తము రా సేవలు నేయకుండితే
నన్ను నీవప్పుడు మరి నగరాదా
వన్నెల నిన్నిట్టె కైవసము సేసుకుంటే
మిన్నక నీ పంతములు మెరయరాదా

చ. 2: ఆయము లంటుచు నిన్ను నాసకొలుపకుండితే
పాయపుమదాన నన్నే పలుకరాదా
చాయల నే నీమోవి చవులుగొనకుండితే
సోయగపుబిన్నాణానఁ జూడఁగరాదా

చ. 3: చేవమీరినరతుల సిగ్గులు రేఁచకుండితే
నీవాసు లిన్నియును నెరపరాదా
శ్రీవేంకటేశ్వర యిట్టె చేకొని కూడితివి
యీ వేడుకులు గలిగె నిఁక మెచ్చరాదా

రేకు: 0901-6 మంగళకౌశిక సం: 19-006

పల్లవి: ఎటువంటివాఁడవయ్యా యిచ్చకము సేయఁగాను
సటలంటా బొమ్మలను జంకింతురా

చ. 1: వూరకే నీపాదములు వొత్తుచుఁ బిసుకఁ గాను
గోరుదాఁకెనంటా యేల కొచ్చి చూచేవు
చేరివూడిగాలు గడుఁ జేసితే మెచ్చుఁ గాక
నేరుపు నేరము లెంచి నిందవేతురా

చ. 2: కన్న గన్న చోటనెల్లా గందము నీకుఁబూయఁగా
చన్నులు నా టెనంటా సాదించేవు
వున్నతి బ త్తిసేసితే నొడఁబడుదురుగాక
సన్నలఁ దప్పులు మోపి చండి సేతురా

చ. 3: మొల్లమిరతుల నిన్ను మోవి యాని కూడఁగాను
పల్లు సోఁ కెనంటా నాతోఁ బంతమాడేవు
యిల్లిదె శ్రీ వెంకటేశ ఇందుకె నవ్వుట గాక
కొల్లగా సిగ్గువరచి కోసరుదురా

రేకు: 0902-1 దేశాక్షి సం: 19-007

పల్లవి: ఏమనేమయ్య నీవు యేలికవు మాకునెల్లా
ఆమనిగా మోవి చూపి యాసరేఁచేవు

చ. 1: ఇచ్చకములే సేసి యెలయించి యెలయించి
పచ్చిదేర నింతులను భ్రమయించేవు
ముచ్చటలాడి కడు మోహములు పైఁజల్లి
మెచ్చులుగా వలపించి మేకులు సేసేవు

చ. 2: సందడిఁ జేతులు చాఁచి జవ్వనము లంటియంటి
మంద పెండ్లి కూఁతులను మరిగించేవు
విందులవీడెము లిచ్చి వేసాలు గడునెరపి
యిందులోనే యేకతాన యెమ్మెల మించేవు

చ. 3: నమ్మిక లెన్నైనా నిచ్చి నగవులు పచరించి
మమ్ము నిందరినిఁ గూడి మన్నించేవు
నెమ్మది శ్రీవేంకటేశ నేరుపులు పచరించి
నిమ్మపండు చేతికిచ్చి నీటులు చూపేవు

రేకు: 0902-2 తెలుఁగుఁగాంబోది సం: 19-008

పల్లవి: దయఁజూడవయా తతిగొని మొక్కేము
ప్రియురాండ్లము నినుఁ బెండ్లాడితిమి

చ. 1: చలములు నీతో సాదించేమా
వలచినవారము వనితలము
బలములు నీతోఁ బచరించేమా
కొలిచినవారము గోలలము

చ. 2: పెనఁగుచు నీతో బిగి సేమా నీ-
ననుపులవారము నాతులము
పవివడి నేరమి పై వేసేమా
చనవరివారము సాదులము

చ. 3: యీ వేళఁ గూడితి మొలయించేమా
దేవుళ్లము నీ తెఱవలము
శ్రీ వేంకటేశ్వర చెలఁగి నగేమా
బూవపువారము భోగులము

రేకు: 0902-3 శుద్ధవసంతం సం: 19-009

పల్లవి: జంకించితనేవు నన్ను సాదవా నీవు
సంకించ వేమిటికి సాదవా నీవు

చ. 1: దూరి కొపకత్తెనంటా తొయ్యలుల కందరికి
సారె సారెఁ జెప్పేవు సాదవా నీవు
వూరికే మాటలాడుతా నొద్దఁ గూచుండి నా కిట్టె
సారపుబుద్ధి చెప్పేవు సాదవా నీవు

చ. 2: గొరబుగా నావలపు కొల్లున నవ్వుతా నీవు
సరవితోఁ గేరేవు సాదవా నీవు
తెరవేసి యానవెట్టి దిమ్మరి సేఁతలు చేసి
సరుగఁ జెక్కునొక్కేవు సాదవా నీవు

చ. 3: కలికినాకుచములు కాఁగిటను బిగియించి
చలపట్టి కూడితివి సాదవా నీవు
అలరి శ్రీ వేంకటేశ అదరపుతేనె లిచ్చి
చలివాసితివి సిగ్గు సాదవా నీవు

రేకు: 0902-4 కేదారగౌళ సం: 19-010

పల్లవి: వింటిమి యీకొత్తలు వీనులు చల్లఁగాను
జంటలై నీపై వలపు చల్లెనట చెలియ

చ. 1: వేడుకలు వెదచల్లి వీడెము పుక్కిటఁ బెట్టి
ఆడరానిమాట లాపె ఆడెనట
కోడెకాఁడవై నీవు కొండగొడగెత్తఁగాను
నీడనుండే చెమటలు నించెనట చెలియ

చ. 2: చిప్పిల నవ్వులు నవ్వి చేతులు బుజాల వేసి
చెప్పరానిసేఁత లాపె చేసెనట
గొప్పలుగా నీవు పిల్లఁగోవి రాగా లొత్తఁగాను
దెప్పరాన నలపెల్లా దేరేనట చెలియ

చ. 3: చాయలు సన్నలు చూసి చన్ను లురమున నాని
సేయరాని సేవ లాపె చేకొనెనట
యీయెడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
మోయరానిచోటు మోపి మొక్కెనట చెలియ

రేకు: 0902-5 ఆహిరి సం: 19-011

పల్లవి: ఎప్పుడు మన్నించేవయ్య్య ఇఁక నీవు
వుప్పతిల్లు వేడు కెల్లా వొడిగట్టుకొన్నది

చ. 1: జవ్వనమదముతోడ చన్నుల వేఁకముతోడ
నివ్వెరగుపడి చెలి నిలుచున్నది
నవ్వులు సెలవిఁగార నయము మోమున మీర
వువ్విళ్లూరుచు నీపై నొరగుకొనున్నది

చ. 2: సిగ్గులనే విఱ్ఱవీఁగి చిప్పిలఁగ మోవి మాఁగి
వొగ్గి విడె మందుకొని వూరకున్నది
నిగ్గుఁబులక లెసఁగ నిట్టూర్పులు వొసఁగ
కగ్గుదేర నేకతానఁ గాఁగిలించుకొన్నుది

చ. 3: పెనుఁ గొప్పు కడువీడ ప్రియాలు మాటలఁగూడ
గునియుచు నీతొడపైఁ గూచున్నది
యెనసితివి శ్రీ వెంకటేశ యీకెను మన్నించి
ననుపుల నిన్ను నిట్టె నమ్మివున్నది

రేకు: 0902-6 సాళంగం సం: 19-012

పల్లవి: ఏమయ్య యింతయేల యెకసక్కేలు
సాముసేసిననీతో సతి పెనఁగీనా

చ. 1: పలచనినగవులపగిడికాఁడవు
వెలలేనివేడుకల వేసదారివి
మలకలపలుకులమతకరివాఁడవు
కలికి నీకు నేఁడు కత చెప్పఁ గలదా

చ. 2: తిరుపు మురుపు నే నేదిమ్మరీఁడవు
పరుగు పెక్కువిద్యలబయకాఁడవు
అరుదై నజూదాల ఆగడీఁడవు
గరిమ నీకు నింతి కత చెప్ప గలదా

చ. 3: సంతకూటముల జాణకా డవు
మంతనపురతుల మాసటీఁడవు
చెంతఁ గలసితివి శ్రీ వేంకటేశ్వర
కాంత నీకు నిట్టె కత చెప్ప గలదా

రేకు: 0903-1 లలిత సం: 19-013

పల్లవి: కానీవే గొల్లెతా గబ్బిగొల్లెతా
ఆనుక తెలుసుకొంటి వవునవురా గొల్లఁడా

చ. 1: పంతకారిగొల్లెతా పదరకు గొల్లెతా
రంతుల నట్టేకానీరా గొల్లఁ డా
యింత గట్టు వాయవౌత యెరిఁగితినే నేను
సంతలోనె వింటిరా నీసాదుఁదనాలెల్లను

చ. 2: మతకారిగొల్లెతా మంకులాఁడిగొల్లెతా
రతులకు మా యింటికి రారా గొల్లఁడా
కతకారివౌత ఇట్టె కానవచ్చెనే నేఁడు
చతురతలు మోమున జడి సేరా నీకును

చ. 3: చనవరిగొల్లెతా చనవిమ్మా గొల్లెతా
కెలయకు శ్రీ వేంకటగిరిగొల్లఁడా
పొలఁతు లందరు నేఁడు పొగడేరే నిన్నును
కలపితి వౌర నిన్ను కమ్మటి మెచ్చితిని

రేకు: 0903-2 హిజ్జిజి సం: 19-014

పల్లవి: విన వేడుకయ్యీ మాకు వింతలై నమీసుద్దులు
యెనలేనిముచ్చటలు యెటువంటివో

చ. 1: యెంగిలిపెదవి వంచి ఇందాఁకా నీ చేతిలోన-
నంగవించి మాటలాడె నది యెవ్వతో
పొంగుచు నీ మేన నిట్టె పులకలు గడునిండె
సంగతి న వెటువంటిసంతోసములో

చ. 2: చెమటచన్నులు దాఁక చేలాగు నీకు నిచ్చి
అమర లోనికిఁ దెచ్చె నది యెవ్వతో
తమితోఁ గళలు రేఁగి తతి నివ్వెర గైతివి
సమమైన వెటువంటిసంగడిపొందులో

చ. 3: జవ్వనమదము గార సదమదముగ నిన్ను
అవ్వలఁ గాఁగిటఁ గూడె నది యెవ్వతో
ఇవ్వల శ్రీ వేంకటేశ ఇటు నన్ను నేలితివి
వువ్విళ్లూర నెటువంటి వుపాయములో

రేకు: 0903-3 వరాళి సం: 19-015

పల్లవి: ఏఁటికి సత్యాలు సేసే వెందాఁకా నీవు
గాఁటముగ నింకాఁ దారుకాణించవలెనా

చ. 1: చెలియిచ్చిన పువ్వులచెండు నీచేత నున్నది
మలసి నీచేఁత కది మచ్చము గాదా
కొలఁదిమీరఁగ తొల్లె గొల్లెతల మగఁడవు
యెలమి నీయెడ్డతనా లెంచిచూపవలెనా

చ. 2: రమణిచే ముద్దుటుంగరము నీవేల నున్నది
కొమరై నీపొందు కది గురుతుగాదా
తమితోడ నీవు తొల్లె ధర్మరాజు మఱఁదివి
గములై నీ నిజాలకు కడగురు తున్నదా

చ. 3: అంగనకంటసరి నేఁడట్టె మెడ నున్నది
సంగతిగా నీకదె లాంచనము గాదా
చెంగట నన్నేలితివి శ్రీ వేంకటేశ్వర
అంగపునీరతులకు నౌఁగాము లున్నవా

రేకు: 0903-4 శ్రీరాగం సం: 19-016

పల్లవి: అంతలోనె తేరెనా ఆకెమనసు
పొంతనుండి యింకానేమి బుజ్జగించేవయ్యా

చ. 1: సెలవి నవ్వులతోడ చెలియ మాటాడఁగాను
వెలయఁబూబంతిఁ గొని వేసితివి
నిలువుఁదురుము దాఁకె నిన్ను నాకె చూడఁగాను
చెలరేఁగి యేమిటికిఁ జెక్కు నొక్కేవయ్యా

చ. 2: కొసరుఁజూపులతోడ కోమలి నీకు మొక్కఁగా
పొసఁగఁ బన్నీరు దిగఁబోసితివి
వెసఁ బయ్యెద దడిసి వేడుక యానవెట్టఁగా
విసువక ఇప్పుడేమి విడెమిచ్చేవయ్యా

చ. 3: సిగ్గులచేఁతలతోడ చెలి కాఁగిలించుకోఁగా
వొగ్గి గందవొడి చల్లి వొనరితివి
నిగ్గులశ్రీవేంకటేశ నిన్ను నాకె మెచ్చఁగాను
అగ్గమై యప్పటి నెంత ఆస సేసేవయ్యా

రేకు: 0903-5 ముఖారి సం: 19-017

పల్లవి: నీవలెనుఁ గొసరఁగ నేరుతుమా
సేవలు చేసి నిన్నుఁ జేకొందుఁ గాక

చ. 1: వెలలేనివలపుల వేడుక కాఁడవు
చలమరిచేఁతలజాజరకాఁడవు
పలుకులఁ గరిగించేబయకారివాఁడవు
నిలువుఁ జక్కఁదనాల నీటుకాఁడవు

చ. 2: తచ్చనతరితీపులతగవరివాఁడవు
పచ్చలాయకట్టేలాబపువాఁడవు
లచ్చిగొండితనములలాగవేగకాఁడవు
విచ్చనవిడి తగులువిరికాఁడవు

చ. 3: చొప్పులెత్తి సోదించేసుంకరివాఁడవు
కుప్పళించి పొందు సే సేకోడెకాఁడవు
ఇప్పుడె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తొప్పఁదోగేరతులకు దొమ్మికాఁడవు

రేకు: 0903-6 శంకరాభరణం సం: 19-018

పల్లవి: అలివేణినిఁ బెండ్లాడవయా
చెలులవిన్నపము చేకొనవయ్యా

చ. 1: సొలపులఁ దొలితొలి చూచినచూపులు
కొలఁదిమీర నుంకువలాయ
చెలఁగి చేతులను సేసినన్నులు
తలఁపఁగ నలుగడఁ దలఁబాలయ

చ. 2: ననుపున సెలవుల నవ్వినవ్వులు
గొనకొనఁగఁ బాలకూళ్ళాయ
అనువుగఁ బ్రియమున నాడినమాటలు
మనసిజతంత్రపుమంత్రములాయ

చ. 3: వేడుకకాఁగిటివినయపు సేఁతలు
కూడినకూటపుగురులాయ
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి
తోడలమేల్మంగ దోమట్లాయ

రేకు: 0904-1 వేళావళి సం: 19-019

పల్లవి: ఏమిటికిఁ జలము యెందాఁకా
నాములతోడుత నగవే యిఁకను

చ. 1: బలము లేమిటికిఁ బచరించేవే
వలచినదానవు వనితవు
సొలయచు రమణుని సోదింతురటే
అలరి ఇచ్చకములాడుట గాక

చ. 2: తగవులఁ బెట్టఁగ తగునటవే యిఁక
మగనితోడ పలుమరు నిపుడు
అగడుసేతురా అతని నింతేసి
చిగురుమో వొసఁగి చెలఁగుటగాక

చ. 3: కూడినవేళను గుట్టుసేతురా
యీడనె శ్రీ వేంకటేశునెడ
ఆడకు వెంగెము లలమేల్మంగవు
వీడెము లంచుక వెలయుటగాక

రేకు: 0904-2 రామక్రియ సం: 19-020

పల్లవి: అవునయ్య్య నీసుద్దు లటువంటివి
జవళితో నంటుబచ్చలివంటివాఁడవు

చ. 1: చెలరేఁగి యేడలేని చేఁతలెల్లాఁజేసివచ్చి
వెలయ నిప్పుడు నన్ను వేఁడుకొనేవు
పలుమారు నీచేత బాసలుగొన వెరతు
కలువకంటులయెడ కాతరీఁడ వనుచు

చ. 2: వాడవారిపైనెల్లా వలపులు చల్లి వచ్చి
యీాడ నాతో నేడలేని యిచ్చలాడేవు
కోడెకాఁడ నీవోజ కొనియాడ సిబ్బితయ్యీా
జాడతో నింతులయెడ చంచలుఁడ వనుచు

చ. 3: పెక్కుగోపికలనెల్లా బెండ్లాడి యిట వచ్చి
గక్కన నాకాఁగిటఁగలసితివి
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నే నలమేల్మంగను
కక్కసించ నోప నీవు గబ్బివాఁడ వనుచు

రేకు: 0904-3 గౌళ సం: 19-021

పల్లవి: చెలులాల చూడరే చెలువునిబాగులెల్లా
నిలువుఁజక్కఁదనాల నిలుచున్నాఁడీడను

చ. 1: ఇయ్యఁగదే విడెము యిందాఁకా నేడ నుండెనే
నెయ్యపు రమణుఁడంటా నే నుంటిని
పయ్య దంటవచ్చీని పలుమారు నన్నుఁ జూచి
కొయ్యతనాలు నేరిచె గొంకఁడేమిటికిని

చ. 2: అడుగవే సుద్దులు ఆడ నుండి తా వచ్చె
నడుమఁ దనప్రియాలు నమ్మితిని
వొడివట్టి పెనఁగీని వొనరి సంతోసాన
గడుసాయఁ జేఁతలను కరఁగఁ డెంతయినా

చ. 3: మొక్కవే నామారు ముంచి నన్నిటు గూడె
యిక్కడ శ్రీ వేంకటేశు కిరవైతిని
అక్కరతో మన్నించీని అలమేలుమంగ నేను
తక్కక రతుల మించీ దంట తనమునను

రేకు: 0904-4 దేసాళం సం: 19-022

పల్లవి: ఇందరు నెఱిఁగినవే యీసుద్దులు
యెందాఁకా వట్టిమాయ లేమిసేసే నిపుడు

చ. 1: తప్పులుదారులు నన్ని తానె తేరీఁగాని
చెప్పరాదా నీమాట చేరి వినేను
అప్పట నుండియు నీవు ఆఇత్తపడే విట్టె
నెప్పున నీనిజములు నెరుపేవు సారెకు

చ. 2: తీపులుఁగారాలు నిటెప తేటతెల్లవయ్యీఁగాని
చూపరాదా నీమోవి చూచే నేను
పైపై నే మల సేవు పంతగారితనమున
వోపికఁజెలుల నేమి నొడఁబరచేవు

చ. 3: పాడియునుఁ బంతమును బాయిటఁబడీఁ గాని
కూడరాదా నీవు నన్నుఁగోరి మెచ్చేను
వేడుక నేలితివి శ్రీ వేంకటేశ ఇంతలోనే
యీడ నే నలమేల్మంగను ఇంపు నాకుఁ జేసేవు

రేకు: 0904-5 పాడి సం: 19-023

పల్లవి: బొంకనితప్పనియట్టి పురుషుఁడవు
మంకుదీర నీ వెట్లా మాటలాడేవయ్యా

చ. 1: చనవుచేసుక ఇంత సారె సొలయఁగా
ననుపుచేసుక నీవు నవ్వఁగాను
మొనసి సవతులెల్లా మోములు చూచుకొనేరు
పొనుగక వారినెట్టు బుజ్జగించేవయ్యా

చ. 2: ప్రియము గూరిచి యాపె బెట్టియాన వెట్టఁగాను
క్రియగూడ నీవు నట్టె కెలయఁగాను
కయిపుగాఁ దోడివారు కనుసన్నలఁ జూపేరు
నయమున వారి నెట్టు నమ్మించేవయ్యా

చ. 3: మక్కువ నిన్నలమేలుమంగ గాఁగిలించఁగాను
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నీవు మెచ్చఁగా
తక్కిన సతులెల్లా నాసగించేరు
అక్కరతో వారినెట్టు ఆదరించేవయ్యా

రేకు: 0904-6 మధ్యమావతి సం: 19-024

పల్లవి: ఎటువంటివలపో యెవ్వరికొలఁదిగాదు
ఘటనతోఁ దమకించీఁ గనుఁగొనవయ్యా

చ. 1: తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొని యింతి
తలపోసీ నీరూపు తనలోననె
నిలువుఁ జెమటతోడ నిట్టూరుపులతోడ
చెలరేఁగి గుబ్బతిలీఁ జిత్తగించవయ్యా

చ. 2: కోరి నీవై నాసపడి గొబ్బునను సిగ్గువడి
పేరఁబెట్టి మాటలాడీఁ బెదవులనె
సారపుతురుముతోడ జవ్వనభారముతోడ
ఆరీతి నివ్వెరగందీ నాదరించవయ్యా

చ. 3: కాఁగిటికిఁ జెయ్యి చాఁచి కన్నులనే నీకు మొక్కి
మాఁగినమోవి యిచ్చీ మతకాననె
చేఁగదేర నిన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడ
వీఁగ దలమేలుమంగ వినోదించవయ్యా

రేకు: 0905-1 భల్లాటి సం: 19-025

పల్లవి: ఏమిటికి మాముందర యెమ్మె లెల్లాఁ జూపేవు
నేమూ నీవలె మేలు నెరపఁగఁగలమే

చ. 1: చక్కనిదాన వౌదువే సణఁగులాఁడి వౌదువే
నిక్కి విభునిఁ గొసర నేరుతువే
దక్కీనే నీ పంతములు తరుణులలోనెల్లా
మక్కువ నాతని నింత మరిగించుకొంటివి

చ. 2: జవ్వని వౌదువే మంచి జాణకతై వౌదువే
రవ్వసేసి భ్రమయించ రాజవే నీవు
నవ్వు లీడేరెనే నీకు నడుమ నిందరులోన
బువ్వాన నీతని నింత పొందుసేసుకొంటివి

చ. 3: మేటి వౌదువే అలమేలుమంగ వౌదువే
పాటించి శ్రీ వేంకటేశుఁ బనిగొంటివి
మాటలు చెల్లె నీకు మావంటివారిలోనెల్లా
చాటున మమ్మేలితని చనవు గై కొంటివి

రేకు: 0905-2 పాడి సం: 19-026

పల్లవి: ఎంతైె నా నాతఁడు నీకు నెక్కుడుగాదా
కాంతుఁడు మన్నించఁగానే ఘనురాల వైతివి

చ. 1: వెక్కసములాడకువే విభునితో సారె సారె
మిక్కిలి నాతఁడు నీకు మేలువాఁడు
జక్కవపిట్టలవంటి చన్నులు విసికెనంటా
వుక్కవంటి గోరనేల వూఁదేవే నీవు

చ. 2: ఆరితేరి యెంచకువే అండనుండి ఇంతలోనె
చేరి నీకు బ్రియములు చెప్పీ నాతఁడు
తోరపు మొయిలువంటితురు మూతఁ డంటెనంటా
భీరానఁ జేతులు చాఁచి పెనఁగుదురటమే

చ. 3: నీ వలమేలుమంగవు నిందలు వేయకువే
శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జెందినవాఁడు
ఆవటించి నిన్నుఁగూడి యట్టె చెక్కంటెనంటా
కావరించి నీ వప్పటి ఘాతనేయఁదగునా

రేకు: 0905-3 శుద్ధవసంతం సం: 19-027

పల్లవి: సూటిగా నన్నేమి చూచేవు
నీటుతోడ నన్నీ నేరుపవయ్యా

చ. 1: నవ్వుతా నిన్ను నాయము లడిగీ-
నెవ్వతో ఆనతి యియ్యవయ్యా
జవ్వని యప్పటి సరిబేసులాడీ
పువ్విళ్లూరఁ బందే లోగి వేయవయ్యా

చ. 2: మచ్చికతోడుత మనవి చెప్పీ
విచ్చనవిడిని వినవయ్యా
వచ్చి యాపె నీతో వసంతమాడీ
పచ్చివలపులు పైఁ జల్లవయ్యా

చ. 3: పలుమరు నీపైఁ బాటలు వాడీ
మెలుపున నిట్టె మెచ్చవయ్యా
అలమేలుమంగనైన నన్నేలితి-
వెలమి శ్రీ వేంకటేశ నేఁడయ్యా

రేకు: 0905-4 దేవగాంధారి సం: 19-028

పల్లవి: మిక్కిలి మేలుది అలమేలుమంగ
అక్కరతో నిన్నుఁజూచీ నలమేలుమంగ

చ. 1: కొచ్చి కొచ్చి యాశాపించి కూరిమితోఁ బాడఁగాను
మెచ్చీ నిన్ను నిదె యలమేలుమంగ
నెచ్చెలులతోడనెల్లా నీగుణాలు సారెసారె
అచ్చలాన నాడుకొనీ వలమేలుమంగ

చ. 2: వాడలవాడల నీవు వయ్యాళిఁ దోలఁగాను
మేడలెక్కిచూచీ నలమేలుమంగ
వీడెము చేతఁబట్టుక వెస నీవు పిలువఁగా
ఆడనుండి వచ్చె నీడ కలమేలుమంగ

చ. 3: యీలీల శ్రీ వేంకటేశ ఇంతచన వియ్యఁగాను
మేలములాడీ నల మేలుమంగ
యేలిననీరతులను ఇదె తననేరు పెల్లా
ఆలోచనలు నేసీ నల మేలుమంగా

రేకు: 0905-5 శ్రీరాగం సం: 19-029

పల్లవి: ఎట్టు దరించఁగవచ్చు నిల్లాండ్లకు నూరిలోన
చుట్టమవై సిగ్గులెల్లా చూరలాడేవు

చ. 1: మాయదారిమాట లాడి మనసులు మరిగించి
పాయపుగొల్లెతలను భ్రమయించేవు
చాయలుసన్నలుఁ జేసి చవులుగా మోవిచూపి
ఆయములు గరగించి ఆసరేఁచేవు

చ. 2: సెలవుల నవ్వునవ్వి చిట్టంటుచేఁతలు నేసి
కలికిజవరాండ్లఁ గాఁకరేఁచేవు
ప్రియముల నవ్వునవ్వి పెంపుగఁ గాఁకలముంచి
నయగారితనమున నమ్మించేవు

చ. 3: కన్నులఁ దప్పక చూచి కాఁగిటను బిగియించి
కన్నెలనుఁ జొక్కించి కైకొనేవు
అన్నిటా శ్రీవేంకటేశ ఆలమేలుమంగను నేను
మన్నించి నన్ను నేలి మంతనమాడేవు

రేకు: 0905-6 రామక్రియ సం: 19-030

పల్లవి: వట్టిబాఁతిపడి నీపై వలపులు చల్లేముగాక
యిట్టయితే మరియిఁక నేమిచెప్పేదయ్యా

చ. 1: కాంతను నాయెదుటనె కాఁగిలించుకొంటివి
పంతములాడఁగ నీకఁ బనియేది
వింతలుగా సిగ్గులెల్లా విడిచినమీఁదట
యెంతకొసరినా నందు నేమిగలదయ్యా

చ. 2: నాపద్దనుండి యాకెతో నవ్వులు నవ్వితివి
భావించి చూచిన నీకఁ బనియేది
వేవేలకు మతిలోనివెరపు దీరినమీఁద
చేవమీరినసుద్దులు చెప్పఁ జోటేదయ్యా

చ. 3: చలివాసి యాకెతోనే సరసములాడితివి
పలుమారుఁ బచ్చిసేయఁ బనియేది
ఆల మేల్మంగనైన న న్నట్టె యేలితివి
యెలమి శ్రీ వేంకటేశ యెట్టు మెచ్చేదయ్యా

రేకు: 0906-1 మనోహరి సం: 19-031

పల్లవి: ఆల మేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి
చలములేఁటికి నిఁక సమ్మతించవే

చ. 1: విడియము చేతికిచ్చి విభుఁడు వేడుకపడి
వొడివట్టి పెనఁగగా నొద్దనకువే
వుడివోని వేడుకతో నుంగరము చేతికిచ్చి
యెడయక వేఁడుకొనఁగా నియ్యకొనవే

చ. 2: చిప్పిలువలపుతోడ చెక్కులు నొక్కుచు మోవిఁ-
గప్పుర మందియ్యఁగాను కాదనకువే
కొప్పు దువ్వి బుజ్జగించి కొసరి మాటలాడి
అప్పసము నవ్వఁగాను అట్టె కానిమ్మనవే

చ. 3: యిచ్చగించి శ్రీ వేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడి
మచ్చికఁ గాఁగిలించఁగాను మారాడకువే
పచ్చడము మీఁదఁ గప్పి పట్టపుదేవులఁ జేసి
నిచ్చలాన నేలుకొనె నీవూఁ గైకొనవే

రేకు: 0906-2 కురంజి సం: 19-032

పల్లవి: ఇంత ఆకాకు గలదు యేమోయి చెలులను
చెంతల మందెమేళాలు సేసుకొంటి విట్లా

చ. 1: యేకతాన నీవు నాకు నిట్టె కతలు చెప్పఁగా
దాకొని సతులెల్లాను తామూ వినేరు
జోకతో నీవు విడేలు సొరిది నా కందియ్యఁగా
చేకొని తామూ నట్టె చేతులు చాఁచేరు

చ. 2: సరసమాడుచు నా చన్నులు నీవంటఁగాను
సొరిదిఁ దమచన్నులు చూపేరు నీకు
తెరలో నాకు నీ మోవితేనె విందు వెట్టఁగాను
గరిమఁ దామును నట్టె కడునోరూరేరు

చ. 3: పలుమారు నీవు నాకుఁ బచ్చడము గప్పఁగాను
కలికికాంతలు తమ్మూఁ గప్పుమనేరు
ఆల మేల్మంగనై న న్నట్టె నీవు కూడి తేను
నెలవై శ్రీ వేంకటేశ నిన్నుఁ దామూ కూడేరు

రేకు: 0906-3 దేసాళం సం: 19-033

పల్లవి: కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు
కొలఁదిమీరకువయ్య గోవిందరాజా

చ. 1: పాదములొ త్తేయట్టి పడఁతికి నిదివొ
ఆదిగొని చెమరించె నంగమెల్లాను
కాదనక పచ్చడము గప్పి మఱఁగుననె
పోదితో నాపెఁ దనివిబొందిఁచవయ్యా

చ. 2: సరుసఁ గూచుండినట్టికియకు నిదివొ
సిరులుగాఁ బులుకించె చెక్కులెల్లాను
తెరవేసుకొని సిగ్గుదేరిచి గుట్టుననె
గరిమతో లోలోనె కాఁగిలించవయ్యా

చ. 3: శ్రీసతికి భూసతికిఁ జేరి కూడఁగ నిదివొ
రాసి నిట్టూర్పులు మిఁచె రతులలోనా
ఆసతోడుత శ్రీ వేంకటాద్రి గోవిందరాజ
లేసుగా నిద్దరిని లాలించఁగదవయ్యా

రేకు: 0906-4 వరాళి సం: 19-034

పల్లవి: ఎంతలేదు నీయాసోద మేమిచెప్పేది
బంతినుండి రతులకే బాఁతిపడేవు

చ. 1: చెలులై తేఁజాలు నట్టె చేరి యెంతవడియైనా
మలసి మలసి నీవు మాటలడేవు
కొలఁదిమీరినయట్టి కుచములు గంటేఁజాలు
యెలమి నూరకయైనా యేఁకారేవు

చ. 2: తప్పకఁ జూచితేఁజాలు తనియక మీఁద మీఁద
వుప్పతిలుఁదమకాన నోలలాడేవు
చిప్పిల నవ్వితేఁజాలు చెంతల నట్టె భ్రమసి
వొప్పగు మోవితేనెకు నొగి నోరూరేవు

చ. 3: కాఁగిలించుకొంటేఁజాలు కడు సంతోసముతోడ
చేఁగదేరి వలపులు చిమ్మిరేఁగేవు
వీఁగక శ్రీవేంకటేశ వెస నన్నుఁ గూడితివి
పొఁగినతరితీపులఁ బచ్చిదేరేవు

రేకు: 0906-5 ముఖారి సం: 19-035

పల్లవి: ఏమే విభునినేల యెలయించేనే నీ
మోమున సింగారాలు మొలచున్నవి

చ. 1: సెలవుల నొకమాటు చేరి నీవు నవ్వితేనే
వెలలేని మహిమల వెన్నెల గాయు
తళుకున నీవటు తప్పక చూచితేనే
నిలువెల్లాఁ జీఁకటుల నిగ్గుదేరును

చ. 2: మురిపేన వాతెరమోవి నీవు చూపితేనే
సొరిదినే పగడాలసోంపు నిండును
మరుగుచు నీవిట్టె మాటలు సారె నాడితే
యిరవై కప్రపుపల్కులిటు నిండును

చ. 3: సందడి నీపయ్యదలో చన్నులు చూపితేనే
కుందణంపువన్నెలెల్లా గుదిగొనును
కందువ శ్రీవేంకటేశుఁ గాఁగిట నీవు గూడితే
యెందు నలమేల్మంగ నీయిరవు గాన్పించును

రేకు: 0906-6 సింధురామక్రియ సం: 19-036

పల్లవి: ఎంతవేడుక కాఁడవు ఇన్నిటా నీవు
సంతసించేవు మోహము చల్లినంతనె

చ. 1: వన్నెవచ్చె మేనికిని వాడుదేరె మోమెల్ల
కన్నులను నాపె నీవు గాంచినంతనె
చెన్నుమీర సంతోసాన చెక్కులెల్లాఁబులకించె
పన్నుగా నాకెమాటలు విన్నంతనె

చ. 2: ఆసపుట్టె మనసుకు అరిమురిఁ జెమరించె
సేసవెట్టి యాపె నిన్నుఁ జేరినంతనె
వాసిమీర పైపైనే వలపులు గడుమించె
చేసన్నలు నీయెడకుఁ జేసినంతనె

చ. 3: నిట్టూరుపులు రేఁగె నిండుఁదమకము నిండె
గుట్టుతోడ నీవు రతిఁ గూడినంతనె
అట్టె శ్రీవేంకటేశ ఆనందము గడునుబ్బె
చుట్టి ఆ కెఆయములు సోఁకినంతనె

రేకు: 0907-1 ఆహిరి సం: 19-037

పల్లవి: ఎడసి కూడినపొందు ఇంపులాయను
తడవి మీభావములు తలపోనేమయ్యా

చ. 1: చెక్కునఁ బెట్టినచెయ్యి సెలవిఁ బారేటినవ్వు
వొక్కమాటే చెలియకు నొనగూడెను
నిక్కపువోరమణుఁడ నీమహిమలే ఇవి
మిక్కిలి మాలో నేమే మెచ్చుకొనేమయ్యా

చ. 2: మేర మీరు నిట్టూర్పులు మితిమీరు తమకము
యీరెండు నింతికి నిట్టె ఇరవాయను
ఆరయ వోరమణుడ అమరించితివి రీతి
యేరుపరచి మీసుద్దు లెంచుకొనేమయ్యా

చ. 3: పయ్యదలెడజారును పచ్చిదేరేరతిచొక్కు
నెయ్యపుఁ గామిని కిట్టె నెలవాయను
యియ్యెడ శ్రీవేంకటేశ యెనసితి వింతలోనె
చయ్యన మిమ్ముఁ బొగడి సంతోసించేమయ్యా

రేకు: 0907-2 బౌళి సం: 19-038

పల్లవి: చెక్కునొక్కి ఇచ్చకము సేతురుగాక
వెక్కసపుఁ సేతలను వింత సేతురా

చ. 1: వలచిన రమణుండు వాడికెకు నీమీద
కలువల వేసితేను కాతాళింతురా
తలుపుదెరచి నీదండ గూచుండినవాని
చలపట్టి బొమ్మలను జంకింతురా

చ. 2: పొందైనమగవాడు బుజముపైఁ జెయివేసి
కందువ లంటితేనే కాదందురా
విందులవోవి చూపి విడెమడిగేటివాని
మందెమేళములాడుచు మారుకొందురా

చ. 3: శ్రీవేంకటేశుఁడు చేరి నిన్ను గాఁగిలించి
ఆవటించి కూడితేనే అలయుదురా
దేవులవంటా నిన్నుఁ దెగడి నవ్వించేవాని
కావరపుఁజూపు చూచి కాతరింతురా

రేకు: 0907-3 లలిత సం: 19-039

పల్లవి: చిత్తగించవోయి నీవు శిరసువంచుకొనక
బిత్తరాన నీకె నీపై ప్రియము చల్లీని

చ. 1: పలుచనిసిగ్గుతోడ బాసికము గట్టుకొని
చెలరేఁగి సతి నీపై సేసచల్లీని
చెలులమాటుననుండి చిప్పిలుఁదమకమున
తళుకుఁజూపుల నిన్ను తప్పక చూచీని

చ. 2: చెంది మురిపెముతోడ సింగారించుకొని
కందువ లంటుచు నీకాలుదొక్కీని
సందడివేళలందు జాణతనాలాడి నీకు
ముందుముందుగాఁదాను మోవి చూపీని

చ. 3: గాటఁపుటాసలతోడి కంకణము నీకుఁగట్టి
పీఁటమీఁదఁగూచుండి పెండ్లాడీని
యీటున శ్రీవేంకటేశ యిటు నన్ను గూడితివి
మేటియై యిందుకు నాపె మెచ్చు మెచ్చీని

రేకు: 0907-4 అమరసింధు సం: 19-040

పల్లవి: ఉచిత మెఱఁగవద్దా వువిదలకు
రచనల నీసరి రారా యెవ్వరును

చ. 1: యింతులెల్లా నిలుచుండి యిట్టెకొలువు సేయఁగ
మంతనములాడేవు మగనితోను
జంతవై నీవొకతెవే జట్టిగొంటివా యేమి
వంతువరుసలు మరివలదా యెవ్వరికి

చ. 2: సవతు లిందరును మీసరుసనే వుండఁగాను
పవళించే వీతనిపానుపుమీఁద
కవగూఁడగా నీకే కాణాచాయనా యేమి
తవిలి నీసాటికి రాఁదగదా యెవ్వరికి

చ. 3: తోడివా రెల్లా నట్టెవూడిగాలు సేయఁగాను
వేడుకఁ గూడితివి శ్రీ వేంకటేశుని
కూడిమాడి నీవే రతిఁ గొల్ల గొంటివా యేమి
వోడక నీవంటియాస వుండదా యెవ్వరికి

రేకు: 0907-5 సౌరాష్ట్రం సం: 19-041

పల్లవి: చూడవయ్యా నీసేఁతలు సూటిపడేను
ఆడరాదు నీతో మారు అవుఁగాదనుచును

చ. 1: సరసములాడితివి చనవు లొసఁగితివి
తరుణితోడ నీవు తమకానను
యిరవై యీపె నోఁడు యేమిభాగ్యము సేసెనో
సిరులవలపులెల్లా చెక్కుల నిండెను

చ. 2: సేవ సేయించుకొంటివి సిగ్గులు దేరిచితివి
భావించి వనిత నింత పనిగొంటివి
పావనమె తనజన్మఫల మదియెట్టిదో
చేవ దేరినవలపు మోవిమీఁద నున్నది

చ. 3: గక్కనఁ బెండ్లాడితివి కాఁగిటఁ గూడితివి
మిక్కిలివేడుక నలమేలుమంగను
యిక్కవ శ్రీ వేంకటేశ యెటువంటితగులమో
చక్కనివలపులెల్లా చన్నులపై నున్నవి

రేకు: 0907-6 సాళంగనాట సం: 19-042

పల్లవి: ఇదివో మావిన్నపము యిట్టె చిత్తగించవయ్య
సుదతిపున్న జాడలు చూతువు రావయ్యా

చ. 1: యిప్పుడే వచ్చేవని యింటవాకిటను చెలి
కప్పురపుటారతెత్తఁ గాచుకున్నది
దప్పిదేర నీకునేలఁ తట్టిలోన బాగాలు
కుప్పలుగా మీఁదెత్తు కొని వున్నది

చ. 2: ఆరగించవచ్చేవని అన్నిదెరఁగులనెల్లా
చేరి విందాయితముగాఁ జేసుకున్నది
గారవానఁ బాదాలుగడిగేనంటాఁ బన్నీరు
ఆరీతిఁ బైఁడిబిందెల నమరించకున్నది

చ. 3: పవళించవచ్చేవని పట్టెమంచముమీఁదట
వివరించి పూఁబరపు వేసుకున్నది
నివిరి శ్రీ వేంకటేశ నీవు విచ్చేసి కూడఁగ
తవిలి యలమేల్మంగ తనివితో నున్నది

రేకు: 0908-1 శుద్ధదేశి సం: 19-043

పల్లవి: ఇప్పటికిఁ జనవరి యింతి నీకు
కొప్పుదువ్వి నన్ను నేల కొంగువట్టేవిపుడు

చ. 1: మలసి నీవు నాతో మాటలాడితివంటాను
సొలసీ నాపె నిన్నుఁ జుట్టి చుట్టి
కలికి యన్నిటా కడుఁగతలెల్ల నేరుచును
వెలలేని యాపెమాటే వినవయ్యా నీవు

చ. 2: ననుపున నాతో నవ్వులు నవ్వితివంటా
గునిసీ నాపె నిన్నుఁగొచ్చి కొచ్చి
చనవరివినోదాల సరసురా లన్నిటాను
వొనర నాపెతో నవ్వి వుండవయ్యా నీవు

చ. 3: గక్కన నన్ను నీవు కాఁగిటఁ గూడితివంటా
కక్కసించీ నాపె నిన్నుఁ గమ్మి కమ్మి
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నేనలమేలుమంగను
లెక్కతోనే యాపెఁ గాగిలించవయ్యా నీవు

రేకు: 0908-2 తెలుఁగుఁగాంబోది సం: 19-044

పల్లవి: నీవే యెరుఁగుదువు నానెయ్యము వోరమణి
భావములోపల నుండి భ్రమయించనేఁటికి

చ. 1: చూపుటమ్ము బొమ్మవింట జోడై నిలిచెఁగాన
చేపట్టి మర్మ వేదనఁ జేయుఁగాక
కోపులమంచితనపుఁగుచమండలము నేఁడు
యేపున బ్రాణాలతోడ యేలాట మెట్లాడీనే

చ. 2: తొడఁగి మబ్బుగవిసి దొడ్డకుటిలపుఁగొప్పు
కడుఁగామాంధకారముఁ గప్పుఁగాక
నడుమ మోముఁజందుద్రు నవ్వువెన్నెల గాయుచు
చిడుముడి నామదినిఁ జీఁక టేల సేసీనే

చ. 3: పచ్చిదొండపండు వంటిబాగుల రాగపు మోవి
రిచ్చవడ మోహము రేఁచుఁగాక
ఇచ్చకపు శ్రీ వేంకటేశుఁడ రమ్మని నన్ను
ఇచ్చఁగూడితివి రతి నిండాఁకా నెట్లుండెనే

రేకు: 0908-3 పాడి సం: 19-045

పల్లవి: తరుణులతోడనా నీతరితీపులు
తొరలింపుఁగూరిముల దొరపాటివాఁడవు

చ. 1: వలచినసతితోను వాసికిఁ బెనఁగుదురా
పలుకులు నేరిచిన పంతగాఁడవు
బలిమిఁ జెనకఁగాను పరాకు సేయుదురా
నెలకొన్న జవ్వనపునెరవాదివాఁడవు

చ. 2: ఆసగించివున్న యింతి నారఁడిఁ బెట్టుదురా
సేసవెట్టి పెండ్లాడిన చెలువుఁడవు
నీసరిఁ గూచుండఁగాను నీటులు చూపుదురా
వేసటలేనిరతుల వేడుకకాఁడవు

చ. 3: అలమేలుమంగఁ గూడి అలయించి నవ్వుదురా
తెలివి శ్రీ వేంకటాద్రి దేవుఁడవు
కలసి మొక్కఁగా మోవికడుపిప్పి సేతురా
తలపోఁత లెటిఁగిన దయగలవాఁడవు

రేకు: 0908-4 పంతవరాళి సం: 19-046

పల్లవి: ననుఁ జూడవే ఇఁకను నాసొమ్ము చేకొనేను
ఘనుఁ డీతనిచెయ్యి నేం గైదండ చేకొంటిని

చ. 1: చనవరిదానవు చలమరిదానవు
యెనలే కాతనిఁ గూడ కేల మానేవే
మనసునమ్మినయట్టిమాటపట్టు వుచ్చుకొంటి-
వినుమడించె వలపు లిట్టుండవలదా

చ. 2: ఇతవరిదానవు ఇయ్యకొన్న దానవు
రతుల నింటికి నేల రాకుండేవే
సతముగా నన్నిటా సమ్మతి చేసుకొంటివి
బలుకు నీవలె నిట్టె పచరించవలదా

చ. 3: పాయరానదానవు పంతగారిదానవు
చాయల నేపొన్దునేల జంటవాసేవే
రేయి వచ్చి శ్రీ వేంకటాద్రిగోవిందుఁడే నన్నేలె
యీయెడ నవ్వునవ్వితి వింత మెచ్చవలదా

రేకు: 0908-5 సాళంగం సం: 19-047

పల్లవి: వలుపేల దాఁచేవే వనిత నీవు
తిలకించి యెంతతరితీపు సేసేవే

చ. 1: పలుమారు నాతఁడు బాఁతిపడి పిలువఁగా
వోలసీనొల్లమి నేల వూఁకొనేవే
బలిమి నాతఁడు నీకు పచ్చడము గప్పఁగాను
అలరి వొయ్యారాన నట్టె లోనయ్యేవే

చ. 2: చిమ్మిరేఁగి యాతఁడు చేసన్న సేయఁగాను
వుమ్మడిజాగుతోనేల వొద్దికయ్యేవే
నెమ్మితోడ నాతఁడు నీకు విడెమియ్యఁగాను
చిమ్ముల మెల్లనే యొట్టు చేయిచాఁచేవే

చ. 3: అట్టె శ్రీ వేంకటేశుఁడు అంకెఁ గాఁగిలించుకోఁగా
గుట్టునఁగరఁగి యెంత గుబ్బతిల్లేవే
యిట్టె యాతఁడు నిన్ను నేలి నేఁడు మన్నించఁగా
దిట్టవై యలసి యేమి తేలించి చూచేవే

రేకు: 0908-6 హిందోళవసంతం సం: 19-048

పల్లవి: మాకేల విన్నవించ మాపుదాఁకా నీతోను
దాకొని నీవే దయఁదలఁచేవుగాని

చ. 1: హత్తి రమణి విలిచీ నాడకు విచ్చేయరాదా
చిత్తము వచ్చినట్లాఁజేసేవుగాని
మొత్తమి నిపుడే నీవు మొగము చూడఁగరాదా
యిత్తల నన్నియు నీవే యెంచిఁగేవు గాని

చ. 2: మనసిచ్చి యేకతాన మాటలాడి చూడరాదా
పనివడి నీవే నిజపట్టేవుగాని
చెనకుచుఁ బానుపుపైఁజేరి కూచుండఁగరాదా
ననిచి మానిజమెల్లా నమ్మేవుగాని

చ. 3: కక్కసమేఁటికి యాకెఁ గాఁగిలించి కూడరాదా
మిక్కిలి శ్రీ వేంకటేశ మెచ్చేవుగాని
యిక్కువ నిప్పట్టిపొందు యిట్టె యీడేరించరాదా
మక్కువలు నేసి నీవే మరిగేవు గాని

రేకు: 0909-1 నాగగాంధారి సం: 19-049

పల్లవి: ఇంకా నేమనేవయ్యా యెదుట నుందాన నేను
కుంకుమ నీకుఁ బూయనా గురుతుగా నేను

చ. 1: సన్నలు నీవు సేయఁగా సమ్మతించి కాదనక
విన్నపము సేయనా వేడుకతోడ
వెన్నెలబాయిటఁజేయివేయఁగా నప్పటి నీకు
కన్నుల నే మొక్కనా కడుఁదమకమున

చ. 2: నాయెడకు జెడలేని నవ్వులెల్లా నవ్వఁగాను
ఆయములు సోఁక నిన్ను నాడనా నేను
దాయక పాయకనీవు దండ నిట్టెకూచుండఁగా
సేయనా వూడిగములు చెప్పినట్టెల్లాను

చ. 3: పంతమున కాఁగిటను బలిమి నీవు గూడఁగా
మంతనాన మెచ్చునా మచ్చికతోడ
చెంతనే మన్నించితివి శ్రీవేంకటేశ నన్ను
సంతోసించనా నీసరసములకును

రేకు: 0909-2 మాళవి సం: 19-050

పల్లవి: వేగిరకాఁడవు నీవు వెసలఁ బెట్టుమనేవు
ఆగడము సేసి యేల అలయించేవు

చ. 1: చలము సాదించరాదు జంకించి చూడఁగరాదు
యెలమి నింతలో నేరా యెగ్గుపట్టేవు
బలిమి చూపఁగరాదు పంతములాడఁగరాదు
తిలకించి యేమిరా తిట్టు దిట్టేవు

చ. 2: బెట్టి మాటాడఁగరాదు బిగువు చూపఁగరాదు
అట్టు అదేరా ఇట్టె యేఁచేవు
గుట్టున నుండఁగరాదు కొసరి నవ్వఁగరాదు
వుట్టిపడి నీవేరా వుప్పతించేవు

చ. 3: కదిసి పెనగరాదు కాగిలించుకొనరాదు
వుదుటున నౌరారా వొడివట్టేవు
ఇదివో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొదిగి యేమిటికిరా బుజ్జగించేవు

రేకు: 0909-3 సామంతం సం: 19-051

పల్లవి: మేలు మేలు నీ గుణము మెచ్చితి నేను
నీలీల లోకమెల్లా నిండెగా నేడు

చ. 1: వలపుగలుగువారు వద్దనే వుందురుగాక
తిలకించి వాడలకు దిరుగుదురా
తెలిపి చెప్పగనేల తేటతెల్లమిగ నాపె-
కలువదండ నీ మెడఁ గంటిగా నే నిపుడు

చ. 2: ననుపుగలుగువారు నవ్వుతానుందురుగాక
తనివో కెవ్వితెనై నాఁ దలపోతురా
వెనుకటి సుద్దులేల వేడుకతో నాపెచేతి-
కొనవేలివుంగరము గురుతాయఁగా

చ. 3: కైవసమైనవారు కాఁగిట నుందురుగాక
ఆవలివారితో మేలాలాడుదురా
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి యిట్టెకూడితివి
నీవే నన్ను మన్నించుట నిజమాయఁగా

రేకు: 0909-4 కేదారగౌళ సం: 19-052

పల్లవి: ఇద్దరి గూర్చఁగదవె యింతిరో నీవు
సుద్దులు చెప్పినంటే చోటెంతైనాఁ గలదు

చ. 1: పడఁతి కడకు నిట్టె పతిఁ దోడుకెనిరావె
యెడమాట లాడఁబోతే యెన్నిలేవు
వెడవెడ మాని యట్టె విడెము చేతి కియ్యవే
ఆదరి యాతని ప్రియా లవెన్నై నాఁ గలవు

చ. 2: మిగులా నిద్దరిఁ బాన్పుమీఁదఁ గూచుండఁ బెట్టవే
తగవుల బెట్టేమంటే తనివిలేదు
బగి వాయకుండా నట్టె పచ్చడము గప్పవే
పగటు లాతనివి చెప్పఁగఁ గొత్త లిపుడు

చ. 3: శ్రీవేంకటేశ్వరుచేత నేసలు వెట్టించవే
వావులు దెలుపఁగాను వయిపాయను
దేవులకు దేవునికి తెరవేయఁగదవే
చేవదేరేమోహము చెప్పనరు దిఁకను

రేకు: 0909-5 గుండక్రియ సం: 19-053

పల్లవి: దేవరవు గావా యీతెఱఁగులకు
చేవదేరె నిఁక రట్టు .సేయఁగవలెనా

చ. 1: అటిముటి నూడిగాలు ఆపెచేత జేయించేవు
యెఱఁగనా నీజాడ లెప్పుడు నేను
మఱి నీవు దొరవౌదు మనసున మెచ్చితివి
గుఱుతులు నాకిన్నిటాఁ గొచ్చి చూపవలెనా

చ. 2: కానుకగా నాపెసొమ్ము గక్కన నాకిచ్చేవు
కాననా నీ సేఁతలు కలకాలము
పూని నిజమరి వౌదు పొంచి నిన్ను నమ్మితిమి
తానకమై ఆ సుద్దులె తలపెట్టవలెనా

చ. 3: అలమి నన్నుఁ గూడి ఆపెపేరఁ బిలిచేవు
తెలియనా నీగుట్టు తెల్లమిగాను
యిల జాణఁడ వౌదువు యిన్నిటాఁ దనిసితిమి
యెలమి శ్రీవేంకటేశ యెచ్చరించవలెనా

రేకు: 0909-6 సింధురామక్రియ సం: 19-054

పల్లవి: తొల్లె ఇన్నిటా నీవు దొడ్డవాఁడవు
చెల్లఁబెట్టి యిందరితోఁ జెప్పఁగ నేమిటికి

చ. 1: పలుకులఁ గరఁగించి భావములఁ జొక్కించి
నెలఁతల వలపించనేరవా నీవు
వెలయు గొల్లెతలెల్లా వెన్నతోఁ బెట్టిరి నీకు
పొలసి నీ మహిమలు పొగడ నేమిటికి

చ. 2: ననుపులు గడుఁజేసి నయములట్టె చూపి
వొనరఁ బెండ్లిండ్లాడ నోపవా నీవు
చనవిచ్చి రుకుమిణి సాముసేయించెను నాఁడె
పెనఁగుచు మెచ్చి నిన్ను బ్బించఁగ నేమిటికి

చ. 3: చెక్కులు వేమరు నొక్కి సేఁతలన్నియునుఁ జేసి
లెక్కలేనిరతి సేయలేవా నీవు
యిక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
తక్కిననీపొందులెల్లాఁ దడవ నేమిటికి

రేకు:	0910-1 ఆహిరినాట	సం:	19-055

పల్లవి:	ఎంతలేదు నీపగటు యెందాఁకానే
	కాంతుని కిచ్చకమాడి కలయఁగరాదా

చ. 1:	వేడుకకు రమణుఁడు వేమారు నవ్వితేను
	జాడెఱఁగక బొమ్మల జంకించేవే
	యీడువెట్టి వేరొక్కతె నింటికిఁ దెచ్చుకొంటే
	పాడిదప్పి నీ సం పై వచ్చెనటే

చ. 2:	చెలరేఁగి యాతఁడు చెనకి చన్నులంటితే
	పెలుచవై సారెనేల పెనఁగేవే
	కొలువులోపలనున్న కొమ్మలఁ గాఁగిలించితే
	చలపట్టి నీవుమరి సాదించేవటే

చ. 3:	శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి యిట్టె కూడితేను
	ఆవటించి రతినెంత ఆలయించేవే
	కావరించి పూడిగపుకాంతలతోఁ జెప్పితేను
	తావుకొన్న నీవలపు దాఁచేవటే

రేకు: 0910-2 రామక్రియ సం: 19-056

పల్లవి: ఎంతటివాఁడవు నిన్ను నేమిచెప్పేది
కంతునితండ్రివౌట కంటిమి నేమెల్లాను

చ. 1: తేనేలు వంటిమాటలు తివిరి నీవాడఁగాను
ఆనుకొని వలచిరి యతివలెల్లాను
మోనముతోఁ బొరుగున మొక్కులు చేత మొక్కఁగ
మానలేక తగిలిరి మగనాండ్లెల్లను

చ. 2: జోడుగాఁ దరితీపుల చూపులు నీవు చూడఁగ
వేడుకతోఁ బైకొనిరి వెలయాండ్లు
వాడి కెనవ్వులు నీవు వరుసతో నవ్వఁగాను
ఆడానీడాఁ బొందిరి పాయపుకన్నెలెల్లాను

చ. 3: సేయరానిమంతనపు సేఁతలెల్లాఁ జేయఁగాను
ఆయ మెటిఁగి పెండ్లాడి రచ్చరలెల్లా
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
డాయఁ గొలిచేరు నీపట్టపుదేవుళ్ళెల్లను

రేకు: 0910-3 శంకరాభరణం సం: 19-057

పల్లవి: ఆకెఁబిలువవయ్యా యిచ్చటికిని
కాకరిపను లడుగఁగవలె నీఁకను

చ. 1: నునుపులమాఁటలు నాతోనాడఁగ
కనుగొని నవ్వీఁగడ నొకతె
యెనయఁగ నీగుణ మేమిదెలిసెనో
వెనకటిపను లవి వినవలె నీఁకను

చ. 2: సరసముతో నాసరులు దిద్దఁగా
కెరలుచు నటు గొణఁగీ నొకతె
ధర నీ సేఁతలు తానేమెఱుఁగునో
గరిమ లన్నియునుఁ గనవలె నీఁకను

చ. 3: కందువతో ననుఁ గాఁగిలించగా
చెంది సన్న సేసీ నొకతె
యిందునె శ్రీవేంకటేశ కూడితివి
చందము లిటు మెచ్చఁగవలె నీఁకను

రేకు: 0910-4 దేశాక్షి సం: 19-058

పల్లవి: మంచివాడవయ్య నీవు మరిగి సిగ్గుపడవు
యెంచరాని నీవలపు ఇటు చూపవలెనా

చ. 1: నవ్వులకు నీతోను నాతియానడిమాటలు
రవ్వలేల నేపవు రచ్చలోనను
పువ్వుల వేసే వప్పటి బుజ్జగించే వంతలోనె
ఇవ్వల నీగజరులు ఇటు చూపవలెనా

చ. 2: విందువలె మోవితేనె వెలఁది యొసగి తేను
అందరిలో నేల చెప్పే వంగడి నీవు
అందు కొనేవు పయ్యెద అట్టె చన్నులు మూసేవు
ఇందు లోనే తమకములు యిటు చూపవలెనా

చ. 3: కలసి మెలసి యింతి కాఁగిలించి కూడితేను
వెలినేల నవ్వేవు వేడుకతోను
యెలమి శ్రీవేంకటేశ యేలి కమ్మటి నంటేవు
యిలపై నీ యెమెలెల్లా నిటు చూపవలెనా

రేకు: 0910-5 శ్రీరాగం సం: 19-059

పల్లవి: ఎఱఁగరా నీసుద్దులు యింతు లెల్లాను
అణిముణి దొడ్డవారమని మమ్ము నవ్వేవు

చ. 1: గొల్లవాఁడవై తిరిగి కోరి నీవు మరికదా
వెల్లవిరి మధురలో వెలవెట్టితి
పల్లదపు సేఁతలతొ పసులఁ గాచికదా
యెల్లవారికిని మరి యేలికవైతివి

చ. 2: బెరసి యశొదకు బిడ్డఁడవై వుండి కదా
పొరలి దేవకి నిజపుత్రుఁడవైతి
వరుసతొ రేపల్లె వాడల దిరిగి కదా
నరపతివై ద్వారకా నగరమెక్కితివి

చ. 3: మందలోని సతులను పొంది పొంది మరికదా
అంది పదారువేలఁ బెండ్లాడితివి
యిందునె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడికదా
దిందుపడి శ్రీ వేంకటాద్రి పై నిలిచితివి

రేకు: 0910-6 వసంత వరాళి సం: 19-060

పల్లవి: పరగ నేఁ జేసినట్టి భాగ్యము గాక
సరస నీ దెవుళ్ల లో చక్కని దాననా

చ. 1: మన్నించి నీవు నను మాఁటలాడించేవు గాక
యెన్నిక నీ సతులలో నేమి బాఁతి
అన్నిటా నేరుపరివై యాదరించేవు గాక
కన్నెలు పదారువేలకంటె దొడ్డ దాననా

చ. 2: యెల్లగా నాచే విడె మిప్పించుకొనేవు గాక
తొల్లిటి కాంతలకంటె దొరనా నేను
మెల్లనె నాచన్నుల మీఁదఁ జేయి వేసేవు గాక
గొల్లెతలకంటె నే నెక్కుడు దాననా

చ. 3: ననుపునఁ గూడి నన్ను నవ్వు నవ్వించేవు గాక
చనవరి కాంతల సరివత్తునా
యెనసితివి శ్రీ వేంకటేశ నన్ను నింతలొనె
మనెడి వారికంటె మలసేటి దాననా

రేకు: 0910-5 శుద్ధవసంతము సం: 19-061

పల్లవి: ఇంతేసి మీ గు ట్టు లెవ్వఁ డెఱుఁగు
వింత లాయ నేఁడు వివరించఁగాను

చ. 1: చల్లని చూపుల నీవు సారెఁ దన్నుఁ జూడఁగాను
మెల్లని మాటల నాపె మెచ్చునాడఁగా
యెల్లవారు నెరిఁగిరి యిద్దరి మీ పొందులు
కల్లలంటా నుంటిమి యీకత లిన్నాళ్లదాఁకా

చ. 2: చెలరేఁగి నీవు నట్టె చేసన్నలు సేయఁగాను
నలువంకలను నాపె నవ్వఁగాను
తెలిసి రిందరు నేఁడు తేటతెల్లమిగాను
బెళుకులంటా నుంటిమి ప్రియము లిందాఁకాను

చ. 3: శ్రీ వేంకటేశ నీవు చేకొని కూడఁగాను
కావరించి పయ్యదాపె గప్పఁగాను
యీవల మమ్మేలితిరి ఇంతులు సంతోసించిరి
ఆవలపులే సతమనుచు నేముంటిమి

రేకు: 0911-2 సామంతం సం: 19-062

పల్లవి: మారుమాట లాడరాదు మరి నేరా లెంచరాదు
సారెకు నిదివో నీ సంగాతాలు

చ. 1: ఇచ్చకము లాడవలె ఇయ్యకొని యుండవలె
నిచ్చలు నేపొద్దు నాకు నీతో బదుకు
పచ్చి దేర నవ్వవలెఁ బనులన్నీఁ జేయవలె
గచ్చులను నీతోడికాపిరము నాకు

చ. 2: తప్పక చూడఁగవలె తమకము చూపవలె
నెప్పున నెప్పుడు నాకు నీపొందులు
ముప్పిరిఁ బొగడవలె మోహము చెప్పఁగవలె
కుప్పలుగ నీతోడిమక్కువ నేస్తాలు

చ. 3: కలసి వుండఁగవలె కాఁగిట బిగించవలె
తోలఁగరా దెంతైనా నీతో చెలిమి
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అలమేల్మంగనే నేను అదె నీనాకూటమి

రేకు: 0911-3 ఆహిరి సం: 19-063

పల్లవి: అదివో నీచి త్తము ఆకెభాగ్యము
కదలిక లిందులోనే కనుకో నీవిఁకను

చ. 1: పున్నమవెన్నెలలోనఁ బొద్దువోక జవరాలు
నిన్నుఁదలఁచి రేయెల్లా నిద్దురవోదు
విన్నవించితిమి నీకు వేవేలకు నొక్కమాటె
యెన్నికలెల్లా నీవే యెఱుఁగుదు విఁకను

చ. 2: చేరి యారామములోనఁ జెక్కుచేతితోడఁ జెలి
నీరూపు భావించి నివ్వెరగందె
యీరీతిఁ గానుక నీకు నిచ్చి వొప్పగించితిమి
తారుకాణ లన్నియునుఁ దలఁచుకో యిఁకను

చ. 3: కనకపుమేడలోనఁ గామించి యలమేల్మంగ
తనివోనినీరతికిఁ దమకించెను
యెనసితివి శ్రీ వేంకటేశ యింతలో విచ్చేసి
మన సొక్కటాయ నిట్టె మన్నించు మిఁకను

రేకు: 0911-4 రీతిగౌళ సం: 19-064

పల్లవి: ఏమిటికి దూరేవు యెరవులవానివలె
యీమోహమే నిజమైతే నింటికి రారాదా

చ. 1: మంతనము గాకుండఁగా మాటలాడదాయఁ గాని
పంతముగాదు నీతోఁ బడఁతికిని
సంతజాణతనమౌను సబలోన నాడితేను
ఇంత గలవాఁడవైతే నింటికి రారాదా

చ. 2: సిగ్గులు నిండుకొనఁగ చేరి మెక్కదాయఁగాని
వెగ్గళించి కాదుసుమ్మీ వెలఁది నీతో
అగ్గమై సందడిలోననైతే గొల్ల దోమటౌను
యెగ్గులేనివాఁడవైతే నింటికి రారాదా

చ. 3: కడుఁబరవశములుగాఁగా నవ్వదాయఁగాని
గడుసుగా దలమేల్మంగ నియ్యెడను
అడరుచు శ్రీ వేంకటాధిప కూడితి విట్టె
యెడయ కెప్పుడు నిట్టె ఇంటికి రారాదా

రేకు: 0911-5 ఆహిరి సం: 19-065

పల్లవి: చిత్తగించి నీవు దయ నేయఁగరాదా
బత్తి నేసి నీకుఁ గడుబాఁతిపడి వున్నది

చ. 1: చెక్కు చేతఁబెట్టుకొని సెలవుల నవ్వుతాను
నెక్కొని యున్నది చెలి నీయెదుటను
వెక్కసపుఁదమకాన విడెము చేతఁ బట్టుక
యెక్కువైన యాసలతో నిచ్చగించి యున్నది

చ. 2: సారె జారుఁగొప్పుతోడ జవ్వనాన విఱ్ఱవీఁగి
నేరుపుతో మాటలాడీ నీ యెదుటను
బోరున నిన్నెచ్చరించి పువ్వుల వేసుకొంటా
కూరిములు గానరాఁగా గుట్టుతోడ నున్నది

చ. 3: అలరి కాఁగిటఁగూడి అలపు సొలపుతోడ
నిలిచె నలమేల్మంగ నీయెదుటను
యెలమి శ్రీ వేంకటేశ ఇరవై పానుపుమీఁద
వెలసినసింగారాల వేడుకతతో నున్నది

రేకు: 0911-6 తెలుఁగుఁ గాఁబోది సం: 19-066

పల్లవి: ఆనతియ్యవయ్య అదేల దాఁచేవు
యీ నేర్పు లేకుండితే నింత సేతువా

చ. 1: చెక్కులు నొక్కుచు సేదలు దేరిచి
పెక్కు ప్రియాలు చెప్పేవు నాకు
యెక్కడ నెవ్వత నెనసి వచ్చితో
యిక్కువ నూరకే యింత సేతువా

చ. 2: కన్నుల మొక్కుచు కందువ సం
యెన్నేసివేసాలు పన్నే విందు
కన్నె నెవ్వతె నిక్కడకుఁ దెచ్చితివో
యెన్నఁడైన నీవు యింత సేతువా

చ. 3: వావులు చెప్పుచు వరుసఁ గూడేవు
శ్రీవేంకటగిరి గోవిందుఁడా
దేవుళ్ళ నెందరిఁ దీపులఁ బెట్టితో
యీవేళ నన్నేలి యింత సేతువా

రేకు: 0913-1 శంకరాభరణం సం: 19-067

పల్లవి: చెప్పదు యెంతై నఁ జెలులకును
చొప్పులెత్తుచును సోదించరాదా

చ. 1: ననుపున నీ విటు నవ్వులు నవ్వఁగా
మునుకొనె సిగ్గులు ముద్దియకు
మనసునఁబొరినమతక మేఁటిదో
అనువున నదియును నడుగఁగరాదా

చ. 2: పలుమరు నీవిటు పైఁజేయి వేయఁగా
పులకలు నిండెను పొలఁతికిని
యెలమినిఁ బొడమినయింపు లెట్టివో
తిలకించి అవియుఁ దెలియఁగరాదా

చ. 3: గక్కన నీ విటు కాఁగిలించఁగా
చొక్కులు మించెను సుదతికిని
యిక్కువలు శ్రీవేంకటేశ యెట్టివో
మిక్కిలి మేలిఁక మెచ్చఁగరాదా

రేకు: 0913-2 కేదారగౌళ సం: 19-068

పల్లవి: నాతో నేలానవెట్టేరే నడుమ మీరు
యీతల నాతనిసేఁత లెఱఁగనా నేను

చ. 1: కడుబత్తిగలవాడు కడల కేలపోవునే
వొడయఁడై నావద్దనే వుండుఁగాక
పుడివోక మీరెంత వొడఁబరచేరే నన్ను
యెడనెడ తనగుట్టు యెరఁగనా నేను

చ. 2: బాసలిచ్చినట్టివాఁడు పరుల నేల చూచునే
సేసవెట్టి కాఁపురము సేసుఁగాక
వేసరక మీరేల వేఁడుకొనేరే నన్ను
యీ సుద్దు లన్నియు ముందే యెరఁగనా నేను

చ. 3: చేరి కూడినట్టివాఁడు సిగ్గులేల నెరపునే
వూరకే లోనై మరిగుండుఁగాక
మీరెల్లా శ్రీ వేంకటేశు మెచ్చి యేలపొగడేరే
యీరీతిజాణఁ డవుత యెఱఁగనా నేను

రేకు: 0913-3 దేవగాంధారి సం: 19-069

పల్లవి: ఏమని వినెనో యిటు నీసరితలు
తామర విసురుచుఁ దాఁకించీని

చ. 1: యీలాగున నీ వింటికి రాఁగా
వాలుకచూపులు వంచీఁ జెలి
ఆలరివై మాటాడకమును పే
కోలుముందుగాఁగొసరీని

చ. 2: ననుపున వీవిటు నవ్వులు నవ్వఁగ
కినియుచుఁ గడుజంకించీని
చనవునఁ బైఁ జేయి చాఁచకమునుపే
పెనఁగుచు నానలు వెట్టీని

చ. 3: గక్కున నీవిటు కాఁగిలించఁ గా
అక్కజపురతుల నలసీని
యిక్కువ శ్రీ వేంకటేశ మునుపనే
చెక్కులు నొక్కుచుఁ జెనకీని

రేకు: 0913-4 నాగవరాళి సం: 19-070

పల్లవి: నేనొకటి సేయఁగాను నీ వొకటీ భావించేవు
ఆనతీవయ్య యింక ననుమాన మేఁటికి

చ. 1: చనవుగలదంటాను సారె నిన్నుఁ గొసరితి
ననుపుగలదంటాను నవ్వితి నేను
యెనసి యిందుకుఁగాను యేల సిగ్గులు వడేవు
చెనకి నీ యందేమైనా సేఁత గలదొ

చ. 2: దేవుల నయితినంటా దిష్టించి నిన్నుఁ జూచితి
కైవసమైతివంటాను కాఁగిలించితి
చేవదేర నీవేల శిరసు వంచుకొనేవు
నీవొళ్ళ నేమైనా మరి నేరములు గలవో

చ. 3: విన్నపము విందువంటా వేవేలు నాడితి
మన్నింతువంటా నిన్నే మరిగుంటిని
యిన్నింటా శ్రీ వేంకటేశ యింతలో నన్నేలితివి
తిన్నఁగా నీవేమి బుద్ధిఁ దలఁచుకొంటివో

రేకు: 0913-5 కన్నడగౌళ సం: 19-071

పల్లవి: బాయిటం బడె వలపు పడంతికి నీకును
యీయెడ నామోము చూచి యెంత నవ్వేవు

చ. 1: అక్కర యంతో కాని అప్పటప్పిటికి నిన్నుం
జెక్కు నొక్కి చెలి నీపై సేస వెట్టీని
పక్కన నాకేసేసేబత్తి చేకొనంగరాదా
యిక్కున నామోము చూచి యెంతనవ్వేవు

చ. 2: యేకతా లెట్టివో కాని యెదుటనే కాచుకుండి
మేకొని సన్నలు సేసి మేలమాడీని
నీకేమి యాపెసలిగె నెమ్మదిం జెల్లించరాదా
యీకడ నామోము చూచి యెంతనవ్వేవు

చ. 3: వేడుక యెట్టిదో కాని వెలం ది కాంగిటం గూడి
జోడై శ్రీ వేంకటేశ చొక్కించీని
యీడుగా నన్నేలితివి యిట్టె యాపెం గూడరాదా
యీడేర నామోము చూచి యెంతనవ్వేవు

రేకు: 0913-6 మలహరి సం: 19-072

పల్లవి: ఎటిఁగినపనులకు నేల గుట్టు సేసేవు
గుటిలేనికోరికలు గూఁటఁ బెట్టేవా

చ. 1: చెలపచెమట గారీఁ జెక్కులను
సెలవుల నవ్వులూరీఁ జెలియకును
పిలిచి మాటాడరాదా ప్రియుఁడవు
వలపులు దాఁచుకొని వడ్డి కిచ్చేవా

చ. 2: పున్నమవెన్నెల చిందీఁ గన్ను చూపుల
చన్నులఁ బులక లుబ్బీ సకియకు
మన్నించి కూడఁగరాదా మగఁడవు
పిన్నవయసుఁదనము పెట్టెఁ బెట్టేవా

చ. 3: ముప్పిరిఁదేనెలు జారీ మోవిమీఁ దను
చిప్పిలీఁ గళలవివో చిన్ని మోమున
యిప్పుడె శ్రీ వేంకటేశ యేలితివి
తప్పకుండా రతులు వెదలు వెట్టేవా

రేకు: 0914-1 సామంతం సం: 19-073

పల్లవి: ఆయలేవయ్యా సుద్దులన్నియు నెరుఁ గుదుము
చాయకాఁడ వౌదువు నీసట లేఁటికయ్యా

చ. 1: మితిమీరినవలపు మిక్కుటమై వుండఁగాను
సతిమాటలెల్లా నీకుఁ జవులాయను
వెతదీర విన్నపాలు వేగినంతాఁ జేసినాను
ఇతరులయెడ కింత ఇతవయ్యీనా

చ. 2: పుప్పతిల్లుఁ దమకము వువిదపై నుండఁగాను
వొప్పి యీపెవిందులెల్లా నొద్దికాయను
ఇప్పు డెవ్వరైనా బోనమింటికి నీకుఁ దెచ్చితే
చప్పనై తోఁ చుఁ గాక ఆసలు వుట్టీనా

చ. 3: పానుపుమీఁదిరతులు పచ్చిదోఁచి వుండఁగాను
తేనెగారేఆపెమోవి తీపులాయను
ఆనుక శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యేనెలఁతలందునైనా ఇటువలె మెచ్చేవా

రేకు: 0914-2 వేళావాళి సం: 19-074

పల్లవి: తగుతగు నీదొరతనము లిఁక
వెగటులన్నియును వేడుకలాయ

చ. 1: విరసపుతిట్లు వేవేలు దిట్టిన
సరసపువేళల చవులాయ
యెరవులచేఁత నీవేమి సేసినా
సరి నాకాఁగిట చందములాయ

చ. 2: బొమ్మజంకెనలు పోరి నెన్నైనా
సమ్మతించితే చవులాయ
దిమ్మరివై యెందు దిరిగినచ్చినా
నెమ్మి నన్నేలఁగా నేరుపులాయ

చ. 3: అంగము లలయఁగ నంటఁబెనఁగినా
సంగడిరతులను చవులాయ
రంగు శ్రీ వేంకటరమణ నన్నేనసితి-
వెంగిలిమోవుల కిచ్చకమాయ

రేకు: 0914-3 సాళంగనాట సం: 19-075

పల్లవి: ఎవ్వ రెట్టయినా నుండినీ ఇదివో నేను
నవ్వుతా నీసేవ సేతు నడుమ నేను

చ. 1: మనసున నొకమాట మఱఁగున నొకమాఁట
యెనసి నే నయములు యెఱఁగ నేను
వనితనై నీమీఁదివలుపే గతియని
తనివోక బదికేటిదానను నేను

చ. 2: వొలిసితే నొకటియు నొల్లకుంటే నొకటియు
చలివేఁడివేసాలు జరప నేను
కలికితనాన నీతో కాఁపురమే గతియని
తలఁచి పొందులు సేసేదానను నేను

చ. 3: వొక్కపరి యిచ్చకము వొక్కపరి మచ్చరము
యిక్కడా నక్కడ యెలయించను నేను
గక్కన శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
మక్కువ నిటువలెనే మరుగుదు నేను

రేకు: 0914-4 గంభీరనాట సం: 19-076

పల్లవి: ఇంకా మమ్ముఁ జెనకేవు యేరా వోరి
కొంకులేక కొసరేవు కొమ్మల నందరిని

చ. 1: గోవుల మరపినట్టు గొల్లెతల వలపించి
కావరించి తిరిగేవు కానీకానీరా
వేవేలు ఇండ్లు చొచ్చి వెన్నదినేనంటానే
మోవులు చవిగొంటివి ముద్దియల నెల్లను

చ. 2: పిల్లఁ గోవిరాగాలనె పెక్కుమంత్రాలు మంత్రించి
కల్లరివై తిరిగేవు కానీకానీరా
చల్లదుత్తలంటాను చన్నులపైఁ జేయి చాఁచి
కొల్లగొంటివి మానము కోమలులనెల్లను

చ. 3: మడుగులఁ జొక్కుచల్లి మచ్చిక నేయించుకొని
గడుసరివై తిరిగేవు కానీకానిరా
నడుమ శ్రీ వేంకటేశ నన్ను నిట్టె యేలితివి
తొడిఁబడఁ గూడితివి తొయ్యలులనెల్లను

రేకు: 0914-5 శ్రీ రాగం సం: 19-077

పల్లవి: వలుపేమి వెగటా వనితలకు
చిలుకుగోళ్ళనేల చెమట చిమ్మేవే

చ. 1: అదనెరిఁగి పచ్చిమాటాతఁడు నిన్నాడితేను
వదనకమల మేల వంచేవే
సదరానఁ గప్పురము చన్నుదాఁక వేసితేను
వుదుటున లోలోన వుసురనేవేలే

చ. 2: చవులువుట్టిం చాతఁడు సన్న నీకుఁ జేసితేను
అవలివలై యేల అలసేవే
తివిరి యట్టె ముసుఁగు దీసి మోము చూచితే
జవళిఁ జొక్కుచు నేల జడిసేవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరి కాఁగిలించితేను
భావము గరఁగి యెంత పదరేవే
కావరపునవ్వుతోడఁ గడుసరసమాడితే
చేవదేర నెంతకెంత చెలఁగేవే

రేకు: 0914-6 హిందోళ వసంతం సం: 19-078

పల్లవి: ఎంత కాకు సేసేవు యింతుల నింతేసి నీవు
వంతులు వెట్టుక యేమి వల్లె వేసేవు

చ. 1: కందువ మర్మములంటి గజరుఁదనము చూపి
యెందరితో నవ్వు నవ్వి యెలయించేవు
చిందేటి మోవితేనెలు చిమ్మి రేఁచి చవిగొని
విందుల వలపులెట్టు వెదచల్లేవు

చ. 2: చన్నులపైఁ జేయి వేసి జాణతనములు చూపి
యెన్నికతలఁ గరపే విందరి నీవు
వెన్నెలనవ్వు నవ్వించి వేడుకలు చిత్తగించి
పన్నిన మాయల నెట్టు భ్రమయించేవు

చ. 3: కాతరాలు వుట్టించి కాగిటను బిగియించి
యేతుల నెందరి గుండే వింపుల నీవు
యీతల శ్రీ వేంకటేశ యిట్టె నన్ను గూడితివి
జాతుల నెందరిపై సేసలు వెట్టేవు

రేకు: 0916-1 ఛాయానాట సం: 19-079

పల్లవి: నేడు గొత్తలా తనకు నెయ్యపుజాణతనాలు
నాఁడే కానవచ్చెను ననుపులెల్లాను

చ. 1: చెంత నుండి పలికీని చేయి మీఁద వేసీని
యెంత లేదు తనవలపెరుఁగు నటే
వంతు తోఁ బువులెల్లాను వాసనలు చూపీని
ఇంతటితనతమక మేమి చెప్పేనే

చ. 2: సెలవుల నవ్వీని చెక్కులు గడు నొక్కీని
తెలిసితిఁగదే తన తెఱఁగెల్లాను
బలిమి నూరకే తాను పచ్చడము గప్పీని
కలిగెనె తన పొందు కాణాచి నాకు

చ. 3: కన్నులఁ దప్పక చూచీ కాఁగిలించి కూడీని
నన్ను శ్రీవేంకటేశుఁడు మన్నించెఁ దానె
సన్నల నప్పుడే నాతో సరసము లాడీని
పన్నిన వేడుకతో నా భాగ్యమాయనే

రేకు:	0916-2 నట్ట నారాయణి	సం:	19-080

పల్లవి:	ఈడనుండే చుట్టరిక మిది చాలదా
	వాడిక సుద్దులు నీవు వదలేటివాఁడవా

చ. 1:	పలుమారు నీతోను పంతములాఁడగ రాదు
	చలములు సారెసారె సాదించరాదు
	పొలుపుగ నీవు నన్నుఁ బొందులు సేయుమనేవు
	వొలిసినట్టు మట్టున నుండేటి వాఁడవా

చ. 2:	యెక్కువ తక్కువ నీతో నెదురు మాటాడరాదు
	కక్కసించి నిన్నెంతైనాఁ గాదనరాదు
	ఇక్కువ లంటుచు నన్ను నియ్యకొలుపవచ్చేవు
	తక్కిన పనులు నీవు తలఁచని వాఁడవా

చ. 3:	శ్రీ వేంకటేశ్వర నీచిత్తము దెలియరాదు
	వావితో నన్నేలితివి వద్దనరాదు
	కావలె ననుచు నాకు గంగణము గట్టితివి
	చేవదేర గూడితివి సిగ్గు పడేవాడవా

రేకు: 0916-3 దేశాక్షి సం: 19-081

పల్లవి: రమ్మనవే చెలియా రమణుని నీడకు
యిమ్మనవే చనువులు యెలయింపు లేఁటికే

చ. 1: కన్నులఁజూచిన దాకాఁకడలేదు తమకము
సన్నల మొక్కినదాఁకా చల్లీఁగూరిమి
మన్నన లడుగుదాఁకా మలసీఁ గోరికలు
యెన్ని లేవు యెడమాట లింకా నేఁటికే

చ. 2: సరసమాడినదాఁకా జడి వట్టీఁ జెమటలు
వరసకు వచ్చు దాఁకా వంచీఁ జలము
గరిమఁ బై కొన్న దాఁకాఁ గమ్మీ నడియాసలు
ఇరవై నడుమఁ దెర యిఁక నేఁటికే

చ. 3: కదిసి కూడిన దాఁకా కడుఁ జన్ను లదరీని
పెదవి యానిన దాఁకా నిదే నోరూరీ
అదన శ్రీ వేంకటేశుఁ డంత లోనె నన్నుఁ గూడె
యెదుటనే వొడఁబాటు లింకా నేఁటికే

రేకు: 0916-4 ఆహిరి సం: 19-082

పల్లవి: ఎవ్వతె కో నేఁడు నిన్ను నింత సేసెను
పువ్వులైన వలపులే పూపఁలు నౌను

చ. 1: చెవిలోఁ జెప్పిన మాట చిత్తము లోపల నాటీ
వివరింప వినుకలి విరహ మవును
తనివి యదే సారెఁ దలపోయ తలపోయ
కవిసి నివ్వెరగులై కమ్ము కొనును

చ. 2: కనుఁగవచూపులే కాయముమీఁదఁ బారీ
వెనుకొని కనుకలి విరహ మౌను
తనరి యాకాంక్షలఁ దగులఁగ దగులఁగ
యెనసేటిరతులకు నేఁకట లౌను

చ. 3: సెలవి నవ్వినవ్వు సేసలై తలకెక్కీ
వెలయుచు నేకశయ్య విరహ మౌను
అలమి శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెలమి సంతోసాల కిరవులౌను

రేకు: 0916-5 దేసాళం సం: 19-083

పల్లవి: వలపులలో నీకీవన్నె లివి ఇన్నియును
మలతురు సొలతురు మంకుల నుండుదురు

చ. 1: చలపాదితనములు సహజము సతులకు
వెలఁది నేమీననక వేఁడుకొవయ్యా
పలుకుదు రేమైనాఁ బక్కన జంకితురు
పిలువఁ బిలువ నట్టె బిగుతు రెంతైనా

చ. 2: కడుగట్టితనములు కలిగిన వెప్పుడును
పడఁతికి నీవిట్టేపంతమీవయ్యా
కొడిమెలు గట్టుదురు కోపములు చూపుదురు
తడవినంతటిలోనే తప్పులువట్టుదురు

చ. 3: ఆసోదపుఁదనములె అంగములు కాంతలకు
యీా సుదతిఁ గూడితివి యేలుకోవయ్యా
బాస లడుగుదురు పై పై శ్రీ వేంకటేశ్వర
సేసవెట్టి గర్వాన చెక్కులు నొక్కుదురు

రేకు: 0916-6 మెంచబౌళి సం: 19-084

పల్లవి: ఎవ్వతెతో మాటలాడే విపుడు నీవు
జవ్వని నిలుచున్నది చక్కఁజూడవయ్యా

చ. 1: కలువకన్నుల నిన్నుఁ గసరి
కులుకుఁజన్నుల నిన్నుఁ గొసరి
చెలిఁ బయ్యదకొంగు విసరి
చెలిఁ నీ సేవలు సేసీఁ జిత్తగించవయ్యా

చ. 2: చిమ్ముల మోహరసము చిలికి
పమ్ముచు ప్రియములెల్లాఁ బలికి
అమ్ముడుసిగ్గులఁ గొంత యలికి
కొమ్మ నీకుఁ దమకించి కొసరీ మెచ్చవయ్యా

చ. 3: చొక్కపుటాసల నిన్ను సొలసి
మక్కువలు చల్లి చల్లి మలసి
గక్కన శ్రీ వేంకటేశ కలసి
మొక్కీ సంతోసాన నింతి ముదమందవయ్యా

రేకు: 0917-1 పళవంజరం సం: 19-085

పల్లవి: ఆఁటది యేమి యెఱుఁగు నన్నిటను మగవాని-
మాఁటలోని దింతమర్మము నీచే నున్నది

చ. 1: సేయకుండవచ్చునా చెప్పినట్టెల్లా నేను
పాయపువాఁడవు నీవు బలువుఁడవు
యేయెడాఁ జెప్పఁగరానియెన్నికలు నీరతులు
తోయరాదు పాయరాదు దోసము నీది

చ. 2: ఆడకుండవచ్చునా అనుకున్నట్టెల్లా నీతో
కోడెకాఁడవు నీవు గొంటరివి
పాడితో నూఁకొనరానిపచ్చివి నీసుద్దులు
వాడిక నాజవ్వనము వడి నీకె సెలవు

చ. 3: వూరకుండవచ్చునా వొడ్డారమున నీతో
ధీరుఁడవు శ్రీవేంకటాద్రినివాసుఁడ
యీరీతి మానఁగరావు యెన్నఁడు నీపొందు లివి
కేరడముగాఁదేలినకీరీతి నీది

రేకు: 0917-2 నాట సం: 19-086

పల్లవి: చిత్తాన నోరువు లేదు విడువఁజాలవు
హత్తి నిన్ను నేమందు నౌదువయ్యా జాణవు

చ. 1: మోము చూచితే ముసిముసినవ్వులు నవ్వేవు
కామించి తలవంచితే కాతరించేవు
గోమునఁ జెనకితేను కొంకి సాములు నేసేవు
నేమమున నుండితేను నిక్కి పైకొనేవు

చ. 2: ఆనుక మాటలాడితే నటు గుట్టు చూపేవు
మోనాన నుండితే చను మొన లంటేవు
కానుక లిచ్చితేను నలుగడలునుఁ జూచేవు
మాని పూరకుండితేను మంతనమాడేవు

చ. 3: సేవలు సేయవచ్చితే చేతు లొడ్డించుకొనేవు
వోవరిలోఁబండుండితే నొడివట్టేవు
యీవేళ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వావులు చెప్పినంతనే వలపులఁజిక్కేవు

రేకు: 0917-3 కేదారగౌళ సం: 19-087

పల్లవి: ఎరవులే నీగుణాలు ఇన్నాళ్ళదనకాను
సరివచ్చె నాడుకొనే జవరాండ్లమాటలు

చ. 1: వెలవెట్టనివలపు వెలది నీపైఁ జల్లఁగా
నలువంకలా నీకు నవ్వులు గావా
మొలకచన్నులు మరి మోమున కెగరఁగాను
యెలమి సంతోసాలుగా కిఁక నెన్నఁడయ్యా

చ. 2: పోరచి దెచ్చి విడేలు పొరుగాపె యియ్యఁగాను
సారె కిందరిలోనా చవులు గావా
తీరనిమోవితేనెలతీపు నీమోవి సోఁకఁగ
యీరీతి నీ భాగ్యమాయ నిన్నిటా మేలయ్యా

చ. 3: పీటమీఁద నీకు నిట్టె పెండ్లికూఁతు రుండఁగాను
పాటించి ఇన్నిటా నీరపములే కావా
యీటున శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
మీటాయ నీసుద్దులెల్లా మెచ్చాయనయ్యా

రేకు: 0917-4 సాళంగం సం: 19-088

పల్లవి: నీచేఁతలే ఇవి నీవేల సిగ్గువడేవు
చేచేత వలపులు చిమ్మిరేఁచకుండునా

చ. 1: తగ నీతనికి నీవు తతిగొని చెప్పఁగాను
చిగురుమోవికి వాడుచెందకుండునా
పగటుసరసమునఁ బై పైఁ బెనఁగఁగాను
వెగటుఁ జన్నులు వెల్లవిరి గాకవుండునా

చ. 2: నడుమ నూరకె నీవు నవ్వులు నవ్వఁ గాను
జడియని నీ కొప్పు జారకుండునా
వొడివట్టి తీసి పతి నొద్దికిఁ బిలువఁగాను
వెడవెడ పోఁకముడి వీడకుండునా

చ. 3: ముందె శ్రీ వేంకటెశు మోవి చవిగొనఁగాను
కందువమర్మము కరఁగక వుండునా
సందులేక కాఁగిటిలో సతములై వుండఁగాను
మందలించి వేడుకలు మరిగించకుండునా

రేకు: 0917-5 ఆహిరి సం: 19-089

పల్లవి: ఘనుఁడైనవాని నింతకాకు నేతురా
మనసునఁబెట్టుకొని మంతనము లాడవే

చ. 1: అంగనలు కొలువు సేయఁగ నుండేరమణుని
వెంగెములాడకువే వేమారును
సింగారించుక యద్దము చేతఁబట్టి చూడఁగాను
చెంగట నాతనిమై మచ్చములు చూపకువే

చ. 2: చెప్పరానిబాసలెల్లాఁ జేసేటిమగవానిఁ
దప్పులెల్లా నెంచకువే తగవు గాదు
ముప్పిరివల్లెవాటుతో మురిపెముచూపేవాని
దుప్పటిపసపు చూపి దూరులు సేయకువే

చ. 3: చేరి కాఁగిలించుకొన్న శ్రీ వేంకటేశ్వరుని
నేరము లెంచకువే నీకుఁ దగదు
కూరిమితో నిను వేఁడుకొంటా నుండేటివాని-
తారుకాణచేఁతలెల్లాఁ దలఁపు సేయకువే

రేకు: 0917-6 పాడి సం: 19-090

పల్లవి: ఇంక నేల కొంకను యిన్నియుఁ జెల్లుబడాయ
అంకెకు వచ్చినపని ఆపె దానే యెరుఁగు

చ. 1: మోహముగలవాడవు మొక్కించుకో ఆపెచేత
పోహణించి నన్నేమి బుద్దడిగేవు
సాహసివని పొగడి సాము సేయు మాపెతోడ
బాహుమూలములఁ గలపస తానే యెరుఁగు

చ. 2: పొందుసేసినవాఁడవు పొత్తున నాకెఁ బెట్టుకో
విందువలె నాతోనేల విచారించేవు
అందరిలో సంతోసించి ఆపెనే నీవడుగుము
మందలించి నీ వాడేటిమాటలు దానెరుఁగు

చ. 3: పెండిలాడినవాఁడవు పిలువు నీవే యాపెను
అండనే నాతోనేమి ఆలోచించేవు
నిండుక శ్రీ వేంకటేశ నీవు నన్ను నేలితివి
పండుమోవిగురుతులభావము దా నెరుఁగు

రేకు: 0918-1 దన్నాసి సం: 19-091

పల్లవి: ఊడిగపునిబ్బరాన వొరపు లెరఁగరు
తాడుపడి గోళ్లేల తాఁకించేరే మీరు

చ. 1: పన్నీట మజ్జనమార్చి పావడలఁ దడివొత్తి
చన్నులేల తాఁకించేరే సతులాలా
తిన్ననికప్పురధూళి తిరుమేననెల్లా మెత్తి
వున్నతపుఁ గొప్పులేల వూఁదేరే మీరు

చ. 2: తట్టుపుణుఁ గలది యంతటా మెరుఁగులు వెట్టి
చుట్టుబయ్యద లేఁటికి సోఁకించేరే
గట్టిగా సొమ్ములు వెట్టి కడుసింగారాలు సేసి
వట్టి మీ చెమటలేల వడియుంచేరే

చ. 3: అలమేలుమంగ నురమందు నెలవుకొలిపి
యెలమి శ్రీ వేంకటేశు నేలనవ్వేరే
బలిమి నానాజాతిపండ్లు నైవేద్యమిచ్చి
అలమి మోవిండ్లవి యేమి చూపేరే

రేకు: 0918-2 రామక్రియ సం: 19-092

పల్లవి: ఏమి నెరుపేవు మేకు లింతులెల్లా జూడఁగాను
ఆమనివేడుకకాఁడ వౌదువయ్యానీవు

చ. 1: నీవద్దఁ గాచుకున్న నెలఁతుక వుండఁగాను
ఆవలాకెతో సరసమాడేవు
తోవలఁ బెళ్ళిచెట్లు మందుగాదనినమాటలు
నీవల్లనే కానవచ్చె నెమ్మది నిందరికి

చ. 2: వరుసతోఁ బెండ్లాడినవనిత మాటాడఁగాను
పొరుగాపెతో నవ్వేవు పోరచిగాను
సరినున్న మేనవారు సరకుగా రనుమాట
నిరతితోడుత నీవే నిజము సేసితివి

చ. 3: అలమేలుమంగ వురమందు నిట్టెవుండఁగాను
ఇల వీఁపెక్కించుకొంటి వెన్నికగాను
భళి శ్రీ వేంకటేశుఁడ పైకొసరు లాభమని
తెలిపితి విందరికి తేట తెల్లమిగాను

రేకు: 0918-3 సామవరాళి సం: 19-093

పల్లవి: ఏమని విన్నవించేము యిట్టె కనుఁగొనవయ్య
మోమునఁ జేతులలోన మొక్కు లున్నవి

చ. 1: నెలఁతమనసులోన నిండువలపు లున్నవి
సెలవివవ్వులలోన సిగ్గులున్నవి
తలిరుమోవిమీఁద తరితీపు లున్నవి
కలువ కన్నుల లోన కాంక్ష లున్నవి

చ. 2: అంగనమాటలలోన నడియాస లున్నవి
రంగగుచన్నులపై కరఁగు లున్నవి
అంగపుసేవలలోఁ బ్రియములెల్లా నున్నవి
సింగారంపుఁగొప్పుమీఁద సేస లున్నవి

చ. 3: కప్పి యలమేలుమంగకాఁగిట నీమేనున్నది
చిప్పిలఁ జెక్కులమీఁద చిహ్న లున్నవి
యిప్పుడె శ్రీ వేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
నెప్పున నీకెవేల నీవుంగర మున్నది

రేకు: 0918-4 శంకరాభరణం సం: 19-094

పల్లవి: మాటలాడఁగదె మగనితో
ఆఁటదాని కింతయమరునా

చ. 1: చెలులు బుద్దులుచెప్పినా వినవు
చలము పతితో సాధింతురా
కలసి మెలసి కాపరాలు సేసి
అలుకలు మఱి యమరునా

చ. 2: నవ్వేవిభునితో నాలేల సేసేవు
రవ్వ లింతయేలే రామలకు
జవ్వనమదాన జడయుచు నుండి
అవ్వలిమోములు అమరునా

చ. 3: మచ్చికచుట్టాల మండాటు సేయవే
హెచ్చుఁగుందులేల యీవేళను
యిచ్చల శ్రీవేంకటేశుఁడు గూడెను
అచ్చమాయ సిగ్గు లమరునా

రేకు: 0918-5 నాదరామక్రియ సం: 19-095

పల్లవి: ఎంతగోస నాసనేసేవేల మమ్ముఁ గోసరేవు
పంతము నీ కిచ్చినదే పైకొంటగాదా

చ. 1: యెదిరించి నీకుఁ జేతులెత్తి మొక్కినపుడే
కొదలేక నిన్ను వేడుకొంటగాదా
పొదిగి మేపొద్దు నీపొంత నున్నయపుడే
అదనఁ గూడుకొని నీయాల నౌటగాదా

చ. 2: కనుఁగొని కొలువులోఁ గాను కిచ్చినపుడే
చెనకి నీకుఁ బ్రియాలు చెప్పుటగాదా
ననుపుతో సెలవుల నవ్వునవ్వినప్పుడే
యెనసేననుచునీతో నియ్యకొంటగాదా

చ. 3: మచ్చిక నీచెవిలోన మాటలాడినపుడే
కొచ్చికొచ్చి నీకాఁగిటఁ గూడుటగాదా
అచ్చపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మెచ్చి నీరతిఁజొక్కితి మేలుదానఁ గాదా

రేకు: 0918-6 సామంతం సం: 19-096

పల్లవి: సారె వల పందిరిపైఁ జల్లుచున్నాఁడు
తీరుగా సరసమాడి తిల్లగోవిందరాజు

చ. 1: భరితమై మేడలోనఁ బవ్వళించి వున్నవాఁడు
తరుణులతో నవ్వుతా నున్నాఁడు
పరగ నందరిచేత పాట వింటానున్నవాఁడు
తెర దీసుకున్నవాఁడు తిల్లగోవిందరాజు

చ. 2: సేసపాలశిరసున సిగ్గుతోడ నున్నవాఁడు
ఆసపాటుచూపులచాయల నున్నాఁడు
బాసికపుసతులపై పాదాలు చాఁచుకున్నాడు
తీసిపెట్టుగానితమిఁ దిల్లగోవిందరాజు

చ. 3: బావపురతులఁ గూడి పంతముతో నున్నవాఁడు
శ్రీవనిత భూవనితఁ జేసుకున్నాఁడు
వావు లిందరికిఁ జెప్పి వన్నెకాఁడై పొందినాఁడు
దేవుఁడు శ్రీ వేంకటాద్రి తిల్లగోవిందరాజు

రేకు: 0919-1 శంకరాభరణం సం: 19-097

పల్లవి: వింటిమయ్యా నేఁడు నీవేడికెలు
కంటిమయ్యా తోడుతనే కందువ వాడికెలు

చ. 1: వలపుల తమ్మివిరివాటులు
సొలపులఁ బెనఁగినచోటులు
నెలకొని వున్న నీనీటులు
కొలువులో సుద్దులివి కొండలుఁ గోటులు

చ. 2: వెల్లవిరిచూపుల నీవీడేలు
మెల్లనె తమకముల మేడేలు
కొల్లలు నీతమకపుగూడేలు
పెల్లురేఁగెఁ బుక్కిళ్ళ పెండ్లివీడేలు

చ. 3: పొలకూళ్ళలోననె పంతాలు
చాలా నమరె నీసంతాలు
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
యీలీల నాతో నాడేవు యేకాంతాలు

రేకు: 0919-2 కాంబోది సం: 19-098

పల్లవి: ఏమిటికిఁ జేసేవే యెగసక్కేలు
కామించినరమణునిఁ గలయఁగరాదా

చ. 1: కప్పి నిన్నాతఁడు తమిఁ గాఁగిలించుకొనఁగాను
యిప్పుడు నీవిన్నపము లేమిసేసేవే
ముప్పిరిదప్పికిని నీమోవితేనె లడుగఁగ
అప్పటిఁ బన్నీరేల అందియిచ్చేవే

చ. 2: సొలసి చక్కఁదనాలు చూచి యాతఁడు చొక్కఁగా
తల దువ్వి తురుము యెందాఁకాఁ బెట్టేవే
కలికి నీచన్నులకుఁ గడు చేయిచాఁచఁగాను
వెలయ నిప్పుడు యేల వీడె మందిచ్చేవే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి రతిఁ గూడఁగాను
యీవేళనే పాదములు యేఁటి కొత్తేవే
కావిరి నేకతమునఁ గడు నీతో నవ్వఁగాను
చేవమీరి ఇఁకనేల సిగ్గువడేవే

రేకు: 0919-3 ముఖారి సం: 19-099

పల్లవి: నీవు మొదలు జాణవు నీకంటె నాకె జాణ
ఈవల నావల మిమ్ము నిద్దరి మెచ్చేము

చ. 1: పయ్యద మాటుసేసుక పలుమారు నవ్వుకొంటా
వుయ్యాలమంచాన నిన్ను నూఁచీఁ జెలి
వొయ్యనె పాదాన నాపెవొడి నీవు దాఁకించఁగ-
నియ్యెడ సిగ్గువడీ నింతలో నీదేవులు

చ. 2: పుక్కిటివిడెముతోడ పొంచి పొంచి చూచుకొంటా
వొక్కట నాకుమడిచి వొసగీఁ జెలి
చక్కనినీకొనగోరు చనుమొన నంటించఁగా
చెక్కు చేతమోపుకొని సిగ్గువడీ దేవులు

చ. 3: తనివోనిగుట్టుతోడ తమకము రేఁచుకొంటా
యెనసి కాఁగిట మోవి యిచ్చీఁ జెలి
ఘనుఁడ శ్రీ వేంకటేశ కళలుమించఁ గూడఁగ
చెనకేచెలులఁ జూచి సిగ్గువడీదేవులు

రేకు: 0919-4 మధ్యమావతి సం: 19-100

పల్లవి: ఏపాటిబత్తిగలఁడో యిటు నామీఁద
దాపుగా నాసుద్దులిట్టె తలపెట్టి చూడవే

చ. 1: మనసు దెలియరాక మర్మము లడుగరాక
వొనగూడి గుట్టుతోడ నున్నదాననే
ఘనుఁ డాతఁ డన్నిటాను కాంతరో నీవై నాను
అనుమానించక మాటలాడించి చూడవే

చ. 2: కూరిమి గొసరరాక కొంగువట్టి తియ్యరాక
వోరుచుక సిగ్గుతోడ నున్నదాననే
నేరుపరి యీతఁడు నెట్టుకొని నీవైనా
చేరి వద్దివారిచేతఁ జెప్పించి చూడవే

చ. 3: బలిమి సేయఁగరాక పాసి వుండఁగరాక
వొలిసి కాఁగిటఁ గూడివున్నదాననే
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నీవయినా
సొలవక కోరికలు సోదించి చూడవే

రేకు: 0919-5 ముఖారి సం: 19-101

పల్లవి: ఏఁటికి నన్ను గుంపించే వేమే నీవు
చాటిచెప్పేవు నాకిది సఫలము గాదా

చ. 1: కుప్పళించి నీవు నాకొంగువట్టి తీసేననే-
విప్పుడే లోకములెల్ల నేలనా నేను
పిప్పిగట్ట నీవు నాతో పెనఁగులాడవచ్చేవు
కప్పుచు నట్టైతే నాభాగ్యముగాదా ఇపుడు

చ. 2: చేరి చేరి నామీఁద చేతులు చాఁచవచ్చేవు
గారవించ నాకిది ఘనతగాదా
ఆరితేరి నామేన నటు గోరు సోఁకించేవు
నేరుపుతో నాకిది నిధానముగాదా

చ. 3: పిక్కటిల్లఁ గాఁగిట బిగియించవచ్చేవు
యెక్కువైనపదవి నా కిదేకాదా
చెక్కు నొక్కి కూడితివి శ్రీవేంకటేశుఁడ నేను
చొక్కపురతు లివెల్లా సోబనముగాదా

రేకు: 0919-6 సింధురామక్రియ సం: 19-102

పల్లవి: ఒద్దనున్నకాంతలకు నుల్లములు గరఁగెను
సుద్దులేమి చెప్పేము చూతువురావయ్యా

చ. 1: పట్టెమంచము మీఁదటఁ బవ్వళించీని చెలియ
నెట్టుకొన్నవేడుకతో నిన్నుఁ దలఁచి
గుట్టున మనోరథాలు గోరుకోంటా ముక్కుమీఁది-
జుట్టవేలితో నున్నది చూతువు రావయ్యా

చ. 2: వొక్కతె యేకతముననండి యుల్లసముతోడ
పక్కన నీమీఁదటి పదాలు వాడి
యిక్కువ నీమోవితేనె కేకట నోరూరుకొంటా
చొక్కి నిట్టూర్పులు నించీఁ జూతువు రావయ్యా

చ. 3: ఇట్టె నీవు రాగా శిరసెత్తి నీమొగము చూచి
గట్టిగా శ్రీ వేంకటేశ కాఁగిట గూడిఁ
నెట్టుకొని రతులను నిన్ను మెప్పించీ దినముఁ
జుట్టి చుట్టి ఇట్లానే చూతువు రావయ్యా

రేకు: 0920-1 సామంతం సం: 19-103

పల్లవి: ఏమిటికిఁ దలవంచే వేల సిగ్గులువడేవు
కామంచి వచ్చెఁగాక గాతసేయవచ్చెనా

చ. 1: మచ్చిక నీతోఁ జెలి మాటలాడ వచ్చెఁగాక
పచ్చిగాఁ జీఁకటితప్పు పట్టవచ్చెనా
ముచ్చటదీరఁగ నీమోము చూడవచ్చెఁగాక
తెచ్చుకొన్నయాకెతో వాదించవచ్చెనా

చ. 2: అట్టె నిన్ను వీడె మడుగఁగ వచ్చెఁగాక
దిట్టయై నీసేతలు సోదించవచ్చెనా
నెట్టన నీసేవసేయ నెయ్యముతో వచ్చెఁగాక
గట్టిగా నీనేస్తాలు కాకుసేయ వచ్చెనా

చ. 3: మిక్కిలి కాఁగిటఁ గూడి మెప్పించవచ్చెఁగాక
కక్కసించి నీపై నద్దికము వచ్చెనా
మొక్కుచు శ్రీ వేంకటేశ మోవి యానవచ్చెఁగాక
పక్కన నాపెను నిన్నుఁ బచ్చి సేయవచ్చెనా

రేకు: 0920-2 మలహరి సం: 19-104

పల్లవి: ఇంతసేతురా యిటువలె రమణుని
యింతిని నిను నెలయించె ననుచును

చ. 1: సారెకు నేఁటికి జంకించేవే
కేరుచు నతఁడు నగె ననుచును
జీరలుగా గోరఁ జిమ్ముదురటవే
వూరకె పరాకై యుండె ననుచును

చ. 2: పెనుఁదురు మేఁటికిఁ బిడికిటఁ బట్టేవే
ననుపున నీతోఁ బెనఁగె ననుచును
అనుగుకుచంబుల నదుముదు రటమే
తనలో నొకతెను తలఁచె ననుచును

చ. 3: జంటల నింతేల చలములు మీ రేవే
నంటున నీతో నెనసెననుచును
ఇంటిలో శ్రీవేంకటేశు జరతురటే
అంటుచు సరసములాడే ననుచును

రేకు: 0920-3 శుద్ధవసంతం సం: 19-105

పల్లవి: వేడుకకు వెలలేదు విభుఁడ వా కెకును
జాడలెల్ల సరివచ్చె సమ్మతాయ మాకును

చ. 1: తచ్చితచ్చి మాటలలోఁ దనవల పఁతయును
యెచ్చరించెఁగా నేఁడు యింతి నీకు
పచ్చిచేఁతలనే నీతోఁ బచరించవచ్చెఁగా ననుపు
యిచ్చకముగాఁ బొంచి యిందరిలోన

చ. 2: సెలవినవ్వులలోనే చేసేటివిన్నపాల్లెలా
తలఁపించెగా నేఁడు తరుణి నీకు
పిలిచేనేరుపులోనే బెరయించెఁగా పగటు
నలువై నీమెచ్చుగాను నడుమఁ దాను

చ. 3: కూడిన కాఁగిటిలోనే గురుతైనకాఁపురాలు
యీడేరఁ జేసెఁగా యీసతి నీకు
జోడై శ్రీవేంకటేశ చొక్కి నన్ను నేలితివి
వీడెమిచ్చెఁగా మఱియు వింతలేక యిపుడు

రేకు: 0920-4 బౌళిరామక్రియ సం: 19-106

పల్లవి: ఏమాయనయా యింతటి లోనే
కామునికి నివి గలసహజములు

చ. 1: చనవరికాంతలు సరసములాడఁగ
ననుపున విభుఁడవు నవ్వితివి
పెనుఁగుచు రమ్మని పేరునఁ బిలువఁగ
పనివడి యట్టే పలికితివి

చ. 2: కొలువు కామినులు కుచములు చూపిన
సొలయుచుఁ దప్పక చూచితివి
కలువ పువ్వులటు కానుక లిచ్చిన
అలరి కరంబుల నందితివి

చ. 3: వూడిగపుసతులు వొడి వట్టుకొనిన
వేడుకతో బెండ్లాడితివి
యీడనె శ్రీవేంకటేశ నన్నెనసి
తోడనె దోమటి దొడికితివి

రేకు: 0920-5 సాళంగనాట సం: 19-107

పల్లవి: వెక్కసపు వలపుల విఱ్ఱవీగేవు
మక్కువలు మారుకొంటే మఱి యేమి సేసేవే

చ. 1: యింతులెల్లా నుండగాను యేకతము నీ వాడేవు
చెంత నుండి విభునికి సేవ సేసేవు
యెంత కెత్తు కొంటివే నీ వించుకాఁ దగవెంచవు
యింతలో దొమ్మి సేసితే నేమి సేసేవే

చ. 2: సరివారిలోననెల్లా చనవుల నెరుపేవు
గరిమ నాతనితోడ గడునవ్వేవు
దొరతన మెంత గద్దే తోడి వారి గైకోవు
నిరతి దొమ్మి గూడితే నీవేమి సేసేవే

చ. 3: కావరించి చెనకేవు కాగిటనుఁ గూడేవు
శ్రీవేంకటేశ్వరునిఁ జెలగించేవు
దేవుల వౌదువే ఆ దేవుడే మమ్మును నేలె
యీ విధాన సంతమైతే నిక నేమి సేసేవే

రేకు: 0920-6 ద్రావిళ భైరవి సం: 19-108

పల్లవి: ఆసపడ్డ వారిని అలయింతురా
పోసరించి యేల జరవులఁ బెట్టేవికను

చ. 1: కన్నులనే మొక్కితి కైదండ నీ కిచ్చితి
విన్నపములు సేసితి వేమారును
యెన్నక యింతటనైనా ఇంటికి రారాదా
సన్నల నెందాకా రచ్చల సేసే విచ్చట

చ. 2: సేవలెల్లా జేసితి చెక్కులు నేనొక్కితి
వేవేలకు గొసరితి వేమారును
చేవదేర మంచముపై జేరి కూచుండరాదా
తోవల చెలులతో సుద్దు లేమిటి కిపుడు

చ. 3: కందువ లిట్టేయంటితి కాగిలించు కొంటిని
విందుగా శ్రీ వేంకటేశ వేమారును
పందెము లేమాడేవు పవ్వళించరాదా
చెందితివి నన్ను నేఁడుఁ చింతలు మరేటికి

రేకు:	0921-1 ఆహిరి	సం:	19-109
పల్లవి:	ఎవ్వరేమి చెప్పేరు యిఁక నీకును
	నివ్వటిల్ల నింకా నవే నేరుచుకోవయ్యా
చ. 1:	ఆసపడి రతులకు నండ నుండి చిత్తమురా
	సెసేఁగా ఆకె నీకు సేవలెల్లాను
	పూసగుచ్చినట్టు చెప్పి బుద్ధులెల్లా నీకు నూరి-
	పోసెఁగా చెవిలోనను పొద్దు వొద్దు నీకును
చ. 2:	వాడికగా నీమీఁద వలపులు చల్లి చల్లి
	వీడెమిచ్చెఁగా నీకు వేడుకతోను
	యేడలేని సుద్దులెల్లా నెచ్చరించి యింతేసి
	తోడ సాము సేయించెఁగా దొరతనమునను
చ. 3:	చెక్కునొక్కి సేసవెట్టి సేఁతలెల్లాఁజేసి చూపి
	చిక్కించెఁగా ఆపె నిన్ను శ్రీ వేంకటేశ
	మక్కువతో నీచేత మన్నింపించి నన్ను మెచ్చి
	మిక్కిలి నవ్వునవ్వెఁగా మేరమీరి నిన్నును

రేకు: 0921-2 మంగళకౌశిక సం: 19-110

పల్లవి: అన్ని సేవలునుఁజేసీ అంగన నీకు
సన్నల నీతో నట్టె సరసమాడీని

చ. 1: కామించి సిగ్గులతోడ కంకణాలు గదలఁగ
వేమారుఁ బాదము లొత్తీ వెలఁది
ఆమనివలపుతోడ నంగమెల్లాఁ జెమరించ
గోమున నప్పటి నీకుఁ గొప్పువెట్టీని

చ. 2: సెలవినవ్వులతోడ చెక్కిన పయ్యద జార
మలయుచు వీడెమిచ్చీ మగువ
పులకచెక్కులతోడ పొందులు తలఁపు రాఁగ
వెలయ సురటి నీకు విసరీని

చ. 3: నిట్టూరుపులతోడ నిండునివ్వెరగుతోడ
గుట్టున గుబ్బల నొత్తీఁ గోమలి
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జట్టిగొని యాపె యింకా చవులు చూపీని

రేకు: 0921-3 సింధురామక్రియ సం: 19-111

పల్లవి: ఎంత నీవు పోతరించి యింపులఁబెనఁగినాను
వంతుకుఁ గొంగువట్టితి వదలకు మనవే

చ. 1: కాతరించి రమణునిఁ గలకాలమెల్లా నీవే
చేతఁ జొక్కించుకొంటివి చెప్పేదేమే
యీతల నాతడే మాయింటికి విచ్చేసె నేఁడు
నీతితోడ నిలువక నేనేల విడుతునే

చ. 2: బలిమితో మగవాని బాసలు చేయించుకొని
యెలయించి కై కొంటివి ఇంకానేమే
వలపించి యాతని నా వద్దికి రప్పించుకొంటి
వెలయ భోగించక నీ వెంట నేలంపుదునే

చ. 3: కందువ శ్రీ వేంకటేశఁ గాఁగిటిరతులఁగూడి
అందరిలో మెరసితి వప్పటినేమే
ముందుముందె నే నాతనిమోవితేనె దక్కఁగొంటి
అందముగఁ బెండ్లాడక అదేల మానుదునే

రేకు: 0921-4 కేదారగౌళ సం: 19-112

పల్లవి: నీవైనా నానతీవయ్యా నెరజాణవు
తావుల నీదేవులైతే దాఁపిరము సేసెను

చ. 1: పొలఁతి నీమాటలకు బొమ్మల జంకించి చూచి
తలవంచి సిగ్గుతోడఁ దడఁ బడీని
అలరి చెలికత్తెలు ఆరహస్య మడిగితే
తెలియఁజెప్పఁగరాక తెరవేసుకొనెను

చ. 2: అప్పటి నీ సేఁతలకు నాయములు సోఁకనాడి
కప్పుకొన్నపయ్యదతో కాఁతాళించీని
వొప్పుగ నూడిగములవువిద లడిగితేను
ముప్పిరి నొడుగరాక ముసుఁగిడుకొనెను

చ. 3: నీవు నవ్వివనవ్వుకు నీతురుము వట్టి తీసి
వోవరిలోపలఁ గూడి వొగి మెచ్చీని
శ్రీ వేంకటేశ నీదేవు లలమేలుమంగ
వోవల నడిగితే నీవుర మెక్కుకొనెను

రేకు: 0921-5 ఆహిరినాట సం: 19-113

పల్లవి: ఏల గడించుకోనేవు యేడలేనికతలును
లోలోనే గుబ్బతిల్లక లోనికి రావయ్యా

చ. 1: చిగురుమోవిమీఁద చిప్పిలుఁదేనే గారితే
వొగరుఁదిట్ల నేవు వూరకే నీవు
మగువ నీమీఁదట మచ్చరించి పలుకఁగ
నిగిడి యింతటిలోన నేవేమి సేసితివి

చ. 2: నలిఁజంద్రవదనాను నవ్వు వెన్నెల గాసితే
అలరుచు నెగసక్కేలనేవు
చెలియ నీమీఁదట చిట్టకము నెరపఁగ
నెలకొన్నయట్టితప్పు నీవేమి సేసితివి

చ. 3: జక్కవ చనుముక్కులు సరివాఁడు లై తేను
వుక్కునఁ గాఁగిట నిన్ను నొత్తెననేవు
అక్కున శ్రీ వేంకటేశ అలమేల్మంగ జరయ
నిక్కి పానుపుమీఁదట నీవేమి సేసితివి

రేకు:	0921-6 సాళంగనాట	సం:	19-114

పల్లవి:	వేడుకకాఁడ వౌదువు వింతమాసటీఁడ వౌదు-
వేడ చూచినా మెచ్చేరు యింతులెల్లా మిమ్మును

చ. 1:	తెఱవఁ బెండ్లియాడి తేరుమీఁద నేఁగిరాఁగా
చిఱుఁజెమటలు గారెఁ జెక్కులమీఁద
మెఱయుచు వీదులను మించి విఱ్ఱవీఁగఁగాను
నెఱవాదిసాముల నిట్టూర్పులు నిండెను

చ. 2:	బాసికము గట్టుకొని పడఁతితో మెఱయఁగ
సేసముత్తేలు చూపట్టె శిరసుల పై
ఆసతో వాడలనెల్లా నారుతులె త్తించుకోఁగా
పోసరించి మోముల గొబ్బున మించెఁగళలు

చ. 3:	అలమేలుమంగఁ గూడి అట్టె వసంతాలాడఁగ
చెలఁగెఁ బులకలు మెయి శ్రీవెంకటేశ
వెలయ నిండ్లనెల్లా విందు తారగించఁగాను
వలపులు మోవిమీఁద వన్నెచూపె నిపుడు

రేకు: 0922-1 అమరసింధు సం: 19-115

పల్లవి: ఎంతబత్తో నీమీఁద నీరమణుఁడు
చెంతనుండి ఇయ్యఁగదే చేతికి బాగాలు

చ. 1: పయ్యదకొంగు పట్టి పతి నీతోఁ బెనఁగీని
ఇయ్యకొని రాఁగదవే ఇంటికి నేఁడు
చెయ్యార నప్పటి నీచెక్కు నొక్కి వేఁడుకొనీ
వుయ్యాలమంచముపైఁ గూచుండఁగదె సరుస

చ. 2: నెట్టుకొనఁ గాఁగిలించి నిన్ను నొడఁబరచీని
అట్టె కానిమ్మనఁగదె ఆతనితోను
వొట్టుకొని పాదము నీవొడిమీఁదఁ జాఁచీని
గుట్టుతో నానతిచ్చి నూఁకొనఁగదె మాట

చ. 3: చెలరేఁగి మంతనాన శ్రీవేంకటేశుఁ డెనసె
ఆలమేలుమంగవు నీవలమఁగదె
పలుమారు నవ్వుతాను బాసికము గట్టీని
చలమెల్లా నీడేరె చల్లఁగదె సేస

రేకు: 0922-2 సాళంగం సం: 19-116

పల్లవి: ఆయనాయ నుండవయ్య అలసితివి
చేయిమీఁదుగా నన్నుఁ జెనకేవు ఇపుడు

చ. 1: వెలి నింతలో నొక్క వెలదిఁకాఁగిట నుండి
కలలోన నొకకాంతఁ గలతువు
యెలమి నీయాసోద మేమిచెప్పే దప్పటిని
కొలఁదిమీరఁగ నాకొంగువట్టే విపుడు

చ. 2: శిర సీవలఁ బెట్టుక చెలితో మాటాడుతానే
తెరలో నొక్కతెఁ గూడి కెరలింతువు
గొరబులుగానీ నీగుణము లెట్టు గనేది
సరి నాపై నిదివో సేసలు చల్లే విపుడు

చ. 3: వెలయ భూకాంతను వీఁపునను మోచుకొని
ఆలమేలుమంగ నురమందు మోచేవు
తెలిసి శ్రీ వేంకటేశ దేవిగా నన్నేలితివి
వలెనని మువ్వంకలా వలచితి విపుడు

రేకు: 0922-3 భైరవి సం: 19-117

పల్లవి: ఆదరించవయ్యా అంగన నింతటనైనా
పోదివలపులు తలపోయుచున్నది

చ. 1: చెప్పరాని ప్రియములు చేరి మీకుఁ జెప్పఁగాను
దప్పి దేరీ మోవిమీఁద తరుణికిని
వుప్పతిల్లు సేవ నీకు వొద్దనుండి సేయఁగాను
చిప్పిలఁగఁ జెమరించె చెక్కులెల్లాను

చ. 2: ననుపులు చేసుకొని నవ్వు నీతోనవ్వఁగాను
నినుపులై నిగిడీని నిట్టూర్పులు
తనియక వీడెమిచ్చి తగ నిన్ను వేఁడుకోఁగా
వొనరెను పులకలు వొళ్ల నెల్లాను

చ. 3: కలికితనాలు చూపి కాఁగిలించు కొనఁగాను
మలసీని కోరికలు మనసునను
అలమేలుమంగ నేలి తట్టై శ్రీ వేంకటేశ
నెలకొనె వేడుకలు నిలువెల్లాను

రేకు: 0922-4 శోకవరాళి సం: 19-118

పల్లవి: ఏమి విన్నవించేము యెుందాఁకా నీకు
నీమనసునఁ గలట్టు నెలఁతను గావుము

చ. 1: పంతగాఁడ వౌదువయ్య పడఁతి నింతసేసేవు
ఇంతకీర్తి గట్టుకొంటి విప్పుడు నీవు
మంతనానఁ జెలువెల్లా మంచివాఁడవని నిన్ను
వంతులకుఁ బొగడేరు వాడలవాడలను

చ. 2: బలువుఁడ వౌదువయ్య బయలీఁదించితి వింత
చల మీడేర్చుకొంటివి సాదువలెనె
సులభాననే నీకీసుకృతము చేరెను
నలుగడ నవ్వేరు నమ్మినట్టివారలు

చ. 3: నిరతపుజాణవయ్యా నేఁ డింటికి విచ్చేసి
గరిమఁ గూడితి వీకెఁ గరుణించి
సిరుల శ్రీ వేంకటేశ చేఁతలు చందము లాయె
ఆరుదుగ మెచ్చేరు అందరు నీకతలు

రేకు: 0922-5 ఆహిరి సం: 19-119

పల్లవి: తెలివ మొక్కు(గా(బిరితియ్యా(దగవుగాదు
గుటిగా మన్నించవయ్య కొసరేల ఇ(కను

చ. 1: పంతమాడ నేరుతువు భావించనేరుతువు
యింతులను లాలించ నెఱ(గవా
అంత నీవు సేసినందు కాకె యలిగివున్నది
సంతము సేసుకోవయ్య చలసేల యి(కను

చ. 2: పెన(గనేరుతువు పెండ్లాడనేరుతువు
అనిశము(జనవియ్య నది నేరవా
యెనయ నిన్న రానందు కిటు మాటాడకున్నది
మనసు నమ్మించవయ్య మర(గేల ఇకను

చ. 3: కలయ(గనేరుతువు కా(గిలించనేరుతువు
అలరి యురమున మోయ(గనోపవా
కలికి శ్రీ వేంకటేశ కైవశమై నీకున్నది
సెలవి నవ్వించవయ్య చెప్పనేల ఇ(కను

రేకు: 0922-6 ముఖారి సం: 19-120

పల్లవి: ఎంతగద్దో నీయాసోద మిప్పు డీకెకు
చింతదీర మనసులో దిక్కువాపరాదా

చ. 1: ననుపున నొకమాఁటు నాతో మాటాడితివంటా
గునిసీ తప్పకచూచి కోమలి నిన్ను
పనివడి నీవాపెతో పచ్చిమాటలెల్లా నాడి
వెనకటిగజరెల్లా విడిపంచరాదా

చ. 2: సమ్మతి నామోము చూచి సరసమాడితివంటా
వుమ్మడిఁ జన్నుల నొత్తీ నువిద నిన్ను
చిమ్ముచు నీకొనగోర జీరలు మేనెల్లాఁ జేసి
దిమ్మరేఁగినమదము తెలుపఁగరాదా

చ. 3: నవ్వుతా నప్పటి నీవు నన్నుఁ గూడితివంటా
రవ్వగా తాఁ గాఁగిలించీ రతికి నిన్ను
యివ్వల శ్రీ వేంకటేశ యెదురుగా నాపెఁ బెట్టి
కువ్వలై నకూటముల గుదిగుచ్చరాదా

రేకు: 0923-1 హిందోళం సం: 19-121

పల్లవి: ఇద్దరివసంతము లీడేరెను
వుద్దండాలు వని ఇంక నూరకుండరాదా

చ. 1: కామిను లిందరు నిన్నుఁ గాఁగిటఁ బెట్టుకుండఁగా
నీమీఁదఁ జెల్లెఁ గా పన్నీరు చెలి
యేమరించి విడిపించు కేతెంచి నీవాకె-
కోమలపుఁజన్నులపై కుంకుమ చల్లితివి

చ. 2: పూడిగాలవారిచేత నొంటి నడెవెట్టించి
జాడతోఁ గప్పురధూళి చల్లెఁగా నీపై
వోడక నీవప్పటిని వొడ్డి తప్పించుక కొప్పు
వీడఁగా నాపెమీఁద విరుల వేసితివి

చ. 3: దొమ్మి నడపాలవారి దోమతెర వేయుమని
చిమ్మెఁగా గంధము నీపై శ్రీ వేంకటేశ
యెమ్మెతో నీకెఁ గూడి ఇంపులచెమటలకు
కమ్మరఁ గమ్మర నట్టె కస్తూరి నించితివి

రేకు: 0923-2 దేవగాంధారి సం: 19-122

పల్లవి: బడలెను పానుపు పరచరే
అడుగరే యిదియేమియని చెలులు

చ. 1: చెలపచెమటలు మైఁ జిప్పిలీని
అలసి వచ్చినాఁడు నేఁడదే విభుఁడు
చలువగాఁ గప్రము పైఁ జల్లఁగదరే
వెలయు సురటిఁగొని విసరరే

చ. 2: పొనుగు నిట్టూరుపుల బుసకొట్టీని
పనిసేసి వచ్చినాఁ డప్పటి విభుఁడు
తనివారఁ జల్లనిగందము మెత్తరే
నినువుగఁ బన్నీరు నించరే

చ. 3: దాఁగక దప్పి మోవులు దడిపీని
కాఁగి వచ్చినాఁడు శ్రీవేంకటవిభుఁడు
పాఁగి వాసించినబాగా లియ్యరే
చేఁగదేర నన్ను నేలె సేవలెల్లాఁ జేయరే

రేకు: 0923-3 పళవంజరం సం: 19-123

పల్లవి: ఎంత వేడుకకాఁడవో యీపెకు నీవు
అంతరంగమెల్లా మాకు నానతీవయ్యా

చ. 1: కాంతకానుక యంత కనుపట్టి వుండెనో
అంతటిలోఁ చేయిచాఁచె వందరిలోన
బంతి నాపెసరస మేపాటి మేన నంటెనో
వింతయి మోముకళల విఱ్ఱవీఁగేవు

చ. 2: చెలియపలుకు లెంత చెవిసోఁకి వుండెనో
అలరి యప్పటి మాఁట లడిగేవు
మలసి యీపెచూపు మర్మము లెట్లంటెనో
తలపోసి రతులకుఁ దమకించేవు

చ. 3: మగువవలపు లెంత మనసునఁ బట్టెనో
నగి నగి సారెసారె నంటుచూపేవు
జిగి నన్నుఁ గూడితివి శ్రీ వేంకటేశ నేఁడు
పొగడి యీపెను నాతోఁ బురుఁడు వెట్టేవు

రేకు: 0923-4 సోమరాగం సం: 19-124

పల్లవి: మాతో నేమి చెప్పేవు మాపుదాఁకాను
యీతరవాతనే నీవు యియ్యవయ్య చనవు

చ. 1: అనరాదుగాక నిన్ను ఆపెయెదుటనే నీవు
ననిచి వేరొకతెతో నవ్వనేఁటికి
మనసిచ్చి యందుకుఁగా మాటలాడదాయ నేమో
పెనఁగి చేవట్టితీసి పెట్టవయ్య విడెము

చ. 2: అట్టు సేయరాదుగాక నెట్టన సతిచెలితో-
నట్టె నీవు జూజము లాడవచ్చునా
ఇట్టె యిందుకుఁగానే ఇంటిలోనే వున్నదేమో
గుట్టున వద్దఁ గూచుండి కూడవయ్య కాఁగిట

చ. 3: తప్పు మోపరాదుగాక తరుణి నిట్టె కూడి
కప్పులు దేరఁగ మోవి గంటి సేతురా
చిప్పిలి యిందుకుఁగాను సిగ్గుపడి వున్నదేమో
అప్పటి శ్రీ వేంకటేశ చెప్పవయ్య ప్రియము

రేకు: 0923-5 వరాళి సం: 19-125

పల్లవి: ఒక్కరు నోచిననోము వొకరికి ఫలియించె
నెక్కొని చూడ నిద్దరు నీదేవుళ్లే కారా

చ. 1: మరిగి మీరిద్దరును మంచముపై నుండఁగాను
తరుణి తొంగిచూచి తలవంచెను
సరసనున్న యాపెకే చాల నీవు వలతువు
నిరతి వెలినున్నాకె నీకే వలచును

చ. 2: కందువ మీ రిద్దరును కాఁగిలించుకుండఁగాను
చెంది వేరొకతె చూచి సిగ్గుపడెను
అంది ఆయాలంటినాపె కటు నీవు చిక్కితివి
విందువచ్చినాకె నీవేడుకకుఁ జెక్కెను

చ. 3: పొంచి మీ రిద్దరు మోవిబువ్వపుతేనె లానఁగా
పొంచుకున్న యాకె తాను పొత్తుగూడెను
యెంచఁగ శ్రీ వేంకటేశ ఇచ్చకుఁడ వొకతెకు
నించి వేరొక్కతెయ్యెతే నీఇచ్చలోనిది

రేకు: 0923-6 సామంతం సం: 19-126

పల్లవి: అంత మనసునఁ గద్దు ఆపెకు నీమీఁదిబత్తి
సంతోస మప్పటిఁ జేసి చనవియ్యవయ్యా

చ. 1: ఘనమైననీదుచక్కనిరూపు చూచిచూచి
తనివి దీర దెంతైనాఁ దరుణికిని
పనివడి నీవలెనే బంగారుపతిమఁ జేసి
వెనుకొ నాపెమోమున వేలఁగట్టవయ్యా

చ. 2: సరసములాడి నీతో సారెకు నవ్వులు నవ్వీ
మరిగియున్నది నీ పై మచ్చికలెల్లా
సరుసఁగూచుండి నీవు చవులుగాఁ జెనకుచు
కెరలించి కెరలించి గిలిగించవయ్యా

చ. 3: ముట్టి నీపాదము లురమున నిడుక వొత్తుచు
యిట్టె పాయదు శ్రీ వేంకటేశ నిన్నును
నెట్టన నన్నేలితివి నీవింకా సొమ్ములు సేసి
మెట్టి నీపాదుకలాపెమెడఁ గట్టవయ్యా

రేకు: 0924-1 శుద్ధదేశి సం: 19-127

పల్లవి: ఏది నిజమని వుందు మెరుఁగించవయ్య మాకు
మేదించి వలపు లిరుమేలాఁ బూసేవు

చ. 1: విన్నపము నేఁజేయఁగ వీనులనే వింటివి
కన్నుల నాపెఁ జూచేవు కమ్మటి నీవు
చన్నులనేనొత్తితేను సరిఁ బులకించేవు
సన్న లాపెకు జేసేవు సారెసారె నిపుడు

చ. 2: మాటలు నే నాడఁగాను మచ్చిక నూఁకొంటివి
గాఁటాన మోవి చూపేవు కడు నాపెకు
యీటున నే నవ్వితేను యిచ్చగించే విందుకు
పాటించి మన సాపెపై నిలిపేవు

చ. 3: పిలిచితే వచ్చితి ప్రియాన మా యింటికి
యెలమి నాసపడేవు ఇంకా నాపెకు
కలసితి విటు శ్రీ వేంకటేశ్వర నన్నును
తొలుతటిపొందు లాపెతోఁ బొదిపేవు

రేకు: 0924-2 పాడి సం: 19-128

పల్లవి: ఎట్టు నమ్మించేవో నీవే యెరుఁగుదువు
ఇట్టె అన్నిపనులు నెంచుకొని వున్నది

చ. 1: మనసు రంజిల్ల నీతో మాటలాడేఁగాని చెలి
వెనుకటిసుద్దులెల్లా వినియున్నది
యెనసి వేడుకతో నీ కిచ్చమాడీఁ గాని
అనుగు నీ గుణములు అరసే నన్నున్నది

చ. 2: సెలవి నవ్వుదెచ్చుక చేరి నీతో నవ్వేఁగాని
కలికి నీచేఁతలెల్లాఁ గని వున్నది
వలచినదై నీతో వాదించఁజాలదు గాని
సొలసి నిన్నేకతాన సోదించే నన్నున్నది

చ. 3: ఆసలు మానఁగలేక అట్టెనిన్నుఁ గూడేఁగాని
బాసలు నేయించుకొన్నఁబరగున్నది
లాసి శ్రీ వేంకటేశ నీలాగు దెలిసెఁగావి
మూసినముత్యమై నీ ముంగిటనే వున్నది

రేకు: 0924-3 బౌళి సం: 19-129

పల్లవి: ఇంకానేల దాఁచేవు యెదురుగుదురుగాను
పొంకపు నీగుణములు యీ బూమెల్లా నెఱఁగదా

చ. 1: పుంకించి నిన్నిందరిలో వొడివట్టి తీసితేను
జంకించి వద్దని యేల సన్నసేసేవు
కుంకుమచన్నులచొప్పు గురిగా నీ మేన నంటె
లంకెల నీసుద్దులు యీలలన లెరఁగరా

చ. 2: జల జాక్షులనుఁ గూడ జాణవని పొగడితే
నెలిమి నోరేల మూనే వింతలోనను
పలుసోఁకులమచ్చము పట్టిఇయ్యఁదొడఁగెను
వొళవై ననీవోజు యీవొద్దివా రెరఁగరా

చ. 3: సొరది నీనాసంది చుట్టరికాలు చెప్పితే-
నెరవు నేయకుమని యేల మొక్కేవు
నిరతి శ్రీ వేంకటేశ నిలువెల్లాఁబచ్చిదేరె
పొరి నీపొందు లిరుగుపొరుగు లెఱఁగరా

రేకు: 0924-4 ఆరిబి సం: 19-130

పల్లవి: ఒక్కరిఁ గాదనలేక వూరకున్నాఁడవు నీవు
మక్కువతో నెవ్వరిపై మనసున్నదయ్యా

చ. 1: ఇంతి నిన్నొకతె తమఇంటికిఁ బిలిచితేను
పంతాన వేరొకతె చెయివట్టి తీసీని
వంతులకు నిరుమేలా వలపులు దైవారి
పొంతల నెవ్వరితోడ పొందుసేసేవయ్యా

చ. 2: కోమలి యెకతె నీకుఁ గొప్పు గడుదువ్వితేను
వేమారుఁ బాదాలొ త్తీ వేరొక్కతె
నేమాన నెదురుబడి నెయ్యము లాసలు చూపి
చేముంచి యెవ్వరిచేత సేవగొనేవయ్యా

చ. 3: కందువ నొకతె నిన్నుఁ గాఁగిలించి కూడితేను
సందడిఁ బెండ్లాడీని సరి నొక్కతె
ఇందులోనే కూడితివి యిద్దరి శ్రీ వేంకటేశ
విందుచెప్పి యెవ్వతెకు వీడెమిచ్చేవయ్యా

రేకు: 0924-5 శంకరాభరణం సం: 19-131

పల్లవి: గుట్టున నుండవే కోమలి
జట్టిగొనుచు నిను జరసీ నిపుడు

చ. 1: సముకాన నతఁడు సరసమాడఁగా
తమకించకువే తరుణీ
చెమటలు నీమేనఁజిప్పిలఁగఁజూచి
తిమురుచు రమణుఁడు తెగడీ నిపుడు

చ. 2: చెలిమి సేసి పతి చేకొనఁగానే
బలిమి సేయకువె పడఁతీ
పులకలు చెక్కుల పొదిగొనఁగనుగొని
నలుగడఁదా నటు నవ్వీ నిపుడు

చ. 3: సొరిది శ్రీ వేంకటేశుఁడు గూడఁగానె
గరిసించ నేఁటికే కలికీ
నిరతి మోమునఁ గళ నిండఁగ దిష్టించి
కెరలుచు నీతఁడే కేరీ నిపుడు

రేకు: 0924-6 సౌరాష్ట్రం సం: 19-132

పల్లవి: చెప్పరయ్య వూడిగాలు సేసేము నేము
చిప్పిలు మోవితేనెలు చిమ్మనేల సిగ్గులు

చ. 1: మచ్చికలు దైవారె మదనకళలు దేరె
యిచ్చలో నిద్దరికిని యింపులు మీరె
తచ్చి సతు లాడుకొంటే తలవంచుకొననేల
పచ్చియైతి రిఁకనేల పలుమారు సిగ్గులు

చ. 2: అంగాలఁ జెమట మించె ఆసలు లోలోఁ బొంచె
రంగుగా నిద్దరి సింగారములు ముంచె
ముంగిటిచెలులతోడ మూసి మంతనములేల
యింగిత మెఱఁగవచ్చె నిఁకనేల సిగ్గులు

చ. 3: తలపోఁతలెల్లా దక్కె తనువులు కడుఁ జొక్కె
కలసితి రిద్దరిభోగములు నిక్కె
యెలమి శ్రీవేంకటేశ యిందరితో మఱఁగేల
యెలుఁగెత్తి నవ్వరాదా యిఁకనేల సిగ్గులు

రేకు: 0925-1 ఆహిరినాట సం: 19-133

పల్లవి: మాముందర నింత యాల మతకాలు నెరుపేవు
గామిడివి గావోయి కడపరాయా

చ. 1: కందువ సేవలు సేసి కడునవ్వులు నవ్వీని
పొందు గద్దో తొల్లి నీకుఁ బొలఁతితోను
విందు చెప్పవచ్చీని విడెము చేతి కిచ్చీని
అందెనో వొడఁబాట్లు ఆపెకు నీకు

చ. 2: ఆసల చూపులు చూచి అంటి ముట్టి పెనఁగీని
బాస సేసితివో తొల్లి పడఁతికిని
సేసలు పైఁజల్లీని చెంగట గొలువు సేసీ
ఆసుద్దు లొనగూడెనా ఆపెకు నీకు

చ. 3: కాయము చన్నుల నొత్తీ కాఁకదేరి మాటలాడీ
ఆయనా చుట్టరికము అంగనతోను
యీయెడ శ్రీ వేంకటేశ ఇటు నన్ను నేలితివి
ఆయితమా పెండ్లికి ఆపెకు నీకు

రేకు: 0925-2 రామక్రియ సం: 19-134

పల్లవి: ఏమి జాణతనా లాడే వింకా నీవు
ఆమాటే నిక్కమౌనె ఆతని వలనను

చ. 1: సుదతిరో నీవద్దఁ గూచున్న చుట్ట మెవ్వఁడే
మదనగురుఁడే వీఁడు మాయింటిలోన
అదియేమె నావిభుఁడౌట నీ వెఱఁగవా
కదిసి నన్నేలేనంటేఁ గాదనఁగవచ్చునా

చ. 2: యెవ్వరితో నవ్వితివే యిందాఁకా నీవు
నివ్వటిల్ల గిలిగించీనే కృష్ణుఁడు
యివ్వల నాకిచ్చిన బాసెరఁగవా
చివ్వనఁ బొందు సేయఁగ సిగ్గులు వడుదునా

చ. 3: నీమంచమేపై నెవ్వఁడు నీటు చూపీనే: నన్నుఁ
బ్రేము శ్రీ వేంకటేశుఁడు పెండ్లాడెనే
ఆముందే నన్నుఁ బెండ్లాడె నదెరఁగవా
నామగఁడ ననఁగా మాననఁగవచ్చునా

రేకు: 0925-3 కన్నడగౌళ సం: 19-135

పల్లవి: అలసేవు సొలసేవు అప్పుడే నీవు
వలపు రేచుటగాక వట్టిసట లేఁటికే

చ. 1: సరసమాడేవిభుఁడు చన్ను లెంతపిసికినా
కరఁగి కూడుటగాక కసరనేలే
గొరబుగాఁ గూడేవాఁడు గోర నెంత వూఁదినాను
దొరసి మెచ్చుట గాక దూరనేఁటికే

చ. 2: మగఁడైనవాఁడు రతి మచ్చరము చూపితేను
నగుట గాక మాఁటలవెగటులేలే
తగుల మోహించువాఁడు తమకించి పాదిగితే
సొగిసి లోనౌటగాక బిగియనేలే

చ. 3: సందడిఁ బెండ్లాడేవాఁడు సారెఁ బువ్వులవేసితే
విందులఁజొక్కుటగాక విసువులేలే
యిందరిలో శ్రీ వేంకటేశుఁడిట్టె నిన్ను నేలె
సందుకొనవలెఁగాక చలపట్టనేలే

రేకు: 0925-4 దేశాక్షి సం: 19-136

పల్లవి: కంటిమయ్యా నీచేఁతలు కన్నులపండుగగాను
పెంటలైన ముచ్చటలే ప్రియము నీకు

చ. 1: మంతనమాడేటివేళ మజ్జనమాడేటివేళ
ఇంతితోడి సరసము లింపులు నీకు
అంతలోఁ గప్పురకాపు అవధరించేటివేళ
సంతతపు వసంతము చవులు నీకు

చ. 2: పొందులవేళలఁ దట్టుపుణుఁగు పూసేటివేళ
ఇందుముఖితోడిమాట లితవు నీకు
చెందమ్మి పూవుదండలు సింగారించుకొనేవేళ
విందుల మోవియీవులు వేడుక నీకు

చ. 3: సొలసి నవ్వేటివేళ సొమ్ము లిడుకొనేవేళ
అలమేల్మంగకూటమి అనువు నీకు
యెలమి శ్రీ వేంకటేశ ఇద్దరుఁ బెండ్లాడేవేళ
కొలువులోని మొక్కులు కొసరు నీకు

రేకు: 0925-5 సౌరాష్ట్రం సం: 19-137

పల్లవి: అందులోనే వున్నవివె అన్ని విన్నపములును
కందువతోడఁగలసీ కరుణించవయ్యా

చ. 1: చెక్కులపై వెడజారుఁజెమట నీపచ్చడాన
గక్కనఁ దుడుచుకొనీఁ గామిని
వెక్కసపుఁ గుచముల వెట్ట దీర నీ చేతుల
అక్కరతో నద్దుకొనీ నప్పటప్పటికిని

చ. 2: ఆలయిక లెల్లాఁ దీర నండ నున్న నీమీఁద
పలుమారు నొరగీని పడఁతి
నిలువుఁగొప్పు వీడితే నిన్నే ముడువుమనీ
తలఁపించి విరహపుతమకముతోడను

చ. 3: తెల్లమిగాఁ దనదప్పి దేరుచుకొని మోవి
మెల్లనే చేకొనీ నలమేలుమంగ
చెల్లుబడి నీకాఁగిట శ్రీవేంకటేశుఁడు గూడి
యిల్లిదే నిన్నుఁ బొగడి యిచ్చకమాడీని

రేకు: 0925-6 శంకరాభరణం సం: 19-138

పల్లవి: ఇంకనేమి గడ మిందరికి
పొంకముగా నిటు భోగించఁగలఁడు

చ. 1: జగడములడిచినసవతుల కెల్లా
తగవులు చెప్పఁగఁ దాఁ గలఁడు
వెగటునఁదనతో వెంగెములాడిన
మగిడి వేఁడుకొన మఱి తాఁ గలఁడు

చ. 2: ప్రియపడి కాంతలు పెనఁగి యలసితే
దయలు దలంచఁగఁ దాఁ గలఁడు
రయమునఁ దనకై గాఁపుగ వలచిన
నయమున నవ్వుచు నమ్మించఁగలఁడు

చ. 3: పతమై వనితలు సరిఁ బెండ్లాడిన
తతిగొని కూడఁగఁదాఁ గలఁడు
యితవై శ్రీ వేంకటేశుఁడు తానె
గతియై మమ్మేలెఁగమ్మటిఁగలఁడు

రేకు: 0926-1 ఆహిరి సం: 19-139

పల్లవి: వద్దనేమా మిమ్ము నేము నట్టి దూరు మాకేల
పొద్దువొద్దు దప్పకుండా భోగించరాదా

చ. 1: మరిగినచెలి నీపై మచ్చికలు చల్లఁగాను
తొరలింపుఁ దమకాన తోఁగి చూచేవు
ఇరవైనఅడియాస లింతగలవారు మీరు
గరిమలఁ జలివాయఁ గాఁగిలించరాదా

చ. 2: పొంచిపొంచి యాపె నిన్ను పూవులను వేయఁగాను
చఁచలించి యట్టె నీవు సన్నసేసేవు
మంచితనముల నింతమరిగినవారు మీరు
కొంచక పీఁటమీఁదటఁ గూచుండరాదా

చ. 3: వెనకనుండాపె నేఁడు విడెము నీకియ్యఁగాను
యెనసితివి శ్రీ వేంకటేశ ఆపెను
మనసార నలమేలుమంగను నన్నేలితివి
పెనఁగనేల ఇద్దరూఁ బెండ్లాడరాదా

రేకు: 0926-2 పాడి సం: 19-140

పల్లవి: పొద్దువోక నీవు వట్టి పొందులు సేసేవుగాక
వొద్దనాపె వుండగాను వొరు లితవయ్యేరా

చ. 1: చెంగట నేపొద్దు నీకు సేవలు సేసీనాపె
వుంగిటి నెదుట నిలిచున్నది ఆపె
సంగతిగా నవ్వునవ్వి సరసమాడీ నాపె
సింగారపు సతులెల్లాఁ జిత్తానఁ బట్టేరా

చ. 2: వేడుకతో సారె మోవివిందులు వెట్టీ నాపె
యీడుజోడై నీకు విడేలిచ్చీ నాపె
యేడలేని విన్నపాలు ఇట్టె సేసి నాపె
వాడవారి మీఁద నీకు వలపు వుట్టీనా

చ. 3: సందుకొని కాఁగిలించి చన్నుల నొత్తీ నాపె
మందె మేళపుటలమేల్మంగే ఆపె
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సందిగొందులవారిని సరకు గొనేవా

రేకు: 0926-3 భైరవి సం: 19-141

పల్లవి: గక్కన లాలించరాదా కాఁగిట నించఁగరాదా
చెక్కుచేతితో నిదెంత సిగ్గులువడేవు

చ. 1: చలివాసి నీతోను సరసమాడీ నదె
మొలకచన్నులు నీపై మోపీ నదె
చెలఁగి చుట్టరికము చెప్పీ నింతలోన నదె
చెలిఁ జూచి నీవెంత సిగ్గులువడేవు

చ. 2: కడువెల్లవిరిగాను కన్నుల మొక్కీ నదె
వొడిమీఁదఁగూచుండి వొరసీ నదె
జడియుఁదమితో మోవిచవు లడిగీ నదె
చిడుముడి నీవెంత సిగ్గులువడేవు

చ. 3: చెనకుచు నిను గూడిసేవలు సేసీ నదె
మనసిచ్చె నలమేలుమంగ నీ కదె
ఘనుఁడ మమ్మేలితివి కందువ శ్రీ వేంకటేశ
చినుకుఁజెమట నెంత సిగ్గులువడేవు

రేకు: 0926-4 శ్రీరాగం సం: 19-142

పల్లవి: నాఁడే నీవిచ్చినబాస నమ్మి వున్నారము నేము
పోఁడిమిఁ దలచవయ్యా పొంతనే మాసేవలు

చ. 1: పఱపుపైఁ బవళించి పడఁతి విడె మియ్యఁగ
నెరిసరసము గడునిండా నాడేవు
యెఱుకతో సంతోసాల నెంతపరాకై నాఁగద్దు
మఱవకురయ్యా మాపై మన్నన లెప్పుడును

చ. 2: గద్దెమీఁదఁ గూచుండి గందము నీకుఁ బూయఁగ
వొద్దిక నాపెతోడ నవ్వులు నవ్వేవు
కొద్దిలేనివలపులు కోటానఁగోటులు మీకు
సుద్దులు దలఁచి దయఁజూడవయ్యా మమ్మును

చ. 3: కొలువులోనిలుచుండి కూరిమి నీపైఁ జల్లఁగా
అలమేలు మంగ నురమందు నించేవు
తొలుతె శ్రీ వెంకటేశ దొరసితి రిద్దరును
అలరి మమ్మేలి మాయంకల రాఁగదవయ్యా

రేకు: 0926-5 పాటి సం: 19-143

పల్లవి: కమ్మటి నెవ్వరినైనాఁ గాకు సేసీని
ఇమ్ముల నాసోదము యెంత గద్దో చూడరే

చ. 1: కొలువై వున్నాఁడు వాఁడె గోవిందరాజు మించి
చెలు లిద్దరు పాదాలు చేరి యొత్తఁగా
చెలరేఁగి నవ్వుకొంటా శేషునిపైఁ బవళించి
పలుమారు వలపులు పచరించీఁ జూడరే

చ. 2: తగవులు దిద్దీ వాఁడే తమితో గోవిందరాజు
మగువ లందెంది యాకుమడిచియ్యఁగా
జిగి మర్మాలంటుకొంటా చిత్తరువుమేడలోన
వెగటులేని మోహము వెదచల్లీఁ జూడరే

చ. 3: కదిసీ నదివో శ్రీ వేంకటాద్రి గోవిందరాజు
సుదతులు కాఁగిట మెచ్చులు మెచ్చఁగా
గుదిగొన మోవియిచ్చుకొంటా నేకతమున
పొదిగొన్నమచ్చికలు పోదిసేసీఁ జూడరే

రేకు: 0926-6 మలహరి సం: 19-144

పల్లవి: ఏఁటికి గుంపెన లీఁకనేలేనీకు
కూటమిరతులకుఁ గొసరఁగరాదా

చ. 1: వొడివట్టుచునుఁ బతి వొడఁబరచఁగాను
జడియుచుఁ బలికి కసరుదురటే
అడరి కెమ్మోవితేనియలు గురిసీ నదే
తొడరి నీవుబువ్వము దొడుకఁగరాదా

చ. 2: నమ్మిక లొసగుచు నవ్వులు నవ్వఁగాను
చిమ్ముచు నాఱడి యింతసేతురటే
వుమ్మడిఁగుచము లాతఁడొరసీ: వలపులు
నెమ్మి చుట్టరికములు నెఱపఁగరాదా

చ. 3: కలయుచుఁ గాఁగిట కందువ లంటగాను
కెలయుచుఁ గడును జంకింతురటే
యెలమిని శ్రీ వేంకటేశఁడు మన్నించీని
పలుకుఁబంతముల పై కొనరాదా

రేకు: 0927-1 కన్నడగౌళ సం: 19-145

పల్లవి: ఇంతసేసినవాఁడవు యీడేరించుకొనరాదా
వింతలాయఁ జేఁతలెల్ల వెరుపేల నీకును

చ. 1: పొందులేనివాఁడవైతే పొంతఁ గూచుండఁగనేల
ఇందుముఖి నీతోడ నేల నవ్వీని
మందలించి నన్నునేల మాటల భ్రమఇంచేవు
సందుకొంటి విఁక వట్టిసటలేల నీకును

చ. 2: ఆసలేనివాఁడవైతే లాసి ఇట్టె చూడనేల
మోసదీర సతి నీకు మొక్కఁగనేల
బాసలిచ్చి నన్నునేల పై పై నొడఁబరచేవు
రాసికెక్కితివి విచారములేల నీకు

చ. 3: చుట్టమవు గాకుంటే సుద్దులు చెప్పఁగనేల
ఇట్టె ఆయింతి విడె వియ్యవచ్చునా
నెట్టన శ్రీ వేంకటేశనేఁడు నన్ను నేలితివి
గుట్టెల్లాఁ దెలిసితిమి కొంకనేల నీకు

రేకు: 0927-2 వరాళి సం: 19-146
పల్లవి: నీ వొళ్ళుఁ గల్లలేకుంటే నిండుక వుందువుగాక
చేవదేరి వుండఁగాను సిగ్గువడ నేఁటికి
చ. 1: మొగము చూచి చెలి మొక్కలు నీకు మొక్కఁగా-
నెగసక్కేలంటా నేల యెంచుకొనేవు
నగుతా నాపె నిన్ను నాయము లడుఁగఁగాను
వెగటువెంగేలంటా వీఁగఁగ నేమిటికి
చ. 2: మక్కువతో నేడలేనిమాట లింతి యాడఁగాను
వెక్కసము లందులో భావించి చూచేవు
యిక్కువ నాపె నీకు నిచ్చకములు ,చూపఁగ
పక్కన నొరపు లట్టె పట్టఁగ నేమిటికి
చ. 3: మనసిచ్చిన సతి నీ మర్మములు ముట్టఁగాను
తనివోని సిగ్గుతోడఁ దలవంచేవు
ఘనుఁడ శ్రీ వేంకటేశ కందువ నన్నేలితివి
పెనఁగీఁ గాఁగిట నాపె బిగువులేమిటికి

రేకు: 0927-3 నట్టనారాయణి సం: 19-147

పల్లవి: దేవరవు గావా తెలిసితి మల్లనాఁడె
చేవదేరిన పనులు చెప్పనేల యిఁకను

చ. 1: జఱసి జఱసి నీ యాచారము లేమి చెప్పేవు
యెఱఁగనా నీ సరిత లింతక తొల్లి
యెఱుకలు సేసి నివు యెచ్చరించ నిపుడేల
మఱచేవా నీకతలు మాటికి మాటికిని

చ. 2: వెంటనే పొగడుకొని విట్టవీఁగే వెంతేసి
కంటిగా నీ గుణములు గరగరగా
పెంటలుగాఁ బచారించి పెనఁగులాడఁగనేల
జంటగాక విడిచేవా చలముతో నీవు

చ. 3: పుక్కిటివిడె మిచ్చి పొంచి వొడఁబరచేవు
దక్కెఁగా నీకాఁగిలి తతితోడను
గక్కన శ్రీ వెంకటేశ కలసితి విదె నన్ను
తక్కువయినవా నీ తగిన మన్ననలు

రేకు: 0927-4 దేసాళం సం: 19-148

పల్లవి: అన్నియుఁ దెలిసినవే అందరును
వెన్నలో నేతివంటిది వేడుక నీ ప్రియము

చ. 1: మొక్కలాన నాకె నిన్ను మోత నొకమాటాడితే
వెక్కసములాడేవు వేమారును
మక్కువ మీ ఇద్దరికి మాటలే వాండ్లుగాని
లక్కవంటి వెంచిచూడ లవి మీ మనసులు

చ. 2: చిట్టకాన కాపె నీపై జెనకి చేయిచాఁచితే
వొట్టుకొని పెనఁగుతా నొడ్డుకొనేవు
గుట్టుతోడ నుండేవి మీ గుణము లింతేకాని
పట్టుజిగురువంటిది పాయనిమీవలపు

చ. 3: చెలిమిసేయుచు నాపె సెలవుల నగితేను
చెలరేగి నవ్వేవు శ్రీ వేంకటేశ
బలిమి చూపేవి మీ పంతము లింతేకాని
తలిరులవంటివి బిత్తరపు మీ మోవులు

రేకు: 0927-5 బౌళిరామక్రాయ సం: 19-149

పల్లవి: నీదుసేతలకు నీవే దిష్టము
మేదివి నేమెల్లా మెచ్చితిమయ్యా

చ. 1: యీడగుకాంతలు యింటనే వుండఁగ
వాడలసతులకు వలచితివి
వోడక క్షీరాబ్ధినుండి రేపల్లెను
తోడనే వెన్నలు దొంగిలినట్లు

చ. 2: వుంగిటివాసన లొడలనే వుండఁగ
అంగడి గందము లడిగితివి
బంగారు పీతాంబరము నీకుండఁగా
చెంగటికోకలు చేకొన్నట్లు

చ. 3: ఆసఁ గౌస్తుభము అక్కున నుండఁగ
శ్రీ సతి నురమునఁ జేర్చితివి
సేస శ్రీవేంకటశిఖరు కుండఁగ
రాసికుచగిరుల రమించినట్లు

రేకు: 0927-6 నాదరామక్రియ సం: 19-150

పల్లవి: అందుకేపో చింతించీ నప్పటినుండి
చెంది వేడుకొనవయ్యా చెలిని యీ వేళను

చ. 1: గుట్టున నుండినదాని గోరు చంటిమీద దీసి
నట్టనడుమ నూరకే నవ్వితివట
అట్టె అదియునుగాక అలయించి యేమిటికో
బట్టుగా గేరడము లిట్టె యాడితివట

చ. 2: ముప్పిరిసిగ్గరిదానిముసుగు దీసి మోమెత్తి
తప్పక చూచితివట త త్తరానను
అప్పటి వేరొకతెతో నాపెరహస్యములెల్లా
చెప్పి మోవిమీఁద గంటిసేసితివట

చ. 3: చెలఁగి కూడినదానిచీర నీవు గట్టుకొని
యెలమిఁ బచ్చడ మాపె కిచ్చితివట
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశుఁడ
నిలువు గల్కితగాలు నేర్పితివట

రేకు: 0928-1 దేశాక్షి సం: 19-151

పల్లవి: చెల్లదా నీవేమేమి సేసినా నీకు
వెల్లవిరిగా నేల వింతలు సేసేవు

చ. 1: చీటికిమాటికి నన్ని సేఁతలెల్లా జేసివచ్చి
మాటలెన్ని యాడేవు మాతోడను
నాటకుఁడ నిన్నుఁ జూచి నగితే నాముందరనే
యేఁటికి బాసలు సేసే వింకా నీవు

చ. 2: వోపిక నీవొళ్ళినేరా లొక్కటొక్కటి యెంచితే
చూపు లేమిచూచేవు సోద్యముగాను
వై పెరిఁగి నేను నీవలపు సోదించితేను
పై పై నన్ను నెంత వొడఁబరచేవు నీవు

చ. 3: మాఁ గినమోవిమీద మణులెల్లా నించుకొని
కాఁగిట నెట్టు గూడితి కమ్మటి నన్ను
వీగకు శ్రీవేంకటేశ వేఁడుకొని మొక్కితేను
నాఁగువారఁ బొందులెల్లా నడపేవు నీవు

రేకు: 0928-2 మాళవిగౌళ సం: 19-152

పల్లవి: కానుకకు జేయిచాఁచీ గమ్మటిఁ దాను
నానిచెమటతో సన్నలుసేసీని

చ. 1: ఆమనికాలము వచ్చె నంగనవలపు హెచ్చె
యేమని విన్నవింతమే యీతనితోను
కామునమ్ములు వాఁడెక్కె కమ్మటిఁ జిగురులు నిక్కె
నాములువారఁ దా నింక నవ్వులు నవ్వీని

చ. 2: చందురుఁడు నుదయించె జవ్వన మీ కెకు మించె
కందు వేడ జూపుదమే కాంతునికి
మందమారుతము రేఁగె మలసి యలులు మూఁగె
చెంది మోము చూచితేనే సిగ్గులువడీని

చ. 3: కోకము లొద్దికిఁ జేరె గుబ్బచన్నుఁ గవ మీరె
చేకూరిచే దెట్లానే శ్రీవేంకటేశు
దాకొనె నిద్దరిసొంపు దైవారె రతులముంపు
కై కొని పొగడితేనే కళలుదేరీని

రేకు: 0928-3 కురంజి సం: 19-153

పల్లవి: మెచ్చవలదా నీవు మెలుఁతనేరుపులకు
హెచ్చుకుందు లెంచుకొని యెగ్గులువట్టుదురా

చ. 1: పంతమాడి నీమోవిఁ బచ్చిసేఁత సేసితేను
కాంతనేల దూరేవు గద్దెనతోను
దొంతినున్నవలపులు దోమటిదొడికితేను
చింతతోడ నిపుడేల శిరసువంచేవు

చ. 2: ఇట్టె జవ్వనమదాన నెంగిలి నిన్నుఁ జేసితే
తిట్టులేల తిట్టేవు దీకొనుచు
గుట్టుతోడఁ దరితీపుగుణ మేరుపరచితే
వొట్టుకొని చింతలేల వొడిగట్టుకొనేవు

చ. 3: రావాడి కడపలోన రతి నలయించితేను
శ్రీవేంకటేశుడ యెంత చిమ్మిరేఁగేవు
వేవేలుతమకముల వీడుదోడు లాడితేను
చేవదేర నెంతేసి సెలవి నవ్వేవు

రేకు: 0928-4 శుద్ధదేశి సం: 19-154

పల్లవి: ఆతనినేల కొసరే వప్పటి నీవు నీ-
యేతులెల్లాఁ జూచెఁగదె ఇందాఁకాను

చ. 1: నిన్నుఁ బేరుకొని పిల్చి నీతోనే మాటలాడి
యెన్నికలు సేసెఁగదె ఇందరిలోన
విన్నపాలెల్లా విని వీడెము చేతికిచ్చి
ఇన్నిటా లాలించెఁగదె ఇందాఁకాను

చ. 2: సరసములెల్లా నాడి సంగడినే కూచుండి
అరుదుగా మొక్కెఁగదె అండనే వుండి
తెరవేసుకొని మోవితేనియలు నీకొసగి
ఇరవుగా నవ్వెఁగదె ఇందాఁకాను

చ. 3: వొడివట్టి నినుఁ దీసి వొద్దిక జూజాలాడి
జడిగొనఁ గూడెఁగదె చవికెలోన
చిదుముడి నన్నునేలె శ్రీవేంకటేశుఁడు నేఁడు
యెడయఁడుగదె నిన్ను నిందాఁకాను

రేకు: 0928-5 ముఖారి సం: 19-155

పల్లవి: సొరిది నీసరితలు చూచితిఁగాక
సిరులనీసేవలు సేయక విడిచేనా

చ. 1: కప్పురాన వేసేవు కడుసన్నలు సేసేవు
యెప్పుడు నీసుద్దులు నే నెఱఁగనివా
దప్పిదేరఁ బలికేవు తమితో బుజ్జగించేవు
చెప్పినట్లు నే నీకు సేయకుండేనా

చ. 2: విరులెల్లా ముడిచేవు వీడెము నాకిచ్చేవు
మరిగి నీమేలు నేను మఱచితినా
పొరిఁబొరిగుణములు పొగడేవు నావద్ద
తిరముగా నిట్టె సమ్మతించక మానుదునా

చ. 3: కలకలనవ్వేవు కాఁగిట బిగించేవు
తొలుతనే నే నిన్ను సంతోసించనివా
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలవైననాకు నవి నేఁడు గొత్తలా

రేకు: 0928-6 హిందోళవసంతం సం: 19-156

పల్లవి: జవ్వనపుదాన వింత చలమేఁటికే
చివ్వన వీడె మొసగి సేవ నేయవే

చ. 1: మక్కువతో రమణుఁడు మంచిమాట లాడఁగానే
వెక్కసములాడి యేల వేగిరించేవే
పక్కన నందుకుఁగాను పైఁ జేయివేసితేను
మొక్కలానఁ గాతాళించి మో మేల వంచేవే

చ. 2: నయమిచ్చి యాతఁడు నవ్వు నీతో నవ్వఁగాను
రయమున నీవెంత రవ్వసేసేవే
ప్రియమున నప్పటిని పెనఁగి పొందుసేయఁగ
నియమానఁ జలపట్టి నీవేల లోఁగేవే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుడు చేరి నిన్ను గూడఁగానే
కావరించి నీవేల కక్కసించేవే
చేవదేర మీఁద మీఁదజిమ్మి రేఁగ మన్నించఁగా
వే వేలు విధాల నెట్టు వెరగందేవే

రేకు: 0929-1 ఛాయానాట సం: 19-157

పల్లవి: ఇట్టె రాఁగదరా యింటిలోనికి
పుట్టిపడి బిగియఁగ నొద్దురా ఇఁకను

చ. 1: జవ్వనపాయమువారు చలమునఁ బెనఁగితే
రవ్వలై వలపులు మేరలు మీరును
పువ్వువంటిదాన నేను పొరుగున నుండి నీవు
వువ్విళ్లూర నింత సేయవొద్దురా నీవు

చ. 2: ప్రేమగలుగువారు బీరములు చూపితేను
దోమటితమకములు చూరుకెక్కును
కామించినదాన నేను ఘనుఁడ విన్నిటా నీవు
వోముచు గుట్టున నవ్వనొద్దురా ఇపుడు

చ. 3: ఆలుమగఁడైనవారు ఆసల నూరకుండితే
చాలుకొన్న తరితీపు సందడించును
మేలిమి శ్రీ వేంకటేశ మెచ్చి నన్ను నేలితివి
వోలవేసి కొసరఁగనొద్దురా ఇఁకను

రేకు: 0929-2 బౌళి సం: 19-158

పల్లవి: కంటిమి వింటిమి నేఁడు కందువగాను
వొంటిఁ జిక్కించుక నిన్ను నొరసే దేమి

చ. 1: నిక్కి నీవు సేయించుకొనిన గురుతులెల్లాను
చెక్కులనే వుండఁగాను చెప్పేదేమి
పిక్కటిల్లుఁజెమటలు పిచ్చిలి మేననుండఁగ
అక్కడి నీసుద్దులెల్లా నడిగేదేమి

చ. 2: పెనఁగి యెక్కడనో తెప్పించుకొన్నవుంగరము
కొనవేల నుండఁగానే కొసరేదేమి
వెనకటి నీపొందులు వెంటనె వచ్చివుండఁగా
దినదినము నీతోఁ దెలిపేదేమి

చ. 3: కాముకళలెల్లా నొక్కగనియై నేఁడింతలో నీ-
మోముననే వుండఁగాను మొరఁగేదేమి
ఆమని శ్రీవేంకటాద్రి అహోబల నరసింహ
చేముంచి నన్నేలితివి సిగ్గువడదేమి

రేకు: 0929-3 పాడి సం: 19-159

పల్లవి: ఎవ్వరిముందరఁ జూపే వేడలేనినీగుట్టు
నవ్వులేమి నవ్వేవు నాలితనమునను

చ. 1: విన్నవించీ నాపమాట వినుకొనరాదా
యెన్నిపరాకులు సేసే వెఱిఁగివుండే
సన్న సేసీ నివెల్లా జాడతోఁ జూడరాదా
కన్నులేల మూసేవు కడుసిగ్గుతోడను

చ. 2: ఆపెయిచ్చెవిడెము అందుకొనరాదా
చూపులేమి చూచేవు సోరణగండ్ల
ఆపని కాసపడితే నట్టె కానిమ్మనరాదా
యేపున నేలకొంకేవు యిందరిలోపలను

చ. 3: కూడిన యాపెకూటమిఁ గోరి చెంగలించరాదా
వాడుమోముతో నెంత వాను లెంచేవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడులేల పెట్టేవు యివ్వలా నవ్వలాను

రేకు: 0929-4 సామంతం సం: 19-160

పల్లవి: మాయలేల సేసేవు మన్నించరాదా
బాయిటఁ బడె నీగుట్టు ప్రహ్లాదవరద

చ. 1: వొరసివలపు తొల్లే వొడిఁ గట్టుకొన్నందుకు
అరుదైనతొడపై తొయ్యలి సాకిరి
సరుసనే మాతోను జాణతనాలాడేవు
యిరవై నీయాసోద మేమిచెప్పే దిఁకను

చ. 2: మొనసి చుట్టరికము తొల్లి మోపు గట్టుకొన్నందుకు
యెనలేని వీఁపుమీఁది యింతి సాకిరి
ననుపు నాతోనే నవ్వులెల్లా నవ్వేవు
నినుపులై గజరెల్లా నిండె నీమైనిపుడు

చ. 3: తమకమెల్లాఁ దవ్వి తలకెత్తుకున్నందుకు
కొమరైనశిరసుపై కొమ్మ సాకిరి
మమత శ్రీవేంకటేశ మరిగి నన్నేలితివి
జమళినీపొందులు సతమాయ నేఁడు

రేకు: 0929-5 ఆహిరి సం: 19-161

పల్లవి: ఎటువంటివలపులో యిద్దరికిని
చిటుకంటే మెచ్చేవు శ్రీ నరసింహా

చ. 1: గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా
పరగ నీమోము తప్పక చూడఁగా
సరుగన నీవు వచ్చి సంగడినే కూచుండి
సిరులతోఁ బొగడేవు శ్రీనరసింహా

చ. 2: యెదురుమేడపై నెక్కి యెలుఁగెత్తి పాడిపాడి
వుదుటునఁ దామరపూవుల వేయఁగా
పొదిగి నీవంతలోనే బుజముపైఁ జేయివేసి
చెదరక చెక్కంటేవు శ్రీ నరసింహా

చ. 3: పఱపుపై నీకె నీపై పరాకునఁ జెలితోడ
అఱిముఱి నిన్నుఁ జూపేకాంత మాడఁగా
మెఱయ శ్రీవేంకటాద్రిమీఁద వచ్చి కూడితివి
చెఱఁగువట్టి చొక్కుతా శ్రీనరసింహా

రేకు: 0929-6 భైరవి సం: 19-162

పల్లవి: ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు
గచ్చు లేమిటికిరా చేఁగలమట్టిచెన్నుఁడా

చ. 1: ఆరితేరి కతలెల్లా నడుగుతా నన్ను నీవు
చేరి యానవెట్టకురా చెప్పేఁగాని
దూరుసేయ కిఁకనైనా దోసము లేదనరా
సారెసారె నీకు మొక్కి జట్టిగొనే నేను

చ. 2: వొగ్గి కొంగువట్టుకొని వొకటొకటే యడిగి
సిగ్గులువడకురా చెప్పేఁగాని
అగ్గలమై కిందుపడి ఆసుద్దులు మఱవరా
అగ్గమై నీవూడిగాలే అన్నీఁ జేసే నేను

చ. 3: యెన్నిఁగ శ్రీ వేంకటాద్రి నిరవై నన్నేలితివి
చిన్ని గోరు దియ్యకురా చెప్పేఁగాని
మన్నించితి వెప్పుడు నామచ్చిక దలఁచరా
సన్నల నీరతులకే సమ్మతించే నేను

రేకు: 0930-1 ధన్నాసి సం: 19-163

పల్లవి: చిత్తగింతువు రావయ్య్యా చెలికడకు
పోత్తులతలపోఁతల బోగించీని

చ. 1: మనసు నిలుపరాక మాటలనుఁ బొద్దువోక
వొనరి విరహమున నున్నది చెలి
కొనలుసాగిన యాస కొప్పునఁ బెట్టేసేసఁ
దనివోక కూటమికిఁ దమకించీని

చ. 2: చెమటలఁ దొప్పఁదోఁగి సిగ్గులనే కడుమాఁగి
అమరినజవ్వనాన నలసీఁ జెలి
తిమురువలపులను తియ్యనసొలపులను
జమళిపులకలతో జాజుకొనీని

చ. 3: యెదురుచూపులు చూచి యిచ్చె కాఁగిటికి లాచి
ముదమునఁ జేతులెత్తి మొక్కీఁ జెలి
అదన శ్రీ వేంకటేశ అట్టె నీవు గూడఁగాను
పుదుటుఁగళలు రేఁగి వూరుపు లాఁగీని

రేకు: 0930-2 ఆహిరి సం: 19-164

పల్లవి: ఇన్నిటా నీచలములు యీడేరెనే
పన్ని నీనేరుపు లిట్టె పచరించవలెనా

చ. 1: పెనగిఁ యాతఁడు నీకుఁ బ్రియములెల్లాఁ జెప్పె
తనిసి ఇంతటా నీచిత్తము వచ్చెనా
యెనసి వలచేనంటా ఇందరిలోనా నీవు
ననిచినమగవాని నగుఁబాటు సేతురా

చ. 2: చెలరేఁగి సేయరానిచేఁతలెల్లా నీకుఁ జేసే
తలచిననీదుపంతము చెల్లెనా
మెలఁగి నీమాటలు మీరెనంటా నీవు
కిలకిలనగి యింత కిందుపరపింతురా

చ. 3: కూరిమి నీకాఁగిటను కూడినట్టెల్లాఁ గూడె
కోరిన నీకోరికలు కొనసాగెనా
యీరీతి శ్రీ వేంకటేశుఁ డిచ్చకుఁడంటా నీవు
రారాపు లిటుసేసి రతి నలయింతురా

రేకు: 0930-3 దేవగాంధారి సం: 19-165

పల్లవి: రాజపు నీకెదురేది రామచంద్ర
రాజీవనయనుఁడ రామచంద్ర

చ. 1: వెట్టిగాదునీవలపు వింటి నారికిఁ దెచ్చితివి
అట్టుసేయఁ బనిలేదు యిట్టె రామచంద్ర
గుట్టుతోడ జలనిధిపై గొండలు ముడివేసితి-
వెట్టు మఱవఁగవచ్చు నివి రామచంద్ర

చ. 2: బతిమితోడుతఁ బైఁడిపతిమెఁ గై కొంటివి
రతికెక్కె నీచలము రామచంద్ర
మితిమీరి జవ్వనము మీఁదుకట్టితివి నాకై
యితరు లేమనఁగల రిఁక రామచంద్ర

చ. 3: నావంటిసీతను నాఁగేటికొనఁ దెచ్చితి
రావాడితమకముతో రామచంద్ర
యీవేళ శ్రీ వేంకటాద్రి నిరవై నన్నుఁ గూడితి
చేవదేర గండికోట శ్రీరామచంద్ర

రేకు: 0930-4 సాళంగం సం: 19-166

పల్లవి: ఏల కూరిమిగొసరే విప్పుడు నన్ను
వాలాయించి నీవాపెకు వసమైవున్నాఁడవు

చ. 1: తమకించి నే నిన్ను దప్పులుదేరిచేనంటే
అమరునా నీవద్దనాపె వుండఁగా
సముకాన నుండి మోవిచవులు చూపేనంటే
తెమలేవా ఆపె తరితీపులు నున్నాఁడవు

చ. 2: వెస నాముచ్చటలెల్లా వేడుక జెప్పే నంటే
బొసఁగునా ఆపె నీతో బొందు సేయగా
రసికత నీతో సరసము లాడేనంటే
అస మిచ్చేవా ఆపై ఆసల నున్నాఁడవు

చ. 3: సతమై నీకుఁ బచ్చడము గప్పేనంటే
ఇతవౌనా ఆపె నిన్ను నెనయఁగను
పతివై నన్నేలితివి బాగుగా శ్రీ వేంకటేశ
తతిఁ గాదనేనా ఇందరిఁ గూడున్నాఁడవు

రేకు: 0930-5 నాదరామ క్రియ సం: 19-167

పల్లవి: కంటివిగా యెటువంటి గయ్యాళి యీపె
ఇంటి కాడనే చూపి ఇచ్చీనట తాను

చ. 1: యెలమి నీవట యాడోయింతి బెండ్లాడితివట
వెలఁది యాడిన మాట వింటివా వోయి
ఆలరి నీవేమైనా నటువంటి వాఁడవా
కలవి లేనివి నీపై గడియించీఁ దాను

చ. 2: మేరతో నీవేల నేడో మెట్టె లిడుకొంటివట
చేరి యాకె కోపము చూచితివా వోయి
నేరమి నీయందుఁ గద్దా నేమెన్నఁడూ నెఱఁగము
తారుకాణించే నంటాఁ దమకించీఁ దాను

చ. 3: విందుల నెవ్వతెకో విడె మిచ్చి వచ్చితట
చెంది యీకె గుట్టు తెలిసితివా వోయి
పొందితివి నన్ను నిట్టె పొసఁగ శ్రీవేంకటేశ
నిందలివే యని మొక్కి నిన్ను మెచ్చీఁ దాను.

రేకు: 0930-6 నాగవరాళి సం: 19-168

పల్లవి: ఎక్కడ గడించుకొంటి వీకెను నీవు
పక్కన సేవలు సేసి పాదాలొత్తీని

చ. 1: సొంపు మీరి నీతోడ సుద్దు లెల్లా విన్నవించి
చెంపల జారే కురులు చేత దువ్వీని
యింపు వుట్ట నేడలేని యిచ్చకములెల్లాఁ జేసి
జంపుల నవ్వుల నవ్వి జట్టి గొనీని

చ. 2: మచ్చిక మాఁటలాడించి మర్మములు సోఁకించి
మెచ్చి మెచ్చి గందము నీ మేనఁ బూసీని
లచ్చెనగా గోరుదీసి లూవులు చూపి పెనఁగి
కుచ్చి కాఁగిలించి నిన్నుఁ గోరికొసరీని

చ. 3: బాగా లిచ్చి వేఁడుకొని పచ్చడము మీఁదఁ గప్పి
ఆగడాలు సేసి కూడె నాపె నిన్నును
చేగదేర నేలితివి శ్రీ వేంకటేశ నన్ను
లాగుల నప్పటి మోవిలంచము దానిచ్చీని

రేకు: 0931-1 మాళవిగౌళ సం: 19-169

పల్లవి: ఇందరు నెరిఁగినవే యీ సుద్దులు
యెందు నుండినాను మా యింటికి రావలెను

చ. 1: యెంత వాఁడవైనాను యెపుడును మాతోను
పంతములాడకురా పలుమారును
కాంతల మోవి తేనెలు కైకొనేటి వేళను
పొంతనుండి యెంగిలికి పొత్తుగూడవలెను

చ. 2: ఘనుఁడవౌదువు నేఁడు గర్వము మాతో సరి-
పెనఁగకురా నీవు పెచ్చు రేఁగుచు
వనితలైనవారు వడిఁ గాఁగిలించేవేళ
చనుఁగొండలసందిఁగి చనవియ్యవలెను

చ. 3: మగఁడవైతివి నాకు మక్కువ శ్రీవెంకటేశ
బిగియకురా ఇంత పెనఁగుతాను
మగువలైనవారి మరిగి కూడేవేళ
పొగురుఁబాదములువీఁపున మోవవలెను

రేకు: 0931-2 బౌళి సం: 19-170

పల్లవి: ఎంతలేదు నీ యాసోద మేమిచెప్పేది
చెంతనుండి నామీఁదఁ జేయిచాఁచేవు

చ. 1: వొక్కతెతో మాటాడుతా నొక్కతెతో నవ్వేవు
అక్కర నొకతె వీడె మడిగేవు
వుక్కుమీరి వొక్కతెను వొడిపట్టి తీసేవు
మక్కువ నప్పటిని నామర్మము లంటేవు

చ. 2: చెయివట్టే వీకెను చేసన్న సేసే వాకెను
పాయఁజాల కిల్లీ కెకుఁ బనిచెప్పేవు
చాయల నల్లాకెతోడ సరసము లాడేవు
సోయగాన నాకప్పటి సొమ్ము లిచ్చేవు

చ. 3: యెవ్వతెనో పేరఁ బిల్చి యెవ్వతెనో కూడేవు
దవ్వుల నదెవ్వతెనో తలపోసేవు
రవ్వగా శ్రీ వేంకటేశ కత నన్నుఁ జెలగించి
చివ్వన నప్పటి నవ్వే చేరికూడేవు

రేకు: 0931-3 కన్నడ గౌళ సం: 19-171

పల్లవి: ఎప్పుడూ నీయాల నేను ఇటు నాకు మగఁడవు
చిప్పిల నాచేత నీవు సేవగొనవయ్యా

చ. 1: కన్నెనాటనుండి నాకుఁ గాచుకుండి యింతేసి-
చన్నులు రాఁగాను సేవవెట్టితివి
విన్నవించే దేమున్నది వేగినంతా నీవు నన్ను
మన్నించిన మన్ననలు మఱవకుమయ్యా

చ. 2: మొలక వలపులే మొదలుసేసుకొని
తొలిసమరుతాడితే దొరసితివి
బలిమి చెప్పఁగనేల పలుమారు నీవు నాకు-
నెలమి నిచ్చినమాఁట యీడేరించవయ్యా

చ. 3: తమకపుఁ జూపులనే దక్కి నాకాఁగిటిలోన
కొమరెపాయ మీఁదేరఁ గూడితివి
అమర నాడఁగనేల ఆసతో శ్రీవేంకటేశ
జమళి నావద్దనుండి చనవియ్యవయ్యా

రేకు: 0931-4 రామక్రియ సం: 19-172

పల్లవి: నేమూ నీవలెనే నేరుతుమే ఇన్నిటాను
నేమముతో మామీఁద నించవే మన్ననలు

చ. 1: చెప్పినట్టు సేసేపతి చేతికి లోనై యుండఁగా-
నిప్పుడేకాక పంతము లిఁక నెన్నఁడే
ముప్పిరి నీవేలను ముద్దుటుంగర మదిగో
చిప్పిల నీ కన్నిటాను చెల్లునే నీపగటు

చ. 2: వలచి యీ విభుఁడు నీవాఁడై నేఁ డుండఁగాను
యెలమి నవ్వునవ్వక యేలమానేవే
పలుసవతులలోన పట్టపుదేవులవట
చలమున నేలవే సవతుల రాజ్యము

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెంది కాఁగిలించఁగాను
ఆవేడుక లీ వేడుక లమరుఁగదే
కైవశమై భోగములు కాణాచులాయ నిట్టె
యీవల నన్నేలె నితఁడిది నీమతకము

రేకు: 0931-5 దేసాళం సం: 19-173

పల్లవి: వెల్లవిరాయఁ బనులు విట్ఠలేశ్వరా
చల్ల జంపు సేఁతల సటకారివాఁడవు

చ. 1: ననుఁజూచి కొలువులో నవ్వినదే చాలదా
వనితల యెడల గర్వపు వాఁడవు
చెనకి యప్పటి నన్నుఁ జేఁత నంటవలెనా
పొనుగనివలపులపొత్తులవాఁడవు

చ. 2: మచ్చికల నాతోడ మాటాడుచే చాలదా
కుచ్చితపు బహు పరాకులవాఁడవు
విచ్చనవిడి నిప్పుడే విడెమియ్యవలెనా
మచ్చు వేసితీ సేవెడమాయదారివాఁడవు

చ. 3: సంగడి నాపై సేస చల్లుటే చాలదా
సంగ తెరిఁగి నెన రజాణకాఁడవు
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశుఁడవై
యెంగిలి సేయవలెనా యిచ్చకపువాఁడవు

రేకు: 0931-6 శంకరాభరణం సం: 19-174

పల్లవి: ఉద్దగిరి కృష్ణుఁడు పుబ్బరికాఁడు వీఁడు
ముద్దులు చూపుతానే ముసుఁగులు దీసేనే

చ. 1: చెంగట నిద్దిరించేటిచెలువంపు గొల్లెతల
దొంగిడుచు వచ్చి వచ్చి తొడ లంటీనే
ముంగిటఁ గూచుండఁగాను ముడిచినపోఁకముడి-
కొంగులు విడిచి యట్టె కొల్లున నవ్వీనే

చ. 2: వేడుకతో గొల్లెతలు వెన్నముద్దలు సేయఁగ
చాడెసంది వచ్చి తాను చన్నులంటీనే
జోడై యెకరొకరు సుద్దులుచెప్పేటివేళ
కోడెకాఁడై యండనుండి కొప్పులు వట్టీనే

చ. 3: అట్టె విడేలు సేయుచు నాకులు మడుచుకోఁగా
గట్టిగాఁ గళలురేఁగ కాఁగిలించీనే
యిట్టె మమ్మిందరిని యేలి శ్రీవేంకటేశుఁడై
దిట్టతనమున మోవితేనే లిచ్చీనే

రేకు: 0932-1 శ్రీరాగం సం: 19-175

పల్లవి: ఏడలేనిసత్యాలు నేఁడేల చేసీనే
వీడె మందినాఁడు యీ విద్యకుఁ దా ననరే

చ. 1: మంతనానఁ దాను నేను మాటలాడుకొన్న వెల్లా
ఇంతటిలోననే ఆపె యెట్టెరిఁగెనే
అంతటివిభుఁడు తానె ఆనతియ్యఁ బోలుఁగాక
వంతులకు నాపె వచ్చి వద్ద నుండెనా

చ. 2: గుట్టునఁ దాను నేను కూడుకొన్న సుద్దులెల్లా
గట్టిగా వెలినుండాపె కనెనటవే
చుట్టమువలెనే తాను చొప్పు చూపఁబోలుఁగాక
పొట్టపొరుగాపె వచ్చి పొందేయప్పు డుండెనా

చ. 3: చేరి తెరలోఁ దనకు సేసిన సేవలెల్లా
తేరకే ఆపెమతిఁ దెలియుటెట్టే
మేరతో భూపతిచెరువు మేటి శ్రీవేంకటేశుఁడు
యీరీతి నన్నుఁ గూడఁగా నీడ నాలె వుండెనా

రేకు: 0932-2 పాడి సం: 19-176

పల్లవి: చూతువుగా నీయామేలు సొంపులుగాను
కాతరాన లోనికి రాఁగదవయ్య ఇపుడు

చ. 1: మొక్కలాన దవ్వులనే మోము చూచి నవ్వితేనే
చెక్కులెల్లాఁ బులకించె చెలియకును
చక్కనిచన్ను లంటితే చవులేమి వుట్టునో
గక్కనఁ బాన్పుపైకి రాఁగదవయ్య ఇపుడు

చ. 2: పోలసి యల్లంతనుండి పూఁచి మాటలాడితేను
చెలపచెమట గారెఁ జెలిమేనను
యెలమిఁ గతచెప్పితే నింపు లెట్టు వొడమునో
కలికి సంగడికి రాఁగదవయ్య ఇపుడు

చ. 3: తమకించి ఇంతనంతఁ దప్పక చూచితేను
అమరెఁ జెలిమోమున అట్టెకళలు
జమళి శ్రీ వేంకటేశ సమరతిఁ గూడితివి
కమలాక్షియంకెకు రాఁగదవయ్య ఇపుడు

రేకు: 0932-3 రామక్రియ సం: 19-177

పల్లవి: కంటిమి యీభాగ్యము కన్నులపండుగగాను
జంటలై మీరుండఁగా సాదించేదేమే

చ. 1: విడెము నీచేతికిచ్చి విభుఁడు సెలవి నవ్వె
యీడేరె నీపంతము లిఁక నేఁటికే
వేడుకకు వెలలేదు వెక్కసములాడరాదు
యేడనున్నా సవతులు యేమిసేసేరే

చ. 2: పేరున నిన్నుఁ బిలిచి ప్రియుఁడు సరసమాడె
కోరినకోరిక చెల్లెఁ గోఁ(క నేఁటికే
నేరుపులెల్లా దక్కె నెయ్యములు దలకెక్కె
యీరసించి తోడివారు యేమిగట్టుకొనేరే

చ. 3: యింటికి వచ్చి శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ గూడె
దంటయై కాఁగిట నించెఁ దడవనేలే
పెంటలాయ సేసలు పెనగొనె నాసలు
వెంటనే వచ్చె మీమేలు వెదకేదెట్లనే

రేకు: 0932-4 సాళంగనాట సం: 19-178

పల్లవి: ఏమి చెప్పేది తనయెమ్మెలు నేఁడు
ఆముకొని కాచుకున్నాఁ డత్తునా యేమైనా

చ. 1: అలసిన వారికేల అట్టె పనులు చెప్పీనే
కలసినవారికేల కాఁకరేఁచీనే
మొలకచన్నులు చూచి మొక్కీ నింతటిలోనే
తలఁచిసవరమియ్యేఁదనకు దేవరలా

చ. 2: సిగ్గు వడ్డవారి నెంత చిమ్మిరేఁచవచ్చీనే
యెగ్గులేనివారినేల యెచ్చరించీనే
నిగ్గులనామోవి చూచి నిలువుఁగొలువు సేసీ
అగ్గలమై సేవగొన నది దనయేలికా

చ. 3: వూరకున్నవారినేల వొడివట్టి కూడీనే
యీరీతి శ్రీవెంకటేశుఁ డెంత సేసీనే
గారవించి నామేను కప్పిదాఁచీఁ బచ్చడాన
నేరుపున రక్షించునిధానమా

రేకు: 0932-5 సాళంగం సం: 19-179

పల్లవి: ఔనయ్యా మంచివాఁడ వన్నియు నెఱిఁగితిమి
మానలేము నిన్నాడక మనసులోఁ గలది

చ. 1: దప్పిదేరె నీమోవికి తరుణులమోము చూచి
కప్పుర మిమ్మంటేనే కాఁతాళించేవు
తప్పు లెంచితినా నిన్ను దయదలఁచితిఁగాక
యెప్పుడూ నీయనుమానా లేఁతైనా విడువవు

చ. 2: నిరతిఁ జెక్కులమీఁదినిండుఁజెమటలు వాయ
సురటి విసురుమంటేఁ జూచి తిట్టేవు
నెరసు లెంచితినా నెయ్యము చూచితిఁగాక
యెరవులే కలకాలమెల్లా నెరుపేవు

చ. 3: సారె జాఱుఁదురుమున జాజులు నిండాఁ బెట్టి
చేరి ముడువుమంటేనే సిగ్గువడేవు
అరయ శ్రీవెంకటేశ అంతలో నన్నేలితివి
కోరికెఁదనివిలేక కొంగులు వట్టేవు

రేకు: 0932-5 మాళవిగౌళ సం: 19-180

పల్లవి: కోరి నీపైఁ దొల్లి నాకుఁగోప మున్నదా
ఆరీతి అట్టునేయఁగా నంటి నింతేగాక

చ. 1: ఆనలేల పెట్టేవు అంత వేఁడుకొననేల
కానీవయ్యా నీమాఁటకుఁ గాదనేమా
నేనిట్టె మాటాడఁగాను నేరుపుతో నాపె చేతి-
కాను కందుకొనఁగాను కసరితిఁగాక

చ. 2: కొప్పుదువ్వి యెంత నన్ను కొస రొడఁబరచేవు
చెప్పినట్టెల్లా నీకుఁ జేయకుండేనా
యిప్పుడు నావద్ద నుండి యెలమి నాపెమట్టెల-
చప్పు డాలకించఁగాను జరసితిఁగాక

చ. 3: వీడె మిచ్చి చేయి నాపై వేసేవు శ్రీవెంకటేశ
కూడితి విందులకు నియ్యకొనవలదా
జాడతోడ నన్నేలి సంగడినున్నాపె మోము
చూడఁగా నందుకు నిట్టె సొలసితిఁగాక

రేకు: 0933-1 ముఖారి సం: 19-181

పల్లవి: కనుకొనరాదా కడమదొడముల్లెల్లా
పనివడి నీముందరఁ బచారించీ నిఁకను

చ. 1: బంతి నాపె మొక్కఁగాను పరాకులు సేసుకొంటే
పంతమాడఁదగదా పడఁతికిని
ఇంతలో నిందుకుఁగాను యెగ్గు లేల పట్టేవు
దొంతరవలపులను తోడుచూపీ నిఁకను

చ. 2: యెనసి కానుకియ్యఁగా నేమీననక వుండితే
పెనఁగఁగఁ దగగా ప్రియురాలికి
యెనలేని తలపోఁత నిచ్చోట నేమిటికి
వెనకటి సేఁతలెల్లా వెలయించీ నిఁకను

చ. 3: సారెఁ బాదా లొత్తఁగాను జడిసి నిద్దిరించితే
గోర గీరఁదగదా కోమలికిని
యీరీతి శ్రీ వేంకటేశ యేలి యింకాఁ గొసరేవు
కోరికరతులు నీకుఁ గుప్ప సేసీ నిఁకను

రేకు: 0933-2 లలిత సం: 19-182

పల్లవి: మూసి దాపిరములేల ముందరికి రాఁగదవే
సేసపాలవెంటనే చిమ్మిరేఁగె వలపు

చ. 1: చిప్పిలుఁ జెమటలివె చెక్కులపై నున్నవి
రెప్పల నిద్దురలు దేరీ నిదివో
ఇప్పు డాతఁడు నిన్నేలె నెఱఁగమా ఇదె నేఁడు
కుప్పలుఁదెప్పలునై గొనకొనె వలపు

చ. 2: చెలపచెలపనవ్వు సెలవుల వడిసీని
పులకలు మేననెల్లాఁ బొదిగొనెనే
మలసి నీనాయకుఁడు మన్నించుట వినమా
కులుకుఁ జన్నులమీఁద గుదిగొనె వలపు

చ. 3: మిసమిసనికళలు మించీ నీమోమున నవె
పొసఁగినపొందు నిన్నుఁ బొదిగొన్నది
యెసఁగి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నీతఁ డిట్టె
పస నీచిగురుమోవిఁ బాదుకొనె వలపు

రేకు: 0933-3 భైరవి సం: 19-183

పల్లవి: అందరికి నీరీతేకా అటమటా లేమిటికి
నిందలకుఁ జొర నీదే నేరుపింతేకాక

చ. 1: పడఁతికి నిన్నునె బాసయిచ్చినవాఁడవు
తడఁబడి యింతలోనే తప్పవచ్చునా
నడుమ నన్నుఁ జూచి నాతో మొగమోటానకు
చిడుముడి నిచ్చకాలు సేసేవుగాక

చ. 2: ప్రేమముతో నిందాఁకాఁ బిలిపించినవాఁడవు
దోమటిదొడుక కిఁకఁ దోయవచ్చునా
నామనసు గన్నదాఁకా నాటకములు జరపి
గామిడి వేసాలు సేసి కదిసేవుగాక

చ. 3: అండఁబెట్టు కాపెవిడే లందుకొన్నవాఁడవు
దండిగాఁ గూడ కిఁక దాఁచవచ్చునా
కొండవలె నన్నేలితి కోరి శ్రీవెంకటేశుఁడ
చండిసేసి వినోదాలు జరుపేవుగాక

రేకు: 0933-4 కేదారగౌళ సం: 19-184

పల్లవి: విచ్చనవిడిని యిఁక వీడేలు సేసుఁగాని
రచ్చలఁబెట్టక యిఁక రమ్మనవే లోనికి

చ. 1: పంతగాఁడైనవాఁడు పరపుపై నుండుఁగాక
ఇంతలోనే నావద్దకి యెట్టు వచ్చెనే
యెంతలేదె తనసుద్దు లిన్నియు నెఱుఁగుదును
రంతులు సేయక ఇట్టె రమ్మనవే లోనికి

చ. 2: యేతులు నెరపేవాఁడు యేమీ ననకుండుఁగాక
యీతల మాతో మాట లేలాడీనే
చూతము తననేరుపు చుట్టులఁ బెట్టఁగనేల
రాతిరాయ నిఁకనైనా రమ్మనవే లోనికి

చ. 3: దిట్ట యెంతవాఁడు తాను దేవర శ్రీవెంకటేశుఁ-
డెట్టు గూడెనె నను నిందరిలోన
అట్టె కానీవే తన ఆయము నేఁగన్నదే
రట్టుసేయ కిఁకనైనా రమ్మనవే లోనికి

రేకు: 0933-5 సౌరాష్ట్రం సం: 19-185

పల్లవి: ఎవ్వరు మంచివారమో ఇప్పుడు నీకు
పువ్వువలె నాకు నీవు బుద్ధిచెప్పవయ్యా

చ. 1: బత్తితోఁ బాదము లొత్తి బాగాలు చేతికిచ్చి
చిత్తమురా సేవలెల్లాఁ జేసీ నాపె
కొత్త కొత్త మాటలాడి కొంగు వట్టి తీసి నిన్ను
గుత్తపు గుబ్బల నూఁది గునిసేము నేము

చ. 2: అంగములు సోఁకించి అట్టె మోవి చవిచూపి
చెంగటనే కాపిరము సేసీ నాపె
జంగిలి దూరులు దూరి జంకెన బొమ్మలు చూపి
వెంగెములనే సడిమేసేము నేము

చ. 3: చనవునఁ గాఁగిలించి చాయలు సన్నలుఁ జేసి
యెనసీ శ్రీవెంకటేశ యెదుట నాపె
ననుపుల నిన్నుఁగూడి నవ్వుతానే గోర గీరి
చెనకి రతుల ఘాతసేసేము నేము

రేకు: 0933-6 శుద్ధవసంతం సం: 19-186

పల్లవి: ఊరకే నన్నిటు దూరి వుప్పతించేవు
యేరీతి తక్కరియౌటా యెఱఁగవు నీవు

చ. 1: ఆతఁడు వాసులెక్కించి ఆటకానకుఁబెట్టితే
యేతులకుఁగాఁతాళించి యేలచూచేవే
రాతిరిఁబగలుఁ దాను రచ్చ లెందోసేసి వచ్చి
యీతల సటలు సేసే దెఁఱగవు నీవు

చ. 2: తానే సన్నలు సేసి తగవులఁ బెట్టితేను
పేనిపట్టుక నీవేల పెనఁగాడేవే
ఆనుకొని వాడవారి నందరిఁబెండ్లాడివచ్చి
యీనేరువులు చూపేది యెఱఁగవు నీవు

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి యిద్దరిఁగూడితే
చేవమీర నీవేల సిగ్గువడేవే
వేవేలుసతులకు వేరేసేసవెట్టివచ్చి
యీవిధాన మొఱఁగేది యెఱఁగవు నీవు

రేకు: 0934-1 కాంబోది సం: 19-187
పల్లవి: నాకేల వేగిరము నమ్మితి నేను
మేకొని నీవే నన్ను మెచ్చేవుగాని
చ. 1: ప్రియురాలు విభునితో పెనఁగులాడఁగఁబోతే
నయమున వూరివారు నవ్వఁజూతురు
క్రియ గూడ నిట్టె చేతికిని లోనై వుండఁగాను
దయ నీచిత్తములోన తానే వుండీఁగాని
చ. 2: పాయరానివారు నీతే పంతము లాడఁగఁబోతే
కాయకపుసవతులు కాకుసేతురు
వోయి నీవెంతసేసినా నోరుచుకవుండఁగాను
యీయెడ నీవే తగవు యెఱిఁగేవుగాని
చ. 3: కందువ నే నిట్టె నిన్నుఁగాఁగిలించి కూడఁబోతే
పొందైన నీసతులెల్లాఁ బొగడుదురు
ఇందులో శ్రీవేంకటేశ యేలితి విట్టె వుండఁగా
మందలించి నీవే యింకా మన్నించేవుగాని

రేకు: 0934-2 బౌళి సం: 19-188

పల్లవి: ఇంక విచారములేల యిద్దరును నొక్కటే
సంకెలేక వుండితేను జరసేరా సతులు

చ. 1: వనితకు నీకును వాడికమాటలవల్ల
మనసులు సరిదాఁకె మరి యేఁటికి
పెనఁగించుకొననేల ప్రియము తొల్లె కలదు
వొనగూడి వుండఁగాను వొద్దనేరా సతులు

చ. 2: సుదతికి నీకును సూటులచూపులవల్ల
కదిసెఁజూట్టరికేలు కత లేఁటికి
పదర నింతేసి యేల పనులెల్లా నీడేరె
యెదురెదుర నవ్వగా నేలనేరా సతులు

చ. 3: జలజాక్షికిని నీకు సారెఁజెనకులవల్ల
కొలఁది మీరె రతులు కొంకనేఁటికి
వెలయఁ గోనేటి శ్రీవేంకటేశ నన్నేలితి
కొలువు సేయించుకొంటేఁ గొసరేరా సతులు

రేకు: 0934-3 పాడి సం: 19-189

పల్లవి: ఎంతసేసినా నీవు ఇన్నిటికిఁ దగుదువు
బంతికిఁ బిలుతు సిగ్గువడేవనికాని

చ. 1: బగివాయ కాపెమీఁదిపరాకుననున్నవేళ
నగినదే చాలదా నాతో నీవు
పొగడుదు నిందరిలో పొంచి నీ సుద్దులు చెప్పి-
యగడు సేసితినంటా ననేవనికాని

చ. 2: చెలిఁగాఁగిలించేవేళ చేరి నిన్నుఁబిలిచితే
పలుకుటే చాలదా పై పై నీవు
సొలసిందుకు మొక్కుదు చూచినవా రేమని
తలఁతురో యని కొంకి దాఁగేవనికాని

చ. 3: వోడక మీరిద్దరును వుండఁగా నే వచ్చితే
కూడుటే చాలదా గొబ్బననీవు
వీడె మిత్తు నిందుకు శ్రీవేంకటేశ వెంగెమని
వాడు మోముతోఁదలవంచేవనికాని

రేకు: 0934-4 ఆహిరి సం: 19-190

పల్లవి: ఎగసక్కే లాడనేర యిచ్చకము లాడనోప
జగడాలు మాని యింక చక్కనుండుమనవే

చ. 1: చెలిమిసేసేవాఁడైతే చేఁతకల్లా లోనౌఁగాక
మలకలమలకలమాట లేఁటికే
వలపెల్లా నాసొమ్ము వట్టిసట దనసొమ్ము
చలము లింకానేల చక్కనుండుమనవే

చ. 2: తప్పులేనివాఁడైతే తాలిమితో నుండుఁగాక
అప్పటిని యింతేసియాన లేఁటికే
యెప్పుడూ నేఁదనదాన యెవ్వరివాఁడో తాను
చప్పుడు సేయక యిఁక చక్కనుండుమనవే

చ. 3: సమ్మతించినవాఁడైతే చనవిచ్చి కూడుఁగాక
కమ్మటి రేపుమాపని గడు వేఁటికే
తమ్మిపువ్వుకాంతను తాశ్రీవేంకటేశుఁడు
సమ్మదము లోనగూడె చక్కనుండుమనవే

రేకు: 0934-5 వరాళి సం: 19-191
పల్లవి: ఇంతకు వచ్చెనా నేఁడు యీపెవలపు
సంతసతులకు నేఁడు సన్నలు చూపేవు
చ. 1: సేసకొప్పు వంచదా చేరి నీకు మొక్కదా
ఆసతో సేవలు సేయదా యింతి
వాసులెక్కించి యాఁడోవనితనుఁ బురికొల్పి
మాసటీనివలె నేఁడు మాటలాడించేవు
చ. 2: పెడరేఁచి వీడెమీదా ప్రియములు చెప్పదా
చిడుముడి చన్నులఁ బూజించదా యింతి
యెడమిచ్చి వేరొక్కతె నెఱఁగనటే తెచ్చి
కడవానివలె నేఁడు కాకుసేయించేవు
చ. 3: ఇటు నిన్నుఁగూడదా యింపు నీకుఁజేయదా
నటన శ్రీ వేంకటేశ నవ్వదా ఇంతి
ఘటనఁబరకాంతను కన్ను లెదుట నిలిపి
విటునిచందాన నేఁడు విద్యలాడించేవు

రేకు: 0934-6 దేసాళం సం: 19-192

పల్లవి: ఏమి గట్టుకొంటివియింతేసి మమ్ముఁజేసి
దోమటి దొడికి మాకు దూరులు గట్టుదురా

చ. 1: పోహణించి నీవేల పూఁచి బాససేసేవు నీ-
మోహమెల్లాఁ గంటిమి మొన్ననే నేము
వూహాపోహ లెరిఁగి వూరకున్నదాన నేను
సాహసించి చన్నులపైఁ జాఁతురా నీ చేతులు

చ. 2: చేరి మమ్మునేల నీవు చెనక వచ్చేవు నీ-
నేరుపెల్లాఁగంటిమి నిన్ననే నేము
కూరిమిగొసరి నీగుట్టు దెలుసుకొంటిమి
మేరమీరి యింతలోనే మెట్టుదురా పాదము

చ. 3: కొయ్యతనాన నన్నుఁగూడితి పానుపుపై నీ-
నెయ్యమెల్లాఁగంటిమి నేఁడే నేము
యియ్యెడ శ్రీవేంకటేశ యిన్నియు నియ్యకొంటిమి
నియ్యెచ్చులమోవిపయి నింతురా గుఱుతులు

రేకు: 0935-1 శ్రీరాగం సం: 19-193

పల్లవి: ఇదివో మీసుద్దులు ఇందుకే వెరగయ్యీని
పుదుటుమీవయసులు వొక్కరతే కాదా

చ. 1: వేడుకతో నిన్నుఁగూడి వింతలై యుండి తనకు
వాడుమోమేల వచ్చె వనితకును
జాడతో నీమోమైతే సరిఁజెంగలించినది
వోడక మీకిద్దరికీ వొక్కరతే కాదా

చ. 2: పువ్వువలె నీతోడ పొందుసేసె నిందాఁకా
నివ్వెరగేఁటికి వచ్చె నెలఁతకును
నవ్వులైతే నీసెలవి నారుకొన్నట్టున్నవి
పువ్విళ్లూర నిద్దరికీ నొక్కరతే కాదా

చ. 3: కలిమె నీకాఁగిటను కడఁగి శ్రీవేంకటేశ
అలపులేఁటికి వచ్చె నంగనకును
కొలఁదిలేవు నీకైతే గుఋుతైనచెనకులు
వొలిసి మీకిద్దరికీ నొక్కరతే కాదా

రేకు: 0935-2 రామక్రియ సం: 19-194

పల్లవి: ఆపెకంటె నీవెక్కుడు ఆపె తొల్లె నీకెక్కుడు
చేపట్టి చెలి మొక్కఁగా చెనకేవు నీవు

చ. 1: కన్నులనే సన్న సేసి కాఁకలు నీపైఁ బూసి
మిన్నక పరాకుసేసి మెలుఁత
చన్నులపైఁజేయి చాపి సంగతి నిట్టూర్పు లాపి
వున్నతి వలపు చల్లి వొరసేవు నీవు

చ. 2: మాటలనే పొద్దువుచ్చి మచ్చిక నీపైఁగుచ్చి
కూటముల నవ్వు దచ్చీ కోమలి
నీటులనే మేనువెంచి నేరుపలనే మించి
పూఁటవూఁటకుఁగొసరి పొదిగేవు నీవు

చ. 3: కడుఁదమకాన మొక్కి కాఁగిటిలోపలఁజొక్కి
అడరి కాలుదొక్కీ నంగన
విడువక రతిఁబొంది వెస మోవితేనె చింది
కడఁగి శ్రీ వేంకటేశ కైకొనేవు నీవు

రేకు: 0935-3 కొండమలరి సం: 19-195

పల్లవి: ఎంతలేదు రమ్మనవే యేల వేసాలు సేసీని
పంతగాఁడై వూరకుంటే పచారించేరా

చ. 1: అలయనేలే తాను ఆసురుసు రననేలే
నలినాక్షి తనతోఁబెనఁగులాడితే
వలవఁగ నింతేసి వచ్చెఁగాక అటు తాను
తొలుతే సాజాన నుంటే దొమ్మిసేసేరా

చ. 2: సిగ్గులు వడఁగనేలే సెలవుల నవ్వనేలే
నిగ్గులను వసంతపునీరు చల్లితే
బగ్గన తా వచ్చి వొడివట్టి తియ్యఁగానేకాక
వొగ్గి గుట్టుననుండితే నొలవేసేరా

చ. 3: మేనిమురిపెములేలే మేకులు చూపఁగనేలే
ఆనుక తనకాఁగిట నాపె గూడఁగా
యీనెపము శ్రీ వేంకటేశుఁడు తాఁ జెసెఁగాక
మోనాన వాసితో నుంటే మొరయవచ్చేరా

రేకు: 0935-4 సాళంగనాట సం: 19-196

పల్లవి: పొందు గలిగితే నన్నీఁ బొసఁగుఁగాక
చందముగానియప్పుడు సమ్మతులు గూడునా

చ. 1: మనసురాని చోటికి మంతనము లేమిటికి
చనవులేనియడకు సరసాలేల
ననుపులేనిపట్ల నగవులు చవిగావు
అనుమానమైనచోట ఆసపడఁదగునా

చ. 2: యితవుగానివేళ ఇచ్చకము లేలవచ్చు
సతముగానివారిసంగా లొద్దు
రతి కెక్కనివలపు రాయిడికి మూలము
తతిగానివయసుకు తమక మమరునా

చ. 3: సిగ్గులు ముంచుకొనఁగా సేసలెట్టు వెట్టుఁజెల్లు
యెగ్గుపట్టఁ బూనితేను యెనయరాదు
అగ్గమై శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
వెగ్గలించె సంతోసాలు వేగిరించఁదగునా

రేకు: 0935-5 సామవరాళి సం: 19-197

పల్లవి: ఏమి గట్టుకొంటివి నీ విందువంకను
సాము లిందులోనే చేసి సాదించవయ్యా

చ. 1: అలిగి నేనే తిట్టితినంటా నాపెతోఁజెప్పి
తెలిపి నీవే తగవు దిద్దవచ్చేవా
వెలయ నిద్దరికిని వేఁడికోపములు రేఁచి
చెలఁగి నడుమ నీవు సీతు గాయవయ్యా

చ. 2: పెనఁగి నే నాపె నొట్టు వెట్టితి నంటాఁజెప్పి
పొనిగి యంతటిలోనే పొందు సేసేవా
వొనరఁగఁ దరితీపు లూరించి వూరించి
యెనలేని వేడుకల నీఁదులాడవయ్యా

చ. 3: నాలితో నాపె నేను నవ్వితినంటాఁ జెప్పి
తాలిమితోడుతనే సంతముసేసేవా
యీలీల శ్రీ వేంకటేశ యేలితి విద్దరి మమ్ము
పోలిమి మావలపు మైఁబూసుకొనవయ్యా

రేకు: 0935-6 దేవగాంధారి సం: 19-198

పల్లవి: మాతో నేమి చెప్పేవు మాపుదాఁకా సుద్దులు
నీతి విచారించుకొంటే నీవెఱఁగవా

చ. 1: నమ్మిక గావలెనని నవ్వు దెచ్చుకొనేఁగాక
కొమ్మమనసులోపలికోప మారెనా
సమ్మతించవచ్చునా చల్లజంపు లివిగాక
నెమ్మి నీచేసినచేఁత నీ వెఱఁగవా

చ. 2: మచ్చిక చూపవలసి మాటలాడె నింతెకాక
కచ్చుపెట్టుకున్నయలుకలు దీరెనా
మెచ్చఁదగునా యివి మిక్కిలి కాఁకలుగాక
నిచ్చలపు నీగుణాలు నీ వెఱఁగవా

చ. 3: వలపు రేఁచేనని వంకచూచె నింతెకాక
తలపులో నెంజరి వింతటఁ బాసెనా
యెలమి శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
నెలకొన్న నీమహిమ నీవెఱగవా

రేకు: 0936-1 శ్రీరాగం సం: 19-199

పల్లవి: ఇప్పటనుంటీ గొసరనేమిటికి నింతలోనే
తప్పీనా తానే ఆసుద్ది దడవీఁగాని

చ. 1: రయమున విరహాన రాఁగిననన్నుఁ జూచితే
దయ పుట్టకుండునా తనకైనాను
ప్రియములు చెప్పియైనాఁ బిలువవే యిక్కడికి
నియతానఁ దానే మన్నించీఁగాని

చ. 2: వెగటులేని నావిన్నపములెల్లా వింటే
చిగిరించకుండునా చిత్తమైనాను
మొగము చూడుమనవే ముచ్చటయ్యీనిదే నేఁడు
జగమెల్లా మెచ్చఁగాను చనువిచ్చీఁగాని

చ. 3: గుఱుతుగా నన్ను నిట్టె కూడినాఁడు ఇటులైతే
చిఱునవ్వు రాకుండునా సెలవినైనా
యెఱిఁగి శ్రీవేంకటేశుఁడేలె నన్ను విడెమీవే
జఱయుచుఁ దనమోవి చవిచూపీఁగాని

రేకు: 0936-2 శుద్ధవసంతం సం: 19-200

పల్లవి: కాంతలనెల్లా నొక్కగాడిఁ గట్టే వింతే కాక
మంతనమాడితేనే మర్మము గరఁగునా

చ. 1: తలచే కలిగితే దండనుండవా నీవు
వలచినవాఁడవై తే వాసులెంతువా
నెల కొకమాటు వచ్చి నిద్రతెంకి నుండఁగాను
తెలిసెనా నాగుణము తేటతెల్లమిగను

చ. 2: చుట్టరిక మెఱిఁగితే సులభాన నవ్వవా
గుట్టుగన్నవాఁడవైతే కొంచివుందువా
యెట్టకేల కిటు మాతో యేలాటా లాడితేనే
పట్టెనా నీమనసున పంతపునాసేవలు

చ. 3: కరుణించవలసితే కప్పురమిడె మియ్యేవా
సరసానకు లోనైతే సమ్మతించవా
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
సరివచ్చెనా తొల్లిటి సంగాతపు రతులు

రేకు: 0936-3 పూర్వగౌళ సం: 19-201

పల్లవి: కానవచ్చీ నందులోనే కడమదొడమలెల్లా
నీనేరుపు లాపెమీఁద నెరపుమా చూతము

చ. 1: చేపట్టుఁగుంచమనంటా సిగ్గు లీడఁ బలికేవు
ఆపెతోడ నీమాటే ఆడుమా నీవు
వోపుదునంటా నాకు వూడిగాలు చెప్పేవు
యేపున నాపెచేత చేయించుకోమ్మా చూతము

చ. 2: గోలదాననంటా నన్నుఁ గొనగోరఁ జెనకేవు
నాలి నాపెతోడ నిట్టె నవ్వుమా నీవు
మేలుగలదాననంటా మెట్టేవు నాపాదము
గేలి నాపెపాదానఁ దాఁకించుమా చూతము

చ. 3: సేసుకొన్నదాననంటా చేరి నన్నుఁ గూడితివి
ఆసల నాపెఁ గాగిట నంటుమా నీవు
శ్రీసతినంటా నన్ను శ్రీ వేంకటేశ యేలితి
భూసతి ఆపెను నిట్టె పొందుమా చూతము

రేకు: 0936-4 మధ్యమావతి సం: 19-202

పల్లవి: అందుకుఁగా మమ్మేల ఆఱడిఁబెట్టేఁదాను
సందడిఁ గాలుదొక్కితే సాదించవలదా

చ. 1: అద్దుకొని యెడమాట లాడించకుండితే నేమి
వద్దికి రాఁగాను నే వద్దనేనా
ముద్దుముద్దువలె నేను మొక్కి నిలుచుండితేను
అద్దో పరాకు సేసితే నలుగఁగవలదా

చ. 2: చప్పుడు గాకుండా వచ్చి సన్న సేయకుంటేనేమి
కప్పురవీడె మియ్యఁగాఁ గాదనేనా
దుప్పటికొంగు వట్టితి తొలుతఁ దా రానందుకు
కొప్పువట్టి తీసి నేను కోపగించవలదా

చ. 3: సేనలుగాఁ బ్రియములు చెప్పకుండితే నేమి
తెనేమోవిచ్చితే సమ్మతించననేనా
తానే శ్రీవేంకటేశుఁడు తగిలి నేఁ గూడితేను
పూని యలసినందుకు పోదిసేయవలదా

రేకు: 0936-5 గౌళ సం: 19-203

పల్లవి: నివ్వెరగుతోడ నేము నిలుచున్నార మిదివో
దవ్వులనుండి నీకెట్టు తమిరేఁచేమయ్యా

చ. 1: మనసులోపలిమాట మగువ కాడఁగరాదు
తనువుమీఁదటికాఁక ధరించరాదు
వనితఁ బాసివాడలవారితో జూజమాడేవు
వినయాన నీకేమని విన్న వించేమయ్యా

చ. 2: కన్నులఁజూచేయాసలు గక్కన నాపఁగరావు
పన్ని పాయపుసిగ్గులు పట్టఁగరావు
సన్నల నింతులతోడ సాము సేసే విందు
అన్నిటా నిన్నెట్లాఁ జాయకుఁ దెచ్చేమయ్యా

చ. 3: కూడినట్టి నీరతులు కొలఁదివెట్టఁగరావు
వాడుమోవిగుఱుతులు వంచించరావు
యీడనే శ్రీ వేంకటేశ యేలితి వింతలో వచ్చి
తోడనే నీకిరితిఁ బోదులు సేసేమయ్యా

రేకు: 0936-6 పాడి సం: 19-204

పల్లవి: ఎంత దక్కరీఁడే వీఁడు యేమి సేతునే
మంతనపుచెలులాల మనిసియ్యాఁ డిదివో

చ. 1: చేసన్న చేసినవాఁడు చేరి మాటలాడరాదా
అసల నవ్వల నెత్తమాడ నేఁటికి
యీసుద్దు లెఱుఁగ నేను యీతనివేళ గాచుక
సేసవట్టుకున్న దాన చిత్తగించఁ డిదివో

చ. 2: తప్పక చూచినవాఁడు దండనే కూచుండరాదా
కప్పురపువసంతాలు కడనేఁటికి
తప్పు విచారించనైతి తనకే వొడిగట్టుక
అప్పటనుంటీఁ జూచేను అవుఁగాదనఁడిదివో

చ. 3: వీడె మిచ్చి కూడేవాఁడు వేరులేక చొక్కరాదా
వాడికసతులకళవళమేఁటికి
యీడనే శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
పాడితో సేవలు సేసేఁబాయలేఁ డిదివో

రేకు: 0937-1 భైరవి సం: 19-205

పల్లవి: సిగ్గువడ నీఁకనేల శిరసు వంచఁగనేల
తగ్గులేని సరసాల తమిరేఁచరాదా

చ. 1: పలుమారు నీచేఁతలు పచ్చిగా నాడఁగరాక
చెలియ చెక్కిటిమీఁదిచేత నున్నది
మొలకచన్నులమీఁద మొనగోర సోఁకింపించి
సెలవుల నవ్వింపించి చెంగలించరాదా

చ. 2: కొొచ్చి కొచ్చి నేమేన గురుతులు చూపలేక
ముచ్చెటతో సారె నీకు మొక్కుచున్నది
కచ్చుపెట్టి యాపెను నీకాఁగిటను బిగియించి
ఇచ్చకపు వలపుల నీఁదింపించరాదా

చ. 3: రతికెక్కినట్టినిన్ను రవ్వసేయఁ జాలక
మితిమీరి నిన్నుఁ గూడి మెచ్చుచున్నది
సతమై శ్రీ వేంకటేశ చనవిచ్చి మన్నించి
యితవుగా మోవి ఇచ్చి ఇటు మెప్పించరాదా

రేకు: 0937-2 వరాళి సం: 19-206

పల్లవి: ఇందుకు నే నేమిసేతు ఇది నీకె తెలుసును
విందువలె లోలో వట్టివిచారాలు సేసేవు

చ. 1: యెన్నఁడైనా నే నిన్ను యొగసక్కె మాడుదునా
కొన్నేసి నీవే గండించుకొందువుగాక
పన్ని నిన్ను నేఁ దప్పులు పట్టితినా యిటు తొల్లి
వున్నట్టేవుండి నీవే వులికిపడేవు

చ. 2: యెచ్చరించి నే నేమైనా యేతువ లెత్తితినా
పచ్చిదేర నీవే సిగ్గుపడేవు గాక
నెచ్చెలులముందరను నీపైఁ నింద మోపితినా
బచ్చెనమాటల నీవే బాసలు సేసేవు

చ. 3: పూనిపట్టి యెప్పుడైనా బొమ్మల జంకించితినా
ఆనుక నీవే వెరగందేవు గాక
వీనుల నీ సుద్దులెల్లా వినవా శ్రీ వేంకటేశ
నానాటికి నన్నునేలి నవ్వులు నవ్వేవు

రేకు: 0937-3 కన్నడగౌళ సం: 19-207

పల్లవి: తేటతెల్లమిగ నన్నిఁ దెలిసితిమి
ఆటదాననంటా నన్ను నాఁజిడిఁబెట్టేవు

చ. 1: చెంత నాపె నీకు నిట్టె సేవసేయఁగాఁ జూచి
యింత నీవు వేడుకొన్నా నితవయ్యీనా
యెంతలేదు నీవేసాలు యెఱఁగనా నేఁ దొల్లి
సంతకూటములు చూపి సటలఁబెట్టేవు

చ. 2: సన్నల నాపె నీతో సరసాలాడఁగాఁ జూచి
మన్నన లెన్నిచ్చినాను మనసొగ్గీనా
పన్నిన నీమాయ లివి భావించి తెలియనా
తిన్నని మోవితేనెల తీపులఁబెట్టేవు

చ. 3: గరిమెతో నాపె నీకాఁగిట నుండఁగాఁ జూచి
సరి నెంతలాలించినా చవు లయ్యీనా
యిరువై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
శిరసువంచి నవ్వి సేసలు వెట్టేవు

రేకు: 0937-4 రామక్రియ సం: 19-208

పల్లవి: ఆఱడిఁబెట్టఁగనేల ఆతని నింతేసి నీవు
మీఱక బంగారుపీఁటమీఁదఁ గూచుండవే

చ. 1: కొంగుపట్టి తియ్యనేలే కొసర నేమిటికే
సంగతెఱిఁగిన నెరజాణ విభుని
ముంగిట నున్నాఁ డుతఁడు మొక్కితే నెఱుకగాదా
రంగుగాఁ దానే వచ్చీ రావే లోపలికి

చ. 2: విన్నపము సేయనేలే వేఁడుకొన నింత యేలే
సన్న దెలిసినయట్టి సరసునికి
కన్నాఁడు నీగుట్టు వేళగాచుటే తగులుగాదా
పన్ని నిన్ను నేలీఁగాని పఱవవే పానుపు

చ. 3: చనవునఁ దిట్టనేలే చవులు చూపఁగనేలే
యెనసిన శ్రీవేంకటేశు నెదుట
ననిచి వున్నాఁ డితఁడు నగుటే వుంకువగాదా
తనివి నొందించి యింకాఁ దడవవే కాఁగిట

రేకు: 0937-5 కాంబోది సం: 19-209

పల్లవి: తలఁచుకొమ్మనవే తనగుణాలెల్లా నేఁడు
కొలనిలోసతులను కోరఁడా తాను

చ. 1: పంతములేలాడీనే పడఁతులుగలవాఁడు
యింతలోనే మరుబాణా లిటు గెల్చెనా
అంతటాను తనసుద్దు లల్లనాఁడే వింటిమి
వింతగా సీతాదేవి వెదకఁడా తాను

చ. 2: నవ్వులేల నవ్వీనే ననుపైనకోడెకాఁడు
ఇవ్వలఁ దనపాయము ఇట్టె గెల్చెనా
చివ్వనఁ దనయెమ్మెలు చెప్పీనేలే మాముందర
దవ్వుల రుక్మిణికిఁగా తగులఁడా తాను

చ. 3: చెప్పుకోనేలే మాటలు శ్రీ వేంకటేశ్వరుఁడు
యిప్పుడే తనమనసు యిట్టె గెల్చెనా
వొప్పుగా నన్నిటు గూడె నొరయనేలే చన్నులు
నెప్పున నురాన లక్ష్మి నిలుపఁడా తాను

రేకు: 0937-6 సౌరాష్ట్రం సం: 19-210

పల్లవి: ఏమి సేయవచ్చు నిఁక నెవ్వరితో నాడేము
నీమన సెఱఁగనిది నేము చెప్పేమా

చ. 1: నెలవుల నగనా చెప్పినట్టు సేయనా
కొలఁదిమీర నన్నేల కొసరేవు
తలుపుమాఁటుననున్న తరుణి నడుగరాదా
యెలమి నీయంత నీవు యెఱఁగకుండితేను

చ. 2: సేస నీపైఁ బెట్టనా చేతికి విడెమియ్యనా
వేసాలకు నన్నునేల వేఁడుకొనేవు
యీసుద్ది నీవెనకదిక్కింతిని నడుగరాదా
దోసము పుణ్యము నీకుఁ దోఁచకుండితేను

చ. 3: కైవసమై కూడనా కాఁగిలించుకొననా
శ్రీ వేంకటేశుఁడ నాచెక్కు నొక్కేవు
భావము నీదాఁపిరముపడఁతి నడుగరాదా
చేవమీఱినసిగ్గునఁ జెప్పరాకుండితేను

రేకు: 0938-1 శుద్ధవసంతం సం: 19-211

పల్లవి: మంచివాఁడవే నీవు మావాఁడవు
అంచెలనేల గుక్కే వాడవయ్య మాట

చ. 1: ఆగడాలేలల సేసే వటువంటివాఁడవా
మీగుణా లైమ్మైనాను మే మెఱఁగమా
నీగుఱు తెఱఁగలేక నిందలాడిరి చెలులు
యీగతి నేఁటికి వంచే వెత్తవయ్య శిరసు

చ. 2: నేరములు నీకున్నవా నీయందు నేమి గడమ
గారనవునీచేఁతలు కన్న వే కావా
దూరిరింతే నిన్నిందరు తుదమొద లెఱఁగక
నారుకొన్న చింత యేల నవ్వవయ్య సెలవి

చ. 3: బొంకనేరుతువా నీవు పొందుగా మమ్మేలితివి
కొంకేల శ్రీవేంకటేశ కొస రున్నదా
సంకించక నిన్ను నిట్టె సాదించిరింతేకాక
బింకపుగుట్టేమిటికి పెట్టువయ్య సేస

రేకు: 0938-2 ముఖారి సం: 19-212

పల్లవి: ఏమి సేయవచ్చు నిఁక నియ్యకొనవలెఁగాక
దీమసపుటాసలేకా దిమ్మరిఁ జేసినవి

చ. 1: చెలరేఁ గాపె సుద్దులే చెప్పేవు పలుమారు
చెలులతోనెల్లా నీవు సిగ్గువడక
నలువంక సవతులు నవ్వే రిందురు నిన్ను
వలపుగా నిన్ను నింత వాఁటము సేసినది

చ. 2: సూటిగా నాపెమెట్టెలు చూపేవు నీవేలఁ బెట్టి
చీటికిమాటికి నీవు సిగ్గుపడక
చాటువగా నండవారు సన్న సేసే దెఱఁగవు
పాటించి మనసేకా పచ్చిగాఁ జేసినది

చ. 3: వడి నాపెకుఁ బూనుక వచ్చేవు శ్రీ వేంకటేశ
చిడుముడి నన్నేలితి సిగ్గువడక
పడఁతులు నీచేఁతలు పట్టి ఇచ్చేది యెంచవు
కడఁగి నీవయసేకా కళలు నించినది

రేకు: 0938-3 దేశాక్షి సం: 19-213

పల్లవి: మాపుదాఁకా నేమిచెప్పే మఱియును నే నిఁక
ఆపనికి లోనైవుండు టదిమేలు నాకు

చ. 1: ప్రియపడి నీతో నింత పెనఁగ నే మున్నది
నయగారిమాటలకు నగుతగాక
నియతాన నడవఁగా నీకు బుద్ది చెప్పేనా
అయినట్టయిన నీవుండు టదిమేలు నాకు

చ. 2: సారెసారె నే నిన్ను సాదించఁగా నేమివచ్చీ
మేరతో నీచేఁతలెల్లా మొచ్చుటగాక
వోరలేక వండఁగాను వొడఁబరచవచ్చేనా
ఆరతి నీ యిచ్చనుండు టదిమేలు నాకు

చ. 3: శ్రీవేంకటేశ నీతోడ సిగ్గువడఁ బనియేమి
భావించి నిన్నుఁ గూడుటే పంతముగాక
నీవొళ్ళ లేనిగుణము నేఁ జెసిపెట్టేనా
ఆవటించి నమ్మివుండు టదిమేలు నాకు

రేకు: 0938-4 మాళవిగౌళ సం: 19-214

పల్లవి: చెప్పవద్దా బుద్దులు నీచెలువునికి
వుప్పతించ కేలుంటివే వొడివట్టఁగాను

చ. 1: విందువలె నాతనిచే విడెము నే నందుకోఁగా
సందుడి నీవేల జరసేవే
పొందుసేసి నీవింతేసి పూనుక వచ్చేదానవు
యెందుంటివే నన్నతఁడు యేలుకొనఁగాను

చ. 2: వొద్దనుండి నేనాతని కూడిగాలు సేయఁగాను
గద్దించి నీవేఁటికిఁ గాఁతాళించేవే
సుద్దులే చెప్పుచు వట్టిసూడు వట్టేదానవు
తిద్దుకోవద్దటవే యీ తెరవు రాఁగాను

చ. 3: గక్కన శ్రీవేంకటేశుకాఁగిట నేఁ గూడఁగాను
వెక్కసాన నేమిటికి వెరగందేవే
అక్కరతో నెడచొచ్చి ఆయాలంటేదానవు
మొక్కి వేఁడుకొనవదా ముందుముందుగా

రేకు: 0938-5 బౌళి సం: 19-215

పల్లవి: దొడ్డవాఁడ వవుదవు దొరతనములు చెల్లు
వెడ్డువెట్టి వేఁడుకొని విచారించరాదా

చ. 1: యేమిటికిఁ దలవంచే వెక్కడిపరాకు నీకు
కామిని నీచేతికిఁ గానుకియ్యఁగా
వాములుగా నీమీఁద వలపులు దొంతివెట్టి
మోము చూచీఁ జిత్తగించి ముచ్చటాడరాదా

చ. 2: సిగ్గులేల నెరపేవు చిరునవ్వు లేలవచ్చె
వెగ్గళించి యాపె నీకు తమకము వడ్డికిచ్చి
తగ్గుమొగ్గులేక నీకు విందుచెప్పఁగా
యెగ్గులేనిముచ్చ టాడీ నిచ్చగించరాదా

చ. 3: నీటులేల చూపేవు నీకునీకే అలసేవు
గాఁటపురతులఁ గూడి కాఁగిలించఁగా
పాటించి శ్రీ వేంకటేశ పాయము తరవువెట్టి
మేటిపంతములు చూపీ మేల మాడరాదా

రేకు: 0938-6 పాడి సం: 19-216

పల్లవి: ఇద్దరము నున్నారము యిరుదిక్కులా నీకు
పెద్దరికముతోడనే పెనఁగఁగవలెను

చ. 1: ఆకె నొడఁబరమకో అంకెకు వచ్చినదాఁకా
నాకేమి చెప్పేవు నమ్మినదాన
శేకరమాయ వలపు సిగ్గులు వడితేఁ బోదు
చేకొలఁదిఁ బ్రియములు చెప్పవలె నీఁకను

చ. 2: పూని యాకెనే నీవు బుజ్జగించి పిలుచుకో
నేనెప్పుడుఁ దొలుతనే నాదానను
నానాఁడే పెండ్లాడి నవ్వులు నవ్వితేఁ బోదు
తేనెమోవి యిచ్చి తరితీపు చూపవలెను

చ. 3: యింటిలో నాకెఁ గూడితి విందాఁకాఁ గాఁగిట నించు
జంటయి నేఁ గూడితి నిచ్చకపుదాన
వెంటనే శ్రీవేంకటేశ వేసాలు నేసితేఁ బోదు
అంటువాయ కిట్లానే ఆదరించరాదా

రేకు: 0939-1 దేసాళం సం: 19-217

పల్లవి: పాయపుమదములేల పచారించేవు
చాయలా సన్నలా నిట్టె జట్టిగొనరాదా

చ. 1: చలము సాదింతురా సతులపై విభుఁడవు
వలచి ప్రియము చెప్పవలెఁగాక
తొలుతే నమ్మించి తెచ్చి దోసము గట్టుకోనేల
చెలియచనవు నేఁడు చెల్లించరాదా

చ. 2: అట్టుగాఁ జేయుదురా గుట్టున రామల నీవు
చుట్టరికమై నయము చూపుట గాక
వట్టియాసలనుఁ బెట్టి వలవంత నేఁచనేల
ఇట్టె కొంతకోరిక యీడేర్చరాదా

చ. 3: తగవులఁ బెట్టుదురా తరుణుల నింతేసి
తగినరతులఁ గూడి దక్కుట గాక
మిగులా శ్రీ వేంకటేశ మెచ్చి గుట్టుసేయనేల
మగువఁ గూడితి విట్టె మన్నించగాదా

రేకు: 0939-2 అమరసింధు సం: 19-218

పల్లవి: సిగ్గుపడితేఁ బోదు చెప్పేము నీకుఁ బ్రియము
తగ్గక నీమాట జవదాఁటకున్నాఁ డతఁడు

చ. 1: మన్నించి నన్ను నిట్టె మచ్చికతో నేలుమని
విన్నవించవమ్మా విభునికిని
పన్ని ఇన్నిటా నీవు పట్టపుదేవులవు
కన్నెరో నీయప్పణకుఁ గాచుకున్నాఁ డతఁడు

చ. 2: దట్టముగా నేఁడు మమ్ము దయతో రక్షించుమని
కట్టడ సేయవమ్మా కాంతునికి
అట్టేనీవు మొదల మోహపుఁబెండ్లికూఁతురవు
యెట్టైనా నీ పంపుసేయ నెంచుకున్నాఁ డతఁడు

చ. 3: చేకొంటి వతని నీవు చేరి నన్నుఁ గూడుమని
కై కొలుపవమ్మా శ్రీవేంకటపతికి
నీకరుణవారము నీ వేలికసానివి
యీకడ నాయింటిలో నీయింపు చూపీ నతఁడు

రేకు:	0939-3 పాడి	సం:	19-219

పల్లవి: సాదుఁగొయ్య వై నాఁడవు సరికి బేసికి నీవు
యేది నిజ మేది గల్ల యేమిసేతునయ్యా

చ. 1: బిగియరాదు నీకుఁ బ్రియము చెప్పఁగరాదు
నగరాదు చూపులు నాటించరాదు
సగము మంచితనము సగము బింకము చూపే
వెగసక్కెవువిభుఁడ వేమి సేతువయ్యా

చ. 2: బొమ్మల జంకించరాదు పొందులు చూపఁగరాదు
కెమ్మోవి యడుగరాదు కినియరాదు
దిమ్మరితనము గొంత దిట్టరాజసము గొంత
యెమ్మెకాఁడ వై నాఁడ వేమిసేతువయ్యా

చ. 3: మచ్చిక మానరాదు మనసు సోదించరాదు
కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడితి నన్ను
పచ్చిసేఁతలు బాసలు నీవాకునను
యిచ్చకుఁడ వై నాఁడ వేమి సేతునయ్యా

రేకు: 0939-4 ఆహిరి సం: 19-220

పల్లవి: చెప్పఁగదవయ్యా చెవులుచల్లఁగా వినే
దెప్పరపుఁదలపోఁతే దిష్టమాయనో

చ. 1: తిలకించి యాపె నీదిక్కు చూచితే నీవు
నెలవి నవ్వితి విట్టె సిగ్గుతోడను
యెలమిఁ దనమాటున నేమైనాఁ జేసితివో
చలివేఁడివలపులు సరివచ్చేనో

చ. 2: విన్నపము లేకతాన వెలఁది నీకుఁ జేయఁగా
సన్నల జంకించితివి సరసానను
కన్నె యెవ్వతైనా వచ్చి కాచుకున్నదనేనో
నున్ననినీచెక్కు దననోరు సోఁకింపించెనో

చ. 3: జవ్వని నీకాఁగిటను చన్నుల నొత్తితే నీవు
పువ్వుల వేసితివి నీపొందు చూపుచు
రవ్వగా శ్రీ వేంకటేశ రతి నలయించెనో
నివ్వటిల్లఁ జక్కఁగాను నిన్ను నెచ్చరించెనో

రేకు: 0939-5 హిందోళవసంతం సం: 19-221

పల్లవి: అడుగరే చెలులాల ఆసలేల పెట్టీని
యెడయక పెనఁగితే నిచ్చగించీనా

చ. 1: నాలినేసి నాతోను నమ్మికమాట లాడి
యేల బేరిజోకొట్టీనే యిప్పుడు తాను
వాలాయించి నేఁ గనక వలెనని పైకొంటేను
వోలి నన్నిటికీఁ దాను వొడఁబడీనా

చ. 2: చాయలా సన్నలాఁ జూపి సారె నాతో నవ్వీని
ఊయి గిలిగించనేలే ఉట్టుతోఁ దాను
పాయక నేనందుకును బాఁతిపడి కొసరితే
నాయము దప్పక తాను నడఁపఁగఁగలఁడా

చ. 3: గారవించి నన్నుఁ గూడె కడునిచ్చకము చేసి
యేరు నిద్రవుత్తురటే యింతలోఁ దాను
యీరీతి శ్రీ వేంకటేశుఁ డిందుకు నే వేడుకొంటే
వూరట నారతులకు నొడిగట్టీనా

రేకు: 0939-5 కుంతలవరాళి సం: 19-222

పల్లవి: ఇందులోనే వున్నది మీ యిద్దరిజాణతనము
అందరము నేమనియాడేము నిన్నును

చ. 1: బాగాలిచ్చేయాఁటదానిపయ్యదకొం గెడలించి
చేఁగదేరేచన్నులు పిసికేవేమయ్యా
ఆగడీఁడవని నిన్ను నౌఁగాదనఁగలేక
సోగకన్నులఁదప్పక చూచెనాపెనిన్నును

చ. 2: కుంచేవేసేమగువను కొప్పువట్టి తీసిమోవి-
యంచు గంటిసేసితి వౌనయ్యా
వంచఁకుఁడ వనుచు రవ్వలుగాఁ జేయఁగలేక
ముంచినమొగమోటాన మొక్కినవ్వీ నిన్నును

చ. 3: సురటివిసరేయింతిఁ జొక్కించి కాఁగిటఁ గూడి
కెరలించేవు సిగ్గు చెక్కిట నేమయ్యా
పొరపొచ్చెగాఁడవని పోరక శ్రీ వేంకటేశ
సరినిక్కి పై నొరగి యాసలఁబెట్టీ నిన్నును

రేకు: 0940-1 సామంతం సం: 19-223

పల్లవి: సందుసుడిదానఁగాను సతమైనదాన నీకు
అందరివలేనే నన్ను నలయించ కిఁకను

చ. 1: వొత్తి నీకు విన్నవించే పూఁకొని విను నామాట
చిత్తమువచ్చినప్పుడు సేతువుగాని
బత్తిగల వెరుఁగుదు పఱిమారు నారతులు
చిత్తగించి యాపెతోడఁ జెప్పకు నీవిఁకను

చ. 2: కనుఁగొన నీకు మొక్కే కానుకగాఁజేకొను
పనిగలప్పుడు చేపట్టేవుగాని
చనవిచ్చితివి తొల్లి సరసపునాచేఁతలు
సొరిది నాపెముందరఁజూపకు నీవిఁకను

చ. 3: తతి నాచన్నులనొత్తేతనివొంది కాఁగిలించు
యితవై నప్పు డింకా నేలేవుగాని
పతివి శ్రీ వేంకటేశ పచ్చయిననాసుద్దులు
నతమాయ నా పెతో పచారించకు మిఁకను

రేకు: 0940-2 వరాళి సం: 19-224

పల్లవి: ఇన్నాళ్ళువలెఁ గాదు ఇప్పుడు నీవు
తిన్ననిమోమునఁ గళదేరుచుకున్నాఁ డవు

చ. 1: గద్దరికన్నుల నిన్ను గద్దించి గద్దించి
సుద్దులు చెప్పుతానుండె సుదతి నీతో
పొద్దువొద్దుకేమైనా బుద్ధులు నీకుఁ జెప్పునో
తిద్దువడె నీ గుణాలు తేటతెల్ల మిగను

చ. 2: జవ్వనపుచనుఁగవ సరిఁ గులికి కులికి
నవ్వులు నవ్వుతానుండె నాతి నీ తోను
అవ్వల దొక్కకుండా నిన్నలవరచుకొనెనో
రవ్వలాయ నీవలపు రాతిఁబగలును

చ. 3: వుట్టిపడ మోవితేనే లూరఁబెట్టి వూరఁబెట్టి
పట్టిపెనఁగుతానుండె పడఁతి నీతో
నెట్టన శ్రీ వేంకటేశ నిన్ను సిగ్గుదేర్చెనో
యిట్టె నన్నుఁ గూడితివి యిచ్చకముతోడను

రేకు: 0940-3 గౌళ సం: 19-225

పల్లవి: ఎందు వోయీ మా పొందు లెప్పుడు మీ వారమే
ఇందరిలో నాపె నీపై యేఁకటతో నున్నది

చ. 1: ఆడరాదా మాటలు ఆపెతోడఁ గొంతవడి
వేడుకతో నున్నది వినేనంటాను
చూడరాదా నెమ్మోము సూటిగా నీయెదుఁటను
వీడెము చేతఁబుట్టుక వేళగాచుకున్నది

చ. 2: చుట్టరికమైనాఁ గొంత చూపరాదా నీమీఁద
రెట్టించినరతులకోరిక నున్నది
ముట్టరాదా చనుఁగవ ముచ్చటైనతమితోడ
యెట్టయెదుట నీకేమిఁదెత్తుక తానున్నది

చ. 3: కూచుండరాదా దండ గొబ్బున మంచముమీఁద
లాచి కూడినమందెమేళాన నున్నది
యేచి యిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చేచేత నిద్దరిఁ జూచి చేరి నవ్వుచున్నది

రేకు: 0940-4 కేదారగౌళ సం: 19-226

పల్లవి: ఏఁటికిఁ బరాకుసేసే విప్పుడు నీవు
మాఁట లాడి ఇఁకనైనా మన్నించరాదా

చ. 1: చిమ్ముఁజూపులనుఁ జూచి చేతికిచ్చీ పూబంతి
కొమ్మ నీకు నిదె యందుకొనరాదా
వుమ్మగిలఁ జెమరించి వూరకే నీవుండఁగాను
ఇమ్మిచ్చి తొడమీఁదట నిడుకొనరాదా

చ. 2: వినయాన నీకు మొక్కి విందుచెప్పవచ్చెఁ జెలి
గునియక యిట్టె ఇయ్యకొనరాదా
నినుపునిట్టూర్పు నించీ నీవు గుట్టుతో నుండఁగా
చనవిచ్చి చెక్కు నొక్కి సమ్మతించరాదా

చ. 3: కొంగువట్టి పానుపుపై కూచుండఁ బెట్టీ నిన్ను
ఇంగిత మెరిఁగి మోవి ఇయ్యరాదా
చెంగలించి రతిఁగూడి శ్రీ వేంకటేశ మెప్పించె-
నంగన నెప్పుడు నిట్టె ఆదరించరాదా

రేకు: 0940-5 ఆహిరి సం: 19-227

పల్లవి: విచారించుకొ నీవే వింతలు నాతోనేల
పచారపు నీచేతలు పట్టిచూపగలనా

చ. 1: మొగమునఁ గళలెల్లా ముంచుకొని వుండఁగాను
నగరాదా నిన్నుఁ జూచి నాకు నీవేళ
నిగిడి సింగారమే నీకు వెంగమైతేను
మగువ నింత నేను మానుపఁగలనా

చ. 2: చిడుముడితో నీ చెక్కుల వడియఁగాను
తుడువరాదా చెమట తొడఁగి నాకు
వుడిబడి నీ సుద్దులు వూరెల్లా నాడుకొంటే
తడయక నే నందు కుత్తర మియ్యఁగలనా

చ. 3: వుప్పతిల్ల నీ మేననున్న పులకలు చూచి
కప్పరాదా పచ్చడము కడఁగి నాకు
యిప్పుడే శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చిప్పిల సిగ్గువడఁగా చిమ్మిరేచఁగలనా

రేకు: 0940-6 ఛాయానాట సం: 19-228

పల్లవి: కిందు మీఁదు నెఱఁగఁడు కెలసీఁగాతరమున
చందము సేయఁగదరే సతులాల

చ. 1: పొద్దువోదా తన కేమి పొలఁతులెల్లా నవ్వఁగా
వుద్దండపునవ్వు నవ్వి వొడివట్టీ
పెద్దరికమా యిదేమి ప్రియురాండ్ల నింత సేయ
బుద్దులుచెప్పరే మీరు పూఁచి చెల్లులాల

చ. 2: వుండఁబట్టదా తనకు నూడిగము సేయుఁగాను
చండిపెట్టి వాఁతవాశి చన్నుల మీఁద
బండారము గూడెనా పడఁతులఁ తక్కించఁగా
అండనుండి వేఁడుకోరే అతివలాల

చ. 3: పాయపుమదమా యిది పంతానఁ దెరలోన
ఆయమంటి నన్నుఁగూడె నచ్చలానను
చేయి మీఁదాయఁగా నేఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
పాయకున్నాఁడు మెచ్చరే భామలాల

రేకు: 0941-1 ఆహిరి సం: 19-229

పల్లవి: ఇంత ఱట్టు గాఁదగునా ఇంతులకును
మంతనాన నీవే నన్ను మన్నించరాదా

చ. 1: పచ్చిమాటలేలాడేవు పరాకులేల సే సేవు
తచ్చి నే నీకుఁ బాదము లొ త్తఁగా
యెచ్చరికతోఁ జెలు లిరువంకా నున్నవారు
బచ్చెనసిగ్గు విడిచి పై కొందునా నేను

చ. 2: కొనగోరే లంటించేవు గుట్టులేల సేసేవు
యెనయ నీకు వింజామ రిట్టె వేయఁగా
మనికై వూడిగాలభామలు గొలువు సేసేరు
మనసుమఱఁగు లేక మర్మాలు ముట్టుదునా

చ. 3: దుప్పటేల కుప్పేవు తూరి యేమి భావించేవు
చెప్పి శ్రీవేంకటేశుఁడ చేరి కూడఁగా
చొప్పుగా సవతులెల్లా చుట్టిరానున్న వారు
యిప్పటలయిక మాన కింకాఁగూడుదునా

రేకు: 0941-2 లలిత సం: 19-230

పల్లవి: తరుణిచెనకులు నీతనువెల్లా నిండినవి
యిరుమేలాఁ జూడరాదా యెంత నీకీ మరపు

చ. 1: నివ్వటిల్ల నీపె నేఁడు నిన్నుఁ బేరుకొని పిల్చీ
యెవ్వతెతో మాటలాడే వేమి సేసేవు
పువ్వుల వేసీఁ గమ్మటి పూఁచిపూఁచి యిందుకుఁగా
ఇవ్వల చూడఁగరాదా యేల నీకీమఱపు

చ. 2: సముకాన నుండి యీాకె సారె నిన్నుఁ జూడఁగాను
తమక మెచ్చుట నుండీ తలఁ పెచ్చోట
గుమితాన నెరుకగా కొంగువట్టి తీసీని
అమరఁ బెండ్లాడరాదా అంతయేల మఱపు

చ. 3: ననుపున నీకె నీతో నవ్వులెల్లా నవ్వఁగాను
పెనుఁగులాట లేవంక ప్రియ మేవంక
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసి నిన్నెచ్చరించీ
చనవు లియ్యఁగరాదా సరినేల మఱపు

రేకు: 0941-3 పాడి సం: 19-231

పల్లవి: తెలియఁ జెప్పఁగవలె తెలుసునో తెలియదో
మెలుపున నోకు నమ్మినదాన నేను

చ. 1: మచ్చరించ నేరఁగాని మనసిచ్చి నీతోడ-
నిచ్చకమాడనేరుతు నిందరికంటె
కుచ్చితురాలఁ గాను గుణము తెలుసుకొంటే
హెచ్చుఁగుందు లేనట్టిహితవరి నేను

చ. 2: గద్దించనోపఁగాని కలకాలము నీకు
బుద్ధులు చెప్పనోపుదు పొందులుగాను
వుద్దండపుదానఁగాను వొద్దికై యెప్పుడు నీ-
తిద్దుతీరుకు వచ్చినదేవుల నేను

చ. 3: వేసరించఁజాలఁగాని, వేడుక శ్రీవేంకటేశ
ఆస పుట్టించఁ జాలుదు నన్నిరతుల
రేసులదానఁగాను రేపును మాపునునీకు
సేసవెట్టి పెండ్లాడినచిన్నదాన నేను

రేకు: 0941-4 శుద్ధవసంతం సం: 19-232

పల్లవి: మగవాని కేడ సిగ్గు మగువల కింతేకాక
యెగసక్కేలాడేనంటా యేలనవ్వే విపుడు

చ. 1: మంతనాన నిద్దరము మాటలాడుకొన్న వెల్లా
యింతలోనే ఆపె నేఁడు యెట్టెరిఁగెను
చెంతల నీవెమ్మెలకు చెప్పితివేమోకాక
వింతగా నీచెవులనే వినవయ్యా సుద్దులు

చ. 2: చేరి యింటిలో మనము చేసుకొన్న బాసలు
వారించి యాపెకు నే డెవ్వరు చూపిరి
మేరమీరి మురిపెము మెరసితి వేమోకాక
ఆరీతి నీవే యడుగవయ్యా యీ సుద్దులు

చ. 3: పానుపు పై నిద్దరము పైకొన్న కూటము లెల్లా
తానకమై యేరీతిగాఁ దలఁచినది
కానీలే నీవే పెద్దరికము చూపేవేమోకాక
మేన శ్రీ వేంకటేశుఁడ మెచ్చవయ్యా సుద్దులు

రేకు: 0941-5 భౌళి సం: 19-233

పల్లవి: నామోము చూచి చూచి నడుమ నేల కొంకేవు
ఆముకొని మెచ్చుఁగా నే నడ్డమాడేనా

చ. 1: బత్తి గలవాడవు పడఁతి పాట వింటివి
చిత్తము రంజించి నీకు చెవి బట్టెనా
యిత్తల మే చెమరించె నెంత గరఁగెనొ మతి
పొత్తుల వాకుచ్చి యాకెఁ బొగడఁగరాదా

చ. 2: సరి నిడుకొంటివి చదివించితి వా పెను
తిరమైన యాయర్థము తెలిసితివా
నిరతిఁ బలుకలెల్లా నిండెను సంతోసమెంతో
అరదైనవుడుగర లట్టె ఇయ్యరాదా

చ. 3: శ్రీవేంకటేశుడు చెలియాట చూచితివి
భావించి నీకు గన్నుల పండుగాయనా
యీవల నన్నేలితివి ఇదెంత జాణతనమో
సేవసేసే మిద్దరము సేసచల్లరాదా

రేకు: 0941-6 నాదరామక్రియ సం: 19-234

పల్లవి: ఓపుదు వెంతకై నాను వువిదలఁ గంటేఁ జాలు
పూపవలపు లెనైనా బోది సేయఁగలవు

చ. 1: బాస చేసినాపె వచ్చి పానుపుపై నున్నది
ఆసవెట్టి నాపె నీయండ నున్నది
గోస నాస తోడ మరి కొప్పు దువ్వనేల నన్ను
లాసి యెన్ని చోట్లను లాగవేగా లాడేవు

చ. 2: రిత్తవచ్చి నాపె కూరిమిఁ దెరలో నున్నది
కొత్తగా వచ్చినయాపె కూచున్నది
హత్తి సరసము లాడే వప్పటి నాతో నీవు
సత్తుగా నెన్ని చోట్ల చవులు చూపేవు

చ. 3: పూనుక వచ్చినయాపె పారుగున నున్నది
కానుక యిచ్చిన యాపె కాచుకున్నది
ఆనుక శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
సేనగా నెన్మి చోటుల సేస వెట్టేవు

రేకు: 0942-1 ముఖారి సం: 19-235

పల్లవి: కంటిమి నీలాగులు కతలు గాను
పెంటలుగా గొసరేవు పెనఁగఁగఁ గలవా

చ. 1: చూపులకే వలచేవు సుద్దులకే భ్రమసేవు
ఆపడఁతి నేరుపు లెన్నని చెప్పేము
చాపలాన బొమ్మలను జంకించితేఁ గనక
పైపై నీ చేసిన భాగ్య ఫలమిది గాదా

చ. 2: మొక్కులకే తగిలేవు ముచ్చటకే లాచేవు
యెక్కువ నీకె పంతము లెంతమెచ్చేము
పక్కన నంతలోనే గుబ్బల నొత్తితేగనక
యిక్కువ నీ మనోరథ మీడేరుట గాదా

చ. 3: నవ్వులకే పొదిగేవు నమ్మికలకె కూడేవు
జవ్వనిభావము యెందు సరిచూపేము
యివ్వల శ్రీవేంకటేశ యెనసె నీ కెగనక
రవ్వల నీకు మదనసామ్రాజ్యము గాదా

రేకు: 0942-2 లలిత సం: 19-236

పల్లవి: ఏమి చెప్పేము నీసుద్దు లెంతవడియైనాను
చేముంచి నాతురుముపైఁ జేయివేయవలెనా

చ. 1: పొఁడిమి నందరితోడాఁ బొందు సేయనేర్తువట
నేఁడు నన్ను నమ్మించ నేరవా నీవు
ఆఁడువారము గనక అలసి నిన్ను దూరితే
వాఁడికొనగోర చంద్రవంక లొత్తవలెనా

చ. 2: ననిచినవారితొడ నవ్వునవ్వ నేర్తువట
పెనఁగి నన్ను సమ్మతింపించనేరవా
వనితలముగనక వడి నిన్ను సొలసితే
ఘనమైనచన్నులు విసుకఁగ నింతవలెనా

చ. 3: శ్రీ వేంకటేశ కొల్వులో సిగ్గువడనేర్తువట
యీవల నన్నుఁ గూడితి వింతనేరవా
కైవసపుటింతులముగనక నిన్ను మెచ్చితే
చేవదేరేమోవితేనె చిప్పిలించవలెనా

రేకు: 0942-3 భైరవి సం: 19-237

పల్లవి: ఇంతసేసినవాఁడవు యిద్దరికి నీవేకావా
దొంతివిడేలువెట్టేవు తొడిఁబడ నేఁడు

చ. 1: జగడించేసవతుల సంగడికి నీవు వచ్చి
తగవులు చెప్పేవు తమకానను
నిగిడి వొండొక రట్టై నీమీఁద వొట్టువెట్టఁగా
నగవులు నవ్వేవు నడుమ నేఁడు

చ. 2: కొద్దిమీరఁ బంతాలాడే కొమ్మలవద్దికి వచ్చి
బుద్ధులెల్లాఁ జెప్పేవు పొసఁగఁగను
చద్దికి వేఁడికిఁ దమలో సాకిరి నిన్నుఁ గోరఁగా
పెద్దరికాన మించేవు పీఁటమీఁద నేఁడు

చ. 3: రాఁగతానాన జరసేరమణులఁ జేరవచ్చి
కాఁగిలింపించి కూడేవు కందువ లంటి
ఆఁగుచు శ్రీవేంకటేశ అట్టె నీమో వెడుగఁగా
మాఁగి రతిఁ జొక్కించేవు మగువల నేఁడు

రేకు: 0942-4 బౌళి సం: 19-238

పల్లవి: ఇంతటా నీసుద్దులే యేఁటికి సిగ్గువడేవు
యెంత లేదు నాకు నిట్టె ఇయ్యవయ్య విడెము

చ. 1: వినరాదా ఆపె మాట వేడుకలు దై వార
యెనలేని పరాకులు యేలసేసేవు
మునుపే యెరుఁగుదురు ముదితలు నీపొందులు
తనివోక నీవేల దాఁచేవో కాని

చ. 2: చూడరాదా ఆపెదిక్కు సూటులు దప్పకుండా
తాడుపడి నీ వేల తలవంచేవు
వాడలెల్లా నిండె నీవు వలచినవలపులు
గాడిఁగట్టి నీ వేల కప్పేవో కాని

చ. 3: వేయరాదా నీచేయి వెక్కసపుఁ జన్నులపై
యీా యెడ శ్రీ వేంకటేశ యేల నవ్వేవు
చాయల నన్నేలితివి సమరితి నా కెవద్ద
నీ యలపు లేమిటికి నెరపేవోకాని

రేకు: 0942-5 నాగవరాళి సం: 19-239

పల్లవి: తారుకాణ సేసుకొంటే తానే నేను
యీరీతినే నవ్వుఁగానీ ఇంటికి రమ్మనవే

చ. 1: చెక్కులివె చెమరించె చిత్తమెల్లాఁ జిగిరించె
కుక్కినట్టు కోరికలు కొనసాగెను
తొక్కినాఁడు నాపాదము తొలుతే సందడిలోన
యెక్కడ పరాకు సేసి నింటికి రమ్మనవే

చ. 2: దప్పిదేరె పెదవుల తమకము దైవారె
కొప్పు వీడి చన్నులపై కుప్పలాయను
ముప్పిరిఁగా గట్టినాఁడు ముంజేత కంకణము
యిప్పుడేల నించీ సిగ్గులు యింటికి రమ్మనవే

చ. 3: ఆయాలంటి నన్నుఁ గూడె అంగమెల్లాఁ బులకించె
చేయి చేయి సోఁకి యాస చిమ్మిరేఁగెను
చాయలా సన్నలా సేస చల్లె శ్రీ వేంకటేశుఁడు
యీయెడ నన్ను మన్నించీ యింటికి రమ్మనవే

రేకు: 0942-5 రామక్రియ సం: 19-240

పల్లవి: నవ్వేవారి నెఱఁగవు నయమున నిన్నుఁ జూచి
నివ్వటిల్లినదొరవు నీ వింతేసి సేతురా

చ. 1: పువ్వులనేల వేసేవు బుజమేల గీరేవు
యెవ్వతె నీకు నేరిపె నిటువంటివి
చివ్వననూడిగాలు నా చేతఁ జేయింతురుగాక
అవ్వలివిడెము నీవే అంది నాకు నిత్తురా

చ. 2: చన్నులేల పిసికేవు సారెనేల పెనఁగేవు
యిన్నేసి నీగజరుల కేమందును
పున్నతినీపాదాలు నావొడిపై వేతురుగాక
మిన్నక నీవుంగరము మెట్టెగాఁ బెట్టుదురా

చ. 3: చెక్కులేల నొక్కేవు సిగ్గులేల తడవేవు
దిక్కుల నీవోజలెల్లాఁ దెలిసె నాకు
గక్కన శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
మెక్కించుకొందురుగాక మోము నాకు వంతురా

రేకు: 0943-1 రీతిగౌళ సం: 19-241

పల్లవి: బలిమి సేయఁగనేల పరపుపై నన్నుదాన
నలువంకలుఁజూచితే నవ్వురాదా నాకు

చ. 1: మునుకొన్న నాగుణములు పొగడేవుగాని
వినరాదా నామాట వింతగాను
చనవిచ్చి సతులతో జాణతనాలాడుతానే
ననుపు నాతోఁ జేసితే నమ్మికౌనా నాకు

చ. 2: జాడ దప్పకుండా నాతో సరసాలాడేవుగాని
చూడరాదా నాదిక్కు సూటితోడను
కోడెకాఁడవై సందడికొలువులో నుండుతానే
వోడక నన్ను మెచ్చితే నొద్దికౌనా నాకు

చ. 3: యీరీతి శ్రీ వేంకటేశ యిట్టె మన్నింతువుగాని
రారాదా యింటిలోనికి రాఁపు సేయక
సారెఁ జెలికత్తెల కాసలెల్లాఁ జూపుతానే
వోరలేక కూడితేనే వొడబాటా నాకు

రేకు: 0943-2 హిందోళం సం: 19-242

పల్లవి: చూడవే యీతఁ డప్పటి సొలసీ నన్ను
యేడ నేరిచినాఁడో యేమందునే

చ. 1: చెక్కులు నొక్కుటయెల్లా సేస వెట్టుటకే కాదా
గక్కన విభునిచేఁత కంటివా చెలి
అక్కరతో మాటాడిన దాసపడుటేఁ(టకే?) కాదా
ఇక్కడ నేమారుమాట లేమందునే

చ. 2: కప్పుర మిచ్చుటయెల్లా కదియవలనే కాదా
చిప్పిలీ నీతఁడు తెలిశితివా చెలి
దప్పిదేర నవ్వుటెల్లా తమకించుటకే కాదా
ఇప్పుడిట్టె వేగిరించి నేమందునే

చ. 3: కనుసన్న సేయుటెల్లా కాఁగిలించుటకే కాదా
వినయము సేసీఁ దాను వింటివా చెలి
చెనకుచు మన్నించి శ్రీ వేంకటేశ్వరుఁడు
యెనసినాఁడిదె నన్ను నేమందునే

రేకు: 0943-3 భైరవి సం: 19-243

పల్లవి: సవతుల మిందరము సంగడినుంటే నేమాయ
యివల నీ వెట్టుండినా యెవ్వ రేమనేరే

చ. 1: ఆతనిమోము చూచేవు అంతలోన భ్రమసేవు
చేతిమీఁది చెక్కుతోడ చెమరించేవే
కాతర మింతగలితే కడుసిగ్గువడనేల
యేతులఁ గాఁగి లించితే నెవ్వ రేమనేరే

చ. 2: పై కొని మాటలాడేవు భావములో నలసేవు
దాకొన్నయాసలతోడ తడఁబడేవు
నీకింతఁయాకటయ్యైతే నివ్వెరగు లిపుడేల
యీకడ నెంతసేసినా యెవ్వ రేమనేరే

చ. 3: అడియాలములు చూపేవు ఆయములు సోఁకించేవు
తడవి శ్రీ వేంకటేశుదండ వాయవు
బడి నాతఁడు నన్నేలె పచ్చిగా నవ్వనేల
యెడయక నీవెంతన్నా యెవ్వ రేమనేరే

రేకు: 0943-4 పాడి సం: 19-244

పల్లవి: ఏల పంతాలాడేవు ఇంతేసి మాతోను
సోలగిలి యాపెదిక్కు చూడకుండఁగలవా

చ. 1: చెలియ చూచినచూపు చీఁకటిలోవెన్నెల
అలవోక మాట బయలువందిలి
తళుకుమోవితీపు తంగెటఁబెట్టినజున్ను
తలఁచుకో ఆపెఁబాసి దరిఇంచఁగలవా

చ. 2: ముదితచక్కఁదనము ముంగిటినిధానము
వెదచల్లేనవ్వు చలివెన్నెలతేట
పొదలుఁ జన్నులు కడివోనివూగుత్తులు
సదరాన నీచలము సాదించఁగలవా

చ. 3: పడఁతి మేనిచాయ బంగారులోనినిగ్గు
జడియనికాఁగిలి జాజులశయ్య
అడరి శ్రీవేంకటేశ అట్టె యీపెఁ గూడితివి
మెడఁ గట్టుకొందుగాక మితిమీరఁగలవా

రేకు: 0943-5 మధ్యమావతి సం: 19-245

పల్లవి: ఎంతమేలువాఁడో తాను యీసతికి
పంతగాఁ డింతేసి యేల పచ్చి సేసుకొనీనే

చ. 1: సెలవి నవ్వినయింతి చేతికి విడెమియ్యదా
తలపోసి తానేల తమకించీనే
కొలువుకువచ్చినాపె కోరి మొక్కక మానీనా
చలివాసి తానేల సాదించీనే

చ. 2: మాటలాడినట్టికాంత మరిగి పై కొనదా
చీటికి మాటికినేల చేయిచాఁచీనే
గాఁటమై పిలిచినాపె కాఁగిలించక మానీనా
కూటమికిఁ బెనఁగేల కొంగువట్టీనే

చ. 3: ముచ్చట గలట్టిరామ మోవితేనె లొసఁగదా
విచ్చనవి డెంతేసి వేఁడుకొనీనే
తచ్చి శ్రీవేంకటేశుఁడు తానప్పటి నన్నుఁగూడె
యిచ్చకము లిపుడెంత యిట్టె నాకుఁ జేసీనే

రేకు: 0943-6 నాగాంధారి సం: 19-246

పల్లవి: ఇదివో నీమహిమలు యేమని పొగడేమయ్యా
కదిసితేనే యినుము కనకమై మించెను

చ. 1: సెలవి నీవు నవ్వితే చిత్తము చీఁకటివాసె
వెలసెను నాలోనివేడుకలెల్లా
చెలిమిసేసి నాపైఁ జేయి నీవు వేసితేను
బలిమితో వలపులపంటలెల్లాఁ బండెను

చ. 2: తప్పక నీవు చూచితే తనువుపై కాఁక మాని
వుప్పతిల్లె జవ్వనము వుదుటునను
కొప్పుదువ్వి నీవు నన్నుఁ గొనగోరు సోఁకించితే
కుప్పళించి తమకపుకొటారులు నిండెను

చ. 3: చేరి నీవు వలికితే సిగ్గులు మూల కొదిగె
కారుకమ్మె నెమ్మోమునఁ గళలన్నియు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సారె నాకిట్టె మదనసామ్రాజ్యము హెచ్చెను

రేకు: 0944-1 వేళావళి సం: 19-247

పల్లవి: ఇన్నిటా సిగ్గులుదేరె నిఁకనేలే
కన్నుల నాపెసొబగు కప్పించుకొమ్మనవే

చ. 1: కోపించఁజాలక నేను గుట్టుతో నుండఁగాను
యేపురేఁగి తనచేఁత లేల చెప్పీనే
ఆపాటి గలవాఁడు ఆపెనే యీడకుఁ దెచ్చి
యేపొద్దూ మెడఁగట్టుక యెమ్మెచూపుమనవే

చ. 2: కోరి వెంగెమాడక గుక్కుతా నే నుండఁగాను
యీరీతిఁ దనవలపు లెంతచెప్పీనే
మేరమీర వేడుకై తే మేడమీఁద నిద్దరూ నుండి
వూరివారెల్లాఁ బొగడ నొద్దికగమ్మనవే

చ. 3: యెడయక శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగా
వొడలిపై రేకలేల వొగిఁ జెప్పీనే
అడరి శ్రీకాంత నేను అవ్వలిపొందు గలితే
వొడిఁగట్టుక మాయింట నుండి నవ్వుమనవే

రేకు: 0944-2 గుజ్జరి సం: 19-248
పల్లవి: అన్నిటా మీవారమే అనుమానించఁగవద్దు
యెన్నికలు సరివచ్చె నీవయ్య చనవు
చ. 1: పచ్చిసేసేదాననా బాఁతితోడ నీవలపు
తచ్చి తచ్చి దాఁచుకొనేదానఁగాక
మచ్చములుగ నేనంటా మరి నాకేల లోఁగేవు
రచ్చవేయఁ జేఁత లిట్టె రావయ్య నావద్దకి
చ. 2: నవ్వేటిదాననా ననిచి నీసుద్దులెల్లా
దవ్వుల వంకలుదిద్దేదానఁ గాక
యెవ్వరు నెరఁగకుండా నేకాంతమేలాడేవు
వువ్విళ్లూరఁ గాఁతాళించ నుండవయ్య యీడను
చ. 3: సిగ్గువరచేదాననా చేరి నీకాఁగిటఁ గూడి
తగ్గనిరతుల మెచ్చేదానఁ గాక
నిగ్గుల శ్రీవేంకటేశ నీవేల వేఁడుకొనేవు
యెగ్గుపట్ట నన్ను నిట్టె యేలవయ్య యిపుడు

రేకు: 0944-3 శ్రీరాగం సం: 19-249

పల్లవి: చిగురుఁబెదవి నిండె సింగారములు నేఁడు
నగితివి మేలుమేలు నల్లఁబల్లిచెన్నుఁడా

చ. 1: చెక్కులఁ జెమట గారీ సిగ్గులు మోమున నూరీ
యెక్కడనుండి వచ్చితి విందాఁకాను
మొక్కేము నీకిదివో మొనగోరు కడువాఁడి
మొక్కలము లేకనేల మోహించితి నీకును

చ. 2: తురు మించుక చెదరె తోడనే సందులదరె
చిరుతపను లేమేమి సేసితివి
గురుతై సేవసేసేము కుచములు గట్లు
జరుపులఁ బెట్ట కిఁక సతినై తి నీకును

చ. 3: కాయమెల్లాఁ బులకించీ కళలు నీయందు మించీ
చేయిచ్చి నన్నేలితివి శ్రీవేంకటేశ
నీ యిచ్చ రతిసేసితివి నిండు నాపెఱుఁదు వేఁగు
పాయకు నన్నిఁక నిట్టె బత్తిసేసే నీకును

రేకు: 0944-4 ఆహిరి సం: 19-250

పల్లవి: ఎరవులదానఁగాను యెంతైనా నే నీకును
సురతవిద్యలకెల్లా చుట్టమను సుమ్మీ

చ. 1: సరసములాడి నీచనవు చేకొందుఁగాక
సరికి బేసికి నిన్ను సాదించేనా
విరసాన నీవు నన్ను వెంగెముగాఁ జూడకు
నిరతపు నీ సేఁతకు నే లోనుసుమ్మీ

చ. 2: ఇచ్చకములాడి నిన్ను యిట్టె దక్కఁగొందుఁగాక
తచ్చనలుసేసి నిన్ను దక్కించేనా
ఇచ్చుట సిగ్గుపడకు యేమిటా విచారించకు
మచ్చిక నీమాటకు సమ్మతిదానఁజుమ్మీ

చ. 3: చేరి నిన్నుఁ గాఁగిలించి సెలవి నవ్వుదుఁగాక
మారుకొని నే నిన్ను మందలించేనా
కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
గారవముతోడి వూడిగపుదానఁజుమ్మీ

రేకు: 0944-5 సామంతం సం: 19-251

పల్లవి: ఏమనీనే రమణుడు ఇంకా నన్ను
కామించి నేరిచినాఁడు కతకారాలు

చ. 1: తగవులఁ బెట్టీనవే తన్ను నదె చూడవే
చిగురుఁబెదవిమీఁదిసింగారాలు
అగడు నేఁ జేసితినా అందరు నాడుకొనేరు
నగవుఁజూపులలోని నయగారాలు

చ. 2: యెదుటనే వున్నవనే యెన్నికగాఁ జూడవే
వుదుటుఁజెక్కులమీఁది వొయ్యారాలు
వెదకితేఁ దనమేలు వెల్లావిరులాయ నేఁడు
పదిమారులునేఁటికే బయకారాలు

చ. 3: చెంగటనే నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁ జూడవే
అంగడిఁ బెట్టీ పులకలంభారాలు
యెంగిలిపుక్కిటివిడే లిప్పుడే కానఁగవచ్చె
పంగెనరతులలోనిపచారాలు

రేకు: 0944-6 సింధురామక్రియ సం: 19-252

పల్లవి: నేరిచినాఁడన్నిటాను నెరతనాలు
తారుకాణ లన్నియును తనవల్లఁ గంటిమే

చ. 1: సెలవి నవ్వినవాఁడు చెక్కునఁ జెయ్యిడనేల
నెలకొన్నరాజసమె నెరపుఁగాక
నిలువుఁజెమటతోడ నీతితో నేకతమాడీ
చెలియరో వీనిజాడ చెప్ప నెట్టువచ్చునే

చ. 2: తప్పక చూచినవాఁడు తలవూఁచి మెచ్చనేల
నెప్పునఁ గైవశమై మన్నించుఁగాక
చిప్పిలుసిగ్గులతోడఁ జెప్పీ నీకుఁ బ్రియములు
యిప్పు డీతనివిద్య లేమని నే నెంతునే

చ. 3: కాఁగిట నించినవాఁడు కడుబునకొట్టనేల
చేఁగదేరేగుట్టుతోడఁ జెలఁగుఁగాక
ఆఁగుచు కడపరాయఁడై శ్రీ వేంకటేశుఁడు
వీఁగఁడు యీవేసా లెట్టు వెలయించవచ్చునే

రేకు: 0945-1 దేశాక్షి సం: 19-253

పల్లవి: నేమేయంటా నుండుదుము నిక్కము నీ విద్యలకు
కామించి నీవొక్క తెవూఁగలిగితివే

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేసేవు విన్నపాలు
చలివాయ నాతఁ డింతచన విచ్చెనా
వలచి కాచుకుండిన వనితలెల్లాఁ జూడఁగా
తలఁచినట్టెల్లా నీ పెద్దరిక మీడేరెనే

చ. 2: యింటిలో నిడుక పన్నులెన్నియైనాఁ జెప్పేవు
బంటువలె నాతఁడింతపంపు చేసేసునా
దంటలై సవతులెల్లా తమలో నేఁకారఁగాను
పంట వండినట్టు నీభాగ్యము సిద్ధించెనే

చ. 3: శ్రీ వేంకటేశ్వరునిఁజేరి కాఁగిలించేవు
వావితో నాతఁడు నీకై వసమాయనా
యీవేళ మమ్మేలెఁదానె ఇందరము నున్నారము
చేవదేరి నీమేలు సేసపాలై నిండెనే

రేకు: 0945-2 ధన్నాశి సం: 19-254

పల్లవి: ఎంత కెంత సేసేవే ఇందుకుఁగాను
సం లాడితేనే పై కొని మన్నించఁడా

చ. 1: పిలిచి యాతఁడు నీకుఁ బ్రియములు చెప్పఁగాను
చలము లేమిటికి జవ్వనివి
మొలకచన్నులనీ మొన లురమునఁ బెట్టి
బలిమి చూపితే నీకుఁబంపు సేయఁడా

చ. 2: నగుతా నీతఁడు నీలో ననుపు నటించఁగాను
బిగియనేమిటికి పిన్నదానవు
వొగరుమోవితేనె లొద్దికఁజవులు నించి
తగవులు చూపితే చెంత నిన్ను మెప్పించఁడా

చ. 3: అంకెల శ్రీవేంకటేశుఁడట్టె నిన్నుఁ గూడఁగాను
మంకులేఁటికి పట్టపుమగువవు
పొంకపుఁగాఁగిటిలో నీపొందులు సతముచేసి
వుంకువఁ జొక్కించితివి వొరపు మరుగఁడా

రేకు: 0945-3 పాడి సం: 19-255

పల్లవి: చిత్తగించు తమకమే చిమ్మిరేఁచె లోలోన
మత్తగజగమనను మన్నించవయ్యా

చ. 1: వలపు నిలుపలేక వనిత నిన్నుఁజూచి
పలుకులఁగొసరీని పలుమారును
చలివాసి యప్పటిని సరసములాడీని
నిలుచుండి చేయిచాఁచీ నీమీఁదను

చ. 2: విరహ మాఁపఁగలేక వెలఁది నీయెదుటను
నిరతిఁగొలువుసేసీ నెయ్యమునను
వొరసి వొరసి మరి వూడిగాలు సేసిని
పరిపరివిధముల బాఁతిపడీ నిపుడు

చ. 3: ఆసలు విడువలేక అలమేలుమంగ నిన్ను
సేసవెట్టి కూడీని శ్రీ వేంకటేశ
తాసువలెఁ బెనఁగీని తరితీపు సేసీని
మూసినముత్యమువలె మొక్కు మొక్కీనీకును

రేకు: 0945-4 మాళవిగౌళ సం: 19-256

పల్లవి: అదె నీపెద్దరికమే అన్నిటాను
పొదిగి నీ కాఁగిటిలో బుజ్జగించవయ్యా

చ. 1: బలిమిగలకాంతకు పట్టినదే పంతము
కలసి నీచెల్లుబడి గలిగితేను
యెలమి మందెమేళాన యేమి నిన్నుఁజేసీనో
వలచినాపెకును గర్వము దగునయ్యా

చ. 2: సేసవెట్టినచెలికి సేసినదెల్లాఁ జేఁత
ఆనయిచ్చి నీవుగన ఆదరించితే
వాసితో నీచనవున వడి నేమేమాడెనో
నీసరినున్నాపెకు నిన్నేసి దగునయ్యా

చ. 3: నెమ్మి నలమేల్మంగకు నిల్చినదే నిలుకడ
ఇమ్ముల నీవు శ్రీ వేంకటేశ కూడితే
వుమ్మడి నీరతి నెంతవొద్దిక నొరసెనో
తమ్మివిరిపై యాపె కింతయుఁ దగునయ్యా

రేకు: 0945-5 సాళంగనాట సం: 19-257

పల్లవి: మంతనాన నాడేరమ్మ మధురలో యీసుద్దులు
వింతలాయ వినరమ్మ వీనులపండుగలు

చ. 1: గక్కనఁ గృష్ణుఁడు వుట్టెఁ గంసుని మదమడఁగె
మొక్కిరి దేవతలెల్లా ముదమందుచు
చక్కఁగా జయంతి నేఁడు శ్రావణబహుళాష్టమి
తక్కక దేవకి తల్లి, తండ్రి వసుదేవుఁడు

చ. 2: యమున దాఁటి యట్టె యశోదయింటఁ బెరిగె
జమళితో బలభద్రసమేతుఁడై
సమమై చంద్రోదయము సమకూడె తోడఁదోడ
రమణఁ బువ్వులవాన రాసులుగాఁ గురిసె

చ. 3: పనులెల్లా నీడేరె బ్రదికె లోకములెల్లా
నినుపులై ధర్మములు నెలకొనెను
వొనర నలమేల్మంగ నురమున నిడుకొని
ఘనశ్రీవేంకటేశుఁడై కందువ నిలిచెను

రేకు: 0945-6 శంకరాభరణం సం: 19-258

పల్లవి: ఏమమ్మ యశోద యిదె నీబిడ్డఁడు
గామిడితనాలఁ గదిసీ వీఁడే

చ. 1: గొల్లలుఁ దానును గోపికలిండ్ల
కొల్లగా నుట్లు గొట్టి వీఁడే
పల్లదాన వారిపాలిండ్లమీఁదట
చిల్లరసేఁతలు చేసీ వీఁడే

చ. 2: పాలువెన్నలును బానలతోడత
కేలు చాఁచి యారగించీ వీఁడే
మేలిమిసతుల మేనబావనంటా
కోలుముందుగాఁ గూడీ వీఁడే

చ. 3: అట్టులుఁజక్కిలా లడుకులు వేలఁ-
గట్టినఁ గోలలఁ గొట్టీ వీఁడే
దిట్టయి శ్రీవేంకటాద్రి నలమేల్మంగఁ-
గట్టుక దేవుఁడై కడఁగీ వీఁడే

రేకు: 0946-1 శంకరాభరణం సం: 19-259

పల్లవి: తగవులు చెప్పుమనీ దండనే నీరమణుఁడు
మొగము చూపరాదా మునికొనిఁ వలపు

చ. 1: నీవాతని వెంగెమాడ నేరిచినదానవు
యీవేళ నిట్టె పంతమియ్య నేరవా
చేవదేర బుద్ధులెల్లాఁ జెప్పేరు నీకుఁ జెలులు
వోవరిలోఁ దలవంచు కూరకుండనేఁటికే

చ. 2: సంగడినే బొమ్మల జంకించినదానవు
ముంగిటి కాతఁడు వస్తే మొక్కఁగవద్దా
చెంగట నుండి నీతులు చిలుకలు చదివీని
సంగతి దెలుసుక యిచ్చక మాడఁదగదా

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జేరి కూడినదానవు
సేవ లలమేల్మంగవు సేయఁగవద్దా
కావరపుఁబావురాలు గక్కున రతులు చూపీ
నీవు నాతఁడును నిట్టె నెలకొనఁ జెల్లునే

రేకు: 0946-2 దేవగాంధారి సం: 19-260

పల్లవి: అంగనజవ్వన మామనికాలము
సంగడినె నీకు జడిగొనె వలపు

చ. 1: తీగెమెఱుఁగులు తెఱవచూపులు
బాగైనమేఘమ్ము బలుకొప్పు
చేగదేర రతిచెమట వానలు
యీగతిఁ గురిసె నింతాయ వలపు

చ. 2: యింతిమోవి కెంపు లింద్రగోపములు
చెంతఁ గోరికలు సెలయేరులు
పొంతనున్న నీరుబుగ్గలు పులకలు
అంతటాఁదొరుగఁగా నసలాయ వలపు

చ. 3: అలమేలుమంగ మోహము నిగిడినసోన
నెలకొన్న చెరువు నీమనసు
వలనై శ్రీవెంకటేశ్వర నీవు గూడఁగ
ఫలమై జగములోనఁ బదనాయ వలపు

రేకు: 0946-3 సామంతం సం: 19-261

పల్లవి: కుందణఁ పుదట్టి గట్టి గోవిందరాజు సందిఁ-
గొందులసతులఁ గూడె గోవిందరాజు

చ. 1: గోవులఁ గాచిననాఁటి గోవిందరాజు నేఁడు
కోవిదుఁడై వున్నవాఁడు గోవిందరాజు
కూవలు చేసీ వలపు గోవిందరాజు ! పిల్లఁ-
గోవిలోనే మాటలాడీ గోవిందరాజు

చ. 2: కుండలతోఁ బాలుదాగే గోవిందరాజు! నేఁడు
కొండంతదొరైనాఁడు గోవిందరాజు
కొండుకబాలులతోడ గొవిందరాజు ! వుట్లు
కొండాటముగఁ గొట్టె గోవిందరాజు

చ. 3: కొలనిలో ఆగడీఁడు గోవిందరాజు నేఁడు
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
కొలఁదిమీర మమ్మేలె గోవిందరాజు మా
కొలమే శ్రీవేంకటాద్రి గోవిందరాజు

రేకు: 0946-4 గుజ్జరి సం: 19-262

పల్లవి: ఓపినంత తొల్లె వింటి నూరిలోన నీసుద్దులు
నీపాటివారమా నెలఁతల మిపుడు

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెప్పేవు మాటలు
కొలఁది వెట్టరావు వూఁకొనే నంటేను
బలిమికాఁడవు తొల్లె పదారువేలసతుల-
వలపెల్లాఁ జెప్పేనంటే వసమా వినఁగను

చ. 2: సారెసారె నాముందరఁ జదివేవు నీతులు
మేర మితి లేదు నిన్ను మెచ్చేనంటేను
ఆరితేరినవాఁడవు అట్టె గొల్లెతలకథా-
భారతము చెప్పఁగానే భట్టునా పొగడను

చ. 3: కొసరి కొసరి నన్నుఁ గూడేవు శ్రీవేంకటేశ
సరసమా నీనేరుపు చూచేనంటేను
అసమానుఁడవు నీవు అష్టమహిషల రతి-
పస లెంచితే మనసు పట్టునా సంతోసము

రేకు: 0946-5 కుంతలవరాళి సం: 19-263

పల్లవి: మొక్కవే పాదాలకు మొనసి నీవు
మిక్కిలి నీనాయకుఁడు మేలువాఁడే నీకు

చ. 1: చెక్కునఁబెట్టినచెయ్యిసెలవుల నీనవ్వు
నిక్కిచూచి మోహించెనే నీరమణుడు
ముక్కుపైఁ బెట్టిన వేలు ముంచిననీనివ్వెరగు
తక్కక పొగడీ నిదే తమితోడ నిపుడు

చ. 2: పడఁతులపై వొరగుపాదముపై పాదము
చిడుముడితోఁ దలపోసెఁ జిత్తములోన
అడియాసమాటలు అట్టె పైకొనే జోకలు
తడయక సంతోసించె తన్నుఁదానె యిపుడు

చ. 3: సారెకుఁజెమటసోన జారినపయ్యదకొంగు
చేరి వేరులేక యెంచీ శ్రీవేంకటేశుఁ-
డీరీతిఁదా నినుఁగూడె యితవరి నీప్రియాలు
తారుకాణై తేఁ బొదిగి దైవార నిపుడు

రేకు: 0946-6 ధన్నాసి సం: 19-264

పల్లవి: ఇంత నాపై బత్తిగలు తేరుఁగుదునే
మంతనాన నన్నుఁదాను మన్నించుటే చాలదా

చ. 1: మొక్కకుమనవే తాను మునుపనే దొడ్డదొర
తక్క కడపము వట్టేతరుణి నేను
దిక్కులఁదనపట్టపుదేవుళ్ళు విని యట్టె
వెక్కసాన నవ్వితేను వినవోప నేను

చ. 2: కిందుపడకుమనవే క్రియగలపంతగాఁడు
కందువ కాళాఁజివట్టేకామిని నేను
గొందిఁ దనకొత్తపెండ్లి కూఁతులు యీసుద్దెరిఁగి
చెంది తన్నుఁ బంగించితే సిగ్గువడఁజాలను

చ. 3: తమకించకుమనవే తాను శ్రీవేంకటేశుఁడు
అమర బోనము వెట్టేయంగన నేను
సముకానఁ దా నన్నేలె చనవరులెల్లాఁజూచి
క్రమముతోఁబెనఁగితే కాదనఁగనేరను

రేకు: 0947-1 దేసాళం సం: 19-265

పల్లవి: ప్రియముచెప్పే వేళ బిగియనేల
నయగారితనముల నవ్వు లిట్టె వలెనా

చ. 1: కూటమికి నాతఁడు కొంగువట్టుకుండఁగాను
యేటికిఁబెనఁగులాడే వెంద్రాఁకాను
నీటున జోలిసేసేవు నేరుపరి విన్నిటాను
మాట లేమిగలిగినా మరి యాడరాదా

చ. 2: ఆసపడి మోవితేనె లాతఁడిట్టె యడుగఁగా
వాసులేల నెరపేవు వట్టిబీరాన
వోసరించి యేడలేనివూడిగా లొనరించేవు
చేసేటినీబత్తి మరి చెల్లించరాదా

చ. 3: యిప్పుడే శ్రీవేంకటేశుఁడిటు నిన్నుఁగూడఁగాను
తప్పక యేమి చూచేవు తమకించేవు
అప్పటిని మెచ్చి మెచ్చి యట్టె బుజ్జగించేవు
కొప్పుదువ్వి మరి వేఁడుకొని మొక్కరాదా

రేకు: 0947-2 నీలాంబరి సం: 19-266

పల్లవి: చూచితివో చూడవొ సుదతులవంక నీవు
కాచుకొని నే నిన్నియుఁగనుఁగొంటి నిపుడు

చ. 1: పానుపుపైఁ బవళించి పడఁతిఁబేరఁబిలిచి
పానిపట్టి పాదాలు పైఁజాఁచితివి
దానికేపో కొలువులో తరుణులు సిగ్గువడి
మోనముతోడుత ముసిముసినవ్వు నగిరి

చ. 2: గుట్టుననే తమకించి కొమ్మఁగొంగువట్టితీసి
ముట్టి చన్నులపై గోరు మోపితివి
చుట్టిరానున్నసతులు చూచి తమలో లోఁగి
ఱట్టుమీచేఁతకు శిర సట్టె వూఁచుకొనిరి

చ. 3: కావరపువలపుతో కాంతఁగాఁగిట నునిచి
శ్రీవేంకటేశ నన్నుఁబచ్చిగా నేలితి-
వీవేళ నందరు నన్నునెనసిరి కాతరించి
వేవేలురతులు భావింపుచుఁ బొగడిరి

రేకు: 0947-3 సామంతం సం: 19-267

పల్లవి: కామినిభావము నేఁడు కంటివా నీవు
కోమలపుకొత్త పెండ్లి కొడుక వైనాఁడవు

చ. 1: నిలిచి యేకతమున నీపై గీతాలు వాడి
చెలి నీ వంతలో రాఁగా సిగ్గువడెను
నలిరేఁగి నీవందుకు నవ్వినవ్వి మెచ్చఁగాను
కులికి కులికి మేనఁ గురిసెఁ జెమట

చ. 2: చతురత నీదట్టి చన్నులపై గప్పుకొని
తతి నట్టె నిన్నుఁజూచి తలవంచెను
కతలుగా నీవందుకు కరుణతోఁ బొఁగడఁగా
కుతుకపుతమకాన గుప్పెఁబులకలు

చ. 3: నెట్టన శ్రీవేంకటేశ నీపానుపుపైఁబండి
అట్టె నీవు కూడఁగా నరుదందెను
వొట్టి నీవందుకు నన్ను నొనరి బుజ్జగించఁగా
ముట్టిననీరతులలో ముంచీ వలపులు

రేకు: 0947-4 నారాయణి సం: 19-268

పల్లవి: కందువుగాని యప్పుడే కలిగిన వలపులు
సందడి జాగు లేఁటికి సంగడి నున్నారము

చ. 1: పొంచి మా యిద్దరినేరుపులుఁ జూడవలసితే
మంచముపైకి రారాదా మందలించేము
యెంచనేల పెండ్లాడితి విద్దరిని నొకమాటె
పంచుక పైఁజాచరాదా పాదా లొత్తేము

చ. 2: దండిమాచన్నులగొప్పతన మెరఁగవలస్తే
నిండఁగాఁ గాఁగిలించరాదా నీటుచూపేము
అండనే మాతో నవ్వేవు అట్టే మానడుమ నీవు
పండి చూడరాదా నిన్నుఁబచారించేము

చ. 3: మించిన మా రతిబలిమి యెరఁగ వలసితే
కంచపు మో వియ్యరాదా కళరేఁచేము
అంచల శ్రీ వేంకటేశ అట్టె మమ్ము నేలితివి
నించరాదా పై రెంటెము నిన్ను మెప్పించేము

రేకు: 0947-5 ముఖారి సం: 19-269

పల్లవి: నడుమనే కంటిమి నీనయగారాలు
వుడి వోని కోరికల నున్నారు సతులు

చ. 1: చేరి వొకతెతొడపై శిరసు మోపుకవుండి
యేరా పాదా లొకతెపై యిటు చాఁచేవు
యేరీతి నుండెనోకాని ఇద్దరి అడియాసలు
సారెకుఁజెమటలతో జడిసేరు సతులు

చ. 2: మెక్కుచు మాటలాడేవు మునుపటియాకెతోడ
నిక్కపుఁజూపు లీపెపై నివాళించేవు
నిక్కుఁదమకము లెట్టు నెరపుకొన్నారోకాని
మిక్కిలి నిట్టూరుపుల మెరసేరు సతులు

చ. 3: బలిమి శ్రీవెంకటేశ పట్టపుదేవుల నేలి
చెలఁగి కూడితి విట్టె చిన్న దానిని
నిలిచినరతుల నెట్టు నిన్ను మెప్పించిరోకాని
పులకమొలకలతోఁ బొదలేరు సతులు

రేకు: 0947-6 రేవగుప్తి సం: 19-270

పల్లవి: తెలియరాదు నీమది దిమ్మరివాఁడవు గాన
చెలరేఁగి యడిగేము చెప్పరాదా మాకు

చ. 1: అగ్గమై యందరిలో నానతీవఁ గాఁగిలించఁగా
సిగ్గుపడి సన్న సేసీఁ జేతనే నీకు
కగ్గి నీకు యీపె నింత కాకు సేయవలశో
నిగ్గులవలపు నీకు నిక్కమును గలదో

చ. 2: సకులెల్లాఁ జూడఁగాను చవులమో వెడిగితే
మోకము వంచి కన్నుల మొక్కు మొక్కీని
ప్రకటించి యీపె నింత పచ్చి సేసేనంటానో
వొకట మేలువాఁడవై వొనరినచందమో

చ. 3: పూడిగపువారుండఁగా నొద్దికై పెనఁగితేను
యీడనె శ్రీవేంకటేశ యీ కె నవ్వీని
జాడతో నీపె నింత సమఁతు సేయవలశో
వేడుకకాడవై నవిధ మిటువంటిదో

రేకు: 0948-1 వసంతవరాళి సం: 19-271

పల్లవి: నలినాక్షి ఇందరిలో నగుఁబాటులాయ నేడు
యెలమి నీకే తెలుసు నేమిచెప్పే మికను

చ. 1: ఇచ్చగించి యాపె నీఇంటికి తానే వచ్చి
ముచ్చట మాటలాడి మొక్కు మొక్కెను
పచ్చిగా నాపెచెక్కుపై గోరుదీసి నీవు
రచ్చల బెట్టితి విదె రమణివలపులు

చ. 2: చెంతల గొలువుసేసి చిత్తమురా విన్నవించి
పంతములెల్లా నిచ్చి పాదా లొత్తైను
వింతలుగా చన్నులపై వెలయ నచ్చువాసి
సంతలఁ బెట్టితివి సకియవలపులు

చ. 3: కడుసిగ్గులు విడిచి కాగిట నిన్ను గలసి
బడిబడి నీవెంట బాయదాయను
అడరి శ్రీవేంకటేశ ఆపెమోవి గంటిసేసి
వడి నంగడివేసితి వనితవలపలు

రేకు: 0948-2 కన్నడగౌళ సం: 19-272

పల్లవి: నే మిందాఁకాఁ జెప్పితిమి నెలతకు బుద్దులెల్లా
కామించి మీఁదట నిక కందము నీనేరుపు

చ. 1: చింతతోడ నాకె నేఁడు చెక్కుచేతితో నున్నది
పంత మాడి యైన నీవు పరికించేవా
వింత నీసుద్దులు విని వెరగుతో నున్నది
యింతలో వంచినశిర సెత్తించేవా

చ. 2: నియమపుఁ జలముతో నిట్లు చేసుక వున్నది
నయగారితనమున నవ్వించేవా
ప్రియముతోఁ బరపుపై బిగియుచుఁ దానున్నది
రయమున నీవద్దికి రప్పించేవా

చ. 3: కడలేనియాసలతోఁ గాఁతాళాన నున్నది
తడఁబడక రతులఁ దనియించేవా
యెడయక శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడున్నది
వుడివోని నీ సత్యాల నొడఁబరచేవా

రేకు: 0948-3 ఆహిరి సం: 19-273

పల్లవి: వింటే దయపుట్టి యిట్టె విచ్చేసీ నీడకు
యింటికిఁ దోడితేరమ్మా యీకె ప్రాణేశ్వరుని

చ. 1: చిత్తరుపటము చూచి సెలవుల నవ్వు నవ్వీ
తత్తరాన బాన్పుచూచి తలవంచీని
పొత్తులడపము చూచి పులకించీ మేనెల్లా
హత్తి విన్నవించరమ్మా అంగన విభునికి

చ. 2: చేరి కేళాకూళి చూచి చింతతోడఁ దలపోసీ
పొరువపుగుంపుఁ జూచి భ్రమసీని
కోరి పువ్వుటిల్లు చూచి కుప్పళించీఁ బెంజెమట
సారె నెరిఁగించరమ్మ సతినాయకునికి

చ. 3: నిలువుటద్దము చూచి నివ్వెరగుతో నున్నది
చెలిక త్తెలనుఁ జూచి సిగ్గువడీని
కలసీఁ గాఁగిట దానె గక్కన నేతించి నేఁడు
చెలఁగి కానుకీరమ్మా శ్రీవేంకటేశునికి

రేకు: 0948-4 సాళంగం సం: 19-274

పల్లవి: గుట్టుగలవాఁడుగాఁగా గుంపించకున్నాఁడుగాక
వొట్టుక నేమెల్లా జూచి వోర్వఁగఁగలమా

చ. 1: అతనినేల దూరేవే అంగడికెక్కె వలపు
యేతులఁ బెండ్లాడినవా రెందరు లేరు
యీతలఁ జెలుల నంపి ఇంటికి రప్పించీని
చేతికి లోనాయనంటే చిమ్మిరేఁచవలెనా

చ. 2: పంతము లేలా డేవే పట్టరాదు పాయము
వంతులకు నెందరైనా వద్దనున్నారు
వింతలుగా నవ్వుతానే విందారగించఁబెట్టి
బంతిఁగూచుండి విభునిఁ బంగించవలెనా

చ. 3: సిగ్గులే లలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు గూడె
కగ్గులేనిసవతులు గాచుకున్నారు
యెగ్గులేక నన్నునేలె నితనిఁ బానుపుమీఁద
అగ్గలపురతుల నీ వలయిఁచవలెనా

రేకు: 0948-5 పళవంజరం సం: 19-275

పల్లవి: ఏఁటిమతకములో యీపెకు నాతనికి
నాఁటకము లివి గొన్ని నడచీఁ జూడరే

చ. 1: కొలువునేసేఁయాటది గుట్టుతోడ నుండుఁగాక
కలకల నగనేలే కాఁతాళానను
చెలఁగి విభుఁడు లోలో సేఁత లేమినేసెనో
తలఁపునఁ బుట్టుకొని తమకించీఁదాను

చ. 2: విందుచెప్పవచ్చినాపె వినయాలు సేసుగాక
పందేలాడఁ దనకేలే పలుమారును
కందువ నాతనివల్ల కపటాలేమిగనెనో
మందలించవలసిట్టె మాట దీసీఁ దాను

చ. 3: పీఁటపై పెండ్లికూఁతురు ప్రియముతోఁగూడుఁగాక
నీటున జంకించనేలే నేరుపుతోడ
సూటి శ్రీవేంకటేశుఁడు చూ చెలమేల్మంగను
కూటములు నేర్చుకొని గురినేసీఁ దాను

రేకు: 0948-6 సౌరాష్ట్రం సం: 19-276

పల్లవి: ఔనయ్యా మంచివాఁడ వందుకెల్లా నేనా గురి
నానఁబెట్టి సెలవుల నవ్వులు నవ్వేవు

చ. 1: చెలియచేసినసేఁత చెప్పేవానివలెనే
కలుపుకోలుగ నన్నుఁ గాఁగిలించేవు
పొలసి గోరనూఁదుట చూపేవానివలెనే
కెలయుచు నాబుజము గీరేవు నీవు

చ. 2: యెచ్చుగుందుమాటలు యెంచేవానివలెనే
వచ్చిదేరేవొట్టు నాపైఁ బచారించేవు
దిచ్చరిసాకిరు లిట్టె తెలిపేవానివలెనే
ముచ్చటఁ జేతులు నామోముపైఁ జాఁచేవు

చ. 3: పెనఁగులాటలు తలపించేవానివలెనే
గొనకొని నా పెద్దకొప్పు వట్టేవు
యెనసి శ్రీ వేంకటేశ యింతిఁ గూడినట్లానే
అనువైనఅలమేల్మంగనైననున్నఁ గూడేవు

రేకు: 0949-1 నట్టనారాయణి సం: 19-277

పల్లవి: ఇన్నాళ్లు నేడ నుండెనో యెవ్వరు నెఱఁగరు
కన్నుల యెదుట నేఁడు గానబడెఁగాని

చ. 1: యేమి గావలెనో కాని యీపె నీకు నెదురై
మోముకళలుదేరఁగ మొక్కె నిపుడు
చేముట్టి యీతినిఁ జేరి కాఁగిలించితివి
మీమీచుట్టరికము మేమిదివో కంటిమి

చ. 2: యేపూరోకాని తాను నీ యింటికే వచ్చి బత్తితో
సేవలెల్లాఁ జేసితేను చెలఁగితివి
భావమెరిఁగి గందము పైఁబూసి నవ్వితివి
దోమటిఁమీయిద్దరిపొందులు నేఁడు గంటిమి

చ. 3: తనుపే రేఁటిదోకాని తగిలి శ్రీవేంకటేశ
చెనకుచు నీపైఁ దాను సేసవెట్టెను
యెనసితి విటు నన్ను యే నలమేలుమంగను
నినుపులమీ ఇంపుల నేఁడు నేము గంటిమి

రేకు: 0949-2 ఆహిరి సం: 19-278

పల్లవి: ఏమని విన్నవించేము ఇంతి నీపైఁ గలప్రేమ
కోమలపుఁగలికి చెక్కునఁ జేయిచేర్చెను

చ. 1: యేకతాన నుండి సతి ఇట్టె నిన్నుఁ దలఁపైతే
చేకొని నిట్టూర్పు నించి చెలులఁ జూచె
పైకొని వారందరు కోపాన నిన్ను దూరితేను
దాకొని యేమీ ననక తలవంచుకొనెను

చ. 2: మంచముపైనుండి కాంత మనసు నీపైఁ బారితే
పొంచి మాటాడేచిలుకఁ బొక్కుచుఁ దిట్టె
ముంచి యందుకు నది నీముఁజేత వాలితేను
దించని చలమున నీదిక్కు చూచెను

చ. 3: వురమె క్కెలమేల్మంగ వోగి చన్నులు నాఁటితే
వొరటుజక్కవలపై నొలవేసెను
మొరసి శ్రీ వేంకటేశ ముక్కులన వెంటించితే
తెరసేసి నినుఁగూడి తెప్పలనుఁ దేలెను

రేకు: 0949-3 శ్రీరాగం సం: 19-279

పల్లవి: విన్నవించరే యీమాట విభునికిని
తన్నుఁ దానె యెఱుఁగును తలఁచుకొమ్మనవే

చ. 1: మనసు లేకములై తే మాటలు సమ్మతులౌను
ననుపు గలిగితేను నవ్వు గలుగు
తనువులు సోఁకితేనే తమకములు రేఁగును
చనవు సతమైతేనే సరసము చెల్లును

చ. 2: పొడితో నడచితేనే సం లీడేరును
జోడుగూడి వుండితేనే సొంపైవుండును
వేడుక లొనగూడితే వీడుదోడు లితవౌను
వాడికలు దొరికితే వలపు లమరును

చ. 3: యేకతములై తేనే ఇక్కువలు గరఁగును
కై కొని కాఁగిలించితే కళ లుబ్బును
యీకడ నలమేల్మంగ నేలె శ్రీ వేంకటేశుఁడు
చేకొని నన్నుఁ గూడెను చిత్తగించుమనవే

రేకు: 0949-4 భైరవి సం: 19-280

పల్లవి: కానీవయ్యా అందరికీఁ గలిగిన సంసారమే
వీనులార నన్నియును వినేము నే మిఁకను

చ. 1: చెప్పుదురు పతులతో చెలులు తమనేర్పులు
వొప్పి యెంతడియైనా నూఁకొంటేను
నెప్పున నాకెమాటలు నీకు బాఁతై నేఁడున్నవి
వుప్పతించ మాకేల వొడఁబడే మిపుడు

చ. 2: చూపుదురు తమయెమ్మె సుదతు లెంతవడైనా
ఆపనలకు నాయకుఁ డాసపడితే
పైపైయి నాపెకు నీవు భ్రమసి వున్నాఁడవు
కోపగించ మాకేల కూడి సంతసించేము

చ. 3: నవ్వుదు రెంత వడైనా ననుపుతో వనితలు
రవ్వగా వలచినట్టి రమణునితో
యివ్వల శ్రీ వేంకటేశ యేనలమేలుమంగను
చివ్వన మమ్మేలితివి చేరె మాకు రతులు

రేకు: 0949-5 పాడి సం: 19-281

పల్లవి: మచ్చికతో నేలవయ్య మదనసామ్రాజ్యలక్ష్మి
పచ్చిసింగారాలచేత బండారాలు నిండెను

చ. 1: కొమరెతురుమునను గొప్పమేఘ ముదయించి
చెమటవాన గురిసెఁ జెక్కులవెంట
అమరఁ బులకలపైరు లంతటానుఁ జెలువొంది
ప్రమదాలవలపులపంట లివె పండెను

చ. 2: మించులచూపుల తీగెమెఱుఁగు లిట్టె మెరిచి
అంచెఁ గోరికలజల్లవె పట్టెను
సంచితపుకుచముల జవ్వనరాసులు మించె
పొంచి నవ్వుల మాని పోదిగొనె నిదిగో

చ. 3: అలమేలుమంగమోవియమృతము కారుకమ్మి
నలువంక మోహపుసోనలు ముంచెను
యెలిమి శ్రీవేంకటేశ ఇంతి నెట్టె కూడితివి
కొలఁదిమీరి రతులకొటార్లు గూడెను

రేకు: 0949-6 లలిత సం: 19-282

పల్లవి: నేనే బుద్ధిచెప్పుకొనే నేరుపునఁ బతికిని
దానికేమి యింతలోనె తానే నన్నునేలెను

చ. 1: మగవాఁడు మేరమీరి మగువలఁ జెనకితే
తగవులఁ బెట్టనేల తడవకువే
మొగమోటయినచోట మోనాన నుండుటమేలు
పగటున మిగులాను బలిమిసేయకువే

చ. 2: పాయపువాఁడు మిక్కిలి పరచై తిరిగితేను
బాయిట వేయఁగనేల పదరకువే
తోయరానిచుట్టముతో చాయనేసుకొంటే మేలు
రాయడించి సారెసారె రచ్చలఁబెట్టుకువే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు సిగ్గులు విడిచితేను
కావరించి నవ్వనేల కదుమకువే
వాపులెనసిన చోట వదలకుండట మేలు
నీ వలమేల్మంగ కూడి నెలవైపాయకువే

రేకు: 0950-1 లలిత సం: 19-283

పల్లవి: అందులోనే కానరాదా అతివ యీతనిసుద్ది
కందువ లన్నియు నీవె కనుఁగొనఁగదవె

చ. 1: సెలవినేల నవ్వీనే చేరి నే మోము చూచితే
లలిఁ దనవంకను కల్లలేనివాఁడు
ములువాడిఁగోర నేను మోపితేనే లలికీనే
వెలుపల లోనాను వెరపులేనివాఁడు

చ. 2: సిగ్గులేల పెంచీనే చెయ్యివట్టి తీసితేను
యెగ్గులుఁదప్పులులేక యేచినవాఁడు
దిగ్గనఁ గాఁగిలించితే దిక్కులేక చూచీనే
బగ్గన నెవ్వతెకైనా బాసియ్యనివాఁడు

చ. 3: శిరనేల వంచీనే చెంత మోవి నే నంటితే
విరసమెరఁగనిశ్రీవేంకటేశుఁడు
అరిది నలమేల్మంగనై కూడితే మెచ్చనేలే
గొరబై యెవ్వరికిని గుట్టియ్యనివాఁడు

రేకు: 0950-2 మంగళకౌశిక సం: 19-284

పల్లవి: చూడఁ జిన్నవు నేఁతలు చూపి చెప్పఁగఁ గొత్తలు
జాడల నిన్నిటా నేఁడు జాణవైతివే

చ. 1: ఆయములుసోఁక మాటలాడ నేర్చుకొంటివే
కాయజుదీమవై నీవు గలగితివే
చాయలాను సన్నిలాను సాదించ దొరకొంటివే
పాయపువిభుని నింత భ్రమలఁ బెట్టితివే

చ. 2: నీటుసెలవినవ్వులు నీవలనఁ గంటిమే
పాటలఁ జొక్కించ నీపాలాయనే
జూటుఁ దనాలకు నీవే సూటియై నిలిచితివే
తాటించి ఆతని నిట్టె దక్కఁగొంటివే

చ. 3: అలమేలుమంగవు నీ వట భూకాంతను నేను
యెలమి శ్రీవేంకటేశు నెనసితివే
పొలసి నాకత నీతో పొందు లీడేరించితివే
తెలిపి నీవే పట్టపుదేవులవైతివే

రేకు: 0950-3 రామక్రియ సం: 19-285

పల్లవి: ఊరకేల దాఁచేవు వుదుటునీచేతలు
యేరీతి నీవుండినాను యెవ్వరేమనేరు

చ. 1: వింతచెలు లుండఁగాను వెలఁదితోఁ జెవిలోన
మంతనాన నీ వప్పుడు మాటలాడవా
ఇంతలో నేఁటికి బొంకనేమాయ నేమిసేసినా
చెంతలమగవాఁడవు చెల్లదా నీకిపుడు

చ. 2: కాకుసేసిరంటాను కడవా రెఱఁగకుండా
ఆకెయిచ్చిన వుంగర మందుకొనవా
నీ కేల సిగ్గువడ నేఁడు గొత్తలా యివి
యీకడ నీయిచ్చరాజ వేల లోఁగే విపుడు

చ. 3: వలచి శ్రీవేంకటేశ వనితల మందిలించి
అలమేలుమంగ నురమందు నుంచవా
కలసితి విటు నన్నుఁ గపటము లేఁకనేల
బలిమికాఁడ వౌదువు పదరకు మిపుడు

రేకు: 0950-4 రామక్రియ సం: 19-286

పల్లవి: మంచివాఁడవువలెనే మంతకములు సేసేవు
అంచెలనే పైకొనే మవునయ్యా నీవు

చ. 1: చీర లెస్సాయనంటాను చెరఁగువట్టి తీసేవు
హారములు చూచేనంటా నంటేవు చన్నులు
తీరాయఁ గమ్మలనుచు గోర గీరేవు చెక్కులు
ఆరీతి నింతసేతురా ఆంగనలను

చ. 2: వుంగరాలు మంచివంటా నూరకే వేలువట్టేవు
సింగారమాయఁ గొప్పంటా జేయిచాఁచేవు
సంగతాయఁ గుచ్చులంటా సరుగ నొడివట్టేవు
చెంగటఁ గాకు సేతురా చెలువలను

చ. 3: మోవిపండు తీపులంటా ముంచి చవులు రేఁచేవు
శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జేరి కూడేవు
ఆవల నలమేల్మంగనని నన్నుఁ బొగడేవు
భావించి సచ్చినేతురా పడఁతులను

రేకు: 0950-5 పాడి సం: 19-287

పల్లవి: వలచినదానికేలే వాసులెంచను
సెలవుల నవ్వుతాను చేకొనఁగవలదా

చ. 1: పిలువఁగా నీవేల బిగిసేవే పతితోను
చలము లెందాఁకాను సాదించేవే
బలిమి నాతఁడు నిన్ను పైకొని చెనకఁగాను
కలువకన్నులఁ జూచి కాఁగిలించవలదా

చ. 2: వొడిపట్టి తియ్యఁగాను వొరటు లింకానేలే
బడివాయకుండఁగాను పంతమేఁటికే
ఆడియాలముగ మోవి యాతఁడు నీకియ్యఁగాను
తడివి మోవి యొసఁగి దప్పి దేర్చవలదా

చ. 3: ముందుముందె మాటాడఁగా మోసము నీకిపుడేలే
కందువ నిన్నుఁ గూడఁగ కాఁతాళమేలే
చెంది యలమేల్మంగవు శ్రీవేంకటేశుఁ డతఁడు
పొందైతి రిట్లానే భోగించవలదా

రేకు: 0950-6 నాట సం: 19-288

పల్లవి: నీచేతనౌనె నేర్పులివి యెల్లాను
కాచుకుండి మనసెల్లఁ గరఁగించఁగలవె

చ. 1: కడువలచితినంటా కాంతుని కిచ్చకమాడి
తొడిఁబడఁ గాఁగిలించి దొమ్మిసేసేవు
అడరి చొక్కులఁబెట్టి అంతసేసినదానవు
బడిఁ దిప్పి యాతని భ్రమయించఁగలవే

చ. 2: పాసియుండ నోపనంటా పక్కననుబ్బించి పతి-
కాసచూపి ఇంటఁబెట్టు కలయించేవు
బేసబెల్లివై ఇట్లాఁ బెడరేఁచినదానవు
బాససేయించు కేపొద్దూఁ బనిగొనఁగలవే

చ. 3: పట్టపుదేవులనంటా పైకొని శ్రీవేంకటేశు-
నట్టు నిట్టుఁ గూడితివి అలమేల్మంగా
గుట్టున నన్నితఁడేలెఁ గుచ్చితపుదానవు
వొట్టుక పురముమీఁద నుండఁగఁగలవే

రేకు: 0951-1 వరాళి సం: 19-289

పల్లవి: ఇప్పుడే విన్నవించితి మెగ్గులువట్టేవుగన
వుప్పతించి మామీఁద నొలవేసేవుసుమ్మీ

చ. 1: కొప్పుల దువ్వేవు నీవు కొంగేల పట్టేవు నన్ను
యిప్పుడే నీవద్దిచెలులెల్లా నవ్వఁగా
కప్పి నీపై నామేనికస్తురిబేంట్లు రాలీ
అప్పుడు మమ్మేమైనా నాడుకొనేవుసుమ్మీ

చ. 2: చెక్కులేల నొక్కేవు చెయ్యేల వేసేవు నాపై
గుక్కక సవతులెల్లా గొణఁగఁగాను
చిక్కనినాగుబ్బలపై చెమట నామేననంటే
చొక్కుచు మామీఁద నీవు సొలసేవుసుమ్మీ

చ. 3: కాయమేల నిమిరేవు కాఁగిటనేల నించేవు
పాయపు పెండ్లికూఁతులు పంగించఁగా
యీయెడ శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చాయలకే కూడితివి జకించేవుసుమ్మీ

రేకు: 0951-2 తోడి సం: 19-290

పల్లవి: కంటిమే నీవల్ల నిట్టికతలెల్లాను
వెంటవెంట వచ్చి కడువేసాలు చూపేవు

చ. 1: కాటుకకన్నులతోడ కరుచు రమణుని
సూటిదప్పకుండా నేమిచూచేవే నీవు
నేటనే కడమాయనా నీయాసోద మెంతలేదు
మేటివై యిందరిలోనా మేకులుసేసేవు

చ. 2: కానుకగా మోవిమీఁద కప్పుచుఁ దమ్ములమ్మున
నానఁబెట్టి యిప్పుడేమి నవ్వునవ్వేవే
కానరాదా నీవలపు కలయవేసేవు పొందు
పూని నీపెద్దరిక మిప్పుడే నెరసేవు

చ. 3: కంకణాలచేతులను కాఁగిటను బిగియించి
మంకవై యీవేళనేల మాటలాడేవే
కొంకక యలమేల్మంగ కూడె శ్రీవేంకటేశుఁడు
జంకెనరతుల నెంత జాగులఁబెట్టేవే

రేకు: 0951-3 పళవంజరం సం: 19-291

పల్లవి: ఏమే యింతటిదాన వెఱుఁగవటే
నామాట సరివచ్చేనా నేఁడు నీకు

చ. 1: యెగసక్కెపుమాటలు యెన్నైనా నాడఁగవచ్చు
అగపడి ప్రియమాడే దరుదుగాని
మగవానితోడనేల మారుకొనఁగఁ జెలికి
మొగమోట ప్రియముతో మొక్కవలెఁగాక

చ. 2: బచ్చెనపంతములను బయలీఁదించఁగవచ్చు
నిచ్చఁ బొందు జరపేది నేరుపుగాని
యిచ్చకపుఁ బతితోడ నెమ్మెలేల మగువకు
యెచ్చుఁగుందులేక కాఁగి లియ్యవలెఁగాక

చ. 3: నలిరేఁగి కేరడపునవ్వులు నవ్వఁగవచ్చు
యెలిమి సరసమాడే దెక్కుడుగాని
అలమేలుమంగవు నిన్నతఁడు శ్రీవేంకటేశుఁ-
డలమె నిట్టె ముదమందవలెఁగాక

రేకు: 0951-4 దేవగాంధారి సం: 19-292

పల్లవి: జోడుగూడితి రిద్దరు సొంపగుజాణలే మీరు
తోడ నీళ్లాడరయ్య్య దొరకె మీకిపుడు

చ. 1: చెలియగుబ్బలమీఁదిచెమట పన్నీరుకాపు
కలకలమనునవ్వు కప్పురకాపు
మలసేటి వినయపుమాటలు వేదమంత్రాలు
వెలసె మజ్జనవేళ వింతలాయ మీకు

చ. 2: కాంతమేనితావి యటకటిఁ చందనపుకాపు
పొంతఁ గడకుంటే చూపు పునుగుకాపు
సంతసపు సరసాలు జరిపేటిపూడిగాలు
యింతటా మజ్జనవేళ యితవాయ మీకు

చ. 3: ఇయ్యలమేల్మంగ కాంతులెత్తే తిరుపండికాపు
గయ్యాళిమదరాగము కస్తూరికాపు
ఇయ్యెడ శ్రీవేంకటేశ యెనసితి రిద్దరును
వోయ్యనే మజ్జనవేళ వొరపాయ మీకు

రేకు: 0951-5 బౌళి సం: 19-293

పల్లవి: ఏల యెడతాఁకించే వీడకాడకు నింతుల
మేలములాడుచునే నమ్మించవలెఁగాక

చ. 1: చాయపాటుమాటలకు సమ్మతించీనా చెలి
ఆయెడకు నీవుంగర మంపినఁగాక
చేయరానిసేఁతలెల్లాఁ జేసితివి తొలుతనె
చేయిపట్టి ప్రియమెల్లాఁ జెప్పవలెఁగాక

చ. 2: అడియాస కానికల కాపె యీడకు వచ్చీనా
యెడయక నీవు వచ్చి యేలినఁగాక
తొడిఁబడ నీపై మోచె తోడనే ఆపెవలపు
గొడవదీరఁగ వేఁడుకొనవలెఁ గాక

చ. 3: చుట్టి రాయబారాలకు చొక్కీనా అలమేల్మంగ
గుట్టున శ్రీవేంకటేశ కూడినఁగాక
చుట్టమవై వచ్చితివి సారిది నీకెయింటికి
నెట్టన నిట్లానే మన్నించవలెఁగాక

రేకు: 0951-5 ఆహిరి సం: 19-294

పల్లవి: ననుc జూచి యిప్పు డెంతనవ్వు నవ్వేవు నీc
వనితనై వున్నదాన వలదనేనా

చ. 1: చెలిమికాcడ నీవేల సిగ్గుపడేవు యేమో
వెలcది విన్నవించీని వినరాదా
యెలమి నామోము చూచి యేల లోcగేవు మీకుc-
గలసాజమే యిది కాదనేనా

చ. 2: కోడెకాcడనీవేల గుట్టు సేసేవు ఆపె
తోడనే కానుకిచ్చీ నందుకొనరాదా
వేడుక నేc జూచేcగాక వెఱవనేలా మీ-
వాడికమోహము లివి వారించేనా

చ. 3: శ్రీవేంకటేశుcడ యెంతచెలరేcగేవు నీ-
దేవులు సన్నలు సేసీc దెలియరాదా
గోవిందరాజవు నీవే గుఱుతుగంటి యిదే
యీవల నన్నేలితివి యీకె యేలనేనా

రేకు: 0952-1 సోమరాగం సం: 19-295

పల్లవి: ఏల తమకముసేసే వింతలోను
లాలించినానుఁ జెప్పవు లాఁతిదానివలెను

చ. 1: నిక్కి చూచినదానవు నీవో మరొకతో
యిక్కువతోఁ జెప్పరాదా యెరిఁగేఁగాని
వుక్కున నీవప్పుడేతే వూఁకొంటివి నేఁ జెప్పితే
వెక్కసాన నుందానవు వింతదానివలెను

చ. 2: కూరిమిఁ బాడినది నీకుత్తికో వేరొకతో
మేరతోడఁ దెలుపరాదా మెచ్చేఁగాని
చేరి నేఁ బొగడితేను చెలరేఁగితి వప్పుడు
బీరాన గుట్టుసేసేవు పెరదానివలెను

చ. 3: చెంది కాఁగిలించేవి నీచేతులో చెల్లెలివో
మందలించరాదా సమ్మతించేఁగాని
అంది శ్రీవేంకటేశుఁడ నని కూడితి విప్పుడు
యెందుకైనా నొనగూడే వింటిదానివలెను

రేకు: 0952-2 దేశి సం: 19-296

పల్లవి: నాకుఁ దెలుసు నితనినాటకములు
కై కొనినా ఇంతలోనే కతకారిగాక

చ. 1: యెఱఁగక చేఁత చేసి యెదిటికి రాఁడనేవు
వెఱువు వాని కేడదే వేసాలుగాక
వొఱువు నీమాటలకే వొడఁబడి తనమతి
కఱకరిఁ గరఁగీనా గామిడిగాక

చ. 2: అగడుగాఁ దిరిగాడి యందుకు లోఁగీ ననేవు
తగ వాతఁ డెఱుఁగునా తక్కులుగాక
తగిలి తనబాసలు తలఁపించితే నేఁడు
మొగమోడినా కడుమొక్కలీఁడుగాక

చ. 3: వలపు లంతటాఁ జూపి వచ్చి నన్నేలీ ననేవు
సులభుఁడా ఇవిగొన్ని సుద్దులుగాక
బలిమి లోనికి వచ్చి పై కొని శ్రీవేంకటేశుఁ-
డలమె నన్నుఁ గాఁగిట నాగడీఁడు గాక

రేకు: 0952-3 లలిత సం: 19-297

పల్లవి: చెప్పుడుమాటలు గావు చెలువుఁడ నీసేఁతలు
చొప్పుదప్పకుండా నేనే చూచితినయ్యా

చ. 1: యెలిమి నా కెయు నీవు నెదురుబడి నుండి
సెలవుల నవ్వితివి సిగ్గులతోను
తలుపుమాటున నుండి తారుకాణగా నేఁడు
సొలవక నేనే ఇట్టె చూచితినయ్యా

చ. 2: వోడక మీరిద్దరును వొక్కమంచముపైనుండి
వీడేలు సేసుకొంటిరి వేడుకతోను
నీడలోనే పొంచివుండి నెట్టన మీసరితలు
జోడనగా నేనే చక్కఁ జూచితినయ్యా

చ. 3: శ్రీవేంకటేశ కాఁగిటఁ జెంది నీ వాకెయు నిట్టె
మోవితేనే లానితిరి ముచ్చటతోను
యీవలికిఁ దీసి నిన్ను నీదే నేనూఁ గూడితి
సోవలుగా నేనే మిమ్ముఁ జూచితినయ్యా

రేకు: 0952-4 దేశాక్షి సం: 19-298

పల్లవి: అడుగరే చెలులాల ఆతనినే యీమాట
వుడవోనితమకాన నుండఁబోలు తాను

చ. 1: వేడుకగలప్పుడే వెస నవ్వు వచ్చుఁగాక
వాడి వున్నప్పుడు తలవంపులే కావా
యేడనో సతులచేత యేఁపులఁబడి రాఁబోలు
యీడ నేఁ జెనకఁగాను యిటులా నుండునా

చ. 2: ఆసలఁ గూడినప్పుడే ఆయాలు గరఁగుఁగాక
పాసివున్నప్పుడు తడఁబాటులేకావా
బేసబెల్లివలపుల పిరివీకై రాఁబోలు
నేస నేఁ బెట్టఁగాను సిగ్గుపడి వుండునా

చ. 3: సరసమాడినప్పుడే చవులెల్లాఁ బుట్టఁగాక
గొరబై నయప్పుడు కొరతలేకావా
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వరుస నిందాకా నిటువలె జొక్కకుండునా

రేకు: 0952-5 పాడి సం: 19-299

పల్లవి: కంటిమయ్యా నీసుద్దులు కతలుగాను
ఇంట్టిపొరుగువారిపై నింపులు చల్లేవు

చ. 1: మలసి కొంగువట్టేవు మగువ దండ నుండఁగా
మొలకచన్నులు నిన్ను మోచెనంటాను
యెలమిఁ బెండ్లాడినెపె నేమిసేతువో యిఁక
చెలిమిక త్తెలమీఁద చేతులు చాఁచేవు

చ. 2: బడినే కానుకిచ్చితే పచ్చడము గప్పేవు
పడఁతికొనగోరు నీపై సోఁకెనంటా
అడరి వుంకువవెట్టినాపె నెంత చిక్కింతువో
నడుమచుట్టాలమీఁద ననుపు చూపేవు

చ. 3: కలసితివి సతిని గక్కన శ్రీవేంకటేశ
అలివేణిచూపులు నిన్నంటెనంటాను
యెలమి మేనవారైతే యెంత దక్కఁగొందువో
కనగొన పేరటాండ్లఁ గాఁగిలించేవు

రేకు: 0952-6 శుద్ధవసంతం సం: 19-300

పల్లవి: కందము నీసంతలు గట్టిగా నిఁక
సందడిఁ బెండ్లాడేవేళ చాయ కెట్టు వచ్చేవో

చ. 1: కుంచెవేసేయట్టియాపె కొప్పు దాఁకించెనంటాను
అంచలఁబంతములెల్లా నాడుకొనేవు
మించినరతివేళను మేనెల్లాఁదాఁకేయపుడు
వంచనలేక యెటువలె నోర్చేవో

చ. 2: జూదమాడి వోడినాపె సొలసి తిట్టెనంటాను
తీదీపుల చలము సాదించఁ జూచేవు
పొదుకొని యేకతానఁ బచ్చిమాట లాడేవేళ
సాదవై నీవెట్లాను సమ్మతించేవో

చ. 3: సేనలు వెట్టినయాపె సిగ్గులువడె నంటాను
వాసితోఁ జన్నులమీఁద వాఁత వాసేవు
యీసరినే శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
తాసువలె నిద్దరిని దయితో మన్నించేవో

రేకు: 0953-1 మేఘరంజి సం: 19-301

పల్లవి: ఇదివో నీతోడిపొందు ఇంతేశేయా
యెదుట నున్నది చెలి యెఱుఁగుకోవయ్యా

చ. 1: కొమ్మచిత్తములోనిచింత కొప్పు నెరులై నిండె
ముమ్మడితరితీపల్లా మోవిపండాయ
నెమ్మది నడియాసలు నివ్వెరగుచూపులాయ
పమ్మి పరాకులేల తప్పక చూడవయ్యా

చ. 2: జలజాక్షి కోరికలు చనుఁగవరాసులాయ
వలపులు రోమరాజివరుసలాయ
వెలలేనితమకము వేఁకమై పిఱుఁదాయ
తలపోఁత లీడేర్చి దయ సేయవయ్యా

చ. 3: కోమలిరతిభావాలు కొనగోరివాండ్లాయ
భూమిఁగల ఇంపులెల్లాఁ బులకలాయ
యీమేర శ్రీ వేంకటేశ యీకె నిట్టె కూడితివి
దోమటిసంతోసాలు తుదిపదములయ్యా

రేకు: 0953-2 కురంజి సం: 19-302

పల్లవి: ఇటువంటిపనులైతే నిందరు నిన్నే మందురు
కటకటా ఇకనైనాఁ గరుణించు మిపుడు

చ. 1: మొల్లమిగా నాకె నీకు మోహించు టెఱఁగవా
చెల్లఁబో నీవేల జోలిసేసేవో కాక
తొల్లె నీరాకకు నెదురుచూచే దెఱఁగవా
వొల్లను నవ్వుకొంటా నున్నాఁడవు గాక

చ. 2: వద్దనుండి నీకాపె సేవసేసే దెఱఁగవా
అద్దిరా నీవేల పరాకైతివో కాక
ముద్దు ముద్దు వలె నీకు మొక్కే దెఱఁగవా
సుద్దుల నీగుణా లేమి చూపేవో కాక

చ. 3: తాలిమితో నిన్నునాపె దక్కఁగొన్న దెఱఁగవా
మేలు మేలుఇంతయేల మీరేవో కాక
యీలీల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
వేళ నీవెఱఁగవా నీవేడుకలు గాక

రేకు: 0953-3 బౌళి సం: 19-303

పల్లవి: ఏమి సేసినాఁ జెల్లును యిదివేళ
చేముట్టి యాతనికే సేవలెల్లాఁ జేయవే

చ. 1: నాటుకొనె చూపులు నడుమఁ గొలువులోన
గాఁటపు రమణునికి కానికియ్యవే
వాఁటమాయ చెమటలు వలపు లినుమడాయ
మాటలాడి యీతని మర్మము లంటించవే

చ. 2: తలకొనె నగవులు దండనుండి చెవిలోన
వెలయ రమణునికే విన్నవించవే
చలివాసె మనసుకు చనవులు తుదముట్టె
తెలిపి యీతనికి నీ తేనెమోవొసగవే

చ. 3: నెట్టుకొనె వేడుకలు నేఁడు శ్రీ వేంకటేశుకు
గట్టిగా బెండ్లాడితివి కాఁగిలియ్యవే
దట్టమాయ తమకము తగులాయ నిద్దరికి
చుట్టమవై యీతనికి సొమ్ములెల్లా నించవే

రేకు: 0953-4 రీతిగౌళ సం: 19-304

పల్లవి: చెప్పుమనేవు తగవు చెప్పకుండరాదు నాకు
ఒప్పుగ వినవలెఁ గాదా వువిద లిద్దురును

చ. 1: పాయపుదానవు గాన పతిని సొలసీ నీవు
ఆయములు సోఁక మాటలాడఁ జెల్లునే
చాయలాను సన్నలాను సవతులఁజూపి చూపి
రాయిడించి పలుకఁగరాదే నీ కిపుడు

చ. 2: చేసుకొన్న యప్పుడే చెలువునికాఁగిటికి
ఆసపడి బలిమి సేయఁగఁ దగునే
వాసితోడ నీతోడివనితలమీఁదట
రాసికెక్కి చేయిచాఁచరాదు గాని నేఁడు

చ. 3: చెలిమిగలఁడు నీకు శ్రీవేంకటేశ్వరు
కలయుట సహజమే కాఁగిట నీకు
పలుమారు నీతోడిభామినులముంగిటను
చలవట్టి మురియుచు సందడించ నేఁటికే

రేకు: 0953-5 రామక్రియ సం: 19-305

పల్లవి: నవ్వేవారి నెఱఁగదు నడుమఁదాను
నివ్వటిల నీ వెన్నినేర్పితివో చేఁతలు

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేసీ నీకు విన్నపాలు
నలనాక్షి నీకెంతచనవోకాని
చలివాసి నీ యెదుట సన్నలెల్లాఁ జేసీని
యెలమి నీవెంతసలి గిచ్చితివో యిపుడు

చ. 2: కొసరి కొసరి నీకుఁగొలువులు సేసీని
సుసరాన నీకె యెంత చుట్టమోకాని
యెసగి నీకప్పటిని యిచ్చకములే సేసీని
వసమై యెంతవలచి వచ్చితివో యిపుడు

చ. 3: చిమ్మరేఁగి చిమ్మిరేఁగి నేసవెట్టీ నిన్నుఁ గూడి
యెమ్మెలఁ దానెంత నీకు నింపుదోకాని
నెమ్మది శ్రీ వేంకటేశ నీవు నను నేలితివి
చిమ్ముల నాపె కెట్లాఁ జెప్పితివో యిపుడు

రేకు: 0953-6 సాళంగనాట సం: 19-306

పల్లవి: కానీలే అందుకేమాయ ఘనుఁడవు నీ విన్నిటా
దానికేమి యిది నీపెద్దతికమే కాదా

చ. 1: పంతమాడరాదుగాక పలుమారు నీ చేఁతలు
కొంతగొంతైనా నీతోడఁ గొనాడరాదా
అంతటివాఁడవుగావా అడఁతురా నీగుణాలు
చెంతల నామోము చూచి సిగ్గులువడుదురా

చ. 2: జంకించఁగరాదు గాక చక్కనినీమోము చూచి
కంకణాలచేయెత్తి మొక్కఁగరాదా
అంకె లింతనేరవా సేయఁగవద్దా వినయాలు
కొంకుదేరి నాయెదుట కొల్లున నవ్వుదురా

చ. 3: అలుగఁగరాదుగాక అట్టె నీకాఁగిటను
సొలవక మోవి యాని చొక్కించరాదా
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలకొన్న నీ పొందులు నివ్వెర గందుదురా

రేకు: 0954-1 ఆరిబి సం: 19-307

పల్లవి: తెలిపి చెప్పఁగవలె తెల్లమిగా ముందుముందే
వలపించి నన్ను నింత వలలఁబెట్టేవు

చ. 1: మొలకలచన్నుల మొనలు దాఁకీఁజమ్మీ
చెలరేఁగి పయ్యదపైఁ జేయివేసేవు
కలువకనులచూపులు కడువాండ్లుసుమీ
నెలవై నాయెదుటనే నిలిచివున్నాఁడవు

చ. 2: మంచి గాలపుమాటలు మతిఁదగిలించీఁ జమ్మీ
అంచేలనే నన్ను సుద్దు లడిగేవు
కొంచక నాకొనవేలిగోరు జీరవారీఁ జుమ్మీ
ముంచి నీపాదాలకు మొక్కించుకొనేవు

చ. 3: చీఁకటికొప్పు నెరులు చేరి నిన్నుఁగప్పీఁజుమ్మీ
తాఁకించినచేతుల ముందులవట్టేవు
యేఁకటతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
తూఁకువసుమ్మీ పిఱుఁదు తొడ లెక్కుమనేవు

రేకు: 0954-2 పూరిబి సం: 19-308

పల్లవి: కానీవయ్య ఇఁకనేల కడు నిన్ను సొలయఁగ
మోనముతో నుండఁగాను మొక్కఁజెల్లునా

చ. 1: తలఁపు నిలుపలేక తమితో మాటాడేఁగాక
పిలిచితే రానపుడే ప్రియమున్నదా
కొలమునాలఁ గనక కోరి సేవసేసేఁగాక
అలపు చూపితినప్పుడే ఆయా లంటఁదగవా

చ. 2: చుట్టపువరుస లెంచి చూచి నీతో నవ్వేఁగాక
అట్టు నిట్టు జునిగేవు ఆసగలదా
పట్టినవ్రతముతోడ పైకొని చెనకేఁగాక
నట్టుకొట్టినపుడే విన్నపములు గలవా

చ. 3: ఇదె నన్నుఁ గూడఁగాను ఇచ్చకము సేసేఁగాక
వదలితేఁ గాఁగిలి వహి కెక్కీనా
పొదిగి శ్రీ వేంకటేశ పొందులు నమ్మితిఁగాక
కదిసి నీ వున్నప్పుడే కాదనఁగ వచ్చునా

రేకు: 0954-3 హిందోళం సం: 19-309

పల్లవి: ఇంకానేల దాఁచేవు ఇంతకువచ్చెఁ బనులు
సంకలే కానతీరాదా సమ్మతించేఁగాని

చ. 1: చక్కెరవంటిమాటలు సతి నీతో నాడికాదా
చొక్కించెను నిన్నునిట్టె సులభానను
చక్కనిమొగము చూచి సన్నలు సేసే కాదా
నెక్కొనుతమకమెల్లా నీకు రేఁగెను

చ. 2: గాలాలవంటిచూపు లొక్కటఁ దగిలించికాదా
తాలిమి నీమనసెల్లాఁ దక్కఁగొనెను
మేలిమిచన్నులు నీమే నిట్టె తాఁకించికాదా
కీలుకొన్న వలపులు కెరలించెను

చ. 3: లతలవంటిచేతుల లలి గాఁగిలించికాదా
రతిరహస్యములఁ గరఁగఁజేసెను
యితవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కతకారియాపెకాదా కళ లెసఁగించెను

రేకు: 0954-4 మాళవిగౌళ సం: 19-310

పల్లవి: ఏమని విన్నవించేము యెందాఁకాను
నీమనసే యెఱుఁగును నేఁడెంతసేసేవు

చ. 1: వలపెల్లా నొక్కటే వారివారిలోపల
కొలఁదిమీరినయట్టిగుణాలు వేరు
చెలిమీ నటువంటిదే చెప్పి చూపఁబోఇతేను
వెలలేని నేర్పులు వేవేలు గాని

చ. 2: మన సందరివంటిదే మరిగివుండేయపుడు
ననుపులసరసాలే నానాగతులు
తనువు లొద్దికైనవేళ తరితీపు లెంచితేను
చెనకులో సన్నలే చిత్రములుగాని

చ. 3: పొందులు నెప్పటివే భోగించేయప్పుడు
మందలించి కరఁగించేమర్మాలు వింత
చెందితివి నన్ను నిట్టె శ్రీ వేంకటేశ్వర
విందుల మోవియీవులే వేడుకలు గాని

రేకు: 0954-5 నాదరామక్రియ సం: 19-311

పల్లవి: ఇంత వని కోపుదుమా యిదివో నేమొ
మంతనానకు వచ్చితే మరిగించుకొంటివి

చ. 1: పొద్దువోనివాఁడవు పొలఁతులఁ గంటేను
చద్దికి వేఁడి కాడేవు జాణతనాలు
వుద్దండీఁడవట మీఁద నొడఁబరచవచ్చితే
కొద్దిమీరి చెలిమేన గొరు దాఁకించితివి

చ. 2: జూటరివాఁడవు నీవు సదుతు లిచ్చి తేఁజాలు
చీటికిమాటి కంటేవు చేకానికలు
నీటుదొరవు గనక నీతు విందుచెప్ప వచ్చి
నాఁటదానికొంగువట్టి యాఁటిడిఁ బెట్టేవు

చ. 3: నిరతి శ్రీ వేంకటేశ నెలఁత లెదుట నుంటే
సరికి బేసి కంటేవు చనుమొనలు
సరసుఁడవని నిన్ను సంగడి నే మెచ్చితేను
సొరిది నన్నేలితివి చుట్టమైనదానిని

రేకు: 0954-6 తెలుఁగుఁగాంబోది సం: 19-312

పల్లవి: కోరిక లీడేరె నిఁకఁ గూచుండవయ్యా
సారె సారె నందుకుఁగా జలపట్టనేఁటికి

చ. 1: యింతలోనే విభుఁడు నీ వింటికి విచ్చేసితివి
పంతపుమాఁటల కికఁ బనిలేదు
వంతుకు వచ్చినయాపె వద్దనే నిలుచున్నది
సంతోసించవలెఁగాని సాదించనేఁటికి

చ. 2: దప్పిదేర చెక్కునొక్కి తమ్ముల మిడితివి
తప్పులు నీపయి నెంచఁదగవుగాదు
చెప్పరానిగుట్టుతోడ చేసన్న చేసీ నాపె
వొప్పనాయ నీవలపు వుప్పతించనేఁటికి

చ. 3: కన్నులనే నవ్వి నన్నుఁ గాఁగిట నించితివి
విన్నపాలుసేయ నిది వేళ గాదు
వున్నతి శ్రీ వేంకటేశ వూరకే మొక్కీ నాకె
మన్ననలు దయివారె మతకములేఁటికి

రేకు: 0955-1 శంకరాభరణం సం: 19-313

పల్లవి: నా మొగము చూచి నగరాదా
దోమటి గలసే నిందుకు నగరాదా

చ. 1: చెనకు లాకెచేఁ జేయించకుండితే
నను నీ వప్పుడు నగరాదా
పెనఁగుల జంకింపించకుండితే
యినుమడిగా నీవిటు నగరాదా

చ. 2: పిలి చటు కొసరింపించకుండితే
నలువంకల మరి నగరాదా
చెలరేఁగి ప్రియము చెప్పించకుండితే
కొలఁదిమీరి గక్కున నగరాదా

చ. 3: వొట్టి పంతానఁ జెయ్యొగ్గించకుండితే
నట్టనడుమనే నగరాదా
యిట్టె శ్రీ వేంకటేశ కూడితివి
చుట్టమవై మెచ్చుగ నగరాదా

రేకు: 0955-2 కన్నడగౌళ సం: 19-314

పల్లవి: ఏల తలవంచీనే యెగ్గులేల పెంచీనీ
తాలిమి నెంచి చూచితే తానే నేననవే

చ. 1: వొడివట్టి పెనఁగవే వొట్టు వెట్టుకున్నవాఁడు
నుడిగి దోసము లేదనుచుఁ బల్కవే
అడియాలమైనట్టియాన నాపైఁ బెట్టవే
వొడయఁడు తాను నాకు వోరుచుకొమ్మనవే

చ. 2: పలుమారు మొక్కవే పంతముతో నున్నవాఁడు
వెలయ సిగ్గు లొల్లనే విడిపించమనవే
సెలవుల నవ్వింపించి చేరి యాసపుట్టించవే
అలుగరానిచుట్టరిక మన్నిటాఁ దెలుపవే

చ. 3: గక్కనఁ దెరవేయవే కరుణతో నున్నవాఁడు
అక్కడిక్కడివా రేమీ ననకనవే
యిక్కువ శ్రీ వేంకటేశుఁ డీడ నిట్టె నన్నుఁ గూడె
దక్కినాఁడు తా నాకు తా నెఱుఁగుననవే

రేకు: 0955-3 బౌళి సం: 19-315

పల్లవి: తమ్ముఁదామే యెఱిఁగేరు తగవులెల్లా
రమ్మంటె వత్తముగాని రావే వాకిటికి

చ. 1: సతికినిఁ బతికిని సాకిరి చెప్పుదురా
తతిగొని పెనఁగఁగా దండనుందురా
యితవరి చెలులము యెవ్వరి నేమనవచ్చు
రతికెక్కెఁ బనులెల్లా రావే వాకిటికి

చ. 2: పవ్వళించి వుండఁగాను పాదము లొత్తుదురా
పువ్వుల వేట్లాడఁగాఁ బొదుగుదురా
నవ్వించేవారము నాలి యెట్టు సేయవచ్చు
రవ్వలాయఁ జేతలెల్లా రావే వాకిటికి

చ. 3: బాసలు చేసుకోఁగా పై పై గురియవుదురా
ఆసల మోవులానఁగా నట్టె చూతురా
సేసవెట్టి యేలినాఁడు శ్రీ వేంకటేశ్వరుఁడు
రాసులాయ వేడుకలు రావే వాకిటికి

రేకు: 0955-4 సాళంగం సం: 19-316

పల్లవి: ఆనతియ్యవయ్యా నీవా తరవాతిమాట
కానుకలు వట్టుకొని కాచుకున్నారింతులు

చ. 1: చట్టువంటినీమనసు సాదించరా దెవ్వరికి
గట్టికొండలవంటివి కాంతచన్నులు
గుట్టుతో మీరుండఁగా మీ గణము దెలియలేక
చుట్టుక మొగమొగాలు చూచుకొనే రింతులు

చ. 2: కాటుకవంటిది నీ చక్కనితిరుమణిచాయ
కోటిచీఁకట్ల గుంపు కొమ్మతురుము
నీటుతో మీరుండడఁగా మీనెపము లెరుఁగరాక
తేటవడ లోలోఁ జింతించుకొనే రింతులు

చ. 3: కొత్తచిగురువంటిది కోరినట్టినీవలపు
చిత్తరువ్రాఁతవంటివి చెలిరతులు
ఇత్తల శ్రీ వేంకటేశ ఇద్దరుఁ గూడితిరి
పొత్తులసంతోసాలఁ బొదలేరు ఇంతులు

రేకు: 0955-5 నాట సం: 19-317

పల్లవి: ఈకెకు నప్పుడుగాని యేకచిత్తము గాదు
చేకొని మచ్చిక చూపి చెప్పవయ్య ప్రియము

చ. 1: కళలు దొలఁకఁగాను గక్కన నీ మోము చూచి
మలసి యెందో కొడిమలుగట్టీని
తలకొని నీ వెంత తారుకాణించవచ్చినా
చెలియ నమ్మదు ఇఁకఁ జేయవయ్య బాస

చ. 2: పంకంపుఁజెమట మేనిపై నీకు నుండఁగాను
తెంకి నేడదోయని సందేహించీని
అంకెల నొడఁబరచి అతివ కెంతచెప్పినా
కొంకక మానదు పెట్టుకొనవయ్య ఆసలు

చ. 3: సతమై నిట్టూర్పులు సారె నీకు రేఁగితేను
సతులఁ బొందితివని జరసీ నిన్ను
ఇతవుగా శ్రీ వేంకటేశ యీాకెఁ గూడితివి
రతిలోనే సోదించి నేరపవయ్య నిజము

రేకు: 0955-6 వరాళి సం: 19-318

పల్లవి: ఇంతదొడ్డవాఁడవౌత ఇంతులెల్లా నెరఁగరా
పంతము లిప్పుడే నీవు పచారించవలెనా

చ. 1: తరుణి నీ వూడిగాలు తఱచుగఁ జేయఁగాను
సిరులఁజెమట మేనఁ జిప్పిలీని
సురటి విసరరాదా సుద్దు లేమి చెప్పేవు
యిరవైన దొరతన మిప్పుడే చూపేవా

చ. 2: కొమ్మ నిలుచుండి నీకుఁ గొలువులు సేయఁగాను
చిమ్ములయలపుతోడ సిగ్గువడీని
పమ్మి కూచుండఁబెట్టుక పన్నీరు చల్లఁగరాదా
యెమ్మెలునేతులు నీవు యిప్పుడే చూపేవా

చ. 3: పడఁతి వేగినంతాను పాదాలు నీ కొత్తగాను
కడఁగి కళలురేఁగి కాఁతాళించీని
అడరి శ్రీ వేంకటేశ అంతలోనే కూడితివి
యెడయని నీనేరుపు లిప్పుడే చూపేవా

రేకు: 0956-1 శ్రీరాగం సం: 19-319

పల్లవి: కానవచ్చె నాపెమీఁది కందువైన వలపులు
నానఁబెట్టి యివి యేమి నాకుఁ జూపేవయ్యా

చ. 1: నీమనసు వచ్చితేను నేరములు నేరుపులే
వేమారు విన్నవించినా వినఁ జవులే
గామిడి సేఁతలైనాను కడుఁదరితీపులే
యే మేమి నవ్వులై నాను ఇచ్చకములే

చ. 2: కూటములు గలిగితే కొసరులెల్లా నింపులే
జూటరిగుంపెనలైనాను చుట్టరికమే
నీటుతోడిజంకెనలు నిండిన సంతోసాలే
చాటున గర్వములైనా సమ్మతింపులే

చ. 3: కైవసములై తేను కాఁగిలే నిధానము
వేవేలుపంతములు వినయములే
శ్రీ వేంకటేశ నన్నుఁ జిత్తగించి యేలితివి
చేవదేరేచెనకులు సింగారాలే

రేకు: 0956-2 పాడి సం: 19-320

పల్లవి: చెప్పరయ్యా మీరిద్దరు చేకొని బుద్ధులు మాకు
యిప్పుడే చెలుల మెల్లా నిఁక మెచ్చవచ్చునా

చ. 1: మంతనాన మీరిద్దరు మాటలాడుకొంటిరట
చెంతల మా కవేమైనాఁ జెప్పవచ్చునా
కాంతులతో మీ మొగాలు కళలురేగి వున్నవి
అంతరంగ మదేమైనా నడుగఁగవచ్చునా

చ. 2: చెమ్మిరేఁగి మీరు మీరే సింగారించుకొంటిరట
సొమ్ములు మాకవేమైనాఁ జూడఁగవచ్చునా
చిమ్ముఁజెమటలు మీకుఁజెక్కులు నిండుకున్నవి
సమ్మతించి మా కిఁక సంతోసించవచ్చునా

చ. 3: వావులు చెప్పక మీరు వరుసఁ గూడితిరట
కావించి మీ గుణాలు పొగడవచ్చునా
యీవేళ శ్రీ వేంకటేశ ఇట్టె మమ్ము నేలితిరి
వేవేలు మీకీర్తులెల్లా వెలఇంచవచ్చునా

రేకు: 0956-3 ఆహిరి సం: 19-321

పల్లవి: సంతోసించుకొనుటే చాలదా సారెసారెకు
చింతించి తలఁచుకొనేసిగ్గరికానికి

చ. 1: చూపునఁదప్పక నీవు చూచినదే చాలదా
పూఁపు దెలిసినయట్టి పురుషునికి
కాఁపురాలు నీవు తారుకాణించవలెనా
యేపున నీగుణమెల్లా నెఱిఁగినవానికి

చ. 2: నలువున కెలవుల నవ్వినదే చాలదా
చెలరేఁగి వాసిగలచెలువునికి
మలసి యేతువులెత్తి మాటలాడవలెనా
వలచి నిన్నుఁ బాయక వసమైనవానికి

చ. 3: మునుకొని చెతులెత్తి మొక్కినదే చాలదా
నిను నింతసేసినట్టినేరుపరికి
పెనఁగవలెనా ప్రియానఁ గాఁగిట నీతో
యెనసిన శ్రీ వేంకటేశ్వరునికి

రేకు: 0956-4 గౌళ సం: 19-322

పల్లవి: వద్దే మామాట విన వచ్చేవో రావో
యిద్దరి మీ పొందులకు నింత చెల్లునా

చ. 1: పట్టినదే వ్రతమా పడఁతి నీ వతనితో
వొట్టువెట్టుకొంటివట వొక్కటి గాదు
వట్టినేరా లెవ్వరికి వచ్చుఁ బోవు నొకవేళ
యిట్టె పాయపువారి కంత చెల్లునా

చ. 2: అత్తి సేసినదే చేఁతా అంగన నిన్ను నతఁడు
పొత్తుకు రమ్మనఁగాను పో ననేవు
వొత్తి విన్నవించనేల వోడలు బండ్ల వచ్చు
యెత్తయినదొరలకు నింత చెల్లునా

చ. 3: ఆడినదే మాటా అదె శ్రీ వేంకటపతి
కూడే నే ననఁగాను గొణఁగేవు
యీడుజోడై యింతలోనే యిద్దరూ నొకటైతిరి
యేడనైనా నీదేకాక యంత చెల్లునా

రేకు: 0956-5 శంకరాభరణం సం: 19-323

పల్లవి: ఆడకే వచ్చ్చెఁబోవే అంతేచాలు
యీడుజోడుఁ జెప్పకువే ఇంతే చాలు

చ. 1: కన్నులనే చూచితివి కాఁకలు చల్లితివి
అన్నిటా నేమీ ననకు మంతే చాలు
సన్నల నవ్వితివి చాయలు మొక్కితివి
యెన్నికలు నరివచ్చె నింతే చాలు

చ. 2: బొమ్మల జింకించితివి పొద్దూఁ గడపితివి
అమ్మకువే వావులు నేఁ డంతే చాలు
చిమ్మితివి మాఁటలు సేసితివి నీఁటులు
యెమ్మె లింకఁ గొలుపవు యింతే చాలు

చ. 3: దగ్గరికి వచ్చితి దవ్వుల మెచ్చితివి
అగ్గలమాయఁ జెమట అంతే చాలు
బగ్గన శ్రీ వేంకటాద్రిపతి నేఁడు కూడె నిన్ను
యెగ్గుసిగ్గు లేఁకనేలే యింతే చాలు

రేకు: 0956-6 నాదరామక్రియ సం: 19-324

పల్లవి: ఈరు దియ్యఁబేను వచ్చు నేమనఁగా నెట్లపునో
వూరకుండుటే చాలు వొద్దుసుమ్మీ బాసలు

చ. 1: అడ్డమాడలేకపో అట్టె నేను నుస్సురంటి
వొడ్డారించఁగలేకే వొగి నవ్వితి
వెడ్డువెట్టి నన్నునేల వెడనిష్టూరిఁ జేసేవు
వొడ్డుకున్నాఁబోనీవు వోపఁజుమ్మీ యింతకు

చ. 2: కోపగించఁ జాలకేపో కోరి వద్ద నిలుచుంటి
రాపుసేయఁజాలకేపో రమ్మంటిని
యీపనికిఁగానే నీవు యేల పచ్చిసేసేవు
దాఁపినా విచ్చివేసేవు తప్పఁ జుమ్మీ నీకు

చ. 3: వేరించఁజాలకే పో వేగమే కూడితి నిన్ను
ఆస చెరుచఁగలేకే అంకె నుంటిని
యీసరికి శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
వాసికెక్కె రతులెల్లా వలెఁజుమ్మీ యిందుకు

రేకు: 0957-1 ఆహిరి సం: 19-325

పల్లవి: గోరఁబొయ్యేపనికిఁగా గొడ్డలేఁటికి
ఆరయ నాతఁడే చెప్పీ నతివకు బుద్దులు

చ. 1: చిత్తములోపలిచింత చెక్కుచేతఁ గానవచ్చె
అత్తి మాటాడించకురే అంగన నంత-
బత్తిగలవారమైతే పతిఁ దోడితెత్త మిట్టె
వొత్తి యాకె నేమన్న వొప్పగించీఁ దనువు

చ. 2: నిండినమైవిరహము నిట్టూర్పులను మించె-
నండనే నవ్వించకురే ఆయాలు రేఁగీ
వుండరే చుట్టాలమైతే నొక్కటిసేత మిద్దరి
చండిపెట్టి పిలిచితే చలపట్టీ నలుక

చ. 3: కూడేటితమకములు కొనచూపులందుఁ దేరె
తోడనే యుడుగకువే తొలఁగీ సిగ్గు
యీడకే శ్రీ వేంకటేశుఁ డేతెంచి కలసె నేఁడు
వాడికతో సతి మీరవలపించె నతని

రేకు: 0957-2 శుద్ధవసంతం సం: 19-326

పల్లవి: వడి నీ జవ్వనానకు వసంతకాలము వచ్చె
అడియాస లిద్దరికి నాయములు సోఁకెనే

చ. 1: ముదితచెమటలనే ముంగారులవె ముంచె
పెదవులఁ జిగిరించెఁ బెక్కులాగుల
పొడలుఁగుచములనే పూఁపలాయఁ బిందెలాయ
యెదుటనే పతి వున్నాఁ డిఁకనేమే చెలియా

చ. 2: కోమలి నీ చూపులనే కొడినాగెఁ గోరికలు
వాములాయఁ బులకలే వలపు పండి
వాముదేరీ మేనిమీఁదిననవిరివాసనలు
ఆమనివిభుఁడు చేరెనలుక లింకేలే

చ. 3: సతి నీ మోహానఁ దీగెసాగె బాహులతలు
సతమాయ నిట్టూర్పు చల్లగాలి
ఇతవై శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నుఁ గూడె
మతిలోఁ బాయకున్నాఁడు మంచిదాయఁ గదవే

రేకు: 0957-3 శ్రీరాగం సం: 19-327

పల్లవి: అన్నియుఁ జేసినఫల మదియె మాకు
విన్నపము లిందుమీఁద వేవేలు నేఁటికి

చ. 1: కప్పుర మంపఁగనేలే కడమా నాకిది తొల్లి
కప్పుర గందినపుట కానఁడా తాను
కప్పురముపేర నుండి కాఁకసేసే వెరబొమ్మఁ
జిప్పిలి మమ్మేపకుండాఁ జేయుమనవే

చ. 2: చందన మే లంపెనే సహజాన నేఁ దొల్లి
చందనగందినపుట చాటువే కాదా
చందనపుఁగొండఁ బుట్టి చల్లజంపు దిప్పకాయ
అంది పచ్చిరేఁచకుండా నడ్డపెట్టు మనవే

చ. 3: కమలము లే లంపెఁ గానుకగా నేఁ దొల్లి
కమలగందినపుట కలదేకదే
కలమలాక్షుఁడైన శ్రీవేంకటపతి దానె నేఁడు
అమరఁగఁ గూడె నన్ను నండ నుండుమనవే

రేకు: 0957-4 మేఁచబౌళి సం: 19-328

పల్లవి: నాకొరకు నిన్ను నింత నలఁగించవలెనా
నీకు నితవై నంతే నే నొడఁబడితిరా

చ. 1: వొలసీనొల్లనిచోట నొరసితే విసుపౌను
బలిమి సేయఁగఁ బోతే పసురౌను
తలఁచితే నీవు నాతలఁపులో నుండుదువు
చెలి నీ కూటమి నింతవేసరించనోపరా

చ. 2: సారె సారె బెనఁగితేఁ జప్పనౌను వుప్పనౌను
కూరిమిఁ గొనరఁబోతే కోపమౌను
చేరువ నీ రూపము నా చిత్తరువులో నున్నది
కోరి నీ వెంటఁదగిలి కోసి రాచనోపరా

చ. 3: తనిసినరతివేళ తగుమోవే మొగచాటు
అనఁగి పెనఁగఁబోతే నలపౌను
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసిత విటు నన్ను
మనసు లొక్కటాయ మారుమాట లోపరా

రేకు: 0957-5 తెలుఁగుఁగాంబోది సం: 19-329

పల్లవి: ఇంక నెంతగాఁగలదో ఇఁతట నీవు రాకుంటే
లంకెఁబెట్టె ప్రాణములు లలన నీతోను

చ. 1: మాటలు నాతో నాడు మనసు నీపై నుండు
చీటికిమాటికి నాతోఁ జెప్పినవే చెప్పును
కాటుకకన్నులు నీరాకకే యెదురుకోనుండు
కోటికిఁ బడగయెత్తెఁ గొమ్మ నీపై మోహము

చ. 2: వెలఁది నన్నీడ కంపి వెంటనే తానూ వచ్చు
యెలిమిఁ గానుక నీకు నిచ్చినవే ఇచ్చును
సొలసి నీవే నేఁగాజూచి భ్రమసి వెదకు
వలపు వెదలువెట్టీ వాడవాడఁ జెలియ

చ. 3: సెలవినే నవ్వు నవ్వు శిరసున నీకు మొక్కు
పొలయు నీ ముంగిటనే పొద్దువోకకు
అలరి శ్రీ వేంకటేశ అంగనఁ గూడితి విట్టె
చలిమి బలిమిఁ జూపె జవ్వని నీ యెడను

రేకు: 0957-6 హిందోళం సం: 19-330

పల్లవి: సరసములాడఁగానే సరి, వయసు వోయీని
తెరమరఁ గిఁకనేల దిష్టించరాదా

చ. 1: చిత్తరున వ్రాసినట్టుసిగ్గువడున్నది చెలి
యెత్తి కాఁగిలించుకోవు యింతగలదా
కొత్తమెరుఁగువలెను కొంకుదేరదు వెరచి
పొత్తుకుఁ బిలుచుకొని బుజ్జగించరాదా

చ. 2: అంచవలెఁ బొలసీని అంగన నీ యెదుటను
మంచముమీఁదికిఁ దీసి మన్నించరాదా
అంచల పూఁగొమ్మవలె నాడనుండే జడసీని
మంచితనములు నేని మాటలాడరాదా

చ. 3: మూసినముత్యమువలె మోనముతో నవ్వీని
సేసవెట్టి రతివిందు సేయఁగరాదా
ఆల శ్రీవేంకటేశ అంగన నిన్నిటుగూడె
వాసికెక్కె మీ వలపు వద్దనుండరాదా

రేకు: 0958-1 ఆహిరి సం: 19-331

పల్లవి: ఇటమీఁద నీచిత్త మిదివో నావిన్నపము
కుటిలకుంత లీదెస గుఱుతుగాఁ జూడుమా

చ. 1: కలసి మెలఁగుదాఁకాఁ గన్నులనే వుండు నాస
సెలవినే వుండు నవ్వు చెనకుదాఁకా
పిలి చాదరించుదాఁకా పెదవిపై నుండు మాట
చెలియకు నీమీఁదఁ జెప్పరాదు ప్రియము

చ. 2: పానుపు చేరినదాఁకా పాదాలనే వుండుఁ దమి
నాని సిగ్గుచేత నుండు ననపుదాఁకా
మోనాన మోవేనుదాఁకా మొకాన నున్నది దప్పి
పూనినమోహ మెట్టిదో పొలఁతి నీ మీఁదను

చ. 3: కూడి రతిసేయుదాఁకాఁ గుచాల నుండుఁ గోరిక
జోడించి మైఁగాఁక యిందు చొక్కుదాఁకాను
యీడుగాను శ్రీవేంకటెశ ఇంతిఁ గూడితివి
తోడునీడవలె నుండుఁ దొయ్యలి నీ వలపు

రేకు: 0958-2 (జక్కిణి) బౌళి సం: 19-332

పల్లవి: దేవ వాసుదేవ
భావయ తాం పాలయ

చ. 1: నరహరే అహో నారాయణ రే
మురహర నగధర ముకుంద
తరుణీయం తు తవ విరహేణ
భరితవిచిత్రప్రతిమా జాతా

చ. 2: దివిజవందిత దేవోత్తమ అహో
నవనీతప్రియ నందసుత
తవ సంగమసంతతకామనయా
యువతి ర్జాతా యోగిణీవ

చ. 3: జితదానవ అహో శ్రీవేంకటపతే
సతత మాధవ కృష్ణ సర్వేశ
రతిసంగమేన రమణీ యం తు
బత తే విహితాభరణా జాతా

రేకు: 0958-3 సాళంగం సం: 19-333

పల్లవి: నీకుఁ దెలియదు గాని నిండినవాలోనికాఁక
కాకు నేయకుండరాదా కమ్మరాఁ గొంతవడి

చ. 1: నాకంటే మునుప నీవు నన్ను మాటాడించఁగాను
పైకొన్న మొగమోట నేఁ బలికేఁగాని
చేకొని నీ వాడానీడాఁ జేసినచేఁతలు విని
కూకులు వత్తులునాయ కొలుపదు మనసు

చ. 2: మొగమిచ్చి సారెసారె మోహము చల్లుచు నాతో
నగఁగా నేనూ నట్టె నవ్వేఁగాని
యెగసక్కేలకు నీమై నెవ్వతోచేఁతలు చూచి
సగమై లోలో నిట్టె జడిసీ నాదేహము

చ. 3: దగ్గరఁగ వచ్చి నీవు తగఁ గాఁగిలించఁగాను
వొగ్గి నేనూఁ గూడి వూరకుండితిఁ గాని
యెగ్గులేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడఁగాను
సిగ్గుచేత నాచెక్కు చేతిమీఁద మోఁచేను

రేకు: 0958-4 శంకరాభరణం సం: 19-334

పల్లవి: ఆడరానిమా టదె గుఱుతు
వేడుకతోనే విచ్చేయుమనవే

చ. 1: కాయజకేలికిఁ గడుఁ దమకించఁగ
ఆయము లంటిన దది గుఱుతు
పాయపుఁబతికినిఁ బరిణాము చెప్పి
మోయుచుఁ దన కిటు మొక్కితిననవే

చ. 2: దప్పిమోవితో తా ననుఁ దిట్టఁగ-
నప్పుడు నవ్విన దది గుఱుతు
యిప్పుడు దనరూ పిటు దలఁచి బయలు
చిప్పిలఁ గాఁగిటఁ జేర్చితిననవే

చ. 3: పరిపరివిధములఁ బలుకలు గులుకఁగ
అరమరచి చొక్కినది గుఱుతు
పరగ శ్రీవేంకటపతి కడపలోన
సరవిఁగూడె నిఁక సమ్మతియనవే

రేకు: 0958-5 రామక్రియ సం: 19-335

పల్లవి: పదియుఁ బదియుఁగాను పరమాత్ముఁడితనికి
వెదకి చవులు దెచ్చి విందు లిట్టె నేయరే

చ. 1: పొలసు పైఁబారెనట బురద మేనం టెనట
యిల మన్ను మోఁచెనట యీదేవుఁడు
నెలవై నరాకాసినెత్తుటఁ దోఁగినాఁడట
కలపన్నీ రెల్లఁ బోసి కడుగరే దేహము

చ. 2: బాఁపనజిడ్డం టెనట పట్టెనట ముమ్మురము
కై పగునల్లనికోక గట్టినాఁడట
చాపలానఁ జెంచుదానిసంగడిఁ దిరిగెనట
కోపులఁ గప్పురధూళి గుప్పరే యీతనికి

చ. 3: కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతలఁ దట్టుపణుఁగు పూయరేనేఁడు
యింతట శ్రీవేంకటేశునెద నల మేలుమంగఁ
గాంతునికి మెడఁగుచ్చి కట్టరే మొక్కుదము

రేకు: 0958-6 ద్రావిళభైరవి సం: 19-336

పల్లవి: ఎట్టు వలపించితివి యేమీ నెఱగనినన్ను
పట్టరాదు ప్రాయమిది పైపై నున్నదిరా

చ. 1: వినుకలివిరహమే వేడుకలై తో చెగాని
కనుఁగొంటే దమకము కడుబెట్టురా
మనసునఁ దలఁచుటే మంచిదయి వుండీఁగాని
తనువు గాఁగిలించితే తతిగొనీ మఱపు

చ. 2: తెమ్మలై తొంటికూటమి దిష్టమై వుండీఁగాని
కమ్మి మీఁదటికోరిక గాసిఁబెట్టీరా
చిమ్ముచు నీకెదురుచూచినదే యింపాయఁగాని
కమ్మర నంటితే గోరు కడువాఁడిరా

చ. 3: మంచిదూతికలయెడ మాటలే చవాయఁగాని
కంచముపొత్తిచ్చితేనే కళదాఁకెరా
అంచల శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
యెంచి కూడితివి యిన్ని నియ్యకోలే యిఁకను

రేకు: 0959-1 ముఖారి సం: 19-337

పల్లవి: అందుకేమి పదరాదా ఆనలేల సతివద్ద
కందువ మగవానికి గలదేకాదా

చ. 1: చెప్పకుండునా బుద్ధి చేరకుండా నెవ్వరిని
యెప్పుడూ నాకెవద్దికి నేగినవేళ
అప్పుడే యందుకు నిచ్చలాడక నీవుందువా
చప్పఁజేసి యవి నేను సాగనీఁగాక

చ. 2: చేయకుండునా ఆకె చెల్లినట్టెల్లా, నీవు
చేయూరఁ గాఁగిటిలోనఁ జిక్కినవేళ
యీయకుందువా బాస యిందరి విడుతునని
పోయినట్టెల్లా నిన్నుఁ బోనీఁగాక

చ. 3: అనకుండునా తానె ఆకె దొడ్డదానవని
వినకుందువా నీవు వేళావేళ
అనుగు శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
తనీయ నే నిన్నుఁ గూడి దక్కఁగొంటిఁగాక

రేకు: 0959-2 ముఖారి సం: 19-338

పల్లవి: వెలది నింక లేపవెఱతుము నేమైతే
చెలువుఁడవు నీవే విచ్చేయవయ్య లోనికి

చ. 1: కాంత, నీవు రాగానే కన్నులుమూసుక యిట్టె
పంతమున నిద్దిరించీఁ బానుపు మీఁద
చెంతల నేము దగ్గరి చేముట్టి లేపి తేను
వింతలుగా విదిలించివేసీఁ గోపానను

చ. 2: అండ నీరాక చెప్పితే నప్పటి నీపచ్చడము
నిండా ముసుఁగువెట్టి నిద్దిరించీని
వుండలేక పాదమువట్టూఁచి పేరఁబిలిచితే
దిండుకట్టఁ జెప్పరానితిట్లు తిట్టీని

చ. 3: సతి యలమేల్మంగ సారెకు గురుకవెట్టీ
తతి నీవు పైఁబడఁగాఁ దా నీలిగీని
కతగా శ్రీ వేంకటేశ కాఁగిలించి కూడితివి
రతిలో మేల్కనెఁదాను రవ్వాయ మాపనులు

రేకు: 0959-3 పాడి సం: 19-339

పల్లవి: కొత్తసింగారాలు సేసెఁ గొమ్మ దనమేనిలోనె
చిత్తగించి రారాదా చెలిఁ జూతుగానీ

చ. 1: కుప్పలుసేసె వలపు కుచములనె యిట్టె
చిప్పిలఁ గరఁగె మతి చెమటలను
కప్పుకొనెఁ జీకట్లు కడుజారిననెరుల
యిప్పుడే విచ్చేయరాదా యింతిఁ జూతుగానీ

చ. 2: నిండఁ జేసెఁ దమకము నిట్టూర్పుగములను
పండఁజేసె పులకలపైరులు మేన
యెండించెఁ గాఁకలచేత యింపుమోవి, తీపువుట్ట
అండకు విచ్చేయరాదా ఆకెఁ జాతుగానీ

చ. 3: వెదచెల్లెఁ జూపులనె వేవేలు ఆసలెల్లా
నిదురవోయీా నీపై నివ్వెరగుల
అదె శ్రీవేంకటేశ నీ వలమేలుమంగఁ గూడి-
తిదె దినము రారాదా యిఁకనైనాఁ గానీ

రేకు: 0959-4 ఆహిరి సం: 19-340

పల్లవి: తనవిందుఁ దలఁపందు తమకము నుడుమను
పెనగోనీఁ దాను పిలిపించఁడొకొ అతఁడు

చ. 1: ఇంతక పతికడకు నేఁగునొకొ చెలియ
వంతుల నిందు మరలి వచ్చునొకొ
చింతదీర నామాట చెప్పెనొకొ ఆడను
ఇంతితో మారుమాటలు యేమనెనొ అతఁడు

చ. 2: రమ్మని పిలుచునొకొ రమణి యాతనిని
నెమ్మది మనవాకిట నిలుచునొకొ
తమ్మిరేకు లేకలైనాఁ దలఁపించకుండునొకొ
సమ్మతిఁ గరుణ నాపైఁ జల్లఁడొకొ యతఁడు

చ. 3: వీఁడె విచ్చేసెననఁగా విందునొకొ నేను
పోఁడిమిఁగాఁగిట వానిఁ బొందుదునొకొ
నేఁడె శ్రీవేంకటపతి నే నలమేల్మంగనని
వాఁడె వచ్చి నన్నుఁగూడె వద్దనున్నాఁడతఁడు

రేకు: 0959-5 వరాళి సం: 19-341

పల్లవి: ఇంతలోనె నీతో నే నేమందురా
పొంతనుండి నీవే నాకు బుద్ధిచెప్పఁగదరా

చ. 1: చెక్కుమీఁదటఁ జేయి చిత్తములోపల నూయి
ఇక్కువమాటలు నీతో నే మందురా
చక్కనే నీ నేరువులు చల్లీ నావూరువులు
అక్కడిసుద్దు లేమైనా నానతియ్యరా

చ. 2: వంచినది నాశిరసు వలపూఁ గడుబిరుసు
ఇంచుకా మొగమోడక యేమందురా
మంచిదే నీలోనిగుట్టు మాకే ఇన్నిటా బిట్టు
కంచపుఁబొత్తుకు నీవే కై కొలుపఁగదరా

చ. 3: ముందుఁ దొక్కితి ముంగిలి మోవిమీఁదనె యెంగిలి
యిందరిలోపల నిన్ను నేమందురా
అంది శ్రీవేంకటపతి వలమేలుమంగ నేను
యిందె కూడితివి నన్ను నిఁక నానతియ్యరా

రేకు: 0959-6 ఆహిరి సం: 19-342

పల్లవి: విచ్చేయుమనఁగదే విభునిఁ జెలికడకు
పచ్చిసిగ్గు నెన్నడుమ బట్టబయలాయను

చ. 1: కోరికలు కొనసాగి కోమలికిఁ గొప్పుగూడె
మేరతోఁ గళలె ముంచె మించుఁబాయము
పేరడైనవలపెల్లాఁ బెదవులఁ జిగిరించె
ఆరయ నంగన నేఁటి కాఱడఁబెట్టీనె

చ. 2: సతితమకములెల్లా చనుఁగొండలై పెరిగె
రతికాంక్ష పిఱుఁదున రాసెకెక్కెను
మతిలోనివిరహము మంచినిట్టూర్పుల రేఁగె
మతకమేఁటికిఁ జేసి మానినితోఁ దాను

చ. 3: కూడేటిసంతసములు కొనగోళ్ళైవాండ్లెక్కె
పాడితోఁ గోమలికము పాదాల నిండె
యీడ నలమేలుమంగ నెనసె శ్రీవేంకటేశుఁ-
డాడినట్టే సేసె నింతి నట్టె దినదినము

రేకు: 0960-1 బౌళిరామక్రియ సం: 19-343

పల్లవి: వాఁడే వాఁడే అల్లరివాఁ డదివో
నాఁడునాఁడు యమునానదిలోన

చ. 1: కాంతలు వలయపుకంకణరవములఁ
నంతంతఁ గోలాటమాడఁగను
చెంతల నడుమను శ్రీరమణుఁ డమరె
సంతతపుఁజుక్కలలో చంద్రునివలెను

చ. 2: మగువలు ముఖపద్మములు దిరిగిరా-
నగపడి కోలాటమాడఁగను
నిగిడీ నడుమ నదె నీలవర్ణుఁడు
పగటుతోఁ గమలబంధునివలెను

చ. 3: గోపిక లీరీతిఁ గోలాటమాడఁగ
యేపున శ్రీవేంకటేశ్వరుఁడు
వోపిలమేల్మంగ నురమున నిడుకొని
దీపించె మణులలో తేజమువలెను

రేకు: 0960-2 శంకరాభరణం సం: 19-344

పల్లవి: మొగమూ నోడితిమి మొన్ననే కూడితిమి
సగముజాణతనాలు చల్ల నింతవలెనా

చ. 1: కానుక లిచ్చితిమి కన్నుల మెచ్చితిమి
పోనీరాదా యిఁకనైనాఁ బోయినపొద్దు
నానె నాకు వలపూ నవ్వులాయఁ దలఁపూ
మానరాదా యిఁకనైనా మామీఁదిఆనలు

చ. 2: చేతుల మొక్కితిమీ చేఁతకుఁ జిక్కితిమీ
తోతో ఇంకానేల తొల్లిటివాని
రాతి రన్నిఁ గంటిమీ రచ్చలనే వింటిమీ
కాతర మింతేనేల కమ్మటి మాతోను

చ. 3: దగ్గరి కూచుంటిమీ తప్పులు లేవంటిమీ
సిగ్గులు నీకికనేల చెల్లు నన్నియు
నిగ్గుల శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
అగ్గమై కూడితి మింకా నసురుసురేలా

రేకు: 0960-3 పాడి సం: 19-345

పల్లవి: అల్లవాఁడె భావించరె అంగన లిందరుఁ గూడి
వుల్లములో తనమాయ లుబ్బెనో శ్రీహరికి

చ. 1: నేలా మిన్నుఁ గొలవఁగ మిన్నేటినురుగు
ఆలరి యీహరిమేన నంటుకొనెనో
పాలవెల్లి తచ్చఁబోఁగాఁ బైఁబడెనో తుంపురులు
మేలిమి కప్పురకాపు మెత్తిరో యీహరికి

చ. 2: చిత్తగించి రేపల్లెఁ జీఁకటితప్పు సేయఁగా
అత్తల చీఁకటినలు పంటుకొనెనేమో
వొత్తి కరిఁ గావబోఁగా నొలికెనో పై మదము
మొత్తమిఁ బుళుగుకాపు ముంచిరో శ్రీహరికి

చ. 3: అలమేలుమంగఁ దెచ్చి అఱుతఁ గట్టుకొనఁగా
పొలసి నవరసాలుఁ బొడచూపెనో
నెలవైన సొమ్ములెల్లా నిండుకొనె మేననెల్లా
అలరి శ్రీ వేంకటాద్రి నందమైనహరికి

రేకు: 0960-4 లలిత సం: 19-346

పల్లవి: అంగన లీరే యారతులు
అంగజగురునకు నారతులూ

చ. 1: శ్రీదేవితోడుతఁ జెలఁగుచు నవ్వే-
ఆదిమపురుషుని కారతులూ
మేదినీరమణి మేలములాడేటి-
ఆదిత్యతేజున కారతులూ

చ. 2: సురులకు నమృతము సొరది నొసంగిన-
హరి కిదివో పసిఁడారతులూ
తరమిది దుష్టుల దనుజుల నడఁచిన-
అరిభయంకరున కారతులూ

చ. 3: నిచ్చలుఁ గల్యాణనిధియై యేఁగేటి-
అచ్చుతునకు నివె యారతులూ
చొచ్చి శ్రీ వేంకటేశుఁడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులూ

రేకు: 0960-5 సామంతం సం: 19-347

పల్లవి: ఎవ్వరు వద్ద నున్నారో యేమి సేసీనే
దవ్వుల నెదురురాక తా నేమి సేసీనే

చ. 1: పచ్చనిచిగురువంటి పాదాల నడచివచ్చె-
నిచ్చకపుఁబతి లోన నేమి సేసీనే
నెచ్చలిమే నింతలోన నిండాఁ గడుఁజెమరించె
యెచ్చుటఁ బరాకైనాఁ డేమిసేసీనే

చ. 2: మంచిమాణికాలురాలేమాట లాడీఁ జెలి యీాడ
ఇంచుకంతా నెఱఁగడు యేమి సేసీనే
మంచముపైఁ బవ్వళించె మగుళ యలసి వచ్చి
యెంచినయెన్నికలాయ నేమిసేసీనే

చ. 3: కలువరేకులవంటి కన్నులఁ జూచె చెలి-
నెలమీఁదాఁ దేరిచూచీ నేమీ సేసీనే
బలిమి శ్రీ వేంకటాద్రిపతి యింతి నిటు గూడె
యిలఁ దనభాగ్యమాయ నేమి సేసీనే

రేకు: 0960-6 వరాళి సం: 19-348

పల్లవి: ఏమన్నా హితవేకాక యెగ్గు నాకేలే
కామించి తనుఁ జూడఁగఁ గలిగితేఁ జాలు

చ. 1: తలఁపులో నున్న వాఁడు తలఁచే నే నెప్పుడైనా
యెలమిఁదా నేడ నున్నా నేమాయనే
వలపు నాకే కద్దు వడి నేఁదన్ను విడువ
చెలఁగి యేపనులైనాఁజేయనీవే తాను

చ. 2: పెదవి పై నున్నవాఁడు పిలిచే నే నెప్పుడైనా
పొదలి యాకెయింటికిఁ బోయిరానీవే
పదరక నాకుఁబోదు పయికొనేఁగాని నేను
అదనాయ తనతోడిఅలుకేల నాకు

చ. 3: చేతికి లోనయినాఁడు చెనకే నే నెప్పుడైనా
రాతిరేమి పగలేమి రానియ్యరే
యీతల శ్రీ వేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
కాతరాన వెనకటికడమేల యిఁకను

రేకు: 0961-1 వసంతం సం: 19-349

పల్లవి: వేడుక వసంతము వేళ నిదే
వాడలవాడలవెంట వనిత లాడేరు

చ. 1: కేలుఁగేలుజట్టిపట్టి కెండామర మోములెత్తి
కోలఁగోలఁ దాఁకఁజేసి గుంపువాయక
చాలుకొని యిద్దరేసి జంటలై సతులు గూడి
వోలి వేరొకతెకోల నొడ్డుతా నాడేరు

చ. 2: పాలిండ్లు గడలఁగ బరువైనతురుముల
చీలుచు సోలుచుఁ గొంతవెనకకును
మేలిమిపిఱుఁదులతో మెరయుచు మురియుచు
కోలలఁబెడమరలి కోలాటమాడేరు

చ. 3: కది శొండురుమోములు కన్నులఁదేలించి చూచి
పదతాళగతులకు పడఁతులెల్లా
అదివో శ్రీ వేంకటేశుఁ డల మేలుమంగతోడ
ముదమంది చూడఁగాను ముందట నాడేదు

రేకు: 0961-2 పాడి సం: 19-350

పల్లవి: అప్పటి మానవు వెంగే లదేమే నీవు
కుప్పలైనవలపుల గురిగాఁ జూచేవు

చ. 1: వద్దే నాతో నింకా వట్టిసటజంకెనలు
గద్దించి తీసిన లోనుగాక మానేవా
కద్దే నావంకఁ దప్పు కప్రవిడె మిచ్చినది
వొద్దిక మదనమెత్తి వొకటొక టాడేవు

చ. 2: పోపో నాతోనేల పొద్దువోనియానలు
చూపుల నాయమంటితే చొక్కకుండేవా
కాపాడి గుబ్బలఁ గొంగుగప్పినది నేరమీ
తీపులపెదవి వంచి తిట్టేవు లోలోనే

చ. 3: రావే నాయెడనేలే రతిలో నీ గుట్లు
మోవి నిన్నుఁ జెనకితే మొక్కకుండేవా
యీవేళనే శ్రీ వేంకటేశుఁడ నేఁ గలసితి
తోప నలమ్మేలంగవు తొక్కేవు పాదములు

రేకు: 0961-3 సామంతం సం: 19-351

పల్లవి: గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు
కొల్లకాఁడు రేపల్లె గోవిందుఁడు

చ. 1: పలుకుల భ్రమ్రయించె భావములఁ గరఁగించె
కొలనికరత నవ్వె గోవిందుఁడు
యెలయించి యప్పటి మాయింటిలేనే పవ్వళించె
కొలఁదిమీరినవాఁడు గోవిందుఁడు

చ. 2: వూరక పువ్వుల వేసె నొకటొకటేసేసె
కూరిమిఁ దప్పకచూచె గోవిందుఁడు
చేరి మావారుండ వారు చెప్పరాదు తనదూరు
కోరి యశోద నీ బిడ్డ గోవిందుఁడు

చ. 3: సమ్మతించఁ జేయివేసె చన్నులతోనే రాసె
కుమ్మరించె వలపులు గోవిందఁడు
దొమ్మిసేసి మమ్ముఁగూడె దొరవలె నదె వాఁడె
కొమ్మరో శ్రీ వేంకటాద్రి గోవిందుఁడు

రేకు: 0961-4 లలిత సం: 19-352

పల్లవి: నిజము చెప్పఁబోతే నెలఁతలు నవ్వేరు
భజన నెందరికని బాస లిచ్చేవయ్యా

చ. 1: చెప్పరాదు చెలులు పదారువేలు
నెప్పున నీవాడుకొంటే నిజమందురా
పిప్పిగట్ట నాసలేల పదవు లెండీఁ జాలు
కప్పుర మిచ్చేఁగానీ కాఁగిలించవయ్యా

చ. 2: నమ్మిరి గొల్లెతలు నీనయగారితనములు
కమ్మరాఁజేయఁగఁబోతే గై కొందురా
చిమ్మి చెక్కునొక్కనేల చేతులు నొచ్చీఁ జాలు
వుమ్మడి గుచాల నొత్తే నొద్దికి రావయ్యా

చ. 3: కంటిమి నీనేరువులు కాగిటిలోనే నేడు
అంటి కూడితే భ్రమయక వుందురా
వొంటినే శ్రీవేంకటేశ వొడబరచి పొందితి-
వింటిలోఁ బానువు మీది కిక రావయ్యా

రేకు: 0961-5 సామంతం సం: 19-353

పల్లవి: అతఁడు నాకుఁగలఁడనేదే చాలు
చతురుని దూరకురే సారెసారె నిఁకను

చ. 1: మలసి వేరొకతెకు మనసిచ్చునా అతఁడు
అలరి మాఁటలాడితే నాడుఁగాక
తలఁపు నామీఁద నుండు తను వెక్కడ నుండినా
వలసినప్పుడు తానే వచ్చీ నాకడకు

చ. 2: అటువలెఁ బరసతి కాసపడునా అతఁడు
నటనల నవ్వితేను నవ్వీఁగాక
యెటైనా నేనే యతఁడు యెవ్వ రేమిచెప్పినాను
తటుకనఁ దనమాఁట తప్పనివాఁ డతడు

చ. 3: పక్కన నెవ్వరికైనా భ్రమసునా నేఁడతఁడు
చొక్కుఁగన్నులఁ జూచితేఁ జూచుఁగాక
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
దక్కె నామతికే మతి తారుకాణ అతఁడు

రేకు: 0961-6 రామక్రియ సం: 19-354

పల్లవి: సిగ్గున మునిఁగెను చింతలఁ బొరలెను
యెగ్గులెంతురా యిఁకనేలే

చ. 1: శిరసును వంచెను సెలవుల నవ్వెను
మరిగెనుఁ బతి నీమాఁటలకే
నిరతితో నలసెను నిట్టూర్పులు నించెను
యెరపరికములఁ జల మిఁకనేలే

చ. 2: నిన్నిటు చూచెను నేలలు వ్రాసెను
సన్నల నీలో సణఁగులకే
యిన్నిటి కొడఁబడె నిటు చేయివేసెను
యెన్నిక కొసరులు యికఁనేలే

చ. 3: పంతము నించెను పానుపు చేరెను
కొంత గొంత నీకూటమికే
యింతట శ్రీవేంకటేశ్వరుఁ గలసితి-
వెంతని మెచ్చే వికఁనేలే

రేకు: 0962-1 సాళంగం సం: 19-355

పల్లవి: మెఱుఁగువంటిది యల మేలుమంగ
అఱిముఱి నవ్వీని అలమేలుమంగ

చ. 1: పలచనియెలుఁగునఁ బాడీ నీమీఁదిపాట
మెలుపుఁగూరిమి నలమేలుమంగ
చెలులతో నీసుద్ది చెప్పిచెప్పి కరఁగీని
అలయుచు సొలయుచు నలమేలుమంగ

చ. 2: యీడుగా నీరాకకు నెదురెదురు చూచీ
మేడమీఁద నుండి యలమేలుమంగ
వాడుమోముతో నీపై వలపు చల్లిచల్లి
ఆడీ నాట్యము సారె నలమేలుమంగ

చ. 3: పేరుకొని పిలిచీని ప్రియములు చెప్పిచెప్పి
మేరమీర నిన్ను నలమేలుమంగ
యీరీతి శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడెఁ నేఁడు
ఆరితేరె నన్నిటాను అలమేలుమంగ

రేకు: 0962-2 సామంతం సం: 19-356

పల్లవి: మూసి మంతనాలతోడి మోహమేలే
వేసరించనేలే మరి వేఁడుకొననేలే

చ. 1: పిలిచినప్పుడు రాక బిగిసి వెనక నాతో
అలరి యెంతనవ్వినా నదియేలే
వలపుకాఁకలచేత వాడఁజేయనేలే మరి
చలువగాఁబన్నీరు చల్ల నేలే

చ. 2: యింటికి వచ్చినపని యియ్యకోక మరి నా-
వెంటవెంటఁ దిరిగేటివేసాలేలే
తుంటతనమున నన్ను దూరనాడనేలే మరి
గెంటి యంతలోనేలే తాను కిందుపడనేలే

చ. 3: చెక్కునొక్కి యప్పుడే చిడుముడిపడి మరి
అక్కరతోఁగాఁగిలించే దదియేలే
తెక్కుల శ్రీవెంకటాద్రిదేవుఁ డిట్టె నన్నుఁగూడె
చక్కటిసిగ్గులవేలే చవిదాయనేలే

రేకు: 0962-3 నాగవరాళి సం: 19-357

పల్లవి: తలపోసి తలపోసి తనువెల్లాఁ గాఁకరేఁగె
వలపు దరించరాదు వాములాయ నిపుడు

చ. 1: యిట్టె విచ్చేయఁడొకొ యింతలో మరచెనొకొ
అట్టె పతి నఁనైనా రమ్మనఁడొకొ
గుట్టున నుందురునొకొ కొమ్మల నంపుదునొకొ
యెట్టు వేగించవచ్చు నింతవొద్దువోయను

చ. 2: యింటిలో నున్నాఁడొకొ యెఱఁగలైనతినొకొ
నంటునఁ దా నింతసేసె నవ్వులకొకొ
అంటి చెలిచేతఁగానుకైనా నంపుదునొకొ
వొంటి నెట్టు దరియించే నోయమ్మ నేను

చ. 3: మోము చూచి నవ్వఁడొక మొగి సన్నసేయఁడొకొ
కామించి తానే కాఁగిటఁ గలయఁడొకొ
యేమిరించి శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ గలసె
నామన సొకటే యాయ నమ్మితిఁబో ఇపుడు

రేకు: 0962-4 సామంతం సం: 19-358

పల్లవి: కంటిఁ గంటి నీగుట్టు కానీలేరా
కంటగించీ నీగుణాలు కానీలేరా

చ. 1: అడరి నావద్ద నుండి యట్టె వుస్సురనేవు
కడ నేమిదలఁచితో కానీలేరా
అడియాలపుమచ్చము లంగమునఁ జూచితేను
కడుఁదేలించి చూచేవు కానీలేరా

చ. 2: నెమ్మి నిన్ను వలపించేనెలఁతపే రడిగితే
కమ్మర నాతో నవ్వేవు కానీలేరా
రమ్మని యాకెయింటికి రతి నానవెట్టితేను
కమ్మి నానోరు మూసేవు కానీలేరా

చ. 3: వక్కణించి నీమోవి వాడుదేరీ నేలంటే
గక్కనఁగాఁగిలించేవు కానీలేరా
యెక్కువ శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కక్కసించనోప నిఁక గానీలేరా

రేకు: 0962-5 వసంతం సం: 19-359

పల్లవి: వచ్చేవో రావో నీవు వాదు లేఁటికే
వచ్చిదేరె వలపులు పగటేలే ఇఁకను

చ. 1: నగవు వెన్నెలగాసె నంటునఁ జన్నులు రాసె
యెగసక్కెములు నాతో నిఁకనేఁటికే
గుగురుగాఁ బులకించె కొప్పువిరు లటు చిందె
సొగసి బిగియ నీకుఁ జోటేదే యిఁకను

చ. 2: మాటలఁ దేనెలు చిందె మనసులో నిండె
యీటు వెట్టి గుట్టుసేయ నిఁకనేఁటేకే
వూటురేఁగెఁ జెమటలు వుసురుసురులు రేఁగె
బూటకవుఁజల మింతే బొంకనేలే యిఁకను

చ. 3: ఆయములు సరివచ్చె నాస లెల్లా గడు హెచ్చె
యేయెడఁ జూచినఁ బంతా లిఁకనేఁటికే
యీయెడ నే శ్రీ వేంకటేశుఁడఁ గూడితి నిన్ను
మాయదారితనముల మఱఁగేలే ఇఁకను

రేకు: 0962-6 పాడి సం: 19-360

పల్లవి: మటి తనుఁబాసినమముబోఁటికిఁగా-
కెటిఁగెటిఁ గివి తను నెలయించీనా

చ. 1: చిత్తజుగురుఁడట జిగిఁ బూబాణపు-
కత్తులు తను మరి కాఁడీనా
పొత్తులచంద్రుఁడు భువిఁదనమఱఁ దెట
వత్తిగఁదనపై వడ చల్లీనా

చ. 2: వంచినకోవిల వాకట్టువాఁడట
ముంచి కోవిలలు మొఱసీనా
పెంచి గాలిదినుపెనుఁబాము పరపట
పంచలఁదను నవి భ్రమయించీనా

చ. 3: మతిఁ దా వసంతమాధవుఁడట మరి
తతి నామని తనుఁ దడవీనా
యితవుగ శ్రీ వేంకటేశుఁడు తాఁగూడె
రతి నిద్దరికిని రారాఁపయ్యీనా

రేకు: 0963-1 వరాళి సం: 19-361

పల్లవి: ఇదివొ నీ మహిమ నేనేమని పొగడుదును
కదిసి నీవుండఁగాను కపటాలూఁ బాసె

చ. 1: వేడుకతో నీనవ్వు వెన్నెలలుగాయఁగాను
యీడనే చిత్తము చీఁకటంతాఁ బాసె
నీడవలె రమణుఁడ నీవు వెంట రాఁగాను
యేడలేని మేనికాఁక యెండలెల్లాఁబాసె

చ. 2: కలసి నీపలుకుల కప్పురాలు చల్లఁగాను
తలపోఁత విరహపుదప్పులు వాసె
చలువై, నీకరుణారసపువాన గురియఁగా
కలిగిన నామనసు కటివెల్లాఁ బాసె

చ. 3: కరకమలము నీవు కమ్మరఁ బై వేయఁగాను
మరునిబాణాలపగ మాలోఁ బాసె
ఇరవై శ్రీ వేంకటేశ ఇద్దరముఁ గూడఁగాను
శిరసులు వంచినట్టిసిగ్గులెల్లాఁ బాసె

రేకు: 0963-2 బౌళి సం: 19-362

పల్లవి: ఏల నన్ను రమ్మనీవే ఇంతే చాలు
యేలినాఁడు తొల్లె నన్ను నింతే చాలు

చ. 1: కూడి తనచేఁతలకు గోపగింతునో యేమో
యీడనుండి మొక్కితి నాకింతేచాలు
వోడక సారెకు రాఁగా నొగరౌనో తీపౌనో
యేడకేడ తననా కింతేచాలు

చ. 2: కామిను లెందరు లేరు కాఁకలు చల్లఁ దనకు
యేమిగారణము నే మింతేచాలు
నేమము దప్పకుంటే నేరుపౌనో నేరమౌనో
యీమాటు వోయిరావే యింతేచాలు

చ. 3: బెట్టి నవ్వ నీరుదియ్యఁబేనువచ్చు నిఁకనేల
యెట్టైనా వచ్చెఁ దా నీడ కింతే చాలు
వొట్టుక శ్రీ వేంకటేశుఁడొనగూడె నిప్పు డిట్టె
యెట్టుసేసీనాఁ జెల్లె నింతేచాలు

రేకు: 0963-3 కాంబోది సం: 19-363

పల్లవి: ఇందరముఁగంటిమి పీ విదిగానవా
వొందిలి పానుపుమీఁద నున్నది గానవా

చ. 1: బంగారుపావాలు మెట్టి పడఁతి యెవ్వతోకాని
ముంగిటఁ బొలసె నీ విమ్ములఁ గానవా
పొంగేటిజవ్వనముతో పొదరిల్లు దూరి నీతో
సంగవించి సన్నసేసె నదిగానవా

చ. 2: వల్లెవాటుఁ బయ్యదతో వనితలపై నొరగి
యిల్లిలదె యేకతమాడీ నిది గానవా
కొల్లలుగా నాడనాడ కొప్పుపూవు లటు జార
చెల్లఁబో కులుకినవ్వేచేతఁ గానవా

చ. 3: జవ్వాదివాసనలతో సతి నీవెనక నదె
యెవ్వరంటా నున్నవాఁడ విది గానవా
రవ్వగా శ్రీ వేంకటేశ రమణిఁ గూడితి విదె
యివ్వలనే బొంకేవు యిప్పుడైనాఁ గానవా

రేకు: 0963-4 రామక్రియ సం: 19-364

పల్లవి: నిచ్చనిచ్చ వాదులేల నీచి త్తము
యెచ్చుకుందు లాడనేల యింకా నీచి త్తము

చ. 1: మిక్కిలిదొరవు నీతో మేలమాడ వెఱతుము
నిక్కి నీవేమి సేసినా నీచి త్తము
యెక్కువతక్కువ నీతో నేమంటే నేమవునో
మొక్కితిమి నీకు నేము ముందర నీచిత్తము

చ. 2: కమ్మరఁ గమ్మర నీపైఁ గల్ల మోప నోపము
నిమ్మపండు గానుకిదే నీచిత్తము
సమ్మతిగా నీవలపు చల్లఁబోతే చవిగాదు
వుమ్మడి నుండే మింక నున్నది నీచిత్తము

చ. 3: చేవదేర నీయెడకు సిగ్గువడ నిఁకనేల
నీవే నేనైతి నిఁక నీచిత్తము
శ్రీ వేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
కైవశమైతి మిఁకఁ గలది నీచిత్తము

రేకు: 0963-5 సాళంగం సం: 19-365

పల్లవి: ఆతనిపై నలిగేనా ఆతఁడు నాకలిగీనా
కాతరాన మీరేల కక్కసపెట్టేరే

చ. 1: మాటలలోనా నతఁడేమనసులోనా నతఁడే
యేఁటికి విభుని దూరే రింకా మీరు
కూటమికిఁ దాఁ జిత్తము కొలఁదినే వచ్చీఁగాక
పాటించి యింతేసి యేల బలిమిసేసేరే

చ. 2: కలలో విచ్చేసినాఁడు కరఁగించి కూడినాఁడు
యెలయించేల పిలిచే రింకా మీరు
తలఁపుఁదలపు నొక్కతారుకాణ లిద్దరికి
చెలఁ గెప్పుడు వచ్చినాఁ జింతించనేఁటికే

చ. 3: మెట్టిననే లొక్కటే మీఁదఁ బారేగా లొక్కటే
యెట్టివారు గలిగితిరే యింకా మీరు
యిట్టె శ్రీ వేంకటేశుఁ డిచ్చగించి నన్నుఁ గూడె
గట్టిగా నితనిమతి కంటిరటే యిఁకను

రేకు: 0963-6 కన్నడగౌళ సం: 19-366

పల్లవి: ఇటువంటిదాన నా కేటియలుకే
కటకట తా రాఁగాఁ గాదనేనా నేను

చ. 1: మాటలాడకుండుఁగాని, మనలోపలనైతే
నాటినది తనమీఁద నాచిత్తము
కాటుకకన్నులఁ జూచి కరుదుఁగాని నేను
వాఁటపువలపు మీఁద వంతుఁబో లోలోనే

చ. 2: దగ్గరి రాకుందుఁగాని, తానన్ను నంటినప్పుడే
వెగ్గళించి సిగ్గులెల్లా వీడఁగలవే
యెగ్గువట్టివుందుఁగాని, యేపాటి నవ్వించినాను
అగ్గలపుసరసము లాడుదుఁబో నేను

చ. 3: నివ్వెర గందితిఁ గాని, నేఁడు నన్నుఁ గూడఁగాను
పవ్వళించినపుడేపో పరవశము
యివ్వల శ్రీవేంకటేశుఁడేకతమాయ నాతోను
జవ్వనబారముచేత జడిసీఁబో తనువు

రేకు: 0964-1 ఆహిరి సం: 19-367

పల్లవి: విరహంబు వేఁడాయ విరుల మొన వాఁడాయ
తరవాతిపనుల కిటు తడవేల ఇఁకను

చ. 1: పిలువరే నాయకునిఁ బ్రేమంపుచెలిమీఁద-
నలఁదరే శ్రీగంధ మందాఁకాను
నిలువరే కొంతవడి నిండురొద లిటు మాని
కలికిమై చెమరించెఁ గంద మిఁకఁ బనులు

చ. 2: చెరుగరే తురుములోఁ జెదరిజారినవిరులు
కరఁగెనే చెలినుదటికస్తూరిబొట్టు
మరుపరే కప్పురము మగువదప్పులు దీర
నెరపుదము నేరుపులు నిమిషంబుమీఁద

చ. 3: అంపరే యెదురుగా నతనికిఁ గానుకలు
చెంపలనుఁ బన్నీరు చిలుకఁగదరే
యింపులను శ్రీవేంకటేశుఁడిదె వచ్చి సతి
సొంపులను గూడె నిఁక సొలయ నేమిటికే

రేకు: 0964-2 నాట సం: 19-368

పల్లవి: ఈఁతకు మిక్కిలిలోఁతా ఇంకా నేలే
చేఁతలెల్లాఁ జెల్లె నీకు చిరునవ్వుగాదా

చ. 1: కాయ మతనిపై వేసి ఘనకుచముల రాసి
మాయలు సేతువుగాక మాతోనేలే
చాయలనే యెకపోసి సన్నల నింత సేసి
యేయెడకుఁ బోనీవు ఇంతకంటె నేమే

చ. 2: మాటలనే కరఁగించి మంతనాలు మరిగించి
నాటక మక్కడఁ జేసి నాతో నీ కేలే
కాటుక కన్నులఁ జూచి కాఁకలఁ జేతులు చాఁచి
వాఁటమై వుండుదుగాక వాదు లీడనేలే

చ. 3: కాఁగిట నాతనిఁగుచ్చి కమ్మి మాయింటికిఁదెచ్చి
ఆఁగితి నాకాఁగిటిలో నాయనాయనే
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁ డిట్టె నన్నుఁగూడె
పాఁగి యింతలోనే నన్నుఁ బంగించనేలే

రేకు: 0964-3 తెలుఁగుఁ గాఁబోది సం: 19-369

పల్లవి: చాలు నింతకోపాలు చలమని
పాలించఁ దనకేమి పంతమని

చ. 1: అంటిరా మీరు ఆమాఁట పతితో
యింటికి విచ్చేయుఁ డిప్పుడని
నంటునా తాను నాఁటఁగఁ జూచినఁ
గంటివేదనలు ఘనమని

చ. 2: ఆంపెనా మిమ్ము నాతఁడు నావద్ది-
కింపుల నామోహ మెక్కెనని
ముంపునఁ జేసిన మొన్నటిచేఁతలు
మంపునఁ నెన్నఁడు మఱవనని

చ. 3: వచ్చెనా తాను వాకిటి కిప్పుడె
యిచ్చల నేపఁగ నేఁటికని
యిచ్చట శ్రీ వేంకటేశుఁడు గూడెను
నిచ్చలుఁ దానే నేనని

రేకు: 0964-4 వరాళి సం: 19-370

పల్లవి: చిత్తజుని మోహపుశృంగారవనమో యీకె
పొత్తుల వసంతమాడే పురుషునితోడను

చ. 1: పాయము మోసులువారెఁ బడఁతికుచములను
చాయవలపు కన్నుల జాజుకొనెను
చేయివాలెఁ గోరికలు చిగురులకొనగోళ్ళ
యీయెడ విభునివద్ద నింతిఁ జూడరమ్మా

చ. 2: కొప్పునఁ గొనలుసాగెఁ గోమలితమకములో
కప్పురపుమాటలను గర్వము వూచె
పుప్పొడి రాలె సెలవిఁ బొలఁతికి సిగ్గులనె
చెప్పరాదు పానుపుపై చెలియభావములు

చ. 3: భావరతి పంటవండె భామినిబింబపు మోవి
కైవశమై రాసికెక్కెఁగళలెల్లాను
యీవేళ శ్రీ వేంకటేశుఁ డింతియుఁ గూడఁగాను
దేవిదేవరవలె దిష్టమాయ నిదివో

రేకు: 0964-5 శంకరాభరణం సం: 19-371

పల్లవి: పోవలె మాయింటికి పొద్దున మాకు
ఆవటించివొక్కసారె అడుగరే మాట

చ. 1: పిలిపించెనేఁటికి ప్రియము చెప్పఁగనేర
చెలువుఁడు నన్ను నేమి సేయుమనీనే
చల మొక్క టేకాని సాధించ నేనేర
అలరి యింకా నేమి అడుగరే మాట

చ. 2: తానె వచ్చెనేఁటికి తలపోఁత నే నెఱుఁగ
పూనిపట్టి నాకు నేమి బుద్ధిచెప్పీనే
మోన మొక్క టేకాని మొఱఁగులు నేనేర
ఆనవెట్టి మీరైనా అడుగరేమాఁట

చ. 3: కాఁగిలించీనేఁటికే కాఁకసేయ నేనేర
యేఁగివచ్చి నామన సేమి చూచీనే
రాఁగయ్యె శ్రీ వేంకటాద్రిరాయఁ డిట్టె నన్నుఁ గూడె
ఆఁగినతనగుట్టేమో అడుగరేమాట

రేకు: 0964-6 మంగళ కౌశిక సం: 19-372

పల్లవి: వలసినట్టాడవయ్య వన్నెలెల్లాఁ జూపవయ్య
నిలువెల్లా మెఱుఁగులే నీకు మొక్కఁజాలదు

చ. 1: మగువ మాటాడఁబోతే మాణికేలు రాలీని
జగడాలు నీతోను సారె నోపదు
మొగమెత్తి చూడఁబోతే మొల్లలే మిక్కుటమయ్యీ
నగవు లంతేసి నీతో నవ్వఁగనోపదు

చ. 2: అంగన నడవఁగానే అందెలెల్లా మొరసీని
వెంగలినీవినయాలు వినఁగూడదు
కుంగక కాఁగిటిలోన కుచములే పెరిగీని
చెంగటఁ జేయివట్టినాఁ జెలియ మొగియదు

చ. 3: పొలఁతి నిన్నొరసితే పులకలు రాసివడీ
వొలిసియు నిందుకేపో వూరకున్నది
అలరి శ్రీవేంకటేశ అంగన నీవు గూడఁగా
నిలిచినపరవశాన నివ్వెరగుఁ బొందెను

రేకు: 0965-1 సాళంగం సం: 19-373

పల్లవి: చెప్పితే నిష్ఠూరము చెలియ నీవారము
రెప్పలనీలోనిచూపే రేసుదెచ్చుఁ జుమ్మీ

చ. 1: కామించి యతఁడు గారవించి పిలువఁగ
యేమన్నా బలుకవు యేలే ఇంత
దీమస మెంత నీకుఁ దీర దెంతైనాఁ బరాకు
వాములైన వలపులు వడ్డివారుఁజుమ్మీ

చ. 2: అదన నీయింటికి నాతఁడే రాఁగా నీ-
వెదురయి మొక్కవు యేలే ఇంత
పెదవు లెత్తవు నీకు ప్రేమైనాఁ గైకోవు
కదలుఁగుచాలు నీకే కడువాండౌఁ జుమ్మీ

చ. 3: చెంత నిట్టె కూడెను శ్రీ వేంకటేశుఁడు
యింతలో మేమఱచేవు యేలే యింత
చింతలెల్లాఁ దీరెను సేసకొప్పు జారెను
పంతములాడఁగఁబోతేపై వచ్చుఁ జుమ్మీ

రేకు: 0965-2 ఆహిరి సం: 19-374

పల్లవి: నేకే తెలుసు నీఁక నే మేమీ నెఱఁగము
ఆకెకు నీకే తగును అదివో విన్నపము

చ. 1: యెక్కడి పరాకో యెంత నేము విలిచిన
చెక్కు మీఁదిచేయికాని చిత్త గించదు
నిక్కి నీవు చూచితివి నిన్న మాపటంతనే
అక్కట నేఁడిట్లాయ నదివో విన్నపము

చ. 2: మందో మంత్రమోకాని మరి బుద్దిచెప్పినాను
చందము తనదేకాని చాయకురాదు
అంది విడె మిచ్చితివి అల్లపు డింతికి నీవే
అందువంక నిట్లాయ నదివో విన్నపము

చ. 3: యెంతసంతోసమోకాని యెదిరిఁ దన్నెరఁగదు
కాంతలు కాను కిచ్చినాఁ గైకొనదు
వింతగా శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితి విట్టె
అంతలోనే చొక్కఁబోలు నదివో విన్నపము

రేకు: 0965-3 మాళవి సం: 19-375

పల్లవి: అల్లదె జవ్వని హరియురమున నదె
మెల్లనె యిటు వుపమించరే మీరు

చ. 1: ముత్తెపుజిప్పలో ముంచినకలువలో
వొత్తిలి కనుఁగవ లొకమాటాడరే
గుత్తపుఁగుండలో కొండలో కుచములో
హత్తి యేర్పడఁగ ననరే మీరు

చ. 2: తామెరతూండ్లో తతియగు తీగెలో
భామచేతు లేర్పరచరే యిపుడు
దోమటిసింహమో తొడఁగినబయలో
ఆమాటాడరే అందులో నొకటి

చ. 3: నీలపుమణులో నిండిన మేఘమో
బాలకితురు మొకపలుకునఁ జెప్పరే
యీలీల శ్రీ వేంకటేశ్వరుఁగూడెను
మేలిమి మెఱుఁగో మెలుఁతో యనరే

రేకు: 0965-4 సామంతం సం: 19-376

పల్లవి: ఎడసితే నొకగుణ మెదుట నొకగుణము
అడియాలాలెల్లఁ గంటి మౌలేరా మాఁటలు

చ. 1: నిచ్చలు వద్దనుండేటినెలఁతలపొందుకంటే
వచ్చీరాని వనితల వలపు చవి
పెచ్చువెరిగే వౌలేరా పెళ్ళిచెట్టు మందుగాదు
యిచ్చకము సేయవచ్చే వీఁకనేల మాటలు

చ. 2: భావించి నాలుకమీఁదిపంచదారకంటెను
ఆవలిచేఁదే తరితీపై యుండును
కావించి యరచేతిమాణికమైనా సరకు గాదు
యీవేళఁ గొసరేదా యిఁకనేల మాటలు

చ. 3: కాఁగిటఁ గూడినయట్టికమ్మనిరతులకంటె
మూఁగినభావరతుల మోహము బెట్టు
యేఁగివచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మాఁగినపండు చవౌను మరియేల మాఁటలు

రేకు: 0965-5 దేవగాంధిరి సం: 19-377

పల్లవి: తెలిసినపనులకు దెగ నిన్ను
సొలపుఁ జూపులనె చూచితి నిన్ను

చ. 1: నామతిలో నున్నవి నీవాడఁగ
యేమని కొసరే నిఁక నిన్ను
మోము చూచితే మొగి నిటు నవ్వఁగ
కామించి యలుగఁగఁ గలనా నిన్ను

చ. 2: పిలువకతొల్లే ప్రియమున రాఁగా
వలెనా రమ్మన వడి నిన్ను
పలికినంతనే పంతము లియ్యఁగ
చలములు సాధించఁ జాలము నిన్ను

చ. 3: అంటకతొల్లే అంగము గరఁగఁగ
కంటకమేల యిక్కడ నిన్ను
యింటనే శ్రీ వేంకటేశ కూడితివి
వెంట వెంట నిఁక విడువను నిన్ను

రేకు: 0965-6 సాళంగనాట సం: 19-378

పల్లవి: నిన్ను దూరఁబనిలేదు నీవు మేలే సేసితివి
కన్నెకుఁ గాఁకలు మించెఁ గర్మఫల మిట్టిది

చ. 1: కాంతపై జల్లనిచూపు కడు నీవు చల్లఁగాను
యింతికిఁ జింతలత లిగిరించెను
కొంత నీకృపారసము కొలఁగులై ముంచఁగాను
వింతగాఁ గలువ లట్టె వికసించెను

చ. 2: నెలఁతకుఁబలుకుఁదేనెలు నీవు చిందఁగాను
అలులు చిందరవందరై మూఁగెను
కలికిపై నీవూర్పుగాలి నేఁడు విసరఁగ
మలిమి జక్కవలకు పంజరము లూడెను

చ. 3: పై పైఁ జెమటయేరు పడఁతిపై బరపఁగ
మోపులై ముత్తెపుసరులు మొలకలొత్తె
యేపున శ్రీ వేంకటేశ యీసతి నీవు గూడఁగ
నీపొందుల భ్రమసి నివ్వెరగై నిలిచె

రేకు: 0966-1 సామంతం సం: 19-379

పల్లవి: చాలుఁజాలు నున్న వెల్లాఁ జాలదా యిది
జాలెలా నిందునే పాసెఁ జాలదా యిది

చ. 1: గొౌరబుగా నవ్వితేనుకోపగించుకొనక
సరిగా నీవు నవ్వితి చాలదా ఇది
తరవై కొంగువట్టితేఁ దప్పించుకొనక
సరవి నూరకుండితి చాలదా ఇది

చ. 2: కన్నుల నేఁ బిలిచితే కమ్మర జంకించక
సన్నలకే వచ్చితివి చాలదా ఇది
నిన్నుఁ దప్పకచూచితే నిలిచి వాదుక రాక
జన్నెవలపు చల్లితి చాలదా ఇది

చ. 3: తమితో నిన్నుఁ గూడఁగా దప్పులనుఁ బొరలక
సమరతిఁజొక్కితివి చాలదా ఇది
అమర శ్రీ వేంకటేశ అనుమాన మెంచక
జమళిఁగూచుంటి విట్లె చాలదా యిది

రేకు: 0966-2 లలిత సం: 19-380

పల్లవి: ఇదె వచ్చె రమణుఁడు యెంచినయెన్నికలాయ
మదనమంత్రాలతోడ మాటాడవే

చ. 1: చెక్కిటఁబెట్టినచేయి చిత్తములోనికి నూయి
తక్కినసిగ్గులకెల్లా దండదాయి
చక్కనినీవదనము చందురునిసదనము
మక్కువతోఁ జిన్నఁబోక మాటాడవే

చ. 2: ఆరీతి పయ్యదకొంగు యౌవ్వనపాయపురంగు
పోరచి కోరికలెల్లాఁ బొంగేటిపొంగు
సారపు నీకెమోవి చల్లగప్రపుదీవి వే
మారు దడువక ఇట్టె మాటాడవే

చ. 3: సగమువీడినకొప్పు సరసమాడేవొప్పు
పగటుభావరతులు పట్టిచ్చేచొప్పు
తగు శ్రీ వేంకటపతి దగ్గరి నిన్నిటు గూడె
మగఁటిమెల్లా మెరసి మాఁటాడవే

రేకు: 0966-3 కేదారగౌళ సం: 19-381

పల్లవి: ఎట్టైయినా మేలే ఇన్నిటికిఁ దానె గురి
మట్టినది నాకుఁ దనమోహమొకటే

చ. 1: కోపగించి చూచేవి కూరిమి పైఁ జల్లేవి
కైపుగా నీతనిరెండుకన్నులే కదే
తీపు గడుఁబూసేవి తెగి చేఁదు నెరుపేవి
మూపుదాఁకా తనతోడిమాటలే కదే

చ. 2: అంగపుఁగాఁక రేఁచేవి ఆయములు గరఁచేవి
పొంగారి తాఁజేసేపొందులే కదే
ముంగిటఁగడు నవ్వించేవి మోము గడువంపించేవి
చెంగటఁదాఁ జేసినట్టిచేఁతలేకదే

చ. 3: మొక్కులు దా మొక్కేవి మొనగోరు మోపేవి
చిక్కనికాఁగిటి తనచేతులేకదే
యిక్కడ శ్రీ వేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
దక్కె మాకు నిద్దరికి తలపోఁతేకదే

రేకు: 0966-4 సాళంగం సం: 19-382

పల్లవి: కాముని బలములెల్లా కాంతమైఁ బొత్తుగలసె
కామినులాల మనకుఁ గతలాయను

చ. 1: పున్నమచద్రుఁడు యీపొలఁతినెమ్మోమైతే
కన్నులే కలువలై కదిసీ నందే
వున్నతంపుఁజిలుకలు వువిదపలుకులైతే
పన్నినకెమ్మోవి బింబఫలమాయను

చ. 2: నెలఁతనడపులివి నెమలిభావములై తే
మెలుపున నెరిఁదురుము మేఘమాయను
అలరి ననుఁ దొడలె అరఁటికంబములై తే
చెలరేఁగి నెన్నడుము సింహమాయను

చ. 3: మగువకంఠము నేఁడు మదనునిశంఖమైతే
జగడించుఁజన్నులే చక్రవాకములాయ
తగు శ్రీ వేంకటపతి ధరియించి కూడఁగాను
మిగుల నింతికి మేలుమీఁద మేలే ఆయను

రేకు: 0966-5 పాడి సం: 19-383

పల్లవి: నీరువట్టుక నేయి వోయి నేరనే నేను
సారె నావలపునీరు చల్లుటింతేకాని

చ. 1: ఇట్టె నాలుకలోన బెల్లాలు యెదలోనఁ గత్తులు
నెట్టుకొని నీవెల నేరనే నేను
వట్టిమాటలిగిరించ వంచితేఁ దేనెలుగార
గట్టిగా నాపెదవులఁ గలదింతేకాని

చ. 2: కని యింటికాడ గానుగకాడా గసి
నినుఁజూచి నేరుచుకొనేరనే నేను
మనసు గరఁగించేది మర్మము భేదించేది
కనుచూపులు నాయందుఁగల దింతేకాని

చ. 3: అమ్మేది వొకటి అసిమలో దొకటి
నెమ్మది నీయంతేసి నేరనే నేను
కమ్మి శ్రీ వేంకటపతిఁ గలసితి వెలసితి
కమ్మరఁ గమ్మర నిదే కలదింతేకాని

రేకు: 0966-6 సాళంగం సం: 19-384

పల్లవి: వాన గురియక తొల్లె వరదలేల
నానఁబెట్టి కొంతగొంత నంటునేయరాదా

చ. 1: మనసులో నేమిగల్లా మాపటంతఁ జేతుగాక
చెనకి నవ్వు నవ్వితేఁ జెల్లదనేవా
అనువై పంతముగొనేయప్పుడే కొనేవుగాక
మనికిగా నందాఁకా మాటలాడరాదా

చ. 2: వేడుక నేమేనికాఁక వెనకఁ జెప్పేవుగాక
వీడె మందుకొన్నంతనే వెలితయ్యీనా
కూడినరతులవేళఁ గొసరే వింతేకాక
పాడితో మంచముమీఁదఁ బవ్వళించరాదా

చ. 3: తారుకాణించినప్పుడు తలవంచుకొందు గాని
చేరి నీవు కాఁగిలించితే దోసమా
మేరతో శ్రీ వేంకటేశ మెచ్చి నన్నుఁ గూడితివి
కారణములేని సిగ్గు కట్టిపెట్టరాదా

రేకు: 0967-1 సింధురామక్రియ సం: 19-385

పల్లవి: ఎచ్చుకుందు లాడకురే యేమీననకురే
కచ్చుపెట్టి యాతనికిఁ గడు నే వలతును

చ. 1: చేసినంతఁ జేయనీరే చెప్పకురే యాసుద్ది
ఆసయిచ్చాతఁడొక మాటాడితేఁ జాలు
వాసికిఁబెనఁగఁబోతే వడిఁబడుఁ జేసునిఁక
నాసరివారెల్లాఁ జూడ నవ్వినంతే చాలును

చ. 2: కూడినట్టె కూడనీరే కోపించకురే యాతని-
నీడ కాతడు విచ్చేసే యెమ్మెలే చాలు
పాడి పంతా లాడబోతే పదను దప్పునో యేమో
మేడెపు సరస వేళ మెచ్చినంతే చాలును

చ. 3: వుండినట్టె వుండనీరే వొరయకురే యాతని-
నండఁ దా నిక్కి చూచిన నదియే చాలు
నిండా శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నుఁ గూడె
కొండుక మేనఁజేసిన గురుతే చాలును

రేకు: 0967-2 శంకరాభరణం సం: 19-386

పల్లవి: కక్కస మిపుడే కావలెనా
వొక్కించుక వడి వుండగరాదా

చ. 1: నేరుపు మాటలు నీకే యమరును
కూరిమి గొసరఁగ గుఱి లేదు
తేరినయప్పుడె తెలిసేఁ గానీ
పోరక లోనికిఁ బోరాదా

చ. 2: సెలవుల నవ్వుల చెల్లును నీకే
తలపెట్టఁ జలము తతిగాదు
వలసినయప్పుడె వచ్చేఁ గానీ
పలుమరుఁ బిలువక పదరాదా

చ. 3: తమకించి కలయఁ దగవవు నీకే
జమళి నలుక లిఁకఁ జవిగావు
చెమరించె మేను శ్రీవేంకటేశ్వర
సమముగఁ గూడితి చనవీరాదా

రేకు: 0967-3 నాదారామక్రియ సం: 19-387

పల్లవి: వాడిక నీమతికిని వలపు వేఁగా
వీడెమిచ్చి తనితో వేసరుకోనేలే

చ. 1: కలికి కన్నులకును కాఁకల చూపులు వేఁగా
వొలసీ నొల్లక యాల వూరకుండేవే
పలు వన్నె నీ మోవికి పచ్చి మాటలు వేఁగా
మలసి పతితోనేల మాఁటాడవే

చ. 2: చేతిమీఁది చెక్కులకు సెలవినవ్వులు వేఁగా
యీతలఁ జింతఁ బొరలనేలే నీకు
కాతరపు మేనికిని కమ్మఁబులకలు వేఁగా
ఘాతలఁ బయ్యద నేల కుప్పేవే నీవు

చ. 3: కొండలకుచములకు గోరిచందురులు వేఁగా
బెండుగాఁ జెలవునితోఁ బెనఁగనేలే
ఆండనె శ్రీవెంకటేశుఁడాతఁడె నిన్నుఁ గూడెను
నిండుఁ గళలతో నీకు నివ్వెరగులేలే

రేకు: 0967-4 సౌరాష్ట్రం సం: 19-388

పల్లవి: గక్కన నిద్దరుఁ గలయు టివి
మక్కువ మాయెడమాఁట లిఁకేలా

చ. 1: పాదపువాఁతలు భావపుటీఁతలు
ఆదెసఁ జెలికిని యాసలఁబో
మోదపుఁ బలుకులు ముంచినపులకలు
యీదెస నీకును యిక్కడఁ గలిగె

చ. 2: కన్నులకెంపులు కాఁకలసొంపులు
వన్నెలసతికిని వలపునఁబో
సన్నపుఁజెమరులు సరసపుతిమురులు
నిన్న నేఁటనే నీకును గలిగె

చ. 3: పైపైనుసురులు పయ్యదవిసరులు
నీపొందు చెలికి నిలువఁగఁబో
యేపున శ్రీ వేంకటేశ్వర నీకును
యాపడఁతికూట మింతలోఁ గలిగె

రేకు: 0967-5 తెలుఁగుగాంబోది సం: 19-389

పల్లవి: చెలఁగి నావిభుఁ డింతసేయుమనెనా
చలమరికోరికలు సాదించీఁగాక

చ. 1: మాయదారిమరునేటు మనసులో గుఱి యింతే
కాయముమీఁదికినేల కాఁకరేఁగీనే
పాయపుమోహము లివి బయలీఁదేపను లింతే
ఆయపునిట్టూర్పులేల అలయించీనే

చ. 2: చందురునివెన్నెలలు జగమెఱిఁగిన వింతే
పందె మాడి నన్నునేల భ్రమయించీనే
కుందనికోవిలకూఁత కుత్తికలో పస యింతే
సందడి నాగుండె యేల జాలిరేఁచీనే

చ. 3: పంతపుటీచల్లగాలి పాణముతోలంకె యింతే
వింతలుగా నన్నునేల వేసరించీనే
యింతలోన శ్రీ వేంకటేశుఁడు గలయఁగాను
చింతలెల్లా బాపెఁగాక సిగ్గులేల ముంచీనే

రేకు: 0967-6 మేఁచబౌళ సం: 19-390

పల్లవి: నటనలు రెండూ నడపేవే
కుటిలపునవ్వులుఁ గోపముఁగలదా

చ. 1: వదనకమల మిటు వంచేవేమే
చదురులమాఁటలు చల్లుచును
పెదవులు గదలగఁ బిలిచి గొణఁగేవే
చెదరనిపొందిటు సేయుచును

చ. 2: చెక్కుచేతితో చింతయిదేమే
వొక్కమంచమున నుండుచును
మొక్కులలోనే ములిగేవేమే
చొక్కులచూపులఁ జూచుచును

చ. 3: రతివేళనె యీరాజమేమే
అతిబాసలు నన్నడుగుచును
యితవుగ శ్రీ వేంకటేశుఁడఁ గూడితి
మతకములేలే మైమఱచుచును

రేకు: 0968-1 భైరవి సం: 19-391

పల్లవి: ఏల దూరీ నేల పోరీ నితఁడే తాను
వేళతో బుద్ధిచెప్పఁగా విననై తినా

చ. 1: అత్తి నే నలిగితిఁబో అప్పుడే రమణుఁడు
పొత్తుకు రమ్మనఁగా నేఁ బోనైతినా
మత్తుఁడై యాపొద్దుకట్టై మఱితేఁబో ఇప్పుడైనా
వత్తునని చెప్పెంపఁగా వద్దంటినా

చ. 2: వుంటిఁబో నాచలముతో నోరుపుగలవాఁడై తే
నంటుగాఁ దా నవ్వఁగా నే నవ్వనైతినా
కంటకాన నొకతప్పు గలిగెఁబో ఇఁకనైనా
జంటన నన్నుఁ జెనకఁగా సమ్మతించకుంటినా

చ. 3: తతితో సిగ్గున నే తలవంచుకుండితిఁబో
రతులఁ గరఁచఁ గరఁగఁగనైతినా
ఇతవై శ్రీ వేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
కతగా, ఇదె తొల్లి కాదంటినా

రేకు: 0968-2 పళవంజరం సం: 19-392

పల్లవి: ఒకటి కొకటి గూడ దువిదకడకు నిట్టె
వెకలివిభునిఁ జేర విచ్చేయుమనవే

చ. 1: పతియింటికేఁగేటిపడఁతి వేగిరానకు
సతిపిరిఁదిభారము సంగరమాయ
మతిలో నాతనిఁ బొందేమచ్చికకోరికలకు
మితిలేనివలపులే మీఁదమీఁదఁ దొడును

చ. 2: సొలసి యాతనిఁ జూచేచూపులవాండ్లకు
చెలియానందజలాలు చిట్టంట్లాయ
మలసి యాతనితోడ మాటలాడేయందుకు
నిలుపునివ్వెరగులు నేరములై నిలిచె

చ. 3: కమ్మర నాతని రతి కాఁగిలించేయందుకు
కొమ్మకంకణరవాలే కొండెములాయ
ఇమ్ముల శ్రీ వేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
నెమ్మది నున్నారు నేఁడు నిన్ననే యింతాయను

రేకు: 0968-3 లలిత సం: 19-393

పల్లవి: తనిసితి నుండనీవే తనవలసినయట్టు
చినుకులేనిచిత్తడి సిగ్గులేలే ఇఁకను

చ. 1: ఆడినదే మాటా ఆతఁడే యెరుఁగును
యేడలేనిబుద్ధులు మీ రేమి చెప్పేరే
గోడలేనిచిత్తరువు కొలచీ నందే కొలపు
తాడు లేని కట్టు వట్టి తగులేలే యిఁకను

చ. 2: తుద నేమనీనె దూరులెల్లా వచ్చె
పదమనవే యింకఁ బనిలేదు
యెదురులేనిమాట కదురువలెనే వుండు
పెదవి పై తేనెల ప్రియమేలే యిఁకను

చ. 3: యింటికిఁ దా వచ్చినదే యిన్నిటికీ గురియాయ
జంటలయెడమాటలు చాలుఁజాలునే
అంటిముట్టి శ్రీ వేంకటాద్రీశుఁ డిదె కూడి
వెంట వెంటఁ దిరిగీని వెర పేలే యిఁకను

రేకు: 0968-4 మంగళకౌశిక సం: 19-394

పల్లవి: ఏల సేసే వడియాస లిందాఁకాను
ఆలకించి వున్నదాన నందాఁకాను

చ. 1: వచ్చి వచ్చి వేగిరాలు వలవనిజాగరాలు
యిచ్చల నడపితిగా యిందాఁకాను
వెచ్చనివూరుపులును వీరిడినేరుపులును
అచ్చుపడె నాకైతే నందాఁకాను

చ. 2: మాటలలో తీపులును మాయదారి చూపులను
యేఁటవెట్టి నడపితి విందాఁకాను
వాఁటమైన కాఁకలును వట్టికొమరాఁకలును
ఆఁటదాన నేఁ బడితి నందాఁకాను

చ. 3: సెలవులనగవులు చే చాఁచి తగవులు
యెలమిఁ జేసితివిగా యిందాఁకాను
చెలఁగి శ్రీ వేంకటేశ చెక్కు నొక్కి కూడితి నే-
నలవోకతోడ నుంటి నందాఁకాను

రేకు: 0968-5 ముఖారి సం: 19-395

పల్లవి: తగిలి నేఁ దడవితేఁ దడవఁగవలెఁ గాక
మిగుల వాసికానికి మేరమీరఁజెల్లునా

చ. 1: చూడకుండఁగానే తాను చూచీ తప్పక నన్ను
యేడాను జగడగాని కింతగలదా
ఆడకుండఁగానే మాటలాడించీ నూరకైన
జాడతో మాసటీనికి చంచలము చెల్లునా

చ. 2: ఇంటికిఁ బోఁకుండఁగ మాఇంటికి వచ్చీఁ దాను
అంటి చలపాదిగాని కది దగునా
అంటుకోకుండఁగ తానే అంటుకొనీ నామేను
దంటపంతగానికి దైన్యమింత చెల్లునా

చ. 3: కాఁగిలించకుండఁగానే కాఁగిలించీ నిదె నన్ను
యేఁగేటియెమ్మెకానికి నిది దగునా
కాఁగిననన్ను శ్రీ వేంకటపతి యిదె కూడె
చేఁగదేరేదొరలకు చేఁత లింత చెల్లునా

రేకు: 0968-6 శంకరాభరణం సం: 19-396

పల్లవి: ననుపున నూరకె నవ్వకురా ! నీ
మనసు రానె నే మాటాడేరా

చ. 1: మొదలిమాఁట నిను మోచివచ్చితే
వదనకమల మిఁక వంచకురా
కొదలు మాని నాకొంగు వట్టితే
పదివేలు దెలిపేఁ బదగదరా

చ. 2: సారెకు నీచేఁత సరిగాఁ జూపిన
బీరముతోఁ గోపించకురా
తారుకాణలకు దగ్గరి వచ్చిన
తేరకొనఁగ నిటు తెలిపేరా

చ. 3: అలమి కాఁగిటను ఆయము లంటిన
మలసి సొలసి మైమఱవకురా
యెలమిని శ్రీ వేంకటేశ కూడితివి
నెలవయి యురమున నిలిచితిరా

రేకు: 0969-1 సామంతం సం: 19-397

పల్లవి: నీ వేమి సేసినాను నిన్ను నేర మెంచరాదు
మూవంక నానిజానికే మొక్కేఁజుమ్మీ

చ. 1: కన్నుల నీమర్మములు కాఁడిపారఁజూచితి
వున్నతి నాతప్పు నీవే వోరుచుకొమ్మీ
వెన్నెల నవ్వులు నవ్వి వేఁడిసిగ్గు రేఁచితి
మున్నుమున్నే యిందుకు మొక్కితిఁజుమ్మీ

చ. 2: మాటలనే నీ మనసు మా యింటికిఁ గొంటఁ బోతి
యేఁటికైనా నన్ను నెగ్గు లెంచకుమీ
వాఁటపువినయముల వలపు లీఁదించితి
మూఁటగా వేవేలకు మొక్కేఁజుమ్మీ

చ. 3: కూడుతానే కాఁగిటిలో కొనగోరు సోఁకించితి
వేడుక నన్ను వెనకవేసుకొమ్మీ
యీడనే శ్రీ వేంకటేశ ఇన్నియు నేఁ జేసితి
మోడిసేసి ఇందుకేకా మొక్కేఁజుమ్మీ

రేకు: 0969-2 దేవగాంధారి సం: 19-398

పల్లవి: నెలఁతకుఁ జీఁకటి నీకే వెన్నెల
చలువయు వేఁడియు సంగడిఁ గలిగె

చ. 1: వాడినమోమును వంచినశిరసును
యేడఁ గలిగెనో యీచెలికి
వీడెపుమోవియు వేడుకనవ్వులు-
నీడనే రమణుఁడ నీకే కలిగె

చ. 2: చెక్కుమీఁదిచేయి చెదరిననెరులును
యెక్కడఁ గలిగెనో యీచెలికి
తక్కినకళలును తనువుచెమటలును
నిక్కపుదొరవగునీ కే కలిగె

చ. 3: తొట్టినతమకము తొడుసగువెరగులు
యెట్టు గలిగెనో యీచెలికి
యిట్టె శ్రీ వేంకటేశ కూడితివి
నెట్టన సతిరతి నీకే కలిగె

రేకు: 0969-3 సామంతం సం: 19-399

పల్లవి: చెప్పకు నీసుద్ది సరిచేసుకోకు నిన్ను నన్ను
వుప్పు గప్పురమువలె నుండితేనే ఆయనా

చ. 1: కన్నులే తెల్లనగానీ కాయమెల్లా నలుపే
యన్నిటా నన్ను నేరా లెంచవచ్చేవా
చన్నులే ఘనముగాక సరి నానడుము చిన్న
వన్నెల నేనూ నీవంటిదాననా

చ. 2: చేతులే నాలుగుగానీ చెలులు పదారువేలు
పోతరించి నీవు నాకు బుద్దిచెప్పేవా
ఆతల మాటలే వాఁడి యధరము మెత్తన
యీతల నీతో నన్ను నీడువెట్టేవా

చ. 3: చూడ బాలుఁడవుగానీ సోఁకేది మేను మిన్నంత
కూడేటి నావలపులు గోరసేసేవా
యీడనే శ్రీ వేంకటేశ యిట్టె నీతో నేకమైతి
మేడేపురతుల నన్ను మెచ్చకుండేవా

రేకు: 0969-4 మలహరి సం: 19-400

పల్లవి: కందుఁగుందు నింత గావలెనా
అందరిలోపల నవుననరాదా

చ. 1: చేరి నాపొందులు చిత్తము రాకున్న
నారుకొనఁ గొంత నవ్వరాదా
మారుమాటాఁడగ మనసు రాకున్న
వూరకైనఁ గొంత వూఁకొనరాదా

చ. 2: పైకొని నారాక పరాకై యుండిన
చౌకగాఁ బైఁ జేయి చాఁచరాదా
యేకడో నీచిత్త మెరవై యుండిన
ఆకుమడి చిచ్చే నందుకొనరాదా

చ. 3: కాఁగిట నీమేను కడుమఱచిన
వేఁగి నాపై మేనువేయరాదా
చేఁగవలపుల శ్రీవేంకటేశ్వర
పొఁగినరతులఁబంత మీరాదా

రేకు: 0969-5 గుజ్జరి సం: 19-401

పల్లవి: కడదాఁకా నీమేలే కాణాచై వున్నది
అడియాల మిఁక వేరే అరయఁ జోటేదిరా

చ. 1: నించిన కూరిమి నాపై నిజముగ నున్నది
మంచినీగుణాలు నామనసులో నున్నవి
అంచెల నీసరసము లంగముపై నున్నవి
కొంచి కొంచి నిన్నింకఁ గొసరఁ జోటేదిరా

చ. 2: చెప్పిపంపిన నీరాక చెవులనే వున్నది
రెప్పలెదుట నీరూపు రేపుమాపు నున్నది
చిప్పిలునీమోవితేనె సెలవుల నున్నది
వుప్పతించి నిన్ను నిఁక నొరయఁ జోటేదిరా

చ. 3: కందువ నీమర్మమెల్లా కాఁగిటిలో నున్నది
అంది నీముద్దుటుంగర మదె నావేల నున్నది
ఇందుకే శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
చిందేటిసిగ్గులు నీపై జిమ్మఁగఁ జోటేదిరా

రేకు: 0969-6 శ్రీరాగం సం: 19-402

పల్లవి: చింతవంత లిఁకనేల చెలుల దూరఁగనేల
దొంతులరతులే నీకు దోడాయఁగా

చ. 1: తలఁచఁగానే వచ్చె తనుఁదానే రమణుఁడు
మలసి నీకిఁక మొక్క మనసాయఁగా
ఆలుక లిన్నియుఁ బానె నతఁడె నీతో నవ్వె
పలుకుఁ బంతము నొక్కపాటాయఁగా

చ. 2: ఆనుమానించఁగనే యతఁడు నీచేయి వట్టె
యెనయు నీకోరికెల్లా నీడేరెఁగా
చనవల్లా నీకుఁ జెల్లె సరసుఁడు నిను మెచ్చె
కొనకెక్కినవలపు గురుతాయఁగా

చ. 3: మొక్కఁగా నాతఁడు నీకు ముందర వరము లిచ్చె
చక్కనై న సకినాలు సరిదాఁకెఁగా
చెక్కులెల్లాఁ జెమరించె శ్రీవేంకటేశుఁడు గూడె
యెక్కువ నీసంతసము లిరవాయఁగా

రేకు: 0970-1 సామంతం సం: 19-403

పల్లవి: మానరా నవ్వు మానరా వద్దు మానరా మాతోమానరా యేల మానరా!నీవు
మానకుంటే నన్ను నిందము వినఁగా మాటలఁ దిద్దక మానరా

చ. 1: వారి వీరితోడ వావులు చెప్పెంపే వట్టిదోసమేల కట్టేవురా
తేరకొన నన్నుఁజూచి వట్టి యాసదేర నుస్సుర నేఁటికి రా
పోరి పోరి నీవే నిజమరి నంటా బొంకుచు నన్నేల ముట్టేవురా
కోరి వూరకున్నవారి కింతేసికొడిమె లేఁటికి వచ్చీరా

చ. 2: చక్కనివారికి నీయెదుట నేఁడు సారె నిలువ రాదటరా
వొక్కమాఁటలోనే నీవింత గరఁగి వొళ్లు చెమరించనేఁటికిరా
చిక్కనిచన్నులు నాకుఁ గలిగితే చింతఁ బొరలఁగ నీకేరా
మొక్కలాన నీవుసేసే రోఁతలకు మొదలనే నాకు సిగ్గవురా

చ. 3: కారణములేక వూరివారితోడ కాలుదొక్క నేలవచ్చేవురా
నీరువంక తుంగవంటీవాఁడ వింతే నీతోడిపొందుకు నేనోపరా
కూరిమితోడుత శ్రీవేంకటేశ్వర కూడితివి నిన్ను నేమందురా
కోరినకోరికలెల్లాఁ దలకూడె గోరనన్ను నూఁదనేఁటికిరా

రేకు: 0970-2 నాదరామక్రియ సం: 19-404

పల్లవి: ఇటువంటివేడుక లెవ్వరికిఁ గలవమ్మ
తటుకన మఱచేరు తమలోనే మేనులు

చ. 1: కలికి రమణునికిఁ గస్తూరినామముపెట్టి
చెలరేఁగి తాఁజూపెఁ జెక్కుటద్దాలు
ములువాఁడి కొనగోళ్లు ముంచి కొప్పు దువ్విదువ్వి
తొలసితో మొల్లలట్టే తురిమీఁ జూపులను

చ. 2: పడఁతి విభునిమీఁద బన్నీరు చిలికించి
తడియొత్తీఁ గుచముల తగుపాట్లాల
చిడుముడి సొమ్ములతో సింగారములు సేసి
ఆడరి నివాళించీ నంగపుఁ గాంతులను

చ. 3: సోవగాఁ బీతాంబరము చుంగులువారఁ గట్టి
మోవి యాని తమ్ముల మిమ్ములఁ బెట్టెను
ఆవేళ శ్రీవేంకటేశు నట్టె మోహించి చూచి
తానిమంచానకుఁ దీసి తమకించి కూడెను

రేకు: 0970-3 ఆహిరి సం: 19-405

పల్లవి: ఏమి నెఱుఁగను నేను ఇఁక నీచి త్తమురా
దోమటి వయసు నాపైఁ దోసినట్టె తోయరా

చ. 1: తలఁపెల్లా నీది తమకమే నాది
చెలగి యేమిసేసినాఁ జేయరా నీవు
పలుకు నీతోనే పంతమే నాలోను
చలివలపులు నాపైఁ జల్లినట్టు చల్లరా

చ. 2: వాలుఁ జూపులు నాపై వడియుఁ జెమట నాపై
కేల నాచన్నులు పిసికినట్టే పిసుకరా
ఆలకింపు నీకొరకు ఆలయిక నాకొరకు
నాలిసేసి నీవు నాతో నవ్వినట్టే నవ్వరా

చ. 3: కాగిలిదె నీకు కళదాఁకేది నాకు
యేఁగక నీమోవి నాకు నిచ్చినంతా వియ్యరా
పాఁగినశ్రీవేంకటేశ పైకొని కూడితినదె
ఆఁగె నిద్దరిమనసు లంటినట్టె యంటరా

రేకు: 0970-4 సాళంగం సం: 19-406

పల్లవి: కానవచ్చె నందులోని కాదామణి
ఆనవెట్టి అడిగీని అట్టెకాదా మణి

చ. 1: వున్నతి నేమీఁజేయక వుండఁగానేఁ దన్నుఁ జూచి
కన్నుల నవ్వితినట కాదామణి
చిన్నిచెక్కులమీఁదటి చిఱుఁజెమటలు చూచి
మిన్నక మొక్కితినట మేలుగాదా మణి

చ. 2: వుమ్మడి నీతని వేలివుంగర మెక్కడిదంటా
కమ్మఱఁ జూచితినట కాదామణి
కమ్మినట్టి తనమేని కస్తూరివాసనలకు
సమ్మతించనైతినట సటగాదా మణి

చ. 3: తీపులైనతన మోవి తెగువ చూపతినట
కాఁపురము లెస్సాయ కాదామణి
పైపై శ్రీవేంకటాద్రిపతి నన్ను నిటు గూడె
చేపట్టి తనకిన్నిఁ జెల్లె గాదామణి

రేకు: 0970-5 కేదారగౌళ సం: 13-407

పల్లవి: ఓయమ్మ యేడకేడే వోయమ్మా
యీయెడ మీసాలతెనె యీవలపు

చ. 1: రమ్మని పిలువరాదు రాకుండితేఁ దిట్టరాదు
యెమ్మెలఁ గొండంతదొరే యీవిభుఁడు
బిమ్మిటి మెడవట్టదు పెట్టరాదు ముక్కునాకు
గుమ్మడికాయంతముత్తెమే యీకూటమి

చ. 2: పూని వేఁగిరించరాదు బొంకితే నలుగరాదు
యీనెలఁత లెందరై నీతనికి
తానూఁ జేతికి నీఁడు దగ్గరి తీసుకోరాదు
యేనుగ చేతి చెఱకే యీమోహము

చ. 3: ముంచి చేయి చాఁచరాదు మొనగోరు మోపరాదు
మించిన శ్రీవేంకటాద్రి మేఁటి యీతఁడు
కంచపుమో విచ్చి కూడె కడుఁదమకాలు రేఁచె
యెంచఁగఁ జుక్కలలెక్కే యీమరులు

రేకు: 0971-1 దేసాళం సం: 19-408

పల్లవి: ఇద్దరిచలముఁ జెల్లె నిదే మేలు
వద్దు వద్దు నాతోడి వట్టినవ్వు లేఁటికి

చ. 1: వేడుకలేనిపనికి వేసరివుండుటే మేలు
కూడనిమాఁటకు వట్టిగుట్టేమేలు
యీడుజాడకాఁపురాన కేడనుండినా మేలు
తాడుపడె వలపులు తలవయ్య నీవు

చ. 2: చనవులేనిచోటికి చాయపాట్లే మేలు
పెనఁగినా రాకుంటే బిగువే మేలు
మనసురాని యందుకు మఱి మఱచుటే మేలు
వెనకఁ జెప్పేఁగాని విడవయ్య కొంగు

చ. 3: వొలసీనొల్లనిపొందు వూరకైనపాటె మేలు
కలసిన రతులకుఁ గలంతే మేలు
ఆలయించి శ్రీవేంకటాధిప కూడితి నన్ను
పులివచ్చికాఁగిలేల వుండవయ్య యీడనే

రేకు: 0971-2 రామక్రియ సం: 19-409

పల్లవి: చేతికిఁ గొంత చేరనీవే
ఘాతలఁ దనమేను కరఁగిచేఁగాని

చ. 1: రానీవే వాని రవ్వసేయక
ఆనిపట్టి నేనే అడిగేను
పూని తొలుతనంటే బొంకినీ
నానినకాఁగిట న్వవించేఁగాని

చ. 2: తిరుగనీవే వానిఁ దెగనాడక
మరిగించే నేనే మాఁటలను
తరవాత నేమనినాఁ దలవంచీని
మరుతంత్రములన్నీ మరి నేసేఁగాని

చ. 3: వుండనీవే వానినొకటాడక
అండనే రతికేలి నలయించేను
దండి శ్రీవేంకటదైవ మీతఁడే
నిండి వురముమీఁదనే మొక్కఁగాని

రేకు: 0971-3 ముఖారి సం: 19-410

పల్లవి: సారె సారె మీరేల సందడిఁబెట్టేరే
మారుని మాయలు నేఁడు మందులఁ బొయ్యీనా

చ. 1: వలపు వెంచఁగఁబోతే వంతులకుఁ జవులవునా
అలవాని పొందు మానుమని యేల చెప్పేరే
తలఁ పాతని మీఁదటఁ దనువు యీడనే యింతే
యెలిమి మీరేమన్నా నిఁక మానఁబొయ్యేనా

చ. 2: మనసునఁ బాలు దాగ మఱి కడుపు నిండునా
పొనిగేల యెడమాటఁ బొద్దువుచ్చేరే
కనుచూ పాతనిమీఁద కాఁక లివె నామీఁద
వెనక మీరెమన్నా వినఁబొయ్యేనా

చ. 3: మాటలు విసుకఁబోతే మాపుదాఁకా మెత్తనౌనా
పూఁట పూఁట నాకేల బుద్ధిచెప్పేరే
యీటులేని శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
మేటుల నేఁడిఁకనేల మీరే నేఁగానా

రేకు: 0971-4 పాడి సం: 19-411

పల్లవి: రమ్మనవే చెలువుని రస్స మమ్ముఁ జేయనేల
తమ్మిపువ్వులవాట్లు దాఁకుదాఁకానా

చ. 1: గక్కనఁ జూచినంతనే కన్నులనే పెండ్లాయ
వెక్కసపు తలఁబాలు వేగినంతానా
పక్కన నవ్వినంతనే పాలకూళ్లు సెలవాయ
మక్కువతో బువ్వములు మాపుదాఁకానా

చ. 2: తొలుతటిసిగ్గులె దొడ్డ తెరమఱఁగాయ
వలిపెపు తెరమాటు వడి వింకానా
సొలపులమాటలవే సోబాన పాటలాయ
చలివాసె పేరటాండ్ల సంద డింకానా

చ. 3: పైనొరగినప్పుడే పరవని పరపాయ
నానఁబెట్టి నాగవల్లి నాఁటిదాఁకానా
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
మేనిలోని సంతసాలు మెచ్చుదాఁకాఁనా

రేకు: 0971-5 వరాళి సం: 19-412

పల్లవి: నేరుపరి వౌదువే నీడకు రావే నాకుఁ
దారుకాణలాయ నిఁక తప్పులేలే

చ. 1: కిన్నెరమీట్లలోని గిలిగింతలూ నీ-
సన్నలచాయలలోని చలివేండ్లు
వన్నెలకాఁకలమేనివసివాడుల నే-
మిన్నిటికి లోనైతి మిఁకనేలే పనులు

చ. 2: జంకెనచూపులలోని సరిబేసులూ నీ-
తెంకులమాటలలోని తెల్లనల్లలు
కంకినగవులలోని కాయపండ్లు
మంకు లిన్నిటాఁ బడితి మరియేలే కతలు

చ. 3: అచ్చపు సిగ్గులలోని అంగభంగాల నీ-
అచ్చుపడ్డకాఁగిటిలో నరమఱలూ
తచ్చి శ్రీ వేంకటపతిఁ దగిలి నేఁగూడితిని
యెచ్చుకుందులెల్లాఁ గంటి నిపుడేలే బొంకులూ

రేకు: 0971-6 సామంతం సం: 19-413

పల్లవి: పంతము పాడియు నీభావములోనే కంటి
యెంతప్రియముచెప్పినా నిది మెచ్చుగాదురా

చ. 1: చిత్తములో తమకము చిఱుఁజెమటలఁ గంటి
కొత్తకొత్తనీపొందులు కొప్పుపువ్వులనే కంటి
తత్తరపునీగుణాలు తనుపులకలఁ గంటి
రుత్తమాట లేమన్నా రుచిగావు మానరా

చ. 2: కాఁకల నీవసివాడు కనుచూపులనే కంటి
వేఁకపునీయలపెల్లా వెడనిట్టూర్పులఁ గంటి
సోఁకుల నీవేడుకలు సొంపుఁ గళలనే కంటి
వూఁకొనేఁగాని నీసుద్దు లొడఁబాటు గావురా

చ. 3: నాటకపునీవిద్దె నగవులలోఁ గంటి
గాఁటపు నీవలపెల్లా కాఁగిటిలోన కంటి
పాటించి శ్రీ వేంకటేశ పై కొని నన్నుఁ గూడితి-
విటు రాఁదొల్లిటివలె నిందులోఁ జెల్లదురా

రేకు: 0972-1 బౌళి సం: 19-414

పల్లవి: నేనే యందుకు రానటరా
పోనీపోనీ యింతసేసి వట్టిపొందులనే నిందవేసితి
అట్టేకానీకానీ శ్రీవేంకటరాయా

చ. 1: చెలులతో నిన్నుమాపే చెప్పిపంపనా నీకు
యెలమి మాయింటికి నేలవచ్చితి కానుక లిచ్చితి
వేగిరించితి శ్రీవేంకటరాయా

చ. 2: నెప్పున మేడపై నీకు నిక్కి సన్న సేయనా
యిప్పుడే చన్నుపట్టేవు యేమిరా నీవే
నేమురా బలిమేలరా శ్రీవేంకటరాయా

చ. 3: నిచ్చలు మాచన వొలినిలయా నేఁ గోరఁగానే
మెచ్చుగా నన్నుఁ గూడి మేలమాడితి
మేలుమేలురా శ్రీవేంకటరాయా

రేకు: 0972-2 అహిరి సం: 19-415

పల్లవి: కోపగించుకొన నోప గొరబూ నోప
తీపుల మీఁదటియెత్తు తెలిసేగాని

చ. 1: చెలుల దూరగనోప చిల్లరవాదుల కోప
చలపట్టి పతితోడ జంకించనోప
అలిగి పానుపుమీఁద నవ్వలిమోమై యుండఁగఁ
గలిగినపాటే మేలు కనుకొనేఁగాని

చ. 2: దైవము దూరఁగ నోప తమకించి పడనోప
మోవనాడేవెంగెములు మొదల నోప
చేవదేరేచింతతోడ చెక్కుచేత నుండఁగాను
కావలసినపనులు కనుకొనేఁగాని

చ. 3: పంతము లియ్యఁగ నోప బచ్చెనమాటల కోప
వంతువాసులకు నోప వరుస లోప
ఇంతటి శ్రీ వేంకటేశుఁడిట్టు నన్నుఁగూడె నేఁడు
కాంతుఁడితనితలఁపు కనుకొనేఁగాని

రేకు: 0972-3 సాళంగం సం: 19-416

పల్లవి: వద్దువద్దు దోసమూ వానిగాడు నీకు నాకు
అద్దో తొలఁగుబావ వంటుకోకువయ్యా

చ. 1: యేమి సేసేవోయంటా నిటు నన్నుఁ జూడనంపె
దీమసపు నీతలఁపు తెలియ నంపె
వాములై న నీలోనివలపులు రేచఁగ నంపె
కామించి నీవేల నన్నుఁ గాఁగిలించేవయ్యా

చ. 2: ఇందుకే విచ్చేనేవంటా నెదురుగా నన్నంపె
కందువ నీనేరుపెల్లాఁ గనుకో నంపె
చందమామ గుటుకలు చవులచూడఁగ నంపె
యిందులోనే నీవు నాతో నేల నవ్వేవయ్యా

చ. 3: చేరువకు వచ్చి నిన్నుఁ జెలి యచ్చరించ నంపె
బీరాన నాచేత నిన్నుఁ బిలువ నంపె
యీరీతి శ్రీ వేంకటేశ యీడ నన్నుఁ గూడి యాకెఁ
గూరిమిఁ గూడితి విట్టె కొత్త యేఁటిదయ్యా

రేకు: 0972-4 భైరవి సం: 19-417

పల్లవి: ఎంత నమ్మనిదానవు యేమే నీవు
చింతతోఁ బగచాటేవు చెల్లఁబో నీవు

చ. 1: జమళిమోహాలు మనసరుసనే వుండఁగాను
తమకించి మాటలాడఁ దగవా నీవు
చెమటకాఁగిలి మనచేతులలో నుండఁగాను
అమరనివెంగెమాడే వౌనే నీవు

చ. 2: నూఁటినమోవులు మననోళ్ళలో నుండఁగాను
యేఁటికిఁ గొసరఁ జొచ్చే వేమే నీవు
కూటములు చెక్కులపై గుఱుతులై వుండఁగాను
పాటించి యేడవోయంటా భ్రమసేవే నీవు

చ. 3: బచ్చనరతులు మనపానుపుపై నుండఁగాను
ఇచ్చగించి మఱచేవు యేమే నీవు
పచ్చిగా శ్రీ వేంకటాద్రినతి నేఁగూడితి నిన్ను
మెచ్చితి మొకరొకరి మేలే నీవు

రేకు: 0972-5 పాడి సం: 19-418

పల్లవి: ఊరకుండేవో లేదో వోసి చెంచెతా ! వోరి
కోరి నిన్ను నెంచుకొంటి గొల్లఁడవుగదరా

చ. 1: జమళిపీకిలిదండ సరి నీకేలే
నెమలిచుంగులపాగా నీకేలేరా
అమరెనే సంకుఁగడె ముందుకుఁ దోడు
భ్రమసి నీవేల గుల్ల పట్టుకున్నాఁడవురా

చ. 2: పలుమెకాలవెంటను పారేవేలే ! నీవు
యెలమిఁ బులుగునేల యెక్కితివిరా
పలచని పారెటాకు పయ్యదేఁటికే
అల మట్టేకుపానుపు అది నీకు నేలరా

చ. 3: కాకిపైఁడిబొట్టు నీకుఁ గడుప్రియమా
ఆకుఁ దొలసిదండ నీకది బాఁతొ
కైకొంటి శ్రీ వేంకటాద్రిఘనుఁడ నిన్ను-
నేకమైతిఁ గదరా నీయిందిరాదేవిని

రేకు: 0972-6 నాగవరాళి సం: 19-419

పల్లవి: ఆడా నీడా నదివో రమణుఁడు
వేడుకలు రేఁచీ వింటి నేననవే

చ. 1: కానీకానీ కసుగాటుమాఁటలు
నానఁబెట్టీని నాతోను
రానీపోనీ రాజస మెంతైనా
మానఁడెంతయినా మఱవకుమనవే

చ. 2: మేలుమేలు మేనరికమే నాకుఁ
జాలాఁ గట్టెను సరసానకు
మూలమూలా ముసిముసినవ్వులు
చాలుకొనెనట సరిదాఁకెననవే

చ. 3: నవ్వి నవ్వి నను శ్రీ వేంకటపతి
జవ్వనము రేఁచి సరిఁగూడెను
దవ్వులటు మాని దగ్గరి నా వద్దఁ
బవ్వళించెను పదరకుమనవే

రేకు: 0973-1 లలిత సం: 19-420

పల్లవి: వీడెపుఁ బెదవితోడి విట్ఠలేశుఁడు
వేడుకలే పచరించీ విట్ఠలేశుఁడు

చ. 1: నిలుచున్నాఁ డలవాఁడు నిక్కి నామోము చూచి
వెలుపల సన్న సేసె విట్ఠలేశుఁడు
సెలవుల నవ్వి చెలితోడ మాటలాడి
వెలుగొందీ సొమ్ములతో విట్ఠలేశుఁడు

చ. 2: కన్నులచే మెచ్చుమెచ్చి కందువకుఁజేయిచాఁచి
విన్నపము లడిగీని విట్ఠలేశుఁడు
తన్నుఁ దానె విఱ్ఱవీఁగీ తన మీఁద నానవెట్టీ
వెన్నతిన్ననోరితోడి విట్ఠలేశుఁడు

చ. 3: బడిబడినే వచ్చి పై కొని నన్నుఁగూడి
విడువఁడు నాచెఱఁగు విట్ఠలేశుఁడు
కడుఁగడుఁ దమకించీ కప్పురమే చేతికిచ్చి
వెడఁగు శ్రీ వేంకటాద్రిం విట్ఠలేశుఁడు

రేకు: 0973-2 వంతవరాళి సం: 19-421

పల్లవి: చెప్పితే నారచికత చెప్పకుండితే వెత
దప్పకి నీరే మందు తలపోయఁగదరే

చ. 1: చిగురులోపలిచేఁగ చెప్పరే మీరు
నిగురులోపలి నిప్పు నిలుపరాదె
పగలు చీఁకటి గమ్మి పాయ దెంతైనా
తెగరానిచోట తరితీపులమందేదే

చ. 2: ఆకాశపంచాంగము అందుకుఁ బేరేదే
రాకపోకజగడము రాఁజీనదే
వాకునిష్టూరాలు వచ్చి వసముగా దెంతయినా
యేకచిత్తమైన మందు యెన్నఁ డిచ్చేరే

చ. 3: వాన లేని చిత్తడికి వైపు లీఁకఁ జూచుకోరే
కానరాని గుఱుతులు కాఁడిపారెనే
ఆనుక శ్రీ వేంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
వీనుల వినేమందు వేధించె దేహము

రేకు: 0973-3 ఆహిరి సం: 19-422

పల్లవి: చేసేనా వినయములు చేకొంట గాక
ఆసలే కాఁకరేఁచితే అందుకేమి సేతమే

చ. 1: చెక్కు నొక్కఁబోఁగాను చేతిగోరు దాఁకె నింతే
వెక్కసాన విదిలించి వేసేవేమే
పక్కన విందువెట్టి పలురుచులు సేయఁగా
నక్కడాఁ గరఁగదు అందుకేమి సేతమే

చ. 2: సరసమాడఁబోఁగా చన్నులు బయటఁబడె
యిరవై యిందుకేల యీసడించేవే
గరిమ సొమ్ములు నీకుఁ గడుఁగడుఁ బెట్టఁగాను
అరగొరవైతయ్యైతే నందుకేమి సేతమే

చ. 3: పొంది కొంగువట్టఁ బోఁగా పోఁకముడి వీడె నింతే
చిందువంద్రై ఇందుకేల సిగ్గువడేవే
కందువ శ్రీ వేంకటాద్రి ఘనుఁడ నేఁ గలసితి
అందుపుటాయాలు సోఁకె నందకేమి సేతమే

రేకు:	0973-4 దేసాళం సం:	19-423

పల్లవి: ఊరకే గడించుకోనీ నొకటొకటే తాను
రారమ్మని పిలువఁగ రానైతినా

చ. 1: పట్టినచలముతోడఁ బదరవద్దంటిఁ గాక
యిట్టె మోవి యడిగితే నియ్యనంటినా
దిట్టతనానఁ బయ్యద తియ్యకుమనంటిఁ గాక
నట్టుకొట్టి తనతో నవ్వనంటినా

చ. 2: పల్లదపుమాటలకుఁ బగచాటితిఁగాక
చెల్లఁబోఁతాఁ జెప్పినట్టు సేయనైతినా
వొల్లకొల్లకుండఁగానే వొడఁబడనైతిఁ గాక
తొల్లింటివలెనే అఇతే తుదకెక్కనా

చ. 3: పయ్యదకొంగు దియ్యఁగా బలిమిచూపితిఁ గాక
వొయ్యనే రతులకు నోపనంటినా
యియ్యెడ శ్రీ వేంకటేశుఁడింతసేసి కూడెఁగాక
నెయ్యమున నపుడే నేఁ దనుఁ బిలువనా

రేకు: 0973-5 సౌరాష్ట్రం సం: 19-424

పల్లవి: తనజాడ లేలమాను తానే తాను
నవిచియున్నాఁడే నాకు నాటకీఁడే తాను

చ. 1: రాతిరెల్లా వద్దనుండె రవ్వగా నవ్వుచునుండె
అతల నప్పుడే మాటలాడినే తాను
చేతికిలోనాయనంటా సేస నాపైఁ బెట్టెనంటా
కాఁతరించి వుండఁగాను కాఁకచల్లీఁదాను

చ. 2: కొప్పు కొనగోర దువ్వె కూరిమితో బుజ్జగించె-
అప్పుడే పరాకయ్యీ నదేమే తాను
కప్పుర మిచ్చినందుకు కాంతలు చెప్పినందుకు
నెప్పున నేఁ జెనకఁగ నిద్దిరించీఁ దాను

చ. 3: కాఁగిట నిట్టె కూడె కడునలయుచు వాడె
మూఁగినమోహన నాకు మొక్కీనే తాను
కాఁగి భూపతిచెరువుకాడ శ్రీ వేంకటేశుఁడు
వీఁగకుండ రతి నిన్ను వెలయించెఁ దాను

రేకు: 0973-6 గుండక్రియ సం: 19-425

పల్లవి: సిగ్గులు సింగారాలు చెల్లునే నీకు
నిగ్గులు నీడలు మాతో నెరపఁగఁజెల్లునే

చ. 1: వుక్కున నీరమణుఁడు వొత్తిన రేకలు దాఁచ
చెక్కుమీఁదాచేయి నీకు చెల్లునే నేఁడు
పెక్కుటధర పానవు పెదవి చొప్పులు మాప
ముక్కుమీఁది వేలు నేఁడు మోప నీకుఁ జెల్లునే

చ. 2: పొంది నీమేనిమీఁది పులకలన్నియు దాఁచ
చెందినపయ్యద కప్పు చెల్లునే నీకు
కందువ నీసమరతి కళలు మొరఁగుటకు
చిందేముసిముసినవ్వు చెల్లునే నీకు

చ. 3: అంగపు కాఁగిటిలోఅలపు లన్నియు దాఁచ
సింగారపు తోఁట కేఁగఁజెల్లునే నీకు
రంగగు శ్రీ వేంకటాద్రిరాయఁడు నిన్నుఁగూడె
ముంగురులు జారినవి ముడువఁగఁజెల్లునే

రేకు: 0974-1 ముఖారి సం: 19-426

పల్లవి: కానీకానీ ఇప్పుడేల కదుఁబంతాలు
తాను నేనుఁ గూడితేఁగా తలపోతలు

చ. 1: చెక్కుచెక్కుఁ గదియించి చేయిఁజేయి బిగియించి
అక్కడగా నీతో నామాటలు
పుక్కిటితమ్ముల మిడి బుజాన గడ్డమానించి
చిక్కించుకొన్నపుడు గా సేసేచేఁతలు

చ. 2: పాదము పాదానఁదొక్కి పానుపు పైఁ బవ్వళించి
పాదుకొన్నప్పుడుగా నాబలిమెల్లాను
పోదిగాఁ జన్నులు మోపి పులకలు మేన రేఁచి
ఆదెస నింతేకా నెయ్యపు నవ్వులు

చ. 3: కాయముఁ గాయము మోపి కమ్మరనే మోవిఇచ్చి
యీయెడ నింతేకా నా ఇంపుసొంపులు
పాయపు శ్రీ వేంకటాద్రిపతి నన్ను నిదె కూడె
చాయల నీమీఁదఁగా నాసరసములు

రేకు: 0974-2 సామంతం సం: 19-427

పల్లవి: చెయ్యి ముంచినవానికి చెప్పితే రోఁత
తియ్యనినోరఁ జేఁదు తెగి నంజేనా

చ. 1: కూర వండి కస వేరఁగూడదు నాకు నయితే
యేరా నిన్నుఁ గూడి యింకా నెగ్గుపట్టేనా
నీరువంక తుంగవంటి నీమనసెందుండినాను
ఆరయఁగ నేనింక నడ్డపెట్టేనా

చ. 2: గోడఁబూసిన సున్నము కూడపెట్ట నేరనోప
అడుకోలు మాటదప్పెనని యెంచేనా
జీడిపంటిగింజ వంటి చెంగియుండె నీగుణము
కోడెమారకునికత్తికి గురిసేసేనా

చ. 3: వెన్నచేతఁబట్టి నేయి వెదక నేఁజాలఁగాక
నన్ను నీవు గూడుండఁగ నవ్వకుండేనా
ఇన్నిటాను శ్రీ వేంకటేశ నీకు నాకు నొక్క-
పన్నుగడ దైవ మిచ్చె పచ్చిసేసేనా

రేకు: 0974-3 బౌళి సం: 19-428

పల్లవి: అప్పుడు గాని కానరా దాయములుఁ బాయములు
రెప్పలెత్తి చూడఁగానే రేసు లింకా నేలరా

చ. 1: వచ్చివచ్చి మామీఁద వలుపే చల్లేవుగాని
చొచ్చి నారతిఁ జెనకి చూడలేలరా
మచ్చికల నాలోనిమనసే చూచేవుగాని
ముచ్చట నీతేనేగారేమోవి ఇయ్యవేలరా

చ. 2: మాటకు మునుపనే మందులు నూరేవుగాని
గాఁటపుగుబ్బలకు దగ్గరవేలరా
చీటికి మాటికి నాతో సిగ్గులే పడేవుగాని
నాటని సెలవులను నవ్వ వింక నేలరా

చ. 3: చట్టనికాఁగిటిలోన చవులే చెప్పేవుగాని
అల్లిబిల్లి తగుఁదగదన వేలరా
యెల్లగా శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
బల్లిదఁడు నిమిషముఁ బాయ వీఁక నేలరా

రేకు: 0974-4 సామంతం సం: 19-429

పల్లవి: ఇంత నీకు వెఱుపేల ఇద్దరిఁగన్నులఁ గంటి
యెంతైనా నీహితవే ఇటు నాహితవురా

చ. 1: యెవ్వతెకు నీవు మోహించి వుండినాను
నివ్వటిల్ల నాకె నాకు నీమాదే
జవ్వనియెవ్వతెతోడ సారె నీవు నవ్వినాను
నవ్వుగాదు అది నీవు నాతో నవ్వుతరా

చ. 2: ఇద్దరు మీ రేకతాన నేమి మాటలాడుకొన్నా
ముద్దుల నవి నాతోడి ముచ్చటలురా
గద్దించి యెవ్వతె నిన్నుఁ గాగిలించుకొన్నాను
కొద్దిమీరినట్టివే నాకూటములురా

చ. 3: చెక్కునొక్కి యెవ్వతైనాఁ జేఁత నిన్నుఁజేసినాను
అక్కరతో నాచేఁత లవియెల్లారా
ఇక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
నిక్కముగ వారెల్లా నే నొకతెనేరా

రేకు: 0974-5 శంకరాభరణం సం: 19-430

పల్లవి: సరిమోహ లిద్దరికి సాటికిఁ బెనఁగఁ జొచ్చె
వరుసతో జవ్వనము వావెరుఁగునా

చ. 1: పొంచి నీతో నవ్వఁబోతే పోఁకముడి నాకు జారీ
నించి యంతలోఁ జెమట నీకుఁ గారీని
పంచలఁ జెలులివి చూచి పకపక నవ్వేరు
చించుకొని వలపులు సిగ్గెరుఁగునా

చ. 2: మాట నీతో నాడఁబోతే మర్మములు గరఁగె నాకు
గాఁటమై నీకంతలోనే గరుపారెను
తేటతెల్లమాయనంటా తెఱవ లాడుకొనేరు
వాఁటమైన మనసిది వాసెఱుఁగునా

చ. 3: కాఁగిట నిన్నుఁ గూడఁగా కళదాఁకె నాకు నేఁడు
మూఁగిన పరవశాలు ముంచె నీకును
చేఁగదేరఁ గూడితిమి శ్రీ వేంకటేశ మనము
దాఁగరాని రతులివి తతెఱుఁగునా

రేకు: 0974-6 సామంతం సం: 19-431

పల్లవి: కై కొనఁగవచ్చుఁగాని కడమవెట్టఁగరాదు
దీకొని యిన్నియుఁ దానే తెలుసుకొమ్మనవే

చ. 1: పొందుసేయఁగవచ్చుఁగాని పురివిచ్చి పాయరాదు
అందునుండే యెడమాట లాడుటేచాలు
అంది నవ్వవచ్చుఁ గాని ఆఁపరాదు తమకము
చందమామగుటుకలే చాలుఁజాలుననవే

చ. 2: కన్నులఁజూడఁగవచ్చు కాఁకలఁ బొరలరాదు
విన్నవినుకులలోనివేడుకే చాలు
మన్ననఁ బొందఁగవచ్చు మరితీలుపడరాదు
సన్నలచాయలనుంటే జాణతనమనవే

చ. 3: చిత్త మియ్యఁగవచ్చుఁగాని సిగ్గునఁబడఁగరాదు
పొత్తులవలపు తోడిభోగమే చాలు
యిత్తల శ్రీ వేంకటేశుఁడింతలోనె నన్నుఁ గూడె
కొత్తలాయ నిన్నియును గుఱుతాయననవే

రేకు: 0975-1 భైరవి సం: 19-432

పల్లవి: నీవూఁబోయి వెదకరా నిలుచుండనేల యీాడ
తేవల నామాట గల్లితే మఱిరారా

చ. 1: చెప్పేరా నీకొకసుద్ది చెవులపండుగఁగాను
ఇప్పుడొకతె వెదకె నిందాఁకా నిన్ను
వొప్పుగు దోమతెరలో నున్నదో కాక నీ-
చప్పురమాళిగెలోన సరి నొంటి నున్నదో

చ. 2: ఇచ్చేరా నీకొక మేలు ఇదివో వొకతె వచ్చి
గచ్చుల నీపేరఁ గమ్మ గట్టిపోయను
మెచ్చులనీమాణికాల మేడపై నెక్కున్నదో
ముచ్చటసింగారవనములోన నున్నదో

చ. 3: అంటెరా పాదములు ఆకె నీవురముమీఁద
సొంటులు సోదించ వచ్చి చొచ్చేంటాను
నంటు సేసి యప్పటివి నన్నుఁ గూడితివి నేఁడు
దంటవు శ్రీ వేంకటేశ తా నిన్ను నేమన్నదో

రేకు: 0975-2 పాడి సం: 19-433

పల్లవి: ఒకటొకటికి మాట వొనగూడెనే
వొకటి కినుమడౌరా వుప్పాలికితేను

చ. 1: మఱచితినే మేను మంచినీమాటలకే
మఱవక బోయపగా మముబోఁటికి
కరఁగెనే నామనసు కాయము నిన్నుసోఁకితే
కరఁగఁ గరఁగ వన్నె కనకమౌఁ గదరా

చ. 2: విడువఁజిమ్మీ నీవేడుకపొందు
విడువ ముడువ నేమి విసమా ఇది
కడిగినట్టు చెమట గారె నామేను
కడుగఁగడుగ రొంపి కడచోట నీకు

చ. 3: చిగిరించెఁ బులకలు చెక్కుల నాకు
చిగురుఁగొమ్మ చేఁగె చెప్పితే నిన్ను
తగిలితి శ్రీ వేంకటోత్తముఁడ నిన్ను
తగులువిరికూటములు తార్కాణ నాకు

రేకు: 0975-3 శంకరాభరణం సం: 19-434

పల్లవి: మించి యెప్పుడును నేము మీవారమే
కంచపుపొత్తు గలసి కసిగాటులేఁటికే

చ. 1: చిక్కని వెన్నెలతేట చిందీ సెలవులను
చెక్కుమీఁది చేయేల చెలియ నీకు
మొక్కళపుఁ దమ్మిదలు మూఁగీఁ గన్నులతుద
ముక్కునఁ గోపములేలే ముట్టినంతలోననే

చ. 2: పూఁపలుఁ బిందెలు నట్టెపొడమెఁ బయ్యదలోన
కై పుసేసీ నీనడుమఁ గరసేఁటికే
పైపైఁ బదారువన్నెపసిఁడిపొడి రాలీని
కోపపుగుంపెనలేలే కొంగు వట్టితేను

చ. 3: నిలువు నూరుఁ బండీని నిచ్చలు నీసింగారాలు
తలకొన సిగ్గులలో దాఁగేవేలే
యెలమితో శ్రీ వేంకటేశుఁడ కూడితి నిన్ను-
నలివేణి మఱపేలే ఆయ మంటితేను

రేకు: 0975-4 లలిత సం: 19-435

పల్లవి: పెళ్ళిచెట్టు మందుగాదు పెద్దకొండ లెక్కి తెచ్చే-
నెల్లిచెట్టు చవిగాక నేమేల నీకు

చ. 1: చెచ్చెరఁ బోరువెట్టిన సితకమ్మ వుండఁగాను
నిచ్చలుఁబ్రియముచెప్పేనేమేల నీకు
చొొచ్చి వలచివచ్చిన సుప్పనాతి వుండఁగాను
నెచ్చలినై పాయకుండేనేమేల నీకు

చ. 2: పట్టితెచ్చినచెరలు పదారువే లుండఁగాను
నిట్టిపిడి మేనదాన నేనేల నీకు
గుట్టున వెలవెట్టనిగోపసతు లుండఁగాను
నెట్టన వుంకువగొన్న నేమేల నీకు

చ. 3: బూతమాటలకుఁ జిక్కి పురసతు లుండఁగాను
నీతితో బుద్దులుచెప్పనేమేలు నీకు
యీతల శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నీతోఁ గాదనఁబోతే నేమేల నీకు

రేకు: 0975-5 పళవంజరం సం: 19-436

పల్లవి: ఏలే నిష్ఠూరము లింత యేమిగట్టుకొంటి విందు
గాలిఁబోయేవాసనలు గంటుగట్టె నందురా

చ. 1: అన్నువ నీమోము చూపి అంతలోనే దాఁచేవేమే
పున్నమ చందురుఁడైనా పొడొకరాత్రి
తిన్నని గుబ్బలకు నాదిష్టి దాఁకెనంటాఁ గప్పి
యెన్నఁగ దిక్కులఁ గొండ కెండదాఁకీ నందురా

చ. 2: నవ్వునవ్వి కొంతగొంత నాతో దాఁచే విదియేమే
పువ్వువంటివెన్నెలైనాఁ బోదొకవేళ
జవ్వనముపైరు విత్తి చాఁచి చేయిదీసేవేమే
మువ్వానఁ బారిననీరు మగుడించే నందురా

చ. 3: కోరి నాతో వచ్చేనని కొంకి ఇట్టేబొంకితివి
ఆరునెల్లు గోయిల కూఁతైన నిజము
వేరులేక శ్రీవేంకటవిభుఁడ నేఁ గూడితిని
నారువోసి వలపులు నాటుకొనె నందురా

రేకు: 0975-6 లలిత సం: 19-437

పల్లవి: చేతికిలోనై నపతిఁ జేసుకొందుఁగాక
ఆతలివారిమాటల కానవెట్టనేలే

చ. 1: అంది మాటాడకతొల్లె అవుఁగాములు చెల్లుఁగాక
అందముగాఁగూడి విడనాడఁగనేలే
పందెములాడకతొల్లే బలుములు చెల్లుఁగాక
నిందమోపి యాతనినే నేరమెంచనేలే

చ. 2: చేయిమోపకతొలుతే సిగ్గువడఁ జెల్లుఁగాక
కాయము లంటినమీఁదఁ గడమలేలే
రాయడి దవ్వులనుండే రాజసాలు చెల్లుఁగాక
యీయెడ మోమోము చూచి యెడమాఁటలేలే

చ. 3: కొత్తవలపుల కెల్ల గురుతులు చెల్లుఁగాక
హత్తి ననుపైనమీఁద నాసుద్దులేలే
యెత్తుక శ్రీ వేంకటేశుఁ డింతచేసి నిన్నుఁ గూడె
పొత్తుగూడినమీఁదట బొరపొచ్చమేలే

రేకు: 0976-1 కన్నడగౌళ సం: 19-438

పల్లవి: ఇంకనేల మారుమాట లింతితోను
లంకె చేసుకొనె చెలి లావులకే పెనఁగి

చ. 1: మాటల తేనెలతీపు మరిగి నిన్నుఁ
గాటుల కన్నులఁ జూచీ కలికి
పాటించి నీనవ్వులకే భ్రమసి అట్టె
నాటించె గుబ్బల నిన్ను ననుపుతోఁగదిసి

చ. 2: తత్తరాన నీమన్నన దలఁచి
హత్తి చేతులెత్తి మొక్కీ నతివ
వొత్తిన నీ కొనగోరి కులికి
గుత్తపు నీకొంగువట్టె కొంత గొంత కరఁగి

చ. 3: తెల్లమి నీరతులెల్లాఁ దెలిసి
వుల్లము నీకొప్పగించె నువిద
కొల్లగా శ్రీవేంకటేశ కూడితివి యీకె
పల్లదాన నిన్నుఁగూడె బాసగొనెఁ గొసరి

రేకు: 0976-2 సామంతం సం: 19-439

పల్లవి: తనకే సంతోమైతే దప్పితో నేనుండరాదా
పొనిఁగి యెట్టుంటిమేమి పొమ్మనరాదా

చ. 1: రాకుంటేఁ దా మానెఁగాక రతిరాజుయేట్లకు
చేకొని ములుగరాదా సిగ్గులో నేము
ఆకెకే మోహించుఁగాక ఆపసోపపుఁ దాపాన
చీకాకుపడి నాలోఁజిన్నఁబోరాదా

చ. 2: పవ్వళించుఁగాక తాను పంచలనే కాచుకుండి
అవ్వల నాలో నుస్సురనఁగరాదా
దవ్వులైతే నాయఁగాక తలఁపులో తన్నుఁజూచి
పువ్వువంటి కోరికతో పొద్దుగడపరాదా

చ. 3: పరాకైతే నాయుఁగాక పట్టి తనకాఁగిటిలో
సరాగానఁ గూరిములు చల్లఁగరాదా
విరాళిఁ గూడెను శ్రీవేంకటేశుఁడిటు నన్ను
సురాళమైనరతిఁజోక్కి వుండరాదా

రేకు: 0976-3 సామంతం సం: 19-440

పల్లవి: మిక్కిలిపంతాలు నేఁడు మీతోనేలే
పక్కనఁ బైఁడమ్మ్ములిడఁ బారసేయవలెనా

చ. 1: ఆయలేరే యెడమాటలఁదరికిఁ జెప్పనోప
చేయిముం చాతనిఁ గంటేఁ జెప్పేలేరే
వేయకురే వొల నాపై వెన్నెలగలప్పుడే
ఆయెడ నల్లునేరేళ్ళనుట యెఱఁగరా

చ. 2: వింటిలేరే మీమాట వీనులు చౌరవు నాకు
అంటిముట్టి పతిఁ గంటే నడిగేఁబోరే
కంటకము లాడకురే గాలిగలయప్పుడే
తొంటిబాస వెళ్ళనాడి తూరుపెత్తే నిఁకను

చ. 3: వచ్చిఁ బిలువకురే వడి నిట్టే విచ్చేసితేఁ
గొచ్చి శ్రీవేంకటపతిఁగూడే నేను
విచ్చనవిడినే యేళ్ళవెనకవే చాళ్ళవుత
తచ్చితచ్చి కాఁగిటిలోఁదారుకాణ లాయను

రేకు: 0976-4 ఆహిరి సం: 19-441

పల్లవి: శిరసుండ మోకాల శేస యేఁటికి
సరసము లాకెపైనే చల్లరాదా నీవు

చ. 1: ఆకెతో మారుత్తరము లాడరాదా విచ్చేసి
పైకొని మమ్మేవొడఁబరచే వీడ
యీకడ మాకుఁ బ్రియము లేలచెప్పే వింతేసి
తూకొని మొక్కఁగరాదా తొయ్యలికే నీవు

చ. 2: అంగనతో వచ్చేనంటా నానవెట్టుక రారాదా
వుంగిటి మాతో వట్టివొట్లేఁటికి
సంగతి గాని మాతోడి జాణతనా లేమిటికి
కంగువాయఁ జెలితోనే కడునవ్వరాదా

చ. 3: వొక్కమారే ఆకెమీఁద నొరగుకొనఁగరాదా
వెక్కసాన మాపైఁ జేయివేయ నేఁటికి
ఇక్కువ శ్రీవేంకటేశ ఇంతి నేఁడు గూడితివి
పక్కన నెన్నఁడు నింకఁబాయకుండరాదా

రేకు: 0976-5 శ్రీరాగం సం: 19-442

పల్లవి: నాకుఁ జేసినదియెల్లా నడుమ నీదేకాదా
దాకొని యున్నయును నేఁడు తారుకాణలాయఁగా

చ. 1: కందువ నీవిరహగ్నిఁ గాఁగినట్టినా మేను
యిందు నీకాఁగిటికి నెక్కెఁగా నేఁడు
అంది కడువేఁడిగాఁగా నలిగి చూచినచూపు
సందడి నీకూటములో చల్లువెదలాయఁగా

చ. 2: తెగి నీతో వాదడచి తిట్టుకొన్నయీనోరే
నగి నీతో మాటలాడ ననుపాయఁగా
చిగురుచింతలచేఁ జెక్కుచేరిచిన చేయి
పగటున నేఁడు చెట్టపట్టఁగఁబాలాయఁగా

చ. 3: వడి నీవు పిలువఁగ వంచినట్టియీ శిరసు
అడరుమోవితేనియ లంది ఇచ్చెఁగా
యెడలేక శ్రీ వేంకటేశ నన్నుఁగూడితివి
విడువనిసిగ్గులెల్లా విడిపించితివిగా

రేకు: 0976-6 లలిత సం: 19-443

పల్లవి: ఏల రేఁచీ నన్ను నింత యేమనినా వెగటౌను
గాలి మూటగట్టఁబోతే కడునవ్వఁబాట్లు

చ. 1: మారుమాట లాడఁబోతే మనసునొచ్చీఁదనకు
కేరికేరి నవ్వఁబోతే కేరడమౌను
తారుకాణించఁగఁబోతే తనకుఁ గొరఁతవచ్చు
నేరనైతి నాఁడే నాఁడే నిజము నిష్ఠూరము

చ. 2: కనుఁగవ నవ్వఁబోతే కడువెంగెమౌఁదనకు
కొనగోర నంటఁబోతే కోపమునౌను
చనవునఁ దిట్టఁబోతే జగడాలు ముదురును
వినకున్నాఁజెప్పఁబోతే విందువెట్టీఁ బగలు

చ. 3: కదిసి మోవడిగితే గట్లు తనకు రాఁగు
పదరి కాఁగిలించితే పచ్చిదేరును
అదన శ్రీవేంకటేశుఁ డంగవించి నన్నుఁగూడె
అద నెరిఁగినయడు గడుగే నిక్షేపము

రేకు: 0977-1 రామక్రియ సం: 19-444

పల్లవి: చాయలసన్నలఁదన్ను సాదించనేలే
పోయినదే పొల్లుగాక పురివిచ్చ నేఁటికే

చ. 1: కాయమిది తనసొమ్ము కాఁకలే నాసొమ్ము
ఆయాలు మోవఁదన్ను నాడనేఁటికే
సేయరానిచేఁత చేసె చెక్కుచేయి నాకు వచ్చె
దాయగాఁడు తనతోడిదంటతన మేఁటికే

చ. 2: మనసెల్లాఁ దనసొమ్ము మచ్చికలే నాసొమ్ము
చెనకి తన్నంత రట్టుసేయ నేఁటికే
తనకే నిదుర యెచ్చె తగె నాకు జాగరాలు
ఘనుఁడు తన్నింక నే గద్దించఁగలనా

చ. 3: కాఁగిలిదె తనసొమ్ము కళదాఁకేది నాసొమ్ము
తోఁగి చూచి తనతోడి దొమ్ము లేఁటికే
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడిట్టె నన్నుఁగూడె
పొఁగితి నే నన్నిటాను పంతమాడ నేఁటికే

రేకు: 0977-2 తెలుఁగుకాంబోది సం: 19-445

పల్లవి: ఏల వట్టిజోలిసేసే వేమిగట్టుకొంటి విందు
కాలమందె యీమేలు గట్టుకొనరాదా

చ. 1: వండవండనల్లాయ వలచినతరితీపు
యెండమావులాయ నీపై నెచ్చిన యాస
వుండ దీయాసలఁ జెలి వొగి నే వచ్చినదాఁకా
అండనే ఇంకొకమాట ఆనతియ్యరాదా

చ. 2: పుచ్చుఁబుచ్చ పున్నమాయ పూఁచిననీసరసాలు
వచ్చీరానిపాటలాయ వట్టిప్రియాలు
ఇచ్చల నే వచ్చేనంటా నిందుకే కాచుకున్నది
అచ్చముగ నన్ను నాడ కంపివిడరాదా

చ. 3: వూరవూర నూటలాయ వొప్పగు నీమోవితేనె
చేరఁజేరఁజేరువాయ చెలికాఁగిలి
యీరీతి శ్రీవేంకటేశ ఇద్దరుఁ గూడితి రీడ
సారెకు నీపొందు లిట్టే జరపఁగరాదా

రేకు: 0977-3 అహిరి సం: 19-446

పల్లవి: ఇటు చేసినదేవర నేమని మెత్తు నే నిఁక
కటకటా నే నిందుకే కరఁగుదురా

చ. 1: తనువులే వేరులై తలఁపొక్కటైనమీఁద
ననిచి నిన్నేమనినా నన్ను నంటేపో
వెనుకొని నీవు రానివేళ గోపించఁబోతే
జునిగి నాగుండె నాకే చుఱుకనురా

చ. 2: వయసులు సమములై వావులు గూడినమీఁద
నయమై నీ మేలెల్లా నామేలే పో
ప్రియము చెప్పేవేళ పెనఁగఁగఁబోయి నేనే
దయదలఁచి నీమీఁదఁ దమకింతురా

చ. 3: కాఁకల నిందాఁకాఁ బొంది కాఁగిటఁ గూడినమీఁద
యేఁకట నీ కెంతగల్లా నిది నాదేపో
సోఁకుల శ్రీవేంకటేశ చొక్కించితివి నన్ను
వేఁకపు గుబ్బలముద్ర వేసితి నీపైరా

రేకు: 0977-4 మాళవశ్రీ సం: 19-447

పల్లవి: నీ వేమీ సేతువయ్య నేరమి నాదే కాక
కావిరి నాయాసలకుఁ గడమ లేదు

చ. 1: కొంతపడి నీరాక గోరుదు నీవు వచ్చితే
అంతమీఁద నీతో మాటలాడఁగోరుదు
చెంత మాటలఁ దనిసి చేయివేయఁ గోరుదు
దొంతుల నాయాసలకు తుద యెందు లేదు

చ. 2: ముచ్చట నొకవేళ నీమోము చూడవలె నందు
వచ్చి యామీఁద నీమోవి వలె నందును
కచ్చు పెట్టి రాఁగా రాఁగా గాఁగిలించవలెనందు
అచ్చపు నాయాసలకు నరకువే లేదు

చ. 3: మేనులంటినట్టిచోట మేలములే కొసరుదు
కోనల నప్పటి రతి గొసరుదును
కానీలే శ్రీవేంకటేశ కై కొని కూడితి నన్ను
మేనిలోనియాసలకు మితి మేర లేదు

రేకు: 0977-5 లలిత సం: 19-448

పల్లవి: ఇచ్చకమాడితే మీకు నేమిదోసమాయ నేఁడు
అచ్చమైనమీకు మాతో నంతచలమేలే

చ. 1: చెప్పకురే చెలులార చెలువుని మానుమని
అప్పుడే వీనులకు వెట్టయి తోఁచీని
తిప్పకురే నామనసు తెమ్మలుగా వలచితి
నెప్పున నేఁ బాయ వట్టినిష్టూరమేలే

చ. 2: తీయకురే చేయివట్టి తెగి వానింటికిఁబోఁగా
కాయమెల్ల నిందువంకఁ గాఁకరేఁగీని
పాయ మాతని కిచ్చితి పంతానకు దక్కితిని
యీయెడ వట్టికయ్యానకేల పెనఁగేరే

చ. 3: వుప్పతించకురే వానివద్ద నేఁ గూచుండఁగాను
రెప్పలఁ గోపము మీపై రేసులెక్కీని
వొప్పుగ శ్రీవేంకటేశుఁ డూరడించి నన్నుఁ గూడె
కప్పుర మియ్యరే మీలోఁ గడమ లింకేలే

రేకు: 0977-6 రామక్రియ సం: 19-449

పల్లవి: పొన్నలలో వేగెఁబొద్దు పోనీవే యింక
కన్నదే కంటి గురుమ కానీవే యింక

చ. 1: పంచించి యెందు వోయినా వచ్చీఁగానీ తా నీడకు
పొంచి యానలువెట్టక పోనీవే యింక
యెంచరాదు పంచరాదు యివే మింటిపై చుక్కలు
కంచు పెంచుమాటలాడీ కానీవే ఇంక

చ. 2: యీరీతి మాయింటిగుఱు తెఱఁగఁడా తానేమి
పోరి సారెఁ బిలువక పోనీవే యింక
నీరులేదు మేరులేదు నిండినయొండమావులు
కారపువలపు చల్లీఁ గానీవే యింక

చ. 3: యెందుండి వచ్చినారానీ యేమనినా నియ్యకొనే
పొందులెల్ల నొనగుడె పోనివే యింక
విందువలె శ్రీ వెంకటవిభుఁడు నన్నుఁ గలసె
కందుకుందులెల్లాఁ బాసె కానీవే ఇంక

రేకు: 0978-1 కాంబోది సం: 19-450

పల్లవి: పట్టకురా ముట్టకురా పసలేని పనులకు
యెట్టువలసినా వచ్చు నిదివో చేసన్నలు

చ. 1: అంతనవ్వు నవ్వకురా అలవాటయ్యీ నీకు
బంతినే రాఁగా రాఁగా భావము లౌను
రంతులు సేయకురా రచ్చకెక్కీఁ బనులెల్లా
ఇంతటిమీఁదటి పను లిపుడే చెప్పేను

చ. 2: నన్ను నంతమెచ్చకురా నాటకమే నిజమౌను
నిన్ను నన్ను నెంచుకొంటే నిక్కము లౌను
మిన్నక దగ్గరకురా మితిమీరుఁ దమకము
కన్నుసుద్ది చెప్పకున్న కడుఁగడుదోసము

చ. 3: వోరగండ్లఁ జూడకురా వుపమే నెపమౌను
సారెకు రతులమీఁద చలమెక్కును
యేరా శ్రీవేంకటేశ యింతలో నన్నుఁగూడితి
కోరిన కోరికలెల్లా గొఱఁత లేదిఁకను

రేకు: 0978-2 ఆహిరి సం: 19-451

పల్లవి: ఇదివో నావంక దప్పు ఇంతే మరేమీ లేదు
యెదురుగా బైకొన్న దిది నేరమాయను

చ. 1: వొంటిఁ దనతో వెంగె మొకమాటు నాడక
కంటగించి తా ముట్టితేఁ గసురుకొనక
దంటతనానఁ జెలులఁ దారుకాణ సేయక
ఇంటిలో నే నూరకున్న దిది నేరమాయనే

చ. 2: యెందువోయినా వెంట నింతుల నే నంపక
కందువ మైకాఁకలకుఁ గాఁతాళించి పడక
సందడించి వేగుదాఁకా జాగుల నే పెట్టక
ఇందు రమ్మని పిలుచు టిది నేరమాయనే

చ. 3: అట్టేకాఁగిలించరాఁగా నవ్వవిమోము గాక
వెట్టగా రతులఁ దన్ను వెస నలయించక
గట్టిగా శ్రీ వేంకటేశఁ గలసితి నీవేళ
ఇట్టె పైఁ గాలుమోఁచీ నిది నేరమాయను

రేకు: 0978-3 ఆహిరి సం: 19-452

పల్లవి: అడుగరే చెలులాల ఆతనినే యీమాట
యెడసీన విరహము యెవ్వరిదో కాని

చ. 1: చూపుల లోపలి యాస చూచుదాఁకా వేగిరము
యేపునఁ దనకు నాపై నెట్లోకాని
ఆపైఁ జన్నులయాస అంటుదాఁకా వేగిరము
వోపిక దనకుండునో వుండదోకాని

చ. 2: మనసు లోపలి యాస మాటాడుదాఁ కా వేగిర-
మెనలేనితనకిఁక నెట్లోకాని
తనువుమీఁదటి యాస దగ్గరుదాఁకా వేగిర-
మనుగు తనకు సమ్మతౌనో కాదో

చ. 3: కాఁగిటి యాస రెంటెము గప్పుదాఁకా వేగిరము
యేఁగివచ్చెఁ దనకైతే నెట్లోకాని
వీఁగక శ్రీ వేంకటాద్రి విభుఁడు నన్ను మన్నించె
చేఁగవేరె వలపులు సిగ్గులేవో కాని

రేకు: 0978-4 శంకరాభరణం సం: 19-453

పల్లవి: సరికి బేసికి మీరు చలము లింకానేలే
సరసములు విరసములు చౌకగదే ఇపుడు

చ. 1: మనసులోపలిగుట్టు మాటలలోపలిరట్టు
చనవుగలపతితోడ జరపఁదగునా
కొనచూపులో కొసరు గొణఁగులో నసురుసురు
మునుపనే పతికి పతి ముంచెఁగదె అతఁడు

చ. 2: సెలవిలోపలి నగవు చేసన్నలో బిగువు
పిలువఁగా బతితోడ పెంచఁదగునా
నిలువులో నివ్వెరగు నిండుఁజెమటకరఁగు
చలివాయ నీమీఁదఁ జల్లెఁగదె అతఁడు

చ. 3: వచ్చిదేరేటి యాస పదరి అడిగెడిబాస
ముచ్చట శ్రీవేంకటేశు ముంచఁదగునా
పెచ్చువెరిగేటి ప్రియము బిగువుఁ గాఁగిటినయము
నిచ్చలును నీమీఁద నెరపుఁగదె అతఁడు

రేకు: 0978-5 మాళవిగౌళ సం: 19-454

పల్లవి: అంపవయ్యా నేఁబోయే నట్టేని వావాత
తెంపున నాయంతనైతే తెగరాదు పనులు

చ. 1: కోపము గాదుగదా గొబ్బున నే వచ్చినది
ఆపెతో నీ వేకతము లాడేవేళ
చేపట్టి నేఁదొలఁగితే సిగ్గువుచ్చినట్టయ్యీ
యీపొద్దు నీవద్దనుంటే నేమౌనో నీయాస

చ. 2: యెగ్గు లెంచవుగదా ఇట్టె ముసుఁగు దీసితే
వొగ్గి ఆకెతోడిరతి నున్నవేళను
కగ్గి కమ్మరఁ గప్పితే కల్ల మోపినట్టయ్యీ
నిగ్గుల నే నూరకున్న నీ కెంతవెఱపో

చ. 3: నేరమి గాదుగదా నే నిన్నుఁ గాఁగిలించితి
నేరపున నాకెఁ గూడి నిద్రించేవేళ
యేరా శ్రీవేంకటేశ యెఱగఁనట్టె నన్ను
యీరీతిఁ గూడితివి నీ వికడి మోమగుచు

రేకు: 0978-6 పాడి సం: 19-455

పల్లవి: దూతికలకు నీతోఁ బొద్దులు వుచ్చఁదగునా
నీతిగాదు యీడనుంటే నింద వచ్చుఁజుమ్మీ

చ. 1: యేమని చెప్పుదు నేను యింతితో మారుమాటలు
నేమాన నన్ను నంపవు నీవును రావు
కోమలినే రమ్మందునో కొంత వోరుచుమందునో
జాముపోయె నంపరాదా చాలుఁజాలు తడవు

చ. 2: నేను వచ్చినపనికి నెలఁత కుత్తర మేది
పూని నాచేయి విడువవు పొందు గానము
నీనవ్వులు నెరుపేవో నిజమును నిట్లనో
కానీలే మమ్మంపరాదా కడుబలి మేఁటికి

చ. 3: అంతేకదా ఆపెతోడి ఆడుకోలుమాట నీకు
ఇంతివాకిట నిలిచే వేమో నవ్వేవు
పంతాన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
పొంతనే మమ్మంపరాదా పొసఁగె మాపనులు

రేకు: 0979-1 సాళంగనాట సం: 19-456

పల్లవి: నీ వెఱఁగవా యింత నిండుదొరవు
చేవలే చిగురలౌను సిగ్గుననుంటేను

చ. 1: అంటి విడె మిచ్చేవు అందుకొనకుండరాదు
వెంటనే పెండ్లికో వీడుకోలుకో
వొంటి నున్నదాన నేను వొకరు సాకిరి లేరు
ఇంటివా రేమందురో నే నియ్యకొంటేఁగనక

చ. 2: చెక్కు గోర నదిమేవు చేయివట్టి తోయరాదు
పక్కనఁ గూరిమికో పగసేసేవో
చిక్కితి నీపాల నేను చెప్పిచూప నెడలేదు
వొక్కట గురుతుపడి వూరకుండితేను

చ. 3: కాఁగిలించవచ్చేవు కాదని తొలఁగరాదు
ఆఁగినజెట్టిసామో అంగరతియో
మూఁగుచు శ్రీవేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
కాఁగి ఇఁకనేమన్నా కైతప్పులౌను

రేకు: 0979-2 సాళంగం సం: 19-457

పల్లవి: అళగరి చక్కనళగరి వోయళగరి
తలఁచుకోర నామాట తారుకాణసుమ్మీ

చ. 1: అలిగితేఁ బోనీదు ఆకెకు లోనైనమీఁద
వలపు రేఁపుచు నిన్ను వంచుఁగాని
పలుకక పోనీదు పక్కున నవ్వినమీఁద
సళువుఁజూపులు నీపైఁ జాఁచుఁగాని

చ. 2: చవులు చూపుకపోదు సరసమాడినమీఁద
చివురుఁగెమ్మోవి గంటిచేసుఁగాని
అవల మాటాడనీదు అతివఁ జేకొన్నమీఁద
తివిరి నీవెంటవెంటఁ దిరుగాడుఁగాని

చ. 3: నిన్ను మెచ్చించకపోదు నలఁతఁ గూడినమీఁద
కన్నులు దేలగిలంగఁ గరఁచుఁగాని
అన్నిటా శ్రీవేంకటాద్రి నళగుఁదిరుమలను
వన్నె నీపురుపుమీఁదఁ గాఁపురమౌఁగాని

రేకు: 0979-3 ఆహిరి సం: 19-458

పల్లవి: నే నొకటి సేయఁబోతే నేరుపు వేరొకటాయ
నానెను వలపులెల్లా నాఁడెనాఁడే అయ్యా

చ. 1: మొక్కఁబోఁగానేపో ముంచినపయ్యద జారె
గక్కన నీతోనవ్వఁగాఁ గారెఁ జెమట
వెక్కసాన మాటాడఁగా వేఁడినిట్టూర్పులు రేఁగె
యెక్కడిగొడవ మాఇంట నుండేనయ్యా

చ. 2: దగ్గరి రాఁగాఁబో తనువెల్లాఁ బులకించె
సిగ్గువడఁగానేపో చింతరేఁగెను
వొగ్గి విడె మియ్యఁగాఁబో వొడలెల్లాఁ గాఁక పుట్టె
యెగ్గుతప్పులకు నోప ఇంటనుండేనయ్యా

చ. 3: కాఁగిలించఁగానేపో కళదాఁకె మేనెల్లా
రాఁగుఁదమకానేపో రచ్చకెక్కెను
పాఁగిన శ్రీవేంకటేశ పైపైఁ గూడితి నిన్ను
యేఁగుఁబెండ్లితో మాయింట నుండేనయ్యా

రేకు: 0979-4 లలిత సం: 19-459

పల్లవి: ఆడకే నే వచ్చినప్పు డయ్యీఁగాని
బూడిద వసంతమాడఁ బొమ్మనవే వానిని

చ. 1: వలపు జాతెఱఁగదు వాసి నీతి యెఱఁగదు
కలిమి ముందువెనక గాననియ్యదు
తెలిసితేఁ బసలేదు దిష్టమాయ మాకిన్ని
పొలసి కొసరనేల పొమ్మనవే వానిని

చ. 2: కోపము దయయెఱఁగదు కూటమి సిగ్గెఱఁగదు
తీపులమోవి దప్పితీరనియ్యదు
రాఁపునేయఁ బనిలేదు రచ్చకెక్కఁ బనులెల్లా
పోపో అదేడసుద్ది పొమ్మనవే వానిని

చ. 3: పాయము భీతెఱఁగదు పంతము తన్నెఱఁగదు
చాయలసన్నలముద్దు చవెఱఁగదు
యీయెడ శ్రీవేంకటేశుఁ డిపు డిట్టె నన్నుఁ గూడె
పోయి ఇట్టేవచ్చీఁగాని పొమ్మనవే వానిని

రేకు: 0979-5 రామక్రియ సం: 19-460

పల్లవి: పాపామంటాఁ బాలిచ్చితేఁ బైపై నోలికింతలాయ
కోపము శాంతముతోడఁ గూడెఁగా నీచనవు

చ. 1: నిండినది నామనసు నీమేఁద నేపొద్దు
పండెను నాకెమ్మోవి పంటలుగాను
వండ వండనట్లాయ వలపులు నీకైతే
యెండలు నీడలు నాయ నిదివో నీకరుణ

చ. 2: ననిచెను నీచూపు నంటిననీమేనిమీఁద
మొనసెను నానవ్వు ముంచి నీతోను
పొనిఁగి పుచ్చఁగఁబుచ్చ వున్నమాయఁ బొద్దునీకు
ఇనుము బంగారమాయ నిదివో నీమాటలు

చ. 3: తతివచ్చె నాకు నీకు దగ్గరి కాఁగిటిలోన
ప్రతివచ్చె నిద్దరికిఁ బాయములివి
ఇతవైన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కతకుఁ గాళ్లువచ్చెఁ గలిగె నీమన్నన

రేకు: 0979-6 సామంతం సం: 19-461

పల్లవి: నీ వెఱఁగనిబుద్దులు నేము చెప్పేమా
భావమే యెరుఁగుఁగాన వచ్చిసేయఁగలమా

చ. 1: పూవువంటిది వయసు భోగించవలెఁగాక
చేవదేరే యీసిగ్గు చెల్లఁబోయెలే
మీవంటివారికా మీరరానివొట్లివి
దైవము దూరుతగాక తగదనఁగలమా

చ. 2: కప్పురమువంటి దిట్టె కలిగె నీమోహము
నిప్పువంటి విరహము నీకేలే
యిప్పుడిది వేళా ఇద్దరి యెగ్గులకును
చెప్పరాని చేఁత మీచేఁ జేయించఁగలమా

చ. 3: పండువంటిది మోవి పదరి చేకొంటగాక
కొండవంటిదికోపము చేకొన నీకేలే
అండనే శ్రీవేంకటేశు నలమి కూడితి విట్టె
మెండుననుండేటిమిమ్ము మొచ్చనైనఁగలమా

రేకు: 0980-1 బౌళి సం: 19-462

పల్లవి: ఏమని తా భావించునో యెరఁగ నేను
చీమకఁ దొంతరమేలు చిమ్మిరేఁగెననవే

చ. 1: అప్పుడే వచ్చేనంటి నటు నావిభునితోడ
అప్పన మెవ్వతుండునో యని మానితి
కప్పుర మంపేనంటిఁ గదియ నీవిరహన
వుప్పతిల్లుఁ దాపమంటా నూరకుంటివి

చ. 2: వీడేమిచ్చి యంపేనంటి వెలఁదిచేతఁ దనకు
ఆడ వేళదెలియక అంపనైతిని
వేడుక విరులబంతి వేసేనంటా నుంటి
ఆడ నవి మరునమ్ము లవునని మానితి

చ. 3: కాఁగిటఁ గూడినవేళఁ గళలు రేఁచేనంటి
మాఁగినరతుల నేనే మఱచితిని
చేఁగదేర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు వచ్చి
దాఁగనినవ్వులు నేనే తనమీఁదఁ జల్లితి

రేకు: 0980-2 శంకరాభరణం సం: 19-463

పల్లవి: ఒక్కటే విన్నపమిది వున్నవెల్లా నేమిటికి
పక్కన విచ్చేయు మా కాపని గాదుసుమ్మీ

చ. 1: తమకించినది చెలి తడవాయ నే వచ్చి
నిమిషము రాకున్న నీకే తెలుసు
చెమటలవెల్లి వారె చింతాజలధి నిండె
భ్రమసితి మిఁక మాకుఁ బనిగాదుసుమ్మీ

చ. 2: చూపుల నున్నది యాస సుదతిమనసు లేత
యేపాటి గలఁగినా నిఁక నేమౌనో
మోపులాయఁ గోరికలు ముక్కున నూర్పులు రేఁగె
పాపము పుణ్యము మా కాపని గాదుసుమ్మీ

చ. 3: దోమతెర మీకు మాటు తొయ్యలికి వినవచ్చు
యేమాటయిన నాడు ఇఁక మమ్మంపు
సామాన శ్రీవేంకటేశ సంధించి కూడితి విట్టె
భామ మెచ్చె నిఁక మా కాపని గాదుసుమ్మీ

రేకు: 0980-3 సామంతం సం: 19-464

పల్లవి: నిండెను కళలు సతినిలువెల్లను
పండినజవ్వన మేరుపరచేటిదెట్లో

చ. 1: చిత్తము చీఁకటివడె చెలి నిన్నుఁ బాయఁగాను
పొత్తులఁ జుక్కలుగాసెఁ బులకలను
బిత్తరపుమోనానఁ బికములు గూండ్లెక్కె
వుత్తలాన కాంత కొఁక నుదయమౌ టెపుడో

చ. 2: మెలుఁతకు కొప్పు వీడి మేఘములు ముంచుకొనె
జలజలఁ జెమటలజడి వట్టెను
కలువకన్నులు మంచికారుమెఱుఁగులు మించె
కిలకికి వెలుతురు గనియేది యెపుడో

చ. 3: పడఁతికి నీరాక పచ్చిగాలియై వీచె
చిడుముడిఁ గోరికలె చిగురించెను
యెడయక శ్రీవేంకటేశ ఇంతిఁ గూడితివి
కడఁగె వసంతవేళ కందువ యిఁకేదో

రేకు: 0980-4 పాడి సం: 19-465

పల్లవి: నిచ్చా జగడమేల నీ వెఱఁగవా
యిచ్చట నీమేన నవే యియ్యకోరాదా

చ. 1: తప్పునిబొంకనిమాఁట తలఁపు లోపలితీఁట
నెప్పున నే నాడనేల నీ వెఱఁగవా
కప్పురవిడెముకాఁక కమ్మఁబులకలమూఁక
చొప్పునవట్టిచ్చీ నద్దము చూచుకోరాదా

చ. 2: చుక్కలు నిండిమోవి సొలపుఁగన్నులకావి
నిక్కమౌత కల్లవుత నీవెఱఁగవా
ముక్కున నీబుసకొట్టు ముసిముసినవ్వులగుట్టు
దిక్కులవారి నడిగి తెలుసుకోరాదా

చ. 3: వుబ్బునఁజేసినచేఁత వొడలిపై గోరివాఁత
నిబ్బరపు రతివేళ నీవెఱఁగవా
గొబ్బున శ్రీవెంకటేశ కూడితివి నన్ను నిట్టె
తబ్బిబ్బు తడఁబాట్లు దాఁచుకోరాదా

రేకు: 0980-5 గౌళ సం: 19-466

పల్లవి: అసురుసురుల నీకు నలపేఁటికే
వసమై యతఁడు నీవద్ద నుండీఁగాక

చ. 1: యెలజవ్వనివి నీవు యేల చిన్నఁబోతివే
వలచినపతి నేఁడే వచ్చీఁగాక
నిలువునఁ దలవంచి నేలవ్రాఁత లేఁటికే
చెలువపునీచనవే చెల్లించీఁగాక

చ. 2: చెక్కుచేతితోడ వట్టి చింతఁ బొరల నేఁటికే
వొక్కటై పతిఁగూడి నీ వుండేవు గాక
ముక్కున వేలుమోపి మోనపువెర గేఁటికే
మిక్కిలి విభుఁడు నిన్నే మెప్పించీఁగాక

చ. 3: పచ్చికస్తూరి నుదుటఁ బట్టువెట్ట నేఁటికే
మచ్చిక నీరమణుఁడే మన్నించీఁ గాక
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నుఁ గూడె
యిచ్చట నొడఁబాటేనే యీడ నుండీఁగాక

రేకు: 0980-6 ముఖారి సం: 19-467

పల్లవి: కప్పురము దిననేల కడుఁజలిఁ బడనేల
అప్పటికి నాభాగ్య మంటి నంతె చాలును

చ. 1: వద్దువద్దు అంతలేసి వట్టి చనవులు మాకు
పెద్దరికముతో నుండేబిగువే చాలు
తిద్దనేల నీగుణాలు తిట్టించుకొననేల
అద్దో యీడ నుండఁగా నైనపాటే చాలును

చ. 2: ఆయ నాయ జాణతనా లంతేసి కోప నేను
చేయి చెక్కిటితో నుండేసిగ్గే చాలు
ఆయము లంటఁగనేల అద్దలింపించుకోనేల
చాయల సన్నలలోని సంతసమే చాలు

చ. 3: పట్టకు పట్టకు నీతో పంతము నెరపఁగనేర
గుట్టుతో నీసముకపుఁ గోలువే చాలు
యెట్టె శ్రీవేంకటేశ యిడె నన్నుఁ గూడితివి
జట్టిగొన్న నీ మోవిచవులే చాలును

రేకు: 0981-1 రామక్రియ సం: 19-468

పల్లవి: ఆతనిఁ గూడినప్పుడే అన్నియు సాదించవమ్మా
రాతిరాయ నీకనైనా రమ్మనవమ్మా

చ. 1: అంపినమాట కుత్తర మానతియ్యవమ్మా
వంపుమోముతో నలుక వలదమ్మా
పంపుడుచెలుల మింతే పలుక విదేమమ్మ
చెంప జారినతురుము చెరుగుకోవమ్మా

చ. 2: తమకించే పతితో నీతలఁపు లేమందుమమ్మ
కొమరుఁ జూపులలోన కోపమేలమ్మా
జమళి నిద్దరి కూడిగములవారమమ్మ
చెమరించే మేనెల్లాఁ జిన్నఁ బోకువమ్మా

చ. 3: యెదురుగా వచ్చు నాతఁ డిట్టె మమ్మంపవమ్మ
కదిసితి విఁత నీకుఁ గడుమేలమ్మా
యెదుట శ్రీవేంకటేశుఁ డేఁగివచ్చి నిన్నుఁ గూడె
వదలఁడు దిన మిట్టె వచ్చీ నోయమ్మా

రేకు: 0981-2 పాడి సం: 19-469

పల్లవి: గక్కున నింట లేనిది గానుగకాడ నున్నదా
నక్కువడ విందుకేపో నవ్వితి నే ననరే

చ. 1: తా నేడనుండిన నేమి తలఁ పొక్కటైనఁ జాలు
ఆనలు సత్యాలఁ జెప్పి యంపవలెనా
దానికే మెదురుమాట తనతో నే నాడేనా
మోనాన నిట్టె తనకు మొక్కితి నే ననరే

చ. 2: యేదిక్కు చూచిననేమి యీడకు విచ్చేసెఁ జాలు
యీదెస నొడఁబరచ నింతవలెనా
కాదని తనచేఁతలు ఖండించఁజెల్లునా
వాదు లడువక తలవంచితి నే ననరే

చ. 3: అసురుసు రై తేనేమి అట్టె నన్నుఁ గూడెఁ జాలు
వసమై నాకిఁక వెరవఁగవలెనా
యెసఁగి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను మన్నించె
రసికుఁడు తాను నారపమాయ ననరే

రేకు: 0981-3 ముఖారి సం: 19-470

పల్లవి: దగ్గరి కూడుటకంటె దవ్వులపొందే మేలు
సిగ్గుతో నున్నది చెలి చిత్త మిఁక ననవే

చ. 1: చి త్తమును నీరుచేసె చిగిరింపించెఁ గోరిక
వుత్తలపు విరహగ్ని వొప్పదా యేమి
హత్తి తనపొందైతే నంగనమర్మము గాఁడి
వత్తివలె వాడించె వడచల్లీ నిదివో

చ. 2: తలఁపించెఁ దనరూపు తమకము పెడరేఁచె
వొలసి చెక్కిటిచేయి వొప్పదా యేమి
బలిమిఁ దనకాఁగిలి పడఁతిని భ్రమయించి
నిలువెల్లా మఱపించె నేర మిందుఁ గలిగె

చ. 3: తఱవు రతికి రేఁచె తనువెల్లా నెచ్చరించె
వొఱపైనకొనగోరు వొప్పదా యేమి
గుఱి శ్రీవేంకటేశుఁడు కూడినకూటములయితే
మఱవనీక సతికి మరులాయ ననవే

రేకు: 0981-4 దేసాళం సం: 19-471

పల్లవి: కానమే నే మింత తాను కదిరికాఁడౌత
మోనాన నే నూరుకున్న మోముచూచీఁ దాను

చ. 1: నగుతా నేనొకమాట నాలో గొణఁగుకుంటే
తగిలి సూడకుఁ బాడు తానిదేమే
మొగి నాపుక్కిటితమ్మ ముందర నే నుమిసితే
జగడానకే వచ్చీ జాణఁడౌనే తాను

చ. 2: వీదిఁబోతా చమ్మాళిగె వెస నేఁ దాటించితేను
ఆదిగొని కొపగించీ నదేమే తాను
సేదదేరి బొమ్మలను చెలుల నే జింకించితే
పొదితో వహించుకుని పోరీనే తాను

చ. 3: కివిసి మాగోడండఁ గేకరించుకొంటేను
చెనకి నాకొంగువట్టీ చెల్లఁబో తాను
యెనసి శ్రీవేంకటేశుడఁ డేమీ ననకుండితేను
తనివితో ననుఁగూడె తలఁగఁడే తాను

రేకు: 0981-5 వరాళి సం: 19-472

పల్లవి: ఎంతచెప్పినా మాన విందాఁకా నేము
అంతలోఁ బెద్దరికములాయనా నేఁడు

చ. 1: చెక్కునొక్కి నేసవెట్టి చెలియ నీకాలు దొక్కి
తెక్కుల నీజగడాలు దీరెనా నేఁడు
చుక్కలు మోవిపై నాఁటె చొక్కపుగుబ్బలు మోపె
వక్కణించి నీపంతము వచ్చెనా నేఁడు

చ. 2: కన్నువేసే మాటలాడె కమ్మనినవ్వులు నవ్వె
చిన్ననాఁడే, నీచలము చెల్లెనా నేఁడు
మున్ను నీకుఁ జేత మొక్కె ముచ్చటలన్నియుఁ జెప్పె
పన్ననినీలోనిచింత పానెనా నేఁడు

చ. 3: చేయివేసె చెట్టవట్టె సిగ్గు నీ కొప్పగించె
చాయల నీ కిదిమైనా సమ్మతా నేఁడు
యీయెడ శ్రీవేంకటేశ ఇంతి దానే నిన్నుఁ గూడె
మాయపునీమేనికాఁక మానెనా నేఁడు

రేకు: 0981-6 రామక్రియ సం: 19-473

పల్లవి: ఆతనికి నీకే తగు నుందుకే పోవే
యీతల నే మిందుకెల్లా నిట్టె తలవంతుమే

చ. 1: సటలివి మాకైతే సగియించ వింకాను
నటన నాతనితోనే నవ్వవే పోయి
యిటువలెఁ జేసి మాయింటికి వచ్చే వప్పటి
కటకటా నేమైతే కడుసిగ్గు విడమే

చ. 2: చెంగలు నీమాట వింటే చిమ్మిరేఁగీ మేనెల్లా
అంగడి నాతనితోడ నాడవే పోయి
వెంగలితనాన నాకే విడెమియ్య వచ్చేవు
యింగితాన నేమైతే నింతరొచ్చు కోపమే

చ. 3: నిలువెల్లాఁ గాఁకరేఁగీ నిన్నుఁజూచితే నాకు
వొలిసి నీపతివద్ద నుండవే పోయి
యెలమి శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
వలచి నే మిందుకెల్లా వాసిదెచ్చుకొందుమే

రేకు: 0982-1 భైరవి సం: 19-474

పల్లవి: నీకేల ఇంతవెరపు నేనుండఁగా
చేకొన నీకిచ్చకాలు సేయవద్దా నాకును

చ. 1: పూని మా యింటికి రాను పొంచి సిగ్గువడేవు
దానికేమి యేమైనానుఁ దప్పుసేసితో
పోనీలే బలిమి నిన్నుఁ బొలఁతు లేమిసేసినాను
కానఁ బడ నొకతప్పు గానవద్దా నాకును

చ. 2: మోముచూడ వెఱచేవు మెదలనే తలవంచి
యేమైనా మావారు నేరాలెంచెరా నిన్ను
భామ లెవ్వరైనా నిన్ను బతిమి చెరిచినాను
వేమారు నిన్ను వెనకవేసుకొక పోవునా

చ. 3: మాఁటలాఁడఁ గొంకేవు మచ్చిక నిన్నిటు గూడి
తూఁటమోని గంటైతే దోసమా యేమి
నేఁటనే శ్రీ వేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
నాఁటకీఁడవైన నిన్ను నమ్మవద్దా ఇపుడు

రేకు: 0982-2 సౌరాష్ట్రం సం: 19-475

పల్లవి: మమ్ము నింకఁ దడవక మానేవయ్యా
నెమ్మి వేవేలు దండాలు నీకుఁ బెట్టేమయ్యా

చ. 1: చెప్పరానినాచింత చేతిమీఁదికి వచ్చె
తప్పక నన్నేమి చూచి తడవేవయ్యా
నెప్పున వలచినట్టినేరమి నావొళ్ళఁ గద్దు
వొప్పులుఁ దప్పులు నీవే వోరుచుకోవయ్యా

చ. 2: కన్నులలోపలికాంక్ష కడుఁ బయ్యద దడిసె
నన్నుఁజూచి ఇఁకనేమి నవ్వేవయ్యా
పన్ని నీతో నలిగినఫలమెల్లా నేఁ గంటి
ఇన్నిటికి నీకుఁ బంత మిచ్చేము కోవయ్యా

చ. 3: తలకెక్కె వలపులు తనుఁదానె దిగజారె
మలసి మాతో నేఁటిమాటలయ్యా
యెలమి శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
చెలఁగి మాచనవుల చెల్లించవయ్యా

రేకు: 0982-3 కాంబోది సం: 19-476

పల్లవి: కటకటా మీఁదటెత్తు కానదాయ నెవ్వతెరా
కుటిలపుఁ బులకలు కుప్పవడీ మేనను

చ. 1: కడు నీమోవిచిగురు గంటిసేసె నెవ్వతెరా
వడిసీఁ దేనెలు అందువంక నింతాను
పొడమించె చెమటలు పొలిఁతి యెవ్వతెరా
కడలేనినీమనసు కరఁగు నందునను

చ. 2: రేసుల నిట్టూరుపులు రేఁచిన దెవ్వతెరా
గాసిగా నీవలపులు గాలిఁబోయీని
తోసి నీకన్నుల నిద్ర తొట్టించిన దెవ్వతెరా
వోసరిలి తమకము లుమ్మగిలీ నందును

చ. 3: గందపు గుబ్బలముద్ర కడునొత్తె నెవ్వతెరా
అందువల్ల సిగ్గు నీకు నచ్చుపడెను
కందువ శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
నిందవాసె నిందువంక నేఁ డెందున్నదిరా

రేకు: 0982-4 పళవంజరం సం: 19-477

పల్లవి: సారె నాటిసుద్ది నేఁడు చవులనవే
కోరి నేఁడు రాజైతే కూరమివోదనవే

చ. 1: మంచముపై నన్నమాట మఱవకుమనవే
లంచపు నామోవి తలఁచుకొమ్మనవే
అంచల నాకొప్పు దువ్వె నది నీవడుగవే
యెంచ నేఁడు తా దొరైతే నేమిదోస మనవే

చ. 2: దాకొన్నమోవిగంటి తానే చూచుకొమ్మనవే
లేకలు ముంజూరు నిండె లెక్కించుకొమ్మనవే
ఆకు మడి చిచ్చినది ఆనవాలాయననవే
యీకడఁ బెద్దరికాన కేమిదప్పె ననవే

చ. 3: నాలత్తుకరేక చిన్నినామమాయ ననవే
చాలుఁజాలు నిఁకనేల సటలనవే
యేలెను శ్రీ వేంకటేశుఁ డిదె నన్నుఁగాఁగిటను
పోలించి తా దేవుఁడైతే పొందు మానదనవే

రేకు: 0982-5 బౌళి సం: 19-478

పల్లవి: ఎంత వలపంచితివో యేమి మాయ సేసితివో
పంతములాడుదుఁగాని పాయలేనురా

చ. 1: కోపగించేనంటా వచ్చి గొబ్బున నీమోము చూచి
దాపుగా నే మొగమోడి తలవంతురా
పోపొమ్మని యలిగి నేఁ బోయేనంటాఁబోయి
తీపునీమోవి దలఁచి తిరుగుదురా

చ. 2: వెంగెమాడేనంటాఁ జూచి వినయాల నినుఁ గని
కుంగుచు నానిట్టూర్పు గక్కుకొందురా
వుంగిటినీమాట నీకే వొప్పగించేనంటా వచ్చి
నింగి మోవఁ జేతులెత్తి నేనే మొక్కుదురా

చ. 3: మిక్కిలి వింతరేకులు మేననెల్లా సోదించి
గక్కుననే నుండరేక కాఁగిలింతురా
పక్కన శ్రీ వేంకటేశ బాసగొనేనంటా వచ్చి
యెక్కువతో నిన్నుఁ గూడి ఇన్ని మఱచితిరా

రేకు: 0982-6 వరాళి సం: 19-479

పల్లవి: అలిగినయలు కెల్లా నరచేత నున్న దిదె
తలపోసి చూచుకొంటే తనకేమి బాఁతే

చ. 1: కుప్పవడ్డయలకలు కుమ్మరింపుఁ జెమటలు
చిప్పిలు మోవితేనెలు సేనాసేన
రెప్పలతుద కెంపు రేసువడ్డచల్లజంపు
దప్పిదేరీ నీవియెల్లా తనకేమి బాఁతే

చ. 2: మాసినట్టి పై చెఱఁగు మంతనములో కరఁగు
పోసపు బాస పోఁకకుఁ బుట్టెడేసి
వేసర నీకుంటెనులు వేవేలు వెంటెనలు
తాన వేసి చూచితే తనకేమి బాఁతే

చ. 3: కాఁగిటకలయికలు కందున అలయికలు
చేఁగలవాని చెట్టునఁ జేటఁడేసి
ఆఁగి కూడెను శ్రీ వేంకటాదిపుఁడు నను నిట్టె
దాఁగరానిసరసాలు తనకేమి బాఁతే

రేకు: 0983-1 సామంతం సం: 19-480

పల్లవి: ఓపనోప నింతేసికి వోయయ్యనేను
కోపగించకున్నాను కొడిమె లెంచేవు

చ. 1: నగితిఁబో అందుకేమి నాలోనే వొకవేళ
నీమీఁద నెట్టైనా వొచ్చె మంటినా
చిగురుఁబెదవి గొంత చిమ్మి కదిలించితిఁబో
జగడించ నీకేల సారెకు దిట్టితినా

చ. 2: వుసురంటిఁబో నే నొడలియలపుతోడ
కసరి నిన్నేమైనాఁ గాదంటినా
అసుదై వూరకుంటిఁబో అంతలోనే నీవు నన్ను
వెస నిట్టే జరసేవు వేగిరపడితినా

చ. 3: కాఁగిలించితిబో నిన్ను కాఁకలు మేన నిండఁగా
రాఁగిననీ మేనికాఁక రవ్వపెట్టేనా
వీఁగక శ్రీ వేంకటేశ వేడుక నన్నుఁ గూడితి
దాఁగనేల నీమాట దాఁటఁగలనా

రేకు: 0983-2 కాంబోది సం: 19-481

పల్లవి: ఏమమ్మ యశోద మీయింటికి నేము వచ్చితే
గాముచంటిబిడ్డ నిచ్చి కలుపడఁజేసితి

చ. 1: పాలు గారీ సెలవులఁ బక్కునఁ జెక్కుమీఁటితే
వేలువెట్టితే లోకాలు వెల్లివిరిసీ
వీలి నేము వుగ్గువెట్ట వెరతుము మీవాఁడు
బాలుఁడా దయ్యముగాక పట్టవమ్మా

చ. 2: నెమ్మిఁదొడమీఁద నుండి నిలువు నూరు వండీని
పమ్మి నాల్గుమోముల పాపఁడు లోన నున్నాఁడు
నెమ్మదిఁ బాలు వోయఁగ నే వెరతు మీవాఁడు
ఇమ్ముల వీఁడు మానిశా యెవ్వఁడో కాక

చ. 3: పక్కన నీరార్చితిఁ బయ్యదలో నిడుకొంటి
మక్కువ నాకే తాను మగఁడైనాఁడు
చిక్కిన పను లింకేమీఁ జెప్పఁగ నేవెరతును
యెక్కువ శ్రీ వేంకటుశుఁడితఁడేపో యమ్మా

రేకు: 0983-3 బౌళి సం: 19-482

పల్లవి: ఎట్టు నమ్మవచ్చు నిన్ను నిటువంటివానిని
నెట్టన నేఁడిదె నిన్ను మఱచితివి

చ. 1: కాటుకకన్నుల నాకె గక్కన నిన్నుఁ జూచితే
మాటలు నాతో నాడేది మఱచితిగా
చీటికిమాటికి నట్టే చిరునవ్వు నవ్వెనంటా
నాటిన మనసుతోడ నన్ను మఱచితివి

చ. 2: పెద్దబెట్టుమాట లాడి పిలిచెనంటానే
వొద్దునున్న నన్ను మఱ చుస్సురంటివి
ముద్దు చూపి దవ్వులనే మెఱఁగులు చల్లితేనే
పొద్దుగూఁకుపొడవు లిప్పుడే మఱచితివి

చ. 3: చిగురుఁజేతుల నాకె చేసన్న సేసితేనే
తగవు మఱచితిగా దగ్గర నుండే
మిగులా శ్రీ వేంకటేశ మించునా కాఁగిటఁ గూడి
అగపడి రతిఁ జిక్కి అన్నీ మఱచితివి

రేకు: 0983-4 రామక్రియ సం: 19-483

పల్లవి: ఇరవై మన్నించవయ్య ఇంతిగుణ మిదివో
తరుణివారముగాన తగుఁల జెప్పతిమి

చ. 1: కొమ్మ నీతో పొందుచేసి కొరి పిన్నానాఁడాడే
బొమ్మలఁ దేనియ్యదు నీ పొందు దగిలీనంటా
ఇమ్ముల సవతి పోరు కిసుమంత కోప దీకె
యెమ్మె కెవ్వతెఁ దెచ్చినా నెట్టవునో పనులు

చ. 2: నీవూఁ దాను గూచుండఁగా నిలువుటద్దములోన
సోవగాఁ బతిరూపులు చూడనోపరు
తావులఁ దననీడకు తా నలిగీని చెలి
ఆవలి ఇంతిఁ దెచ్చితే నప్పు డేమేమౌనో

చ. 3: తనరూపు వ్రాసి వేరేతరుణి యయ్యీనంటా
యెనలేని తనసంది నిడుకొనెను
ఘనుఁడు శ్రీ వేంకటేశ కైకొంటివి ఇంతిని
ననుపు చెల్లులపొందు నవ్వుఁబాటు సుమ్మీ

రేకు: 0983-5 ముఖారి సం: 19-484

పల్లవి: ఇద్దరు నేకములైన యెదురు మీకికిలేదు
చద్దివేఁడివలపులకు సటలు మరిలేవు

చ. 1: తనువు లేకములైన తప్పులునొప్పులు లేవు
మనసు లేకములైన మరఁగులే లేవు
చనవు లేకములైన సాదింపు మరి లేదు
వనిత విచ్చేయఁగదే వరుసఁ బతికడకు

చ. 2: పలుకు లేకములైనఁ బైకొసరు మరి లేదు
తెలువు లేకములైన తెగువలే లేవు
చెలిమి సరిదాఁకితే చింతలే మరి లేవు
వెలఁది విచ్చేయఁగదే వెనకకతలేల

చ. 3: వయసు లేకములైన వంతులువాసులు లేవు
ప్రియము లేకములైన బిగువులే లేవు
దయను శ్రీ వేంకటోత్తముఁడు నినుఁగూడె నిదె
ప్రియురాలి విచ్చేయు పిలిపించుకొనక

రేకు: 0983-6 లలిత సం: 19-485

పల్లవి: మంకు విడిచిన నిదె మంచి బుద్ది
సుంకుల మీలోనే మీరు చూచుకొనరాదు

చ. 1: నీడలెల్ల నెండలాయ నెలంత నీవు రాకున్న
వేడుకెల్లా వేసటాయ వెచ్చఁదనాన
వాడిక నడుమ వేరే, వయసు రిత్తవోయీని
కూడిన కూటాలమేలు కొల్లలాడరాదా

చ. 2: కప్పురమే కారమాయ కగిసేమాటలు లేక
దప్పులెల్లాఁ దనివాయ దగ్గరి రాఁగా
రెప్పవే సేయంతలోనే రేసులెక్కు నీ మనసు
తెప్పలఁ దేలఁగరాదా దిష్టపుమీరతుల

చ. 3: దవ్వులెల్లఁ జేరువాయఁ దరుణి మీవియ్యకోఁగా
పువ్వులెల్లఁ బిందెలాయఁ బూఁటపూఁటకు
యివ్వల శ్రీ వేంకటేశ యింతి నీవు గూడఁగాను
నవ్వులాయ మాకెల్ల నమ్మికియ్యరాదా

రేకు: 0984-1 సామంతం సం: 19-486

పల్లవి: అడియలాలెల్ల నిండె నంపరాదా నీ
నడిగినట్టెల్లా నాయ నంపరాదా

చ. 1: కన్నుల నిద్దుర దేరెఁ గందువలు చెమరించె
అన్నివనులును నాయ నంపరాదా
వన్నె మోవి కడురాఁగె వసివాడె మైఁదీగె
అన్నిటా జాణఁడవౌదు వంపరాదా

చ. 2: కాయమెల్లా మఱపాయఁ గరఁగె నామనసెల్ల
ఆయములు సరిదాఁకె నంపరాదా
పాయములు ఫలమందె పంతము లొక్కట్లాయ
ఆయెడకే వత్తుఁగాని అంపరాదా

చ. 3: మచ్చికలే తనివొందె మంతనాలే చవులాయ
అచ్చుపడెఁ గూటములు అంపరాదా
ఇచ్చకుఁడ శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితి-
వచ్చికములెల్లఁ బాసె నంపరాదా

రేకు: 0984-2 సావేరి సం: 19-487

పల్లవి: వెఱతుమయ్యా నీకు వింత లింకానేమైనా
మఱి నిన్ను నెప్పుడుఁ గమ్మరా విడువరా

చ. 1: పిలివ వచ్చినసతి పెదవులెల్లాఁ బొక్కె
వెలయ నీపే రెంతవేఁడోకాని
చలువకు మందులేక సాదించ నే వచ్చితిరా
పలుకకుండితే మోవి పతిపొక్కింపింతురా

చ. 2: చూడవచ్చినట్టి ఇంతి చూపులెల్లాఁ గెంపువారె
జాడ నీరూ పెంతటిబాసటమో కాని
వేడుక నిది మానుప వేఁడికో నే వచ్చితిరా
తోడనే నీ పూరకున్న తుదమీరఁ జేతురా

చ. 3: ఆకుమడిచిచ్చే సతియంగ మెల్లాఁ జెమరించె
చేకొని నీవేమిచేఁత సేసితోకాని
దాకొని శ్రీ వేంకటేశ దగ్గరి నేఁ గూడుండఁగా
నాకన్నీఁ జెప్పకుండితే నవ్వు నవ్వింపింతురా

రేకు: 0984-3 వేళావళి సం: 19-488

పల్లవి: నీకునీకే యూడుకోకు నియ్యాన
కైకొని నేనే నీపై గడియించేఁగాని

చ. 1: అంతవాఁడ వవుదువు అంగనల వలపించి
వంతులకు నీవే నవ్వనోపుదువు
పంతమాడఁ బనిలేదు పలుమారు మాకెల్లా
కాంతుఁడు నిన్నెప్పుడుఁ బొగడవలెఁగాని

చ. 2: మంచివాఁడ వవుదువు మచ్చికలే పచరించి
వంచి సవతులఁ జూపి వాసిరేఁచును
కొంచ నిఁకఁ బనిలేదు కోడెతనానకు నీవే
చంచులకు రాజవంటాఁ జాటవలెఁగాని

చ. 3: రసికుఁడ వౌదువు రతులఁ గాఁగిటఁ గూడి
మిసిమిమమ్మెల్లా నీవు మెప్పించను
యెసగి శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
పసగానిమన సిఁకఁ బట్టవలెఁగాని

రేకు: 0984-4 వరాళి సం: 19-489

పల్లవి: ఏమిబొంతి నిజములు యీకాలము
జాముజాము కొకటైనసటలే చాలు

చ. 1: గక్కన మాటాడఁబోతేఁ గలది గలట్టె
మొక్కలాన నూరకుండు మోనమే చాలు
చక్కఁ జూడఁబోతేను సందేహాలే యప్పటిని
వక్కణించరానితలవంపులే చాలు

చ. 2: పచ్చిగా నవ్వఁబోతే పనులెల్లాఁ గానఁబడీ
కొచ్చి మమ్ముఁ దడవకు కోపమే చాలు
అచ్చపుటేకతమైతే అయములు రేఁగీని
యిచ్చుటఁ జెలులసందడిదియే చాలు

చ. 3: పానుపు మీఁదికిఁ బోతేఁ బంతమెల్లా బయలయ్యీ
నానఁబెట్టి యీయెదుటినటనే చాలు
మానక శ్రీ వేంకటేశ మరి నన్నుఁ గూడితివి
కానఁబడ్డ ఇందుకంటే కతలే చాలు

రేకు: 0984-5 సాళంగం సం: 19-490

పల్లవి: మఱచినపని రేఁచ మాకేలే
తఱవాతిపను లిట్టే తమకించనేలే

చ. 1: పెనఁగి మాయింటికిఁ బిలువఁగ నిలువఁగ
మనసు వచ్చునో రాదో మాకేలే
తమయంతలేనిది తడవ నేమిటి కెంత-
పనిగలిగున్నాఁడో పలికించనేలే

చ. 2: తెరయెత్తి నేఁజూచి తిరిగితే జరిగితే
మరుతంత్ర మేమౌను మాకేలే
సరసాలే విరసాలు చవిగానిపనులకు
పరిణామ మడిగి నేఁ బచరించనేలే

చ. 3: ఆరసి యప్పటిసుద్ద లడుగఁగ నొడుగఁగ
మారాక కూరకుండఁగా మాకేలే
చేరువఁ గడపలోన శ్రీ వేంకటేశ్వరుఁడు
గారవాన నన్నుఁ గూడెఁ గాదననేలే

రేకు: 0984-6 తెలుఁగుకాంభోది సం: 19-491

పల్లవి: చెప్పరాదు చూపరాదు చెలియభావము నేఁడు
వుప్పతిల్లుఁ జెమటతో నుస్సురనీనమ్మా

చ. 1: చక్కఁదన మొకవంక జవ్వన మిదొకవంక
మొక్కలపుపతి మీఁది మోహ మొకవంక
వొక్కటొక్కటికిఁగా కువిద నివ్వెరగుతో
ముక్కుమీఁదివేలితోడ మోము వంచెనమ్మా

చ. 2: చిత్తపు కోరికలతో సిగ్గరిభావముతోడ
పొత్తుల చెలులు చెప్పే బుద్దులతోడ
యెత్తిన తమకమున నెదురు మాఁటాడలేక
తత్తరానఁ దనలోన తానే నవ్వీనమ్మా

చ. 3: కన్నులఁ గావులు దేరె కళలు మోమునఁ దేరె
తిన్నని కెమ్మోవినెల్లా తేనేలు గారె
వెన్నెలవంటివలపు వేడుకఁ దలకెక్కఁగా
యిన్నిటా నిట్టె శ్రీ వేంకటేశుఁడు గూడెనమ్మా

రేకు: 0985-1 శంకరాభరణం సం: 19-492

పల్లవి: ఔలేరా జాణతనాలాడేవు నీవు
లేలే నే నీవలె లెక్కలు వెట్టేనా

చ. 1: కప్పకురా నీగుణాలు కందువ పొద్దాయ, నేఁ-
గప్పినట్టే నీకుచాలు గప్పేవు గాక
ముప్పిరిఁ గరఁగకురా ముదితలఁ జూచి, నీవే
కప్పురము నోరిలోనే కరఁచేవుగాక

చ. 2: కన్నుల గీఁటకురా కాంతలకు నేనా నీవే
కిన్నెరతంత్రుల గోర గీఁటేవు గాక
యెన్నిక చెమట చింద నేలరా చెక్కులవెంట,
చిన్ని మోవిఁ దేనె నీవే చిందేవే యిపుడు

చ. 3: జాఱనీకురా సిగ్గు సంగడిరతుల, నీకే
జాఱెఁగదీ మునిగోంగు సంతసాలతో
మీఱి శ్రీ వేంకటేశ్వర మేలుతోఁ గూడితివి
ఆఱడికూటములెల్లా నబ్బెఁగదే నీకు

రేకు: 0985-2 పాడి సం: 19-493

పల్లవి: నిక్కి యెండదాఁకనేల నీడకుఁబోనేల నాకు
చక్కనినీకెమ్మోవి చవిగొంటే చాలును

చ. 1: కందువ నీ మాటలకుఁ గల్లపరచఁగనేల
అందుకొని అవి నిడమననేల
నిందలాడేవారు నీవు నెఱిఁ దగవాడు కోఁగా
విందువలెఁ జెవులార వింటేనాకుఁ జాలును

చ. 2: గుట్టున నీచేఁతలకుఁ గోపగించుకొననేల
వెట్టఁబడి కమ్మటిని వేఁడుకోనేల
తిట్టులాడి నీవు వారుఁ దీదీపులాడఁగాను
నట్టనడుమ నే వచ్చి నవ్వుటే చాలును

చ. 3: చేసన్నచేసి నిన్నుఁ జేరఁ బిలువఁగ నేల
దోసాలు నీపై నించి తోయనేల
సేసవెట్టి కడపలో శ్రీ వేంకటేశ నన్ను
వాసిమీరఁ గూడితివి వద్దనుంటేఁ జాలును

రేకు: 0985-3 సామంతం సం: 19-494

పల్లవి: చిగురో చేఁగ చూపఁజెల్లదే నీకు
అగపడె నీరమణుఁ డదిగో నీకు

చ. 1: వలపులే కడుఁబెంచి వాలుకరెప్పలు వంచి
సెలవినవ్వులనేల చిందేవే సిగ్గు
నిలువునఁ దమిరేఁచి నెయ్యపుటాసలు పూఁచి
మలసి యంతలోనే మానవేలే నీకు

చ. 2: మాటలతేనెలు చూపి మదనముద్రలు మోపి
యీటునఁ దలుపుమాటు కేల పాయ్యేవే
గీఁటుచుఁ గన్నుల నవ్వి కిందటిమోహలు దవ్వి
మాటికిమాటికి మేనమఱుపేలే నీకు

చ. 3: కాఁగిటిరతికిఁ జొచ్చి కమ్మటి నీకెమ్మోవి ఇచ్చి
కాఁగినగుబ్బలనేల ఘాతసేసేవే
వీఁగుచుఁ గూడితివి శ్రీ వేంకటేశుని విఁట్టె
మూఁగినపులకల యీమో పేలే నీకు

రేకు: 0985-4 సాళంగనాట సం: 19-495

పల్లవి: అరుదు రామునిచేఁత లదిగో పుష్పకమును
సొరిది మనబాలులే సోద్యము గదమ్మా

చ. 1: హరునివిల్లు విరిచె అట్టె సీతఁ బెండ్లాడె
పరశురాముని బాహుబలము గొనె
సురలకు మునులకు సొరిది నభయమిచ్చె
వరుస నయోధ్య యేలవచ్చె నటవమ్మా

చ. 2: వాలిఁ గొటి సుగ్రీవువరరాజ్య మిచ్చెనట
చాలుగాఁ గొండలనే జలధిగట్టె
తీలుగా రావణుఁ జంపి చెగి లంక సాదించి
వాలినసేనలఁ గూడి వచ్చెనటవమ్మా

చ. 3: కాంతయైనసీతఁ గూడి కలుషములెల్లఁ బాపి
పంతముతో విభీషణుఁ బట్టముగట్టి
ఇంతటా శ్రీ వేంకటాద్రి నిరవున వేఁటలాడి
వంతులకు రాజ్య మేలవచ్చెనటవమ్మా

రేకు: 0985-5 వేళావళి సం: 19-496

పల్లవి: అన్నియు నందె యున్నవి అదిగొ మాట
యెన్నుకొనె దినములు ఇదిగో మాట

చ. 1: సీత నీకుఁ జెప్పి పంపి శిరోమణి నీకిచ్చె-
నాతల నే మెఱఁగము అదేమాట
చేతినీవుంగరమును శిరసున నెత్తుకొనె
యేతలఁపు లెట్లొనో ఇదిగో మాట

చ. 2: తాడుపడ్డనేనితోడ తలఁపు నీకొప్పగించి
యేడవుతా నెఱఁగదు ఇదివో మాట
పాడిదప్ప దించుకంతా పదిల మాకెగుణము
అడ నేమీఁ జోటులేదు అదిగో మాట

చ. 3: తెలివ నీకు బాసిచ్చె దేవతలమాట విను
యెఱుఁగినదే ఇందరు ఇదిగో మాట
గుఱుతై శ్రీ వేంకటాద్రిఁ గూడితి రిద్దరు మీరు
అటిముటి రామచంద్ర అదిగో మాట

రేకు: 0985-6 నాదరామక్రియ సం: 19-497

పల్లవి: కంటిమిగా నీగుట్లు కాలమందునే
అంటితేనే లోనైతి వయ్యా నాయకుఁడా

చ. 1: కన్నులనే మాటలాడి కప్పురపుసిగ్గు చల్లి
కిన్నెరమీంట్ల నాకె గిలిగించెను
నిన్నుఁ జూడవలె నింక నిలువెల్లాఁ జెమరించి
అన్నిటా మెయిమఱచితి వయ్యో నాయకుఁడా

చ. 2: వయ్యద బయలుచేసి పగడవా తెర చూపి
తియ్యనివలపులనే తేలించేను
నియ్యిచ్చు దెలి సిదెపో నివ్వెరగు నాకు నిండె
అయ్యెడ నుంజి పాయపు అయ్యా నాయకుఁడా

చ. 3: కాఁగిటనే వలవేసి కందువ రతికిఁదీసి
తీఁగెసరసాల నాకె తెరవేసెను
వీఁగక శ్రీ వేంకటేశ వేగిరమే ఆకెఁ గూడి
ఆఁగి నన్నుఁ గూడితివి అయ్యా నాయకుఁడా

రేకు: 0986-1 హిజ్జిజి సం: 19-498

పల్లవి: ఎదురుచూచీఁ జెలి యేమయ్యా
నిదుర కన్నులఁ దేరీ నీ కేలయ్యా

చ. 1: చెక్కిటఁబెట్టినచెయ్యి చిత్తములోపలినుయ్యి
యెక్కడికిఁ గాదు యేమయ్యా
పక్కున నవ్వేవు కొప్పు పైపై గోర దువ్వేవు
నెక్కొని వట్టిదోసాలు నీకేలయ్యా

చ. 2: పాదపు నేలలవ్రాత బలిసె నూరుపుమోఁత
యీదెస చెలియకేల యేమయ్యా
మోదమున నొరగేవు మొక్కలానఁ దిరిగేవు
నీదయ నేఁడు దాఁచఁగ నీకేలయ్యా

చ. 3: మూపుపై జారిన కొప్పు ముంచిన చెమటల చొప్పు
యేపొద్దు జెలికిఁ బాయ దేమయ్యా
దాపై శ్రీవేంకటేశ తరుణిఁ గూడితి విట్టె
నీపరవశాలు చూప నీకేలయ్యా

రేకు: 0986-2 వరాళి సం: 19-499

పల్లవి: ఎవ్వరినడుగనేల యేడ లేని యానలేల
దివ్వె చేతఁ బట్టువొని తెరువు దప్పకురా

చ. 1: పంతమాడ నోపఁగాని భావము నీదిట్టిదని
పొంతనే నేఁడక్కునను బోసి చూపేరా
యెంత దాఁచినను బోదు యేల నాతో బొంక నీవు
అంతా నీకే కానవచ్చీ నద్దము చూచుకోరా

చ. 2: నిన్నుఁ గల్ల సేయఁ గాని నీకుఁ గల మోహమెల్లా
వన్నెగాఁ బూవుల చేరువలె నెత్తేరా
కన్ను గిరిపితేఁ గాదు కాంతలెల్లా నెరిఁగిరి
మొన్నటి నిన్నటివి నీమోముపై నున్నవిరా

చ. 3: వాదడువఁ జాలఁగాని వక్కణించి నీగుట్టెల్లా
సాదించి నీరుకంటెఁ బలచన సేసేరా
పోదిగా శ్రీవేంకటేశ పొంచి నన్నుఁ గూడితివి
వేదేల నీవుంగరము నేల నీకున్నదిరా

రేకు: 0986-3 శంకరాభరణం సం: 19-500

పల్లవి: నీకుఁ దెలయదుగాక నీమంచిగుణాలే కావా
పైకొని మమ్మింత చేసి భ్రమయించేవి

చ. 1: వంచీ నీరెప్పల లోని వాలుక చూపులు గావా
మంచితనమున నామెయి మఱపించేవి
ఇంచుకంత సెలవుల యీనవ్వులే కావా
తుంచి తుంచి ఆయములు తూరిపారేవి

చ. 2: కొంత కొంత గొణఁగుల కొనమాటలే కావా
చింతతో నా చెక్కిటికిఁ జేయి దెచ్చేవి
పంతపుటలుకలతో పచ్చి వొట్లే కావా
అంతలోనే నన్ను సురనిపించేవి

చ. 3: కూరిమి నీ వేకతానఁ గూడినరతులే కావా
తారుకాణలై సారెఁ దలఁపించేవి
యీరీతి శ్రీ వేంకటేశ యిద్దరము నున్నారము
సారె నీపొందులేకావా చవులయినవి

రేకు: 0986-4 శంకరాభరణం సం: 19-501

పల్లవి: మొదల నేమి నెఱఁగదాయ ముంచిన దెంతపరవశంబో
కదిసినప్పటి చేఁతలు విభునిఁగనుచు విభునిదూరెను

చ. 1: ఇంతి మోము గడుగఁ బోయి యెలమి దోసిట నీరు నించి
అంతట మోవి కెంపుల నీడ యందుఁ చూచి నవ్వెను
రంతు సేసి ముంజేతి చిలుక రతి పలుక లప్పుడు నుడుగ
అంతలోనే పంజరమున నదిమి శిరసు వంచెను

చ. 2: నెలఁత సొమ్ములు వెట్టఁగఁబోయ నిలువుటద్దములోన మదన-
కళలు చెదరుఁగురులు చూచి గక్కున సిగ్గున మునిఁగెను
చెలులమీఁదఁ జేయివేసి చేతనున్న విభునివేలి-
అలరుముద్దుటుంగరంబు అపుడు చూచి భ్రమసెను

చ. 3: పానుపుమీఁదఁ బవ్వళించ పడఁతి యేగి యుందుమీఁద
తానకమ్మైనవిభునిఁ జూచి దగ్గరి కాఁగిలించెను
అనిన శ్రీ వేంకటేశుఁ డంతటిజాణ గనక కలసి
మోనముతోడఁ జొక్కిచొక్కి మున్నిటివెల్ల వడిగెను

రేకు: 0986-5 పాడి సం: 19-502

పల్లవి: ఇంచుకంత చాలదా యీడవారికి
పెంచిపెంచి నీవె రచ్చఁబెట్టుకోవయ్యా

చ. 1: చిటుకంటేఁ జాలదా సిగ్గుగలదానికి
తటుకన నీవద్దఁ దలవంచను
కటకట నవ్వఁబోయి కన్నవారిచేతనెల్ల
దిటముగా నీవలెఁ దిట్టించుకోవలెనా

చ. 2: గొణఁగితేఁ జాలదా గుటుతోడిదానికి
వొణఁ కెతోఁ గన్నుల నీ రొలికించను
అణఁగక కన్నవారి ఆయాలకుఁ జేచాఁచి
సణఁగుల నీవలె జంకెఁబడవలెనా

చ. 3: డగరితేఁ జాలదా తమకించేదానికి
వొగ్గినరతులలో నోలలాడను
నిగ్గుల శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
బగ్గన నీవలె వేరేపంత మియ్యవలెనా

రేకు: 0986-6 రామక్రియ సం: 19-503

పల్లవి: ఎవ్వరుంటా నెఱఁగవు యేరా నీవు
యివ్వల దగ్గరినా కిది వెద్దలా

చ. 1: మానరా నీవు నాతోడిమందెమేళాలు
నానఁబెట్టి యేడనైనా నవ్వవచ్చేవు
నేనూ నీ పొరుగైతే నేరమాయనా
పూని మావా రిందిగంటే పోరులు రావా

చ. 2: గుట్టుతోడ నుండరా కొంతైనా నీవు
చిట్టకానకుఁ నా మీఁదఁ జేయి వేసేవు
ఇట్టె నీమోము చూచితే నియ్యకొంటినా
గట్టిగా మగనాలనుఁ గానా నేను

చ. 3: ఆయరా నేఁడింతలోనే అన్నిపనులు
ఆయములు సోఁక నన్ను నానవెట్టేవు
యీయెడ శ్రీ వేంకటేశ యెనసితివి ! నన్ను
చాయల సన్నల నిదె సతమాయఁగా

రేకు: 0987-1 పాడి సం: 19-504

పల్లవి: ఈవల కాంతలగుణా లేకమే కావా
పూవులవాటు కోపవు పూఁపవాటు కోపినా

చ. 1: కప్పురపు వీడెముతో కలికి మాటలాడఁగ
దప్పిదేరే వేఁటికోయి దగ్గరివుండి
చెప్పరానికారాలే చిందీ మాకన్నులను
యిప్పుడే నన్నుఁ జెనకే విందు కోపినా

చ. 2: చిగురుచేతుల నిన్నుఁ జెలియ విలువఁగానే
వొగరుఁజెమటలతో నుస్సురనేవు
మిగులవాఁడి మొనలు మెరిచీ మాచన్నులను
యెగువ నన్నుఁ బిలిచే విందు కోపేవా

చ. 3: అద్దపు మెఱుఁగుఁజెక్కులాకె నిన్ను వలపించి
ముద్దుచూపితే భ్రమసి మోమువంచేవు
పొద్దుపొడపు గోళ్ళపాలఁతి నన్నుఁ గూడితి-
విద్దరికి శ్రీ వేంకటేశ వోపేవా

రేకు: 0987-2 తోండి సం: 19-505

పల్లవి: కానీవే గొల్లెతా కమ్మటి నవ్వకువే
నానసీవే రేపటికి నయమువును దాఁచవే

చ. 1: తీపుచేసి వలపులు తీర నాపైఁ జల్లకువే
పోపో నీగొల్లచల్ల పుల్లనేకాదా
మాపటంత వచ్చేఁగాని మగుడి చూడకువే
చేపట్టి చూడఁజూడఁగ చీఁకటిండ్లే వెలుఁగు

చ. 2: మాటలనే నా మీఁద మందులు నూరకువే
మూటగట్టితే గొల్లముంజులేకావా
చీటికిమాటికి నాపై చేతులు చాఁచకువే
వాఁటమైతే నీరు వారు వచ్చే నే నాడకు

చ. 3: చేయివట్టి తియ్యకువే చేరి నన్ను లోనికి
పాయపు గొల్లెతలకు బలువేకదా
వేయిటికిఁ గూడితి శ్రీ వేంకటేశుఁడను నేను
యీయెడ జాతొకటాయ నింటికి వచ్చేనే

రేకు: 0987-3 మాళవి సం: 19-506

పల్లవి: ఎట్టు నమ్మవచ్చునే ఇంతి నీమనసు నేఁడు
వొట్టి యొకవేళ బుద్ధి యొకవేళ వచ్చునా

చ. 1: వెన్నెలబయట నుండి వేఁడిఁబడి యిందాఁకా
సన్నల నీపతిఁ గూడి చల్లనైతివి
వున్నతపుఁజందురుఁడొక్కఁడే వెన్నెలొక్కటే
కన్నెభావాలు రెండుగతులాయ నివిగో

చ. 2: కోయిలకూఁతలకే గుండె బెదరి యిందాఁకా
యీయెడ నీపతిఁగూడి యిచ్చగించేవు
ఆయెడాఁ బలుకొక్కటే అప్పటి నీవు నీవే
రాయడి నీగుణములే రండు దెఱఁగులాయ

చ. 3: వేడుక చల్లగాలికి విసిగితి విందాఁకా
కూడి శ్రీవేంకటేశుతో కోరే వదియే
ఆడనే నీయాలవట్ట మదియును నొకటే
యీడా నాడాఁ దలపోఁత లివియే వేరు

రేకు: 0987-4 లలిత సం: 19-507

పల్లవి: ఊరకే గడించుకొనీ నోయమ్మా తన-
నోరే ఘనముచేసీనో చూడరమ్మా

చ. 1: తనివార నొకమాఁటు తప్పక చూచితి నింతే
వెనక తనచేఁతకు వెంగెమా యిది
ననుపైన దానఁగాన నవ్వితే నింతే కాక
చెనకేతనతో గేలిచేసితినా

చ. 2: వుబ్బసపోక నేనే వుస్సురంటి నొకమాఁటు
గొబ్బుననుఁ దనమీఁది కోపమా యిది
నిబ్బరానఁ దనమాఁటే నిజమంటిఁగాక నేను
దబ్బరలు చేసినట్టి తలఁపా యిది

చ. 3: కడుఁదమకానఁ దన్నుఁ గాఁగిట నించితిఁగాక
సుడిగొన్న తనకాఁక చూచుటా యిది
యొడయక శ్రీవేంకటేశుఁడు గాఁగాఁ,దన్ను
బడినాయఁగాక యిది పైయద్దికములా

రేకు: 0987-5 భైరవి సం: 19-508

పల్లవి: తరవాతిపనులెల్లఁ దా నెఱఁగఁడా
బిరుదే నెరపుఁ గాక పిలిపించనేఁటికే

చ. 1: గోరుకొన సోఁకకతొలుతే కోపగించేవాఁడు తాను
యీరీతి నుంగరము నా కేఁటి కంపెనే
వీరివారిమాటలకు వెఱ పింతగలవాఁడు
దారకుఁడై వుండుఁగాక దగ్గరి రానేఁటికే

చ. 2: వీసము సేయనందుకే విడనాడేవాఁడు దాను
ఆసమాటలేల చెప్పియంపెనే నాఁడు
వాసిమెరమెచ్చులకు బయలీఁదించేటివాఁడు
వేసాన నే నున్నచోటు వెదకఁగనేఁటికే

చ. 3: అండకు రాకమునుపే యంతా మఱచేవాఁడు
నిండినమోహము నాపై నించనేఁటికే
మెండగు శ్రీవేంకటాద్రిమేటి ఇట్టె నన్నుఁ గూడె
వుండినట్టేవుండి నన్ను వూరడించనేఁటికే

రేకు: 0987-6 పాడి సం: 19-509

పల్లవి: గుట్టున నుండుటచాలు కూడినదాఁకా
అట్టె ఆమీఁదిపను లప్పుడే చెప్పేను

చ. 1: చూడకురా అద్దము సొంపగు నీ నుదుటను
యేడో లత్తుక చూచి యెంత సిగ్గవునో
ఆడకురా మాఁటలు ఆయపునీమోవిమీఁది-
నీడ కెంపులు రాఁగితే నీ కెంత నొచ్చునో

చ. 2: వెలి వెళ్ళకురా నీవేఁడిచెమట గారితే
చెలుల మెదుట నెంత చింత పుట్టునో
కులికి నవ్వకురా కొప్పుసేస రాలితే
యెలమి నీబాసలు నిన్నేమనునో

చ. 3: కాఁగిటఁ బెనఁగకురా కమ్మఁగస్తూరిబేంట్లు
చేఁగలై రాలితే నీచిత్త మెట్టవునో
తూఁగుబడి నన్ను నీవు తోడుతనే కూడితివి
పాఁగిన శ్రీవేంకటేశ పచ్చి యెంత దోఁచునో

రేకు: 0988-1 ఆహిరి సం: 19-510

పల్లవి: చిక్కితి మీపాలనూ చేయరె యీవేళనూ
ఇక్కడనే వేగిరించే రేమందు నేనూ

చ. 1: చెక్కిటిమీఁదికి చెయ్యి చిత్తములోనిది నుయ్యి
యెక్కడిబుద్ధులు నాకు నేమిచెప్పేరే
ముక్కుమీఁదటిది వేలు మోహములు వేవేలు
ఇక్కువ లెఱఁగలేరు యేమందు నేను

చ. 2: నిలువెల్లా నివ్వెరగు నిద్దుర రెప్పమరఁగు
కలిగినమీఁదటెత్తు కనుఁగొనరే
సెలవులనే నగవు చెప్పఁబోతేనే బిగువు
యెలమి మీరు మొక్కఁగ నే నేమందునే

చ. 3: చెదరిన నీ కురులు సేసకొప్పున విరులు
తుదమొద లెఱఁగరు తొలఁగరే
యెదుట శ్రీవేంకటేశుఁ డిదే వచ్చి, నన్నుఁ గూడె-
నిదెవో మీతో నింక నేమందు నేను

రేకు: 0988-2 శ్రీరాగం సం: 19-511

పల్లవి: ఇచ్చకమే మదిఁ దోఁచీ నేమందునే
వచ్చినది పదివేలు వాని నేమందునే

చ. 1: కన్నులఁ జూచినప్పుడే కాఁకలెల్లాఁబెడఁబాసె
యెన్నికల కేడలేదు యేమందునే
మున్నిటి సుద్దు లెంచితే మోహములు చవిదప్పీ
విన్నదే విందవుత మేలు విభుని నేమందునే

చ. 2: సెలవి నవ్వినప్పుడే చిక్కులెల్లాఁ బెడఁబాసె
యెలయించఁ దరిగాదు యేమందునే
పలికితే సంతోషభావములు చవిదప్పీ
పిలుపే కోటానఁగోటి ప్రియుని నేమందునే

చ. 3: కాఁగిట నించినప్పుడే కడమలు వాసె నిట్టె
యేఁగకున్నఁ జవిదప్పీ నేమందునే
పాఁగిన శ్రీవేంకటాదిపతి యిన్నిటా నాతో
రాఁగిన మోవితేనెలరసికు నేమందునే

రేకు: 0988-3 నాగవరాళి సం: 19-512

పల్లవి: నీవు మంచివాఁడవే నీచేఁతలే నన్ను
చేవముంటిఁ పోటులై చిమ్మిరేఁచీఁగాని

చ. 1: కన్నులు నీవి మంచివి కడలఁ గెంపులు నిండి
యెన్నఁగఁ గోపమురేఁచె నిదే కానిది
అన్నిటా నీమాట లెస్స అందులోనే దగదొట్టి
విన్నని నీయలపులే వెతరేఁచీఁ గాని

చ. 2: ముంగిటినవ్వు మంచిది మోవిని పొక్కులు నాకు
చెంగటఁ జిగురుచేఁదులే చేసీఁగాని
అంగడిఁ జక్కనివాఁడ వౌదువు నీమేనిమీఁది-
వుంగిటివింతవాసన లుడికించీఁగాని

చ. 3: అతిరతినీయధరామృతము తియ్యనే
సతులెల్లాఁ జవిగొంటేఁ జప్పన గాని
ఇతవుగా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కతలుగావా నిన్నుఁ గై కొంటిఁ గాని

రేకు: 0988-4 ఆందోళి సం: 19-513

పల్లవి: ఇంతులాల నావంక నిదే తప్పు
కొంతైనాఁ బిలువనంటాఁ గొసరీ మనసు

చ. 1: మాటకు మాటాడను మరి కల్లలెంచెను
నాఁటుకొన్న చూపులతో నవ్వితి నేను
గీఁటెఁ గొనగొరఁ దానే కిందుపడ నొక్కెఁ దానే
కూటమికి రానంటాఁ గోపగించీఁ దాను

చ. 2: పతికిఁ బతి సేయను పను లేమి నడుగను
అతికాఁకఁ దనమేనే అంటితి నేను
కతలు చెప్పీఁ దానే ఘాతలుసేసీఁ దానే
తతితో దగ్గరనంటా దమకించీఁ దాను

చ. 3: కాదుగూడ దనను కఱకరి సేయను
యీాదెసఁ దనకుఁ బంతమిచ్చితి నేను
సేదదేర నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడు దానె
పోదితో మెచ్చితినంటాఁ బొదిగీఁ దాను

రేకు: 0988-5 లలిత సం: 19-514

పల్లవి: నవ్వితినే గొల్లెతా నాయ మపుర గొల్లఁడా
యెవ్వ రేమనిరే నిన్ను నియ్యకొంటిఁ బదరా

చ. 1: కానీవే గొల్లెతా కద్దులేరా గొల్లఁడా
ఔనా మఱవకువే అట్టే కానీరా
నే నేమంటిని నిన్ను నీకే తెలుసురా
మానితినే ఆమాట మంచిదాయఁ బదరా

చ. 2: అదియేమే గొల్లెతా అందుకేరా గొల్లఁడా
కదిసెఁ గడుపనులు కల్లగాదురా
ఇది నిక్కెమటవే ఇంతకంటె నటరా
పదరకువే నీవు పలుమారు నేలరా

చ. 3: మెచ్చితినే గొల్లెతా మేలు లేరా గొల్లఁడా
కుచ్చితిఁ గాఁగిట నిన్నేఁ గూడుకొంటిరా
యిచ్చకుఁడ శ్రీ వేంకటేశుఁడను నేనే
యెచ్చరించవలెనా, యెఱుఁగుదుఁ బదరా

రేకు: 0988-6 తోండి సం: 19-515

పల్లవి: మరిగిననీకేకాక మాకేలరా
తెరమఱఁ గింతే నీవు తీసివేయనేలరా

చ. 1: ఆడకురా నాముందర ఆకెగుణములు సారె
గోడ గడుక నసలే కుప్పవడీని
వోడక నీ కితవైతే వుట్టి గట్టు కుందు గాని
సూదుబంటుతో బలాలు చూపి చెప్పనేలరా

చ. 2: యెంచకురా ఆకెపొందు యెక్కుడుగా నాయెదుట
యెంచఁబోతే మంచముకిందింతా నుయ్యే
కంచముపొత్తు గలితే కలవెల్లా నితవుగా-
నించుకాఁ జలిలేకున్న నెండగాయ నేలరా

చ. 3: కప్పకురా ఆకెచీర గట్టుకొంటి వదె నీవు
వుప్పాలికి యినుమడౌ నొద్దికైతేను
యిప్పుడె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
దప్పికి నీరేకాక తగ నీ నెయ్యేలరా

రేకు: 0989-1 లలిత సం: 19-516

పల్లవి: ఎంతటఁగాని మెచ్చవు ఇంకా నిది
పంతానకు నీవే పైకొనవద్దా యిది

చ. 1: పక్కఁన నలిగినట్టిపడఁతి ఇవ్వలిమోమై
చక్కఁగా నిన్నుఁజూచెఁ జాలదా యిది
గుక్కక కానిమాటలు గొణఁగిననోటనే
గక్కునిన్నుఁ బిలిచెఁ గాదా యిది

చ. 2: పలవంత గోపగించి వంచినట్టిరెప్పలనే
మెలపున నిన్నుఁ జూచె మేలుగా యిది
చలయిలే యిందాఁకా సాదించినట్టినీ -
చెలి నీతో నవ్వె చెల్లదా యిది

చ. 3: వేడుక నీవు వట్టితే విదిలించుకొన్నచేత
వీడెమిచ్చి వూరకుండె వెలితా యిది
వీడుపడ్డచోనే శ్రీ వేంకటేశ కూడెఁ జెలి
యీాడఁ దనివి దీరదా ఇంకా నిది

రేకు: 0989-2 హిందోళం సం: 19-517

పల్లవి: నీడా యండా నొక్కటే నినుబోఁటికి
ఆడకురా మారుమాట లాయనాయఁ బదరా

చ. 1: తెల్లని వెల్లాఁ బాలే తెలిసితి వవులేరా
గొల్ల దేమటాయ నాఁడుగుల మెల్లాను
చల్లలమ్మఁ బోనీరా సారె నన్నుఁ బట్టకురా
చల్లువలపులు పైపైఁ జప్పనాయఁ బదరా

చ. 2: కన్నదే కంటి గురుమ కంటివి నీవవులేరా
అన్నిటా నీ కాఁడుఁబోడి అగ్గువా యను
నన్ను నింటి కేఁగనీరా నవ్వులెల్లఁ జాలుఁజాలు
వెన్న నున్నగా నూరితే వేసటాయఁ బదరా

చ. 3: పట్టినదే పంతమాయఁ బై కొంటి వవులేరా
కట్టినకంకణమాయఁ గాంతలెల్లాను
ఇట్టె శ్రీ వేంకటేశ ఇరవై కూడితి నన్ను
దట్టమైనతమకమే తగులాయఁ బదరా

రేకు: 0989-3 శంకరాభరణం సం: 19-518

పల్లవి: ఎరవులకోపఁ బిఁక నెల
తెరమఱఁగున నిఁకఁ దిరుగఁగవలదే

చ. 1: చెలియ నీనగవు సెలవుల నుండఁగ
యెలమి మారుమొగ మిఁకఁ దగదే
కలిగినయాసలు కన్నుల నుండఁగ
చలముల బొమ్మల జంకెన దగదే

చ. 2: ననుపులమాఁటలు నాలుక నుండఁగ
పెనఁగేటి బిగువులు పెంచకువే
చెనకేటి తమకము చేతుల నుండఁగ
యెనలేనిజగడ మిఁకఁ బేర్చకువే

చ. 3: కరఁగిన భావము కాఁగిట నుండఁగ
పరగేటి మోనము పనిలేదే
యిరవుగ శ్రీ వేంకటేశుఁడఁ గూడితి
సరి వెనకటి వెంచఁగఁ బనిలేదే

రేకు: 0989-4 శ్రీరాగం సం: 19-519

పల్లవి: నిన్నుఁ బాసి రమణికి నిమిషమెందును నేఁడే
మన్నించితి రమణుఁడ మాచెలిని నేఁడే

చ. 1: చిత్తమెల్లా నీరాయ చెమట లేరులు వారె
యెత్తిన వానకాల మింతా నేఁడే
మొత్తమిఁ జెలితురుము మొయిలి విరిసె నిదె
హత్తి వెలుతురుఁగాల మది నేఁడే

చ. 2: చలిసిగ్గులెల్ల ముంచె పులకలమంచు ముంచె
చలిమంచికాలాలు సతికి నేఁడే
తలఁపెల్లాఁ జిగిరించె తమకపుటెండ గాసె
వెలయు వసంతము వేసవియు నేఁడే

చ. 3: పగడపు మోవివంటి పచ్చి వెచ్చికొండ నిండె
మొగి యామనికాలము మొదల నేఁడే
నిగిడి శ్రీ వేంకటేశ నీవే యింతిఁ గూడితివి
బగివాయ నిద్దరికిఁ బండుగలు నేఁడే

రేకు: 0989-5 లలిత సం: 19-520

పల్లవి: జయ లక్ష్మి వరలక్ష్మి సంగ్రామవీరలక్ష్మీ
ప్రియురాలవై హరికిఁ బెరసితివమ్మా

చ. 1: పాలజలనిధిలోని పసనైన మీఁగడ
మేలిమి తామరలోని మించవాసన
నీలవర్ణునురముపై నిండిననిధానమవై
యేలేవు లోకములు మమ్మేలవమ్మా

చ. 2: చందురుతోడఁ బుట్టిన సంపదల మోఱుఁగవో
కందువ బ్రహ్మలఁ గాచే కల్పవల్లి
అందిన గోవిందునికి అండనే తోడునీడవై
వుందానవు మా ఇంటనే వుండవమ్మా

చ. 3: పదియారువన్నెలతో బంగారుపతిమ
చెదరని వేదముల చిగురుఁబోడి
యెదుట శ్రీ వేంకటేశు నిల్లాలవై నీవు
నిదుల నిలిచేతల్లి నీవారమమ్మా

రేకు: 0989-6 ముఖారి సం: 19-521

పల్లవి: చెలువుఁడ యెంతైనాఁ జెల్లదా నీకు
సెలవు వెట్టితి మాకు చెల్లదా నీకు

చ. 1: వొరసి నేమిద్దరము నూరకే వాదు లడువఁగ
శిరసు వంచుకుండఁగఁ జెల్లదా నీకు
పరగ మాలో నేమే పగలు చాటుకోఁగా
సిరులతో నవ్వేవు చెల్లదా నీకు

చ. 2: ముప్పిరి నీకుఁగా మొకాలు చూడకుండఁగ
చెప్పవచ్చేవు సాకిరి చెల్లదా నీకు
రెప్పలతుదల మాకు రేసులు వుంటుండఁగాను
చిప్పిలి మోముకళలు చెల్లదా నీకు

చ. 3: యిక్కడనే దగ్గరితి మిందరినడుమా వచ్చి
చెక్కుల నొక్కేవు యింతచెల్లదా నీకు
మక్కువ శ్రీ వేంకటేశ మమ్ముఁగూడితి విద్దరి
చిక్కితిమి నీపాలఁజెల్లదా నీకు

రేకు: 0990-1 హిజ్జిజి సం: 19-522

పల్లవి: ఒకటిపై నొకటేల వొద్దే యింత
చికురము వీడెఁ జాలు సిగ్గులు నీకేలే

చ. 1: తియ్యనిపెదవినోటఁ దెగి వెంగెమాడఁబోతే
వొయ్యనే కారములయ్యా వొద్దే యింత
పయ్యదలోని జక్కవపక్షు లడిచేయట్టి-
కయ్యము చాలదా నాతో కయ్యము నీకేలే

చ. 2: తెల్లని కన్నుల నీవు దిష్టించి చూడఁబోతే
వుల్లసపు చేఁగదేరీ వొద్దే యింత
చెల్లఁబో నడపుకరి సింహము నడుము నీమై
పెల్లున బెనఁగీ నాతోఁ బెనఁగ నీకేలే

చ. 3: మెత్తని తామెరచేత మీఁటి నన్ను దొబ్బఁబోతె
వొత్తి మరునమ్ములయ్యా వొద్దే యింత
యెత్తి నిన్ను శ్రీవేంకటేశుఁడ నేఁగలసితి
పొత్తులరతులు చెల్లె పూఁపనవ్వు లేలే

రేకు: 0990-2 శంకరాభరణం సం: 19-523

పల్లవి: ఎట్టు గడించుకొంటివే ఇవి చక్కఁదనమంటా
చుట్టములు గావే అవే సూడిబంట్లు

చ. 1: తామెరలవంటివేమో తరుణి నీకన్నులు ఆ-
తామెరలే మరునికి తగ బాణాలు
సోముని వంటిదే నీసొంపైన మొగము ఆ-
సోముఁ డాతనిఁ గలసి జోడౌతెలిఁగవా

చ. 2: జక్కవల బోలినవి తి నీకుచములు ఆ-
జక్కవలే మరునికిఁ జనవరులు
మిక్కిలితేంట్లఁ బోలె మేలిమి నీకురులు
పక్కన నాతని కవి బంట్లౌతెలిగవా

చ. 3: చిగురుఁ బోలినదె చెలియ నీమేను ఆ-
చిగురేపో మరునికిఁ జేకత్తులు
నగుతా శ్రీవేంకటాద్రినాయకునిఁ గూడితివే
తగ నీతఁడే యాతనితండ్రౌ తెలిఁగవా

రేకు: 0990-3 రామక్రియ సం: 19-524

పల్లవి: నీకే తెలుసుఁగాక నీ వొళ్ళిపనులు
కై కొని యెఱుఁగుదుమా కడము నున్నవారము

చ. 1: ఔరా నీమాట నిజమందునో కల్లందునో
దూరి దూరి యేమన్నా దోసమయ్యీని
యేరా నీమోవి యిది యెంగిలో పావనమో
యేరుపరచ వెఱతు మెఱఁగ మితేఁసి

చ. 2: యేచిననీ కన్నులవి యెఱ్ఱనో తెల్లనో
సూచించితే నిజము నిష్టూరమయ్యీని
తాచి నీగుణము మంచితనమో కపటమో
చేచేత నడుగరా చెప్పేరు వీధిని

చ. 3: నీవుగా సించినచీర నీదో నొరులదో
భావించి యేమన్నాఁ బచ్చిదోఁచీని
శ్రీవేంకటేశ నేఁడు చేరి నన్నుఁ గూడితివి
నీవే నే ననుకొంటి నిండుకుఁడు మికను

రేకు: 0990-4 శుద్ధవసంతం సం: 19-525

పల్లవి: ఇందరిలో బిగి సేవు యిప్పుడేలా
నిందలమాట లన్నియు నీపై నున్నవిరా

చ. 1: పంతగాఁడ వవుదువు పలుకరా
యింతచాలదా కోప మిఁక నేలరా
దొంతినున్నది వలవు తొలఁగకురా
అంతచలము రతులయందునే చూపరా

చ. 2: చెల్లె నీకు రాజసము శిరసెత్తరా
తొల్లి నీకు మొక్కితి దూరలేలరా
వెల్లవిరాయఁ బనులు వెంటనే రారా ! నీ-
పల్లద మేమిగల్లాను పానుపుపైఁ జూపరా

చ. 3: కడుజాణ వౌదువు కాఁగిలించరా
వడఁబడ నిఁకనేల వద్దువద్దురా
కడఁగి శ్రీవేంకటేశ కలసితిరా! నీ-
అడియాల మింతయు నాయంగముపై నించరా

రేకు: 0990-5 దేసాళం సం: 19-526
పల్లవి: ఎరువులు సతమౌనా యెందాఁకనే ! కానీ
తరువాత నయ్యీఁగాక తరవెందాఁకనే
చ. 1: తతిఁ దనయంతటనే తనకు లేనిమోహ-
మితరులు యెచ్చరించే దెందాఁకనే
పతిఁ బిలువకతొల్లే పైకొని వచ్చేరాక
సతుల నంపఁగ వచ్చె సట లెందాఁకనే
చ. 2: మక్కువతోఁ దనంతనే మాటాడించనిమాట
యెక్కించి మీ రాడించే దెందాఁకనే
ఇక్కువ గరఁగి తానే యెదురుకొని కాఁగిలి
చిక్కినేఁ గొసరఁగాను చేరే దెందాకనే
చ. 3: సంతతము నిదేపనై జంటవాయకుండేపొందు
ఇంత దలఁపించి కూడే దెందాఁకనే
చింతదీర మన్నించె శ్రీవేంకటేశుఁడు నన్ను
దొంతులాయఁ బులకలు దూరులెందాఁకానే

రేకు: 0990-6 నాదరామక్రియ సం: 19-527

పల్లవి: ఏమైనా నయ్యీఁగాక యెందఁకనే
ఆమని పచ్చలమీఁది ఆస లెందఁకనే

చ. 1: తానే వచ్చీఁగాక తగిలి పిలువనేల
యేనుగఁ గఁబానఁదీనే దెందాఁకనే
కానీలేవే వానిచేత కాదుగూడదననోప
మానవిగుణములకు మందు లెందాఁకనే

చ. 2: తీటీ నలుకలు దానే దీమస మెడలనేల
యేటులు వంకలు దిద్దే దెందాఁకనే
ఆబడి సేయఁగనేల అంది పొంది పాయనోప
నూటేటివెన్నలకు నును పెందాఁకనే

చ. 3: ఆండనే శ్రీవేంకటేశుఁడాదరించి నన్నుఁగూడె
యెండమావులదప్పు లెందాఁకనే
నిండుదొర వీనిమీఁద నేరమెంచ నే నోప
వండ వండనట్లయినవాసు లెందాఁకానే

రేకు: 0991-1 శంకరాభరణం సం: 19-528

పల్లవి: ఇందాఁకా నెందు వోతివి యీపాటివాఁడవు
సందడిఁ బెండ్లి నేఁడు చక్కఁబెట్టరాదుగా

చ. 1: నాటఁగ దొరవు నాతో నవ్వితివంటా నవ్వు
బూటకాన నే గాదెఁ బోయరాదుగా
గీఁటుచు వలపు చల్లి గిరిపేవు కన్ను లిట్టె
మూటగట్టి అవి నే మూలఁబెట్టరాదుగా

చ. 2: సాగిన సబలలోన సరసమాడితివంటా
చేగలనది వాఁటము నేయరాదుగా
తీగెల మాటలాడి తేనెలు పూసితివంటా
వేగిరించి తమకము వెళ్లఁబోయరాదుగా

చ. 3: కరఁగి నీ విట్టె నన్నుఁ గాఁగిలించితివంటా
మరునమ్ము వాఁడిచెడ మందు లేదుగా
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వొరసి నిన్నిట్లాడకుండరాదుగా

రేకు: 0991-2 ముఖారి సం: 19-529

పల్లవి: నిజమాడరా నాతో నీకు నీవే
బజనచెడ్డవలవు పనిలేదురా

చ. 1: అరయ నామీఁదితలఁ పంతనీ కున్నదా
వరుస వంతుకు నేనేవచ్చేఁగాక
సరసమాడేయందు చవిగద్దా నామీఁద
వొరసిన నాచేతివొత్తులుగాక

చ. 2: పసమా నాకు నీవు వద్ద నుండి వూరకైనా
అసముదించనిమాట లాడేఁగాక
సుసరమా నీపొందు సుదతు లిందరిలోన
కసుగాటు నీవలపు కైకొనేఁగాక

చ. 3: ఆరీతి నాపై తమక మంత నీకుఁ గలదా
గోరపెట్టి నిన్ను నేనే కూడేఁగాక
నేరిచి యానవెట్టేవు నీవు నాపై మోహమంటా
యేరా శ్రీ వేంకటేశ యియ్యకొంటిలేరా

రేకు: 0991-3 సాళంగ సం: 19-530

పల్లవి: ఆయనాయ నూరకుండు మంతే చాలు
చాయలు సన్నలు నైతే జప్పనయ్యీనిఁకను

చ. 1: కన్నులు దెరచి చెలి గక్కున రెప్పలు వంచె
వెన్నెలో అది నీకు వేసఁగో కాని
మున్నిటి మీ మోహముల ముచ్చటల కొలఁదింతే
పన్ని నేము చెప్పఁబోతే పచ్చిదోఁచు నిఁకను

చ. 2: పెదవులు గదలించి పేరుకొన కూరకుండె-
నది నీకుఁ జిగురో చేగాయనో కాని
యెదుట మీలోలోనే యెనసినకొలఁ దింతే
పొదిగి యేమన్నాను పొరయెత్తీ నిఁకను

చ. 3: చేరి నీయెదుట నుండి చిఱునవ్వు నవ్వె నింతె
పేరడి నీ కవి పాలో పెరుగోకాని
కూరిమి శ్రీవేంకటేశ కూడితి రిద్దరు నిట్టె
మేరతో నెవ్వ రేమన్నా మితిమీరీ నిఁకను

రేకు: 0991-4 సామంతం సం: 19-531

పల్లవి: చెలిపలుసోఁకులే నీసింగారము
అలరె నీకిన్నియును అవధారు నేఁడు

చ. 1: అంగన నిన్నుఁగూడఁగ నటు నీపై వడిసేటి-
అంగపుఁ జెమట నీకు నభిషేకము
వుంగిటిఁ గొప్పువిరులు వుపరిసురతవేళ
సంగతి రాలేటిచల్లు వేదపూజ

చ. 2: నించిన కాఁగిటిలోని నెలతఁ నిట్టూర్పుగాలి
అంచులు మోప విసరేయాలవట్టాలు
అంచెల మర్మముసోఁక నాడుకొనేమాటలే
కాంచనపు గిన్నెలతో కప్పురబాగాలు

చ. 3: వనిత విడెముతోడ వంచినమోవితేనె
నునుపై నీకు మహనైవేద్యము
యెనసి శ్రీవేంకటేశ యిన్నియుఁ గలిగె నీకు
మొనగోరిమాచేతి మొక్కు లిందవయ్యా

రేకు: 0991-5 రామక్రియ సం: 19-532

పల్లవి: ఏరా నీవప్పుడే నన్ను నెంతగాఁ జూచితివి
మేరమీరి నీచేతనే మెప్పించుకోనోపనా

చ. 1: ఇట్టె నామోహము నీవే యెఱిఁగే వనుంటిఁ గాక
నెట్టన నిన్ను రప్పించనేరనా నేను
చిట్టకానకకు నన్నింత సేయవని వుంటిఁగాక
గట్టిగా నా చేయి మీఁదుగా నడవ నేరనా

చ. 2: తెమలించి నీవే మాట తీసేవని వుంటిఁగాక
తమిరేఁచి నిన్ను నాఁగ తడవా నాకు
సముఁడవై నవ్వే వింతే సటలని వుంటిఁగాక
రమణులతో నవ్వితే రచ్చవేయలేనా

చ. 3: ఆసాసల నీమాటకు నడ్డమాడనై తిఁ గాక
వాసి దెచ్చుకుని నిన్ను వంచుకోలేనా
బాసిచ్చి శ్రీ వేంకటేశ పైకొని కూడితిగాక
వేసరినదాఁకా నిన్ను వెంటఁ దిప్పకుందునా

రేకు: 0991-6 శుద్ధవసంతం సం: 19-533

పల్లవి: ఇన్నే సివావులతో నిందరిపాలఁ గలిగె
పిన్న పెద్ద మేలుసేసీ పెంచరే యీబాలుని

చ. 1: నరకారినితండ్రి నడురేయి జనియించె
అరుదుగఁ గంసుని కల్లుఁడాయను
నిరతి శిశుపాలుని నెయ్యపు మఱఁది పుట్టె
పెరుగఁగా మేలుసేసీ పెంచరే యీబాలుని

చ. 2: వొద్దిక పాండవులకు నుదయించె మేనబావ
బుద్ధితో వసుదేవునిపుత్రుఁడాయను
వుద్దండపు గొల్లెతల కొగి మగఁడు గలిగె
పెద్దవాఁడై మేలు సేసీ పెంచరే యీబాలుని

చ. 3: నేరనిదుష్టులకెల్లా నిండుచిచ్చరపిడుగు
నేరిచినశిష్టులకు నిధానము
యీరీతి శ్రీ వేంకటేశుఁ డితడె బాలకృష్ణుఁడు
పేరడిగా మేలు సేసీ పెంచరే యీబాలుని

రేకు: 0992-1 లలిత సం: 19-534

పల్లవి: గుఱిగా శ్రీ కృష్ణుఁడు మనకు దొర దూరువాఁడు
వెఱవక చేతికొద్ది వెఱఁజరో మీరు

చ. 1: పెట్టిరి గొల్లెతలెల్ల పెరుగు నెయ్యి వుట్ల
కొట్టరో కొట్టరో మీరు కోలలవారు
తిట్టేరు వారిల్లదివో తెగి దగ్గరకతొల్లె
పట్టరో వారలు మీరు పైఁగారేపాలు

చ. 2: యెంచి పెట్టిరి దొంతుల నేడలేనిచక్కిలాలు
దించరో కుండలతోనే దిగువకును
పెంచులయినదాఁకా పెనఁగేరు మనతోడ
తుంచి నోరవేసుకొని తొలఁగరో మీరు

చ. 3: తక్కక యడుకులెల్లా దాఁచిరి తమసొమ్మంటా
చిక్కెఁ జిక్కెఁ దీసుకోరో నేన వున్నవి
యెక్కెను శ్రీ వేంకటాద్రి ఇదివో మనకృష్ణుఁడు
చక్కనాయఁ బనులెల్లాఁ జాలించి రారో

రేకు: 0992-2 శంకరాభరణం సం: 19-535

పల్లవి: ఎవ్వనికి వలతువే చెలియా
యెవ్వలఁ బిలిచిన నెఱఁగవే చెలియా

చ. 1: చక్కఁగఁ బయ్యదజారిన దెఱఁగవు
యెక్కడ చూచేవే యిటు చెలియా
చెక్కులవెంటఁ జెమటలు వడియఁగ
ముక్కున నూర్పులు ముంచేవే చెలియా

చ. 2: జాఱినకొప్పునుఁ జక్కఁగఁ బెట్టవు
మీఱేవు పరాకున నేమే చెలియ
మాఱుమాటలును మాతో నాడవు
తీఱక లోవెలిఁ దిరిగేవే చెలియా

చ. 3: వెలయ హరములు వెనకకు వేసితి
తలఁ పెందున్నదె తగఁ జెలియ
కలసెను శ్రీ వేంకటపతి నఁను నిటు
కులికి యితనిఁ బేర్కొనవే చెలియా

రేకు: 0992-3 ముఖారి సం: 19-536

పల్లవి: ఎఱఁగ విన్నవించేను యిప్పుడే నేను
తఱవాతఁ దలఁచుకో తప్పదు మాచేఁతలు

చ. 1: కొప్పు ముడవఁగఁబోతే కుచములు నాఁటు జేసు-
నప్పు డోరువఁగలవా ఆయముచోటు
చిప్పిల నేఁ జూచితేనే చెమరించె నీమేను
చెప్పి మాచేత సేవలు సేయించుకోఁగలవా

చ. 2: కుంకుమ వూయఁగఁబోతే గోరికొన దాఁకుఁ జెసు
కొంకక సమ్మతించేవా గుండె దాఁకును
అంకెల మాటాడఁగా నీకట్టే మదనమెత్తె
ఇంక మావూడిగము సేయించుకోనోపేవా

చ. 3: హరములు గట్టఁబోతే నదె కాఁగిలౌఁజేసు
యీరీతి మారుకొన నిఁక వచ్చునా
యేరా శ్రీ వేంకటేశ ఇంతలో నే కూడితివి
చేరి మాచేతిపనులు చిత్తమువచ్చీనా

రేకు: 0992-4 శంకరాభరణం సం: 19-537

పల్లవి: వలపు వేచి కొరుకవద్దే నేఁడు
చెలి నింత సేయఁగాను సెలవేమే తనకు

చ. 1: చిగురుఁ బోడికి నేఁడు చింత దగునా
వెగటు మాని యతని విచ్చేయుమనవే
తగదు యీపె అలపు తనది గాదా
మగవాఁడే ఇంతైతే మానుపరాదనరే

చ. 2: కమలగంధికి నేఁడు కాఁక లింత దగునా
తమకానఁ జేకొని దయఁజూడుమనవే
అమరదు యీదోస మంతేసి మేలా
తమబోఁటు లిట్లైతేఁ దప్పించరాదనరే

చ. 3: వెసఁ గోమలికిని విరహము దగునా
యెసఁగి శ్రీ వేంకటేశుఁ నీపెఁ గావుమనమే
అసము దించక నేఁ డంతలో విచ్చేసి కూడె
రసికులచేఁతలెల్లా రతికెక్కెననరే

రేకు: 0992-5 పాడి సం: 19-538

పల్లవి: ఇంత కింతే చాలదా యేఁటికమ్మా
దొంతులాయ వలపులు తొలరో వోయమ్మా

చ. 1: ఆయనాయ వానిసుద్ద లందుకేమి నే మీకుఁ
జేయఁగల పనులకుఁ జెప్పరమ్మా
పోయినపనులకుఁ పోనీ పొద్దువోదా మీ కేమి
చాయలు సన్నలు నింక చవుల గావమ్మా

చ. 2: యేడ నుండెనేమి వాఁడు యేమిగారణము మీకు
యీడకేడ వచ్చినపని యేదమ్మా
యేడకేడ తలపోఁత లింకా మరవరా
నీడలకు యెండలకుఁ గూడునా వోయమ్మా

చ. 3: పుక్కట వీనికిఁగాను పూనుక రావద్దు గాని
తక్కక వేరోకమాట తలఁచరమ్మా
గుక్కక శ్రీ వేంకటేశుఁ గూడి మీమాట వింటి
యెక్కె మీచలము నేఁడు యెన్నికాయనమ్మా

రేకు: 0992-6 ఆహిరి సం: 19-539

పల్లవి: ఓప నోప తియ్యకురే వొడివట్టి రమ్మంటా
యీపొద్దు కాతనివద్ద కేఁగరే మీరు

చ. 1: ఔలేవే తనసుద్ద లందరుఁ దెలిసేరా
తేలింపుసటలు నాకే తెలుఁసుఁగాక
వోలి సూడుబంటౌట వొండెఁ జుట్ట మవుట గాక
మైల గొంత అందులో మణుఁగూఁ గొంతా

చ. 2: వింటిలేవే వానికిఁగా వేఁడుకొనే మీ మాఁట
రెంటికిఁ గలఁడు తనరీ తెరుఁగుదు
ఇంట నుండవలె నొండె యీడకే రావలె నొండె
కుంటెనలు గొంత మరి కూటములు గొంతా

చ. 3: అట్టేకాదా మీకుఁ దెల్లనైనవెల్లాఁ బాలవును
గట్టిగఁ దనగుణాలు కన్నవే నేను
యెట్టకేలకు శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
తిట్టు గొంతా ఇందాఁక దీవె నిఁకఁ గొంతా

రేకు: 0993-1 శంకరాభరణం సం: 19-540

పల్లవి: ఊరకున్న వారి కూరోపదన్నట్లు
నేరనైతి నే నింక నిన్నేల కొసర

చ. 1: మగిడి చూడఁగదా మనసు నీపైఁ దగిలె
తగులు గలుగఁగదా దైవారె వలపు
నగుతానే ఇంతాయ నావంకనే నేఁడు
ఇగిరించెఁ గోర్కి నీవేమి సేతువురా

చ. 2: మాటలాడఁగఁగదా మర్మములు గడునాటె
నాటుఁదమకము గదా నమఁ బాయనీదు
తేటతెల్లమి సేసె తెగనినాయాసలే
వాటపుఁదప్పు నీవల్ల నిఁకనేదీ

చ. 3: మెకమోటమునఁగదా మొలచె నివ్వెర గొకటి
వొకటి కొకటికి లంకె లమరె మన కిపుడు
వెకలినై కూడితిని వింతగా నిను నేను
అకట శ్రీవేంకటేశ అనఁగఁ జోటేది

రేకు: 0993-2 వరాళి సం: 19-541

పల్లవి: విచ్చేయవయ్యా వెలఁదిఁ జూతువు గాని
ఇచ్చకములాడేము యెట్టయినాఁగాని

చ. 1: మరుఁడు పువ్వుల నేసె మగువ నేలలు వ్రాసె
ఇరవగునీవలపు లింతగాఁ జేసె
తెరమరఁ గిది నీవు దీసినఁగాని పోదు
యెరవు సేయక నే మేమన్నా వాదు

చ. 2: చందురుఁడు జామెక్కె సతి చింతలోఁజిక్కె
అందపు నీచలములే అన్నియు దక్కె
నింద లిన్నయు నిట్టె నీమీఁద గురియాయ
అందిపొంది నేఁడు మాకు నాడఁదరియాయ

చ. 3: చల్లగాలి కడుహెచ్చె సతి గరఁగఁగ జొచ్చె
ఇల్లిదే నీమాటపటులిప్పుడే వచ్చె
చెల్లుఁబడిఁ గూడితివి శ్రీ వేంకటేశ యీచెలి
బల్లిదురాలాయ నేము పైతరవు సేయ

రేకు: 0993-3 సామంతం సం: 19-542

పల్లవి: తానేడ నేనేడ దగ్గరీ వీఁడు
పూని కన్నులఁ దిట్టినా పోఁడే వీఁడు

చ. 1: సారెకుఁ దప్పక చూచి జాణతనాలాడీని
పోరి పోరి వద్దన్నాఁ బోఁడే వీఁడే
పేరుకొని పిలిచీని పెదవుల గొణఁగీని
పూరకున్నా నవ్వుతాను వొరసీనే వీఁడు

చ. 2: పానుపుపైఁ బవళించీఁ బనులుచెప్పఁ బిలిచీ
మోనాన నే నుండినాను మొక్కీనే వీఁడు
మానములు సోఁక నవ్వీ మంతనాలే వెదకీని
వీనులు చొరఁగనీడు విన్నపాలు వినఁడు

చ. 3: పట్టినచలమే పెంచీఁ బైఁ జేయివేసీని
గుట్టున నుండఁడు నాతోఁ గొంతైనా వీఁడు
యిట్టె శ్రీ వేంకటేశుఁ డెలయించి నన్నుఁ గూడె
అట్టు కెక్కించెను నన్నాఱడిసేసి వీఁడు

రేకు: 0993-4 శ్రీ రాగం సం: 19-543

పల్లవి: చెప్పఁగ సిగ్గులువడే విదే చేఁతలు నేమే కంటిమి
ఇప్పుడుగా మాకొరిక లిటు ఫలియించినది

చ. 1: చెక్కుల జారినచెమటలు చిందరవందరకురులను
గక్కన నవిరిబాగులు కంటిమి నీకిపుడు
మొక్కలమగుకన్నెవు నీమొలక కుచంబుల మీఁదట
ఇక్కువలంటినచందురు లెక్కడివే నీకు

చ. 2: మోమునఁ దేరేటికళలును ముంచిన కన్నుల తేటలే
కామించిన భాగ్యంబులు గలిగెనే నీకిపుడు
నేమే చెప్పిన నొల్లవు నీయంతనే నీ కిప్పుడు
యీ మోహపుటసురుసురులు యెక్కడివే నీకు

చ. 3: సదమదమగురతియలపులు సారెకు సారెకు వెరగులు
నిదురలు మిక్కిలి మించెను నేఁడే నీ కిపుడు
కదియుచు శ్రీ వేంకటపతికాఁగిటఁ గూడఁగఁ గలిగెను
ఇదివో ఇంతకముందర యెక్కడివే నీకు

రేకు: 0993-5 ముఖారి సం: 19-544

పల్లవి: అందరి మెప్పించుదాఁకా నణఁగేఁగాక !నే-
నిందులోనే పాలు నీరు నేరుపరచలేనా

చ. 1: ఇంకాఁ దానే యెరిఁగీని ఇప్పుడేలంటాఁగాక
అంకెలం బదరనైతి నయ్యా నేను
వంకలొత్తి నేఁ దనవంటిదాననై తేఁ గన
లంకెలమీఁతోఁ దనలాగులెల్లఁ జెప్పనా

చ. 2: ఇప్పటి కోపము మీఁద నిట్టే వుండదని కాక
కప్పుడు నాచేఁతలెల్లఁ గంటే నేను
తప్పని నాగుణములు తనగుణములఁ బోలితే
బొప్పుతో నక్కునఁబోసి చూపనా మీకు

చ. 3: పోరానిచుట్టరికపు పొందు దనదని కాక
చేరి నోరు మూసుకొంటి చెల్లఁబో నేను
ఆరీతి శ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
తారుకాణ లిఁక నేల తానే నేను

రేకు: 0993-6 దేశి సం: 19-545

పల్లవి: అటుగనక నినుఁ దలఁచు కంతట నుండుటమేలు
అటుమటము లెందాఁక నంపరా నీవు

చ. 1: చెంతల వేరొకతెపై చిత్తము నీకుండఁగా నే
యెంతప్రియము చెప్పిన నేమి సెలవు
ఇంతట గుట్టున నుండ నెరిఁగేవు గాక నీవే
కాంతుఁడ నిద్రించువారికాళ్లు గడుగవశమా

చ. 2: అవ్వల నెవ్వతెపసకో అసురుసుకు గాఁగ నిను
నవ్వించఁబోవు టిస్సీ నగుఁబాట్లు
దవ్వులపొందువులే చవులు దగిలేవు నీవు నను
నెవ్వగ నీరువట్టుకును నేయి మందగునా

చ. 3: వేరే యేసతినో తలఁచి వేడుకలు చెలఁగఁగ
కూరిమి నేఁ బైకొనుట కూళతనము
చేరువనే కూడితికి శ్రీ వేంకటేశ్వరుఁడ
తేరిపోయినపనికి తిరుగ మాఁటేలా

రేకు: 0994-1 దేసాళం సం: 19-546

పల్లవి: పోయినపనులకేల పోనీవయ్యా
చాయ సేసుకొంటినా సమ్మతైతిఁ గాక

చ. 1: వలవవద్దంటినా వడి నీ వెవ్వరికైనా
అల మాయింటికి రాకుమంటిఁ గాక
పిలువవద్దంటినా పేరుకొ నెవ్వతెనైనా
వలవనిమాట మాతో వద్దంటిఁగాక

చ. 2: చూడఁగవద్దంటినా సుదతులవంక నిన్ను
ఆడా నీడా మమ్మంటకు మంటిఁ గాక
వేడుకకాఁడవై నీవు వీది నుండవద్దంటినా
యేడలేనిప్రియాలు నా కేటికంటిఁగాక

చ. 3: నగఁగా వద్దంటినా ననుపుసతులతోడ
యిగురుమో వడుగకు మిట్టంటిఁగాక
అగపడి శ్రీ వేంకటాధిప కూడితి నిన్ను
మొగమోడకుండితినా మొక్కనైతిఁ గాక

రేకు:	0994-2 పాడి	సం:	19-547

పల్లవి:	వాఁడిగో దగ్గరివచ్చె వద్దే యింత
ఆఁడుదాన వెదురేఁగి యందము గైకొనవే

చ. 1:	యీతఁడు విచ్చేయుటేడ ఇంతేసి మాట లేడ
రాతిరెల్లా నీవు నిద్రవోతివో పోవో
చేతికి లోనైనవేళఁ జేతురా యింత యగడు
యేతప లెత్తాడఁ బతి నిల్లాలికిఁ జెల్లునా

చ. 2:	నిన్నతఁడు చూచుటెంత నీవు తలవంచు టెంత
కన్నెకోప మెంత మూఁట గట్టుకొంటివో
మన్నించ వచ్చినవేళ మగవానిఁ బరతురా
తిన్నని పంతాలు చూప దేవులకుఁ జెల్లునా

చ. 3:	మగఁ డాడ వుండనేల మంచాన నీ వుండనేల
బిగువే నీకు వెన్నెతోఁ బెట్టిరో యేమో
నగుతా శ్రీ వేంకటాద్రి నాథుడు గూడెఁ గమ్మటి
జగడాలు రాణివాసములకుఁ జెల్లునా

రేకు: 0994-3 బౌళి సం: 19-548

పల్లవి: నిన్నింత సేసినందుకు నే నేమి సేతు దాని
అన్నిటా నెక్కెనుఁ గోప మప్పటినుండీరా

చ. 1: నగవులు వెదచల్లి నయములు మాటలాడి
జిగురువలె నిన్నది చిక్కించెఁగా
పగటులు పచరించి పడఁతి కనుచూపుల
సగమే జళిపంచి జట్టిగొనెఁగా

చ. 2: నటనలనే నడచి నంటు వినయాలు సేసి
యిటువలె నది బటలీఁదించెఁగా
సటలసిగ్గులు చూపి చాయలు సన్నలు సేసి
కటకటా నిను నింత కరఁగించెఁగా

చ. 3: కొప్పు దువ్వి నీచెక్కు కొనగోర నంటించి
ముప్పిరిఁ జెమటలలో మునిఁగించెఁగా
ఇప్పుడె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అప్పు డాకె నిన్నుఁ గూడి అలయించెఁగా

రేకు: 0994-4 గుజ్జరి సం: 19-549

పల్లవి: బాపు బాపు మెచ్చితిని పదవే నీవు
తీపులోనఁ జేఁదేల తెగకువే నీవు

చ. 1: సెలవి నే నవ్వుటేడ చేరి నీ గొఱఁగు లేడ
మెలఁకువ లెస్సాయ మేలే నీవు
అలిగినదే లేదు అంతక తొల్లే మనము
పిలిచితే బిగిసేది పెద్దరికమటవే

చ. 2: పొందినేఁ జేయివేయుటెంత బొమ్మల నీజంకె నెంత
అందు కందుకు లెస్సాయ నౌనే నీవు
కందువై నమనలోనఁ గవట మించుక లేదు
యిందరుఁ జూడఁగఁ గోప మేడనుండి వచ్చెనే

చ. 3: కాఁగిట నేఁ గూడుటెట్టు కరఁగే వింతలో నెట్టు
రాఁగె నిదివో వలపు రావే నీవు
చేఁగదేరఁ గూడితిని శ్రీ వేంకటేశుఁడ నేను
అఁగినరతుల నింత అలయఁగఁదగునా

రేకు: 0994-5 ఆహిరి సం: 19-550

పల్లవి: అండఁ గూచుండెను చెలి యంత చాలదా
నిండునీతో జూజమాడ నేఁడే నేరుచునా

చ. 1: పగడవాతెర యెత్తి పలికెను చాలదా! నీవు
మగువను మంతనాన మాటాడియ్యఁగా
తగినకన్యక ఇంతేఁ తమకించనేల
ఇగిరించె సిగ్గులు నేఁ డీప్పుడే తేరునా

చ. 2: తలుపుమాటున నుండి తమిఁ జూచెఁ జాలదా నీవు
పిలిచి చేయివట్టి పెనఁగఁగను
చలివాయ నిప్పు డిట్టె సరసము లేల
వొలసి రట్టడితన మొక్కమాఁటే వచ్చునా

చ. 3: కాఁగిలించఁగా నీతోఁ గరఁగెను చాలదా నీవు
మాఁగినమోవి ఇచ్చి మచ్చు చల్లఁగా
పొఁగిన శ్రీ వేంకటేశ పడఁతిఁ గూడితివి
ఆఁగి నీతో రతిసేయ కప్పుడే పోనిచ్చునా

రేకు:	0994-6 గౌళ	సం:	19-551

పల్లవి:	ఏమని చెప్పుదమే ఇద్దరిభావములును
ప్రేమము లీరూపములై పెనఁగఁగఁ జొచ్చినవి

చ. 1:	కోపగించుకొని రాఁగా కొంగువట్టీ రమణుఁడు
వోపనంటేఁ బెనఁగీనే వొయ్యనే చెలి
పైపై కాఁగిటఁబట్టి బలిమి సేయఁగఁబోఁగా
తీపుల పెదవి వంచి తిట్టీ నతనిని

చ. 2:	పెదవి గొణఁగుకోఁగా ప్రియుఁ డాకెచెక్కు నొక్కె
చెదర నాడుత లోనై చిక్కీఁ జెలి
మొదలఁ గోలుముందుగ మోవి గంటిసేసే నాడ
అదివో చురుముఁ జూపు లాకె చల్లీ మీఁదను

చ. 3:	పక్కన నానవెట్టఁగ పానుపుపైఁ బడవేసీ
చొక్కుచుఁ గరఁగి తానే సొలసీఁ జెలి
యిక్కువైన శ్రీ వేంకటేశుఁడు గూడె నిట్టె
ముక్కుమీఁది వేలితోన మోనమున నున్నది

రేకు: 0995-1 ఆహిరి సం: 19-552

పల్లవి: అల్లదె మేడమీఁద నతివ
వెల్లవిరయ్యీ నిట్టె విచ్చేయవయ్యా

చ. 1: వాలుకచూపులు నీపై వంచీ
బేలుఁబులకలు మేనఁ బెంచీ
తాలిమెందు దాఁచెనో తాను నీకే
మేలుసేసి వున్న దిదె మిక్కిలి మాపిన్నది

చ. 2: మనసు నీపైఁ గడుమరిగీ
వొనరుఁజెలులమీఁద నొరగీ
తనివిదీర దెంతైనా తాను నీకె
అనయము దలఁచితి నన్నది మాపిన్నది

చ. 3: తమకపుఁ జెమటలఁ దడసీ
జమళి కోరికలచే జడిసీ
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి
గములై ననీగుణాలు కన్నది మాపిన్నది

రేకు: 0995-2 నాదరామక్రియ సం: 19-553

పల్లవి: అంది తెలియఁగరాదా అంగననేరుపులెల్లా
కందువతారుకాణలు గలిగె మీకిప్పుడు

చ. 1: నిద్దపు నొసలిమీఁద నిలువుఁగస్తూరిబొట్టు
అద్దము చూచి గోర నటుదిద్దఁగా
వొద్దిక వెనకవంకననుండిననీనీడ గని
ముద్దుచూపి సన్న సేసీ మొరఁగులేలయ్యా

చ. 2: గుబ్బలపై మాణికాలఁ గుచ్చినహారములు
అబ్బురానఁ దలవంచి యమరించఁగా
నిబ్బరాన నీవెదుట నిలిచితే నీనీడ
గబ్బితనమునఁ గని గాఁగిలించె నదివో

చ. 3: మించుబంగారుపావాలు మెట్టఁగ శ్రీవేంకటేశ
చంచుల నీవును దనసరి నుండఁగా
నించి గోరిమెఱుఁగులో నీరూపు వొడగని
అంచెల నిన్నుఁ గలసినది మెచ్చరాదా

రేకు: 0995-3 పాడి సం: 19-554

పల్లవి: బిగిసే వింకా నీవు పిలిచినరావు
చిగురువలెనే వుండు చేఁగసుమ్మీ వలపు

చ. 1: చిత్తజునియమ్ములునుఁ జెనియచూపులు లోలోఁ
బొత్తుల నున్నవి పాలువో దెన్నఁడు
హత్తినజక్కవలును నంగనచన్నులు నొళ-
జొత్తుసుమ్మీ మీఁదటెత్తు చూచుకొందుగాని

చ. 2: తుమ్మిదలపవుఁజులు తొయ్యలినెరిఁగురులు
వుమ్మడి నున్నవి పాయ కొకటొకటి
చిమ్ములపలుకులును చిలుకలుఁ దమలోన
దొమ్మిచుట్టరిక మింకఁ దోఁచినది దెరువు

చ. 3: చందురునివెన్నెలలు సకియలేఁతనవ్వులు
ముందువెనకలు వాసి మొద లొక్కటే
ఇందునె శ్రీవేంకటేశ ఇంత సేసి కూడితివి
పొందినసతికి నీకుఁ బొదుసుమ్మీ యెప్పుడు

రేకు: 0995-4 లలిత సం: 19-555

పల్లవి: చేసినట్టెల్లా నీవు సేయవయ్యా
వోసరించి నవ్వుతా నే నూరకుండే నిఁకను

చ. 1: మల్లడిమీగుణములు మానుమన మాకేల
చెల్లుబడిగలవారే చెప్పేరు గాక
ముల్లు ముంటనేకాక ముసలాన వచ్చునా
వొల్ల వొల్ల నీవద్ద నూరకుండే నిఁకను

చ. 2: కొత్తసుద్దులెల్ల నేము కోరి నీతో నాడనేల
చిత్తమువచ్చినవారే చెప్పేరుగాక
మెత్తనైన చోటికే మించినగుద్దలి వాఁడి
వొత్తనేల వింతవార మూరకుండే మిఁకను

చ. 3: అంగపు నీ రేకలు అవి చూప మాకేల
చెంగట సలిగెవారే చెప్పేరుగాక
అంగవించి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితి-
వుంగిటిరతులతోడ నూరకుండే మిఁకను

రేకు: 0995-5 శంకరాభరణం సం: 19-556

పల్లవి: ఇద్దరూ నేకములైతే నేమాయనే
చద్దివేఁడి వలపులు జాగునేయఁ జెల్లునా

చ. 1: తుమ్మిదవంటివాఁడు తొలుతనే మగవాఁడు
యెమ్మెలకు నేడనున్నా నేమాయనే
తమ్మి పువ్వువంటి దింతే తగిలినయాఁటదెల్లా
సమ్మతించవలెఁగాక సడిఁబెట్టఁజెల్లునా

చ. 2: వెన్నెలవంటి దింతే వెస మగవానినవ్వు
యెన్నిచోట్లఁ గాసిన నేమాయనే
యెన్నఁ జకోరాలవంటి వింతులకనుఁగొనలు
అన్నిటాఁ బొందౌటగాక అలుఁగఁగఁజెల్లునా

చ. 3: సిరులగాలివంటిది శ్రీవేంకటేశుమనసు
ఇరవై యెందువారినా నేమాయనే
విరులతావివంటివెలఁదివి నిన్నుఁగూడె
నరసుఁడాతని నింక జరయంగఁ జెల్లునా

రేకు: 0995-6 సామంతం సం: 19-557

పల్లవి: అందుకే చింతయ్యీని అప్పటనుండి యు నాకు
కందువ నెదుగఁబోయి కమ్మరఁ దేవుగా

చ. 1: పడఁతి వాని నొడఁబరచి తోడుకరావే
కడు నీనేరుపు లిందే కనుఁగొనేఁగా
వడిఁ బరాకైతినంటా వాఁడే యలగిపోయె
బడి నేఁగి నామారు పై కొని మొక్కవుగా

చ. 2: యెంతరానన్నా వాని నీపొద్దే తోడుకరావే
యిఁతి నీవు సేసేమేలు ఇందుఁజూచేఁగా
పంత మేమోఅంటినంటా పట్టఁగా నలిగిపోయె
ఇంతలో నామారు వాని ఇంటికి నేఁగవుగా

చ. 3: శ్రీ వేంకటేశుని నన్నుఁ జేకొని కూడించితివే
యీ వేళ నిన్ను మెచ్చే దిందువంకఁగా
పూవుల వేసితినంటాఁ బొదిగి నన్నిదె పట్టె
ఆవల నామారు నీవు అతని వేయువుగా

రేకు: 0996-1 వరాళి సం: 19-558

పల్లవి: ఆడువారి కింతలోఁగే వదేమిరా
నేఁడు నాఁడు నొక్కఁడవు నీవే కదరా

చ. 1: నవ్వుతా గోర నిటంటే నాఁటెనంటాఁ గోపించేవు
ఇవ్వల రాకాసికయ్యా లెట్టునేసితో
పువ్వుల వేయఁబూఁచితేఁ బొరిఁ దప్పించుకొనేవు
రవ్వైననీబిరుదెల్లా రతికెక్కెరా

చ. 2: వెలయఁ గొంగు పట్టితే విడుమంటాఁ బెనఁగేవు
యెలమి రోలఁగట్టితే నెట్టుంటివో
చిలికిన పన్నీటి జిగి నుడ్డుకుడిచేవు
పలు జలధుల నెట్టు పవ్వళించితివిరా

చ. 3: సరి నన్నొకతెఁ గూడి సదమదమైతి విట్టె
యిరవై పదారువేల నెట్టు గూడితో
అరయ శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
పరగ నాతోనే నీకు బలిమి చెల్లదురా

రేకు: 0996-2 ఆహిరి సం: 19-559

పల్లవి: చెప్పఁ గొలఁదులు గావు చెలియ సింగార మిది
చొప్పుగా నిందరికి సూచనై నిలిచె

చ. 1: వెలఁది కుచముల మీఁద వెలి పెంపుపయ్యె దిదె
యెలమి బోలింపరే యెట్లున్నది
కులికి పతిఁ గలియచోఁ గురియుఁ జెమటలజడికి
మెలఁగి కొండల మొయిలు మేసినట్లాయ

చ. 2: సుదతి నెన్నుదుటిపై జూడఁ గుంకుమ బొట్టు
యెదుటఁ బొలింపరే యెట్లున్నది
కదిసి తన నాయకునిఁ గలసినప్పటి వేళ
మదనరాగం బిపుడె మలసినట్లాయ

చ. 3: సతితురుములో విరులు జారి పైరాలె నిదె
యితరులకు బోలించ నెట్లున్నది
యితవుగా శ్రీవేంకటేశు గూడిన ఇపుడు
చతురతలఁ బై సేస చల్లినట్లాయ

రేకు: 0996-3 ముఖారి సం: 19-560

పల్లవి: ఎఱగఁజుమ్మి యపు డేమి నేను
మొఱఁగు లన్నిటికిని మొక్కే నేనిపుడు

చ. 1: నిక్కమును దొరవంటా నిన్నుఁ జూడవచ్చితేను
చిక్కనివలపు నామైఁ జిమ్మి రేఁచితి
నెక్కొని నేఁ గళదాఁకి నీమీఁద నొరగితి
తక్కక నాకాలు చేయి దాఁకదు గదా

చ. 2: వొంటి నీవున్నాడవంటా వూరికే నే వచ్చితేను
యింటివా రెఱగకుండా నింత సేసితి
జంటనై కాదనలేక సరిగా నేఁగూచుంటి
అంటితిని మందె మేళా లాయనోకదా

చ. 3: మంచివాఁడవని నీతో మాటలాడ వచ్చితేను
యెంచకే యింతి సేసితి వేరా నీవు
కొంచక శ్రీవేంకటేశ కూడితి మిద్దరమును
ఆంచల నారతుల నీవలసితివో కదా

రేకు:	0996-4 మాళవి	సం:	19-561

పల్లవి:	ఇంత సేయ జెల్లునా యీరమణిఁ బెడఁబాసి
యెంత కెంత విన్నవించే నింక నీచిత్తమురా

చ. 1:	విరులు ముడువఁ బోతే వెలది యేమో కాని
మరుని బాణములంటా మచ్చరించీ ని
నిరతిఁ గొప్పుదువ్వితే నిండుఁదుమ్మిదలగుంపు
వరుస రేఁచేరంటా వద్దనీఁ జెలి

చ. 2:	పయ్యద వెట్టఁగఁబోతే బలుజక్కవలతోడ
కయ్య మందించేనంటాఁ గసరీని
పుయ్యఁగ గందము చూచి పొరిఁ గాలకూటమంటా
నెయ్యపుఁజెలులఁ జూచి నేరమెంచీని

చ. 3:	అరుదైనమాణికాలహారము లియ్యఁగఁబోతే
విరహాగ్ని శిఖలంటా వెఱచీని
గరమ శ్రీవెంకటేశ కలసితి వింతలోనే
యిసరసై యలమేల్మంగ యిటు మెచ్చీని

రేకు: 0996-5 ఆహిరి సం: 19-562

పల్లవి: అడుగువెట్టితే నీకు ఆకెపాదమాన సుమ్మీ
నిడు జంగనడు పేల నిలవయ్య పోక

చ. 1: సారె జాఱె మొలనూలు జడిసె ముత్తేలుపేరు
భారపుసొమ్ముతో నిన్నుఁ బట్టరాఁగాను
వూరకే యలిగిపోయే వువిదదిక్కు చూడక
నేరుచుకొంటివి నేఁడే నిలవయ్య పోక

చ. 2: కురులు చెమటఁదోఁగె కుచయుగ మిటురానె
బెరసి నీచేయివట్టి పెనఁగఁగాను
శిరసు వంచుకొంటివి చెలియకు మొకమోడి
నెరవేరెఁ బనులెల్లా నిలవయ్య పోక

చ. 3: పులకలు మేన నిందె భోగపుఁగళలు మించె-
నలమేలమంగ నిన్ను నలమఁగాను
యెలిమి శ్రీ వేంకటేశు యియ్యకొని కూడితివి
నెలవుల నిట్లానె నిలవయ్య పోక

రేకు: 0996-6 దేవగాంధారి సం: 19-563

పల్లవి: ఇంటికి విచ్చేసె నాతఁడేమే నీవు
కంటకములాడేది కాదే నీవు

చ. 1: ఆగడుఁజెమటతోడ నలసివచ్చినపతి
యెగసక్కేలే యాడే వేమే నీవు
మగవాని మోహ మింత మదివిచ్చి చూడఁబోతే
యిగురువంటి దింతే యేల నీవు

చ. 2: చెంతల నిన్ను నవ్వించి సిగ్గులెల్లాఁ బాపినాఁడు
యెంతైనా మెచ్చవైతి వేమే నీవు
పంతపు దొరలపొందు పచ్చిగాఁ బిసుకఁబోతే
యింతలోఁ బసురువేసు నిదియాలే నీవు

చ. 3: నెయ్యాన గడ్డమువంటి నిన్నతఁడు వేఁడుకొని
యియ్యకొనవే పనకి యేమే నీవు
తియ్యఁగా శ్రీవేంకటాద్రిదేవునిఁ గూడితి వెట్టె
అయ్యెడ నలమేల్మంగ వునవునే నీవు

రేకు: 0997-1 సింధురామక్రియ సం: 19-564

పల్లవి: ఔరా రాజసము అంతేసి తగదా
గారావాన నీవాకెకుఁ గలకాలము

చ. 1: నిలుచుండి పిలిచేటినీతో నంగన నేఁడు
మలగుపై నొరగుండే మాటలాడీని
వెలినుండి వేఁడుకోఁగా వెసఁ దలుపుమాఁటుగ
సెలవుల నవ్వీ నిన్నుఁ జెల్లురా యీసతికి

చ. 2: ఆంగవించి సరసము లాడేటి నీతోను
ముంగిటఁ దప్పక చూచీ మోనానఁజెలి
చెంగటఁ బ్రియము చెప్పె చెక్కునొక్కఁగా నీవు
యెంగిలిమోవి గదల నించుకంత గొణఁగె

చ. 3: పూనిపట్టి కొప్పు దువ్వి బుజ్జగించె నియ్యెడకు
మేనెల్ల మణచె నల మేలు మంగ
అని పట్టి శ్రీవేంకటాధిప కూడితి విట్టె
తానైతే నీపురమెక్కి తానకమై నిలిచె

రేకు: 0997-2 మాళవి సం: 19-565

పల్లవి: ఊడిగపు సతులాల వుండరే మీరు
ఆడరే మెల్లనిమాట లంతంత మీరు

చ. 1: మాటలాడే రిద్దరును మాణికపుటింటిలోన
తేటలుగ దేవుఁడును దేవులు నిదె
యేటికి దగ్గరిపోయే రిదివేళగాదు మీకు
బోఁటులాల పిలిచితే పోదముగాని

చ. 2: తూఁగుటుయ్యాల లూగేరు తొలఁకు మోహము తోడ
యేఁగివచ్చిలోని కేఁగి రింతకముందు
తోఁగిచూడకురే మీరు తొడరి తమంతనే
పొఁగి పిలిచినప్పుడే పలుకుదము

చ. 3: యేకతాన శ్రీ వేంకటేశుఁడలమేల్మంగయుఁ
బై కొని కూడున్నవారు పానువుమీఁద
పోకురే చనవుచేసి పొలఁతు లిపుడే వారు
ఆకుమడువఁబిలిచే రప్పుడే పోదము

రేకు: 0997-3 ముఖారి సం: 19-566

పల్లవి: అప్పటి నెత్తము జాజమాడేవు పరాకున
యిప్పుడు నీవద్ద నున్న దిదివో చెలి

చ. 1: ముంచిముంటి నవ్వునవ్వీ మొగలి రేకుల కొప్పు
యించుకించుక గదల నిదివో చెలి
తుంచితుంచి నిన్ను వేసి తోరుపుఁబువ్వులదండ
ఇంచువిలుతునివలె నిదివో చెలి

చ. 2: చిత్తగించి మాఁటలాడీ చెక్కులమెరుఁగు మించ
యెత్తినవదనముతో నిదివో చెలి
త త్తరించి వీఁపునఁ దనుపేరు వ్రాసీని
యిత్తల నేమీ నెఱఁగ దిదివో చెలి

చ. 3: తొడమీఁదఁ దొడవేసీఁ దోరపుకుచము లానీ-
నెడనెడ నొత్తుతాను యిధివో చెలి
పడఁతి శ్రీ వేంకటేశ పరాకుమాని నిన్ను-
నెడయక గాఁగిలించె నిదివో చెలి

రేకు: 0997-4 సామంతం సం: 19-567

పల్లవి: వలెనా నీకింత దూరు వనితలతో నేఁడు
యెలమి నామాట విని యింటికి రావయ్యా

చ. 1: ఆగడాలు నీవే నేసి యలగేవు రానంటా నీ -
లాగులు చూచినవారు లండఁడందురు
వేగుదాఁకా విరహాన వేసరి మా వంటివారు
యేగతి మన్నించఁడు వీఁడెంత కూళందురు

చ. 2: వలచి చెయివట్టితే వాఁటముగా నవ్వేవు
తెలిసినవారు నిన్ను దిమ్మ రందురు
తలపోసి నీకుఁగా దప్పిఁబడ్డయాఁడువారు
చలమరి వీఁడేడ జాణఁడందురు

చ. 3: ముంచిన ప్రియముతోడ మొక్కినాఁగై కొనకున్న
చంచలించినట్టివారు జడుఁడందురు
యెంచి చూచి శ్రీవేంకటేశ నన్నుఁగూడితివి
వంచ నింత లేకుండితే వడి గర్వి యందురు

రేకు: 0997-5 ఆహిరి సం: 19-568

పల్లవి: జమళిఁగల్యాణము సరసుఁడాడె నేఁడు
చెమట లేఁటికి వచ్చెఁ జెప్పరే

చ. 1: తూఁగు మంచముమీఁదఁ దొయ్యలు లిద్దరిఁ
గాఁగిలించుకొంటాఁ గరఁగీని
యేఁగుబెండ్లికొడు కెవ్వరిపై మోహము
చేఁగదేర నిది సరిఁ జెప్పలే

చ. 2: ఇదె పెండ్లి పీఁట యిద్దరి కొకమాఁటే
కదసి పచ్చడము గప్పీని
యెదుగ దోసిట నించి యెవ్వరిపైఁ దలఁబాలు
చెదరకుండాఁ బోసెఁ జెప్పరే

చ. 3: పొలఁతులిద్దరితోడ బువ్వానఁ గూచుండి
చలివాయఁ గళ్ళిచ్చీ సరిగాను
యెలమి శ్రీ వేంకటేశుఁ డెనసె నీవేళ నే-
చెలులకుఁ జనవిచ్చెఁ జెప్పరే

రేకు: 0997-6 లలిత సం: 19-569

పల్లవి: దీపించఁ జక్కఁదనము దేవునికిని
పైపైఁ జల్లేరు నేఁడు పన్నీరుకాపు

చ. 1: పుడివోనికల్పభూజ మొద్దికఁ గొమ్మలతోనే
పొడవెల్లా దెల్లనై పూచెనో కాక
యెడలేక తిరుమేన నింతటా మెత్తిరిదివో
కడలేనిహరికిని కప్పురకాపు

చ. 2: తిరమై యాకాసమందు తెల్లనిచంద్రునిమీఁద
వరుస నీల మేఘము వాలెనో కాక
సరసనే శశివర్ణ మైనందు
పురిగొన నించిరిదే పుణుగుకాపు

చ. 3: పొంచి నీలగిరి మీఁద బొసఁగి బంగారు కొండ
అంచెలఁ గీలించినట్టి యందమో కాక
మించి శ్రీ వేంకటపతి మెడ నలమెలుమంగఁ
జంచులఁ బెట్టి పూసిరి చందనకాపు

రేకు: 0998-1 లలిత సం: 19-570

పల్లవి: ఇందుకే నీవు వచ్చితి వీడనేనే నున్నవాఁడ
విందువంటినీగుణాలు వేవేలు గదవే

చ. 1: మట్టెలు గల్లురనఁగ మగువ యెందు వోయేవే
యిట్టేనీ కెదురుచూచి యీడ నున్నాఁడ
కట్టిన నీదవ్వఁటము గజభజించఁగ నీ-
దిట్టమాట లివి మాకు దెలియవు గదవే

చ. 2: వెదచల్లువాసనతో వెదకే వెవ్వరినే
యిదె నీవు రమ్మనగా నీడ నున్నాఁడ
కదిసి నీముంజేతికంకాణాలరవళికి
చదల నీవిన్నపాలు సందడినే వున్నవే

చ. 3: కలకలనవ్వులతో కమ్మటి నేమిచూచేవే
యెలిమి నిన్నుఁగాచుక యీడ నున్నాడ
చెలఁగి కూడితి నిదె శ్రీవేంకటేశుఁడ నిన్ను
పలుకుఁబంతము నింతబలువాయఁగదవే

రేకు: 0998-2 శంకరాభరణం సం: 19-571

పల్లవి: ఆయలేరా మాతోనే అంత యేఁటికి
చాయలకు సన్నలకు చవులువుట్టీనా

చ. 1: బలిమిఁ బట్టకురా పనిగల దీవేళ
బలిమెల్లా నాఁడువారిపైనేయటరా
చలమింతేఁటికిరా సమ్మతి రేపయ్యీఁగాక
వలపు లింతటిలోనే వడ్డికిఁ బారీనా

చ. 2: కొనగోర నొత్తకురా కుమ్మెవోయీ ముఁజేయి
కొనఁబెట్టి మోహాలు కొనసాగీనా
వెనక వచ్చేరా వీరిడిఁ జేయకు నన్ను
ననిచినమన సిట్టేనాని మెత్తనాయనా

చ. 3: పయిఁ జేయివేయకురా పట్టరాదు మేనికాఁక
ప్రియములు పెంచఁ బెంచఁ బెంటలయ్యీనా
దయతో శ్రీవెంకటేశ తగిలి కూడితి నన్ను
క్రియ వచ్చె నిఁక నిన్నుఁ గేరడమాడేనా

రేకు: 0998-3 ధన్నాసి సం: 19-572

పల్లవి: విచ్చేయవయ్యా వేగమే అక్కడికి
అచ్చమైనకోరికతో నలసీఁ జెలి

చ. 1: వుప్పరిగెలోన నీవు వున్నాఁడవంటా వచ్చి
అప్పుడే రావైతివంటా నడిగీఁ జెలి
తొప్పఁ దోఁగేచెమటతో తూగుమంచముపైఁబండి
ముప్పిరి మోహములోన మునిఁగీఁ జెలి

చ. 2: వేడుకతో నీకు నిట్టే వీడెమిచ్చేనంటా వచ్చి
వీడుపడి యందు నిందు వెదకీఁ జెలి
వాడుచు మలగుమీఁద వడి నొరగుండి తాను
పాడించుకొనీ నీపై పాటలిన్నీఁ జెలి

చ. 3: వుట్టిపడి నీవు కొలువున్నాఁడవంటా విని
అట్టె నిన్ను రమ్మని చెప్పింపీఁ జెలి
గుట్టున శ్రీ వేంకటేశ కూడి యలమేలుమంగ
నట్టనడుమ నిందుకే నవ్వీఁజెలి

రేకు: 0998-4 హిందోళం సం: 19-573

పల్లవి: ఎంత మోహమో మీకు నిట్టే బతుకరయ్య
సంతసపువేళ మీకు చవి చెరితిఁగా

చ. 1: యిద్దరు నొక్కపచ్చడ మిటు గట్టుక మీరు
అద్దరిపాటు నే రాఁగా అట్టేలోఁగేరు
వొద్దు వొద్దు మీకునేల వూరకే వట్టిభయము
గద్దరి నేం బుద్ది మీకు కంటైతిఁగా

చ. 2: చూపుల మీ రిద్దరూను సొరిదిఁ గరఁగుకొంటా
యేపున నుండఁగఁ నే నేలవస్తినో
రాపుల నాకుఁగా మీరు రహిఁ దియ్య నింతయేల
తీపుల మీగుండెలకు దిగులైతిఁగా

చ. 3: ముంచి యిద్దరునుఁ గూడి ముచ్చటలే యాడుకోఁగా
యెంచక పొడచూపితి నిట్టేనేను
అంచెల శ్రీ వేంకటేశ అలమేలుమంగను నే
మంచమెక్కి కూడుటకు మనసైతిఁగా

రేకు: 0998-5 వరాళి సం: 19-574

పల్లవి: ఎరవు సతమవునా యెప్పుడు నేము నేమే
మురి పెపుటాకెఁ గని మొగమోడితివి

చ. 1: మగువ కప్రము నోట మాటలాడీ వినవయ్య
వెగటైననేమేమన్నా వినవైతివి
బిగి శుంగరపువేలఁ బిలిచీఁ బోవయ్యా
జిగి నేము యెంత విలిచినా రావైతివి

చ. 2: మొనగోరిచేత నాకె మొక్కీఁ జేకొనవయ్య
పనివడి మాతోనే పరాకైతివి
ననుపున నాకె నీతో నవ్వె నీవు నవ్వవయ్య
చనవున మానవ్వు చవిగాదు నీకు

చ. 3: గందము వూసినమేనఁ గాఁగిలించీ మెచ్చవయ్య
ఇందుకుఁగా మాతోడ నింత సేసితివి
అందపు శ్రీ వేంకటేశ అలమేలమంగ నిన్నుఁ
బొందఁగాఁ జొక్కితివి మాబుద్దులు చవాయఁగా

రేకు: 0998-6 ముఖారి సం: 19-575

పల్లవి: ఎదురు చూచీ నీవు యెప్పుడు వత్తువో యంటా
పదఁ గదవే నీతో పాలుపడ్డాఁ డతఁడు

చ. 1: కొంకక కూడినదాఁకా కొండవంటిది వలపు
అంకెకు వచ్చినదాఁకా నాయమువంటిది చింత
సంకెదేరినందాఁకా చలివంటిది సిగ్గు
యింకా నేఁటికి రానే యీడనున్నాఁ డతఁడు

చ. 2: మనసు గలయదాఁకా మరులువంటిది తమి
యెనయఁ బిలుచుదాఁకా యేరువంటిది కోరికె
కని మాటాడుదాఁకా చీఁకటివంటిది మోనము
కినియకువే నీవాకిటనున్నాఁ డతఁడు

చ. 3: సరిఁగఁగిలించుదాఁకా జాలివంటిది వయసు
ధరఁ దలయెత్తుదాఁకా తలుపువంటిది చూపు
ఇరవై శ్రీ వేంకటేశుఁడీడకే విచ్చేసి కూడె
వరు సడుగక రావే వద్దనున్నాఁ డతఁడు

రేకు: 0999-1 వరాళి సం: 19-576

పల్లవి: ఏమోయని వుంటి మిందాఁకా
యీమాటలేకా యిఁక నేలరా

చ. 1: అందరిఁబొమ్మని యంకెకుఁబిలిచేవు
యిందుకా వోరి యిందాఁకా
అందుకు మావారి నడిగి వచ్చేఁగాని
పొందుగా దీవేళ పోపోరా

చ. 2: జఱయచుఁ బిలిపించి సరసములాడేవు
యెఱఁగనైతిదా యిందాఁకా
మఱి జంకించకు కడమా నేఁ జెప్పఁగాని
తఱిగాదు యీవేళ తడవకురా

చ. 3: చెక్కునొక్కి ననుఁజేకొని కూడితి
యెక్కెరా నీచల మిందాఁకా
చిక్కనినవ్వుల శ్రీ వేంకటేశుఁడ
దక్కితి నిఁక నెందూ దలఁగకురా

రేకు: 0999-2 శంకరాభరణం సం: 19-577

పల్లవి: ఎక్కడౌతా నెఱఁగదు యెంత వలచెనోకాని
చిక్కువడ్డవేళ బుద్దిచెప్పరె చెలులు

చ. 1: కోరి మాఁటలాడీఁ గాని కొప్పు వీడు టెఱఁగదు
ఆరయ విభునితోడ నయ్యా చెలి
పారితెంచీఁ జనుఁగొంగు బయలౌతా నెఱఁగదు
గారవించిమీరైనాఁ గప్పరే చెలులు

చ. 2: తప్పక చూచీఁగాని తన్నుఁదానె యెఱఁగదు
అప్పుడే మోహము నాఁటీ నయ్యో చెలి
చిప్పిలఁ బైనొరగీని చెమరించు టెఱఁగదు
దప్పిదేర విసరరే దగ్గరైనఁ జెలులు

చ. 3: కాఁగిలించకొనీఁగాని కళదాఁకు టెఱఁగదు
అఁగి తనివిదీరక అయ్యో చెలి
వీఁగక కడపలోన శ్రీ వేంకటేశుఁగూడి చెలి
చేఁగదేర నవ్వీ సన్న సేయరే చెలులు

రేకు: 0999-3 సామంతం సం: 19-578

పల్లవి: కొలువున్నాఁడదివో గోవిందరాజు
కొలఁదిలేనిసొమ్ముల గోవిందరాజు

చ. 1: గారవానఁ బాదములు కాంతలపైఁ బారఁజాఁచి
కూరములు వెదచల్లీ గోవిందరాజు
దీరత సంకుఁజక్రాలతెల్లని కన్నులతోడ
కోరినవరము లిచ్చీ గోవిందరాజు

చ. 2: దట్టపుంగరాలవేళ్ల దాపలిచెయు వారఁజాఁచి
గుట్టుతో నూరకున్నాఁడు గోవిందరాజు
వొట్టుకొనె వలకేలు వున్నతిశిరసుకింద
కొట్టఁగొన నవ్వులతో గోవిందరాజు

చ. 3: చిప్పిలుతా నొత్తగిలె శేషునిపడగెనీడ
గొప్పకిరీటముతోడ గోవిందరాజు
అప్పుడే బొడ్డునఁ గనె నజని శ్రీ వేంకటాద్రి-
కుప్పెకటారముతోడ గోవిందరాజు

రేకు: 0999-4 కేదారగౌళ సం: 19-579

పల్లవి: వద్దుసుమ్మీ ఇది నీవువలచిననీరమణి
వొద్దనుండఁగానే యింత వుమ్మలఁబెట్టేవు

చ. 1: చెక్కులెల్లాఁ జెమరించెఁ జేలియకు విభుఁడ నీ-
వక్కడనెందో పరాకై వుండఁగా
ముక్కునఁ గోపము నిండె ముందరనుండినయాపె
తక్కించి నీవు పరులఁ దప్పకచూడఁగను

చ. 2: తనువెల్లాఁ గాఁకరేఁగె తరుణి చూడఁగ నీవు
మనసిచ్చి సతులతో మాటలాడఁగా
కనుఁగొన లెఱ్ఱనాయ కలికి నవ్వఁగ నీవు
యెనలేని తలపోఁత లెక్కడో పెంచఁగను

చ. 3: ముచ్చికలే దైవారె మగువవిన్నపము నీ-
విచ్చగించి ఇన్నిటికి నియ్యకొనఁగా
పచ్చిగా శ్రీ వేంకటేశ పైకొని కూడితి చెలి-
నచ్చలములెల్లాఁ దీరె నంతేసి సేయఁగను

రేకు: 0999-5 ఆహిరి సం: 19-580

పల్లవి: వేగిరించకురే వెలఁదులాల
బాగుగా నారమణుఁడు పాడెలఁగఁడా

చ. 1: దగ్గరి వచ్చినవాఁడు తనే మాటాడఁడా
యెగ్గువట్టి నుండరే యిదేమనక
బగ్గన రమ్మన్నవాఁడు పైకొనక మానునా
సిగ్గువడీ మానరే చేరి విన్నవించక

చ. 2: నన్ను మన్నించినవాఁడు నవ్వక మానీనా
సన్నలు సేయకురే జడిసీఁ దాను
అన్నిటా వలచినాఁడు ఆదరించకుండునా
యిన్నేసి దూరకురే యేమనీనో అతఁడు

చ. 3: ఇయ్యకొనొనట్టివాఁడు ఇటమీఁదెలఁగఁడా
కొయ్యతనాలాడకురే కోపగించీని
ఇయ్యెడనే శ్రీ వేంకటేశుఁడిట్టె నన్నుఁ గూడె
నెయ్యములె నెరపరే నిండుదొర ఇతఁడు

రేకు: 0999-6 శ్రీ రాగం సం: 19-581

పల్లవి: చిన్నదానవై నాను చేఁతలివి మేలమ్మ
నిన్నుఁ జూచినసతులెల్లా నేఁడు మెచ్చేరమ్మా

చ. 1: చెక్కునఁబెట్టినచేయి సెలవినవ్వినవ్వు
తక్కక వోచెలి నీకే తగునమ్మా
పక్కన నిట్టూర్పులును పతితోడిమాటలు
నెక్కొని యింతేసి యాడ నేరిచితివమ్మా

చ. 2: తేలగింపుఁజూపులును తియ్యనివినయములు
కాలమందే నీయందే కంటిమమ్మా
తాలిమి నివ్వెరగులు తమకపుఁగరఁగులు
వేళతో విభునిమీఁద వేసితివమ్మా

చ. 3: వసివాడునటనలు వలపులఘటనలు
యెసరెత్తివి నేఁడే యేమమ్మా
కొసరి శ్రీ వేంకటేశుఁ గూడితి వింతటిలోనే
రసికతనము నీకు రతికెక్కెనమ్మా

రేకు: 1000-1 నాదరామక్రియ సం: 19-582

పల్లవి: అతని నేచేసేనంటా నట్టేనీవు వేఁగేవు
యీతలఁబోయేపొద్దు లెవ్వరికి సెలవే

చ. 1: తడఁబాట్టు పతితోడ తలుపుమాఁటున వుండి
యెడమాట లాడించే వేమే నీవు
జడిసి యాతనితోడి చలానకు నీవు నట్టె
వుడికేయ వుసరాఁకల వోరువఁగఁగలవా

చ. 2: ఆడనుండే తెరలోన అక్కరైనపతికిని
వీడెమిచ్చి పంపే వేమే వెలఁది నీవు
వేడుక నాతని నీవు విరహనఁ బెట్టేనంటా
తోడ నీవు విరహనఁ దొలఁకేవు గదవే

చ. 3: మాటలాడేపతితోడ మంచముమీఁదనే వుండి
కాటుకకన్నులఁ జూచి కరఁగేవేలే
యీటున శ్రీ వేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
వాటమై నీవూఁ గలసి వసమైతి గదవే

రేకు: 1000-2 సామంతం సం: 19-583

పల్లవి: రెంటికి వచ్చుఁగదే నీరీతులు చెలి
ఇంటనుండి మమ్ము నేఁప నింతేలే నీకు

చ. 1: సిగ్గుతోఁ బెట్టినయట్టి చెలి నీచెక్కిటివేయి
వెగ్గళపుఁ జింతలంటా వెరచితిమే
బగ్గన నీవుయ్యాలపై నూఁగేపయ్యదజారు
నిగ్గుల విరహమంటా నివ్వెర గందితిమే

చ. 2: ముసిముసినవ్వులతో మోనాన నీవున్నకీలు
పసురుఁగోపములంటా భ్రమసితిమే
అనురులతోడి యలవోక నిద్దురలు
కొసరునలుకలంటాఁ గొంకితిమే నేము

చ. 3: శ్రీ వేంకటేశుతో నీచేముట్టినసరసాలు
తావుల మీవాదులంటాఁ దలఁకితిమే
వోవరిలో మీరిద్దరు నినగూడి వుండఁగాను
చేవదేరెఁ బనులంటాఁజెలఁగితిమే

రేకు: 1000-3 వళవంజరం సం: 19-584

పల్లవి: చెప్ప వెఱతుము నీకు చేరి సారెసారెకును
యిప్పు డిట్టె రారాదా యిది యేమే నీవు

చ. 1: వంచిన శిరసుతోడ వలఁపు చింతల నీడ-
నంచల నీపతి వున్నాఁడదె కదవే
మించినచెమట గార మీఁటుకొనీ గొనగోర-
నించుకంతా దయసేయ విదియేమే నీవు

చ. 2: నిట్టూరుపు మోఁతలును నేలపై వాఁతలును
వొట్టుక నీపతి లోన నున్నాఁడదె
అట్టె కఁబాన నొరగె ఆయములు లోఁ గరఁగె
యెట్టని మాఁటాడవైతి విది యేమే నీవు

చ. 3: నిండినకోరిక వెంచి నెరిఁ బులకలు ముంచి
అండకే శ్రీ వేంకటేశుఁ డదె నీపతి
పండినకెమ్మోవితోడ పైకొని నిన్నిటు గూడె
యెడ నీడ కన్నెఱఁగ విది యేమే నీవు

రేకు: 1000-4 రామక్రియ సం: 19-585

పల్లవి: వద్దే యింతేసి మాతో వట్టిసణఁగు
గద్దరివై యీపంతమే కడకూ నడుపేవా

చ. 1: కప్పుర మియ్యఁగఁబోతే కాఁతాళించి చూచేవు
వొప్పదా నీకిది నేఁడు వూరకే రాఁగా
కొప్పు గోరదువ్వితేనే గొణఁగేవు సారెసారె
అప్పుడే నే నంటితేనే ఆయములు దాఁకెనా

చ. 2: పొంచి చేయివేసితేనే బొమ్మముడివెట్టేవు
నించి చన్నుఁగొండలానేనీ కిది వేఁగా
మంచముపైకిఁ దీసితే మరిఁ దలవంచేవు
యెంచఁగలపనులాయ నిఁకనేలే కొంకు

చ. 3: అంది కాఁగిలించుకొంటే నసురుసు రయ్యేవు
కందువరతులు నేఁడే ఘనమాయనా
విందువలెఁ గూడితి శ్రీ వేంకటేశుఁడను నేను
ముందువెనక వాసింతే మొక్కలములేలే

రేకు: 1000-5 లలిత సం: 19-586

పల్లవి: ఎంతటివాఁడవౌతా నెఱఁగ వీతని నీవు
ఇంతట నీపతియైతే నిటు సేయఁజెల్లునా

చ. 1: పుప్పొడి చల్లఁగదమ్మ పూఁచి నీవెంట రాఁగాను
చిప్పిల నీపతిమేను చెమరించెను
కప్పుర మియ్యఁగదమ్మ కడు నీతో మాటాడఁగా
దప్పిదేరీఁ గెమ్మోవి తగఁ జూడరాదా

చ. 2: పచ్చడము గప్పవమ్మ బడి నీపై నొరగఁగా
పచ్చిదోఁచి గరుపారెఁ బతిమేనెల్లా
మెచ్చి కొప్పువెట్టవమ్మ మేరమీరీ నీపనులు
ఇచ్చకానకుఁ జేయఁగ నిదె వీడెఁ దురము

చ. 3: తూఁగుమంచ మూఁచవయ్య తుద శ్రీ వేంకటేశుఁడు
కాఁగిట నిన్నుఁ గూడి కడు నలసె
ఆఁగి ముచ్చటాడవమ్మ అట్టె నీవద్ద నుండఁగా
మూఁగినరతుల మేనుమఱచియున్నాఁడు

రేకు: 1000-6 బౌళి సం: 19-587

పల్లవి: ఇన్నీఁ గన్నవే నేము ఇంకాఁ గొన్నేలరా
పన్నిన నీసటలేల పదరా ఇంటికిని

చ. 1: పంతపు నడుములను బయలీఁదే వారము
ఇంతేనిమాటల బయలీఁదించేవా
బంతిఁ దొల్ల జవ్వనపు భారముల వారము
రంతుల నీమోహపుభారము గొంత గట్టేవా

చ. 2: గొబ్బునఁ బెరిగేచనుఁగొండలలో వారము
వుబ్బించి కొండ లెక్కించే వూరకే నీవు
దొబ్బరాని చీఁకటి తురముల వారము
తబ్బిబ్బుఁగాఁగలజీకు తవ్వించేనా నీవు

చ. 3: బచ్చనల సిగ్గుల చప్పరములో వారము
యిచ్చఁ జప్పరానకు నన్నిటు దీసేవా
మెచ్చి శ్రీ వేంకటేశుఁడ మిమ్ముఁ గూడిన వారము
నిచ్చలుఁ బైకొని నన్ను నీవూఁ గూడేవా

రేకు: 1000-1 వరాళి సంపుటం: 20-001

పల్లవి: ఇంకా నేమౌనో ఇంతట నూరకుండవే
కొంకఁబోఁగా నాగోరికొన దాఁకెఁగా

చ. 1: వొడివట్టి నేఁ దియ్యఁగా వోపనంటాఁ బెనఁగఁగా
వెడఁగునీపోఁకముడి వీడెఁగా యిట్టె
తొడికి కాఁగిలించఁగా తోదోపు లాడఁగాను
పడఁతి నీకుచములు బయలాయఁగా

చ. 2: మోవినే నా కందియ్యఁగా మోరతోపై నీవుండఁగ
భావించ నీమోవి నాపల్లు సోఁకెఁగా
యీవల నేఁ బైకొనఁగా నిట్టునట్టు బొరలఁగా
చేవ దేరే నీ కొప్పు చెంపలకు జారెఁగా

 చ. 3: పచ్చడము నేఁ గప్పఁగా పంతాలు నీ వాడఁగాను
మచ్చికరతుల సదమద మైతిగా
ఇచ్చకాన శ్రీవేంకటేశుఁడ నేఁ గూడఁగాను
వచ్చి వచ్చి నాకు లోనై వసమైతిగా

రేకు: 1000-2 భైరవి సంపుటం: 20-002

పల్లవి: నీ వొకటి దలఁచఁగా నేరుపు వేరొకటాయ
యీవిధము సరిగాదు యేమి సేసేవే

చ. 1: చన్నులంటాఁ బెంచితివి జక్కవలాయ నివె
కన్నెరో పయ్యదనేల కుప్పేవే నీవు
ఇన్ని నెరులంటా దువ్వే వివియుఁ దుమ్మిదలాయ
యెన్నినట్టు రాదాయ నేమి సే సేవే

చ. 2: చొక్కపు నీకన్నులంటాఁ జూడఁబోతే నమ్ములాయ
తక్కరిరెప్పలనేల దాఁచుకొనేవే
తొక్కేవు పాదములంటాఁ దొలుతే తామరలాయ
యెక్కడౌతా నెఱఁగవు యేమి సే సేవే

చ. 3: నడుమంటాఁ బట్టితివి నాఁడే బట్టబయలాయ
వడి నందునేల పోఁకముడి వే సేవే
యెడయక శ్రీవేంకటేశుఁడ నేఁగూడితిని
యెడపు విన్నిముఁ దేరె నేమి సే సేవే

రేకు: 1000-3 సామంతం సంపుటం: 20-003

పల్లవి: కోరినట్టే నీకుఁ జెల్లె గోవిందుఁడా మా-
కూరిములు మాకు దక్కె గోవిందుఁడా

చ. 1: కొలనికఱుత నీవు గోవిందుఁడా ! మము
గులుగురేఁచకువోయి గోవిందుఁడా
కొలముఁ గొలముఁ గూడె గోవిందుఁడా ! ఇంత
కులికి నవ్వకువోయి గోవిందుఁడా

చ. 2: కోకలేల తీసితివి గోవిందుఁడా ! నీకుఁ
గోకో ఇదివో మొక్కు గోవిందుఁడా
గోకులమిందరిలోన గోవిందుఁడా ! సిగ్గు
కూకులు వత్తులు నాయ గోవిందుఁడా

చ. 3: కొప్పు దాఁకించకువోయి గోవిందుఁడా ! మా
కుప్పెసవరము వీడీ గోవిందుఁడా
గొప్ప శ్రీవేంకటగిరిగోవిందుఁడా ! మేలు
కుప్పళించి కూడితివి గోవిందుఁడా

రేకు: 1000-4 సామంతం సంపుటం: 20-004

పల్లవి: ఏమన్నా ననసీవే యింతి నీ వాతనితోఁడ
వాములై నమేలుమీఁద వాదులు నేరకువే

చ. 1: చెంగలిచూపులు చూడనేర్చినదానవు
నింగి బొమ్మజంకెనలు నేరకువే
కుంగనిచిలుకపలుకులు నేర్చినదానవు
కంగి నిష్టూరాలాడ కమ్మర నేరకువే

చ. 2: ననలుగా సెలవుల నవ్వనేర్చినదానవు
నినుపుల కసరులు నేరకువే
అనిశ మాతనికళ లంటనేర్చినదానవు
పెనఁగి విభుని రట్టుపట్టికువే

చ. 3: యెలమి రతుల భ్రమయించనేర్చినదానవు
నిలుగునివ్వెరగులు నేరకువే
కులికి శ్రీవేంకటేశుఁ గూడనేర్చినదానవు
పలుమారు నెన్నఁటికిఁ బాయఁగనేరకువే

రేకు: 1000-5 లలిత సంపుటం: 20-005

పల్లవి: ఇద్దరి మీకూటములు యిన్నిటానుఁ దగును
నిద్దపు శ్రీవేంకటేశ నేఁడుగా నాభాగ్యము

చ. 1: పాలదొంగవై గొల్లపడుఁచువైతివంటా
పాలజలనిధిలోనఁ బడఁతి పుట్టె
నీలవేణి పుండరీకనేత్రుఁడవు నీవంటా
తాలిమి రెండుచేతులాఁ దామెరలు వట్టెను

చ. 2: బంగారుపచ్చడము పడఁతి నీప్రియమంటా
బంగారువంటిమేనఁ బరగె నిదె
నింగిమోచేచదువులు నీవల్లనే పుట్టెనంటా
చెంగటఁ జదివినట్టిచిలుకఁ జేఁబట్టెను

చ. 3: మెండగుశ్రీవేంకటాద్రిమీఁద నీవెక్కితివంటా
కొండవంటి నీయురము కొమ్మయెక్కెను
పండునిమ్మపంటివన్నెపాలిండ్లంటుదువంటా
పండినమాధీఫలము పడఁతి చేఁబట్టెను

రేకు: 1000-6 శంకరాభరణం సంపుటం: 20-006

పల్లవి: అలుకలు చెల్లవు హరి పురుషోత్తమ
నలి నిందిర నీతో నవ్వినది

చ. 1: ఆదిలక్ష్మి మోహనకమలంబున
వేదమాత నిను వేసినది
ఆదెస నీపై నభయహస్తమును
సాదరమునఁ గడుఁ జాఁచినది

చ. 2: సిరి దనకన్నుల చింతామణులను
పొరి నీపై దిగఁబోసినది
వరదహస్తమున వలచెయి వట్టుక
అరుదుగ విను మాఁటాడించినది

చ. 3: జలదికన్య తనసర్వాంగంబులఁ
బిలిచి నిన్ను నిటు పెనఁగినది
అలముక శ్రీవేంకటాధిప నిను రతి-
నెలమి నీవురఁ(రం) బెక్కినది

రేకు: 1002-1 సామంతం సంపుటం: 20-007

పల్లవి: నీరువట్టు గొన్నవేళ నేయి మందవునా
కూరిమి మమ్మిద్దరినిఁ గూరుచరే చెలులు

చ. 1: నెలఁతచెక్కులే నాకు నిలువుటద్దములు
అలరులతావిపూర్పు లాలవట్టాలు
నెలవులనగవులే చేతికిచ్చేకప్పురాలు
చలిమందు లీఁక నన్నీఁజాలునే నాకు

చ. 2: వనితమాటలే నాకు వలరాచమంత్రాలు
నినుపుఁజెమటలే పన్నీటిసోనలు
ఘనమైనసరసాలే గందపుఁగస్తూరిఁపూఁత
యెనలేని వుపచారా లివియేలే నాకు

చ. 3: సతితోడిపానుపే చంద్రకాంతపువేది
యితవుగఁ గూడించితి రిందరూ మమ్ము
రతుల శ్రీవేంకటాద్రిరాయఁడ నే నిదివో
మితిమీర నూఁచకురే మేలాయఁ బనులు

రేకు: 1000-2 బౌళి సంపుటం: 20-008

పల్లవి: అట్టే మేలుకంటినే అదివో నేను
గట్టిగా నే నిటువంటికల గంటినే

చ. 1: తరుణికుచములపైఁ దగ నా మొగము మోపి
గరిమ నే నిద్దరించఁ గల గంటినే
పెరరేఁచి యాపె నన్నుఁ బేరుకొని పిలిచి
కరఁగించి కూడెనంటాఁ గల గంటినే

చ. 2: చిప్పిలేటిమోవి ఇచ్చి చెలియవదనమునఁ
గప్పురము నే నందుకోఁ గల గంటినే
మప్పురిఁ దప్పకచూచి ముదితపయ్యెద నాకు
కప్పెనంటా నిప్పుడిట్టే కల గంటినే

చ. 3: మొక్కుచు నింతికి నేను ముంచినపెక్కురతులఁ
గక్కసించితి నంటాఁ గల గంటినే
యిక్కువతో శ్రీవేంకటేశుఁడఁగనక యాకె
గక్కున నన్నుఁ గూడె నిక్కల గంటినె

రేకు: 1002-3 మాళవి సంపుటం: 20-009

పల్లవి: చేయిముట్టి సరసాలు చెల్లవు నేఁడు
ఆయనాయ నీఁకనేల అటువంటిపనులు

చ. 1: చేరి నన్ను నంటకురా చెఱఁగుమాసినదాన
ఆరసి మాఁట చెప్పరా అల్లంతనుండి
కోరి నీవేమన్న మాకును నవ్వు రాదురా
ఔరా నీవేమి సేయుమన్నాఁ జేసేను

చ. 2: మట్టుమీరి రాకురా మంచముపై నున్నదాన
యిట్టె నీపంపినవిడె మిదె చాలును
దిట్టి నీజాణతనాలు తెలియవురా మాకు
వెట్టికి నావీనుల వినేఁగాని

చ. 3: బలిమి సేయకురా పవళించివున్నదాన
అలరి నీవు నాకు లోనౌటేచాలు
చెలఁగి కూడితి విట్టె శ్రీవేంకటేశుఁడ నన్ను
అలుక లిన్నియుఁ దీరె నట్టె కానీరా

రేకు: 1000-4 సాళంగం సంపుటం: 20-010

పల్లవి: ఏమని చెప్పేనే యిట్టి నావలపు
ఆమీఁదటి పనులతఁడే యెఱుఁగు

చ. 1: యెదుటనే వున్నాఁడు యిదె నారమణుఁడు
కదిమీఁ దమకము కనురెప్ప లిడిన
పెదవుల నున్నది పే రాతనిదే
కొాద దీరవు నా కోరికలు

చ. 2: నగుతా నున్నాఁడు నాతో నాతఁడు
నిగిడీఁ గాఁకలు నే నూరకుండిన
వెగటునఁ బతిపై వేసితి నేఁ జేయి
తగులకతొల్లే తడిపీఁ జెమట

చ. 3: కాఁగిట నుందానఁ గడు నాతనితో
రేఁగీ వలపులు రేవగలు
వీఁగ కలమె శ్రీవేంకటపతి నను
చేఁగదేరె నాచిగురుటధరము

రేకు: 1002-5 సాళంగనాట సంపుటం: 20-011

పల్లవి: చేసినవారి చేతఁలు చేతనఁ బెట్లు గావా
యీసున నన్నుఁ జూడఁగ నెట్టునాయ కన్నులు

చ. 1: కోపించి వాదుకురాఁగాఁ గొప్పు కడువెడజారె
యేపున నాతో జగడ మిదివొమ్మదె
యీపాటికి నీపాటి యిఁక నెంత యవునో
పోపో యింతటనైనా బుద్దెఱఁగవే

చ. 2: బీరాన నన్నుఁ దిట్టిఁగాఁ బెదవికెంపులు రేఁగె
దూరి పెద్దల నాడేది తోడ దోసమే
దారిదప్పఁదిరిగితే దయ్యమైనాఁ దోడౌనా
యీరు దియ్యఁ బేను వచ్చు నివి యేఁటికే

చ. 3: వోపనంటాఁ బెనఁగఁగ వో పోఁకముడి వీడె
దాఁపురాలు బయలాయఁ దగదే యిఁక
ఆపనికి సిగ్గుపడి యట్టే కాఁగిలించితివి
చేపట్టి వదలకు శ్రీవేంకటేశుఁడను

రేకు: 1002-6 కాంబోది సంపుటం: 20-012

పల్లవి: పట్టకు పట్టకురా నాపయ్యదకొంగు
వెట్టివలపులు నాపై వెదచల్లవలెనా

చ. 1: యింత నీవు నేసినందు కిట్టె నిన్నుఁగూడితేను
యెంత బతిమాలెనని యెంచరా నన్ను
కొంతగొంత నిన్ను నింకాఁ గూరిమి గొసరఁబోతే
యింతులెల్లా నన్నుఁ జూచి యెకసక్కెమాడరా

చ. 2: యీవేళ నే నీకు యిచ్చకము లాడితేను
నావంటివారుచూచి నవ్వరా నన్ను
వాని చూచి నీతో నేను వాసికిఁ బెనఁగఁబోతే
ఆవలీవలి సతులాడరానన్ను

చ. 3: మొక్కి నీవు వేఁడుకోఁగా మొగమైనాఁ జూడకుంటే
దిక్కుల కామినులెల్లాఁ దిట్టరా నన్ను
చక్కని శ్రీవేంకటేశ సమ్మతిగఁ గూడితివి
చిక్కినసతులు గోరనేయరా నన్ను

రేకు: 1003-1 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-013

పల్లవి: ఏళ్ల వెనకవే చాళ్లు యెఱఁగవటే
ఆళ్లేమి గంటే కొట్టిలాయనేమి

చ. 1: సుదతినాతో నలిగి చూడదువో చెలియ
యెదుట నీవు చూడవే యిదే అది
వెదకఁ జందురుఁడేమి వెన్నెలేమి నాకును
మదిలోనితాపము మానితేఁ జాలును

చ. 2: మగువ తాఁ గోపించి మాటాడ దదె నాతో
తగ నీవు వలుకవె తానే తాను
చిగురేమి చేఁగేమి చేరినమానికిని
నిగిడి నాకుఁ జల్లనినీడైతేఁ జాలును

చ. 3: చెలి నాకాఁగిట నుండి సిగ్గువడీ నింకాను
కలిసి నీవై నాఁ గొంతకాఁక రేఁచవే
వెలియేమి లోనేమి వేడుక కొక్కటేకాదా
అలరిన శ్రీవేంకటాధిపుఁడ నేను

రేకు: 1003-2 మాళవిగౌళ సంపుటం: 20-014

పల్లవి: పలుక కూరకుండుటే పాడి నాకు ! అప్పు-
డలిగితివంటా నేమి ఆడకుమీ అయ్యా

చ. 1: మలసి నీ వాడినమాఁటలెల్లాఁ జక్కనే
కలికినాకురులే వంకలు గాని
వలచిన యిటువంటి వారము నే మేమన్నా
చలువౌనో వేఁడౌనో చవి చాలదయ్యా

చ. 2: నిక్కి నీచేఁతలు నీ మేనికి నన్నీ వన్నెలే
దిక్కుల మానగవులే తెల్లనగాని
వెక్కసాన నీపొందు వెఱవక సేయఁగాను
యక్కువౌనో తక్కువౌనో యెడ చాలదయ్యా

చ. 3: కొసరి కాగిఁట నన్నుఁ గూడ నీకుఁ జాలుకనే
పసిమి నాజవ్వనమే బరఁ(రు?)వు గాని
యెసఁగ శ్రీవేంకటేశ యింకాఁ గూడి పిలువఁగ
పొఁసగునో పొసఁగదో పూఁపు చాలదయ్యా

రేకు: 1003-3 దేసాళం సంపుటం: 20-015

పల్లవి: మానుమన్నా మానఁడు మాఁటి మాఁటికి
పోనిమ్మని వూరకున్నాఁ బొడవెక్కీఁగదవే

చ. 1: ఆడరాదు తనకెదురంటే ననీఁగాక
వాడు దేరినమోమేల వచ్చోఁ దనకు
వోడక యిందుకుఁదోడు వూరకుండనీఁడు నన్ను
యీడుగాని మాట దీసి యెచ్చరించీఁగదవే

చ. 2: తలవంచుకుండరాదు తనచేతిబాధ నేఁడు
చిలుకుగోళ్ల నెత్తీ సిగ్గువడఁడు
నిలువఁబెట్టుచు తననిజమే నెరపవచ్చీ
యెలమి నిందరు నవ్వే దెలిఁగఁడుగదవే

చ. 3: గుట్టుసేసుకుండ నీఁడు కుమ్మరించీ వలపులు
యెట్టివాఁడు యిందాఁకా నేడ నుండెనే
వొట్టుక శ్రీవేంకటాద్రి నుండి వచ్చి నన్నుఁ గూడె
పట్టిన చలముతోడఁ బంత మిచ్చీగదవే

రేకు: 1003-4 వరాళి సంపుటం: 20-016

పల్లవి: వద్దువద్దు యెన్నఁడూను వాదులు మీకు
ముద్దుముద్దువలె నేఁడు మొక్కవయ్య ఆకెకు

చ. 1: యిక్కువలు సోఁక నేఁడు యేమాడితివో కాని
చెక్కులెల్లఁ జెమరించె చెలియకును
యెక్కువతక్కువ సేఁత లేమి సేసితివో కాని
ముక్కున నూర్పులు రేఁగె మొక్కవయ్య ఆకెకు

చ. 2: నాలి నాకె యేమనఁగ నాఁటఁ జూచితివో కాని
తాలిమెల్ల దిగఁబడె తరుణికిని
అలరిరతుల నెంత అలయించితివో కాని
మూలనుండి సిగ్గువడీ మొక్కవయ్య ఆకెకు

చ. 3: చెప్పినట్టు నీవేమి సేయవైతివో కాని
అప్పుడే కోపము రేఁగె నంగనకును
యెప్పుడో శ్రీవెంకటేశ యిటు గూడితివో కాని
ముప్పిరి నవ్వులు నవ్వీ మొక్కవయ్య ఆకెకు

రేకు: 1003-5 సామంతం సంపుటం: 20-017

పల్లవి: ఏల వూరకున్నదాన విటు నిన్నుఁ గూడుదాఁకా
పొలువ డిన్ని వ్రతాలు పట్టుకున్నాఁ డతఁడు

చ. 1: తామెరలు ముడువఁడే తరుణి కెంగేలనే
తామెరలు(ల) చేత నంటి దగ్గరుదాఁకా
నేమముతో మేనిపైఁ బన్నీరు నించుకో నొల్లఁడే
దోమటి నీచెమటలఁ దొప్పఁదోఁగుదాఁకా

చ. 2: అద్దము చూడనొల్లఁడే అంగన నీమించుఁజెక్కు
టద్దములు చూచుదాఁకా నాడ నుండి
వొద్దిక నారగించఁడే వూరేటినీమోవితేనె
అద్దుకొని చవిచూచినందాఁకను

చ. 3: కప్పురము నొల్లఁడే కలికి నీసెలవుల-
కప్పురపు నవ్వు తన్నుఁ గప్పుదాఁకాను
ఇప్పుడే శ్రీవేంకటేశుఁ డీడకే విచ్చేసి కూడె
అప్పటి వేగిరించీ నీ వలమినందాఁకాను

రేకు: 1003-6 దేసాళం సంపుటం: 20-018

పల్లవి: వలపు గంపలబెట్ట వడి నెందాఁకా నుండీ
కలిగినపాటే చాలు గాసిఁబెట్టనేలే

చ. 1: మన సొక్కుచో నుండఁగ మాఁటలాడఁబోతేను
వినఁ జవులౌనా వేసటౌఁగాక
యెనయ నెందుకో పోఁగా నింటికి రమ్మని నేఁ
బెనఁగితే నితవౌనా పెనుజోలి గాక

చ. 2: యెదు రవ్వతెకో చూచేయీవేళ నేఁ బొలసితే
అది యింపౌనా గుండెబెదరవుఁగాక
కదిశొక్కతేఁ బిలువఁగా నేఁ బలికితేను
ముదమౌనా అది పెద్దమొగచాటౌఁగాక

చ. 3: నాఁటినయాకపై నవ్వు నామీఁదికిఁ దీసుకోఁగా
వాటమౌనా అది వేరే వగలౌఁగాక
యేఁటికి శ్రీవేంకటేశుఁడిదివో నన్నుఁగలసె
పూఁటపూఁట యిటులైతేఁ బొందులౌఁగాక

రేకు: 1004-1 శ్రీరాగం సంపుటం: 20-019

పల్లవి: వాసికి బతుకుటింతే వనితలయినవారు
పాసినకూటికంటే పస్తైనా మేలురా

చ. 1: రాకుండేవాఁడవా రాతిరెల్ల మాయింటికి
ఆకడ నీ కెవ్వతో పై యాడెఁగాక
నీకు నీగుణము లేదు నేఁడిన్నాళ్లదాఁకా
కాకునఁ బడుటకంటే కడనుంటే మేలురా

చ. 2: కోపగించేవాఁడవా కొసరి నే నేమన్నా
నీపావ మెవ్వతొ ! నీకు నేరిపెఁగాక
యేపున మారుమాటాడ వెన్నఁడు నేఁడలిగేవు
తీపులలోఁన జేఁదైతే తెగువలే మేలురా

చ. 3: తలవంచేవాడవా దగ్గరి కాఁగిలించితే
కులుకి యెవ్వతో బాసగొన్నదిగాక
బలిమి శ్రీవేంకటేశ పై కొని నిన్నుఁ గూడితి
కలకాలమును నిన్నుఁ గాచుకున్న మేలురా

రేకు: 1004-2 ఆందోళి సంపుటం: 20-020

పల్లవి: సిగ్గువాసి కూటికే చీరగట్టినవారము
యెగ్గులేక తనవలె నెదుట నుండేదా

చ. 1: నెట్టన మాయింటిలోన నిద్దిరించఁగా జూచి
యిట్టే యలిగితినంటానేల పోరీనే
అట్టె యొక్క వేళ మాకు నలపు సొలపు లేదా
పట్టులేక తనవలె పనిలేదా మాకును

చ. 2: తగిలి జూజమాడుతా తలవంచుకుండఁగాను
నగవంటానేల పోరీ నాతో నేఁడు
మగుదలమైనమాకు ముసిమి ముచ్చట లేదా
మొగమెత్తి తనవలె మొక్కులు మొక్కేదా

చ. 3: అలసెనంటాఁ దనకు ఆలవట్ల మిడఁగాను
చలిగొనినంటా నేల సారెఁ బోరీనే
యెలమి శ్రీవేంకటేశుఁ డిటు గూడఁ జెల్లుఁగాక
వలెనంటా మాకుమాకే పద్దికి రాఁదగవా

రేకు: 1004-3 మధ్యమావతి సంపుటం: 20-021

పల్లవి: ఎటువంటి వేడుకలో ఇద్దరికి మీఁద మీఁద
ఘటన వెన్నెలపులుఁగము లాడేరదివో

చ. 1: చిత్తజునిఁ గన్నతల్లి సిగ్గువడు తానే పతి-
పొత్తునఁ గూచుండెఁ బెద్దబువ్వానను
యిత్తల నాయకుఁడును యెడమిచ్చి తొడఁదొడఁ
నొత్తుక కూచుండి మేను లొరసీనదివో

చ. 2: శిరసు వంచుకొని చిమ్ముఁజూపుతో నింతి
పురుషుఁ డిచ్చేకడి పుచ్చుకొనీ
సరసములాడుకొంటా చవిచెప్పుతా నతఁడు
సరిఁ గుజ్జాయపుమోవి సారె నిచ్చీనదివో

చ. 3: కప్పినకుచగిరులు కానరాఁగా మూసుకొంటా
నప్పటి దవ్వులకూర లందీఁ జెలి
అప్పుడే శ్రీవేంకటేశుఁ డాయాలకే చేచాఁచె
దెప్పరపుఁగందువలఁ దేలించె నదివో

రేకు: 1004-4 ఆహిరి సంపుటం: 20-022

పల్లవి: కాంతునివలపు నేనే కన్నదాఁకాను
చెంతల నన్ను బలిమినేయకురే చెలులు

చ. 1: దగ్గరివచ్చినదాఁకా దవ్వుల నుండుటే చవి
సిగ్గులు దేరినదాఁకా చింతలే చవి
బగ్గన నవ్వినదాఁకా పంతపుమోనమే చవి
వొగ్గి నన్నుఁ బిలువకుండరాదా చెలులు

చ. 2: తెంకికి వచ్చుదాఁకా సాదింపఁజూపలే చవి
మంకు దీరుదాఁకా నెడమాటలే చవి
సంకె దీరునందాఁకా సరసములే చవి
అంకెకు రమ్మని నన్ను నంటకురే చెలులు

చ. 3: మనసు గలయుదాఁకా మచ్చరములే చవి
తనివిఁ బొందినదాఁకా తాపమే చవి
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ నేఁడు
పెనఁగి నన్నింకా రట్టుపెట్టకురే చెలులు

రేకు: 1004-5 ముఖారి సంపుటం: 20-023

పల్లవి: అందాఁకా నీ వేమన్నా నన్నీ నౌఁగాదనఁ గాని
యెందునుఁ బోనప్పుడుగా యెనసేది మనసు

చ. 1: అక్కడిపరాకు మానినప్పుడుగా నీవు
గక్కన నాకాఁగిటిలోఁ గరఁగేది
నిక్కి చూడక నావద్ద నిలిచినప్పుడుగా
చిక్కి నాకుఁజెప్పినట్లు సేసేది నీవు

చ. 2: వింత చెలులసుద్దులు వినిన(నని) యప్పుడుగా
మంతనాన నీవు నాతో మాటలాడేది
సంతల నీసన్నలు నీ చాయలు నుడిగితేఁగా
అంతట నాతో సరసమాడేది నీవు

చ. 3: మగువలభ్రమలెల్ల మఱచినప్పుడుగా
నగితే నీవు నాతో నవ్వేది
అగడై శ్రీవేంకటేశ అంతసేసి నిన్నాఁగఁగ
తగ నన్నుఁ గూడితివి తప్పకిదె నీవూ

రేకు: 1004-6 నాగవరాళి సంపుటం: 20-024

పల్లవి: అంత మమ్ము జోలిఁబెట్ట కవులే నీవుఁ నీ
యంతరంగమే యెఱుఁగు నంటకురా నీవు

చ. 1: చెక్కులేల చెమరించెఁ జెలితో నవ్వకుండితే
నక్కట బాసలు సేసే వప్పటి నీవు
ముక్కునూర్పులేల రేఁగె ముగుదవై వుండితేను
చక్కటి చెప్పకు నాతో సారాసారె నీవు

చ. 2: అంగమేల పులకించె నాకెయింటి కేఁగకుంటే
యింగితాలు మొరఁగేవు యేరా నీవు
సంగతిఁ గొప్పేల వీడె సతిచేయి దాఁకకుంటే
జంగిలివేసాలు నాతో చవిగాదునీవు

చ. 3: లత్తు కేలంటె నొసల లలనకు మొక్కకుంటే
వుత్తరా లియ్యవచ్చేవు వొద్దురా నీవు
కొత్తలై శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేడు
మత్తిలి యితరములు మానరా నీవు

రేకు: 1005-1 దేశాక్షి సంపుటం: 20-025

పల్లవి: ఊరకున్నవారి మమ్ము నుండనీ కేలరేఁచీనే
మారుమాటాడక యిన్నీ మఱచుండుఁ గాక

చ. 1: ఇంతపరాకయ్యేవాఁ డేల పిలువనంపీనే
చెంత నేఁడే పనులెల్లాఁజేసుఁగాక
కొంత సిగ్గువడేవాఁడు కొంగువట్టేల తీసీనే
వంతులఁ దా బాలనాటివలె నుండుఁగాక

చ. 2: జాగులు సేసేవాఁడు సన్నలేల సేసినే
వేగుదాఁక జాగరాలు వేగించుఁగాక
బాగుగ నిద్రించేవాఁడు పైనేల వొరగీనే
వేగమే పానుపుమీఁద విహరించుగాఁక

చ. 3: రాజసము చూపేవాఁడు రతికేల దగ్గరీనే
వోజతోడ మమ్ము నంపి వుండుగాఁక
సాజపు శ్రీవేంకటాద్రి సరసుఁడై నన్నుఁ గూడె
జూజమేలాడీనే యిట్టే సుకియించుఁగాక

రేకు: 1005-2 తోండి సంపుటం: 20-026

పల్లవి: సంగడి నట్టే వుంటే చవివుట్టీనా
కొంగు వట్టి తియ్యఁగాను కోపించరాదా

చ. 1: పయ్యెద నేఁబెట్టుకొంటే బలిమి నేనే వదేర
అయ్యో ఆఁటదాననైతే అలఁత తేదా
పాయ్యేనంటా లేచితేను పాదిగేవు నీ వదేర
కయ్య మడిచిన వేళ కడనుండరాదా

చ. 2: ఆకడి మోము నే నైతే నలమి పట్టే వదేర
వాక నిష్టూరాలనైన వద్దనరాదా
చేకొని నే నుస్సురంటే చెక్కనొక్కే వదేర
కాఁక బొందినట్టివేళ కసరుకోరాదా

చ. 3: కన్నుల నేఁ జూడకుంటే కాఁగిలించేఁ వదేర
సొన్నలనీచేఁతులకు చొక్కఁగరాదా
యెన్నఁగ శ్రీవేంకటేశ యింతసేసి కూడితివి
ఇన్నేసి నీ వినయాల కియ్యకొనరాదా

రేకు: 1005-3 శుద్ధవసంతం సంపుటం: 20-027

పల్లవి: అప్పటి నీపంతముల కంటిఁగాక
యెప్పుడూ నీ వేలమానే వెట్టయినాఁ జేయరా

చ. 1: తడవనివాఁడవేల తగిలేవు మావెంట
విడువిడు నాచెఱఁగు వెఱితు నీకు
బడినే వోయమ్మ మేను పరవశమయ్యీని
యెడపు నీచేఁత చెల్ల నెట్టైనాఁ జేయరా

చ. 2: ఆనవెట్టుకొన్నవాఁడ వాడేనేల మాట మాతో
మాను మాను సరసాలు మరినేల
నానెఁ జిరుచెమటల నవ్వువచ్చి నాకు నిట్టె
యే నేమి ననఁజాల నెట్టయినాఁ జేయరా

చ. 3: అలిగినవాఁడ వేల అంకెలఁ గాఁగిలించేవు
నిలునిలు కొంతవడి నేఁ జెప్పేను
బలిమి శ్రీవేంకటేశ పైకొని బోగించితివి
యిల నే నీకే వలచి తెట్టయినాఁ జేయరా

రేకు: 1005-4 శంకరాభరణం సంపుటం: 20-028

పల్లవి: అబ్బె నాకు నేఁ డంతటిలోనె
సుబ్బనచూరల సూచన లిదివో

చ. 1: పూచీ నౌనే పున్నమ వెన్నెల
చేచేతనే నీ సెలవులను
కాచె నిమ్మ లివె కడు నీ పురమున
పైచింతలనే పండెను మోవి

చ. 2: మూఁగీ నౌనే మొకరితుమ్మిదలు
తూఁగేటి నీనెరి తురుమునను
రాఁగీఁ జిలుకలు రతి నీపలుకుల
ఆఁగీఁ బికములు అదె కుత్తికను

చ. 3: పాఁకీ నౌనే బాహులతలు గడు
కాఁకల నీనాకాఁగిటను
యేఁకట శ్రీవేంకటేశుఁడఁ దియ్యఁగ
సోఁకీ మదనునిసొమ్ములు రతుల

రేకు: 1005-5 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-029

పల్లవి: అందరును వినరమ్మ ఆమాఁట
ఆందాలు చెప్పఁగవచ్చీ నమ్మరోయమ్మా

చ. 1: యీతల నన్ను రమ్మని యేఁటికి బిలిపించెనో
ఆతని నడుగరమ్మా ఆమాఁట
రాతిరెల్లా జాగరాలే రవ్వ కెక్కెఁ బగలెల్లా
చేతలేమి సేయవలెఁ జెప్పరోయమ్మా

చ. 2: పనిలేనిపని కేల పంతమిచ్చెనో కాని
అనఁడా తా నావేళ ఆమాఁట
తనిసె నామనసెల్లాఁ దలకెక్కె వలపెల్లా
ఆనుమానా లేమిగల్లా నాడుమనరమ్మా

చ. 3: యేకతానఁ జెప్పేనంటా నిందరి మిమ్ముఁ బొమ్మనె
అకడ నప్పుడే వింటి నామాఁట
పైకొని శ్రీవేంకటాద్రిపతి యింతసేసి కూడె
మీకుమీకే యిఁకనైనా మెచ్చుకోరేయమ్మా

రేకు: 1005-6 సామంత సంపుటం: 20-030

పల్లవి: సతివిధము నేర్పు వెదచల్లినటులాయ
యితవు లిటమీఁదిమే లెట్టు రాఁగలదో

చ. 1: కనుచూపు పతిమీఁద కాయంబు చెలిమీఁద
మనసు కోర్కులమీఁదమగువ కిపుడు
తనకొ ప్పెచట వీడె తలపువ్వు లెటురాలె
విని వినదు మనమాఁట వెస నెంతవలపో

చ. 2: నిట్టూర్పు తనువుపై నెరిఁ జెక్కు చేతిపై
గుట్టు చన్నులపయినె కొమ్మ కిపుడు
పట్టినవిడియ మేడ బలుపరా కిది యేడ
తట్టినా నెఱఁగ దిదె తమక మెట్టిదియో

చ. 3: సిగ్గు దనవయసులో చిఱునవ్వు నెలవిలో
నిగ్గు రతికళలలో నెలఁత కిపుడు
అగ్గలపుశ్రీవేంకటాధిపతిఁ గూడి మరి
యెగ్గు లెంచదు యీపె యెటువంటి గుణమో

రేకు: 1006-1 దేవగాంధారి సంపుటం: 20-031

పల్లవి: నే నొకమాటాడితే తేను నీ వొకటాడేవేమే
కానీలేరా నీవంటికతలు నేరుతుమా

చ. 1: వెన్న దిన్న నోటనే వేఁడిపాలు దాగినట్టు
వెన్నెగా మాటాడి యేల వెంగెమాడేవే
వెన్నాఁ దింటివి వే డివేఁడిపాలుఁ జవిగొంటిఁ
విన్నిటా నీమోవి పాక్కె నిఁకనేల మాటలు

చ. 2: పువ్వు లందిచ్చినచేతఁ బూఁచి రాలందిచ్చినట్టు
జవ్వని కుచాల నొత్తి జగడాలేలే
పువ్వుల నందుకొంటివి పూఁచి, రాలూ నెత్తితివి
ఇవ్వల నీవొళ్లే చెప్పీ నిఁకనేల చేఁతలు

చ. 3: సూడిదెవట్టినవారి సొమ్ముల నించినయట్టు
వోడక కైదం డిచ్చితే నొత్తేవే గోర
సూడిదెగా నన్నుఁ గూడి సొమ్మో నా కిచ్చితివి
యీడనే శ్రీవేంకటేశ యిఁకనేల పనులు

రేకు: 1006-2 భైరవి సంపుటం: 20-032

పల్లవి: పాయమే పైతరవాయఁ బట్టికురా యెగ్గ నీవు
యేయెడ నీకతమున నే నెన్నిక కెక్కితిరా

చ. 1: మునుముందు చూచితేను మోవరాదు కుచములు
వెనక చూచితే వేఁకము నాతురు మిది
యెనసి నీ చేతలును యిట్టైపో యేమి సేతు
తనిసి నింత లోనే తమక మేఁటికిరా

చ. 2: పట్టితేను పసలేదు పంతపునానదు మిది
వెట్టిని విడువరాదు వేఁడి నిట్టూరుపుగాలి
ఇట్టెపో నీసుద్దు లేమందు నే నిన్ను
మట్టులేదు నావలపు మాయలఁ బెట్టకురా

చ. 3: చొక్కక నిన్నెడసితే సొమ్మలవుమ్మలఱట్టు
పక్కన నిన్నుఁ గూడితే పరవశములు బెట్టు
యెక్కువ శ్రీవేంకటేశ యిఁకనో నాచంద మిది
చక్కఁగాఁ గూడితి విట్టె జాణతనా లేలరా

రేకు: 1006-3 పాడి సంపుటం: 20-033

పల్లవి: చూత మింక తనజాడ సొలయక నీవు రావే
కాతరపు రమణుని కడకుఁ బోనిచ్చేనా

చ. 1: తలఁ పెందునిల్చినా తానూ నక్కడ నిల్చు
యెలమి నెంత విల్చినా యేలవచ్చీనే
పలుకేడ నిఁ(నిం)పైనా భావమందింపౌను
తెలిసి నీవు మాటాడితే నేల చేకొనీనే

చ. 2: కనుచూ పెందువారిన కందువ లందు వారు
పనివడి వానినేల బల్మి సేసేవే
తని వెందు గలిగినా తమక మందే కలుగు
వెనుకొ నంతే శతని వేసట సేయకువే

చ. 3: కాఁక లెంతవిరివైనాఁ గాఁగి లంత విరివౌను
వీఁకల నాతని నేమి వేఁడుకోకువే
వేఁకపు శ్రీవేంకటాద్రి విభుఁడు నన్నిటుగూడె
యేఁకట వాసె నింక నేమీ ననకువే

రేకు: 1006-4 రామక్రియ సంపుటం: 20-034

పల్లవి: విన్నమాఁట కన్నమాఁట విన్నవించితిమి నీకు
వున్నాఁడవు మాయింట వూహలు నీకెట్టివో

చ. 1: అల్లాడ వారు నిన్ను నడిగిరి యేమిటికో
వెల్లవిరిగాఁ గొందరు వెదకిరి
మొల్లమిఁ గొందరు నీకు మొక్కిరి యందరియిండ్లా
వల్లెగా నేమి సేసి వచ్చితివో

చ. 2: నయములనే కొందరు నవ్విరి నీసుద్దులకు
ప్రియపడి పేర నిన్నుఁ బిలిచిరి
దయతో నినుఁ గొందరు దలఁచిరి యాడనాడ
జయమై చుట్టరికము సరి నెంత గలదో

చ. 3: కొందరు నీరాకలకుఁ గోరి నిక్కిచూచిరి
కందువ నీకూటములే కడుమెచ్చిరి
యిందరిఁ గూడి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
సందడిజాణఁడవు నీసరవి చూచితిమి

రేకు: 1006-5 శంకరాభరణం సంపుటం: 20-035

పల్లవి: వరుస దప్పిన మీఁద వాదులేలిఁక
సరవి నడిపితేను సమ్మతించేఁగాక

చ. 1: కోపగించ నిఁకనేలే కొంకుదేరినవెనక
వోపి తనయిల్లాలనై వుండుటగాక
రాపు సేయ నిఁకనేలే రాజసమే చూపఁగాను
చేపట్టి వూడిగాలు నేఁ జేయు టింతేకాక

చ. 2: జంకించ నిఁకనేలే చలివాసిన వెనక
మంకుతోఁ బుస్తెగట్టుక మనుటగాక
అంకించి పిలువనేలే అటుమోమైన వెనక
కంకియై తనరాకకుఁ గాచుకుండదుఁ గాక

చ. 3: పచ్చిసేయ నిఁక నేలే పంతమిచ్చిన వెనక
మెచ్చి తనకాఁగిట నే మెరతుఁగాక
అచ్చపు శ్రీవేంకటేశుఁ డంగవించి కూడె నన్ను
యెచ్చుఁగుందు లిఁకనేలే యెఱఁగనైతిఁగాక

రేకు: 1006-6 సాళంగనాట సంపుటం: 20-036

పల్లవి: పరమాత్ముఁ డైన హరి పట్టిపురాణివి నీవు
ధర మమ్ము విచారాంచఁదగు నీకు నమ్మా

చ. 1: కమలజుఁ గన్నతల్లి కామునిఁ గన్నతల్లి
అమరులఁ గన్నతల్లి ఆదిమలక్ష్మి
విమలపు నీపతికి విన్నపము నేసిమమ్ము
నెమకి యేలితి దయ నీకే తగునమ్మా

చ. 2: కామధేను తోఁబుట్టుగ కల్పకము తోఁబుట్టుగ
దోమటి చల్లనిచంద్రుతోఁబుట్టుగ
నీమగనిపంపునను నిజసిరు లిచ్చితివి
నేనుపువితరణము నీకే తగునమ్మా

చ. 3: పాలజలధికన్యవు పద్మాసనవి నీవు
పాలఁబండే శ్రీవేంకటపతిదేవివి
యేలిన యితనిబంట్ల కిహపరా లిచ్చి మా-
పాలఁ గలిగితివి సంబంధము మేలమ్మా

రేకు: 1007-1 దేవగాంధారి సంపుటం: 20-037

పల్లవి: పాకముదప్పినఁ బనికిరా వికను
దీకొని రమణుఁడ తెలుపఁగవలెనా

చ. 1: వుడికినచిత్తం బూఁకొననోపదు
పడఁతులతోఁ జెప్పర మాఁట
బడలినచేతులు పట్టఁగనోపవు
అడపమునకు వీడె మందియ్యరాదా

చ. 2: వాడుమోము నవ్వఁగనోపదు నీ-
వాడర సరసము లటువోయి
వీడినతురు మది విరులకు నోపదు
బోడమ్ముల మరుపాదుల నునచరా

చ. 3: కాఁగిన దేహము కప్పుదు కోపదు
రాఁగుఁబచ్చడము రతి నిడరా
కాఁగిట శ్రీవేంకటపతి కూడితిఁ
వేఁగక యిచటనే యెనసి వుండరా

రేకు: 1007-2 భూపాళం సంపుటం: 20-038

పల్లవి: అలపు దీర్చుకోరాదా అన్నీ నయ్యీఁగాని
నిలువెల్లాఁ జెమరించి నీళ్లుగారినీ

చ. 1: వీడె మందుకొనరాదా వెనక విచ్చేతుగాని
బీడై నీకెమ్మోవి పిప్పిగట్టెను
చూడరాదా మమ్ముఁగొంత చొక్కి కన్నుమూతుగాని
అడా నీడా నుమ్మఁదాకి యలపుదేరీని

చ. 2: పాద మొత్తించుకోరాదా పక్కన నవ్వుదుగాని
వీదులెల్లాఁ దిరుగాడి విసిగినది
జూదమైనా నాడరాదా సొంట్లు సోదింతుగాని
అదిగొని కోరికలు అంకెకుఁ దీసీని

చ. 3: పవళించి వుండరాదా పానుపుపై నీఁకనైనా
జవళిఁ బులుకలు మై జడిసీని
యివల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సవతులఁ దేకుమీ చలమెక్కీని

రేకు: 1007-3 రామక్రియ సంపుటం: 20-039

పల్లవి: ఈడ నెవ్వరి సొలసే వింతసలిగె గలితే
వాడికె నాతనిచేత వలపించుకోవే

చ. 1: సారె నీవు నాతో జగడించినందుకెల్లా
చేరి ప్రియా లతనిచేఁ జెప్పించుకోవే
దూరి నేఁ గోపాన నిన్ను దొబ్బినందు కిపుడే
యీరానిపంతాలు నందే ఇప్పించుకోవే

చ. 2: సేయరాని సేఁత నిన్నుఁ జేసినందు కెల్లాను
మోయనాడి నాతనిచే మొక్కించుకోవే
వోయమ్మ నిన్ను నే వొట్టువెట్టినందుకట్టె
వేయిమారు లతనిచే వెస మొక్కించుకోవే

చ. 3: సవతిమచ్చరాన నే సడిఁబెట్టినందుకేల్లా
రవళి నీయింటికే రప్పించుకోవే
యివల శ్రీవేంకటేశుఁ డీడ నిట్టె నన్నుఁ గూడి
కవ వాయకున్నాఁడు కరఁగించుకోవే

రేకు: 1007-4 సామంతం సంపుటం: 20-040

పల్లవి: మరులుకొలుపఁ జోటులేదు మాకుబొంకనెడము లేదు
సరస నాయకుఁడవు నీకు చందమాయఁగా

చ. 1: కరఁగి కరఁగి చెలియ పేరు కలవరించి నుడుగువంక
మరిగినట్టిపొందులౌత మాకుఁ దెలిసెఁగా
వెర వెఱుఁగకుండువంక వింత లాలకించువంక
తరతరంబుఁ బాయరానితగులు దెలిసెఁగా

చ. 2: నిలిచి నిలిచి చొక్కువంక నీలోనినవ్వువంక
చెలికి మేలువాఁడీవౌతా చెలువు మిగిలెఁగా
పలికి పలికి భ్రమయువంక బహుపరాకులైనవంక
కలిగినంత మోహమెల్లఁ గాన వచ్చెఁగా

చ. 3: ఇట్టునట్టుఁ జూచువంక యేకతాన నుండువంక
అట్టె చెలియఁ గూడురతుల ఆస దెలిసెఁగా
పెట్టుకొన్న సేసవంక పండ్లి శ్రీవేంకటేశ
గట్టిగాఁగ సతికి నీకుఁ గలుగు టాయఁగా

రేకు: 1007-5 పాడి సంపుటం: 20-041

పల్లవి: మానుమనవే ఇట్టివి మాయింటికి రమ్మనవే
తానే యెరుఁగు నీమాట తలఁచుకొమ్మనవే

చ. 1: సరవిదప్పినవేళ సతితో నవ్వేవాఁడు
వరుసెరఁగని యట్టివాఁడెపో కూళ
యెరపరికపు పొరుగింతితో నవ్వేవాఁడు
దొరయైనఁగాని వాఁడే దొడ్డైనకూళ

చ. 2: వలవనివనితలవాకిలి దొక్కేఁవాడు
వలరాచగురుడైన వాఁడెపా కూళ
తలవంచిన సతిని తప్పకచూచేవాఁడు
తొలుత నన్నందుకంటె దొడ్డైనకూళ

చ. 3: చిత్త మెరఁగనియట్టి చెలి జేరి కూకులును
వత్తులునై విరిగినవాఁడెపా కూళ
చిత్తగించి నన్నుఁగూడె శ్రీవేంకటేశుఁడే జాణ
తొత్తువంటి దాకెపో దొడ్డైనకూళ

రేకు: 1007-6 బౌళి సంపుటం: 20-042

పల్లవి: ఇటు నీకు సతమైతే నేమి సేయవలసునో
తటుకునను నివి యెపుడుఁ దలపోయవలసె

చ. 1: చెలఁగి నీ వొకనాఁడు సేసినపొందుకుఁగాను
కులికి నీవు రాకుండఁగాఁ గోపగించవలసె
సొలసి నీ వలవోకఁ జూచిన చూపుల భ్రమసి
బలిమి నినుఁ బట్టుకొని పచ్చి సేయవలసె

చ. 2: వేడుకలకు నీవు నాకు విడె మియ్యఁగా మరిగి
జాడ నీవు పరాకైతే జంకించవలసె
నాఁడు నీ వొకమాఁటు నవ్వు నవ్వఁగఁ జొక్కి
కూడుమనుచు నిను సారెఁ గొంగుముట్టవలసె

చ. 3: గరిమెతో నను మెచ్చి కాఁగిలించినందుకుఁగా
సురతముల నిను నొత్తి సూడువట్ట వలసె
సిరుల శ్రీవేంకటేశ సేసవెట్టినందుకుఁగా
యిరవుకొని నీవురము యెక్కివుండవలసె

రేకు: 1008-1 ముఖారి సంపుటం: 20-043

పల్లవి: ఇందుకు నేమందునే యిపుడు నేను
ముందుముందే జాణఁడని మొక్కేనే నేను

చ. 1: కూరిమి వేరొకతెఁ దాఁ గూడఁగా నే జంకించితే
ఆరామపై నానవెట్టీ నాయఁగా నేను(డు)
కోరక నే నుండినాను కొమ్మచేత విడె మంపె
మేరమీరి ఇది చూచి మేలంటినే నేను

చ. 2: ఆలిగి నే నుండఁగాను ఆకెచేఁ బిలువ నంపె
చెలువుని చేఁతకు మెచ్చితినే నేను
పలుక కుండఁగ నన్నాపడఁతి పేరఁ బిలిచె
నలుగడ నిందుకుఁగా నవ్వేఁబో నేను

చ. 3: తను నే నొట్టివెట్టితే తనసతి మొక్కించి
తనిసితి నిందుకుఁగా తగునే నేను
అనుగు శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడి
తనకాంతఁ జేతికిచ్చె దక్కఁగొంటి నేను

రేకు: 1008-2 వరాళి సంపుటం: 20-044

పల్లవి: నేరుపెల్లా నొక్కటే నెతఁతలభాగ్య మింతే
సారెసారె ముట్టికురా సటలకు వచ్చేనా

చ. 1: కన్ను లార్చ నేరుతురు కడు నవ్వ నేరుతురు
కన్నెలట పురుషులఁ గరఁచలేరా
వన్నెల మోహము గల్తే వాడులైనా నింపులే
మన్నించరా రమణుఁడ మాటలకు వచ్చేనా

చ. 2: చక్కఁదనాలూఁ గలవు చతురతలుఁ గలవు
చొక్కపుఁ గామినులట చొక్కించలేరా
గక్కనఁ జనవు గల్తే గర్వమైనా చందమౌను
చెక్కునొక్కకురా నీవు చేతఁలకు వచ్చేనా

చ. 3: పైకొని కూడఁగవచ్చు పంతములాడఁగవచ్చు
లోకములో సతులట లోఁగ నున్నదా
మేకొని శ్రీవేంకటేశ మించి నన్నుఁగూడితివి
పోకురా యెందునుఁ దలపోఁతలకు వచ్చేనా

రేకు: 1008-3 పాడి సంపుటం: 20-045

పల్లవి: అందుకు నిందుకుఁ బతి ఆయఁగదరా
నందకధరుఁడ నేఁడు నవ్వువచ్చీ నాకు

చ. 1: పిన్నదాననై బొమ్మపెండ్లి నేఁ జేయఁగాను
నన్నుఁ జూచి నీవు నాఁడే నవ్వితివిగదరా
చెన్నుగ నాకిట్టె సన్న సేసి నీవు గూడఁగాను
నన్ను నిన్నుఁ జూచి నేఁడు నవ్వు వచ్చీ నాకు

చ. 2: పడుచులు నేను చెట్టాపట్టాలు పట్టు కాడఁగా
నడుమనే నన్నుఁ జూచి నవ్వితివి గదరా
చిడుముడి నీవు నన్నుఁ జెట్టివట్టుకోఁగా నేఁడు
నడుకొత్తి నిన్నుఁ జూచి నవ్వువచ్చీ నాకు

చ. 3: పొలసి గుజ్జనఁగూళ్ల బువ్వాలాడే నన్నుఁ జూచి
నలువంక నాఁడు నీవు నవ్వితివి గదరా
యెలమి శ్రీవేంకటేశ యిటు నా మోవిబువ్వము
నలి నీ వంటి కూడఁగా నవ్వువచ్చీ నాకు

రేకు: 1008-4 వరాళి సంపుటం: 20-046

పల్లవి: కనీఁగానములకుఁ గక్కసించేనా నిన్ను
ఘనుఁడవు నీవైతే గబ్బితన మేలరా

చ. 1: నగితిఁగాక నీతోను నాయానకు వచ్చేనా
అగడుగ శతాయుష్యమంటేఁ గొంగువట్టేవా
మొగము చూచితిఁగాక ముట్టితే ముయి గొనేనా
మగవాఁడవైతేనే మాట లింతే శేలరా

చ. 2: సరసమాడితిఁగాక సాదించ వచ్చేనా
పొరి నిప్పంటేనే నోరు పొక్కేననేవా
మరఁగు దీసితిఁగాక మంద మిరేలు చల్లేనా
సరసుఁడవై తేనే సాదింపులేలరా

చ. 3: కాఁగిలించితిఁగాక కయ్యాలకు వచ్చేనా
మాఁగెను మోవిపండంటే మరి గుక్కిళ్లు మింగేవా
చీఁగక కూడితి నన్ను వేగమె శ్రీవేంకటేశ
తోఁగి సేస వెట్టితేనే తోదోపులేలరా

రేకు: 1008-5 శంకరాభరణం సంపుటం: 20-047

పల్లవి: నవ్వే దెఱఁగఁడు నడుమంత్రములవారు
చివ్వనఁ దనలోన సిగ్గువడవలదా

చ. 1: రాకాఁబోకల రమణుఁడు దూరీనే ! తా
జోక సన్న సేయఁగాను చూడనంటా
పోకుంటేఁ బిలిచి బొమ్మల జంకించీనే !యింత-
కాకు గలదా కాంతలలోన

చ. 2: బలిమిఁ జలిమిఁ బతి యేల యలిగీనే ! తా-
నలసి నిద్రించ లేపనై తినంటా
పలికి పలికి పలువెంగేలాడీనే ! నే
వెలికి వచ్చితినంటా వేగిరమా తనకు

చ. 3: తగిలి తగిలి తానేల మొక్కీనే ! నే
జిగిఁ గూడి చెప్పినట్టు సేసితినంటా
చిగులుతా మెచ్చీ శ్రీవేంకటేశ్వరుఁడె నేఁ
దగ నుర మెక్కితిని తా జాణఁగదవే

రేకు: 1008-6 హిందోళవసంతం సంపుటం: 20-048

పల్లవి: పతి మీఁది తమకాన భ్రమసితివింతే నీవు
అతివరో వెఱపేలే అవే నీవు గావా

చ. 1: చందురుఁ డితఁడు గాఁడే సతి నీనెమ్మోముగాని
పొంది నీనీడ జలధిఁ బొడచూపెను
మందానిలుఁడు గాఁడె మగువ నీవూర్పు గాని
గందపుఁగొండఁ దాఁకి కమ్మరా నేతెంచెను

చ. 2: కోవిలకూఁతలు గావె కొమ్మ నీయెలుఁగు గాని
యీవలఁ బ్రతిధ్వనులై యెగసె వనానను
పూవుల మొగ్గలు గానె పూఁపనీచన్నులు గాని
తావుల వసంతమాడఁ దలలెత్తెఁ బొదల

చ. 3: చిక్కుల మరుఁడు గాఁడె శ్రీవేంకటేశుఁడు గాని
తక్కి నీమనసు చూచి దగ్గరె భావమున
యిక్కువ లంటి కూడితి రిద్దరూఁ బానుపు మీఁద
మొక్కుగాదు మోపు గాని ముంచి నీపై వేసెను

రేకు: 1009-1 హిందోళం సంపుటం: 20-049

పల్లవి: వనితకుఁ బతి కిదె వసంతము
దినదినము నమరె తిరుమలమీఁద

చ. 1: పుప్పొడి వసంతము పొసఁగె రమణునికి
కప్పురవసంతము కాంతకును
కొప్పెరల నెదురుగఁ గుంకుమ పన్నీరు నించి
కుప్పెలఁ జల్లులాడేరు కోనేటికాడ

చ. 2: జవ్వాదివసంతము చతురుఁడు గై కొనె
పువ్వుల వసంతము పొలఁతి కిదె
రవ్వగా బండ్లపై రాసులు వోసుక
నవ్వుతా వేటులాడేరు నడిమించింతాడ

చ. 3: గందపు వసంతముఁ గడు శ్రీవేంకటపతి
అందె కస్తూరివసంత మలమేల్మంగ
చిందుచుఁ దట్టుపుణుఁగు చిమ్ముచుఁ గూడాడేరు
సందడి సమరతుల సంపెఁగకాడ

రేకు:	1009-2 ముఖారి సంపుటం:	20-050

పల్లవి:	చెల్లునా నీ కీపనులు చెన్న కేశా
కొల్లకాఁడ వౌర గండిగోట చెన్నకేశా

చ. 1:	అంగవించి మగనాలి కాసపడే విందరిలోఁ
జెంగలింపుఁ జూపులతోఁ జెన్నకేశ
రంగుమీర నిరువంక రమణు లిద్దరుండుఁగా
అంగన లింకానా ఔరా చెన్నకేశా

చ. 2:	కమ్మటి మానవు మమ్ముఁ గరఁగించే వూరకైనా
చిమ్ముఁదేనె మాటలతోఁ జెన్నకేశ
దొమ్మిసేసి మగువల తొల్లె యాఁడిఁ బెట్టితి-
వమ్మరో నీకు వెరతుమౌర చెన్నకేశా

చ. 3:	వావి గద్దంటా నాతో వచ్చి వచ్చి నవ్వేవు
శ్రీవేంకటాద్రి మీఁదఁ జెన్న కేశ
కావిమోవి గంటిసేసి కమ్మి నన్నుఁగూడితివి
ఆవేశ నేమననైతి (నే మనసైతి)చెన్న కేశా

రేకు: 1009-3 వరాళి సంపుటం: 20-051

పల్లవి: ఏమనేవోయని నాకు యెంచరాదు తమకము
నామనసు దా నెఱఁగు నాలిసేయఁడుగదా

చ. 1: చెప్పితినా ఆతనితోఁ జెలియ నామాటలెల్లా
దప్పిగొన్న ట్టిచ్చగించి తాను వినెనా
అప్పటి నేమని విభుఁ డానతిచ్చె మారుమాట
తప్పఁడు గదా నాడుఁ దా నిచ్చినబాస

చ. 2: పిలిచితివా నీవు ప్రియము గూరిచి వాని
వలపు గలిగి తా వచ్చేననెనా
తలఁపు నీకుఁ దెలుసు తడవెనా నాసుద్ది
సెలవినవ్వులతో నీచేతికాను కంటేనా

చ. 3: యిచ్చితివా ఆనవాలు యింతి నారమణునికి
యిచ్చల శ్రీవేంకటేశుఁ డియ్యకొనెనా
వచ్చె నిదె యింతలోనే వహి కెక్క ననుఁ గూడె
తచ్చన లింతాఁ జేసె తారుకాణ లాయనా

రేకు: 1009-4 సాళంగనాట సంపుటం: 20-052

పల్లవి: వట్టిదూరులేల వేసీ వద్దే యింత ! తన-
గుట్టు నే నెఱఁగనిదా కూడుకొంటి నేను

చ. 1: మఱి తాను నవ్వఁగాను మానుమంటినా నేను
తఱితోడ సిగ్గువడీ తానే కాక
వుఱక కాఁగిలించఁగా నొల్లనంటినా నేను
యెఱఁగి పరాకు సేసీ యేఁటికో కాక

చ. 2: కడఁగి సేసలెట్టఁగాఁ గాదంటినా నేను
తడవు జోలి దవ్వీ తానే కాక
జడిసి మాటాడఁగాను చాలునంటినా నేను
యెడ నెడ సొలసీని ఇది యేమో కాక

చ. 3: పొలసి లోనికి రాఁగాఁ బొమ్మంటినా నేను
తలవాకిటనే వుండీ తానే కాక
ఆలమి శ్రీవేంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
చలము సాదించీ యెంతసలిగో కాక

రేకు: 1009-5 సామంతం సంపుటం: 20-053

పల్లవి: కానీ కానీ పదవే కానవలెఁగా తన్ను
నేనే తాఁగావలె నెగులేలే తనకు

చ. 1: కలిపించఁ గలఁడట ప్రియము చెప్పఁగలేఁడా
బలువుఁడైతే మాతోఁ బంతమా యిది
వలపంచఁగలఁడట వరుసకు రాలేఁడా
చెలులమైతేనే చెల్లుబడా తనకు

చ. 2: చెక్కునొక్కఁ గలఁడట చెప్పినట్టు సేయలేఁడా
అక్కటా యిదిఁగోంత అగడా నేఁడు
మొక్కించుకోఁగలఁడట మొకమోట నుండలేఁడా
పక్కన నేఁ డింతలోనే పగటా తనకు

చ. 3: కాఁగిలించఁ గలఁడట కందువ మోవియ్యలేఁడా
వీఁగేటిరతులలోన వేసటా ఇది
యేఁగివచ్చి శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
దాఁగి దాఁగి సిగ్గువడఁ దగవా తనకు

రేకు: 1009-6 భైరవి సంపుటం: 20-054

పల్లవి: అంతేకాదా మరి ఆయఁగా పని
చెంతఁ జక్కనివా రూరఁ జేరివుండఁ బాసెనా

చ. 1: ఔరా నీపగటు ఆయము లంటవచ్చేవు
మారుమాటాడకుంటేనే మన సిస్తినా
సారెనేల పట్టేవు చక్కనుండేవో వుండవో
నేరిచి మా వారు నన్ను నీకుఁగానే కనిరా

చ. 2: అద్దో నీ బలువు అద్దలించి పిలిచేవు
వద్దన జాలకుంటేనే వసమైతినా
వొద్దువోదా నీకదేమి బూతులనే గొఱఁగేవు
బుద్దిలో(లే)నిమరుఁడు నీపొరుగే కాఁ జేసెనా

చ. 3: మేలువో నీతగవు మించి నన్నుఁ గూడేవు
మేలవడకుంటేనే మెచ్చనైతినా
పాలించి శ్రీవేంకటేశ పకపకనవ్వేవు
పాలవంటివయను నీపాలికిట్టె దక్కెనా

రేకు: 1010-1 శుద్ధవసంతం సంపుటం: 20-055

పల్లవి: ఇంతలోఁ గోపము గద్దా ఇయ్యకొని వుండవద్దా
వింతగాదు నీకు నాకు వెరగైతి నింతే

చ. 1: సతి యేలే గొణఁగూ చల్లకువే సణఁగూ
మతి నీ మొగమై వుండి మళ్లితి నింతే
కతగాఁ దిట్టికువే కానినింద గట్టికువే
పతినై వున్నాఁడఁ గోక పైఁ గప్పుకొంటి నింతే

చ. 2: వద్దువద్దే కసరూ వంచకువే వుసురూ
వద్దఁ బాయ నాలోఁ దలవంచితి నింతే
గద్దించి చూడకువే కల్లలింతాడకువే
పొద్దువోగా నీయింటిలో విద్దిరించే నింతే

చ. 3: వేగిరించి తియ్యకువే వేసాలు సెయ్యకువే
నాగుట్టు నీకుఁ దెలుసు నవ్వితి నింతే
భోగించితిఁగదవే పొంచి ఇంకాఁ బదవే
యీగతి నే శ్రీవేంకటేశుఁడ నింతే

రేకు: 1010-2 వేళావళి సంపుటం: 20-056

పల్లవి: నిజమరివి నీవని నే నుండుదును
గజరులు చెలి య దే కదిసీ నిన్నును

చ. 1: పగటులనడపులఁ బకపకనగుచును
మగువ నీయెదుటను మలసీని
తగులు గలుగఁబోలు తరుణుల నొల్లనని
పొగరుల నాతో బొంకుదువు

చ. 2: పుక్కిటివిడెముతోఁ బొరిఁ గన్నులార్చుచు
చక్కనిమగువ నిన్ను జరసీని
వొక్కటి నీతోఁ గాఁబోలు వొగి నీవాఁడ నేయంటా
చక్కఁగ నేడలేనిబాసలు సేతువు

చ. 3: నిలువుఁజెమట గార నీతో సరసమాడినీ
కలికి నీకు నసలు గాఁబోలును
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యిలఁ గొంతవడి భ్రమయించనేల నీవు

రేకు: 1010-3 సామంతం సంపుటం: 20-057

పల్లవి: పేరుఁ గీర్తిగావలె బిరుదులు వేరే యేల
ఆరీతి నా పఁ(పం)త మిదె అటు చూదరాదా

చ. 1: కన్నెను నామోహము నీకాళ్లఁ బెనఁగించకుంటే
నన్నుఁ జూచి నీ వప్పుడు నవ్వరాదా
యెన్ని చెప్పినా రావు యిదె నా నిట్టూర్పుగాలి
దిన్నలై రాసులువోసితే మెచ్చరాదా

చ. 2: తక్కక నాజవ్వనము తరపు వెట్టించకుంటే
పెక్కువతో నొండుపేరు వెట్టరాదా
చక్కనుండ వెఁ(వెం)తైనా సటలకుఁ దిరిగేవు
ముక్కులబంటి గావలె ముదు(ద)లియ్యరాదా

చ. 3: మంతనపునామాటలు మర్మాలు నాటించకుంటే
అంతవింతా నీవు వెంగేలాడరాదా
చెంతల శ్రీవేంకటేశ చేకొని కూడితివి నఁ
న్నంతటాఁ బొగడవలె నటు చూడరాదా

రేకు: 1010-4 శంకరాభరణం సంపుటం: 20-058

పల్లవి: ఇంతకంటె నోపము యేదౌతా నెఱఁగము
పంతము లింకానేల పదవయ్యా

చ. 1: సన్ననేసితివి నీవు సంగడికి వస్తి నేను
యెన్నఁగ మీఁదటిపని యేమనేవయ్యా
కన్నులఁ జూచితివి నీవు కైదండ యిచ్చితి నేను
చిన్నదాన నేమిసేతుఁ జెప్పఁగదవయ్యా

చ. 2: చిరునవ్వు నవ్వితిని సిగ్గువడితిని నేను
యెఱుఁగ మేమిటికౌతా నిది యేమయ్య
జఱపులఁ బెట్టితివి జంకించితిని నేను
మఱఁగులు మొఱఁగులు మఱి యేలయ్యా

చ. 3: కాలుదొక్కితివి నీవు కరఁగితి మేను నేను
వోలి నొక్కమనసుతో వుండవయ్యా
యేలితివి శ్రీవేంకటేశుఁడ విందిర నేను
మేలు మేలు యిన్నిటాను మెచ్చితి నిన్నయ్యా

రేకు: 1010-5 దేసాళం సంపుటం: 20-059

పల్లవి: మానవయ్య్య మాతోడి మందెమేళాలు
సానఁబట్టేవు పంతాలు సతులపై నేలయ్యా

చ. 1: వా(వ్రా)యవయ్య్య చెక్కులపై వలపులవాఁ(వ్రా)తలు
యేయెడనీసతిపై యెఁ(యెం)దైనాఁ బోయి
ఆయము దాఁకీ మాకు నంతేసి కోపము నీ-
చేయి వూరకుండకుంటే చిమ్మవయ్య్య బయలు

చ. 2: ఆడవయ్యా నీనోర నలపెండ్లిమాటలు
యీాడ నాడ సతులపై నెఁ(నెం)దైనాఁ బోయి
వీదెపు మాసెలవుల విచ్చిచెప్పఁజాలము
ఆడుకొన వేడుకైతే నటు ముంటాఁ బోవయ్యా

చ. 3: అందువయ్య్య చేయిచాఁచి అంగజమర్మములు నీ-
విందు రాకుంటేఁ జాలు నెఁదైనాఁ బోయి
కందువ శ్రీవేంకటేశ కాఁగిట న న్నేలితి నీఁ
వందుకోలుజాణవైతే నట్లే కానీవయ్యా

రేకు: 1010-6 లలిత సంపుటం: 20-060

పల్లవి: నవ్వులు నవ్వించవచ్చీ నగకున్నాను
యివ్వలఁ గతలు మానఁ డీఁకనన్నాను

చ. 1: తన్నెవ్వారు దడవిరే తానేల మాటాడీనే
సన్నలుసేయఁగ వచ్చీఁ జాలునన్నాను
యెన్నోవినయాలు సేసీ యియ్యకొన్నవా రెవ్వరే
వున్నతిఁ బైఁజేయివేసీ నోపనన్నాను

చ. 2: యిట్టె తానేడ నే నేడ యిచ్చకాలు సేసి సేసి
వట్టివావులు దెలిపీ వద్దన్నాను
చుట్టిచుట్టి మొక్కు మొక్కీఁ జూచినవా రెవ్వరే
నెట్టుకొని బాస సేసీ నిలువుమన్నాను

చ. 3: కాదన్నవా రెవ్వరే కడుమోహములు చెప్పీ
సేదదేర మోవి చూపీ సిగ్గువడ్డాను
యీదెస శ్రీవేంకటేశుఁడిట్టె బలిమిఁ గూడె
గాదెఁ బోసీ బంతములు కైకొంటి నన్నాను

రేకు: 1011-1 సాళంగం సంపుటం: 20-061

పల్లవి: అంది ఇతవునేసితే నాయఁగా పని నాఁ
కందరితో వెరగయ్యీ నాయఁగా పని

చ. 1: చిందేటిచెక్కుచెమట చేతఁదుడువఁగఁబోతే
అందుకేఁ తా జగడించీ నాయఁగా పని
కందువలఁ దనమేన గందము వూయఁగబోతే
అందందే తప్పకచూచె నాయఁగా పని

చ. 2: తురుమువాడుఁబువ్వులు తొలఁగఁ దియ్యఁగఁబోతే
అరమరై జంకించీ నాయఁగా పని
గరిమ వంచినమోము కని అలసితివంటే
అరుదుగా మారుమోమై ఆయఁగా పని

చ. 3: అప్పుడు చెదరినట్టిహారాలు చక్కదొబ్బితే-
నప్పటి తాఁ గాఁగిలించీ నాయఁగా పని
కప్పురము మోవి కియ్యఁగా శ్రీవేంకటపతి
అప్పళించె రతుల న న్నాయఁగా పని

రేకు: 1011-2 సామంతం సంపుటం: 20-062

పల్లవి: ఓయమ్మ ఇంతయేల వొద్దనరే
నాయముగా దిందరిలో నగుఁబాటు

చ. 1: చెక్కునొక్కితిని సెలవి నవ్వితిని
మక్కువతో నేఁత్తైనా మాటాడఁడు
మొక్కు మొక్కితిని మోనాన నుండితిని
యెక్కుడు దిట్టితినంటా నెగ్గువట్టీ నితఁడు

చ. 2: ఇచ్చకముఁ జేసితి ఇచ్చితి విడెమును
కచ్చుపెట్టి యేఁత్తైనాఁ గరఁగఁడు
ముచ్చటలాడితిని మోవిఁజూచితిఁ దన్నుఁ
బచ్చిగాఁ జేసితినంటా పగచాటీ నీతడు

చ. 3: కన్నులాఁ జొక్కితిని కాఁగిటా నించితిని
మన్నించె రతి నేఁత్తైనా మానఁడు
సన్నల మెచ్చితిని చాయల హెచ్చితిని
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డెంతజాణే ఇతఁడు

రేకు: 1011-3 భైరవి సంపుటం: 20-063

పల్లవి: ఇంతిరో యిట్లనైతే యేమిసేసేనే
మంతనాన పతి వీడే మరి యేమనేనే

చ. 1: అప్పుడే నే ననినా ఆతఁడిందుకు వచ్చితే
వొప్పనతో మొగమోడి వుండుదునని
తప్పుదేర నాడనుండే తగినట్టెల్లా నాడక
నెప్పున యీడకుఁ దెస్తే నే నేమనేనే

చ. 2: చేత సన్న నేయ నాచెలిఁ గిట్టే పట్టితే-
నాతల నేఁ బరవశ మందుదునని
పై తరవై ఆడనుండే వంతములు వుచ్చుకోక
యీతల నన్నాడుమంటే యిఁక నేమనేనే

చ. 3: నెలవి నే నవ్వనా శ్రీవేంకటేశ్వరుఁడు
కలసితేఁ గరఁగుదు కమ్మర నని
తొలుతనే ఆడవైతి దూరకువే యిఁకనేమి
నిలిచితి మిద్దరమూ నిన్ను నేనునేమే

రేకు: 1011-4 బౌళి సంపుటం: 20-064

పల్లవి: పొంద్తైన యింతులు లేరో పురుషులు లేరో భూమి
ఇందే కంటివి వింత లివి గొన్ని వలెనా

చ. 1: వేడుకా నొకకొంత విసువూ నొకకొంత
ఆడనుండే పతి మాటలాడించఁగా
తోడ నలయించుకంటె తొల్లిటి అలుకే మేలు
వాడికె నీసతి కింతవలెనా అగడు

చ. 2: సెలవిన వ్వొకకొంత చిక్కుచేయీా నొకకొంత
సొలసి ముందర నిల్చి జోలిదవ్వఁగా
నిలుచుండి యేఁచుకంటె నీవు రానన్నా మేలు
వలచినచెలి కింతవలెనా తగవు

చ. 3: నిండుఁగల లొకకొంత నిట్టూర్పు నొకకొంత
అండ నీవు కాఁగిలించి అటు గూడఁగా
కొండల శ్రీవేంకటేశ కోమలిపై నీమేలు
వండు గేరెఁ జెలి కింకవలెనా వెరగు

రేకు: 1011-5 శంకరాభరణం సంపుటం: 20-065

పల్లవి: ఇప్పటనుంటినేల యెడమాట కానీకానీ
ముప్పిరి నే నవ్వితేఁగా మొగకళ లెక్కుత

చ. 1: పొలసి పొలసి లోఁగి పొంచి పొంచి తలవంచి
సెలసి సెలసి తాను చిమ్మిగోర
అలసి సొలసి యిప్పు డాడనేల తాను నేను
కలసినప్పుడుగదా కడమలు నిండుత

చ. 2: జునిఁగి జునిఁగి లేచి మునిఁగి మునిఁగి యేసి
పెనఁగి పెనఁగి పాసి ప్రేమ చల్లీని
పొనిఁగి పొనిఁగి తన్ను బోదించనేల నేను
పెనఁగినప్పుడుగదా బిరుదు వొగడుత

చ. 3: మానిమాని కరఁగీని మగుడ కాలుఁ దొక్కి
ఆనని శ్రీవేంకటేశుఁ డంతలో నిదె
కోనకోనచన్నులపైఁ గొంక కిట్టె చేయివేసీ
నానినవలపులఁగా నానాఁట మెచ్చుట

రేకు: 1011-6 కాంభోది సంపుటం: 20-066

పల్లవి: ఎగ్గువట్టీ నిదియేమే యీతఁడు
సిగ్గుపడ్డనాలోనిచింత లెంచవలదా

చ. 1: మనసు చంచలమైతే మాటాడఁ గొలుపునా
నను పైనవిభుడేల నన్ను దూరీనే
తనువు కాఁక రేఁగితే దగ్గరి రాఁగొలుపునా
తనపనే చూచెఁగాని తగ వెంచవలదా

చ. 2: పాయపువేఁకముచేతఁ బలుకఁగఁ గొలుపునా
చాయల సన్నల నేల సాదించీనే
రేయి విరహనఁబొంది రిచ్చఁజూడఁ గొలుపునా
నాయెడ రాజస మెంచి నన్ను నెంచవలదా

చ. 3: కడుజెనుట నిండితే కాఁగిలించఁ గొలుపునా
బడివాసి యిప్పుడేల పైకొనీనే
అడరి శ్రీవేంకటేశుఁడాదరించి నన్నుఁగూడె
విడువ నిరతు లెంచి వేళ యెంచవలదా

రేకు: 1012-1 రామక్రియ సంపుటం: 20-067

పల్లవి: వలపించి తిప్పేవు వాడవాడలను మమ్ము
యిల గొంత గుట్టు వద్దా యేలోయి విట్ఠలా

చ. 1: వొల్లనే మగలవద్దనున్న గొల్లెతలను
పిల్లఁగోవిసన్నలనే పిలిచేవు
చల్లలమ్మఁబోయ్యేచోట జాణతనా లాడేవు
బల్లిదుఁడ వౌదువయ్య పండరంగి విట్ఠలా

చ. 2: వైపులఁ గొలనాడేటివారిచీరలు దీసి
రాఁపుచేసి నీవొద్దికి రప్పించేవు
యేపున వీదినుండితే యెలయించేవు చూపుల
బాపు బాపు మెచ్చితిఁగా పండరంగివిట్ఠలా

చ. 3: కన్నచోట నెవ్వరైనాఁ గాంతలైతేఁ గూడేవు
చిన్ననాటనుండి యిటె చెనకేవు
యెన్నఁగ శ్రీవేంకటాద్రి నిటు నిట్ఠలాన మమ్ము
పన్నుక వుండి కూడితి పండరంగి విట్ఠలా

రేకు: 1012-2 సామంతం సంపుటం: 20-068

పల్లవి: ఒక్కరీతి నుండదోయి వోవిట్ఠలా
వుక్కువంటి నీచిత్తము వోవిట్ఠలా

చ. 1: పొద్దువోయి వచ్చేవు పూఁచి బాసలు సేసేవు
వొద్దన్నా మానవేల వో విట్ఠలా
కొద్దిమాలి తిరిగేవు కొంగువట్టేవు మమ్ము
వుద్దండా లేలోయి వో వివిట్ఠలా

చ. 2: వెడనవ్వు నవ్వేవు వీదులెల్లా నేఁగేవు
వొడఁబాటు లింకానా వో విట్ఠలా
కడుఁబరాకయ్యేవు కదిసేవు కమ్మరాను
వొడలు మోపకు వోయి వో విట్ఠలా

చ. 3: కప్పురాలు చల్లేవు కాఁగిటిలో భ్రమసేవు
వొప్పితి నీసుద్దులకే వో విట్ఠలా
యిప్పుడె శ్రీవేంకటాద్రి నిరవై కూడితి విదె
వుప్పటించఁజాల నిఁక నో విట్ఠలా

రేకు: 1012-3 శంకరాభరణం సంపుటం: 20-069

పల్లవి: పట్టకురా అంత నీవు పనిలేదు
దిట్టనై నీగుణమెల్లాఁ దెలిసినమీఁదను

చ. 1: చెక్కునొక్కాఁ బనిలేదు సేసవెట్టఁ బనిలేదు
గక్కన నే నలిగినకాఁకమీఁదను
నిక్కిచూడాఁ బనిలేదు నిలుచుండాఁ బనిలేదు
తక్కించి నీవు రాక తడసినమీఁదను

చ. 2: నవ్వు నవ్వాఁ బనిలేదు నాఁటజూఁడా బనిలేదు
దవ్వులుగ బొంకినయంతటిమీదను
రవ్వసేయాఁ బనిలేదు రాజసాలూఁ బనిలేదు
పవ్వళించి పానుపుపైఁ బలుకనిమీఁదను

చ. 3: కాఁగిలించాఁ బనిలేదు కరఁగించాఁ బనిలేదు
మాఁగినరతుల నన్ను మన్నించుమీఁద
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
వీఁగ నీకుఁ బనిలేదు వేడుకలమీఁదను

రేకు: 1012-4 గుండక్రియ సంపుటం: 20-070

పల్లవి: నీవూ నీయంతనే నేనూ నాయంతనే
కావలసినట్లయ్యీఁ గడమ లింకేలా

చ. 1: దవ్వులఁ జూచితివి తనివిఁబొందితి నేను
నవ్వు నవ్వితివి నీవు నమ్మితి నేను
పువ్వుల వేసితివి పులకించితి నేను
రవ్వగా నింకానేల రతికిఁ దీసేవు

చ. 2: కన్నుల మొక్కితివి కరఁగి కై కొంటి నేను
సన్నలు సేసితివి సమ్మతించితి
కిన్నెర మీఁటితివి కిమ్ముఁల జొక్కితి నేను
పన్ని యింకానేల నీవు పైకొని పిలిచేవు

చ. 3: మోవి నీవు చూపితివి మోహము చేకొంటి నేను
వావి నీవు చెప్పితివి వలచితిని
తావుల శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
తోవల నింకానేల దొమ్ములు సేసేవు

రేకు: 1012-5 శంకరాభరణం సంపుటం: 20-071

పల్లవి: నిన్నపాలు సేయకురే వేగుదాఁకాను
అన్నిటా నిచ్చకములే యాడుదముగాని

చ. 1: మంతనాలాడకురే మనసుదెలియుదాఁకా
కాంతుఁడు దా నేమనీనో కందముగాని
పంతాలు నెరపకురే పడఁతిఁ గలయుదాఁకా
చెంతనుండి ప్రియములే చెప్పుదముగాని

చ. 2: తత్తరించి పిల్వకురే తానే వచ్చిన దాఁకా
యిత్తలఁ గానికె సారె నిత్తముగాని
మొత్తమి నాతని నంతమోవనాడి దూరకురే
బత్తితోడ మీఁదఁ మీఁదఁ బై కొందముగాని

చ. 3: సన్నలు సేయకురే సంగడి నవ్వినదాఁకా
యెన్నిక ముందరికత లెంతముగాని
చెన్నుమీర నింతిఁ గూడె శ్రీవేంకటేశుఁడిట్టె
వన్నెకెక్కఁ బొగడరే వద్దన్నదాఁకాను

రేకు: 1012-6 బౌళి సంపుటం: 20-072

పల్లవి: అనుమానా లిఁకనేల అంపరాదా నీఁ
మనసు దెలిసితిమి మమ్ము నంపరాదా

చ. 1: చెలిమాఁట విన్నపము సేసితిమి నీ చిత్త-
మలరఁగ నానతిచ్చి అంపరాదా
బలిమి సేయఁగరాదు పట్టరాదు నిన్ను నేము
మలకలమాఁటలేల మమ్ము నంపరాదా

చ. 2: ఆకె నీవు నెదురైతి రండనున్నారము నేము
ఆకొలఁది నీవెఱఁగి యంపరాదా
యేకతాన యిద్దరునే యెఱుఁగుకొందరు గాని
మాకతలు యిప్పుడేల మమ్ము నంపరాదా

చ. 3: మంచముపై నున్నారు మారుమోము లవి యేల
అంచెల శ్రీవేంకటేశ అంపరాదా
మించుల దోమతెరలో మేనుమేను సోఁకె మీకు
మంచిదాయ నిట్టె వుండి మమ్ము నంపరాదా

రేకు: 1013-1 శంకరాభరణం సంపుటం: 20-073

పల్లవి: అతని కివెల్లా నలవాటు
యితవులు చేసే యించుక నిలవే

చ. 1: యెనసినమాఁటలె యెఱుకలు
మనసురానివే మఱపులు
తనిసితి మిఁక నింతటఁ బదవే ! తనఁ
ననుపుఁ బ్రియములకు నవ్వితిఁగదవే

చ. 2: కూరిమి గలచో కూటములు
వేరై తేనే వెడవెడలు
తారుకాణ లివె తడవకువే ! తా
మేరమీరఁగా మెచ్చితి నిపుడే

చ. 3: సమరులైతేఁ జవు లవును
అమరనివై తే నలపవును
క్రమమున శ్రీవేంకటపతి గూడెను
తమితో నే నిఁక దక్కితి నవునే

రేకు: 1013-2 నాదరామక్రియ సంపుటం: 20-074

పల్లవి: ఎచ్చరించవయ్యా నీవు యింతి తన్నుఁ దా మఱచె
మచ్చికనాయకుఁడ నీమందెమేళములను

చ. 1: పలుకఁగ మఱచెను పడఁతి నిన్నుఁజూచి
పలుకరాకున్నమతి భ్రమయించఁగా
సెలవి నవ్వ మఱచె చెలువుఁడ నీపేరు
తలఁచి తలఁచి చొక్కె తమకంబునను

చ. 2: అడుగు వెట్ట మఱచె నంగన నీ కెదురేఁగి
కడు నీకు సన్నచేసె కాతరానను
అడరి విన మఱచె నప్పుడే నీమాఁటలు
పడఁతి పానుపు చేరె పరవశమునను

చ. 3: యిప్పుడే మెచ్చమఱచె యింతిని నీవు గూడఁగ
కప్పిననీరతులలో గర్వానను
చెప్పరాదు యిఁక నేమి శ్రీవేంకటేశ్వరుఁడ
తప్పులెల్లా మఱచె నీతములము వంకను

రేకు: 1013-3 సామంతం సంపుటం: 20-075

పల్లవి: తేనెపేరు నోర నంటేఁదీపు వుట్టీనా
తాను నేనూఁ గలిగితేఁదమకాన కేమే

చ. 1: తనుపైఁ జేయివేసి తాప మడఁచినఁగాక
వనితలఁదా నంపగావచ్చీ నదేమే
కనుఁగొని మోవి నంటి కప్పుర మిచ్చినఁగాక
అనుఁగుమాటలవల్ల నైన దేమే

చ. 2: కాఁగిట రతులఁ గూడి కరఁగించినఁగాక
కూఁగుల నవ్వులవల్లఁ గూడినదేమే
మూఁగుచుఁ బానుపుమీద ముచ్చటలాడినఁగాక
వీఁగి దవ్వులసన్నల వెలసినదేమే

చ. 3: మదము లొలుక నటె మనసు లొక్కటి గాక
యెదురు మొక్కులవల్ల నిందునేమే
యిదివో శ్రీవేంకటేశుఁ డిట్టే మన్నించెఁగాక
పదరి వూరక మేను పచ్చి సేసిననేమే

రేకు: 1013-4 రామక్రియ సంపుటం: 20-076

పల్లవి: నగినగి పాడుటేల నాయమా నీకు
మగువ వూరకుంటే సమ్మతించుటగాక

చ. 1: చేయివట్టి తియ్యఁగాను చేసన్న వలెనా
చాయల నేఁజెప్పఁ గాను సాకిరి నేఅ
పాయపురమణి యెంత పక్కన నీచలమెంత
ఆయనాయ నే రమ్మంటే ఆకె యంటగాదా

చ. 2: వొంటిఁజిక్కివుండగాఁను వొడఁబాటు వలెనా
వెంటవెంట నే రాఁగా విన్నపాలేల
దంటతనము నీ కెంత తరుణివిరహ మెంత
అంటి నే నీకు మొక్కేది ఆకెపంపు గాదా

చ. 3: కాఁగిలించి వుండఁగాను కై మీరవలెనా
రాఁగి నరతివేళలో రవ్వలేల
సాగిన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
ఆఁగి నిన్నుఁబోకుమంటే ఆకెంటగాదా

రేకు: 1013-5 మాళవిగౌళ సంపుటం: 20-077

పల్లవి: నిజ మాడఁబోతేను నీకునీకే భ్రమసేవు
భజన మెరసితిఁగా పంతమాడి నేను

చ. 1: పలుకులో నొకటి భావములో నొకటి
కలికి నీగుణమెల్లాఁ గంటిఁగా నేను
తెలిసి చింతించేవు దినము లెంచుకొనేవు
యెలమి నీవూహలెల్ల నెఱిఁగితి నేను

చ. 2: నగవులో నొకటి నడవడిలో నొకటి
వెగటైన నీకతలు వింటిఁగా నేను
పొగరుల నలసేవు పొదుదిక్కే చూచేవు
అగడైతి విందరిలో నంటిఁగా నేను

చ. 3: కాఁగిటిలో నొకటి కాఁకలలో నొఁకటి
కిఁగంటఁజూచి యెఱిఁగితిఁగా నేను
దాఁగక శ్రీవేంకటేశ తగఁ గూడితివి నీవు
ఆఁగి నీసిగ్గు వాపితి నవుఁగా నేను

రేకు: 1013-6 శుద్ధవసంతం సంపుటం: 20-078

పల్లవి: వాకిటికి వచ్చినాడు వనిత నీ రమణుఁడు
కై కొని యలుకలేల కడుఁదడవేల

చ. 1: కప్పురవిడియ మిదె గందవొడిబరణిదె
దప్పి మోవి యండనేల తలపోఁతేల
కుప్పలై నవిరు లవె కోరతట్టుపునుఁగిదె
కొప్పు ముడువవిదేల కొమ్మ నీవు నేఁడు

చ. 2: బంగారుసురటి యదె పచ్చికస్తూరి యిదె
పొంగెటిచెమట యేల బుసకొట్లేల
రంగుమీర నద్ద మదే రచనలసొమ్ము లవే
సింగారించ విదియేల చెలియరో నేఁడు

చ. 3: చేరువనే పానుపిదే శ్రీవేంకటేశుఁడు వీఁడె
మారుమోము లింకనేల మంకులేల
పూరకే యాతఁడు నిన్ను నొడఁబాటు చేసి కూడె
బీరమేల కమ్మరాను పిలువవే నేఁడు

రేకు: 1014-1 రామక్రియ సంపుటం: 20-079

పల్లవి: నే మెట్టుండితిమి నీ కేలయ్యా
దీమసాన నుండరాదా దీనత నీకేలయ్యా

చ. 1: సెలవిఁబార నగుతాఁ జెలిదిక్కు చూచితేను
నిలిచి వుస్సురనేవు నీ కేలయ్యా
నలువుగాఁ బెదవిపై నాలో నే మాటడితేను
వెలవెలఁబారె మోము వింత నీ కేలయ్యా

చ. 2: తడఁబడఁబేరుకొని తరుణులఁ బిలిచితే
నిడివి సిగ్గువడేవు నీ కేలాయ్యా
చిడుముడి నీచెక్కులచెమట నేఁ దుడిచితే
నొడఁబరచవచ్చేవు వులుకు నీ కేలయ్యా

చ. 3: మెండుకొనఁ గాఁగిలించి మే నెల్ల నిమిరితే
నిండాఁ బులకించేవు నీ కేలయ్యా
కొండల శ్రీవేంకటేశ కూడితివి యింతలోన
పండుమోవితేనె దక్కె పంతము మా కేలయ్యా

రేకు: 1014-2 సామంతం సంపుటం: 20-080

పల్లవి: చెలియరొ నన్ను నేనే చెప్పి పొగడుకోఁగాక
కలికినానేరుపెల్లఁ గనుకొనరాదా

చ. 1: చూపుల నన్నొకమాటు చూచితేనే చాలుఁగాక
యేపడతులకు మొకమియ్యనిచ్చేనా
దాపై విభుఁడు నేను దగ్గరితేఁ జాలుఁగాక
కోపులకాంతలపొందు కొలుపనిచ్చేనా

చ. 2: పూరకే నామాట వాఁడు పూఁకొంటేఁ జాలుఁగాక
వీరివారి విన్నపాలు విననిచ్చేనా
నారుకొన నాతోను నవ్వితేనే చాలుఁగాక
ఆరయ నెందూ సరస మాడనిచ్చేనా

చ. 3: సరి నాకాఁగిటఁ జేయిచాఁచితేనే చాలుఁగాక
తరుణుల తలపోఁత తన కిచ్చేనా
ఇరవై శ్రీవేంకటేశుఁ డీవేళ నన్నుఁగూడె
వరుస నెవ్వరికి నే వలవనిచ్చేనా

రేకు: 1014-3 బౌళి సంపుటం: 20-081

పల్లవి: కల్లసుమ్మీ రమణుఁడ కలఁగీ నిందుకే మతి
తొల్లిటినీగుణ మెట్టు తోఁచెనోకాని

చ. 1: ఆడఁజుమ్మీ నిన్ను నేను అంతచులుకనిమాట
వాడికె నీకెట్టు నిందవచ్చెనోకాని
తోడ వేగువెట్టుసుమ్మీ దొరవు నీమీఁద నేను
యేడ నిన్నెవ్వతె సందేహించెనోకాని

చ. 2: నవ్వఁజుమ్మీ నే నిన్ను నాతులయీసభలోన
అవ్వల నీమీఁద నెట్టు అంటెనోకాని
యెవ్వరితోఁ జెప్పఁ జుమ్మీ యిట్టునట్టు అని నిన్ను
దవ్వుల నీకాఁక యెటు తగిలెనోకాని

చ. 3: చూడఁజుమ్మీ నిన్ను నేను చురుకన గుండెనాఁట
ఆడనే నీ వెట్టు గుఱియైతివో కాని
వేడుక శ్రీవేంకటేశ వెలయ నన్నుఁగూడితి-
వాడుకో లిదేసుమ్మీ ఆనతిత్తుఁగాని

రేకు: 1014-4 రామక్రియ సంపుటం: 20-082

పల్లవి: పట్టితే పదిరూపులై పాయఁడు నా వొద్దఁదాగు
యెట్టువున్న మేలు ఇఁక నెప్పుడైనా రానీవే

చ. 1: కన్నులనే వొకరూపు కాళ్లఁ బెనఁగీ రూపు
వెన్నెలాఁ దురుమువంటి వన్నెల రూపు
నెన్నడిమి దొకరూపు నిచ్చలు నామేని మీఁద
ఇన్నిటాఁ బాయఁడు తాను యెప్పుడైనా రానీవే

చ. 2: చేతిలోని దొకరూపు చేరి నాపేరిటిరూపు
కాతరపు జవ్వనానఁ గలఁడు రూపు
పై తరవైనా బుజబలమున నొకరూపు
యీతల నాయందుఁ బాయఁ డెప్పుడైనా రానీవే

చ. 3: కడుబుద్ధుల నొకరూపు కలికితనాలరూపు
బడిఁబడిఁ బాసినాను పాయఁడు నన్ను
అడరి శ్రీవేంకటాద్రిమీఁద నను గూడి
యెడయ డెన్నివిధాల నెప్పుడైనా రానీవే

రేకు: 1014-5 ముఖారి సంపుటం: 20-083

పల్లవి: రేసులు వాసులును రెండు గలవా
వేసరించఁగాని నను వేగించనీరాదా

చ. 1: నవ్వితే నవ్వనివాఁడు నన్నేల తప్పక చూచె
యివ్వల నాఁడువారై తే హీనమా యేమి
జవ్వనాన చంకగుదె శరణార్తిఁ దనకేల
వువ్విళ్లూరించక నన్ను నుండవీరాదా

చ. 2: ముట్టితే ముట్టనివాఁడు ముందేల సరసమాడె
నెట్టుకొన వలచుటే నేరమా యేమి
తొట్టి యెడఁగ తెరయుఁ దోడ నోర బెల్లమేల
పట్టిన వ్రతముతోనే బ్రతుక నీరాదా

చ. 3: మొక్కితే మొక్కనివాఁడు మున్నాడి నన్నేల కూడె
దక్కినవారిఁ జొక్కించఁ దడవా యేమి
చెక్కునొక్కి చెట్టవట్టి చేసన్న లిఁకనేల
మిక్కిలి శ్రీవేంకటేశు మెచ్చనీరాదా

రేకు: 1014-6 శంకరాభరణం సంపుటం: 20-084

పల్లవి: గుట్టుతోనే వుందుగాని కొరి నేనేమి సేసినా
పట్టిపురమణి నాతోఁ బదరేవు సుమ్మీ

చ. 1: కోవిలలు చిగురాకు కొరుకునంటా భూమి-
నావలీవలివా రెల్లా నాడుకొందరు
కొవిల కూఁతలు నీకుత్తికలోనివి గదే
కావి నీ మోవిచిగురు గంటిచేసీఁ జుమ్మీ

చ. 2: జక్కవలు భూమిలోన చంద్రోదయమైతే
తక్కక విరహాన బెదురు నందురు
జక్కవనీచన్ను లిట్టే సరి నీపయ్యెద నవె
పెక్కుచంద్రవంకలైతే బెదరీఁ జుమ్మీ

చ. 3: తుమ్మిదలు తామెరపైఁ దోలినానుఁ బోవందురు
దొమ్ముల శ్రీవేంకటాద్రి తుమ్మిద నేను
కొమ్మ నీతుమ్మిదవంటికురులు నీనెమ్మోముఁ
దుమ్మిమీఁదఁ జెదరి యంతటఁ గూఁడెఁజుమ్మీ

రేకు: 1015-1 సామంతం సంపుటం: 20-085

పల్లవి: మాఁజితేను జవ్వనము మట్టున నిలుచునా
రాఁజిరాఁజి వలపు లాఁజడిఁ బెట్టుఁగాక

చ. 1: చెలి నీవు మోవితేనె సిగ్గువడి దాఁచితేను
వెలయఁ బలుకుఁదేనై వెళ్ళఁబారీని
సెలవులనవ్వులవి చిత్తములో నడఁచితే
కొలుకులఁ దెలిచూపై కుమ్మరించీ నదిగో

చ. 2: పడఁతి నీ తమకము బయటనే మొరఁగితే
నిడుదనిట్టూర్పులై నిగ్గుదేరిని
బడి కుచముల వుబ్బు పయ్యదలోఁ గప్పితేను
వెడలుఁ బులకలై వెల్లివిరిసీని

చ. 3: కామిని నీ కోరికలు కాఁగిటిలో దలఁచితే
నామనలోఁ దోఁచి నారుకోసీని
వేమరు శ్రీవెంకటాద్రివిభుఁడ నేఁగూడితిని
యీమేలెల్లా నీపై నినుమడించీని

రేకు: 1015-2 భైరవి సంపుటం: 20-086

పల్లవి: తనువులో దైవము దయదలఁచు టెప్పుడో
తనివోనితమకాన తడఁబాటు లివిగో

చ. 1: చెక్కునొక్కి చెలిమీఁద చేయివేసి సారె సారె
మక్కళించి మక్కళించి మాటాడు టెపుడో
మొక్కుఁచు గన్నుల నట్టె ముచ్చట దీరఁగ లో లో
చిక్కనినవ్వులు నవ్వి చెలఁగుట యెన్నఁడో

చ. 2: మోము చూచి సన్న చేసి మోహములు చల్లి చల్లి
నామువారఁ జొక్కేటినను పెప్పుడో
దీమసపుఁ గోరికలు దిష్టముగాఁ గొనసాగ
ఆమని సరసములు ఆడుట యెన్నఁడొకొ

చ. 3: కాఁగిటిరతులలో కరఁగించి మానినికి
మాఁగినమోవియిచ్చేమన్న నెప్పుడో
దాఁగక ఇంతటిలోనే తరుణి యేతెంచి కూడె
సాఁగి శ్రీవేంకటేశ పంతము లిఁకెన్నఁడో

రేకు: 1015-3 శ్రీరాగం సంపుటం: 20-087

పల్లవి: అడుకోఁగలితే జాలు నందరితో పెద్దరిక-
మేడనైనాఁ దనచిత్త మిట్టట్టనఁ జెల్లునా

చ. 1: మెచ్చినంతే చాలు వాఁడు మీరేమి ననకురే
అచ్చమైన ఇల్లాల నంతే నేను
యిచ్చినంతే చాలుఁ జన వేమనఁగలనే వాని
పచ్చిగా వలచితిని పంత మింకఁ జెల్లునా

చ. 2: నవ్వినంతే చాలుఁ దాను నాయ మేమీ జెప్పకురే
రవ్వపడ్డమేనవావి రమణిని నేను
దవ్వులఁగన్నంతే చాలు తగుఁదగ దనకురే
మువ్వంక మొగమోడితే మొక్కలము చెల్లునా

చ. 3: కొంగు వట్టినంతే చాలు కొప్పు వీడె ననకురే
కుంగనిసిగ్గరి పెండ్లికూఁతుర నేను
అంగవించి శ్రీవేంకటాద్రిపతి నన్నుగూడె
రంగు మీరితిని మచ్చరము లేకఁజెల్లునా

రేకు:	1015-4 శుద్ధవసంతం	సంపుటం:	20-088

పల్లవి:	కాలము లారునుఁ గలిగె నీకు నిదె
	బాలకియందే పైపై నీకు

చ. 1:	సతికొప్పువిరులు జలజల రాలిన
	లతల వసంతకాలము నీకు
	కతగా దనమ్మై కాఁకలు చూపిన
	అతి వేసవి కాల ముప్పుడే నీకు

చ. 2:	కాఁగిటచెమటల కడు నినుఁ దడిపిన
	కాఁగల తొలుకరికాలు మది
	వీఁగనిచూపుల వెన్నెల చల్లిన
	రాఁగినమతికి శరత్కాలంబు

చ. 3:	లంచపుఁ బులకల లలన నీరతుల
	కంచపు హేమంతకాల మది
	యెంచఁగ శ్రీ వేంకటేశ వలపుసతి
	వంచ శిశిరకాలవైభవ మాయ

రేకు: 1015-5 సౌరాష్ట్రం సంపుటం: 20-089

పల్లవి: నే నొకటి సేయఁగాను నీవొకటి సేయకువే
మానిని నీ చేఁతలకు మారుమలనెను

చ. 1: కన్నులకాటికెతోడ కసరకువే నా-
వెన్నెల మోమునవ్వుల విసరేను
కిన్నెరమీఁటుల గిలిగించకువే నా-
సన్నపు ధైర్యము వెదచల్లేను

చ. 2: చెరుసగముమాటలు పైఁ జిమ్మకువే ! నీకు
యిరవైన మోవితేనే లిచ్చేను
సరసాల విరసాల సాదించకువే నా-
మెరవడివినయాల మెప్పించేను

చ. 3: పానుపుపై నన్నుఁ గూడి భ్రమయించకువే ! కానఁ
గానే గోరఁ దారుకాణించేను
అని శ్రీ వేంకటేశుఁడు నలయించకువే
పూనిపటి నిన్ను నిట్టె బుజ్జగించేను

రేకు: 1015-6 శంకరాభరణం సంపుటం: 20-090

పల్లవి: ఎన్నటి కెన్నటివాదు లేలపంచే వింకాను
యెన్న నీకుఁ బంతమిచ్చే నింత చాలదటరా

చ. 1: నిక్కిచూచి పేరఁబిల్చి నీమన సొక్కటిగాఁగ
మక్కువ చలితి నింకా మఱి యేమనేవురా
చెక్కునొక్కి బుజ్జగించు చేతిమీఁద జేయిఁ వేసి
మొక్కు మొక్కినా నీవు వెమేల వంచేవురా

చ. 2: సన్న చేసి కానుకిచ్చి సారె నీతో నవ్వు నవ్వి
కన్నులారిచితి నీకు కడమ లేమాయరా
నిన్ను నట్టె మెచ్చి మెచ్చి నెయ్యముతో మాటలాడి
యెన్నిసేసినా మనసేల కరఁగవురా

చ. 3: కాలుదొక్కి వేగిరించి కాఁగిటిలో బిగియించి
లాలించినా నాతోను లావుచూపే వేలరా
మేలిమి శ్రీ వేంకటేశ మించి నీవే నన్నుఁ గూడి
యీలీల నేలినవాఁడ విట్టె మన్నించరా

రేకు: 1016-1 దేసాళం సంపుటం: 20-091

పల్లవి: మీఁదమీఁద వలపెక్కె మేలుమేలోయి
చీఁదర రేఁచేవు నన్ను చెల్లులేవోయి

చ. 1: నిద్దురో నివ్వెరగో నేనేమో చెప్పఁగాను
వొద్దనుండే వూఁకొనవు వోయి మేలోయి
పెద్దరికమో బీరమో బెట్టివీడె మడిగితే
కద్దనవు లేదనవు గర్వమేలోయి

చ. 2: కాఁకలో నీఁకలో కడు నేను నవ్వినను
మాఁకువలె నున్నాఁడవు మతక మౌనోఇ
వేఁకమో వెరపో వేగ నేఁ జేయివేసితే
కేఁకరించి ములిగేవు గేలి యేలోయి

చ. 3: ఆసలో వాసులో అండ నేను నిలుచుంటే
మేసులఁగాఁగిలించేవు మె స్తిలేవోయి
బాసతో శ్రీ వేంకటేశ పంతాన నన్నుఁ గూడితి
వేసములెల్లాఁదీరె వింతలాయనోయి

రేకు: 1016-2 శ్రీ రాగం సంపుటం: 20-092

పల్లవి: కాఁకసేయఁ దగవా కలయఁగఁ దగుఁగాక
మూఁకలాయఁ బులకలు మొకమియ్యరాదా

చ. 1: రమణుని ఆడనీడ రవ్వసేయఁ దగవా
తమి నట్టే బుద్ధిచెప్పఁదగుఁ గాక
నెమకి యాతడు వేరో నీవు నింతదానవో
చెమరించె మీ మేనులు చిత్తగించరాదా

చ. 2: చేసుకొన్న మగనినిఁ జిమ్మిరేఁచఁ దగవా
త్రాసులై సరసమాడఁ దగుఁగాక
మోసము నీకుఁ గలదో మోహ మాతనికి లేదో
సేసకొప్పు లవే వీడెఁ జెకొనఁగరాదా

చ. 3: యేలిన శ్రీ వేంకటేశు కెదురాడఁ దగవా
తాలిమి నిట్ల గూడఁదగుఁగాక
నీలాగు నే నెఱఁగనో నీవే ఆతఁడవు గావో
కాలుఁగాలుఁ దొక్కితిరి కరుణించ రాదా

రేకు: 1016-3 కేదారగౌళ సంపుటం: 20-093

పల్లవి: కూరిమి గలితేఁ జాలు కోపించినా మేలువో
ఆరయ నోరమణుఁడ అంతాను మేలువో

చ. 1: మనసున నీవు నన్ను మఱవకున్నాఁ జాలు
యెనసి నీ వేడనున్నా నియ్యకోలే పో
ననుపువలపు నీవు నాపైఁ జల్లితేఁ జాలు
వెనక నీవు వేమన్నా వేడుకలో పో

చ. 2: పాయము నీ మేనిమీఁద పచ్చిగా నుండతేఁ జాలు
రాయడి విరహమైన రాజ్యపదవి
యేయెడ నీచూ పొకమా టిటు పైఁబారితేఁజాలు
నాయములు దప్పి నీవు నడచినా మేలువో

చ. 3: పానుపుపై కూడి నాకు పంతమిచ్చితేఁ జాలు
కానని కన్నుల నీబింకాలు మేలేపో
ఆనిన శ్రీ వేంకటేశ అంతలో నన్నేలితివి
కోనల నీ కొనగోరిగుఱుతులు మేలువో

రేకు: 1016-4 దేసాళం సంపుటం: 20-094

పల్లవి: ఒక్కమాంటి కింతేసి కోపరా నేను
వుక్కువంటిది నీ చిత్త మోపఁగా నేను

చ. 1: యెట్టైనా నేనుండే యేమైనాఁ జేసేఁగాని
వొట్టి నిన్ను బాసగొన నోపరా నేను
పట్టిన పంతము లిచ్చే పలుమారు నిన్ను మెచ్చే
అట్టె నీ కెదురు మాటాడఁగ నే నోపను

చ. 2: యెందుకైనా నియ్యకొనే యిఁపైన నీసతిఁదెచ్చే
వొందిలి వేగించ నంత వోపరా నేను
పందె మెంతకైనా వేసే పాదములకైనా మొక్కే
బొందిలోని మాట నీతో బొంకలేఁగా నేను

చ. 3: వెరవైనా నడిగేను వేడుకకైనా నవ్వే
వొరటు నీతో నింక వోపగా నేను
యిరవై శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి-
అరమఱచి చొక్కితినా అద్దిరా నేను

రేకు: 1016-5 భైరవి సంపుటం: 20-095

పల్లవి: ఇటమీఁదికడమెల్లా నిఁక నీవు దీర్చవయ్యా
పటుకునఁ జెలి నీకుఁ బాలువెట్టీ నిదిగో

చ. 1: నెలఁత మంచము పై కిన్నెర వాయించి వాయించి
తలకొని నీవు రాఁగాఁ దలవంచెను
సొలసి చెలులతోడ సుద్దులు దాఁజెప్పిచెప్పి
చెలఁగి నీ మోము చూచి సిగ్గువడీ నిదిగో

చ. 2: పడఁతి నీమీఁదిపాట పాడిపాడి అర్థము నీ-
వడిగితే నవ్వలి మోమై నవ్వీని
అడియాలములరూపు అద్దములోఁ జూచి చూచి
కడు నీవు కొంగువట్టఁగా భ్రమసీని

చ. 3: సతి యేకతాన నుండి జవ్వాది పూసిపూసి
రతి నీవు గూడఁగా సరసమాడిని
ఇతవైన శ్రీ వేంకటేశ నీ వాపెఁ గూడఁగా
పతి చూచి యిప్పు డిట్టె పక్కున నవ్వీని

రేకు: 1016-6 ఆహిరి సంపుటం: 20-096

పల్లవి: రమణిభాగ్యము నేఁడు రచ్చలకెక్కె
తమకపువలపు నీతల కేల యెక్కదో

చ. 1: చెలితలఁపులో చింత చెక్కిటిచేతికి వచ్చె
యెలమి నీచిత్తమింకా నేల రాదో
నిలువున కాఁకలెల్లా నిట్టూరుపులఁ బుట్టె
తలిరుబోఁడి పై నీకు దయ యేలపుట్టదో

చ. 2: దట్టపుఁగోరికలెల్లా తనుపులకలఁ దీరె
యిట్టె విన్నపాలఁ గతలేల తేరవో
చిట్టికపువిరహము చెమటలఁ గానవచ్చె
గట్టిగా నీమోహమేల కానరాదో

చ. 3: నిక్కుఁగుచము లింతివి నీకాఁగిటనే మించె
యెక్కువ నీసిగ్గు లిఁకనేల మించవో
ప్రక్కన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
తక్కించి మన్నించ నీకుఁ దరి యెట్టాయనో

రేకు: 1017-1 రామక్రియ సంపుటం: 20-097

పల్లవి: ఒల్లనని మానరాదు వొలసి పై కొనరాదు
వెల్లవిరి ఆయ నావేగిరపుఁదనము

చ. 1: యెవ్వరికో విన్నపము యిదివో నేము
నవ్వుతాఁ జిత్తాన నవి నాటెనో లేదో
అవ్వలఁ దమచేఁత లవి చూచుకోరు గాని
నివ్వటిల్లీ నేఁడు నా నిష్ఠూరపుఁదనము

చ. 2: యెక్కడనో చూచితిమి ఇదిగో నేము
వక్కణించి అది గానవచ్చెనో లేదో
తక్కరితమగుణాలు తాము చూచుకోరుగాని
మొక్కలమై వున్నది నాముంగోపితనము

చ. 3: యేమిటికో వుపచారా లిదిగో నేము
కామించి శ్రీవేంకటేశ కలదో లేదో
నీమనసులోనివెల్లా నీవెఱుఁగుదు! నాకు
నేమమాయ నిన్నుఁగూడి నివ్వెరగుఁదనము

రేకు: 1017-2 బౌళి సంపుటం: 20-098

పల్లవి: చాలుఁజాలు రోఁతలూ సటలాయఁ బనులూ
తాలిమిలేనిదానను తడవకువయ్యా

చ. 1: మాటలాడితివొ లేదో మగువతో నేఁ జూడఁగ
మాట లిఁక నాకు నీతో మఱి యాల
తేటగా నవ్వితొ లేదొ తేరకొని ఆకేతోనే
యీటుకు నీతో నవ్వ నిఁకనేలయ్యా

చ. 2: తప్పక చూచితొ లేదో తరుణిమొగ మప్పుడు
యిప్పుడు నే నిది చూడ ఇత వవునా
వొప్పి దగ్గరితొ లేదొ వున్నచో ఆకెను నీవు
యిప్పుడు నిన్ను దగ్గర నింపవునటయ్యా

చ. 3: కాఁగిలించితివొ లేదొ కాంత నల్లనాఁడు నీవు
కాఁగిలించితి నేఁడు కమ్మటినిన్ను
వీఁగక శ్రీవేంకటేశ వేమారు సాదించనోప
మాఁగినరతులఁ బెనుమాయ లింకేలా

రేకు: 1017-3 బౌళి సంపుటం: 20-099

పల్లవి: వలచినపతి వాఁడే వచ్చినదాన నే నిదె
తలఁపులుఁ దలపులు తారుకాణ లెన్నఁడే

చ. 1: పచ్చఁబుచ్చఁబున్నములు పొలఁతి నీనవ్వులు
యిచ్చట నీపతిఁ జూచే దీఁక నెన్నడే
నిచ్చ నిచ్చఁ గొత్తలాయ నెలఁత నీజవ్వనము
మెచ్చి మెచ్చి ఆతనితో మేలమాడు టెన్నఁడే

చ. 2: పండపండ నట్లాయ వాడిక నీవలపు
నిండినపతి కాఁగిట నించు టెన్నడే
వుండ నుండ నొగరాయ వువిద నీజంకెనలు
అండ నాతనికి వినయాలు సేయు టెన్నఁడే

చ. 3: తినఁదినఁ దీపులాయ తెరవ నీమోవిజున్ను
పొనిఁగి శ్రీవేంకటెశుపొందు లెన్నఁడే
ననిచి యాతఁడే నేఁడు నయముల నిన్నుఁ గూడె
మనకి మీలోలోన మందలించు టెన్నఁడే

రేకు: 1017-4 శంకరభరణం సంపుటం: 20-100

పల్లవి: ఏలో తెలియదు యేలినవాఁడవు నీవే
మేలుమేలు జాణవౌదు మేర నడపినను

చ. 1: ఆలించఁదడవా అప్పుడే నావిన్నపము
వాలియించి నీవు వలెనంటేను
పాలించఁ దడవా పై కొని నన్నిప్పుడిట్టె
తాలిమితో నామతిఁ దలచీఁతేను

చ. 2: యియ్యకొనఁ దడవా యిప్పుడే నాకూరిములు
యియ్యెడ నింతట నీకు నితవై తేను
నెయ్యమాడఁ దడవా నీవు నేను నవ్వుతాను
చయ్యన నీకే నేఁడు సమ్మతైతేను

చ. 3: కాఁగిలించఁ దడవా కందువరతులలోన
వీఁగక యిట్లా నీకు వేడుకైతేను
దాఁగక శ్రీవేంకటెశ తగఁ గూడితివి నన్ను
ఆఁగి నవ్వఁ దడవా అబ్బురమైతేను

రేకు: 1017-5 ముఖారి సంపుటం: 20-101

పల్లవి: వలపు తొలుకరించె వనితపై నిదె నేఁడు
చెలువుఁడ వింతట విచ్చేయవయ్యా

చ. 1: పడఁతివిరహవేళ పానుపుపైఁ దెగి రాలే-
వడిముత్యపుసరులే వడగండ్లు
చిడుముడి మేనిమీఁదచిప్పిలేటిచెమటలు
జడివాన గురిసీ విచారించవయ్యా

చ. 2: నిరతిఁ దురుము మొయిలు నిలువెల్లా ముంచుకొనె
గరిమ నిట్టూర్పు పెనుగాలివంకను
నిరతపుఁ బులకల నీరుబుగ్గలవి మించె
నిరులఁ గన్నీటిసొన చినుకులవంకను

చ. 3: యొద్దరికాఁగిటిలంకె యింద్రధనువులు మించె
వొద్దనే మాచెలిఁ గూడి వుండేవంకను
నిద్దపుశ్రీవేంకటేశ నిండెఁ జిత్తపుమదుగు
కొద్దిగా మోహరసాలు కురిసినవంకను

రేకు: 1017-6 సాళంగం సంపుటం: 20-102

పల్లవి: కంటిమిగా నీగుణాలు కడసారెను! నేఁడు
నంటు నీవు సేయరాఁగా నవ్వువచ్చీఁ బనులు

చ. 1: యెదుటనే వచ్చియున్న దెఱఁగవైతి వప్పుడు
కది శాకెవద్ద నుండే గర్వానను
ఇదిగో యొప్పుడు నాకు నిచ్చకాలు సేసేవు
పదవయ్య యిఁకనేల బయలాయఁ బనులు

చ. 2: మునుప నే పేరఁ బిల్చి మొక్కినాఁ గై కోవయితి
పనిన డాకె మాఁటాడేపరాకునను
వెనక నిప్పుడు నాకు విడె మియ్యవచ్చేవు
పెనఁగ నే నోపనయ్య ప్రియమాయఁ బనులు

చ. 3: కాఁగిలించి మోవి గంటిగాఁ జేసే దెఱఁగవైతి
పాఁగి తొల్లాకెఁ గూడినభ్రమవల్లను
వీఁగక శ్రీవేంకటేశ వేగమే నన్నుఁ గూడితి
రాఁగిన తమకముతో రవ్వాయఁ బనులు

రేకు: 1018-1 శంకరభరణం సంపుటం: 20-103

పల్లవి: ఘనుఁడు దానేకాక కలరా నాకు దిక్కు
అనరమ్మ చెలులార ఆతనితో మీరు

చ. 1: చిత్తము నలసెను చెక్కు చెమరించెను
కొత్తగాఁగఁ దనరాక కోరి కోరి
వత్తియాయ దేహము వానలాయఁ గన్నీళ్లు
తత్తరపుఁ బతికేల దయ పుట్టదో

చ. 2: తాలి మెందో దాఁగెను తలపోఁత రేఁగెను
అలకించి తన ఆడియాసలఁ జిక్కి
తీలుపడె నూరుపులు దిష్టమాయ వెరగులు
యీలాగు నన్ను మన్నించే దీఁక నెన్నఁడో

చ. 3: పాయముఁ బైకొనెను భావము దాకొనెను
ఆయముతో నన్నుఁగూడి అంటఁగాను
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుగూడె
పోయినఁ బోనీ కెవ్వరు బోదించరో

రేకు: 1018-2 భైరవి సంపుటం: 20-104

పల్లవి: ఇంతలో రమణుఁడ నీ వేమి గట్టుకొంటివి
కాంతఁజూచై నాఁ గొంత గరఁగరాదా

చ. 1: సేసకొప్పు వెడజారె చెక్కులఁ జెమటలూరె
పాసియున్న నీయింతితోఁ బలుకరాదా
రాసులుగాఁ బులకించె రామ నిన్నుఁ దిలకించె
బేసబెల్లియెలు గెత్తి పిలువరాదా

చ. 2: చెలిమేను కడుఁగాఁగె చిత్తములు తమిరేఁగె
నలిరేఁగి యాకెతోడ నవ్వరాదా
వలపులు గడుమించె వాడుమో మిప్పుడు వంచె
వెలి నాకెపైఁ జేయి వేయరాదా

చ. 3: కఁదువ నీకాలు దొక్కె కామిని నీపాలఁ జిక్కె
మందలించి యిఁక నీవు మన్నించరాదా
అంది నామాటలు విని యంగనఁ గూడితి విట్టె
ముందె శ్రీవెంకటేశ మోవి ఇయ్యరాదా

రేకు: 1018-3 మాళవి సంపుటం: 20-105

పల్లవి: ఎటు నేరిచితివయ్యా యిన్ని వాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడుమెచ్చేమయ్యా

చ. 1: గరుడునిమీఁద నెక్కి గమనించితివి నాఁడు
అరుదైన పారిజాతహరణానకు
గరిమతో రథమెక్కి కదలితి వల్లనాఁడు
సారిది బ్రాహ్మణపడచుల నుద్ధరించను

చ. 2: చక్కఁగాఁ గుబేరుని పుష్కక మెక్కి కదలితి
మక్కువ సీతాదేవి మరలించను
తక్కక వాయుజు నెక్కి దాడి వెటితివి నాఁడు
చొక్కపువానరులపొఁజులు చూడను

చ. 3: కొట్టఁగొన నీవు రాతిగుఱ్ఱము నెక్కి తోలితి-
పట్టియెడ నధర్మము నడఁచఁగను
మెట్టుక శ్రీవేంకటాద్రిమీఁదఁ బల్లకి యెక్కితిఁ
విట్టె యిందిరఁ గూడి యేఁగుబెండ్లి యేఁగను

రేకు: 1018-4 రామక్రియ సంపుటం: 20-106

పల్లవి: దేవుఁడవు నీవు నీదేవులమ్మభాగ్య మింతే
చేవదేరెఁ బనులెల్లా చిత్త మెట్లున్నదో

చ. 1: విన్నపాల కెడలేదు వేగిరించఁ బొద్దులేదు
అన్నిటా నింతి కేమని యానతిచ్చేవో
సన్న సేయఁ బనిలేదు సాదించఁ దరిగాదు
యెన్నినకోరికలెల్ల నెట్టు సేసేవో

చ. 2: నవ్వఁగ నోపికలేదు నాయములుఁజవిగావు
చివ్వన నీబాస లెట్టు చెల్లించేవో
రవ్వసేయఁజోటులేదు రాజసాన కిమ్ములేదు
పువ్వువంటిచెలి నెట్టు బుజ్జగించేవో

చ. 3: నిక్కి చూడ నంకెగాదు నెలఁతకు నీకుఁబోదు
మక్కువ నెట్లా నీవు మన్నించేవో
వొక్కటై శ్రీవేంకటేశ వువిదఁ గూడితి విట్టె
యిక్కువఁ గెమ్మోవి యాని యేవగఁ జొక్కేవో

రేకు: 1018-5 భైరవి సంపుటం: 20-107

పల్లవి: ఎఱఁగక నిన్నునంటి నిందాఁకాను నీ
కెఱుక సేసితి నిఁక నీ వింటికి రావయ్యా

చ. 1: నీమీఁదాఁ దప్పులేదు నిద్దురాఁ గంటికి రాదు
దోమటి నప్పటి నిన్ను దూరకపోదు
దీమసము నాకు లేదు తెగనాడఁగాఁ గాదు
యేమి సేతు నింతట మాయింటికి రావయ్యా

చ. 2: నాకు మోహింతువు నీవు నవ్వులు నా కింపు గావు
దీకొని నిన్నొరయక దిష్టాలు రావు
నీకు మంతనమే తావు నేఁడుమరునమ్ము పూవు
యేకపటములు నేర నింటికి రావయ్యా

చ. 3: తనువు లింతేవేరు తలఁపు లొక్కేతీరు
పనివడి యిఁకను నాపానుపు చేరు
యెనలెక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
యినుమడించె వలపు యింటికి రావయ్యా

రేకు: 1018-6 సామంతం సంపుటం: 20-108

పల్లవి: ఓరిచితేఁ జుట్టిరిక మొల్లకుంటేఁ జెట్టరిక
మీరసపువాపోటు లీడనేల

చ. 1: మాటల కెగ్గులు లేవు మనసులోఁ బెరరేఁచె
కూటవకోపాలలోని కొలఁదు లింతే
నేటనే తప్పదు మీకు నెయ్యపు దంపతులాల
యీటులేనిమారు మోము లిప్పుడే యేల

చ. 2: చేఁతలకుఁ దప్పులేదు చేయారఁ దమలోని
పూఁతలపంతాలు రేఁగె బటకా లింతే
రోఁత యింతేసివొట్లు రుచిగాదు జాణలాల
యీఁతలాయఁ జలములు యింకానేల

చ. 3: చూపులో దోసములేదు సూటిగాఁ గందము లోని-
కోపు బొమ్మజంకెనల గుణము లింతే
యేపున శ్రీవేంకటేశ యిందిరా నీవూఁ గూడితి-
రాపనులెల్లాఁదీరె నడుగనేల

రేకు: 1019-1 ధన్నాశి సంపుటం: 20-109

పల్లవి: నీవు మన్నించఁగా నే నింతయితిఁ గాక
కావరించి నీతో నవ్వఁగలనా నేను

చ. 1: ఘనుఁడ విడె మియ్యఁగా కాదనరాదు గాని
చెనికి నీసొమ్ము లంటఁ జెల్లునా నాకు
చనవిచ్చి మాటాడఁగాఁ జాలుననరాదు గాని
తనర నీతో నేకతాలదానవా

చ. 2: వరుస నీవు రాఁగా వద్దనఁగారాదు గాని
తర మెఱిఁగి రప్పించఁదగునా నాకు
వొరసి చేయి వేయఁగా నోపననరాదు గాని
సరి నింతదీమసపుసతినా నేను

చ. 3: నీవు కాఁగిటఁ గూడఁగా నేమానరాదు గాని
యీవేళ మఁదెమేళా లెమ్మెలా నాకు
శ్రీవేంకటేశ నీవు సేసినట్టే సేతుగాని
చేవదేర మెచ్చి సంతసించకుండగలనా

రేకు: 1019-2 సామంతం సంపుటం: 20-110

పల్లవి: కన్నులు పెంచవచ్చునా కలంతే కాక
యెన్నిక నియ్యాలనైతి నెట్టైనాఁ జేయరా

చ. 1: చెంది నీమతిఁ గూరిమి నేసిపెట్టవచ్చునా
కందువఁ దన్నుఁదానే కలితేఁగాక
అంది నీకు నే మొక్కితే నాకడి పరాకైతి
విందుకంటె నూరకుండే నేమైనాఁ జేయరా

చ. 2: వినయాలు నాలుకపై వి తించవచ్చునా
కనుఁగొనఁ దనంతనే కలితేఁ గాక
ననుపై నే మాటడితే నాలి నీ వూరకుంటివి
యెనలేక నవ్వు నవ్వే నేమైనాఁ జేయరా

చ. 3: పోయినరాతిటిరతిఁ బోగుసేయవచ్చునా
కాయములోఁ దలపోఁత కలితేఁగాక
యీ యెడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యీయరానిబాస లిచ్చే నేమైనాఁ జేయరా

రేకు: 1019-3 ఆహిరి సంపుటం: 20-111

పల్లవి: సతమైనదానఁగాక సటలా నేను నీ
మతిలో మెలఁగకుంటే మగువనా నేను

చ. 1: మందలించి యిందరిలో మాయసేసి మేకులకు
సందడిఁ గాలుదొక్కేటిసతినా నేను
అందుకోలుమోవి యిచ్చి ఆసరేఁచి సారె సారె
చందమామగుటుకలసతినా నేను

చ. 2: కన్నులఁ దప్పకచూచి కడగడలనే వుండి
సన్నలనే పొద్దువుచ్చేసతినా నేను
వన్నెల నీమీఁద నిట్టె వలపులు చల్లి చల్లి
చన్నుల మొనులుచూపేసతినా నేను

చ. 3: శిరసు వంచి నవ్వి సిగ్గులువిడిచి నీ-
సరుసలనిటచుండేసతినా నేను
నిరతి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడఁగాను
పురమెక్కినదాన వేరొకతోనా నేను

రేకు: 1019-4 లలిత సంపుటం: 20-112

పల్లవి: రాఁపు సేయక చెలులు రారే మీరు
యీపొద్దే మేలాయ్యాని యెడయ నే నోపను

చ. 1: వేసరుకోకరే మీరు విభుఁడే మన్నించీఁగాక
సేసవెట్టి పెండ్లాడి చిన్నఁబుచ్చీనా
ఆసలనెదురుచూచి అప్పటికి రాకుంటే
యీసరేఁగు వానిమీఁద నింతకు నే నోపను

చ. 2: తలపోఁత మనకేలే తానే వచ్చీఁగాని
పిలువనంపినవాఁడు బిగిసుండీనా
చలాలకుఁబెనఁగఁగా సరసము ఘనమైతే
అలుగవలయు వాని కంతకు నే నోపను

చ. 3: విన్నవించకురే మీరు వెలితి దీర్చీఁగాని
పన్ని నాకు బాసయిచ్చి పాడిదప్పీనా
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెన్నగఁ వాని సొలయ ఇంతకు నే నోపను

రేకు: 1019-5 పాడి సంపుటం: 20-113

పల్లవి: ఏపులును రాఁపులును యెందాఁకనే
చాపకిందివెల్లువాయఁ జాలదా సరసము

చ. 1: యెడమాట లాడేది యెందాఁకనే
అడియాసలఁ బెట్టే దదెందాఁకనే
కడకుఁ దొలఁగరాదు గక్కనఁ బైకొనరాదు
జడిసీ జిత్తము నాతో చాలదా సరసము

చ. 2: యెలయింపుఁ గొసరులు యెందాఁకనే
అలిగి కోపము నాతో అదెందాఁకనే
వలపు చల్లగరాదు వడి మూటఁగట్టగరాదు
చలములు పతి నాతో చాలదా సరసము

చ. 3: యేడలేని వినయాలు యెందాఁకనే
ఆడుకోలు నిజబాస లవెందాఁకనే
కూడెను శ్రీవేంకటాద్రి గోవిందుఁ డిదె నన్ను
జాడలెల్లాఁ గంటి మిఁకఁ జాలదా సరసము

రేకు: 1019-6 ముఖారి సంపుటం: 20-114

పల్లవి: నే నెంతతమకినైనా నీకు నోరువక పోదు
కానీవే తీగెకు కాయ కదువేఁగైవుండునా

చ. 1: చన విచ్చితివి గాన సరసమాడితిఁ గాని
ననిచి దొరలతోడ నవ్వఁదగునా
నను మన్నింతువు గాన నమ్మి కడిగితిగాని
యెనసి యేనుగతోడ యేలాట మున్నదా

చ. 2: సమ్మతింతు వటుగాన సరుసఁ గూచుంటిఁగాని
యెమ్మె నీముందర జేసే దితవా నాకు
రమ్మని పిల్తువుగాన రాజసాన నుంటిగాని
తమ్మి సూర్యోదయమైతేఁ దలవంచఁ జెల్లునా

చ. 3: నీవే నే నందువుగాన నిన్ను నేఁ గూడితిఁగాని
దేవుఁడవు నిన్ను నంటఁదీరునా నాకు
శ్రీవేంకటుశుఁడవంటా సేవలు చేసితిఁగాని
తేవల మందెమేళమైతేఁ బ్రియాలు చెల్లునా

రేకు: 1020-1 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-115

పల్లవి: నీ వెటువలె మన్నించేవో
భావము నిలువదు పంతానకైనా

చ. 1: అలనీతో విరహాన నలసి మరి
కొలుపదు చి త్తము కొంతైనా
తలఁచి తలఁచి నిన్నుఁ దప్పక చూచిన
నిలువదు కన్నీరు నిమిషంబయినా

చ. 2: కయ్యపు కాఁకలఁ గాఁగి నవ్వులకు
యియ్యకొనదు తను వేమైనా
కొయ్యమాఁటలను గొణఁగిననాలిక
నెయ్యము వలుకదు నిజానకైనా

చ. 3: మహి నీకాఁగిలి మరిగిన చేతులు
సహజము విడువవు సటకైనా
యిహమున శ్రీవేంకటేశ కూడితివి
మహిమలు వొగడెద మాఁటలనైనా

రేకు: 1020-2 లలిత సంపుటం: 20-116

పల్లవి: ఏమరించి యింత చేసి యేలుకొంటివి
నేమము చెల్లించితివి నీవే పో జాణవు

చ. 1: యెందుఁ బరాకై వింటివో యిప్పుడు నావిన్నపాలు
అంది కమ్మరా నన్నే యడిగేవు
పొంది యింతవడికైనా బుద్ధిపుట్టెఁగా నాపై
నింద దీర్చుకొంటి విఁక నీవేపో జాణవు

చ. 2: యేడనుండి విచ్చితివో యిప్పుడు మాయింటికాడ
తోడఁ బారుపత్యాలెల్లఁ దరి సేసేవు
వోడక యిన్నాళ్ళకైనా వొక్కటైతివిగా నాతో
నీడ నన్ను మెచ్చితివి నీవేపో జాణవు

చ. 3: యెట్టు వలచితో నాకు యెక్కువ నీకాఁగిటిలో
జట్టిగొని యిచ్చకాలు సారెఁ జల్లేవు
యిట్టె శ్రీవేంకటేశ యెడయవుగా నన్ను
నెట్టిన నావాఁడవైతి నీవేపో జాణవు

రేకు: 1020-3 శ్రీరాగం సంపుటం: 20-117

పల్లవి: తానే నేనైనవాఁడు దాఁగువలెనా
కానుకవలపులతోఁ గాఁగిలించవలదా

చ. 1: యింత తమకించేవాఁడు యేఁటి కప్పు డలిగెనే
చెంతల నేఁజెప్పినట్టు సేయవలదా
పంత మిప్పు డిచ్చేవాఁడు పై కొనేల తిట్టీనే
సంతసపుసరసాల చన వియ్యవలదా

చ. 2: తగవు దప్పనివాఁడు తబ్బిబ్బు లాడనేలే
నగుతా నే నన్నమాఁట నమ్మవలదా
పొగడేటివాఁడు తనబోగపురాజసమేలే
అగడు మాని నాయంకెకు రావలదా

చ. 3: యిటు నన్నుఁ గూడేవాఁడు యీడనాడ నేలుండెనే
తటుకన తా నాకు దక్కవలదా
ఘటన శ్రీవేంకటాద్రి ఘనుఁడు నన్నిదె కూడె
సటలెల్లాఁ దీరి యింత సతముగావలదా

రేకు: 1020-4 శంకరాభరణం సంపుటం: 20-118

పల్లవి: రాజసాలే తఱచాయ రావే నీవు తన
వోజ యిట్టిదౌ తెలఁగ వోయమ్మ తాను

చ. 1: పతి నింత దూరకువే పదవే నీవు నేఁ
దతి నింత వగవఁగఁ దగదే నాకు
కతలాయ నాబదుకు కదవే నేఁడూ:తన
యితవయినట్టు సేయినీ యెట్టియినాఁ దాను

చ. 2: వెంటవెంటఁ దిరుగక విడవే నీవు యిందుఁ
కంటిపట్టి మిమ్ము నేమి ననవే నేను
దంటతనము నాకెందో దాఁగెనే నేఁడు ! తనఁ
నంటు చెల్లితేఁ జాలు నగనీవే తాను

చ. 3: మాట లింత కోపరాదు మానవే నీవు ! యిట్టె
వోటలేక వెరగుతో నుండే నేను
నాటకా లిన్ని విడిచి నన్నుఁ గూడెను! వాదుఁ
లేఁటికి శ్రీవేంకటేశుఁ డింతవాఁడా తాను

రేకు: 1020-5 వేళావళి సంపుటం: 20-119

పల్లవి: ఎందాఁకా నీచల మేమి గట్టుకొంటివి
యిందువంకనే దొర విన్నిటా నీ వైతివి

చ. 1: పలుకరాదా కొంత పరాకు మానరాదా
పిలిచి పెదవులెల్లా బెండుపడెనుఁ
సెలవుల నవ్వరాదా చెంతల దగ్గరరాదా
నిలువు నివ్వెరగాయ నీకుఁగానే ప్రేమను

చ. 2: చక్కఁగాఁ జూడఁగరాదా చలము మానఁగరాదా
మొక్కి మొక్కి చేతులెల్లా మొనలాయను
మక్కువతో వినరాదా మన్నన లియ్యఁగరాదా
యిక్కువలు విన్నవించి యెలుఁగెల్లా రాసెను

చ. 3: యింటి కిట్టె రారాదా యిటు నన్నుఁ గూడరాదా
వెంటవెంటఁ దిరిగాడి వేసటాయను
అంటి ముట్టి శ్రీవేంకటాదీశ యేలితివి
నంటున నీతోడిరతి నాభాగ్యమాయను

రేకు: 1020-6 సామంతం సంపుటం: 20-120

పల్లవి: అయ్యో నీకు వగచినదే దోసమా
ఇయ్యెడ నీకు వలచుటిదే దోసమా

చ. 1: వాలాయించి మొక్కేవు వాదులకే నిక్కేవు
ఔలే నీతో నవ్వినదే దోసమా
సోలగిలఁ జూచేవు చొక్కి చొక్కి లాచేవు
యీలాగై నీవద్దనుండే దిదే దోసమా

చ. 2: బొమ్మల జంకించేవు పూఁటపూఁటకు మించేవు
అమ్మరో నీయాలనైన దదే దోసమా
రమ్మనుచు మరపేవు రాజసాలు నెరపేవు
యిమ్ముల నిన్ను నమ్మినదిదే దోసమా

చ. 3: యేకతానకుఁ దీసేవు యేమన్నా నోరుమూసేవు
ఆకుమడిచియిచ్చిన దదే దోసమా
పైకొని శ్రీవేంకటేశ పచ్చిగా నన్నుఁ గూడేవు
యీకడ నీవే నేనై తిదే దోసమా

రేకు: 1021-1 సామంతం సంపుటం: 20-121

పల్లవి: తానేడో మనసేడో తత్తరము లవి యేడో
పానిపట్టి ఇటువంటి భ్రమ యింత గలదా

చ. 1: సుదతి విభునిమోము చూచె పరాకున
అదనఁ గప్రపుభర ణద్దమంటాఁ జూచీనే
పదకము నడుమఁ బైపైఁ బెట్టి మొలనూలు
కదిసి హారమంటాఁ గటుకొనెఁ జూడవే

చ. 2: యేఁటవెట్టి పతితోడ మాటలాడి వేగిరాన
గాఁటపుటందెలు తనకరములఁ బెట్టీనే
పాటియైనవుంగరాలు పాదపువేళ్ళఁ బెట్టి
యీటుగా మట్టెలు వేళ్ళ నిదియేల పెట్టీనే

చ. 3: కామిని శ్రీవేంకటేశుఁ గదిసేటి వేడుకను
వేమరు మాణిక్యములు విడెమంటా నిచ్చీనే
ఆమని రతిఁ దనిసి అంతలో నన్నీఁదెలిసి
సామజగమన ఇన్నీఁ జక్కఁ జేసుకొనెనే

రేకు: 1021-2 భైరవి సంపుటం: 20-122

పల్లవి: మనసు రానిది యాల మానఁగరాదా
చనవిచ్చి నాకు వేరే సతులఁ దేవలెనా

చ. 1: పొమ్మనఁగ రాదా పోయేము మాయింటికి
దిమ్ములమాటల వాదుదియ్యవలెనా
వుమ్మడి నుండనీరాదా వుండేము మాయింటిలోనే
కమ్మటిని వచ్చి వచ్చి కాఁకరేఁచవలెనా

చ. 2: మోనాన నుండనీరాదా మొక్కేము నీకాళ్ళకు
నానఁ బెట్టి వలపులు నగవలెనా
నే నొల్లననరాదా నిన్నే మీ ననరాను
ఆన వెట్టించుక నన్ను నణఁకించవలెనా

చ. 3: చేసన్న చేయరాదా చేరి అప్పుడే కలతు
యీసురేఁచి యింతవడి నేఁపవలెనా
వాసికి శ్రీవేంకటేశ వద్దనక కూడితివి
యీసరి నితరకాంత లిఁకమీఁద వలెనా

రేకు: 1021-3 ముఖారి సంపుటం: 20-123

పల్లవి: ఏల వూరకున్నాఁడవో యెఱఁగము నేము నిన్ను
చాలా నమ్మి శరణంటే సమకూడరాదా

చ. 1: జాలు గరఁగించు నీఱట్టడిపాదము
కాలుచాఁచి సతులఁ గరఁగించు టరుదా
కీలించి మిన్ను నేల దొంగిలిన నీ చేయి
తాలిమి సతులమతి దక్కఁగొనలేదా

చ. 2: మాఁకులలోనైనా నుండి మాటలాడే నీనోరు
కాఁకలమాటల జెలి గారవించు టరుదా
మూఁక వనితలసిగ్గు ముంగిట వేసే కన్నులు
ఆఁక నీసతి మోహ ముందుకొనలేదా

చ. 3: ముంచి కాంత నురమున మోచుకుండే నీ మేను
ఇంచుకు పరిసురత మిందు కోర్చుటరుదా
యెంచఁగ శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
మంచముపై నుండి మీరు మమ్ము నంపవలదా

రేకు: 1021-4 రామక్రియ సంపుటం: 20-124

పల్లవి: గుట్టుతోడిబ్రదు కొక కొలఁదైనఁ జాలురా
గట్టిగా నీవు మన్నించే కరుణే చాలురా

చ. 1: మొదల నలుగలేను ముంచి నీకు మొక్కలేను
కదిసియున్న పెద్దరికమే చాలురా
పెదవులఁ దిట్టలేను పెంచి పంతమియ్యలేను
అదన నీవు నవ్విన ఆపాటే చాలురా

చ. 2: బిగిసియుండగలేను ప్రియము చెప్పఁగలేను
మొగము చూడఁగలిగేముచ్చటే చాలురా
తగవులు చెప్పలేను తగ నిచ్చలాడలేను
తగువైన వావులతో తత్తరాలే చాలురా

చ. 3: అటు పరాకు గాలేను ఆనవెట్టుకోలేను
యిటుఁ నిన్నుఁ గూడితి నాకిది చాలురా
ఘటన శ్రీవేంకటేశ కరఁగించి మానలేను
తటుకున నీవు నాకు దక్కినదే చాలురా

రేకు: 1021-5 లలిత సంపుటం: 20-125

పల్లవి: ఏమి సేతు రమణుఁడ యెట్టైనా మేలు
దీమసము యింతంతని తెలియలేఁ గాని

చ. 1: నిను నే దూరుటకంటే నిచ్చలాన నుంటే మేలు
మనసిజుఁడు రేఁచక మానలేఁడుగాని
మనవి చెప్పుట కంటె మోనాన నుండితే మేలు
తనువులో తలపోఁత తమకించీఁగాని

చ. 2: కలసి పాయుట కంటె కడల నుండితే మేలు
తలఁపు నాజవ్వనము తగిలించీఁగాని
పిలిచి వాదించు కంటె బిగువుతో నుంటే మేలు
చెలుల బుద్ధులు నన్నుఁ జిమ్మిరేఁచీఁగాని

చ. 3: నిక్కి చూచి వేఁగుకంటె నిద్రవోయిన మేలు
మొక్కలపుటాస కన్ను ముయ్యనీదు గాని
చక్కని శ్రీవేంకటేశ సతిఁ గూడితివి మేలు
పక్కున సిగ్గు లిందాఁకా భ్రమయించీఁగాని

రేకు: 1021-6 నాదరామక్రియ సంపుటం: 20-126

పల్లవి: ఇదె యదె యవిబొంకే దెందాఁ కానే
కదిసే నన్నిపనులుఁ గానీ కానీ తాను

చ. 1: యెరవై తాఁదిరిగాడే లెందకాఁనే నేఁటి
వరుస కీడకు రావలెఁగా తాను
యెరపరికపుపొందు లెందాఁకనె ఇట్టె
గరిమ నామోము చూడవలెఁగా తాను

చ. 2: యేడో పరాకు చేసే దెందాఁకనే నన్ను
వాడిక విడె మడుగవలెఁగా తాను
యీడ నిట్టె యెడమాఁట లెందాఁకానే! నాతో
యీడుకు బొత్తుకు వచ్చే దిప్పుడేకా తాను

చ. 3: యెనలేనిసిగ్గు దన కెందాఁకనే ! తన
వనిత నయితిఁ గైకొనవలెఁగా తాను
యెనసెఁ శ్రీవేంకటేశుఁ డెందాఁకానే ! నాకుఁ
జనవిచ్చి నయాలే జరపెఁగా తాను

రేకు: 1022-1 రామక్రియ సంపుటం: 20-127

పల్లవి: పో పో అదేమోసి పొద్దువోదటే
రాఁపులేల వొద్దు యింతరాజసాలు చెల్లవే

చ. 1: అతనిపై నాస గల్తే నాడకే పోదువు గాని
నాతో మాటలాడేవేళ నవ్వరాకువే
పాఁతుక నీ కఁతబడి గలవేళ నన్నీఁ
జేతువు గాని నీ బలువు చెప్పకువే నాకు

చ. 2: పొత్తులనీకు బత్తైతే భోగింతు గాని యేఁ దైనా
హత్తి మాయింట నుండఁగా నంటరాకువే
చిత్తములో రేసు గల్తే చెలులఁ గూడుకవచ్చి
వొత్తి సాదింతువుగాని వుద్దండాలు మానవే

చ. 3: వానికి నీ కంత గలితే వాడలోఁ జెప్పుదుగాని
యీవేళ నావరు సింతే యేఁకారకువే
శ్రీవేంకటేశుఁడు నన్నుఁజేరికూడె నిప్పు డిట్టె
కోవర ముందువు గాని కుచ్చితాలు మానవే

రేకు: 1022-2 గౌళ సంపుటం: 20-128

పల్లవి: ఎందాఁకా జోలి దవ్వీ నేఁటికనరే
విందానఁదొల్లి నేను విడువరే మీరు

చ. 1: వద్దు వద్దు తాను వట్టినిద్రతొడుసు
అద్దో మాయింటికి నన్నంపించరే
యిద్దరము నిద్దరమే యెకసెక్కెములకైతే
తిద్దలేరు మాగుణాలు తిరిగి పోఁగదరే

చ. 2: ప్రియములేనిమాట పెదవికి సంగరము
నయగారా లివియెల్లా నమ్మనోపనే
జయ మొకరొకరిలో చలములే వెగ్గళాలు
లయ లెరఁగరు మీరు లాగు లటు చూడరే

చ. 3: కారణములేనినవ్వు కనుచూపులకొలఁది
తేరెఁ బను లన్నిటాను తేజ మనరే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁగూడె
మారుకొనక మీ రొక్కమనసున నుండరే

రేకు: 1022-3 సామంతం సంపుటం: 20-129

పల్లవి: మేలు మేలు విభుఁడా మెచ్చితి నిన్ను నిపుడు
చాలునన్నా వినయాలు సారె సారె వలెనా

చ. 1: నిన్ననేఁటి పొందులా నీవే నేఁగానా
మన్ననల నింతేసి మరిగించవలెనా
వన్నె నీపోలికే కానా వావు లొక్కసరి గాదా
పన్ని యిఁక నన్ను నొడఁబరచఁగ వలెనా

చ. 2: బాసచేసుకొనమా భావములు వెలితా
సేసపట్టి నీ గుణాలు చెప్పవలెనా
ఆసలెల్ల దక్కవా అప్పుడే మొక్కవా
వేసర కింకా నన్ను వేడుకొనవలెనా

చ. 3: గక్కున మోహించమా కన్నులఁదనియమా
చెక్కు నొక్కి బుజ్జగించి సేవ సేయవలెనా
యిక్కువ శ్రీవేంకటేశ యింతలోనె కూడితివి
నిక్కి నిక్కి చూచి నవ్వు నేఁడే నాతో వలెనా

రేకు: 1022-4 భైరవి సంపుటం: 20-130

పల్లవి: వెనక నీవు చెప్పినట్టు వినేఁగాని
ననిచి నాతో నంత నవ్వకుమీ విభుఁడా

చ. 1: అసము దించక మాఁటలాడేఁగాని నీతో
విసిగితి నీవిరహవేదనలను
రసికులైనవారు రామల నలఁగేఁచితే
పసురువేసీ నందరు పట్టికుమీ విభుఁడా

చ. 2: వీడనాడఁ జాలక నే వీడె మిచ్చేఁగాని నీకు
తాడుపడె నామనసు తమకానను
వేడుక కాఁడైనవాఁడు వెలఁదుల నేఁచితేను
గోడు దాఁకీ నందురు తక్కుల కోప విభుఁడా

చ. 3: గుట్టు మానలేక నీతోఁ గూడేఁగాని నేను
తొట్టె నిట్టూర్పులు నీదొమ్మిరతుల
యిట్టె శ్రీవేంకటేశ యేలినవా రాఁడువారిఁ
పట్టుకు దయసేతురు పాయకుమీ విభుఁడా

రేకు: 1022-5 శ్రీరాగం సంపుటం: 20-131

పల్లవి: ఏమీ నెఱఁగనిసతి నింతసేతురా
కోమలపుమనసులు కొలఁది నిలుచునా

చ. 1: దగ్గరి నీవు నవ్వితే తరుణి కొప్పెల్లా వీడె
సిగ్గరి పెండ్లికూఁతురుఁ జిమ్మిరేఁతురా
దిగ్గన నీవు చూడఁగ దేహమెల్లాఁ జెమరించె
అగ్గల మాయ వలపు అంత కోపునా

చ. 2: చెలితో మాటలాడఁగ చెక్కులెల్లాఁ బులకించె
పలుమారు నిందరితోఁ బచ్చిసేతురా
నిలువున నొరగితే నిట్టూర్పు లవి రేఁగె
మలసితే దమకాలు మట్టున నిలుచునా

చ. 3: పంతానఁ జేయివేసితే భామ నివ్వెరగుఁ బొందె
కాంతుఁడవు వొకమాటే కరగింతురా
వింతగా శ్రీవేంకటేశ వేడుకతోఁ గూడితివి
సంతసాలు మతిలోనఁ జాలునంటే మానునా

రేకు: 1022-6 పాడి సంపుటం: 20-132

పల్లవి: నీకంటే మునుపను నిన్ను నే రమ్మనఁగానే
వాకుచ్చి పిలిచేవు వలెరా యీవలపు

చ. 1: వొక్కటయ్యే ననఁగానే వొద్దికిఁ జెలి నంపేవు
చిక్కనినవ్వులు వచ్చీ సేయరా సేఁత
నిక్కిచూచేననఁగానే నీవే విచ్చేసితివి
చెక్కులెల్లాఁ జెమరించెఁ జెప్పరా మాఁట

చ. 2: వీడెమిచ్చేననఁగానే వేగమే చేయి చాఁచేవు
జోడుగా మయిఁ బులకించె చూడరా చూపు
వేఁడుకొనే ననఁగానే వేగమే నాకు మొక్కేవు
వాడుదేరె నా మోము వంచరా నీ కరుణ

చ. 3: కాఁగిలించే ననఁగానే గక్కున నన్నేలితివి
మాఁగె నాచిత్తమంతయు మానరా జోలి
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
చేఁగదేరెఁ బనులెల్లా చెల్లించరాదా

రేకు: 1023-1 రామక్రియ సంపుటం: 20-133

పల్లవి: నిన్ను మంచివాఁడవన నేరుతుము గాని నేము
సన్నలఁ దిట్టిను వినఁజాలమయ్యా

చ. 1: ఆవులమందలలోన ఆడుకొనేసుద్దులు
వేవేగ విట్ఠలుఁడ వినవయ్యా
చేవదేర నీదొంగచేఁతలెల్లా వీరు వారు
వోవపుచ్చే రివి వినవోపమయ్యా

చ. 2: కొలనికరత నీకు గురుతై నరవ్వలు
తలఁచుకో విట్ఠలుఁడ తగదయ్యా
యెలమిఁ బువ్వులవారి యింటికాడి నిందలు
తెలిపేరు యెట్టు సమ్మతింతుమయ్యా

చ. 3: నిండార రుకుమిణి నీ కంపినలేకలు
పండరంగివిట్ఠలుఁడ పట్టవయ్యా
అండనే శ్రీవేంకటాద్రి నందరిఁ గూడితివి
యెండలెల్లా నీడలాయ నేమనేమయ్యా

రేకు: 1023-2 భైరవి సంపుటం: 20-134

పల్లవి: ఎదురరైతి మిద్దరము యిఁకనేఁటిదే
పదిమారులు దూరఁబనిలే దనరే

చ. 1: నెట్టన నీళ్ళపైవ్రాఁత నిజమా సరసాలు
వట్టిమోపు లింత గట్టవద్దనరే
దట్టముగ వట్టిజోలి దవ్వుకొనవద్దనరే
గుట్టుచేసి సందెకాడ గుంపించకుమనరే

చ. 2: మిక్కిలియటమటాల మేను వెంచవద్దనరే
పక్కున దారామోనఁ జూపకుమనరే
గక్కన చేఁతల ఊయి గరఁగించవద్దనరే
దక్కనిదొంగగుణాలు తగవుగాదనరే

చ. 3: యేడలేనిబుద్ధులకు యెడములేదనరే
వేడుకపరువులేల్లా విడుమనరే
యీడనే శ్రీవేంకటేశు డింత సేసి నన్ను గూడె
యీడు జోడై యివి యెన్ని కాయననరే

రేకు: 1023-3 బైరవి సంపుటం: 20-135

పల్లవి: ఎఱఁగడు గాక తన్ను నిందరు నాడుకొనేది
తఱితో నామాఁట తానే తలఁచుకొమ్మనవే

చ. 1: తగునా పాలుసు మేనఁ దట్టుపుళుగు
సొగయుబట్టతలకు చుట్టు తపారయేలే
అగడుసెలసుమోర కమరునా చిరునవ్వు
సగముమానిసికేలే చక్కదనాలు

చ. 2: పుట్టుతిరిపేనకేలే భూషణములు
యిట్టె బ్రహ్మచారికేలే యింతులపొందు
నెట్టన యెంగిలీ నోఁట నిచ్చల ఘటనలేలే
తిట్టులఁబడేవానికి దీవనలేలే

చ. 3: సిగ్గువిడిచినమీఁద చీర గట్టవలెనా
వెగ్గళమై గెరదాఁటే విచారమేలే
నిగ్గుల శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నుఁ గూడె
యెగ్గులెల్లాఁ బాసె నిఁక యెడమాఁటలేలే

రేకు: 1023-4 కాంబోది సంపుటం: 20-136

పల్లవి: అందుకేమి దోసమా నే మంతేసి కోపముగాక
నిందవేసుకోనేల నిన్నుఁ జూడరాదా

చ. 1: చిక్కనినవ్వులు నవ్వి చెక్కులెల్లాఁ జెమరించె
చక్కనివాఁడ వౌదువు చాలించరాదా
మొక్కలపుమాట లాడి మోవియెల్లాఁ బొక్కెనిదె
మిక్కిలిజాణ వౌదువు మేర నుండరాదా

చ. 2: తేరకొన నన్నుఁ జూచి దేహమెల్లాఁ బులకించె
తారుకాణలాయ నీకఁ దలఁగరాదా
గారవించఁ జెయివేసి కరఁగె నీచిత్తమెల్లా
తేరెఁదేరె నీమోహము తెలుసుకోరాదా

చ. 3: పానుపు మీఁదికి వచ్చి పక్కన నీకొప్పు వీడె
మాన వింకాఁ బంతములు మన్నించరాదా
కోనేటి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
మానరాని పొందులాయ మమ్ము మెచ్చరాదా

రేకు: 1023-5 పాడి సంపుటం: 20-137

పల్లవి: బలిమి సేయకురే పదరే మీరు
చలము సాదించ నోప సారె మొక్కఁ జాలునే

చ. 1: ఆన వెట్టుకునే వాఁడు ఆకెవద్ద నేలవుండె
దానికేపో కోపగించఁదగదా నాకు
వానిసుద్దు లిట్లానే వలసినట్లా నాడు
యేనెపము వేయనోప యీడ నుండేఁ జాలునే

చ. 2: నన్ను వలసినవాఁడు నాఁడేల పరాకాయ
కన్నుల నిందుకేపో నే గద్దించరాదా
యెన్ననేల వానిగుణా లెట్టువలసినా వచ్చు
తన్ను నేమీ ననోప తాలిములే చాలునే

చ. 3: దగ్గరి పైకొనేవాఁడు తారుకాణ లింత యేలే
యెగ్గువట్టి యిందుకేపో యెలయించితి
నిగ్గుల శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నుఁ గూడె
సిగ్గులెల్లాఁ దీరెఁ దాను చెప్పినట్టె చాలునే

రేకు: 1023-6 ఆహిరి సంపుటం: 20-138

పల్లవి: ఒక్కటై యప్పటి జోక నుందాము గాక
నిక్కు(జూపు(దలవంపు నీ కేలరా

చ. 1: కన్నుసన్న నొక్కమాఁట కాయములో నొక్కమాఁట
నిన్ను(జూచి చూచి యాడ నే నోపరా
వన్నెలకు నోరితీఁటవాదులేల యీచోట
నిన్నటి మొన్నటి లోనే నీ కేలరా

చ. 2: చేరితేనే వొకచేఁత చేరకుంటే నొకచేఁత
నెరచి నీయెడ(జేయ నే నేరరా
ఆ రీతి వలపు లీఁత అంత లోనే పై పూఁత
నీరువంకతుంగవలె నీకేలరా

చ. 3: మోవి మీఁది తేనెలు మోనములో కేనములు
నీవద్ద(బచరించ నే నేరరా
శ్రీవేంకటేశ్వరుఁడ చేకొని కూడితి నన్ను
నేవళపు(జిఱునవ్వు నీకేలరా

రేకు: 1024-1 ముఖారి సంపుటం: 20-139

పల్లవి: ఆఅడిఁబెట్టీ మమ్ము నంతేకాదా
జాఱికున్నా మొక్కవచ్చీ సట లింతేకాదా

చ. 1: అప్పసము వేగుదాఁకా నాకు మడిచి ఇచ్చితిఁ
నప్పటి నన్నుఁ బిలిచీ నంతేకాదా
పిప్పిగాఁ దనపాదాలే పిసికితి నిందాఁకాఁ
జెప్పకవచ్చితిననీఁ జెప్పఁ గొత్తగాదా

చ. 2: జాముదాఁకాఁ దనకు వెంజామరము వేసితి
నేమి సేయుమనీ నన్ను నింతేకాదా
దోమటినవ్వులు దనతోనే మారు నవ్వితి
యేమో పరాకైతిననీ నిది వింతగాదా

చ. 3: చేయారఁ బెనఁగితి చెరఁగు నన్నుఁ బట్టఁగా
ఆయము లంటీ గోర నంతేకాదా
యీయెడ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వేయిటికి నానవెట్టీ వేసా లింతేకాదా

రేకు: 1024-2 సామంతం సంపుటం: 20-140

పల్లవి: నిచ్చా నిచ్చా విట్టలా నీ కేల యీ అట్టు
మచ్చము నేఁ జూపితేను మాతోనే నవ్వులా

చ. 1: వల్లెవాటు పైఁడిచీర వనిత శ్రీసతి నీకు
చల్లలమ్మేవారితోడ జాణతనాలా
చెల్లఁబో కొండ గొడుగుచేసి యెత్తేనీవు
గొల్లెతల చీరలెల్లాఁ గోరి ముచ్చిలేదా

చ. 2: అందరి నేలే గోపనందనుఁడ వైన నీవు
చెంది చీఁకటి తప్పులు సేయ బొయ్యేదా
గొందినే దేవతలు గొనియాడేదట నిన్ను
మందవారి పాలఁ జిక్కి నిందలఁ బడేదా

చ. 3: కొనబుకాఁడవు నీవు కొమి రెవయసు నేను
పనిలేక వొంటినుంటేఁ బైకొనేదా
ననుపై శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
మనలోఁ దగవు దేరె మరియింకాఁ గొసరా

రేకు: 1024-3 నాట సంపుటం: 20-141

పల్లవి: అప్పటికప్పుడే కాక ఆ లింతేలే
కప్పురమే గనమైతే కాయమున కితవా

చ. 1: ఆలసి నిద్రించఁబోతే ఆడకేల రమ్మనీనే
వలసినప్పుడే నేనే వచ్చేఁగాక
బలుదొర దానైతే బతుకనీ మాకేమీ
బలిమిఁ బిసుకఁబోతే పసురౌఁబో విరులు

చ. 2: ఇంత నే మోనానుంటే యేల మాటాడించీనే
పంతము చెల్లినమీఁదఁ బలికేఁగాక
అంతజాణ దానైతే అవుఁగాక మాకేమి
చెంతఁ గడుఁ గరఁచితేఁ జేదౌఁబో తేనెలు

చ. 3: యెదురుగా రాఁగానే యేల కొంగువట్టీనే
కొదదీరఁ దనతో నే గూడేఁగాక
అదన శ్రీవేంకటేశుఁడైతేఁ దానౌఁగాక
వెదకి నన్ను మన్నించె విరివవుఁ బనులు

రేకు: 1024-4 రామక్రియ సంపుటం: 20-142

పల్లవి: ఎంతనేర్చెనే యీలేమ పువుఁ
బంతివాట్లనె బడలీని

చ. 1: వాలుకచూపులు వంచి చెలి పతిఁ
గోలుముందుగా గొణఁగీని
చాలుగ నడచి సారెకు నిలిచి
వీటుచుఁ బయ్యెద విసరీని

చ. 2: చెదరిననెరు లటుచెరిగి యిటు నటు-
నుదుటనఁ జెలిపై నొరగీని
కొదలుచుఁ బలికి కోపమె చిలికి
చెదరగ నవ్వులు చిందీని

చ. 3: సరసపు సిగ్గులు చల్లీని తన-
కరము చెక్కుపైఁ గప్పీని
యిరవుగ శ్రీవేంకటేశుఁ గలసి తాఁ
నరమరపున ముదమందీని

రేకు: 1024-5 సాళంగనాట సంపుటం: 20-143

పల్లవి: తగవు నీ వెఱఁగవా తప్పు నాయం దిఁకలేదు
వెగటైనవారితోడ వియ్యమంద వచ్చేమా

చ. 1: పంతము దప్పినా పలికితేను నీవు
రంతు మగనాలవు రాఁపుసేసేమా
పొంతపొరుగుననుండేపొందుసతి వని కాక
మంతనాన నందరితో మాఁటలాడ వచ్చేమా

చ. 2: జవ్వనము వెలితౌనా సారె నాతో నవ్వితేను
రవ్వ నీ దొరతనము రాఁపుసేసేమా
యివ్వల నొక్క వయసే యిద్దరికినని కాక
దవ్వులవారితో జానతన మాడవచ్చేమా

చ. 3: కాయము కొంతరగీనా కాఁగిలించితే నన్ను
రాయడి నీతమకము రతి దూరేమా
వేయిటి శ్రీవేంకటాద్రి విభుఁడ నయిననన్ను
చాయలఁ గూడితి విఁక సారె మెచ్చుకుండేమా

రేకు: 1024-6 లలిత సంపుటం: 20-144

పల్లవి: ఎంత మీఁదుకట్టెనో యింతి నీకు జవ్వనము
కాంతుఁడ వేమి సేసితో కానుక లంపెఁ జెలి

చ. 1: నిద్దిరించవలసినా నీకాఁగిటనే కాని
వొద్ద నిన్నుఁ బాసి వొంటినొల్లదు చెలి
కొద్దిగా మాఁటాడినాను కోరి నీతోనేకాని
ముద్దిరించి పరులతో మోనమే చెలి

చ. 2: ఆరగించవలసినా అటు నీపొత్తునఁగాని
వూరకే వేరెయ్యైతే నొల్లదు చెలి
సారె విడెమిచ్చినాను సగమాకు నీ కియ్యక
చేరి వేరేతమ్ములము చేయదు చెలి

చ. 3: కొమ్మ పయ్యద గప్పినాఁగూడ నీతోఁగాని
వుమ్మడిఁ దనంతనై తే నొల్లదు చెలి
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోఁ గూడితిఁగాని
బమ్మర వెట్టినా నీకుఁ బాయదు చెలి

రేకు: 1025-1 ముఖారి సంపుటం: 20-145

పల్లవి: అందపువిభుఁడు దాను అంగన నేను
కందువ కేఁగినఁజాలుఁ గదిసీఁ బనులు

చ. 1: సేయనీవే చేఁతలెల్లా చెంగటఁ జూచేఁగాక
నాయాలకు వచ్చేనా నవ్వేనింతే
వేయిటిపై జవ్వాదివో వేగిరించనేల నాకు
దాయము వచ్చినప్పుడు తలఁపించేఁ బనులు

చ. 2: ఆడనీవె మాటలెల్లా అన్నియు వినేఁగాక
సూడువట్టఁబోయేనా చొక్కేనింతే
వోడఁగట్టుదూలమువో వోపనన నాకునేల
వీడె మిచ్చేయప్పుడైనా వెలయించేఁ బనులు

చ. 3: రానీవె తా నీడకు రవ్వగాఁ గూడేఁగాక
కానీకానిమ్మనేనా కైకొనే నింతే
యీనెపాన శ్రీవేంకటేశుఁడు గలసె నన్ను
మేనుమేనుఁ బెనఁగించి మెప్పించేఁ బనులు

రేకు: 1025-2 సాళంగం సంపుటం: 20-146

పల్లవి: వాసి వంతుకుఁ బెనఁగేవనితలము
సేసవెట్టితివి ఇఁకఁ జెప్పనేల విభుఁడా

చ. 1: చల్లనివెన్నెలనవ్వు చల్లితివి నేఁడు నీవు
మొల్లమిగా నంత నేము మోవఁగలమా
నల్లనిచూపులు నీపై నాటేము మారుకు మారు
తెల్లమి నీ గుట్టు మాకుఁ దెలియదు విభుఁడా

చ. 2: మొగిఁదేనెవంటిఁమాట మోపేవు మామీఁద
మిగులా నిందుకు నిన్ను మెచ్చఁగలమా
యిగురుఁ గారపువీడె మిచ్చేము నేమైతే
తగునో తగదోకాని తలచుఁకో విభుఁడా

చ. 3: వెడ వుంగరాలచేయి వేసేవు మామీఁద
ఆడరి నిన్నిఁక నౌఁగాదనఁ గలమా
విడువక నిన్ను నే శ్రీవేంకటేశ కూడితిని
బడిబడి నిఁక నిన్నుఁ బాయలేను విభుఁడా

రేకు: 1025-3 శుద్ధదేశి సంపుటం: 20-147

పల్లవి: ఎట్టు నమ్మవచ్చు నిన్ను నిటువంటియందగాని
పట్టపగలే నీచేత పచ్చాయఁగా

చ. 1: మల్లడి నీతో నలిగి మారుమోమై యున్నవేళ
చల్లువలపులు నీకుఁ జవులాయఁగా
యిల్లిదె యింతలో నీతో నేకము నేనైనవేళ
వెల్లవిరి నవియెల్లా వెగటాయఁగా

చ. 2: చెఱఁగుమాసి నేఁ జెక్కుచేతితో నున్నవేళ
యెఱుకతో సరసాలే యింపాయఁగా
చిఱుతనై నాలుగునాళ్లు చేసియున్నవేళఁ జూచి
మొఱఁగులపనులెల్లా మొగచాట్లాయఁగా

చ. 3: కాఁగిటికి నెదుగక కన్నె నేనై యున్న వేళ
తోఁగిచూపులే నీకే తొడుసాయఁగా
వీఁగక శ్రీవేంకటేశ వెస నేఁ గూడినవేళ
మాఁగినతొల్లిటివెల్లా మఱపాయఁగా

రేకు: 1025-4 బౌళిరామక్రియ సంపుటం: 20-148

పల్లవి: అన నింకేమున్నది అలుగ నేమున్నది
కనుఁగొనలనే చూచి కరఁగుట గాక

చ. 1: నవ్వు నవ్వాజెల్లును నాలిసేయజెల్లు నీకు
రవ్వగా నే మోహించి రాఁపైనయందుకు
యెవ్వరితోఁ దగవూ లిఁక నాడే నేను
జవ్వనాన నొంటి నేను జడియుట గాక

చ. 2: బిగియా నమరునూ బీరాలు నమరునూ
తగవులెంచక నిన్ను దగ్గరినయందుకు
జగడమూఁ జెల్లదూ సాదించ జెల్లదూ
మొగమోటమున నేనే ములుగుటగాక

చ. 3: సరసము దక్కెనూ చనవెల్లా నెక్కెనూ
మరిగి నీకాఁగిట నేను మఱచినయందుకు
తెరయెత్తఁ బనిలేదు దిష్టము శ్రీవేంకటేశ
సరుగ నీరతిఁ జిక్కి సతమౌటగాక

రేకు: 1025-5 మంగళకౌశిక సంపుటం: 20-149

పల్లవి: సారె దూరఁజాలనూ చలముల కోపనూ
చేరితి మాచనవోలి చెన్నుని భ్రమలను

చ. 1: యీడకుఁ బిలుపించెను యేమిసేయుమనీనే
వోడక తనయెదుట నున్నదానను
పాడితో నీట ముంచనీ పాల ముంచనీ తాను
వాడుఁదనవలపులకు లోనైతిని

చ. 2: మాఁట నన్ను నాడించెను మన నెట్టుదెలిసీనే
యేఁటికైనా నియ్యకొంటి నిదివో నేను
నాఁటిమాఁట చెల్లించీనా నగనీ తెగడనీ
మేఁటిపాయము తనకే మీఁదుగా నె త్తితిని

చ. 3: కాఁగిట నన్ను నించెను కళదాఁకె నిఁకనేలే
దాఁగక తనకు నిట్టె దక్కితి నేను
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడు దా నన్నుఁగూడె
యేఁగించనీ రేఁగించనీ యిరవైతి నేను

రేకు: 1025-6 రామక్రియ సంపుటం: 20-150

పల్లవి: ఎదురుగుదురుగా నిది యే మే
పెదవులు గదలఁగఁ బెనఁగీఁ దాను

చ. 1: పక్కున నగఁగాఁ బంతము లాడితి
యెక్కువ తక్కువ లే విందు
ముక్కునఁ దనకే ముంగోపము మరి
తక్కరి రమణుఁడు తగునా తనకు

చ. 2: సారిదిఁ జూచితే సూడిటు వట్టితి
యిరువగు తగవులు యే విందు
సరుగన తానే సాకిరి చెప్పీ
కెరలినజగడమె గెలుపా తనకు

చ. 3: యీాడుకు వచ్చిన నిన్నియు మఱచితి
యిడుగానిపను లే విందు
వేడుకతో శ్రీవేంకటరమణుఁడు
కూడి మొక్కి నిది గుఱుతా తనకు

రేకు: 1026-1 దేసాళం సంపుటం: 20-151

పల్లవి: ఎప్పుడు మీకే పోదు యింతవలెనా
కొప్పువట్టితే అప్పుడు కొంచెము గావలెనా

చ. 1: పలుకుల కొదదీరె పరాకు లేఁకనేలే
చెలువుఁడు చెప్పినట్టు నేయరాదా
నిలుచున్నాఁడిదె వచ్చి నిదుర నీ కింత యేలే
బలిమిఁ బట్టినమీఁద భ్రమయఁగవలెనా

చ. 2: మనసు కోపమువాసె మరి చింత లేఁకనేలే
ఘనునిప్రియములెల్లఁ గైకోరాదా
తనుఁదానె వీడెమిచ్చి తలవంచ నీకేలే
చెనకి చేయిచేసుకొంటే సిగ్గువడవలెనా

చ. 3: కాఁగిటిలో కొదదీరె కమ్మర జంకించనేలే
పేఁగక శ్రీవేంకటేశుఁ బిలువరాదా
రేఁగి యాతఁడు నవ్వీని రిచ్చలఁ గొంకఁగనేలే
మూఁగి యాతఁడు ముంచితే మొగమోట వలెనా

రేకు: 1026-2 ముఖారి సంపుటం: 20-152

పల్లవి: అప్పటి మానవు బింకా లౌనయ్యా
కుప్పేవు పచ్చడ మిట్టె కమ్మటి నౌనయ్యా

చ. 1: వూని రేపుమాపుదాఁకా వూరెల్లాఁ దిరిగి వచ్చి
ఆనలు వెట్టవచ్చేవు అవునయ్యా
మానాన మణిఁగి నే మౌనముతో నుండఁగాను
కానీ కానిమ్మనేవు కమ్మటి నౌనయ్యా

చ. 2: పొద్దువోనివాఁడ విట్టే పోకలనెల్లాఁ బోయి
అద్దము చూపుమనేవు ఔనయ్యా
నిద్దురతోఁ బానువుపై నే నిట్టె వుండఁగాను
గద్దించి అయా లంటేవు కమ్మటి నౌనయ్యా

చ. 3: కాంతలఇద్దరిలోనికనుసన్న దెలిపితే
అంతేపో నవ్వునవ్వే వౌనయ్యా
చింతదీర నన్నుఁగూడి శ్రీవేంకటేశ నేఁడు
కంతుముద్రలు మోపేవు కమ్మటి నౌనయ్యా

రేకు: 1026-3 పాడి సంపుటం: 20-153

పల్లవి: పొమ్మంటేఁగాని వూరకే పోయివచ్చేనంటేను
సమ్మతించ లేనోయి సంగడీఁడ

చ. 1: యిత్తల నీవు నేను యిటు గూడినకూటమి
చిత్తాన మఱవకుమీ చెలికాఁడ
మత్తిలి నీవు నేఁడే మాపటంత రాకుంటే
వత్తుఁజుమ్మీ మీయింటికి వగకాఁడా

చ. 2: ఆవేళ నీవు నేను ఆడుకోలుమాటలెల్లా
నీవే తలఁచుకొమ్మీ నేస్తకాఁడా
యేవంక చూచినా యిప్పుడు కోమటిమేన
వావిసుమ్మీ నీకు నాకు వన్నెకాఁడా

చ. 3: వాకిటికిఁబోయి యిటువచ్చి నన్నుఁగూడితివి
నాకంటే మేలుగదోయి నాటకీఁడా
చేకొని శ్రీవేంకటేశ చెల్లుఁజెల్లు యిది నీకు
యేకాలముఁ బాయకుమీ యిచ్చకీఁడా

రేకు: 1026-4 కేదారగౌళ సంపుటం: 20-154

పల్లవి: పొయ్యేవో పోవో అంతేపో బాలుఁడా
వొయ్యన చేరేవు నే మోపమయ్య బాలుఁడా

చ. 1: చంక నెత్తుకోఁబోఁగా సంది జీరువారుఁ జేసు
అంకెలబాలుఁడ మమ్ము నంటకువయ్యా
పొంకమున నీయెదుటఁ బొలయరాదా చెలులు
కొంకక నాపైఁ బడేవు కొయ్యవుగా బాలుఁడా

చ. 2: ముద్దువెట్టుకోఁబోఁగా మోవి పల్లు నాటుఁ జేసు
వొద్దువొద్దు బాలుఁడా నే మొల్లమయ్య
అద్దో యశోదతోడ ముచ్చటాడరాదా మాకు
వుద్దండానఁ బైపడేవు వుండరాదా బాలుఁడా

చ. 3: అప్ప లప్పులనఁబోఁగా నాయము కరఁగుఁ జేసు
తప్పక మాకుచములు దాఁకీనయ్యా
చెప్పఁగానే వుద్దండానఁ జెఱఁగు వట్టితి విదె
వొప్పితి శ్రీవేంకటాద్రి వొరపరి బాలుఁడా

రేకు: 1026-5 సామంతం సంపుటం: 20-155

పల్లవి: చంక గుదియము మరి శరణార్తియునేల
సంకేలేక నీపంతమె సాదించుకోరాదా

చ. 1: యేడనుండో వచ్చి నీవు యేమీ నే ననకుండా
వాడుమోము నీవు ముందే వంచవలెనా
వేడుక దొరవు నీవు వెరపు నీ కింతయేలా
యీడుగాఁ జేసినచేఁతే యీడేర్చుకోరాదా

చ. 2: సొలసి నీమేనిపచ్చి చూచి వెంగెమాడకుండా
అలయకముందే వుస్సురనవలెనా
బలవంతుఁడవు నీవు పరితాప మిఁకనేల
చెలఁగి తొల్లటిచేఁతే చెల్లించుకోరాదా

చ. 3: అరవిరై వచ్చి నీవు అదేమీ నే ననకుండా
గరిమఁ గాఁగిట నన్నుఁగలసేవు
యిరవై శ్రీవేంకటేశ యిన్నిసుద్దు లిఁకనేల
పరగ నన్నేలితివి పాయకుండరాదా

రేకు: 1026-6 శ్రీరాగం సంపుటం: 20-156

పల్లవి: పొద్దువోక కిటు పొలసితిని
అద్దము నీడల నాఁగేవా

చ. 1: పెనఁగఁగ నేఁటికి పిలువఁగ నేఁటికి
ననుపున నూరక నవ్వితిని
చనవరికాంతవె చాలు నీకు నిఁక
కనుకలి వినుకలి గాణాచా

చ. 2: పట్టఁగ నేఁటికి పయికొననేఁటికి
చుట్టపు వరుసలఁ జూచితిని
పెట్టువలపులె ప్రియములు నీ కిఁక
జట్టిబేరములు సతమవునా

చ. 3: బాసలిఁ కేఁటికి బచ్చన లేఁటికి
వాసివంతులకె వచ్చితిని
ఆసల శ్రీవేంకటాధిప కూడితి
వేసతులును నా కిటయ్యేరా

రేకు: 1027-1 నాదరామక్రియ సంపుటం: 20-157

పల్లవి: సింగారరాయుఁడ వౌదు చెన్నకేశా యింకఁ
జెంగకుమీ మారతుల చెన్నకేశా

చ. 1: చిమ్ములచుట్లతోనే చెన్నకేశా మాకు
చిమ్మిరేఁచేవు వలపు చెన్నకేశా
చెమ్మఁజెమటచెక్కుల చెన్నకేశా: మాపైఁ
జిమ్మకు గోళ్ళు నీవు చెన్నకేశా

చ. 2: సెలవిలేనగవుల చెన్నకేశా: మాకే
సెలవనెవు వయసు చెన్న కేశా
చెలఁగి పసిడిదట్టి చెన్నకేశా: యీ-
చెలువము నీకే చెల్లె చెన్నకేశా

చ. 3: చెప్పరానిమహిమల చెన్నకేశా మాకు
చెప్పిలేమోవి యిచ్చితి చెన్నకేశా
యిప్పుడే శ్రీవేంకటాద్రి నిందు మాచనవోలిలో
చెప్పఁగా నన్నేలితివి చెన్నకేశా

రేకు: 1027-2 సామంతం సంపుటం: 20-158

పల్లవి: విన్నపమిదెపో వింటివో వినవో కాని
కన్ను గిరిపే వేమికారణమో కాని

చ. 1: మాఁటలివి మంచివేపో మనసే తెలియఁగాని
ఆఁటదానఁ బుణ్యపాప మది నీదేపో
నాఁటిన సెలవులను నవ్వులు నవ్వే నిది యొఁబో
యేఁటికొఁతా వెనకముం దెంచలేము గాని

చ. 2: ననుపెల్లా మంచిదేపో నడవ డెఱఁగఁగాని
యెనసితి పరభారా లింక నీవేపో
నను నీవు సారెసారె నమ్మించే విది యొఁబో
కొనయౌతా మొదలౌతా గుట్టెఱఁగఁగాని

చ. 3: పాయమిది మంచిదేపో పంతము లెఱఁగఁగాని
అయమంటి కూడితి నీయాసఁ గంటిఁబో
యీయెడ శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
రేయి - పగ లిదియని రీతెఱఁగఁ గాని

రేకు: 1027-3 శంకరాభరణం సంపుటం: 20-159

పల్లవి: ఇద్దరికిఁ బోవునా ఇదియూ గొంతా
అద్దుకొన్నవలపొత అది నీవెఱఁగవా

చ. 1: పంతము దప్పినా పక్కన నవ్వితే మాతో
కొంతగొంత నవ్వునవ్వి గుక్కుకొనేవు
మంతనాన నొకవేళ మాటమాట జగడాలు
అంతనంతనే పాసె నది నీ వెఱఁగవా

చ. 2: దొరతనము వోయీనా తొంగిచూచితే మమ్ము
ధర పులుకనఁ జూచి తలవంచేవు
విరస మేమిగల్లాను వేళవేళనే పాసె
అరగొరత లిఁకేల అవి నీవెఱఁగవా

చ. 3: పాకము దప్పినా పలికితే మాతోను
మాకువలె రతిఁజొక్కి మఱచేవు
యేకమైతి శ్రీ వేంకటేశ మమ్ము గూడితేను
ఆకతలే చెప్పనేల అది నీ వెఱఁగవా

రేకు: 1027-4 రామక్రియ సంపుటం: 20-160

పల్లవి: ఇప్పుడు వేగిరమేలే యింతలోఁదాను
కొప్పు వీడె నాకుఁ గూడవచ్చేఁ బదవే

చ. 1: నాటకాన బూటకాన నవ్వివచ్చితి నిందాఁక
యేఁటికిఁ బిలువనంపె నిట్టే తాను
కాటుక కన్నుల నాకు కమ్మీ నిద్దుర నేఁడు
నేఁట నే తప్పీనా రేపు నే వచ్చేఁబదవే

చ. 2: పొంతనాల మంతనాల పొద్దువుచ్చితి నిందాఁక
అంతలో లేకలేలంపె నప్పుడే తాను
చెంతల కస్తూరిబొట్టు చెదరె నీవేళ నాకు
వంతుకు నే మాపటంత వచ్చేఁ బదవే

చ. 3: వొడఁబాటు తడఁబాటు నొప్పి వచ్చితి నిందాఁక
బడి నీడకేల వచ్చెఁ బదరి తాను
యెడచొచ్చి శ్రీవేంకటేశుఁడిట్టె నన్నుఁగూడె
వడి మీమనసులెల్లా వచ్చెఁగద పదవే

రేకు: 1027-5 బౌళి సంపుటం: 20-161

పల్లవి: చెల్లుబడి గద్దంటాఁ జేసేవు గాని
వొల్లమన్నాఁ బోరుసుమ్మీ వుద్దండమైనాను

చ. 1: చిట్లుగురుగులతో చిలుపాలు గొల్లెతలు
వుట్లపైఁ బెట్టినారు వోకృ(ష్టుడా
కొట్లుగొట్టేవు నీవు గోపాలకులఁ గూడి
తిట్లు దిట్టేరుసుమ్మీ దేవరవై నాను

చ. 2: అట్టువపైఁ జక్కిలాలు అట్లును నురుగులు
కట్టిపెట్టి దాచినా రిక్కడఁ గృష్ణుఁడా
మెట్టుకొని కొల్లలాడి మెఱసేవు వీదులను
పట్టుకోనే రిఁకఁ జుమ్మీ బల్లిదుఁడవైనాను

చ. 3: తోవల తేనెలు నేయి దొంతులుగఁ బోట్టినారు
శ్రీవేంకటాద్రిమీఁది చిన్ని కృష్ణుఁడా
వావారి జోరునవచ్చి వంచి ముంచి పోసేవు
పోవిడువ రేలికవై పోకులఁబోయినాను

రేకు: 1027-6 నారాయణి సంపుటం: 20-162

పల్లవి: నవ్వునవ్వె రమణుఁడుననుపుగాఁబొందుసేసె
రవ్వల నింతచాలదా రాతిరి రమ్మనవే

చ. 1: చెక్కునొక్కె సేసవెట్టె చేయివేసె బుజముపై
జక్కవనాచన్ను లంటె చాలదా యింత
యెక్కువేది తక్కువేది యిప్పుడే కావలెనా
చుక్కకెదు రీవేళ చూచుక రమ్మనవే

చ. 2: కాలుదొక్కె కాఁకరేఁచెఁ గన్నులఁ దప్పక చూచె
చౌలుగా మాఁటలూ నాడె చాలదా యింత
వేళలేదు పొద్దులేదు వేగిరించి నింతలోనే
యీలకూర కుప్పువేసే నిటుండి రమ్మనవే

చ. 3: కొంగువట్టె గాఁగిలించెఁ గూడె సమరతులను
సంగతాయ నన్నిటాను చాలదా యింత
చెంగలించె నిన్నిటాను శ్రీవేంకటేశ్వరుఁడు
ముంగిట నున్నాఁడు యిట్టె మొక్కె రమ్మనవే

రేకు: 1028-1 సాళంగం సంపుటం: 20-163

పల్లవి: తడవకు మము నటు తలవయ్యా
పిడికెడునడుములఁబెనఁగేమయ్యా

చ. 1: పంతము మాతోఁ బలుకఁగఁ బలుకఁగ
దొంతులు బెదరీఁ దొలవయ్యా
కాంతల మింతే కన్నులు పెద్దని
బంతులఁ జూపిటు బతికేమయ్యా

చ. 2: అంచె జాణతన మటు నీవాడఁగ
మంచము ములిగీ మానవయ్యా
కొంచపుమోమున గురిగా కళలే
నించుక మెరసే నెలతలమయ్యా

చ. 3: కాఁగిటి కొయ్యనె కదియఁగఁ గదియఁగ
వాఁగీ నందెలు వద్దయ్యా
ఆఁగుచు శ్రీవేంకటాధిప కూడితి
మాఁగినరతి మెయి మఱచేమయ్యా

రేకు: 1028-2 ముఖారి సంపుటం: 20-164

పల్లవి: పోపో యిదేడసుద్ది పొద్దునఁరాఁగదవే
యీపాటిదానవు ముందేల పిలిచితివే

చ. 1: మంతనము లేమిటికే మారుమాట లేమిటికే
కాంతుఁడు వాకిట వచ్చి కాచుకుండఁగా
యింతులకు మగవానియిచ్చకమే వలెఁగాక
యెంతలేదు నీచలము యేమి గట్టుకొంటివే

చ. 2: అలుక లింకేమిటికే అవ్వలిమో మేమిటికే
నలిరేఁగి పతి నీతో నవ్వు నవ్వఁగా
చెలులకు పతి కట్టె సేవ సేయవలెఁగాక
యెలమి నెగ్గులువట్టే వింతేసి కద్దటవే

చ. 3: చెక్కుచేతు లేమిటికే సిగ్గులింకా నేమిటికే
వొక్కటై శ్రీవేంకటేశుఁడొప్పుఁ జెప్పఁగా
తప్పక సతికి పతి తగులమే వలెఁగాక
ఇప్పుడే కూడితిరి ఇంకఁ జెప్ప నేఁటికే

రేకు: 1028-3 లలిత సంపుటం: 20-165

పల్లవి: ఒద్దనుంటేఁ జప్పనౌను వోపము నేము
సుద్దులు చెప్పనంతనే చొక్కేము నేము

చ. 1: కలిగితే మోహమెల్లా గాదెఁ బోసుకొమ్మనవే
సొలపుమాటల మాకుఁ జూపఁగనేల
చెలులాల మనసెల్లాఁజిల్లులాయ నిందుననే
తలఁచి దవ్వులపొందే తనివాయ మాకు

చ. 2: రాజ మెంతగల్లాను రాసి చేసుకొమ్మనవే
జాజుకొన మాయెడఁ బచరించ నేల
వోజతోడ నిందుననే వుడుకెత్తె మేనెల్లా
తేజానఁ బెండ్లినాఁడే తేఁకువాయ మాకు

చ. 3: మంచి నవ్వులేమి గల్లా మూఁట గట్టు కొమ్మనవే
వంచి మాపైనేల చల్లీ వరుఁస దాను
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
మించి వుర మెక్కించుటే మేలాయ నాకు

రేకు: 1028-4 ఆహిరి సంపుటం: 20-166

పల్లవి: నిలువుఁ గొౌలువు లేల నివ్వెరగు లిఁకనేల
చలము మాని విభునిఁ జక్కఁ జూడరాదా

చ. 1: పంత మొక్కటేకాక పలుమాఁట లిఁకనేల
మంతనాన పతితో మాటాడరాదా
చింత లిన్నియునుఁ బాసె చెక్కునొక్కినప్పుడే
కొంత సెలవుల నవ్వి కూచుండరాదా

చ. 2: వొడఁబా టొొక్కటేకాక వున్నవిచారము లేల
బెడఁగులేక యాతనిఁ బిలువరాదా
కడమలిన్నియుఁ బాసె కప్పురమిచ్చినప్పుడే
విడువరానిపతికి విడెమియ్యరాదా

చ. 3: కూటమి వొొక్కటేకాక కొణఁత లింకానేల
చోటిచ్చి శ్రీవేంకటేశుఁ జొొక్కించరాదా
బూటకములెల్లాఁ బాసె పొంది పొసఁగి నప్పుడే
పాటించి యాతని నిట్టె పచ్చి సేయరాదా

రేకు: 1028-5 మాళవిగౌళ సంపుటం: 20-167

పల్లవి: ఏమాయ నిందుకు నీ వెగ్గులేల పట్టేవు
కామిని నీచెక్కు నొక్కి కై కొనవయ్యా

చ. 1: పడఁతి నోరై త్తితేను పగడాలే రాసులయ్యా
యెడపు నిన్నుఁ దిట్టితే నేమాయనయ్యా
కడలేనిరత్నాలు గానుకవచ్చిననీవు
తడవి బండారాన దాఁచుకోవటయ్యా

చ. 2: మగువచూపులవంక మాణిక్యాలే రాలీని
తగఁ గోపించి చూచితే తప్పటవయ్యా
సొగిసి మణులు దాఁచి సొమ్ములు నీ కిచ్చితేను
జిగి మేన ధరియించి చెలఁడవటయ్యా

చ. 3: ముంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని
యించుక గేలిసేసితే నేమాయనయ్యా
పెంచెపు శ్రీవేంకటేశ పెండ్లిముత్యాలసేస
వంచి కూడి చెలి మానవచ్చునటయ్యా

రేకు: 1028-6 రామక్రియ సంపుటం: 20-168

పల్లవి: ఏమని చెప్పుదు నిరుగుపొరుగుతో
గామిడితనమునఁ గదిసీని

చ. 1: మలయుచు నే నటు మంద కేఁగఁగా
తొలఁగక యెదురుగఁదుమ్మీని
యెలిమి మగుడి మాయింటికిఁ బోతే
బెళకక యిలు గడెవెట్టీని

చ. 2: జడిగొని వీదుల చల్లలమ్మఁగా
తొడిఁబడ దూడలఁదోలీని
వడి నందుకు నేవద్దని కసరిన
ఆడరి జాణతన మాడీని

చ. 3: ఏకతమున నే నిటు నీళ్ళాడఁగ
కైకొని నాచీర గట్టీని
కాకుగ శ్రీవేంకటగిరి కృష్ణుఁడు
దాకొని నన్నిటు తగఁ గూడీని

రేకు: 1029-1 కాంబోది సంపుటం: 20-169

పల్లవి: నేవచ్చినపనేమి నీవు సేసిన చేఁతేమి
ఆవలఁ జెలేమనునో అవునయ్య చాలును

చ. 1: పిలిచేవ నుంటిఁగాని పెనఁగే దెఱఁగనైతి
చెలిక త్తెఁ బచ్చి సేయఁ జెల్లునా నీకు
తొలుతే వేడుక కాఁడు దోస మెఱఁగఁ డనేటిఁ
పలుకు నీయందే కంటిఁ బదవయ్య చాలును

చ. 2: నగేవంటా నుంటిఁగాని నాకుఁ జేయిచాఁచే దెఱఁగ
జిగినేస్త కత్తెనంటా జెల్లునా నీకు
జగములోన వలపు చవెఱఁగ దన్నమాట
తగవు నీయందే కంటిఁ దలవయ్య చాలును

చ. 3: వూరకంటా నుంటిగాని వొడివట్టే దెఱఁగను
చేరి దూతికిల గూడ జెల్లునా నీకు
అరయ శ్రీవేంకటేశ అట్టె నను గూడితివి
మేరమీరితిని నీవు మేలయ్య చాలును

రేకు: 1029-2 ముఖారి సంపుటం: 20-170

పల్లవి: ఇంకనేల దూరుమాట లింతేకాక
కొంకుదీర నిన్ను నిట్టె కూడఁగలఁగాక

చ. 1: తప్పులెంచి నీగుణాలు తగదనేనా మోము
తప్పకిట్టె నిన్నుఁ జూచి తనిసేఁగాక
అప్పుడు నీ వన్నమాట కాఁగఁబోయేనా నా-
నొప్పిదీర నీచెక్కు నొక్కఁగలఁగాక

చ. 2: యేమి సేసినాను నిన్ను యెగ్గువట్టేనా
నాముదేర సెలవుల నవ్వేఁగాక
బూమివారివలె నీకు బుద్ధిచెప్పేనా
వేమారు నీపై మేను వేయఁగలఁగాక

చ. 3: పానుపుపై నీతో నింక పంతమాడేనా నీ-
సోనల మోవితేనెలఁ జొక్కేఁగాక
కావీలే శ్రీవేంకటేశ కాదనేనా నీ-
మేనుసోఁకినరతుల మెచ్చఁగలఁగాక

రేకు: 1029-3 బైరవి సంపుటం: 20-171

పల్లవి: చిత్తము వచ్చినట్లు నేఁ జేసేఁగాని
బత్తి గొట్టానఁ బెట్టేవు పదరకు చాలును

చ. 1: నీరువంక తుంగవంటి నీ మాటలనే మమ్ము
వూరకే మోచి దించేవు నోపఁబో నేను
మోరతోపుఁదనమున ముట్టివచ్చి తేఁగనక
గోర గీరితే నేరౌను కొంగుముట్ట కిఁకను

చ. 2: మూడిఁజొచ్చి వాతవెళ్లేముడి కారితనముల
వోడక పంతమాడేవు వోపఁబో నేను
యేడనైనా వచ్చినీవు యెన్నికతో బాసగొని
యీడుగాని పనులకు నెమ్మెలు సేయకుమీ

చ. 3: మాయలనే భ్రమయించి మానము చేకొంటి విదె
వొమయ్య కాలుదొక్కేవు వోపఁబో నేను
యీయెడ శ్రీవేంకటేశ యింతసేసి కూడితిని
పాయము నీకే సెలవు పది బదిగాను

రేకు: 1029-4 సామంతం సంపుటం: 20-172

పల్లవి: అండనే నిలుచుంటీ నే నప్పుడుగాదా
మెండుకొన్న ఆనలేల మేలు మేలు గాదా

చ. 1: తొయ్యలి యెవ్వతో నీతొడమీఁదఁ బవళించి
అయ్యెడ నీకు మోవిచ్చె నప్పుడు గాదా
నెయ్యాన నాకుమడిచి నీ వందిఇయ్యఁగాను
పయ్యదకొం గప్పుడు నీపైఁ గప్పెఁ గాదా

చ. 2: చెక్కు చెమరించఁగా నీచే సురటి విసరించి
అక్కరతో సేదదేరె నప్పుడు గాదా
వొక్కటై నీ నెన్నడుము వొక్కచేతఁ గాఁగిలించి
మొక్కె నప్పు డొక్కచేత ముచ్చటాడికాదా

చ. 3: దిట్టయై తమకమునఁ దేలించి నిన్నుఁ జూచి
అట్టె తెరవేయించె నప్పుడు గాదా
నెట్టిన శ్రీవేంకటేశ నీవు నట్లానే
పట్టి నేఁడు గూడితి వాభావమేకాదా

రేకు: 1029-5 సాళంగనాట సంపుటం: 20-173

పల్లవి: అప్పటి నాకే వలతు నందువు నీవు
చిప్పిల నావద్ద నేఁడే చెల్లె నీప్రతాపము

చ. 1: జూటరివై యాకెమోము చూచి చూచి పలికేవు
యేఁటిమతకములౌతా నెవ్వఁ డెఱుఁగు
నాఁటకమే మోకాని నవ్వునవ్వే వేమన్నా
ఆఁటదాని నింతసేసే వౌ నీప్రతాపము

చ. 2: అదె మాయింటికి నాకె నడిగడిగి వచ్చేవు
యెదుటి నీవెడమాయ లెవ్వఁ డెఱుఁగు
చదివి వచ్చితోకాని సరసాలే నెరుపేవు
సుదతులకే చూపేవు సొంపు నీప్రతాపము

చ. 3: అకెతో నేకతమాడి అంతలో నన్నుఁ గూడితి
వీకడ నీతమకము లెవ్వఁ డెఱుఁగు
దాకొని శ్రీవేంకటేశ తలఁచుకొంటివోకాని
నీకతలు రతికెక్కె నిండె నీప్రతాపము

రేకు: 1029-6 పాడి సంపుటం: 20-174

పల్లవి: తడవీ నూరక తగ దనఁడు
బడిబడి రమణుఁడు పయిపై వీడఁడు

చ. 1: మంతన మొకతెతో మాఁటలాడుతా
బంతికిఁ బిలిచీఁ బతి నగఁడు
సంతత మాకెతో సరసమాడుతాఁ
జెంత నీడె మొసఁగీ సిగ్గువడఁడు

చ. 2: పానుపున నొకతెపైఁ జెఱఁ గంటుచు
లోనికిఁ బలిచీ లోఁగఁ డిదే
ఆనుకొని యాకెయధరము గ్రోలుచు
మానము దొడికెను మాఁటా వినఁడు

చ. 3: పురమున నొకసతి నునుచుక కాఁగిట
ధరనుఁ గూడీఁ దడఁబడఁడు
యిరవుగ శ్రీవేంకటేశుఁ డిద్దరిని
సరిగాఁ గూడెనుఁ జాలూ ననఁడు

రేకు: 1030-1 దేశాక్షి సంపుటం: 20-175

పల్లవి: ఏలరా యింతవలపు యేమిబాఁతి నే నీకు
సోలి నాపె నొరగేవు చొక్కనాథ లేలే

చ. 1: పొలసితే నంతలోనే పొదిగి కాఁగిలించేవు
యెలుఁగించితే తలయెత్తి చూచేవు
తలఁకితే విరహాన దక్కి చీకటి దవ్వేవు
నలిరేఁగి దగ్గరితే నవ్వులు నవ్వేవు

చ. 2: చక్కఁ బయ్యద వెట్టితే చాఁచేవు చేయి సారె
దిక్కులెల్లా సాదించి తెంకిచూపేవు
చొక్కి నే నేడనుండినా చొప్పులెత్తుక వచ్చేవు
పెక్కురతులనే నన్నుఁ బెనఁగఁజొచ్చేవు

చ. 3: చేరఁబిలువకే వుంటే సిగ్గయినా విడిచేవు
గారవించినంతలోనే కాలుదొక్కేవు
వోరి శ్రీవేంకటగిరినుండి వచ్చికూడితివి
మేరతో నెలఁదలూరి మేటిచొక్కనాథా

రేకు: 1030-2 సాళంగం సంపుటం: 20-176

పల్లవి: తెలిసెగా నీగుణము తేటఁగా మీదటికైనా
బలురాజసాలు చూపేపంతము లెఱఁగరా

చ. 1: వొంటి నేను వేగించగా నూరకే యల్లాడ నీకు
కంటికి నిద్దుర వచ్చెఁగా: చెల్లబో
నంటున నాతో నీవు నవ్వే వనుచు నే-
నుంటిఁగాని యిట్టవుత నొకటీ నెఱఁగరా

చ. 2: వెలసి నేఁ బానుపుపై విరహానఁ బొరలఁగా
కొలువు సేయించుకో గోరికాయఁగా
పిలిపించే విటు నాకే వలతు వనుంటిగాని
వొలిసినొల్లములౌత వొకటీ నెఱఁగరా

చ. 3: అద్దరిపాటుండగాను అంతలో విచ్చేసి కూడి
సుద్దులు చెప్పవచ్చేవు సుగుడవౌదు
ముద్దుల శ్రీవేంకటేశ మొరఁగే వనుంటిఁగాని
వొద్దికైతి వింతకతొ ల్లొకటీ నెఱఁగరా

రేకు: 1030-3 కాంబోది సంపుటం: 20-177

పల్లవి: ఆనలేలయ్యా నీవాడినట్టె ఆడేము
పూనిననీమనసులో పూఁపక మేదయ్యా

చ. 1: సన్నల నాకెకు నీకు సాకిరి చెప్పుమనేవు
అన్నట్టే నీమాట లవిగోవయ్య
మిన్నక తిట్టే వందుకు మించి వెంగెములంటా
యిన్నిటా దొరవు నిన్ను నేమనందునయ్యా

చ. 2: అప్పటి మొక్కించుమనే వాకెనే నీముందట
చెప్పినట్టేల్లా నింకఁ జేసేమయ్యా
రెప్ప వెట్టక చూచేవు రేసు నెరుపేనంటా
దెప్పరాలు నీకు నీవే తెలుసుకోవయ్యా

చ. 3: కందువ నీ వెదురేగి కాఁగిలించితి వాకెను
అందరికి వొక్కమన సాయనయ్యా
అందపు శ్రీవేంకటేశ అంతలో మమ్ము మెచ్చేవు
విందువంటి మావంక వెలుతు లేవయ్యా

రేకు: 1030-4 సాళంగం సంపుటం: 20-178

పల్లవి: అదే రాముఁడు సువేలాద్రిపై నిలిచె
యెదిరితివి సీత యిఁక నేమమ్మా

చ. 1: దనుజులు వారేరు తలఁకేరు లంకలో
వనజాప్తకులుఁడు వచ్చెనమ్మా
వినవచ్చెను కపివీరుల యార్పులు
వెనుకొని పవుఁజులు విడిసెనమ్మా

చ. 2: కదనములో కుంభకర్ణాది వీరులు
మదమున బయిపడి మడిసిరమ్మా
చిరుఁమగ రావణుచేతులుఁ దలలు
నిదులనెల్లా విన్ను నిండెనమ్మా

చ. 3: పతి విభీషణునిఁ బట్టముగట్టెనమ్మా
అతఁడు నిన్నుఁ బిలువనంపీనమ్మా
కతగా శ్రీవేంకటగిరిమీఁదను
యితవుగఁ గూడరొ యిపుడేమమ్మా

రేకు: 1030-5 మాళవిగౌళ సంపుటం: 20-179

పల్లవి: పూవుటమ్ములు మరుఁడు పూఁచినాఁ డేమరఁడు
రావే నామాట విని రవ్వపడనేఁటికే

చ. 1: వద్దు నీచలము వలపించఁగలము !నీ
కొద్ది దెలిసిన దాఁకా గొంకే మింతే
అద్దొ యిటువలె నలిగేవా నెంతలేదు
చద్దికి వేఁడికి నవి సాగ వింతేకాక

చ. 2: యింతేలే నీకోపము యిందు కెల్లా నోపము ! నీ-
పంతము చూచినదాఁకా పాటించే నింతే
యెంతో బిగువుతోడ యెలయించే దెంతలేదు
సంతతము పతి వద్ద జరగదుగాక

చ. 3: మానవే నీబిరుదు మాకు నివి యరుదు
నానఁబెట్టి కొంతవడి నవ్వితి నింతే
నేనే శ్రీవేంకటగిరినిలయుఁడఁ గూడితిని
దానికేమి నీకు నాకుఁ దగు లింతేకాక

రేకు: 1030-6 లలిత సంపుటం: 20-180

పల్లవి: చెలులాల యీమాఁట చెప్పఁగదరే ! నేఁ
నలసితే తా సొలసీ నది యేఁటిదే

చ. 1: చేతుల మొక్కితి నేను చెంగావిచూపులు చూచె
యీతల నాతల నాకు నేది దగవే
యేతుల నేఁ బలికితే నింతలోనె నవ్వేఁ దాను
నీతి విచారించి మాఁట నిలుపరే

చ. 2: పూరకే నే నుసురంటే నొరగి తాఁ జెమరించె
యీరీతి మాలో నికేది దగవే
కోరి నేఁ గొప్పువట్టితే కొంగువట్టీ నింతలోనె
నేదమేది యీమాఁట నిలుపరే

చ. 3: అంగము నేమఱచితే నంతలోనే నన్నుఁ గూడె
యింగితాన నిద్దరికి నేది దగవే
సంగతి శ్రీవేంకటేశు సమరతిఁ గూడితిని
నింగిమోవ సంతసము నిలుపరే

రేకు: 1031-1 భైరవి సంపుటం: 20-181

పల్లవి: కటకటా మామాంట కాదందురా
కుటిలకుంతలివిఁ యీగుణ మేఁటికే నీకు

చ. 1: చాలుఁజాలు చలము నీకు! పతి నింత
నాలిఁబెట్టుట నాయమా
వాలుఁజూపులు వంచెఁ గదవే ! అతనిపై-
నేలే అలుకులు యింతలో నీకు

చ. 2: మానగదవె మంకులింకా ! పతిగుణము
కానకే కలఁగఁదగునా
ఆనవెట్టె నతఁడు నేఁడు ! తప్పదనె
మోనమున పతి కింక మొక్కఁగదవె మగువా

చ. 3: యింకాఁ దగదు యెరవు లింతా ! కూడె నిదె
కొంకక శ్రీవేంకటేశుఁడు
వంక లొత్త మాకునేల వడి నీకుఁ బోదు
కంకణము లిద్దరికిఁ గలిగెఁగదె మగువా

రేకు: 1031-2 సాళంగనాట సంపుటం: 20-182

పల్లవి: పేరఁటాండ్లు వాడరే పెండ్లివేళ
సారెసారె నిద్దరికి సంతోషవేళ

చ. 1: చి త్రజాతల్లికి వేగ సింగారించరె మీరు
తత్తరించె రిదె ముహూర్తపువేళ
హత్తి తలఁబాలు నారాయణునిఁ బోయుమనరే
పొత్తుల నిద్దరికిని బువ్వపువేళ

చ. 2: పాలవెల్లి కూతుఁరునకు పసపులు నలఁచరే
చాలించరే జోలి వీడు చదివేవేళ
పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగోదినము నేఁడు నాగవెల్లివేళ

చ. 3: అంది బాగాలియ్యరే అలమేలుమంగకును
కందువ శ్రీవేంకటేశుఁ గలసేవేళ
గందమూఁ గస్తూరి నీరె ఘనరతి నలసిరి
కుందక యిద్దరు నిఁకఁ గొలువుండేవేళ

రేకు: 1031-3 రామక్రియ సంపుటం: 20-183

పల్లవి: అంత నీవు పంతములు ఆడుకోకు నాయెదుట
సంతవేదాలనీమోవి చప్పరించివేతుఁబో

చ. 1: మనసు చూచితిఁగాక మంతనాన నీచెఱఁగు
తనివోక నేఁ బట్టితే దాఁటిపోయేవా
మును రామావతారమున మునులలో నీవుండిన
వెనకటివ్రతమెల్లా విడిపింతుఁబో

చ. 2: వచ్చేవంటా నుంటిఁగాక వడి నీపైఁ జేయి వేసి
కచ్చు పెట్టి చెనకితేఁ గాదనేవా
పచ్చిగాఁ గృష్ణుఁడవై పలుయజ్ఞాలు సేసినఁ
మెచ్చుల ఆచారములు మీఁదుకిందు సేతుఁబో

చ. 3: యిప్పుడే కూడితిఁగాక యించుకవడి యుండితేఁ
నప్పటి నే దగ్గరితే నాసమానేవా
నెప్పున శ్రీవేంకటేశ నీవు యోగీంద్రులలోన
కప్పినరతిజడ్డు కమ్మటి మానుతుఁబో

రేకు: 1031-4 సామంతం సంపుటం: 20-184

పల్లవి: ఎట్టుండునో నీచిత్త మిదియెల్లా గర్వమంటా
పట్టిన పంతమే కాక పచ్చి సేయ నేర్తుగా

చ. 1: నీమోము చూచినంతనే నిలువెల్లా మఱచితి
నేమానఁ బ్రియము చెప్పనేర్తునా నేను
కామించి నీమాఁట విని కన్నులు దేలవేసితి-
నేమైనా వెనకముందు యెంచనేర్తునా

చ. 2: వొద్దికి వచ్చినప్పుడే వొరగితి నీమీఁద
బుద్ధితోడ నీకు మొక్కఁ బొద్దుగలదా
అద్దివో నీవు నవ్వితే నంతలోనే కళదాఁకె
అద్దపు నీచెక్కు నొక్కి ఆదరించనేర్తునా

చ. 3: చేయివట్టి తీసితేనే సేసవెట్టితి నంతలో
చాయల నిన్నెదురుకో సందుగలదా
యీయెడ శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
వేయిటికైనా నింక వెలితున్నదా

రేకు: 1031-5 బౌళి సంపుటం: 20-185

పల్లవి: కానీ కానీ యిఁకనేల కదిసిన పనులకు
మానువలె నిగిరించె మాఁటలకే మేను

చ. 1: కాలుదాఁకితే నేమాయ కాంతల మింతే నేము
మూల నిందిరపాదాలు మోవవా నీవు
లేలే పెద్దరికాలు లెక్కలేవు నీవొద్ద
యీలకూర కుప్పచాల దిందుకేపో నాకు

చ. 2: మేను మోచితే నేమాయ మెలుఁత నింతే నేను
మోనాన భూకాంత మేను మోవవా నీవు
పోని పోని యెవ్వరితో బూటకాలు సేసేవు
నానదాయ గొడ్డలేమి నవ్వులనే నాకు

చ. 3: మోవి మోపితే నేమాయ ముదితలయెంగి లింతే
మోవి నీవు గొల్లెతల మోపవా తొల్లి
భావించి శ్రీవేంకటేశ పై కొనిట్టె కూడితివి
చేవ గలిగినట్టాయ చిగురందే నాకు

రేకు: 1031-6 శంకరాభరణం సంపుటం: 20-186

పల్లవి: దిమ్మరిమాట లాడీనే తిమ్మరాయఁడు
కొమ్మని వరము లిచ్చీఁ గొండలరాయఁడు

చ. 1: గద్దెమీఁద నల్లవాఁడే కంటిరటే చెలులాల
పొద్దొక సింగారాల భోగరాయఁడు
యిద్దరు సతులమీఁదా నిమ్ములఁ జేతులు చాఁచి
సుద్దులు చెప్పీఁగదే సుగుడరాయఁడు

చ. 2: నిక్కిచూచీ నేఁటికో నెలఁత లదేమనరే
చక్కనిమోవినవ్వులజాణరాయఁడు
వెక్కసపు రాజసాన విఱ్ఱవీఁగీఁ గొలువులో
చెక్కుల చెమటతోడ చెలువరాయఁడు

చ. 3: మెండగు కళల మేని మెఱుఁగులు చల్లీని
నిండు సరసముల కోనేటిరాయఁడు
దండిగా నురము మీఁది తరుణికాఁగిట వాఁడే
వెండి పైఁడి మేడలో శ్రీవేంకటరాయఁడు

రేకు: 1032-1 వరాళి సంపుటం: 20-187

పల్లవి: విచ్చేయరాదా వెలఁదికడకు నీవు
యిచ్చ నాసపడువారి నెలయించఁదగునా

చ. 1: నిలిచి నిలిచి నీకు నిక్కి యెదురుచూచీని
వలచిన సతి నీవు వచ్చేవంటా
మలసి మలసి నీమాఁటలే ఆలకించీని
యెలమి నేమని యానతిత్తువో యనుచు

చ. 2: చిమ్మి చిమ్మి నీయింటికి చేతులే చాఁచీని
తెమ్మల ఆసన్న నీవు తెలుతువంటా
కుమ్మరించి కుమ్మరించి గుట్టు మాని నవ్వీని
పమ్మి నీవు తలకొంగు పట్టుదువో యనుచు

చ. 3: పూఁచి పూఁచి నీవద్దికి పొలఁతుల నంపీని
యేఁచక నీ విప్పుడిట్టె యేలుదువంటా
రేఁచి రేఁచి వలపులు రేసువాయఁ గూడితివి
దాఁచెను శ్రీవేంకటేశ తమక మేలనుచు

రేకు: 1032-2 సామంతం సంపుటం: 20-188

పల్లవి: నగుఁబాటు లివిగొన్ని నడుపేవుగాక యీ-
ఆగడుఁజేఁతలు సేసి ఆడిక కెక్కుదురా

చ. 1: మగువనే కట్టుకొంటి మంగళసూత్రము గాను
యెగ సక్కేల గొల్లెత లేమందురో
జగములో నెవ్వరైనా సతులకుఁ బురుషులు
తగఁ గట్టుదురు గాక తాము గట్టుకొందురా

చ. 2: ఆకె పుట్టినిల్లే నీకు నాకరము సేసుకొంటి
వీకడఁ బోఁదైనసతు లేమందురో
యేకమై తమసతుల యిల్లు నించుకొంటగాక
యేకడా ఘనులై నవా రిల్లిటము లుందురా

చ. 3: అలమేలు మంగవల్ల నన్నిసిరులూ నందితి -
విల నీకూటపుసతు లేమందురో
కలవి శ్రీవేంకటేశ కాంతల కిత్తురు గాక
అలరి సతులసొమ్ము కాసపడఁజూతురా

రేకు: 1032-3 లలిత సంపుటం: 20-189

పల్లవి: చి త్తజగురుఁడ నీకు శ్రీమంగళం ! నా-
చిత్తములో హరి నీకు శ్రీమంగళం

చ. 1: బంగారు బొమ్మవంటి పడఁతి నురముమీఁద
సింగారించిన నీకు శ్రీమంగళం
రంగుమీరఁ బీతాంబరము మొలఁగట్టుకొని
చెంగలించేరి నీకు శ్రీమంగళం

చ. 2: వింతనీలములవంటివెలఁది నీపాదముల-
చెంతఁ బుట్టించిన నీకు శ్రీమంగళం
కాంతులకౌస్తుభమణి గట్టుక భక్తుల కెల్లాఁ
జింతామణివైన నీకు శ్రీమంగళం

చ. 3: అరిది పచ్చల వంటియంగన శిరసుమీఁద
సిరులఁ దాల్చిన నీకు శ్రీమంగళం
గరిమ శ్రీవేంకటేశ ఘన సంపదలతోడి-
సిరివర నీకు నిదె శ్రీమంగళం

రేకు: 1032-4 మంగళకౌశిక సంపుటం: 20-190

పల్లవి: వద్దు వద్దు నవ్వ కలవాటయ్యీ నేఁడు
బుద్ధులు చెప్పకు నీవు పులకించీ నాకు

చ. 1: యెదురెత్తి మిద్దరము నేమనే వీఁక నీవు
పొదుగ కానతీరాదా పోవలె మాకు
పదరి పయ్యదకొంగు పట్టకు మంతేసి నీవు
చెదరీ కురులు మేను చెమరించీ నాకు

చ. 2: ఆయఁ గన్నులఁ జూచితి మంతేచాలు మాకు
పోయి రమ్మనఁగరాదా పొద్దున మమ్ము
చేయివేయ కంత నీవు చి త్తమొకలా గయ్యీని
ఆయములు సోఁకి సోఁకి యాసలు రేఁచీని

చ. 3: మాటలాడితిమి చాలు మరి యేమిగావలె
నేఁటనే తప్పెనా మాకు విండెఁ గూరిమి
గాఁటపు శ్రీవేంకటేశ కరుణించి కూడితివి
ఆఁటదాన నింతే నేను అలయకయ్యీని

రేకు: 1032-5 శ్రీరాగం సంపుటం: 20-191

పల్లవి: విరహ మొక్కందమాయ విచ్చేయవయ్యా
నిరతి నాకెఁ జూచి నీవంటా మొక్కితిమి

చ. 1: చెక్కిటి చెయ్యే చెలికి శేషపరియంక మాయ
జక్కవచన్నులు శంఖచక్రము లాయ
వుక్కచెమటే జలధి వునికి సేసుక నిన్ను
జక్కనిసతి దలఁచి సారుప్య మందె

చ. 2: చలువకస్తూరి పూఁత సరి నీలవర్ణమాయ
మెలుఁత నివ్వెర గనిమిషద్రిష్టాయ
తొలుత చిగురుపాన్పు తులసిపూజాయ నిన్ను
జలజాక్షి తలపోసి సారూప్య మందె

చ. 3: సిరులఁ గట్టినతాళి శ్రీధరభావ మాయ
వరుస వలపు భక్త వత్సల మాయ
యిరవై శ్రీవేంకటేశ యింతలో నీవు గూడఁగా
సరుస నిన్నంటి నాకె సారూప్య మందె

రేకు: 1032-6 శంకరాభరణం సంపుటం: 20-192

పల్లవి: వలసినప్పుడు నేనే వచ్చేఁగాని
చలివేఁడి సరసాలు చాలుఁజాలు నేలయ్య

చ. 1: అంటేఁబో మాతెరువురా కాకెవద్ద నుండుమని
నంటున నూరకె మాతోనవ్వేవుగాని
యింటికేల వచ్చితివి యెన్నటి కెన్నటిపొందు
రంట దెప్పరములేల రాకురాకు పోవయ్యా

చ. 2: సెలవిచ్చితిఁబో నీకు చెల్లినట్టె సేయుమని
వెలినుండే నన్ను గారవించేవుగాని
అలుకేల తేర్చేవు ఆనలేల పెట్టేవు
బలువుఁడ వన్నిటాను పదపద యిఁకను

చ. 3: మొక్కితిఁబో యిప్పుడిట్టె మోహించి కూడినందుకు
చెక్కునొక్కి నన్ను అట్టు సేసేవుగాని
అక్కరతో శ్రీవేంకటేశ ఆయము లే లంటేవు
చొక్కితి నన్నిటా నన్నుఁ జూడుచూడు మిఁకను

రేకు: 1033-1 ముఖారి సంపుటం: 20-193

పల్లవి: నాఁడే కన్నదిగాదా నవ్వేఁగాక
నేఁడు నిన్నాడఁగఁబోతే నేర మింతేకాక

చ. 1: మనసు వచ్చినఁగాక మాటలు విన నింపౌనా
పనిమాలినట్టి వట్టి పరాకేకాక
యెనసి వుండినఁ గాక యేకతము లింపౌనా
తనివోని దానఁ గాన దగ్గరేఁగాక

చ. 2: యిచ్చ గలినఁ గాక యింటికిరా నింపౌనా
పెచ్చు పెరిగి వూరకే పిలిచేఁగాక
నిచ్చఁ గూడుండినఁగాక నెయ్యములు సతమవునా
పచ్చిసేసి నిన్నుఁ గడుఁ బైకొనేఁగాక

చ. 3: కాఁకలు రేఁగినఁగాక కన్నులఁ జూడనింపౌనా
తాఁకు మాఁకెఱఁగక వాతప్పితిఁ గాక
యేఁకట శ్రీవేంకటేశ యెఱిఁగి కూడితివిట్టె
తేఁకువ యిదేకాదా తెలియలేఁగాక

రేకు: 1033-2 రామక్రియ సంపుటం: 20-194

పల్లవి: వెన్న వేసినట్టివారి వెస రాతవేసినట్టు
యెన్నికలు మీరి వచ్చీ నేమందు నితని

చ. 1: చిగురుఁ బెదవి వంచి సెలవినవ్వులు ముంచి
తగిన మాటాడితిని దాఁచితినటే
మొగమెత్తనైతి నంటా మోము చూడనైతినంటా
జగడాలకే వచ్చి సారెకు నిదేమే

చ. 2: తొలుతనే కానుకిచ్చి తొంగలి రెప్పలు విచ్చి
కొలువులో నేనుంటిఁ గొంకితినటే
ఆలరి దగ్గరనంటా నంది విడె మియ్యనంటా
అలుకమోమున నున్నాఁ డౌనౌనే తాను

చ. 3: చి త్తమెల్లా నీరై చెలులలో దూరై
త త్తరించి కలసితి తక్కితినటే
అత్తిన శ్రీవేంకటేశుఁ డట్టె మఱచితినంటా
వొత్తి గోర నెచ్చరించీ నోయమ్మ తాను

రేకు: 1033-3 రామక్రియ సంపుటం: 20-195

పల్లవి: పట్టినపంతమె బలువనవే
చుట్టపువరుసలు చూచితిననవే

చ. 1: తానూఁ జూచెను తనువూ నాఁటెను
కానీకానీ కద్దనవే
నానితిఁ జెమటల నవ్వుల మునిఁగితి
పూని యిద్దరికిఁ బోదనవే

చ. 2: మారు మాఁటాడెను మనసున నిలిచెను
ఆరీఁ దేరీ నవుననవే
తీరవు పులకలు తెగదిది తమకము
భారము దనపైఁ బడెననవే

చ. 3: కాఁగిటఁ గూడెను కళలను గరఁగితి
దాఁగనేల యిఁకఁ దగుననవే
వీఁగనైతి శ్రీవేంకటపతి రతి
చేఁగదేరె నిఁకఁ జెల్లుబడనవే

రేకు: 1033-4 పాడి సంపుటం: 20-196

పల్లవి: ఇంతినే తప్పక చూడు మిందే ఇన్నిఁ గానవచ్చీ
వంతువాసుల నేమేల వాదించేమో కానీ

చ. 1: చెలియ విరహమెల్లా చెక్కుచేతనే వున్నది
వెలయ నేమేల విన్నవించేమో కానీ
నెలకొన్న తమియెల్ల నిలువుననే తోఁచీ
కెలసి యేమని యెఱిఁగించేమో కానీ

చ. 2: కమలాక్షి మోహమెల్లా కనుచూపుల నున్నది
అమరని మాటఁలేల ఆడేమోకానీ
జమళి కాఁక లవెల్లా చల్లుఁజెమట నున్నది
తమితో నేమేల యెడతాఁకేమో కానీ

చ. 3: ముదితకూటములెల్లా మోముకళనే వున్నది
చెదర నిన్నేల కలఁచితిమోకానీ
యెదుటనే శ్రీవేంకటేశ కూడితి విప్పుడే
యిదె మాసతిని యేల యెఱుఁగమో కానీ

రేకు: 1033-5 సామంతం సంపుటం: 20-197

పల్లవి: చూడరమ్మ చెలులాల సుదతి చక్కఁదనాలు
కూడుకొన్న పతికాంతిఁ గురులే పోలేను

చ. 1: మొగము చందురుఁ బోలె ముంచిన యీ యిందిరకు
తగినతోడఁబుట్టు గాఁతఁడే కనక
నగ వమృతముఁ బోలె నలినాక్షి కదియను
తగినపుట్టిన యింటిధనమే కనక

చ. 2: సతిగుణమింతాను సముద్రమునే పోలె
తతి నాతఁ డీకెకు తండ్రిగనక
మితిగాఁ గన్నులు గండుమీనములఁ బోలె నవి
గతి గూడి తమ వారి కడవే కనక

చ. 3: తరుణి పాదాలు కల్పతరువుచిగురుఁ బోలె
పరగఁగఁ దనవెనుబలమంటాను
గరిమ శ్రీవేంకటేశుఁ గైకొని పెండ్లాడి యీపె
సరవు లాతనిఁ బోలె సరసుఁ డంటాను

రేకు: 1033-6 శంకరాభరణం సంపుటం: 20-198

పల్లవి: మెచ్చితి నిన్నిటాను మేలురా నీవు
రచ్చ కెక్క వలపులు రారా నీవు

చ. 1: చిప్పిల నీదేహమెల్లాఁ జెమరించఁగఁ జేసితి
నప్పటి నాడేవు బీరా లౌరా నీవు
వుప్పతిల్లఁ జొక్కించి వూదితి నీమేన గోరు
యిప్పు డేమో తాఁకెననే వేరా నీవు

చ. 2: యింత రాజసపు నిన్ను యింటికి రప్పించితి
వంతులు వాసులు నెంచేవు వద్దురా నీవు
చింతమోము కళదేర సెలవుల నవ్వించితి
మంతనాలు మఱఁగులు మానరా నీవు

చ. 3: యిట్టె కాఁగిట గూడి యిన్నిటాను మెప్పించితి
పట్టినచలము చెల్లెఁ బదరా నీవు
వొట్టుగా శ్రీవేంకటేశ వొక్కటయితి మిద్దరము
మెట్టుకొన్నదొర వవుదు మేలురా నీవు

రేకు: 1034-1 రామక్రియ సంపుటం: 20-199

పల్లవి: దగ్గరినప్పుడే అన్నిఁ దారుకాణించే నేనే
సిగ్గుతో నుండుటేచాలు చెప్పితి నే ననవే

చ. 1: తా నాడ నే నీడ తమకించఁ బనిలేదు
నానఁ బెట్టీ తా వలపు నవ్వితిఁబోవే
నే నటు వచ్చేనంటే నెలఁత లెవ్వరుందురో
మోనాన నుండుటే మేలు మొక్కితి నే ననవే

చ. 2: మాట లిందు మన సందు మగుడించఁ జోటులేదు
నాటువేసీ ననుపులు నయమేలేవే
యీటుగా సతి నంపితే నెవ్వ రేమి బోదింతురో
మేటిగుట్టు చాలు నింక మెచ్చితి నే ననవే

చ. 3: కాఁగి లిదే కందు విదే కాదుగూడ దనరాదు
పాఁగితిఁ దనరతులఁ బదపదవే
దాఁగి శ్రీవేంకటేశుఁడు తానే వచ్చి నన్నుఁ గూడె
చేఁగదేరె మీఁదటికి చిత్తగించు మనవే

రేకు: 1034-2 బౌళి సంపుటం: 20-200

పల్లవి: వద్దు వద్దు నీ కింతేసివట్టి సొలపు
సుద్దులు చెప్పఁగబోతే సూటిఁబడ దిఁకను

చ. 1: నగితిఁ జాలదా నీతో నాలోఁ గోపించుకొనక
మగుడి గమ్మటి నీవే మమ్ము దూరేవు
మొగమోడితిఁ జాలదా మొక్కలీఁడ నియ్యడకు
వొగరులాడ వచ్చేవు వోపము నే మిందుకు

చ. 2: మాటాడితిఁ జాలదా నే మారుమోము సేసుకోక
నీటున నప్పటి నీవే నేర మెంచేవు
చాటువఁ బేరుకొంటిని చాలదా నిన్నిందరిలో
తేటతెల్లమాయఁ బని తెలిసితి మిపుడే

చ. 3: వూరకుంటిఁ జాలదా వొంటి నన్నుఁ జెనకఁగ
కేరడాల నీవు నన్నుఁ గెరలించేవు
ఆరితేరి శ్రీవేంకటాధిప కూడితి విట్టె
చేరె నీపంతములెల్లాఁ జింతలేల యిఁకను

రేకు: 1034-3 గౌళ సంపుటం: 20-201

పల్లవి: ఎట్టుగూడెఁ బెండ్లియోగ మిద్దరికి నీవేళ
అట్టె లక్ష్మీనారాయణయోగము

చ. 1: నెలఁత కమలవాసి నీవు కమలాక్షుఁడవు
పొలఁతికి నీకుఁ గూడె పొంతనాలు
వలుద చక్రవాకాలు వనితకుచాలు నీవు
యెలమిఁ జక్రాయుధుఁడ విద్దరికిఁ దగును

చ. 2: తరుణి నీలకుంతలిఁ తగు నీలవర్ణుఁడవు
సరుస మీకే తగు సమ్మంధము
నిరతి హేమవ ర్ణాకె నీవు పీతాంబరుఁడవు
సరవి నిద్దరి కొక్కజాతియ్యము

చ. 3: పాలవెల్లిఁ బుట్టె నాకె పాలవెల్లి యిల్లు నీకు
మేలు మేలు యిద్దరికి మేనవావి
యీలీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సోలి మాకుఁ బెట్టరాదా సోబనవిడేలు

రేకు: 1034-4 సామంతం సంపుటం: 20-202

పల్లవి: ఎప్పటివాఁడవేయంటా యెనసి మాటాడితిని
తప్పు నే నెఱఁగనైతి తలఁపులో నుందును

చ. 1: సెలవి నే నవ్వితేనే సిగ్గువడే వింతలోనే
కలిగెనో నీవొళ్ళఁ గల్లయేమైనా
తొలఁగక యీసుద్ది తొలుతనే చెప్పవద్దా
కొలఁదితో నీగుణాలు గుట్టుసేతు నపుడే

చ. 2: తప్పక నే జూచితేను తలవంచే వింతలోనే
చెప్పరాక సేసితివో చేఁత లేమైనా
అప్పుడే నే నెటిఁగితే నంత నిన్నుఁ బచ్చి సేయ
తొప్పఁదోఁచి యిందరిలో దొరఁ జేతు నిన్నును

చ. 3: గక్కున నేఁ గూడితేను కన్నులు దేలవేసేవు
మొక్కల మేమైనా నీపై మోచెనో మాట
చక్కని శ్రీవేంకటేశ సంతమయితి వప్పుడే
వెక్కసాలు మానితేను వెంగెమాడ నిన్నును

రేకు: 1034-5 దేసాళం సంపుటం: 20-203

పల్లవి: ఇన్ని సుద్దులును వింటి మింకా రాఁడా
యెన్నిక కెక్కింతేఁగాని యింకా రాఁడా

చ. 1: కాంతునిఁ బిలువ నంపి కడవాకిటనే వుండి
యింతి యెదురు చూచీని యింకా రాఁడా
చింతతో మెయి చెమరించె చెక్కులెల్లాఁ బులకించె
యెంతలేదు తనగర్వ మింకా రాఁడా

చ. 2: అప్పసము తనతో నేనమ్మ విడె మంపేనంటే
యిప్పుడే వచ్చేనని యింకా రాఁడా
ముప్పిరి నిట్టూర్పు మూఁగె ముదితమై కాఁకరేఁగె
ఇప్పటివలె నుండునా ఇంకా రాఁడా

చ. 3: కందువపానుపుమీఁద కాచుకున్నది లేమ
ఇందరుఁ బిలువఁబోరే ఇంకా రాఁడా
అందపు శ్రీవేంకటేశుఁ డంతలో విచ్చేసికూడె
ఇందుఁ గొలువుచావడి కింకా రాఁడా

రేకు: 1034-6 పాడి సంపుటం: 20-204

పల్లవి: తొలుతనే లోనైతి తొక్కుమెట్లికనేల
బలిమి సేయఁబోతేను పట్టరాదు పాయము

చ. 1: చేయివేయకుమీ నీవు చెమరించే నామేను
ఆయములు దాఁక మాటలాడఁగాను
మోయనీకుమీ గోరు ముంచుకొనెఁ బులకలు
ఆయెడ నీమేన నివి యంటీఁజుమ్మీ

చ. 2: కొంగువట్టి తియ్యకుమీ గుబ్బతిలీ నూరుపులు
ముంగిటనుండి తప్పక మోము చూడఁగా
నింగిమోవ నవ్వకుమీ నిలువెల్లాఁ గాకరేఁగె
సంగడి నాప్రేమ నిన్ను జట్టిగొనఁ జేసును

చ. 3: కాఁగిట బిగించకుమీ కళవట్టె నిదె నాకు
రేఁగి రేఁగి వలపులు రేఁచఁగాను
యేఁగివచ్చి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
పాఁగిననాయధరము పచ్చాయ నిదివో

రేకు: 1035-1 శంకరాభరణం సంపుటం: 20-205

పల్లవి: తగుదువమ్మ నీ వందపుమరుతండ్రికి
మొగిఁ దచ్చినమృతము మోవి నుందిగాన

చ. 1: కోమలి నీజవ్వనము కొలఁదివెట్టఁగరాదు
ప్రేమమున మీఁదమీఁదఁ బెరిగీఁగాన
ఆమని నీసింగార మంత ఇంత యనరాదు
వేమారు నీచూపు వెల్లి విరిసీఁ గాన

చ. 2: తొయ్యలి నీవొరపులు తులదూఁచి చెప్పరాదు
నెయ్యపునీతురు మిదె నిక్కీఁగాన
చయ్యన నీసొబగు లిచ్చట నియమించరాదు
అయ్యెడ నీపిఱుఁదున కలవిలేదుగాన

చ. 3: వనిత నీభావ మిఁక వర్ణించిపలుకరాదు
కొన నీపాదములు చిగురులుగాన
తనరునీభాగ్యము తలఁచ నలవిగాదు
ఘనుఁడు శ్రీవేంకటేశుఁగలసితిగాన

రేకు: 1035-2 రామక్రియ సంపుటం: 20-206

పల్లవి: వలవనిజోలింక వద్దనరే తన
తలఁపులోన నేఁదగిలితిని

చ. 1: పిలువరె పిలువరె ప్రియునీ తా-
నలిగి యలిగి కడ నరిగీనా
తెలిసినవే తనతెగువలూ నే
నలుగడ నిందుకు నవ్వితినే

చ. 2: అడుగరె యడుగరె యతనీ నేఁ
దొడరిపట్టినాఁదొలఁగీని
విడువుమనవె తనవిద్యలూ తా
బడిబడి నిందు కె భ్రమసితినే

చ. 3: తలఁగరె తలఁగరె దగ్గరీ నేఁ
గలసిన తా నిఁకఁ గాదనునా
అలరెను శ్రీవేంకటాధిపుఁడూ నా
యిలు చొచ్చి కలసె నెఱిఁగితి నేను

రేకు: 1035-3 ముఖారి సంపుటం: 20-207

పల్లవి: అనుమానానకు నోపనపుడు నేనూ
తనివోని నీతలఁపు తలపోసుకొమ్మా

చ. 1: పిలిచేవు సారెసారెఁ బెదపెద యెలుఁగున
నెలవుల నీమాఁట నిక్కమావోయి
వెలయ నన్నే యవునో వేరొకతెనే నంటానో
తెలియఁ జూతువుగాని దిష్ట మిటురమ్మా

చ. 2: చూచేవు దవ్వులను సూటిఁబడ్డచూపులను
యేచి నే నమ్ముదునా యిదైనా నోయి
కాచి యిదేపనో నీకు కాక తాళనాయమో
ఆచెంతే విచారింతు పండ కిటురమ్మా

చ. 3: కూడితివి కాఁగిటను కూరిమి చేతులు చాఁచి
జాడతో నీకిఁక నేనే సతమా వోయి
వేడుక శ్రీవేంకటేశ వింతలాయ నీచేఁత
జాడతో నీమోవితేనెచవి యింకా నిమ్మా

రేకు: 1035-4 సౌరాష్ట్రం సంపుటం: 20-208

పల్లవి: ఎంతవేగిరకాఁడే యేమే వీఁడు
కాంతరో తాఁ జెప్పితేను కాదనేనా నేను

చ. 1: నొడిగినమాఁట నోటిలోనే వుండఁగాను
తొడిఁబడ నామోవి దొమ్మిసేసీనే
చిడుముడిఁ జేసన్న చేతిలోనే వుండఁగాను
అడరి పై కొని నన్ను నలమీనే వీఁడు

చ. 2: తలఁపులో మన తనువులో నుండఁగాను
కళవట్టించి చొక్కించి కాకుసేసీనే
చలిమిఁ బయ్యద కొంగు చన్నులపై నుండఁగాను
చిలుకుగోర నూఁది చిన్నలుసేసీనే

చ. 3: పట్టినట్టికాఁగిలి పట్టినట్టే వుండఁగాను
బెట్టుగఁ బెక్కుబందాలఁ బెనఁగీనే
యిట్టె శ్రీవేంకటేశుఁడింత సేసీ నన్నుఁగూడె
అట్టె తా నెంతయినా నలయఁడే వీఁడు

రేకు: 1035-5 పాడి సంపుటం: 20-209

పల్లవి: సేసెఁగా దైవము నీచేతిమీఁదుగా నేఁడు
వేసితిఁగా పైఁజేయి వింతలేమి నెంచక

చ. 1: వొంటి నేను రాతిరెల్లా వొక్కతెనే వుండినాను
కంటిఁగా వేగైనా నిన్నుఁగన్నులెదుట
దంటవై నీ వెంత మతిఁ దలఁచ కుండినా నేనే
వుంటిగా నీ వద్ద వచ్చి వున్నవేమీ నెంచక

చ. 2: పాడిపంతాలను నీవు పరాకుతో నుండినాను
ఆడితిఁగా నీతో మాట లప్పుడే నేను
యీడుగాని సతులతో నెగసక్కేలు సేసినా
కూడితిఁగా నీమతానఁ గోపగించు కొనక

చ. 3: పొఁగినచెమట నెంతపచ్చయి నీవు వచ్చినా
కాఁగిలించితిఁగా నిన్ను గక్కున నేను
వీఁగనిరతుల శ్రీవేంకటేశ కూడితివి
దాఁగనేల ఇదె నీకె దక్కెఁగా చలము

రేకు: 1035-6 సాళంగం సంపుటం: 20-210

పల్లవి: వద్దువద్దు మమ్ము నీవు వట్టిజోలిఁ బెట్టనేల
సుద్దులనే తనిసి నేఁ జొక్కివున్న దానరా

చ. 1: మాఁటలు నెఱఁగవచ్చు మరి కొండ మోవవచ్చు
మేఁటిదొరవు నిన్నైతే మెప్పించరాదు
దూఁటు కెఁదైనాఁ దూరి తోఁచినందే వుండవచ్చు
ఆఁటదాన నిన్ను నౌఁగాదనలేనురా

చ. 2: ఆక మందుకోవచ్చు అరుల సాదించవచ్చు
నాకు నీతో నింతేసి నవ్వరాదురా
వాకుగా జలధి గట్టవచ్చు మాయచూపవచ్చు
పైకొని నిన్నొక యింత పలికించరాదురా

చ. 3: ఱట్టయి తిరుగవచ్చు ఱాతరూపు గావచ్చు
యిట్టె నీరతులమేలు యెంచరాదురా
నెట్టిన శ్రీవేంకటేశ నీకు వలవఁగవచ్చు
పట్టినచలాన నిన్నుఁబాయరాదురా

రేకు: 1036-1 సామంతం సంపుటం: 20-211

పల్లవి: అండకేఁగి బుజ్జిగించి యడుగవయ్యా
కొండలరాయఁడ ఇది కోపమో సంతోసమో

చ. 1: చిక్కనినవ్వులు నవ్వి చెలియ నెమ్మోము చూచె
యెక్కువ తక్కువ నీమై నేమిచూచెనో
మొక్కుమొక్కి యంత లోనే మోనాన దలవంచె
తక్కరి నీచేత లేమిదలఁచు కొనియెనో

చ. 2: మాటలాడి మాటలాడి మంతనాన సన్నసేసె-
నేఁటికి గుట్టువెట్టెనో యెంతమర్మమో
కూటువ నీవద్దనుండి గోరఁ జెమటలు మీటె
గాఁటముగ నీవు సేసే కాఁకల వలసెనో

చ. 3: చేయిచాఁచి చెంగలించి నిన్నుఁగూడె
చాయల నీచన వెంత సతి నమ్మెనో
పాయపు శ్రీవేంకటేశ పసగానే కూడితివి
కాయమును కడుఁజొక్కె కళలేడఁ దాఁకెనో

రేకు: 1036-2 శంకరాభరణం సంపుటం: 20-212

పల్లవి: ముట్టకు ముట్టకు మొక్కేను
చుట్టపువరుసల చూపులె చాలు

చ. 1: నెయ్యము నీతో నెరపఁగఁ గుచములు
అయ్యెడ జగడము లడిచీని
వొయ్యనె చెనకకు వొమ్మదు మాకిది
ముయ్యడ మాటల ముచ్చటె చాలు

చ. 2: నంటున నీతో నవ్వఁగఁ జూపులు
పెంటల నూరక బెదరీని
వొంటదు యింతేసి కోపము నే మిటు
జంటలఁ బై పైసరసమె చాలు

చ. 3: కాఁగిట నే నిటు కలయఁగఁ గలయఁగ
మూఁగి నాతనువు మఱచీని
ఆఁగుచు శ్రీవేంకటాధిప కూడితి
మూఁగి చవిగొనేటి మోవులె చాలు

రేకు: 1036-3 ముఖారి సంపుటం: 20-213

పల్లవి: చెలువుఁడు వచ్చె వీఁడె సింగారించరే వేగ
చెలియకుఁ దమకమే చిత్తములో నిండెను

చ. 1: తుమ్మెదలఁ బోలేటి తొయ్యలి తురుమునకు
సమ్మతిఁ దామెర లీరే సంపెఁగలేల
కొమ్మకలువకంటికిఁ గూడుఁ జంద్ర గావిచీర
వొమ్మదు వుదయరాగ మొద్దేలే యిపుడు

చ. 2: మగువసింహమధ్యకు మలయజ మలఁదరే
మృగమద మియ్యకురే మెచ్చు గా దేల
అగుఁ గొలఁకుల పెండె మటు కరియాన కీరే
మొగపుల సింహలమొలనూ లేల

చ. 3: యిదె పికవాణి విడె మిచ్చి యాకు మడి చీరే
చెదురుఁ బన్నీటి తోడి చిత్తడి యేల
యెదుట శ్రీవేంకశుఁడింతలో విచ్చేసి కూడె
యిది యది యని యెంచ నికనేల

రేకు: 1036-4 రామక్రియ సంపుటం: 20-214

పల్లవి: అలిగితినా నీతో నలసి నే నుంటి నింతే
యెలమి నీవు రాఁగా నే నెదురురాకుందునా

చ. 1: నీమోము చూచి చూచి నివ్వెరగందితి నింతే
యేమాటకైనా నుత్తర మియ్యకుందునా
కామించి నీమేను సోఁకి కళవట్టి వుంటిఁగాక
నామతి నీచేఁతలకు నగకుందునా

చ. 2: చేతికి వీడె మియ్యఁగాఁ జెమరించి వుంటిఁగాక
ఘాతలఁ గాఁగిలించక కడనుందునా
బూతుల నన్నుఁ దిట్టఁగఁ బులకించి వుంటి నింతే
కాతరాన మోవి ఇచ్చి కాఁక సేయకుందునా

చ. 3: సరుగ నీవు గూడఁగ సమ్మతించి వుంటి నింతే
గరిమఁ జిత్తమురా మొక్కకవుందునా
ఇరవైనశ్రీవేంకటేశ నీరతుల నేను
మరిగి మెచ్చితిఁగాక మరి జోలి సేతునా

రేకు: 1036-5 సాళంగనాట సంపుటం: 20-215

పల్లవి: దొరతో బొందు సేసిన తొయ్యలుల కేది వాటు
నెరపిననిజమే నిష్టూరముగా

చ. 1: పేరుకొని పిలిచేవు పెడమొకము వెట్టేవు
యేరా నీవు సేసేవి యేఁటిచేఁతలు
చేరువకు రారాదు చెంగిచెంగి పోరాదు
సారె సారె చలివేఁడి చల్లేవుగా

చ. 2: పకపక నవ్వేవు పలికితే మానేవు
యెకసక్కేలేలివి మాతో యింతయేలరా
వెకలివై మీరరాదు వేసారుకొనఁగరాదు
వొకటఁ జేదునుఁ దీపు వునిచేవుగా

చ. 3: పానుపునఁ గూడేవు పరవశము నందేవు
మానవు గా యిటువంటిమాయలు నాతో
సోనగా శ్రీవేంకటేశ చొక్కించితివి రతుల
కానఁగానే పాలు నీరూఁ గలుపేవుగా

రేకు: 1036-6 నాదరామక్రియ సంపుటం: 20-216

పల్లవి: కానీ కానీలేవే కలికి ! నే
పూని నీతోఁ బలికితే పూఁచి నీవు నగరా

చ. 1: మాఁట చెప్పే రావే మగువా ! ఆఁ
మాఁటలు నే నెఱుఁగుదు మానరా నీవు
యేఁటికె యీబిగువులు యిట్టే వుండీనా ! నీఁ
చోటికిఁ గిందుపడితే చూపి నీవు నగరా

చ. 2: పనిగద్దు రావే పడఁతీ ! ఆఁ
పనులు నే నెఱుఁగుదు పదరా నీవు
పెనఁగకువే నాతోఁ బెక్కుమారులు ! నాఁ
మనసు మెత్తనిదైతే మరి నీవు నగరా

చ. 3: కాఁగిలించే రావే కాంతా! తొల్లె
కాఁగిటనే వున్నదానఁ గదరా నేను
ఆఁగి యిందాఁకా నేల అంటివే నీవూ !నీకు
వీఁగితి శ్రీవేంకటేశ వికవిక నగరా

రేకు: 1037-1 వరాళి సంపుటం: 20-217

పల్లవి: మించె మందెమేళములు మేలుమేలు నే
కొంచ కింత వలపించుకొంటి విది మేలునే

చ. 1: మాన కిట్టిదొరపాటిమగనితోఁ గొంకులేల
మేనిమీఁద నొరగేవు మేలుమేలునే
సానఁబట్టినచూపులు చల్లిచల్లి యేఁటికైనా
ఆనవెట్టేవు నీపై నది మేలునే

చ. 2: పక్కనను రాజసపుఁ బతితో మేలములాడి
మిక్కిలిఁ బెనఁగే విది మేలుమేలునే
చిక్కనినవ్వులు నవ్వి చేతి కాకుమడిచిచ్చి
నిక్కి నీమోవి నందుకొనేవు మేలుమేలునే

చ. 3: దార కానఁ గొంగువట్టి దంతపుటింటికిఁ దీసి
మేర గడెవెట్టుకొంటి మేలుమేలునే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతటివానిఁ గూడి
సారె నుర మెక్కితిని చనవిది మేలునే

రేకు: 1037-2 గౌళ సంపుటం: 20-218

పల్లవి: పూఁచిపట్టి యీయింతిఁ బొగడరమ్మా
కోఁచక మేఘములోని క్రొమ్మెఱుఁగు వలెను

చ. 1: చెమటఁ గస్తూరి బొట్టు చెదరి చెక్కుల జారీఁ
నమరఁ బోలుచరమ్మ అంగన కిది
తమితోడ నీపె ముందె దంతియానగనక యీఁ
సమయాన మదములు జారినట్లున్నవి

చ. 2: కలికి కొప్పుననుండి కమ్మనివిరులు రాలీ
చెలఁగి యేమనవచ్చుఁ జెప్పరే యమ్మ
పొలఁతి లతాంగిగాన పువ్వులు నిలువునను
జలజలరాలినట్టిసంగతాయ నిదివో

చ. 3: కాఁగిట శ్రీవేంకటేశుఁ గమ్ముకొని విఱ్ఱవీఁగీ
పొఁగినయీభావములు పలుకరమ్మా
దాఁగక కలువయునుఁ దామరయుఁ బెనగొని
మూఁగిన పరిమళము ముంచినట్లున్నవి

రేకు: 1037-3 ఆహిరి సంపుటం: 20-219

పల్లవి: తానే యెఱుఁగు నాతనువే యెఱుఁగును
వీనులారఁ దనతో నే విన్నవించేదేమే

చ. 1: ముంచినది విరహము మోచినది జవ్వనము
చుంచునఁ బతి నేమని సొలసేనే
వంచినది నాశిరసు వాడినది నామోము
యెంచఁగ నామే నిట్లయ్యీ నెందుకు వగతునే

చ. 2: పుట్టినది తమకము పూఁచినవి పులకలు
యిట్టే తనకుఁగానే యేమి సేసేనే
తొట్టినది కన్నీరు తోఁచినది నివ్వెరగు
చిట్టికాలు చెలిచేతఁ జెప్పిపంపే దేమే

చ. 3: చెమరించేవి చెక్కులు చెదరేది నాతురము
అమరించి తనతో నే ననఁగా నేమే
అమలుఁడు శ్రీవేంకటాద్రీశుఁడిటు గూడె
సముకాన సణఁగులు చల్లే దిదేమే

రేకు: 1037-4 భైరవి సంపుటం: 20-220

పల్లవి: ఏమి సేతు నమ్మలాల ఇట్టాయ నావలపు
ప్రేమము చెప్పఁగరాదు పిలువక పోదు

చ. 1: మంతనాన నే నుంటే మనసులో నిలిచీని
కాంతుఁడు నే నిద్రించితేఁ గలలోన వచ్చీని
పంతమో పాడో తనకు బాలకి నన్నింతసేయ
రంతులఁ దానూ రాఁడు రానివాఁడు గాఁడు

చ. 2: పాడుతాఁ బరాకైతేఁ బదాలలో ముద్రచూపీ
గోడ చూచినఁ జిత్తరుకూటములోఁ బొడచూపీ
సూడో పాడో తనకు సొఁరది న న్నింతసేయ
యీడా నుండడుఁ చూడ నింటనే వున్నాఁడు

చ. 3: వూరకే నే నుండితేను వుంగరాన నెచ్చరించీ
ఆరయ శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
నేరుపో నెయ్యమో నన్ను మన్నించి పురమున మోచె
తారుకాణించఁగరాదు తన కింకఁ బోదు

రేకు: 1037-5 దేసాళం సంపుటం: 20-221

పల్లవి: ఏమిసేయుమనేవే ఇంకా నీవు
కోమలపురమణుని కొలువూఁ జేసితిని

చ. 1: ముంగిట నాతని తోడ ముచ్చటలాడితి నే
నంగవించి యిందాఁకా నది చాలదా
జంగిలి సతులలోన సరసమూ నాడితిని
యెంగిలివలపులాయ నిఁకనేలే నేను

చ. 2: నంటుదోఁచఁ బతితోడ నవ్వులు నవ్వితిని
ఇంటికిఁ బిలువనంపె నింతలో నేలే
కంటఁ గంటఁ దనమోము కన్నులారఁ జూచితిని
అంటఁగాకుండితి నంటి నదివో నామాట

చ. 3: ఇప్పుడిట్టె తా రాఁగా నెదురుగా వచ్చితిని
తప్పనియలుక నాకుఁ దనతో నేదే
చెప్పరానిబాస ఇచ్చి శ్రీవేంకటేశుఁడు గూడె
తప్పులెల్లాఁ దీరె నిఁక తలపోఁతలేలే

రేకు: 1037-6 లలిత సంపుటం: 20-222
పల్లవి: అప్పుడే నే నంటిగా అండనుండే నీగుణము
అప్పళింతువు కాఁగిట న దేపాటౌను
చ. 1: పేరుకొనకు మంటిఁగా బెట్టి ఇందరిలో మమ్ము
కారణము నీకు నాకుఁ గద్దా యేమైనా
సారె నవ్వకు మంటిఁగా సందుల గొందుల నీవు
వారు వీరుఁ జూచితేను వట్టిరట్టౌఁ బనులు
చ. 2: సన్న సేయకు మంటిఁగా చాలుజాలు నీకు నాకు
కన్నచోట నేమైనఁ గద్దా పని
నన్ను ముట్టికు మంటిఁగా నామన నెఱఁగరు
కన్నవారు విన్నవారు కాకుగా నాడుదురు
చ. 3: మంచ మెక్కకు మంటిఁగా మాటలు చెప్పుదుగాని
కంచముపొత్తు మనకు గద్దా భేదము
పొంచుక శ్రీవేంకటేశ పోనీ కిట్టె కూడితివి
చంచలము లే కదే సతమాయ నిపుడు

రేకు: 1038-1 పళవంజరం సంపుటం: 20-223

పల్లవి: అందుకు సరికిసరి ఆయనోయి
పందెమాడినట్లాయఁ బదరకు మికఁను

చ. 1: మోవి నాకుఁ జవిచూపి ముచ్చటలన్నియుఁ బాసి
ఆవేళ మాటాడఁజూచే వౌనోయి
తావివీడెపురసము తగ నీపుక్కిట నించి
యీవిధాన గెలిచితి నేమి సేసే విఁకను

చ. 2: పయ్యదలో జేఁచాచి పక్కఁన గళలురేఁచి
ఆయ్యెడ నామోము చూచే వౌనోయి
చెయ్యారఁ గాఁగిట నొత్తి చెక్కు చెక్కున నదిమి
నెయ్యానఁ జొక్కించితి నీట్లేల యిఁకను

చ. 3: రతి నన్ను మఱపించి రాతిటిసుద్దు లడిగేవు
అతినేరుపరితన మౌనొయి
యితవై శ్రీవేంకటేశ యిందుకు మారుకుమారు
తతిగా నిన్నే కూడితి తలఁచుకో ఇఁకను

రేకు: 1038-2 వరాళి సంపుటం: 20-224

పల్లవి: నాటివాఁడవె కాదా నాకు వెఱవ నీకేల
యేఁటికని మావారు యెదురాడఁ గలరా

చ. 1: వాకున సరసమాడి వలపులే చల్లేవు
చేకొని యేమి సేసినా జెల్లదా నీకు
లోకములో గొల్లెతల లోనుసేసుకొన్నఁచేత
సేకరముగా నీకుఁ జెల్లదాయనా

చ. 2: ముంగిటనే సన్న సేసి మోవిఁదమ్మ చూపేవు
చెంగటఁ గొంగువట్టితే జెల్లదా నీకు
దొంగిలి వారి చీరలు తొడికి తీసిన చేఁత
సింగారరాయఁడ నీకు జెల్లదాయనా

చ. 3: సారె న న్నొడఁబరచి చనవిచ్చి కూడితివి
చేరి బలిమి సేసితేఁ జెల్లదా నీకు
దూరుగా రుకుమిణి నెత్తుక వచ్చిన నీచేఁత
చేరువ శ్రీవేంకటేశ చెల్లదాయనా

రేకు: 1038-3 వరాళి సంపుటం: 20-225

పల్లవి: ఈరుఁదియ్యు బేనువచ్చు నిదియేఁటిదే
సారెసారె నిది యేడ సంగరమోయమ్మా

చ. 1: చూతమంటాఁ బిలిచితే చుట్టిరికాలే చెప్పిని
వాతెర విచ్చి యడుగవ స్తినా నేను
రాతి రేడనుంటివంటే రతికేల పిలిచీనే
పోతరీఁడు వీనికేల పొద్దువోదోయమ్మా

చ. 2: మాఁటలాడఁ బిలిచితే మర్మము లేలంటీనే
వాఁటమైనతనుఁ జెనకవస్తినా నేను
యీటుకు వీడెమిచ్చితే నేల కొంగువట్టీనే
నేటిలోనే వీనికింత నీఁటు లేలోయమ్మా

చ. 3: పందెమాడఁ బిలిచితే పచ్చినేసి నన్నుఁ గూడె
వందనతోఁ దన్ను ముట్టివ స్తినా నేను
అందగాఁడు శ్రీవేంకటాద్రీశుఁ డింతసేసె
పొంది పొరుగున నుంటే పోనీఁ డోయమ్మా

రేకు: 1038-4 బౌళి సంపుటం: 20-226

పల్లవి: నూటి కొక్కటే నూలిపోఁగని
కూటువలై కైకొను టిఁకఁగాక

చ. 1: చెనకుచుఁ దొలఁగెనుఁ జేరఁగ వచ్చెను
తను వికఁ నేమని తడవేనే
వెనకకి కోపము వేడుక లిప్పుడు
కనుఁగొన మింగినకడి కిఁకఁ జవులా

చ. 2: బిగువూఁ జూపెను ప్రియమూఁ జెప్పెను
తగవులఁ బెట్టఁగ తతి గాదే
తెగవులె అప్పుడు మొగమో టిప్పుడు
జగడము దీరెను సాదించవలెనా

చ. 3: కాఁకలు రేఁచెను కాఁగిటఁ గూడెను
సోఁకుచు నిఁక మరి సొలసేనా
యేఁకట శ్రీవేంకటేశుఁడు వాపెను
చీఁకటి వాసెను చేదీపమేలే

రేకు: 1038-5 పాడి సంపుటం: 20-227

పల్లవి: పదపద ఇఁకనేలే తనతోఁ బతిమాటలు దగునా
యెదురెదురనె తా నాడినమాటలు యెంచఁగ వసమౌనా

చ. 1: చాలుఁజాలు నగవూ ఇక సారెసారె నేలా
తాలిమి నొకసతిపై నొరగుండియు తగదు వేరొకతెఁ బిలువఁగను
కేలుచాఁచి మొక్కితిఁ దనకూ నను గెరలించఁగఁ దగదు
వాలుఁగన్నులను మొక్కినయందుకు వడి మనసున నే దీవించితిని

చ. 2: ఆయనాయఁ బ్రియమూ ఇక సంతకోప నేనూ
మాయలచూ పొకసతిపై నిలుపుక మాటలు నాతో నాడీనా
కాయపుఁగాఁకలు ఘనమాయా తాఁ గలిగినపల మిదివో
చాయల సన్నల వలపులు చల్లిన జాణతనముల నే కలసితిని

చ. 3: చెల్లెఁజెల్లె జింతా ఇక సెలవుకెక్కెఁ బనులు
కల్లకాదు శ్రీవేంకటరమణుఁడు కలసెఁ గళలు మీరా
కొల్లలాయ నిక్కువరతులూ నాకోరిక దైవారె
మొల్లమిఁదనమోవితేనియలు ముయికి ముయిలు గాఁగా

రేకు: 1038-6 రామక్రియ సంపుటం: 20-228

పల్లవి: మేలే చెలియా మేలుగాల మిది
తాలిమి లేదిదె తతిపో నాకు

చ. 1: వెన్నెల గాసీ వెలఁది నేఁడిపుడు
పున్నమిచంద్రుఁడు పొడచెనటే
కన్నెకోవిలలకలకల మయ్యో
వన్నెవసంతము వచ్చెనటే

చ. 2: కడఁగి చక్రవాకంబులు మూఁగీ
పుడమిఁ బొద్దిపుడు పొడచెనటే
ముడివడి చకోరములు కడుఁ బొలసీ
అడరి సందెవేళాయనటే

చ. 3: చినుకులు రాలీ చిత్తజునెండల
కనుఁగొన వానలకాలమటే
యెనసితి శ్రీవేంకటేశుఁడ నే నిటు
వనిత నీరతికి వరుసిది యటవే

రేకు: 1039-1 రామక్రియ సంపుటం: 20-229

పల్లవి: ఇదె శిరసుమాణిక్య మిచ్చిపంపె నీకు నాకె
అద నెఱిఁగి తెచ్చితి నవధరించవయ్యా

చ. 1: రామ నినుఁ బాసి నీరామ నేఁ జూడఁగ నా-
రామమున నినుఁ బాడె రామరామ యనుచు
ఆమెలుఁత సీతయని యపుడు నేఁ దెలిసి
నీముద్రవుంగరము నే నిచ్చితిని

చ. 2: కమలాప్తకులుఁడ నీకమలాక్షి నీపాదఁ
కమలములు దలపోసి కమలారి దూరె
నెమకి యాలేమ నే నీదేవి యని తెలిసి
అమరంగ నీనేమ మటు విన్నవించితి

చ. 3: దశరథాత్మజ నీవు దశశిరునిఁ జంపి యా-
దశనున్నచెలిఁ గావు దశదిశలుఁ బొగడ
రసికుఁడ శ్రీవేంకటరఘువీరుఁడ నీవు
శశిముఖిఁ జేకొంటివి చక్కనాయఁ బనులు

రేకు: 1039-2 నాట సంపుటం: 20-230

పల్లవి: కలదా తొల్లి మీకతలు చెప్పేరు నేఁడు
బలువాఁడు గదవమ్మ పాయపునీమగఁడు

చ. 1: జడల సొల్లెము సుట్టి సరి వీఁకవిల్లు వట్టి
వెడదవా తంపపాది వీఁపునఁగట్టి
పొడలమెకము నేసి పొడవాటిరాకాసి
గొడవలఁ దీసెనట కోరి నీమగఁడు

చ. 2: నారపట్టుసీర గప్పి నవ్వు సెలవుల గుప్పి
సారె రుషులకు బాసలు సేసి
కూరగాయపాలమాడి కొనబుతమ్ముణిఁగూడి
మేరమీరెనట నాడు మేసులనీమగఁడు

చ. 3: కోఁతులమూఁకల నేలి కొంకక బూమికి సొలి
నీతోడ సుట్టాలుఁ దాను నిదులఁ దేలి
యీతల సివేంకటాద్రి యెక్కి మమ్ముఁ గిపఁ జూచె
బాఁతితో నిన్నెద మోచె బాగ్యపునీమగఁడు

రేకు: 1039-3 ఆహిరి సంపుటం: 20-231

పల్లవి: ఓయమ్మ తనపొందు వోపనంటినా
చేయివట్టి తియ్యనేలే చెలులు నన్నిపుడు

చ. 1: దగ్గరి మారాడ నాకుఁ దడవా నేఁడు దనతో
నెగ్గు దప్పు లౌనని యెంచేఁగాక
నిగ్గుల సరసమాడ నేరనా కొంతయినా
సిగ్గరితనానికే నేఁజింతించేఁగాక

చ. 2: సొలపుఁజూపులఁ దన్నుఁ జూచు టరుదా తనఁ
దలఁపు దెలియలేక దాఁగేఁగాక
సెలవినవ్వు దనపై చిలికించనేరనా
కొలఁది మీరునోయని కొంకేఁగాక

చ. 3: కాఁగిలించి యిట్లానే కరఁగించకుందునా
మూఁగినయాసలు చూపి మోపితిఁగాక
తోఁగెను చెమట నాకుఁదొడనె శ్రీవేంకటేశు
నాఁగి రతిఁ జొక్కించితి నందుకే కాక

రేకు: 1039-4 శ్రీరాగం సంపుటం: 20-232

పల్లవి: రవ్వ మాని ఆయనాయ రారే మీరు
అవ్వలఁ దన్నుఁ బిలిచేయంతవారమా

చ. 1: తడవీనా మమ్మతఁడు తరుణులఁ గడమా
పడఁతు లాతనికైతే పాదరేణువు
బడిబడి నే వలచి పైఁబడేఁగాని తనకు
చిడుముడిఁ జెట్టడువఁ జేటఁడేసిన సతులు

చ. 2: వలచీనా నా కతఁడు వనితలు లేరా
వలచివచ్చేవారే వనమెల్లాను
వెలయ నేఁ దనపొందు విడువఁగలేఁ గాక
చిలికితే నేమిబాఁతి చెలువలేతనికి

చ. 3: మానీనా నన్నతఁడు మగువ లెందరుండినా
పూని యాతనిసతులే భూమెల్లాను
యీనెపాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
కానికగాఁ బూజగొంటే గంపెడేసిసతులు

రేకు: 1039-5 సామంతం సంపుటం: 20-233

పల్లవి: వంచకువే శిరసు వలవని నెరుసు
పంచ చెటు మందుగాదు పలుకులింకేలే

చ. 1: పట్టినదే చలమా పంతమే నీఫలమా
చుట్టపు చెలుల మింత చూఁడగలమా
యిట్టె యాతఁడు వచ్చిన నిద్దరును నొక్కటే
అట్టు వొలకమ్మ కెక్కె యిట్టెమాసు మిఁకను

చ. 2: పొద్దులిట్టె జరపేవు బూటకాలే నెరపేవు
గద్దించి బుద్ధులు మాకుఁ గరపేవు
వద్దువద్దు మాఁటలనే వలపులయేరు వారి
మద్దులు మారేళ్లు మోఁచె మానరాదా యిఁకను

చ. 3: యింకనై తే బిగువూ యియ్యకొంటే తగవూ
వుంకువాయ మీకు నెలవుల నగవూ
పొంకపు శ్రీవేంకటేశుఁ బొందితి వింతటిలోన
చంక గుదె శరణార్తి చాలుఁజాలు నిఁకను

రేకు: 1039-6 శంకరాభరణం సంపుటం: 20-234

పల్లవి: తనిసితి మిఁక మముఁ దడవకురా
చనవుకు మనవికి సరికిసరి

చ. 1: నలుగడ నీవిటు నవ్వినవ్వులు
అలిగినవేళకు నవి సరియే
వలపులు చల్లేవు వాదుకు వచ్చేవు
చలువకు వేఁడికి సరికిసరి

చ. 2: వరుస నాకిచ్చితి వద్దికి వచ్చిన
సరవులఁ బెట్టిన సరికిసరి
మరిగినాఁ బోనీవు మాటలు నాడవు
సరసము విరసము సరికిసరి

చ. 3: తమకంబున మనతనువు లిద్దరికి
సమరతి వుపరతి సరికిసరి
అమరిన శ్రీవేంకటాధిప యిటు మన-
సముకపుమఱపులు సరికిసరి

రేకు: 1040-1 మధ్యమావతి సంపుటం: 20-235

పల్లవి: అతనిమన్ననే చూచే వప్పుడె నీవు
యితవై నీయిద్దరిలో యెంతసమ్మతములో

చ. 1: చెలువుని మోము చూచి సెలవులఁ బార నవ్వి
చెలితో మాటలాడేవు చెల్లఁబో నీవు
అలవోకఁ బవళించి యాకుమడి చిచ్చేవు
అల వెఱఁగవు పతి నౌనే నీవు

చ. 2: కాటుక దీరుచుకొంటా ఘనునితోఁ బలికేవు
నేటివలె నుండునటె నేరవు నీవు
నీటున నొయ్యారిబాగై నిలుచుండి మొక్కేవు
వోటలేదు దొరచిత్తా లొకరీతి నుండునా

చ. 3: తొడమీఁదఁ దొడవేసి దొరతనమే చూపేవు
నడుమ శ్రీవేంకటేశు నంటున నీవు
జడికొని దోమతెరచాటునఁ గూడి మాకు
నడియాలాలు చూపేవు అంతలో నీవు

రేకు: 1040-2 సాళంగం సంపుటం: 20-236

పల్లవి: ఆడరాదు వీడరాదు అంతమాట
వేడుకవలపు లింతే వేసాలు మానరా

చ. 1: బిగిసేవు దగ్గరితే పిలిచితే నవ్వేవు
తెగనాడరా మాట తెలియ నేను
మొగము చూచితి నింతే మోనాన నుందాన నింతే
చిగురు నీమోవికిని సిగ్గులేల వచ్చెరా

చ. 2: ములిగేవు పైకొంటే మొక్కితేనే నీలిగేవు
వొలసీనొల్లములైతే వొద్దురా పొందు
నిలుచుండి వుంటి నింతే నేరము లెంచుకొంటి నింతే
వలుదకన్నులరెప్పవంపు లేల వచ్చెరా

చ. 3: చెనకితే వీఁగేవు చెఱఁగువట్టితే రేఁగే
వనుమాన మేమిగల్లా నాడరా నాతో
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వప్పటిని
మనసు లొక్కట్లాయ మఱి యానలేలరా

రేకు: 1040-3 గుజ్జరి సంపుటం: 20-237

పల్లవి: ఏల మమ్ము భ్రమయించే రింకా మీరు
యేలినవాఁడు హరి యెంచి చూడరాదా

చ. 1: సెలవుల నవ్వేది చెక్కుచేత ములిగేది
కలికికాంతల కివి కలవేకావా
పలుకుల నొరసేది భావముల మురిసేది
జలజాక్షులకు నివి సహజమే కాదా

చ. 2: వోరగండ్లఁ జూచేది వొంటిఁ జెయిచాఁచేది
దారకపుసతులకుఁ దగవేకాదా
వోరికొట్లు కొట్లేది వున్నట్లే సిగ్గువడేది
కోరికసతుల కివి గుణములేకావా

చ. 3: యెంగిలిమోవు లిచ్చేది యిటు చన్నులఁ గుచ్చేది
ముంగిటిరమణులకు ముక్కెమేకాదా
సంగతి శ్రీ వేంకటేశు శరణంటి మిఁక మీ
వెంగలిచేఁతలు మాతో విరసమేకాదా

రేకు: 1040-4 సాళంగనాట సంపుటం: 20-238

పల్లవి: సవతిపోరుల కోపఁజాలనయ్యా
జవళితో నీకు మొక్కే సమ్మతించవయ్యా

చ. 1: గచ్చురేఁగి నీవే యింకాఁ గొన్ని దిట్టవయ్యా
మచ్చురాలు నీతోను మాకేలయ్యా
చెచ్చెర నీ కూడిగాలు సే సేవా రుండఁగాను
నిచ్చలుఁ బయికొసరు నే నేలయ్యా

చ. 2: కలవి లేనివి నీవే గడియించుకోవయ్య
మలసి నీతోఁ బలుక మాకేలయ్య
తలఁ పొక్కట నుండఁగ దగ్గరనేఁటికి మమ్ము
వలపులు చప్పనాయ వద్దేలయ్యా

చ. 3: కందువ దెలసి నీవే కయికొని కూడవయ్య
మందెమేళానఁ జెనక మాకేలయ్యా
యిందులోన శ్రీవేంకటేశ నీకు లోనైతి
సందడిఁ బెండ్లాడితివి జాణ వవుదువయ్యా

రేకు: 1040-5 మాళవిగౌళ సంపుటం: 20-239

పల్లవి: నీరువట్టు గొన్న చోట నేయి మందుగా దెపుడు
నేరుచుక వత్తుగాని నీవు వోయిరారా

చ. 1: ఆడినట్టుండదు మాఁట అవురా మీఁదటికి
పాడి విచారించుకొనేఁ బట్టకుండరా
వేడుకకానికి మరి వెసలఁ బెట్టుమనక
వీడనే వగరించేవు నీవు వోఇరారా

చ. 2: చెప్పినటువలె రాదు చేచేతఁ గాలము
దప్పిగొంటి నీకతలఁ దలరా నీవు
వుప్పు గప్పురముతోడ నొక్కసరి సేయక
నిప్పు చెదలంటీనా నీవు వోయిరారా

చ. 3: రాజవైన యట్టుండదు రతికేళి సేయువేళ
వోజతో నే నియ్యకొంటి నోపననకు
తేజపు శ్రీవేంకటేశ తెలిసి కూడితి నన్ను
నీజాడలెల్లాఁ గంటి నీవు వోయిరారా

రేకు: 1040-6 శంకరాభరణం సంపుటం: 20-240

పల్లవి: అతని మీరే యిది యడుగరే
చతురతఁ దానే జంకించీనే

చ. 1: పదవికెంపు లవి ప్రియమున నడిగిన
యెదురు గుదురుగా నిటు దిట్టీనే
నిదురకన్నులవె నిదిరించు మనిన
అదనుఁ దానె మఱి యలిగీనే

చ. 2: చెక్కుల చెమటలు చేతులఁ దుడిచిన
గక్కన నూరక కసరీనే
పక్కనఁ బులకలు పయ్యదఁ గప్పిన
చిక్కనిగోళ్లఁ జిమ్మీనే

చ. 3: కళలు చూచి నేఁ గాఁగిట నించిన
మలసి మలసి మయిమఱచీనే
చెలువరాయఁ డిదె శ్రీవేంకటపతి
నలుగడ నన్నే నవ్వీనే

రేకు: 1041-1 ఆహిరి సంపుటం: 20-241

పల్లవి: చెల్లఁబో యింత పచ్చినేయవలెనా
వుల్లములో మీకుమీకే వొప్పుగొనఁదగదా

చ. 1: కూడిపాయరానిచోట కోపగించితే నేమాయ
సూడుఁబాడు పతితోనే చూపవలెనా
మేడెపు దంపతులకు మేరదప్పితే నేమాయ
జాడతోనే అతనికిఁ జనవియ్యఁదగదా

చ. 2: యేకచిత్తాలైనచోట నేమి సేసిన నేమాయ
పై కొన్నవిభునితోనే పంతమా నీకు
నీకు నీకుఁ బ్రాణప్రాణనేస్తమైనచోట
చౌకగా కతనికి నిచ్చకమాడఁదగదా

చ. 3: తనువులంటినచోట తమకించితే నేమాయ
ననిచినచోట నిది నాయమా నీకు
యెనసీ శ్రీవేంకటేశుఁ డిటువంటిమీచోట
ననగిఁ పెనఁగి ఇట్టె ఆదరించఁదగదా

రేకు: 1041-2 పాడి సంపుటం: 20-242

పల్లవి: ఈడ మాతో నింతయేల యెగసక్కేలు
వేడుకకాఁడవు నీవు వేసాలు మానరా

చ. 1: వద్దన్న మానవు యేరా వాదులకే వచ్చేవు
కొద్దిమాలి నిన్నుఁ బేరుకొంటిమా నేము
పెద్దరికాలకు నీతోఁ బెనఁగేటివారితోనే
చద్దికి వేఁడికి నీవు సరసము లాడరా

చ. 2: చాలునన్న మానవేరా జాణతనా లాడేవు
కేలుచాఁచి నిన్నుఁ జెనకితినా నేను
నాలితనమున నీతో నవ్వేటివారితోనే
కోలుముందుగా వారికూటములే సేయరా

చ. 3: వోపనన్న మానవేరా వుద్దండానఁ గూడితివి
కోపగించవలెనని కొసరితివా
యేపున శ్రీవేంకటేశ యేడవారినైనా వట్టి-
చూపులు చూచితి వీఁక సుద్దులవి మానరా

రేకు: 1041-3 దేశాక్షి సంపుటం: 20-243

పల్లవి: ఎంత చెప్పినా వినవు యేలే నీకు
మంతనాన రమణుఁడు మనసిచ్చీ నీకును

చ. 1: నిండిన కళలమోము నివ్వెర పరచకువే
కొండవంటిపతి నిన్నుఁ గొంగువట్టఁగా
యెండకంట నీడకంట నేల చూచేవే యాతని
పండువంటిమోవి చూచి పాలార్చీ నిన్నును

చ. 2: బంగారువంటిమేను పయ్యద మూసుకోకువే
సింగారపురమణుఁడు చేయిచాఁచఁగా
చెంగి పచ్చిమాటలు వెచ్చినమాటా నాడకువే
అంగమంటి చెక్కునొక్కి యాదరించీ నిన్నును

చ. 3: తుమ్మిదవంటిబొమ్మలు తోడ ముడివెట్టకువే
నెమ్మి శ్రీవేంకటపతి నీతో నవ్వఁగా
సమ్మతించి చనవిచ్చి సమరతి వీఁగకువే
కమ్మరఁ గమ్మరఁ గూడి కరగించె నితఁడు

రేకు: 1041-4 అమరసింధు సంపుటం: 20-244

పల్లవి: దైవమే యెఱుఁగుగాక తలవే నీవు
వేవేలు వచ్చెఁ జాలు విడవే నీవు

చ. 1: మనసు లేకములైతే మరి యెందు వోయీని
తనసు ద్దేఁటికిఁ జెప్పీ తలవే నీవు
చనవు గలితేఁ జాలు సోదించఁ బొద్దులేదా
వినివిని వేసరితి విడవే నీవు

చ. 2: తానే విచ్చేసునట తగులేల పాసీని
దానికేమి గొఱితాయ తలవే నీవు
నాననీవే వలపులు నాకుఁ దన కెందువోయీ
వీనులెల్లాఁ జల్లనాయ విడవే నీవు

చ. 3: కాయములు సోఁకితేనే కరఁగక మానీనా
దాయగాఁ డింతే తాను తలవే నీవు
పాయపు శ్రీవేంకటాదిపతి నన్ను నిదె కూడె
వేయకు నిష్టూర మిఁక విడవే నీవు

రేకు:	1041-5 శుద్ధవసంతం	సంపుటం:	20-245

పల్లవి:	కానీకానీలేరా కడమయి వుండనీరా
	నేను నీవు నిట్లానే నిలుచుంటేఁ జాలురా

చ. 1:	ముంచి మాటలాడేది మోవితేనె చిందుదాఁక
	యెంచినప్రియాలు పాను పెక్కుదాఁకానే
	పంచలనవ్వేనవ్వులు పైఁ జేయి వేయుదాఁకా
	ఇంచుకంత గడచితే నీడ నుండఁబొయ్యేవా

చ. 2:	కప్పుర మియ్యవచ్చేది కాఁగిట నించినదాఁక
	తప్పకచూచుట నన్ను దగ్గరుదాఁకా
	అప్పటి నానవెట్టేది ఆయముమోచినదాఁకా
	దప్పులుదేరినమీఁద తలఁచఁబొయ్యేవా

చ. 3:	చెక్కులు నొక్కేదెల్లా చేరి నే లోనై నదాఁకా
	మొక్కలు మొక్కేది తుదిముట్టినదాఁకా
	అక్కరతో శ్రీ వేంకటాధిప కూడితి విట్టె
	వొక్కమనసైనమీఁద నొడఁబాట్లేలరా

రేకు: 1041-6 నాదరామక్రియ సంపుటం: 20-246

పల్లవి: పూవుల వేసినవారి బొగ్గిట వేతురా
నీ వేమి సేసినాను నిండనవ్వీ నతఁడు

చ. 1: కాని కాని తిట్టు కాఁకలతో వొట్లు
మానుమన్నా మానవేలే మాటిమాఁటికి
పూనినట్టి మొక్కులూ పూఁటపూఁట చొక్కులూ
తేనెలమాటల నిన్నుఁ దీవించీ నతఁడు

చ. 2: పనిలేనినేరాలు పలుకుల కారాలు
అనకుమన్నా విడువ వంతకంతకు
తనివోనివలపులు తరితీపుసొలపులు
ననుపుఁ గూరిమి నిన్ను నాఁటించీ నతఁడు

చ. 3: కాంతలతో పంతనాలు కాఁగిటిలో మంతనాలు
యెంతయినాఁ బోనీవు యింత యేఁటికే
యింతటికి వేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
సంతతము నీకు నిట్టె చనవిచ్చె నతఁడు

రేకు: 1042-1 దేసాళం సంపుటం: 20-247

పల్లవి: ఎడమాటలే బెట్టు యేమి సేసీనే
అడియాలములు చూపి యానవెట్టి రారే

చ. 1: ఇక్కువ మమ్ము నిలిపె యింతవొద్దాయ రాఁడు
యెక్కడఁ బనిగలిగె నేమి సేసీనే
మక్కువలు మఱచెనో మరుఁ డెచ్చరించెనో
అక్కడికే నే వత్తునో అడిగిరారే

చ. 2: అంటే ననఁగరాదు అల నేమముఁ బెట్టి
యింటిలో నున్నాఁడు యేమి సేసీనే
వింటలేదో నీమాట వేరొకతెఁ గూడున్నాఁడో
వొంటినున్న నాతపసు వొప్పగించి రారే

చ. 3: విందువలె విచ్చేసి వెనక నిలుచున్నాఁడు
ఇందులో నే నెఱఁగనా యేమిసేసీనే
ఆందపు శ్రీవేంకటేశుఁ డాయమంటి నన్నుఁ గూడె
ముందువెనకపనికి మొక్కితి నే ననరే

రేకు: 1042-2 నారాయణి సంపుటం: 20-248

పల్లవి: ఎంతైనా నెఱఁగవు యెమ్మెలు చూపేవు నీవు
అంతటా నీకె యాకె అప్పణియ్యవలెనా

చ. 1: తప్పక చూచీ నీతో తలవంపే చాలదా
వుప్పటించి నిన్ను వేరె వొరయఁగవలెనా
పిప్పిగట్టఁ బెదవులఁ బేరఁ దిట్టవలెనా
కప్పురగంది నిన్నుఁ గసరఁగవలెనా

చ. 2: వూరకుంటేఁ జాలదా వువిద నీతో నిప్పుడు
గోరపెట్టి సారెసారెఁ గోపగించవలెనా
నీరాక దెలిసియు నిద్దిరించెఁ జాలదా
బీరమాడి నిన్ను రతి బెండుసేయవలెనా

చ. 3: చేత మొక్కెఁ జాలదా చేకొని నిన్నిఁక వేరే
రాతిరిఁ బగలుఁ గడురాఁపు సేయవలెనా
నీతితో శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడెఁ జాలదా
యీతరుణి నేఁడే నీయింటికి రావలెనా

రేకు: 1042-3 రామక్రియ సంపుటం: 20-249

పల్లవి: సేసినది చేఁతగాక చేతికి లోనైనవేళ
యీసున నిందుకుఁ బతి కెదురాడనేఁటికే

చ. 1: తత్తరించి కూడేవేళ తాలిము లున్నవా
హత్తి కాఁగిలించేవేళ నానలు మరున్నవా
ఇత్తల నవ్వేవేళ యెగ్గుదప్పు లున్నవా
కొత్తగాఁ బతి నిందుకుఁ గోపగించనేఁటికే

చ. 2: చెఱఁగు వట్టిన మీఁదఁ జేసన్న లున్నవా
కఱతల రతివేళ ఘాత లెంచ నున్నదా
మఱఁగు వాసినవేళ మఱి సిగ్గులున్నవా
వుఱకె యిందుకుఁ బతి నుప్పటించనేఁటికే

చ. 3: రతికేళి సేయు వేళ రాజసము లున్నవా
తతివచ్చినపటికి దాఁచఁ జోటు లున్నవా
యితవై శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గలసె
అతని నిందుకుఁగాను అదలించనేఁటికే

రేకు: 1042-4 దేవగాంధారి సంపుటం: 20-250

పల్లవి: ఏలే మనసుద్దులు యెఱిఁగినవే కావా
యీలాగు అలుక నీ కింత చెల్లునా

చ. 1: వాలుఁజూపు నామీఁద వంచితే నేమాయ నీకు
నాలిగా సెలవిఁ గొంత నవ్వితే నేమీ
ఆలించి వొకమాట ఆడితే నేమాయ నీకు
వాలాయించి నేఁబట్టిన వద్దనఁగఁ జెల్లునా

చ. 2: జట్టిగొని నాపైఁ జేయిచాఁచితే నేమాయ నీకు
గుట్టుతో నామంచముపైఁ గూచుంటే నేమీ
పుట్టివడి నాకతలు వూఁకొంటే నేమాయ నీకు
అట్టె నేఁ గాఁగిలించితే నౌఁగాదనఁగలవా

చ. 3: పొత్తుకు వచ్చినాతో బోఁదైతే నేమాయ నీకు
హత్తి రతిఁ దనిపితే నందుకూ నేమి
బత్తితో శ్రీవేంకటాద్రిపతి నేనే బుజ్జగించి
చిత్తమురాఁ గలసితి సిగ్గు లిఁకనేటికి

రేకు: 1042-5 శంకరాభరణం సంపుటం: 20-251

పల్లవి: నీవు ముందు చెనకకు నిన్నతఁడు చెనకితే
కైవశమై లోలోనే కరఁగుదుగానీ

చ. 1: కన్నుల నిన్నుఁ జూచితే గక్కన నవ్వేవుసుమ్మీ
వన్నెగా నందుకుఁ దలవంతువుగానీ
మన్నించి చేయివట్టితే మందెమేళ మొద్దుసుమ్మీ
యిన్నిటాఁ బతిచేఁతకు నియ్యకొందుగానీ

చ. 2: దగ్గరఁ బిలిచితేను తమకించేవుసుమ్మీ
వొగ్గి చేతులు వట్టుక వుందువు గానీ
అగ్గలపు సరసాల కవుఁగాదనేవు సుమ్మీ
సిగ్గువడి చెక్కుచేత చింతనుందు గానీ

చ. 3: అంది రతిఁ గూడితేను అలఁతఁ బొందేవు సుమ్మీ
చెంది నీవు యిచ్చకమే సేతువుగానీ
విందుగ శ్రీవేంకటాద్రివిభుఁడు గలసె నిన్ను
అందపుఁ జెలితో ముచ్చటాడేవు సుమ్మీ

రేకు: 1042-6 రామక్రియ సంపుటం: 20-252

పల్లవి: నాఁటికి మరి నను నగరాదా
గీఁటి కన్ను మఱి గిఱుపఁగరాదా

చ. 1: మలసి నీకు నే మనవులు చెప్పిన
నలుగడ నీవే నగరాదా
వలపు చల్లి యిఁక వడి నినుఁ గొసరిన
నిలువుకు నీవే నిలుగఁగరాదా

చ. 2: కనుఁగొనలఁ జూచి కాఁకలు చల్లిన
నను నీ వప్పుడు నగరాదా
తనియక నే నిను తగవు లడిగినను
కినిసి బొమ్మల జంకించఁగరాదా

చ. 3: వేమరు రతులకు వెనకతీసినను
నా మొగము చూచి నగరాదా
గామిడి శ్రీవేంకటపతివి నీవు
కామించి కూడితి కానీరాదా

రేకు: 1043-1 దేవగాంధారి సంపుటం: 20-253

పల్లవి: నేనే వొడఁబరచే నెలఁతఁ గొంతవడికి
నానితేనే మెత్తనయ్యీ నవ్వకురే మీరు

చ. 1: మనసు లోపలి వేద మాటల లోపలివూద
కనుఁగొనలనే గోద కానరాదా
వనిత యిప్పుడేమన్న వాదులకే వచ్చుఁగాని
వినదు మీమాటలెల్ల విడువడరే

చ. 2: కాయము మీఁదటి కాఁక కడునిట్టూర్పులమూఁక
చేయి చెక్కుమీఁది వీఁక సేసె నిందాఁక
యీయెడఁ జెలి నేమన్న నీసడించఁ జూచుఁగాని
చాయకు రాదు మీచేఁత చాలుఁజాలునే

చ. 3: గుబ్బలపై మెరుఁగూ గుణములలో కరఁగూ
వుబ్బురతితెలిఁగూ వుని దెఱుఁగూ
గొబ్బనఁ గూడితి నిట్టె కోరి శ్రీవేంకటేశుఁడ
అబ్బురపు తొఁటిమాట లాయనాయనే

రేకు: 1043-2 నారాయణిదేశాక్షి సంపుటం: 20-254

పల్లవి: తగవో నగవో తలఁపిదివో
జగడము లేఁటికి సతమగుపనికి

చ. 1: పిలిచినయపుడే ప్రియమునఁ బలికితి
కలదో లేదో కనుఁగొనరే
అలుకయుఁ దనదే అఱిడిఁ దనదే
తెలిసెనో తెలియదో తేరిన పనికి

చ. 2: కవకవ నవ్వినఁ గైకొని మొక్కితి
అవునో కాదో అడుగరే
అవల నివలఁ దనయాసలు మానఁడు
చివుకన నేఁటికిఁ జేసినపనికి

చ. 3: మనిపే ననఁగా మాటలు నమ్మితి
అనెనో అనఁడో అదెకదరే
యెనగొని శ్రీవేంకటేశుఁడు గూడెను
నను నొరయకురే ననిచిన పనికి

రేకు: 1043-3 ఆహిరి సంపుటం: 20-255

పల్లవి: ఏమిసేతు నిఁక నేను యేమిసేతు
వాములైన తననవ్వు వద్దనేమా

చ. 1: అప్పుడే తా రాకుండఁగ నలుగఁగఁ బోతేను
యెప్పటి పతిచిత్తము యెంతనొచ్చునో
దప్పిదేరి తనమోము దప్పకచూడఁబోతేను
చిప్పిల లోలో నెంతసిగ్గువడునో

చ. 2: కడుఁగాఁక తనమేను గాఁగిలించఁబోతేను
యెడసి మదనరేక లేడ రేఁగునో
జడియ కాతనితోనే సరస మాడఁగఁబోతే
వెడఁగుఁదనాల నెట్టి వెంగెములై తోఁచునో

చ. 3: మించిన రతికేలిని మేను మఱపించఁబోతే
నించుకంత దెలిసి నన్నేమనునో
అంచల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁగూడె
నెంచరాని తలపోఁత లేమి దలఁచునో

రేకు: 1043-4 రామక్రియ సంపుటం: 20-256

పల్లవి: ఏలే రమణునికి నివి గొన్నిరోఁతలా
పోల బొంకనైన రాదా పోది సేయవలెనా

చ. 1: చెదరెఁ బతికురులు చెరుగరాదా మీరు
అదివో చూచినవారు ఆడవలెనా
తుద చెమరించెఁబో తుడువరాదా మీరు
సుదతు లీతనికాఁక చూచి తిట్టవలేనా

చ. 2: పులకించెఁబో మేను పుప్పొడైనాఁ జల్లరాదా
నలువంకఁ గన్నవారు నవ్వవలెనా
తెలిగన్ను లాయఁబో తెరయైనా వేయరాదా
పలుమారు నతనిమై పచ్చిదోఁచవలెనా

చ. 3: కడురతి నలనేఁబో కప్పురమైనా నీరాదా
కడవా రీతనిచేత కానవలెనా
అడరి శ్రీవేంకటేశుఁ డందులోనె నన్నుఁ గూడె
బడలిక వాపరాదా పైపైనే వలెనా

రేకు: 1043-5 ముఖారి సంపుటం: 20-257

పల్లవి: అప్పటి కప్పుడే చెప్పే మందుకేమి
వొప్పులుఁ దప్పులు నీకే వొప్పగించేమయ్యా

చ. 1: కన్నుల జంకెలు గొన్ని కారపు బొంకులు గొన్ని
నిన్నటనుండి పడేము నీచేతను
వెన్నెల నగవు గొంత వేసాల తగవు గొంత
యెన్నిచెప్పినా మాన వికఁ జూడవయ్యా

చ. 2: పచ్చిమాఁట లోకకొన్ని వెచ్చినమాఁటలు గొన్ని
నిచ్చనిచ్చఁ బడలేము నీచేతను
వచ్చి సన్న సేసేవు వలపసలే పూసేవు
మెచ్చుగాదన్నాఁ బోవు మేరమీరేవయ్యా

చ. 3: మోనపుతిట్లు గొన్ని మోహపుటొట్లు గొన్ని
నేనే లోనైతిఁగా నీచేతను
కానీలే శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
మానరానిపొందులాయ మఱియేఁటికయ్యా

రేకు: 1043-6 మాళవిగౌళ సంపుటం: 20-258

పల్లవి: పొద్దువో దతఁడు పొందు లెఱఁగఁడు
కొద్దిమాలి మముఁ గొసరీని

చ. 1: వెన్నెతామెరలు వెదచల్లితిఁబో
కన్నులఁజూచినగతి యాయ
పున్నమవెన్నె పోఁజెరిగితిఁబో
చిన్నినవ్వునుచుఁ జెనకి నతఁడు

చ. 2: పలుమరుఁ జిలుకలఁ బలికించితిఁబో
వలపుమాటలని వచ్చీని
అలమి జక్కవల నల్లార్చితిఁబో
అలరుఁ గుచములని అంటీని

చ. 3: తమ్మితూఁడులను తను బిగిసితిఁబో
చిమ్ముఁగాఁగిలని చెలఁగీని
యిమ్ముల శ్రీవేంకటేశుఁడు గూడియు
నెమ్మది నావద్ద నెలకొనె నతఁడు

రేకు: 1044-1 లలిత సంపుటం: 20-259

పల్లవి: ఎవ్వరు సాకిరి చెప్పిరివే నీతక్కు(దనాలు
వువ్విళ్లూరేటి బాస లొల్లరా నేను

చ. 1: యిందరిలో మమ్ము నింత యేల అట్టుసేసేవు
ముందర నెవ్వరికైనా మొక్కరా నీవు
గొందులనే వెంగేలు కొలువులో వినయాలు
యెందు నేరిచితివి ని న్నేమందు నిఁకను

చ. 2: నెయ్యపు సొమ్ము నాయింట నునిచితివి తనిసితి
యియ్యరా యెవ్వరికైనా యీవులు నీవు
కయ్యము లోలోనే గారవా లిందరిలోన
కొయ్యసాదుఁ దనములు కూడునా నేఁ డిఁకను

చ. 3: గక్కన నన్నింతలోనే కాఁగిలించ వచ్చేవు
యెక్కువఁ గాఁగిలించరా యేమైనా నీవు
తక్కించి శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
చక్కనాయఁ బనులెల్లాఁ జాలు నీవేసాలు

రేకు: 1044-2 దాసాళం సంపుటం: 20-260

పల్లవి: నే నిదె నీ విదె నెగులేలే
నానాఁడే తగులాయ నవ్వు లింకా నేలే

చ. 1: అంగన నీ కరచేత నడఁగెను చందురుఁడు
యింగితాన నీ కింకానేలే చింత
పొంగేటి జలనిధులు పుడిసిటికి వచ్చెను
కొంగువట్టితీసితేనే కోప మింకా నేలే

చ. 2: పెంచెపుటాకసము నీపిడికిటిలోనిది
యెంచరానివెడదైన్యమేలే నీకు
చంచులకొండలు నీ సందిటిలోనే చిక్కె
వంచిన నీకెమ్మోవి వాడఁబారనేలే

చ. 3: కోరి మదనాస్త్రాలు కొనగోరిలోఁ జొచ్చె
యీరీతి నివ్వెరగులేలే నీకు
చేరితి శ్రీవేంకటపతిఁ జిక్కితి నీపాలిట
నారుకొనెఁ బులకలు నయగారా లేలే

రేకు: 1044-3 కాంబోది సంపుటం: 20-261

పల్లవి: మాపుదాఁకా సుద్దులేల మఱఁగుమొఱఁగులేల
చేపట్టి నీ వింకఁ జేసినట్టు చేయరా

చ. 1: వంపునీగోరిగుఱుతు వాఁసుకొన్నది నా మేన
యింపులఁ గాచినది నీయింటివాకిలి
ముంపున నాతురుము నీముంజేతి సేసలకే
చెంప జారె నీ వింకఁ జేసినట్లు సేయరా

చ. 2: యె త్తినవి నాచేతు లివె నీ మొక్కులకే
పొత్తు నీకాఁగిటికి నావూఁపచన్నులు
హత్తిన నాజవ్వనమంతా నీకే మీఁదు
చిత్తగించి నీవింకఁ జెసినట్టు సేయరా

చ. 3: యిచ్చితివి నీరూపు యిదె నామతికి దక్క
వచ్చితివి నేఁడు నావద్దకి నీవు
యిచ్చగించి శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
చెచ్చెర నేమైనా నింకఁ జేసినట్టు సేయరా

రేకు: 1044-4 శంకరాభరణం సంపుటం: 20-262

పల్లవి: కన్నెవయసు మీఁదనే ఘనజవ్వనము వచ్చె
విన్నకన్నచోటనేల వెరగందేవే

చ. 1: పూచినవెన్నెలనవ్వు పుప్పొడితేనెమాటలు
కాచిన చన్నుల నిమ్మకాయ లవిగో
యేచిన వసంతకాల మిప్పుడే నీ మేన నిండె
చేచేత నిఁకనేల సిగ్గువడేవే

చ. 2: కందువ చిగురు మోవి కప్పినకన్నులకావి
మందపు నిట్టూర్పులమంచిగాలి
అందపునీ మేనిమీఁద నామనికాలము వచ్చె
యిందులో నీపతి వచ్చె నేలకొంకేవే

చ. 3: పండినపులకపంట పాయపుఁగళలపచ్చి
మెండగుబాహులతలు మేరవరెను
నిండి శ్రీవేంకటపతి నిన్నుఁ గూడెఁ దతికాల
మండనే నీమేనఁ దోఁచె ననుమానమేలే

రేకు: 1044-5 వరాళి సంపుటం: 20-263

పల్లవి: కానీ కానీ యందు కేమి కైతప్పీనా
సానఁబట్టి నీగుణము జవదాఁట నిచ్చీనా

చ. 1: చిమ్ముఁజూపు చూచి యిట్టె సిగ్గుపడేఁగాక నేఁడు
కొమ్మ నీపైమోహములోఁ గొఱఁతున్నదా
నెమ్మది నీమాటలకే నివ్వెరగు నొందేఁగాక
అమ్మరో నీవంతమెల్లా నట్టునిట్టు సేయదా

చ. 2: నవ్వినందుకే నీతో నను వు నటించెఁగాక
జవ్వనినీపొందులకు సరియున్నదా
చివ్వనఁ జేయివేయఁగ చిత్తము మఱచెఁగాక
పవ్వళించేపానుపుపై పచ్చి నిన్నుఁ జేయదా

చ. 3: నిద్దురకన్నుల నిట్టె నీపై నొరగెఁగాక
గద్దరిచెలియ మేన గర్వ మున్నదా
వొద్దిక శ్రీవేంకటేశ వువిదఁ గూడితిగాక
తిద్దని నీచేఁత తేటతెల్లమిగాఁ జేయదా

రేకు: 1044-6 సాళంగనాట సంపుటం: 20-264

పల్లవి: అప్పటి నొడఁబాటేల అతఁడయ్యీ నే నయ్యే
వొప్పులుఁదప్పులుఁ దీరె వుండరే మీరు

చ. 1: బగ్గనఁ దానే యింకఁ బచ్చితిట్టు తిట్టినాఁడు
యెగ్గులు సిగ్గులుఁ బాసె నేలే యింక
వెగ్గళించి యేమన్నా వెల్లవిరులయ్యీ మాఁట
దగ్గరిరాఁ బనిలేదు తలరే మీరు

చ. 2: నిమ్మపంట వేసినాఁడు నెట్టిన నాకొంగు దాఁకె
యెమ్మెలు నేతులుఁ జెల్లె నేలే యింక
కుమ్మరించి నవ్వఁబోతే గుట్టుచెడీ నిఁక నేఁడు
బొమ్మలజంకెలె చాలుఁబోరే మీరు

చ. 3: చెక్కులు తా నొక్కినాఁడు చిత్తము నేఁ గరఁగితి
యెక్కువ తక్కువ దీరె నేలే యింక
అక్కరై శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
మక్కళించె వలపులు మానరే మీరు

రేకు: 1045-1 వరాళి సంపుటం: 20-265

పల్లవి: ఇరవై ననీరాక కెదురైతిరా నీ-
పరిణాములే చూడఁ బాలాయరా

చ. 1: నిద్దురకన్నుల రాఁగా నీ మొగముచూచి నేను
అద్దిరా జాగరమంటా నలిగితిరా
చద్దివిడెము పుక్కిట సవరించుకొని రాఁగా
వద్దిక మాఁటాడవంటా నుస్సురంటిరా

చ. 2: సారెకు నిట్టూరుపుతో సదమదమై యుండఁగ
నీరువంకతుంగవంటా నిలిచితిరా
మేరతో వానలెల్లా మేన వాసించుకరాఁగా
తేఁరె బనులెల్లానంటాఁ దిరిగితిరా

చ. 3: కాంతుల నీ మోము చంద్రకళలుదేరఁగఁ జూచి
వింతలెల్లాఁ గంటినంటా వెరగైతిరా
యింతలో శ్రీవేంకటేశ యిట నన్నుఁ గూడఁగాను
వంతమెల్లాఁ జెల్లెనంటాఁ బైకొంటిరా

రేకు: 1045-2 దేవగాంధారి సంపుటం: 20-266

పల్లవి: రమణుఁడ ఇంతట రారాదా
సమరతిఁ దేరీ జగడము లిఁకను

చ. 1: కోవిలతిట్లగొణఁగుల చేతను
తావులు దప్పెను ధైర్యములు
మావుల చిలుకలమాటవెంగెముల
వావులుమాలెను వలపులు చెలికి

చ. 2: కొంచెవువాయువుకుంటెనతనముల
చంచల మందెను సతిమనసూ
పంచలతుమ్మిదబలములపొంచుల
యించుకించుకే యెక్కెను చలము

చ. 3: విరులశరంబులవేండ్లవాండ్ల
మరులునుఁ దెలువులు మగువకును
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
సరసపుమాఁటలు సాగెను కొనకు

రేకు: 1045-3 సాళంగం సంపుటం: 20-267

పల్లవి: ఎటువంటివలపో యేమిసేయఁగలదో
కుటిలపుఁ దనలోనిగుణమెల్లాఁ గరఁగె

చ. 1: కలికి దనవిభునికడ కేఁగె వేగిరాన
తిలకము కస్తూరి తిద్దమఱచె
మలసి యాతనితోనే మాటాడేతమకాన
నిలువునఁ దనచేతినిమ్మపండు వదలె

చ. 2: సొగిసి చక్కనిరూపు చూచె పరాకున
మొగి వీడినతురుము ముడువదాయ
జిగిమించ నతనితోఁ జేరి నవ్వె సందడిని
తగఁ జెలియిచ్చినకై దండయును విడిచె

చ. 3: కందువశ్రీవేంకటేశుఁ గాఁగిలించే వేడుకను
అందపుఁబులకపువ్వులందు మునిగెఁ
చిందేటిమోవితేనే చేకొనేటిదప్పితోడ
పందెమాడి తనతో నీవంతమెల్లా నొసఁగె

రేకు: 1045-4 సామంతం సంపుటం: 20-268

పల్లవి: నీకేలే మాగొడవ నీయంత నుందువుగాక
ఆకొలఁది కాకొలఁది అయ్యీఁగాక

చ. 1: చొక్కపునీ మోము చూచేచూపులకు నడ్డమా
చెక్కుకుఁ జేయడ్డమైతేఁ జెల్లెఁగాక
యిక్కువ సెలవినవ్వు లిందులోనాఁ గొంచెమా
నిక్కి నడుము కొంచెము నీకుఁ జెల్లుఁగాక

చ. 2: మాటలాడేయందుకు మఱఁగా నీగుబ్బలకు
మాఁటు పయ్యదైతే నమరుఁగాక
కూటమి నామనసుకు గుఱుతా నీకొనగోరు
కోటిచంద్రవంకలకు గుఱుతింతేకాక

చ. 3: చిమ్మురతికాఁగిటికి సిగ్గులా నీలోలోనే
వుమ్మగిలి వొకచోటి కొదుగుఁగాక
తెమ్మగా శ్రీవేంకటాద్రిదేవుఁడ నేఁ గూడితిని
వమ్మువోనినీకుఁ బరవశములేకాక

రేకు: 1045-5 పాడి సంపుటం: 20-269

పల్లవి: ఇన్నియు నీ కలవాటే ఇంత సేయజెల్లదా
సన్నమేమి దొడ్డేమి సడిసన్నవారికి

చ. 1: చెల్లదా నీకు నాచెఱఁగువట్టి తియ్యగ
గొల్లెతలచీర అందుకొన్ననీకును
చెల్లఁబో నీవు నాతో చేరి నవ్వఁ జెల్లదా
తల్లిఁగూఁతు నొక్కవావిఁ దగులనవ్వేనీకు

చ. 2: వెక్కసాన నీవు నన్ను వేసుకొన్నాఁ జెల్లదా
గక్కునఁ బదారువేలఁ గైకొన్ననీకు
తెక్కులఁ దిట్టి నా చేతఁ దిట్టించుకోఁజెల్లదా
వొక్కట నూరుదిట్ల కోరిచిననీకు

చ. 3: తెగి నన్ను నీమీఁదికిఁ దీకొన్నాఁ జెల్లదా
మోగి శ్రీసతి నురాన మోచిననీకు
తగురా శ్రీవేంకటేశ దక్క నన్నుఁ గూడితివి
నగ నిఁకఁ జెల్లదా నాటకపునీకు

రేకు: 1045-6 శ్రీరాగం సంపుటం: 20-270

పల్లవి: వలెనా అతనితోవాదులు నీకు వో
అలనా నీమనసు లక్కవంటిది

చ. 1: తగవా అతనితోఁ దారుకాణలు వో
మగువా అతఁ డెంత మన్నించినాను
నగవు సేసుక నీవు నడచుటింతే కాక
బిగువు చెల్ల దింత ప్రియునితో నీకు

చ. 2: అలుకలు యింకనేలే అతనితోను వో
కలికీ పిలిచితేఁ గాదనరాదు
పలుకుఁదేనె చల్లి పైకొనుటింతే కాక
చిలుకుఁజలములు చెల్లవిఁక నీకు

చ. 3: కలయకుండఁగనేలే కాంతునితో వో
చెలి అతఁడట్టె చేయిదాఁచఁగా
వెలయువలపు లవేడుక శ్రీవేంకటాద్రి
నిలయఁ డిదె కూడె నిట్టూర్పేలే నీకు

రేకు: 1046-1 నాట సంపుటం: 20-271

పల్లవి: అందుకే పో నీచేత నగడైతిమి
యిందరిని మొఱఁగేవు యేడ చొచ్చేదే

చ. 1: పంతమే కావలె నొండె పతితో నిప్పటివేళ
సంతమే కావలెఁగాక సటలేఁటిదే
వంతులకుఁ బెనఁగేవు వాదులకు వచ్చేవు
యింతలో రెండూనై తే యేడ చొచ్చేదే

చ. 2: నగవే కావలె నొండె నడుమ నీతనితోడి
తెగువ గావలెఁగాక తిట్టులేఁటిదే
మొగమునుఁ జూచేవు మోనానఁ దలవంచేవు
యెగదిగపోఁతలైతే నేడ చొచ్చేదే

చ. 3: సిగ్గులే కావలె నొండె శ్రీవేంకటేశు నిట్టె
దగ్గరి కూడుటే కాక తచ్చనేఁటిదే
అగ్గమై కూడితివి అన్నిమాఁట లాడితివి
యెగ్గులు నెమ్మెలునైతే నేడ చొచ్చేదే

రేకు: 1046-2 భైరవి సంపుటం: 20-272

పల్లవి: అది నాభాగ్యమేకాక ఆతఁడేమిసేసునే
అదనై నందాఁక నింతే ఆతఁ డేమిసేసునే

చ. 1: కలువకన్నులఁ జూచె ఘను డాతఁ డవె నాకు
అలరుబాణములై తే నతఁ డేమిసేసునే
పలుకుఁదేనెల నాతోఁ బలికె నవె నాకు
చిలుకుబాసటమైతే సేయుమనే దేమే

చ. 2: వెన్నెలనవ్వులు నవ్వె విభుఁ డాతఁ డవె నాకు
నన్నువట్టియెండలై తే నాతఁ డేమిసేసునే
సన్నిధిఁ గప్రము చల్లె సరసపువేళ నాకు
నన్నిటాఁ జొక్కుమందైతే నాతఁ డేమిసేసునే

చ. 3: కొంగువట్టి తీసి నన్నుఁ గూడె నాతఁ డది నాకు
నంగమెల్ల మఱపించె నాతఁ డేమిసేసునే
ఇంగితపుశ్రీవేంకటేశుఁడు మోహించఁగాను
అంగడి కెక్కె వలపు ఆతఁ డేమిసేసునే

రేకు: 1046-3 రామక్రియ సంపుటం: 20-273

పల్లవి: ఇంటికి వచ్చితి నిఁకనేలే
జంటలమనలో జగడము దీరె

చ. 1: చాయలఁ దిట్టకు సన్నలఁ గొణఁగకు
చేయిని వేసితి చెక్కును నొక్కితి
మాయలు సేయకు మతకము నెరవకు
నాయంత నవ్వితి ననుపును నాయ

చ. 2: శిరసును వంచకు చింతలఁ బొరలకు
కురులునుఁ జెరిగితి కుంకుమ పూసితి
నెరుసులు వెదకకు నేరము లెంచకు
వొరసితి నీతో నొక్కటులాయ

చ. 3: చిమ్మకు చూపులు సిగ్గులఁ బొరలకు
కమ్మర గాఁగిటఁ గలసితి వెలసితి
యిమ్ముల శ్రీవేంకటేశుఁడ నేనిదె
రమ్మని పిలిచితి రతికెక్కితిని

రేకు: 1046-4 సామంతం సంపుటం: 20-274

పల్లవి: ఇంచుకంతవడిలోనే యిన్నియుఁ దేరీఁగాని
కొంచ కాతని సంగడిఁ గూచుండఁ బెట్టరే

చ. 1: చెక్కుల నున్నది చింత చిత్తాన నున్నది యాస
వుక్కుమీరి మేనిమీఁద నున్నది కాఁక
యిక్కడి కిందాఁక రాక యిప్పుడు విచ్చేసెఁ బతి
మక్కువఁ జెలియమారు మాటాడరే చెలులు

చ. 2: మోమున నున్న దలుక ముక్కునఁ గోప మున్నది
దీమసపుఁ జూపులలో తిట్లున్నవి
వేమారు విరహమున విభుఁడింత సేసెనంటా
కామిని దగ్గరిపోదు కదియరే మీరు

చ. 3: కన్నుల నున్నది మొక్కు కాఁగిట నున్నది మేలు
సన్నల నున్నది రతిసరస మిది
యెన్నఁగ శ్రీవేంకటేశు డీయలమేల్మంగను
వున్నతిఁ గూడె నవ్వుతా నుఁడరే మీరు

రేకు: 1046-5 శ్రీరాగం సంపుటం: 20-275

పల్లవి: ఏఁటికి నన్ను భ్రమయించే వింకా
కూటపుసరసమె గుఱుతులాయరా

చ. 1: చలమున వలపులు చల్లఁగఁ జల్లఁగ
నిలువున బులకలు నిండె నిదె
పలచనియెలుఁగునఁ బాడఁగ నామెయి
చెలమలచెమటలు చెరువులాయరా

చ. 2: చిక్కనినవ్వులు చిందఁగఁ జిందఁగ
ముక్కున నుసురులు ముంచె నిదె
కక్కసించి యిటుకన్నులార్చఁగా
మిక్కిలి తమకము మేరమీరెరా

చ. 3: బిగువుఁగాఁగిటిటనుఁ బిసుకఁగఁ బిసుకఁగ
పొగరుకుచగిరులు పొడవాయ
అగపడి కూడితి వలమేల్మంగను
పగటు శ్రీవేంకటపతి మరిగితిరా

రేకు: 1046-6 రీతిగౌళ సంపుటం: 20-276

పల్లవి: కొన్నదె కొనఁగఁబోతే కోపము సరకుగాదు
వన్నెమీఁద వన్నెలేలే వాసు లివి చాలదా

చ. 1: మోపులుగా మాటలన్ని మూఁటగట్టివేసీని
అఁప లేజవ్వనభార మది చాలదా
పూఁపవలపులు నాపై పొద్దువొద్దుఁ బూసీని
పోపో విరహపుఁగాఁక పూసె నాఁడే చాలదా

చ. 2: కన్నుచూపు నెఱుఁగులగంపఁ గమ్మి నన్ను నిట్టె
యెన్నికె గంపంతకొప్పు ఇది చాలదా
కన్నెపచ్చి సేఁతలనే కలగూర లేరీని
వున్నది నామేనఁ బచ్చి వూరకింత చాలదా

చ. 3: తనతో నవ్వఁగఁబోతే తరితీపుసేసీని
దినము నామోవిమీఁదితీపు చాలదా
యెనయ శ్రీ వేంకటేశుఁ డివు డిట్టె నన్నుఁ గూడె
మనసిచ్చితి నలమేల్మంగ నేనే చాలదా

రేకు: 1047-1 సామంతం సంపుటం: 20-277

పల్లవి: ఆయలేరా పంతమాడేయందు కేమిరా
యేయెడ నెంతోరిచినా నెఱఁగవుగాక

చ. 1: అంటిముట్టి సరసము లాడలేనా నీ మేను
వొంటిఁగాలు దాఁకుఁ జేసు వొద్దనికాక
వెంటవెంటఁ దిప్పి నిన్ను వేగ వలపించలేనా
నంటున నన్నిందరు న వ్వేరని కాక

చ. 2: ముందు నిన్నుఁ దమిరేఁచి మొక్కించుకొనలేనా
ఆందరిలో నిది దోసమనికాక
పందెమాడినటు నీమై పచ్చిగాఁ జేయఁగలేనా
అందపునీమేను రేకలయ్యీనని కాక

చ. 3: మోవి ఇచ్చి పుక్కిటఁదమ్ములము నే నించలేనా
భావించి నాలోనే సిగ్గువడికాక
శ్రీవేంకటేశ నీవే చేరి నన్నుఁ గూడితివి
యీావల నలమేల్మంగ నిరవైతిఁగాక

రేకు: 1047-2 శంకరాభరణం సంపుటం: 20-278

పల్లవి: దయదలఁచేవాడు తానేకదవే
నయగారికపటైన నాకు తానేకదవే

చ. 1: యిక్కడ నేనలిగితే యేల పగచాటినే
తక్కులఁబెట్టేవాడు తానేకదే
వుక్కున నేనూరకుంటే వొట్టేల పెట్టుకొనీనే
యెక్కుడు సేఁత సేసితే నింకఁ దానేకదవే

చ. 2: పగల నేదిట్టితేను వాదుకేల వచ్చీనే
తగవు వెట్టేవాఁడు తాప కదవే
నగుతా గోరనూఁదితే ననునేల దూరీనే
యెగసక్కేలాడేవాడు యిఁకఁ దానేకదవే

చ. 3: బలిమి నే గూడితేను పంతము లేలాడీనే
తల మోచి వచ్చినాఁడు తానేకదవే
అలమేలుమంగ నేను అతఁడు శ్రీవేంకటేశుఁ
డిల నన్నుఁ గూడి చొక్కె నింకఁ దానేకదవే

రేకు: 1047-3 భౌళి సంపుటం: 20-279

పల్లవి: మానిపండ్లు మఱి మానికిందనే వుండు
తానేమన్నా తనకే యనరే

చ. 1: చిగురుల మాటల చిల్లులు వోయను
తగుఁ బెదవులపై తనకే అది
మగటిమి యింకా మాతో నేటిఁకి
జగడము లడిచీఁ జాలించు మనవే

చ. 2: కారపుఁజూపుల కాలువలాయను
దారలచెమటలఁ దనమేన
పోరుచు మాతో బొంకఁగ నేటికి
దరులఁబడితిమి తొల తొలమనవే

చ. 3: కొనగొనచేతులు గురులయి తగిలెను
తననాకాఁగిట తనఁదనకే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నన్నిటు
మనికయి అలమేల్మంగ నేఁగదవే

రేకు: 1047-4 హిందోళం సంపుటం: 20-280

పల్లవి: సాదించఁ బొద్దులేదు జంకించ వేళలేదు
యీదెస రమణునికి ఇంత లోనైతి

చ. 1: అలిగి నేరాఁగా నప్పుడే మొగము చూపి
తెలిఁగన్నుల నవ్వితే తీరెఁ గోపము
తలవంచుకుండగానే దగ్గరనే నిలుచుండి
కలకల మాటాడిఁతే గక్కున నే నవ్వితి

చ. 2: ఆకడి మోమై వుంటే ఆయములు గరఁగంగ
కైకొని పైనొరగితే కందు వాసెను
చీకాకు నిట్టూరుపుల చిముడఁగ వెనకకు
కోకవట్టి తీసితే గక్కున సమ్మతించితి

చ. 3: చెక్కుచేత నే నుండఁగ చేయిజేయి గీలించి
తొక్కినపాదములోనే దొరసెఁబొందు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
గక్కన నలమేల్మంగఁ గనక మోహించితి

రేకు: 1047-5 మలహరి సంపుటం: 20-281

పల్లవి: నాటివాఁడవేకాదా నాకడ నేఁడును
కూటము లింకా గొసరగవలెనా

చ. 1: నాకు నావాఁడవై ననిచితి విట్టె
యేకడ నెవ్వరి కెట్టుండువో
ఆకడ వత్సాపహరణమువేళను
జోకగఁ జేసినసుద్దులు వినమా

చ. 2: చేరి నామాఁటలే చెల్లించే విట్టే
యేరీతి నెందరి కెటువలెనో
కూరిమి రేపల్లె గోపికలయడనే
తేరె నీగుణము తెలిసితి మిపుడు

చ. 3: కాఁగిట నాకునుఁ గరఁగే విట్టే
యేఁగి కడసతుల కేమందువో
లోఁగ కిప్పు డల మేలుమంగఁ గూడితి
వాఁగి శ్రీవేంకటేశ అంతరాత్మవు

రేకు: 1047-6 నాదరామక్రియ సంపుటం: 20-282

పల్లవి: పోనీపోనీ ఇకనేల పోయిన నీళ్లకుఁ గట్ట
నేనే యింతకు జొచ్చితే నిన్నుఁ బారనిత్తునా

చ. 1: పదవోయి నీమాఁటపట్టు నీకే వచ్చెను
వదల కెప్పుడును నీవారమే నేము
కదిసి నీవిందు కొరకా వలపించితివి
యిది నే నెఱఁగితేను యింతా మెచ్చుసేయనా

చ. 2: చాలునోయి యిందాఁకా నీసరితలే చూచితిమి
యీలాగుల నీకు నే మీఁదెత్తితి మేను
తాలిమి నీచేసన్న లింతకు వచ్చెనా నేఁడు
నాలినీగుణము గంటే నాఁడే మెచ్చుసేయనా

చ. 3: తగునోయి నీకు-నాకు దతివచ్చె మితివచ్చె
మొగి నిన్ను నేడఁగన్నా మొక్కేము నేము
అగడు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నిగిడి నన్నుఁ గూడితి నీకె మెచ్చుసేయనా

రేకు: 1048-1 సౌరాష్ట్రం సంపుటం: 20-283

పల్లవి: వరుసకు రాకుంటే వావిదప్పీనా
వెర విందు కేది గోవిందరాజా

చ. 1: చిందేటి తేనే మోవితో చెలి నీతో మాటలాడెఁ
నందుకంటె నేమిసేసు నదిచాలదా
ముందే మొల్లచూపులను ముంచి చల్లఁగాఁ జూచె
కందువైన దిందుకంటె కలదా ప్రియము

చ. 2: వెన్నెల సెలవి తోడ వెలఁది నీతో నవ్వె
యిన్నిటా నీయాసోద మిఁక నెంతయ్యా
అన్నువచంద్రునివంటిఆననము నీకుఁజూపె
యిన్నేసిచేఁతలు సేసె నిఁకనేమి గడమ

చ. 3: చిగురుఁదీగెలవంటిచేతులు నీపై వేసె
తగవులన్నియుఁదేరె తారుకాణేలా
పగటుశ్రీవేంకటాద్రిపతి విట్టె కూడితివి
జగడాలిన్నియుఁ బాసె చనవింత చాలదా

రేకు: 1048-2 వరాళి సంపుటం: 20-284

పల్లవి: ఇంతలాయ వింతలాయ నెంధాఁక సరసాలు
చెంతలఁ జేరఁగరాదా చెలి జవ్వనమున

చ. 1: చిత్తరువు వ్రాతలాయ చెలినివ్వెరగులు
ముత్తెపుముగ్గులాయను మోహములెల్లా
పొత్తుల తేనియలాయ పొలఁతి పలుకులెల్లా
చిత్తగించి చూడరాదా చెలియభావములు

చ. 2: విడువనిజడులాయ వెలఁదిమోయిచెమటలు
తడఁబడే సంపదాయ తమక మది
కడివోని విరులాయ కందువకోరిక లివి
తొడిఁబడఁజూడరాదా తొయ్యలిచందములు

చ. 3: పూచిన వెన్నెలలాయ పొలఁతి సెలవినవ్వు
చూచినటల్లానాయ సొంపుకళలు
యేచిన శ్రీవేంకటేశ ఇట్టె ఇంతిఁ గూడితివి
రాచిలుకవంటి దాయ రమణి నీరతిని

రేకు: 1048-3 పాడి సంపుటం: 20-285

పల్లవి: నీవల్లఁ గడమ గద్దా నేనే యానగించేఁగాక
భావ మొక్కటేకాదా పంతమాడేఁగాక

చ. 1: యెఱఁగనా నీవు నాపై నిటుగల మోహము
గుఱిగా మఱచి ఇఁకఁ గొసరేఁగాక
మఱి కరఁగనా నీమంతనపు కాఁగిటిలో
జఱసి తనియ కిట్టె జలకించేఁ గాక

చ. 2: ఇయ్యకొననా నీవు ఇచ్చినచనువులెల్లా
తియ్యనిసిగ్గున నేనే తిట్టితిఁగాక
నెయ్యపు నీగుణమెల్లా నేఁగన్నదేకాదా
పయ్యదజారినందుకే పదరితిఁగాక

చ. 3: వినవా నీవాడినట్టివినయపు మాటలెల్లా
ననుపుమందెమేళాన నగితిఁగాక
యెనయఁగ శ్రీవేంకటేశ నేనూఁ గూడనా
పెనఁగేయందుకే నేను ప్రియపడేఁగాక

రేకు: 1048-4 గుండక్రియ సంపుటం: 20-286

పల్లవి: కానీకానీ యందుకేమి కడమ దేరీఁగాక
నానఁగాఁ గోపము దీరి నవ్వువచ్చెఁగాక

చ. 1: అనలేనా నిన్ను నే ననఁగలమాటఁలెల్లా
మనసు నొచ్చీనంటా మానితిఁగాక
చెనకలేనా నీవు సేసిన చేఁతకుఁ జేత
తనువు పచ్చౌనంటా దయవుట్టెఁగాక

చ. 2: బొమ్మల జంకించలేనా పుక్కిటితమ్మటు చూచి
నెమ్మి సిగ్గువడేవంటా నే నుంటిఁగాక
చెమ్మఁజెమటలు చూచి చేరి యలుగఁగలేనా
వుమ్మడిఁ జింతించేవంటా నొక్కటైతిఁగాక

చ. 3: పంతమాడలేనా నీపరవశములు చూచి
కొంత నీవెఱఁగేవంటాఁగూడితిఁగాక
యింతటా శ్రీవేంకటేశ యేకమైతి మిద్దరము
వంతువాసు లెంచలేనా వలచితిఁగాక

రేకు: 1048-5 లలిత సంపుటం: 20-287

పల్లవి: బాపు బాపు జాణఁడా పైకొంటి నేఁడు
యేపుమీరె నాసొద మిఁకనెంత నేఁడు

చ. 1: శిరసు నెత్తి తివి చెక్కు నొక్కితివి
అరయ నీ కొక్కమన సాయఁగా నేఁడు
వెరవు చూపితివి వెన్నెలనవ్వు నవ్వితి
వరిది నొక్కమన సాయఁగా నేఁడు

చ. 2: బొమ్మల జంకించితివి బూతునఁ దిట్టితివి
అమ్మరో నీకోరినట్టె ఆయఁగా నేఁడు
తమ్ములము వెట్టితివి దక్కఁగ మోవిచ్చితివి
అమ్ముడువలపు సతమాయఁగా నేఁడు

చ. 3: గక్కునఁ గూడితివి కన్నులఁ జొక్కితివి
అక్కరఁ దనివి నీ కాయఁగా నేఁడు
గక్కున శ్రీవేంకటేశ కలకాలమెల్ల నన్ను
అక్కున నిలిపితివి అరుదాయ నేఁడు

రేకు: 1048-6 దేసాళం సంపుటం: 20-288

పల్లవి: నీవే చన విచ్చితివో నెలంతగర్వమో యిది
వావాంత మాంటలాడి వలపుచల్లీ నిదె

చ. 1: మొకమెత్తి చూచీని నీ మోహన ముద్దుచూపీని
నకనకవాడి వాడి నవ్వు నవ్వీని
చికురము దువ్విదువ్వి చేసన్న సేసీని
యెకసక్కెమో నాతో నెవ్వతెరా నేఁడు

చ. 2: కన్నులు దేలవేసీని కడుంగేకరించీని
చన్నుమొనలు చూపీన జరసీని
కిన్నెరలు మీంటీని కిందుపడి మొక్కీని
యిన్నేసి మాయలు సేసీ నెవ్వతెరా యిది

చ. 3: కప్పురవిడె మిచ్చీని కాంగిలించవచ్చీని
నెప్పున శ్రీవేంకటేశ నీతో నిదె
అప్పుడే నన్నుఁగూడితి వండ నేనూ నున్నదాన
చిప్పిలీ నిదెవ్వతెరా సిగ్గువడ దిపుడు

రేకు: 1049-1 పాడి సంపుటం: 20-289

పల్లవి: ఇటమీఁద నీచిత్త మెట్టువలసినఁ జేయు
కుటిలాలకి వలపు గుఱుతాయ నయ్యా

చ. 1: తనువు పానుపు మీఁద తలఁపెల్ల నీమీఁద
కనుచూపు లివి నీరాకలమీఁద
వినయాలు చెలులతో వేసట మరునితోను
వనితవలపు లింత వన్నెకెక్కెనయ్యా

చ. 2: చెక్కుకుఁజేయివచ్చె సెలవికి నవ్వువచ్చె
ముక్కుమీఁదివేలితోడ మోనము వచ్చె
పుక్కిట నూర్పులు నిండె పొందులు కోర్కుల నిండె
చక్కనింతి వలపు లీచందమాయనయ్యా

చ. 3: కళలు మోమున కెక్కె కాఁగిలి నీకు నెక్కె
తలకొన్నసంతసము తలకెక్కె
యెలిమి శ్రీవేంకటేశ ఇంతి నీవు గూడఁగాను
జలజాక్షివలపులు సతమాయనయ్యా

రేకు: 1049-2 శ్రీరాగం సంపుటం: 20-290

పల్లవి: నిమిషముఁ బాయలేరా నిన్నెడసి యొకచోట
తమకమేకాని నాధైర్యమేఁటిదిరా

చ. 1: వాకిటి కంపించుకొని వత్తుఁగాని నీచేత
ఆకడ మగుడ నీయండకు రాకుండలేరా
కైకొని తప్పక చూచి కనురెప్ప వేతుఁగాని
జోకలఁ గమ్మర నిన్నుఁజూడకుండలేనురా

చ. 2: మాటలాడి నీతోను మానినట్టే వుందుఁగాని
పాటించి అంతటిలోనే పలుకక వుండలేరా
పాటిసిగ్గునను నాపయ్యదఁ గప్పుదుఁ గాని
వూటచమట నాచన్నుల నొత్తకుండలేనురా

చ. 3: మంతనపు నీరతుల మనసు చొక్కుదుఁగాని
అంతలోఁ దెలిసి మరి యాసపడకుండలేరా
అంతట శ్రీవేంకటేశ అదెటింగి కూడితివి
చింతలో నీమేలు నేను చింతించకుండలేరా

రేకు: 1049-3 శ్రీరాగం సంపుటం: 20-291

పల్లవి: రమణుఁడ చెప్పుమా రమణి నీయెడను
జమళి రెండొకటఁ జల్లీ వలపు

చ. 1: మోతుగు వూచెనో మొల్ల వూచెనో
కాతరపుచెలి కన్నులను
చూతము వూచెనో సురపొన్న వూచెనో
ఘాతల నీసతికాయమున

చ. 2: పగడము వండెనో పై మోవి పండెనో
అగపడి యీకాంత అధరమున
పొగరునిమ్మలో పోకలు వండెనో
మగువ కిదివో నెమ్మదిఁ జన్నులను

చ. 3: తమలపుఁ జిగురో దాడిమచిగురో
అమరెఁ గరములనె అంగనకు
చెమటలఁ గూడితి శ్రీవేంకటేశ్వర
సమరతి మీ యిచ్చలు చిగిరించె

రేకు: 1049-4 రామక్రియ సంపుటం: 20-292

పల్లవి: చెప్పరాదు మీపొందులు చిగురు చేఁగైనట్టు
ఇప్పుడే మెచ్చితిమి నే మిద్దరిఁజూచి

చ. 1: చెలిఁ జూచితివి నీవు చెలియూ నిన్నిటు చూచె
కలువలుఁ దామరలుఁ గలసినట్టు
పలికితి వింతితోడ పడఁతియు మాటలాడె
చిలుకలుఁ గోవిలలు చిమ్మిరేఁగినట్లు

చ. 2: అప్పుడే నీవు నవ్వితి వంగన నీతో నవ్వె
కప్పురాలు వెన్నెలలుఁ గలసినట్టు
నెప్పునఁ జేయివేసితివి నెలఁతయుఁ జేయివేసె
వొప్పగుఁదీగెలుఁ దూండ్లొన గూడినట్లు

చ. 3: పట్టితి నీ కెపయ్యద భామయు నీచేయి వట్టె
గట్టి హేమాద్రి నీలాద్రిఁ గలసినట్టు
ఇట్టె శ్రీవేంకటేశ యీసతి నీ వురముపైఁ
బెట్టితి నాకె నిలిచెఁ బెండ్లాడినట్లు

రేకు: 1049-5 ఆహిరి సంపుటం: 20-293

పల్లవి: ఏడనున్నా నీవారమే యెరవు సేయకు వయ్యా
మోడా మోడితనమున మొక్కేము నీకు

చ. 1: పాయము నీ కిచ్చితిమి పంతములదానఁగాను
పోయివచ్చేమయ్యా పొద్దున నేము
కాయ మిది నీసొమ్ము కడమ నే నెఱఁగను
మాయింటికి రావయ్యా మరి చెప్పేఁగాని

చ. 2: మనసు నీ కొప్పనాయ మారుమాట లెఱఁగము
వెనక వచ్చేమయ్యా విడిదికిని
దినము నీకే సెలవు దేవరచిత్త మిఁకను
ననుఁజూడవయ్యా నవ్వు నవ్వేఁగాని

చ. 3: సేస నీపైఁ బెట్టితిమి చెప్పుకొనఁ బనిలేదు
ఆసతో నుండేనయ్యా ఆడనే నేను
బాసతో శ్రీవేంకటేశ పైకొని కూడితి విందే
వేసరక రావయ్యా వెంటఁదిప్పేఁ గాని

రేకు: 1049-6 భైరవి సంపుటం: 20-294

పల్లవి: పంతము నీ కిదె వచ్చె పరవశములు హెచ్చె
ఇంతటనైన మాట లియ్యకొనరాదా

చ. 1: చెలిమోవిఁ దేనె లూరె చెమటలు మేనఁ గారె
చలము లింతటనైనఁ జాలించరాదా
సెలవి నవ్వులు చిందె సిగ్గులు చేతికి నందె
అలివేణి నీఁకనైన నాదరించరాదా

చ. 2: నిట్టూర్పు లివె మించె నివ్వెర కన్నులఁ బెంచె
వట్టిజాలి యీఁకనేల వరు సీరాదా
మట్టుమీరెఁ దలపోఁత మానిని వలపు యీఁత
యిట్టె విచ్చేసి యింతి నీఁకఁ జేకోరాదా

చ. 3: పున్నమకళలు నిండె పులకపంటలు పండె
మన్నించి వనితతోడ మాటడరాదా
వున్నతి శ్రీవేంకటేశ వొక్కటైతి వీకెతోడ
యిన్నిటా యేకచిత్తాన యీఁక నుండరాదా

రేకు: 1050-1 మంగళకౌశిక సంపుటం: 20-295

పల్లవి: క్షీరాబ్ధికన్యకకు శ్రీ మహాలక్ష్మికిని
నీరజాలయమునకుఁ నీరాజనం

చ. 1: జలజాక్షి మోమునకు జక్కవకుచంబులకు
నెలకొన్న కప్పురపునీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం

చ. 2: చరణకిసలయములకు సకియరంభోరులకు
నిరతమగుముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు నతివనిజఁ నాభికిని
నిరతి నానావర్ణనీరాజనం

చ. 3: పగటు శ్రీ వేంకటేశు పట్టపురాణియై
నెగడుసతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కఁదనముల కెల్ల
నిగుడు నిజశోభనపు నీరాజనం

రేకు: 1050-2 ఆహిరి సంపుటం: 20-296

పల్లవి: అవి యేమరకుమీ అనరే మీరు
తివిరి విభునిఁ దానే తెలుసుకొమ్మనరే

చ. 1: కాయ మీఁద నుందిగాని కడమదొడమ నా-
ఆయమెల్లాఁ దనచేతి దనరే మీరు
చేయి చెక్కుమీఁద నాకుచేరిన దింతేకాని
చాయఁ దనమేన గోరు చక్కఁజూడు మనరే

చ. 2: మాట లీడ నాడేఁగాని మనసెల్లఁ దనమీఁద
నాటియున్న దనరే నానాయకునితో
యేఁటికో నవ్వేఁగాని యెదురై తనమీఁద
కాటుకకన్నులచూపు ఘాతసేసు ననరే

చ. 3: అవ్వలి మోమైతిఁ గాని అదియొకబంధమున
చివ్వనఁ గూడితి నని చెప్పరే మీరు
రవ్వగా శ్రీ వేంకటేశు రతిఁ గొసరితిఁగాని
నవ్వుతానే నటించిన నాటకము లనరే

రేకు: 1050-3 మాళవిగౌళ సంపుటం: 20-297

పల్లవి: నేర మింతటికి నేమైతే
ఆరితేరినది యలమేల్మంగ

చ. 1: కన్నులచూపులు కాఁకలరేపులు
వెన్నెలనవ్వులు వెదచల్లీ నదే
చన్నుల నొత్తీ సరసుడ నీమై
అన్నిట జాణ యీయలమేల్మంగ

చ. 2: పెదవుల ముద్దుల పిలుపుల యెలుఁగుల
వదలుఁ బయ్యదనె వలపంచీ నదె
కదులుచు మెచ్చీ ఘనుఁడ నీయెదుట
అదె నేర్పరిగా యలమేల్మంగ

చ. 3: నయముల మాటల నటనలపాటల
పయిఁ జెయివేయుచు భ్రమయించీ నదే
నియతి శ్రీ వేంకటనిలయ నినుఁ గలసె
అయుతపురతులనె యలమేల్మంగ

రేకు: 1050-4 సామంతం సంపుటం: 20-298

పల్లవి: మించి నీవే సేతుగాక మీఁద మిక్కిలిపనులు
పంచనే మొదల లెట్టు పై కొనేరా

చ. 1: గక్కనఁ జూచినంతనే కళదాఁకె నా తోడ
మక్కళించి యిఁక నెట్టు మాటలాడేరా
మిక్కుటమై పులకించె మెరసి నీవు రాఁగానే
యిక్కువ లెరిఁగి నిన్ను నెటు గాఁగిలించేరా

చ. 2: దవ్వుల నీవు నవ్వితే తనువెల్లాఁ జెమరించె
రవ్వగా నీతో నెట్టు రతినేసేరా
అవ్వల సన్న సేసితే నంతలోనే భ్రమసితి
చివ్వన నీచెఱుఁ గెట్టు చేతఁ బట్టేరా

చ. 3: తతితో వీడె మిచ్చితే తలకెక్కె వలపెల్లా
యితవై నీమోవి యానే దిఁక నెంతరా
అతివేడుక శ్రీవేంకటాద్రీశ కూడితివి
మతిలోఁ జొక్కుటగాక మరి యేమనేరా

రేకు: 1050-5 వరాళి సంపుటం: 20-299

పల్లవి: చేరి చూడ మాకునైతే సిగ్గులు గానీ
యీరీతి సింగారాలు యీతనికే తగునే

చ. 1: నున్న నిలత్తుకవన్నె నొసలిపై నించెఁగదే
అన్నువ కిన్నెరమీఁటు లాతనిమ్మై నంటేనే
పున్నమ వెలుఁగు మోముపొంతనెల్లా నిండెఁగదే
యిన్నేసి సింగారాలు యీతనికే తగునే

చ. 2: కుంకుమగుబ్బల పూఁతగుబుతు మైనంటెఁగదే
అంకెల మోవి కెంపులు అమరెఁగదే
కొంకక వాడుఁ బువ్వులు కొప్పుమీఁద రాలెఁగదే
యింకా నిన్ని సింగారాలు యీతనికే తగునే

చ. 3: శిరసుచెమటవాన చిత్తడి పై జారెఁగదే
యెరవుల సొమ్ము మేన నిదివో కదే
పరగ శ్రీ వేంకటాద్రిపతి నన్నుఁ గూడెఁగదె
యిరవైన సింగారాలు యీతనికే తగునే

రేకు: 1050-6 మాళవి సంపుటం: 20-300

పల్లవి: చెల్లినట్లు నీవే చేఁత సేతువు గాక
యెల్లి నేఁ డనేజాగు లింకానేలే

చ. 1: చెక్కులెల్లాఁ జెమరించె సేసకొప్పు వెడజారె
యిక్కడ నాతోఁ గోప మింకానేలే
మొక్కు నాచేతికి వచ్చె మోవి నీకు నవ్వు చిందె
యెక్కువ వెంగెపుమాట లింకానేలే

చ. 2: తనువెల్లాఁ బులకించె తగునిట్టూర్పులు రేఁగె
యినుమడించినచల మింకానేలే
మును నాపంతము వచ్చె మొగి నీసిగ్గులు మించె
యెనలేనియనుమాన మింకానేలే

చ. 3: వలపు కాఁగిట కెక్కె వాసులురేసులు నిక్కె
యెలయింపుఁ గసరులు యింకానేలే
బలిమి శ్రీ వేంకటాద్రిపతి నేఁ గూడితి నిన్ను
యెలుఁగెత్తి రట్టుసేయ నింకానేలే

రేకు: 1051-1 సామంతం సంపుటం: 20-301

పల్లవి: ఎంతదవ్వయిననేమి ఇక్కడ నుండిననేమి
చింత వొక్కటైనప్పుడే చేరువౌటగాదా

చ. 1: విన్ను నంటినట్టిగాలి నేఁడు నామీఁదఁ బొలసె
యెన్న నది యిద్దరికి నేకము గాదా
ఇన్నిటా నొకచందురు నిద్దరముఁ జూచితిమి
కన్నులచూపిదరికిఁ గలయుటే కాదా

చ. 2: యిద్దరి యెలుఁగులకు యీయాకసమె గురి
అద్ది మనయిదియె మాటాడుటగాదా
పొద్దుపొడ పొక్కటే పొంచి యీయింటా నాయింటా
వొద్దనుండి నట్టేకాదా వొరసిన భేదమా

చ. 3: భావజునమ్ములే కావా పలుమారు సోఁకేవి
చేవదేరె నవె పూవు సేసలు గావా
శ్రీ వేంకటేశ నీవే చేకొని కూడితి నన్ను
యీవేళలకు నిదె హితవు గాదా

రేకు: 1051-2 నీలాంబరి సంపుటం: 20-302

పల్లవి: ఉన్న వేమీ గుఱిగావు వొద్దనుండి నీవు నాతో
అన్న మాటలే గుఱుతు అప్పటికప్పటికి

చ. 1: చూపులకు గుఱుతు నీసోయగమైనమేను
తీపులకు గురి నీతేనెమోవి
కోపములకు గురి నీగొరిమదనరేకలే
చేపట్లకు గుఱి నీచెట్టాపట్లాలే

చ. 2: చిత్తమునకు గుఱుతు సేసేటినీచేఁతలే
హత్తి నాకు గురి అంటుఁగాఁగిలి
మొత్తపు నవ్వుకు గురి ముంచిననీసుద్దులే
గుత్తపువలపులకు గురి నీమోహములు

చ. 3: పంతముల కెల్లా గురి పరచినపానుపే
సంతసములకు గురి సరసములే
ఇంతలో శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
మంతనాలకెల్లా గురి మతిపరవశమే

రేకు: 1051-3 మాళవి సంపుటం: 20-303

పల్లవి: తగునయ్యా హరి నీకు దానము దెచ్చుకొనిన
జగములో భూకాంత సౌభాగ్యలక్ష్మి

చ. 1: కిమ్ముల శిశుపాలుని గెలిచి చేకొంటివిగా
సమ్మతించి రుక్మిణి జయలక్ష్మి
అమ్ము మొనను జలధి నడఁచి లంక సాదించి
కమ్మరఁ జే కొన్నసీతే ఘనవీరలక్ష్మి

చ. 2: నరకాసురు నడఁచి నవ్వుతాఁ జేయివేసితివి
సరిగా సత్యభామే పో సంగ్రామలక్ష్మి
హిరణ్యకశిపుఁ గొట్టి యింద్రాదులకు నీచే
వరమిప్పించినయాకే వరలక్ష్మి

చ. 3: నిండినవురముమీఁద నిఖిలసంపదలతో
అండనుండే యాకెపో ఆదిలక్ష్మి
మెండగుశ్రీ వేంకటాద్రిమీఁద నీసరుస నేఁగే
గండుమీరెఁ గళలతోఁ గల్యాణలక్ష్మి

రేకు: 1051-4 శంకారాభరణం సంపుటం: 20-304

పల్లవి: ఇంకనేలే నీకుఁ జింత యెంచి చూచుకోవు గాక
మంకులమరుఁడు నీమనసే కాదా

చ. 1: చందురుఁడు నెమ్మోము చల్లువెన్నెలనే నవ్వు
అందలియమృతము నీ యధరామృతము
పొందిననీ విభునిఁ బాసి పొడవుచందురుఁ గని
ఇందులోనే కసరేవు హితుఁడు గాఁడా

చ. 2: మెఱుఁగుఁ దీగె నీమేను మించుఁ జిగురు చేతులు
తటిఁ బూవుగుత్తులే తగునీచన్నులు
మెఱయ నీపతిఁ బాసి మించినతీగెలు చూచి
వెఱవనేఁటికే యివి వింతలా నీ కిపుడు

చ. 3: చల్లగాలి నీవూర్పు సంపంగ నీనాసికము
వెల్లిగా నిన్నిటిమీఁదా విసుగనేలే
యెల్లగా శ్రీ వేంకటేశుఁ డిదివో నిన్నుఁ గలసె
బల్లిదుఁ డితఁడే నీకుఁ బ్రాణముగాఁదా

రేకు: 1051-5 గుండక్రియ సంపుటం: 20-305

పల్లవి: ఇవి నీకొక్కనికే యా ఇద్దరికి సరిగాక
తవిలి మోవితేనెలే తరితీపు సేయఁగా

చ. 1: నిరతి నన్నొరసేవు నీ వేమి సేతువయ్య
వొరటు నాగుబ్బలలో నుండఁగాను
యెరపరికపు గుణా లెంచ నీపై నేలయ్య
యెరపరికము నాకు నివిగో కురులను

చ. 2: గుట్టుతో నీమాఁటలెల్లా కొంచపరచనేలయ్య
అట్టె నానడుము కొంచమై వుండఁగా
అట్టయిననీచేత గుట్టు సేయనేలయ్య
అట్టు నాయందెలమోతై యిట్టె వుండఁగాను

చ. 3: పలుమారు నీమేనఁ బచ్చిచూపనేలయ్య
వులివచ్చివలపు నావొళ్ల నుండఁగా
బలిమి శ్రీ వేంకటేశ పై కొని కూడితి నన్ను
నిలువున నెప్పుడు నే నీవురాన నుండఁగా

రేకు: 1051-6 కాంబోది సంపుటం: 20-306

పల్లవి: చూతుఁబో అప్పుడు నీ సుగుడతనము లెల్లా
కాతరాన నేఁ దిట్టితేఁ గాదనఁగలవా

చ. 1: ఆవులమందకు రాఁగా నాయము లంటితిగాక
మావిటికి వచ్చి నీవు మమ్ముఁ జేసేవా
తోవనుండి నాకాలు దొక్కితి వింతేకాక
చేవదేర నేకతాన సేవ సేయఁగలవా

చ. 2: చల్లలమ్మ రాఁగానే సరసమాడేవు గాక
గొల్లపల్లె లోను చొచ్చి కొంగువట్టేవా
చెల్లఁబో యమునలోన సిగ్గులు వరచితిగాక
పల్లదాన రతివేళ బలిమి చుపేవా

చ. 3: అంకులు వెట్టించుకోఁగా నండ వచ్చితిగాక
లంకెలఁ బెనఁగితేను లావు చూపేవా
యింకనేల శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
కొంకుదేరె నిఁక నీవు కొఱంత సేసేవా

రేకు: 1052-1 ముఖారి సంపుటం: 20-307

పల్లవి: చేఁత సేసేవారు లేరా సిగ్గు విడువరుగాక
పూఁతల రోఁతలకెల్లా బుద్ది చెప్పరాదా

చ. 1: చిత్తము నొచ్చీనంటాఁ జెప్పఁగాక నీమోవి-
జొత్తు లద్దములోనైనాఁ జూచుకోరాదా
హత్తివుండేచెలులైనా నట్టె తుడువరుగాక
కొత్తచెమటలు చూచి కొమలెల్లా నగరా

చ. 2: తలఁచుకొనేవంటాఁ దడవఁగాక నీలోనే
అలపునిట్టూర్పులు ఆలించరాదా
నిలువునవ్వులు సారె నీమేన జారెఁగాక
చలివేఁడిపులక లెంచఁగఁ బచ్చిగాదా

చ. 3: నీకునీకే చెప్పేవంటా నే నడుగఁ జాలఁగాక
యేకతమాడుచు గాని ఇటు రారాదా
పైకొని శ్రీ వేంకటేశ బలిమిఁ గూడితి నన్ను
యీకడాకడిసుద్దులు ఇఁక నెంచనేఁటికి

రేకు: 1052-2 శంకరాభరణం సంపుటం: 20-308

పల్లవి: ఒట్టులేల తిట్టులేల వున్నదిగా నీమేలు
దట్టమైన నామనసు తనిసే నిఁక

చ. 1: వింటిఁగా నీమాటలు వీనులెల్లాఁ జల్లఁగాను
అంటి నీతో సరసములాడే నిఁక
కంటిఁగా నీగుణము కన్నులపండుగగాను
నంటున నీమాటలెల్లా నమ్మే నేనిఁక

చ. 2: తెలిసెఁగా నీచేత తేటతెల్లమిగాను
నలుగడ నిచ్చకమే నడుపే నిఁక
నిలిచెఁగా నీవలపు నిదులై నామేననేల్లా
నలువంక నీతో నే నవ్వే నిఁక

చ. 3: చిక్కెఁగా నీమేనెల్ల చేరి నాకాఁగిటి లోన
ముక్కుమోము వంచి నీకు మొక్కే నిఁక
యిక్కువ శ్రీ వేంకటేశ యిటు నిన్నుఁ గూడితిఁగా
వొక్కటై నీవురముపై నుండే నిఁక

రేకు: 1052-3 వరాలి సంపుటం: 20-309

పల్లవి: మగరూపు నాఁడురూపు మారుచుకొని రిద్దరు
సొగి నెద్దము చూపరే చూచుకొని రిద్దరు దామే

చ. 1: కలికి కస్తూరి బొట్టు కాంతునినొసల నంటె
నిలువునామము పైపై నెలఁత కంటె
అలివేణికొప్పు జారి ఆతనికొప్పుపై వాలె
అలరె నీతని సిక ఆతనిపాపటపైని

చ. 2: కుంకుమగుబ్బలపూఁతగురుతు విభుని కంటె
అంకెఁ బతిరొమ్ముబొచ్చు ఆకె కంటేను
కంకణాలగాజులచేయి ఘనునిసందిటఁ జిక్కె
అంకపు సాముల చేయి ఆకెసందిఁ జిక్కెను

చ. 3: మట్టెలపాదము లవె మగిడె నాతనిమీఁద
నిట్టపెద్దపాదము నిలిచె నందు
యిట్టె శ్రీ వేంకటేశుఁ డింతిఁ గూడి పానుపుపై
పట్టపగ లిందరిని భ్రమయించి రిదివో

రేకు: 1052-4 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-310

పల్లవి: రాఁడాయ నతఁ డింది రాఁపులనె పొద్దు వోయ
యేఁడాయ నిమిషము ఇంతలోనే చెలియా

చ. 1: కలతునొకొ పతిఁ గాఁగిట నొకపరి
తలఁచునొకొ నన్నుఁ దా నతఁడు
పిలిచి యాతఁడు నాతోఁ బ్రియమున నవ్వేనంటా
కలలోన వేగుదాఁకాఁ గంటినే వోచెలియా

చ. 2: ముచ్చటలాడుదునొకొ మోముచూచి పతితోను
చెచ్చెర నాతఁ డందేమి సేసీనొకొ
గచుల్చనాకన్నులకుఁ గట్టినట్లు తనమేను
పచ్చిదోఁచ నామదిఁ బాయఁడే వోచెలియా

చ. 3: నేతునొకొ సేయఁగల సేఁతలెల్లా నాతనిపై
యేతల దాఁగివున్నాఁడో యీడనే తాను
చేతులు మూసి కూడెను శ్రీ వేంకటేశుఁడు నన్ను
యీతలఁ బాయఁ డిఁకను యిందాఁకా జెలి

రేకు: 1052-5 పాడి సంపుటం: 20-311

పల్లవి: ఎవ్వరూఁ దమంతనుంటే నేలవచ్చీ నింతేసి
దవ్వుల నుండినవారిఁ దడవఁ బొయ్యేరా

చ. 1: మామాట లాడఁగాఁబో మరుముద్ర మోవి కెక్కె
కేరడానఁ జూడఁగాఁబో కెంపులెక్కెను
తారుకాణకు రాఁగాఁబో తనువెల్లాఁ బచ్చిదోఁచె
యీరు దియ్యఁ బేను వచ్చె నింతలోనే విభుఁడా

చ. 2: నాలిఁ దలవంచఁగానబో నవ్వులు సెలవికెక్కె
నీలీల వంక నేపో నింద వచ్చేను
కైలాటాలు వెట్టఁగాఁబో కాఁకల నీ మేను చిక్కె
మూల నున్న వారినేల ముంగిట వేసేరా

చ. 3: కాఁగిటికి రాఁగా నేపో కడువాసనలు మించె
చేఁగ సరసాననేపో జీరనారెను
వీఁగుచు శ్రీ వేంకటేశ వేడుకఁ గూడితి నన్ను
వేఁగగ యిట్లనే వుంటే వేరులు సేసేరా

రేకు: 1052-6 గుండక్రియ సంపుటం: 20-312

పల్లవి: నీపాలివారము నే మెట్లున్నా
చేపట్టితి వింకఁ జేరినా మేలే

చ. 1: నిను నేఁ దడవను నీ కెదురాడను
నను నింక నేమన్నా మేలే
మునుపనె మొక్కితి మోహానఁ జిక్కితి
చెనకి నీ వెట్లఁజేసినా మేలే

చ. 2: జగడించను బొమ్మజంకెన చూపను
వెగటున నను నవ్విన మేలే
తగిలితి వెంటనె దగ్గరి పిలిచితి
యెగసక్కెముతో నెట్టున్నా మేలే

చ. 3: తలఁపున మఱవను తడఁబడి కొసరను
చెలఁగిటు గాఁగిలించిన మేలే
యిల నిను శ్రీ వేంకటేశ కూడితిని
మెలఁగి నీ వెట్లామెచ్చినా మేలే

రేకు: 1053-1 సామంతం సంపుటం: 20-313

పల్లవి: మనసుకుఁ జల్లన నీమక్కువ తలఁపులె
నను బుజ్జగించకురా నవ్వితేనే చాలును

చ. 1: కన్నులకుఁ జల్లన నీకడుఁ జక్కఁదనమే
పన్నీ రేల చల్లేవు పలుమారును
చన్నులకుఁ జల్లన నీ చాయలకొనగోరే
మన్ననతో గందమేల మాకుఁ బూసే విపుడు

చ. 2: వీనులకుఁ జల్లన నీవింత వింతమాటలే
అనినఁ గప్పురమేల అప్పలించేవు
మేనికిఁ జల్లన నీమీఁదనున్న పచ్చడమే
పూవి విసరించకురా పొంబట్టుసురట్ల

చ. 3: కాఁగిటికిఁ జల్లన నీకాయపు సింగారమే
పాఁగిన పూవులపాన్పు పఱచకురా
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
చేఁగదేరఁ గొసరకు చెప్పినట్టే ఆయను

రేకు: 1053-2 లలిత సంపుటం: 20-314

పల్లవి: నీడ చూడ నిఁకనేలే నేఁడు మమ్మడుగనేలే
జోడగుమీకూటమలు చూడఁజూడఁ గొత్తలు

చ. 1: చెలువపు వలపుల చెమట ముత్యములె
చెలి నీచెక్కుల కివి సింగారమే
మలసేటి పులకలమల్లెలమొగ్గలు నేఁడు
బలువుఁ గుచములకు బంగారమే

చ. 2: అసురుసురున వీడినట్టి నెరిఁదుమ్మిదలు
పసగ నీవెనువెంటఁ బరివారమే
రసికపుఁ బతితోడ రతివేళమాఁటలెల్లా
కసుగాటునీ మోవికిఁ గైవారమే

చ. 3: పొందేటియలపు దేర పూఁటపూఁట కిచ్చేటి
కందువనీమోవితేనె ఘనసారమే
యిందునె శ్రీవేంకటేశు నిటు గూడివుండిననీ
విందులవెరగు మంచివిచారమే

రేకు: 1053-3 శంకరాభరణం సంపుటం: 20-315

పల్లవి: ఏమంటే నేమంటి నింతేకదే
దామెనప్రియాలు నేరఁ దనకేలే యలుక

చ. 1: నవ్వితే నవ్వుదును నామోము చూచితే-
నివ్వల నేనూఁ జూచే దింతేకదే
రవ్వతన మెఱఁగను రాజసాల కోపను
దవ్వులనుండి వచ్చి తనకేలే యలుక

చ. 2: పలికితేఁ బలికితి పైఁ జేయివేసితేను
యెలమి నేనూ వేసితి నింతేకదే
యెలయించనొల్లను యిచ్చకము నేరను
తలుపు మాటున నుండి తననేలే యలుక

చ. 3: కూడితేఁ నేఁ గూడితి కొసరితేఁ గొసరితి
యీడనే శ్రీవేంకటేశు నింతేకదే
పాడిపంతా లెఱఁగను వచ్చి సేయఁజాలను
తాడుపడి యిందాఁకాఁ దనకేలే యలుక

రేకు: 1053-4 రామక్రియ సంపుటం: 20-316

పల్లవి: ఘూత నలుపుఁ దెలుపు కన్నులందె నొంటెనట
అతని నీసందికోపా లంతకంటేనా

చ. 1: సతి నీమోమున నదే సంపెంగతావి వలిచీ
మితిమీరె కురులతుమ్మిదలు నందె
అతివైరమును శాంత మందులో నోరిచితివి
పతితో నేఁటికి నింకఁ బలుకవే నీవు

చ. 2: చెలి నీనడుమ నదే సింహము పోలికలాయ
కలసెఁ బాదాల గజగమన మందే
చలువకు వేఁడికి సరి నం దోరిచితివి
చలము సాదించి పతి జంకించ నేఁటికినే

చ. 3: జక్కవలే కుచములు చందురుఁడే నీమోము
వొక్కటొక్కటి వైరము లోరిచితివి
యెక్కువ శ్రీవేంకటేశు నిదెటిఁగే కూడితివి
వొక్కటై చెక్కునొక్కఁగ వొద్దన నేఁటికినే

రేకు: 1053-5 బౌళి సంపుటం: 20-317

పల్లవి: మూసి మంతనాలమేలు మూట గట్టేవా
వాసుల వంతులనే వడ్డివారీనా

చ. 1: మోనమున నుండనేలే మొకము వంచఁగనేలే
నానఁబెట్టితే వలపు నయమెక్కీనా
సానఁ బట్టేచూపులేలే సమ్మతిగా నినవ్వేలే
యీనెపానన్నైనఁ గొంత యీసు వోయీనా

చ. 2: నేలవ్రాఁత లిప్పుడేలే నివ్వెరగు నీ కేలే
మూలవేసితే వయసు మొదలయ్యీనా
తాలిము లింతేసేలే తడవు సేయఁగనేలే
కాలము గడపఁగాను కండగట్టీనా

చ. 3: సెలవి నవ్వితివేలే చేతివిదింపులేలే
మొలపించేవు సిగ్గులే మొనలయ్యీనా
బలిము శ్రీవేంకటాదిపతి నేఁ గూడితి నిన్ను
పలుకుఁ బంతాన నింత పరిణామమా

రేకు: 1053-6 నారాయణిదేశాక్షి సంపుటం: 20-318

పల్లవి: కంటిమి నీజాడలెల్లా కానీవయ్యా
జంటలే చాయకు వచ్చి చవివుట్టెనా

చ. 1: నవ్వేటి నీనవ్వులను నయగారిమాఁటలను
దివ్వెలెత్తుఁ బొద్దులాయ తెల్లవారెను
పువ్వుల వేట్ల చేత పొరుగు పోరచిచేత
దవ్వులే చేరువలై తతి వచ్చెనా

చ. 2: వొలిసి నొల్లములను వొడబాటుఁ బాగులను
పొలసి యమాస వోయ పున్నమ వచ్చె
తలపోఁతచేత మంచితనువు సోఁకులచేత
చలివాసి వలపులు సరివచ్చెనా

చ. 3: యిచ్చేటి వీడెములను యితవైన ఆనలను
నచ్చినపెండ్లి నేఁడే నాగవల్లాయ
అచ్చపు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పచ్చిగాఁ గూడఁగా నేఁడు ఫలియించెనా

రేకు: 1054-1 సాళంగనాట సంపుటం: 20-319

పల్లవి: అటువంటి నిన్నేమందు ఆపె నేమందు
తటుకున మీసిగ్గులు తడవ నేమున్నది

చ. 1: శ్రీసతి కాఁగిటనుండి జిడ్డు గొల్లెతల నెల్ల
బాసలిచ్చి కాఁగిలించి పాలించితి
మోసపుచ్చి అందులోన మొఱఁగఁగఁ జోటులేదు
యీసరియాఁడు వారిలో నింతబండు గలదా

చ. 2: భూమిదేవిని వీపుఁన పూఁచి మోచి అచ్చరల
దోమటిఁ బదారువేల దొమ్మిఁ గూడితి
బూమెలు సేసి నీ కంతబొంక విందు యెడలేదు
బామినుల పొందికలు వచ్చి సేయఁ దగునా

చ. 3: శిరసుపై తులసిని చెక్కుక మరెఁదరైన
తరుణులఁ గూడితి నన్నుఁ దగఁ గూడితి
యిర వెఱిఁగుండఁగానే యింత భ్రమయించరాదు
నిరతి శ్రీవేంకటోశ నీకే తెలును

రేకు: 1054-2 బౌళి సంపుటం: 20-320

పల్లవి: తతివచ్చె వింక దయదలంచరాదా
యితరులవలెం జెలి యింత కోపంగలదా

చ. 1: కేలుం గేలుం గీలించి గిలిగించే వాపె నిన్ను
నాలిసేసి సారె సారె నవ్వెనంటాను
మేలములనే యలసె మేనెల్లాం జెమరించె
యీలావులు నీవు సూపె వింత కోపంగలదా

చ. 2: పయ్యదలోం జేయిచాంచి బలిమిం జన్ను లంటేవు
వొయ్యనే ఆపె నీపు నొరగెనంటా
నెయ్యపుం జేంతలం జొక్కె నేరుపున నీకు మొక్కె
అయ్యెడ నీతో నూంకోన నంత నంత కోపంగలదా

చ. 3: కాయము నీవే యంటి కాంగిలించే వాపె నీపై
చాయచేసుకొని చేయి చాంచెనంటాను
యీాయెడ శ్రీవేంకటేశ యెనసి మై పులకించె
యేయెడనైనాం జెప్పె వింత కోపంగలదా

రేకు: 1054-3 శ్రీరాగం సంపుటం: 20-321

పల్లవి: నిలువులమేడలో నిలుచున్నాఁ డిదె
పిలువవే రమణునిఁ బ్రేమముతోడ

చ. 1: చలివేఁడి చేమటల జలక మార్చవే
అలసి వచ్చెఁ బతికి యందుండి
పలుకుల కపురపుబాగా లీవే
తలఁపుల తమకపు దాహము గొనెను

చ. 2: తనువులక విరులఁ దగఁ బూజించవే
తనకుఁ దనకె నినుఁ దగిలీని
కనుఁగొన నవ్వుల గందము పూయవే
వెనకటి విరహపువేదన దీర

చ. 3: పొరి మోవితేనె బువ్వము దొడుకవే
గరిమ రతుల నాఁకలి గొనెను
మరిగి యితనితో మంతనమాడవే
యిరవుగ శ్రీవేంకటేశుఁడు గూడె

రేకు: 1054-4 భైరవి సంపుటం: 20-322

పల్లవి: చిన్నదానఁ జేసినట్టు సేయుమనవే
విన్నపమిదే తనకు వేవేల కనవే

చ. 1: సిగ్గువడ్డచిత్త మిది చేరి మాటాడనియ్యదు
యెగ్గుపట్టుఁ జో నాతఁ డేమిసేతునే
అగ్గలపు సతులలో అరితేరినట్టి వాఁడు
వొగ్గి తానే యిప్పుడు నా వొద్దికి రమ్మనవే

చ. 2: జవ్వనపుమద మిది సరసములాడనీదు
రవ్వఁ గాఁతాళించునేమో రతి నతఁడు
యివ్వల నావంటివారి నెదుగా నేలినతాను
మవ్వపుఁగూరిమి నన్ను మాటాడించుమనవే

చ. 3: తనకాఁగిటిదేహము తగులు వాయఁగనీదు
అను వెట్లనో తనక దెలిఁగనే
యెననెను శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ దాను
మనసుమర్మ మెరిఁగి మన్నించుమనవె

రేకు: 1054-5 సౌరాష్ట్రం సంపుటం: 20-323

పల్లవి: ఏమయ్యా నీదయ యెన్నఁటికయ్యా
దీమస మిచ్చి చెలియఁ దెలుపవద్దా

చ. 1: చెక్కులపైఁ జెమటలు చెలికిఁ గారఁగాఁ జూచి
వెక్కసపు సురటిని విసరవద్దా
అక్కజమై నీతో మాటలాడి అలయఁగాఁ జూచి
యిక్కడఁ గప్రపుఁబలు కియ్యవద్దా

చ. 2: సందడిఁ జెంపలవెంట జారిన నెరులు చూచి
ముందుముందే యీచెలికి ముడువవద్దా
చెంది నీకుఁగాఁ గరఁగి సిగ్గువడఁగాఁ జూచి
అందుకొని సేదదీర్చి అసరేఁచవద్దా

చ. 3: కప్పుచు బాగా లిచ్చి కాఁగిలించే చెలిఁ జూచి
దప్పివాయ మోవి యిచ్చి తనుపవద్దా
ఇప్పుడే శ్రీవేంకటేశ ఇంతసేసి కూడితివి
ముప్పిరిసంతోసా లిట్టె ముంచవద్దా

రేకు: 1054-6 ఆహిరి సంపుటం: 20-324

పల్లవి: ఏకచిత్తమున నుండు యిదివో యాపె
చేకొనుము రమణుఁడ చింతదీరె నేఁడు

చ. 1: పాసి నీతో సారె సారె పంతాలాడిన యాపె
వాసి దలఁచుకయ్యైన వచ్చెఁగా నేఁడు
కాసు సేయని పనికి కన్నులఁ దిట్టినయాపె
ఆసలు వుట్టఁగ మాటలాడెఁగా నేఁడు

చ. 2: దగ్గరక నిన్ను నట్టె తప్పులెంచినట్టి యాపె
వెగ్గళించి నీపైఁ జేయివేసెఁగా నేఁడు
వొగ్గి నీపనులకెల్ల వొడఁబడకుండినాపె
సిగ్గుదేర నిన్నుఁ దానే చెనకెఁగా నేఁడు

చ. 3: మంచముమీఁదనే వుండి మాయలు నెరవినాపె
కొంచక నీకాఁగిటఁ గూడెఁగా నేఁడు
యెంచక శ్రీవేంకటేశ యెనసితి విఁక నాపె
మించి నిన్ను లోఁగొనె మేలుగా నేఁడు

రేకు: 1055-1 ఆహిరి సంపుటం: 20-325

పల్లవి: దేవ నీవునికి తేటతెల్లయను
భావించ మాకుఁ గన్నులపండుగాయను

చ. 1: పన్నీటిజలకములు బామ కనుచూపులును
యెన్నికఁ గూడుక నీపై నేరులై పారె
తిన్నని చెమలెల్లా తిరుమేననెల్లా నిండె
అన్నిటా ముతేల పేనుహారములాయ

చ. 2: తెల్లనికప్పురకాపు తెఱవనవ్వులుఁ గూడి
పొల్లుగా నీపుప్పొళ్ల పోగులాయను
మెల్లనే నీవూరుపుల మించులరవలు రేఁగె
వొల్లనే తడిసూళ్లవొత్తులాయను

చ. 3: అంగపుఁ బుళుగు కాపు అలమేలుమంగఁ గూడి
సింగారాలాయను మంచుసిరులాయను
ముంగిట శ్రీ వేంకటేశ మోహనపు నీకూటమి
సంగతిఁ బూవుదండల జాడలాయను

రేకు: 1055-2 శుద్ధవసంతం సంపుటం: 20-326

పల్లవి: సవతైనా నాపె మేలు సరి నీకంటె
ఆవల నాపెచెప్పిన అట్టె నేయవయ్యా

చ. 1: యేపున నన్ను మన్నించి యేమి సేయవలసిన-
నాపెనే యేకతమున నడుగవయ్యా
దాపుగ నాఁడుజాతికి దయగల దెప్పుడును
మాపుదాఁకా మగవాఁడు మత్తుడే యెంచఁగను

చ. 2: నేరుపున నీవు నాతో నెత్తమాడవలసిన
కోరి యాపె నొద్దఁ బెట్టుకొనవయ్యా
అరితేరినాఁడు వారి కాఁడువారే తోడునీడ
గారవపు మగవాఁడు కపటే యెపుడు

చ. 3: శ్రీవేంకటేశ్వర నన్నుఁ జేకొని కూడితి విట్టె
యేవేళ నలమేల్మంగ కియ్యకోలయ్యా
కైవశమై ఆఁడువారు కనిపించేయట్టివారు
వాపులనే మగవారు వంతువా నెఱఁగరు

రేకు: 1055-3 గౌళ సంపుటం: 20-327

పల్లవి: గుట్టుతోడ నుండవయ్య కోరిన కోరికలాయ
చిట్టిక మింతయుఁ బాసె చింతలేల ఇఁకను

చ. 1: మొగము చూచినందె మోహము నాకుఁ దెలిసి
నగితి నందుకుఁ దగ నానఁబెట్టి
జగడాలన్నియుఁ దేరె చనవు నా కిచ్చితివి
యెగసక్కెములు లేవు యిఁకనేల మాటలు

చ. 2: వీడెమిచ్చినందే నీవేడుకెల్లాఁ గానవచ్చి
ఆడితిని సరసము లందుకుఁ దగ
ఆడ కోలుమాట చెల్లె సంగము లంటితి నిట్టె
సూడుఁబాడు గాదు వట్టిసొలపేల ఇందుకు

చ. 3: దగ్గరినందే నీతలఁపెల్లాఁ గనుకొని
వొగ్గితి నీరతులకు వొద్దికతోడ
అగ్గపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
సిగ్గుదేరఁ గూడితివి చేత మొక్కే నిపుడు

రేకు: 1055-4 ముఖారి సంపుటం: 20-328

పల్లవి: చేరి యిందుకుఁగా నే నీచెక్కు నొక్కేను
నేరనివారని కన్నీ నేరుపుటే పుణ్యము

చ. 1: నీవంకఁ గడమలేదు నేనే దూరుదుఁగాని
మూవంకల నిందుకు నే మొక్కేనయ్యా
తావున మోహించినట్టి తమకాన నాఁడువారు
సేవలు సేయఁబోఁగానే చేయి కాలు దాఁకును

చ. 2: తప్పువు నీ వేమిటాను తతిమీరుదు నేనై తే
యిప్పు డన్నిటికిఁ బంతమిచ్చేనయ్యా
వొప్పుగా నేకతవేళ వుండేవూడిగపువారు
ముప్పిరిఁ బాదా లొత్తఁగ మునిగోరు దాఁకును

చ. 3: అట్టె శ్రీవేంకటపతి వలమేల్మంగను నేను
చుట్టిరికము నేతువు సొలతు నేను
పట్టదేవైన నేను పానుపుపై నుండఁగాను
మట్టుమీరి పెనఁగఁగ మర్మములు దాఁకును

రేకు: 1055-5 హిందోళం సంపుటం: 20-329

పల్లవి: నన్ను మీరఁ డాతఁడు నమ్మినదాన నేను
పన్నినమాయల కేమిఁ బదరకువే

చ. 1: పాయము గడచనదు పంత మింతలోఁ దప్పదు
ఆయములు మోవ మాటలాడనీవే
చాయకాఁ డాతఁ డూరకే చల్లువల పేఁదైనా
చేయి నాచేఁ జిక్కినది చెలఁగనీవే

చ. 2: తలఁ పాకచో నుండదు తమి పండి పొల్లవోదు
నలువంక వారి తోడ నవ్వనీవే
సులభుఁ డాతఁడు తాను చూపుల పేరెలు వారు
నిలువెల్ల నాసొమ్ము నేరుచుకోనీవే

చ. 3: కోరికెకు గురిలేదు కొసరులు మీఁదువోదు
చేరి యందరితో నంటు సేయనీవే
అరయ శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
గారవించి నన్నుఁ గూడె కై కొననీవే

రేకు: 1055-6 ఆహిరి సంపుటం: 20-330

పల్లవి: ఆడఁగలమాట లాపె నాడవయ్యా నీ
వేడుకలోనివారము వేరొకర మయ్యేమా

చ. 1: చిత్తమువచ్చినవారే చేరి నవ్వఁజెల్లుఁగాక
కొత్తవారు నవ్వఁబోతే కోపముగాదా
హత్తి వూరకున్నారంటా నండవారి సొలసేవు
విత్తక తొలుతే పైరు వేరే కలుగునా

చ. 2: కడుదగ్గరినవారే కైదం డియ్యఁ జెల్లుఁగాక
యెడపులవా రిచ్చితే నెరవే కాదా
తడసి కొలువువారు దగ్గరరంటాఁ దిట్టేవు
వడిగొన్న వానలేని వఱదలు గలవా

చ. 3: పురము అలమేల్మంగ వొరయఁగఁ జెల్లుఁగాక
వరుసవా రొరసితే వాసిరేఁగవా
గరిమ శ్రీవేంకటేశ కమ్మటి మమ్ముఁ గూడితి
సరసమాడినవావే సతమై నిలిచెఁగా

రేకు: 1056-1 కన్నడగౌళ సంపుటం: 20-331

పల్లవి: ఇంతటనైన మన్నించు యీమాటాడితి నేఁడు
ఇంతులకు నీకు నేను ఇచ్చలాడేదానను

చ. 1: నీపై మోహపుదాన నీనెలఁత లిందరును
దాపుగా నీవలెనే దయఁజూతురు
రాఁపులోనిదానఁ గాను రమణులకును నీకు
చేపట్టి యేకతవేళ సేవ చేసేదానను

చ. 2: చేసన్న దానను నీకు చెందిన నీసతులను
ఆసలెల్లా నెరవేర్చి ఆదరింతురు
వేసరించేదానఁ గాను వెలఁదులకును నీకు
సేసలు వెట్టించి నట్టి చేతిలోని దానను

చ. 3: అలమేలుమంగ నేను అక్కున నుందాన మీవా
రెలమి నాపంపు నేసి ఇయ్యకొందురు
కలసితి విట్టె శ్రీవేంకటేశ నే వింతఁ గాను
పొలఁతులను నిన్ను నేఁ బొగడేటిదానను

రేకు: 1056-2 ముఖారి సంపుటం: 20-332

పల్లవి: ఏల మాను నీ వోజ యెం తైనాను
నాలితోడ చెలులెల్లా నవ్వేరు నిన్నును

చ. 1: వొట్టుక వెన్నలనాఁడు పుట్లెక్కి పెద్దవై
యిట్టె రుక్మిణి పెండ్లి తేరెక్కితివి
చిట్టికాన చిన్ననాఁడు సేసినట్టు సేసితివి
నెట్టన నింతదొరవై నేఁడు సేయవలెనా

చ. 2: పసిబాలనాఁడు నీవు బండికి బాదము చాఁచి
దెసల నర్జునుబండితేరు నెక్కితి
శిసువవై నాఁడేమి సేసినా నమరుఁగాక
కొస రింతవాఁడవై యాగుణములే వలెనా

చ. 3: చిన్ననాఁడు గొల్లెతలఁ జేరి చనుఁగొండలెక్కి
చిన్నియారథమెక్కితి శ్రీవేంకటాద్రి
పిన్న నాఁటిచేఁతలే పెద్దనాఁడుఁ జేసితి
వెన్న అలమేల్మంగ నెనసింతవలెనా

రేకు: 1056-3 శుద్ధవసంతం సంపుటం: 20-333

పల్లవి: అండనుండేవారము అడ్డము నేరము
నిండుకొని మీకుమీకే నెలవుకోరయ్యా

చ. 1: చెలినీలో మాటలు సిగ్గులలో తేటలు
చలివాయ వింటిమి మాసాకి రేలయ్యా
వలపులు వడ్డివారీ వాదు లెక్కడిమి మీకు
చలిమి బలిమి మీరే సంతము గారయ్యా

చ. 2: మగువనీనవ్వులు మరునంపపువ్వులు
తగవు దేర్చితిమి మంతన మేలయ్యా
చిగిరించె తమకము చింత లెక్కడివి మీరు
మొగములు చూచి మీరే మొక్కులాడరయ్యా

చ. 3: వనితనీచూపులు వడిఁ దరితీపులు
మనసురాఁ జేసితిమి మఱి యేలయ్యా
అనుగుశ్రీవేంకటేశ అలమేల్మంగయు నీవు
యెనసితి రిఁకను మీ కిచ్చలాడేమయ్యా

రేకు: 1056-4 దేసాళం సంపుటం: 20-334

పల్లవి: ఎమ్మెల నాలిమగని కిద్దరికిఁ దగునయ్యా
మమ్ముబోంట్ల నన్నిటా మన్నించుఁడీ అయ్యా

చ. 1: చేకొని మీరిద్దరు నా చేత మాటఁబడితిరి
ఆకెయు మీరు బదుకుఁడయ్యా యింక
నాకన్నుల జంకెలకు నవ్వులేల నవ్వితిరి
మీకెవ్వరు యిట్టె సరి మేలు గానిమ్మయ్యా

చ. 2: మంతనాన నుండి మీరు మచ్చిక నేఁ జూచితేను
పంతమిచ్చితిరి యిట్టె బదుకుఁడయ్యా
బంతి నేఁ గొసరితేను బాగాలు నా కిచ్చితిరి
సంతోసాలు మీ కెప్పుడు సరి గానిండయ్యా

చ. 3: ఇల నాకుఁ జనవిచ్చి ఇద్దరు నాచెప్పినట్టు
పలుమారుఁ జేసితిరి బదుకుఁడయ్యా
అలమేలుమంగవు నీ వాతఁడు శ్రీవేంకటేశుఁ
డెలమి నన్ను మెచ్చితి రిద్ద రీడేరుఁడయ్యా

రేకు: 1056-5 లలిత సంపుటం: 20-335

పల్లవి: ఊడిగపువారము వూరకుండేవారము
జోడగు మీసరసాలు చూచుకుండేమా

చ. 1: అంగన నీ మోము చూచె నందుకు నీవు నవ్వితి-
వంగములు చెమరించె నంతలో మీకు
చెంగట సురటి గొని చేరి విసరేము నేము
యెంగిలి మీరతులు నే మెఱుఁగుదుమా

చ. 2: వనిత చేయెత్తి మొక్కె వలపులు చల్లితివి
మనసులు సరిదాఁకె మచ్చిక మీకు
వెనుకొని నేము నట్టె విడెము లిచ్చితి మదె
అనుగు మీయేకతాలు అడిగితిమా

చ. 3: అలమేలుమంగ మెచ్చె ఆయాలు మీ వంటితివి
కళలు రేఁగెను శ్రీవేంకటేశ మీకు
బలిమి మీరు గూడఁగ పచ్చడము గప్పితిమి
తలఁచేమీకోరికలు తడవితిమా

రేకు: 1056-6 బౌళి సంపుటం: 20-336

పల్లవి: ఇంత గలుగకుండితే నేఁటిపొందులు
వింతగా విభుఁడ నాఁడే విన్నవించమా

చ. 1: చిగురుఁ బెదవులనే చెలి నీతో మాటలాడీ
మొగము నీవు చూచితే మొక్కీఁ దాను
నగేటి సెలవులను ననుపులు నటియించీ
తగులైన వలపులతారుకాణఁ లిట్టివి

చ. 2: వంచినట్టి శిరసెత్తి వాడికచూపులు చూచీ
ముంచి నీవు చెనకఁగ మొక్కీఁ దాను
మంచముపై వేడుకల మచ్చికలు వచరించీ
కంచపు రతులలోని కాంక్షలెల్లా నిట్టివి

చ. 3: దప్పులువాయఁగ నిన్ను దండకుఁ దీసుకొనీని
ముప్పిరి నీవు గూడఁగ మొక్కీఁ దాను
చిప్పిలు నీభోగముల చిమ్మిరేఁచీఁ బులకలు
తప్పని శ్రీవేంకటేశ తమకము లిట్టివి

రేకు: 1057-1 దేవగాంధారి సంపుటం: 20-337

పల్లవి: చిత్తగించి మాపై దయసేతువుగాక
బత్తిగలవాఁడ వింత పచ్చిసేయనేలా

చ. 1: మక్కువ నీపాదాలు మరిగినదాన నేను
యెక్కువ తక్కువమాఁట లేకనేలా
చెక్కులు, నీవు నొక్కఁగా సేదదేరినట్టిదాన
పక్కన నంతేసి వేరే పరాకులేలా

చ. 2: చేరి నీకు నేపొద్దు చెప్పినట్టు సేసేదాన
కూరిమి నీలో వట్టిగుట్లేలా
మేరతో నీసన్నలతో మెలఁగేటియట్టిదాన
గారవించితివి నన్ను కడమ మరేలా

చ. 3: కందువనీ కాఁగిటికి గలిగిన యట్టిదాన
చందాలు సేనుక వట్టిజాగులేలా
యిందుకే శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చెందెను నీదయ నాపై చింత లేకనేలా

రేకు: 1057-2 దేశాక్షి సంపుటం: 20-338

పల్లవి: రమణికడకు నిట్టె రావయ్యా
సముకాన నీకిన్ని చాటిచెప్పె నీఁకను

చ. 1: మంతనపు నీచేఁతలే మాపుదాఁకా వినివిని
కాంత చెలులతోడ కడునవ్వెను
వింతలైననీగుణాలు విచారించుకొని లోలో
చెంతలనే తలపూఁచి నేదదేరి మెచ్చెను

చ. 2: వేడుకైన నీమాటఁలే వేగినంతా నాడుకొని
జాడతోనే సారెసారె సంతసించెను
కూడిన నీకూటముల గుఱుతులు చూచుకొని
వాడుదేరి నీమీఁద వలపులు చల్లెను

చ. 3: యిక్కువై న నీరాకకు నిందాఁకా నెదురు చూచి
గక్కన నిన్నుఁ గాని కాఁగిలించెను
తక్కక శ్రీ వేంకటేశ తతి నిట్టె కూడితివి
పెక్కు భావముల నీపై ప్రియమే పెంచీవి

రేకు: 1057-3 పాడి సంపుటం: 20-339

పల్లవి: నీ వెప్పుడూ ఘనుఁడవే నే నీచేతిలోదానను
యేవేళ నెట్లున్నా నేమాయ నీకు

చ. 1: వన్నెల నన్నింత నీవు వలపించిన వాఁడవు
కన్నుల నాచూపులకుఁ గాచుకుందువు
పన్ని తాము చేసే పైరుపంట కెదురుచూడరా
యెన్ని సేసిన నాయెడ కేమాయ నీకు

చ. 2: తలఁపెల్ల నీ వన్నిటా దక్కఁగొన్నట్టివాఁడవు
పలుకులు నావెల్లాఁ బాలింతువు
మలసి తమచిలుకమాటలు ముద్దు సేయరా
యెలమి నాకొరకుఁగా నేమాయ నీకు

చ. 3: కందువ నారతులను కలసినట్టివాఁడవు
మందెమేళములు నావి మన్నింతువు
విందారగించేటివారు వేడఁయిన నోర్వరా
యిందులో శ్రీ వేంకటేశ యేమాయ నీకు

రేకు: 1057-4 పంతువరాళి సంపుటం: 20-340

పల్లవి: కుచ్చితము లెఱఁగని కోమలులము
బచ్చన చేఁతల నేరుపరి విదె నీవు

చ. 1: అప్పటి నీసుద్దులెల్లా నాడుకొనఁగా నింతలో
యిప్పుడు విచ్చేసితివి యీడకే నీవు
ముప్పిరి నిన్నుఁ జూచి మొక దాకిరిని నీతో
విప్పేటి సెలవుల నవ్వే మిదే నేము

చ. 2: పంతపునీపై పాదాలు పాడఁగానే యేకతాన
వింత లిదె నీకు నీవె వింటివి నేఁడు
కొంత ముండె మేళముగఁ గొసరఁగఁ జాలక
బంతినే నీరూపము తప్పక చూచితి మిదివో

చ. 3: ప్రియమున నాలో నిన్ను పేరుకొని పిలువఁగ
దయతోఁ బలికితివి దగ్గరి నీవు
నియతి శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడి పాయ కిట్టె
నయమై నీసరసాన నంటుసేసే మిదివో

రేకు: 1057-5 కాంబోది సంపుటం: 20-341

పల్లవి: చిత్తముకొలఁది మరి చెలిభాగ్యము
హత్తి విన్నవించలేక అండనున్న దానను

చ. 1: కొమ్మతో నీవన్నమాట కొంగుముడి వేసుకొని
ఇమ్ముల నెదురుచూచీ నింటికాడను
రమ్మనఁగా నేమందువో రాజసపు వాఁడవు
వుమ్మడిఁ గానుక యిచ్చి వూరకున్న దానను

చ. 2: కాంతతో నవ్వినవ్వు కట్టికపుసై సేసుక
పంతాన రతుల గోరిఁ బానుపుమీఁద
ఇంతలో కొంగువట్టితే నెట్టుండునో ఘనుఁడవు
అంత నిన్నుఁ గొసరక ఆసల నుందానను

చ. 3: సతికిచ్చిన కాఁగిలి సవరాజ్యము సేసుక
మతిలోనే నిన్నుఁ గూడీ మాటికిమాటికి
రతి సేసితివి నేఁడు రమణి శ్రీ వేంకటేశ
మతకరితనమున మట్టున నుందానను

రేకు: 1057-6 పాడి సంపుటం: 20-342

పల్లవి: నేరుపరు లిందరును నెరజాణఁడాతఁడు
ఆరీతి వేసరకుండా నండకుఁ దేఁగదరే

చ. 1: వాసులేల రేఁచేరే వద్దువద్దు ఆతనితో
సేసుకొన్నమగఁడట చెప్పవలెనా
ఆసపడ్డదాన నేను ఆయ మెరుఁగు నాతఁడు
వేసట గాకుండానే విన్న వించఁగదరే

చ. 2: తప్పులేల మోపేరే తగవుగా దాతనికి
కుప్పళించే వలపట కొసరనేల
కప్పురపుదాన నేను కలిగినవాఁ డతఁడు
యెప్పుడుఁ జిన్నఁబోకుండా నెఱిఁగించఁగదరే

చ. 3: సిగ్గులేల పరచేరే చేతికిలోనై తానే
వొగ్గి శ్రీవేంకటేశుఁడే వొనగూడెను
తగ్గులేనిదాన నేను దయఁజూచేవాఁడు దానే
కగ్గులేకుండా నిచ్చకము లాడఁగదరే

రేకు: 1058-1 సామంతం సంపుటం: 20-343

పల్లవి: నెలఁతఁ గరుణించితి నెరజాణఁడవు నీవు
నెలకొంటి విఁక నిట్టె నిండుకొనవయ్యా

చ. 1: కాంతపై నీచూపులనేక లువలు చల్లి
దొంతిఁబెట్టితి వలపు తొలునాఁడే
బంతెనఁగూళ్లు నేఁడు పచ్చదోరణాలు నేఁడు
చింతదీర భోగించి చిత్తగించవయ్యా

చ. 2: పోదిగొని నవ్వులకప్పురములు ముంచి చల్లి
గాదెఁ బోసితి మోహము కలనాఁడే
గాదిలి గుజ్జనఁగూళ్ళు కమ్మనిబువ్వాలు నేఁడు
యీదెస దోమటి దొడి కిచ్చగించవయ్యా

చ. 3: ఆసపాటుమాటల అధరపుఁ దేనె వూసి
రాసి చేసితివి మేలురతుల నాఁడే
వాసికి శ్రీవేంకటేశ వంతుల విందులు నేఁడే
సేసవెట్టి కూడితి వచ్చికములేదయ్యా

రేకు: 1058-2 ముఖారి సంపుటం: 20-344

పల్లవి: మన్నించవోయి మమ్ము మంచివాఁడ
విన్నపము వినవోయి వేడుకకాఁడ

చ. 1: ఆసలు మాకుఁజూపి అంగముపైఁ జేయివేసి
వాసులు రేచకువోయి వన్నెకాఁడ
బాసికము గట్టితివి పైసేస వెట్టితివి
నీసటల కోవుదునా నీటుకాఁడా

చ. 2: సన్నలు మాకు జేసి చవులుగా మాటలాడి
పన్నకువోయి మాయలు పసకాఁడ
కన్నులనే నవ్వితివి కందువలు చూపితివి
యిన్నియు నీ వెఱగవా యేతులకాఁడా

చ. 3: మరిగించి మమ్ము నీవు మంతనాన బాయకుండి
యెరవు సేయకువోయి యింపులకాఁడ
కరుణించితివి శ్రీవేంకటరాయ కూడితివి
సరవి నడపవోయి చాయలకాఁడా

రేకు: 1058-3 దేశి సంపుటం: 20-345

పల్లవి: కరుణగలవాఁడవు ఘనుడ విన్నిటా నీవు
తరుణిని నాతో నిట్టె తగులై వుండుమీ

చ. 1: చెక్కులు నొక్కితి నిన్ను సేదలు దేరిచితిని
మక్కువతో నన్నిట్టె మన్నించుమీ
మొక్కులు మొక్కి నీపై మోహము నేఁజల్లితి
తక్కుక నాపై నీఁక దయవెట్టుమీ

చ. 2: కన్నుల నే జూచితిని కందువలు నంటితిని
వెన్నెలనవ్వులు నాపై వెదచల్లుమీ
చన్నుల నొత్తితి నీతో సరసములూ నాడితి
యిన్నిటా మంచితన మిటు నాకుఁ జూపుమీ

చ. 3: సేవలు నేసితి నీకు జెప్పితి బ్రియములెల్లా
కైవశమై నీవు నాకు గలిగుండుమీ
వావులు చెప్పితి నీవు వరమిచ్చి కూడితివి
శ్రీవేంకటేశ్వర నన్ను జిత్తగించుమీ

రేకు: 1058-4 శుద్ధవసంతం సంపుటం: 20-346

పల్లవి: నంటున నీమేకులకు నవ్వేనయ్యా
దంటనైతి నీయెడకు తమక మేలయ్యా

చ. 1: చూపులనే తనిసితి సుద్దులనే చేలఁగితి
యీపొద్దు నాతోఁ బెనగే విదేమయ్యా
వోపిక నీకుఁ గలదు వొరయఁగరాదు నిన్ను
తీపులాయ నామోవి తెగువలేలయ్యా

చ. 2: మాటలనే భ్రమసితి మచ్చికలనే చొక్కితి
యేటికి నన్ను గొసరే విదేమయ్యా
నీటుకాఁడ వౌదువు నిన్ను వదలఁగరాదు
వాటమాయ తలపోత వంచనలేలయ్యా

చ. 3: రతుల నోలలాడితి రాజసాన బెరిగితి
యితవు నన్నడిగేవు యిదేమయ్యా
పతివి శ్రీవేంకటేశ పైపైఁ గూడితివి నన్ను
కతలాయ నామోహము కాదననేలయ్యా

రేకు: 1058-5 భైరవి సంపుటం: 20-347

పల్లవి: తామె యెఱుగుదురు తమతమభావము
చేముంచి యెవ్వరికిని చెప్పఁ జూపరాదు

చ. 1: మంతనపు పతిమాట మనసునఁ దలఁచుక
చింతించి చింతించి తానే సెలవి నవ్వె
వింత లీచెలివి చూచి వెరగయ్యీ నీవేళ
అంతరంగములోపను లవి యెటువంటివో

చ. 2: కన్నుల జేసిన సన్నకాయమున మెరమంగ
తన్నుఁ దానే పులకించి తలయూఁచీని
అన్నిటా నేమిందుకే ఆయములు గరఁగేము
మున్నీటి వొఁడబాట్ల ముచ్చట లెట్టివో

చ. 3: దగ్గర వచ్చిన మేలు తమకాన బోరుగఁగా
సిగ్గుతోడ గొంకికొంకి చేయివట్టెను
అగ్గమై శ్రీవేంకటేశు డంగన గూడె మెచ్చితి-
మెగ్గుదప్పులేనితమయెనయిక లెట్టివో

రేకు: 1058-6 ఆహిరి సంపుటం: 20-348
పల్లవి: నీతోఁబంతముగాదు నివ్వెర గింతేకాని
చేతులు చాఁచి యిట్టె చిత్తగించవయ్యా
చ. 1: శిరసు వంచుటేకాని చెలిచూపు నీపై నదె
సరసమాడవయ్యా సారెకు నీవు
ఇరవైన ఆపెగుట్టు యెఱఁగఁజెప్పితి నీకు
విరసము లేదాపెను వేఁడుకోవయ్యా
చ. 2: పిలువకున్నదిగాని ప్రేమమెల్ల నీమీఁద
బలిమి దగ్గరవయ్య పైకొని నీవు
కలిగినదేసుమ్మీ కల్లయించు కెఱఁగము
అలుక లేదాపె నీపై నాదరించవయ్యా
చ. 3: మాటాడకున్నదిగాని మనసెల్లా నీమీఁద
పాటించి భోగించవయ్య పైపై నీవు
చాటితి శ్రీవేంకటేశ సతి నిట్టె కూడితివి
యీటులేదు మీకిద్దరి కిట్టె వుండరయ్యా

రేకు: 1059-1 సింధురామక్రియ సంపుటం: 20-349

పల్లవి: ఎక్కువ తక్కువ లెఱఁగ మిదే
మొక్కఁగ నేరుతు మునుకొని నీకు

చ. 1: కలిగినమాటకుఁ గాదనరాదు
తొలఁగక చెలితో దూరితిని
తొలుతటివిధ మది తూరీ నన్నిపుడు
మెలుపునఁ గూడఁగ మెచ్చితి నిన్ను

చ. 2: చేసిన చేఁతలు చెప్పకపోదు
వేసితి నీపై వెసఁ దమ్మి
వాసి అప్పటిది వరుస నీ విపుడు
సేసలు వెట్టఁగఁ జేకొంటి నిన్ను

చ. 3: కూడిన కూటమి కొద మరిలేదు
వోడక కాఁగిట నొత్తితిని
వేడుక లావేళ విభవము లీవేళ
యీడనే శ్రీవేంకటేశ పొగడితి

రేకు: 1059-2 నాదరామక్రియ సంపుటం: 20-350

పల్లవి: వట్టిదూసకములేల వాదులేల నాకిఁక
దట్టముగ నీకు మంచిదాననై వుండేను

చ. 1: సరసుఁ డాడినమాఁట చక్కనే యందురుగాక
వొరయఁగవచ్చేరా వొకరైనను
ధరలో నేనొకతెను తప్పక నీమీఁదను
నెరుసు లెంచఁగఁబోతే నిజపట్టేరా

చ. 2: బలురాజు చేసే చేఁత పాడియుఁ బంతమెకాక
తలపోసి యెవ్వరైనాఁ దప్పు గొనేరా
వలచినదాన నేను వంతులకు నిన్ను మీరి
చలము సాదించేనంటే సాగఁబొయ్యీనా

చ. 3: మగఁడు వట్టితీసితేను మన్నించీ నందురుగాక
వెగటు లింతేఁటికి విడుమనేరా
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగి సిగ్గువడితేను నమ్మికయ్యీనా

రేకు: 1059-3 హిందోళవసంతం సంపుటం: 20-351

పల్లవి: కలదిదె మాట కట్టినయాట
చెలువుఁడు తనయిచ్చ సేసినట్టు సేయనీ

చ. 1: పంతము తనతో నాడి బలిమి సేయఁగ నోప
కాంతఁ దనసేవ సేయఁగలదానను
దొంతి నున్నవలపులు దోమటి దొడుకుకొంటా
చెంతల నే నుండఁగాను సేనినట్టు సేయనీ

చ. 2: మంకు దనతో నెరపి మాయలు సేయఁగనోప
అంకెఁ దనయిచ్చలోనిఆఁటదానను
లంకెలఁ దాఁ జేసినట్టి లచ్చనలు చూచుకొంటా
చింకచూపుల నుండఁగఁ జేసినట్టుసేయనీ

చ. 3: కందువలఁ దన్నుఁ గూడి కడకుఁ బాయఁగనోప
సందడి రతుల తనజంట దానను
అందపు శ్రీవేంకటేశుఁడైనతన్నుఁ బాడుకొంటా
చెంది కాఁగిట నుందాన సేసినటు సేయనీ

రేకు: 1059-4 ఆహిరి సంపుటం: 20-352

పల్లవి: నీ వెఱఁగని దున్నదా నెలఁతలాగు
చేవదేరి చెక్కుఁతోడి చింత లివే

చ. 1: పైపై నతివ నీకు ప్రాణమంటా నాడేవు
ఆపె చిత్తమున నున్న దామాఁటే
ఆపొందులు సిగ్గువిడిచాడఁగఁ జాలదుగానీ
మాపురేపు నెదలోని మర్మమిదే

చ. 2: అలివేణి పొందులే నీ కన్నిసంపద లనేవు
తలఁపులో నాపెకు యీతమకములే
చెలులు నవ్వేరని చెనకకున్నదిగానీ
కలలోనఁ గనియేటికాను పిదే

చ. 3: పడఁతిరతులే నీకు బ్రదుకని యెంచేవు
కడఁగి యాపెకు నిది కలగుణమే
తడవి శ్రీ వేంకటేశ తానే నీవనుండెఁగానీ
బడిపాయక కూడితి పంతము నిదె

రేకు: 1059-5 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-353

పల్లవి: పొందినట్టితనమేలు పొగడే నేను
యిందరిలో యీసలిగె యెవ్వరికిఁ గలదే

చ. 1: కైవశమై నాకుఁ దాను గలుగు టెఱుఁగుదును
సోవల నూరకే నేనూ సొలతుఁగాని
నావల్లఁ గొర తెంచఁడు నవ్వుతానే వుండు తాను
యీవలపు లీచనవు లెవ్వరికిఁ గలవే

చ. 2: వేడుకతో నామాఁట వినే దెఱుఁగుదును
జాడగా బొమ్మలనే పై జంకింతుఁగాని
యేడ నాతోఁ గలఁగఁడు ఇచ్చకములే సేఁసుగాని
యీడుజోడై యీననుపు లెవ్వరికిఁ గలవే

చ. 3: గక్కన నన్నిట్లాను కలసే దెఱుఁగుదును
పక్కనఁ బదరి నేను పై కొందుఁగాని
వొక్కటై శ్రీ వేంకటేశుఁ డొద్దనఁడు మెచ్చుఁగాని
యిక్కువలై యీభాగ్యా లెవ్వరికిఁ గలవే

రేకు: 1059-6 మాళవిగౌళ సంపుటం: 20-354

పల్లవి: వేగిరించ మనకేల వింతవారమా
పోగు సేతము వలపు పొందుదాఁకా నతఁడు

చ. 1: చేకొని యాపెయింటిలో చెలువుని మాటలయ్యీ
ఆకెఁదాను యేకతము లాడేరేమో
కాకు సేసినట్లయ్యీ గక్కన నేఁబిలిచితే
వాకిటఁ గాచుకుందము వచ్చుదాఁకా నతఁడు

చ. 2: పట్టెమంచమొద్దు నవె పైఁడిపావా లాతనివి
అట్టె యాపెతో సరసపాలాడీనేమో
పట్టితిఁ జొప్పులవిగో పచ్చి సేయ నిఁకనేల
గుట్టుతోఁ గోరుకొందము కూడుదాఁకా నతఁడు

చ. 3: పచ్చడముఁ గదె పనులెల్లాఁ గానవచ్చె
అచ్చముగాఁ గూడెనేమో ఆకె నిందాఁక
ఇచ్చకుఁడు శ్రీ వేంకటేశుఁడు నన్నిటు గూడె
నచ్చుల గిలిగింతము నవ్వుదాఁకా నతఁడు

రేకు: 1060-1 రీతి గౌళ సంపుటం: 20-355

పల్లవి: అన్నియు నీ వెఱుఁగుదు వద్దమాడ నే నీకు
మన్నించ నేరుతువు మారుమాట లేఁటికి

చ. 1: సేసవెట్టి నీవు నాపై చెలిమిసేసినట్టి-
వాసులకే పెనఁగేను వద్ద నుండి
సేసుకొన్న మగఁడవు చిత్తముకొలఁది ఇఁక
రాసికెక్కె నాపంతము రవ్వసేయనేఁటికి

చ. 2: కన్నులఁ జూచి నాతో కవకవ నవ్వినట్టి-
సన్నలకే పిలిచేను సారె సారెకు
యిన్నేసి నమ్మిక లిచ్చి తెటువలసినఁ జేయు
వన్నె వచ్చె నారతికి వంకలొత్తనేఁటికి

చ. 3: కందువకుఁ దీసి నన్ను కాఁగిలించి కూడినట్టి-
అందాలకే తగిలేను అప్పటనుండి
పొందిన శ్రీ వేంకటేశ భువి నీకృప నించితిఁ
పందమాయ నాజన్మము అలయించనేఁటికి

రేకు: 1060-2 శంకరాభరణం సంపుటం: 20-356

పల్లవి: ఎవ్వరికి విన్నప మిఁకనేల
యివ్వల నీదయ యింతటఁ గలది

చ. 1: మనసునఁ బెనగొనుమాటల కేకా
తనవునఁ దమకము తతిగొనెను
ననువున నుండిన నయములకేకా
కనుఁగొనఁ జూపులు కడిమిఁ జెలికి

చ. 2: నంటునఁ గొసరిననవ్వుల కేకా
జంటల నిట్టూర్పు సతమాయ
అంటుముట్టు అడియాసకేకా
మెంటునఁ జెమటలు మిక్కిలిఁ బొలసె

చ. 3: కూడిన తొల్లిటి కూటముల కెకా
వీడని వేడుక వెసఁ నలిగె
యీడనె శ్రీ వేంకటేశ కలిసితివి
నీడలఁ గాంతకు నిర్మలమాయ

రేకు: 1060-3 నాదరామక్రియ సంపుటం: 20-357

పల్లవి: పంతగాఁడవు నీకు బాఁలైతినా
యింతినై నన్ను మెచ్చే విది వలెనా

చ. 1: మచ్చికల నీతోను మాటలాడేయట్టివారు
చెచ్చెర నెందరు లేరు సేనాసేన
తచ్చనకు నే నీతో తలవంచుకుండఁగాను
యెచ్చరించి వేఁడుకొనే వింత వలెనా

చ. 2: జంటల నీవద్ద నుండి సన్నలు సేసేటివారు
యింట నీకెందరు లేరు యింకానింక
గుంటివెట్టి వాసులకు గుట్టుతో నే నుండఁగాను
అంటిమల్లి చేయివట్టే వంతేసి వలెనా

చ. 3: గక్కన నిన్నేడనైనాఁ గాఁగిలించేయట్టివారు
యిక్కువ నెందరు లేరు ఇంతానంతా
మొక్కి శ్రీవేంకటేశుఁడ ముంచి నే నిన్నుఁ గూడితి
చొక్కించి బుజ్జగించేవు సుద్దు లిన్ని వలెనా

రేకు: 1060-4 రామక్రియ సంపుటం: 20-358

పల్లవి: మఱి యేమిటికిఁ గాదు మతినేల పదరేవు
తఱిఁ దొల్లింటిపనులే తలఁచుఁగాని

చ. 1: పంతమేల యిచ్చేవు బాసలేల సేసేవు
యింతి పిలిచిన పని యిందుకుఁ గాదు
చింతదీర నీకు నాపె సేవసేసి మెప్పించి
అంతరంగము చేకొనేననికాని

చ. 2: నవ్వులేల నవ్వేవు నాటకమేల సేసేవు
యివ్వల సతి మొక్కిన దిందుకుఁ గాదు
పువ్వువలె భోగించి పొదిగి నిన్నుఁ జొక్కించి
అవ్వల నీకృపఁ బొందేననికాని

చ. 3: చెక్కులేల నొక్కేవు సిగ్గులేల ముంచేవు
అక్కునఁ జేకొన్నది యందుకుఁ గాదు
యిక్కువ శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగాను
అక్కజమై నిను మెచ్చేనని కాని

రేకు: 1060-5 హిందోళవసంతం సంపుటం: 20-359

పల్లవి: నీగుణము చక్కనాయ నిజమా యిది
వేగినంతా నిందులకు వెరగయ్యీ నాకు

చ. 1: అక్కడనుండి నాపై ఆసల నీవు కడు
నిక్కి చూచితివి యట నిజమా యిది
యెక్కడ నేరుచుకొంటి వెవ్వరు బుద్ధిచెప్పిరి
వెక్కసముగా నేడు వెరగయ్యీనాకు

చ. 2: భావించి నే నున్నందుకు పంతములు నీ విచ్చితి
నీవు నన్ను మెచ్చితట నిజమా యిది
సేవ లెట్టు చేకొంటివి చిత్త మెటువలె వచ్చె
వేవేలుచందములను వెరగయ్యీ నాకు

చ. 3: తలపోఁత కాఁగిలితగులాయముల నిట్టె
నెలకొంటి వన్నిటాను నిజమా యిది
కలసితి విదె శ్రీ వేంకటేశ యేకారణమో
వెలయ యీకరుణకే వెరగయ్యీ నాకు

రేకు: 1060-6 నాగవరాళి సంపుటం: 20-360

పల్లవి: తెలుసుకో యిఁక నీవు తెల్లవారె నీమాట
బలువుఁడ వీరెంటిపంతము నీచేతిది

చ. 1: వేసరిన వారితోడ వింతసుద్దలెల్లాఁ జెప్పి
వాసులేల రేఁచేవు వద్దు వద్దు
నీసరివారమా నేము నీతో మారాడేమా
పోసరించి దయఁజూచేపుణ్యము నీచేతిది

చ. 2: పూరకున్నవారిమీఁద వుమ్మగిలఁ జేయివేసి
సారెనేల పెనఁగేవు చాలుఁజాలు
నేరుపుగలవారమా నిన్నుఁగొసరఁగలమా
మేరతోడ నడుపేటిమేలెల్లా నీచేతిది

చ. 3: కనుసన్ననుండేవారిఁ గాఁగిటఁ జొక్కించి కూడి
పన్ని యెంతమన్నించేవు భళిభళి
నన్నుఁ గలసితి విదె నమ్మించి శ్రీ వేంకటేశ
యెన్నికైనపేరుఁ గీర్తియింతయు నీచేతిది

రేకు: 1061-1 ఆందోళి సంపుటం: 20-361

పల్లవి: ఇద్దరము నిద్దరమె యెట్టు వెనకతియ్యము
తిద్దేవానిఁ జూతము దేవరవు నీవు

చ. 1: మక్కువ నీతో నేను మాటలాడినట్టి మాట
అక్కడ నేల చెప్పితి వంతలోనే
పక్కన నప్పటి నాపెపంతము నాతోఁజెప్పేవు
నిక్కి యీపనులు దీర్చ నీకే భారము

చ. 2: చేపట్టి నీతో నేను సెలవి నవ్విన నవ్వు
ఆపెకేల కన్నుగీఁటే వంతలోనే
తీపులుగా నాకప్పటి తిరుగ సన్న సేసేవు
నీపొందులు జరపఁగ నీకే భారము

చ. 3: కూరిమితో నే నిన్నుఁ గూడినకూటము లివి
ఆరయ యందేలసేసే వంతలోనే
యీరీతి నాపెను నన్ను ఇట్టె సమ్మతి సేసితి
నేరుపు శ్రీ వేంకటేశ నీకే భారము

రేకు: 1061-2 పళవంజరం సంపుటం: 20-362

పల్లవి: చవిగానిపనికేల సాదించేరే
కవగూడినవా రింకఁ గాదంటే వినేరా

చ. 1: యొగ్గులు- సిగ్గులు లేవు యెనసినవారికి
అగ్గలముగఁ గూడేటియాసలే కాని
వొగ్గి మీ రేల చెప్పేరే వూరఁగలబుద్ధులెల్లా
అగ్గలపు వారిద్దరి కవి యితవవునా

చ. 2: చింతలు-వంతలు లేవు చేకొన్నవారికి
వింతలుగా నవ్వునవ్వేవేడుకే కాని
వంతుకు మీరందుకేల వంక లొత్తఁబొయ్యేరే
వంతపు వారివి నేఁడు పాటివట్టేరా

చ. 3: కడమఁదొడను లేవి కలసినవారికి
వుడివోని రతులలో వొద్దికే కాని
అడరి శ్రీ వేంకటేశుఁ డాపె నొక్కటి
యెడమాటలేలే వారు యెఱఁగని వున్నవా

రేకు: 1061-3 శ్రీరాగం సంపుటం: 20-363

పల్లవి: ఘనుఁడవు నీవెట్టున్నాఁ గాదనేమా
వినఁగానే మీకు విన్నువించేము గాక

చ. 1: చనవిచ్చి నీవు మాకు చలివాపఁగాఁ గదా
ననుపుసేసుక సారె నవ్వేము నేము
మనసు వేరొకటైతె మాటలాడ వచ్చేమా
వొనరి దయఁజూడఁగ నొరసేముగాక

చ. 2: మందెమేళముగా మమ్ము మన్నించఁగాఁ గదా
సందడిఁ బెనఁగేము నీసరుస నేము
అందాలకు రాకుంటే నాయములు చెనకేమా
పొంది మమ్ము మెచ్చఁగానే భోగించేము గాక

చ. 3: వావి సేసుకొని మమ్ము వడిఁ గలయఁగఁ గదా
వోవలఁ గుచగిరుల నొత్తేము నేము
శ్రీవేంకటేశ్వర నీవు చేపట్టకుంటే మొక్కేమా
కైవశము గాఁగానే కైకొంటిమి గాక

రేకు: 1061-4 మౌళవిగౌళ సంపుటం: 20-364

పల్లవి: రచ్చలఁబెట్టి కతని రారే మీద
చెచ్చెర నాయింటిదిక్కు చిత్తగించీ దానే

చ. 1: అతఁ డెఱిఁగినవే అన్నిబుద్ధులును భూమి
యీతల చెలులు సారెనేల చెప్పేరే
నీతిగలవాఁ డతఁడు నిక్కలఁ గందాన నేను
యేతుల నేఁడే చనవు లిచ్చీనే తాను

చ. 2: రమణుఁ డిచ్చినవే రాఁపులవిడేలెల్ల
జమళి మీరే లతని సాదించేరే
మమత గలఁ డాతఁడు మాటగొన్నదాన నేను
సమముగా నాపైఁ జేయిచాఁచీనే తాను

చ. 3: శ్రీవేంకటేశ్వరుడేఁ చేసినచేఁత లన్నియు
వేవేలుచందాల నేల వేసరించేరే
కావించి యీతఁడె నన్నుఁ గలసె నేను మెచ్చితి
తావుల నిట్లా నాకు దక్కెనే తాను

రేకు: 1061-5 శంకరాభరణం సంపుటం: 20-365

పల్లవి: కొంకితి నందుకే కొనఁగొనలా
యింకా నీచిత్త మెట్టున్నదో

చ. 1: కందువ నినుఁగని కన్నుల నవ్వఁగ
అందుకు నెంతటిదనందువో
సందడి నీతో సరసములాడఁగ
మందెమేళమని మతిఁ బెట్టుదువో

చ. 2: చేతుల నీపై చెనకి చిమ్మితే
యేతు లనుచు మఱి యేదుమంవో
కాతరమున నిటు కడుఁబై కొనినను
నీతలఁపుల నేనెపము లెంతువో

చ. 3: నిలువునఁ గాఁగిట నిను నిటు మించిన
కొలఁది మీరె నని కొంతందువో
కలసితి శ్రీవేంకటేశ నన్నిదె
మలయుచు నెటువలె మరులుగొందువో

రేకు: 1061-6 నాదరామక్రియ సంపుటం: 20-366

పల్లవి: ఏల వేగిరించేవు యేఁటికి నీకు నలుక
నాలితనమెల్లా మాని నవ్వు నవ్వవయ్యా

చ. 1: తిట్టినపెదవినే దీవించె నదె యాకె
పట్టిన చలము మాని పలుకవయ్యా
నెట్టన నింతకతొల్లి నీవుసేసినటియా
దట్టపుఁ జేఁత లేఁటివో తలఁచుకోవయ్యా

చ. 2: దొబ్బినచేతులనే దోసిలించి మొక్కీ నాకె
అబ్బురా లేఁటికి విడె మందియ్యవయ్యా
గబ్బితనాన నీవొళ్లఁ గలిగినయట్టియా
తబ్బిబ్బుచేఁత లేఁటివో తలఁచుకోవయ్యా

చ. 3: వొరసిన చన్నులనే వొత్తి నిన్నుఁ గూడె నాకె
మరిగికూడితి విట్టె మన్నించవయ్యా
యెరవుల శ్రీవేంకటేశ నీచిన్ననాఁటి
ధరలోనిపను లెల్లాఁ దలఁచుకోవయ్యా

రేకు: 1062-1 సామవరాళి సంపుటం: 20-367

పల్లవి: నీ కెట్టు దెలుసును యీనెలంత లెరుఁగుదురు
సాకిరి వీరు చెప్పఁగా సమ్మతౌట గాక

చ. 1: ఇక్కువ లంటేటివేళ ఇద్దరము నిద్దరమె
యెక్కువ తక్కువ లెంచ నీకనేల
లక్కవలె గరఁగిలాగులునుఁ-బాగులను
చొక్కివున్న విధములు చూచుకొంటగాక

చ. 2: చనవు మెరసేవేళ సంగడీలము మనము
మనసులు సోదించ మఱియేల
పెనఁగేటి యాసలును ప్రియముల వాసులును
యెనఁసేటి తమకాలే యెంచుకొంటగాక

చ. 3: తతిఁ గూడేయీవేళ దంటలమే యిద్దరము
కతులు చెప్పఁగ నీక కడమలేల
రతిలోఁ జొక్కితి మిదె రమణ శ్రీవేంకటేశ
మితిమీరినందు కెల్లా మెచ్చు టింతేకాక

రేకు: 1062-2 తోండి సంపుటం: 20-368

పల్లవి: చెలులము నేమన్న చిత్తము నీ కెట్టుండునో
యెలమి నీచేఁత లివె యెంచుకోరాదా

చ. 1: మోవిచవిగొనేవేళ మొగము చూడఁగఁబోతే
భావించి జాణలకు కోపమురాదా
చేవదేర నిందు కాపె చేతనంటెనవి దూరే
వీవల నెవ్వరితప్పో యెంచుకోరాదా

చ. 2: చన్నుల నొ త్తేటివేళ సరసములాడఁబోతే
విన్నకన్నవారికైన వెగటుగాదా
తిన్నని మాటల నిట్టే తిట్టెనంటా నాడేవు
ఇన్నిటా తగవు నీవే యెంచుకోరాదా

చ. 3: చొక్కేటి రతుల వేళ సొంట్లు సోదించఁబోతే
నిక్కపు శ్రీవేంకటేశ నిన్ను దూరరా
తక్కక నీవు గూడితే తరుణి నవ్వె ననేవు
యెక్కువ తక్కువ నీవే యెంచుకోరాదా

రేకు: 1062-3 లలిత సంపుటం: 20-369

పల్లవి: ఊరికే వున్నదాన న న్నొరయకురే
నేరుపులు మీతోనే నెరపనేలే

చ. 1: యితరు లయ్యాతని కిచ్చకము లాడితేను
కుతదీర మిమ్ము నిట్టె కోపించనేలే
అతఁడు సేసినచేత కాతనినే యందుఁగాక
మితిమీరినమాఁటలు మీతోనేలే

చ. 2: తోడువచ్చినసతులు దోమటిదొడికించితే
సూడుఁబాడు వట్టి మిమ్ముసొలయనేలే
వీడెమిచ్చేవిభునినే వెల్లవిరి సేతుఁగాక
పాడిపంతముల మిమ్ముఁ బరచనేలే

చ. 3: బడివాయ నీయింతులు బలిమిఁ గూడింపించితే
పెడమరలి మీతోను పెనఁగనేలే
అడరి శ్రీవేంకటేశుఁ డాతఁడు నే నొక్కటైతి
చిడుముడి మిమ్ము నవ్వి చిమ్మరేఁచనేలే

రేకు: 1062-4 మధ్యమావతి సంపుటం: 20-370

పల్లవి: ఆతఁడదె నీ విదె అరగొరత లేఁటికే
చేతిలోని వాఁ డితఁడు సిలుగు లింకేఁటికే

చ. 1: చలువైన నీమోముచంద్రుడు వెన్నెలగా
చెలియ నీమతిలోని చీఁక టేఁటికే
నిలువుఁ గొప్పుమేఘపు నీడలు నీమేన నిండె
యెలమితో విరహపుటెండ లేఁటికే

చ. 2: పుదుటునీనాసికపుటూరుపుగాలి విసరీ
చెదరుఁజెమటవానచిత్త డేఁటికే
పదరమ్మైఁదీగె బంగారు పసిమి దేరీ
యిదె మోవిపండు వాడ నింతయేఁటికే

చ. 3: పొంచినవీచెక్కులనే పులకలపంట పండె
యించుకనడిమికఱ విఁకనేఁటికే
అంచెల శ్రీవేంకటేశుఁ డాతఁ డదె నిన్నుఁ గూడె
మంచపు దొమ్ములలోన మంకు లిఁకనేఁటికే

రేకు: 1062-5 ఆహిరి సంపుటం: 20-371

పల్లవి: పగవారినైన నింతపరతురా యెవ్వరైన
మొగమోట దలఁచుక ముంచరాదా కరుణ

చ. 1: చెక్కులెల్లాఁ బులకించె చెమరించె చెలిమేను
యెక్కడ చూచేవు చిత్త మేడ నున్నది
కక్కసించి ఆపెవంకఁ గట్టుకొనే దిఁకనేమి
చక్కని చెలియమీఁద చల్లరాదా కరుణ

చ. 2: కొప్పునెరులును వీడె కూరిములు తలకూడె
ఇప్పు డెంతపనిగద్దు యీాడ నీకు
చెప్పరానిచేఁత చెలిఁ జేసి దొడ్డవాఁడ వైతి
చొప్పుగాఁగా ఆపె కిట్టె చూపరాదా కరుణ

చ. 3: సెలవుల నవ్వు నిండె చిత్తమెల్లఁ దమకించె
చలమరి వౌదు విఁక చాలించరాదా
యెలమి శ్రీవేంకటేశ ఇంతిఁ జేరి కూడితివి
మొలచినట్టె యింకా ముంచరాదా కరుణ

రేకు: 1062-6 దేసాళం సంపుటం: 20-372

పల్లవి: అందుకేమి దోసమా అవునయ్య
యెందును రాజులకుఁ దప్పేడ లేదయ్యా

చ. 1: యేకతము నీతో నాడి యెదుట నిలుచున్నది
చేకొని ఆపెకు బుద్ధిచెప్పవయ్యా
ఆకడి పరాకయ్యేవు అండ నే మున్నారమని
యీాకడ వండివార్చి దొమ్మిఁక నేలయ్యా

చ. 2: సన్నలు నీతోఁ జేసి సరసములాడీని
వున్నతి నాపెకు లోనై వుండవయ్యా
తిన్ననిసిగ్గువడేవు దిష్టించి మామోము చూచి
అన్నిటా గరిడి చొచ్చి అడఁగనేలయ్యా

చ. 3: సెలవుల నవ్వు నవ్వి శిరసు వంచుకున్నది
మలసి సందేహము మానుపవయ్యా
అలరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
ఫలము చేకొన్నమీఁదఁ బదరనేలయ్యా

రేకు: 1063-1 వేళావళి సంపుటం: 20-373

పల్లవి: వాదులు వతోనేల వాకిట నున్నార మిదే
సేదదేర నీ వాపెనే చెనకవయ్యా

చ. 1: యెదుట నిలుచుండఁగ యేమందువోయంటా
వొదిగి మంచముమీఁద నున్నది చెలి
అదన నీ కింతలోనే అందాఁకా వేగిరమైతే
పొదిగి అక్కడి కేఁగి భోగించవయ్యా

చ. 2: తప్పక చూచితేను దంట యిది యందువంటా
వొప్పుగ తెరమాటున నున్నది చెలి
దప్పిదేర నాపె మీఁది తమకమే కలితేను
కప్పి లోని కేగిఁ నీవే కాఁగిలించవయ్యా

చ. 3: గక్కనఁ గాఁగిలించఁగ గబ్బిది యనేవంటా
వొక్కటై వోనరిలోన నున్నది చెలి
ఇక్కువ శ్రీవేంకటేశ యింతి నిట్టె కలసితి
తక్కక యిద్దరు లోన తగిలుండరయ్యా

రేకు: 1063-2 కేదారగౌళ సంపుటం: 20-374

పల్లవి: ఎప్పుడు నీదాననే యిన్నిటా నీచిత్తము
చప్పుడు సేయుటేకాని సాదించనేరను

చ. 1: చూపులకు లోనై సుద్దులకు వెలియై
నీపొందు సేసేను నిచ్చలు నేను
తీపులనే పిలుపులు తిట్లనే బులుపులు
మోపుగట్టివేసే నీపై మొరఁగనేరను

చ. 2: పలుకులకు గురై పంతానకు మరఁగై
వలపులు చల్లేను వాసికే నేను
సెలవుల నవ్వులును చేతులనే పువ్వులును
నిలువున వేసేను నెపాలు నే నేరను

చ. 3: తమకములకుఁ జిక్కి తలపోఁతలకుఁ జొక్కి
సమముగాఁ గూడేను సారెకు నేను
అమరె శ్రీవేంకటేశ అంకెలును-లంకెలును
జమళి నీపై వేసేను సటలు నే నేరను

రేకు: 1063-3 బౌళి సంపుటం: 20-375

పల్లవి: ఏకమై వుండినచోటిఁ యెగ్గులేఁటివి
నీకు నాకెకును సరే నేరములేలయ్యా

చ. 1: మతిలో మఱఁగు లేదు మోటల కొదువలేదు
సతికి నీ విచ్చినట్టి చనవే కాని
రతివేళ నీతోడ రాజసము చూపెనంటా
చతురుఁడ వింత యాల సాదించేవయ్యా

చ. 2: కన్నుల కసరులేదు గర్వ మించుకంత లేదు
కన్నెకు నేరిపినసీ కట్టిడే కాని
వున్నతపు కొనగోరు వూఁది నీతో నవ్వెనంటా
యెన్నేసి గడించుకొనే వేడసుద్దులయ్యా

చ. 3: వేసట యేమీ లేదు వెఁగెములాడేది గాదు
యీసతికి కాఁగిటిసీయీవులేకాని
ఆసల శ్రీవేంకటేశ అలయించి కూడెనంటా
వాసులేల పట్టేవు వరము లీవయ్యా

రేకు: 1063-4 ముఖారి సంపుటం: 20-376

పల్లవి: మాతో నీవు యేమనినా మాటలాడే మింతేకాక
యేతుల నెవ్వరిగొడ వేఁటికి మాకు

చ. 1: రవ్వ నాపె నిన్నేమన్నా రచ్చ నీ వాపె నేమన్నా
యెవ్వరి నౌఁగాదననేల మాకు
అవ్వలఁ దొండకు వెలుఁగు సాకి రింతేకాక
యెవ్వ రెఱుఁగుదురు మీయిద్దరిలో పనులు

చ. 2: గోర నాపె నిన్నొ త్తనీ కొమ్మను నీవైన నొత్తు
యీారసాన వహించుకోనేల మాకు
చేరువనూతికొలఁది చేఁతాడే యెరుఁగుఁగాక
సారె మిమ్ము నంత మాకు సాదించనేఁటికి

చ. 3: చెలి సన్నలు సేయనీ చేరి నీవు సన్నసేయు
కలసితి విదె శ్రీవేంకటేశ నన్ను
యెలమి నీరుకొలఁది యెప్పుడు తామెర కాక
వెలుపటి మీసుద్దులు వివరించనోపము

రేకు: 1063-5 గౌళ సంపుటం: 20-377

పల్లవి: అప్పటి నన్నేలడిగే వౌనోకాదోయంటా
నెప్పున నిన్నిందులోన నేరమెంచేవారమా

చ. 1: చెప్ప నేమున్నవి నీవు చిత్తగించినవియెల్లా
కప్పురపునో ళ్లఁ బొగడేవే కాక
తప్పు లెక్కడివి నీవు తగఁ జేసేపనులలో
కప్పి ఇందరును మెచ్చఁగలవే కాక

చ. 2: వెలుతులు గలవా నీవిద్య లిన్నిటి లోపల
కొలఁది మీరఁగ నిండుకొన్నవే కాక
యెలమి నవ్వేవా రెవ్వ రింతటి నీగుణాలకు
చెలరేఁగి రేఁగి సంతసించుటే కాక

చ. 3: మట్టు పెట్టనేది నీ మహిమ వెల్లివిరిసె
గుట్టున నీతోఁ బెనఁగుటేకాక
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విదె నన్ను
ముట్టి యెప్పుడ నీకు మొక్కుటేకాక

రేకు: 1063-6 వసంతవరాళి సంపుటం: 20-378

పల్లవి: వద్దన్న వారెవ్వరు ఆవక్కణలేల చెప్పేవు
బద్దుల మీసుద్దలకు బాఁతే నేను

చ. 1: మొగము చూచి యాపె మొక్కినయప్పటిమొక్కు
తగులుగా మూలఁబెట్టి దాఁచుకో నీవు
తెగరాకుంటే నీవే దేవరపై యందుకుఁగా
వగదీర నాచెలికి వరమిమ్మా యిపుడు

చ. 2: నిలుచుండి కొలిచిన నిలువుఁ గొలువు లెల్లా
వలసుగా కవిలేల వాయించు నీవు
అలరి యప్పటి నీవే ఆపెపాలిటిరాజవై
మలసి మలసి మెచ్చి మన్నించు మిపుడు

చ. 3: యీవల నన్నుఁ గూడితి వీపె సేసిన సేవలు
పోవులుగాఁగొన్ని కూడపోసుకో నీవు
శ్రీ వేంకటేశ యింకా నాచెలికి విటుఁడవై
సావధానమున సరసములాడు మిపుడు

రేకు: 1064-1 దేవగాంధారి సంపుటం: 20-379

పల్లవి: చెప్పినట్టు సేతుఁగాక చింతలు నాకిఁకనేల
పట్టినచలములకుఁ బగదానవా

చ. 1: మాఁటలు నీవాడఁగాను మంకులు నాకిఁకనేల
నాఁటకపు సెలవుల నవ్వుదుఁగాక
యేఁటికి నొడఁబరచే వెడమాటలను నన్ను
గాఁటాన నీతో నలిగి కట్టుకొనేదేమి

చ. 2: వలపులు చల్లఁగాను వాదులు నాకిఁకనేల
బలిమినైన నీ కొంగు పట్టుదుఁగాక
వలదు నీ కింతయేల పట్టియానలెల్లా నేడుఁ
సళిపి నిన్నిందువంక సాదించేదేమి

చ. 3: చేరి నీవు గూడఁగాను సిగ్గులు నా కిఁకనేల
గారాబు నీరతులెల్ల కైకొంటిఁగాక
వేరులేదు మనకు శ్రీ వేంకటేశ మెచ్చేవు
దూరి నిన్ను నిందులోనే దొమ్మిసేసేనా

రేకు: 1064-2 గౌళ సంపుటం: 20-380

పల్లవి: వద్దువద్దు నీకేల వట్టివాసులు
తిద్దే నేను నీయందు తీరని కడములు

చ. 1: అంగన నీతోనాడిన అప్పటిమాటలకా
చుంగులువారఁగఁ దలఁచుక నవ్వేవు
యెంగిలి సేసిన మోవి యింపుల చేఁతలకా
సింగారపుఁగళలతో శిరసువంచేవు

చ. 2: చెలి నీపై వినోదాన చేయి వేసినందుకా
వెలలేని పుబ్బుల నివ్వెర గందేవు
చలముతో బొమ్మలను జమకించి నందుకా
చిలుకుఁ గాఁకలు దేర చెమరించేవు

చ. 3: కాంత నిన్నందరిలో కాఁగిలించినందుకా
పంతపుమాట లాడుచు బయలీఁదేవు
యింతలో శ్రీ వేంకటేశ యే నిన్నుఁ గూడినందుకా
మంతనానఁ బవ్వళించి మనసు చూచేవు

రేకు: 1064-3 పాడి సంపుటం: 20-381

పల్లవి: తాముఁదా మెరఁగరా తరవాతిపనులు
దోమటి వారిబుద్ధుల తోడనేలే ఇఁకను

చ. 1: ఇంతిమోము చూచి మోహ మీతనిపైఁ జల్లె నిదె
అంతలో నవ్వు లీతఁ డాపెపైఁ జల్లె
వింత లిద్దరికి లేవు వేడుకచెలుల మింతే
మంతనపు విన్నపాలు మనకేలే ఇఁకను

చ. 2: వెలఁది యీవిభునికి వీడెము చేతికిచ్చె
చెలువుఁ డాకుమడిని చెలికిచ్చెను
తలఁపు లిద్దరికిని తారుకాణలాయ నిదె
చలివాసె వేఁడుకొనుఁ సారేనేలే మనకు

చ. 3: అంగన శ్రీ వేంకటేశు నంకెలఁ గాఁగిలించె
సంగతి నాతఁడే కూడి చనవిచ్చెను
ఇంగితాన నిద్దరికి యెరవులు లేవిఁక
ముంగిటనున్న మనకు మొరఁగేలే యిఁకను

రేకు: 1064-4 శంకరాభరణం సంపుటం: 20-382

పల్లవి: ఎమ్మెలు నెరపి యాపె యెంతసేసెనో
కమ్మర నింతగుణాలు కంటిఁగా విభుఁడా

చ. 1: తనకే వలతువని తరుణి యాడుకొనఁగ
కొనమాటలకే నిన్నుఁ గోపగించితి
ననిచి యప్పటిఁ గొంతనవ్వేవు నాయెదుటను
నిను భావించఁగలేక నిజమంటా నుంటిని

చ. 2: యేడో ముద్దుటుంగరము ఇచ్చితివని చూపఁగ
అడరాని మాటలెల్లా నాడితి నిన్ను
కూడుక తా మాసరిఁ గూచుండె నావేళ గొంత
యీాడుపడి నీఁచేఁత లివియంటా నుంటిని

చ. 3: పిలువ నంపితినని పెద్దరికాలు చెప్పఁగ
చలములెల్లా నిన్ను సాదించితిని
అలరి శ్రీ వేంకటేశ అంతలో నన్నుఁ గూడితి-
వెలమి నాపె చేఁతలు ఇప్పు డెఱిఁగితిని

రేకు: 1064-5 భైరవి సంపుటం: 20-383

పల్లవి: ఇది గొంతవలెనా యిందుకుఁదోడు
మదనమెత్తించీ నన్ను మంచివానివలెనే

చ. 1: అచ్చలానఁ దన్ను జూడ ఆడకు నే రాఁగానే
ఇచ్చటికేల విచ్చేసె నింతలోఁదాను
కచ్చుపెట్టి విన్నవారు గర్వియని నన్నందురు
మచ్చిక నేఁతసేసీనే మంచివానివలెనే

చ. 2: చేకొని తన్నుఁజూచి చేతులెత్తి మొక్కఁగానే
వాకునఁ దానేల మొక్కె వద్దంటాఁ దాను
యీకడ లోకమువారు యెంతటిది ఇదనరా
మా కెంతదూర గట్టీనే మంచివానివలెనే

చ. 3: తిరమై తనవారమై తెరలోని కేఁగఁగానే
సరుగఁ గాఁగిట నించె సరుసఁ దాను
అరుదై శ్రీ వేంకటేశుఁ డౌనే నన్ను నిటు గూడి
మరిగించె నిన్నిటాను మంచివానిలెనే

రేకు: 1064-6 శ్రీ రాగం సంపుటం: 20-384

పల్లవి: చిత్తగించు రమణుఁడ చేరి యెడమాటలేల
చిత్తరుపతిమను నీచిత్తము నాభాగ్యము

చ. 1: చొప్పుగు నా వలపు చూపిచెప్పరాదు నన్నుఁ
గప్పి కాఁగిలించుకొంటేఁ గానవచ్చీని
వుప్పతించ నే నేర వూరకుండఁగాఁ జెమట
చిప్పిలీ నామేనను నీచిత్తము నాభాగ్యము

చ. 2: అందికూడేతరితీపు అంతిం తనఁగరాదు
కందువ నీవంటఁగానే కానవచ్చీని
మందలించ నే నేర మరిగి నే నుండఁగాను
చిందేటి జవ్వనిని నీ చిత్తము నాభాగ్యము

చ. 3: చొక్కననా వేడుకలు సూడిదిపట్టఁగరాదు
గక్కన నీ వెనసితేఁ గానవచ్చీని
వొక్కటైతివి శ్రీ వేంకటోత్తమునే మెచ్చనేర
చిక్కి నీకు నుండఁగా నీచిత్తము నాభాగ్యము

రేకు: 1065-1 సాళంగనాట సంపుటం: 20-385

పల్లవి: నేరుపరి వౌదువమ్మ నిజలక్ష్మి
పేరడిమహిలను బెరసితివి

చ. 1: మనసు రంజిల్లఁ జేసి మారుగొండ లెక్కివుండి
ననుపు సేసుకొంటినా నాయకునిని
చనవిచ్చి తొడమీఁద సరి నాతఁ డిడుకొంటే
పెనఁగి కూడితివమ్మ ప్రియురాలవు

చ. 2: చేయిచాఁచి రాఁగిలించి చిత్తగించి మోము చూచి
ఆయము లంటితివా ఆతనిని
చాయలకు నాతఁడు చల్లనినవ్వు నవ్వితే
దాయపుమో విచ్చితమ్మ తగుజాణవు

చ. 3: శ్రీ వేంకటాద్రి యిది శ్రీ నరసింహదేవుని
ఆవటించి కూడితి వాఆవుభళానను
వోవరిగా నాతఁడు నిన్నురమునఁ బెట్టుకొంటే
భావించి మెచ్చితివమ్మ పంతపుటిందిరవు

రేకు: 1065-2 పాడి సంపుటం: 20-386

పల్లవి: అందుకేమి దోసమా అట్టే కానీ కానీవయ్య
చెంది యీపెతోడ నేము చెప్పకుండేమా

చ. 1: పైపై యీపెకు నిట్టె బత్తులెల్లఁ జేసేవు
చూపులఁదప్పక ఆపెఁ జూడవా నీవు
యీపొద్దే అన్నియును బయిటవేయరాదుగాక
తీపు నీగుణా లందరుఁ దెలియనివా

చ. 2: వంకలొత్తి యీపెతోను వట్టిబాసలు సేసేవు
అంకెమాట లాపెతోడ నాడవా తొల్లి
బింకాన మీలో వాదులు పెట్టి దోసమనికాక
ఇంకా మామరఁగువాఁడ వెఱఁగవా నీవు

చ. 3: ఇట్టె కాఁగిలించి యీపె నిక్కువకుఁ దీసేవు
గుట్టున నిట్లా నాపెఁ గూడవా ముందు
నట్టినడుమఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ
రట్టు నిన్నుఁ జేసేనా నెట్టుకొనెఁ బనులు

రేకు: 1065-3 ఆహిరి సంపుటం: 20-387

పల్లవి: అందరివంటిది గాదు అంగనయీవి
నిందల నీగుణములు నెరపకుమీ

చ. 1: సెలవుల నవ్వునవ్వి చెక్కులు గోర నొక్కి
వలపులు చల్లితివి వనితమీఁద
నిలువున నమ్మె నాపె నిజమరివని నిన్ను
తలఁపులు మరివేరే తలఁచకుమీ

చ. 2: అందపుమాట లాడి ఆయములు సోఁకించి
విందుగా మోవిచ్చితివి వెలఁదికిని
కందువలఁ జొక్కె నాపె కాణాచి దీడ నఁ కని
అందాలకుఁ బరుల పొందా లించకుమీ

చ. 3: గక్కన గాఁగిటఁ గూడి కైకొని శ్రీవేంకటేశ
యెక్కించితివి వురముపై యీరమణిని
మొక్కె నాపె నీవే తనమోహనపుసింహాసనమని
పక్కన నేమిటా నిఁకఁ బదరకుమీ

రేకు: 1065-4 రామక్రియ సంపుటం: 20-388

పల్లవి: ఎఱఁగుదు నిదె విడె మిందవయ్యా
వెరగాయ వలపులు వేగిరమే లిపుడు

చ. 1: పచ్చిదేరీ మోవులను పాలుగారీ చెక్కులను
రచ్చకెక్కె నీబతుకు రావయ్యా
నిచ్చ నిచ్చ కొత్తలాయ నిన్ను నేమీనన నిఁక
విచ్చనవిళ్లేకాక వెఱుపేల ఇఁకను

చ. 2: సిగ్గుదేరీ మోహమునను చెమరించీ నొసలను
యెగ్గులేదు నీకు మొక్కె మియ్యకోవయ్యా
వొగ్గితి మిన్నిటికిని వొరసి నే నేమనే
నిగ్గులు దేరుటేకాక నేరమేది యిందును

చ. 3: చొప్పులెత్తి నీవురము సొంపుదేరెఁ బులకల
కొప్పువీడె వద్దనిట్టే కూరుచుండవయ్యా
అప్పుఁడ శ్రీవేంకటేశ అన్నిటా నన్నుఁ గూడితిఁ
వుప్పతిల్లు సంతోసాలే వొనగూడె మనకు

రేకు: 1065-5 శంకరాభరణం సంపుటం: 20-389

పల్లవి: తనకు నాకు నిటు భేదము గలదా
మనసుమంకు లిటు మాన్పఁగరాదా

చ. 1: చెలి నిటురమ్మని చెప్పితి నీతో
కలదో లేదో కమలాక్షి
తలఁచనైతినని తా నను దూరీ
తెలిసినమాటలు తెలుపఁగరాదా

చ. 2: యిపలఁ దనకుఁగా యెదురు చూచితిని
అవునో కాదో అలివేణి
తివిరి నే రానని తెగువలు వలికీ
కవగూడఁగ మముఁ గలపఁగరాదా

చ. 3: అగపడితి శ్రీవేంకటాద్రీశుఁడ నిది
తగునో తగదో తనుమధ్య
నగవుల సెలవుల నాపైఁ జిలికీ
పగటులెల్ల నేర్పరచఁగరాదా

రేకు: 1065-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-390

పల్లవి: ఇరవయి నే మెఱిఁగిన వింతాను నీఁ
వరుసవంతేకాక వాదించఁదగునా

చ. 1: పలుకులతుదనేలే పంతాలు నీపతి-
వలపులమీఁదనే వంచరాదా
నిలుచుండే విదియేమే నీవు నావద్ద నీ-
చలము లక్కడనే సాదించరాదా

చ. 2: కన్నులచూపులనేలే కసరులు
నిన్నింతసేయువానిపై నెరపరాదా
నన్నుఁ జుట్టి నీకేలే నాయాలు నీ-
పన్నుగడ లక్కడనే పచరించరాదా

చ. 3: చెక్కుల చేతులనేలే సిగ్గులు నీకుఁ
జిక్కినయాతనివద్దఁ జేయరాదా
యిక్కువ శ్రీవేంకటేశుఁడిటు గూడె నన్ను నీ-
మొక్కు లాడ మొక్కి ప్రియములు చెప్పరాదా

రేకు: 1066-1 ఆహిరినాట సంపుటం: 20-391

పల్లవి: తానెంత నేనెంత దగ్గరేపాటిదా
పానిపట్టి నీవు చేపట్టఁ గానేకాక

చ. 1: మచ్చిక నీతో నాపె మాటలాడఁగాఁగదా
వొచ్చెమని ఆవేళ నూరకుంటిని
యెచ్చి అంతనాతోను యెదురాడేపాటిదా
నిచ్చలు నసమిచ్చిననీవల్లఁగాక

చ. 2: యిరవై అంగన నీయింటిలో నుండఁగగదా
సరవితో నావేళకు సమ్మతించితి
పొరుగుపొంతలనుండి పొందు సేసే పాటిదా
మరిగి కాచుకున్న నీమన్నించఁగఁ గాక

చ. 3: పనివేళ నీకుఁ జెలి పాదాలొత్తఁగఁగదా
కని వూడిగపుదని కై కొంటిని
యెనసి శ్రీ వేంకటేశ నన్ను యింతటిదా
ననలుగా నీవు గొంత నవ్వఁగాఁగాక

రేకు: 1066-2 కాంబోది సంపుటం: 20-392

పల్లవి: ఆడేబొమ్మలు వారు ఆడించేసూత్రము నీవు
యేడో ఇన్నాళ్లు నేను ఇదెఱఁగనైతిని

చ. 1: నీవు చెప్పినబుద్ధుల నెలఁతలు నడవఁగా
ఆవలివారి దూరితి నయ్యా నేను
చేవదేర తాలము చేయి నీచే నుండఁగాను
వేవేలుచోట్లను వెదకితి నేను

చ. 2: కన్నుగీఁటి నీవు వారి కైకొని మొక్కించఁగా
సన్నల వారి దొబ్బితి సాదించి నేను
పన్నినకూఁకటివేరై పారి నీవు వుండఁగాను
వున్నతిఁ గొనలకు నీ రొగ్గి నేఁ బోసితిని

చ. 3: కోరి పెండ్లాడిన పెండ్లి కొడకవు నీవుండఁగా
గారవించితిని వారిఁ గరుణ నేను
యీరీతి నన్ను శ్రీ వేంకటేశ నీవు గూడుండఁగా
కారణ మిందరునంటాఁ గడల మెచ్చితిని

రేకు: 1066-3 బౌళి సంపుటం: 20-393

పల్లవి: ఇంకనేలే కొంక నీకు ఇద్దరముఁ గూడితిమి
అంకెకువచ్చినట్టెల్లా నందువుగాక

చ. 1: పంతము నెరపనేల పలుమారు నీతోడ
చింతదీర నేమైనాఁ జేతువుగాక
వింతవా రెవ్వరున్నారు వీరిందరిలో నీకు
అంతరంగములో మాటలాడుదువుగాక

చ. 2: సన్నల జంకించనేల సమ్మతించినపనికి
వెన్నెలవలపు నాపై వేతువుగాక
కన్నులనాజంకెనలు కదిసి నిన్నేమిసేసీ
మన్ననలన్నియు నాపై మక్కళింతుగాక

చ. 3: కందువలు చెప్పనేల కైకొని కూడితిని
పొందికలు మాకు నేరుపుదుగాక
యిందులోన శ్రీ వేంకటేశ నీకు మఱఁగేది
చెందినట్లనే దయసేతువుగాక

రేకు: 1066-4 సామంతం సంపుటం: 20-394

పల్లవి: అన్ని నీవే తెలుకో అటమీఁది పనులు
కన్నులనే నిన్ను మెచ్చి కాచుకుండే నేను

చ. 1: పంతాలు నీతోఁ జెప్పి పలుమారు కొసరఁగ
యెంతటి రట్టడియని యేమందువో
మంతనాన నీరూపు మనసునఁదలచుక
చింతదీర నూరకుండి చేత మొక్కేను

చ. 2: ఆయములు నన్ను నంటి అంకెలకుఁ దియ్యఁగాను
యీయెడ నిల్లాలి కింత యేలందువో
చేయార నీసేవ చేసి చేరి నీపానుపువద్ద
తోయరానిసిగ్గుతో నెదురుచూచే నేను

చ. 3: నీవు గాఁగిలించుకోఁగా నిట్టనిలిగి వుంటేను
యీవనిత గర్వియని యేమందువో
శ్రీ వేంకటేశ నీచేతికిలోనై కూడితి
భావించి యేపొద్దు నిట్టె పాయకుండే నేను

రేకు: 1066-5 సౌరాష్ట్రం సంపుటం: 20-395

పల్లవి: నీవే యెఱుఁగుదువు నే విచ్చి చెప్పనేల
కైవశమైనందుకెల్లా కడమలు లేవు

చ. 1: వింతలైనసుద్దులెల్లా విన్నపాలు సేసితిని
మంతుకెక్క మఱవకు మతిలో నను
చింతదీర నీకు నే చేతులెత్తి మొక్కితిని
అంతటాను దయవెట్టు మందుకే నామీఁదను

చ. 2: కందువలు చూపిచూపి కానుకలు నీకిచ్చితి
అందముగ వదలకు హస్తము నను
సందడిలో నిన్ను నిట్టె సన్నల నే వేఁడుకొంటి
పొందికతో నీయిచ్చల భోగించు నన్నును

చ. 3: సారె సారెఁ గాఁగిలించి సరసములాడితిని
కోరికలింకా నానతీ గుఱుతుగాను
యీరీతి శ్రీ వేంకటేశ యిట్టె నిన్నిటు గూడితి
గారవించి రక్షించుమీ ఘనుఁడవు నన్నును

రేకు: 1066-6 లలిత సంపుటం: 20-396

పల్లవి: నేరుపరివి నౌదవు నెరజాలు వౌదువు
మేరమీరేనంటే నన్ను మేకులఁ బెట్టితివి

చ. 1: మచ్చరించి నేనీతో మారువట లాడఁగాను
కుచ్చి కాఁగిలించుకొంటి కోపగించక
ఇచ్చకుఁడ వౌదువు ఇంతవాఁడవు గాకున్న
వచ్చేరా పదారువేలు వలచి నీ వెంటను

చ. 2: పెక్కులాగులను నీతో పెనఁగి తప్పించుకోఁగా
ఇక్కువ లంటితివి నీ వెగ్గుపట్టక
తక్కరుఁడ వౌదు వింతదంటతనము లేకున్న
మొక్కుదురా గోపికలు ముంచి సిగ్గువిడిచి

చ. 3: పంతాన నేఁబానుపుపై పవ్వళించి వుండఁగాను
చింతదీరఁ గూడితివి సిగ్గువడక
శాంతుఁడ శ్రీ వేంకటేశ సరసమింత లేకున్న
ఇంతని నీవురముపై నిరవైతి నరుధా

రేకు: 1067-1 దేసాళం సంపుటం: 20-397

పల్లవి: ఆయనాయ యింద వీడె ముందుకోవయ్యా
యీయెడ నీమాయలు యేలసేసే వికను

చ. 1: సన్న సేసినవాఁడవు సారెఁగాచుకుండు గాక
వన్నెలఁ బిలిపించుకోవలెనా నీకు
అన్నిటా నేలినవాఁడ వండఁ గూచుందవు గాక
యేన్నేసిపరాకులు యెంతసేసే విపుడు

చ. 2: నవ్వినట్టివాఁడవు నను పేసేతువు గాక
పవ్వళించివుండ నింతపంతమా నీకు
రవ్వసేసినవాఁడవు రతికే వత్తువు గాక
యెవ్వరికిఁ దరితీపు లేలసేసే వికను

చ. 3: చెక్కునొక్కినవాఁడవు సేసవెట్టుదువు గాక
వెక్కసాన మే మఱవ వేడుకా నీకు
తక్కక శ్రీ వేంకటేశ తగ నన్నుఁ గూడితివి
యిక్కువంటి అప్పటి నన్నేమడిగే విపుడు

రేకు: 1067-2 దేశాక్షి సంపుటం: 20-398

పల్లవి: వింటిరా వోచెలులాలా విభుని తగవులెల్లా
దంటతనసరితలు తా నెఱఁగఁడా

చ. 1: మొగము చూచినవాఁడు మోహమే పైఁ జల్లుఁగాక
చిగురుఁ జేఁతల తోడి సిగ్గు లే
నగితిఁబో నే నందుకు నన్నడుగ నిఁకనేల
తగుఁ దనవొళ్లికల్ల తా నెఱఁగఁడా

చ. 2: యిచ్చకమాడేటివాఁడు యేమనినా వినుఁగాక
వచ్చి వచ్చి తానే తలవంచనేల
యెచ్చరించితిఁబో నేను ఇందుకుఁ దాననేల
తచ్చితే నాకాపిరము తానెఱఁగఁడా

చ. 3: కాఁగిలించు కొన్నవాఁడు కడుఁదమకించుఁగాక
వీఁగనియాసలతో నివ్వెరగులేల
ఆఁగుచు శ్రీ వేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
దాఁగని తన మహిమ తా నెఱఁగఁడా

రేకు: 1067-3 పాడి సంపుటం: 20-399

పల్లవి: రాతిరే చెప్పియంపితి రమ్మనవే
యేతులు పచరించఁగ నికనేలే

చ. 1: మనసు మర్మము సోఁకె మాటలెల్లఁ దేటలాయ
తనకు నాకిఁక వేరే తగవేలే
వెనకటి సుద్దు లవి వింతవింతలాగు లివి
తనిసితి నన్నిటాను తారుకాణలేలే

చ. 2: చూపులు రూపై నిలిచె సూట్లు వాఁటాన కెక్కె
వోపిక లిద్దరివాయ వొట్లేలే
తీపులపైఁ దీపు తొల్లి తేనెలపై తేనే, నేఁడు
యీపసన నే నెఱుఁగుదు యెచ్చరించనేలే

చ. 3: తనువులు జంటలాయ తమకము పెంటలాయ
చనవిచ్చెఁ దా నాకు సటలేలే
వినుకలాయ నప్పుడు కనుకలాయ నిప్పుడు
యెనసె శ్రీ వేంకటేశుఁ డింకా నేలే

రేకు: 1067-4 ఆహిరి సంపుటం: 20-400

పల్లవి: సేసినపాటే చాలు చెల్లాటాలు
వాలు రేఁగితే మరి వడిఁబడుఁజుమ్మీ

చ. 1: చెలువుఁడు పిలువఁగ సెలవి నీవు నవ్వఁగ
యెలయింపుసరసము లెందాఁకనే
బలిమి సేసు నాతఁడు పట్టుదు వెగ్గులు నీవు
కలి ముదిరి మెడిదకలయ్యీఁ జుమ్మీ

చ. 2: నీపతి వేగిరించఁగ నీవు సిగ్గులు చల్లేవు
యేపుమీరి జాణతనా లెందాఁకనే
పైపైనున్నాఁ డాతఁడు పంతాలు చూపేవు నీవు
పూపలు ముదురఁగాను పులుసయ్యీఁ జుమ్మీ

చ. 3: శ్రీ వేంకటేశుఁడంట చేయి నీవు పట్టుకోఁగ
యావల నలమేల్మంగ యెందాఁకనే
భావించి కూడె నతఁడు పైకొంటివి నీవు నట్టె
చేవదేరిన పనులు చెప్పరాదుసుమ్మీ

రేకు: 1067-5 భైరవి సంపుటం: 20-401

పల్లవి: మరిగే విప్పుడును ఆమాట లింకాను
దొరతో సరిమాటాడేదోసమే చాలదా

చ. 1: చెక్కునొక్కి నన్ను నీవు చేరి వేఁడుకొనే విదే
మొక్కే నందుకు నేను ముమ్మాటికి
యెక్కడిసుద్దులు యింకా నేలతడవేపు సారె
తొక్కితి నీ పాదము ఆదోసమే చాలదా

చ. 2: కలకల నవ్వునవ్వి కరగించే విందుకు నే
భళియని పొగడేను పదిమారులు
వలెనా ఇవియుఁ గొన్ని వద్దు వద్దు రేఁచనేల
తొలుత సేసపట్టినదోసమే చాలదా

చ. 3: కమ్మర నాకొంగు వట్టి కాఁగిలించితి విందుకు
నమ్మె నలమేల్మంగ నున్నతి వేమారు
వుమ్మడి నుండనీ మాట లూరకే శ్రీ వేంకటేశ
దొమ్మిసేసితి రతుల దోసమే చాలదా

రేకు: 1067-6 కేదారగౌళ సంపుటం: 20-402

పల్లవి: ఇటువలె నీ వుండితే నెట్టుదెలుసు
ఘటనలు పెరచొటఁ గాన వచ్చినప్పుడు

చ. 1: మాటలెల్లా మంచివే నీమన సెట్లానో కాని
యీటున నీమోహము యెట్టు దెలుసు
ఆఁటదాని నొకతె నీయండఁ బెట్టి చూడఁగాను
గాఁటమున నీబుద్దులు కానవచ్చీ నపుడు

చ. 2: గుట్టులెల్లా మంచివే గుణమెట్లానోకాని
యిట్టి నిన్ను వొక్కమాటే యెట్టు దెలుసు
అట్టే వొకతెచే నీకు ఆయము లంటింపించగా
గట్టియైన నీ పంతాలు కానవచ్చీ నపుడు

చ. 3: కలసితిని మంచిది కడమెట్లానో కాని
యెలమి శ్రీ వేంకటేశ యెట్టు దెలుసు
అలమేలుమంగను నేను అవ్వల నెవ్వతెనైనాఁ
గలయకుండితే నిన్నుఁ గానవచ్చీఁ నపుడు

రేకు: 1068-1 మాళవి సంపుటం: 20-403

పల్లవి: ఎంతగద్దు నీ యాస యింకా నోయి
వింతవారమా నేము వెరవకు వోయీ

చ. 1: పొరుగున వేగినంతా పొలఁతిఁ గూడుండి, మాతో
సరసములాడేవు వేసరవా వోయి
అరసి ముచ్చటాడేవు అందుఁ జాలక ఇక్కడ
వరుసకు నీనోరు నొవ్వదా వోయి

చ. 2: వొట్టుక ఇందాఁక ఆపె వద్ద నుండి, మాదిక్కు
నిట్టచూపు చూచేవు తనియవా వోయి
బెట్టుగా నాపె చన్నులు పిసికి, నాచన్ను లంటే-
విట్టే వుక్కునఁ జేసిరా యీచేతు లోఇ

చ. 3: నాఁట నాపెఁ గాఁగిలించి నన్నుఁ గాఁగిలించితివి
పూఁటవూఁట కింతేసి వోపుదువా వోయి
నీటున శ్రీ వేంకటేశ నే నలమేల్మంగనని
పాటించి చెక్కునొక్కేవు పై కొసరా వోయి

రేకు: 1068-2 హిజ్జుజి సంపుటం: 20-404

పల్లవి: ఆకెకు నీకుఁ బోవునటవయ్యా
చేకొని నెరులనున్న చిక్కు దీర్చవయ్యా

చ. 1: నలినాక్షి నీ వప్పుడు నవ్వించినప్పటనుండి
యెలిమిఁ దొల్లిటి కోపమెల్ల మానెను
కులికి తనలోపలి గుట్టున నన్నుదిగాని
చలము లేదిఁకను ముచ్చటలాడవయ్యా

చ. 2: ఇంతకి నీవు విడెమిచ్చినయప్పటనుండి
పంతపుటలుకల తాపము మానెను
చెంతల గన్నెరికపు సిగ్గున నున్నది గాని
వంతువాసి గాదు నీవు వద్దికి రావయ్యా

చ. 3: అలమేలుమంగఁ జేతనంటినయప్పటినుండి
సిలుగులెల్లను మానె శ్రీ వేంకటేశ
బలిమి నీవు గూడినపంతాన నున్నది గాని
బెళకు లేదిఁకను నీ ప్రేమ నించవయ్యా

రేకు: 1068-3 పాడి సంపుటం: 20-405

పల్లవి: ఏఁటికి అనుమానాలు యెందాఁకాను
వాఁటమైతే వలపుల వన్నెలు దీసీనా

చ. 1: సిగ్గువడివున్నచెలిఁ జేయివట్టి తియ్యరాదా
వొగ్గి యెంతవడిదాఁకా నూరకుండేవు
వెగ్గళించి యాపె నిన్ను వేసరించన నున్నది
బగ్గనఁ జెనకితే నీ పంతము దప్పీనా

చ. 2: వొంటినున్న నీవనితవొద్దనే కూచుండరాదా
అంటిముట్టిక యెందాఁకా నడ్డాఁకలు
గొంటరియై యాపె నిన్నుఁ గొసరఁజాలకున్నది
నంటుసేసితే నిన్ను నవ్వరా నీసతులు

చ. 3: మలశున్న దలమేలుమంగఁ గాఁగిలించరాదా
సెలవిన వ్వెందాకా శ్రీవేంకటేశ
కలసితి వాపె నీకుఁ గడుమేరతో నున్నది
అలపు దేరిచితే నీయాయము సోఁకీనా

రేకు: 1068-4 సాళంగనాట సంపుటం: 20-406

పల్లవి: సేవింపరో జనులాల చేరి మొక్కరో
భావింప నున్నాఁడిందరి భాగ్యమువలెను

చ. 1: జలకమాడి వున్నాఁడు సర్వేశ్వరుఁడు నిగ్గుఁ
గలిగిన మంచినల్ల కలువవలె
యెలమిఁ గప్పురకాపు ఇదె చాతుకున్నవాఁడు
వెలలేనియట్టి పెద్దవెండికొండవలెను

చ. 2: అందముగఁ దట్టుపుణుఁగ గలదుక వున్నవాఁడు
కలదున ఇంద్రనీలాలగనివలెను
ముందరివలెనే తా సొమ్ములు నించుకున్నవాఁడు
పొందిన సంపదలకు పుట్టినిల్లువలెను

చ. 3: మించి యలమేలుమంగ మెడఁ గట్టుకున్నవాఁడు
పొంచి బంగారుతామెరపువ్వువలెను
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిదె కొలువై వున్నవాఁడు
నించిన దాసులపాలి నిధానము వలెను

రేకు: 1068-5 దేసాళం సంపుటం: 20-407

పల్లవి: ఏమి దప్పిపోయ నీవు ఇయ్యకోరాదా
సాములు సేయుచు తాను జట్టిగొనీ నిన్నును

చ. 1: మచ్చిక నీమాటలు మనసునఁ బెట్టుకొని
కచ్చుపెట్టి నవ్వె నదె కలికి
ఇచ్చకపునీవిభుడు యెఱఁగమి సేసుకొని
అచ్చలాన చదురంగ మాడుమనీ నిన్నును

చ. 2: తగ నీవున్న లాగులు తనలోనే దాఁచుకొని
మొగము దప్పక చూచి ముంచీ వనిత
వగదీర తన్నుఁగానివానివలెనే పతి
పగటున మెచ్చిమెచ్చి పాడుమనీ నిన్నును

చ. 3: యెంచఁగ నీప్రేమ తనయెదఁ బెట్టుకొని నిన్ను
మించి వురమెక్కె నలమేలుమంగ
నించి శ్రీవేంకటేశుఁడు నేరుపు సేసుక నీమో-
వంచెల నిమ్మనుచును ఆదరించి నిన్నును

రేకు: 1068-6 సామంతం సంపుటం: 20-408

పల్లవి: ఏలలోఁగీ నేలవీఁగీ నేలమొక్కీనే
తాలము చేయి వున్నది తనచేతఁగాదా

చ. 1: చలమరిదానఁ గాను సరిదానఁ గాను నాకు
వలెనా యింతేసి తనవన్నె ప్రియాలు
బలువుఁడు దనకు నేఁ బడఁతినై వుందానను
యెలమిఁ దాఁ జేసినవే యిచ్చకము గాదా

చ. 2: వేసాలదానఁగాను వెక్కసపుదానఁగాను
పోసరించి నన్ను నింతపొగడనేతే
దాసినై వుందాన నేను తానె నన్ను నేలినాఁడు
వాసితోఁ దనతగవే వన్నె నాకుఁగాదా

చ. 3: పంతమాడేదానఁ గాను పాసివుండేదానఁ గాను
పొంతనుండి తను నింతపొదుగనేలే
యింతలో శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నుఁగూడె
సంతతము తనమాటే చవి నాకుఁగాదా

రేకు: 1069-1 వరాళి సంపుటం: 20-409

పల్లవి: మేలు నీకంటే నాకెను మెచ్చితి నేను
తాలిమి గలదీ నౌను దయగల దవును

చ. 1: అంగన నీకు నేఁడు అప్పణ ఇయ్యఁగఁబోలు
చెంగక మాయింటికి విచ్చేసితి విటే
అంగవించి అందువంక అన్నిటా వెరపుదేరి
రంగుగా యీాడ నిట్టే రచ్చసేసే విపుడు

చ. 2: ఆపె నీకు నేరిపిన ఆసుద్దులే కాఁబోలు
పైపై నన్ను వేఁడుకొని పాలించితివి
తీపులుగా నందులకే తిరమైన సొమ్ము లిచ్చి
చేపట్టి యందరుఁ జూడ సేసవెట్టే విపుడు

చ. 3: నీసతి నీవెంట వచ్చి నెపము సేయఁగఁబోలు
వాసితోడ నన్నుఁ గూడి వలపంచితి
ఆసతో శ్రీవేంకటేశ అందుకే నన్ను మన్నించి
వోసరించ కిద్దరు నావొద్దనున్నా రిపుడు

రేకు: 1069-2 బౌళి సంపుటం: 20-410

పల్లవి: ఎంతవేగిరకాఁడవు యేరా నీవు
పంత మంతేకలితేను బతికేము మనము

చ. 1: మొకము చూడఁగానే మొరఁగేవు నాతోడఁ
నెకసక్కేలకు నట్టే యేరా నీవు
వొకటంటే నొకటని వొట్టులేల పెట్టేవు
నికలంకుఁడవేయైతే నీకేల వెఱపు

చ. 2: పొదిగి నే నుండఁగానే బూటకాలు సేసేవు
యెదురెదురుకట్ల నేరా నీవు
యిది నే సోదించితేను యెగ్గులేల పట్టేవు
మదిలో నిజముండితే మరియేల వెఱపు

చ. 3: చెక్కులు నే నొక్కితేను సిగ్గులు వడేవు నీవు
యిక్కడ శ్రీవేంకటేశ యేరా నీవు
వొక్కమనసాయ నాకు వూరక నిన్నంటినేను
చిక్కనాయ నీవలపు చెల్ల దేలవెఱపు

రేకు: 1069-3 సామంతం సంపుటం: 20-411

పల్లవి: ఆయనాయఁ జాలుఁజాలు అన్నియు నే నెఱఁగుదు
చాయలకు దిద్దుకొంటే చలిమే బలుములు

చ. 1: తేనెలమోవిమాట తీపులెక్కే వుండుఁగాక
వీనులకు యేమాడిన వింతదోఁచీనా
పూని అవి నీకుఁ జవి పోరచిసవతులకు
కానుకవట్టఁగఁ బోతే కారము లౌఁగాని

చ. 2: ననుపు చేతిసన్నలు నయమెక్కే వుండుఁగాక
వెనక నీమనసుకు వెగటయ్యీనా
పనికినచ్చు నీకవి పరసతులకునైతే
పెనగవెట్టఁబోతేను బిరుసెక్కుఁగాని

చ. 3: కడుకాఁగిటిచన్నులు గట్లయ్యే వుండుఁగాక
పొడవై నీరతులను పొల్లువొయ్యీనా
కడిమి శ్రీవేంకటేశ కలసితి వీకె, యాడోఁ
పడఁతుల కెల్లానైతే పచ్చిదోఁచుఁగాని

రేకు: 1069-4 శుద్ధవసంతం సంపుటం: 20-412

పల్లవి: నిచ్చనిచ్చ సోబనాలు నెల మూఁడుసోబనాలు
హెచ్చె నీకు నింతలోనె ఇవి గదవయ్యా

చ. 1: చెలియమోహములే సేసపాలు
పెలుచుసిగ్గులే మీకు పెండ్లితెర
కలగొనుచూపులే కంకణాలు
సులభాన నీకు నబ్బె సుఖియించవయ్యా

చ. 2: మగువ మాటలే నీకు మంత్రాలు
పొగరుమోవితేనెలే బువ్వాలు
వెగటుబొమ్మజంకెలే విడేలు
జిగి నీకు నేఁ డబ్బెఁ జిత్తగించవయ్యా

చ. 3: కాంతసరసములే కప్పురాలు
పొంతనున్నకుచములే బూఁజకుండలు
చెంతలఁ గూడితి విట్టే శ్రీవేంకటేశా యివి
సంతసమాయను నీకు జయమందవయ్యా

రేకు: 1069-5 శంకరాభరణం సంపుటం: 20-413

పల్లవి: అతఁడు నేనుఁ గూచుండే అతివలందరుఁ గూడి
చతురత నూడిగాలు సరసానఁ జేయరే

చ. 1: కాయమెల్లాఁ జెమరించె గందవొడి చల్లరే
యేయెడనుండి వచ్చెనో యీతనికిని
చేయిచాఁచి నేనేమైనా సేవలు సేయఁగఁబోతే
చాయలకు సిగ్గువడీ సంగతిగా దిపుడు

చ. 2: మోవి గడువసివాడె మొక్కి విడెమియ్యరే
యీవేళకు నుచితము ఇతనికిని
కావించి యేమైనా నిచ్చకములు నేఁ జేయఁబోతే
భావించి తలవంచును భావ్యముగా దిపుడు

చ. 3: ఆంగమెల్లా బడలెను ఆరగించఁబెట్టిరే
ఇంగితపు శ్రీ వేంకటేశ్వరునికి
సంగతిగా సరి నే విన్నవించితే
వెంగలినవ్వులు నవ్వువేళలు గాదిపుడు

రేకు: 1069-6 ఆహిరి సంపుటం: 20-414

పల్లవి: చేయివట్టి తియ్యకువో చెనకి వేగిరించకు
నీయాఁధీనమై యిటే నెట్టుక వుందానను

చ. 1: దగ్గరి విచ్చేసి నాతలపై సేసలువెట్టి
సిగ్గులెల్ల బాపి మతి చింత దీర్చితి
నిగ్గుల కళలతోడ నిండురాజసముతోడ
సగ్గుడై ముగ్గుజడై యింట్టై సతంసించుదానను

చ. 2: కంచపుమోవి యిచ్చికన్నులనే నవ్వునవ్వి
చంచలములెల్లఁ బాపి చనవిచ్చితి
నించిన వేడుకతోడ నీసరసముతోడ
మంచముపై రతులని మలసి వుందానను

చ. 3: మచ్చిక నాపై నెరపి మనసెల్ల సోదించి
ముచ్చటల నీవు నాపై మోహించితివి
ఇచ్చకపు శ్రీవేంకటేశ నీకాఁగిటితోడ
నిచ్చలపుటానందాన నెరసి వుందానను

రేకు: 1070-1 దేశాక్షి సంపుటం: 20-415

పల్లవి: నామాట వినవయ్య నాటకమేల సేసేవు
వేమారు నింతేసి నీకు విన్నవించఁగలమా

చ. 1: కోపము నీకుఁ దగదు కోమలిమీఁదట; నీవు
తీపుచల్లి వలపించి తెచ్చుకొంటివి
ఆపె నిన్ను నేమనినా నందుకు నవ్వఁగవలె
వోపనంటేఁబోవునా వొగి మగవాఁడవు

చ. 2: మంకులు నీకుఁదగదుఃమానినికిఁ దొలుతే
వుంకువగా నిచ్చితివి వుంగరము
సంకెలేక యాపె నిన్ను జరసితే మొచ్చవలె
కొంక నిఁకఁ దీరునా కొండవంటిదొరవు

చ. 3: వేసట నీకుఁ గూడదు వెలఁదికాఁగిట నీవు
యీసుదీర శ్రీ వేంకటేశ కూడితి
ఆసలు నాపె నిన్ను ఆఱడెంతసేసినా
వాసులు నీ కమరపు వలచిన జాణవు

రేకు: 1070-2 ఆహిరి సంపుటం: 20-416

పల్లవి: చెలియా మరి నాకుఁ జెప్పవే బుద్ధి
వలపుల మొదలనే వలరాజున్నాఁడు

చ. 1: చెలఁగి నావిన్నపము చిత్తాన నున్నదో లేదో
తలఁపించి రాఁగదవే తగువిభుని
వెలి నేడ నున్న వాఁడో వేళ యెటువంటిదో
తెలిసి నీవు వచ్చితే తేరీని పనులు

చ. 2: ఆయమైన నాగుఱుతు లంగాన నున్నవో లేవో
చాయలఁజూపు మనవే సరసునిని
యీయెడ కెపుడు వచ్చీ నేమనున్నదో గుణము
నాయాననే సోదించితే ననిచీని పనులు

చ. 3: అదివో వాకిటికిఁ దా నట్టె వచ్చినాఁడో లేదో
యెదురుకోవే నీవు ఇంతలోననే
అదన శ్రీ వేంకటేశుఁడాతఁడే విచ్చేసి కూడె
పొదిగి పాయకుండితే పొసఁగీని పనులు

రేకు: 1070-3 పాడి సంపుటం: 20-417

పల్లవి: ఎప్పుడును నాకు లోనెఁ యేరా కృష్ణా
చెప్పేవు ప్రియ మప్పుడే చెలువపుఁగృష్ణా

చ. 1: చన్నుల నొరసితిని సాదించేననుచు నిన్ను
వెన్నలేల దొంగిలేవు వేసాలకృష్ణా
కన్నుల జంకించితిని కాఁగిటఁ బట్టేనని
పన్నేల మాయ లింత బాలకృష్ణా

చ. 2: మాటల నిన్నొరసితి మంతనానకు రమ్మని
చాటేవేల సరసాలు జంగిలికృష్ణా
యీటుతోనే నవ్వితిని యిద్దర మొక్కటేయని
వోటమి నీ కెందూ లేదు వున్నతపుకృష్ణా

చ. 3: కూడితి కాఁగిట నిన్ను గుఱుతులు నించి నించి
జాడలు దప్పకుమీ జాణకృష్ణా
వీడె మిచ్చితిని శ్రీవేంకటాద్రిపయి నీకు
వాడికలు మనసొమ్ము వన్నెల వోకృష్ణా

రేకు: 1070-4 కాంబోది సంపుటం: 20-418

పల్లవి: పువ్వులనేసి నిన్ను పొందులుచల్లీ నతఁడు
నవ్వులు నవ్వుచు నీతో ననుపై వున్నాఁడు

చ. 1: వంచనేలే శిరసు వాడనేలే మోము
అంచెలఁ బతిలో మాటలాడరాదా
కంచువంటిది వలపు గాలివంటిది వయసు
పెంచకువే కోపము నీ ప్రియుఁ డీడ నున్నాఁడు

చ. 2: నిట్టూర్పులేలే నీకు నిండఁ జెమరించనేలే
గుట్టుతోడఁ బతివద్దఁ గూచుండరాదా
నెట్టుకొన్నవి కాంక్షలు నిండినది తమకము
వట్టి విసుపేలే నీవద్ద నాతఁ డున్నాఁడు

చ. 3: కొంతకొంత సిగ్గులేలే కొనగొనయాసలేలే
ఇంతలో శ్రీవేంకటేశు నెనయరాదా
మంతనాన మన్నించె మామిందర నెలయించె
ఇంత నిన్నుఁ గూడి యాతఁ డింటనే వున్నాఁడు

రేకు: 1070-5 బౌళి సంపుటం: 20-419

పల్లవి: కూడినమీఁదట మరి కొరతేఁటికే
యీడులేదు ఇన్నిటా మీయిద్దరికిఁ జుమ్మీ

చ. 1: చక్కెరవంటి మాటలు సారెసారె నాడఁగాను
ఇక్కువలకుఁ దీపెక్కె నీ విభునికి
చెక్కునొక్కి ఇఁకఁ జప్పఁ జేయక కాఁగిలించితే
పక్కనను చెఱకున పండు పండుఁజుమ్మీ

చ. 2: పన్నీరువంటిమోహము పతిపైనే చల్లఁగాను
వెన్నెలతేటలువాకె వీడు దోడుగ
ఇన్నిటా నీఁక విరహపు టెండలు గాయకుండితే
పన్నినరతి కప్రపుపంట పండుఁజుమ్మీ

చ. 3: చిగురువంటి ప్రియాన శ్రీవేంకటేశుఁ గూడఁగా
తగులెల్లు గురులాయ తతి మీలోన
పొగరుభోగములనుఁ బొదిగి పోదిసేసితే
పగటునవరసాలపంట పండుఁజుమ్మీ

రేకు: 1070-6 బౌళి సంపుటం: 20-420

పల్లవి: చిత్తమువచ్చినయట్టు సేయవయ్య
ఇత్తలికి నత్తలికి యెడవట లేఁటికి

చ. 1: కోపగించుకొనినట్టికొఱత దీరుచుకోను
వైపగాఁ గని ఇంటికి వచ్చితి నేను
ఆపొద్దుననుండి నీవు అట్టె కాచుకుండఁగాను
యేపున నీ వున్న మంచ మెక్కితి నేను

చ. 2: ఆడరానిమాటాడిన ఆనెగులుదీర్చుకోను
వీడెమిచ్చి పాదాలు సేవించితి నేను
వాడుదేరె మోము తోడ వద్ద నే మాటాడఁగాను
వేడుకగందము పూసి వెలసితి నేను

చ. 3: నీరతులలో చేఁతలనేరమెల్లఁ దీరేయట్టు
గానవించి కాఁగిలించి కై కొంటి నేను
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నుఁ గూడితి
మేరతో నీగుణానకు మెచ్చితి నేను

రేకు: 1071-1 రామక్రియ సంపుటం: 20-421

పల్లవి: ఇద్దరుఁ గూడుండితే నేకచిత్తమౌఁగాక
గద్దరితనా లింతేసి కడుఁదగదయ్యా

చ. 1: ఇంటిలోన ఆపెను నీ వేమంటివో కాని
గొంటుఁదనమున నట్టె కూచున్నది
వెంటఁబెట్టుకొనిరాక వెళ్ళివచ్చితివి నీవే
వొంటి నాపె వేగించనోపునటవయ్యా

చ. 2: పానుపుపై నాపె నెంతపచ్చి సేసితివో కాని
పూనినట్టి సిగ్గుతోడ నూరకున్నది
మౌనాన నట్టె వుండక మారుమంచ మెక్కితివి
పూనినవలపులకుఁ బోయఁజోటేదయ్యా

చ. 3: కాఁగిటిలో నాపె నెంత కరఁగించితివో కాని
మాఁగినమోవితోడ మలశున్నది
వీఁగక శ్రీవేంకటేశ వెలఁదికొంగు వట్టితి
చేఁగదేర నిట్లానే చిత్తగించవయ్యా

రేకు: 1071-2 వరాళి సంపుటం: 20-422

పల్లవి: ఏమిసేయఁగలము మీ రిద్దరును నిద్దరే
దోమటిదొడికి మీలో దొమ్మిసేయరాదా

చ. 1: ఆతనినీచూపునే అవి తారుకాణగాక
యీతల నేము తార్కాణా ఇంతులము
కాతరపు మాటలేల కందువకుఁ దీసి పతి
చేతులార బుజగించి సేవ సేయరాదా

చ. 2: చెలఁగి మీరువెట్టిన సేసలే గుఱుతుగాక
అలుకకు వద్దిచెలులందరు గుఱే
పెలుచుఁ దనములేల పెంపునఁ బానుపుమీఁద
చలములన్నీఁ దీర సాదించరాదా

చ. 3: కూడినమీ కాఁగిటి కూటమే మెచ్చులుగాక
వూడిగపువారిమెచ్చు లొద్దికయ్యీనా
వేడుకఁ గూడితివి శ్రీవేంకటేశు నిట్టే మరి
వాడుదేర మోవి ఇచ్చి పన్నె నేయరాదా

రేకు: 1071-3 ధన్నాశి సంపుటం: 20-423

పల్లవి: నీవే యెఱుఁగుదువు నీవు సేసిన మహిమ
కైవశమాయఁ బనులు కల్ల లేదు యిందును

చ. 1: తలఁపు నీభోగములే తలపించీఁగాని నీతో
చలము సాదించేనంటే సాగనియ్యదు
వలపు లంతంతకు వడ్డివారీఁగాని మరి
పలుకకవుండేనంటే పట్టరా దెంతైనా

చ. 2: చూపులు నీరూపము చూడనే కోరీఁగాని
కోపగించుకోనేనంటే కొలుపనీదు
తీపుల జవ్వన మిది తేనెలే మించీఁగాని
వోపనన్నాఁ దమకము వుడివోవనీయదు

చ. 3: కాయమిది నీకాఁగిటికందువఁ బొదలీఁగాని
చాయ సేసుకొనేనంటే సమ్మతించదు
యీయెడ శ్రీవేంకటేశ ఇంత సేసి పొందితివి
ఆయము లంటేనంటే అడ్డమయ్యీఁ గరుణ

రేకు: 1071-4 శ్రీరాగం సంపుటం: 20-424

పల్లవి: మఱవకుమీ మాట మతిలోనను
జఱసి నీవేమనినా సమ్మతించేదానను

చ. 1: చింతదీరె నీవు నాపైఁ జేయివేసినయప్పుడే
మంతనాన బుజ్జగించ మఱివలెనా
వింతదాననా నేను విభుఁడవు నీవు నన్ను
యెంత సేసినా నటె యియ్యకొందుఁగాక

చ. 2: తనివిఁబొందెను నీవు దగ్గరినయప్పుడే
మనసు రంజిల్లఁ జేయ మఱివలెనా
నను నీ వెఱఁగవా నమ్మికిచ్చినవాఁడవు
పనిగొన్నయందుకెల్లా పంపుసేతుఁగాక

చ. 3: మెచ్చితిని నీవు నన్ను మేకొనికూడినప్పుడే
మచ్చికలు వచరించ మఱివలెనా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నీయిల్లాలను
తచ్చివేసినట్టు నిన్ను తగిలుందుఁగాక

రేకు: 1071-5 భైరవి సంపుటం: 20-425

పల్లవి: ఎందాఁకా నలుకలు యేఁటికే నీకు
విందువలె నిఁక నిన్నీ వేడుకలేకాక

చ. 1: తగులు మనసులోన తగిలినవారైతే
మొగము చూడకుందురా ముచ్చటకైనా
అగపడి నీవాతని ఆనలేల పెట్టేవే
నగకుండవచ్చునా ననిచి నీతోను

చ. 2: పోరాని చుట్టరికము పొసగినవారైతే
గారవించి యెంతైనా దగ్గరకుందురా
ధీరత నంటకుమని తిట్లేల తిట్టేవే
కూరిమిసేయకుండునా కూడేటినీతోను

చ. 3: సమ్మతించినమోహము చనవుగల వారైతే
కమ్ముకొనకుందురా కాఁగిట నిట్టే
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
బొమ్మజంకెలే లితఁడు పాసఁగె నీతోను

రేకు: 1071-6 నాదమక్రియ సంపుటం: 20-426

పల్లవి: ఎన్నిలేవు సుద్దులు యేఁటికి విచారాలు
మన్నించి ఆచింతలెల్లా మానుము నీ వింకను

చ. 1: మనసెఱిఁగినచోట మాటలు సోదించనేల
తనువుకుఁ దనువే తారుకాణ
పనిమాలినపనికి బాసలేల సేసేవు
చెనకితి లోనికి విచ్చేయవయ్యా యింకను

చ. 2: కూడివుండినట్టిచోట గుఱుతు వెతకనేల
వేడుకలు వేడుకలే వీడుజోళ్లు
జాడలతో వారి వీరి సాకిరేల తెలిపేవు
వీడెమిచ్చే నామాఁట వినవయ్య ఇఁకను

చ. 3: రతి గలిగినచోట రవ్వసేయఁగనేల
యితవుకు నితవులే యియ్యకోళ్లు
సతమై శ్రీవేంకటేశ సరిగాఁ గూడితి నన్ను
అతిముదములు మనకబ్బెనయ్యా ఇఁకను

రేకు: 1072-1 ముఖారి సంపుటం: 20-427

పల్లవి: వద్దు వద్దు నీ కింతేసి వలసీనొల్లములు
గద్దించి నిన్నుఁ గలసేకాఁగిటిలోదానను

చ. 1: వెట్టికే మాటలాడకు వేగనంతా నాతోను
యెట్టకేలకు వచ్చితి వీడకు నీవు
జట్టిగొని చక్కఁజూడు సరసములాడు నీతో
కట్టఁగడదానఁ గాను కలదాన నీకు

చ. 2: తేరనవ్వులు నవ్వకు తిరిగి తిరిగి నీవు
ఆరితేరి చేతికి లోనైతి విపుడు
ఆరగించుమా కప్పురము అందుకో తమకమున
పోరచివారము గాము పోరానివారము

చ. 3: నివ్వెరగులు విడువు నెమ్మది శ్రీవేంకటేశ
యివ్వలఁ గూడితివి నన్నిచ్చకముతో
పవ్వళించు మా వద్దఁ బాయ కిట్టె సుఖియించు
దవ్వులవనితనా దండనుండేయింతిని

రేకు: 1072-2 లలిత సంపుటం: 20-428

పల్లవి: నీరమణునికొలఁది నీ వెఱుఁగుదు
గారవించి మట్టుతోనే కలయు నీ వపుడు

చ. 1: చెలియరో నీ వతనిచెక్కు నొక్కఁబోయేవు
ములువాఁడికొనగోరు మోచీఁజుమ్మీ
వులివచ్చివలపుల వుప్పొలి కినుమడైతే
ములుగ ములుగ నట్టె వేఁగౌనపుడు

చ. 2: సరుసఁ గూచుండి నీవు సారె సారెఁ బెనఁగేవు
వొరసి నీచనుఁగొండ లొత్తీఁజుమ్మీ
తిరమై పాసి కలి ముదిరి మెడిదెయ్యైతే
ధరలో పండ్లువులిసి తమిరేఁగు నపుడు

చ. 3: మోవిచవులకుఁ జొక్కి ముందుముందె కొసరేవు
సోవలుగఁ గొంత పల్లుసోఁకీఁజుమ్మీ
శ్రీవేంకటేశుఁడు గూడె చిగురె చేఁగలైతే
వేలువేలు చేఁతలెల్లా వెలవెట్టు నపుడు

రేకు: 1072-3 సాళంగ సంపుటం: 20-429

పల్లవి: దిక్కులను మగవాఁడు ధీరుఁడందురు
యెక్కడికెక్కడ మోహ మింతసేతురా

చ. 1: నిడువాలుఁ గన్నులను నెలఁత నిన్నుఁ జూచితే
తడసి నీమన సాపెఁ దగిలున్నది
వడి నీవద్దనుండినవారి నెఱఁగ విందుకు
వారిది చూఁచితే గక్కనను నవ్వరా

చ. 2: మచ్చికల నీయెదుట మాటలాడినంతలోనె
అచ్చపునీమోహ మాపె నంటుకున్నది
నిచ్చలాన నాఁకలియు నీరువట్టూ నెఱఁగవు
హెచ్చిననీసతులెల్లా నిందు కిట్టె నవ్వరా

చ. 3: ఆయమెరిఁగి కొసరి ఆసఇచ్చినంతలోనే
చాయల శ్రీవేంకటేశ సతిఁ గూడితి
పాయక ఆపెతో రేయిఁబగ లేమీ నెఱఁగవు
యీయెడ నేనూఁ గూడితి నిఁక లోలో నవ్వరా

రేకు: 1072-4 ఆహిరి సంపుటం: 20-430

పల్లవి: ఏది నిజమని మీరు యెట్టు వొడఁబరచేరే
ఆదినుండి యీకతలు అడుగరే యాతని

చ. 1: కన్నుల తేటలువాగె కాయము చెమటగారె
యెన్నియైనా తనమాట లేడ కెక్కునే
నిన్ననే వచ్చేనని నేఁడు యీపొద్దుకు వచ్చె
అన్నిటాఁ గలదో లేదో అడుగరే మీరు

చ. 2: మోమునఁ గళలు నిక్కె మోవిపైఁ గెంపులు చిక్కె
యేమిటికైనా తన్ను నెట్టు నమ్మేరే
దోమటి యీడఁ దొడికె దొరతన మిడఁ జేసె
ఆముక కలదో లేదో అడుగరే మీరు

చ. 3: సెలవుల నవ్వు నించె చేతులనే కాఁగిలించె
యెలమి నెటుల నిఁక నెదురాడేనే
కలవాఁడు తానె శ్రీవేంకటపతి నన్నుఁ గూడె
అలుకలన్నియుఁ దేరె నడుగరే మీరు

రేకు: 1072-5 ముఖారి సంపుటం: 20-431

పల్లవి: ఎంతపని కెంతపని యేల పదరేవే నీవు
కాంతుఁడు చెలరేఁగితే కందువలు ముట్టవా

చ. 1: తగునా నీ కింతమాట తరుణి యాతనితోడ
చిగురుఁబెదవి వంచి 'చీ' యంటివి
మొగము చూచి యతఁడు ముంచి నవ్వె నింతేకాని
తగవులఁ బెట్టఁబోతే తప్పు నీదే కాదా

చ. 2: చెల్లునా నీ కింత సేఁత చెలువునితోడను
మెల్లనే నేమంతిచెండు మీఁదవేసితి
వల్లగా నాతఁ డందుకు సరసములాడెఁగాని
వొల్లనే మారువేసితే నోరుచుకెఁగలనా

చ. 3: అమరునా శ్రీవేంకటాధీశ్వరునితోడ
తమకించలిగితి విందాఁకా నీవు
రమణ నాతఁడే నిన్ను రతులఁ గలసెఁగాని
సమముగాఁ బెనఁగితే చాలుననవచ్చునా

రేకు: 1072-6 మధ్యమావతి సంపుటం: 20-432

పల్లవి: వలసినప్పుడు తానే వచ్చీఁగాని
చలపట్టి మీరేల సాదించేరు రారే

చ. 1: చిత్తము లోపలిప్రేమ చెప్పి చూపవచ్చునా
హత్తినచూపులఁ గాననగుఁగాక
తత్తరీఁడు తనలోనితలఁపెల్లాఁ దెలిసెను
కొత్తలుగా మీరేల కొసరేరు రారే

చ. 2: అప్పటి మొగమోటాలు అవియే తేవచ్చునా
మెప్పించినవేళలను మించుఁగాక
ముప్పిరి నుబ్బరికాఁడు మోహమెల్లాఁ దెలిసెను
వుప్పటించి కడునేల వొరసేరు రారే

చ. 3: వేడుకలు గలన్నియు వేరేవుంటేఁ దోఁచునా
కూడిన కాఁగిటిలోనే గుఱుతవుఁగాక
యీడనె శ్రీవేంకటేశుఁ డెనసెఁ దా విచ్చేసి
ఆడనే దూరక మీరు అండకిట్టె రారే

రేకు: 1073-1 వరాళి సంపుటం: 20-433

పల్లవి: మగవాఁడు తాను మగువను నేను
నగుమనవే యిట్టే నాలి యాల యిఁకను

చ. 1: కన్నులఁజూచినప్పుడే కాఁకలెల్లాఁ జల్లనాయ
యెన్నికేల రమ్మనవే యేమనే నేను
సన్నలు సేసినప్పుడే చనవెల్ల నాకిచ్చె
విన్నవించనే తనకు వెఱపేల యిఁకను

చ. 2: యింటికివచ్చినప్పుడే యియ్యకోళ్లాయ నాకు
జంటయై యుండుమనవే సాదించ నేను
అంటిముట్టినయప్పుడే ఆయములెల్లాఁ గరఁగె
దంటతనమే మేలు తప్పులేదు యిఁకను

చ. 3: కలసినయప్పుడే కడమలు లేవు నాకు
బలువుఁడు తా ననవే పైకొంటి నేను
అలరి శ్రీవేంకటేశుఁ డన్నిటాఁ దానన్ను నేలె
వలపు లిద్దరివాయ వంతులేలే ఇఁకను

రేకు: 1073-2 గుండక్రియ సంపుటం: 20-434

పల్లవి: మానఁగదె ఇంతట నీమంకువిద్యలు
యీనెపాన నాతఁడన్ని నియ్యకొనఁడా

చ. 1: నవ్వులకు నొకమాట నాయకుఁడాడి నందుకు
ఇవ్వల సతులతోడ నేమి చెప్పేవే
జవ్వని వేకతమున సాదించితే నాతఁడు
చివ్వన నీ చెప్పినట్టు సేయకుండీనా

చ. 2: చేరి నిన్ను రమణుఁడు చేయివట్టినందుకు
తేరకొన నీవేల తిట్టఁజూచేవే
యీరీతి పానుపుమీఁద నేమిసేసినా నతఁడు
గారవించి నీకు లోనుఁగాక వుండీనా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నినుఁ చెనకి కూడినందుకు
చేవదేర నీవేల సిగ్గువడేవే
నీవేమి అతనికి నేరిపిన యాతఁడు
కావించి నిన్నంతలోనే కడుమెచ్చకుండీనా

రేకు: 1073-3 దేసాళం సంపుటం: 20-435

పల్లవి: మనకు మనసే మరి తారుకాణ గాక
వెనకకు ముందరికి విచారములేలా

చ. 1: కన్నులనీచూపులే కంకణదారములాయ
పన్ని నన్ను వేరే వొడఁబరచనేల
చన్నులనావొత్తులే సరి నీకు ముద్రలాయ
విన్నపాలు మరి సేసేవిధమేల

చ. 2: సెలవులనవ్వులే సేసపాలై అబ్బె నాకు
వెలిమొన సారె నన్ను వేఁడుకోనేల
యెలమి నాశావలే నీకెదురువుంకువలాయ
కులికి నే నిన్ను వేరె కొసరనేల

చ. 3: కందువనీమోని నాకు కై కొన్నబువ్వములాయ
విందువలె చెక్కునొక్క వేరెయేల
అందముగ శ్రీవేంకటాధిప కూడితి నిన్ను
మందలించి యిఁక నీతో మట్టుమీరనేల

రేకు: 1073-4 భైరవి సంపుటం: 20-436

పల్లవి: లేవయ్య నీ కెంతలేదు లేమతోడను
చేవదేరినపనికి సిగ్గు లికనేల

చ. 1: మంతనానఁ గూచుండి మగువపైఁ జేయివేసి
చింతలు దీరుచరాదా చెలియకును
వంతులకే పెనఁగీని వాసులే పంచీ నాపె
పంతమా నీ కింతితోడ బలుమగవాఁడవు

చ. 2: మంచముపైఁ బవళించి మర్మములు సోఁకించి
చంచలము దీర్చరాదా సకియకును
ముంచి నీపైఁ గొసరులే మోహము చల్లీ నాపె
కొంచెమా నీ వియ్యకొంటే కొండవంటిదొరవు

చ. 3: కన్నుఁగొనలను నవ్వి కాఁగిట శ్రీవేంకటేశ
యిన్నిటా నీ వెనసితి వీసతితోను
మన్ననకే అసపడి మాటలఁ జొక్కీ నాపె
యెన్నికా నీ కిందువల్ల ఇంతదొడ్డవాఁడవు

రేకు:	1073-5 కాంబోది సంపుటం:	20-437

పల్లవి:	ఎందుకని చింతింతు నేమి సేతును
కందువ నీమహిమకుఁ గడపల లేదు

చ. 1:	మనసులో కోపము మాటలలోపల లేదు
మొనసి యింతటిలో నీమోము చూచితే
పెనగొన్నకోరికలు బిగువుచూపఁగనీదు
తనివోనినీమంచితన మెంచితేను

చ. 2:	చేతులలో చల్లఁగాఁక నెలవినవ్వుల లేదు
నీతో సరసములు నేనాడితే
ఘాతఁ గొనగోరివాఁడి కాయముపై నాఁటదు
యీతల నీనాసంది ఇంపు లెంచితేను

చ. 3:	జంకెలకారాలు మోవిచవులలోపల లేవు
కంకిగా నిన్ను రతులఁ గాఁగిలించితే
అంకెల శ్రీవేంకటేశ అన్నిటాఁ గూడితి మిదె
కొంకులేనిమనలోనిగుణా లెంచితేను

రేకు: 1073-6 ధన్నాశి సంపుటం: 20-438

పల్లవి: నవ్వినట్టివాఁడవు అనయ మియ్యనేరవా
జవ్వనభారముతో వేసరుకొనేఁగాక

చ. 1: ఆస వుట్టించి వలపు లంతరేఁచినవాఁడవు
రాసికెక్క భోగించనేరవా నీవు
వీసమంతకోపముతో విరహతాపముతోడ
రాసేటికుచాతలతో రాయడించేఁగాక

చ. 2: అనవెట్టి నిలిపి నాఅయాలంటినవాఁడవు
అనుక నన్నుమన్నించే దరుదా నీకు
సానఁబట్టేచూపులతో సళుపుఁ గాఁకలతోడ
తానకపుఘాతలతో తమకించేఁగాక

చ. 3: అరతిఁ గాఁగిలించి అట్టెకూడినవాఁడవు
చేరి నాకు వినయాలు సేయనేరవా
యీరీతి శ్రీవేంకటేశ ఇంపుతోడ సొంపుతోడ
కోరికలు కొనసాగ కొరితిఁగాక

రేకు: 1074-1 పళవంజరం సంపుటం: 20-439

పల్లవి: విన్నవించితిమి నీకు వేడుకైన దీమాట
పన్నినట్టిమేళ్లెల్లా పైపైనే వున్నవి

చ. 1: నిందునిధానములుగా నెలఁతచన్నులు నీకు
దండిగాఁ బయ్యదలో దాఁచుకున్నది
పండుమోవితే నెలపంచామృతాలతోడ
గండుమీరి విందుచెప్పఁ గాచుకున్నది

చ. 2: కందువచిరునవ్వులకప్పురవిడేలు నీకు
అంది సూడిదెవట్టుక అట్టె వున్నది
సందడి కనుచూపుల చకోరపుఁబక్షులను
యిందు కెదురుగా నంపి ఇంపుతోడ నున్నది

చ. 3: పక్కన తనజవ్వనబండార మంతయును
అక్కజాన నీ కిచ్చేనని వున్నది
తక్కక శ్రీవేంకటేశ తానే నిన్నుఁ బిలుచుక
వెక్కసాన నిన్నుఁ గూడి విఱ్ఱవీఁగి వున్నది

రేకు: 1074-2 ఆహిరినాట సంపుటం: 20-440

పల్లవి: కొంకక నావద్ద నిట్టె కూరుచుండరా
సంకెలల్లాఁ బాపి నిన్ను జాణఁజేసే నిపుడు

చ. 1: మొదల నీవే నాకు మోహించవలెఁగాక
అది నాతో మారుకొనే ఆపాటిదా
వొదిగి దానికిఁగా నీవూరకే లోఁగే వింతే
అదన నేనే తీర్చే ఆవెరపు నీకు

చ. 2: చనవిచ్చి నీవు నాకు సమ్మతించవలెఁగాక
పెనఁగి యాపె నాతో బీరమాడేదా
చెనకి ఇందుకుఁగాను చింత నీకు నింతయేల
అనుమానమెల్లాఁ బాపే ఆసతిముందరనే

చ. 3: ఇటువలె నీవు నన్ను యెనయఁగవలె గాక
సటకారి ఇంతి నాతో సరిదూగేదా
ఘటన శ్రీ వేంకటేశ కాఁగిలించితివి నన్ను
కిటుకులన్నియుఁ బాసె కేరికేరి నవ్వేరా

రేకు: 1074-3 శ్రీ రాగం సంపుటం: 20-441

పల్లవి: ఇందాఁకా దూరితి నిన్నేడలేని మాటలను
చందమాయఁ బనులెల్లాజాణవౌదువయ్యా

చ. 1: గక్కన నానవెట్టఁగ కపటములెల్లఁ దీరె
చెక్కునొక్కఁగా మతి సేదదేరె
చక్కనన్నుఁ జూడఁగాను సంతసములెల్లాఁ జేరె
వొక్కమనసునను నావొద్ద నుండవయ్యా

చ. 2: తారుకాణ సేయఁగాను తప్పులన్నియునుఁ బాసె
కోరి నాతో నవ్వఁగాను కొంకుదేరెను
సారె సారెఁ బెనఁగఁగ చవులాయ పొందులెల్ల
యీరీతి నేకాలము మమ్మేలుకొనవయ్యా

చ. 3: మచ్చికఁ గాఁగిలించఁగ మర్మములెల్లఁ గరఁగె
చెచ్చెర నీరతులను చింతదీరెను
అచ్చపు శ్రీ వేంకటేశ అన్నిటా మేలే చేరె
తచ్చనలేక మాతో తాపుకొనవయ్యా

రేకు: 1074-4 రామక్రియ సంపుటం: 20-442

పల్లవి: ఇద్దరము నిద్దరమే యెందువొయ్యేమే
కద్దులేవే వేడుకకుఁ గడమేమీ లేదు

చ. 1: చవులై నవలపులు సరుసనే వుండఁగాను
ఇవల నెడమాటలు యింకానేలే
తవిలి నేనే వచ్చే తానీడకు విచ్చేసీ
వివరముతో నంతేసి వేగిరములేలే

చ. 2: కాతరపుతమకము కైవశమై వుండఁగాన
చేతుల సన్నలు గొంత సేయఁగనేలే
యీతలఁ దా చెక్కునొక్కీ యిందుకు నేనైనా మొక్కే
యేతులుఁ యెమ్మెలు నీక యెంచనున్నదా

చ. 3: కదిసినదేహములు కాఁగిటనే వుండఁగాను
గుదిగొని మది వేరే కొసరనేలే
యిదివో శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
వెదకి చూచితె మరి వేరులేదు ఇఁకను

రేకు: 1074-5 దేసాళం సంపుటం: 20-443

పల్లవి: ఈపాటివుపచార మిది చాలదా
చేపట్టి నే నిఁక నిన్నుఁ జేసేదేమీ

చ. 1: అందరితోనుఁ జెప్పక అట్టె మనపొందులెల్లా
అంది ఆకెతోఁ జెప్పితి వది చాలదా
చెంది యాఁటదాని కీసిగ్గులే సింగారములు
నిందలమగవాఁడవు నీ కేమయ్యా

చ. 2: అంగపు మేనిగురుతు లాపెకే చూపితిగాని
అంగడిఁ బెట్టవైతి వది చాలదా
ముంగిట నిల్లాలికి ముంచినసొమ్ము ణఁకువ
చెంగట నీవు దొరవు చెప్పనేఁటికయ్యా

చ. 3: అంకెల మాతోసాటికి ఆకెనే యేలితి గాని
అంకిం చితరులనేల వది చాలదా
మంకులేని నేర్పరికి మానమే మూలధనము
యింక శ్రీ వేంకటేశ నన్నేలితివి మేలయ్యా

రేకు: 1074-6 లలిత సంపుటం: 20-444

పల్లవి: చెలులము మా కీమాటచెప్పకపోదు
చెలఁగి ఆపెకోరిక చెల్లించవయ్యా

చ. 1: మతకపునీలోనిమనసు దెలియలేక
సతి నన్ను రమ్మనఁగఁజాలదు గాని
తతి నిన్నుఁ బిలునఁగ తానే విచ్చేసినది
యితనై నకోరిక నీ వీడేరించవయ్యా

చ. 2: కడురాజసపు నిన్నుఁ గమ్మి వేగిరించలేక
వొడిసి కొంగువట్టిక వున్నది గాని
అడరి విందుచెప్పఁగ నాయతపడి వున్నది
కడలేని వేడుకతో కానిమ్మనవయ్యా

చ. 3: మించినజాణవు నిన్ను మితిమీఱఁగాలేక
ముంచిన మొగము చూచి మొక్కీఁగాని
అంచెల శ్రీవేంకటేశ అట్టె నిన్నుఁ గూడున్నది
చంచుల నీలాగులనే చనవియ్యవయ్యా

రేకు: 1075-1 రీతిగౌళ సంపుటం: 20-445

పల్లవి: వట్టిమాటలఁ బోదు వలపు పేరడియైతే
గుట్టుతో నేమీననక కొంగువట్టుమనరే

చ. 1: పాయపుఁ దానూ నేను పంతములాడుకొంటే
కాయము లందలి కండగర్వ మందురు
చాయల నేకతమున సమరతి వుపరతి
సోయగపు బలుములు చూపవలె ననరే

చ. 2: జాణల మిద్దరమును చనవునఁ బెనఁగితే
గాణలు మెరసినకాతర మందురు
ప్రాణమైనకాఁగిటిలో బంధవిశేషములను
రాణించఁజేసితే మేలు రాశికెక్కుననరే

చ. 3: వొక్కటైన తాను నేను వూరకేవుండితేను
మక్కువ మీరిన యట్టి మత్తు లందురు
ఇక్కువ శ్రీ వేంకటేశుఁడిదె నన్నుఁ గూడెఁగాన
యెక్కువ తక్కువ గల్తే నెంచవలె ననలే

రేకు: 1075-2 నాట సంపుటం: 20-446

పల్లవి: ఒద్దు వొద్దు నిన్నుఁజూచి వూరకుండేను
సుద్దులనీచేతలు సోదించ నిఁకను

చ. 1: అంగడి నున్నది చిత్త మప్పట నుండి నీకు
కొంగువట్టి నేఁ దీసితే కోపమురాదా
ఇంగిత మెఱఁగకున్న నేది జాణతనము
వెంగిలితనాన నిన్ను వేసరించ నిఁకను

చ. 2: తత్తరాన నున్నది నీతనువు అప్పటనుండి
అత్తి నేఁ బెనఁగితే నీ కలపుగాదా
ఇత్తన గుట్టులేకున్న నేది దొరతనము
పొత్తుల మంకుదనాన బోదించ నిఁకను

చ. 3: పైపై నున్నది నీభావ మప్పటనుండి
చేపట్టి నేఁ గూడకుంటే చింత రేఁగదా
కాపాడి శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
దాఁపుల బేలుఁదనాన రవ్వసేయ నిఁకను

రేకు: 1075-3 ఆహిరి సంపుటం: 20-447

పల్లవి: అప్పటికోప మించుకే ఆపఁగలేవైతివి
వొప్పుగా విభుని కెట్టు వుత్తరమిచ్చేవే

చ. 1: చెక్కునొక్కి నీకు బుద్దిఁచెప్పఁడా ఆతఁడు దొల్లి
వొక్కటై ఆపెనుఁ గూడుకుండు మనుచు
యిక్కడ నది మఱచి యింతితో వాదించితివి
యెక్కువ నాతనిమొగ మేమని చూచేవే

చ. 2: సేయరానిప్రియమెల్లాఁ జేయఁడా ఆతఁడు దొల్లి
మాయల సవతి పోరు మానుమంటా
ఆయమెరగక వొట్లాపెకేల పెట్టితివి
చాయల నీతని కెట్టు సమ్మతి సేసేవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరికూడఁడా తొల్లి
సేవసేసీ నాపె నీకుఁ జేకొనుమని
వేవేలుతి నాడి వెనక బుజ్జగించితి
నీవిభుఁ డీతని కెంత నేరుపు చూపేవే

రేకు: 1075-4 సామంతం సంపుటం: 20-448

పల్లవి: వాదులేల మాతోను వట్టిసటలకు నీవు
సేదదేరి నవ్వరాదా సేఁతలెల్లా నున్నవి

చ. 1: తిద్దినగందవు బొట్టు తియ్యనిమోవిని గుట్టు
కద్దని నీకునీకే కానవచ్చునా
వద్దనున్న మావంటివారు చెప్పఁగా విని
అద్దము చూచు కోరాదా అన్నియును నున్నవి

చ. 2: చెక్కుల మింతిననిగ్గు చిత్తములోపలిసిగ్గు
చొక్కుచు నింతంతని చూపవచ్చునా
దక్కియున్నారము నేము దాఁపిరాలకెల్లా మమ్ము
వక్కణ లడుగరాదా వన్నెలెల్లాఁ జెప్పేము

చ. 3: నిలువు నివ్వెరగులు నేరుపులమరఁగులు
తొలఁకఁగా నవి నీకు దొబ్బవచ్చునా
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
తలపోసు కొనరాదా తగవెల్లాఁ గనేవు

రేకు: 1075-5 గౌళ సంపుటం: 20-449

పల్లవి: వీదులవీదులనేఁగే విట్ఠలేశా వట్టి
వేదలెల్లాఁ బాసె నిఁక విట్ఠలేశా

చ. 1: వేడుకకాఁడవైతివి విట్ఠలేశా నీకు
వీడె మందుకోవోయి విట్టలేశా
వీడు జోడునగవుల విట్టలేశా నీ పై
వేడెవెట్టె మావలపు విట్టలేశా

చ. 2: వెలసె నీమోవి గడువిట్టలేశా నీకు
వెలుపలే లోనయ్యె విట్టలేశా
వెలలేనిమహిమలవిట్టలేశా పూవు
విలుతునిఁ గన్న తండ్రి విట్టలేశా

చ. 3: వెన్నెలతేటమాఁటలవిట్టలేశా నాఁ
విన్నపానకే కూడితి విట్టలేశా
వెన్నతో శ్రీవేంకటాద్రి విట్టలేశా నీవు
వెన్నుఁడవు వెయినామాలవిట్టలేశా

రేకు: 1075-6 దేవగాంధారి సంపుటం: 20-450

పల్లవి: తొడిఁబడ సందుసుడిదొంగాడిని
వెడఁగుఁగొప్పుశిరసు వెన్న ముద్దకృష్ణుఁడు

చ. 1: ఆదిగొని నేరాఁగా నఱచేతి వెన్నముద్ద
పాదుకొన నోర నిండాఁ బాపుకొన్నాఁడు
సాదించీ నామాఁటాడఁ డచ్చమయ్యిన గోలవలె
యీదెసఁ జట్టిలో వెన్నయియ్యవచ్చీఁ జేతికి

చ. 2: కుత్తక బంటిదాఁకా గూనలో పాలెల్లాఁ దాగి
యెత్తుక వున్నాఁడు మొగ మిందుదాఁకాను
యెత్తుకొనఁ బిలిచితే యెంతైనాఁ గదలఁడు
వొత్తుపట్టి వూఁదుకొనీ నొకచేత నేలను

చ. 3: పెరగుమీఁగడలెల్ల పిన్నవాండ్ల కందిచ్చి
దొరవలె లోననుండి తొంగిచూచీని
యెరపు లేక శ్రీ వేంకటేశుఁడని మొక్కితేను
ఇరవైతినని నవ్వీ నిట్టె సెలవులను

రేకు: 1076-1 రామక్రియ సంపుటం: 20-451

పల్లవి: ఎవ్వరినైనా నడుగు మామాట నీవు
రవ్వలు సేయుచు నే లెఱఁగవోకాక

చ. 1: మొక్కితినంటా నన్ను మోహపుఁదిట్టుఁ దిట్టేవు
వెక్కసాన నేమైనా వెంగమా యిది
కక్కసించి నీ వొళ్లఁ గల్లలేమి గల్గఁగానో
తక్కరితనమునఁ గాఁతాళించేవుగాక

చ. 2: నగితినంటా నన్నునను గోర నూఁదేవు
వొగరుఁదనముల నీ వొరటా యిది
యెగసక్కెపు నీచేఁత లెందుకు సరివచ్చెనో
పగటున నీలోనీవే భావించేవుగాక

చ. 3: చన్నుల నొత్తితినంటా సారెఁ దప్పకచూచేవు
కన్నెనైన నీ వొద్దిగర్వమా యిది
యిన్నిటా శ్రీ వేంకటేశ యెమ్మెలు గలుగఁగానో
నన్నుఁ గూడితివి నీనయా లిట్టేకాక

రేకు: 1076-2 సాళంగనాట సంపుటం: 20-452

పల్లవి: చూడరమ్మ చెలులార జూటితఁడు
యీడుజోడై వినయాలు యెంత సేసీ నితఁడు

చ. 1: సన్నల సారెసారె సాగిలి నే మొక్కఁగాను
యెన్నేసి నవ్వులు నవ్వీ నితఁడు
కన్నులఁ దప్పక నేను కాఁగిలించి చూడఁగాను
వున్నతి తానేల లోఁగీ వూరకైనా నితఁడు

చ. 2: కూరిమి నిలుచుండి నే కొలువులు సేయఁగాను
యీరీతి చెఱఁగువట్టీ యీతఁడు
తారుకాణలైనట్టు తన్ను నేనే పాడఁగాను
ఆరిసి తా చెక్కునొక్కీ నంతలోనే యీతఁడు

చ. 3: చింతదీర తనకు నే సేవలెల్లాఁ జేయఁగాను
యింతలోనే కాఁగిలించీ నితఁడు
అంతటి శ్రీ వేంకటేశుఁడని నే తన్నుఁ గూడితి
సంతోసములెల్లా రేఁచి చనవిచ్చీ నితఁడు

రేకు: 1076-3 ముఖారి సంపుటం: 20-453

పల్లవి: వెల్లవిరాయ వలపు వేసాలేలే
చల్లగా నతఁడు నిన్ను సమ్మతించఁజేసెను

చ. 1: సెలవిఁబారేటినవ్వు చేతనేల మూసేవే
అలుక దేరిచె విభుఁడపుడే నిన్ను
బలువైన పులకలు పయ్యదనేల తడిచేవే
సొలసి మర్మ మతఁడు సోఁకించె నిన్నును

చ. 2: అంగపుఁ జెమటలు పయ్యదనేల తుడిచేవే
వెంగలి నీసిగ్గతఁడు విడిపించెను
ముంగిటినీనిట్టూర్పులు మొరఁగి యేలణఁచేవే
చెంగలించ జేసి నీలో చింతవాపె నతఁడు

చ. 3: వేడుక మోవికెంపులు విడేననేల కుప్పేవే
కూడి యీాతఁడే నీ కొంకు దేర్చెను
యీాడనె శ్రీ వేంకటేశ నింతలోనేల మెచ్చేవే
జాడతోఁ గలకాలము సతమాయ నీకును

రేకు: 1076-4 లలిత సంపుటం: 20-454

పల్లవి: ఎందువోయే విపుడు ఇద్దర మెదురైతిమి
కందువల మనగుట్టు కానవచ్చీ నిఁకను

చ. 1: చన్నులు నీ పైనాని సాదింతుఁగాక కత-
లెన్నిచెప్పినా నేను యేలమానేను
విన్నవినుకులకును వేతుఁగాక నీపై నింద
వన్నిననీయానలకు భ్రమసేనా ఇఁకను

చ. 2: పెదవితేనియ లాని పిప్పి సేతుఁగాక నవ్వు-
లెదుట నెంతనవ్వినా యేలమానేను
పుదుటునీయెమ్మెలకు వూఁదుదుఁగాక గోరు
చదురునీ సేఁతలకు జడిసేనా ఇఁకను

చ. 3: కూడినరతుల నాని కుమ్మరింతుఁగాక తమ్మ
యీడ నీ వెంతమొక్కినా యేలమానేను
పాడితో శ్రీవేంకటేశ పై కొంటివి మెత్తుఁగాక
ఆడుకోలు పంతాలకు నలసేనా ఇకను

రేకు: 1076-5 తోండి సంపుటం: 20-455

పల్లవి: ఏల వూరకున్నాఁడవు ఇంకా నీవు
పాలించి మనలోనివే పంతాలు గావా

చ. 1: మచ్చికతో నీవు నేను మాటలాడినందుకే
తచ్చి యాపె దిట్టుకొనీఁ దానేతాను
విచ్చనవిడి నందుకు వేఁడుకొనవయ్య నీవు
నెచ్చలి తన్నునుకొంటే నినునంట గాదా

చ. 2: ఇద్దరము నేకతాన ఇట్లనుండినందుకే
కొద్దిమీరఁ జెలులపై గోపగించీని
బుద్ధిచెప్పి చేయివట్టి బుజ్జగించవయ్య నీవు
పెద్దరిక మాపెది నీ పేరే యింతా గాదా

చ. 3: మక్కువ శ్రీ వేంకటేశ మనము గూడినందుకే
కక్కసించి వూరకైనాఁ గాఁతాళించీని
వొక్కటే ఆపే నేను వొరసి కూడితి విదె
నిక్కము దెలుసుకొంటే నీవు నీవే కావా

రేకు: 1076-6 ఆహిరి సంపుటం: 20-456

పల్లవి: ఇదివో మావొళ్లినేర మిఁకనేఁటిది
నిదులనాజవ్వనము నీచేతి దిఁకను

చ. 1: ననిచి యప్పటి నీతో నవ్వులు నే నవ్వితిఁగా
తనిసి యన్నిటా నీపైఁ దయకించుక
మనసు మెత్తనిదాన మఱి యేమిచెప్పే నీకు
నినుపై నాభాగ్యము నీచేతి దిఁకను

చ. 2: సొలసి యప్పటి నీతో సుద్దులు చెప్పితిఁగా
బలిమి పొడిపంతాలు పచరించక
అలరినమేలుదాన అననేమున్నది నిన్ను
నెలవై నాధైర్యము నీచేతి దిఁకను

చ. 3: గక్కన నప్పటి నీతో కాఁగిటఁగూడితిఁగా
చొక్కులఁబెట్టుచు నీతో సోదించక
వొక్కటై శ్రీ వేంకటేశ వొరయనేఁటికి నిన్ను
నిక్కపు నాసిగ్గులెల్లా నీచేతి దిఁకను

రేకు: 1077-1 రామక్రియ సంపుటం: 20-457

పల్లవి: ఆతఁడిదె నీవిదె అరగొరతేఁటికే
కాతరానఁ గాఁగిలించి కపటము లేఁటికే

చ. 1: యిచ్చకము లాడేది హితము మోహములకు
పచ్చిదేర నవ్వేది ఫల మందుకు
ముచ్చటలు నడుపేది మొదలు కూటములకు
యెచ్చుకుందుసొలపులు యీడ మరియేఁటికే

చ. 2: తమకించి పైకొనుటే తగవు వయసులకు
అమరఁగఁ బెనఁగేదే ఆయ మందుకు
సమమగు సరసాలే చవులు కరఁగులకు
తిమిరేటి పంతముల తెరమఱఁగేఁటికి

చ. 3: ఇటువలెఁ గూడేదే యెన్నిక ఆసలకును
ఘటన మోవితేనెలే కందు వందుకు
తటుకనఁగూడె శ్రీవేంకటరమణుఁడు నిన్ను
నటనలన్నియుఁగూడె నాలి ఇఁకనేఁటికే

రేకు: 1077-2 నాట సంపుటం: 20-458

పల్లవి: బుద్ధిచెప్పరా నీకు పొరుగులవారెల్ల
తిద్దుబడీఁ దా నిన్నీఁ దెలిసినపనులు

చ. 1: పంతమాడ నేఁటికి పడఁతులముందరను
వింతవా రెవ్వరున్నారు వీరిలోన
దొంతినున్నవలపులు దోమటి దొడికితిమి
రంతు సేయఁబోతేను రవ్వకెక్కుఁ బనులు

చ. 2: తప్పకచూడనేఁటికి తరవాతిపనులకు
వుప్పటించుచుట్టాలెల్లా వొద్దనున్నారు
రెప్పలనున్నయాసలు రేపునుమాపును నిండె
చొప్పులెత్తఁబోతేను జోడించుఁబనులు

చ. 3: సిగ్గువడనేఁటికి చెందినకాఁగిటిలోన
అగ్గలమయ్యేరా నీకు నండవారెల్లా
కగ్గని శ్రీవేంకటేశ కందువలఁ గూడితిమి
వెగ్గళించఁబోతేను వింతలవుఁ బనులు

రేకు: 1077-3 బౌళి సంపుటం: 20-459

పల్లవి: ఇన్నిటాను మేలుమేలు యేల దాఁచేవు
వన్నెలను తొల్లింటివాఁడవా నీవిపుడు

చ. 1: మంతనాన నీతో నాపె మాటలాడెనటకా
చెంతలఁ జెవిలెనేమో చెప్పేనటకా
సంతసాన మరియును సన్న సేసెనటకా
వింతలుగ నన్నియును వింటిమి నీసుద్దులు

చ. 2: అంగన తనపై నీకు నానవెట్టెనటకా
సంగతి వలపులెల్లఁజల్లెనటకా
వుంగిటిదీరఁగ సెలవుల నవ్వెనటకా
చెంగటనే వూరెల్లాఁ జెప్పిరి నీసుద్దులు

చ. 3: కలికి పై కొని నిన్నుఁ గాఁగిలించె నటకా
యెలమి మాయింటి కప్పణిచ్చె నటకా
కలసితివి శ్రీ వేంకటరమణుఁడు నన్ను
పలుకుఁక బంతములు బలిసె నీసుద్దులు

రేకు: 1077-4 భైరవి సంపుటం: 20-460

పల్లవి: ఇంతిచనవు చెల్లించు మెగ్గులుపట్టకు నీవు
సంతిసించి మెచ్చుటే చాయపాటుఁదనము

చ. 1: అంగన యలిగితేను అట్టె తా మారలుగక
సంగడిఁ గూచుండితేనే జాణతనము
యింగిత మెరిఁగి యాపె కిచ్చకములే యాడి
కొంగువట్టి తియ్యుటే గక్కున మంచితనము

చ. 2: కామిని దిట్టిఁగాఁ జూచి కదిసి యాకెమ్మోవి
దోమటి దొడికితేను దొరతనము
చేముట్టి సరసమాడి చేతికి లోనుగాఁజేసి
ఆమనిరతిఁ జొక్కించే దది దొడ్డతనము

చ. 3: గుట్టుతోడ నున్నసతి గొల్లునను నవ్వించి
నెట్టినఁ గాఁగిలించుటే నేర్పుఁదనము
యిట్టె శ్రీ వేంకటేశ యీమగువఁగూడితివి
నట్టనడుమఁ గూడుటే నయగారితనము

రేకు: 1077-5 గౌళ సంపుటం: 20-461

పల్లవి: ఎందుకు రోయనివాఁడ వేమైనాఁ జేయవచ్చేవు
విందువలె వింతవారు వింటే నవ్వేరయ్యా

చ. 1: వుంగిటిగా నెవ్వతో నీవురమున మెత్తినట్టి -
యెంగిలిగందాలు నాపైనేల పూసేవు
పంగెము గలవాఁడవు బాఁతిపడుదువు గాక
సంగతా ఇల్లాండ్లకు సర విది యౌనా

చ. 2: అమరించి యేడవారో అట్టే నీకు నిచ్చినట్టి
చెమటసొమ్ములు నాచేతఁ బెట్టేవు
తమిగలవాఁడవు తగిలించుకొని వచ్చి
గుమితాన నుండేమాకు గురిగా నిచ్చితివి

చ. 3: మానినులరతులను మాఁగినచేతులఁ దెచ్చి
కానుక వట్టుచు నన్ను గాఁగిలించేవు
కానీలే శ్రీ వేంకటేశ కలసితివి వలపు
నానఁబెట్టి నీకుఁ దగు నాలి నాకుఁ దగునా

రేకు: 1077-6 పాడి సంపుటం: 20-462

పల్లవి: నీకుఁబోదు నాకుఁబోదు నీచనవుగలదాన
మేకొని నిన్నేమనినా మేలుసుమ్మీ విభుఁడా

చ. 1: వొద్దనుండి చన్నులనే వొరసితి నే నిన్ను
అద్దుక నాఁటవుగదా ఆకొనలు
పెద్దరికానకే కడుఁబెనఁగేవారము నీపై-
నుద్దండాలు సేతుము వోరుచుకో విభుఁడా

చ. 2: ముచ్చటాడేనని వచ్చి మోవి యెంగిలిసేసితి
పచ్చియై తోఁచదుగదా పలుసోఁకుల
మెచ్చులసలిగెలను మెరసేవారము నిన్ను
యెచ్చుకుందు లాడుదుము యియ్యకొమ్మీ విభుఁడా

చ. 3: కాఁగిలించుకొంటానే కన్నుల జంకించితిని
చేఁగదేరించవుగదా చేతలెల్లాను
మూఁగిన శ్రీవేంకటేశ మోహపువారము నీతో
వీఁగక కూడితి మిది వింతసుమ్మీ విభుఁడా

రేకు: 1078-1 దేసాళం సంపుటం: 20-463

పల్లవి: మెఱఁగుఁ జెక్కుల అలమేలుమంగా
తరి తోడి రతులను దైవారవమ్మా

చ. 1: చనవులు నీకిచ్చి చక్కనివదన మెత్తి
పెనఁగి నాతఁడు నిన్నుఁ బ్రేమతోడను
కనువిచ్చి చూడవమ్మ కందువల నవ్వవమ్మ
మనసిచ్చి యాతనితో మాటలాడవమ్మా

చ. 2: పొందులు నీతో నెరపి పూఁచి నీపైఁ జేయివేసి
చిందీ నీపై నతఁడు చిఱుఁజెమట
విందుల మోవియ్యవమ్మ వేడుకలు చూపవమ్మ
అందుకొని ఆకుమడి చాతని కీవమ్మా

చ. 3: గక్కుననుఁ గాఁగిలించి కరుణ నీపై నించి
ఇక్కువఁ గూడె శ్రీ వేంకటేశుఁడు నిన్ను
వక్కణ లడుగవమ్మ వన్నెలెల్లాఁ జూపవమ్మ
నిక్కుచు నురముమీఁద నిండుకొనవమ్మా

రేకు: 1078-2 శ్రీ రాగం సంపుటం: 20-464

పల్లవి: ఈ విన్నపము మఱవ కింకా నీవు
నీవూడిగపుదాన నీచిత్త మికను

చ. 1: మోము చూచినవాఁడవు మెక్కించుకొన్నవాఁడవు
యీమేలే నడుపుము ఇంకా నీవు
నామనసెఱుఁగుదువు నమ్మించితివి తొల్లె
నేమము పట్టితి నీకే నీచిత్త మికను

చ. 2: చేయుపట్టితివి నీవు సెలవుల నవ్వితివి
యీయెడ నన్నుఁ బాయకు మింకా నీవు
ఆయము నీచేతిది అడియాల మిదె నాపై
నీయిచ్చలోనిదాన నీచిత్తమికను

చ. 3: గట్టిగా నన్నుఁ గూడి కప్పురవిడె మిచ్చితి
ఇట్టె కరుణఁ జూడు మింకా నీవు
అట్టె శ్రీ వేంకటేశుఁడ నలమేలుమంగ నేను
నెట్టుకొంటి పానుపుపై నీచిత్త మికను

రేకు: 1078-3 గౌళ సంపుటం: 20-465

పల్లవి: ఔలే యెఱిఁగితిమి అన్నియు నేఁడు
మేలుమేలు జాణవౌదు మెచ్చితిమి నిన్నును

చ. 1: నీమేనివాసనలే నెలఁతమేన నున్నవి
యేమి సమ్మంధములో మీ కిద్దరికిని
చేముట్టి నా కప్పటి నీచెలిజవ్వాది పూసేవు
కామించి కదంబముగాఁ గలుపేవు వలపు

చ. 2: అదిగో నీవుంగరాలే ఆపెవేళ్లఁ గొన్నున్నవి
కదిసినతగ వెంతగద్దో కాని
పుదుటున నీముద్దుటుంగరము నా కిచ్చేవు
పొదిగి తొరలించేవా పొరుగులవలపు

చ. 3: అంగపునీకరఁగులే అలమేల్ మంగ కున్నవి
సంగతి శ్రీవేంకటేశ చనవెట్టిదో
అంగవించి యేలితివి అప్పటి నన్నింతలోనే
ముంగిటనే నిలిపేవా మునుకొన్నవలపు

రేకు: 1078-4 వంతవరాళి సంపుటం: 20-466

పల్లవి: ఎంత వేగిరకాఁడమ్మ ఇదివో తాను
పొంత నావద్దఁ గూచుండి బోధించీఁ దాను

చ. 1: సిగ్గువడి చెక్కుచేత చింతించుకుండఁగాను
వెగ్గళించి నాపైఁ జేయివేసీ తాను
దగ్గరి ఇందరిలోన తలవంచుకుండఁగాను
ఆగ్గలము వేఁడుకొని ఆదరించీ తాను

చ. 2: మానాపతితనాన మాటలాడకుండఁగాను
ఆనుకొని యాడోకత లడిగీఁ దాను
పానుపుపైఁ గూచుండి పంతముతో నుండఁగాను
మేను ముట్టి సారె సారె మేలమాడీ తాను

చ. 3: ఇయ్యకొని తనకాఁగి లిచ్చగించి వుండఁగాను
పయ్యదంటుచును వొడఁబరచీఁ దాను
నెయ్యపు ఆలమేల్మంగ నేను తా శ్రీవేంకటేశుఁ -
డియ్యెడఁ గరుణఁ గూడె ఇన్నిటాఁదాఁను-

రేకు: 1078-5 పాడి సంపుటం: 20-467

పల్లవి: ఇద్దరము నున్నారము ఇంత చాలదా
పెద్దగాఁగ నడియాస పెనచఁగవలెనా

చ. 1: మొక్కితి నీకు నేను మొన్న నిన్నటిసుద్దికి
వక్కణలేల చెప్పేవు వద్దు వద్దు
కుక్కి తోసినట్టు నీకు గుట్టున నుంది వలపు
పిక్కటిల్లు తనుఁదానె పెడరేఁచవలెనా

చ. 2: నవ్వితి నీమోము చూచి నాలిసేసి ఇందాఁకా
జవ్వనమేల పట్టేవు చాలుఁజాలు
పువ్వులవలెనే నీకు పూఁచుక వున్నది తమి
రవ్వలయ్యీఁగాక తానే రారాఁపు వలెనా

చ. 3: ఆడితి నలమేల్మంగనని నన్నుఁ గూడితివి
యీడనే బాసలు సేసేవేల యేలఁ
వేడుకవలేనే శ్రీ వేంకటేశ నిండె మాట
వాడికలై వుండీఁగాక వ్రాసిచూపవలెనా

రేకు: 1078-6 ఆహిరి సంపుటం: 20-468

పల్లవి: ఇదివో దిష్టము చూడు యింతి ఇదె నీ విదె
మదిలో మావిన్నపాలు మఱవకువయ్యా

చ. 1: నిన్నుఁ జూచి నంతలోనే నెలఁతమై చెమరించె
చన్నులపైఁ బులకలు జాజుకొనెను
కన్నులఁ దేటలు మించె కళలు మోమున నిండె
యెన్నేవి నీమీఁది మోహ మేమిచెప్పేమయ్యా

చ. 2: మాటలాడినంతలోనే మగువకుఁ గొప్పు జారె
తేటలైన సిగ్గులెల్లా దిమ్ముఁవాసెను
పాటించి కోరికలెల్లా భావాన నీరిక లొత్తె
కూటువ నీపై కాంక్షలు కొలఁదియేదయ్యా

చ. 3: దగ్గరినయంతలోనే తతిగొనె నూరుపులు
దిగ్గనఁ బయ్యదకొంగు దిగజారెను
అగ్గమై శ్రీ వేంకటేశ అలమేలుమంగ యీకె
కగ్గుదీర నిన్నుఁ గూడె కడమేడదయ్యా

రేకు: 1079-1 ఆహిరి సంపుటం: 20-469

పల్లవి: ఇట్టె నన్నుఁ గరుణించి యీడేర్తు గాక
తొట్టుకొన్న సవతుల తొడుసులేల

చ. 1: నమ్మించి వద్ద నీవు నాకుఁ గలిగుండఁగాను
పమ్మినట్టి విరహపు భయ మేల
సమ్మతించి యన్నిటాను చనవిచ్చియుండఁగాను
చిమ్ములఁ జెక్కిటిచేతి చింతలేల

చ. 2: మనసిచ్చి నీవు నన్ను మన్నించియుండఁగాను
ఘనమైన కాంక్షల కడమేల
ననుపున నీవు నాతో నవ్వులు నవ్వఁగాను
యెనసి చెలులచేతియెడమాట లేల

చ. 3: కూడి నీవు నన్ను నిట్టె కొంగువట్టుకుండఁగాను
ఆడుకోలుమాటలలో ఆరడేల
నీడల శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
మేడెపురతు లబ్బెను మేకు లింకానేల

రేకు: 1079-2 వరాళి సంపుటం: 20-470

పల్లవి: ఎఱఁగము వోరుచుకో యేమి గలిగినా నన్నీ
తటివచ్చె పనులలో తప్పుదేరీఁగాని

చ. 1: చనవుగలుగువారు సణఁగు లెంతాడినాను
మనసు నాటుకొని మంచిదై తోఁచు
పెనఁగితి నిందాఁకా ప్రియము రెట్టించ నేను
యెనసి నీచిత్తానకు యెట్టుండెనో

చ. 2: పిలిపించుకొన్నవారు బీరము లెంతాడుకొన్నా
వలపుల చేఁతలకు వన్నెలై తోఁచు
మలసితి నిందాఁక మర్మము సోఁకఁగ నిన్ను
వలనై నీచిత్తానకు వచ్చునో రాదో

చ. 3: బాసలు గొనినవారు పట్టి యేమి సేసినాను
వేసట యించుకలేక వేడుకై తోఁచు
యీసులేక శ్రీ వేంకటేశ నేఁ గూడితి నిన్ను
ఆసతో, నీ చిత్తానకు నది మించెనో

రేకు: 1079-3 సాళంగనాట సంపుటం: 20-471

పల్లవి: నేరుపరి విన్నిటాను నెరజాణవు
మేరలు మీరేవారము మేము మీకెదురా

చ. 1: మారుకొని నీతోడ మీటలాడ వసమా
బీరానఁ జదివేవి పెనువేదాలు
గారవాన వేసేవి గాలాలైతే నాయఁగాక
తీరువడరైరా నీలో త్రిపురాంగనలు

చ. 2: సాదించి నీదిక్కు చక్కఁజూడవశమా
గాదిలినీచూపులు అంగజుశాస్త్రాలు
కాదన నీచేఁతలు చీఁకటివైతే నాయఁగాక
సేద దేరరైరా నీలో చేరి గొల్లసతులు

చ. 3: జాడల నీమోవితీపు చవిగొనవశమా
ఆడుకొందు వందునే మోహనమంత్రాలు
కూడనా శ్రీ వేంకటేశ గొల్లవైతే నవుదుగాక
యీడ నే నలమేల్మంగ నిందరును మెచ్చరా

రేకు: 1079-4 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-472

పల్లవి: చూతువు విచ్చేయవయ్య సుద్దులు చెప్పగనేల
రాతిరిఁబగలు జాగరములాయను

చ. 1: ముంచిన వలపు తలమునుకలై వనితకు
దించినట్టు కొప్పువీడి దిగజారెను
యెంచరానితమకము ఇగిరించినట్టు మేనఁ
జంచులపులకలెల్ల జాజుకొనెను

చ. 2: తగినచింతాసముద్రానఁ గోరిక వోడ
దిగినయట్టు చెక్కుచేతికి వచ్చెను
పగటున నిధానాలు బయటఁ బడినయట్టు
సగముపయ్యెదెడలి చన్నులు మెరసెను

చ. 3: కందువఁ దనభాగ్యము కాఁగిట నిలిచినట్టు
పొందితి శ్రీవేంకటేశ పొలిఁతి నిట్టె
అందె అలమేలుమంగ నప్పటి లోనింటి కేఁగి
కందువ చెప్పింపినట్టు కాంతలఁ బుత్తెంచెను

రేకు: 1079-5 నారాయణి సంపుటం: 20-473

పల్లవి: చిత్తగించి నీవే నన్నుఁ జేకొని పాలింతుగాక
బత్తు లేడకెక్కును నాభావ మేమున్నదిరా

చ. 1: చేరి నీమోము చూచితే సిగ్గులే ముంచీ నాకు
యేరీతి మాటలాడుదు యేమిసేతురా
ఆరయ నిన్నునంటితే నంగమెల్లాఁ జెమరించీ
నేరుపు లేడకెక్కును నేఁడు నీముందరను

చ. 2: ననుపు నటించఁబోతే నవ్వులే వచ్చీ నాకు
మనసెటు దెలుసు నీమర్మమేదిరా
చనుమొనల నొత్తితే జాజుకొనఁ బులకించీ
తనివేడఁ దెచ్చుకొందు దంటవు నీయెదుట

చ. 3: గడుగఁ గాఁగిలించబోతే కరఁగీ మర్మములెల్ల
తడవ కెట్టుండుదును తతి యేదిరా
అడరి శ్రీవేంకటేశ అలమేలేమంగ నేను
జడియక కూడితివి సరసుఁడవౌదువు

రేకు: 1079-6 శ్రీరాగం సంపుటం: 20-474

పల్లవి: ఇంతటనుఁ గరుణించు ఇదె విన్నపము నీకు
ఇంతి యలమేలుమంగ ఇరవై నీకున్నది

చ. 1: చేతుల నీరూపు వ్రాసి చెలరేఁగివుండే యాస
గాతల నీసతి పొద్దుగడపీ నదె
నీతితోడ వీనులను నీకతలు వినేయాస
రాతిరిఁబగలును బీరము సేసుకున్నది

చ. 2: తలపోఁతలను నిన్ను దగ్గరివుండేటియాస
పెలుచై నదేహము పెంచీ నదె
కలలోననైన నిన్నుఁ గాఁగిలించుకొనేయాస
బలువుగాఁ బ్రాణము పట్టుకున్నదదివో

చ. 3: యిట్టె నీవు వచ్చేవని యెదురుచూచేయాస
నెట్టుకొని వేడుకతో నిలుచున్నది
గట్టిగా శ్రీవేంకటేశ కై కొని కూడితి విదె
వొట్టుక నిన్నుఁ బాయక వొద్దికై తానున్నది

రేకు: 1080-1 సామంతం సంపుటం: 20-475

పల్లవి: దాఁచినవాఁడే యెఱుఁగు ధనము గుఱుతు నాకు
పూఁచి నీవు చెప్పితేనుపొంచివినే నీఁకను

చ. 1: మొక్కితి నప్పుడే నీకు మోహము రెట్టించనా
చెక్కులేల నొక్కేవు చేరి యందుకు
నిక్కి నీలోనికడమ నీకే తెలుఁసుగాక
ఇక్కువలలోని యర్తాఁ లెఱుఁగ నావశమా

చ. 2: వీడెమిచ్చితి నాడనే వేవేలుచందముల
కూడి యేలకాఁగిలించి కుచ్చియెత్తేవు
నీడ నీవు సేసేచేఁత నీకే తెలుసుఁగాక
వేడుకతో నవి నేను విచ్చి చెప్పఁగలనా

చ. 3: పాదాలొత్తితి నేను పంతపు శ్రీవేంకటేశ
ఆదిఁ గూడి తలమేల్‌మంగందురంటాను
నీదయ నాపైఁ బెట్టేది నీకే తెలుసుఁ గాక
మేదినిలో నింతంతని మెచ్చ నాకు నలవా

రేకు: 1080-2 కన్నడగౌళ సంపుటం: 20-476

పల్లవి: నిచ్చలు నాబతుకెల్ల నీచేతిది: నీఁ
యిచ్చవచ్చినట్టు సేయు మెదురాడ నీకను

చ. 1: పలికితి నీతోడఁ బంతములు సారెసారె
సొలసితిఁ గొంత గొంత చూపులలోను
అలసితి నీకనోప నన్నిటా నీచిత్తమునఁ
గలిగినయట్లఁ జేయు కాదన నే నీకను

చ. 2: కక్కసించితిని నిన్ను ఘనమైనరతులను
వెక్కసానఁ గొసరితి వేసరించితి
మొక్కెద నీక నేనేర మొదల నుపాయాలు
మక్కువ గలట్టే సేయు మఱఁగేల యీకను

చ. 3: కరఁగించితి మనసు కాఁగిటిరతుల నిన్ను
సిరుల శ్రీవేంకటేశ సేవచేసితి
అరమఱచితి: నవ్వే నలమేలుమంగ నేను
తరవాత నన్నిఁ జేయు తమకించ నీకను

రేకు: 1080-3 కేదారగౌళ సంపుటం: 20-477

పల్లవి: చెప్పినట్టు సేతుగాక చెలువునియెడ నీవు
ముప్పిరిఁ బెనగుదురా మోహించినదానవు

చ. 1: వొగ్గి నీరమణుఁడిదె వొడివట్టు కుండఁగాను
సిగ్గులేలే చింతలేలే చెల్లఁబో నీకు
దగ్గరఁ గూచుండి తానే తతి నిన్ను వేఁడుకోఁగా
యెగ్గులేలే యెమ్మెలేలే యింకా నీకు

చ. 2: పలుకుల నీవిభుఁడు పాలార్చఁగా నిన్ను
అలుకేలే కలఁకేలే అద్దో నీకు
నిలుచుండి యాతఁడు నిన్ను నొడఁబరచఁగా
చలమేలే బలిమేలే సారెసారె నీకు

చ. 3: కడు శ్రీవేంకటేశుఁడు కాఁగిలించుకుండఁగాను
తడవేలే గొడవేలే తగవా నీకు
అడరి యలమేల్మంగవని నిన్నుఁ గూడె నేఁడు
బెడసేలే గడుసేలే ప్రియురాల నీకు

రేకు: 1080-4 సింధురామక్రియ సంపుటం: 20-478

పల్లవి: ముట్టివచ్చినపనికి మొక్కేనయ్యా
జట్టిగొంటి విన్నిటాను జగడము లేఁటికి

చ. 1: పంతము నాచేతిది బలిమి నీచేతిది
ఇంతినిదె కంటి నెక్కుడా నేను
వింతదాన నేఁగాను విడువఁగరాదు నీవు
యెంతకెంత రావయ్య ఇఁకనేల అలుక

చ. 2: తగవు నావొళ్ళిది దయ నీకుఁ గలదే
మగువ నిదివో నేను మారాడేనా
వెగటాడ నే నీతొ వెక్కసము లేదు నీకు
తగు నిఁక లేవయ్య తలపోఁత లేఁటికి

చ. 3: ఫలమెల్లా నాసొమ్ము పైపైనవ్వులు నీవి
అలమేలుమంగ నేను అడ్డమున్నదా
యెలమి శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
చెలఁగితి నుండవయ్య సేసన్నలేఁటికి

రేకు: 1080-5 నాదరామక్రియ సంపుటం: 20-479

పల్లవి: కల్లగాదు యిది నీవు గన్నపనే
చెల్లు నీకే యన్నియును చిత్తగించరాదా

చ. 1: మొక్కిననా మొక్కులోనే మోహమెల్లాఁ గానరాదా
చొక్కపునామనసేమి సోదించేవు
యిక్కడనే భ్రమయించ యిదిగొంత వలెనా
తక్కరితనము నేర దయఁజూడు మిఁకను

చ. 2: యిచ్చినకానికెలోనే యితవెల్లాఁ దెలియదా
తచ్చి, మాగుణములేమి తలపోసేవు
రచ్చఁబెట్టి నీవింత రవ్వసేయవలెనా
మచ్చరమెఱఁగ నన్ను మన్నించు మిఁకను

చ. 3: కూడిన నాకూటమిలో గుణమెల్లఁ గానరాదా
తోడనే మమ్మెంత నీవు తొరలించేవు
వేడుక మించితివి శ్రీవేంకటేశ నన్ను నిట్టె
జాడ నలమేల్మంగను చనవులి మ్మిఁకను

రేకు: 1080-6 శంకరాభరణం సంపుటం: 20-480

పల్లవి: ఈడేరి చనవాడవు యెప్పుడు నీవు మానేవా
మేడెపుఁ గళలచేత మించేవుగాక

చ. 1: ఆయములెరిఁగి మెచ్చ నది నీవే నేరుతువు
నీయంత నేరుతునా నెలఁత నేను
చాయల నన్నేల నీవు సరులు వెట్టుకొనేవు
కాయకమైన యామేలు గట్టుకొందుగాక

చ. 2: పంతము చెల్లించఁగ పాడి నీవెఱుఁగుదువు
యెంతయిన నీతోడ యీడువచ్చేమా
అంతలోనే నీవు నన్ను అప్పణలేలడి గేవు
చెంత నీదొరతనమే చెల్లింతుగాక

చ. 3: రతులఁ జవులు చూపేరసికుఁడ వౌదువు
యితవులు దెలియనే మెంతవారము
గతియై శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
సతమై నీమహిమలే జట్టిగొందుగాక

రేకు: 1081-1 లలిత సంపుటం: 20-481

పల్లవి: ఆయనాయ చాలుఁజాలు అంతసేయకు
నాయములఁ బెట్టి నిన్ను నవ్వించజాలనా

చ. 1: సిగ్గున నూరక చెక్కు చేతితో నుంటిఁగాక
దగ్గరి మాటాడ నిన్నుఁ దడవా నాకు
వెగ్గళించి నీమాట వేలుచుకొనుచుంటిఁగాక
యెగ్గులెంచి వొలవేయ నెంతకైనా నేరనా

చ. 2: సారె సారెఁ గన్నుల నీసరిత చూచితిఁగాక
తారుకాణలకుఁ దియ్య దడవా నాకు
గారవపు నీమోము కన్నదాఁకా నుంటిఁగాక
బీరమాడి నీతో నింత పెనఁగనోపనా

చ. 3: నిలుచుండి నీచేఁతకు నివ్వెరగందితిఁగాక
తలఁపెల్లఁ దెలియ గఁ దడవా నాకు
బలిమి శ్రీవేంకటేశ పాయకిట్టె కూడితివి
అలమేలుమంగను నే నంత నేరనా

రేకు: 1081-2 గౌళ సంపుటం: 20-482

పల్లవి: చేతికిలోనాయఁ బతిఁ జేకొనవమ్మ
నీతులెల్లఁ గంటిమిదె నీవంకనే యమ్మ

చ. 1: మొగము నీవు చూడఁగ మోహము రెట్టించె నేఁడు
నగవమ్మా ఇప్పుడిట్టె నాయకునితో
నిగిడి కూటములకు నీయంతనే పోఁగువెళ్లె
వగదీరె నాతనిని వలపించవమ్మా

చ. 2: ముచ్చట నీవాడఁగాను ముమ్మడించె నిదె మేలు
ఇచ్చకమాడవమ్మ ప్రాణేశునితోను
నిచ్చలపుఁ గందువలు నీవద్దనే వున్నవి
రిచ్చగా నాతనితమి రేఁచఁగదవమ్మా

చ. 3: వెలసె నీవు మెచ్చఁగ వేవేలాయ రతులు
కలయవమ్మ శ్రీవేంకటపతిని
కలికితనము లివి కాణాచిగా నీకుఁ జిక్కె
పొలసి యీతనినిట్టె భోగించవమ్మా

రేకు: 1081-3 దేసాళం సంపుటం: 20-483

పల్లవి: ఊరకే అలుగకు నీ వోయయ్యా
ఆరితేరినమాట నిన్నంటి నింతేకాక

చ. 1: కపటములెల్లాఁ బాసె కన్నులఁ గన్నంతలోనె
వుపమలు చెప్పవయ్య వోయయ్యా
చపలచిత్తుఁడవా జడిసేటివాఁడవా
అపురూపముగనేమో అంటి నింతేకాక

చ. 2: పట్టికు నీవంతయెగ్గు పనిలేనిపనులకు
వొట్టుక నవ్వఁగదయ్య వోయయ్యా
వెట్టివలపా నీది వేసట నీకున్నదా
అట్టునిట్టు యేఁటికో నిన్నంటి నింతేకాక

చ. 3: కోరిక లీడేరె నిన్నుఁ గూడినయంతటిలోనే
వూరటసేసుకోవయ్య వోయయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా జాణవౌదువు
ఆరసి నిన్నూరకె అంటి నింతేకాక

రేకు: 1081-4 వేళావళి సంపుటం: 20-484

పల్లవి: ఇంకనేల మఱఁగూ యిందరు నెఱిఁగిరి
సంకెదీర నీమోవి చవిగొంటిమి

చ. 1: సారిది నీసుద్దులకే చొక్కి చొక్కి నేమెల్ల
వరుసలు వెట్టుకొని వలచితిమి
సిరులఁ గొలనిదరిని చీరలకొరకుఁగాను
వెరవుతోడ నిన్ను వేఁడుకొంటిమి

చ. 2: చల్లలమ్మేచోటనెల్ల జాణతనాలాడి యాడి
లొల్లిగా నీపొఁగులకు లోనయితిమి
కొల్లలాడిన వెన్నల గొందుల సందుల నెల్ల
పెల్లు రేఁగి నీకాఁగిటఁ బెనఁగితిమి

చ. 3: యమునలో పిల్లఁగోవి యరసేరాగాలు విని
గుమిగట్టి వచ్చి నిన్నుఁ గూడితిమి
తమితో శ్రీవేంకటేశ తలఁపు నీపైఁ బెట్టి
సమరతుల మెప్పించి చనవు చేకొంటిమి

రేకు: 1081-5 సాళంగనాట సంపుటం: 20-485

పల్లవి: చెప్పనేల నీసుద్దులు చెల్లుబడ్డై వుండఁగాను
కప్పినపట్నాలవారు గందమిత్తురా

చ. 1: నాలిసేసినవాఁడవు నగ నీవే నేరుతువు
మేలు మేలనుచు నిన్ను మెచ్చఁగనేల
వాలుమగఁడవు యింతవాఁడవు గాకుండితే
మూలనున్న గొల్లెతలు మోహింతురాఁ

చ. 2: వలపించినవాడవు వంకలాడ నేరుతువు
నులివాఁడి గోరఁ జెక్కునొక్కఁగనేల
కలికితనాల నింతఘనుఁడవు గాకుఁడితే
పొలసి పురసతులు భోగింతురా

చ. 3: కొంగువట్టినవాఁడవు కూడ నిట్టె నేరుతువు
వెంగలితనాన నిన్ను వేఁడుకోనేల
సంగతి శ్రీవేంకటేశ జాణ వింతగాకుండితే
జంగిలి పదారువేలు చనవిత్తురా

రేకు: 1081-6 శుద్దవసంతం సంపుటం: 20-486

పల్లవి: ఆకెకు నీకుఁ దెలుసు నామీఁదిసుద్దులెల్లా
చేకొని వాకుచ్చి నీతో చెప్పనేమున్నదిరా

చ. 1: ఆయముసోఁకినమాఁట లప్పుడు నీవాడఁగాను
కాయమెల్లఁ బులకించెఁ గరఁగీ చెలి
చాయ సేసుకొని నీవు సంగడివారి మొరఁగి
మాయలనవ్వు నవ్వేవు మరి నేనేమందురా

చ. 2: కమ్మటి నీవు కడగండ్లనే చూడఁగాను
యెమ్మెలెల్లా నాడదా నీయింతి ఆవేళ
దిమ్మురేఁగి చెలులకుఁ దెలియకుండా నీవు
చిమ్మి పెదవిసన్నలు సేసేవు యేమందురా

చ. 3: అంటిముట్టి యాపెను నీ వరమఱపించఁగాను
నంటులెల్ల నడపదా నమ్మి యీడను
గొంటవై శ్రీవేంకటేశ కూడితి విందుకు నన్నుఁ
జంటలఁ గొసరితేను సాదించే వేమందురా

రేకు: 1082-1 బౌళి సంపుటం: 20-487

పల్లవి: కానీవే అందుకేమి కల్లలేదు నాయందు
దానికేరా నీకల్లకు తతిరాదు యిఁకను

చ. 1: అందుకేవే గొల్లెతా ఆసలివే కానుక
కందువవుర నీచేఁత కానుక గాదా
నిందలేల వేసేవే నెలఁతల నడుగవే
సందడిలో నేమనినా సాకిరులుగావా

చ. 2: పుచ్చు కోవే లంచమూ పోరచి కెమ్మోవితేనె
లచ్చనపలు సోఁకులే లంచములౌరా
పచ్చిసేయకువే నీవు పనులు గలవు మీఁద
పచ్చని మోముకళలు పాలుగారీఁగదరా

చ. 3: ఇయ్యకోవే వలపూ ఇవివో మచ్చికలు
ఇయ్యకొంటిరా తొల్లె ఇన్నిటా నిన్ను
ముయ్యకువే నీమెచ్చు ముసిముసినవ్వులను
యియ్యెడ శ్రీవేంకటేశ యిదివో మెచ్చితిరా

రేకు: 1082-2 సౌరాష్టం సంపుటం: 20-488

పల్లవి: నేనేమీ ననఁజుమ్మీ నిన్నుఁ దొలుత
కానుకగా నిన్ను నీవే కాకుసేసేకొందురా

చ. 1: తగవు లేమిటికి తప్పు నీయందున్నదా
నగఁగా నీతో నేను నగితిఁగాక
మగడిమగడి యాల మర్మము లెత్తుకొనేవు
వెగటుగ నీకునీవే వెల్లవిరు లౌదురా

చ. 2: వొడఁబరచగనేల వొద్దంటినా నిన్ను
తడవఁగానే నేనుఁ దడవేఁగాని
బడల నీవే వొళ్లేల పట్టి చూచుకొనేవు
జడిసి నీపై నీవే సడివేసుకొందురా

చ. 3: తమకించి కూడితివి దయగలవాఁడవౌదు
భ్రమయఁగా నేను నీతో భ్రమసితిని
అమర శ్రీవేంకటేశ అంటి నన్నుఁ గూడితివి
సమరతులలొ గుట్టు సారె నాడుకొందురా

రేకు: 1082-3 భైరవి సంపుటం: 20-489

పల్లవి: ఏఁటికి సిగ్గులువడే విందువంకఁ దప్పేమి
నాటకములన్నిటాను నావాఁడవే

చ. 1: నీవు నామొగము చూచి నిలుచుండితేఁ జాలు
చేవదేర రతిఁ జొక్కించిన వాఁడవే
కైవశమై నాకు నీవు కలిగివుండితేఁ జాలు
యీవలసినచన విచ్చినట్టి వాఁడవే

చ. 2: చేసన్నల నామేను చేతనంటితేఁ జాలు
వోసరించక మాయింట నున్నవాఁడవే
వేసరక నావునికి విచారించితేఁజాలు
పోసరించి నీవు నన్ను భోగించినవాఁడవే

చ. 3: పానుపుపై నీవు నన్నుఁ బాయకుండితేఁజాలు
నానా రీతుల నాకు నంటువాఁడవే
కోనేటిశ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
యీనెలవులను బాసలిచ్చినట్టి వాఁడవే

రేకు: 1082-4 ముఖారి సంపుటం: 20-490

పల్లవి: ఎంచితే నావల్ల నీకు నేమున్నది
మించి నేనే జాణనంటా మెచ్చేవుగాక

చ. 1: మొక్కలాన నే నీతో మోమువంచు కుండఁగాను
చెక్కునొక్కి మోమెత్తి చిత్తగించితి
ఇక్కువ నింతమన్నించ నేమి బాఁతి నే నీకు
నిక్కి నీమంచితనమే నిరుపేవు గాక

చ. 2: పంతములు నేనీతో పచరించుకుండఁగాను
చింతదీర నవ్వు నవ్వి చేయివట్టితి
చెంత నన్నుఁ బొది గింతసేయ నేమిపని నీకు
కాంతలెడ నీ పుణ్యము గట్టుకొంటిఁగాక

చ. 3: ముందు వెనకెంచి నీతో మొన వెట్టుకుండఁ గాను
అంది నన్నుఁ గాఁగిలించి యాదరించితి
కందువ శ్రీ వేంకటేశ కారణమేమి నీకు
సంగడి యేలే నీకు సాజమేమో కాక

రేకు: 1082-5 కన్నడ గౌళ సంపుటం: 20-491

పల్లవి: నేనేమి యెఱఁగను నీవే భారకుఁడవు
మోనముతో నున్న దాన ముచ్చట నీచేతిది

చ. 1: తేనెగా రేనీ మాటల తేటలకే చొక్కితిమి
లోనుండిన నీమనసులోఁతెంతో
ఆనుక బాగాలిచ్చి ఆకు చేతఁబట్టుకొని
నానఁబెట్టుకున్న దాన ననుపు నీచేతిది

చ. 2: చవులైన వినయాల సందడి నే మున్నారము
తవిలి నీరతులకు తతి యేదో
జవళిఁ బాదములొత్తి సంగడి మర్మాలు రేఁచి
తవన మీఁదెత్తితిని తగవు నీచేతిది

చ. 3: యిచ్చిన నీచవుల యెమ్మెల నోలలాడితి
కచ్చుపెట్టి బోగములకత లేఁటివో
యిచ్చకుఁడ శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
యిచ్చలు నీ కాడితిని యిరవు నీచేతిది

రేకు: 1082-6 సామవరాళి సంపుటం: 20-492

పల్లవి: ఏల బూటకముసేసే వింతలోనను
పోలికలన్నియును నీపొరుగును నున్నవి

చ. 1: బత్తిసేయ నెఱఁగను పంతమాడ నెఱఁగను
చిత్తమువచ్చినదాఁకా సేవ చేసేను
హత్తి కాఁగిలించుమంటా నానలేల పెట్టేవు
వత్తివలె నీమోవి వాడుదేరీ నిపుడు

చ. 2: తలఁపు దెలియనోప తమకించి దూరనోప
వలెనన్నప్పటిదాఁకా వద్ద నుండేను
మొలకనవ్వులతోడ మొగమేమి చూచేవు
కలిగినయలపెల్లా కాయముపై నున్నది

చ. 3: కనుసన్న సేయఁజాల కమ్మటిఁ గొసరఁజాల
తనిసిన యందాఁకా తమిరేఁచేను
ఘనుఁడ శ్రీవేంకటేశ కరగించి కూడితివి
వెనకటిరతులెల్లా వెరగులై మించెను

రేకు: 1083-1 మాళవిగౌళ సంపుటం: 20-493

పల్లవి: నయము గలుగనే నవ్వుదుగాక
రయమునఁజెనకితే రవ్వకోపునా

చ. 1: సిగ్గువడి వున్నచెలిఁ జెఱఁగువట్టి తీసేవు
అగ్గలపుఁ గొలువులో నందరుఁ జూడ
నిగ్గుల ప్రౌఢవు నీవు నెలంత యీపె బాలకి
దిగ్గనఁ గొసరేవు ఇంతేసి కోపునా

చ. 2: పంతాన నుండిన సతిఁ బచ్చిమాట లాడేవు
అంతరంగ మెఱఁగవు ఆసకాఁడవు
అంతటా సూరుఁడవు నీవాపె గడుముద్దరాలు
చెంతలఁ బెనఁగితే నీచేతికోపునా

చ. 3: తలమంచుకున్నకాంతఁదమకించి కూడితివి
చలమరి వవుదువు సాదించను
బలిమికాఁడవు నీవు భామ నీకుఁ జనవరి
వెలసె శ్రీవేంకటేశ వేసరఁగ నోపనా

రేకు: 1083-2 ఆహిరి సంపుటం: 20-494

పల్లవి: నీవే యెఱిఁగి మన్నించు నీచిత్తము
కావరించి నిన్ను నంత గాసిఁబెట్టను

చ. 1: కొసరఁగఁ దగుదువు కొంగువట్టఁ దగుదువు
విసిగేవోయని నిన్ను వేసరించను
రసికుఁడ విన్నిటాను రాజసము చెల్లు నీకు
వసమైనదాఁకా నీతో వాసు లెంచను

చ. 2: పచ్చి సేయఁ దగుదువు పంతమాడఁ దగుదువు
రచ్చకెక్కేవని నిన్ను రాయడించను
వచ్చినట్టే వత్తువు వలపు గలదు నీకు
మెచ్చినదాఁకా నీతో మేలమాడను

చ. 3: నవ్వు నవ్వఁదగుదువు నాలిసేయఁ దగుదువు
జవ్వనపు వాఁడవని సాదించను
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
చివ్వన నిందాఁకా నిన్నుఁ జెక్కునొక్కను

రేకు: 1083-3 పాడి సంపుటం: 20-495

పల్లవి: నిండుకున్నది వలపు నీమీఁద
పండివున్నవి ఆసలు పైపై నామీఁదను

చ. 1: చెక్కులు నీవు నొక్కఁగ చింతలన్నియునుఁ బాసె
మొక్కులు నే మొక్కఁగాను మోహము నిండె
ఇక్కువలు గరఁగెతి మిద్దరము నిందువంక
తక్కిని మాటలేమియుఁ దడవకు మిఁకను

చ. 2: చేయి నీవు వేయఁగాను చెమరించె దేహమెల్ల
చాయల నేఁజూడఁగాను చవివుట్టెను
పాయపు వేడుక లబ్బెపలుమారు నిందువంక
పోయిన సుద్దులు వోనీ బొంకకుమీ ఇఁకను

చ. 3: చెనకి నీవు గూడఁగ సిగ్గులు పొత్తుకు వచ్చె
తనిసి నే మెచ్చఁగాను తమివుట్టెను
యెనసితిమి శ్రీవేంకటేశుఁడ నేఁడిందువంక
చనవులెల్ల నీడేరె సాదించకు మిఁకను

రేకు: 1083-4 ఛాయనాట సంపుటం: 20-496

పల్లవి: ఔరా లెస్సాయను అట్టేకాదా
కేరికేరి మమ్ముగనింత గేలిసేసేవు

చ. 1: చెలులతో నీవు సేసేచేఁత లాడుకొంటినో
చలపట్టి సారెసారె సాదించేవు
అలమి నాకొనగోర నంగము లంటితినో
చలివాసి బొమ్మలనే జంకించేవు

చ. 2: మేకులకు నీసతులమీఁదఁ బెట్టితినో
వాకుచ్చి వాదులకే వచ్చేవు నీవు
కై కొని నీమోవిమీఁద గంటిగాఁజేసితినో
దీకొని తప్పకచూచి దిమ్మురేఁచేవు

చ. 3: నీతగిలి కాఁగిటిలో తప్పులు వట్టితినో
నగుతానే నాతో నాననలు వెట్టేవు
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడ నీవు
మిగులఁ గూడితినంటా మెచ్చు మెచ్చేవు

రేకు: 1083-5 శంకరాభరణం సంపుటం: 20-497

పల్లవి: వలచినందుకు నిటువంటిదా గురి
తలపోసి నీమోము తప్పకచూచెను

చ. 1: నగవులు నీతో నవ్వి నాటకములెల్లాఁజేసి
తగుల నిన్నుఁదిట్టెఁగా తరుణి
మొగమోటించుకలేక ముంగోప మెట్లఁజూపె
వెగటుగ నాకిందుకు వెరగయ్యీ నేఁడు

చ. 2: మచ్చిక నీపైఁ జల్లి మంచిమాటలెల్లనాడి
పచ్చిసేసెఁగా నిన్ను పడఁతి
రచ్చల నవ్వేరనక రాజస మెట్లఁ జూపె
తచ్చి నీమోము చూచి దయపుట్టీ నాకు

చ. 3: కన్నులనే సన్నసేసీ కాఁగిట బిగించి కూడి
నిన్ననలయించెఁగా నెలఁత
యిన్నిటా శ్రీ వేంకటేశ యీడ నన్నుఁ గూడితివి
కన్నె నిన్నుయెట్టు మెచ్చె కతడిగె నిపుడు

రేకు: 1083-6 రామక్రియ సంపుటం: 20-498

పల్లవి: వింతవారా నీకు వీరు విడువ వింకా గుట్టు
వంతుతోడ నంత తలవంచనేల యిఁకను

చ. 1: చెవిలోన నీకు నే జేసిన విన్నపములు
అవల నీసతులెల్లా నడిగేరు
తివిరి యానతియ్య దేవరవే వారితోడ
జవళినేల నవ్వేవు సారెసారె నిపుడు

చ. 2: సమ్మతించి నేను నీతో సన్న సేసిన భావము
నెమ్మది విచారించేరు నీసతులు
తెమ్మలుగ నందరికి తెలుపువయ్యా నీసుద్ది
చిమ్ముచు నింతలోనేల సిగ్గువడ నీకును

చ. 3: లోలత నిన్ను జేవట్టి లోనికిఁ దీసిన పని
ఆలించి వినేమనేరు అతివలెల్లా
లాలించి శ్రీవేంకటేశ లలి నన్ను గూడితివి
పోలికలు చూపవయ్యా బొంకనేల యికను

రేకు: 1084-1 శుద్ధవసంతం సంపుటం: 20-499

పల్లవి: మాపుదాకా యేమనిన మంకుదేరేవా
తీపులు చల్లుక నీతో దెగడేదే నాపని

చ. 1: చలము సాదించరాదు సణగులఁ దిట్టిరాదు
వలచినదాన నిన్ను వంచుకోరాదు
తెలివి దెచ్చుక నీతో తేటలుగా నవ్వునవ్వి
కెలసి ఇచ్చకమాడి గెలిచేదే నాపని

చ. 2: పెనఁగఁ దగదు నీతో బిగువు చూపఁదగదు
నవిచినదాన నీతో నాలి దగదు
మనసువట్టుక నీమర్మములు సోఁకించి
చనవు సేసుకుండేది సంగతైన నాపని

చ. 3: పొందుసేయ కిఁకఁ బోదు బోగించి మెచ్చకపోదు
విందువంటిదాన మాట వినకపోదు
కందువతోడుత శ్రీ వేంకటేశ నేఁ గూడితి
యిందునే పాయకవుండి యెనసేదే నాపని

రేకు: 1084-2 ఆహిరి సంపుటం: 20-500

పల్లవి: నావొళ్ల గల్లలేదు నామాట నాకు జెల్లె
ఆవేళ నీకు దీరదాయజుమ్మీవిభుఁడా

చ. 1: పవళించి చంద్రగావిపచ్చడముసుగుతో
జవళి నాపెయు నీవు సరినుండగా
ఇవల నప్పుడు నిన్ను యెరుకసేసుకోఁ గాని
తివిరి వచ్చితి జుమ్మీ దేవరవద్దికిని

చ. 2: తలవీడి మొలవీడి దంతపుటోవరిలోన
అలమినాపెయు నీవు నట్లుండగా
పలికించి నిన్నప్పుడు పచరించనైతిఁ గాని
నిలిచి చూచితిజుమ్మీ నీమొగము నేను

చ. 3: చిత్తజకేలిని మీరు సిగ్గువిడిచుండఁగా
హత్తి శ్రీ వేంకటేశ నిన్నలమితిని
పొత్తుల గూడితి విట్టె పూఁచి పేరు చెప్పఁ గాని
తత్తరించనైతి జుమ్మీ దండనే వుందానను

రేకు: 1084-3 ఆహిరినాట సంపుటం: 20-501

పల్లవి: నీవేల లేదనేవు నీసతితోను
కావరించి పడుఁగాక కాదనకు మిఁకను

చ. 1: మచ్చికలు చల్లుచు నీతో మాటలాడి నీకు నేఁడు
ఇచ్చకము నెరపదా ఇందాఁకను
అచ్చమైన ఆపెనేపో అన్నసుద్దులెల్లా నేను
ముచ్చటగా మరియేల మూసిదాఁచే విపుడు

చ. 2: వీడెమిచ్చి నీతోను వేసాలు సేసుకొంటా
యీడ నిట్టే వుండదా యిందాఁకను
యేడనైనాఁ గాని యాపె నిన్నిటా నేఁ దిట్టితిఁబో
ఆడనిఁ వాదు లేఁటికి అణఁచేవు యిపుడు

చ. 3: సరి నిన్నుఁ గాఁగిలించి సరసములాడుకొంటా
యిరవుకొని వుండదా ఇందాఁకను
అరిది శ్రీవేంకటేశ ఆపెనేపో కొసరితి
గరిమ మమ్మేల వొక్కటిసేసే విపుడు

రేకు: 1084-4 కేదారగౌళ సంపుటం: 20-502

పల్లవి: ఇంక నీవు వెఱవకు యీడ నే నుందానను
పొంకపు నీగుణములే పొదిసేసె నిన్నును

చ. 1: నిన్నుఁ జేత ముట్టితేను నీవేల వులికేవు
పన్నిన మరుచి గురుబాణమా యిది
యెన్నిక యీచేతలను యెవ్వతె బెదరించెనో
ఇన్నిటా నీయలవాటు ఇంతసేసె నిన్నును

చ. 2: దగ్గరఁ గూచుండితేను తత్తరించనేల నీకు
ఆగ్గలపు నీపాలిటి ఆత్తనా నేను
దిగ్గన యెవ్వతెచే సాదింపులఁబడి వచ్చితో
యెగ్గుల నీమొగమోటే ఇంతసేసె నిన్నును

చ. 3: ఇట్టె నారతిలోన యేల బుసకొట్టేవు
గట్టిగా సాముచేసేటిగరిడా యిది
పట్టుక యెవ్వతే నిన్ను పంతమిచ్చి కూడెనో
యెట్టు శ్రీవేంకటేశుఁడ యెమ్మసేసె నిపుడు

రేకు: 1084-5 పాడి సంపుటం: 20-503

పల్లవి: నాకే సతమైతే మాతో నవ్వవయ్యా
కాకు సేసేచేతలైతే కాఁక కోపమయ్యా

చ. 1: సంగడిఁ గూచుండిమంటా సరుస నిందలాడేరు
రంగుగా నింత మాకు రవ్వ యేల్లయ్యా
యెంగిలి సేసేవు మోవి యెక్కడనుండో వచ్చి
వుంగిటి తరితీపుల కోపమయ్యా

చ. 2: సరసమాడితిమంటా సతులెల్లా నేఁకరేరు
తరఁగు మొరఁగులైతే తగులేలయ్యా
కరగించేవు మనసు కడలఁ దనిసివచ్చి
పొరగుపొరచులై తే పొందుకోపమయ్యా

చ. 3: కూడితి నన్నునంటా కొమ్మలెల్లా గొణఁగేరు
ఆడికలకు లోనైతి మదిగోవయ్యా
వేడుక వుట్టించేవు శ్రీవేంకటేశ నేడు వచ్చి
తోడుత నలసితిమి దొమ్మి కోపమయ్యా

రేకు: 1084-6 కన్నడగౌళ సంపుటం: 20-504

పల్లవి: నీవే విచ్చేసి చూడు నెలంత భావములెల్లా
భావించఁగలమా అయ్య పడఁతిలోవలపు

చ. 1: తలపోఁతలనె కొంత తమకములనె కొంత
మలసి పొద్దుజరపె మగువ
అలసేయతంటిలోనె అతివమీఁద నొరగె
బలిమి నింతటిమీఁద పట్టిరాదు వలపు

చ. 2: యెడమాటలనె కొంత యెదురుచూపులఁ గొంత
అడరి ధీరత నుండె అతివ
జడిసి పానుపుమీఁద చల్లఁగాఁ బవ్వళించె
విడువక ఇక విన్నవించరాదు వలపు

చ. 3: నీపై పాటలఁ గొంత నిక్కలలనే కొంత
తీపులఁ గాచుకుండెను తెఱవ
యేపున శ్రీవేంకటేశ యింతలో నీపెఁ గూడితి
యేపొద్దూ దనివిలేదు యేమిటాను వలపు

రేకు: 1085-1 సామంతం సంపుటం: 20-505

పల్లవి: మానవయ్యా యింతేసి మంకుఁదనము
కోనల చూపులలోని కొసరేఁటికిఁకను

చ. 1: కన్నులనే మెచ్చి మోవిఁగప్పురము లియ్యఁగాను
కన్నెనేల తిట్టేవు కాతరించి
వున్నతి వెంగెమాడెనా వూడిగము సేసెఁగాక
పన్ని నీకు నేఁడింత భయమేఁటికిఁకను

చ. 2: సెలవుల నవ్వు నవ్వి చెక్కులిట్టె నొక్కఁగాను
చెలినేల జంకించేవు చిత్తగించి
వెలయ రట్టుసేసెనా వేడుకలు చూపెఁగాక
కొలఁది మీరగ నీకు కోపమేఁటికిఁకను

చ. 3: కందువలు చూపి నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
ఇందుముఖినేల మించే విచ్చగించి
సందడి నీపైఁ జేసెనా చనవుమెరఁసెగాక
అంది శ్రీవేంకటేశుఁడ అలుపేల ఇఁకను

రేకు: 1085-2 పాడి సంపుటం: 20-506

పల్లవి: ఊరకే చక్కజాడతో నుండనీరాదా
సారె సారె మమ్ము నింత జాగుసేయవలెనా

చ. 1: కన్నసతులనెల్లా నాకాళ్లకు మొక్కించేవు
పన్ని నీవే మొక్కించుక బతుకరాదా
ఇన్నేసిరవ్వలు సేసి యేల వుప్పటించేవు
కన్నెలము మమ్ము నింత కాకుసేయవలెనా

చ. 2: అండనున్న వారిచేత నాకుమడి చిప్పించేవు
దండిగా నీవే అందుక తనియరాదా
బండునేసి మమ్ము నేల పరచేవు ఇటువలె
నిండుసిగ్గులవారము నేఁడె ఇంతవలెనా

చ. 3: వుమ్మడిసవతులచే నూడిగాలు సేఇంచేవు
ఇమ్ముల నీవే మెచ్చి ఇయ్యకోరాదా
నమ్మించి శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
సమ్మతించి నీవారము సంతోసించవలెనా

రేకు: 1085-3 లలిత సంపుటం: 20-507

పల్లవి: ఎవ్వరిఁ బొగడుదుము యెంతని నేము మేచ్చేము
బువ్వముల కిచ్చుడాయ భోగపుమీకతలు

చ. 1: జక్కవచన్నులమీఁద సరులు నీ వంటఁగాను
చెక్కులెల్లాఁ జెమరించె చెలియకు
యెక్కడి కెక్కడ సూత్ర మెంతనేరిచె మరుఁడు
పుక్కిటి పురాణమాయ పొందులమీచేఁతలు

చ. 2: తుమ్మిద నెరులకొప్పు దొడ్డగా నీవు వెట్టఁగ
కమ్మి మేను పులకించె కాంతకు
యెమ్మెల నేడకునేడ యెంతసేసీ యీవలపు
వుమ్మడినే దిగుపారె వొళ్ళనే మీ జాడలు

చ. 3: గక్కన కంబుకంఠము కాఁగిలించుకొనఁగాను
ఇక్కువలు గరఁగెను ఇంతికి
ఇక్కడ శ్రీ వేంకటేశ యెంతకెంత మీ నేర్పులు
వక్కణలలేకలాయ వాడిక మీరతులు

రేకు: 1085-4 సౌరాష్ట్రం సంపుటం: 20-508

పల్లవి: తలఁచిన పనులెల్ల దక్కె నీకును
సిలుగు లన్నియు మాని చెలఁరేగవయ్యా

చ. 1: ఆకె నీతో మాటలాడె అన్నియునుఁ దలకూడె
యేకచిత్తమున నుండు మిఁక నీవు
రాకుండఁగ నిందాఁక రవ్వగా నలిగితివి
యీకడ నీతోడ యెక్కె నిఁక నవ్వవయ్యా

చ. 2: యిదె నీపైఁ జేయివేసె ఇయ్యకములెల్లాఁ జేసె
యెద నిమురుకవుండు మిఁక నీవు
అదనఁ బిలువదంటా అసురుసురైతివి
చదురుల మాటలాడె చనవియ్యవయ్యా

చ. 3: నెయ్యమునఁ గాఁగిలించె నేరుపుల మోవి యిచ్చె
యియ్యకోలు సేసుకొమ్మా యిఁక నీవు
పయ్యదంటి కొసరితి భామను శ్రీ వేంకటేశ
తియ్యగానే నిన్నుఁగూడె తిరముకోవయ్యా

రేకు: 1085-5 శ్రీ రాగం సంపుటం: 20-509

పల్లవి: తడఁబాట్లాయఁ బని తప్పులోరుచుకోవయ్య
అడరి నాసొమ్మువు నీవంటా నేనుంటిని

చ. 1: వొలిసి యెవ్వతెనో నీ వూరకే చింతించఁగాను
మలసి నడుమ నేను మాటాడించితి
కులికి నీ చిత్తానకు కోపముగాదుగదా
అలరి నాకే వలతువంటా నేనుంటిని

చ. 2: పట్టి యెవ్వతో చన్నులపైఁ బరాకై నీవుండఁగ
గుట్టున నుండక నిన్నుఁ గొంగువట్టితి
వెట్టియైన నీభోగానకు వేసటగాదుగదా
నట్టుకొన్న నీచేతలు నాకంటా నేనుంటిని

చ. 3: సొరిది నెవ్వతెపైనో చూపువెట్టుకుండఁగాను
గరిమ నిన్నుఁ గాఁగిటఁ గలసితిని
అరుదై శ్రీ వేంకటేశ అంకెవచ్చెనా నీకు
పరువపునీమాటపట్టు నమ్మివుంటిని

రేకు: 1085-6 సాళంగనాట సంపుటం: 20-510

పల్లవి: సారెకు నానవెట్టకు సంగతి గాదు
మారుమాట నే నేర మర్మమింతేకాని

చ. 1: చిత్తమెట్టున్నదో నీకు సిగ్గువడుందాన నేను
అత్తి నీవూ నాపెఁ గూడినది చూచితి
యిత్తల మగవాఁడవు యేమైనా నమరు నీకు
రుత్తనవ్వే వచ్చీ నాకు రోసమేమీ లేదు

చ. 2: తగవెట్టున్నదో నీకు దయవుట్టీ నాకైతే
తెగువతో మీ ఇద్దరిదిక్కునుఁ జూచి
అగవడ్డదొరవు నీ వన్నియుఁ జెల్లు నీకు
మొగమోటే మించె నాకు మోసమేమీ లేదు

చ. 3: వెఱగెట్టాయనో నీకు వేడుకవుట్టెను నాకు
నెఱి మీభావ మెఱిఁగి నేఁ గూడితి
వెఱపేమీ లేదు శ్రీ వేంకటేశుఁడవు నీవు
తఱి నామతి గరఁగె తక్కువేమీ లేదు

రేకు: 1086-1 శ్రీ రాగం సంపుటం: 20-511

పల్లవి: నాయందుఁ గడమలేదు నమ్మించినవాఁడవు
చెయిమీఁదుగా నెట్టుసేసినా నీచిత్తము

చ. 1: మొక్కలాన నే నిన్ను ముంచి యాడినమాఁటకు
మొక్కితిఁ బంతమిచ్చితి ముందుముందుగా
కక్కసించనోప దయగలిగినప్పుడు నీవే
మక్కువసేసి నన్ను మన్నింతువుగాక

చ. 2: చలవట్టి నే నిన్ను జంకించినయందుకు
చెలఁగి నవ్వు నవ్వితి సెలవుగాను
బలిమిశాయఁగనోప బత్తిగలప్పుడే నీవే
పిలిచి కాఁగిట నించి పెనఁగేవుగాని

చ. 3: ఆసపడి నిన్నుఁ గూడి అలయించినయందుకు
వాసితో మోవి యిచ్చితి వన్నెలుగాను
యీసుదీరె శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
రాసికెక్క నింకా నీవే రక్షించేవు గాని

రేకు: 1086-2 భైరవి సంపుటం: 20-512

పల్లవి: సరసములలోనికి జగడాలేల
బెరసి యంతగలితే పెనఁగఁగరాదా

చ. 1: మోహమునఁ జెలి నీపై మొనగో రంటించెఁగాక
సాహసాన నాపై నీతోఁ జలపట్టెనా
వూహించ కిందుకుఁగాను వూరకే మారువమోహమేల
సోహగా మొకామొకాలు చూచుకొనరాదా

చ. 2: గట్టిసేసి యాపె నిన్ను గందమున వేసెఁ గాక
గుట్టుతోడ నీమీఁది కుచ్చితములా
వట్టినొప్పు లిందుకుఁగా వహించుకో నీకేల
చుట్టపువరుస మించ జోడై వుండరాదా

చ. 3: కందువచేతలు చూపి కాఁగిట బిగించెఁగాక
అంది నీతో బలిమి దా నట్టె సేసెనా
ఇందుకుఁగా శ్రీవేంకటేశ బుసకొట్టనేల
పొందుగాఁ గూడితి రిట్టె భోగించరాదా

రేకు: 1086-3 దేశి సంపుటం: 20-513

పల్లవి: ఏమైనా నను యెదురాడ నేను
దీమసంబుతోఁ దెలిసితి నేను

చ. 1: యెక్కుడుమాట నే నేమనియాడిన
వెక్కసురాలని విసుగుదువు
మొక్కుచు నీపాదములు చూచుక ఇటు
వొక్కట నూరకయుండెద నేను

చ. 2: పంతంబున నేఁ బైకొని నవ్విన
అంతరట్టడని యాడుదువు
చెంత నూడిగము సేసుక నీకిట్టె
చింతదీరి కడుచెలగెద నేను

చ. 3: ఆలమి నిన్ను రతి నలయించినను
బలిమితోడిదని పలుకుదువు
యెలమిని శ్రీవేంకటేశ్వర కూడితి
మెలగినట్లనే మెచ్చెద నేను

రేకు: 1086-4 వరాళి సంపుటం: 20-514

పల్లవి: నీకునీకే కొంకనేల నెలఁత నిన్నే మనీని
చేకొని సేదదేరిచి చెక్కునొక్కరాదా

చ. 1: సిగ్గుతోడ నున్నది చెలి నీవన్నమాటకు
యెగ్గువట్టియున్న దలయించినందుకు
నిగ్గుదేరుచున్నది నీవు చెనకినందుకు
బిగ్గెఁ గాఁగిలించి కడుఁ బెనఁగఁ గరాదా

చ. 2: మోనముతో నున్నది మొక్కళపునీచేఁతకు
ఆనవెట్టుకున్న దేమో అనినందుకు
పూనిపట్టుకున్న పొందేటినీకతలకు
కానుకగా నీవే వచ్చి కలయఁగరాదా

చ. 3: వలపుపై నున్నది పంతములాడినందుకు
తలఁ గెరలుచున్నది తక్కినందుకు
యెఱిఁగి శ్రీ వేంకటేశ యింతలో నీవు గూడితి
జలసి సరసముల చనవియ్యరాదా

రేకు: 1086-5 దేసాళం సంపుటం: 20-515

పల్లవి: అందుకైతే దోసము లేదంటి మింతే నేము
సందడిజాణవు నీవు సమ్మతించుకొందుగా

చ. 1: రేయిఁబగలును నీరేపల్లెలో చేఁతలు
ఆయాలు మోవఁగా నిన్నునాడెఁగా చెలి
యీయెడనైతే నేము యింతేసికి నోపము
పాయపు వాఁడవు మాటఁబడ నోపుదువుగా

చ. 2: గుఱుతైన యట్టినీ కొలనిలో చేఁతలు
వెఱవక నిన్ను వెలివేసెఁగా ఆపె
తెఱవల మింతేసి తెగువకుఁ జాలము
నెఱతనీఁడ విన్నిటా నీకు నవ్వవచ్చుగా

చ. 3: యింపుమీర నాఁటదాని నెత్తుకవచ్చినవింద
ముంపున నీమీఁద నిట్టె మోపెఁగా ఆపె
జంపుల శ్రీ వేంకటేశ సరి నిన్నింత నేఁ జేయ
అంపక నన్నుఁ గూడితి వన్నియు నేర్తువుగా

రేకు: 1086-6 హిందోళవసంతం సంపుటం: 20-516

పల్లవి: ఇప్పుడు విచ్చేసితి వేమందు నే నిఁక
కప్పిన మొగమోటముగలదాన నేను

చ. 1: యెదురుచూచితి నీకు నెప్పుడు వత్తువోయంటా
నిదుర గంటికి రాక నిన్ననెల్లాను
వెదకి తెమ్మంటి నిన్ను వెలదులనెల్లాఁ బంపి
వుదుటున నెవ్వతింట నుందువోయంటాను

చ. 2: పేరుకొని పిలిచితి పెద్దవాస నను నిన్ను
కూరిమితో నిట్టె పలుకుదువంటాను
వారివీరి నడిగితి వలసినచోట్లను
ఆరగించి పవ్వళించే యట్టినీ ఇక్కువలు

చ. 3: దేవరకే మొక్కుకొంటి దిక్కులకుఁ జేయెత్తి
కావించి నిన్నుఁ గన్నులఁగన్నదాఁకాను
శ్రీ వేంకటేశ నన్ను జిగిఁ గూడితివి నేఁడు
తావులనే నెలకొంటి దక్కుదువంటాను

రేకు: 1087-1 దేశాక్షి సంపుటం: 20-517

పల్లవి: సతి నిన్ను గెలిచాను జవ్వనపు గరిడీలో
మతిలోన మెచ్చి మెచ్చి మన్నించు రమణుఁడా

చ. 1: కనుసూటి వలపు కాంత చూచినచూపు
కొనకెక్క మరుఁడదె గురులేసెను
మొనకత్తిసాముా ములువాఁడికొనగోరు
పెనఁగి చెక్కులనొత్తి పేరెమువారెను

చ. 2: చేసూటివలపూ చెలికాఁగిలించినది
బాసతోనే కాయజుఁడు పందె మాడెను
మూసిదింపు మొరఁగూ ముంచినపయ్యదకొంగు
ఆసలు నీకుఁ జూపి ఆయాలు రేఁచెను

చ. 3: మొగసూటివలపూ మోహపు రమణి నవ్వు
తగవుతో మదనుఁడు దారగట్టెను
అగపడి శ్రీ వేంకటాధిప నీవు గూడితి
జగడమింతయుఁ దీరి చనవు చేకొనెను

రేకు: 1087-2 బౌళి సంపుటం: 20-518

పల్లవి: తెలుకోవయ్యా నీవే దిష్టమిది మోహము
కలకాలమును నీపైఁ గలది నామోహము

చ. 1: ఆయములు గరఁగేటిఅదివో మోహము
చాయలకు లోనైనదే సరి మోహము
పోయినానుఁ బోనీక పొదిగినది మోహము
యీఁయెడ నెగ్గులుసిగ్గు లెంచనిదె మోహము

చ. 2: మంతనమె యేపొద్దు మరిగినది మోహము
దొంతి పులకల తొప్పఁదోగేఁ మోహము
వొంతలేనినవ్వుల వేడుకలే మోహము
బంతిరతుల నేపొద్దుఁ బరగుటే మోహము

చ. 3: కన్నులఁగనినప్పుడు కాఁగిలించుటే మోహము
వన్నెలకు మాటగడవనిఁ మోహము
ఇన్నిటాను శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
వున్నతి నలుగ కిట్టె వుండుటే మోహము

రేకు: 1087-3 లలిత సంపుటం: 20-519

పల్లవి: ఏలినవారికి సెల వేమి సేసినా
నాలి నాచేఁతలెల్లాను నవ్వు సేసుకొమ్మీ

చ. 1: తాలిమిలేనిదాన తమకించి నిన్ను నిట్టె
వేళతోనే రావనుచు వెంగెమాడితి
నీలాగు లెఱఁగక నేరములెల్లా నెన్నితి
వోలవేయ కిఁకవన్నీ నోరుచుకొమ్మీ

చ. 2: చపలచిత్తపుదాన సడిఁబడ్డకోపాన
కపటములెల్లాఁ జూచి కల్లలాడితి
వుపమలనే వంచక వొరసితి జరసితి
నెపములెంచక యిఁక నెయ్యమే నిలుపుమీ

చ. 3: చనవు తోడిదాన సారెసారె నిట్టె
కనుఁగొని కనుఁగొని కలదాడితి
యెనసితి శ్రీ వేంకటేశ నే నింతటిలోనె
తనిసితనిసి నాతో దయివారుమీ

రేకు: 1087-4 శంకరాభరణం సంపుటం: 20-520

పల్లవి: నేరమెల్లా నావొళ్లిదే నీవేమి సేతువు
దారిదప్పి సూటిఁబడ దరిచేరే మిదివో

చ. 1: సేసవెట్టినవాఁడవు చేకొనేవుగాక యిఁక
వేసరేవా యిందువంక వీడీనా పొందు
ఆసపడి తమకాన అలసినదానఁ గాన
వేసినట్టేవేసి నిన్ను వేడుకొనే నిదివో

చ. 2: వలపించినవాఁడవు వద్దనే వుండేవుగాక
తలఁగేవా యింతలోనే తప్పె నా మాట
బలిమి నీచనవునఁ బరగినదానఁ గాన
పిలిచి నిన్ను జంకించి ప్రేమచల్లే నిదివో

చ. 3: అంటికూడినవాఁడవు ఆదరించేవుగాకిట్టె
జంట వాసేవా మొగచాటున్నదా
యింటనే శ్రీవేంకటేశ యిరవైనదానఁ గాన
దంటనై నీసరసాన దక్కితి నే నిదివో

రేకు: 1087-5 రామక్రియ సంపుటం: 20-521

పల్లవి: ఓపినదానఁ గాను వూరకే సుద్దుల కెల్లా
నీపాదము సేవ సేసి నిలుచుంట చాలదా

చ. 1: మొక్కుచు నీకొకమాఁట మొన్న నే విన్నవించనా
పక్కన నన్నేల వొడఁబరచేవంత
చిక్కినవారిపై నేల చేఁతలెల్లాఁ జేసేవు
వొక్కటై నీవారమని వుండుటిది చాలదా

చ. 2: వేమారు నే నిన్ను వేఁడుకొనవా ఇందాఁక
నాముపార నాతోనేల నవ్వేవంత
దీమసములేనివారిఁ దెగి యేలపరచేవు
ప్రేమతోడ నీతోఁ గొంత పెనఁగుట చాలదా

చ. 3: కందువ లంటుచు నిన్నుఁ గాఁగిలించుకొనవా
అందరిలో నన్నుఁ మెచ్చే వప్పటి నీవు
విందువెట్టి యిట్టె శ్రీవేంకటేశ కూడితివి
పందెమాడి నీమాటలో పరగుట చాలదా

రేకు: 1087-6 మాళవిగౌళ సంపుటం: 20-522

పల్లవి: తలవంచేనేఁటికి దండనున్న వారిఁ జూచి
వెలయంగ నేమెల్లా వింతవారమా

చ. 1: సిగ్గువడ్డదానవు చింతతోటిదానవు
యెగ్గులుఁదప్పులు నిఁకనేఁటికమ్మా
దగ్గరి యాతఁడేమైనాఁ దడవినా చేఁతలకుఁ-
నగ్గమైతి విఁక నీకు నంకెలాయనమ్మా

చ. 2: జవ్వనపుదానవు సతమైలదానవు
యెవ్వరిబుద్దులు వినవేఁటికమ్మా
పువ్వుల వేసి యాతఁడు పూఁచి సన్నలు సేయఁగ
నవ్వితిని నీకు నిఁక ననుపాయనమ్మా

చ. 3: మంతనుపదానపు మాటలోనిదానవు
యెంతసేసినాఁ జెల్లె నేమమ్మా
చింతదీర నింతలోనె శ్రీ వేంకటేశుఁడె గూడె
అంతరంగమెల్లా నిండె ననువాయనమ్మా

రేకు: 1088-1 ముఖారి సంపుటం: 20-523

పల్లవి: రమ్మనపు పొమ్మనపు రాజసము నెరుపేవు
తెమ్మలుగా నవ్వునవ్వి తెలుసుకొవే

చ. 1: చెప్పుడుమాటలు విని, చెలువుఁడు నీకిచ్చినఁ
కప్పురమేఁటికి నీకుఁ గాదనేవే
దప్పి దేరేమోవితోడ తలవంచుకొని యాతఁ
డప్పట నుంటియు నున్నాఁడది గదవే

చ. 2: ఇంగితాకారాలు చూచి యీతఁడు వెట్టినతమ్మ
యెంగిలి యనుచు సారెనేల మొక్కేవే
వుంగరము చేతికిచ్చి వూరకే యానలు వెట్టీ
అంగవించి నిన్నుఁ బాయఁ డదిగదివే

చ. 3: వింతవాసనలతో నీవిభుఁడు కొంగువట్టఁగ
ఇంతలోఁ దప్పించుకొంటానేల లోఁగేవే
అంతటి శ్రీ వేంకటేశుఁ డాతఁడే నిన్నిటు గూడె
అంతరంగమెల్లాఁ జెప్పె నదిగదవే

రేకు: 1088-2 ఆహిరి సంపుటం: 20-524

పల్లవి: మంచిదాయ మేలు మేలు మాకు నది పరిణాము
అంచెల నాకె నిన్ను ఆదరించెనా

చ. 1: చెలఁగి వున్నాఁడవు చిమ్ముఁగళలతో నేఁడు
మలసి నీతో నాపె మాటలాడెనా
సొలసేవు కెలసేవు సుమాళముతో నప్పటి
కులికి నీపై నాపె గురుతులు నించెనా

చ. 2: ఇందరికి నీవేళ యేమడిగిన నిచ్చేవు
విందువలె నాపె నీకు విడెమిచ్చెనా
పందేలకే పెనఁగేవు పారిపారి మాతోను
సందడించి తనమోవి చవిచూపెనా

చ. 3: గక్కన నన్ను మన్నించి కాఁగిలించి కూడేవు
పుక్కటగాక నీకాపె బుద్ధిచెప్పెనా
యిక్కువతో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
వక్కణించి నీకుఁ జెప్పి వరుసకు నంపెనా

రేకు: 1088-3 దేవగాంధారి సంపుటం: 20-525

పల్లవి: సారపునవ్వులతోడి సటకాఁడా
పోరచిపొరుగులనే బుద్ధిచెప్పరా

చ. 1: చలము సాదించేనంటే చవి చాల దించుకంత
వలపు చల్లేనంటే వాసి చాలదు
బలిమి చూపేనంటే పాడిపంతము చాలదు
యెలమి నీతోడిపొందు లెట్టుసేతురా

చ. 2: సిగ్గుతోడ నుండేనంటే సెలవులే దెవ్వరికి
దగ్గరేనంటే దంటతనము లేదు
వెగ్గళించేనంటే నీతో విరసమేమియు లేదు
యెగ్గుదప్పులేక సేవ యెట్టుసేతురా

చ. 3: మఱుఁగువ నుండేనంటే మనలో భేద మెఱఁగ
జఱసేనంటేను నీసర వెఱఁగ
గుఱిగా శ్రీవేంకటాద్రి గోవిందరాజ నేఁడు
యెఱుకతోఁ గూడితివి యిఁకనేమి సేతురా

రేకు: 1088-4 మధ్యమావతి సంపుటం: 20-526

పల్లవి: పరాకుసేయకురమ్మ పడఁతులాల
సరాగాన బాగాలీరే సతులకుఁ బతికి

చ. 1: మాటలఁ దేటలు చల్లి మగువలిద్దరిమీఁద
కూటువఁ బాదాలు చాఁచి కొలువున్నాఁడు
చాటుచు నవ్వులు నవ్వి సన్నలు కన్నులఁ జేసి
వేఁటలాడీ వలపు గోవిందరాజు లిదివో

చ. 2: వొత్తగిలి పానుపుపై నుంగరపు వేళ్లు చూపి
గుత్తపు గుబ్బలంటఁగఁ గోరుచున్నాఁడు
పొత్తుల మోవులు చూప పూవులవాట్లు వేసి
విత్తీఁ దమకము గోవిందరాజు లిదివో

చ. 3: లోననే యేపొద్దునుండి లోకమెల్లాఁ దెలుసుక
మానినులకాఁగిళ్ళ మరిగున్నాఁడు
నానిన చెమటాలతో నంటు శ్రీ వేంకటేశుఁడై
వీనులతో మాటాడీ గోవిందరాజు లిదివో

రేకు: 1088-5 బైరవి సంపుటం: 20-527

పల్లవి: ఏమిసేసీనని నీవు యేలడిగేవు
కామించినచెలి నిట్టె కరుణించు మిపుడు

చ. 1: నీమీఁదిచిత్తమున నిద్దుర కంటికిరాక
కోమలి కత చెప్పించుకొంటా నున్నది
దోమటితో మదనుని తుమ్మిదబలములకు
దామెనగాఁ గొప్పు విడిదల సేయుచున్నది

చ. 2: చెలుల నీకడకంపి చిమ్మేటి యాసలతోడ
కెలన నడిమి వాకిట నున్నది
పొలసి తన చూపులు పూవుల బాణములకు
బెళకులు లేకుండాఁ బెనఁబెట్టుకున్నది

చ. 3: దగ్గర నిన్ను రప్పించి తమకము రెట్టించఁగ
సిగ్గుతోడ విన్నపాలు సేయుచున్నది
యెగ్గుదీర శ్రీ వేంకటేశ నేఁడె కూడితివి
నిగ్గులను నవ్వుకొంటా నెలపున నున్నది

రేకు: 1088-6 ఆహిరినాట సంపుటం: 20-528

పల్లవి: వద్దు వద్దు వేగిరాలు వనితతోను
పొద్దువొద్దు నీనిజము పొదిగొంటే జాలును

చ. 1: కలువరేకులవంటికన్నులకలికి నీమై
సొలసి సొలసి చూచి సోదించీని
వీకొలదిమీఱగ నీకుగోపమేల తాపమేల
మొలచి నీవొళ్ల కల్ల మోవకున్న జాలును

చ. 2: నాలికప్పురమువంటినవ్వులచెలియ నేఁడు
లోలత నీమనసు దెలుసుకొనీని
వోలి నీకు నింతలోనె వొట్లేల సత్యాలేల
తాలిమితో నీతగవు తప్పకున్నఁ జాలును

చ. 3: తీగెలవంటిచేతుల తెఱవ కాఁగిట నించి
ఆగతి నిన్ను రతుల నలయించీని
వేగిర మేఁటికి శ్రీవేంకటేశ యిటువలె
బాగుగాఁ బెనఁగి మీరు పాయకున్నఁజాలును

రేకు: 1089-1 ముఖారి సంపుటం: 20-529

పల్లవి: ఏలయ్య మాకు నిది యెంతదోసము
యీలీలఁ దప్పక చూచే వెఱఁగని వారమా

చ. 1: పగటు గోపికలతోఁ బరచవై వుంటివని
జగమెల్ల నిన్నే చాటేరు
వెగటై నీవీనులనే వినవయ్య వీదివీది
నిగిడి నేఁడు గొత్తగా నేము గడించేమా

చ. 2: యిక్కువ రాచకూఁతురు నెత్తుక వచ్చితివని
యెక్కడ చూచిన నీపై నిదే సుద్ది
నిక్కము దెలుసు కొంటే నీవు చేసిన చేఁతలే
వుక్కున మాకెంతగుండె వూరకే మిమ్మాడను

చ. 3: మించుఁ దామెరలొ సతి మెడఁగట్టుకొంటివని
యెంచేరు కొలువులోన యిదే దిష్టము
కొంచక శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
మంచముపైఁ గళదేరీ మఱి యేఁటిపనులు

రేకు: 1089-2 శ్రీరాగం సంపుటం: 20-530

పల్లవి: నిండునాపాయము నేఁడు నాచేతిది
గుండెలో నీయాసలైతే కోటానఁగోట్లు

చ. 1: తనివోదు నిన్ను మతిఁదలపోసినా నాకు
మనసు లోపలికాంక్ష మఱి యెట్టిదో
మొనసి నవ్విన ముచ్చటలు దీరవు
పెనఁగేటి సంతపుఁ బ్రేమ యెట్టిదో

చ. 2: కన్నులలో తమి వోదు కదిసి తప్పక చూచి
ఇన్నిటా నాతరితీపు లెటువంటివో
యెన్నిమాఁట లాడినాను యేఁకటలు వాయవు
సన్నల నాలుకమీఁదిచవు లిఁక నెట్టివో

చ. 3: కాయముపై కసి వోదు కాఁగిట బిగించినాను
చాయల సన్నల సాహసము లెట్టివో
యీయెడ శ్రీవేంకటేశ యీడేర నన్నుఁ గూడితి
మాయని మనలోపలి మాటప ట్లెట్టివో

రేకు: 1089-3 వరాళి సంపుటం: 20-531

పల్లవి: ఆసపడ్డవారికి నడ్డమేడది
వాసులసిగ్గులతోడ వడఁబడనేఁటికి

చ. 1: తప్పక చూచితే నీవు తలవంచుకొనెఁ జెలి
యిప్పటి మీలోనిసుద్దు లేఁటివోకాని
చెప్పరాదా మాకు నవి చిక్కులు వాపేముగాని
దప్పిదేరే మోవులతో తడఁబడ నేటికి

చ. 2: నీవు మాటలాడఁ గాను నెలఁత తో మాటలాడీ
యేవేళ నీ వాపె నేమంటివో
చెవదేర నవ్వరాదా చెలఁగఁ జేసేము గాని
వేవేలు సణఁగుల వేసరఁగ నేటికి

చ. 3: కొంగువట్టి తియ్యఁగాను కొనగోర నదిమీని
యింగితాకారాలు మీకు నెటువంటివో
అంగమించి కూడితిరి అట్టె శ్రీవేంకటేశ
కంగ కిట్టె వుండరాదా కడుజంకె లేఁటికి

రేకు: 1089-4 ఆందోళి సంపుటం: 20-532

పల్లవి: వెనకటిపొందు గద్దు వెఱపేల నీకును
అనుమాన మింకనేల ఆడవయ్య మాఁట

చ. 1: సిగ్గులు మోమునఁగాని చిత్తములోపల లేదు
దగ్గరి కూచుండవయ్య తరుణివద్ద
వెగ్గళించినా నిన్ను వింతెలా నీకు నాపెకు
అగ్గమైనదాఁకా నింతే అంటవయ్య చన్నులు

చ. 2: జంకెలు బొమ్మలఁగాని చలము లోపల లేదు
వంకలు దీరుచవయ్య వడిఁ గురులు
మంకునఁ దిట్టినా నిన్ను మచ్చిక నీమీఁదఁ గద్దు
సంకెదీరుదాఁకా నింతే చల్లవయ్య వలపు

చ. 3: మఱగు రెప్పలఁగాని మర్మము లోపల లేదు
యెఱిగి మోవియ్యవయ్య యెదురుగాను
జఱసి శ్రీవేంకటేశ సతి నిట్టె కూడితివి
నెఱవైనదాకా నింతే నించవయ్య కరుణ

రేకు: 1089-5 లలిత సంపుటం: 20-533

పల్లవి: వచ్చిదేరినపనికిఁ బరాకులేల
మచ్చికతో మీరిద్దరు మన్నించేవారము

చ. 1: ఇంతి నీ మొగము చూచె ఇన్నిటికి నొడఁ బడి
అంతరంగములోపను లానతీవయ్యా
వింతవారమా నీకు వింటేనేమి సిగ్గుగాదు
చెంతల మివుడిగాలు సేసేటివారము

చ. 2: పతి నీతో మాటలాడె చనవెల్లాఁ జెల్లించె
మితిమీర నవ్వునవ్వి మెచ్చువయ్యా
మతకపు వారమా మరఁగు లిందులోనేల
అతివకు నీకు నేము అడపమువారము

చ. 3: తరుణి కాఁగిటఁ గూడె తలపెల్లా నీడేరె
పొరిసి నానారతుల భోగించవయ్యా
సరివారమా నేము చాయల శ్రీవేంకటేశ
ధరలోఁ గూడితివి నీదయలోనివారము

రేకు: 1089-6 మాళవి సంపుటం: 20-534

పల్లవి: అందుకుఁగా చెలి నవ్వి అంగమెల్లాఁ జెమరించె
సందడి జాణతనాల సరసుఁడ వవుదువు

చ. 1: తెప్పమీఁద నుండి నీవు దిక్కులు చూడఁగాను
అప్పుడు తామెరఁ గొని అతివ వేసె
తప్పువట్టి యంతలోనే తాకెనంటా నీమేను
రెప్పలెత్తి చూచేవు రేసు లిఁకనేఁటికి

చ. 2: పంతముతో జలకేలిఁ బరాకై వుండగాను
అంతలో జలము చల్లె అంగన నిన్ను
వంతుకుఁ దిట్టేవు నీవన్నె దొప్పఁదోఁగెనంటా
యెంత బొమ్మల జంకించే వెగసక్కేలేఁటికి

చ. 3: చంచుల గోనేటిలోన చల్లగా నీవు దేలఁగా
మించి కాగిలించె నలమేలుమంగ
ముంచి శ్రీవేంకటేశుఁడ మొక్కేవు బిగించెనంటా
పొంచి సరివెనఁగేవు బూటకము లేఁటికి

రేకు: 1090-1 రామక్రియ సంపుటం: 20-535

పల్లవి: ఐతేనేమి దోసము అపరాధమేమి నీకు
కాతరముగలిగినఘనుఁడవు నీవు

చ. 1: పుక్కిటఁ బోసిన యట్టిబుద్దులు నీకవి సుమ్మీ
తక్కక ఆకెవెట్టిన తమ్ములము
అక్కడ నీకు నేను ఆకుమడిచియ్యలేదు
యెక్కడనుండి వచ్చెనో యేల లేదనేవు

చ. 2: వుంకువిచ్చి కైకొన్నవొగి సంచకారుసుమ్మీ
అంకెల నీకొనవేలి ఆవుంగరము
పొంకాన నే మెన్నఁడు పూఁచి యిచ్చినది లేదు
లంకెఁ బెట్టుకొంటివి పల్లదా లేలాడేవు

చ. 3: వుమ్మడి నాపె వెట్టిన వొరపు వలపు సుమ్మీ
కమ్మి కాఁగిటనంటిన గంధము నీకు
నెమ్మది శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
అమ్మకోఁ నే నెఱఁగని వానలేల పట్టేవు

రేకు: 1090-2 కాంబోది సంపుటం: 20-536

పల్లవి: వద్దు వేడుకొనవయ్య వనిత చేతిలోనిది
పెద్దరికానకే పొంచీఁ బ్రేమగల దాపె

చ. 1: కప్పురాన వేసె నాపె గందవొడిని వేసేవు
యెప్పుడు నందుకునిందు కెంతమాత్రము
చప్పునివలపుగాదా సరిగానిపనులకు
కుప్పళించి అందుకేపో కోపగించె నాపె

చ. 2: కంటసరి యిచ్చె నాపె కప్పి వుంగర మిచ్చేవు
యింటిలో నందుకునిందు కెంతమాత్రము
వొంటనితలఁపుగాదా వోపక గానియీవులు
పెంటలుగా నందకేపో పెనఁగె నేఁడాపె

చ. 3: చన్నుల నిన్నొత్తె నాపె సరిగా మోవి ఇచ్చితి
ఇన్నిటా మెచ్చాయ నిఁక నెంతమాత్రము
యెన్నగ శ్రీవేంకటేశ ఇట్టె నీవు గూడితివి
మన్ననల దైవారి మరిగిన దాపె

రేకు: 1090-3 పాడి సంపుటం: 20-537

పల్లవి: గందమందుకోవయ్య కలికి నీ కొసఁగీని
అందుకునందుకే సరి అధికము వలపు

చ. 1: దవ్వుల నుండిన పతి దగ్గరి వచ్చినప్పుడు
రవ్వలైన కోపము రాకుండదు
నవ్వులునుఁ దోడనే నయములు చూపకుండదు
యెవ్వరికి నిందుకుగా నెగ్గులేల యెంచను

చ. 2: తలవంచు కొన్నవాఁడు తప్పకచూచితేను
మొలకపంతాలు గడుమోవకుండవు
అలరి అంతటిలోనే ఆసలు రేగకుండవు
చలము లిందుకుగాను సాదించనేటికి

చ. 3: మెడఁగట్టుకొన్నవాడు మేలములాడితేను
అడియాలములు మేన నంటకుండవు
అడరి శ్రీవేంకటేశ ఆపె యలమేలుమంగ
వొడికమై కూడితిరి వోరించనేటికి

రేకు: 1090-4 గౌళ సంపుటం: 20-538

పల్లవి: ఏమన్నా నంటివి గాని యెంచిచూచితే నేఁడు
కామించునాయకుని పైఁ గల్లలేదే యిఁకను

చ. 1: ఆనలువెట్టుకోఁగానే ఆడెనంటా లేనిమాట
పూని యేల గడించేవే పురుషునిపై
రానికోపమున నింత రవ్వసేసితే నెఱఁగ
కానిమ్మన ఆతనిపై కల్లలేదే యెపుడు

చ. 2: సాదువలె నుండఁగాను సన్న సేసీనంటా నెందో
వేదలేల కట్టేవే విభుఁనిమీఁద
వాదులొకటి పైఁ బెట్టి వంకలొత్తితే నెఱఁగ
కాదన నాతనిమీఁద కల్లలేదే యిపుడు

చ. 3: కొంగుపట్టి కొసరఁగ కులికి తీసెనంటా
వింగళించేవేలే శ్రీవేంకటేశ్వరు
చెంగటఁ గూడినందుకు చెనకితే నే నెఱఁగ
కంగులేనియాతనిపై కల్లలేదే యిపుడు

రేకు: 1090-5 సౌరాష్ట్రం సంపుటం: 20-539

పల్లవి: అటువంటివానినా అలయించేవు
నటలు నీ కాతఁడు చవిచూపఁజాలఁడే

చ. 1: మొక్కలపుమాటల మొనగోరినాటుల
తక్కులఁబెట్టేవేల తగ దాతని
చిక్కనినవ్వులు నవ్వె సిగ్గులెల్లాఁ బెడఁబాపె
వెక్కసానఁ బతి నీపై వింత సేయఁజాలఁడే

చ. 2: బొమ్మముడి జంకెలను బూటకపులంకెలను
చిమ్మనేల కోపమెల్లఁ జెల్ల దాతని
సమ్మతించ నిన్నుఁ జేసె చనువులెల్లాఁ జెల్లించె
కమ్మని రమణుఁడు గాతసేయఁ జాలఁడే

చ. 3: పూవుల చెందులవాట్ల బొంకులకన్నులగీఁట్ల
కావరించనేఁటికే కాఁగా దాతని
మోవియిచ్చి నిన్నుఁ గూడె మోహమెల్లా నిండఁజల్లె
శ్రీవేంకటేశుఁ డితఁడు చెనకఁగఁజాలఁడే

రేకు: 1090-6 ఆహిరి సంపుటం: 20-540

పల్లవి: నీయందు నేరమి లేదు నే నెఱఁగనైతిఁగాక
ఆయమైనయెమ్మెకాఁడ వవుదువయ్యా

చ. 1: మంతనాన నే నీతో మాటలాడినవియెల్ల
అంతరంగముగఁ జెప్పె నాపె నాతోను
యింతలోనే పెద్దరికా లేడేడ నాడుకొంటివి
అంతటిదొడ్డవాఁడ వవుదువయ్యా

చ. 2: గుమితాన నీవు నేనుఁ గూడినకూటములెల్ల
అమరఁగ నాపె చెప్పె నందరితోను
రమణుఁడ నీవలపు రచ్చఁ బెట్టుకోవలెనా
అమసిఁన నిఁడుదొర వవుదువయ్యా

చ. 3: ముచ్చట నీవును నేను మోహించినచేఁతలెల్లా
పచ్చిచేసెఁ జెలులతోఁ బైపై నాపై
అచ్చమై శ్రీవేంకటేశ అప్పటి నన్నుఁ గూడితిఁ
వచ్చుపడ జాణఁడ వౌదువయ్యా

రేకు: 1091-1 బౌళి సంపుటం: 20-541

పల్లవి: నన్నేల యసపెట్టేవు నాయకునిమీఁదను
పిన్నదాన ఆతనికిఁ బ్రియమాడేదానను

చ. 1: పెలుచుమాటదానవు పెద్దాలవు
అలరి నీవే యతని ననవమ్మా
వలచినదాన నేను వద్దనుండేదానను
పిలువనేరుతుఁ గాని బిగియఁగనేరను

చ. 2: చనవరిదానవు చలమరిదానవు
చెనకి నీవేమైనాఁ జేయవమ్మా
ననిచినదాన నేను నయగారిదానను
వినయమే నేరుఁగాని వేసరించనేరను

చ. 3: తగవరి దానవు తమకపు దానవు
సొగిసి నీవే దయఁజూడవమ్మా
మొగమోటదానను ముంచి శ్రీవేంకటేశుఁడు
జిగిఁ గూడె బొంకనేర చెంగలించనేర్తును

రేకు: 1091-2 సామంతం సంపుటం: 20-542

పల్లవి: సేసినట్టితప్పు గాచినదే దొరతనము
వాసుల నాతనిమేలు వన్నెవెట్టరాదా

చ. 1: చలము సాదించరాదు చనవుమెరయుచోట
చలివాయఁ బతినేల సాధించేవే
తెలసినపనులకు తేటతెల్ల మిఁకనేల
కులికి పయ్యదమఱఁగున దాఁచరాదా

చ. 2: మొక్కలములాడరాదు మొగమోడేయట్టిచోట
కక్కసించి యేల తారుకాణఁబెట్టేవే
వొక్కటైనమీఁద మఱి వూరఁగలసుద్దలేల
అక్కునఁబెట్టుక అట్టే ఆదరించరాదా

చ. 3: సిగ్గులు వడఁగరాదు చేకొనికూడినచోట
దగ్గరుండి యిఁకనేల తలవంచేవే
యెగ్గుదీర శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
వెగ్గళించి మోవితేనె విందువెట్టరాదా

రేకు: 1091-3 రామక్రియ సంపుటం: 20-543

పల్లవి: ఆపె కావలె నొండె అట్టె నేనే కావలె
యేపని కేపనిసేసే విఁకనేడ సుద్దులు

చ. 1: గద్దరిచూపులఁ జూచి కన్నులనే మాటలాడి
తిద్దుకొనె నిన్నుఁ జేతికిలోనుగా
వొద్దనుండి మమ్మునేల వొడఁబరచేవు నీవు
యిద్దరికి నోపుదువా యిఁకనేడ సుద్దులు

చ. 2: వోరికొల్లు గొట్టి నిన్ను వొరసి చన్నులనొత్తి
సారె నలవాటుసేసె జంట నీ కాపె
చేరిచేరి మమ్మునేల చెనకేవు నీ విప్పుడు
యేరా మమ్ముఁ గొసరే విఁకనేడ సుద్దులు

చ. 3: కమ్మటిని మోవి నీకిచ్చె కాఁగిటను బిగియించి
నమ్మించి దక్కఁగొనెను నవ్వుతా నిన్ను
దొమ్మిసేసి నను నీవు తొడిఁబడఁ గూడితివి
యెమ్మెల శ్రీవేంకటేశ యిఁకనేడ సుద్దులు

రేకు: 1091-4 కాంబోది సంపుటం: 20-544

పల్లవి: రావే ఆతఁడు నిన్ను రంతుసేసి పిలిచీని
తావులనే లోఁగుటే తగునేరుపు

చ. 1: బలిమిఁ బెనఁగరాదు పాయపువారికెల్ల
వలనైనచనవు చూపవలెఁగాని
కలిగినవేడుకలు కై వ్రాలకుండాను
నెలవునఁ గూడుటే నెరవైననేరుపు

చ. 2: వాదు లడువఁగరాదు వలచినవారికెల్ల
సేదదేరి చెప్పినట్లు చేసుటేకాని
పోదిగొన్న కోరికలు పొది విచ్చుకుండాను
సాదువలె లోనౌటె చక్కనినేరుపు

చ. 3: సిగ్గులువడఁగరాదు సేసపాలవారి కెల్ల
నిగ్గులఁ గాఁగిటఁ గూడి నిక్కు టేకాని
అగ్గమై శ్రీవేంకటేశుఁ డరిసి నిన్నుఁ గలసె
కగ్గులేక సుఖించుటే కడునేరుపు

రేకు: 1091-5 శుద్ధవసంతం సంపుటం: 20-545

పల్లవి: నీవే యిన్నిటాఁగల నెరజాణవు
తావుల నీవన్నమాఁట తలఁచుకోవయ్యా

చ. 1: బొమ్మలలో సరసము పూఁచినజంకెనలు
నెమ్మనపుసరసము నిండినగుట్టు
తమ్మిమోముసరసము తనివోనినగవులు
తెమ్మలుగాఁ జెలి యాడీ తెలుసుకోవయ్యా

చ. 2: కొనగోరిసరసము గురియైన తాఁకులు
తనువుపై సరసము తడఁబాట్లు
చనుమొన సరసము సారెసారె కులుకులు
పనివడి యిందునే తెప్పలఁ దేలవయ్యా

చ. 3: పెదవులసరసము ప్రియముల ముచ్చటలు
చదురైన రతిసరసము ముద్దులు
నిదుల శ్రీవేంకటేశ నీచెలిఁ గూడితివి
వదలక యిన్నియు నవధరించవయ్యా

రేకు: 1091-6 సాళంగనాట సంపుటం: 20-546

పల్లవి: ఏమిటికి బుద్ధిచేప్పేమే యిఁక నీకు
కామించి యాతని కిచ్చకములే ఆడేవు

చ. 1: ముంచి మోహపువారికి మొగమోటలేకాని
యించుకంతనిష్టూరమూ నెఱఁగరు
చంచుల నెడసితేను సాహసములేకాని
పంచలఁ దాలిములను పట్టిలేరు మనసు

చ. 2: ననిచినవారికి నగవులే వచ్చుఁగాని
పెనఁగినకోపము పెంచరు
తనివోక వుండితేను తమకమే హెచ్చుఁగాని
గునిసి వేసటలకు గుఱిగారు

చ. 3: కూటినట్టివారికి కోరికలే మించుఁగాని
వాడుదేరినకాఁగిలి వదలరు
వీడెమిచ్చి కూడెను శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను
వేడుకలు మీవలెనే విడువరు లోకులు

రేకు: 1092-1 గుండక్రియ సంపుటం: 20-547

పల్లవి: ఇద్దరితో నాలిసేయ నిఁకనేఁటికే
బుద్ధులెల్ల నీ వక్కునఁ బోసిచూపరాదా

చ. 1: చనవున నాపె నిన్ను సాకిరు లడుగఁ గాను
తనువు లోపలిమాట దాఁతురా
సునిసి నామొగమేమి చూచి నీవు లోఁగేవు
మనసునఁ గలయట్టే మాకుఁ జెప్పరాదా

చ. 2: నట్టనడుమ నీలావు నమ్మి యాపె వుండఁగాను
పట్టిపెనఁగే పనికి పరాకౌదురా
యెట్టయెదుటను మాకు నింతయేల వెఱచేవు
బెట్టి నీవు మాతోనుఁ బెనఁగఁగరాదా

చ. 3: మోసదీర ఆపె నేఁడు మొక్కులు మొక్కగాను
యీసులు రేసులు మరి నిఁకనెంతరా
సేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ్వర నన్ను
ఆసపడ్డవారిని మమ్మాదరించరాదా

రేకు: 1092-2 దేసాళం సంపుటం: 20-548

పల్లవి: వేడుక నేఁ జేసితేను వెంగెమందురా
కొడెతనమెల్ల నాపై గురిసేసేవేరా

చ. 1: చిగురుఁబెదవి వంచి చెప్పితి నేఁ బ్రియములు
నగవు లింకానేల నాతో నీకు
అగడు నేఁ జేసితే నాయములు సోఁకెఁగాక
తగుఁ బలుసోఁకులకే తమికించేవేరా

చ. 2: కొనగోరు వంచి నిన్ను కొసరితిఁ బలుమారు
పెనఁగ నింకానేల బింకాన నీకు
మొనలు నేఁ జూపితి నామోహములు రేఁగెఁగాక
కొనచంద్రవంకలకే గుంపించేవేరా

చ. 3: గట్టిచన్ను లిటు వంచి కాఁగిలించుకొంటి నిన్ను
గుట్టుసేయ నిఁకనేల కొసరి నీకు
ఇట్టె శ్రీవేంకటేశ యిందుకే మెచ్చితిఁగాక
చుట్టపురతుల కిఁక సూడువట్టేవేరా

రేకు: 1092-3 పాడి సంపుటం: 20-549

పల్లవి: నిన్నురానికోపము నేఁడేఁటికే
పన్ని నీచేఁతలచే భ్రమయించరాదా

చ. 1: మొగము చూచి నీపై మోహ మాతఁడు చల్లఁగా
నగరాదా కొంతైనా నాలి యేఁటికే
బిగువు చూపకుండితే పిరిదీసినట్లుండు
తెగువతో దీమసము తెచ్చుకోరాదా

చ. 2: దగ్గర వచ్చి విభుఁడు తమకము రేఁచఁగాను
సిగ్గులు విడువరాదా చింతలేఁటికే
కగ్గుదేరి యంటకున్న కై కోనియట్లుండు
వెగ్గళించి మచ్చికలు వెదచల్లరాదా

చ. 3: శ్రీవేంకటేశుడు నిన్ను జిత్తగించి కూడఁగాను
భావించి మెచ్చఁగరాదా పంత మేఁటికే
మోవితేనే లియ్యకున్న మొరగినయట్లనుండు
సావధానాన నన్నిటా చనవియ్యరాదా

రేకు: 1092-4 కాంబోది సంపుటం: 20-550

పల్లవి: మించి నా రమణుఁడవు మేనవాఁడవు
వంచుకొని తిద్దుకొనేవారిచేతివాఁడవు

చ. 1: వేళలు గాచితినంటా వేసరించనై తినంటా
వేలె త్తి మమ్మేల మెచ్చి వెంతసేసేవు
నీలాగు లెఱఁగనా నీవే నేఁ గానా
పాలుమాలితే నిన్నిట్టే పచ్చి సేయవలెనా

చ. 2: కొమ్మ నిన్నుఁ గంటినంటా కోపగించనైతినంటా
వుమ్మడి మాకేల మొక్కి వూరడించేవు
యెమ్మెలకాఁడవుగావా యిందుకు రాజవుగావా
దొమ్మికాఁడనై తే నీకు దూరగట్టవలెనా

చ. 3: కందువ నుండితినంటా కాఁగిలించుకొంటినంటా
ఇందరిలో మన్నించి యెంతసేసేవు
పొందినశ్రీవేంకటేశ భోగించ నింతనేరవా
అందాలకు మాటాడితే నౌఁ గాదనవలెనా

రేకు: 1092-5 వరాళి సంపుటం: 20-551

పల్లవి: నావంటివారెందరున్నా నయమే నీకు
పూవువలె భోగించితే పుణ్యములే చేరును

చ. 1: వాసులువంతు లెంచక వద్దనున్నదానను
వేసరకుమీ నీవెలఁది నేను
ఆసపడ్డవారిమతి అక్కరదీరిచితేను
దోసములే దిందువంక తొయ్యలులు మెత్తురు

చ. 2: సిగ్గులువడక నీపైఁ జేతులు నేఁ జాఁచితే
యెగ్గులు వట్టకుమీ నీయింతిని నేను
వొగ్గినవారిచనవు లొనరఁ జెల్లించి తేను
తగ్గుమొగ్గులేదు నీదయ లోకు లెంతురు

చ. 3: అలపుచూడక నిన్ను అట్టె కాఁగిలించితి
బలిమి సేయకుమీ నీపడఁతి నేను
చెలఁగి నన్నేలితివి శ్రీవేంకటేశ నీవు
సిలుగులేదు నిన్నుఁ జేరి నేఁ బొగడుదు

రేకు: 1092-6 శంకరాభరణం సంపుటం: 20-552

పల్లవి: తిట్టితేనే పెదవినే తేనె గారీనే
గట్టియాయ నీపనులు కానీలేవే

చ. 1: నీమనసువచ్చునటే నెలఁతా
చేముట్టి నీవు నవ్వఁగఁ జేరి వుండితి
యేమిటికి నవ్వేవే యింతలో నీవు
కామినివంటా నుంటిఁ గానీలేవే

చ. 2: పంతము చెల్లెనటవే పడఁతీ
మంతనాన నీకు నాకుమడిచిచ్చితి
రంతులేల సేసేవే రచ్చల నన్ను యే-
కాంతమున నీకుఁ జెప్పేఁ గానీలేవే

చ. 3: కలసితి పన్నిటాను కలికీ
బలిమి శ్రీవేంకటాద్రిపతినే తానుఁ
చలపట్టి యింతయేల సాదించేవే
కలిగె నీదయ నాపైఁ గానీలేవే

రేకు: 1093-1 రీతిగౌళ సంపుటం: 20-553

పల్లవి: ఎవ్వరిబలువు వీరి నేమందమే
పువ్వులు బలియఁగాను పూపలాయ నిదివో

చ. 1: సిగ్గుపడివున్నచెలిఁ జేయివట్టితియ్యఁబోతే
దిగ్గనను వినరానితిట్లు దిట్టెను
యెగ్గువట్టక విభుఁడు యెగసక్కేలకే మరి
బిగ్గెఁగాఁగిలించి మోవి పిప్పిసేసె నిదివో

చ. 2: మూలనున్న యింతిఁ బట్టి ముంగిటికిఁ దీసితేను
తాలిమిసేయరానిసేఁతలు చేసెను
బేలుఁడై యుండ కితఁడు ప్రియమునఁ జెలరేఁగి
కాలుదొక్కి పానుపుపై కందువంటె నిదివో

చ. 3: వొద్దనున్న ఇల్లాలి నురముపైఁ బెట్టుకొంటే
గద్దించి బొమ్మజంకెలఁ గై కొని కూడె
వొద్దికై శ్రీవేంకటేశుఁ డొనగూడి మన్నించి
పెద్దరికమెల్లాఁ జేసి ప్రియమాడె నిదివో

రేకు: 1093-2 శ్రీరాగం సంపుటం: 20-554

పల్లవి: అంతలోనే నవ్వునవ్వే వౌనే నీవు
అంతరంగమెల్ల నిండ ఆతఁడుగదే

చ. 1: చిన్నఁబోయి వుండినది చెలియ నీమోమిదేమే
చెన్నగునీవిభుఁడు విచ్చేయఁడాయనా
వెన్నెలలోపల నుండి వేసవియెండ లనేవు
అన్నమాటలోనే వచ్చె నాతఁడుగదే

చ. 2: నొసలెల్లాఁ జెమరించి నున్ననిచెక్కులఁ జారె
అసురుసురుగ నీతఁ డలయించెనా
పసురు మొగ్గలు చూచి పంచబాణము లనేవు
అసమునఁ జేయిచాఁచీ నాతఁడుగదే

చ. 3: కాయమెల్లఁ బులకించి కళలునిండె నిప్పుడు
యీాయెడ శ్రీవేంకటేశుఁ డిట్టె కూడెనా
రేయిఁబగలాయనని రెట్టించె వలపనేవు
ఆయములిన్నీఁ దెలిపె నాతఁడుగదే

రేకు: 1093-3 గౌళ సంపుటం: 20-555

పల్లవి: నేనేమెఱఁగుదును నీచేఁతలు
ఆనుక నిన్ను వెంగెము లాడేపాటి దానానా

చ. 1: ముచ్చట నీవాడఁగాను మొగము చూచితిఁగాక
వొచ్చెములెంచి తప్పు లున్నవంటినా
తచ్చనలు నే నెర తగులువిరులు నేర
యిచ్చల నీవే లోఁగేవు యేమిసేసితివో

చ. 2: దగ్గరి నీవు రాఁగాఁ బాదాలు గడిగితిఁగాక
బగ్గన యెవ్వతే దొక్కె పాదమంటినా
వెగ్గళించ నే నేర వెంగమాడ నే నేర
సిగ్గువడే వేసనులు చి త్తములో నున్నవో

చ. 3: గక్కన నీవు గూడఁగఁ గాఁగిలించుకొంటిఁగాక
మక్కువతో నిన్ను నే నమ్మకయుంటినా
యిక్కు వెఱిఁగి కూడితి విదివో శ్రీవేంకటేశ
వెక్కసాలు నే నెఱఁగ వేడుక నీకెట్టిదో

రేకు: 1093-4 భైరవి సంపుటం: 20-556

పల్లవి: దేవర విన్నిటా నీదేవిని నేను
నీవే నా కిన్నియును నేరుపుదుగాక

చ. 1: యెక్కుడుమాట నీవన్నా యెదురాడఁ దగవా
అక్కర మంకుదనాన నాడితిఁగాక
యిక్కువైనతగవు నీవెఱఁగనివాఁడవా
చొక్కముగా నామనసు సోదించేవుగాక

చ. 2: తప్పులు నీవు వట్టితే తారుకాణించఁదగవా
అప్పటికోపము లాఁపనైతిఁగాక
కప్పి నీవల్ల నేమైనా కడమలు గలవా
తిప్పి నాచేఁతల నన్నుఁ దిటిచేవుగాక

చ. 3: వొత్తి కాఁగిలించుకొంటే వొపననఁదగవా
చిత్తగించి రతి నలసితిఁగాక
కొత్తగా శ్రీ వేంకటేశ కూడితివి నన్ను నిట్టె
తత్తరపువాఁడవా దయ ఇదిగాక

రేకు: 1093-5 తెలుఁగుకాంబోది సంపుటం: 20-557

పల్లవి: నాయకుఁడ నీచిత్తము నాభాగ్యము
పాయపుఁ జక్కఁదనాన పాయకుందుఁగాక

చ. 1: వీనులఁ బొంచుకుండితి వేడుకనీమాటలకు
ఆనుకొని సరసము లాడవైతివి
నేనా నిన్నుఁ గొసరి నెప్పునకుఁ దెచ్చేదాన
మోనముతోఁ జేతులెత్తి మొక్కఁగలఁగాక

చ. 2: కన్నులఁ గాచుకుండితి కదిసి నీమాటలకు
నిన్ననే రావైతివి నీయంతను
నన్నువంటిదా నిన్ను నయానకుఁ దీసేది
పన్నిననీపాదుకులు పట్టఁగలఁగాక

చ. 3: చేతులు చాఁచుకుండితి శ్రీవేంకటేశ్వర నీకు
యీతల నన్నుఁ గూడితి విందుకుఁగానే
ఘాతల మాతరమా కరగించ నీమనసు
నీతితో నాతమకము నించఁగలఁగాక

రేకు: 1093-6 రామక్రియ సంపుటం: 20-558

పల్లవి: నేఁడే నాగవెల్లి నేఁడే యిల్లునింపులు
పోఁడిమి గోవిందపతి భోగించీ నిదివో

చ. 1: అల్లదే దేవునిరథ మల్లదే గరుడధ్వజఁ
మెల్లలోకములు గెల్చి యేఁగీనదే
యిల్లిదే లక్ష్మి భూమి లిద్దరుదేవుళ్లు వీరె
చల్లేరు శాసలుఁదామ సరికి బేసికిని

చ. 2: సేనాపతి యల్లవాఁడే చేరి దేవతలు వారే
శ్రీనారాయణుఁడు చెలఁగీనదే
ఆనుక యడుగడుగు కారగించీ వీధులను
వానలుగా నందరికి వరములొసఁగుచు

చ. 3: దేవదుందుభలు మ్రోసె దిక్కులెల్లాఁ జల్లనాయ
శ్రీ వేంకటేశుఁ డితఁడె చిత్తగించీని
సేవించరో భావించరో జీవులాల బ్రదుకుఁడు
వేవేలు శోభనముల వేడుకకాఁ డితఁడు

రేకు: 1094-1 బౌళి సంపుటం: 20-559

పల్లవి: ఏరా నన్నింతలోనే యెంతగాఁ జూచేవు నీవు
దారతో, నీదాననై నతగవరిఁగాక

చ. 1: సారె నిన్ను సాదించ చలమరిదాననా
వోరిచి నిన్నుఁబొందేటి యోగిణిఁ నేను
కూర వండి కసవేరి గొల్లమంకుదాననా
నేరిచి బతికేననేనీదేవిఁగాక

చ. 2: కన్నుల నిన్ను జంకించేకపటపుదాననా
అన్నిటా నీతలఁపులో యక్షిణి నేను
విన్న కన్నందుకుఁ బట్టే వెఱ్ఱివంటిదాననా
సన్నల నీపని సేసేజవరాలఁగాక

చ. 3: సోలి నిన్ను వేసరించేడుఁబాడుదాననా
లాలించి నిన్నుఁ గూడినలక్ష్మిని నేను
ఆలమాడి పెనఁగ నే నందగారిదాననా
యీలీల శ్రీ వేంకటేశ యింటిదానఁగాక

రేకు: 1094-2 ముఖారి సంపుటం: 20-560

పల్లవి: నిచ్చలు నాపుణ్యము నీచేతిది
మచ్చరపుదానఁ గాను మరియేఁటిమాటలు

చ. 1: పంతమాడి నీతోను పచ్చిగా నే వలచితి
యెంతసేసినా నీచిత్త మేమనే నిన్ను
దొంతులాయఁ గోరికలు దొమ్మిసేసెఁ దమకము
మంతుకెక్కె నావయసు మరియేఁటిమాటలు

చ. 2: చలపట్టి నీతోను సలిగెకే పెనఁగితి
యెలమి నీదయే మాకు యేమనే నిన్ను
నిలువెల్ల జెమరించె నిండె నీపైఁ జూపులు
మలసీ నీతల పోఁత మరి యేఁటిమాటలు

చ. 3: కొంగువట్టి నీకాఁగిటఁ గూడితి శ్రీ వేంకటేశ
యెంగిలిసేసితి మోవి యేమనే నిన్ను
వుంగరము నాచేఁ జిక్కె వొక్కటాయ నామనసు
మంగళాలన్నియుఁ జేరె మరియేఁటిమాటలు

రేకు: 1094-3 సామంతం సంపుటం: 20-561

పల్లవి: ఇన్నిటా జాణఁడవైతే నేమాయను
పన్ని చెఱకునఁ బండువండినట్టె ఆయను

చ. 1: అందరును మనవారె అంగనలు నీకు నేఁడు
యెందరు చుట్టాలఇన నేమాయను
అందుకుఁగా నిజాలేల అమరఁజెప్పఁగనేల
ఇందులోనే వుప్పాలికి ఇనుమడి ఆయను

చ. 2: పనికివచ్చినవారె పాయపువారెల్ల నీకు
యెనతురు గాక అందుకేమాయను
వెనకముందెంచనేల వెఱపులు మరియేల
ఘనముగఁ బాలు నీరు గలసినట్టాయను

చ. 3: తగినట్టిమేనవారే దండనున్న వారెల్ల
యెగసక్కే లిందుకేల యేమాయను
నగుతా శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితి విప్పుడు
చిగురుతంగేటిజున్ను చేరినట్టె ఆయను

రేకు: 1094-4 గుజ్జరి సంపుటం: 20-562

పల్లవి: ఏమాయ నీకిందుకు నేఁటికే సిగ్గు
చేముట్టి చెనకఁగాను చేయిచాఁచకుందురా

చ. 1: మొక్కుచు నీతో నాపె మొదలనే విన్నవించి
చెక్కునొక్కి వేఁడుకొనె సేయవైతివా
మొక్కల మింతేశాల మొగమోట మాతోనేల
వొక్కట నాపె రమ్మంటే వోపనందురా

చ. 2: పన్నివెట్టు కాపె నీవద్దనే నిలుచుండె
అన్నిటాఁ బెనఁగి నీవంటవైతివా
యెన్నికలింతేశాల యెవ్వరేమనేరు నిన్ను
వున్నతి నాపె నవ్వఁగా నూరకుందురా

చ. 3: కందువలు నీకుఁ జూపి కాఁగిలించుకొనె నాపె
కిందుపడి నీమోవి సోఁకించవైతివా
అందపు శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
పందెము ఆపె వేయఁగా పరాకులు సేతురా

రేకు: 1094-5 బౌళి సంపుటం: 20-563

పల్లవి: కొంకనేల యింకను కొమ్మలము నీకును
సంకెదేర్చి మామాటకే సమ్మతింతుగాక

చ. 1: చనవువారము గాక సరివారమా నేము
మనసేమి చూచేవు మాతోడను
వెనకవారమే మేము వేడుకకాఁడవు నీవే
పనిగొని మమ్మునిట్టె పాలింతు గాక

చ. 2: యిచ్చకమాడేము గాక యెదురుమాటాడేమా
వచ్చియేల సేసేవు పలుమారును
మెచ్చితిమప్పుడే నిన్ను మించె నీజాణతనాలు
కచ్చు పెట్టి మమ్మునిట్టె కరుణింతుగాక

చ. 3: చుట్టాలమౌదుము గాక సూడుబంట్లమా నేము
రట్టేల మమ్ముఁ జేసేవు ఇట్టె రతివేళను
గుట్టుతో శ్రీ వేంకటేశ కూడితి మిందరమును
వొట్టుక మావద్దఁ బాయకుండుదువుగాక

రేకు: 1094-6 పాడి సంపుటం: 20-564

పల్లవి: ఇంతటిగడుసులకు నేది వాటి
చింతలేక నీమొగానఁ జెలఁగా కళలు

చ. 1: మేలు మేలు జాణవౌదు మెత్తనిమనసు గాదు
యీలీల విరహమాఁప ఇంతకోపను
తాలిమితో గడెవెట్టి తరుణి లోనవుండఁగ
గోలవై మాతో మాటాడఁగొలిపెఁగా నీకును

చ. 2: ఘనుఁడవౌదువు నీవు కరఁగేవాఁడవు గావు
యెనసినచో దంటల మింతేసి కాము
వనిత పంతములకు వాకిట వచ్చివుండఁగ
చెనకి మాతో నవ్వఁ జెల్లెఁగా నీకును

చ. 3: వేడుకకాఁడ వౌదువు వెనకతియ్యు వెందుకు
యీడుజోడై కలసే దింతెఱఁగము
ఆడ నాపె వుండఁగాను అట్టె నన్నుఁ గూడితివి
తోడనే శ్రీవేంకటేశ దొరకెఁగా నీకును

రేకు: 1095-1 నారాయణి సంపుటం: 20-565

పల్లవి: ఎరవులవారెవ్వరు యిందులో నీకు
విరివికాఁడవు నీవు విచ్చేయవయ్యా

చ. 1: తగవెల్ల నీయందె తగిలించినదిగాన
మగువలతోఁ జెలి మాటాడదు
వగయెఱఁగ కిందాఁకా వలలబడుండితిమి
అగడు నీవల్లఁ దీరు నాడకు రావయ్యా

చ. 2: పాయమెల్లా నీకే పాలుపట్టినదిగాన
వేయైనా తనగుట్టు వెళ్ల వేయదు
చాయ దెలియ కిందాఁకా సరితలు చూచితిమి
నీయందే చిక్కులు వాసీ నిక్కి చూడవయ్యా

చ. 3: వొరసి కాఁగిలి నీకే వొప్పగించినదిగాన
సొరిది నెవ్వరిబుద్ధి చొరనియ్యదు
యిరవై శ్రీ వేంకటేశ యీపె నిట్టె కూడితివి
వెరవు నీవల్ల నుంది విడెమియ్యవయ్యా

రేకు: 1095-2 లలిత సంపుటం: 20-566

పల్లవి: ఎంత నీవు జఱసిన యేమనే నిన్ను
వంతువాసులెంచ కిట్టె వద్దనుండవయ్యా

చ. 1: చిక్కని తేనెల మోవి చేరి నాకు నియ్యగాను
చక్కెర మాటలాడితి సారె నీతోను
వక్కణ లడుగ నేల వట్టితల పోఁతలేల
వొక్కరీతిఁ జక్కజాడ నుండవయ్యా

చ. 2: చల్లని వలపుఁ జూపు సారె నాపై వంచఁగాను
మెల్లనినవ్వు నవ్వితి మించి నీతోను
చిల్లర ముచ్చటలేల చేవట్టిపెనఁగనేల
బల్లిదుఁడవై యిట్టె బతుకవయ్యా

చ. 3: కందువజాణతనాలఁ గాఁగిలించుకొనఁగాను
పొందితి రతుల నిన్ను భోగించితి
విందులఁ గూడితివి శ్రీ వేంకటేశ బాసలేల
సందడి నాకిటువంటిచన వియ్యవయ్యా

రేకు: 1095-3 ఆహిరి సంపుటం: 20-567

పల్లవి: కాతరాన మోహించి కాచుకుందాన నీవేళ
చేతికి నీవు వరమిచ్చేదెపుడోకాని

చ. 1: పొలపచూపులఁజూచి బొమ్మలను జంకించి
చలిమీ బలిమీని సాదించితి
వలపుతేటలు చల్లి వాదించితిని నీతో
కెలన నీమతి గరఁగేదెన్నఁడోకాని

చ. 2: చెనకి చేఁతలేసేసి సిగ్గులు సోఁకించితి
ననుపు గావలెనని నవ్వు నవ్వితి
మొనవాఁడి గోరితోనే మొక్కులెల్లా మొక్కితిని
యెనసి నీవు లోనయ్యే దెట్లానోకాని

చ. 3: తగులాయములు చెప్పి తమకము గడునించి
తగవులెల్లా నెరపి దైవారితి
మగువనని దయతో మన్నించి కూడితి విట్టె
నిగిడి శ్రీ వేంకటేశ నేర్పుయేదోకాని

రేకు: 1095-4 సామంతం సంపుటం: 20-568

పల్లవి: కానవచ్చినపనికిఁ గై దివ్వె లేఁకనేల
తానే యెఱుఁగుఁగాక తతిఁబోరనేలే

చ. 1: వలపించుకొన్నవాఁడు వచ్చికూడనేరఁడా
కొలచినందె కొలచి కొసరఁగాక
చెలులనంపె నిపుడు చేరవచ్చేననుచు
వొలసినొల్లములకు వొరయఁ జోటేది

చ. 2: సేసపట్టినవాఁడు చేకొనఁగనేరఁడా
రేసుల తన మనసు రేఁచఁగాక
ఆసలకు నడియాల మంపీ నచటనుండి
తీసిపెట్టయినచోట తెలుప చోటేది

చ. 3: దగ్గరి వచ్చినవాఁడు తమకించనేరఁడా
అగ్గలపుమాట తను నాడఁగాక
యెగ్గెఱిఁగి శ్రీ వేంకటేశుఁడే నన్నుఁగూడె
సిగ్గువడివున్నచోట చెప్పఁజోటేది

రేకు: 1095-5 దేసాళం సంపుటం: 20-569

పల్లవి: ఇన్నియునుఁ గానవచ్చె నిందువంకనే
సంగడిఁ నింతక నీవు సంగడిఁ గూచుండవా

చ. 1: తగులు గల వాఁడవు తమకించవలెఁగాక
చిగురుఁ బెదవిమీఁది సిగ్గులేల
జిగి నీవే యేమిగల్ల సేసివున్నాఁడవో కాక
పగటున నింత కిట్టె పై కొనిదగ్గరవా

చ. 2: ప్రేమముగలవాఁడవు పెనఁగఁగవలెఁగాక
నేమముతోడుత వట్టినీటులేల
యేమగువకును బాస ఇచ్చివున్నాఁడవోకాక
దోమటి నింతక కాలుదొక్కవా నీవు

చ. 3: చుట్టమవైనవాఁడవు చొచ్చి కూడవలెఁగాక
పట్టినకొంగుతో నొడఁబరచనేల
యిట్టె శ్రీ వేంకటేశ యెరిఁగి కూడితిగాక
గుట్టున నింతక బుసకొట్టుల నలయవా

రేకు: 1095-6 శంకరాభరణం సంపుటం: 20-570

పల్లవి: మెచ్చితి నిన్నప్పటి మేలు మేలు
ముచ్చటాడి రావయ్య మొఱఁగులు మానితి

చ. 1: తక్కించనేరుతువు తరిదప్పకుండా నట్టే
వొక్కటిసేయానేర్తువు వొక్కొక్కరినే
చెక్కులేల నొక్కేవు చిఱునవ్వేల నవ్వేవు
మొక్కే నూరకుండవయ్య మోహానఁ దనిసితి

చ. 2: ఆడకూఁ గలవు నీవు యీడకునుఁ గలవు
తోడతోడ వలపులు తొరలించితి
వేడుకకాఁడ వౌదువు వేసాలేల సేసేవు
కూడే నోరుచుకోవయ్య కొంకెల్లఁ దేరితిని

చ. 3: తమకించా నీకే చెల్లు దయసేయా నీకే చెల్లు
అమరించితి విద్దరి నట్టె కాఁగిట
చెమరించఁ గూడితివి శ్రీ వేంకటేశ నన్ను
గుమిత మేల సేసేవు కోవయ్య వీడెము

రేకు: 1096-1 రామక్రియ సంపుటం: 20-571

పల్లవి: ఎదురుమాటలు నీతో నేమందురా
చెదరెఁ గస్తూరిబొట్టు చెనకనేఁటికిరా

చ. 1: కూరిమి రెట్టించె నాకు కొనగోరు వాఁడాయ
యేరా నీవింకా నాతో నేమనేవురా
సారె జారీఁ జెమట చన్నుల కొనలవెంట
యీరీతి వేఁడుకొన నేనేమి బాఁతిరా

చ. 2: జవ్వనము తతివచ్చె జడివట్టె నవ్వులెల్లా
యివ్వల నాతో నీవు యేమనేవురా
పువ్వులతురుము వీడి బుజమురేకలు రాఁగె
తవ్వేవు నాసిగ్గులెల్ల తగునటరా

చ. 3: రతు లెన్నికకువచ్చె రాసులాయఁ గళలెల్లా
యితవులు నాతో నేఁడు యేమనేవురా
సతమై శ్రీ వేంకటేశ చనవిచ్చి కూడితివి
పతినలు పలికేవు పట్టపుదేవినిరా

రేకు: 1096-2 లలిత సంపుటం: 20-572

పల్లవి: తానేవచ్చీఁగాక తఱవాతిపనులెల్ల
మోనాన నాడినమాట మోపులుగట్టెరా

చ. 1: చింతకొలఁదే మరి చెక్కిటఁబెట్టినచేయి
సంతోసముకొలఁదే సరి నవ్వులు
అంతేనేల దూరేరే ఆతఁడేమి సేసు నిఁక
కొంత కొంత మీరు బత్తి గొట్టానఁ బెట్టేరా

చ. 2: పెనఁగేటికొలఁదే ప్రేమపుచుట్టరికాలు
చనవులకొలఁదే సలిగెలును
మనసేమి చూచేరే మగవాఁడాతఁడు తొల్లే
తనిసినవలపులు దప్పికిఁ బోసేరా

చ. 3: ఆసలకొలఁదులో ఆయములు గరఁగేవి
సేసిన కొలఁదులే జిగిఁ బుణ్యాలు
యీసుదీర శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
పోసరించినబుద్దులు పోరచివెట్టేరా

రేకు: 1096-3 మాళవిగౌళ సంపుటం: 20-573

పల్లవి: ఇల్లాండ్ల కిదివోజ యింపులు నీకేకాక
చిల్లర లింకాఁ గలవు చిత్తగించవయ్యా

చ. 1: చిగురుమోవి వంచి సెలవినే నవ్వునవ్వి
సగము మాటలాడీ సతి నీతోను
యెగసక్కేలై తోఁచు యేమిచెప్పినా నేము
జిగి నీవే ఆపెమోము చిత్తగించవయ్యా

చ. 2: కడకంటనుఁ జూచి కందువ సన్నలుసేసి
జడిసిఁ వలపుచల్లీ సతి నీతోను
తడవితే సవతులందలిమచ్చర మనేరు
చిడుముడి యింకా నీవే చిత్తగించవయ్యా

చ. 3: చేయిఁ జేయి నప్పళించి చెలఁగి పందేలు వేసి
చాయలకు గోరనొత్తీ సతి నీతోను
యీయెడ శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చేయరానిచేత సేసె చిత్తగించవయ్యా

రేకు: 1096-4 శ్రీ రాగం సంపుటం: 20-574

పల్లవి: ఏడలేనివిన్నపాలు నిఁకనేలా
వాడుదేరి నీకు నాకు వలపులే గుఱుతు

చ. 1: పలుమాఁటలాడఁగాను పైపైఁ గోపమందురు
కలసి వూరకుండితే గర్వమందురు
మలసి విభుఁడ నీవు మన్నించి నదే గుఱుతు
చెలరేఁగి నేను సంతసించినదే గుఱుతు

చ. 2: మయిముట్టి చెనకఁగా మందె మేళ ములందురు
ప్రియమున లోఁగితేనే బీరమందురు
దయతోడ నీవు నన్ను దగ్గరినదే గుఱుతు
నయమున నే నీతో నవ్వినదే గుఱుతు

చ. 3: నెట్టిన నిన్ను రమ్మంటే నిండురాజసమందురు
గట్టిగా నే వచ్చితేను గబ్బినందురు
గుట్టున శ్రీ వేంకటేశ కూడితి నిదే గుఱుతు
మెట్టుకొని నే నిను మెచ్చినదే గుఱుతు

రేకు: 1096-5 ఆహిరి సంపుటం: 20-575

పల్లవి: వలపు నిలపులేవు వట్టిబీరాలేకాని
నలువంక చూచేవు నయమేదే యిందుకు

చ. 1: తప్పకచూచినందుకు తలవంచుకుండేవు
చప్పుడుగా కతనితో సంగతా యిది
వోప్పుగా నౌననవలె నొండెఁ గాదనవలెను
కుప్పళించేవు చెమట గురుతేదే ఇందుకు

చ. 2: చేయిపట్టి తియ్యఁగాను సిగ్గులువడి వుండేవు
పాయపువిభుఁనితోడ పంతమా ఇది
యీయకోవలె నొండెఇచ్చులాడవలే నొండె
మోయిచు నుస్సురనేవు మొదలేదే ఇందుకు

చ. 3: మోవి నీకు నియ్యఁగాను ముచ్చటలాడవచ్చేవు
శ్రీ వేంకటేశ్వరుతోడ చెల్లునా ఇది
భావించి యీతఁడే కూడె పై కొనఁగవలె నొండె
సేవసేయవలె నొండె సేసేదేమే ఇందుకు

రేకు: 1096-6 సాళంగనాట సంపుటం: 20-576

పల్లవి: ఏటికి వేగిరపడే విపుడు నీవు
కూటువవేళ నే నిన్నుఁ గొసరేఁగాక

చ. 1: మనసిచ్చి నీవు నాపె మాఁటలాడుకొనేవేళ
గునిసి నిన్ను సాదించఁగూడునా నాకు
యెనసి నామోము చూచి యేమీయనినవేళ
చెనకి నీకుఁ బ్రియాలు చెప్పేఁగాక

చ. 2: సందడి నా పెయు నీవు సరసమాడేటివేళ
గొంది నీతో బై యాడఁగడునా నాకు
విందుల నాపైఁ జేయివేసినయప్పటివేళ
కందువలంటుచు నిన్నుఁ గై కొనేఁగాక

చ. 3: ననుపున నాపె నీవు నవ్వులు నవ్వేటివేళ
కొనగోరు సోఁకించఁగూడునా నాకు
యెనసితివి శ్రీ వేంకటేశుఁడ యిప్పటివేళ
తనిసితి నింకా మీదఁ దలపించేఁగాక

రేకు: 1097-1 శుద్ధదేశి సంపుటం: 20-577

పల్లవి: మమ్మేమి చూచేవు నీవు మాఁటిమాఁటికి
దిమ్ముల మీలోమీరే తెలుసుకోరయ్యా

చ. 1: తతి నామొగమ్మైయుండి తలఁచుక నవ్వేవు
సతి నీతోనన్నమాట సరివచ్చెనా
మతకరివాఁడవు మాయదారి ఆపె నీకు
ఇతవుగ మరుఁడు మిమ్మెట్టు గూర్చెనయ్యా

చ. 2: పందేలు వేయుచు నాతో పచ్చిమాటలాడేవు
అందిచ్చి నాఁడె నీకు ఆపె నేర్పెనా
అందగాఁడవు నీవైతే అంకెలు నేరుచునాపె
ఇందుకునందుకు సరి యెట్టుగూర్చె మరుఁడు

చ. 3: శ్రీ వేంకటేశుఁడ నన్నుఁ జిత్తగించి కూడితివి
వేవేలుగ నాపె నీకు విన్నవించెనా
దేవర విన్నిటా నీవు దేవులమ్మ ఆపె నీకు
యీవిధాల మరుఁడు మి మ్మెట్టు గూర్చె నిపుడు

రేకు: 1097-2 పాడి సంపుటం: 20-578

పల్లవి: అప్పటి కిప్పుడు మాట లవియేల తడవేవే
కప్పురము దిన్నమీఁద కాఁకలుండునా

చ. 1: తెగువలేమిటికే తేనెగారే మోవిమీఁద
నగవే నింతురుగాక నయముగాను
చిగురుఁ గాలమునాఁడు చేరి వొగరైవుండు
మిగులఁ బండిననాఁడు మించి తీపై వుండును

చ. 2: సూడఁబాడు లేఁటికే చుట్టిరికమైనచోట
వీడుదోడులై వుండుటే వేడుకగాక
యేడనైనాఁ బట్టపగ లెండలు గాయుచునుండ
ఆడ వెన్నెలగాయు నది చల్లనౌను

చ. 3: శ్రీ వేంకటేశుఁడు గూడె సిగ్గులు పైపైనేలే
వేవేలువిధాలఁ జెల్లు వేడుకలెల్లా
భావించఁగ ననలు పసురువేయుచునుండు
పూవులైతే వాసనలు బుగులుకొనుండును

రేకు: 1097-3 లలిత సంపుటం: 20-579

పల్లవి: అందరును చుట్టాలే అందరును బందుగులే
సందడి మీతో నేను జగడించేనా

చ. 1: వరుస రాజుమన్నించేవారే దేవుళ్లుగాక
యెరవులవా రిందుకేల వచ్చేరే
నిరతి నాతఁడుండఁగ నేఁడు మీ రేమి సేతురే
గొౌరబుసేసి మిమ్మిఁక కోపగించేనా

చ. 2: బలువుఁడు కసవుచేపట్టిన మేరువేకాక
నెలకొన్నసతులకు నేరమేడదే
కలవాఁ డాతఁడే కాక కారణము మీరయ్యేరా
పిలిచి మీతో నేను బీరమాడేనా

చ. 3: పక్కనను వెదుళ్లపందిలే చక్కనగాక
యెక్కువ తక్కువలు మీ కేడనున్నవే
యిక్కువతో శ్రీ వేంకటేశుఁడిదె నన్నుఁ గూడె
వొక్కటైతి మీతో నిఁక నొరటులాడేనా

రేకు: 1097-4 గౌళ సంపుటం: 20-580

పల్లవి: నీవు సేసిన దేచేఁత నీ నగరి లోపలను
ఆవటించ నేమిటికి అనుమానా లిఁకను

చ. 1: కాతరించి ఆపె నీకు కమ్మి కొలువులోనుండి
చేతులెత్తి మొక్కేదే సెలవా నీకు
పోతరాన మేను సోఁక పొందులు సేయఁగరాదా
యీతలఁ గాదనేవారు యెవ్వరు నిన్నిఁకను

చ. 2: కమ్మి నీవూడిగమున కాళాఁజి వట్టుకొని
చిమ్ముచుఁ జూచినదే సెలవా నీకు
కుమ్మరించి యాపె లోనికోరిక దీరుచరాదా
చొమ్మెల నింతలో వెలిఁబుట్టీనా యీసుద్దులు

చ. 3: తమకించి యేకతాన దగ్గరిమేరలుమీరి
చెమటలు నించినదే సెలవా నీకు
అమర శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
జమళి నీవలపులు సరిదాఁకె నిప్పుడు

రేకు: 1097-5 వరాళి సంపుటం: 20-581

పల్లవి: తగ నిన్నిటికి నిదే దండము సుమ్మీ
నగితి నిందాఁక నీపై ననుపునఁ జుమ్మీ

చ. 1: అనరానిమాటలెల్ల నాడుదు నిన్నెందుకైనా
మునుకొని నీమీఁది మోహమేసుమీ
పనివడి నిన్నుఁ గొంగువట్టితీతు నొకవేళ
చనవున నీవిచ్చినసలిగెలఁ జుమ్మీ

చ. 2: పంతమున నీమీఁద పక్కనఁ జేయి చాఁచితే
అంతయును నీమీఁది ఆసలేసుమ్మీ
సంతమై నిన్ను బొమ్మల జంకించి అదలింతును
వింతలైన నీమీఁదివేడుకలెసుమ్మీ

చ. 3: కదిసి నిన్నుఁ గాఁగిట కడుబిగించితే నేను
పొదిగిననీకు నిది భోగమేసుమ్మీ
అదన శ్రీవేంకటేశ అంటి నిన్ను గెలిచితి
యెదుట నీపెద్దరిక మిదియునుఁ జుమ్మీ

రేకు: 1097-6 సింధురామక్రియ సంపుటం: 20-582

పల్లవి: ఎందరు గావలె మరియింకా నీకు
సందడిలోపల నాకు చనవులిచ్చేవు

చ. 1: వలచిననీవే నావాఁడవై యుండితేఁ జాలు
యెలమి నేఁ గడనుంటే నేమాయను
కులుకి కులికి యేల కొంగువట్టి తీసేవు
చెలులెల్ల నావారే చేరి నీకున్నారు

చ. 2: అచ్చమైననీకు నే నాలననుకొంటేఁ జాలు
యెచ్చుకుందు లేమైనా నేమాయను
పచ్చిగా నాగడ్డము పట్టేల వేఁడుకొనేవు
యిచ్చట నాచెల్లెండ్లె ఇందురునుఁగారా

చ. 3: యింతట శ్రీవేంకటేశ యిటు గూడితివి చాలు
యెంత వెనకనైనాను యేమాయను
పంతమిచ్చి నాకేల బాసలు సేసే విప్పుడు
వింతవారా వూడిగపు వెలఁదులు మనకు

రేకు: 1098-1 శుద్ధవసంతం సంపుటం: 20-583

పల్లవి: ఏమని విన్నవించేను యెందాఁకా నీకు
నేమపురతులకును నీవు నేనే గుఱుతు

చ. 1: మనసు నీపైఁ బెట్టి మంకుతో నే నుండినాను
యెనసినదాననే నీ వెగ్గుపట్టకు
తనువులు మోచినాను తలఁపులు మోచినాను
నినుపైనపనులకు నీవు నేనే గుఱుతు

చ. 2: వయసు నీకొప్పగించి వద్ద నిద్దిరించినాను
ప్రియురాలనే నీకు భేదముగాదు
క్రియతో సన్న సేసినా కేలువట్టి తీసినాను
నియతపుచేఁతలకు నీవు నేనే గుఱుతు

చ. 3: చన్నుల నిన్ను నొరసి జగడాలఁ బెనఁగినా
నిన్నుఁ గూడినదాననే నేరమెంచకు
మన్నించి శ్రీవేంకటేశ మరిగి నన్నుఁ గూడితి
నిన్ను నన్నుఁ జూచుకొంటే నీవు నేనే గుఱుతు

రేకు:	1098-2 ముఖారి సంపుటం:	20-584

పల్లవి: ఎంతయిన నెఱఁగవు యేమని బుద్ధిచెప్పిన
బంతినే మాకు సిగ్గయ్యీ పైపై నిన్నుఁ జూచి

చ. 1: చల్లలమ్మేవారితోడ జాణతనాలాడనేల
గొల్లెతలచేఁ దిట్టించుకొననేల
కొల్లలుగ మందలోన గోవులపాలు దాగి
బల్లి దుఁడవై యిట్టె బదుకరాదా

చ. 2: కందువల వెన్నదీసేకాంతలతో నవ్వనేల
కిందుపడి అంకులు దాఁకించుకోనేల
పొందుగ బాఁపన వారి పోరచికూళ్లారగించి
బందు కలవాఁడవై బలియరాదా

చ. 3: దొడ్డిలోన నేడు మమ్ము తొడికి కూడఁగనేల
గొడ్డేరేనీవు బుసకొట్టఁగనేల
వొడ్డుక శ్రీవేంకటేశ వూరవిందు లారగించి
వెడ్డాఁగమయి నీవు వెలయరాదా

రేకు: 1098-3 మంగళాకౌసిక సంపుటం: 20-585

పల్లవి: నేయఁగలపని నాకుఁ జెప్పు మనరే
ఆయమెఱిఁగి మాఁటలు ఆడుమనరే

చ. 1: నెట్టినఁ దాన నేను నేరుపరుల మన్నిటా
వట్టిసట లిందులోన వద్దనరే
గుట్టుతెలిసి కొలిమిగూంట్లో సూదులమ్మితే
జట్టిగొని యిద్దరికి చవులేకావా

చ. 2: పంతాన వొకరొకరు బలుపులు మిద్దరము
వంతులువాసులు నిఁక వద్దనరే
యెంత బేరిజోకొట్టినా యెక్కుడే వాఁగుగాక
పొంతనే నిద్రవోయిన బూమెలేకావా

చ. 3: శ్రీ వేంకటేశుఁడు దాను చేరి తనదేవులను
వావినర్తన లడుగవద్దనరే
ఆవటించి నన్నుఁ గూడె అట్టె నీళ్లడచితే
వేవేలకయినాను వేరులయ్యీనా

రేకు: 1098-4 పలవంజరం సంపుటం: 20-586

పల్లవి: తలచినప్పుడు రాక తడసితివి
చలము సాదించి నేఁడు చనవులిచ్చితివి

చ. 1: చేపట్టి విడువకు చిత్తగించి నవ్వేవు
యీపాటివాఁడవు నిన్న నెందువోతివి
తీపుల యీవిరహాన దేహమెల్ల వలసితి
కోపుల నిట్టె రతికిఁ గొలిపీ నామనసు

చ. 2: అక్కరతోఁ గాఁగిలించి ఆనలెల్లాఁ బెట్టేవు
యిక్కడనక్కడ నీవు యేలవుంటివి
చొక్కముగా నీకెదురుచూచి చూచి వేసరితి
పక్కున దొల్లిటివలె పదరీ నాఆసలు

చ. 3: తనివిగా నన్నుఁగూడి దప్పు లెల్ల దీరిచేవు
యెనయిక యిందాకా యెంతసేసితి
ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసి నే భ్రమసితి
అనుగునిష్ఠూరాలు నిన్నాఁడీనా నామాఁటలు

రేకు: 1098-5 బళహంస సంపుటం: 20-587

పల్లవి: పాయపువారమట పండిపొల్లవోయీనా
చాయల మెలఁగవోయి జరపులేమిటికి

చ. 1: కన్నుల నీవు మొక్కఁగ కాదని తోసేనా
చన్నుల నొత్తితేను చాలుననేవా
యెన్నిలేవు నీ యాస లెక్కడ నుండినాను
పన్ని లోనికి రావోయి పరపుమీదికిని

చ. 2: సరసము నీవాడఁగ సమ్మతించకుండేనా
వొరసి నేఁగొసరితే నొల్లననేవా
యిరవైన కోరికలే యిందుకు మీఁదుమిక్కిలి
తెరవేసితి రావోయి తేరి నా ముందరికి

చ. 3: పై పై నీవు గూడగాను పలుమారు లోఁగేనా
దాపుగా నామోవిచ్చితే తనివందేవా
యేపున శ్రీవేంకటేశ యెప్పుడూ సమరతులే
ఆపనికి రావోయి అప్పటి కాఁగిటికి

రేకు: 1098-6 రామక్రియ సంపుటం: 20-588

పల్లవి: పంతము నీకుఁ దగదు పడఁతి తోను
చింతలకు బనిలేదు చిక్కులెల్లాఁ బాసెను

చ. 1: మొగము చూచి చెలి మోనమున దలవంచె
నగవురాగా నణఁచి నాలిసేసెను
తగిలి యింతటఁబోయి దగ్గర గూచుండవయ్య
అగపడి నిన్ను మెచ్చి నలుకెల్లాఁ దీరెను

చ. 2: వలపు నీపై జల్లి వాసులువట్టుక చెలి
పలుకఁబోయి మాని పరాకైనది
చెలఁగి యింతటబోయి చెక్కులిట్టె నొక్కవయ్య
చలములెల్లా విగిచి సమ్మతించు నీకును

చ. 3: బొమ్మలజంకెన చూచి వూఁచి చూపి సిగ్గుపడి
తమ్ములపు మోవి చేత దాఁచి మూసెను
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలో గూడితివయ్య
నెమ్మనము నీకునిచ్చి నివ్వెరగుఁ బొందెను

రేకు: 1099-1 హిజ్జిజి సంపుటం: 20-589

పల్లవి: చెప్పితి మాసాజము చెనకకు మమ్మును
కప్పినపయ్యదవల్ల గరగీ నామనసు

చ. 1: యేపున బ్రియము చెప్పే వేల చేయివట్టేవు
మాపుదాకా మావల్ల మంకుఁదనాలే
తీపులు మామోవి నింతే తేనెలు మామాట లింతే
దాపుగా నీకిందువల్ల దనిసీ నామనసు

చ. 2: వొడివట్ట నేమిటికి వూరకే నవ్వనేఁటికి
కడలేనిమాచూపులు కడువాండ్లే
విడియాలు మాచేతివి వేసాలు మాగుణాలు
నడుమనే ఇందువల్ల నమ్మీ నామనసు

చ. 3: గక్కున గూడితి విట్టె కప్పురము చల్లేవు
యెక్కువైనమాచన్ను లివి గట్లే
మొక్కులు మాచేతులవి మొరఁగులు సిగ్గులవి
ఇక్కువ శ్రీవేంకటేశ యెరిఁగీ నామనసు

రేకు: 1099-2 లలిత సంపుటం: 20-590

పల్లవి: సేయంగలపని మాకు జెప్పవమ్మా
యీయెడ కాతఁడు వచ్చె నెదురుకోవమ్మా

చ. 1: భావములోపలనున్న పంతపు నీరమణుడు
కైవశము నీకు నాయగదవమ్మా
ఆవటించి నిన్ను నింత అరడిఁ బెట్టినవాఁడు
నోవిలేకుండాఁ జెక్కునొక్కఁగదవమ్మా

చ. 2: పేరుకొని ఇందాఁకాఁ బిలిపించుకొన్నపతి
యీరీతి నీతొడ యెక్కె నిదివోయమ్మా
సూరుఁడు నీవు యెదురుచూచి మోహించినవాడు
నేరుపుల నవ్వు నీపై నించెగదవమ్మా

చ. 3: చేపట్టినపెండ్లాడిన శ్రీవేంకటేశ్వరుఁడు
యేపున నిన్నుఁ గూడె నిఁకనేమమ్మా
తీపగునీకు మోవిచ్చి తేనెమరపినవీఁడు
నీపొందులే మరిగి నిలిచెగదవమ్మా

రేకు: 1099-3 సావేరి సంపుటం: 20-591

పల్లవి: నేనెంతకోపినైన నీకేల చలము
పూనిపట్టి నాకు నీవు బుద్ధిచెప్పరాదా

చ. 1: బీరములాడేవారికి బిరుదులే యెక్కు(గాక
వోరుపుగలవారికి వొరటున్నదా
నేరుపుగలవా(డవు నేనేమనిన నీవు
అరితేరి చుట్టమవై అండనే వుండరాదా

చ. 2: తెగువగలవారికి దిమ్ములట్టె రే(గు(గాక
మొగమోడేవారికి మోసమున్నదా
తగవరిమాట నీవు తత్తరించి నేమీరితే
నగుతా నన్ను బోదించి నమ్మించరాదా

చ. 3: వాసులువట్టేవారికి వట్టిజోలి మించుగాక
సేసవెట్టినవారికి సిగ్గులున్నవా
ఆసతో శ్రీ వేంకటేశ ఆయములు నేనంటితే
యీసులేక కూడితివి యి(క మెచ్చరాదా

రేకు: 1099-4 సాళంగనాట సంపుటం: 20-592

పల్లవి: ప్రియురాలతోనేల బీరాలు
జయమంది రాకాసుల సాదించరాదా

చ. 1: చిగురుమోవిదాన చిగురుమేనిదాన
చిగురుచిత్తముదాన చెప్పేదేమి
నగుతానే సరసాన నాతోనేల పెనఁగేవు
పగవారిమీఁద నీబలువు చూపరాదా

చ. 2: తామెరకన్నులదాన తామెరచేతులదాన
తామెరమోముదాన తడవేదేమి
సాముసేసిసేసి మాచన్నులేల పిసికేవు
దోమటిబూతకిమీఁద తొడుకఁగరాదా

చ. 3: తీగెబుజములదాన తీగెకోరికలదాన
తీగెమెఱుఁగులదాన తెలిసేదేమి
యీగతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితి నీ-
జాగులు చుప్పనాతికే చల్లి చూపరాదా

రేకు: 1099-5 పాడి సంపుటం: 20-593

పల్లవి: ఇట్టాయఁ బనులు యిఁక నేమనందు నిన్ను
గుట్టు బయలుసేసేవు గుణివంటా నుంటిని

చ. 1: మతకము నేరుతుము మాటలాడ నేరుతుము
కతకుఁ గాళ్లడిగితే కడమ నేర
బతిమాలి నే నీకు బానిసనుకున్నాను
రతికిఁ దీసేవు నీవు రాజవంటా నుంటిని

చ. 2: నంటు సేయనోపుదుము నగ నీతో నోపుదుము
ముంటికి వాఁడివెట్టఁగ ముందే వోపము
గొంటరినై నే నీకు కుంటెన నడచేనన్నా
జంటల మొక్కవచ్చేవు జాణవంటా నుంటిని

చ. 3: వంకలాడనెఱుఁగుదు వలవఁగ నెఱుఁగుదు
తెంకాయలో నీటికి తెరువెఱఁగ
మంకుగొల్లదాననన్నా మన్నించి నన్ను గూడితి
పొంకపు శ్రీవేంకటేశ భోగివంటా నుంటిని

రేకు: 1099-6 దేసాళం సంపుటం: 20-594

పల్లవి: అటువంటిది గలితే నానతీవయ్యా
యెటువంటి మగవాడ వేమిచెప్పేవయ్యా

చ. 1: చనవుసేసుక నీతో సరసములాడితేను
కొనగోరుదాఁకెనంటా గుంపించేవు
వెనకటిచెలులెల్లా వినోదములాడేవేళ
మనసిజముద్రలకు మాన్యమిచ్చిరా

చ. 2: మచ్చికచేసుక నీతో మాటలు నేనాడితేను
యెచ్చుకుందులున్నవంటా యెగ్గుపట్టేవు
అచ్చమైనరతివేళ ఆడువారెల్లాఁ గూడి
పచ్చిమాటలాడుమని బాసయిచ్చిరా

చ. 3: కూరిమి సేసుక నిన్నుఁ గూడఁగా శ్రీవేంకటేశ
మేరలుమీరితినంటా మించివచ్చేవు
కోరిక కాఁగిట నీకు గోపసతులెల్లాను
మారుకొనమవి నీకు మన్ననిచ్చిరా

రేకు: 1100-1 ఆహిరి సంపుటం: 20-595

పల్లవి: నీయంత నీవెఱిఁగి మన్నింతువుగాక మమ్ము
దాయగానివలె బొంకఁదగునా నీకు

చ. 1: తేరినపనులకు తియ్యనిమోవులకు
దారదప్పక నవ్వేవు తగునా నీకు
నేరుపరిచేఁతలెల్లా నీమేన నుండఁగానే
తారుకాణించవచ్చేవు తగునా నీకు

చ. 2: కప్పురపుమాటలకు గట్టియైనచన్నులకు
తప్పకచూచే విట్టే తగునా నీకు
కుప్పళించి నీసతులు కొలువులో నుండఁగాను
తప్పక ఆనవెట్టేవు తగునా నీకు

చ. 3: పొగరుమాకళలకు భోగించేమానేర్పులకు
తగిలి మమ్ము మెచ్చేవు తగునా నీకు
నిగిడి శ్రీ వేంకటేశ నీవే నన్నుఁ గలసితి
దగదొట్టి అలసేవు తగునా నీకు

రేకు: 1100-2 నాదరామక్రియ సంపుటం: 20-596

పల్లవి: ఆతనికంటే జాణవవుదువే నీవు
చేతికి లోనుచేసుక సిగ్గులువడేవు

చ. 1: మచ్చిక నాతఁడు నీమనసు చూడవలసి
నెచ్చెలియొకతెవంక నిక్కిచూచెను
అచ్చలాన నీవంతలో నాతనికన్నులు మూసి
పెచ్చు పెరుగుచు నీపేరు చెప్పుమనేవు

చ. 2: రంతులనీపతి నిన్ను రాఁపులు సేయవలసి
చెంతల వేరొకతెకు చేయిచాఁచెను
పంతాన నీవంతలోనే బాగాలు చేతికిచ్చి
వింతలుగ దోమతెర వేసేవు నీవు

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నీచే చెనకించుకోవలసి
పూవుల నొకతెమీఁద పూఁచివేసెను
ఆవల నీవంతలోనే యడ్డము వచ్చి నిలిచి
కైవసము చేసుకొని కాఁగిలించుకొంటివి

రేకు: 1100-3 రామక్రియ సంపుటం: 20-597

పల్లవి: ముందువెన కెఱఁగవు మోహమున నీవతని
పొందుల నీకొనగోళ్ళఁ బోట్లాడేవా

చ. 1: మంచముపైఁ గూచుండి మాఁటలకుఁబెట్టి నీతో
కంచముపొత్తుకుఁ దీసి కడి యందిచ్చెను నీకు
యించుకంతాఁ గరఁగవు ఇదియేమే నీవతని
యించుక నీబొమ్మలను ముళ్ళఁబెట్టేవా

చ. 2: జలకేలిసేచోట సరసములెల్లా నాడె
కొలువు లోపల నుండి కోరి తొడెక్కించుకొనె
కలసీఁ గలయవు నీకైవశమైనయతని
మొలకనీచన్నులనే మొనలుచూపేవా

చ. 3: కాఁగిటిలో నినుఁగూడి కందువలెల్లా నంటె
మాఁగినమోవిరసాల మచ్చిక చూపె
చేఁగదేరఁ గూడితివి శ్రీ వేంకటేశ్వరుని
పొఁగినతమకములఁ బచ్చిసేసేవా

రేకు: 1100-4 సౌరాష్ట్రం సంపుటం: 20-598

పల్లవి: నేరమెల్లా నేరుపాయ నీవంకను
యీరీతి నిన్నుదూరి యేమిసేసే మీఁకను

చ. 1: సిగ్గులు చేతికివచ్చె వింతలు మతికి దక్కె
నిగ్గులయీవనితకు నీవంకను
దగ్గరి నీవే దయదలఁతువుగాక యిఁక
యెగ్గుపట్టి నేము నిన్ను యేమిసేసే మీఁకను

చ. 2: చెఱఁగు ముంజేత జాతె చెమట మడుగు గట్టె
నెఱవుగఁ జెలియకు నీవంకను
గిఱికొన మన్నించి కీరితిఁ బొందుదుగాక
యెఱఁగించితి నిన్ను యేమి సేసే దిఁకను

చ. 3: పులకలు రాసివడె పొందులు దగ్గరివచ్చె
నిలువులఁ గామినికి నీవంకను
అలరి శ్రీ వేంకటేశ అట్టె కూడితివిగాక
యెలమి నేమెల్లా మొక్కి యేమి సేసే మీఁకను

రేకు: 1100-5 గౌళ సంపుటం: 20-599

పల్లవి: కొంగువట్టి తియ్యనేల కోరి బుజ్జగించనేల
ముంగిటనే వున్నారము మొదల నీవారమే

చ. 1: కులికి నీచూపులకు గురియైనమీఁదట
నిలుచుకవుండినను నీవారమే
పిలిపించి నీవు లోనఁబెట్టుకొన్న మీఁదట
నెలకొని యాడనున్నా నీవారమే

చ. 2: సారె నీవు మాతోను సరసమాడినమీఁద
నేరక మాటాడినాను నీవారమే
చేరి నీవు మాపయిని సేసవెట్టినట్టిమీఁద
నేరక కొసరినాను నీవారమే

చ. 3: భావించి నీకు నేను పడఁతినయినమీఁద
నీవు మమ్ముఁ గూడినాను నీవారమే
శ్రీ వేంకటేశ నన్నుఁ జేరి కూడితి విదివో
నీవిధాలు గన్న మీఁద నీవారమే

రేకు: 1100-6 తెలుఁగుఁగాంబోది సంపుటం: 20-600

పల్లవి: రావయ్య యింకనూ రమణుఁడ లోనికి
యీవలఁ జలము మనకిఁకనేలయ్యా

చ. 1: వాసులెల్లా నామాఁట వన్నెలెల్లా నీమాఁట
సేసినట్టెల్లా మనకుఁ జెల్లునయ్యా
వేసరవు మనసులు వేడుకైన రతులకు
యీసులు రేసులు మనకిఁకనేలయ్యా

చ. 2: పంతమెల్లా నాసొమ్ము పలుకెల్లా నీసొమ్ము
చెంతలఁ జేసినవెల్లాఁ జెల్లువయ్యా
దొంతినే తమకములు దోమటిదొడుకఁజొచ్చె
యింతలోనే బిగువులు ఇఁకనేలనయ్యా

చ. 3: యెగ్గులు నేఁబట్టితి యెమ్మెలు నీవు సేసితివి
సిగ్గులువిడువ నిఁకఁ జెల్లునయ్యా
అగ్గమై శ్రీ వేంకటేశ అన్నిటాఁ గూడి తిమిదె
యిగ్గుచునుందము వెర పిఁకనేలయా

రేకు: 1101-1 భైరవి సం: 21-001

పల్లవి: ఇంకనేల బొంకనూ ఇద్దరము గూడితిమి
పొంకముగ నానతిమ్మా పూఁచి నవ్వే నేను

చ. 1: ఆసలురేఁచుక పోయి ఆకెమీఁద వేడుకతో
సేసలు వెట్టితివా చెలరేఁగి
వేసరక నమ్మించి వేగినంతాఁ దమకించి
బాసలు సేసితివా పలుమారును

చ. 2: చిక్కనినవ్వుతోడ సిగ్గులెల్లాఁ బెడఁబాయ
చెక్కులు నొక్కితివా సేదలుదేర
లక్కవలెఁ గరఁగఁగ లలనతో దూరుతాను
మొక్కులు మొక్కితివా ముచ్చట దీరఁగను

చ. 3: వలపులు చల్లి చల్లి వంతులు వాసులెంచక
అలుకదేర్చితివా ఆపెను నీవు
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
అలరీ యీసుద్దు లాడ నాడుకొంటివా

రేకు: 1101-2 పాడి సం: 21-002

పల్లవి: గుట్టుతోడి నీవు నన్ను గొరబుసేయకువయ్య
వుట్టిపడి నాతో నవ్వనోపుదువా

చ. 1: ఆయములు సోఁక నీతో నాడుకొనఁజాలఁగాక
పాయపునీయాలఁగానా పరాకేఁటికి
చేయిచాఁచ కిటు నీతో సిగ్గువడి వుందానగా-
కోయినీవు నాతో సంతకోపుదువా

చ. 2: కన్నుల జంకించి నిన్ను కక్కసించఁజాలఁగాక
మన్నించేదానఁగాన మాయలేఁటికి
చన్నుల నే నొత్తి నీతో సరసములాడఁగాక
వున్నపనుల కంతేసి కోపుదువా

చ. 3: తేనెగారేమోవి ఇచ్చి తిట్టు దిట్టఁజాలఁగాక
మేనదానఁగాన నాతో మేకులేఁటికి
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
పూనిననారతులకు వోపుదువా

రేకు: 1101-3 శ్రీరాగం సం: 21-003

పల్లవి: చెలులాల నాయకుని చిత్తము గాక
తలఁపించేనా బాసలు తనతో నేను

చ. 1: జగములేలేవాఁడు జవ్వనమదమువాఁడు
నగితే నే సరిగాను నవ్వఁగలనా
పగటుఁ జుట్టుఁగైదువపట్టినచేతివాఁడు
తగవులాడఁగలనా తనతో నేను

చ. 2: వేవేలుసతులవాఁడు వెన్నెలచూపులవాఁడు
వావులు చెప్పి వరుసవంతడిగేనా
కోవరపుకాసులఁ గొట్టిన వొరటువాఁడు
తావళించి వొరసేనా తనతో నేను

చ. 3: నాలుగుచేతులవాఁడు నాగశయనపువాఁడు
బేలుఁదనమున సరిపెనఁగేనా
యీలీల శ్రీవేంకటేశుఁ డిటు తానే నన్నుఁ గూడె
దైలతో నే గొసరేనా తనతో నేను

రేకు: 1101-4 మాళవిగౌళ సం: 21-004

పల్లవి: అప్పటి కప్పుడే కాక అంతయేఁటికి
యెప్పుడూ మనకుబోఁదు ఇందవయ్య విడెము

చ. 1: తక్కి మాఁటునన్నున్నంతతడవు నిను దూరితి
నిక్కి చూడఁబోతేను నీవే నేను
కక్కసించ నిఁక నిన్ను కడు నానవెట్ట కిఁక
యిక్కువలు గరఁగేను ఇందవయ్య విడెము

చ. 2: గుట్టుతో నూరకుండఁగా గుణము వెరవులాయ
నెట్టుకొని మాటాడితే నీవే నేను
పెట్టను రట్ల పెనఁగకుమిఁక నీవు
ఇట్టే నీమాఁటలు వింటి నిందవయ్య విడెము

చ. 3: రయ దూరకున్నందు కటు నిట్టు బిగిసితి
నారిచి పొందుసేసితే నీవే నేను
కోరి శ్రీవేంకటేశుఁడ కూడితి మిద్దరమును
యీరీతిఁ బాయకుందము ఇందవయ్య విడెము

రేకు: 1101-5 ఆహిరి సం: 21-005

పల్లవి: నమ్మిక లియ్యవచ్చేవు నాకా నీవు
తమ్ములపునోర నిఁక దడవకు పనులు

చ. 1: చెక్కిటి చేఁతలమీఁద సెలవినవ్వులమీఁద
మొక్కిన మొక్కులమీఁద మోచె నీమాట
యెక్కువతక్కువలేల ఇంకా సాకిరులేల
దక్కె నీవేడుకలెల్లా తడవకు పనులు

చ. 2: వొట్టినచెమట మీఁద వొరగుఁదురుమీఁద
నిట్టూరుపులమీఁద నిండె నీమాట
వట్టియాన లిఁకనేల వలవనిముచ్చటేల
దట్టమాయ నేరుపెల్లఁ దడవకు పనులు

చ. 3: కన్నులచూపుల మీఁద కాయపుకళలమీఁద
మున్నిటి రతులమీఁద ముంచె నీమాట
యెన్నిక శ్రీవేంకటేశ ఇద్దరముఁ గూడితిమి
తన్నుఁదానె నైకమాయఁ దడవకు పనులు

రేకు: 1101-6 బౌళి సం: 21-006

పల్లవి: ఎక్కువతక్కువ మాట లిఁకనేల
మిక్కిలి నీలోఁగలమేలు చూపవలెఁబో

చ. 1: పంతమాడినట్లానే పనికి రావలెఁగాని
యెఁత్తైననేతులు నెమ్మె లెవ్వ రాడరు
మంతనాన నున్నారము మచ్చిక నిద్దరమును
చెంతన నీచేతఁలెల్లాఁ జేసి చూపవలెఁబో

చ. 2: నన్ను నవ్వినట్లానే ననుపు గావలెఁగాని
ఇన్నేసి వేసాలబీరా లెంతలేదు
కన్నుల యెదుట నిదె కానవచ్చీ మనగుట్టు
పన్నినరతిమర్మాలు పచరించవలెఁబో

చ. 3: కొంగువట్టినట్లానే కూడిచూపవలెఁగాని
యెంగిలివట్టి సరసా లేమిబాఁతి
చెంగటఁ గూడితిమిదె శ్రీవేంకటేశ మనము
పొంగేటి యాసోదాల భోగించవలెఁబో

రేకు: 1102-1 సామంతం సం: 21-007

పల్లవి: వలచినదాని కెందు వాదు చెల్లదు
బలువులే చూపవయ్య బాసదప్ప దిఁకను

చ. 1: వేడుకకు వెలలేదు వెన్నెల కెంగిలిలేదు
ఆడిక నీచేఁతలకు నడ్డములేదు
వీడె మిందవయ్య నీవిద్యలెల్ల లోఁగొంటి
వోడ కిట్టె నవ్వవయ్య వొరయ నిన్నిఁకను

చ. 2: మరునికి వేళలేదు మాయలకు గురిలేదు
వరుస నీకూటాలకు వావిలేదు
సరుగ మో విందవయ్య చనవెల్లఁ జేకొంటి
తెరలోనికి రావయ్య తెగ నీకు నిఁకను

చ. 3: చిగురుకు చేఁగలేదు సిగ్గులకు తప్పులేదు
తగు నీయాసోదానకు తనివిలేదు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నేనూఁ గూడితిమి
మొగమెత్తి చూడవయ్య మొక్కే నేనిఁకను

రేకు: 1102-2 దేసాళం సం: 21-008

పల్లవి: పట్టినవ్వు లంత యాల వావాతను
నెట్టుకొనఁ జొక్కించితే నిన్నుఁ బొగడేము

చ. 1: వేడుక నీమాఁటలకు వెలలేదు అట్టె
కూడినకూటములకు గుఱిలేదు
యేడ సుద్దులు దడవే వింకా నీవు నన్ను
సూడిదెగా మన్నించితే చుట్టాలమయ్యేము

చ. 2: కొంగువట్టితే వలపు కుప్పవడదూ నీ-
వుంగిటి మెచ్చులనే వుట్టిపడదు
జంగిలికేల తెచ్చేవు సారెకు నీవు మా-
ముంగిటికి వచ్చితేనే మొక్కులు మొక్కేము

చ. 3: కన్నులఁ జూచినంతలో కాఁకదేరదూ లోలో
సన్నలుసేసినంతలో నడిదేరదు
ఇన్నిటా శ్రీవేంకటేశ ఇటు గూడితి మా-
విన్నపములు వింటేను విందుల వెట్టేము

రేకు: 1102-3 పాడి సం: 21-009

పల్లవి: నేరుపరి ననుకొను నెరజాణ ననుకోను
యీరీతి నాహావభావా లింతెఱఁగఁడా

చ. 1: మలసి తనతో నేను మాటాలాడనని దూరి
సెలవుల నవ్వితేనే సేనమాటలే
పిలిపించనని తాను బిగువులు నెరపీని
తలుపు దెరచితేనే తగుసన్నగాదా

చ. 2: దగ్గరఁ గూచుండనంటా తమకించనంతలోనె
సిగ్గువడి వుండితేనె చేరివుండుటే
వొగ్గి తన్నుఁ జూడనంటా వొరట్లు వట్టీని
అగ్గమై యెదుటనుంటే అన్నియును గాదా

చ. 3: ముందు కాఁగిలించనంటా మొనలెల్లఁ జూపీని
ఇందమని విడెమిచ్చు టిదియే అది
అందపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
పొందితి మిద్దర మివి పొదులెల్లాఁగావా

రేకు: 1102-4 వరాళి సం: 21-010

పల్లవి: కామిని యప్పటి నుండి కాచుకున్నది
దోమటివలపులకు దోసమున్నదా

చ. 1: మంతనమాడఁ గరాదా మలసి యప్పటనుండి
యింతి నిన్నుఁ బిలిచీని యేకతానకు
వింతవా రుండితే నేఁడు వెలుపేల వచ్చె నీకు
దొంతరవలపులకు దోసమున్నదా

చ. 2: పమ్మి చేయిచాఁచఁగరాదా పందెమువేసేనంటా
యెమ్మెలకే పెనఁగీని యీపె నీతోను
చిమ్ముచు నామోము చూచి సిగ్గేల వచ్చె నీకు
దొమ్మి వలపుల కింత దోసమున్నదా

చ. 3: గడ్డమువట్టఁగరాదా కాఁగిలించుకొనేనంటా
వొడ్డుక వున్నవి చన్ను లువిదకును
అడ్డమై శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
దొడ్డివలపులకును దోసమున్నదా

రేకు: 1102-5 సాళంగం సం: 21-011

పల్లవి: వద్దు వద్దు మాతోను వట్టిసట లిఁకను
యిద్దరుఁ గూడేటివేళ యెవ్వరున్నా రపుడు

చ. 1: పొంచి నిన్నాపెవేసిన పువ్వులచెండే గుఱుతు
కొంచక జారిననీకొప్పే గుఱుతు
యెంచఁగ నప్పుడు సాక్షి యెవ్వరు వచ్చుండేరు
ఇంచుకంతలోనే నీవేల బొంకే విపుడు

చ. 2: పువిదకంకణములవొత్తు లవిగో గుఱుతు
జవళి నీపెంజెమటజాఱే గుఱుతు
పవళించి మీరుండఁగా పైకొని రానైతిఁగాని
ఇవల నిందుకుఁగాను యేలబొంకే విపుడు

చ. 3: చెలి నీమోవి నించిన చిలుకవోటే గుఱుతు
సెలవుల నీకుఁదోఁచేసిగ్గు గుఱుతు
బలిమి శ్రీవేంకటేశ పైకొని నన్నుఁ గూడితి-
విలపై నిండె నీసుద్దులేల బొంకేవిపుడు

రేకు: 1102-6 పాడి సం: 21-012

పల్లవి: నిన్నేమనేము నేము నీకేఁటి ఆచారము
కన్నచోట్లను మోటు గాలికి వెలచునా

చ. 1: సరసము లేమాడేవు సతుల పయ్యదల
మరిగేవాఁడవు నీకు మాటలు నేల
దరిచేరినవియెల్ల తలపోయ గుల్లలని
ధరలోన ననేమాట తగ నీయందున్నది

చ. 2: తొడికేవు నిజముల తొయ్యలులచూపుల
బడిసెవాటవు నీకు బాసలునేల
నుడుగులు దప్పినాను నోముఫలము దప్పదు
అడరఁగ ననుమాట అది నీయందున్నది

చ. 3: వేసరక నవ్వేవు వెలఁదులరతులకు
ఆసోదకాఁడవు నీకు నంతేశాల
సేసపెండ్లి కొడుకవు శ్రీవేంకటేశ కూడితి
తాసు పయిఁడంతతూకము తగ నీయందున్నది

రేకు: 1103-1 వరాళి సం: 21-013

పల్లవి: కొలువువా రివి గంటే కొల్లున నవ్వుదురు
తిలకించి చూచుకొంటే తిద్దుకొందువు

చ. 1: నీమేనివింతచేతలు నీడచూచుకోవయ్య
కామినిచెక్కులే నీకు కంచుటద్దాలు
వేమారు నేమనఁబోతే వెంగెమై తోఁచు నీకు
దీమసాన నీవైతే తిద్దుకొందువు

చ. 2: వెలఁదిడినజవ్వాది వేరేపూవు గట్టవయ్య
పొలఁతిగుబ్బలే నీకు పూవుగుత్తులు
యెలమి నేమేమనిన యెగసక్కెమై తోఁచు
తెలుసుక నీకునీకే తిద్దుకొందువు

చ. 3: యెయ్యేడో ఆఁకలి నీవు యీడఁ దీరుచుకోవయ్య
తొయ్యలిమోవే నీకు దొంతిబోనము
నెయ్యపుశ్రీవేంకటేశ నేసంటే నన్నుఁ గూడితి
తియ్యక వెనకవెల్ల తిద్దుకొందువు

రేకు: 1103-2 ముఖారి సం: 21-014

పల్లవి: ఔ నౌ మరి ఆఁడువార మంత కోపము
ఆనతిమ్మా నీకు నితవైనట్టే సేసేను

చ. 1: సారె సారె నీతోను సణఁగులు చూపఁగాను
భారము గాదుగదా పంతగాఁడవు
కూరిమి గలిగి నేను గొణుఁగుచుఁ దిట్టఁగాను
వైరముగాదుగదా వాసికాఁడవు

చ. 2: కప్పినట్టి నీమోవిగంట్లిట్టె రేఁచఁగాను
నొప్పులు గావుగదా నుడికారివి
చిప్పిల నింటికి నీవు చేయివట్టి తియ్యఁగాను
దప్పులు గొనవుగదా తమకపుదొరవు

చ. 3: కాలుమీఁద గాలువేసి కరఁగించి కూడఁగాను
నాలితో మొక్కవుగదా నాఁటకీఁడవు
యీలీల శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
వేళలు గావవుగదా వేడుకకాఁడవు

రేకు: 1103-3 రామక్రియ సం: 21-015

పల్లవి: ఏది వాటి నీగుణాన కేమి చెప్పేము
పోదిగొన్న వద్దివారిపుణ్యము నీచేతిది

చ. 1: సలిగెలు రేచుకొని సణఁగులురాలిచేటి-
చెలులకే నీవు కడుఁజిక్కుదువు
వలచి పైకొనియేటి వనితలఁ గంటేను
పెలుచుఁదనాన నట్టె బిగుతువు

చ. 2: చనవులు సేసుకొని సారె సారె దిట్టేటి-
వనితలకే నీవు వలతువు
పెనఁగి ప్రియముచెప్పేప్రియురాండ్లఁ గంటేను
కొనగొనలనే నీవు గుట్టుసేసుకొందువు

చ. 3: తరితీపుసేసుకొని తమకాలు రేఁచేటి-
తరుణులనే నీవు దగ్గరుదువు
అరుదై శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితిః
విరవై అంతటిలోనే యిందరి మన్నింతువు

రేకు: 1103-4 గౌళ సం: 21-016

పల్లవి: ఇంతకంట జెలులాన యేమిచెప్పే రతనికి
మంతుకెక్కి తన్నుదానె మంచిదయ్యీఁగాక

చ. 1: బుద్ధులు నేఁ జెప్పనా పొందులు నేఁ జూపనా
బద్దులకాంతల నట్టె పాయఁడుగాక
గద్దించి నేఁ జూడనా కన్నుల జంకించనా
పెద్దరికపువారితోఁ బెనఁగీఁగాక

చ. 2: పొంకానకు దిద్దుకోనా పొంచి పరాకుసేయనా
మంకుఁజీకటి తప్పులు మానఁడుగాక
లంకెసేసుక వుండనా లావులెల్లఁ జూపనా
బింకపువారిమాటలు ప్రియపడీఁగాక

చ. 3: కందువ నేఁ గూడనా కాఁగిలించుకొననా
చెంది వారిగుణా లీడఁ జెప్పీఁగాక
అందపుశ్రీవేంకటేశుఁ డాతఁడే నేఁ గానా
మందెమేళాలేలో తొట్టి మరిగీఁగాక

రేకు: 1103-5 లలిత సం: 21-017

పల్లవి: వనిత లిట్టయితేను వలచివత్తురు నీకు
ఘనుఁడవు మేలు మేలు కంటిమిగా గుణము

చ. 1: వంచినశిరసుతోడ వాలినట్టితురుముతో
కుంచె నీకు విసరేటికోమలిఁ జూచి
మంచముమీఁదికిఁ దీసి మన్నించితి వన్నిటాను
అంచె నాఁటదానిగోడు ఆలించితిగా

చ. 2: కమ్మర నాసలతోడ కారేటి చెమటతోను
చమ్మాళిగెలు వట్టినసతిఁ జూచి
కమ్మి పచ్చడము గప్పి కరుణించితి వన్నిటా
నెమ్మి నింతులపయ్యెద నీకుఁ గద్దుగా

చ. 3: వాలుకచూపులతోడ వడి నిట్టూరుపులతో
కాళాఁజి వట్టినసతిఁ గలసితివి
మేలిమి శ్రీవేంకటేశ మించ నన్నుఁ గూడితివి
యీలీల సతులవలపియ్యకొంటిగా

రేకు: 1103-6 బౌళి సం: 21-018

పల్లవి: ఓపనన్నవారినేల వొడిపట్టేవు నీపై
చూపునాటించినవారిఁ జూడరాదా

చ. 1: తలవంచుకుండఁగాను తగ పంతమియ్యఁగాను
వొలిసి నన్నేల నీవు నొడివట్టేవు
చెలఁగి నీమేననున్నచేఁత సేసియాపెతో
సొలసి నీబలిమెల్లాఁ జూపరాదా

చ. 2: చెక్కుచేత నుండఁగాను చేరి నీకు మొక్కఁగాను
వొక్కటొక్కటాడి యేల వొడివట్టేవు
నిక్కి నిక్కి తామెరల నిన్ను వేసినవారితో
పెక్కుచందముల నీవు పెనఁగరాదా

చ. 3: వొద్ద గాచుకుండఁగాను వూడిగాలు సేయఁగాను
వుద్దండానఁ గూడి యేల వొడివట్టేవు
చద్దికిని వేఁడికిని జమళినుండినవారి
అద్దుక శ్రీవేంకటేశ అలమరాదా

రేకు: 1104-1 కేదారగౌళ సం: 21-019

పల్లవి: పూవకపూచె వీరికి పొదిగొని వలపులు
చేవదేర మాతోనే చెప్పేరు యీసుద్దులు

చ. 1: చన్నుల నొత్తితేఁ దనజంటమేను గందెనట
కన్నులచూపులే ఆపెఁ గాఁడెనట
యెన్నివేసాలు సేసేరు యేమిచెప్పేమమ్మ నీతో
విన్నపుటనుండి మాకు వెరగయ్యీ సుద్దులు

చ. 2: మోవి సోఁకితే నాతని మొనలెల్లా రాఁగెనట
కావిజంకెన లాపెఁ గదిమెనట
యేవంక చూచిన వీరియెమ్మెలే వెగ్గళమాయ
నూవుగింజ నానదిదె నోటిలో నీసుద్దులు

చ. 3: చేయిచాఁచితే ననిచె శ్రీవేంకటేశ్వరుకట
కాయము చెమరించె నాకాంతకునట
యీయెడ నన్నిటు గూడె యెవ్వరి నేమనవచ్చు
బాయిలిపందిలులాయ పంతపు యీసుద్దులు

రేకు: 1104-2 బౌళి సం: 21-020

పల్లవి: నేననగ నెంతదాన నీపాలికి
చేనిపంట కొయ్యేలే చెప్పీ చెప్పవయ్య బుద్దులు

చ. 1: మచ్చిక నే జల్లఁగానే మాటలాడ వచ్చేవు
ఇచ్చకుఁడ ఇందాఁక నెందువోతివి
తచ్చనకాఁడవు నీవు తగులువిరులాడేవు
నచ్చులగొల్లెత లెట్టు నమ్మిరయ్య నిన్నును

చ. 2: పైకొని నేఁ బిలువఁగ పలుకఁగ వచ్చేవు
చాకలవాఁడవు ముంచవద్దా నీవు
కాకరివాఁడవు మాతో గాలి ముడియగట్టేవు
చేకొని నీచెలి మెట్టు చేసిరయ్య సతులు

చ. 3: మించి నేఁ గూడఁగానే మెచ్చులెల్లా మెచ్చేవు
మంచముపై నుండి యేల మరచుంటివి
చంచులశ్రీవేంకటేశ సందుసుడి మెలఁగేవు
యెంచ నిన్నెట్టు గెలిచి రిన్నాళ్లు నింతులు

రేకు: 1104-3 పాడి సం: 21-021

పల్లవి: కలమాఁట చెప్పే నీతో కల్లలాడనేరఁగాని
చెలఁగి కడపలోన చిత్తగించవయ్యా

చ. 1: కపట మించుకలేదు కాఁతాళమే వుండీఁగాని
వుపమల నన్నేల వొరసేవయ్యా
నెపములు వేయ నీపై నిందలే మోచీఁగాని
చపలచిత్తము మాని చక్కవినవయ్యా

చ. 2: జగడ మింతాఁ దీరె చనవు మెరసేఁగాని
నగుతానే నన్నేల నమ్మించేవయ్యా
పగటులు చూప నీతో పంతమే నెరపేఁగాని
మొగము చూతువుగాని ముందట నుండవయ్యా

చ. 3: కోపములెల్లాఁ బాసె కొనగోరే నాఁటేఁగాని
తీపులు నీవేఁటికి సాదించేవయ్యా
యేపున నిన్ను శ్రీవేంకటేశ నేఁ గూడితిఁగాని
చేపట్టితి విదె నీవు సిగ్గువడవయ్యా

రేకు: 1104-4 కురంజి సం: 21-022

పల్లవి: ఆతఁడిదె నీవిదు అన్నిటాను జాణలు
యేతుల నింకానేలే యెడమాఁటలు

చ. 1: అంకెకు రానేరిచితే అలుకలైనా సుఖమే
మంకుఁదనాలుడిగినమానినులకు
సంకెదీరితే మరునిశరములెల్లా విరులే
యింకనైనా మామాఁట లియ్యకొనరే

చ. 2: విననేరిచినఁజాలు విరహమైన సుఖమే
మనసుదెలిసినట్టి మగువలకు
చెనకి లాలించితేను చిలుకలు మాఁటలాడు
చలములు మాని యిఁక సమ్మతించరే

చ. 3: సరసము నేరిచితే జంకెనలైనా సుఖమే
తరితీపులెఱిగిన తరుణులకు
యిరవై శ్రీవేంకటేశుఁడిదివో నిన్నిటు గూడె
యెరవులు మరియేల యెనశుండరే

రేకు: 1104-5 ముఖారి సం: 21-023

పల్లవి: సంకెలెల్లాఁ దీరె చనవు లీడేరెను
వంక లొత్తకువే మాఁట వాఁటమయ్యీ సిగ్గులు

చ. 1: నగినదాఁకా నింతే నాతీ నీనిష్ఠూరమెల్ల
తెగనాడి ఇంతలోనే తిట్టనేఁటికే
మొగము చూచినప్పుడే ముచ్చటలు తుదకెక్కె
పగచాటకువే నీపయ్యద జారీని

చ. 2: దగ్గరుదాఁకా నింతే తలపోఁతలన్నియును
కగ్గి ఇందుకుఁగాను వట్టికపటాలేలే
బగ్గనఁ బలికితేనే పంతమెల్లా నీడేరె
నిగ్గులఁ బెనఁగకువే నిండీఁ జెమటలు

చ. 3: పొందినదాఁకా నింతే పొరపొచ్చెములెల్లాను
సందుసుడి నీకేలే జంకెనలు
ముందే శ్రీవేంకటేశుఁడ మొక్కఁగానే కూడితివి
పందెములు వేయకువే వచ్చీ దోఁచీఁ బనులు

రేకు: 1104-6 రామక్రియ సం: 21-024

పల్లవి: ఒద్దనే నే నున్నదాన వున్నది నీవెఱఁగవు
గద్దించి చూడవైతివి కామాంధకారానను

చ. 1: హత్తి నీతోఁ బొందుసేసి ఆయములు గరఁగించి
బిత్తరిమాటలాడెఁగా ప్రియురాలు
లత్తుకరసాలతోడిలలితంపుఁగొనగోర-
నొత్తి నిన్ను సన్న సేసి వొరసెఁగా అపుడు

చ. 2: పెనఁగి కాఁకలు చల్లి బిరుదులెల్లా నెరపి
చనవు మెరసెఁగా జవరాలు
తనివోనిముచ్చటల తమకము రేఁచిరేఁచి
పనిగొనెఁగా ఆపె పంతమున నపుడు

చ. 3: గక్కనఁ గాఁగిలించి కన్నులు దేలగింపుచు
మొక్కి వూరకె వుండెఁగా ముద్దరాలు
అక్కడ శ్రీవేంకటేశ ఆవేళ నన్నుఁ గూడితి
తెక్కులనీతమకము తెలిసెఁగా అపుడు

రేకు: 1106-1 గౌళ సం: 21-025

పల్లవి: ఇంతవాఁడవు నీబలి మిందుమీఁదనా
పంతపునీమనసెల్లఁ బట్టి తెచ్చీనా

చ. 1: పిక్కటిల్లఁ దమకానఁ బెరిగెనింతె చన్నులు
కిక్కిరియ నీవు పెనఁగేపాటివా
పెక్కుమారు లింతయేల పిసికేవు ఇవి నిన్ను
జక్కవపులుగు లిట్టె సాదించీనా

చ. 2: నిండినకోరికలచే నిక్కెనింతె యీతురుము
బండుబండుగా నీవు పట్టేపాటిదా
చండిసేయక విడువు సమయముసేసీ నీపై
గండుఁదుమ్మిదలు ఇవి ఘాతసేసీనా

చ. 3: అట్టె చూడఁగా వెలసె అడుగులనడవులు
పట్టేవేల కూడుమంటా బలిమా యిది
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
జట్టిగొన్నహంస లివి చండిసేసీనా

రేకు: 1106-2 సాళంగనాట సం: 21-026

పల్లవి: కన్నవే అన్నియును నీఘనతలెల్లా
నిన్న మొన్న నివియెల్లా నేరుచుకవచ్చేవా

చ. 1: చూపులోనే కానరాదా సూటియైననీవలపు
ఆపొద్దుననుండి పెట్టేఆనలేలా
చేపట్టితి వల్లనాఁడే చేరి నీవారమైతిమి
తీపులు పైఁబూసేవు దీనికీఁ గడమలా

చ. 2: మాటలోనే కానరాదా మనసులో మర్మాలు
యేఁటికి మాతోఁ జెప్పె వెందాఁకను
మేఁటిఁ జేసితివి నన్ను మేనదాన నే నీకు
యేఁటికి వేఁడుకొనేవు యిదిగొంత వలెనా

చ. 3: కూడినందే కానరాదా గుణములు నీవెల్లా
ఆడుకొననేమిటికి అంత మాతోను
యాడులేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వేడుకపడేవు వీవిధము లెఱఁగనా

రేకు: 1106-3 ఆహిరి సం: 21-027

పల్లవి: ఆతఁ డీడనే వున్నాఁడు అడుగరే
నీతితోడ నన్నునేల నేరమెంచేరే

చ. 1: మొగము చూచినఁగాక మోహమెట్టు గానవచ్చు
నగినఁగా కెటు లామన్నన దెలుసు
తగులనాడినఁగాక దగ్గర నెట్లవచ్చు
నిగుడి మీరేల నన్ను నేరమెంచేరే

చ. 2: మచ్చిక చల్లినఁగాక మాఁటలెట్లా నాడవచ్చు
ముచ్చటలాడక యెట్లు మొక్కవచ్చును
మెచ్చుకతొలుతనే మేలమెట్లా నాడవచ్చు
నెచ్చెలు లిందరునేల నేరమెంచేరే

చ. 3: చెలిమి సేసినఁగాక చెనకఁగ నెట్టువచ్చు
పిలువకతొల్లే యెట్టు పెనఁగవచ్చు
అలమి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
నెలకొని యిప్పుడేల నేరమెంచేరే

రేకు: 1106-4 దేసాళం సం: 21-028

పల్లవి: నీయంతవారమా నీవార మింతేకాక
నాయమాడేవారమా నమ్మేవారముగాక

చ. 1: మారుకొని నేము నీతో మాటలాడేవారమా
వైరము లేకుండఁ దిట్టేవారముగాక
చేరి నీమేను నొవ్వ చెనకేటివారమా
నారుకొన గోరుసోఁక నవ్వేవారముగాక

చ. 2: సరికిబేసికి నీతో జగడాలవారమా
వరుసెరిఁగి జంకించేవారముగాక
పరిపరివిధముల పగచాటేవారమా
గౌరబుగా కొంగువట్టుకొనేవారముగాక

చ. 3: బలిమిఁ గాఁగిట నన్నుఁ బట్టుకొనేవారమా
వలపించి లోలోఁ గూడేవారముగాక
కలసితి వీడ శ్రీవేంకటేశ్వరుఁడ నన్ను
పిలిచేటివారమా ప్రేమవారముగాక

రేకు: 1106-5 పాడి సం: 21-029

పల్లవి: చెప్పక నే మెఱఁగము చిత్తము నీదెట్లానో
చెప్పి సేయించుకోవయ్య చేరి వూడిగాలు

చ. 1: గుఱితాఁకులవలపు కొమ్మచూపుల నున్నది
చిఱునవ్వులవలపు చెక్కుల నదె
తఱచయిన వలపు తగ మోవినున్నది
నెఱయ నేవలపులు నేరిచితివో

చ. 2: చలమఱివలపులు చనుమొనల నున్నవి
కులుకువలపు గోరికొన నదె
పెలుచువలపులెల్ల పిరుఁదుననే వున్నవి
యెలమి నీ కేవలపు యితవయ్యీనో

చ. 3: తమకపువలపెల్ల తగుకాఁగిట నున్నవి
గుములరువలపు పెద్దకొప్పున నదె
చెమటతోఁ గూడితివి శ్రీవేంకటేశ్వర చెలి
అమరిన దేవలపు అంటీనో నీకు

రేకు: 1106-6 సామంతం సం: 21-030

పల్లవి: నేరుపరివౌదు వన్నిటా నీవు
యీరీతి మమ్ముఁజూచి నీవేల నవ్వేవయ్యా

చ. 1: మచ్చికసేసిననీమాటలకు లోనై
రచ్చలకు నెక్కితిమి రవ్వయితిమి
పచ్చినీసతులచేతి పలుకులకు లోనైతి-
మిచ్చల మమ్ముఁజూచి నీవేల నవ్వేవయ్యా

చ. 2: సొగకన్నులఁ జూచేనీచూపులకు లోఁగి లోఁగి
జాగులకు లోనైతిమి సరియైతిమి
బాగులై ననీవద్దిపడఁతులఁ జూచితిమి
యీగతి నీవింతలోనేల నవ్వేవయ్యా

చ. 3: చేవలు దేరిన నీచేఁతలకు జొక్కి చొక్కి
వావులు దెలుపుకొంటి వనితనైతి
దేవ శ్రీవేంకటేశ నీదేవి నలమేల్మంగను
యీవేళఁ గూడితివి నీవేల నవ్వేవయ్యా

రేకు: 1107-1 దేశాక్షి సం: 21-031

పల్లవి: కాంతమీఁద నిష్ఠూరము కట్టకువయ్యా
వింతలేడఁ జేసిని విచారించవయ్యా

చ. 1: తలఁపు నీమీఁదఁనే తలవంచుకున్నదింతే
అలుకేడ నున్నదో అంగనకును
వలపు నీమీఁదిదే వాడుదేరీ నింతే మోము
చలము లేడనున్నవి సటలు వద్దయ్యా

చ. 2: తగులు నీమీఁదిదే తక్కి సిగ్గువడీ నింతే
యెగసక్కె మేడనుందో ఇందులోనను
నగవు నీమీఁదిదే నానఁబెట్టీ నిదె యింతే
పగటు లెక్కడఁ జూపె పచారించవయ్యా

చ. 3: చేతులు నీమీఁదిదే చిత్తము తెలిసీ నింతే
ఘాత యాడనున్నాడో కలది యిది
యీతల శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
నీతి యెక్కడ నున్నది నీవు జాణవయ్యా

రేకు: 1107-2 తోండి సం: 21-032

పల్లవి: నీవు నేనుఁ జాలదా నేరుపులే కలితేను
వేవేలుగ వలపులు వెదచల్లేటందుకు

చ. 1: నగవులేమిటికి నాలిసేసి నీవు నన్ను
పొగరులఁ గాఁగిలించి పొందేయందుకు
తగవులేమిటికి తరుణలఁ గూడపెట్టి
మొగిఁ గంకణదారము ముంచి కట్టేయందుకు

చ. 2: చెనకులేమిటికి చేసన్నలకు లోనై
తనివంద నీవు నాకు దక్కేయందుకు
ననుపులేమిటికి నమ్మించి నీవు నాపై
పెనఁగి నిండుసేసలు పెట్టేయందుకు

చ. 3: పంతములేమిటికి పైపై నిందరిలోన
యింతేసిచనువు నాకిచ్చేయందుకు
కాంతుఁడ శ్రీవేంకటేశ గక్కునఁ గూడితి నన్ను
బంతిబాసలేమిటికి బతికించేయందుకు

రేకు: 1107-3 శుద్ధవసంతం సం: 21-033

పల్లవి: వెలుపల బెట్టి మాతో వేసాలేల సేసేవు
కలపితే కదుపున గలసి యిట్టుండుగా

చ. 1: యింతలో నీవాపెను యింటికి తెచ్చుకొంటేను
వంతులకు వాసులకు వచ్చుఁగా మాతో
చింతదీర నొక్కఁ టే సేసవెట్టి పెండ్లాడితే
పంతములుమీరక మాపనులకు వచ్చుఁగా

చ. 2: చలివాపి ఆపెను మాసవతిఁగా జేసితేను
నిలువుఁ గొలువులను నిలుచుండుఁగా
కొలము తెలిపి మాతో కూటికి లోనుచేసితే
నెలకొని మావలె నిన్ను సంతోసించుఁగా

చ. 3: గద్దెపీఁటమీఁద నాపెఁ గడఁ గూచుండఁబెట్టితే
సుద్దులెల్లఁ జెప్పుతాను సుకియించుఁగా
వొద్దిక నాపెను మమ్ము నొక్కటిగాఁ గూడితివి
వద్దనే శ్రీవేంకటేశా వాదులెల్లాఁ దీర్చుఁగా

రేకు: 1107-4 కుంతలవరాళి సం: 21-034

పల్లవి: ఎన్నాళ్ల కెన్నాళ్లు యిదేమే నీవు
విన్నపము లాలకించి విచారించేవు

చ. 1: యిన్నిటాను నీవు నన్ను నేలవలె ననుచును
నిన్ను నొడఁబరచుట నేఁడా నేను
కన్నెలు పదారువేలు కలరంటానుండి వచ్చి
చన్నులంటే విది లెస్ససరవాయఁగా

చ. 2: చేచేత నాచెప్పినట్టు సేయవలె ననుచును
నీచేత బాస గొంట నేఁడా నేను
యేచి నీవు వేగలేచి యెనమండ్రఁ జక్కఁబెట్టి
కూచుండేవు నావద్ద గుఱుతాయఁగా

చ. 3: కైకొని నీవునాతో కాపిరము సేతువంటా
నీకుఁ జేతులు చాఁచుట నేఁడా నేను
యీకడ శ్రీవేంకటేశ యిందరినీఁ బొందివచ్చి
మేకొని నన్నుఁ గూడితి మెచ్చాయఁగా

రేకు: 1107-5 రామక్రియ సం: 21-035

పల్లవి: ఆపె మెచ్చవలె నీవు అట్టే మెచ్చఁగవలె
వోపిక గలిగి యిట్టే వుండవయ్య యిపుడు

చ. 1: అంగన నీతోఁ జెప్పఁగ నట్టే నీవు మాటలాడే-
వెంగిలిమాఁటల మాఁటలేల మాకు
పొంగుచు నేనే మీఁదువోనిమాఁట లాడించేను
వుంగిటి గొనక యిట్టే వుండవయ్య ఇపుడు

చ. 2: అప్పుడే నిన్నింతి నవ్వుమనఁగా నవ్వే-
వప్పణనవ్వులు నవ్వ టవేల మాకు
ముప్పిరి నేనే నిన్ను మెసులుగా నవ్వించే
వొప్పుగాని నావొద్ద నుండవయ్య యిపుడు

చ. 3: రవ్వగా నింతి చెప్పఁగా రతి నన్నుఁ గూడితివి
యెవ్వరిపంగెనకూటాలేల మాకు
మవ్వపుశ్రీవేంకటేశ మరి నే నిన్నుఁ గూడితి
వువ్విళ్లూరుచు నిట్టే వుండవయ్య ఇపుడు

రేకు: 1107-6 సాళంగనాట సం: 21-036

పల్లవి: మమ్మేమడిగేవు నీమతకములు
నెమ్మది నుండేవారము నెపాలు నేరుతుమా

చ. 1: నీచిత్త మాపె యెఱుఁగు నీవెఱుఁగుదువు గాక
యేచి నీదేవరహస్యా లెవ్వఁ డెఱుగు
వాచవులకు నేము వద్దనుండి మాటలాడి
చూచేవార మింతేకాక సోదించఁగలమా

చ. 2: నీతో నాపె నవ్వఁ జెల్లు నీకుఁ జెల్లు నింతేకాక
యేతుల మీవీడుదోళ్లు యెవ్వఁ డెఱుగు
చేతులార నేము నీకు సేవలేమయినాఁ జేసి
పోతరించే మింతేకాక బుద్ధి చెప్పఁగలమా

చ. 3: కోరినట్టే నిన్నుఁ గూడె కొమ్మఁ గూడితివి నీవు
యీరీతి మీ వూహపోహ లెవ్వఁ డెఱుగు
చేరి నన్నుఁ గలసితి శ్రీవేంకటేశ్వర నేఁడు
నేరుపుమిమ్మెంతుఁగాక నీటు చూపఁగలమా

రేకు: 1108-1 ధన్నాసి సం: 21-037

పల్లవి: చెప్పిన ట్టిద్దరమునుఁ జేసేమయ్యా
ఇప్పుడు గాఁగిలించే మియ్యకొంటిమయ్యా

చ. 1: వరుసఇచ్చేవాఁడవు వాదు మాన్పనేరవా
వెరసి యిద్దరిమాట వినవయ్యా
తెరలోనున్నవాఁడవు తెలియదా నీకిన్నియు
అరసి వెనకముందు లడుగనేలయ్యా

చ. 2: తగవు దిద్దేవాఁడవు తప్పు దీర్చనేరవా
సొగసి నేమున్న జాడ చూడవయ్యా
నగినవాఁడవు నీవే నయములు నేరిపేమా
మొగమిచ్చలను నీవే మొక్కించవయ్యా

చ. 3: ఇద్దరిఁ గూడినవాఁడ వెక్కుడు సేయనేరవా
చద్దికి వేఁడికి మోవి చవిగోవయ్య
గద్దరిశ్రీవేంకటేశ కలిగితివి మాపాల
పొద్దువొద్దున నిట్టె భోదించవయ్యా

రేకు: 1108-2 బౌళి సం: 21-038

పల్లవి: బాపు బాపు మెచ్చితినే బలుదానవు
యేపుతోడ నుండేవార మింతేసి కోసరమే

చ. 1: వాసనకస్తూరి వూసి వలపుచవులు చూప
వేసరవుగదే నీవు విభునితోను
మూసినముత్తెమువలె ముంగిటనే నిలుచుండి
ఆసపడేవారము నే మంతేసి కోపమే

చ. 2: మోవితేనె లంచమిచ్చి మొకమోడింపించుకొన
దేవరవుగదే నీవు దేవునితోను
హావభావములతోడ ఆయమంటి మన్ననలే
ఆవటించుకొనేవార మందు కొడిగట్టము

చ. 3: గందవొడి మీఁదఁజల్లి కాఁగిలించి కూడికూడి
విందవైతిగదే శ్రీవేంకటేశుతో
అందమై ఆతఁడే కూడె అలమేలుమంగనేను
చందమైనవార మింత సాదించనెఱఁగము

రేకు: 1108-3 రామక్రియ సం: 21-039

పల్లవి: ఇంకనేలే మాటలు యెఱుఁగుదు నేనన్నియు
కంకిగా నీతోఁ దారుకాణించితిఁ జాలదా

చ. 1: సెలవి నీవు నవ్వఁగా సిగ్గువడి ఇంతి నిన్ను
కలువపూవున వేసెఁ గద్దో లేదో
నిలువుటద్దములో నీ నీడ నీవు చూచుకోఁగా
కలికి కాఁగిటఁబట్టె కద్దో లేదో

చ. 2: అందముగా నీవు దన్ను ఆయములు చెనకఁగా
గందము నీపైఁ బూసె కద్దో లేదో
సందడిఁ గొలువలోన సరిఁ బరాకై యుండఁగా
కందువలు నిన్ను నంటెఁ గద్దో లేదో

చ. 3: నిక్కి నీవు చూడఁగాను నిన్నుఁజేయివట్టి తీసి
గక్కున రతులఁ గూడె కద్దో లేదో
యిక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
కక్కసించి జంకించెఁ గద్దో లేదో

రేకు: 1108-4 లలిత సం: 21-040

పల్లవి: సోబాన బాడేము మేము సుదతులము
యీబుద్ధులు మీకుఁ జెల్లు నిద్దరికి నయ్యా

చ. 1: చూపులనే వుంకువలు సుదతికిఁ బెట్టితివి
పూపనవ్వులు మించేకప్పువిడేలు
యేపుమీరి నవ్వులనే యెదురుతెర వేసితి-
వీపొద్దే పెండ్లాయను మీకిద్దరికినయ్యా

చ. 2: తరితీపుమాటనే తలఁబాలు వోసితి
గరిమ సరసములే కంకణాలు
గొరబైనవలపుల కొంగులు ముళ్లువేసితి-
విరవాయ వేడుకలు ఇద్దరికినయ్యా

చ. 3: పొంచినకెమ్మోవినే బువ్వపువిందు వెట్టితి
మంచముపై కాఁగిలే మంచిచవికె
అంచలశ్రీవేంకటేశ అలమేలుమంగ నీవు
యెంచి కూడితిరి తగు నిద్దరికినయ్యా

రేకు: 1108-5 ఆహిరి సం: 21-041

పల్లవి: ఇన్నియు నీవే నేరుతు నిఁక నెన్నఁడు
పన్నినసటలెల్లాఁ జేసి పాలార్చవయ్యా

చ. 1: కాంతకు నీబుజమురేకలు చూచినంతనుండి
చింతతోడ చెక్కులెల్లాఁ జెమరించెను
మంతనానకుఁ బిలిచి మనసుమర్మము సోఁక
పొంతనే నీవానవెట్టి బొంకఁగదవయ్యా

చ. 2: కొమ్మ నీతురుము చూచి కొత్తపూవులెల్లాఁ జూచి
తమి మోము వంచుకొని తడఁబడీని
నెమ్మనమలర నీవు నేరుపులెల్లా మెరసి
సమ్మతించేయట్టుగాను సత్యాతు చూపవయ్యా

చ. 3: అలమేలు మంగ నీవాడేటిప్రియాలు చూచి
కలసి మోవిచ్చె శ్రీవేంకటేశ్వరుఁడా
వెలయ నింకా నీవు వేవేలుచందముల
పలుసాకిరులు చెప్పి భ్రమయించవయ్యా

రేకు: 1108-6 భైరవి సం: 21-042

పల్లవి: ఏల నన్ను సోదించె వెందాఁకాను
నీలాగులు నాలాగులు నీకే తెలుసును

చ. 1: తక్కించి నీవు నన్నుఁ దప్పులువట్టేవు గాక
యెక్కువనామనసు నీవెఱఁగనిదా
చెక్కు చేతఁబట్టుకొని సిగ్గువడి వున్నదాన
నిక్కి నావిన్నపాలెల్లా నీకే తెలుసును

చ. 2: మంతనాన నాతోను మాఁటలు దీసేవుగాక
యింతట నాగుణము నీవెఱఁగనిదా
బంతి నిందరిలో మానాపతినై నేనున్నదాన
దొంతునాయాస నీకు తొల్లే తెలుసును

చ. 3: నవ్వుతానే నీవు నన్ను నంటునఁ గూడితిగాక
యివ్వల నానేరువు నీవెఱఁగనిదా
జవ్వనపు శ్రీవేంకటేశ్వర యలమేల్ మంగను
పువ్వువంటిపొందు నీకుఁ బూఁచితేఁ దెలుసును

రేకు: 1109-1 నట్టనారాయణి సం: 21-043

పల్లవి: ఏల సాకిరి గోరేవు యింతలో నన్ను
ఆలరిసతులకు నీ కమరుఁగాక

చ. 1: నిగ్గులమాట లాడ నీతో నే నేరుతునా
సిగ్గువడియుండేటిచెలి నేను
కగ్గి నీవలెనే నేను కల్లలాడ నేరుతునా
మొగ్గులేనియటువంటి ముద్దరాల నేను

చ. 2: నీవునేరనిచేఁతలు నే నేరుపఁగలనా
వావితో లోనుండేరాణివాసమ నేను
వోవరిలో నీసుద్దులు వూఁకొన నేఁ గలనా
కోవిలకూఁత కుత్తిక కోమలిని నేను

చ. 3: జంకించి కాఁగిటఁ గూడేచలమరిదాననా
వంకలాడ నేరిచినవనిత నేను
అంకెల శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పొంకమై కలసితివి పొందనేర్తు నేను

రేకు: 1109-2 పళవంజరం సం: 21-044

పల్లవి: ఎంత కెంత మన్నించేవు యేమయ్య నీవు
అంతలోనే మెచ్చేవు నీయంతదాననా

చ. 1: చెక్కులు నే నొక్కఁగాను చేతుల మొక్కవచ్చేవు
వొక్కటఁ బతికిపతి వుపకారమా
మొక్కలపుదాన నేను ముందెంచేవాఁడవు నీవు
చక్కఁగ చేయి వట్టేవు సరిదాననా

చ. 2: కందువ నే నవ్వితేను కడుసరసమాడేవు
వొందిలి నందుకునిందు కుపకారమా
మందెమేళపుదానను మంచినేర్పరివి నీవు
పందేలువేసేవు నీపాటిదాననా

చ. 3: చేరి కాగిలించుకొంటే సిగ్గులు చేతఁబట్టేవు
వూరట మారుకుమారు వుపకారమా
ఆరీతి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
మేరలు రేవు నిన్ను మించేదాననా

రేకు: 1109-3 వరాళి సం: 21-045

పల్లవి: తీరుచవయ్య తగవు దీనికి నీవు
నేరుపరితనమెల్లా నీచేత నున్నది

చ. 1: పందేలువేసి నీతోఁ బలుమారు జూజమాడి
దిందుపడ నుంగరము దీసుకొన్నది
అందుకుఁగా వేరొకతె అది దనసొమ్మనుచు
అంది తలపిడివట్టి అడుగుతానున్నది

చ. 2: సరి బేసి వట్టి యొక్కసతి నిన్ను నోడించి
గొరబుగా నచ్చుటాసె కోకకొంగున
సిరుల నీదట్టి తనచీరంటా వేరొకతె
అరసి పట్టి యందుకు నాపె మారుకొనెను

చ. 3: వానగుంటలాడి వొకవనిత నీచేయి వట్టి
ఆనవెట్టి వేలొకతె ఆచేయిఁ బట్టె
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్ మంగ నే వచ్చి
మేనంతి పురమెక్కితే మెచ్చిరి యిందరును

రేకు: 1109-4 గౌళ సం: 21-046

పల్లవి: వద్దనుండే చెనులతో వట్టిబీరము లేఁటికి
పొద్దువోనిజంకెనలు బొమ్మలలో నున్నవి.

చ. 1: మొనలుచూపకువే ముంచిననీచన్నులు
కొనలు సాగీ యాతనిగోరు వాఁడి
పెనఁగితే మీరిద్దరు బిరుదుల దొడ్డవారు
తనువులు సోఁకితేనే తారుకాణ వచ్చునే

చ. 2: కాటుకకన్నులనేల కారములు చల్లేవే
తేటమాటల నాతనితిట్లున్నవి
యీటుతో నీసరసాన నిద్దరును దొడ్డవారే
కూటములలోనే మీగురుతులయ్యీనే

చ. 3: కందువకాఁగిటనేల ఘాతలెల్లాఁ జూపేవే
అందుకు శ్రీవేంకటేశుఁ డాణికాఁడు
పొందితిరి మీరిద్దరు భోగముల దొడ్డవారే
సందడి జాణతనా చవిపుట్టీనే

రేకు: 1109-5 శంకరాభరణం సం: 21-047

పల్లవి: కొలువూ౯ జేయించుకొనీ గోవిందరాజు
చెలులము యీడనుండే చేరి మొక్కరే

చ. 1: పవళించి వున్నవాఁడు పాదాలు చాఁచుకున్నాఁడు
జవళిఁ దనయిద్దరుసతులమీఁద
రవళి గోవిందరాజు రవ్వగా నవ్వులు నవ్వీ
తివిరి యీభావము తెలుసుకోరే

చ. 2: చేయిచాఁచుకున్నవాఁడు శిరసెత్తుకున్నాఁడు
చాయల గోవిందరాజు సన్నసేసిని
ఆయములు సోఁకించి అంగనలఁ గరఁగించీ
కాయపుటిచ్చల నూడిగము సేయరే

చ. 3: సంకుఁజక్రములవాఁడు చల్లుచున్నాఁడు వలపు
కొంకక శ్రీవేంకటాద్రి గోవిందరాజు
వుంకువగా లోలోనే వువిదలఁ గూడినాఁడు
సంకెలేక వారిలో ముచ్చట వినరే

రేకు: 1109-6 భైరవి సం: 21-048
పల్లవి: గుట్టు చేకొందువుగాక కోమలితోను
పట్టి పెనఁగఁగఁబోతే పంతమెక్కీ సుమ్మీ
చ. 1: చెక్కులనే నీడ చూచి సిగ్గుల నీరెండ గానె
చిక్కుదీసీ నీనెరులు చెలియ
మొక్కీఁ దనకాలు దాఁకి మోసమున నంటాను
వక్కణ లడుగఁబోతే వాదువచ్చీ సుమ్మీ
చ. 2: కన్నుల నివాళ్లిచ్చి కాఁకలనే చొప్పులెత్తి
చన్నులఁ గానుక చూపీ జలజాక్షి
మన్ననల వేఁడుకొని మాటదప్పి వచ్చెనంటా
సన్నలు సేయఁగఁబోతే చలమెక్కీ సుమ్మీ
చ. 3: మోవినే విందుచెప్పి మోహమున విడెమిచ్చి
కైవసమై నినుఁ గూడె కలికి
శ్రీ వేంకటేశ్వర నవ్వి చేఁతసేసితి నిన్నంటా
వావాతఁ గొసరఁబోతే వాసులెక్కీ సుమ్మీ

రేకు: 1110-1 మధ్యమావతి సం: 21-049

పల్లవి: ఏమోయా మాతోనే యేల గోరాదిగొనేవు
దీమువలె నున్న వారి దీకొనేవు

చ. 1: మాట మఱఁగుసేసుక మౌనముతో నుండితేను
గాఁటమున నన్నేల గర్వమనేవు
కాటుకకన్నుల గాఁగా కడుఁదలవంచుకొంటే
గోటారించి నన్నేల కోపమనేవు

చ. 2: సిగ్గుతెర వేసుకొని చెక్కుచేత నుండితేను
యెగ్గులువట్టితినంటా యేల లోఁచేవు
దగ్గరనోపక నేను తలుపుమాటును నుంటే
బగ్గన లోనికి వచ్చి పైకొనేవు

చ. 3: మానాన మణిఁగి నేను మంచముపై నుండితేను
కానుకగా మోము చూచి కాగిలించేవు
పూని శ్రీవేంకటేశుఁడ పొదిగి నిన్నుఁ గూడితే
సానఁబట్టినగోరేల జళిపించేవు

రేకు: 1110-2 సామవరాళి సం: 21-050

పల్లవి: మానరాదా యిఁకనేల మతకములు
నాని నాని నవ్వులెల్లా నయములు వచ్చెను

చ. 1: నిన్ను నే గొసరఁగాను నీవు నాతోఁ బెనగేవు
యెన్నిక లింకేమున్నవి యేడ సుద్దులు
సన్నల మనమంకులు సరికి బేసికి నాయ
నున్ననిచెమట లివె నొసళ్లెల్లా నిండెను

చ. 2: పంతాలు నే నాడఁగాను పై పై నురము దట్టేవు
యెంతకెంత సేసే వు యేడ సుద్దులు
మంతనపుమాటలెల్లా మారులు మలయఁజొచ్చె
చెంతల పులకలెల్ల చెక్కులెల్లా నిండెను

చ. 3: కొంగు నేనే పట్టఁగాను కుచ్చి కాఁగిలించేవు
యెంగిలాయ మోవులెల్లా నేడ సుద్దులు
కంగక శ్రీవేంకటేశ కలసితి మిద్దరము
సంగడి మనమేనుల సంతోసాలు నిండెను

రేకు: 1110-3 బౌళి సం: 21-051

పల్లవి: నెట్టనఁ బాపపుణ్యాలు నీచేతివి? నీ—
వొట్టి చనవియ్యఁగాను వొల్లనంటినా

చ. 1: చలమేల మాతోను సాదించేవు నీ-
పలుకులకు లోనైనపడఁతులము
వలపు లేమిటి కింత వడిఁబెట్టేవు నీ—
వలసినట్టు సేయఁగా వద్దంటినా

చ. 2: కడునిష్ఠూరములేల కట్టవచ్చేవు
విడువరానినీవెలఁదులము
జడిగొన్నమనసేల చండిసేసేవు నీ-
వొడివట్టఁగ నీతో వోపనంటినా

చ. 3: బెట్టుగాఁగిటనేల బిగియించేవు
జట్టిగొన్ననీమోహంపుజవరాలను
గుట్టున శ్రీవేంకటేశ కూడితి నిన్ను
యిట్టె నావొద్దనుంటే యిచ్చగించనా

రేకు: 1110-4 శ్రీరాగం సం: 21-052

పల్లవి: పొంచిననీమన్ననకు పొగడుచుండుదుఁగాక
కంచములోనమృతము కడకుఁ బోఁదోతునా

చ. 1: నీవుసేసేచేఁతలలో నే నేరము లెంచేనా
కైవసమై అన్ని యునుఁ గైకొందుఁగాక
పూవులపుప్పొడిలోన పూఁదేనె చిందితేను
వేవేలైనా నందుకు వింతలుగాఁ జూతురా

చ. 2: ఆడిననీమాటలలో అందములు వెదకేనా
వేడుకతో మంచివేకా విందుఁగాక
వీడెములోఁ గప్పురము వింతలుగాఁ గలసితే
వీడుపడీనా యందుకు వేరులుగాఁ జూతురా

చ. 3: పొందిననీరతులలో పొరపొచ్చా లరసేనా
కందువలు మొరయఁ బొగడుదుఁ గాక
గందములోపల మంచికస్తూరి గలసితే
విందులశ్రీవేంకటేశ వెగటుగాఁ జూతురా

రేకు: 1110-5 లలిత సం: 21-053

పల్లవి: ఇంకా మరి యశోద మెంతనీకు
సంకెదీర నన్నిటాను చవులు చూచితివి

చ. 1: నన్ను నీవు పిలిచేది నవ్వులకో నిజాలకో
కన్నెలు పదారువేలు గలరు నీకు
కన్నుల నీవు చూచేవు కాఁకలకో మేకులకో
మున్నె గొల్లెతలయంగములు చూడవా

చ. 2: దగ్గరఁ గూచుండేవు తప్పులకో వొప్పులకో
యెగ్గులేని యెనమండ్రు ఇంతులు నీకు
సిగ్గుదీర నవ్వేవు చింతలకో వంతులకో
నిగ్గులగొల్లెతలతో నీవు నాఁడే నవ్వవా

చ. 3: కలసితి విటు నన్ను ఘాతలకో యేతులకో
యెలమి నిరువంకలా ఇద్దరు నీకు
అలరి శ్రీవేంకటేశ అన్నిటా మన్నించితివి
మెలఁగి లోకమువారి మిక్కిలి మన్నించవా

రేకు: 1110-6 అందోళి సం: 21-054

పల్లవి: రమ్మనవే ఇఁకను నీరమణునిని
పమ్మి వలపులు చల్లీఁ బదిమారులు

చ. 1: నెలకొ నప్పటనుండి నిన్నే తప్పకచూచీ
తలపోసి తలపోసి తడఁబడీని
మొలకనవ్వులతోడ మూతులు గిరిపీనదె
నలువంక పొంచి పొంచి నవ్వులు నవ్వీని

చ. 2: పెనఁగుచుఁ బలుమారు పెచ్చుపెరగీఁ దాను
గునిసి పరులమీఁద కోపగించీని
వెనుకొని నీజాడలే వెదకీ నితఁడు నేఁడు
మనసుమర్మాలు చూడ మచ్చికసేసీని

చ. 3: పొరుగుపొంతలనుండి బుద్దులు చెప్పీనదె
గరిమల మించీఁ గలికితనమునను
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుఁ గలసె
సరసములాడుతానే చనవు చూపీని

రేకు: 1111-1 మంగళకౌసిక సం: 21-055

పల్లవి: చేవట్టితే రానిది చిక్కి సన్నకు వచ్చినా
వావి దిరుగవేసితే వలపు లేమున్నది

చ. 1: మన్నించి నీవు నాతో మాటలాడితివిగాక
నిన్నుఁ బలికించేనంటే నే నెంత దాన
చన్నులు గిలిగించితే సరి నవ్వవచ్చుగాక
కిన్నెరకాయలు గిలిగించితే నేమున్నది

చ. 2: దయవుట్టి నీవు నాదండకు వచ్చితిగాక
నయమున నేఁ బిలువ నావశములా
ప్రియమున జౌలెఱఁగ పెద్దనాలికనేకాక
క్రియ యెఱఁగ జేతిలో కీలు మరేమున్నది

చ. 3: కందువతో నీవు నన్నుఁగాఁ గిలించితివి గాక
అంది బలిమిసేయఁగ నంతదానా
పొంది శ్రీవేంకటేశ నీభోగమందే వుందిగాక
అందుకోలు జాణతనా లందులో నేమున్నది

రేకు: 1111-2 నాట సం: 21-056

పల్లవి: ఏల సాకిరులువెట్టీ నేమి మీతోఁ జెప్పీని
జాలిలేక తానే చక్కజాడ నుండరాదా

చ. 1: ఆఱడిగా కేకతానే ఆలుమగఁ డుండఁ గాను
వేఱొకతె వచ్చితేనే వీరిడి గాదా
జాఱిక తమలోనను జాణతనాలాడఁగాను
తూఱి తాను నవ్వఁబోతే దొమ్మి సేయకుందురా

చ. 2: పడఁతియుఁ బురుషుఁడు పైకొనొ మాటలాడఁగ
యెడచొచ్చి మాటలాడే దెడ్డగాదా
అడియాలముగ వారు ఆయములు చెనకఁగా
కడనుండి తా నంటితే కడుఁగూళ గాదా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నన్ను చేకొని కూడుండఁగ
భావించి వింతది చూడఁ బాడియవునా
పూవువలెఁ దొల్లి తాను పొందుగలదిగనక
ఆవేళఁ దా నొరసితే నంగవించకుందురా

రేకు: 1111-3 సామంతం సం: 21-057

పల్లవి: రమణునీకడ కిటు రావమ్మా
జమళిముచ్చటలు చవులై నిలిచె

చ. 1: కొత్తకోరికలు కొనలు సాగఁగా
చిత్తము నిండెను సిగ్గెల్లా
పొత్తులవలపులు పొగువోయఁగా
హత్తినపులకలు అంగము నిండె

చ. 2: తొక్కినతమకము దొంతుల నుండఁగ
ముక్కున నూర్పుల ముసరుకొనె
చిక్కనినవ్వులు సెలవులఁ దొలఁకఁగ
చొక్కపుచెమటలు సోనలు గురిసె

చ. 3: కందువైనరతి కాఁగిట నుండఁగ
విందులనెమ్మోము వికసించె
యిందె శ్రీవేంకటేశుఁడు గలసెను
అంది మోవితేనియలు దయివారె

రేకు: 1111-4 శుద్ధవసంతం సం: 21-058

పల్లవి: ఎన్ని లేవు నేరము లిఁకనేల
నన్ను నిన్ను నెంచుకొని నవ్వఁగదవమ్మా

చ. 1: ఆసపడినయప్పుడు అన్నియును చవులౌను
వేసరుకొన్నప్పుడైతే విసుపౌను
రాసికెక్కినవలపు రంటికి వచ్చు నిప్పుడు
యీసులెల్లఁ దీరె నిఁక నింటికి రావయ్యా

చ. 2: దగ్గరి యేకతమైతే తమకించు నెందుకైనా
సిగ్గువడి ఇందరిలో చింతపుట్టును
నిగ్గులవయోమదము నీడా నెండావలె నుండు
యెగ్గు లెంచఁబనిలేదు ఇంటికి రావయ్యా

చ. 3: కూడఁగఁ గూడఁగ నట్టె కోరికలు కొనసాగు
వీడనాడఁబోతేను వింతపుట్టును
యీడనే నన్ను శ్రీవేంకటేశ కాగిలించితివి
యేడకు నేఁటికిని మా ఇంటికి రావయ్యా

రేకు: 1111-5 బౌళి సం: 21-059

పల్లవి: ఎంగిలిపొందులు నీకు నింతప్రియమా
జంగిలివలపులేల సానఁబెట్టేవే

చ. 1: మంతనమునను నేము మాటలాడుకొనఁగాను
వింతదానవు నీవేల వినవచ్చేవే
బంతి నాతఁడును నేను పాలకూ ళ్లారగించగా
అంతట నుండి నీవేల అట్టె చూచేవే

చ. 2: సారెకు నేమిద్దరము సన్నలు సేసుకొనఁగ
తారుకాణ నీవేల అర్థాలు చెప్పేవే
నారువోసినట్టు నేము నవ్వులిట్టె నవ్వుకోఁగా
దూరుగాను నీవేఁటికి తోడు నవ్వేవే

చ. 3: ఇక్కువల శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగాను
గక్కన వాకిట నేల కాచుకుండేవే
నిక్కమై నే మిద్దరము నివ్వెరగుతో నుండఁగ
వొక్కటై కూడితివి నీవును మాతోనే

రేకు: 1111-6 పాడి సం: 21-060

పల్లవి: అప్పుడు మనసువచ్చు నన్నిటా నీకు
చెప్పరానిమాటలకు చెవియొగ్గేనయ్యా

చ. 1: యేతులకు నీవు నన్ను ఇటు నటుఁ జెనకఁగా
కాతరాన నే నిన్నుఁ గాదందునా
వాతులు మోవఁగ నీకు వలపులు పొంగఁగాను
పోతరించి ఇచ్చకాల పూవుగట్టేనయ్యా

చ. 2: నవ్వులకు నీవు నన్ను నయములఁ దిట్టఁగాను
రవ్వలుగా నే నప్పటి రాఁపుసేతునా
మువ్వంక జవ్వనము మొలకలువెళ్లఁగాను
నివ్వటిల్లఁ జెమటల నీరుగట్టేనయ్యా

చ. 3: చనవు చేసుక నన్ను సమ్మతించఁ గూడగాను
గునిసి వేరే నిన్నుఁ గొసరుదునా
తనివి శ్రీవేంకటేశ తమకపువిందులకు
చనవులనే వుపచారము చెప్పేనయ్యా

రేకు: 1112-1 ధన్నాసి సం: 21-061
పల్లవి: ఇప్పుడిట్టె వింటిమి నీవేల నవ్వేవు
చెప్పితేను దోసమా సిగ్గువడనేఁటికి
చ. 1: అంగన విచ్చేసి నేఁడు ఆయమైననీమోవి
యెంగిలిసేసినదట ఇది నిజమా
కుంగకుండేయటు వంటి కుచముల కొనలను
అంగవించి వొత్తెనట అది నిజమా
చ. 2: వొక్కమంచముపై నుండి వొడఁబడఁజెప్పి నీ-
యిక్కువ లంటినదట యిది నిజమా
చక్కనితనపాదాలు సారె నీమై సోఁకించి
అక్కర దీరిచేనట అది నిజమా
చ. 3: నీవు నేనుఁ గూడుండఁగా నెమ్మది శ్రీవేంకటేశ
యీవేళఁ దా నున్నదట యిది నిజమా
వోవరిలో మిగిలినవూడిగాలెల్లాఁ జేసి
ఆవటించి మొక్కెనట అది నిజమా

రేకు:	1112-2 దేశాక్షి	సం:	21-062
పల్లవి:	నీవేల నన్ను నింత నేరమెంచేవు
మోవితేనియలు చూచి ముందే భ్రమసితి
చ. 1:	యేమిసేతు నను నీవు యేల యెగ్గువట్టేవు
నామేను చెమరించీ నవ్వఁబోతేను
కోమలపుమేనిదాన కొండుకపాయపుదాన
నీమీఁది మోహమున నేనింత అలసితి
చ. 2:	నాపంక గడమ యేది నన్నేల లోఁచి చూచేవు
చేవఁ బరవశమయ్యీ చెనకితేను
పూవువంటిమతిదాన భోగపురతులదాన
కావరించి నీకుఁగానే కాఁకలు రేఁగితిని
చ. 3:	నేనెంత నీవెంత నేఁడేల వేఁడుకొనేవు
కానుకగాఁ బులకించి గదిసితేను
అనుక శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
తానకమై నీకొరకు తమకమందింతిని

రేకు: 1112-3 ఆహిరి సం: 21-063

పల్లవి: మనలో నెక్కడి వీఁక మంకుఁదనాలు
చనవులు గలవారు చలపట్టరు

చ. 1: వొలిసినవారు తమవోరుపే నెరపుదురు
యెలమి నేమిసేసినా యెగ్గుపట్టరు
కలసినవారు లోలో కరఁగుదురు చిత్తాలు
కొలఁదిమీరివచ్చిన కోపగించరు

చ. 2: కూడినట్టివారు మంచిగుణములే నింతురు
వీడ నెంత ఆడినాను వేసారరు
వేడుకగలుగువారు వీడుదోడు లాడుదురు
పాడి దప్పి యించుకంటా పంతమాడరు

చ. 3: ననుపులుగలవారు నవ్వులే నవ్వుదురు
తనువులు సోఁకినాను తమకించరు
యెనసితిమి శ్రీవేంకటేశ మనమిద్దరము
ఘనులయినవారిట్లా గతి గూడుకొందురు

రేకు: 1112-4 వరాళి సం: 21-064

పల్లవి: అందుకేమి దోసమా అతనికి నీకు వేరా
సందడి నాతనిరతి సమ్మతించవే

చ. 1: మోహముగలుగువారు ముందువెనక లెంచరు
యీహల మొక్కెనంటా నీవేల లోఁగేవే
సాహసములూఁ జేతురు చనవులూఁ జెల్లింతురు
పోహణించి వలపుల భోగించవే

చ. 2: తమిగలిగినవారు దండనుండి పాయరు
కొమరెనంటానేల కొంకఁజూచేవే
జమళిఁ జొక్కుదురు ఇచ్చల నవ్వుదురు తాము
చెమట చిత్తడి తోడ చెలరేఁగవే

చ. 3: ఆయమెరిఁగినవారు అట్టె కాఁగిలింతురు
చేయివట్టెనంటానేల సిగ్గువడేవే
యీయెడ శ్రీవేంకటేశుఁ డిదె నిన్నుఁ గూడె నేఁడు
చాయలు సేసుక ఇట్టె చనవియ్యవే

రేకు: 1112-5 భైరవి సం: 21-065

పల్లవి: నమ్మితిమి నిన్నును నానారీతుల మేము
నెమ్మనపు మన్ననలు నీచేతి దిఁకను

చ. 1: మొక్కితిఁగా అల్లనాఁడే మోపులకొలఁదులు
మిక్కిలి యెంచుకో నీమీఁద నున్నవి
నిక్కి చూచితి నిందాఁకా నీకు నెదురై నేను
చిక్కినపుణ్యములు నీచేతిదే ఇఁకను

చ. 2: పంపితింగా కానికలు బండులకొలఁదులు
ముంపున బండారించి ముడుపైనది
సంపదల నీపేరు జపియించుకొంటా నుంటి
ఇంపులఁ గీర్తులు నీ కెక్కినవే ఇఁకను

చ. 3: చెప్పితిఁగా ప్రియములు సేనాసేనలు నేఁడు
కుప్పలుగా నీయందు గొనకొన్నవి
చిప్పులఁ గూడితి నిదె శ్రీవేంకటేశ్వర నిన్ను
చెప్పరానిమెచ్చులెల్లా చెల్లు నీకు నిఁకను

రేకు: 1112-6 శ్రీరాగం సం: 21-066

పల్లవి: ఏఁటికి అనుమానము లిద్దరును నిలుచుండి
కూటములు గూడితే మీగుణమే సుఖము

చ. 1: నేరుపు గలిగితేను నెపము లెంచకుండితే
ఆరితేరకుండినా మోహము సుఖము
బీరములు నెరపక ప్రియములే ఆడితేను
వారించరానియట్టివయసే సుఖము

చ. 2: యెరవులులేక మరి యియ్యకోళ్లే కలితేను
గొరబుగానియట్టిసిగ్గులే సుఖము
కరఁగినమనసులై కైవశము లయితేను
సిరులమించినయట్టి చెనకులే సుఖము

చ. 3: చనవులు మెరసితే జగడాలు దీరితేను
తవివోనిరతులే సంతతసుఖము
యెనసితిరి శ్రీవేంకటేశ మీరిద్దరును
ననుపులతోడిమీలో నగవులే సుఖము

రేకు: 1113-1 పాడి సం: 21-067

పల్లవి: అత్తగారు వచ్చుదాఁకా నణఁగుంటిని
యెత్తినకోపముతోడ యోమందునే

చ. 1: యేకతమాడినదాఁకా నిద్దరివేళ గాచుక
వాకునిష్ఠూర మాడక వాకిట నుంటి
మేకులన్నియుఁ జూచి మెచ్చులు మెచ్చుతా నుంటి
యీకడ మంచితనము లెందాఁకనే

చ. 2: నవ్వు ముగిసిన దాకా ననుపుసేసుక వుంటి
పవ్వళించుండఁగా నెగ్గుపట్టక వుంటి
పువ్వులు లోని కంపిత భోగించుమని యంటి
యెవ్వరిబుద్ధులు వినే దెందాఁకనే

చ. 3: తానే విచ్చేసినదాఁక ననుపుసేసుక వుంటి
ఆనెలఁత మొక్కఁగాను ఆవునంటిని
వూని శ్రీవెంకటేశుఁడు పొందె నింతలో నన్ను
యేనేరమి లేదు చల మెందాఁకనే

రేకు: 1113-2 బౌళి సం: 21-068

పల్లవి: చాలుఁజాలు నిఁకనేల సాదింపులు
మీలోనిదాన నేను మీరే నేను

చ. 1: కతలు నేరుచుఁ దాను కపటా లెరుఁగుఁ దాను
అతనితో నే మాటలాడఁగలనా
ఇతవరులైనవారు ఇచ్చకాలాడరే మీరు
మితిమీరితేఁజాలు మీరే నేను

చ. 2: తప్పులు లేవు దనకు తగవ రిన్నిటాఁ దాను
దెప్పరమై తనతోను దీకొనేనా
చెప్పరానిచుట్టాలు సేవలు సేయరే మీరు
మెప్పించితేఁ జాలు మీరే నేను

చ. 3: అన్నిటా జాణఁడు దాను అందాలకు వచ్చుఁ దాను
చన్నుల నొత్తితి నిఁక చలపట్టేనా
పున్నతి శ్రీవేంకటేశు నొనగూర్చితిరి మీరు
మిన్నక నవ్వఁగఁ దేరె మీరే నేను

రేకు: 1113-3 గౌళ సం: 21-069

పల్లవి: మేలే జాణతనాలు మిక్కిలి లాబగాఁడౌను
కీలు చెప్పఁబోటే నాపై కేలు చాఁచీనే

చ. 1: తగవులు చెప్పఁబోతే తమలోని మాటలకు
తగులనాడె నన్నుఁ దగునే తాను
మొగములు చూచి నేను మొక్కులు మొక్కఁగఁబోతే
చిగురుఁజేతులు వట్టి చెనకులు నించీనే

చ. 2: ఇతవులు సేయఁబోతే ఇద్దరునుఁ గూచుండి
రతులకుఁ బెనఁగీనే రాజసానను
మితిమీరి మెచ్చితేను మేనరికములు చూపి
తతి నేకతములకు దగ్గరఁ దీసీనే

చ. 3: తోడు గాచుకుండితేను తొడిఁబడఁ గాఁగిలించి
వేడుకఁ గూడెను శ్రీవేంకటేశుఁడు
పాడిపంతములతోడ పలుమారు నవ్వితేను
జాడల మమ్మిద్దరిని జంటలు సేసీనే

రేకు: 1113-4 ముఖారి సం: 21-070

పల్లవి: నాతో నేమి చెప్పేవు నమ్మించిన విభుఁడవు
చేతికి లోనయి పంపుసేయవలెఁగాక

చ. 1: చలముగల మగువ సాదించకేల మాను
అలిగినది దిట్టక అదేల మాను
పిలిపించుకొన్న యాపె బిగియక యేల మాను
చెలరేఁగి చనవెల్లాఁ జెల్లింతువుగాక

చ. 2: కన్నులు గలిగినాపె కడుఁజూడకేల మాను
అన్నిటా మించిన దాఁగ కదేల మాను
చన్నులుగట్టైనయాపె చలపట్టకేల మాను
యిన్నిటా నాపెకు లోనై యెనతువుగాక

చ. 3: కందువఁ గూడినయాపె కరఁగించకేల మాను
అందినాపె గో రంటించి కదేల మాను
ముందె శ్రీవేంకటేశ మొక్కక ఆపేల మాను
విందువలె మోవిచ్చు వెలతువుగాక

రేకు: 1113-5 వరాళి సం: 21-071

పల్లవి: తరుణి, నీతో వీఁడు తానేమనీనే
గెరసు దాఁటక మరి కిందుపడు టరుదా

చ. 1: నేరుపే వలెఁగాని నెలఁతకు, విభుఁడు
యేరీతి నీవు చెప్పినట్టెల్లాఁ జేయఁడా
గారవించవలెఁగాని, కనుసన్నలనె వారి-
తీరుకు దిద్దుకు లోనై తిరమవు టరుగా

చ. 2: అండ నుండవలెఁగాని ఆఁడుజాతికి; విభుఁడు
వుండనుండ యెందుకైనా వొడిఁగట్టడా
మెండుకొనవలెఁ గాని, మించి వారివలలకు
తండుమోఁడై చిక్కుకొని తలవంచు టరుదా

చ. 3: చేయి చాఁచవలెఁగాని శ్రీవేంకటేశుఁడు, నాకు
పాయపురతులఁ గూడి పంతమియ్యఁడా
యీాయెడ నన్ను నేలె యింతేసి కావలెగాని
దాయిదండై నాపాలిదైవమౌటరుదా

రేకు: 1113-6 ఆహిరి సం: 21-072

పల్లవి: ఆరమణి వుండఁగాను అంతేకాదా
బారలు చాఁచే వప్పటి పఇకొసరా నేను

చ. 1: నీసతి వెంట వచ్చిననెలతఁనంటానా
ఆసపడి జాణతనాలాడేవు నీవు
సేసవెట్టి పెండ్లాడిన చెలియనుఁ గూడితివి
బాసయిచ్చి చెనకేవు పయికొసరా నేను

చ. 2: నీ కాపెమాట చెప్పిననేస్తకతైనంటానా
కైకొన నాకు సన్నలు గావించేవు
లోకమెల్లా నెఱఁగఁగా లోనఁబెట్టుకొంటి వాపెఁ
బైకొని నాతో నవ్వేవు పఇకొసరా నేను

చ. 3: ప్రియరాలి వొద్ది తోడఁబెండ్లి కూఁతురనంటానా
నయమ్మై శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి
దయతో నాపె నేలి మంతనమాడితి విందాఁకా
భయము దీర్చితి విట్టె పయికొసరా నేను

రేకు: 1114-1 సౌరాష్ట్రం సం: 21-073

పల్లవి: మంచిదాయ దానికేమి మాటలు పోట్లయ్యీనా
పెంచి యెంతసేసినా నీపెద్దరిక మింతేకా

చ. 1: మెల్లనే నే మాటాడితే మించి ఇందరితోడాను
తెల్లమిగా నాడేవు తిట్టితినంటా
బల్లిదుఁడ వౌదువయ్య పని ఇందే కానవచ్చె
కల్లలాడేవా నీవు కలుగఁగఁబోలును

చ. 2: పూవులచెం డిచ్చితేను పూఁచి ఇందరితోడాను
వేవేలుగాఁ జెప్పేవు వేసితినంటా
దేవరవుగావా నీవు తెలిసె నిన్నియు మాకు
నీవల్ల నేరమున్నదా నిజము గాఁబోలును

చ. 3: పాదాలు సేవసేసితే పై పై నిందరితోడాను
గోదానఁ జెప్పేవు బెట్టి గుద్దితినంటా
యీదెస శ్రీవేంకటేశ యెనసితి వీఁక మీర
సాదవుగావా ఇవే చవులు గాఁబోలును

రేకు: 1114-2 ఆరబి సం: 21-074

పల్లవి: ఆ పెఱఁగదా నీయంతరంగము
చూపి చూపి అంతేసి చొప్పులెత్తవలెనా

చ. 1: సిగ్గువడ్డభావానకు చిఱునవ్వులే యెఱుక
యెగ్గులెంచనియందుకు ఇంపు లెఱిక
వొగ్గినరతులకును వూరకుండుటే యెఱుక
అగ్గలమై విచ్చి విచ్చి ఆనతియ్యవలెనా

చ. 2: చెప్పరాని మాటలకు చేసన్నలే యెఱుక
ముప్పిరివలపులకు మొక్కు లెఱుక
అప్పసమై ఆసలకు ఆయములంటు టెఱుక
అప్పటిని పేరుకొని ఆనతియ్యవలెనా

చ. 3: చేతికి లోనైనందుకు చెలరేఁగుటే యెఱుక
కాతరముగలందులకు ఘాత లెఱుక
యేతులశ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
ఆతలీతలిమాకెల్లా నానతియ్యవలెనా

రేకు: 1114-3 గౌళ సం: 21-075
పల్లవి: ఎప్పుడయ్యా ఆమేలు యెఱిఁగే నేను
కొప్పు దువ్వి నిన్ను జేకొనదా యింకా
చ. 1: కాలమెల్ల నాపె నీతో కన్నులారుచనే పట్టె
నాలి మాని కొంత్తైనా నవ్వదా యింకా
వేలఁ జూపి మగఁడంటా విట్టవీఁగనే పట్టె
చేలకొంగు గప్పి బుద్ది చెప్పదా యింకా
చ. 2: కొలువు సేయుచు నిన్నుఁ గూరిమి గొసరఁబట్టె
చలివాయ వలవులు చల్లదా యింకా
కలిమి మెఱసి నీకుఁ గానుక లియ్యనే పట్టె
ములువాఁడి కొనగోర మోపదా యింకా
చ. 3: చనవు మెరసి నీకు చవులుచూపనె పట్టె
చెనకి రతుల సేవసేయదా యింకా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
యెనసి మరీ నెలయించదా యింకా

రేకు: 1114-4 లలిత సం: 21-076

పల్లవి: నీ వొక్కటొక్కటే సేసి నెరసు లెంచేవుగాక
వోపలేని ఆపె మంచివోజదే కాదా

చ. 1: చిప్పిలుమాఁట లాడఁగా సిగ్గులువడీఁగాక
కప్పి నీ కెప్పుడు నూడిగము సేయదా
దప్పికి మోవడుగఁగాఁ దలవంచుకోనీఁగాక
ముప్పిరి నిందాఁక నీమోము చూడదా

చ. 2: పచ్చిగాం జెనకఁగా నప్పటి నొడ్డుకొనెఁగాక
కచ్చుపెట్టి నీపై బత్తి కలదే కాదా
రచ్చలోఁ బిలువఁగాను రమణి జంకించెఁగాక
యిచ్చకురాలు నీకు నెప్పుడుఁ గాదా

చ. 3: చేయివట్టి తియ్యఁగాను చెక్కు నిన్ను నొత్తెఁగాక
ఆయాలు నీవెఱిఁగిన ఆపె కాదా
యీాయెడ శ్రీవేంకటేశ యెనసితి వింతలోనె
పాయరాని వేడుకలపాలిదే కాదా

రేకు: 1114-5 శ్రీరాగం సం: 21-077

పల్లవి: నమ్మఁగలవార మింతే నాకు నీవిచ్చినబాస
యిమ్ములఁ జెలుల నీకు యేమి చెప్పే రిఁకను

చ. 1: నిలువెల్లా నిజమే నీవొళ్లిదే తగవు
తెలిసె నీగుణాలెల్ల తేటతెల్లమి
కలిగినసాజమే కల్లలాడేవా నీవు
బలువుఁడవు నీతోడి పంతములవారమా

చ. 2: నీ వాడినదు మాఁట నెరసు నీయందు లేదు
దేవరవనేరు నిన్ను దేవుళ్లెల్లా
చేవదేరేనడకలు చెల్లు నీకు నన్నియును
వేవేలు వచ్చెను నీతో విరసాలవారమా

చ. 3: నిన్నుఁ గాదన రెవ్వరు నీ వటువంటి వాడఁవా
విన్న కన్న వే నీవిద్యలెల్లాను
యిన్నిటా శ్రీవేంకటేశ యిదె నన్ను నేలితివి
మన్నించనేర్తువు నీతో మండాడేవారమా

రేకు: 1114-6 నాదనామక్రియ సం: 21-078

పల్లవి: నీకు నంకెవచ్చితే నీవు మానేవా
యేకడఁజూచినసరే యిద్దరికి నెపుడు

చ. 1: పతుల మోహింపించేది పంతములు మెరసేది
సతుల కెప్పుడు నివి సహజములే
రతికిఁ బెనఁగుదురు రాకుండితే జంకింతురు
హితవై కైకొంటగాక యేలయ్య కోపము

చ. 2: చలివాసి నవ్వేది సరసములాడేది
కలికికాంతలకుఁ గలగుణమే
పిలుతురు బిగుతురు ప్రియములు చెప్పుదురు
నెలకొని యిందుకుఁగా నీకేల చలము

చ. 3: మొక్కి మొక్కి కూడేది మోవి గంటిసేసేది
చక్కనిసతుల కివి చందములే
యెక్కువ శ్రీవేంకటేశ యిటు నీవే కూడితివి
మక్కళించి మక్కళించి మఱి యాల కొసరు

రేకు: 1115-1 కాంబోది సం: 21-079

పల్లవి: ఏఁటికిఁ బాట్లఁ బడే వేమే నీవు
కూటసాక్షులకే నీవు గురియైతివో

చ. 1: వొద్దనుం డాతనికిఁగా వొలపక్షమాడేవు
గద్దించేవు నీకుఁ గొంత గలదో పొందు
అద్దుక సన్నలుసేసి ఆతనిచే మొక్కించేవు
బుద్ధితో వలపులపొత్తు నీకు నబ్బెనో

చ. 2: పూరకైనాఁ బతికిఁగా వొడఁబరచవచ్చేవు
నేరము లేమైనను నిన్ను సోఁకేనో
తీరిచి ఆనేరములు తిద్ది తిద్ది చెప్పేవు
పోరచితనాన నీకు పూఁటలంటెనో

చ. 3: గక్కన శ్రీవేంకటేశుఁ గాఁగిలింపించేవు నన్ను
చక్కనిరతులు నీకుఁ జవిపుట్టేనో
చొక్కేవు ఆకుమడిచి సోఁక నీవు అందిచ్చి
నిక్కి నిక్కి సంతోసాలు నీమీఁద జారెనో

రేకు: 1115-2 శ్రీరాగం సం: 21-080

పల్లవి: నావల నింతే శాయ నాథుఁడ నీవంకఁ గాదు
చేవలుదేరి తేరి చిగురాయను

చ. 1: తెగనాడఁజాలక తేరి యిచ్చలాడఁగాను
పగటునీవోజలెల్లాఁ బలచనాయ
నగి నగి నీతోను ననుపు నటించఁగాను
అగడై కరుకుపడె అదిగో నీచిత్తము

చ. 2: వూరకే మొగమోట నొదిగి నే నుండఁగాను
కూరిమినవ్వులు పైకొసరాయను
నీరువంకతుంగవలె నిన్ను నిట్టె భోగించఁగా
సారపుతరితీపులు చప్పనాయను

చ. 3: కందువకాఁగిట నిన్ను కడుదిద్దకుండఁగాను
విందుల వంటి నీరతులు వింతలాయను
అందపు శ్రీవేంకటేశ అంతలో నన్నుఁ గూడితి
ముందువెనకలెల్లాను ముదమాయను

రేకు: 1115-3 దేసాళం సం: 21-081

పల్లవి: ఇంతేసిమతకాలు నే నెఱఁగనివా
పొంతనుండి నవ్వేవు పొద్దువోదా నీకు

చ. 1: తారుకాణ లంతేనేల తగవు నడపరాదా
గారాపునీవెఱఁగనికల్ల వున్నదా
కూరిమిసతులమూఁక కూరిచి తలవంచేవు
పోరులేల పెట్టేవు పొద్దువోదా నీకు

చ. 2: వొడఁబరచఁగనేల వూరకే వుండఁగరాదా
తడవితిమా నీ వింతయు నేరవా
కడగడ లటు దొక్కి కమ్మి నన్ను వేఁడుకొంటాఁ
బుడికేవు నన్నునీవు పొద్దువోదా నీకు

చ. 3: నివ్వెర గందఁగనేల నిచ్చలాన నుండరాదా
జవ్వనపునాచేఁత నీసలిగె కాదా
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పువ్వులనేల వేసేవు పొద్దువోదా నీకు

రేకు: 1115-4 సామంతం సం: 21-082

పల్లవి: ఎందరు లేరు నీకు నెగసక్యాలు సేయఁగ
మందలిఁచే ఆడనుండే మన్నించవయ్యా

చ. 1: మొక్కలపుచేఁతలకు మొదలివాఁడవు నీవు
తక్కరివిద్యలకెల్లా దాఁపిరమవు
నెక్కొని చయ్యాటాలకు నేమా నీకు నెదురు
మక్కళించి మొక్కేము మన్నించవయ్యా

చ. 2: తీపులు వుట్టించి పొంద దేవర విన్నిటాను
రాఁపుచేసి నవ్వు నవ్వ రాజవు నీవు
యీపనులకెల్లా నీతో నియ్యకొనఁగలమా
మాపు రేపు సేవసేసే మన్నించవయ్యా

చ. 3: వట్టివలపులు రేఁచ వగకాఁడ వన్నిటాను
పట్టినచలములకు బలువాఁడవు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మట్టులేనివేసాలేల మన్నించవయ్యా

రేకు: 1115-5 లలిత సం: 21-083

పల్లవి: నీవే ఇంత సేయఁగాను నేఁ డిదిగో బాలకృష్ణ
వావులు యెవ్వరికైనా వాడలోన నున్నవా

చ. 1: చలివాసె గొల్లెతలు సారె నిన్ను నెత్తుకోఁగా
వొలుగులువారె మోహ మూఁచి పాడఁగా
పలుకులకొంకు దీరె పక్కున నిన్నుఁ దిట్టఁగా
బలుమొగలకు నాండ్లు పంపుసేతురా

చ. 2: వింత దేరెఁ గొమరెలు వీదుల నిన్నాడించఁగా
సంతలాయ నిండ్లు నీసంగాతాలను
జంతలైరి లోలోనే సారె నిన్ను ముద్దాడఁగా
కొంతయినా నత్తలకు కోటరాలు సేతురా

చ. 3: సిగ్గెడలెఁ గన్నెలు నీచెలుములు సేయఁగాను
నిగ్గులఁ గళలు మించె నీతో నవ్వఁగా
అగ్గమై శ్రీవేంకటాద్రి నందరినిఁ గూడితివి
వొగ్గి చుట్టాలలోనెల్లా వోజలు నేరుతురా

రేకు: 1115-6 గౌళ సం: 21-084

పల్లవి: ఆతఁడే నన్నుందుకుఁగా అట్టె కూరిమి గొసరీ
యీతలనాతల నీవే యెడమాఁట లాడేవా

చ. 1: మాట మాటగా విభుని మంతనాన నాడుకొంటే
చీటికిమాటికిఁ బోయి చెప్పుదురటే
నీటున నాతనికి నే నీవంటిదానసేకానా
యేఁటికే నీవొకతెవే యితవరివటవే

చ. 2: అక్కవంటా నీతో నాతనిగుట్టు చెప్పితే
కక్కసించి నీవు తారుకాణింతురా
చక్కనిఇద్దరము సరివారమే కామా
వెక్కసాన నాకంటె విశ్వాసివా

చ. 3: నిగ్గులశ్రీవేంకటేశునేరుపు నీతో మెచ్చితే
సిగ్గువడ నెఱుకలు సేసుకొందురా
అగ్గమై నిన్నుఁ గూడినట్టె నన్నుఁ గూడితేను
వెగ్గళించేవు నీవంటివేడుకే నాకును

రేకు: 1116-1 అమరసింధు సం: 21-085

పల్లవి: చలువకు వేఁడికి సంగతయ్యీనా
నెలఁతలఁ గంటే నిట్టే నీ వేమి సేతువు

చ. 1: పెక్కుమారులు నేనైతే ప్రియములు చెప్పఁగాను
పక్కన నీవాడేవు పాడిపంతాలు
వక్కణతో వేఁడుకొనేవారిఁ గంటే బిగుతురు
నిక్కినవారిసాజాలు నీ వేమి సేతువు

చ. 2: ననువుగా నే నీతో నవ్వు లిట్టే నవ్వఁగాను
చనవిచ్చి నీవైతే జంకింతువు
వొనరినవారిఁ గంటే వొత్తుకొత్తుక వత్తురు
నినుపై లోకులజాడే నీ వేమిసేతువు

చ. 3: కందువ నే నిన్నుఁ గూడి కాఁగిలించుకోఁగాను
చెంది నీవు మోవి గంటిసేయఁజూచేవు
ముందే శ్రీవేంకటేశ్వర మొక్కితే దీవింతురు
నిందలేని వారినేర్పు నీ వేమి సేతువు

రేకు: 1116-2 వరాళి సం: 21-086

పల్లవి: కూచుండవే ఇంకా వట్టిగట్టు లేఁటికి
వాచవులు మరిగిన వలపులు మానీనా

చ. 1: చనుఁగవ గప్పకువే సకియా మన-
మనసులలోనికి మఱఁగున్నదా
తనిసి నీనవ్వేల దాఁచేవే
కనుగొన నెమ్మోముకళలు దాగీనా

చ. 2: మాటలేల మొఱఁగేవే మగువా మన-
మూఁటల ఆసలలోన మొఱఁగున్నదా
చీటికిమాఁటికి నేల చేయి దీసేవే
కూటపురతిఁ జేయి దీసుకొనవచ్చునటవే

చ. 3: కూడితివేల నించేవే గుఱుతులు మన-
కోడె వయసులకును గుటియున్నదా
యీడుగల శ్రీవేంకటేశుఁడఁ గదే
యీడుజోడు మనకంటే నిఁక మఱి పున్నదా

రేకు: 1116-3 మాళవిగౌళ సం: 21-087

పల్లవి: ఇంతులు నీకు బాతా యెంతసేసేవు
దొంతిఁబెట్టేవు ప్రియము దొడ్డికట్టుదానవా

చ. 1: నెట్టుకొన్నలకిమమ్మ నీవురము పై నుండఁగా
పట్టేవు మాచన్నులు పై కొసరా
అట్టడితనాన మీఁదక నీతో రానన్నాను
పెట్టేవు నీసొమ్మెల్లా పెట్టెవంటిదానవా

చ. 2: చింతదీరఁ దొళశమ్మ శిరసుపై నుండఁగాను
వంతుకు నన్నులమేవు వడ్డిబేరమా
వింతలుగా నిన్నంత వేసరించఁజాలనన్నా
పంతానఁ దమ్మ వెట్టేవు పడిగెపుదానవా

చ. 3: బూమిదేవులమ్మ నీబుజముపై నుండఁగాను
వేమారు నాతో నవ్వేవు వింతొకచవే
ఆమని శ్రీవేంకటేశ ఆయాలు సోఁకీనన్నా
కామించి కూడితివి నీకాఁపురపుదానవా

రేకు: 1116-4 రామక్రియ సం: 21-088

పల్లవి: ఎదిరి నెఱఁగవు నీయితవే చూచేవుగాని
యెదఁబెట్టున్నారము యేము నేము నేము

చ. 1: గడుసునిన్నుఁ జూచితే కాఁకరేఁగీ నాకైతే
నడుమ నీవూరకే నవ్వేవు గాని
పుడికినందుమీఁదట పుప్పలు చల్లినట్టాయ
యెడనెడ నీచేఁతల కేమనేము నేము

చ. 2: కుచ్చితపునిన్నుఁ జేరుకొనఁ గొలుపదు నాకు
అచ్చువలె నీవు మాటలాడేవుగాని
ముచ్చటదీర నీవేళ మోము గప్పినట్లాయ
హెచ్చిననీసుద్దులకు నేమనేము నేము

చ. 3: దిమ్మరిని న్నంటుకొన సమ్మతించదు నాకైతే
లెమ్మని నీవే కాఁగిలించేవుగాని
చిమ్ముచు శ్రీవేంకటేశ చేఁదే తీపైనట్లాయ
యెమ్మెలనీమన్ననకు యేమనేము నేము

రేకు: 1116-5 గుజ్జరి సం: 21-089

పల్లవి: ఎక్కి నంతలోననే యేనిగ గుజ్జా
అక్కరై మాయింటికి రాకాతఁ డట్టె వుండీనా

చ. 1: ఆతనిచనవు వట్టు కట్టె విఱ్ఱవీఁగేవు
యేతులకు వాఁడికత్తులేల మింగేవే
కాతరాన నీకింత కపటాలు నెరపితే
ఆతల నీకేకాక అండవారి కేమే

చ. 2: రమణుఁడు నవ్వెనంటా రవ్వశాయ వచ్చేవు
తిమిరి యిసుక మీఁదై తిరుగకువే
భ్రమసి నీకాతఁడు బాస లెంత ఇచ్చినాను
అమర బతుకవే నే మాండ్లము గామా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెందెనని మెరసేవు
దోవఁ బెసరు విత్తితే తుదకెక్కీనా
కావరిం చాతనిమేను కాఁగిటఁ జిక్కితే
యీవల మారతిఁ దొల్లి టెంగిలేకదే

రేకు: 1116-6 తెలుఁగుఁగాంబోది సం: 21-090

పల్లవి: చాలునయ్యా వేయిటపై జవ్వాదికొమ్ము
యేలిననీపై నుండనియ్యవయ్యా మాట

చ. 1: కూరిమి చూపి నిన్నుఁ గొసరఁగఁ గొసరఁగ
యేరీతి నుండునో చిత్త మేవేళను
బీరపువారము నేము బిరుదువాఁడవు నీవు
తారుకాణించఁగఁబోతే దైలువారుఁ గోపము

చ. 2: ప్రేమతోడుత నిన్నుఁ బిలువఁగఁ బిలువఁగ
యేమని వేసరుదువో యేవేళను
నేమపువారము నేము నీయిచ్చవాఁడవు నీవు
చేముట్టి పెనఁగఁబోతే చిమ్మిరేఁగుఁ జలము

చ. 3: తతిగొని నిన్ను రతిఁ దగులఁగఁ దగులఁగ
యితవై వుండునో కాదో యేవేళను
సతి నేను శ్రీవేంకటపతివి నాకు నీవు
సతమై యిట్టె కూడితే చక్కనౌను పనులు

రేకు: 1117-1 హిందోళం సం: 21-091

పల్లవి: పెద్దలు మీ రంతేసి పెనఁగనేల
వుద్దండపునీచేతలు వుట్టిఁబెట్టవయ్యా

చ. 1: మోవిపండు గానుకిచ్చె మొక్కె నీకుఁ జేతులను
సేవ లింకానేమి యాపె సేసునయ్యా
కావిరించి దగ్గరితే కాలు దాఁకుఁ జేయి దాఁకు
దేవరవంటినీ కంతేసి తగదయ్యా

చ. 2: గోరంటపూ వందిఇచ్చె కొలువున నిలుచుండె
పేరి యిచ్చకము లేమి పెంచునయ్యా
వేరెమాట లాడఁబోతే వెంగెమౌనో వెగటౌనో
ఆరీతి దొరవు నీ కవి చెల్లవయ్యా

చ. 3: ఆరతిచ్చె నానాంగల నన్నిటికి సమ్మతించె
కూరిమి నిన్నెట్లాను కొసరునయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యింపు లేదో సొంపు లేదో
ఆరితేరినట్టినీకు ఆస మానదయ్యా

రేకు: 1117-2 హిజ్జిజి సం: 21-092

పల్లవి: మాపుదాఁకా రేపకాడ మాటకు మాటాడఁగాను
యేపునఁ దెగనిపనికేల పెట్టే వాన

చ. 1: నవ్వి నవ్వి మానేవు నడుమ నడుమ నీవు
జవ్వని యెవ్వతేమైనా సన్న సేసెనా
వువ్విళ్లూర నీనిజము వొరసి చూచే నింతే
యెవ్వరిందుకు గురయ్యే రేల పెట్టే వాన

చ. 2: చెప్పి చెప్పి కొంకేవు సిగ్గులువడుతా నీవు
వుప్పటించ నీడ నెవ్వరున్నారు నీకు
రెప్పలెత్తి చూచి నిన్ను రేఁచి వెదకే నింతే
యెప్పటివాఁడవే నీవు యేల పెట్టే వాన

చ. 3: ముట్టి ముట్టి చూచేవు మొరఁగి నాకుచములు
యిట్టె యెవ్వతెవైనా యీడువచ్చెనా
నెట్టన శ్రీవేంకటేశ నిరతి మెచ్చితి నింతే
యెట్టకేల కైనపనికేల పెట్టే వాన

రేకు: 1117-3 రామక్రియ సం: 21-093

పల్లవి: భామలతోఁ బోరఁగాను ఫలమేమి నీకు వచ్చె
యేమిటికిఁ గాతరించే వింతలోనే నీవు

చ. 1: సిగ్గులే మూలధనము చెలులకెల్లా నీవు
బగ్గననేల పట్టేవు పయ్యదకొంగు
నిగ్గులమోనములే నీఁడురాజ్యపదవులు
అగ్గలమై యాల మాటలాడిచేవు నీవు

చ. 2: పంతమే పెట్టనికోట పడఁతుల కెల్లాను
వంతుకునేల తీసేవు వారియిండ్లకు
చెంతల గుట్టునవ్వులే సేయనిసింగారాలు
చెంతనుండి యేల గరిసించేవు నీవు

చ. 3: చలమే ముందరిపొఁజు సతులకునెల్లాను
చెలఁగి యేల ప్రియముచెప్పేవు నీవు
బలిమి శ్రీవేంకటేశ బాసయిచ్చి కూడితివి
పెలుచుఁగుచములేల పిసికేవు నీవు

రేకు: 1117-4 సామంతం సం: 21-094

పల్లవి: ఏకటాన నీవు నీవూ నెరిగినపను లివి
యీకడ మాతోనేల యెరుక సేసేవు

చ. 1: ప్రేమమున నాపె నిన్నుఁ బేరుకొని తిట్టితేను
నామోము చూచి యేల నవ్వేవు నీవు
చేముంచి యాపె నిన్నుఁ జెనకి పైకొంటేను
దీమసాన నేఁటి కానతిచ్చేవు నీవు

చ. 2: చనవున నాపె నిన్ను సారెకు జంకించితేను
పెనఁగి సాకిరి యేల పెట్టేవు నన్ను
మనసిచ్చి యాపె నీతో మందటలాడితేను
చొనిపి నన్నేల నీవు చుట్టుకొనేవు

చ. 3: గారవించి యాపె నిన్నుఁ గాఁగిలించుకొంటేను
చేరి నే నుందాననంటా సిగ్గువడేవు
యీరీతి శ్రీవేంకటేశ యాపె నిన్నుఁ గూడె నేఁడు
మీరతులు నాతోనేల మెచ్చవచ్చేవు

రేకు: 1117-5 సాళంగం సం: 21-095

పల్లవి: అందరిని యీమాఁటే అడుగవయ్యా
కందువలు నీకునీకే కానరాదుగానీ

చ. 1: వనిత యిప్పుడే నీవద్దికి రాఁగానే
మనసు నీ కొక్కటాయ మాఁటలేఁటికి
చెనకి నే మిందాఁకాఁ జేసినచేఁతలకెల్లా
వొనరి యిటువలెనే వుండుగా నీమొగము

చ. 2: చాఁచి చాఁచి నీ కాపె సారె విడెమియ్యఁగానే
పూఁచినపూఁవు లీడేరె బొంకులేఁటికి
తూఁచి వలపు నేమెల్లా తోడగడ్డెము వేయఁగా
పాఁచి సంతోసాలిట్లాఁ బ్రబలెనా నీకు

చ. 3: గక్కన నీదేవు లిట్టె కాఁగిలించుకొనఁగానే
చక్కనాయఁ బనులెల్లా సటలేఁటికి
యిక్కువ శ్రీవేంకటేశ యిద్దరూఁ గూడఁగాఁగాక
చిక్కనినవ్వు లిట్లాఁ జేకూడెనా

రేకు: 1117-6 శంకరాభరణం సం: 21-096

పల్లవి: ఇద్దరును గూడితిరి యిక నెన్నఁడు
సుద్దుల మామొగమేమి చూచేరయ్యా

చ. 1: సతి చెమటకాఁగిలే చక్కనికేళాకూళి
యితవైనవలపులే యీఁతా మోఁతా
మతకరిసిగ్గులే మంచినీటిచల్లులాట
తతిగొని మీరు వంసతములాడరయ్యా

చ. 2: చెలిగోరిచెనుకులే చిమ్మనఁగోవిచిమ్ములు
కులుకునవ్వులే తలకొన్న తెప్పలు
పిలుపులమాఁటలే పెట్టినట్టివొలలు
కిలకిల నవ్వి జలకేలి సేయరయ్యా

చ. 3: ముగుడచన్నులు తమ్మి మొగ్గలవేట్లు నీకు
తగినకూటములే పంతపుముంపులు
అగడై శ్రీవేంకటేశ ఆయాలంటి కూడితిరి
నిగిడిన పెండ్లితోడ నీళ్లాడరయ్యా

రేకు: 1118-1 నాగవరాళి సం: 21-097

పల్లవి: చెల్లదా ఆతనికేమి సేసినంతాను
వెల్లవిరైనపనికి వెంగె మింత వలెనా

చ. 1: నగనేలె నీకును నాయ మాతఁడు చెప్పితే
తగవులో నేమైనాఁ దప్పులుండెనా
మగువ లబ్బితేఁజాలు మానలేఁ డింతేకాక
పొగరుఁబదారువేలపూఁతకోక గాఁడా

చ. 2: తప్పక చూడనేలే తానే సాకిరి చెప్పఁగా
అప్పటి నొలపక్షము లందుండెనా
కప్పురగందులెడల కక్కూరితిపడుఁగాక
కప్పి గొల్లెతలరొంపికంబము దాఁ గాఁడా

చ. 3: వెరవుతో నిన్నును శ్రీవేంకటేశుఁడు గూడఁగా
సరవు లందేమైనాఁ జాలకుండెనా
తరుణులైతేఁజాలు తగులు మానఁగలేఁడు
ఇరవై మధురలోఁ బెక్కిండ్లవిందు గాఁడా

రేకు: 1118-2 పాడి సం: 21-098

పల్లవి: మఱి ఇంతేకదవయ్య మనలో మాట
తఱితో సరివచ్చె మీతగవులు చూచి

చ. 1: కలసెఁగా ఆపె నిన్ను కాఁగిటిరతులనెల్లా
తెలిసెఁగా నీమహిమ తెల్లమిగాను
వలసలినట్లనయ్యీ వారివారి భాగ్యాలు
చలివాసె మాకైతే మీసరితలు చూచి

చ. 2: మెచ్చెగా ఆపె నీమేలము లన్నిటికిని
యిచ్చితివిగా చనవు యిందరిలోన
విచ్చనవిడాయ నిఁక వెలఁదులవలపులు
ముచ్చట వాసె మాను నీ మోహములు చూచి

చ. 3: పండెఁగా ఆపెతపము పక్కన నీకూటమిని
నిండెఁగా సంతోసాలు నీమతిలోన
అండగా శ్రీవేంకటేశ అందరి కివే చాళ్లు
దండేయ మాకు మీలోనితరితీపు చూచి

రేకు: 1118-3 బౌళి సం: 21-099

పల్లవి: ఒక్కమనసున నీవొద్ద నిట్టె వున్నారము
నిక్కేము మాసేవలెల్లా నీమీఁద నుండఁగా

చ. 1: తత్తరము నేమిటికి తాలిమీ నేమిటికి
హత్తిన కూరిమిగలఆఁడువారికి
బత్తి చెప్పుకోనేల పాసి కోపగించనేల
నిత్తెమై మాభారమెల్లా నీమీఁద నుండఁగా

చ. 2: చేరి పైకొన నేఁటికి సిగ్గువడనేమిటికి
వూరకే యిచ్చకురాండ్లై వుండేవారికి
కోరి కొంగువట్టనేల కొంచి కొంచి అలయనేల
నేరుపులమాచేఁతలు నీమీఁద నుండఁగా

చ. 3: మెచ్చుమెచ్చ నేమిటికి మేలమాడ నేమిటికి
హెచ్చి నిన్నుఁ గూడినట్టి ఇంటివారికి
రచ్చలశ్రీవేంకటేశ రంతులేల రాఁపులేల
నిచ్చ నీవిచ్చనబాస నీమీఁద నుండఁగా

రేకు: 1118-4 సాళంగనాట సం: 21-100

పల్లవి: ఎక్కడ నున్నా నీకు నేమాయను
పక్కన నవే యిందు భావించుకోవయ్యా

చ. 1: అతివలుండినచోటు అదె నీకు రేపల్లె
అతిశయపువలపు యమునానది
రతులకాఁగిళ్లే రాసక్రీడలు నీకు
తతి వచ్చె నిందు నవి తలఁచుకోవయ్యా

చ. 2: కొమ్మలపోఁకముడులు కొలనిదరికోకలు
కుమ్మరించు మోవితేనె గొల్లదోమటి
పమ్మి వారితో నవ్వులు పాలుఁబెరుగువుట్లు
తమ్మిచూపులే రేతిరి తలఁచుకోవయ్యా

చ. 3: చెలులజవ్వనమెల్లా చేరువబృందావనము
కులుకుఁజన్నులు పెక్కుగోవర్ధనాలు
కలసితి మాచెలిని గక్కన శ్రీవేంకటేశ
తలఁపున నిఁకనిన్నిఁ దలఁచుకోవయ్యా

రేకు: 1118-5 ముఖారి సం: 21-101

పల్లవి: చవి చార మెఱఁగవా జాణనందువు
యివి యెల్ల నాపెకు నీవిచ్చినచనవులే

చ. 1: చెప్పరాని మాటలకు చెవులొగ్గే వేమయ్య్య
వొప్పులెల్లా చెలినగవుల నున్నవి
కప్పురపునోఁటిమాఁట కమ్మి బరణిఁ బెట్టేవు
యెప్పు డాపె యేమనిన నేమాయ నీకు

చ. 2: సేయరాని చేఁతలకు సిగ్గవడే వేమయ్య్య
తోయరాదు అంగనచేతుల నున్నవి
పాయపుఁగళలకును బారలు చాఁచేవు నీవు
యీయెడ నేమిసేసిన నేమాయ నీకు

చ. 3: పట్టరాని వయసులు పచ్చిసేసే వేమయ్య్యా
నెట్టనఁ గాఁగిట నింతి నిన్నుఁ గూడెను
ముట్టితే శ్రీవేంకటేశ మోవితేనెఁ గొలిచేవు
యిట్టివి; మీసరసాల కేమాయ నీకు

రేకు: 1118-6 సౌరాష్ట్రం సం: 21-102

పల్లవి: ఏమనేము నిన్ను నీఁక నింతా మేలే
వేమారుఁ జవిగొంటేను వేమే తీపు

చ. 1: యెమ్మెలకు నిజమేది యెడమాట గురియేది
ముమ్మారు నూఁకొంటే ములుకే వంగ
సమ్మతించుకొంటి నేను చనవిచ్చితివి నీవు
పమ్మి పేరఁబెట్టితేను పాలే పెరుగు

చ. 2: ఆసలకుఁ దనివేది ఆనలకు మితియేది
వేసర కడుగిడితే వెనకే ముందు
సేసవెట్టితిని నేను చేతికి లోనైతివి
చేసూటి ముదిరితేను చిగురే చేఁగ

చ. 3: కూటమికి అడ్డమేది కొసరులకు లెక్కేది
గాఁటమై గోర గీరితే కాలువే యేరు
యీటువెట్టి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
నీటునఁ దెలుసుకొంటే నీవే నేను

రేకు: 1119-1 రీతిగౌళ సం: 21-103

పల్లవి: విచ్చి చెప్పరాదు వింతలు యీభావాలు
రచ్చలకెక్కెను అంత రవ్వసేయనేఁటికి

చ. 1: వలపులలోనివే వడిగొన్న యాసలెల్ల
సెలవులలోనివే సిగ్గులెల్లాను
పిలుపులలోనివే ప్రియములుగలవెల్లా
కులికి కులికి యేలే కొసరేవు పతిని

చ. 2: చనవులలోనివే సరసములెల్లాను
ననుపులలోనివే నయములెల్లా
మనసులలోనివే మచ్చికలుగలవెల్లా
వొనర నింకానేలే వొరసేవు పతిని

చ. 3: నమ్మికలలోనివే నానాఁటివొడఁబాటు
వుమ్మడివయసులోనే వొద్దికలెల్లా
నెమ్మదిఁ గూడె నతఁడు నిన్ను నట్టె బుజ్జగించి
చిమ్మకువే గోళ్లను శ్రీవేంకటపతిని

రేకు: 1119-2 గుండక్రియ సం: 21-104

పల్లవి: నేరుపరి వౌదువే నెలఁత నీ విన్నిటాను
యీరీతుల రమణుని నెంత సేసేవే

చ. 1: పనిలేనిమాటలను బయలు పందిలివెట్టి
మనసేమి సోదించేవే మగనిని
తవివోనిచూపులను తగులువిరులు వేసి
యెనసి పందేలాడేది యెందాఁకనే

చ. 2: వాడికనవ్వులు చల్లి వలపువలువ దీసి
యేడదాఁకా మోసపుచ్చే వింత యేఁటికే
కోడెవయసుగరిడీఁ గొంకుదీర సాముసేసి
మేడెపురతుల నెంత మీరేవే యిపుడు

చ. 3: వాములైన ప్రియములవడగండ్ల గుళ్లు గట్టి
గోమున శ్రీవేంకటేశుఁ గూడితి వవునే
దోమటి చేఁతలనే దొమ్మిసేసి మొక్కులాడి
దీములొడ్డి వేఁటలాడి తిరమైతివే

రేకు: 1119-3 సౌరాష్ట్రం సం: 21-105

పల్లవి: ఇంతటి మీఁదటేపను లెఱఁగమయ్యా
సంతకూటములే కడుఁజవులాయనయ్యా

చ. 1: వొడఁబాటుమాటలు వుప్పనౌనో చప్పనౌనో
వెడఁగునీమాటలు వినేమయ్యా
తడఁబడి నీసుద్దులు దైలువారీఁ జెవులను
అడఁచరాని నవ్వులు అగ్గువాయనయ్యా

చ. 2: సంగడి మాచెనకులు చల్లనవునో వేఁడౌనో
వుంగిటినీచెనకులు కోరిచేమయ్యా
చెంగటినీనేరుపులు చిత్తములోఁ బేరుకొనె
కుంగనినివ్వెరగులు కోటికొండలయ్యా

చ. 3: మచ్చికమావూడిగాలు మఱపౌనో తలఁపౌనో
కుచ్చి నీమన్నన లియ్యకొనెమయ్యా
తచ్చి శ్రీవేంకటేశ్వర తగ నన్నుయఁ గూడితివి
లచ్చన నీగుఱుతులు లాగవేగాలయ్యా

రేకు: 1119-4 పాడి సం: 21-106

పల్లవి: ఏఁటి మాట లాడీనే యెందాఁకా వీఁడు
నటున నేఁ దన కంత నేరుపేటిదాననా

చ. 1: కలయనికాఁకలను కడునెంత పొరలినా
వలపు వెంచవచ్చునా వనితలకు
నిలువునఁ దమకము నిండుక యెంతవుండినా
వెలినున్నసిగ్గులెల్లా విడువఁగవచ్చునా

చ. 2: రాయడిపడక యంతరాణివాసమై వుండినా
పాయము దాఁచవచ్చునా పడఁతులకు
యేయడఁ దనకు వాసు లెంతగలిగివుండినా
కాయముపైఁ గళలెల్లాఁ గప్పఁగవచ్చునా

చ. 3: అనిశము మీఁద మీఁద నతి రాజసమై వుండినా
మనసీకుండవచ్చునా మగువలకు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేఁడు
వెనకముందులు మరి వేరే యెంచవచ్చునా

రేకు: 1119-5 లలిత సం: 21-107

పల్లవి: కొమ్మలకు మనోభావకుఁ డందురు
సమ్మతించ మాకు దిష్టము చూపరాదా

చ. 1: మగువ కోరికలనే మనసునఁ బాలు దాగె
జిగి నీవెన్నేని లెక్కచెప్పవయ్యా
నగవులకప్పురము నంటున బేరాలాడె
వెగటులేక నీవు వెల దీర్చరాదా

చ. 2: జలజాక్షి జవ్వనము చన్నులఁ గుప్పలు వోసె
యెలమిఁ గోరుపా లందునేమయ్యా
కలికి కన్నులనే కలువలఁ బూజసేసె
ఫల మెంత ఇచ్చేవు పచరించరాదా

చ. 3: మానిని సిగ్గులనే మర్మములు విన్నడిగి
ఆనతిచ్చి మెచ్చులు నీవందవయ్యా
పూనిక శ్రీవేంకటేశ పొందులు మీకిట్టె అబ్బె
తేనెలమోవిమఱపు తెలియఁగరాదా

రేకు: 1119-6 మాళవిశ్రీ సం: 21-108

పల్లవి: కోరినట్టె వున్నవారు కొమ్మలు ముయ్యాడువారు
గారవపుగొల్లజాతి కలిగెఁగా నీ కిందుకే

చ. 1: మెరవడికత్తెలైన మెలుఁతలే నీకు బాఁతి
కరకరిఁబెట్టేటి కాంతలే బాఁతి
సరి నిన్నుఁబనిగొనేజారకాంతలే బాఁతి
గరిమ రేపల్లెనుఁ గలరుగా యిందుకే

చ. 2: జిడ్డువలె నంటుకొనేచెలులే నీకుఁ బ్రియము
వొడ్డారపుసతులే నీకొగిఁ బ్రియము
యెడ్డతనపుమాటల ఇంతులే నీకుఁ బ్రియము
దొడ్డిమంద లిందుకే దొరకెఁగా నీకును

చ. 3: తామే తేరకువచ్చినతరుణులు నీకు నింపు
కామించి సిగ్గులేని కాంత లింపు
యీమేర శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
ఆమని రాసక్రీడ లబ్బెఁగా నీకును

రేకు: 1120-1 కేదారగౌళ సం: 21-109

పల్లవి: మాపుదాఁకానేల జోలి మంచివాఁడవే నీవు
రాఁపుసేయకుండరాదా రామ గలసీని

చ. 1: నేరుపుల కెంతలేదు నీవు మాటాలాడేనంటే
మారుకొని వూఁకొనఁగ మాతరములా
మేరతోడివాఁడ వౌదు మెచ్చితిమి నిన్నుఁ దొల్లె
రారాదా యెందాఁక రమణి దిట్టీని

చ. 2: ననుపులకుఁ గడమా నవ్వు నీవు నవ్వేనంటే
ఘనము మరి పెంచఁగలమా నేము
ఘనుఁడవు నీ వౌదువు కడమ నీయం దెంచము
యెనయరాదా ఇంతి యెగ్గులువట్టీని

చ. 3: వేడుకలకు వెలితా వియ్యములందేనంటే
జాడతోడఁ గొసరేమా సారెకు నేము
కూడితివి వనితలను గొబ్బున శ్రీవేంకటేశ
తోడనే మోవియ్యరాదా తొయ్యలి వేఁడీని

రేకు: 1120-2 బౌళి సం: 21-110

పల్లవి: అందరిముందరా నింతఆగడాలు సేతురా
విందువంటినీరాకకు వేసరుకొనేనా

చ. 1: పెనఁగ నీతో నంత పెద్దరికమా నాకు
చెనకితే చెలులకు సిగ్గులు రావా
పనిమాలినపని బలుములు సేతురా
ఘనుఁడ యేకతమైతేఁ గాదనేనా

చ. 2: బిగియ నీతో నాకు బిరుదులపంతమా
మగువలు నవ్వితేను మాటకు రారా
తగవెంచి చూచుకోక తమకింతురా నీవు
మొగము చూచితే నీకు మొక్కకుంటీనా

చ. 3: జంకించ నీయెడకు సారె సారె సూడుఁ బాడా
మంకు గలిగించితే మారుకొనరా
అంకెల శ్రీవేంకటేశ ఆయమంటి కూడితివి
సుంకులనీరతులకు చొక్కకుంటినా

రేకు: 1120-3 తోండి సం: 21-111

పల్లవి: ఇదియే వేళవచ్చె నెచ్చరించితిమి నీకు
వుదుటుఁగోపాననేల వూరకున్న దానవే

చ. 1: వన్నెలెల్లా నీసొమ్ము వాసులెల్లా నీఇరవు
సన్నలు సేయఁజెల్లుసే సరసునితో
చన్నులు నీకు గొప్పలు చనవు నీకే కలదు
యెన్ని సేఁతలు చేసినా యియ్యకోలే పతికి

చ. 2: చక్కఁదనము నీరూపు జవ్వనము నీకు దాపు
అక్కరతో నవ్వఁజెల్లు నన్నిటా నేఁడు
చిక్కనిమాటలు నీవి చిమ్ముఁజూపు నీధనము
ఇక్కువ లెంతంటినాను ఇయ్యకోలె పతికి

చ. 3: పంతమే నీకు గుణము భావమే నీకు బలువు
చెంతల శ్రీవేంకటేశు సేవ సేయవే
యింతలో నాతఁడే నిన్ను నెనసె నీవు జాణవు
యెంతకెంత చొక్కించినాను యియ్యకోలే పతికి

రేకు: 1120-4 సాళంగం సం: 21-112

పల్లవి: బలిమిసేయఁగఁబోతే పాటివట్ట రెవ్వరును
తలఁపు సరివచ్చితే దగ్గరి రారాదా

చ. 1: నను పందరికి సరే నాకు నీకే పాలు గాదు
మనసు లెనసి మరి మరఁగేఁటికి
అనుమానము గలిగితే నందరి నడుగవయ్య
వనితలమాట విని వద్దికి రావయ్యా

చ. 2: తమి యిందరికిఁ గద్దు తగ మనలోనే రాదు
అమరఁ బైకొని మరి అడ్డమేఁటికి
భ్రమసితేఁగన వద్దిపడఁతుల విచారించు
క్రమమై వుంటేఁగాన పొంకానకు రావయ్యా

చ. 3: కూట మిందరికిఁ గద్దు గురుతు ఇద్దరికే కాదు
వాఁటముఁగా గలసియు వరుసేఁటికి
గాఁటపు శ్రీవేంకటేశ కాంతలకు సమ్మతమే
యీటుదొరశుండితేను ఇంకా రావయ్యా

రేకు: 1120-5 గౌళ సం: 21-113

పల్లవి: ఏమందుము నే మిందుకు యెదురుమాట
ఆమతకమెల్లా నాకు నానతియ్యవయ్యా

చ. 1: వొకమాట మీదఁబెట్టి వొకమాట లాడేవు
వెకలివై కొంతగొంత వేరే నవ్వేవు
మొకము చూచితేనే మోహములు చల్లేవు
యెకసక్కేలో నిజమో యెఱఁగరాదయ్యా

చ. 2: కొంత పరాకులుసేసి కొంగువట్టి తీసేవు
చెంతల దగ్గరి నీవే సిగ్గువడేవు
దొంతిఁ బెట్టి వలపులు దోమట్లు దొడికేవు
పంతానకో భక్తి గద్దో భావించరాదయ్యా

చ. 3: నయగారములు చూపి నన్ను నిట్టే కూడేవు
ప్రియములు చెప్పి రతిఁ బెదరేఁచేవు
నియతి శ్రీవేంకటేశ నీవే నన్ను మెచ్చేవు
దయనో తరితీపులకో తలఁచరాదయ్యా

రేకు: 1120-6 సావేరి సం: 21-114

పల్లవి: ఇంతే నేమెఱుఁగుదు మిద్దరికి సాకిరి
చెంతల మీకే తెలుసు చిత్తములో సుద్దులు

చ. 1: సింగారపుఁ గొప్పు వంగి చిమ్మిరేఁగేఁ దమకము
సంగతిగా నీవు చేయి చాఁచఁగాను
వుంగిటిగొని చెక్కుల నుమ్మగిలె బులకలు
చుంగుల కొనగోళ్లు సోఁకఁగాను

చ. 2: కప్పురపుమోవి వాడి కసరెత్తెఁ దేనెలు
దప్పిదేర మాటలాడి తగులఁగాను
కుప్పళించఁ జెమరించి గురిగాఁడెఁ జూపులు
వొప్పుగ నొకరొకరు వొకచోనే వుండగా

చ. 3: జవ్వనపుమే నుబ్బి చలిదీరె సిగ్గులు
రవ్వలుగాఁ గూడఁగాను దతివేళను
యివ్వల శ్రీవేంకటేశ యింతిరో మీ రెనయఁగా
నవ్వులు మామోములను ననిచీ మీయెదుట

రేకు: 1121-1 ఆహిరి సం: 21-115

పల్లవి: నీ వెందరికి నౌదువు నీపాపము
వావులఁ గూడవేయఁగా వాములాయ వలపు

చ. 1: వంతులకు నొకమాట వాసులకు నొకమాట
కొంతగొంత గొసరేరు కొమ్మలు నిన్ను
బంతివిందులు చెప్పేరు పాలిండ్లు చూపి చూపి
సంతకూటములలోని చవులాయ వలపు

చ. 2: కలువల నొకవాటు కప్పురాన నొకవాటు
చలములు సాదించేరు సతులు నిన్ను
వెలలు నీకుఁ బెట్టేరు వేడుకల మోవులకు
కలగూరగంపలై గరుబాయ వలపు

చ. 3: కాతరాలన నొకరతి కాఁకలనే వొకరతి
పైతరవు వెట్టేరు భామలు నిన్ను
నీతితో శ్రీవేంకటేశ నీవు మమ్మిట్టె కూడగ
రేతిరిఁ బగలు పెరరేఁపులాయ వలపు

రేకు: 1121-2 సామంతం సం: 21-116

పల్లవి: వేడుక మదనునివిద్యలివి
వాడలఁ గతలివి వాఁటములాయె

చ. 1: చలములు సతితో సాదించరాఁగా
వలపులు రేఁగెను వడిఁబడెను
చెలువుఁడ మఱియును చెక్కులు నొక్కఁగ
అలరినయాసలు అవుఁదున జిక్కె

చ. 2: కాయపుమదములు కాఁకలఁ బెనఁగంగ
పాయపుటురు లివి పైఁ దవిలె
వోయయ్య తమకపుటోడ లాడఁగా
ఆయపుకుచములు అడిబర వాయె

చ. 3: కక్కసించి యిటు కాంగిఁటఁ బెనఁగఁగ
లక్కవంటిమతి లలిఁ గరఁగె
యిక్కువ శ్రీవేంకటేశ కూడితివి
వెక్కస మీపెకు వెల్లవిరాయె

రేకు: 1121-3 హిందోళవసంతం సం: 21-117

పల్లవి: ఏల కరంగఁడే మన సిందాఁకాను
యేలికంటాఁ జూచితినే యిందాఁకాను

చ. 1: వచ్చినట్టే వచ్చితిని వాడవారి మెప్పించితి
యిచ్చకమాడితిఁ దన కిందాఁకాను
మచ్చరించనైతి తొంటిమాటలు నొప్పగించితి
యెచ్చరికలే సేసితి నిందాఁకాను

చ. 2: సన్నలకు లోనైతి చవులెల్లాఁ జూపితిని
యిన్నటాఁ జుట్టమనైతి నిందాఁకాను
తన్ను నేమీఁ గోపగించ తప్పులువట్టను నేను
యెన్నుకొని మొక్కితిని ఇందాఁకాను

చ. 3: అదను గాచుకుండితి నట్టే కాంగిటఁ గూడితి
ఇదివో శ్రీవేంకటేశ ఇందాఁకాను
పదరఁ డీతఁడే చేపట్టి నన్ను మన్నించె
యెదుట నవ్వులు నవ్వె యిందాఁకాను

రేకు: 1121-4 వరాళి సం: 21-118

పల్లవి: వివరించి చెప్పరాదు వేరే నీకు దాఁచరాదు
జవకట్టి వున్నవి మీజాణతనాలు

చ. 1: చిదుముడి మాటలలోఁ జిందీ నిన్న మొన్నటి-
కడువిరహములోనికాఁతాళలు
గుడిగొన్ననిట్టూర్పులఁ గుమ్మరించీ నీమీఁద
తడఁబడ్డతనలోనితలపోఁతలు

చ. 2: సొలపుఁ జూపులవెంట జొబ్బిలీని యేకతపు-
టలుకలఁ గొసరేటియందచందాలు
కులికి చెమటనీటఁ గురిసీ నీయెదుటను
చలివేఁడి వలపుల జడివానలు

చ. 3: మొలకనవ్వులలోనే ముంచీ నీవు గూడిన-
పలురతులలోపలి భావ భేదాలు
యెలమి శ్రీవేంకటేశ యేలిననీకే తెలుసు
తలకొన్న జవ్వనపుతమకములు

రేకు: 1121-5 కాంబోది సం: 21-119

పల్లవి: మరిగి మరిగి తాను మగనాలి వలెనే
సరని దెలిసి లోలో సన్నసేయరే

చ. 1: మెలుపునఁ బిలువఁగ మెత్తఁగానే పలికీని
వెలి నెవ్వరైనా నది వినేరంటానో
చెలులు వొద్దనుండఁగా సిగ్గులు రేఁగఁగఁబోలు
తలఁపు దెలిసి యేకతానఁ జెప్పరే

చ. 2: కానుక చేతికివ్వఁగా కానకుండా నందుకొనీ
కానీలేవే యెవ్వరైనాఁ గనేరంటానో
తానెవ్వతెకైనా మాట తగులఁగ నియ్యఁబోలు
యేనెపములైనాఁ జూపి యింటికిఁ దేరే

చ. 3: పలుమారు మొక్కఁగాను పరాకువలెనే వచ్చె
బలిమి గుట్టు బయటఁ బడీనంటానో
యెలమి శ్రీవేంకటేశుఁ డీడగాఁగా నన్నుఁ గూడె
వలపుకొలఁదినే రవ్వలు సేయరే

రేకు: 1121-6 నాగవరాళి సం: 21-120

పల్లవి: తగులాయ నీకనేలే తడఁబాట్లు
మొగిగొనె వలపుల మొగమోటలు

చ. 1: పెనఁగేరమణునికిఁ బ్రియమే సేతువుగాక
కనుచూపులలోనేలే కసుఁగాట్లు
ననిచినవేళను నవ్వు నవ్వుదువుగాక
మొనచేతులలోనేలే ములవాండ్లు

చ. 2: మక్కువ మగనితోడ మంచిమాటాడుదువుగాక
చక్కెరమోవి నేలే చప్పుచారులు
చెక్కులు నీకు నొక్కఁగా సేదదేరుదువుగాక
ముక్కుల చన్నులనేలే మొనపోట్లు

చ. 3: కలసి శ్రీవేంకటేశుఁ గాఁగిలించుకొందుగాక
నిలుగులమేననేలే నిండుసిగ్గులు
తలకొన్నరతులలోఁ దమితో నుందువుగాక
అలవి మీరి యేలే అసురుసురు

రేకు: 1122-1 ధన్నాసి సం: 21-121

పల్లవి: నీ కేల భయము నీకునీకే అలికేవు
చేకొన్న నీచేఁతలందుఁ జెరిగున్నవా

చ. 1: చనవుసేసుక ఆపె సారె నీమోము చూచితే
చెనకఁ జాలక యేల సిగ్గువడేవు
కనుఁగొనఁబోతే నందు కళ లింతే వుండీ నవి
వెనుకొని కాంతలెల్లా వేలు కాడేరా

చ. 2: మచ్చికచేసుక ఆపె మాటలు నిన్నడించితే
కొచ్చి కొచ్చి నీవేల కొంకంజూచేవు
కచ్చుపెట్టి తోఁచేవి కల్లనిజములేకాక
అచ్చమై పొందినసతు లంటుకున్నారా

చ. 3: చుట్టము సేసుక యింతి సారిది నిన్నుఁ గూడితే
యిట్టె శ్రీ వేంకటశ నీవేల మొక్కేవు
గుట్టునను కొనగోళ్ల గురుతు లుండీఁగాక
ముట్టిన కాంతలు మేన మూఁగుకున్నారా

రేకు: 1122-2 కన్నడగౌళ సం: 21-122

పల్లవి: సేయవయ్య నీవు సేసేచేఁత లెల్లాను మా-
పాయపువయసేపో భ్రమయించేది

చ. 1: పక్కున నీవు మాతో బలిమి చూపిన మా-
జక్కవకుచములేపో సాదించేవి
చక్కఁగా నీవెంతేసి సాములు సేసి వచ్చినా
వెక్కసపుమాఁటలే పో వేటువేసేవి

చ. 2: చెలరేఁగి నీవు మాపై చేతు లెంత చాఁచినాను
సొలపుఁజూపులేపో సూదువట్టేవి
తొలఁగక సరసాన దొమ్మి యెంతసేసినా మా-
మొలకనవ్వులేపో ముంచుకొనేవి

చ. 3: చిత్తగించి కాఁగిటను చేపట్టులకుఁ జొచ్చితే
తత్తరపు సిగ్గులే పంతము గొనేవి
యిత్తల శ్రీవేంకటేశ యెనసితి విట్లానే
లత్తుక గోరివన్నెలే లావుచూపేవి

రేకు: 1122-3 నాగవరాళి సం: 21-123

పల్లవి: తానే సిగ్గువడఁగ తప్పు లెందుఁ బట్టుదునె
కానీవే అన్నిటా తారుకాణకు గురెవ్వరే

చ. 1: చిక్కనినవ్వులతోడ శిరసు దా వంచఁగాను
యెక్కువమదనముద్ర లెందువోవునే
ముక్కుమీఁది వేలితోడ మోసముతో నుండఁగాను
మక్కువ నామాఁటకు మాటాడేవారెవ్వరే

చ. 2: చిరుగుఁగెమ్మోవితోడ చెక్కునఁ జేయిడుకోఁగా
అగడుగా నాతోఁ బెండ్లాడే దెప్పుడే
మొగము చూచి తాను మొక్కులు దా మొక్కఁగాను
మొగమాట తిట్లెల్ల మోఁచే దెక్కడనే

చ. 3: నంటుసేసుకొని తాను నన్నుఁ గాగిలించుకోఁగా
వుంటనింట మరువా ట్లొడ్డేదెపుడే
దంట శ్రీవేంకటేశుడు తానే వచ్చి నన్నుఁ గూడె
బంట పంతములెల్లానుఁ బచరించే దెప్పుడే

రేకు: 1122-4 పళవంజరం సం: 21-124

పల్లవి: వలపించఁబోయి నీవే వలచితి వతనికి
పలుకించేనంటా నీవే పలికేవే కరఁగి

చ. 1: కన్నుల నీవు చూచితే కాంతుఁడు గుఱియౌఁగాక
చన్నుమీఁదిపయ్యద జాఱనేఁటికే
సన్నలు నీవు సేసితే సమ్మతించుఁగా కతఁడు
చిన్ని చెమటలు నీమెయిఁ జిందనేఁటికే

చ. 2: నీవు చేయి చాఁచితే నీవిభుఁడు లోనౌఁగాక
వేవేలకు నీకొప్పు వీడనేఁటికే
మోవి నీవు చూపితేను మొక్కి తాఁ జేకొనుఁగాక
ఆవేళను నీవు వెరగందనేఁటికే

చ. 3: అంటితే శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడుఁగాక
పెంటపులకుల నీకుఁ బెరుగునేలే
జంటయై కూడితిరి నీచన వాతఁ డిచ్చుఁగాక
వెంటవెంట వచ్చి వచ్చి వేఁడుకొననేఁటికే

రేకు: 1122-5 సాళంగం సం: 21-125

పల్లవి: ఎంతమాయకాఁడవో యేమని చెప్పుదు నిను
పొంతల నవ్వేవేల బూమెటవలెను

చ. 1: చెప్పగానే నూరూరీ చిన్ననాటివలపు
కప్పుము వట్టినచింత కాయవలెను
దప్పి నాఁకలీఁ దీరీని తగ నీమోవి చూచితే
విప్పుచును పెక్కిండ్లవిందువలెను

చ. 2: వింటే మేను గరుపారీ వినోదపు నీసుద్దులు
ముంటివాఁడిజాజిననమొగ్గలవలె
చంటికొనలజవ్వనమే జడిసీ నీవద్దనుంటే
పంటవండినరాసులభాగ్యముల వలెను

చ. 3: కూడఁగానే ఆసలెక్కీ కోరిననీరతులను
వాడికెఁ గూడివచ్చినవడ్డివలెను
యీడన శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీడలనిలిచిననిధానము వలెను

రేకు: 1122-6 రీతిగౌళ సం: 21-126

పల్లవి: ఆయనాయ నూరకుండు ఆసోదమా నాకు
ఆయమ్మై నీనేసపాలు అఱచేత నున్నవి

చ. 1: అంతేసి నాతో నీవు ఆనవెట్టుకోనేలయ్య
దొంతిఁ బెట్టుకుందాన నీతొల్లిటిబాస
వింతగా వేరె నాకు విడె మియ్యవలెనా
పొంత నీతమ్ముల మిదె పుక్కిటిలో నున్నది

చ. 2: వెడ్డువెట్టి యింత నన్ను వేఁడుకొననేలయ్య
దొడ్డిఁ బెట్టుకుందాన నీతొంటి మొక్కులు
వొడ్డుకోఁగా నప్పటిం బూవుల వేయవలెనా
వొడ్డిననీ కొప్పు విరు లోడి నిండి వున్నవి

చ. 3: ఆసచూపి జవ్వాదివం కిట్టె నాకీనేలయ్య
దోసిటఁ బట్టుకుందాన తొంటికానికె
వాసి నలమేల్మంగను వడి శ్రీవేంకటేశుఁడ-
వీసుదీరఁ గూడితివి యింతబలు వున్నదా

రేకు: 1123-1 ముఖారి సం: 21-127

పల్లవి: కాకుండితే రమణుఁడ కాఁతాళములు రేఁగు
పైకొన్నమాటతోడ పంతమెల్లా దక్కెను

చ. 1: వుల్లసముగా నాడినవొడ్డారపునీమాట
చల్లనినవ్వుమాటతో శాంతమాయను
కల్లలుగా నాడినకారపువెంగెపుమాట
తెల్లమై ఆసమాటతో తియ్యనాయను

చ. 2: వూరకె నీవాడిన వుప్పనైననీమాట
సారపుముద్దుమాటతో చవి వుట్టెను
జారువడ నాడినట్టిచప్పనైననీమాట
పేరుకొన్న మాటతోడఁ బ్రియమాయను

చ. 3: కప్పురపు వెసురుకాఁగిటిలో తిట్టుమాఁట
వొప్పినసమ్మతి మాఁట నొచ్చెము దీరె
యిప్పుడే శ్రీవేంకటేశ యెనసినపచ్చిమాఁట
తప్పినినీమాఁటతోడ తనివి నాకాయను

రేకు: 1123-2 వరాళి సం: 21-128

పల్లవి: కొంకనేల నీవింత కోరి సిగ్గువడనేల
సంకెదీరె నీతోడ చలము లేదయ్యా

చ. 1: మనసొక్కటైతేఁ జాలు మాఁటలు వేరు తోఁచవు
అనుమానమేల మాతో నానతీవయ్యా
యెనయికలు గలిగితే నెరవు లించుకా లేవు
కొనమొద లెంచనేల కూచుండవయ్యా

చ. 2: యితవులైన చోట నెగ్గులుసిగ్గు లుండవు
చతురతల వలపు చల్లవయ్యా
పతి తారుకాణలైతే పట్టినదెల్లా నిజము
రతికెక్కేఁ బనులెల్లా రావయ్యా లోనికి

చ. 3: సమ్మతించినందుకెల్లా సరసములే మించు
నమ్మించితి విట్టే మాతో నవ్వవయ్యా
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యెమ్మెలేల నీమోవి యియ్యవయ్యా

రేకు: 1123-3 దేశాక్షి సం: 21-129

పల్లవి: వెట్టిచెలులము నేము వేడుకేకాదా
నట్టుకొని నీవింతేసి నవ్వవద్దా నేఁడు

చ. 1: రాతిరెల్లాఁ బాదాలు రాసి గుద్దించుకొంటివి
నాతోడి పొందు నీకు నయమేకాదా
యేతులకు నాకు మడిచిప్పించుకొంటి విందాఁకా
లాతుగా నిది గొంతలాభమేకాదా

చ. 2: కొంగుపట్టు కిందాఁకా కొప్పు దువ్వించుకొంటివి
చెంగట నీగజరుకు సెలవేకాదా
వుంగరాలవే ళ్లిందాఁకా వూరకే పిసికించితి
వెంగలిమావుడిగాలు వినోదాలుగావా

చ. 3: కూరిమి గొసరుకొంటా కుంచవేయించుకొంటివి
సారెకుఁ గరఁగ నీకు చవులేకావా
ఆరయ శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
దారకుఁడ వింతసేయఁ దగవే కాదా

రేకు: 1123-4 సాళంగనాట సం: 21-130

పల్లవి: ఎంతైనా నీయలవాట్లేల మానేవు
వింతలు సేయవుగా వెలఁదులయెడను

చ. 1: వాసికిఁ గొంగువట్టేవు వడి నీవు గొల్లెతల
సేసినట్టెల్లా ముందు చెల్లెనంటాను
ఆసలఁ జేయిచాఁచేవు అల్లనాఁడు రుక్మిణిని
వేసుకొంటి నిఁకలేదు వేసరంటాను

చ. 2: యింటికి రప్పించుకొంటి విట్లాఁ బదారువేల
యింటఁ బెట్టుకొంటి రతికెక్కెనంటాను
జంట సాము నెరపేవు సత్యభామకు విల్లిచ్చి
వెంటఁబెట్టుకొన్నసుద్ది వెలసెనంటాను

చ. 3: శిరసు వంచి మొక్కేవు శ్రీవేంకటేశ నీ-
శిరసుపైఁ దొళశమ్మ చేరెనంటాను
యిరవై నన్ను నేలితి విందిరను భూసతిని
యిరుమేలా నిడుకొని యేలితినంటాను

రేకు: 1123-5 భైరవి సం: 21-131

పల్లవి: వినవే నామాటలు వివేకించుకొనవే
పనులేమి గలిగినా పతిఁ గొసరుదమే

చ. 1: మగువలెల్లా నొక్కటి మనలో విరహమేలే
తగుసవతులమైతే తప్పు వచ్చెనా
మగనికాఁగిలే గతి మఱి యెంత చుట్టినాను
పగలు రేతిరి నొక్కబయటనే కూడీనే

చ. 2: అక్కయేమే చెల్లెలేమే అందులో భేదమున్నదా
నిక్కి యేరాండ్లమైతే నేరమాయనా
చిక్కేటి దాతనిమోవే చేరి యిద్దరినోళ్లకు
చుక్కలూఁ జంద్రుఁడూ నొక్కచూపులోనే కూడునే

చ. 3: నీవు నేను సమమే నేరిచి నడచితేను
దేవుళ్ల మిద్దరమైతే తెలివిలేదా
శ్రీవేంకటేశుఁడు గూడె చెలఁగి నిన్నును నన్నూ
పూవులెల్లా వనమునఁ బూచేవేకదవే

రేకు: 1123-6 కన్నడగౌళ సం: 21-132

పల్లవి: కాగిలించుకొనవే గక్కన నీరమణుని
కాఁగి కరఁగినమేలు గట్టాయఁ జాలదా

చ. 1: బిగువు నీచన్నులందు బెరసీని చాలదా
బిగియఁగావలెనా ప్రియునితోడ
వొగరు చిగురుమోవి నుట్టిపడీఁ జాలదా
వొగరుమాఁటలు వేరె వొలుకగవలెనా

చ. 2: పెనగొని నీనెరులు పెక్కులయ్యీఁ జాలదా
పెనఁగఁగవలెనా పిలువఁగానే
మొనసెఁ బులకలు కమ్మిక మేనఁ జాలదా
మొనలగోళ్లఁ జూపి మోప నింకా వలెనా

చ. 3: నాఁటుకొనె నీప్రియము నగవులఁ జాలదా
నాఁటఁజూడవలెనా నయములనె
మీఁటె వలమేల్మంగవు మీఁదఁ గప్పు మిట్టె కూడి
మీఁటె వేలు శ్రీవేంకటమేఁటి నీపైఁ జాలదా

రేకు: 1124-1 ఆహిరి సం: 21-133

పల్లవి: విన్నవించితిమి నీకు వేడుకవేళ
కన్నెను నీవు దయఁ గాచేటివేళ

చ. 1: మచ్చికలు దయివారె మనసెల్ల జైవారె
వచ్చె జవ్వనానకు వసంతవేళ
చొచ్చి నిన్నుఁ బాసి తాపసూర్యుఁ డెండగాయఁగా
విచ్చనవిడిగాఁ దోఁచె వేసగివేళ

చ. 2: సిగ్గులు మొలవఁజొచ్చె చెమటలేరులు హెచ్చె
కగ్గులేక మించె వానకాలపువేళ
వెగ్గళించి సెలవుల వెన్నెలలు చూపట్టి
వొగ్గి శరత్కాలము వొదిగె నీవేళ

చ. 3: తత్తరపుచలి పొంచె తలపోఁతమంచు మించె
యెత్తి యలమేల్మంగకు హేమంతవేళ
బత్తితో శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
చిత్తజుకాఁకలు దేరె సిసిరవేళ

రేకు: 1124-2 నాదనామక్రియ సం: 21-134

పల్లవి: నీకే పంపుసేసుఁగాక నేమేమన్నాఁ గైకొనీనా
యేకడా నీమఱఁగున నిటుండేవారము

చ. 1: చెలియ నీచెప్పినట్టు సేసుఁగాక అతఁడు
మలసి మాకెల్లాను మట్టుపడీనా
పిలిచినీపిలుపే ప్రియములై వుండుఁగాక
బలిమి నేము రమ్మంటేఁ బలికీనా అతడు

చ. 2: వినవే నీకన్నులకే వెఱచుఁగా కాతఁడు
చెనకి నేము చెప్పితే చెవులొగ్గీనా
చనవిచ్చి నీమొక్కులే చవులై యుండుఁగాక
యెనసి మావినయాల కింటికి వచ్చీనా

చ. 3: పై పై నీకూటమికే భ్రమసుఁగా కాతఁడు
తీపులు నేము చూపితే తెమలీనా
యేపున నీయప్పణను యిటు మమ్ము నేలెఁగాక
వోపి శ్రీవేంకటేశుఁడు వొడఁబడీనా

రేకు: 1124-3 బౌళి సం: 21-135

పల్లవి: చేంతకుఁ జేత సేసెను చెల్లుఁగదవే
యీఁతా మోఁతా నొక్కటాయ నిఁకనేమనేరే

చ. 1: కన్నుల మొక్కేరు మీరు కాఁకలు చల్లేరు మీరు
యెన్నఁగ రెండూ నడపేరేమే వొక్కంటే
కిన్నెరకాయచన్నుల కేరినవ్వేటిచెక్కుల
సన్నపుగోర నొత్తెను సరసుఁడే అతఁడు

చ. 2: చేతులుచాఁచేరు మీరు సిగ్గులూఁ బడేరు మీరు
యేతులకు రెండూ నడపే రిదె మీయందే
ఘాతలఁ గొప్పు విరులు కప్పినపయ్యదకొంగు
రీతి నొక్కమాఁటే జారించెఁగదే ఘనుఁడు

చ. 3: కందువఁ గూడేరు మీరు కడుభ్రమసేరు మీరు
అందాలు రెండూఁ జూపే రంగాలందునే
ముందే శ్రీవేంకటేశుఁడు మోవి ఇచ్చి ముచ్చటాడె
విందులుగా మొహింపించె వేడుకకాఁడే

రేకు: 1124-4 గౌళ సం: 21-136

పల్లవి: ఇందుకేకా విభుఁడు నీయింట నెలకొన్నాఁడు
కందు వెఱుఁగుదువు యీకత నీవే నేర్తువే

చ. 1: నయమెంత గలిగినా ననుపులకే మేలు
ప్రియమెంత గలిగినా పెనపులకే మేలు
జయమెంత గలిగినా చనవులకే మేలు
క్రియ లెఱుఁగుదువు యీకీలు నీవే నేర్తువే

చ. 2: మొగమెంత చూచినా మోహానకే మూలము
తగవెంత నెరపినా తగులుకే మూలము
నగవెంట గలిగినాను నమ్మికలకు మూలము
పగ టెరుఁగుదువు యీపాడి నీవే నేర్తువే

చ. 3: వూడిగ మెంతసేసినా వొద్దికలకే దాపు
వేడు కెంతనిలిపినా విఱ్ఱవీఁగుటకే దాపు
కూడితి విన్నిచందాల కోరిక శ్రీవేంకటేశు
జాడెఱుఁగుదువు సరసము సరసము నీవే నేర్తువు

రేకు: 1124-5 సామంతం సం: 21-137

పల్లవి: చూగఁ బిన్నగాని సుద్దులు పెద్దలు
కూడి పట్టఁబట్ట గొట్టీ గోవిందుడు

చ. 1: పాలవుట్టిఁ గొట్టి పరువునఁ బోయి
వేలాడఁగాఁ గొట్టె వెన్నవుట్టి
కేలు చాఁచి కొట్టె కిందితేనెవుట్టి
యేలాగు దాఁతమే యేమందమే

చ. 2: చక్కిలాలవుట్టి సరుగనఁ గొట్టి
నిక్కి నిక్కి కొట్టె నేతివుట్టి
పక్క దిక్కు గొట్టె పంచదారవుట్టి
యెక్కడ దాఁతమే యేమందమే

చ. 3: వారవట్టి కొట్టె వంచి పెరుగువుట్టి
చారపప్పువుట్టి జారఁగొట్టె
కోరి శ్రీవేంకటగోవిందకృష్ణుని-
కేరీతి దాఁతమే యేమందమే

రేకు: 1124-6 బౌళి సం: 21-138

పల్లవి: ఆయలేవే యేమి చెప్పే వాతనిపొందులు
పాయములకొలఁదివే పైకొనెడియాసలు

చ. 1: పిలుపులకొలఁదివే బిగువులు
బలిమి కొలఁదివే పంతాలు
చలము కొలఁదివే సాదింపులు
కలసిన కొలఁదివే కరగులు

చ. 2: చనవుల కొలఁదివే సరసాలు
నను పు కొలఁదివే నగవులు
వినికి కొలఁదివే విన్నపాలు
తనిసిన కొఁలదివే తమకములు

చ. 3: వేడుక కొలఁదివే వేసాలు
వాడిక కొలఁదివే వలపులు
యీడనె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను యీ-
కూడిన కొలఁదివే గుఱుతులు

రేకు: 1124-7 రామక్రియ సం: 21-139

పల్లవి: సారెనేలే జగడము సారెనేలే సణఁగులు
సారెనేలే పతితోఁ బంతము సారెనేలే

చ. 1: పెదవుల గొణఁగుచు బీరములాడుచు
కొదలుఁదిట్లనే కొసరుచును

చ. 2: సెలవుల నవ్వేవు చేతులు చాఁచేవు
సళుపుఁజూపులనె చల్లేవు

చ. 3: చిడుముడిపడకువె శ్రీవేంకటపతి
కడపరాయఁడయి కయికొనెను

రేకు: 1125-1 కాంబోది సం: 21-140

పల్లవి: ఇటమీఁద నీచిత్తము యెఱుకగలవాఁడవు
తటుకన నింకానేమి దండమువెట్టేను

చ. 1: కోరినకోరిక నీవు గుఱి నీచక్కఁదనము
వేరే నీకు నిఁకనేమి విన్నవించేను
జారె నాపయ్యద నీకు చన్నులివి కానుకాయ
గారవాన నిఁకనేమి కప్పమిచ్చేను

చ. 2: అంగము నీవద్దనుండి ఆయము నీచేతిది
అంగవించి యెందాఁకాఁ బ్రియము చెప్పేనే
ముంగిట వెరగందితి ముట్టితివి నీవు నన్ను
యెంగిలిమోవివిందు లేమి చెప్పేను

చ. 3: గక్కనఁ గూడితి నిన్ను కాఁగిలి నీసొమ్మాయ
చిక్కించు కెంతతడవు సేసవెట్టేను
అక్కున శ్రీవేంకటేశ ఆలను నీవు పతివి
పక్కన మరేమి నిన్ను బాసగొనేను

రేకు: 1125-2 బౌళి సం: 21-141

పల్లవి: ఈకె యెంతచనవరో యేకతాన నింతసేసె
లాకలుగా వారు నవ్వి లలి నొక్కటైరి

చ. 1: అలిగా నొక్కరొక్కరు అటుమోములై వుండఁగా
వెలయఁజెప్పె బుద్దులు వినకుండఁగా
చెలివలువలు దీసి సిగ్గునఁ దలుపులు మూసి
వెలి నిలుచుండీతేను వింతతిట్టు దిట్టిరి

చ. 2: బాగాలు నోళ్లఁబోసి బలిమి నాకు మడిచి
ఆగతి నిడీ నప్పటి నట్టె వుండఁగా
చేఁగదేరఁ గాఁగిళ్లకు చేతులు చక్కఁగా దొబ్బి
బాగుగఁ దెరవేసితేఁ బచ్చితిట్టు దిట్టిరి

చ. 3: శ్రీవేంకటేశ్వరు నింతిఁ జేరి మర్మా లంటించి
ఆవేళవారివలువ లట్టె కప్పఁగా
దేవుఁడు దేవులుఁ గూడి తెలివను మెచ్చి మెచ్చి
వేవేలిచ్చి మన్నించి వేరేతిట్టు దిట్టిరి

రేకు: 1125-3 లలిత సం: 21-142

పల్లవి: ఎవ్వరెవ్వరిపంతాలు యెటు వచ్చునో
ఇవ్వల వీరినేరుపు లేమి చెప్పేమే

చ. 1: మాటలాడమని లోలో మరి వొట్టువెట్టుకొని
యీటునఁ గొంతవ డూర కిద్దరు నుండి
పాటించి ఇంతిచెల్లెలిఁ బట్టితెచ్చి నాయకుఁడు
గోటారించి భంగించఁగా కొమ్మ వేఁడుకొనెను

చ. 2: మోములు చూడమనుచు ముంచి వొట్లువెట్టుక
వోముచుఁ గొంతవడి తామూరకే వుండి
నేమమున నద్దములో నీడలు దెచ్చి విభుఁడు
భామినికిఁ జూపితేను పై పై జంకించెను

చ. 3: కూడమంటాఁ గోపమునఁ గోరి వొట్టువెట్టుకొని
వోడక కొంతవడిదాఁ కూరకే వుండి
వేడుకాపె కాళాఁజ శ్రీవేంకటేశుఁ డంటఁబోఁగా
గాఢల వద్దంటా సతి కాఁగిలించి పట్టెను

రేకు: 1125-4 మంగళకౌసిక సం: 21-143

పల్లవి: మించి ఇన్నిటికి మీకుమీరే జోడు
మంచముపై రతులకు మంతనాలే జోడు

చ. 1: తీరని యాసలకు తియ్యనిమోవులు జోడు
మేరమీరేచిత్తాలకు మేనులే జోడు
ఆరనికాఁకలకును అంటినకాఁగిళ్లు జోడు
నేరిచిననేర్పులకు నెయ్యమే జోడు

చ. 2: చెనకుల కన్నిటికి చిమ్ముఁదమకము జోడు
ననుపులకును లేఁతనగవే జోడు
చనువుమనవులకు సన్నలు చాయలు జోడు
వొనగూడి వుండుటకు వోరుపులే జోడు

చ. 3: కలయికలకు సారెఁ గనుఁగొనుటే జోడు
అలపులకును మాటఁలాడుటే జోడు
అలమేల్మంగ శ్రీవేంకటాద్రీశ నిన్నుఁ గూడె
తలపోఁతలకు మీమీతారుకాణే జోడు

రేకు: 1125-5 హిందోళం సం: 21-144

పల్లవి: ఆతఁ డాడుమనఁగానే ఆడితి నే నీమాట
కాతరాన లోన వాఁడే కైకొనఁగరాదా

చ. 1: పయ్యదేల మూసేవే పడఁతి నీచన్ను లవి
వొయ్యన జక్కవలంత వుబ్బ కోర్చునా
పుయ్యాలమంచముమీఁద వొరసేనీనాయకుని
కొయ్యరతుల కాఁగిటి గూఁటఁ బెట్టరాదా

చ. 2: రెప్పలేల వేసేవే రేసుల నీకనుచూపు-
ముప్పిరిచకోరాలు మూలనుండునా
కప్పురపుమేడలోనఁ గదిసేనీరమణుని-
దెప్పరపు మేననే దండెన వేయరాదా

చ. 3: తురుమేల ముడిచేవే తుమ్మిదలఁ బిసికితే
మరుగునా అలమేలుమంగవు నీవు
పరపుపై శ్రీవేంకటపతిఁ గాఁగిటఁ గూడితి-
వరయఁగ నాతనిపై నాట నేర్పరాదా

రేకు: 1125-6 శంకరాభరణం సం: 21-145

పల్లవి: అందరిముందరనైతే నను వు రాదు
కందువకు నీవు రమ్మా కత చెప్పేను

చ. 1: చనవు లొకతె కిచ్చి చలము రేచే వొకతె
వనితకు వనితలు వట్టపెట్టేరా
ఘనుఁడవు నీకింత గలితే లోనికి రమ్మా
వొనర నీమనసురా నొప్పఁజెప్పేను

చ. 2: నవ్వే నాపెతో నీకె నమ్మించి దీకొలిపేవు
జవ్వనికి జవ్వని సరిదూఁగదా
అవ్వల నీకింత ప్రియమైతే దగ్గరిరమ్మా
చివ్వన నీవేడుకలు చెల్లించేను

చ. 3: రతిసేసి చెలియను రమణిఁ బురికొల్పేవు
అతివపై నతివ రా నాస మానీనా
తతి నలమేల్మంగను తగు శ్రీవేంకటాచలా
పతి కూడితివి రమ్మా బాగులు సేసేను

రేకు: 1126-1 దేసాళం సం: 21-146

పల్లవి: జాము వోయ నింకాను సటలేఁటికే
నీమతక మింతయు నే మెఱఁగమా

చ. 1: సిగ్గులెందాఁకానే చెఱఁగు వట్టెను పతి
యెగ్గు లెందాఁకనే యిదె మొక్కీని
నిగ్గుఁజల మెందాఁకానే ని న్నాతఁడు వేఁడుకొనీ
వొగ్గి విడె మిమ్మంటే వోపనందురా

చ. 2: పెనగు లెందాఁకానే ప్రియపడీ రమణుఁడు
కినుక లెందాఁకానే కిందుపడీని
జనుగు లెందాంకానే చోటిచ్చీఁ గూడుమంటా
నిను గుంచ వేయుమంటా నేరనందురా

చ. 3: చిఱునవ్వుం లెందాఁకానే శ్రీవేంకటేశుఁడు గూడె
నెఱి నలమేల్మంగవు నిన్ను నిప్పుడే
వెఱగు లెందాఁకనే విచ్చనవిళ్లాయ నీకు
మఱియుఁ గొసరితేను మచ్చరింతురా

రేకు: 1126-2 పాడి సం: 21-147

పల్లవి: ఇద్దరి మీతలపోఁత లెఱఁగఁగాక
కొద్దిమీరితే నగవే కోటి కొండగాదా

చ. 1: వాడికెవిభునితోడ వాదైతే నెఱఁగఁగాక
చూడనేరిచితే చూపే సూడిదెగాదా
పాడిపంతాలకు నెగ్గుపట్టితే నెఱఁగఁగాక
ఆడనేరిచితే మాట అమృతము గాదా

చ. 2: సవతిపో రితనిపైఁ జల్లితే నెఱఁగఁగాక
చవిగొంటే వలపులే చక్కెర గాదా
తివిరి చలములే సాదించితే నెఱఁగఁగాక
వివేకించితే మనసే వింతసొమ్ముగాదా

చ. 3: మతకపుసిగ్గులు నేమరితే నెఱఁగఁగాక
రతిసేసితేఁ గాఁగిలే రాజ్యము గాదా
తతి నలమేల్మంగవు దక్కె శ్రీవేంకటేశుఁడు
సతమైనచనవులే సంపదలుగావా

రేకు: 1126-3 శుద్ధవసంతం సం: 21-148

పల్లవి: ఏమి సేసినా నీయిచ్చకొలఁదే కాక
కామినులము నిన్నెట్లు కాదనఁగవచ్చును

చ. 1: తళుకునఁ బొలసేవు తలయెత్తి చూచేవు
చలపట్టితే వలపు చప్పరించేవు
చెలి దగ్గరివచ్చితే చేతి లోనయ్యేవు
బలిమి నీమనసెట్టు పట్టేమనవచ్చును

చ. 2: కడుఁబెచ్చుపెరిగేవు గక్కన సూడువట్టేవు
విడువలేక సతిని వెంటఁ దిప్పేవు
వొడివట్టి తీసేవు వూరివారి నెల్లాను
చిడుముడి నిన్ను నెట్టు చెనకఁగవచ్చును

చ. 3: కమ్మి సిగ్గువడవు తొక్కనిచోట్లు తొక్కేవు
పమ్మి యలమేల్మంగకుఁ బతివి నీవు
చిమ్ముచు మేకులకే శ్రీవేంకటేశ మొక్కితి
నెమ్మది నిన్నిఁక నెట్టు నేరమెంచవచ్చును

రేకు: 1126-4 రామక్రియ సం: 21-149

పల్లవి: వట్టిపంతములు మాతో వద్దు వద్దయ్యా
పట్టుపుదేవులకును భ్రమయఁగవలదా

చ. 1: ఆయాలుసోఁకినమాట ఆపె నీతో నాడఁగాను
యీయెడ నీవు గరఁగ కెట్టు మానేవు
పాయపుఁజెలియ నీకు బత్తులెల్లాఁ జేయఁగాను
సోయగాన నీవెట్లఁ జొక్కకుండేవు

చ. 2: ముంచి యాపె నీకు చనుమొనలు చూపఁగాను
యెంచి యిట్టే పంపుసేయ కేల మానేవు
పొంచి నీరమణి నిన్నుఁ బొత్తుకుఁ బిలువఁగాను
కొంచించి నిలిచి ఇట్టె గుండె వట్టేవు

చ. 3: అలమేలుమంగ వురమందు నీకు నెక్కఁగాను
యెలమి నానందించ కెట్టు మానేవు
అలరి శ్రీవేంకటేశ ఆపె సరసమాడఁగ
పెలుచవై నీవెట్టు పెనఁగాడేవు

రేకు: 1126-5 వరాళి సం: 21-150

పల్లవి: ఏమయ నీతోడిపొందు లిటువంటివి
దోమటి దొడికితేను తొడిఁబడ నెట్లో

చ. 1: నవ్వఁగానే నీతోను నాటుకొనెఁ బ్రియములు
దవ్వులనుండి చూచితేఁ దగిలె మతి
మువ్వంకల మొక్కఁగానే ముదిరె మిక్కిలియాస
యివ్వలఁ జేయంటితేను యిఁక నెంతేశానో

చ. 2: మాట లూరవే యాడితే మర్మములు గడురేఁగె
పాటించి కానుకియ్యఁగా పట్టెను తమి
చాటువమొగమోటు నమ్మతులాయ నన్నియు
యీటు సరసాలాడితే నిఁక నెంతేశానో

చ. 3: యేకాంతము జరపఁగా నిట్టె మేను చెమరించె
దికొని పెనఁగంగాను తేరెఁ బనులు
చేకొనె నలమేల్మంగ శ్రీవేంకటేశ్వర నిన్ను
యీకడఁ గాఁగిలించెను ఇఁక నెంతేశానో

రేకు: 1126-6 ముఖారి సం: 21-151

పల్లవి: ఇన్నిటికి నోపుదు విటువంటినీకును
యెన్నఁగ వలచివచ్చే దేమిబాఁతి సతులు

చ. 1: చుట్టపువరసకుఁగాఁ జొచ్చి బండి రొప్పితివి
గుట్టున గొల్లలకుఁగా కొండ యెత్తితి
బిట్టువాగెలఁ బెండ్లిపేరటము వోతివి
యిట్టిపూసగొండివి నీకేమిబాఁతి సతులు

చ. 2: మామపంచ వేఁడుకొని మనికియై వున్నాఁడవు
చూ; మరల నింటఁ బసులఁ గాచితి
దోమటి దోడివితివి దొడ్డివారి యిండ్లను
యీమంచి యిచ్చకుని కేమిబాఁతి సతులు

చ. 3: అంకెల యజ్ఞసత్నుల నడిగి బోంసేసితివి
కంకిగాఁ గోకలు మోచి కాచుకుండితి
వుంకువ నలమేల్మంగ నురమెక్కించుకొంటివి
యింక శ్రీవేంకటేశ నీకేమిబాఁతి సతులు

రేకు: 1127-1 సాళంగనాట సం: 21-152

పల్లవి: పట్టము గట్టితి వింక బ్రతుకరయ్యా
చిట్టకాలు లేవు మీకు శ్రీవేంకటేశుఁడా

చ. 1: అలమేలుమంగకు సింహాసనము నీవురము
కలితహారములే సింగారపుదండలు
తొలఁకునీహస్తములే తోరణగంభములు
చెలిరాజ్యమే నీవు శ్రీవేంకటేశుఁడా

చ. 2: పరగుతులసిదండ పచ్చతోరణ మాపెకు
మెరుఁగుఁ గౌస్తుభమణి మించుటద్దము
గరిమ నీసొబగులు కప్పములుఁ గానికలు
సిరులు నీకూరిములు శ్రీవేంకటేశుఁడా

చ. 3: సంతతమైనవిందులు సారె నీమోవితేనెలు
వింతరతిభోగములు వినోదాలు
కొంత నియ్యారును బొడ్డు కుంచెయుఁ గాళాఁజి
చెంతల నన్నీ నమరె శ్రీవేంకటేశుఁడా

రేకు: 1127-2 పాడి సం: 21-153

పల్లవి: వేళగాదు సిగ్గులకు విచ్చనవిడింతే కాని
గోలతన మిపుడేలే కొంగువట్టీ నతఁడు

చ. 1: తమకించినపుడే తతియాయ రతులకు
సుముఖుఁడైనపుడే సూటి మాటకు
చెమరించినపుడే చేఁతలకెల్లా లోను
కొమరవేల లోఁగేవే కొంగువట్టీ నతఁడు

చ. 2: అంటఁజూచినపుడే అద నట్టే నవ్వులకు
వెంటవచ్చినపుడే విందు మోవికి
నంటు సేసుకొన్నపుడే నయము కోరికలకు
దంటవు యేల కొంకేవే దక్కఁగొనీ నతఁడు

చ. 3: ఆయములంటినప్పుడే అనువు నీపంతాలకు
చాయసేసుకొన్నపుడే చవి కాఁగిలి
యీయెడ నలమేల్మంగ ఇదిగొ శ్రీవేంకటేశు-
నోయమ్మ కూడితివి నీవొడివట్టె నతఁడు

రేకు: 1127-3 బౌళి సం: 21-154

పల్లవి: ఏల యింతచలము యింతి నేను
తాలిమితో నుండఁగాను తమకించేనా

చ. 1: మునుప నే నీకును మొక్కితి నే ననఁగానే
చెనకి చెనకి మరిఁ జేయివట్టేవా
పనివడి యిప్పుడిట్టె పంతమిచ్చితి ననఁగా
పెనఁగి చెలులచేతఁ బిలిపించేవా

చ. 2: ఇదివో నే నీకును ఇచ్చకములాడఁగానే
పదిరి నావొడివట్టి పచ్చిసేసేవా
సదరాన నన్నిటికి సమ్మతించి వుండఁగానే
వెదకి నన్నిందరిలో వింతసేసేవా

చ. 3: తలవంచుకొని నీదగ్గర నే నుండఁగానే
నలినలిగా నన్ను నవ్వించేవా
కలసి నే నుండఁగానే గక్కన శ్రీవేంకటేశ
తళుకుఁజూపుసన్నల తమి రేఁచేవా

రేకు: 1127-4 ఆహిరి సం: 21-155

పల్లవి: ఊరకుండుమనవే వువిదలాల విభుని
నేరనివాఁడా తాను నేనే యెఱుఁగుదునే

చ. 1: చిగురుఁజేతులఁ గావా చేవకొనగోళ్లున్నవి
మొగిచి యందులకేల మొక్కీనే నాకు
మొగమోటమునఁ గాదా మునుకొనె వలపులు
నగవులు నగి యేల నయాలు చూపీనే

చ. 2: మాఁటలలోనే కావా మర్మములెల్లా నుండేవి
మాఁటపట్టు సారె నేల మరీ నిచ్చీనే
గాఁటపుఁజూపులఁ గావా కంతునివాఁడిములెల్లా
ఆఁటదాన నాపైనేల అల్లార్చి చూచీనే

చ. 3: చిక్కనిసిగ్గులే కావి చిత్తములఁ గరఁచేవి
పెక్కుమారు లవియేల పెడరేఁచీనే
ఇక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
వక్కణతో నివి యేల వర్ణించీనే

రేకు: 1127-5 మాళవి సం: 21-156

పల్లవి: కాంతలమనసులోని కఊవు వాసె
అంతటా జవ్వనమనేఆమని కాలమున

చ. 1: వేవేలు గొల్లెతలపై వెరవెట్టి వలపులు
నీవు లూడ్చి కొలనిలో నీరుగట్టెను
వేవేలు దొడ్లకాడ వెలుఁగులు వెట్టి పెట్టి
కేవల మితనికి నాఁగేలూ వొకటే

చ. 2: దుండగపుగొల్లను దోమటిఁ గలుపుదీసి
బండిగట్టె రుకుమిణిభామపెండ్లికి
కొండలంతలుచన్నులఁ గొటారుకుప్పలు వేసె
పండెఁ గట్టుకొమ్మనవ పైఁడి చీర వరచి

చ. 3: పచ్చిమోవికణఁజాల బండారించి ముద్రవెట్టె
రచ్చలఁ గాఁగిళ్లఁ గాఁపురాలు సేసెను
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నేరుపరి
కుచ్చి కుచ్చి రతిసేయఁ గొండవేలూ నాయను

రేకు: 1127-6 హిందోళం సం: 21-157

పల్లవి: ఏఁటికి దోసాలుగట్టే వింతలో మాకు
పాటించి నాకుఁగా నేలో భ్రమసేవుగాక

చ. 1: నచ్చి నీమాటలకెల్ల నాఁడే నే లోఁగాన
ముచ్చట దీరక నీవే మొక్కేవుగాక
యిచ్చకురాలనై నీకు నే నేమయినాఁ జేయనా
పచ్చిగా వలచి వొడఁబరచేవుగాక

చ. 2: కన్నులఁ జూచినప్పుడే కరఁగదా నామనసు
చన్నులంటి చొక్కుఁజూపు చల్లేవుగాక
సన్న సేసినంతలోనే సరసములాడనా
చిన్నికొనగోరు నాపైఁ జిమ్మేవుగాక

చ. 3: కందువకు రాఁగానే కాఁగిలించనా నిన్ను
చెంది ప్రియా లప్పటినిఁ జెప్పేవుగాక
విందువలె నన్నిటా శ్రీవేంకటేశ కూడితివి
మందెమేళాలు మీరేనా మన్నించేవుగాక

రేకు: 1128-1 లలిత సం: 21-158

పల్లవి: సిగ్గువడి యిందాఁకా చెలవుఁడు నన్ను దూరె
బగ్గన మమ్మింతేసి పచ్చిసేతురా

చ. 1: అలవోకగా నీతో నాడుకొన్నమాటలెల్ల
వెలయఁగ నాతనితో విన్నవింతురా
చెలివంటా నాతనిచేఁత లిటువంటివంటే
చలపట్టి యంతలోనే సాదింతురా

చ. 2: నగుతా నాతనిరచనలు నే సందేహించితే
సొగసి యాతనిమేను సోదింతురా
పగటున నావేళ పంతాలు నే మెరసితే
తగవు విడిచి మీరు తమకింతురా

చ. 3: వద్దనుండి నే నాతనివలపులు వొగడితే
కొద్దిమీరి వెంగెములు కొనవేతురా
వొద్దికై శ్రీవేంకటేశుఁ డున్నతి నన్నుఁ గూడె
సుద్దులు తొల్లిటి వింతే సూదువట్టుదురా

రేకు: 1128-2 భైరవి సం: 21-159

పల్లవి: ఎవ్వరు నేమి చెప్పేరు ఇంటికి రావయ్యా నీవు
పువ్వుఁను బిందెయువలె పొసఁగివున్నారము

చ. 1: మనసునఁబట్టితే మరి దేహము గరఁగు
తనువు సోఁకితేనే చిత్తము గరఁగు
వొనరి తలఁచుకొంటే వొకటొకటికి లంకె
మనలోన నట్లానేకా మరిగివున్నారము

చ. 2: మొగము చూచితేనే మొలకనవ్వులు వుట్టు
నగవుఁజూపులనే మొగమోడును
తగి యారెంటికి సరిదాఁకి యుండునట్లానే
బిగువుఁగాఁగిళ్ల నిట్టె బెరసివున్నారము

చ. 3: సేసచేయి చాఁచితేనే చిమ్మిరేఁగుఁ దమకము
ఆసఁ దమకము చేతికందిచ్చు రతి
తాసువంటి వివి రెండు దక్కెను శ్రీవేంకటేశ
వాసితోఁ గూడితి మింత వలచివున్నారము

రేకు: 1128-3 ఆహిరి సం: 21-160

పల్లవి: ఎప్పుడునుఁ దమవార మేడనున్నాను
తప్పులు వట్టక మమ్ము దయఁ జూడుమనవే

చ. 1: పేటలైనగొల్లెతలు పిప్పిసేసి కొసరిన-
నాటివాఁడే కాఁడా తననవ్వు లేఁటివే
పాటించి యెనమండ్రు వట్టపుదేవుళ్లకింది-
మాటువాడు తానాడేమాట లేఁటివే

చ. 2: జంగిలి పదారువేలఁ జప్పుచారు సేసినట్టి-
యెంగిలిపొత్తులవాఁడు యేమి చూచీనే
అంగడి గందపుసతి అనుభవించి వేసిన-
సింగారము తానేమి చేయివట్టీనే

చ. 3: చయ్యన మధురలోని సతులచన్నుల మీఁది-
పయ్యద తా మమునేల భ్రమఇంచీనే
వొయ్యనే శ్రీవేంకటేశుఁడుద మెక్కించుక నాకు-
నియ్యరానిచన విచ్చె నెదురేడదే

రేకు: 1128-4 దేసాళం సం: 21-161

పల్లవి: ఊరకున్న వారితోడ వూరు నోప దెలిఁగవా
చేరి నాతో సుద్దులెల్లాఁ జెప్పేవుగాక

చ. 1: వద్దని నీతో నేను వాదులడిచేనా
గద్దించి యప్పటి నిన్నుఁ గాదనేనా
తిద్ది నీగుణాలు నేఁడు తీరుచవచ్చేనా
వొద్దనే నీ వెట్టుండినా నుండివిగాక

చ. 2: చలపట్టి నిను నేను సాదించవచ్చేనా
కలవి లేనివి తారుకాణించేనా
నిలువుకునిలువే నిన్ను నేరాలెంచేనా
వెలి నెంతనవ్వినా నవ్వితివిగాక

చ. 3: పంతమాడి సారె సారెఁ బంగించదొరకొనేనా
వంతులకు నంతేసి వాసిపట్టేనా
యింతలో శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యెంత చనవిచ్చినాను ఇచ్చేవుగాక

రేకు: 1128-5 రామక్రియ సం: 21-162

పల్లవి: కన్నదే కంటి గురుతుగాఁ గైకొనేవు
యిన్నిటాఁ గలపుకోలు ఇది నీకే కలదు

చ. 1: పొరుగాపె నీతోను పోరచి మాటాడితేను
పరగ నంతలోఁ గొంగువట్టేవు నీవు
సరుగ వేరొకసతి సాకిరి చెప్పవచ్చితే
సరసమాడుతా నాపెచన్ను లంటేవు

చ. 2: వాడవనిత నీతోను వట్టినవ్వు నవ్వితేను
జీడివలె నంటుకొని చేయివట్టేవు
ఆడనుండి వేరొక్కతె పాడా దిద్దవచ్చితేను
మేడెపుగాగిట నించి మెచ్చు మెచ్చేవు

చ. 3: అంగడినున్న కాంత అట్టె నిన్నుఁ జూచితేను
యెంగిలిసేసి మోవి యెలయించేవు
చెంగట నుండి నేను శ్రీవేంకటేశ్వర నీది
సంగతి గాదంటేను సరిగాఁ గూడి మొక్కేవు

రేకు: 1128-6 నాదనామక్రియ సం: 21-163

పల్లవి: నే మేమిసేతుమే నీవలనే యింతేశాయ
దోమటి వే సింగారాలు దొమ్మిసేసెఁ గదవే

చ. 1: కూరిమిగొసరఁబోతే కొప్పు గడువెడజారె
సారెఁ గొప్పు వెట్టఁబోతే చన్నులు గానఁగవచ్చె
కోరి పయ్యదిడఁబోతే కుచ్చుల వదలె నిదె
దారదప్పి జవ్వనమే తడఁబడీఁ గదవే

చ. 2: సిగ్గులువడఁగఁబోతే సెలవినవ్వుల రేఁగె
సిగ్గులనవ్వు దాఁచితే నిట్టూర్పు రేఁగె
అగ్గపుటూర్పు లాఁగితే అలపులు గడునిండె
తగ్గన నీవలపులే తడఁబడీఁగదవే

చ. 3: చేయి చాఁచఁబోతేను శ్రీవేంకటేశ్వరుఁ దాఁకె
కాయమంటి కాఁగిటనే కళలు రేఁగె
తోయపుటాకళలకు దొరకొనె వేడుకలు
చాయల నీచెనకులే సందడించీఁ గదవే

రేకు: 1129-1 గౌళ సం: 21-164

పల్లవి: తెలిసినదే నేము తేటతెల్లమిగా నిది
అలవాటు సేసేవు అందుకేమిలేవయ్యా

చ. 1: మంతనాన నతులకు మాయింటికాడనే
బంతిఁ బెట్టి వలపులు పంచిపెట్టేవు
యింతకోపినాఁటదైతే యియ్యకొనీఁగాక మమ్ము
అంత యేల లోఁచేవు అందుకేమిలేవయ్యా

చ. 2: యిక్కువ నాపానుపుపై యేడవారిఁ దెచ్చి పెట్టి
వెక్కసపుటాసలెల్ల వెదవెట్టేవు
అక్కరగలదియైతే నందుకొనీ యీచేఁత
అక్కుమీఁదికిఁ దీసే వందుకేమిలేవయ్యా

చ. 3: వాసులనీకాఁగిటిలో వారివీరిరతులెల్లా
బేసబెల్లితనానను పేరుకొనేవు
వేసరక నన్నిట్టె శ్రీవేంకటేశ కూడితివి
ఆసుద్దులే యీసుద్దులు అందుకేమిలేవయ్యా

రేకు: 1129-2 లలిత సం: 21-165

పల్లవి: నన్ను నేల సొలసేవు నగితి నింతే యిందుకు
అన్నిటా నీలాగులకు నడ్డము రాఁగలనా

చ. 1: కంచము మోవి పొత్తుల కాంతనే యిందరు నీకు
మంచముపై కెక్కినట్టు మందెమేళాలు
యెంచి నేఁడు మానుమంటే యేలమానునిఁక నిన్ను
వంచుక యేమి సేసినా వారివారి పుణ్యము

చ. 2: పిడికిటిసేసతోడి పేరంటాండ్లే ఇందరును
వొడలుసోఁకినయట్టి వుద్దండములు
జడియ నీమొగమోట సారె నీకు నేల మాను
వడిబెట్టి నిన్నుఁ బొందే వారివారి పుణ్యము

చ. 3: చలములరతికేలిసవతులే ఇందరును
ములుగోరిసరసాలమొగమోటాలు
యెలమి శ్రీవేంకటేశ యెనసితి విదె నన్ను
వలపించి చొక్కించిననవారివారి పుణ్యము

రేకు: 1129-3 నాట సం: 21-166

పల్లవి: ఇందుకేపో నీపైఁ గోప మేడనుండైనా వచ్చు
యెందుండి విచ్చేసితి వేమోయి నీవు

చ. 1: చెంత మోము చూడఁగానే చేయివట్టి తీసేవు
యెంతదయలేనివాఁడ వేమోయి నీవు
చింతతో నే నుండఁగాను చిమ్మేవు నీవేడుకలు
యెంతకక్కూర్తి కాఁడ వేమోయి నీవు

చ. 2: ముంచి కన్నీరు జాఱఁగ ముట్టేవు నాచనుదోయి
ఇచుంక తగవెఱఁగ వేమోయి నీవు
మించె నాకైతేఁ జలము మెరసీ నీకైతే నవ్వు
యెంచవు కూళతనము యేమోయి నీవు

చ. 3: అవ్వలిమోమై వుండఁగా అట్టె కాఁగిటఁ గూడేవు
యెవ్వతె నీకు నేర్పె నేమోయి నీవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ జొక్కించి
యివ్వలిమోము సేసితి వేమోయి నీవు

రేకు: 1129-4 దేసాళం సం: 21-167

పల్లవి: కోరి నిన్ని దెఱఁగక కోపగించుకొంటిఁగాక
నేరు పెంతలేకుండితే నీవు నన్నంటుదువా

చ. 1: అంది వాదులకు రావు ఆఱడిఁబెట్టుకొనవు
యెందుకైనా నౌదువు ఇది మేలయ్యా
అందగాఁడ విటువంటిఆతఁడవుగాకుండితే
చెంది మున్ను సేసినట్టిచేఁతలెల్లఁ జెల్లునా

చ. 2: వోపనన వేమిటికి వొద్ద నెవ్వరుండినాను
యేపనైనాఁ జేసేవు ఇది మేలయ్య
వైపరివి ఇటువంటివాఁడవు గాకుండితేను
రాపుల నిన్నిందరును రసికుఁడవందురా

చ. 3: వట్టిసిగ్గులు వడవు వాసులెంచవు నాయెడ
యిట్టె కాఁగిటఁ గూడితి విది మేలయ్య
ముట్టి శ్రీవేంకటేశుఁడ మోహ మింత లేకుండితే
జట్టిగొని నీమేలు సతులెల్ల మెత్తురా

రేకు: 1129-5 పాడి సం: 21-168

పల్లవి: ఎప్పుడు నీవారమే యేడనుండినా
నెప్పునఁగట్టినపుస్తె నీకుఁగానే కాదా

చ. 1: పిప్పిగట్ట నేవేల ప్రియములు చెప్పేవు
అప్పుడే నే జెప్పింపనా ఆకెతోను
చిప్పిల నీవంతయేల చేయివట్టి పెనఁగేవు
చప్పునాయ వలపులు చాలునని యననా

చ. 2: జిడ్డుదేర నీవేల చేతులు పైఁజాఁచేవు
గడ్డెము వొద్దని నీకుఁ గమ్మ లంపనా
వొడ్డుకోఁగా నీవేల వూరకే కాఁగిలించేవు
జడ్డుపడెఁ దమకము సటలేఁటికననా

చ. 3: పచ్చిగా నీవింత యేల పైపై నన్నుఁ గూడితివి
కచ్చుపెట్టి వుంకువ వుంగర మంపనా
మెచ్చి శ్రీవేంకటేశుఁడ మీరి నన్నుఁ బొగడేవు
విచ్చనవిడాయ నీకు వెఱపేఁటికననా

రేకు: 1129-6 హిందోళవసంతం సం: 21-169

పల్లవి: వద్దువద్దు అంతేసి వైతాళాలు
వుద్దండాలు సేయఁబోతే వుట్టిలేక వూఁగవా

చ. 1: సిగ్గువడి నే నీచేతికి లోనైతినంటా
వెగ్గళించి యెమ్మెలేల వెదచల్లేవు
అగ్గలమైన నే నిన్ను అందుకు మీఁజూచితే
బెగ్గలి మచ్చరములే పెరుగుతానుండవే

చ. 2: మొగమోటతోడ నే నీముందర నుందాననంటా
నగుతా నీసుద్దులేల నారువోసేవు
మగటిమి నే నీకు మారుకు మారు సేసితే
చిగిరించి పంతములే చిమ్మిరేఁగవా

చ. 3: ఆసపడి నేను నీయాలనై వుందాననంటా
వాసులకు నన్నునేల వలఁబెట్టేవు
వేసరక నేనే శ్రీవేంకటేశ కూడితిని
తాసువంటివలపులు తారుమారు గావా

రేకు: 1130-1 సామంతం సం: 21-170

పల్లవి: మీరు నేరుతురు మీఁద మిక్కిలి గలితే
వారివీరి నడిగితే వంకలొత్తేరా

చ. 1: చెప్పరాని చేఁతకు మీచిత్తములే గురిగాక
ఇప్పుడు మాకేల పెట్టి రింతేశానలు
తప్పులు దిద్దేమా మిమ్ము దండనుండేచెలులము
ముప్పిరి వేఁడుకొంటానే మొక్కేవారము

చ. 2: గుట్టుతో మీపంతాలకు కొనగోళ్లే గురిగాక
బెట్టి మమ్మేల తోడుగాఁ బిలిచేరు
రట్టుసేసేమా మిమ్ము రచ్చల నిచ్చకులము
చుట్టపువరుసలే చూపేవారము

చ. 3: నిండుమీకాఁగిళ్లకు నేరుపులే గురిగాక
దండివూడిగేలమాతోఁ దలపోఁతురా
కొండలశ్రీవేంకటేశ కోమలిఁ గూడితి విట్టె
మెండుతీసేయా మిమ్ము మెచ్చేవారము

రేకు: 1130-2 భైరవి సం: 21-171

పల్లవి: ఏఁటికి నెగ్గులువట్టే విందుకు నీవు
కూటముగలుగుచోట గుటు మేలుగాదా

చ. 1: తెగనాడరాదు గాక తెలిసిన ప లకు
నగరాదా నిన్నుఁజూచి నాకుఁ గొఁత్తైనా
జగడించవద్దుగాక చనవుగలుగుచోట
సగముచూపులు చూచి సాదించరాదా

చ. 2: పదరఁగరాదుగాక పాయరానిచోటికి
వొదిగి నివ్వెరగుతో నుండఁగరాదా
అదలించవద్దుగాక ఆసలెల్లఁ బెట్టుకోఁగ
వదలక అంతేశాల వద్దనఁగరాదా

చ. 3: గుఱి సేయరాదుగాక కూడినకూటములకు
చెఱఁగువట్టి బలిమి సేయఁగరాదా
యెఱిఁగి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
తఱి దూరవద్దుగాక తలపించరాదా

రేకు: 1130-3 ముఖారి సం: 21-172

పల్లవి: ఆయనాయఁ బదపద అట్టె తన్ను రమ్మనవే
దాయగాఁ డెట్టైన నాడు తనకేమి యనవే

చ. 1: పడఁతులనెల్లఁ గూడి బమ్మచారి నను కొనె
జడియక తాను సత్యసందుఁడుగదె
బడి బడి మాతోను బాసలు సేయక తాను
విడిచినా అటువంటివియే కాదా ఇఁకను

చ. 2: పనులన్నిటిఁ గాచి పట్టపురాజాయ తాను
దెసల నీపనులకు దేవరగదే
యెసఁగి మమ్మెల్ల నిట్టె యేలక తా మానీనా
కొసరితే ఇక్కడా నాగుణమేకదే

చ. 3: వెన్నలెల్లా దొంగిలి శ్రీవేంకటేశుఁడైనాడు
వున్నతి దనకుఁ గలవోజేకదే
మన్నించి నన్నిట్టె కూడె మనసు తాఁబట్టెనా
యెన్నికలు మాయెడకు యిట్టి వేకదవే

రేకు: 1130-4 కాంబోది సం: 21-173

పల్లవి: కానీవయ్య అందుకేమి కనుకొనే మన్నియును
తేనెలమామోవితీపు దిమ్ము రేచును

చ. 1: నగినట్లనె వుండు నాతోడి పొందులు
చిగురించc జిగురించ చేcగలెక్కును
యెగసక్యాలై యుండు ఇప్పుడు నేనన్నమాట
తెగరాని ఆసలతో తీగెసాగును

చ. 2: దక్కినట్లనే వుండు తతి నాతో చేతలెల్ల
చిక్కినప్పుడు చేతికి జిడ్డుదేరును
లెక్కసేయనట్లుండ్లు లేcతమాసరసాలు
వక్కణతో వలపు పూవక పూచును

చ. 3: పట్టినట్లనే వుండు పై పై మాతో పంతములు
మట్టుపెట్టి ముయికి ముయి మళ్లించును
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
పట్టినచలములెల్లా పంటవండును

రేకు: 1130-5 కేదారగౌళ సం: 21-174

పల్లవి: అన్నియుఁ జక్కనయ్యీని అందుకేమిలేవయ్య
నున్ననివలసే కాదా నూఁగులెక్కెఁగాక

చ. 1: సారె నీవాడె వెల్లా చల్లనిమాటనే కావా
వేరేసతులఁ గూడఁగ వేఁడాయఁ గాక
మేరతో నవ్వేదెల్లా మించువెన్నెలలే కావా
యీరనపువారివల్ల యెండలాయ గాక

చ. 2: మక్కువ నీనిలువెల్లా మంచితనమే కాదా
వెక్కసానఁ దిరుగఁగ వెట్టాయఁగాక
పక్కన నీమోవెల్లాఁ బచ్చితేనెలే కావా
వుక్కపలుసోఁకులను వొగరాయఁగాక
చ 3: కందువ నీకాఁగిలెల్లా కామనిధానమే కాదా
అందునిందు నంటుముట్టు లాయఁగాక
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
సందడి నన్నిటివల్లాఁ జవులాయఁగాక

రేకు: 1130-6 దేశి సం: 21-175

పల్లవి: ఆఆడిఁ బెట్టక మాతో నానతీవయ్యా
మీఱరాదు ఇచ్చకపుమీవారమే నేము

చ. 1: చుట్టరికముసేసుక సుద్దులెల్లఁ జెప్పేవు
నెట్టన నీరచలు నిజమా యిది
చెట్టాపట్టు వట్టుక సిగ్గులు విడిపించేవు
నట్టపడుమ నివెల్లా నమ్మవచ్చునా

చ. 2: సారె సారె నియ్యరానిచనవులెల్లా నిచ్చేవు
కోరి యివెల్లా నియ్యకోలవునా
పేరడిగా నపులే పెనఁచేవు నాతోను
సారెకు విలువలెనే సతములయ్యవా

చ. 3: పరపుపైఁ బవళించి బాసలెల్లాఁ జేసేవు
అరనే నింకొక్కమాఁటు అవునా యిది
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మురిపెముతోడుతను మొక్కుదునా యిందుకు

రేకు: 1131-1 శ్రీరాగం సం: 21-176

పల్లవి: ఇంకనేల రావమ్మ ఇన్నియుఁ జెల్లెను నీకు
సుంకునీమతకములు చూపి చెప్పఁగలనా

చ. 1: గొందినున్న నీమేని గురుతులు చూచేనంటే
గందము వూసినమీఁదఁ గానరాదుగా
కందువ నీమోములోనికళలు దెలిసేనంటే
సందడినవ్వులలోన చక్కఁగా నణఁగెఁగా

చ. 2: నిట్టూరుపులోనైన నిన్ను నేర్పరచేనంటే
జట్టిగొని నాముందర సాముసేసేవు
చిట్టకపుఁబులకలు చెక్కుల నరసేనంటే
గట్టిగా నన్నిట్టె బిగ్గఁ గాఁగిలించుకొంటివి

చ. 3: దిట్టనై నీకనుచూపుతేటలు దెలిసేనంటే
గుట్టున నన్ను రతులఁ గూడితి విట్టె
నెట్టన శ్రీవేంకటేశ నిన్ను నే నడిగేనంటే
రట్టడితనాల నింత రచ్చలకెక్కితివి

రేకు: 1131-2 ముఖారి సం: 21-177

పల్లవి: ఇందుకుఁగా నీవేల యెమ్మెలాడేవు
అందరిముందర నాపె నాఁబడిఁబెట్టెదరా

చ. 1: పడఁతికి వయసనేబలుగర్వ మొకటి
కడుఁజక్కఁదనములగర్వ మొకటి
బెడిదంపునిన్నువలపించినగర్వ మొకటి
జడియఁగ నీతో రాజసము చూపఁదగదా

చ. 2: సరిఁ గొండలంతేసిచన్నులసంపదొకటి
సరవిఁ గళలునిండుసంప దొకటి
గరిమతో మేనిసింగారపునంప దొకటి
దొరతనమే నీవద్ద తోడుచూపఁదగదా

చ. 3: చనవునీవిచ్చినట్టి సామ్రాజ్య మొకటి
మనికై నమదనసామ్రాజ్య మొకటి
యెనసితివి శ్రీవేంకటేశ యింతి నింతలోనె
వెనుకొని నీవలెనే విఱ్ఱవీఁగఁదగదా

రేకు: 1131-3 సామవరాళి సం: 21-178

పల్లవి: ఎట్టున్నదో నీమనసు యెఱఁగ నేను
వెట్టి కొసరులు నీపై వేయఁగవచ్చేనా

చ. 1: అప్పుడు నీవాడినట్టి ఆమాఁటపట్టుకే, మోవి
పిప్పిగట్ట సారె సారెఁ బెనఁగేఁగాక
వుప్పతించి వొలసియునొల్లనివల పెప్పుడు
చప్పనే కాదా నిన్ను సాదించవచ్చేనా

చ. 2: మచ్చిక నీవు మొదలమన్నించినమన్ననకు
చెచ్చెర నీకొలువు సేసేఁగాక
ముచ్చటదీరఁగ నీకు మొగచాటైనమాఁటలు
తుచ్చములే కావా నీపై దొరలించేనా

చ. 3: గక్కున నన్నుఁ గాఁగిట కాఁగిలించినందుకే
లక్కవలె నిన్ను నేఁ గలసితిఁగాక
యిక్కువ శ్రీవేంకటేశ యింతేసి సేసినందుకు
చొక్కపుమేలే యింకా సోదించేనా

రేకు: 1131-4 మంగళకౌసిక సం: 21-179

పల్లవి: ఏలయ్య మా కంతేసియెమ్మెలు నీతో
నాలావుకలిములు నన్ను నీవెఱఁగవా

చ. 1: పంతము నీతో నాడేపలుకులవారమా
వంతుకు నీసేవసేసేవారముగాక
జంతలవలెను నిన్ను సాదించేవారమా
దొంతిఁ గొంగువట్టితేను తోసేవారముగాక

చ. 2: అచ్చలాన నీతోడ నలిగేటి వారమా
వచ్చి తలవంచుకుండేవారముగాక
కొచ్చి కొచ్చి నీతోడ కొపగించేవారమా
తుచ్చపుగోర నూఁదితే దూరేవారముగాక

చ. 3: చేరి నన్నుఁ గూడఁగాను చేయివట్టేవారమా
వారించి సిగ్గులు వడేవారముగాక
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నేరమివట్టేవారమా నీవారముగాక

రేకు: 1131-5 బౌళి సం: 21-180

పల్లవి: ఊరకే కోపగించకు వోహో నీవు
కారణములేనివాదు కాంతకు లేదు

చ. 1: నెపములేక నిన్ను నెలంత మాటాడీనా
వుపమించుకొనలేక వుసురనేవు
నిపుణతఁ దలంచుకొని నీవు మఱచితివేమో
కపటము లే దాపె కల్లలాడదు

చ. 2: నీవుసేయనిపనులు నింద నీపై మోపీనా
భావించలేక యెగ్గులుపట్టనేఁటికి
చెవదేరఁ బరాకుసేసితివేమో నీవు
వేవేలకు నాపె కవివేకము లేదు

చ. 3: చవులు నీవు చూపక చనవులు మెరసీనా
యివల సెలవినవ్వు యేల దాఁచేవు
రవళి శ్రీవేంకటేశ రతి సిగ్గువడేవేమో
కవగూడ నాపె నిన్నేగతిఁ బాయదు

రేకు: 1131-6 నాదనామక్రియ సం: 21-181

పల్లవి: ఎటువలెఁ జేసితివో యెఱఁగ మెన్నఁడును
ఘటియించవయ్యా మాతో కందము నీసుద్దులు

చ. 1: పూసినకస్తూరి పూఁత పొంచినట్టినడురేయి
వోసరించి మాయధర ముట్టిపై పాలు
ఆసపడి గొల్లయిండ్ల నల్లఁవాడు సేసినట్లు
సేసి చూపవయ్య మాకు చిత్రము నీసుద్దులు

చ. 2: అదె మాసెలవినవ్వు యమునలోని వెన్నెల
చదురుసరసాలు రాసక్రీడలు
తుదిముట్ట గొల్లెతల తొల్లి నీవు సేసినట్లు
యిదె మాతోఁ జేయవయ్య యెట్టివో నీసుద్దులు

చ. 3: ఇక్కువ బృందావనము ఇచ్చుట మాజవ్వనము
చక్కనిసతుల పొందుసరి నాపొందు
చిక్కి శ్రీవేంకటేశ్వర చిన్ననాఁడు గొల్లెతల
చొక్కించినట్టె చొక్కించు చూతము నీసుద్దులు

రేకు: 1132-1 దేశాక్షి సం: 21-182

పల్లవి: దేవుఁడు దేవియు వారే తెరవేసితిమి మన-
మీవల నుందము మరి యేమీ ననవలదు

చ. 1: మంతనములే సుమ్మీ మనసులలోపలి-
వింతలైనసిగ్గులెల్ల విడిపించేవి
దొంతులైన కోరికలే తోడఁదోడఁ దిరిగాడి
సంతతపువెఱపుల చలివాపేవి

చ. 2: పాయపుమదాలే సుమ్మీ పలుకులు వొనగూర్చి
బాయిటనుండే వొడఁబాటు సేసేవి
చాయలసరసములే నందులు గొందులు దూరి
కాయము కాయము నంటఁ గాఁగిలింపించేవి

చ. 3: చూపులుఁ జూపులే సుమ్మీ సూదువట్టి మర్మములు
రాపులఁ దలచినట్టు రతులిచ్చేవి
యేపుల శ్రీవేంకటేశుఁ డీకెయుఁ గూడి రిద్దరు
దాపులైనవలపులే తమిరేఁచేవి

రేకు: 1132-2 ధన్నాసి సం: 21-183

పల్లవి: వలచుటే దోసమా వనిత నీ కాతఁడు
నలువంక మరి యేఁటినవ్వులు నవ్వేవే

చ. 1: పంతమెల్ల నీమాటపట్టులోననే వున్నది
చింతలెల్ల నీచెక్కుచేత నున్నవి
వింతలిన్నియును నీనివ్వెరుగులలో నున్నవి
యెంతకెంత పతి నింకా యేఁటికి దూరేవే

చ. 2: బిగువెల్ల నిపుడు నీపెదవులపై నున్నది
తెగువలు నీకన్నులతేట నున్నవి
అగడింతా నీపొలయలుకలలో నున్నది
యెగసక్కే లాతని నేఁటికి నాడేవే

చ. 3: గబ్బితనమెల్లాను నీకాఁగిటిలోనే వున్నది
నిబ్బరము నీవుండేటినీటులో నున్నది
అబ్బురమై శ్రీవేంకటాధీశుఁడు నిన్నుఁ గూడె
వుబ్బున నీతనికెంత వొరటులు చూపేవే

రేకు: 1132-3 కాంబోది సం: 21-184

పల్లవి: ఏమి సేతు నమ్మలాల యిదివో నాకాపిరము
కామించి వలపు పతికాఁగిలే కోరీని

చ. 1: కాయమే కాఁకలఁ బొందీఁగానీ రమణునిఁ బాసి
పాయమే చిగురించీఁ బైపైనే
చేయి చెక్కిటిమీఁదఁ జింతలు రేఁచీఁగానీ
యేయెడఁ గనుచూపులు యెదురే చూచీని

చ. 2: పనివూని పయ్యదే పైపై జారీఁగానీ
ఘనమైన చన్నులైతే గట్టులయ్యీని
గొనకొన్న విరహము కోపము పుట్టించీఁగానీ
ననుపుల సెలవులు నవ్వింపించీని

చ. 3: గారవపునాకాఁగిలి కారాలు పుట్టించీఁగానీ
వూరేటిమోవితేనెలు వుట్టిపడీని
యీరీతి శ్రీవేంకటేశు డింతలో నన్నుఁ గలసె
తేరేటిమోముకళలు తెలివిసేసీని

రేకు: 1132-4 వరాళి సం: 21-185

పల్లవి: నీకే తెలుసునయ్యు నీవు సేసినచేఁతలు
కూకులువత్తులు సేసె గుట్టుతోనే సిగ్గులు

చ. 1: పంతాలు నీతో నెరపి పఁడతి నిన్నిందరిలో
యింతేసిమాట లాడీ నెంతచనవో
వంతువరుసలవారు వాకిటఁ గాచుకుండఁగా
దొంతివెట్టీ నవ్వులెల్లా దొరతన మెట్టిదో

చ. 2: అయాలాంటి చదురంగ మాడుదువు రమ్మంటా
యీాయెడ నీచేయివట్టీ నెంతపగటో
బాయిటఁ జెలులతోడ పచారించి నీతోడ
దాయిగాఁగఁ బవళించీఁ దన కెంత చెల్లునో

చ. 3: విచ్చనవిడిని మొక్కి వీడెము వేసుకొమ్మంటా
యిచ్చకము సేసీ నీకు నెంతనేరుపో
ఇచ్చట శ్రీవేంకటేశ ఇందరిఁ గూడినయట్టె
యెచ్చి కూడితివి తన కెంతమేలు చేరెనో

రేకు: 1132-5 కాంబోది సం: 21-186

పల్లవి: నీ విన్నిటా ఘనుఁడవు నే నెఱఁగనా
యీవల నావల సుద్దులెల్ల నాకుఁ జెప్పేవు

చ. 1: మంతనాన నేను నీమనసెల్లఁ గనుఁగొంటి
వింతలై నీమాటలెల్ల వేలుచుకొంటి
వంతులు వెట్టుక నీవలపెల్లఁ దెలిసితి
యెంతకెంత నీగుణము యేల మాకుఁ జెప్పేవు

చ. 2: కడల నీవిద్యలు ఇక్కడనే విచారించితి
బడి నుండి నీలాగు భావించితి
వుడుగక నీతో నవ్వి వోరుపు విచారించితి
యెడలేక నీనేరుపు లేల నాకుఁ జెప్పేవు

చ. 3: నిన్నుఁ గాఁగిటనే కూడి నెయ్యమెల్లాఁ జేకొంటి
చన్నుల నొత్తి నీమోవి చవిగొంటిని
యిన్నిటా శ్రీవేంకటేశ ఇచ్చకములు మెచ్చితి
యెన్నటి కిది గురుతు యేల నాకుఁ జెప్పేవు

రేకు: 1132-6 గౌళ సం: 21-187

పల్లవి: ఏల భేదాలుసేసేవు యేమి గట్టుకొంటివి
రేలునుఁ బగళ్లు యిద్దరికిఁ బొత్తు గాదా

చ. 1: వావియెల్లా నొకటే వరుస లెంచిచూచితే
నీవు మేనభావపు నే మఱఁదల
యీవల వలపునూ ఇద్దరి కొక్కటే నీవు
ఆవటించి మొగవాఁడ వాఁటదాన నేను

చ. 2: మనసెల్లా నొక్కటే మదనకేలిలోన
వినయము నాది రతివెరగు నీది
ననుపెల్లా నొక్కటే నగవులలోపలి-
చెనకులు నీచేతివి సిగ్గులు నామేనివి

చ. 3: కాఁగిలియు నొక్కటే కమ్మినభోగములోన
పాఁగినది నీమోవి ఆపసలు నావి
వీగక యిద్దరము శ్రీవేంకటేశ కూడితిమి
రాఁగినతమకములరచన లిదరివి

రేకు: 1133-1 భూపాళం సం: 21-188

పల్లవి: కన్నులనే దీపావళి కడుఁజన్నుల యుగాది
యెన్నికలు నీకుఁ జేసె యియ్యకొనవయ్యా

చ. 1: అంగన మోముకళల నట్టె పచ్చఁగా నలికి
ముంగిట నవ్వులనే ముద్దులు వెట్టె
ఇంగితపుచూపుననే యదురుకొనెఁ బండుగ
సంగడిఁ గూచుండవయ్యా చక్కెరమోవి విందు

చ. 2: కప్పినసిగ్గులనెల్లఁ గలపడములు గట్టె
ఇప్పుడె సరసముల నిచ్చె విడేలు
చిప్పిలుఁ జెమటలనే శిరసు మజ్జన మార్చె
కప్పెఁ బయ్యద కట్నాలు గైకొనవయ్యా నీవును

చ. 3: అట్టె కాఁగిటఁ గావించె అంగరంగవైభవాలు
ముట్టినమీచెనకులు ముయికి ముయి
ఇట్టె శ్రీవేంకటేశ ఇంతి నిన్ను నిట్టె కూడె
గట్టిగాఁ జేకొనవయ్యా కందువసోబనాలు

రేకు: 1133-2 దేశాక్షి సం: 21-189

పల్లవి: ఊరకుంటే నెఱఁగవు వొకటొకటాడేవు
నేరుపులమాబీరాలు నీవే యెఱుఁగవా

చ. 1: చలము సాదించఁగాక చక్కెరనీ మోవియెల్ల
పులివచ్చి సేయనా వొక్కమాఁటే
బలిమి చూపఁగాక పంతపునీమేనెల్ల
కులికి నాకుచముల కుమ్మెలుగాఁ జేయనా

చ. 2: బతిమి చెరుచఁగాక భ్రమయించి నీమనసు
వ్రతము వట్టించనా వలపులను
మితిమీఱఁగాక నీమిక్కు టపురతులలో
తతిగొని పాదమునఁ దాటించి నవ్వంచనా

చ. 3: పంగించఁగాక నిన్ను పైకొని కూడి ఇప్పుడు
యెంగిలిగాఁ జేయనా ఇన్నిటా నేఁడు
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
సంగతి నాచెమటల జలకమాడించనా

రేకు: 1133-3 ఆహిరి సం: 21-190

పల్లవి: ఏల సిబ్బితిపడేవు; యేమి సేసేది; నీవు
యేలిక విందరికైతే ఇంతలోనే తప్పెనా

చ. 1: చెనకి నీమదిలోని సిగ్గులు వాపేకొరకే
ననుపుసేసుక నీతో నవ్వితి నేను
మనసు రంజిల్లఁజేసి మాటలాడేకొరకే
చనవుసేసుకొని సరుసఁ గూర్చుంటిని

చ. 2: ముంచిననీమొగమోటములు దీరిచేకొరకే
వంచనతో నీయింటికి వచ్చితి నేను
కొంచిననీమేనియళుకులు మానిపేకొరకే
అంచెలఁ బైకొంటి నీకంటె ముందు నేను

చ. 3: చేసిననీచేతలెల్లా జెల్లఁబెట్టేటికొరకే
మూసి దించి కాఁగిలించి మొక్కితి నీకు
వాసుల శ్రీవేంకటేశ వలపుఁరేఁచేకొరకే
రాసికెక్కి నీకిచ్చకురాల నైతి నేను

రేకు: 1133-4 శుద్ధవసంతం సం: 21-191

పల్లవి: నీపాలిటికి నాపె నిధియు నిధానము
చేపట్టి నేఁ డింతగాఁగ సేవసేసె నీకును

చ. 1: ఇంతేసి వెంగములాడ నెవ్వతైనా నేర్చునా
పంతమాడి నీకొంగు పట్టనేర్చునా
వంత నిన్ను వలపించి వంచుకొననేర్చునా
ఇంత సేసి యాపెగాఁగా నీడేరించె నిన్నును

చ. 2: పచ్చిగా నిన్నెవతైనా భ్రమయించనేర్చునా
రచ్చవేసి ఇందరిలో రవ్వసేసునా
ముచ్చటాడి నీచేతుల మొక్కించుకోనేరుచునా
యెచ్చి యాపెగాఁగా యీడేరించె నిన్నును

చ. 3: కలసి నిన్నెవ్వతైనా కళలురేఁచనోపునా
చలివాపి నవ్వింపించి జాణఁ జేసునా
యెలమి శ్రీవేంకటేశ ఇంతలోనే నిన్నుఁ గూడె
బలిమి ని న్నాపెగాఁగా పనిగొనె నిన్నును

రేకు: 1133-5 వేళావళి సం: 21-192

పల్లవి: మిక్కిలి విచ్చి చెప్పితే మేడిపంటిబోన మిది
తొక్కుమెట్టుసందడెల్ల తోదోపులే కావా

చ. 1: చాయలకే మాటలాడి చనవులుమెఱసేవు
యీయెడఁ దెలుసునే మీకిద్దరికిని
నాయ మే మడిగేవే నన్ను నీ వింతటిలోనే
మాయదారిసుద్దులెల్ల మఱఁగులేకావా

చ. 2: గిలిగింతనవ్వు నవ్వి కిందుమీఁదుఁ జూచేవు
నిలువుల నున్నవే మీనేరుపులెల్లా
మలసి మీసరితలు మాకేమి అప్పగించేరే
కొలఁదిలేనివలపు గుమితమే కాదా

చ. 3: భావపురతిఁ గరఁగి పైఁ జేయివేసేవు
వావిరిఁ దేటపడె మీవగలెల్లను
శ్రీవేంకటేశుఁడు నీవు సిగ్గు లిందేల పడేరే
కూవలై వున్నవి మీగుట్లింతే కావా

రేకు: 1133-6 శ్రీరాగం సం: 21-193

పల్లవి: జవ్వనము పంటవండి సరి ముంగిటికి వచ్చె
యెవ్వరిమాటలు నేల యింతిఁ జేకొనవయ్యా

చ. 1: తేటతెల్లమిగ నవ్వి తేనెగారేమాట లాడి
కాటుకకన్నులఁ జూచీ కాంత నిన్నును
వాఁటమాయ వలపులు వడ్డివారీ తమకము
యేఁటికి జోలిసేసేవు ఇంతిఁ జేకొనవయ్యా

చ. 2: సరసము నీపైఁ జల్లి సన్న లిన్నియునుఁ జేసి
వరుసవంతులు వేఁడీ వనిత నిన్నును
సరవాయ కోరికలు చవులాయ వేడుకలు
యెరపు లింకానేల ఇంతిఁ జేకొనవయ్యా

చ. 3: చెక్కు కొనగోళ్ల నొక్కి చేయివట్టి నినుఁ దీసి
గక్కనఁ గాఁగిలించెను కాంత నిన్నును
యిక్కువ శ్రీ వేంకటేశ యీకె నిన్నుఁ గూడి మెచ్చె
యిక్కడనే మేలుచేరె యింతిఁ జేకొనవయ్యా

రేకు: 1134-1 కురంజి సం: 21-194

పల్లవి: చెల్లుబడిగలవేళ సిగ్గువడవే నీవు
యెల్లవారిలో నీకు యెన్నికలు గావా

చ. 1: తగవరిమాఁటలు తతిఁ జూపులతేటలు
నిడిడి నీవే లెస్స నేరిచితివే
జగడాలడిచేవేమే సవతులతోనెల్ల
మొగుఁడు చూడఁగ నీకు మురిపెముగాదా

చ. 2: సారెఁ జాఁచేచేతులు జంకెనలరీతులు
నీరపమాయఁ గనక నేరిచితివే
బీరము లాడేవేమే పెద్దపెద్దయెలుఁగుల
యీరీతిఁ బతిముందర యెమ్మెలు గావా

చ. 3: బచ్చెననీరవ్వలు పకపకనీనవ్వులు
నిచ్చలు నిచ్చలు నీవే నేరిచితివే
యిచ్చుట శ్రీవేంకటేశు నెనసితి వీఁకనేమే
గచ్చు లాతనివొద్ద ఘనతలు గావా

రేకు: 1134-2 శంకరాభరణం సం: 21-195

పల్లవి: నీవే ఆనతియ్యవయ్య నీచెప్పినట్టు సేసే
భావించి రెంటికిఁ గాక భ్రమసివుందానను

చ. 1: కొచ్చి కొచ్చి నే నిన్నుఁ గొసరఁగఁబోతేను
రచ్చలలోని సతులు రట్టడందురు
వొచ్చెములు నిన్నెంచక వూరకే నే నుండితేను
యిచ్చకురాలు మరేమీ నెఱగదందురు

చ. 2: జిగి నిన్ను రమ్మంటాఁ జేయివట్టి తీసితేను
మగవాని నింతసేసె మంకుదందురు
వెగటులేక నిన్ను విచ్చనవిడి సేసితే
అగపడె నిది యెంత అధమురాలందురు

చ. 3: వేవేలుగా నీకు వినయాలు సేసితేను
చేవదేర మాయదారిచేఁత దందురు
శ్రీవేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
నీవురముపై నుండఁగ నీవేనందురు

రేకు: 1134-3 ధన్నాసి సం: 21-196

పల్లవి: ఈఁతడు నీవసమాయ నిఁక నెన్నఁడు
చేతులార వూడిగాలు సేయవమ్మ ఇపుడు

చ. 1: నిన్నే చూచీ నాఁతడు నీమొకమై యున్నవాఁడు
విన్నపాలు సేయవమ్మ విభునితోను
నున్ననిమాఁట లాడఁగ నొసలెల్లఁ జెమరించె
తిన్ననికస్తూరిబొట్టు తిద్దవమ్మా దగ్గరి

చ. 2: పూనిపట్టి నవ్వునవ్వి బుజముపైఁ జేయివేసె
కానిక లియ్యవమ్మా కాంతునికిని
ఆనుక చన్ను లొత్తఁగా నంగమెల్లాఁ జెమరించె
మేనిపైఁ గప్పఁగరాదా మెఱుఁగునీపయ్యద

చ. 3: గక్కున విడెమువెట్టి కాఁగిట నిన్నుఁ గూడె
యెక్కవమ్మా శ్రీవేంకటేశువురము
మొక్కులు నీవు మొక్కఁగా ముంచేను నిట్టూర్పులెల్లా
తొక్కవమ్మా పాదమున తోడుతనే పెండ్లి

రేకు: 1134-4 గౌళ సం: 21-197

పల్లవి: ఆతఁడు నీవు నేకమై అనుభవింతువుగాక
రీతిగాని చలములు రేచఁగారాదమ్మా

చ. 1: మారుమాట లేమిటికి మంతనము లేమిటికి
కూరిమిగలవారికి కొన్నదే కోలు
నేరుపరివిభుఁడు నీవద్దికి వచ్చె
బీరపునీయలుకలు పెంచఁగరాదమ్మా

చ. 2: మల్లాడనేమిటికి మాటలాడనేమిటికి
చెల్లుబడి గలితూ సేసినదే చేఁత
కొల్లలుగా నానలు వెట్టుకొని పతి నమ్మించె
పల్లదపు నీవెంగేలు పనికిరాదమ్మా

చ. 3: సిగ్గువడనేమిటికి చెక్కుచేయి యేమిటికి
అగ్గమై మీలోనఁ బట్టినదే పంతము
వొగ్గి శ్రీవేంకటేశుఁడు వొనగూడె నిన్ను నిట్టె
వెగ్గళించి నిఁకనేమి వెలితిలేదమ్మా

రేకు: 1134-5 రామక్రియ సం: 21-198

పల్లవి: ఏమిసేయుమనేవయ్య యింకా నన్ను
నీమీఁదిప్రేమకు కరుణించఁగవద్దా

చ. 1: చెప్పిననీ మాఁటలెల్లా చెవియొగ్గి వింటి నేను
కప్పురవిడె మియ్యఁగాఁ గైకొంటివి
అప్పటి నే నేమిసేతు నాఁటదాన నింతే నేను
తప్పునీపట్టుకు దయఁదలఁచవద్దా

చ. 2: అంగవించి పిలువఁగ నట్టె దగ్గరివచ్చితి
కొంగువట్టి తియ్యఁగానే కూచుండితి
సంగ తానతియ్యవయ్య నన్నుపుగొలదాన
చెంగట మొక్కేను కృపసేయఁగవద్దా

చ. 3: నీవు గాఁగిలించఁగాను నీచేతఁకు లోనైతి
వావిసేసుక నవ్వితే వసమైతిని
శ్రీవేంకటేశ నీసేసపెండ్లిదాన నింతే
కేవలమై యిఁక కనికరించవద్దా

రేకు: 1134-6 కన్నడగౌళ సం: 21-199

పల్లవి: ఇంతి నిన్ను దూరఁజాల దెంతైనను
వంతువట్టె నీకు నేఁడు వలసినవూహలు

చ. 1: సెలవుల నగఁగానే చెక్కులెల్లాఁ జెమరించె
వలవనిగాసిఁ బెట్టవద్దు ఆపెను
వలిపపయ్యదంటఁగా వాన గురిసెఁ గన్నీరు
తలఁచుకో నీచేసినతప్పులెల్లా నందును

చ. 2: మాటలు నీవాడఁగానే మచ్చరపుఁజూపు లెచ్చె
వాఁటముగాఁ జండిపెట్టవద్దు ఆపెను
పాటించి వేఁడుకొనఁగా పలునిట్టూర్పు లు రేఁగె
యేఁటివో నీసరితలు యెఱుఁగుకో అందును

చ. 3: ముంచి నీవు చూడఁగానే మోమునఁ గళలుదేరె
వంచనతోఁ గొనియాడవద్దు ఆపెను
అంచెల శ్రీవేంకటేశ అన్నిటాఁ దనిసే నాసె
నించి నీవే తెలుసుకో నీవుపకారములు

రేకు: 1135-1 శంకరాభరణం సం: 21-200

పల్లవి: ఇందుకుఁగాఁ గొస రేఁకనేలా
చెంది నీపనుపు సేసేమయ్యా

చ. 1: పలుమారు నీతో బంతములాడఁగఁ
గలిగినవలపులకసి వోదు
చలమున నీతో జంకించఁగా
తలఁచినతలఁపులతహతహ వోదు

చ. 2: వట్టికోపమున వాదులడువఁగా
వెట్టికి నెంజెరివియుఁ బోదు
దట్టించి నిన్నును తగవులఁ బెట్టిన
పట్టినసూడునుఁ బాడునుఁ బోదు

చ. 3: పేరుకొనుచు నినుఁ బెదవులఁ దిట్టిన
ఆరీతికాఁతాళ మటు వోదు
యీరీతి శ్రీవేంకటేశ కూడితివి
నేరుపు నేరమి నీకే పోదు

రేకు: 1135-2 సాళంగనాట సం: 21-201

పల్లవి: మాకేల అంతేసి నీతో మారుమలయ
యీకడివారితో యీడు కెనసేవుగాక

చ. 1: పంతగత్తైనా నీతోఁ బలుమారు జగడించ
వంతుదానసనా నీతో వాసులెంచను
యెంతకెంత యేమయ్య నిన్నే మాకుఁ జెనకఁగ
బంతివారితోడట్టు పాలించేవు గాక

చ. 2: మెచ్చునివారమా నిన్ను మీఁద మీఁద దప్పు లెంచ
మచ్చరములా నీతో మారుకొనను
కుచ్చిత మెఱుఁగుదునా గొరబు నిన్నేల సేసే
మచ్చికసతులపాడి మన్నించేవుగాక

చ. 3: సరివెనఁగేమా నీతో సాములుసేయఁగ నేము
పొరుగుపోరచా నిన్ను బూమెలు సేయ
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వరుసవారికివలె వలచేవుగాక

రేకు: 1135-3 బౌళి సం: 21-202

పల్లవి: ఒక్కట మీరిద్దరు నహోబలేశ
వుక్కళమై కాచుకొండహోబలేశ

చ. 1: మారుకొండ లెక్కి వచ్చి మంకువాపె లకిమమ్మ
వూరె నీసెలవినవ్వహోబలేశ
తేరి చూచి నీమారు దేవతలఁ గరుణించె
వూరటాయ నీకాపె యహోబలేశ

చ. 2: గొబ్బున నీతొడ యెక్కి కొసవెండ్రుకలు దువ్వి
వుబ్బించీ నిన్నిపుడే యహోబలేశ
నిబ్బరపుఁజేతులను నిన్నుఁ గాఁగిలించి పట్టి
వొబ్బిడిఁ దా మెరసె నహోబలేశ

చ. 3: మొల్లమినవ్వులతోడ మోవితేనె విందువెట్టి
వుల్లమెల్లఁ గరఁచె నహోబలేశ
యిల్లిదె శ్రీవేంకటాద్రి విరవై తనచన్నుల-
వొల్లనె నాఁటించీ ని న్నహోబలేశ

రేకు: 1135-4 రామక్రియ సం: 21-203

పల్లవి: ఆనసుమ్మీ నీకును ప్రహ్లాదవరదా నిన్ను-
నానితిఁ గుచముల ప్రహ్లాదవరదా

చ. 1: అలుక మానుమీ ప్రహ్లాదవరదా నిన్ను-
నలమితి నిప్పుడే ప్రహ్లాదవరదా
అలసితి రతుల ప్రహ్లాదవరదా నీకు-
నలవాటే ఇన్నియుఁ బ్రహ్లాదవరదా

చ. 2: అంగపుఁ జెమటల ప్రహ్లాదవరద నీకు-
నంగడి మొక్కు మొక్కేఁ బ్రహ్లాదవరదా
అంగదెల్లాఁ బాసెను ప్రహ్లాదవరదా మోవి-
నంగజముద్ర లంటెఁ బ్రహ్లాదవరదా

చ. 3: ఆరితేరెఁ బనులు ప్రహ్లాదవరదా యింక-
నారీతి మన్నించుమీ ప్రహ్లా దవరదా
యీరీతి శ్రీవేంకటాద్రి నిందునందుఁ గూడఁగాను
హారములు పెనఁగెఁ బ్రహ్లాదవరదా

రేకు: 1135-5 లలిత సం: 21-204

పల్లవి: ఇంత సేతురా నీవు యెమ్మెకాఁడ
వింతవాఁడవా నీవు వేడుకకాఁడ

చ. 1: పడఁతి విలువఁగాను పలుకక వూరకుండి
నడుమ నవ్వుదురా నాలికాఁడ
చిడుముడి నప్పటిని చెయివట్టి తియ్యఁగాను
జడిసి మారిదుదురా జాణకాఁడ

చ. 2: సిగ్గు విడిపించి సతి చెక్కునొక్కి వేఁడుకోఁగా
బగ్గన నలుగుదురా పంతగాఁడ
వెగ్గళమై ఆపె నీకు విందులమో వియ్యఁగాను
దగ్గరి వీడె మిత్తురా తాటోటుకాఁడ

చ. 3: చింతదీర నీమగువ చేరి కాఁగిలించుకొంటే
అంతలో భ్రమతురా అందగాఁడ
వంతుకు శ్రీవేంకటేశ వనిత నిన్నుఁ గలసె
బంతి నింతేసి మెత్తురా బయకాడ

రేకు: 1135-6 ముఖారి సం: 21-205

పల్లవి: నిన్నుఁ జూచుకొనవద్దా నేఁడు మమ్మేమి చెప్పేవు
జున్నుగా సిగ్గురేఁచితే జోరునఁ బైజారదా

చ. 1: నిండుజాణలైనవారు నీతో నవ్వేరుగాక
అండనున్న కన్నెలము అందుకోపేమా
చండిపెట్టి నీవు నేఁడు చల్లలమ్మేవారిఁ దెచ్చి
బందుబందుసేయఁబోతే పలుచనేకాదా

చ. 2: యిచ్చకమాడేటివారు యియ్యకొనుందురుగాక
అచ్చపముద్దరాండ్ల మందుకోపేమా
పచ్చిదేరేమాట లాడి పల్లెతావువారిఁ దెచ్చి
ముచ్చిలి చేచాఁచఁబోతే ముదుగులేకావా

చ. 3: మందెమేళమైనవారే మారువెనఁగేరుగాక
అందపు మానావతుల మందుకోపేమా
చెందితి శ్రీవేంకటేశ చేఁగల మట్టిలో నన్ను
మందలించఁబోతేను మతకమేకాదా

రేకు:	1136-1 సాళంగనాట	సం:	21-206

పల్లవి:	ఎంతకెంత పెంచేవే యెందాఁకాను
కాంతలకుఁ బతులకుఁ గలదేకాదా

చ. 1:	వొట్టువెట్టుకొంటినంటా వూరకే మాటాడవు
పట్టినదే వ్రతమా పడఁతులకు
మెట్టిపట్టుకొని నీతో మేనవావి సేసుకొని
తిట్టెఁ గాక కోపాన సాదించవచ్చెనా

చ. 2:	ఆడనలిగినంటా నట్టె శిరసు వంచేవు
ఆడినవే ఆటలా యతివలకు
వేడుక పుట్టవలసి విభుఁడు జూజాన నిన్ను-
నోడించెఁగాక నీతో వొరటువాఁడా

చ. 3:	చెల్లుబడిగలదంటా సిగ్గులువడే విప్పుడు
పల్లదమే పగటా భామిసులకు
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
వుల్లము చూచెఁగాక వొకరీతి నుండెనా

రేకు: 1136-2 పాడి సం: 21-207

పల్లవి: ముంచి ముంజేయీా నాడితే మోచేయీా నాడుఁగాక
మంచితనము లేకుంటే మరిగీనా తాను

చ. 1: ఇచ్చకమాడేవారినే ఇందు రమ్మందురుగాక
తుచ్ఛమాడేవారినేల తొంగిచూతురు
మచ్చిక నేఁ జేయఁగానే మనసిచ్చెఁగాక తాను
వొచ్చెములు దన్నెంచితే వొనగూడీనా

చ. 2: అడ్డాలుచెప్పునివారి కట్టె పలతురుగాక
వొడ్డారపువారికేల వొద్దికొదురు
వెడ్డువెట్టి వేడుకోఁగా విడువకున్నాఁడు గాక
యెడ్డెతనాన నుండితే ఇయ్యకొనీనా

చ. 3: గక్కన మొక్కినవారిఁ గాఁగిట నింతురుగాక
కక్కసపువారినేల కై కొందురు
నిక్కి శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగాఁ జిక్కెఁగాక
మొక్కలాన నూరకుంటే మోహించీనా

రేకు: 1136-3 ఆహిరి సం: 21-208

పల్లవి: అలుగకువే నీవు అందుకెల్ల నాతనితో
చలములేకుండాఁ దెలుసుటగాక

చ. 1: వాడికెమాట లాడితే వద్దనఁగవచ్చునా
యీడుజోడు లందులోన యెంచుటగాక
జాడతో నవ్వు నవ్వితే సాదించవచ్చునా
సూడుఁబాడుఁ గాకుండ సోదించుటగాక

చ. 2: తప్పకచూచితేనే తమకించవచ్చునా
కప్పి వెంగెములేకుండాఁ గనుటగాక
ముప్పిరిఁ జేయివట్టితే మొనచూపవచ్చునా
చొప్పుగా బాసలు సరిచుచుకొంటగాక

చ. 3: చిమ్మిరేఁగఁ గూడఁగాను సిగ్గువడవచ్చునా
నిమ్మలాన నేరుపులు నించుటగాక
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
యెమ్మె చూపవచ్చునా యెఱుఁగుటగాక

రేకు: 1136-4 మాళవిగౌళ సం: 21-209

పల్లవి: ఆయ రావే యేడ సుద్ది అందువంక నేమి గద్దు
పాయపువేడుకకాఁడు భయపడేనా

చ. 1: చేయిమీఁదై చేఁతచేసి సెలవుల నవ్వ్వఁగాక
యీయెడ నెంతదిట్టినా యెదురాడీనా
కాయకపుటందగాఁడు కతలెల్లాఁ జెప్పుఁగాక
రాయడించి వొద్దనినా రాక మానీనా

చ. 2: తగవుచాలనివాఁడు తలవంచుకొనుఁగాక
జిగి నెంత గాదనినా సిగ్గువడీనా
సొగసి వేడుకకాఁడు చూరువట్టి వేలుఁగాక
వెగటుగా దొబ్బినాను విడువఁబొయ్యీనా

చ. 3: నేరమిపైఁబడ్డవాండు నిండా నోర్చుకుండుఁగాక
సారె నెంత జంకించినా చండి మానీనా
సారపుశ్రీవేంకటేశ్వరుఁడిదె నన్నుఁ గూడె
మీరేమి చెప్పినా మించి వీఁగీనా

రేకు: 1136-5 లలిత సం: 21-210

పల్లవి: నీవల్ల వచ్చినమేలు నిన్ను సోఁకును
దేవర వీజగడాలు దిద్దవయ్య నీవే

చ. 1: మచ్చరించి సవతులు మాటలాడదొరకొంటే
నిచ్చలపు వెంగేలెల్ల నిన్ను మోచును
కొచ్చి కడకన్నులకు కోపపుటెఱ్ఱ వచ్చితే
కచ్చుపెట్టి నీపైఁ దారి కమ్ముకొనును

చ. 2: చిమ్మిరేఁగి ఆపోనాపెఁ జేతులు చాఁచంబోతే
నెమ్మది నడుమనున్ననిన్ను మోచును
వుమ్మడిపంతాలు వొక్క రొక్క రాడుకొంటేను
పమ్మి అవి దిద్ద నీపాల నుండును

చ. 3: మించినయాకాంతలకు మేనులు చెమరించితే
పంచల నాచెమట నీపై నంటును
యెంచఁగ శ్రీవేంకటేశ ఇద్దరినిఁ గూడితివి
కంచపు మోపుల చవి కానవచ్చు నీకును

రేకు: 1136-6 బౌళి సం: 21-211

పల్లవి: మాఁటలాడవయ్య ఇఁక మగువ నీవుత నొక్కటే
ఆఁటదాని కిదే చల్లవారెఁ గోపము

చ. 1: కాయముపైఁ జేయివేసి కప్పురము నోటికిచ్చి
ఆయము లంటఁగాఁ జల్లనారెఁ గోపము
చాయలు సన్నలుఁ జేసి చవులుగా మోవి ఇచ్చి
ఆయెడ మొక్కఁగాఁ జల్లనారెఁ గోపము

చ. 2: కొప్పు గడుదువ్వి యట్టె కొంగు చేతఁబట్టుకొని
అప్పసము నవ్వఁగాం జల్లారెఁ గోపము
రెప్పలెత్తి చూచి చూచి రేసులెల్లా నించఁగాను
అప్పుడట్టె మతిఁ జల్లనారెఁ గోపము

చ. 3: పచ్చిగాఁగం గాఁగిలించి పట్టి తమ్ములము వెట్టి
అచ్చు గోరు మోపఁగాఁ జల్లరెఁ గోపము
మచ్చిక శ్రీవేంకటేశ మనసారఁ గూడితివి
అచ్చలము దేరి చల్లనారెఁ గోపము

రేకు: 1137-1 సామంతం సం: 21-212

పల్లవి: ఇదివో నీదొరతన మింకా నేమి చెప్పేను
సదరమైతి వీయాడేజాణతనాలకును

చ. 1: చలివాసి యాపె నీతో సారె వెంగేలాడఁగాను
నలిరేఁగి నీవు గడునవ్వఁగాను
చులుకనివాఁడవైతి సుదతుల కెల్లాను
మెలఁగి చూడఁగ మందెమేలాలపాలైతివి

చ. 2: సందడి మాలో నీతో సన్న లాపె సేయఁగాను
మందలించి నీవు లోనై మన్నించఁగాను
అందరియెంగిలి వైతి వాడికలకు లోనై
కందువరతులలోన కంకివైతివి

చ. 3: గక్క నిన్నిపు డాపె కాఁగిలించి కూడఁగాను
మిక్కిలి శ్రీవేంకటేశ మెచ్చఁగాను
లక్కవంటివాఁడవైతి లాగుల మాతోఁ గరఁగి
కక్కసించఁగా రొంపిలో కంబమవైతివి

రేకు: 1137-2 చాయానాట సం: 21-213

పల్లవి: ఏఁటికి ఆఁటదానికి నింతగర్వము వలెనా
మేఁటిరతుల చేతనే మెప్పించుటగాక

చ. 1: మాటలాడేపతితోడ మరి పరాకేఁటికే
కాటుకకన్నులఁ జూచి కైకొంటగాక
కూటమికిఁ బెనఁగఁగా గుట్టు చూపనేఁటికే
చాటించి మోవివిందులు చవిరేఁచుటగాక

చ. 2: నవ్వునవ్వే పతియెడ నాలితన మేఁటికే
రవ్వగాఁ జన్నులనొత్తి రాయుటగాక
పువ్వులు ముడువఁగాను బొమ్మజంకెనేఁటికే
జవ్వనపాయము పొందు జరపుటగాక

చ. 3: కూడేశ్రీవేంకటపతిఁ గొసరఁగనేఁటికే
జాడతో వలపు పైపైఁ జల్లుటగాక
వేడుక నెనసితివి వేగిరము లేఁటికే
పాడిపంతము మెరసి పనిగొంటగాక

రేకు: 1137-3 తోండి సం: 21-214

పల్లవి: ఏల మేకులు సేసేవు ఇందరిఁ జూపి మమ్ము
పాలు వాలే నీరు నీరే పలుక లేమిటికి

చ. 1: కాయకపువావులకాంతలు సరయ్యేరా
చేయిమీఁదై సేసపాల చెలులకును
మాయదారిబీటియెుడమావులనేళ్లెల్లాను
కాయపుదప్పి దేరుచఁ కాఁగులు నిండీనా

చ. 2: యెరవులసతులెల్ల యీడుజోడు వచ్చేరా
తిరమైనపట్టంపుదేవులకును
అరమరచి చూచిన ఆమనిపచ్చలెల్లాను
వరుస రాసులై కొలవఁగ వచ్చీనా

చ. 3: కన్నవూడిగపువారు కలసేరా కొలమున
నిన్నుఁ గూడిమావంటినెలఁతలతో
యిన్నిటా శ్రీవేంకటేశ యెంచి చూచుకొంటేను
వెన్నెలకువ్వలెల్లా వెలకెక్కీనా

రేకు: 1137-4 గుజ్జరి సం: 21-215

పల్లవి: వద్దనేనా నేఁ దన్ను వలపెంత చవియైనా
అద్దుకొని తనకును ఆపెకు నమరునే

చ. 1: మచ్చికకు వేళ గద్దా మాటలకుఁ గొన గద్దా
పెచ్చు వెరిగీఁ గాక ప్రియుఁడు నాతో
ఇచ్చకాలు నేసెనంటా నింతి నిట్టె మెచ్చితేనే
మెచ్చనీవే మాతోనేల మేకులు చెప్పినే

చ. 2: ననుపులో వింత గద్దా నవ్వులకు మితి గద్దా
అనువులు చూచీఁగాక ఆతఁడు నాతో
పెనఁగి పిలిచీనంటా ప్రియురాలిమాట వింటే
విననీవే మాతోనేల వేడుక చెప్పినే

చ. 3: కూటమిలో కొంకు గద్దా కోరికకు మేర గద్దా
యేఁటిదో కాక శ్రీవేంకటేశుఁడు నాతో
యీటువెట్టే నంటా నాకెయింపులకె ననుఁ గూడె
కూటమికి నన్నేల గొరబుసేసీనే

రేకు: 1137-5 దేసాళం సం: 21-216

పల్లవి: ఎందాఁకా వేఁడుకొనేవు యేఁటికయ్యా
అంది పొంది యింకా నిన్ను అటమటించేనా

చ. 1: అలుకలేఁటికి నీఁక నంతరంగ మొక్కటాయ
బలిమి యేఁటికి నీతోఁ బలికితిని
సొలపులేఁటికి నీసుద్దులు సమ్మతించితి
మలసి యప్పటి నీతో మరికాదనేనా

చ. 2: వట్టిసొలపులేఁటికి వద్దనే వుందాన నేను
తిట్టనేల నేమోహము తెలిసితిని
పట్టి కొసరఁగనేల పనులెల్లాఁ జేసే నీకు
మట్టుమీరి యంతలోనే మరి కాదనేనా

చ 3: జంకించనేఁటికి నీచనవెల్లాఁ జేకొంటి
వుంకువలేఁటికి నీతో నొద్దికైతివి
అంకెల శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁ గూడితి
మంకు వాసె నాతోను మరి కాదనేనా

రేకు: 1137-6 లలిత సం: 21-217

పల్లవి: ఎవ్వరు సాకిరిచెప్పే రిందుకుఁగాం దనకు
వువ్విళూరఁ దనలోనే వూహించుకొమ్మనవే

చ. 1: మొగములోపలితేట ముందరనే కానరాఁగా
యెగసక్కెపురమణుఁ డేలబొంకీనే
తగిలి తనవన్నెలు తాఁ జూచుకోరాకుంటే
సొగిసి యద్దమైనానుఎ జూచుకొమ్మనవే

చ. 2: లచ్చనగా నొసలను లత్తుక లంటుకుండగా
యిచ్చకములాడి విభుఎ డేలబొంకీనే
తచ్చి తనపై మచ్చము తాఎజూచుకోరాకుంటే
అచ్చలాన నద్దమైన నట్టె చూడుమనవే

చ. 3: పెదివిపై మాణికేలు బిగువులువట్టుండఁగా
యెదుట శ్రీవేంకటేశుఁ డేలబొంకీనే
వదనము తాఁ జూడవసముగాకుంటే నద్దము
యిదె చూచుకొమ్మనవే యిట్టె నన్నుఁ గూడెను

రేకు: 1138-1 సౌరాష్ట్రం సం: 21-218

పల్లవి: ఎఱఁగనంటా నానలేల పెట్టుకొనే వీడ
యెఱిఁగేవుగాక ఇఁక నెందువొయ్యేవయ్యా

చ. 1: మనసు మర్మమెఱుఁగు మాటలు వాసులెఱుగు
తనువు కాఁగిటిలోనితమి యెఱుఁగు
పనివడి నీవెంత పరాకుతో నుండినాను
యెనసేవుగాక మమ్ము నెందు వొయ్యేవయ్యా

చ. 2: వలపు తెగులెఱుఁగు వయసు వాడికెఱఁగు
చెలునపుపంతములు సిగ్గెఱుఁగును
నిలువురాజసముతో నీవెంత వుండినాను
యెలమి మన్నించేవుగా కెందువొయ్యేవయ్యా

చ. 3: కన్నులు కాంక్ష లెఱుఁగు కందువలు గోళ్లెఱఁగు
సన్నపునవ్వులు మోవి సారె నెఱుఁగు
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యెన్నికఁ గూడితి విఁక నెందువొయ్యేవయ్యా

రేకు: 1138-2 పాడి సం: 21-219

పల్లవి: ఊరకే వుండితే నిన్ను వూరెల్లా నెటిఁగేరు
దూరువచ్చీ సుమ్మీ నీవు దొరపాటివాఁడవు

చ. 1: నిలువుఁగస్తూరి పూఁత నీమేన నలఁదుకో
చెలఁగి చీఁకటితప్పు సేసేవాఁడవు
తలఁగక సేమంతులదండలు నిండా వేసుకో
తొలువెన్నముద్దలెల్లా దొంగిలేటివాఁడవు

చ. 2: పడిఁ బైఁడిపచ్చడము పల్లెవాటు వేసుకో
చిడుముడిఁ జీరలు దీసేవాఁడవు
కడు నీవు పొద్దొకసింగారాలు సేసుకో
తొడికి ఆఁటదాని నెత్తుకవచ్చేవాఁడవు

చ. 3: మితిలేని హారములు మెడనిండాఁ గట్టుకో
రతి నలమేల్మంగవురమువాఁడవు
ఇతవై శ్రీవేంకటేశ ఇదె మమ్ము నేలుకో
సతుల వేలసంఖ్యల సంతరించేవాఁడవు

రేకు: 1138-3 బౌళి సం: 21-220

పల్లవి: పాయపుమదమువట్టి పనులేమి యెఱగను
చేయిమీఁదై నీవేమైనాఁ జేసుకోరాదా

చ. 1: సిగ్గువడ్డనాచిత్తము చెప్పినట్టు సేసీనా
తగ్గి నన్ను మూలమూల దాఁచుఁగాక
యెగ్గువట్టి యేలదూరే వెంతగబ్బి నేనంటా
అగ్గమై నీయిచ్చల నేమైనాఁ జేయరాదా

చ. 2: వాసితోడినాచలము వసము నాకయ్యీనా
యీసురేఁచి అట్టె బిగియింపించుఁగాక
ఆసలనేల జంకించే వంకెకు నే రానంటా
సేసవెట్టి యేమైనాఁ జేసుకోరాదా

చ. 3: అంగపుజవ్వనమద మడఁచితే నడఁగీనా
పొంగుచు నీకాఁగిటిలో బోగించుంగాక
రంగుగుశ్రీవేంకటేశ రతి నలమేల్ మంగను
చెంగట నిచ్చఁ బెండ్లి సేసుకోరాదా

రేకు: 1138-4 శ్రీరాగం సం: 21-221

పల్లవి: నీరచన లింతేశాయ నివ్వెరగేల పడేవు
పౌరకామినులు నిన్నుఁ బంగించితేఁ దప్పా

చ. 1: కోరి కోరి పిలువఁగ గుట్టెల్లా బయిటఁబడె
సారె సారె నవ్వఁగాను చలివాసెను
మారుకొని మాటాడఁగ మందెమేలమాయ నేఁడు
తేరి చూచి ఆకె నిన్నుఁ దిట్టకుండునా

చ. 2: చెక్కులు నీవు నొక్కఁగా సిగ్గులెల్లాఁ దొలఁగెను
చక్కఁగ నీవు మెచ్చఁగ చండిపడెను
దక్కి నీవండనుండఁగ తనకు వెలవు దీరె
తక్కక పాదాన నిన్నుఁ దాఁకించక మానునా

చ. 3: నీవు గాఁగిలించుకోఁగా నిండురాజసము గప్పె
కైవసము గాంగాను కాఁకదేరెను
యీవల నలమేల్మంగ యిట్టె పురమెక్కించఁగ
శ్రీవేంకటేశ నీసేవ సేయవలదా

రేకు: 1138-5 ఆహిరి సం: 21-222

పల్లవి: నే నేమి సేతునే నిచ్చలాన నే నుందాన
ఆనకపుతనసుద్దు లడుగరే మీరు

చ. 1: చల్లనిచందురుఁడే సారె వేఁడి చల్లీతేను
యెల్లవారి కిఁకమరి యేమిసేసేదే
వెల్లవిరి నానవ్వు వెంగెము తనకయితే
పల్లదాన తనకైనభాగ్య మింతేకాక

చ. 2: ముడిచేటిపూవులే మొనలై నాఁటితేను
యెడయక యెల్లవారి కేది దెరువే
అడరి నాకనుచూపు లాయములు గాడితేను
బడి బడిఁ దాఁ జేసినభాగ్య మింతేకాక

చ. 3: చక్కెరవంటిమాటలే సరిఁ జిరుచేఁదైతే
యెక్కడా దంపతులకు నిఁక నేఁటిదే
అక్కరై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
పక్కనఁ గూడితిఁ దనభాగ్య మింతేకాక

రేకు: 1138-6 రామక్రియ సం: 21-223

పల్లవి: వద్దు వద్దమ్మా యింతవాదు లాతనితోడుత
పొద్దువోనిసుద్దులెల్లా పోగులై నిలిచెను

చ. 1: కోరికలు దఱచైతే కోపములు దఱచౌను
మారుకొంటే మీఁదమీఁద మంకువట్టును
సారె సారెఁ బతినేల సాదించేవే నీమీఁది-
పేరడివలపు పెక్కుప్రియురాండ్లఁ దెచ్చెను

చ. 2: చెనకులు గడునైతే చిమ్మిరేఁగుఁ దిట్లెల్లా
పెనఁగఁబోతే నట్టే బిరుదెక్కును
కినిసి యీతనినేల కెరలి తిట్టేవే నీపై
మనసే పిక్కటిల్లి యీమగువలఁ దెచ్చెను

చ. 3: నయములు మించితేను నగవులు జాలువారు
నియతి నలమేల్మంగ నిన్నుఁ గూడఁగా
దయవెట్టె శ్రీవేంకటోత్తముఁడు యింతేలే సిగ్గు
ప్రియము నీమీఁదిదే యీపేరటాండ్లఁ దెచ్చెను

రేకు: 1139-1 పళపంజరం సం: 21-224

పల్లవి: ఆతఁడు నీచేతఁ జిక్కె నదివో నేఁడూ నీ-
యేతులు యెమ్మెలు మరి యేమి చెప్పే మిఁకను

చ. 1: వెన్నెలనవ్వులు నవ్వె వేఁడివేఁడివలపు
చన్నులతుదలనె చవుకళించె వయసు
కన్నులచూపులనె కాఁడిపారె మనసు
యెన్నిలేవు నీసుద్దు లేమిచెప్పే విఁకను

చ. 2: నాలికతుదలనె నానెఁ జుట్టరికము
మేలిమిసరసముల మించె మోముకళలు
గాలపుగోరికొనల కరఁగె మర్మములు
యీలాగుల నీనేరువు లేమిచెప్పే మిఁకను

చ. 3: పెదవిపైఁ గుఱుతులఁ బెరసెఁ గూటములు
పొదిగొన్నతమకాన పొగులాయ నాసలు
అదన శ్రీవేంకటేశు డలమేలుమంగ నిన్ను-
నిదె కూడె మీ భావము లేమిచెప్పే మిఁకను

రేకు: 1139-2 గౌళ సం: 21-225

పల్లవి: ఎప్పుడూ నాభావము నీవెఱిఁగినవాఁడవు
తప్పులెంచ కిట్లానే దయఁజూడుమీ

చ. 1: చక్కనినీరూపు చూచి చొక్కివున్నదాన నేను
పక్కన నీవే నన్నుఁ బైకొనుమీ
యిక్కువ నే నంటనంటా యెగ్గువట్టేవు గనక
చిక్కని చన్నులమీఁదఁ జేయివేయుమీ

చ. 2: మాటలు నీ వాడఁగాను మత్తురాలనై వుందాన
గాఁటపునీపచ్చడము గప్పుమీ నాపై
కూటమిలోఁ బరాకంటా గుంపించేవుగనక
నాఁటుకొనంగా నీవే నన్నుఁ గాఁగిలించుమీ

చ. 3: సమరతి నిన్నుఁ గూడి సదమదమైనదాన
తమకాన మోవి ఇచ్చి దప్పిదీర్చుమీ
అమరె శ్రీవేంకటేశ అదేమనేవుగనక
సముకమిచ్చి యేపొద్దూ చనవరిఁ జేయుమీ

రేకు: 1139-3 బౌళి సం: 21-226

పల్లవి: ఇంతగా నేర్చితివి నీ విన్నియు నిందుకొరకే
మంతనవ్వులేకా మక్కువకు మందులు

చ. 1: మించి ఇంతులు వలవ మిక్కిలి నీవాడేటి-
మంచిమాటలేకావా మచ్చుమేపులు
పంచల నందరికిని పాయరానిపొందులకు
కంచపుఁబొత్తులేకావా గాలపువేఁటలు

చ. 2: కొమ్మలననువులరు కొనగోరితాఁకులు
చిమ్ములేకా విడువనిచేపట్లు
నెమ్మనములు గరఁగ నిలుచుండి నీవు చూచే-
వుమ్మడి చూపులేకావా వుంకుధనములు

చ. 3: కూడిన కూటములకు గుఱుతులు రేఁచేవి నీ-
వేడెపుమోవులే కావా నీడుదోళ్లు
యీడనే శ్రీవేంకటేశ ఇందరి నేలితి విట్టె
వేడుకమొక్కులేకావా వెలలేని యాసలు

రేకు: 1139-4 ముఖారి సం: 21-227

పల్లవి: ఒకటంటే నొకటనే వూరకే నీవు
వెకలియై నిన్నేమైనా వెంగెములాడెనా

చ. 1: పక్కన నీమోవి చూచి పకపక నవ్వె నాపె
యెక్కువ నీమోవికెంపు లేడవనెనా
వెక్కనపునీపై చేయి విసరె నిప్పుడె ఆపె
చొక్కమై నీవుసేసినసుద్దులు దడవెనా

చ. 2: కళదేరేనీమేనికాంతులు వొగడె నాపె
అలరి వున్నాఁడవు నిన్నదేమనెనా
అలసినందుకు పన్నీ రట్టె నీపైఁ జల్లెఁగాక
కలనీసేఁతలు యెఱుకలు సేసుకొనేనా

చ. 3: చిమ్మిరేఁగేనీనెరులు చిక్కులుదీసె నాపె
పమ్మి నిన్ను యిట్టే సిగ్గువడఁజేసేనా
కమ్మి శ్రీవేంకటేశుఁడ కలసె నలమేల్మంగ
కుమ్మరించి నీపై బత్తి కొత్తలుగఁ జేసెనా

రేకు: 1139-5 కన్నడగౌళ సం: 21-228

పల్లవి: కల్లగాదు చూడవయ్య కన్నులెదుటనే యిదె
జల్లన మైపులకలజాజులు పైఁబోసెను

చ. 1: చెప్పేటి నీగుణములు చెవియొగ్గి మాచెలి
కప్పురవునవ్వులనే కానుకవట్టె
వొప్పులుగ నీవిట్టే తనవొద్దికి వచ్చేవంటే
కప్పినతనచన్నులు కప్పముగాఁ బట్టెను

చ. 2: యివ్వల విడెము నీకు యిట్టె యిమ్మనేనంటే
పువ్విళ్ళూరఁ దనమోవి పులుపా వట్టె
దవ్వులనే వలపులు తతి నీపైఁ జల్లేనంటే
సువ్వనఁ జేతిమొక్కులు సూడిదెగాఁ బట్టె

చ. 3: నెమ్మది నీవు సరుస నిలుచున్నాఁడవంటే
కొమ్మ నీబంగారపు కొంగు వట్టెను
యిమ్ముల శ్రీవేంకటేశ యిదె నీవు గూడఁగాను
పమ్మి నీకాఁగిలి మరి బారచాఁచి పట్టెను

రేకు: 1139-6 భైరవి సం: 21-229

పల్లవి: నిన్నుఁ జూచి నాకైతే నెరవుడా దయవుట్టె
యెన్నిటి కోపుదువు మాయింటికి రావయ్యా

చ. 1: చేసన్న సేసి యొకతె చెట్టవట్టి తీసె నిన్ను
ఆసల వొకతె నిన్ను నట్టె నవ్వెను
యీసందుల నీమనసు యిరుమొనసూదాయ
సేసల యిద్దరిచేతఁ జిక్కెఁగా నీతురుము

చ. 2: కందువకుఁ దెచ్చొకతె కాఁగిలించుకుండఁగాను
మందలించి వేరొకతె మర్మమంటీని
అంది తాసువంటిదాయ అట్టె నీరతియెల్ల
సందడి నిద్దరిచేత సదమదమైతివి

చ. 3: మునుప వేరొకతె నీమోవి గంటిసేయఁ గామ
వెనక నొకతె గోరు వీఁపు మోపీని
యెనసితి నే నిన్ను యింతో శ్రీవేంకటేశ
అనువై ముక్కాలిపీఁట వైతివి గా యిపుడు

రేకు: 1140-1 అందోళి సం: 21-230

పల్లవి: ఇన్నిటా జాణవే నీకిది వోజ
యెన్నేని సంతోసించేని కిదివో వోజా

చ. 1: వచ్చినప్పుడే పతికి వలపు పైఁబూసితివి
యెచ్చరికగలదాని కిదివో వోజా
లచ్చనలు నించితేను లలి నూరకె వుంటివి
యిచ్చకపుజవరాలి కిదివో వోజా

చ. 2: సరసములాడితేనే చనవెల్లా నిచ్చితివి
యెరవులేని దానికి నిదివో వోజ
తెరవేసినంతలోనే తెలిసి పాదాలొత్తితి-
విరవైన పెండ్లికూఁతు కిదివో వోజా

చ. 3: చెంగటికి వచ్చితేనే శ్రీవేంకటేశుఁ గూడితి-
వింగితజ్ఞురాలికి నిదివో వోజ
వుంగిటితమ్ముల మాతఁ డుమియఁబోతే నీవు
యెంగిలికిఁ జేయొగ్గితి విదివో వోజా

రేకు: 1140-2 ఆహిరి సం: 21-231

పల్లవి: ఇంక నేమిచెప్పేము నీయెమ్మెలు సింగారాలు
చింకచూపులనుఁ జూచి సిగ్గువిడిపించిరి

చ. 1: ఆవులఁ గాచుచు పరాకైననిన్ను గొల్లెతలు
చేవదేర వలపులు చిమ్మిఁరేచిరి
వోవలఁ బాలెల్లఁ దాగి వుబ్బి మదించీనని
తావిబుజాల గోరికోఁతలు గోసిరి

చ. 2: అంచెలయమునలోన అట్టె యీఁదులాడేనిన్ను
ముంచి మానములు చూపి మోహించిరి
పెంచెపువనాలలోన పిల్లఁగోవిపట్టి నీకు
కంచపుకెమ్మోవు లిచ్చి కళలెల్లా నించిరి

చ. 3: గచ్చకాయలాడే నిన్నుఁ గాఁగిలించుకొని పట్టి
కొచ్చి కొచ్చి చన్నులనే కూరాడిరి
యిచ్చల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చెచ్చెర వారెల్ల నీపై సేసవెట్టిరి

రేకు: 1140-3 పాడి సం: 21-232

పల్లవి: ఓపనోప నిందుకెల్లా వోచెలులాల
యేపనులకని పై పై నెచ్చరించే నతని

చ. 1: కన్నులు చల్లంగాఁ జూచి కడుసంతసించేఁగాక
యెన్నిటికని కోపించే నిఁక నాతని
చన్నులమొనల నొత్తి సారెఁ గాఁగిలించేఁగాక
కన్నుందుకెలా నెట్లఁ గక్కసించే నాతిన

చ. 2: చేతులు నిండా నేను సేవసేఁగాక మరి
యేతుల నెట్టు జంకించే నిఁక నాతని
ఆతుమార మోవితేనె లట్టే విందువెట్టేఁగాక
జాతినీతిమాని యెట్టు సాదించే నతని

చ. 3: కాయము నిండాఁ బొంది కరఁగించి కూడేఁగాక
యేయుపాయముల మీరే నిఁక నాతని
యీయెడ శ్రీవేంకటేశుఁ డెనసి నన్ను మన్నించె
చాయల సన్నల నేమి జగుసేసే నాతని

రేకు: 1140-4 దేసాళం సం: 21-233

పల్లవి: మంచితనములు సేసి వంచుకోనేర వతని
పొంచి మోవి చూపితేనే పొందు నీకు నియ్యఁడా

చ. 1: పచ్చిసేసి బలిమినే పతినేల పిలిచేవే
యిచ్చకమాడితే నాతఁ డింటికి రాఁడా
బచ్చెనలఆనలు వెట్టి బాసలేల అడిగేవే
చెచ్చెర నీవు మొక్కితే చెప్పినట్టు సేయఁడా

చ. 2: తలుపు మూసుక యేల తగఁ బతి నాఁగేవే
వలచితినంటేనే వద్ద నుండఁడా
మలసి పొలసి యేల మనసు సోదించేవే
మొలకనవ్వు నవ్వితే ముచ్చటెల్లాఁ జెప్పఁడా

చ. 3: చిప్పిల శ్రీవేంకటేశుఁ జెనకి యేల పట్టేవే
కప్పురవిడె మిచ్చితే కాఁగిలించఁడా
దప్పిదేర నప్పటిని తమకపడఁగనేలే
చెప్పినప్రియములకే చేకొనిట్టె కూడఁడా

రేకు: 1140-5 గౌళ సం: 21-234

పల్లవి: నీవే నేరుతువమ్మ నేఁ డాతని దక్కఁగొన
యీవల నిందుకే వురమెక్కించె నిన్నతఁడు

చ. 1: మచ్చరమువిడిచినమానినికి అట్టెకదా
ముచ్చట తనవిభుఁడు మోహించును
చెచ్చెర నుపచారముచెప్పినయాపెకుఁగదా
అచ్చపుమన్ననలెల్లా నఱచేతితలోనివి

చ. 2: పంతములాడనియట్టిపడఁతికి నిట్టెకదా
సంతతము రమణుఁడు జంటవాయఁడు
చెంతల నెప్పుడు సేవలుసేసినయాపెకుఁగదా
బంతినే ఆతం డెప్పుడుం బంపసేసును

చ. 3: ఇచ్చకురాలై నయట్టిఇంతికి నీ కిట్టె కదా
వచ్చి శ్రీవేంకటేశుఁడు వలచి కూడె
తచ్చివేసి నీవంటితమిగలాపెకుఁ గదా
కచ్చుపెట్టి ఇతఁడిట్టె కైవశమై వుండును

రేకు: 1140-6 తెలుఁగుఁగాంబోది సం: 21-235

పల్లవి: చెలులాల యీచెలి గాచుకొనుచు
సెలవున నెప్పుడు నే నుండేను

చ. 1: తప్పక చూచిన తానే తెలుసును
చెప్పకతొల్లే చేరి వలపు
ముప్పిరి నాతనిముందర నిలువదె
యిప్పుడే యీడకు నేతెంచీని

చ. 2: యింతిఁ బేర్కొనిన యిటు దయదలఁచును
అంత బలిమిసేయఁగ వలదు
కాంతలు చేయెత్తి గక్కన మొక్కరే
మంతనమిచ్చీ మనసతి కిపుడు

చ. 3: కానికిచ్చితేఁ గలసీ నీకేను
నానెను మనవిన్నప మపుడే
ఆనుక శ్రీవేంకటాధిపు నగరే
యీనెలంత గలసె నిదివో నేఁడు

రేకు: 1141-1 నీలాంబరి సం: 21-236

పల్లవి: ఎంత భ్రమలఁబెట్టేవే ఇతని నీవు
దొంతున నీయానలు తోయఁజాలడు

చ. 1: జిగిఁ జెక్కుచేత నీవు చిరునవ్వు నవ్వఁగానె
మగిడి మగిడి పతి మాఁటలాడీని
మొగము చూచి నీవు ముంచి యాస లియ్యఁగానె
తగిలి నీమాట లిట్టె దాఁటఁజాలఁడు

చ. 2: పెక్కు విధముల నీవు ప్రియములు చెప్పఁగానె
అక్కరతో రెప్పలువేయక చూచీని
లక్కవలెఁ గరఁచి విలాసాలు నీవు చూపఁగ
వెక్కసపునీపొందు విడువఁగఁజాలఁడు

చ. 3: వేడుకతోడుత నిట్టె విడెము నీ కియ్యఁగానె
కూడి శ్రీవేంకటేశుఁడు గోర నొత్తీని
యేడఁజూచినాను నీవే ఇచ్చకములాడఁగానే
జాడ నురమెక్కించి దించఁగఁజాలఁడు

రేకు: 1141-2 పాడి సం: 21-237

పల్లవి: ఎంతసేసితివో ఆపె నేమిటఁగాని నమ్మదో
పంతములు మెరసె నేపనికోకాని

చ. 1: పలుమారు వాలుకరెప్పలు వంచి చూచీ నిన్ను
యెలమిఁ గొసరె నాపె యేఁటికోకాని
సెలవుల నవ్వుదేర చేత రొమ్ము దట్టుకొంటా
మలయుచు శిరసూఁచె మరియేలోకాని

చ. 2: పెదవులు గదలఁగ పేరుకొని గొణఁగుతా
యెదురుగా నిలుచుండె నేఁటికో కాని
మదముదొలఁక నీతో మాటకు మాటాడి నిన్ను
నదనఁ జెయివట్టి తీసె నదేఁటికోకాని

చ. 3: గుట్టుతోడఁ బరతెంచి కుచములు గదలఁగ
ఇట్టె నీవద్దఁ గూచుండె నేఁటికోకాని
జట్టిగా శ్రీవేంకటేశ సమరతినిఁ జొక్కించి
నెట్టుకొని నిన్ను మెచ్చె నెపమేదోకాని

రేకు: 1141-3 లలిత సం: 21-238

పల్లవి: ఏఁటిమాటలాడేవు యెందాఁకనైనా
వాఁటమై నిన్నుఁ గాదనేవారు లేరంటానా

చ. 1: చెలుల కిందరికని సిగ్గే మూలధనము
తలవంచుకొనరాదా తరుణికిని
చనివాసినవాఁడవు సారె నీవు నవ్వితేను
మలసి యిల్లాలికి మారు నవ్వఁదగునా

చ. 2: కొమ్మలకునెల్లాను కోపమే సింగారము
బొమ్మల జంకించరాదా పొలఁతికిని
దిమ్మరివాఁడవు నీవు దీకొని సన్న సేసితే
అమ్మరో గరితలకు నాగడాలు దగునా

చ. 3: కోమలులకెల్లాను గుట్టే చక్కఁదనము
నేమముతో నుండరాదా నెలఁతకును
ఆముక శ్రీవేంకటేశ అట్టె నీవు గూడితివి
ప్రేమపుపెండ్లికూఁతుకు పెనఁగఁగఁదగునా

రేకు: 1141-4 సౌరాష్ట్రం సం: 21-239

పల్లవి: ఇంకనేఁటి మాటలు యిట్టె కంటి నీనిజము
వంకలొత్తఁబోతేను కొంకరలయ్యీని

చ. 1: యెవ్వతెకస్తూరిబొట్టో ఇదె నీనొసలనంటె
చువ్వన నద్దములోన చూచుకోవయ్యా
నవ్వఁబోతే పెదవిపై నయానఁ గెంపులురేఁగె
యివ్వల చెక్కులపస పిరుమేలా నంటెను

చ. 2: కుంకుమగుబ్బలపూఁత గురిగా రొమ్మున నించె
సుంకుమోవఁ దలవంచి చూచుకోవయ్యా
పొంకపుచెవులతట్టుపుణుఁగు బుజాలఁ గారె
లంకెల హారములొత్తి లచ్చనలై వున్నవి

చ. 3: సమరతిచెమటలు చారలై నీమేన నిండె
సుముఖుఁడవై నీవే చూచుకోవయ్యా
అమర శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
జమళి ఇద్దరిచొప్పు సరి నీపైఁ బడెను

రేకు: 1141-5 భైరవి సం: 21-240

పల్లవి: ఏమి వేగిరము నా కింతటిలోనే
దీమసాన నీగుణము తిద్దలేనిదాననా

చ. 1: పల్లదపు నీమాటకు పదరేటిదాననా
పెల్లున నిన్నింతలోఁ గోపించేదాననా
చెల్లుబడినీచనపు చెల్లించనిదాననా
చల్లఁగా నీవలపు రేంచఁగలేనిదాననా

చ. 2: అంతలో నవ్వితే నర్తమడిగేటిదాననా
కాంతుఁడ నీయిచ్చ యెఱఁగనిదాననా
పంతమాడి నిన్నింతలో భ్రమయించేదాననా
మంతనాన నీమన్నన మఱచేటిదాననా

చ. 3: ప్రియము చెప్పఁగా నీతో బిగిసేటిదాననా
క్రియ యెఱఁగక కరఁగించేదాననా
రయమున శ్రీవేంకటరమణ నన్నుఁ గూడితివి
నయమిచ్చి నీకాఁగిట నాటుకోనిదాననా

రేకు: 1141-6 వరాళి సం: 21-241

పల్లవి: ఎట్టి మొగమాయకాఁడ వేమని చెప్పుదు నిన్ను
తిట్టవచ్చినట్టియాపె దీవించె నిదివో

చ. 1: జగడించేనంటా వచ్చి సకియ తప్పకచూచి
మొగమోటమున నీకు ముంచి లోనాయ
వొగరునీబాసలు వొప్పగించేనంటా వచ్చి
తగిలి నీమోవితేనె తానాసపడెను

చ. 2: వడి జంకించేనంటా వచ్చి నీమాఁటలు విని
నడుమంతరాలనే నవ్వె నిపుడు
కడఁగి చేయి చాఁచ వచ్చి గక్కన నీమన్ననకు
యెడమిచ్చి నీకుఁ జేయెత్తి మొక్కెను

చ. 3: కొంగువట్టేనంటా వచ్చి కూరిమి నీప్రియాలకు
కంగుమాని యంతలోనే కాఁగిలించెను
కుంగక శ్రీవేంకటేశ కూడి గోర నూఁదవచ్చి
యెంగిలిమోవిపైఁ గెంపులెల్లా నించుకొనెను

రేకు: 1142-1 రామక్రియ సం: 21-242

పల్లవి: ఏల సిగ్గువడేవు నే నెఱిఁగితే నేమాయ
తాలిమితో నాలోనే దాఁచుకొనే నీకను

చ. 1: పతులు మన్నించినవి పరకాంతలతోడ
అతివలయినవారు ఆడుకొందురు
ఇతవుగాని వప్పుడు యేకతానఁ జేసినట్టి-
రతులరహస్యాలు రవ్వకెక్క నిపుడు

చ. 2: వొంటిఁజేసినట్టి తమవుపచారాలు చెలితో
నంటుననుఁ జెప్పి చెప్పి నవ్వుకొందురు
జంటల నప్పటివేళ చవులైనకతలెల్లా
పెంటలఇంతులనోళ్ల పిరివీకు లౌను

చ. 3: వలచినవలపులు వడిం దమచుట్టాలతో
అలరుచు ముచ్చటగా ననుకొందురు
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
తలఁచి అందరికిని తారుకాణలాయను

రేకు: 1142-2 కాంబోది సం: 21-243

పల్లవి: ఏల వేగిరపడేరు ఇంత చాలదా
వేలు చూపి మెచ్చినదే వేవేలు గాదా

చ. 1: వనితలు పెక్కుగలవల్లభునితోడుతను
చనవుగలుగుపాటే చాలు నవ్వులు
మనసుగలయుదాఁకా మంతనమబ్బిన దాఁకా
వినుకలిమాటంలే వేవేలు గాదా

చ. 2: అన్నిటా నందరితోడా నలసినపతితోడ
చన్నులనొత్తినపాటే చాలు మేలము
విన్నపమందినదాఁకా విచ్చనవిడైనదాఁకా
వెన్నెలబాయిటికొల్పు వేవేలు గాదా

చ. 3: సింగారాన నింటికివచ్చిన శ్రీవేంకటేశుతో
సంగడి గూచున్న పాటే చాలుఁ బ్రియాలు
అంగవించి యిట్లా న న్నలమి కూడినదాఁకా
వెంగెములేని పంతాలు వేవేలు గాదా

రేకు: 1142-3 మాళవిగౌళ సం: 21-244

పల్లవి: ఆయలేరే యేడ సుద్ది ఆతనికి నిది వన్నె
సేయుమన్నట్టెల్లా నేనే సేసేంగాక

చ. 1: అట్టె రమణునికి నంతబాఁతే మామీంద
పట్టినవ్రతాన నేనే పైకొనేఁగాక
గుట్టు విడువఁ డాతండు కోరి మమ్ముఁ గైకొనీనా
వెట్టివలపులదాన వెస నేనే కాక

చ. 2: తావుల పెక్కిండ్లవిందు తలఁచీనా మమ్ము నేండు
కావలెననుచు నేనే కదిసేఁగాక
దేవరవంటివాఁడు తెమలీనా తనుందానె
వావులు వెదకేదాన వడి నేనే కాక

చ. 3: అమ్మరో శ్రీవేంకటేశు కపురూపమా చెలులు
నెమ్మది మేనదాన నేనే కాక
వుమ్మడిం బంతమాడక వూరకుండీనా యీతఁడు
యెమ్మెల యిచ్చకురాల యేడా నేనే కాక

రేకు: 1142-4 రామక్రియ సం: 21-245

పల్లవి: ఆ నేల పెట్టుమనేవు అంతలో నీపై
తానకమై నీకాపెకుఁ దగునిపుడు

చ. 1: మిగులాఁజక్కనిదైనమెలుఁత నొక్కతె నీకు
తగిలించే వచ్చేవా తరి నావెంట
మగువ నాదోమతెరమంచములో నున్నది
నగనేల అప్పుడుగా నన్ను మెచ్చేది

చ. 2: నీ కాపెకుఁ బొందుసేసి నిన్ను సంతోసించఁజేసే
వాకిచిచ మాఁటాడదు వలెనా నీకు
దాకొనీ గుట్టుమానిసి తలుపు ముయ్యుము వేగ
పైకొని యేల కొంకేవు పండీ నియ్యాన

చ. 3: నెలవై శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెలయించేనా నీకు నెవ్వరైరేమి
అలరి ఇదివో అంటే అట్టె కాఁగిలించితివి
కలసితి నేనే ఆపెగానా యీడను

రేకు: 1142-5 వరాళి సం: 21-246

పల్లవి: వేగిరించే విదియేమి వేవేలుసతు లుండఁగ
నీగుణాలు మంచివౌత నేఁడే చూపవలెనా

చ. 1: సిగ్గువడి వుండఁగానే చేయివట్టి తీసేవు
దగ్గరివచ్చినవేళ తడవరాదా
నిగ్గు నించుకవడి నిలిచితేనే వలపు
వెగ్గళించి ఇంతలోనే వెల్లివిరిసీనా

చ. 2: జలకేళి సేయఁగానే సారెఁ జేయిచాఁచేవు
పిలిచినప్పుడే వచ్చి పెనఁగరాదా
వెలయ వించుకవడి వేళగాచుకుండితేను
యెలమి జవ్వనమద మెదురుదొట్టీనా

చ. 3: గుట్టుతోడ నుండఁగానే కూడితి శ్రీవేంకటేశ
పట్టితే నలమేల్మంగఁ బై కొనరాదా
యిట్టె యాపెయిచ్చలో నెనసితే నేమాయ
బెట్టుగా నీపెండ్లి వచ్చి పెళ్ల విడిశున్నదా

రేకు: 1142-6 పాడి సం: 21-247

పల్లవి: చెప్పినట్టు సేసీఁగాని సిగ్గులువడితేఁ గాదు
పిప్పిగట్ట మోవియాని ప్రియమెల్లాఁ జెప్పుమా

చ. 1: మంతనాన నుండరాదా మాఁటలాడీ నాపె దానె
బంతి నిందరిలోనైతేఁ బలుక దాపె
చెంతఁ గొలువునెల్లా చేతుల వేండుకొనేది
పంతమిచ్చి వోవరిలో పాదాలు వేఁడుకొమ్మా

చ. 2: మనసు నమ్మించరాదా మగువ నీకు లోనయ్యా
తనువెంత నిమిరినాఁ దరల దాపె
మునుప నీమోవియాకు ముదితకు నిచ్చేది
వెనక నాపెమో వేకు వెస నందుకొమ్మా

చ. 3: గుట్టుతో నుండఁగరాదా కూడె ని న్నలమేల్మంగ
వొట్టిరట్టు సేయఁబోతే వోరువదాపె
దిట్ట శ్రీవేంకటేశ తెలవ కుంగలమిచ్చి
మట్టె నీవు తీసుకొని మచ్చిక చేసుకొమ్మా

రేకు: 1143-1 దేవగాంధారి సం: 21-248

పల్లవి: సేసినట్టె వానిఁ జేయనీరే
మాసటినివంటి మంకువాఁడే

చ. 1: పట్టఁగఁ బట్టఁగఁ బాముతల దొక్కె
యిట్టిపిన్నవాని నేమందమే
తిట్టఁగఁదిట్టఁగ దినె వెన్నలెల్ల
బట్టగుత్తుచలపాదివాఁడే

చ. 2: కూయఁగఁగూయఁగఁ గోకలు దొంగిలె
వోయమ్మ వీఁడెంత వుద్దండీఁడే
తోయఁగఁదోయఁగ దుండగములు సేసె
చేయిమీఁదయి నట్టిసేఁటవాఁడే

చ. 3: చెప్పఁగఁ జెప్పఁగఁ జేతఁ గొండ యెత్తె
అప్పుడే శ్రీవేంకటాద్రీశుఁడే
కప్పఁగఁగప్పఁగఁ గలసె నింతుల
అప్పఁ డలమేల్మంగాధిపుడే

రేకు: 1143-2 నాదనామక్రియ సం: 21-249

పల్లవి: ఆతుర బందుగుఁడవు అన్నిటా నాకు
యీతల నున్నాఁడవుగా యెప్పుడైనాను

చ. 1: తలఁగి నీరాక గోరి దప్పిఁ బొరలేటివేళఁ
గలవుగా యిప్పుడైనాఁ గప్పురమీయ్య
జలజలఁ జెమరించి సదమదమై యుండగా
వెలినుండి వచ్చితిగా విసరనైనా

చ. 2: చేరి నిన్నుఁ దలఁచుక చింతతోడ నుండఁగాను
నీరూపు చూపితివిగా నేఁడైనాను
ఆరీతి నిట్టూరుపుల నసురుసురై వుండఁగా
గారవించి స్వస్తపెట్టి కందువ నిల్తువుగా

చ. 3: నీకుఁగా నెదురుచూచి నవ్వెరగై వుండఁగాను
కైకొని శ్రీవేంకటేశ కలసితివి
యీకడ నలమేల్మంగ నిటు సేవసేయఁగా
మేకొని యిప్పుడు నన్ను మెత్తువుగా నీవు

రేకు: 1143-3 శంకరాభరణం సం: 21-250

పల్లవి: పొంచి యిఁక నెటువలె పొందు సేసేవే
దించరాని పొంతనాలు దేవరే కూర్చెనే

చ. 1: సొలసి యాతనిదిక్కు చూడవదేమే
నలువంక నాతనిమై నాఁటీనంటానే
మలసి కొంతయినాను మాఁటలాడవే
నిలిచి యేమనినాను నిందమోచునే

చ. 2: ముడువనే శిరసున ముడిపువ్వులూ
కడలేని వవియెకా కంతునమ్ములూ
అడరినదప్పి దేర నధర మీవే
నడుమఁ బలుసోఁకులు నాఁటీనంటానే

చ. 3: శ్రీవేంకటేశ్వరునిఁ జెక్కునొక్కవే
ఆవల నొత్తినరేక లవి రాఁగీనే
కావిరి నలమేలుమంగవుగదవే
కైవశమై కూడితి వెక్కసమయ్యీఁగదవే

రేకు: 1143-4 నట్టనారాయణి సం: 21-251

పల్లవి: అప్పుడు నమ్మేవు నీవు అన్నిఁ దారుకాణలైతే
ఇప్పుడు నీతో మాకునేఁటికి వాదించను

చ. 1: నీమోవిపై నించె నాపె నెయ్యమెల్లాను
కామించి నీవేల యెఱఁగవో కాని
దోమటి మాకైతే నిది తోడ దిష్టము
ఆమాట నిజమూఁ గల్లా నాపెనే యడుగుమా

చ. 2: వువిదవలపులు నీవొళ్ల నించెను
అవల నీకేల తెలియదో కాని
వివరించి మాకుఁజాడ వెల్లావిరులు
తవిలి నీకిష్టమైనతరుణి నడుగుమా

చ. 3: ముంచి నీమన్నన వురమున నించెను
అంచేలశ్రీవేంకటేశ అలమేల్మంగ
చంచులమీకూటములు సరివచ్చెను
యెంచఁగ మమ్మేలితిరి యింతినే యడుగుమా

రేకు: 1143-5 శ్రీరాగం సం: 21-252

పల్లవి: నే నెఱఁగనా యిది నీవు చెప్పవలెనా
తేనెలమాట లాడఁగ దేవరపు గావా

చ. 1: యిద్దరము నొక్కటే నీ వేమానినా నేమాయ
చద్దివేఁడిరతులలో సరసాలింతే
అద్దుక యేల లోఁగేవు ఆనలేల పెట్టేవు
తిద్దుక మాఁటలాడఁగ దేవరపు గావా

చ. 2: నీవు నేను భేదమా నేర మిందులోన నేది
భావపుమందె మేళాలపలుకు లింతే
సేవలెల్ల సేసేవు చెక్కులేల నొక్కేవు
తీవరించి మాఁటలాడ దేవరవు గావా

చ. 3: మనకేలెగ్గలమేలుమంగను న న్నేలితివి
చలవులతిట్లెల్లా సలిగె లింతే
చెనకి యేల మొక్కేవు శ్రీవేంకటేశ్వర నీవు
దినము నీమాఁటలాడ దేవరపు గావా

రేకు: 1143-6 తెలుఁగుఁగాంబోది సం: 21-253

పల్లవి: ఇందాఁక నెఱఁగనైతి నీఁకఁ గపటము లేదు
చెంది యిట్టె నాతోడఁ జెప్పవయ్య మాఁటలు

చ. 1: మంతనానకు రాఁగాను మనసెల్లా నొక్కటాయ
పంతము నీ వియ్యఁగాను పాసెఁ గోపము
అంతరంగము చెప్పఁగా ననుమాన మిఁక నెంచ
రంతులుసేయక యిట్టె రావయ్య యింటికి

చ. 2: సరసు నీ వాడఁగా చల్లనాయ నామేను
సరుసఁ గూచుండగాఁను సమ్మతించితి
యెరవులేక నవ్వఁగా నిరవాయఁ గూరియులు
బిరుదులెల్లాఁ గంటిఁ బెట్టవయ్య విడెము

చ. 3: గక్కన నీవు గూడఁగా కాఁతాళము లణఁగె
మిక్కిలి మన్నించఁగాను మెచ్చితి నేను
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
వొక్కటై కూడితి విట్టె వుండవయ్య వొద్దను

రేకు: 1144-1 ముఖారి సం: 21-254

పల్లవి: చేరి చనవులే నీవు చెల్లించవయ్యా
వలవనివాసు లింక వద్దు నీకు నయ్యా

చ. 1: కాంతలకుఁ బతులతో గబ్బితనమే వన్నె
కొంతపుఁజూపుతోడికోపమే వన్నె
మంతుకెక్కే గుట్టుతోడిమంకుఁదనమే వన్నె
ఇంతలో మీకు నెగ్గు లెంచనేఁటికయ్యా

చ. 2: వెలలేని కొసరుల వెంగెపుమాటలే వన్నె
చలివాసినట్టి రాజసములే వన్నె
అలమిపట్టినవేళ నానలు పెట్టుటే వన్నె
యెలమి నాపెకు నీకు నేఁటిచలమయ్యా

చ. 3: వొనగూడివున్న వేళ వుద్దండములే వన్నె
చనవులసరసజంకెనే వన్నె
యెనసి శ్రీవేంకటేశ యీాపె నీ కిదే వన్నె
యెనలేనితరితీపు లేఁటి కింకా నయ్యా

రేకు: 1144-2 నాదనామక్రియ సం: 21-255

పల్లవి: ఎఱఁగనివానివలె యేలడిగే విటు నన్ను-
నెఱవుగా నింతసేసి నీవే యెఱఁగవా

చ. 1: చెంగట నీవు నాకుఁ జేయిసన్న సేయఁగాను
పొంగి చెమరించితి నప్పుడుగాదా
ముంగిటినీచూపు నాపై ముంచి ముంచి చల్లఁగాను
అంగపుసొమ్ములు బిగువైనది యెఱఁగవా

చ. 2: మలసి నీవు నాతో మాఁటలు గడునాడఁగా
మొలు నూలు జారెను నీముందరఁగాదా
వలపులు చల్లి నీవు వాడికెనవ్వు నవ్వఁగా
పులకలు జాజుకొని పొదలె నెఱఁగవా

చ. 3: గక్కన నీవు నన్నుఁ గాఁగిలించి కూడఁగాను
నెక్కొనెఁ గెంపులు మోవి నీవల్లఁగాదా
అక్కజపుశ్రీవేంకటాద్రిగోవిందరాజవు
మిక్కిలి రతులలో నీమేలు నీవెఱఁగవా

రేకు: 1144-3 సామంతం సం: 21-256

పల్లవి: ఎటువంటి తగవరి వేమోయి నీవు
ఇటువంటి వాఁడవా యేమోయి నీవు

చ. 1: మారుకొని యాపె సారె మాటలెల్ల నాడఁగాను
వూరకుండుమనేవు యేమోయి నన్ను
చేరియాపె కమ్మటిని చేతులు చాఁచఁగాను
యీరీతి నన్నే పట్టేవు ఇదేమోయి నీవు

చ. 2: పుదుటున రేఁగి యాపె వొట్టులెల్లాఁ బెట్టఁగాను
ఇదె నా కడ్డాలు వచ్చే వేమోయి నీవు
పదరి యాపె పూవుబంతిఁ గొనివేయఁగాను
యెదిగి నీమే నొడ్డే వేమోయి నీవు

చ. 3: పన్ని యాపె నా మీఁద పంతమెల్లాఁ జూపఁగాను
ఇన్ని నీపైఁ దీసుకొనే వేమోయి నీవు
వన్నెలశ్రీవేంకటేశ వాకిట నాపె వుండఁగా
యెన్న నన్ను లోనఁ గూడె వేమోయి నీవు

రేకు: 1144-4 వరాళి సం: 21-257

పల్లవి: నీ వెఱఁగవా ఇది నెరజాణవు
యీవల మాతో నీవే యెందాఁకాఁ జెప్పేవు

చ. 1: పువ్వులఁ గొని వేసేది పుప్పొడి పైఁ జల్లేది
జవ్వనపుసతులకు సాజమే యది
నవ్వుసేసుకొంటేనే నానును వలపులెల్ల
చివ్వనఁ గోపించుకొంటే చేరుఁ గూళతనము

చ. 2: మక్కువలు చూపేది మనసు సోదించేది
చక్కని కాంతలకును సాజమే యది
దక్కి లోనై వుండితేనే తతిగొనుఁ గూటములు
మిక్కిలి పెనఁగఁబోతే మించు నెడ్డతనము

చ. 3: కరుణించి చూచేది కాఁగిలించి కూడేది
సరసపుటింతులకు సాజమే యది
నిరతి శ్రీవేంకటేశ నీకు నివే యింపులైను
వరుస నిటు గాకుంటే వచ్చు మంకుఁదనము

రేకు: 1144-5 బౌళి సం: 21-258

పల్లవి: అన్నియుఁ జూతురుగాని యట్టె వుండరే
సన్న లాతఁ డెఱుఁగు వేసారకురే

చ. 1: నీతులుగాఁ భోహణించి నే విన్నవించేది
ఆతఁడే యెఱుఁగునే అంగనలాల
రాతిరిఁబగలు నాడ రచ్చ లెంత సేసినాను
ఆతుమ యిక్కడ గుండు నాతనికిని

చ. 2: యీడనేఁ గానుక మీచే నిచ్చి పంపేదెల్లాను
ఆడ నాతనిచే నున్న దతివలాల
చేడెలు పదివేగురు సేవలు సేసినాను
వేడుకెల్లా నామీఁదిదే విభునికిని

చ. 3: కదిసి శ్రీవేంకటేశుకడకుఁ బోయేమనఁగ
అదె యాఁతడే వచ్చెనే అక్కలాల
అడ నెఱిఁగి కలసె నందరికంటె నాపై-
నెదుగా వలపుగద్దే యీాతనికిని

రేకు: 1144-6 కన్నడగౌళ సం: 21-259

పల్లవి: ఇంతి యదె నీ విదె యేమనేము నేమెల్లా
చింతలెల్లాఁ బాసెను నీచిత్త మింతే యిఁకను

చ. 1: తలఁపెల్లాఁ దమకమే తనువెల్లాఁ జెమటలే
నెలఁత కెంతమోహమో నీమీఁదను
పిలిచినప్పుడు రాక బిగిసి యిప్పుడు వచ్చి
చెలరేఁగి నవ్వేవు నీచిత్తమింతే యిఁకను

చ. 2: చూపులెల్లా నివ్వెరగే సుద్దులెల్లా నీకతలే
యీపడఁతి కెంతాసో యిటు నీమీఁద
రేపకాక రచ్చసేసి రేతిరి యీపె దగ్గరి
చేపట్టితి వింతలో నీచిత్తమింతే యిఁకను

చ. 3: చెక్కులెల్లాఁ బులకలే సెలవులెల్లా సిగ్గులే
అక్కరెంతో కాఁగిటిలో నాపె నీమీఁద
గక్కన శ్రీవేంకటేశ కలసితివి కాంతను
చిక్కనాయ ననుపు నీచిత్తమింతే యిఁకను

రేకు: 1145-1 సాళంగనాట సం: 21-260

పల్లవి: మీఱితివిగదవమ్మ మెచ్చితిమి నీసుద్దులు
ఆఱడిఁబెట్టకువమ్మ అలమేలుమంగా

చ. 1: పాయపువిభుఁడు తన్నుఁ బట్టి పెనఁగఁజూచితే
చాయకు వచ్చినదే సరసాలు
చేయిచాఁచి మీఁదమీఁద చెక్కునొక్కి వేఁడుకొంటే
రాయడి కోర్చినదే రసికురాలు

చ. 2: సంగతిగా మాటలాడి సన్నలుసేసితేను
అంగము లంటినదే అధికురాలు
చెంగటఁ గన్నులెదుటఁ జేసినచేఁతలకెల్లా
కంగువెట్టుకోనిదే ఘనురాలు

చ. 3: యిత్తలఁ జేతికిలోనై యెంతచన విచ్చినాను
తత్తరించకుండినదే దారకురాలు
బత్తితో శ్రీవేంకటాద్రిపతి నిన్ను నిదె కూడె
కొత్తగా నీవంటిదే కోవిదురాలు

రేకు: 1145-2 హిజ్జిజి సం: 21-261

పల్లవి: చెంగలించె నీమొగము జిగి నాపె దగ్గరితే
సంగడి నీ కపుడెంత సంతోసమో

చ. 1: సొగచూపులనుఁ జూచి సుద్దులా పెడుగఁగాను
ఆగతి నీకపుడెంత ఆనందమో
చేగదేర మాఁటలాడి చెక్కులట్టె నొక్కఁగాను
బాగుగ నీకపుడెంత పరిణామమాయనో

చ. 2: కొనగోరు సోఁకఁగ నీకొప్పు ఆపె దువ్వఁగాను
ఘనమైననీ కపుడెంత కళరేఁగెనో
తవియ నీతొడమీద తా దొడవేయగాను
మనసు నీకపుడెంత మర్మము దాఁకెనో

చ. 3: గక్కన నలమేల్మంగ కాఁగిలించుకొనఁగాను
తక్కక నీ కపుడెంత తమ్మివుట్టెనో
అక్కున శ్రీవేంకటేశ ఆపె నిన్నటె కూడఁగా
పక్కన నీ కపుడెంత పరవశమందెనో

రేకు:	1145-3 శుద్ధవసంతం	సం:	21-262

పల్లవి:	దొరవైననీతోడి పొందులు యెట్టయినా వచ్చు
మరకుండఁగరాదు మరగారాదు

చ. 1:	యెంగిలినోర మాట యెటువలె నాడేను
సంగడిఁ బలుకనంటా సారె దూరేవు
రంగగువాఁడిచూపు లూరక ని న్నట్టు నాఁటింతు
అంగవించి శిరసెత్త నని కొసరేవు

చ. 2:	చెమటచేతులను నీసేవ లెట్టు సేసేను
తమి విడెమియ్యనంటాఁ దత్తరించేవు
జమళిపాదాలు దాఁక సరినెట్టు గూచుండేను
అమర నీవద్దికి రానని సొలసేవు

చ. 3:	కుప్పెలవంటి చన్నులఁ గుచ్చి నిన్నెట్టి త్తేను
అప్పుడే కాఁగిలించనైతి ననేవు
అప్పుఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యిప్పుడే కూడితి వింకా నేమని కోరేవు

రేకు: 1145-4 శంకరాభరణం సం: 21-263

పల్లవి: ఇంగిత మెఱఁగలేవా యింత జాణవు
వుంగిటిగా నాపెనేల వొరసేవు నీవు

చ. 1: నగవె ననుపు నయమె ప్రియము
తెగువే తెలివి దినదినమూ
మగువనుఁ జూడరాడా మాటాడ సిగ్గువడీని
అగడుసేసి యేల అడిగేవు నీవు

చ. 2: పిలుపే నిలుపు పెనఁగుటే తగులు
చలిమే బలిమి సారెసారెకూ
కలదు యీచెలియందే; గక్కన గుట్టుతోనుంటే
సొలసి యాపెతోనేల సోదించేవు నీవు

చ. 3: మరులే మచ్చికలూ మానమే మోనము
కరఁగులే యితవులు కలకాలమూ
మరలి ని న్నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడ
యిరవై సొలసె నీ వింకానేల సొలసేవు

రేకు: 1145-5 చాయానాట సం: 21-264

పల్లవి: ఇంతవాఁడవు గాకుంటే యెవతురా గోపికలు
చెంతకురాకతొలుతే చెలఁగె నామొకము

చ. 1: పిలువకతొలుతే ప్రియముతో వచ్చితివి
తలఁచుకొంటివా నీతప్పనిబాస
నిలిచినంతటిలోనె నిండాఁ జెమరించితివి
కలయకతొలుతనె కరఁగే నామనసు

చ. 2: అడుగకతొలుతే ఆనతిచ్చితి వీపని
పెడరేఁచె నావలపు బెట్టుగా నీకు
తడయకతొలుతే దక్కితివి నీవు నాకు
బడిబడి నీకృప ఫలమందెనా

చ. 3: కానికాయీకతొలుతే కాఁగిటఁ గూడితి నన్ను
తానకపునీయాస దైలువారెనా
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
నానారతులు తొల్లె నాటివుండెనా

రేకు: 1145-6 నాగవరాళి సం: 21-265

పల్లవి: ఏమి సేసునో నిన్ను యింకా నాపె
ప్రేమ నాపైఁ జేసేవంటాఁ బెనంగీనాపె

చ. 1: మలసి నీతో నేను మాఁటలాడితినంటా
చలము సాదించి నిన్ను జంకించీ నాపె
నలిరేఁగి నీవప్పటి నవ్వులు నవ్వితివంటా
పెలుచుంబంతములెల్లాఁ బెంచీ నాపె

చ. 2: చేతులెత్తి నే నీకు సిగ్గున మొక్కితినంటా
కాతరించి సారె నిన్నుఁ గసరీ నాపె
ఆతుమెల్లా నీవు నాతో నట్టె చెప్పితివంటా
యేతులెత్తి నీమీఁద యెమ్మెచూపీ నాపె

చ. 3: యేకతాన నీతో నే నెనసివుందానవంటా
యీాకడ నీవురమెక్కె నింతో నాపె
చేకొని కూడితి నిట్టె శ్రీవేంకటేశ్వర నీవు
దాకొనె నలమేల్మంగ తానే యాపె

రేకు: 1146-1 గుండక్రియ సం: 21-266

పల్లవి: ఇంకనేల తమకించే నిందుకు నేను
సంకెలెల్లాఁ దీరెఁ జనవరి నేను

చ. 1: వాములుగా వలపులు వలసినవారి కిచ్చి
నామొగము చూడఁగానే నవ్వితి నేను
చేముంచె నీచేఁతలు చేరె నీవుద్దండములు
యేమని వుత్తరమిచ్చే నియ్యకొంటి నేను

చ. 2: వుమ్మడి నీవొక్కఁడవే వూరెల్లాఁ దిరిగివచ్చి
నమ్మికే నీవియ్యఁగానే నవ్వితి నేను
కమ్ముకొనెఁ జెమటలు కానవచ్చె గుఱుతులు
కమ్మటి నిన్ననలేక కానిమ్మంటి నేను

చ. 3: అన్నిటా జాణతనాల నాయములెల్లాఁ గరఁగి
నన్ను నిట్టె కూడఁగాను నవ్వితి నేను
నిన్ను శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
సన్నలఁ గలసి మోవి చవిగొంటి నేను

రేకు: 1146-2 మాళవి సం: 21-267

పల్లవి: ఏమి తగవులు చెప్పే మింకా మీకు
ఆముకొన్న వలపుల కవియెల్లా దొడ్డా

చ. 1: తలపునిలువలేని తమకము గలయట్టి-
చెలి ని న్నెంతసేసినాఁ జెల్లునయ్యా
బలిమిఁ బట్టుక నిన్ను పడఁతులు చూడఁగానే
అలమో వెంగిలిసేసే దదియేమి దొడ్డా

చ. 2: ఆయములు గరఁగి కాయము మదించినసతి
చేయిమీఁదై చెనకఁగం జెల్లునయ్యా
దాయము వచ్చినవేళ దాఁచరానిచోట్ల
యీయెడ గుఱుతుసేసు టదియేమి దొడ్డా

చ. 3: అందుక నీవురమెక్కినట్టియలమేలుమంగ
చెంది నిన్నెంత గూడినాఁ జెల్లునయ్యా
అందపుశ్రీవేంకటేశ అట్టె పాదాలు చాఁచుక
యెందుకునైనా నవ్వే దిదియేమి దొడ్డా

రేకు: 1146-3 దేసాళం సం: 21-268

పల్లవి: తిట్టినా వెఱవ వెంతదిట్టతనమే
గుట్టు విడిచితి వెంత గొంట వైతివే

చ. 1: నావద్దనున్న పతితో నవ్వులు నవ్వేవు నీవు
చేవదేర నీకెంట చెల్లుబడే
కావికన్నులఁ నాతని గమ్మటి నాఁటఁ జూచేవు
తావికొని యెంత గబ్బితనమే నీది

చ. 2: పొత్తుల మాయిద్దరికి పోరచి వెట్ట వచ్చేవు
యిత్తల నీపెద్దరిక మెంతగలదే
సత్తుగాఁ బైకొసరులు జాణతనాలూ నాడేవు
కొత్తగాఁ బోతర మింత కూడఁ బెట్టుకొంటివా

చ. 3: నన్నిట్టె కూడినవాని నయగారాలఁ బెట్టేవు
కన్నె వోయమ్మ యెంతగామిడివే
ఇన్నిటా శ్రీవేంకటేశు నెలయించి చెనకేవు
సన్నల చాయలనే సవతివైతివా

రేకు: 1146-4 సామవరాళి సం: 21-269

పల్లవి: వింటిమి కంటిమి నాఁడే వీనులఁ గన్నులను
సొంటులు సోదించవద్దు జొబ్బిలీఁ జెమటలు

చ. 1: చొప్పెలెత్తి పలుమారుఁ జూచితి నన్నియు నిట్టె
కప్పవద్దు నీచేఁతలు కల్లలు గావు
వుప్పటించెననవేవు నిన్నూరక నే నేమనినా
చెప్పవద్దు నీసుద్దులు చెల్లుబడులాయను

చ. 2: బట్టబయటఁ బడెను పట్టితి మి మ్మిద్దరిని
గుట్టుసేయ నిఁక వద్దు గురుతు లివే
బెట్టుగా మోవికెంపులు బేట్లెత్తి నేఁజూపితి
ముట్టవద్దు నన్ను నీవు మునివేళ్లు చాఁచి

చ. 3: దివ్వెవెలుఁగుననే తేటపడె నీకూటమి
నవ్వవద్దు నీ వంతేసి నయగారాల
రవ్వగా శ్రీవేంకటేశ రతి నిన్నుఁ జేసితిని
దువ్వవద్దు నాకొప్పు దొరకె వేడుకలు

రేకు: 1146-5 సౌరాష్ట్రం సం: 21-270

పల్లవి: సతులగబ్బితనాలే చవులు గావా
ఇతవులే సుమ్మీ నీకు నెరవులు గావు

చ. 1: మనసు నీపైఁ బెట్టి మాటల నెంతదూరినా
చనవుగాఁ జేకొనుమీ చలము గాదు
పెనఁగ నాపెచనుమొనలు నిన్ను నాటితె
కినియకుమీ నీపైకేరడము గాదు

చ. 2: యెదుటనే నిలుచుండి యెంత నిన్నుఁ గొసరినా
అది నీపై మేలు సుమ్మీ అలుక గాదు
పెదవుల మాటాడఁగా పెనుఁదిట్లు వెళ్లితే
పదరకుమీ నీతో పంత మిది గాదు

చ. 3: కడుసరసమాడుతాఁ గరము నీపైఁ జాఁచితే
విడువని పొందుసుమ్మీ వెగటు గాదు
అడరి శ్రీవేంకటేశ అతివఁ గూడి నవ్వితే
వెడమాట లాడకుమీ వెంగె మిదిగాదు

రేకు: 1146-6 శుద్ధవసంతం సం: 21-271

పల్లవి: ఇటువంటికొత్తలు నే మెఱఁగమమ్మ
చిటుకుమని నంతనే చిమ్మిరేఁగేవు

చ. 1: మంచి మాఁటాడేపతిని మలసి తిట్టే నవేవు
యెంచరానిరాఁగతన మేల సేసేవే
పొంచి పువ్వుల వేసితే బొప్పిగట్టె మేననేవు
నించి యాతఁ డందుకేపో నివ్వెరగు నందెను

చ. 2: పచ్చడము గప్పితేనే బలిమిసేసె ననేవు
అచ్చలాన నీ వెంతగయ్యాళివే నేఁడు
పచ్చిమోవి యానఁగాను పగసాదించీ ననేవు
కచ్చుపెట్టి యివియెల్ల గామిడితనములా

చ. 3: యేకతానకుఁ దీసితే యీడిచెను నిన్ననేవు
పైకొని యెంతటినేరుపరివే నీవు
యీకడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
మేకొని యిందుకే నేము మెచ్చితిమే నిన్నును

రేకు: 1147-1 కేదారగౌళ సం: 21-272

పల్లవి: అదియు నీభాగ్యము అవధరింతువుగాక
వెదకివచ్చేటివారే వేగినంతాను

చ. 1: కాతరించి నీమోము గంటేఁజాలుఁగాని
చేతులు చాఁచేవారే చెలులెల్లాను
ఆతలనీతల నీవు అండకు వచ్చితేఁ జాలు
యేతుల నవ్వేవారే యేడనైనాను

చ. 2: మక్కువ నోరుదెరచి మాట నీవాడితేఁచాలు
గక్కనఁ దిట్టేవారే కాంతలెల్లాను
చక్కనినీ వేపాటి సమ్మతించినాఁజాలు
యిక్కువ లంటేవారే యెవ్వరైనాను

చ. 3: వలపులు చల్లుచు నీవు వావులు చెప్పితేఁ జాలు
అలరి పెండ్లాడేవారే అంగనలెల్లా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
కలసేమనేవారే యేకాలమైనాను

రేకు: 1147-2 మధ్యమావతి సం: 21-273

పల్లవి: ఏఁటికిఁ దమకించే వేల పెట్టే వానలెల్లా
నీటుతోనే వుండరాదా నిజమయ్యీగాని

చ. 1: యిందరిలో రంతులేల యింటికి విచ్చేయరాదా
చెంది నీతో నొకమాట చెప్పేఁగాని
విందువలె నాచేతివిడె మందుకోరాదా
కందువ మీఁదటిసుద్ది గనేవు గాని

చ. 2: పాసివుండక పానుపుపైఁ బవళించరాదా
రాసికెక్క నీచిత్తము రప్పించేఁగాని
పోసరించి నామోవిపొత్తు గలయఁగరాదా
ఆసల నీపనికి సహాయమయ్యేగాని

చ. 3: పక్కన నిట్టె నీపచ్చడము గప్పరాదా
నిక్కము నానేరుపులు నెరపేఁగాని
యిక్కడ శ్రీవేంకటేశ యెనసితి మిద్దరము
చెక్కునొక్క నియ్యరాదా సేసవెట్టేఁగాని

రేకు: 1147-3 హిందోళవసంతం సం: 21-274

పల్లవి: మాతోడి గొడవేల మాపుదాఁకాను
యేతులకు వెంటవచ్చే విది యేమోకాక

చ. 1: సింగారించఁగానే ఆపెచేతికి లోనైతివి
వుంగరపువేలిగోరి కొరవైతివి
కంగినతిట్ల కెల్ల కణఁజమైతివి
పంగెనమానిసి వింక పనికివచ్చేవా

చ. 2: కమ్మటి నాపెమోవికిఁ గంచమవైతివి
దొమ్మిచూపులబందెకు దొడ్డివైతివి
పమ్మిననవ్వులకెల్లా పడిగమవైతివి
వుమ్మడివాఁడవు నీకు నున్నదా స్వతంత్రము

చ. 3: కలికిరతులకెల్లా గద్దెవు నీవైతివి
వలపులపంటకెల్ల వామివైతివి
బలిమి శ్రీవేంకటేశ పైకొని న న్నేలితివి
వలరాచకయ్యాన నీవంక వేసటున్నదా

రేకు: 1147-4 చా(ఛా?)యానాట సం: 21-275

పల్లవి: ఇదివో నీపెద్దరిక మెంతని విన్నవించేము
కదిసి కదిసి జాతిగని వైతివి

చ. 1: ఆపెకును నీకెకును ఆసలు నీవిచ్చి యిచ్చి
చేపట్టి చేరవచ్చితే సిగ్గువడేవు
కోపుల నిరువంకలా కొనగోళ్లు మేననంటి
యేపున నడిగితేను యెమ్మె చెప్పేవు

చ. 2: యిద్దరినడుమ నీవు యేకతానఁ బవ్వళించి
వుద్దండాలు సేసితేను వొడ్డుకొనేవు
చద్దికి వేఁడికి వారు చన్నుల ని న్నొత్తి తేను
వొద్దిచెలులసాకిరు లూరకె పెట్టేవు

చ. 3: శ్రీసతి భూసతిని చేసూటిఁ గూడికూడి
సేసలు నీపైఁ బెట్టితే చెలరేఁగేవు
ఆసల శ్రీవేంకటేశ అందరుదేవుళ్లతోడ
తాసువలెఁ దులఁదూఁగి దయిలువారేవు

రేకు: 1147-5 ఆహిరినాట సం: 21-276

పల్లవి: ఏఁటిదో నీమతకము యెఱఁగ నేను
నోటినీయానలకు వీనులు మూసీఁ దాను

చ. 1: యేతలఁపు దెలిసెనో యెచ్చుకుందు గలిగెనో
నాతో నీవు మాఁటాడఁగ నవ్వీ నాపె
కాతరాన నీవు నాకు కడుగిందుపడి యిట్టె
చేతులు ఛాఁచఁగాను సిగ్గువడీఁ దాను

చ. 2: యేకడ దెచ్చితివో యెందరి భ్రమయింతువో
నాకు విడెమియ్యఁగాను నవ్వీ నాపె
జోకకు నాసింగారాలు చూచి చూచి సారెకు
దాకొని నీవు మెచ్చఁగ తలవూఁచీఁ దాను

చ. 3: యేపున వింతకుముందే యెవ్వతెఁ బెండ్లాడితివో
నాపై సేసవెట్టఁగ నవ్వీ నాపె
రాపుగ శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
చాపలాన నింతలోనే సంతసించీఁ దాను

రేకు: 1148-1 సామవరాళి సం: 21-277

పల్లవి: ఆఁటది గూళయ్యైతే నందేమి చెప్పేము నేము
వాటముగ నీవైన వద్దనవద్దా

చ. 1: వూని యేకతాన నీవొద్ద నేఁ గాచుకుండగా
కానుకె లిచ్చి తగిలీఁ గదిసి తాను
మానకు నీతో నేను మంతనములాడఁగాను
ఆనుక యెంగిలిమాట లాడనేల తాను

చ. 2: పడతినై నే నేకు బాగాలిందియ్యఁ గాను
యెడ నాకుమడిచిచ్చీ యేఁటికిఁ దాను
జడిగొని నీతో నేను సరసములాడఁగాను
కడిగి పయ్యదకొంగు కప్పనేల తాను

చ. 3: గద్దించి ఇంతలో నేను కాఁగిలించుకుండఁగాను
చద్దివేఁడివలపేల చల్లీఁ దాను
ఇద్దరము శ్రీవేంకటేశ పొద్దై కూడఁగాను
బద్దులకునేల వొడఁబరచీఁ దాను

రేకు: 1148-2 పాడి సం: 21-278

పల్లవి: ఒద్దు వొద్దు చాలుఁ జాలు నోపదయ్యా
ఇద్దరితమకముల నిఁక యెంతయౌనో

చ. 1: కొమ్మ నీతో నవ్వఁగాను కొప్పున విరులు రాలె
చిమ్ముఁజూపులు చూడఁగఁ జెమరించెను
నెమ్మి సాగిలి మొక్కఁగా నిట్టూరుపులు రేఁగె
యెమ్మెల పొందుసేసితే నిఁక నెంతయౌనో

చ. 2: సంగడిఁ గూచుండఁగాను జాజుకొనఁ బులకించె
అంగవించి మాటాడఁగా నాయము లంటె
ముంగిటఁ జెనకఁగాను మోపులాయ వలపులు
యెంగిలిమోవి పొత్తుల నిఁక నెంతయౌనో

చ. 3: గక్కనఁ గాంగిలించఁగా కడుఁ గరఁగె మనసు
చెక్కునొక్కఁగా సిగ్గులు చిమ్మిరేఁగెను
మక్కువ శ్రీవేంకటేశ మానినిఁ గూఁడితి విట్టె
ఇక్కువలెల్ల నంటఁగా నిఁక నెంతయౌనో

రేకు: 1148-3 బౌళి సం: 21-279

పల్లవి: ఎవ్వరు నిన్నాడుకొనే రేది వెంగె మిందులోన
రవ్వగా మొక్కఁగరాదా రచ్చలోన నీకును

చ. 1: తగవరివౌదువు తప్పు నీయందేమిలేదు
నగరాదా వూరకె నాలోనను
వెగటు నీ కెక్కడిది వెరపు నీకిఁకనేల
మొగము చూడరాదా ముంచి నాకు నేఁడు

చ. 2: పంతగాఁడ వౌదువు బాససేసితే మీరవు
సంతోసించఁగరాదా సారెసారెకు
వింతవా రిందులో వేరీ; వేడుకచుట్టానే నీకు
మంతనమాడుకోరాదా మాలో మేము

చ. 3: దయగలవాఁడవు తగ్గుముగ్గు లెరఁగవు
ప్రియము చెప్పఁగరాదా పెనఁగి నీకు
నియతి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
నయము చూపఁగరాదా నంటుసేసి నీకు

రేకు: 1148-4 దేసాళం సం: 21-280

పల్లవి: ఏఁటికిఁ జేసేవు నాతో నింకా గుట్టు
యీటువెట్టి సతులకు నిదె చాలౌఁజుమ్మీ

చ. 1: అన్నువచెమటలతో నలసి నీవు రాఁగాను
నిన్నుఁ జూచి నామనసు నీరాయను
యిన్నిటా నానతీవయ్య యెవ్వతె నీ కింత సేసె
పన్ని వాదువెట్టుకొని పచరించే నాపెను

చ. 2: వింతవింతనీమేనివెడవెడగురుతులు
కొంతగొంత వొడగని కోపమాయను
పంతగత్తె యెవ్వతె యీపాట్లఁబెట్టెను నిన్ను
రంతుల నందరిలోన రచ్చవేసెను

చ. 3: కందువకు వచ్చి నన్ను గాఁగిలించి కూడఁగాను
విందులనీనేర్పులకు వెరగాయను
అందపు శ్రీవేంకటేశ అవ్వల నెవ్వతె నేర్పె
చందము సేసుక నేను సారె మెచ్చే నాపెను

రేకు: 1148-5 బౌళి సం: 21-281

పల్లవి: అందుకేమి దోసమా అటువంటిఁవాడవా
నిందలేని నీమీఁద నించవద్దా మోహాము

చ. 1: తగవు నీవు చెప్పఁగా తప్పు లందు లేకుండఁగా
నగరాదా నీతోను నయముగాను
మొగము నీవుచూడఁగ మొక్కులు చేత నుండఁగ
చిగురుఁబెదవులెత్తి చెప్పరాదా ప్రియము

చ. 2: కప్పురము నీ వియ్యఁగా కాయమెల్లఁ జల్లఁగాఁగా
ముప్పిరి మెచ్చఁగ వద్దా ముందు ముందే
కొప్పు నీవు దువ్వఁగాను కొంగు చేతఁ బట్టఁగాను
నెప్పున సిగ్గులు నీపై నించరాదా నాకును

చ. 3: విడెము చేతికియ్యఁగా వేడుకఁ గాఁగిలించఁగా
కూడవద్దా నిన్ను నేను కొఱతదీర
జోడై నీ వుండఁగాను చొక్కఁగా శ్రీవేంకటేశ
పూడిగాలుసేసి వొద్దనుండరాదా ఇఁకను

రేకు: 1148-6 లలిత సం: 21-282

పల్లవి: నీ వేమి సేతువు నీవొళ్లికల్లగాదు
వావులు మోవితేనె నవ్వఁగఁ జూతురు

చ. 1: సేసవెట్టి లచ్చిమమ్మ చెంగటనే వుండఁగాను
ఆసపడే వెవ్వరికో అప్పటి నీవు
యీటులేని సిరులెల్లా నింటిలోనే వుండఁగాను
కాసు వీదిఁ బడియుంటే కైకొని యెత్తుదురు

చ. 2: వింతగా భూసతి నీవీఁపుననే వుండఁగాను
చింతించే వెవ్వరినోయి సిగ్గువడక
దొంతిఁ బెట్టి రుచులెల్లా దొరకి తమకుండినా
చింతకాయ గనుఁగొంటే చేరి నోరూరుదురు

చ. 3: సింగారపుఁ దొళశమ్మ శిరసుపై నుండఁగాను
ముంగిట నెవ్వరికోయి మోహించేవు
ఇంగితాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అంగడిబేరాల కొసరడుగక మానరు

రేకు: 1149-1 భైరవి సం: 21-283

పల్లవి: ఇంత చాలదా నాకు యేమిసేసుఁ జలములు
పంతగాఁడు తా నిట్లా బతికితేఁ జాలును

చ. 1: పిలువఁగనేల తన్ను బిగిసితేఁ దిట్టనేల
కలఁడుగా మాకుఁ దానే కలకాలము
చలివాసె వేయిటిపై జవ్వాదికొమ్ముపలె
తొలుతటిచెలులలో తొరలివుందానను

చ. 2: తనతోడిమాటలేల తప్పితేఁ గోపించనేల
మనసున నున్నదిగా మామీఁదిమేలు
మునుకొని తనకు నే ముద్రలోనిసొమ్ముపలె
తనవనితలలోన తగిలివుందానను

చ. 3: మొగము చూడనేల తా మొక్కితే దీవించనేల
అగపడి కూడెఁగా తా నప్పుడే నన్ను
జిగి శ్రీవేంకటేశుముఁజేతికంకణమువలె
తగుఁబట్టపు దేవులదండనే వుందానను

రేకు: 1149-2 వరాళి సం: 21-284

పల్లవి: నీకే తెలుసు నిది నేమేమి విన్నవించేము
చేకొన్న రమణిమతి చిక్కుదీర్చవయ్యా

చ. 1: మచ్చరమే లేనిసతి మాటలెన్ని యాడినాను
విచ్చనవిడిరతికి వెంగెము గాదు
అచ్చపుమోహాన నింతి ఆయమెంత తాఁకించినా
మచ్చికె పెరుగుఁగాని మఱి నొప్పిలేదు

చ. 2: కైవశమయ్యినకాంత కాఁకలెన్ని చల్లినాను
వేవేలై మతికిని వెట్టదోఁచదు
సేవసేయట్టి చెలి సిగ్గులెంత రేఁచినాను
మూవంకలపొందులకు మొగచాటై వుండదు

చ. 3: సేసవెట్టినమగువ సిగ్గున నెంతమీరినా
వీసమంతాఁ గాఁగిటికి వేసటేది
ఆసల శ్రీవేంకటేశ అంగన నిట్టె కూడితి
వాసితోడి సరసము వడిఁబడదు

రేకు: 1149-3 కురంజి సం: 21-285

పల్లవి: సంగతి యెఱఁగవద్దా జాణకాఁడవు
అంగడి వేతురా మోహ మాసోదకాఁడవు

చ. 1: చెక్కు చేత నిడుకొని సిగ్గున నవ్వేచెలిఁ
బక్కన నేల పట్టేవు పంతఁగాడవు
చిక్కనిచెమటతోడ చేతులెత్తి మొక్కేయాపె-
నిక్కువ లంటుదురా యింతవాఁడవు

చ. 2: అడరి తెరమాటున నానలువెట్టేఇంతిఁ
దొడికి పట్టుదురా దొరవాఁడవు
వొడఁబాటు మాటల నే వొద్దనే లోనైవుండఁగా
పుడుకుదురా చన్నులు బూములేలేవాఁడవు

చ. 3: అంగవించి నీసేత కడ్డమాడనిసతిని
యెంగిలిసేతురా మోవి ఇంపూవాఁడవు
రంగు శ్రీవేంకటేశ రతి నెనసి చొక్కించి
పంగింతురా యింతలోనే బలువాఁడవు

రేకు: 1149-4 సాళంగనాట సం: 21-286

పల్లవి: ఊరకుండు చాలుఁజాలు వొరలోనఁ బెట్టు మిఁక
సారపునీవినయాలు సతములయ్యీనా

చ. 1: పయ్యదేల పుడికేవు పంతములేల ఇచ్చేవు
తియ్యనినీమాటలెల్లఁ దెలిసె నాకు
చెయ్యార నీవు నాకు సేసినబాసలే చాలు
వెయ్యయినా నీవినయాలు వీనులఁబట్టీనా

చ. 2: కన్నులనేల మొక్కేవు కడునేల నవ్వేవు
తిన్ననివలపెల్లాఁ దెలిసె నాకు
చిన్ననాఁడు నామీఁద సేసవెట్టినదే చాలు
యెన్నైనా వొడఁబాటు లితవయ్యీనా

చ. 3: బలిమేల సేసేవు పైకొని యేల మెచ్చేవు
తిలకించ నీమేలు తెలిసె నాకు
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
అలరి యెంతైనా నీపై యాసమానీనా

రేకు: 1149-5 సింధురామక్రియ సం: 21-287

పల్లవి: ఊరివారిఁ జూచి చూచి వూరకే నోరూరనేల
ఆరీతి నీకెందుకైనా ఆసపడనేఁటికి

చ. 1: కన్నులెంత గనమైనాఁ గాంతకే చక్కఁదనము
చన్నులెంత గనమైనా సాగు బలిమి
యెన్నుకొంటా సారె సారె నేల యేఁకరేవు నీవు
విన్ను నీవెంచుకోరాదా నీకేల యీగొడవ

చ. 2: నెఱి దురుమెఁతైనా నెలఁతకే సింగారము
పిఱుఁ దెంతబటువైనా పెద్దఱికమే
పఱచై పొగడ నీవు బట్టువాఁడవా యేమి
గుఱుతువెట్టుకొనరాదా కొంచపడనేఁటికి

చ. 3: మొగమెంత మెఱుఁగైనా ముద్దుగాఁ జెలియకు
నగవెంత గలిగినా నయమై తోఁచు
వెగటుదీర శ్రీవేంకటేశ కూడితివి
మగువనే మెచ్చరాదా మచ్చికలే నిండును

రేకు: 1149-6 నాదనామక్రియ సం: 21-288

పల్లవి: ఎందువోయా దాను యేల మానే నేను
సందడి వేఁడికాఁకలు చల్లారనీవే

చ. 1: తమి యెంతరేఁగినాను తగులమౌఁ బొందులు
తెమలి పొద్దులు వుచ్చితే నేమాయనే
చెమటెంత పుట్టినాను చిగిరించు వలపులు
సముకాన సరసము సాముసేయ నియ్యవే

చ. 2: నగవెంత గలిగినా ననుపులు సతమౌను
యెగసక్కేన నుండితే నేమాయనే
తగవెంత నడపినా తరితీపౌఁ బనులెల్లా
మొగమెదుటనే కొంత మొక్కులాడనీవే

చ. 3: భావమెంత చిక్కినాను పరవశములు మించు
తావుల మనోరథాలు తలఁచనీవే
యీవేళ శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడినాఁడు
వేవేలుప్రియములు వెదచల్లనీవే

రేకు: 1150-1 కుంతలవరాళి సం: 21-289

పల్లవి: ఇందాఁకా నామంకుబుద్ధి ఇట్లుండెను
కందువకు రాఁగాను కడమెల్లాఁ దీరెను

చ. 1: మక్కళించి మక్కళించి మాటలు నీవాడఁగాను
గక్కన నామనసెల్లఁ గరఁగె నిదె
చెక్కులు నొక్కి నొక్కి చేరి నీవే వేఁడుకోఁగా
ఇక్కువ సెలవినవ్వు లిదె వచ్చెను

చ. 2: చనవుసేసుక నీవు సారెసారెఁ బెనఁగఁగా
తనివిదీరనియట్టితగులాయను
కొనబుఁజూపులు చిమ్మి కొచ్చికొచ్చి చూడఁగాను
వెనకమునుపులెల్ల వింతలాయను

చ. 3: కాఁగిలించి కాఁగిలించి కమ్మటి నీవు గూడఁగా
మాఁగినమోవి సదమదమాయను
యేఁగి వచ్చి పెండ్లాడితి విదివో శ్రీవేంకటేశ
వీఁగనిసిగ్గులు వెల్లవిరులాయను

రేకు: 1150-2 గౌళ సం: 21-290

పల్లవి: పొద్దువోనివాఁడవు బొంకేవుగాక
వుద్దండపునీగుణాలు వొద్దికలయ్యీనా

చ. 1: మొగమెంత చూచినాను మొక్కులెన్ని మొక్కినాను
చిగిరించినవలపు చేఁగలెక్కీనా
నగవెంత నగినాను వయసెంత చూపినాను
పొగరులనీమాటలు పొసఁగివుండీనా

చ. 2: తీపు లెంతవుట్టించినా తిద్దీని వంకలాడినా
పూపనియాసలు నేఁడు పుల్లటౌరలా
వోపి యంతవోరిచినా వూడిగ మెంతసేసినా
నీపఱచుఁజేఁతలు నేడు చక్కనవునా

చ. 3: మనసెంత గరఁచినాను మచ్చికెంత రేఁచినాను
పెనఁగొన్నరతు లిఁక బీరుపోయినా
ననిచి శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
వినవయ్య నీమన్నవ వేరొకటయ్యీనా

రేకు: 1150-3 రామక్రియ సం: 21-291

పల్లవి: నావంటి సతులే నన్ను మెత్తురు
భావించ నీకే నేను బాఁతిగాఁగాని

చ. 1: చిన్నదాననైనా నీచిత్తము రా సేవసేతు
నన్ను నే పొగడుకొన నాయము గాదు
వున్నతినీచేఁతలకు వోరుతు నెంతేసికైనా
యెన్నిక నీతో నేను యీడురాఁగాని

చ. 2: కడుగర్విసైనా నీకతలకెల్లా లోను
బడిబడి విన్నవించఁ బాడిగాదు
యెడయక యిచ్చకాన నెప్పుడూ నీవద్దనుందు
ముడిమాఁటలను నీపై మోపుగట్టఁగాని

చ. 3: పట్టపుదేవినైనా నీపలుకులెనె నడతు
దట్టించి నీ కెచ్చరించఁ దగవుగాదు
యిట్టె శ్రీవేంకటేశ యెనసితి నిట్లు నిన్ను
అట్టడితనాన నే నాఁడిసేయఁగాని

రేకు: 1150-4 ముఖారి సం: 21-292

పల్లవి: తనకు నాకుఁ బోపునా తానేల పదరీనే
నను పులకెల్లాను నవ్వే గురిగాదా

చ. 1: అలిగి నేనూఁ దాను నాడా నీడా నుండినాను
తలపోఁతలకు గురితానే కాఁడా
యెలమి నాడకు నన్ను నేల పిలువనంపీనే
మలసి తాఁ జెప్పించినమాటే గురిగాదా

చ. 2: పంతముతో తను నేను పలుమారు బిగిసినా
అంతరంగములో గురి ఆసలే కావా
వంతదీర నింతలోనే వాకిటికేల వచ్చీనే
యెంతైనా మేనరిక మీదే గురిగాదా

చ. 3: మంచముపై సిగ్గులను మారుమోములై యుండినా
పొంచి రతులకు గురి భోగమే కాదా
అంచెలశ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడె నిదె
మంచితనముద్రలకు మోవే గురిగాదా

రేకు: 1150-5 గౌళ సం: 21-293

పల్లవి: నేము బుద్ధులు చెప్పేమా నెలఁతకును
దీమసము నీవల్లనే తేటతెల్లమాయను

చ. 1: చెప్పరాని మాట లేమిచెప్పితివో అపెతోడ
ముప్పిరిసిగ్గులతోడ మోము వంచెను
తప్పకుండా నేడ నేడఁ దాఁకించితివో గోరు
రెప్పలెత్తి చూచి మేలు రేచుకొనెను

చ. 2: నవ్వరాని నవ్వులేమి నవ్వితివో ఆపెతోడ
దువ్వటపుపయ్యెద మీఁదు బిగించెను
రవ్వ నెంత వూడిగాలుద రతిఁ జేయించితివో
పువ్వులచెండున నిన్నుఁ బూఁచి వేసెను

చ. 3: సేయరాని సేఁత యేమి సేసితివో ఆపెను
కాయము బిగించి నిన్నుఁ గాఁగిలించెను
యీయెడ శ్రీవేంకటేశ యెంతగా మన్నించితివో
చాయల సన్నల మొక్కి సంతోసించెను

రేకు: 1150-6 సౌరాష్ట్రం సం: 21-294

పల్లవి: మారుకొనేదాననా మచ్చరించి నీతోను
కోరికలే పచరించి కూడుకుందుఁగాక

చ. 1: పంతమాడఁగలమా పలుమారు నీతోడ
చెంతఁబ్రియమాడేనోటిచెలులము
రంతుల నీ వికా నెంత రాజసము చూపినాను
అంతయు నే నిచ్చగించి అలరుదుఁగాక

చ. 2: కొసరఁగఁగలమా కొంగువట్టేనీతోను
వెస నూడిగాలు సేసేవెలఁదులము
పసలుగా నీవెంత బలుములు చూపినాను
పొసగ నీకే లోనై పొందేదానఁగాక

చ. 3: సిగ్గువడఁగలమా చెనకేటినీతోను
వొగ్గి నీరతులకెల్ల వోపుదుఁగాక
కగ్గక శ్రీవేంకటేశ కడు మందెమేళమైన
నిగ్గుల నిన్నే పొగడి నిండుకుందుఁగాక

రేకు: 1161-1 నారాయణి సం: 21-295

పల్లవి: తనతోడి యీడువెట్టి తానేల మమ్ముఁ దడవీ
ఘనుఁడైతే బూములేలఁ గర్త గానీవే

చ. 1: తాలిమెంతగలిగినా తానే బతుకనీవే
ఆలరికాంతలకెల్లా నవి వచ్చీనా
చాలా నవ్వితేను ఆజాణతనముఁ దనదే
మేలిమతనగుణాలు మెలుఁతల కుండునా

చ. 2: యింతుల కిచ్చకుఁడైతే యీపుణ్యముఁ దనదే
బంతినున్న వారికెల్లఁ బట్టుపడీనా
యెంత తాఁ బంటమిచ్చినా ఇదియూఁ దనకే వన్నె
వంతులు మాకు నడప వసగాదుగాక

చ. 3: యెందరిరొచ్చుకోర్చినా యీ కీరితి దనదే
అందరికిఁ దనవలె నలవడీనా
యిందరిలో శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
విందులయీమోహానకు వెల వున్నదా

రేకు: 1161-2 దేశాక్షి సం: 21-296

పల్లవి: ఇదివో నీభాగ్యము యేమని చెప్పఁగవచ్చు
పొదలు సరసముల పొగులాయఁగదరా

చ. 1: వుప్పతిల్లుఁగుచముల నూఁదిపట్టి ఆపె నీతోఁ
జెప్పఁగలమాటలెల్లాం జెప్పఁగాను
చిప్పిలేవు చెమటల జెలియకాఁగిలే నీకు
కుప్పళించి మంచి కేళాకూళి ఆయఁగదరా

చ. 2: బాగాలిచ్చి సారె సారె పైతరవై అపె నిన్ను
వేగినంతా గోరనంటి వేఁడుకోఁగాను
యీగతి బులకించేవు యీపెతోడిసరసమే
జాగులేని పువ్వులవసంత మాయఁగదరా

చ. 3: చిగురునీమోవి యాని చేరి యాపె మొక్కఁగాను
నగుతా శ్రీవేంకటేశ నన్నేలితివి
తగ నీ విద్దరితోడఁ దమకించి పెనఁగేవు
తగిలి రతులు నీచే తాసులాయఁగదరా

రేకు: 1161-3 పాడి సం: 21-297

పల్లవి: ఇంతి యిదె నీవిదె యిఁక నెన్నఁడు
సంతసాలు రేఁచకుంటే చవు లేడ నున్నవి

చ. 1: అలిగి మాఁటాడనట్టిఅతివను నేరుపున
పలికించకుంటేను పంతములేవి
చలపట్టిన గొంటెతెఁ జక్క నవ్వించకుంటేను
తలకొన్ననీజాణతన మేమి వున్నది

చ. 2: చెక్కుతోఁ జింతించేయాపెఁ జెలరేఁగించి సారెకు
చక్కఁగా నవ్వించకుంటేఁ జనవులేవి
మొక్కలాన రతులకు మొగియకవున్నయాపె
మొక్కఁ జేసుకొనకుంటే మోహమేమి వున్నది

చ. 3: కతలుచెప్పినసతిచే కాఁగిలింపించుకొనకుంటే
యితవు శ్రీవేంకటేశ యేమున్నది
తతిగొని నిన్నుఁ గలసి తమకించేయాకెనిండు-
వ్రత మీడేరుచకుంటే వాడికేమి వున్నది

రేకు: 1161-4 వరాళి సం: 21-298

పల్లవి: చవిగావు నీవెంత సటలు సేసినాను
తవిలి లోకులు నీకుఁ దప్పు లేదనేరా

చ. 1: యెన్నియానలు వెట్టుక యెంత వొడఁబరచినా
వెన్న నీవు దొంగిలివా వెనకకును
నన్నుఁ జూచి నీవెన్నేసి నవ్వులు నవ్వినాను
నిన్నును నీసుద్దులును నే నెఱఁగనా

చ. 2: అందరు జూడఁగా నీవు ఆచారాలు సేసినాను
చెంది చీఁకటితప్పులు సేయవా నీవు
యిందులోనే నాయెడకు యిచ్చక మేమిసేసినా
అందుకొని నిన్ను వెంగెమాడక వీఁగుదునా

చ. 3: మనసచ్చి నీవెంత మక్కువ నాకుఁ జేసినా
తనివోక ముట్టవా పదారువేలను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
చనవున నీరతుల చలము విడుతునా

రేకు: 1161-5 రామక్రియ సం: 21-299

పల్లవి: చూడరమ్మ యీతనిసుద్దులెల్ల నిట్లానే
వేడుకమాఁటలకెల్ల వెసఁ గారాలెక్కవా

చ. 1: నగనేరిచినచోట నగితే నమరుఁగాక
జగడగానితోడ సరసమేలా
మొగము నేఁ జూచితేను మొక్కలానఁ దిట్టవచ్చీ
యెగసక్కెపుచన్నుల కిఁక వాండ్లెకవా

చ. 2: ఆసలుచల్లేచోట నట్టే కొసరుటగాక
మాసటీనితోడ మారు మలయనేల
బాసగలవాఁడవంటే పై పైనే వొట్టు వెట్టీ
యీసున చిగురుగోళ్ల కిఁక చేఁగలెక్కవా

చ. 3: సులభమయినచోట సూటిపడుఁగాక మేలు
చలపాదివాని తోడ సణఁగులేల
యెలమి శ్రీవేంకటేశుఁ డింపుతోడ నన్నుఁ గూడె
యెలయింపుమోవులకు నిఁకఁ గెంపులెక్కవా

రేకు: 1161-6 హిందోళం సం: 21-300

పల్లవి: వేమారు నెంతలేదు వెలుమజోలి
నేము నీవలెనే కూర్మి నెరపేము గాక

చ. 1: నీకు నాతనిమాఁటలు నీలోనె తెలుసునే
మాకేమి చేప్పేవు మాపుదాఁకాను
దాకొని మీవద్ద నేము తగవులు దిద్దేమా
జోకల మీవోపికలు చూచే మింతేకాక

చ. 2: మీ యిద్దరిచేఁతలు మీకుమీకే అందాలే
చాయలేల అడిగేరే సారె మమ్మును
యేమనేము నేము మిమ్ము నెటువలె నడచినా
బూమిలో మీనేరుపులే పొగడేముగాక

చ. 3: మచ్చికలమీనవ్వులు మాకెల్లాఁ దెలుసునా
చెచ్చెర మీకే ఇవి సెలవుగాక
యిచ్చకమై శ్రీవేంకటేశుఁ డేలె నన్ను; నీవు
ముచ్చటలాడితే మీకు మొక్కేముగాక

రేకు: 1162-1 అందోళి సం: 21-301

పల్లవి: ఇందుకుఁగా నెవ్వరును యెగ్గులెంచరు
సందుకొని ఆపెనేల సాదించేవు నీవు

చ. 1: వాడికగలచోటను వలచి వొకరొకరు
ఆడరానిమాటలైనా నాడుచుందురు
వూడిగము సేసేవారు వూసివాసు లెంచరు
జోడై తమ మేనులు సోఁకింతురు

చ. 2: సరసమాడేవేళ సమ్మతించి తమలోన
సరుగ మందెమేళాన జంకింతురు
వరుస విడెమిచ్చేవారు వింతసేయరు
అరిదిఁ దమచేతుల నంటింతురు

చ. 3: రతిఁ గలసేయప్పుడు రాజసము విడువరు
తతి గూడఁ దమలోనఁ దమకింతురు
యితవై శ్రీవేంకటేశ ఇంతి నీవూఁ గూడితిరి
చతురులైనవారు సతమే చింతింతురు

రేకు: 1162-2 సాళంగం సం: 21-302

పల్లవి: నీయంత నెఱఁగవు నేఁటిదాఁకాను
మాయలెల్లా నీకు నేమగువ నేరిపెరా

చ. 1: పలుమారు నవ్వుమని పడఁతులఁ దిట్టుమని
చెలఁగి యవ్వతె బుద్ధిచెప్పెరా నీకు
చలము సాదించుమని సటలెల్లాఁ జేయుమని
నిలుకడగా నెంతనేరిపెరా నీకు

చ. 2: వొద్దనే కూచుండుమని వొడివట్టి తియ్యుమని
తిద్ది యెవ్వతె బోదించెరా నీకు
కొద్దిమీరి వుండుమని గుఱుతులు సేయుమని
గద్దరితన మేగతిఁ గట్టెరా నీకు

చ. 3: పంతగాఁడవు గమ్మని పైపై నిచ్చలాడుమని
కాంత యెవ్వతె పట్టముగట్టెరా నీకు
యింతో శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
బంతినే యీగుణ మెట్టు పట్టించెరా నీకు

రేకు: 1162-3 పాడి సం: 21-303

పల్లవి: నీయంత నెఱఁగకున్న నేనైనాఁ జెప్పే నీకు
పాయపువాఁడవు గాన పరాకెంతో నీకు

చ. 1: కరఁగిజారినయట్టికస్తురి బొట్టు చెలికి
సరుగ దిద్దుతాను ముచ్చటలాడేవు
సరిఁ జెఱుఁగువట్టుక సతులెందరో వున్నారు
పరగ వారిఁ జూడవు పరాకెంతో నీకు

చ. 2: యెక్కువై తడఁబడినఇంతికంఠమాలికలు
చిక్కులు దీసుకొంటాను చిత్తగించేవు
మొక్కులు నీకు మొక్కుతా ముందరనున్నా రెందరో
ఫక్కనవారిఁ జూడవు పరాకెంతో నీకు

చ. 3: సుదతిఁ గాఁగిటఁ గూడి సురటి విసరుకొంటా
వుదుటై శ్రీవేంకటేశ వున్నాఁడవు
పదిమారులును నీకుఁ బాదాలు విసికేవారి-
పదనుకాంక్ష చూడవు పరాకెంతో నీకు

రేకు: 1162-4 లలిత సం: 21-304

పల్లవి: నేనూ మీవంటిదాననే నేరమి నాకు నెదే
తానకమ్మై యాతనినే తడవరాదా

చ. 1: చలివాయ దినములు సవతిపాళ్లకు వచ్చు
వలపు పాలు వెట్టంగవచ్చునా యేమి
నలువంకఁ జెలులెల్ల నన్నేల వుప్పటించేరే
కొలదిఁమీరఁగఁ బతిఁ గొసరరాదా

చ. 2: ప్రియురాండ్లకు సేసలు పెండ్లివేళఁ బెట్టినట్టు
వయసు వంచిపెట్టఁగవచ్చునా యేమి
నయమెఱఁగక మీరు నన్నేల గోరసేసేరే
దయవుట్ట నాతనిఁ దగులరాదా

చ. 3: అడియాలపుఁగాఁగిట నాతఁ డిందరికిఁ బొత్తు
వడిరూపు పంచిపెట్టఁగవచ్చునా యేమి
చిడుముడి నన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
బడిబడి మీరు నింకాఁ బై కొనరాదా

రేకు: 1162-5 తోండి సం: 21-305

పల్లవి: రాగదే యెక్కడిసుద్ది రమణుఁడున్నాడకు
పాఁగినవోవరిలోనఁ బవళించున్నాఁడు

చ. 1: తెరమఱఁగు దియ్యఁగా తీపులాయ వలపు
సరసములాడఁగానే చవులాయ మాఁటలు
తరితీపు శాయఁగానే తమకము రేఁగెను
యెరపుసేసుకవుంటే నెడలౌను పొందులు

చ. 2: యెడమాఁట లాడఁగానే యియ్యకోలాయఁ బనులు
తొడిఁబడ నవ్వఁగానే దొరకెఁ గూటములు
వొడివట్టి తియ్యఁగానే వొళ్లెల్లాఁ జెమరించె
జడిసి వూరకేవుంటే చప్పనౌను వావులు

చ. 3: యిచ్చకము శాయఁగానే యింపులు మిక్కిలిఁగల్లు
తచ్చి తచ్చి పెనఁగితే తగులాయమౌను
అచ్చపు శ్రీవేంకటేశుఁ డప్పుడే కూడె నిన్ను
మెచ్చి మెచ్చి పొందకున్న మీరుఁ జుట్టరికము

రేకు: 1162-6 దేశి సం: 21-306

పల్లవి: నీవు సామాన్యుఁడవా నీగుట్టు నే నెఱఁగనా
వావులెంత చెప్పినాను వలచేవా

చ. 1: కలయఁగ నీకుఁ బని గలుగఁగానే కాక
బలిమిసేసితే నీవు పలికేవా
నెలకొన్నతమకము నీకుఁ గలుగఁగాఁ గాక
పిలిపించితే నీవు ప్రియాన వచ్చేవా

చ. 2: చేకొని నీవుల్లాసము సెలవి వెళ్లఁగాఁ గాక
నాకు వలెనంటే నీవు నవ్వేవా
కైకొనఁగా నీకు నాపై కాంక్ష గలుగఁగాం గాక
ఆకు నే మడిచియ్యఁ గా నందుకొనేవా

చ. 3: యింతటాను నీవు నన్ను యేలుకొనఁగాఁ గాక
మంతన మెంతాడినాను మనసిచ్చేవా
యింతులలో శ్రీవేంకటేశ నన్నేలితివి
పంతము నేనాడితేను పరాకుసేసేవా

రేకు: 1163-1 పళవంజరం సం: 21-307

పల్లవి: ఏమని వలపు చెప్పే నెవ్వరూ నే మెఱిఁగేరు
నేమపునీగుణాలకు నీవే సాక్షి

చ. 1: వొనర నీపైబత్తి వొరులకుఁ జెప్పరాదు
మనసులోపలనున్నమరుఁడే సాక్షి
నినుఁబాసి విరహాన నే నిందాఁకా నున్నందుకు
నినుపులయిననానిట్టూర్పులే సాక్షి

చ. 2: నెక్కొన్న నాకోరికలు నీతో వాకుచ్చరాదు
దిక్కులను మొక్కుకొన్న దేవరే సాక్షి
చొక్కపునాచూపులసూటి నీపైనున్నందుకు
పక్కన నే నుండేటిభావమే సాక్షి

చ. 3: బాసతోడ నీకాఁగిటఁ బాయలేకవున్నందుకు
రాసికెక్కనట్టినారతియే సాక్షి
సేసవెట్టి యేలితివి శ్రీవేంకటేశ్వర నన్ను
ఆసుద్దులకెల్లా మనఆయములే సాక్షి

రేకు: 1163-2 వేళావళి సం: 21-308

పల్లవి: అప్పుడన్నీఁ జెప్పేఁగాని అందరిముందరనేలా
దెప్పరాన నిట్టే పట్టుతెర వేసేమయ్యా

చ. 1: మొగములోపలిసిగ్గు మోవివెంట నవ్వులాయ
చిగురులోపలిచింత చెక్కుఁచేయాయ
మగువ నప్పటి నీవు మాఁటలేమి యడిగేవు
అగడుసేయక యేకాంత మియ్యవయ్యా

చ. 2: చేతులఁగారే చెమట చీరకొంగు దడిసెను
కాతరపుఁజూపు కడకన్నులఁ దేరె
యేతుల నీపెను నీవు యేల వెడ్డువెట్టేవు
జాతులు సేయక రహస్యానఁ జెనకవయ్యా

చ. 3: పట్టినపాయపుమీఁద పై పై నీకే సెలవాయ
తొట్టినవలపులెల్ల దోమటాయను
యిట్టె శ్రీవేంకటేశ యెనసితి వింతి నిట్టె
దట్టముగా నీవు మంతన మానతీవయ్యా

రేకు: 1163-3 లలిత సం: 21-309

పల్లవి: మొక్కవే యాతనికి మున్నిటినేరమి దీర
మొక్కళీ డాతఁడు నీమోవెంగిలే చాలు

చ. 1: వేసటేలే నీకూ వేగినంతా నాతఁడు
ఆసలు రేఁచి రేఁచి ఆయాలంటఁగా
వేసములఁ దిట్టకువే విభుని నేమనినాను
దోసము లందురు కాలుదొక్కినదే చాలును

చ. 2: జంకెనలేలే నీకు సమ్మతించి నీమగఁడు
వుంకువగా విడెమిచ్చి వూరడించఁగా
మంకుఁదనాలు చూపకు మగనాలి మీరితేను
అంకెగాదు నీచెమట నద్దినదే చాలును

చ. 3: సిగ్గులు వడఁగనేల శ్రీవేంకటేశ్వరుఁడు
అగ్గమై నిన్నుఁ గలసి ఆదరించఁగా
వెగ్గళించి కితనికి వెక్కసాలు చూపితేను
సగ్గవు కోరికలెల్లా సరసమే చాలును

రేకు: 1163-4 గుండక్రియ సం: 21-310

పల్లవి: కానీవే నాకెంత గలిగెఁ దనకూ నంతే
వూని నానినసనిగె లొకటి కినుమడి

చ. 1: తన కెంతకుచ్చితము తానే బదికీలేవే
మనసంతే మంగళము మాపుదాఁకాను
వనిత నొక్కతె నాతో వడి నీడువెట్టెను
తనకూ నదేకాదా తగవు మీఁదటికి

చ. 2: యీసులెంత రేఁచుకొన్నా నెక్కడవోయీలేవే
సేసినసుబాఫలాలు చేతిలోనివే
యీసిరులతో మగని కెందరిఁ బెండ్లిసేసినా
లాసి నావలెనే తనలాబము గాదా

చ. 3: తడవి శ్రీవేంకటేశు దక్కనిచ్చె నాకు నేఁడు
నుడుగులఁదే వున్నది నోముఫలము
పఁడతులచేతనెల్లా పంతము నాకిప్పించితే
కడఁగి తనపెద్దరికముగాదా యిఁకను

రేకు: 1163-5 మాళవి సం: 21-311

పల్లవి: ఏమి చెప్పేవు సుద్దులు యెందాఁకాను
వేమారు వెన్నెలేకాదా వేసవయ్యేది

చ. 1: పురుషుఁడైతేనేమి పొలఁతియైతేనేమి
వరుస నొకటేకాదా వాసిపట్లు
కడఁగి చొక్కిననేమి కడువెరగైతేనేమి
మరునియమ్ములేకావా మతి నాఁటేవి

చ. 2: వొంటి నేలికైతేనేమి పూడిగపుదై తేనేమి
జంటల సరేకావా జవ్వనములు
ఇంటిలో నైతేనేమి యీవాకిట నైతేనేమి
అంటి చల్లగాలేకాదా ఆయాలు రేఁచేది

చ. 3: దేవరయైతేనేమి దేవులైతే మరియేమి
వావిరిఁ బొత్తేకాదా వలపులెల్లా
శ్రీవేంకటేశ్వరుఁడ చేరి నన్నుఁ గూడితివి
కోవిలకూఁతలేకావా గురులయ్యేవి

రేకు: 1163-6 రామక్రియ సం: 21-312

పల్లవి: ఎంతవేగిరకాఁడవు యేమి చెప్పేది
పంతమెల్ల నీవు నాపైఁ బచరించేవు

చ. 1: కూరిమి నేనాడినకొసరుమాటలకు
ఆరీతిఁ దారుకాణించుమని యాడేవు
నేరుపుతో మెలఁగితే నీవే బదికేవు మఱి
వారకపునీగుణా లెవ్వరికి వచ్చీని

చ. 2: ననుపున నే నీతో నవ్వినసుద్దల కెల్లా
పెనఁగి నీవానలేల పెట్టవచ్చేవు
అనువుగా నిజమరివైతే నిన్నే పొగడేరు
వొనర నొకరికిరి తొకరి నంటీనా

చ. 3: కూడేవేళనే నిన్ను గోరు సోఁకించినందుకు
చూడఁజాతి రతి నెంత సూదువట్టేవు
యీడుగా శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యీడేరినచుట్టరిక మిద్దరికుండీని

రేకు: 1164-1 ఆహిరి సం: 21-313

పల్లవి: ఏమయ్య్య కరుణించేది యిఁక నెన్నఁడు
చేముట్టి సరసమాడి చెక్కునొక్కరాదా

చ. 1: చిప్పిలుఁగాఁకలతోడి సిగ్గులు నీపైఁ జల్లీ
కప్పుర మియ్యగఁరాదా కలికికిని
రెప్పలెత్తుఁజూపులతో రేసుల నిన్నుఁ గొసరీ
దప్పికి మోవియ్యరాదా తరుణికిని

చ. 2: కొలకొలనవ్వులతో కూరిమి నీపై వేసీ
పిలిచి చేకొనరాదా ప్రియురాలిని
తొలఁకునాసలతోడ దూరీ నిన్ను సారెకు
అలమి చనవీరాదా అంగనకును

చ. 3: కందువఁ జన్నులు మోపి కళలు నీపై రేఁచీ
అంది కాఁగిలించరాదా అతివను
చెందెను బలిమిఁ బట్టి శ్రీవేంకటేశ్వర నిన్ను
అంది విడెమియ్యరాదా అలివేణికి

రేకు: 1164-2 దేసాళం సం: 21-314

పల్లవి: పట్టివాదులకునేల పచ్చినే తాను
అట్టునిట్టు జంకించి ఆదరించరాదా

చ. 1: తగవు చెప్పరే మీరు తరుణులాల
మొగముచూచేపతికి మొక్కరాదా
మగఁడు దనకై తేను మాటమాట సరసాన
వెగటుగాఁ దిట్టి నేను వేఁడుకోరాదా

చ. 2: వొలపక్షమడకురే వువిదలాల
పలుమారుఁ బిలువఁగాఁ బలుకరాదా
మలసి తనవాఁడైతే మాతోఁ బెనఁగేవేళ
చెలఁగి గోరుదాఁకితే చెక్కునొక్కరాదా

చ. 3: మీకే తెలుసునే మెలుఁతలాల
కైకొని నన్నుఁ గూడితేఁ గలయరాదా
జోక శ్రీవేంకటేశుఁడు సొరిదినే యేలఁగాను
వాకునఁ బ్రియము చెప్పి వంచుకోరాదా

రేకు: 1164-3 సాళంగనాట సం: 21-315

పల్లవి: నిన్ను గెలువవసమా నీ వింతటివాఁడవు
మన్నించవయ్యా నే నీమరఁగు చొచ్చితివి

చ. 1: బలువాఁడ వౌదువు పడఁతు లెందరైనాను
సొలసితిట్టినా నోరుచుకవుందువు
మెలుపునీగుణాలకు మెచ్చితి నిందరిలోన
బలిమిఁ బదారువేల పాదముల సోఁకెను

చ. 2: యెంతలేదు నీమహిమ యెంచి చూడ నిప్పుడిట్టె
కాంతలకెల్లా నీమోవి వకంచమాయను
వింతలాయ నీబతుకు వేడుకఁ బీతాంబరము
బంతినే గోపికలకుఁ బరపాయను

చ. 3: మేలుమేలు నీపాదు మెరవడికత్తెలకు
వాలాయము వరుసలువంతులాయను
యీలీల శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
నీలాడు లిందరికిక కానికాలాయను

రేకు: 1164-4 కుంతలవరాళి సం: 21-316

పల్లవి: నే మిద్దరమును నీపాలఁ జిక్కితి మిదె
కామించి యేపుణ్యమైనాఁ గట్టుకొనవయ్యా

చ. 1: ఆకె నీకు నేరిపిన వవే తగవులు
లోకులము మమ్మునేల లోఁచి చూచేవు
సాకి రెవ్వరు చెప్పినా సటలే యందువు నీవు
వాకున వలచువారి వంకలాడవయ్యా

చ. 2: చెవిలో నాడినమాటె చిత్తమునఁ బుట్టుఁగాక
వివరించి మమ్మునేల విచారించేవు
జవళిఁ జెలికత్తె ల సారెకు గరిసించేవు
భువిలోఁ గడవారికి పూనుకరావయ్యా

చ. 3: ఇచ్చకములాడినవే ఇంపులు నీకౌఁగాక
అచ్చులము మమ్మునేల అలయించేవు
చెచ్చెర శ్రీవేంకటేశ చెనకి మమ్మేలితివి
మచ్చికైనవారినే మరగవయ్యా

రేకు: 1164-5 హిందోళం సం: 21-317

పల్లవి: ఒక్కతెనే యాలనా వూరకే నీకు
చక్కఁగా నీనెపమున సాదించేవుగాక

చ. 1: కొల్లగాఁ జెక్కు నొక్కుచు కొనగోరు నాఁటించేవు
చెల్లినంతఁ జేయవయ్య చేఁతలు నీవు
పల్లదాన నీవిది పగ సాదించుటగాక
చెల్లఁబో నామీఁద బత్తిసేయుటా నీవు

చ. 2: కొంగువట్టుతానే నాకుచములు విసికేవు
అంగడి వేయవయ్య నీ వన్నిటా సిగ్గు
చెంగట నీపంత మిఁదే చేకొనవచ్చుటగాక
సంగతి నాపై వలపుచల్లుటా నీవు

చ. 3: పక్కునఁ గాఁగిటఁ గూడి పలుసోఁకులు సోఁకించేవు
వెక్కసానఁ గూడవయ్య వేడుక నన్ను
మక్కువ శ్రీవేంకటేశ మమ్ము మన్నించుట గాక
తక్కక మాతోడివినోదములా యివి

రేకు: 1164-6 శుద్ధదేశి సం: 21-318

పల్లవి: మదించిన వలపుల మత్తురాలను
చెదర నీవే యింత సేసితి నన్ను

చ. 1: మాటలు నీ వాడించఁగ మఱచివుంటి నిందాఁకా
గాఁటానఁ జేయెత్తి మొక్కేఁ గైకొనవయ్యా
పాటించి నీవు రాఁగాను పై పైఁ జూడఁబట్టె నాకు
చాటువైనకానుకిచ్చే చాఁచవయ్యా చెయ్యా

చ. 2: సెలవి నీవు నవ్వఁగ సిగ్గుననుంటి నిందాఁకా
యెలమితో వీడెమిచ్చే నిందవయ్యా
నిలుచుండఁగా బానుపు నీకుఁ బరవఁగబట్టె
యెలమిఁ గైదండ ఇచ్చే నిందవయ్యా

చ. 3: పైకొని కాఁగిలించంగ భ్రమసివుంటి నిందాఁకా
యీకడ మోవితేనియ లిందవయ్యా
దాకొని శ్రీవేంకటేశ దక్కితి విట్టె నాకు
రేకలఁ గస్తూరి గప్పే జోకై వుండరాదా

రేకు: 1165-1 రీతిగౌళ సం: 21-319

పల్లవి: ఎంతకు నంతేకాక యెక్కుడేఁటికే
పొంతనుండి యాతని బుజ్జగించఁగదవే

చ. 1: పయ్యదకొంగు వట్టితే పతిని జంకించితివి
తియ్యనిమోవిపై మరి తిట్లూ నేలే
వొయ్యనే వలపు చింది వొకటి ఇనుమడాయ
చయ్యాటలు మాని ఇఁక సరసములాడవే

చ. 2: కోరి చన్ను లంటితేను కొనగోర నూఁదితివి
వూరకే మీఁదమిక్కిలి వొట్లేంటికే
పోరచి వయసు వండి పోఁకకుఁ బుట్టెఁడాయ
కేరడాలు మాని ఇట్టే కేలెత్తి మొక్కవే

చ. 3: పక్కన గాఁగిలించితే పాదము పైవేసితవి
చెక్కిటిచేతితోడిసిగ్గు లేఁటికే
యెక్కువైన శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
పెక్కులెల్లా మాని యిట్టె ప్రియములు చెప్పవే

రేకు: 1165-2 బౌళి సం: 21-320

పల్లవి: అట్టె బదుకవయ్యా అంతలోనే మాకేమి
ఇట్టె వలపే నీకు యెక్కువసింగారమా

చ. 1: మాయదారివాఁడవు మానినులవుంగరాలు
యీయెడ వేళ్లఁబెట్టుక యెమ్మెసేసేవు
చాయలమేనిరేఖలు చాలవా అందుకుఁదోడు
కాయముపై మచ్చములు కడుసింగారమా

చ. 2: పొద్దువోనివాఁడవు పొలఁతులవలువలు
కొద్దిమీర మొలఁ గట్టుకొనివచ్చేవు
ముద్దుముద్దువలె నీమోవికెంపులే చాలవా
పెద్దరికపుటెరవు పెక్కువసింగారమా

చ. 3: కతకారివాఁడవు కాంతలపువ్వు దండలు
ఇతవై మెడవేసుక యెలయించేవు
తతి నన్నుఁ బొందితివి దగ్గరి శ్రీవేంకటేశ
రతులసదమదము రాఁపులసింగారమా

రేకు: 1165-3 శంకరాభరణం సం: 21-321

పల్లవి: పెనఁగే పూరకే ప్రియపడి నాతో
నను పు నటించక నయమౌనా

చ. 1: చిత్తములోపలిసిలుగులు వాయక
బత్తులు సేయఁగఁ బనిగలదా
వొత్తినగొళ్లు వొళ్లనే వుండఁగ
హత్తినకాఁగిలి అనువౌనా

చ. 2: నగవులలోపలి నలుసులు దియ్యక
పగటులు సేయఁగఁ బని గలదా
తగిలిదండలు తతి మెడనుండఁగ
వెగటుగఁ బెనఁగఁగ వేడుకలైనా

చ. 3: వలపులలోపలి వాసులు దోయక
బలుములు చూపఁగఁ బని గలదా
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
కలసిరతులకుఁ గడమలు నౌనా

రేకు: 1165-4 కాంబోది సం: 21-322

పల్లవి: ఓయమ్మ నీగాతికి నోరుచునా యెవ్వతైనా
పాయలు వడినఁ బోదు పట్టకు మాచెఱఁగు

చ. 1: కాంతలఁ బెక్కులఁ బొంది కాయాటుపడె నీమేను
యెంతవడ్డైనా నలయ దిదివో నేఁడు
ఇంతలోనే తమ్ములము లిందరివి లోఁగొని
యేఁతైనాఁ గద్దు నీనోరు యెట్టు మాటాడేను

చ. 2: పనితల రహస్యాలు వాఁగి వాఁగి నీవీనులు
వెనకతియ్య వెంతేసి విన్నవించినా
తనివోనిమర్మములు తాఁకి తాఁకి గట్టిపడె
పనివి నీచేతు లెట్టు పట్టిపెనఁగేను

చ. 3: కుచములు దాఁకి తాఁకి గురులాయ నీవురము
రచన నన్నిటాను నీరచ్చకెక్కెను
యిచట శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
పచరించి నీయాసలు పట్ట నెట్టు వచ్చును

రేకు: 1165-5 గౌళ సం: 21-323

పల్లవి: పొయిఁ బాలవంటిది పూఁచినతనమోహమెల్లా
నయముల నెందాఁకా నానఁబెట్టవచ్చునే

చ. 1: కన్నులఁ గన్నపుడే కందువచుట్టరికము
వున్నప్పుడెల్లా నూరకే వుండును తాను
చన్నులు మోఁపినప్పుడే జల్లనఁ బులకించును
యెన్నిక నల్లంతనుంటే యేఁతైనా గరఁగఁడు

చ. 2: పిలిచినప్పుడే తన ప్రియవాదిపలుకులు
చలముననున్నపుడు సటలే తాను
తలఁచినప్పుడే తనతమకపువినోదాలు
మలసివున్నప్పుడైతే మానుపడివుండును

చ. 3: గక్కనఁ గూడినప్పుడే ఘనమైనతనయింపు
తక్కినప్పుడు గొంటుఁదనమే తాను
యెక్కువతో శ్రీవేంకటేశుఁ డిప్పుడు నన్ను నేలె
చెక్కులునొక్కినవేళ చిరునవ్వు నవ్వును

రేకు: 1165-6 సామంతం సం: 21-324

పల్లవి: ఇంతియవ్వనసీమకు యేలికవు నీవైతివి
రంతు లిన్నియును నేలు రపమాయ నీకును

చ. 1: మొలకనవ్వులనేటి మోసులు
చెలఁగేటి పెదవులచిగురులు
మలసి పైతాఁకులమారాకులు
వలపులపైరులు వనితపై నవివో

చ. 2: పూఁచినసిగ్గులలోనిపుప్పొడులు
కాచినచన్నుల నిమ్మకాయలు
యేచినమోవిపండ్లు యెసఁగెను
చేచేత వసంతవేళ చెలియమ్మై నదివో

చ. 3: చెప్పరానిపలుకులచిలుకలు
ముప్పిరి నెరిఁదుమ్మదమూఁకలు
యిప్పుడే శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగాను
కుప్పలకొటారులు కొమ్మమేన నదివో

రేకు: 1166-1 వరాళి సం: 21-325
పల్లవి: ఇద్దరిలోపల నీవు యెవతెను మెచ్చితివి
అద్దలించక మాకిది యానతియ్యవయ్యా
చ. 1: కొమ్మ వొక్కరితె కేళాకూళిలో జలకేళిని
కమ్మి పెనఁగేయట్లాఁ గాఁగిటఁ గూడె
పమ్మి వేరొక్కతె వచ్చి పైకొని యది దెలిసి
దిమ్మరితనాన మోవితేనె చవిగొనెను
చ. 2: పడఁతి వొక్కతె నిన్ను పక్కపారిశాన వచ్చి
తొడలఁ బీడించి పట్టి తొలఁగఁదీసె
యెడచొచ్చి వేరొకతె ఇవ్వలిపారిసెమున
అడియాలమైనమాట లటు విన్నవించెను
చ. 3: మునిఁగి వచ్చి యొకతె మొక్కలాన నిన్నుఁ గూడి
మొనలచన్నుల నూఁది మొకమెత్తెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కమ్మటి మఱియొకతె
మనసిజరతులను మాఱుపిళ్లాడెను

రేకు: 1166-2 పాడి సం: 21-326

పల్లవి: నమ్మిదురు యింక నిన్ను నలినాక్షులు
వుమ్మడి నింకానేల వొడఁబరచేవు

చ. 1: వేడుకకాఁడవైతివి విచ్చి విచ్చి ఆపె నాతో-
నాడినన్నీఁ గలవు నీయంగములందు
యీడుపడ నీ నిన్ను నింతకంటె నేమాడేను
యేడలేని యానలు నీవేల పెట్టేవిఁకను

చ. 2: నగితివట యేడనో నాలి చేసినచేఁతకు
తగుదు వన్నియు వింటిఁ దరుణిచేత
యెగసక్యానకు నే నింత కంటే నేమిసేసే
తగిలి సతుల నేల తారుకాణించేవు

చ. 3: నన్నేలితివి కాఁగిట ననుపు లక్కడివలె
కన్నులెదుటనే నాకుఁ గానవచ్చెను
యెన్నఁగ శ్రీవేంకటేశ ఇంతకంటె నిఁక నేమి
పన్నిననగవులేల పచారించేవు

రేకు: 1166-3 నాదనామక్రియ సం: 21-327

పల్లవి: వట్టిదోసాలు గట్టేవు వద్దన్నాఁ బోవు
అట్టడిసేఁతల నింతాఁడిసేతురా

చ. 1: చలివాయ గొల్లెతల సంగడిఁ గూచుండుకొంటా
బలిమి వారిపాదాలు పైవేసుకొంటా
కులికి చేతుల వారగుబ్బలు రాచుకొంటా
బులిసే వదేమోయి పొద్దువోదా నీకు

చ. 2: కొమరెపడుచులతో కొల్లున నవ్వుకొంటా
చెమటలంట చేతులఁ జెనకుకొంటా
అమర వారిపూదండ లవి మెడవేసుకొంటా
తమకించే వేఁటి దొరతనమోయి నీకు

చ. 3: మందబోయి రాండ్లను మానముపైఁ దిట్టుకొంటా
అంది పోఁకముడి విడిచాడు కొంటాను
ఇందరి శ్రీవేంకటేశ యెనసితిని మమ్మెల్లా
ఇందుముఖులెల్లాను ఇంతబాఁతే నీకు

రేకు: 1166-4 దేసాళం సం: 21-328

పల్లవి: కామాతురునకును గర్వ మెక్కుడు
వేమారుఁ బెచ్చువెరిగి విఱ్ఱవీఁగు మిఁకను

చ. 1: నీకేల వెరపూ నీవిన్నిటా దొరవూ
చేకొని యేమి చేసినాఁ జెల్లును నేడు
యీకడనాకడ సతు లెందరైనా నున్నవారు
చేకొని మత్తుఁడవై చెలరేఁగు మిఁకను

చ. 2: అడ్డాఁక లేడవి అన్నిటాఁ దెగుదారివి
వొడ్డారాన నెట్టుండినా వొరపే నీకు
జడ్డుదేరె తమ్ములము సరి నీపుక్కిళ్ల నదె
దొడ్డగాఁ జొక్కుచు సోలి తుదమీరు మిఁకను

చ. 3: పండెను నీతపమూ పట్టినదెల్లాఁ బైఁడి
అండనే నన్నుఁ గూడితి వాయను పని
నిండఁగ శ్రీవేంకటాద్రినిధిఁ దొక్కివున్నాఁడవు
కొండవంటి వుబ్బుతోడఁ గొల్లగాను మిఁకను

రేకు: 1166-5 బౌళి సం: 21-329

పల్లవి: కడమమాటలు నీవే కనుకోవయ్యా
పడఁతులలోన వాసిపట్టుదాననయ్యా

చ. 1: పంతము నేనా విడువ పైకొని మాటలాడేవు
యెంతవడి వూఁకొందు నేమనేవయ్యా
కాంతుడవు నీవు గక్కన వంచుకోరాదు
చెంత నీనవ్వుల కెట్టు చేతులొగ్గేనయ్యా

చ. 2: పాయపుగర్వపుదానఁ బలుమారు మొక్కేవు
యీయెడ నెందాఁకాఁ జూతు నేమనేవయ్యా
నీయంత దొరవు పని నీచేఁ గొనఁగరాదు
చాయల నేమని నీతో సమ్మతించేనయ్యా

చ. 3: చలము నాకే కలదు సారె నన్ను వేఁడుకొనే-
యెలయింపు లెట్టువిందు నేమనేనయ్యా
బలిమి శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
నిలువెల్లా వలుపులే నీవే నేనయ్యా

రేకు: 1166-6 సాళంగం సం: 21-330

పల్లవి: ఇంతా నీమహిమలే యేల నవ్వేవు
ఇంతులెల్లా నుండఁగానే యేల నవ్వేవు

చ. 1: దవ్వులనుండినదాన దగ్గరివచ్చితి నింతే
యెవ్వరు నిన్నేమని రేల నవ్వేవు
పవ్వళించివుండఁగాను పనీనరు చల్లితి నింతే
యివ్వల నామోము చూచి యేల నవ్వేవు

చ. 2: యిచ్చకములాడి నీకు యిటు ప్రియాలు చెప్పితే
యెచ్చరి నీవే తెలిసి యేల నవ్వేవు
మెచ్చి మెచ్చి చనవుతో మేలములాడినందుకు
యెచ్చుకుందు లాయనంటా యేల నవ్వేవు

చ. 3: కాయకపుచెమటలు కడిగి కడిగి నేను
యీయెడ నిన్నుఁ గూడితే యేల నవ్వేవు
పాయపుశ్రీవేంకటేశ పనులెల్లాఁ జక్కనాయ
యీయరానిచన విచ్చి యేల నవ్వేవు

రేకు: 1167-1 సౌరాష్ట్రం సం: 21-331

పల్లవి: లేవే యెందాఁకను లెక్కలు వెట్టేవు
ఆవటించి పైకొంటే నాయములు రేగును

చ. 1: యెదురుమాటలాడితే నెన్నైనాఁ గలవు
పొదిగి కాఁగిలించితే పొందు చేకూరు
చదురులాడఁజూచితే సరియాఁకలై యుండు
అదన మోవియానితే నడ్డాఁక లేదు

చ. 2: పనులు విచారించితే బండ్లకొలఁదులు
ననిచి రతిసేసితే నాఁడే పెండ్లి
పెనఁగఁబోతే కడుబిగియ మనసువుట్టు
చెనకి పై కొంటేను చేతఁ జిక్కు వలపు

చ. 3: కొచ్చి సిగ్గువడితేను కొండలౌను జగమెల్లా
పచ్చిగా రతిసేసితే బట్టబయలు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డెనసె నేఁ డింతలోనె
ఇచ్చగించితే నట్టే యితవౌఁ దమకము

రేకు: 1167-2 నీలాంబరి సం: 21-332

పల్లవి: తెలుసుకొమ్మీ యిట్టె దిక్కుల పరాకు మాని
ఫలించెఁజుమ్మీ జవ్వనపాయమెల్లాను

చ. 1: చిగురుటాకులను వ్రాసినమేలుసుద్దులే
మగువయాడేమంచి మాటలెల్లాను
మొగి ముత్తెపుఁజిప్పల మూసిదించినవే
వెగటైనచూపుల వెన్నెలలెల్లాను

చ. 2: కమలపుపుటికల కలయ నీపైఁజల్లేవే
రమణిచేఁతలు సేసే రచనలెల్లా
అమర మరుగరిడి నటు సాములు చూపేదే
కొమరె నీతొడ మీఁదఁ గూచుండేదెల్లాను

చ. 3: పువ్వులగుత్తుల నిన్నుఁ బూజలుసేసేదే
జవ్వని చన్నులనొత్తేసరసమెల్లా
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ బెండ్లాడినదే
బువ్వపురతుల నీతోఁ బొత్తులు గూడినది

రేకు: 1167-3 ముఖారి సం: 21-333

పల్లవి: ఎరవై పట్టనేరము యింతేసి వూసివాసులు
ఇరవైవుందాన నీకు నేమిసేతురా

చ. 1: యెంత నే మాటలాడినా యెగసక్కెమే యనేవు
కొంతగొంత చూచితేను కోపమనేవు
వింతప్రియాలు సేసితే వెంగెములుగాఁ బట్టేవు
యెంతటివాఁడవు నిన్ను నేమనందురా

చ. 2: అట్టే సిగ్గులు వడితే నలిగితి నే ననేవు
గట్టిగాఁ గొంగువట్టితే గయ్యాళనేవు
నెట్టుకొని నీవద్దనుంటే నే నిన్ను నమ్మకనేవు
యిట్టిమతకపువాని నెట్టు నే గెలుతురా

చ. 3: అంకెకెల్లా వచ్చితేను అబ్బురము లివనేవు
సంకెలేక నవ్వితేను సటలనేవు
లంకెల శ్రీవేంకటేశ లలి నన్నుఁ గూడితివి
యింకా నిన్నప్పటిని యెట్టు గొసరుదురా

రేకు: 1167-4 కేదారగౌళ సం: 21-334

పల్లవి: చూతము దానికేమి సుభము లన్నియు నింకా
కాతరపుచేఁతలచే కడుమించరాదా

చ. 1: తెల్లనాయఁ గన్నులు తేటలాయ నీసుద్దులు
పల్లదాన మావొడేల పట్టేవయ్య్య
చెల్లుబడి గలదు సిగ్గులు నీకా లేవు
బల్లిదుఁడవై యిట్లానే బతుకరాదా

చ. 2: చెమరించె నీమేను చేఁతలు రూడికెక్కె
తమితో నింకా మమ్మేల దగ్గరేవయ్యా
భ్రమయించనేరుతువు బాసలు మీఱఁగలవు
అమర నిన్నిమేళ్లు నందఁగరాదా

చ. 3: కళలు మోమున రేఁగె కాఁగిటిలో చలివాసె
బలిమిసేసి మమ్మేల పై కొనెవయ్య
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
వెలలేని వేడుకల వెలయరాదా

రేకు: 1167-5 ఆహిరి సం: 21-335

పల్లవి: ఇంతికి నీవు లోనైతి వేమందు నిన్ను
పంతములాడేటికాంతఁ బట్టవచ్చునా

చ. 1: నాయములు చెప్పఁగాను నన్నునేల తిట్టేవు
ఆయింతిపొందు సేయుమంటినా నిన్ను
ఆయెడ నే నడ్డమురానని నన్ను దూరేవు
పాయపుమదముసతిఁ బటవచ్చునా

చ. 2: నడుమ నవ్వేటిదాని నన్నునెల గద్దించేవు
గొడవ లాపెతోఁ బెట్టుకొమ్మంటినా
తొడిఁబడ నీకు నేను తోడుగానైతి ననేవు
బడిఁబైకొనేజవ్వనిఁ బట్టవచ్చునా

చ. 3: నిన్నుఁ జేయివట్టేదాని నీవేల సొలసేవు
అన్నిటా నాపెతోఁ బెనఁగాడుమంటినా
యెన్నఁగ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పన్ని నీమోహపుఁజెలిఁ బట్టవచ్చునా

రేకు: 1167-6 మంగళకౌసిక సం: 21-336

పల్లవి: వద్దనున్నారము నేము వాడికవారమెల్లాను
కొద్దిమీరి ముమ్మదము కుంగ దేఁటైనాను

చ. 1: వెలఁది కొత్తవలపు వేఁడివేఁడి చెమటలు
బలిమి ని న్నే పొద్దుఁ బాయఁగలేదు
మెలుపుతోడ నీవు మెడఁగట్టుకొనవయ్య
తిలకించ నాసోదము తీర దేఁటైనాను

చ. 2: చెలియ వింతొకచూపు చిరునవ్వు లొకచవి
కొలువులో నీతొడపైఁ గూరుచున్నది
పొలుపై నీదేవరగా బూజించుకొనవయ్య
తలఁపులో నాపెకు తనియ దేఁటైనను

చ. 3: అంగనకాఁగిటిపెండ్లి అట్టె నాగవెల్లి
సంగతిగా నినుఁగూడి సతమాయను
యింగితాన శ్రీవేంకటేశుఁడ మన్నించవయ్య
చెంగట మాసరుసకె చేరె నెంతయినాను

రేకు: 1168-1 పళవంజరం సం: 21-337

పల్లవి: దయగలదానవు తమకించకువే ఇట్టె
ప్రియపడఁగానే ఇంక బిగియఁగవచ్చునా

చ. 1: భావ మెఱిఁగి మెల్లనె పైకొని కూడుటగాక
కైవసమైనవానిఁ గక్కసింతురా
యేవల్లనుండి వచ్చిన యెదురుకొందురుగాక
నీవద్దఁ గూచుండఁగానే నిష్ఠూరమాడుదురా

చ. 2: వూరట చేసుకొని వొడఁబరచుటగాక
కూరిమిగలుగు వారిఁ గోపగింతురా
కోరి మచ్చము లుండినా కూర్చుకొనవెలఁగాక
సారె సారెఁ జెనకఁగా సణఁగులాడుదురా

చ. 3: వేడుకలెల్లాఁ జూపి విన్నవించుకొంటగాక
కూడి శ్రీవేంకటేశుఁ గొసరుదురా
మేడెపురతులలోన మెచ్చులు మెత్తురుగాక
పాడిగా నీతో నవ్వఁగా పంతములాడుదురా

రేకు: 1168-2 తోండి సం: 21-338

పల్లవి: మావంటివారికెల్లా మాటల లోనయ్యేవా
లావరులకై తేఁగాక లాలనకు మెత్తువా

చ. 1: చలమరులైనట్టి సతులకుఁగాని మరి
బలిమిగలపతులు పంపుసేయరు
తెలివితోఁ గొంగువట్టితీసేవారికిఁగాని
కెలయుచు నేఁతైనా కిందుపడరు

చ. 2: ముంగోపులై నట్టి ముదితలనే కాని
కందు దీరి యెందుకునుఁ గై కొనరు
వంగక తిట్టేమెరవడికతైలకుఁగాని
ముంగిటఁ గాచుకుండి మోహించరు

చ. 3: యెడయక కాచుకుండేఇంతులకేకాని
బడిబడిఁ గాచుకుండి పనికిరాదు
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
తడవకుండిన మీరు తమకించరు

రేకు: 1168-3 ఆహిరి సం: 21-339

పల్లవి: ఏమోయి నేనెఱఁగనా యెంతకెంత సేసేవు
కామతంత్రముల కివి కందువలుగాక

చ. 1: ఈకడ దిట్టితినంటా నెగ్గులేల పట్టేవు
నాకు నీపైఁ గోపమా నగితిఁగాక
కైకొని జంకింతునంటా కమ్మటిని దూరేవు
చేకొన్నపగదాననా చెలిమిగాక

చ. 2: పొలయలు కలకె పొగిలేవు రానంటా
చలమా నీతో నాకు చవులుగాక
పలుకనైతినంటా పై పైఁ జింతించేవు
చలపట్టినదాననా సరసముగాక

చ. 3: గుట్టుతో నేనుండఁగాను కొసరేవు రానంటా
చిట్టకపుదాననా సిగ్గులుగాక
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
అట్టుచేసేనా నిన్ను జట్టిగొనేఁగాక

రేకు: 1168-4 వరాళి సం: 21-340

పల్లవి: ఎట్టు భ్రమయకుందుము యిటువంటినిన్నుఁ జూచి
వుట్టిపడి నిదివో నీవొడఁబాటుపొందులు

చ. 1: పెచ్చురేఁగి వలచినప్రియురాండ్లకెల్లాను
మచ్చుమేఁపులాయను నీమంచిమాటలు
అచ్చలాన నీవుచూపే ఆస లందరికిఁ జేల-
పచ్చలాయ నిదివో నీబయకారిచేఁతలు

చ. 2: కాలుదొక్కినట్టి నీకామినుల కెల్లాను
పాలకూళ్లాయను నీపచ్చినవ్వులు
యీలాగులె ఇందరికి యీఁదులాడేనీటిలోని-
వోలలాయ నిదివో నీవుప్పవేసి పొత్తులు

చ. 3: మక్కువ నిన్నుఁ గూడినమముబోంట్లకల్లాను
చొక్కుమందులాయను నీసొంపురతులు
గక్కన శ్రీవేంకటేశ కలసితివి నీమేలు
రొక్కమాయ నిదివో నీరూఢైనమన్ననలు

రేకు: 1168-5 గౌళ సం: 21-341

పల్లవి: వెఱపేల రమ్మనవే వింతవాఁడా తా నాకు
మెఱుఁగు మెరచితేను మించదా దిక్కులను

చ. 1: అందుకేమె తా నన్ను నాదరించె నింతలోనే
యెందటిఁ గూడివచ్చినా నేమాయనే
ముందు నన్నుఁగూడెను ముడిచివేసినపువ్వు
పొందుగా వీదినుండితే బుగంధించకుండునా

చ. 2: కడమ యేదే తాను కైకొని నన్ను మెచ్చె
యెడసి యెందుండినాను యేమాయనే
కడఁగి నాతో నవ్వె గరచివేసినబూరె
అడరి యెక్కడఁగన్నా నట్టె నోరురదా

చ. 3: ఇన్నీ నేలె శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నేలె
యెన్నిపెండ్లిండ్లాడినా నేమాయనే
వున్నాఁడు నాకాఁగిటను వొద్దికైననాకంచము
కన్నవారెల్లాఁ బొత్తుగలయక వుందురా

రేకు: 1168-6 ఆహిరినాట సం: 21-342

పల్లవి: ఇయ్యకొంటి నీపనులు ఇంతా మేలే
చెయ్యిమీఁదాయ నాకు సిరులేమి బాఁతి

చ. 1: నయగారివాఁడవునాకు నీవు గలవు
ప్రియములేమి గడమ పెక్కుమారులు
క్రియ లెఱుఁగుదువు కేలు చాఁచేవు నామీఁద
నియతా నిందుకే నీయాలనైతిని

చ. 2: చలపాదివాఁడవు సతమై వున్నాఁడవు
బలిమి యేమి గడమ పై పై నేఁడు
వలపించనేరుతువు వంచేవు నాపై ననుపు
కలకాలమును నీకుఁ గైవశమైతిని

చ. 3: శ్రీవేంకటేశుఁడవు చేరి నన్నుఁ గూడితివి
దైవిక మేమిగడమ తగులాయను
భావ మెఱుఁగుదువు పచ్చిగా నవ్వేవు నాతో
వేవేలకును నీకే వెల్లవిరి యైతిని

రేకు: 1169-1 సామంతం సం: 21-343

పల్లవి: తరుణి కింతచలము తగవు గాదు
సరుగ నాతనిమాఁట సమ్మతించవే

చ. 1: తడవితే నొడ్డుకొంటా తరితీపుసేసుకొంటా
వుడుకఁబెట్టేవు మోహ మొక్కమాఁటే
బడలె నీరమణుఁడు పంతము నీకుఁ జెల్లె
యెడయ కింతటనైనా యింపు చల్లవే

చ. 2: పిలిచితే బిగుసుతా ప్రియము చెప్పించుకొంటా
కలయ నూరేవు నవ్వు కడుఁగడు
అలవిమీరె నాతఁడు అమరె నీరాజసము
సొలసి యింతటనైనాఁ జొక్కించవే

చ. 3: కదిసితేఁ దిట్టుతాను కందువలు రేఁచుకొంటా
వెదచల్లేవు సిగ్గులు వేడుకతోడ
చెదరకుండా నిన్ను శ్రీవేంకటేశుఁడుఁ గూడె
పొదలి ఇంతటనైనాఁ బొసఁగుండవే

రేకు: 1169-2 పాడి సం: 21-344

పల్లవి: మానినుల మీఁదనేల మదములు చల్లేవు
ఆనుకొని జూజాలెల్లా నాడుదము రమ్మా

చ. 1: వలపులెల్లా రేఁచి వాడలసతులఁ జూపి
చలము పుట్టింతురా సతుల కింత
పొలసి పొద్దులు నీకుఁ బోకుంటేఁగనక నేఁడు
అలవోక చదురంగాలాడుదము రమ్మా

చ. 2: సరసములెల్లా నాడి సవతుల నెచ్చరించి
కరికరిసేతురా కాంతల నింత
పురుటున నీకింత పుబ్బసపోకుంటేను
అరుదుగాఁ బగడసాలాడుదము రమ్మా

చ. 3: కొల్లున నవ్వులు నవ్వి కొలువుసతులఁ గూర్చి
పల్లదాలాడుదురా పట్టపుదారి
యెల్లగా శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
అల్లాడ నెత్తము మన మాడుదము రమ్మా

రేకు: 1169-3 ఆహిరి సం: 21-345

పల్లవి: ఎందాఁకా వట్టి జాగులేల సేసేవే
సందడించి వలపులు జాజుకొనఁగాను

చ. 1: సిగ్గులు వడుదురా శిరసు వంచుదురా
దగ్గరి కూచుండి పతి తలఁపించఁగా
వొగ్గి అందుకోకుందురా వూరకే వుండుదురా
వెగ్గళించి యాతఁడు విడెమియ్యఁగాను

చ. 2: కన్నెపడుచువా నీవు కడుముద్దరాలవా
మిన్నక లోఁగేవు పతి మేలమాడఁగా
మన్నన నెఱఁగవా మనసు సోదించేవా
విన్నంతనే పలుకవు వేఁడుకోఁగాను

చ. 3: కప్పుర మియ్యఁగవద్దా కాఁగిలించుకొనవద్దా
యిప్పుడె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను
చెప్పినట్టు సేయవద్దా సేవల మెప్పించవద్దా
తప్ప కాతఁ డప్పటిని తమకించఁగాను

రేకు: 1169-4 భైరవి సం: 21-346

పల్లవి: కరుణించవయ్యా కామినిని
గరిమ నివ్వెరగుల కాఁణాచితో నున్నది

చ. 1: జమళికానుకలు సతి నీకు వియ్యవచ్చి
సముకాన నిలిచుండీ చాఁచుమా చెయ్యి
నెమకి చెక్కులనే నిలువుటద్దాలు వట్టి
అమర నూడిగాలు నీకదివో సేసీని

చ. 2: వేడుక మోవిపంటి విందు నీకుఁ జెప్పవచ్చి
వోడుక నిన్నుఁ జూచీ వొగ్గుమా కొంగు
వీడినకొప్పునీలాలు వెలసేసీ నీకుఁ జూపి
జాడతోడ నిచ్చకాలు సారెసారె జేసి నీకును

చ. 3: కనకపుమేనివన్నె కప్పములు నీకుఁ బట్టి
చెనకీఁ బానుపుమీఁద జేకొనరాదా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసె నిన్నింతలోనే
వనిత నానారతుల వంతులువేసీవి

రేకు: 1169-5 ముఖారి సం: 21-347

పల్లవి: ఏమి చెప్పేవు సుద్దులు యెందాఁక మాతో
కామించినటువలెఁ గైకొందువు గాక

చ. 1: పంతములాడఁగనేల బలిమి గలితే నీకు
చెంతనుండ యేమైనా జేతువుగాక
వింతలు మరేడవి వెల్లావిరైననీకు
నంతకూటములనె జడుతువుగాక

చ. 2: అనుమానాలు మరేల అన్నిటా సర్వజ్ఞుఁడవు
చెనకి మమ్ము రట్టుసేతువుగాక
వెనకముందేడది వేడుకగలుగునీకు
పనిగలయపెడెల్లాఁ బైకొందువుగాక

చ. 3: సిగ్గు వీడనేల నీకు శ్రీవేంకటేశుఁడవు
వొగ్గి నన్నేలితి విట్టె వుందువుగాక
యెగ్గుదప్పు లేడవి యింతవలచిననీకు
కగ్గులేక యిట్లానే కలతువు గాక

రేకు: 1169-6 నాదనామక్రియ సం: 21-348

పల్లవి: ఏమి సేయవచ్చునమ్మ యీకాలము
కామినుల నెవ్వరైనాఁ గైకొందురా

చ. 1: యిచ్చకములాడేకాదా యింతులెల్లాఁ బతులను
పచ్చిగాఁగ భ్రమయించి వలపించేది
మచ్చరించి సతులెల్లా మఱియేల అగ్గువైరి
తచ్చి యిటువంటివారే తఱచైరి భువిని

చ. 2: సరసము లాడేకాదా సారెకును మనసులు
కరగిఁచి గర్వముల ఘనమయ్యేది
తరితీపుల మరేల తడబడేరు ముయ్యాడ
సరి నిందువంక మొగచాటాయ మోహము

చ. 3: నవ్వులు నవ్వేకాదా నయాన వేంకటేశు
రవ్వఁగాఁ గాఁగిటఁ గూడి రతికెక్కిరి
యివ్వల మరేల నన్ను నెవసె నీతఁడై పై పై
ముప్పంక నిందువంక నే మును వాయఁ బంతము

రేకు: 1170-1 వేళావళి సం: 21-349

పల్లవి: ఎన్నిమాయలు సేసేవు యేఁటివేసాలు బొయ్యేవు
నిన్ను నన్ను నెంచు కొంటే నీవే కావా

చ. 1: మిన్నక నీవలపులే మెరమీ నింతేకాక
కన్నులనాచూపు నీపైఁ గాఁడిపారీనా
తిన్ననై నీకాఁక తరితీపులు సేసీఁగాక
వున్నతి నామోవి నోరూరించీనా

చ. 2: పట్టరానినీవయసు భ్రమయించీ నింతేకాక
గట్టినాచన్నులు నీకళ దాఁకీనా
నెట్టన నీతమకమే నిన్నుఁ గరఁగించీఁగాక
తొట్టి నాచక్కఁదనము దొమ్మిసేసీనా

చ. 3: కలనీ నీకాఁగిలే గక్కనఁ జొక్కించెఁగాక
మలసి నామేలు నిన్ను మఱపించెనా
తెలిపి శ్రీవేంకటేశ దిక్కయి నన్నేలితివి
చలపట్టి నాగుణము సాదించెనా

రేకు: 1170-2 మేఁచబౌళి సం: 21-350

పల్లవి: ఓపితేఁగనక నీవు వొడిగట్టు మిందుకును
కోపము పనికిరాదు కొమ్మలయెడలను

చ. 1: వలపు జున్నువంటిది వడి రేఁచఁబోతేను
తిలకించ మోవినే తేనె గారును
తలఁపు తీగెవంటిది దగ్గరి పొందుసేసితే
పులకలమొగ్గలు గొబ్బున మేనఁ బొడము

చ. 2: ననుపు వెన్నవంటిది నవ్వులు నవ్వితేనే
మొనసి సెలవి నయములు దేరును
చనవు పంటవంటిది జాణతనాలాడఁగానే
అనుగునాలికెతుద నక్షయమై పెరుగు

చ. 3: రతి తపమువంటిది రచనలు మీఱఁగాను
చతురతఁ గాఁగిటిలో సఫలమౌను
హితవుతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మితిమీఱి యిందులోనె మేలెల్లాఁ జేరును

రేకు: 1170-3 దేసాళం సం: 21-351

పల్లవి: మఱచేమా నేమిఁక మాఁటిమాఁటికి
తఱితోడ నేపొద్దు ధ్యానము సేసేము

చ. 1: ఆపె గరుడిఁ జదివినటు వంటిమాఁటలు
రాపుల నిదివో నేఁడు రచ్చకెక్కెను
పై పై నే మవియెల్లా పాటము గొంటిమి నేఁడు
చాపలాన నేపొద్దూ జపము సేసేవు

చ. 2: పడఁతి మొగసాలలోఁ బచరించినచేఁతలు
వడిగాఁగ నిన్నిట్లాను వహికెక్కెను
విడివిగా నేమవి నేరుచుకొంటి మిదివో
తడఁబడ కేపొద్దూఁ దలఁచుకొనేము

చ. 3: అంగనమంచముమీఁద నభ్యసించినవిద్యలు
రంగుగా మాకాఁగిటిలో రతికెక్కెను
అంగవించి శ్రీవేంకటాధిప నన్నే కూడితి
సింగారాలనీరూపే చింతనసేసేము

రేకు: 1170-4 సామంతం సం: 21-352

పల్లవి: ఇవివో మాసుద్దులు యెవ్వరికి ముద్దులు
వివరించి చూచుకొమ్మా వింతవింతబుద్దులు

చ. 1: తారుకాణించఁగఁబోతే తప్పులాయ మాఁటలు
పూరకే వినఁగఁబోతే నుప్పులాయను
సారెసారెఁ జెనకఁగ చప్పనాయ వలపులు
కోరి వెనఁగఁగఁబోతే గొప్పలాయను

చ. 2: బడిబడిఁ జేయఁబోతే పగలాయసేఁతలు
తడవినప్పుడెల్లాను తగులాయను
నడుకొత్తవినయాలు నానావగలాయను
గొడవలేని పొందులగుట్టు మిగులాయను

చ. 3: ననిచి పెనఁగఁబోతె నవ్వులాయ నాసలు
పొనుఁగక దాఁచితేనే పువ్వులాయను
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనే
కనుఁగొన్నరతులెల్లా కడురవ్వలాయను

రేకు: 1170-5 బౌళి సం: 21-353

పల్లవి: నేసవెట్టవయ్యా ఇట్టె చెలిమీఁదను
ఆసల మీకిద్దరికి నన్నిటా నమరును

చ. 1: గక్కనఁ జెట్టపట్టితే కంకణము వంటి దాపె
దక్కి వురమెక్కితేను తాళివంటిది
మొక్కలానఁ దొడెక్కితే మొలనూలువంటిది
అక్కజమై నీకు నాపె కన్నిటా నమరును

చ. 2: చేరి విన్నవించితేను చెవిపోగులవంటిది
నీరతికి వద్దనుంటే నీడవంటిది
కోరి పానుపుపై పెండ్లికూఁతురువంటి దేపొద్దు
ఆరీతి నాపెకు నీకు నన్నిటా నమరును

చ. 3: పాదాలసేవసేసితే పావకోరళ్ల వంటిది
సోదించి కూచుండితేను సొమ్ముvaంటిది
యీదెస శ్రీవేంకటేశ యింతి నీవుఁ గూడితిరి
ఆదిగొని నీకు నాపె కన్నిటా నమరును

రేకు: 1170-6 మధ్యమావతి సం: 21-354

పల్లవి: అప్పటి మమ్ముఁ జెనకే వాసోదకాఁడవు నీవు
చప్పఁగా గరివడ్డ పెసరుగింజవయ్యా

చ. 1: అలిగించుకొంటా వెంగే లట్టె యాడించుకొంటా
వెలఁది యొకతెచేత వేగించరాదు
పలువురు గొల్లమంకు భామలబారిఁ జిక్కి
బలిమినెట్లా వెళ్లఁబడితివయ్యా

చ. 2: చన్నుల నొత్తించుకొంటా సారె జంకింపించుకొంటా
కన్నె వొక్కతె కాఁగిటఁ గరఁగరాదు
పన్నినపదారువేలపంతాలకు లోనై
ఇన్నిటా నెట్ల ధరియించితివయ్యా

చ. 3: చెందినరతికేలిని శ్రీవేంకటేశ్వర
పొంది యొక్కతె మెప్పించి భోగించరాదు
యిందరిరూపులైన యిందిరను నన్ను నేలి
అందపు వేడుకల నెట్టలరితివయ్యా

రేకు: 1171-1 ఆహిరి సం: 21-355

పల్లవి: సిగ్గువడ వేఁతైనా చెల్లఁబో నీవు
బగ్గన మమ్ము నవ్వుఁబాటు సేసేవు

చ. 1: చాయలకు నీవు నాతో సరసములాడఁగాను
మోయుచు సవతులు మోములుచూచుకొనేరు
యీాయెడ మంచముమీఁద నిద్దరముఁ గూచుండఁగా
నాయములు వెట్టుక సన్నలుసేసుకొనేరు

చ. 2: కాతరాన నీవు నాకు గందపుబొట్టు వెట్టఁగా
జాతులు సేసేరు వారె సారెసారెఁ జెలులు
చేతిసురటిని నీవు చేరి నాకు విసరఁగ
రాతిరిఁబగలును కేరడములాడేరు

చ. 3: కందువల నీవు నన్నుఁ గాఁగిలించి కూడఁగాన
అందరుఁ దమతమకే ఆసపడి రిపుడు
పొందినశ్రీవేంకటేశ భోగములెల్లా సరి
మందలించి నా కెక్కుడుమన్నన లనేరు

రేకు: 1171-2 బౌళి సం: 21-356

పల్లవి: ఏమిదప్పిపోయి నీకు నెందరు లేరు సతులు
నేమముతో నున్నదాన నెరవేర్చరాదా

చ. 1: మగువా నీవును నుండి మాటలు నన్నాడించేవు
యెగసక్కేలాడఁగా నీ వేముందువో
జగడాల కోపను చాయసేసుకొని నేను
వొగి నూరకున్న దాన నుండనీరాదా

చ. 2: పడఁతి నీకుండఁగా నాపయ్యెదకొంగు వట్టేవు
యెడసి చేత దొబ్బఁగా నేమందువో
కడుంగోప మాపలేక గక్కన గుట్టుసేసుక
వొడికాన నున్నదాన నుండనీరాదా

చ. 3: దక్కి యాపెఁ గూడుండి తడవేవు నన్నప్పటి
యెక్కడికైనా రమ్మంటే నేమందువో
ఇక్కడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
వుక్కుమీరి వున్నదాన నుండనీరాదా

రేకు: 1171-3 లలిత సం: 21-357

పల్లవి: ఎఱుఁగుదు మిందరము నీవలపు
తర గరితనముతో దాఁచనేమిటికే

చ. 1: జొబ్బిలుఁ జెమటలతో సోనగారీ నీవలపు
నిబ్బరపుటూర్పుల నిండీ వలపు
వుబ్బరిపులకలచే వుట్టిపడీ నీవలపు
అబ్బురపుపతితోడ నలుగనేమిటికే

చ. 2: జాఱెడితురుముతోడ సందడించీ నీవలపు
మీఱినరతుల మితిమీఱీ నీవలపు
ఆఱడికాఁకలతోడి ఆయాలురేఁగీ వలపు
చూఱలుగా నితనికి చూపిచెప్పనేఁటికే

చ. 3: వేడుకచూపులతోడ వేళగాచీ నీవలపు
వూడిగెపుచేఁతల కోగ్గీ వలపు
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బున ని న్నంతలోనె
మోడామోడిసిగ్గుల మూసిపెట్టనేఁటికే

రేకు: 1171-4 మంగళకౌసిక సం: 21-358

పల్లవి: ఏల తిట్టు దిట్టేవు ఎవ్వరి దపరాధము
మూలలవారిచన్నులు ముట్టితియ్యఁగాను

చ. 1: చెక్కులు నొక్కె నొకతె జీరలుదీసె నొకతె
చక్కనిగొల్లెతలతో సాముసేయగా
తొక్కెఁ బాదాన నొక్కతె దొమ్మిసేసె మరొకతె
వుక్కున వారిండ్లలోనివు ట్లెక్కఁగాను

చ. 2: చన్నుల నొత్తె నొకతె చప్పరించె మోవొకతె
పన్ని గొల్లవారి నీవు బండుసేయగా
సన్నల దూరె నొకతె చలము రేఁచె నొకతె
పన్నుగ వారిచీరలు పట్టితియ్యఁగాను

చ. 3: కైకొని పట్టె నొకతె కందువఁ గూడె నొకతె
జోకతో మందలవారి సోదించఁగా
ఆకడ శ్రీవేంకటేశ అలయించె నిన్నొకతె
దీకొని వారి బలిమిఁ దీసి కూడఁగాను

రేకు: 1171-5 సామవరాళి సం: 21-359

పల్లవి: తగవెఱఁగనివాఁడా తరుణిరో నీమగఁడు
నగవులకొలఁదినే నాఁటుకొనీఁగాక

చ. 1: సొలసేవు రమణుని సూటిదప్పకచూచేవు
కలసినందాఁకా నిట్టె కాంతాళించేవు
బలువులు చూపుదురా పతితోడ నింతేసి
కొలఁదెఱిఁగాతఁడే కూడీఁగాక

చ. 2: పెనఁగే వాతనితోడ బెట్టిమాటలాడేవు
తనువుసోఁకినదాఁకాఁ దమకించేవు
మొనలెత్తి చూపుదురా మొదలనే ఆతనితో
అనువెఱిఁగి తానే ఆదరించీఁగాక

చ. 3: కక్కసించి పిలిచేవు కరకరిఁబెట్టేవు
చిక్కిలోనైనదాఁకా చిమ్మిరేఁగేవు
యెక్కువ శ్రీవేంకటేశుఁ డితం డిట్టె నిన్నుఁ గూడె
మిక్కిలియాతఁడే నీకు మేలువాఁ డవుఁగాక

రేకు: 1171-6 అమరసింధు సం: 21-360

పల్లవి: ఆనతియ్యవయ్యా అందుకు మాఁటెఱుఁగుదు
పూని అందరిని నీకుఁ బొందుసేసేను

చ. 1: వసివాడు మోముతోడ వంచుకొనేవు శిరసు
దెసల నెవ్వతెయ్యైనాఁ దిట్టదుగదా
అసురుసురౌతాను అలసేవు పలుమారు
పిసికి ని న్నెవ్వతైనాఁ బిప్పిసేసెనో

చ. 2: పుడుకుఁ జెమటతోడ నొరగేవు మలగుపై
కడనెవ్వతైనా నలుగదుగదా
చిడుముడితోఁ గొంత చిన్నఁబోయివున్నాఁడవు
పడఁతి యెవ్వ తెయ్యైనాఁ బంతమాడెనో

చ. 3: నిండుఁగళలతోడుత నివ్వెరగైనాఁడవు
అండనెవ్వతైనా మర్మా లంటదు గదా
దండిగా శ్రీవేంకటేశ తగ నన్ను నేలితివి
చండిపెట్టి యెవ్వతైనా సారెకు బోధించెనో

రేకు: 1172-1 సామంతం సం: 21-361

పల్లవి: నీవొళ్లినేర మెంచవు నేమే కల్లలమనేవు
తావుకు విచ్చేయుమా తారుకాణించేము

చ. 1: మావంటివారిమాట మనసునఁ బట్టకుంటే
ఆవలికి రావయ్యా ఆపె ఆడీని
కావించి నేనిచ్చినట్టికమ్మ నీవు నమ్మకుంటే
వావిరి నీవడుగుమా వాసి చూపీని

చ. 2: పూడిగపువారి మొక్కు లొల్లఁబే ట్లైతేను
ఆడకే రమ్మా నీకు నాపె మొక్కీని
యీాడ నేము వెట్టేఆన లియ్యకోలుగాకుంటే
తోడనే విచ్చేయుమా తొయ్యలిచే వినేవు

చ. 3: ఇచ్చిన మాచేకానుక లింపులు నీకుఁ గాకుంటే
అచ్చటికి రమ్మా చెలి ఆపె యిచ్చీని
ఇచ్చల శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అచ్చుగా నీ వేకతము లాడుమా విన్నవించీని

రేకు: 1172-2 వరాళి సం: 21-362

పల్లవి: మాపుదాఁకా పట్టిజోలి మాతో నేఁటికి
నీపొందుల కిది వలె నేరుచుకోవయ్యా

చ. 1: తెగరాని మాఁటలకు తెరువు కోపగించుట
నగితేనే పెనగొను నాలితనము
మొగము చూచితేనే మోహములెల్లా నిండు
నిగిడి నీకేది వలె నేరుచుకోవయ్యా

చ. 2: తీరనియలుకలకు తెరఁగు పంతమిచ్చుట
వూరకుండితేనే నాయ ముమ్మళినుండు
కూరిమి గొసరితేనే కుప్పవడు వలపులు
నీరచన కేది వలె నేరుచుకోవయ్యా

చ. 3: పట్టినవాలములకు పరిహరము మొక్కుటే
గుట్టుతో నుంటే నన్నిఁ గొనసాగును
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
నెట్టన నీ కేది వలె నేరుచుకోవయ్యా

రేకు: 1172-3 దేసాళం సం: 21-363

పల్లవి: చేతికి లోనైనప్పుడే చేరి కై కొందువుగాక
పోతరపుమదమున బొద్దేల జరపేవె

చ. 1: పిలువగబిలువగ బిగిసే వాతనితోను
చలపాదితనమేలే సారెసారెకు
నలువున నీవలపు నాటి మతి నుండగాను
వెలి నీవు సటచేసి విఱ్ఱవీగేదేటిదే

చ. 2: పట్టబట్ట నాతనితో బలిమినే పెనగేవు
వట్టిబీరములేటికే వరవాతాను
పుట్టిపడి నీయాసలు వొడినిండా నుండగాను
దిట్టతనములు చూపేదీమస మదేటిదే

చ. 3: కూడగగూడగ గునిసే వాతనితోను
పాడిపంతము లేటికే పచ్చిదేరెను
యీడనె శ్రీవేంకటేశు డెనసె ని న్నింతలోనె
వీడెపు సొక్కులతో డివింత లిదేటిదే

రేకు: 1172-4 రామక్రియ సం: 21-364

పల్లవి: ఏల వేగిరించేవు యింతలోననే నీవు
కాలుదొక్కినప్పుడే కరగించీగాక

చ. 1: నిన్ను నేమైనా దిట్టినా నెలత నీచేతలకు
చన్నుల మొనలనే సాదించీగాక
యెన్నిసుద్దులు చెప్పినా యెదురు నీ కాడీనా
సన్నలచాయలనే చక్క బెట్టీ గాక

చ. 2: కోపగించీనా ఆపె కొండుకనీసుద్దులకు
చూపులకొనలనే సోదించీగాక
మాపుదాకా నవ్వినాను మారుకొనీనా నీతో
తీపులమాటలనే తిద్దుకొనీగాక

చ. 3: జంకించీనా నేడు సతి నీగుణములకు
పొంకపురతులనే భోగించీగాక
అంకెల శ్రీవేంకటేశ ఆపె నీవు గూడితిరి
మంకుదనాలు చూపీనా మనసిచ్చీ గాక

రేకు: 1172-5 గౌళ సం: 21-365

పల్లవి: ఎప్పటికెప్పటివాదు లెందాఁకానే
కొప్పులు వీడినమీఁద కూడుకొనవలదా

చ. 1: సొగిసి మొగామొగాలు చూచుకొంటె జాలుఁగాక
తగవు లేమున్నవే తనకు నాకు
నగవులు సెలవులు నారుకొంటేఁ జాలుఁగాక
ఎగసక్కేలు మరెవ్వరు నేమాడేరే

చ. 2: ఆరీతినే మాటకు మాటాడుకొంటేఁ జాలుఁగాక
తారుకాణ లేమున్నవే తనకు నాకు
తారసించి మేనుమేనుఁ దగులైతేఁ జాలుఁగాక
నేరములు మరెవ్వరు నేఁడేమి వట్టిరే

చ. 3: ఇతవుతో నిట్లానే యెనసితేఁ జాలుఁగాక
తతి యెంచ నేమున్నదే తనకు నాకు
రతిని శ్రీవేంకటాద్రిరమణుఁడు నన్నే నేలె
మతకా లెవ్వరు నింక మరేమి వన్నెరె

రేకు: 1172-6 పళవంజరం సం: 21-366

పల్లవి: ఈతగవు నీమతిలో నెంచుకోవద్దా
కాతరాన నీవు మమ్ముఁ గదియఁగఁజెల్లునా

చ. 1: వేడుకకు నేఁ దిట్టితే వెంగెము సేసుకొందురా
ఆడుకొనేరా నిన్ను నవ్వలివారు
పాడితో నింత సిబ్బితిపడేవాఁడవైతేను
వోడక మోవెంగిలికి నొగ్గ నీకుఁ జెల్లునా

చ. 2: నగుటా గోరఁగీరితే నాతో వాదింతురా
అగడుసేసేరా నిన్ను నవ్వలివారు
వొగి నీ వింతపనికి నోపనివాఁడ వైతేను
మిగులా రతులఁ గిందుమీఁదుపడఁజెల్లునా

చ. 3: చేయివట్టి నేఁదీసితే శిరసిటే వంతురా
ఆయెడఁ బంగించేరా అవ్వలివారు
యీయెడ నన్నుఁ గూడితి వింతవాసివాఁడవు
చాయ శ్రీవేంకటేశ చన్నులంటఁజెల్లునా

రేకు: 1173-1 కాంబోది సం: 21-367

పల్లవి: అనరాదు గాక నిన్ను ఆయములు చూపి మోపి
ఘనుఁడవైతే పాపము కలపేవా నీవు

చ. 1: శిరసు వంచుకుందాన సిగ్గువడివున్నదాన
కరఁగుచు నాపై నేల కాలు వేసేవు
సరుగన నేఁతైనా మజ్జన మవధరించవు
దొరవైతే నేసినట్టిదోసములు వాసునా

చ. 2: కలయక వున్నదాన కడనిట్టే వున్నదాన
యెలమిఁ దమ్ములము నాకేల పెట్టేవు
కలవి మోవి యెంగిలి కడుగకో వేఁతైనా
యిలయేలేవాఁడవైతే నెంగిలి లేదా

చ. 3: అంటఁగాక వున్నదాన ఆనవెట్టుచున్నదాన
జంటగాఁ గాఁగిటఁ బట్టి సారెఁ గూడేవు
నంటున శ్రీవేంకటేశ నామతక మెఱఁగవు
దంటవయసువాఁడవైతే తప్పొప్పు లేదా

రేకు: 1173-2 ఆహిరి సం: 21-368

పల్లవి: ఇన్నాళ్లు నెఱఁగము ఇంతలేసిపనులు
సన్నల చాయలనే సతమాయ వావులు

చ. 1: పాటపాట సిగ్గులతో పఁడతి నీవు నవ్వఁగ
తేటతెల్లమాయను మీతెఱఁగులెల్లా
మాటమాటలను మీరు మర్మాలు సోఁకనాడఁగా
వాటమాయ మీలోనివాడికవలపులు

చ. 2: వెడవెడ చూపు మీసై విచ్చనవిడిఁ బారఁగ
తడఁబడీ మీలోనితమకమెల్లా
చిడుముడితో మీరు చేతులుపైఁ జాఁచఁగాను
అడియాలాలాయను మీఅంకెలైనలంకెలు

చ. 3: పొద్దువొద్దు బాసలు గొబ్బున మీలోఁ జేయఁగాను
వొద్దికాయఁ గూటములు వొందురులలో
అద్దుక శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడఁగాను
సుద్దులాయఁ దొల్లి టినీ సొలపుల పొందులు

రేకు: 1173-3 పాడి సం: 21-369

పల్లవి: తరవాతి పనులకు తానే నేను
మరుతంత్రములోన మరియేఁటిమాటలే

చ. 1: బలువు కొలఁదియే పంతము
చలము కొలఁదియే సాదింపులు
కలిమికొలఁదియే గర్వము
మలసి తనకు నాకు మరియేఁటిమాటలే

చ. 2: మనసుకొలఁదియే మంగళము
చనవుకొలఁదియే సరసము
యెనసినకొలఁదివే యింపులు
మనవి సనవి చెల్లె మరియేఁటిమాటలే

చ. 3: మచ్చికకొలఁదివే మంతనాలు
వచ్చినకొలఁదివే వాడికలు
ఇచ్చగించి శ్రీవేంకటేశుఁడే తా నన్నుఁ గూడె
మచ్చరములెల్లాఁ బాసె మరియేఁటిమాటలే

రేకు: 1173-4 హిందోళం సం: 21-370

పల్లవి: ఏమయ్య కటకటా యెంతదోసము
ఏమైన మందెమేళ మింతసేసీనా

చ. 1: ఆపె నీకు విడెమిచ్చేననఁగానే వేగిరించి
చాపలానఁ దముల మొసఁగుమనేవు
ఆపని తొల్లెలవాటైతే నీకు నాయఁగాక
యీపడఁతి యిపుడు నీ కెంగిలివెట్టీనా

చ. 2: వెలఁది నీకొకనాఁడు విందువెట్టేననఁగానె
తొలఁగక యిపుడే పొత్తుకు వచ్చేవు
అలరి నీకిది సాజమైతే నాయఁగాక
కలికి నీకు నెంగిలికడి వెట్టీనా

చ. 3: సారెకు రతుల మేలు చవిచూపేననఁగానె
తేరి యిందరిలో మోవితేనడిగేవు
మారుక శ్రీవేంకటాద్రిమండెమురాయ కూడితి
యీరీతి నింకా నీకు నెంగిలివెట్టీనా

రేకు: 1173-5 దేసాళం సం: 21-371

పల్లవి: సేయవయ్య నీకు నేఁడు చెల్లినంతాను
పాయరాదు నిన్ను నిట్టె పైకొనుటేకాని

చ. 1: తెగరాదు నీవెంత దిమ్మరివై తిరిగినా
జగడానఁ గొంతగొంత సాదించది
నగరాదు నీవు సేసేనాటకపుఁజేఁతలకు
మొగమోడి చేతులెత్తి మొక్కు టింతేకాని

చ. 2: తిట్టరాదు యెవ్వతెతోఁ దెగడియాడినా నిన్ను
జట్టిగాఁ జూపులఁ జూచి జంకించుటే
పట్టరానినీ వెందుఁ బఱచవై తిరిగినా
చెట్టవట్టి నీసేవసుయు టింతేగాని

చ. 3: మానరాదు నీవెన్నిమతకములు నుండినా
నానినచెమటలతో నంటుసేయుటే
పూనిక శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టె
ఆనుకొని నీతో ముదమందు టింతేకాని

రేకు: 1173-6 కాంబోదిసం: 21-372

పల్లవి: నన్ను నేల తడవేవు నాజాడ నీవెఱఁగవా
యెన్నిక నిను దగ్గర నిది వేళా నాకు

చ. 1: చాయలకు నాపె నీతో సరసములాడఁగాను
నాయమా నీతో నాకు నవ్వఁగ నేఁడు
చేయి చాఁచి యప్పటిని చెనకులు చెనకఁగా
యీయెడ నీసేవ సేయ నిది వేళా నాకు

చ. 2: యెలయించి యాపె నిన్ను నేకతానకుఁ దియ్యఁగా
చలమా నిన్నుఁ బిలువ సారెకు నాకు
పలుమారుఁ దానె నీతోఁ బచ్చిమాఁటలాడఁగాను
యెలమి నే విడెమీయ నిది వేళా నాకు

చ. 3: గరిమ నాపె నిన్నుఁ గాఁగిలించుకుండఁగాను
పురుఁడా నేను నట్టె పొత్తుగలయ
ఇరవై శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
యెరవులేక కొసర నిది వేళా నాకు

రేకు: 1174-1 ముఖారి సం: 21-373

పల్లవి: అంత విచ్చి చెప్పకు మా కప్పటి నీవు
యింతా నీమన్ననలోనె యెఱఁగరాదా

చ. 1: వీనులకు నేఁజేసేవిన్నపము చవులైతే
నావినాని నీవలపు ననలొత్తీని
ఆనందించి నీకు నాపై నంతబత్తి గలిగితే
కానరాదా నీమోము కళలలోనె

చ. 2: సొగలుగా నేఁజూచేచూపులే నీకితవైతే
చేఁగదేరేనీమనసు చిగిరించీని
వేగిరించి నన్నుఁ బొందేవేడుక నీకుఁ గలితే
లాగుగాఁ దెలియదా సెలవినవ్వులోనె

చ. 3: చెనకేనాసరసము చిత్తాన నీకుఁ బట్టితే
పనివడి నీకోరిక ఫలియించీని
యెనయుచు శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ననుపెల్లాఁ దోఁచగా యీనయములోనె

రేకు: 1174-2 శ్రీరాగం సం: 21-374

పల్లవి: ఇంతలోనె వేగిరమా యెందు వోయేము
వంతులువెట్టాడకురా వచ్చేఁగాని నేను

చ. 1: నాలితనాననే నీవు నాతులను వలపించి
వేలసంఖ్యలను లోన వేసుకొంటివి
పాలించి యింకా నెందరి భ్రమయించనున్నాఁడవో
చేలకొంగు విడువరా చెప్పేఁగాని నీకు

చ. 2: సాదుఁదనాన నప్పటి సతులఁ దక్కులఁబెట్టి
ఆదిగొ నిందరిమానా లంటుకొంటివి
యీదెస నెవ్వరెవ్వరి నెంతసేయ నున్నాఁడవో
సోదించకురా నావొడి చూపేఁగాని మేలు

చ. 3: మంచితనాననే నీవు మానినులమోవు లాని
చంచుల నెంగిలిసేసి చవిగొంటివి
యెంచఁగ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
దించకురా నీవురము తిరమైతి నిపుడు

రేకు: 1174-3 పూర్వగౌళ సం: 21-375

పల్లవి: ఇద్దరూ నెదిరించిరి ఇన్నిటికి మూలము
పొద్దువొద్దుకు మనము బుద్ధిచెప్పనేఁటికే

చ. 1: సెలవినవ్వినవ్వు సిగ్గులకు మూలము
కలికితనము కాఁకలమూలము
పలుకులు లోలోనె పైకొనుటకు మూలము
వెలసె నన్నిపనులు వేగిరించనేఁటికే

చ. 2: కొనఁగోరిచెనకులు కోరికలకు మూలము
పెనఁగులాటలు కడుఁ బ్రియమూలము
తనివోనికొసరులు తమకముల మూలము
యెనసెఁ దనంతఁదానె యెచ్చరించనేఁటికే

చ. 3: మొగమొగాలు చూచూట మొక్కులకు మూలము
తగవులు కూటమికిఁ దానె మూలము
నిగిడి శ్రీవేంకటాద్రి నిలయుఁడు సతి నేలె
పగటున నిఁక వేరే బాసడుగనేఁటికే

రేకు: 1174-4 గౌళ సం: 21-376

పల్లవి: ఇంత వెఱపుమఱపు లేఁటికి నీకు
కాంతలు పెక్కుఁగలుగుఘనుఁడవు నీవు

చ. 1: చెక్కులు నిన్ను నొక్కితే సిగ్గులువడుదురా
చొక్కపుచూపుల నన్ను చూతువు గాక
గక్కున చేయివేసితే కడుఁజెమరింతురా
ఇక్కువ లంటి నన్ను యెచ్చరింతువు గాక

చ. 2: నిన్ను సోఁకనాడితేను నివ్వెరగందుదురా
అన్నిటాను నాకు లోనవుదువుగాక
సన్నలు సేసితేనే జల్లనఁ బులకింతురా
మన్నించి నాతో మారుమలతువుగాక

చ. 3: వొద్దికై నేఁ గూడితేను వూరకె భ్రమతురా
చద్దివేఁడివలపులు చల్లుదుగాక
అద్దో శ్రీవేంకటేశ ఆలనైతి నీకు నేను
పొద్దువొద్దు రతులను భోగింతువుగాక

రేకు: 1174-5 ఆహిరినాట సం: 21-377

పల్లవి: తనవోజ మానఁడు తప్పు లాతనికి లేవు
పెనఁగఁగం బెనఁగఁగఁ బీరమే కలది

చ. 1: సారె మీరు చెప్పఁగాను చలపట్టి పోరఁగాను
కూరిమిఁ గొసరఁగాను కోపగించేనా
మేరమీరినాతఁడు మిందుఁగిందు నెంచఁడు
తారుకాణించగఁబోతే తగవులే కలవి

చ. 2: అందాలు మీరు చెప్పఁగా నట్టె వేఁడుకొనఁగా
విందువలె మొక్కఁగాను వెగ్గళించేనా
మందెమేళమే యాతఁడు మానఁడు తన గుణాలు
అందుకు నౌఁగాదంటే నానలే కలవి

చ. 3: పనివడి మీరనఁగా పంతాలు సరిసేయఁగా
చనవులు చెల్లించగా సాదించేనా
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నిట్టె
ననుపు నటించఁగాను నవ్వులే గలవి

రేకు: 1174-6 సామంతం సం: 21-378

పల్లవి: నీలోనివారమే నేమెల్లాను
పాలువొంగినట్లనే బతుకవే యిఁకను

చ. 1: నిలువెల్ల నీటే నీకేమి గడమే
వలపించితివి యిందువంక నాతని
చలవాసితి వన్నిటా సతమాయ నాతఁడు
ఫలియించె నీతపము బతుకవే యిఁకను

చ. 2: మేనెల్ల గర్వమే మేకులు నీకేమి బాఁతె
లోను సేసుకొంటివి మేలున నాతని
యీనెపాన దొరవైతి వింతసేసె నాతఁడు
పానినచలము చెల్లె బతుకవే యిఁకను

చ. 3: రూపెల్ల బిగువే నేరుపులు నీకేమి గొత్తె
తీపులఁబెట్టితివి యింతేసి యాతని
చేపట్టి నిన్నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడు
పైపైనె మావలెనే బతుకవే యిఁకను

రేకు: 1175-1 ఆహిరి సం: 21-379

పల్లవి: ఏమి సేయవచ్చునయ్యా ఇంతుల భాగ్యము గాక
బూమెలనీగుణములే బుద్ధులు నేరుపవా

చ. 1: వెలుపలినీచేఁతలు వెల్లవిరులై యుండఁగా
తెలియదా నామాట దిష్టము నీకు
చలివాసి నీవలపు సరివచ్చివుండఁగాను
సెలవి నీనవ్వులింకాఁ జిమ్మిఁరేగవా

చ. 2: మిక్కిలిపరాకులు నీమీఁద నిండివుండఁగాను
చిక్కదా నాకానికె చేతికి నీకు
మక్కువతో నీమేను మచ్చములు చూపఁగాను
తక్కక నీసిగ్గు లింకాఁదలకొనవా

చ. 3: కరగిననీరతులు కాంరిటిలో నుండఁగాను
యిరవుగావా నాగోరియెచ్చరికెలు
యెరవులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ధరలోన నీబాసలు తగవులు చెప్పవా

రేకు: 1175-2 శ్రీరాగం సం: 21-380

పల్లవి: నేరుతునా నేనేమైనా నీమహిమ లింతేకాక
వూరకేవుండేనన్నా వుద్యోగాలఁ బెట్టును

చ. 1: నెట్టుకొన్న యటువంటినీతోడిపొందులు
రట్టుసేయవా నీచుట్టాలనెల్లా
గుట్టున నెంతవుండినాఁ గొచ్చికొచ్చి పెడఁరేచి
దిట్టమాట లాడించు దీకొని నీతోను

చ. 2: కూరిమితో నీకాఁగిటఁ గూడేటి కూటములు
ఆరీతి రేఁచకుండునా అఁడవారిని
యేరేతిసాదులనైనా యెమ్మెలెల్లాఁ బుట్టించి
నేరములు పట్టింపించు నిన్ననే సారెకును

చ. 3: సందడించినటువంటి సరసపురతు లివి
మందెమేళము సేయించు మానినులను
కందువ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
అందాలు సేయించును నీయరఁగొరలెల్లాను

రేకు:	1175-3 వరాళి	సం:	21-381

పల్లవి:	ఇంకనేల కొసరూ యిన్నిపనులను నాయ
	పొంకమైతి రిన్నిటాను పొరలెల్లాఁ బాసె

చ. 1:	యీవల నింటిలోన మిమ్మిద్దరినిఁ బొడగని
	వేవేగ మామతిలోని వెఱపు వాసె
	చేవలుమీరినమీకు చేతులారా వద్దనుండి
	సేవలెల్లాఁ జేయఁగాను సిబ్బితి వాసె

చ. 2:	ననుపున నిద్దరూను నవ్వు లిట్టె నవ్వఁగాను
	పనివడి తొల్లిటికోపమూఁ బాసె
	పెనఁగుచు నొండొరులు ప్రియములు నటించఁగా
	జయమంది తిట్లాడేచలమెల్లఁ బాసె

చ. 3:	అలమేల్మంగ నురమందు నీవెక్కించుకోఁగా
	మొలచినయను మానములెల్లఁ బాసె
	యెలమి శ్రీవేంకటేశ ఇద్దరూ మమ్మేలఁగాను
	నెలకొంటి మిఁకను మానేరమెల్లఁ బాసె

రేకు: 1175-4 భైరవి సం: 21-382

పల్లవి: నేనే యెంతైనాను నిన్ను విడువలేఁగాక
నానఁబెట్టితే గొడ్డలి నానఁబొయ్యీనా

చ. 1: చెలరేఁగి నీకెంత సేవలు చేసినాను
వలపుగలంతె కాక వద్దనుండేవా
మలసి నిన్నప్పటిని మాటలఁ బేలించినాను
తలఁపుకొలఁదే కాకతమకించేవా

చ. 2: యెనసి నీతో నెన్నియిచ్చకము లాడినాను
కనుపట్టినంతేకాక కైకొనేవా
చనవుసేసుక మరి సరసములాడినాను
పెనఁగేకొలఁదిగాక ప్రియపడేవా

చ. 3: పగటున నిను నెంత పట్టి యెచ్చరించినాను
నగవుకొలఁదేకాక నాటుఁకొనేవా
మిగుల శ్రీవేంకటేశ మెచ్చి నన్నుఁ గూడితివి
మొగమోటకైనాను మోహించకుండేవా

రేకు: 1175-5 పాడి సం: 21-383

పల్లవి: ముంచి కతలకుఁ గాళ్లు ముంతకుఁ జెవు లడిగేవు
అంచెలమోవితిట్ల కందుకేమడిగేవు

చ. 1: గబ్బితనాననాడినకాఁకలమాటలకెల్లా
గొబ్బునఁ దెలుపుమని కొంగువట్టేవు
వుబ్బున రతివేళల నొకటొకటే యాడిన-
అబ్బురపుసుద్దులకు నందుకేమనేవు

చ. 2: కూరిమి గొసరుతాను గొణఁగినబాసలకు
తారుకాణించుమనుచు దగ్గరేవు
యేరోరి అనుచునాడే యింపులరాకొట్లకు
ఆరసి యేకతమున నప్పుడేమనేవు

చ. 3: జవ్వనమదాన నీపైఁ జల్లినపంతాలకు
చివ్వనఁ గాఁతాళించి చేయివట్టేవు
నవ్వుతా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి వింతలో
అవ్వల నిందుకు నాతో నర్త మేమనేవు

రేకు: 1175-6 శంకరాభరణం సం: 21-384

పల్లవి: గోరీగిరీ నాచెక్కు గోవిందుడు
కూరిములు గొసరీని గోవిందుడు

చ. 1: నలిరేఁగి ననుఁ జూచి నవ్వీఁగదవే నేఁడు
కొలువులోపలనుండి గోవిందుఁడు
తలవంచుకొని నేను తరుణిమాటున నుంటే
కులికికులికి చూచి గోవిందుఁడు

చ. 2: చిప్పిలుఁదమకమున చేసన్న సేసీఁగదే
కొప్పు ముడుచుకోఁగానే గోవిందుఁడు
వుప్పతిల్లుసిగ్గుతోడ నొడికా నే నుండితే
గొప్పతామరల వేసీ గోవిందుఁడు

చ. 3: కమ్మటినిఁ దెరవేసి కాఁగిలించి కూడెఁగదే
కుమ్మరింపుమోహముల గోవిందుఁడు
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిరవై తిరుపతిలో
కొమ్మలతో నీడువెట్టీ గోవిందుఁడు

రేకు: 1176-1 ధన్నాసి సం: 21-385
పల్లవి: ఆత డెవ్వాడు చూపరే అమ్మలాల
ఏతుల నాడేటిక్రిష్ణుఁ డీతఁడే కాఁడుగదా
చ. 1: కందువ దేవకి బిడ్డఁగనెనట నడురేయి
అంది యశోదకుఁ గొడుకైనాఁడట
సందడించి పూతకిచంటిపాలుఁ దాగెనట
మందల ఆవులఁ గాచి మలసెనట
చ. 2: మంచిబండి దన్నెనట మద్దులు విరిచెనట
ఇంచుకంతవేలఁ గొండయెత్తినాఁడట
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట
మించులఁ బిల్లగోవివట్టి మెరసెనట
చ. 3: కాళింగుని మెట్టెనట కంసుఁ బొరిగొనెనట
పాలించి సురలఁ జేపట్టెనట
యీలీల శ్రీవేంకటాద్రి నిరవైనదేవుఁడట
యేలెనట పదారువేలింతుల నిందరిని

రేకు: 1176-2 దేశాక్షి సం: 21-386

పల్లవి: ఏమిసేతుమమ్మ నేము యెశోదమ్మ
గామిడితనములనే కడఁగీ బాలుఁడు

చ. 1: అందెలు మువ్వలు ఘల్లురనఁగ వీదివీదుల-
నందుక వుట్లు గొట్టీనదె బాలుఁడు
గొందినున్నఁ బోనీక కోలలు చాఁచిచాఁచి
పొందుగ దొంఢ్లువోఁ బొడిచీ మీబాలుఁడు

చ. 2: చుంగలకాళతోడ సారిది బాలులతోడ
ముంగిటి వుట్లు గొట్టీ ముద్దుబాలుఁడు
అంగవించి గొల్లెతలు అడ్డములురాఁగానే
యెంగిలిసేసీ మోవులు యిదిగో మీబాలుఁడు

చ. 3: చొల్లెపుజెడ వీఁపున సోయగమై వేలఁగాను
చిల్లరవుట్లు గొట్టీఁ జిన్నిబాలుఁడు
మెల్లనె సతులుఁ దాను మేలములాడుకొంటా
ఇల్లిదె శ్రీవేంకటాద్రి యెక్కెను మీ బాలుఁడు

రేకు: 1176-3 పాడి సం: 21-387

పల్లవి: ఇంకనేఁటి మాటలే ఇయ్యకొనేదేగాక
పంకపుఁజెమటలు మైఁ బరగెఁగదే

చ. 1: కడఁగి నీవలిగి గక్కన లేచి నిలుచుంటే
బెడిదపుటానలెల్లాఁ బెట్టీ నీపతి
వొడివట్టి తియ్యఁగాను వోపనంటాఁ బెనఁగఁగ
జడిసి పోఁకముడి జారెఁగదవే

చ. 2: పంతమున నీవు లోనిపరపుపైఁ బండితేను
చెంతల నాతఁడు నీచెక్కులు నొక్కె
కొంతఁగొంత చెనకఁగఁ గోపగించి తిట్టఁగాను
బంతినే సిగ్గులు నీరై పారెఁగదవే

చ. 3: ననుపున నింతలోనె నవ్వులు నీవు నవ్వితే
ఘనశ్రీవేంకటేశుఁడు కలసెఁగదే
మనసులు సోదించఁగా మరపులు మించఁగాను
నినుపులై పులకలు నిండెఁగదవే

రేకు: 1176-4 అమరసింధు సం: 21-388

పల్లవి: అక్కవు నీవు నాకు నైనానైతివి గాని
వొక్కింతవడికైనా నోపుదువటె

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేతులు చాఁచేవు నీవు
వలెనటే నీతో నీకు వరవాతాను
బలుములు చూపి పెక్కుపంతములాడుకొనేవు
నిలిచేవా నాముందర నేరుపులను

చ. 2: నారువోసి నారువోసి నవ్వులు నవ్వేవు నీవు
వోరిచేవటే నాతో వొడ్డారాలకు
పేరువాడి పేరువాడి బిరుదులు మెరసేవు
చేరఁగలవా నాచేవల్లకు

చ. 3: పెచ్చురేఁగి పెచ్చురేఁగి పెనఁగేవు నాతోను
వచ్చేవటే నాతోడి వరుసలకు
యిచ్చగించి శ్రీవేంకటేశుఁ డిద్దరిఁ గూడె
మెచ్చేవటే నిన్నుమించినయందుకును

రేకు: 1176-5 సోమరాగం సం: 21-389

పల్లవి: బిగిసి యాపె నీకుఁ బెట్టనికోట
యెగసక్కేలకు నీవు యేమిసేసుకొంటివి

చ. 1: కోపగించుకోఁబోఁగా కొలిచి మొక్కవలసె
తీపులఁ దిట్టినందుకు దీవించవలసె
చూపుల జంకించఁగాను సూడుపెనఁగవలసె
యేపున నెంతకు నెంత యేమిసేసుకొంటివి

చ. 2: చేవట్టితియ్యఁగఁబోఁగా చెక్కులు నొక్కవలసె
చేవమీర నవ్వఁగాను సిగ్గువడవలసె
కావరించి పైకొనఁగా కైవశము గావలసె
యేవిదాన నుండివుండి యేమిసేసుకొంటివి

చ. 3: కాఁకలు సేయఁగ బోఁగా గక్కనఁ గూడవలసె
పోఁకముడి యంటఁగాను భోగించవలసె
వేఁకపుశ్రీవేంకటేశ వెలఁదిఁ గలసి తిట్టె
యేఁకట నీయంత నీవు యేమిసేసుకొంటివి

రేకు: 1176-6 ఆహిరి సం: 21-390

పల్లవి: మానితివే తనతోడిమచ్చరములు
కానీవే ఇఁకనేమి కపటాలు బాసెనే

చ. 1: వెనకటివలెఁగాక విచ్చేసెఁ దా నీడకు
మనసొక్కటాయ వేరేమాఁటలేఁటికే
చనవిచ్చె నింతఁగాను చలమెల్లా విడిచెను
కనుపట్టెఁ దనచేఁత కాఁతాళించనేలే

చ. 2: పరులమాట వినక పైకొని నన్ను మన్నించె
మరిగితి నాలోని మంకు దీరెనే
సరసము లాడె నాతో సటలెల్లా విడిచెను
కెరలెను నామోహము కిసరు విడిచెనే

చ. 3: వూసివాసు లెంచక వొగి నన్ను వేఁడుకొనె
సేసలు పైఁ బెట్టితినే చెల్లెఁ బంతము
ఆసల శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
సేసిననాపుణ్య మంబెఁ జెలఁగితినె

రేకు:	1177-1 శ్రీరాగం సం:	21-391

పల్లవి:	ఇంకనేల కొసరేవు యింతిని
సుంకులు గావా గోరిసూటివాటు

చ. 1:	చిగురుఁజిత్తము లోనిచేఁగతనములే కావా
నగియేటిచెలిమోవినగవులు
మొగి విచ్చుకకురిసేమోవితేనెలే కావా
పగటున నీతోడి పలుకులు

చ. 2:	పుదుటుఁగాంక్షలలోని పురుఁదాళ్లే కావా
సుదతి నిన్నుఁ జూచేచూపులు
వదలుఁ బయ్యెదలోని వన్నెకానికలు గావా
మెదలుఁజన్నులనీమేనిసోఁకులు

చ. 3:	వల్లేటి వలపుల సంగడి సేసలు గావా
చెల్లుఁబడి నింతిసేసే చేఁతలు
మెల్లనె శ్రీవేంకటేశ మించి యేలితి వాపెను
కొల్లలుగావా నీతో గొనకొన్నరతులు

రేకు: 1177-2 మధ్యమావతి సం: 21-392

పల్లవి: తప్పులేల పట్టేవు తరుణి నప్పటి నీవు
చప్పరింపుమాఁటలు సాజమే కాదా

చ. 1: పతి సన్నసేసితేను పనిలేనిపనికైనా
సతులు జంకించేది సాజమేకాదా
రతికి రాయడించితే రాజసాన జంపు సేసి
చతురతఁ దిట్టేది సాజమే కాదా

చ. 2: చేరి కొంగువట్టేవానిఁ జిగిరింపుఁగాఁకలతో
సైరణతోఁ జూచేది సాజమే కాదా
మేరమీరి కాఁతాళించి మీఁద మీఁదఁ బొదిగితే
సారె సిగ్గులు వడేది సాజమేకాదా

చ. 3: అంకెల నీవు గూడఁగా నట్టె శ్రీవేంకటేశ్వర
జంకించి మోవడిగేది సాజమేకాదా
లంకెలై మీరిద్దరును లావులఁ బెనఁగేవేళ
సంకెలెల్ల మానేది సాజమేకాదా

రేకు:	1177-3 కాంబోది సం:	21-393

పల్లవి:	నేమెల్లా నీయంత నేరమా యేమి
గామిడితనాలు బుద్దికాదనికాక

చ. 1:	యిచ్చకపుమాఁటలు యెందాఁకా నాడేవే
పచ్చిగా విభునినేల భ్రమయించేవే
నెచ్చెలులు నీవలె నేరనివారా యేమి
తుచ్ఛెము సేయుట కడుదోసమనికాక

చ. 2:	చనవున నేంతని సాదించేవే యతని
యెనసి పను లెట్టు చేయించుకొనేవే
వనితలిందరు నీవంటివారే కారా యేమి
కొనల కెక్కేది కడు గోరతనికాక

చ. 3:	భావించి యెటువలె బాసలుగొనేవే నీవు
శ్రీవేంకటేశ్వరు నెట్టు చిక్కించితివే
నీవలెనే కూడమా నిండుఁగాఁగిట నితని
చేవదేరే దిది కడుసిబ్బితనికాక

రేకు: 1177-4 వరాళి సం: 21-394

పల్లవి: కాఁగిలించుకొనవలెనా కమ్మటి నిన్ను
వీఁగక మాఁటాడితేనే వేడుకెల్లాఁ జెల్లెను

చ. 1: కందువల నీవు నన్నుఁ గన్నులఁ జూచితేనే
అందరితోడివరుస లబ్బెను నాకు
చెంది నీవు వొకమాఁటు సెలవుల నవ్వితేనే
పొందినటువంటి రతిభోగములు నాయను

చ. 2: చెనకి యొకమాఁటు నాచెక్కులు నీవు నొక్కితే
పనివడి సంసారఫల మబ్బెను
చనవున నిటువలె చదురంగమాడితేనే
తనువుమీఁది మదనతాపమెల్లా నారెను

చ. 3: ఇచ్చగించ నావద్ద నేకతాన నీ వుండితే
నిచ్చకల్యాణము లిట్టే నెరవేరెను
యెచ్చరించి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అచ్చపుమనోరథము లన్నియు సిద్ధించెను

రేకు: 1177-5 రామక్రియ సం: 21-395

పల్లవి: తానేల సిగ్గువడీనే తనకెలే వెరవు
నానాటిసుద్దులకు నవ్వేగాక

చ. 1: యేలే తనతో నాకు నెక్కువ తక్కువ లాడ
మేలుమేలనుచుఁ గడుమేచ్చేఁగాక
చాలుకొని యప్పటిని చలము సాదించనేల
కేలెత్తి తనకు మొక్కి గెలిచేఁగాక

చ. 2: పైకొని తన్నింతేసిబాసలు గొనఁగనేలే
యేకొలఁది కాకొలఁది యేనసేఁగాక
దీకొని మారుకుమారు తిట్లు దిట్టగనేలే
వాకున మంచి మాఁటాడి వలపించేఁగాక

చ. 3: కనుచూపులను తన్ను కాంకలఁబెట్టఁగనేలే
చనుమొన లొత్తి మేలు చల్లేఁగాక
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనే తానె నన్ను
పెనఁగనేలె రతుల బెరయించేఁగాక

రేకు: 1177-6 రీతిగౌళ సం: 21-396

పల్లవి: ఆమాఁట నాతో నీవు ఆనతిమ్మా
యీమతకమింతా నీదా యేమోయివోయి

చ. 1: పైకొని నిన్ను నేను పచ్చిగాఁ దిట్టితినని-
నాకెకుఁ దెలుపవోయి ఆసుద్ది
దాకొన్నమగఁడవంటాఁ దా నీకుఁ బూనుకవచ్చీ
చేకొని నీవే తనతోఁ జెప్పితివా వోయి

చ. 2: చేరి నీచేత సేవలు సేయించుకొంటినని
నారుకొన నీ వాపెను నమ్మించవోయి
యీరీతిఁ జుట్టమవంటా నిచ్చకములు నెరపీ
ఆరీతిని నీవే యిన్నీ నాడించవోయి

చ. 3: పక్కన నీపై నేను పాదాలు వేసితినని
పెక్కులాపెతో నానలు పెట్టుకోవోయి
ఇక్కువల శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మొక్కీఁ దాను బావ వంటా మొరఁగులా వోయి

రేకు: 1178-1 శంకరాభరణం సం: 21-397

పల్లవి: వినపించవే యీసుద్ది వినే నేను
వనితరో యిన్నాళ్లవలెఁ గాదు నీవు

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెలులతో నవ్వేవు
అలనీపతి నీతో మాఁటాడెనటె
తలవీడి మొలవీడి దగ దవ్వులఁబడేవు
వలపులసివములు వడిఁబట్టెనటవే

చ. 2: తమకించి తమకించి తడఁబడ నడచేవు
అమరఁగ రతులు నీకబ్బెనటె
చెమటలమేనితో చిందువందై యుందానవు
కొమరెమదము నీకు గొనకొనెనటవె

చ. 3: పదరి పదరి నీవు పాటలెల్లాఁ బాడేవు
యెదుటశ్రీవేంకటేశుఁ డెనసెనటె
చెదరనికళలతో చిమ్ముల మాఁటలాడేవు
మరదరాజ్యగర్వము మతిఁ బట్టెనటవె

రేకు: 1178-2 అందోళి సం: 21-398

పల్లవి: రాఁగదవే అన్నిటాను రవ్వయితిమి
కాఁగినకాఁకలచేతఁ గరివడె నిపుడు

చ. 1: సాదించేవు నీ కాతఁడు చాయలకు వచ్చీనా
వాదించేవు నీ కాతఁడు వలచీనా
ఆదిగొని చెలులెల్ల నట్టె పైపైఁ బడఁగాను
గాదిలియాతనిమది కాయగాచె నిపుడు

చ. 2: చెనకే వాతఁడు నీచెప్పినట్టు సేసీనా
పెనఁగే వాతఁ డందుకు ప్రియపడీనా
వనితలందరు వచ్చి వద్దనే వుండఁగాను
చనుమానముల మొగచాటాయ నిపుడు

చ. 3: యేకతానకు దీసేవు యింతలోనే లోనయ్యీనా
పైకొని కూడితి వట్టె బాఁతిపడి
శ్రీకాంత వురమెక్కిన శ్రీవేంకటేశుఁ డితఁడు
మైకొని వురమెల్లాను మట్టుపడె నిపుడు

రేకు: 1178-3 గౌళ సం: 21-399

పల్లవి: సరివారమా నీతో సరసములాడఁగా
నెరవాదివై మమ్ము నీవేల రేఁచేవు

చ. 1: నగితేనే కాదా నాఁటుక వెంగేలయ్యేది
తగులనాడితేఁ గాదా తప్పు లయ్యేది
వెగటు లింతేసికి వెఱతుమయ్య నేము
వొగి నీమేమనినాను వోరుచుకుండేము

చ. 2: ముందర నుండితేఁగాదా మొగచాట్లయ్యేది
కందువ లంటితేఁగాదా ఘాతలయ్యేది
విందువెట్టి పగలకు వెరతుమయ్య నేము
ఇందరివలెనే నీకు నిచ్చక మాడేము

చ. 3: సన్నలు సేసితేఁగాదా చలములు పుట్టేది
కన్నులఁ జూచితేకాదా కాఁక పుట్టేది
యెన్నికతో శ్రీవేంకటేశ నీకు వెఱతుము
మన్నించి కూడితివి నీమఱఁగుఁ జొచ్చేము

రేకు: 1178-4 సామంతం సం: 21-400

పల్లవి: రమణుఁడు వీఁడివో రాతిరి యీడ నున్నాఁడు
సముకాన నుండవే చలమువాసీని

చ. 1: మంతనమాడవే చాలు మనసు నీకుఁ గరఁగీ
చెంతల నేమెల్లా బుద్దిచెప్పనేల
పంతములాడవే చాలు పతితోడ నదే మించి
యింతి నీకు మచ్చుమందయ్యీ నదే నేఁడు

చ. 2: కొచ్చి చూడవే చాలు కోపము తానె పోయీని
వచ్చి వచ్చి నేము నిన్ను వద్దననేల
పచ్చిగాఁ దిట్టవే చాలు పైకొని యదే నీకు
తచ్చి వలపులవల్లెతాళ్లయ్యీ నిపుడు

చ. 3: విడెమియ్య వే చాలు వేడుక తానే పుట్టీని
కూడుమని నేము నిన్నుఁ గొసరనేల
యీడుగా శ్రీవేంకటేశుఁ డెనసె నీకు నిదె
వాడికరతులకును వాఁటమయ్యీ నికను

రేకు: 1178-5 బౌళి సం: 21-401

పల్లవి: నీయంత నీవెఱఁగవు నేనది విన్నవించితి
చేయి మీఁదాయెను నాచెక్కులు నొక్కకుమీ

చ. 1: పిలువకు సారెసారె పేరుకొని నన్ను నీవు
వలపు పేరడిఁబడీ వద్దు నవ్వకు
బలిమిసేసి నీవు వట్టకు నాకుచములు
కొలఁదిఁబడదు కొనగో రంటించకుమీ

చ. 2: తప్పక చూడకు నీవు తమకపుచూపుల
కుప్పలువడీ సిగ్గులు కొంగువట్టకు
కొప్పు జారీ నీవు నన్ను కూరుములు గొసరక
దప్పిదేరీ మోవి నిదే దంట మాటాడకుమీ

చ. 3: వొడివట్ట కంత నీవు వూరకే దగ్గరి వచ్చి
తడఁబడీ మానములు తతిగొనకు
అడరి శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
యెడయక కూడితి ఇట్టె మరవకుమీ

రేకు: 1178-6 దేసాళం సం: 21-402

పల్లవి: మానవే యెక్కడిసుద్ది మంకుఁదనాలు
తానే యాతఁడు నిన్నుఁ దగులఁగాను

చ. 1: చలపాదితనమేల సారెకుఁ బిలువఁగాను
పలుకరాదా నీపతితోను
తలపోఁత లింత యాల తమకించియాతడు
వెలయ నీపైఁ జేయివేయఁగాను

చ. 2: పంతములింతేఁశేలే బలిమిఁ బెనఁగఁగాను
మంతనములాడరాదా మగనితోను
రంతుతోడ వాదులేలే రతినాతఁ డలముక
వింతలుగా నిన్ను నిట్టె వేఁడుకోఁగాను

చ. 3: నివ్వెరగు లిఁకనేలే నిన్నుఁ బెండ్లాడఁగాను
నవ్వరాదా శ్రీవేంకటనాథునితోను
రవ్వగా నమ్మికలిచ్చి రమణుఁడు వేడుకతో
నివ్వటిల్లఁ బొగడుతా నిన్ను మెచ్చఁగాను

రేకు: 1179-1 నారాయణి సం: 21-403

పల్లవి: తుడుచుకొంటేఁ బోదు తొడరి నీవెంతైనా
వడియించీ మొక్కులనే వలపు నీమీఁద

చ. 1: నిక్కిచూచి చెలి నీపై నిండా నవ్వులు నవ్వి
చిక్కనివెన్నెలతేట చిందీనదె
చెక్కులను కొనగోళ్లఁ జెనకి కాంతుల మించి
లక్కరసములు చల్లీ లావుగా నీమీఁద

చ. 2: వొరసి వొరసి నీతో వూరఁగలమాట లాడి
సిరులగమ్మఁదేనెలు చిందీనదె
సరిగా సేవలు సేసి చన్నుల మెఱుఁగులను
సరుగ బంగారుపొడి చల్లీ నీమీఁద

చ. 3: బలిమిఁ గాఁగిటఁ బట్టి భావములనే కరఁగి
చెలఁగి వయోమదము చిందీనదె
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిన్నిటాఁ గూడి
చలములఁ గూరిములు చల్లీ నీమీఁద

రేకు: 1179-2 దేశాక్షి సం: 21-404

పల్లవి: అంగడిఁ బెట్టేవయసు అడియాల మానునే
బెంగతనాన నుండినాఁ బెడరేంచుఁగాక

చ. 1: వాసికి నెంతలిగినా వలపేల తక్కువౌను
ఆసలతోఁ జిగిరించి అలరుఁగాక
యీసున నెంతదిట్టినా ఇంపులేల కొంచమౌను
వేసరనిపులకలై విఱ్ఱవీఁగుఁగాక

చ. 2: ఆకడిమోమెఁత్తైనా ఆయమేల వూరకుండు
దీకొని తమకమై తిమురుఁగాక
చేకొని మాటాడకుంటే చిత్తమేల మరపించు
కాకుసేసి లోలోనె కరఁగించుఁగాక

చ. 3: చేయి చాఁచకుంటేను సెలవి నవ్వేల వుండు
తోయరానిసరసమై తొడరుఁగాక
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వేయిటికి నీరతులు వింతసేసుఁగాక

రేకు: 1179-3 లలిత సం: 21-405

పల్లవి: ఈపాటి మానేరుపు యెట్టువలసినాఁ జేయి
చోపినపాటి నే నొనగూడేఁగాక

చ. 1: బిరుదుమగనితోడఁ బెనఁగఁగఁగలనా
గరిమ నే నొడ్డుకొనఁగలఁగాక
దొరవు చేతులఁబట్టి దొబ్బఁగలనా నేను
కెరలి కొనగోర దాఁకించఁగలఁగాక

చ. 2: చలపాదివానితోడ సరసమాడఁగలనా
కలసి మెలసి మొక్కఁగలఁగాక
పెలుచుఁదనపునీతో బిగియఁగలనా నేను
వొలిసినట్టు చన్నుల నొత్తఁగలఁగాక

చ. 3: శ్రీవేంకటేశ్వర నిన్నుఁ జేరి మీరఁగలనా
కావరించి సేవసేయఁగలఁగాక
యీవేళ నలమేలు మంగ నేను నన్నుఁ గూడితివి
చేవమీరఁగలనా చెందఁగలఁగాక

రేకు: 1179-4 శుద్ధవసంతం సం: 21-406

పల్లవి: ఎంతైనా నెక్కినవాని కేనుఁగు గుజ్జేకాదా
పంతమున మొగవానిఁ బచ్చిసేతురటవే

చ. 1: మనసుమర్మమెఱిఁగి మాటలాడవలెఁగాక
చనవుగద్దంటాఁ బతి జంకింతురటే
చెనకితే ప్రియములుచెప్పి లాలింతురు గాక
కినిసి మారుకుమారు గేలిసేతురటవే

చ. 2: వేళచూచుకొని నీవే వేఁడుకొనవలెఁగాక
మేలుగద్దంటా నట్టె మీరుదురటే
చేలకొంగు వట్టితేను సిగ్గువడుదురుగాక
పేలరివు యింతేసి పెనఁగుదురటవే

చ. 3: కావించి నీవే యిచ్చకము లాడుదురు గాక
శ్రీవేంకటేశ్వరు నింతసేతురటే
యీవిభుఁడె నిన్నుఁ గూడె నిందుకు మొక్కుటకు గాక
భావించి యలమేల్మంగ పదరుదురటవె

రేకు: 1179-5 గౌళ సం: 21-407

పల్లవి: అనరే యీమాఁటే మీరు ఆతనితోను
నసుపు చూపితే నవ్వు నాలిఁబడదా

చ. 1: తననగరిలో నుంటే తనకే సెలవుగాదా
చెనకి పైకొని గాసిసేయవలెనా
మనసుగలిగితేనే మన్నించీఁగాక తానె
పెనఁగఁబోతే వలపు పిప్పి గట్టదా

చ. 2: కొలువవారిలో నుంటే కోరి తన సొమ్మఁగానా
మొలకచన్నులు సారె మోపవలెనా
వలసినప్పుడు తానే వచ్చీఁగాక యిట్టె
చలపట్టితే రతులు చప్పగాదా

చ. 3: అండ బానుపుపై నుంటే ఆలఁ దనకేకాదా
బండుగాఁ గాఁగిట మెదుపఁగవలెనా
నిండు కలమేలుమంగ నేను శ్రీవేంకటేశుఁడు
దండిగాఁ దా నన్నుఁ గూడె తప్పే వొప్పుగాదా

రేకు: 1179-6 శోకవరాళి సం: 21-408

పల్లవి: నీచిత్తమునఁ బెట్టి నీవే దయదలఁచేవు
యేచి నీతో సారె సారె యెదురాడేనా

చ. 1: నిన్నుఁ గొసరేమాఁట నన్నే కొసరుకొనే
యెన్నఁగ నిన్నుఁ గాదననేఁటికి నాకు
వున్నతిఁ బ్రోడవు నీవు కన్నెపడుచను నేను
సన్నలచాయల నీతో సరిదూఁగేనా

చ. 2: నీతోఁ బెనఁగేమారు నేనే నాతోఁ బెనఁగేను
యేతువ గాసిసేయనేఁటికి నిన్ను
యీతల నీ వేలికవు యేలినదాన నేను
కాతరించి నీకంటె ఘనమయ్యేనా

చ. 3: నీకు విన్నవించేమారు నేనే బుద్ధినేర్చేను
యీకత లిన్నియుఁ జెప్పనేఁటికి నీతో
అకడశ్రీవేంకటేశ యలమేల్ మంగను నేను
పైకొని కూడితి నింకాఁ బంతమాడేనా

రేకు:	1180-1 ఆహిరి	సం:	21-409
పల్లవి:	గుట్టుతో నుండనీవయ్య గుణవంతుఁడవు నీవు
	పట్టి పెనఁగఁబోతే పండు గాయయ్యీనా
చ. 1:	మలసి సారెకు నిన్ను మనసు సోదించనేల
	యెలమి నందులోఁ దప్పులెంచనేల
	బలిమి నుక్కు కాచితే పై పై రాపాడేకాక
	కలిగీనా అందులోనే కనకపురజము
చ. 2:	పంతమాడి నీతోడ బలిమిఁ బెనఁగనేల
	హోంతకారివైననిన్ను నోడించనేల
	యెంతమాను రాచినాను ఎదుటఁ జూపరేకాక
	బంతినే గందమువలెఁ బరిమళించీనా
చ. 3:	శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కోపగించనేల
	మూవంకల నంతలోనె మొక్కనేల
	యీవేళ నన్నుఁ గూడితి వే నలమేల్మంగనని
	నీవు నీవేకాక మరి నేనయ్యేవా

రేకు: 1180-2 పాడి సం: 21-410

పల్లవి: అప్పటిగురుతులెల్లా నట్టె వున్నవి
దెప్పరమునఁ గొంత సాత్మించనీయరాదా

చ. 1: నెట్టనఁ గళలు దేరె నీ మొగము చూచితేను
నట్టుకొట్టి నాకైతే నవ్వువచ్చీని
ముట్టి నిన్నుఁ జూడుమని ముసుఁగేల తీసేవు
జట్టి నీవేఁడి చేతలు చల్లారనీరాదా

చ. 2: వద్దనుండి నీమేని వాసన మూరుకొంటే
కొద్దిమీరి చూపులఁ గుంకుమ రాలీని
అద్దో నే వంచిన సిరసట్టె యేల యెత్తేవు
బద్దులు యీవేళ మట్టుపడనియ్యరాదా

చ. 3: గక్కన నీచెమటమ్మై కాఁగిలించుకొంటేమ
చిక్కి నాతమి నీమీఁదఁ జిమ్మిరేఁగీని
అక్కరై శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చెక్కులేల నొక్కేవు చిత్తగించరాదా

రేకు: 1180-3 బౌళి సం: 21-411

పల్లవి: ఎంతచేసిన నీవిద్య లేల మానేవు
బంతినే నీనవ్వులెల్లాఁ బచరింతువుగాక

చ. 1: వెక్కసపుమాఁట లాడి వేమారు నిన్నుఁ దిట్టేటి-
యెక్కువసతులకుఁగా కేల వంగేవు
మొక్కులు మొక్కి నేము ముందే సేవలుసేయఁగ
మిక్కుటపుపంతాలు మామీఁద నింతువుగాక

చ. 2: కొప్పువట్టితీసి నిన్ను గోరు నీమీఁదఁ బెట్టేటి-
యెప్పటియింతులకుఁగా కేల వంగేవు
ముప్పిరిఁ బ్రియాలుచెప్పి మొగమోడి పొందఁగాను
ఇప్పు డింతేసి మమ్ము నెలయించఁదగదా

చ. 3: పరపుపైఁ బడవేసి పచ్చిమోవి గంటిచేసే-
యెరవులవారికిఁగా కేల వంగేవు
అరిది శ్రీవేంకటేశ ఆలమేల్మంగ నేనంటా
సరవిఁ గూడితి వింత చవిసేయవలదా

రేకు: 1180-4 హిందోళం సం: 21-412

పల్లవి: తనకు నా కెంతదవ్వు దగ్గరఁ జేతెఁడు గద్దు
మొనసి నాకాలు దన్ను మోఁచెననీని

చ. 1: తగవులఁబెట్టఁబోతే తనవంకదే నేరమి
యెగసక్కే లెవ్వరిఁ దా నేలాడనే
చిగురుఁజేతులఁ దనసేవచేసే దెఱఁగఁడు
అగడుచేసి గోర నంటితినీని

చ. 2: సాకిరులడుఁగఁబోతే జగడము తన్నే మోంచు
చేకొని మరేల నన్ను చిమ్మిరేఁచీనే
వాకుచ్చి తనకుఁ గాను వంకలాడే దెఱఁగఁడు
దీకొని సందుచేసుక తిట్టితినీని

చ. 3: నిజము తెలిసితేను నేనుఁ దాను నొక్కటే
గజరుఁజేఁతలనేల కాఁతాళించీనే
భజనఁ దా శ్రీవేంకటపతి నే నలమేల్ మంగను
త్రిజగ మెఱంగఁ గూడె దిట్ట నేననీని

రేకు: 1180-5 వసంతవరాళి సం: 21-413

పల్లవి: చూచేవారికె యివి సోద్యా లింతేకాక
యేచి నీకయితే యివి యింపులే కావా

చ. 1: సారె సారె నాడేటిసవతుల జగడాలు
నారుకొన వింటే నీకు నవ్వులు గావా
చేరిచేరి వొండొరులు చేపట్లకుఁ జొచ్చితే
సైరణతో వినోదించఁ జవులు గావా

చ. 2: కొలువులోని ఇంతులు గొణఁగి తిట్లాడితే
అలరి నీకుఁ జెర్లాటా లివియె కావా
వొలసి నీమీఁదఁ బెట్టి వొట్లు వెట్టుకొంటే
చెలరేఁగి నీకు విన సిగ్గులు గావా

చ. 3: నీపెండ్లికూఁతు లిద్దరు నిన్ను సాకిరడిగితే
పై పై నీవుచేసినభాగ్యముగాదా
యేపున శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
రాఁపుగాఁ గూడితి నీరపము గాదా

రేకు: 1180-6 నాదనామక్రియ సం: 21-414

పల్లవి: సెలవినవ్వులతోడ సిగ్గులతోడ
తలఁపించరే పనులు తమితోనున్నారు

చ. 1: పంతములాడే రిద్దరు బాగా లియ్యఁగదరే
వంతల కొకరొకరి వంకలాడరే
మంతనమాడేరేమొ మరి తెరవేయరే
కాంతయుఁ బురుషుఁడును గద్దెపై నున్నారు

చ. 2: సరసమాడే రిద్దరు సంగడి నుండఁగదరే
అరిది మర్మపుమాఁట లందీయరే
కరఁగి మోహించేరేమో కందువలు దెలుపరే
సరికి బేసికిని మంచముపై నున్నారు

చ. 3: యెనసిరి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగయు
మొనయుచు నుపచారములు సేయరె
చనవులు గొసరేరేమొ సమరతి నుపరతి
పెనచి మొక్కరె పెండ్లిపీఁటపయి నున్నారు

రేకు: 1181-1 శ్రీరాగం సం: 21-415

పల్లవి: అంగనకు విరహమే సింగారమాయ
చెంగట నీవే యిది చిత్తగించవయ్యా

చ. 1: కలికి నిన్నుఁ దలఁచి గక్కున లోలోఁ గరఁగి
జలజలఁ జెమరించి జలకమాడె
బలుతమకాన నీకుఁ బక్కన నెదురువచ్చి
నిలువునఁ గొప్పువీడి నీలిచీర గప్పెను

చ. 2: సుదతి నిన్నుఁ జూచి సోయగపుసిగ్గులను
పొదలి చెక్కులదాఁకాఁ బూసె గంధము
మదనమంత్రములైనమాటల మర్మము సోఁకి
ముదురుఁబులకలను ముత్యాలు గట్టెను

చ. 3: గక్కన గాఁగిట నిన్నుఁ గలసి యీమానిని
చొక్కి చంద్రాభరణపుసొమ్ములు వెట్టె
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
దక్కి సరసములను తలఁబాలు వోసెను

రేకు: 1181-2 ఆహిరి సం: 21-416

పల్లవి: ఏమి సేతునయ్య ఇఁక నిదివో మాబ్రదుకు
చేముట్టినసరసాలు సిగ్గులకే మూలము

చ. 1: తప్పులెంచఁబోతేను తగిలీ నీనుతులె
రెప్పలెత్తి చూడఁబోతే రేఁగీ వలపు
అప్పటిఁ బెనఁగఁబోతే ఆయములు గరఁగీని
యెప్పుడు నీతోడివాదు లింపులకే మూలము

చ. 2: చేతుల దొబ్బఁగఁబోతే చిమ్మిరేఁగీఁ బులకలు
గాతలఁ జంకించఁబోతే కమ్మీ నవ్వులు
యేతులు నెరపఁబోతే నెలయింపులై తోఁచీ
నీతోడిమచ్చరాలు నెయ్యానకే మూలము

చ. 3: కొప్పువట్టి తియ్యఁబోతే కూడీఁ బరవశము
ముప్పిరి నలుగఁబోతే ముంచీనాసలు
యిప్పుడే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
దెప్పరపునీతో రతి తేఁకువకే మూలము

రేకు: 1181-3 పాడి సం: 21-417
పల్లవి: పొద్దు వొద్దు కిట్లానే భోగించరయ్యా
ఇద్దరికిఁ గలిగె నేఁ డిదివో సోబనము
చ. 1: పెంచెపుమీతొడలే పెండ్లిపీఁటలు మీకు
ముంచినసిగ్గులే కడుముత్తేల సేస
పంచలచిమ్ముఁజూపులు పసవులు నలఁచుట
అంచెల మీయిద్దరికి నమరె సోబనము
చ. 2: పొత్తులమోవితేనెలే బువ్వపుఁబాలకూళ్లు
బత్తి తోడినవ్వులే కప్రపుబాగాలు
హత్తినచెనకులే అలరినవుంకువలు
యెత్తులఁ జూచిన మీకు నెనసె సోబనము
చ. 3: కందువకాఁగిటిరతి గందాక్షతలు మీకు
విందులసరసములు వీడుదోడులు
యిందునె శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
సందడితో మెరసె నిచ్చలు మీసోబనము

రేకు: 1181-4 కాంబోది సం: 21-418

పల్లవి: మంచితనము సేయఁగ మంకుదనా లేఁటికే
అంచెల విభునితోడ నంతచలమేఁటికే

చ. 1: గక్కన నాతఁడు నిన్నుఁ గప్పురాన వేసితేను
ఇక్కువలు దాఁకెనంటా యేల తిట్టేవే
చెక్కులనొక్కనని చేరి వేఁడుకొనరాఁగా
పెక్కుగోళ్ళు దాఁకీనంటా పెనఁగనేమిటికే

చ. 2: ఘనుఁడు వల్లెగా నీపై కలువదండ వేసితే
చనుఁగవ దాఁకెనంటా సాదించేవేమే
యనసి యందుకె యాతఁడిట్టె కాఁగిలించుకొంటే
తనువంటెఁ జెమటంటా తప్పువేయనేఁటికే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్ను చెందామరలవేసితే
యీవేళనేల జంకించే విందరిలోన
చేవదేర నీతఁడే చేకొని రతిఁ గలిసె
భావిం చలఇంచెనంటా పంతమాడనేఁటికే

రేకు: 1181-5 దేసాళం సం: 21-419

పల్లవి: దిక్కుల నీకతలెల్లాఁ దెలిసెఁగాక
వెక్కసాన నిన్ను నావెంటవెంటఁ దిప్పనా

చ. 1: యితరులు పిలిచితే నేఁతైనాఁ బలుకవు
సతిమాటకై తేను జవదాఁటవు
ప్రతినలాడుకోఁగా నీపలుకుల భ్రమయించి
వెతదీర నిన్ను నావెంటవెంటఁ దిప్పనా

చ. 2: సరస మెవ్వరాడినా సరకుఁ గొనవుగాని
తరుణి నవ్వినంతేనే తమకించేవు
సరవులు దప్పఁగాని చలపట్టి నే నిన్ను
విరివిగా వలపించి వెంటవెంటఁ దిప్పనా

చ. 3: కొలువులో నెవ్వరున్నాఁ గూరిమిసేయవుగాని
కలికిఁ బొడగంటేనే కరఁగేవు
మెలఁగి శ్రీవేంకటేశ మీరఁగాని నిన్నుఁ గూడి
వెలయ సిగ్గులుమాన్పి వెంటవెంటఁ దిప్పనా

రేకు: 1181-6 వరాళి సం: 21-420

పల్లవి: మీవంటిదాన నటె మీరఁగ నేను
పూవుబరిమళమ్మై పొదిగేఁగాక

చ. 1: చలము సాదించేనటే సలిగెగలదానను
బలువుకొద్ది పంతానఁ బతికేఁగాక
అలిగేనటే పతి కంతరంగమ్మైనదాన
పలుకురసమునఁ బైకొనేఁగాక

చ. 2: తప్పు లెంచేనటవే తగినచుట్టపుదాన
ఎప్పుడూ మేలుదాననై యెనసేఁగాక
వుప్పటించేనటే నేను వూడిగముసేసేదాన
దప్పిదేర మోవితేనెఁ దనిపేఁగాక

చ. 3: వొరసేనటవే నేను వురమెక్కినట్టిదాన
గరిమఁ గాఁగిట నించి కైకొనేఁగాక
యిరవై శ్రీవేంకటేశుఁ డిదివో నన్ను మన్నించె
సరిలేనివేడుకల సతమయ్యేఁగాక

రేకు: 1182-1 గుండక్రియ సం: 21-421

పల్లవి: ఓజతో నుండినవారి కొకటొకటె రేచేవు
రాజవైతేనే మమ్ము రవ్వసేయవలెనా

చ. 1: అప్పటికప్పటికి నీ వనుచరించేవుగాక
యెప్పుడును ఇంటికి నీ విట్టే వచ్చేవా
వొప్పుగువేవేలుసతు లొద్దనే వుండఁగాను
చప్పనైకాక సతులు సరకయ్యేరా

చ. 2: బాసదప్పీనంటా నాతోఁ బైకొని నవ్వేవుగాక
ఆసల నేపొద్దూ నిట్టె ఆదరించేవా
రాసికెక్క ఇరుమేలా రామలు కొల్వుసేయఁగా
వేసటేకాక రతులు వెలవెట్టీనా

చ. 3: దయదలఁచేమో నన్ను తతిఁ గూడితివిగాక
ప్రియము లిట్టే నీకు పెనగొనీనా
నియతి శ్రీవేంకటేశ నేనే నీయండ నుండఁగా
జయమేగాక మేలు చండివడీనా

రేకు: 1182-2 గుజ్జరి సం: 21-422

పల్లవి: నెలఁత యెంతటిజాణో నీవెంత చతురుఁడవో
పిలిచితేఁ జెలియకు ప్రియముచెప్పితివి

చ. 1: మగువ యలిగి నీతో మారుమోము వెట్టుకొని
మొగిచి యప్పటి నీతో మోము చూచెను
నగుతా నప్పటి నీవు నలినాక్షిఁ గాఁగిలించి
పగటున నాదరించి పంతములిచ్చితివి

చ. 2: మానిని నీతోఁ గొంత మౌనము జరపి యట్టె
మానములు సోఁకించి మాటలాడెను
కానిమ్మని నీ వందుకు గతిగూడ నింపు చల్లి
మేనవావి పచరించి మేలెల్లాఁ జూపితివి

చ. 3: కోమలి ముసుఁగువెట్టుకొని పవళించి నిన్ను
గామిడి శ్రీవేంకటేశ కాఁగిలిచెను
దోమటి దొడికి నీవు తొలుతటికంటెను
సేమమునుఁ బాలించి సిరుల మించితివి

రేకు: 1182-3 పాడి సం: 21-423

పల్లవి: ఇంటికివచ్చిన వాఁడ వీడేర్చుకోవయ్య
జంటగూనవాఁడవు చనవియ్యవయ్యా

చ. 1: తరుణి వలచినదే తప్పయితేఁగనక
పురవుగా నీవది వోర్చుకోవయ్యా
మరలి నిన్నుఁ జూచుటే మచ్చరమైతేఁగనక
నిరతితో నందుకొను నీకు మొక్కేనయ్యా

చ. 2: వెలఁది మాటాడినదే వెంగెములై తేఁగనక
మలసి యీనేరమి మన్నించవయ్యా
అలమిపట్టినదే అపరాధమైతేఁ గన
బలిమిచెల్లఁగ నీకుఁ బంతమిచ్చీనయ్యా

చ. 3: ఇంతి పాదాలొత్తి నదే యెగ్గులైతేఁ గనక
చెంతనే నేరు పాపెకుఁ జెప్పవయ్యా
కాంతను శ్రీవేంకటేశ కలిసితి వింతలోనె
వింతవింతరతులను వియ్యమందవయ్యా

రేకు: 1182-4 వరాళి సం: 21-424

పల్లవి: నీవేళ భ్రమసేవు నే నుందాన నిడివో
సేవసేసేఁగాని యిట్టె సేయించుకోరాదా

చ. 1: కప్పురవిడె మింద కస్తూరివుండ లివిగొ
దప్పిదేర్చుకో కొంత దగదొట్టకు
కొప్పు చక్కఁబెట్టుకో గోణము చక్కఁగట్టుకో
అప్పటి మేను గిజిగిజియై వుందురా

చ. 2: చల్లనిగందవో డిదే సారపుఁబన్నీ రిదే
చల్లుకోరాదా మేని సరతువాసు
వల్లెవాటు వేసుకో వద్దవచ్చి కూచుండు
బల్లిదుఁడవై వుండి పాఁచి సింగారాలేల

చ. 3: చాయపట్టుపర పదె సకినలమంచ మిదె
యీయెడనే పవళించు ఇఁక లోఁగకు
పాయపుశ్రీవేంకటేశ పచ్చిగాఁ గూడితి
దాయదండై వుండు మేల తడఁబడ నిపుడు

రేకు: 1182-5 బౌళి సం: 21-425

పల్లవి: ఆనతిమ్మా వినేఁగాని అది గొంత
యీనెలఁత నీపైబత్తి యిటువంటిదా

చ. 1: వద్దనే నుండఁగానె వనిత సన్నలు సేసీ
కద్దా తొల్లిఁ బొందు కాంతకు నీకు
ముద్దుముద్దువలెనే మోము చూచి నవ్వీని
యిద్దరికి లోలోనే యింతవలపా

చ. 2: కమ్మటినిఁ గానకుండా కానికలంపీ నీకు
సమ్మతా నీ కాపెసేసేసరితలెల్లా
పమ్మి నీవు విందువంటా పాటపాడీ నాడనుండే
వుమ్మడి మీతమకపుటొద్దిక లింతేశా

చ. 3: నీవూ నేనూఁ జూడఁగానే నిలుచున్న దీడ వచ్చి
కావర మింతేసి మీకుఁ గప్పివున్నదా
శ్రీవేంకటేశ యిద్దరిఁ జేతులు వట్టి కూడితి-
వీవేళనే నీయాపెయెన్నికలుఁ గూడెనా

రేకు: 1182-6 భైరవి సం: 21-426

పల్లవి: ఎక్కడ పరాకు నీకు నింతకంటె నేమున్నది
చిక్కనాయఁ గోరికలు చిత్తగించవయ్యా

చ. 1: సెలవినవ్వు చిందఁగాఁ జెక్కునఁ జేయివెట్టె
పులకపైరు పయ్యదఁ బొదిగ నిదె
కొలఁదిమీరె వయసు కొప్పు గట్టిగా ముడిచె
చెలియసింగారము చిత్తగించవయ్యా

చ. 2: చిమ్ముఁజూపులు మీఱఁగా చెంపల గందాలు పూసె
ముమ్మరమై మేలు పోఁకముడి వేసెను
చెమ్మగిలె మోవితేనెఁ దమ్మరసములు నించె
చిమ్మిరేఁగె సొబగులు చిత్తగించవయ్యా

చ. 3: చనుమొనల కడ్డము సరినిన్నుఁ గాఁగిలించె
ఘనమైనరతులను కళరేఁగెను
యెనసితివి శ్రీవేంకటేశ యీయింతిని నీవు
చెనకులమురిపెము చిత్తగించవయ్యా

రేకు: 1183-1 కేదారగౌళ సం: 21-427

పల్లవి: ఏమి బొఁతి నేఁ దనకు యెందాఁకనే
యీమాట నిజమయ్యే దెందాఁకనే

చ. 1: పన్ని యలిగితినంటా పలుమారు దూరిదూరి
యెన్నిమాట లాడీని యెందాఁకనే
వెన్నెలనవ్వులు నవ్వి వేఁడుకొని చెక్కునొక్కి
యెన్ని నేఁ జెప్పిన మానఁ డెందాఁకనే

చ. 2: గక్కునఁ దా లేచివచ్చి కప్పురవిడెమిచ్చీ
యెక్కడిసుద్దు లింకా నెందాఁకనే
పక్కన నానలు వెట్టి పచ్చడము గప్పి లోలో
ఇక్కువ లిదివో యంటె యెందాఁకనే

చ. 3: పచ్చి మాఁటలెల్లా నాడి బలిమిఁగాఁగిటఁ బట్టి
యిచ్చీఁ బంతములు తానెందాఁకనే
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతటఁ దా నన్నుఁ గూడె
హెచ్చి సరసములాడె దెందాఁకనే

రేకు: 1183-2 ముఖారి సం: 21-428

పల్లవి: చక్కజాడనుండవే చలమేమౌనో
నిక్కకువే సారెసారె నిలువేమౌనో

చ. 1: సెలవి నవ్వఁగఁబోతేఁ జెక్కులెల్లాఁ బులకించె
పలుకకువే ఇఁకఁ బంతమేమౌనో
తలవంచఁబోతేను తనువెల్లాఁ బులకించె
నెలసి చూడకువే సిగ్గులేమౌనో

చ. 2: చేసన్న సేయఁబోతే చిత్త మెల్లా నీరాయ
పాసి యదుగిడుకువే పాయమేమౌనో
వాసికిఁ జంకించఁబోతే వాడఁబారె మొగమెల్లా
ఆసలఁ జింతించకువే అప్పటి నేమౌనో

చ. 3: కాఁగిటఁ గూడఁగఁబోతే కందువ మరపులాయ
మూఁగి బుసకొట్టకువే మోనమేమౌనో
పాఁగినశ్రీవేంకటాద్రిపతినై నినను నీవు
వీఁగక రతిసేసితి వెనక నేమౌనో

రేకు: 1183-3 దేసాళం సం: 21-429

పల్లవి: నేనేమి సేసినాను నీచిత్తము
భావము వేరొకటై పదరి నేఁ జాలను

చ. 1: కొంగువట్టితే నిన్నుఁ గోపగించఁజాలను
అంగజగురుఁడవు నీ వటుగాన
అంగడి నవ్వి నిన్ను నదలించఁజాలను
వెంగలిపదారువేలవిభుఁడవుగాన

చ. 2: పూవుల వేసి నిన్నుఁ బొరిఁ దిట్టజాలను నీ-
వవ్వలఁ బారిజాతహరుఁడవుగాన
రవ్వల గోరంటఁగాను రాయడించఁజాలను
చివ్వలగొల్ల నరసింహుఁడవుగాన

చ. 3: చనుఁగొండ లొత్తఁగాను చాలుననఁజాలను
యెనసి గోవర్ధనగి రెత్తితివిగాన
మునుపె శ్రీవేంకటేశ మొక్కి నన్నుఁ గూడితివి
తనిసినా నిన్నుఁ బాసి తలమనఁజాలను

రేకు: 1183-4 ఆహిరి సం: 21-430

పల్లవి: మోహమెంతో కోపమెంతో ముదిత నీయెడ నేఁడు
వూహల యీభావములు వొక్కదోమటాయ

చ. 1: సెలవినే నవ్వేఁగాని చేకొని మాటాడదాయ
చెలువుఁడ నీవు విచ్చేసితివంటే
వలచేత మొక్కేఁగాని వడి సుద్దిచెప్పదాయ
పొలసి నీకడకు నేఁ బోయేనంటేను

చ. 2: కన్నులనె చూచెఁగాని కమ్మర డగ్గరదాయ
సొన్నల నీగురుతులు చూపినాను
సన్నలనే మెచ్చెఁగాని సరి దండె మీఁటదాయ
పన్ని నీ వల్లంతనుండి పాడఁగాను

చ. 3: పరవశ మందెఁగాని పైకొని బిగించదాయ
గరిమఁ గాఁగిట నీవు గలయఁగాను
సిరుల సంతసమందె శ్రీవేంకటేశ నేఁడు
శిరసువంచి కొంత సిగ్గువడదాయ

రేకు: 1183-5 సామంతం సం: 21-431

పల్లవి: ఇంతి చూచి యేమనెనో యెంత భ్రమసితినంటా
కంతునిమాక లవుత గానన్తెతినే

చ. 1: వెన్నెల గాయఁగఁ జూచి వెలఁది నవ్వెనోయంటా
పన్ని నే మారుకుమారు పతి నవ్వితినే
కన్నెచకోరాలఁ జూచి కన్నులఁ జూచెనోయంటా
మన్ననచూపుల నేను మారు చూచితినే

చ. 2: కోవిల గూయఁగ విని కొమ్మ మాటాడెనోయంటా
వోవల మారుకుమారు వూఁకొంటినే
పూవులు మాఁకుల రాలఁ బొలఁతిసేసలోయంటా
యీవలఁ గమ్మర నవే ఇటు చల్లితినే

చ. 3: చల్లగాని విసరఁగా సతినిట్టూర్పులోయంటా
వుల్లపుసంతసమున నొనరితినే
మెల్లనె శ్రీవేంకటాద్రిమీఁదనె నే నుండఁగాను
వొల్లనె చెలియ వచ్చి వూరడించి కూడెనే

రేకు: 1183-6 పాడి సం: 21-432

పల్లవి: ఏమో సేయఁగఁబోగా నేమో సుమ్మీ
మోమెదిరి, నందుపై మొక్కులే సుమ్మీ

చ. 1: చిగురుఁగెమ్మోవి వంచేవు చేరి నన్నుఁగని
వొగరుటధరామృతం బొలికీఁ జుమ్మీ
సగము మాఁటాడి గుక్కి జడిసేవు యింతలో
పగటు నీపుక్కిటను పట్ట దది సుమ్మీ

చ. 2: గొబ్బునను గమనించి కొంకేవు నన్నుఁ గని
వుబ్బెల్లఁ జెమటలై వుదిరీఁజుమ్మీ
మబ్బు విడువఁగ నవ్వి మానితివి అంతలోనె
గుబ్బతిల్లి యానవ్వు గుండెవట్టుఁజుమ్మీ

చ. 3: యింపు చేకొనుచు బిగియించేవు కాఁగిటను
ముంపుఁగుచములవాఁడి మొద్దౌఁజుమ్మీ
తెంపున శ్రీవేంకటాద్రిదేవుఁడగనకు నన్ను
సంపదలఁ గూడితివి సరికిసరిసుమ్మీ

రేకు: 1184-1 కాంబోది సం: 21-433

పల్లవి: వద్దువద్దు తడవితే వాదులేసుమ్మీ . నీవు
పొద్దువొద్దు వారివీరిపోడులే సుమ్మీ

చ. 1: పూచిననా మేననున్న పులకలకంత లివి
చేచేత నీమాటలచు చిల్లులేసుమ్మీ
చాఁచిననాచన్నులు నీజవ్వనపుయడిచే-
గాచినవురము మీఁది కాయలే సుమ్మీ

చ. 2: వేఁకపునాకళ లివి వెలెకురికినయట్టి-
కాఁకల నీవిరహాగ్ని కాంతులేసుమ్మీ
చేకొను నాతురుమిది చిత్తములోపలనున్న-
చీకాకులచింతలచీఁకటి సుమ్మీ

చ. 3: వన్నెలనామోవి యిట్టె వడిసేటితేనెలు
వున్నతి నీకు నోరూరేవూటలేసుమ్మీ
యెన్నఁగ శ్రీవేంకటేశ ఇంతలో నన్నుఁ గూడితి-
విన్నిటా నీవూ నేనూ నేకమేసుమ్మీ

రేకు: 1184-2 సాళంగం సం: 21-434

పల్లవి: ఇట్టె వచ్చేఁగాని యీవనకేలికిఁ బోయి
నెట్టన నాడనుండేది నిమిషమేసుమ్మీ

చ. 1: మఱవకుమీ నాపై మన్ననా నే-
నెఱఁగ కేమనినా నిముడుకొమ్మీ
గుఱిగా నాయుంగరమే కోరి యెప్పుడుఁ బెట్టుమీ
మఱి నాచెలులను నామారుగాఁ జూడుమీ

చ. 2: తలఁచుమీ నామీఁది తగులాయమూ నా-
మెలుపుఁబాయము నీకే మీఁదుసుమ్మీ
సళుపునీపేరు నాకు జపముసుమ్మీ యీ-
యలరులఁబంతి నాయాత్మగాఁ జూడుమీ

చ. 3: చవి నీతమ్ములమే నాచద్దిసుమ్మీ నేఁ-
బవళించేపానుపే నీపదవిసుమ్మీ
ఇవల శ్రీవేంకటేశ ఇంతలోనే కూడితివి
వివరించ దినమొకవింత ఇదెసుమ్మీ

రేకు: 1184-3 మంగళకౌసిక సం: 21-435

పల్లవి: సరికి బేశాయ నిది చాలదా నేఁడు
యిరవాయఁ బనులెల్ల నికనేల మాటలు

చ. 1: బయలువంటిదె నాపట్టె ననెన్నడుము
బయలుపందిలి నీపలుకులెల్లా
నయమైనకుచములు నావి కొండలవంటివి
దయలేని నీమనసు తగురాతివంటిది

చ. 2: నిండిననాతురుమున నెరులెల్లా వంకలే
చండియై నీమేనెల్లా చంద్రవంకలే
పండిననామోవి ఇదె పైపైనే కడుఁదీపు
దండినీవినయములు తరితీపులే

చ. 3: మెఱుఁగువంటిదివో మించయిననామేను
మెఱుఁగువంటిదెపో నీమేఁటివలపు
నెఱి శ్రీవేంకటేశ్వర నీవే ననుఁ గూడితివి
తఱితోడఁ జవులాయ తగిననీరతులు

రేకు: 1184-4 వరాళి సం: 21-436

పల్లవి: చొల్లెపుఁజుట్ల వో చొక్కనాథా నీ-
చల్లరిచేఁతలు గంటిఁ జొక్కనాథా

చ. 1: చూడ వేగన్నుల నిన్నుఁ జొక్కనాథా నీకు
జోడు భూమియును లక్ష్మిఁ జొక్కనాథా
సూడిదె నాపాయమిదె చొక్కనాథా నీతో
సూడువట్టీ నారతులు చొక్కనాథా

చ. 2: చొక్కపు సింగారాల చొక్కనాథా మోవిఁ
జుక్కలు నించె నెవ్వతో చొక్కనాథా
చొక్కించితి గోపికలఁ జొక్కనాథా నాతో
సుక్కులమాట లేలోయి చొక్కనాథా

చ. 3: సొమ్ముతొవిఙ్ణవిగేచొక్కనాథా పొదు-
సుమ్మీ నీకు నాకుఁ జొక్కనాథా
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిటు నీవు గూడఁగాను
జుమ్మన మై పులకించెఁ జొక్కనాథా

రేకు: 1184-5 శంకరాభరణం సం: 21-437

పల్లవి: పచ్చి సేయకుందునా పై పై నిన్ను
అచ్చలపు నీవు దొరవని యింతేకాక

చ. 1: నీకన్నుల కావి చూచి నిన్ను మెచ్చకుందునా
దాకొని నీవంటివాని దగ్గరక వుందునా
యీకడ నీమేనితావి ఇందు జొక్కకుందునా
పైకొని నామనసొడబడ దింతేకాక

చ. 2: ముందు నీభావము చూచి మొక్కు మొక్కకుందునా
చిందేటి చెమట చూచి చెక్కు నొక్కకుందునా
పొందగుఁగళలు చూచి పొగడక వుందునా
యెందు నాపంతము నన్ను నెడసేసీఁగాక

చ. 3: కాఁగిలించుకోఁగా కొంగు గప్పక నే నుందునా
మూఁగినరతులవేళ ముచ్చటాడకుందునా
వీఁగక శ్రీవేంకటేశ విన్నవించకుందునా
మాఁగినమరపు నన్ను మంకుఁ జేసీఁగాక

రేకు: 1184-6 లలిత సం: 21-438

పల్లవి: ఏమిసేత మేమిసేత మేవంక చూచినాఁ దామె
దోమటి నాకెకు నాకు దొరసీ నేఁ డిపుడె

చ. 1: కాసీ నదొకటి కాంతనవ్వువెన్నెలలు
పూసీ నదొకటి పూఁవవలపు
రాసీ నదొకవంక రాఁపుఁగుచములు రెండు
యేసీ మయఁ డీవంక నేమి సేసేదే

చ. 2: చిమ్మీ నదొకటి చెలిచూపుల చీఁకటి
కమ్మీ మాటలనె కమ్మఁదేనెలు
తుమ్మీఁ జింకతుమ్ములు తుమ్మిదగుంపుల కొప్పు
అమ్మీ నల్లదె పాయ మాకెకె నన్నును

చ. 3: చాఁచీ నదొకటి సతికాఁగిటికిఁ జేయి
పూఁచీ నదొకటి బువ్వపుమోవి
యేఁచీ యిట్టె శ్రీవేంకటేశుఁడ గనక నన్ను
లాచి కూడె నీమగువ లాగాయ నిఁకను

రేకు: 1185-1 తెలుఁగుఁగాంబోది సం: 21-439

పల్లవి: అతనిఁదోడితెచ్చినందాఁకా
హితబుద్ధుల చెలి యేమరకుమీ

చ. 1: వెలఁది విరహముల వేసవికాల మిది
యెలమి మోవిచిగు రెండనీకుమీ
కలికి నిట్టూర్పులగాలికాల మదె
తెలివలపుపదను తియ్యనీకుమీ

చ. 2: వనిత పెంజెమట వానకాలమదె
మొనపులకననలు ముంచనీకుమీ
మనవుల సిగ్గుల మంచుఁగాల మదె
ఘనకుంచగిరులనుఁ గప్పనీకుమీ

చ. 3: వెసఁ గాంత నవ్వువెన్నెల కాలము
పసిఁ గొప్పుచీఁకటి జారనీకుమీ
పసగా శ్రీవేంకటపతి విచ్చేసి కూడె
వసంతకాల మిదె వదలనీకుమీ

రేకు: 1185-2 సామంతం సం: 21-440

పల్లవి: తానొక్కఁడే గురి తమకమునకును
యే నింక నెవ్వరితో నేమిచెప్పేనే

చ. 1: తనువొక్కటే గురి తన్నుఁ బాసేకాఁకలకు
మనసొక్కటే గురి మంతనాలకు
కనుఁగొనలే గురి కడునిట్టచూపులకు
యెనసి యెవ్వరి కింక నేమిచెప్పేనే

చ. 2: పాయమొక్కటే గుఱి పచ్చివలపులకెల్లా
చేయి చెక్కిటికి గురి చింతలకును
మోయు నిట్టూర్పులు గురి మనుకొన్న కోరికకు
యేయెడ ముచ్చట లింక నేమిచెప్పేనే

చ. 3: కూడినకూటములకు కొనగోరొక్కటే గురి
యీడనాకు శ్రీవేంకటేశునికిని
తోడనే కళలు గుఱి తుదలేనివేడుకకు
యేడ నెవ్వరికి నింక నేమి చెప్పేనే

రేకు: 1185-3 మేఁచబౌళి సం: 21-441

పల్లవి: తనిసితి నన్నిటాను తాలిమే మేలిమాయ
యెనసినసంతసము లిఁక నెన్నఁడే

చ. 1: ఆసలనే కొంతవొద్దు అంగమంటి కొంతవొద్దు
బాసచేసి కొంతవొద్దు భ్రమయించెను
వాసికి సరసమాడ వయసు వోయీనేమో
యీసుదీర మన్నించే దిఁక నెన్నఁడే

చ. 2: మోము చూపి కొంతవొద్దు మొక్కులాడి కొంతవొద్దు
నాముదేద నవ్వి కొంత నాలిసేసెను
ఆమని(గుంటెనమాఁట లాడఁగానే తెల్లవారె
యీమేర నన్నుఁ గూడె దిఁక నెన్నఁడే

చ. 3: చేయివేసి కొంతవొద్దు సేసవెట్టి కొంతవొద్దు
యీయెడఁ గాఁగిటఁ గూడె నీపొద్దు
పాయపుశ్రీవేంకటాద్రిపతి కింతా సెలవాయ
యేయెడఁ జొక్కుదుఁగాక యిఁక నెన్నఁడే

రేకు: 1185-4 హిజ్జిజి సం: 21-442

పల్లవి: అది నీకుఁ దారుకాణ అవునోకాదో కాని
కదిసి చెప్పఁగబోతే కతలయ్యీఁ గాని

చ. 1: కలలోని నీరూపు కన్నులఁగన్నట్లయ్యీ
చెలఁగి ఆసుద్ది చెప్పఁజింతయ్యీఁగాని
వెలయ నీపలుకులు వీనుల విన్నట్లయ్యీ
సెలవిఁ గమ్మరఁ జెప్పసిగ్గయ్యీఁగాని

చ. 2: మంతనాన నీతో మాట లాడినట్లయ్యీ
అంతటఁ జూచితే వెరగయ్యీఁగాని
కంతునమరతి నిన్నుఁ గాఁగిలించినట్లయ్యీ
పంతాన నేమనినాను పచ్చిదేరీఁగాని

చ. 3: సరుస నీమోవితేనె చవిగొన్నఅట్లనయ్యీ
వొరసి చూపఁబోతే గోరొత్తీఁగాని
ఇరవయినశ్రీవేంకటేశ నీవు ద్రిష్టముగా
సరుగఁ గూడిన నదె చాలాయఁగాని

రేకు: 1185-5 లలిత సం: 21-443

పల్లవి: ఏమాటకేమాట యేమే నీవు వోరి
ఆమాటకామాట లవి యంతే కావా

చ. 1: పచ్చిపాలు పోయవుగా పసిగొల్లెతా అవె
పచ్చిపచ్చి అయ్యీఁగాని పదరా నీవు
పచ్చిచిగురే కాదా భామ నీమోవి నీవు
పచ్చిగాఁ దిరుఁగఁగాను పసురెక్కకుండునా

చ. 2: పెరుగు వెట్టవుగా గుంపెనగొల్లెతా నీవు
పెరిగి యింతై తివి పెక్కులేలర
పెరుగు నీకుచములు పిక్కటిల్లను నీవు
పెరుగఁగ నవి కడుఁబెద్దలు గాకుండునా

చ. 3: వెన్నలైనఁ బెట్టవుగా వెడగొల్లెతా నిన్ను
వెన్నకంటె నున్నఁ జేసే వేగమేలరా
వెన్నతోఁ బెట్టినది యీావేషము నీకు
వెన్నలఁ గూడితి శ్రీవేంకటేశ చాలదా

రేకు: 1185-6 సామంతం సం: 21-444

పల్లవి: తొల్లిటి తాఁదానే కాఁడా దొరయాయనా
అల్లనాఁటి తగవు నేఁ డందదాయనా

చ. 1: చాయల నే రానంటా సణఁగులాడేవాఁడు
కాయముఁ దానంటఁగా నేఁ గాదంటినా
పాయపుసతులత మింతే బలుమగవాఁడు దాను
పాయక గొల్లెతలను పచ్చి సేయఁడాయనా

చ. 2: కన్నులఁ దిట్టితినంటా ఘాతలు సేసేఁవాడు
సన్నచేసి పిలువంగాఁ జరసితినా
కన్నెలము ఇదె నేము ఘనమైనప్రౌఢ దాను
మున్నే ఎరుకచేసితే మొగిఁ జెల్లదాయనా

చ. 3: కులికి గోరంటితేను కోపగించేవాఁడు నన్ను
పలుసోఁకించఁగ నేను పదరితినా
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆలమి పదారువేల నంగవించఁడాయనా

రేకు: 1186-1 శంకరాభరణం సం: 21-445

పల్లవి: ఏమయ్య రమణుఁడ యింత సేతురటవయ్యా
కామిని నూరడించి కలయఁగరాదా

చ. 1: పడఁతి కధరమిచ్చి పలుసోఁకించినది
బడి బడి విందువెట్ట పగలాయ
వెడవెడఁగా నవ్వి వెంగెమాడినది
తొడికేదోమటి పాలఁదోడనే వేఁడాయ

చ. 2: తరుణిఁ దప్పకచూచి తలవంచినది
అరిది నమ్మించి తప్పినట్లాయ
సరస మాడియాడి సరుగన దాఁగినది
పొరిఁబొరి మధ్యాహ్నేనఁ బొద్దుగుంకినట్టాయ

చ. 3: మెలుఁత గాఁగిటఁ గూడి మేను మరచినది
నిలువునీడలలోన నివ్వెరగాయ
అలరి శ్రీవేంకటేశ ఆదరించినది
ఫలియించి పసిఁడిలోఁ బరిమళమాయ

రేకు: 1186-2 శంకరాభరణం సం: 21-446

పల్లవి: చూచినవారికినెల్లా సోభనమై వుందువు
తాచిన శ్రీవేంకటేశ దైవమై వుందువు

చ. 1: నాలుగుచేతులతోడ నలి నీవు నిలుచుంటే
చాలి కొమ్ములకల్పవృక్షమువలె నుందువు
మేలిమపీతాంబరాన మెరసి నీ వుంటేను
వాలిన బంగారురాశివలె నుందువు

చ. 2: జమళిపాదములతో సరి నీవు నిలుచుంటే
అమరి యిహపరము లందినట్టె వుందువు
తమినీలవర్ణముతోఁ దగ నీవు నిలుచుంటే
గమిఁ గనకవరుషకాలమేఘ మౌదువు

చ. 3: కొండవంటి తురుముతోఁ గోరి నీవు నిలుచుంటే
మెండుశిఖరముతోడి మేడవలె నుందువు
అండనె శ్రీవేంకటాద్రి నలమేలుమంగఁ గూడి
వుండితే మిన్నునేలా నొక్కటైనట్లుందువు

రేకు: 1186-3 పాడి సం: 21-447

పల్లవి: చల మింకానా నీకుఁ జాలదా నేఁడు
సలిగెడు పతితోడఁ జాలదా నేఁడు

చ. 1: వదనము వసివాడె వనిత నీకొప్పు వీడె
చదురులబింకము చాలదా నేఁడు
గుదిగొనెఁ బులకలు కుమ్మరించెఁ జెమటలు
సదమదమైతి వింకఁ జాలదా నేఁడు

చ. 2: కన్నులఁ గెంపులుదేరెఁ గడునిట్టూర్పులు మీరె
సన్నలుఁజాయలు నింకఁ జాలదా నేఁడు
వెన్నగా మతి గరిఁగె విభుపైఁ దనువొరగె
సన్నపుమోవితిట్లు చాలదా నేఁడు

చ. 3: సెలవుల నవ్వులు చిందె సిగ్గులు లోలోఁ గుందె
చలివేఁడి కొసరులు చాలదా నేఁడు
బలిమి శ్రీవేంకటాద్రిపతి నిన్ను నిదె కూడె
సళుపులెల్లాఁ బాసెఁ జాలదా నేఁడు

రేకు: 1186-4 సౌరాష్ట్రం సం: 21-448

పల్లవి: చాలుఁజాలు వాఁడులేని జన్మమేలా
జాలి నన్నుఁబెట్టకురా సారె సారెఁ జెలులు

చ. 1: నేఁడు వానిఁబాసిన వెన్నెలబయలేలా
వోడక వాఁడుగాఁగిటనుండనినిద్రేలా
కూడి వాఁడు నేను గప్పుకోనిపయ్యెదేలా
వీడని చెక్కుతోడివెరగే చాలును

చ. 2: లీల వానిసరసములేనినవ్వేలా
ఆలించి వాడువినని ఆమాటలేలా
సోలి నిద్దరు నొక్కటై చూడనియద్దమేలా
తాలిమితో లోలోనె తలపోఁతే చాలును

చ. 3: యీకడ వాఁడుగూడ నియీజవ్వనమేలా
ఆకు వాఁడు మడచియియ్యనితమ్ములమేలా
వాఁకగా శ్రీవేంకటాద్రి వాఁడు నన్నుఁ గూడె నిదె
మాఁకు పడఁజొక్కినయీమర పిదె చాలును

రేకు: 1186-5 ముఖారి సం: 21-449

పల్లవి: చాలునె చాలునె సట లిఁకనూ ని-
నే్నలినపతికడ కేఁగగరాదా

చ. 1: పెంచినఁ బెరుగును పెనునీచలములు
నించిన కొప్పునెరులవలె
వంచిన వాలును వడి నీకోపము
చుంచులనీకనుచూపులవలెను

చ. 2: కరఁచినఁ గరఁగును కలికి నీమనసు
పరుగునీకాంతులపసిఁడివలె
మరపిన మరగును మహి నీగుణములు
పెరతేనేలనీపెదవులవలెను

చ. 3: కదిసిన గద్దా కాంక్ష నీరతులు
ముదిరిన నీకుచములవలెను
యెదురనె శ్రీవేంకటేశుఁడు గూడెను
పదవులజవ్వనసాయమువలెను

రేకు: 1186-6 మంగళకౌసిక సం: 21-450

పల్లవి: కంటిమి వింటిమి నాఁడె కమ్మర నేఁడు కొత్తేల
వొంటినుండఁగాఁ జేత నొత్తకురా మమ్మును

చ. 1: వొప్పుల నీతీపుమోవినుండి వెడలేమాఁట
దెప్పరపుటొగరౌనా తీపేకాక
ముప్పిరి నీతరితీపు మొగచాటాయ మాకు
అప్పుడే తనిసితిని అంటకురా నన్నును

చ. 2: నయగారిగుణమున నడపేనీచేఁతలు
నయములెకాక వేరేనాఁటి వెట్టవునా
నయములఁ బ్రియముల నమ్మికలఁ దనిసితి
చెయిముట్టి నీవంత చెనకకు నన్నును

చ. 3: చల్లనికాఁగిట నీవు సరిఁగాఁ గిలించఁగాను
చల్లనయ్యేవుండుఁగాక సారెఁ గాఁకౌనా
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నిటా నేఁ దనిసితి
మెల్లనె మారుకుమారు మెచ్చకురా నన్నును

రేకు:	1187-1 వరాళి	సం:	21-451

పల్లవి:	ఎన్నఁటికెన్నఁటిపొందు యిస్సీ నేను
ఎన్నుకొను నామనసు యిస్సీ నేను

చ. 1:	కొంకక నీరాతి గుండె గుణ మెరిఁగుండియు
యింకా నిన్నుఁ గొసరే నిస్సీ నేను
వుంకువ వేరొకతెతో వుండఁగా నిన్నుఁ జూచియు
యింకవు నాకన్నీళ్లు యిస్సీ నేను

చ. 2:	మంతనాన నాడిననీమాఁట గల్లెవుండఁగాను
యెంతైనా మానఁగలేను యిస్సీ నేను
పంతాన నీవటుమోమై పరాకై వుండఁగాను
యెంతకెంత మాఁటలాడే నిస్సీ నేను

చ. 3:	తొప్పఁదోఁగి చమటల తొల్లిటినీబాగు చూచి
యిప్పుడె నేఁ గాఁగిలించే నిస్సీ నేను
అప్పుడె శ్రీవేంకటేశ ఆదరించి కూడితివి
యెప్పుడో మైమరచితి నిస్సీ నేను

రేకు: 1187-2 శంకరాభరణం సం: 21-452

పల్లవి: మెచ్చనిదాననా నీవు మితిమీరఁగాఁగాక ని-
న్నెచ్చరించే దాననాయిచ్చలోనే కాక

చ. 1: యింత నీవు వద్దనుండే దెరఁగనిదాననా నీ-
పంతము చెడీనంటాఁ బట్టఁగాక
అంతకంటె ముద్దుమాఁట లాడకుండేదాననా
వింతరీతిఁ దిరుగఁగా వెరచితిఁగాక

చ. 2: గుట్టునఁ బిలువఁగ నే కొంకేటిదాననా నీ-
వొట్టు దప్పీనని లోన నుంటిఁగాక
తొట్టి ననీ మైచెమట తుడువనిదాననా
మట్టు నీమైగురుతులు మాసీననికాక

చ. 3: నీకపుఁ గాఁగిట నిన్ను నించకుండేదాననా
చొక్కపునీసరితెలు చూచితిఁగాక
యెక్కువ శ్రీవేంకటేశ యిటు నీవె కూడితివి
మొక్కకుందునా నీవు మొక్కేవనికాక

రేకు: 1187-3 మంగళకౌసిక సం: 21-453

పల్లవి: ఏమన్నా నాకుఁ బోదు ఇచ్చగించ నీకుఁ బోదు
మోముచూచినంతలోనె మొక్కనేఁటికయ్యా

చ. 1: పాయమె నాకు నెక్కె పంతమె నీకు నెక్కె
చేయార యేమైనాఁ జేయవయ్య
కాయము నాకే సెలవు కాఁకలు నీకే సెలవు
చాయలు సన్నలు ఇంకఁ జాలించవయ్యా

చ. 2: వలపు నాకాయ నీకు వలసీనొల్లములాయ
మలకలబొంకు లేఁక మానవయ్య
పులకలు నావంతు బూటకాలు నీవంతు
నిలువునివ్వెరగులు నీకేలయ్యా

చ. 3: బాగుగఁ గూడేది నాది పై పైఁ జొక్కేది నీది
చేగలనీసరసము చెల్లునయ్య
యీగతి శ్రీవేంకటేశ యిద్దరముఁ గూడితిమి
తీగెనవ్వులెల్లా నేఁడు దిష్టమాయనయ్యా

రేకు: 1187-4 లలిత సం: 21-454

పల్లవి: ఇంప నీచిత్తముకొలఁదిదేమాఁట
అంకెల చెలికడకు నంపనేల నన్నును

చ. 1: చెప్పిచూపవచ్చుఁగాని చెట్టవట్టి తియ్యరాదు
ఇప్పుడెట్టున్నదో గాని చెలి యిదేమాట
రెప్పలెత్తవచ్చుఁగాని రిచ్చవడివుండరాదు
అప్పటి చెలికడకు నంపనేల నన్నును

చ. 2: మోముచూడవచ్చుఁగాని మోహము గడించరాదు
యీమగువప్రాణ మెత్తు మిదేమాట
దోమటిదొడకవచ్చుఁ దూరి కాలుదొక్కరాదు
ఆమాట చెలికిఁ జెప్ప నంపనేల నన్నును

చ. 3: పంతమాడవచ్చుఁగాని పాడిదప్పకుండరాదు
యింతలో చెలిఁ గూడితి విదేమాట
చెంతల శ్రీవేంకటేశ్వర చెల్లుఁజెల్లు నిద్దరికి
అంతయు మేలాయ నిఁక నంపనేల నన్నును

రేకు: 1187-5 శుద్ధవసంతం సం: 21-455

పల్లవి: కూడినంతఫలమె కోరి నీ వేపకుండితే
ఆడికెరమణుఁడ నేఁ డందు కదె చాలును

చ. 1: కులికికులికి నవ్వె కొమ్మ నీయాసలకు
పలికిపలికి మెచ్చె పచ్చినీసేఁతలకు
నిలిచినిలిచి చూచె నిండునీరాజసము
అలసెఅలసె నింతె అందు కదె చాలును

చ. 2: తిరిగి తిరిగి చూచె తెలవ నీరాకలకు
వొరగివొరగి వుండె వొక్కతె నీఅలుకకు
మొరగిమొరఁగి చొక్కె మొన్నటినీపొందులకు
అరసియరసి నవ్వె అందు కదె చాలును

చ. 3: తనిసితనిసి కూడె తరుణి నీకాఁగిటికి
యెనసియెనసి వీఁగె యెక్కువనీరతికి
మునుపె శ్రీవేంకటేశ మొక్కె నీసన్నలకు
అనుమానము వాసె నందు కదె చాలును

రేకు: 1187-6 ముఖారి సం: 21-456

పల్లవి: సమ మోహములతోడ సంగడి భ్రమతతోడ
నిమిషము సందేహించి నిలిచి రిద్దరును

చ. 1: వనితకుచంబులు వనజంబులు హరి-
కనుచూపుతామరలు కలబెరకై
యెనసి చిక్కువడి యేరుపరచఁగరాక
నినుపునివ్వెరగుల నిలిచి రిద్దరును

చ. 2: కాంతచెక్కుటద్దముల ఘనునిచెక్కుటద్దాల-
కాంతి నిద్దరిచూపులు కలబెరకై
అంతలోనే తమమేను లవె తడఁబడెనని
వింతలై నిలిచి రట్టె వెరగై యిద్దరును

చ. 3: చెలిబాహులతలును శ్రీవేంకటేశ్వరుని-
కలయుబాహులతలు కలబెరకై
అలమి మరుకేళిని అవి యేర్పరచరాక
నెలకొన్న మరపున నిలిచి రిద్దరును

రేకు: 1188-1 ముఖారి సం: 21-457

పల్లవి: ఎవ్వరు జాణలే వీరిద్దరిలోన
రవ్వలు మాయలుసేసే రాజనపుకృష్ణుడు

చ. 1: దోసిట నీరు నించె తొయ్యలి మోము గడిగె
ఆసమయాన కృష్ణుఁడు అటు వెనకనుండఁగా
వోసరి యాతనినీడ దోసిటిలోఁ గని నీరు
వాసి గాల్లఁజల్లుకోఁగా వడి నవ్వె కృష్ణుఁడు

చ. 2: అద్దము చూచి నామ మటు దీర్చుచును ఇంతి
వొద్దనే మానిమీఁదనున్నకృష్ణు నందుఁ గని
అద్దము తామరగొని యడిచిన నది చూచి
చద్దికి వేఁడికి నవ్వి జంకించెఁ కృష్ణుఁడు

చ. 3: నిక్కపుపూలు గోయుచు నీరెండగాయఁగాను
పక్కన కృష్ణునినీడ పడఁతి గని
అక్కడ నేతెంచి వద్దియంగనఁ గూడఁగాను
వెక్కసాన మెచ్చెను శ్రీవేంకటాద్రి కృష్ణుఁడు

రేకు: 1188-2 దేశి సం: 21-458

పల్లవి: మీఱరాదు దూరరాదు మేనవానివలెనాయ
ఆఱడి నీతోడిపొందు లగడాయ నిఁకను

చ. 1: చేరి మాటలాడఁబోతే సెలవుల నవ్వు చిందీ
వూరకుంటే పెంజెమట లుమ్మగిలీని
యీరీతి ముందరనుయ్యి యెంచ వెనకఁ దగరు
యేరా నీతోడిపొందు యేమిసేతు నిఁకను

చ. 2: తప్పకచూడఁగఁబోతే తనువెల్లాఁ బులఁకించే
రెప్పలు మూసిన కాఁకరేఁగీని
విప్పకపట్టితే నుమ్మ విడిచి తేనెగారీ
తిప్పరానినీపొందు ద్రిష్టమాయ నిఁకను

చ. 3: మోవి చవిగొంటేను మోహ మగ్గలమయ్యి
తావితములమందితే తమివుట్టీని
యీవేళ మందాఁబాలు యింటాఁ బాశమాయ
శ్రీవేంకటేశ కూడితి చెప్పరాదు ఇఁకను

రేకు: 1188-3 దేశాక్షి సం: 21-459

పల్లవి: అంటివి వింటిని అవుఁ బదరా నీ-
దంటతనంబులు తగుతగురా

చ. 1: నిక్కల గంటిని నీమాట చేకొంటి
చొక్కుల నను నిఁక సొలయకురా
చెక్కిలి నొక్కిలి సేసయుఁ బెట్టితి
యెక్కడిసుద్దులు యేఁటికిరా

చ. 2: సెలవుల నగితిని సేఁతలఁ దెగితిని
బెళకుల ఆనలు పెట్టకురా
పులకల మునిఁగితి బూతులఁ గొణఁగితి
వలపుల చల్లఁగవలెనటరా

చ. 3: కాఁకల వాడితిఁ గాఁగిటఁ గూడితి
వాకుసరసములు వలెనటరా
యీకడ శ్రీవేంకటేశ నీప్రియము
కైకొంటి పయ్యెదఁ గప్పేరా

రేకు: 1188-4 శుద్ధవసంతం సం: 21-460

పల్లవి: ఇంకనేలే మాటలూ యింతి నీజాడ చూచితి
అంకెలఁ జల్లగాలికి నాయాలు ముట్టితిని

చ. 1: కప్పురము దిన్ననోటఁ గాదన నింపుగాక
వుప్పుదిన్న నోట నంటే నొడఁబాటౌనా
నెప్పున నాబుద్ధి విని నీవు పతిఁ గలసేవా
విప్పుఁగోవిలనోటికి వెరచితిగాక

చ. 2: వుంగరపువేల సన్న లూరకనైనా నింపుగాక
సంగతి రుత్తెనవేల చవివుట్టీనా
బంగపడి మొక్కినాను పతివి దగ్గరితివా
వుంగిటఁ జంద్రునిరాక కులికి వచ్చితివి

చ. 3: కాటుకవెట్టినకంటఁ గసరితే నింపుగాక
గాఁటపురుత్తకన్నులఁ గందువయ్యీనా
నాటినమరునమ్ములనంజా తలకెక్కఁగాను
కూటువ శ్రీవేంకటేశుఁ గూడితివే మగువా

రేకు: 1188-5 శంకరాభరణం సం: 21-461

పల్లవి: దవ్వుల పంతాలు చెల్లె దగ్గరరా
యివ్వలనవ్వల మీకు నిద్దరికిఁ దగులు

చ. 1: కాయములో కరుఁగు కనుచూపులో మొరఁగు
చేయిచెక్కువెరగూ చెలియ కదె
పాయములో బిగువూ పచ్చిమోవినగవూ
యీయెడ నీకే చెల్లె యింతిమనోహరుఁడా

చ. 2: పలుకులకొదలూ పయ్యెదలోపదలూ
అలకలకదలూ అతివె కదె
నిలువుఁదమకము నిట్టూర్పుగమకము
చెలువుఁడ నీకుఁ జెల్లె చెప్పనిఁకనేలా

చ. 3: మొనపేటిసిగ్గులూ మోములోని నిగ్గులూ
పనిలేని యెగ్గులూ పడఁతె కదె
యెనసితివి శ్రీవేంకటేశ నీవే విచ్చేసి
వనితకు నీకుఁ జెల్లె వాసు లింతలోనె

రేకు: 1188-6 సామంతం సం: 21-462

పల్లవి: తక్కులు మొక్కులు తగులాయ
దిక్కులుమోహము ద్రిష్టములాయ

చ. 1: కాంతమేను కడుఁగాఁకలఁ బొరలఁగ
చెంతలఁ జెక్కులు చెమరించె
వంతుల నెండయు వానయు నొక్కట
దొంతులఁ గూడిన తోయములాయ

చ. 2: తెలినిట్టచూపు దీపాలు గలుగఁగ
కలికితురుముచీఁకటి నెరసె
వెలసిన చీఁకటి వెలుఁగును నొక్కట
కలిగినభావము కతలై నిలిచె

చ. 3: పూవులపులకలు పొడిమినవేళ
మోవులపండు ముదిరె నదె
శ్రీవేంకటపతి చేరి కూడఁగ
వావులరతు లేవంబులు గాచె

రేకు: 1189-1 రామక్రియ సం: 21-463

పల్లవి: సారెసారె నన్నంత జరయకురే
మేరతో నాపతియట మేలు మఱచీనా

చ. 1: తానే వచ్చీఁగాని తడవకురే కొంత
నానితేనే మెత్తనౌను నయగారాలు
పోనీపోనీవే అంతపాదుగకురే
పూనిపూచినవిరులు పూఁపలు గాకుండునా

చ. 2: కూడీకూడీఁగాని కొసరకురే కొంత
వాడితేను చవులౌను వలపైనాను
నాడెనాడె మొక్కె నవ్వకురే
వేడుక చంద్రోదయము వెన్నెల లేకుండునా

చ. 3: వుండీనుండీఁగాని వొరయకురే
కొండలైనఁ గోట్లవును గుట్టుగలితే
దండి శ్రీవేంకటపతి తానే విచ్చేసి కూడె
మెండుగా మెరచినందు మేఘము లేకుండునా

రేకు: 1189-2 శంకరాభరణం సం: 21-464

పల్లవి: చెలి నీవు సేసవెట్టి సిగ్గులింకేలే
ఫలము దెలుసుకొమ్మీ పతి యిందున్నాఁడు

చ. 1: తరుణి నీవు బింబాధరివి
సరిఁ జిలుకపలుకు లిచ్చుట నీకేలే
పొరసి మోవిఁ జిలుకపోట్లోఁ జూమ్మీ
వరుస నీరమణుఁడు వద్దనే వున్నాఁడు

చ. 2: అంగన నీవు చకోరాక్షివి
అంగడి వన్నలనవ్వు లవి నీకేలే
ముంగిటఁ బొత్తుగలసి యెంగిలౌఁజూమ్మీ
చెంగట నీరమణుఁడు చేకొని యున్నాఁడు

చ. 3: కోమలిరో కరికుంభకుచవు నీవు
ఆమైఁ జెమటమడుగు లవి నీకేలే
గామిడిజవ్వన మిది కలగీఁ జూమ్మీ
యామేర శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడె

రేకు: 1189-3 సాళంగం సం: 21-465

పల్లవి: నీచందములు వేరె నాచందములు వేరె
ఏచి నీకు నాకుఁ బొందు లెట్టు గూడెరా

చ. 1: కమ్మినీకన్ను లిట్టె కడుఁదెల్లఁగాఁ గాను
ఇమ్ముల నాకనుఁగొన లెఱ్ఱఁబారెరా
సమ్మతించి నీమేను చల్లనైనందులకె
కమ్మర నామేను యిట్టె కాఁకరేఁగెరా

చ. 2: పూచిననీమేన నిట్టె పులుక లుబ్బఁగ జూచి
లాచి నీవుండి నాదేహలత వాడెరా
వీచుల నీసెలవుల వెన్నెలలు గాయఁగాను
యీచాయ నాకోపముల యెండగాసెరా

చ. 3: అంతలో శ్రీవేంకటేశ ఆదరించి కూడఁగాను
వింతగా నాతురుమును వెడవీడెరా
చింతలనీమతి నీవే చిమ్మిరేఁగి మఱవఁగా
యింతట నాతమకము లెచ్చరించీరా

రేకు: 1189-4 సౌరాష్ట్రం సం: 21-466

పల్లవి: పట్టినదెల్లాఁ దప్పు భావించినదే తప్పు
యెట్టయినఁ దలపోఁత లెనయనిచోటికి

చ. 1: మించుఁగాఁగిలియ్యఁబోతే మేనురాయుటే తప్పు
కంచపువిడిమిచ్చితేఁ గారమౌటే తప్పు
వుంచముగాఁ బిలిచితే నూఁకొనుటే తప్పు
ఇంచుకంత మతిలోన నీసడించేచోటికి

చ. 2: చేకొని మొక్కఁగఁబోతే చేతులు దాఁకుటే తప్పు
యీకడ మోవానితేను యెంగిలైనదే తప్పు
మేకుఁ గొప్పు దువ్వితేను మే గోరింటితే తప్పు
వూకించి లోలోన నొరటైనచోటికి

చ. 3: పానుపుపైఁ గూడితేను బడలఁజేయుటే తప్పు
యీనెపానఁ దారకాణ లిందరికిని
కోనలశ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
యీనవ్వు మనకేకాని ఇంపుగానిచోటికి

రేకు: 1189-5 కాంబోది సం: 21-467

పల్లవి: ఇంత చాలదా మరి యేమైన నాయఁగాని
వంతులు వాసులు నందే వక్కణించఁ గంటిఁగా

చ. 1: చూచినచూపులలోన చురుకన్నా ననేఁగాని
కాచినమోవి కెంపైనాఁ గంటిఁగా నేను
వేచినచిరునవ్వులు వేఁడైనా నాయఁగాని
చేచేతనే సిగ్గు చేవదేరఁ గంటిఁగా

చ. 2: వారింపులమాటలలో వాండ్లయినా నాయఁగాని
తీరైనగొణములెల్లఁ దెలిసితిఁగా
వేరులేని మొక్కులలో వెంగెమైనా నాయఁగాని
నారుకొన్నపులకల నములైనాఁ గంటిఁగా

చ. 3: పట్టినకైదండలోనె పచ్చయినా నాయఁగాని
చిట్టంటు చేఁతలు మేనఁ జేయఁగంటిఁగా
గుట్టుగా శ్రీవేంకటేశ కూడినాఁ గూడితిఁగాని
వొట్టులు సత్యాలు నీచే నొనరించఁగంటిఁగా

రేకు: 1189-6 ముఖారి సం: 21-468

పల్లవి: నీయందు కడమా నిండుదొరవు నీవు యీ-
నాయము లోకపునడవడేకదరా

చ. 1: సగము చీఁకటియు సగము వెలుంగును
జిగి యొకదినమునఁ జెలఁగీనటా
నిగిడి నీగుణములు నిజమును కల్లయు
వొగి నీకుఁ గలుగు టుచితమేకదరా

చ. 2: చేఁదు కాఁకరను చెరకునఁ దీపును
పోదితో నిట్టే పొడమీనటా
నేదల మతి నొలసియు నొల్లమియును
యీదెస నీకిది ఇటు దగుఁగదరా

చ. 3: శ్రీవేంకటేశ్వర చిగురును చేఁగయు
వోపల నొకమాన నుండీనటా
నీవల వినయము నిటు రాజసముఁ
దావాయ నీరతిఁ దగుఁదగుఁ బదరా

రేకు: 1190-1 సామంతం సం: 21-469

పల్లవి: చెక్కునొక్కేనా బుద్ది చెప్పుటగాక
గక్కన నిందులకుఁగా కళవళ మేఁటికే

చ. 1: తనుఁదానె రాకుండితే తలఁపులో రాఁడా
మనసునా రాకుండితే మాటలో రాఁడా
తను నిందరిలో దొలతనమే చెరుచనేలే
వెనకఁ జెప్పేఁగాని వేగిరించనేఁటికే

చ. 2: పాడి దా నొల్లకుండితే పంతమైన నొల్లఁడా
వాడికా నొల్లకుండితే వంతులకు నొల్లఁడా
యీడనె ఇంతిటిలోన యెమ్మెలు చెరుచనేలే
ఆడఁ దనరచ్చలలో నైనదయ్యీఁగాని

చ. 3: సెలవి నవ్వకుండితే చెక్కు చెమరించఁడా
చెలగి వూరకుండితే చేతికి లోఁగాఁడా
బలిమి శ్రీవేంకటాధిపతి నన్నుఁ గూడె ఇట్టె
పలువినయాలు సేసీఁ బచ్చిసేయనేఁటికే

రేకు: 1190-2 శంకరాభరణం సం: 21-470

పల్లవి: ఇద్దరు నిద్దరే మిమ్ము నేమనేదే
నిద్దపునాబుద్ది విననిది మీకుఁ దగదే

చ. 1: ముందుముందే వొట్లు మోవిమీఁది తిట్లు
నిందలునాడే దాతని నీకుఁ దగదే
కందువై నబీరాలు కాఁకపుట్టేనేరాలు
అందమై నీమీఁదఁ జేసే దాతనికిఁ దగదే

చ. 2: చలివేఁడి గొణఁగులు సారె సారె సణఁగులు
నిలిచి మారుమొగము నీకుఁ దగదే
వలవనితమకాలు వాడు మోముసముకాలు
అలిగితే మారలుగ నతనికిఁ దగదే

చ. 3: కాఁగిటిలో వాసులు కదిసినరేసులు
నీఁగనిచలము వీడ నీకుఁ దగదే
వీఁగక నిన్ను శ్రీవేంకటేశుఁ డిటు గూడె
ఆఁగి చలములుచూప నాతనికిఁ దగదే

రేకు: 1190-3 లలిత సం: 21-471

పల్లవి: ఇది దా నావలపంటా యీాడుచూపీనే
పదరేనామతికిఁ దాఁ బై కొసరా

చ. 1: నిక్కి నే విరహమున నిట్టూర్పు నించఁగాను
పుక్కటఁ దా నేమిసేశో బుసకొట్టీనే
చెక్కుచేతిచింతతో నే చెమరించఁగాఁ దాను
చిక్కినసురతముల చెమటఁ దోఁగీనే

చ. 2: తనపై మోహమున నే దగఁ బులకించఁగాను
పొనిగి తానేమిటివో పులకించీనే
నినుపుఁగోరికల నే నివ్వెరగుపడఁగాను
వెనకటి చేతలకు వెరగందీనే

చ. 3: కమ్మరఁగమ్మర నే కాఁగిలించఁగా తాను
కమ్మి యెవ్వతోఁ దలఁచి కాఁగిలించీనే
అమ్మరో శ్రీవేంకటేశుఁ డట్టివాఁడా కాఁడు నేఁడు
నమ్మించి నన్నుఁ గూడి నవ్వు నవ్వీనే

రేకు: 1190-4 దేసాళం సం: 21-472

పల్లవి: నీకుఁ బ్రియమైన వెల్లా నేఁడు నాయందివిగో
పైకొనిచేకొనుమీ యౌభళనారసింహా

చ. 1: కొండలెక్కి చూచితివి కోరి యౌభళాన నా-
కొండలకుచములె ఇక్కువవో నీకు
అండనే కంబాన నుంటి వలనాఁడు నాతొడలు
నిండునరఁటికంబాలు నీకు నివివో

చ. 2: యెత్తితివి రెండురూపు లేకమైనమేను నాఁడు
అత్తిననీనారూపు లటువలెఁబో
చిత్తగించి నవనారసింహములై వుంటి వాడ
మొత్త మినానవరసములఁ దేలరాదా

చ. 3: నిచ్చలును భవానాశినీట నోలలాడితి వందు
పచ్చినాచెమటనీరు పతి యిదివో
లచ్చనల గురుడాద్రిలక్ష్మీపతివి నాఁడు
చెచ్చెర శ్రీవేంకటాద్రిశ్రీపతివి నేఁడు

రేకు: 1190-5 సాళంగం సం: 21-473

పల్లవి: నాకె సతమైనప్పుడు నమ్మేఁగాని
చీకాకుకొనగోర చిమ్మకురా నన్నును

చ. 1: వడఁగండ్లగుళ్లాయ వానలేని జల్లాయ
వొడఁబాటు లిఁకనేనల వోపరా నేను
ముడిలేనివలలాయ మూఁగగన్నకలలాయ
యెడనెడ నీపొందు; లేఁపకురా నన్నును

చ. 2: యెండమావినీళ్లాయ యెదుటి గుక్కిళ్లాయ
చండితో నీవినయాలు చాలురా నేఁడు
వండ వండనట్లాయ వావిగావి వొట్లాయ
అండనే మొక్కులు మొక్కే అంటకురా నన్నును

చ. 3: తినఁదినఁ దీపులాయ తిద్దులేనిరూపులాయ
తనియ నీమోవితేనె దక్కెరా నాకు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
అనువాయ నిఁకనేమీ నాడకురా నన్నును

రేకు: 1190-6 మంగళకౌసిక సం: 21-474

పల్లవి: పడఁతి యిందులకే భ్రమసితినే
నిడుపుఁగుఋచ లివి నేర్చితివే

చ. 1: చిక్కవినవ్వులు శిరసుల నవ్వులు
వొక్కటఁ గులుకుచు వొలుకకువే
పుక్కిటివూర్పులు బూమెలనేర్పులు
మిక్కిలిఁ గంటిని మెచ్చితినే

చ. 2: కెరలినచూపులు కెమ్మోవితీపులు
సరిసరి నొక్కట జరపకువే
మరువపుఁబులకలు మాఁటలఅలకలు
అరుదుగఁ గంటిని అవునౌనే

చ. 3: వేగిరపురతులును వేడుకమతులును
పోగాయ నెమ్మెలఁ బొరలకువే
యీగతి శ్రీవేంకటేశుఁడ నేనిదె
బాగుగఁ గూడితి పదరకువే

రేకు: 1191-1 కాంబోది సం: 21-475

పల్లవి: ఓబులేశుఁ డీకొంత నొరసీఁ గొంత
యీబిగువు దనకేల ఇంతెఱఁగఁడా

చ. 1: అదివో లకిమమ్మ ఆయపుచూపులు చిమ్మ
యెదురై నవ్వీ నితఁ డిదేమమ్మ
మది నీతగలవారు మారుగొండ లెక్కినారు
వదలుఁబయ్యదజారు వనితకుఁ జూడఁడా

చ. 2: సొమ్ములతో ఆకె వీఁగీ సొంపుఁజెమటలఁ దోఁగీ
వుమ్మలయీతఁడైతే వూర్పు రేఁగీ
యెమ్మె లింతగలవాఁడు యీడనేలున్నాఁడు ఇంతి-
తమ్మిమోముచింత వాఁడు తాఁ గానఁడా

చ. 3: కామినిమోహము రేఁచెఁ గాఁగిటికిఁ జెయి చాఁచె
యేమిరే యీనరసింహుఁడిందాక లాచె
ఆమని శ్రీవేంకటాద్రి నన్నినోములు నోఁచె
కామతంత్రముల నంతఘనుఁడు గాఁడా

రేకు: 1191-2 ముఖారి సం: 21-476

పల్లవి: కానికాని మెచ్చుసేసేఁగానీ నేను
సోనల శ్రీనరసింహ చూడుమీ నేను

చ. 1: గొంది నీవు వోబుళపుకొండలో వుండేవునికి
ఇందిరతో విన్నవించే నిదివో నేను
చెంది నీవు చేచేతఁ జేసినట్టి ఆగడాలు
అంది యాకెతోనే చెప్పే నప్పటి నేను

చ. 2: శిరసువంచి నీవు చిరునవ్వులు నవ్వేది
సిరితో విన్నవించే నంచెలనే నేను
అరుదై నీమేన నిండానానినపెంజెమటలు
ధర నాపె కెరిఁగించేఁ దప్పక నేను

చ. 3: అమరు నీవాఁడిగోల్ల అందపువిటతనాలు
కమలతో విన్నవించేఁ గందువ నేను
సమమై శ్రీవేంకటేశ సతిఁ గాఁగిటఁ గూడి నా-
కమర లంచమిచ్చితి వంతదాన

రేకు: 1191-3 రామక్రియ సం: 21-477

పల్లవి: ఆన లింకా మానవా ప్రహ్లాదవరదా
నానెఁ జెమటఁ జెక్కులు నవ్వులింత చాలదా

చ. 1: పిప్పిచేసితివి మోవి బెదరించితివి నీవి
అప్పటి నాసోదమా ప్రహ్లాదవరదా
కొప్పు జారఁజేసితివి కొంగువట్టితీసితివి
రెప్పలెత్తి చూచే వింకా రేసెంత గలదో

చ. 2: మానముపైఁ దిట్టితివి మర్మము చేముట్టితి
ఐన నింతచాలదా ప్రహ్లాదవరదా
మేనెల్లఁ జొక్కించితివి మేకుల దక్కించితివి
శేననవ్వులు నవ్వేవు సేఁత లింత చాలదా ,

చ. 3: చెక్కుఁ గడునొక్కితివి చేతులెత్తి మొక్కితివి
అక్కరింకానేఁటికి ప్రహ్లాదవరదా
యెక్కువ శ్రీవేంకటాద్రి నిరవైనదేవుఁడవు
దక్కి నన్నుఁ గూడితివి తమి యెంతగలదో

రేకు: 1191-4 భైరవి సం: 21-478

పల్లవి: ఇదివో చెలియభావ మిఁక నీచిత్త మెట్టో
పెదవులు మోడిమోడి పేరుకొని పాడును

చ. 1: నీవు వచ్చేవని చెలి నిలుచుండినిలుచుండి
తోవకెదురుగ వచ్చి తొంగిచూచును
భావములో నీరూపు భావించి భావించి
నీవి జారఁ గరఁగుచు నివ్వెరగు నొందును

చ. 2: యెవ్వరు మాఁటాడినా నీయెలుఁగని సారె సారె
అవ్వలనివ్వలఁ జూచి యాలకించును
జవ్వని గాలివెట్టినచప్పు డట్టె వినినిని
మవ్వపుఁగళవళాన మాటలాడును

చ. 3: యింతలో శ్రీవేంకటాద్రి యెక్కి ప్రహ్లాదవరద
కాంత నిన్నుఁ గూడి కవకవ నవ్వెను
చింతదీర నీవు మేనఁ జేసినరేకలు చూచి
వంతుల నీమేనఁ జేయవలెనని యెంచును

రేకు: 1191-5 లలిత సం: 21-479

పల్లవి: చూచినవారికి నిది సోద్యములయ్యా
నీచనవు గాదనేనా నీచిత్తమయ్యా

చ. 1: కాకిపైఁడి మాబొట్టు కప్పు పారిటాకు పట్టు
పైకొనఁ జూచేవు నీకు బాఁతైతినా
మేకుల మొల్లలకొప్పు మేనెల్లఁ గస్తూరితుప్పు
కైకొని నిన్ను మెప్పించఁగలనటవయ్యా

చ. 2: చెక్కుల జవ్వాది నూనె చెంచుజాతి తోడుతోనె
యిక్కువ నాతోఁ బెనఁగే వింత కోపేవా
పెక్కువపూఁబొద యిల్లు పిసకత్తి యేదుముల్లు
నిక్కి నిక్కి చూచేవు నీకు నింతేలయ్యా

చ. 3: పానుపు లేఁతచిగురు పట్టువలపు జిగురు
నానాఁటి కిఁక నంత నవ్వకువయ్యా
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
ఆని నీనామై గురుతు లంటెఁ బైపైనయ్యా

రేకు: 1191-6 నాదనామక్రియ సం: 21-480

పల్లవి: అందుకదే తారుకాణ అంతే చాలునేఁ
జెంది నిన్ను దూరఁజుమ్మీ చెప్పితిఁగాని

చ. 1: వింటిఁజుమ్మీ నీనటన వింతసుద్దులు నిన్ను-
నంటిముట్టి యిఁకనేమి ననఁగాని
కంటిఁజుమ్మీ నీమేన గబ్బిచేఁతలు నే-
నొంటి నీకు బుద్ధిచెప్పనొల్లఁ గాని

చ. 2: హెచ్చెఁజుమ్మీ నీవేసా లిందరిలోన అంత
విచ్చి విచ్చి యిటు వెల్లవేయఁగాని
వచ్చెఁజుమ్మీ నీబాస నీవద్ది కప్పుడే నే
రచ్చనీదొలతనాలు రాఁపుసేయఁగాని

చ. 3: చిక్కెఁ జుమ్మీ నీకాఁగిలి చేతికిఁజేయి వేరే
తక్కినసుద్దులు మరి తడవఁగాని
దక్కెఁజుమ్మీ నీమన్నన తప్పక నాకు నేఁ
జక్కని శ్రీవేంకటేశ చాలించఁగాని

రేకు: 1192-1 పాడి సం: 21-481

పల్లవి: ఇందును బతిమాలించ నిది యేలయ్యా
అంది దవ్వుచుట్టరిక మదియే మేలును

చ. 1: పన్నినతెరమఱఁగు బహురూపములెల్లాను
కన్నదాఁకానే కాని కడఁ జవుకే
యెన్నిక నీనాపొందు లెడనివుండఁగఁగాని
మన్ననఁ గూడినమీఁద మరి ఇట్టెపో

చ. 2: వోడక ముచ్చటమాట లొకరొకరు గదిసి
ఆడినదాఁకానేకి అంతటఁ జౌక
యీడ నీనాయెడమాట లింతులాడఁగానేకాని
కూడిమాటాడితి నీకఁ గొస రింతేపో

చ. 3: గరిమ సమరతులు కడుఁజలములు మేను
మరిగినదాఁకాఁ గాని మరిచౌకే
సిరుల శ్రీవేంకటేశ చేరి నీకాఁగిట నేను
అరమరచితిఁ బను లన్నియు నింతేపో

రేకు: 1192-2 గౌళ సం: 21-482

పల్లవి: పెక్కు నిచ్చకల్యాణాలపెండ్లి కొడుకా
మిక్కిలి జాణఁడవయ్యా మేలయ్య నీకు

చ. 1: చెలులుపదారువేల సేసవెట్టినచేతుల
చెలఁగి నాకు మొక్కేవు చెల్లునా నీకు
కలఁగక గొల్లెతలకాలుదొక్కే పాదమున
అలరి నాకాలు దొక్కే వౌనయ్య నీవు

చ. 2: పురకాంతలఁగూడ బోడించినమాటల
ధర సరసమాడేవు తగునా నీవు
పరగఁ గొలనిలోని పచ్చితనపుచూపుల
వొరసి మమ్ముఁ జూచేవు వోయమ్మ నీవు

చ. 3: కడుబలిమి రుక్మిణిఁగాఁగిలించిన కాఁగిట
యెడయక కాఁగిలించే విదివో నన్ను
కడఁగి శ్రీవేంకటాద్రిఘనుఁడ నీకు నాకు
బడినే శోభనములు పైకొనెనయ్యా

రేకు: 1192-3 కేదారగౌళ సం: 21-483

పల్లవి: నీకే తెలుసును నెలఁతభావములు
యీకడఁ గలదియు నింతేమాట

చ. 1: చెలువుఁడ నీపేరు చెవిలో నుడిగిన
చెలియకుఁ జెక్కులు చెమరించె
పులకలు కుచములఁ బొదలెను కమ్మర
నిలువునివ్వెరగు నిండెను మతిని

చ. 2: కాంతకు నీరూపు కన్నులఁ జూపిన
వింతగునగవులు వెడలె నదె
చెంతల నుదుటునుఁ జెదరె నెరిఁగురులు
కంతునికళలును గరఁగెను తుదిని

చ. 3: తరుణిఁ గాఁగిటికి దగ్గరఁ బిలువఁగ
అరిది బాహులత లదె యదరె
యిరవుగ శ్రీవేంకటేశ యిద్దరికి
మరుతంత్రంబుల మర్మము లలరె

రేకు: 1192-4 కాంబోది సం: 21-484

పల్లవి: అల్లదివో చూడరమ్మ అతివభావము నేడు
వెల్లవిరిఁ బతివద్ద వింతలాయఁగదరె

చ. 1: తప్పక చూచి యింతి తలవంచి సిగ్గువడి
చిప్పిలఁ గడమచూపు చిత్తములోఁ జూచెనే
కొప్పు గదల నడచి కొంచి కడమనడపు
చెప్పక పయ్యద మాఁటుసేయుచు నడచెనే

చ. 2: సెలవిఁబారఁగ నవ్వి సిగ్గునఁ గడమనవ్వు
కులికి కులికి తనకుత్తికలో నవ్వెనే
నిలిచి కొంతమాఁటాడి నీఁటునఁ గడమమాఁట
సెలసిచేయి మరగుచేసుక మాటాడెనే

చ. 3: చేతికి నాకు చుట్టిచ్చి సిగ్గుతోడ సగమాకు
చేతనే చిదిమి తనవాతెరఁ గీలించినే
యీతల శ్రీవేంకటేశుఁ డింతిభావములు చూచి
కాతరానఁ గూడఁగాను గడుసై నిలిచెనే

రేకు: 1192-5 ముఖారి సం: 21-485

పల్లవి: ఇంతచాలదా నిన్ను యింక సొలయనేల
పంతముఁబలుకు నొక్క పాటేయఁగదరా

చ. 1: చొక్కి మనతనువులు సోఁకకుండినా నేమి
ఇక్కువ నీనాచూపు లిటు సోఁకెఁగా
మిక్కిలి నీటిలోని మీనములు కన్నులనె
తక్కక చూచితేనే తనివయ్యీఁగదరా

చ. 2: ఇమ్ముల నీనాపాన్పు లెడదవ్వయినా నేమి
చిమ్ము నీపై తలపోఁత చేరువలేకా
పమ్మినకూర్మములు పాసి యెచ్చొటనున్నా
తమ్ముఁదామె తలఁచితే తనివయ్యీఁగదరా

చ. 3: శ్రీవేంకటేశ నీచిత్తము పరాకైనా
వోవరి నాకాఁగిటిలో నున్నాఁడవుగా
యీవలఁ బక్షులు భూమి నెందు మేసి వచ్చినాను
తావులఁ బొదిగితేనే తనివయ్యీఁగదరా

రేకు: 1192-6 సామంతం సం: 21-486

పల్లవి: కంటివో కానవో కాని ఘనమై నామోహ మిది
వెంటవెంట నీకు వేవేలై వున్నదిరా

చ. 1: నెమ్మది నాశిరసే నీతొడపై నుండెఁగాని
కమ్మర నాచిత్తము నీకాఁగిటిపై నుండెరా
దొమ్మి నాకొనగోరు నీతొడమీంద నుండెఁగాని
పమ్మి నాయాస నీమోవి పంటిపై నున్నదిరా

చ. 2: పాయక నాచన్నులు నీపాదముపై నుండెఁగాని
మోయుచు నాచూపు నీమొగముపై నుండెరా
చేయార నాచేఁతలు నీసిగ్గులపై నుండెఁగాని
మాయపుదిట్లు నీమానముపై నుండెరా

చ. 3: పొంది నాతములను నీపుక్కిటిలో నుండెఁగాని
చందపునాకుటమి నీసమరతి నుండెరా
వొందిలి శ్రీవేంకటేశ వురాన నే నుందుఁగాని
అందపునావయసు నియాతుమ నున్నదిరా

రేకు: 1193-1 ముఖారి సం: 21-487
పల్లవి: ఏమంటి వేమంటి వెఱగ నేను వో-
కామిని నీకిప్పుడైనఁ గానవచ్చెఁగా
చ. 1: వేలఁ దలుపుమీఁటినవిటుఁ డెవ్వఁడే వో
తాలిమి నేనే మాధవుఁడను
వాలినమాధవుఁడవంటె వసంతుఁడవా కాదే
గాలింపుచక్రము చేతఁగలవాఁడ నేనే
చ. 2: ధరఁ జక్రివైతేఁ గుమ్మరవాఁడవా కాదే
సిరుల భూమి ధరించినవాఁడనే
శిరసున భూమిమోఁచే శేషుఁడవా కాదే
అరయ నిన్నియునేలేహరినే నేను
చ. 3: వంతులకు హరివైతే వానరమవా నీ-
మంతనపు లక్ష్మీరమణుఁడ నేను
యింతయేల శ్రీవేంకటేశుఁడ ననఁగరాదా తొల్లి
అంతేపో నామారు నీవంటివిగదే

రేకు: 1193-2 రీతిగౌళ సం: 21-488

పల్లవి: ఔనయ్య నీకింతా నలవాటే పో
నానాఁటఁ దెలిసేవు నన్ను నీవే చెలియా

చ. 1: యేమయ్య యిందాఁకా నెటువోతివే నే-
నామనిమెకాల వేఁటలాడఁబోతినే
బూమి సర్వసముఁడ వీబుద్ది దగునా అందు-
కేమే రావణాదిదుష్టు లిందరి నేఁ జంపనా

చ. 2: ఐతే నీమేనివాస నది యేడదె
ఆతలఁ బుప్పొడి నామై నంటుకొనెనే
యీతల నీమేనిజీర లేల వచ్చెను
వోతరుణి పూఁదీగె లొరసెనే నన్ను

చ. 3: కాని మెయి చెమరించఁ గారణమేల నేఁ-
డీనెపము వేసఁగి యెండదాఁకెనే
మోనపుశ్రీవేంకటేశ మోవిగంటేలా నేఁ
బూని శంఖమూ దఁగానే పొరయెత్తైనే

రేకు: 1193-3 రామక్రియ సం: 21-489

పల్లవి: అదియేల నీవుచెప్పినట్టు చేసేనే
కదిసితి మిఁకనేల కంటి మన్నిపనులు

చ. 1: బాససేయుమంటే నేఁ బాముఁ బట్టేనే అవులే
భాసురపునీపరపు పామేకాదా
మోసదీర జలధి ఇమ్ములఁ జొచ్చేనే నీవు
వాసికి జలధిఁబండేవాఁడవే కాదా

చ. 2: చింతదీర ననలంబు చేతఁబట్టేనే తొల్లి
బంతి నగ్నిమింగినట్టిబాలుఁడవేకా
దొంతరకొండలతో నేఁ దులఁదూఁగేనే నీ-
కింతేల గోవర్ధనగిరెత్తవా తొల్లి

చ. 3: యెంచనేల మీఁదిమాట లేమనేవే అయితే
పంచ నొక్క యక్షరమె పంతమీవయ్యా
పెంచనేల నీకు నాకు భేదమటవే యిఁకఁ
గొంచక శ్రీవేంకటేశ కూడితి యిందులకు

రేకు: 1193-4 దేసాళం సం: 21-490

పల్లవి: ఓపననఁగా నేపో వొళ్లు వేసీని
తీపుల జంకించి నాపైఁ దేనెచల్లీని

చ. 1: మాటలాడెఁబో తాను మరి నే నూఁకొంటినా
కూటమి నిందులకే తాఁ గొంగువట్టీని
నీటున సన్నసేసెఁబో నిక్కి నేఁ జూచితినా
తాటల నిందులకే తాఁ దగులనాడీని

చ. 2: సరుసఁ దా నవ్వెఁబో నే జాణతనాలాడితినా
అరుదై యిందులకే నన్నంటవచ్చీని
అరసి తా మొక్కెఁబో నే నామొక్కు గైకొంటినా
సిరుల నందులకే తా సేసవెట్టీని

చ. 3: చేయివట్టి తీసెఁబో నే సిగ్గువడి రాకుంటినా
బాయట నందులకే తాఁ బచ్చి సేసీని
వోయమ్మ శ్రీవేంకటేశుఁ డోఁగునూఁతులాడ నన్ను
చాయలకే కూడెఁబో వేసాలు సేసీని

రేకు: 1193-5 లలిత సం: 21-491

పల్లవి: ఇంతకతొల్లేమియు నే నెఱఁగఁబో
మంతనానఁ దనకే నే మరులైతిఁబో

చ. 1: చెక్కులెల్లాఁ జమరించెఁ జింతలెల్లాఁ జిగిరించె
చొక్కుల నిట్టే తాఁ జూడఁగానేపో
ముక్కున నూరుపు దొట్టె మోమెల్లా వాడువుట్టె
మక్కువ నాతోఁ దా మాటలాడఁగాఁబో

చ. 2: అంగమెల్లాఁ బులకించె నాయమెల్లా గిలిగించె
అంగడిఁ బయ్యదకొంగు అంటఁగానేపో
ముంగురులెల్లాఁ జెదరె మోవియంతయు నదరె
సంగతి సెలవినవ్వు చల్లఁగా నేపో

చ. 3: కన్నులఁ గెంపులుమీరె కాఁగిటఁ బంతము చేరె
కన్నెనైననన్నుఁ దాఁ గలయఁగాఁబో
చన్నులు పై పై నిక్కె జవ్వనము రతికెక్కె
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిటు గూడఁగాఁబో

రేకు: 1193-6 రామక్రియ సం: 21-492

పల్లవి: పట్టితే నాతోపని పదియుఁబది ఇట్టె
నెట్టుకొని నిలువుము నీవే నేను

చ. 1: వొరసి తప్పకచూచే వోతఁడా
తిరిగి యిట్టె తల దియ్యకుమీ
గిరిపితేఁ బోదింక కెరలీ పంతాలు
సరస నీనవ్వులెల్లా చక్కఁజేసే నిఁకను

చ. 2: అడుగు దియ్యకుమీ నీవంతేసి నీవు
గొడవల కియ్యకొంటేఁ గొంకేనా
అడవే మేడెము మాయంకెకు నీ-
వెడనీలికాసెకు వెఱతు నేను

చ. 3: మాటలపచారమేల మగవారికి
గాఁటపునీరాతిగుండె కంటి నేను
నేఁటనే శ్రీవేంకటేశ నిన్ను నన్ను వొకటిగా
తూఁటవిలుతుఁడు వచ్చి దొమ్మి సేసెఁగా

రేకు: 1194-1 ముఖారి సం: 21-493

పల్లవి: నీవు నన్ను దగ్గరుటే నేరమాయఁగా
కావిరి నీసుద్దులెల్ల కతలాయఁగా

చ. 1: తొలఁగి కడలు నీవు తొక్కివచ్చినట్టివేళ
సెలవి నానవ్వు నీకుఁ జేఁదాయఁగా
పలుచేఁతలను నీమై వచ్చియైనయీవేళ
కలికినాకనుచూపే కారమాయఁగా

చ. 2: యెంచఁగ వేరొకతెతో నేకతమైవున్నవేళ
వంచిననామొక్కు నీకు వాఁడాయఁగా
నించి రాత్రిజాగరాలు నీవు నిద్రించేవేళ
పొంచిననామట నీకు పులుసాయఁగా

చ. 3: కందువకాఁగిటఁ గూడి కరఁగివుండేవేళ
సందడి నాకొనగోరే చవులాయఁగా
ఇందునందు శ్రీవేంకటేశ నన్నుఁ గూడఁగాను
చందపువపులలెల్లా సతమాయఁగా

రేకు: 1194-2 ఆహిరి సం: 21-494

పల్లవి: ఇంకా నీమనసెట్టో యెఱఁగఁజుమ్మీ
కొంకితి నింతే నేఁ గొసరఁజుమ్మీ

చ. 1: చుక్కలు గాయఁగా నేఁజూడఁ దలెత్తితి నింతె
ఇక్కడ నేముండుతా నే నెఱఁగఁజుమ్మీ
చిక్కువడ్డముత్యములు చేతులఁ బట్టితి నింతే
అక్కర నివేఁటివని యడుగఁజుమ్మీ

చ. 2: తుమ్మిదలు బెదరఁగాఁ దోడ నే నవ్వితి నింతే
తమ్మిమోవి నిన్ను నేమీఁ దడవఁజుమ్మీ
వుమ్మ గాలివిసరఁగా నొంటి నేఁ బండితి నింతే
అమ్మరో నీతో నే నలుగఁజుమ్మీ

చ. 3: చీకాకురేకులు చూచి చే గోరగీరితి నింతే
చేకొని నీమేను పచ్చిసేయఁజుమ్మీ
యీకడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
పైకొని చొక్కితి నింతు పదరఁజుమ్మీ

రేకు: 1194-3 గుండక్రియ సం: 21-495

పల్లవి: కేరడమాడఁగలనా కేశవరాయా
చూరగొని మర్మములు సోఁకింతుఁగాక

చ. 1: పంతమాడితే నీతోఁ బతి యాడఁగలనా
కాంతలతోఁ జెప్పి నవ్వఁగలగాక
దొంతి సాకిరివెట్టేవు తొలమనఁగలఁగాక
కొంత మోముమూసుక సిగ్గున నుందుఁగాక

చ. 2: వట్టియెమ్మె మెరసితే వద్దన నేఁ గలనా
చుట్టపుమొకమోటానఁ జూతుఁగాక
వెట్టినీచేఁతలకు వేఁగై మాడఁగలనా
కిట్టి మరునికి నొప్పగించఁగలఁగాక

చ. 3: కాఁగిలించితే నిన్నుఁ గాదనఁగఁగలనా
లోఁగి యందులకే చొక్కి లోనౌదుఁగాక
నాఁగులెల్లఁ దీర మాఁచనవోలిచెన్నుఁడవై
మూఁగితి శ్రీవేంకటేశ మోవి యిచ్చేఁగాక

రేకు: 1194-4 లలిత సం: 21-496

పల్లవి: ఇది మేలు నీలాబ మిందరిలోన
అదనెరిఁగి బేహారాలాడనేర్తువే

చ. 1: కన్నులఁ గెంపులుదేరెఁ గాఁకల ముత్యాలు రాలె
పున్నతి మరునిపెద్దవోడ దిగెను
మున్ను మోవిఁ బగడాల మునిఁగేవు నిలాల
కన్నెరో నీవేడనైనా గని గంటివో

చ. 2: చెక్కులఁ గస్తూరి నిండెఁ జెమటఁ గుంకుమ గూడె
మొక్కలాన నీకుచాలు మూల గలదో
చిక్కనిమేన జాజులు సెలవిఁ గప్రము చిందె
పక్కన నిదేమి నీకుఁ బంట పండెనో

చ. 3: కోరి మేనఁ బైఁ డి రాలీ కొనగోర వెండి రాలీ
నేరుపుల నీవు పెన్నిధి గంటివో
సారెకు శ్రీవేంకటేశ్వరుఁడును నీవు నిట్టె
చేరి మారుబేరాలాడి చెలఁగే రిదెట్టిదో

రేకు: 1194-5 శ్రీరాగం సం: 21-497

పల్లవి: మమ్ము మన్నించి విచ్చేయు మగువకడకె నీవు
కమ్మర నన్నంటకు నీకపటమే యెఱుఁగు

చ. 1: తిలకించి చూచె నినుఁ దేరకొన దేఁటికో
చెలికన్ను లెఱఁగు నీచిత్త మెఱుఁగు
పిలిచె నూరక నిన్ను బిగువున నేఁటికో
మలయుమో వెఱఁగు నీమర్మమే యెఱుఁగు

చ. 2: పక్కన నవ్వె నదె పడఁతి యదేఁటికో
చెక్కు సెలవు లెఱుఁగు సిగ్గు లెఱుఁగు
అక్కడఁ జేనన్న సేసె నతివ యదేఁటికొ
నిక్కుఁబాయ మెఱుఁగు నీనిండుమోహ మెఱుఁగు

చ. 3: పూవులచెండున వేసె పొలఁతి యదేఁటికో
తావులచే యెఱుఁగు నీతను వెఱుఁగు
యీవల శ్రీవేంకటేశ ఇద్దరిఁ గూడితి విట్టె
కావరపుగుణములు కంతుఁడే యెఱుఁగు

రేకు:	1194-6 వరాళి	సం:	21-498

పల్లవి:	చెల్లఁబో నన్ను నీవింత సేతురటవే
వెల్లవిరిగా నేమైనా వింటివటవే

చ. 1:	వెన్నెలలే మరిగేవు వెంటవెంటఁ దిరిగేవు
నన్ను నీవు మతి నంత నమ్మవటే
వెన్న నున్నఁగా నూరేవు వెక్కసమై దూరేవు
కన్నెరో నీవేమైనాఁ గంటివటవే

చ. 2:	కుంకుమలే కురిసేవు కొంగువట్టి జరసేవు
ఇంకా నాగుణము నీ వెఱఁగవటే
లంకెనుండి జునిఁగేవు లావులకే పెనఁగేవు
కంకిగా నెందుకైనా నేఁ గాదనేనటే

చ. 3:	పన్నీరే చిలికేవు పట్టి తేనె యలికేవు
అన్నువనాకాఁగి లింత యలపటవే
వున్నతి శ్రీవేంకటాద్రి నుండి వచ్చి నంబటూరి-
చెన్నుఁడనై కూడితిని చేకొంటివటే

రేకు: 1195-1 భైరవి సం: 21-499

పల్లవి: అప్పు డెట్టుండెనో చిత్త మయ్యో యెఱఁగనైతి
చెప్పుడుమాటలకే నేఁ జేరనైతిఁగా

చ. 1: కొసరికొసరి నీపై కోపమున నుంటిఁగాని
అసమిచ్చి నీతో మాటలాడనైతిఁగా
పసలేని సిగ్గుతోడిపంతాననే వుంటిఁగాని
ముసిముసినవ్వుమోవి మోపనైతిఁగా

చ. 2: విరహపుఁగాఁకల నావిసుపే చూపితిఁగాని
సరిఁ బిల్చితే నూఁకొనఁజాలనైతిఁగా
వరుసవంతులకై నే వాదులాడితిఁగాని
మురిపేన మొక్కితే నే మొక్కనైతిఁగా

చ. 3: వేగమే నీవు గూడితే వెస భ్రమసితిఁగాని
చేగలనీమేను పచ్చిసేయనైతిఁగా
భోగపుశ్రీవేంకటేశ పొట్లదొరితిలోన-
నీగతిఁ జెన్నుఁడవైతే నెనసితిఁగా

రేకు: 1195-2 పాడి సం: 21-500

పల్లవి: ఎక్కడి కెక్కడి సుద్దు లేమనేవురా
వొక్కమారే యింతసేయ నొద్దు వొద్దురా

చ. 1: మాటలనే కరఁగితి మన్ననకే పెరిగితి
యీటునఁ గోపించనేర నేమిసేతురా
నీటున నివ్వెరగైతి నెయ్యానకే పొరుగైతి
నేఁటికి నన్నొరసేవు యేడకేడరా

చ. 2: చింతలనే జానిఁగితి సిగ్గులనే మునిఁగితి
ఇంతలోనే పిలిచేవు యేమందురా
పంతానకే పాలైతిఁ బాయానకే లోనైతి
యెంతకెంత సారె నిన్ను నెచ్చరింతురా

చ. 3: కాఁకలనే తనిసితి కాఁగిట నే నెనసితి
వాకున నన్నుఁ బొగడవలెనటరా
పైకొని శ్రీవేంకటేశ పలురతులుఁ జొక్కితి
యేకచిత్తమాయఁ బను లియ్యకొంటిరా

రేకు: 1195-3 ఆహిరి సం: 21-501

పల్లవి: నెలఁత మోహించినదే నేరమటయ్యా
పలువిన్నపాల కిఁకఁ బనిలేదయ్యా

చ. 1: చెక్కునఁ జేర్చినచేత సేమంతిరేకులు రాలె
చొక్కపు నీసతి దెస చూడవయ్యా
నిక్కి చూడ నంతలోనే నిలువునఁ గొప్పు వీడె
వెక్కసపుఁజలమేల విచ్చేయవయ్యా

చ. 2: ముంచినవూర్పులవెంట ముత్యపుఁగన్నీను జారె-
నించుకంత తెమలపు యిదేమయ్యా
చంచలపునడపుల సందడించెఁ జెమటలు
అంచెల నీమనసు కాయటవయ్యా

చ. 3: పెట్టినపయ్యదలోన బేఁటుగందములు రాలె
చిట్టకాల కింతి నింతసేసితివయ్యా
యిట్టె శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
అట్టె మేను పచ్చి సేతురటవయ్యా

రేకు: 1195-4 సామంతం సం: 21-502

పల్లవి: అయినట్టయ్యీఁగాక అతనునిమాయ లివి
దయయు దాక్షిణ్య మెంచీఁ దనకేఁటికే

చ. 1: రచ్చకెక్కె వలపులు రాఁపులకెక్కెఁ జన్నులు
ఇచ్చకాలు మాపుదాకాఁ నిఁకనేఁటికే
వెచ్చనాయ నిట్టూర్పు వెరఁగు పైతరవాయ
తచ్చనజగడములు తనకేలే పతికి

చ. 2: కొప్పు గడువెడజారెఁ గోపము కన్నుల మీరె
ఇప్పుడు మూసిదాఁపురా లిఁకనేఁటికే
చప్పనాయ సాదింపులు చౌకాయఁ గుంటెనలు
దప్పిదేరేవినయాలు తనకేఁటికే

చ. 3: రంగుమీరెఁ బులకలు రతులు కాఁగిటఁ జేరె
ఇంగితాకారాలు చూడ నిఁకనేఁటికే
అంగవించి శ్రీవేంకటాధిపుఁడు ననుఁ గూడె
దంగుడు బంతములాడఁ దనకేఁటికే

రేకు: 1195-5 బౌళి సం: 21-503

పల్లవి: వేగిర మిప్పుడేయేల వింతవారమా
సోగల నివెల్ల నేఁడే సోద్యమా

చ. 1: యీతల మెచ్చకయున్న నెదలో మెచ్చేవుగాక
ఆతల నిప్పుడే యేమి అవసరమా
ఘాత మోవి నవ్వకుంటు కన్నుల నవ్వేవుగాక
తోతో ఇంతన యేమి దోసమా

చ. 2: యెదుట మాటాడకున్న నింటిలో నాడేవు గాక
పదరి నీమీఁద నేను పై తరవా
మదిరేపట రాకుంటే మాపట వచ్చేవుగాక
కదిసి ఇప్పుడు యేమి కక్కూరితా

చ. 3: రచ్చల వీఁగకయున్న రతుల వీఁగేవుగాక
వచ్చివచ్చి నీతోడ వావాదమా
పచ్చిగా శ్రీవేంకటేశ పైకొనికూడితి నిట్టె
గచ్చుల నీగుణ మిది కానమా

రేకు: 1195-6 భూపాళం సం: 21-504

పల్లవి: మూలనున్న వారి నీవు ముంగిట వేసేవుగాక
గోలవై యూరకుండితే కొంగువట్టేనా

చ. 1: పిలువఁగాబో నీతోఁ బ్రేమమున నూఁకొంటి
అలిగినట్టే వుంటే నదేమనేనా
నిలిచి చూడఁగఁబో నే నిన్నుఁ జూచితిని
తలవంచుకొని యుంటేఁ దడవఁబోయేనా

చ. 2: చెనకఁగాఁబో నేఁ జేబలిమి చూపితిని
కొనగొనలనే వుంటే గోరఁ దీసేనా
మనసిచ్చి నవ్వఁగాఁబో మారుకొని నవ్వితిని
వెనకటివలె నుంటే వేగిరించేనా

చ. 3: పైనొరఁగఁగానే పో పంతానకే కూడితిని
మాని నీ వూరకుండితే మాయసేసేనా
యీనెపాన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నేనే నీవైనమీఁద నేరమెంచేనా

రేకు: 1196-1 ఆహిరి సం: 21-505

పల్లవి: ఎండగాదు నీడగాదు యెక్కువనీ పొందులు
బండుబండులైతి నింకఁ బడలేనురా

చ. 1: పచ్చిగారు వెచ్చిగాదు పాయపునీసేఁతలు
ఇచ్చట నే మొకమోట నేమందురా
వెచ్చనాయ పచ్చనాయ వెడ నీమేను నీమోవి
రచ్చలకెక్కె వలపు రాకు రాకురా

చ. 2: వేండ్లాయ వాండ్లాయ వెడద నీచూపులు
యేండ్లాయ నిమిషము లేమిసేతురా
ఆండ్లెరి గోపసతులంటావే బిగిసేవు
వీండ్లవాండ్లమాటలు వినలేనురా

చ. 3: అంకెలాయ లంకెలాయ అందపు నీకాగిఁలి
యింక నిన్ను వీడనాడ యేడకేడరా
తెంకినే శ్రీవేంకటేశ తేజముతోఁ గూడితవి
మంకులనీగుణ మింక మానుమానురా

రేకు: 1196-2 ముఖారి సం: 21-506

పల్లవి: చాలునిది పదివేలు సరివచ్చెఁగా
తాలిమిఁ జెలులమాఁటే తప్పదాయఁగా

చ. 1: అదె నామతి పలచనైనా నాయఁగాని
కదిసితే నీనవ్వు గట్టియాయఁగా
అదన నాచూపు తెల్లనైనా నాయఁగాని
యెదుట నీమోవి యిదె యెఱ్ఱనాయఁగా

చ. 2: కడగిననామేను కాఁకైనా నాయఁగాని
చిడుముడి నీచెక్కు చెమరించెఁగా
నడుమనే వేగించినా వేగించితిగాక
తొడరి నీకైతే నిద్ర తొట్టుకొనెఁగా

చ. 3: రేఁగుచు నాగోరఁ జిన్న రేకయినా నాయఁగాని
కాఁగిటినీయాసలైతేఁ గనమాయఁగా
చేగఁదేరెను రతుల శ్రీవేంకటేశ నేఁడు
తోఁగినమనరతులు తులఁదూఁగెఁగా

రేకు: 1196-3 సామంతం సం: 21-507

పల్లవి: తాను సేసినట్టి చేఁత తనకుఁ జెల్లెననరే
ఆవినతనకిది సందాయననరే

చ. 1: చిత్తజుఁ డమ్ముల నేసె సిగ్గులు నానోరు మూసె
వొత్తి తన్ను దూరనేరకున్న దాననే
జొత్తుఁగూడెఁ బులకలు సొంపువీడె నలకలు
యెత్తినతనతోఁ బెనఁగ నెఱఁగనైతినే

చ. 2: చిన్నిగాలి సందు దూరె చెమట నామేనఁ గారె
పన్ని తనకొంగు బిగ్గెఁబట్టనై తినే
కన్నులఁ గెంపుల మూఁగె కమ్మర నామోవి మాఁగె
మున్నిటిచేఁత మరచి మొకమోడితినే

చ. 3: చందురుఁడు సుంకుమోపె జవ్వనము చిమ్మిరేపె
మందలించి నామేను మరచితినే
యిందులో శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
అందెను మన్ననరతి కందునే చొక్కితినే

రేకు: 1196-4 సాళంగం సం: 21-508

పల్లవి: వలపు చల్లుదుఁగాని వాడిక నే నొల్లనయ్యా
తొలతొల యింతేసిలోఁతుకు నే వెరతురా

చ. 1: మునుప నీచూపులకు మొక్కేఁగాని నే
వెనక నీసన్నలకు వెఱతుమయ్యా
యెనలేనినవ్వులకు నెఁ తైనాఁ బొగడేఁగాని
వొనరేనీసరసము లుత్తరమీనోపరా

చ. 2: ఇప్పటినీకానికలు యియ్యకొనేఁగాని నే
వొప్పుల నీవిడె మందనోపమయ్యా
తప్పనినీనిజమరితనము మెచ్చేఁగాని
చెప్పేనీయేకతములు చెవియొగ్గనోపరా

చ. 3: సంగడి జాణతనాలు సమ్మతించేఁగాని నే
అంగపుఁజెనకులు పయ్యాడలేనయ్యా
యెంగిలిగా శ్రీవేంకటేశుఁడ కూడితి నిట్టె
ముంగిట నిన్నిఁకఁ బాసి మోసపోనోపరా

రేకు: 1196-5 ముఖారి సం: 21-509

పల్లవి: అలుగఁజూచేవు నీవు అంతేసికిఁ బొద్దేది
తలపోఁత యిప్పుడింతే దాచఁగఁ బొద్దేది

చ. 1: నీరాక వింటే నింతే నివ్వెరగైతి నిట్టె
ఆరసి నీతో మాటలాడఁ బొద్దేది
చేరితి నిప్పుడే యింతే సిగ్గున మునిగితిని
మోరతోపు మాని నీకు మొక్కఁగాఁ బొద్దేది

చ. 2: నీదెస చూచితి నింతే నిలువెల్లఁ బులకించె
నాదించి నీతో నవ్వఁబొద్దేది
పాదము లొత్తితి నింతే భావమెల్లఁ గరఁగితి
సేదదేర వినయముసేయఁ బొద్దేది

చ. 3: కూడితి నిట్టె ఇంతె గొబ్బున మేను చొక్కితి
మేడెపునీరతులక మెచ్చఁబొద్దేది
వాడికశ్రీవేంకటేశ వరస నాకిపుడింతే
తోడనే నేసవెట్టితి తొలఁగఁ బొద్దేది

రేకు: 1196-6 సామంతం సం: 21-510

పల్లవి: నీకు నీకే తెలుసును నీచేఁతలు
జోకలాయ నీసుద్దులు సొంపులెల్లా వింటిరా

చ. 1: పంతము చూడవలసి పక్కన నవ్వితిఁగాక
కాంతుడ వొచ్చేము నీమైఁ గంటినా యేమి
అంతలోనె సిగ్గువడే వందరిలో నీకునీకే
యెంతని నీగుణమున కిఁక నేమిసేతురా

చ. 2: నిజముఁ గనవలసి నీమోము చూచితిఁగాని
భజన నిన్ను నమ్మనిభావమా యేమి
గుజగుజఁబొయ్యేవు కొంకికొంకి నీకునీకే
గజరునీచేఁతలకు కమ్మదా నేమందురా

చ. 3: మోహము గానవలసి ముందరమొక్కితిఁగాక
సాహసించి వుప్పటపుసాదనా యేమి
యీహల శ్రీవేంకటేశ ఇంతలోనె కూడితివి
ఆహా నీరతు లెన్నియని పొగడుదురా

రేకు: 1197-1 లలిత సం: 21-511

పల్లవి: మైల వాసి మణుఁగాయ మాటలేలరా
చాలుఁజాలు బనులెల్లఁ జక్కనాయరా

చ. 1: తొడిఁబడ నవ్వితిని తోడుతనే మొక్కితిని
చిడుముడి నిఁక నేమి చేసేవురా
అడరి నేఁ దిట్టితిని అంతలోఁ బంతమిచ్చితి
వడిగాఁ బైపై నాతో వాదులేలరా

చ. 2: కోపగించి చూచితిని గొబ్బననే మెచ్చితిని
మాపుదాక నింత జోలిమాటలేలరా
రేఁపకాడ నెడసితి మాపటంతఁ గూడితివి
యీపాటి వాసికిని యెగ్గులేలరా

చ. 3: మోవి గంటిసేసితి నామోమితేనె లిచ్చితిని
దేవుఁడ శ్రీవేంకటేశ తెగువేలరా
భావమెల్లఁ గరఁగితి పక్కన మెప్పించితిని
చేవదేరెఁ బనులెల్లఁ జింతలేలరా

రేకు: 1197-2 ఆహిరి సం: 21-512

పల్లవి: దగ్గరగరాదు మరి దగ్గరకుండఁగరాదు
యెగ్గులాయ జవ్వనము యిఁకనేఁటికే

చ. 1: చేరి వానిరూపు చూచి జిగి సంతోసించేనంటే
సారె నాకన్నులనీరు సంగరమాయ
ఆరయ వానితో మాటలాడి చొక్కేనంటేను
దూరేనానవ్వులే నాకుఁ దొడసాయెనే

చ. 2: మునప వానింటికేఁగి ముచ్చటఁ బాసేనంటే-
నన్నువైనమరపులే అడ్డమాయెనే
తనివోక వానిరతి తలపోసివుండేనంటే
కొనసాగి కోరిక పైకొసరాయెనే

చ. 3: గక్కన వానిమేను కాఁగిలించి పట్టేనంటే
పక్కన నాసిగ్గులు దెప్పరమాయెనే
ఇక్కువ శ్రీవేంకటేశు నిట్టె నేఁ గూడితిని
దక్కిన వాని మన్నన తలకూడెనే

రేకు: 1197-3 సామంతం సం: 21-513

పల్లవి: అంతటిపై నీవుచెప్పినట్టే సేసేఁగాని
పంతమాడ కందాఁకా పండరంగి విట్ఠలా

చ. 1: చెదిరినకురు లివి చెరిగినందాఁకను
పదరకు మంత నీవు పండరంగివిట్ఠలా
వదలుఁబయ్యదకొంగు వైపుగాఁ బెట్టినదాఁకా
పదిమారులు నవ్వకు పండరంగివిట్ఠలా

చ. 2: చిక్కువడ్డహారములు చేతదిద్దునందాఁకా
పక్కనఁ జెనకకుమీ పండరంగివిట్ఠలా
చెక్కులనూనినయట్టిచెమట లారినదాఁకా
పక్కన వోరుచు పండరంగివిట్ఠలా

చ. 3: చలువనీమోవితేనె చవిగొన్న యందాఁకా
పలుకులు చాలించు పండరంగివిట్ఠలా
చెలఁగి కూడితి విట్టె శ్రీవేంకటాద్రిమీఁద
బలిమి నీకె చెల్లెఁ బండరంగివిట్ఠలా

రేకు: 1197-4 భైరవి సం: 21-514

పల్లవి: చెప్పితి నిప్పుడే నే నాచి త్తములోఁ గలమాట
యెప్పు డేడ మాటలాడే దిది మేలుసుమ్మీ

చ. 1: మనసులో కోపమెల్లా మఱచేనంటే నాకుఁ
దనమేవిగుఱుతులు తలఁపించీనే
తనుఁదానే విచ్చేసినాఁ దలవంచుకొందుఁ జేతు
యెనలేక ఇందుకు సిగ్గువట్టీఁ జుమ్మీ

చ. 2: మొదలితనవోజలు మూసిదాఁచేనంటేను
యెదిరి తనమైకాఁక లెత్తి పెట్టీనే
కదిసి తాఁ గూచుండినాఁ గడ వేరేమంచముపై
నిదిరింతుఁ జేతు నది నేరమెంచీఁ జుమ్మీ

చ. 3: గోలనై తనతిట్లు గుట్టుసేసుకొనేనంటే
నాలితనమొక్కు చూచి నవ్వువచ్చీనే
యీలీల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసికూడె
పాలుపడి మెత్తుఁ జేతు పంతమాడీఁ జుమ్మీ

రేకు: 1197-5 ముఖారి సం: 21-515

పల్లవి: ఇప్పటినీచేఁతే వొకటినుమడై పొడచూపీ
దప్పితో సిగ్గువడకు తారుకాణయ్యీని

చ. 1: సారెసారె నవ్వకువే సరి నవె వెన్నెలలై
ఆరయ విరహవేళల నలయించీని
మేరమీరి వల్కకువే మించి యివె తేనెలై
తేరుకొని నిన్నుఁ దరితీపులఁబెట్టీని

చ. 2: తప్పకచూడకువే తగుచూపులే యమ్ములై
యప్పటి నలిగితే నాయము గాఁడీని
వుప్పటించి జంకించకు వూర కవి పొగలై
ముప్పిరిఁ దాపాగ్ని రాఁజమొదలుసేసీని

చ. 3: సరసములాడకువే సారే బాహులతలై
సొరిదిఁ గాఁగిట నవె చుట్టుకొనీని
యిరవై శ్రీవేంకటాద్రి నిద్దరముఁ గూడితిమి
విరుల వేయకువే వేడుకరేఁచీని

రేకు: 1197-6 ఆహిరి సం: 21-516

పల్లవి: ఏమని వుత్తరమిచ్చీ నీఁకఁ దా నాకు
వేమారు సారె సారె వెడమాట లేఁటికే

చ. 1: అద్దరిపాటు రమణుఁడాకెయింటఁ బానుపుపై
నిద్దరించంగా జూచి నే నాఁపలేక
వొద్దఁబండి కుచముల నొత్తితి నాతనివీఁపు
అద్దివో న న్నా కెనంటాఁ నాపేపేరఁ బిలిచె

చ. 2: తక్కక ఆకెమేడలో దాఁగిలిముచ్చులాడఁగా
గక్కన మోవి యాని గంటిసేయఁగా
పెక్కుమారు లానెలఁతపేరఁ దిట్టె నన్ను నేఁడు
తక్కులేమీ నెఱఁగఁడు తన్ను నేమనెందునే

చ. 3: దొంతులై ఆకెయుఁ దాను దొమ్మిరతి సలుపఁగా
కాంతఁగన కాఁగిలించి కళలంటఁగా
అంతలో శ్రీవేంకటేశుఁ డాకెనంటా నన్నుఁ గూడె
యెంతకెంత అవసర మిపుడు దాఁ గనెనే

రేకు: 1198-1 కాంబోది సం: 21-517

పల్లవి: చెల్లినంతయు నీవు సేతువుగాక
మొల్లంపునీచేఁత ముయికిముయిగాది

చ. 1: ప్రేమమున నంటఁగాఁ బెనఁగే వవుర నీ-
దీమసం బెట్టిదో తెలియఁగలదు
వేమారు నీకింత వేగితేఁ జాలుఁగా-
కేమాయ నుప్పాలి కినుమడేకాదా

చ. 2: పిలువనంపిన రాక బిగిసితి విందాఁక నీ-
అలరుఁదలంపెట్టిదో అడుగఁగలదు
నిలుకడై నీమనసు నిల్చితేఁ జాలుఁగాక
వలపు వేయింటిపై జవ్వాదికొమ్ముగాదా

చ. 3: కాఁగిలించిన నపుడె కరఁగేవు నీతొంటి-
నాఁగుఁజలములకు నిది నవ్వుగాదా
వీఁగ కిటు నన్ను శ్రీవేంకటేశ కూడితివి
రేఁగితివి గోర గీరిన నేరుగాదా

రేకు: 1198-2 ఆహిరి సం: 21-518
పల్లవి: మొక్కేరా నీకంటే ముందుముందే
కక్కూరి తింతయేల కాఁకఁలబెట్టకురా
చ. 1: నీటిలోని ముల్లువంటి నీగుణము దెలియ
యేఁటవెట్టి హెచ్చుకుందు లెంచనోప
యేఁటికి గొరసెరాయ డెందుఁ బొందనివేళ
ఆఁటదాన నింతే నన్నారడిసేయకురా
చ. 2: వేవేలుఁ జేసి నీకు వేఁడుకొనేదే గుణము
ఆవల నలిగితే మారలుగనోప
వావిదప్పు కంత నీవు వల్లెవేసే వెందునైనా
పూవువంటిదాన నింతే బూకలు సేయకురా
చ. 3: మానుమాను మిఁకనైనా మాతోడిచలములు
కేనముతో రాయి గిలిగించ నేనోప
యీనెపాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
ఆనిపట్టి నన్ను నింత అలయింపించకురా

రేకు: 1198-3 పాడి సం: 21-519

పల్లవి: ఇంతి నీపైఁ జేయు టిదిగదా వలపు నీ-
వంతటికి సమ్మతించు టదిగదా వలపు

చ. 1: పెదవిపైఁ దములంపుబేంట్లటురాలఁగా
యెదుట నేకతమాడు టిదిగదా వలపు
వదలుఁదురుమునశిరసు వడి నీదుతొడలపై-
నదన నిడుకొని నవ్వు టదిగదా వలపు

చ. 2: కనుఁగొనలమోద్పుతో కాఁకదేరఁగఁ జూచి
యెనలేక మైమరచు టిదిగదా వలపు
కొనచెమట జవ్వాదిఁ గూడి చెక్కుల జార
అనుగుఁజేయి పయివేయు టదిగదా వలపు

చ. 3: వొడలునొడలునుఁ బెనచి వొక్కటై చెమరించి
యెడపుఁబయ్యెద దడుపు టదిగదా వలపు
జడిసి శ్రీవేంకటేశ్వర నీవు నీచెలియ
అడియాలముగఁ గలము టదిగదా వలపు

రేకు: 1198-4 కేదారగౌళ సం: 21-520

పల్లవి: నీరాజసముతోడ నెమ్మది నుందువుగాక
కూరవండి కసవేరి గుణ మింకానేఁటికి

చ. 1: కోపగించఁజెల్లునా కొంగువట్టితివి నీవు
ఆపని; కేమైనాఁ జెలి యనుఁగాక
వోపననఁజెల్లునా వూఁకొంటివి పైఁడికత-
కీపాటివాఁడవు ముందేల నవ్వితివి

చ. 2: వేగిరించఁజెల్లునా వెలఁదిఁ బిల్చినవాఁడ-
వాగతి నాకెచిత్తమది నీభాగ్యము గాక
రాగిదేర్చ కంత నీవు రాలుదింటా మలిగండ్లా
వేగి లేరి వచ్చి నీవు వేసాలే సేసేవు

చ. 3: వంతమాడఁజెల్లునా పడఁతికాఁగిటఁ జిక్కి
చెంతల నాకె యేమైనాఁ జేసుఁగాక
వింతగా శ్రీవేంకటేశ వేసితే వేయిరూపులాయ.
మంతనపురతులు నీమగువకును నీకును

రేకు: 1198-5 సామంతం సం: 21-521

పల్లవి: చెట్టవట్టి తీసినదే సెలవుగాక
నెట్టన నాతనితోనే నిష్టూరమేఁటికే

చ. 1: చింతలెల్లాఁ దీరె నింకాఁ జెక్కుచే యేమిటికే
అంతటా విచారించేనంటే నూయి
కాంతుఁడు మతిలో మొక్కెఁ గన్నుల దీవించితివి
యెంతకెంతదొరతోడ నెచ్చుకుందులేటికే

చ. 2: తనువు చెమటఁ దోఁగె తాప మింకా నేఁటికే
కనుఁగొంటె నింతటాఁ జీకటే వెలుఁగు
మొనగోర గీరెఁ బతి మోహమున కేరువారె
వనిత బలువునితో వావాదమేఁటికే

చ. 3: సేస దలమీఁద మోఁచె సిగ్గులింకా నేఁటికే
పోసరించి వోరిచితేఁ బూవే పిందె
ఆసల శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్నుఁ గూడె
పాసికూడేపతితోడఁ బంతమాడనేఁటికే

రేకు: 1198-6 బౌళి సం: 21-522

పల్లవి: ముందుముందే నిక్కితే మూరెఁడు మాట
వొందితి నీసతినైతే వొడఁబాటు లేదా

చ. 1: కడదాఁక నీసుద్దులే కాంతలతోఁ జెప్పేవు
అడరి నామాటఁ గొంత ఆడనీరాదా
తొడిఁబడ నీవు గడుదొరవైతే రాజ్యమేలు
పడఁతులతోనే ఇంతబలువా నీకు

చ. 2: సందడించి యెందునైనా సాకిరులేల పెట్టేవు
విందుఁగా నాతగ వింత విననీరాదా
కందువలఁ జెల్లుఁబడి గలితే నీవే బదుకు
యిందువదనలతోడ నెగసక్కెమేఁటికి

చ. 3: పచరించి యాన నీవే పలుమారుఁ బెట్టుకొనే-
విచట నావొట్టుసత్యా లెక్కనీరాదా
రచన శ్రీవేంకటేశ రతుల నన్నుఁ గూడితివి
పచరించి నాతోనే పంతమా యిపుడు

రేకు: 1199-1 శ్రీరాగం సం: 21-523

పల్లవి: లోకు లేమందురోయని లోఁగేఁగాక
మేకొని నిన్నిట్టె కిందు మీఁదు సేయనా

చ. 1: మానవుగా అదేమోయి మాటిమాటికిఁ దిట్టేవు
కానీలే మగనాలింత కడునసుదా
పోనీపోనిమ్మనికాక పొరుగిరుగు మొరఁగి
తేనెవంటినీమదము దించ నిట్టె వోపనా

చ. 2: వుండవుగా చక్కజాడ నొకటొకటె చెనకే-
వండనే ఇల్లాండ్లింత ఆటపాటలా
కొండవంటిదొర వంటా గొంకితిఁగా కిట్లయితే
కండగర్వమెల్లాఁ దీర్చి కంకిసేయనోపనా

చ. 3: విడువవుగా చలము వెసఁ గాఁపురాలుసేసే-
పడఁతుల కూరనుండఁ బొసెనా యేమి
యెడపుశ్రీవేంకటేశ యింతలోఁ గూడితిఁగాక
విడువనిపంతమైతే వింత వింత సేయనా

రేకు: 1199-2 ముఖారి సం: 21-524

పల్లవి: ఏమని చెప్పుదునే యీతని జాణతనము
నాముదేర నూరకిట్టె నవ్వించీనే

చ. 1: సిగ్గువడి తనవద్ద శిరసు నే వంచుకొంటే
బగ్గన నామోము తప్పక చూచీనే
అగ్గలపు మోహముతో నరమరచి నేనుంటే
బుగ్గలాంటి నామేను పులకింపించీనే

చ. 2: కడుఁదమకములఁగాఁ కల నేనుండఁగ నాకు-
మడిచియిచ్చి మేను చమరింపించీనే
బడిఁ బాన్పుపై నలసి పవ్వళించి వుండఁగాను
నిడివి నాకళ్ల లంటి నిద్దిరింపించీనే

చ. 3: అంగవించి తనరతి కడ్డమాడకుండఁగాను
చెంగట నందంద మెచ్చి చెక్కునొక్కీనే
యింగితాన శ్రీవేంకటేశు డిట్టె నన్నుఁ గూడె
కొంగువట్టితీసి నన్నుఁ గొసరింపించీనే

రేకు: 1199-3 సామంతం సం: 21-525

పల్లవి: ఎవ్వరి దూరే మేమనఁగల మిఁక
జవ్వనపుమీకె చందములాయ

చ. 1: కలిమికి లేమికిఁ గాణాచి యదియె
అలివేణిచన్ను లసియాడునడుము
చెలువుఁడ నీలోచిత్తము కఠినము
పలచనికెమ్మోవి పతికిఁ బతియాయ

చ. 2: చీకటి వెలుఁగుకు సీమది యొకటే
నీకాంతతురుము నీచూపు
వాకున వినయము వళుకులు చెంతల
సాకిరిరమణుఁడ సరికి సరియాయ

చ. 3: చిగురుకుఁ జేవకు శేఖరమొకటే
మగువహస్తనఖమహిమ లవె
తెగి శ్రీవేంకటదేవ నీకొకటె
తగవులు నగవులు తగురతులాయ

రేకు: 1199-4 సౌరాష్ట్రం సం: 21-526

పల్లవి: చాలుఁజాలు దీమసము సతిమాట వినవయ్య
మేలుగలవాఁడవు గామిడిచేఁతలేలా

చ. 1: అవ్వలిమోమైనపరా కంత గలవాఁడవైతే
.జవ్వనిఁ గాంతలచే విచారించనేల
నవ్వకపిలిచినాను నాలిసేసేవాఁడవైతే
పువ్వులవలె నీమేను పులకించనేలా

చ. 2: యింటిలోననుండి బీరా లింత గలవాఁడవైతే
అంటి నాఁడు సరసములాడఁగనేల
వొంటి నే మాటాడినా వూఁకొననివాఁడవైతే
అంటుముట్టుచెమటల నలయఁగనేలా

చ. 3: కాలుదొక్కి యింతలోనే కళదాఁకే వాఁడవైతే
బాలకితో నలి గింత పాయఁగనేల
మేలిమి శ్రీవేంకటేశ మెచ్చితి నీగుణము
వేళతోఁగూడితి వింత వేగిరించనేల

రేకు: 1199-5 బౌళి సం: 21-527

పల్లవి: ఇంపుగాని సొంపుగాని యెఱిఁగించితి నిదివో
జంపులనీగుణములచంద మెట్టోకాని

చ. 1: పలుకఁగవచ్చుఁగాని పంతములియ్యఁగరాదు
చెలితోడ జగడించఁ జెల్లదుసుమ్మీ
పలుకఁగరాదుసుమ్మీ పక్కన జాణతనాన
తొలఁగి పిమ్మట నటు దూరవచ్చుఁగాని

చ. 2: కాఁకసేయవచ్చుఁగాని కలఁకదీర్చఁగరాదు
తేకువకు నెమ్మెకు తీదీపుసుమ్మీ
కాఁక సేయరాదుసుమ్మీ కమ్మర నేరుపుతోడ
వేఁకపునిష్టూర మందె వేయవచ్చుఁగాని

చ. 3: జంకించవచ్చుఁగాని సారెకుఁ బొంకఁగరాదు
వంకలనేమీ ననవద్దు సుమ్మీ
జంకించరాదుసుమ్మీ సతిమనసు దెలిసి
కొంకక శ్రీవేంకటేశ కూడవచ్చుఁగాని

రేకు: 1199-6 మధ్యమావతి సం: 21-528

పల్లవి: అందులకుఁ దగినట్టు అప్పుడే చూచుకొందును
ముందుముందే యింతసేసేమొరఁగులు గానవైతి

చ. 1: పిలువనంపెననేటి పెద్దరికమే చూచితి
తలఁపు వెరొకటౌట దలఁచనైతి
నిలిచి మాటాడెనని నెయ్యపుమేలే యెంచితి
వలపని జోలిమాటలవ గెఱఁగనైతి

చ. 2: యీరానచనవులెల్ల నిచ్చేదే చూచితిఁగాని
దారకాన మచ్చుచల్లి తగిలించే దెంచనైతి
చేరి ప్రియములు సారెఁ జెప్పేదే చూచితిఁగాని
కారించి నాకొడఁబాటుగానిపని చూడనైతి

చ. 3: కాఁగిలించి బుజ్జగించేఘనతే చూచితిఁగాని
ఆఁగి మేలుమరపించే ఆయము దెలియనైతి
రాఁగినశ్రీవేంకటేశురతులఁ గూడితిఁగాని
యేఁగించి పురమెక్కించే ఇక్కువ దెలియనైతి

రేకు: 1200-1 దేసాళం సం: 21-529

పల్లవి: ఇట్టివిందు గంటివా నీ వెక్కడనైనా
అట్టె ఆకెపొత్తున నీ వారగించవయ్యా

చ. 1: కలికికెమ్మోవితీపు కమ్మని తేనెలవిందు
చలువచూపులు నీకుఁ జక్కెరవిందు
సెలవిలేనవ్వులే చిలుపాలతోడివిందు
అలమేలుమంగ సేసీ నారగించవయ్యా

చ. 2: కాంతగోరిచెనకులు కారపుఁగూరలవిందు
పంతపుమాటలే ఆవపచ్చడివిందు
వింతబొమ్మజంకెనలే వేఁడిపడిదాలవిందు
అంతసేసీ నీదేవి యారగించవయ్యా

చ. 3: ఱట్టడి సమరతియాఱడి తరితీపువిందు
గట్టిసిగ్గు పెరుగుమీఁగడలవిందు
గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీవేంకటేశ
అట్టె నీతనివిదీర నారగించవయ్యా

రేకు: 1200-2 సామంతం సం: 21-530

పల్లవి: చిత్తమెట్టున్నదోకాని చెప్పవెరపయ్యీ నాకు
మొత్తాన నూరకేవుంటే మోసమౌఁబో యిపుడు

చ. 1: తొయ్యలిచెక్కునుఁ జేయీ దొంతరతామరలాయ
వొయ్యనె నీవిరహసూర్యోదయవేళ
నెయ్యపునీనవ్వుల వెన్నెలఁ గొంతచిలికితే
చయ్యన వానివాఁడి సమసుఁబో యిపుడే

చ. 2: అంగన మోనాన మోపు లమడమంకెనలాయ
భంగపుఁగోరికల ప్రభాతవేళ
అంగపునీమాటల పయ్యెద గొంతవిసరితే
వెంగలి వానిగుట్టు విరియుఁబో యిపుడె

చ. 3: కాంతమేను నీమేను కదంబపుఁబువ్వులాయ
ఇంతలో శ్రీవేంకటేశ యీకెఁ గూడఁగా
పొంతల మీరిద్దరును పొంది యెడయకుండితే
బంతినే వాసనలంకెపాటు లౌఁబో యిపుడె

రేకు: 1200-3 పాడి సం: 21-531

పల్లవి: చాలదా ఇంత సారెసారె వలెనా తాను
యేల చలమున నిఁక నేమి సేయుమనీని

చ. 1: మొక్కితిఁగదె తనకు మొన్ననే నేను
యెక్కడనుండిన మనసేకమని
దక్కితి నంటిఁగదె తనపాలికి
యిక్కడఁ జెలులమాటలెల్లాన నే వింటినే

చ. 2: ఇచ్చితిఁగదె పంత మింతకుముందె నాకు
హెచ్చి తా నాడినమాట లియ్యకోలని
మెచ్చితిఁ గదెతన్ను మీఁదమీఁదనె మరి
పచ్చియెమ్మెలు నావద్దఁ బచరించనేఁటికే

చ. 3: అంటితిఁగదె తనఆయము నేనే ఇది
దంటపాయ మిందరికిఁ దగునని
గుంటిపై శ్రీవేంకటేశుఁ గూడితిఁగదె ఇఁక
వెంటవెంటఁ దను నే విడువనని

రేకు: 1200-4 లలిత సం: 21-532

పల్లవి: చాలుఁజాలు ననరె సాదించ మమ్మింతయేల
యీలకూర కప్పు చాల దిందేమి గలదే

చ. 1: గొప్పలు మాకన్నులు కొంచము మానెమ్మొగము
తప్పులెన్నినాఁ గలవు తడవనేలే
చిప్పిలీ నాకిదె నవ్వు చిందీ నామోవిఁ దేనె
యెప్పుడు వచ్చినాఁ దన కిందేమి గలదే

చ. 2: పిడికెఁడు మానడుము పెచ్చువెరిగేచన్నులు
వెడ మామేనివొచ్చాలు వెదకనేలే
వుడికీ నామనసైతే వూరికె యదరీ మేను
యెడయక తాఁ బిలిచీ నిందేమి గలదే

చ 3: కంచువంటిది కుత్తిక కపురాలు పలుకులు
యెంచి మామాటలు సోదించఁగనేలే
అంచెల శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
యెంచియెంచి పొగడీని యిందేమి గలదె

రేకు: 1200-5 ముఖారి సం: 21-533

పల్లవి: తానే యెఱఁగఁడా తగినజాణఁ డతఁడు
మానిని నిను మన్నించె మన్ననలె చాలదా

చ. 1: మట్టులేని మాటలేల మందెమేల మింతయేల
గుట్టుతో నవ్వుటే మంచిగుణముగాదా
చిట్టంబుఁజెనకులేల సిగ్గువడి వుండనేల
వొట్టినమోహము తోడ నుస్సురంటెఁ జాలదా

చ. 2: కానికానివొట్లేల కాఁకలఁ బొరలనేల
మౌనముతో నుండుటే మంచిదిగాదా
పానుపుపై నిద్దురేలపైఁ గలవరింపేల
పూనిన జాగరముల పొద్దువోకే చాలదా

చ. 3: యిందాఁకా బింకమేల యిటు పంతమియ్యనేల
పొంది మేనుమరచుటే బుద్ధిగాదా
అందపు శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
గొందినే మేని చెమటే గురితిది చాలదా

రేకు: 1200-6 తోండి సం: 21-534

పల్లవి: ఇంకనేల మొరఁగు యిదివో నివ్వెరగు
వుంకువ నేనన్నమాట కుత్తరమీవేఁటికే

చ. 1: చిత్తమెల్లఁ జిగిరించె చెలి నీజవ్వనమున
అత్తినవ్వులు పువ్వు లవి యెన్నఁడే
కొత్తగాఁ గాఁకర గాచె గోరికొనతాఁకులెల్ల
యెత్తి చన్నులనిమ్మపండ్లెక్కడ దాఁచితివె

చ. 2: కురులచీఁకట్లవె కొంతగొంత సమకూడె
అరచందురులపొడ పది యేడదే
విరివై సిగ్గులఁ గడువెన్నెలలు గాసికాసి
తిరమై కెంపుఁగన్నుల తెల్లవారెఁగదవె

చ. 3: చెమట వాన గురిసి చిత్తడి యేరులువారె
తమకాన వెలిచేటితతి యెప్పుడె
తమి శ్రీవేంకటపతి తగ నిన్నేలుటఁ గంటి
గుమురుఁబులకలేల కొంగునఁ గప్పేవే

రేకు: 1201-1 సామంతం సం: 22-001

పల్లవి: విన్నవించవలెనా వీరూ వారు నిందులకు
పన్ని సమీకంకణాలే పదిలాలు గాక

చ. 1: వాసులెంచనేఁటికి వలసినచోటికి
యిసునఁగోపించినాను ఇంపులేకాక
వేసరఁగఁ బనిలేదు వేయైనా మీకె పొదు
సేసతోఁ బెండ్లాడినట్టిచెలియకుఁ బతికి

చ. 2: కోపగించనొద్దు నొద్దు కొనకెక్కె నదె పొద్దు
చేపట్టినప్పుడే మీకుఁ జెల్లెఁగాక
మోపులాయఁ బులకలు ముంచినసిగ్గులు వోయ
యేపున నేర్పరులు మీ కింతగద్దా చలము

చ. 3: కూడితిరి చాలను గుణములు మేలును
యీడుజోడు లెంచనేల ఇంతటిమీఁద
వేడుకలు తదకెక్కె వింతకళలెల్లా నిక్కె
యీడనే శ్రీవేంకటేశ ఇందిరకు నీకును

రేకు: 1201-2 పాడి సం: 22-002

పల్లవి: పట్టినదే తనకిది పంతముగాదా
నెట్టన నీరువట్టితే నేత నది దీరునా

చ. 1: తనకేలే నావిరితాపమునకు వగవ
ననుపున చిరునవ్వు నవ్వఁగాక
వినయములే చాలు వెనకకె అన్నిఁ జేసె
మును గోపగించి చెవులు మూసితే నమరునా

చ. 2: పదవే నే నుసురంటే భావము దయపుట్టీనా
ఇది ఇందరితోఁ జెప్పనెమ్మెతోఁగాక
కదియక ఆడనుండే కతలేల చెప్పిని
కెదటుచు నేటావలిగిగింత లంటునా

చ. 3: కాఁగిట నే నలమితే కాతరాలు మానీనా
చేఁగదేర మీకు నిన్నిఁ జెప్పితిఁగాక
ఆఁగి కూడె శ్రీవేంకటాధిపుఁ డింతలో నన్ను
పాఁగినరతి నంగడిఁ బచరింపచ్చునా

రేకు: 1201-3 వేళావళి సం: 22-003

పల్లవి: అందుకేమి దోసమా అతనితో నిట్లనరే
పొందైనాతోడ బొంకవద్దగాక

చ. 1: పిలచితే దోసమా ప్రియముతో నోరార
వలవంతఁ గేకరించవద్దుగాక
నిలిచితే దోసమా నివ్వెరగుతో నెదుట
నలువంకఁ జెలులతో నవ్వవద్దగాక

చ. 2: పూఁకొంటే దోసమా వొంటి సుద్దులు చెప్పఁగా
వాఁకపుగోళ్లు చిమ్మవద్దుగాక
వీఁకఁ బట్టితే దోసమా వేడుకఁ బొందైనవారు
సొఁకుచు కెఁగండ్లఁ బారఁజూడవద్దుగాక

చ. 3: కూడితేనే దోసమా గుట్టుతో దంపతులకు
వాడికసిగ్గులు వడవద్దుగాక
యీడనే శ్రీవేంకటేశుఁడింతలోనె నన్నుఁ గూడె
యేడనైన మోవిచూపేయెమ్మె వద్దుగాక

రేకు: 1201-4 దేసాళం సం: 22-004

పల్లవి: ఉరకుండవే అతనివొరపు లెంచఁగనొద్దు
మేరమీరేపని కాపె మెచ్చునేసీఁగాని

చ. 1: మనకేలే ఆమాట మతిలోనే మఱవవే
కనుఁగొన్నప్పుడే ఆకె కాదనీఁగాని
కొనకేల పారేవే గుట్టున నుంద మతని -
చనవుమిగుల నాకె చంకఁబెట్టీఁగాని

చ. 2: తగదేలే పగ చాట తక్కి యాతఁ డెవ్వతితో
నగితే ఆకె చూచి తెగడీఁ గాని
తగవు గాదననేలే దగ్గరివున్నది యాకె
వెగటేమిగలిగాని విడిపించీఁ గాని

చ. 3: జాతులేలే యాతనితో జాగునేసినందు కాప
అతనిఁ గాఁ గిటిలోనే అణచీఁ గాని
యేతుల శ్రీవేంకటేశుఁ డింతి నింతనేసి కూడె
బాఁతిపడి మేనెల్లాఁ బచ్చినేసీఁ గాని

రేకు: 1201-5 ముఖారి సం: 22-005

పల్లవి: మాకేల దాఁ చేవే మగువ నీమోహము
ఆకడ నీమాటలకు నే మడ్డమాడేమా

చ. 1: నిండినచెమటనీరు నీచెక్కుల నుండఁ గ
యెండనేలే నీమోవి యెదురెదుర
రెండురెంటా వేయనేలే రీతులైన నీ చన్నులు
వుండనుండఁ గానవచ్చె నువిద నీసుద్దులు

చ. 2: యెక్కువనీమేనికాఁ క యెండలుగాయఁ గాను
ముక్కులై పులకలేల మోసులొత్తీనే
చిక్కనినెరిఁ గురుల చీఁ కటేల చల్లేవే
తెక్కులనే తేటపడె తేజాపునీగుణము

చ. 3: భారపునిట్టూర్పుగాలి పచ్చిదేర విసరఁ గా
గారవానఁ గోవిలలు గళము చేరె
కోరి శ్రీవేంకటపతిఁ గూడితివిగాఁ బోలు
ఆరితేరె నీగుట్టు అంతయు మాయెదుట

రేకు: 1201-6 వసంతవరాళి సం: 22-006

పల్లవి: చెప్పకురే అంత మీరు చెలువునిగుణములు
తిప్పరానిమగవానితీరు లివేకాక

చ. 1: అతిమోహమే కలితే ఆడికకు వెఱచునా
చతురునిప్రియమెల్ల సటలుగాక
యితవే కలిగితేను యెగ్గులకు లోఁ గునా
మతకాన నవి గొన్ని మాయలుగాక

చ. 2: మనసులే యేకమైతే మారుమాట లాడునా
వినయములెల్లాను వేసాలుగాక
తనతమే నిజమైతే తనివి గలుగునా
ననుపుగా నాఁ టకము నడపీఁ గాక

చ. 3: తానే నన్నేలకుండితే దగ్గరి వూరకుండునా
నానఁ బెట్టి యిందిరిలో నవ్వులుగాక
యీనెపాన శ్రీవెంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
కానవచ్చెఁ దొంటివెల్లాఁ గత లింతేకాక

రేకు: 1202-1 ముఖారి సం: 22-007

పల్లవి: నీమనసు కోమలము నేనెఱుఁగుదును నీవు
భామచేఁతలకు వేరేపదరేవుసుమ్మీ

చ. 1: సగము గోపించి సతి సగము నవ్వె నీవు
మొగిఁ బయ్యదంటితి నీ మోము చూడఁగా
పగ పాడిగాదు నీతోఁ బరిహాచకము గాదు
యెగసక్కెమని ఇది యొగ్గువట్టేవుసుమ్మీ

చ. 2: పేరుకొని నిన్నుఁ దిట్టి ప్రియముచెప్పెను చెలి
గోర నిన్ను నెచ్చరించి కుంగి మొక్కఁ గా
బారిజగడము గాదు పంతమిచ్చుటాఁ గాదు
వైరమాయనని పొందు వదలేవుసుమ్మీ

చ. 3: ఆకడిమోమై ఇంతి ఆయమంటి నిన్నుఁ గూడె
జోకగా రతిబంధము చూపఁ గా నీవు
కైకొనకుండుట గాదు కడుఁ దమకము గాదు
యేకమై శ్రీవేంకటేశ యెడ సేవుసుమ్మీ

రేకు: 1202-2 భైరవి సం: 22-008

పల్లవి: అక్కలాల అమ్మలాల ఆయఁబో పని
వెక్కసాన నేడనైనా వింటిరా యీ తగవు

చ. 1: చెక్కు నొక్కి మెచ్చఁబోతే చేతి గోరు దాఁకె ననీ
మక్కళించి తన్నొరయ మాసటీఁడనా
మక్కు వ పురుషుఁడట మానిని నేఁ దనకట
ఇక్కడ మాతల వేగె నిటువంటి పనులు

చ. 2: ఇల్లిదె ఆకు యాకుమడిచీ యీఁగా నోరు వొక్కెననీ
చెల్లఁబో యెగసక్కెము సేసే దానా
బల్లిదానఁ బాపమంటాఁ బాలువోయఁ బోతేను
వొల్ల నోకిలించె నన్న వూహ నిజమాయఁగా

చ. 3: కదిసి కాలుదొక్కి గళదాఁకె నిదెయనీ
పదపద యంత నేరుపరినా నేను
యెదుట శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
యిది వో అన్నియుఁ జెల్లె నీకనేలే మాటలు

రేకు: 1202-3 పాడి సం: 22-009

పల్లవి: ఇంక నేలే అనుమాన మింతటాఁ దెగువే కాక
కొంకు వాపితే వలపు కొనకెక్క వలెను

చ. 1: మది నింత విచారించ మంచము కిందే నుయ్యి
కదిసినంతటి మీఁదఁగా పనులు
కొదలేక కొన గోరఁ గుమ్మిననాఁచేతలెల్ల
చెదరక ఆకె చూచి సిగ్గు పడవలెను

చ. 2: యెంత లేదు పదవే వేయింటిపై జవ్వాది కొమ్ము
అంతక వచ్చితేఁగా ఆ పనులు
కంతలుగా తన మోవి గంటివడఁజేసితేను
చింత తోడ నాకె చూచి చిన్నఁబోవవలెను

చ. 3: కానీ లేవే ముంజేతి కంకణమున కద్దమా
ఆనినరతుల వేళఁగా పనులు
పూని శ్రీవేంకటపతిఁ బొంది వలపించితిని
పానిపట్టి యాకె చూచి భ్రమయఁగవలెను

రేకు: 1202-4 వసంతం సం: 22-010

పల్లవి: ముగుద ముగుదతనమునఁ బుచ్చెఁ గాలమెల్ల
తగిలి నీకాఁగిటిలో దగదేరు టెన్నఁడో

చ. 1: తళుకున నిన్నుఁ జూచి తలుపుమాటున కేఁగె
కలికిసిగ్గుల కిఁక కడ యెన్నఁడో
యిల నీవు వటాడ నిటు కాలిగోర వ్రాసెఁ
దలవంచి యిఁక మారుత్తర మెన్నఁడో

చ. 2: పాడిపాడి నీవు రాఁగాఁ బక్కనఁ దానము గుక్కె
తోడనే యీసిబ్బితి కిఁక తుద యెన్నఁడో
కూడఁ జెలితో నవ్వఁగ గోబ్బున నీవు నవ్వితి
గోడచి త్తరువు చూచీఁ గొంకుదేరు టెన్నఁడో

చ. 3: పానుపఁ మీఁదికిఁ దోసి పచ్చిగాఁ గూడఁగాను
మేనిలోనే జునిఁగీ మేల మెన్నఁడో
మానక శ్రీవేంకటేశ మంతినాన నుండఁగాను
తా నూరకే వుండీ దంటతన మెన్నఁడో

రేకు: 1202-5 ఆహిరి సం: 22-011

పల్లవి: అందులోనే విన్నపము లన్నియు నున్నవి నాకు
మందలించి ఇంతకంటె మరి నేరననరే

చ. 1: వద్దు వద్దు తనతోడివాదులకు నే నోప
పొద్దువొద్దు వాసులకే పోరలఁ బట్టె
కద్దుగద్దు నామీఁదఁ గడు మోహము దనకు
ముద్దుముద్దువలె నిట్టె మొక్కితి నే ననరే

చ. 2: చాలుఁజాలు చలములు సాదించఁ దరిగాదు
యేల యేల తనసుద్దు లిదె వింటివి
వేళ వేళ గాచికాచి వేగిరించితి నిందాఁక
మేలు మేలు దనపొందు మెచ్చితి నేననరే

చ. 3: సారె సారె బోమ్మలను జంకించఁ బనిలేదు
తీరెఁ దీరెఁ గోపమెల్లాఁ దేటపడెను
చేరెఁజేరెఁ గాఁగిటిలో శ్రీవేంకటేశ్వరుఁడు
పేరెఁబేరెఁ దేనెలెల్ల పెదవుల ననరే

రేకు: 1202-6 సామంతం సం: 22-012

పల్లవి: కడుఁ బెలుచుగుణములదిగదె యమ్మ యీకొమ్మ
యెడలేక ఇఁక నెంత యేలునో పతిని

చ. 1: పోదలఁ బుక్కిటినిండ పాలితి తములము నించి
పెదవులను మాటాడెఁ బ్రియునితోడ
పుదుటుగర్వము యించ నొక్క చెలిపై నొరగి
కదలుఁగన్నుల నవ్వెఁగదె మరియుఁ బతిని

చ. 2: అచటఁ బావాలు వోయ్యారముగ మెట్టుకొని
పచరించె మాటలనె పంత మితని
కుచములెడఁ బయ్యెఁటకొంగు వల్లెవాటు గొని
రచన నొకచే మొక్కె రాజసానఁ బతికి

చ. 3: కొప్పువూవులు వీడి కొంతగొంత రాలఁగాఁ
గప్పుచు శ్రీవేంకటేశుఁ గాఁగిలించెను
దప్పిదేరుమోవితోడ తనిసీఁ దనియనిరతుల
యిప్పుడే వురమెక్కె నెనయుచుఁ బతిని

రేకు: 1203-1 సామంతం సం: 22-013

పల్లవి: వెనకఁ జేతువుగాని వేసాలప్రియములెల్లా
కసనున్న సేయకుమి కావి గానవచ్చీని

చ. 1: కుంగి యంత మొక్కకుమీ కొప్పుపూలటు రాలీ
కొంగుజార వేఁడుకొకు గురి గానవచ్చీవి
చెంగట చేయివేయకు చెమటలు రాగిదేరీ
వుగిటి యెదురు రాకు వూర్పులు రేఁగీని

చ. 2: పలువినయములు చెప్పకు మోవిబయలయ్యీ
వెలయ విసరకు నీవింతతావి వచ్చీవి
కలసి పెనఁగకుము గందాలు చిట్లీని
అలవిమీరఁ బొగడ కలపుఁదోఁచీని

చ. 3: ఆకుమడిచియ్యరాకు ఆకెవుంగరాలే మించీ
యేకతమాడనే రాకు యేచ్చినకళలు దోఁచీ
పై కొని శ్రీవేంకటేశ బలిమి నన్నుఁ గడితి
యేకతము సేయకు మంత యెచ్చుకొందయ్యీని

రేకు: 1203-2 శ్రీరాగం సం: 22-014

పల్లవి: ఆవుఁగాము లెరిఁగించు మంతేచాలు
వువిద వొక్కమతితో నుండేము నేము

చ. 1: పిలిచినా రావు ప్రియమూఁ జేసేవు
యెలమి రెండూ నడుపే విదియేఁటిదే
అలరి యమ్మేదొకటి యసిమలఁ దొకటాయ
చెలి యాతని కేమని చెప్పుదుమే నేము

చ. 2: అదె చలము సాదించే వాదరమూ నించేవు
మెదుట రెండూ నడుపే విదియేఁటిదే
యిది యేలే చంక దుడ్డూ నింతలోనే శరణార్ది
పొదిగి యాడ కెట్లఁబోదు మే నేము

చ. 3: వింతరతిఁ గూడేవు విఱ వీఁగి భ్రమసేవు
యింతలో రెండూ నడుపే విదియేఁటిదే
ఆంతటిశ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
మంతనాన మెచ్చ కెట్టు మానుదుమే నేము

రేకు: 1203-3 దేసివి సం: 22-015

పల్లవి: నాటకము లికి గొన్ని నడపీఁగాక
కూటమిఁ గపటమట కోరిక చవౌనా

చ. 1: మనసొక్కటైతేఁ గా మాట లొక్కటయ్యేది
యెనయవిపొందులకు నేఁటిమాటలే
చనవు గలిగితేఁగా సరసా లింపయ్యేది
మునుపనే కోపమట మొక్కులు చవోనా

చ. 2: నగవు గలితేఁగా నయములు వొదలేది
యెగసక్కెమైనందు కేఁటిమాటలే
మొగమోట గలితేఁగా ముచ్చటలు చెల్లేది
బిగువులే తనకట ప్రేమము చవౌనా

చ. 3: గొరికొన సొఁకితేగా గుట్టెల్ల వదలేది
యీరుదియ్యఁ బేనువచ్చీ నేఁటిమాఁటలే
ఆరితేరి శ్రీవేంకటాధిపుఁడు నన్నుఁ గూడె
నేరుపులే నిండెనట నీటులు చవౌనా

రేకు: 1203-4 ఆహిరి సం: 22-016

పల్లవి: ఇంకా నీచిత్తముకొలఁ దిన్నియు విన్నవించితి
వంకలప్రాయము నీకే వ్రతమువట్టినాఁడే

చ. 1: తరుణికొప్పువిరులు తనమీఁద రాలుదాఁకా
విరులు ముడువనంటా విభుఁడు నేమముసేసె
సురతగంధము మేన చొడుముట్టినదాఁకా
గరిమఁ బరిమళాలగంధము మైఁ బూయఁడే

చ. 2: పడఁతి నీవూరుపులు పైఁబారినందాఁకా
విడిచి మేన సురిటి విసరించుకొఁడే
తడిసి నీచెమటలు తనమీఁద చిందుదాఁకా
యెడసి కేళాకూలికి యేఁగఁగ నొల్లఁడే

చ. 3: పానుపుపై నీవు గూడి పచ్చిమాట లాడుదాఁకా
మోనమున యెవ్వరితో ముచ్చటలు నాడఁడే
ఆని శ్రీవేంకటపతి నట్టె పొందితిగాన
వూనినపరవశాన వొంటి నింకఁ బాయఁడే

రేకు: 1203-5 బౌళి సం: 22-017

పల్లవి: తామొకరి నాడుదురు తమనేరా లెంచుకోరు
భూమిలో నిట్లఁ గాఁగానేపో కౌను సమసె

చ. 1: కాదనేటిదాననా కడు నీవు నవ్వితేను
సోదించి నీమోవి నీవే చూచుకోరాదా
యీదె నీభావ మయ్యా యెదుటిచందురుకందు
నాదించేకన్నులు తననలుపు లెంచీనా

చ. 2: వేసరేటిదాననా వెంగేలు నీ వాడితేను
యీసు నీగుణము నీవే యెంచుకోరాదా
మోసాన జలనిధిని మునినోరియెంగిలనే -
వూసివాసినోరు తనవొద్దియెంగి లెంచీనా

చ. 3: వంతుకెంచేదాననా వచ్చి నీవు గూడఁగాను
ఇంతలో నావరుస నీవెంచుకోరాదా
పంతపు శ్రీవేంకటేశ పైకొని కూడితి నన్ను
దొంతి తన నీడ తోడువాసి వుండునా

రేకు: 1203-6 బౌళి సం: 22-018

పల్లవి: ఇప్పుడునుఁ గల్ల నిజ మేరుపడ దిది మాకు
కొప్పుపువ్వులు రాలెఁ గొసరు పైననఁగా

చ. 1: కాంత నీనెన్నుదుటికమ్మఁ గస్తూరిబొట్టు
పంతమునఁ జెలుల నిటు భ్రమఇంచెనే
కంతుసమరము గెల్చి కడనారెఁ బగదీర
ఇంత నెత్తురున బోట్టిడుకోనినగతిని

చ. 2: పడఁతి నీవురముపై పచ్చిపగడపుదండ
బడిబడినే మమ్ము నిటు భ్రమఇంచెనే
కడలేనిచలిగాలిఁ గలనిలోపల గెల్చి
వెడఁ బేగుంజంధ్యములు వేసితివోయనఁగ

చ. 3: చెలియ నీమెయిఁ బోడముచెమటముత్తెపుసరము
పలుమారుమమ్ము నిటు భ్రమయించెనే
వలచి శ్రీవేంకటేశ్వరుఁ గూడి చందురుని
బలిగొనుచు వెన్నెలలు పైఁ గురిసితనఁగా

రేకు: 1204-1 దేశాక్షి సం: 22-019

పల్లవి: విన నేమిదప్పిపోయ వెనకముందు వాసింతే
మానివి నెక్కుడు సేసేమన్న నింతే కలది

చ. 1: పంతము విడువనిదె పడఁతికి వుచితము
చెంతనుండి యేల గాసిసేసేవయ్యా
వంతుకువంతుకు సరివలపులు మీలోన
ఇంతితో ముందు మాటాడు టిదియే కలది

చ. 2: చలము సాదించుకొంటే సతులకు వుచితము
పలుకుఁ బంతానకేల పారేవయ్య
బలిమి మీఇద్దరికి పాయ మొక్కకొలఁదే
యెలజవ్వని నవ్వించు టెక్కు డింతే కలది

చ. 3: సిగ్గువడివుండేది చెలియకు నుచితము
యెగ్గుదప్పు లిందేల యెంచేవయ్య
కగ్గని శ్రీవేంకటేశ కాఁగి లిద్దరి కొక్కటే
వెగ్గళ మాకెకుఁ జేసేవిభవమే కలది

రేకు: 1204-2 హిజ్జిజి సం: 22-020

పల్లవి: ఎవ్వ రెట్టుండిన నేమి యేమైనా నేమి
నవ్వుచుఁ దనసుకము నడచీ జాలదా

చ. 1: వోలిసీనోల్లనిమాట కూఁకోనఁగవలెనా
చెలఁగి మోమెగరవేసేది చాలదా
తలఁపు నాకెట్టుండినా తనకేమి వద్దనుండి
వలసినపనులెల్ల వంతుసేసేఁ జాలదా

చ. 2: ముట్టీముట్టనిపనికి మోము చూడవలెనా
నెట్టన నదానఁ జూచేనీడ చాలదా
దట్టమై నేఁ జిన్నఁ బోతే తనకేమే పానుపుపై
వెట్టదీర పాదమొత్తి వేగించేఁ జాలదా

చ. 3: కూడీఁగూడనందుకును కోసరులు వలెనా
వోడక మేనోప్పగించివుంటేఁ జాలదా
యీడనే శ్రీవేంకటేశుఁ డెట్టయిననేమి నన్ను
జోడై కూడఁగాఁ జోక్కితినేఁ జాలదా

రేకు: 1204-3 రామక్రియ సం: 22-021

పల్లవి: నిన్ను నేమనఁగలను నీకుసహజమివెల్ల
చెన్నగునావల పింతసేసె ననేఁగాక

చ. 1: వీడనాడఁజెల్లదా వింతనీమైతావి చూచి
వీడనాడలనినోరు వీరిడిగాక
చూడకుండఁజెల్లదా సూటి నాకెతో నుండఁగా
చూడఁబోయేచంచలపు చూపుల ననేఁగాక

చ. 2: ఆలుగఁజెల్లదా నీమై యాచెమట చూచైనా
ఆలుగనినాగుణము వెలితిగాక
తలఁచకుండఁ జెల్లదా తప్పు నీ బాసలు చూచి
తలఁచేటి నామనసుతమి ననేఁగాక

చ. 3: తారుకాణించఁజెల్లదా తగునీసుద్దులు విని
తారుకాణించలేనినాదయ గాక
యీరీతి శ్రీవేంకటేశ ఇప్పుడే నన్నేలితివి
ఆరయ వేగిరించేనా ఆస నఁనేగాక

రేకు: 1204-4 బౌళి సం: 22-022

పల్లవి: మమ్మునేల యడిగేవు మరి నీయాచారాలు
చిమ్ముల నూరకవుంటే నేసినంతపలము

చ. 1: ఆంగము నీకొప్పగించే ఆఁటదాన నేనింతే
కంగి నిన్నోఁగాదనఁగలనా నేను
అంగడి నెవ్వరినైనా నడుగవయ్య నీగుణ-
ముంగరపువేలనైతే నొక్కమనసాను

చ. 2: సేసతోఁ బెండ్లాడినట్టిచెలియ వింతే నేను
గాసి నిన్ను దిద్దితీర్చఁగలనా నేను
ఆసల నెవ్వరినైనా నడుగవయ్య సాకిరి
బాసఁ గప్పురపు నోటిపలుకు లింపాను

చ. 3: ఇమ్ముల నీ కాఁగిటలో యిల్లాల నింతె నెను
కమ్మి నీమ్మై పచ్చి చెప్పఁగలనా నేను
నెమ్మది శ్రీ వెంకటేశ నీడ చూచుకొనవయ్య
పమ్మి చీఁకటింటనే దీపము గానవచ్చును

రేకు: 1204-5 సాళంగనాట సం: 22-023

పల్లవి: పట్టకురా నాచెఱఁగు బలిమి నీవు
వట్టిమాట లింతయేల వచ్చే విడువరా

చ. 1: మోవితీపె కడునైతే మొగచాటు గాకుండునా
నీవద్ద నేనుండఁగాను నీకుఁ జవులవునా
తావునఁ బోతావచ్చేతరితీపే మేలుగాక
వావిరి రమ్మన్నప్పుడే వచ్చే విడువరా

చ. 2: చేరి యగ్ని పొంత నుంటే చెమరించకుండునా
సారె నీతోఁ బెనఁగ వేసట మానీనా
తీరక సోఁకీసోఁకవితేఁకువే మేలుగాక
వారక నావరుసైతే వచ్చే విడువరా

చ. 3: నిండునీట నుంటేఁ దమ్మి నెగడక వనునా
మెండునీవు ననుఁ గూడి మెచ్చకుండేవా
అండనే శ్రీవేంకటేశ అటు నన్నుఁ గూడితివి
వండ వండనట్టాలయ్యీ వచ్చే విడువరా

రేకు: 1204-6 కన్నడగౌళ సం: 22-024

పల్లవి: కోంకుకోసరెల్లా దీర కోట్టి బతుకనీవే
జంకెనలకెల్లా లోను సాదించుమనవే

చ. 1: ప్రాణమే తనసొమ్మైతే ప్రాయ మేమినేనీనే
ప్రాణేశుఁడట తా నీపాటెఱఁగఁడా
జాణఁడు తనకు నాకు సరికిబేసికి లంకె
ఆణాజ్ఞకు లోను అట్టే సేయుయనచే

చ. 2: తనువే తనసొమ్మైతే తాప మేమిసేసీనే
తనివిఁబొందించీ నింత తా నెఱఁగడా
తనుప్రేమ నాప్రేమ తారుకాణలకు వచ్చె
చెనకులకెల్లా లోను సేంత సేయుమనవే

చ. 3: చిత్తమే తనసొమ్మైతే సిగ్గు లేమి సేసీనే
చిత్తజగురుఁడు తా నీచింతెఱఁగఁడా
అత్తి శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నుఁ గూడె
కోత్త చేఁత కెల్లాలోను కోరితి నే ననవే

రేకు: 1205-1 సామంతం సం: 22-025

పల్లవి: మేడిపంటిబొౌన మింతే మేలు విచ్చిచెప్పఁబొౌతే
పాడియుఁ బంతము చెల్లెఁ బదవే చాలును

చ. 1: చిత్తములో నామాఁట చెప్ప నోరాడదుగాక
తత్తరపు తనచేఁత తా నెరఁగఁడా
వొత్తుకోలు సేసి యింకా నోడఁబరచఁగనేల
బత్తి గొౌట్టానఁ బెట్టేమా పదవే చాలును

చ. 2: అందుకే నాకన్నుల నీ రాఁపలేనైతిఁగాక
నింద కొడిగట్ట నంతనేరఁడా తాను
మందమిరియాలు చల్లీ మరి తన్ను మేయని-
బందెలు గట్టవచ్చేనా పదవే చాలును

చ. 3: వంతదీరఁగూడఁ బరవశము నాకాయఁ గాక
పంతగాఁడు తన కింత భ్రమయనేలే
యింతితో శ్రీవేంకటేశుఁ డిచ్చినకాఁగిలి. లేదు
బంతియని మొరఁగేనా పదవే చాలును

రేకు: 1205-2 సాళంగనాట సం: 22-026

పల్లవి: పచ్చిగాఁ గానఁగరాదా పైపై ప్రియాలు తన్ను
విచ్చి పరులాడేరనే వెర పింతేకాక

చ. 1: తలఁపు లేకములైతే తానాడ నుండునా
వలసీనొల్లము లైనవగలుగాక
వలపులు నిజమైతే వరుసవం తెంచునా
పిలిచి పెండ్లాడినట్టి పేరు కింతేకాక

చ. 2: మాటలే యేకములైతే మారుత్తర మిచ్చునా
జూటరిమాయల తనసుద్దులు గాక
నాటుఁజూపే కలిగితే నవ్వులు రాకుండునా
మేఁటిబాసయిచ్చినట్టిమేర కింతేగాక

చ. 3: ప్రాణము లేకములై తే పగలురే యెరుఁగునా
జాణతనముల లోని సటలుగాక
నాణెపు శ్రీవేంకటాద్రినాథుఁ డింతసేసి కూడె
రాణువెల్లా నెరిఁగినరాపు కింతేకాక

రేకు: 1205-3 భైరవి సం: 22-027

పల్లవి: పొద్దు వోక నిన్ను నింతా పోదిగేఁగాక
చద్దికి వేఁడికి నీతో సాదించవచ్చేనా

చ. 1: వొత్తి నీకు విన్నవించి వోడఁబరచితిఁబో నీ-
చిత్తములోలేనిమేలు సేసిపట్టేనా
హత్తుకుండుమని నాపై నాన వెట్టించు కొంటిఁబో
బత్తి గొటానఁ బెట్టితే పాదుపడీనా

చ. 2: ఆఁగిపట్టి పానుపుపై నలమి నిలిపితిఁబో
కాఁగిటలేనినునుపు గడియించేనా
చేఁగదేర నిన్ను బాససేయించుకొంటిఁబో
దాఁగి నీవు రాకుండితేఁ దప్పుగొనేనా

చ. 3: యెడయక రతుల నిన్నేసితిఁబో నేఁడు
అడియాసతమకాన కడ్డగించేనా
బడినే శ్రీవేంకటేశ పాయలే మిద్దరమును
కడకూ నీచిత్త మింతే కడకట్టేనా

రేకు: 1205-4 ఆహిరి సం: 22-028

పల్లవి: నీ చేతిలోనిదాన నేను నీసతి నింతే
చీచీ పూచిమానేటిసెలవేల యిఁకను

చ. 1: సొలసి చూడఁగలంతాఁ జూతువుగాక నన్ను
తలవంచ నిఁకనేల దాకొనెఁబని
మొలచెఁ బులకపైరు ముంచెఁ జెమటనీరు
కలువతూపులు వానికడమేల ఇఁకను

చ. 2: ఆడెడిసరసమింతా నాడుదువుగాక నాతో
తోడ మొకమోటలేల దూరాయఁ బని
వీడెఁ దురుముభారము విరహమింతాఁ గారము
కూడేటిమరుకొంతాలకొరతేల ఇఁకను

చ. 3: నవ్వఁగలిగినదెల్లా నవ్వుదువుగాక నీవు
రవ్వలగుట్టిఁక నేల రాఁపాయఁ బని
ఇవ్వల శ్రీవేంకటేశ యెన్నికగాఁ గూడితిని
మవ్వపు వెన్నెలచొక్కు మానినేల ఇఁకను

రేకు: 1205-5 ముఖాం సం: 22-029

పల్లవి: ఎట్టు గడపీనో దైవ మింతికి నీగండ మిఁక
ముట్టివచ్చి ఇరుమేల మోహరించెఁ బనులు

చ. 1: జలజాక్షిమోము వాడె చంద్రుఁడు కళలుగూడె
కలికికన్నులు మూసె కలువలు లాసె
బలువూరుపులు దాఁగె పయ్యరగాలి రేఁగె
కులుకుమాట లణఁగె కోవిలలు గొణఁగె

చ. 2: చింతఁ జెలిమేను చిక్కె చిగురుకెంజాయ లెక్కె
వింతనవ్వులెల్లాఁ గుండె వెన్నెలలు పొంగె
దొంతిఁ దురుము విరిసె తుమ్మిదమూఁక మొరసె
మంతనాలు కరవాయ మరుఁడు యెరవాయ

చ. 3: చనుఁగొంగెడలె పంచశరుటెక్కెము వెడలె
వెనువెంటఁ బులకించె విరులెల్లఁ బొంచె
యెనసి శ్రీవేంకటేశుఁ డింతి నిట్టె కూడఁగాను
ననుపట్టె సేయఁ దమి నచ్చు గనమాయ

రేకు: 1205-6 శంఖారాభరణం సం: 22-030

పల్లవి: కలివొనిననుఁట్లకడ యేలె
తలదొఁక యేరుపడె తగు లింకనేలె

చ. 1: యిచ్చె నపుడె విడె మిఁకనెలె
మచ్చికఁ బిలువనంప మరియేలే
హెచ్చి వాకిట మాఁటాదె నిఁకనేలే
పచ్చియేకతపువిన్నపము లిఁకనేలే

చ. 2: యెరవై వుపచరించె నిఁక నేలే
మరిగి నేనే తాననేమాఁట లేలే
ఇరవై మెచ్చఁగ మెచ్చె నిఁక నేలే
సరవాయఁ బనులెల్ల జాగు లిఁకనేలే

చ. 3: యెన్నికగా ననుఁ గూడె నిఁక నెలే
మన్ననలు వద్దనఁగ మరియేలే
ఇన్నిటా జాణతనాలే ఇఁకనేలే
పన్ని శ్రీవేంకటపతిఁ బాయ నిఁకననేలే

రేకు: 1200-1 శ్రీరాగం సం: 22-031

పల్లవి: ఎమ్మెలు సేయఁగబొతే నిన్నియు బయటఁ బడె
కొమ్మలెల్లా నిందులకే గోరాదిగొనేరు

చ. 1: వేడుకకు నవ్వఁబోతే వెన్నులలు వెళ్లీఁజుమ్మీ
తోడనే రేపల్లెవారు తొంగిచూచేరు
ఆడ రాగాలు సేసితే నావులు వచ్చీఁజుమ్మీ
మేడెపు బ్రహ్మాదులెల్లా మింట నున్నారు

చ. 2: చిత్తగించి చూచితేనే సిగ్గులు రేఁగీఁజుమ్మీ
మొత్తమై గోపికలెల్ల మొక్కుచున్నారు
మత్తిలి మెయి సోఁకనికు మాకులు విరిగిపడీ
వొత్తినకంసాదులెల్ల నుప్పతించేరు

చ. 3: పాదమునఁ జిమ్మఁ బొతే బండ్లు బందుబండయ్యీ
వీదుల వీదులవారు వెరగంచెరు
ఆదిగోని శ్రీవేంకటాద్రివితలుఁడ నన్ను
యీదెసఁ గూడితివి మాయింటివా రాడేరు

రేకు: 1200-2 సామంతం సం: 22-032

పల్లవి: పొద్దువొకలకు తనపొందు సేసితిఁగాక
నిద్దపుజాణఁడు దనతో నేఁనేటిదే

చ. 1: తనువు దనకాఁగిటందు తలఁపు పరవశమందు
యెనసె నిదె నాలోన నేఁటివలుపే
కనుచూపు తనమీఁద కడునాస రతిమీఁద
కొనరంటలాయ నాగుణ మేఁటిదే

చ. 2: మోవిదనవదనమందు ముచ్చట ముదములయందు
యీవలావలను నా కేఁటివలుపే
వావి దనమానము పై వర్తనలు మోము పై
నావలనఁ గలిగె నానను పేఁటికే

చ. 3: నగవు దనచేఁతలందు నాలి మేలములందు
యెగువదిగువలునాయ నేఁటివలపే
వగలో శ్రీవేంకటేశ్వరుఁడు దా ననుఁ గూడె
మొగమెదుటఁ దనకు నా మొక్కులేఁటివే

రేకు: 1200-3 ఆహిరి సం: 22-033

పల్లవి: మఱవరే యీమాట మనసోకలాగయ్యీ
యెఱఁగనై తిఁగాక యెరవు సతమౌనా

చ. 1: చెల్లులేవే యిఁకఁ దాను చేసినచేఁతలెల్లా
మొల్లమిఁ గొలుముందై నే మోహించితిని
ఇల్లిదె యెక్కినవాని కేనుగ గుజ్జనుమాట
పొల్లవునా తన్నూరకె పొదిగే నేఁ గాక

చ. 2: తగులేవే ఇఁక నేఁడు తానాడేమాటలెల్లా
వెగటై తా విడిచినా విడువలేను
వగ విరిగినబండివారే వెఱ్ఱులన్నమాఁట
నెగడియుండఁగా నేనే నేర వింతేకాక

చ. 3: మించెలేవే తాఁ జేసినమేకులవినయమెల్లా
కొంచక తనకాఁగిటఁ గూడితి నేను
అంచె శ్రీవేంకటుశుఁ దన్నంటితేఁ దనంతనేది
మంచిదిగాదా నేనే మఱచితిఁగాక

రేకు: 1200-4 సాళంగం సం: 22-034

పల్లవి: కంతునిబలఁగము లివివో కై తప్పా నేమన్నా
సంతంబయ్యీనమీఁదట సందింతువు గానీ

చ. 1: సరుగన దగ్గరిరా కిటు చనుజక్కవ లిటు బెదరీ
అరుదుగ మరేమిగలిగిన నందుండే పలుకు
గరిమలఁ బిలువకు మంతేసికంచపు మోవిదె యదరీ
యిరవుగఁ జేసన్నలనే యెరిఁగింతువుగాని

చ. 2: నిలువునఁ జూడకు మంతేసి నెరిఁదుమ్మిదలివెయఁగినీ
వలపు లవేమి గలిగినా వడిఁ బారఁగఁజల్లు
కలకలనవ్వకు మంతేసి కరములచిగురులు గదిలీ
వెలినే నీయెమ్మె లెదట వెదచల్లుదుగాని

చ. 3: కాఁగిట కడుఁబీడించకు కన్నుచకోరము లుదిరీ
మాఁగినరతు లేమిగల్లా మన్నించే చూపు
వీఁగక పానుపుపై శ్రీవేంకటపతిననుఁ గూడితి
ఆఁగిననిటూర్పు లడఁచీ అరమఱతువుగాని

రేకు: 1200-5 దేసాళం సం: 22-035

పల్లవి: అంతయు నీకే చెల్లు నవులేవయ్యా
అంతర మెఱుఁగుదువు ఔలేవయ్యా

చ. 1: నేరక నే మీఁదమీఁద నీకు వలవఁగఁబట్టి
అరటానఁబెట్టితి నీ వౌలేవయ్యా
ఆరీతి వేరుసేయక అండకు నే రాఁబట్టి
ఆరితేరెఁ బనులెల్లా నౌలేవయ్యా

చ. 2: యేమీననక నీకె యిచ్చకాలాడఁగఁబట్టి
ఆమాఁటలాడితివి ఔలేవయ్యా
కామించి వొకరివలె గయ్యాళించకుండఁబట్టి
ఆమీఁద నొత్తుకవచ్చె వౌలేవయ్యా

చ. 3: కాదుగూడదనక నీకై వశముగాఁబట్టి
ఆదరించి కూడితివి ఔలేవయ్య
యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను మెచ్చఁబట్టి
ఆదెస నవ్వులు నవ్వే వౌలేవయ్య

రేకు: 1200-6 సామంతం సం: 22-036

పల్లవి: ఏమయ్యీనోకాని యిఁకనోయమ్మా
ప్రేమతో వయసు పెంచితినే

చ. 1: చల్లుఁజూపులు పతి చల్లఁగ గుండె
జల్లురనె నిచ్చట నోయమ్మా
కొల్లగా నవ్వి కొసరఁగ మేను
చెల్లఁబో నాకు చెమరించెనే

చ. 2: పేరుకొని తాను పిలువఁగ
యీరీతిఁ బులకలేలో యమ్మా
వూరకే గోర నొరయఁగ
దారిఁబడి మేలు తలకెక్కెనే

చ. 3: మోనమునఁ దాను మొక్కఁగ
నానె సిగ్గు లున్నతి నోయమ్మా
పాని శ్రీవేంకటపతిఁ గూడఁగ
తానే నేనైతి తగుఁదగునే

రేకు: 1207-1 సామంతం సం: 22-037

పల్లవి: ఏచేఁత కేచేఁత యిందుకేపో వెరగయ్యీ
చేచేతం బెనంగేవు చెక్కునొక్కఁగాను

చ. 1: పెదవులనే గొణఁగి బెట్టి తిట్టే విదియేమే
చెదరక నే నీకు చేత మొక్కఁగా
కదలుఁగన్నులఁ జూచి కసరే విదియేమే
యెదుట నీ కాకుచుట్టియీరాఁగానొ

చ. 2: మచ్చరమే పచరించి మారుమోమయ్యేవేమే
విచ్చనవిడి సురటి విసరఁగాను
కొచ్చికొచ్చి ముక్కుననే కోపగించే విదియేమే
యిచ్చగా నెరులఁ జిక్కు లిటు దిద్దఁగాను

చ. 3: నవ్వినవ్వి జగడాలు నటియించే విదియేమే
పువ్వుఁబానుపున నిన్నుఁ బొరుగఁగను
యివ్వలనే శ్రీవేంకటేశుండ నేఁ గూడితిని
అవ్వల మైమఱచేవే అధరమీఁగాను

రేకు: 1207-2 పాడి సం: 22-038

పల్లవి: దొడ్డదొర దానైతే దొసమాయనా
గొడ్డేరునిష్టూరములే కూడాయనా

చ. 1: కాఁకలఁబెట్టినవాఁడు కన్నుల నవ్వీఁగదే
చీకాకై యాఁడు జన్మమే చెడఁబోయనా
చేకోని తా రానివాఁడు చెలులా నంపీఁగదే
కాకుసేసేదే తనకుఁ గడమాయనా

చ. 2: మోపఁగనాడినవాఁడు మోనాన నున్నాఁడుగదే
దాపతితో వలచుటే తప్పాయనా
వావిదెలిపినవాఁడు వగల నేఁచీఁగదే
మావంటివారికన్నాఁరే మనసాయనా

చ. 3: పచ్చిగాఁ గూడినవాఁడు పంతము నాడీఁగదె
ముచ్చటలు చెప్పినదే మోసమాయనా
ఇచ్చకుఁడు శ్రీవేంకటేశుఁడు నన్నేలె నిట్టె
పచ్చినాపాయమే తనపాలాయనా

రేకు: 1207-3 వరాళి సం: 22-039

పల్లవి: ఎక్కడి కేఁగితివని యేమిసేసేవని
చక్కనిసతులు నిన్ను సాదించరా

చ. 1: చిందరవందరలనీచెక్కులచెమట చూచి
ఇందు నెవ్వరైనా నిన్నుఇదేమనరా
గందుపుబేంట్లు చూచి కందినబుజాలు చూచి
మందెమేళమున ననుమానించరా

చ. 2: కన్నులకావులు చూచి కాఁకలవాదులు చూచి
నిన్ను వాడవారిఁగూడ నిందలెంచరా
చిన్నిపులకలు చూచి చింద్రికెమోవి చూచి
సన్నల నిన్నాడవారు సారె నవ్వరా

చ. 3: నీకుఁ గానరాదుగాక నీమేనిపచ్చి చూచి
మే కొవి ఇంటివారు కొడిమెలు గట్టరా
యీాకడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడి నీవు
వాకిట నుండినఁ జూచి వదనము నొక్కరా

రేకు: 1207-4 కాంబోది సం: 22-040

పల్లవి: ఎదుట నున్నాడు వీడె ఇఁక నేఁటిదే
వుదుదు సిగ్గులు దొట్టి నుపమ యెక్కడిదే

చ. 1: సన్న సేసి పిలిచీని సరసుఁడు వాఁడె తొల్లి
యెన్నఁడూ మాటాడుతఁలే దేమందునే
కన్నుల మొక్కులు మొక్కెఁ గప్పురము నా కంపె
యెన్ని ప్రియములు సేసి నేమిసేతునె

చ. 2: తోరపునవ్వు నవ్వీ దొరపాటివాఁడు తా-
నేరీతిఁ జిత్త మెఱఁగ నిఁక నేఁటిదే
నారుకొనఁ జూపు చూచీ నను పెన్నఁడూ లేదు
కోరినరతుల కిఁకఁ గొన మొద లెట్టిదే

చ. 3: పానుపుమీఁదికిఁ దీసీం బైఁ దనగుణము గాన
మేనుమేను సోఁకితేను మెచ్చుటేఁటి దే
యీనెపాన శ్రీవేంకటేశుఁ డింత సేసి కూడె
మోనమున వావులెంచి మొఱఁగమ జోటేదే

రేకు: 1207-5 శ్రీరాగం సం: 22-041

పల్లవి: ప్రాణనాయకుఁడు వాఁడె ప్రాణేశ్వరివి నీవు
జాణవు నీ విన్నిటాను చలమేఁటికే

చ. 1: వీడనాడవచ్చుగాని వెనక వేఁడుకోరాదు
కూడేరు మీకె పొదు కోప మింతేలే
నీడలు వేరైతోఁచు నిలు వొక్కటేకాదా
యీడనాడ నుండేనంటాయేల నమ్మవే

చ. 2: అలుగఁగవచ్చుఁగాని అట్టె కిందుపడరాదు
కలసేరు మీకె పొదు కపటమేలే
పలుకులెన్నైనాఁ దోఁచు బాస వొక్కటేకాదా
పులక లివేడవంటా పొర్లనేఁటికే

చ. 3: తప్పు లెంచవచ్చుఁగాని తారుకాణించరాదు
యెప్పుడు మీకె పొదు యెరవేఁటికే
అప్పఁ డిదే శ్రీవేంకటాధిపుఁడు నిన్నుఁ గూడె
కుప్పళించి నవ్వెనంటా గొరఁ జించనేఁటికే

రేకు: 1207-6 సౌరాష్ట్రం సం: 22-042

పల్లవి: కలవి లేనివి గొన్ని గడించుకొందువుగాక
పులకించితేనే మేనిపోలికలు దప్పెనా

చ. 1: నిన్ను నవ్వి నీగుణము నే మానిపేనా కొంత
కిన్నెరమీఁటుల గిలిగింతుఁగాక
పన్నినచన్నులమీఁదివయ్యద దొలఁగితేనే
తన్నుఁదానే వాయించేటితానములు దప్పెనా

చ. 2: జాచతనాలాడి నిన్ను జంకించేనా మరి కొంత
వీణెలోనే వివరాలు వెళ్లింతుఁగాక
నాణెము గాఁ జెమరించి నాచీర దడి సితేనే
రాణించి యాళాపనలో రచనలు దప్పెనా

చ. 3: ఆయములంటి నన్ను నణఎచేనా మరి కొంత
కాయపుజంత్రాన సన్న గావింతుగాఁక
చేయారా శ్రీవేంకటేశ చేకూడఁగాఁ జొక్కితేనే
వాయించేటితంత్రులో వరుసలు దప్పెనా

రేకు: 1208-1 వరాళి సం: 22-043

పల్లవి: అందుకేమి దోసమా అయినట్టియ్యీఁగాని
పొందినయప్పుడుగాని పూఁపు గానరాదురా

చ. 1: కొమలపుకృష్ణుఁడ నీ గొల్లబాలతనమేల
కామునిగరిడిఁగాని కానరాదురా
బూమెల నీవాడుకోన్న బొమ్మచారితన మెల్ల
పామిడిగొల్లెతలందే పచ్చిదేరీఁ బదరా

చ. 2: నిగ్గులమునులతోడ నీచదివేవేదములు
సిగ్గుల కొట్టఁగొనల చేఁగదేరీరా
దగ్గరితే నీకుఁ బెద్దతనముతో పూజలెల్ల
ఆగ్గపువెన్నముచ్చిమియందు చూపీఁ బదరా

చ. 3: చక్కఁగా నీదొడ్డరాజసపుదొరతనమెల్ల
తక్కి నావుపరిసురతమే చూపీరా
అక్కరై శ్రీవేంకటేశ ఆయమంటి కూడితివి
దిక్కుల నేమిసేసినా దేవుఁడ వనేరా

రేకు: 1208-2 సామంతం సం: 22-044

పల్లవి: వెఱగే మనకు వెడమంకు దనకు
యెఱుకా మఱవునాయ నేమిసేతమే

చ. 1: చిత్తజుఁ డొక్కఁ డెఱుఁడు శివుఁడొకఁడే యెఱుఁగు
ఇత్తలఁ జెలియమనసెట్టుగనేమే
మొత్తపుమోనముతోడ మొక్కినా నూరకున్నది
హత్తి తరవాతిమాట లవి యేమాడుదమే

చ. 2: అట్టుఁ గోవి లెఱుంగు మీఱఁగ రాముఁడే యెఱుఁగు
ఇట్టె యీ చెలిపలు కెట్టు వినేమే
గుట్టువిడిచి నవ్వినా గుణము చెప్పకున్నది
కట్టఁగడపటఁ బతి కన్న దేకానుపే

చ. 3: చందురుఁ డొక్కఁ డెఱుఁగు సరిఁ జకోర మెఱుఁగు
పొంది చేరి మోముకళ పొగడేదెట్టే
అందపు శ్రీవేంకటేశుఁ డండకే విచ్చేసి కూడె
ఇందరముఁ జెలిసిగ్గు లెట్టు వెళ్లవేతమే

రేకు: 1208-3 నాదరామక్రియ సం: 22-045

పల్లవి: పనిగల దింకాఁ బదరకువే
ఘనుఁ డాతినిగతి గందముగాని

చ. 1: మనసున నొకటియు మాటల నొకటియు
ననుపున రెండును నడపకువే
మునుపటికోపము మొక్కినఁ బోయీ
తినఁదిన వేములు దీపులెకావా

చ. 2: దవ్వులఁ గపటము దగ్గరినఁ గూట-
మివ్వల నవ్వల నెంచకువే
నవ్వులపోట్లు నమ్మికఁ బాసీ
పువ్వఁగఁ బువ్వఁగ బూఁపలెకావా

చ. 3: సిగ్గుల మొరఁగులు చింతలవెరగులు
యెగ్గులు యేతులు యిఁకనేలే
యిగ్గతి శ్రీవేంకటేశుఁడు గూడెను
నిగ్గులయద్దము నీడకేకాదా

రేకు: 1208-4 నాట సం: 22-046

పల్లవి: ఇంతులఁగంటేజాలు నెవ్వరున్నా నెఱఁగవు
ఇంత కాతరించినపడే వింటికి రారాదా

చ. 1: మానరాదా ఇటువంటిమాటలు దొరలనోట
నానితేరు విన్నవారు నవ్వరా నిన్ను
కానితిట్లు దిట్టేవు కఁడు బెద్దరికాలకు
మానవుగా ఇటువంటిమాతోడచలము

చ. 2: పట్టరాదా పాయ మింత పచ్చిచేతఁరాజవు నీ-
యట్టివానందుఁ గలితే నాడరా నిన్ను
ముట్టి గొరఁ జెనకేవు మోఁచి యారజముగాను
దిట్టవౌత గంటి నాకె తేరిచూడనేఁటికి

చ. 3: వుండరాదా కొంతవడి వూరటగా జాణఁడవు
మెండుగాఁ దమకించితే మెత్తురా నిన్ను
కొండల శ్రీవేంకటేశ కూడితిని నన్ను నిట్టె
బండుబూతు లిఁక నేల పంతమెక్కె నిపుడు

రేకు: 1208-5 బౌళి సం: 22-047

పల్లవి: నీవు నాకు దాఁచనేల నిజసుద్ది
చేవదేర వేదములో చెప్పేటి సుద్ది

చ. 1: నిండెను లోకములోన నీవు గొపికలనెల్లా
అండనే బలిమిసేతువన్న సుద్ది
మెండాయ నదివొ నీమేనమామఁ జంపి
దండిమధుర సతులఁ దగిలిన సుద్ది

చ. 2: వింటిమి సీతకుఁగాను వేవేలుకోఁతులఁ గూడి
బంటతనమున పాటువడ్డ సుద్ది
కంటిమి సిగ్గువిడిచి కడు బురసతులకై
గెంటక బిత్తలేతిరిగినసుద్ది

చ. 3: నెగడె వరాహమవై నీమేనిరోఁత చూడక
పొగడి భూపతి నీవుపొందిన సుద్ది
అగడాయ శ్రీవేంకటాధిప నీ విందిరమ
తగ మెడఁగట్టుకొని దైవమైన సుద్ది

రేకు: 1208-6 రామక్రియ సం: 22-048

పల్లవి: ఇందునే బతుకవయ్య యిన్నాళ్లకైనా నీవు
కందువ గంటివిగా యిక్కడనున్నవేళను

చ. 1: ముచ్చటాఁడ గలిగెఁగా ముదిత నీకొక్కతైనా
కెచ్చురేఁగి నాతోనలిగినవేళను
వచ్చిపోఁగలిగిరిగా వాకిటికి వాడవారు
నచ్చుకొట్టి నిన్ను నే మనసు చూచేవేళను

చ. 2: యింత నవ్వఁగలిగెఁగా యిరుగు పొరుగు నీకు
చెంతల నీ నిన్ను సాదించేవేళను
పొంతనే కలిగిరిగా బుద్దులుచెప్పేవారు
దొంతులు నే నంటఁగాక తొలఁగున్న వేళను

చ. 3: దగ్గరియుండఁగల్గెఁగా తగినచుట్టాలు నీకు
సిగ్గువడి నేఁ దలవంచినవేళను
ఆగ్గమై శ్రీవేంకటేశ ఆదరించి కూడితివి
వొగ్గి నేఁ బానుపుమీఁద వొంటినున్న వేళను

రేకు: 1209-1 బౌళి సం: 22-049

పల్లవి: మా కాపని గాదు మానివి పైఁదప్పు లేదు
చేకొన్ననాయకుఁడవు నీకడమేపా

చ. 1: సిగ్గుల వెలితేకాని చేఁతలవెలితి లేదు
యెగ్గువట్టేవుసుమ్మీ నీ వీయింతిని
దిగ్గన నాకెసిబ్బితి తేరుచ కుండితే నేఁడు
నిగ్గుల నింతటిమీఁద నీకడ మేపా

చ. 2: పంతముచలమే కాని పాయము వెలితి లేదు
వంతువాసు లెంచి మోము వంచేవుసుమ్మీ
చెఁతల బుజముమీఁద చేయివేసి కుచముల
ఇంతటఁ బట్టకుండితే యీకడమేపో

చ. 3: రాఁపైనకడమేకాని రతులవెలితి లేదు
కొపగించెనంటాను కొంకెవుసుమ్మీ
యేపున శ్రీవేంకటేశ ఇంతి నిన్నుఁ దానె కూడె
నీపడఁతి నెడసితే నీకడమేపో

రేకు: 1209-2 సామంతం సం: 22-050

పల్లవి: వద్దనకురే నన్నునేల వలలఁబెట్టినే
పొద్దువొద్దునకు నెగపోసీనే రమణుఁడు

చ. 1: వూరకుండఁగానే వొకటొకటే తలఁపించి
ఆరీతిఁ గొసరి మాటలాడింపించీనే
మేరతోఁ దలవంచితే మిక్కిలి మాయలు సేసి
చేరి తానేమైనఁ జూపించీనే రమణుఁడు

చ. 2: మఱచి నిద్రించేవారిమర్మపుఁ గళలు రేఁచి
గిఱిగొన మేను పులకింపించీనే
గుఱిగా నేఁ బాడఁగాను కొనగోర గిలిగించి
నఱుజుగా సెలవుల నవ్వింపించీనే

చ. 3: అచ్చపుసాజాన నుంటే నండనే పానుపు చేరి
పచ్చిచేసి నన్ను సిగ్గుపరపించీనే
యిచ్చల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడి
ముచ్చటాడి నాచేత మొక్కింపించు కొనీనే

రేకు: 1209-3 ముఖారి సం: 22-051

పల్లవి: అన్నియు మరుఁడెఱుఁగు నౌనే తాను
సన్ననేసి కాననీనిజౌణఁడే తాను

చ. 1: ఆసలాసలఁబెట్టి అలయించుటాఁగాక
వేసాలకు నున్సురినీ వేళమే తాను
బాసవేసి యింతలెనె పాడి దప్పుటాఁగాక
దోసాన కొడిగట్టీని దొడ్డఁవాడే తాను

చ. 2: పచ్చిమాఁటలాడి నన్ను భ్రమయించుటాఁగాక
నచ్చుకోట్టికొంతగొంత నవ్వీనే తాను
కుచ్చి నన్ను దగ్గరుచు గోరు దాఁకించుటాఁగాక
పెచ్చుగాఁ బెట్టకుమంటాఁ బెనఁగీనే తాను

చ. 3: గక్కనఁ గాఁగిటిలోనేఁ గరఁగించుటాఁగాక
ముక్కుమీఁద నొంటివేలు మోపీనే తాను
పక్కన రతుల సరి పంతమాడుటాఁగాక
యెక్కుడైన శ్రీవేంకటేశుఁడే తాను

రేకు: 1209-4 సాళంగం సం: 22-052

పల్లవి: ఏమిసేయవచ్చుఁ దొల్లి యిటు నోఁచినఁతేకాక
వోమిననీమాఁట నీకే నొప్పనాయఁగా

చ. 1: ఆకడనే వుండ వేడుకాయఁగా నీకు నే-
నీకడ నీకు వలచి యిటులుండఁగా
ఆకెమోము చూచుటే పనాయఁగా నీకు నేఁడు
పైకొని నీదిక్కు నేఁ దప్పకచూడఁగాను

చ. 2: మంతనమందే నీకు మనసాయఁగా నేఁ
జింతతో నీకుఁగా మరిఁ చెదరఁగాను
పొంత జాణతనమందే పొద్దువోయఁగా యీడ
వింతనీవిరహన నే వేగించఁగాను

చ. 3: తగునాకాఁగిట నాకె తలపాయఁగా నీకు
బిగువుఁగాఁగిట నేఁ బెనచఁగాను
నగుతా శ్రీవేంకటేశ నన్ను భ్రమయించితిగా నేఁ
బగటురతుల నీతోఁ బంతమాడఁగాను

రేకు:	1209-5 శంకరాభరణం	సం:	22-053

పల్లవి:	ఆనతియ్యఁగదవయ్య ఆకడనీకడ నీకు
తానకపుఁ గానుకలు దక్కెనో దక్కదో

చ. 1:	మోవితేనెబోనాలు మోసునవ్వుమోనాలు
ఆవలఁ జెలి యొకతె అంపె నీకదే
కావికంటికుంకుమలు కమ్మపూర్పుసురటులు
యీవలనీ కంపితిని యెక్కెనో యెక్కదో

చ. 2:	చేసన్నవీడేలు చిమ్ముగోరి మేడేలు
పోసరించి వేరొకతె పుత్తెంచె నీకు
యీసుఁజెమటపన్నీరు యింపుగాఁకలరతులు
వాసికి నే నంపితిని వచ్చెనో రాదో

చ. 3:	పలుకులకప్పురాలు భావరతిచప్పరాలు
యెలమి శ్రీవేంకటేశ యిచ్చె నెవ్వతో
బలుసరసపు మొక్కుపాన్పుపై కూటమిచొక్కు
తలఁగక నీ కిచ్చితి తని సెనో తనియదో

రేకు: 1209-6 తెలుగుగాంబోది సం: 22-054

పల్లవి: చెలువుఁడ విదె నీచీ త్తముకొలఁ దిఁక
వలచినసతి నటు వదలేనా

చ. 1: యేరీతి నీవివు డెరవుగ నడచిన
కూరిమి నే నీఁకఁ గొసరేనా
పొరచికాంతలపొందుల బొంకిన-
తారుకొణలకుఁ దగిలేనా

చ. 2: పాదగునీమై పచ్చిగ నడచిన
వాదులకును నే వచ్చేనా
యేదెసనుండైన యీపొద్దు వచ్చిన
కాదు గూడదని కసరేనా

చ. 3: యెంగిలియేనితో యిటు నన్నుఁ గూడిన
అంగములంటక అలిగేనా
చెంగటఁ జొక్కితి శ్రీవేంకటేశ్వర
వెంగలినీరతికి వెఱచేనా

రేకు: 1210-1 వరాళి సం: 22-055

పల్లవి: దక్కినంతే చాలదా తమక మంతేశాల
కక్కసాన యింతలేసి కతలేలే తనకు

చ. 1: మన తన కిచ్చితి మాటలు నే నాడఁగాని
వినయ మేఁటికిఁ జేసీ విడుమనవె
చనవు దనకిచ్చితి సరసములాడఁగాని
ననుపుల యింతలేసి నవ్వులేలె తనకు

చ. 2: గక్కనఁ బ్రాణ మిచ్చితి కాయ మంటనియ్యఁగాని
తక్కినబాస లింతేల తలమనవే
చక్కఁజూడనిచ్చితిని సమకూడరాఁ గాని
వక్కణించి పేరఁ బిలువఁగనేలే తరకు

చ. 3: సేసనవెట్టనిచ్చితిని జీరదియ్యనియ్యఁ గాని
వాసులెక్కించేపంతము వలదనవే
యీసుదీర శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
ఆసల రతికిఁ జొచ్చి అలుపేలే తనకు

రేకు: 1210-2 లలిత సం: 22-056

పల్లవి: విన్న వించితిమి ముందే వెనక నెఱఁగ రాదు
పన్ని మాటదప్పితేనే పచ్చిదేరుసుమ్మీ

చ. 1: మదనుఁడెక్కెడితేజిమాటలాడే దీచెలియ
వదనము చంద్రునివంటిది
యెదుటఁగోవిలకూఁత దీకెతో నీ వెన్నఁడైనా
పదరి నీ వలిగితేఁ బై వచ్చుఁజుమ్మీ

చ. 2: కారుమెఱుఁగులవంటికన్నులమించుల దీకె
తోరపు మేఘమువంటితురుమది
నారసపువిరులలేనవ్వుల దీపెతోడ
చేరి మారుకొంటేను చిమ్మిరేఁచుఁ జుమ్మీ

చ. 3: కెలనఁ జుట్టు కొనే తీగెలవంటిచేతులది
వులుకుగాలివంటివూరుపులది
బలిమి శ్రీవేంకటేశ పాలించితి వింతిఁ గూడి
తులదూఁగకున్న రతి దూరుసేసుఁ జుమ్మీ

రేకు: 1210-3 సామంతం సం: 22-057

పల్లవి: మర్మములే వేరుగాని మనసు లొక్కటేపో
కూర్ములే వింతలుగాని గుణము లొక్కటేపా

చ. 1: రెప్పలే యడ్డముగాని రేపుమాపు మీలోన
కప్పి చూపులు కలసికనిపించుఁబో
అప్పటి గుచగిరులే అఁ నేటియడ్డముగాని
వొప్పుగుఁగాఁగిలి సదా వొక్కటియాయఁబొ

చ. 2: మోవులే యడ్డము గాని ముంపుమోవితీపుతేనె
తోవల నొకటొకటి తొరలించెఁబో
యీవల మేను మేను ఇవి రెండింతేకాని
సావధాన మిద్దరికి సమరతే పో

చ. 3: రేకలే పెక్కులుగాని రెట్టించి ఇద్దరికి
యీకడ మరుగురుతు లి వొక్కటేపో
చేకొను శ్రీవేంకటేశు చెంత నలమేలుమంగ
పైకొనుమోహము లనుభావన లొక్కటేపో

రేకు: 1210-4 ముఖారి సం: 22-058

పల్లవి: ఐనపని యాయఁగాక అవుఁగాము లిఁకనేలె
సేనా సేనలు గంటి చెప్పనేలే మాఁట

చ. 1: కన్నులకెం పది దేరె కాఁకలనే తెల్లవారె
యెన్నఁగ తనవో నింకా నేలే మాఁట
సన్నపుఁజెమట రేఁగె జాజుఁబులకలే మూఁగె
యిన్నిటికి నోచితి నే నిఁకనేలే మాఁట

చ. 2: మోమున కళలు మించె మోవికెంపు లంగమించె
యేమిటికి తనతో నింకేలే మాఁట
కామునేటు మేనఁ దేలె గందపుబేంట్లు రాలె
యీమరఁగు వింటిఁ గంటి నిఁకనేలే మాఁట

చ. 3: కడసారెఁ గాఁగిలించె కై వశమై నాకుఁ బొంచె
యెడప తగవు దేరె నేలే మాఁట
అడరి శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
యెడమిచ్చి సంతసము లిఁకనేలే మాఁట

రేకు: 1210-5 దేవగాంధారి సం: 22-059

పల్లవి: పాలుగారీ చెక్కంటితే పసిబిడ్డఁడూ చన్ను-
బాలంటే పెదవులు చప్పరించీ బిడ్డఁడూ

చ. 1: కాచేపూచేమాకులైన కడలకు దొబ్బీని
చేచేతనెత్తిన వారి చేతిబిడ్డఁడు
వాచవికి యిండ్లు చోచ్చెవ్వరికుండలైనా దొబ్బీ
యేచాయ నేమఱకురే యెఱఁగఁడు బిడ్డఁడు

చ. 2: కొరముట్టుబండియైన కూలఁ గాలఁ దన్నీని
యిరివై పాములమడు గీఁదఁజొచ్చీవి
మరుగ నావులఁగాచి మల్లరాల విరిచీని
సరుగ బుద్ధిచెప్పరే చలమరిబిడ్డఁడు

చ. 3: వచ్చివచ్చి వయసెక్క వనితల వలపించీ
కుచ్చిపట్టి కొండ గొడగుగ నెత్తీని
అచ్చపు శ్రీవేంకటేశుఁ డందరిపాలిటివాఁడు
యిచ్చలాడి మెపంచరే యే తులాఁడీ బిడ్డఁడు

రేకు: 1210-6 రామక్రియ సం: 22-060

పల్లవి: మాతో మాఁటలు మరి యేలాడేవు
తోతో నీకింక దొరకెఁగా నేఁడు

చ. 1: నిండునిదానము నెలతఁజఘన మిది
కొండలు కోట్లు గురుకుచంబు లివె
పండినపంటలు పలుకుటధర మిది
అండనె రమణుడ అబ్బెఁగా నీకు

చ. 2: తమ్మివనంబులు తరుణిపాదములు
కమ్మినకరములు కల్పకశాఖలు
పుమ్మిడి వయ సిది పూరెడియమృతము
కమ్మర నీ కిదె కలిగెఁగా నేఁడు

చ. 3: తరుణివదనమఁదపుఁ దోరణములు
కెరలినకాఁగిలి గృహప్రవేశము
యిరవుగ శ్రీవేంకటేశ నీకు రతి
సిరుల నీకెతోఁ జెల్లెఁగా నీకు

రేకు: 1211-1 కాంబోది సం: 22-061

పల్లవి: మానరమ్మ చెలులాల మరి పను లింకనేల
కానీలేరే వొడఁబాట్లక్కడ నయ్యీఁగాని

చ. 1: మనసెనయనిచోట మాటాడిన మాట గాదు
చెనకిన కడుఁగడు చేఁదుగాని
ననుపులేనిచోట నవ్వినా నవ్వు గాదు
వొనరఁగఁ బైఁజల్లేవుడుకులేకాని

చ. 2: కూరిమిలేనిచోట కూడినాఁ గూటమి గాదు
ఆరీతి నుండెడిరిఆఁకలుగాని
మోరతోపులైనచోట మొక్కినా మొక్కు గాదు
వేరోక్కజాడలైనవెంగెముగాని

చ. 3: యింపులమేనచోటి కేమన్నా నెగ్గు గాదు
జంపులమోహములోనిసటలు గాని
తెంపున శ్రీవేంకటాద్రిదేవుఁడిట్టె నన్నుఁ గూడె
ముంపులపోరామి గాదు మోహమేకాని

రేకు: 1211-2 మేచబౌళి సం: 22-062

పల్లవి: చెప్పినవారిబుద్దులు సేయవైతిగా
కప్పురపుమోవెల్లఁ గడువాడెఁజుమ్మీ

చ. 1: దువ్వటపుచంద్రగావి తోప్పదోఁగెఁ జెమటల
నవ్వకుమన్న మానవు నాయకునితో
పువ్వులు గొయకుమంటే పురుషునియెదుటను
చివ్వన మరునమ్ములు చేయినాటకుండునా

చ. 2: గాఁటపునిట్టూర్పులు కసిరితేఁ బతితోడ
మాటలాడమకున్నాను మానవైతిగా
మేఁటితురుమెల్లా జారె మిక్కిలిరమణునితో
వాటపుసరసములు వద్దంటిఁగా

చ. 3: పూసినకుంకుమపూఁత పులకలఁ బేట్లైతై
ఆసలఁ బ్రాణేశ్వరు నంటుకోఁగాను
మేసులఁ బరవశము మీఁదమీఁద నబ్బె నదె
బాసల శ్రీవేంకటేశుఁ బై కొనితే నంటిఁగా

రేకు: 1211-3 సామంతం సం: 22-063

పల్లవి: అందరి కొక్కటే చాలే ఆండ్లకు మొగలకు
ముందటెత్తు వేరె నీతో మోవనాడవలెనా

చ. 1: వలపుల యీఁది యీఁది వాసులకే లోఁగిలోఁగి
అలుకలే తవ్వితవ్వి యట్టే నవ్వి
చెలఁగేటివిరహివి చింత మాన్ప నెఱఁగవా
చెలి నింతే నీకు నేను చెప్పిచూపవలెనా

చ. 2: బలిమై చేయి చాఁచిచాఁచి పంతాన మెయిదోఁచితోఁచి
పలుకాఁకఁ గందికంది భామలఁ బొంది
కులుకు జాణఁడవు నాకోర్కి దీర్చనెఱఁగవా
ఇల నే జవ్వని నింతే ఇంతరట్టువలెనా

చ. 3: పలుకులే చల్లి చల్లి పారిపారి మళ్లీమళ్లీ
వలరాచపనులకే వయ్యాళి వెళ్లి
తలఁచి శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
వెలయు నీదేవి నింతే వేఁడుకొనవలెనా

రేకు: 1211-4 బౌళి సం: 22-064

పల్లవి: పసిఁడి చీరవాఁడవు పాలుదచ్చితివిగాన
పసిఁడిఁబోలినది చేపట్టెను నీకరము

చ. 1: తొలుతనే చందురునితోడఁ బుట్టుగనక
పొలుపుజందురుమోము పోలికై నది
కళల చింతామణికందువచెల్లెలుగాన
తళుకుమానికపు దంతములఁ బోలినది

చ. 2: మంచి యైరావతముతో మగువ సైదోడుగాన
ముంచిన కరిగమనముఁ బోలినది
పంచలఁ బారిజాతపు బావపు సోదరిగాన
యెంచఁగ చిగురుఁ బోలె నీకెపాదములు

చ. 3: తామెరతొట్టెలలోన తగిలి తానుండుఁ గాన
తామెరకన్నులఁబోలి తనరినది
యీమేర విన్నిటాఁ బోలి ఇన్నిలక్షణములతో
నీమేన శ్రీవేంకటేశ నెలవై నిల్చినది

రేకు: 1211-5 గుజ్జరి సం: 22-065

పల్లవి: ఆఁటదాన నవుట తప్పా అంతేకాదా
ఆటపాటలాయ బదు కంతేకాదా

చ. 1: కొంగువట్టి తియ్యఁగాను గోరుదాఁకి యిందరిలో
అంగమెల్లాఁ బులకించె నంతేకాదా
వుంగిటిగా మగనాలి కుండరాదా వూరి లోన
అంగభంగాలఁబెట్టెవు అంతేకాదా

చ. 2: మేరమీరి నగఁగాను మీఁదమీఁద జెక్కులెల్లా
ఆరితేరి చెమరించె నంతేకాదా
వూరికే వోయమ్మ నీకు వుండవయ్య వెఱతుము
ఆరవితాప మందించే వంతేకాదా

చ. 3: ఆకుమడిచి కొమ్మంటా ఆనవెట్టే వండనుండి
ఆకడివారు చూచేరు అంతేకాదా
చేకొని శ్రీవేంకటేశ చేయిమీరి కూడితివి
ఆకెసుద్దులు చెప్పేవు అంతేకాదా

రేకు: 1211-6 కాంబోది సం: 22-066

పల్లవి: ఉండనుండఁ దరితీపు లొగరాయఁగా
పండినవలపులెల్లాఁ బచ్చియాయఁగా

చ. 1: వాలాయించి మాయింటికే వచ్చేనన్నవాఁడు నేఁడు
లేలే ఆకెయింటి కేఁగె లెస్సాయఁగా
నాలిసేసి నన్ను నింత నమ్మించి యిట్టె తాను
తాలిమిఁ బరాకు సేసిఁ దగవాయఁగా

చ. 2: యీరీతి నేనాడినట్టి యేకతపుముచ్చటలు
మేరతో నాకెకుఁ జెప్ప మెచ్చాయఁగా
పారితెంచి త త్తరానఁ బానుపుమీఁదికి వచ్చి
జారువలపులు చల్లీ సంగతాయఁగా

చ. 3: నాకు లోనై యింతలోనే నగుతానే నన్నుఁ గూడి
అకెను నాతోనే తిట్టీ నరుదాయఁగా
పైకొని శ్రీవేంకటాద్రిపతిగాన యీమాయలు
జోకతోఁ దనకే చెల్లు సోద్యమాయఁగా

రేకు: 1212-1 లలిత సం: 22-067

పల్లవి: ఏఁటికి వెరపనేల యిందుకుఁగా నే నీకు
సూటిగా తప్పక నీవు చూతవు గాక

చ. 1: చలము నీకు జెల్లితే సాదించ నాకుఁ జెల్లదా నీ-
చలమి రాజ్యమేలితే ఏలుదు గాక
బలిమి నీకుఁ జెల్లితే పంతము నాకుఁ జెల్లదా
కులి కెంతగొపించిన కోపింతుగాక

చ. 2: గుట్టు నీకింత చెల్లితే గుంపించ నాకుఁ జెల్లదా
జట్టిగాఁ బగచాటితే చాటుదుగాక
తిట్ట నీకు జెల్లితేను తెగువ నాకుఁ జెల్లదా
పట్టి యెగ్గు నీవెంతైనాఁ బట్టుదుగాక

చ. 3: నయము నీవాడితేను నగ నాకుఁ జెల్లదా
బయలుబందె వట్టితేఁ బట్టుదు గాక
ప్రియమై శ్రీవేంకటేశ బెనఁగి నన్నుఁ గూడితి
క్రియతో కళరేఁచితే రేఁతువుగాక

రేకు: 1212-2 ముఖారి సం: 22-068

పల్లవి: కోపము గాదు తనతో గుట్టుదెలియకకాని
పోపో యెక్కడిసుద్ది బూటకమా తాను

చ. 1: మనసు దెలియఁగాక మాటలు నాకొకదొడ్డా
తనవంకనే మోనము తనరె నాకు
అనఁగానే యెదిరికి నలుకై తోఁచె నిది
పనిలేనిపని నాకుఁ బగవాఁడా తాను

చ. 2: సెలవు వినకేశాక చేఁతలు నాకొకదొడ్డా
చలము దనవంకనే జడిసీ నాకు
యిల నిది నిందరికి నెగసక్కెమైతోఁచీ
వలవని ఋట్టు గాక వాదువాఁడా తాను

చ. 3: కాఁక లుండఁగాఁగాక కాఁగిలి నాకొకదొడ్డా
వీఁకలు దనవంకనే వెలసీ నాకు
యేఁకట వాయ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
మాఁకువలె మైమఱచె మాయకాఁడా తాను

రేకు: 1212-3 బౌళి సం: 22-069

పల్లవి: ఓయమ్మ నీలిబిడ్డఁ దొయమ్మ
యీయెడ యశోద నీవెట్టు గంటివమ్మ

చ. 1: గాలిగొట్టై తిరిగినగామిడివాఁ దొయమ్మ
గోలవలెనుండుఁగాని కోడెకాఁడమ్మా
తాలిమి యించుకాలేదొతరువరివాఁడమ్మ
ఆలరీఁడు నీబిడ్డఁ డదె బుద్ధిచెప్పరో

చ. 2: కడలేనిసాహసాల గట్టు వాయివాఁడమ్మ
తడమారి ఇందరిలో తాటఁగట్టమ్మ
ముడికారితనముల మునిముచ్చువాఁడమ్మ
బడిబడి నుద్దండపనులు మానుపవో

చ. 3: శ్రీవేంకటాద్రిమీఁది సేఁతలయేతులవాఁడు
వావాత నుడుగులవడ్డి నాఁడు
వేవేలు దూరినాను విడువక మమ్ము నేలె
వోవల మాతప్పులెల్ల నోరుచుకొమ్మనవో

రేకు: 1212-4 దేసాళం సం: 22-070

పల్లవి: చెల్లనిచేఁతలు మీరు సేసేరు గాక
గొల్లెతలు హరితోడ గోసనాస యేఁటికే

చ. 1: బాలుని నవ్వకురమ్మ పాలదొంగ వీఁడంటా
యేలే మీతో పిన్నవాఁడు ఇంతకోపునా
గేలిసేయకురేయమ్మ గీరలు మెయిఁ దీసెనంటా
నీలవర్ణుఁ డిందునెల్లా నేర్చవచ్చెనా

చ. 2: యేడుపించకు రేయమ్మ యెంగిలిముద్దిచ్చేమంటా
చూడఁ బిన్నవానితోడ సుద్దు లింతేలే
ఆడుకోకురమ్మ సిగ్గు లందరివీఁ జూచెనంటా
యీడుగానివారితోడ నెగ్గు లింత గలదా

చ. 3: చెక్కులు గిల్లకురమ్మ చేఁతలెల్లఁ జేసీనంటా
పెక్కులు నేరుతుమంటాఁ బేలనేఁటికే
యెక్కుడు శ్రీవేంకటేశుఁ డిన్నిటా మిమ్మేలువాఁడు
చక్కనిబిడ్డని నింత సాదించనేఁటికే

రేకు: 1212-5 ఆహిరి సం: 22-071

పల్లవి: ఎన్నఁడు బానెఱఁగము యింతదడ వీసతిని
కన్నె నింత గిజిగిజిగాఁ జేతురా

చ. 1: చెంపల కుడులు జారె చెమట నిండా నూరె
అంపలేవు చెలి నింకా నలవిలేదా
ఇంపున దొమతెరలో నింత దడవుసేసితి
సొంపుల మమ్మికెమోము చూడనీరాదా

చ. 2: నిలువెల్లఁ బులకించె నిట్టూర్పు వెఁమ్మి రేఁగె
అలమి పైఁ జేయివేసే వాసోదమా
నిలువుల మేడమీఁద నిన్న నెల్లా నుండితివి
కలికిని వమాఇంటిదాఁకా రానీరాదా

చ. 3: కన్నుల నిద్దుర దేరీ కందువ పయ్యద జారీ
అన్నువఁ దొడపైఁ బండే వది యేమయ్య
పన్నినశ్రీవేంకటాద్రిపతి వింతి నురముపై
వున్నతి నిడుకొంటివి వొద్ద నుండేమయ్యా

రేకు: 1212-6 ఆరి సం: 22-072

పల్లవి: చెప్పిపంప నింత యేలే చెలులచే సారెసారె
యెప్పుడును తనబుద్ధి కెదురాడలేనే

చ. 1: తనతో నేఁ గోపగించి తనదిక్కు చూడకున్న
సునిసి తా నున్న మేడ చూడకుండలేనే
మనసిచ్చి తాను నేను మాటలాడకుండినా తా-
ననిపినచెలితో మాటాడకుండలేనే

చ. 2: కొంకి తన్నంట నేనని గొప్పవొట్టు వెట్టుకొన్న
అంకె దాఁబండేపరపు అంటకుండలేనే
నంటుచేసి తనతోనే నవ్వుది నవ్వకుండినాను
గెంటుఁదనమేనిపచ్చికి నవ్వకుండలేనే

చ. 3: సమరతి నలయక చలముదించకుండినా
ఆమరఁగఁ బరవశమందకుండలేనే
తెమలి శ్రీవేంకటాద్రిదేవుఁ డింత సేసి కూడె
కొమెరవయసునసిగ్గులు మానలేనే

రేకు: 1213-1 అమరసింధు సం: 22-073

పల్లవి: నవ్వువచ్చీ నిన్నుఁజూచి నాకు నేఁడుయీా -
రవ్వలు నీకే చెల్లు రాజసపుదేవుఁడా

చ. 1: సతికుచములు మోవ సాముచేసినటువలె
సతముగా మోచేవు శంఖచక్రములు
మతకాన వేఁడుకొనేమార్గమున నున్నట్టు
తతి నభయహస్తము తప్పవు నీ విపుడు

చ. 2: కామిని నలమిపట్టేగతి అలవాటుగా
యెమరవు కటిహస్త మెంతైనా నీవు
నేమమున ఆకెరాక నిక్కిచూచేమతకాన
కోమలపు నీకు నిల్వుఁగొలువులే ఇపుడు

చ. 3: అంకె నుపరిసురత మలవాటు చెడకుండా
వుంకువ శ్రీసతి మోచే వురమునను
అంకపుశ్రీవేంకటేశ అంది మమ్ముఁగాచేటి -
పొంకమున మన్ననచూపులు చల్లే విదిగో

రేకు: 1213-2 బౌళి సం: 22-074

పల్లవి: చెల్లుబడిగలవాఁడు సేసినంతాఁ జెల్లెఁ గాక
వొల్లనే రెండూ నడపి వొద్దనేమా నేము

చ. 1: తప్పకచూచినవాఁడు తలవంచఁ దనకేలే
అప్పుడే యెవ్వరైనాఁ దన్నా డేరా
చెప్పితే గుబ్బినేవాఁడు చేరి నవ్వఁ దనకేలే
తపలు నెగ్గులు వట్టి తన్ను సొలసేరా

చ. 2: వేఁడుకొనేవాఁడు తాను వీరుత్తరములేలే
నేఁడే తన కింతలో నీటువొయీనా
ఆఁడువారిసాదించువాఁ డందరిఁ దగులనేలే
పోఁడిమిఁ దనగుణము బూమెల్ల నెఱఁగదా

చ. 3: వొరుల బోదించువాఁడు వుప్పరాలెగయనేలే
వోరిమైనగుణముతో నుండరాదా
సిరులమించినతాను శ్రీవేంకటాద్రివాఁడు
కరఁగించి నన్నుఁ గూడె కాదనఁబొయ్యేనా

రేకు: 1213-3 లలిత సం: 22-075

పల్లవి: అంతకోపుదుమా నేము ఆవునే తాను
పంతమా నాతో వింత భళా తాను

చ. 1: రెప్పలెత్తి నన్నుఁ జూచె రేసులకే తలవంచె -
నప్పటిని మగనాలి నద్దో తాను
తప్పక మోము గిరిపె తనలోనే తానవ్వె
ఇపుడే తా మానఁడుగా యెవ్వఁడే తాను

చ. 2: వచ్చివచ్చి వేఁడుకొనీ వద్దంటేఁ గోపగించీ
అచ్చలము నాతోనేల అప్పటిఁ దాను
రచ్చల నెమ్మెలు చూపి రాజనంటాఁ బచ్చిసేసీ
యెచ్చుకుందు తనకు నా కేడకేడే తాను

చ. 3: బుద్ధులు చెప్పఁగ వచ్చి పూఁచినవాకిళ్లు దాఁటి
అద్దమరేతిరికాడ నాయఁగా తాను
దిద్దుచు శ్రీవేంకటాద్రిదేవుఁడు నన్నిటు గూడె
వొద్ద నుండి ఇంత సేయ నోపునా తాను

రేకు: 1213-4 శ్రీరాగం సం: 22-076

పల్లవి: కొప మింతలో నేలే యెదురుదురనే వుండి కోసరినాఁ గొంతగాక
పైపైనే వున్నాఁడు చెయిపట్టి తియ్యఁగదే పంతగాఁడుగదె నీకంటెను

చ. 1: మెత్తనిమాఁటేలాడేవే అతనితో మేకులైనాఁ గొంతగాక
పొత్తు లేకుండితేనే అతనికి నీకుఁ బండి పొల్లవొయనా వలపు
చిత్తమేల చిన్నఁబోయేవే పైపడి చెనకినఁ గొంతఁగాక
హత్తి యాడలనుండెఁగాని తమియెల్ల నీపైనే అతనికి నీకంటెను

చ. 2: సారెసానేల మొక్కేవే యాతిని సాదించినాఁ గొంతగాక
తారి చూడకుండితే నిమిషములోననే తతిదప్పినా వయసు
నేరమేల యెంచుకొనేవే పతివద్ద నిండుకున్నాఁ గొంతగాక
కేరికేరి నవ్వేఁగాని అతఁడు దగ్గరితే కిందుపడు నీకంటెను

చ. 3: సిగ్గున నీవేల కొంకేవే గోరికొనఁ జిమ్మినాఁ గొంత గాక
వొగ్గి కాఁగిలించితేనే అతనినీసంది వుడివొయనా చలము
యెగ్గులేల యిఁకఁ బట్టేనేఁ శ్రీవేంకటేశ్వరుఁ డిదె కూడెను
అగ్గపు నీమోవి గంటిసేసె నింతేకాని గుట్టు అతనికి నీకంటెను

రేకు: 1213-5 సాళంగం సం: 22-077

పల్లవి: ఇదివో సుద్దులు యీరేపల్లెను
కదిసి యిందరివీఁ గైకొనవయ్యా

చ. 1: పలచనిరెప్పలఁ బగటులు నెరపుచు
సొలసి నిన్నొకతె చూచెనటా
తళుకులగోళ్ల దండె మీఁటి యదె
పలికి నిన్నొకతె పాడెనటా

చ. 2: చనవులు నెరపుచు సన్న సేయుచును
ననుపున నొక్కతె నవ్వెనటా
చెనకి యొకతె యదె చిగురుగేదఁగుల
వెనకనుండి విను వేసెనటా

చ. 3: అదన నీవు నన్నులమిపట్టఁగా
కొదలి యొకతె గని గొణఁగెనటా
యెదురనె శ్రీవేంకటేశ యొకతె నీ -
చెదరినయలకలు చెరిగెనటా

రేకు: 1213-6 వాడి సం: 22-078

పల్లవి: తానే తడవిన తడవేఁగా కిఁక
రానీవే తతీ రఁతిఁకనేలా

చ. 1: నవ్వనిపతితో నవ్వఁగఁబోతే
యెవ్వరికైనా యింపౌనా
పువ్వులవాసన పూఁపల మొగ్గల
రవ్వగ వెదకిన రచనలఁ గలదా

చ. 2: పలుకనిపతితో పలుకఁగఁబోతే
చలమున మతికిని చవులౌనా
లలి నామనికాలపుకోవిలగమి
నలుగడ లెపుడైనాఁ బలికీనా

చ. 3: మోహపుపతితో మొరఁగు చూపితే
ఆహ వుచితము లవి యవునా
యీహల శ్రీవేంకటేశుఁడు గూడెను
వూహజక్కవల కుదయమెకాదా

రేకు: 1214-1 శంకరాభరణం సం: 22-079

పల్లవి: చేతులారాఁ జేఁతలేల చెల్లదిఁకను
నాతి యెవ్వతో తన్ను నవ్వుఁబాటుచేసెను

చ. 1: మాటాడకుమనవే మాణిక్యాలు మోవి రాలీ -
నాఁటది యెవ్వతో తన్ను నంత చేసెను
నాఁటఁజూడకుమనవే నవ్వు ముత్యా లవె రాలి
గాఁటాన నెవ్వతో తన్నుఁగడు రట్టుచేసెను

చ. 2: అడుచిడకుమనవే అంటినగందాలు రాలీ
పడఁతి యెవ్వతో తన్నుఁ బచ్చిచేసేను
కడు మొక్కమనవే కామునిఅమ్ములు రాలీ
చిడుముడి యెవ్వతో సేసవెట్టెఁ దనకు

చ. 3: అంగ మంటకుమనవే అయపుఁగళలు రేఁగీ -
నంగన యెవ్వతో తన్ను నలవరచె
ఇంగితాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
సంగతాయ నితరాలు చాలించుమనవె

రేకు: 1214-2 సామంతం సం: 22-080

పల్లవి: నీవంటివారమే నేము నింతకతొల్లి
లేవమ్మ అందుకేమి లెస్సాయనమ్మా

చ. 1: వలపు సిగ్గెఱఁగదు వడి నెట్టివారికైనా
కలిమి వెనకముందు గానరాదు
బలిమి తగవెంచదు పైపై నిందరికి నో -
వెలఁది నీతలనే వేఁగెనటవమ్మా

చ. 2: వయసు వెరపెంచునా వాసులే యెక్కించుఁగాక
బయకారికపటము బాసలెంచునా
నయగారిగర్వము వినయమెంచునా యీ -
క్రియలెల్ల నీతలనే కెరలి వచ్చెనటే

చ. 3: రతి యలయికెంచునా రారాఁపుచేసుగాక
యితవైన చుట్టరిక మెగ్గులెంచునా
సతిరో శ్రీవేంకటేశు సరుసఁ గూడి నా -
మతి దక్కఁగొంటివి నీమనసెల్ల వచ్చెనా

రేకు: 1214-3 తెలుగుగాంబోది సం: 22-081

పల్లవి: ఔఁగాదనలే మంతటినిను నిటు
దాఁగిననీవలపైన తలఁపించదు గా

చ. 1: నిలువునఁ గరఁగి నివ్వెరగంది
నెలఁత వుస్సురనీ నీకుఁగానే
తలఁచవు తాఁకవు దగ్గరిరా విటు
పెలుచుమరుఁడైనాఁ బెరరేఁచఁడుగా

చ. 2: చెమటలఁ దోఁగి చింతల మునిఁగి
తమకము మీఁదెత్తెఁ దరుణి నీకే
తెమలవు తెరలవు దిష్టించిచూడవు
జమళివయసులైన చవిపుట్టించదుగా

చ. 3: యెదురుగ నేతెంచి నెడమాటలాడించి
కదిసి నిన్నింతలోనే కాఁగిలించీ
చెదరవు బెదరవు శ్రీవేంకటేశ యీకె
పొదిగినకూటమైనా పొదిసేయదుగా

రేకు: 1214-4 వరాళి సం: 22-082

పల్లవి: చాలుఁజాలుననవే జాణతనాలు
కోలుముందాయఁ బనులు కొస రింకానేఁటికే

చ. 1: చిగురుఁజేతలు గొన్ని చేఁగలచేఁతలు గొన్ని
నగుతా రెండూ నాతో నడపనేల
మొగములోఁ గానరాదా మోహము తనకు నాపై
వొగరులపులుసుల వొట్టు లింకానేఁటికే

చ. 2: వెచ్చినమాటలు గొన్ని వేవనిమాటలు గొన్ని
లిఁచ్చముగా నాతో నాడీనేలే
ముచ్చటనే కానరాదా ముంచినతననిజము
నచ్చుకొట్టి నాతో నవ్వు లింకానేఁటికే

చ. 3: పూఁచినసిగ్గులు గొన్ని పువ్వక సిగ్గులు గొన్ని
యేఁచి నాకాఁగిటిలోన యేల చల్లీనే
యీచాయ శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
చూచిచూచి నన్నేల చొక్కులఁ బెట్టీనే

రేకు: 1214-5 మాళవిగౌళ సం: 22-083

పల్లవి: కొంత నిలుపఁగరాదు కొంచేవు వొక్కమారే
యింతాఁ దీరిన మరి యేమిసేసేవే

చ. 1: కొప్పు వీడినదాఁకా కుచము లదరుదాఁకా
యిప్పుడే అంత నీవు యేలనవ్వేవే
రెప్పలణఁచినదాఁకా రేవులురేవులుగాను
అప్పటిఁ దప్పక నన్ను అదేల చూచేవే

చ. 2: పెదవు లెండినదాఁకా చెదరేయేలుఁగుదాఁకా
మదముదొలఁక నేల మాఁటలాడేవే
నిదుర ముంచినదాఁకా నివ్వెరగందినదాఁకా
సదమదమై యేల సరసమాడేవే

చ. 3: నిండాఁ జెమరించుదాఁకా నిట్టూర్పు రేఁగేఁనదాఁకా
అండనే రతులనేల అలఇంచేవే
పండినశ్రీవేంకటాద్రిపతి నేనే కూడితిని
పండే మంచ మెక్కేదాఁకా పదరనేమిటికే

రేకు: 1214-6 శుద్ధవసంతం సం: 22-084

పల్లవి: దంటమనసుగలతనకేమే వెను -
వెంట నబలగన వెరచీఁ గాక

చ. 1: మరు గురుఁడట తా మరువిరిశరములు
ధరఁ దను నేఁచవు తనకేమే
విరులే కొయుచు వేయుచు ముడిచేటి -
తరుణులముగనక తడవీఁగాక

చ. 2: వెడశశిబావట వెన్నెలయెండలు
తడవవు తను నీకఁ దనకేమే
జడియుచు మోముల చందురుగెలిచేటి-
పడఁతులముగనక పరచీఁగాక

చ. 3: యేఁకట వాయుజు నేలెఁగనక తనుఁ
దాఁకదు వాయువు దనకేమే
కాఁకదేర శ్రీవేంకటపతి తా నన్నేలె
వేఁకపుగిరికుచఁ గన విసరీఁగాక

రేకు: 1215-1 కేదారగౌళ సం: 22-085

పల్లవి: ఎగ్గానో తప్పానో యేమీననఁగఁజాల
ఆగ్గలపునీచిత్త మానతియ్యవయ్యా

చ. 1: అంటుదునో ఆంటవద్దో ఆయము సోఁకెననేవో
వెంట వత్తునో వద్దో వెంగెమనేవో
జంటై వుందునో వద్దో సారె నమ్మలేవఁననేవో
బంట పంతాలికఁనేల పలుకఁగదయ్యా

చ. 2: ఆడుదునో ఆడవద్దో ఆఅడిసేసేననేవో
వీడెమిత్తునో వద్దో వేసటనేవో
కూడఁజింతింతునో వద్దో గుట్టు నేఁ గనేననేవో
యీడనే నీగుణ మింతా నెఱిఁగించవయ్యా

చ. 3: పక్కకు వత్తునో వద్దో బాసదప్పించెననేవో
మొక్కుదునో వద్దో నీవే ముంచేవ నేవో
పక్కన శ్రీ వేంకటేశ పైపైనే కూడితివి
అక్కున నుందాన బుద్ధు లానతియ్యవయ్యా

రేకు: 1215-2 వరాళి సం: 22-086

పల్లవి: నిద్దిరించఁ బోద్దులేదు నిన్నుఁ దలఁచనేపట్టె
సుద్దులనీగుణములసోద్యాలవల్లను

చ. 1: చిత్తము చంచలమంది చిందువందుగానేపట్టే
బత్తి నీమీఁదఁ జేసిన ఫలమునను
యెత్తినశిరసుతో నీ కెదురుచూడనే పట్టె
హత్తిననీవు వచ్చేవనేయాసలాసలను

చ. 2: వొడలెల్లఁ జెమరించి వుస్సురననే పట్టె
యెడమాట లాడించేఇందువంకనే
జడియుఁగన్నీటితో జాలిఁబడనేట్టె
తడతాఁకుఁ గోరికలతమకానను

చ. 3: మిక్కిలిపరవశాన మేను మఱవఁగఁబట్టె
పిక్కటిల్లునీకాఁగిటిబిగువుననే
గక్కన శ్రీవేంకటేశ చెక్కులు మూయనేపట్టె
యిక్కువల నీవు సేసేయీచేతవల్లను

రేకు: 1215-3 శంకరాభరణం సం: 22-087

పల్లవి: రమణుఁడట రమణీనట రతుల నే నలిగేనా
తమి నేఁ జూచితిఁగాక దగ్గరఁదడవా

చ. 1: వెగటుగాఁ బిలిచీని వేగిరించేలే తన-
వగటు చూచితిఁగాక పలుకఁదడవా
మిగుల నను(బైకొనీ మీఁదమీఁద నేఁడు తన-
బిగువు చూచితిఁ గాక పెనఁగఁదడవా

చ. 2: చెనకుచును సరసములే చిమ్మీని సారెఁ దన-
ననుపు చూచితిఁగాక నవ్వఁదడవా
అనువుగా నా కిచ్చలాడీ నిదేల తన-
చనవు చూచితిఁగాక సతముగాఁ దడవా

చ. 3: గొణఁగుచును సన్న సేసి కోసరి మొక్కీని తన-
గుణము చూచితిఁగాక కూడఁదడవా
ఆణఁగ కిటు శ్రీవేంకటాధిపుఁడు గూడె నను
గణనకెక్కితిఁగాక కరఁగఁగఁదడవా

రేకు: 1215-4 శ్రీరాగం సం: 22-088

పల్లవి: చాలదా దంపతులకు జన్మసాఫల్య మిది
యీలాగు నీనేరుపులే యెందూఁ దలఁతురా

చ. 1: పరపుపైఁ బవళించి పచ్చిగానే నిన్నుఁ గూడి
సరుస మోములు చూచి సారెకు నవ్వి
సరుగఁ గెమ్మోవితీపు చవిచూచిచూచి అందు
గురుతులు సేసిన ఇక్కువలే తలఁతురా

చ. 2: పొంచి తూఁగుమంచముపై పొలఁతి తమలపాకు
చుంచుల నందుకొనుచుఁ జోక్కిచొక్కి
అంచెఁ బచ్చిమాటలాడి అంతలోనే కళలంటి
కొంచక చొక్కించినదె కోరి తలఁతురా

చ. 3: సింగారపుదోఁటలోన శ్రీవేంకటేశ నీవు
చెంగటనే నన్నుఁ గూడి చెక్కునొక్కి
పొంగేటిరతులలోన బుసకొట్టిబుసకొట్టి
అంగములే చెమరించే ఆస లీడఁ దలఁతురా

రేకు: 1215-5 పాడి సం: 22-089

పల్లవి: సుదతులు లేరే సొబనము సేయ
పొదలి మరుగురుఁడు పొడమెను వాఁడె

చ. 1: శ్రావణబహుళాష్టమి యిదివో
ఆవలఁ జంద్రోదయం బదివో
యీవేళ నడురే యిప్పుడే రోహిణి
దేవకి కొడుకుఁ గనె దేవుఁడు వీఁడె

చ. 2: సరి వసుదేవుని సంతోష మదివో
మరులుగొల్పేహరిమా యదివో
విరిసెరు కాంతులవెలుఁ గదివో
పురుషోత్తముఁడె పుట్టెను వీఁడె

చ. 3: నాలుగుచేతులు నలి నివివో
మేలిమిసొమ్ములమెఱుఁగు లవె
యీలీల శ్రీవేంకటేశ్వరుఁడు మన-
పాల జనించెను బాలుఁడు వీఁడె

రేకు: 1215-6 తెతుగు గాంబోది సం: 22-090

పల్లవి: జవ్వనవనములసందడిఁ బెనగొని
దవ్వుగఁ జూడక తగులవయ్యా

చ. 1: చెక్కిటి చేతనే చింతలచిగు రమ్మీ
పొక్కుచు నీయెదుట బొయతి
ముక్కుపైవేలనే మోవిపండ్లమ్మీ
అక్కరతో నీ వడుగవయ్యా

చ. 2: కాయపుఁగాఁకలఁ గలగూరమ్మీ
పోయినఁ బోకిటు బోయతి
పాయపు వెరగుల పచ్చిగొంటు లమ్మీ
చేయారఁగ వెల సేయవయ్యా

చ. 3: కసరుల నానాగరబులు నమ్మీ
పాసఁగ నీకాఁగిట బోయతి
కసుగందనిచనుఁగవ వెలఁగలు నీ-
వసము శ్రీవేంకటేశ్వర కొనవయ్యా

రేకు: 1216-1 శ్రీరాగం సం: 22-091

పల్లవి: తనకు నాకుఁ బనులు తారుకాణించక తీర -
దెనలేనివొడఁబాట్లు యిఁకనేమి చెప్పేరే

చ. 1: మనసులోకోపమెల్ల మాటలాడక తీరదు
తనువుపై పనులెల్ల తగఁ గూడక తీరదు
అనుమానించినచోట ఆనవెట్టక తీరదు
యెనలేనితనద్దు లిఁకనేమి చెప్పేరే

చ. 2: సరిబేసిపంతాలు జగడించక తీరదు
మరుతంత్రములమెండు మతి చోక్కక తీరదు
సరుగ మోఁచినచోట సాదించక తీరదు
యెరవు లాతనిగుణా లిఁకనేమి చెప్పేరే

చ. 3: కోసరి దూరేచోట కుస్తరించక తీరదు
పోసఁగినరతివేళ బుజ్జగించక తీరదు
అసుడై శ్రీవేంకటేశుఁ డంత నేసి నన్నుఁ గూడె
యెసగె నాతని చేత లిఁకనేమి చెప్పేరే

రేకు: 1216-2 ధన్నాసి సం: 22-092

పల్లవి: గాడిదె గూయకుండఁ గంసుఁడెఱఁగకుండ
వేడుక వసుదేవునకు విన్నవించరో

చ. 1: దేవతలు జయవెట్ట దేవకి గర్భమునందు
యీవేళ నేనుగబిడ్డఁ డిదె జనించె
పూపులవాన గురిసె భూభార మెల్లఁ దీరె
వేవేగ నొజ్జల్లు వేళ చూడరో

చ. 2: అద్దమరాతిరికాడ నటు చంద్రోదయముతో
వొద్దికఁ గృష్ణుఁడు వుట్టె నోచెలులాల
సుద్దులెల్లఁ జెప్పఁజోచ్చేఁజూపె నాల్గుచేతులవె
పొద్దున సోబన మిట్టె పాలఁతులు సేయరో

చ. 3: సంకుజక్రములు వట్టి సాదుల నిందరిఁ గావ
తెంకినే శ్రీవేంకటాద్రిదేవుఁడు వుట్టె
కొంకుఁబనులెల్లాఁ దేరె కోరి తొట్టెలఁ బెట్టరే
లంకె బలభద్రుతోడ లలనలు వెంచరో

రేకు: 1216-3 శంకరాభరణం సం: 22-093

పల్లవి: ఓయమ్మ శ్రీవిభుఁ డోయమ్మ
కాయము నేఁ గరఁగితే కాఁక చల్లీనే

చ. 1: యెఱఁగమమ్మ నే నెవ్వరుంటా నావెనక
తెఱవఁ జూచితినంటాఁ దిట్లాడీని
మఱచితినమ్మ నే మాయపుదనసుద్దలు
గుఱిగా నవ్వితినంటాఁ గొంగువట్టీని

చ. 2: తలఁచనమ్మ నేఁడు తా నాకుఁబొంచినట్టి
కులికి మాటాడితేనే గొర నొక్కీని
తెలియనమ్మ తాఁ దిరిగి యింతిసేసేది
తలదువ్వి ముడిచితే తగులనాడీని

చ. 3: తడవనమ్మ నేను దగ్గరి శ్రీవేంకటేశు-
కెడమిచ్చితే వొద్ద యిట్టె పండీని
తోడరమమ్మ తానే తోడికి కాఁగిటఁ గూడి
బడలి నే నుండితేనే పంతమిచ్చీని

రేకు:	1216-4 ముఖారి సం:	22-094

పల్లవి:	దయగలవాఁడవు తప్పనిజాణఁడవు
ప్రియములజగడాలు పెంతురా నీవు

చ. 1:	కన్ను గీఁటినవాఁడవు కై కోక నుండనేల
చిన్నఁ బోయీ ఁజెలి నింతసేతురా నీవు
వెన్నేలరేకులవలె వెదచల్లెఁ జూపు నీపై
చిన్నదాన నేఁచ నింత చెల్లునా నీకు

చ. 2:	కాలఁ జిమ్మినవాఁడవు కడకు రమ్మననేలే
యీలేమ సిగ్గుపడీ నింతకోపునా
రాలేటిపుప్పొడివలె రాలిచీ ముద్దుమాటలు
గొల నింత సేసేది గుణమా నీకు

చ. 3:	చేయివేసినవాఁడవు చిత్తము పరాకేల
యీ యింతి నిను నవ్వీ నిట్టిదాఁ నీవు
చాయల శ్రీవేంకటేశ సతి నిట్టె కూడితిని
పాయపు మగువతోడఁ బంతమా నీకు

రేకు: 1216-5 సాళంగనాట సం: 22-095

పల్లవి: అలనట మగఁడట అవుఁగాము లిందునేల
తాలిమితోనే నుండే తరియైనాదాకఁను

చ. 1: ఆయలేవే చాలుఁజాలు అప్పటిఁ గొసరనేల
చాయల నేఁ బిలిచితే చనుదెంచీనా
వోయమ్మ కలి వోయ నుట్టి దిక్కు చూడనేల
సేయనీవే తనచేఁత చెల్లియయందాఁకను

చ. 2: పోపో వె తనతోడి పురుఁడు వెట్టుకోనేల
దావులఁ జిల్లరపొందు తా మానీనా
మాపుదాఁకా ఊలు దింటా మలిగం డ్లేరనేల
తీపులఁ దాఁ బడనీవే తెలిసినందాఁకను

చ. 3: చాలులేవు తనతోడ సారెసారె వాదులేల
వోలి దారుకాణించితే నోడఁబడీనా
గాలిగలప్పుడే తూర్పుగాక శ్రీవేంకటపతి
యేలి నన్నుఁ గూడె నే నిరవైనదాఁకను

రేకు: 1216-6 మంగళకౌసిక సం: 22-096

పల్లవి: ఆడరో పాడరో అప్సరోగణము
నీడెము లిందరో విభవము నేఁడు

చ. 1: కమలారమణునికల్యాణమునకు
తమినదె గరుడధ్వజ మెనఁగె
తెమలుచు మ్రొసెను దివ్యదుందుభులు
గమనించరో దివిఁగలదేవతలు

చ. 2: వెలయఁగ లక్ష్మీ విభుని పెండ్లికిని
బలసి అంకురార్పణ మదివో
కలగొన నిచ్చేరు గంధాక్షతలవె
చెలఁగి కైకోనరో శ్రీవైష్ణవులు

చ. 3: బడి శ్రీవేంకటపతికి శ్రీసతికి
అడరినతలఁబా లందెనిదె
నడచీఁ బరుషలు నానాముఖముల
ముడుపులు చదువరో ముయిగా నరులు

రేకు: 1217-1 ముఖారి సం: 22-097

పల్లవి: కందుగుందు నందనికిఁ గలిగినదే
అందులకే యలిగితే నంతలో నేమాయనే

చ. 1: నెలఁత నీమొగము వెన్నెలగాయఁ బొరుగున
అలరుఁదురుము చీఁకటదె చల్లీని
వలచినరమణుఁడు వడి నీతో నొకమాఁటు
అలిగి మాటడకున్న నందు కేమాయనే

చ. 2: మిక్కిలి నీమనసిది మెత్తనైతేఁ బొరుగున
గక్కనఁ జనుఁగొండలు గట్లాయను
చక్కనినీరమణుఁడు సరుస నిన్నొకమాటు
ఇక్కువ గోర నంటితే నిందుకేమాయనే

చ. 3: నడపుల నేనుగలు నటిఇంచఁ బొరుగున
నడుమ సింహము నీకు నటించీ నదె
అడరి శ్రీవేంకటేశుఁ డటు గాదు నీవుఁ దాను
కొడిఁ జంద్రుఁడు గల్వలై కూడిన మోమాయనే

రేకు: 1217-2 భైరవి సం: 22-098

పల్లవి: కొంగువట్ట కంత నీవు గొల్లబోయిఁడా
కుంగక నీకు మొక్కేము గొల్లబోయిఁడా

చ. 1: పొలసు మాటలగొల్లబోయిఁడా నీ-
కొలము దాఁచకువోయి గొల్లబోయిఁడా
పొలము మేపకు గొల్లబోయిఁడా
కొలువుకంబముచాటుగొల్లబోయిఁడా

చ. 2: పొడవాటికాళ గొల్లబోయిఁడా
గొడవలు మానవోఇ గొల్లబోయిఁడా
పొడలమెకముగొల్లబోయిఁడా
గొడగెత్తియాలఁ గాచే గొల్లబోయిఁడా

చ. 3: బుద్ధులగొలవు గొల్లబోయిఁడా
కొద్దిలేనిదాఁటులగొల్లబోయిఁడా
మద్దులశ్రీవేంకటాద్రి మందబోఇయఁడా నీకు
గుద్దే బాదాలు నే గొల్లబోఇఁడా

రేకు: 1217-3 గుండక్రియ సం: 22-099

పల్లవి: ఇది దా నెఱఁగఁడా ఇంపులనారమణుఁడు
హృదయమే యెఱుఁగును యెంచిచెప్పదేమే

చ. 1: దవ్వు విచారింతురా తమ్మువలసినవారు
యెవ్వల నుండినాఁ గూడనెంతురుగాక
దవ్వుల సూర్యునికి ధరణిఁ దామరలకు
యెవ్వరైనాఁ బొందునేసి యెనఇంచిరా

చ. 2: వెనకముందెంతురా వెక్కసపు పొందువారు
యెనలేనిసాహసము లెంతురుగాక
వినువీథిఁ జంద్రుడుండ వె జంద్రకాంతము
లెనసి కదగుమని యెవ్వరైనాఁ జెప్పిరా

చ. 3: వొకరి నడుగుదురా వుల్లములు గలసితే
వొకట్గె రతులఁ గూడివుందురుగాక
ప్రకటించి శ్రీవేంకటపతి దానె నన్నుఁ గూడె
సకలము లోలోనె సంతమౌటగాక

రేకు: 1217-4 కాంబోది సం: 22-100

పల్లవి: ఎగ్గో తప్పోకాని యివివో మాచేఁతలు
ఆగ్గపురమణుఁడ నే మంతేసి యెఱఁగము

చ. 1: నీవు నన్ను మన్నించఁగా నిన్నుఁ గొసరితిఁగాక
వేవేగఁ బనిలేదంటే వేసరించేనా
తావివసంతము రాఁగాఁ గోవిల గూసెఁగాక
వావాతా నారునెలలు వాయెత్తైనా

చ. 2: కన్నుల నీవు చూడఁగఁ గాఁకలఁ గోరితిఁగాక
యెన్నిక నీ వెందోవుంటే నింత వేఁడేనా
వెన్నెలకుఁ జకోరము వేడుకపడెఁగాక
నన్నెల యెండగాయఁగ వచ్చితలయెత్తైనా

చ. 3: ఆయము నీ వంటఁగాను అట్టే నేఁ గూడితిఁగాక
బాయిట నల్లంత నుంటే పైకోనేవా
వేయైన శ్రీవేంకటేశ విరులకుఁ దుమ్మిదలు
మ్రోయుఁగాక చిగురులమూఁకలకు మ్రోసునా

రేకు: 1217-5 ఆహిరి సం: 22-101

పల్లవి: చెలులాల వానిసుద్ది చెప్పకురే నాతోడ
పలుకులవెంగమేల పగ మేలుగాక

చ. 1: మనసురానిచోటికి మంతనాలుఁ గొన్నా
మెనకులవాదులైన మేలుగాక
చనవులేని చోటికి సరసాలు గొన్నా
మునుకొన్నఅవ్వలిమోములు మేలుగాక

చ. 2: గుఱుతుమఱచినచో కూటువమొక్కులు గొన్నా
మెఱయని తెరమాటే మేలుగాక
జఱయుచుండేటిచోట చనవులుచూపేవీఁ గొన్నా
కుఱకుఱబీరములగుట్టు మేలుగాక

చ. 3: చిత్తజకేలిచోటను సిగ్గులునుఁ గొన్నా
యెత్తిన దేహ మొప్పించు టెక్కువగాక
హత్తిన శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
కోత్తగా నన్నియు నియ్యకొంట మేలుగాక

రేకు: 1217-6 శుద్ధవసంతం సం: 22-102

పల్లవి: తానట నేనట తడవేలే
పూనికె చెల్లెను బుద్ధు లిఁకేలే

చ. 1: నలుగడ నాతో నవ్వేడివాఁడట
మలసి చెక్కు చెయిమఱఁగేలే
చిలుకులగోళ్లఁ జెనకేటివాఁడట
వెలుపలిలోపలివెలితేలే

చ. 2: సూటిగ నాదెస చూచినవాఁడట
చీటికిమాటికి సిగ్గేలే
వీటికిఁ దా నిటు విచ్చేసినాఁడట
నీటున వాకిట నిలువఁగనేలే

చ. 3: గుట్టున సమరతిఁ గూడినవాఁడట
పట్టి వూర్పు లణఁపఁగనేలే
యిట్టె శ్రీవేంకటేశుఁడు నాపయిఁ
బెట్టినఆసట పెనఁగఁగనేలే

రేకు: 1217-7 కాంబోది సం: 22-103

పల్లవి: వెలిఁదొఁచే దొకటి వేసము నీలో నోకటి
చలివాయ రమణునిచనవు చేకొనవే

చ. 1: గక్కన నవ్వేవుగాని కన్నుల కెంపులు వొవు
ఇక్కడ నలుక దీరు టెట్టు నమ్మేది
నిక్కముమాటలాడేవు నిట్టూర్పు లణఁగవు
చక్కనిపతికి నీకు సంతస మెట్లాయనే

చ. 2: పొంచి వీడెమిచ్చేవు బోమ్మముళ్లు నున్న వవె
యెంచఁగ మీమచ్చరము లెట్టు దీరెనే
మంచమెక్కి వుందానవు మానవు నివ్వెరగులు
వంచించ కిద్దరిలోన వాదు లెట్టు దీరెనే

చ. 3: కాఁగిట నించే వతనిఁ గాఁకలు మేన నున్నవి
ఆఁగినచేఁత లింకా నవి యేఁటివే
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశునిట్టె
నాఁగు వారె మీగుణాలు నమ్మనెట్టువచ్చునే

రేకు: 1217-8 బౌళి సం: 22-104

పల్లవి: తననేరుచుబుద్ధి తానే యెఱుఁగుఁగాక
అని యనిపంచుకొను టంత నాకుఁ జెల్లునా

చ. 1: కప్పురపు నోటిమాటే కడునిఁ పైవుండుఁగాక
చప్పనిమానోరిమాట చవులయ్యీనా
యెప్పటిమోహపుకాంత యేమనినా వినుఁగాక
అప్పసమై వున్నదాన నంత నాకుఁ జెల్లునా

చ. 2: వుంగరపు వేలిసన్న లోడఁబాటై వుండుఁగాక
సంగడి మాచేసన్న సంగతియౌనా
చెంగట నాకె యేపచ్చి సేసినా నమరుఁగాక
అంగము నే గొర నంట నంత నాకుఁ జెల్లునా

చ. 3: కాటుకవెట్టినకంట కన్నులార్చఁజెల్లుఁగాక
తేట తెల్లని మాచూపు తేఁకువయ్యీనా
యేఁటికని శ్రీవేంకటేశుఁడు గూడెఁగాక
ఆఁటదానఁ దన్ను దూర నంత నాకుఁజెల్లునా

రేకు: 1217-9 భైరవి సం: 22-105

పల్లవి: ముందర నేఁటిదొ ముగుదను నేనిదె
విందువంటిపతి విడువఁగఁగలనా

చ. 1: తలంపులోనినాతమకఁ బెంచిన
వొలికీఁ గన్నీ రొకటొకటి
వెలసిననామైవిరహము చూచిన
పులుకునఁ బులకలు నుదిరీ నిదివో

చ. 2: పాయపుమదములపరవశము చెప్పిన
తోయపునిట్టూర్పు తొట్టీని
నాయపురముఖునినమ్మిక దలఁచిన
రాయడిఁజెమటలు రాలీ నిదివొ

చ. 3: నెమ్మిఁ బాన్పుపై నేఁ జెయిచాఁచిన
తమ్మిగొరు పతిఁ దాఁకీని
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డితఁడే నన్ను
సమ్మతిఁ గూడఁగ సంతస మిదివో

రేకు: 1217-10 బౌళి సం: 22-106

పల్లవి: వత్తలూరికేశవా వన్నె లీడఁ జేసేవా
బత్తిగలవాఁడవౌదు పట్టకువయ్యా

చ. 1: పిల్లఁగోవి వింటిమి బిరుదులు గంటిమి
చల్లలమ్మఁ బోవలెఁ జాలునయ్యా
చెల్లు నీకుఁ జేఁతలు చెక్కులెల్ల రోఁతలు
పల్లదాలు యిఁకనేల పదవయ్యా

చ. 2: నిందలు వేసితివి నేరమీఁ జేసితివి
మందకునుఁ బోవలె మానవయ్యా
చిందె మోవిఁ దేనెలు సిగ్గులాయ మేనులు
ముందరి కట్టేకాని మొక్కకువయ్యా

చ. 3: చీర నీచేఁ జిక్కెను చిత్తమెల్లాఁ బొక్కెను
నీరుఁగొల నాడవలె నిలవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
తేరీ పనులేమిగల్లా తెంకికి రావయ్యా

రేకు: 1217-11 ముఖారి సం: 22-107

పల్లవి: అందుకేమే యెడమాటలాడితేనేదోసమా
అంది నేను మొక్కినందు కటు చూడఁదగదా

చ. 1: చేరి తనపంతమే చెల్లితేఁ జాలుఁగాక
నారుకోన వెనకనే నవ్వఁదడవా
నేరమి నాదేకాక నెట్టనఁ దా నేమిసేసు
అరీతి నే వలవఁ దా నంతి సేయఁదగవా

చ. 2: నటనల యెమ్మెలఁదా నడచితేఁ జాలుఁగాక
చిటుకన గోర నేఁ జిమ్మఁ దడవా
సటకాఁడు దనకేమి సాదుగొల నేనేకాక
తటుకన నేరాఁగాఁ దలవంచఁ దగదా

చ. 3: మిక్కిలి రతులఁ దానే మీఁదైతేఁ జాలుఁగాక
చొక్కించి తనవెము చూడఁదడనా
చక్కనిశ్రీవేంకటేశ్వరుఁడే తానన్నుఁ గూడె
తక్కక యిన్నిటికి నేఁ దన్ను మెచ్చఁదగదా

రేకు: 1217-12 భైరవి సం: 22-108

పల్లవి: సిగ్గరిపెండ్లికొడుక చెలువరాయ నన్ను
వెగ్గళించ కిఁక నీవు వెసఁ జెలువరాయ

చ. 1: చెరువుకొ నీతురుము చెలువరాయ నీవు
శిరసు వంచకు మంత చెలువరాయ
సిరితో వీదులనేఁగేచెలువరాయ నీ -
నెరబడి వారము చెలువరాయ

చ. 2: చెక్కులేల చెమరించెఁ జెలువరాయ అట్టె
చిక్కనిబొంకు బొంకేవు చెలువరాయ
చిక్కునడె నీ నెరులు చెలువరాయ నన్నుఎ
జిక్కించేవు మాఎటలనే చెలువరాయ

చ. 3: చెప్పరానితమకపు చెలువరాయ నన్నుఁ
జిప్పిలఁ గూడితివిగా చెలువరాయ
యిప్పుడే శ్రీవేంకటేశ యేకతము కడపలోఁ
జెప్పితిఁగా అలనాఁడే చెలువరాయ

రేకు: 1219-1 ముఖారి సం: 22-109

పల్లవి: ఎందుకై నాఁ జెప్పేవటే యెరికెత నీవు నాకు
యెందుకైనా నోపుదువు యెఱుఁగుదుఁ బదరా

చ. 1: వానకుఁ జెప్పేవటే నన్నెయెరికెత నీవు
ఆప నీమ్మైఁ జెమటవా నదె కదరా
పూని వంటకుఁ జేప్పేవా బొంకుయెరికెత నీవు
చేనిపంట రాసులుగాఁ జేసేవురా మోవిని

చ. 2: మేలుకుఁ జేప్పేవటే మిండయెరికెత నీవు
మేలు సేసితివిరా నామీఁదనే నీవు
యేలుభూమికిఁ జెప్పేవా ఇంకా యెరికత నీవు
యేలుకొంటి భూమి సిరి నిట తొల్లేకదరా

చ. 3: వచ్చే మీఁదిపని చెప్పేవా యెరికెత నీవు
వచ్చేది నాకాఁగిలేరా వంతుల నీకు
నిచ్చలు నిట్టె చెప్పవే నీటుయెరికెత నాకు
నిచ్చలు శ్రీవేంకటేశ నిన్ను నేఁ గూడితిరా

రేకు: 1219-2 పాడి సం: 22-110

పల్లవి: చెప్పనీవే ద్దులు చేరి చెక్కు నే నొక్కితే
వుప్పుగప్పురమువలె వోప్పనగావలెను

చ. 1: మాననీవే తా నన్ను మానినా నల్లంతనుండి
సానఁబట్టేచవులైనాఁ జల్లకుండేనా
నాననీవే వలపులు నాకుఁ దనకుఁ గోమటి -
మేనరికమైనట్టు మెచ్చుగావలెను

చ. 2: వుండనీవే ఆడనీడ వుండినా నే నిక్కిచూచి
నిండువెన్నులనవ్వులు నించకుండేనా
పండనీవే కోరికలు పంతాలు తనకు నాకు
దండ నేళ్ల వెంట చాళ్లై తగులఁగవలెను

చ. 3: చేయనీవే సన్నలు చేరి నేనేఁ గాఁగిలించి
బాయిటనే తన్నుఁ గొంగుపట్టకుండేనా
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కాయలే పండ్లయినట్టు కతలు గావలెను

రేకు: 1219-3 సామంతం సం: 22-111

పల్లవి: మాఁటలనే చలివాప మనకేలే
వాఁటమయ్యీఁ జేఁతలెల్ల వద్దు మనకేలే

చ. 1: నిందఁబడ్డవాఁడుగాన నిన్నుఁజూచి మొక్కఁగాను
మందలించి రట్టుసేయ మనకేలే
ఇందునందు నుండేఁగాన యిచ్చకము సేయఁగాను
అందరిలో నణఁకించ నంత మనకేలే

చ. 2: నేరమి గలిగెఁగాన నీయింటికే రాఁగా వే -
మారు వెంగెములాడ మనకేలే
జీరలు మైనిండెఁగాన చెరఁగునఁ గప్పుకోఁగా
తోరముగా నవ్వు నవ్వి దూరమునకేలే

చ. 3: గక్కన సిగ్గువడ్డాఁడుగాన తలవంచితేను
మక్కువఁ బైకొనకుండ మనకేలే
వొక్కటై శ్రీవేంకటేశుఁ డొడఁబడ నిన్నుఁ గూడె
యెక్కడిసుద్దులు నీక నెంచ మనకేలే

రేకు: 1219-4 సాళంగనాట సం: 22-112

పల్లవి: ఎక్కువతక్కువలేవో యెఱగ మిద్దరిలోన
వొక్కటై నీవురముపై వున్న దిదె చెలియ

చ. 1: ఆకడ జలధి దచ్చి యమృత మిచ్చితి నీవు
ఆకెకైతే మోవిఁ జిందీ నమృతము
సైకపుఁ బసిఁడిచీర సరిఁగట్టితివి నీవు
మేకొని యీకెకైతే మేనెల్లఁ బసిఁడే

చ. 2: నిగిడి కౌస్తుభపుమాణికము గట్టితి నీవు
మగువకైతే నోరెల్లా మాణికములే
బెగడి యాకసమెల్లాఁ బెద్దసేసి కొలచితి
బిగి సేయీచెలికైతేఁ బిడి కేఁడునడుమే

చ. 3: పలుమారు జలధిలోఁ బవళించితివి నీవు
కలికి గుణములోనే ఘనజలధి
యెలమి శ్రీవేంకటేశ ఇప్పుడు గూడితిగాని
జలజాక్షియైతే నిన్ను సన్నలనే కలసె

రేకు: 1219-5 శుద్ధవసంతం సం: 22-113

పల్లవి: బలువుకొలఁదియే పో పంత మెల్లాను
వెలిఁ దారుకాణలతో విన్నవించఁగలనా

చ. 1: చెక్కే నొక్కితివిగాని చేతిగోర నూఁది తేను
ఇక్కడ నౌఁగాదనేవారెవ్వరు నిన్ను
ముక్కుమీఁది వేలితోడ ములిగేటిదానఁగాక
పెక్కుమాటలాడి నీతోఁ బెనంగఁగఁగలనా

చ. 2: మంచిమాటాడితిగాని మానము పైఁ దిట్టితేను
యెంచి తగవుచెప్పేవారెవ్వరు నీకు
వంచినశిరసుతోడ వగచేటిదానఁగాక
పంచల నీగుట్టులెల్లఁ బచ్చి సేయఁగలనా

చ. 3: కాలుదొక్కితివిగాని కడచేఁత సేసితేను
పోలదని యెవ్వరైనా బుద్ధిచెప్పేరా
మేలిమి శ్రీవేంకటేశ మెచ్చఁగూడఁగలఁగాక
వేళవేళఁ గూడఁగానే వేగిరించఁగలనా

రేకు: 1219-6 నాదరామక్రియ సం: 22-114

పల్లవి: కన్నదే విన్నదే కందువసుమ్మీ
వున్నతి నీసతిసుమ్మీ వొడఁబా టిద్దరికి

చ. 1: యేకడ నీవుండినాను యెంత పనిగలిగినా
ఆకెమాటే నామాట అట్టె రమ్మీ
పోకలెన్నైనాఁ గలవు పొందు లెన్నైనాఁగలదు
సాకిరి యీచెలిసుమ్మీ సరుస నిద్దరికి

చ. 2: అలుకెంత గలిగినా అడ్డములే యాడినా
చెలిమొక్కే నామొక్కు చేకోనుమీ
తలఁపట్టైయినాఁగాని తగులెంతయినాఁగాని
తొలుత యీపెసుమ్మీ దూతిక యిద్దరికి

చ. 3: యెంతదవ్వువొయినా యేమని పోడచూపినా
యింతిసన్నే నాసన్న యెఱుఁగుకొమ్మీ
యింతేల శ్రీవేంకటేశ యిందాఁకాఁ గూడితిని
సంతతయు నీకెసుమ్మీ సాదన మిద్దరికి

రేకు: 1220-1 కాంబోది సం: 22-115

పల్లవి: మానవే మానవే నీమంకుఁదనము
మానరానివిభునితో మరి చలమేఁటికే

చ. 1: సెలవుల లేఁతనవ్వు చిందఁగానే మాటలాడే -
చెలువునితో నలుక చెల్లునటవే
తెలివివెన్నెలలోని తేటలుగా నిన్నుఁ జూచి
వలచినపతితోడ వట్టిమోనమేఁటికే

చ. 2: కన్నుల మొక్కులతోడఁ గట్టెదుర నిలుచుండే -
పన్నినజాణనితోడఁ బంతి మేఁటికే
సన్నలనే వినయము చల్లేటిరమణునితో
కిన్నెరమీఁటులలో నీకేరడములేఁటికే

చ. 3: చేరి కాఁగిలించుకొనే శ్రీవేంకటేశుతోడ
ఆరయ లేఁతసిగ్గు లంతయేఁటికే
గారవాన నిన్నుఁగూడి ఘనుఁడైనయతనితో
బీరమాడి పచ్చినేసీ పెనఁగఁగనేఁటికే

రేకు: 1220-2 దేసాళం సం: 22-116

పల్లవి: ఇంతివుపచారపూజ యిందే కలిగె నీకు
వంతులఁ జేకొని నీవు వరమియ్యవయ్యా

చ. 1: అంగన నిన్నుఁజూచుటే అవాహనము, ఆకెకు
ఆంగవించి నీవు మతి హత్తినదే ఆసనము,
సంగతి నీపైచింతే సదా ధ్యానముసుమ్మీ ,
అంగపుఁ జెక్కుచెమటలు లర్ఘ్యపాద్యాదులు

చ. 2: సరుసఁ గన్నీళ్లే ఆచమనము జలకము,
అరవిరి పయ్యదము అంగవస్త్రము,
నిరతి మైకమ్మఁదావి నీకునిచ్చినగంధాలు,
పరగినపులకలే పలుపూజలు

చ. 3: దొమ్మివూర్పు విరహాగ్నిదూపము దీపము నాయ,
సొమ్ములే మైమెఱుగులు, సోలి వీఁగేవే దండాలు,
నమ్మిక శ్రీవేంకటేశ నై వేద్యమాయ మోవి,
కమ్మరఁ గాంగిటినవ్వే కప్పురపువిడేలు

రేకు: 1220-3 ముఖారి సం: 22-117

పల్లవి: చూడవే నాదిక్కు సుదతి నీవు ఇఁకఁ
జూడఁబోతే నన్నియును సోద్యాలేపో

చ. 1: పలుకవే నాతోడఁ బడఁతి నేఁడు
పలికితే నిందరిలోఁ బసలేదువో
తలఁచవే తొంట్టిపొద్దుతగు లింతై నా నేఁ
దలఁచితే బనులెల్లాఁ దారుకాణెపో

చ. 2: అందుకొనే విడెమ్మైనా నతివా యిట్టె
అందుకోంటెఁ దాఁకుంబో నీ యాయములెల్ల
ముందు నవ్వవే యిఁక ముచ్చటదీర
ముందు నే నవ్వితేఁగన మోవి గంటివడుఁ బో

చ. 3: మఱవవే కాఁగిటిలో మాటలు చెలి అంత
మఱచితే కాఁకలెల్ల మక్కళించుఁబో
యెఱఁగవే శ్రీవేంకటేశుఁడ నేను నాలో
నెఱిఁగికాదా నిన్ను నేకమై కూడితిని

రేకు: 1220-4 సామంతం సం: 22-118

పల్లవి: ఎదుటనే వున్నఁదాన యెంతదడవే
అదనుచూచే నింతే అందుకెంతదడవే

చ. 1: జోకతో నొకట రెంటఁ జూచి వోర్చేఁగాక వాని-
కీకడిమోము సేసుకో నెంతదడవే
సాకిరివెట్టినదాఁకా చవి సేసుకోంటఁగాక
మైకొని తెగనాడేది మరి యెంతదడవే

చ. 2: మిమ్మెల్ల మెచ్చుదాఁకా మీరఁగాక తనమీఁద
ఇమ్ముల నేరాలువేయ నెంతదడవే
నమ్మికలిచ్చేనతననాటకాలు చూచేఁగాక
చిమ్ముల చేఁతకుఁ జేఁత సేయ నెంతదడవే

చ. 3: మగవాఁడు, తనమీఁదిమచ్చెములు చూచేఁగాక
యెదసక్కేలకు నవ్వ నెంతదడవే
తగుశ్రీవేంకటపతి తా నన్నుఁ గూడఁగఁగాక
నిగిడి నేఁ గాఁగిటిలో నించ నెంతదడవే

రేకు: 1220-5 బౌళి సం: 22-119

పల్లవి: ప్రియమెట్టైనా నుండనీ పెంపగునారమణుని
క్రియ నాచేఁ దగిలెను గెలిచితిఁ జింత

చ. 1: పాయమెట్టైనాఁగానీ పంత మెట్టేనాఁగానీ
కాయమిచ్చితిఁ దనకుఁ గలదా చింత
చాయలకే నడవనీ సన్నలకే తిరుగనీ
చేయి దనపయినే వేసితి నేల చింత

చ. 2: మనసెందైనాఁ బెట్టనీ మాఁట లెంతేశాడనీ
పునికై వొద్దనుందాన నున్నదా చింత
పనులెట్టయినాఁ గానీ భావమేదయినాఁగానీ
చెనకితిఁగాన గోరసేయ నేల చింత

చ. 3: చూపు లేడఁ బారనీ సోలపెంత మీరనీ
పై పైఁ గాఁగిలించితిఁ బాసెఁగా చింత
యేపున శ్రీవేంకటేశుఁ డెన్ని కెగా నన్నుఁ గూడె
తీపుమోవి నాకుఁ జిక్కెఁ దేరె నెల్లచింత

రేకు: 1220-6 నాదరామక్రియ సం: 22-120

పల్లవి: ఇదియే చాలును నేమి ననకురే
కదిసిన ప్రాణము కామిని నాకు

చ. 1: మాఁటలలోపలిమర్మము వేరే
గాఁటపుసతి పలుకఁగనీరే
తేటలకన్నులదృష్టులు వేరే
సూటిగ నెట్టయినఁ జూడఁగనీరే

చ. 2: అంగములోపలిఆయము వేరే
అంగన చేయివేయఁగనీరే
రంగులసరసపురచనలు వేరే
జంగిలినవ్వులు చల్లఁగనీరే

చ. 3: సన్నలలోపలిచనవులు వేరే
చన్నుల నోరయుచుఁజననీరే
యిన్నిట శ్రీవేంకటేశుఁడ యీసతి
వున్నది పురమున నుండఁగనీరే

రేకు: 1221-1 సాళంగం సం: 22-121

పల్లవి: కామినులాల మీకన్నుల బట్టఁడా బాలు-
డేమమ్మా నవ్వేరు వీఁడేమాయనమ్మా

చ. 1: చూడఁగలవాఁడు చేతఁ జూపఁగలవాఁడు వీఁడు
యేడ నెవ్వరైనాఁ గంటే నెత్తుకోఁదగువాఁడు
జాడతో రూపురేకా సాదించరానివాఁడు
యీడనే మాపసిబాలుఁ డేమాయనమ్మా

చ. 2: అడుగఁదగినవాఁడు అన్నిటానుదారివాఁడు
వుడిబడి వారి నేల నోల్లనివాఁడు
వడిఁ దానే ఇందరిని వలపించనేర్చువాఁడు
యెడసీ ముద్దాడమనే రేమాయనమ్మా

చ. 3: రచనమాటలవాఁడు రచ్చరాళ్ల మీఁదివాఁడు
ఇచట శ్రీవేంకటాద్రిపై నిరవైనాఁడు
పచరించ నేపనులాఁ బదిఁ బదైనవాఁడు
యెచట నాడి వచ్చినా నేమాయనమ్మా

రేకు: 1221-2 బౌళి సం: 22-122

పల్లవి: నీపాపమా వొరి నిచ్చుఁగాలమహి మిది
అపాటితగవెల్ల నంతేసీ కోపుదునా

చ. 1: కోపము వేళమె వచ్చుఁ గోరి నిజమాడితేను
యేపున శాంతము వచ్చు నిచ్చలాడువారిఁ గంటే
వోప నాదిక్కేమి చూచే వొల్లనొల్లఁ బట్టకురా
నీపాటిదొరతనము నేరఁగాక నేను

చ. 2: యేతులు వేళమె వచ్చు నింటనున్నవారిఁ గంటే
జాతివినయాలే వచ్చు సారె వాడవారిఁ గంటే
నీతుల నీగుణమిది నేఁడు గొత్తలా నాకు
రీతి గాదు నవ్వకురా రేయిపొద్దు దోసము

చ. 3: బీరాలు వేళమె వచ్చ ప్రియపడ్డసతిఁ గంటే రతిఁ
దారిన మొక్కులే వచ్చు దంటైనసతిఁ గంటే
యేరా శ్రీవేంకటేశ ఇది నేనెఱిఁగినదే
కూరిమిఁ గూడితి విఁక గొంకు నాకుఁ జెల్లదు

రేకు: 1221-3 ఆహిరి సం: 22-123

పల్లవి: కానీలేవే అట్టె కానీలేవే అట్టె కానీలేవే
పోనీ చూత మింకఁ దనపొందు చెరుచనేల

చ. 1: చలమా తనతో నాకు సరవినడపినాఁ గాదనను
వలచి తాఁ బైకొనివచ్చినా వాదులడువనేలా నాకు

చ. 2: పగలా తనకు నాకు బాసవేసినాఁ దగదనను
తగిలి తా రమ్మనునెడ నేఁ దామసించనేలా నాకు

చ. 3: బడి నే శ్రీవేంకటగిరి పైఁ బంతమిచ్చే నిఁకనేమనను
కడపరాయఁడు ననునేలెనుకడమ లెంచనేలా నాకు

రేకు: 1221-4 కాంబోది సం: 22-124

పల్లవి: ఏమిచేసినాఁ జేసె నేలదూరేరే యతని
ఆముకోన వలచితి నాతఁ డేమి సేసునే

చ. 1: కన్నులఁ బతిఁ జూచితేఁ గాయమెల్లాఁ బులకించే
చన్నుల నొత్తితి నింతే జాజుకోనఁ బులకించే
సన్నల నవ్వితి నింతే జడిచెమటలు నిండె
అన్నిటా నానేర మింతే నాతఁ డేమి సేసునే

చ. 2: సుద్దులు నే వింటి నింతే చురుకనె నాయములు
వొద్దికి వచ్చితే నింతే వుల్లమెల్ల మఱపాయ
గద్దించి మాటాడఁ బోతేఁ గడు మోవిఁ దేనె చిందె
అద్దొ నానేర మింతే అతఁ డేమిసేసునే

చ. 3: కాఁగిలించఁబోతి నింతే కళలెల్లాఁ జిమ్మిరేఁగె
తోఁగి సిగ్గువడఁబోతే తొలఁగెఁ బయ్యదకొంగు
పాఁగిన శ్రీవేంకటాదిపతి దానె నన్నుఁ గూడె
ఆఁగిన నారతి ఇంతే నతఁ డేమి సేసునే

రేకు: 1221-5 బైరవి సం: 22-125

పల్లవి: ఊరకుండవయ్యచాలు నోయయ్య
నేరుపరి వౌదువయ్య ను వెఱతునయ్యా

చ. 1: అయ్య నీకు దండమయ్య అంతకు నేనోపనయ్య
పయ్యద ముట్టకువయ్య పచ్చిగానయ్యా
గయ్యాళి నేనౌదునయ్య కల్లలాడేవా అయ్య
దయ్య మెరిఁగితేఁ జాలు దాని కేమయ్యా

చ. 2: బల్లిదుఁడ వౌదువయ్య పలుమాట లేలయ్య
చెల్లునయ్య నీవుసేసేచేఁతలునయ్యా
అల్లనాఁడె కంటిమయ్య అందరును సాకిరయ్య
మల్లడి నీగుణమయ్య మంచి దౌనౌనయ్యా

చ. 3: అనలింకానేలయ్య అట్టె తనిసితినయ్య
కానికాని వొట్లేల కానీవయ్య
మేనంటి శ్రీవేంకటేశ మెప్పించి కూడితివయ్యా
మోనాన నుండేవయ్య మోవు నా కీవయ్య

రేకు: 1221-6 ఆహిరి సం: 22-126

పల్లవి: ఉన్న సుద్దు లేమిచెప్పీ నుద్దవుఁ డేఁటికి వచ్చె
మిన్నక వలచినమామేలు దలఁచీనా

చ. 1: తల్లితోఁ బుట్టినవానిఁ దగ నేమో సేయువాఁడు
గొల్లెతలమీఁద దయ కోరి సేసీనా
మల్లాడి మేనమఱఁదిమాట కలిగినవాఁడు
చల్లువాని సరసాలు చవులయ్యీనా

చ. 2: ఆలితోఁబుట్టినవాని నందముసేసినవాఁడు
జోలి గోక వాని కేఁటిచుట్టరికమే
లేలే కొడుకువియ్యాల లెస్స తగవు నడపె
నాలిదాక వానితోడినవ్వు లేఁటినవ్వులే

చ. 3: మేనత్తకొడుకులను మిక్కిలి రక్షించినాఁడు
వూని తనసుద్దుకెల్లా నూఁకొనరే
కానీలే శ్రీవేంకటేశుఁ గమ్మరఁ గూడితి మిదే
తానేమనీనో ఇంక దగ్గరి యడుగరే

రేకు: 1222-1 రామక్రియ సం: 22-127

పల్లవి: కన్నులనే నిన్నుఁ జూడఁగలవార మింతేకాక
వున్నచలమువారమా వూరకే జంకించను

చ. 1: యేరవులవారమా యేమన్నా నీతోడ
కెరలి చీటికిమాటికి నలుగను
తరవులవారమా దవ్వున నుండి రాకుంటే
కరికరించి పిలిచి కమ్మటి సాదించకు

చ. 2: మెచ్చునివారమా నేము మేకులనీచేతలెల్ల
అచ్చటనిచ్చట సారె నాడుకొను
మచ్చరిపువారమాపో మాటాడమఱచినా
ఇచ్చటనే మారుమోమై యెచ్చుకుందు లెంచను

చ. 3: పనిలేనివారమా పైకొని నీవు గూడఁగ
తనరి శ్రీవేంకటేశ తప్పించుకొను
తనియఁగఁ గూడితివి తగవు నగవు నీదె
పెఁనగేవారవ నీవు పిలువఁగ నిఁకను

రేకు: 1222-2 ముఖారి సం: 22-128

పల్లవి: ఆఁడుజన్మమే మాకు నాఁబడాయనో కాక
పోఁడిమిఁ దా మగవాఁడు భువిఁ బచ్చి సేతురా

చ. 1: ముంచుకొని మగవారు ము0 గిటనే వుండఁగాను
మంచము చప్పుడుసేసీ మాకు నిదెక్కడికాకే
యెంచఁ బొరుగు వినఁగ నేడగొడవమ్మ మాకు
పా0 చి పటుకురనఁగఁ బోఁకఁ గొరికీని

చ. 2: చక్కఁ బొద్దుగుంక దిదె సతులెల్లనవ్వఁగాను
పక్కనఁ దలుపు మూసీఁ బనో మరి
యెక్కువతోఁ జింటిబిడ్డ లిదె చేయి దిగరు తా-
నక్కరతోఁ గొంగువట్టీ నౌనే లెస్సాయను

చ. 3: యెలిమితో నత్త మామ లెదుటనే వుండఁగాను
చలాలకే మాటలాడీ సంగతెఱఁగఁడే వీఁడు
అలరి శ్రీవేంకటేశుఁ డందరి మొరఁగి కూడె
తలఁగ కింతేసిరట్టు తగునా ఇల్లాలికి

రేకు: 1222-3 మలహరిసం: 22-129

పల్లవి: నిచ్చనిచ్చఁ జేకొను నివాళి
యిచ్చఁ బేరెవరమోబు శేశ నివాళి

చ. 1: సొలపులవాలుకచూపుల నెత్తేరు
నెలఁతలు నీకిదె నివాళి
నలయపు కంకణరవంబుల నెత్తేరు
నిలువుఁ బయ్యదల నివాళి

చ. 2: గక్కనను సరసపుకప్పురపునవ్వుల
నిక్కుచు నెత్తేరు నీకు నివాళి
వక్కణించ మాణికపువన్నెగోళ్ల చేతుల
నెక్కొని నెత్తేరు నీకు నివాళి

చ. 3: ముంచినకాఁగిటిలో నీ మోహనవేదమంత్రాల
నించినించి యెత్తేరు నివాళి
పెంచపు శ్రీవేంకటాద్రి పేరెవరపోబు శేళ
అంచె నిన్నుఁ గూడి యెత్తే రదే నివాళి

రేకు: 1222-4 శంకరాభరణం సం: 22-130

పల్లవి: ఎంత సింగారించేవే యేమే నీవు
కాంతుఁడు వాకిట వచ్చి కాచుకున్నాఁడు

చ. 1: చెలులకు వెడవెడసిగ్గులే సింగారము
సెలవులకు నవ్వులే సింగారము
పలచనిమోవికి పలుకులే సింగారము
కలికిన్నులకును సోలుపే సింగారము

చ. 2: చక్కనిబొమ్మలకును జంకెనలే సింగారము
చెక్కులకు మురిపెమే సింగారము
వెక్కసపుగొళ్లకు విసరులే సింగారము
చొక్కపుజవ్వనానకు సొంపులే సింగారము

చ. 3: కఱకుచన్నులకును కాఁగిలే సింగారము
చిఱుఁదొడలకు రతి సింగారము
మఱి యలమేలుమంగమగఁడు శ్రీవేంకటేశుఁ-
డెఱిఁగి నిన్నిట్టె కూడె నిదే సింగారము

రేకు: 1222-5 దేసాళం సం: 22-131

పల్లవి: చెప్పవయ్య వినేను చెవులపండుగగాను
వొప్పుగా నీవు లెస్సవుండుటే నాలాభము

చ. 1: అలుకదేరి నీతో నాపె మాటలాడెనా
కళలు మించీ నీచక్కనిమొగము
చలములు మాని నీతో సరసములాడెనా
చెలరేఁగి వేడుకతో జిగిమించే విపుడు

చ. 2: జంకించక యట్టె నీతో సారెసారె నవ్వెనా
పొంకపునీబుజము లుబ్బుచునున్నవి
మంకు దలఁచక నీ మనసురాఁ గూడేనా
అంకెల సంతోసాన నలరేవు నీవు

చ. 3: పెట్టుకొన్నవొట్టెంచక ప్రేమతో మోవిచ్చెనా
మెట్టుక రతిచిన్నలు మేన నున్నవి
యిట్టె శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
గట్టిగా నన్నేలితివి కలిగె నానందము

రేకు: 1222-6 మంగళకౌసిక సం: 22-132

పల్లవి: పొద్దువోనిఆఁటది బొమ్మల కాటుక వెట్టీ
అద్దుక యేమిచూచేవు ఆయనాయ రావయ్యా

చ. 1: వింతవింతచూపులను వెలఁది నిన్నుఁజూచి
దొంతరసిగ్గులతోడఁ దొట్టుకొనీని
జంతవలె నీముందర సారెఁ జేసీ వేసాలు
యెంతలేదు రావయ్య మాయింటికి నీవు

చ. 2: విరుల నిన్నువేసి వెడయాస నీకుఁ జూపి
తరగిరినవ్వు నవ్వీఁ దనలోననె
యెరవులకతలాఁడి యెన్ని నేరుచుకొన్నది
అరుదందేవేల రావయ్యా లోనికిని

చ. 3: సంగడినే నిలుచుండి చన్నుల నిన్ను నోరసి
అంగపుఁ జెమటతోడ నానందించీని
సంగతి నే నలమేలుమంగను శ్రీవేంకటేశ
రంగుగాఁ గూడితి విట్టె రావయ్యా కాఁగిటికి

రేకు: 1223-1 సాళంగం సం: 22-133

పల్లవి: ఇన్నియుఁ దనతోఁగాక ఇఁకమరి కలదా
యెన్నిరానిపరవశ మెవ్వరిసోమ్మే

చ. 1: మాటలాడకుండితేను మాననీవే కొసరఁగ-
నేఁటికే మౌనవ్రత మెవ్వరిసొమ్మే
యీటులేనిమోము చూడకున్న నుండనీవే
కాటుకకన్నులనీటికాలు వెవ్వరిసొమ్మే

చ. 2: నవ్వకుండితేఁ బోనీవే నాకు నింకాఁ దనకుఁగా-
నివ్వలఁ జెక్కిటిచే యెవ్వరిసొమ్మే
దవ్వుగాక వద్దనుండి తడవకున్నఁ బోనీవే
చివ్వన బానుపుమీఁద సిగ్గు లెవ్వరిసొమ్మే

చ. 3: కూడినరతులవేళ కొంకకున్న లేలేవే
యీడులేనిబుసకొట్టు లెవ్వరిసొమ్మే
జోడై శ్రీవేంకటపతి చొక్కించే నౌనౌనే
వీడెపుమోవిఁ జేసేటివింత లెవ్వరిసొమ్మే

రేకు: 1223-2 ముఖారి సం: 22-134

పల్లవి: ఇంతకంటె నేమిసేసే వేలరా నీకు నవ్వు
వంతగాఁడవైతివి అప్పటి నానవ్వు

చ. 1: వుమ్మడి నీతో నలిగి వొంటినుండి నామలగు
నెమ్మదిఁ గాఁగిలించితే నీకేలరా నవ్వు
దిమ్మువట్టి కొనగోరు తీఁటగోఁగా నిమ్మపండు
ఇమ్ముల నాఁటనూఁదితే ఇంతేల నవ్వు

చ. 2: వొట్టు వెట్టుకొంటిఁగాన వొకరితోఁ బలుకక
నెట్టన నేఁ బాడుకొంటే నీకేల నవ్వు
నిట్టనిల్గి నీ వుండఁగా నిద్ర రాఁగా గడెవెట్టి
పట్టేమంచానఁ బండితే పైఁజల్లకు నవ్వు

చ. 3: కామించి నివు గూడఁగా కన్నుమూసి కొంతవడి
నీమనసు చూచితేను నీకేలరా నవ్వు
దోమటి శ్రీవేంకటేశ తోడిఁబడ దక్కఁగొంటి-
నీమతకా లెఱఁగరా యిఁకనేల నవ్వు

రేకు: 1223-3 సామంతం సం: 22-135

పల్లవి: చూడరమ్మ సతులాల సుదతిలాగులు నేఁడు
యేడలేనితమకాలఇంపు లెట్టివో

చ. 1: కన్నులఁ దప్పకచూచు గక్కననుఁ దలవంచు
అన్నిటా విభునిఁ జెలి యంపలేక వేగిలేచి
తన్నుఁదా నాతనిరూపు తలపోసుఁ గన్నుమూసు
యెన్నరానిసతిమో మేమిచెప్పదే

చ. 2: మగిడిమగిడి వచ్చు మంతనాన మాటలాడు
పగటున రమణునిఁ బాయలేక జలజాక్షి
నగుతానే విడెమిచ్చు నాలి నాకుమడిచిచ్చు
సోగిసి యీవలపులాసోద మెట్టివో

చ. 3: కమ్మరానుఁ గాగిలించు కందువగా మోవి ఇచ్చు
తెమ్మగా శ్రీవేంకటేశుతీపురతులు మరిగి
దొమ్మినేసి కూటమికి దొమతెరలోని కేఁగు
అమ్మలాల జవ్వనపాయపువేడు కెట్టిదో

రేకు: 1223-4 రామక్రియ సం: 22-136

పల్లవి: బలురాజసమైనాను బత్తి నీమీఁదఁ గలఁడు
వలపులెల్లాఁ జల్లవే వచ్చీ నతఁడు

చ. 1: చేలకొంగు వట్టుకొని చేరి ప్రియములు చెప్పి
వాలాయించి పిలువరే వచ్చీ నతఁడు
తాలిమితో నిలుచుండి దయవుట్ట మొక్కు మొక్కి
వాలుకచూపు చూడవే వచ్చీ నతఁడు

చ. 2: కదిసి కానుక ఇచ్చి గడ్డమువట్టి వేఁడుక
వదనము చపవే వచ్చీ నతఁడు
వుదుటుగుబ్బల నూఁది పోదిగి కాఁగిటఁ బట్టి
వదలక వుండవే వచ్చీ నతఁడు

చ. 3: వేడుకలు వుట్టించి వెనకటిపొందుల-
వాడికలు సేయవే వచ్చీ నతఁడు
యీడనే శ్రీవేంకటేశు నీతలోనే కూడితివి
వాడలో దినదినము వచ్చీ నతఁడు

రేకు: 1223-5 వరాళి సం: 22-137

పల్లవి: నీవేల సిగ్గువడేవు నేమేమనేము నిన్ను
వావి గూడితేఁజాలు వదలకువయ్య

చ. 1: వొల్లనే యిచ్చకమాడి వొడఁబరచీ నిన్ను
వెల్లవిరిగా నీవు వినవయ్య
చల్లుఁజూపులనుఁ జూచి సారెఁ దమకము రేఁచీ
అల్లదే లొనుగావయ్య ఆపెకు నేఁడు

చ. 2: సంగతిగా మోవి చూపి చవులువుట్టించీ నీకు
అంగవించి వేడుకతో నందుకోవయ్య
సింగారించుకవున్నది చిఱునవ్వు నవ్వి నీతో
సంగడిఁ బెట్టుక నీవు చనవియ్యవయ్యా

చ. 3: వూరకే నీ కెదురుగా నొడ్డుకున్నది గుబ్బలు
నేరుపుతోఁ గాఁగిట నించుకోవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చేరి నన్నేలితి వాపెఁ జేసుకోవయ్య

రేకు: 1223-6 వేళావళి సం: 22-138

పల్లవి: ఇంకఁ బాయరావుసుమ్మీ యీసంగాతాలు
కంకణదారాలాయఁ గడుసంగాతాలు

చ. 1: చల్లలమ్మేవారితోడి సంగాతాలు
చల్లుఁజెలమలవూట సంగాతాలు
జల్లెడలోపోఁకలు మాసంగాతాలు
యెల్లవారు నెటిఁగిరి యీసంగాతాలు

చ. 2: జంగిలిగొపికలసంగాతాలు నీకు
సంగడి బండికండ్లాయ సంగాతాలు
సంగతాయ పొరుగిండ్లసంగాతాలు
యెంగిలిపోత్తులతోడియీసంగాతాలు

చ. 3: సరిబేసులాయ మనసంగాతాలు
సరుగ మరవరానిసంగాతాలు
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నిరతిఁ గూడఁగఁజేసె నీనాసంగాతాలు

రేకు: 1224-1 సామంతం సం: 22-139

పల్లవి: ఆడేనంటా వచ్చె నారగించలే దింకా
వాడవారచేడెలాల వనజాక్షుఁ జూపరో

చ. 1: మందనున్నపసులాల మంచిగోపబాలులాల
కందర్పగురుఁడు వచ్చెఁ గంటిరా మీరు
కెందమ్మివనములాల కృష్ణుఁడు యమునలోన
చిందుల నీఁదాడునల చెప్పరో సుద్దులు

చ. 2: గొల్లవారిఇండ్లాల గొందిపాలువెన్నలాల
కొల్లలాడేహరి వచ్చె గొండించరో
చల్లలమ్మేసతులాల సరసపురచ్చలాల
ఇల్లీడ నేడనున్నాఁడో యెఱిఁగించరో

చ. 3: గోవర్ధనముదండ గుంపులపూఁ బొదలాల
కోవిదుఁ డేమి సేసి గుట్టుచూపరో
శ్రీవేంకటాద్రిమీఁదఁ జేరి కంటి మింతలోనె
పూవువలె నెత్తుకొంటి భోఁగిచీ నీఁకను

రేకు: 1224-2 ముఖారి సం: 22-140

పల్లవి: అందుకేపో నీవద్ది కప్పటనుంటి రాదు
కందువకే విచ్చేసి కైకొనుమీ చెలిని

చ. 1: యేకతమాడేనంటా నింతి దగ్గరఁ బిల్చి
కాకుమాటలాడితట కలదా ఇంత
ఆకుమడిచియిమ్మంటా నందుకోఁ బోయి గొర
రేక లంటించితివట రీతిగాదుమ్మీ

చ. 2: పాదములొత్తుమీయంటా పడఁతి పైఁ బారఁజాఁచి
యేదెసో మోపితివట ఇది దగునా
పోదిగా నీతురుమునఁ బూవులు ముడువుమంటా
పాదుగ వీఁపున నాకొపై నొరగఁదగునా

చ. 3: పానుపు వరచుమంటా పడఁతిఁ గాఁగిటం బట్టి
అనెలవుననే కూడి తాయఁగా పని
నేను వచ్చితి నింతలో నెరవుగాఁ గూడితివి
యీనిజము శ్రీవేంకటేశ నీకే తగును

రేకు: 1224-3 లలిత సం: 22-141

పల్లవి: చేకొలఁదిమగఁడవు చెల్లింతు వాకెగర్వము
దీకొని ఇంతలో నీవు తిట్టఁగనేమిటికి

చ. 1: ఇంతవడి నవ్వు నవ్వే నేకతాలు నీతో నాడె
ఇంతకంటె నేమిసేసు నీపె నీతోను
బంతిబోజనాలు సేసె పచ్చిదేర మాటలాడె
కొంత గాఁగిలీకుండితేఁ గొరతాయనా

చ. 2: కెఱలించె నీమోహము కేలెత్తి సన్నలుసేసె
మఱి యేమిటఁ గొదువ మగువకును
మెఱఇంచెఁ దనమేలు మించి నీపై బత్తి చూపె
తఱి మోనాననుండితే తక్కువాయనా

చ. 3: చలివాపె రతులను చన్నులంటఁ బెనఁగెను
వెలితేది యాపెకు శ్రీవేంకటేశుఎడ
అలమేలుమంగపతి వన్నిటా నన్నేలితివి
కలకి లోన నుండితేఁ గడమాయనా

రేకు: 1224-4 ఆహిరి సం: 22-142

పల్లవి: ఏమని చెప్పము నేము ఇందుకు మారుత్తరము
కామించి నీకే తెలుసుఁగాక యీకతలు

చ. 1: చిక్కనినవ్వులు నవ్వేఁ జెలియ నీమోము చూచి
వక్కణడిగేవు చెప్పవచ్చునా యిందు
మొక్కు మొక్కెఁ జేతులెత్తిముందరనే నన్నుఁ గని
లెక్క లెంచుకోనే విది లెస్సాయనయ్యా

చ. 2: కడలేనివినయాలు కాంత నీకుఁ జేసీతేను
వొడివట్టే వందుఁ బెట్ట నొనగూడునా
వడిగా నీమీఁదట వలపులు చల్లీతేను
ముడిచేవు కొంగునను కడుజాణవయ్యా

చ. 3: అలమేలుమంగ నీతో నట్టె మాటలాడఁ గాను
కొలచేవు కుంచానఁ జిక్కునా ఇవి
యెలమి శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
వెలవెట్టేవు చన్నులు వేడుకకాఁడవయ్యా

రేకు: 1224-5 పాడి సం: 22-143

పల్లవి: ఔనయ్యా మంచివాఁడ వాపె తొల్లె ముద్దరాలు
అనలేల పెట్టేవు అంతేసి కోపునా

చ. 1: చెలి నీతో నవ్వెనంటా చెక్కులేల నొక్కేవు
కలన నీగోళ్లు మిక్కిలివాండ్లు
పలుకుమంటా సారె పయ్యదేల తీసేవు
బలిమికాఁడవు నీతో పంతాల కోపునా

చ. 2: జంకించి చూచెనంటా చన్నులేల పట్టేవు
కంకణపునీచేతులు కడుగట్లు
అంకెలఁ బెనఁగుమంటా ఆయములేల ముట్టేవు
సంకెలేనివాఁడవు నీసాములకు నోపునా

చ. 3: తొక్కేవు పాదాలంటా తురుమేల యంటేవు
నెక్కొని నీవేళ్లు కిన్నెరమీట్లు
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ గూడేవు
వెక్కపుజాణవు నీవినోదాల కోపునా

రేకు: 1224-6 మాళవి సం: 22-144

పల్లవి: మేలుమేలు సతులెల్లా మెచ్చిరి నిన్ను
వేళతో మావిన్నపాలు వింటివి నీవు

చ. 1: చతురుఁడవైనందుకు జాణవు నీవైనందుకు
అతివను మన్నించితి వదివో నీవు
కతలు నేర్చినందుకు కడుమేటివైనందుకు
తతెఱిఁగి వచ్చితివి దయతో నీవు

చ. 2: సంతోసించుకొన్నందుకు సమ్మతించినందుకు
యింతికిఁ జనవిచ్చితి విపుడే నీవు
ఇంతచుట్టమవైనందు కింపుగలిగినందుకు
పొంతనే లాలించితివి బుజ్జగించి నీవు

చ. 3: సలిగె ఇచ్చినందుకు సరసుఁడవైనందుకు
అలమేల్ మంగ గూడితి వన్నిటా నీవు
కలిగినందుకు శ్రీవేంకటపతివైనందుకు
తెలిపితివి నీపొందు దీననే నీవు

రేకు: 1225-1 కాంబోది సం: 22-145

పల్లవి: ఔనయ్య మంచివాఁడ వప్పుడే యెంతసేసితి
పూనెఁ బ్రేమపేరెవర పొటుళేశ నీకు

చ. 1: కన్నుల నవ్వులుదేరీ కాంత నేమేమి సేసితో
పన్నినయేకతవేళఁ బానుపుమీఁద
కిన్నెరకాయచన్నులు గిజిగిజాయ నిదివో
కన్నె ఇంతె తొలుసారే కడుఁబచ్చి సేతురా

చ. 2: మోపకమోచి సెలవి ముసిముసినవ్వుదేరీ
ఆవేళ నేమేమిమాటలాడితో నీవు
కానిమోవి తెల్లఁబారి కడుసదమదమాయ
పూవువంటిబాల ఇంతభోగముల కోపునా

చ. 3: చెక్కులఁ జెమటగారి చెలిపయ్యద దడిసె
గక్కన నెంత మనసు గరఁచితివో
యెక్కువ శ్రీవేంకటేశ యీడఁ బెరియవరాన
వోక్కటఁ గూడితి విట్టే వొబుళేశుఁడవై

రేకు: 1225-2 మలహరి సం: 22-146

పల్లవి: ఒక్కొక్కసతినడుమ నొక్కొక్కరూపు గైకొని
యెక్కువైతి కృష్ణా నిన్నెట్ల నమ్మేదిరా

చ. 1: మాటలాడే వొకతెతో మళ్ళిచూచే వొకెతను
వోటలేక నవ్వునవ్వే వొకతెతోను
కూటువై గొల్లెతలము గుంపుగూడున్నార మిదే
యేఁటిది నీమోహ మిఁక నెందని నమ్మేదిరా

చ. 2: కన్నుగీఁటే వొకతెకుఁ గాఁగిలిందే వొకతెను
వెన్నదిన్న మోవిచ్చేవు వేరొకతెకు
వున్నతి రాసక్రీడ లున్నార మిందరము
ఇన్నిటిలో నీవలపు యెందని నమ్మేదిరా

చ. 3: తమ్మవెట్టే వొకతెకుఁ దగమెచ్చే వొకతెను
సమ్మతించఁజేశొకతెచన్ను లంటేవు
యెమ్మెల శ్రీవేంకటేశ ఇందరి మమ్ముఁ గూడితి-
విమ్ములనే నమ్మితిఁగా కెటుల నమ్మేదిరా

రేకు: 1225-3 బౌళి సం: 22-147

పల్లవి: అతనికి నీకు నింపులై యుండఁగా
యీతలాతలివారి కెంచఁగనేమిటికి

చ. 1: మగఁడుమన్నించేదానిమాటలెల్లాఁ జక్కనే
తగవరివనితపంతము చక్కన
నగనేరిచినదానినటనలెల్లా జక్కన
యెగసకెములాడఁగ యెవ్వరికేమిటికి

చ. 2: సిరిగలిగినదానిచేఁతలెల్లాఁ జక్కనే
పొరుగుపోరచికాంతపొందు చక్కన
సరినిచ్చకపుదానిసరసములు చక్కన
దొరకొని యెవ్వరికి దూరఁగనేమిటికే

చ. 3: పాయము గలుగు దాని పగటులెల్లాఁ జక్కనే
చాయయెఱిఁగినసతిజాడ చక్కన
యీయెడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
పాయక నన్నేలె తాము పచ్చార నేమిటికే

రేకు: 1225-4 సౌరాష్ట్రం సం: 22-148

పల్లవి: పడఁతి నీవుసేసినభాగ్య మెట్టిదో
అడరి నీపై నిలిచె నాతనిమోహము

చ. 1: చాలుకొన నిన్నుఁజూచి సారెసారె నాతఁడు
కెలెత్తి మొక్కఁగదవే కిమ్ములనుండి
అలకించి నీసుద్దులే యంగనలతోఁ జెప్పీని
వేళగాచుక వుండుమీ వేడుకతోను

చ. 2: కొచ్చికొచ్చి సన్న సేసీ కోరికోరి నీకతఁడు
వచ్చేనని చెప్పెంపవే వనిత నీవు
మచ్చికతోఁ దలపోసీ మతిలోనే నీరూపు
యిచ్చోటు వదలకుమీ యీడకే వచ్చీవి

చ. 3: నెలవుల నవ్వీ నిన్ను శ్రీవేంకటేశ్వరుఁడు
అలమేల్‌మంగవు విడె మటు చూపవే
తలఁపెటిఁగి మన్నించి తానే వచ్చి నిన్నుఁ గూడె
నెలకొని యిచ్చకమే నించుమీ యీతనికి

రేకు: 1225-5 వళవిగౌళ సం: 22-149

పల్లవి: తాను నాతోనన్నమాఁట తానెఱుఁగును
నానఁబెట్టి సిగ్గులెల నాఁటుకొలిపీని

చ. 1: నాముందరి కిట్టె వచ్చి నాతో నాడుమనరాదా
యేమిటికిఁ జెప్పిపంపీ నెడమాఁటలు
మోముచూచి నాచేత మొక్కించుకొమ్మనరాదా
రామలకెల్లాఁ జెప్పి రాఁపేల సేసీవి

చ. 2: యెదుటికి వచ్చి వీడెమిప్పించుకొమ్మనరాదా
పదిమారులు లేకలు పంపనేఁటికి
కొదదీరఁ బానుపుపైఁ గూచుండుమనఁగరాదా
వుదటున ననునెంత వొడఁబరపించీని

చ. 3: చేరి నాచేత సేవలు సేయించుకొమ్మనరాదా
యీరీతి దెరమఱ గిఁకనేఁటికి
కోరి యలమేలుమంగఁ గూడె శ్రీవేంకటేశుఁడు
వేరులేక నన్నునెంత వేఁడుకొనీని

రేకు: 1225-6 ఆహిరి సం: 22-150

పల్లవి: ఏమి చెప్పేమిఁక నీతో నింతికతలు
కామించి నీవే వచ్చి కనుఁగొంటగాక

చ. 1: వుమ్మగిలువలపుల నూరివూరి వానలుగా
కొమ్మమేనఁ జెమటలు గురిసీ నవె
నెమ్మిఁ గొరికలచేత నిగిడినపులకలు
గమ్ముకొని పసిమెక్కె కడుఁ గుచములను

చ. 2: వలగొన్నతలపోఁత వసంతకాలము వచ్చి
నలినాక్షిచింతలు ననిచీ నవె
తొలఁకేతమకముల తురుములోనివిరులు
జలజలరాలుకొంటా జవ్వనము మించెను

చ. 3: వుంగిటియైనతరితీపు లుపతిలి యలమేలు-
మంగమోవిఁ దీనె లామని వచ్చెను
రంగుగ శ్రీవేంకటేశ రతి నీవు గూడఁగాను
సింగారము రాసులై చెలఁగి చూపట్టెను

రేకు: 1226-1 ఆహిరి సం: 22-151

పల్లవి: నిన్ను నేమీననలేక నివ్వెరగందితిఁగాక
యిన్నేసివగలఁబెట్ట ఇతవా నీకు

చ. 1: పువ్వులవేసినవారిఁ బూచి రాత వేయలెక
నవ్వఁగనే నీతో నే నవ్వేఁగాక
నివ్వటిల్లువలపుల నిట్టూర్పు లివె మించీఁ
జవ్వనాన ననుఁ బాయఁ జలమా నీకు

చ. 2: వెన్నపూసినట్టివారి వెలిమిడి పూయలేక
పన్ని నీవు పలుకఁగఁ బలికేఁగాని
కన్నుల నీళ్లు దొట్టి కాఁకలు మేన నిండె
వన్నెలనన్నింత సేయ వ్రతమా నీకు

చ. 3: చెట్టవట్టి తియ్యఁగాను చేసన్న నేయఁగలేక
గుట్టుతో నీవు గూడఁగఁ గూడితిఁగాని
అట్టె శ్రీవేంకటేశ అరమఱపాయ మేను
చుట్టమై ఇంతసేయ సూడా నీకు

రేకు: 1226-2 మాళవిగౌళ సం: 22-152

పల్లవి: ఈడనేల మాతోనే యింతబీరాలు
వాడవారితోనే పోయి వాదించరాదా

చ. 1: కొల్లున నే నవ్వి తేనే కొంగువట్టేవు రేపల్లె-
నల్లవారు నిన్ను నవ్వే రందు వొవోయి
చల్లగా నేఁ జూచితేనే జంకించేవు పురసతు-
లుల్లసాన నిన్నుఁజూచే రొద్దనఁగరాదా

చ. 2: ఆఁటదాన వద్దనుంటే నాసపడేవు చుప్పనాఁతి
ఆఁటదిగాదా నీ వందు వోవోయీ
మేఁటివంటా మొక్కితేనే మేలమాడేవు యింతైతే
నాఁటికొలనిసతుల నసలు విడుతురా

చ. 3: గందము పైఁజల్లితేనే కడుఁదిట్టేవు తొల్లి
గందమువారింటిసతి బొందవా వోయి
కందువ శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
వొందిలి నీకొనగోర నొత్త నింకావలెనా

రేకు: 1226-3 పాడి సం: 22-153

పల్లవి: చెలి విన్నవించవే నేఁ జెప్పేనంటే సిగ్గయ్యీని
బలిమిఁ గాదని తోయఁ బంతగత్తెనా

చ. 1: నేనెంతటి దానను నెట్టుక నొడఁ బరచీ
తానెంతమన్నించినాను తనచిత్తము
పూని యెంతవేడుఁకొనీ నూడిగపుదాన నింతే
కానీవే తనమాట గాదనేనా

చ. 2: తనకేమి బాతి నేను తలచుగా నాతో నవ్వీ
నను నెంతలాలించినా నాభాగ్యము
చెనకి యెంతమెచ్చీఁ దాఁ జేసినమానిసి నింతే
తననిచ్చదానఁగాక తగదనేనా

చ. 3: సతులతోఁ బోగడీ నాచక్కఁదన మేమున్నది
రతి నెంతగూడినా సమ్మతమే నాకు
యితవై శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
సతముగా నన్ను నేలె చాలుననేనా

రేకు: 1226-4 ముఖారి సం: 22-154

పల్లవి: ఏల పెనఁగులాడేవు ఇందరిలోన
మేలువాఁడవై యాపె నేలుకోరాదా

చ. 1: వేడుకతో జెలి నీపై వెన్నెలనవ్వులు చల్లె
కోడెకాఁడవు తుడుచుకొనఁగలవా
చూడఁగానే నిన్ను తనచూపులజిగు రంటించె
యీడ విడిపించుకొన నీఁకనోపేవా

చ. 2: మక్కువతో నాపె నీకు మాఁటలనే చొక్కువేసె
వుక్కుమీరి లోనుగాక వుండఁగలవా
నిక్కిచూచి కోనగోర నీమర్మములెల్లా నెత్తె
మక్కళించి కూడక మానవచ్చునా

చ. 3: కందువ నలమేల్మంగ కాఁగిటనే వలలొడ్డె
మందలించి తగులక మానఁగలవా
ముందె శ్రీవేంకటేశ మోవి నీకు లంచమిచ్చె
చెంది చెప్పినట్టు నీవు సేయకుండఁగలవా

రేకు: 1226-5 శ్రీరాగం సం: 22-155

పల్లవి: నీమహిమో నాలోన నిండినవలపుజాడో
యేమి సేతు నన్నెప్పుడు వెడయకువయ్యా

చ. 1: యెనని నీతో నేను యెంతవడి మాటాడినా
తనియదు నామనసు తమి యెట్టిదో
వినయముతో రెప్పలువేయక చూచినాను
నినుపులై మమతలు నిచ్చ కొత్తలు

చ. 2: చలపట్టి నీతోను సారెసారెఁ బెనఁగిన-
నలయదు నామేను ఆస యెట్టిదో
కొలువులో నీవద్దఁ గూచుండి యెంతనవ్విన
తలఁపులో కోరికలు తరగనిధాన్యాలు

చ. 3: కడఁగి యందాఁకా నిన్నుఁ గాఁగిలించుకుండినాను
విడువవు చేతులు వేడుకెట్టిదో
అడరి శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
తొడరి యేలితివి రతులు తరితీపులు

రేకు: 1226-6 నాదరామక్రియ సం: 22-156

పల్లవి: ఎఱిఁగించవే నాకునేల దాఁచేవు
గుఱుతులు గానవచ్చీఁ గొంకనేఁటికే

చ. 1: కామినిరో నీమోమునఁ గళలుదేరీ నేఁడు
నీమగఁడు వచ్చెనా నీవద్దకి
అముకొని చెంగలించి యట్టె మాటలాడేవు
యేమైనా నీకుఁ జనవులిచ్చెనటవే

చ. 2: సంతోసించుకొందానవు చవులు చూపి యతఁడు
మంతనాన నిన్నప్పుడె మన్నించెనా
వింతలుగా నెలవుల వేడుకతో నవ్వేవు
యింతలో నీకోరికలు యీడేరిచెనటవే

చ. 3: వేవేలుచిన్నలతోడ వెల్లవిరై మెఱసేవు
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కూడెనా
యీవేళ నల మేల్మంగ విన్నిటాఁ జొక్కే వీతఁడే
చేవమీరినరతులఁ జిమ్మిరేఁచెనటవే

రేకు: 1227-1 శ్రీరాగం సం: 22-157

పల్లవి: ఇందాఁకాఁ బొరలితివి యేడలేనివిరహన
కందువ నీపాలఁ జిక్కె కాంతుఁడు నేఁడిదివో

చ. 1: చెలువుఁడు వీడె వచ్చెఁ జిత్తగించవే నీవు
కలికికన్నులఁ జూచి కరఁగించవే
పలుకుఁదేనెలు మోవిఁ బైకోన మాటాడవే
పిలుచుకవచ్చితిమి ప్రియములుచెప్పవే

చ. 2: అతఁడు విడెమిచ్చిని అందుకొనివె ఇప్పుడు
చేతులెత్తి మనసారా సేసవెట్టవే
యీతల సరుసనుండి ఇట్టె సరసమాడవే
నీతో నోనగర్చితిమి నిండాఁ గాఁగిలించవే

చ. 3: శ్రీవేంకటేశుఁ డేలెఁ జిరునవ్వు నవ్వవే
మోవితీపు చూపి కేలు మొగిడించవే
యీవేళ నలమేల్మంగ వెనసితి వితనితో
సేవసేసీ నీరతులఁ జేకొని మెప్పించవే

రేకు: 1227-2 పాడి సం: 22-158

పల్లవి: చెప్పితేఁ దెచ్చేముగాక చెలి నెవ్వతెనైనా
వొప్పుగొని పైఁడికత వూఁకోనేదెట్టే

చ. 1: నివ్వటిల్లఁ దనలోనే నిట్టూర్పు నిగిడించీ
యెవ్వరిపై మోహమౌతా నెట్టు దెలుసు
జవ్వనపుతనమేను జలజలఁ జెమరించీ
వువ్విళ్లూర నేఁటికని వూహించేమే

చ. 2: చెక్కిటఁ జేయివెట్టుక చింతించీఁ దనుఁ దానె
యెక్కడ నున్నదో చిత్తమేమిసేతమే
పక్కన నవ్వులు నవ్వి పలుదిక్కులునుఁ జూచీ
అక్కర నేసుద్దులని యడుగఁగవచ్చునే

చ. 3: వింతవింతకళలెల్ల వెస నెమ్మోమున నిండె
యెంతసంతోసమో గుఱు తెట్టు వెట్టేమే
ఇంతటిశ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
పొంతనుండి నన్నుఁ గూడె పొగడేదేమే

రేకు: 1227-3 సామంతం సం: 22-159

పల్లవి: నీమన నెఱుఁగుదుము నెలఁత పై దయ గద్దు
కామించి ఇంటికివచ్చి కనుసన్నలేఁటికి

చ. 1: మక్కువ సేసినవారి మన్నించనేవలెఁగాక
పెక్కులాగులను జోలిఁ బెట్టనేఁటికి
చక్కెరమోవి యిచ్చితే చవిగోనవలెఁగాక
తక్కులఁబెట్టేటివట్టితరితీపు లేఁటికి

చ. 2: చుట్టాలయినవారిఁ జూచి చోటీవలెఁగాక
అట్టె రట్టుసేసేటియాఁడేఁటికి
గట్టిచన్నుల నోత్తితే కరఁగఁగవలెఁగాక
గుట్టున గుబ్బతి లించేగొరబు లింతేఁటికి

చ. 3: లలి నాసపడ్డవారి లాలించవలెఁగాక
నెలవినవ్వుల జాగు సేయనేఁటికి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితివి చెలివి కత లిఁకనేఁటికి

రేకు: 1227-4 బౌళి సం: 22-160

పల్లవి: ఎవ్వరికిఁ దెలుసును ఇటువంటిమీగుట్లు
యివ్వల వెల్లవిరైన దిపు డింతేకాక

చ. 1: యెఱుఁగుదుమా తొల్లి యాపె నీకు దేవులౌత
చిఱుతనవ్వుల నీపైఁ జిందఁగాఁగాక
గుఱుతు గానవచ్చునా కోరినమీపొందులకు
వుఱక నీవద్ద బాయకుండఁగాఁగాక

చ. 2: చెప్పితిరా మీరు మాకు సేసుకొన్నపెండ్లి
కప్పి యాపె నవ్వఁగానే కంటిమిగాక
వొప్పి చూచుకున్నారమా వుడివొనిమీరతులు
చిప్పిలఁ దా నిందరితోఁ జెప్పుకోఁగాఁగాక

చ. 3: పుట్టెనా యెక్కడనైనా పొంచి మీచుట్టరికాలు
బట్టబయ లాపె సిగ్గువడఁగాఁగాక
గట్టిగ నలమేలుమంగకాఁగిటి శ్రీవేంకటేశ
ఇట్టె నన్నేలితి వీకె నిరవాయఁగాక

రేకు: 1227-5 దేశి సం: 22-161

పల్లవి: ఆటని విన్నవించరే యాతనితోను
తటుకన మిమ్మునేల తగవడిగీని

చ. 1: కూడినమందెమేళాన కొమ్మ తెంతగొసరినా
వేడుకపడుటేకాని వేసరరాదు
వాడికైనచోట నెంతవడి యలయించినాను
యీడుజోడై యంటగాని యెడయఁగరాదు

చ. 2: చనవులుచేసుకోని సతు లెంతసాదించినా
తనివిఁబొందుటఁగాని తలఁకరాదు
పెనఁగులాడేటిచోట బిరుదు లెంతాడుకొన్నా
ననిచి లోనౌటగాని నంటువాయరాదు

చ. 3: కూరిమితో వనితలు గుబ్బల నెంతవొత్తినా
వోరుచుకుండుటగాని వొదుగరాదు
యీరీతి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
సారె నన్నేలుటేకాని జడియఁగరాదు

రేకు: 1227-6 గౌళ సం: 22-162

పల్లవి: బెరసి పెండ్లి వచ్చి పెరట విడిసె నీకు
సొరిదిఁ బెండ్లాడవయ్య సోబానఁ బాడేము

చ. 1: పొట్టఁబొరుగుననుండి పొంచి నీకు మోము చూపె
గుట్టుతోఁ దాఁ బండేఇంటిగురుతు చెప్పె
దట్టపుసొరణగండ్లతలుపుఁ దెరచి ఇచ్చె
చుట్టమవైతి వాపెకు సుద్దు లిఁక నేఁటికి

చ. 2: యెలుఁగెత్తి పాటవాడి యెచ్చరికెసేసి నీకు
కలపీఁ బరిమళాలు గాలివైపున
వెలిఁ బావురమువేసి పిలిచి నిన్ను సన్నల
చెలిమి చేటఁడు గల్గె చెప్పనిఁకనేఁటికి

చ. 3: ఆకె సింగారించుకొని అట్టె నిన్నుఁ దోఁగిచూచె
వాకునఁ దాఁగలసినవావి దెలిపె
పైకొని యలమేల్ మంగపతివి శ్రీవేంకటేశ
యీకడ నన్నేలితివి యేమీననేఁటికి

రేకు: 1228-1 రామక్రియ సం: 22-163

పల్లవి: ఇంతవలచినవారి నెఱఁగమమ్మ
కాంతలు గుట్టుననుండేగతులా యివి

చ. 1: ఆఁపలేవు నీమనసు ఆతనిఁబాసి ఇంచుక
కాఁపురాలు సేసేవారికతలా యివి
చూపుల నాతని నిట్టె చూఁచేవు రెప్పవేయక
పూఁపవయసువారికి బుద్ధులా ఇవి

చ. 2: మంతనాన నీమనసు మగనితోఁ జెప్పేవు
పంతగత్తెలైనవారిపగటా ఇది
సంతతము నీకునీవే చవులుచూపేవు మోవి
వంతువాసులవారికి వైపులా యివి

చ. 3: మేరసే కురముపై మిక్కిలి తావుకొంటివి
నేరుపరులైనవారినేర్పులా ఇవి
చేరి యలమేల్మంగవు శ్రీవేంకటేశుఁ గూడితి
పూరివారికెల్లాను వొనగడునా యిని

రేకు: 1228-2 బౌళి సం: 22-164

పల్లవి: ఎందాఁకా నవ్వులు నవ్వే వీపెతోను
ఇందరిలోనాఁ జనవుతియ్యవయ్య ఇపుడు

చ. 1: ముంచక మునుకలాయ మొదల నీపైవలపు
పెంచకే పెద్దలాయను పెనుచన్నులు
మంచినీటిచెలమాయ మరియును తేనెమోవి
నించరాదా నీకరుణ నెలఁతపై నిఁకను

చ. 2: కూడఁగూడఁ గుప్పలాయ కొప్పులోని కీనెరులు
వాడనిచిగురువలె వచ్చె వయసు
వూడుచరానితగులై వున్నది నీనేస్తము
వేడుకఁ గూడఁగరాదా వెలఁది నింతటను

చ. 3: చెప్పఁజెప్పఁ గొత్తలాయ చెంతనే సింగారము
అప్పటి పెండ్లిచవికాయఁ గాఁగిలి
చిప్పిల నేలుకొంటివి శ్రీవేంకటేశ్వర
మెప్పించరాదా యలమేల్మంగను రతుల

రేకు: 1228-3 లలిత సం: 22-165

పల్లవి: ఎక్కడఁ దెచ్చితివయ్య యీపెను నీవు
వెక్కసముగా నీకు విడెలిచ్చీని

చ. 1: పట్టపగలే నీకు పాదాలు గుద్దుతాను
చుట్టరికములు చెప్పీ సుదతి
నట్టనడుమఁ గూచుండి నవ్వులు నవ్వుకొంటాను
వట్టి వూడిగాలునేసీ పలుమారు నీకు

చ. 2: పూని పట్టుకొని వచ్చి పువ్వులు ముడిచేనంటా -
నానుక చన్నుల నొత్తి నంగన
తానే మొగము చూచి తగ సిగ్గువడుకొంటా
మోనమునఁ దేనెలూరేమోవి చూపీ నీకు

చ. 3: పైపైఁ దెరవేసుక పాఁతపెండ్లికూఁతరై
కాఁపురమునేసీ నీకుఁ గలికి
ఆఁపక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
నాపొందు సేయఁగఁ దానూ నాఁటుకొనీ నీకు

రేకు: 1228-4 గౌళ సం: 22-166

పల్లవి: ఎంత లేదు లేలే మాయింటికి రావయ్య నీవు
చింతలెల్లఁ బాయ నీకుఁ జెప్పేఁగాని బుద్దులు

చ. 1: చేసూటి నాపె నీకు జెప్పినట్టెల్లాఁ జేసేవు
చేసుకొంటి బాస లాచెలికి నీకు
యేసతులు చెనకిన నిట్టే నేమము చూపేవు
వాసుకొన్నపత్రాలా వనితకు నీకును

చ. 2: వోడక మాటాడితేను వున్నాఁడవు మోనముతో
ఆడుకోన్నమాటలా ఆపెకు నీకు
యీడుజో డై యేపొద్దు ఇల్లువాయకున్నాఎడవు
వొడఎగట్టినదూలమా వువిదకు నీకును

చ. 3: ముట్టి నే నిన్నుఁ గూడితే మోము చూచితివాపెను
కట్టినదే కంకణమా కాంత నీకును
అట్టె శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
పట్టినదే పంతమా పడఁతి నీకును

రేకు: 1228-5 ముఖారి సం: 22-167

పల్లవి: నేనే నీవు గూచుండఁగా నీతో సరసమాడి
తాన నొకతె గలిగెఁ దగులుకొవయ్యా

చ. 1: చెక్కిటఁ జేయివిట్టి సిగ్గులు నానఁబెట్టి
చక్కనినీమోము చూచీ సకియ
మక్కువ నీకుఁ జేసీ మాటలమందులు వూరి
చక్కెరమోవి చూపీఁ జవిగోనవయ్యా

చ. 2: నెమ్మి మొక్కె జేతులెత్తి నీకుఁ జూపె తనబత్తి
కమ్మటిఁ బొందుకు లాచీఁ గలికి
కుమ్మరించి తమి వెంచి గుబ్బల నిన్నుఁ దాఁకించి
చిమ్మీఁ గొనగోర నీవూఁ జేరి కూడవయ్యా

చ. 3: సెలవుల నవ్వు నవ్వి చెలరేఁగి కొప్పుదువ్వి
బలిమిఁ గుచ్చీ నిన్నుఁ బడఁతి
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అలమితివి నన్నిఁక నాపెను నేలవయ్యా

రేకు: 1228-6 వళవి సం: 22-168

పల్లవి: సింగారించుకొనీరాదా చెనకే విప్పుడే వచ్చి
అంగన నీచేఁతలకు నౌఁగాదనఁజాలదు

చ. 1: సుదతి యద్దము చూచి చుక్కబొట్టు వెట్టుకోఁగా
వుదుటున నిప్పుడే వొడివట్టేవు
పొదిగి కొప్పునిండా పూవులు ముడుచుకోఁగా
చదురులాడుత వచ్చి చన్నులంటేవు

చ. 2: కామిని కనుఁగొనల కాటుక వెట్టుకోఁగా
ప్రేమముతో దమ్ములము పెట్టవచ్చేవు
దోమటి గందమునుఁ గస్తూరి యలదుకొగా
కామించి యంతలోనే కాఁగిలించేవు

చ. 3: పక్కన నలమేల్మంగ పట్టుచీర గట్టుకోఁగా
మొక్కలాన వేడుకతో మోవి యానేవు
ఇక్కువ శ్రీవేంకటేశ యీకె తెరవేసుకోఁగా
చిక్కించుక మన్నించి చిమ్మిరేఁచేవు

రేకు: 1229-1 వరాళి సం: 22-169

పల్లవి: ఆకెకు నీకు దెలుసు నాసుద్దులు
చేకోని తగవులెట్టు చెప్పేమయ్యా మీకు

చ. 1: సోలసిసోలసి నిన్నుఁ జూచిచూచి మాటలాడీ
యెలమి నాపె నీతో నేఁటికోకాని
తలుపుమాటున నుండి తనివోక నవ్వీని
చెలరేఁగి తను నేమిసేసితివోకాని

చ. 2: సన్నల చాయల నిన్ను జరసీని పలుమారు
ఇన్నిటా నీవొడఁబాటు లెట్టివోకాని
యెన్నిమారులైనఁ జేతులెత్తియెత్తి మొక్కీని
పన్నినతారుకాణ లేపగిదివోకాని

చ. 3: కూటమితో సారెసారె కొలువుసేసీ నీకు
పాటించి మీకెట్టిమాటపట్లోకాని
నీటున శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
వాఁటాన నన్నేలితి వాపెవరు సేదో కాని

రేకు: 1229-2 కాంబోది సం: 22-170

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నింతిభావము
కామించి నీకుఁగానే కరఁగీని మనసు

చ. 1: బత్తితో జవరాలు పాదాలు పిసుకఁగాను
చిత్తడిచెమట గారీఁ జేతులవెంట
వొత్తివొత్తి నీకుఁ గడుపూడిగాలు సేయఁగాను
హత్తినిట్టూర్పులచేత నాఱడాయఁ జెలియ

చ. 2: మవ్వపుఁగూరిమి నీతో మాటలాడిమాటలాడి
నివ్వెరగుతోడుత నిలుచున్నది
చివ్వన మోముచూచి చిరునవ్వు నవ్వఁగాను
వువ్విళ్లూరేఆసలతో నుమ్మగిలీఁజెలియ

చ. 3: గుఱుతుగాఁ గాఁగిట గుబ్బలు నిన్నొత్తఁగాను
నెఱిఁగళ లుప్పతిల్లీ నెమ్మోమున
మఱి నిన్నుఁ గూడఁగ నెమ్మది శ్రీవేంకటేశుఁడ
మెఱసీ నీతో నలుమేలుమంగ చెలియ

రేకు: 1229-3 పాడి సం: 22-171

పల్లవి: చిత్తిణిగుణముతోడఁ జెనకీ నిన్ను
హత్తుక ఆడుగవయ్య ఆపెపేరు నీవు

చ. 1: ఇద్దరముఁ బండుండఁగ యెవ్వతో సోరణగండ్ల
వొద్దికఁ దామరకాము నొరసీ నిన్ను
కొద్దిమీరఁగా చిమ్మనఁగొవినిఁ బన్నీరు నించి
ఆద్దుకొనఁ జిమ్మవయ్య ఆపెమీఁద నీవును

చ. 2: నెయ్యపువేడుకతో నీవు నేను మాటాడఁగ
పడి అవ్వలనుండి పాటవాడీని
కొయ్యతనపమాటల గరిమితో నొట్టువెట్టి
నెన బిలువవయ్య నీవు నీడ కాపను

చ. 3: ఆలుమేలుమంగపతివైనంతో నే నవ్వగా
తలుపు దురువుమని తట్టీఁ జేతుల
యెలమి శ్రీవేంకటేశ యేచితివి నన్ను నిట్టె
కలయవయ్య ఆమెను కామించివున్నది

రేకు: 1229-4 శుద్ధవసంతం సం: 22-172

పల్లవి: ఇపుడెట్టు వస్తివే మాయింట నాతఁ డుండఁగాను
తప్పక కొలువుసేయ నప్పు డేమరితివా

చ. 1: ఆమ్మరో నీవరునాఁ డాతనికి బత్తివేసి
నెమ్మదిఁ బాదా లొత్తనేరవైతివా
సమ్మతి నీతోడ సరమాడేటివేళ
నిమ్మలాన మోము చూడ నీవు మఱచితివా

చ. 2: కందువ నాతఁడు నీకాఁగిటలో నున్నపుడు
అది నవ్వక పరాకులైవుంటివా
పొందులుసేసి భోగించె తఱవాత
ముందుముందే మాటాడక మోసపోయివుంటివా

చ. 3: పానుపుపై నీతఁ డిట్టె పక్కనీకు నుండవిగాను
వూని వూడిగాలు సేయ నొల్లవైతివా
ఆనుక శ్రీవేంకటేశుఁ డాతఁడే వచ్చి నన్నేలె
యేనలమేలు మంగ నన్నేంచుకోవైతివా

రేకు: 1229-5 లలిత సం: 22-173
పల్లవి: అప్పటనుండి నీవు ఆపెతోనే మాటాడేవు
చొప్పగ నీచరితలు చూచి వెరగయ్యీని
చ. 1: చెలికత్తై నీకుఁ జేసె సేనసేన విన్నపాలు
వెలయ నీచెవులార వింటివా నీవు
పిలువ నంపిన నీవలపులదేవులఁ
దలఁచుకొంటివా లెస్స తాలిమితోడుతను
చ. 2: ఇక్కువ నాకెయిచ్చిన యెట్టినినిమ్మపండులు
అక్కర తోడుత నీ వందుకొంటివా
చక్కఁగ నాపెయేలికసానిపరిణామము
అక్కజముగా సారెకు నడిగితివా
చ. 3: దొరకొని నీకుఁ జేసేదూతికలవినయాలు
సిరులఁ గైకొని యట్టే సేసితివా
పరగ నలమేలె మంగపతివి శ్రీవేంకటేశ
ఆరపి నన్నే లితి వల్లాపెనుఁ గూడితివా

రేకు: 1229-6 నాదరమక్రియ సం: 22-174

పల్లవి: ఎంతచిత్తిణో యిది నీయిత వెటువంటిదో
చెంతనున్నచెలులెల్లా శిరసులు వంచేరు

చ. 1: చిన్నచేతుల నీకొప్పు చెలరేఁగి దువ్వుతాను
చన్నుల నిన్ను నొత్తీ జవరాలు
పన్నుక నీవద్దనుండి పాదాలు గుద్దుతాను
సన్నలనే పొందొడల సాముసేసీని

చ. 2: యేపొద్దు చూచిన నీతో యేకతాలాడుతాను
రాపుగ నీబుజము లోరసుకొనీని
తీపుతనీమాటలకు తేరకొన నిన్నుఁ జూచి
ఆఁపరాక మెచ్చిమెచ్చి అలముకొనీని

చ. 3: చెలరేఁగి నీమెనల్లా సింగారించుకొంటా
సోలసి మర్మము లిటె సోఁకించీని
అలమేలుమంగపతివైనశ్రీవేంకటేశ్వర
యెలమి నన్నేలఁగాఁ దా నచ్చీని విడెము

రేకు: 1230-1 భైరవి సం: 22-175

పల్లవి: తరుణిభాగ్యము మరి తఱవాతిపనులెల్లా
నెరవేరిచి యేలేది నీచేతి దిఁకను

చ. 1: సారె నీమొగము చూచే జలజాక్షి గొంతవడి
కూరిములే చల్లె నీపైఁ గొంతవడి
చేరి నీసుద్దులు చెప్పెఁ జెలులతోఁ గొంతవడి
నేరుపు లిందాఁకాఁ జూపె నీచేతి దిఁకను

చ. 2: అక్కడక్కడనే వుండి ఆసచేసెఁ గొంతవడి
గుక్కిగుక్కినవ్వు నవ్వెఁ గొంతవడి
మొక్కెను చేతులెత్తి మునుకొని కొంతవడి
నెక్కొని మన్నించేది నీచేతి దిఁకను

చ. 3: చెలఁగి వద్దికి వచ్చి చెక్కునొక్కెఁ గొంతవడి
కొలువులుసేసె నీకుఁ గొంతవడి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
నెలఁత నేలితి వింతా నీచేతి దిఁకను

రేకు: 1230-2 సాళంగం సం: 22-176

పల్లవి: సరిమేలు గలిగితే సంతోసించఁగఁ బాడీ
గరిమ నీకేల సిగ్గు కడుమెచ్చవయ్యా

చ. 1: కలికి నిన్నుఁజూచి కందువలకు లాచి
వెలయ నీరతులకు వేళగాచీని
పలుకులనుఁ గొసరి పయ్యదకొంగు విసరి
చెలఁగి యెన్నిచేఁతలు సేసీ మెచ్చవయ్యా

చ. 2: చన్నులు నీపై మోపి చవు లంతలోనె రేపి
మున్ను మున్ను గానే నీకు మోవి చూపీని
కిన్నెర మీటులు మీటి కెలసి వలపు చాటీ
యెన్నెని నేరుచుకొన్న దీపెను మెచ్చరయ్యా

చ. 3: నిక్కి రతులకు బొంచి నీకు నిచ్చకమే పెంచి
గక్కన వినయములు కడు నించీని
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగపతిని
చిక్కి నన్నేలితి వీకెఁ జేకొని మెచ్చవయ్యా

రేకు: 1230-3 సాళంగనాట సం: 22-177

పల్లవి: ఎన్నాళ్లనుండి కాచేవో యిందుకుఁగాను
వన్నెలఁ జూడవచ్చినవారి ఁజుట్టుకొనేవు

చ. 1: కన్నుల నవ్విన దాపె గయ్యాళించిన దాపె
నన్ను నీవు గొరనేల నాఁటించేవు
పన్ని జూదాలాడె నాపె పందెలువేసె నాపె
చన్నులంటి నాపయ్యద జారనేల తీసేవు

చ. 2: వొడివట్టితీసె నాపె వుదుటులు చూపె నాపె
నడుమఁ బువ్వులనేల నన్ను వేసేవు
వెడవంతాలాడె నాపె వేసెను నీసారె లాపె
జడవట్టి నన్నునేల సరిఁ జెనకేవు

చ. 3: చేముట్టి పెనఁగె నాపె చేఁతలెల్లాఁ జేసె నాప
నామొగముచూచేల సన్నలు సేసేవు
ఆనుక శ్రీవేంకటేశ అలమేలుమంగపతివి
కామించి నన్నేలి యంత కడు రట్టుసేసేవు

రేకు: 1230-4 సామంతం సం: 22-178

పల్లవి: కొత్తగా వచ్చినాపె నీగుణ మేమి నెఱఁగదు
బత్తిసేసి లాలించితే పనికివచ్చీని

చ. 1: చిగురుమోవి దెరచి చెలి యేమో విన్నవించీ
వెగటులేక నీవు వినవయ్య
జిగిమించి యంతలోనే సిగ్గువడియున్నదేమో
అగడుగాకుండాఁ గూర్మి నడుగవయ్యా

చ. 2: నెలఁత వినయముతో నీవద్ది కేఁటికో వచ్చీ
చెలరేఁగి యాపనులు సేయవయ్యా
యెలమి నీయెదుటను ఇచ్చక మేలో నెరపీ
సెలవుగా ఆచనవు చెల్లించవయ్యా

చ. 3: వొయ్యన కదిసి యేవె వూడిగాలు సేసేని
ఇయ్యెడ నీ వాపచేఁ జేయించుకొవయ్య
అయ్య శ్రీవేంకటేశ్వర అలమేల్మంగపతివి
నెయ్యాన నన్నేలితివి నీవాకెఁ గూడవయ్యా

రేకు: 1230-5 గౌళ సం: 22-179

పల్లవి: ఔనయ్య మంచివాఁడ వంగనతో నేమనేవు
కానుకలిచ్చితేనే గక్కన నేలితిని

చ. 1: యెలమి దేవులుండఁగా నెడమాటలాడేటి -
చెలికత్తియలనేల చెనకేవు
కలిగినమేలెల్ల కాఁగిటిలో నుండఁగాను
చెలఁగి దోంతులకేల చేతులు చాఁచితివి

చ. 2: బెరసినాపె వుండఁగా పేరటమువచ్చిన -
పోరుగువారినేల పోదిగేవు
యిరవైన చుట్టరిక మింటిలో నుండఁగాను
గరుసు దాఁటి వావులు కలయఁబెట్టితివి

చ. 3: జాడతోడ సేసలు చల్లుతా నాపె వుండఁగా
తోడఁ బెండ్లికూఁతులతో మాఁటాడేవు
వీడ కలమేల్మంగ శ్రీవేంకటేశ నీకుండఁగా
వూడిగపువారి నెంత వోవలఁ బెట్టితివి

రేకు: 1230-6 శంకరాభరణం సం: 22-180

పల్లవి: నిన్నాతఁడు మన్నించఁగా నేను వలదంటినా
సన్నల చాయల నీవు సాదించరాదా

చ. 1: మేలిమిసొమ్ములు నాకు మించి యాతఁ డిచ్చెనంటా
యీలాగుల నందరితో నేమిచెప్పేవే
చాలుకోని నాతోనే సరసమాడీనంటా
కొలుముందుగానేల గుబ్బతిలేవే

చ. 2: పలుమారు నాతఁడు నాపై బత్తి సేసెనంటా
చెలగి నన్నేంత దిష్టంచి చూచేవే
పిలిచి నాపై నతఁడు ప్రియములు చల్లెనంటా
వెలయ మోమెంత వెలవెలఁ జేసుకొనేవే

చ. 3: అక్కరై శ్రీవేంకటేశుఁ డాసతో నన్నేలెవంటా
చెక్కుచెమటతోనేల సిగ్గువడేవే
యిక్కడనే నిన్నునేలె యే నలమేలుమంగను
యిక్కువ నన్నంటెనంటా నెంత యేఁకరేపే

రేకు: 1231-1 నాదరామక్రియ సం: 22-181

పల్లవి: వేడుకకాఁడవౌదు నీవింతలెల్లాఁ గంటిమి
యీడుజోడాయ వలపు లిదిగో నీభాగ్యము

చ. 1: కంకణసూడిగాలాపె కస్తూరి నామము వెట్టి
కుంకుమ గందము పూసి గుబ్బలు సోఁక
వంకరగోళ్లతోడ వడిఁ గోప్పుముడిచీని
ఇంక నేమిచెప్పేది ఇదివో నీభాగ్యము

చ. 2: మొలనూలిగంటలాపె ముంచి నీపాదాలు గుద్ది
తలగడవెట్టి మోముతావి వలయ
పలుకుఁదేనెలు గారఁ బాటవాడీ నీయెదుట
ఇలపై నెన్నికకెక్కె నిదివో నీభాగ్యము

చ. 3: అందెలసూడిగాలాపె అండనుండి విడెమిచ్చి
అందిఇచ్చీ కొనవేళ్ల నాకుమడిచి
చెంది యలమేల్మంగను శ్రీవేంకటేశుఁడవు
ఇందు నిట్టె నన్నేలితి విదివో నీభాగ్యము

రేకు: 1231-2 లలిత సం: 22-182

పల్లవి: ఒక్కమనసున నిట్టె వుండఁగదవే
చెక్కిటఁ జేయివెట్టక సింగారించేకొనవే

చ. 1: విన్నపాలు విన్నవాఁడు వేగ నింటికి వచ్చినే
కన్నుల నవ్వినవాఁడు కరుచించీనే
సన్నలు సేసినవాఁడు సరసములాడినే
యెన్నఁగరానిసగినాలు యెందాఁకఁ జూచేవే

చ. 2: కానుకందుకోన్నవాఁడు కడు నిన్ను మన్నించీనే
పూసి కెటిఁగినవాఁడు బుజ్జగించీనే
తానే ఇయ్యకొన్నవాఁడు తగిలి కాఁగిలించీనే
తానకమై సగినా లెందాఁకాఁ జూచేవే

చ. 3: విందులియ్యకొన్నవాఁడు వేడుక నీకుఁ జేసీనే
చెంది వాకిట నున్నవాఁడు చేరి నవ్వీనే
అందపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
ఇందుల నిన్నేలె సగినా లెందాఁకాఁ జూచేవే

రేకు: 1231-3 బౌళి సం: 22-183

పల్లవి: నీవాడేసరసము నిన్ను నింతసేసెను
యీావేళ నలమేల్మంగ కియ్యవయ్య పంతము

చ. 1: పొలతి నీకంపినపూవులచెండు దీసుక
చెలికత్తెనే వేసేవు చెలరేఁగి
కలికి దవ్వులనుండి కంటినంటా నిమ్మపంట
కొలువులోననే నీకొప్పుదాఁక వేసెను

చ. 2: వీడెము నీకంపితేను వేచమే కైకోని యాపె-
వూడిగపుసతి నొర నొగి నించఁగా
ఆడనే వుండి నీదేవు లందుకుఁ దనపుక్కిటి -
వీడెము నీకొంగున వెస మూట గట్టెను

చ. 3: కాతరాన నీవంపినకానికపంచదార
దూతికకుఁ జవిచూపి తోరలించఁగా
యీాతల శ్రీవేంకటేశ ఇల్లాలు మోమితేనె
వాతెర నంటించి నిన్ను వలపించుకొనెను

రేకు: 1231-4 రామక్రియ సం: 22-184

పల్లవి: నీవుసేసినభాగ్యము నే మేమని పొగడేమే
యేవేళ నిన్నుఁ బాయఁడు యెంతబత్తో ఇతఁడు

చ. 1: సేయఁ గలసింగారాలు సేసుక నీవుండఁగాను
సోయగపుఁగన్నులనుఁ జూచీ నాతఁడు
పాయపుమదములు నీపై తొలఁకఁగాను
ఆయములెరిఁగి నిన్ను నదె మెచ్చీ నితఁడు

చ. 2: కొమ్మలు నీవు నిట్టె కొలువులో నుండఁగాను
చిమ్మిరేఁగి కడు సంతోసించీ నితఁడు
సమ్మతించి నీవు సారె సరసములాడఁ గాను
ఇమ్ముల నిన్నిటికిఁ దా నిచ్చగించీ నితఁడు

చ. 3: చాలుకొని మోవితేనే చవులు నీవు చూపఁగా
మేలుమేలనుచు నిన్ను మెచ్చీ నితఁడు
యేలినలమేలుమంగ ఇట్టె నీవు సేవించఁగా
వేళావేళతో శ్రీవేంకటేశుఁ డితఁడు

రేకు: 1231-5 నాట సం: 22-185

పల్లవి: వెగ్గళపుఁగూరిములు విభునికిఁ జూపవే
సిగ్గులు నెరపితేను చిత్తము గరఁగునా

చ. 1: వెంగెమాడి కోసరితే వేడుకలువుట్టుఎగాక
సంగడి నూరకుండితే చప్పనేకాదా
యెంగిలిమోవితేనెలు ఇంపులు రేఁచుఁగాక
ముంగిటిఆచారాలు మోహములు రేఁచునా

చ. 2: బీరమున బెనఁగితే ప్రియములు నిండుఁగాక
సారె వట్టివినయాలు చౌకలుగావా
గోరికొన దాఁకించితే గురుతులై వుండుఁగాక
దారకపుశాంతాలు తరితీపు రేఁచునా

చ. 3: కొమరెగుబ్బలూఁదితే కోరిక గోరించుగాక
సముకపు గొలువులు జాగులుగావా
అమర శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నిన్నేలె
అమితపు గోలతనా లాసలెల్లా రేఁచునా

రేకు: 1231-6 ఆహిరి సం: 22-186

పల్లవి: ఇంక నీచిత్తమేకాని యీపెకడ మేమి లేదు
అంకెల నీకెగుణమేలరసేవు నీవు

చ. 1: పవళించి వుండితే నీపాదా లొత్తనేరుచు
ఇవలఁ గూచుండి విడెమియ్యనేరుచు
నవకమై లాలించితే నవ్వులు నవ్వనేరుచు
నివిరి ఇంకా నేమైనా నేరువు మీకెకును

చ. 2: మచ్చిక నీవుసేసితే మాటాలాడనేరుచు
ఇచ్చగించితే వీణె వాయించనేరుచు
పచ్చిగా మన్నించితే పక్కనుండనేరుచు
నిచ్చనిచ్చ యేమైనా నేరువు మీకెకును

చ. 3: కానిమ్మనివుంటే మతి గరఁగించనేరుచు
మేనంటినీవు గూడితే మెచ్చనేరుచు
యే నలమేలుమంగను నన్నేలితి శ్రీవేంకటేశ
నీనేరుపు లేమైనా నేరుపు మీకెకును

రేకు: 1232-1 గౌళ సం: 22-187

పల్లవి: తలఁచుకోవలదా తరుణివినయములు
పిలిపించుకొందురా ప్రేమగలచోటను

చ. 1: కప్పురపువానలకమ్మవినోరఁ జెలియ
చెప్పరానిప్రియములు చెప్పీఁగా నీకు
తొప్పఁదోఁగె నోసలికస్తూరి బేఁటులు రాల
ముప్పిరిగొన సారెకు మొక్కీఁగా నీకు

చ. 2: గారవించి యాసతోడఁ గంకణాలచేతుల
గోరఁ జెక్కునొక్కి వేఁడుకోనెఁగా నిన్ను
కూరిమి నెందుకోకాని కుంకుమగుబ్బల నొత్తి
నేరుపుతోఁ గాఁగిట నించెఁగా నిన్ను

చ. 3: సోయగపుఁగన్నుల సోలసిసోలసి చూచి
సేయరానిచెలుములు సేసెఁగా నీతో
యీయెడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
ఆయమంటి కూడి ముదమందెఁగా నీతో

రేకు: 1232-2 బౌళి సం: 22-188

పల్లవి: ఎంతని పొగడవచ్చు నిద్దరిమీనేరువులు
సంతోసములాయ సతులకెల్లాను

చ. 1: చనవు గలిగితేను చవులు దానె పుట్టు
మనసు లెనసితెమ మర్మములంటు
యెనసివుండితేను ఇంపులును దైవారు
కనుఁగొంటే మీయందే కలిగె నీగుణాలు

చ. 2: మచ్చికలు సతమైతే మమతలు నెలకొను
ముచ్చటలాడినచోట మోహలు రేఁగు
కుచ్చికుచ్చి పెనఁగితే గుబ్బతిలుఁ దమకము
మెచ్చులుగా యీసుద్దులు మీయందే వింటిమి

చ. 3: విందు లొనగూడితెను వేడుకలు వెలవెట్టు
కందువ సమరతులు కడుఁ జొక్కించు
చెంది యలమేల్మంగవు శ్రీవేంకటేశుం డితఁడు
పొందులు మీయందే ఇపుడు దెలిసితిమి

రేకు: 1232-3 పాడి సం: 22-189

పల్లవి: చిత్తగించవయ్య యేల సిగ్గులతో నవ్వేవు
బత్తిగలవారిమీఁద పరాకుగావచ్చునా

చ. 1: కిన్నెరమీటులలోనే కెరలికెరలి నీకు
విన్నపాలు సేసీవి వెలఁది
సన్నలాను చాయలాను జారినపయ్యదలోని-
చన్నులనే కానికలు సారెకుఁ జూపీని

చ. 2: సేసేటిరాగాలలోనే చెలరేఁగి చెలరేఁగి
సేసలుచల్లీ వలపుచెలియ
మూసినముత్తెమువంటిమోవినే నోరూరించి
ఆసల విందులు చెప్పీ నదివో నీకును

చ. 3: చెప్పిన గీతములలోసిగ్గు గులికికులికి
కప్పురవిడెములిచ్చీఁ గలికి
యిప్పుడే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కప్పి నన్నేలితి వాపెఁ గరుణించవయ్యా

రేకు: 1232-4 వసంతవరాళి సం: 22-190

పల్లవి: కొత్తపొందో పాఁత పొందో కొమ్మతో మాటాడవయ్య
బత్తిగలవారిమీఁదఁ బరాకు చూపుదురా

చ. 1: చెక్కుల వెంటఁగారేచిరుఁజెమటలతోడ
నిక్కినిక్కి చూచీని నెలఁత నిన్ను
వెక్కసపుఁదనకొప్పు వీఁపువెంట జారఁగాను
తక్కక నిమ్మపంటఁ దాఁకవేసీ నిన్ను

చ. 2: గుఱుతులై పయ్యదలో గుబ్బలు గానరాఁగాను
ముఱిపానఁ జేతులెత్తి మొక్కీ నీకు
తఱితోడ ముక్కర గదలఁగాఁ బెదవులెత్తి
మెఱిసి పేరఁబిలిచీ మిక్కిలి నిన్ను

చ. 3: అదనెఱిఁగి ముంగిట నందెలు గల్లురనఁగ
యెదురుగా వచ్చి కానుకిచ్చీ నాపె
యిదె శ్రీవేంకటేశ్వర యే నలమేలుమంగను
కదిసి నన్నేలితివి కాగిలించీఁ దా నిన్ను

రేకు: 1232-5 కురంజి సం: 22-191

పల్లవి: మేలుమేలు సాము సేయ మేఁటిజాణ వౌదువు
చేలకొంగున నాపెకు చెమట దుడిచేవు

చ. 1: అంగనగట్టిచన్నులు అడియాలమైనట్టి-
సంగడాలంటా నీవు సారె నెత్తేవు
అంగవించి యప్పటిని ఆపెకాఁగిలే నీకు
చెంగటిగరిడీయంటా చేరి పాయ విపుడు

చ. 2: కాంతమేనఁబూసినకస్తూరిబేఁటులు రాలి
సంతత మెట్టుమన్నంటాఁ జల్లుకొనేవు
పంతముతో నీవాపంబంగారువంటిమేను
వింతలుగా కంబము గావించుక పెనఁగేవు

చ. 3: అలమేలుమంగరతు లట్టె విన్నాణాలంటా
తలఁచి శ్రీవేంకటేశ తమకించేవు
చెలరేఁగి యాపెమోవి చెఱకుఁబిచ్చెయంటాను
చలువగా వేడుకతోఁ జవిగొనేవు

రేకు: 1232-6 ఆహిరి సం: 22-192

పల్లవి: ఏమి నేరుచుకొంటివి యెలయించేవు సతుల
కామించి వచ్చినవారిఁ గరుణించవయ్యా

చ. 1: కానుకంపె యాపె వేళ గాచుకొనియుండఁగాను
వీనుల విన్నాపెను వెదకించేవు
మోనముతోఁ జేతులెత్తి మొక్కి యాపెవుండఁగాను
అనుకొని వీదినుండి యాపెవంకఁ జూచేవు

చ. 2: వీలనున్నయాపె నీకు విన్నపాలు సేయఏగాను
మాటునన్నున్నాపె తోను మాటలాడేవు
సాటికిఁ జుట్టమైనాపె సరసములాడఁగాను
నాటకపుతితోడ నవ్వులు నవ్వేవు

చ. 3: లలమేలుమంగ యాపె అక్కునవేవుండఁగాను
కొలువులోనున్నా పెను గోర నొత్తేవు
నెలవై శ్రీవేంకటేశ నే నూడిగము సేయఁగా
చెలికత్తెయినాపెఁ గని సిగ్గునఁ గొంకేవు

రేకు: 1233-1 పళవంజరం సం: 22-193

పల్లవి: సరుసఁ గూచుండవే సరసములాడవే
శిరసు వంచుకోనేల చిన్నదానవటవే

చ. 1: పలుకుతనై తేను పచ్చికప్పురాలు రాలీ
తిలకించితే మోవిఁ దేనె చిందీని
చెలువుఁడు చెనకితే సిగ్గుతోడఁ బెనఁగేవు
చెలియరో నీవింకాఁ జిన్నదానవటవే

చ. 2: మొలకనవ్వులనైతే ముత్యాలు వొడమీని
నిలువు నూరు వండీవి నీమురిపేలు
బలిమిఁ జన్నులంటితే పయ్యద కొంగు మూసేవు
చిలుకరాదా వలపు చిన్నదానవటవే

చ. 3: సందడిచూపలనైతే చల్లఁగా వెన్నెలగాసీ
కందువ నెమ్మోమునఁ గళ లుబ్బీవి
అందపు శ్రీవేంకటేశు నలమేల్మంగవు నీవు
చెంది మరీఁ గొసరేవు చిన్నదానవటవే

రేకు: 1233-2 పాడి సం: 22-194

పల్లవి: ఎంత గట్టువాయవైతి వేమే నీవు
అంతలో నీతోడ మోపె వాతనిపై నీవు

చ. 1: హత్తుకొని చదరంగ మాతడుఁ నేను నాడఁగా
యెత్తులు చెప్పవచ్చేవు యేమే నీవు
యిత్తల నేఁ బరాకైతే నిదేసందుగా నాతని -
నోత్తేవు కొనగోర నోల్లనే నీవు

చ. 2: పచ్చిమాట లాతఁడు నాపై మోవనాడితేను
ఇచ్చకాలకు నవ్వే వేమే నీవు
కొచ్చి నేను తలవంచుకొనివుండఁగా నాతనిఁ
దచ్చి నీచన్నుల వీఁపు దాఁకించేవు నీవు

చ. 3: గెలిచి నేఁ బెనఁగఁగా కెరలి నీవూ నాతని -
నెలమిఁ గాఁగిట నించే వేమే నీవు
అలమేల్మంగను నేను ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డిల నన్నేలె నాతని కేమౌదువే నీవు

రేకు: 1233-3 సామవరాళి సం: 22-195

పల్లవి: నిన్ను నీవెఱఁగలేవు నేరువు లేమిచూపేవే
చన్నులమీఁదిపయ్యద చక్కఁబెట్టుకొరాదా

చ. 1: సారె నాతనితో నెంత సరసములాడేవే
జారుఁగొప్పు ముడుచుకో చక్కఁగా నీవు
కేరికేరి యెందాఁకా కిలకిల నవ్వేవే
కారేటిచెక్కుఁజెమట కడుగుకోరాదా

చ. 2: దాకోని యాతనిమోము తప్పకేమి చూచేవే
కోక చక్కఁగట్టుకో గుట్టుతో నీవు
కాకరితనముతోడ కతలేమి చెప్పేవే
తూకొని తమ్మబేంట్లు తుడుచుకొరాదా

చ. 3: బలిమి వొద్దఁగూచుండి పాదా లేమిగుద్దేవే
అలపు దీరుచుకొ అంతలో నీవు
అలమేల్మంగను నేను ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డలమె నన్నిఁక నీవు నండనే కూడరాదా

రేకు: 1233-4 హిందోళం సం: 22-196

పల్లవి: ఎక్కడలేనిమాటలు నేమిచెప్పేవు
పక్కన నేము సేసినభాగ్య మిదిగాదా

చ. 1: నీవద్ది కాపె వచ్చితే నిద్దుర మేలుకొంటివి
సేవసేయఁబూనితేను చెంగలించేవు
మోవి చూచినంతలోనే ముంచి నోరూరీ నీకు
వావిరి నింతానింత వలపే కాదా

చ. 2: సరుసఁ గూచుండితేనే సగచోటిచ్చితివి
శిరసు దువ్వితేనే చిమ్మిరేఁగేవు
గరిమఁ బాదాలొత్తితే కడుఁ జెమరించీ నీకు
వరుసతో నింతానింతి వలుపేకాదా

చ. 3: బాగాలు చేతికిచ్చితే పచ్చడము గప్పితివి
చేగదేరఁ గూడితేనే సిగ్గువడేవు
యీగతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
వాగమైన దింతానింత వలుపే కాదా

రేకు: 1233-5 సిందురామక్రియ సం: 22-197

పల్లవి: అంతలో నితఁడు మగఁడాయనా నీకు
బంతికి వచ్చినీవేల బాఁతిపడేవే

చ. 1: మాయింట నాతఁడు నేను మాటలాడుకొనఁగాను
నాయము లేమిచెప్పేవే నడుమ నీవు
చేయిచాఁచి నే నూరకె చెనకితినంటా నీవు
పూయక దూలవై యేల పూనకవచ్చేవే

చ. 2: చయ్యన నాతనిపై వసంతము నే జల్లఁగాను
పయ్యదఁ దుడువనేలే బత్తితో నీవు
వోయ్యనే పవ్వళించేటివోవరి కతఁడు రాఁగా
గయ్యాళితనాననేల కైలాగిచ్చేవే

చ. 3: నెట్టఁన బానుపుమీఁద నేనితఁడు నుండఁగాను
వొట్టుక నీవేల పాదాలోత్త వచ్చేవే
యిటెప శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
జట్టిగా నన్నేల నీవు సవతి వేలయ్యేవే

రేకు: 1233-6 పూర్వగౌళ సం: 22-198

పల్లవి: మామిందర నీవేల మఱఁగులు వెట్టేవు
యీమతకములెల్లా మీయిక్కువలు గావా

చ. 1: వీడెము చేతికియ్యవే విభుఁడు నీమోము చూచి
యీడుజోడై కూడె యందు కెఱుకగాదా
వేడుకఁ బాదాలొత్తవే వెసఁ బవ్వళించినాఁడు
జాడతోడ నీకదే సన్నగాదా

చ. 2: యేకతాన మాటాడవే యేమిటికో పిలిచీని
లాకల నీరతులకు లాచుటగాదా
పైకొని తెరవేయవే పచ్చడము గప్పుమనీ
నీకు నాతనికి నీవే నెపములు గావా

చ. 3: చెలఁగి కాంగిలించవే చేయి నీమీఁద వేసీని
కలయికలకు నదే కందువగాదా
అలమేలుమంగవు నీవతఁడు శ్రీవేంకటేశుఁ-
డలమె నిన్నుఁ జెల్లెల నందుకు నేలోఁగాదా

రేకు: 1234-1 కాంబోది సం: 22-199

పల్లవి: ఆఁటదానిఁ గంటేఁజాలు నాసలు పుట్టించేవు
పాటించి యేపొద్దు నిదేపనియై వున్నాఁడవు

చ. 1: రెప్పలెత్తి చూచిచూచి రేఁచేవు వలపులు
కప్పురము నీకాపె కానుకియ్యఁగా
నెప్పున నించుకవడి నీతోఁ బొందు సేసితెను
ఇప్పుడిట్టె యాపెగుణ మిఁక నెంత సేతువో

చ. 2: నవ్వులు నవ్వినవ్వి నసలఁబెట్టేవు నీవు
పువ్వుల నీపాదా లాపె పూజించఁగా
జవ్వని యేపాటి నీతో సరసములాడినాను
ఇవ్వల నాపెమనసు యెంత గరఁగింతువో

చ. 3: మొలకచన్నులు వట్టి మోవితేనె లానేవు
అలరి నీకాపె గంద మట్టె పూయఁగా
అలమేలుమంగను నేననఁగా శ్రీవేంకటేశ
ఇల నన్నేలితి వాపె నెంతగా మన్నింతువో

రేకు: 1234-2 ఆహిరి సం: 22-200

పల్లవి: ఏమిసేసుకొంటిరో ఇందాఁకా మీరు
ఆముకొని మిమ్ము నేము అడుగసిగ్గయ్యీని

చ. 1: కొమ్మకొప్పులోనున్నగొజ్జఁగరేకులచొప్పు
వుమ్మడి నీమేనిమీఁద నున్న దిదిగో
కమ్మటి నాపె గుబ్బలకస్తూరి గంధము
దుమ్మురేఁగి పచ్చడానఁ దొప్పఁదోఁగివున్నది

చ. 2: సతిచెవులఁ బెట్టినజవ్వాదికరఁగులు
మితిమీరి నీబుజాలమీఁద నున్నవి
తతి నాపె పెదవులతములపుఁ జెదరులు
కతలుగా నీచెక్కులఁ గానుపించెను

చ. 3: అలమేలుమంగపాదాలందులలత్తుకరేక
మెలుపున నీనొసలిమీఁద నిండెను
యెలమి శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
తోలుతనే యాపెగుఱుతులు ధరించితివి

రేకు: 1234-3 సామంతం సం: 22-201

పల్లవి: వట్టిగుట్టు సేసుకొని వలపించ వచ్చితిని
బట్టబయలు నవ్వితే బ్రమసునా విభుఁడు

చ. 1: చేయఁగలసేవలు సేసి చూపవలెఁగాక
చాయసేసుకుండితేను సమ్మతులౌనా
పాయపుదాననంటాను పానుపుపై నుంటేను
కాయజకేలిని యెట్టు గరఁగునే విభుఁడు

చ. 2: మనసులోఁగలమాట మందలించవలెఁగాక
తనలోనే దాఁచుకొంటే తారుకాణౌనా
మనవైనయాలనంటా మాకువలె నుంటేను
తనివోనిరతి నెట్టు దరించునే విభుఁడు

చ. 3: అలమేల్ మంగచెల్లెల నైననావలెనే కూడ-
వలెఁగాక గోలవైతే వసమయ్యీనా
కలయుచో సిగ్గునఁ గాఁగిలించు కుండితేను
చెలఁగి యెట్టు చిక్కునే శ్రీవేంకటవిభుఁడు

రేకు: 1234-4 కాంబోది సం: 22-202

పల్లవి: చెలియరో నీమగఁడు సేసినభాగ్యము
యెలమి నిందుకు నాతఁ డెంతనోఁచెనే

చ. 1: వంచి నీవు మొక్కితేను వలపులు రాలీని
ముంచి మాటలాడితేను ముద్దుగారీని
పంచలఁ బొలసితేను పైఁడిపోడి దోరిగీని
యెంచరాదా నీసింగార మేమిచెప్పేదే

చ. 2: ముసిముసిగా నవ్వితే ముత్యాలు రాసులయ్యీ
కోసరి చూచితే మెఱుఁగులు రేఁగీని
ముసుఁగు దీసితేను మోహనమే వడిసీని
యెసఁగిననీవిలాస మేమిచెప్పేదే

చ. 3: నిలిచితే నీపగటు నిలువు నూరు వండీని
సొలసితే నీవేడుక జోబ్బిలీ నిదే
యెలమి శ్రీవేంకటేశుఁడేలినల మేల్ మంగవు
యెలయింపునీ వొరపు లేమిచెప్పేదే

రేకు: 1234-5 సౌరా+పం సం: 22-203

పల్లవి: మామననేల సోదించి మాటలాడించేవు నీవు
నీమన నెఱఁగనిది నేము చెప్పేమా

చ. 1: వాడికైనయాపె నిన్ను వలపించుకుండఁగాను
వేడుకకత్తెలకేల వెంగెమాడను
జాడతోడ నేమూ నిట్టె సంతోసించవలెఁగాక
పాడిఁబంతా లెంచి తేను పచ్చిదేరదా

చ. 2: మచ్చికైనయాపె నీతో మంతనములాడఁగాను
యిచ్చకురాండ్లకేల యీసురేఁగను
మెచ్చిమెచ్చి యాపొందే నీమెడఁ గట్టుదుముగాక
విచ్చి చెప్పఁ బోతేను వేసటగాదా

చ. 3: రతివేళ నాపె నిన్ను రాఁపు లింత సేయఁగాను
సతమైనవారికేల జంకిచను
తతి నలమేలుమంగపతివి శ్రీవేంకటేశ
యితవై నన్నేలితివి యిది గొత్తగాదా

రేకు: 1234-6 హిందోళవంతం సం: 22-204

పల్లవి: ఎన్నటిచుట్టరికమో యీపెకు నీకు
సన్నలమొక్కులు మొక్కి సంతసించరాదా

చ. 1: వాలుకచూపులఁ జూచి వావుల చెప్పీఁ జెలి
ఆలించి విని కూచుండుమనరాదా
చేలకొంగు మాఁటు నేసి చిఱుత నవ్వులు నవ్వీ
కేలుచాఁచి వలపులు కెరలించరాదా

చ. 2: చేరి తనమోము చూపి సిగ్గులు నెరపీ నీకె
జారుఁగొప్పు చక్కఁబెట్టి చనవీరాదా
నేరుపుతో నోయ్యారాన నిలిచి కూరిమి చల్లీ
గారవాన లాలించి కాఁగి లియ్యరాదా

చ. 3: మోవితేను లూరఁగాను ముందెట నున్నది తాను
చేవదేరె నిఁక నీవు చెనకరాదా
వేవేల కలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
యీవేళ నన్నేలితివి యిద్దరూఁ గూడరాదా

రేకు: 1235-1 కన్నడగౌళ సం: 22-205

పల్లవి: ఎదురుచూచీ నీకు నెప్పుడు వత్తువోయంటా
పదివేలుగా విన్నపములు సేసితిమి

చ. 1: చేరఁడేసికన్నుల జెలినిన్నుఁజూచెను
కోరినీకు వలచి ఇక్కువ నున్నది
నేరుపుతోఁ గానుకగా నిమ్మపండంపె విదె
వేరు సేయక రావయ్య వెలఁదికడకును

చ. 2: కొండలంతలేసి పెనుగుబ్బలు నీకు మీఁదెత్తే
నిండుమనసెల్లాను నీపైఁ బెట్టె
దండిగా నేపొద్దూను తపముసేసీ నీకు
మెండుకొన్నకరుణతో మెలుఁతఁ జూడవయ్యా

చ. 3: ముంచి మూరెఁడంత కోప్పు వంచి నీకు మొక్కెను
అంచెలఁ జెప్పరాని ప్రియము చెప్పెను
కొంచ కలమేలుమంగఁ గూడితి శ్రీవేంకటేశ
యెంచక మన్నించవయ్య ఇట్టె కలకాలము

రేకు: 1235-2 పాడి సం: 22-206

పల్లవి: నేరుపకువయ్య్య నాకు నీ విప్పు డోకటోకటె
తారుకాణలైననీతలఁపులోదానను

చ. 1: గోరికొన నూఁదజాల గుంపెన చూపఁగజాల
నేరము లెంచాఁజాల నిన్నుఁజూచి
వారివీరివలె నేను వాసులఁ బొరలఁజాల
చేరి నీ కేపొద్దు నేను సేవసేసేదానను

చ. 2: మందెమేళములు నేర మనసు సాదించనేర
నిందలుగట్టఎగనేర నిన్నుఎజూచి
అదరివలె నే నీచే నానలు వెట్టించనేర
విందువలె వచ్చితే నీవేడుకలోదానను

చ. 3: పెనఁగులాడఁగ నోప పెలుచుఁదనాల కొప
చెనకి నిన్నింత దూరు సేయఁగ నోప
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను మన్నించి
మనుటకు నలమేలుమంగనైనదానను

రేకు: 1235-3 రామక్రియ సం: 22-207

పల్లవి: సుద్దులేమి యడిగేవు చూచిచూచి నవ్వుకోంటా
పొద్దువొద్దులాలించి బుజ్జగింతువుగాక

చ. 1: సిగ్గువడివున్న యట్టిచెలియ నిన్నేమనీని
యెగ్గుపట్టనేరనిది యేమనీని
వొగ్గి నీకె జవ్వనము వొడిగట్టి యేమనీని
అగ్గమై నీవే మాటాడి యాదరింతువుగాక

చ. 2: మిగులా వలచినట్టిమెలుఁత నిన్నేమనీని
యెగసక్కెమాడ విది యేమనీని
మొగము చూచి నీకు మొక్కుచున్న దేమీనీని
మగఁడవై నీవిన్నిటా మన్నింతువుగాక

చ. 3: మచ్చికైనయలమేలుమంగ నిన్నేమనీని
యిచ్చకురాలైనది యేమనీని
పచ్చిగా నీకాఁగిటిలో పాయకున్న దేమనీని
యిచ్చట శ్రీవేంకటేశ యేలుదువుగాక

రేకు: 1235-4 దేసాళం సం: 22-208

పల్లవి: ఇక్కువైననీరమణుఁ డెట్టుండినా నేమి
పెక్కుసతులుగలుగుప్రియుఁడాతఁడు

చ. 1: వేమారు నాతని వెంగెములాడకువే
కామించియున్నసిగ్గరి యాతఁడు
చేముంచి కొనగోరఁ జిమ్ములు చిమ్మకువే
నేమముతో నుండేటి నిండుదొర యతఁడు

చ. 2: అట్టు సేసి యందరితో అంతుల నాడకునే
గుట్టుతోడనుండేటి గుణి యాతఁడు
చుట్టి చుట్టి యాతని మొయి సాదించి చూడకువే
నెట్టుకొన్న తప్పులేనినిజమరి యాతఁడు

చ. 3: కొచ్చికొచ్చి నీవంత కోరి కొసరకువే
ఇచ్చకుఁడు మొదలనే హితుఁ డాతఁడు
అచ్చపుటల మేల్మంగ నలయించకువే నిన్ను
విచ్చనవిడిఁ గూడె శ్రీవేంకటేశుఁ డతఁడు

రేకు: 1235-5 ఆహిరి సం: 22-209

పల్లవి: ఆసలఁబెట్టి యేల అలయించేవు
పోసరించఁ జేసి యిట్టె భోగించరాదా

చ. 1: కేలుఁగేలు గీలించి కెరలింపుమాటలాడి
చేలకొంగువట్టి చెలిఁ జిమ్మిరేఁచేవు
మేలములు వచరించి మేనెల్లాఁ జెమరింపించి
నాలిసేసి యంతలోనే నవ్వులు నవ్వేవు

చ. 2: విందులమోవి మోపి వేడుక నోరూరించి
కందులవంటి మనసు గరఁగించేవు
పొందులసాములు సేసి పులకలు వుట్టించి
పందేలు వేయుచును తప్పకచూచేవు

చ. 3: సరుసనే నిలుచుండి చన్నులపై నొరగుచు
సురతపు విద్యలను చొక్కించేవు
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగఁ గూడి
తెరవేసుక తెప్పలఁదేలించేవు

రేకు: 1235-6 కాంబోది సం: 22-210

పల్లవి: వేఁటలాడివచ్చేనంటా వేసాలు సేసేవు మాతో-
నేఁటికి నిదెట్టు నీకు యితవాయనయ్యా

చ. 1: జొబ్బిలినజవ్వాది జొటజొట వడియఁగ
నిబ్బరపుఁ దేనెకంపు నిగుడఁగాను
గుబ్బలపై పేరులగురిగింజ లొత్తఁగాను
గబ్బిచెంచెతల నెట్టు కాఁగిలింతువయ్యా

చ. 2: పుప్పొడి మైనిండ రాలి పొదిగొని వుండఁగాను
కప్పురమే తిని మోవి గాజుగట్టఁగా
కప్పినపారిటాకులు కళబెళమనఁగాను
చప్పిడిచెంచెతలతో సంగతెట్లాయనయ్యా

చ. 3: తలపై మొల్లవిరుల కలులు మూఁగుకరాఁగా
చిలుకబాసలు సెలవుల రేఁగఁగా
అలమేల్మంగను నన్నుఁ నలమి శ్రీవేంకటేశ
పెలుచుఁజెంచెతలలోఁ బెనఁగుటెట్లయ్యా

రేకు: 1236-1 సిందురామక్రియ సం: 22-211

పల్లవి: ఎంతవలచినదో యీపె నీకు
ఇంతేసిప్రియాలు చెప్పీ నియ్యకొనరాదా

చ. 1: చిత్తడిచెమట గార సిగ్గులు లోలో జార
బత్తితోఁ బాదాలొత్తీఁ బడఁతి నీకు
బిత్తరిచూపులతోడఁ బెనుఁగొప్పు గొంత వీడ
హత్తి నీకు విడెమిచ్చీ నందుకోరాదా

చ. 2: పువ్వులదండలు వేల పులకలు మేనఁ దేల
వువ్విళ్లూర సేవసేసీ నువిద నీకు
నవ్వులు సెలవి నూర ననుపులు గడుమీర
నివ్వటిల్ల మాటలాడీ నీవు వినరాదా

చ. 3: చన్నులు గానరాఁగా జవ్వనము మించిరాఁగా
వన్నెపచ్చడము గప్పీ వనిత నీకు
ఇన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిన్నుఁ గూడి మెచ్చుమెచ్చీ నీవూ మెచ్చరాదా

రేకు: 1236-2 ఆందోళి సం: 22-212

పల్లవి: ఏల వొడ్డించుకొనేవు యియ్యకోరాదా
మేలుదిగనక నీతో మేలమాడీఁ జెలియ

చ. 1: ముంగురులఁగుచ్చినముత్యాలు గదలఁగా
బంగారుపవ్వులచీరపయ్యెద జార
కంగుకంగుమనుచును కంకణా లొరయఁగాను
వుంగరాలవేళ్ల నీవొడివట్టీఁ జెలియ

చ. 2: పెనుఁగొప్పుపై వజ్రాలబిల్లలు మెరవఁగాను
మినుకుఁ గమ్మలకాంతి మించఁగాను
పెనగొన్నహరములు బెరసి వుయ్యాలలూగ
ముసుకొని పలుమారు మొక్కీ నీకుఁ జెలియ

చ. 3: పోలుపైన మాణికపులు బుజకీర్తులు వెలయ
ములువాఁడిచన్నులు మోము కెగర
అలమేలు మంగపతివైన శ్రీవేకంటేశ్వర
కలయుమనుచు నిన్నుఁగాఁగిలించీఁ జెలియ

రేకు: 1236-3 లలిత సం: 22-213

పల్లవి: చెప్పితి మిప్పుడే నీకు చెలులము బుద్ధులెల్లా
వొప్పుగొని తగినట్టు వూహించుకొనవే

చ. 1: పందేలు వేసేవేమే బలువునితో
అందుకు నీవోడితేనే అలవయ్యేవా
అంది సాములు చేసేవే యాతనితోను
కిందఁ జిక్కితే మోవివిందు వెట్టేవా

చ. 2: సంగడిఁ గూచుండేవేమే సరసునితో
యెంగిలి మోవెంటించితే నియ్యకొనేవా
ముంగిటికి వచ్చేనంటా మొక్కేవే నీవు
చంగనఁ గాఁగిలించితే సమ్మతించేవా

చ. 3: వీడెమిచ్చేవేమే శ్రీవేంకటేశుకు
యీడుగాఁ గూడితేను యిచ్చగించేవా
యీడనే యలమేల్మంగ యిరవైతివే
వాడిక నీవాతనివలపు చేకొనేవా

రేకు: 1236-4 సాళంగం సం: 22-214

పల్లవి: ఎన్నిజాణతనాలాడే వేమిసేసె నిన్నాతఁడు
నిన్ననే యాతఁడు నాకు నేరిపినాఁడనేవు

చ. 1: మెనసి నీపతివద్ద మోమేల వంచేవంటే
వెనుకొన్న నీకొప్పు వేఁగనేవు
మనసిచ్చి యాతనితో మాటలాడుమంటేను
తనరినమోవి మెత్తనిచిగురనేవు

చ. 2: సూటిగా నాతనిదిక్కు చూడరాదా యంటేను
వాఁటపుఁగనుఁగొనలు వాండ్లనేవు
నాఁటుకోన్న సెలవులనవ్వయినాఁ జూపుమంటే
యీటునఁ జెక్కులకాంతు లెండగాసీ ననేవు

చ. 3: యేలిన శ్రీవేంకటేశు కెదిరి కాఁగిలిమ్మంటే
రాలవంటిచన్ను లొరసీననేవు
యీలీల నలమేల్మంగ యితఁడు గూడెనిమ్మంటే
వొలిఁ బెండ్లాడిననాఁడే వొద్దికైతిమనేవు

రేకు: 1236-5 గౌళ సం: 22-215

పల్లవి: నీ కతఁడు మేలువాఁడు నీవూ మలుదానవు
జోకతో వొద్దఁగూచుండీఁ జోటియ్యఁగదవే

చ. 1: వాడికవలపులకు వాసు లెంచుకొనేల
వేడుకచెనకులకు వేసరనేల
జోడువాయకున్నందుకు సొంటులు సోదించనేల
వీడెమిచ్చీ నందుకో చెలి విభుఁడు నీకు

చ. 2: తారుకాణలైనమీఁద తలవంచుకొననేల
కూనిమిగలుగుచోటఁ గొసరనేల
చేరి వేఁడుకొనేవేళ సిగ్గులువడఁగనేల
పేరుకొనీ నూఁకోనవే ప్రియుఁడు నిన్ను

చ. 3: మెలములు సలుపఁగా మించి వొడ్డించుకొనేల
కాలుదొక్కి పెండ్లాడఁ గడమలేల
ఆలవు తోల్లేనీవు అలమేల్మంగవు నిన్నుఁ
నేలె మొక్కవే శ్రీవేంకటేశుఁడు నేఁడు

రేకు: 1236-6 లలిత సం: 22-216

పల్లవి: అప్పుడేమందువో నీవు అందు కోపితేఁ జెనకు
చెప్పితి యిప్పుడే నీచిత్తముసుమ్మీ

చ. 1: పలికించేవు మామాట పచ్చికప్పురముసుమ్మీ
చెలిమిసేసేవు అది చిగురుసుమ్మీ
వలపించుకొవచ్చేవు వంతుకు నోరూరుఁజుమ్మీ
కలసేవు మాచన్నులు గట్టులుసుమ్మీ

చ. 2: నగించేవు మమ్ముసారె నాము నీపైఁబారుసుమ్మీ
మొగమే చూచేవు కడుఁదగులౌఁజుమ్మీ
సొగిసి మోవెడిగేవు చోక్కుమందులౌఁజుమ్మీ
తగమేలమాడే వదు తలఁబాలౌఁజుమ్మీ

చ. 3: మలసిమైసోఁకించేవు మర్మములు రేఁగుఁజుమ్మీ
బలిమిఁ గూడేవు కళవట్టీఁజుమ్మీ
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
ఇల నన్నేలితివి మేలిఁకఁ జూచుకొమ్మీ

రేకు: 1237-1 సామంతం సం: 22-217

పల్లవి: చెల్లునమ్మ నీవేమి నేసినాను నీవిభుఁడు
యెల్లనాఁడు నిన్నుఁబాయ కేలేవాఁడుగనక

చ. 1: సంకెలేక పూవులు సారెఁ గోసే వదియేమే
అంకెల నవి మరుని కమ్ములు గావా
కొంకక చిగురాకులు కోవిలకు మేపేవేమే
కొంకులేనియడిదాలకొనలు గావా

చ. 2: నిందుగాఁ జకోరాలకు వెన్నెల దాగించేవేమే
చందురుని కిదణాల సంపదగాదా
మందలించి పన్నీరు చిమ్మనఁగోవి జిమ్మేవేమే
పొంది యది మంచుననే పుట్టినది గాదా

చ. 3: చెట్టులమందులు దెచ్చి చిలుకల కిచ్చేవేమే
పట్టిన వసంతుని పంటలు గావా
గుట్టున శ్రీవేంకటేశుఁ గూడి యలమేల్మంగవు
అట్టె చోఁపేవేమే యలు లందలివే కావా

రేకు: 1237-2 వరాళి సం: 22-218

పల్లవి: ఆకెవద్దనుండఁగానే అండఁగూచుండుమనేవు
నీకు వలసితే మరి నెలఁతలు బాఁతే

చ. 1: వూరకుండేవారినేల వొడివట్టవచ్చేవు
చేరి నీతో నవ్వేవారిఁ జెనకరాదా
మేరతోడివూడిగపు మెలుఁతను నన్నంటేవు
బీరపు నీదేవులతోఁ బెనఁగరాదా

చ. 2: తెరలోనివారినేల దిష్టించి చూచేవు
సరసమాడేవారినే సాదించరాదా
పొరుగుననున్ననన్నుఁ బోరచి వెట్టుమనేవు
సరినున్నకాంతమోవి చవిగొనరాదా

చ. 3: కొలువులోనున్నవారికొప్పేల దువ్వేవు
లలి నమేల్మంగనే లాలించరాదా
చెలికత్తెనైననన్ను శ్రీవేంకటేశ కూడేవు
అలమి వురమాపెనే యాదరించరాదా

రేకు: 1237-3 ఆహిరి సం: 22-219

పల్లవి: తక్కక యాదరింతు వీతరుణి నెప్పుడు నీవు
వొక్కరీతినే చనవొసఁగవయ్యా

చ. 1: మక్కువ నీతో నాపె మాటలాడీ వినవయ్య
చిక్కనితేనెలు మోవిఁ జిందఁగాను
చెక్కులచెమటతోడఁ జేసీ కొలువు నీకు
మిక్కిలివేడుక మతి మెఱయఁగను

చ. 2: నంటున నీతో నిట్టే నవ్వీఁ జిత్తగించవయ్య
జంటలై దంతకాంతులు సారె మించఁగా
అంటిముట్టి వూడిగము లప్పటిఁ జేసీ నీకు
పెంటలై నపులకలు పెనగొనఁగాను

చ. 3: సోలపుఁజూపుల నిన్నుఁజూచీఁ గనుఁ గొనవయ్య
తళుకురెప్పలమించు దైవారఁగాను
చెలియలమేల్మంగను శ్రీవేంకటేశ కూడితి-
విల నీపె తనబత్తి యిరవుకోఁగాను

రేకు: 1237-4 నారాయణి సం: 22-220

పల్లవి: బట్టబయలు వలపు వచారింతురా
అట్టె యాఁడువారి సిగ్గు లంగడి నమ్ముదురా

చ. 1: పక్కన నాతఁడు నాపానుపుపై నుండఁగాను
గక్కన వచ్చి నీవేమి కానుకిచ్చేవే
చెక్కుచెక్కు సోఁకగఁ జెవిలో మాటలాడేవు
ఇక్కువ నాఁటదానికి ఇంత కాకు గలదా

చ. 2: యెడయక విడెము నాకీతఁ డిచ్చుకుండఁగాను
నడుమ నీవేల వచ్చినవ్వు నవ్వేవే
కడుఁజుట్టరికముతోఁ గదిసి కూచుండేవు
వొడికపుజవరాలి కోజ గొంత వలదా

చ. 3: యే నలమేలుమంగను యీతఁడు శ్రీవేంకటేశుఁ-
డానుక నేమఱఁదల ననేవదేమే
పూరుక నన్నితఁ డేలే పొందులు సేయవచ్చేవు
మానాపతి కిటువంటి మతకము దగునా

రేకు: 1237-5 గౌళ సం: 22-221

పల్లవి: వరుసతో నిద్దరికి వలపు వంచిపెట్టేవు
యిరుమేలా నీయాస యెంతగలదయ్యా

చ. 1: గుట్టుతో నాపెచేతను కొప్పు దువ్వించుకొంటివి
అటెపె సారెసారె విడే లందుకొంటివి
చుట్టరికపు(దనాన సుద్దులు నడిగితివి
మట్టుమీరి మాతో నవ్వ మరియే(టికయ్యా

చ. 2: పనివూని యాపెచేత పాదా లొత్తించుకొంటివి
పెన(గేపె వుంగర మిప్పించుకొంటివి
చను(గవ నొరయ(గ సరసములాడితివి
చెనకుచు మాపైనేల చేయిచా(చేవయ్యా

చ. 3: తోలుత నాపెచేత రతుల(జొక్కించుకొంటివి
నిలువున(బె(జెమట నించుకొంటివి
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
లలి నన్నేలి ఇద్దరి లాలించేవు మేలయ్యా

రేకు: 1237-6 లలిత సం: 22-222

పల్లవి: ఏడ నుండి వచ్చినాఁడే ఇప్పుడు దాను
వోడక జాణతనాల కొడిగట్టీఁగాక

చ. 1: చూడఁజూడఁ జూపులకు సుంకములేలడిగీనే
వేడుకకు వెలగద్దా వేసాలుగాక
వాడికనవ్వులకు వావులేల చెప్పీనే
తోడఁదొడ వలపులు దొంతివెట్టీఁగాక

చ. 2: మేలపుమాటలకు మీరి కొంగేల పట్టినే
యీలకూర కుప్పుగద్దా యెమ్మెలుగాక
పోలిక చక్కఁదనాలు పురుఁడేల పెట్టీనే
తాలిమితో రతులకు దమి రేఁచీఁగాక

చ. 3: నేరుపుల చేఁతలకు నెపమేల వెదకీనే
కోరికకు మితిగద్దా కొత్తలుగాక
యీరీతి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
చేరినన్నుఁగూడి యిట్టె చెలరేఁగీఁగాక

రేకు: 1238-1 అమరసిందు సం: 22-223

పల్లవి: ఇంకానేల దాఁచేవు యిందరితోను
తెంకినే మీభావనములు తెలిసితి మిపుడు

చ. 1: చింకచూపులతోఁ గడుసిగ్గున మొక్కీ నీకు
కుంకుమగుబ్బలతోడికొమ్మ యదివో
కంకణాలసూడిగాలు గల్లుగల్లురనఁగాను
అంకెల నారతులెత్తీ నందముగా నీకు

చ. 2: నెలవిచిఋనవ్వుల చేరి కానుకిచ్చీతి నీకు
నిలువుఁ దురుముతోడినెలఁ తదివో
మొలనూలికాంతులు ముంచి నీపైఁ గప్పఁగాను
వెలయ నాలవట్టము విసరీని నీకు

చ. 3: వెక్కసపుఁ బ్రియముల విన్నపాలు సేసీ నీకు
చక్కెరమోవితోడిసతి యదివో
చక్కనిశ్రీవేంకటేశ జాజులు పై రాలఁగాను
ఇక్కడ నలమేల్మంగ ఇరవాయ నీకు

రేకు: 1238-2 పాడి సం: 22-224

పల్లవి: ఎంతతే దెవ్వరితో నేమినన నేమిటికే
చెంత నిట్టే వుండఁగానే చెలిమి సేసేరు

చ. 1: యేతులకు సవతులు యెంత వెంగేలాడినాను
అతడు నాకుఁగలం డందుకేమే
కాతరానఁ గొక్కెరలు కడురవళించినాను
అతలఁ గొలఁకులఁ దావై యుండవా యలులు

చ. 2: సందుసుడికత్తె లెంతసుణఁగులు రాలిచిన
యెందు నామాట మీరఁడు ఇల నాతఁడు
ముందే కోవిలలు వనముల రొదసేసితే
అందే చిలుకలు నిరవై యుండుఁగదవే

చ. 3: పొసఁగనివా రెంతపొరపొచ్చాలఁబోయిన
వెస సన్నేలెను శ్రీవేంకటేశుఁడు
యెగి యలమేల్మంగ నేను, కొండల నెమళ్లు
కోసరినాఁ బావురాలుకూడ నిట్టే వుండుఁగా

రేకు: 1238-3 గౌళ సం: 22-225

పల్లవి: ఎంతవడి సరసము లిద్దరును నాడేరు
పంతములు వచ్చె మీరు బాగాలందుకోరాదా

చ. 1: వేడుకతో నాపె నిన్ను విరులను వేయఁగాను
నీడనుండి గందవొడి నీవు చల్లేవు
జాడతోడ నవ్వినవ్వి చలములు వెగ్గళించి
చూడఁజూడఁ జెమటలు జొబ్బిలించె నీకును

చ. 2: కొలువుతో జవరాలు గోర నిన్ను గీరఁగాను
చెలఁగి యాపెచన్నులు చేత నంటేవు
తలకొని యాసాసలఁ దమకము లుప్పతిలి
నిలువునఁ బులకలు నిగుడించె నీకును

చ. 3: చిక్కంచు కలమేల్మంగ చెక్కు నీకు నొక్కఁగాను
అక్కున శ్రీవేంకటేశ అలమితివి
మిక్కుటపుఁ గోరికల మీదమీఁద మీమోముల
తక్కక సంతోసాలు దైవారించె నీకును

రేకు: 1238-4 వరాళి సం: 22-226

పల్లవి: ఆలికి మగనికిని అమరెను వలపులు
వాలాయపుపొందు లిటువలె నుండనలదా

చ. 1: యీడుజోడై తమలోన యెగ్గుదప్పు లెంచుకోరు
ఆడు కోలు మాటలు అవి యెట్టివో
వాడికసంతోసాలు వదల రెంతై నాను
వేడుకఁ గూడినయట్టివేళ లెటువంటివో

చ. 2: సరసములాడుకొంటా జంటవాయ రెన్నఁడును
ఇరవైనపొంతనాలు యెట్టు గూడెనో
మరిగి యొకరొకరు మనసుల నేఁతైనాను
యెరపరిక మెఱఁగ రేమినోము నోఁచిరో

చ. 3: వేమారు రతులఁ గూడి వీసమంతా నలయరు
ప్రేమతో నేసగినానఁ బెండ్లాడిరో
ఆముక శ్రీవేంకటేశుఁ డలు మేలుమంగ యీకె
యేమిటా నొద్దికమీర రెంతభాగ్యవంతులో

రేకు: 1238-5 దేసాళం సం: 22-227

పల్లవి: ఇది యెంతగబ్బియని యెంచకువయ్యా
కదిసి పట్టపు దేవిఁగా నన్ను నేలితివి

చ. 1: పొందుగలవారికి పోరపొచ్చములు లేవు
మందెమేళమెంతైనా సమ్మతులేకాని
చెంది యేకతాన నుంటే సిగ్గులు పనికిరావు
సందడింపుఁ దమకము చవిరేఁచుఁగాని

చ. 2: వాడికైనవారికె వాసివంతు లెక్కడివి
జోడై యెంతపెనఁగినా సొంపలౌఁగాని
కూడిమాడి వుండితేను కొంకుగొసరులు రావు
వీడనిమోవితీవులు వేడుకలౌఁగాని

చ. 3: సతమైలవారికి చలములు నిగుడవు
మితిమీరఁ గూడినాను మేలేయౌఁగాని
ఇతవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
తతి నీనాకూటమి తారుకాణౌఁగాని

రేకు: 1238-6 బౌళి సం: 22-228

పల్లవి: కోడెవయసు విభుఁడు కొత్తపెండ్లికూఁతురును
జాడతోనే మెలఁగేరు జాణలౌదురు

చ. 1: తవిలి యొకరొకరు తమలోనిమాటలు
జవదాఁట లిద్దరును జాణలౌదురు
కవగూడి వయసులు కడివోకుండా మోవుల-
చవులు మరిగినారు జాణలౌదురు

చ. 2: ముంగిట నేపొద్దు మొకమొకములు చ t చుకొంటా
సంగతిగా నవ్వేరు జాణలౌదురు
చెంగటఁ దొడాఁదొడ జిగి నంటవేసుకొని
సంగడినే కూచున్నారు జాణలౌదురు

చ. 3: ఇరవైనరతులను ఇంపులతోఁ గూడికూడి
సతతముఁ జెలఁగేరు జాణలౌదురు
ఇతఁడు శ్రీవేంకటేశుఁ డీకె యలమేలుమంగ
చతురత వెలసేరు జాణలౌదురు

రేకు: 1239-1 దేశాక్షి సం: 22-229

పల్లవి: ఇది యెంతగర్వియని యెంచేవు గనక నన్ను
పెదవులతుదలనే పిలిచితిఁజుమ్మీ

చ. 1: కన్నుల మొక్కితిఁజుమ్మీ గక్కన నీకు నేను
కిన్నెర వాయించుకొంటా కెంగేలను
సన్నలుచేసితిఁజుమ్మీ సముకాననే యప్పుడు
చిన్నిచిన్నినగవులసిగ్గుతోడను

చ. 2: అంది చోటిచ్చితి జుమ్మీ అండనే నీకు నేను
గందము వూసుకొంటా గద్దెమీఁదను
విందులూఁ జెప్పితిఁజుమ్మీ వేడుకతోడ నిలిచి
మందలించి చెలికత్తెమాఁటుననే వుండి

చ. 3: యెదురుకొంటిఁజుమ్మీ ఇంపులచూపుల నీకు
ముదమున నాతురుము ముడుచుకొంటా
ఇదివో శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కదిసితి విటునన్ను కడు సంతోసించితి

రేకు: 1239-2 ఆహిరి సం: 22-230

పల్లవి: ఏ మంచిదాననంటా నన్నింతగా మన్నించితివి
కామించి నీకృప నాపైఁ గలిగె నీవేళను

చ. 1: కోరి నాపయ్యదలోనికుచములే కావా
సారెసారె నిన్ను నొత్తి సాదించినవి
నారుకొన్ననాసెలవినవ్వు లివియే కావా
వారించరాక నిన్ను వలలఁబెట్టినవి

చ. 2: చొక్కపునాకనుఁగోనచూపు లివియే కావా
ఇక్కువల నిన్ను బయలీఁదించినవి
పక్కన నాపెదవుల పైమాటలే కావా
చిక్కించి నీమనసెల్లా జిమ్మిరేఁచినవి

చ. 3: మించిననారతులసమేళము లివె కావా
పొంచి నీకు చెమటలు పుట్టించినవి
అంచెల శ్రీవేంకటేశ యలమేల్మంగపతివి
యెంచేనాపొందులే కావా ఇంపులు నించినవి

రేకు: 1239-3 సామంతం సం: 22-231

పల్లవి: చూచి వేడుకాయ మాకు సుదతి నీచెలులము
పూచిన రేలాఁదంగేడు బొసఁగినట్టున్నారు

చ. 1: యేపునఁ జెలియ నీవు యేమినోము నోఁచితివో
నీపై బత్తిగలఁడు నీరమణుఁడు
చేపట్టి నీవెటువలె సేవలు సేసితివో
యేపొద్దు దించక నిన్ను నెదఁ బెట్టుకొన్నాఁడు

చ. 2: యెనసి యీతని కెంతిఇచ్చకము సేసితివో
ననిచివున్నాఁడు నీనాయకుఁడు
మనసిచ్చి యెటువలె మర్మానఁ జొక్కించితివో
కనుఁగొని నీతోడిదే కాఁపురమై వున్నాడు

చ. 3: అలమేలంగవు నీవేమని వరము గొంటివో
వెలమ నిన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
కలికితనాల నెంత కడఁగి మెప్పించితివో
ఇల నీకుఁ గంకణము ఇదె కట్టుకొన్నాఁడు

రేకు: 1239-4 లలిత సం: 22-232

పల్లవి: చెలియ నీవడుగఁగా జెప్పే నేను
సలిగె నాకిచ్చినాఁడు సంతతమునమ్మా

చ. 1: కన్నులఁగన్నప్పుడెల్లా కరుణించు నన్నాతఁడు
సన్నలనే మోవితేనె చవిచూపును
విన్నపాలేమి సేసినా వేడుకతోనే విను
పన్ని నాపై నామగఁడు బత్తిగలఁ డోయమ్మా

చ. 2: అందరిలోనా నన్ను నాదరించు నేపొద్దు
ముందుముందే పుక్కిటితముల మిడును
అంది నే నెంతనవ్వినా నాసతోనే చిత్తగించు
కందువనాపతి నాకుఁ గడుమేలువాఁడమ్మ

చ. 3: పలుమారు నాచేతఁ బాదాలొత్తించుకొను
లలి గుబ్బల నూఁదితే లాలించును
యెలమి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
తలఁచి నాకాఁగిటనే తగులైనవాఁడమ్మా

రేకు: 1239-5 హిజ్జిజి సం: 22-233

పల్లవి: చూచితిరా చెలులాల సోద్యము లివిఁ గొన్ని
కాచుకొని సంతోసమే కావించీ నాకును

చ. 1: చిత్తము రాఁదనకు నే సేవలు సేసేదానను
తత్తరించి కొసరేనా తనతో నేను
యెత్తలఁ జూచిననన్ను నెక్కువగా మన్నించె
హత్తి ఇంతబుజ్జగించి యాదరించవలెనా

చ. 2: యెలమి నేపొద్దుఁ దనఇచ్చలోనిదానను
బలిమి వేసరించేనా పైకొని నేను
కలమేలెల్లా నాకె కరుణించినాఁడు నేఁడు
ఇల నేమివలెనని యెట్టడిగీ నన్నును

చ. 3: మచ్చికతో నలమేలుమంగనైనదానను
కొచ్చి తమిరేఁచేనా కొత్తగా నేను
యిచ్చట శ్రీవేంకటేవుఁ డేలి న్ను లాలించె
మెచ్చిమెచ్చి కాఁగిలించి మేలమాడె నిపుడు

రేకు: 1239-6 రామక్రియ సం: 22-234

పల్లవి: ఇంతకమునుపే నీకు నెదురుగా వచ్చునేమో
వింతలేక నీ విప్పుడే వేగమే రప్పించవే

చ. 1: విన్నపాలెల్లా విన్నాఁడు విడెము నాకిచ్చినాఁడు
చెన్నుమీర నింటికి వచ్చేనన్నాఁడు
మన్నించేననుచు నాకు మాటపట్టూ నిచ్చినాఁడు
అన్నిటా నావిభుని రమ్మని తోడితేఁగదే

చ. 2: కోరి బత్తి చేకొన్నాఁడు కొప్పు నాకు బెట్టినాఁడు
కేరి నవ్వి మావిందారగించేనన్నాఁడు
గారవించి నావెంటనే కప్పురమూ నంపినాఁడు
పేరుకొని మొక్కితనిఁ బిలుచుకరాఁగదే

చ. 3: కడుఁగడు మెచ్చినాఁడు కాఁగిలించుకొన్నాఁడు
యెడయక నన్ను నిట్టే యేలినాఁడు
అడరి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
బడినేవదెచ్చి యాతనిఁ బాన్పుపై నిలుపరే

రేకు: 1240-1 మంగళకౌసిక సం: 22-235

పల్లవి: నేరుపరి వొౌదువు నెరజాణవూ నౌదువు
మేరతోనే చిత్తము రా మెలఁగితి వౌనే

చ. 1: సరసములాడుకొంటా చవులెల్లా రేచుకొంటా
మరిగించికొంటి వౌనే మగనిని
గరిమతో నూరఁగలకఁ లెల్లాఁ జెప్పిచెప్పి
సోరిది నేపొద్దు నిట్టే చొక్కించితి వౌనే

చ. 2: మొగము చూపిచూపి మోహములు చల్లిచల్లి
తగులుసేసుకొంటివే తతి నాతని
నగుతానే గుబ్బలకొనల నోరసియొరసి
మిగులా వేడుకసేసి మెప్పించితి వౌనే

చ. 3: కోసరికోసరి మొక్కి వసముసేసుకొంటివి
వెస నలమేల్మంగ శ్రీవేంకటేశ్వరు
సుసరాన నేపొద్దు జోడువాయక వుండి
పోసఁగి రతుల నిట్టే భోగించితి వౌనే

రేకు: 1240-2 లలిత సం: 22-236

పల్లవి: కంటి మిదె మిమ్మిద్దరిఁ గన్నులపండుగలాయ
జంటనున్నచెలలము సారెఁ బొగడేమే

చ. 1: చెంతనుండి నాయకుఁడు చెప్పినట్టు సేసితేను
ఇంతులు సేసినభాగ్య మేమిచెప్పేదే
వింతలేక యేపొద్దు వెస మాటలాడితేను
సంతోసాలకు మరి సరిగలదటవే

చ. 2: మమకరించి మగనిమన్నన గలిగితేను
రమణులు సేసినదే రాజ్యమాయనే
సమరతి మనసుసు సరిఁ దులఁదూఁగితేను
కొమరెపాయములకు గురుతెట్టు వెట్టేమే

చ. 3: పతియైనతఁడు తమపక్క వాయకుండితేను
సతులు సేసిననోము సమకూడెనే
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
తతిఁ గూడితిరి మీతలఁపు లీడేరెనే

రేకు: 1240-3 పాడి సం: 22-237

పల్లవి: అతఁడు నన్ను మన్నించేదంతా నే నెఱుఁగుదు
కతలేమిచెప్పరే కాంతలాల

చ. 1: వలచినకొలఁదినే వాడికలు గలుగును
పిలుపులోఁ గానవచ్చు ప్రేమమెల్లాను
తలఁపు గలిగితేనే తగులాయముఁ గలుగు
తెలిపి యేమిచెప్పేరే తెఱవలాల

చ. 2: మొగము చూచితేనే మోహమెల్లా గనుపట్టు
నగితేనే వెల్లవిరౌ ననుపెల్లాను
సొగిసి యిచ్చగించితే చుట్టరికము గలుగు
తగ నాకేమిచెప్పేరే తరుణులాల

చ. 3: మేలములు దఱచైతే మేలెల్లా రూడికి నెక్కు
పోలికలనే తోఁచు పొందులెల్లాను
యేలె శ్రీవేంకటేశుఁడు నలమేలుమంగను
లాలించి మేమిచెప్పేరే లలనలాలా

రేకు: 1240-4 శుద్ధవసంతం సం: 22-238

పల్లవి: నేనూ సంతోసించుకొనే నీకుఁ దొడుగా నేఁడు
అనుక నీదేవినైతి నానతీవ

చ. 1: కళలు నీమొగమునఁ గడు నిండెను
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగీని
చెలపలచెమటలు చెక్కుల నవె
అలరిన నీ వేడుక లానతీవయ్యా

చ. 2: అరవిరిబాగులు నీయందుఁ జూపట్టె
శిరసులోపల వింతవిరు లున్నవి
గిరిగొన్న మోవిమీఁదఁ గెంపులు నవె
అరుదైననీవేడుక లానతీవస్సా

చ. 3: కనుఁగొనచూపులు కడుఁదేటాయ
నినుపులై వింతతావి నిండె నీమేన
యెనసి యలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
అనిశము నీవేడుక లానతియ్యవయ్యా

రేకు: 1240-5 సాళంగనాట సం: 22-239

పల్లవి: జనులాల పూజించరో జయంతి నేఁడు
వోనర నర్ఘ్యమీయరో వుదయించెఁ జంద్రుఁడు

చ. 1: సవరేయి వుట్టినాఁడు శ్రావణబహుళాష్టమి
నవముగా రోహిణినక్షత్రమందు
దివిజులు వోగడఁగ దేవకిగర్భమునందు
భువిలో వసుదేవునిపుత్రుఁడై కృష్ణుఁడు

చ. 2: తఱితో యమున దాటి తగఁ బెంచఁ బెట్టిరట
గుఱిగా యశోదనందగోపులయింట
మఱి జాతకర్మనామకరణాలు సేయరో
నెఱి నారగింపులెల్ల నించరో కృష్ణునికి

చ. 3: చక్కిలాలు నురుగులు సరిఁ బళావళిగట్టి
మొక్కరో యీబాలునికి ముద్దుగారీని
తక్కకలమేల్‌మంగతోఁ దగ శ్రీవేంకటేశుఁడై
నిక్కిచూచీఁ గోలువురో నెమ్మదిఁ గృష్ణునిని

రేకు:	1240-6 బౌళి	సం:	22-240

పల్లవి:	వీదులవీదులనెల్ల వీఁడె కృష్ణుఁడు
అదిగొని మెరసీని అల్లవాఁడె కృష్ణుఁడు

చ. 1:	చక్కిలాలు నురుగులు జలజలరాలఁగాను
వుక్కుమీరికొట్టీఁ గృష్ణుఁడుట్లెల్లాను
పక్కన గొపికలెల్లాఁ బట్టఁగా, వారిపాదాలు
దొక్కి పెండ్లాడఁ జూచీ దొమ్మికాఁడు కృష్ణుఁడు

చ. 2:	పాలుఁ బెరుగులు పెద్దపరఁటులవెన్నలు
సోలిగోన్నదొంతులలో జుట్టుకొనీని
కోలలగోపాలులకు గొబ్బన వంచిపోసీని
చాలునన్నా మానఁడు జాణకాఁడు కృష్ణుఁడు

చ. 3:	చారపప్పుఁదేనేలు సనఁగలు చెఱకులు
అరగించి బాలులతో నట్టుగలెక్కి
కోరి యలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడై
మేరమీరి యేగీ వీఁడే మేటికాఁడు కృష్ణుఁడు

రేకు: 1241-1 రీతిగౌళ సం: 22-241
పల్లవి: ఏమి గడించుకొనేవే ఇట్టే వట్టివలపులు
ప్రేమ నాడుకొనేవేమే నీమగఁడంటాను
చ. 1: చేరి యాతనిపాదము చెంత నీవే తాఁకించుక
దూరి పలికేవదేమే తొక్కెనంటాను
సారె జారుపయ్యదతో సమదిష్టి నిలుచుండి
కోరి సిగ్గువడేవేమే కొచ్చి చూచెనంటాను
చ. 2: పొంకానఁ జన్ను లతనిబుజాన నోరసుకొని
జంకించేవదేమే చేయిచాఁచెనంటాను
అంకెలఁ దమ్ములము సేయఁగ మోవి గదలితే
సంకెలేక నవ్వేవేమే సన్న సేసెనంటాను
చ. 3: కానుకగా నిమ్మపండు గదిసి నీవే యిచ్చి
ఆనవెట్టేవేమే గోరనంటెనంటాను
యే నలమేలుమంగను యేలె శ్రీవేంకటేశుఁడు
పూని కాఁగిలించేవేమే పొందెనంటాను

రేకు: 1241-2 శ్రీరాగం సం: 22-242

పల్లవి: జత్తాఇత్తమై యుండరే సకియలాల
చిత్తమురా నూడిగాలు సేయరే ఇందరును

చ. 1: కొలువున నున్నవాఁడు గొబ్బున లోనికి వచ్చె
జలకము వోయరె సతులాల
తేలుపుమణుఁగు లిచ్చి తిరుణామము వెట్టి
నిలుచుండఁగానే మీరు నివాళెత్తరే

చ. 2: అట్టె పీఁటపై నునిచి యడ్డెనపైఁ బళ్లెమిడి
వొట్టి వడ్డించరే బొనా లువిదలాల
గుట్టుతోఁ బట్టపుదేవిఁగూడాఁ బొత్తునఁ బెట్టి
గట్టిగా వాసననీరు గక్కన నందియ్యరే

చ. 3: వేవేగ బాగాలియ్యరే వెసఁ బానుపువేయరె
తావిపువ్వు లోసఁగరే తరుణులాల
కావించి యలమేలుమంగఁ బాదాలోత్తుమనరే
సేవలెల్లఁ జేయరే శ్రీవేంకటపతికి

రేకు: 1241-3 వరాళి సం: 22-243

పల్లవి: వేవేలు నీసుద్దులు విననేఁటికి
బావ నీకు నాతఁడై తే బతుకఁగదే నీవు

చ. 1: పొత్తులసవతిమాట పోసఁగ నాతోనాడేవు
హత్తినయాతనిపొందు లట్టె చెప్పేవు
కొత్తదానివలెనే నీగుఱుతులు దెలిపేవు
బత్తిగలదానవైతే బతుకఁగదే నీవు

చ. 2: సందడిలోననే మాసరుసఁ గూచుండేవు
చెంది మాతో విడేలకుఁ జేయిచాఁచేవు
మందలించి నీవావులు మాకునేల కలుపేవు
బందుగురాలవైతే బతుకగదే నీవు

చ. 3: పలుమారు నీకిచ్చినబంగారాలు చూపేవు
పలికి నీచువులు పచారించేవు
యిల నలమేల్ మంగను యేలె శ్రీవేంకటేశుఁడు
బలిమి నీతో నవ్వితే బతుకఁగదే నీవు

రేకు: 1241-4 దేవగాంధారి సం: 22-244

పల్లవి: అతనికి బుద్ధిచెప్ప రమ్మలాల
తతి నిన్నిటాఘనుఁడు తానిది యెఱఁగఁడా

చ. 1: చెంది యెవ్వతెకు వలచితేఁ దా వంచుఁగాక
కందువచెమట మేనఁ జిందవలెనా
పొందు లేడనైనాఁ జేసి పోసఁగినా వద్దనేమా
అందపుమే నింతపచ్చియై వుండవలెనా

చ. 2: మంతనాన నెవ్వతెతో మాటాడినా నాడుఁగాక
పొంత నిట్టె మోవిపైఁ గెంపులు వలెనా
మంతుకెక్క నెవ్వరిని మన్నించినా నందుకేమి
వింతవుంగరాలు తనవేల నుండవలెనా

చ. 3: సరి నెవ్వతెపై సేస చల్లినాం జల్లుఁగాక
సురతపుచిన్న మేనఁ జూపవలెనా
ఇరవై శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
సొరిది నన్నేలినచొప్పు లనవలెనా

రేకు: 1241-5 గుండక్రియ సం: 22-245

పల్లవి: ఏమిసేకున్నాఁడవో యెఱిఁగి రమ్మనె నింతి
కామించి ఇంతలో నీవిక్కడికి వచ్చితివి

చ. 1: చెలియ నీకుఁ దొల్లిచేసినవూడిగాలు
తలఁపౌనా యెన్నఁడైనా తమితోడను
యెలమిఁ గేళాకూళిలో నీఁదులాడిననేర్పులు
చెలిమికత్తెలతోడఁ జెప్పుకొందువా

చ. 2: గుదిగోన నిన్నాపె కుంకుమగుబ్బల నొత్తి -
నది నీమేనిపై గుఱుతైవున్నదా
వదలక పూఁదోఁటలో వసంతములాడినది
పొదలి యావినోద మెప్పుడు నెంచుకొందువా

చ. 3: నెట్టన నలమేల్‌మంగ నీకు లేకలంపినది
గుట్టుతోడనే చదువు కొంటివా నీవు
చుట్టమవై యేలితివి చూచి యీపె నీతో నవ్వె
పట్టపు శ్రీవేంకటేశ భావించుకొందువా

రేకు: 1241-6 గేళ సం: 22-246

పల్లవి: ఇపుడేల సిగ్గువడె విందరితోన
వుప్పతిల నాపెరతి నోలలాడవా

చ. 1: గుత్త పుగుబ్బలతాఁకులకు నొడ్డించుకొంటా
హత్తి యాపెతో సరసమాడవా నీవు
జొత్తుగా మోవియుమోవి సోఁకఁగా నోరుదెఱచి
బత్తితోడఁ దమ్ములము పడఁతి కొసఁగవా

చ. 2: వడియుబెంజెమటలవానలఁ దడుసుకొంటా
కడుఁగడుఁ బెనఁగవా చాఁచి కాంతతోడను
తోడపైఁ బాదాలు చాఁచి తోరలింపునవ్వులతో
చిడుముడిచేతలెల్లఁ జేయవా ఆపెతోను

చ. 3: కొప్పువిరులవాసన గొలుకొంటాఁ గాఁగిలించి
మెప్పించి కూడవా యలమేలుమంగను
ముప్పిరి శ్రీవేంటేశ మోహించి యాపె నురాన
యెప్పుడుఁ బెట్టుకుండవా యేలితివి నన్నును

రేకు: 1242-1 వళవిగౌళ సం: 22-247

పల్లవి: నిచ్చకల్యాణములెల్ల నీయిల్లు నిండె
తచ్చి యప్పటి నన్నేల తడవేవయ్యా

చ. 1: చెప్పఁజెప్పఁ గొత్తలాయ చెలులకు నీవలపు
ముప్పిరిఁ జనుఁగొండలు మోపులాయను
రెప్పలెత్తి చూడఁ జూడ రేపులాయఁ దమకము
చొప్పులెత్తి చూపరాదు చూతువురావయ్యా

చ. 2: పట్టినదే పంతమాయ పచ్చిదేరె నీపొందు
గుట్టున మోవితేనెలు గుక్కిళ్లాయను
వొట్టిన సెలవినవ్వు లూరనూర నూటలాయ
చుట్టరిక మేమిచెప్పేఁ జూతువు రావయ్యా

చ. 3: అంటుకోనేజిగురాయ నందపునీకాగిలి
జంటలయారతులాయ చల్లుఁ జూపులు
ఇంటియలమేలుమంగను యేను శ్రీవేంకటేశుఁడ
సొంటు లెమిసోదించేవు చూతువు రావయ్యా

రేకు: 1242-2 సామంతం సం: 22-248

పల్లవి: ఎంచిచూచితేనీ కీఇన్నిభాగ్యాలుఁ గలవు
పొంచిచూడ వేడుకలు పొంకపునీకతలు

చ. 1: మక్కువగలుగువారు మంచిమాట లాడితేను
చక్కెరకంటెఁ దీపులై చవివుట్టును
చోక్కపుఁ జూపుతను సోలసి చూచితేను
అక్కజముగా గందమ్ములందినచందము

చ. 2: ననుపుగలుగువారు నవ్వులు నవ్వితేను
పెనఁగి ముత్తేలసేస పెట్టినట్లుండును
చనవున నంతలోనే చనుఁగవ నొత్తితేను
కనకపురాసులు గలిగినయట్లు

చ. 3: చుట్టరికమైనవారు సోగయఁ గాఁగిలించితే
ఇట్టే రాజ్యమేలినంతఇంపు గలుగు
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
జట్టిగా నన్నేలితివి సంతోసమే యౌను

రేకు: 1242-3 జభౌళి సం: 22-249

పల్లవి: చెలినీవు మొదలనే సిగ్గరిపెండ్లికూఁతుర-
వీల నింతపచ్చిదేరీ నిదివో నీభావము

చ. 1: చెక్కులవెంటాఁగారేచెమట దుడుచుకొవే
చక్కఁబెట్టుకోనవే నీజారినకొప్పు
అక్కుమీఁదఁ బెనగోన్నహారాలు
చిక్కుదియ్యవే యిక్కువల నీకోరిక లీడేకె నిపుడు

చ. 2: పెదవిమీఁది కెంపుల బేంట్లు రాలుచుకొవే
చెదరినముంగురులు చేత దువ్వవే
వదలినపయ్యద చివ్వన బిగించుకొనవే
పదిఁబదిగా నీనోము ఫలియించె నిపుడు

చ. 3: తిలకము గరఁగెను దిద్దుకొవే నోసలను
కలసినగురుతులు గప్పుకోనవే
యెలమి శ్రీవేంకటేశుఁ డేల నలమేల్మంగవు
తలఁచినతలఁపులు తలకూడె నిపుడు

రేకు: 1242-4 ముఖారి సం: 22-250

పల్లవి: నీరుకొలఁదితామర నీతో వలవు
నేరిచినవారికి నిండునిదానమవు

చ. 1: హత్తి నీకు నేపొద్దు నండనుండి సేవసేసి
చిత్తము రా మెలఁగేదే చెలియ
కొత్తకొత్తరతులను కోరి నిన్నుఁ గరఁగించి
బత్తిసేసితే నీవూఁ బాయక వుండుదువు

చ. 2: కచ్చుపెట్టుకోని వేళగాచుక నీతోడుత
యిచ్చకములాడినదే ఇంతి
నిచ్చనవిడివి నీవేడుకవినయముల
మెచ్చఁగూడితే నీవు మేలువాఁడ వౌదువు

చ. 3: కలికితనాల నిన్నుఁ గాఁగిలించి నేరువులు
తలఁపించుక నవ్వీందే తరుణి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
లలి నావలె నుండితె లాలించి రక్షింతువు

రేకు: 1242-5 నాదరామక్రియ సం: 22-251

పల్లవి: తగవైన పను లివి తరుణుల కెల్లాను
వెగటుగాకుండా నీకు విన్నవించే నిపుడు

చ. 1: కొచ్చికొచ్చి చూడవచ్చు కోపగించుకొనరాదు
పచ్చిగాఁ జెనకవచ్చు పదరరాదు
పచ్చిక సొలయవచ్చు మాఁటలు మీఱఁగరాదు
యిచ్చకమెఱిఁగినట్టియిల్లాండ్లకును

చ. 2: మనసు సోదించవచ్చు మంకులు నెరపరాదు
పెనుఁగులాడఁగవచ్చు బిగియరాదు
కొనగోర నూఁదవచ్చు కుచ్చితము సేయరాదు
యెనసివుండిన యట్టి యిల్లాండ్లకును

చ. 3: బొమ్మల జంకించవచ్చు పొంచి యెగ్గుపట్టరాదు
కుమ్మరించవచ్చు సిగ్గు గునియరాదు
నెమ్మి నలమేల్మంగను నేను శ్రీవేంకటేశుఁడ
యెమ్మెఁ గూడవచ్చు నావంటిల్లాండ్లకును

రేకు: 1242-6 శుద్ధదేశి సం: 22-252

పల్లవి: ఎదుట నుండవే నీవు యేపొద్దును
అదివో మేలువాఁడైనాఁ డతఁడు నీకిపుడు

చ. 1: తేనెలు గారేటి నీతేటలమాటలు వింటె
వీనులపండుగలౌను విభునికిని
కానుకగా నీవు చక్కనిమోము చూపితేను
వూనినమదనకళ లుప్పొంగు నాతనికి

చ. 2: నీలపుసరాలవంటినీచూపులు సోఁకితేను
చాలా సంతోషమౌ నీసరసునికి
చాలుకోన సెలవుల సన్నపునవ్వు నవ్వితే
తాలిమితో వేడుకలు దట్టమౌ నాతనికి

చ. 3: మెఱుఁగుగుబ్బల నీవు మేను సోఁకఁజేసితేను
కఱఁగు జిత్తము శ్రీవేంకటేశ్వరుకు
గుఱియై యలమేల్మంగ కూడితి విన్నిటా నీకు
నెఱి నీపై కోరికలే నెగడు నాతనికి

రేకు: 1243-1 శంకరాభరణం సం: 22-253

పల్లవి: ఎన్ని నేరుచుకొంటివి యెంతని సంతోషించే-
నన్నిటా నిందుకే నేను ఆలనైతి నీకు

చ. 1: ఆయములు గరఁగఁగ నంటి మాటలాడేవు
చేయిమీఁదుగానే చెనకేవు
పాయపుమదము రేఁగ పచ్చిగానే పెనఁగేవు
చాయలసన్నల మోవిచవులు చూపేవు

చ. 2: ఆసలెల్లఁ బుట్టించి యట్టె తప్పకచూచేవు
లాసి కుచములు ముట్టి లాలించేవు
వాసనలు మేనఁ బూసి వాడికలు సేసేవు
పోసరించఁ జెక్కు నొక్కి పొందు నెరుపేవు

చ. 3: కళలు పైపై రేఁగ గాఁగిలించి కూడేవు
కులికి నోరిలోఁ దమ్మ కుమ్మరించేవు
నెలవై శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసి నన్నిట్లానే కడుమన్నించేవు

రేకు: 1243-2 రామక్రియ సం: 22-254

పల్లవి: భామతో నీ వందుకుఁగా పంతములేలాడేవు
చెముంచి మారుకుమారు చేఁతసేయఁదగదా

చ. 1: చెలరేఁగి నీ వాపెను చెనకి గోర నూఁదితే
వొలిసి గుబ్బల నిన్నొత్తఁదగదా
నలువున నూరఁగల నవ్వులెల్ల నవ్వఁగాను
కలువపూవుల నాపె కమ్మివేయఁదగదా

చ. 2: పిరిదూరి నీవాపెతో పెనఁగులాడఁగాను
కెరలి బొమ్మలను జంకించఁదగదా
తరుణులమీఁదఁబెట్టి తగనివొట్టు వెట్టఁగ
సిరులనిన్నంటఁబట్టి చెక్కునొక్కఁదగదా

చ. 3: గుట్టుతోనుండినయాపెఁ గొప్పువట్టి తడవఁగా
నెట్టనఁ గప్రము నీపై నించఁదగదా
అట్టె శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
వొట్టి నీవు గూడఁగాను వురమెక్కఁదగదా

రేకు: 1243-3 దేసాళం సం: 22-255

పల్లవి: ఎంతలేదు నీపగటు యేమిచెప్పదే
మంతనాన నా కితఁడు మాటఇచ్చినాఁడు

చ. 1: కందవ లేమిచూపేవే కన్నుసన్నలను
మందు లెంతనూరేవే మంచిమాటల
యెందరైనా సవతులు యిరుమేలా నుండఁగాను
అంది నీవే యీతనికి నాలవైతివా

చ. 2: ఆసలేల పుట్టించేవే అట్టె ముందటఁ బొలసి
వేసా లేమి సేసేవే వెడనవ్వుల
సేసలువెట్టినవారు చేరి కాచుకుండఁగాను
బేసబెల్లినిన్ను నేఁడు పెండ్లాడీనా

చ. 3: వావు లేమి దెలిపేవే వాడికచేఁతలను
మోవేల కదలించేవే మురిపముల
యీవల నలమేల్మంగ యేను గూడివుండఁగాను
శ్రీవేంకటేశుఁడు నీకుఁ జేతికిలోనయ్యీనా

రేకు: 1243-4 సౌరా+పం సం: 22-256

పల్లవి: వివరించి చెప్పవయ్యా వినవేడుకయ్యీ మాకు
సవరఁగా నేము తెరచాటుననే వుంటిమి

చ. 1: యింతవడి నాపె నీవూ నేకతము లాడితివి
పంతమున నది యెంతపనికో కాని
చెంతవ దెరలో కొలువసేయించుకొంటా నుంటివి
వింతలుగా నెటువంటివేడుకోకాని

చ. 2: చప్పుడుగా విడే లాపెజంట నుండి సేసితివి
దప్పిదేర నెటువంటితమియో కాని
తప్పక జాగరాలు తఱచుగాఁ బెంచితివి
గొప్పగా నేమిగడించుకొంటివో కాని

చ. 3: ననుపున నాపెతోను నవ్వుతానే వుండితివి
సొనిపి యేమిమర్మాలు సోఁకెనో కాని
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
ననుఁ గూడితివి యెంత నాపైబత్తో కాని

రేకు: 1243-5 పాడి సం: 22-257

పల్లవి: ఎంత యాఁకరేవు నీవు ఇంతిచెలువము చూచి
వింతలుగా జోడుగూడ విచారించేవా

చ. 1: గుత్తమైనగుబ్బలగురుతులు చూచేవు
చిత్తరువు వ్రాసేవా చెలిరూపము
హత్తి కలువరేకుల యళతులు గొలచేవు
కొత్తగాఁ గనుఁగోనలకొలఁది దెలిపేవా

చ. 2: పోడవైనయట్టికొప్పు పూఁచి కొలచుకొనేవు
అడియాలము చూచేవా అపెభావము
వెడఁద జంటపిఱుఁదు వేఁకము పడికట్టేవు
తొడరి యాసింగారము తూఁచుకొనేవా

చ. 3: చలపట్టి మోవితేనె చవులై యడిగేవు
అలమేల్ మంగభోగము లవి అయనా
యెలమి శ్రీవేంకటేశ యీపెఁ గాఁగిలించేవు
కలపుకోలుచుట్టరికము చూపేవా

రేకు: 1243-6 శ్రీరాగం సం: 22-258

పల్లవి: ఎవ్వరికి మోహించినా యే నిన్ను వద్దనేనా
ఇవ్వల నన్నుఁజూచి యేల సిగ్గువడేవు

చ. 1: అకెసుద్దులే వింటా నందలముమీఁద నుండి
జోకగా ఆయింటిదిక్కే చూచుకొంటాను
మేకొని పైఁజెమటలు మేన నిండా వడియఁగా
యీకడ నామోము చూచి యేల సిగ్గువడేవు

చ. 2: గుఱుతైనచెలి నాపెగుణము లడుగుకొంటా
చిఱునవ్వులు సెలవిఁ జిందుకొంటాను
నెఱి నావీది నాడాడ నిలిచి యాసించుకొంటా-
నెఱిగితే నన్నుఁజూచి యేల సిగ్గువడేవు

చ. 3: యిక్కువలు చెప్పుకొంటా నెదురులు చూచుకొంటా
నిక్కి మాఇంటికి వచ్చి నీవు నన్నేలి
అక్కున శ్రీవేంకటేశ అలమేల్మంగ నుంచఁగా
యిక్కడ నేఁ జూచి తే యేల సిగ్గువడేవు

రేకు: 1244-1 సామంతం సం: 22-259

పల్లవి: చెప్పవే ఆసుద్దులు నే చెవులార వినేఁగానీ
యిప్పు డాతనికి వావి యేమౌదువే

చ. 1: గుఱుతుగా నావిభునిఁ గొచ్చకొచ్చి చూచేవు
యెఱుఁగుదువటవే నీ వీతనిఁ దొల్లి
మఱియునుఁ దమకించి మాటలాడఁబొంచేవు
జఱసి యిదీఁ గోంత సంగాతము గలదా

చ. 2: సంగడి గూచుండి నీవు సరసములాడేవు
అంగవించి పెండ్లాడినఆలవటవే
చెంగట నప్పటి నీవు సేవలు సేయవచ్చేవు
అంగడిఁ గొనుకవచ్చితటవే యీవలపు

చ. 3: తోడరి శ్రీవేంకటేశుతోడ నీవు నవ్వేవు
కడు నీకీయలవాటు గలదటవే
యెడయ కితఁడు నావాఁ డే నలమేలుమంగను
బడివాయకుందానవు పాలిదానవైతివా

రేకు: 1244-2 మంగళకౌసిక సం: 22-260

పల్లవి: వెలలేనిగుణములవిభుఁ డాతఁడు
సలిగెతనాల నెంత సాదించేవే

చ. 1: చన్నుల నోరసుకొంటా సణఁగుల నాతనితో
యేన్నేసిమాఁట లాడేవేమే నీవు
సన్నలనే మెవి చూపి సారె నోరూరించేవు
యిన్నేసివెడమాయ లేల సేసేవే

చ. 2: కాతరించి నవ్వుతాను గబ్బిచేఁతలెల్లాఁ జేసి
అతని నెంతగోసరే వౌనే నీవు
చేతులెత్తి మొక్కిమొక్కి చిత్తమెల్లాఁ గరఁగించి
యేతరితనాలనేల యెలయించేవే

చ. 3: నిక్కి నిక్కి మోముచూచి నేరుపులు విచారించి
మిక్కిలి గాఁగిలించేవు మేలే నీవు
అక్కరో శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
యిక్కువ లంటుచుఁ జెక్కులేల నొక్కేవే

రేకు: 1244-3 రామక్రియ సం: 22-261

పల్లవి: రతులయెంగిలిపొత్తు రామలకుఁ దగునా
బతిమాలి నీవెంత పచ్చియైవుందానవే

చ. 1: చెంగట నుండి యాతనిసేవలు నేఁ జేయఁగాను
అంగవిచ్చి యేల వుపాయాలు చెప్పేవే
ముంగిట నేమిద్దరము ముచ్చటలాడుకోఁగా
తొంగిచూచి నీవదేమి తోడుగూచుండేవే

చ. 2: వేడుకతోఁ బతివొద్ద వీణె నే వాయించఁగాను
జోడుగావచ్చినీవేమి సుతిగూడేవే
వీడెమిచ్చి తములము వెస నేఁ బెట్టిపంచుకోఁగా
జాడతో నీవేమి చెయిచాఁచబూఁచేవే

చ. 3: అలమేలుమంగ నేను అతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమి నీపేరు మరి యేమందురే
కలసె నాతఁడు నన్ను కాచుక నీవుండితివి
చెలిమిసేసి నాకిట్టె చెల్లెల వయితివే

రేకు: 1244-4 దేసాళం సం: 22-262

పల్లవి: అనతీవయ్యా మాకు నందుకు నేమాయను
వూని తగవుదిద్దేము పొలఁతుల మిపుడు

చ. 1: సొలసిసొలసి చూచి చొప్పలెత్తి నీకుఁ జూపి
చెలి నీకు విన్నపాలుసేసీ నిదె
తలఁపులో బెట్టుకొని దాఁచిదాఁచి నవ్వేవు
కలదా నీవోళ్లఁ గొంత కపట మేమైనను

చ. 2: తారుకాణలెల్లఁ జేసి దయవుట్ట నీకు మొక్కి
కూరిములు చల్లి చల్లి కొసరీ నిన్ను
వూరకె తలవంచేవు వొడ్డించుకొనే వప్పటి
నేరము లేమైనాను నీవల్లఁ గలవా

చ. 3: నిన్నే వొడఁబరచి నీకన్నిబుద్దులూఁ జెప్పి
కన్నె యలమేలుమంగ కాఁగిలించీని
యిన్నిటా శ్రీవేంకటేశ యియ్యకొంటివి నీవును
వున్నవా నీవల్లఁ గొన్ని వుదుటుఁచేతలు

రేకు: 1244-5 కేదారగౌళ సం: 22-263

పల్లవి: వట్టికుచ్చితము వలదే నీకు
యెట్టయినా నాతఁడు యేలునే నన్నును

చ. 1: మన్నించి పతి నాతో మాఁటలాడఁగాను
సన్నల నీవేల సాదించేవే
పన్నిననీమాయ పనికిరాదు ఆతఁ-
డెన్నిచెప్పినాను యేలునే నన్ను

చ. 2: సంతోసాన నాతో సరసమాడగాను
పొంత నీతనినేల బోదించేవే
పంతాలు నీకునిఁకఁ బనికిరావూ మరి
యెంతైనా నాతఁడు యేలునే నన్ను

చ. 3: అలమేలుమంగపతియగు శ్రీవేంకటేశుఁడు
యిల నన్నుఁ గూడఁగా నీవేల నవ్వేవే
బలిమి నీచేఁతలు పనికిరావూ యితఁ-
డెలమి నేకాలము యేలునే నన్ను

రేకు: 1244-6 సాళంగనాట సం: 22-264

పల్లవి: ఎంతప్రియము చెప్పినా నెఱఁగవొద్దా నీవు
మంతనాన నిప్పుడుగా మంచిమాటలాడేవు

చ. 1: గయ్యాళి యెవ్వతెయైనా గడువనాడినఁగాక
చయ్యన నీవొజలు చక్కనయ్యీనా
కొయ్యతనమునను నీకొప్పువట్టితియ్యక
నెయ్యమునఁ బిలిచితే నీవు వచ్చేవా

చ. 2: పంతగత్తెయైనది బలిమి సేసినఁగాక
చెంతనుండి చెప్పినట్టు సేసేవా నీవు
జంతవలె బొమ్మలను జంకించి పెనఁగక
కాంతలకు నీ వూరికే కరఁగేటివాఁడవా

చ. 3: కావరపుది నీమోవి గంటినేసినఁగాక
శ్రీవేంకటేశ నీవు సిగ్గువడేవా
సేవించి యలమేల్మంగ చెప్పఁగా నన్నేలితివి
చేవమీరి కోరక చేతికిలోనయ్యేవా

రేకు: 1245-1 రామక్రియ సం: 22-265

పల్లవి: ఎదుట నేనుండఁగా నీవేల కొంకేవు
గుదిగొన్నవలపులు కుమ్మరించఁగదవే

చ. 1: రవళి నల్లంత నీవు రాఁగా విభుఁడు నీకు
చెవులోగ్గీ విన్నపాలు సేయఁగదవే
తివిరి నీవొడిదిక్కే తేరకొనఁజూచీని
వువిద, కానుకేమైనా నుంటే నియ్యఁగదవే

చ. 2: పొద్దున వచ్చి నీవు పొంచి నిలుచుండఁగాను
వొద్దఁ జోటిచ్చీ నీకుఁ గూచుండఁగదవే
కొద్దిమీర మోముచూచి గుక్కిళ్లతో నోరూరీని
చద్దికివేడిఁక మోవి చవిచూపఁగదవే

చ. 3: తోలుతే బాగాలు నీవు దొసిటఁ బట్టుకుండఁగ
యెలమిఁ జెయిచాఁచీ నందియ్యఁగదవే
అలమేల్మంగపతియైన శ్రీవేంకటేశుఁడు
నెలకొని నన్నునేలె నీవూఁ గూడఁగదవే

రేకు: 1245-2 పాడి సం: 22-266

పల్లవి: నాతో నేమిచెప్పవు నంటున నియ్యాల నేను
చేత నే నీవూడిగాలు సేసేఁగాక

చ. 1: వేడుకతో నిమ్మపంట వేయఁగ వద్దనేనా
యీాడ నట్టే కానుకగా నిచ్చేఁగాక
జాడతోఁ బన్నీరు నాపైఁ జల్లితే నిన్నే మనేను
తోడనే నీవచ్చుడానఁ దుడిచేఁగాక

చ. 2: కోమ్మలవిరులు నాపైఁ గులుకఁగా వద్దనేనా
ముమ్మడిగా నీకొప్పున ముడిచేఁగాక
యెమ్మెలఁ గేళాకూళిలో నీఁదించితే నందుకేమి
ఇమ్ముకొని నీబుజ మేక్కేఁగాక

చ. 3: చన్నులు నీ వంటఁగాను జడిపి నే వద్దనేనా
వున్నతి నీవురమున నొత్తేఁగాక
యిన్నిటా శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మన్నించితే మంచిదాయ మరిగేఁగాక

రేకు: 1245-3 భైరవి సం: 22-267

పల్లవి: ఎంతకెంత సేసేవు యేమయ్యా
కాంతఁ జూచి నీమనసు గరఁగఁగవలదా

చ. 1: చెనకినదై యాపె చేతులెత్తి మొక్కఎగాను
పెనఁగుచు చన్నులేల పిసికేవయ్యా
తనమీఁద నానవెట్టీ తడవకుమనుచును
వినవయ్యా విన్నపము వేగిరించనేఁటికి

చ. 2: వొట్టువెట్టీనదె యాపె వూరడించి వేఁడుకోఁగా
తిట్టుచుఁ గొప్పెల పట్టితీ సేవయ్యా
అట్టె మోవి లంచమిచ్చేనని మన్నించుమనుచు
చుట్టరిక మెంచరాదా సూడువట్టనేఁటికి

చ. 3: కాలుదొక్కినదై యాపె కాఁగిలించుకొనఁగాను
యేల మరుకేలి నలఇంచేవయ్యా
ఆలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చాలమెచ్చి నవ్వరాదా జాగు సేయఁనేటికి

రేకు: 1245-4 కన్నడగౌళ సం: 22-268

పల్లవి: తత్తరించనేఁటికి తరుణిమనసెఱిఁగి
హత్తి మరిగించుకొని యాదరించుటగాక

చ. 1: సిగ్గుతోడ జవరాలు శిరసువంచుకుండఁగ
దిగ్గనఁ గొప్పువట్టితియ్యవచ్చేవు
వెగ్గళించి నిన్నేమైనా వేగిరించి పలికెనా
వొగ్గి నీచేతికిలోనై వుండీఁగాక

చ. 2: కొత్తగాఁగాఁ జెలిమాటుకొని నిలుచుండఁగాను
బత్తితోఁ గప్పురమేల పైఁజల్లేవు
వొత్తి నీవు చెనకఁగా వొవనని జంకించీనా
యిత్తల నీచేఁతలకు నియ్యకొనీఁగాక

చ. 3: అలమేలుమంగ వొయ్యారాన నుండఁగాను
కలసి యప్పటి నెంతకాఁగిలించేవు
యెలమి శ్రీవేంకటేశ యిఁక నిన్ను మఱచీనా
మెలఁగి నీరతులెల్లా మెచ్చీఁగాక

రేకు: 1245-5 శంకరాభరణం సం: 22-269

పల్లవి: ఏమినోము నోఁచెనో యింతకతొల్లి
నీమనసురా మెలఁగి నీకు దేవులాయను

చ. 1: యెంత వలచినదో యీ యింతి నీకును
వింతవింతమాట లాడి వేఁడుకొనీని
పొంతనా లెట్ల నీతో బోసఁగఁగూడెనో
చెంతల నేపొద్దు నిన్నుఁ జేరి యెడవాయదు

చ. 2: కామినికి నీమీఁదికాంక్ష ఇఁక నెట్టిదో
నీమోమే చూచుకొంటా నిలుచున్నది
ప్రేమతో యేసగినానఁ బెండాడెనొ నిన్ను
చేముంచి నీమనసులు చేకొనీఁ దానిన్నిటా

చ. 3: యీయలమేల్‌మంగ నీకు నెట్టిచుట్టరికమో
ఆయితమై నీవురమునందె వున్నది
కాయజకేళి కూడిన కందువవేళ యెట్టిదో
పాయపు శ్రీవేంకటేశ ప్రబలె నీకృపను

రేకు: 1245-6 గౌళ సం: 22-270

పల్లవి: చూతము నీయగ్గలిక సూటి నింకా నెంతగద్దో
కాతరించేవు వలపు గంపc బోసుకొవే

చ. 1: మగిడిమగిడి సారె మగని నేమిచూచేవే
జిగిమించ లోలోనే సిగ్గువడక
నగేవారి నెఱంగవు నలుదిక్కులానిన్ను
మిగులా బత్తిగలితే మెడcగట్టుకొవే

చ. 2: యేపొద్దు నిలుచుకొని యెదుట నేముందానవే
ఆపరాని తమితోడ నలపులేక
పూcసవయసుదానవు బుద్దిచెప్పేవారు లేరా
వొపితే నీవాతని వొడిcబెట్టుకొనవే

చ. 3: యిట్టె శ్రీవేంకటేశుతో నెన్నిమాcటలాడేవే
గట్టువాయవై నోరc గాయవేయక
మట్టుమీరి యలమేలుమంగనైననన్నుc గూడె
నెట్టనc జుట్టమవైతే నెత్తి కెత్తుకొవే

రేకు: 1246-1 వరాళి సం: 22-271

పల్లవి: నన్ను నింతగాఁ జేసె నావలపు
వున్నతితో నేమని వున్నదో నీమనసు

చ. 1: మంతనాన వేడుకతో మగువా నీవూ నుండఁగ
యింతలో నే వచ్చితి నెఱఁగక
యెంతో తడవాయ విడెమియ్యవలెనంటాఁజుమ్మీ
చెంత నీకు నన్నుఁజూచి సిబ్బితిగాదుగదా

చ. 2: అదిగొని పవళించి యాపెతో మాఎటలాడఎగా
పొదాలోత్తితి నీకు భావించక
పోదితో నలపుదీర భోగింతువంటాఁజుమ్మీ
నాదె చూచి నీకు నవ్వులు రావుగదా

చ. 3: తలకొని యాపె మీఁది తలఁపు నీకుండఁగాను
కలికితనాన నిన్నుఁ గాఁగిలించితి
అలమేలుమంగపతివని సుమ్మీ శ్రీవేంకట-
నిలయ, నన్నుఁ జూచి తెలుసుకోవుగదా

రేకు: 1246-2 అహిరి సం: 22-272

పల్లవి: విన్నవించరే యీమాట విభునికిఁ జెలులాల
కన్నులసన్నలనే కానవచ్చీ వలపు

చ. 1: చెక్కులఁబెట్టినచేయి సిగ్గులకు మూలము
మొక్కినమొక్కులు ప్రియములకు దాపు
నిక్కినిక్కి చూపులు నిండుమోహములచోఁపు
ఇక్కువలు చూచికోరే ఇంతిభావములను

చ. 2: మోనముననుండినదె మోహమునకు మూలము
వానలచెమటలే జవ్వనము చిహ్న
తానకపునిట్టూర్పులు తలపోఁతలకు వింత
పూని కనుఁగోనరే ఇపుడు తారుకాణలు

చ. 3: సెలవినవ్వులు రతి సేఁతలకు సన్నలు
కలఇకలకుమోముకళ లెరుక
అలమె శ్రీవేంకటేశు డలమేల్మంగ నీకెను
యెలమితోఁ బొగడరే యీకె మేచ్చీ నితని

రేకు: 1246-3 భల్లాటి సం: 22-273

పల్లవి: చిట్టకపుచెంతలకు చేందేదేమి
పెట్టినాఁ డుంకువ తొల్లె పెండ్లాడుమనవే

చ. 1: వాసులు రేఁచీ నాకు వనితలఁ జూపిచూపి
ఆసలు పుట్టించీని ఆయములంటి
యేసుద్దులు నేమిటికి యింతగలవాఁడైతే
బేసబెల్లి తనమేల పెండ్లాడుమనవే

చ. 2: మనసు గరఁగించీని మాట లూరకే యాడి
ననుపుగాఁ దమిరేఁచీ నవ్వులు నవ్వి
పనిలేనిజాగులు పచారించనేమిటికి
పెనఁగేనా తనతోను పెండ్లాడుమనవే

చ. 3: మెలుపునఁ గాఁగిలించీ మేనవావి సేసుకొని
వెలయించీఁ బులకలు వింతచేఁతల
అలమేల్మంగ నేను తానైతే శ్రీవేంకటేశుఁడు
పిలుపులు సమకూరెఁ బెండ్లాడుమనవే

రేకు: 1246-4 మాళవిగౌళ సం: 22-274

పల్లవి: అప్పుడేమనేవో అన్నిఁ జూచే నేను
తప్పులేదు నీవే నాపంతము చూడవే

చ. 1: చేయివట్టుకొని యేమిచెప్పేవే నాతో మాట
పాయఁడు విభుఁడు నీపై బత్తియంటాను
కాయజకేళికి నాకన్నుసన్నల నీతని
నాయింటికి రప్పించేను నన్నుఁ జూడవే

చ. 2: యెదుటికి వచ్చి సొమ్ము లేమినాకుఁ జూపేవే
యిదివో అతఁడు నాకు నిచ్చెనంటాను
సదరాన నే నాతని జట్టిగొని యేపొద్దుఁ
జెదరక నాసొమ్ముగఁ జేసుకొనేఁ జూడవే

చ. 3: పొలయుచు నాతని నీపొందు లేమిదెలిపేవే
కలసె నిన్నును శ్రీవేంకటేశుఁడంటా
అలమేలుమంగపతియైన యాతఁడే నన్నేలె
యిల నాచెప్పినట్టు సేయించుకొనే జూడవే

రేకు: 1246-5 సాళంగనాట సం: 22-275

పల్లవి: నీవేల తిట్టేవు నన్ను నీచేతలే యింతసేసె
వావాత ఇన్ను దూరఁగవలెనా నాకు

చ. 1: కోరి నీమేనిపైనున్నగుఱుతులు చూచికాక
సారె నిన్నునవ్వ నింతచలమా నాకు
వేరే నీవాడేమాటలు వింతలై వుండఁగాఁగాక
కోరి గద్దించి యడుగఁ బోద్దువొదా యేమి

చ. 2: అవ్వల నెవ్వతోచీర అంటిమచరాఁగాఁగాక
దవ్వులఁ బెనఁగ దంటతనమా నాకు
నివ్వటిల్ల నన్నిఁజేసి నీవే వేఁడుకోఁగాఁగాక
పవ్వళించి మొక్క నుండఁబట్టదాయేమి

చ. 3: పలునారతులలోనే పరాకైవుండఁగాఁగాక
బలిమిఁజన్నులనొత్తఁ బంతమా నాకు
అలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేనీ-
తలఁపు చూచేఁగాక దారకమా యేమి

రేకు: 1246-6 శ్రీరాగం సం: 22-276

పల్లవి: ఇంచుకంతా సిగ్గువడ వెంతఅట్టపడివైతివే
మించివచ్చే వాయలేవే మేలే నీపగటు

చ. 1: కులికి పతిపై నెంత కుమ్మరించేవే వలపు
నలిరేఁగి సెలవుల నవ్వుకొంటాను
చలివాసి యెందాంకా సరసములాడేవే
నిలువుఁగోప్పుతో సారె నిక్కుకొంటాను

చ. 2: పిక్కటిల్ల నెంత కెంత పెడరేఁచేవే యాసలు
చక్కనిచూపులు వెదచల్లుకొంటాను
తక్కక మోవిచూపి తమి యేల రేఁచేవే
మిక్కుటవుసింగారము మెరసుకొంటాను

చ. 3: మగడి శ్రీవేంకటేశు మనసెంత చొక్కించేవే
బిగువుఁజన్నులు దాఁకఁ బెనఁగుకొంటా
తగ నలమేల్ మంగను మగఁడు యీతఁడు నాకు
మొగమేమిచూచేవే మొక్కుకొంటాను

రేకు: 1247-1 వంతంవరాళి సం: 22-277

పల్లవి: ఇద్దరికిఁ జెలులము యెడమాట లాడనేల
వొద్దికలు మీకుమీకే వొనగూడి యున్నవి

చ. 1: ఇంతికి నీకు జూపు లెదురుతాఁకులాయ
అంతరంగాలలోనిమీయాస లెట్టివో
సంతోసపుఁజెమటలు జాలువారిఁ జెక్కుల
చెంతల మీవేడుకలు చెప్పీ నవె ఇపుడు

చ. 2: తారుకాణై మీనవ్వులు తాళము వేసినట్టాయ
కోరినకోరిక లెంత గురుతాయనో
సారెసారెఁ బులకలు జాజుకొని మేనుల
యీరీతి మీతమకము లెచ్చిఁగించి నవియె

చ. 3: మోవిమీఁదిమీసన్నలు ముఇకి ముఇయ్యై తోఁచె
తావుల మీఇంపు లెంత తలకూడెనో
శ్రీవేంకటేశ నీకుఁ జేరి యలమేల్మంగకు
పోవులాయఁ గళలు మీపొందు చెప్పీనవియె

రేకు: 1247-2 లలిత సం: 22-278

పల్లవి: ఇరుగుపొరుగువార యీ తగవు వినరమ్మ
పెరిగి వూరకె నన్నుఁ బెల్లించీ విభుఁడు

చ. 1: పొరచిచెలుల నెల్లా బొమ్మల జంకించీనే
చేరి తనసుద్దులెల్లాఁ జెప్పేరంటాను
నేరుపుతో పచ్చడము నిండాఁ గప్పుకొననేలే
వేరే తనమొయిచేతలు వెల్లవిరై నంటాను

చ. 2: సముకాన నందరిలో సన్నలేల సేసీనే
తమితో తనపొందులు తడవేనంటా
జమళి సాకిరి చెప్పేసతులనేల తిట్టీనే
నెమకినఁ దారుకాణ నిజమయ్యీనంటాను

చ. 3: ఇచ్చకము సేసి నన్ను నెంత కాఁగిలించీనే
కచ్చుపెట్టి తనగుట్టు గందీనంటాను
అచ్చపుశ్రీవేంకటేశుఁ డలమేలుమంగపతి
అచ్చలాన నగనేలే అలనైతినంటాను

రేకు: 1247-3 పాడి సం: 22-279

పల్లవి: అతఁ డేమి చెప్పినాను అట్టే సేతువుగాని
చేతికి విడెమియ్యఁగా సిగ్గులువడకువే

చ. 1: యెనసివుండినవారి కిచ్చకములే పోడము
ననుపుగలుగుచోట నాటుఁ బ్రేమము
పెనఁగఁగ బెనఁగఁగా ప్రియములు పెచ్చురేఁగు
చెనకితే విభునితో సిగ్గులువడకువే

చ. 2: మంతనాన నుండఁగాను మనసుసు గరఁగును
వింత సేయకుండితేనే వేడుక నిండు
సంతసించి మాటాడితే చవులు దానే పుట్టు
చెంత నాతఁడేమనినా సిగ్గులువడకువే

చ. 3: తలఁపులు సరియైతేఁ దమకము లుప్పతిల్లు
కలయిక లబ్బితేను కైవశమౌను
అలమె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చెలికత్తేల ముందర సిగ్గులువడకువే

రేకు: 1247-4 రామక్రియ సం: 22-280

పల్లవి: చెమటలు గారఁగాను చెలఁగి యేఁకరుకొంటా
కొమరెలందరు నెంత గుంపుగూడేరే

చ. 1: చేరఁడేసికన్నుల చెలిమి కత్తియలాల
మూరఁడేసి కొప్పుల ముగుదలాల
నారమణుఁ డేకతాన నన్ను సింగారించఁగాను
యీరీతి నిందరు వచ్చి యేమిచూచేరే

చ. 2: పట్టెఁడేసి చన్నులపాయపు గుబ్బెతలాల
జుట్టెఁ డేసియడుగుల సుదతులాల
చుట్టాలమై యిద్దరము సుద్దులు చెప్పుకోఁగాను
వెట్టికిఁ బొంచి మీరేల వినవచ్చేరే

చ. 3: చేటఁడేసిసోమ్ములసింగార వతులాల
మూటెఁడేసి వలపుల మోహినులాల
యీటున శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
మాటికిమాటికి నెంత మమ్ము మెచ్చేరే

రేకు: 1247-5 కాంబోది సం: 22-281

పల్లవి: ఊరకుండవే చెలియ వొద్దికతో రమణుఁడు
చేరి తానే వలెనంటే సేవసేసేఁగాని

చ. 1: సుసరాననేవచ్చినచుట్టరిక మింపుగాక
కొసరఁబోతే మనసు గొంటుడదా
ముసిముసినవ్వులతో ముదులకించేవట
పిసికిపిసికాడితే పిప్పిరేఁగదా

చ. 2: వరుతోననిచినవలపు చవౌఁగాక
వొరసి పెనఁగితే మే నుప్పుఁ రేగదా
సరసపుఁ జేఁతలలో సారేకుఁ జల్లేటిచూపు
తిరిగితిరిగి చూచితేఁ దెల్లవారదా

చ. 3: కదిసి బిగించితేను కాఁగిలి వేడుకౌఁగాక
వదలితే నడియాస వలఁబెట్టదా
యిదె కూడె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను
పదరితే సమరతి పచ్చిదేరదా

రేకు: 1247-6 తెలుగుగాంబొది సం: 22-282

పల్లవి: తరుణి నీతలఁపులు తలకూడెనే
నిరతి లోనికి వచ్చి నిలిచె నీవిభుఁడు

చ. 1: చెక్కులవెంటఁగారే చెమట దుడుచుకొవే
యెక్కడలేని విరహమేల పెంచేవు
చిక్కువడ్డ నెఱిఁగొప్పు చక్కఁబెట్టుకోఁగదవే
పక్కన వాకిటికి నీపతి వచ్చినాఁడు

చ. 2: జారినపయ్యదకొంగు చన్నులపై మూసుకోవే
తీరుగాఁ గస్తూరిబొట్టు దిద్దుకొనవే
నేరుపులెల్లా మెరసి నీవు సింగారించుకోవే
చేరి విభుఁడదే తెరచెంతనే వున్నాఁడు

చ. 3: అలపుదీరఁగ గంద మలఁదుకొనఁగదవే
అలమేలుమంగవు మాటాడఁగదవే
కలసితి రిద్దరును కడుసంతోసించుకొవే
యెలమినిదె శ్రీవేంకటేశుఁ డున్నాఁడు

రేకు: 1248-1 రామక్రియ సం: 22-283

పల్లవి: ఎంత వోరుచుకుండివా నెఱఁగవు నీయంత
వింతగా నీతనికిని వేరేపనులు లేవా

చ. 1: చెంతనుండి యెందాఁకాఁ జేసేవే విన్నపాలు
కాంతలందరు వాకిటఁ గాచుకుండఁగా
వంతుకు సింగారించుతా వాకిలేల వెళ్లనీవే
యెంతపొద్దాయను వేగి యేఁటిదే నీనేరుపు

చ. 2: సారె భ్రమయించుకొంటా చన్ను లేమిచూపేవే
సోరణగండ్ల నందరుఁ జూచుకుండగా
తోరపుఁదెర వేసుక తొంగి యేల చూడనీవే
ఆరగించేవేళాయ నవునే నీనేరుపు

చ. 3: లలి విడెమిచ్చుకొంటా లావు లేమిచూపేవే
బలిమి నేఁ జొచ్చి వచ్చి పాదాలొత్తఁగా
అలమేలుమంగపతి యతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమి నన్నేలె నీడ యిఁకనే నీనేరుపు

రేకు: 1248-2 ఆహిరి సం: 22-284

పల్లవి: చిత్తానఁ బెట్టుకుండు చెప్పితి నిప్పుడే నీకు
బత్తిగలది సతి నీపై మఱవకుమీ

చ. 1: వలచి యేకామినివద్ద నీవుండినాను
తలఁపు నీమీఁదిదే తరుణికిని
మలసి యెవ్వతెతోను మాఁటలు నీవాడినాను
పిలుపు నీపే రికెకు పెదవులమీఁదను

చ. 2: యేపొలతిఁకి నీవు యెదురుకొని వుండినా
చూపులు నీమీఁదివే సుదతికిని
చేపట్టి యెందరిఁ గొల్వుసేయించుక నీవుండినా
వొపి చన్నులు మీఁదెత్తుకుండు నీకాఁగిటికి

చ. 3: తాలిమి నెవ్వరిపొందు తగిలి నీవుండినాను
మేలము నీతో నలమేలుమంగకు
యేలితివి శ్రీవేంకటేశ ఇన్నిటా నీకెను
మేలుదై వున్నది నీకు మిక్కిలి నిందరిలో

రేకు: 1248-3 వరాళి సం: 22-285

పల్లవి: వెలఁదిచందము లెల్లా విన్నవించితిమి నీకు
అలమేలుమంగపతి వాకెఁ జూచుకొవయ్య

చ. 1: వేరె నిన్నుఁ బాసి చెలి విరహపురవిపొంత
యీరెండలుగాసీని యేకతానను
కోరికైనఁ గేళాకూళిలోనఁ గొంతవడి
వూరేటిమైచెమటల నోలలాడీని

చ. 2: నెయ్యమున జవరాలు నీమీఁదితమకపు-
టుయ్యాలమంచముమీఁద నూఁగులాడీని
వొయ్యన నిన్ను మతిలో నూహించేచింతలనీడ
చయ్యన నీరతులకు సాముసేసీని

చ. 3: గోలయై యీసతి నిన్నుఁగూడిననిట్టూర్పుగాలి-
యాలవట్టములచేత నానందించీని
యేలితివి శ్రీవేంకటేశ యిట్టె నీ చేఁతలు
చాలుకొనఁగా నాటకసాల చూచీని

రేకు: 1248-4 సాళంగం సం: 22-286

పల్లవి: ఇపుడు దయదలచే విది ముందే యెఱగవా
వుపతిల్లువెమున వుమ్మగిలేవు

చ. 1: చెక్కునొక్కి ప్రియములుచెప వాకెకు నీవు
తక్కక నీకోనగోరు దాకెనంటాను
యిక్కువైననీవుంగర మిచ్చి బుజ్జగించేవు
పక్కటిల్లుచన్నులు పిసికితినంటాను

చ. 2: వొట్టుచు దమ్ములమిడి వూరడించే వాపను
అట్టె నీపాదాలు గుద్ది యలసెనంటా
పట్టి కాగిలించుక నీ పక్క బెట్టుకొనేవు
నెట్టుకొని వేగినంతా నిద్రవోదంటాను

చ. 3: పచ్చడముగప్పాకెను పలువరు లాలించేవు
కుచ్చెల వట్టితే జారె గొంగటాను
అచ్చప శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
మెచ్చేవు నన్నేలి కె మెయికోనెనంటాను

రేకు: 1248-5 నాదరామక్రియ సం: 22-287

పల్లవి: ఎప్పుడు వత్తువోయంటా యెదురుచూచీ నీకుఁ
గప్పురమిచ్చేనంటాఁ గాచుకున్నాఁడతఁడు

చ. 1: మక్కువైనపతితోడ మాటలాడుకొనవమ్మ
వుక్కుమీరి యేకతాన నున్నవాఁడు
పక్కనఁ జిత్తమురాను పాదా లొత్తఁగదవమ్మ
పిక్కటిల్లి సిగ్గులేల పెంచేవు నీవు

చ. 2: వసమై నీనేరుపుల వలపించుకొనవమ్మ
వెస నీవు వచ్చువంటా వేళైవున్నాఁడు
కోసరి దండఁగూచుండి గుబ్బల నొత్తఁగదమ్మ
ముసిముసినవ్వులేల ముంచేవు సెలవుల

చ. 3: నీవల మేలుమంగవు నేఁడు మెప్పించుకోవమ్మ
శ్రీవేంకటేశుఁడు నీపై చింతనున్నాఁడు
దేవుల వైతి వింకఁ దెరదియ్యఁగదవమ్మ
పువ్వుల సేసల నెంతపొద్దు జరపేవు

రేకు: 1248-6 నారాయణి సం: 22-288

పల్లవి: పోరుగుపోరచివలపులు నీవెంత చల్లేవు
గరితెవు పెండ్లాడితేఁ గాదనెనా

చ. 1: మొక్కినదాన వాతనిముందరఁ గూచుండరాదా
యిక్కడనక్కడనుండి యేమి లాచేవే
నిక్కిచూచినదానవు నిండా మాటాడఁగరాదా
చెక్కిటిచేతితోనేల సిగ్గులుచూపేవే

చ. 2: సన్నచేసినదానవు చన్నుల నొత్తఁగరాదా
యిన్నిటా మూసిమఱఁగు లిఁకనేఁటికే
కిన్నెరమీటేదానవు కేలట్టిపైఁ జాఁచరాదా
వున్నతపుటాసలేల వుమురఁబెట్టేవే

చ. 3: కొలువుసేసేదానవు కుచ్చి కాఁగిలించరాదా
సెలవులనవ్వులేల చిందుకొనేవు
అలరి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవిభుఁడు
మలసి నన్నేలె నీవు మన్నింపించుకోఁగదే

రేకు: 1249-1 సామంతం సం: 22-289

పల్లవి: ఎంతమోహమో నీపై నేమని చెప్పఁగవచ్చు
సంతోసమున నితనిసరుసఁ గూచుండవే

చ. 1: కొమలు లెందరు తనకొలువులో నుండినాను
నీమొగ మేమిచూచీని నీవిభుఁడు
కామించి యెవ్వ రెంతేసికతలు చెప్పినాను
అముకొని నీగుణాలే అడిగీ నితఁడు

చ. 2: చేపట్టి యేవనితలు చేతులు పైఁజాఁచినాను
నీపైనే చేయివేసీ నీవిభుఁడు
దాపుననుండెంతచక్కఁదనము తాము చూపినా
పూఁపలైన నీచన్నులే పొగడీ నితఁడు

చ. 3: చెలులెందరుఁ దనపై సేసలు చల్లినాను
నెలకొని నిన్ను నేలె నీవిభుఁడు
అలమేలుమంగవు నీవతఁడు శ్రీవేంకటేశుఁ-
డిలతా మెంతగూడినా నింపు నీపై నితఁడు

రేకు: 1249-2 కన్నడగౌళ సం: 22-290

పల్లవి: చెలియరో యెన్నాళ్లెనాఁ జిన్నదానవా
కలికితనాల మతిఁ గెరఁగించవలదా

చ. 1: సిగ్గువడేదానిచేతఁ జిక్కునటే మగవాఁడు
యెగ్గువట్టితే వలపు లింపవునటే
అగ్గమై యాతఁ డొసఁగీ నందుకొవే విడెము
వొగ్గి వొద్దఁగూచుండవే వొడ్డివట్టీ నతఁడు

చ. 2: నాలికత్తెనదానికి ననచునా పొందులు
గొలతనాన నుంటేను కూడుట యెట్టే
మేలములాడీ నతఁడు మేకొని నవ్వఁగదవే
తాలిమిఁ బిసుకవే పాదాలు చాఁచీ నతఁడు

చ. 3: యెనలేనిఅట్టడైతే నిచ్చకము వుట్టునా
పెనఁగితే ముచ్చటలు ప్రియములౌనా
అనిశము నిన్నుఁగూడె నలమేల్ మంగవిభుఁడు
వినయాన మొక్కవే శ్రీవేంకటేశుఁ డతఁడు

రేకు: 1249-3 దేసాళం సం: 22-291

పల్లవి: ఎక్కడఁ దెచ్చుకొంటివి యెన్నఁడు పెండ్లాడితివి
అక్కజపుటిసుద్ది ఆనతీవయ్యా

చ. 1: పంచనిచెక్కులతో పగడవాతెరతోడ
సెలవుల నవ్వు నవ్వి చెలరేఁగీని
కలువకన్నులచూపు కడుఁగడు నాటఁగ
సోలసిసోలసి చూచి సుదతి యిదెవ్వతో

చ. 2: పిక్కటిల్లుఁజన్నులపైఁ బెట్టినపయ్యద జార
మొక్కీ నీకుఁ జేతులెత్తి ముందరనుండి
నిక్కుగాఁ దురుమువెట్టి నేరుపులెల్లా మెరసి
మిక్కిలి సరసమాడీ మెలుఁత ఇదెవ్వతో

చ. 3: మొలనూలిగంటలు మొరమొరమనఁగాను
అలమి పెనఁగులాడీ అంటి నిన్ను
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ
యిల నన్ను గూడితివి యీపెనిదెవ్వతో

రేకు: 1249-4 ఆహిరి సం: 22-292

పల్లవి: ఏమి సేసీనే విభుఁడు యిప్పు డిట్టె రావద్దా
చూమరల నే నెదురుచూచుకొంటా నుందాన

చ. 1: మనసులోనున్నవాఁడు మాటలాడవద్దా తాను
తనివొక యేపొద్దుఁ దలఁచే నేనే
కనుఁగొన్నట్టయ్యీ దండ గక్కనఁ గూచుండవద్దా
పనివూని తనుకుఁగా భ్రమసివుందానను

చ. 2: కలలోవచ్చినవాఁడు కాఁగిలించుకొనవద్దా
తలిరుఁబానువుపై నుందానను నేను
యెలుఁగు విన్నట్టయ్యీవి ఇట్టె వూఁకొనవద్దా
బెళకక పేరుకొని పిలిచే నేను

చ. 3: చిత్తరువులోనివాఁడు సేస పైఁ జల్లఁగవద్దా
మత్తిలి, నే నలమేలుమంగఁ దనకు
యిత్తల శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా వచ్చికూడె
కొత్తగా మన్నించవద్దా కోసరే నేను

రేకు: 1249-5 దేవగాందారి సం: 22-293

పల్లవి: ఏలపిలిచేవు నన్నుయింటిలో నే నుండఁగాను
అలనై తేనేమి యింతయగడు గావింతురా

చ. 1: సోలసి వెరోకతెతో పొందులు నీవు సేయఁగా-
నెలయించి నే మాఁటాడేదేఁటి నేరుపు
కలసి లోలో మీరు కాఁపురాలు సేయఁగాను
వెలిఁ గాచుకుండేటివీరిడియుఁ గలదా

చ. 2: అన్నిటాఁ బొత్తులవిడే లాపె నీవుఁ జేయఁగాను
సన్నలు నే జేసే దేటిజాణతనము
మన్ననతో మీలో మీరు మచ్చికలు సేయఁగాను
కన్నులఁ జూచేయట్టిగరితయుఁ గలదా

చ. 3: అలమేలుమంగ నీవు నట్టే ననుపు సేయఁగా
చెలగి నే నవ్వే దెంతచెల్లుబడి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
చలము సాదించేటిసవతియుఁ గలదా

రేకు: 1249-6 బౌళి సం: 22-294

పల్లవి: నీమగఁ డిందరిలోన నీపైనే వలపు చూపీ
చేముంచి కైవ మెంత సేసుకొంటివో

చ. 1: సారె నీమొగ మాతఁడు చల్లుఁజూపులను జూచి
నారువోసినట్లనే నవ్వులు నవ్వీ
నేరుపులెల్లా మెరసి నీతోనే మాటలాడీ
దారకాన నీ వెంతతపము సేసితివో

చ. 2: చేరి నిన్ను రమణుఁడు చెక్కునొక్కి వేఁడుకొని
గారవించి నీగుణాలు కడుమెచ్చీని
చేరువనే కూచుండి సింగారాలు నీకుఁ జేసీ
చూరలుగా మనసెంత చొక్క జేసితివొ

చ. 3: అలమి శ్రీవేంకటేశుఁ డంది నీకు విడెమిచ్చి
తలకోన లాలించి తమిరేఁచీని
అలమేలుమంగవు నీయంకెలనే మెలఁగీని
పిలి చెటువంటివేళఁ బెండ్లియాడితివొ

రేకు: 1250-1 శ్రీరాగం సం: 22-295

పల్లవి: ఏమని విన్నవించేను యిట్టివి నీచేఁతలు
కామించి యేమిసేసినాఁ గావిమ్మనేఁగాక

చ. 1: పొందుసేసి నన్ను నింతబుజ్జగించేటివాఁడవు
యిందాకాఁనేల ఆపెయింట నుంటివి
మందలించి నాతో మంచిమాట లాడేటివాడవు
విందుకు నాపెచెలిని వెంటనే తేఁదగునా

చ. 2: పైకోని నాకుఁగా నింతబాఁతిపడేటివాఁడవు
ఆకెతోనేల యేకాఁతా లాడితివి
నాకు మోహించితినంటా నమ్మఁబలికేవాఁడవు
యీకడ నాపెవుంగరమేల పెట్టుకొంటివి

చ. 3: పలుమారు నాపై నింత బత్తిసేసేటివాఁడవు
చెలఁగి యాపెవిడేలే సేయవలేనా
అలమేలుమంగపతివైనశ్రీవేంకటేశ్వర
యిల నన్నేలినవాఁడ వీడ కాపెఁ దెత్తురా

రేకు: 1250-2 తొండి సం: 22-296

పల్లవి: ఆకెనేల వొట్టువెట్టే వది దెలుపునుంటాను
పైకొని నీతో నీవే భావించుకొరాదా

చ. 1: నగితే నీదేవుల నానలువెట్టేలడిగేవు
జిగిమించ మరి యేమి చెప్పుమనేవు
మగఁడవు నీచేఁతలు మరేమైనాఁ గలితే
తగిలి నీలో నీవే తలఁచుకొరాదా

చ. 2: నీమోము చూచితేనేల నెలఁత కొంగు వట్టేవు
నేమాన నేమి దారుకాణించుమనేవు
యేమైనా నీసుద్దులు యేకడనైనాఁ గలితే
దీమసాన నీలో నీవే తెలుసుకోరాదా

చ. 3: అలమేలుమంగ నిన్ను నంటితే నేల కొంకేవు
యెలమి శ్రీవేంకటేశ యెంతొరసేవు
యిలఁ గూడితివి యింక నేపనులైనాఁ గలితే
వెలయ నీలో నీవే విచారించుకొరాదా

రేకు: 1250-3 దేశాక్షి సం: 22-297

పల్లవి: ఎంతచన విచ్చితివి యీపెకు నీవు
సంకవెట్టి వలపులు సారె నమ్మి నీకును

చ. 1: కన్నుల కలికికొమ్మ కాంతలెల్లఁ జూడఁగాను
సన్నలనే నిన్ను నెంత సాదించీని
వన్నెవలిపెవయ్యెద వల్లె వాటువేసుకొని
చన్నులుచూపుకొంటా సముకాన నున్నది

చ. 2: చిలుకలకొలికియై చిగురుఁ బెదవులను
పలుకుల నిన్ను నెంత భ్రమయించీని
నిలువుఁ గొప్పు వెట్టుక నిన్ను నెలయించుకొంటా
పలుమారు నీతో నెంతపచ్చిగా నవ్వీని

చ. 3: ముద్దులబిటారికత్తె మొక్కలాన నీపాదాలు
గుద్దేనంటాఁ బానుపుపై గూచున్నది
అద్దో శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
అద్దుక నన్నేలితివి అసతోఁ దానున్నది

రేకు: 1250-4 పళవంజరం సం: 22-298

పల్లవి: ఏకతాన మీలోమీరు యేమిసేసుకొంటిరో
చేకొని మేమెఱఁగము చెప్పవయ్యా వినేము

చ. 1: ఆకెకు వలచితివట అందరితో నాడుకొనీ
నీకు వేడుకా యిది నెయ్యపుమాట
ఆకుమడిచి చేతికినందినీవిచ్చితివట
నీకేల సిగ్గువడ నిజమా వోయీ

చ. 2: వుంగర మిచ్చితివట వువిదలకెల్లఁ జూపీ
సంగడిఁ బొగడీ నీకు సంతోసమా
యెంగిలిమోవి గంటి సేయించుకొంటివట మాతో
అంగవించి యేమినవ్వే వౌనా వోయీ

చ. 3: పాయకుండేనంటివట పచారించీఁ జెలులను
యేయెడ శ్రీవేంకటేశ యింపులా నీకు
యీయలమేల్ మంగపతి వేలితివి తన్నూనట
నాయిచ్చఁ గూడితి విది నమ్ముదునా వోయీ

రేకు:	1250-5 గౌళ	సం:	22-299

పల్లవి:	ఎంతవేడుకొ తనకు నింత నీకు బత్తిసేసీ
	మంతనాన నీవూ నిట్టె మన్నించవయ్యా

చ. 1:	నెలంత పొరుగునను నీపై పద్యాలు చదివీ
	వెలలేనివేడుకతో వినవయ్య
	వలపుతో నిన్ను దిద్ది వాకిటనే తోంగిచూచీ
	నిలిచి మాఱుకుమాఱు నీమోము చూపవయ్యా

చ. 2:	తరుణి నీకెరుకగా తనలోనే తా నవ్వీ
	మరిగించుకొని నీవూ మాటాడవయ్యా
	విరుల నీమేను దాఁక వేసీని సారెసారె
	గరిమల నీవూ నింకఁ గాఁగిలించవయ్యా

చ. 3:	చెనకుతా నీకు మొక్కి సేవలెల్లాఁ జేసీని
	యెనసితివి తెరలో నింతలో నీవు
	పెనఁగి యలమేల్మంగప్రియుఁడ శ్రీవేంకటేశ
	నను నేలితివి యానాయకి నీకయ్యా

రేకు: 1250-6 హిందోళవసంతం సం: 22-300

పల్లవి: ఇన్నిటా జాణఁడు తాను ఇల్లాల నేను
మన్నించుమని మొక్కవే మఱి నామారు నీవు

చ. 1: మచ్చికతో నాడేనంటే మాటలెన్నియైనాఁ గల-
విచ్చుకుఁ డాతని సుద్దులేమివినేవే
తచ్చితచ్చి నాగుణాలు తానెంతపొగడీనే
రచ్చకెక్క నావలపు రావే నీవూ

చ. 2: చేతులారఁ జేసేనంటే చేఁతలెన్నైనాఁ గలవు
యేతరీఁ డాతనివిద్య లేమిచూచేవే
రీతితో నన్నెంత పెద్దరికముగాఁ జేసీనే
అతని సంతోసించితి ననవే నీవూ

చ. 3: వేళతో నేఁ జేప్పేనంటే వింతలెన్నయినాఁ గలవు
యేలిక శ్రీవేంకటేశుఁ డేమి మెచ్చేవే
యీలీల నలమేల్మంగ నేను నన్ను నేలినాఁడు
వొలి నోకమనసున నుండవే నీవూ

రేకు: 1251-1 మధ్యమావతి సం: 22-301

పల్లవి: నీవోయ్యారిభావము నెలంతలు పొగడేరు
చేవదేర నీకు నిన్నిఁ జెల్లునే చెలియా

చ. 1: గుత్తపుగుబ్బలమీఁదికుంకుమగందపుఁబూఁత
చిత్తరువుమీఁదటి చేతులవాఁత
హత్తినపెంజెమటలఅంగపునీనిలువీఁత
కొత్తలేడఁ గడియించుకొంటివే చెలియా

చ. 2: పున్నతపు కొప్పుమీఁద నోనరేముత్యాల సేస
చిన్ని పెదవులమీఁది చిలుకబాస
కన్నుల విభునిఁ జూచేకడ లేని యడియాస
అన్ని వేడుకలు నీకు నమరునే చెలియా

చ. 3: చతురత చెక్కుపై జవ్వాదికరఁగులు
కతలాయ నీరతి మైకరఁగులు
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
మితిలేక నిన్నుఁ గూడె మేలుమేలే చెలియా

రేకు: 1251-2 ఆహిరి సం: 22-302

పల్లవి: బొనముపట్టుకుందాన పొద్దును జామెక్కెను
తానేమిసేసీనో తలఁపించరే

చ. 1: యెప్పుడు వచ్చునోయంటా యెదురుచూచే నేను
కప్పురవిడె మందుక కాచుకుందాన
ఇప్పుడే వచ్చేనన యేడ పరాకై వున్నాఁడో
చెప్పరే యాతవికిని చెలులాల మీరు

చ. 2: ఆరతి యెత్తేనంటా నాఇత్తమైవుందాన
కోరి పీఁటవెట్టుకొని కూచుందానను
చేరి యిందాఁకా వేగిరించె నాడ నేమిసేసీనొ
యీరీతులు చెలులాల యెచ్చరించరే

చ. 3: తలుపు దెరుచుక వుందాన నూడిగపుదాన
లలి శ్రీవేంకటేశు కలమేల్మంగకు
నిలిచె వాకిట వచ్చి నేఁడితఁడె మన్నించె
పిలువరే చెలులాల ప్రేమతో లోనికిని

రేకు: 1251-3 లలిత సం: 22-303

పల్లవి: నను నేమియడిగేనే నంటునఁ దనసుద్దులు
దినకొత్తలు తనకే తెలుసుగాక

చ. 1: మనసులో మఱఁగులు మాకు నెట్టు దెలుసునే
తనువుపచేఁతలు దాఁగవుగాక
పెనగోన్నయాసలు బేదించ నెట్టువచ్చునే
కనుఁగొనేచూపలు కానవచ్చుఁగాక

చ. 2: సెలవులనవ్వులకు చెప్పేయర్థ మేఁటిదే
పలికితే నన్నీ నేరుపరచేఁగాక
వలచినవలపులు వాకుచ్చుట యెటులే
చెలవలచెమటలు చెప్పఁగలగాక

చ. 3: పచ్చిదేరేసిగ్గులు పట్టఁగ వసమౌనటే
యిచ్చట రతులచోప్పులెత్తేఁగాక
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
కచ్చుపెట్టి నన్నుఁ గూడెఁ గాదనేనటవే

రేకు: 1251-4 శుద్ధవసంతం సం: 22-304

పల్లవి: నడివిడి మాటలు నాయమా నీకు
పిడితెఁడుచల్ల వోసేఁ బెనఁగకువోయీ

చ. 1: గొల్లవారము మాకుల మేమియడిగేవు
మొల్లమిగా జాణతనములు నేరము
చొల్లెపుజుట్టులతోడ సుద్దు లెందాఁకాఁ జెప్పేవు
అల్లదె మాయిల్లు దాయాలాడుదము రావోయి

చ. 2: దొడ్డివారము మేము దొవేల చూపుమనేవు
వొడ్డారపుఁ జేఁతల కొపము నేము
బిడ్డ నాచేతనున్నది ప్రేమతో నేమినవ్వేవు
జిడ్డుచేత విడెమిచ్చేఁ జేతువు రావోయీ

చ. 3: అలఁగాచేవారము మాయంగా లెంతపొగడేవు
మేలేటిఁగి మెచ్చఁగ నేమీ నెఱఁగము
అలరిశ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
యేలితివి నన్నునీడ నిట్టె రావోయీ

రేకు: 1251-5 సామవరాళి సం: 22-305

పల్లవి: కొనరమ్మ యింతులాల కుప్పలాయ వలపు
పోనుఁగక పోఁకకు పుట్టిఁడాయ వలపు

చ. 1: పిల్లఁగోవిరాగాలఁ బెనగొనె వలపు
చల్లచాడెతలల జాజుకొనె వలపు
మొల్లమినివ్వెరగులై ముంచుకొనె వలపు
అల్లదివో రేపల్లె అగ్గవాయ వలపు

చ. 2: కొలనిదండ నోముల గుదిగొనె వలపు
వెలలేనిజాగరాల వేడుకాయ వలపు
తోలఁగుసిగ్గుల నూరదోమటాయ వలపు
అలరి దొడ్డిసెంటల నామనాయ వలపు

చ. 3: బావించి యలమేల్మంగపతిఁ గూడె వలపు
శ్రీవేంకటగిరిమీఁద జిమ్మిరేఁగే వలపు
కైవసమై యీకృష్ణుఁడు కాంతలాల మిమ్ముఁ గూడె
తావుల నుండఁగానే దారణెక్కె వలపు

రేకు: 1251-6 కాంబొది సం: 22-306

పల్లవి: చెలియసేసేసేవ చిత్తగించవయ్యా
వెలయ నామోము చూచి వెస నెంతనవ్వేవు

చ. 1: యింతి నీకు మోహముతో నెదురులుచూడఁగాను
పంతముతో నేమాడేవు పగడసాల
దొంతివెట్టు కక్కడ విందులు నీకుఁ జేయఁగాను
సంతసతులతో నేమిసరసాలాడేవు

చ. 2: లలి నిన్నుఁ బెండ్లాడ లగ్నము వెట్టుకుండఁగ
వొలిపి యేమివినేవు వూరఁగతులు
అలరి నీరాకలకు నారతి వట్టుకుండఁగ
చలపట్టి గరడీలో సాము లెంత సేసేవు

చ. 3: ఇంటిలో నలమేల్‌మంగ ఇట్టె నిన్ను రమ్మనఁగా
నంటున నేమిచూచేవు నాటకసాల
జంటై కూడితి వింతలో సరుగ శ్రీవేంకటేశ
గొంటరివై యాపెవీణె గొర నేమిమీటేవు

రేకు: 1252-1 ధన్నాసి సం: 22-307

పల్లవి: ఉమ్మడి మీఇద్దరికి నూడిగపుదాన నేను
నెమ్మది నాపెసమ్మతినే నన్ను మన్నించుమీ్మి

చ. 1: ఇక్కడికి వచ్చేసుద్ది యెఱుఁగువా నీదేవులు
పక్కన నీవాకె నొడఁబఱచితివా
వెక్కసాన వెనకను వెంగెములాడదుగదా
చక్క విచారించుకొమీ్మి సరుగ మీఁదటెత్తు

చ. 2: వేడుక నీనాపొందు వినెనా పట్టపురాణి
జాడతోడ నందు కిట్టె సమ్మతించెనా
ఆడుకొని నిన్నప్పటి నాఱిడిఁ బెట్టదుగదా
తోడనే తెలుసుకొమీ్మి తొల్లిటిమాట

చ. 3: సోరిది మనయిద్దరిఁ జూచెనా అలమేల్మంగ
సిరుల నిన్ను మెచ్చెనా శ్రీవేంకటేశ
ఇరవై నన్నేలినందు కిచ్చగించి వుండుఁగదా
అరసి యెంచుకొమీ్మి ఆకెనీసరవులు

రేకు: 1252-2 సామంతం సం: 22-308

పల్లవి: ఇంతిభాగ్యము నీచిత్త మేము చెలికత్తేలము
యెంతసేసునో వల పేమౌతా నెఱఁగము

చ. 1: కోరి నిన్ను సారెసారెఁ గూరిమి గొసరఁగాను
యేరీతి నున్నదో చిత్త మెఱఁగము
చేరి నీకుఁ గానుకిచ్చి చేతులెత్తి మొక్కఁగాను
బొరన నీకును దయ పుట్టునో యెఱఁగము

చ. 2: బెట్టుగా నింతేసి నీకుఁ బ్రియములు చెప్పఁగాను
యెట్టు సేసేవో నీచేత లెఱఁగము
చుట్టిచుట్టి నిన్ను నింత సొలసి వేగిరించఁగా
గుట్టున నెప్పుడు వచ్చి కూడేవొ యెఱఁగము

చ. 3: పిలిచితెచ్చి నిన్నీకె పెండ్లిపీఁట నుంచఁగా
ఇల నెంతమన్నించేవో యెఱఁగము
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు
కలిసితివి నేరుపుగలుగు టెఱఁగము

రేకు: 1252-3 పాడి సం: 22-309

పల్లవి: విన్నవించితి నావిధమెల్లా నీకు నేఁడు
మన్నింతువు నాగుణము మఱవకు మీఁకను

చ. 1: జిగురువంటిది నాచిత్తముగాఁబోలును
అగవడి నీయందే యంటుకున్నది
తగులువంటిది నాతనువుగాఁ బోలును
వెగటులేక కాఁగిలి విడువ దేఁతైనా

చ. 2: కొడితీఁగెవంటిది నాకోరికగాఁబోలును
అడరి నీపొందుల నల్లుకొనీని
వడిఁ జుట్టమువంటిది వలపు నాది గాఁబోలు
యెడసి పాయఁగలేదు ఇంచుకంతా నిన్నును

చ. 3: సరి వనమువంటిది సంతోసముగాఁ బోలును
నిరతి నామోవిపండు నీకిచ్చెను
ఇరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సిరుల నన్నేలితివి చెప్పఁ గొత్తలాయను

రేకు: 1252-4 శ్రీరాగం సం: 22-310

పల్లవి: చెప్పఁగలబుద్ధులెల్లాఁ జెప్పితి నీకు
నెప్పున నిట్టైతే మన్నించేనే నీవిభుఁడు

చ. 1: మంచిమాట లాడితేను మగఁడు మోహించునే
వంచన గలిగితేను వసమైయుండునే
ముంచి శావలు సేసితే మొగమోట గలుగునే
మించి యీనేరుపుల మెలఁగవే చెలియ

చ. 2: తనయిచ్చతో నుండితే దయతో రక్షించునే
మనసెరిఁగి కూడితే మరిగుండునే
వినయమే సేసితే వేడుకతో లాలించునే
పెనఁగక యీగుణాల బెరయవే చెలియ

చ. 3: నీవే పైకొంటేను నెమ్మది నిన్ను మెచ్చునే
యేవేళఁ బాయకుండితే యింపు పుట్టునే
శ్రీవేంకటేశుఁ డేలెఁ జిత్తము రా బ్రతుకవే
వేవేల కలమేల్మంగ వెలయవే చెలియ

రేకు:	1252-5 పళవంజరం	సం:	22-311

పల్లవి:	మేలుమేలు నీనేరుపు మెచ్చిరి సవతులెల్లా
తాలిమితో ననుఁ జూడు దక్కఁగొనే నతని

చ. 1:	చిత్తము రా సేవసేసి సిగ్గు విడిపించితివి
బత్తితోడ నీయొద్దఁ బాయనియ్యవు
గుత్తపుగుబ్బ లురాన గుఱుతులు మోపితివి
యిత్తల నాతని నింకా నెంత వలపింతువో

చ. 2:	కోరినీమొగము చూచుకొంటా నుండఁ జేసితివి
నేరఁగలపనులెల్లా నేరిపితివి
అరగింపు లెప్పుడు నీయందే మరిపితివి
భీరాన నింకా నెంత ప్రియములు రేఁతువో

చ. 3:	కొప్పు దువ్వేనంటానే గోరఁ జెక్కు మోపితివి
వొప్పుగఁ గూడీ చెమట లూరించితివి
అప్పుడే శ్రీవేంకటేశు నలమేల్మంగవు నీవు
అప్పన మింకా నెంత ఆసలఁబెట్టుదువో

రేకు: 1252-6 మంగళకౌశిక సం: 22-312

పల్లవి: ఏమిమాట ఇచ్చితివో యేకతానను
నీమది దలఁచుకొని నెరవేర్చరాదా

చ. 1: చేరఁడేసికన్నులచెలియ నీమోము చూచె
కూరమి గొసరీ నిన్నుఁ గొలువులోన
నారుకొన సెలవుల నవ్వు లేమినవ్వేవు
చేరి యాపెచనవులు చేకొనఁగరాదా

చ. 2: పట్టెఁడేసిగుబ్బలపడఁతి కానుక యిచ్చి
గుట్టుకతోడ నెచ్చరించీ గోర నంటుచు
బట్టబయలు సిగ్గునఁ బరాకులేల సేసేవు
చుట్టమైతేఁ గాఁగిలించి చొక్కించరాదా

చ. 3: నిలువుఁదురుముతోడినెలఁత నీకు మొక్కి
వలపులు చల్లీ సన్నలు సేయుచు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితి వాపె నిట్టె కడుమన్నించరాదా

రేకు: 1253-1 శంకరాభరణం సం: 22-313

పల్లవి: గుదిగోన్నతమితోడ గుబ్బతిలీని
మదనకేలికి నీవే మన్నించవోయి

చ. 1: మగువ నిన్నుఁజూచి మనులోఁ దలపోసి
జిగిమించ మేనఁ జిందీఁ జెమటలు
నిగిడించీఁ బులకలు నిలువెల్లా జాజుకొన
సోగిసి యాపెదిక్కు చూచితివా వోయి

చ. 2: మఱి నీవద్ద నిలిచి మాట లోయ్యనే డి
చిఱునవ్వులు నవ్వీ శిరసు వంచి
కఱఁగికఱఁగి నీకుఁ గడుఁబదనై వున్నది
యెఱిఁగితివా నీవు యీపెభావ మోయి

చ. 3: చెలిమి నీతోఁ జేసి సిగ్గులెల్లాఁ బచరించి
బలువైనయాసతో నీపాదలోత్తీని
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
యిల నన్నునేలితివి యీాకెఁ గూడవోయి

రేకు: 1253-2 సాళంగనాట సం: 22-314

పల్లవి: ఏమని పొగడవచ్చు నిదివో నీలీలలు
ఆముకొన్ననీవలపు లంగడికి నెక్కెను

చ. 1: బంగారుబొమ్మవంటిపడఁతి వద్ద నుండఁగా
చెంగలించి సంతోసానఁ జెలరేఁగేవు
ముంగిటనున్నసతులు ముసిముసినవ్వులతో
తొంగి చూచే రదె నీసుద్దులు చెప్పుకొంటాను

చ. 2: చిలుకలకొలికియై చెలి నీతో మాటాడఁగా
వెలలేని వేడుకతో విఱ్ఱవీఁగేవు
కెలననున్న దేవుళ్లు కెరలి తెరమాటున
నిలిచి యాలకించి వినేరు మెచ్చుకొంటాను

చ. 3: మరుతల్లి యలమేలుమంగ విడెమియ్యఁగాను
సిరుల శ్రీవేంకటేశ చిమ్మిరేఁగేవు
విరుల సేసలువెట్టి వింతసతు లిద్దరికి
దొరుకొని నిన్నుఁ గూడి దోమటి గలపేరు

రేకు: 1253-3 ఆహిరినాట సం: 22-315

పల్లవి: ఇందరముఁ బైకొంటే నేమిసేసేవు
చెంది నీకిప్పుడే చాటిచెప్పితిఁజుమీ

చ. 1: చీరలియ్యఁగదవోయి సిగ్గరిగొల్లెతలము
చేరి మమ్మునేల కాకుసేసేవోయి
బారెఁడేసినెరులివె పైఁ గప్పుకున్నారము
కేరికేరి యంత కిలకిల నవ్వేవోయి

చ. 2: చేతులెత్తి మొక్కుమని చెప్పేవు పలుమారు
కాతరీఁడ వౌదువు దగ్గర రావోయి
జౌతిగాఁ దమ్మిపువ్వులఁ జాటువెట్టుకున్నారము
యేతరిచేఁతలు మాతోనేల సేసేవోయి

చ. 3: వలపులు చల్లేవు వడి మాపై సేసలుగా
కలసి చీర లిచ్చితి గామిడివోయి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
ఫలించే మానోము నీవే పతివయితివోయి

రేకు: 1253-4 నాదరామక్రియ సం: 22-316

పల్లవి: ఏతపము సేసినో యిట నన్నులాలించి
చేతికి విడెమిచ్చేవు చిన్నదాన నేను

చ. 1: కుడిదిక్కు సతులెల్లాఁ గొలువు నీకుఁ జేసేరు
యెడమవంక సతులు యిదె మొక్కేరు
వుడివోనివేడుకతో నొడ్డోలగమై వుండి
యెడయక నాతో నవ్వే వేమిబాఁతి నేను

చ. 2: విన్నపాలు సేసేవారు వేళగాచుకున్నారు
సన్నసేసేవారు సరుసనే వున్నారు
మన్నించి యేపొద్దు నీవు మాటలు నాతో నాడేవు
యేన్ని చూచితే మరి యెంతదాన నేను

చ. 3: పెండిలి నిన్నాడేవారు పీఁటమీఁదనే వున్నారు
నిండువావిమేనవారు నిలుచున్నారు
అండనే శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
మెండుగా నన్నేలితివి మేలుదాన నేను

రేకు: 1253-5 తెలుగుగాంబోది సం: 22-317

పల్లవి: ఆఁపరాదు తమకము అట్టె నిన్నుఁజూచి
మోపరాదా నీకరములు నాచన్నులను

చ. 1: చోప్పుగా నెందాఁకా సుద్దు లడిగేవు మమ్ము
కప్పరాదా పచ్చడము గక్కన నీవు
అప్పటి విడేలిచ్చి ఆసల నేమివెట్టేవు
చెప్పి వూడిగాలేమైనాఁ జేయించుకొరాదా

చ. 2: సారెసారె మాతోను సరసము లేమాడెవు
రారాదా పానుపుపైకి రంతులేఁటికి
వూరకె యేకతమున నుండి తమిరేఁచనేల
యీరాదా నీమోవితేనె లెంత నోరూరించేవు

చ. 3: గుట్టుతోడ వలపులు గుబ్బతిలించనేఁటికి
పెట్టరాదా తమ్ములము పెనఁగనేల
అట్టె శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
గట్టిగా నన్నేలితి విక్కడనే వుండరాదా

రేకు: 1253-6 రామక్రియ సం: 22-318

పల్లవి: కానీవయ్యా సంతోసము కడు నీకైతేఁ జాలు
నే నీచెపనట్టుసేసేనీమాటలోదానను

చ. 1: పడఁతిసుద్దులు నీవు పలుమారుఁ జెప్పఁగాను
విడువకేపొద్దూ మాకు వినవలెఁగా
తడవి యాపెగుణాలు తలపోసి పొగడఁగా
జడియ కందులకు మెచ్చఁగవలెఁగా

చ. 2: వెగటులే కాపె నీవు వినోదము లాడఁగాను
నగవురాకున్నా మాకు నగవలెఁగా
తగిలి నీ వింతేసి పెద్దరికము సేయఁగాను
మొగమోటమున మేము మొక్కవలెఁగా

చ. 3: చెలఁగి యాపె నీవు సేసలు చల్లుకోఁగా
బలిమి నేము సొబానఁ బాడవలెఁగా
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
యెలమి నన్నేలితివి యియ్యకొనవలెఁగా

రేకు: 1254-1 మధ్యమావతి సం: 22-319

పల్లవి: ఇలువలె నుండవద్దా ఇద్దరివేడుకలుని
తటుకనఁ జూచి సంతమాయ మాకు

చ. 1: వీఁపుఁన జన్నుల మోపి వెలఁది నీకొప్పు దువ్వీ
ఆఁపరానితమి నుస్సురంటాను
మోఁపుచు నాకుమడిచి మోవి నందిచ్చేవాపెకు
చేపట్టి వూడిగా లిట్టే సేయించుకొంటాను

చ. 2: యెదురుగాఁ గూచుండి ఇంతి నీకుఁ బాగ చుట్టీ
వుదుటునఁ దొడాఁదొడా నూఁదుకొంటాను
కదిమి యాపెనోరిలోఁ గప్రపులప్ప వెట్టేవు
అదనఁ బనులుగొనేయట్టినిబ్బరానను

చ. 3: దేవులలమేలుమంగతెచ్చి కరమాలవెట్టి
శ్రీవేంకటేశ కాఁగిటఁ జిక్కించీ నన్ను
ఆవేళ రెంటేము గప్పే వాకెపయ్యద జారితే
నీవు సింగారింపించుకొనేయాసోదానను

రేకు: 1254-2 బౌళి సం: 22-320

పల్లవి: ఏమిసేసే విచ్చటను ఇంతి నిన్నుఁ బిలిచీని
ప్రేమములు కణఁజాలఁ బెట్టుకొందువు రావయ్యా

చ. 1: చెలియచెమటలను చిత్తడివాన గురిసె
బలువుగా వలపులపంటలు వండె
కలిమిమీరి చన్నులు కనకపురాసులాయ
కొలచి కొరు గొందువు కొటారుకు రావయ్యా

చ. 2: పుడివోని తమకపుటూర్పునే తూరుపెత్తె
కడలేనియాసలగాదెలఁ బోసె
యెడయనిపయ్యదనే ఇల్లారుగాఁ బెట్టె
కడలేనిరతుల కంగాణింతువురావయ్యా

చ. 3: పోలపసిగ్గుల పాలపొంగలిగాఁ బెట్టె
వెలయఁ గాఁగిలి నీకు విడిదిసేసె
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితి విట్టెవచ్చి కాణాచాయ రావయ్యా

రేకు: 1254-3 వరాళి సం: 22-321

పల్లవి: నీవేమి బాసగొంటివో నీమాట జవదాఁటదు
యీవల మమ్ము నీట్టే యేలుమనవమ్మా

చ. 1: విప్పుచు నాకుఁగాను విన్నపాలు సేయవమ్మ
చెప్పినట్టెల్లానీకుఁ జేసునాతఁడు
యెప్పుడునుఁ బ్రేమతో మాఇంటికి రమ్మనవమ్మ
అప్పణ నీవిచ్చితేను ఆదరించు నన్నును

చ. 2: పొందు మాతోఁ జేయుమని బుద్ధులుచెప్పఁగదమ్మ
అంది నీచేతిలోనివాఁడైనాఁ డాతఁడు
మందలించి మాతోను మాటలాడుమనవమ్మ
యెందు నీకు వయసు మీఁదెత్తుకున్నాఁ డతఁడు

చ. 3: బలువై నన్నుఁ బాయరాకుండుమనవమ్మ
వొలిసి నిన్ను మరిగివున్నాఁ డతఁడు
అలమేలుమంగ వింకా నతని వేఁడుకొవమ్మ
వెలయ నన్నేలె శ్రీవేంకటేశుఁడతఁడు

రేకు: 1254-4 ముఖారి సం: 22-322

పల్లవి: అతఁడే కావలెనంటే అట్టె పొందుసేసేగాక
యీతల నోచెలులాల యేల వేగిరించేరే

చ. 1: మన్ననగలుగువా రేమాటలాడినా నింపులు
కిన్నెరమీటుల గిలిగింపు లింపులు
చన్నులు దాఁకఁ బెనఁగ సాదింపు లింపులు
వున్నవారేమనినా నొద్దికౌనా పతికి

చ. 2: చెంగటనున్నవా రేచేఁత సేసినా నింపులు
వుంగరపువేలిసన్న లొగినింపులు
సంగతి నద్దములోనిసరినీడ లింపులు
జంగిలిసరసములు చవులౌనా పతికి

చ. 3: ననపుగలుగువారినవ్వులెల్లా నింపులు
తనివోనిజవ్వనమదము లింపులు
పనితో నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
వినయాన నన్ను నేలె వేసటౌనా పతికి

రేకు: 1254-5 బౌళి సం: 22-323

పల్లవి: ఇందరిముందరా నీవు ఇంతేసి సేసేవుగాక
కందువ వినోదించఁగా కాదనేమా నిన్నును

చ. 1: మూసినముత్యమువలె ముద్దరాలుమొక్కిమొక్కి
లాసీ నీపాందులకు లాలించరాదా
ఆసపడివచ్చినాపె నాదరించితే నేము
వాసుల కెవ్వరిమైనా వద్దనేమా నిన్నును

చ. 2: వినయపువిత్తరాలు వేడుకతోఁ గొలువుసేయఁ
బెనఁగీ, వద్ద గూచుండఁబెట్టుకోరాదా
ననిచినయాసెను నంటున మన్నించఁగాను
కనికరించక ఇట్టె కాదనేమా నిన్నును

చ. 3: మానాపతిజవరాలు మరిగి కాచుకున్నది
పూని చననిచ్చి యిట్టె బొగించరాదా
యే నలమేలుమంగను యీకెను శ్రీవేంకటేశ
కానిమ్మని కూడితివి కాదనేమా నిన్నును

రేకు: 1254-6 భైరలి సం: 22-324

పల్లవి: నీవెంతసిగ్గువడేవు నే నేమనే నిన్ను
చేవదేర మేలుసుద్ది చెప్పితి నీకయ్యా

చ. 1: కదిసి యన్నింటాను చక్కనివాఁడవని విని
సుదతి యొక్కతె నిన్నుఁ జూడవచ్చెను
చదురులాడఁగ నీవు జాణఁడవని చెప్పఁగా
అదిగో నీతో మాటలాడ వచ్చెను

చ. 2: నిగిడి రాజనమున నీవు గొలువుండఁగాను
మొగము చూపి యాకె మొక్కవచ్చెను
మిగులాఁ జుట్టరికపు మేనదాననంటాను
తగిలితగిలి నీకుఁ దమి రేఁచ వచ్చెను

చ. 3: యెడమిచ్చి పానుపుపై యేకతాన నుండఁగాను
నడుమ నీతోఁ దానూ నవ్వవచ్చెను
అడరి శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తడవి నన్నేలఁగాను తాఁ బెండ్లాడవచ్చెను

రేకు: 1255-1 హిజ్జిజి సం: 22-325

పల్లవి: ఎందుఁ దెచ్చుకొంటి వీకేమౌ నీకు
సందుసుడిఁ దానేల సాదించవచ్చీని

చ. 1: నేనిన్ను సొలసితే నీకుఁ దాఁ బూనుకవచ్చీ
తానేమౌనొకాని యీతరుణి
పూని నే నప్పటి నీపై పుప్పొడి చల్లితేను
ఆనుకొని సారెసారె నడ్డాలువచ్చీని

చ. 2: కూరిమితో నే నిన్నుఁ గొంగువట్టి తీసితేను
బీరానఁ దానేల విడిపించవచ్చీని
మేరమీరి నేనితో మేలమాడి చెనకితే
చేరి తానెంత గొణఁగి చేతులు చాఁచీని

చ. 3: నిలుచుండి వేడుకతో నిన్ననేఁ గాఁగిలించితే
సెలవి నవ్వి తానేమి సిగ్గువడీని
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
లలి నీవద్ద నే నుంటే లాఁచీఁ దాను నీకును

రేకు: 1255-2 నాదరామక్రియ సం: 22-326

పల్లవి: ఎంతనేరుపే నీవు యేను నితఁడు నుండఁగ
కొంతైనా సిగ్గువడవు కొసరేవు నీవు

చ. 1: చెలికతైమాటునను చిఱునవ్వు నవ్వుకొంటా
యెలయించ వచ్చితివా యీతని నీవు
సోలసిసొలసి చూచి సొంపులెల్లా రేచుకొంటా
వలపించేనంటాను వచ్చితివా నీవు

చ. 2: సొమ్ములెల్లా బెట్టుకొని సారిది సింగారించుక
యెమ్మెచూపవచ్చితివా యీతనికిని
సమ్మతి నూరఁగలసరసము లాడుకొంటా
కిమ్ముల నిలుచుండి చొక్కించఁగ వచ్చితివా

చ. 3: కందువఁ బయ్యద జార కడుమురుసుకొంటాను
పొందుసేయవచ్చితివా పొంది యీతని
అందపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవిభుఁడు
ముందే నన్నేలె నితనిమోహాన వచ్చితివా

రేకు: 1255-3 గౌళ సం: 22-327

పల్లవి: ఎక్కడ పరాకు నీకు యెదపై నీకె వున్నది
మక్కువతో నన్నిటాను మన్నించరాదా

చ. 1: చెక్కులఁ జెమట గారఁ జిప్పిలుఁ గళలతోడ
అక్కరతోనీకు మొక్కీ నప్పటనుండి
వెక్కసపుఁ బావురాలవేడుక లెంతచూచేవు
జక్కవ లివిగో ఇంతిచన్నులు చూడరాదా

చ. 2: నించినకోర్కులు మీర నెట్టుకొన చూపులతో
పొంచి నీకుఁ గానుకియ్యఁ బూఁచుకున్నది
పెంచినకోవిలకూఁత బెటుగా నేమి వినేవు
మంచి చిల్కపలు కీకెమాట వినరాదా

చ. 3: తలపోఁతలరతులతమితో శ్రీవేంకటేశ
అలమేల్మంగవద్ద నదె వున్నది
నెలకొన్నఇంటిలోన నెమళ్లతో నేమాడేవు
చెలి హంసవంటి దీపె చెల్లాటా లాడరాదా

రేకు: 1255-4 శ్రీరాగం సం: 22-328

పల్లవి: చెలియా వేగువెట్టుక చెప్పవే యాతనిరాక
తలకోని మొక్కితేను దయదలఁచీఁగాక

చ. 1: వీది నింత రాఁగాను విభునికి నెదురేఁగి
కైదండ ఇచ్చి తెచ్చి గద్దెపైఁబెట్టి
పాదాలొత్తి విడెమిచ్చిపైపై వేఁడుకొంటేను
పాదుగా నేలుఁగాక నాపలుకేల తోసీనే

చ. 2: పల్లకి యెక్కుకరాఁగా పక్కనఁ గానుక యిచ్చి
యిల్లు చూపి విందువెట్టి యేకతానను
చల్లఁగాఁ బానుపువేసి సరి నుపచరించితే
చెల్లించుఁగాక చనవు చిత్తము రాయటవే

చ. 3: చెలులు దొడుకరాగా చేరి నేనారతి యెత్తి
లలి దెరవేసి వెవి లంచమిచ్చితే
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
కలసె నన్నిట్టె యిదె కాణాచిగదవే

రేకు: 1255-5 రామక్రియ సం: 22-329

పల్లవి: చూడవే చెలియా తనసుద్దు లిటువంటివే
వొడక విభుఁడు తాను వుల్లసాలాడేనా

చ. 1: కంగులేక వింటేను కత చెప్పవచ్చుఁగాక
వెంగేలుగా భావించితే వింతగాదటే
ముంగిటికి వచ్చితేను మొక్కు మొక్కవచ్చుఁగాక
చెంగిచెంగి పొలసితే చేసేదేమే

చ. 2: నవిచి మోముచూపితే నవ్వు నవ్వచ్చుఁగాక
తనలో సిగ్గువడితేఁ దడవేదెట్టే
చనవిచ్చితే మోవి చవిగొనవచ్చుఁగాక
పనివడి వేఁడుకోఁగా బచ్చిసేయనేఁటికే

చ. 3: కలసి వూరకుండితేఁ గాఁగిలించవచ్చుఁగాక
గిలిగింతలైతే గోర గీరవచ్చునా
బలువుఁ డలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
యిల నీతఁడే నన్నేలె నిఁక నేమనేవే

రేకు: 1255-6 దేవగాంధారి సం: 22-330

పల్లవి: అన్నిటా జాణవు నీయంతదాననా నేను
యిన్నేసినేరువుల నన్నెంత వొరసేవు

చ. 1: ప్రేమతో నీవు నవ్వితే ప్రియమున నుందుఁగాని
యేమిటికొతా నే నెఱఁగను
మోము దప్పకచూచితే ముంచి యాసగింతుఁగాని
కోమలమైన నీలొగుట్టు నేఁ దెలియను

చ. 2: మాటలు నీవాడితేను మతిఁ గరఁగుదుఁగాని
తేటలనీమర్మములు తెలియ నేను
చొటిచ్చి లాలించితేను చొక్కుచుఁ గూచుండుఁగాని
జూటరినీమరఁగులు సోదించ నేను

చ. 3: చెనకి కాఁగిలించితే వినయాన నుందుఁగాని
తనివోనినీతమి దలఁచ నేను
మనసిచ్చి యలమేలుమంగను శ్రీవేంకటేశ
నను నేలితివి యింకఁ బెనఁగ నేను

రేకు: 1256-1 సాళంగనాట సం: 22-331

పల్లవి: అమ్మరో యెంతవుద్దఁ డీఁ డావిభుఁడు
బొమ్మల జంకించి యెంతపొమ్మనినాఁ బోఁడు

చ. 1: గుట్టున నే నుండఁగాను కొచ్చికొచ్చి చూచీని
వొట్టువెట్టినా మానఁ డొయమ్మ వీఁడు
బట్టుసేసి పిసికీని జాలవంటిచన్నులు
దిట్టయై చేతులువట్టి తీసినాఁ బోనియ్యఁడు

చ. 2: మానాపతినైననాతో మాటలు సారె నాడీ
ఆనవెట్టినా విడువఁ డక్కరో వీఁడు
ఆనుక యిందరిలో నాఆయము లంటఁగవచ్చీ
యే నెంతపెనఁగినాను ఇంచుకా జడియఁడు

చ. 3: తలవంచుకొన్ననాతో తగిలితగిలి నవ్వీ
తలుపు మూసిన వచ్చి తడవీ వీఁడు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
బలిమి నెంతగూడినాఁ బంతాన నలయఁడు

రేకు: 1256-2 ముఖారి సం: 22-332

పల్లవి: ఏమయ్యా నవ్వుమనేవు యెంతచప్పనా
కామించితే సిగ్గులు గాడిఁగట్టవచ్చునా

చ. 1: చెంతనుండి యాపెనీకు సేవలెల్లాఁ జేయఁగాను
కాంత వేరొకతే పొత్తుఁ గలయుటెట్టు
ముంతలముంచినయట్టి మోహములు చల్లఁగాను
వంతులకుఁ గొసరేటివనితయుఁ గలదా

చ. 2: మనసుమర్మ మెరిఁగి మాట లాపె యాడఁగాను
వెనుకొని వేరొకతె వినుట యెట్టు
పెనఁగి పెనఁగి నీతోఁ బెనుసరసాలాడఁగ
గునిసి బంతికి వచ్చి కొమలియుఁ గలదా

చ. 3: మలయుచు నలమేలుమంగ యాపె గూడఁగాను
లలి వేరొకతె నీకు లాఁచుట యెట్టు
మెలఁగి శ్రీవేంకటేశ మెచ్చి నన్ను నేలితివి
పిలువక మెలఁగేటి పేరటాలు గలదా

రేకు: 1256-3 పాడి సం: 22-333

పల్లవి: వేడుకయ్యీఁ బలుకవే వేగమే
యీడకు వచ్చినాఁడా ఇంతలోననే

చ. 1: చెలి పోయివచ్చితివా చెలువుఁడున్నాడకు
పోలుపుగా నాతనిఁ బొడగంటివా
పిలిచితివా రమ్మని ప్రియము సేసితివా
తెలిపి చెప్పితివా తెగరానిమోహము

చ. 2: ముందె కానుకిచ్చితివా మొక్కితివా నామారు
కందు వెరిఁగించితివా గక్కన నీవు
మందలించి ఆడఁగలమాటలెల్లా నాడితివా
పొందులెల్లాఁ దలపించి పోనీక తెచ్చితివా

చ. 3: పాదాలు గడిగితివా పానుపు వేసితివా
యీదెస నన్ను లాలించీ ఇదివో(ట్టె తాను
పాదుగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
ఆదిగొని నన్ను నేలె ఆస పుట్టించితివా

రేకు: 1256-4 సిందురామక్రియ సం: 22-334

పల్లవి: కందువ నప్పటినుండి కాచుకున్నాఁడాతఁడే
చెంది వూడిగములెల్లా చిత్తము రాఁ జేయవే

చ. 1: పవళించినాఁడు పతి పాదాలు పిసుకవే
ఇవల వాకిటనుండి యేమిసేసేవు
తివిరి పన్నీరడిగీఁ దెచ్చేనని పలుకవే
చివురుమోవినవ్వుల సిగ్గువడనేఁటికే

చ. 2: కదిసి నిద్దురవోఁడు కతచెప్పఁగదవే
యెదుట నిలువుటద్ద మేమిచూచేవు
అదివో విసరుమనీ నండనే కూంచుండవే
కొదికి వట్టిగుట్టున గుబ్బతిలనేఁటికే

చ. 3: యేకతానఁ బొద్దువొదు యెనసి మాటాడవే
యీకడఁ జెలితో జూజాలేమాడేవు
పైకొని యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
నీకాఁగిట నిదె కూడె నివ్వర గేమిటికే

రేకు: 1256-5 వసంతవరాళి సం: 22-335

పల్లవి: నాయకుఁడు సన్ననేసీ నన్ను నీతోఁ జెప్పుమని
కాయముఁ గాయము మోచె కడమ లింకేఁటికి

చ. 1: పగడవాతెరమోవిఁ బలుకవే పతితోడ
జిగిమించ మంచమెక్కి సిగ్గులేఁటికి
మొగమెత్తి చూడవే ముచ్చటలు దైవార
తగులాయ నేస్తములు తల వంచనేఁటికి

చ. 2: గట్టినీచన్నుల నొత్తి కాఁగిలించుకొనవే
చుట్టరికము గలసె సుద్దులేఁటికి
నెట్టుకొని నవ్వవే నేరుపులెల్లా మించ
దట్టమాయఁ దమకము తాలిము లిఁకేఁటికి

చ. 3: సోలయుచు మోవి యిచ్చి చొక్కించఁగదవే
తలకొన్న వలపులు దాఁచనేఁటికి
అలమె శ్రీవేంకటేశుఁ డలమేల్‌మంగవు నీవు
కలసితివి మెచ్చవే కడుగుట్టులేఁటికి

రేకు: 1256-6 మేచబౌళి సం: 22-336

పల్లవి: చెలి మమ్ముఁ జెప్పుమని సిగ్గుతోడఁ దా నున్నది
తలకొని యాకెతో మంతనమాడవయ్యా

చ. 1: కన్నులచూపులనే కాంత నీకారతులెత్తీ
మన్నించి రావయ్యా లోనిమల్లసాలకు
చన్నులనే నిమ్మపండ్లు సారెకుఁ గానుకలిచ్చీ
చెన్నుగా నందుకొందువు చేయిచాఁచవయ్యా

చ. 2: పచ్చిచిగురాకుమోవిఁ బళ్లెము నీకుఁబెట్టీ
ఇచ్చ విందారగింతువు ఇయ్యకొవయ్యా
ముచ్చటఁ గరకమలముల నిన్నుఁ బూజించీ
కొచ్చి కాఁగిటిలోనఁ జేకొనఁగదవయ్యా

చ. 3: మొలకనవ్వులనే ముత్యాలసేస వెట్టీ
లలినాపెమోము చూచి లాలించవయ్యా
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితి నీకె నిట్టె కరుణించవయ్యా

రేకు: 1257-1 దేసాళం సం: 22-337
పల్లవి: నేనేల యలిగేను నీతో నేఁడు
కానీవయ్యా నీపాదాలకడనే వుందానను
చ. 1: యియ్యెడ నన్నేల నీవు యింతేసి వేఁడుకొనేవు
తొయ్యలి నెవ్వతెనైనాఁ దోడి తెత్తునా
పయ్యదకొంగేమిటికి పట్టితియ్యవచ్చేవు
చెరయ్య నానతీవయ్య జేసే నూడిగములు
చ. 2: పైకొని నన్నెంత వొడఁబరచఁగవచ్చేవు
యేకాంతకుఁ బంతమిత్తు నేమనేవు
జోకతో నాచెక్కు నొక్కి సొమ్ములెన్ని యిచ్చేవు
యేకడ నీతలఁపున్నా నీడేరించే నేను
చ. 3: యిచ్చఁ గాఁగిలించి ప్రియలేల సేసేవు నాకు
మచ్చికసతుల కేడ మాటాలాడేను
అచ్చపు శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
యేచ్చుగా నన్నేలితివి యెఱఁగుదు నన్నియూ

రేకు: 1257-2 శంకరాభరణం సం: 22-338

పల్లవి: ఇంక నేమి గావలె నింతకంటె నేమి సే
కొంకక మతిఁ దలఁచుకొనరాదా పొందులు

చ. 1: యెట్టనెదుటనే వుండి యెఱుకలు సేసి నీకు
చుట్టరికములు చెప్పీ సుదతి
మట్టుమీరి యప్పటి నీమర్మములు సోఁకఁగాను
గుట్టుతోడ నీవిచ్చినగుఱుతులు చూపీని

చ. 2: యేరుపరచి నీవావి యిరుగుపొరుగువారిఁ
దారుకాణ సేసీని తరుణి
కూరిమితో తాఁ దొల్లి గోరగీరితినని
ఆరితేరి నీమేన నానవాలు చూపీని

చ. 3: కలసినరతివేళ కాఁగిటిలో నీలెక్కలు
చిలుకచే నాడించీఁ జెలియ
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
అలరి నన్నేలితివి యాపె నాలననీని

రేకు: 1257-3 హిజ్జిజి సం: 22-339

పల్లవి: ఎ 0 త జాణతనమూ యెతనేరుపు
పొ0 త నీవైనా నాపెకు బుద్ధిచెప్పరాదా

చ. 1: ఆడరి నీప్రియురాలు ఆకుమడిచియ్యఁగాను
యెడచొచ్చి యందుకొనీ యెవ్వతో తాను
తొడిఁబడ నీ కాపె కస్తూరిబొట్టు వెట్టఁగాను
వడువున గోర దిద్దవచ్చీఁ దాను

చ. 2: పక్కన నీదేవి పీఁటపై నిను నునిచితే
యొక్కుకొనీ నీతోడ యెవ్వతో తాను
అక్కరతోఁ బదములు ఆపె నీపైఁ బాడితేను
చెక్కుచేతఁ దానాలు చెప్పవచ్చీఁ దాను

చ. 3: వలచినయాపె నీవద్దఁ బవ్వళిచఁగాను
యెలమితోఁ గాగిలి0 చీ యెవ్వతో తాను
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
తొలుత నీపెఁ గూడితే దొమ్మిఁగూడీఁ దానను

రేకు: 1257-4 సామంత సం: 22-340

పల్లవి: చేకొని యాపెచనవు చెల్లించరాదా
దాకొని నీమేలులోనిదానవే నేను

చ. 1: చిప్పిలుఁ జెమటతోడ సిగ్గుతోడ జవరాలు
కొప్పు గొ0 తు జారఁగానే కోసరి నిన్ను
చెప్పరాక సన్నలేల సేసే వాపెకు నీవు
యెప్పుడు మీపా0 దులు నే యెఱఁగనివా

చ. 2: చెక్కిటిచేతితోడ సెలవినవ్వులతోడ
చొక్కపుముద్దుమాటల సొలసీ నిన్ను
పక్కన నెఱఁగకుండాఁ బరాకులేల సేసేవు
దిక్కులమీసుద్దులు నేఁ దెలియనివా

చ. 3: తెల్లనికన్నులతోడఁ దేలింపుఁ జూపుల తోడ
చెల్లుబడితనమునఁ జెనకీ నిన్ను
యిల్లిదె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వెల్లవిరి నేలితి మీవిధాలు విననినా

రేకు: 1257-5 రామక్రియ సం: 22-341

పల్లవి: వాతరోట్టుదనమేలే వనితలకు
నీతితో మెలఁగితేనే నిన్ను మెచ్చీఁగాక

చ. 1: పగటులు చూపిచూపి పలుమారు నవ్వేవు
మగనితో నేమిటికి మందెమేళాలు
మొగము చూపి చేయెత్తి మొక్కితేను మేలెరిఁగి
తగలి యాతఁడే నీపై దయసేసీఁగాక

చ. 2: వాలుకచూపులఁ జూచి వాసులకుఁ బెనఁగేవు
యేలినవానితోనేలే యెగసక్కేలు
తాలిమితో సేవసేసి దండనే కాచుకుండితే
పాలించి యాతఁడే నిన్నుఁ బైకొనీఁగాక

చ. 3: చలములు సాదించి చన్నులనేల వోతైవు
బలువునితోనేలే పాడిపంతాలు
అలమేలుమంగవిభుఁడుగు శ్రీవేంకటేశ్వరు-
కొలువుసేయఁగఁ దానే కోరి కూడీఁగాక

రేకు: 1257-6 కాంబోది సం: 22-342

పల్లవి: ఇంతి నీచేలువ మిది యెంతని పొగడవచ్చు
చెంతనున్నచెలులము చేసినదే భాగ్యము

చ. 1: చక్కనిదాన నన్నిటా జాణతనాలు నేర్తువు
నిక్కి చీఁకటులుగమ్మీ నీతురుము
ముక్కుసంపంగి పూఁబోలుమోముచంద్రునివంటిది
పక్కన నీపతి చూచి భ్రమసునేకదవే

చ. 2: జవరాలవు మొదల చల్లుఁజూపులాఁడివి
చివురువలె నీమోవి చెంగలించీని
కవచున్నులు గట్టులు కరికుంభజఘనవు
యివల నీకుఁ బతి మోహించ కెట్లుమానునే

చ. 3: వొరపరి వన్నిటాను వుదటుగలసతివి
సరసతలు నీవల్ల జాజుకొనీని
సిరులమేల్‌మంగవు శ్రీవేంకటేశుఁ డితఁడు
వరుసతో నిన్నుఁ గూడి వలచునేకదవే

రేకు: 1258-1 ఆహిరి సం: 22-343

పల్లవి: ఎందుండి విచ్చేసితివి ఇప్పుడు మాఇంటికి
చెంది సేవలు నేనేమిసేతుఁ జెప్పవయ్యా

చ. 1: కన్నుల నిద్దురదేరీ గట్టినీతురుము జారీ
చెన్నగునీ మొగమున సిగ్గుదేరీని
నున్నని చెక్కులవెంట నోసలిచెమట గారీ
యెన్నఁగ నీవున్నజాడ యిదియేఁటిదయ్యా

చ. 2: నిట్టూరుపులు రేఁగీ నీమోవిఁ గెంపులు రాఁగీ
చుట్టుకొన్నపచ్చడముచుంగు లూఁగీని
పెట్టినకంకణములు బిగువువదలి వాఁగీ
వెట్టదీరఁ గాఁగిటికి వేడుకపడేవయ్యా

చ. 3: చిత్తమేఁటికో లాసీ చేఁతలు బయలుసేసీ
హత్తి వెన్నెలలు నవ్వులందుఁ గాసీని
యిత్తల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
బత్తితో నన్నేలితివి బాగులాయనయ్యా

రేకు: 1258-2 వళవిగౌళ సం: 22-344

పల్లవి: ఎంత బాఁతిపడేవు మాకెమిచెప్పేవు
వింతలింకా నేమున్నవో వెదకి చేకోవయ్యా

చ. 1: కన్నే చక్కనిందంటాను కదుఁగదుఁ బొగడేవు
వన్నెగా పటము మీఁద వ్రాసుకోవయ్యా
చన్నులు గొప్పలంటాను సారెఁ జేతనంటేవు
వున్నతి వేడుకైతే నీవొళ్ళ నొత్తుకొవయ్యా

చ. 2: బొమపిఱుఁదు గొప్పంటా బలుమారు మెచ్చేవు
ప్రేమ నింకాఁ బోదిసేసి పెంచవయ్యా
మోము గడుసొగంటాను మునుకొని చూచేవు
వేమరుఁ దలపోసుకో వినోదించవయ్యా

చ. 3: చెలికొప్పు మూరెఁడంటాఁ జేరిచేరి కొలచేవు
పిలిచి ముత్యాలసేస పెట్టవయ్యా
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
ఇల నన్నేలితి వాకె నింకా మన్నించవయ్యా

రేకు: 1258-3 బౌళి సం: 22-345

పల్లవి: కానీ కానీవయ్యా నీకతలన్ని నెఱుఁగుదు
పూనీపట్టి మాట లెంతపోసఁగనాడేవు

చ. 1: గట్టినాచన్నుల నీమెయి కడుఁగాఁడ నెత్తుక
యిట్టి నీజవ్వనగర్వ మేల మానేవు
చుట్టిచుట్టి గొనగొరుసోఁక సరసమాడక
తోట్టిన నీమదమేల తుదమొద లెంచును

చ. 2: గబ్బినానోరను నిన్నుఁ గరకులెల్లా నాడక
వుబ్బరివై తిట్టకేల వుండేవు నీవు
నిబ్బరపుచన్నులను నీమనసుఁ గరఁచక
సిబ్బితితో నీవేల నాచెప్పినట్టు సేతువు

చ. 3: పరపుపై నీవు నేనుఁ బడితళించినఁగాక
సరుగ నీవేల వోజకు వచ్చేవు
అరయ శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తిరమై నన్నేలితివి తేర యేల వేసేవు

రేకు: 1258-4 ఆహిరి సం: 22-346

పల్లవి: అప్పటినేల పిలిచే వాసల నేల పెట్టేవు
వొప్పుగా నీపనులకే వొడిగట్టుకున్నది

చ. 1: పలుమరు విడేలిచ్చి పాదొలొత్తె వేగినంతా
చెలి యేమిసేయవలెఁ జెప్పవయ్యా
వలసినట్టల్లా వీణె వాయించెఁ గొంతవడి
తలఁపు నీకెందుపైనొ తతి నీకే తెలుసు

చ. 2: చేముట్టి సరమాడి సేవసేసె నిందాఁకా
యేమనేవు యింకా నానతీవయ్యా
కామించినట్టల్లాఁ గతలు చెప్పె నీకు
యేమో నీకు నిద్ర రాదు యెఱఁగము నేము

చ. 3: పక్క నీకుఁ దొడు వండె బడివాయ దెప్పుడును
నిక్కి నీకితవైనట్టు నేరుపవయ్యా
వెక్కసపలమేలుమంగవిభుఁడ శ్రీవేంకటేశ
నెక్కొని పెండ్లాడితివి నీవన్నీ నేరుతువు

రేకు: 1258-5 వళవిగౌళ సం: 22-347

పల్లవి: ఎట్టుండునో పతిచిత్త మించుకంతా నెఱఁగవు
గుట్టుతోడ నుండఁగదే కూడీఁ దానే ఇతఁడు

చ. 1: చేరి నే వలతునంటాఁ జెప్పుకొననేఁటికే
సారెసారె నాతనితో చవులుగాను
గోరు దాఁకించెనంటాను కొసరఁగనేఁటికే
జీర చూపే విందరికి సిగ్గువడ కిపుడు

చ. 2: అచ్చువ్రాసుకొంటినంటా నక్కు చూపనేఁటికే
కొచ్చికొచ్చి యాతనికి గురుతుగాను
తచ్చి తొంటిపొందులెల్లాఁ దారుకాణించనేఁటికే
యిచ్చల నవ్వేవారి నెంచక నీ విపుడు

చ. 3: మరిగివుందాననంటా మదలించనేఁటికే
పోరిఁబొరి నీతనికి పొందులుగాను
ఆరిది శ్రీవేంకటేశు నలమేల్మంగపతిని
సరుసఁ గాఁగిలించేవు చనవుతో నిపుడు

రేకు: 1258-6 పాడి సం: 22-348

పల్లవి: ఏమనునో ఆతఁడంటా నేల లోఁగేవే
కామినుల కీచేఁతలు కలవేకదే

చ. 1: బలువుగాఁ బతితోడఁ బంతమాడరాదుగాక
చెలరేఁగి ప్రియములు చెప్పఁగరాదా
కొలువులోఁ గొచ్చికొచ్చి కొసరఁగరాదుగాక
నలిరేఁగి సెలువుల నవ్వనైనరాదా

చ. 2: మందెమేళమున మారుమలయఁగరాదుగాక
చెంది వూడిగములెల్లాఁ జేయఁగరాదా
చిందరవందరగాను జీర దియ్యరాదుగాక
కందువఁ జన్నులనొత్తి కళ రేఁచరాదా

చ. 3: చెలరేఁగి మంచమెక్కి సిగ్గువడరాదుగాక
పిలిచి సరసమాడి పెనఁగరాదా
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశ్వరు-
నెలయించరాదుగాక యిట్టె కూడరాదా

రేకు: 1259-1 దేవక్రియ సం: 22-349

పల్లవి: గుట్టుతోడ నుండరాదా కొమ్మతానే ప్రియముసేసీ
అట్టె ఆపెకెంత ప్రియములు చెప్పేవయ్యా

చ. 1: సిగ్గరిదాన నంతేసి చెనకఁగనేఁటికి
యెగ్గవట్టేదానితో నేలాటాలెల
వెగ్గళించి మాటాడఁగా వేడుకౌనా సరసపాలు
బగ్గన వలపు లెంత పారఁజల్లేవయ్యా

చ. 2: వాసివంతులెంచేదానివంక చూచి నవ్వనేల
వేసరేటిదాని నేమివేఁడుకొనేవు
రేసిరేసి పెనఁగఁగా రేఁగునా తమకములు
మూసిన సిగ్గునేల ముంగిటవేసేవయ్యా

చ. 3: చన్నునలనొత్తేదానితో సాములు సేయఁగనేల
సన్నవేల శ్రీవేంకటేశ్వర దానితో
పన్ని యలమేలుమంగపతివి నన్నేలితివి
వున్నతపు రతులెన్ని వొడిఁగట్టేవయ్యా

రేకు: 1259-2 మేపశిరంజి సం: 22-350

పల్లవి: ఎంత నన్ను వేఁడుకొనే విందుకుఁగాను
సంతోసాన నీచేఁతలు సమ్మతింతుఁగాక

చ. 1: యేసతితో మాటాడినా నెగ్గువట్టే దాననా
ఆసతో నీకిచ్చకమే అడుదుఁగాక
వాసు లాపె కెక్కించితే వద్దనేటిదానగా
సేసవెట్టి నీచలము చెల్లింతుఁగాక

చ. 2: కడదానితో నవ్వితేఁ గాదనేటిదాననా
యెడమిచ్చి నీవేడుక యీడేర్తుఁగాక
తొడఁమీదఁ బెట్టుకుంటే దూరేటిదాననా
పిడికిటివిడేలిచ్చి ప్రేమ రేఁతుఁగాక

చ. 3: చెలికత్తేఁ జెనకితే చేరి జంకించేదాననా
సెలవిచ్చి నీకరుణ చేకొందుఁగాక
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
అలమితి విటు నన్ను నానందించేఁగాక

రేకు: 1259-3 కురంజి సం: 22-351

పల్లవి: పట్టేఁడేసిచన్నులపాయపురాలవు నీకు
గుట్టుసేసే వింత నీవు కొత్తదానవటవే

చ. 1: యిచ్చగించి నీమగఁడు యేకతాన నున్నవాఁడు
మచ్చికలు చూపవే మాటలాడవే
వచ్చివచ్చి సిగ్గువడి వాకిటనే వుందానవు
పెచ్చురేఁగ నింకా నీవు పిన్నదానవటవే

చ. 2: పొద్దువొక నీకుఁగానే పొంచుకొనివున్నవాడు
వొద్దఁ గూచుండవే పాదాలొత్తఁగదవే
అద్దో కొంగు వట్టుకోఁగా నండె నూరకుందానవు
బుద్ధులేమి నెఱఁగని పూఁపదానవటవే

చ. 3: అలరి నీరతులకు నాసపడి వున్నవాఁడు
కలసి మెలఁగవే కాఁగిలించవే
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశ్వరు
లలిఁగూడి పెనఁగేవు లాఁతిదానవటవే

రేకు: 1259-4 మధ్యమవతి సం: 22-352

పల్లవి: మేటివేకంటేశునకు మేలుదానను
తేటలుదా నాసలనే తెల్లవారును

చ. 1: చెప్పరే చెలులాల చెవులార వినే నేను
యెప్పుడు వచ్చునే మాయింటి కాఁతడు
చొప్పులెత్తి యెదురులుచూడఁగా నింతటిలోనే
వుప్పతిల్లి గక్కనఁ జంద్రోదయ మాయను

చ. 2: ఇరవై యెఱిఁగించరే యిట్టె మిమ్ము సంతోసించే
గరిమ నామీఁద బత్తిగలఁడటరే
తెరమఱుగుకు రాఁగా తేరి మొగము చూచితే
సారిదిఁ గొవిల లిట్టె సొబానఁ బాడెను

చ. 3: వెలయఁ బెండ్లి సేయరే వేడుకయ్యీ నిదె నాకు
తెలిసి యీతఁడు సమ్మతించెనటరే
అలమేలుమంగను నే నతఁడు శ్రీవేంకటేశుఁ-
డలమె మంచిముహూర్త మప్పుడే వచ్చెను

రేకు: 1259-5 లలిత సం: 22-353

పల్లవి: మంచితనము సేసితే మాకైనాఁ గరఁగును
కొంచించ కాతనిఁ బైకొనవే చెలియా

చ. 1: వేడుకకాఁ డాతఁడు వెంగెమాడనేమిటికే
కూడివడి చాయసేసుకొనుటగాక
వాడినమోవి చూచి వట్టినవ్వు నవ్వనేలే
వీడెమిచ్చి రతులకు వేఁడుకొంటగాక

చ. 2: అసాదాకాఁ డాతఁడు అవుఁగాదననేఁటికె
సేసపట్టి తగఁ బొందుసేసుటగాక
సేసినచేఁత లెంచి సిగ్గువరుచనేఁటికే
యేసుద్దులకైనా నిచ్చగించుటగాక

చ. 3: శ్రీవేంకటేశు డాతఁడు చెప్పిచూపనేఁటికే
సేవసేసె తని మెచ్చఁజేయుటగాక
నీవలమేలుమంగవు నెపాలు వెదకనేలే
దేవులవై వురమునఁ దిరముకొందుగాక

రేకు: 1259-6 నారాయణి సం: 22-354

పల్లవి: నేరువరి నందువు నెరజాణ నందువు
వీరిడియాసలు వెల్లవిరిసేతురటవే

చ. 1: నలిరేఁగి పతితోడ నవ్వులేమినవ్వేవే
కలికితనాల నెంత గయ్యాళించేవే
కొలమునాలవు కడుగుట్టుతో నుందువుగాక
వెలయాలివలె నెంత వేసాలుసేసేవే

చ. 2: సంగడిఁ గూచుండి యేమిజాణతనా లాడేవే
కొంగువట్టి సారె నేమి కొచ్చితీసేవే
రంగయిన పెండ్లికూఁతురవు సిగ్గువలెఁగాక
అంగడిజంతవలె నాస లెంత చూపవే

చ. 3: వాడికలు చూపిచూపి వలపు లెంతచల్లేవే
వీడని యలమేల్మంగవిభుఁ డితఁడు
కూడినాఁడు నన్ను విట్టె కోరి శ్రీవేంకటేశుఁడు
వేడుకకత్తేవలె వింత లేమిసేసేవే

రేకు: 1260-1 వేళావళి సం: 22-355

పల్లవి: ఆతఁ డెంత నీవెంత ఆయఁగా మందెమేళము
యేతు లాతనిముందర నెంత మెరసేవే

చ. 1: అవులేవే కొప్పువిరు లాతని పై రాలఁగను
చెవిలో విన్నపాలేమి సేసేవే నీవు
జవళిఁ జన్ను మొనలు సారెసారెఁ దాఁకఁగాను
తివిరి కస్తూరియలఁదే విదేమే నీవు

చ. 2: జోరునఁ బైఁజెమటలు జొటజొటఁ గారఁగాను
చేరి వూడిగా లేమి సేసేవే నీవు
గోరికొన శిరసుపై కురులలో నూఁదుకొంటా
సారెఁ గొప్పు దువ్వేవేము సందుసుడి నీవు

చ. 3: అలరి నీనిట్టూరుపు లాతనిమై సోఁకఁగాను
చెలఁగి మచ్చిక లేమిసేసేవే నీవు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
వొలిసి నన్నేలె నేమి వొరసేవే నీవు

రేకు: 1260-2 కాంబోది సం: 22-356

పల్లవి: మరునిసంపదలును మగువసింగారమును
పొరిఁబొరి నిపు డొక్కపొత్తు గూడఁ బొలును

చ. 1: చెలియచిరునవ్వులఁ జిక్కనివెన్నెలు గాసి
కలువలు వెదచల్లీఁ గనుచూపుల
అలులు మూఁకలు గూడీ నంగనతురుమునను
పొలసి యన్నియు నొక్కపుట్టువుగాఁబోలును

చ. 2: మొక్కలానఁ జివురులు మోవిమీఁద జాజుకొనీ
జక్కవలు పాదుకొనీఁ జన్నులమీఁద
నిక్కెవడి సంపెంగ నెలఁత నాసికమున
నొక్కజాతేకాఁబోలు నొనగూడియున్నవి

చ. 3: అమరి పాదములకు నటు తామరలు మొక్కె
తిమురుచుఁ బిరుఁదున తేరు నిలిచె
తమి శ్రీవేంకటేశుఁడు తరుణి యలమేల్మంగ
జవళిఁ గూడిరి వొక్కజంటగాఁ బోలును

రేకు: 1260-3 గౌళ సం: 22-357

పల్లవి: ఎందువొయ్యే నేను తన ఇంటిలోనే వున్నదాన
కందువలెల తడవీఁ గట్టిపెట్టుమనేవే

చ. 1: చలపట్టి నాతోను జాణతనా లాడియాడి
వలపులేఁటికిఁ జల్లి వద్దనఁ గదే
తలపెట్టి యప్పటినిఁ దగులనాడీ మాట
మలసి యాసుద్దు లిఁక మన్నించు మనవే

చ. 2: వేసరక నాతోను వేడుకకు నవ్వునవ్వి
ఆలేల పెట్టీ మొక్కెననఁగదవే
పొసరించి వేడుకకు పొందుసేసె నొకనాఁడు
లాసుక ఆచేఁతలు తలఁచేఁగ నేఁడనవే

చ. 3: మొలకనాచన్నులు ముట్టిముట్టి కళరేఁచి
అలయించనేల రమ్మనఁగదవే
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
కలసె నన్నిఁక నిట్టె కరుణించుమనవే

రేకు: 1260-4 కాంబోది సం: 22-358

పల్లవి: చెలియరో రమణుని సేవ లేపొద్దుఁ జేయవే
వలపు లినుమడవును వద్దనే వుండితేను

చ. 1: మనసు గలసితే మాటలాడ నింపువుట్టు
తనువులుసోఁకితే తమిరేఁగును
చనవు లొనగూడితే చాలౌను సరసాలు
వినయము గలిగితే వేడుకౌఁ బొందులు

చ. 2: తగులాయములై తేను తాలిములు గొనసాగు
మొగమోట లబ్బితేను మోహము నిండు
నగవులు దఙచైతే ననుపులు సతమౌను
తగుచుట్టరికాలైతే దట్టమౌ నాసలు

చ. 3: కొలువులు సేసితేను కూరిములు పెరుగును
పలుకులు సమ్మతేతే బలిమౌ రతి
అలమేల్‌మంగవు నీవు అతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమిఁ గూడె నిందే యెసఁగు బోగములు

రేకు: 1260-5 ఆహిరి సం: 22-359

పల్లవి: ఏమిసేతు నామోహము ఇటువలెఁ జేసీ నన్ను
ఆముక యెంతచిత్తిణి యనకుమీ నన్నును

చ. 1: చేరి వద్దనుండఁగాను సిగ్గులు పైకొనుఁగాని
వూరకే నీమోము చూడకుండఁగరాదు
బీరముతో నెమ్మేలకు పెనఁగులాడుటగాని
వొరిచి నిన్ను గుబ్బల నొత్తకుండరాదు

చ. 2: పట్టినమోనము లోలో పంతాలు రేఁచుఁగాని
అట్టె ముచ్చటమాట లాఁపఁగరాదు
వట్టిపాలయలుకలు వాసులు వుట్టించుఁగాని
నెట్టుకొన్నతమకము నిలుపఁగరాదు

చ. 3: నెలకొన్న కూటములు నివ్వెరగందించుఁగాని
తలకొన్నతలపులు దాఁచఁగరాదు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
అలమి నన్నేలితివి ఆవుఁగాదనరాదు

రేకు: 1260-6 పాడి సం: 22-360

పల్లవి: వేగిరించనేమిటికి వెలఁదులాల
యేగతినైనా నన్ను నేలీ నాఁతడు

చ. 1: మాటాడితేఁ గానరాదా మనసు సొాదించనేల
గాఁటపునీవిభుని బత్తి గలదల్లాను
చీటికిమాటికినేల సేసేరే విన్నపాలు
తాటించి తానే నాపై దయసేసీ నాతఁడు

చ. 2: మోమెత్తితేఁ దెలియదా ముదులకించఁగనేల
చేముంచి ఆతఁడు సేసేచేఁతలెల్లాను
ప్రేమతో నెందాఁకాఁ బెనఁగుచుఁ బిలిచేరే
కామించి నాయకుఁ డిట్టె కరుణించీఁగాక

చ. 3: చూచితే నెఱఁగరాదా సుద్దు లడుగనేల
యేచి శ్రీవేంకటేశ్వరునింపులెల్లాను
కాచి యలమేల్మంగనినేల సొాలసేరే
లాచి నన్నుఁగూడె నింకా లాలించీఁగాక

రేకు: 1261-1 ఛాయానాట సం: 22-361

పల్లవి: మేలే నీయగ్గలిక మెచ్చితి నేను
సొలినున్న సతులెల్ల చూచేరు నిన్నును

చ. 1: మాటలాడ నేరుతువే మగనితో సారెసారె
నాటుకొన సెలవుల నవ్వనేర్తువే
గాఁటమైననీకతలుఁ గారణాలుఁ జూచిచూచి
నీటున నివ్వెరగుతో నిలుచుందానవే

చ. 2: వలపించనోపుదువే వంగి మొక్క నోపుదువే
కొలువులు సేసి చేకోనోపుదువే
తలపోసి నీవుసేసేతరితీపుఁ జేఁతలకు
తొలఁగక చెక్కుచేతితోఁ గూచుందానవే

చ. 3: మన్నించుకోఁగలవే మరిగించుకోఁగలవే
చెన్నగునీగుణాల మెచ్చించఁగలవే
పన్ని యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
నన్నునేలె యీతనిమన్ననలో నుందానవే

రేకు: 1261-2 పూర్వగౌళ సం: 22-362

పల్లవి: ఎందరు గావలె నీకు యిన్నిటి కాపె వుండఁగా
సందడించితే వలపు చవులయ్యీనా

చ. 1: వింతచెలి వచ్చినీతో వేడుకకు నవ్వఁగాను
వంతుల కిందరు నవ్వవచ్చునా నీతో
చెంతనుండి విన్నపాలు సేయుచు నాపె వుండఁగా
పంతగత్తె లెడచొచ్చి పలుకఁగవచ్చునా

చ. 2: తాలిమి నాపె నీచేతఁ దమ్ముల మిప్పించుకోఁగా
పాలువెట్టు కందురును పంచవచ్చునా
వోలివెట్టి నీపాదాలొత్తుతా నాపె వుండఁగా
వాలి యెవ్వరైనా సేవలు సేయవచ్చునా

చ. 3: చలపట్టుకొని యాపె చన్నుల నిన్నొత్తఁగాను
కొలువుసతులందరుఁ గూడవచ్చునా
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితి వికఁ నిన్నుఁ గాదనఁగవచ్చునా

రేకు: 1261-3 సౌరాష్ట్రం సం: 22-363

పల్లవి: నమ్మిక లియ్యవచ్చేవు నాకిట్టే నీవు
నెమ్మది నీయాండ్లలోనే నొకతెఁగానా

చ. 1: వెగటులేనియట్టివేడుకకాఁడవు నీవు
నగకుండఁగలవా నాతులతోను
తగులు గలిగిన వింతలులేనిచుట్టమవు
మొగమైనాఁ జూడక మోము వంచఁగలవా

చ. 2: అందుకోలువాపులఆసాదకాఁడవు నీవు
పొందకుండఁగలవా పొలఁతులను
చందపుమరుగరిడీసాదనకాఁడవు నీవు
సందడిఁ జన్నులపైఁ జేయిచాఁచకుండఁగలవా

చ. 3: చలమరిజవ్వనపుజాజరకాఁడవు నీవు
కలయకుండఁగలవా కాంతలను
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితిని నన్ను నీకత లిన్ని గలవా

రేకు: 1261-4 వరాళి సం: 22-364

పల్లవి: శిరసుండఁగా మోకాల సేసవెట్టవచ్చునా
సరి నీపెఁ జిత్తగించి మన్నించవయ్యా

చ. 1: కొత్తకొత్త విన్నపాలు కొమ్మ నీతోఁ జేయఁగాను
ఇత్తల వేరొకతెతో నేమి నవ్వేవు
పొత్తుల నాకుమడిచి పొరచి నీకియ్యఁగాను
హత్తి మోవివిందులు నీవాపెకేల పెట్టేవు

చ. 2: వేడుకతోఁ గన్నులను వెలఁది నిన్నుఁ జూడఁగా
వూడిగపుదానినేల వొడివట్టేవు
వాడికతో జవరాలు వలపు నీపైఁ జల్లఁగా
యీడుగానిదాని నీవేల కాఁగిలించేవు

చ. 3: చిడుముడి నీదేవులు సేస నీపైఁ జల్లఁగాను
కడనున్నదానికేల కాలుచాఁచేవు
అడరి శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
పడఁతిఁ గూడితి వాపెపస లేమిచూచేవు

రేకు: 1261-5 రామక్రియ సం: 22-365

పల్లవి: చూడ వేడుకయ్యీ మాకు సారిది మిమ్మిద్దరిని
కూడఁగూడ వలపులు కుప్పలాయ మీకును

చ. 1: దొంతరమాటలాడి తోక్కె నాపె నీపాదము
వింతమోవిసన్నలనే విందు వెట్టెను
పంతపుఁ జెమటలను పన్నీరు చిలికెంచె
యెంతనేరుపరి యికె యింకా నేమిసేసుకొ

చ. 2: కలకల నవ్వు నవ్వి కలపె మేనవావి
పొలపుఁ జూపుల నిన్నుఁ బూజించెను
మొలక నవ్వులను ముత్యాలసేస వెట్టె
పెలుచుఁదమకముల ప్రియమెంత రేచునొ

చ. 3: పుక్కిటవిడెముల బువ్వములు చేకొనె
మిక్కిలికాఁగిట నిన్ను మెప్పించెను
పక్కన నలమేల్‌మంగపతి శ్రీవేంకటేశుఁడ
తక్కక నన్నేలితివి తానిందు కేమనునో

రేకు: 1261-6 హిందోళవసంతం సం: 22-366

పల్లవి: ఎవ్వరు చెప్పిరంటాను యేల నన్నడిగేవు
మవ్వవు నీనిట్టూర్పులే మర్మాలు చూపీని

చ. 1: చెంది నీచెక్కులఁగా రేచెమటలవల్లనే
కందువ నీచేఁతలెల్లాఁ గానవచ్చీని
ముందుముందుగానే నీమోముకళవల్లనే
ఇందరిలో నీవేడుక లెచ్చిఁగించీని

చ. 2: చెంత చెక్కుచేతితోడ సిగ్గువడేవల్లనే
వింతనీభావము వెల్లవిరియయ్యీని
పంతపునీనవ్వులు పచారించేవల్లనే
యింతటా నీసుద్ది చొప్పులెత్తి యిచ్చీని

చ. 3: పలుమారు నీవు తప్పకచూచేవల్లనే
వలచినవలపులు వంతు కెక్కీని
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితివి నన్ను నీకతలు మెప్పించీని

రేకు: 1262-1 సాళంగనాట సం: 22-367

పల్లవి: ఎంతని చెప్పేమయ్య ఇంతి నీపైఁ గల బత్తి
మంతుకెక్క నాపెను మన్నించు మిపుడు

చ. 1: సన్నపుటెఁలుగునను సతి నిన్నుఁ బాడిపాడి
కిన్నెర వాయించీఁ గిలకిల నవ్వుతా
వెన్నెలబాయిటనుండి వేడుకతో నీకతలు
కన్నవారికెల్లాఁ జెప్పి కడుఁబొగడీని

చ. 2: పాటించి నీరూపము పలకపై వాసుకొంటా
మేటినీసుద్దు లడిగీ మెలుఁతలను
కోటిసేసీ నీగుణాలు కోరికోరి మెచ్చుకొంటా
నీటునఁ బద్యాలు చెప్పీ నీమీఁదను

చ. 3: తలపోసితలపోసి తనివిదీరక నిన్నుఁ
గలసీ మనసునను కరఁగుచును
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
చెలిని నీవేలఁగాను సేసలు చల్లీని

రేకు: 1262-2 నాగవరాళి సం: 22-368

పల్లవి: ఏలపరాకున నుండే విందరిముందర నీవు
కాలుదొక్కి నాపె నీవు కప్పవయ్యా రెంటెము

చ. 1: చిప్పిలుఁ దమకమున సిగ్గులు నెరపుకొంటా
కప్పురము చేతికిఁచ్చి గలికి నీకు
గొప్పగొప్పచన్నులకొనలు దాఁకించుకొంటా-
నప్పుడే బాగాలిచ్చీ నందుకొనవయ్యా

చ. 2: చిన్నిచిన్నినవ్వులతో చెక్కుఁజెక్కు మోపుకొంటా
విన్నపాలెల్లాఁ జేసీ వెలఁది నీకు
నున్నని మోవితో నిన్ను నోరూరించుకొంటాను
వున్నతి సరసమాడీ నుత్తర మీవయ్యా

చ. 3: మోమునఁ గళలు రేఁగ మోహములు చల్లుకొంటా
గామిడియై కాఁగిలించీఁ గామిని నిన్ను
అముక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
నీమనసు చొక్కించె మన్నించవయ్యా

రేకు: 1262-3 పాడి సం: 22-369

పల్లవి: ఎప్పుడు గూడేవోయంటా నెదురుచూచీ నీకు
ఇపుడే మావిన్నపాలు ఇయ్యకొనవయ్యా

చ. 1: మనసు లక్కవంటిది సదము పొంగువంటిది
ననిచినయాసలు నాముపంటిది
పెన్నగొన్నకోరిక పెనుజిగురువంటిది
వనిత నీకు మేలుది వద్దికి రావయ్యా

చ. 2: వలపు వలవంటిది వయ సామనివంటిది
తిలకించేచూపు తరితీపువంటిది
చెలిమి సేయఁజేయఁగ చేనిపంటవంటిది
చెలి నీపై బత్తి గద్దు చిత్తగించవయ్యా

చ. 3: చింత లాభమువంటిది సిగ్గు చెలమవంటిది
బంతినుండియాడేమాట పైఁడివంటిది
పంతపుటలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యింతిఁ గూడితివి నేఁడు ఇట్టె మన్నించవయ్యా

రేకు: 1262-4 ముఖారి సం: 22-370

పల్లవి: ఎవ్వరూ నేమిచెప్పేరు యేల బయలీఁదించేవు
చివ్వన నావిన్నపము చిత్తగించవయ్యా

చ. 1: సూటిగా నేఁ జూచేచూపులకు నీవు గురి
నీటున నీపొందులకు నేనే గురి
జూటవై నామన సింత సోదించ నేమున్నది
మాటలిన్నీ నాడ నేల మన్నించవయ్యా

చ. 2: వరుసతో నీకు నేను వలచుట నాపాలు
నిరతి జనవిచ్చేది నీపాలు
పొరిఁబొరి సేసవెట్టి పొంతనాలు చూడనేల
తిరి వచ్చి నన్ను నిట్టె దయఁజూడవయ్యా

చ. 3: యెగ్గులేక సేవసేయు టిదియే నాకు సెలవు
నిగ్గుల సిగ్గుదేర్చుట నీకు సెలవు
అగ్గమై శ్రీవేంకటేశ అలమేల్‌మంగపతివి
కగ్గులేక కూడితివి కరుణించవయ్యా

రేకు: 1262-5 నాదరామక్రియ సం: 22-371

పల్లవి: ఆనతీవయ్యా నీమోహపుదేవులసుద్దులు
వీనులార వినేము వేడుకయ్యీ మాకు

చ. 1: సొలసిసొలసి యాపె సుద్దులు చెప్పుతానుండె
యెలమితో నిందాఁకా నేఁటికోకాని
మొలకనవ్వులతోడ మోము చూపుతానుండె
పలుమారు నది యెంతపనికోకాని

చ. 2: చెంతఁ జెక్కుచేతితోడ సిగ్గువడుతానుండె
పంతమున నది యేమిభావమోకాని
సంతోసాన మెచ్చిమెచ్చి సరసమాడుతానుండె
వింతలేక నీతో నెంతవేడుకోకాని

చ. 3: కమ్మరఁగమ్మర నిన్నుఁ గాఁగిలించుకొంటానుండె
చిమ్మినేఁటిరహస్యపుచేఁతలో కాని
పమ్మియలమేలుమంగపతివి శ్రీవేంకటేశ
కమ్ముక నన్నేలితి వాకతలేవోకాని

రేకు: 1262-6 రామక్రియ సం: 22-372

పల్లవి: మేలేమేలు నీకతలు మెరసె నేఁడు
పొలించిపొలించి నీపొందులు నెరపేవు

చ. 1: వీడెము చేతఁబట్టుక విభుని కియ్యవచ్చేవు
యేడ నేరుచుకొంటివే యిచ్చకములు
తొడఁదొడఁ బాదాలు తుడిచేవు పయ్యదను
వాడికసేసుక యెంత వలపు చల్లేవే

చ. 2: మిన్నక జారకతొల్లె మేనఁగుప్పేవు రెంటెము
వెన్నతోఁ బెట్టిరటె యీవేసాలు నీకు
చన్నులు చూపుకొంటాను సారెఁ గొలువు సేసేవు
పన్ని నీసింగారా లెంత పచారించేవే

చ. 3: గోరికొన సొకఁగాను కురులూరకె దిద్దేవు
చేరి నీబత్తి యింతేసి చేయవలెనా
వేరులే కలమేల్మంగవిభుఁడు శ్రీవేంకటేశుఁ-
డీరీతి నన్నేలె నీవెంత పొగడేవే

రేకు: 1263-1 ఆహిరి సం: 22-373

పల్లవి: ఎంతని చెప్పుదునే ఇదిగో నాతలపోఁత
చింతామణియాయ నాకు చిత్తజజనకుఁడు

చ. 1: అడియాసలనే అలసీనే నామనసు
కడుఁబతిగుణము లిక్కడఁ జెప్పఁగా
నిడువాలుఁ జూపులు నివ్వెరగు నొందీనే
చిడుముడివేడుకలు చిమ్మిరేఁచఁగాను

చ. 2: చెలరేఁగి తమితోడఁ జెమరించీనే చెక్కులు
చెలువునివుంగరముచేతికిఁగాను
వులివచ్చివలపులు వుమ్మగిలఁగడఁగీనే
నులిగొన్న కోరికలు నోరూరించఁగాను

చ. 3: వొట్టినసంతోసాన వుప్పొంగీనే జవ్వనము
తొట్టి శ్రీవేంకటేశ్వరుఁ దోడితేఁగాను
ఇట్టె నన్నేలినాఁడు యే నలమేలుమంగను
పొట్టఁబొరుగున మీరు పొదిసేయఁగాను

రేకు: 1263-2 మంగళకౌసిక సం: 22-374

పల్లవి: ఏమిచెప్పేవు నీసుద్దు లెఱఁగ నేమిన్నయు
వౌముక సంగతిచేకున్నారముగాక

చ. 1: సందడి నాపెతోడ సరసమాడేవాఁడవు
పొందుసేయకుందువా పోసఁగించుక
ముందుముందుగా నిట్టె మోము చూచేవాఁడవు
చెంది సేసేచేఁతలెల్లాఁ జేయకుందువా

చ. 2: యేకతాన వీడెము నీవిచ్చినట్టివాఁడవు
ఆకుమడిచీకుందువా అప్పటి నీవు
చేకొని యేపొద్దూ నిట్టిసేవల గొనెవాఁడవు
కాకరితనాల నీవు కలయకుండుదువా

చ. 3: కులికి చన్నులమీఁద గోరగీరినవాఁడవు
వలవక వుందువా వాఁటమ్మై నీవు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
అలరి నన్నేలితివి ఆపె నంటకుందువా

రేకు: 1263-3 బౌళి సం: 22-375

పల్లవి: ఏమి నవ్వులు నవ్వే వెఱిగెఁటెఁగుండి నీవు
కాముకురాలైనదానిఁ గాఁగిలించరాదా

చ. 1: చెక్కిటి చెమటతోడ చెలి నీవద్దికి వచ్చె
వుక్కుమీరి చన్నుఁజన్ను నొరయఁగాను
యెక్కుడైనయాసలతో నెదుట నిలుచున్నది
గక్కన నలపుదీరఁ గాఁగిలించరాదా

చ. 2: కుమ్ముడిజారుతోడఁ గోరి నీవద్దికి వచ్చె
కమ్మవిరులు వీఁపుపైఁ గడురాలఁగా
నిమ్మపండ్లుకానుక నీకు నొసఁగీ నదె
కమ్ముకొని లాలించి గాఁగిలించరాదా

చ. 3: మదముప్పొంగ నలమేల్మంగ నీవద్దికి వచ్చె
గుదిగొన్నవాసనలు గుబులుకోఁగా
యేదపై శ్రీవేంకటేశ ఇరవాయఁ గూడితివి
కదిసి ఇంకానింకా కాఁగిలించరాదా

రేకు: 1263-4 మాళవిగౌళ సం: 22-376

పల్లవి: నిండునిదానమువలె నీకుఁ గలిగె
అండనే భాగ్యవంతుఁడ వౌదువయ్యా నీవు

చ. 1: వీడెమిచ్చుతరినే విన్నపాలెల్లాఁ జేసె
వూళిగపువేళనే వొడఁబరచె
వేడుకతో నవ్వుతానే వేలువెట్టి యిమ్ముగొనె
యేడఁ దెచ్చుకొంటివి ఇటువంటిసతిని

చ. 2: పన్నిపాదాలొత్తుతానే బాసలు సేయించుకొనె
చన్నులు చూపిచూపి చనవరాయ
వెన్నెలగలనాఁడే కావించె నలునేరేళ్లు
యిన్నేసి కతలకారి యెట్టు నీకు దొరకె

చ. 3: సేలు చల్లుతానే చెలఁగి నీమోవి యానె
లాసిలాసి కూడె నీయలమేలుమంగ
వాసితో శ్రీవేంకటేశ వలపు వర్తనగొనె
యీసరి నన్నేలితివి యీకె నీకు నబ్బెను

రేకు: 1263-5 శంకరాభరణం సం: 22-377

పల్లవి: ఇంకనేల మఱఁగులు నింద రెట్టిఁగినందుకు
సంకెదీరఁ గాగిలించీ చనవియ్యరాదా

చ. 1: చొప్పులెత్తి నీమోము చూచి చెలి మాటలాడీ
యిప్పుడు మారుత్తరము లియ్యరాదా
దప్పిదేరేమోవితోడఁ దారుకాణించీ నీకు
వొప్పుగ నీవాపె నిట్టె వొడఁబరచరాదా

చ. 2: నెలకొన్ననీమేని పైనె గురుతులు చూపీ
మెలుపున సంతోసించి మెచ్చఁగరాదా
అలరుచు నీవలపు లక్కునఁ బోసీ చూపీ
చెలరేఁ గాపెపంతము చెల్లించరాదా

చ. 3: మనసిచ్చి యలమేలుమంగ నీచేఁతలు మెచ్చీ
ననిచి శ్రీవేంకటేశ నవ్వఁగరాదా
యేనసి నీకీరితి ఇంపులతోఁ దమిరేఁచీ
పెనఁగి యాపెతో నిట్టే ప్రియమందరాదా

రేకు: 1263-6 సామంతం సం: 22-378

పల్లవి: శిరసేల వంచేవు సిగ్గువడనేమిటికి
సరుస నాతఁ డున్నాఁడు చవులు వుట్టించవే

చ. 1: యేలమితో రమణుఁడు యెంత చెనకినా
వలపు వేసటౌనా వనితకును
చెలఁగి యెన్నిమారులు సెలవుల నవ్వినాను
వెలలేనివేడుకకు వెలితి యాలౌను

చ. 2: గనముగా నెన్నాళ్లు కాఁపురము సేసినాను
మనసు దనియునా మగువకును
యెనసిన పచ్చిమాట లెన్నిమారు లాడినాను
వినయపు టేకతాలు వెగటు లేలౌను

చ. 3: జమళిఁగన్నుల మోము సారెసారెఁ జూచినాను
తమక ముడుగునా తరుణికిని
అమరె శ్రీవెంకటేశుఁ డలమేల్మంగవు నీవు
సమరతి మీకు మొగచాటు లేలవును

రేకు: 1264-1 పాడి సం: 22-379

పల్లవి: ఇట్టె వొకటొకటే యేల గడించుకొనేవు
జట్టిగొన్నమేలు మీఁది జాణలే మీరిద్దరూ

చ. 1: చుట్టములైనవారు సొలయుచుందురుగాక
బట్టబయలు పంతాలు పచారించేరా
గుట్టునఁ బాదాలొత్తఁగా కుచములు దాఁకెఁగాక
దిట్టతనమున నీతో దీకొనెవా

చ. 2: ప్రేమగలవారు పట్టిపెనగుచుందురుగాక
దీమసానఁ జలము సాదించనేర్తురా
గొముునఁ గొప్పువెట్టఁగా గోరు చెక్కుసోఁకెఁగాక
గామిడితనాన నీతో గయ్యాళించెనా

చ. 3: పాలుగలవారు రతిఁ బాయకవుందురుగాక
అలరిచేతలు సేసి అలయింతురా
యీలీల నలమేల్మంగ యీకె శ్రీవేంకటేశ్వర
యేలితివి యీకె నీతో నెదురాడెనా

రేకు: 1264-2 బౌళి సం: 22-380

పల్లవి: అప్పుడుగాని నాకు నాతుమ సమ్మతించదు
చిప్పిల నామోము చూచి సెలవుల నగుమా

చ. 1: అగ్గలపుఆసతో నిన్నాడరానిమాట లాడీ
సిగ్గుతోడ నున్నరాన శిరసువంచి
యెగ్గుపట్టనని నాయెదలో నమ్మికవుట్ట
బెగ్గిలక తలఁ జెయి పెట్టుమా నాకును

చ. 2: వొంటిఁ జిక్కించుక నిన్నునొక్కక్కచేఁతే సేసీ
ఇంటిలో మొకదాకిరి నిట్టున్నదాన
దంటనని యెంచి నాపైఁ దప్పుమోవనాడనని
అంటి నాచన్నులమీఁద నానవెట్టుమా

చ. 3: కలసేతమకమున గబ్బితనములు చూపి
తలపాయుచున్నదానఁ దగదనుచు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
కలసితి వీఁక నన్నుఁ గడునాదరించేమీ

రేకు: 1264-3 వరాళి సం: 22-381
పల్లవి: ఎఱఁగఁ జెప్పితి నీకు యేకతమైనప్పడే
మఱి యింక నామాట మఱవకుమీ
చ. 1: వాసి వంతులను నీకు వలచి మాటలాడుదు
వేసరక విమీ వేమారును
సేసుకొన్న యాలను చెయివట్టి నిన్నుఁ దీతు
చేసూటినే రమ్మీ చెలఁగి మాయింటికి
చ. 2: మేలుదానవై నీమోమే సారెకునుఁ జూతు
తాలిమితో నిలువుమీ తనివారను
యేలుకొమ్మనుచు నిన్ను నిక్కువ లంటినప్పుడు
చాలా మన్నించి నాచనవు చెల్లించుమీ
చ. 3: సరుస నుండి నీమోవిచవులు చూడఁగోరుదు
గరిమ నాకు నొసఁగి కరుణించుమీ
అరుదై శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
మరిగితిఁ గూడితివి మన్నించు మెపుడూ

రేకు: 1264-4 సామంతం సం: 22-382

పల్లవి: చెప్పఁగదవే యేల సిగ్గుపడేవు
కొప్పుజారీ నిన్ను నిట్టే కూడినవాఁడెవ్వడే

చ. 1: నున్ననిచెక్కులమీఁద నూలుకొన్నపులకలు
చన్నులమీఁద నిండినచంద్రవంకలు
కన్నుల కాంక్షలఁ జూచె, కరఁగుల తేటలు-
నెన్నికకెక్కె నీమేన నేఁడఁ దెచ్చుకొంటివే

చ. 2: మొగమునఁ గళలతో ముంచెఁ జిరుఁజెమటలు
నిగిడీ నవె ముక్కున నిట్టూరుపులు
చిగురుఁ బెదవిమీఁదఁ జిమ్మిరేఁగె నవ్వులు
మిగులా నున్నవి యెందుఁ దగిలించుకొంటివే

చ. 3: అలవొకగానే మించె అడుగులఁ దడబాటు
నిలిచిననిలువున నివ్వెరగులు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుమైఁ
గలసిరులు నీవెట్లు గలిగించుకొంటివే

రేకు: 1264-5 హిందొళవసంతం సం: 22-383

పల్లవి: కంటిమి నీవల్ల నేఁడు కందువైనవేడుకలు
పంటలై నీకోరికలు పలియించేనటవే

చ. 1: కళలుదేరీ నివె కాంత నీమొగమున
వలచిననీవిభుఁడు వచ్చెనటవే
తళుకుజెక్కుల మీఁద దైవారీఁ జెమటలు
కలికిఁచేతల నిన్నుఁ గరఁగించెవటవే

చ. 2: ముప్పిరిగొనుచు నీమోవి పైఁ దేనియ లూరీ
అప్పుడే ఆతఁడు మాటలాడెనటవే
గొప్పలైనచన్నులపై కుంకుమరసాలు గారీ
వొప్పుగ నీజవ్వనాన నొలలాడెనటవే

చ. 3: భావించితే నీమేనఁ బాదుకొనె సొబనము
శ్రీవేంకటేశ్వరుఁడు చెందెనటవే
నీ వలమేల్మంగవు నిండె సింగారాలు నీమెయి
వేవేలవిదాలు నీతో వినొదించెనటవే

రేకు: 1264-6 రామక్రియ సం: 22-384

పల్లవి: వద్దనేవమా నేము నిన్నువట్టిమాట లేలాడేవు
పొద్దువొద్దు దప్పకుండా భోగించేవమ్మా

చ. 1: నేరుతువు మాటలెల్ల నీకే వలవుమని
చేరి విన్నపాలెల్లఁ జేసుకొవమ్మా
సారమైనవీమోవిచవు లాతనికిఁ జూపి
బీరముతో మాఁట పట్టించుకోవమ్మా

చ. 2: కలికి వన్నిటా నీవు కైవశము చేసుకొని
పిలిచి పతికి విందువెట్టవమ్మా
పలువూడిగాలు సేసి బలిమిఁ జన్నుల నొత్తి
మలసి యీతని నిట్టె మరిగించుకోవమ్మా

చ. 3: జిగి నలమేల్మంగవు శ్రీవేంకటేశుఁ డాతఁడు
తగిలితివి కాఁగిట దాఁచుకోవమ్మా
నగుతా నీయప్పణను ననునేలె నీతఁడు
మిగులాఁ జనవులను మెఱయవమ్మా

రేకు: 1365-1 వరాళి సం: 22-385

పల్లవి: వింటి మిదిగొ నేము వీనులపండువగాను
వింటేకాదు కన్నులారఁ గంటిమి నీచేఁతలు

చ. 1: చెలులెల్ల నాడానీడాఁ జేప్పుకొనేరు సుద్దులు
వలనుగ వేగిరమే వలతువంటా
నలిరేఁగి తమలోన నవ్వేరు జవరాండ్లు
పిలిచితే లోనౌదువు పెనఁగవంటాను

చ. 2: సవసవఁగా నింతులు సన్నలుసేసుకొనేరు
వువిదలమాటల వొ౯ర్తువంటాను
తివిరి మొకమొకాలు తేరకోఁజూచుకొనేరు
కవగూడి చెనకితేఁ గరఁగుదువంటాను

చ. 3: వేడుకతో నీదిక్కు వేళ్లనే చూపుకొనేరు
యిడుజొడై నీవు తమ్ము నేలితివంటా
పాడితో నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర
వాడిక నన్నుఁ బెండ్లాడి వసమైతివంటాను

రేకు: 1365-2 మధ్యమావతి సం: 22-386

పల్లవి: విచ్చలవిడై మీరు వినోదింతురుగాక
హెచ్చెను తమకములు ఇకనేల జాగులు

చ. 1: వేవేగ రమ్మనుచు వెలఁది లేకలు వ్రాసి
పావురము మెడఁగట్టి పంపె నీకను
నీవది చదువుకొని నెమ్మిఁ బతికమ్మ వెట్టి
యీవేళనే అంపితివి ఇకనేల జాగులు

చ. 2: కలికి నీరాకకుఁ గాచుకవుందాననని
చిలుకచే విన్నపాలు చెప్పిపంపెను
మలసి నీవని విని మారుత్తరములు నేర్పి
యెలమితో నంపితివి ఇకనేల జాగులు

చ. 3: దతి యలమేల్మంగ చూపులు నీ కెదురంపె
యెదుటనే నిలిచితి వింతలో నీవు
కదిసి పెండ్లాడితివి గక్కన శ్రీవేంకటేశ
యిదె కంటి మిందరము ఇకఁనేల జాగులు

రేకు: 1365-3 ఆహిరి సం: 22-387

పల్లవి: తెలిపిచెప్పరే బుద్ది తెరవలాల పతికి
కలయఁగవలెఁగాక కాఁగిట నీతిని

చ. 1: కోవిలలు గుయ్యఁజొచ్చెగుదిగొనెఁ జిగురాకు
భావజుఁడు బాణములఁ బదనువెట్టె
సేవసేసీ జవరాలు చెంగటనుండి తనకు
యీవలెఁ గాక చనవు లేమనఁగవచ్చునే

చ. 2: చిలుకలు మాటలాడెఁ జిమ్మిరేఁగెఁ దుమ్మిదలు
అలరి చంద్రోదయమాయ నిపుడు
సొలసి తనమొగము చూచి మాటలాడీఁ జెలి
బలిమి గూడుటగాక పాయ నెట్టువచ్చునే

చ. 3: వాకుచ్చెఁ బావురములు వసంతుఁడు పొడచూపె
జోకలుగా చల్లగాలి సొంపు మెరసె
ఆకె యలమేల్మంగ తానైతే శ్రీవేంకటేశుఁడు
తూకొని యేలెఁగాక తోయ నెట్టువచ్చునే

రేకు: 1365-4 సౌరాష్ట్రం సం: 22-388

పల్లవి: ఏమి నేరుచుకొంటివి యెంత సేసేవు నన్ను
వేమరు నాపొందు లింత వేడుకయ్యీనా

చ. 1: మన్నించి నాతో నీవు మతకాలాడేవుగాక
కన్నుల నాచూపు నిన్నుఁ గాఁడిపారీనా
వన్నెల నందరిలో నావాసు లెక్కించేవు గాక
చిన్నినాసెలవినవ్వు చిమ్మిరేఁచీనా

చ. 2: గారవించి నాపై నొకకత గడించేవుగాక
వూరకే నామోవి నీనోరూరించీనా
పేరఁ బెట్టి వలపులు పెంచేవుగాక నేఁడు
సారె నాచన్నులు నీపై చవుకళించీనా

చ. 3: వుమ్మడి నీరతుల నన్నుబ్బించే వింతేకాక
కమ్మి నాకాగిలి నిన్నుఁ గరఁగించీనా
ఇమ్ముల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పమ్మి నాకూటమి నిన్ను బయలీఁదించీనా

రేకు: 1365-5 సాళంగనాట సం: 22-389

పల్లవి: అల్లవారే సరసములాడుకొనేరు
వెల్లవిరియైనట్టివేడుకకాండ్లె

చ. 1: గద్దెమీఁద నున్నవారు కాంతయు రమణుఁడును
పెద్దరికములకే పెనఁగేరు
వొద్దికైననేరుపుల నొకరొకరి నెంచితే
ఇద్దరి కిద్దరే సాటి ఇన్నిటాను జాణలే

చ. 2: తెరలొ నున్నవారు దేవియు దేవరవలె
దొరతనపుఁబంతాల దులఁదూఁగేరు
సరి నెంచిచూచితే చక్కఁదనములయందు
పిరుతియ్య కొండొరులు పెచ్చువెరిగేరే

చ. 3: అలముకవున్నవారు అల్లియుఁ దామరవలె
పిలువుఁ బ్రియములతోఁ బెండ్లాడేరు
అలమేలుమంగ యీకె అతఁడు శ్రీవేంకటేశుఁ-
డలరీ తానూఁదాను నమరివున్నారే

రేకు: 1365-6 రామక్రియ సం: 22-390

పల్లవి: పిలుపించుకవలెనా పెనఁగి సారెసారెకు
తలవంచుకొననేల తగులాయ ననవే

చ. 1: వసంతకాలము వచ్చె వలపులు కడుహెచ్చె
వెసఁ దుమ్మిదలెల్లాను విచ్చెరెక్కలు
కొసరించుకొననేల గొరగిరితే నేరొను
రసికుఁడు తానెఱుఁగు రమ్మనవే యిఁకను

చ. 2: పున్నమవెన్నెల గాసెఁ బొందుగాఁ గోవిల గూసె
చన్నులతో హారములు సాముచేసెను
చిన్నఁబోనేల నవ్వులు చెట్టడువఁ జేటఁడవును
విన్నపములు సేయరే విభునికిఁ దెలిపి

చ. 3: చిలుకలు రవళించె చిత్తజుఁడు గిలిగించె
చెలరేఁగి జవ్వనము చిగిరించెను
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
కలసె నన్నుఁ దొల్లె కడమ లేదిఁకను

రేకు: 1266-1 కన్నడగౌళ సం: 22-391

పల్లవి: అంగన నాసనేల అలయించేవు
అంగవించి కూడరాదా ఆయిత్తమైవున్నది

చ. 1: వెనక నవ్వేవుగాని విడె మందుకొనరాదా
తనివోనికోరికలఁ దగులున్నది
చనవు లిచ్చేవుగాని సరసములాడరాదా
పెనగొన్నరతులకుఁ బ్రియమందివున్నది

చ. 2: కప్పుర మిచ్చేవుగాని కాఁగిలించుకొనరాదా
కప్పినవేడుకలతోఁ గాచుకున్నది
కోప్పు దువ్వేవుగాని గొబ్బున మోవియ్యరాదా
దప్పిదేరేముచ్చటలఁ దమకించి వున్నది

చ. 3: మాటలాడుదువుగాని మర్మము లంటఁగరాదా
యీటున నీచుట్టరిక మెంచుకున్నది
గాఁటపు శ్రీవేంకటేశ రాంత యలమేలువంగ
మేటివై నీవు గూడఁగ మెచ్చుకొనివున్నది

రేకు: 1266-2 దేసాళం సం: 22-392

పల్లవి: నాపై బత్తిగలఁడు నామగఁడు
యేపున మీరేల దూరే రించుక వోరువరే

చ. 1: వలపు బూమిలో లేదా వలననేరఁడా తాను
చలములేమిటికో సాదించీఁగాక
మొలకలెత్తెఁ జన్నులు మోచుకుందాన వయసు
తెలుకొందము తన తెఱఁగు లిన్నియును

చ. 2: నవ్వులేమి కఱవా నవ్వనేరఁడా తాను
తవ్వీనేలో ఇసుకపాఁతరలు తాను
పువ్విళ్లూరీ మోవిఁ దేనె పుబ్బీ మదనకళలు
రవ్వగాఁ జూతము తనరాజస మంతయును

చ. 3: కాఁగిలేమి దవ్వా కలయకున్నాఁడా తాను
లోఁగక సిగ్గులేఁటికో లోఁచీ నేఁడు
యేఁగ కలమేల్‌మంగను ఇట్టె శ్రీవేంకటేశుఁడు
చేఁగదేర నన్నుఁగూడె చెలఁగుద మిఁకను

రేకు: 1266-3 లలిత సం: 22-393

పల్లవి: నెరజాణవు కడునేర్పరివి
మరిగె నీకె నిన్ను మన్నించవయ్యా

చ. 1: దొంతులువెట్టీఁ దొయ్యలి వలపులు
పంతపుమాటలఁ బలుమారును
చింతలచిగురులు సిగ్గుల నమ్మీ
చెంతఁ జేరి మచ్చికఁ గొనవయ్యా

చ. 2: గంపల ముంచీ కాంత కోరికలు
సొంపులచూపులఁ జోక్కుచును
ముంపులతేనెలు మోవినె కురిసీ
జంపులెక కడుఁజవిగొనవయ్యా

చ. 3: పుయ్యలలూఁగీ నుదుటుఁదమకమున
నెయ్యపు వెరగుల నిక్కుచును
యియ్యెడ శ్రీవేంకటేశ యలమేల్మంగ
చెయ్యారఁ గూడీని చేకొనవయ్యా

రేకు: 1266-4 పాడి సం: 22-394

పల్లవి: ఎంత నేరుచుకొన్నాఁడే యీతఁడు తాను
సంతోసపుగుక్కిళ్లు చవిగొనీఁ దాను

చ. 1: కన్నులనాచూపు తన్నుఁ గాఁడిపారీనంటాను
వున్నతి నొడ్డించుకొనీ నూరకే తాను
చిన్నసెలవినవ్వులు చిమ్మిరేఁచీనంటాను
సన్నలనే బొమ్మలను జంకించీఁ దాను

చ. 2: నంటున నామాటలు నాములెక్కీనంటాను
గొంటరియై మంతరించుకొనీనే తాను
కంటగించి కొనగోరు కడువాఁడియంటాను
తుంటరితనాన జోడుదొడిగీనే తాను

చ. 3: వలుదచన్నులు రాలవంటివేయంటాను
వెలయఁగఁ గప్పురాన వేసీనే తాను
అలమి శ్రీవేంకటేశుఁడు డలమేలుమంగను నేను
వలపులకతలకు వన్నెవెట్టీఁ దాను

రేకు: 1266-5 శ్రీరాగం సం: 22-395

పల్లవి: చతురులై నవారికి సరవులు దెలుసును
కతవలె విచ్చిపలుకఁగ నెట్టు వచ్చునే

చ. 1: వలపులోపలిచేఁగ వదలని అడియాస
తలఁపులోపలి తరితీపు
పలుకులోపలి మేలు పచ్చికొసరులమాట
చెలువులోపలిమించు సిగ్గుతోడినగవు

చ. 2: పాయపుఁ బరిణామము పైకొన్నసరసము
కాయపుసొంపులపస గరగరిక
చాయలమొగముకళ చక్కనివాఁడిచూపు
ఆయములోపలిఆయ మంటుకొన్నకోరిక

చ. 3: కూటమిగలసొబగు గుదిగొన్నతమకము
మాటలలోనివేడుక మంతనము
పాటించి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
నాటినేటిసుద్దులివి ననుపులోననుపు

రేకు: 1266-6 కేదారగౌళ సం: 22-396

పల్లవి: రావయ్యా లోనికి నీరమణి నేను
సేవలెల్లాఁ జేసే నీవు చిత్తగించు మిఁకను

చ. 1: కూరిమిసతిఁగనక కొసరితి నిఁతేకాక
సారెసారె నిన్ను దూరఁ జలమా నాకు
వోరుతువు గనక నిన్నోరసిచూచితిఁగాక
నేరములు నీపైవేయ నెపమా నాకు

చ. 2: చనవరిఁగనక నే సన్నలు సేసితిఁగాక
పనివడి జంకించఁ బంతమా నాకు
యెనలేనివేడుకల నింపులు చల్లితిఁగాక
పెనఁగి నీతో నంతబిరుదా నాకు

చ. 3: చంచులఁ గాఁగిలించఁగా చన్నుల నొత్తితిఁగాక
మించి మేలమాడ మందెమేళమా నాకు
యెంచఁగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కొంచక కూడితి విదె గుఱుతా నాకు

రేకు: 1267-1 ముఖారి సం: 22-397

పల్లవి: కడుఁడడుమేలుదానఁగనక నేఁ జెనకుదు
యెడయ కేమందువొ యేమిసేతునయ్యా

చ. 1: చన్నుల నిన్నొత్తఁగా చలమరిందువో
కన్నుల సారెఁ జూడఁగా గబ్బినందువొ
పన్ని నీతోఁ బెనఁగితే పంతగత్తైనందువో
ఇన్నిటా నీమనసెట్టో యేమిసేతునయ్యా

చ. 2: కిలకిలనవ్వఁగాను కేరడములందువో
సోలసి చేయివట్టితే జూటనందువొ
పిలిచి మాటాడితేను పెనుఁబట్టడి యందువో
యెంమి నీచిత్తమెట్టో యేమిసేతునయ్యా

చ. 3: అలరి మోవెడుగఁగా నాసాదకత్తెందువో
తెలివిఁ గాఁగిలించఁగా దిట్టనందువొ
కలసితి వలమేల్మంగాన శ్రీవేంకటేశుఁడ
యిల నీతలఁపు లెట్టో యేమిసేతునయ్యా

రేకు: 1267-2 వళవిగౌళ సం: 22-398

పల్లవి: ఎందరి బెండ్లాడేవు ఇంకా నీవు
కందువ నీకు ముంజేతికంకణమాయను

చ. 1: చెప్పరానివూడిగాలు సేసిసేసి నీకు నాపె
దెప్పరాన మోహపుదేవులాయను
యెప్పుడు చూచిన నీతో నేకతములెల్లా నాడి
అప్పనము వురముపై హారము నీకాయను

చ. 2: అంచెల నాపె నీకు నాకుచుట్టి ఇచ్చిఇచ్చి
వంచనతోఁ గడుఁజనవరి యాయను
కొంచక నాపాదాలు కూరిమితో నొత్తి మేలు
నించి నీకు నరచేతినిమ్మపండాయను

చ. 3: నెక్కొని యలమేల్మంగ నీకాఁగిఁటఁ గూడికూడి
చొక్కిచొక్కి పాయరానిచుట్టమాయను
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిక్కి తానెనసి తోడినీడ నీకాయను

రేకు: 1267-3 పాడి సం: 22-399

పల్లవి: చెప్పఁగదే వేడుకయ్యీ చెలులకెల్లా మాకు
చెప్పరానిచేఁత లేమిసేసెనే నీకు

చ. 1: చెలరేఁగి లోలోలొనే చిరునవ్వులు నవ్వేవు
అలరి నీరమణుఁ డేమనెనే నీతో
తలఁచుకతలఁచుక దైవారేవు కళలు
మలసి తానెంత నిన్ను మన్నించెనే

చ. 2: చొక్కుచు నలుదిక్కులు చూచిచూచి వేదకేవు
యక్కువ నడియాల మేమిచ్చెనే నీకు
మొక్కిమొక్కి గుట్టుతోడ మునుకొని మెచ్చేవు
చక్కఁగ నీ కాతఁ డెంతచనవు లొసయఁగెనే

చ. 3: చెమటచిత్తడితోడ సిగ్గువడి వుందానవు
సమరతుల నీకెంత చవిచూపెనే
అమరె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
తమిఁ గూడి నిన్ను నెంత తనివి నొందించెనే

రేకు: 1267-4 నీలాంబరి సం: 22-400

పల్లవి: అన్నియుఁ దనకు నాకు నమరియున్నవి నేఁడు
యెన్నికల కెక్కెఁ బతి నీడకు రమ్మనవే

చ. 1: చనవుగలచోటను సరసము చవులౌను
మనసెనసినచోట మాట లింపౌను
ననుపులయినచోట నవ్వులు ప్రియములౌను
వినయముచూపేచోట వేడుకలౌఁ జెలిమి

చ. 2: కూడివున్నచోటను గుదిగొను వలపులు
వాడిక లబ్బిన చోట వసమౌ రతి
పాడి నెరపేటిచోట పంతములు సమకూరు
యీడైవుండినచోట హెచ్చుఁ దమకములు

చ. 3: సమ్మతియయినచోట సతమౌను కాఁపురము
నమ్మికైనచోటను నంటు లీడేరు
నెమ్మి శ్రీవేంకటేశుఁడు నే నలమేలుమంగను
వుమ్మడి నన్నేలె నిఁక నొనరు సంతోసము

రేకు: 1267-5 రీతిగౌళ సం: 22-401

పల్లవి: చెప్పరానినేరుపులచేఁతలాఁడివి
నెప్పున నివి యెన్నఁడు నేరుచుకొంటివే

చ. 1: చేతులెత్తి మొక్కేవు చేరి కొలువుసేసేవు
యేతులకుఁ గానుకలే ఇయ్యవచ్చేవు
కాతరించి పలికేవు కడుఁదమి రేఁచేవు
యీతల నీరమణుని నెంతపాదిగేవే

చ. 2: మంచిమాట లాడేవు మచ్చికలు చల్లేవు
కొంచక వద్దఁ గూచుండి కొప్పు దువ్వేవు
ఇంచుకంత నవ్వేవు ఇచ్చకమే నెరుపేవు
మంచముపై పతి నెంత మరిగించుకొనేవే

చ. 3: కొచ్చికొచ్చి చూచేవు గుబ్బలనే వొత్తేవు
పచ్చిగా రతులఁ గూడి భ్రమఇంచేవు
అచ్చపుశ్రీవేంకటేశుఁ డలమేల్‌మంగవు నీకు
యిచ్చల నన్నీతఁ డేలె నిందు కెంతమెచ్చేవే

రేకు: 1267-6 సామంత సం: 22-402

పల్లవి: చెప్పరే యీమాట చెలులాల విభునిక
చిప్పిలి నేనైతేను సిగ్గుతో నుందానను

చ. 1: విరుల వేసినవేటు వేడుకలు పుట్టించె
తొరల నవ్వినవవ్వు దొమ్మిసేసెను
మరలిచూచినచూపు మనసెల్లాఁ గరఁగించె
యిరవాయఁ దనవలపెట్టోర్వవచ్చునే

చ. 2: పెదవిపై సన్నలు ప్రియములు నిండించె
పురుటుజంకెన రతి నుబ్బులు రేఁచె
పొదిగొన్నతమకము పొంచి తమకము నించె
ఇదె తననేరువు లేరీతి మఱితునే

చ. 3: చేరి తనమైసోఁకులు చెమటలు గారించె
సారెఁ దనపొందులు చవులు వెంచె
కోరి యలమేల్మంగకుఁ బతి శ్రీవేంకటేశుఁ-
డీరితి నన్నుఁగూడె నిఁక నేమి సేతునే

రేకు: 1268-1 దేసాళం సం: 22-403

పల్లవి: వేరే నేము సేసేటివిన్నపము లేమున్నవి
చేరి నీవే జవరాలిఁ జిత్తగించవయ్యా

చ. 1: జలజలరాలీని సతికొప్పున విరులు
సెలవులఁ జిందీని చిరునవ్వులు
నిలువున వడిసీని నిండాఁ బెఁజెమటలు
కలికివలపు నీవే కనుఁగొనవయ్యా

చ. 2: ముక్కున నిట్టూర్పులు మునుకొని నిగుడీని
చెక్కులపైఁ బులకలు చిమ్మిఁరేగీని
జక్కవచన్నుల మీఁద జారీఁ బయ్యద కొంగు
పక్కన నీమనసారఁ బలికించవయ్యా

చ. 3: తేటలుగా బెదవిపైఁ దేనియ లూరీని
కోటిసేయ మోమున సిగ్గులు మించీని
యీటున శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
గాఁటానఁ గూడితి విట్టే కరుణించవయ్యా

రేకు: 1268-2 నాదరామక్రియ సం: 22-404

పల్లవి: మూరెఁడు గొప్పుతోడిముద్దరాలికి
చీరుమూరాడీ వలపు చిత్తగించవయ్యా

చ. 1: కంచపుమోవి చూపి కాఁగిలించుమని నీకు
లంచమిచ్చీ నదివో లలితాంగి
కొంచక పయ్యదలోని గుబ్బలు గానుకవట్టి
వంచనతో మొక్కీ నాకెవంక చూడవయ్యా

చ. 2: చిక్కగా నవ్వులునవ్వి సిగ్గులువడుకొంటాను
చక్కెరమాఁట లాడీ జవరాలు
తక్కక కొలువు సేసి దండనుండి తమిరేఁచి
చెక్కునొక్కి వేఁడుకొనీ సేసవెట్టవయ్యా

చ. 3: చల్లనిచూపులఁ జూచి సన్నలనే రతులకు
మెల్లనే పిలిచీ నలమేలుమంగ
యిల్లిదె శ్రీవేంకటేశ యింతలో నీవు గూడఁగా
చల్లీ నీపై సరసము చనవియ్యవయ్యా

రేకు: 1268-3 భైరవి సం: 22-405

పల్లవి: సేసవెట్టి మోము చూపి చెలిసిగ్గు దేర్చితివి
లేల నీగుణాలెన్ని లెక్కవెట్టేమయ్యా

చ. 1: నెలఁతను లాలించ నీవే నేరుతువు
తలకొని పొందు సేయఁ దగుదువు
కలసిమెలఁగేయందు కడుజాణ వౌదువు
పొలసి నిన్నెంతని పొగడేమయ్యా

చ. 2: మాటనే చొక్కించి మరిగించుకోగలవు
మేటితనముల మంచిమెరవణివి
చాటువగా వలచితే చనవులియ్యఁగలవు
తేటగా నీమహిమెట్టు దెలిసేమయ్యా

చ. 3: నవ్వులనే నమ్మించి ననుచఁ జేసుకొందువు
నివ్వటిల్లఁ గూడి మేలునెరపుదువు
యివ్వల నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
చివ్వన నీవిద్య లెట్టు చెప్పఁగలమయ్యా

రేకు: 1268-4 జఆహిరి సం: 22-406

పల్లవి: చెప్పినట్టు సేయనా చెల్లఁబో నేను
కప్పురమిచ్చి యేల కాఁక రేఁచీనే

చ. 1: వింతవింతమాట లాడి వేడుకవాటలు వాడి
యెంతేసీ సేసి నన్ను నెలయించీనే
మంతనానఁ గూచుండి మర్మములు ముట్టిముట్టి
దొంతి వెట్టి వలుపేల తూరుపెత్తీనే

చ. 2: సారెసారె నన్నుఁ జూచి చక్కఁదనాలకు లాచి
మేరమీరి నాతోనేల మేకు సేసీనే
నేరుపుతో నవ్వినవ్వి నెయ్యములు చల్లి చల్లి
గోరగీరి వావులేల కుప్ప సేసీనే

చ. 3: వచ్చివచ్చి కాఁగిలించి వాడికలెల్లా నించి
మెచ్చిమెచ్చి నాతో నెంత మేలమాడీనే
యిచ్చట శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కొచ్చికూడి రతులేల గుదిగుచ్చీనే

రేకు: 1268-5 మంగళకౌసిక సం: 22-407

పల్లవి: మేలుమేలు నీగుణాలు మెచ్చితిమయ్యా
యీలాగుల నీకుఁ జేతులెత్తి మొక్కేమయ్యా

చ. 1: మంతనాన మాటలాడి మనసు సోదించవచ్చే-
వింత నే నెఱఁగనా యేమయ్యా
సంతోసాన నవ్వు నవ్వి సమతుసేసుకొనేవు
చెంత నీవేమీ సేసినాఁ జెల్లునయ్యా

చ. 2: కొంగువట్టితీసి దండఁ గూచుండఁ బెట్టుకొనేవు
అంగడిఁ బెట్టేవా వలపానయ్యా
వుంగరము వేలఁబెట్టి వొద్దికఁ బెండ్లాడేవు
సంగతెల్లాఁ గంటి మిట్టె జాణవౌదువయ్యా

చ. 3: మొగము దప్పకచూచి మోవితేనె లానేవు
యెగసక్కేఁడవు నిన్ను నేమనేమయ్యా
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడవు
తగిలి నన్నేలితివి తగుఁదగునయ్యా

రేకు: 1268-6 శ్రీరాగం సం: 22-408

పల్లవి: ఎన్నఁడు నేరుచుకొంటి వీచేఁతలు
సన్నల చాయల నేల చవులు రేఁచేవే

చ. 1: పెదవిపై తములముబేఁటులు రాలఁగాను
యెదిరించి పతితోడ నేమినవ్వేవే
వదలుఁబయ్యదతోడ వాసనచేమట గార
సదరాననే యెంత సరసమాడేవే

చ. 2: చెక్కులవెంటను పెఁజెమటలు గారఁగాను
మక్కువతో నేడకేడ మాటలాడేవే
నిక్కినిక్కి చూచేకొంటా నివ్వెరగు నొందుకుంటా
మక్కళించి పతినెంత మరిగించేవే

చ. 3: చలిమీ బలిమీ నిట్టె చన్నుల నొరసుకొంటా
కలికితనాల నెంత కరఁగించేవే
అలమేలుమంగను నే నతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమి నన్నేలినాఁడు యిఁక నేమనేవే

రేకు: 1269-1 బౌళి సం: 22-409

పల్లవి: ఏల లోఁగేవే పతి నేమిసేసినా నేమాయ
మేలుగలదానవు మెరయఁగవచ్చును

చ. 1: పంతమాడరాదు గాని పలుమారుఁ జెలులకు
చెంతనుండి విన్నపాలు సేయవచ్చును
వింత చూపరాదు గాని విభునితో సారెసారె
సంతోసానఁ గూరిములు సాదించవచ్చును

చ. 2: కక్కసించరాదుగాని కడుఁ దమకముతోడ
చెక్కునొక్కి కొనగోరఁ జిమ్మవచ్చును
వెక్కసాలు వద్దుగాని వెస నిమ్మపంట వేసి
నిక్కిచూచి లాకొట్టులు నెరపఁగవచ్చును

చ. 3: పెనఁగరాదు బీరముతో గాఁగిలించి
వొనరఁగ నీచన్నుల నొత్తవచ్చును
యెనసె శ్రీవేంకటేశుఁ డిట్టె యలమేల్మంగవు
ననిచి యీాతనితోడ నవ్వు నవ్వవచ్చును

రేకు:	1269-2 రామక్రియ	సం:	22-410

పల్లవి:	హత్తి నీకె దక్కెనటె ఆతఁడు నేఁడు
	పొత్తుల మొగఁ డాతఁడు పొలఁతులకు

చ. 1:	మంతనాన నేమని మాటలాడేవే
	కాంతునిమనసు నీవు కంటివటవే
	పంతాలతో నీవేల బయలీఁదేవే
	బంతివలపులవారు పదివేలు గలరే

చ. 2:	నాటుకొన సారెనేల నవ్వు నవ్వేనే
	జూటరి యాతఁడు నీకు సులభుఁడటే
	మేటివై నీవెంత యేమ్మెలు సేసేవే
	కూటమిసతు లెంచితే కొట్లున్నారే

చ. 3:	పలుమారు నీవేల గుబ్బల నొత్తేవే
	బలిమి శ్రీవేంకటేశుఁ బైకొనేవటే
	అలమేలుమంగపతి యతఁడు నన్నేలినాఁడు
	యిలనింకొ మనబోఁటు లెందరైనాఁ గలరు

రేకు: 1269-3 కాంబోది సం: 22-411

పల్లవి: చెలులము ముందుగానే చెప్పేము బుద్దులు నీకు
చెలఁగి సేవసేయవే చిత్తమురాఁ బతికి

చ. 1: పొంచి కొంగువట్టితేను బొమ్మల జంకించకువే
కొంచక మోవెడిగితే గుంపించకువే
అంచెల గుబ్బలంటితే నానలు వెట్టకువే
మించి నీమగఁడు కడుమేలువాఁడే నీకు

చ. 2: చెనకితే నాతనితో సిగ్గులువడకువే
పెనఁగవచ్చితే నీవు బిగియకువే
యెనసి నవ్వితే నందు కెగ్గులువట్టకువే
ఘనుఁడు నీపై బత్తిగలఁడే యెపుడు

చ. 3: పలుమారుఁ జూచితేను పదరి దూరకువే
అలమితే రతులను నలయకువే
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
యిల నిన్ను నేలె నీకు యిచ్చకపువాఁడే

రేకు: 1269-4 భూపాళం సం: 22-412

పల్లవి: చెలియ నీవెన్నాళ్లైనాఁ జిన్నదానవా
మలసి నీమగనితో మాటలాడఁగదవే

చ. 1: మిక్కిలి నీచన్నులు మీఁదమీఁదఁ బెరుగఁగా
గక్కనఁ బయ్యదనేల కప్పిపెట్టేవే
తక్కక నీజవ్వనము తతి గొనసాగఁగాను
చెక్కిటి చేతితోనేల సిగ్గులువడేవే

చ. 2: ముట్టి మదనకళలు మోమున నిండఁగాను
యిట్టె చేతిమాటున నేమిసేసేవే
దట్టమైనవలపులు తలఁపులో నుండఁగాను
నట్టనడు మఁదరలో నవ్వులేమినవ్వేవే

చ. 3: చొప్పులెత్తి తమకము చూపులనే కానరాఁగా
చిప్పిలుఁ జెమట నంత చిమ్మిరేఁగేవే
అప్పఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
ముప్పిరిఁ గూడితి రింకా మూసి మంతనమేలే

రేకు: 1269-5 ధన్నాసి సం: 22-413

పల్లవి: ఇట్టై నాపెఁ జేసితి వింతమోహము
నెట్టనఁ దారుకాణాయ నీకు నాకు మోహము

చ. 1: చేయఁ జేయ నేస్తములఁ జేగలెక్కు మోహము
పాయక కాచుకుండితేఁ బదనెక్కు మోహము
చాయలాను సన్నలాను చవులుట్టు మోహము
వేయువేయు వినయాల వేడుకలౌ మోహము

చ. 2: కుమ్మరింపుఁజూపుల గుదిగొను మోహము
సమ్మతించి పెనఁగితే జడిగొను మోహము
దిమ్మురేఁగఁ జెనకితే తీపులెక్కు మోహము
పమ్మినసరసములఁ బచ్చిదేరు మోహము

చ. 3: కూడఁగూడఁ గాఁగిటిలోఁ గొనసాగు మోహము
జోడై నరతులనుఁ జుట్టుకొను మోహము
వీడనియలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
వాడికనీసతులకు వరుసాయ మోహము

రేకు: 1269-6 పాడి సం: 22-414

పల్లవి: పదరి నీకిట్టె విన్నపములు సేయఁగనేల
సుదతి నీదేవులట సొంపులు వుట్టీని

చ. 1: కోరి చెలి యేపొద్దు నీకొలువు సేయఁగాను
తారుకాణై నీకు నీకే దయవుట్టీని
నోరుపుతో నప్పటి నీవూడిగాలు చేయఁగాను
నేరుపుతో నీమనసు నీకే కరఁగీని

చ. 2: వనిత నీపాదాలకు వంచనతో మొక్కఁగాను
కనికరమున నీవే గారవించేవు
పెనఁగిపెనఁగి నీకుఁ బ్రియములుచెప్పఁగాను
విని విని నీకంతలో వేడుక వుట్టీని

చ. 3: మంతనాన నుండి యాకుమడచి నీకియ్యఁగాను
సంతోసాన నాపెమోవి చవులయ్యీని
ఇంతలో శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
దొంతి సేసవెట్టి నీపొందులు జరగీని

రేకు: 1270-1 లలిత సం: 22-415

పల్లవి: సరసుఁడ వన్నిటాను సర్వజాణవు
తరుణిమీఁదట దయదలఁచఁగవలదా

చ. 1: చిగురుఁబెదవులనుఁ జెప్పె నీకుఁ బ్రియములు
మొగము చూచినప్పుడే మొక్కె నీకును
తగులు గావలెనంటా దండనే కొలువుసేసె
మగిడి యింతటనైనా మన్నించవలదా

చ. 2: కలికికనుచూపులఁ గడునిన్నుఁ బూజించె
సెలవినవ్వులఁ బ్రేమ చిమ్మిరేఁచెను
సోలయుచుఁ గుచములు సూడిదలుగాఁబట్టె
తలఁపెరిఁగిం చాకె నాదరించఁగవలదా

చ. 3: కోరి చుట్టరికములు కూడఁజెప్పె నిందాఁకా
చేరి కాఁగిటిరతుల సేవసేసెను
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సారెఁ జెనకే విట్టే చనవియ్యరాదా

రేకు: 1270-2 వరాళి సం: 22-416

పల్లవి: వినవయ్య నీదేవుల వేడుకై నసుద్దులు
పెనగొన్న మచ్చికలఁ బెచ్చువెరిగీని

చ. 1: కొమలి నీగుణములు కొనియాడుకొంటాను
నామువార సెలవుల నవ్వు నవ్వీని
ఆముక నీరూపు మతి నట్టే తలఁచుకొంటాను
వేమరు సంతోసాన విఱ్ఱవీఁగీని

చ. 2: నెట్టుకొని చెలులతో నీసుద్దులు చెప్పుకొంటా
గుట్టుతో లోలోనే సిగ్గులువడీని
దట్టపుటానల నీకుఁ దా నెదురుచూచుకొంటా
వొట్టుక మనోరథాల నోలలాడీని

చ. 3: నెమ్మదిఁ దెరమాటున నీమాటలే వినుకొంటా
చెమ్మఁజెమటలచేతఁ జెలరేఁగీని
యిమ్మల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కమ్మి నీవిట్టె కూడఁగాఁ గడుమెచ్చీని

రేకు: 1270-3 దేశాక్షి సం: 22-417

పల్లవి: మేలుమేలే నీపగటు మెచ్చితి మిందరమును
యేలాటాలాడేవు కడు నెంతదంటవే

చ. 1: జక్కవలవంటివి నీచన్ను లతఁ డంటెనంటా
పక్కన జంకించే వెంతపంతగత్తెవే
తొక్కెఁ బాదమంటా నూఁదుచు గోర నదిమేవు
చిక్కించుక యెటువంటిచేఁతలాఁడివే

చ. 2: మొగము చూచితేనే మోహించెను నీకంటాను
తగులనాడే వెంతయాతరిదానవే
వెగటునఁ దామరను వేసెనంటా బులిసేవు
యెగసక్కేలను నీ వెంతకతకారివే

చ. 3: ఆసతో శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడెనంటా
వేసాలుసేసే వెంతవిత్తరాలవే
బాసతో నలమేల్మంగపతి యీతఁడు మమ్మేలె
నీసుద్దులే చెప్పే వెంతనెరజాణవే

రేకు: 1270-4 పళవంజరం సం: 22-418

పల్లవి: చెప్పవే నాతోనేల సిగ్గువడేవు
కప్పురగంది నీచెలికత్తెఁగానా నేను

చ. 1: చెలరేఁగి నీవలపు చెక్కులవెంటఁ గారీ
చెలియరో నీపతికిఁ జెప్పుదునటే
నిలువునఁ దమకము నిట్టూర్పులై మించీ
పిలుచక వత్తునటే ప్రియుని నీడకును

చ. 2: అట్టె నివ్వెరగు నీపయ్యదతోనే జారీని
చుట్టపునీవిభునికిఁ జూపుదునటే
గుట్టుతోడఁ బులకలు గుబ్బతిలీఁ జెక్కులను
దట్టపునీపొందులు తలఁపింతునటవే

చ. 3: చేవమీరి నవ్వులు నీసెలవులవెంటఁ జిందీ
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెందెనటవే
నీ వలమేలుమంగవు నెక్కొని నీ ప్రియములు
సేవసేనే మీకు నేను చెప్పఁగదవే

రేకు: 1270-5 నాదరామక్రియ సం: 22-419

పల్లవి: ఎంతటిజాణవే చూడ నిటులుందానవుగాక
సంతోసాన నాతని నీవము సేకొంటివే

చ. 1: నిమ్మపంటగొని వేసి నేరుపతో న్న సేసి
కమ్మర విభుని నెంత కరగించేవే
మ్మతించ మాటలాడి ◌ంగడి గడివడి
దిమ్మురేచి రతులకు దిద్దుకొంటివే

చ. 2: వీడెము చేతికిచ్చి వేమరు గాగిట గుచ్చి
వాడికచేతల నెంతవలపంచేవే
వేడుకతో గొప దువ్వి వింతగా సెలవి నవ్వి
వొడక నీవద్దనుండ నొడగర్చుకొంటివే

చ. 3: చనుమొనలు దాకించి నారె వెవి సొకించి
యెనసి శ్రీవేంకటేశు నెలఇంచేవే
అనిశము నంది పొంది అలమేల్మంగ వితడు
నను నెలె నీవూ మన్నగలు గైకొంటివే

రేకు: 1270-6 ముఖారి సం: 22-420

పల్లవి: వీఁపుగానరాఁగా దాఁగేవిద్య లేఁటికే
యేపున మాముందర నీవెంతకెంత సేసేవే

చ. 1: చిమ్మిరేఁగ వలచిము సిగ్గువడనేమిటికే
వుమ్మడిఁ దొడమీఁదఁ గూచుందువుగాక
కొమ్మచేఁ బిలువనంపి కొంకుఁగొస రేఁటికే
లెమ్మని విభునిఁ గాఁగిలింతువుగాక

చ. 2: వొక్కపీఁట్టపై నుండి వొడ్డుకొననేఁటికే
చొక్కమైన మోవి చవిచూతువుగాక
పెక్కుసరసము లాడి బిగియఁగనేఁటికే
జక్కవచన్నుల నొత్తి సాదింతువు గాక

చ. 3: ఆసతోఁ బెండ్లాడి మరి యలయఁగ నేఁటికే
సేసవెట్టి రతుల మెచ్చింతువుగాక
లాసి నన్ను నేలినాఁ డలమేలుమంగను నేను
యీసరి శ్రీవేంకటేశు నెనతువుగాక

రేకు: 1281-1 దేసాళం సం: 22-421

పల్లవి: నీ వన్నిటా జాణవు నీకుఁ జెప్పేమా బుద్ది
సేవసే శాపెను మెచ్చఁజేతువుగాక

చ. 1: దొరపాటి వనితలు దూరుదురా పతులను
తొరలుచుఁ గొనియాడుదురుగాక
మరిగినచోటను మరి యెగ్గువట్టుదురా
వొరసి గొరగిరినా నోరుతురుగాక

చ. 2: వుత్తమనాయికైనది వుదుటున జంకించునా
చిత్తమురా వినయమే సేసుఁగాక
హత్తినట్టిపొందులకు నడ్డమాఁక లున్నవా
బత్తి మీఁదమీఁద రేఁచి బలియించుఁగాక

చ. 3: పట్టపుదేవులు మరి పంతాలు నెరపునా
చుట్టమై ఇచ్చకములే చూపుఁగాక
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
వొట్టినసంతోసాన నుందువుగాక

రేకు: 1281-2 రామక్రియ సం: 22-422

పల్లవి: కట్టఁగడ నూరకుండి కట్టుకొనే దేమున్నది
చుట్టాలసురభివై చొక్కించరాదా

చ. 1: సారెసారె నిన్నుఁ జూచి సతి మరఁగున నుండీ
చేరఁడేసికన్నుల చెలియ
యీరీతి యాఁకరీఁ దాను యీకెయాస యెంతో
కోరినకోరికలెల్లాఁ గొనసాగించరాదా

చ. 2: యెట్టనెదుటనే వుండీ యిదివో కొలువు సేసీ
పట్టెఁడేసిగుబ్బలపడఁతి
నెట్టుకొన్న వలపుతో బట్టబయలీఁదీఁ దాను
యిట్టె యీపెనేస్తము లీడేరించరాదా

చ. 3: చేఁగదేర నింతలొనె చెలి నీవద్దఁ గూచుండె
కాఁగెఁడేసిపిరుఁదులకలికి
వీఁగక శ్రీవేంకటేశ వెలఁది నిన్నుఁ బెండ్లాడె
మాఁగినమోవి యొసఁగి మన్నించరాదా

రేకు: 1281-3 వళవిగౌళ సం: 22-423

పల్లవి: దొరసి నీవెంత సిగ్గుతోడ మూసి దాఁచినాను
దొరయైనవానిచేత తుదకెక్కకుండనా

చ. 1: మంతనాన నీవు దను మన్నించినమన్ననలు
చెంతనున్న చెలులతోఁ జెప్పుకొన్నది
వింతలుగా వారివారు వీదువీదులఁ దమలోను
యింతికే వలతువంటా నెంచుకొంటానున్నారు

చ. 2: నగరిలొ నీవుఁ దానూ నవ్విననవ్వు లాకె
నిగిడి చిలుకకును నేరిపెనట
వొగి నాదండనుండిన వూరిచిలుకలు నేర్చి
పగలు రేయును నవే పలుకుతానున్నవి

చ. 3: పరగ నీకూటములు పాటలుగాఁ బాడఁగాను
నిరతి నచ్చరలెల్లా నేరుచుకొని
సిరులు నన్నేలినట్టి శ్రీవేంకటేశ్వర
ధరలో గీతాలుగా సంతతముఁ బాడేరు

రేకు: 1281-4 ఆహిరినాట సం: 22-424

పల్లవి: ఎంత మందెమేళమని యెంచకు మీఁక
మంతుకెక్క వలచాపె మరి యేమిసేసును

చ. 1: తలఁపులు లోలోనే తతిగొని రేఁచఁగాను
సొలసి చూడకెట్టుండు సుదతి నిన్ను
పెలుచుఁ దమకములు బెరసి గుబ్బతిలఁగా
యెలమిఁ బైకొనక యెట్టోర్వవచ్చును

చ. 2: ఆడుకోలు మాటలు యాసలు రేఁచఁగాను
వేడుకపడ కేలుండు వెలఁది నీకు
యీడుజోడైన వలపు లెచ్చరిక సేయఁగాను
తోడఁదోడఁ గోరికలు తొడర కేలుండును

చ. 3: తనివోని జవ్వనము తరపులు వెట్టఁగాను
పెనఁగికూడ కెట్లుండు ప్రియురాలు
యెనసితివి శ్రీవేంకటేశ యిన్నిటా నీకెను
మనసు నిలుప నెట్టు మరి వసమౌను

రేకు:	1281-5 శ్రీరాగం సం:	22-425

పల్లవి:	నీచిత్త మెట్టున్నదో నే నెఱఁగను
చేచేత నెప్పుడూ నీసేవ సేసేదానను

చ. 1:	పెక్కుమాట లాడితేను పెనుగయ్యాళి యందువో
గక్కన నూరకుండితే గర్వినందువో
నిక్కిచూచితే నెంత నీటుచూపీ నందువో
గుక్కొని నాలో నేనే గుట్టుతో నుందానను

చ. 2:	ఇంతలో నీకు మొక్కితే నేమిగోరి నందువో
మంతనానకు వచ్చితే మరేమందువో
చెంతనుండి వచ్చితేను చిత్తిణి ఇదెందువో
యింతేసి కోపక నాయిచ్చనే వుందానను

చ. 3:	కడుబత్తిసేయఁగాను కతకారి యందువో
విడెము నిన్నడుగఁగా వేసాలందుపో
యేడనేడ శ్రీవేంకటేశ నను నేలితివి
వొడఁబడి నీరతుల నొద్దికై వుందానను

రేకు: 1281-6 మధ్యమావతి సం: 22-426

పల్లవి: ఎటువంటివలపులో యెంతభాగ్యమో
యిటువంటిసరసత లిద్దరికిఁ దగును

చ. 1: సరిసకి బేసికి నాడేసరసపుమీమాటలఁ
గురిసీని తేనెలు గుబగుబను
మరలిమరలిచూచేమచ్చికమీచూపులఁ
దొరలీని వెన్నెలలు తోడఁదోడవే

చ. 2: సన్నలఁ జాయలఁజల్లేసముకపుమీనవ్వుల
మిన్నక కప్రాలు చిందీ మీఁదమీఁదను
తన్నుఁదానే గుబ్బతిలేతనియనిమీసిగ్గుల
దిన్నలై చూపట్టీ ముత్తెపురాసులు

చ. 3: చలిమిబలిమిఁ గూడేజంటలమీచెనకుల
కొలఁదిమీర జారీఁగుంకుమరసాలు
కలసిన మీచుట్టరికములు శ్రీవేంకటేశ
తలకొనీ వేడుకల తరితీపులు

రేకు: 1282-1 రామక్రియ సం: 22-427

పల్లవి: అతిరాజసపు విభుఁ డాతఁడుగదే
రతి మెప్పింతువుగాక రవ్వసేయనేఁటికే

చ. 1: కలికతనాల మతిఁగరఁగింతువుగాక
సళుపుచుఁ బతినేల జంకించేవే
తలఁపులోనే మెలఁగి తమిరేఁతువుగాక
పెలుచుఁదనాల నేల పెనఁగులాడేవే

చ. 2: సరసతల వలపుచవి పుట్టింతువుగాక
వొరసి యాతనినేల వుప్పతించేవే
వరుసవంతులు చూపి వసపరతువుగాక
తెరదీసి మరియేల తేలించేవే

చ. 3: కాయజకేలినే నీవు కడుఁ జొక్కింతువుగాక
చాయల సన్నలనేల సాదించేవే
యీయెడ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
చేయి మీఁదాయ నేల సిగ్గులు వెంచేవే

రేకు: 1282-2 కన్నడగౌళ సం: 22-428

పల్లవి: ఏటికి శిరసువంచే వెదిరించి యాతనితో
మాటలాడఁగదవే మిన్నంచీ నతఁడు

చ. 1: కొనచూపులనుఁ జూచి కూరిమిగొరితేను
మనసు రంజిల్లును మగవానికి
వినయము లేసేసి వేమారుఁ దగిలితేను
ననిచి మిక్కిలి లోలో నంటు సమకూరును

చ. 2: వాడికవలపు చల్లి వద్దఁ గొలువు సేసితే
వేడుకలు వుట్టును విభునికీని
వీడెమందుకొని కొంత వెల్లవిరిగా నవ్వితే
చూడఁ జూడఁ బాయరాని చుట్టరిక మబ్బును

చ. 3: మచ్చికలే పచరించి మంతనానఁ బొదిగితే
యిచ్చక మవును శ్రీవేంకటేశ్వరునకు
వచ్చినట్టే వచ్చి కైవసమై మెలఁగితేను
మెచ్చు లిద్దరికి లోలో మిక్కుటమై నిండును

రేకు: 1282-3 బౌళి సం: 22-429

పల్లవి: ఇంత నిన్నుఁ జేసినాతఁ డెంతజాణఁడే
సంతోసాలు చెప్పఁగదె సరుగ నోచెలియా

చ. 1: చెక్కులఁ జారుఁదురుము చెంపలనూరేచెమట
యెక్కడఁ గలిగేనే యింతలో నీకు
చొక్కిటి కరఁగులును చూపులలొ మెరుఁగులు
పక్కన నీమేన నిండె బాగాయనే

చ. 2: మోవివసినాడులు మంచినచిరునవ్వులు
యేవిదాన నీవు గడియించుకొంటివే
చేవదేరేచెనకులు చిట్లుగందములును
సొవసొవసిగ్గులును సొదగాయనే

చ. 3: వింతవింతవాసనలు వేడుకమోముకళలు
యింతలో నెట్టువచ్చెనే యివిగో నీకు
చెంత నిన్నుఁ గాగిలించె శ్రీవేంకటేశ్వరుఁడు
పంతాన నీతని పొందుపట్లు లాగాయనే

రేకు: 1282-4 ఆహిరి సం: 22-430

పల్లవి: ఏమిసేతునే యాతఁ డెట్టు వసమయ్యీనొ
కామించి యున్నదానఁ గరుణించుమనవే

చ. 1: తక్కక తనరూపము తలపోసేనంటివా
మిక్కిలిచక్కఁదనాల మేఁటి యాతఁడు
చిక్కించుక యిట్టితనచిత్తము దెలిసేనంటే
గక్కన వూహించరానిగంభీరుడాతడు

చ. 2: జడియక తనుమెచ్చి సారెఁ బొగడేనంటె
కడలేని గుణసాగరుఁ డాతఁడు
తడయక యేపొద్దు తను సేవించేనంటినా
కడుఁగడురాజసపుఘనుఁ డాతఁడు

చ. 3: సరసపు మాటలు సారె నాడేనంటినా
సరిలేనియట్టినెరజాణఁ డాతఁడు
బెరసి నన్నేలె తనుఁ బేరుకొనేనంటినా
గరిమల శ్రీవేంకటవిభుఁ డాతఁడు

రేకు: 1282-5 గంభీరనాట సం: 22-431

పల్లవి: సేయనీవే దానికేమి చేఁతలెల్లాను
పాయరానిపతి తానే పాలించీ నన్నును

చ. 1: తలఁపు దెలియుఁదాంకా తలవంచుకొంటిఁగాక
నెలకొని కొసరఁగనేరనా నేను
అలయించనేఁటికంటా నణఁకువ నుంటిఁగాక
చలపట్టి తను నిట్టె సాదించనోపనా

చ. 2: చెనకిదాఁకాను సిగ్గులువడితిఁగాక
ననిచి తా నవ్వినట్టె నవ్వనా నేను
చనవిచ్చినందాఁకా సరవి చూచితిఁగాక
పెనఁగి తమకములు పెడరేఁచ జాలనా

చ. 3: గుట్టు గనుదాఁకాఁ దేకువతో నుండితిఁగాక
ఱట్టుసేసి కలయనెఱఁగనా నేను
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలో దానన్నుఁ గూడె
చుట్టమనై యన్నిటాను చొక్కించి మీరనా

రేకు: 1282-6 హిందొళవంతం సం: 22-432

పల్లవి: ఆయనాయ రావయ్యా అందుకు నేఁగాదనేనా
పాయరానిపొందులకు పంతాలాడనేఁటికి

చ. 1: చెప్పినయాపెమాటలు చెవులొగ్గి వింటివి
కుప్పళించఁ జెమటలు గురిసె మేన
ముప్పిరిగొనె నవ్వులు మోహములు దైవారె
చొప్పులెల్లాఁ గంటిమి సుద్దు లింకా వలెనా

చ. 2: చన్నులాపె దాఁకించఁగా సాములు సేసితివి
తన్నుఁదానే చొక్కి నీచిత్తము గరఁగె
కన్నులసన్నలు మించె కలిగె మోముకళలు
పన్నుగడలాయ నొడఁబరచఁగవలెనా

చ. 3: గక్కన నాపెచేతికికానుక లందుకొంటివి
చెక్కులపై పులకలు చిమ్మిరేఁగెను
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్నప్పటి
దక్కె నీమన్ననలెల్లా తారుకాణ వలెనా

రేకు: 1283-1 లలిత సం: 22-433

పల్లవి: ఇంతి నీసింగారము లెంతని పొగడవచ్చు
కంతుని సంపదివై కలిగితి విపుడు

చ. 1: భామ నీసెలవులను పండువెన్నెలలు గాసీ
నీమోమే చంద్రుఁడౌత నిక్కమేకదే
కొమలపుఁదుమ్మిదలె కొప్పువలెఁ గనుపట్టె
తామరలు కన్నుల గాఁదగునే నీకును

చ. 2: రమణి నీమాటలను రసములు దొలఁకీని
అమరునే నీమోవి పండనేఁటిమాట
జమళిబాహులతలు సమకొనె నీమేన
కొమరెగుబ్బలు పువ్వుగుత్తులౌ టేమరుదే

చ. 3: మెలుఁత నీనిలువెల్లా మించి వన్నెల కెక్కెను
అలరి బంగారుబొమ్మవౌదువే నీవు
చెలఁగి నీకాఁగిటను శ్రీవేంకటేశుఁడు గూడె
నెలకొన్ననీ నడలు నెమళ్లా నవునే

రేకు: 1283-2 మంగళకౌసిక సం: 22-434

పల్లవి: వేవేలుసతులు గలవిభుఁడవు నీవైతే
యీవల మఱవకుండా నెఱిఁగించే నేను

చ. 1: కన్నులచూపుల నవె కలకలనవ్వులు
చన్నుల తుదల నవె చవుకళింపులు
చిన్ని పెదవుల నవె చిప్పిలీవి తేనెలు
యిన్నిగుఱుతులుగల దెఱుఁగుకో యీకెను

చ. 2: చెక్కులపైఁ దొలఁకేవి సేనాసేనకళలు
పిక్కటిల్లీ మోమునఁ జక్కఁదనము
అక్కజపు నడపుల నంచ లవె మెదలీని
యిక్కువలెల్లాఁ జూచుకో యీకెయందె నీవు

చ. 3: కరమూలముల నవె కాఁగితలించేయాసలు
తిరమై దంతముల ముత్తేము లవిగో
అరుదుగా నేలితివి యందరిలో నీకెను
సిరిమించె మఱఁగెల శ్రీవేంకటేశ్వరా

రేకు: 1283-3 సామంతం సం: 22-435

పల్లవి: ఇందాఁకా రాఁడంటా నేఁకరితి వీతనికి
విందులుగా మోవి ఇచ్చి విడెమియ్యరాదా

చ. 1: చెక్కు చేతఁబెట్టుకొని సిగ్గులువడఁగనేల
చక్కనియాతని మోము సారెఁ జూడవే
ముక్కుమీఁద వేలిడుక ముసిముసినవ్వులేల
మొక్కరాదా చేతులెత్తి ముందర నిలుచుండి

చ. 2: చెలుల కాతనిఁ జూపి చేసన్న లేమి సేసేవు
పలుకుల వినయాలు పచరించేవే
వలిపెపయ్యదలోన వలిగుబ్బ లేల దాఁచ
సులభాన నాతనికి సూడిదె చూపరాదా

చ. 3: పానుపుపైఁ గూచుండి పాదా లెందాఁకా నొత్తేవు
మేనుమేను సోఁకఁగూడి మెప్పించవే
అనుక శ్రీవేంకటేశుఁ డన్నిటా నిన్ను మన్నించె
సేనా సేనసేవలెల్లాఁ జేయరాదా ఇంకాను

రేకు: 1283-4 కాంబోది సం: 22-436

పల్లవి: సిగ్గువడ్డ నిఁకనేలే చెక్కుఁచేతితో
యెగ్గుపట్టననీవంటి యిచ్చకురాలికిని

చ. 1: పెనఁగఁగవద్దుగాని ప్రియములు చెప్పవచ్చు
చెనకితేఁ బతితోను చెలియకును
కినియఁగవద్దుగాని కేలెత్తి మొక్కఁగవచ్చు
వినయముతోడ వివేకియైనదానికి

చ. 2: జంకించవద్దుగాని సరసములాడవచ్చు
అంకెఁ దనకుఁ బొఁదైనయతనితోను
మంకు చెప్పవద్దుగాని మర్మము లంటఁగవచ్చు
సంకెలేని యట్టినెరజాణయైనదానికి

చ. 3: వేసాలు వద్దుగాని వేడుక సేయఁగవచ్చు
ఆసిచ్చి తనుకు మేలైనవానితో
సేసవెట్టి నిన్నీతఁడే శ్రీవేంకటేశుఁడు గూడె
సేసినట్టౌనే నీబోఁటిచెలియైనదానికి

రేకు: 1283-5 ఆహిరినాట సం: 22-437

పల్లవి: నీవిచ్చినసలిగెలే నేఁ బచారింతు నెప్పుడు
యీవలె వేరొకటిగా బావించకు విభుఁడా

చ. 1: చెంది నన్ను మన్నింతువు చెప్పినట్టే సేతువంటా-
నందరిలో నేనెప్పుడు నాడుకొందును
పందేలాడుదువు సారెఁ బైకొని నవ్వుదువంటా
మందెమేళమున మారుమలయుచునుందును

చ. 2: నామొగమే చూతువు నాకే మోహింతువంటా
నీముందర నాయెమ్మెలు నెరపుదును
యేమైనా నాకిత్తువు నన్నెన్నఁడు నెడయఁడంటా
వేమారు మురిపెమున విఱవీఁగుచుందును

చ. 3: కడుబత్తిసేతువు కాఁగిటిలోవాఁడవంటా
బడిబడి నీసుద్దులే పచరింతును
కడఁగి శ్రీవేంకటేశ కరుణ నన్నేలితివి
పుడివోనిగర్వమున నోలలాడుచుందును

రేకు: 1283-6 పళవంజరం సం: 22-438

పల్లవి: మిక్కిలిజాణలు తొల్లె మీరిన్ని నేరుతురు
వక్కణ లడుగనేలా వలపు లీడేరెను

చ. 1: మంతనాన నీవాడినమాటలు దలఁచుకొని
యింతి సంతోసాననున్న దేమంటివో
చెంత నుండి మేలు వార్త చెప్పవచ్చితిమి నేము
ఇంతంతనరాదు మీకు నిద్దరికే తెలుసు

చ. 2: నీవు రాతిరెల్లాను మన్నించినమన్ననలు
బావించి పొగడుకొనీఁ బానుపుమీఁద
కావించి వేడుకలు కనివచ్చితిమి నేము
ఆవిధా లెట్టివోకాని యతిరహస్యములు

చ. 3: చెలి వేగు బొద్దునను సేసీననీచేఁతలకు
సెలవుల నవ్వుకొంటా సిగ్గువడీని
యెలమి శ్రీవేంకటేశ యెనసితి రొండొరులు
అలవడె మీలోమీకు నమరె నన్నియును

రేకు: 1284-1 లలిత సం: 22-439

పల్లవి: ఎన్నఁడు నేరుచుకొంటి విన్నేసి నీవు
వన్నెల నాతని నింత వలపించుకొంటివే

చ. 1: చెక్కునొక్కి మాటలాడి చెలువుని సారెసారె
యిక్కువలు గరఁగించి యెంతసేసేవే
మొక్కు మొక్కి నిలుచుండి మోవితేనె చవిచూపి
యెక్కడెక్కడ ప్రియాలేమిచెప్పేవే

చ. 2: సెలవుల నవ్వునవ్వి చెనకుచుఁ జిమ్మిరేఁచి
యెలయింపులఁ జేతల నీ వెంత సేసేవే
సొలపుఁగన్నుల జూచి సొరిదిఁ గానుక లిచ్చి
యెలుఁగెత్తి పాటలు నీ వేమివినిపించేవే

చ. 3: విడెమిచ్చి జాగరాలు వేగినంతాఁ జేసిసేసి
యెడయక వలపించి యెంతసేసేవే
అడరి శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్నుఁ గూడె
యెడనెడ రతుల నీ వేలీల భోగించేవే

రేకు: 1284-2 సాళంగనాట సం: 22-440

పల్లవి: అతిరాజసపువాఁడ వౌదువు నీవు
సతమాయఁ బనులెల్లాఁ జనవియ్యవయ్యా

చ. 1: మనసువు గలసితే మాటలకు లోఁగావలె
ననుపులు గలిగితే నవ్వఁగవలె
చెనకులే యితవైతే చెప్పినట్టు సేయవలె
పెనఁగకుమిఁక నింతి పిలిచి రావయ్యా

చ. 2: వేడుకలు పుట్టితేను విన్నపాలు వినవలె
వాడిక లింపులై తేను వలవవలె
యీడుజోడై మెలఁగితే నిన్నీ నియ్యకొనవలె
వొడక చెలిమాటల కొడఁబడవయ్యా

చ. 3: ఆసలఁ దగులైతేను ఆయాలు గరఁగవలె
బాసలు దలఁచుకొంటేఁ బైకొనవలె
వాసితో శ్రీవేంకటేశ వచ్చికూడితి వింతలో
మోసపా కేపొద్దూ నీకెముందర నుండవయ్యా

రేకు: 1284-3 ముఖారి సం: 22-441

పల్లవి: పొత్తులవలపు గద్దా బూమిలోనను
యిత్తల నీచేఁతలకు నేమందు నిన్నును

చ. 1: బత్తితోడ నాపె నీకు పాదాలొత్తఁగాను
హత్తి నామొగము చూచే వదేమి నీవు
కొత్తలుగా నాపెనిన్నుఁ గొచ్చికొచ్చి చూడఁగాను
చిత్తగించి నాపైనేల చేయిచాఁచేవు

చ. 2: మచ్చికతో నాపె నీతో మాటలెల్లా నాడఁగాను
అచ్చులాన నాతో నవ్వే వదేమి నీవు
పచ్చిదేర నాపె నీకు బాగా లందియ్యఁగాను
ఇచ్చకానకు నాకిచ్చే వింతలోనే నీవు

చ. 3: నెట్టుకొని సేస లాపె నీపైఁ జల్లఁగా నాకు
అట్టె పచ్చడము గప్పే వదేమి నీవు
యిట్టె శ్రీవేంకటేశుఁడ యిద్దరి నేలితి విదె
గట్టిగా మేలవాఁడవై కలిగితివి నాకు

రేకు: 1284-4 భైరవి సం: 22-442

పల్లవి: ఇంతులాల మాపుదాఁకా నేమిచెప్పేను
అంతరంగాన నున్నాఁడు అన్నియుఁ దానెఱుఁగును

చ. 1: యెనసివుండుదుఁగాని యెరవులు సేయనేర
పెనఁగి పైకొందుఁగాని బిగియనేర
ననుపే చూపుదుఁగాని నమ్మక సాదించనేర-
నని విన్నవించరే అన్నియుఁ దా నెఱుఁగు

చ. 2: చేరి చెలఁగుదుఁగాని చిన్నఁబోయేయందుకోప
సారె మోముచూతుఁగాని జంకించనోప
కూరిమి చల్లుదుఁగాని కోపగించుకొననోప
అరీతి విన్నవించరే యన్నియుఁ దానెఱుఁగు

చ. 3: సిగ్గులువడుదుఁగాని చిట్టకము సేయఁజాల
వొగ్గి వేడుఁకొందుఁగాని వొరయఁజాల
యెగ్గులేక తానే వచ్చియేలె శ్రీవేంకటేశుఁడు
అగ్గమై విన్నవించరే యన్నియుఁ దానెఱుఁగు

రేకు: 1284-5 గౌళ సం: 22-443

పల్లవి: చేరి యాతనికి బుద్దిచెప్పవద్దా నీవే తొల్లి
నేరుపుతో నీతగవు నీవెఱఁగవటవే

చ. 1: గామిడిమాటలాడఁగాఁ గడఁగి తిట్టితిఁగాక
యేమంటినే నీమగని నింతిరో నేఁడు
గోమునఁ జెనకరాఁగా గోరగిరితిఁగాక
చేముట్టి యేమైనానుఁ జేసితివటే

చ. 2: కొంగువట్టితియ్యఁగా గుబ్బల నొత్తితిఁగాక
వెఁగలినీపతి దడవితినటవే
సంగాతాలు సేయరాఁగా సారెకు నవ్వితిఁగాక
పంగించి యాతని నేఁ దప్పకచూచితినటే

చ. 3: వావి చెప్పఁగాఁ గాఁగిట వడి బిగించితిఁగాక
శ్రీవేంకటేశ్వరుం బిలిచితినటవే
కైవసమై మోవియ్యఁగా గంటిచేసితిఁగాక
యీవల నీతనిపొందు లెఱుఁగుదునటవే

రేకు: 1284-6 పాడి సం: 22-444

పల్లవి: కనికరించఁగరాదా కాంతఁ జూచి ఇఁక నైనా
యెనలేనిసరసము లెందాఁకా నాడేవు

చ. 1: కొనచూపులనే యింతి కోరికతో నిన్నుఁ జూచీ
చనవిచ్చికూచుండుమనఁగరాదా
తనివోనియాసలతో దండనే నిలుచున్నది
ననుపు సేలుకొని నవ్వఁగరాదా

చ. 2: వెక్కసపు దమకాన వేళ గాచుకవున్నది
అక్కరతోఁ బిలిచి మాఁటాడరాదా
నెక్కొన్నమోహముతోడ నివ్వెరగున నున్నది
చెక్కునొక్కి బుజ్జగించి చెనకఁగరాదా

చ. 3: యెదుటనే నీకాఁగిటి కేఁకారుతానున్నది
పొదిగి రతుల నిట్టె భోగించరాదా
కదిసి శ్రీవేంకటేశ కరుణించి యేలితివి
మదిఁ జొక్కి యీట్లానే మన్నించరాదా

రేకు: 1285-1 దేసాళం సం: 22-445

పల్లవి: ఇద్దరికోరికలును యేకమౌత గంటిమి
పొద్దున విచ్చేయవయ్యా పొందు లొనగూడెను

చ. 1: వెలయ నేఁ జేసినవిన్నపాలెల్లా వింటివి
యెలమితో వచ్చేనని యియ్యకొంటివి
తలంచుక యేపొద్దూఁ జిత్తానఁ బెట్టుకుండవయ్య
చెలియతో నన్నియునుఁ జెప్పవచ్చే మీఁకను

చ. 2: కైకొని సతియంపినకానుక లందుకొంటివి
ఆకెకు నీవుడుగర లంపితివి
జొకతో సింగారించు కచ్చొటి కిట్టె రావయ్య
సేకరకముగానీరాక చెప్పివచ్చే మీఁకను

చ. 3: మావెంటనే వచ్చినీవు మగువతోఁ గూడితివి
దేవులాయ నీకు నాపె తెల్లమిగాను
యీవల విందాయితము యింట్లోఁ జేసీ నీకు
శ్రీవేంకటేశ నీయింపు చెప్పివచ్చే మీఁకను

రేకు: 1285-2 గౌళ సం: 22-446

పల్లవి: వలదనేమా మిమ్ము వట్టిసట లేలయ్య
తలకొనెఁ దమకము తడవేల యిఁకను

చ. 1: మొనసి మీరిద్దరును మోములు చూచుకొంటిరి
ననుపులు సమకూడ నవ్వుకొంటిరి
పెనఁగుచు వలపులు పెంచుకొందురుగాక
పనిలేనిసిగ్గులు పడనేల యిఁకను

చ. 2: పిలువక వచ్చి యొక్కపీఁటపైఁ గూచుంటిరి
చెలరేఁగి వావులు చెప్పుకొంటిరి
పులివచ్చిరతులలొ నోలలాడుదురుగాక
మలకలమతకపుమరఁగేల యిఁకను

చ. 3: కడుఁజుట్టకరిముతోఁ గాఁగిలించుకొంటిరి
విడియాలు నందుకొని వేసుకొంటిరి
అడరి శ్రీవేంకటేశ యప్పుడే నన్నేలితివి
నడుమ నాపెతోడిసన్నలూనేల యిఁకను

రేకు: 1285-3 వరాళి సం: 22-447

పల్లవి: చెలి నీకుఁ దగినది చెప్పవచ్చితిమి నేము
పిలుచక రమ్మన్నది ప్రియము చేకొవయ్యా

చ. 1: కలికిచేఁతలది కడుఁగడుఁజక్కనిది
తలఁపు నీపైఁ బెట్టి తగులైనది
మొలకచన్నులది సొమ్ములు నిండాఁ బెట్టినది
నెలకొని యాసలతో నీకు వలచినది

చ. 2: చేరఁడేసి కన్నులది చిత్తరుబొమ్మవంటిది
కోరి నీగుణాలే యడుగుతామన్నది
మూరెఁడంత గొప్పుది ముసిముసినవ్వులది
వేరులేక నిన్నుఁ జూచేవేడుకతో నున్నది

చ. 3: కొమరెవయసుది గుణాల నెక్కుడైనది
తమి నిన్ను వినివిని తనియనిది
జమళి శ్రీవేంకటేశ సతిఁ గూడితి వింతలో
అమరి నీదేవులై యానందింపుచున్నది

రేకు:	1285-4 సామంతం	సం:	22-448

పల్లవి:	ఇల్లాండ్లము నేము ఇంత సేయఁగలమా
మెల్లఁగె నీచిత్తమురా మెలఁగేముగాక

చ. 1:	నవ్వులు నిన్ను నవ్వించి నయగారిమాటలాడి
నివ్వటిల్ల భ్రమయించనేరుచు నాపె
పువ్విళ్లూర మోవి చూపి వొద్దనుండి నోరూరించి
తవ్వితవ్వి వలపులు తమిరేఁచును

చ. 2:	కన్నులఁ దప్పక చూచి కడుబొమ్మల జంకించి
వున్నతి దగించుకోనోపు నాపె
చన్నుల నిన్నునొరసి సారెకు నీతో సొలసి
తిన్నఁగా ననేకతరితీపులఁ దేలించును

చ. 3:	కలికి తనాలు చూపి కాతరానఁ బైకొని
బలిమి నిన్ను గలయ బాగరి యాపె
యేలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అలరి తానన్నీ నీకు నలవాటు సేసును

రేకు: 1285-5 వళవిగౌళ సం: 22-449

పల్లవి: వలపు గంపలఁ బెట్టి వడిఁ దలకెత్తవయ్య్య
యిలనిట్టె యాసాదము యింకా నెంతగలదో

చ. 1: మాటలాడి తనివోదు మగువ నీతోడుత
తాటించి పాదాలొత్తి తనివోదు
కాటుకకన్నులఁ జూచి కమ్మటిఁ దనివోదు
మేటియైనయీపెకు నీమీఁద నెంతమోహమో

చ. 2: ననుపునఁ గవకవనవ్వియునుఁ దనివోదు
తనువుసోఁకఁ బెనంగి తనివోదు
చెనకుచు మెచ్చిమెచ్చి చెక్కునొక్కి తనివోదు
పసివూని యాపెకు నీపై నెంతమోహమో

చ. 3: కలికితనాల నిన్నుఁ గాఁగిలించి తనివోదు
తలిరుమోవి యాని తనివోదు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అలమె నిన్నీపెకు నీయందు నెంతమోహమో

రేకు: 1285-6 లలిత సం: 22-450

పల్లవి: వింటివటె మగువా విభుఁడు నీవు నుండఁగాఁ
గంటి మీసొబగులెల్లా గక్కన మీయందునే

చ. 1: తలపోఁతలే పండుగ తరితీపులే వేడుక
పిలుపులే చెప్పరాని ప్రియములు
సొలపులే పాయరానిచుటరికపుఁ జేఁతలు
చెలులకుఁ బతులకుఁ జెప్పరానిచవులు

చ. 2: ననుపులే నిధానాలు నగవులే నిచ్చపంట
పెనగొన్నసరసాలే పెనువిందులు
తనివొనిచెనకులు తరగనిధాన్యాలు
యెనసినదంపతుల కెంచరానిచవులు

చ. 3: ముచ్చటలే సంపదలు మోముచూపులే భాగ్యము
విచ్చనవిడిరతులే వింతసొమ్ములు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నిన్ను నేలె
నిచ్చలు మీలోమీకు నిండుకొన్నచవులు

రేకు: 1286-1 శ్రీరాగం సం: 22-451

పల్లవి: ఎఱుఁగుదు రందరును యేల దాఁచేవు మోహము
వెఱపేల ఇఁకఁ దెర వేసుకోరాదా

చ. 1: ననుపునఁ జవరాలు నాఁటఁగంజూచినచూపు
తనివోనినీకుఁ బైతరవాయను
మొనగోరి చేతుల మొక్కినమొక్కులు నేఁడు
యెనలేనివలపుల కెచ్చరికకలాయను

చ. 2: సొరిది నప్పటి నాపె సొలసి యాడినమాట
మరిగించేమచ్చుమేపుమందాయను
సిరులుమించినయట్టిసెలవులనవ్వులు
బెరయనిరతులకుఁ బెడరేఁపులాయను

చ. 3: యిట్టె నీదేవులు చేతికిచ్చినయీకానుక
జట్టిగాన్నకాఁగిలే లంచములాయను
నెట్టన శ్రీవేంకటేశ నెమ్మి నీకె నేలితివి
చుట్టరికము లివియే సులభములాయను

రేకు: 1286-2 హిందొళం సం: 22-452

పల్లవి: ఆయనాయ నలసితి వన్నిటా నీవు
మోయరానివలపులు మోపుగట్టుకొనేవు

చ. 1: చెక్కులవెంటఁగారేచెమట దుడుచుకోవే
యిక్కడ నాపతితోడ నేమినవ్వేవు
చక్కఁబెట్టుకొనవే నీజారినపయ్యదకొంగు
చొక్కుచు నాతని నేమిచూచేవు నీవు

చ. 2: చెదరివిడినకొప్పు సిగ్గుతో ముడుచుకోవే
యెదుట నిలుచుకుండి యేమి మొక్కేవు
వదలినపోఁకముడివంక చూచుకొనవే
కదిసి యంతాతని కేఁకారేవు నీవు

చ. 3: లలిఁ బెదవిపై తమ్ములము గడుగుకొవే
కలయికలకు యేమి కాఁతాళించేవు
అలమి శ్రీవేంకటేశు డన్నిటాను నన్నునేలె
తలఁచి యాతనినేల తడవేవు నీవు

రేకు: 1286-3 శంకరాభరణం సం: 22-453

పల్లవి: నాతిరో ముఁజేతికంకణాన కద్దము వలెనా
యీతల నింకానేలే యేడలేని మాటలు

చ. 1: మోమునఁ గళలు దేరీ మొగఁడు వద్ద నున్నాఁడు
ఆముక లోన నుంటిరి యప్పటనుండి
కామించి మిమ్ముఁజూడ గక్కన వచ్చితేను
యేమనేవే నాతోను యేడలేనిమాఁటలు

చ. 2: పానువు పై దానున్నాఁడు పాదాలొత్తేవు నీవు
వూని చెమటగారీఁ గొప్పూ వీడెను
కానీవే నేఁగంటే నన్నుఁ గడునొడబరిచేవు
యేనాట నేర్చుకొంటివే యేడలేనిమాటలు

చ. 3: చేవదేరె నీమోవి శ్రీవేంకటేశుఁడు నాఁడు
కావించి, పచ్చడ మిట్టె కప్పుకొంటిరి
యీవేళ నేరాఁగాను యీతఁ డిట్లైనన్నుఁ గూడె
యేవల్లఁ జెల్లఁబెట్టేవే యేడలేనిమాటలు

రేకు: 1286-4 సౌరాష్ట్రం సం: 22-454

పల్లవి: వద్దనేమో నేము నిన్ను వట్టిసట వొద్దుగాక
బుద్ధు లాతనికిఁ జెప్పి బొదించఁగాను

చ. 1: పంతమేల పలికేవే పడఁతీ
అంతే కలితే పతితో నాడుకొనవే
వంతుకేల పెనఁగేవే వాడలోనను
చెంత నాతనికే యింకా సేసగా వలవవే

చ. 2: వరగ నీపగ టెంతపచారించేవే
సొరిది నాతనికే చూపవే నీవు
మురిపెములేఁటికి నాముందరను
మరిగినదాఁకాను నీమగనిఁ జోక్కించవే

చ. 3: నన్నునేల కొసరేవే నడుమ నీవు
అన్నీ నాతని నీవే యడుగఁగదే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డేలి నాకుఁ జనవిచ్చె
యెన్నటిపొందులో నీవూ నెఱిఁగించుకొనవే

రేకు: 1286-5 నాదరామక్రియ సం: 22-455

పల్లవి: ఇంతనీ కబ్బురమౌత యెఱఁగ మిన్నాళ్లు నీకె
వింతలెల్లాఁ గంటిమి వెరగయ్యీ మాకు

చ. 1: సతియంపినలేకలు చదువుకచదువుక
కతగాఁ జేప్పేవు వద్దికాంతలకును
తతి నాపెదూతికను దండఁ గూచుండఁబెట్టుక
అతిమోదమున నీ వందరికిఁ జూపేవు

చ. 2: తరుణిమాఁటలు నీవు తలఁచుకతలఁచుక
శిరసూఁచక మెచ్చేవు చెలులతోడ
గరిమ నాపెయంపినపరిమళా లందుకొని
పరగ నందరికినిఁ బంచిపెట్టేవు

చ. 3: సుదతిసొమ్ములపెట్టె చూచుకచూచుక
పదిమారులురచ్చలోఁ బచారించేవు
యిదివో శ్రీవేంకటేశ యిటు మమ్ము నేలితివి
పొదిగి యాపెవలపు బొసఁగించుకొనేవు

రేకు: 1286-6 కాంబోది సం: 22-456

పల్లవి: ఎందఁకా వట్టిజోలి యెంతవొద్దువోయ నేఁడు
ఇందరుఁ జుట్టాలే మాఇంటికి రావయ్యా

చ. 1: మాటలెన్నైనాఁ గలవు మళ్లి యాడేమంటి
జూటుఁదనాలునేర్చినసుదతులకు
కూటువగూడినయట్టికొలువులో నాడితేను
యేఁటికి వినేవు మాయింటికి రావయ్యా

చ. 2: చేఁత లెన్నైనాఁ గలవు చేకొని సేసేమంటే
పూఁతనవ్వులఁదేలించేపొలఁతులకు
బాఁతిపడి యిందుకెల్లా భ్రమయనేఁటికి నీకు
యీఁతకు లోఁతున్నదా మాఇంటికి రావయ్యా

చ. 3: చూపలెన్నై నాఁ గలవు సొలసి చూచేమంటే
తీపుల మోవులు చూపే తెఱవలకు
చేపట్టి నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
యీపాటేఁ గరుణించి మాయింటికి రావయ్యా

రేకు: 1287-1 దేవగాందారి సం: 22-457

పల్లవి: వెలయ నాగుణమెల్లా విన్నవించితి నీకు
చెలఁగి ఇందుకే సంతోసించుకొందు నేను

చ. 1: పట్టరానిమనసుతోఁ బదరి పై కొందుఁగాని
యెట్టునీవే మన్నించేది యెరుఁగుదును
నెట్టుకొన్నవేడుకతో నీకెదురుజూతుఁగాని
ఇట్టె నీవు వత్తువని యెంచుకొందు నేను

చ. 2: మోపరానివయసుతో ముంచి తమకింతుఁగాని
తాపుకొని నన్నేలేది తలఁచి మెత్త
చేవదేరే కోరికతో చెలిచేఁ జెప్పింతుఁ గాని
నా వాఁడవనే నిన్ను నమ్ముకొందు నేను

చ. 3: చెప్పరాని యాసతోఁ జేరి కొసరుదుఁగాని
కప్పి నాపై వలపెల్లాఁ గనుఁగొంటివి
ఇపుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొప్పైనయీగురుతులు చూచుకొందు నేను

రేకు: 1287-2 నాట సం: 22-458

పల్లవి: కంటివిగా వోయి దీనిగబ్బితనము మా-
ఇంటనే వుండుము దీనియెమ్మెలుడిపేను

చ. 1: సొలసిసొలసి చూచి చొక్కులఁబెట్టి నిన్ను
వలపించెఁగా ఇంతవడిగా నీపె
కలికితనాల నీతోఁ గాఁపురాలు సేసిసేసి
యెలయించెఁగా దీనియెమ్మె లెటువంటివో

చ. 2: సారెసారె మాటలాడి సన్నలుచేసి నీకు
నేరిపెఁగా వినయాలు నేఁడిన్నేసి
కూరిమి గొసరి నీగుణము లీపాటివని
యేరుపరిచెఁగా దీనియెమ్మె లెటువంటివో

చ. 3: పెనఁగి పెనఁగి నిన్నుఁ బ్రియమునఁ గాఁగిలించి
ననుపు రేఁచెఁగా నీకు నవ్వుతానే
నను నేలితి వింతలోననే శ్రీవేంకటేశ్వర
యెనయవచ్చి దీనియెమ్మె లెటువంటివో

రేకు: 1287-3 పాడి సం: 22-459

పల్లవి: ఎదురుబడి నున్నారు ఇద్దరూ మీరు
పొదిగి రతుల నిట్టే భోగించుటగాక

చ. 1: సేస వెట్టి పతితోడ సిగ్గువడనేఁటికే
ఆసలెల్లా రేఁగ గోర నంటుటగాక
వాసితోఁ గొసరి తలవంచుకొననేఁటికే
మోసపాక చేతులెత్తి మొక్కుటగాక

చ. 2: సరుసనే కూచుండి జాగులు మరేఁటికే
బెరసి వలపులెల్లాఁ బెంచుటగాక
సరసములాడి పొద్దు జరపఁగనేఁటికే
సురతభోగాల చవిచూపుటగాక

చ. 3: కనువిచ్చి చూచితయును కాంతలమఱఁగేటికే
ననిచి కాగిటఁగూడి నవ్వుటగాక
యెనసితివి శ్రీవేంకటేశు నింతలో నీవు
మనసిచ్చి యీతనినే మరుగుటగాక

రేకు:	1287-4 భైరవి	సం:	22-460
పల్లవి:	తప్పు లెంచేనా నీతలఁపులోదానను
	వొప్పుఁజెప్పి నన్నునెంత వొడఁబరచేవు
చ. 1:	చూడఁజూడ చూపులకు చోద్యములు నీచేతలు
	ఆడుకొన నందరికి నబ్బురములు
	తోడ దిష్టాలైయున్నవి తొల్లె రేపల్లెవాడల
	యీడ మాతో వట్టిబాస లేలసేసే వింకను
చ. 2:	వినవిన వీనులకు వేడుకలు నీగుణాలు
	వొనరఁ దలఁచుకొంటే నుబ్బురేఁచేవి
	వినుతింప మదురలో వెల్లవిరులై యున్నవి
	మనసులొ మఱవము మఱఁగేల పెట్టేవు
చ. 3:	కొరకొరఁ గాఁగిటికిఁ గొనసాగె నీపొందులు
	నేరిచితే రతులకు నిదానములు
	యీరీతి శ్రీవేంకటేశ యెన్నికలై యున్నవి
	చేరి నన్నేలితి వెంత సెలవుల నవ్వేవు

రేకు: 1287-5 కాంబోది సం: 22-461

పల్లవి: చెలియా యిప్పుడే బుద్ధిచెప్పితిజూమీ నీకు
చెలరేఁగి చిత్తమురా సేవలెల్లాఁ జేయవే

చ. 1: కంకణాలచేతులఁ గాఁగిలించి రమణుని
వుంకువగా మోవి యిచ్చి వూరడించేవు
మంకుదనాన నితని మాటల దూరవుగదా
లంకెలఁ బెనఁగి యింకా లాలించఁగదవే

చ. 2: చిప్పిలుగుబ్బల నూఁది చెక్కునొక్కి యీతనికి
చెప్పరానిప్రియాలెల్లాఁ జెప్పేవు నీవు
అప్పటి వుబ్బున నీవేమైనాఁ జేయవుగదా
ముప్పిరిఁ బాదాల కింకా మొక్కనేనాఁ గదవే

చ. 3: కొచ్చి మోముమోముతోడఁ గూడించి శ్రీవేంకటేశు-
నిచ్చకములెల్లాఁ జేసి యెనసితివి
అచ్చపురతులవేళ నలయించవుగదా
మచ్చికల బుజ్జగించి మరిగించఁగదవే

రేకు: 1287-6 గౌళ సం: 22-462

పల్లవి: అవదార చిత్తగించవయ్యా యీకెదిక్కు
కవగూడి ఇప్పుడిట్టే కాఁగిలించవయ్యా

చ. 1: చినుకుచిరుఁజెమట చెక్కులవెంటఁ గారఁగా
వనిత ఇదివో నీవద్దికి వచ్చె
కొనలు వేళ్లఁ దురుము కొంతగొంత ముడుచుక
యెనలేనితమితోడ నిదె నిలుచున్నది

చ. 2: పొలపునిట్టూర్పులు పుక్కిళ్ల నాఁపుకొంటా
వెలఁది నీకు సురటి వినరీ నిదె
నెలకొన్నయాసతోడ నిన్నుఁజూచి వెరగంది
కొలువులో నీపొందు గోరుకొంటానున్నది

చ. 3: మదనకళలెల్లా నెమ్మది మోమున నుండఁగా
సుదతి నిన్నే తప్పకచూచిఁ దాను
ఇదివో శ్రీవేంకటేశ యెనసితి వింతలోన
తెరవేసుక రతులఁ దెప్పలఁ దేలీని

రేకు: 1288-1 శంకరాభరణం సం: 22-463

పల్లవి: నీవల్లనే యింత నేరుపరియాస నాపె
వేవేలుపగటులను వెలయఁగవలదా

చ. 1: కన్నులనే నవ్వుదువు కాఁకతోఁ గొలుపులోన
సన్నలెల్లాఁ జేతువు సారెసారెకు
ఇన్నిటాను మందెమేళ మింత సేసుకొంటివి
పన్ని వుద్దండాన నిన్నుఁ బలుకఁగవలదా

చ. 2: వేడుకతో విందువు విన్నపా లాపెచేత
ఆడుదువు సరసము లంటిముట్టి
పాడితో నీవే యాపె పంతములెక్కించితివి
జోడై నీకు రాజసాలు చూపఁగవలదా

చ. 3: వూరకే పొగడుదువు వొకటొకటే యాపెను
చేరి కాఁగిలింతువు శ్రీవేంకటేశ
గారవపురతులనే కరకుపరచితివి
కోరి నన్నేలితి వాపెఁ గొసరఁగవలదా

రేకు: 1288-2 నాదరామక్రియ సం: 22-464

పల్లవి: అందుకే వెరగయ్యీ నప్పటనుండిఁ జూచి
ఆందముగ నేనే నీకు నాలనై వుందానను

చ. 1: చెక్కునొక్కి సతి నిన్నుఁ జనకియుఁ దనివోదు
తక్కక సేవలు సేసి తనివోదు
యిక్కువలంటి మోహ మెఱిఁగించి తనివోదు
ఇక్కడ దీనిబత్తి యింకా నెంతగలదో

చ. 2: చెలరేఁగి విన్నపాలు సేసియునుఁ దనవోదు
తలఁచి నిన్నుఁ బొగడి తనివోదు
వెలయ నీసుద్దులు వినివిని తనివోదు
యెలమి నీపై బత్తియింకా నెంతగలదో

చ. 3: పచ్చిగాఁగ నిన్ను గుబ్బలనొత్తి తనివోదు
తచ్చితచ్చి కాఁగిలించి తనివోదు
యిచ్చట శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
హెచ్చినతనబత్తి యింకా నెంతగలదొ

రేకు: 1288-3 మాళవిగౌళ సం: 22-465

పల్లవి: చెప్పవయ్యా ఆసుద్దులు చెవులారా వినేము
ముప్పిరిగాఁ జెలులతో ముచ్చటలాడేవు

చ. 1: యేకతాన నాపె నీతో నేమని విన్నవించెనో
చేకొని సంతోసానఁ జెలరేఁగేవు
ఆకుమడిచిచ్చినప్పు డాస లేమివెట్టెనో
జోకతోఁ గళలు దేరీ సొంపుగ నీమొగము

చ. 2: సరుసఁ గూచుండి యేమిసన్నలు నీకుఁ జేసెనో
శిరసెత్తి నవ్వుకొంటాఁ జిమ్మిరేఁగేవు
విరులుముడిచేవేళ వేడుక లేమిచూపెనో
గరిమతో రతులకుఁ గడుఁదమకించేవు

చ. 3: పాదాలు గుద్దుతా నేమి పక్కఁన జెనకెనో
ఆదరించి కాఁగిలించి యానందించేవు
పాదితోడ నేలిత విప్పుడు శ్రీవేంకటేశ్వర
పాదుకొని నీలోనీవే భావించి మెచ్చేవు

రేకు: 1288-4 సామంతం సం: 22-466

పల్లవి: కంటివటే చెలియా ఇక్కడ నీతారుకాణలు
యింటిలో నుండఁగా నీకు నీడేరెనే వలపు

చ. 1: సారెకు మాటలాడఁగాఁ జవులెక్కె వలపు
కూరిమి గొసరఁగాను కుప్పలాయ వలపు
చేరి వాయకుండఁగాను చిమ్మిరేఁగె వలపు
యీరీతి మేలే నీకు నీడేరె వలపు

చ. 2: సన్నలా చాయలానే సతమాయ వలపు
తిన్నవినవ్వులనే తీగెసాగె వలపు
విన్నపాలు సేయఁగానే వేడుకాయ వలపు
యిన్నేసిచేతల నీకు నీడేరె వలపు

చ. 3: కూడి సరసమాడఁగా గుఱుతాయ వలపు
వాడికల మెలఁగఁగా వనమాయ వలపు
జోడై శ్రీవేంకటేశు జొక్కించితివి కాఁగిట
యీడ నీనేరుపులనే నీడేరెనే వలపు

రేకు: 1288-5 మాళవిగౌళ సం: 22-467

పల్లవి: చేకొని వూడిగములు సేసేవారి పైనే బత్తి
యీకాలము దొరలకు నేమిచెప్పే మిఁకను

చ. 1: తచ్చితచ్చి యాపె నీపాదాలు గుద్దెనంటాను
మెచ్చిమెచ్చి పొగడుతా మేలమాడేవు
కొచ్చికొనగొర నీకొప్పు దువ్వెనంటాను
యిచ్చగించి తమ్ములము యీవిగా నిచ్చేవు

చ. 2: కలికి నీమర్మాలంటి గందము వూసెనంటాను
చెలరేఁగి యాపెమీఁద జేయిచాఁచేవు
పలుమారు నేకతాన బాగా లొసఁగెనంటా
అలమి చెక్కులునొక్కి యాదరించేవు

చ. 3: చెనకుచుఁ జెప్పరానిసేవలెల్లాఁ జేసెనంటా
కనుఁగొని నవ్వునవ్వి కాఁగిలించేవు
యెనసితివి శ్రీవేంకటేశ యీమాటకు నన్ను
మనసిచ్చి యాపెను నామారుగాఁ జూచేవు

రేకు: 1288-6 బౌళి సం: 22-468

పల్లవి: వలవఁగలట్టెల్లా వలచినది
కలసిమెలసి యిట్టె క రుణించవయ్యావ

చ. 1: చిగురుఁబెదవులనుఁ జెప్పి నీకుఁ బ్రియములు
మగువ నింతటనైనా మన్నించవయ్యా
నిగిడి అపటనుండి నిలిచి కొలువుసేసీ
అగడుసేయనేల ఆదరించవయ్యా

చ. 2: చక్కనిమోమెత్తి నిన్నుసారె సారెకునుఁ జూచీ
చెక్కులునొక్కి చనవు చెల్లించవయ్యా
మొక్కుతానే నీతో మొలకనవ్వులు నవ్వీ
యిక్కువలంటి లాలించి యీడేర్చవయ్యా

చ. 3: కొమలపుఁ జేతులను కోరి నీకు విడెమిచ్చీ
ప్రేమ నందుక కాఁగిట బిగించవయ్యా
కామించి శ్రీవేంకటేశ నీమనసు దక్కఁగొనె
వేమరు రతుల నింకా వెలయించవయ్యా

రేకు: 1289-1 ఆందోళి సం: 22-469

పల్లవి: ఇటువంటిచేఁతలనె ఇన్నిటా నే వలచితి
విటరాయ నిన్నుఁ జూచి వేడుకాయనయ్యా

చ. 1: మనసిచ్చి మాటాడి మర్మములు రేఁచేవు
కనువిచ్చి చూచి మతి గరఁగించేవు
చెనకుచు పలుమారు సిగ్గులు వుట్టించేవు
యెనసి పొందులుసేయ నెంతనేర్తువయ్యా

చ. 2: చెక్కునొక్కి బుజ్జగించి సెలవుల నవ్వించేవు
చిక్కనిచన్నులు ముట్టి చెలఁగించేవు
చక్కెరమోవి చూపి సారె నోరూరించేవు
యిక్కువలంటి మెప్పించ నెంతనేర్తువయ్యా

చ. 3: చుట్టరికములు చెప్పి సొంపున నుబ్బించేవు
దట్టముగ సేసచల్లి తమి నించేవు
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
యెట్టనెదుట లాలించ నెంతనేర్తువయ్యా

రేకు: 1289-2 సాళంగనాట సం: 22-470

పల్లవి: వద్దనేమా నేము నిన్ను వట్టిదూరులేల దూర
సుద్దులు చెప్పవే నీవూ సొద్యములుగాను

చ. 1: మావద్దఁ గూచుండఁగాను మాటాడితి నతనితో
దేవులవైతే నీవూఁ దెలుసుకొవే
వావులు చెప్పఁగా నే నివ్వల సరసమాడితి
చేవల్లకు వచ్చి నీవు చెవులారా వినవే

చ. 2: చెనకఁగా నే నితనిచెలిమి సేసితి విట్టె
పనిగలితే నీవూఁ జూపవే మోము
ననుపుగా నవ్వఁగాను నాఁటఁ జన్నులనొత్తితి
మనసొక్కటిగా నీవూ మళ్లిమళ్లి చూడవే

చ. 3: సన్నసేయఁగా నితని సమరతులఁ జొక్కితి
మున్నె పొఁదైతే నీవూ మొక్కు మొక్కవే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిల నన్ను మన్నించె
యెన్నఁగా నీవు మమ్ము నిద్దరిఁ బొగడవే

రేకు: 1289-3 శుద్దదేశి సం: 22-471

పల్లవి: ఎన్నఁడు గడించుకొంటి వీకెను నీవు
యెన్నరాదు దీనిపగ టెవ్వతోయీ

చ. 1: పెదవులవిడేలతోఁ బిక్కటిల్లుచన్నులతో
యెదుటనే నిలుచున్న దెవ్వతోయీ
వుదుటులు చూప్పుకొంటా నుబ్బించి నవ్వుకొంటా
యిదివో నీదిక్కే చూచీ నెవ్వతోయి

చ. 2: సోమ్ములతో విఱ్ఱవీఁగి సొలపుల మాటాడుతా
యెమ్మెలెల్లాఁ జూపీని యెవ్వతోయి
నిమ్మపండెగరవేసీ నీటుతోను మురిసీని
యిమ్ముల బిటారికత్తే యిదెవ్వతోయి -

చ. 3: వలపు నీపైఁ జల్లి వద్దనే కూచుండి నిన్ను
నెలయించీ సారెకు నెవ్వతోయి
వెలయ నేలితివి శ్రీవేంకటేశ నన్ను నిట్టే
యెలమిఁ జుట్టమైవున్న దెవ్వతోయీ

రేకు: 1289-4 కన్నడబంగాళం సం: 22-472

పల్లవి: ఇంచుకంతా గుట్టెఱంగ దిదేమీకే
యెంచరాదు దీనిగర్వ మీదే మీకే

చ. 1: సంతోసాన నీవు చేసన్నలు సేసితేను
యింతులకెల్లాఁ జూపీ నిదే మీకె
చెంత నీ నప్పటిఁ దనుఁ జేరి సుద్దు లడిగితే
యెంతసిగ్గువడీఁ దాను యిదే మీకే

చ. 2: నెమ్మది నీవు దననెలవు లడిగితేను
యెమ్మెలకు నవ్వు నవ్వీ నిదే మీకె
సమ్మతించ కొనగోరు చన్నులపై నూఁదితేను
యిమ్ములఁ దప్పకచూచీ నిదే మీకె

చ. 3: చుట్టరికములు నీవు సాదించి చెప్పితేనే
యిట్టే కాఁగిట నించీ నిదే మీకె
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
యెట్టిదో తనవేడుక యిదే మీకె

రేకు: 1289-5 శ్రీరాగం సం: 22-473

పల్లవి: చూచితి నే నప్పుడు మీసొంపులు కిమ్ములనుండి
ఆచోటిదానిచేఁత లివౌనా వోయీ

చ. 1: పిలిచెఁగా అదినిన్ను పెద్ద పెద్ద యెలుఁగున
సొలసెఁగా మాటలను చొక్కులఁ బెట్టి
వెలయఁ బానుపుమీఁద విడెము చేతికిచ్చెఁగా
తలఁచుకో అలనాటిదానిసుద్దులోయీ

చ. 2: నొక్కెఁగా చెక్కులు నిన్ను నోరఁ దమ్మవెట్టుమని
మొక్కెఁగా చేయెత్తి ముసిముసినవ్వుతో
వెక్కసపుఁజన్నులను వేడుకతో నొత్తెఁగా
చొక్కుచు నెంచుకో దానిచుట్టరికాలోయీ

చ. 3: పెనఁగెఁగా కాఁగిటను ప్రియములు రెట్చించ
తనిసెఁగా రతులను తారుకాణలై
యెనసితివి శ్రీవేంకటేశ యిప డిటు నన్ను
మనసునఁ బెట్టుకో మర్మములు దానివోయీ

రేకు: 1289-6 సౌరాష్ట్రం సం: 22-474

పల్లవి: చెలఁగి యప్పుడు సంతోసించుకొందువుగాని
చలపట్టితవివమోవి చౌలుగొనేను

చ. 1: చన వాతఁ డిచ్చెనంటా సారె నిన్నుఁ జూచెనంటా
యెనసి పెద్దరికము లేమిచేప్పేవే
ననుఁజూడు నీయెదుట నయమున నాతని
మనసు చొక్కించి నన్నే మరిగించుకొనేను

చ. 2: సొమ్ములు నీకిచ్చెనంటా చొప్పుగాఁ జెనకెనంటా
యెమ్మె లిందరికి నీవు యేమిచూపవే
కమ్మి నాపంతము విను గక్కన నాతనినా -
సొమ్ముచేసుకొని యీడుజోడై వుండేను

చ. 3: వలపించుకొంటినంటా వాడికై యున్నాఁడంటా
బలిమి నీనేరుపెంత పచారించేవే
కొలిచి శ్రీవేంకటాద్రి గోవిందరాజుకాఁగిట
నెలకొంటి నింకాను నిన్నే మెప్పించెను

రేకు: 1290-1 కురంజి సం: 22-475

పల్లవి: కామిని యప్పటనుండి కాచుకున్నది నీవేళ
ప్రేమము నీకుఁ జేసె ప్రియము చేకోవయ్యా

చ. 1: పలుకులఁ గొసరీని భామ నీతో సారెసారె
చెలుములు సేసీని చెనకులను
వలపులు చల్లీని వాడికమొక్కులను
పిలిచీ వింటికి నిన్నుఁ బ్రియముచేకొవయ్యా

చ. 2: ననుపులు సేసీని నయముల నవ్వుల
చనవిమ్మని యడిగీ సరసముల
వునుకులు చెప్పీని వుడివొనిసన్నల
పెనఁగీ నీరతులకు ప్రియము చేకోవయ్యా

చ. 3: వదలుఁబయ్యద చూపి వలపు నీపై నించి
గుదిగుచ్చీ వాపులు కొలువులోన
యిదె శ్రీవేంకటేశ్వర యీకె యలమేలుమంగ
పెదవితేనె లొనఁగీ ప్రియము చేకోవయ్యా

రేకు: 1290-2 కన్నడగౌళ సం: 22-476

పల్లవి: ఇతరికాంతలు చూచియేమని నవ్వుదురో
రతివేళచేఁతలు మరఁగుచేయఁగదవే

చ. 1: సమరతి యాతనితో సలుపఁగాఁ బొడమిన-
చెమటార విసరవే చెలువునికి
తమల మప్పుడు నీకు తమితోడఁ బెట్టెనేమో
అమర వేరొక్కవిడెమంది చేతికియ్యవే

చ. 2: కప్పుకొన్నవచ్చడము కడునెరి విరిగెను
యెప్పటివలెనే విచ్చి యియ్యఁగదవే
లప్పలై గందము రాలీ లావునఁ బెనఁగెనేమో
చొప్పెఱఁగకుండాఁ గస్తూరి మీఁదఁ బూయవే

చ. 3: సరసమాడఁగనేమో తురుము వీడివున్నది
విరులు ముడువవే వేవేగను
అరిది శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవిభుఁడు
నెరులచిక్కు దిద్దవే నెట్టన నన్నేలెను

రేకు: 1290-3 శంకరాభరణం సం: 22-477

పల్లవి: ఇదివో దంపతు లిద్దరు న్నున్నారు
పుదుటున దంతెపుటోవరిలోన

చ. 1: పొందులమాఁటలఁ బొసఁగుముచ్చటలు
కందువకాఁగిటకల యికలు
విందులవమోవులవియ్యపుసన్నలు
అందెను తెరవెయ్యరే చెలులు

చ. 2: చనవులమీరేటిసరపుఁజేఁతలు
తనియక పెనఁగేటి తమకములు
చెవకులలోపలి చిరుసిగ్గు లెసఁగె
అనువుగఁ దెరవేయరే చెలులు

చ. 3: కెలయుచు నెటిఁగినకేరేటినవ్వులు
కొలఁదిమిగులుబుసకొట్టులును
బలు శ్రీవేంకటేపతి కలమేల్మంగ -
కలవడే దెరవేయరే చెలులు

రేకు: 1290-4 శుద్ధవంతం సం: 22-478

పల్లవి: ఏమే వట్టితరితీపు లేలసేసేవే
ప్రేమగలచోటన పెనఁగఁగఁదగదే

చ. 1: నెట్టనఁ బతి విలిచీ నిన్ను చేసన్నలేఁటికే
చుట్టరికము చెప్పఁగా సుద్దులేఁటివే
గుట్టుతోడ రమణునిఁ గూడుటే మేలు యిఁక
బట్టబయలు పందిలివెట్టనేఁటికే

చ. 2: కొంగువట్టితియ్యఁగా నిక్కువలు చెప్పఁగనేలే
ముంగిటఁ జన్నులంటఁగ మొక్కులేఁటివే
సంగతిగా దేవులవై చనవు చేకొంట మేలు
యింగితపుటాసలనేల దొంతివెట్టేవే

చ. 3: బూవాన నుంటివి మేలుపొందు లేమిచూచేవే
చేవదేరఁ గాఁగిలించి సిగ్గులేఁటికే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁజెందె నలమేల్మంగవు
కైవసమై కతలెన్ని గాదెఁ బోసేవే

రేకు: 1290-5 ముఖారి సం: 22-479

పల్లవి: ఎంతటుట్టడితనమే యెందు నేరుచుకొంటివే
వింతలుగా నీతనికి వినోదాలు సేసేవు

చ. 1: కడలేనినవ్వులు గాదెఁ బెట్టుకుందానవా
గుడిగొనఁ బతివద్దఁ గుప్పవోసేవు
వొడికపుజాణతనా లొడిఁగట్టుకుందానవా
వెడ వెడగా సారె వెద చల్లేవు

చ. 2: మురిపెములల్లాను మూటగట్టుకుందానవా
పరిపరివిధములఁ బచరించేవు
గరిమలవలపులు గంపఁబెట్టుకుందానవా
అరిమురి నితనికి నమ్మవచ్చేవు

చ. 3: తొలుతే తరితీపులు దొంతిఁ బెట్టుకుందానవా
వెలయఁగ నితనికి విందువెట్టేవు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
యెలమి నన్నేలె నీవూ నీవిభుఁగూడేవు

రేకు: 1290-6 భౌళి సం: 22-480

పల్లవి: ఏల కాచుకుందానవు యీతఁడు నీమగఁడంటా
లేలే ఆయనాయ నేఁతలేదు నీయాసొదము

చ. 1: బలిమిగలదానవు పతిఁ బిలుచుకొరోదా
కలిగిననీపగటు కందముగాని
వెలయ నితనిచేత వీడె మిప్పించుకోరాదా
కలికితనాలెల్లాఁ గానవచ్చీ నపుడు

చ. 2: చుట్టమవైనదానవు చొక్కవలపించరాదా
గట్టిగ నీనేరుపెల్లా గందముగాని
అట్టయితే నీతనిచేఁ బ్రియము చెప్పించుకోరాదా
దిట్టతనమెల్లాఁ దేట తెల్లమయ్యీ నపుడు

చ. 3: పొందుగలదానవు బువ్వానఁ బెట్టుకోరదా
కందువ నీబీరమెల్లాఁ గందముగాని
చెందె నలమేల్మంగను శ్రీవేంకటేశుఁ డితఁడు
యిందునే నీకోరికలు నీడేరీ విపుదు

రేకు: 1291-1 ఆహిరి సం: 22-481

పల్లవి: వట్టిజోలిఁ బొరలేవు వద్దన్నా మానవు
ఒట్టు కొకరిసొమ్ము వేరొకరికి దక్కునా

చ. 1: చక్కనిదాన వౌదువు జాణతనాలు నేర్తువు
ముక్కరఁ వెట్టుకుంటివి మోము చూచేవు
నెక్కొన్న నారమణుఁడు నీయెలయింపులకు
చిక్కఁడు గాని నీచేఁతలకు మెచ్చును

చ. 2: చుట్టమవు నౌదువు చొక్కులఁబెట్టాఁగలవు
యిట్టె సింగారించుకొంటి వీతనెదుట
గుట్టుతోడ నావిభుఁడు కోరి యిందుకు నిన్నుఁ జే-
పట్టఁడుగాని నీపగటులు మెచ్చును

చ. 3: మేలుదానవు నౌదువు మెప్పించా నీచేతనౌను
వేళ గాచుకుందానవు వెస మొక్కేవు
యేలె నన్ను శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను
నీలోనుగాఁడుగాని నీబత్తికి మెచ్చును

రేకు: 1291-2 కాంబోది సం: 22-482

పల్లవి: ప్రియమంత గలిగితే పెండ్లాడుమనవే
నయగారివాఁడు తాను నన్నేల తడవీనే

చ. 1: చిన్నదాన నన్నునేల సిగ్గువరచీనే తాను
చన్నులేల ముట్టీనే సారెసారెకు
కిన్నెర వాయించవచ్చి కేలుమొగిచితే నన్ను
సన్నలనే మోవిచూపి జాణతనాలాడీనే

చ. 2: గుట్టుతోడిదాన నన్ను గొరనేల గీరీనే
యిట్టే యిందరిముందరానేల నవ్వీనే
చుట్టపువాఁడంటాఁ దన్నుఁ జూడఁగా నే వచ్చితేను
వట్టిగిలిగింతలను వలపు రేఁచీనే

చ. 3: కొమలపుదాన నాతోఁ గొరియెంత పెనఁగీనే
సాము లెంతసేసీనే సమరతుల
ఆముక శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవిభుఁడు
యీమేరల నన్ను గూడి యింపులు పుట్టించెనే

రేకు: 1291-3 పాడి సం: 22-483

పల్లవి: మీరేల పదరేరే మెలుఁతలాల
మేరతో తన్ను నే మెప్పించేఁగాని

చ. 1: చెప్పనీరే తనమాట చెలులిందరిముందర
యిప్పుడే మారుత్తరము లిచ్చేఁగాని
కప్పురము చల్లనీరే కాఁతాళించి నామీఁద
చిప్పలఁ జేఁతకుచేత సేసేఁగాని

చ. 2: నగనీరే కేరడాన నాతో సారెసారెకు
మగుడి యినుమడిగా మళ్లించేఁగాని
మొగము చూడనీరే మునుకొని యందుకేమి
యెగసక్కేలన్నియు నేరుపరచేఁగాని

చ. 3: పెనఁగనీరే తాను ప్రియమునఁ గాఁగిలించి
వొనరఁగ గుబ్బల నేనొత్తేఁగాని
యేనసె శ్రీవేంకటేశుఁ డే వలమేల్మంగను
వినయాన మనవులు విన్నవించేఁగాని

రేకు: 1291-4 దేసాళం సం: 22-484

పల్లవి: చెప్పరాదు నీపరాకు జిగి మించె వలపులు
యెప్పుడు వచ్చీవి యీడేరించీ నన్నును

చ. 1: తలఁచునొకొ నేఁడు తానాతో నాడినమాట
పిలువక వచ్చునొకొ ప్రియుఁడీడకు
నిలుచునొకొ యిట్టె నెమ్మది నాయెదుటను
చెలియా నాకోరికలు చిమ్మిరేచీ నన్నును

చ. 2: కందునొకొ వొకపరి గక్కననుఁ దనరూపు
విందునొకొ తనమాట వీనులారాను
అందునొకొ తనతోను ఆడుకోలుమాటలెల్లా
సందడించీఁ దమకము సారెకు నాలోనను

చ. 3: గారవించునొకొ నన్ను కాఁగిలించికాఁగిలించి
సారెకు మోవిచ్చునొకొ చవులుగాను
యీరీతి నలమేల్మంగ నేను శ్రీవేంకటేశుఁడు
చేరి తానేవచ్చి గూడె చెంగలించీ మనసు

రేకు: 1291-5 హిందళం సం: 22-485

పల్లవి: మగవాఁడు తనకే యమరుఁగా కేమి సేసినా
యెగసక్కెములు గావా యింతుల కీపనులు

చ. 1: చిగురాకుమోవి యేల చిల్లులు సేయవచ్చినే
నగుమంటా నూరకే లానలు వెట్టినే
మొగమెత్తిచూడుమంటా మొనగోర నేలె త్తీనే
జిగిమించ సిగ్గుగాదా చెలుల కీపనులు

చ. 2: బంగారువంటిచన్నులు పట్టియేల పిసికీనే
వంగి మొక్కుమంటాఁ గావరించీనేలే
చెంగల గూచుండుమంటా చెఱఁగేల ముట్టినే
సంగతి నార్జముగాదా సతుల కీపనులు

చ. 3: అందపుఁ దీగెవంటిమే నందులకు బెనఁగీనేలే
పొంది కాఁగిటనే యెంత భోగించీనే
అందపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
కందువ నవ్వులుగావా కాంతల కీపనులు

రేకు: 1291-6 శంకరాభరణం సం: 22-486

పల్లవి: నెఱజాణవు ఇవి నీవే యెఱుఁగుదువు
మెఱయఁ జెలులుల నిన్ను మెచ్చిరి యిపుడు

చ. 1: వసమై వలచినవలపులలోనికి
కొసరెడుచిరుసిగ్గులు చవులు
పోసఁగఁగఁ జేసినపొందులలోనికి
సురపుసళుపులచూపులు చవులు

చ. 2: మనసుననాటినమచ్చికలోనికి
గునియు రతులపలుకులు చవులు
పెనగొనుసరసపుప్రియములలోనికి
ననిచిన సెలవులనవ్వులు చవులు

చ. 3: అలరి పాదలునడియాసలలోనికి
పొలుపగు తమకపుపొందులు చవులు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశ
నిలయ నీకు నీచెలుములు చవులు

రేకు: 1292-1 తోడి సం: 22-487

పల్లవి: ఎందునేరుచుకొనెవొ యీపెదిక్కు చూడవోయీ
సందడిలొనీకు మోవి చవిచూపీని

చ. 1: వలపులు చల్లుకొంటా వనిత యేమౌనొకాని
మలసి సొలసి నీతో మాటలాడీని
బలిమిఁ బెనఁగుకొంటా పనిగలదానివలె
పిలిచిపిలిచి నీకు బ్రియముచెప్పీని

చ. 2: యెమ్మెలు నెరపుకొంటా నెందుండి వచ్చెనోకాని
చెమ్మఁ జెమ్మటతో నీపైఁ జేయి చాఁచీని
బొమ్మలారుచుకొంటాను పొఁదైనచుట్టమువలె
పమ్మి వద్దఁగూచుండి పాదాలొత్తిని

చ. 3: సారెసారె నవ్వుకొంటా చన వెంతగద్దోకాని
కూరిమితోఁ గాఁగిటఁ గూడీ నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
చేరి నన్నేలితివి తా సిగ్గుతో మొక్కిని

రేకు: 1292-2 మంగళకౌసిక సం: 22-488

పల్లవి: పొద్దువోనిజవరాలు బొమ్మలఁ గాటుక వెట్టీ
గద్దరిసవతులెల్లా గాచుకుండఁగాన

చ. 1: సంతవెట్టుక మగని సంగడిఁ గూచుండి యీాకె
యెంతదడవైనా మొగ మేమిచూచీనే
చింతకాయకజ్జాయాలు చెప్పరానివలపులు
అంతటా నోరూరించే దది తా నెఱఁగదా

చ. 2: పలుమారు రమణుని పక్కఁ బండి తనియక
మలయుచు నెందాఁకా మాటలాడీనే
యెలమి యిసుకపాఁత రెంతదవ్వినా మనసు
అలవిలేకపై కొనే దది తానెఱఁగదా

చ. 3: యేపున శ్రీవేంకటేశుఁ డీలమేల్‌మంగపతి
యేపొద్దూఁ గాఁగిలించి తా నేమినవ్వీనే
పూపలై వసంతకాలపుఁ జిగురులు రతులు
ఆపొద్దే నన్నేలె నాతఁ డదిదా నెఱఁగదా

రేకు: 1292-3 లలిత సం: 22-489

పల్లవి: మంచిదాన నలమేల్మంగ వొమదిరాక్షి
యెంచి చూచితే మదనుఁ డిద్దరికి సాక్షి

చ. 1: చెనకేవు యెంతేసి చిగురుఁబోఁడి
కొనలుసాగినవి నీగోళ్లు వాఁడి
పెనఁగేవు వలపులు పేఁడి పేఁడి
గునియుచు మొక్కేవేమే కోఁడికోఁడి

చ. 2: నవ్వేవు మేలుమేలే నయగారీ
చివ్వన నీమేనినిండాఁ జేమటలూరీ
దువ్వటముకొంగంటేవు దూరిదూరి
కువ్వసేసేవేమే వాని కోరికోరి

చ. 3: నెలకొనేవే కాఁగిట నెఱవాది
కలపె నీమోవితేనె కడుఁబోది
లలి శ్రీవేంకటేశుఁడుఁ జలపాది
వెలసె నీనాపొందు వీదివీది

రేకు: 1292-4 హిందొళవంతం సం: 22-490

పల్లవి: నీకు వలచినట్లుండు నీరమణుఁడు
మేకొనీ నీసింగారపుమిసమిసలు

చ. 1: చద్దికి వేఁడికి గడుచవులు రేఁచీఁ బతికి
ముద్దులమాటల నీముసగసలు
వుద్దండాన రతులకు నొడిగట్టఁ జేసీ నవె
గద్దరిచూపుల నీకరకరులు

చ. 2: పన్నుక సరసములఁ బలుమారుఁ బెనఁగించీ
సన్నలపొందుల నీసదమాదాలు
యెన్నరానివేడుకల కింపులువుట్టించీ నిదె
వెన్నెలనవ్వుల నీవికవికలు

చ. 3: కమ్ముక తమకములు ఘనముగఁ బుట్టించీ
దొమ్ముల నీకాఁగిటితుదిపదాలు
కొమ్మరో శ్రీవేంకటేశుఁ గూడినగురుతు లివె
నెమ్మది మోముకళల నిగనిగలు

రేకు: 1292-5 మాళవిగౌళ సం: 22-491

పల్లవి: ఎంతపని గలిగేనొ యేమి సాదించెనొకాని
వింతగా నప్పటినుండి వేళగాచుకున్నది

చ. 1: చిన్నిచిన్నిచెమటలు చెక్కులపైఁ బొడమఁగా
విన్నపా లెంతసేసీని వెలఁది నీకు
పన్నుగాఁ జన్నులమీఁదిపయ్యద కొంత జారఁగా
మిన్నక కొలువు సేమీ మిక్కిలి నీకు

చ. 2: పెనగొన్ననగవులు పెదవిపైఁ బెట్టుకొని
వినయాలు సేసిని వెలఁది నీకు
నినుపులచూపుల నీమొగమే చూచుకొంటా
యెనయుచు సన్నలు నీకే లందుకుఁ జేసీని

చ. 3: తొడఁదొడ గాజులు చేతులనుండి వాఁగఁగాను
వీడే లెంతయిచ్చీని వెలఁది నీకు
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వాడిక లేమిచూపీని వంతులఁదా నీకు

రేకు: 1292-6 కేదారగౌళ సం: 22-492

పల్లవి: ఇంతకోపితే మాపాందు లిటు నీవు సేయవయ్యా
చెంతనే నోరూరించు జెలులవలపులు

చ. 1: చెవులొగ్గి వింటేను చిగిరించు మాటలు
తివిరి వూఁకొంటేను తీగెలు సాగు
నవకమై లాలించితే ననలొత్తుఁ గొరికలు
చనవులు పైపైరేఁచు సతులవలపులు

చ. 2: కన్నులఁ జూచితేను కడుఁబొదలు మనసు
సన్నలకు లొనైతే ససు లొత్తును
అన్నిటా సమ్మతించితే ననలుఁగొనలుఁ బారు
యెన్నేని చెప్పఁగవచ్చు నింతులవలపులు

చ. 3: చేరి వద్దగూచుంటేఁ జెలరేఁగు నవ్వులు
సారెఁ జవిగొంటే మోవిచవులు పుట్టు
యీరీతి శ్రీవేంకటే యిటు నన్నుఁ గూడితివి
కారుకమ్మినపంటలు కాంతలవలపులు

రేకు: 1293-1 శుద్ధవంతం సం: 22-493

పల్లవి: ఇద్దరిలో బలిమేదే యింతులాల
బుద్ధిచెప్పరే మాకు పొలంతులాల

చ. 1: నగె నీతఁడు నాతోను మొగము చూచె నీపెను
తగవులు చెప్పరే తరుణులాల
చిగురున వేసె నన్ను శిరసూఁచె దనకును
జిగిఁ దురమొదలేదే చెలువలాలా

చ. 2: సారె నాతో మాటలాడె న్నలు సేసెఁ దనకు
తారతమ్మలు చెప్పరే దైతలాల
చేరి నావద్దఁ గూచుండె సిగ్గువడెఁ దనతోను
నేరుపునేరములేవే నెలంతలాలా

చ. 3: సేసవెట్టి నన్నుఁగూడె చెనకెఁ దనచన్నులు
వాసివంతులు చెప్పరే వనితలాల
సేసెఁ బొందు లిద్దరిని శ్రీవేంకటేశుఁ డీతఁడు
ఆసా బాసా నెవ్వరిదే అంగనలాలా

రేకు: 1293-2 నాదరామక్రియ సం: 22-494

పల్లవి: చెల్లఁబో యేల లాచేవే సిగ్గువా టింతేకాక
చిల్లరవూడిగా లిఁకఁ జేయఁగ రమ్మనీనా

చ. 1: యేపునఁ దొం గేలచూచే విద్దరు లోన నుండఁగా
కాఁపురాలు సేసేవారిఁ గాకుసేతురా
యీపొద్దు కేరడాలాడి యెఱుకలు సేసేవే
రాఁపుల నాతఁడు నిన్ను రమ్మని పిలిచీనా

చ. 2: దీకొని దంపతులున్న తెర యేల యెత్తేవే
యేకతపువారిఁ బాయిటవేతురా
కేకలుగొట్టుచు మరి కేరి యేల నవ్వేవే
ఆకె వుండఁగా నిన్ను నండకు రమ్మనీనా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నాపె జెందె శయ్యాల చేరేవే
భావించి పెండ్లాడేవారిఁ బచ్చిసేతురా
పూవులగుత్తులఁ గొని పూఁచి యేల వేసేవే
నీవిభుఁడై తేనేమే నిన్నందు రమ్మనెనా

రేకు: 1293-3 భౌళి సం: 22-495

పల్లవి: ఔనయ్య మంచివాఁడవౌదువు నీవు
సేనలుగా నుద్దండాలు సేయనేర్చుకొంటివి

చ. 1: మొనసి చుట్టమవంటా మొక్కవచ్చినసతిని
వొసర నీతొడపై గూచుండుమనేవు
మనిసిచ్చి నీవాడేమాటలు వినేదాని
పెనఁగుచుఁ జన్నులే పిసికేవు నీవు

చ. 2: చూపుల వేడుక నిన్నుఁ జూడవచ్చినదాని
కాఁపరాలు సేయుమంటాఁ గాఁతాళించేవు
యేపుమీర నిన్నుసుద్దు లిట్టే యడిగేటిదాని
చేపట్టి మోవెల్లా గంటిసేసేవు నీవు

చ. 3: చేరి నీచెనకులకు సిగ్గులువడేటిదాని
కూరిమితోఁ గాఁగిలించుకొనుమనేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితి పొరుగు దాని
కేరుచుఁ నవ్వఁగా గిలిగించేవు నీవు

రేకు: 1293-4 వరాళి సం: 22-496

పల్లవి: ఏఁటికే యింతేసిపంతా లితనితోను
తాటించి నీవలపులు దాఁచనేలే నీవు

చ. 1: కొండవంటిమగవాఁడు కొంగువట్టి తియ్యఁగాను
అండుకాచి లోఁగేవు అదేమే నీవు
దండువెళ్ళి మదనుఁడు దాడివచ్చి వుండఁగను
గుండె రాయిగాఁ జేసుకొనేవేమే నీవు

చ. 2: విడువరానిచుట్టము వేడుకతో నవ్వఁగాను
అడఁకువ సిగ్గువడే వదేమే నీవు
పెడలిదిక్కున వచ్చి పెండ్లి విడిశుండఁగాను
గడుసవై చన్నులేల కప్పేవే నీవు

చ. 3: వేడుకకాఁడైన శ్రీవేంకటేశుఁడు గూడఁగా
ఆడేవు తెక్కులమాట లదేమే నీవు
మేడెపు మేనవాని మెచఁ గాఁగిలించుకోఁగా
యీడ నివ్వెరగు లందే విదియేమే నీవు

రేకు: 1293-5 రామక్రియ సం: 22-497

పల్లవి: వేగమే రాగదవయ్య వెలఁదిఁ జూతువుగాని
జాగులెల సేసేవు సరసుఁడవు నీవు

చ. 1: తలపోఁతలనె కొంతతడవు పొద్దులువుచ్చు
చెలికత్తెలతో కొంతసేప పొద్దులువుచ్చు
చిలుకలకుఁ జదువుచెప్పి కొంతపొద్దువుచ్చు
వెలసి నిన్నుఁ బాసినవిరహన మగువ

చ. 2: నీమీఁదిపాటలు వాడి నెమ్మిఁ కొంతపొద్దువుచ్చు
దీమసాన సిగ్గులనే తేరి కొంతపొద్దువుచ్చు
ఆముకొన్న ఆసలనే అటు కొంతపొద్దువుచ్చు
వేమరు నిన్నుఁ బాసినవిరహనఁ దరుణి

చ. 3: యెదురుచూపులనే ఇంటఁ గొంతపొద్దువుచ్చు
కదిసేటికోరికలఁ గడుఁ గొంతపొద్దువుచ్చు
ఇదివో శ్రీవేంకటేశ ఇంతలో వచ్చి కూడితి
వెదఁకీ జల్లారినవిరహన వనిత

రేకు: 1293-6 బౌళి సం: 22-498

పల్లవి: నామొగము చూచి యెంతనవ్వేవు నీవు
కామినిచేఁత లెల్లాఁ గనుఁగొనరాదా

చ. 1: పన్నుక వినయాలెల్లా పచారించుకొని నీకు
విన్నపాలు సేసీ నాకె వినరాదా
చన్నులమీఁది పయ్యద జారఁ దోసుకొంటాను
సన్నలనే మోవిచూపీఁ జవిగొనరాదా

చ. 2: అతివేడుకతోడుత అట్టె వేళగాచుకొని
సతి పాదాలొత్తవచ్చీఁ జూఁచరాదా
మతిఁ దలపోసుకొంటా మర్మములు గరఁగఁగ
రతులకు నాసపడీ రారాదా లోనికి

చ. 3: గుట్టుతోడఁ దమకము గుబ్బతిలు కొనఁగాను
అట్టె నీకు విడెమిచ్చీ నందుకోరాదా
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
చుట్టమాయఁ డానూ దయఁ జూడఁగరాదా

రేకు: 1294-1 దేశాక్షి సం: 22-499

పల్లవి: తాూన బైపైనే వున్నది తమితో నీకూటమికి
యీనటన లేమినేర్చే నెంతవేసాలాఁడి

చ. 1: వొడివట్టి తియ్యఁగాను వొయ్యనే పెనఁగీ నీతో
పడఁతి లేఁతసిగ్గులపగటుతోను
వొడఁబరచఁగ నిన్ను నొద్దని తోయఁగలేక
నిడుసాగిల నెలుఁగు నేరువుతోఁ బెంచీని

చ. 2: చన్నులు చేత నంటఁగ సగము గుంపీచీని
సన్నలనే కొంత బొమ్మజంకెనతోను
వున్నతిఁ గాఁగిలించఁగా నోపననఁజాలక
కన్నులు మూసి మోనానఁ గమ్మి పైనొరగీని

చ. 3: లాలించి మోవియానగా లలినొడ్డుకొనరాక
తేలించి మోముచూచి వాతెర చూపీని
వొలివెట్టి నన్నుఁగూడి వొద్దికై శ్రీవేంకటేశ
యీలీలఁ దన్ను నేలఁగా నింపులు నెరపీని

రేకు: 1294-2 ఆహిరి సం: 22-500

పల్లవి: ఎన్నిదలపోఁతలది యెంతయెమ్మెలాఁడి ఇది
కన్నులారా దీనిగుట్టు గంటివా వోయి

చ. 1: అందమై కాఁగిట నీపై నంటవలెనంటాను
పొందుగఁ గస్తూరి మేనఁ బూసుకొన్నది
యెందుఁ దనరాక నీవెఱఁగవలెనంటాను
అందెలు బావాలతోడ నదివో వచ్చినది

చ. 2: తతి విడెమిచ్చితేను తాఁకవలెనంటాను
అతివాఁడిగాఁ జేసు కదెవున్నది
రతివేళ విరులెల్లా రాలవలె నీపైనంటా
జతనానఁ దురిమెను జాజులు సంపగలు

చ. 3: తనపై నీచూపులు తగులవలెనంటాను
కొనబుగా సింగారించుకొని వున్నది
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలో నన్ను
తను నేలవలెనంటా దండ నిలుచున్నది

రేకు: 1294-3 గౌళ సం: 22-501

పల్లవి: చన్నులు చిన్నవై తేనే సాదవా నీవు
సన్న యెఱఁగ వదేమే సరసునితోను

చ. 1: చెక్కుచెయ్యాల పెట్టెవే సిగ్గులెల పెంచేవే
అక్కరతో విడెము నీకాతఁ డియ్యఁగా
చిక్కనేల పెనఁగేవే చిరునవ్వేమి నవ్వేవే
మక్కువ నిన్నుఁ జెనకేమగనితోను

చ. 2: చెమరించే వదియేమే చెలుల మాటికనేలే
తమితో నాతఁడు నిన్నుఁ దడవఁగాను
అమర నీవేసాలేలే ఆనలు వెట్టఁగనేలే
సముకాన వేఁడుకొనే జాణపతితోను

చ. 3: పయ్యదేల బిగించేవే పాపటేల దువ్వేవే
చయ్యన నాతఁడు సేస చల్లఁగాను
వొయ్యనే మొక్కఁగనేలే వొడఁబాటింత యేలే
చెయ్యరా నిన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడును

రేకు: 1294-4 సాళంగనాట సం: 22-502

పల్లవి: అవదరించవయ్యా అట్టె కలకాలము
తవిలి సేవలు సేసీఁ దరుణి నీకు

చ. 1: నెలఁతచెమటలే పన్నీటి మజ్జనము నీకు
తళుకుఁబయ్యదకొంగు తడియొత్తు
కలికినవ్వులే కప్పురకాపు నీకు
పొలుపొందఁ జూపులే పుణుఁగుకావు

చ. 2: మగువయంగరాగమే మంచిచంద్రగావిదట్టి
తగుఁగాఁగిటిచేతులే తమ్మిపూజలు
చిగురుఁబెదవులే శ్రీతులసీదళములు
మొగి రతిచెనకులే మునుకొన్నసొమ్ములు

చ. 3: అలమేలుమంగ తానే యక్కునుండేదేవులు
పలుకులే వేదమంత్రపాటలు
యెలమి శ్రీవేంకటేశ యెంచి చూచితే నీకు
జలజాక్షిసరసాలు సకలసంపదలు

రేకు: 1294-5 సాళంగం సం: 22-503

పల్లవి: ఇన్నాళ్లవలెఁ గాదు యిప్పుడు నీభావము చిన్నారిపొన్నారినోరఁ జెప్పవయ్యా సుద్దులు

చ. 1: యింతి యెవ్వతైనా వచ్చి యీడనీకు నిచ్చెనో
వింతవుంగరము నీవేల నున్నది
చెంతనుండి యాపె నీకు సేవలేమైనాఁ జేసెనో
కాంతుఁడ నీపచ్చడానఁ గడుపస వున్నది

చ. 2: యెంచరానిచుట్టము నీకెవ్వతైనా యిచ్చెనో
మించులపుంజాలదండ మెడ నున్నది
కంచముపొత్తు గలసి కాఁపురాలు సేసెనో
మించునీచెక్కుల నంటి మెరసీఁ గాటుకలు

చ. 3: వన్నెలాఁడి యెవ్వతైనా వాడికై నీకిచ్చెనో
చెన్నగు బాహుపురి నీ చేత యున్నది
ఇన్నిటా శ్రీ వెంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెన్న నా సొమ్ములే కావా యెఱిఁగితి నేను

రేకు: 1294-6 పాడి సం: 22-504

పల్లవి: నాకు నిన్నుఁ జూచిచూచి నవ్వు వచ్చీని
యేకతాన నన్నేలితి వేమిచెప్పేదయ్యా

చ. 1: తొయ్యలియొక్కెతకుఁ గందువ చెప్పుకుండఁగాను
వొయ్యనే వేరొకతె నీవొద్దికి వచ్చె
చెయ్యార విత్తొకటిడఁ జెట్టొకటై మొలచె-
నియ్యెడ నీవలపిదె యేమని చెప్పేదయ్యా

చ. 2: పేరుకొని యొకతెను ప్రియముతోఁ బిలువఁగా
మారుపేరు దొకతె నెమ్మది నూఁకొనె
కోరినదొకటుండఁగా గొసరు వేరొకటాయ
యీరీతి నీభాగ్యము లేమిచెప్పేదయ్యా

చ. 3: గక్కన వేరొకతేను కలయ సన్న సేసితే
నక్కున శ్రీదేవి నిన్ను నదె కూడెను
మొక్కొకటి మొక్కఁగాను ముంచి దీవెనొకటాయ
యిక్కడ శ్రీవేకంటేశ యేమిచెప్పేదయ్యా

రేకు: 1295-1 భైరవి సం: 22-505

పల్లవి: చిత్త మెఱఁగక పతిసేవ లేమిసేయుమనే -
వత్తుక యాతని నన్నీ నడిగి రావే

చ. 1: చెప్పరానిమాఁటలకుఁ జెవులొగ్గఁబోతేను
కుప్పవడి తమకమే గుబ్బతిలును
ముప్పిరినవ్వులు సారె మూటగట్టఁ బోతేను
చిప్పిలుఁజెమటలే చిందఁజొచ్చును

చ. 2: పిలువని పేరటముపెండ్లికిఁ బొతేను
నిలువున నివ్వెరగులే నిండఁజొచ్చును
బలిమి చుట్టరికాలు పచారించఁ బోతెను
వులివచ్చివలపులే వుమ్మగిలును

చ. 3: వొక్కమాఁటె సరసాన వొడిగట్టఁబోతేను
మొక్కలముతోఁ బోఁకముడి వీడును
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కక్కసించి కూడితే కాయే పండవును

రేకు: 1295-2 ఆహిరినాట సం: 22-506

పల్లవి: వేవేలకు నొకటే విన్నప మిదే
చేవదేరె వలపులు చిత్తగించవయ్యా

చ. 1: వూరనూర నూఁటలాయ నువిదకుఁ జెమటలు
కోరికలైతేఁ బెద్దకొండలాయను
కారుకొని తమకము గంపలకొలఁదులాయ
చేరవచ్చి మగువనుఁ జిత్తగించవయ్యా

చ. 2: చెప్పఁజెప్పఁ గొత్తలాయ చెలిచెక్కిటిచింతలు
ముప్పిరిగొన్నయాసలు మోపులాయను
కప్పి నీసుద్దులు వినఁగడుఁదరితీపులాయ
చిప్పిల మాఁటాడీ యింతిఁ జిత్తగించవయ్యా

చ. 3: చూడఁజూడ సొంపులెక్కె సుదతిమోముకళలు
వేడికలైతే వెల్లావిరులాయను
యీడనె శ్రీవేంకటేశ యేలితివి మన్నించి
చేడె నీకు దేవులాయఁ జిత్తిగించవయ్యా

రేకు: 1295-3 లలిత సం: 22-507

పల్లవి: జవ్వనము నీమేన జడిగొనివున్నది
చివ్వనఁ జేయి మీఁదుగాఁ జెవకి పైకొనవే

చ. 1: సిగ్గులెంత పెంచినాను చిత్తము గరఁగీనా
అగ్గలము గొసరితే నాస దీరీనా
దగ్గరి కొలిచితేనే తనివివుట్టీనా
కగ్గులేనివేడుకతోఁ గాఁగిలించుకొనవే

చ. 2: కన్నులఁ జూచితేను కలసినట్టయ్యీనా
సన్నలఁ బొద్దువుచ్చితే సంతోసా లవునా
మిన్నక నవ్వితేనే మేనుమేను సోఁకీనా
చన్నుల నొరపి మోవి చవిచూడఁగదవే

చ. 3: సంగడిఁ గూచుండితేను జంటలయ్యీనా పొందు
ముంగిటిమాఁట లెన్నైనా మోచీనా వావి
యింగిత మెఱిఁగి కూడె నిదె శ్రీవేంకటేశుఁడు
అంగవించి యేపొద్దూఁ బాయకవుండఁగదవే

రేకు: 1295-4 హిందొళం సం: 22-508

పల్లవి: ఆసగించియున్నదాని నలయించనిఁకనేలే
పాసి వుండలేకుండితే బత్తిసేయవయ్యా

చ. 1: మునుకొని యాపె వచ్చి ముందర నిలుచున్నది
నను పు గలిగితేను నవ్వవయ్యా
వినయముతో నీకు విన్నపాలకు లాచీ
పని గలిగితే మాటపలు కాడవయ్యా

చ. 2: గుట్టుతోడ నీపొందులగుఱుతులెల్లాఁ జెప్పీ
చుట్టమైతే నాపెదిక్కు చూడవయ్యా
నెట్టుకొని సారె నిన్ను నేరుపున సొలసీని
అట్టే నీకు నితవైతే నాదరించవయ్యా

చ. 3: నియతానఁ జేరిచేరి నీకుఁ బాదాలొత్తవచ్చె
ప్రియమైతే మంచముపైఁ బెట్టుకోవయ్యా
నయాన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి విన్నిటా
క్రియ గలితే నాపెపైఁ గేలు చాఁచవయ్యా

రేకు: 1295-5 దేసాళం సం: 22-509

పల్లవి: నీవిచ్చినచనవెల్లా నెరపీఁ దాను
యీవలఁ దనయాసోద మింకా నెంతగలదో

చ. 1: కొసరికొసరి నిన్నుఁ గొమ్మ నీతో మాటలాడి
ముసిముసినవ్వులనే మోవిచూపీని
విసవిస నేతెంచి విడెము చేతికిచ్చెను
యెసఁగ తనయాసోద మింకా నెంతగలదో

చ. 2: కందువలు చూపిచూపి కనుసన్నలు సేసీ నీ-
ముందరికి వచ్చి నీకు మొక్కు మొక్కీని
విందువలె సారెసారె విన్నపాలు నీకుఁ జెప్పీ
యిందరిలోఁ దనయాస యింకా నెంతగలదో

చ. 3: వుడివోనివేడుకతో నూడిగాలెల్లాఁ గావించి
నిడువాలుఁజూపులు నీపైఁ జల్లీని
అడరి నన్నేలితివి అన్నిటా శ్రీవేంకటేశ
యెడయనితనయాస యింకా నెంతగలదో

రేకు: 1295-6 మాళవి సం: 22-510

పల్లవి: తానిదె నేనిదె తగులై వున్నారము
ఆనవెట్టి యీతగవు లడుగరే యాతని

చ. 1: చనవుగలుగుచోట సరసములాడవచ్చు
ననువుగలుగుచోట నవ్వవచ్చును
మనసుఁగానరానీక మతకాననుండేవానిఁ
జెనకఁ గవచ్చునటె చెప్పరే వోచెలులు

చ. 2: బత్తిగలిగితే మాఁటపలుకు లాడఁగవచ్చును
చిత్తగించితే సేవసేయవచ్చును
కొత్త సేసుకొని లోలో గుట్టుతోడనుండేవాని
హత్తి పట్టవచ్చునటె ఆడరే వోచెలులు

చ. 3: ప్రేమము నెలకొంటేను పెనఁగులాడఁగవచ్చు
కామించె నీవేళ నొక్కటిగావచ్చు
వేమారు శ్రీవేంకటేద్రివిభుఁ డిట్టే నన్నునేలె
అమాఁటాడవచ్చునటె యనరే వోచెలులు

రేకు: 1296-1 ముఖారి సం: 22-511

పల్లవి: మగవానితో బలిమి మగువల కమరునా
వెగటులేక యిట్టె వినయమే సేయవే

చ. 1: కొంగువట్టి తీసితేను కొప్పు గడువెడజారె
వుంగరాన కొడిసితే నూర్పు రేఁగె
చెంగటఁ బెనఁగితేను చెమటలు మేనఁ జిందె
సంగడి నాతనితోను సాము లెంతసేసేవే

చ. 2: కడుఁజెనకఁబోతేను కంకణాలు వాఁగఁజొచ్చె
తడవి తిట్టఁగఁబోతేఁ దగదొట్టెను
తడవుగా నవ్వఁగాను తలకెక్కె వలపులు
యెడయక యిందులో నీ వెందుకయ్యేవే

చ. 3: నాఁటఁగ గాఁగిలించఁగా నడుమఁ జన్నులు చిక్కె
మాటున రతిసేయఁగా మతి గరఁగె
యీటున శ్రీవేంకటేశుఁ డితనిపొందింతసేసె
చీటికిమాటికి నీఁక సిగ్గులేల పెంచేవే

రేకు: 1296-2 సామంతం సం: 22-512

పల్లవి: మేలుమేలు నీ భాగ్యము మెరసె నిందరిలోన
యీలీల నెందరినైనా నేలవయ్యా నీవు

చ. 1: జక్కవచన్నులుయాపె సన్నపునడిమియాపె
చుక్కబొట్టుతో నిన్నుఁజూచేయాపె
వెక్కనపు ముంగరాపె వింతసింగారాలయాపె
యెక్కడఁ గలిగె నీకు నింతటివొయ్యారి

చ. 2: గొప్పకన్నులాపె కొమరెపాయపుటాపె
కప్పురపునోరఁ జెప్పె కత నీ కాపె
కొప్పునిక్కఁబెట్టినాపె గుడిగొన్నసొమ్ములాపె
యెప్పుడు నిన్నుఁ బెండ్లాడె ఇంకచేఁతలాఁడి

చ. 3: చిన్నిపెదవులయాపె చెలువపుఁజెక్కులాపె
చెన్నగుచేతుల సేవసేసీ నీ కాపె
ఇన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఎడు
యెన్నఁడు నీపొందుసేసె నీ ముద్దులకలికి

రేకు: 1296-3 బౌళి సం: 22-513

పల్లవి: ఎంతజూటుఁదనముల దీచెలియ
వింతవింత సింగారాల వెలసీఁ జెలియ

చ. 1: ముంగిట నీ ముందరను మురిసేనంటానేమో
చెంగావిచీరఁ గట్టెఁ జెలియ
చెంగల నీతో సాములు సేసేనంటానేమో
సంగతిగాఁ గస్తూరి చల్లుకొనెఁ జెలియ

చ. 2: పన్నెలువెట్టుక నిన్ను వలపించెనంటానేమో
కన్నులఁగాటుక వెట్టీఁ గడుఁ జెలియ
సన్నలనే నీ కింత చవిచూపేనంటా నేమో
నున్ననిపెదవులను నోరూరించీఁ జెలియ

చ. 3: మనసు గరఁచి నిన్ను మరగించేనంటానేమో
ననుపుసేసుక నీతో నవ్వీఁ జెలియ
యెనసితి విటు నన్ను యిన్నిటా శ్రీవేంకటేశ
తననేరుపులూఁ గొంత తాఁ జూపీ జెలియ

రేకు: 1296-4 పళవంజరం సం: 22-514

పల్లవి: నెఱజాణతనములనేరుపరి యాతఁడు
కఱకరి బెట్టకే కరఁగించఁగదవే

చ. 1: చలము లేమిటికే సరసములాడేవేళ
సొలసి వినయములే చూపఁగరాదా
పెలుచుఁదనములేలే బెరసియుండేవేళ
వెలలేనినగవులు వెదచల్లఁగదవే

చ. 2: పంతములేఁటికే మాటపలుకు లాడేవేళ
చెంతనుండి ప్రియములే చెప్పఁగరాదా
వింతలు సేయంగనేలే వేడుకఁ జెనకేవేళ
సంతసానఁ బొందులెల్లా జరపఁగఁగదవే

చ. 3: జంకెన లేమిటికే సన్నలుసేసేవేళ
పొంకపుకాఁగిట నిట్టే పొదుగరాదా
అంకెల శ్రీంవేకటేశుఁ డన్నిటాను నిన్ను నేలె
కంకణాలచేతులనుఁ గాఁగిలించఁగదవే

రేకు: 1296-5 రామక్రియ సం: 22-515

పల్లవి: తిట్టితేనే యెగ్గుగాక తేఁకువతో నాతనికి
చుట్టరికము చూపితే సొంపుగాదా నీకు

చ. 1: మచ్చికతో నీవిభుఁడు మాఁటలు నీతో నాడఁగా
మెచ్చితే నేమాయెనే మేలుగాదా
ముచ్చట నాతఁడు నాపె మోహములు చల్లఁగాను
వచ్చి వద్దఁగూచుండితే వాడికగాదా

చ. 2: పువ్వుల వేసి యాతఁడు పొందు నాతోఁ జేయఁగాను
నవ్వితే నేమాయనే నాయమేకాదా
పువ్విళ్లూర నాతఁడు నావొడిమీఁదఁ గూచుండఁగా
చివ్వనఁ గొప్పువెట్టితే సింగారముగాదా

చ. 3: వీడెమిచ్చి నన్నాతఁడు వెసఁ గాఁగిలించుకోఁగా
కూడితే నేమాయనే వేడుకేకాదా
యీడనె శ్రీవేంకటేశుఁ డిటు నిన్ను నన్నుఁ గూడె
వూడిగాలు నేఁజేసితే నీడుజోడుగాదా

రేకు: 1296-6 ఆహిరి సం: 22-516
పల్లవి: నెట్టన దర్మపుణ్యాలు నీచేతివి
గట్టిపెండ్లికొడుకవు కానిమ్మనవలెను
చ. 1: సారెసారె నిన్ను నాకె సాకిరులే యడిగీని
చేరి నీవెఱిఁగినంత చెప్పవయ్యా
పొరచివచ్చినయట్టిపొత్తులమగవాఁడవు నీ-
వేరీతిఁ జెప్పినా మాకు వియ్యకొనవలెను
చ. 2: నిక్కినిక్కి యప్పటిని నీమొగము చూచీని
పక్కన నాపెను వొడఁబరచవయ్యా
యెక్కుడుగాఁ దొల్లె నీవు యిద్దరాండమగఁడవు
వొక్కమాఁటే సంతోసాన నొడఁ బడవలెను
చ. 3: కొత్తకొత్త మొరఁగులఁ గొంగువట్టి తీసీనె
చిత్తగించి సన్నలైనాఁ జేయవయ్యా
సత్తుగా శ్రీవేంకటేశ సరివారిమగఁడవు
హత్తి కూడితివి నిన్ను నట్టె మెచ్చవలెను

రేకు: 1297-1 రామక్రియ సం: 22-517

పల్లవి: నీ వెఱఁగవా తగవు నెఱజాణ విన్నిటాను
కొవిదుఁ డాతఁడు నిన్నెగ్గులుపట్టకున్నాను

చ. 1: వెక్కసాన నీవతని వెంగెములాడినందుకు
చెక్కునొక్కి వేఁడుకొనఁజెల్లునే నీకు
గక్కనఁ బెనఁగఁగాను కాలుదాంకినందుకు
చక్కసాగిలి మొక్క సంగతీనౌనె

చ. 2: జడికొన్నకాఁతాళాన జంకించినందుకు
వొడివట్టి పిలువఁగా నుచితమౌనె
కడుఁగరకుచూపులఁ గసరి చూచినందుకు
విడెమిచ్చి బుజ్జగించ వివరమూ నౌనె

చ. 3: కులికికులికి నీవు గుబ్బలనొత్తినందుకు
అలపుదీర మోవియ్యనందమౌనె
తెలిపి శ్రీవేంకటేశు దేవులవయినందుకు
వలసినరీతుల నవ్వఁగ వావీనౌనె

రేకు: 1297-2 శంకరాభరణం సం: 22-518

పల్లవి: ఉత్తమనాయకురాలి కోజ యిదియేకాదా
చిత్తగించి నీసేవ సేయించుకోవయ్యా

చ. 1: యెల్లవారిలోనా నేరాలెంచఁగఁజాలక నిన్ను
చల్లనిచూపులనే సాదించీని
వల్లదానఁ బెనఁగుతా బలమిచూపఁజాలక
వొల్లనే కొసరుతా నిన్నొడివట్టీని

చ. 2: మనసు నాఁటంగ నిన్ను మాటలాడఁజాలక
ననుపుసేసుక నీతో నవ్వు నవ్వీని
చెనకుచు నిన్నుఁ గడుసిగ్గువరచఁజాలక
మొనగోరు సోఁకకుండా మొక్కు మొక్కీని

చ. 3: చలముల నీతోను సాదించఁజాలక
కలపుకోలుఁదనానఁ గాఁగిలించీని
చెలి నేలితి విన్నిటా శ్రీవేంకటేశ్వర
సోలయఁజాలక రతిఁ జొక్కించీని

రేకు: 1297-3 లలిత సం: 22-519

పల్లవి: పతితోడిచలములు పడఁతులకేఁటికే
యితవు దెలుకోవే యీడేరుఁ బనులు

చ. 1: పెంచిపెంచి వెంగేలు పెక్కుమారు లాడుకుంటే
మంచిమాఁ టొకటాడితే మతి గరఁగు
పంచనుండి బీరముతో బడలుటకంటెను
ఇంచుక మొక్కు మొక్కితే నీడేరుఁ బనులు

చ. 2: వొట్టులు వెట్టుక లోలో నూసురసురనుకంటే
చుట్టరిక మేపాటైనా సుకము దక్కు
వెట్టరియైనవిరహన వేగినంతా వేగుకంటే
యెట్టైనాఁ బంతమిచ్చితే నీడేరుఁ బనులు

చ. 3: తలవంచుక సిగ్గులు తప్పుకొంటా నుండుకంటే
మొలకనవ్వు నవ్వితే మొగమోటలౌ
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
ఇల నీనేరుపులనే యీడేరుఁ బనులు

రేకు: 1297-4 శ్రీరాగం సం: 22-520

పల్లవి: ఏమి నోము నోచినదో యీయింతి
కామించి కన్నులారఁ గంటిమి మీపొందులు

చ. 1: చిత్తగించి నిన్నుఁజూచి సిగ్గువడీ నిదివో
కొత్తపెండ్లి కూఁతురు యీకొమ్మగాఁబోలు
మొత్తమి నీమాట విని ముసిముసినవ్వు నవ్వీ
జొత్తైనతొల్లిటినీచుట్టముగాఁ బోలును

చ. 2: అగపడి సరసములాడితే సమ్మతించీని
తగిననీ మేనమఱఁదలు గాఁబోలు
పగటున నీవుగుప్పేపచ్చడము గప్పుకొనీ
జగమెఱఁగఁగ నీకు చనవరి గాఁబోలు

చ. 3: వొనరఁ బానుపుమీఁద నుండి నీపాదములొత్తీ
యెనసి వూడిగమాపె యీకె గాఁబోలు
నను నేలితివి ముందే నంటున శ్రీవేంకటేశ
నిన్నుఁ జెనకీఁ దానూ నేస్తము గాఁబోలు

రేకు: 1297-5 వరాళి సం: 22-521

పల్లవి: ఓపితే నీచిత్తము నేనున్నట్టె విన్నవించితి
చేపట్టి యేలుము నీసేవసేసేదానను

చ. 1: జవళినాగుబ్బలకుఁ జాఁచేవు చేతులు
నవకా లింతేకాని నాననిగట్లు
కవగొని పిసికితేఁ గరఁగ వెంతైనాను
తవిలి పెనఁగితే మీఁదఁ బెచ్చువెరుగును

చ. 2: చుట్టిచుట్టి పిఱుఁ దేమిచూచేవు నీకన్నులను
పట్టవసగావు పెద్దబండికండ్లు
వొట్టి పైకి దీసుకొంటే నుంగిటితోఁ గళదాఁకు
వట్టిమాఁకు లిగిరించేవలపులుచేఁగలు

చ. 3: యెటిఁగెటిఁగి నామోవి కేఁటికి నొరూరేవు
మఱఁగేల కొమరాఁక మానిపండు
గుఱిగా శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
తఱి తీపులెల్లా నిందు దాఁచుకొనేనెలవు

రేకు: 1297-6 బౌళి సం: 22-522

పల్లవి: కోడెకత్తెవు కొమ్మ నీకు నేఁ జెప్పితి
రూడితో నీచేఁతలె నేరుచుకొవే చెలియా

చ. 1: చుట్టరికము గలితే సొలయఁగవచ్చును
యెట్టనెదుల నుండితే నింపువుట్టును
గట్టిగాఁ బొందుసేసితేఁ గాఁపురము లీడేరు
నెట్టుకొన్నబుద్ధులివి నేర్చుకొవే చెలియా

చ. 2: చనవు మిక్కుటమైతే సరసములు చెల్లును
మనసు లేకములైతే మాట లింపౌను
ననుపులు దొరకితే నాటుకొనుఁ బ్రియములు
యేనసేటినీతు లివి యెంచుకొవే చెలి యా

చ. 3: చేరి చెనకఁ జొచ్చితే సెలవుల నవ్వు మించు
కోరినట్టే వచ్చితేను గూడఁగఁదగు
యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నునేలె
పేరడిగుణా లివి పెంచుకొవే చెలియా

రేకు: 1298-1 దేశాక్షి సం: 22-523

పల్లవి: మెలుఁత కెప్పుడు నీవు మేలువాఁడవు
తలఁపులో నిఁక దయదలఁచఁగరాదా

చ. 1: కన్నుల నీకు మొక్కేఁ గాంత వద్దఁగూచుండి
విన్నపాలు సేసుకొని వేఁడుకొనెను
సన్నలనే మోవిచూపె చనవు చేకొని యింక
మన్నించి లోనికేంగి మాటలాడరాదా

చ. 2: వాడికతోఁ జెక్కునొక్కి వలపు నీకెరిఁగించె
వీడెము చేతికిచ్చి వేఁడుకొనెను
జొడగుచన్నుల నొత్తె చొక్కుచుఁ దెరవేసుక
యీడనైనా సేవలు సేయించుకొరాదా

చ. 3: కొలువులు నీకు జేసె కూరిమిఁ బ్రియాలు చెప్పె
వెలయఁగఁ గాఁగిలించె వేఁడుకొనెను
పిలిచి ఇందాఁకా నీతోఁ బెనఁగె శ్రీవేంకటే
తలుపుమూసుక రతిఁ దనియించరాదా

రేకు: 1298-2 హిజ్జిజి సం: 22-524

పల్లవి: సతి యిట్టిదైతేనే సంసారఫలము
కతలిన్ని నీయందే కలవే వోచెలియా

చ. 1: చెప్పినబుద్ధులు విని చిత్తములోన మెలఁగి
తప్పక సేవసేసేది తరుణి
ముప్పిరి నితవుతోడ ముచ్చటలచ్చటలాడి
యెప్పుడూఁ బాయకుండేది ఇల్లాలు

చ. 2: వోపిక గలిగి పతి కొడఁబడ బత్తి చూపి
కాఁపురము నేసేదే గరితె
యేపున వహించుకొని యింటిపను లేమరక
చేపట్టుగుంచమైనది సేసపాలమగువ

చ. 3: యిచ్చకమెఱిఁగి తనయిలువరుస నెరసి
నిచ్చఁ బతిఁగూడినదే నెరవాది
హెచ్చి నీవూ శ్రీవేంకటేశుఁడూ దొరసినట్టు
అచ్చపుగుణాల నెక్కుడైనదే వనిత

రేకు: 1298-3 ఆహిరి సం: 22-525

పల్లవి: పతికరుణే దిక్కు పదివేలకును నాకు
రతుల నాయాసొదాలు రచ్చవేసినటవే

చ. 1: అరిదినాకోరికలే యాతనిపైఁ బారఁగాను
మరుఁ డేమిసేసునే మగువలాల
సొరిదిఁ దప్పకచూచేచూపులే తగిలీఁగాక
విరులబాణములైతే వెసఁ దాఁకీనటవే

చ. 2: కిందువ నావలపులే కడుఁ దమిరేఁచఁగాను
చందురుఁ డేమి సేసునే సకియలాల
చిందిననాతలఁపులే జిగురువలె నంటఁగా
గందము బొసటమై కమ్ముకొనీనటవే

చ. 3: మలసి యాడించేయెడమాటలే ఇంతసేయఁగా
చిలుక లేమిసేసునే చెలియలాల
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చినన్నేలె
చలువపన్నీరు మరి సాదించీనటరే

రేకు: 1298-4 పాడి సం: 22-526

పల్లవి: చెప్పవచ్చితిమి నీకు చెలఁగి యీమేలుసుద్ది
తప్పదు మీకిద్దరికే తగుఁదగునయ్యా

చ. 1: చిలుకపలుకులది చేరఁడేసికన్నులది
నెలఁత యొక్కతే యిది నీకే తగును
నిలువుఁగొప్పుతోడినిండుమోముకళలది
నిచ్చుచున్న దల్లదివో నిక్కిచూడవయ్యా

చ. 2: పిడికెఁడునడుమిది పిక్కటిల్లుగుబ్బలది
నీడువాలుఁజూపులది నీకే తగును
కడుఁజక్కనిది సంగతులనడపులది
పొడచూపె నల్లదివో పొందుసేయవయ్యా

చ. 3: చిగురుఁ బెదవులది చిన్నారిపాదములది
నిగనిగమేనిది నీకే తగును
నిగిడి శ్రీవేంకటేశ నీవే వచ్చికూడితివి
నగరిలో నున్న దది నన్ను మెచ్చవయ్యా

రేకు: 1298-5 మేచబౌళి సం: 22-527

పల్లవి: ఎంతవేగిరకత్తెవే యేమే నీవు
చెంతనుండి వలపులఁ జిమ్మిరేఁచరాదా

చ. 1: అట్టె పానుపుపై నుండి యాతని నన్నుఁ జూచి
వొట్టేల పెట్టుకొనేవే వువిదా
యెట్టనెదుటఁ గూచుండి యేపున మాటమాటల
చుట్టరికము గలితేఁ జూపిచెప్పరాదా

చ. 2: మగఁడు నన్నన్నిటాను మన్నించఁగాఁ జూచి
మొగము వంచుకోనేలే ముదితా
నగుతా నాతనితోను నయములెల్లాఁ జూపి
తగవు గలిగితేను తలఁపించరాదా

చ. 3: చెలఁగి నన్నుఁగూడిన శ్రీవేంకటేశునిఁ జూచి
బలిమిఁ బైకొననేలే పడఁతీ
వెలయఁ బొందుసేసి వేళలు గాచుకవుండి
వలపు గలిగితేను వడ్డించుకొరాదా

రేకు: 1298-6 గౌళ సం: 22-528

పల్లవి: ఎవ్వరికి జెప్పఁడమ్మ యెదలోనిమర్మము
నివ్వటిల్ల భోగించ నెరజాణఁ డితఁడు

చ. 1: మెలుఁత కెవ్వతెకొ మేలువాఁడు గాఁబోలు
చలువగాఁ బన్నీట మజ్జనమాడీని
కలయఁగ మేనఁ బచ్చకప్పురము మెత్తుకొనీ
తలఁపులోని విరహతాపమెల్లా నారను

చ. 2: అప్పటి శైత్యోపచారా లందుకుఁగాఁ జేయఁబోలు
గుప్పుకొనీఁ దులసిచిగురుదండలు
యెప్పుడూ నాలవట్టము లిరుమేలాఁ జేకొనీని
చిప్పిలువలపుల ముంచినవెట్ట దీరను

చ. 3: కూరిమి చలిమందులకొరకుఁగానే కాంబోలు
కోరి చలువరాళ్లకొండ నున్నాఁడు
యీరీతి శ్రీవేంకటేశుఁ డిందిరతోఁ గూడినాఁడు
తారని రతులజాణతనములు మీరను

రేకు: 1299-1 ధన్నాసి సం: 22-529

పల్లవి: విన్నకన్నవారికెల్లా వెరగయ్యీని
చిన్నదాన వెంతేసిచేఁతలు సేసేవే

చ. 1: చిన్నిచిన్నినగవులు సెలవులఁ జిందుకొంటా
సన్నపుటెలుఁగులను సాదించుకొంటా
కిన్నెరమీఁటులు మీఁటి గిలిగించుకొంటాను
ఇన్నేసివిధాలఁ బతి నెంత యెలయించేవే

చ. 2: పొఁగినగుబ్బలు సారె పయ్యదను మూసుకొంటా
మూఁగినమోవి చూపి మలసుకొంటా
కాఁగెఁడేసిపిరుఁదులఁ గడుమురుసుకొంటాను
వీఁగ కితనిముందర వేసా లెంతసేసేవే

చ. 3: చేరఁడేసికన్నులను చెలరేఁగి చూచుకొంటా
కూరిమి మాటలలోనే కొసరుకొంటా
యీరీతి శ్రీవేంకటేశు నింత సేసి కూడితిని
మేరతో నన్నితఁ డేలె మేకు లేమిచూపేవే

రేకు: 1299-2 నారాయణి సం: 22-530

పల్లవి: తెలియజెప్పితి మీకెతెరఁగెల్లా నిదె నీకు
తలఁపునఁ బెట్టుకొని దయఁజూడు మిఁకను

చ. 1: నెలఁత వేగినంతాను నీతోడికలలె కను
నలువంకా మరి సగినాలు చూచును
చెలుల నీవద్ది కంపి చేరి సుద్దు లడుగును
చెలియభాగ్యము నీచిత్త మిఁకను

చ. 2: భామ నీపై బదాలు చెప్ప నుపమలు దలఁచు
ఆముక పటాన నీరూపటు వాసును
నేమాన మేడలెక్కి నీనగరు చూచి మొక్కు
యేమనము యిన్నీ నీవే యెఱుఁగుదు విఁకను

చ. 3: ఇంతి పానుపుపై నుండి యెదురులుచూచు నీకు
చెంత నీవున్నాఁడవని చెనకి నవ్వు
ఇంతలో శ్రీవేంకటేశ ఇట్టెవచ్చి కూడితివి
పంతమెల్లా యీడేరె పాయకుండు మిఁకను

రేకు: 1299-3 గౌళ సం: 22-531

పల్లవి: కంటిమే యిన్నాళ్లకు మీకాఁపురాలు కన్నులారా
జంటలై మీకోరికలు సతమాయఁగదరే

చ. 1: మొలకనవ్వుల మీరు మోములు చూచుకోఁగా
తెలిసెనే మీపొందులు తెల్లమిగాను
చలివాసి మీలోన సరసము లాడుకోఁగా
వెలిసెనే సబలో మీవేడుకలెల్లాను

చ. 2: పగటున మీరిద్దరు పానుపుపై గూచుండఁగ
నెగడెనే యీకొత్తలు నేఁడింతటాను
వెగటులేక మీరు విడెము లందుకోఁగా
తగులై మేభోగా లీడఁ దరితీపులాయనే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నీవు చెలఁగి పెండ్లాడఁగాను
చేవదేరేనే మీచేఁతలెల్లాను
మోపులసన్నల మీరు ముచ్చట లాడుకోఁగా
వేవేలై నిలిచెనే మీవినోదములెల్లాను

రేకు: 1299-4 లలిత సం: 22-532

పల్లవి: ఎంతలేదు యివీఁగొన్ని యేఁటికి మీతచ్చనలు
ఇంతయు నెరిఁగితిమి ఇఁక మన్నించరయ్యా

చ. 1: పొద్దువోక మీరెంతేసి బొమ్మల జంకించుకొన్నా-
నిద్దరూ నొక్కటేకాక యెరవయ్యేరా
వుద్దండాన నప్పటిని వొడివట్టి పెనఁగినా
పెద్దకారిలకేకాక బిరుదు లెక్కించేరా

చ. 2: వొరసి మీరెంతేసి వొట్లు వెట్టుకొనినా
సరసము లింతేకాక చలపట్టేరా
గొరబై మీలోమీరే కొచ్చికొచ్చి చూచుకొన్నా
తరితీపు లింతేకాక తప్పులు వట్టేరా

చ. 3: పంతాన మీరెంతేసిచేపట్లకుఁ జేరినాను
దొరతిఁ గాంగిటికేకాక దొమ్మిసేసేరా
చెంత మమ్ము నేలితివి శ్రీవేంకటేశుఁడ నేఁడు
యింతి యీకె కొసరుఁగా కింకాం గొత్తలయ్యేరా

రేకు:	1299-5 మధ్యవవతి	సం:	22-533
పల్లవి:	ఏఁటి బుద్ధులు చెప్పేరే ఇంతులాల
	మాఁటువెట్ట కాతనికే మారుమాట చెప్పరే
చ. 1:	మంతనాన వారిద్దరూ మాటలాడుకొనఁగాను
	దొంతివలపు దొమటిదొడుకఁగాను
	వింతగా నాతనికి నే విడెమెట్లా నిత్తునే
	చెంతనుండి వూడిగాలు సేయ నెట్ట వచ్చునే
చ. 2:	పానువు పై నుండి తాము పచ్చిదేర నవ్వఁగాను
	ఆనుక లోలో సరసాలాడఁగాను
	వీనుల సిగ్గువడక విననెట్టు దగునే
	పానిపట్టుకొని యెట్టు పాదము లొత్తుదనే
చ. 3:	జగిమించ నొండొరులు చెనకి పెనఁగఁగాను
	నిగిడి సిగ్గు దమకు నిండుకోఁగాను
	తగ శ్రీవేంకటేశుఁడు తానే వచ్చినన్నుఁ గూడె
	తగిలి యప్పటి నెట్టు తమకము రేఁతునే

రేకు: 1299-6 పాడి సం: 22-534

పల్లవి: తానే వచ్చి నన్నునేలీ దయదలఁచి
కానుక చేతికియ్యరే కాంతలాల

చ. 1: మన్నించి వావులు చెప్పి మావారి నొడఁబరచి
కన్నెనాఁడే పెండ్లాడెఁ గాంతుఁడు దానె
నన్ను గడు మరిగించె నమ్మికమాటలాడి
విన్నవించరే యీసుద్ది వెలఁదలాల

చ. 2: ముచ్చటకుఁ జెలినంపి ముద్దుటుంగరము నిచ్చి
వచ్చి మాయింటికి నేంగీ వరుసఁ దానె
ఇచ్చెనాకు సొమ్ములెల్లా ఇవె నామేన నున్నవి
యెచ్చరించరే మీరు ఇంతులాల

చ. 3: మెలుపున నవ్వినవ్వి మెచ్చిమెచ్చి కాఁగిలింది
కలసె శ్రీవేంకటఘనుఁడు దానె
తిలకించి తొల్లె కూడె తెరమఱఁగేఁకనేల
తలఁపించరే మీరు తరుణులాల

రేకు: 1300-1 వళవిగౌళ సం: 22-535

పల్లవి: పొగడవసముగాదు వూని యీతనిగుణాలు
మొగము చూచి చూచి మొక్కేనే నేను

చ. 1: వేడుకకత్తెలతోడివెడవెడనవ్వులు
వూడిగాలవారితోడివొడఁబాటులు
వాడవనితలతోడివరుసజాణతనాలు
యేడ నేర్చుకొన్నాఁడే యీతఁడు తాను

చ. 2: కొలువుకాంతలమీఁదిగుదిగొన్నచూపులు
వెలయాండ్లతో నాడేవినోదములు
వలచివచ్చినయట్టివారిపొందులు
చలపట్టి యెన్నఁడు సాదించెనే తాను

చ. 3: చేరి వున్నవారితోడఁ జేసేటిసన్నలు
కోరి యలమేలుమంగకూటములు
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలిననాతో మెచ్చులు
కూరిమి నెట్టు గడించుకొనెనే తాను

రేకు: 1300-2 సాళంగం సం: 22-536

పల్లవి: ఏమిసేసేవో చూతము యెవ్వరు బలువో మీరో
నా మొగము చూచి నీవు నవ్వులు నవ్వేవు

చ. 1: ముంచి ముంచి తేనెగారేమోవినే మాటలాడి
పంచనుండే యాపె నిన్ను భ్రమయించెఁగా
కొంచెముగా నవ్వి పెద్దకొప్పు నీకు జూపిచూపి
వంచనతో నీకు మొక్కి వలపించెఁగా

చ. 2: పట్టెఁడేసిగుబ్బలపై పయ్యదించుక జారించి
బెట్టుగా సరసాలాడి బెల్లించెఁగా
గుట్టుతోఁ దప్పకచూచి గోరుసోఁక విడెమిచ్చి
చుట్టపుఁదనాల నిన్నుఁ జొక్కించెఁగా

చ. 3: చెయ్యారా సన్నలు సేసి సేసలు నీపైఁ జల్లి
తియ్యఁదనాలఁ దెప్పలఁ దేలించెఁగా
ఇయ్యెడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నెయ్యాన నన్నేలితివి నీ కప్పణ ఇచ్చెఁగా

రేకు: 1300-3 ధన్నాసి సం: 22-537

పల్లవి: అలమేలుమంగపతి యన్నిటా జాణఁ డితఁడు
ఇల మీచుట్టరికమిరవాయసుండీ

చ. 1: వుంకించి కృష్ణుడు వుట్టు గొట్టీ
వేంకటాద్రిపురవీథులను
మంకుగొల్లెతలు మరి మీరు పెనఁగితే
నుంకించి మానాలు సొఁకీనసుండీ

చ. 2: పాలు వెరుగు వారబట్టి గోవిందుఁడు
సోలిఁ గొనేటియీచుట్టులను
అలించి గొల్లెత లటు మీరు సొలసితే
చెలకొంగు లంటినే సిగ్గుయ్యీసుండీ

చ. 3: చేకొని వెన్నలు జుట్టీ శ్రీవేంకటేశుఁడు
వాకైననిది మీఁదివాడలను
కాకరిగొల్లెతలు కాంగిలించి పట్టేరు
యేకమైతిరి మీగుట్టు లెరింగీసుండి

రేకు: 1300-4 లలిత సం: 22-538

పల్లవి: సోబనము సోబనము చూడరే పేరటాండ్లు
అబలభద్రుడు ముందే యవతరించినాఁడు

చ. 1: జనియించె గృష్ణుడు సతమాయ ధర్మములు
జననీజనకులకు సంతోసమాయ
ననిచి యశోదానందగోపులు వెంచేరు
వొనర నందరికిని వొక్కమనసాయ

చ. 2: నాలుగుచేతులవాఁడు నల్లని మేనివాఁడు
మేలిమి సంకు జక్రాల మించినవాఁడు
కోలుముందుగాం గంసునిగుండెదిగులైనవాఁడు
వొలార్చరే యిందరికి నొక్కమనసాయను

చ. 3: కోరికె లీడెరెను గోపికలకెల్లాను
తేరి కరుణించి మనదిక్కు చూచీని
గారవపుటల మేల్మంగపతి శ్రీవేంకటేశు-
నూరడించరే యిందరికి నొక్కమనసాయను

రేకు: 1300-5 కేదారగౌళ సం: 22-539

పల్లవి: ఇద్దరి గూరిచితిమి యేము చెలికత్తెలము
పొద్దు కొకకొత్తలుగా భోగించరయ్యా

చ. 1: ప్రేమముతో సేసాలపెండ్లికూంతు రిదె వచ్చె
ఆముకొని సరసములాడవయ్యా
ఆమనిసిగ్గులతోడ నదె తెరలో నున్నది
చేముట్టి సేవలెల్లాఁ జేయించుకోవయ్యా

చ. 2: మక్కువతో నీమేనమరఁద లిదివో వచ్చె
చక్కఁగాఁ బాదా లీకెపై జాఁచవయ్యా
వెక్కసానఁ దమకించి వేడుకతో నున్నది
గక్కననుఁ దప్పక మొగము చూడవయ్యా

చ. 3: అరుదై శ్రీవేంకటేశ అలమేలుమంగ వచ్చె
బెరసి రతుల నిట్టె పెనఁగవయ్యా
గరిమ వేళగాఁచి నీకాఁగిటిలోనే వున్నది
సరికిబేసికి నీవు చనవియ్యవయ్యా

రేకు: 1300-6 ఆహిరి సం: 22-540

పల్లవి: తానెప్పుడూ నావాఁడే తనసొమ్ము నేనిదివో
పూని చుట్టరికా లీడఁబొదిపి చెప్పనేలే

చ. 1: పులివచ్చిప్రియముల నొడంబరచఁగనేలే
వలచినయటువంటి వనితలను
తలఁపులుఁ దలఁపులు తారుకాణలై యుండఁగా
యెలమిఁ జెలుల చేతియెడమాట లేలే

చ. 2: తగవులఁ బెట్టిపెట్టి తమకమురేఁచనేలే
మొగమిచ్చలెనసినముదితలను
చిగురుమోవి నవ్వులు చిమ్మిరేణగియుండఁగాను
తగువైనపొందు లీఁకఁ దడవంగనేలే

చ. 3: చేఁగదేర వినయపుచేతలు సేయఁగనేలే
కాఁగిటిలోనుండేటికాంతలను
దాఁగ కలమేల్మంగను తాను శ్రీవేంకటేశుఁడు
వీఁగక నన్నేలె నిఁక వింత సేయనేలే

రేకు: 1301-1 సౌరాష్ట్రం సం: 23-001

పల్లవి: నీకెంత వేడుక గద్దో నేమూఁ జూచేముగాక
కాకుసేయవచ్చునా కడలవారికిని

చ. 1: వలెనని యాతనికి వాడిక నీవు చూపఁగా
వలదనవచ్చునా వాడవారికి
చలపట్టి యప్పటిని సలిగెలు నెరపఁగా
పొలసులాడవచ్చునా పొరుగువారికిని

చ. 2: చిప్పిల నీవాతనితోఁ జేఁతలెల్లాఁ జేయఁగాను
వుప్పతించవచ్చునా వూరివారికి
చొప్పుఁగ బతి మొగము చూచి నీవు నవ్వఁగాను
తప్పులెంచవచ్చునా దండనున్నవారికి

చ. 3: గారవించి నీవూఁ దానుఁ గాఁగిలించుకొనఁగాను
వారించఁగవచ్చునా సవతివారికి
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నంతలోనె
వేరుసేయవచ్చునా వింతవారికి

రేకు: 1301-2 దేశాళం సం: 23-002

పల్లవి: మఱి మీకు వేళలేదా మగువలాల
మెఱశాతఁడే మన్నింటీ మిమ్ము్మ సవతులాల

చ. 1: ఆలుమగఁడు న్నున్నారు అదివో యేకతమున
యేల తొంగిచూచేరే యింతులాల
మేలువార్రై తమలోన మేలములాడుకొనేరు
ఆలకించే రదియేమే అతివలాల

చ. 2: వెలఁది పాటవాడఁగా వింటానున్నాఁ డాతఁడు
గలభిసేయకురే కాంతలాల
నలిరేఁగి యిద్దరూను నవ్వుకొంటా నున్నవారు
తలుపేల తెరచేరే తరుణులాల

చ. 3: సరిఁ దాము చిలుకకు చదువులు నేరిపేరు
పరాకుసేయకురే పడఁతులాల
అరుదై శ్రీవేంకటేశఁ డలమేల్ మంగ నున్నారు
సిరులఁ గాచుకుండరే చెలువలాల

రేకు: 1301-3 ముఖారి సం: 23-003

పల్లవి: చెప్పవే యాకె కీమాట చెలియా
యెప్పుడూను నాబలిమి యెఱఁగదా తాను

చ. 1: పంతమాడుకొంటేనేమి పడఁతి తనవిభుని
వంతులకు వలపించవలెఁగాక
యెంతగర్వము చూపినానేమి పరివారిలోన
రంతుతోడ నేరుపు మెరయవలెఁగాక

చ. 2: యీడువెట్టుకొంటేనేమి ఇల్లాలై యాతనికి
వాడలోఁ బొగడించుకోవలెఁగాక
వేడుకకు బిరుదులు వెసఁ బెట్టుకొంటేనేమి
తోడనే వాసుల తులఁదూఁగవలెఁకా (గా?) క

చ. 3: యేతులు చూపితేనేమి ఇట్టె శ్రీవేంకటేశుచే
వాతప్పక బాసగొనవలెఁగాక
యీతఁడే నన్నేలె తానూ నేమి సేసినా నేమి
రేతిరిఁ బగలూఁ దమిరేఁచవలెఁగాక

రేకు: 1301-4 సామంతం సం: 23-004

పల్లవి: సతి నిన్నింతచేసినజాణనిఁ జెప్పేదిగాక
కతకారి వైతివి కడుఁజిన్నదానవు

చ. 1: చెలులమఱఁగులును చిత్తములో కరఁగులు
తెలిసిగ్గులును యేడఁ దెచ్చుకొంటివే
మలగుపై వొరగులు మరి నివ్వెరగులును
కలికి నీవెటువలెఁ గలిగించుకొంటివే

చ. 2: చిఱుతనవ్వులును చిందేటికొప్పుపువ్వులును
కెఱలి నేఁ డెందు దొరకించుకొంటివే
కఱతలమాటలును కన్నులలో తేటలును
గుఱుతు లిన్నేసి యెందుఁ గూడపెట్టుకొంటివే

చ. 3: కావరపుఁగెలపులు కమ్ముకొన్నవలపులు
యీవేళ నీవెట్టు గడియించుకొంటివే
శ్రీవేంకటేశుఁడట చేరి నిన్నుఁ గూడెనట
వేవేలు నీచేఁత లెంత వెలయించుకొంటివే

రేకు: 1301-5 కుంతల వరాళి సం: 23-005

పల్లవి: ఆసుద్దులే చెప్పుకొనే మది నీవేలడిగేవు
దోస మానవెట్టకుము తోయరాదు మాకును

చ. 1: వోరగండ్లను జూచి వొయ్యనే నీవాకెను
చేరి వాఁడికొనగోరఁ జిమ్మవా నీవు
సారెకునుఁ దమిరేఁగ సన్నలుసేసుకొంటా
పేరుకొని నీయింటికిఁ బిలువవా నీవు

చ. 2: తనువుఁదనువు సోఁక దండ నాకెఁ బెట్టుకొని
ననుపుసేసుక కొంత నవ్వవా నీవు
నిను నాపె జంకించఁగా నిమ్మపంట వేసుకొంటా
పెనఁగుచు వలపులు పెంచవా నీవు

చ. 3: పచ్చిదేర నీ వాపెను బలిమిఁ గాఁగిటఁబట్టి
కొచ్చికొచ్చి మోవి చదవిగొనవా నీవు
యిచ్చట శ్రీవేంకట యేలితివి నన్ను నేఁడు
తచ్చి యాకెఁ దెరలోన దాఁచవా నీవు

రేకు: 1301-6 దేశాళం సం: 23-006

పల్లవి: బంగారువంటిమేనెల్లాఁ బచ్చిసేసుకొంటివి
సింగారా లద్దములోనఁ జేరి చూచుకొవయ్యా

చ. 1: అగ్గలమై సతిసొమ్ము లవె నీబుజాల నొత్తె
బిగ్గెఁ గాఁగిలించుకొని పెనఁగితివో
వొగ్గి వట్టుగట్టుక వున్నది సెలవిఁ దమ్మ
యెగ్గులేక విడెముసే సింతికిఁ బెట్టితివి

చ. 2: మించి నీచేతులఁ గడుమెఱుఁ గై జిడ్డంటె నదె
పొంచి జవ్వా దాపెమేనఁ బూసితివో
నించి లత్తుకరేకలు నీవొసల నంటినవి
వంచనతో నాపెకు వలచి మొక్కితివో

చ. 3: కప్పి నీచెక్కులవెంటఁ గారీఁ బెఁ(బెం?) జెమటలు
చెప్పరానిచేఁత లట్టె సేసుకొంటివో
యిప్పుడు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొప్పులు నావల్ల గడించుక మెఱసితివో

రేకు: 1302-1 ఆహిరినాట సం: 23-007

పల్లవి: సారిది నీపంతాలెల్లాఁజూచేరా నేను
సిరులనీకోరికలు చెల్లించేరా నేను

చ. 1: అంతేసి నాకేమి చెప్పే వందుకేమి కానీలేరా
వింతలు నీసఁతలెల్లా వింటిరా నేను
యెంతకెంత నీతోను యిప్పటనుండీ నేల
చెంత నీచిత్తమురాను సేసేరా నేను

చ. 2: నన్నేమి చెక్కు నొక్కేవు నవ్వువచ్చీ నాయలేరా
కన్నులారా నీఁచేతలు కంటిరా నేను
సన్నలా చాయలా నిన్ను సాదించఁగ మరియేల
మిన్నక కూచుండ నిన్నే మెప్పించేరా నేను

చ. 3: సారెఁ గాఁగిలించేవు చలములు దీరెలేరా
చేరి నీపొందులఁ దనిసితిరా నేను
యీరీతి శ్రీవేంకటేశ యిఁకఁ గాదనఁగనేల
కూరిమితో నిన్ను వేఁడుకొనేరా నేను

రేకు: 1302-2 కాంబోది సం: 23-008

పల్లవి: ఏల యింతసేసేవు యింటికి రావే
వేళవచ్చె నిఁకనైన విడెమందుకోవే

చ. 1: వగరుఁబెదవులపై వులివచ్చినీమాఁటలు
చిగిరించి వలపులు చిమ్మిరేఁచీనే
తెగ నిండాఁజాఁచినతీగెసో గలచూపులు
తగిలి మర్మములంటి తమి పుట్టించీనే

చ. 2: కలకలమనియేటికప్పురపునీనవ్వులు
తలఁపులో గుబ్బితిలి దైవారించీనే
పొలపు మిగిలినట్టిబొమ్మలనీజం కెనలు
తలకొని యాసాసలఁ దగిలించీనే

చ. 3: చక్కఁదనములనీసరసపువిలాసాలు
వెక్కసపువేడుకలఁ జొక్కించీనే
ఇక్కడనె శ్రీవేంకటేశుఁడనైననాకు
దక్కితిని నీచేఁతలు తడఁబఱచీనె

రేకు: 1302-3 భైరవి సం: 23-009

పల్లవి: ఇట్టె నాకు సిబ్బితయ్యీ నేమీ ననఁజాలను
దిట్ట వాతనితలఁపుఁ దెలియనే చెలియా

చ. 1: తప్పకచూచితేఁ బతి దంట ఇది యనునో
కప్పుర మడిగితేను గబ్బి యనునో
అప్పటిఁ గానుకిచ్చితే నాసపడీ ననునో
చెప్పవే బుద్ధి నే నేమి సేతునే వోచెలియా

చ. 2: సెలవుల నవ్వితేను చిత్తిణి ఇదెనునో
సొలసి పాదాలొత్తితే జూటరెనునో
వెలయఁగ మొక్కితేను వేసాలది యనునో
నెలకొన్న వెరవులు నేరుపవే చెలియా

చ. 3: పచ్చిగా నేఁ జెనకితే పంతగత్తె యనునో
రచ్చలో నేఁ గొసరితే రాఁగయనునో
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతలో నన్నేలినాఁడు
మచ్చిక నాతని నాతో మరుపవే చెలియా

రేకు: 1302-4 శ్రీరాగం సం: 23-010

పల్లవి: ఏమి సేతుఁ జెప్పవే యేది నా కుపాయము
ఆముకొన్ననావలపు లాఁపరాదే చేలియా

చ. 1: కళరేఁగ వానిమేను కలువల వేతునా
కలయుమనుచు మొక్కి కాఁగిలింతునా
మొలకచన్నుల నొత్తి మొనగోరు దాఁకింతునా
పిలిచి పోకుండా నానవెట్టుదునా చెలియా

చ. 2: యీకడిమోమౌదాఁకా నెసగి సొలతునా
కైకొని పాదాలొత్తి కరఁగింతునా
జోకతో మోవితేనెలు సోఁకించి చొక్కింతునా
కోకకొంగుపట్టి వేఁడుకొందునా చెలియా

చ. 3: సురతపువిందుచెప్పి చూపులు నాఁటింతునా
సరుగ నిచ్చకముల జట్టిగొందునా
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
సిరుల నేఁ బొగరి మెచ్చింతునా చెలియా

రేకు: 1302-5 పాడి సం: 23-011

పల్లవి: ఈపాటిది వలె నీకు నిన్నియునుఁ జెల్లంబెట్ట
దాఁపురము గల్గె నీకు తానెవ్వరోయీ

చ. 1: పొంకముగాఁదిట్టీ పొలఁతి; నీమాటలు
వంకలొత్తి పూనుకవచ్చీ నీకు
లంకెలై యడ్డాలు దూరీ లావుగా నిన్నాడుకొంటే
కొంకర యెందు గడించుకొంటివోయి యీకెను

చ. 2: బాసలు సేయఁగవచ్చీ పలుమారు నీకుఁగాను
వాసితోఁ బొగడీ నిన్ను వదివారితో
సేసినచేఁతలకుఁ జెప్పీఁ గతకారణాలు
నేసుక యెన్నాళ్లాయఁ జెప్పవోయి యీకెను

చ. 3: తప్పులుదీరుచవచ్చీ తక్కరినీనడకలు
తప్పక సాకిరిచెప్పీఁ దగుదునంటా
ఇప్పుడిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అప్పనము దాఁచుకొంటి వవునోయి యీకెను

రేకు: 1302-6 గౌళ సం: 23-012

పల్లవి: మేలు మేలు యివీఁగొన్ని మించె బూమిపైఁ గొత్తలు
సోలినున్నమిమ్మిద్దరిఁ జూచి వేడుకయ్యీని

చ. 1: చెలరేఁగిచెలరేఁగి చెప్పీ నాపె సుద్దులు
పొలసిపొలసి కడుఁ బొందు సేసీని
తలఁచుకతలఁచుక గత నూడిగాలు సేసీ
యెలమి నీపెపొందు లినుమడించఁబోయి

చ. 2: తగిలితగిలి నీపైఁ దమకము నించీని
మొగమెత్తి మొగమెత్తి మోము చూచీని
నగినగి సారెసారె నాఁటించీఁ జన్నులు
మగువవలపు లినుమడిగాఁబోలును

చ. 3: పెనఁగిపెనఁగి నిన్నుఁ బ్రేమఁ గాఁగిలించీని
తనిసితనిసి నిన్నుఁదగ మెచ్చీని
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
నని చిద్దరివలపూ యినుమడిగాఁబోలు

రేకు: 1303-1 పళవంజరం సం: 23-013

పల్లవి: మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా ఇఁకనైనా
కాలుదొక్కుదువు పొన్పుకడకు రావయ్యా

చ. 1: వెలఁది యొకతె నిన్ను వెదకీ నేమిటికో
సొలవక నీ మొగము చూపవయ్యా
పిలిచీ నప్పటనుండి పెదపెదయెలుఁగుల
పలుకవయ్యా యేల పరాకు నీకు

చ. 2: వొడినేమోపెట్టుకొనివుండి నిన్నే తలఁచీని
అడిగాపెఁ దెలుసుకోవయ్యా నీవు
నడివనీది నిలుచుండి నన్ను నీకడకు నంపె
విడిది నీపారుగే యీవింతలేల నీకు

చ. 3: చేపమీద నేకతము చెప్పేనంటా నున్నది
నావంటిదే తానూనేమి చెప్పేవయ్యా
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి యిట్టె కూడితివి
సేవించే నాపెనే నేను చెప్ప నేల నీకూ

రేకు: 1303-2 సింధురామక్రియ సం: 23-014

పల్లవి: వద్దనేనా రెవ్వరు వలపు నీకుఁ గలిగే
పెద్దరికముతోడనే పెండ్లాడరాదా

చ. 1: సారెకు నాతనితోను సరసము లేమాడేవు
కోరికైతే గాఁగిలించుకొనరాదా
తేరకొన మోముచూచి తిమిరి యాఁకారనేల
సారపుటాతనిమోము చవిగొనరాదా

చ. 2: పొసఁగ నితనికెంత పొంచిపొంచి లాచేవు
కొసరు గలితే వద్దఁ గూచుండరాదా
ముసిముసినవ్వులతో మొక్కులు మొక్కఁగనేల
విసవస నాతనిచే విడెమందుకోరాదా

చ. 3: వొల్లనే యంటిముట్టి వూడిగా లేమిసేసేవు
చెల్లుబడైతేఁ జేతలు సేయరాదా
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
వెల్లవిరి నీవాతని వేఁడుకొనరాదా

రేకు: 1303-3 లలిత సం: 23-015

పల్లవి: సేసే వుపచారా లేవి చెప్పవయ్యా
వేసాలేల సేసేవు వేఁడుకొనే నిన్నును

చ. 1: వింతవింతమాటలే వేగినంతా నాడితిరి
బంతి విడెములు సేసి పరగితిరి
కొంతదడ వూరకే గుట్టుతోడ నుంటిరి
యెంతేసిబడలితివో యెఱఁగము నేము

చ. 2: నడుమనడుమ మీరు నవ్వుకొంటా నుంటిరి
బడినే సుతిగూడుక పాడుకొంటిరి
నిడివిగాఁ బంతాలతో నెత్తమాడుతా నుంటిరి
అడరి నీవోరుప దెలియదు మాకు నిపుడు

చ. 3: వొప్పుగ నుయ్యాలమీఁద నూఁగుకొంటా నుంటిరి
కప్పుకొంటివి రెంటెము గళబెళను
యిప్పుడు శ్రీవేంకటే: యేలితివి నన్ను నీడ
దప్పిగొనువుగదా నీతలఁ పడిగేను

రేకు: 1303-4 సామంతం సం: 23-016

పల్లవి: ఎంత బయలీఁదించేవే యీతని నీవు
ఇంత నేరకుండితేను యిల్లాల వవుదువా

చ. 1: చూపులనే సొలసేవు చుట్టమువలె నాపతి
రాఁపుసేసి నీయింటికి రమ్మంటాను
పూఁపచన్నుల నొత్తేవు బొమ్మల జంకించుకొంటా
యేపున ముద్దుటుంగర మిమ్మనియంటాను

చ. 2: కోరి కొంగువట్టేవు కూరిమితో నప్పటిని
ఆరగించ విందుకు రమ్మనియంటాను
గోరనే చెక్కునొక్కేవు గుట్టుతోడ వేఁడుకొంటా
సారమైననీమోవి చవిచూపుమంటాను

చ. 3: వుద్దండానఁ బెనఁగేవు వొడఁబడికగాఁ జెప్పి
వొద్దికై నీపొత్తునఁ గూచుండుమంటాను
కొద్దిమీర నన్ను నేలుకొనె శ్రీవేంకటేశుఁడు
సుద్దు లేమిచెప్పేవే చొక్కఁజేసుకొంటాను

రేకు: 1303-5 నట్టనారాయణి సం: 23-017

పల్లవి: చెలియా మఱవకువే చెప్పితి బుద్ది
తొలుతే గాలిగలట్టే తూరుపెత్తుమందురు

చ. 1: బత్తితో నీరమణుఁడు పానుపుపై నున్నవాఁడు
చిత్తమురా విన్నపాలు సేసుకొనవే
హత్తినితో సమేళమై యిప్పుడున్నవాఁడు
గుత్తపుగుబ్బల నొత్తి కొసరఁగఁగదవే

చ. 2: ననిచి నీమోము చూచి నవ్వుతానే వున్నవాఁడు
చెనకి యేపనులైనాఁ జేయించుకోవే
కనుఁగొని నీమీఁదివే కన్నులై తా నున్నవాఁడు
పెనఁగి తమ్ముల మిట్టె పెట్టించుకోఁగదవే

చ. 3: మరగి నీతోడుతనే మాటలాడుతా నున్నాఁడు
యెరపు లేకుండా వరమిప్పించుకోవే
ఇరవై నిన్నేలి చనవిచ్చి నీకు తా నున్నాఁడు
నిరుగ శ్రీవేంకటేశు సారె మెప్పించఁగదే

రేకు: 1303-6 ధన్నాసి సం: 23-018

పల్లవి: అందుకేమే నాసంతోస మదియేకాదా
కందువల నన్ను నిట్టె కరుణించుమనవే

చ. 1: ఇంతవడి నన్నె చూచె యేమినోము నోచితినో
వింతలేల మాయింటికి విచ్చేయనీవే
యెంతేసి వేఁడుకొనీనే యెదురాడేనా నేను
అంతేపో వోయమ్మ అడుగఁగవలెనా

చ. 2: వేడుకైతేఁ జాలుఁగాక విచారమేల నాచేత
వూడిగము సేయించుకవుండుమనవే
వీడె మందుకోనీవే వేరేల తనవారమే
చూడవో చేసుకొంటేను చుట్టరికముగాదా

చ. 3: అడియాల మంపెఁగాను అంత నేను బాఁతియైతే
యెడమాట లీఁకనేల యేలుమనవే
బడినే శ్రీవేంకటపతి దానె వచ్చి కూడె
కడమ లేదే మన్నించె కమ్మటి మెచ్చీని

రేకు: 1304-1 బౌళి సం: 23-019

పల్లవి: ఇతఁడే నావాఁడైతే నెవ్వరికీ లోఁగనేల
కతగా యీవుపాయము గంటినే వోచెలియా

చ. 1: చిలుకలు పలుకనీ చేరి కోవిల గూయనీ
చెలువుఁ డాడినమాట చెప్పఁగదవే
కలువలు మెరయనీ కమలాలు చెలఁగనీ
తలఁపు దెలిసితివా తగిలి నీవతని

చ. 2: చందురుఁడు రానీవే చల్లగా లేతేరనీవే
యిందుకు వచ్చెనా తాను యెటిఁగించవే
ఇందిందిరాలు రేఁగనీ యిగిరించనీ తీగెలు
కందువ నాపై బత్తిగఁదా విభునికి

చ. 3: కప్పుర మగ్గువగానీ గందవొడెక్కుడుగానీ
వొప్పుగఁ బానుపుపై నాతఁడున్నాఁడటే
కప్పి వసంతకాలము గానీ మరుఁ డెసగనీ
యిప్పుడు వచ్చి శ్రీవేంకటేశుఁడేలె నన్నును

రేకు: 1304-2 ముఖారి సం: 23-020

పల్లవి: నన్ను నింతసేసినాఁడు నాయకుఁడు వలపించి
అన్నిటా మన్నించె నింకా నాఁపరాదు మనసు

చ. 1: విందమువో తనమాట వేడుక నేమిచెప్పీనో
పెందలకాడే దూతికఁ బిలిచి తేవే
పందెమువేసె నా తోను పతిఁదెచ్చే నంటాను
అందాఁకాఁ జివి రేఁగీ ఆఁపరాదు మనసు

చ. 2: చూతమువో తనమోము సొమ్ము లేమిదెచ్చీనో
దూతిక యిక్కడికే తోడుకరావే
యేతులు నెరపె నాతో నిట్టె పొందులు సేసేనంటా
ఆతనిఁజూచినదాఁకా నాఁపరాదు మనసు

చ. 3: ఇత్తమువో తనకు మెచ్చి యిట్టె యాతనిఁ జూపితే
బిత్తరపుదూతివి రప్పించవే ఇందు
ఇత్తల శ్రీవేంకటేశు నెనయించెఁ దా నింతలో
హత్తి కూడె నీతఁడింకా నాఁపరాదు మనసు

రేకు: 1304-3 పాడి సం: 23-021

పల్లవి: కన్నె గడుజవరాలు కామిని నీకు మేలుది
ఇన్ని సేవలునుఁ జేసె నిఁక జాగులేఁటికి

చ. 1: కొమరెగుబ్బ లదరఁ గొలిచివచ్చీఁ జెలి
చెమటలు గాతఁగాను సిగ్గులోడను
అమరఁ బల్లకిమీఁద నాపెఁ బెట్టుకొనరాదా
రమణి యలయికలు రచ్చవేయనేఁటికి

చ. 2: సరిబిరుదువేకాన బిరబిర వచ్చీని
పరువులు వెట్టుకొంటా బడివాయక
ఇరవుగ గుబ్బముపై నిద్దరూ నెక్కుకోరాదా
తరుణి నిందరిలో వింతలు సేయనేఁటికి

చ. 3: కడుబుసకొట్టుకొంటాఁ గైదండ నీకిచ్చుకొంటా
యెడయక మేడయెక్కె నిందాఁకా నీతో
తొడపై విడుకోరాదా తోడ శ్రీవేంకటేశ
పడఁతి గూడితి విఁక బచ్చిసేయనేఁటికి

రేకు: 1304-4 కాంబోది సం: 23-022

పల్లవి: వేడుకైతే యీయిండ్లకు విచ్చేయవయ్యా
యీడ నేమియడిగేవు యివిగో మాసుద్దులు

చ. 1: మోవరానిమోపులు మునుకొన్నవలపులు
పూవకపూచేపూవులు పూఁవనవ్వులు
చేవలోనిచేఁగలు చెప్పరానివయసులు
యీవల నేమడిగేవు ఇవిగో మాసుద్దులు

చ. 2: పట్టరానిపదనులు పంతపుమావాసులు
చెట్టులపై చిగురులు చిమ్ముఁజూపులు
పుట్టులపైతేనెలు పుడివోనిమామాటలు
యిట్టె యేమడిగేవు ఇదిగో మాసుద్దులు

చ. 3: వెన్నెలలోపులుఁగాలు వెక్కసపుమాసిగ్గులు
కిన్నెరమీఁటులు గిలిగింతరతులు
ఇన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ముఁదొల్లె
యెన్నెని యడిగేవయ్యా ఇదిగో మాసుద్దులు

రేకు: 1304-5 ముఖారి సం: 23-023

పల్లవి: ఇంతులట మగఁడట యేల మానేరు
వింతలుగ నీవెంత వేసాలు సేసేవే

చ. 1: సలిగెగలుగువారు జంకింతురు రమణుని
వలచినవారు రవ్వలు సేతురు
బలిమిగలుగువారు పైపైఁబెనఁగుదురు
నిలుచుండి చూచిచూచి నీవేల దూరేవే

చ. 2: మనసెనసినవారు మందెమేళాలు సేతురు
ననుపైనవారు చెనకవత్తురు
తనియనివారు సంతతముఁ గొనరుదురు
వనితరో నీ వేల వాసులురేఁచేవే

చ. 3: మేనవారయినవారు మించి యేమైనాఁ జేతురు
పూని మరిగినవారు పొదుగుదురు
యీనెపాన శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
నానఁబెట్టుకొని నీవు నవ్వు లేమి నవ్వేవే

రేకు: 1304-6 ఆహిరినాట సం: 23-024

పల్లవి: ఏమే నమ్మితిఁగదే యింకానేల దాఁచేవు
చేముంచితివేమో నాకుఁ జెప్పవే యాకతలు

చ. 1: కళలు మోమునఁ దేరీఁ గారీఁ బెఁ(బెం?) జెమటలు
చెలి నిన్నాతఁడేమైనాఁ జెనకెనటె
పిలువ నిన్నంపితేను పెనఁగులాడితివేమో
సెలవి నేమినవ్వేవు చెప్పవే యాకతలు

చ. 2: నాతి నీకొప్పదె జారె నలఁ గెఁ గట్టినచీర
ఆతఁడేమైనా నిన్ను నంటెనటవె
రాతిరెల్లా నాడనుండి రచ్చలు సేసితివేమో
చేతిసన్నేమి చూపేవు చెప్పవే యాకతలు

చ. 3: మోవిపైఁ గెంపులు నిండె ముడిచిన కొప్పు జారె
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెందెనటవే
నీవెంటనే వచ్చి తాను నేఁడు నన్నూ నేలెఁ బతి
సేవ లేమిసేసేవు చెప్పవే యాకతలు

రేకు: 1305-1 ఆహిరి సం: 23-025

పల్లవి: చిత్తాన నెగ్గుపట్టకు చేతులెత్తి మొక్కే మిదె
కొత్తకొత్తవయసులకోమలులము

చ. 1: కెలతుము సొలతుము కేరడము లాడుదుము
వలపులు చల్లుదుము వనితలము
పిలుతుము పేరుకొని ప్రియములు చెప్పుదుము
సళుపుఁజూపులఁ జూచి సరసమాడుదుము

చ. 2: వినయాలు సేతుము వేడుకతో నవ్వుదుము
చనవున మెరతుము జవరాండ్లము
పెనఁగుదుము పైకొని పెక్కుచేఁతలు సేతుము
మనసులు గరఁగించి మరిగింతుము

చ. 3: యెప్పుడైనాఁ గూడుదుము యెంగిలిమోవి సేతుము
చెప్పుకొందుము నీపొందు చెలులము
ఇప్పుడే శ్రీవేంకటేశ యేలితి విన్నిటా మమ్ము
కుప్పలుగాఁ జొక్కించి గురుతులు నింతము

రేకు: 1305-2 గౌళ సం: 23-026

పల్లవి: నేరుగా నిధానము నెలఁతలకు
తారుకాణ నామాట తలఁచుకోవే

చ. 1: వినయములే సేసి వేడుక పుట్టించితే
మనసు గరఁగు నిట్టె మగవానికి
యెనయఁ గొలువుసేసి ఇచ్చకమే నెరపితే
ననుపులు సమకూరు నాయకునికి

చ. 2: చెప్పినట్టెల్లాఁ జేసి చేరి పాయకుండితేను
కప్పుకొనుఁ దమకము కాంతునికి
వొప్పుగా మాటలాడి వొరిమతో మెలఁగితే
చిప్పిలఁ గళలు రేఁగు చెలువునికి

చ. 3: చతురత నవ్వు నవ్వి సరసము లాడితేను
రతులఁ గాంక్షలు పుట్టు రమణునికి
సతమై శ్రీవేంకటేశు పతివైతి విట్లైతే
యితవులౌ నన్నియును యితనికిని

రేకు: 1305-3 సాళంగం సం: 23-027

పల్లవి: ఎటువంటిపొందులో మీ కిద్దరికిని
తటుకన నీలోనే తలఁచుకోవయ్యా

చ. 1: పట్టెఁడేసిగుబ్బల పడతి మొక్కితిననె
నెట్టన బంగారువంటినీపాదాలకు
మట్టున నీతోడుత మాటలాడి రమ్మనె
యిట్టె మారుత్తరము లేమని చేప్పేవయ్యా

చ. 2: చేరఁడేసికన్నులచెలి యడిగితిననె
చేరి నీ పరిణామపుచేఁతలెల్లాను
వేరుసేయ కిట్టె నీవేళ చూచి రమ్మనె
నేరుపు మాపెతోడుత లేలేమందునయ్యా

చ. 3: కాఁగెఁడేసిపిఱుదులకాంత వలచితిననె
వీఁగక నీవుగూడిన వేడుకలను
కాఁగిటిలో నిన్నూ దన్నూ గలపుదవు రమ్మనె
యేగివచ్చి శ్రీ వేంకటేశ కూడితివయ్యా

రేకు: 1305-4 ఆహిరి సం: 23-028

పల్లవి: వలపులేనిజోలి వట్టినిరాలి
యెలయించె నన్నుఁ దాను యేమిసేయుమనీనే

చ. 1: మంతనములే యాడితి మాపురాఁకాఁ దనతోను
వింతగాఁ జోకటాలాడి వేగించితి
చెంతనే పొద్దులువుచ్చి చెలరేఁగి నవ్వితి –
వింతసేసెనన్ను దానె యేమిసేయుమనీనే

చ. 2: సారెసారె రచ్చెలోన సరసములాడితి
కోరి కొలువులు సేసి గుబ్బతిలితి
తేరకొనఁ జూచిచూచి తేలితిఁ దనమాయల
యీరీతిఁదా నింతసేసె నేమిసేయుమనీనే

చ. 3: ఆసాసలఁ గొంతవడి యట్టె పాదాలొత్తితి
రాసినసిగ్గులలోన రాఁపైతిని
సేసవెట్టి నన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
యీసులే కింతసేసెఁదా నేమిసేయుమనీనే

రేకు: 1305-5 మధ్యమావతి సం: 23-029

పల్లవి: కంటిమి వింటిమి నీకతలెల్లాను
దంటలై పొగడించుకోఁ దగుదువే నీవు

చ. 1: కన్నులారిచేవు యెంతకలికితనమో నీది
సన్నలు సేసే వదేమిజాణతనమో
చన్నులతో గునిసేవు సాము లెంతనేరుతువో
యిన్నిటా నీమురిపెము లేమి చెప్పేదే

చ. 2: యేకతములాడేవు యేమేమెఱుఁగుదువో
కైకొన విదేటివాసికత్తెవో నీవు
దాఁకొని నవ్వేవు దొరతనమెట్టిదో యిది
యీకడ నీపెద్దరిక మేమి చెప్పేదే

చ. 3: కాలుదొక్కఁబూనే వెంతకతకారితనమో
వోలవేయఁజొచ్చే వెంతవొయ్యారివో
యేలె నన్ను శ్రీవేంకటేశుఁడు నీవు లాచేవు
యీలీల నీపగటులు యేమిచెప్పేదే

రేకు: 1305-6 నాదనామక్రియ సం: 23-030

పల్లవి: ఎటువంటివిలాసిని యెంతజాణ యీచెలువ
తటుకన నీకు దక్కె దైవారఁజూడవయ్యా

చ. 1: మగువ మాటాడితేను మాణికాలు నిండుకొని
పగడాలు పెదవులఁ బచ్చి దేరీని
మగడిచూచితేను మంచినీలా లుప్పతిలీ
తగు నీకు నీపెదిక్కు తప్పకచూడవయ్యా

చ. 2: పడఁతి జవ్వనమునఁ బచ్చలు గమ్ముకొనీని
నడచితే వైడూర్యాలు వెడలీగోళ్ళ
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వొడికమైనది యీపెవొరపు చూడవయ్యా

చ. 3: కొమ్మ ప్రియాలతేనేలఁ గురిసీఁ బుష్యరాగాలు
కుమ్మరించీఁ జెనకుల గోమేధికాలు
ముమ్మరపుఁజెమటట ముత్తెపుసరాలు నిండీ
నెమ్మది శ్రీవేంకటేశ నీదేవిఁ జూడవయ్యా

రేకు: 1306-1 సామంతం సం: 23-031

పల్లవి: ఎంతవేడుకో నీకు నిటువంటిచేఁతలు
మంతుకెక్క నేనూ నీమతి గరఁగించేను

చ. 1: చుల్లరితనాన నీపైఁ జూపులు చిమ్ము కొంటా
బిల్లఁగోట్లాడీ నీప్రియురాలు
కొల్లలుగఁ గొనగోళ్లఁ గుంకుమచెమట నించి
చల్లీ వసంతము నీపై జవరాలు

చ. 2: వాడికమాటల నిన్ను వలపులు రేఁచి రేఁ
వేడుకలు గాదెఁబోసీ నుదుటులు చూపుకొంటా
వోడక బొమ్మజంకెన నుదుటులు చూపుకొంటా
జాడతోఁ బంతాలు దూసీ చదురాలు

చ. 3: సేసవెట్టి నిన్నుఁగూడి చిరునవ్వు నవ్వుకొంటా
మూసిదాఁచీ సిగ్గులు ముద్దరాలు
వాసితో శ్రీవేంకటేశ వరుసరతుల నీకు
యీసుదీర సేవసేసీ నిచ్చకురాలు

రేకు: 1306-2 వరాళి సం: 23-032

పల్లవి: ఎందాఁకా మనసుచూచే వేమిజోలిఁబెట్టేవు
అంది కాఁగిలించుకొని యాదరించవయ్యా

చ. 1: చెప్పరానిప్రియుములు చెప్పిచెప్పి నీకును
కప్పురము గానుకిచ్చెఁ గలికి
కొప్పుజార మొక్కుమొక్కి కూరిమి గొసరీ నిన్ను
తప్పక యిఁకనైనాను దయదలఁచవయ్యా

చ. 2: సేయరానివినయాలు చేసిచేసి యప్పటికిని
పూయిమని గందమిచ్చె బొలఁతి
చేయిమీఁదుగా నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకొని
పాయరానిచనవిచ్చి పాలించవయ్యా

చ. 3: ఆడరానిమంతనము లాడియాడి నీముందర
వీడెము చేతికిచ్చె వెలఁది
యీడుజోడై శ్రీవేంకటేశ ఇప్పు డేలితివి
వేడుకలెల్లాఁ జేసి వెలయించవయ్యా

రేకు: 1306-3 బౌళి సం: 23-033

పల్లవి: ఏమిబాఁతి నేము నీకు యేల తడవేవు మమ్ము
కామునిదీములమైనకాఁతలము

చ. 1: వాసులకు నొడిగట్టి వంతులకుఁ జేయిచాఁచి
ఆసలనే చెలఁగేటియంగనలము
సేసలు మీఁదటఁ జల్లి సిగ్గులనేపొరలేటి-
మూసినముత్యాలు వంటిముగుదలము

చ. 2: చిమ్ముఁజూపులను జూచి చిత్తములోఁదలఁచేతి
వుమ్మగిలువలపులు వువిదలము
తమ్మిమోము విచ్చి నవ్వి తమకించి పెనఁగేటి-
కుమ్మరింపుఁగోరికల కోమలులము

చ. 3: అంకెల గుబ్బలనొత్తి అంతలోనే వేఁడుకొనే
కొంకుఁగొసరెఱఁగనికొమ్మలము
పొంకాన శ్రీవేంకటేశ పొదిగి నన్నేలితివి
కంకణముగట్టుకొన్న కామినులము

రేకు: 1306-4 సామంతం సం: 23-034

పల్లవి: ఏల జాగరాలు సేసే విటు నే నుండఁగాను
వేళవచ్చెఁ గూడరాదా వెఱపుమీ కేఁటికి

చ. 1: మచ్చికతో మీరిద్దరు మాటాడుకోరాదా
కచ్చుపెట్టి వాకిటఁ గాచుకుండెను
విచ్చనవిడిగా నింక విడేలుసేయరాదా
యిచ్చిపంపెఁ జెలిచేత నెన్నయినాను

చ. 2: గాఁటముగా నొండొరులు కాఁగిలించుకోరాదా
తేటతెల్లమి గాకుండాఁ దెరవేసేను
చాటువగా మోవితేనె చవులుగొనఁగరాదా
వూటలుగా మోమురసా లుబ్బఁజేసెను

చ. 3: పానుపుపై నాపె నీవూఁ బవళించి వుండరాదా
కానిమ్మని పచ్చడము గప్పె మీకును
యే నలమేలుమంగను నన్నేలితి శ్రీవేంకటేశ
పూని మీమనసు లిట్టె పొత్తుగలపేను

రేకు: 1306-5 కన్నడగౌళ సం: 23-035

పల్లవి: అందుకు మనసు నిల్పనలవిగాదు గాని
కందువతో నీపొందు కలకాలము మేలు

చ. 1: వెదకి వెదకి నీపై విరహాన వేఁగుకంటే
కొదదీర నిద్రించినాఁ గొంతమేలు
యెదురులు చూచి నీకు నేఁకారుతానుండుకంటే
చదురంగమాడి పొద్దు జరపినా మేలు

చ. 2: ఆసల నిన్నుఁ దలఁచి యసురుసురవుకంటే
వేసరక చుక్క లెంచివేసినా మేలు
నీసుద్దులు వినివిని నెమ్మి గుబ్బతిలుకంటే
వాసితో నింటిలో వీణ వాయించినా మేలు

చ. 3: నవ్వులు నవ్వుతా నిన్ను నాఁటఁగఁ జూచుటకంటే
చివ్వన నీమోవి గంటిసేయుటే మేలు
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నివ్వటిల్లేమనరతినివ్వెరగే మేలు

రేకు: 1306-6 పాడి సం: 23-036

పల్లవి: ఇంతే కలితే మీరు మాఇంటిలోని కేఁగరాదా
చెంత మీరు సన్నలేల సేసుకొనేరు

చ. 1: మొక్కలాన నాకె నీవూ మోములు చూచుకొంటాను
పక్కననట్టె సిగ్గులుపడుకొంటాను
అక్కరతో నంతలోనె యాసల మాటలాడుకొంటా
ఇక్కడ మీరెందాఁకా నేలాటాలాడేరు

చ. 2: చెలరేఁగి యిద్దరును సెలవుల నవ్వుకొంటా
చలపట్టి బొమ్మలను జంకించుకొటా
నిలువునఁ గరఁగుతా నివ్వెరగు లందుకొంటా
వలపుల నెందాఁకా వసివాడేరు

చ. 3: చేవమీరి మీకుమీరే చేఁతలు మెచ్చుకొంటాను
యీవల నన్నేలి విడె మిప్పించుకొంటా
శ్రీవేంకటేశుఁడ కూడి చేరి యలమేల్ మంగాను
వేవేలకు నెందాఁకా వినోదాలాడేరు

రేకు: 1307-1 రామక్రియ సం: 23-037

పల్లవి: అతని కొొక్క తెవే నీవాలవైతివా
సతులందరును నీసాటివారేకారా

చ. 1: గాదెఁబోసుకొనేవేమే గంపముంచి వలపులు
పోదిసేసి రమణునిపొంత నీవుండి
పాదుసేసి విత్తేవేమే పదనుతో నీసిగ్గులు
ఆదిగొని చన్నులు పయ్యదఁ గప్పికప్పి

చ. 2: వెదచల్లే వదియేమే వెన్నెలవంటినవ్వులు
కొదరీర నీతనికొలువునను
తుదఁ బచారించేవేమే తొంగితొంగి నీచూపులు
చెదరిననీకొప్పు చేతఁ బెట్టుకొంటాను

చ. 3: వొడిఁగట్టుకొనేవేమే వుబ్బరిసంతోసాలు
కడఁగి శ్రీవేంకటేశుకాఁగిటఁగూడి
నడుమ నీ వదియేమే నన్ను నీతఁ డిపు డేలె
అదరి యలమేల్ మంగనౌత నీవెఱఁగవా

రేకు: 1307-2 భల్లాటి సం: 23-038

పల్లవి: ఉద్దండము నయమును వొసరి నీయందున్నవి
సుద్దులేల చెప్ప నీవే చూచుకొనరాదా

చ. 1: పొంచిపొంచి యాతనిని బొమ్మల జంకించనేల
మంచితనము చూపి మాటాడరాదా
ఇంచుకించుక సొలసి యెలయించ నింతయేల
కంచపుమోవి చూపి కరఁగించరాదా

చ. 2: కన్నులఁ దప్పకచూచి ఘాతలు సేయఁగనేల
నున్ననిచేతులఁ జెక్కు నొక్కఁగరాదా
చన్నుమొనలు దాఁకించి సాదించ నిదియేల
చిన్ని సెలువుల నవ్వి చిక్కించుకోరాదా

చ. 3: పంతనుఁజేఁతల నిట్టె పట్టి పెనఁగఁగనేల
చెంతల నిరతిఁ గూడి చెనకరాదా
అంతటి శ్రీవేంకటేశునలమేల్ మంగపు నీవు
వింతగా నన్నితఁ డేలె వేగమె మెచ్చరాదా

రేకు: 1307-3 తెలుంగుగాంబోది సం: 23-039

పల్లవి: నీకేమి గలిగినాను నెమ్మ నది నాలాబము
జోకగా నానతీవయ్య సొంపుగా వినేను

చ. 1: చెక్కులమీఁదట నవే చెమటలూ । నీ
చక్కని మోమున నవే చంద్రకళలు
యెక్కడఁ గలిగెనయ్య యింతేసి
నిక్కము చెప్పఁగరాదా నేనూ వినేను

చ. 2: సెలవుల నవిగో చిఱునవ్వులూ నీ
తలిరుమోవిని నిండె తగుకెంపులు
యెలమి నీకె యవరె నీకొత్తలు
నెలకొని చెప్పరాదా నేనూ వినేను

చ. 3: తొరలె నీనొసల లత్తుకచిన్నలూ నీ
విరవయిన శ్రీవేంకటేశుఁడవు
పురాన నలమేల్ మంగ నున్నదానను
నిరతితోఁ జెప్పరాదా నేనూ వినేను

రేకు: 1307-4 సామంతం సం: 23-040

పల్లవి: ఎంత సణఁగులు రాల్చే వితనిమీఁద
చెంత నిన్నుఁ గూడి పచ్చిసేయ కేల మానునే

చ. 1: పలుకులఁ గొసరుతా పయ్యదను విసరుతా
చిలుకుగోరికొనలఁజిమ్ముతాను
యెలయించి రమణునికేల వొడ్డించుకొనేవే
బలునీచన్ను లాతఁడు పట్టితే నేమాయనే

చ. 2: బొమ్మల జంకించుతాను పొంచి యానలు వెట్టుతా
పమ్మిఁజూపుపంతాలు పచారించుతా
యెమ్మెలకు నాతనితోనేల సాములుసేసేవే
నిమ్మపంట వేసితేను నీకేమాయనే

చ. 3: ఆయములు దాఁకించుతా నంటిముట్టి పెనఁగుతా
చాయల సన్నల నిన్ను సాదించుతాను
పాయ కలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
యీయెడ నిన్నేలి చనవిచ్చితే నేమాయనే

రేకు: 1307-5 బౌళి సం: 23-041

పల్లవి: చూడ ముద్దరాలుగాని జూటరి యిది
యేడ నీపె నెట్టు గడియించుకొంటివయ్యా

చ. 1: కదలుఁగన్నులఁ జూచి కప్పురము గానుకిచ్చి
పెదవుల మాటలాడి బెల్లించీ నాకె
వెదచల్లి నేరుపుల వేడుకలు నీకుఁజేసి
యెదుటనే నిలుచుండి యెలయించీ నిన్నును

చ. 2: తరితీపుమాట లాడి తమకము నీకు రేచ
తెరమాఁటువలపులఁ దేలించీ నాకె
వొరపులు నీకుఁజూపి వొడిఁబెట్టి వావులు
గరిమలఁ జొక్కించి కరఁగించీ నిన్నును

చ. 3: జోకగాఁ బ్రియాలు చెప్పి చుట్టరికాలు నటించి
మేకులనే నిన్నుఁ గూడి మెప్పించీ నాకె
పైకొని యలమేల్ మంగపతి శ్రీవేంకటేశుఁడ
నాకు మగఁడవైతివి నవ్వించీఁదా నిన్నును

రేకు: 1307-6 పాడి సం: 23-042

పల్లవి: నీకొలఁదివారమా నేమెల్లాను
కాకుసేయఁజాలక కనుఁగొనేఁగాక

చ. 1: పంత మేమినెరపేవే పగటేమి చూపేవే
కొంతైనా సిబ్బితిలేక కొలువులోన
వంతుకేల పెనఁగేవే వట్టి వారితో నీవు
ఇంతటినాయకుఁడు నిన్నేమీ ననఁడంటాను

చ. 2: వేసా లేలసేసేవే వెగటేల సలిపేవే
వాసులేమీ నెంచక వనితలతో
తోసుకేల వచ్చేవే తోడివూడిగపువారి
యీసేఁత లాతఁడు చూచి యేమీ ననఁడంటాను

చ. 3: సెలవినేల నవ్వేవే సిగ్గులేల పెంచేవే
తలఁపేమీ నెఱఁగనితగువారిలో
అలమేలుమంగపతియుగుశ్రీవేంకటేశుఁడు
యిల నన్నేలె నిన్నా తఁడేమీ ననఁడటాఁను

రేకు: 1308-1 ఆరబి సం: 23-043

పల్లవి: అందులకే వెరగయ్యీ నతివరో నిన్నుఁజూచి
సందుకొని యాతనితో సరసములాడేవు

చ. 1: మత్తిలి నీరమణునిమనసెట్టు గంటివే
కొత్తకొత్తవలపులకోడెదానవు
యిత్తల నీతఁడిప్పుడే యెట్టు గైవసమాయనే
హత్తి కడునవ్వేవు అంతలోనే నీవు

చ. 2: కలికితనాల నెంత కాపురాలు సేసేవే
మెలకచన్నులతోడి ముద్దరాలవు
చలివాసి యంతలోనే చనపరివైతివటే
బలిమి నాతని మీరి పలికేవు నీవు

చ. 3: రాఁపుగ శ్రీవేంకటేశు రతి నెట్టు గూడితివే
పూఁపజవ్వనముతోడి పోదికత్తెవు
యేపున నలమేల్మంగ యేమి నేరుచుకొంటివే
ఆపరానితమితోడ నడరేవు నీవు

రేకు: 1308-2 శంకరాభరణం సం: 23-044

పల్లవి: ఎక్కడికెక్కడ మరుఁడేలికట యిన్నిటికి
యిక్కువల నూతఁగూట మెట్టు గూడెనే

చ. 1: కొలనిలో తుమ్మిదలు కొంతలలో చల్లగాని
చెలరేఁగి పలికేటిచిలుకగుంపు
ములువాఁడివిరులును మొయిలులోనమెఱుఁగు
యెలమి నూరఁగూట మెట్టుగూడెనే

చ. 2: కావరపుచందురుఁడు కడువేఁడివెన్నెలలు
చేవమీరినట్టి లేఁతచిగురులును
పావురపుఁబలుకులు బలువసంతునిడాక
యీవిధాన నూరఁగూట మెట్టు గూడెనే

చ. 3: చిమ్మిరేఁగేవలపులు చెఱకుసింగిణివిల్లు
తెమ్మలకోరికలపాలదికరతులు
కొమ్మయలమేలుమంగఁ గూడె శ్రీవేంకటేశుఁడు
యెమ్మెల నూగఁగూటము లెట్టు గూడెనే

రేకు: 1308-3 బౌళి సం: 23-045

పల్లవి: చిన్నదాన వైతేనేమి చేఁతలు పెద్దవిగావా
సన్నలా చాయలా నీకు జడియఁగనేఁటికే

చ. 1: నిక్కినిక్కి పతిఁజూచి నీడనుండి యలసేవు
చెక్కులవెంటాఁ జెమట చిందుకొనేవు
అక్కర ఇంతగలితే నాతనిఁ బెండ్లాడరాదా
వుక్కుమీరి యాసలను వుమ్మగిలనేఁటికి

చ. 2: చేరిచేరి మాటలాడి చెనకి బయలీఁదేవు
వూరకే లోలో నస్సురుస్సురంటాను
కూరిమింత గలిగితే కొంగుపట్టి తియ్యరాదా
సారాసారె కొప్పువీడి జాలిబడనేఁటికి

చ. 3: వచ్చివచ్చి నవ్వునవ్వి వలపు చవిగొనేవు
మెచ్చె శ్రీవేంకటేశుఁ డల మేలుమంగవు
మచ్చికింత గలిగితే మరిమరిఁ గూడరాదా
యిచ్చ నన్నేలీ నీవిఁక నెచ్చుకించనేఁటికే

రేకు: 1308-4 ముఖారి సం: 23-046

పల్లవి: మఱి వెనక నాతోను మాటలాడుదువుగాని
గుఱుతులు దాఁచుకోవే కొమ్మలు నవ్వేరు

చ. 1: పిక్కటిల్లుఁజన్నులపై పెనగొన్నహారాలు
చిక్కువడీ దిద్దుకోవే చక్కఁగా నీవు
చుక్కబొట్టు చెమటలఁ జొబ్బిలఁగాఁ గరఁగెను
గక్కన నద్దముచూచి గందమువెట్టుకోవే

చ. 2: కొప్పులోనిసంపెఁగలు కొణికలవెంటజారీ
విప్పక ముడుచుకోవే వేగఁ దురుము
పిప్పిగట్టి పెదవులు పిడి చినట్టున్నది
దప్పిదేర వేసుకోవే కప్పురబాగాలు

చ. 3: కట్టనచీర వదలి కానవచ్చీఁ బోఁకముడి
వొట్టి బిగించుకొనవే వొడ్డాణము
యిట్టె శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
నెట్టన నన్నేలెఁ బొందు నీవూఁ దెలుపుకోవే

రేకు: 1308-5 ద్రావిడ భైరవి సం: 23-047

పల్లవి: చెప్పిరి నీచిత్తము చెలిభాగ్య మిఁకను
తప్పదు కలిగినది దాఁచ నీకు నేను

చ. 1: వెలఁది యిప్పుడు నీవేళ చూచి రమ్మనె
తలఁపు నీకెట్టున్నదో తెలియుమనె
కలపుకోలుగాఁ దనకానుకిచ్చి రమ్మనె
పిలిచి తెమ్మనె నింతి ప్రేమ దాఁచనేఁటికి

చ. 2: తనతో నీవన్నమాట తలఁపించి రమ్మనె
వినయములెల్లాఁజేసి వేఁడుకొమ్మనె
మునుపనె తనమారు మొక్కులు మొక్కుమనె
తనుఁజూడ రమ్మనె దాఁచ నిఁకనేఁటికి

చ. 3: ఇంతలో నీరాకకు నెదురుకొనీ(నే?) రమ్మనె
చెంత నీవేలితివి మెచ్చితి నిన్ననె
అంతటి శ్రీ వేంకటేశ యలమేలుమంగ యీకె
మంతనాన గూడితిరి మఱి దాఁచనేఁటికి

రేకు: 1308-6 నాదనామక్రియ సం: 23-048
పల్లవి: ఎఱఁ(ఱిఁ?) గించవే నాకు నిట్టె వూరకుండేఁగాని
గుఱుతు దెలుసుకొని గుట్టుసేసుకొనేను
చ. 1: చెలికత్తెలకు నేల సిగ్గులు మూఁటగట్ట
అలరి దేవులకైతే నమరుఁగాక
కొలువులో నీవేల కోరి తలవంచేవే
నెలవై యాతనిపొందు నీకూఁ గొంత గలదో
చ. 2: పొదరుగుదానికినేల బువ్వానఁ గూచుఁడ
గరిమితో సమ్మందము గలితేగాక
సరసుఁ డారఁగించఁగా సంగడిఁ గూచుంటివేమే
అరయ నీకిట్టె తొల్లి నలనా(వా?) టు గలదో
చ. 3: కెలనిమగువకేల కెరలి సరసమాడ
లలి మఱఁదల నాకెలాఁగౌగాక
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
కలసె నన్ను నీకూఁ గారణము గలదో

రేకు: 1309-1 సాళంగ నాట సం: 23-049

పల్లవి: వట్టియెమ్మెలు చెప్పఁగా వచ్చేదేమే
నెట్టన నావలెనే మన్నింపించుకోవలెఁబో

చ. 1: వాసికత్తెయైనది వడిఁ బంతాలు చూపదు
సేసి చూపు నూడిగాలు చేరి పతికి
రాసికెక్కినగరితె రవ్వసేసి మాటాడదు
మూసినము త్తెమువలె ముచ్చటలే యాడును

చ. 2: నేరుపరియిల్లాలు నేరమెంచదు విభుని
కోరి తనుమన్నించిన గుణాలెంచును
పారమైనచదురాలు సణంగులు నెరపదు
గారవించి తనిచ్చకములే నెరపును

చ. 3: జడిసి మానాపతి చలము సాదించదు
పుడమి శ్రీవేంకటేశుపొందు సాదించు
అడరి నన్నేలె నాతఁడల మేల్ మం గను నేను
యెడమనిచుట్టమైన దిట్లనే వుండును

రేకు: 1309-2 రీతి గౌళ సం: 23-050

పల్లవి: తొయ్యలి నీభాగ్యమున దొరకెఁగాక
వెయ్యైనా నీపెకు మరి వెల యేదయ్యా

చ. 1: పలచని పెదవుల బచ్చి తేనియలు గారీ
మొలకలై సెలవుల ముత్యాలు రాలీ
నెలకొన్న చన్నులను నిమ్మపండ్లుప్పతిలీ
వెలఁదిజవ్వనానకు వెలయేదయ్యా

చ. 2: నెఱిఁగుఱులను మంచినీలపురంగులు మించీ
మెఱుఁగులు మొగమున మేళవించీని
పిఱుఁదు పెంపరసితేఁ బెరసీఁ గరికుంభాలు
మెఱసేయీజవ్వనము మేలువెల యేదయ్యా

చ. 3: పాదపుసొబగులను పద్మరాగా లొలికీని
పాదుకొనె దేహమెల్లా బంగారువన్నె
యీదెస శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
యేదైనా యీజవ్వనాన వెల యేదయ్యా

రేకు: 1309-3 వరాళి సం: 23-051

పల్లవి: పిలుచుకవచ్చితివా ప్రియుని నీడకు నేఁడు
తలపోసితలపోసి తడబడీ నాసలు

చ. 1: కుప్పలాయఁ దెప్పలాయఁ గోరికలు నాకు నేఁడు
యెప్పుడు వచ్చునే పతి యేమే చెలియా
చెప్పరాదు చూపరాదు చిత్తములో తమకము
కుచ్చళించినట్లు మేనఁ గురిసీఁ జెమటలు

చ. 2: తతివచ్చె మితివచ్చె తప్పక నాజవ్వనము
అతఁ డేమిసేసీనే ఆడఁ జెలియా
రతికెక్కె నుతికెక్కె రాఁపుల నావలపులు
చతురతఁ జిమ్మిరేఁగీ సారె నావేడుకలు

చ. 3: పచ్చిదేరీ మెచ్చువారీ పైకొన్ననాకూటములు
ఇచ్చల శ్రీవేంకటేశుఁ డేలెఁ జెలియా
తచ్చనేల గిచ్చనేల దాకొనె సంతోసాలు
అచ్చమై యతనిమీఁద నమరీ మచ్చికలు

రేకు: 1309-4 దేశాక్షి సం: 23-052

పల్లవి: కొత్తపెండ్లికూఁతు రిది గుట్టుతోడి మానిసి
చిత్తగించి మెల్లనే చెనకఁగరాదా

చ. 1: చెక్కుచేతితోడఁ జెలి సిగ్గుపడి వుండఁగాను
వుక్కుమీరి కాతరాన వొడివట్టేవు
మక్కువతోడుతఁ దెరమఱఁగున నున్నదాని
జక్కులవలెఁ బోలునంటా చన్నులంటేవు

చ. 2: ముసిముసినవ్వులతో మోమువంచుకుండఁగాను
నుసరాన మర్మములు సోఁకనాడేవు
పసగా నీదిక్కు చూచి భావము గరఁ(గ) గాను
కొసరికొసరి నీవు గోరఁజీమ్మేవు

చ. 3: చెప్పరానిమోహముతో చిమ్మిరేఁగియుండఁగాను
కప్పురముమోవినిచ్చి కాఁగిలించేవు
యిప్పుడే శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడెనని
చిప్పిల సరసమాడి చేత గిలిగించేవు

రేకు: 1309-5 శ్రీరాగం సం: 23-053

పల్లవి: ఎంతని చెప్పేము నీకు యింతి నీపైఁగలబత్తి
చెంత నీవే చూతువు విచ్చేయవయ్యా ఇంటికి

చ. 1: తరుణి నీరూపము తలపోసితలపోసి
శిరసూఁచి మెచ్చిమెచ్చి చెంగలించును
గరమ నీవిచ్చినవుంగరము తప్పకచూచి
మరిగి సంతోసాన మనసు గరఁగును

చ. 2: చెలులచే నీసుద్దులు చెవులారా వినివిని
సెలవుల నవ్వినవ్వి చిమ్మిరేఁగును
మెలుపున నీవంపినచిలుకతో మాటలాడి
వెలలేనివేడుకల విఱ్ఱవీఁగును

చ. 3: వేసరక నీరాకకు వేళగాఁచి వేళగాఁచి
ఆసలనే చొక్కిచొక్కి యానందించును
సేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ యింతలో
వాసితో నీరతికేలి వరుసఁ బొగడును

రేకు: 1309-6 హిందోళం సం: 23-054

పల్లవి: ఏమని చెప్పుదునే యింతిరో నాముచ్చటలు
సాములుసేసె నాతో సరసపువిభుఁడు

చ. 1: కన్నులఁదాఁ జూచితేను కరఁగె నామనసు
సన్నలు మోవిఁజేసితే చవులు రేఁగె
చన్నులు చేతనవంటితే జలజలఁ జెమరించె
యిన్నేసిచేఁతలు సేసె నేకతాన విభుఁడు

చ. 2: వొడిపట్టుకుండితేను వుమ్మగిలె వలపులు
విడెమిచ్చితే నెంతోవేడుకాయను
తడవి మాటాడితేను తమకము లుప్పతిల్లె
బడి నుండి యింతసేసె పాయపునావిభుఁడు

చ. 3: గక్కనఁగాఁగిలించితే కాయ మెల్లాఁ బులకించె
వుక్కుగోరు సోఁకించితే సుబ్బెఁ గళలు
మక్కువతోఁ గూడితేను మర్మములు గుబ్బతిల్లె
చెక్కు నొక్కి రట్టుసేసె శ్రీవేంకటవిభుఁడు

రేకు: 1310-1 ఆహిరి సం: 23-055

పల్లవి: ఆతనికే వలతునే సన్నింటాను
కాతరాన నిందుకే నేఁ గాచుకవుందానను

చ. 1: విన నవధరించెనా విభుఁడు నీవిన్నపము
మనసురంజిలి నీతో మాటలాడెనా
నవిచి నీచేకానుక నంటున నందుకొనెనా
వినవేడుకయ్యీ నాకు వెలఁది చెప్పఁగదే

చ. 2: అడిగెనా నిన్నాతఁ డట్టె నాపరిణామము
కడుసంతోసాన నిన్ను గారవించెనా
కడఁగి నేనంపినలేకలు చదువుకొనెనా
జడియ కాతలఁపులు చక్కఁగాఁ దెలుపవే

చ. 3: నీవెంటనే వచ్చెనా నెమ్మి శ్రీవేంకటేశుఁడు
యీవేళఁ జనవిచ్చెనా యింతలో నాకు
కైవసమై నన్నునేలె కప్పురపుటింటిలోన
తావుకొన్నభావములు తగ నెఱిఁగించవే

రేకు: 1310-2 మాళవిగౌళ సం: 23-056

పల్లవి: నీవెంత లెస్సవుండినా నేఁడది నాలాబము
యీవల నొకటొకటే యెచ్చరించే నేను

చ. 1: సొలసి యీపె నిన్నుఁజూచినమర్మపుఁజూపు
నలిరేఁగి నీమనసు నాఁటి కొనెనా
చెలులచే నెడనెడఁ జెప్పిపంపిన మాటలు
తలఁచుకొంటివా నీవు తనివారను

చ. 2: అల్లంత నుండి నీకు నాపె సేసినసన్నలు
తెల్లమిగా నీలోనఁ దెలిసితివా
వొల్లనే నీచేతి కాపెవొసగినబాగాలు
చల్లఁగా నీపుక్కిటిచవులాయనా

చ. 3: ముచ్చటతో నాపె నీకు మొక్కినకేలిమొక్కులు
అచ్చముగ నీకు సెలవాయనా నేఁడు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మెచ్చి యాపెపొందు నీవు మెయికొంటివా

రేకు: 1310-3 దేశాళం సం: 23-057

పల్లవి: అడుగరే యీమాట అవునో కాదో
తడయక నావేడుక తా నెఱఁగఁడా

చ. 1: కుచ్చితము నేరను కూళతనము నేరను
యిచ్చకములాడనేర్తు నిట్టె తనకు
మచ్చికతో నప్పటి నామనసేమి సోదించేనే
తచ్చిచూచి నాగుణము తా నెఱఁగడా

చ. 2: వెక్కసాలూ నెఱఁగను వేసాలు నెఱఁగను
మొక్కనెఱుఁగుదు నేను ముందే తనకు
యిక్కడ నానేరుపులు యెంతంతని తెలిసీనే
తక్కక నేఁజేసేసేవ తా నెఱఁగఁడా

చ. 3: బలిమిఁ బెనఁగానోప పంతములాడానోప
వొలిసి కాఁగిలించఁగనోపుదుఁగాని
యెలమి శ్రీవేంకటేశుఁ డెంతసరసమాడీనే
తలకొన్న నావలపు తా నెఱఁగఁడా

రేకు: 1310-4 భూపాలం సం: 23-058

పల్లవి: ఏకతాన నున్నవాడు యిందరికి మగఁడాయ
చేకొందము చనవులు చేత లేమిసేసీనో

చ. 1: విడెము చేతికియ్యరే విన్నపాలు సేయరే
వేడుకసంతోసాన విభుఁ డున్నాఁడు
కూడి సరనమాడరే గుబ్బలఁ గడునొత్తరే
యీడనే చూతము తా నిఁక నేమిసేసీనో

చ. 2: పానుపు వరచరే బాసలు సేయించుకోరే
నానినమోహానఁ బతి నవ్వుచున్నాఁడు
మోనముతో మొక్కరే మోవితేనె లందుకోరే
తానకమై యీవేళ తా నేమి సేసీమో

చ. 3: కొలువులు సేయరే గుఱుతెఱింగించుకోరే
యెలమి శ్రీవేంకటేశుఁ డేలుకొన్నాఁడు
పొలుపొందఁ జెనకరే పొత్తు గలపుకొనరే
మలసి పచ్చిసేతము మరి యేమిసేసీనో

రేకు: 1310-5 మంగళకౌసిక సం: 23-059

పల్లవి: మగఁ డేమీననఁడంటా మలసేవు కెలసేవు
యెగసక్కేలాడేవారి నెంచుకోవుగదవే

చ. 1: పంతములు మెరసేవు పకపకనవ్వేవు
మంతనాన రమణుఁడు మన్నించెనంటా
చెంతనున్న వారిలోను సిగ్గవడ వించుకంతా
యెంతలేదు నీపగటు యెమ్మెలాఁడివటవే

చ. 2: సారెసారె మాటాడేవు సన్నలు మోవిఁజేసేవు
చేరి నీచన నాతఁడు చెల్లించెనంటా
యీరీతి నిల్లాండ్లకు వింతరట్టు గలదా
నేరపులెల్లాఁజూపేవు నీటుకత్తెవటవే

చ. 3: ముప్పిరిఁ జెంగలించేవు ముద్దులెల్లా గునిసేవు
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డేలెనంటాను
వొప్పుగఁ గూడె నన్నితఁ డూఁకొని వినవే నీవు
కప్పురము చల్లేవు కతకారివటవే

రేకు: 1310-6 శ్రీరాగం సం: 23-060

పల్లవి: నిండువేడుకలతోడ నెమ్మది నుండుటఁగాక
పండువెన్నెలలోన బయలీఁదనేఁటికి

చ. 1: మొగమోటే కలిగితే మంచి పదరనీయదు
నగితేఁ జుట్టురికము నాఁటుకొనును
తగిలితే మనసే తఱవుకాఁడై మించు
మగనికి నాలికిని మఱి చింత యేఁటికి

చ. 2: తలకొన్న నేస్తాలే తమకము పెడరేఁచు
పిలుపు లొనగూడితేఁ బ్రియాలు వుట్టు
తొలసినజవ్వనమే పొంతనాలై కలయించు
చెలియకుఁబతికిని సిగ్గుపడనేఁటికి

చ. 3: ఆసలు నెలకొంటేను అందించుఁ గాఁగిటిరతి
వేసరక పొదిగితే వెలయుబత్తి
సేసవెట్టి నిన్నునేలె శ్రీవేంకటేశ్వరుఁడు
బాస లాతనికి నీకుఁ బచారించనేఁటికి

రేకు: 1311-1 ఆహిరినాట సం: 23-061

పల్లవి: పొద్దువోనివాఁడు తాను పొంచి నన్నుఁ జెనకీని
వొద్దికైతి నే నంతేసి కోపుదునటే

చ. 1: పెనఁగులాడి తేను పెంజెమట లుప్పతిలు
ననిచి సిగ్గువడితే నవ్వులు రేఁగు
కనుఁగవఁ జూడఁజూడ కాంక్షలు మిక్కుటమౌను
వొసరి తనతో పొందు కోపుదునటే

చ. 2: కడుఁగడుమాటాడితే గ్రక్కన మర్మాలు సోఁకు
తడవితేఁ దమకము దైలువారు
వొడిఁగట్టుకొంటేను వుమ్మగిలు వలపులు
వుడివోనివేడుకల కోపుదునటే

చ. 3: చెలఁగి కాఁగిలించితే చిత్తమెల్లాఁ గరఁగును
కొలువు సేసితే నాస గుబ్బతిలును
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
వులివచ్చిచేఁతలకు నోపుదునటే

రేకు: 1311-2 కన్నడగౌళ సం: 23-062

పల్లవి: అన్నినాయ నీఁకనేల ఆసుద్దులు
మన్నించితి వప్పుడే నీమాట వింటినయ్యా

చ. 1: యింటికి నీవు వచ్చి యీతవరివై యుండఁగా
నంటు సేసి నీతోను నవ్వవలెఁగా
జంటనుండి వాపులు సారె నీవు చెప్పఁగాను
అంటిముట్టి సరసములాడవలెఁగా

చ. 2: కదిసి చుట్టమవై కాఁపురాలు సేయరాఁగా
యెదురుకొని విడెము లియ్యవలెఁగా
కొదలేక నీవు నాకొంగువట్టి పెనఁగఁగా
యిదె నీతో మొగమోట నియ్యకొనవలెఁగా

చ. 3: చేరిచేరి నీవు నాపై సేసలు చల్లఁగాను
కూరిమితోఁగాఁగిలించుకొనవలెఁగా
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కోరికె లీడేరె నిన్నుఁ గొనియాడవలెఁగా

రేకు: 1311-3 దేశాళం సం: 23-063

పల్లవి: నేరుపరి వన్నిటాను నెరజాణవు
యీరమణితెలఁగు నీ వెఱుఁగుకోవయ్యా

చ. 1: కలువలు పైఁజల్లె కమలము లందిఇచ్చె
ములువాఁడిజాజులు మోపుగట్టె
చెలమ లూటకుఁబెట్టె చింతలచిగురుఁగోనె
చెలియభావము నీవు చిత్తగించవయ్యా

చ. 2: వెన్నెలలు ముగ్గువెట్టె విరుగాలి తూరుపెత్తె
పన్నుకొని నిమ్మపండ్లు పట్టెఁ గానుక
చిన్నితుమ్మిదల రేఁచె చిలుకలఁ బలికించె
కన్నెచందములు నీవు కనుగొనవయ్యా

చ. 3: తేనెలు పెరలదించె తీగెలను వల్లెవేసె
ఆనుకొని చంద్రకళ లంగడిఁదోసె
పూని శ్రీవేంకటేశుఁడ పొంచి నీపై సేసవెట్టె
మానిని నేలితివి మఱఁగు లేటివయ్యా

రేకు: 1311-4 బౌళి సం: 23-064

పల్లవి: వాకిటి కప్పటనుండి వచ్చివున్నదాన నేను
కాకుసేయ కాతని నిక్కడికి నంపఁగదే

చ. 1: చెంతల నాతని నొంటిఁ జిక్కించుక యేమేమో
మంతనములాడేవేమే మాపుదాఁకాను
వింతగా నాతనిచేత వీణె వాయింపించుకొంటా
యెంతభ్రమలఁబెట్టేవే ఇంటిలోనను

చ. 2: పచ్చడము గప్పుకొని పతిపక్కఁబండుండి
యిచ్చకా లేమిసేసేవే యెందాఁకాను
పచ్చిగా నెటిపెటిని బాగా లొత్తియిచ్చుకొంటా
మచ్చిక లెంతచూపెవే మఱఁగునను

చ. 3: ప్రేమమున లోలోనె పెనఁగులాడుకొంటాను
వేమారు నేమి నవ్వేరే వేగుదాఁకాను
ఆముక శ్రీవేంకటేశుఁడంతలోనే నన్ను నెలె
యేమే నన్ను మెచ్చేవే యిందుకుఁగాను

రేకు: 1311-5 రామక్రియ సం: 23-065

పల్లవి: వింతవింతవలపులనిటుకులాఁడి
యింతమెమ్మెలు చూసీ నీకేమౌనయ్యా

చ. 1: నిక్కఁగొప్పుముడిచిననీలపుఁగురులయాపె
చెక్కుచెమటలతోడి సిగ్గులయాపె
ముక్కుపైవేలిడుకున్న ముసిముసినవ్వులాపె
ఇక్కడ నున్నది నీకు నేమౌనయ్యా

చ. 2: నెలఁత మాఁటున నుండి నీదిక్కేచూచేయాపె
కెలసి చిలుకఁ బలికించేయాపె
పెలుచుఁజేఁతలతోడి పెద్దపెద్దగోళ్లాపె
యెలుఁగెత్తి పాడీ నీకు నేమౌనయ్యా

చ. 3: పట్టెఁడేసిచన్నులుపచారించుకున్న యాపె
గట్టిగా నీపాందులకుఁ గాచుకున్నాపె
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
యిట్టె నిన్నుఁదా మెచ్చీ నీ కేమౌనయ్యా

రేకు: 1311-6 సౌరాష్టం సం: 23-066

పల్లవి: పొలఁతికి నీతోఁ పొందు పోఁకకుఁబుట్టేఁడాయ
యెలమి నీభాగ్య మిఁక నెంతైనా గద్దయ్యా

చ. 1: పడఁతిచెక్కులవెంటఁ బన్నీటివాన గురిసె
వడి నందె మెఱుఁగులవాన గురిసె
విడివడి తురుమున విరులవాన గురిసె
చిడుముడి జవ్వనము చిగిరించెనయ్యా

చ. 2: మొలకనవ్వులనె ముత్యాలవాన గురిసె
విలపులఁ చెనుజడివాన గురిసె
కలికిసిగ్గులఁ దొలుకరివానలు గురిసె
పలుమారు జవ్వనము పదనెక్కినయ్యా

చ. 3: సొరిది మోవితేనల సోనలవాన గురిసె
వరుస రతులఁ దతివాన గురిసె
యిరవై శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
పరగినజవ్వనము పచ్చిదేరెనయ్యా

రేకు: 1312-1 లలిత సం: 23-067

పల్లవి: మేలుమేలు మీగుణాలు మెచ్చ కెట్లుండవచ్చు
వొలవేసి గుట్టుతోడ నున్నారమయ్యా

చ. 1: చెప్పఁబొప్పఁ గొత్తలాయ సేసినవే చేఁతలాయ
కప్పురగందికి నీకుఁ గాఁపురములు
చొప్పులెత్తిపెట్టరాదు సుద్దు లడుగఁగరాదు
వొప్పుగొని గుట్టుతోడ నున్నారమయ్యా

చ. 2: చూడఁజూడ సోద్యాలాయ చుట్టరికము గట్టేయ
జాడతో మీయిద్దరికి సరసములు
వేడుకకు వెలలేదు విచ్చిచెప్ప వేళగాదు
వొడకిట్టె గుట్టుతోడ నున్నారమయ్యా

చ. 3: పుట్టఁబుట్ట వింతలాయ పొద్దు కొక్కచాయలాయ
ఇట్టె శ్రీవేంకటేశ మీఇంపురతులు
నెట్ట న నన్నేలితివి నీకు నాకు నిఁకఁ బోదు
వొట్టుకొని గుట్టుతోడ నున్నారమయ్యా

రేకు: 1312-2 గౌళ సం: 23-068

పల్లవి: చెంతనున్న చెలులము చెప్పితిమి తగవులు
మంతనాన లాలించుటే మగపాడిసుమ్మీ

చ. 1: చిగురుఁబెదవులెత్తి నీకు బ్రియములు
జిగిమించ వేఁడుకొని చెక్కునొక్కిని
యెగసక్కేలు నిన్నాడి ఇంతలోనె పంతమిచ్చె
మగువగాఁగిలించుటే మగపాడిసుమ్మీ

చ. 2: అందపుఁజన్నులు మోవనప్పటి నీతోఁ బెనఁగి
విందువలె నీచేతికి విడెమిచ్చీని
ముందె బొమ్మల జంకించి మొక్కీ నీకు వినయాన
మందలించి మన్నించుటే మగపాడిసుమ్మీ

చ. 3: చక్కనిమోము చూపి సరసము నీతో నాడి
తక్కక గోరఁ జెనకి తమిరేఁచీని
ఇక్కువ శ్రీవేంకటేశ యీకెఁ గరుణించితివి
మక్కువ నిట్టె యేలుటే మగపాడిసుమ్మీ

రేకు: 1312-3 భైరవి సం: 23-069

పల్లవి: వెన్న పట్టుకొని నేయి వెదకనేల
కన్నప్పుడే రమణునిఁ గాఁగిలించుకొనవే

చ. 1: మంతనము లాడియాడి మరి యెడమాటలేల
చెంత నొక్క టైనమీఁద సిగ్గులేలా
సంతోసమైనవెనక సారె విచారములేల
కాంతరో విభుని మెచ్చి కాఁగిలించుకొనవే

చ. 2: కన్నులఁ జూచి పతి చక్కఁ దనా లడుగనేల
ఇన్నియు నేరిచి బయలీఁదనేల
మన్ననలు చేకొని మఱఁగున దాఁగనేల
కన్నెవైతేనే మితనిఁ గాఁగిలించుకొనవే

చ. 3: ననుపు లొనగూడితే మనసు సోదించనేల
తనిసి యాసాసలు దప్పఁగనేల
యెనసె శ్రీవేంకటేశుఁడింతలొనె నిన్ను మెచ్చి
ఘనుఁ డీతని నేపొద్దూ గాఁగిలించుకొనవే

రేకు: 1312-4 పళవంజరం సం: 23-070

పల్లవి: ఏఁటివిజాణతనమే యెవ్వరు మెత్తురే యిది
తేటలనే మగవానిఁ దేలించఁగదవే

చ. 1: కలికితనాలఁ బతిఁ గరఁగించవలెఁగాక
బలిమిసేయఁగఁబోతే పచ్చిదేరదా
చెలిమి పొందుగఁ జేసి చిక్కించుకొంటఁగాక
వలవని సణఁగుల వలపించవచ్చునా

చ. 2: ఇచ్చకపుఁజేఁతలనే యెలయించవలెఁగాక
పెచ్చురేఁగి కొసరితేఁ బిప్పిగట్టదా
మచ్చికతోఁ బానుపుపై మరిగించుకొంటఁగాక
రచ్చలోనఁ బెనఁగితే రతి సమకూడునా

చ. 3: సారిది గుబ్బల నొత్తి చొక్కించవలెఁగాక
గరువానఁ గూడితేను గరివడదా
కరుణించి శ్రీవేంకటేశుఁడే నిన్ను నేలె
వొరసిట్టె పైకొంటేను వొక్కటౌనా మనసు

రేకు: 1312-5 భూపాలం సం: 23-071

పల్లవి: రమ్మనవమ్మ విభుని రత్నాలపెట్టె
చిమ్మెకొనగోళ్ళ నారీశిరోమణి

చ. 1: చిత్తగించవమ్మ పతిఁ జిలుకలకొలికి
చిత్తజుదీమమా వోసింగారదండా
గుత్తపుగుబ్బలతీరు కొనియాడీ నీమగఁడు
బత్తి చేకొనఁగదమ్మ బంగారుబొమ్మ

చ. 2: సుద్దులు చెప్పఁగదమ్మ చొప్పాణిముత్తెమా
పొద్దువొద్దు నీపతికి పువ్వారుఁబోణి
అద్ది జవ్వాది పూసీ నీ కతఁడు కారుమెఱుఁగ
వద్దనక చేకొనవో వనముకోగిలా

చ. 3: ముచ్చటలాడఁగదమ్మ ముంగిటినిధానమా
గచ్చులేల రా వోచెంగలువబంతీ
హెచ్చి శ్రీవేంకటేశుఁడు యిన్నిటాను నిన్నుఁ గూడె
రచ్చకెక్కె నీవలపు రాయంచకొదమా

రేకు: 1312-6 శ్రీరాగం సం: 23-072

పల్లవి: ఏరుపరచి చెప్పరే యింతిచక్కఁదనములు
వూరకే యీరెంటికిని నొనరె నీభావము

చ. 1: తుమ్మిదలో నీలాలో తొయ్యలినెరిఁగురులు
పమ్మి యద్దమో చంద్రుఁడో పసనిమోము
వుమ్మడిఁ దిలపుష్పమో వొగి సంపెంగో ముక్కు
కమ్మటిఁ గలువలో గండుమీలో కన్నులు

చ. 2: జక్కనలో నిమ్మపండ్లో జవారాలిచన్నులు
అక్కజపుబయలో సింహమో నడుము
చొక్కపుబిసములో సొంపుఁదీగెలో చేతులు
చక్కనిసుకదిబ్బలో చక్రాలో పిఱుఁదులు

చ. 3: కందున నరఁటులో కరికరాలో తొడలు
చెందమ్ములో చిగురులో జిగిఁబాదాలు
ఇందిరాదేవి శ్రీవేంకటేశుపురమున నినదె
కుందణమో మెఱుఁగో నిగ్గుల యీకెమేను

రేకు: 1313-1 ముఖారి సం: 23-073

పల్లవి: మరగించితి వాతని మాయలఁబెట్టి
యిరవుగా నేఁ జేకొంటి నిఁక నేమిసేసేవే

చ. 1: ఆకుమడిచి యిచ్చితి వాతనికి వద్దనుండి
యేకతములాడితివి యింటిలోనను
చేకొని నీయాతుమార సేవలెల్లాఁ జేసితివి
యీకడ నీయాసోద మింకా నెంతగలదే

చ. 2: లలి నీ వాతనితమ్ములము వెట్టించుకొంటివి
సలిగెతనాల నివె జట్టిగొంటివి
కొలువు లేపొద్దూఁ జేసుకొంటా నిట్టె వుందానవు
యెలమి నీయాసోద మింకా నెంతగలదే

చ. 3: పచ్చడములో చొచ్చుక పతి నెలయించితివి
విచ్చనవిడి నిందాఁకా వెలసితివి
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
హెచ్చితి నీయాసోద మింకా నెంతగలదే

రేకు: 1313-2 దేవక్రియ సం: 23-074

పల్లవి: ననిచి పదివేలకు నావాఁడే తాను
వినయానఁ దనకిట్టె విన్నవించరే

చ. 1: యెక్కడఁదా నుండినాను యెదలోఁ దలఁతు నేను
మొక్కలాన మఱచున్నా మొక్కుదు నేను
యిక్కువ లంటకుండితే యెచ్చరిక సేతు నేను
పక్కన తన్నుఁ దప్పులుపట్టేనా నేను

చ. 2: యెంతవొద్దు రాకుండినా నెదురులుచూతు నేను
చెంతనుండి పరాకైతే చేచాఁతు నేను
వింతవారితో నవ్వితే వేడుకతో మెత్తు నేను
యెంతైనాఁ నిన్ను నేరములెంచేనా నేను

చ. 3: పవళించి వుండితేను పాదాలు గుద్దుదు నేను
అవలిమోమై యుంటే మాటాడుచు నేను
ఇవల శ్రీవేంకటేశుఁ డీతఁడిట్టె నన్ను నేలె
తివిరి తనగుణాలు దిద్దేనా నేను

రేకు: 1313-3 శ్రీరాగం సం: 23-075

పల్లవి: ఎంత నాసుద్దులు చెప్పీ నిందరితోను
కొంతైనా తనపాదపుగోఁ బోలఁగలనా

చ. 1: తనమన్ననే నాచక్కఁ తనముగలఫలము
సనివినతనపొందే నాభాగ్యము
పెనఁగేటితనరతిపెంపే నాసంపద
యని చెప్పరే చెలులు యతనితోను

చ. 2: కరుణించి తాఁజూచుటేకలది నాసింగారము
సరుగఁ దాఁబై కొనుటే సామ్రాజ్యము
పరగఁదా మెచ్చుటే నాపాయపు గరగరిక
గరిమఁ దెలుపరే యీకతలు విభునికి

చ. 3: కొలువులోఁదా నవ్వుటే గుట్టు నాపెద్దరికము
కలసేతనకాఁగిలే కాణాచిమేలు
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నునేలె
చెలఁగి యీ విన్నపము సేయరే తనకు

రేకు: 1313-4 ఆహిరి సం: 23-076

పల్లవి: ఏల సిగ్గులువడేవే యింతిరో నీవు
వేళవేళ నూడిగాలు వెలయఁగఁ జేయవే

చ. 1: చూడఁజూడఁ దగులును చుట్టరికము
వాడికలనే పెరుగు వలపులును
తోడనే గుట్టైతే నిక్కు దొరతనము
వీడెమిచ్చి పతితోను వేడుక నెరపవే

చ. 2: సేయఁగఁజేయఁగ మించు చెలుములెల్లా
కాయముఁగాయ మంటితేఁ గరఁగు మతి
పాయక కాచుకుండితేఁ బంత మీడేరు
ఆయములంటి మగని నాసలురేఁచవే

చ. 3: నవ్వనవ్వమీఁద మీఁద నాఁటుఁ బ్రియము
పువ్విళ్లూరితేఁ గోరిక లుప్పతిలును
యివ్వల శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
చివ్వన నితనిఁ జెంది సేవలు సేయవే

రేకు: 1313-5 సామంతం సం: 23-077

పల్లవి: వినవేడుకయ్యీ మాకు వింతవింతమీసుద్దులు
మనసు లొక్కటిగాను మాకు నెఱిఁగించవే

చ. 1: చెలరేఁగిచెలరేఁగి సెలవుల నవ్వేవు
యెలమి నాతఁడు నిన్ను నేమిసేసెనే
బలిమి నూరకె నీవు పలుమారుఁ బెనఁగేవు
అలరినమీచెనకు లవి యెటువంటివే

చ. 2: అంటకుముట్టకుమని యానలెల్లాఁబెట్టేవు
యింటిలో మీ చయ్యాటా లేరీతివే
వొంటినుండి మీలో మీరు వొద్దికై వేఁడుకొనేరు
దంటలై మీరాడినపంతము లెటువంటివే

చ. 3: కన్ను సన్నలుగఁ దారుఖాణలకుఁ జొక్కేవు
మన్నించి నిన్నెటువలె మరిగించెనే
యెన్నఁగా శ్రీవేంకటేశు నెనసి పెండ్లాడితివి
అన్నిటా మీసమరతు లవి యెటువంటివే

రేకు: 1313-6 సామంతం సం: 23-078

పల్లవి: అందరికిఁ దారుకాణ లౌఁగదరె చెలులాల
పొందుగా నీరీతుల భోగించుటే నేరుపు

చ. 1: వినయముతోఁ జెప్పినవిందు కడుఁగడుఁజవి
ననువుతో నవ్వినవవ్వుచవి
మనసురా మాటాడిన మంతన మెప్పుడుఁజవి
పనిపూని వలచినపతికి సతికిని

చ. 2: యితవుతోనాడించేయెడమాటలే ఇంపు
తతి నెదురుచూపుల తమక మింపు
చతురతఁ బెనఁగేటిసరసపుఁ జేఁత లింపు
అతికాంక్ష మెలఁగేటియాలికి మగనికి

చ. 3: గుట్టుతోడఁ గూరిములు గొసరుటే వేడుక
చుట్టుక రతుల మెప్పించుటే వేడుక
వొట్టుకొన్న కూటముల నుమ్మగిలుటే వేడుక
అట్టె శ్రీవేంకటేశు కలమేలుమంగకూ

రేకు: 1314-1 భైరవి సం: 23-079

పల్లవి: ఏమని చెప్పుదునే యింతులాల మీతోను
కామించి యాతఁడే నన్నుఁ గరుణించీఁగాక

చ. 1: కొమరెవలపు లోలో గుబ్బతిలుకొంటాను
తమకమే రేఁచుఁగాని తనియఁగనియ్యదు
తిమిరేటితలపోఁత తీగెలువారుకొంటా
మమతలే పెంచుఁగాని మఱవఁగనియ్యదు

చ. 2: సేసుకొన్నపొందులు చేఁగలు దేరుకొంటా
అసలే పుట్టించుఁగాని అలపారనియ్యదు
సేసవెట్టినవేడుక సిగ్గువాపుకొంటాను
వాసిఁ బెనఁగించుఁగాని వదలఁగనియ్యదు

చ. 3: పాయనిచుట్టరికము పచ్చిదేరుకొంటాను
కాయము చొక్కించుఁగాని గద్దించనియ్యదు
పాయపుటల మేల్ మంగపతి శ్రీవేంకటేశుఁడు
యీయెడ నన్నేలెఁ దగు లెడయఁగనియ్యదు

రేకు: 1314-2 కురంజి సం: 23-080

పల్లవి: ఎఱుఁగుకోవే నీ యెస్సెలు చాలు
మఱియిఁక దూరకువే మగఁడు నాపాలు

చ. 1: పలుమారుఁ జూపకువే పంతాలు
వెలయనింతేఁటికి వేసాలు
పెలుచవై యాడకువే బింకాలు
చెలువుఁ డిన్నిటా నాకుఁ జేసినాఁడే మేలు

చ. 2: ఆయనాయఁ జెప్పకువే అందాలు
పాయనాతని నేను పగలు రేలు
నీయందుఁ గంటిమే కడునేమాలు
యీయెడఁ బెట్టె నా కాఁత డిదె సేసపాలు

చ. 3: చేసె నాకుఁ జూడవే సింగారాలు
వాసులు నెరపకువే వట్టి మాయలు
బాసతో నలమేత్మంగపతి శ్రీ వేంకటేశుడు
మోసపోక నన్ను నేలె మోహాన కిదె కీలు

రేకు: 1314-3 వరాళి సం: 23-081

పల్లవి: ఇవేఁ గొన్ని నేరిచితి విసుమంతపడుచవు
జవరాలనైతివి సాదించనోపుదువే

చ. 1: సెలవుల నవ్వుకొంటా సిగ్గులుపడుకొంటాను
తలకొని పతికెంత తమిరేఁచేవే
కలువల వేసుకొంటా కడుసన్న సూసుకొంటా
వలపులు చల్లిచల్లి వలలంబెట్టేవే

చ. 2: కన్నులారుచుకొంటాను కతలు చెప్పుకొంటాను
పన్నుకయాతని నెంతభ్రమయించేవే
చన్నులు చూపుకొంటాను సంగడిఁ గూచుండుకొంటా
తిన్ననిచేఁతల నెట్లు తేలించేవే

చ. 3: సరసములాడుకొంటా చవులుచూపుకొంటాను
పెరరేఁపుల నెందాఁకా బెల్లించేవే
అరిది శ్రీవేంకటేశుఁడల మేలుమంగపతి
యిరవై నన్నేలె నిఁక నేమిసాలసేవే

రేకు: 1314-4 సామంతం సం: 23-082

పల్లవి: నీచిత్తము నాభాగ్యము నీవెట్టయినాఁజేయు
కాచుకున్నదాన నీకుఁ గరుణించు మిఁకను

చ. 1: మనసురాని యట్టిమాట లెన్నియాడినాను
పనిమాలుటేకాని బాఁతి గావు
తనివిలేనియట్టితమక మెంతవెంచినా
పెనఁగులాటకునుఁబెట్ట కేల మానును

చ. 2: సెలవుగానియట్టిచేఁత లెన్ని సేసినాను
ఆలమటలేకాని యందము గావు
వలవనికోరికలు వాములెంత వేసుకొన్నా
తలకొన్న వలపులు తనియనేలిచ్చును

చ. 3: ఆయముసోఁకనినవ్వు లవి యెంతనవ్వినాను
కాయకములేకాని కళ దాఁకదు
పాయపుటలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడ
యీయెడ నన్నేలితివి యిఁక నిన్ను మెత్తును

రేకు: 1314-5 నాదనామక్రియ సం: 23-083
పల్లవి: నేరుప రిన్నిటా నీపె నీకే తగు
సారపుచక్కెర బొమ్మచంద మిట్టిదయ్యా
చ. 1: బంగారువంటిది చెలి పదారుగళల మించు
ముంగారుమొయిలువంటిది ముద్దుగురుసు
అంగపుహంసవంటిది యడుగులు పెట్టేచోట
రంగుగ నీకు నేమని రచ్చఁ బొగడేమయ్యా
చ. 2: కోవిలవంటిది సతి కోమలపు టెలుఁగున
పూవువంటిది వాసనబుగులుకొను
పావురమువంటిది గొబ్బునఁ బిలుపనకువచ్చు
వేవేల కీపె నేగతి విసుతించేమయ్యా
చ. 3: చిలుకవంటిది యింతి చేరి పలుకఁగ నేర్చు
చిలుకవంటిది రతిఁ జిక్కించుఁ గూడి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశుఁడ
యెలమి నీకెఁ గూడితి వెంతగొనాడేమయ్యా

రేకు: 1314-6 పాడి సం: 23-084

పల్లవి: మనసుకు మనసే మరి తారుకాణగాదా
నిను నే నింతేసి తా నేరము లెన్నితిని

చ. 1: చెలరేఁగి నీ విక్కడఁ జింతించే వెవ్వతెనో
తలఁపులో నాపె నిన్నుఁ దలఁచఁబోలు
పులకించె నీమేను పొంచి యూరకుండి యుండి
మెలుఁత జాజినసలు మీఁదెత్తఁబోలును

చ. 2: కోరి యెవ్వెతనో నోర గుణించుకొనేవు నీవు
పేరుకొని యాపె నాడఁ బిలువఁబోలు
పేరడిగా నీచెక్కులఁ బెంజెమటలు గారీ
యేరీతినో పన్నీరు నీ కెక్కించఁబోలును

చ. 3: చెంది యెవ్వతెకుఁగానో సెలవుల నవ్వేవు
కందువ నిన్నాపె నవ్వేఁగాఁబోలును
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
పొందితి నన్నాకె నీకుఁ బూఁచుకుండఁబోలును

రేకు: 1315-1 ధన్నాసి సం: 23-085

పల్లవి: ఇట తఱవాతిపను లేఁక నీకే తెలుసును
యెటువలెనైనాఁ జేయు మెదురాడ నీకును

చ. 1: చేసిననావిన్నపముల చిత్తానఁ బట్టెనో లేదో
ఆసల నెక్కడ పరాకైవుంటివో
వేసరక నాతో పొందు వేడుకాయనో లేదో
యేసుద్ది నెఱఁగ నీయిచ్చలోనిదానను

చ. 2: యిట్టె నాతో కాఁపురము ఇతవాయనో కాదో
నెట్టన నెటువంటివి నీకుఁ బ్రియమో
జట్టిగొన్ననా సేవలు సమ్మతాయనో కాదో
యెట్టౌతా నెఱఁగ నీయిచ్చలోనిదానను

చ. 3: నెమ్మి నాచక్కఁదనము నీయీడువచ్చునో రాదో
కమ్మర నాకు నీదయ గులుగుటెట్టో
పమ్మి యలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడ
యెమ్మె లెఱఁగనియాల నీయిచ్చలోదానను

రేకు: 1315-2 భూపాలం సం: 23-086

పల్లవి: ఎక్కడ పరాకు నీకు యెన్నిలేవు పనులు
దిక్కు నీవే యిందరికి దేవరాయా

చ. 1: గుత్తపుగుబ్బలాఁడి నీకొలువుకు వచ్చినది
కొత్తలుగాఁ జూడవయ్య కోడెకాఁడ
పుత్తడిబొమ్మవంటిది పూఁచి నీతో మాటలాడీ
చిత్తగించి వినవయ్య సింగారరామా

చ. 2: చిమ్ముఁజూపులాఁడి యదె చిరునవ్వులు నవ్వీని
నెమ్మది లాలించవయ్య నెరతనీఁడ
పమ్మి చంద్రకళవంటిపడఁతి సన్నలు సేసీ
సమ్మతిఁ జేకొనవయ్య జాణరాయా

చ. 3: కూడె నిన్నుఁ జేఁతలాఁడి కుచ్చి కాఁగిటను నించి
విడె మియ్యఁగదవయ్య వేడుకకాఁడ
పాడితో నలమేల్మంగపతివి నన్నేలితివి
చేడియ నీపె నేలుము శ్రీవేంకటరాయా

రేకు: 1315-3 పాడి సం: 23-087

పల్లవి: మెలుంత నిన్నిటాను మెచ్చితి నేను
ఫలియించె నేఁడు నాభాగ్యమెల్ల నిపుడు

చ. 1: తరుణి నీమాటలు తారుకాణ వచ్చెనే
నెరజాణతనములు నేర్చు నతఁడు
సొరిది నాతో వీవన్నసుద్దులెల్లా జెప్పెవే
పొరిఁ జక్కఁదనములు పోగైనవాఁడే

చ. 2: కాంత నీవుసేసేవుపకారము నీడేరెనే
వంతుతో నావున్నాడకు వచ్చె నతఁడు
సంతోసముసేసి నాకు చనవెల్లా నిచ్చెనే
యెంతకెంత వానిగుణ మేమనిచెప్పుదునే

చ. 3: చెలి నీవు వొడఁబరచినమేలు దక్కెనే
పలుమారు నన్నుఁగూడి పాయఁడతఁడు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడ
కలిగె నాకు నిఁక గైకొంటి వేడుకలు

రేకు: 1315-4 భైరవి సం: 23-088

పల్లవి: చిత్తానఁ బెట్టుకోవయ్యా సేసినవావిన్నపము
సత్తుగ నన్నేలితివి జాణవు నీవౌదువు

చ. 1: యెంతెంతచక్కదనాన నెక్కుడగా మెరసిన
కాంత గుణవంతురాలు గావలెను
వంతుకుఁ జూచితే నుప్పు వడఁదెల్లనై యుండితే
సంతతము కప్పురము పాటివచ్చీనా

చ. 2: నిడిగి మగువ యెంతనేరుపరియైనాను
మగని కిచ్చకురాలై మనవలెను
పొగరుగలుగుతుమ్మిపువ్వులెన్ని ముడిచినా
తగినజాజులవలె తావి యంటీనా

చ. 3: సతి యెంత జవ్వనాన జడియుచునుండినాను
రతికేలిఁ జిత్తముఁ గరఁగించవలె
క్షితి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడ
సతమై కొక్కెరలు హంసలఁ బోలీనా

రేకు: 1315-5 ముఖారి సం: 23-089

పల్లవి: చూచితే గోలగాని జూటుదనా లిన్నియును
చేచేత నీపెచేఁతలు చెప్పఁ గొత్తలయ్యా

చ. 1: మాటలఁ దేనెలు గారీ మలసితే సిగ్గుదేరీ
తేటలై కనుచూపులఁ దెల్లవారీని
కోటిసేయ నిన్ను నీపె కూరిములు గొసరీని
నీటున నెన్నఁడింతేసి నేరిచెనో కాని

చ. 2: నడక నందెలు వాఁగీ నవ్వితే వెన్నెల రేఁగీ
తడవితేఁ గొప్పు తుమ్మిదలు మూఁగీని
వడిగాఁ జెనకుతాను వలపులు నిన్ను నాఁగీ
కడు నెటులాఁ గతలఁ గఱచెనోకాని

చ. 3: కొనగోరు నీపైఁ జిమ్మీ గుబ్బచన్నులనుఁ గుమ్మీ
కినియక నిన్ననే కాఁగిటఁ గమ్మీని
పనితో నలమేల్మంగపతిశ్రీవేంకటేశుఁడ
యెనసితివి నన్ను తా నెట్టెఱిఁగెనోకాని

రేకు: 1315-6 మేచ బౌళి సం: 23-090

పల్లవి: కోమలిరో యింతులకు గుట్టు వలదా
యేమే నవ్వులు నవ్వే విందరిలోనాను

చ. 1: కాఁపురాలు సేసేవారు కలరుగాక నీవలె
చేపట్టి మన్నించెనంటాఁ జెప్పుకొందురా
యేపొదూఁ బాయకవుండి హెచ్చవలతురుగాక
పైపై వెల్లవిరిగాఁ బచ్చి సేసుకొందురా

చ. 2: ఇల్లాండ్లయినవారు ఇంటిలో నుందురుగాక
పెల్లునఁ జేఁత లంగడిఁబెట్టుకొందురా
మెల్లనే సేవలుసేసి మెప్పించుకొందురుగాక
వల్లదాన గర్వములు పచారించుకొందురా

చ. 3: తగులుగలుగువారు తతిఁ గూడుదురుగాక
మిగులా నీయెమ్మె లిట్టె మెరఇంతురా
జిగి నలమేల్ మంగయోఁచినశ్రీవేంకటేశుఁడు
తగ నన్ను నేలె నీమగఁడనుకొందురా

రేకు: 1316-1 రీతి గౌళ సం: 23-091

పల్లవి: ఇంత నేరకుండితే నిన్నెవ్వ రెరుఁగుదురమ్మ
వింతలెల్లాఁ జూచిచూచి వెరగయ్యీ మాకు

చ. 1: సేయరానివూడిగాలు చేసిచేసి యాతని
ఆయములు గరఁగించి ఆలవై తివే
చాయల నేపొద్దూ మోముచక్కటిఁ గొలువుసేసి
పాయరానిచుట్టమవై పనిగొంటివే

చ. 2: అనరానిమాటలెల్లా నాడియాడి కళరేఁచి
ఘనునికిఁ జనవరికాంతవైతివే
చెనకి యాతఁడు సేసేచేఁతలెల్లా నొడిగట్టి
యెనలేక యిందరిలో నిట్టె దొరవైతివే

చ. 3: తలఁచరానిరతులఁ దగిలి కూడికూడి
కలికితనాలఁ గతకారివైతివే
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
యెలమి నన్నేలె నీవూ నిందుకు మెచ్చితివే

రేకు: 1316-2 రామక్రియ సం: 23-092

పల్లవి: ఏడనుండి వచ్చినాఁడే యీడకుఁ దాను
వీడెమిచ్చిఁ జూడవే వేసాలవాఁడు

చ. 1: వెలలేనివలపుల వేడుకకాఁడు
కలికితనాలమంచిగయ్యాళివాఁడు
చలమరిసరసాలజాజరకాఁడు
చెలువుఁడు వీఁడుగదె శ్రీవేంకటేశుఁడు

చ. 2: కొనబుతనాలతోడికోడెకాఁడు
వినుపునవ్వులునవ్వేనీటులవాఁడు
వొనరినవరముల వుదారికాఁడు
చెనకులవాఁడుగదే శ్రీవేంకటేశుఁడు

చ. 3: గొల్లెతలమానములుకొల్లకాఁడు
పిల్లదొరులూఁదేటిపిన్నవాఁడు
యెల్లగా నలమేల్మంగనేలినవాఁడు
చెల్లుబడి వీఁ(వాఁ?) డుగదె శ్రీవేంకటేశుఁడు

రేకు: 1316-3 నారాయణి సం: 23-093

పల్లవి: చెల్లఁబో యేమయ్యా యింతసేతురా నీవు
వెల్లవిరిఁ దమకాన వేఁగించీఁ దాను

చ. 1: చిప్పలవంటికన్నులచెలి నీ కెదురుచూచీ
యెప్పుడు వత్తువోయంటా నింటా వాకిట
చొప్పుగా నీవేపెతోను జా(జొ?) జాలాడే దెలిఁగదు
వొప్పుగా నీదాక నమ్మివున్నది దా నాడను

చ. 2: అంతరంగపుటాసల నట్టె నీవు గూడేవంటా
మంతనానఁ దలపోసీ మంచము మీఁద
యింతులపాట వింటా నీవందునుండే దెలిఁగదు
చెంత నీవేళ గాచుక చెలఁగీఁదా నాడను

చ. 3: వెలినుండి నీవు రాఁగా వేడుకతో నవ్వు నవ్వీ
అలసతి వెంటవచ్చే ద దెలిఁగదు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశుఁడ
కలసితి విప్పుడంటా సొలసీఁదా నాడను

రేకు: 1316-4 శంకరాభరణం సం: 23-094

పల్లవి: చెలికత్తెవు నీవేమి సేసినా దోసము గాదు
తొలుసారే యింతేసిపొందులు నేనెఱఁగను

చ. 1: వూరకే తాఁ గతచెప్పీ నూఁకొనవే నామారు
చేరి యెం(యం?)త దంటగాను చిన్నదానను
తేరకొన నన్నుఁజూచి దిగ్గన మోము చూపవే
నేర నంతేసి తనతో నెరవాదితనము

చ. 2: వొడివట్టి తీసీ నామా రొద్దఁ గూచుఁడఁగదవే
చిడుముడి నందుకైతే సిగ్గయ్యీ నాకు
విడెమిచ్చీ నందుకొని వేగమె నాకొసఁగవే
గుడిగొన్న కొత్త పెండ్లికూఁతురను నేను

చ. 3: నలువున గిలిగించీ నామారు నీవు నవ్వవే
ఇలువెళ్లకబోగించేఇల్లాల నేను
అలమేలుమంగపతియగు శ్రీవేంకటేశుఁడు
కలసె నన్నిట్టె మెచ్చఁగదవే నేఁ గోలను

రేకు: 1316-5 మాళవిగౌళ సం: 23-095

పల్లవి: ఎటువలెఁ బొగడినా నిన్నిటికిఁ దగినది
ఘటిఇంచె మేలుమేలు కంటిమి యీవేడుక

చ. 1: చెలిచన్నులబలిమి సింగారానకుఁ గలిమి
అలరుఁగన్నులచూపు ఆసలదాపు
నిలువయిక్కఁదనము నెమ్మి దాఁచినధనము
కులుకుఁగుత్తికసొంపు కోవిలలగుంపు

చ. 2: కాంతవెట్టినకొప్పు గండుదుమ్మిదలకప్పు
చెంత నెన్నడిమికీలు సింగముఁ బోలు
యెంతే పిఱుఁదుతీరు ఇంచువిలుతునితేరు
వింతచిరునవ్వులాగు వెన్నెలపోగు

చ. 3: లేమపాదములసోగ లేఁతచిగురులో చేఁగ
భూమిలో మించె యీయమ్మ పుత్తడిబొమ్మ
ఆముక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
ప్రేమ నేలితివి పొందు బెరసినవిందు

రేకు: 1316-6 బౌళి సం: 23-096

పల్లవి: సెలవిచ్చితి నీకు నీచేఁతలకెల్లా లోను
సెలవుల నవ్వుకొంటా సిగ్గుపడ కిపుడు

చ. 1: కోరి నీవెవ్వేతేఁ దెచ్చుకొనినా నే వలదన
యీరానియీవు లిచ్చినా నేమీ నన
సారె నీకు నాపెకును సమతారుకాణలాయ
చేరి నా మొగము చూచి సిగ్గుపడ కిపుడు

చ. 2: మఱి నెవ్వతెతోనైనా మాటలాడు నోరార
గుఱిగాఁ దొడపైఁబెట్టుకొని లాలించు
మెఱసి నీ కాపె తొల్లె మేనవదినెగాఁబోలు
చిఱుఁజెమటలతోడ సిగ్గువడ కిపుడు

చ. 3: తలఁచుకో యింకా నీతరుణి నెవ్వతెనైనా
చలివాసి కూడిమాడి సరసమాడు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశుఁడ
చెలంగి నన్నేలిగతివి సిగ్గువడ కిపుడు

రేకు: 1317-1 ఆహిరి సం: 23-097

పల్లవి: ఆదరించి మంచిమాట లాడేఁగాక
భేదము సేయ కాతనిఁ బిలువవే చెలియా

చ. 1: కోరేటికోరికలెల్లా గురియైయుండేటివాని
పారపుమోవితేనె లొసఁగేటివాని
చేరి చేతులెత్తి నాపై సేసలు వెట్టినవాని
తూరి యేమిసేసినాను దూరనెట్టు వచ్చునే

చ. 2: కూడిపాయరానినెట్టుకొన్న చుట్టమైనవాని
వీడెముపొత్తుకు లోనై వెలసేవాని
జోడుగూడేయాసలకు చోటై యుండేటివాని
యేడనుండివచ్చినాను యెట్టు దూరవచ్చునే

చ. 3: సరుస నాకాఁగిటికే సతమైయుండేటివాని
మరిగిననామనసు మర్మపువాని
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని
తొరల నన్నేలె నిఁక దూరనెట్టువచ్చునే

రేకు: 1317-2 భైరవి సం: 23-098

పల్లవి: వీడెమియ్యఁగదవే విభునికిని
వేడుకలు గొనసాగె వెరగు లిఁకనేలే

చ. 1: చేరి యాకతాన నుండి సిగ్గులువడఁగనేలే
కోరి వావిచెప్పి మరి కొంకఁగనేలే
సారెఁ బయ్యెద జారీని చక్కఁబెట్టుకొననేలే
తారుకాణాయఁ బొందులు తరితీపులేలే

చ. 2: తప్పక మోముచూచి తలవంపు లిఁకనేలే
కొప్పువీడె గొణఁగుతాఁ గొసరనేలె
చిప్పిలఁ జెమట లుబ్బెఁ జిమ్ముచుఁ బెనఁగనేలే
వొప్పుగా మర్మము లంటె వొడఁబాటులేలే

చ. 3: పొత్తులవిడెము లంది పొంతనా లడుగనేలే
గుత్తపుగబ్బల నూఁది కొదుకనేలే
బత్తితో నలమేల్ మంగపతి శ్రీవేంకటేశుఁడు
చిత్తగించి నిన్నునేలె చేసన్నలేలే

రేకు: 1317-3 ముఖారి సం: 23-099

పల్లవి: ఒకరిపై నెపము వేరొకరిపైఁ జూపేవు
యెకసక్కేలకు నాపె నేమీననఁజాలకే

చ. 1: పక్కనఁ గాంత చన్నులు పయ్యదలో దాఁచుకోఁగా
జక్కవపిట్టలనేలసాదించేవయ్యా
మక్కువ నాపె సిగ్గుతో మాటలాడకుండితేను
ఇక్కడ గూఁటిచిలుక నేల దిట్టేవయ్యా

చ. 2: ఇట్టినీచేఁతలు చూచి ఇంతి మోము వంచితేను
చుట్టుక యద్దమునేల సొలసేవయ్యా
పుట్టిపడ నాపె నిన్ను వుదుటునఁ జూచితేను
పట్టి చకోరాలతోడ పంతమేలాడేవయ్యా

చ. 3: నిండుఁగొప్పు వెట్టుకొని నెలఁత నిక్కీనంటాను
గండుఁదుమ్మిదలఁ జెనకఁగ నేలయ్యా
అండనే శ్రీవేంకటేశ అలమేల్ మంగపతివి
దండిగవఁగూడి యాపెచక్కఁదనము మెచ్చేవయ్యా

రేకు: 1317-4 బౌళి సం: 23-100

పల్లవి: ఎంత వోరుచుకుఁడినా నెఱఁగవు నాముందర
వింతలుగా నెంతేసి వేసాలుసేసేవే

చ. 1: వన్నెలు వెట్టుకొంటేనే వాసికత్తెవైతివా
చన్నులు గొప్పలై తేనే జాణవైతివా
సన్నపుచీర గట్టితే సరి దొరవైతివా
ఇన్నిటా నాపతితోడ నేమిమాటలాడేవే

చ. 2: నిక్కుఁగొప్పు వెట్టితే నేరుపరి వైతివా
పుక్కిట విడె ముంటేనే భోగివైతివా
చెక్కిటఁ జేయిడుకొంటే చేఁతలాఁడివైతివా
ఇక్కడ నితనితోడ నేమినవ్వేవే

చ. 3: సంగడిఁ గూచుండితేనే చనవరివైతివా
అంగాలు సోఁకించితే నొయ్యారివైతివా
చెంగట నలమేల్మంగఁ జెంది శ్రీవేంకటేశుఁడు
యింగితమెఱింగి నన్ను నేలె నేమిసేసేవే

రేకు: 1317-5 తెలుఁగుగాంబోది సం: 23-101

పల్లవి: ఇన్నిటికి మూలము ఇతఁడు నారమణుఁడు
కన్నులారఁ జెలులాల కనుఁగొంటిరటరే

చ. 1: తనివోనియాసలు తమకానకు మూలము
ననుపులు చుట్టరికానకు మూలము
చెనకినచెనకులు సిగ్గులకు మూలము
వినయాలు సురతపువేడుకకు మూలము

చ. 2: కొసరుఁజూపులెల్లాను కోరికలకు మూలము
కసరుజంకెలు మచ్చికకు మూలము
ముసిముసినవ్వులు ముచ్చటలకు మూలము
పొసఁగినసరసాలు పొందులకు మూలము

చ. 3: తలపోఁతలు మదనతంత్రములకు మూలము
లలిఁ దాలిములు పొందులకు మూలము
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
కలసె; నన్నిటా చెప్పఁగతలకు మూలము

రేకు: 1317-6 పాడి సం: 23-102

పల్లవి: అంగనలఁ గనుఁగొంటే నాచారా లెక్కడ నుండు
సంగతి గాదన్నాఁ బోక సాకిరి దెలిపేవు

చ. 1: మనసువచ్చినాపెతో మాటలాడకుండేవా
ననుపుగలచోటను నవ్వకుండేవా
చనవరిదానిమోవి చవిగొనకుండేవా
యెనయ నెందూ నంటాను యేలపెట్టే వానలు

చ. 2: కొలువుకు వచ్చినా పెఁ గోరి చూడకుండేవా
అలమి పైకొన్నదాని నంటకుండేవా
వలచివచ్చినదానివసము గాకుండేవా
పలుమారు నాతో నీవు బాసలేల సేసేవు

చ. 3: కడుఁబ్రేమగలయాపెఁగాఁగిలించకుండేవా
వుడివోనికూటముల కూరకుండేవా
అడరి శ్రీవేంకటేశ యలమేల్మంగపతివి
యెడయక నన్నేలితి వే లొడఁబరచేవు

రేకు: 1318-1 సామంతం సం: 23-103

పల్లవి: తానే యెఱుఁగుననవే తరవాతిపనులెల్లా
నే నేమిచెప్పేఁ దనకు నేరిపేనా సుద్దులు

చ. 1: చిత్తములో తమకము చిమ్మిరేఁచఁగా
వొత్తియణఁచేనంటే నొద్దికయ్యీనా
గుత్తపుగుబ్బలు పైపై గొప్పలు గాఁగా(గా?)
బొత్తుగాఁ గొలఁదివెట్టి బుద్ధిచెప్పవచ్చునా

చ. 2: కన్నులఁ జూచేయాసలు కదుమఁగాను
వన్నెలఁబట్ట నెఁ(నెం?) తైనా వనమయ్యీనా
తిన్నవివయసు తరితీపుసేయఁగా
వున్నతి నందులకు నూరకుండవచ్చునా

చ. 3: వీనుల విన్నవినికి వేగిరించఁగా
ఆనుకొన్న కోరికలు ఆపవచ్చునా
పూని యలమేల్ మంగవిభుఁడు శ్రీవేంకటేశుఁడు
మేనవానితో నన్నేలె మెచ్చకుండవచ్చునా

రేకు: 1318-2 రీతి గౌళ సం: 23-104

పల్లవి: పుట్టఁగాఁ బుట్టినవి పొలఁతుల కీగుణాలు
నెట్టన నీ వేలితేను నేస్తములై యుండును

చ. 1: వున్నతి సవతికాంత లొకరొకరిఁ గంటేను
సన్నల నుప్పతింతురు సాదింతురు
విన్నకన్నవారితోడ వెంగెములాడుదురు
పన్ని పతిపైఁ బెట్టి పంగింతురు

చ. 2: ముందరికి వచ్చితేను మూతులు గిరుపుదురు
నిందింతురు వూరకే నెపా లెంతురు
అంది సింగారించుకొంటే నటుమోమై నవ్వుదురు
యెందు మేలు గలిగినా నీసడింతురు

చ. 3: చక్కఁదనా లీడుచూపి సణఁగులు రాలుతురు
నిక్కిచూతురు యెమ్మలు నెరపుదురు
పక్కన నలమేల్ మంగపతి శ్రీవేంకటేశుఁడ
ఇక్కడ నన్నేలినందు కిఁక మెచ్చుకొందురు

రేకు: 1318-3 పాడి సం: 23-105

పల్లవి: గుట్టుసేసుకో నీలోలో గుబ్బతిలీ వలపులు
చుట్టరిక మేవేళ చూపీనో నీకును

చ. 1: చిప్పిలుసిగ్గులతోడఁ జెలి నీయొద్ద నిలిచె
కప్పుకొనెఁ బయ్యద జంగాళముగాను
విప్పినదోసిట నీకు విడెమియ్యవచ్చె నదె
యెప్పుడు మోమెత్తి చూచి యెనసీనో నిన్నును

చ. 2: తనివోనితమితోడ తనసింగారాలు చూపి(పె?)
పెనుఁగొప్పు మఱఁగుగాఁ బెట్టెఁ జెంపల
పనివూని వేడుకతోఁ బాదాలొత్త లాచీనదె
మనసిచ్చి యేపొద్దు మాటాడీనో నీతోను

చ. 3: కడకంటిచూపులతో కమ్మటి నిన్నుఁ గొసరె
చిడుముడి చిఱునవ్వు చిందుకొంటాను
అడరి శ్రీవేంకటేశ యలమేల్మంగపతివి
యెడయక నన్నేలితి వెన్నఁడు తాఁ బొందీనో

రేకు: 1318-4 శుద్ధ వసంతం సం: 23-106

పల్లవి: ఎంత చెప్పినా మానఁడు యిదేమే తాను
చెంతనుండి నామీఁదఁ జేయివేసీఁ దాను

చ. 1: యెక్కడ నుండి వచ్చెనే యీతఁడు నన్నుఁ బొదిగి
చక్కఁదనము వొగిడీ సారెసారెకు
నిక్కినిక్కి నన్నుఁజూచీ నే సిగ్గుతో నుండఁగాను
వెక్కసాన నవ్వుకొంటా వీడెమిచ్చీ నాకును

చ. 2: యెన్ని నేరుచుకొన్నాఁడే ఇప్పు డీమాయకాఁడు నా
చన్నులు పయ్యదఁ గప్పీ జారెనంటాను
చిన్నినిమ్మపంట వేసి చేరి నే నొడ్డించుకోఁగా
కన్నెపడుచను యేల కాకుసేసీ నన్నును

చ. 3: యేమి జాణతనమే తా నిదె శ్రీవేంకటేశుఁడు
మోము వంచఁగానే నాకు ముడిచీఁ గొప్పు
ఆముక యలమేల్మంగననఁగానే నన్నుఁగూడి
ప్రేమముతో వేడుకకుఁ బేరడిగీ నిన్నును

రేకు: 1318-5 ఆహిరి సం: 23-107

పల్లవి: మావసమా బుద్ధిచెప్ప మరి నీయంతవానికి
నీవే యెఱింగి పతికి నెయ్యములు చూపవే

చ. 1: మల్లాడేకోపకత్తెను మట్టుకుఁ దేవచ్చుఁగాని
చల్లజంపులాఁడినైతే సాదించరాదు
తెల్లమిగా గోలదానిఁ దీరుకుఁ దేవచ్చుఁగాని
వొల్లనే జూటుదాని నొడఁబరచరాదు

చ. 2: చలమరిదానినైనా చాయకుఁ దేవచ్చుఁగాని
పలువినయపుదాని గెలువరాదు
సొలసి పంతపుదాని సూటికిఁ దేవచ్చు గాని
లలి నాలిదానిగుట్టు దెలియఁగరాదు

చ. 3: వెట్టచేఁతలాఁడినైనా వీఁకకుఁ దేవచ్చుఁగాని
చుట్టపుసూడుదానిఁ జొక్కించరాదు
పట్టి యలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరు
నిట్టె కూడితివి నిన్ను నిఁక దూరరాదు

రేకు: 1318-6 గౌళ సం: 23-108

పల్లవి: చెప్పినట్టు సేసే నీకఁ జేతికి లోనైతివి
చప్పుడు సేయకు మీఁక సటలకు నోరువను

చ. 1: నవ్వులెంత నవ్వేవు నానాసతులఁ గూడి
రవ్వలెల్లం జేసితిని(వి?) రపమాయను
తవ్వకు తొల్లిటిపొందు తడవాయ నీకనేల
జవ్వనము జాలువారీ సటలకు నోపను

చ. 2: మాట లేదాఁకా నాడేవు మగువల ఇండ్లు చొచ్చి
పాటించితిని దూరు నీపాలాయను
వాటము సేయకు బాస వడిఁబడీ నీకనేల
సాటివచ్చె సుద్దులెల్లా సటలకు నోపను

చ. 3: చూపులేమి చూచేవు సుదతుల వెంటఁ దెచ్చి
కాఁపురా లీడేర్చితివి కతలాయను
రాపుగ శ్రీవేంకటేశ రతి నన్నుఁగూడితివి
చాపలము నీకేడది సటలకు నోపను

రేకు: 1319-1 వరాళి సం: 23-109

పల్లవి: నీకు నేము బాఁతెయ్యేమా నేఁడిపుడు
ఆకుమడిచిమ్మంటా నాసలు రేఁచేవు

చ. 1: విందుచెప్పేయాపె నిన్నువిడిదికిఁ బిలుచుక
మందలించి వొయ్యనే మరిగించెను
పందేలువేసి నీతో పగడసా లాడియాడి
కందువైనరతులలెక్కలు మోపెను

చ. 2: పెక్కుకానికె లొసఁగి పీఁటపైఁ గూచుండఁబెట్టి
గక్కన నీమనసెల్లఁ గరంగించెను
చిక్కించి చుట్టరికాలుచెప్పి విడెములువెట్టి
దక్కఁగొని నిన్ను నిట్టె తగిలించుకొనెను

చ. 3: యిచ్చగించి పాదాలొత్తి యేకతానఁ దెరవేసి
మెచ్చులుగాఁ గాఁగిలించి మెప్పించెను
యిచ్చట శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
తచ్చి తా నాపొందు నీకుఁ దలఁపించెను

రేకు: 1319-2 కన్నడగౌళ సం: 23-110

పల్లవి: ఏమని చెప్పేమయ్యా ఇదివో మాకాఁపురాలు
నీమేలులోనివారము నీచిత్త మిఁకను

చ. 1: తలఁచితే తలఁపులు తగులములై యుండు
పలికితే మాటలు పచ్చిదేరును
మొలచితే సిగ్గులు ముదిరి తీగెలువారు
వలచితే వలపులు వాములకొలఁదులు

చ. 2: పెంచితే ప్రియములు పెంటలై పెరుగును
వంచుకొంటే నవ్వులు వరదవారు
నించితేఁ దమకములు నిండుబండారములౌను
ముంచితే జవ్వనాలు మోపులకొలఁదులు

చ. 3: తనిసితేఁ గోరికలు తప్పక దైలువారు
మునిపితేఁ బంతములు ముప్పిరిగొను
యెనసితి విటు నన్ను వింతలో శ్రీవేంకటేశ
గొనకొన్నరతు లివి కోట్లకొలఁదులు

రేకు: 1319-3 కాంబోది సం: 23-111

పల్లవి: చెప్పరాని నేరుపుల చేతలవాఁడవు నీవు
నెప్పున నిన్నుఁ గొసర నే నెంతదానను

చ. 1: నంటున నీ వడుగఁగా నావావి చెప్పితిఁగాక
యింటికి నిన్నుఁ బిలువ నెంతదానను
అంటిముట్టి సరసములాడఁగాఁ బైకొంటిఁగాక
జంటలై నీతోఁ బెనఁగ సరి నెంతదానను

చ. 2: నీచిత్తానఁ బెట్టి మన్నించఁగా మాటాడేఁగాక
యేచి నిన్నుఁ బలికించ నెంతదానను
కాచుక నావంకఁ జూడఁగాఁ గానుకిచ్చిఁగాక
లాచి నీతోఁ బొందు సేయ లలి నెంతదానను

చ. 3: వినఁగానే వినపాలు వేమారుఁ జేసితిఁగాక
యెనసి నిన్ను నే మించ నెంతదానను
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
పెనురతుల నిన్ను మెప్పించ నెంతదానను

రేకు: 1319-4 నాదనామక్రియ సం: 23-112

పల్లవి: మాటలెన్ని యాడేవే మాపుదాఁకాను
చాటువగా రమణుఁడు చనవిచ్చె నాకును

చ. 1: సలిగెగలదానికి సరసములాడఁజెల్లు
తెలిమికత్తెకు నేమిసేసినాఁజెల్లు
కలిమిగలదానికి గర్వించియుండఁజెల్లు
పిలుపుగలదానికి బీరములు చెల్లునే

చ. 2: వొడఁబాటుగలదాని కొరసి పెనఁగఁజెల్లు
బడివాయనిదానికి పంతము చెల్లు
కడుఁజుట్టమైనదానిఘనతలెల్లాఁ జెల్లు
వొడికముగలదాని వొప్పిదము చెల్లునే

చ. 3: బత్తిగలిగినదానిపగటులెల్లాఁ జెల్లు
హత్తికొలిచినదానియందము చెల్లు
కొత్తగా నలమేల్ మంగకుఁ బతి శ్రీవేంకటేశుఁ
డిత్తల నన్ను నేలె నింపు నాకే చెల్లునే

రేకు: 1319-5 బౌళి రామక్రియ సం: 23-113

పల్లవి: వనితలజాడలు వద్దంటే మానరు
చనవు నీవిచ్చినదే సరివచ్చెనా

చ. 1: ఆంకెలకువచ్చినదాఁకా నాడుదురు మాఁటలు
చంకకులోనైతేనే జంకింతురు
పొంకపుగొల్లెతలను భోగించి చూచితివి
సంకెదీర నామాట సరివచ్చెనా

చ. 2: నమ్మికై నయందాఁకా నవ్వుదురు సెలవుల
సమ్మతించినందుమీఁద సాదింతురు
వుమ్మడిఁబదారువేల నొడివట్టి చూచితివి
సమ్ముకానఁ జెప్పితిని సరివచ్చెనా

చ. 3: దక్కినయందాఁకానే తమకించి పై కొందురు
చిక్కితేనేకొనగోరఁ జెనకుదురు
గుక్కక శ్రీవేంకటేశ కూడి నన్నుఁ జూచి(చి?) తివి
చక్కనినావిన్నపము సరివచ్చెనా

రేకు: 1319-6 కొండ మలహరి సం: 23-114

పల్లవి: ఇప్పుడు మారతివేళ నిన్నిపొందులు
తప్పకుండాఁ దలఁచుకో తనిసేవు పొందులు

చ. 1: వెన్నలారగించేనాఁటివేఁడివేఁడి పొందులూ
చన్నులకొనలనొత్తేచద్దిపొందులూ
అన్నిటా రాసక్రీడ యమునలో పొందులూ
మున్నిటివి దలఁచుకో ముచ్చటలపొందులూ

చ. 2: చల్లలమ్మేచోట్ల సరసపుపొందులూ
పిల్లఁగోవిరాగాల పెనుపొందులు
తొల్లి నీవుగాచుకున్న దొడ్డిపొంతపొందులూ
వెల్లవిరిఁ దలఁచుకో వేడుక నీపొందులు

చ. 3: ఆవులఁ బితికేటిఆనవాల పొందులూ
కావరపుమందల పొంగటి(లి?) పొందులూ
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితిని
గోవాళుఁడ తలఁచుకో గొల్లవారిపొందులూ

రేకు: 1320-1 దేశాళం సం: 23-115

పల్లవి: ఇంత సేసితివి నీవే యిందాఁకాను
యెంతైనాఁ గద్దు చలము యేమిసేతురా

చ. 1: మంచిమాఁట లాడేనంటేమరి వెంగేలే తోఁచీ
చుంచుల నిచ్చకములు సూటిపడవు
లంచము మోవిచ్చేనంటే లావులఁ బెనఁగీ మోము
యెంచరాదు నాపంతము యేమి సేతురా

చ. 2: సేవలు సేసేనంటే చేతికొనగోరు దాఁకీ
వోవరిలో మనసులువుడికించీని
భావించి నవ్వేనంటే పగిడి వెట్టినట్టయ్యీా
యీావిధము నావుదుటు లేమిసేతురా

చ. 3: మెచ్చి కాఁగిలించుకొంటే మేనిగురుతులు రాఁగీ
కొచ్చికొచ్చి సిగ్గులెల్లా గుంపుగూడీని
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
యెచ్చరించీ మర్మములు యేమిసేతురా

రేకు: 1320-2 శంకరాభరణం సం: 23-116

పల్లవి: ఇద్దరికిఁ జెల్లు నిటువంటిప్రేమ
ముద్దుఁదుమ్మిదలు మెరసినట్లాయ

చ. 1: తళుకుఁజూపులు తరుణి చూచితే
నెలవుల నవ్వేవు చెలువుఁడ
వొలిసి చంద్రుఁడు వుదయించితేను
కలువలు చెలఁగేగతులాయను

చ. 2: కాంత నిమ్మపండు కానుకిచ్చితే పూ
బంతిఁగొని యాపెపై వేసితి
కంతునివసంతకాలము వచ్చితే
పొంత వనమెల్లఁ బూచినట్లాయ

చ. 3: మోవిచూపి యాపె మొక్కు మొక్కి తేను
శ్రీవేంకటేశ్వర చేకొంటివి
వావిరి భూమిపై వానగురిసితే
భావించి పంటలు పండినట్లాయ

రేకు: 1320-3 నాదనామక్రియ సం: 23-117

పల్లవి: గారవించవయ్యా యింతిఁ గాఁగిలించి
కోరికతో కొప్పుజారీ కొచ్చిచూచి నిన్నును

చ. 1: నీకు మొక్కఁబూనితేను నెలఁత వేలిగోరు
రేకగాఁ జెక్కుమీఁదఁ జీరెను చేతప్పి
ఆకడ నీవు నవ్వితి వందుకుఁగా సిగ్గువడి
వాకుచ్చనేరక తలవంచుకున్న దెదుట

చ. 2: నీతో మాఁటలాడరాఁగా నెలఁతపలు వొరసి
ఘాతగాఁ దనపెదవి గంటివడెను
యేతున నీవు మెచ్చితే నిందుకుఁగా సిగ్గువడి
కాతరాన నిన్నుఁజూచి కాఁతాళించీ నదివో

చ. 3: నిన్నుఁగాఁగించఁగాను నెలఁతచనుఁగొండలు
తన్నుఁదానే తనచంకఁ దడఁబడితే
కన్నె శ్రీవేంకటేశుఁడ కంటివంటా సిగ్గువడి
పన్ని నిన్నుఁ బరాకుగా భ్రమయించీ నిపుడు

రేకు: 1320-4 ముఖారి సం: 23-118

పల్లవి: మరిగేల కొసరేవు మగువను సారెసారె
తరితీపులకునెల్ల తమకించెఁ జాలదా

చ. 1: యెక్కువతక్కువలుగా నెదురు మాటాడక
అక్కరతో సేవసేసె నది చాలదా
కక్కసించి మారుకొని కాఁతాళము రేఁచక
మక్కువ నీనవ్వులకు మారునవ్వెఁ జాలదా

చ. 2: చప్పనవుప్పనను చు జగడాలుదియ్యక
అప్పుడే విడెమిచ్చె నది చాలదా
తప్పులు నిన్నుఁబట్టి తరితీపులు చూపక
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కె నీకుఁ జాలదా

చ. 3: సిగ్గులునెగ్గు లెంచక శ్రీవేంకటేశ్వర యింతి
అగ్గమై నిన్నుఁ గూడె నది చాలదా
వెగ్గళించ కింపులుగా వేవేలురతులను
వొగ్గి నీకు నొడిగట్టి వొక్కటాయఁ జాలదా

రేకు: 1320-5 సౌరాష్ట్రం సం: 23-119

పల్లవి: కడమలే దేమిటాను ఘనుఁడవయ్యా
కడుపులోనే నేర్పితి కంటిమయ్యా

చ. 1: సిగ్గువడ్డఆపెనే చీరవట్టి తీసేవు
అగ్గలమైతి వన్నిటా నౌనయ్యా
వొగ్గి నవ్వేయాపెనే వూరకే గిలిగించేవు
తగ్గులేనిజాణఁడవు తగునయ్యా

చ. 2: మొక్కేటియా సెపైనే మోపేపు నీపాదములు
మిక్కిలి నేరుపరవి మేలయ్యా
అక్కరపడేయాపెకే ఆసలు మరి రేఁచేవు
యెక్కువగుణాలు నీయం దెటిఁగితిమయ్యా

చ. 3: కూడేటియాపెనే కుచ్చి కాఁగిలించేవు
వోడనేమిటికి నీవు వొప్పితిమయ్య
పాడితో శ్రీవేంకటేశ పైకొని యాపెఁ బైకొంటి
వేడనైనా నీవే దొర నియ్యకొంటిమయ్యా

రేకు: 1320-6 తెలుఁగుగాంబోది సం: 23-120

పల్లవి: వట్టిబూటకాన వడి నన్ను దూరేవు
దట్టించి ముట్టితే తాఁకీనటరా

చ. 1: కొప్పువట్టితీసి గోర గీరితే
యిప్పుడింతలోనే యేమాయరా
వుప్పతించి నిన్ను నొట్టువెట్టితే
కప్పిననీమేను కనుగందెనటరా

చ. 2: తిలకించి చూచి తిట్టుదిట్టితే
యెలమి నింతలో నేమాయరా
లలి సరసాన లావు చూపితే
అలసి నీ వుర మగడాయనటరా

చ. 3: సారె గాఁగిలించి చన్నుల నొత్తితే
యేరా యింతలోనే యేమాయరా
యీరీతి శ్రీవేంకటేశ నేఁ గూడితే
బీరపునీమోవి పిప్పాయనటరా

రేకు: 1321-1 ఆహిరినాట సం: 23-121

పల్లవి: సమ్మతిలఁ జెప్పేవు సారెసారెకు
వుమ్మడి మామనసింకా నొడఁబడీనా

చ. 1: అన్నిటా నీవెంత నన్ను ఆసలఁబెట్టినాను
యెన్ని లేవు నీగుణాలు యెఱిఁగినవే
కన్నుల దొల్లె నేము కంటిమి నీసరితలు
వున్నతి నామనసిది వొడఁబడీనా

చ. 2: రవ్వలుగ నీవెంత రతికిఁ బిలిచినాను
యివ్వల నీచేఁతలు యెఱిఁగినవే
తవ్వి తలకెత్తేవు నీతగవులు మాకును
వువ్విళ్లూర మామనసు వొడఁబడీనా

చ. 3: సిగ్గువడక నీవెంత చెక్కులు నొక్కి నాను
యేగ్గులేని నీపొందు లెఱిఁగినవే
నిగ్గున శ్రీవేంకటేశ నేఁడె నన్ను నేలితివి
వొగ్గి యింక వేరేమనసావొడఁబడీనా

రేకు: 1321-2 నీలాంబరి సం: 23-122

పల్లవి: చెలఁగి పెద్దరికము సేతుఁగాని
కలఁకరేఁచేదానఁగానుసుమ్మీ నిన్నును

చ. 1: నాకే వలతునంటా నమ్మికెలే లిచ్చేవు
చేకొంటెఁ గానవచ్చీఁ జెప్పవలెనా
రేకలు దీయిమనేవు రీతిగా నీబుజముల
కాకుసేసేదాననుఁగానుసుమ్మీ నిన్నును

చ. 2: పాయలేనుసుమ్మీయని బాసలేల సేసేవు
యీయెడనే కానవచ్చీ విదియేఁటికి
సేయరానిచేఁతలెల్లాఁ జేయుమని యేలనేవు
కాయ పండుసేసేదానఁగాను సుమ్మీనిన్నును

చ. 3: యిచ్చకపువాఁడనంటా యేల నన్ను ముట్టేవు
యెచ్చరిక గానవచ్చె నెఱుఁగుదును
కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడి నన్నేలుమనేవు
గచ్చుల మీరేదానఁగానుసుమ్మీ నిన్నును

రేకు: 1321-3 బౌళి సం: 23-123

పల్లవి: అండనున్న చెలులలము నన్నిటాఁ దనిసితిమి
యెండా నీడాఁ దెలిసితి వేమిసేతువయ్యా

చ. 1: చెప్పినమాటలెల్లా చెవులొగ్గి వింటివి
రెప్పలెత్తి చూచితివి వొప్పుగొంటివి
దప్పిదేరె నీ యింతి దవ్వుల నీసుద్దులకే
ఇప్పుడింతకంటె నిఁకనేమి సేతువయ్యా

చ. 2: కరఁగిలి వింపులను కడును లాలించితివి
శిరసూఁచుకొని సన్నసేసితివి
సరసమున నీఇంతి చినవరిమాయను
ఇరవాయ నింతకంటె నేమిసేతువయ్యా

చ. 3: చేరి కాఁగిలించితివి చెక్కు చేత నొక్కితివి
గారవించి రతులనుఁగైకొంటివి
యీరీతి శ్రీవేంకటేశ యీసతి మన్ననఁ బొందె
యేరవ్వా నే లింతకంటె నేమిసేతువయ్యా

రేకు: 1321-4 సింధురామక్రియ సం: 23-124

పల్లవి: ఈపె వంటిదిట్టతన మేడ నీవు గంటివయ్య
నీపాదము లొత్తుతాను నీవద్దనే వున్నది

చ. 1: ఆసల నిన్నుఁ దిట్టీ అన్నిటికి సెలవుగా
సేసకొప్పు వంచి నీకు చెలి మొక్కీని
సేసేచేఁత నిన్నుఁ జేసి చిత్తమురా వలసి
మూసినముత్తైమై ముందటనే వున్నది

చ. 2: నీమోవి గంటిసేసీ నేరమెల్లాఁ దీర
చేముట్టి కప్రవిడెము చేతికిచ్చీని
సాముసేసినట్లనే చన్నులను నిన్ను నొత్తి
ఆముకొని పంతమిచ్చి ఆయమంటుచున్నది

చ. 3: పాదమునేఁదాకించీ భయమెల్లాఁ బాయను
సాదువలెఁగా గాఁగిలించి సరిఁగూడీని
యీదెస శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
ఆదరించి కమ్మటిని ఆసరేఁపుచున్నది

రేకు: 1321-5 కేదార గౌళ సం: 23-125

పల్లవి: తనచేతి దిఁకను ధర్మము పుణ్యము
చొనిపి యింకాఁ దన్ను సొలసేఁటిదేఁటిదే

చ. 1: ములువాఁడికొనగోరిమొనలు వాఁడి
కలయనితనతోడికాఁకలు వేఁడి
అలసితి రెంటివల్లానప్పుడే నేను
యెలమి నింకాఁ దనతో నేఁటిమాఁటలే

చ. 2: సారపుఁబయ్యదలోనిచన్నులు గట్టి
సారెకు నాడేసరసములు వెట్టి
అరితేరె నిందునందు నందరిలోన
మారుకొని యింకాను మరి యేఁటిపొందులే

చ. 3: నెమ్మి వీడినతురుమునెరులు చిక్కు
కమ్మరఁ గూడినయట్టి కాఁగిలిచొక్కు
నమ్మించి శ్రీవేంకటేశుఁడు నన్నేలెను
సమ్మతిఁ దనకు నాకు సరి నేఁటిసిగ్గులు

రేకు: 1321-6 నాదనామక్రియ సం: 23-126

పల్లవి: అంగడినేల వేసేవు అప్పటి వలపులు
యింగిత మెఱిఁగి యిట్టె యేలుకొనరాదా

చ. 1: మంచిమాఁట లాడితేనే మనసుఁ గరఁగుదుము
కంచముపొత్తిచ్చితే కాఁతాళించము
మంచమెక్క నిచ్చితేనే మచ్చికలు సేతుము
యించుకంత చనవిచ్చి యేలుకొనరాదా

చ. 2: చెక్కునొక్కినందుకే సేవలెల్లాఁ జేతుము
చక్కఁగాఁ జూచితేనే సమ్మతింతుము
గక్కన గొంగువట్టితే కందువకు లోనౌదుము
యిక్కువతో మన్నించి యేలుకొనరాదా

చ. 3: చనుఁగవ లంటితేనే సరుసఁ గాఁగిలింతుము
వొనరంగ నవ్వితేనే వోరుతుము
ఘనుఁడ శ్రీవేంకటేశ కలిసితి వింతలోనే
యెనసి యట్టె లాలించి యేలుకొనరాదా

రేకు: 1322-1 ఆహిరి సం: 23-127

పల్లవి: ఇందులోనే వున్నవివె యింతితమకములెల్ల
గొందినే కోరికలెల్లా కొమ్ములే కిగిర్చెను

చ. 1: చెలి నీకడకు రాఁగా చెమటలఁ దొప్పఁదోఁగె
వలపులు వానలేనివరదాయ
యెలమి నీరాకల కెదురుచూడఁగాను
వెలయఁగ దివ్వెలేకే వెలుఁగనిపించెను

చ. 2: వెదకుతానే నిన్ను వెలఁది కాఁకలఁ బొందె
యెదుటఁ బొద్దువొడవ కెండగాసెను
యిదె నీపైయాసల నిట్టె మేను పులకించె
వెదవెట్టక ససులు వేవేలు మొలచెను

చ. 3: నీరతికిఁ జేయిచాఁచె నిట్టూర్పుల నిండెఁ జెలి
కోరి యాస గాలిలేక తూరుపెత్తెను
సారె శ్రీవేంకటేశుఁడ చన్నుల నిన్నునొత్తి
బోరునఁ దా జాళెలేక బొమ్మరాలు వేసెను

రేకు: 1322-2 రామక్రియ సం: 23-128

పల్లవి: నీవేడుకే చూచేవు నెలఁతలా గెంచవు
సోవలకన్నుల నాపె సొలయఁగాను

చ. 1: యెందాఁకా మాటలాడేవు యెంతలేదు నీనవ్వు
అందపుటాసలఁ జెలి అలయఁగాను
యిందునందూ సోలుతా నెమ్మె లేమిచూపేవు
గొంది నుండి యాపె నిన్నుఁ గొసరఁగాను

చ. 2: యేమి సరసమాడేవు యేదిగొద్ది నీపగటు
కామిని కాఁకలచేతఁ గసుగందగా
సాములు సేయుచును చలమేల సాదించేవు
వేమరు నాపె నిన్ను వేఁడుకొనఁగాను

చ. 3: యెట్టు వేసాలు సేసేవు ఇన్నియు నేర్తువు నీవు
అట్టె ఇంతి నిన్నుఁగూడి అలయఁగాను
రట్టుగ శ్రీవేంకటేశ ముట్టి యేల కెలసేవు
వెట్టదీర నాపె నిన్ను వినుతించఁగాను

రేకు: 1322-3 పాడి సం: 23-129

పల్లవి: దేవుడవు నీవూ దేవుల నేను
వాపులు గూడఁగాను వడి సేసవెట్టితి

చ. 1: వలపులు నే నెఱఁగ వాసు లెఱఁడను; నీవు
కలకల నవ్వితేనే కరఁగితిని
పలుకులు నే నేర భావించఁగ నే నేర
పిలిచి విడెమిచ్చితే ప్రియమందితిని

చ. 2: మనసు సాదించనోప మర్మము లడుగనోప
చెనకి గోర నూఁదితే చేకొంటిని
పెనఁగఁజాలను నేను బిగియఁగఁజాలను
కనువిచ్చి చూచితేనే కానిమ్మంటిని

చ. 3: పచ్చిచేఁతలు రచించఁ బలుమారు సిగ్గువడ
మచ్చికఁ గాఁగిలించితే మరిగితిని
యిచ్చట శ్రీవేంకటేశ యేలుకొంటి విటు నన్ను
మెచ్చి కాఁగిలించితేను మేకొని మొక్కితివి

రేకు: 1322-4 సామంతం సం: 23-130

పల్లవి: అన్నిటికి నేరుతువు అవునయ్యా
కన్నదే కంది గురుమ కంటిమయ్యా

చ. 1: పిలిచె నిందాఁకాను పెద్దయెలుఁగున నింతి
పొలసి నీ వెక్కడికిఁ బోతివయ్యా
మొలచినట్లు వచ్చి ముసుఁగుతో పానుపుపై
తల గానరా దాఁగేవు తగునయ్యా

చ. 2: వెదకె నిందాఁకాను వీదులవీదుల నాకె
వుదుటున నెవ్వరింట నుంటివయ్యా
తుద పిందె దిగినట్టు దోమతెరమరఁగున
నిదురవోతా బొంకేవు నేరుపరివయ్యా

చ. 3: కొసరె నిందాఁకాను కొమ్మ నీకాఁగిటఁ గూడి
వెస నేమని చెవుల వింటివయ్యా
రసిక శ్రీవేంకటేశ రమణిఁ గూడితి విట్టె
కసుగాయమో విచ్చేవు ఘనుఁడవయ్యా

రేకు: 1322-5 దేశాళం సం: 23-131

పల్లవి: కొమ్మలు పదారువేలగోవిందరాజ
నిమ్మపంట వేతురా నీ వాఁటదానిని

చ. 1: చేరి కొంగువట్టెనంటాఁ జెలులతోఁ జెప్పి చెప్పి
ఆరీతి నవ్వుదురా ఆఁటదానిని
కోరి చెమటదీసితే కొనగోరు దాఁకెనంటా
నేరము లెన్నుదురా నీవాఁటదానిని

చ. 2: సన్నలఁ జిక్కించెనంటా సాకిరులు వెట్టివెట్టి
అన్నిటా దూరుదురా అఁటదానిని
చన్నులుసోఁకఁగ నీసరుసఁ గూచుండెనంటా
నిన్నటికి నేఁ డందురా నీవాఁటదానిని

చ. 3: జట్టిగొని కూడెనంటా సముకాన మెచ్చిమెచ్చి
అట్టె పొగడుదురా అఁటదానిని
వొట్టుక శ్రీవేంకటేశ వుర మొక్కించుకొంటివి
నెట్టన నింతసేతురా నీ వాఁటదానిని

రేకు: 1322-6 సాళంగ నాట సం: 23-132

పల్లవి: కొలువు సేయించుకొనే గోవిందరాజా
అలరి వోరుచుకొంటే నందమయ్యా

చ. 1: చిగురుమోవులవారు చేరి నీతో మాటాడితే
వొగరువేయకుండునా వొకకొంత్తైనా
వెగటున విని నీవు వెంగెములు సేసుకొనేవు
నగవు సేసుకొనేదే నయమయ్యా

చ. 2: కలువకన్నులవారు కప్పి నిన్నుఁ జూచితేను
చలువ గాకుండునా జవ్వనానకు
లలి నీవందుకును చలములు రేచుకొనేవు
పులకించి మెచ్చేదీ బుద్దియౌనయ్యా

చ. 3: జక్కవచన్నులవారు సరిఁగాగిలించుకొంటే
ముక్కులు సోఁకకుండునా ముంచి వురము
యిక్కువ శ్రీవేంకటేశ యిందుకుఁగా నలసేవు
చొక్కుచు సంతసించేదే జోకౌనయ్యా

రేకు: 1323-1 శ్రీరాగం సం: 23-133

పల్లవి: అటువంటివాఁడు గాఁడు అతఁడు నీకుఁ దప్పఁడు
కిటుకులెల్లా మాని కేలెత్తి మొక్కవే

చ. 1: దప్పిదేరెమోముతోడ తమకాన నున్నాఁడు
కప్పుర మియ్యఁగదవే కలికీ
ఇప్పుడు వచ్చితి వాతఁ డిందాఁకాఁదా నొంటి నుండె
చిప్పిలుఁజెమట లార్చి సేదదేర్చవే

చ. 2: అసురుసురనుకొంటా ఆసలతో నున్నాఁడు
కొసరి విడెమియ్యవే కోమలీ
ముసుఁగు దీసితి విట్టె మోము గాన కాతఁ డుండె
వెస నీమోవి యిచ్చి వేడుకసేయవే

చ 3: చిగురుఁదలపోఁతతో శ్రీవేంకటేశుఁ డున్నాఁడు
తగురతిఁ గూడవే తరుణీ
వొగి సేసవెట్టితివి వొలసి నిన్నాతఁడేలె
పొగడి కాఁగిటలోనే పొసఁగివుండవే

రేకు: 1323-2 సాళంగం సం: 23-134

పల్లవి: కొండవంటిదొరవు కోరి చెయివట్టఁగాను
కండించి యాడవచ్చునా కానీవయ్యా

చ. 1: వలపు చవిచూపితే వద్దనఁగవచ్చునా
చెలఁగి మాయింటికి విచ్చేయవయ్యా
వొలసి విడెమియ్యఁగా నొల్లననవచ్చునా
తిలకించి పుచ్చుకొనేఁ దేవయ్యా

చ. 2: సిగ్గులు చేతికిచ్చితే చేత దొబ్బవచ్చునా
వెగ్గళించ నింకఁ దెరవేయవయ్యా
వొగ్గి నవ్వులు నవ్వఁగా నోపననవచ్చునా
నిగ్గుల సమ్మతించితి నీచిత్తమయ్యా

చ. 3: జవ్వనము పైఁబూసితే జంకించవచ్చునా
చివ్వనఁ గాఁగిట నించి చేచాఁచవయ్యా
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నివ్వటిల్ల మన్నించి నిండుకుండవయ్యా;

రేకు: 1323-3 రామక్రియ సం: 23-135

పల్లవి: అంటుకొంటి వింకనో ఆయఁగా రట్టు
కంటగించ కంతలోనె కాఁగిలించుకొంటిని

చ. 1: చెఱఁగుమాసినసుద్ది చెలితో నేఁ జెప్పఁగను
యెఱుకలుసేసుకొనే వేఁటికి నీకు
చిఱుతనవ్వులు నవ్వి సిగ్గుపడి నే నుండితే
వొఱపుతోడను వచ్చివొద్దఁ గూచుండితివి

చ. 2: నాలునాళ్లు సేసేనని నాతులఁ బిలిచితేను
యీలీల నదేమనేవు యేఁటికి నీకు
మైలవాసి నేనిటు మఱఁగున నుండఁగాను
పోలిమి నెంగిలిచోటు పొలసి తొక్కితివి

చ. 3: పాయపుమదముతోఁ బడఁతుల జూచితేను
యీయెడ నేకతమాడే వేఁటికి నీకు
చాయల శ్రీవేంకటేశ జంట నసుఁ గూడితివి
పాయ నీచేయి దాఁకెఁ బట్టినకాఁశాఁజి

రేకు: 1323-4 ఆహిరి సం: 23-136

పల్లవి: అందువంకనైనాఁ గొంత ఆతుమ దనుసును
పొందులన్నియునుఁ దలపోసుకొనవయ్యా

చ. 1: పెక్కుసతులమీఁదను ప్రియముగలవాఁడవు
వొక్కతే నీరతులకు నోపుదునా
గక్కన నీమనసు కరఁగేయట్టుగాను
తక్కక మరేఁగొందరిఁ దలఁచుకోవయ్యా

చ. 2: నానావిధాలవారితో ననిచినవాఁడవు
నేనొక్కతె నవియెల్లా నేరుతునా
సోనగా మైచెమరించి చొక్కేయట్టుగాను
తానకపుకతలెల్లాఁ దలఁచుకోవయ్యా

చ. 3: చెంచులా గొల్లెతలా మెచ్చినయట్టివాఁడవు
మించి నేనొక్కతెనే మెప్పించేనా
కొంచక శ్రీవేంకటేశ కూడితి వైనట్టుగాను
దంచక నావంటి దేది తలఁచుకోవయ్యా

రేకు: 1323-5 కాంబోది సం: 23-137

పల్లవి: చెప్పినట్టు సేయవయ్య చెలియచిత్తమురాను
దప్పిదేర బుజ్జగించి తనివందవయ్యా

చ. 1: చిగురుఁబోణి నిన్ను శ(సె?) లవుల నవ్వీవి
జిగి నీవెక్కడ నేమి సేసితివయ్యా
తగిలి నీనిలువెల్లాఁ దప్పకచూచీ నిదె
యెగసక్కెపుమచ్చము లేమున్నవయ్యా

చ. 2: కచ్చుపెట్టి నీకు నట్టె కస్తూరి వూసీని
పచ్చిగా నెవ్వతెతావి పట్టెనయ్యా
దిచ్చరినీమోవి గలతేనెతీపు చాలదని
వెచ్చ మేడఁబెట్టి కొంత తెచ్చితివయ్యా

చ. 3: శ్రీవేంకటేశ నిన్నుఁ జేరి కాఁగిలించి కూడె
కావించి నీనిజ మెట్టు కనెనయ్యా
వోవరిగాఁ దనకు నీవురము నెలవుచేసె
భావమెఱింగి రతెట్టు పనిగొనెనయ్యా

రేకు: 1323-6 మాళవిగౌళ సం: 23-138

పల్లవి: ఎఱుఁగుదు మిన్నియును ఇంతే శేల
వఱవాతా నింకా వింతవారమా నేము

చ. 1: మాటలనే చొక్కితిమి మంతనాలు మెచ్చితిమి
తాఁటలఁదూఁటలచేతఁ దనిసితిమి
యేఁటికి మమ్ముఁ జెనకీ నిన్నిటాఁ జుట్టాలము
వాఁటముగ నిఁక వింతవారమా నేము

చ. 2: నగవుల నలసితిమి నయముల నమ్మితిమి
తగవులు నెరపఁగాఁ దనిసితిమి
మొగము లేమిచూచీని మోహించినవారము
వగలేల యింకా వింతవారమా నేము

చ. 3: మోవితేనె లానితిమి ముచ్చటలఁ గూడితిమి
తావుల సరసములఁదనిసితిమి
యేవల్లా శ్రీవేంకటేశు కిచ్చకపుసతులము
వావిగూడె నింకా వింతవారమా నేము

రేకు: 1324-1 వరాళి సం: 23-139

పల్లవి: అవునయ్య మంచివాఁడ వన్నిటా నీవు
యివల నిన్నేమందు నెంతకాఁతరీఁడవు

చ. 1: చెప్పుదునా ఆపెతోడ చెంది నీసేసినచేఁత
యిప్పు డిట్టె వింటేను యేమను నిన్ను
చెప్పరానివిశ్వాసిచెలికత్తెలము నేము
కొప్పువట్టి మాపయ్యదకొం గంటఁదగునా

చ. 2: చూపుదునా ఆపెకు సొమ్ములు నీవిచ్చినవి
ఆపనుల కేమని ఆడునో నిన్ను
వోపికతో నితవరివూడిగపువారము
చేపట్టి మాచెక్కులను జీరఁదియ్యఁదగునా

చ. 3: సాకిరి దెలుపుదునా సరి నీనవ్విననవ్వు
తూకొనెలమేల్మం గెంతదూరునో నిన్ను
యీకడ శ్రీవేంకటేశ ఇద్దరి నమ్మినవార
మేకొలఁదిఁ(ది?) గాఁగిలించి యింత మెచ్చఁదగునా

రేకు: 1324-2 దేశాళం సం: 23-140

పల్లవి: నీలో మెలఁగినదాన నేఁడు మాకుఁ గొత్తలా
నీలాగులన్నియును నే మెఱఁగమా

చ. 1: కట్టినది చంద్రగావి, కాయముతట్టుపుణుఁగు
యెట్టైవ్వతెఁ గూడినా నిన్నెఱఁగవచ్చు
పెట్టకు మంతేసియాన బిరుదుబంటవు నీవు
నెట్టుకొన్న నీనిజము నే మెఱఁగమా

చ. 2: పొడికప్రము చెక్కుల, పూవులదండలు మేన
కడ నెవ్వతెఁ బొందినాఁ గానఁ గవచ్చు
వొడఁబరచకు మంత వొడయఁడ వందరికి
నిడుపునీగుణాలు నే మెఱఁగమా

చ. 3: వోవరి శ్రీవేంకటాద్రి, పురాన నలమేల్మంగ
చేవ నెవ్వతెఁ గూడినాఁ జెప్పఁగఁవచ్చు
కావించకు బాస నాకు శ్రీవేంకటేశ నన్నేలి
నీవోజ లెప్పుడును నే మెఱఁగమా

రేకు: 1324-3 బౌళి సం: 23-141

పల్లవి: కాఁగిలించవయ్యా కామినినీవు
మాఁగినమోవితోడ మధురమైవున్నది

చ. 1: యెలయింపుఁజూపులను ఇంతిఁజూచితే నాపెకు
చెలపచెమటనీరు చిమ్మిరేఁగెను
వెలయ నీవందుకుఁగా విసరితివి సురటి
పులక మొగ్గలమేనఁ బొదిగొనివున్నది

చ. 2: మనసిచ్చి సతితోను మాటలు నీవాడితేను
చనుఁగవ బిగువెక్కి జారెఁ బయ్యద
అనువుగాఁ బెట్టఁబోతే నందుపై నీగోరు సోకి
మనసెల్లాఁ గరఁగి నీమంచముపై నున్నది

చ. 3: దొమ్మి నలమేల్మంగతోడ నీవు నవ్వితేను
కుమ్మరింపుసిగ్గుతోడ కొప్పు వీడెను
నెమ్మది శ్రీవేంకటేశ నీవింతలోఁ గూడితేను
సమ్మతించి మెచ్చిమెచ్చి సారె నీకు మొక్కెను

రేకు: 1324-4 శ్రీరాగం సం: 23-142

పల్లవి: కంటి మిదివో నేము కన్నులపండుగగాను
జంటలఁ గొలువై నీవు చనవియ్యఁగాను

చ. 1: హేమంతకాలము నేఁడు యిటు నీతిరుమేన
ఆముకొని జనియించినట్లుండెను
భూమిఁగలకప్పురము పొడిసేసి నిలువెల్లా
నేమముతో నిందరును నీకుఁ జాతఁగాను

చ. 2: వానకాలము నీలవర్ణముతోఁ దిరుమేన
సోనయ్యె కురిసినట్టు చూపట్టెను
సేనగాదట్టుపుణుఁగు చిత్తడిగా సర్వాంగాల
పూని యిందరును నీకుఁ బూయఁగాను

చ. 3: వసతకాలంము తానె వచ్చి నీ తిరుమేన
యెసగినట్టు శ్రీవేంకటేశ తోఁచెను
వెస నలమేల్మంగతో వింతసొమ్ము నీవురాన
పొసగి: చందరు విన్నందరు బొగడఁగాను

రేకు: 1324-5 ఆహిరి సం: 23-143

పల్లవి: ఎదురాడఁజాలదు యేమిసేసినా నీకు
వదలుఁదురుమువట్టి వంచకువయ్యా

చ. 1: చెక్కునఁ జేయివెట్టుక చింతించేచెలియకు
పుక్కిటితమ్ముల మిడి పొదిగేవు
వెక్కసపువిరహాన వేగించె నిందాఁకా
పిక్కటిల్లుఁజన్నులు పిసుకకువయ్యా

చ. 2: వుమ్మగిలుఁజెమటచే నోలలాడేమగువను
కమ్ముక యిప్పుడు వచ్చి కాయమంటేవు
నెమ్మనపుఁదమకాన నెరి నలసె నిందాఁకా
బిమ్మిటిగాఁ జేయివట్టి పెనఁగకువయ్యా

చ. 3: వుసురసురనుకొంటానుండేయల మేలుమంగను
పొసగించి కూడి యిట్టె భోగించితివి
యెసఁగ శ్రీవేంకటేశ యెనసె నిన్నిందాఁకా
వెస మోవి గంటిగావించకువయ్యా

రేకు: 1324-6 భైరవి సం: 23-144

పల్లవి: చెలులాల యేమని చెప్పెనో తాను
యెలమితో వివరించి యీతని నడుగరే

చ. 1: చెక్కులవెంటఁగారీఁ జెమటలూ
వెక్కసపుంగొప్పువెంట విరులు రాలీ
చెక్కుకొంటాఁ దనదట్టీచెఱఁగు జీరాడఁగా
యెక్కడనుండి వచ్చీని యీతని నడుగరే

చ. 2: అంగమునఁ దొట్టుపడీ నలపులూ
వుంగిటిగొనీ ముక్కున నుసురులు
సింగారపువింతాలెల్లా చెలఁగఁగా
యెంగిలై యెందుండి వచ్చీ నీతని నడుగరే

చ. 3: గిఱికొనీ మోవిమీఁద కెంపులూ
మెఱసీ నురాన నలమేలుమంగా
తఱి శ్రీవేంకటేశుఁడు తానె మమ్మెల్లా నేలె
యెఱఁగ మెందుండి వచ్చీ నీతని నడుగరే

రేకు: 1325-1 దేవ గాంధారం సం: 23-145

పల్లవి: ఎన్నినోములు నోఁచెనో యీారమణి
చన్నుల జవ్వనపుసంపదతోడా

చ. 1: వలపుగద్దె యెక్కె వనితా
చెలపచెమటలఅభిషేకముతోడ
కొలువు సేయించుకొనీఁ జెలులచేతా
బలిమి నిట్టచూపులసం(పం?) జులతోడా

చ. 2: కోరికలరాజ్యమేలీఁ గోమలి
నూరువేలుపులకకానుకలతోడ
చేరిశైత్యోపచారాలు సేయించుకొనీ
సారెఁ గొప్పునల్లజల్లిచామరాలతోడా

చ. 3: మరుపట్ట మలమేలుమంగ గట్టె
పురమున శ్రీవేంకటోత్తముతోడా
గరిమఁ గప్పముగొనెఁ గళలెల్లాను
సురతపుకొనగోరిసొమ్ములతోడా

రేకు: 1325-2 శంకరాభరణం సం: 23-146

పల్లవి: ఏలుకొన్నఫలమూ యింటి కిట్టె రామయ్య
మేలుగలఫలమూ మెచ్చఁగదవయ్యా

చ. 1: చెప్పినట్టువింటేనే సేసినంతఫలమూ
వొప్పుగొని నామాఁటకు నూకొనవయ్యా
యిప్పుడియ్యకొంటేనే యిచ్చినంతఫలమూ
చప్పఁగదు నాపొందు సమ్మతించవయ్యా

చ. 2: నావూడిగము చేకొంటే నగినంతఫలమూ
భావించి నీపాదము నాపైఁ జాఁచవయ్యా
వావి నాతోఁ జెప్పితేనే మోవియిచ్చినఫలము
యీవల నేఁ జేసేబత్తి కిటు లోనుగావయ్యా

చ. 3: కప్పుర మందుకొంటేనే కాఁగిలించినఫలము
దప్పిదేరీ రతికేళిఁ దనుపవయ్యా
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
యిప్పుడు గూడినఫల మీడేరించవయ్యా

రేకు: 1325-3 లలిత సం: 23-147

పల్లవి: కడుఁజుట్టమవు నీవు కా వంటినా
యెడయక నన్ను నిట్టె యేలుమంటిఁగాక

చ. 1: చెక్కునొక్కి నీవు నాచేయిమీఁదఁ జేయివేసి
తక్కక నవ్వు నవ్వు నవ్వఁగాఁ దగదంటినా
వొక్కతెపైఁబెట్టి మాట వొక్కొక్కటె తడవఁగా
వక్కణించ నంతేసి వద్దంటిఁగాక

చ. 2: యేపున నావద్దనుండి ఇంతకలసిమెలసి
కాఁపురము సేయఁగాను కాదంటినా
చూపి మోపి యాడోవారిసొమ్ములు మేనఁబెట్టుక
రాఁపులు సేయఁగా నందు కోపనంటిఁగాక

చ. 3: చన్నులురమున రాయ సారెఁ గాఁగిలించుకొని
యెన్నిచేతలు సేసినా నేఁటికంటినా
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
మన్నించి కూడితి విది మాననంటిఁగాక

రేకు: 1325-4 మాళవిగౌళ సం: 23-148

పల్లవి: చెప్పరాదు యీతనిసింగారాలు
యుప్పిరిగొని సిరులు ముంచెనోకాని

చ. 1: అండనే కప్పురకాఁపు లదివో దేవునికి
మొండుకొని అమరెను మేననెల్లాను
పుండరీకాక్షుఁడుగాన పొదలి తెల్లనికాంతి
నిండుకొని నిలువెల్లా నెలసెనోకాని

చ. 2: తట్టుపుణుఁగుకాఁపు దైవాలరాయనికి
దట్టమై యమరె నిదె తనువెల్లాను
చుట్టు నెమలిపెంచముచుంగులనల్లనికాంతి
అట్టె అంగములనెల్లా నలమెనోకాని

చ. 3: అలమేలుమంగ పురమందు శ్రీవేంకటేశున
కెలమి నమరె యిదె యీతనువున
మొల పీతాంబరమున మొలచినపైఁడి కాంతి
అలరి మెడను సొమ్ములాయనోకాని

రేకు: 1325-5 సామంతం సం: 23-149

పల్లవి: గడుసవు గదె నీవు కలికీ వోరి
అడరి మరనిమహి మటువంటిదౌరా

చ. 1: తప్పకచూచేవేమే తరుణీ వోరి
కుప్పించీ నీమీఁదను చకోరాలురా
చిప్పిల నామేనెల్లాఁ జెమరించెనే వోరి
యెప్పుడూ వాఁటిగుణాలు ఇటువంటివౌరా

చ. 2: వొఱపులే నీచన్ను లువిదా వోరి
యెఱసీ జక్కవలు నీమీఁదనుండిరా
మఱి కరఁగేఁగదవే మగువా వోరి
యెఱఁగనా వాఁటివోజ లిటువంటివౌరా

చ. 3: మించి పురమెక్కె వలమేలుమంగా వోరి
యంచలు నీయందు వోలలాడఁజొచ్చెరా
యెంచఁగల శ్రీవేంకటేశుఁడఁగదే వోరి
వంచనతోఁ గూడితివి నానిజాడలౌరా

రేకు: 1325-6 పాడి సం: 23-150

పల్లవి: ఏమి దక్కువాయ నీకు నిందువంకను
కామినిసేసేబత్తిఁ గైకొనరాదా

చ. 1: కన్నులనే కొసరుచు కాఁకలు నీపైఁ జల్లీ
అన్నిటా నదేమని యడుగరాదా
చిన్ననాఁడే బాస యిచ్చి సేసలు వెట్టితివట
మన్నించి యట్లానే మనుపరాదా

చ. 2: పలుకుచు సతి నీపచ్చడము కొంగంటీ
నిలిచి మారుమాఁట నీవాడరాదా
అలరుఁజవికెలోన అసలఁబెట్టితివట
తలపోఁత లీడేర్చి దయఁజూడరాదా

చ. 3: నవ్వుతా నలమేలుమంగ నంటున నీవురమెక్కె
నివ్వటిల్ల నీమచ్చిక నెరపరాదా
రవ్వగా శ్రీవేంకటేశ రతుల మెచ్చితివట
జవ్వనికి నన్నిటాను చనవియ్యరాదా

రేకు: 1326-1 శంకరాభరణం సం: 23-151

పల్లవి: నీనేరములకు నేనా గురి
నానఁబెట్టి కత నడపఁగరాదా

చ. 1: మఱఁగుల మొఱఁగుల మాఁటలాడితే
మఱి కరఁగెను నీమన సిపుడు
యెఱఁగను నే నందుకేమి సేతురా
నెఱపునీబిగువు నిలుపఁగరాదా

చ. 2: సేయరానిపని చేసి కడు వడిసె
కాయపుఁజెమటలు కడు వడిసె
రాయడించరా రతివేళ వెనక
తీయక ధైర్యము తెచ్చుకోరాదా

చ. 3: అలమేల్ మంగ నే నటు నినుఁ గూడిన
పులకించె మొగము కళరేఁగె
సెలవి నవ్వరాదా శ్రీవేంకటేశ్వర
బలిమిఁ బరాకునఁబై కొనరాదా

రేకు: 1326-2 హిందోళ వసంతం సం: 23-152

పల్లవి: మేలు మేలయ్యా నిన్ను మెచ్చితిమి నీ వింతిని
లాలింతురుగాక యీలాగు సేతురా

చ. 1: శిరసువంచుకుండితే సిగ్గుదేర్చవలెఁగాక
కరకరిఁబెట్టి యింత కాఁగిలింతురా
విరసాన నలిగితే వేఁడుకొనవలెఁగాక
పెరిగేకుచము లిట్టె పిసుకుదురా

చ. 2: దవ్వులనే నిలుచుంటే దగ్గరిరావలెఁగాక
పవ్వళించి గజ నిమ్మపంట వేతురా
అవ్వలిమోమైతేను ఆదరించవలెఁగాక
కువ్వవడ కుచ్చెలకొంగువట్టి తీతురా

చ. 3: మోనాన నుండితే మోవితేనె చవిగొంటగాక
కానుకగా నందుమీఁద గంటిసేతురా
ఔనని శ్రీవేంకటేశ అలమేల్ మంగఁ గూడితి
వానుక వుందువుగాక ఆఱడి సేతురా

రేకు: 1326-3 కాంబోది సం: 23-153

పల్లవి: ఎంత గిజిగిజిసేసే వింతిని నీవు
మంతనానఁ జేయరాదా మఱి చేఁతలెల్లను

చ. 1: విప్పుచు సెలవులను విన్నపాలుసేయఁగాను
చిప్పిల మోవి యెంగిలిసేసేవు
రెప్పలెత్తి కన్నులను రేసువడి చూడఁగాను
కొప్పువట్టి జారఁదీసి కొసరేవు

చ. 2: పాదములు నీ కొత్తఁగాఁ బడఁతి చన్నుమొనలు
దాదాత(య?) బొట్టనవేళ్లఁ దాఁకించేవు
కాదనక నీకు నూడిగములెల్లాఁ జేయఁగాను
సేదదేరఁ బిరుదుపైఁ జేయిచాఁచేవు

చ. 3: గందము నీకుఁ బూయఁగా కమ్మి యలమేల్ మంగను
కందువ శ్రీవేంకటేశ కాఁగిలించేవు
సందడింపురతులను చవులెల్లాఁ జూపఁగాను
మందలించి కూడి సదమదము సేసేవు

రేకు: 1326-4 మాళవిగౌళ సం: 23-154

పల్లవి: భావించి చూడరే పడఁతులాల
చేవదేరి మహిమలు చెలఁగినట్టుండెను

చ. 1: పరమపురుషునికి పచ్చకప్పురముకాఁపు
తిరుమేన నమరెను తెల్లనికాంతి
ధరలోఁ బాలజలధి తచ్చేటివేళను
మురిపెమై తుంపురులు ముంచినయట్టుండెను

చ. 2: తవిలి యీదేవునికి తట్టుపుణుఁగుకాంపు
నవమై మేన నమరె నల్లనికాంతి
తివిరి గోవర్ధనమెత్తిననాఁడు నీఁడుకొని
ధ్రువమై మేఘకాంతులు తొలఁకినట్టుండెను

చ. 3: శ్రీవేంకటేశునికి సింగారించిన సొమ్ములు
బావించ మేన నమరే బంగారుకాంతి
తావుగా నలమేల్ మంగ తనవుర మెక్కఁగాను
వేవేలుసంపదలెల్ల వెలసినట్టుండెను

రేకు: 1326-5 రామక్రియ సం: 23-155

పల్లవి: చిత్తగించవయ్యా చెలియ విలాసాలు
బత్తిసేసీ నేఁడు నీపాదా లొత్తఁగాను

చ. 1: చిగురుమోవిమీఁదఁ జిప్పిలీఁ దేనెలు కడు
మగువ నీతో నట్టె మాటాడఁగాను
నగెడిసెలవులను నారుకొనీఁ గప్పురము
మొగము చూచి నీకు మొక్కఁగాను

చ. 2: నెరసి గుబ్బలమీఁద నిండీఁ బులక లివె
తరుణి పయ్యెద నిన్నుఁ దాఁకఁగాను
పురిగొని కొప్పులోని పువ్వులు రాలీ నివె
బెరసి నీకాఁగిటఁ బెనఁగఁగాను

చ. 3: కలికి మొగములోనఁ గళలు రేఁగీ నవె
అలమేలుమంగ నిన్ను నలమఁగాను
అలరి శ్రీవేంకటేశ అంగములు పొంగీ నవె
అలసినరతిలో నీవాదరించఁగాను

రేకు: 1326-6 ముఖారి సం: 23-156

పల్లవి: ఎటిఁగించీ నిరుమేలా నిదివో నీమనసు
గుటి గాదిపారీని గోవిందరాజా

చ. 1: కొలువులోపలనున్న కొమ్మలపాటలు వింటా
అలరినీవు పరాకై వుండఁగా
కులికి పాదములొత్తేకొమ్ములు కొనగోళ్ల
యెలమిఁ దమమోహము లెచ్చరించేరు

చ. 2: యెదుట నాట్యములాడిఇంతులనుఁ జూచుకొంటా
గుదిగొని యట్టె చొక్కు చునుండఁగా
ఇదివో ఆకుమడిచిఇచ్చేసతులుచేతుల
నదిమి తమమీఁదట ఆసలుచూపేవు

చ. 3: సారె నిన్ను సింగారించేసతులచన్నులు చూచి
చేరి శ్రీవేంకటేశుఁడ చేఇచాఁచఁగా
శ్రీరమణ భూరమణిఁ జెంది నీ కాఁగిటిలోన
పేరడిరతుల నిన్నుఁ బెచ్చు రేఁచేరు

రేకు: 1327-1 సామంతం సం: 23-157

పల్లవి: చూడరమ్మ చెలులాల సుదతిభాగాయలు నేఁడు
వేడుకలెల్లా వెల్లివిరిసినట్లుండె

చ. 1: కోమలికొప్పుననుండి కురిసేటివిరులకు
వాములై తుమ్మిదలు వాలఁగాను
కాముఁడు గురులేయఁగా కడనుండి నల్లఁబజ
దోమటి నెఱుకరాను తొడఁగినట్లుండె

చ. 2: మెలుత మాటాడఁగాను మించె చిగురుమోవిని
తొలఁగక కోవిలలు తొడుకఁగాను
వలరాజు నఱికిన వాఁడినెత్తురుపట్టెలు
చెలఁగి బంట్లు చికిలిసేసినట్లుండె

చ. 3: కొమ్మ శ్రీవేంకటేశ్వరుఁ గూడినచెమటవాన
కుమ్మడిఁ జకోరాలు వొడియఁగాను
దిమ్మరేఁగి మరుఁడు ముత్తేల వసంతమాడఁగా
యిమ్ముల నర్థులు వచ్చి యెదిరినట్టుండె

రేకు: 1327-2 వరాళి సం: 23-158

పల్లవి: వింతవారమా నేము విచారించుకొనవయ(య్య?)
బంతి నున్నారు సతులు పాయనినీకృపను

చ. 1: యెంతలేదు నీనవ్వు యెన్నిలేవు నీమాటలు
అంతటాను తనిసిరి యాఁడువారెల్లా
చింతదీర నీకు నేము సేవసేసేవారము
దొంతి నున్నది వలపు తొల్లె నీకృపను

చ. 2: యేమిసేసేవు నీయాన లెఱఁగమా మీబాసలు
దోమటిగాఁ దొడికిరి తొయ్యలులెల్లా
వోముచు నేమెప్పుడును వూడిగపువారము
నాములాయఁ దమకము వంచిననీకృపను

చ. 3: యెక్కడా నీసుద్దులే యెవ్వరైనాఁ బొగడేరు
వొక్కటై కూడిరి నిన్ను వువిదలెల్లా
చిక్కి నన్ను నేలితివి శ్రీవేంకటేశ్వర
వెక్కసమాయ భోగము వెలసె నీకృపను

రేకు: 1327-3 దేశాళం సం: 23-159

పల్లవి: వెలఁది నింతటే నీవు వేఁడుకోవయ్యా
యెలయింపుఁజేతలు నేఁడివి యేలయ్యా

చ. 1: మొగమోటమునఁ జెలి మొదలికోపము మాని
మగఁడవంటా నీతో మాటాడెఁగాని
అగడుసేసేనంటే అందు నెంతైనాఁ గద్దు
యెగసక్కే లింకాను నీవే లాడేవయ్యా

చ. 2: ప్రియవాదిగన నీతోఁ బెనఁగి మారాడక
నయమచ్చి జలజాక్షి నవ్వెఁగాని
నియతి సాదించేనంటే నేరుపెంతైనాఁ గలదు
జయమాయ నిఁకనేల చల మింకానయ్యా

చ. 3: యిచ్చకురాలై నిన్ను యెనసి శ్రీవేంకటేశ
మచ్చికసేసి యిఁ(యిం?)తి మరిగెఁగాని
పచ్చిసేసేనంటేను పగటెంతైనాఁ గద్దు
యిచ్చినచనవు లిట్టె యీడేరించవయ్యా

రేకు: 1327-4 మాళవిగౌళ సం: 23-160

పల్లవి: ఇప్పుడే విన్నవించితి నెఱుఁగుకొందువుగాని
తప్పితే నలులమోఁత తమికిఁ(కిం?) చీఁజుమ్మీ

చ. 1: బలిమి నింతి నీవు పాసివుండేవుగనక
తలఁపఁ గప్రపువేఁడిఁ దాఁకీఁజుమ్మీ
నలువంకసెలవులనవ్వక నీవుండితేను
కలువపూవుటమ్ములగాలి వారీఁజుమ్మీ

చ. 2: చేరి చెనకఁగ నీవు సిగ్గువడేవు గనక
సారెకు వెన్నెల వడచల్లీఁజుమ్మీ
గారవించి యాపె యిట్టె కాఁగిలించకుండితేను
నారుకొని చిగురు మొనలుచూసీఁజుమ్మీ

చ. 3: మొక్కలాన నీ వవ్వలిమోమయ్యేవు గనక
నిక్కి కోయిలలరొద నిండీఁజుమ్మీ
గక్కన శ్రీవేంకటేశ కలసితి వీకె నిట్టె
కక్కసించితే మదనకళలందీఁజుమ్మీ

రేకు: 1327-5 హిందోళ వసంతంసం: 23-161

పల్లవి: నీ వుండే దొక్కయంగము నే నుండే దొక్కయంగము
కైవశమైతివి యింకఁ గతలెల్లాఁ జెల్లును

చ. 1: సిగ్గువిడిచేయాఁటది చేతులఁ బట్టఁగరాదు
యెగ్గులేదు మగవాని కెట్టుండినాను
వొగ్గినేను మేరతోనే వున్నచో నుందానను
బగ్గన నీకంతటాను పారాడఁజెల్లును

చ. 2: పొంచి యణఁకువలేనిపొలఁతి దేఁటిగుణము
వంచనలేకున్నా మగవాని కమరు
మంచముపై నిట్టె నెమ్మది నే నుందానను
యెంచఁగ రచ్చలు సేయ నిటు నీకుఁ జెల్లును

చ. 3: గుట్టుతో నుండకుంటేను కోమలి కేఁటివొరపు
వట్టిరట్టు మగవానివద్దనే కద్దు
ఇట్టె శ్రీవేంకటేశ ఇటు నిన్ను నేఁ గూడితి
ముట్టి యెంతైనా నీవు మోహించఁజెల్లును

రేకు: 1327-6 కాంబోది సం: 23-162

పల్లవి: ఎఱఁగనివాఁడవా యేమయ్యా నీవు
మఱవవచ్చునా మేలు మన్నింతురుగాక

చ. 1: సరసములాడితేను సాకిరివెట్టుదురా
వొరసివొరసి నవ్వుదురుగాక
శిరసువట్టితేనే చేతుల బిగింతురా
కరఁగినమనసుతో కైకొందురుగాక

చ. 2: తచ్చితచ్చి చూచితేను తలవంచుకొందురా
ఇచ్చగించి గక్కనఁ జేయిత్తురుగాక
పచ్చిమాటలాడితేను పరాకు సేయుదురా
అచ్చమైనచనుఁగొండ లంటుదురుగాక

చ. 3: అట్టె కాఁగిలించుకొంటె ఆయాలు ముట్టుదురా
నెట్టుకొని యిట్టె కరుణించితురుగాక
గుట్టున శ్రీవేంకటేశ కూడినింతి జంకింతురా
చుట్టురికములెల్లాను చూపుదురుగాక

రేకు: 1328-1 శంకరాభరణం సం: 23-163

పల్లవి: ఔదువయ్యా జాణఁడవు అన్నిటాను
సాదవని పొగడితే జడిసేవయ్యా

చ. 1: నీచిత్తము రావలసి నేఁ జేసితి నూడిగాలు
యేచి యందుకు నవ్వే వదేమయ్యా
చేచేత నే విన్నపాలు చెవిలోనఁ జేసితేను
లాచి నన్నుఁ దిట్టితివి లాగౌనయ్యా

చ. 2: సంగతి నాకుమడిచి చవిదెలిసిచ్చి తేను
యెంగిలంటాఁ గానుసేసేవేమయ్యా
ముంగిట నే నీశిరసుముడిచేనంటా నంటితే
వంగి నాకొప్పు నంటేవు వాసికాఁడవయ్యా

చ. 3: గాఁటముగా రతికేలిఁ గాఁగిలించుకొంటేను
నాఁటెఁ జన్నులంటా గోరగీఁటేవయ్యా
నీఁటుల శ్రీవేంకటేశ నిన్ను నేనే మెచ్చితేను
యీటులేనిచనవెల్లా నిచ్చితివయ్యా

రేకు: 1328-2 శుద్ధ వసంతం సం: 23-164

పల్లవి: ఇందుకే నేఁ జింతించే నెటువలె నున్నాఁడవో
సందడి పెండ్లిండ్లాయ సరుస నీబతుకు

చ. 1: చెంతలనాకె నీపైఁ జేయిచాచగాను
వంతుకు జేయిచాఁచితి నవ్వల నే నుండి
యింతుల మిద్దరమును ఇరువంకలా నుండఁగా
సంతకూటమాయ నిదె చక్కనినీమేను

చ. 2: ఆకడ నాకె నీకు నాకుమడిచియ్యఁగాను
యీకడ నేనూ నీకు నిచ్చితి నిట్టె
కైకొని యిద్దరు నూడిగము నీకుఁజేయఁగాను
కాకుపడి కలగూరగంపాయ నీనోరు

చ. 3: గక్కన నాపె నిన్నుఁ గాఁగిటఁ గూడఁగాను
వొక్కటై నేనూ నట్టే వొనరఁగాను
యిక్కువ శ్రీవేంకటేశ యెనసి యిద్దరివల్లా
అక్కర నురేపేకల్ల మాయను నీవురము

రేకు: 1328-3 ఆహిరి సం: 23-165

పల్లవి: ఇద్దరిభావములును యేమని విన్నవించేము
అద్దుకొన్న ప్రియుములు ఆయములు సోఁకెను

చ. 1: చెక్కుచేతితోడనే చెలి నిన్నుఁ జూడఁగాను
చిక్కనిచెమటలెల్లా చేర నిండెను
నెక్కొని యంతవట్టును నీమీఁద నేఁ జల్లితేను
వెక్కసమై పులకలు వెదకు మెలచెను

చ. 2: సయ్యదముసుఁగుతోడ పడఁతి నీతో నవ్వితే
వొయ్యనే కొప్పువిరులు వోడి నిండెను
నెయ్యపువేడుకతోడ నీమీఁద నవి చల్లితే
ముయ్యరానికళలెల్లా మోమున వెలసెను

చ. 3: చన్ను లురమున మోవ పతి నిన్నుఁ గూడితేను
వున్నతి మోవిఁ దేనె లుబ్బి నిండెను
యెన్నఁగ శ్రీవేంకటేశ యివి నీమోవిఁ జల్లితే
తిన్ననియానందము దేహాన నిలిచెను

రేకు: 1328-4 సాళంగం సం: 23-166

పల్లవి: ఎఱఁగనివారు గల రెరుఁగువారు గలరు
యెఱుకతోనే నీవు ఇంత గేలిసేతురా

చ. 1: మన్నింతువంటా నీతో మనవి విన్నవించితే
సన్నల నవ్వేవు నీవు సారెసారెకు
తిన్నఁగాఁ దప్పుగలిగితే దిద్దవలెఁగాక నీవు
యెన్నఁగ వింతులలోన నింత గేలిసేతురా

చ. 2: వోరుత (తు?) వంటా నిన్ను వొడివట్టి కొసరితే
సారెసారె నవ్వేవు జారుఁగొంగుతో
నేరమి గలిగితేను నేరుపఁగవలెఁగాక
యీరీతి నిందరిలో నిఁత గేలిసేతురా

చ. 3: చెందితినంటా నిన్నుఁ జెలంగి మెచ్చితేను
సందడి నవ్వు నవ్వేవు సారెసారెకు
విందుల శ్రీవేంకటగోవిందుఁడ నన్నే లితివి
యిందరిలో నారతుల నింత గేలిసేతురా

రేకు: 1328-5 సాళంగ నాట సం: 23-167

పల్లవి: బతికితి వన్నిటాను పడఁతివల్లను నీవు
రతికిఁ బిలువవయ్య రవ్వగాఁ జేసీని

చ. 1: సుద్దులు నీతోఁ జెప్పి చొక్కించి అందరుఁ జూడ
బుద్ధులు నీకు నేరిపిఁ బొలఁతి
వొద్దనుండి నవ్వుతాను వొడివట్టి తీసితీసి
పెద్దరికములు నేసి ప్రియముచెప్పీని

చ. 2: చెక్కులు నీకు నొక్కి సేవలు గొంత సేసి
ఇక్కువలెల్లా నంటీ నింతి
అక్కరతో వీడెమిచ్చి ఆకుమడిచొసఁగుతా
వెక్కసపుటిచ్చకము వేమారుఁ జేసీని

చ. 3: నెమ్మదిఁ గాఁగిట నించి నీకు మోవి చవిచూపి
సమ్మతించఁజేసి కూడె సకియ
మమ్ముఁ గూడితివి నేఁడు మక్కువ శ్రీవేంకటేశ
చిమ్ముచుఁ గమ్మటిఁ దాను సేసలువెట్టీని

రేకు: 1328-6 శ్రీరాగం సం: 23-168

పల్లవి: వెనకటినేరములు వేయైనాఁ దడవను
మనసొక్కటిగా బుద్ధిమంతుఁడైతేఁ జాలును

చ. 1: యేఁటికింకా మాటలుయేమని దూరేము నేము
గాఁటపుఁదనకరుణ కలంతే చాలు
కూటమికి రమ్మనవే గుట్టుతోనే వుండేను
మాఁటులేనితాను బుద్ధిమంతుఁడై తేఁ జాలును

చ. 2: కాఁతరించఁబనిలేదు గద్దించ నోపను
చేతికిలోనై మన్నించినదే చాలు
తే తెమ్మనవే విడెము తిరమైతి నన్నిటాను
మాతలఁపువలె బుద్ధిమంతుఁడైతేఁ జాలును

చ. 3: చెక్కు లెంతవడి నొక్కె సిగ్గు లెందాఁకా నెరపె
ఇక్కు వంటి ననుఁగూడె నిదె చాలు
దక్కె శ్రీవేంకటేశుఁడు తానే నాకిన్నిటాను
మక్కున నింతట బుద్ధిమంతుఁడై తేఁ జాలును

రేకు: 1329-1 రామక్రియ సం: 23-169

పల్లవి: కలసితి మిందరము కాఁగిటిపొత్తు
చెలఁగి నీనేమములు చెప్పనేఁటి కిఁకను

చ. 1: కాంతలందరితోడాను కలయఁగ నవ్వేవు
సంతవావులాయఁగా నీసరసములు
యింతలో నందరిమోవులెంగిలి నేకములాయ
చెంతల నీనేమములు చెప్పనేఁటి కిఁకను

చ. 2: చల్లఁగా నందరితో జూజములు నీ వాడేవు
గొల్లదోమటాయఁగా నీ కోరికలు
కల్లగాదు రతివేల కాఁగిళ్లెల్లా నొక్కటాయ
చిల్లర నీనేమములు చెప్పనేఁటి కింకను

చ. 3: వాడిక నందరి కొక్కవరుసిచ్చి కూడితివి
యీడఁ గలగూరగంపె యెనసెఁ బొందు
తోడనే శ్రీవేంకటేశ దొమ్మెయ మరుతంత్రము
జీడిగా నీనేమములు చెప్పనేఁటి కిఁకను

రేకు: 1329-2 శుద్ధ వసంతం సం: 23-170

పల్లవి: ఎదిరి నిన్నెంచుకోవు యేమీ నీవు
కదిసివుండినవారిఁ గైకొనవచ్చేవు

చ. 1: తఱిగరివానివలె తచ్చితచ్చి మాఁటాడేవు
యెఱఁగవా నాగుణ మింతకతొల్లి
మెఱసేసతులరతి మిక్కిలి బేరములాడి
కొఱతలేనివారిఁ గొసరవచ్చేవు

చ. 2: తగవరివలెనే తతిగొని యడిగేవు
పగటు దెలియవా నాభావపు(ము?) నీవు
అగపడినయింతుల అలుకలు దిద్దిదిద్ది
వొగరులేనివారి నొరయవచ్చేవు

చ. 3: చుట్టపువానివలె చూచి కాఁగిలించేవు
దిట్టతన మెఱఁగవా దేవుల నేను
యిట్టె శ్రీవేంకటేశ యిటు ని(న?) న్నుఁ గూడికూడి
మట్టులేనివారిని మరుపవచ్చేవు

రేకు: 1329-3 సామ వరాళి సం: 23-171

పల్లవి: గుట్టున నుండుటే మేలు కొసరంగఁబనిలేదు
బట్టబయ లీఁదఁగాను పనికివచ్చీనా

చ. 1: వలసినొల్లపతివద్ద నెంతవిలుచున్నా
తలఁపులో నీకిట్టె దయవుట్టీనా
సొలసిసొలసి యెంత సోబానఁ బాడినాను
పిలువని పేరటము ప్రియమయ్యీనా

చ. 2: చనవులేని యింతి సరస మెం తాడినాను
పెనగొని నీకిఁకఁ బ్రేమవుట్టీనా
మనవితో నిచ్చకము మాపుదాఁకాఁ జేసినాను
వొనరనినేస్తములు వొద్దికయ్యీనా

చ. 3: ననుపుగానిచెలి నవ్వు లెన్ని నవ్వినాను
తనిసి వుందువుగాక తమకించేవా
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
వెనకటివారిపొందు వేడుకయ్యీనా

రేకు: 1329-4 మధ్యమావతి సం: 23-172

పల్లవి: కానీలే అందుకేమి కామిని దానె వచ్చి
మైనమువలెఁ జేయక మనమాట వినునా

చ. 1: చలపాదివానితోడ జాణతనాలాడితేను
మలసి తనగుణము మానీనా
మొలకచన్ను మొనల మోసుల నూఁడి మనసు
చెలఁగించినఁగాక చెప్పినట్లు సేసునా

చ. 2: గట్టువాయవానితోడ కతలెన్ని చెప్పినాను
అట్టే వుండుఁగాక చాయకు వచ్చీనా
మట్టుమీరఁ గొనగోర మర్మములెల్లా నంటి
వొట్టి కరఁగించక వొడఁబడనేర్చునా

చ. 3: శ్రీవేంకటేశ్వరునిఁ జెక్కు లెంతనొక్కినాను
చేవలుమీరుఁగాక సిగ్గువడీనా
యీవేళనే యింతిఁ గూడి ఇచ్చలాడి వురముపై
తావుకొన నిటుగాక తనవోజ మానునా

రేకు: 1329-5 బౌళి సం: 23-173

పల్లవి: చెనకేవు వూరకైనాఁ జెరఁగువట్టి తీసేవు
మనసిచ్చి మమ్మెందులో మన్నించేవయ్యా

చ. 1: చనవుగలవారికి సారె మందెమేళము
ననుపుగలవారికి నవ్వులువచ్చు
యెనసినవారికి ఇయ్యకోలైవుండు
ఆనిశము మమ్మెందులో నాదరించేవయ్యా

చ. 2: మేనవారైనవారికి మించు నట్టె వుద్ధండము
నానినయింటివారికి నమ్మిక గల్గు
పూని కొలువువారికి పొద్దులు దనిసివుండు
కానీలే మమ్మెందుగోఁ గైకొనేవయ్యా

చ. 3: వొట్టి పెండ్లాడినవారి కొకమనసైవుండు
నెట్టుకొన్న వారికి నెలవై వుండు
గుట్టున శ్రీవేంకటేశ కూడితిని నన్ను నేఁడు
యిట్టె మమ్మెవ్వరిలోన నేలేవయ్యా

రేకు: 1329-6 శంకరాభరణం సం: 23-174

పల్లవి: నీవల్ల నింతేసి నివ్వెర గందితి
చేవల్లకు రావే చెప్పేను నేను

చ. 1: కొప్పు దువ్వఁగాను గోరుదాఁకెఁ జెక్కు
యెప్పుడు నవ్వఁగ నేమిటికి
చిప్పిలఁగా నీవు జీరదీసితివో
చెప్పఁగదే భ్రమసితి నేను

చ. 2: పలుకఁగాను నాపల్లు దాఁకె మోవి
యెలయించి నవ్వనేమిటికి
నిలిచి యీచేఁత నీవు సేసితివో
తలఁపించవే కొత్తలైతి నేను

చ. 3: సరసమాడఁగాను సందిసొమ్ము లొత్తె
యిరవయితి నవ్వనేమిటికి
సరి శ్రీవేంకటేశ్వరుఁడను నా
పుర మెక్కితిని వొప్పితి నేను

రేకు: 1330-1 ముఖారి సం: 23-175

పల్లవి: చెవులార వినరే చెలులాల మీకుఁ జెప్పే
వివరించి యీతగవు విచ్చిచెప్పరాదే

చ. 1: యెఱుఁగుదులేవే తన కిచ్చలాడితే నేను
మఱపులేని యట్టిమంచిదానను
నెఱయ నెరుసువెట్టి నేరములెంచితేను
నెఱతనములతోడినిష్టూరి నేను

చ. 2: తెలుసులేవే తన్ను దేవరంటాఁ బొగడితే
పలుమారు నాపైనే బత్తిసేసీని
అలిగి తనమర్మము లట్టె యెత్తి తిట్టితేను
చలపాదితనములజగరాఁగ నేను

చ. 3: కంటిలేవే యిట్టె తన్ను కాఁగిలించి కూడితేను
జంటతో తనపాలికి జాణనైతివి
యింటిలో శ్రీవేంకటేశుఁడితని నే సోదించి
దంటతనపు సేఁతలతరుణి నేను

రేకు: 1330-2 నాదనామక్రియ సం: 23-176

పల్లవి: ఇంక నెంతగా గద్దో యింతి నీజవ్వనము
వుంకువై వొక్కటొక్కటి కొనగూడె వలపు

చ. 1: చిక్కఁగా నీవు నవ్వితే చిత్తడిచెమట గారె
చెక్కునఁ జేయిపెట్టితే సిగ్గులు మూఁగె
నొక్కొన మాటాడితేను నిట్టూరుపులు రేఁగె
వొక్కటొక్కటే దొంతరై వొనగూడె వలపు

చ. 2: తప్పక చూచితేనే తతిగొనెఁ బులకలు
చిప్పిలఁ జెనకితేనే చింత రేఁగెను
వొప్పి సరసమాడితే వొడికట్టు వదలెను
వుప్పరాలై వొక్కటొక్క టొనగూడె వలపు

చ. 3: తనువులు మోచితేనే తతిగొనెఁ దమకము
పెనఁగితేఁ బ్రియములు పిక్కటిల్లెను
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నిన్నిటాను
వునికై వొకటొకటే వొనగూడె వలపు

రేకు: 1330-3 రీతి గౌళ సం: 23-177

పల్లవి: చెలియకు నే నన్నీఁ జెప్పిపంపేను
అలయక నీవే యన్నీ నానతియ్యవయ్యా

చ. 1: మంతనాన నాపెచేత మాటలెల్లా నాడించే
చెంతల నీమేనెల్లాఁ జెమరించించే
దొంతినున్న వలపులు దోమటిదొడికించించె
వింతలేమి సేయవలె వేగ నానతీవయ్యా

చ. 2: సేవసేసి నిన్ను నిట్టే సిగ్గులెల్లాఁ బరపించే
పూవులనే వేసి నిన్నుఁ బొసఁగించించే
లావులఁ బెనఁగి నీమై లచ్చనలు నిండించించె
కావలసినపని గక్కన నానతీవయ్యా

చ. 3: సమరతులను నీజవ్వనము పండించించే
తమితో మోముకళలు దాకొనిపించే
నెమకి శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
సముకాన నీయాసలు సారె నానతీవయ్యా

రేకు: 1330-4 మళవి సం: 23-178

పల్లవి: ఇంతటివాఁడవు నీకు యేమ రెవ్వ రున్నారు
చెంత నీవుసేసినవే చేఁతలుగావా

చ. 1: కొమ్మలమనసులోనికోపములు మానిసేవి
పమ్మి నీవుసేసేటిబాసలేకావా
కమ్మి మొకములనిండా కళ లట్టే రేఁచేవి
చిమ్ముల నీకొనగోరి చెనకులేకావా

చ. 2: కడుసంధానము సేసి కపటాలు పాపేవి
అడియాలమైననీయాసలే కావా
బడిబడిఁ బాయకుండా బాఁతిపడఁ జేసేవి
విడువక నీవు సేసే వినయాలే కావా

చ. 3: జమళిసిగ్గు దీరిచి, చవులు వుట్టించేవి
సుముకమయిననీచూపులే కావా
తమితో శ్రీవేంకటేశ తగ నన్ను నేలితివి
నేమకేవి వీరతులనేరుపులే కావా

రేకు: 1330-5 హిందోళ వసంతం సం: 23-179

పల్లవి: నీకే మేలుగదవే నీపతిసరసములు
దాకొని నిలువుననే తమి నూరువండీని

చ. 1: కోపగించుకొనకువే కోరి యాతఁడేమనినా
తీపులమాటలవెంటఁ దేనె గారీని
యేపున వేసరకువే యిట్టె చెనకితేను
రాపుల గోరికొననే రాలీని వలపు

చ. 2: సిగ్గులువడకువే చెంత నాతఁ డుండితేను
వెగ్గళపువినయాన వెన్న పుట్టీని
బగ్గనఁ దిట్టకునే పయ్యదకొం గంటితేను
వొగ్గి వుంగరపువేళ్ళ నొరపు మించీని

చ. 3: కొసరకువే నిన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
సుసరపురతులను సుంకు మోపీని
అసురుసురనకువే అన్నిటాఁ బెనఁగితేను
వెసఁ గనుచూపుల వెన్నెలగాసీని

రేకు: 1330-6 తెలుఁగుగాంబోది సం: 23-180

పల్లవి: మొకదాకిరిని నీపై మోహమే చల్లుఁగాని
వెకలితనాన నిన్ను వేసరించదు

చ. 1: యెం తైనాఁ జెలి నీతో యెదురు మాఁటాడదు
వంత గలిగితేఁ దలవంచుఁగాని
వింతవై తిరిగినాను వెగ్గళించదు నిన్ను
అంతలోనే వుసురసురనుఁగాని

చ. 2: యెరవుగ మఱచి నా యెంచదు నేరాలు నిన్ను
వొరిమెతో మోనాన నుండుఁగాని
విరహతాపము గల్లా విసుగదు నీమీఁద
సిరులచెక్కిటచేత చింతించుఁగాని

చ. 3: నవ్వులకయినా నీతో నాలివెంగే లాడదు
యివ్వలిమోమై విడె మిచ్చుఁగాని
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ గూడితి నిట్టే
పువ్విళ్లూరఁ గాఁగిట నొనరుఁగాని

రేకు: 1331-1 ఆహిరినాట సం: 23-181

పల్లవి: నీయంతా నెఱఁగవు నేముచెప్పినా వినవు
పాయముగలయందుకు ఫలమా ఇది

చ. 1: పట్టినదే చలమా పడఁతి నీ వాతనితో
చుట్టరికము సేసితే సూడువట్టేవా
బట్టబయలఁదించేవు పలుకుల సారెసారె
గుట్టుతోడిసతులకు గుణమా ఇది

చ. 2: చెనకితే సెలవా చెమరించే వంతలోనె
పెనఁగఁగానే అలసి బిగిసేవు
తనిసేవు నవ్వులనే తను విది మీఁదమీఁద
చనవుగలయందుకు చందమా ఇది

చ. 3: సేసినదే చేఁతా శ్రీవేంకటేశుకాఁగిట
సేసవెట్టంగానే గోరఁ జెక్కునొక్కేవు
రాసినేసేవు వలపు రతులతో నెల్లా నీవు
పోసరపువేడుకకు భోగమా యిది

రేకు: 1331-2 మాళవిగౌళ సం: 23-182

పల్లవి: బలిమి యెంతసేసినాఁ బనికిరాదు
అలరంగ నిచ్చకము లాడవలెఁగాని

చ. 1: అటమటములవాని నౌఁగాదనఁగరాదు
సటలాడేవాని సాదించరాదు
విటతనములవాని వేమారుఁ గొసరరాదు
చిటుకురంటే సేవసేయవలెఁగాని

చ. 2: తూఁటరివిద్యలవాని దూరితేఁ బనికిరాదు
జూటుఁదనములవాని సొలయరాదు
మాటకుమాటాడేవాని మారుకొనఁగరాదు
మూఁటకట్టువినయాన మొక్కవలెఁగాని

చ. 3: పంతగారివానిని పచ్చిగా నాడఁగరాదు
అంతరంగమైనవాని నణఁచరాదా
ఇంతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను మెచ్చి
వింతసేయరాదు నిన్ను వేఁడుకోవలెఁగాని

రేకు: 1331-3 దేవ గాంధారం సం: 23-183

పల్లవి: కొలఁదులుమీరినగోవిందా
పలుదెఱగుల మతి పరగీఁజుమ్మీ

చ. 1: యేలితి వప్పుడే యిల్లాండ్లంగా
గోలతనముగలగొల్లెతల
అలఁగాచితివి అఁబోతువలెనే
పాలించ మనసు పారీఁజుమ్మీ

చ. 2: పెట్టితి సేసలు పెండ్లికూతులఁగా
వొట్టి యచ్చురల కొకమాటే
చుట్టితి పెంచముసోగ నెమలివలె
పెట్టనెమళ్ళను బెరిసేవుసుమ్మీ

చ. 3: కలసితివి శ్రీవేంకటేశ మమ్మిటు
లలిఁ బట్టపుసతుల మనుచును
యెలమి మమునలో నీఁదులాడితివి
పొలసి యాఁడుమీలఁ బొందేవుసుమ్మీ

రేకు: 1331-4 మళవిశ్రీ సం: 23-184

పల్లవి: ఎఁదాకా మనసు చూచే వింతిని నీవు
పొందులనే కానరాదా భోగములు

చ. 1: మొగము దప్పకచూచి మోహము నీతోఁ జెప్పి
నగినందే కానరాదా నాతియాసలు
చిగురుమోవి ఇచ్చి చేతులుచాఁచీ నీకు
తగులఁగా గానరాదా తమకములు

చ. 2: నిలువుఁగొలువు వేసి నేరుపులు వచరించీ
పిలువఁగఁ గానరాదా ప్రేమములు
మొలకచన్నులు చూసి ముద్దులమాట లాడీ
తలఁచితేఁ గానరాదా నిలుకడలు

చ. 3: కదిసి కూచుండి యట్టె కాఁగిటను బిగియించీ
వుదుట్లఁ గానరాదా వొడఁబాటు
అదన శ్రీవేంకటేశ అంగన నేలితి విట్టె
యెదుటనే కానరాదా ఇచ్చకములు

రేకు: 1331-5 సౌరాష్ట్రం సం: 23-185

పల్లవి: బదుకవయ్యా ఇంత పగిడికాఁడవై తివి
పదరి వొకరొకరు పైకొనఁగాను

చ. 1: మనసొక్కటాయనా మాట నీకుఁ జెల్లెనా
చెనకి యాకెపై నీకె చేఇచాచగా
కనుపట్టెనా నీకు కడునవ్వు వచ్చెనా
వెనుకొని ఆకె నీకె వెసఁ దిట్టఁగాను

చ. 2: చలము నీకుఁ జెల్లెనా సమ్మతి నీకాయనా
బలిమి నాకె నీకె పరచఁగాను
తలఁపు లేడేరెనా తగవు గెలిచెనా
సలిగెతో నాకె నీకె జంకించఁగాను

చ. 3: పంతాలు సమకూడెనా పనులు నీకు దక్కెనా
ఇంతలో నాకె నీకె విన్నెనయఁగాను
సంతోసమాయనా చక్కని శ్రీవేంకటేశ
పొంత నిన్నాకె నీకెఁ బొగడఁగాను

రేకు: 1331-6 వరాళి సం: 23-186

పల్లవి: ఏల వంకలు దిద్దేరే యీతనిలా గెఱఁగరు
యేలాటము లాడేవి యెఱఁగరాదా

చ. 1: నగుతానే రమణుఁడు నాలినే పొద్దు గడసీ
యెగసక్కేములు సేసే దెఱఁగరాదా
మొగము చూడఁగానే మొనగోర నూఁదీ యాస
లిగిరించఁ జేసేది యెఱఁగరాదా

చ. 2: సుదతుల నీడువెట్టి సూడుఁబాడుఁ బట్టించిన
యెదలోనిమర్మము లెఱఁగరాదా
అదనులు చెప్పించి అట్టె తనరాకకు
యెదురులుచూపించే దెఱఁగరాదా

చ. 3: చొక్కుచుఁగాంగిట నించి సురతము చవిచూపీ
యెక్కువల కెలఇంచే దెఱఁగరాదా
చక్కనిశ్రీవేంకటేశ్వరుఁడిదె నను నేలె
యిక్కడనే వుండినది యెఱఁగరాదా

రేకు: 1332-1 దేశాళం సం: 23-187

పల్లవి: ఇంత చాలదా నిష్టూర మింకా వేరేవలెనా
మంతన మిదే చాలదా మర్మములు రేచను

చ. 1: నవ్వితేనే చాలదా నాతులమనసులలో
అవ్వలఁ బంచబాణములై నాఁటును
దవ్వుల మాఁటలాడితే తగ నదే చాలదా
పువ్వుల తేనియలై తీపులు రేఁచును

చ. 2: చూచితేనే చాలదా సుదతుల మేనుల
కాచినట్టే పులకలగని చూపుమట్లు
చేచేత నీ వంటితేనే సేనలుగాఁ జాలదా
తాచినట్టె వలపులతమి రేఁచును

చ. 3: సన్న యిదె చాలదా చక్కని శ్రీవేంకటేశ
యిన్నిటా నిన్నును నన్ను నెనయించెను
మన్నించి నీవు నన్ను మరుగుటే చాలదా
విన్న కన్న జాడలను వేడుకలు రేఁచును

రేకు: 1332-2 మాళవిగౌళ సం: 23-188

పల్లవి: తలఁచిన పనులెల్లా తానే అయ్యీఁగాని
చలములు మాని మోవి చవిచూపరాదా

చ. 1: వెంగలియలుకలేల విరహతాపము లేల
అంగనతో మంచిమాఁట లాడరాదా
ఇంగితమెఱిఁగి యాకె యెదురుగా వచ్చీని
ముంగిటికి విచ్చేసి మోము చూపరాదా

చ. 2: అనురుసురననేల ఆరడిఁబడఁగనేల
ఇసుమంత పంతమునియ్యరాదా
సుసరాన నీతో నాకె సొలయుచు నవ్వీని
వెస నీవే ముందుగాను విడెమియ్యరాదా

చ. 3: శిరసు వంచుకోనేల చెలుల నంపగనేల
సరుసఁగూచుండి చేయి చాఁచరాదా
గరిమ శ్రీవేంకటేశ కలసితి వాకె మెచ్చి
సరుగఁ జెక్కు లంటుచు సరసమాడరాదా

రేకు: 1332-3 రామక్రియ సం: 23-189

పల్లవి: నీకు నీవే గడించుకొనేవు గాక యేమైనా
దాకొని నిన్నుందరిలో తగదంటినా

చ. 1: ఆవల వేరే మరి ఆనవెట్టవలెనా
నీవాడేమాటలు నిజమేకావా
వేవేలుగా నిందు వెంగెమేమైనా వున్నదా
నావద్ద నీవుండఁగాను నమ్మనంటినా

చ. 2: చెలులచే యింకా చెప్పించవలెనా
వెలయ నీవాడినవే వేదాలుగావా
వెలుపలి సుద్దులెల్లా వెలుచుకొంటాయిది
పిలిచి మరేమైనా బేరుకొంటినా

చ. 3: చూడుమని నీమేను సోదనియ్యవలెనా
జాడతో నీసేఁతలు సత్యాలుగావా
వేడుకఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను నిట్టె
యేడ నేర్చితివి రతు లివి యంటినా

రేకు: 1332-4 పళవంజరం సం: 23-190

పల్లవి: వేరేపొందు వలెనా వింతవారితో
ఆరితేరితే మనసు అలవాటువడును

చ. 1: మక్కళించి మక్కళించి మాటలట్టె ఆడితేను
చిక్కి నీవలపులకు చేవలెక్కును
యెక్క డెక్కడ నైనాను యెదురుకట్లనుంటే
జవ్వన ముబ్బి దైలువారును

చ. 2: తగిలితగిలి మోము తప్పకచూచితేను
అగపడ్డరతులకు ఆస వుట్టును
నగినగి పలుమారు ననుపులు సేసితేను
జిగి మర్మాలు గరఁగి చిమ్మిరేఁగును

చ. 3: చెలరేఁగిచెలరేఁగి చెనకదొరకొంటేను
ములువాఁడి కొనగోళ్ళముద్ర లంటును
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
పలుకుఁబంతము లిఁకఁ బచ్చిదేరును

రేకు: 1332-5 మంగళకౌసిక సం: 23-191

పల్లవి: అంగన నాపతితోడ నంటివా నీవు
అంగడి కెక్కె వలపు లంటివా నీవు

చ. 1: చేతుల మొక్కి తినవి సిగ్గుతో నుందాననని
అతనితో నీమాఁట అంటివా నీవు
నాతలఁపెఱుఁగుమని నమ్మితి నన్నిటానని
అతుమలో విలువఁగ నంటివా నీవు

చ. 2: నానితిఁ జెమటనని నవ్వులకు లోనని
అసలు మరవనని అంటివా నీవు
వీనుల నాలించుమని విన్నపముల లివేయని
బనదయ్యీ దానే గతి యంటివా నీవు

చ. 3: కప్పురపుఁబడియ నీకాఁగిలి నాసొమ్మని
అప్పణ నాకిమ్మని అంటివా నీవు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్నునని
అప్పుడే మెద్చుతినని యంటివా నీవు

రేకు: 1332-6 శుద్ధ వసంతం సం: 23-192

పల్లవి: ఆడుకొనే నెంతకైనా అందరితోను
వేడుక నీవు విచ్చనవిడి నుండవయ్యా

చ. 1: మంతనాన నీవు నాతో మాటలాడవా యిప్పుడు
అంతోనే లేదనేవు ఆకెఁ జూచి
వంతులేక నీవొకరివాఁడవా యేమైనాను
ఇంతటిమగవాఁడవు యేల నీకు వెరపు

చ. 2: అండనుండి నాచే విడె మందుకొనవా నీవు
అందుకాచే వప్పటిని ఆకెఁ జూచి
బెండుపడి నీ వొకరిపెట్టుఁజెట్టవా యేమైనా
నిండుదొర వప్పటిని నీకేల వెఱపు

చ. 3: కలసి మెలసి నన్ను కాఁగిలించవా నీవు
ఆలికే వింతటిలోనే యాకెఁ జూచి
చెలఁగి శ్రీవేంకటేశ అలమేల్ మంగపతివి
నెలకొంటి వింతటాను నీకేల వెఱపు

రేకు: 1333-1 హిజ్జిజి సం: 23-193

పల్లవి: చెలిచెలువ మేమనిచెప్పేమయ్యా
ఆలమేలుమంగ నీకె యమరు నన్నిటాను

చ. 1: కొమ్మమోముఁదమ్మి మీదికుంతలపుఁదుమ్మిదలు
సమ్మతిఁ జంద్రాస్యనేత్రచకోరములు
నెమ్మి నధరపుఁదేనె నిందునవ్వు వెన్నెలలు
వుమ్మడి నుండఁగ నంటనోడి భ్రమసెను

చ. 2: మెలుతనాభిసరసిమీఁదిచనుజక్కనలు
మలసి కుహరనాభి మధ్యసింహము
అలరు వళితరంగాలు అందపుటారనుపాము
చెలఁగివుండఁగాఁ బ్రవేశించక భ్రమసెను

చ. 3: తరుణిఘనకటిపులినతలపు గతిహంసలు
కరిశిరోనితంబోరుకాండకరులు
వరుసఁ జెమటేరు యౌవనవనము నుండఁగా
గురు శ్రీవేంకటేశుఁడ కూడఁగా భ్రమసెను

రేకు: 1333-2 బౌళి సం: 23-194

పల్లవి: ఏమినేరుపులు చూపే వెందాఁకాను
కామించి నీపట్టు కతికడవలేఁగాక

చ. 1: ఆకెతో మాటాడఁగా నేమందునోయంటా నీవు
నాకున మాటాడేవు వంతుకు నాతో
పైకొని నాపై నంతబత్తి గద్దా నీ కేమైనా
నీకు మోహించినదాన నేఁ బాయలేఁగాక

చ. 2: నెట్టన నాపెతో నవ్వి నేఁ గోపగించేనంటా
నట్టనడుమ నూరకే నవ్వేవు నాతో
బట్టబయలు నే నీకు బాఁతే ఇందరిలోనా
అట్టిట్టని నీతోను అలుగలేఁగాక

చ. 3: అలమేలుమంగఁ గూడి అట్టె నన్ను బుజ్జగించఁ
గలసితి నిటు భూకాంత నేనంటా
యెలమి శ్రీవేంకటేశ ఇంతకరుణా నాపై
మలసి యెంతైనా నిన్ను మరవలేఁగాక

రేకు: 1333-3 సామంతం సం: 23-195

పల్లవి: ఎఱఁగము నీచిత్తమిఁక నెట్లున్నదో
మఱియు నీయానతికి మారుకొనమయ్యా

చ. 1: చలములు సారెకు సాదించువారికి
మలసి యేమనినా సమ్మతి గాదు
వలపులు పైపై వడిసేటివారికి
పిలిచినఁ గొండంతప్రియము గలుగును

చ. 2: పంతములే కడుఁబచరించేవారికి
శాంత మించుకయుసమకొనదు
సంతపుఁబొందులు జరపెడివారికి
వింతగాఁ జూచినా వేడుక గలుగు

చ. 3: ధరలో యెగ్గులుతప్పులవారికి
సరసపుఁజెనకులు చవిగావు
యిరవుగ శ్రీవేంకటేశ కూడితివి
అరయ మనల కింకా ఆసలే కలుగు

రేకు: 1333-4 శంకరాభరణం సం: 23-196

పల్లవి: మదనుబండారము మగువమేను
పొదిగొన్నవలపులఁ బొసఁగెఁగాన

చ. 1: మరునియాయుధశాల మగువకొప్పు
తొరలించి విరులెల్లాఁ దురిమెఁగాన
యిరవై కీరపు(ము?) లాయ మీసెగళము
సరసపుమాఁటలెల్లా జరసెఁగాన

చ. 2: కామునిసాము గరిడి కాంతపురము
ఆమనిచనుసంగడా లమరెఁగాన
ప్రేమపుఁగేళాకూళి గంభీరనాభి
తేమచెమటలచేత దిగుపారెఁగాన

చ. 3: కాంతునివేఁటపాలము కన్నె పిఱుఁదు
బంతి మొలనూళ్ళపోఁగు వారెఁగాన
అంతటివానితల్లి యీయల మేల్మంగ
యింతో శ్రీవేంకటేశు నెనసెఁగాన

రేకు: 1333-5 తెలుఁగుగాంబోది సం: 23-197

పల్లవి: వట్టియలుకల నీకు వచ్చినదేమి
యిట్టె చెలిని మన్నించి యింటికి రావయ్యా

చ. 1: ఆపెతో మాఁటాడితేను యములెల్లాఁ గరఁగు
చేపట్టి పెనఁగితేను చెమరించును
వోసి నవ్వు నవ్వితేను వొడదలెల్లాఁ బులకించు
తీపులుండఁగా జేఁదు తిననేఁటికయ్యా

చ. 2: సరుసఁ గూచుండి తేను సంతోసములు మించు
ఇరవై చూచితే కోర్కు లీడేరును
తిరమై గురులు నించితే కొంకుగొసరు మాను
వెరవుతో నీడలివె యెండలేలయ్యా

చ. 3: మోవితేనె లానితేను మోహములు చెలరేఁగు
భావించి సేసవెట్టితే ఫలము గద్దు
శ్రీవేంకటేశ కూడితి నీవేళనలమేల్మంగ
యీవల నీకె వుండఁగా నితరమేలయ్యా

రేకు: 1333-6 ఆహిరినాట సం: 23-198

పల్లవి: ఇంటికి విచ్చేసితివి యెంతవనికి
అంటిసుడివంటిదాన నందుకోపేన

చ. 1: యెంగిలిమోవిదాన యేడలేనిసిగ్గుదాన
పొంగేటి చెమటలతోఁ బొరలేదాన
వంగనిచన్నులదాన వాడికెవలపుదాన
పంగెనకోపముదాన బాఁతెయ్యేనా

చ. 2: సన్నపునడిమిదాన పళుపుఁజూపులదాన
వెన్నెలనవ్వులతోడి వీరిడిదాన
నున్నని చెక్కులదాన నూఁగురులకొప్పుదాన
పిన్నదాన నే నీకుఁ బ్రియమయ్యేనా

చ. 3: చిగురుఁబాదాలదాన చిమ్ముఁజూపులదాన
వెగటుఁబిఱుఁదుగలవేఁకపుదాన
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
జిగిబిగువులదానఁ జిత్తము వచ్చేనా

రేకు: 1334-1 దేశి సం: 23-199

పల్లవి: ఎంత కాతరీఁడితఁ డేమిసేతునే
పంతముతోడ నాకు పైకొనఁగవచ్చునా

చ. 1: సిగ్గులు మూఁటగట్టి చెక్కుచేయి తీసిపెట్టి
యెగ్గులేక నవ్వుమనీ నేమి సేతునే
వొగ్గితా నేమి సేసినా నూరకే యమరుగాక
తగ్గుమొగ్గులేనివానకు మతకించవచ్చునా

చ. 2: గుట్టు బాయిటను వేసి కోరికలు యెగపోసి
ఇట్టె పాదా లొత్తుమనీ నేమిసేతునే
రట్టుగాఁ దా నెట్టుండినా నెట్టన నమరుఁగాక
చుట్టమనయిననాకు జోలిఁబెట్టవచ్చునా

చ. 3: కొంకుగొసరెల్లా మావి కుచము లెదురు వూని
ఇంకాఁ గాఁగిలించుమనీ నేమి సేతునే
అంకె శ్రీవేంకటేశుఁ డని దన కమరుఁగాక
సంకలేనిదాన నాకు సటలాడవచ్చునా

రేకు: 1334-2 పాడి సం: 23-200

పల్లవి: ఎట్టిజాణలో మీరు ఇటువలె నుండవద్దా
చుట్టపువరుస మిమ్ముఁజూచి నేరవలెను

చ. 1: మక్కువగలనీవైతే మాటలాడి తనియవు
దక్కి యాపైతే నూఁకొని తనియదు
ఇక్కడ నందరుఁజూచే రెగ్గుసిగ్గు లెఱఁగరు
చొక్కపువలపు మిమ్ముఁజూచి నేరవలెను

చ. 2: ఆసల నీ వాపె చన్ను లంటియంటి యలయవు
సేసి యాపె వూడిగేలచే నలయదు
తాసువలెఁ బెనఁగుచు తలమొల యెఱఁగరు
నూసకపుఁబెండ్లి మిమ్ముఁజూచి నేరవలెను

చ. 3: గక్కన శ్రీవేంకటేశ కాఁగిలించి పాయవు
యెక్కువ నాపె నీవురమెక్కి పాయదు
పక్కన నానారతుల పగలురే యెఱఁగరు
చొక్కేటియాసలు మిమ్ముఁజూచి నేరవలెను

రేకు: 1334-3 బౌళి సం: 23-201

పల్లవి: మన్నించవయ్యా యీమగువ నిట్టె
విన్నపము విని నీవే విడెమియ్యవయ్యా

చ. 1: మచ్చికసేసి యాపె మాట నీతో నాడఁగాను
యెచ్చోటు చూచేవు పరా కేడదయ్యా
పచ్చిచెమటలతోడ పాదాలు నీకు గుద్దఁగ
వచ్చునా నాకు నిద్దుర వట్టిసట లేలయ్యా

చ. 2: నంటుసేసి యప్పటిని నవ్వులెల్ల నవ్వఁగాను
గొంటవై వున్నాఁడవు యీగుణ మేలయ్యా
చంటిమొన సోఁకఁగ వింజామర నీకు వేయఁగ
వొంటి నీసిగ్గు దగునా వొగి మాయలేలయ్యా

చ. 3: కందునకుఁ దీసి యాపె కాఁగిటికి రమ్మనఁగ
యెందరితో సన్న సేసే వెమ్మెలకయ్యా
చెంది శ్రీవేంకటేశుఁడ సేస లాపె చల్లఁగాను
మందలించి మారుకుమారు చల్లే వౌనయ్యా

రేకు: 1334-4 కాంబోది సం: 23-202

పల్లవి: ఆఁటదానిబలిమి నీయంతకంటె నెక్కుడా
మేఁటివి నీయెమ్మెలెల్లా మెరసెఁగా ఇపుడు

చ. 1: పయ్యదకొం గంటఁగాను పడఁతి దప్పించుకొంటే
అయ్యెడనే పంతాలెల్ల నాడేవు
వుయ్యాలమంచ మెక్కితే వొద్దఁ బండుండితి విట్టె
చెయ్యారా నీపంతములు చెల్లెఁగా ఇపుడు

చ. 2: కొప్పువట్టి తియ్యఁగాను కొమ్మ నీచేఇ పట్టుకొంటే
రెప్పలెత్తి జంకించి రేసులాడేవు
అప్పుడే సిగ్గుపడితే నాయము లంటితి విట్టె
చిప్పిల నీకోరికలు సిద్దించెఁగా ఇపుడు

చ. 3: రతికేలిఁ గూడఁగాను రామమేను చొక్కితేను
ఇతవుగా కొనగోర నెచ్చరించేవు
సతమై శ్రీవేంకటేశ జట్టిగొంటే మెచ్చే విట్టె
తతి మీఇద్దరి మేళ్లు దక్కెఁగా ఇపుడు

రేకు: 1334-5 మేచ బౌళి సం: 23-203

పల్లవి: సరసుఁడ విన్నిటాను జాణవు నీవు
వొరసె నిందాఁకా సతి వోరుచుకోవయ్యా

చ. 1: మనసొక్కటైన దాఁకా మాటలు సూటిఁబడవు
యెనయకుండితే నన్నీ యెరవెరవే
నినుఁబాసి విరహాన నెలఁత యెంత దూరెనో
వొనరితి విఁక నని వోరుచుకోవయ్యా

చ. 2: సిగ్గులు దేరినదాఁకా చేఁతలు సమ్మతిగావు
దగ్గరఁ గూచున్నదాఁకా తనివిలేదు
కగ్గి నీవు రా నట్టి కాతరాన నెట్టుండెనో
వొగ్గి మన్నించితి నిఁక నోరుచుకోవయ్యా

చ. 3: కలసికూడినదాఁకా కడమలు దీరవు
చలములు మానితేనే చవిపుట్టును
యెలమి శ్రీవేంకటేశ యిప్పుడి కెంత మెచ్చెనో
వొలసి యేలితి విఁక నోరుచుకోవయ్యా

రేకు: 1334-6 శంకరాభరణం సం: 23-204

పల్లవి: కొప్పు వంగ నీ వెంత్తైనా గోవిందరాజా పైఁడి
కుప్పెకతారము వట్టి గోవిందరాజా

చ. 1: నిద్దిరించేనంనటాను నెలఁతలచేఁబాదాలు
గుద్దించుకొనే విప్పుడు గోవిందరాజా
సుద్దులు చెప్నేనంటా చొక్కించితివి మేనులు
కొద్దిమీరె వలపులు గోవిందరాజా

చ. 2: అలసితినంటాను ఆఁడువారిచే నేప్రొద్దు
కొలిపించుకొనే నిట్టే గోవిందరాజా
వలచితినంటాను వారితోడిమంతనాలు
కొలఁదిమీరె నెప్పుడు గోవిందరాజా

చ. 3: పచ్చడము గప్పేనంటా పడఁతులతొడలపై
కొచ్చేవు నీమునివేళ్లు గోవిందరాజా
నిచ్చ నాలుగుచేతులు నిందుఁగాఁగిట నిద్దరి
గుచ్చేవు శ్రీవేంకటాద్రి గోవిందరాజా

రేకు: 1335-1 పాడి సం: 23-205

పల్లవి: ఏలా ఇంకాఁ గొసరను ఇన్నిటా తా జాణఁడౌను
మేలుమేలు ఇన్నిటాను మెచ్చితి నేననరే

చ. 1: కానుక నే నంపి తేను కమ్మటి మారుకుమారు
తానూఁ గప్పురమంపెఁ దగవేకదే
వీనులు చల్లఁగా వింటి వీడుకువీడాయను
మోనమున నప్పటిని మ్మొక్కితి నేననరే

చ. 2: పూవుల నే వేసితేను పూఁచి తా మారుకుమారు
తావిజవ్వాదిని వేసె దగవే కదే
సావివోక వలపులు సరికిసరాయను
పోవులుగా తను నేఁ బొగడితిననరే

చ. 3: అడరి నేఁ బిలిచితే నంతలో మారుకుమారు
తడయక వూఁకొనెఁ దగవే కదే
యెడయక శ్రీవేంకటేశుఁ డేలెఁ బొందాయను
నడుమ సరమరతికి నవ్వితి నేననరే

రేకు: 1335-2 శ్రీరాగం సం: 23-206

పల్లవి: ఏమిసేయమనేవయ్యా యింకా నన్ను
కామించి నీమన్ననలు గైకొంటి నేను

చ. 1: వొద్దనేఁ గూచుండనా వూఁకొననా నీమాటలు
కద్దు నిజమేయననా కానిమ్మనా
గుద్దిరము మానవంటా కొసరేవు కమ్మటిని
ముద్దుముద్దువలె నీముంగిట నుందానను

చ. 2: పాదాలు పిసుకనా బత్తిసేయనా నీకు
సాదువలె నుండనా సమ్మతించనా
సోదించక మాననంటా సొలసేవు కమ్మటిని
సాదించి నీ సేవకు మంచముపై నుందానను

చ. 3: గక్కన విడెమియ్యనా కాఁగిలించి కూడనా
మిక్కిలి నీకు లోఁగానా మెచ్చు మెచ్చనా
యెక్కువ శ్రీవేంకటేశ యేలితివి నన్ను: నాకు
దక్కితిని కమ్మటిని తగిలివుందానను

రేకు: 1335-3 నాదనామక్రియ సం: 23-207

పల్లవి: మొక్కీఁ జేకొను మోహపునీసతి
చెక్కుదియ్యి దియ్య చెదరదు వలపు

చ. 1: చనపు నేసుకొని సతి నినుఁ గొసరెను
మనసునఁబెట్టకు మాఁట లింక
ననుపు గలుగఁగా నవ్వులు నవ్వెను
విను నీపట్టుకు వెంగము కాదు

చ. 2: చుట్టరికంబున సుదతి చెనకె నిను
పట్టకు యెగ్గులు పలుమారు
జట్టిగొనెఁగనక జంకించె నిపుడు
అట్టిట్టనకుము అరగొర లేదు

చ. 3: దేవులతనమున తెలివ నిన్నొరసె
శ్రీవేంకటేశుఁడ చింతించకు
వానిగలుగఁగా వడి నినుఁ గలసెను
భావించ కిచటఁ గపటమే లేదు

రేకు: 1335-4 కేదార గౌళ సం: 23-208

పల్లవి: దొరవు నీవన్నిటాను తొయ్యలి నేను
కరకరిఁ గక్కసించఁగలమా నేము

చ. 1: యేఁటికి నవ్వితివయ్యా యెఱఁగము నే మాపని
నాఁటకుఁడ వేమందుకునైనా వచ్చును
మూఁటగట్టి వలపుల మోపు నెత్తికి నెత్తేవు
గాఁటాన నింతేసి కోపఁగలమా నేము

చ. 2: చేసన్న లేఁటివయ్యా సిగ్గువడితిమి నేము
ఆసోద మెంత నీమనసందు నున్నదో
పూసగుచ్చి తరితీపు పొంచి మెడఁగట్టేవు
గాసించి నీతోఁ బెనఁగఁగలమా నేము

చ. 3: తప్పకచూచేవేమయ్యా దయలోవారము నేము
ఇప్పుడు శ్రీవేంకటేశ యెంతేమన్నాను
వొప్పగించినట్టు నీవొళ్ళు నాకాఁగిటి కిచ్చి
కప్పేవు మే లెదురాడఁగలమా నేము

రేకు: 1335-5 సామంతం సం: 23-209

పల్లవి: ఘనుఁడవు చింతకుంటకంభమురాయ మముఁ
గనుఁగొని రక్షించు కంభమురాయ

చ. 1: కంతునిగురుఁడ వోకంభమురాయ శ్రీ
కాంతఁ దొడ పై నిడనకంభమురాయా
కాంతులు నీమేనెల్లఁ గంభము రాయ యే
కాఁతమాడే వింతులతోఁ గంభమురాయ

చ. 2: కప్పురపువిడేలకంభమురాయ
కప్పము గొనే వింతటఁ గంభమురాయ
కప్పులుదేరీ నీమోవిఁ గంభమురాయ
కప్పుకొమ్మీ పచ్చడము కంభమురాయ

చ. 3: కమ్మఁ జెమటలు నిండెఁ గంభమురాయ
కమ్మటిఁ గూడితి విట్టే కంభమురాయ
కమ్మికొనెఁ బులకలు కంభమురాయ
కమ్మన (ని?) శ్రీవేంకటాద్రికంభమురాయ

రేకు: 1335-6 తోండి సం: 23-210

పల్లవి: ఏల నీకు వెరపూ ఇన్నటా గెలిచితివి
నాలి మాని నీతో నేను నవ్వుచుండఁగాను

చ. 1: మంతనాన నీవాపెతో మాటలాడిన సుద్దులు
ఇంతయు నాతోఁ జెప్పి రిందరు నేఁడు
యెంతకెంత సేసి నాతో యే లానలు వెట్టేవు
రంతుసేసి నిన్ను నేను రవ్వపెట్టేనా

చ. 2: సిగ్గువడ కిందరునుఁ జేసిన సేఁతలెల్ల
నిగ్గుల సోరణగండ్ల నేఁ జూచితి
అగ్గమై సాకిరులేల అట్టె నాకుఁ దెలిపేవు
తగ్గించి విన్నిఁక నేను తలవంపించేనా

చ. 3: కలసిన మీలోని కాఁపిరాలు నిన్నరేయి
కలలోనే కంటి శ్రీవేంకటగిరీశా
చెలఁగి నన్నిట్టె కూడి చెక్కు లేల నొక్కేవు
పలుమారు యిఁక నిన్నుఁ బంగించేనా

రేకు: 1336-1 సామంతం సం: 23-211

పల్లవి: నీ వెఱఁగవా వోయి నే నేమిచెప్పే నీకు
వేవేలైనాఁ బొందు సేసి విడువరాదు

చ. 1: పంతములాడఁగవచ్చు పట్టైపెనఁగఁగవచ్చు
బంతినే సతులఁగూడి పాయఁగరాదు
రంతులు సేయఁగవచ్చు రాజసాన నుండవచ్చు
యెంతైనా వలపులేరు యీఁదఁగరాదు

చ. 2: యెమ్మెలు నెరపవచ్చు యేమైనాఁ జేయఁగవచ్చు
దొమ్ముల నానవెట్టితే తోయఁగరాదు
వుమ్మడి నుండఁగవచ్చు వొరట్లు చూపవచ్చు
కమ్మి కాఁగిలించొకొంటే కాదనఁగరాదు

చ. 3: నాయము చెప్పఁగవచ్చు నవ్వులు నవ్వఁగవచ్చు
పాయపుమదము చేతఁ బట్టఁగరాదు
యీయెడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
చాయలు చూపఁగవచ్చు జంట వాయరాదు

రేకు: 1336-2 బౌళి సం: 23-212

పల్లవి: పిన్నలు నాచన్నులు పిసుకకు పలుమారు
వున్నతిఁ బెరిగితేను వోరిచేఁగాని

చ. 1: నేరుపుగలవారలు నీతో మాటలాడిరి
నేరనిదాన నేను వూరకుందాన
గోరనేల వూఁదేవు కుమ్మెలయ్యీ మే నిట్టె
నేరుపరాదా నీవల్ల నేరిచేఁగాని

చ. 2: రట్టడిసతులెల్లాను జట్టులు సేసిరి నిన్ను
గుట్టుతోడిదానఁగాన కొసరనోప
పట్టకు కుచ్చెల చేత పాసీ పోఁకముడి
గట్టువాయఁ జేయరాదా ఘనమయ్యేఁగాని

చ. 3: నెగ్గళించినచుట్టాలు వెట్టిపనులు గొవిరి
సిగ్గువడ్డదానఁగాన సేవ సేసితి
నిగ్గుల శ్రీవేంకటాద్రినిలయ నన్నేలితివి
తగ్గక మోవియ్యరాదా దప్పిదేరేఁగాని

రేకు: 1336-3 దేశాళం సం: 23-213

పల్లవి: ఆసోదకుఁడవు నిన్నే మనేమయ్యా
ఆసుద్దు లింకానా అవునయ్యా

చ. 1: కప్పురము చేతికిచ్చి కలయఁగ విడెమిచ్చి
చెప్పరానిమాటలెల్లాఁ జెప్పిచెప్పి
అప్పసము నీవద్ద నాపె గాచుకుండఁగాను
అప్పటి మమ్ముఁ జెనకే వవునయ్యా

చ. 2: గందము నీపైఁ బూసి కమ్మి సురటి విసరి
గొందిఁ బానుపు వరచి గుబ్బల నొత్తి
యెందునుఁ బాయక ఆకె యేఁకారుచుండఁగాను
అంది మాపైఁ జేయిచాఁచే వవునయ్యా

చ. 3: సిగ్గులెల్ల విడిపించి చేరి మోవి గంటిసేసి
వెగ్గళపునవ్వు నవ్వి వేసాలు సేసి
వొగ్గి శ్రీవేంకటేశ్వర వొడిగ ట్టాపె వుండఁగ
అగ్గమై నన్నుఁ గూడితి వవునయ్యా

రేకు: 1336-4 దేశాక్షి సం: 23-214

పల్లవి: ఎంత మానాపతివి నిన్నేమి చెప్పేది
మంతనములాడేవు మండెమునారసింహా

చ. 1: చేరి విడెమిమ్మంటే సిగ్గులువడేవు నీవు
వోరి నీసతెవ్వతైనా వున్నదా యీడ
గోర నిన్ను గీరఁగాను గొబ్బున వేఁడుకొనేవు
ఆరీతు లెవ్వతైనా నిన్నాడుకొనీనా

చ. 2: మోముచూచి నవ్వితేను మొక్కుచును లోఁగేవు
నీమగువ లీడ వచ్చి నిన్నుఁ జూచేరా
కామించి మోవికెంపులు కలిగించితే మూసేవు
చూ; మరల నెవ్వతైనా సొలసి తిట్టెనా

చ. 3: సారెకు మాటలాడితే సన్నలు సేసేవు నీవు
దూరి నీమోహపుచెలి దొమ్మి సేసీనా
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కేరడాన నెవ్వతైనా కేలుచాఁచీనా

రేకు:	1336-5 సాళంగ నాట	సం:	23-215

పల్లవి:	నవ్వేవారి నెఱఁగవు నాలుగువంకలనిన్ను
జవ్వనమదముననే సాముసేసేవు

చ. 1:	యెంతైనా గద్దునీయాసయేమి చెప్పే దిందరిలో
కాంతవలపులకు గాదె నీమేను
చెంత నాకుచములు చేతులనే పట్టుకొని
మంతులెక్క నాపెతోను మాఁటలాడేవు

చ. 2:	తలఁచరాదు నీరతి తమకివి యిన్నిటాను
జలజాక్షులెంగిలికంచము నీమోవి
అలరి యధరామృత మందుకొంటా నాపెపొత్తు
కలసి సన్నలుసేసి కాఁకరేఁచేవు

చ. 3:	పట్టరాదు నీవయసు పడఁతుల కెల్ల రచ్చ
కొట్టమాయ నిదివో నీగొప్పవురము
నెట్టన శ్రీవేంకటేశ నీవునన్నుఁ గూడి యట్టె
కట్టుకొంటి వాపెపదకము నీమెడను

రేకు: 1336-6 గుండక్రియ సం: 23-216

పల్లవి: ఇది యేఁటిదయ్యా యెంతసేసితివి నీవు
చెదరనిదయతో విచ్చేయవయ్య యింటికి

చ. 1: చెలులతో యేమని చెప్పంపితివి
యెలమి నానవాలు యేమిచ్చితివి
కులికి యేమని యాసకొలిపితివి
చెలిని మన్నింతువు విచ్చేయవయ్య యింటికి

చ. 2: చెప్పరానిసన్న లేమి సేసితివి
తప్పకేల కొనగోరఁ దాఁకించితివి
చొప్పుగా నేమని నీమోవి చూపితివి
చిప్పిలఁ గూడుదువు విచ్చేయవయ్య యింటికి

చ. 3: నావద్దనుండాపె నెట్టు నవ్వించితివి
యేవిధానఁ దొల్లేమని యేలుకొంటివి
శ్రీవేంకటేశ మాయింతిఁ జేరి కూడితి
సేవగొందువు మాచే విచ్చేయవయ్య యింటికి

రేకు: 1337-1 పాడి సం: 23-217

పల్లవి: ఏవంక నేరిచితివో యింతేసి నీవు
దేవులచెరువుయేలేతిరువేకంటేశా

చ. 1: సారెసారెకు నెత్తేవు సంగడాలా నాచన్నులు
బోరనఁ బట్టేవు చేయిబొందేకోలా
సారె జారె ననెంటేవుచక్రాలా నాపిఱుఁదులు
నేరుతువోయి సాములు నెలఁతలతోడనె

చ. 2: కామించి పెనఁగేవిట్టె కలబమా నాకంబుకంఠము
గోమునఁ గాఁగిలించేవు గోఁతమా మేను
ఆముకొని వొడ్డుకొనే వమ్ములా నాచూపులు
సాము నీకుఁ జెల్లునయ్య సకియలతోడనె

చ. 3: కమ్మటి బుసకొట్టేవు గరిడా నాజవ్వనము
దొమ్మిఁ బట్టితీసేవు ద్రోణమా జడ
ఇమ్ముల శ్రీవేంకేటాద్రి నిట్టె నన్నుఁ గూడితివి
కమ్మి సామమరెనోయి కాంతలతోడనె

రేకు: 1337-2 ఆహిరి సం: 23-218

పల్లవి: ఇన్నాళ్ళువాఁడవె కావా ఇంత వున్నదా నీకు
మన్ననతో నెట్లా మర్మము లంటెనో

చ. 1: జలజలఁ జెమరించె సరసుఁడ నీమేను
కలికి యేమని యేకతమాడెనో
కళలు నీమోమున గక్కన నిండె నిట్టె
అలరి మరి యేమని ఆనఇచ్చెనో

చ. 2: ముసిముసినవ్వు రేఁగె ముంచి నీసెలవులను
కొసరి ప్రియ మెంత నీకుఁ జెప్పెనో
సుసరాన మోమునకు సొంపువచ్చె నింతలోనె
వసమై నీ కెట్లు మోమువంచి మొక్కెనో

చ. 3: వెడవెడఁ బులకలు వెలసె నీ చెక్కులను
అడియాలపుగోర నెట్టదిమెనో
కడఁగి శ్రీవేంకటేశ కాంతఁ గూడి మమ్మేలితి
తడఁబడీ సంతోసము తగనా కేమనెనో

రేకు: 1337-3 శ్రీరాగం సం: 23-219

పల్లవి: ఇందాఁకా మనమెల్లా నెఱఁగము యీకీలు
ముందు సరసమాడక ముచ్చట వాయదు

చ. 1: నిక్కి విరహాననున్న నెలఁతకు పతి వచ్చి
చెక్కులు నొక్కినఁగాని సేద దేరదు
వెక్కసపుఁగాఁకల విసిగినయందుకు
చొక్కపునవ్వునఁగాని సొంపురేఁగదు

చ. 2: ఆగడుఁదమకమున నలసినయాపెకు
తగుమోవిచ్చినఁగాని దప్పి దేరదు
చిగురుఁగోరికలచే చిక్కువడినందుకు
మొగము చూపక ప్రియములు వెలవెట్టదు

చ. 3: రాఁగినజవ్వనికి యీరతి శ్రీవేంకటేశుఁడు
కాఁగిట నించినఁగాని కళదేరదు
పాఁగినచెమటచేత పచ్చియైనయందుకు
చేఁగదేరఁ గొసరక చిత్తము గరఁగదు

రేకు: 1337-4 మళవి సం: 23-220

పల్లవి: తగుఁదగునయ్యా మీఇద్దరికి నేఁడు
చిగురువలపులెల్లా సేసలై నిలిచెను

చ. 1: కూరిమి నిన్నుఁ గొసరికొసరి తప్పకచూచీ
చేరఁడేసికన్ను లచెలియ
మారుకుమారు నీవు మరి తప్పకచూచితే
బోరనఁ గలువలతో పూజలై నిలిచెను

చ. 2: వొట్టుక నిన్ను నొరసి వొరయుచుఁ జెనకీని
పట్టెఁడేసిగుబ్బలపడఁతి
అట్టడితనాన నీవాఅడిఁ జేతులు చాఁచితే
పొట్టఁ బొరుగునఁ దమ్మిపూజలై నిలిచెను

చ. 3: ముందుముందె మోవితేనె ముంచిముంచి అందియిచ్చె
అందీ కొణిఁదెఁడు మోవిఅతివ
కందువ శ్రీవేంకటేశ కలసి నీవూ నిచ్చితే
పొందుల సంపెఁగపువ్వుపూజలై నిలిచెను

రేకు: 1337-5 నాగ వరాళి సం: 23-221

పల్లవి: చెక్కిటిచేయి దియ్యదు చింతతోడను
చక్కఁబెట్టుదువు పతి సరుగన రామయ్యా

చ. 1: కొమ్మ నీతో నెఱఁగక కోపగించుకొంటినంటా
వుమ్మడిఁ బొడిఁబడుచు నుసురనీని
యిమ్ముల నెంతసేసిన యీపె నీకు మేలుది
సమ్మతించఁ జెప్పుదువు సరుగన రామయ్యా

చ. 2: మగువ నిన్నపుడు బొమ్మల జంకించితినంటా
చిగురుఁబరితాపానఁ జింతించీని
తగవులు దప్పినాను తరుణి పాయఁగలేదు
జగడము దీరుతువుసరగన రావయ్యా

చ. 3: సతి నీపై తమకాన చన్నుల నొత్తితినంటా
మతిలో చిడుముడిసీరతి సేసీని
యితవై శ్రీవేంకటేశ యేలితివి నీవెందున్నా
సతమైతి విట్లానే సరగన రావయ్యా

రేకు: 1337-6 పళవంజరం సం: 23-222

పల్లవి: మనపుకు మనసే మరి తారుకాణవచ్చె
చెనకినచెనకులు చేచేత నున్నవి

చ. 1: వలపులు సరివచ్చె వనిత నిన్ను మెచ్చె
పొలసి యిందాఁకా నాపె పొగడెనయ్యా
కలలు నిక్కములాయ కడుమర్మములు రాయ
కొలువులో నాపెవద్దఁ గూచుండవయ్యా

చ. 2: నవ్వులు సెలవి ముంచె ననుపులు లోలో మించె
మవ్వముతో నిన్ను నాపె మరిగెనయ్యా
జవ్వనము సరిదూఁగె జగడములెల్ల దాఁగె
చివ్వన లోనికిని విచ్చేయవయ్యా

చ. 3: చూపులఁ గళలు నిండె సురతము పంటపండె
వోపిక విన్నాపె నోరూరించెనయ్యా
యేపున శ్రీవేంకటేశ యిద్దరుఁ గూడితి రిట్టె
తీపుల నాపె నురము దించుకువయ్యా

రేకు: 1338-1 భైరవి సం: 23-223

పల్లవి: అందుకు నిందుకు వింతలాయనయ్యా
అందాలుగాఁ జెప్పుదువు ఆడకు రావయ్యా

చ. 1: అంగనకుఁ గస్తూరి ఆంపేనంటి వదేదయ్యా
చెంగల వింతలో మఱచితివా అయ్యా
ముంగిటిచెలులఁ జూచి ముందెరఁగనా అయ్యా
యెంగిలాయ నీమోవి యిదేఁటిదయ్యా

చ. 2: సగమా కందుకొంటి వాసగమూ బుత్తెంచెదయ్యా
వగలేమిఁ దలఁచక వచ్చితివయ్యా
బగివాసి ఇంతలోనే భ్రమసితివా అయ్యా
చిగురువంటి నీమేను జీరలాయనయ్యా

చ. 3: పాటించినసగినాలు పనికివచ్చెనో అయ్యా
గాఁటాన మగిడి ఇంతిఁ గంటివయ్యా
యీటున శ్రీవేంకటేశ ఇద్దరుఁ గూడితిరయ్యా
నీటుఁజెక్కుల చెమట నిండుకొనెనయ్యా

రేకు: 1338-2 పాడి సం: 23-224

పల్లవి: మగరూపు నాఁడురూపు మక్కళించి ఇట్టె తన్నుఁ
దగిలినవారికెల్ల తమిరేఁచీ నితఁడు

చ. 1: సతిపయ్యదచెఱఁగే చక్కఁగానుఁ గప్పుకొని
కతగా నొక్కపక్కనే కాఁగిలించుక
చతురత చెక్కుఁజెక్కు జంటగా నదుముకొని
అతివలు కొలువుసేయఁగ నున్నాఁడితఁడు

చ. 2: పడఁతి ముత్యాలపేరే మెడఁ దాఁ దగిలించుక
అడరి శలవినే మోవందుకొనీని
తొడతొడఁ దగిలించుక తుదలేనియాసలతో
తడివి చెలులతో నెత్తములాడీ నితఁడు

చ. 3: తరుణి మందచుదోమతెర మాటు సేసుకొని
సరి శ్రీవేంకటేశుఁ డిచ్చలఁ గూడీని
కరములు కరముల కందువఁ బెనచుకొని
దొరతన మింతులయెదుటఁ జూపీ నితఁడు

రేకు: 1338-3 దేశి సం: 23-225

పల్లవి: ఇట్టె తప్పులెంచేనంటే నెంత లేదు
కట్టు గాచుకొని వూడితము సేసేఁగాక

చ. 1: చిగిరించినట్టు నీవునేసిన చేఁతలకు
యెగసక్కేలాడేనంటే యెంతలేదు
మొగమోడి చేతులెత్తి మొక్కి నీవాడినట్టెల్లా
అగపడి నీకు నే నిల్లాల నైతిఁగాక

చ. 2: దిమ్మరివై నీవు గడుఁదిరిగేతిమ్మటలకు
యెమ్మలు మెరసేనంటే యెంత లేదు
సమ్మతించి నీపట్టుకు సాద నే నీచేతను
తమ్మల మందుక మరఁదల నైతిఁగాక

చ. 3: అడియాలమైననీయంగపుమచ్చాలు చూచి
యెడసి కోపించేనంటే యెంత లేదు
అడరి శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁగూడి
వుడివోక పురముపై నుందానఁగాక

రేకు:	1338-4 ముఖారి సం:	23-226

పల్లవి:	గామిడిని నీవు కైలాటలువెట్టేనవి
యేమరించఁజూచేవు యిద్దరము నొకటే

చ. 1:	మంతనాన నేనీతో మాటలాడినవియెల్ల
అంతరంగముగఁ జెప్పె ఆపె నాతోను
మంతుకెక్కినట్టినీమతకాలే వేరుగాని
ఇంతులము తొల్లే నేము నిద్దరమునొకటే

చ. 2:	గుఱుతుగా నీవు నేనుఁ గూడినకూటములెల్లా
యెఱుకగా నాపె నీ(నా?) తో యెచ్చరించెను
నెఱవుగా నన్నిటానునీవే కపటివిగాని
యెఱఁగ మామేలెల్లా నిద్దరము నొకటే

చ. 3:	చెప్పరానిమనలోని నేసుకొంటి బాసలెల్లా
చప్పిడించ కాపె నాతో సన్న సేసెను
ముప్పిరి శ్రీవేంకటేశ మోహయించితి విద్దరికి
యెప్పుడు నీపాలిటికి నిద్దరము నొక్కటే

రేకు: 1338-5 ఆహిరి సం: 23-227

పల్లవి: ఏమి మొగము చూచేవు యెన్నటికి నీదయ
చేముట్టి సరసమాడి సిగ్గుదేర్చరాదా

చ. 1: చెలి నీవద్ద నుండఁగ చెక్కు లెల్లాఁ జెమరించె
వెలయ సురటిఁ గొని విసరరాదా
అలసె నీతో నవ్వి అప్పటి నింతటిలోనే
చలువనీమోవితేనె చవిచూపరాదా

చ. 2: సతి నీతో మాటాడఁగ జల్లుననుఁ బులకించె
గతిగూడ పచ్చడము గప్పరాదా
తతి మేను సోఁకఁగాను తమకములెల్ల రేఁగె
కత లెందాఁకాఁ జెప్పేవు కాఁగిలించరాదా

చ. 3: అంగన సేసవెట్టఁగ ఆయములెల్లఁ గరఁగె
సంగతిగాఁ గౌఁగిలించి చనవీరాదా
రంగుగ శ్రీవేంకటేశ రతిఁ గూడితి వీకెను
ముంగింటనే మోహించె ముచ్చటాడరాదా

రేకు: 1338-6 బౌళి సం: 23-228

పల్లవి: మేము విన్నవించరాదు మీలోనిమర్మములు
ఆమనివలపు చల్లి అంగవించరాదా

చ. 1: చిత్తడిచెమటతోడిసిగ్గులేల పతితోడ
చిత్తములోపలిమాట చెప్పరాదా
వత్తివలె మోవిమీఁది వసివాడులేమిటికి
పొత్తుకు వచ్చి యీతనిఁ బోదిసేయరాదా

చ. 2: మంచిరనపులకలతో ముసిముసినవ్వులేల
చుంచుల నీవేడుకలు చూపరాదా
అంచెల నిట్టూరుపులఅసురుసు రేమిటికి
మంచముపైఁ గూచుండి మరుపఁగరాదా

చ. 3: నిండుమోముకళలతో నిట్టచూపు చూడనేల
దండిగాఁ గాఁగిట నించి దైవారరాదా
అండనె శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్ను నలమె
కొండలవంటిచన్నుల (లఁ?) గుచ్చియెత్తరాదా

రేకు: 1339-1 గౌళ సం: 23-229

పల్లవి: ఎమ్మెలవాఁడవునీతో నెదురాడవచ్చునా
సమ్మతించిబొమ్మలనే జంకిచుటగాక

చ. 1: కోపగించవచ్చునాకొచ్చి నిన్నుసారెసారె
చూపులునాఁటించి సాదించుటగాక
రాపుసేయవచ్చునా రావనుచు నింతలోనె
తీపులమోవివలువ తీసుటగాక

చ. 2: అలఇంచవచ్చునా అట్టునిట్టుఁ దీసినిన్ను
వొలిసి నాచనుగుబ్బల నొత్తుటగాక
బలిమిచూపవచ్చునా పైకొని సరసమాడి
కళలురేఁచివేడుక కైకొంటగాక

చ. 3: వేసరించవచ్చునా వేగినంతా రతులను
ఆస చూపి నిన్ను మర్మాలంటుటగాక
సేసతో శ్రీవేంకటేశ చెందితి వాఁపవచ్చునా
లాసి నీకరుణెల్లా లాగించుటగాక

రేకు: 1339-2 ముఖారి సం: 23-230

పల్లవి: చెలిమోము చూచిప్పుడు సిగ్గులువడేవు నీవు
తలఁపించనా నేను తక్కించేవుగాక

చ. 1: ముంచి చెలివిరహము మొన్ననే విన్నవించనా
అంచెలతో వొద్దికి రావైతివి గాక
కంచము పొత్తు కొరకే కానుక చేతికియ్యవా
యెంచుకోక మఱచితివేమోకాక

చ. 2: నెలాతచిత్తము ఎంత నిన్ననే యెచ్చరించనా
అలముక బుజ్జగించవైతివిగాక
కలయుమనుచు నీకు కుడుఁ బ్రియముచెప్పనా
నలిరేఁగి కవకవ నవ్వితివిగాక

చ. 3: అంగనఅలపులెల్లా నప్పుడే నీకుఁ జూపనా
అంగవించి పంతమియ్యవైతివిగాక
రంగుగ శ్రీవేంకటేశ రతి నిట్టె కూడితివి
యింగిత మెంచనా మెచ్చే వింతలోనేకాక

రేకు: 1339-3 దేశాళం సం: 23-231

పల్లవి: ఇరువంకల నీకు నిందరము నున్నారము
తెరమరఁగునవ్వులు తెలుసుకోవయ్యా

చ. 1: వేడుకకుఁ దోడువచ్చి వెనకతియ్యఁగరాదు
వాడికకుఁ జోటిచ్చి వద్దనరాదు
పాడిచెప్పేనని వచ్చి పక్షపాత మాడరాదు
తాడుపై తపసు నీవే తలఁచుకోవయ్యా

చ. 2: అట్టె తా పూఁటవడి అరవననఁగరాదు
పట్టి చవిగొంటా రోతపడఁగరాదు
చుట్టరికము సేయుచు సూడువట్టఁగరాదు
చట్టురాతినారిది విచారించుకోవయ్యా

చ. 3: సేసవెట్టి పెండ్లాడి సిగ్గులువడగఁరాదు
బాసగెని(లి?) చినమీఁద బద్దనరాదు
యీసుదీర శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
వేసినముడియ ఇది విడువకువయ్యా

రేకు: 1339-4 హిందోళం సం: 23-232

పల్లవి: ఎంతవడి గుట్టుసేసే విక్కడనయ్యా
దొంతరవలపులకు తోవేదయ్యా

చ. 1: కామినిచూపులు నీపై కలువదండలై నిండె
యేమయ్య వూరకున్నాఁడ వెందాఁకాను
దోమటినవ్వులు కప్రధూళియై నీమేను ముంచె
మేమరుముచ్చటలకు వేళ యెప్పుడయ్యా

చ. 2: పడఁతి మొక్కులు నీకుఁ బల్లవపుఁబరపాయ
తడవవేమయ్య యెంతదడవాయను
జడిగొన్న వూరుపులు చల్లనిసురట్లాయ
జడియనిరతి కవసర మెప్పుడయ్యా

చ. 3: ముదితమాటలు నీకు ముత్యాలసేసలాయ
యెదురుకొనవలదా ఇఁకనైనాను
కదిసితి రిద్దరును గక్కన శ్రీవేంకటేశ
చదురులాడుటకును సమయమేదయ్యా

రేకు: 1339-5 వసంత వరాళి సం: 23-233

పల్లవి: ఐనపని కిఁకనేల అనుమానము
కానిమ్మని లోనుగాక కట్టుకునేదేమీ

చ. 1: మొగముచూచినదాన మొక్కవద్దా నీకు నేను
యెగసక్కెమాడఁగాను యేమాయను
నగినదాన నీతో నంటున మెప్పించవద్దా
జగడమడిచి నిన్ను సాదించేదేమి

చ. 2: చేరఁగవచ్చినదాన సేవలు సేయఁగవద్దా
యీరసాన జంకించఁగ నేమాయను
పేరఁబిలిచినదాన ప్రియములు చెప్పవద్దా
దూరి నిన్నుఁ దిట్టుఁగాను దొరతనమేమి

చ. 3: సిగ్గులువడినదాన చెప్పినట్లు సేయవద్దా
యెగ్గులెంచి పెనఁగఁగా నేమాయను
వెగ్గళించి నన్నిదె శ్రీవేంకటేశ కూడితివి
బగ్గన నిన్నుఁగాదనేపను లిఁకనేమి

రేకు: 1339-6 సౌరాష్ట్రం సం: 23-234

పల్లవి: పిసికితే పసురౌను ప్రియములెల్లా
పొసఁగినవాటినే పొందవలెఁగాని

చ. 1: సలిగెగద్దంటాను సారె నెత్తికెక్కరాదు
పిలిచేవంటా నీతోబిగియరాదు
కలసేనంటా మేను కడుఁబిప్పి సేయరాదు
వొలిసి మట్టుకుమట్టే వుండవలెఁగాని

చ. 2: యిందు రమ్మనేవంటా యిల్లెల్లాఁ జేకొనరాదు
మందెమేళమాయనంటా మారుకోరాదు
యెందైనా వచ్చేవంటా యిలయెల్లాఁ దిప్పరాదు
అంది సరవి మనసియ్యవలెఁగాని

చ. 3: చెప్పినట్లు సేసేవంటా సేవలు గొనఁగరాదు
వొప్పుగఁ గూడితివంటా వుబ్బఁగరాదు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
మెప్పించి సమరతుల మెచ్చవలెఁగాని

రేకు: 1340-1 దేశాక్షి సం: 23-235

పల్లవి: ఏమే యెంతనేరుపరి వి దెలఁగవా
ప్రేమమతి కడతురా బెరయుటగాక

చ. 1: కన్నుల మొక్కినమీఁద కాఁకలు చల్లుదురా
సన్నలనే వలపులు చల్లుటగాక
చన్నులు చేతికిఁ జిక్కె సారెనిఁకలోఁగుదురా
వెన్నెలనవ్వులు నవ్వి వేఁడుకొంటగాక

చ. 2: పాదాలు చాఁచినమీఁదఁ పంతాలు నెరపుదురా
సేదదేర సేవలు సేయుటగాక
ఆదిగొని కాఁగిలించె నాసలు వెట్టుదురా
సాదువలె భోగములు చవిగొంటగాక

చ. 3: ఆయములంటినమీఁద అరగోరసేతురా
పాయనిసమరతులఁ బైకొంటగాక
యీయెడ శ్రీవేంకటేశుఁడేలె సిగ్గువడుదురా
కాయములు సోఁక నిట్టె కలయుటగాక

రేకు: 1340-2 లలిత సం: 23-236

పల్లవి: ఎంచి చూడుమా నీ కెంత యితవైనాను
వంచన మీరి నవ్వవచ్చునా వోయి

చ. 1: పాయలేక నీవెంత పచ్చిగా మోహించినాను
చేయరానిసేఁతలు చేయవచ్చునా
అయెడ నీ కటువంటి వలవాటు గలిగితే
చాయల మా కింత సేయ సంగతులా వోఇ

చ. 2: వేడుకతో నీవెంత వెన నవ్వ ణిచ్చినాను
ఆడరానిమాటలు నిన్నాడవచ్చునా
యీడనాడఁ దిరుగాది ఇవి నీకుఁ చవులైతే
పాడిదప్ప మాకివి పనులా వోయి

చ. 3: ఇప్పుడే నీవు నెంత చన విచ్చినాను
చెప్పరానిపని నీకుఁ జెప్పవచ్చునా
నెప్పున శ్రీవేంకటేశ నీకు నేను బాఁతైతే
అప్పటి మా కలఇంచ నందమా నిన్నోయి

రేకు: 1340-3 తోండి సం: 23-237

పల్లవి: ఇదె నేఁ జేసినభాగ్య మేమిచెప్పేది
పొదిగొని వలపులె పోదిసేసేవు

చ. 1: వంతులవాసులవారు వద్దఁ గాచుకుండఁగాను
చెంతల నాపై నేల చేయివేసేవు
సంతలో బేరములే సరసమే కురియఁగా
పొంతనుండి నాతోడీ పొందుసేసేవు

చ. 2: కోటానఁగోటి సతులు కొలువులో నుండఁగాను
సూటిగాను నా మొగమే చూచేవు
తేటచెలమలవలె తేనెలమాట లాడఁగా
కూటమి కొడఁబఱచి కొంగువట్టేవు

చ. 3: సేసలు వెట్టినవారు సేనాసేన లుండఁగాను
ఆసపడి నన్నుఁగూడి ఆనదించేవు
బాసల శ్రీవేంకటేశ పాలవలె నవ్వఁగాను
రాసికెక్క నన్నే గారవించి మెచ్చేవు

రేకు: 1340-4 కేదార గౌళ సం: 23-238

పల్లవి: చెలులాల మీరైనాఁ జెప్పరే బుద్ధి
చలములన్నియు మాని సరసమాడితిని

చ. 1: యెప్పటికెప్పటిమాటలేల తలఁచుకొనీనే
చిప్పిలుచు లోలో నేల చెమరించీనే
తప్పులేదంటానేల తారుకాణించవచ్చీనే
అప్పుడే అన్నిమరచి అందాలఁ గూడితివి

చ. 2: యెక్కడి కెక్కడిపనులేల నిలువఁబెట్టీనే
వుక్కుమీరి తానేల వుస్సురనీనే
నిక్కమిందంటానేల నిండా నానలు వెట్టీనే
చక్కనై అలుకదేరి చవిసేసుకొంటివి

చ. 3: యేడనేడ తగవులు యిందునేల కలపీనే
వోడక తానేల నాపై వొళ్ళు వేసీనే
కూడి శ్రీవేంకటేశుఁడు గురుతులేల నించీనే
ఆడానీడాఁ తెలుసుక అన్నిటా నమ్మితిని

రేకు: 1340-5 మాళవిగౌళ సం: 23-239

పల్లవి: ఇన్నిటా ఘనుఁడు దాను యేమిచెప్పేరే
యెన్నుకొనీ నాగుణము లేమిచెప్పేరే

చ. 1: చెంతఁ దనచెప్పినట్టు సేసితినంటా నిదె
యెంత నన్ను బుజ్జగించీ నేమిచెప్పేరే
అంతటాఁ దన కిచ్చకమాడితినంటా నిదె
ఇంతలో నన్నుఁ బొగడీ నేమిచెప్పేరే

చ. 2: వొట్టి తనపై పాటలు వొనరఁ బాడితినంటా
యిట్టె విడెమిచ్చీని యేమిచెప్పేరే
జట్టిగాఁజన్నులతోడ సాము సేయించితినంటా
యెట్టనెదుటనే మెచ్చీ నేమిచెప్పేరే

చ. 3: మనసుమర్మములంటా మంతనమాడితినంటా
యెనసి కాఁగిలించీ యేమిచెప్పేరే
చెనకి మొక్కితినంటా శ్రీవేంకటేశ్వరుఁడు
యినుమడిగా మన్నించె నేమిచెప్పేరే

రేకు: 1340-6 రామక్రియ సం: 23-240

పల్లవి: వట్టివేసాలు సేసుక వాదులు దూరేవు
గుట్టు బాయిటను వేసి గురిగాఁ జేసితినా

చ. 1: కొప్పునే దువ్వితిఁగాక కోపగించి నిన్నేమైనా
వొప్పుగ మందటిపట్ల కొడిసితినా
విప్పక చేతులువట్టి వేఁడుకొంటిఁగాక నిన్ను
ముప్పిరి నొసలు మోపిమొక్కించుకొంటినా

చ. 2: కందువ లంటితిఁగాక కపటాన నిన్నేమైనా
కిందుపడ కొనగోర గీరితినా
అందుకొమ్మనుచు మోవినాకు నీ కిచ్చితిఁగాక
చెంది ఇప్పుడు నోరొగ్గించితినా యెంగిలికి

చ. 3: వలపు రేఁచితిఁగాక వడి నిన్ను నేమైనా
కులికి చన్నుల నొత్తి కుమ్మితినా
యెలమి శ్రీవేంకటేశ యెనసిమెచ్చితిఁగాక
పలుకులలో నే బూతుబండునఁ దిట్టితినా

రేకు: 1341-1 సాళంగ నాట సం: 23-241

పల్లవి: మెలుఁతలందురును మెచ్చిరమ్మా
వలపు లొక్కమాఁటె పంచితివమ్మా

చ. 1: మారుగొండ లెక్కితివి మగనితొ డెక్కితివి
నేరుపరి వౌదువు నీవమ్మా
సారె జారించి పయ్యద చన్నులు చూపితివి
నీరపమాయ నింక నెరజాణవమ్మా

చ. 2: బొమ్మలను జంకించిబుద్ధులెల్ల బోదించి
చిమ్మేటికోపము మానిచితివమ్మా
తమ్మిమోము మోము చేర్చి దప్పి దేర మోవి ఇచ్చి
కుమ్మరించితివిసిగ్గు గుణవతివమ్మా

చ. 3: పాదము పాదానఁ దొక్కిపక్కన చెక్కులు నొక్కి
సేదదేర్చితివి నీకు చెల్లునమ్మా
ఆదిగొని శ్రీవేంకటమందు అహోబలేశ్వరు
సాదుఁ జేసితివి మంచిచక్కనిలక్ష్మివమ్మా

రేకు: 1341-2 మాళవిగౌళ సం: 23-242

పల్లవి: కోనతిరువెంగళేశ కోడెకాఁడా
ఆనించీ నీసతి నీపై అప్పటి వలపులు

చ. 1: వేడుకకు నీతోను వేసారక మాటలాడి
వీడెము చేతికి నిచ్చి వెడ్డువెట్టీని
వాడికగా నీ సొమ్ము వడిఁ దనమేనఁ బెట్టి
తోడనే మోపులుగట్టీ తొయ్యలి వలపులు

చ. 2: చెక్కునొక్కి నవ్వించి చిత్తము రా సన్నసేసి
మొక్కు మొక్కి ఆసపుట్ట మోవి చూపీని
వొక్కమాఁటే నీకొప్పుపువ్వులు దా ముడుచుకొని
చిక్కించి నీపై రాసిచేసీ వలపులు

చ. 3: కొంగువట్టి కొసరుచు కూరిమి కాఁగిట నించి
సంగతిగాఁ గూడికూడి చల్లీ నేస
రంగుగ శ్రీవేంకటేశ రతిని గంద మలంది
పొంగుచును కణఁజాలఁ బోసీ వలపులు

రేకు: 1341-3 దేశాళం సం: 23-243

పల్లవి: ఇంతితో నేఁటిబీరాలు యెందాఁకాను
సంతోసించి మచ్చికలు చల్లఁగరాదా

చ. 1: చనవరికాంతగాన సతి నీపైఁ జేయిచాఁచె
కొనగోరు దాఁకెనంటిఁ(టాఁ?) గోపగింతురా
ననుపు గలదుగాన నవ్వులెల్లానవ్వె నీతో
కనుఁగొని యందు కీకెఁ గాఁగిలించరాదా

చ. 2: కూరిమి వనితగాన కొప్పువట్టి నిన్నుఁ దీసె
ఆరీతి జంకించెనంటా నదలింతురా
నేరుపుగలదుగాన నీకఁ(కం?) టే మితిమీరె
గారవించి అందుకిట్టె కాఁగిలించరాదా

చ. 3: ఇచ్చకపుసతిగాన ఇటు నిన్నుఁ జొక్కించె
పచ్చిసేసెనంటా నిట్టె పదరుదురా
మచ్చికె గలదుగాక మరిగె శ్రీవేంకటేశ
కచ్చుపెట్టి అందు కిట్టె కాఁగిలించరారా

రేకు: 1341-4 వేళావళి సం: 23-244

పల్లవి: ఇందాఁకానున్న భావ మేమి చెప్పేది
చెంది వేడుకతో మించె చెక్కునొక్కఁగాను

చ. 1: చిగిరించెఁ జిత్తము చిరునవ్వులు మొనసె
మొగము కళలునిండె ముదితకును
వెలగులన్నియుఁ బాసె వేడుకలుదైవారె
మగటిమితో నీవు మాటలాడఁగాను

చ. 2: పొదలెను కుచములు భోగపుటాసలు రేఁగె
యెదిరించెఁ బులకలు యింతికిని
అదన నానంద మొబ్బె ఆయములు గరఁగెను
చదురుఁదనాన నీవు చనవియ్యఁగాను

చ. 3: కొప్పు గడు వెడజారె గుట్టుఁ దమకము నిండె
అప్పటి వలపు పండె నతివకును
కుప్పళించెఁ దమకము కోరికలు దైవారె
నెప్పున శ్రీవేంకటేశ నీవు గూడఁగాను

రేకు: 1341-5 సామంతం సం: 23-245

పల్లవి: ఎంతవాఁడవయ్యా నిన్ను నేమనేము
సంతకూటములవాఁడ సంబటూరి చెన్నుఁడా

చ. 1: సోగకన్నులనుఁజూచి సొలపులమాట లాడి
వాగపుగొల్లెతలను వలపించేవు
జాగులనవ్వులు నవ్వి జాజరపాటలు వాడి
బాగుగా నప్పటిఁ గొంత భ్రమయించేవు

చ. 2: బింకపుసాములు సేసి బెట్టుగాఁ బువ్వులు వేసి
అంకెకువచ్చినదాఁకా నాసరేఁచేవు
లంకెలనుఁ గూచుండి లలితో మర్మము లంటి
మంకుఁదనములవారి మరిగించేవు

చ. 3: చీరలకొంగులు వట్టి సిగ్గులు బయటవేసి
గారవించి కాఁగిటను కరఁగించేవు
యీరీతి శ్రీవేంకటేశ యిందరిని యేలుకొని
మేరమీరి చనవిచ్చి మెప్పించేవు

రేకు: 1341-6 సామంతం సం: 23-246

పల్లవి: రావయ్య్య చూతువు రమణిని
దేవుల కిటువంటితెఱంగులు

చ. 1: పలచని యెలుఁగులపాటలు
చెలపలచెలపలచెమటలు
నిలువు నివ్వెరగులనీటులు
కలిగె నేఁడిదివో కలికికిని

చ. 2: సుడిగొనిన యెదురు చూపులు
వుడుకవుడక నట్టె వూరుపులు
బడిబడిఁ దిరిగేటిబాగులు
ఆడియాలమయ్య్య నీయంగనకు

చ. 3: చేతిలో పిడికిటిసేసలు
రాతిరిఁబగలు రతి రహస్యములు
యీతల శ్రీవేంకటేశ యెనసితివి
లాతాయ మన్ననలు లలనకును

రేకు: 1342-1 రామక్రియ సం: 23-247

పల్లవి: ఒకటి కినుమడయ్యా నుప్పు చింది
మొకము చూచీ నట్టె ముచ్చటాడనీవే

చ. 1: చలివాసివున్నదాన సముకాస నున్న దాన
నలువంక నింకఁ గొంతనవ్వీనీవే
తలఁపులోనిదాన తగులాయమైనదాన
ములువాఁడికొనగోరు మోపనీవే

చ. 2: సేసకు లోనైనదాన సేవసేయుచున్నదాన
పోసరించి యింకఁ గొంత బోదించనీవే
రాసికెక్కినట్టిదాన రతి కియ్యకొన్నదాన
మోసపోనివలపుల ముంచనీవే

చ. 3: కందువనే వున్న దాన కాఁగిలించుకన్నదాన
యిందమని మోవి నాకునియ్యనీవే
యిందరిలో శ్రీవేంకటేశ్వరుఁడు నిన్ను గూడె
మందలించి యింకానింకా మన్నించనీవే

రేకు: 1342-2 కన్నడగౌళ సం: 23-248

పల్లవి: ఎప్పుడు దయదలఁచే నింకనీవు
దప్పిదేర మోవి యిచ్చి దక్కఁగొనవయ్యా

చ. 1: నిలువెల్లఁ జెమరించె నీతో మాటాడరాఁగా
వెలఁదియలపుదీర విసరవయ్యా
నెలవై కొలువుసేసి నివ్వెరగుతో నున్నది
యెలమి నీతోడమీఁద నిడుకొనవయ్యా

చ. 2: భారపుతురుము జారె పాదాలకు మొక్కరాఁగా
నేరుపున ముడిచి మన్నించవయ్యా
తేరకొన నిన్నుఁజూచి తిమురుచునున్నది
గారవించి కాఁగిటను కాఁగిలించవయ్యా

చ. 3: వెసఁ బోఁకముడి వీడె వీడెము చేతికిరాఁగా
పసగాను తెరవేసి పాలించవయ్యా
కొసరి శ్రీవేంకటేశ కూడె నిన్ను నింతలోనె
సుసరాన రతులకు జొక్కి మెచ్చవయ్యా

రేకు: 1342-3 దేవ గాంధారం సం: 23-249

పల్లవి: ఇంక నెంతగావలె యీవలపూ
యింకదు చెక్కుచెమట యిదెకాదా వలపు

చ. 1: పెదవిపై వీడెపుఁబిసరు
అదన నిన్నుఁజూచి యసురుసురు
పదరి పయ్యదకొంగుపై విసరు
యెదిరించీఁ జెలి నీపై నిదెకాదా వలపు

చ. 2: గక్కన మనసులోనికరఁగూ
మొక్కలపుసిగ్గులలో మొరుఁగూ
మిక్కిలి మరుకళల మెరుఁగూ
యిక్కువలు చూపెఁ జెలికిదిగాదా వలపూ

చ. 3: ననుపుతో సెలవుల నగవూ
పెనఁగేటి కాఁగిటి బిగువూ
యెనసెశ్రీవేంకటేశ యింతినిన్నునూ
యినుమడించెఁ దమక మిదిగాదా వలపూ

రేకు: 1342-4 కాంబోది సం: 23-250

పల్లవి: ఎవ్వతైనా వలచును యిటువంటి పనులకు
రవ్వపడినచేతల రతికెక్కితివిరా

చ. 1: సొలపులాడి మనసు సోదించి చూచితి
చులుకఁగాఁ బెనఁగి నేఁ జూచితిని
యెలమి నందుకులోన ఇచ్చకమే సేసేవు
చలివాసె నన్నిటాను జాణఁడ వౌదువురా

చ. 2: కప్పిన నీచేతలు సంగడి జూపి చూచితి
చొప్పులెత్తి నవ్వు నవ్వి చూచితివి
వొప్పుకొని అందుకెల్లా నొడఁబడఁ జెప్పేవు
తప్పని బొంకనియట్టిదంట వౌదువురా

చ. 3: మిక్కుటపురతులను మెప్పించి చూచితి
చొక్కించి గోరగీరి చూచితివి
యెక్కడాను మోసపోవు యిన్నిటా నన్నేలితివి
యెక్కువైన శ్రీవేంకటేశుఁడ వౌదువురా

రేకు: 1342-5 సామ వరాళి సం: 23-251

పల్లవి: అన్నిటా గుట్టుతో నుండుటదిమేలు
తన్నుఁదానె వచ్చి యేల తడవేవు మమ్మును

చ. 1: మనసురాని సతి మాఁటలెన్ని యాడినాను
వొనరివుండరు కడువగరై తోఁచు
కొనవేసి మరొకొంత కొసరఁగ బోతేను
పెనపరాలకు వచ్చి పిప్పిగట్టును

చ. 2: యెరపరికపుచెలి యెంత నవ్వు నవ్వినాను
సరవితోనుండదు చప్పనై తోఁచు
పొరలించి మరికొంత పూఁచి కానుక వెట్టితే
కరఁగక లోలోనే గరివడును

చ. 3: నెమ్మిఁ దరితీపులేని నెలఁత యెంత మొక్కినా
వొమ్మి సమ్మతమై వుండదు వుప్పనై తోఁచు
కమ్మి శ్రీవేంకటేశ నేఁ గలసితి నింకెట్టన్నా
చెమ్మపుట్టి వలపులు చిగిరించును

రేకు: 1342-6 సాళంగం సం: 23-252

పల్లవి: గొల్లదాన నింతే నేను; కొంగువట్ట దొరకొనె
యెల్లవారుఁ జూడఁగాను యేమిసేతునే

చ. 1: కన్నుల జంకించీని కైదండ వట్టీని
వున్నతపు కొనగోర నొత్తీని
చన్నులు చేతఁబట్టీని సరసములాడీని
యెన్ని చెప్పినా మానఁడు యేమిసేతునే

చ. 2: తీగెనవ్వు నవ్వీని తెరలోనికి రమ్మనీ
బాగుగాఁ దానే కస్తూరి పైఁబూసీని
వేగిరించి వలపులు వెల్లవిరిగాఁ జేసీనీ
యీగతి వీని గుణము లేమిసేతునే

చ. 3: మొక్కలానఁ గాఁగిలించి మోవి గంటిచేసీని
చిక్కుదీసి శిరసుపై సేసవెట్టీని
గక్కున శ్రీవేంకటాద్రి ఘనుఁడిట్టె నన్నుఁ గూడె
యెక్కువగా మన్నించీ నేమిసేతునే

రేకు: 1343-1 రీతి గౌళ సం: 23-253

పల్లవి: మంచిమేలు గలిగితే మానవచ్చునా
యెంచక చేకొనవయ్యా ఇంటిదాన నేను

చ. 1: యిన్నియు నేరుచు నాపె యెగ్గుసిగ్గులేని దాపె
వన్నెల నింకా నాపెకు వలవవయ్యా
మన్ననతోదాన నేను మానాపతిని నేను
వున్నతిఁ దొల్లే సతమైవున్నదాని నేను

చ. 2: యేమైనాఁ జేసు నాపె యెమ్మెలెరగని దాపె
ప్రేమతో నాపె నింటికి బిలువవయ్యా
నీమాటలోదాన నేను నిగర్వపుదాన నేను
కామించి నీ కెప్పుడును గలదాన నేను

చ. 3: పనిలేనిపని దాపె పంతములొల్లనిదాపె
ననుపున బాసలిచ్చి నమ్మించవయ్యా
చనవరిదాననేను జట్టిగొన్నదాననేను
యెనసితిని శ్రీవేంకటేశ యిట్టె నేను

రేకు: 1343-2 పూర్వ గౌళ సం: 23-254

పల్లవి: ఎంతలేదు రమణినియేలాటాలు
పంతపుమాఁటల కెల్లా బారలుచాఁచేవా

చ. 1: చెలువుఁడు నవ్వుతాను చేఁతలేమో సేసెనంటా
చలములు నీవేల సాదించేవే
జలజలమనుచును జడివాన గురిసితే
కలచోటికెల్లా నీవు కట్టలు గట్టేవా

చ. 2: రమణుఁడు వేడుకతో రవళించి తిట్టెనంటా
గమకాననంత యేల కాఁతాళించేవే
సమముగా నంతటా వేసవి యెండగాసితేను
భ్రమసి యేడనేడకై పందిళ్ళువెట్టేవా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్ను చెంగలించి కూడితేను
ఆవేళ నీవేల వుసురసు రనేవే
కావరించి పొలమెల్లా గాలి విసరితేను
దావతి నెందుఁజూచినా దళ్ళుగట్టేవా

రేకు: 1343-3 ఆహిరినాట సం: 23-255

పల్లవి: ఇదియే చాలు నాకు యేడలేని వెగటేల
పదిటి కొకమాఁటైనాఁ బలుకకుండేవా

చ. 1: మంతనాన నీతోను మారుకొని మాటాడఁగ
పంతము వచ్చెనా నేఁడు పలుమారును
చింతగోడఁ దలవంచి చెక్కుచేతితో నుండఁగ
కొంతైనా నన్ను వేఁడుకొనకుండేవా

చ. 2: గద్దించి నీతో నేను కమ్మటినిఁ బెనఁగఁగ
పెద్దరికమా నాకుఁ బెచ్చువెరిగి
కొద్దితోడఁ బానుపుపై గుట్టుసేసుకుండఁగాను
బుద్ది దలఁచుకొనైనా పొందకుండేవా

చ. 3: నెలవై కాఁగిటిలోను నిన్ను నలయించఁగాను
కలిగెనా మేలుశ్రీవేంకటవిభుఁడా
చెలఁగి రాజసముతో చేరి సంగడి నుండఁగ
నలువంక నాతోనే నవ్వకుండేవా

రేకు: 1343-4 శుద్ధ వసంతం సం: 23-256

పల్లవి: పొగడేవు నన్నును పూఁచిపూఁచి పలుమారు
యెగసక్కెములకైతే యేమిబాఁతి నేను

చ. 1: వలపు చవిగొంటేను వడిఁ జెప్పరానితీపు
బలిమి నొల్లకుంటేను బాఁతిగాదు
పిలిచి విడెమియ్యఁగాఁ బ్రియురాల నైతివి
యెలమి వింతకతొల్లి యేమి బాఁతి నేను

చ. 2: రతివేడుక గలితే రసము లొలుతుచుండు
ఇతవుగాక వుండితే యెందూఁ బొందదు
తతిసరసమాడఁగా తగుచనవరినైతి
ఇతరకాంతలలోన యేమిబాఁతి నేను

చ. 3: కాఁపురముసేసేనంటే కల్పవృక్షమై తోఁచు
వోపనంటే మోఁటుపడివుండు నూరకే
యేపున శ్రీవేంకటేశ యేలఁగా ఇల్లాలనైతి
యీపై చమ్మటూరఁ జూపే వేమిబాఁతి నేను

రేకు: 1343-5 దేశాళం సం: 23-257

పల్లవి: నివ్వెరగుతో నుందాన నిన్నుఁ జూచి
జవ్వనపుసంపదలు సందు చూపరాదు

చ. 1: మనసార నేనీతో మాటలాడేనంటేను
వినేయందునీకైతే వేళలేదు
పనివడి యప్పటిని పాదాలు గుద్దేనంటేను
యెనసి కొలువేగాని యేకాంతము లేదు

చ. 2: సారెసారె నీతోను సరసమాడేనంటే
కోరి నీవలపులకు గురిలేదు
గారవించి నిన్ను నంటి కళలురేఁచేనంటే
యీరీతినైన నీకు ఇంపులేదు

చ. 3: గక్కున నిన్నుఁ గదిసి కాఁగిట బాగిసేనంటే
తక్కరితనాన నీకు తనివిలేదు
అక్కరై శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
యెక్కువతక్కువ లెంచ యీరసము లేదు

రేకు: 1343-6 దేశాళం సం: 23-258

పల్లవి: పోపో యక్కడిసుద్ది పొద్దువోదా అయ్య నీకు
యీపనులు మీకెకాక యిది మాకుఁ దగవా

చ. 1: ఆకెతోడ నీవు నన్ను నాడుమన్న మాఁటలెల్ల
యేకతానఁ జెప్పఁబోతే యెట్టుండును
ఆకడనుఁ దనసరియాఁటదానిఁ బేరుకొంటే
యీకడ నీపెకు నేఁడు యితవయ్యీనా

చ. 2: వువిదకు నీవంపినవుంగరాలు నే నిపుడు
ఇవలఁ జేతికియ్యఁగ యేమనునో
ఆవల నొక తెపాదలందున్న మెట్టె లిచ్చితే
సవతులైనవారు యీజాడల కోరుతురా

చ. 3: ఇంతిఁ బిలువుమనఁగా యీడకు రప్పించితిని
యింతలో గూడె ఇంకెంత యెగ్గువట్టునో
వింతగా శ్రీవేంకటేశ వేరొకతె యింటిలోన
బంతి యీపె వెట్టితే యీపనికి సఇంచునా

రేకు: 1344-1 శుద్ధ వసంతం సం: 23-259

పల్లవి: గెలువరాదు నీమాయ కేరడము లేమాడేము
కలికి నింతటనైనఁ గరుణించవయ్య

చ. 1: చెలితోఁ జుట్టమువలె సేసితివి మేలమేలు
వెలలేనిజాగారాలే వేగినంతాను
పలుమారుసుద్దలనే భ్రమలఁబెట్టితి విట్టె
కలలోనికూటములే కలిగినంతాను

చ. 2: ఆనుక నిజమువలె నాడితివి మేలు మేలు
మాననిజోలిమాటలే మాపుదాఁకాను
సానఁబట్టి యాసలనే సంతోసాలు రేఁచితివి
వీనుల పండుగలే విన్నంతాను

చ. 3: పాడితివి పాటవలె బాసలేమేలమేలు
యేడలేని వొడఁబా ట్లిందాఁకాను
వీడెమిచ్చి కూడితి శ్రీవేంకటేశ యీసతిని
వాడికవలపులే వలసినంతాను

రేకు: 1344-2 మధ్యమావతి సం: 23-260

పల్లవి: తనకంటె నేరుతుము తరవాతిపనులకు
చెనకెఁ జిగురుఁగొమ్మె చేఁగయయ్యీ ననరే

చ. 1: చెప్పఁబోతే నెన్నియైనా చిగిరించీ మాటలు
వొప్పుగ మోనముతోడనుండుమనవే
అప్పటనుండి వింటి సవె చాలు నేమన్నా
పిప్పి గట్టీ నీరుదియ్యఁ బేనువచ్చీ ననవే

చ. 2: చేరి పెంచఁబోతేను చెంగలించీ పగవులు
వోరుచుక గుట్టుసేసుకుండుమనవే
ఆరితేర కనుఁగొంటి నవె చాలు నిఁకమీఁద
గోరగీరితేమఱి గొప్పయేరౌ ననవే

చ. 3: వొత్తి కాఁగిలించుకొంటే వూరీని చెమటలు
వుత్తలపడక కొంత వుండుమనవే
ఇత్తల శ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్నుఁగూడె
కొత్తమొలకచన్నులే కొండలాయ ననవే

రేకు: 1344-3 ధన్నాసి సం: 23-261

పల్లవి: బడలె నీమేనెల్ల పవ్వళింతువు రావయ్య
తడయక నాకుచాలు తలగడబిల్లలు

చ. 1: ఇంత పొద్దువోయి వచ్చే వేడనుంటి విందాఁకా
యెంతమాటలఁ బెట్టుక యెవ్వతుండెనో
పంతపుఁబందేలకు పగడసా లాడితివో
సంతజాణతనములు సతులెల్ల నాడిరో

చ. 2: తడఁబడి మాటాడేవు తలఁ పెక్కడిపరాకో
బడిఁబెట్టు కెవ్వతైనా పనిగొనెనో
వెడయాసల నెందైనా వేడుకకాఁడవైతివో
వడివెట్టి వాడవారు పలపులు చల్లిరో

చ. 3: నన్నుఁ గాఁగిలంచి కూడి నలుదిక్కులు చూచేవు
సన్నల నెవ్వతైనా పంచకు వచ్చెనో
యిన్నిటా శ్రీవేంకటేశ యేమి సరసమాడేవో
కన్నవారెల్లా నీకీకందువ నేరిపిరో

రేకు: 1344-4 వరాళి సం: 23-262

పల్లవి: ఇద్దరము నున్నారము యెందువొయ్యేము
తిద్దువడ్డననుపులే తెమలించీఁగాక

చ. 1: సారెసారె నీతోను చలము సాదించనేల
కూరిములే కలిగితే కూరిచీఁగాక
కారములుగా నిన్ను గంటెసాలాడఁగనేల
పేరడైతేఁ దమకము పెడరేఁచీఁగాక

చ. 2: పొలసిపొలసి నిన్ను బొమ్మల జంకించనేల
చిలుకుఁజూపులే పెండ్లినేసీఁగాక
వులివచ్చిచెనకుల నొత్తడిపెట్టఁగనేల
తలఁగరానిమర్మాలే తలఁపించీఁగాక

చ. 3: పెనఁగిపెనఁగి మేను బెండుపరచఁగనేల
చను మొనలే నిన్ను నెచ్చరించీఁగాక
యెునసితివి శ్రీవేంకటేశుఁడ కొసరఁగనేల
తనివోనిమోవితేనె దప్పిదేర్చీఁగాక

రేకు: 1344-5 హిందోళ వసంతంసం: 23-263

పల్లవి: తక్కినవారికినేల తమక మమరు
వెక్కసపువారికిని వేడ్కలిదె యమరు

చ. 1: చనవుగలవారికిని సరసమాడిన నమరు
ననుపుగలవారికిని నగవు లమరు
మనవిగలవారికిని మంతనంబులు నమరు
పనులుగలవారికిని పైకొనుట లమరు

చ. 2: బలిమిగలవారికిని పంతమాడిన నమరు
వలపుగలవారికిని వాడికమరు
చలముగలవారికిని జంకెనలు కడు నమరు
తలఁపుగలవారికిని తగులాయ మమరు

చ. 3: ఆసగలవారికిని అందనుండఁగ నమరు
వాసిగలవారికిని వన్నెలమరు
సేసతోఁ గూడితివి శ్రీవేంకటేశ నను
బాసగలవారికిని పనులెల్ల నమరు

రేకు: 1344-6 తెలుఁగుగాంబోది సం: 23-264

పల్లవి: చేయెత్తి మొక్కితి చెక్కునొక్కితిని
ఆయెడ నీకెంత ఆసోదమో

చ. 1: కప్పుర మిచ్చితి కాఁకలు చల్లితి
ముప్పిరిఁ జన్నులు మోపితివి
చెప్పర న న్నేమిసేయుమనే వీఁక
అప్పటి నీకెంత ఆసోదమో

చ. 2: మొగము చూపితిని ముచ్చటలాడితి
నిగిడి మోవితేనె యిచ్చితి
పగటులేలరా పచరించేవిఁక
ఆగపడేవు యెంత ఆసోదమో

చ. 3: కందువ చూపితి కాఁగిటఁ గూడితి
సందడి నీమేలు చవిగొంటి
చిందురా సిగ్గు శ్రీవేంకటేశ్వర
అందరిలో నెంత యాసోదమో

రేకు: 1345-1 శంకరాభరణం సం: 23-265

పల్లవి: ఇంటికి విచ్చేసె నీతఁడిదె
జంటయియున్నాడు జంకింతురటవే

చ. 1: తలఁచినతలఁపులు తలకూడె మరి
పలికినపలుకులు ప(ఫ?) లియించె
మలసి విభువిమె యి మచ్చము లుండినా
అలుగుదురటవే అంతటిపనికి

చ. 2: విడువనివేడుకలు విరినాయ మరి
గుడిగాను కూటమి కొనసాగె
యెడనెడ నాతఁడు యెవ్వతెఁ జూచిన
తడవుదురటనే దక్కినపనికి

చ. 3: చేసినసేఁతలు చెల్లెను నీకిఁక
దాసినపెండ్లి తగులాయ
ఆసల శ్రీవేంకటాధిపుఁడు రతి
సేసె నలతురటె చేకొన్నపనికి

రేకు: 1345-2 దేవ గాంధారం సం: 23-266

పల్లవి: మెచ్చితి మప్పుడే నీకు మిక్కిలి మోహించితిమి
హెచ్చె నీసింగారాలు యెక్కడ చూచినను

చ. 1: అరిదిచెక్కులమీఁది యంగనకస్తూరిపూఁత
కరఁగి నీచెంపలపై కారివుండఁగా
దొరతనాలు సేసేవు తొయ్యలులలోననెల్లా
యిరవాయ నీయెమ్మె యేమిచెప్పేది

చ. 2: కోమలిగుబ్బలమీఁదికుంకుమగంధపుఁబూఁత
ఆముకొని నీవురాన నంటివుండఁగా
సాముసేసేవానివలె సతులకుఁజూపేవు
నే మెఱఁగమా నీవు నెరజాణవౌట

చ. 3: పొలఁతిమైనలఁదినపాడికప్పురపుపూఁత
నెలకొని రతివేల నీపై నంటఁగా
కొలువులో మాకుఁ జూపి కూడితివి మమ్మిందరి
తలఁచమా శ్రీవేంకటోత్తమనీమహిమలు

రేకు: 1345-3 ఆహిరి సం: 23-267
పల్లవి: మన్నించవయ్య యిఁక మగువను
సన్నలనే మాకుఁ జెప్పీ సంతము సేయుమని
చ. 1: పయ్యదచెమటఁ దోఁగి బయటఁబడెఁ జన్నులు
మొయ్యేఁ(య్యఁ?) జొచ్చె సిగ్గువడి ముంజేతులను
కొయ్యతనాన నంతలో గోర గీరేవు చెక్కులు
ఇయ్యెడఁ దప్పించుకొనే వెందుకొను చెలియ
చ. 2: పూరుపుగాలికి చీర వొడిసి తొడ గాన్పించె
ఆరసి సిగ్గున మూసీ నరచేతుల
కేరడాన నంతలో గిలిగించేవు సందులు
యీరీతిఁ దప్పించుకొని యెన్నికొఁ జెలియ
చ. 3: పులకల నిబ్బరాన పోఁకముడి వీడెను
కులికి సిగ్గునఁ బట్టె కొనచేతుల
అలరి శ్రీవేంకటేశ అంతలోనె కూడితివి
యెలిమి నవ్వులు నవ్వి యేమిటికొఁజ(జె)లియ

రేకు: 1345-4 వసంత వరాళి సం: 23-268

పల్లవి: ఇన్నిటా సంతోసించి ఇదివో నేను
యెన్నఁగ నీవెఱఁగని వేమున్న విఁకను

చ. 1: చెప్పకతొలుతే నీవు చేరి వింటి వామాట
విప్పుచు నేనిఁక విన్నవించేదేమి
అప్పుడే అందుకుఁగాదా అంగమెల్లఁ జెమరించె
కప్పిన నీవలపెల్లా కంటిని నేను

చ. 2: సేయకతొలుతే నీవు చేకొంటివి వూడిగము
కాయకముగా నేను కావించేదేమి
నీయందు నందుకేకాదా నిండె మోమునఁ గళలు
ఆయెడ నీపనులెల్లా అవనంటి నేను

చ. 3: కూడకతొలుతే నీవే కూడితివి కాఁగిటను
వోడక శ్రీవేంకటేశ వొరసేదేమి
యీడ నీ విందుకేకా ఇటు మేను చొక్కితివి
జాడతోడ నీమతికి సమ్మతైతి నేను

రేకు: 1345-5 సామంతం సం: 23-269

పల్లవి: ఏమి చెప్పేది నీసుద్దు లెంత లేదు
దామెన గట్టేవు బొంకు తారుమారుగాను

చ. 1: చెప్పరాదు చూపరాదు నేసిననీచేఁతలైతే
ఆప్పటి బాసలు సేసే వందరిలోన
దుప్పటికొంగైతేను తొగరద్దినట్టున్నది
కుప్పళించేవు పంతాలు గుఱుతులుగాను

చ. 2: పట్టరాదు ముట్టరాదు పచ్చియైననీమేనైతే
పెట్టుకొనేవు ఆనలు పెద్దెలుఁగున
పట్టెమంచమయితేను పదునుగారుచున్నది
దిట్టకూళతనములు దిగుపారించేవు

చ. 3: వినరాదు అనరాదు వీనుల నీగుణములు
వొనరించేవు సాకిరు లొకటొకటే
చెనకి శ్రీవేంకటేశ చెక్కులైతేఁ జెమటూరీ
యెనసితివి ఆసోదా లింకా నాపైఁ జల్లేవు

రేకు: 1345-6 నాదనామక్రియ సం: 23-270

పల్లవి: ఏల పంతాలాడుకొనీ యెందాఁకాను
తలి మెఱఁగదు ఔట్టు తనకేలే

చ. 1: సిగ్గువడేదానికేలే చెనకులు మరి
యెగ్గుపట్టేదాని కేలే యేలాటాలు
అగ్గమైననుబోఁటి కందమౌఁగాక వట్టి—
తగ్గుమొగ్గు లెంచేటితనకేలే

చ. 2: గుట్టుచూపేతనకేలే కొసరులు కడు
మట్టులేనితనకేలే మంతనములు
యిట్టె నావంటిదే యెఱుఁగుఁగాక
దట్టప్ప(పు)గర్వము దిది తనకేలే

చ. 3: కూడెఁ దొల్లె తనకేలే కొరతలు యిట్టె
వీడెమిచ్చేతనకేలే వేసాలు
యీడనె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను
తాడుపాడవుగర్వము తనకేలే

రేకు: 1346-1 ముఖారి సం: 23-271

పల్లవి: ఔనయ్య్య మంచివాఁడ వౌదువు నీవు
కానుకవట్టిన మొక్కుఁ గాదెలఁ బోతురా

చ. 1: పేరఁ బిల్చితే వచ్చితిని పెనఁగనేల చెలితో
గోరగీరేపని కిఁక గొడ్డలేఁటికి
సారపు మోవితీపుతో సరిపెట్టేవు తేనెలు
యేరు గుడిచి కాలువ యింత పొగడుదురా

చ. 2: ఆసపడి చూడఁగానే ఆడించేవు యెడమాట
చేసన్నవచ్చేపనికి చెట్ట యేఁటికి
యీసతిఁ జూచి యెవ్వతో ఇటులావున్నదనేవు
పూసినగందపుపూఁత పుప్పొడిఁ బోలుతురా

చ. 3: నగినమాటలలోన నలుసులు వెదకేవు
తగులాటాలై నమీఁద తగవేఁటికి
జిగిమీరి కూడితివి శ్రీవేంకటేశ ఇంతిని
చిగిరించితే మరి చెట్టుగట్టుకుండునా

రేకు: 1346-2 రామక్రియ సం: 23-272

పల్లవి: ఏమాయ నింతలోనే యెగ్గులేల పట్టేవు
సాముసేయఁగా నూరుపు చల్లరాదా నేను

చ. 1: యెగసక్కేలంటాను యేల నన్నుఁ దిట్టేవు
నగరాదా వూరకైన నాలోనను
వొగరాయనంటాను వురము దట్టుకొనేవు
మొగము నీవు చూచితే మొక్కరాదా నీకు

చ. 2: తివిరి కోపించెనంటా తెరవలతోఁ జెప్పేవు
చెమరించరాదా నాచెక్కులమీఁద
భ్రమసి నీకునీవే పంతములే నెరపేవు
సముకానఁ గానుక వొసఁగరాదా నీకు

చ. 3: అయ్యెడ సిగ్గువడితి నంటానే కొసరేవు
ముయ్యరాదా చన్నులు నామునిగొంగున
నెయ్యపుశ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
చెయ్యంటఁగ నిచ్చకము సేయరాదా నీకు

రేకు: 1346-3 బౌళి సం: 23-273

పల్లవి: పిలిచిన నెఱఁగవు ప్రేమపుఁబరాకున
చెలరేఁగి ఆడేవు చెల్లునయ్య ఇఁకను

చ. 1: చొక్కపుఇంతిగుబ్బలే జూజపుసారెలు నీకు
నిక్కినమంచివురమే నెత్తవలక
అక్కడిగోరిరేకలే ఆమర వ్రాసినయిండ్లు
చిక్కించు కాటలాడేవు చెల్లునయ్య యిఁకను

చ. 2: మదనమందిరమే మచ్చికపులిజూజము
వుదుటుమొగపు వజ్రా లొడ్డినరాళ్లు
మొదలైన రతులెల్ల మూలదాంట్లు నీకు
చెదరని ఆటాడేవు చెల్లునయ్య యిఁకను

చ. 3: పొలసి ముట్టి ముట్టాడేపోఁకముడి గుంతపోఁక
కొలఁదైననాభే యిక్కువైన గుంత
వెలయ శ్రీ వేంకటేశ వెసఁ గూడి సారెసారె
చెలరేఁగి ఆడేవు చెల్లునయ్య యిఁకను

రేకు: 1346-4 సౌరాష్ట్రం సం: 23-274

పల్లవి: ఎంత నిజమరివి నిన్నే మిచెప్పేది
బంతినే నోరూరించేబాగు లింతేకాక

చ. 1: నెలఁతపై బత్తిగలితేనిన్న రాకవుందువా
పెలుచవై కన్నప్పటిబేఁట మేకాక
తలఁపులో నుండితేను తమకించకుందువా
పలికి కొసరేవేళ పచారాలేకాక

చ. 2: చేరి కూడ వేడుకైతే సిగ్గులువడుదువా
వూరట సరసాలాడే వుబ్బులుగాక
నారుకొన్నపనులైతే నవ్వులు నవ్వుదువా
పోరచి చుట్టరికాల పొందు లింతేకాక

చ. 3: ఆయములు గరఁగితే నండఁ బవ్వలింతువా
కాయకపు ప్రియముల గచ్చులుగాక
యీాయెడ శ్రీవేంకటేశ యింతలో నేలితి వీకె
చాయమరుఁడు పుట్టించేచవు లింతేకాక

రేకు: 1346-5 సింధురామక్రియ సం: 23-275

పల్లవి: నాటకాలు బూటకాలు నాతోనే వలెనా
నీటుతోడ నీసుద్దులు నే నెఱఁగనా

చ. 1: తళుకున నాపెఁజూచి తలవంచుకొంటివిని
వలన నాసపడనవానివలెనె
తలఁపులో నారూపు తలపోసి తలపోసి
నెలకొని కరఁగేది నే నెఱఁగనా

చ. 2: ఆకెమాట చెవుల విననట్టె మారుమాటాడవు
నాకు నా కొప్పగించినవానివలెనె
చేకొని యీపరాకున సిగ్గులమాట లూహించి
నీకునీకె సుకించేది నే నెఱఁగనా

చ. 3: నీమీఁద నాపె చేచాఁచ నీవు నాపైఁ జేచాఁచేవు
వాములుగా నన్నుఁ గూడేవానివలెనే
యీామై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీమన సాడ నుండుట నే నెఱఁగనా

రేకు: 1346-6 కేదార గౌళ సం: 23-276

పల్లవి: అడుగరే యీసుద్ది యౌనో కాదో
పడఁతులా తనభావము దెలియను

చ. 1: యెంతకు నంతేకాని యెక్కుడుబాఁతౌనటే
పంతాన తాఁబిలిచితేఁ బలికితిని
అంతలోనే సొలయుచు నప్పటివిఁ గొసరీని
వింతదాననా తనవిధము దెలియనా

చ. 2: కలది కలట్టే కాక కపటము నిజమటే
అలరి వీడెమిచ్చితే నందుకొంటివి
బలిమిఁ బైకొననంటా పలుమారుదూరీని
సిలుగుదాననా తనచిత్తము దెలియనా

చ. 3: యెప్పటికప్పుడే కాక యిఁక సంగతౌనటే
ముప్పిరి దాఁజూచి తేను మొక్కితిని
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డెనసియు నాసపడీ
తప్పించేదాననా తగవు దెలియనా

రేకు: 1347-1 మేఘరంజి సం: 23-277

పల్లవి: ఆతనిమనసు నేనే అన్నిటా నెఱుఁగుదును
ఘాత లెంతచూపినా కరఁగ దెంతైనా

చ. 1: చెలులాల మీరు బుద్ధి చెప్పకురే పతికిని
వలపు వద్దనబోతే వడిబడును
తలఁచుక మా ఇంటికి తనయంతనే రానీ
తెలుపఁబోతే మంకు దేర దెంతైనా

చ. 2: చేయివట్టి తియ్యకురే చెలరేఁగి రమణుని
చాయ కొత్తితే గుణము చండిపడును
పాయక తానే వుండీఁ బట్టినచలమైతేను
పాయపు మదము మట్టుపడదు యెంతైనా

చ. 3: అనిశము పైపైని ఆనలెల్ల బెట్టకురే
పెనఁగితే ప్రియములు పిప్పిగట్టును
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో దానె నన్ను
వెనకటిపొందు యిఁక వింతగాదెంతైనా

రేకు: 1347-2 ముఖారి సం: 23-278

పల్లవి: ఎమ్మెలు సేయఁగనేలే యేలుఁగాక
చిమ్ముగోరితాఁకులేలే చేకొనుఁగాక

చ. 1: కన్నుల నవ్వినవాఁడు కాఁకలతు సేయఁగనేలే
వన్నెతోనే మాయింటికి వచ్చుఁగాక
సన్నలు సేసినవాఁడు చలము సాదించనేలే
మన్నించి నాతోను మాటాడుఁగాక

చ. 2: తప్పక చూచినవాఁడు తనివోని జాగులేలే
కప్పురము నోటికిచ్చి కలయుఁగాక
కొప్పువట్టినట్టివాఁడు గుట్టు సేసుకుండనేలే
కప్పిన పయ్యద దీసి కాఁగిలించుఁగాక

చ. 3: చెలిమి సేసినవాఁడు సిగ్గులు వడఁగనేలే
సొలసి రతుల చవి చూచుఁగాక
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
వొలసిన మోవితేనె లొసగుఁగాక

రేకు: 1347-3 కురంజి సం: 23-279

పల్లవి: మానవుని వోజలు మరి యెవ్వరి చెప్పినా
నానఁబెట్టి యేతుల నడపేవుగాని

చ. 1: నయగారితనమున నాలి నీమాటలకేల
ప్రియమంది మోహించి బేలనైతిని
క్రియ యెఱఁగక నీవు కిమ్ములవారిఁ దెచ్చి
బయలీఁదింపుచు మముఁ బఱచేవుగాని

చ. 2: మతకారి సరసపు మచ్చిక నీమాయకే
ఇతవుగాఁ బైకొని యెడ్డనైతివి
చతురతలేక నీవుసరిగా నెవ్వతోఁ దెచ్చి
కుతిలపెట్టి గో రాదిగొనేవుగాక

చ. 3: సటకారి నీమోవిచాయలనవ్వులకే
తటుకున నినుఁగూడి దంటనైతిని
నటన శ్రీవేంకటనాయక నీవాకెఁ దెచ్చి
కిటుకుదీర మొక్కించి కేరించేవుగాని

రేకు: 1347-4 సామంతం సం: 23-280

పల్లవి: ఎందున్నవి నీనిజాలు యేమాయ నేఁడు
ముందుముందే నీ కప్పటి మూరెఁడునోరు

చ. 1: యెవ్వతె మాటలోకాని ఇప్పుడిట్టె వినవచ్చె
నివ్వటిల్లఁ బవళించె నీఇంటిలోన
దివ్వెవెలుఁగున నీడ దిష్టముగఁ గానవచ్చె
వువ్విళ్లూర నాకె వలచున్నాఁడ నందువు

చ. 2: యెటువంటిదోకాని ఇదె వాసనలు వచ్చె
మటమాయ దోమతెర మంచములోన
గటనఁ బన్ని రందుండి కాలువలు గట్టి వచ్చె
ఇటు నాకెవయసు మీఁ దెత్తితినే నందువు

చ. 3: యెంతనేరుపరో కానియెదురుగఁ దానె వచ్చె
సంతైననీయురముపచ్చడములోన
ఇంతలోనె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పొంత నీయేకాంతము యెప్పుడు దాఁచనందువు

రేకు: 1347-5 బౌళి సం: 23-281

పల్లవి: ఏమి నవ్వులునవ్వేవు యెందాఁకా సరసము
తేమ చెమటలు నిండె తెరవేయవయ్యా

చ. 1: కోమలిని రమ్మంటా కొంగు నీవు వట్టితేను
మోము చూడఁగానే పోఁకముడి వీడెను
చేముంచి చేతఁబట్టి(ట్ట?) సిగ్గుపడె నంతలోనే
కామించి నీపచ్చడము గప్పరాదా యిపుడు

చ. 2: పెనఁగి చుట్టరికాన ప్రియము నీవు చెప్పఁగా
ననువుగ నప్పటి పయ్యద జారెను
వొనర వేరొకచోత నొగిఁ బట్టి సిగ్గువడీ
తనివోని వేడుకతో తలుపు మూయరాదా

చ. 3: చేయిచాఁచి రతికిని సేసనీవు వెట్టఁగాను
ఆయెడఁ జెంపపై తురు మటుజారెను
పాయక శ్రీవేంకటేశ పట్టరాక సిగ్గువడీ
యీయెడఁ గాఁగిటఁ గూడి ఇట్టె వుండు మిఁకను

రేకు: 1347-6 ఆహిరి సం: 23-282

పల్లవి: చాలుఁజాలు నిఁకనేల జాలిఁబెట్టేవు
యేలాటాలు యేనుగతో నింత నేరఁగలమా

చ. 1: తగవులే నడపేవు తరుకాణకే వచ్చేవు
జగడము సాదించితే సారె నవ్వేవు
మొగము చూచితేను ముంచి యానలు వెట్టేవు
యెగసక్కేఁడవు నీతో నింత నేరఁగలమా

చ. 2: తేరకొనఁ జూచేవు తేనె లుట్టిపడించేవు
తారుచుఁ దిట్టితే జాణతనాలాడేవు
మారుమోమై వుండితేను మరియు వేఁడుకొనేవు
యీరీతివాఁవు నీతో నిఁత నేరఁగలమా

చ. 3: కందువలే చూపేవు కాఁగిటనె కూడేవు
అంది వెంగెమాడితేను అట్టె మెచ్చేవు
ఇందరిలో శ్రీవేంకటేశుఁడ నన్నేలతివి
యిందలివాఁడవు నీతో నింత నేరఁగలమా

రేకు: 1348-1 శ్రీరాగం సం: 23-283

పల్లవి: పిలువవే ఇఁకపైనఁ బ్రియుఁడితఁడే నీకు
పొలుపునఁ బాయరాని పొందెంచ వలదా

చ. 1: అతిమోహములవారు అలుగఁగఁ జెల్లునా
ఇతవుగ వేఁడుకొనే దింపొఁగాక
ఇతర కాంతలకుఁగా నితని నేల కోపించ
పతి కిచ్చకములాడేపొడి యెంచవలదా

చ. 2: చేతికి లోనైనవారు సిగ్గువడఁదగునా
కాతరానఁ బైకొంటే కందువగాక
దూతిక పొందులకుఁగా దూరనేల రమణుని
నీతైనమొగనిసేవ నీవెంచవలదా

చ. 3: సేసవెట్టినవారికి చిడుముడి పొసఁగునా
వేసరని కూటములే వేడుకగాక
శ్రీసతిని గూడితిని శ్రీవేంకటేశ్వరుని
ఆస నిన్నేలినవానినట్టె మెచ్చవలదా

రేకు: 1348-2 హిందోళం సం: 23-284

పల్లవి: ఏవీ(దీ?) నీయందుఁ జేపు ఇందులో నొకటైన
ఆదిగొని నిన్ను మెచ్చే నప్పుడే నేను

చ. 1: తప్పక వలపులెల్ల తలకెక్కినప్పుడు
కప్పురమే నోటికి కారమై తోఁచు
వుప్పటిల్లు మదనాగ్ని వొడల రేఁగినపుడు
అప్పటి పన్నీరు వుడుకై తోఁచును

చ. 2: కందునైన కాంక్షలు కన్నులఁ దొట్టినప్పుడు
గందమే బాసటమై కమ్ముకొనును
మందలించి తమకము మనసునిండినప్పుడు
విందుల నమృతమైనా వెగటై తోఁచును

చ. 3: చిగిరింపుఁజింత చేయిచెక్కిట మోపినపుడు
మొగిఁ గొప్పువిరులెల్లా మెనలై నిక్కు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
నగిన నగవులెల్లా ననుపులై మించును

రేకు: 1348-3 ఆహిరి సం: 23-285

పల్లవి: ఆనతీవయ్యా నాకు నన్నియు వినేఁగాని
మోనముతో సిగ్గువడి మొక్కక వుందానను

చ. 1: చెలులచే విన్నపము సేయింపించిన మాటలు
తలఁగ కెప్పుడు నీచిత్తాన నున్నవా
వలపురొమ్ము లబంటి వాసులు యీఁతలబంటి
పలుకఁగ సిగ్గువడి భ్రమతో నుందానను

చ. 2: కానుకగా నీకంపినకందువై నగురుతులు
తానకమై బండారాన దాఁచివున్నవా
నానెను జవ్వనమెల్లా నవ్వులు మొలకలెత్తె
పూని యంట సిగ్గువడి పొంచుకవుందానను

చ. 3: ఇంపులసన్నలనే యెచ్చరించినచేఁతలు
ముంపులై యిప్పుడు నీమోవి నున్నవా
నింపుల శ్రీవేంకటేశ నీమోవినే మరుముద్ర
గుంపు నిన్నుఁగూడి సిగ్గు గుఱుతై వుందానను

రేకు: 1348-4 వేళావళి సం: 23-286

పల్లవి: నెరవాదిరమణుఁడ నీదే భాగ్యము
వొరిమి నీ కందురు వొక్కటైపున్నారు

చ. 1: గరగరనియాఁటది గడుఁజేసూటై యుండితే
వరుసఁ గూడేటిమొగవానిభాగ్యము
ఇరవునయిటుగాక యెరవెరవై వుండితే
పరగ నందుకంటె పాపములేదు

చ. 2: చక్కనిరమణి రతిచవులు వుట్టించఁగాను
చొక్కమై కూడేటిసరసునిభాగ్యము
వెక్కసము యిటుగాక విరసాలు నెరపితే
పక్కన నందుకంటె పాపములేదు

చ. 3: పాయపుదానను నీపాదాలసేవ సేయఁగ
నీయందే మెచ్చఁగలిగె నీభాగ్యము
యీయెడ శ్రీవేంకటేశ యిటుగాక మరెవ్వరు
పాయుమన్ననందుకంటె పాపములేదు

రేకు: 1348-5 భైరవి సం: 23-287

పల్లవి: నేరనివారముమాకు నేరపవయ్య బుద్దులు
మేరమీరి మాయంతనే మెప్పంచఁగలమా

చ. 1: వంతువాసులు పుట్టించి వనితల రప్పంచి
సంతవలపులురేఁచిజాజరాడేవు
బంతికూటివారమింతే పందేలువేసి నే మంత
దొంతులపొందులు చేసి తోడుచూపఁగలమా

చ. 2: వొక్కరికొక్కరు చూడ వొడివట్టి పెనఁగుచు
జక్కవచన్నులు ముట్టి జాజరాడేవు
ప్రక్కనుండేవార మింతేబలిమి సేసి నేమంత
పిక్కటెల్లేనీమోవి పిప్పి సేయఁగలమా

చ. 3: ఆయము లిందరి కంటి ఆసలెల్లాఁ బుట్టించి
చాయల సన్నలనే జాజరాడేవు
యీాయెడ శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
సోయగానఁ గొసరుచు సొలయఁగఁగలమా

రేకు: 1348-6 గౌళ సం: 23-288

పల్లవి: నే నెప్పుడు నెఱుఁగుదు నీగుణాలు
కానీలే పనులకు తార్కాణలు గావలదా

చ. 1: చేకొని చెమటలెల్లా చెక్కులనే కారఁగాను
ఆకెకు మోహించనంటా నానవెట్టేవు
నీకు నీబొంకులెల్లాను విజమువలె నుండితే
వాకునఁ జూచినయట్టివారు మెచ్చవలదా

చ. 2: ముంచిన నిట్టూర్పులు ముక్కు కొన నుండఁగాను
అంచె నాకెఁ గూడనంటా నానవెట్టేవు
యెంచఁగ నీకపటాలు యియ్యకోలు నీకైతే
పొంచి పొరుగువారెల్లా పొగడఁగవలదా

చ. 3: పోసరించి మేనిమీఁద పులకలు నిండుండఁగా
ఆసపడ నాకెకంటా నానవెట్టేవు
రాసికెక్క శ్రీవేంకటరమణ నన్నేలితివి
సేసవెట్టినాకె కివి పసెలవు గావలదా

రేకు: 1349-1 దేశాళం సం: 23-289

పల్లవి: ఇంకనేల యీసుద్దు లెందాఁకాను
సంకె దీరె నన్నిటాను చలివాసె నీకును

చ. 1: పిలిచి పెక్కుసతుల పెండ్లియాడితివంటా
చలము సాదించేనా సారెసారెకు
తెలివిఁ జెక్కుల గోరు దీఇంచుకొంటివంటా
నెలకొన్న నిను నేఁడు నేరము లెంచేనా

చ. 2: తచ్చక కెవ్వతెచీరో దట్టిగట్టుకొంటివంటా
మచ్చరించేనా నీతో మాటిమాటికి
మెచ్చుల కాపెసొమ్ములు మెడఁబెట్టుకొంటివంటా
తుచ్చములాడి నీపై దూరుగట్టేనా

చ. 3: ఆసపడి వాడవారి నట్టె చూచితివంటా
బాసగొనేనా నిన్నుఁ బలుమారును
సేసవెట్టి కూడితివి శ్రీవేంకటేశ నన్ను
చేసినసేఁతల కెల్ల సిగ్గువరచేనా

రేకు: 1349-2 వరాళి సం: 23-290

పల్లవి: ఇటమీఁద సతి నిన్ను నేమి సేసునో
తటుకున మీఁదటెత్తు తలఁచుకో యిపుడు

చ. 1: తెఱవ కన్నుల నిద్రదేరేది మానిపేనంటా
మఱచిచన్నులు విసికి మలసితివి
జఱసి యందుకుఁగాను జంకించె ఆకెఁ (కె?) దిట్టితే
తఱి పూవులచెండునఁ దాఁకవేసే విదివో

చ. 2: వనితయలఁతపరవశము మానిసేనంటా
కొనగోర చెక్కు చురుకున నూఁదితి
పెనచి యందుకు నాకె బిగియించి పట్టితేను
మొనసి యట్టె కప్రములు చల్లేవిదివో

చ. 3: ఇంతి నిన్నుఁ గూడినచొక్కిట్టె మానిపేనంటా
కాంతకెమ్మోవిమీఁద గంటిసేసితి
చెంత నందుకుఁగా నవ్వె శ్రీవేంకటేశ నిన్నాకె
పంతాన పన్నీరు పైపైఁ జల్లే విదివో

రేకు: 1349-3 సాళంగం సం: 23-291

పల్లవి: కానవచ్చె నీగుణాలు కలవెల్లాను
నానవేసేవు పొందులు నవ్వుతానే యిపుడు

చ. 1: నెట్టుకొన్న మోహమైతే నిన్న రాకవుందువా
వెట్టికిఁ గాఁగా నుఁడు విచ్చేసితివి
చుట్టమవైతే నీవు సుద్దులు చెప్పుదువా
బట్టబాయ లీఁదించేవు పనిలేనిపనికి

చ. 2: ఆయములు గరఁగితే నప్పుడే కూడవా
కాయకముగాఁగాను కాఁక చల్లేవు
చేయంకెకు వచ్చితేను సిగ్గులువడుదువా
మాయలెల్లాఁ జేసేవు మనసుపట్టలేక

చ. 3: వేడుక గలిగితేను విడెము చేతికియ్యవా
యీడుజాడ గాఁగాను యెమ్మెసేసేవు
పాడితో శ్రీవేంకటేశ పైకొని నన్నేలితివి
జోడుగూడ మన్నించేవు సొంపులెల్లా రేఁగను

రేకు: 1349-4 భైరవి సం: 23-292

పల్లవి: చాలదా నాకీభాగ్యము సతమాయను
కాలుదొక్కినప్పుడే కానిమ్మంటిఁగదవే

చ. 1: మాఁటలు సారె నాడితే మందెమేళమయ్యీని
యేఁటికే గుట్టున నుండే దిదిమేలే
చీకటి మాటికినేల చేరి యానలువెట్టీనే
చాటించి తొల్లె తనకు సతినైతిఁగదవే

చ. 2: చూపులు చూడఁజూడఁగ చులుకఁదనములౌను
యేపున మాటున నుండు టిది మేలే
తోపునూకుడు సేసుక తొంగి యేల చూచీనే
వోపి తొల్లె సేసవెట్టి వుందానఁగదవే

చ. 3: నవ్వులు సారె నవ్వఁగ ననుపు మొగచాటయ్యీ
యవ్వలఁ గాంగిట నించె నిది మేలే
రవ్వలేల సేసీనేరతి శ్రీవేంకటేశుఁడు
వువ్విళ్లూర దేవులనై వొప్పుగొంటిఁగదవే

రేకు: 1349-5 మళవిశ్రీ సం: 23-293

పల్లవి: ఇట్టిపతితో వేసా లింకనేలే
చుట్టరికములే నీతోఁ జూచుకొనఁగదవే

చ. 1: చెక్కులు నొక్కఁగాను చేయివట్టి తియ్యఁగాను
యెక్కుడుగాఁ బెనఁగేవు ఇదియేమే
యిక్కువ లంటఁగాను ఇయ్యకోళ్లు సేయఁగాను
మొక్కు మొక్కి కరఁగవు ముంచి నీవదేమే

చ. 2: మంచిమాట లాడఁగాను మచ్చికలు చూపఁగాను
యెంచుకోనేవు నేలలే ఇదియేమే
కంచపు మోవియ్యఁగాను కాఁగిలించుకొనఁగాను
ఇంచుకంత నవ్వు నవ్వి యెనయ విధేమే

చ. 3: పంతము లియ్యఁగాను బాసలెల్లఁ జేయఁగాను
యెంతైనాఁ గొసరేవు ఇదియేమే
వింతగా బుజ్జగించి శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను
దొంతిరతిఁ దనియవు తోడనే ఇదేమే

రేకు:	1349-6 లలిత	సం:	23-294

పల్లవి:	నీ వెఱఁగవా ఇంత నెరజాణవు
భావించి నవ్వంగానే పంతములాడుదురా

చ. 1:	చిత్తగించవమ్మా చెలి; నీవు చూచుదాఁకా
తత్తరించీ రమణుఁడు; తలవంతురా
కొత్తలేఁటికమ్మా కొలువులోపల; నీపై
బత్తితోడఁ బిలువఁగఁ బలుకకుందురా

చ. 2:	అందుకొనవమ్మా ఆతఁడు వీడెము చేత
నందియ్యఁగాఁ జేకొనక అట్టె వుందురా
మందట లేలమ్మా మనసిచ్చి తనమోవి
నిందు నీకుఁ బెట్టఁగాను వీఁగుచునుండుదురా

చ. 3:	మెచ్చు మెచ్చవమ్మా మేకొని శ్రీవేంకటేశుఁ
డచ్చముగా నిన్నుఁ గూడె నలఇంతురా
తచ్చనేఁటికమ్మా తగినరతుల నీతో
మచ్చికలాడఁగాను మరపింతురా

రేకు: 1350-1 శుద్ధ వసంతం సం: 23-295

పల్లవి: ఎదురుబడి వలపు లిట్టుండవలదా
ముదురుఁబరువముతో మునుకొని నివిగో

చ. 1: సిగ్గులనే తెరవేసి చిరునవ్వుఁదలఁబాలు
అగ్గలము నీపైఁజల్లీ నతివ
వెగ్గళించి నీమ్మై నవి చెమటముత్యాలై
దిగ్గన నలువంకట దిగుపారీనవిగో

చ. 2: తీపుమోవి లిం(విం?) దువెట్టి తెలిగన్నుల తేటల
చూపులవిడేలు వెట్టీసుదతి
పైపై యవే నిమేనఁ బచ్చిపులకమోసులై
మోపులకొలఁదులతో ముంచుకొనీ నవిగో

చ. 3: కాఁగిటనే పీఁటవెట్టి కడురతుల వేడుకఁ
బాఁగుచునుఁ బెండ్లాడీ పడఁతి
చేఁగలై యవే శ్రీవేంకటేశ్వర
దాఁగనిమరుకళలై తమిరేఁచీ నవిగో

రేకు: 1350-2 మాళవిగౌళ సం: 23-296

పల్లవి: ఏమీ ననఁగఁజాల మింత నిన్ను
దీమసాన నీకునీవే తెలుసుటగాక

చ. 1: కలికి వలచెనంటా కడల నాడుకొనేవు
నెలకొన్న నీమాఁటలు నీకేమెచ్చు
అలయింతురా మరి యంత సేసినవాఁడవు
నలఁగకుండాఁ బొందునడపుటగాక

చ. 2: అప్పటి నవ్వు నవ్వేవు అండవాయదంటాను
నెప్పున నీచేఁతలు నీకే మెచ్చు
కొప్పువట్టి తీతురా గోమునఁ బెంచినవాఁడ
వొప్పురతుల మెల్లనే వోలార్చుటగాక

చ. 3: సారె నిన్నుఁ గూడెనంటా సన్నలుసేసిచూపేవు
నేరుపు లిన్నియు నీవి నీకే మెచ్చు
జీరదీతురా యిట్టె శ్రీవేంకట మేలేవాఁడ
వోరలేక యిచ్చకమై వుండుటగాక

రేకు: 1350-3 బౌళి సం: 23-297

పల్లవి: ఉండనీవే తానెట్లనుండినాను నే నిమ్మ
పండు గానుకిచ్చి తేను పనులెల్లా నౌను

చ. 1: యెఱఁగనిపొందులు యెక్కడోవారికినైన
జఱఁగఁ బొఁ (బొం?) దైతేనే చవిపుట్టును
మఱచి ముమ్మదముతో మాఁకువలె నుండినాను
గుఱిగా గోరుసోఁకితే కోరికలు రేఁగును

చ. 2: అగ్గలమై యించుక మోహములేనివారికైన
దగ్గరఁ గూచుండితేనే తమిరేఁగును
సిగ్గువడి తలవంచి చెక్కు చేతిలో నుండిన
వొగ్గి మాటలాడితేనే వొడఁబడు మనసు

చ. 3: అక్కజపువొట్లతో నటిగినవారికైన
చక్కఁజూచి నవ్వితేనే సమ్మతులౌను
యిక్కు వెఱిఁగి శ్రీవేంకటేశుఁడిటు నన్నుఁ గూడె
మొక్కిననా మొక్కులెల్ల ముద్దులై తోఁచును

రేకు: 1350-4 రామక్రియ సం: 23-298

పల్లవి: ఇప్పుడును నీవు నాకు ఇచ్చకము సేసేవు
అప్పుడైతే నింతేసి అనువుకు వత్తువా

చ. 1: చలముసాదించేవేళ సరసునితోడను
పలికినపలుకెల్ల పంతములౌను
యెలమి నీలాగెరింగి ఇందుకే వూరకుండితి
మలసి నీవంతలోనే మంచివాఁడవైతివి

చ. 2: గోరబుసేసేటివేళ గోర గీరి యేపాటి
సరసములాడినాను సాదింపులౌను
ధరలో నీజాడెరిఁగి తలవంచుక వుండితి
మరిగి నీవంతలోనే మంచివాఁడవైతివి

చ. 3: సిగ్గులు పరచేవేళ శ్రీవేంకటేశ్వర నీ
దగ్గరఁ గూచుండినాను తమకమౌను
వొగ్గి నీగుణ మెరిఁగి వోటుకై నిన్నుఁ గూడితి
మగ్గపు రతులవేళ మంచివాఁడ వైతివి

రేకు: 1350-5 నాదనామక్రియ సం: 23-299

పల్లవి: సేసపాలవారము చెల్లుబడి గల
తాసువలె రతులకిద్దరము నున్నారము

చ. 1: మఱవదు మనసు మరి నీవాడిన మాట
గుఱుతై మనసులో గుబ్బతిలీని
మఱి తెరమఱుఁగైతే మంచివయ్యా నన్నియును
తఱియైన పనొ(న?) ల కిద్దరము నున్నారము

చ. 2: సాయదు నెఁ (నెం?) జెరివి పంతపు నిచేఁతలకు
చేయంటినజిడ్డులై చిమ్మిరేఁచీని
మూయికి మూయున్న దింతే మూసిదాఁచితి నీకు
దాయిదండ్లై వేడుక కిద్దరము నున్నారము

చ. 3: విడువదు అసా విఁ (విం?) త నీకూటములకు
వుడివోపవలపులై వుమ్మగిలీని
చెడనిమేలైన దింతె శ్రీవేంకటేశ యెప్పుడు
తడయని మొక్కుల కిద్దరము నున్నారము

రేకు: 1350-6 సామంతం సం: 23-300

పల్లవి: నీకివి ప్రియములు నే నెఱుఁగుదును
జోకలాయ మెచ్చుము సతినయ్యా

చ. 1: పొలపుఁజూపులలో బొమ్మలజంకెలు
సళుపుఁబ్రియములతో సాదింపులు
పలుసరసములలో పంతపుసణఁగులు
చెలి నెరపీ నదె చేకొనవయ్యా

చ. 2: మక్కువ సొందులలో మందె మేళములు
మొక్కులలో గోరిమొన వాండ్లు
చొక్కుమాటలలో సొలపుల కొసరులు
మిక్కిలి జరపీ మెఇకొనవయ్యా

చ. 3: తఱితీపులలో తమకపుటాసలు
చిఱునవ్వులలో సిగ్గులును
నెఱితో శ్రీవేంకటనిలయ నిన్నెనసీ
మఱియు నాపె నేనుమన్నించవయ్యా

రేకు: 1351-1 మంగళకౌసిక సం: 23-301

పల్లవి: తగవు తానె యెఱుఁగు తాఁ జేసినచేఁతకు
చిగురునవ్వులు రేఁచె చెక్కు చేతిచెలిని

చ. 1: కొప్పు దువ్వుమనఁగదే కురుచులగూడఁ జెలికి
ఇప్పుడే తాఁబానుపుపై వింతసేసెను
దప్పికిఁ బన్నీరుసు తానే ఇమ్మనఁగదే
మిప్పిరిగా నలఇంచె మొక్కఁగానే చెలిని

చ. 2: వీడె మిమ్మనఁగదవే వెస నిచ్చకముగాను
యీడఁ దెరమఱంగున నింతసేసెను
వాడువిడువ సురటి వడి విసరుమనవే
జోడై నిట్టూర్పులు రేఁచె చూడఁగానే చెలిని

చ. 3: గంద మిమ్మనఁగదవే కాఁగిట శ్రీవేంకటేశుఁ
డిందుముఖిఁ జెమరింప నింతసేసెను
కందువాయ మోవికే కప్పుర మిమ్మనగదే
అంది కళలెల్లా రేఁచె నంటఁగానే చెలిని

రేకు: 1351-2 బౌళి సం: 23-302

పల్లవి: ఆతఁడు చేసినభాగ్య మది యెట్టిదో
చేతికి వచ్చినమేలై చెంతలనే నిలిచె

చ. 1: చెలి నీవు పతితోడ నెలవి నవ్వినవ్వు
వెలయనాతని మతి వెన్నెలగాసె
నిలిచి కట్టెదురను నీవుండినభావము
తలకొన్నముంగిటనిదా (దా?) నమై నిలిచె

చ. 2: జాఱకుండా రమణునిఁ జక్కఁగఁ జూచినచూపు
మీఁటి యాతనిమేనిపై మెఱుఁగు లెక్కె
వేఱులేక నీవిప్పుడు వీడెమిచ్చిన భావము
ఆఱడితో మదనుని అడపమై నిలిచె

చ. 3: తోడనే శ్రీవేంకటేశుతో నీవాడినమాటలు
జాడ నాతనిచెవులకు చవులు మించె
కూడితివి యింతోనే కూరిమి నీరతి యిదె
పాడితో యింటిలోపలిబండారమై నిలిచె

రేకు: 1351-3 పాడి సం: 23-303

పల్లవి: మందెమేళమై నీవు మన్నంచరాఁగాను
యెందుకనీ విన్నవించే నీడ నుండేనయ్యా

చ. 1: మంతనములాడఁగానే మరి దగ్గరవచ్చునా
ఇంటనుండేదేమేలు ఇద్దరికిని
చెంతల నప్పటి నిన్ను చేఇ దాఁకించవచ్చునా
వింతలుగా నాకు నీవు విడెమియ్యఁగాను

చ. 2: నవ్వులు మీరు నవ్వఁగా నడుము చొరవచ్చునా
వువ్విళ్లూర గుట్టుతోడ నుండుటే రీతి
జవ్వనమదముసోక చన్నులంటించవచ్చునా
పువ్వులు ముడుపుమని పొందు సేయఁగాను

చ. 3: ఇట్టె మీరు గూడుండఁగ నెజేఁగించుకోవచ్చునా
చుట్టుక మీవారమై మెచ్చుటే మేలు
రట్టుగా శ్రీవేంకటేశ ఇట్టె యాడుకోవచ్చునా
జట్టిగొనందుకు నీవు సన్న సేయఁగను

రేకు: 1351-4 హిజ్జిజి సం: 23-304

పల్లవి: మానవచ్చునా నీవు మన్నించఁగా
సేనలుగా సేవలు సేసేమయ్యా

చ. 1: పెనఁగఁగవచ్చునాప్రియపడి నీవు రాఁగా
కినియఁగవచ్చునా కేలు చాఁగఁగ
అనుమానించవచ్చునా ఆయమునీవంటఁగాను
చెనకి నీ చెప్పినట్లు సేసేమయ్యా

చ. 2: కసరఁగవచ్చునా కప్పురము నీవియ్యఁగ
కొసరంగవచ్చునా కూడేనసంగ
విసుగఁగవచ్చునా వేఁడుకతో మాటాడఁగ
పసలుగా నిన్నట్టె పాయకుండేమయ్యా

చ. 3: తలవంచవచ్చునా తప్ప కిట్టె చూడఁగాను
చలపట్టవచ్చునా చౌలు చూపఁగ
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నునేలితివి
కలకాలమును నిన్నుఁ గడుమెచ్చేమయ్యా

రేకు: 1351-5 మధ్యమావతి సం: 23-305

పల్లవి: మాతోనేఁటికి నీవు మరిఁ బంతాలాడేవు
అతలివారినే యిఁక ననరాదా నీవు

చ. 1: పన్నుక నీచెక్కులపై పచ్చిచేఁతలతో వచ్చి
నన్ను దప్పక చూచేవు నగితినంటా
యెన్నిక మీరంగ నేఁడు యింతసేసిన ఆపెను
వన్నెలుగా నటు దూరవద్దా నీవు

చ. 2: కుంకుమపూఁత చన్నుల గురుతులతోనే వచ్చి
సంకుమోవఁ దిట్టేవు చూచితినంటా
కంకిగా నిన్నిఁతారడిగాఁ జేసినాపెను
వంకలొత్తి సాదించవద్దా నీవు

చ. 3: పేరిచిన నీమోవి పిడుచలతోనే వచ్చి
మేరమీరి తిట్టేవు మెచ్చితినంటా
యీరీతి శ్రీవేంకటేశయేలితివి నన్నాపెను
వారించక బుద్దిచెప్పవద్దా నీవు

రేకు: 1351-6 నాదనామక్రియ సం: 23-306

పల్లవి: ఎందాఁకా మంకుఁదన మింత గలదా
విందుచెప్ప నాతఁడువేడుకపడీని

చ. 1: చలపాదితనమేల సరసములాడఁగదే
అలరి వేడుకపడీనాతఁడందుకు
తలవంచుకుండనేలతప్పకచూడఁగదవె
నెలవున నీమొకమై నిలుచున్నాడతఁడు

చ. 2: పంతము లింతోనేల పట్టఁగదవే విడెము
వింతగాఁ దమకించీనివిభుఁడించుకు
చింతలో నుండఁగనేలచిమ్మిరేఁగి నవ్వఁగదె
చెంతనేకాచుకుండి చెలఁగీ నతఁడు

చ. 3: సిగ్గులువడఁగనేల చేకొని కూడఁగదవె
వెగ్గళించీశ్రీవేంకటవిభుఁడిందుకు
తగ్గనియాసోదమేలేతనిసి మెచ్చఁగదవే
నిగ్గుల నిన్నేలి మేలు నిండించీ నతఁడు

రేకు: 1352-1 వరాళి సం: 23-307

పల్లవి: వినఁగదవే చెలులవిన్నపము లిఁకనైన
మనసిచ్చి నీకాతఁడు మరిగినాఁడిపుడు

చ. 1: సిగ్గులకుఁ దుదయేది చేయిచాఁచఁ గదవే
వొగ్గి విడమిచ్చీ నాతఁ డొడిఁబెట్టుక
కగ్గివున్న దెల్లఁ దేరెకన్నుల మొక్కఁగదవే
అగ్గలమై నీకు నాతఁడాసపడీ నిపుడు

చ. 2: గుట్టుసేయ నెడయేది కొంగు వొడ్డఁగదవే
వొట్టి సొమ్ములిచ్చీ నాతఁ డొడిఁబెట్టుక
చిట్టకములెల్ల మానె చివియొగ్గఁ గదవే
అగ్గలమై నీకు నతఁ డాసపడీ నిపుడు

చ. 3: తప్పించుకోఁ బనిలేదు కొప్పు వంచఁగదవే
వొప్పుగఁ బువ్వులు నించీ నొడిఁబెట్టుక
తప్పు లిన్నియునుఁ బాసె తగిలి మోవియ్యఁగదే
ఇప్పాట శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నిపుడు

రేకు: 1352-2 దేశాక్షి సం: 23-308

పల్లవి: ఏమేమి నీవు సేసినా నింపే నాకు
యీమేకులకు నే లోనే యిఁక నేల సిగ్గులు

చ. 1: మూసీఁ దనచేత నోరు ముసిముసినవ్వు రాఁగా
సేసినచేఁత నీవే చెప్పుకొనఁగ
ఆసుద్దులు వినవేడుకయ్యీ నాపెచేత నాకు
యీసరిఁగ గూచుండఁబెట్టు మిఁకనేల సిగ్గులు

చ. 2: నిట్టచూపులనుఁ జూచీ నివ్వెరగు గాఁగాను
నెట్టన నీ నిజములు నెరపఁగాను
గట్టిగా నడిగేను నిక్కము నాపెను నేను
యెట్టైనా రప్పించు నీ కిఁక నేల సిగ్గులు

చ. 3: మెచ్చీఁ దనవేలను మేనెల్లఁ గళలుబ్బఁగ
చెచ్చెర సన్న సేయఁగ శ్రీవేంకటేశ
తచ్చి నన్నే లితి విది తలపోసే నాపెతోడ
యిచ్చకములెల్లఁ జూపు మిఁకనేల సిగ్గులు

రేకు: 1352-3 మేచ బౌళి సం: 23-309

పల్లవి: ఇందాఁకావలెఁ గాదు యిదేమి నీవు
సందుగొని సారెసారె సరసమాడేవు

చ. 1: నీమాట సరివచ్చెనో నీ వేమి దలఁచితివో
నామోము చూచి యిట్టె నవ్వు నవ్వేవు
కాముఁడు మరి యేసెనో కాంతలమాట వింటివో
గోమునఁ బెంచినచన్నుఁగొండ లంటేవు

చ. 2: ఇచ్చకములు చూపేవో యెగసక్కెము చేసేవో
మచ్చికచేయుచు నాతో మాటలాడేవు
ముచ్చటాడెవో కీరాలు మోహము నీకుఁ బుట్టెనో
పచ్చితేనెమోవికి పైకొనేవు

చ. 3: వన్నెలు చూపవలసో వాడికలు సేసేవో
కన్నులఁ దప్పకచూచి కాఁగిలించేవు
వెన్నెలచంద్రుఁ డేఁచెనో వేడుకో శ్రీవేంకటేశ
మన్ననరతుల కె మచ్చు చల్లేవు

రేకు: 1352-4 ఆహిరినాట సం: 23-310

పల్లవి: ఆయనాయ రామయ్య అంగనవద్దికి నేఁడు
పాయపునీదేవి యింత బాఁతిపడఁగాను

చ. 1: మాటలెన్ని లేవు మాపుదాఁకా నాడితేను
కూటమి నీమన్ననలే గుఱుతుగాక
నే(నేఁ?) టనెతప్పెనా నీనేరుపులేపచరించ
అఁటది నీవిరహాన నట్లుండఁగాను

చ. 2: నవ్వు లెన్ని లేవు ననుపులు జరపితే
యివ్వలఁ గరుణించుటే యెన్నికెగాక
రవ్వగా నిందువంకనా రాజసము నిలిపేది
జవ్వని నీయాసల లోఁగఁగాను

చ. 3: మొక్కు లెన్ని లేవు మోపులుగాఁ గట్టితేను
యిక్కువ నిట్టె కూడిన దెక్కుడుగాక
నిక్కము శ్రీవేంకటేశ నీజాడ లిట్లానా
చక్కనమ్మ నీపొందు సారెఁ జేయఁగాను

రేకు: 1352-5 శుద్ధ వసంతం సం: 23-311

పల్లవి: ఏల తమకించేవు యింతలోఁ దప్పిన దేమి
ఆలికిఁ బంపుసేసితే నందరును నవ్వరా

చ. 1: పంతములాడినయాకె పలుక కుండీనా
రంతులఁ దిట్టినయాకె రాకుంతునా
యింతలోనె నీవు లోఁగి యేల ప్రియాలు చెప్పేవు
కాంతకుఁ గిందుపడితే కడవారు నవ్వరా

చ. 2: మారుకొని వుండినాపె మాటలాడకుండీనా
బీరమాడినాపె ప్రేమ నెంచకుండీనా
ఆరీతి యిందుకునేల అట్టె కాఁతాళించేవు
కోరి సతికి బంటైతే కొమ్మలెల్ల నవ్వరా

చ. 3: అలుకదేరినయాపె అట్టె కూడకుండీనా
కలసె నిన్నాపె ఇఁకఁ గాదనీనా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
తొలుతాపెకు మొక్కితే దొడ్డవారు నవ్వరా

రేకు: 1352-6 శ్రీరాగం సం: 23-312

పల్లవి: ఇప్పుడే నీరమణుడు యెనసీ నిన్ను
చిప్పలఁగ నప్పటిని సేద దేర్చవలెను

చ. 1: నెలవంకచందురులు నీచన్నుపై నుండఁగ
పలుమారు విరహతాపములేలే
కలువరేకులు నీకన్నులై వుండఁగాను
చలి మందుల వుపచారములేలే

చ. 2: మదనరేకలు నీకు మరి చెక్కుల నుండఁగా
అదన పువ్వుటమ్ముల కలుకనేలే
చెదరనికప్పురము సెలవుల నుండఁగాను
యెదుటనున్నకాఁకలు యేమిసేసీనే

చ. 3: మంచినచుక్కలు నీమోవిపై నిండివుండఁగా
యెంచిపగలంటి నిద్దిరించేవేలే
అంచెల శ్రీవేంకటేశు డంతలోనే నిన్నుఁ గూడె
ఇంచుకంతా చీఁకటి ఇఁకనేడదే

రేకు: 1353-1 సామంతం సం: 23-313

పల్లవి: మచ్చికగలపతివి మంచిదయ్యీని
ఇచ్చకము సేసుకొని యెనయరాదా

చ. 1: చిగురుమోవితోడిచెలి మాటలాడితేను
వొనరై వుండక వేరే వుప్పునుండునా
యెగసక్కేలంటానేల యెగ్గుపట్టేవు
సగమందుఁ బంచదార చల్లుకోరాదా

చ. 2: వసమై కెందామరవంటికనుచూపులు
దెసల నెఱ్ఱనుండక తెల్లనుండినా
యెసఁగి కోపమంటాను యేల దూరేవు
పొసఁగఁ గప్రము గొంత పొదుపుకోరాదా

చ. 3: సరుస కొండలనంటినచన్నులకాఁగిలి నీకు
ధర గట్లుగాక మెత్తన లయ్యీనా
యిరవై శ్రీవేంకటేశ యేలితివింతలోనె
పురమున బూదండలొత్తుకోరాదా

రేకు: 1353-2 నారాయణి సం: 23-314

పల్లవి: మచ్చికగలపతివి మంచిదయ్యీని
ఇచ్చకము సేసుకొని యెనయరాదా

చ. 1: చిగురుమోవతోడిచెలి మాటలాడితేను
వొనరై వుండక వేరే వుప్పనుండునా
యెగసక్కేలంటానేల యెగ్గుపట్టేవు
సగమందుఁ బంచదార చల్లుకోరాదా

చ. 2: పసమై కెందామరలవంటికనుచూపులు
దెసల నెఱ్ఱనుండక తెల్లనుండినా
యెసఁగి కోపమంటాను యేల దూరేవు
పొసఁగఁ గప్రము గొంత పొదువుకోరాదా

చ. 3: సరుస కొండలనంటినచన్నులకాఁగిలి నీకు
ధర గట్టుగాక మెత్తన లయ్యీనా
యిరవై శ్రీవేంకటేశ యేలితి వింతలోనె
పురమునఁ బూదండ లొత్తుకోరాదా

రేకు: 1353-3 దేశాళం సం: 23-315

పల్లవి: మొకదాకిరిదానను మొదల నేను
వెకలివైతివి యిట్టె వెలయవయ్యా

చ. 1: తేనెగారీ నీమాటల తేటలూరీ నీచూపులను
ఆనుకొని యేమనిఆడే నిన్ను
నానుపుఁజెమటలును ననలై నపులకలు
సోనల నీమేన నివె చూచుకోవయ్యా

చ. 2: రసముబ్బీ నవ్వులను రాసివడీ మొక్కులను
దొసకులేమని దూరే నిన్ను
పసిమి మోముకళలు బచ్చనమై గుఱుతులు
సుసరాన నీకునీవే చూచుకోవయ్యా

చ. 3: చిగిరించీ సిగ్గులను చిమ్మిరేఁగీవేడుకల
తగవుల సేమని తడవే నిన్ను
నిగిడిశ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
సొగసులు నీకునీవే చూచుకోవయ్యా

రేకు: 1353-4 మాళవిగౌళ సం: 23-316

పల్లవి: నీచలము నీకు జెల్లె నేరుపులేల
చేచేత నీవంటఁగానుసిగ్గు లిఁకనేల

చ. 1: మొగము చూచి నీకు మొక్కినయప్పుడే తొంటి
జగడములెల్లఁ బాసె జంకింపులేల
చిగురుమోవి యెత్తి చేరి మాటాడినపుడె
పగయెల్లాఁ దీరె మరి పంతములేలా

చ. 2: చనవుసేసుక నీసంగడిఁ గూచున్నప్పుడె
కినుకలిన్నియుఁ దీరె కేరడాలేల
చెనకి నీకు నేను సేవలు సేసినప్పుడె
వెనకకోపము దీరె వేఁడుకొననేలా

చ. 3: కైవశమై నిన్ను నేనుఁ గాఁగిలించుకొన్నప్పుడె
యేవలెల్లా ముగిసెను యెన్నికెలేల
శ్రీవేంకటేశ నీపై సేసనేఁ బెట్టినప్పుడె
చేవలు నిండె రతుల చిఱునవ్వులేలా

రేకు: 1353-5 సింధురామక్రియ సం: 23-317

పల్లవి: నే నిట్టె కొసరితేను నీ వెటిఁగేవా
కానుకలు చూపనేల కమ్మటి బీరములు

చ. 1: చెంతలఁగూడేయప్పుడే చెప్పేఁగాక బుద్ది
పంతమాడనేల నీతో పలుమారును
మంతనమైనపుడే మహిమలు చూపేఁగాక
దొంతి వెట్టనేల నీతో తోడనే గర్వములు

చ. 2: వీడెమిచ్చేయప్పుడే వేడుక సేసేఁగాక
పాడివెట్టనేల నీతో బలిమిసేసి
యీడుజోడైనప్పుడేయెరుక సేసేఁగాక
కూడఁగట్టనేల నీతో గుంపెనసొలపులు

చ. 3: నవ్వేయిప్పుడే నిన్ను నంటున మెచ్చేఁగాక
రవ్వసేయనేల నిన్ను రచ్చలోనను
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వువ్విళ్లూరించఁగలనేల వొక్కపరే యాసలు

రేకు: 1353-6 తెలుఁగుగాంబోది సం: 23-318

పల్లవి: ఏల జోలిసేసేవు యెందాఁకాను
యీలీల నన్నివినోదా లింటిలోనే వున్నవి

చ. 1: జలజాక్షి నవ్వులైతే చల్లు వెదలు
కలికితనములు పోఁకకుఁ బుట్టేఁడు
నిలువుఁజక్క దనము నిండుబండారు
కలిగె నీకు రావయ్య కందువల నిపుడు

చ. 2: తరుణిపలుకులె తంగేడుజున్ను
బెరసేటివిన్నపము పెళ్లిచెట్టు
అరుదైన వలపెల్లా నట్టె కొటారు
దొరకె నీకు రావయ్యతొడిఁబడనిపుడు

చ. 3: వనితకాఁగిటిరతి వాడనిపువ్వు
తనివోనిమోవి దొంతరబోనము
యెనసితివి శ్రీవేంకటేశ యీకెను
వొనగూడీ రావయ్య వొద్దికతోనిపుడు

రేకు: 1354-1 రీతి గౌళ సం: 23-319

పల్లవి: చెలువుని కిచ్చకమే సేయఁగదవే
అలుగుదురా వట్టిఆఙడిగానిపుడు

చ. 1: పిలిచి తెచ్చినవేళ ప్రియము చెప్పఁగవలె
బలిమి చూపుదురా పతితోను
చెలిమి సేవేటివేళ చెక్కులు నొక్కఁగవలె
చలము సాదింతురా సంగతిగా దిపుడు

చ. 2: నవ్వులు నవ్వేటివేళ నయము చూపఁగవలె
రవ్వలు సేయుదురా రమణునిని
పువ్వులు ముడిచేవేళ పొడవు సేయఁగవలె
దువ్వుచునే గోరనూఁదుదురా ఇపుడు

చ. 3: ఆసలఁ గూడేటివేళ అట్టె బుజ్జగించవలె
వేసరింతురా శ్రీవేంకటేశ్వరు
బాసలుగొనేటివేళ భ్రమయించఁగవలె
వాసు లెక్కించుక తలవంతురా ఇపుడు

రేకు: 1354-2 వసంత వరాళి సం: 23-320

పల్లవి: వెఱవక లోనికి విచ్చేయవయ్యా
యెఱపరికము లాపె యేమిసేసీ నీకను

చ. 1: నగిన యందాఁకానే నాతుల కినుకలు
మొగము చూచుదాఁకానే ముంగోపాలు
తగిలినదాఁకానే తలపోఁతలిన్నియును
యెగసక్కే లాపె నిన్ను యేలాడీ నీకను

చ. 2: వొద్దికి వచ్చుదాఁకానే వొట్లును సత్యములు
ముద్దుమా టాఁడుదాఁకానే మొఱఁగులెల్లా
చద్దిమో విచ్చుదాఁనే సాదింపులన్నియును
ఇద్దెన మొక్కితే నాపె యేల తిట్టీ నీకను

చ. 3: వీడెమిచ్చుదాఁకానే వెక్కసములన్నియును
వాడికైనదాఁకానే వాసులెల్లాను
కూడితి యింతలోనే కూరిమి శ్రీవేంకటేశ
యీడనే వున్నాఁడ వాకె యేలదూరీ నీకను

రేకు: 1354-3 పాడి సం: 23-321

పల్లవి: నే నంతదాననా ఇంత నీవేకాక
తానకపుననుపులే తగులమి రేఁచును

చ. 1: నేరిచిన నేరకున్న నీకా బాఁతి నేను
ఆరితేరినట్టి నీయిల్లాలఁ గనక
యీరీతి నెంత మెచ్చేవు యిచ్చకురాలనంటా
సారపుమోహములన్నీఁ జవులు పుట్టించును

చ. 2: యియ్యకున్న మారుకొన్నఇంకా నీకే బాఁతి నేను
ఇయ్యెడ నీవూడిగపుటింతిఁ గనక
నెయ్యాన నెంతవేఁడుకొనేవుఇతవరినంటా
యెయ్యెడ నీకరుణే ఇంపులు పుట్టించును

చ. 3: ఆసపడ్డ వలసిన అట్టె నీకె బాఁతినేను
నేసవెట్టికూడినచెలిఁ గనక
యీసరి శ్రీవేంకటేశ యేలనవ్వే వంటినంటా
బాసతోడినీభోగమే పనికి రప్పించును

రేకు: 1354-4 శ్రీరాగం సం: 23-322

పల్లవి: ఎదురుచూచీఁ జెలి యెఱుక నీకు లేదా
సదరాన రావయ్య చలపట్ట కిపుడు

చ. 1: కలికిగుబ్బలనేటికమలపుమొగ్గలు
యెలమితో నీకు మీఁదెత్తుకున్నది
తలఁప మోవితేనె తరివట్టుకున్నది
పిలువుమనె రావయ్య పెనఁగక ఇపుడు

చ. 2: కడివోనిమాటలనేకప్పురపుఁబలుకులు
బడిబడిఁ గానుకగాఁ బట్టుకున్నది
వెడనవ్వుచిలుపాలు విందువెట్టే నన్నన్నది
వొడికాన రావయ్య వోసరించ కిపుడు

చ. 3: కలయుఁ గాఁగిలనేటి కమ్మనిపులుపా నీకు
సొలయుచు సూడిదెగాఁ జూపుకున్నది
అలరి శ్రీవేంకటేశ అంతలోనె కూడితివి
నెలవుకొని రావయ్య నీయంతనే యిపుడు

రేకు: 1354-5 సామంతం సం: 23-323

పల్లవి: చెయ్యరానిచేఁతల వోచెన్నకేశ్వరా
చేయం టేవు గండికోటచెన్నకేశ్వరా

చ. 1: బగ్గన నీవు నాపయ్యద వట్టి తియ్యఁగా
సిగ్గులువడఁగరాదా చెన్నకేశ్వరా
వొగ్గి యెవ్వతోమెట్టెలు వొట్టి నావేలఁ బెట్టఁగ
యెగ్గులువట్టఁగరాదా ఇటు చెన్నకేశ్వరా

చ. 2: సిరులతో నీవు నన్నుఁ జెనకులు చెనకఁగా
శిరసైన నూఁచరాదా చెన్నకేశ్వరా
తెరలోనఁ బెట్టుకొన్న తెరవను మొక్కించఁగ
వొరిమఁ దిట్టఁగరాదా వో చెన్నకేశ్వరా

చ. 3: వేవేలుగా మన్నించివేడుకపడఁగా నీకు
సేవలు సేయఁగరాదా చెన్నకేశ్వరా
యీవల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
తావుకొని మెచ్చరాదా తగుచెన్నకేశ్వరా

రేకు: 1354-6 సామ వరాళి సం: 23-324

పల్లవి: ఏఁటి కొడఁబరపించే వింత నీ బోఁడ్లచే
సాటించితే నాఁటదానిపంత మేమున్నది

చ. 1: చూపులకు లోనైతేసురతపుటాస వుట్టు
చేపట్లకు వచ్చితే సిగ్గులు వుట్టు
దాపుగా వద్దనుండితేతలపోఁతలోనఁజిక్కు
పైపైనే అఁటదానిపంత మేమున్నది

చ. 2: మాటలకు లోనైతే మర్మములు గరఁగును
కూటువకతలకే గుఱుతులంటు
యీటుకు వచ్చితేనే యీరవౌను పనులెల్లా
పాటించితే నాఁటదానిపంత మేమున్నది

చ. 3: నగవుకు లోనైతే నంట్లుమిక్కుటమౌను
మొగమోట గలిగితేముచ్చట దీరు
జిగిఁ గూడె నిన్ను నీకె శ్రీవేంకటేశ్వర
పగటున నాఁటదాని పంత మేమున్నది

రేకు: 1355-1 ఆహిరి సం: 23-325

పల్లవి: ఇంకనేల దాఁచేవు యెఱిఁగినపనులకు
కంకియైన నీమేననే కంటిమి నే మిపుడు

చ. 1: మంతనాన నీవు నాకె మాటలాడుకొంటిరట
అంతలోఁబూవులవేట్లాడితిరట
సంతములన్నియు మీలోఁ బచరించుకొంటిరట
వింతలు మీసుద్దులెల్లా వింటిమి నే మిపుడు

చ. 2: నటనల నిద్దరును నవ్వులు నవ్వితిరట
గుటుకలు మోవులఁ జేకొంటిరట
తటుకన కిందమీఁదట లాడితిరట
విటతనములు మీవి వింటిమి లే(నే?) మిపుడు

చ. 3: మొక్కుచును మీరు మోములు చూచుకొంటిరట
ఇక్కురతులఁ గూడి యేలితిరట
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
వెక్కసపు మీలాగులు వింటిమి నే మిపుడు

రేకు: 1355-2 దేవ గాంధారం సం: 23-326

పల్లవి: కానీవోయి అందుకేమి కడపరాయ
కానవచ్చె నీపనులు కడపరాయా

చ. 1: కప్పురమియ్యఁగదోయి కడపరాయ
కప్పవోయి పచ్చడము కడపరాయ
కప్పమివే మాచన్నులు కడపరాయ నీకు
కప్పులు మోవి నున్నవి కడపరాయ

చ. 2: కాలు దాఁకించకు మంత కడపరాయ
గాలపుచూపులు మాని కడపరాయ
కాలమందె నీవారము కడపరాయ మాలో
కైలాటాలు వెట్టుమీ కడపరాయ

చ. 3: కందులేని వలపుల కడపరాయ
గందము మామేననిదె కడపరాయ
కందర్పజనక వోకడపరాయ
కందువ శ్రీవేంకటాద్రి కడపరాయా

రేకు:	1355-3 శంకరాభరణం	సం:	23-327

పల్లవి:	నెలఁతభాగ్య మిఁకనీచేతిది
తొలఁకీసిరులు నీవు తొంగిచూచినపుడే

చ. 1:	తరుణికి నీవలపు దాకొన్నతలపోఁత
మరుగుటే నీమంచిమరులూ
తొరలినమోపులదోమటి పెనువిందు
నిరతితో గుఱుతాయ నీవు ముట్టితేనే

చ. 2:	మగువకు నీతో నవ్వు మానరానితరితీపు
వగయెఱఁగని విడువనిజోలి
తగువైనమంచితెల్లఁదామరపూవులపూజ
అగపడె నీ వీకె నాయమంటినపుడే

చ. 3:	సతికి నీకూటమి సారె నాగవల్లిపెండ్లి
మతకపురతులకు మానినిజిడ్డు
తతి శ్రీవేంకటేశ్వర దక్కినరత్నాలసొమ్ము
జితమాయ నీవిపుడు చేకొనేలినపుడే

రేకు: 1355-4 బౌళి సం: 23-328

పల్లవి: ఎన్నెన్నిమేళ్లుగలవో యింకా నాపెవల్ల
సన్నసేసి యేకతాన జరయవయ్యా

చ. 1: సంగడి జాణతనాలు సారెకు నాడీ నాపె
జంగిలి వావులకుఁ జేచాఁచీ నీకాపె
గుంగిలి సరసముల గురులు సోఁకించీ నాపె
కొంగువట్టి నీవింకాఁ గొసరవయ్యా

చ. 2: బయలు నవ్వులు మరీఁ బైపై నవ్వీ నాపె
దయివారుఁజూపులఁగాఁతాళించీ నాపె
నయగారవలపులు నానఁబెట్టీ నీపై నాపె
ప్రియమునఁ జెక్కు నొక్కి పెనఁగవయ్యా

చ. 3: మూఁటగట్టువినయాలు మొక్కులు మొక్కీ నాపె
వాఁటపు మోవితేనెలు వంచీ నాపె
యీటువెట్టి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
జూటుఁదనము లాపెను సొలయవయ్యా

రేకు: 1355-5 రామక్రియ సం: 23-329

పల్లవి: గజరున నంతానేల కలయఁబెట్టుకొనేవు
గుజగుజతో నవ్వుకొంటా నుండరాదా

చ. 1: ఇంతితోనే మాటాడితే నేల పూనుకవచ్చేవు
సంతసతులెల్లా నీకు సమమేకాదా
పంతపు సవతులము పడితళించుకొంటేను
కొంతగొంత నీవు నవ్వుకొంటా నుండరాదా

చ. 2: నెలఁతఁ దప్పువట్టితే నీవేల దిద్దవచ్చేవు
సళువుగొల్లెత లింతా సరియేకాదా
వలపుదొడ్డివారము వంతువాసు లెంచుకొంటే
కులికి నీవు నవ్వుకొంటా నుండరాదా

చ. 3: అంగన నే సాదించితే ఆకెనేల మొక్కించేవు
జంగిలివారెల్లా నీకు సరియే కదా
యెంగిలి శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
కుంగక కూడితి నవ్వుకొంటా నుండరాదా

రేకు: 1355-6 శ్రీరాగం సం: 23-330
పల్లవి: బంగారుమేడలలోన పరమాత్ముఁడు వాఁడే
సింగారాలు మీఁదమీఁద సేయరే చెలులు
చ. 1: తట్టుపుణుఁగుల నూనె తగ నిండా నంటుకొని
గట్టిగాఁ గస్తూరియుట కలివెట్టి
మట్టులేనిపన్నీట మజ్జనమాడె నిదె
వెట్టదీర నిందరును విసరరే చెలులు
చ. 2: కప్పురపుగందవొడి కదు నిట్టె మెత్తుఁకొని
కొప్పుదువ్వి ముడిచెను గొజ్జంగలెల్లా
తెప్పులుగా నించుకొని తిరుమేన సొమ్ములెల్లా
దప్పిదేర విడెమీరే తలకొని చెలులు
చ. 3: అలమేలుమంగ నురమందు నిట్టె నుంచుకొని
తలసిదండలుమోఁచె నిలువునను
చెలరేఁగి యారగించె శ్రీవేంకటేశ్వరుఁడు
కొలువున్నాఁడు మోహాలు గుప్పరే చెలులు

రేకు: 1356-1 దేవ గాంధారం సం: 23-331

పల్లవి: యెశోధ నీబిడ్డ నేమందుము
రాశికెక్క మమ్మురక్షించుమనవో

చ. 1: వుట్టమీఁదటనున్నపాలు వెన్నా
చట్లతోడనెసాదించీ
కొట్లుగొట్టుచు గోపాళులుఁదాను
అట్లు తోడనే యారగించీని

చ. 2: జిడ్లు గాకుండ చిలుపాలుఁ దేనె
తెడ్లతోఁ దినీ దేవి దేవి
గుడ్లకొలఁది కోరి మెసఁగుచు
దిడ్లకంతలఁదిరుగాడీని

చ. 3: పండ్లుఁ గాయలును బాసలు వీదుల
దొండ్లుగాఁ జేసి దొబ్బి దొబ్బి
బండ్ల శ్రీవేంకటపతి యలమేల్ మంగతో
యిండ్లిండ్ల వాకిండ్ల నేఁగే రదివో

రేకు: 1356-2 సాళంగ నాట సం: 23-332

పల్లవి: సంతోషించితిమి నిన్ను చల్లఁగాఁబెండ్లాతివి
యింతటివాఁడ నైతివియేమనేము నిన్నును

చ. 1: వొఱపైనజాణఁడవు వొక్కఁడవే యింతటికి
గుఱి నీ వలపులైతే కోటానంగోటి
పఱపుపైఁ జాచితేను పదారువేలు దేవుళ్ళు
యెఱఁగము నీమహిమ లేమనేము నిన్నును

చ. 2: వొలసితే నొకతెను పురమెక్కించుకొందువు
పిలిచి వొకతె నెత్తిఁబెట్టుకొందువు
తలుపు దెఱచితేను దండనెల్లా గొల్లెతలే
యిల నిన్ను గెలువలే మేమనేము నిన్నును

చ. 3: గొందిఁ బవ్వళించితేనే గోవింరాజవు నీవు
కందున నిలుచుంటే శ్రీవేంకటపతివి
అందుకొంటేనే యిద్దరంగనలు పాదాలొద్ద
యిందరిలోమమ్మేలితి వేమనేము నిన్నును

రేకు: 1356-3 హిజ్జిజి సం: 23-333

పల్లవి: ఏకతానఁ జేయరాదా ఇటువంటి సుద్దులెల్లా
యీాకడా కడవారి కెమ్మెలై తోఁచును

చ. 1: చెలరేఁగిచేఁగి చెప్పె నీ కాపె సుద్దులు
నలువంక నీవూ నవ్వే వందుకు
మెలఁగి మీసుద్దు లివి మీకే చవులుగాని
కెలవి సవతులను గేలియ్యై తోఁచును

చ. 2: దగ్గరి దగ్గరి ఆపె తగ సేవసేసీ నీకు
అగ్గమై నీ నందుకెల్లా ఆనందించేవు
యెగ్గు సిగ్గులేక మీకే యితవులై వుండుఁగాని
వొగ్గిన నీలేమలకు వొరటులై తోఁచును

చ. 3: కమ్మటిఁ గమ్మటి నాపె కాఁగిలించి కూడఁగాను
సమ్మతించి నీనందుకు చనవిచ్చేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యింపు మీకేయౌఁగాని
దొమ్మిగాఁగూడినమాకు తోడునీడై తోఁచును

రేకు: 1356-4 మంగళకౌసిక సం: 23-334

పల్లవి: అలుకలు దీరెను అంగన నీకు మొక్కెను
వెలయఁగఁ జెలికి విడె మియ్యరాదా

చ. 1: నగమెంత నవ్వేవు నాలి యంత సేసేవు
జిగి నాపె చెప్పినట్లు సేయరాదా
మొగ మెందాఁకాఁ జూచేవుముట్టిముట్టేమాడేవు
వెగటుదీరఁ జేతికి విడె మియ్యదా

చ. 2: మాట లెంతేశాడేవు మనపసు లేలొరసేవు
యీటున నీకెకుఁజనవియ్యరాదా
పాటలెన్ని వాడేవు పరాకేల సేసేవు
వేటుఁబువ్వుల చేతికి విడెమియ్యరాదా

చ. 3: మక్కువెంత సేసేవు మర్మమేమి యంటేవు
పిక్కటిల్ల నిఁక సేసవెట్టరాదా
గక్కన శ్రీవేంకటేశ కలసితి వీకెనిట్టె
వెక్కసమై చేతికి విడెమియ్యరాదా

రేకు: 1356-5 సౌరాష్ట్రం సం: 23-335

పల్లవి: ఏల వేఁడుకొనేవెయ్యా యింకానీవు
చాలుకొని మొక్కే నాకుజాలి యాడది

చ. 1: తగిలి నీరూపము తలఁపులో నుండఁగాను
వెగటైన విరహపువేద నేడది
పగటున నీపై పాటలు నోట నుండఁగా
చిగిరించేమతిలోనిచింత యేడది

చ. 2: సొరిది నీవిచ్చినట్టిసొమ్ము నామేన నుండఁగా
కరకరిఁబెట్టు మరి కాఁకలేడవి
వెరసి నీసుడులెల్ల వినేవీనుల(లు?) నుండఁగా
అరుదైన ఆడియాస అలపేడది

చ. 3: కలసినయిప్పటినీకాఁగిలి నా కుండఁగాను
బలిమిఁ బెనఁగేయట్టిసంతా లేడవి
నెలవై శ్రీవేంకటేశ నీవే నేనై యుండఁగాను
కులికి కులికి మరి కొస రేడది

రేకు: 1356-6 శంకరాభరణం సం: 23-336

పల్లవి: నీసాజ మిట్లానే నీవద్ద నుండఁగాను
వేసాలెల్ల నాముందర మేమారుఁజూపేవు

చ. 1: వరసకువచ్చినాపె వద్దఁ గాచుకుండఁగాను
యెరవుల యాఁటదాని నేల తెచ్చేవు
సరవితో సొమ్ము నీమైచందమై వుండఁగాను
పరుల సొమ్ముల కెంత బాఁతిపడేవు

చ. 2: ముందు పెండ్లాడినాపె నీమొగము చూడఁగాను
కందువనున్నాఁటదానికడ చూచేవు
చిందుచు గందము నీజిగిమేన నుండఁగాను
అందుకోలుగందానకు నాసపడేవు

చ. 3: చేకొనూడిగపుటాపె చెవిలో విన్నవించఁగా
ఆకడాఁటదానిమాట లాలకించేవు
యీకడ శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
సేకరించి యిపుడుగా చెలరేఁగేవు

రేకు: 1357-1 సామంతం సం: 23-337

పల్లవి: మాతోనేల బీరాలు మాపుదకా నెరపేవు
ఆతరుణి పిలిచితే నౌఁగాదనఁగలవా

చ. 1: రంతులెంత సేసినాను రాజసము చూపినాను
చెంతల నింతికి నీవు చేతికిలోనే
పంతము లెన్నాడినాను పైపై నెంతపెనఁగినా
మంతనానఁ జెలితోను మారుకొనఁగలవా

చ. 2: దీకొనెంత తిట్టినాను దిమ్మరివై వొరసినా
చేకొన్నసతికి నీవు చేతికిలోనే
బూక లెంత సేసినాను బుద్ధులెన్ని నేరిచినా
మేకొన్న యీవనితను మితిమీరఁగలవా

చ. 3: కోరి యెంత జంకించినా గుబ్బలెంత పిసికినా
చేరికూడినకాంతకు చేతికిలోనే
యీరీతి శ్రీవేంకటేశ యింకా నెట్లుండినా
సారెకు నీలేమతోడ సరిదూఁగఁగలవా

రేకు: 1357-2 కురంజి సం: 23-338

పల్లవి: వెంగెమాడ నెంత లేదు వేగినంతాను
అంగవించి మఱచేవా అంతటినావలపు

చ. 1: సాదించ నెంత లేదు జంకెనబొమ్మల నిన్ను
సోదించనెంతలేదు చొప్పు నీమేన
కాదనము రావయ్య కడ నీ వెందుండినాను
పాదుకొని మఱచేవా బత్తితో నావలపు

చ. 2: నవ్వు నవ్వ నెంత లేదు నాలిసేసి విన్నిపుడు
రవ్వసేయ నెంత లేదు రమణులతో
రువ్వి తిట్టము రావయ్య రుచు లెందు చూచినాను
చివ్వనను మఱచేవా సేవతో నావలపు

చ. 3: అలయించ నెంత లేదు అట్టె రతుల నిన్ను
వెలయించ నెంత లేదు వేడుకతోడ
సొలయము రావయ్య సొంపగు శ్రీవేంకటేశ
కలసితి మఱచేవా కందువనావలపు

రేకు: 1357-3 లలిత సం: 23-339

పల్లవి: ఏమయ్యా నే నటువంటి యెరవులదాననా
వోముచు నప్పటి నన్ను వొడఁబరచేవు

చ. 1: మనసు చూడవలసి మాటాడ కూరకుండితే
కినిసితి నంటా వచ్చి కేలువట్టేవు
చనవు మెరసి నిన్ను జంకించి చూచితేను
పెనఁగుచు నాకు నెంతో ప్రియముచెప్పేవు

చ. 2: తమి రేచవలసి నేఁ దలవంచుకొంటేను
అమరఁ గోపించెనంటా ఆయాలంటేవు
భ్రమఇంచవలసి నేఁ బంతములాడుకొంటే
చెమటచేతుల నన్నుఁజెక్కునొక్కేవు

చ. 3: బలిమిఁ గూడవలసిపానుపుపై నుండితేను
అలిగినజాడలంటా నాదరించేవు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్నింతలో
వలపెక్కుడాయనంటా వన్నెమోవిచ్చేవు

రేకు: 1357-4 ఆహిరి సం: 23-340

పల్లవి: ఎప్పటివలె నుండరే యెరవులు మీకేల
కుప్పలుఁ దెప్పలునాయ గురుతైన వలపలు

చ. 1: మచ్చికకు వెల లేదు మాటలకుఁ దుద లేదు
గచ్చులేల సేసేవే కాంతునితోను
ఇచ్చకమాడినదాన వెగసక్కే లాడనేల
పచ్చివెచ్చిఁ జేయకువే పాయని నీ వలపు

చ. 2: చేపులకు వంత లేదు సొంపులకు వేళలేదు
పైపై నలుగుదురా పతితోను
చేపట్టినదానవు సిగ్గులువదుదురా
ఆపసోపాలఁ బెట్టకు అందపునీవలపు

చ. 3: కూటమికి గురిలేదు కోరకకు కొద్ది లేదు
గాటారింపులేలే శ్రీవేంకటేశుతోను
చాటి కూడినదానవు జడియఁగనేమిటికి
తూఁటతాఁటల దాఁచకు తోరపునీవలపు

రేకు: 1357-5 నాగ వరాళి సం: 23-341

పల్లవి: ఇద్దరికిఁబోదు యెంతకెంత సేసేవు
ముద్దరాల యతనితో మొగమోట వలదా

చ. 1: సరసమాడేయప్పుడే చలము సాదించేవు
తెరమరఁగై తేనే తిట్టు దిట్టేవు
సరుగ నెదుటనుంటే సారెఁ గొప్పు వట్టేవు
మురిపేన, మొగనితో మొగమోట వలదా

చ. 2: పెనఁగేటి యప్పుడే బెట్టిగోరు దాఁకించేవు
కనుఁగొన్నయంతలోనే గద్దించేవు
చనవు నీ కిచ్చితేనె సదమదము సేసేవు
మొనసి యీతనితోను మొగమోట వలదా

చ. 3: కెలసి నవ్వేయప్పుడే కిందుపడ వేసేవు
కలికి మోవియ్యఁగానే గంటిసేసేవు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
మొలక వయసు దాన మొగమోట వలదా

రేకు: 1357-6 హిజ్జిజి సం: 23-342

పల్లవి: అందుకేమెచ్చవద్దా అతివ నీవు
పొందెటిఁగినవానితోఁ బోర మరి తగవా

చ. 1: పిలిచినప్పుడే వచ్చెపెనఁగితే లోనాయ
చలమేల సాదించేవే సరసునివి
వెలి నెంత సేసినాను వేళ దప్పనియ్యఁడు
తలఁపులోనున్న వాని తప్పులెంచఁదగవా

చ. 2: నవ్వినప్పుడేనవ్వె ననుపున మెచ్చఁజేసె
రవ్వలే సేసేవే రమణునిని
యెవ్వతెఁ బెండ్లాడినాను యిరవునీనగరే
వువ్విళ్లూరించేవారి నొద్దనఁగఁదగవా

చ. 3: కూడినప్పుడే కూడెను కూరిమికి సంతోసించె
వీడనేలాడేవే శ్రీవేంకటేశుని
వీడె మెవ్వతిచ్చినాను విడువఁడు నీకాఁగిలి
జోడయి వుండినవాని సోదించఁగవా

రేకు: 1358-1 కుంతల వరాళి సం: 23-343

పల్లవి: వట్టియాసఁ బొరలేము వలచి పాయఁగలేక
చిట్టకపుఁ జేతులకే చిక్కేవా

చ. 1: వుంకువైన బాసలును వొట్లుఁ దలఁచవట
జంకించి నేఁ జూచితేను జడిసేవా
పొంకమైన సేవలును పొందులు మఱచితివి
కంకణాలచేయి వేసితే కరఁగేవా

చ. 2: గాఁటపునీవలపులు కందువలుఁ జూడవట
మాఁటల సొలపులకు మనసిచ్చేవా
వాఁటపునా ప్రియములు వాసులు నెంచవైతివి
తేటలనా నవ్వులకు తెమలేవా

చ. 3: మన్ననలు నాగుణాలు మరి తలఁచితివట
చన్నులతాఁకుల కోర్చి సమ్మతించేవా
యిన్నిటా శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
యెన్నియైనా నాకోరిక లియ్యకూడేవా

రేకు: 1358-2 లలిత సం: 23-344

పల్లవి: ఇంకాఁ గొన్ని దలఁచుకో యిటువలెనే
పొంక మెఱుఁగుదువయ్య పొందులు సేయఁగను

చ. 1: బీరాన నొకతేపేరఁబిలిచేవు నన్ను నిట్టె
నేరుతువయ్యా మాఁటలు నిన్నేమనేను
చేరి యొకతెవిడెము చిమ్మి నాచేతి కిచ్చేవు
దూరుకు వెరవవయ్యా తొలుత నీవు

చ. 2: జొబ్బిల నొకతెఁ జూచి సొరిది నన్నుఁ జూచేవు
గబ్బిచేఁతలు నీయందె కలవయ్య
వుబ్బున నొకతె నంటి వొళ్లు నాపై వేసేవు
నిబ్బరాల మరునయ్యానీయందే యెపుడు

చ. 3: నంటున నొక్కతె గూడి నన్ను నట్టె కూడేవు
గొంటవయ్యా అన్నిటాను గుంపించరాదు
ఇంటిలో శ్రీనేంకటేశ ఇందరి జంటసేసేవు
వింటివయ్యా లీ సుద్దులు వివరముగాను

రేకు: 1358-3 పాడి సం: 23-345

పల్లవి: పదరుదురటవే పలుమారును
కుదురై మజ్జాతి(రే?) సేసుకొనఁదగుగాక

చ. 1: కాఁపురాలు సేసేవారు కడు నొట్టువెట్టుదురా
కోపమెంతైనా నోర్చుకొందురు గాక
యేపురేఁగి రమణుఁడుయెంతమీరితిరిగినా
కోపుల మెల్లనే వంచుకొనవలెఁగాక

చ. 2: ఇల్లాండ్లఇనవారు యెగసక్కేలాడుదురా
వుల్లాన గుట్టుసేసుక వుందురుగాక
వెల్లవిరైమగవాడు వేరేపనులు సేసితే
మెల్లనే వోజకుఁదెచ్చి మేకొందురుగాక

చ. 3: కడుఁజుట్టాలైనవారు గక్కన నలుగుదురా
బెడిదపురతుల మెప్పింతురుగాక
అడరి శ్రీవేంకటేశుఁ డందరిఁ గూడి వచ్చితే
వడి నీవూఁ గూడి ఇట్టె వంపింతురుగాక

రేకు: 1358-4 గౌళ సం: 23-346

పల్లవి: మేమింత యేఁకరఁగాను మేలా వోయి
నాములెక్క వలపించి నవ్వేవా వోయి

చ. 1: యింటికిఁ బిలువఁగాను యెఱఁగనట్టే పోయి
దంటవై ఆడఁ గూచుఁడఁదగునా వోయి
వెంటవెంట నే రాఁగా వెలఁదులచేతను
కంటకములాడించ సంగతులా వోయి

చ. 2: కప్పురము నే నియ్యఁగా కడఁబెట్టి యొక్కతెను
దప్పికి నీళ్లడిగేవు తగవా వోయి
కొప్పువట్టి నేఁ దియ్యఁగా గొబ్బున ముసుఁగిడుక
యిప్పుడే పవ్వళించేవు ఇదిగొంతా వోయి

చ. 3: కడఁగి శ్రీవేంకటేశ కాఁగిలించి నేఁ గూడితే
తడవుకుఁ గరఁగేవు తగవా వోయి
తడవి నే మొక్కఁగాను దయఁజూచితివి నీవే
చిడుముడి నింతరట్టు సేతురా వోయి

రేకు: 1358-5 శ్రీరాగం సం: 23-347

పల్లవి: ఇంతి చెలువం బెంచ వితరులకు వసమౌనా
ఇంతయునుఁ దలపోసి యెరిఁగించవలదా

చ. 1: చిగురైనమోవిపై చిలుకవోట్లు నిండె
తగుఁ గోవిలకుఁగాక తనకేల
మొగమైనతామరకు మొగి విచారము లేదు
తగవులివి యేర్పరచి తా దిద్దవలదా

చ. 2: పలుదజక్కవచన్నుల వంకలచంద్రులు వొడమె
జలధందుఁగాక ఇచ్చట నమరునా
కలికిమేనై నతీగకు విచారము లేదు
తలకొన్నయీతగవు తా దిద్దవలదా

చ. 3: మఱి గజకరపుఁదొడల నఱిదిఁ బగడపులతలు
అఱింట్లందము గాక అందుకేలా
యెఱిఁగిశ్రీవేంకటేశు కీవిచారము లేదు
తఱిఁగూడీనీతగవు తా దిద్దవలదా

రేకు: 1358-6 బౌళి సం: 23-348

పల్లవి: ఎదుటనే వున్నవాఁడు యేలమమ్ము గేలిసేసీ
అదను వదనుఁ గూడ నడుగరే యతని

చ. 1: తలఁపులోపలిమాట తానే యెరుఁగుఁగాక
యెలమి మమ్మడిగితే నేమనేమే
తలఁపు గొల్లెతలెల్లా తగఁ బంచుకొన్నారు
అలి మిగులఁగద్దాఅడుగరే యతని

చ. 2: కతన నవ్వినట్టినవ్వు తానే యెరుఁగుఁగాక
యెనసి మమ్మడిగితే నేమనేమే
తననవ్వు మధురలో తరుణు లందుకొనిరి
అనువై మిగులఁ గద్దా అడుగరే యతని

చ. 3: శ్రీవేంకటేశుఁడు తనచేఁత తానే యెరుఁగుఁగాక
యీవల మమ్మడిగితే నేమనేమే
సేవఁ దనకాఁగిలి చేరి నేనే కైకొంటి
ఆవల మిగులఁ గద్దా అడుగరే యతని

రేకు: 1359-1 కన్నడగౌళ సం: 23-349

పల్లవి: అంగన నింతటనైనా నలపుదీర్చరాదా
సంగతెఱిఁగిననెరజాణఁడ విన్నిటాను

చ. 1: చెమరించె నుదురెల్లా చెదరెఁ గస్తూరిబొట్టు
జమళిపాదాలు ఇంతి సారె గుద్దంగా
తమిఁ దురుముజారె గందపుబేంట్లెత్తె మేన
గుమితాన నీకు నిట్టె కుంచెవేయఁగా

చ. 2: పైపై నిట్టూర్పులు రేఁగె బాయిటఁబడెఁ జన్నులు
యేపున నాకుమడిచిఇయ్యఁగాను
తీపులమోవి వాడె తెట్టెలై పూవులు రాలె
ఆపొద్దుననుండి జవ్వా దలఁదఁగాను

చ. 3: కన్నుల నిద్దుర దేరె కళలు మోమున నిండె
ఇన్నిటాఁ గాఁగిట ని న్నెనయఁగాను
వున్నతి శ్రీవేంకటేశ వొడి నిండె వలపులు
చెన్నుమీర నీకు నిట్టె సేవసేయఁగాను

రేకు: 1359-2 ఆహిరి సం: 23-350

పల్లవి: ఔదువే జాణవు నీవు అన్నటాను
సాదనా నీవును తొల్లె జాణఁడవురా

చ. 1: ఆకసపుఁగొలనిపై నంటుఁదామరలు వుట్టె
యీకత చెప్పఁగదవే యింతిరో నీవు
మేకొని మరువింకి మిట్టెకోలలై యవి
కూకులు వత్తులుగానీగురి దాఁకురా

చ. 2: అలరినశశిబింబమందు తేనెపెర వుట్టె
కల విరుచఁగదే నిక్కముగా నీవు
చలమున నిదియె చంద్రకళలోనితేటై
నెలకొన నీనోరు నిండుకొనురా

చ. 3: ఆమనెరఁటులపై రావాకుబదనికె వుట్టె
నేమందుకు వచ్చును నా కెరిఁగించవే
గోమున శ్రీవేంకటేశ కూడిన యీరతివేళ
వేమరు నాతో నీవు విద్యలాడవచ్చురా

రేకు: 1359-3 శుద్ధ వసంతం సం: 23-351

పల్లవి: చెలులకుఁ దగుఁగాక చలము నీకుఁ దగునా
పెలుచుఁదనాననేల పెనఁగేవు నీవు

చ. 1: చనవుసేసుకొని సతి నిననుఁ దిట్టితేను
పనిని ఆపెతోనేల పంతాలాడేవు
మనసు రంజిల్ల ఏపై మరి చేయివేసితేను
కినిసి యేల జంకించేవు నీవు

చ. 2: నగవుసేసుకొని వలినాక్షి గోరంటితే
తగవులఁబెట్టేవేల తరుణులతో
మొగమోటతో నీమోవి గంటివేసితేను
చిగురుఁబాదమునఁ జిమ్మేవు నీవు

చ. 3: గుట్టుసేసుకొని గొప్ప కుచముల నదిమితే
అట్టె యందుకు రతి వలయించేవు
యిట్టె శ్రీవేంకటేశ యెనసి రా కొట్టితేను
దట్టముగ నోరినిండాఁ దమ్ముల మిడేవు

రేకు: 1359-4 సామంతం సం: 23-352

పల్లవి: కోరికెలెల్లా వీడేరె గోవిందరాజా
యీరీతి సతుల వెనయఁగఁగలిగె

చ. 1: చిడుముడి నీవు నాల్గు చేతులతో మెరసేది
వుడివోక మాకు నొక్కవుపమ వుట్టె
పడఁతులిద్దరు నీకుఁ బాదము లొత్తఁగాను
కడఁగి నీ వొకమాటే కాఁగిలించఁగలిగె

చ. 2: గక్కన కఠినమైన కౌస్తుభమాణికము
అక్కునఁగట్టిన దొక అనువువచ్చె
చక్కఁగా నిద్దరినాల్గుచనుఁగొండ లొక్కమాఁటే
వుక్కుమీర నొరయఁగ నోరువఁగఁగలిగె

చ. 3: తావై శ్రీవేంకటేశ వొత్తగిలి పవ్వళించేది
వోవరిలో నిది యొక్కవుపమకెక్కె
యీవలనావల భూమి నిందిర నీఁపు నురము
చేవమరీ చేకొనఁగ జిగిఁ గూడఁగలిగె

రేకు: 1359-5 పూర్వ గౌళ సం: 23-353

పల్లవి: ఇటువంటిది గలదా యేలికవు నీవు మాకు
యిటులా నూడిగము సేయించుకొంటగా

చ. 1: నవ్వు లెన్ని లేవునీవు నాతోనే జరపేవి
పువ్వు లెన్ని లేవు నాపైఁ బూఁచి వేసేవి
యివ్వలనే లోనౌదునా యెంత చెప్పినా నీకు
జవ్వనపుమాయేలికసాని వుండఁగాను

చ. 2: మాట లెన్ని లేవు నీవు మంతనాన నాడేవి
చీటు లెన్నిలేవు నవు వ్రాసి చేతికిచ్చేవి
పాటించి ఇయ్యకొందునా పచ్చిగా నీపనులకు
చాటువగా మాయేలికసాని వుండఁగా

చ. 3: చూపు లెన్ని లేవు నీవు సొలయుచుఁ జూచేవి
తీపు లెన్ని లేవు సాదించి చల్లేవి
యేపున శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
చానఁ మీదనే యేలికసాని వుండఁగాను

రేకు: 1359-6 దేశాళం సం: 23-354

పల్లవి: ఇంతులకు వింతగుట్టు యిత్తురా నీవు
పంతము మెర సేయట్టిబలువుఁడవు

చ. 1: ముచ్చట నెవ్వతెకైనా మోహము చెప్పుదురా
పచ్చిగా నంతలో కిందుపడుదురా
మచ్చికై సిగ్గువిడిచి మాఁటాలాడుదురా
అచ్చమై బూమేలేటినాయకుఁడవు నీవు

చ. 2: వెస నాఁటదానికి వెంటవెంటఁ దిరుగుదురా
పసగా నూడిగాలు పైపైఁ జేతురా
నసలుగ సారెసారె నవ్వులు నవ్వుదురా
రసికుఁడవై వట్టిరాజసపునీవు

చ. 3: దిగ్గనఁ గాఁగిటికిముందే బారచాఁతురా
తగ్గక కూడితి విట్టె తమకింతురా
అగ్గలమై యలసిట్టె అసురుసురౌదురా
యెగ్గులేనిశ్రీవేంకటేశుఁడవు నీవు

రేకు: 1360-1 లలిత సం: 23-355

పల్లవి: ఇంకా నిట్లానే గడియించుకొనవయ్య ధనము
సంకెలేక చిత్తమనేజాళెఁ బోసుకొందువు

చ. 1: తెలిసి నీసుద్దులెల్ల తేటలెల్లమాయను
వల పినుమడిగాను వడ్డికిచ్చేవు
యెలమి నందుకు సాక్షి యిరుమేలా నున్నావారు
బలిమిఁ బంచబాణాలు పంచారూడిపత్రము

చ. 2: కంటికి నీజాడలెల్ల కడుదిష్టమాయను
నంటువావులు ముమ్మడినాఁగు కిచ్చేవు
దంటతనానఁ గొలువ తలపోఁతే కుంచము
అంటినగొల్లెతలెల్ల నప్పులవారు

చ. 3: మెచ్చితిమి నీకూటమి మీఁదమీఁద మేలాయను
పెచ్చురతి నలుమడి బేరమాడేవు
ఇచ్చకుండ శ్రీవేంకటేశ నీవే లాబగాఁడ
వచ్చుపుగోరొత్తులెల్లా నన్నిటికీ లెక్కలు

రేకు: 1360-2 వరాళి సం: 23-356

పల్లవి: ఇప్పుడే నేరుచుకొంటి వేడలేనికుచ్చితము
చిప్పిల నద్దముచూచి సింగారించుకొనేవు

చ. 1: కాంత నిన్ను వేఁడుకొనీ కతలు చెప్పఁగరాదా
ఇంతలో నిద్రించేనంటానేల పవ్వళించేవు
అంతలోనే విడెమిచ్చీ హస్తము చాఁచరాదా
పంతాననేల చిత్తరుప్రతిమఁ జూచేవు

చ. 2: సతి వేడుకపడీని చదురంగమాడరాదా
తతిఁబాడీనంటానేల దండె మీటేవు
రతిఁ బూలుముడిచీ శిరసు వంచరాదా నేఁడు
కతలుగా సొమ్ములు లెక్కలు వెట్టేవు

చ. 3: వెలఁది బాఁతిపడీని వినోదాలు చూపరాదా
సొలసి కూడి యెంతని చొక్కించేవు
అలరి శ్రీవేంకటేశ అదె మొక్కీఁ జూడరాదా
మెలఁగి ఇందుకె సారె మెచ్చులు మెచ్చేవు

రేకు: 1360-3 పాడి సం: 23-357

పల్లవి: నాతో దాఁచక చెప్పవే నాతిరో నీవు
యీతనువుసోఁకినవాఁ డెంతభాగ్యవంతుఁడే

చ. 1: చక్కనివెన్నెలవూట సతి నీనవ్వులతేట
మొక్కులలోని మొఱఁగు మోవితెఱఁగు
రెక్కతుమ్మిదలవొప్పు నిక్కిననీపెద్దకొప్పు
యిక్కువ నిన్నేలినవాఁడెంతభాగ్యవంతుఁడే

చ. 2: అలచందురునిదీము అతివనీ నెమ్మోము
కలువలమైబాగులు కన్నుసోగలు
లలి శంకముకులము లక్షణపునీగళము
యిల నీమగఁడైనవాఁ డెంతభాగ్యవంతుఁడే

చ. 3: నిరతిఁ గొండపాడవు నీచన్నులవడువు
మరునికొలువు నీమర్మపు నిలువు
సిరులఁ గూడె నిన్నట శ్రీవేంకటేశుఁడట
యిరవై నీవుగలవాఁ డెంతభాగ్యవంతుఁడే

రేకు: 1360-4 ముఖారి సం: 23-358

పల్లవి: ఆతఁడు సేసేటివినయమునకా నీబిగువు
చేతికి లోనై వుండఁగా చిడుముడి దగునా

చ. 1: చెలువుఁడు వీడెము చేతఁబట్టుకున్న వాఁడు
అలుక లెందాఁకాను అదుకోరాదా
వెలలేని వెన్నెలలు వేగినంతాఁ గాయఁగాను
వెలి నుండే యెవ్వరికి వెట్టఁబడఁదగునా

చ. 2: వచ్చివచ్చి రమణుఁడు వాకిటఁ గాచుకుండఁగా
పెచ్చువెరిగే వెందాఁకాఁ బిలువరాదా
యెచ్చరించి దగ్గరనే యేరు వారుచుండఁగాను
కుచ్చితాన లోలో దప్పిగొనఁదగునా

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి కాఁగిలించినాఁడు
లావు లెందాఁకాఁ జూసేవు మోవియ్యరాదా
భావించి వలపులపంట వండి వుండఁగాను
ఆవటించి రతిఁ దనియక వుండఁదగునా

రేకు:	1360-5 భైరవి	సం:	23-359

పల్లవి:	నిరతి వెరగయ్యీని నీవిధము చూచి నాకు
	తెరమఱఁగున సాదించితివో పనులు

చ. 1:	సతి నిన్నిట్టె తలఁచఁగానే విచ్చేసితివి
	తతి వేగువెట్టుక ఇందాఁకా నుంటివో
	అతివల మనసుల అదనెల్లఁ దెలుసునో
	అతనుఁడు నీ కేపొద్దు నన్నియునుఁ జెప్పునో

చ. 2:	మాట నోర నుండఁగానో మారుమాట లాడితివి
	యీటున నేమైనా మంత్ర మెఱుఁగుదువో
	మూటగా నిట్టెపుస్తకమున వ్రాసుకుండితివో
	నాఁటనుడియు నవధానములు నేరుతవో

చ. 3:	కలగనినట్లనే కాఁగిలిం కూడితివి
	యెలమి నిద్దరిదేహ లేకములో
	వెలయ శ్రీవేంకటేశ విద్యలు సాదించితివో
	బలిమి నీ విందిరిపాలిటిదేవరవో

రేకు: 1360-6 సామంతం సం: 23-360

పల్లవి: ఏమి నేర్పితివి యిటువంటిపనులు
కామినిమోహము గైకొనరాదా

చ. 1: మలయుచు నూరక మగువ వుండఁగా
చెలరేఁగి యేల చెనకేవు
తలుపుమాఁటునను తలవంచుకొనఁగ
పలుకుల నూరక భ్రమించేవు

చ. 2: చిఱునవ్వులతో చెలియ వుండఁగా
చెఱఁగువట్టి గురిసేసేవు
పఱపుమీఁదనే పాదము లొత్తఁగ
కఱకుల నిటు చనుఁగవ యంటేవు

చ. 3: సేవలు సేయుచు శ్రీపతి యుండఁగ
మోవి మోవితోమాపేవు
శ్రీవేంకటేశ్వర జిగిఁగూడే వనిత
భావఁబులఁ గడుఁబస రెఁచేవు

రేకు: 1361-1 సౌరాష్ట్రం సం: 23-361

పల్లవి: ఆసలనే బడలితే నట్టె రావయ్య
యీసులేదు నీకు నాకు నింటికి రావయ్యా

చ. 1: మొగమెల్లఁ జెమరించె మంచి నీపై తమకాన
తగవులఁబెట్టక ఇంతట రావయ్య
చిగిరించె చిత్తమును చెక్కునఁ జేయి మోఁచె
యొగసక్కేలు సేయ ఇంటికి రావయ్యా

చ. 2: చెక్కులెల్ల బలకించ చెలువపునిన్నుఁ జూచి
తక్కులఁబెట్టక ఇంతట రావయ్య
ముక్కున నూర్పుల ముంచె ముంగురులు కడుజారె
యెక్కువతక్కువ లంచ కింటికి రావయ్యా

చ. 3: శిరసునెరులు జారె సిగ్గుల పలచనాయ
తరితీపులేల ఇంతట రావయ్య
గరిమశ్రీవేంకటేశ కలసితి విక్కడనె
యిరవైతి వింక మా యంటికి రావయ్యా

రేకు: 1361-2 సాళంగం సం: 23-362

పల్లవి: బుద్ధిచెప్పవయ్యా నీపొలఁతికిని
ఇద్దరికి సరేకావా యెన్నుకొన్న సిగ్గులు

చ. 1: మంచముమీఁద మనము మాటలాడఁగా
పొంచులు దా వినెనట పొలఁతొకతె
వంచన లే కాసుద్దులు వారివీరితోఁ జెప్పి
కంచుఁబెంచు సేసి అట్టె కాకుసేసె నదివో

చ. 2: పీఁటమీఁద నిద్దరము పెనఁగులాడఁగాను
మాఁటుననే చూచెనట మరియొకతె
గాఁటముగ నాపనులు కన్నవారితోఁ జెప్పి
చాటుచుసారెసారె జాతులఁబెట్టీని

చ. 3: యెంగిలిమోవిచ్చి పన్ను ఇంటిలోఁ గూడినది
ఇంగిత మెఱిఁగెనట ఇదియెకతె
అంగపుశ్రీవేంకటేశ అందిరతో నాడుకొని
రంగుమీర నంతటాను రవ్వలు సేసీని

రేకు: 1361-3 వేళావళి సం: 23-363

పల్లవి: బుద్ధిచెప్పేవార మింతే పొద్దువొద్దుకు
ఇద్దరు సంతమౌట కియ్యకొనవయ్యా

చ. 1: తరుణి యలిగెనంటే తమక మాపఁగలేదు
మరిగివుంటే కోపము మానఁగలేదు
సారిది నెంచితే నీసుద్దు లెన్నైన గలవు
ఇరవై ననీచెలుల మేమిసేతుమయ్యా

చ. 2: ముదిత దూరెనంటే మొగమోట మానలేదు
వొది గూరకుండెనంటేవోరువలేదు
వెదకితే నీయందు వేవేలు నెరుసులు
యెదుట నిలుచున్నార మేమిసేతుమయ్యా

చ. 3: కాంత కరఁగించెనంటే కడు నలయించలేదు
మంతనపురతు లివి మానఁగలేదు
ఇంతలోనే శ్రీవేంకటేశ నీవే యేలితివి
యింతటిసంతోసాన కేమి సేతుమయ్యా

రేకు: 1361-4 కేదార గౌళ సం: 23-364

పల్లవి: ఆఁటది రాజ్యమేలితే అది మంచిదేకాదా
చాటునగా మాకు నీన్ను సాదించనేఁటికి

చ. 1: పీఁటపై నున్న దాపె ప్రియుఁడవు నిలుచుండి
మాఁటలాడే వాపెతోను మంచిదేకాదా
గాఁటముగా వంచ నెంత గలిగి మెలఁగినాను
యీటున నీవే బదే వేమిననేఁటికి

చ. 2: పడఁతి పవ్వళించఁగా పాదాలకాడ నుండి
మడిచిచ్చే వాకు నీవు మంచిదేకాదా
వుడుగక నీవెంత వూడిగాలు నేర్చినాను
కడు నీకే లాభమయ్యీ కాదనఁగనేఁటికి

చ. 3: వురముపై నున్న దాకెవొగి నిట్టే కిందుపడి
మరులు గొంటివి నీవు మంచిదేకాదా
ఇరవై శ్రీవేంకటేశ యెంత మోపెత్తుకొనినా
మరిగి నన్నేలితివి మచ్చరించనేఁటికి

రేకు: 1361-5 భల్లాటి సం: 23-365

పల్లవి: అప్పటి మానవు బీరా లందరిలోనా
చెప్పనేల లోలో నీకే సిగ్గువడవలదా

చ. 1: అదె మోవి గంటిరేఁగీ నానలేలపెట్టేవు
యెదిరి వారిందుకెల్లా నెట్టు నమ్మేరు
మదిమది నీచేఁతలే మచ్చము పట్టియ్యఁగాను
చెదరక నీకునీవే సిగ్గుపడవలదా

చ. 2: వేలిమట్టె లొరసీని వెసఁ జెక్కేల నొక్కేవు
అలరిచెలు లిందుకు అట్టె నవ్వరా
సోలి నీసంగారాలే చొప్పులైఇయ్యఁగాను
జీలుగుబెండాయ గుట్టు సిగ్గువడవలదా

చ. 3: అలవేలుమంగవొత్తీ వదేల కాఁగిలించేవు
వలచినవారికి వాసివుట్టదా
బలుశ్రీవేంకటేశ నీభావమే పట్టియ్యఁగాను
చెలఁగి నన్నేలితివి సిగ్గువడవలదా

రేకు: 1361-6 పాడి సం: 23-366

పల్లవి: ఏమిచూచేవు నాదిక్కు యెంతవడియైనాను
యీమేరలనే నిన్ను యెగసక్కె మాడేనా

చ. 1: ప్రియురాలు నీవును పెండ్లాడఁగా జూచి
నయగారితనమున నగె నొకతె
క్రియగా నాపెయెరుకఁ గెర లేమిసేసితివో
నియతాననుఁ దారుకాణించుకోవయ్యా

చ. 2: చెలరేఁగి యాపె నీవు సేసవెట్టుకోఁగాఁ జూచి
సొలసి కేరడముగాఁ జూచె నొకతె
కలఁకలేనినీవోళ్లఁ గపటమేమైనాఁ గద్దో
తిలకించి యీసుద్దులు తెలుపుకోవయ్యా

చ. 3: అలమేల్మంగతో బువ్వమారగించేనిన్నుఁ జూచి
మెలుపునఁ బొగడుచు మెచ్చె నొక్కతె
అలరి శ్రీవేంకటేశ అందరిమమ్మేలితివి
కలిగిన నమ్మిక లిక్కడఁ జూపవయ్యా

రేకు: 1362-1 వేళావళి సం: 23-367

పల్లవి: చల్లఁగా బదుకవయ్య సాదించేమా నిన్ను నేఁడు
చెల్లు నీకు నన్నియును చెప్పిచూపనేఁటికి

చ. 1: బాససేయనేరుతువు పనిగొననేరుతువు
ఆసకొలుపనేర్తువు ఆఁటదానిని
సేసేవారివూడిగాలు సేయించుకొనేరుతువు
నీసుద్దు లేమిచెప్పేవునేఁడు మాకుఁగొత్తలా

చ. 2: పొంద నిందుకుఁ గలవు పొరుగుకునుఁ గలవు
సందడిఁ గాలుదొక్కి మించఁగగలవు
యెందు నీవు నవ్వుతానే యెడము గైకొఁగలవు
దిందుపడఁ దొల్లె నేము తెలియనిపనులా

చ. 3: మొక్కు మొక్క నోపుదువు మోహించనోపుదువు
వొక్కటిగాఁ గూడివుండనోపుదువు
అక్కర శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యెక్కువై మమ్మేలితివియెఱఁగమానేము

రేకు: 1362-2 సౌరాష్ట్రం సం: 23-368

పల్లవి: ఎవ్వరును తమవలె నెంచవద్దా
రవ్వకెక్క సవతుల రాఁపుసేతురు

చ. 1: ఆతఁడింటికి రాకుంటే నాడితివి వెంటేలెల్లా
చేతికిలోనైతేనే చెలఁగితివి
నీతులు చెప్పేవు నేము నీవంటివారమే కామా
యేతులకు మాకు బుద్దులేల చెప్పేవు

చ. 2: వెక్కసమై తిరిగితే వెసఁ గోపగించితివి
చెక్కు నిన్ను నొక్కితేనే చేకొంటివి
నెక్కొని నోరది మేవు నేము నీవలెనేకాదా
యెక్కువతగవులు మాకేల చెప్పేవు

చ. 3: మఱచి వూరకుండితే మర్మాలుసోఁకించితివి
మఱియట్టె యలమేలుమంగ మెచ్చితి
నెఱతనాలు నేర్పేవు నీవంటివారమే కామా
మెఱయ శ్రీవేంకటేశు మెచ్చి పెండ్లి సేసేవు

రేకు:	1362-3 బౌళి	సం:	23-369

పల్లవి:	ఎంత చనవిచ్చితివో యీపె నీపై వెదచల్లీ
	కొంతపుఁజూపుల చూడికుడుతనాచారు

చ. 1:	ముప్పిరిఁమనసార ముడిచినదండలు నీ
	కొప్పున ముడిచీఁ జూడికుడుతనాచారు
	తప్పులేక నిన్నుఁ జనుఁదామర మొగ్గలు మోవ
	గుప్పీ నిన్నిదివో చూడికుడుతనాచారు

చ. 2:	చేరఁదీసి నీమీఁద చెమటపయ్యద గప్పి
	కూరిమి గొసరీఁ జూడికుడుతనాచారు
	చేరి వేఁడుకొని వేరుసేయకుమవి నీచెక్కు
	గోరనొత్తీ నిదె చూడికుడుతనాచారు

చ. 3:	అంకెల శ్రీవేంకటేశ అదె నీమ్మెఁ దనమేని
	కుంకుమ పూసీఁ జూడికుడుతనాచారు
	అంకపురతులఁగూడి అలమేలుమంగె తానై
	కొంకుదేర్చె నిన్నుఁ జూడికుడుతనాచారు

రేకు: 1362-4 ముఖారి సం: 23-370

పల్లవి: అందుకేపో యెమ్మెలంటా నాడుకొనేరు
సందడిలో గందవొడి చాతుకొనేవు

చ. 1: చేరలంతలుగన్నులచెలి నిన్నుఁ జూడఁగాను
తీరుగాఁ గస్తూరిబొట్టు తిద్దుకొనేవు
నేరుపుగలిగినావె నీవద్దనే వుండఁగాను
గారవించి వలపులకతలు చెప్పేవు

చ. 2: కొండలంతలు గుబ్బలకొమ్మ నిన్ను నొరయఁగా
మెండుగఁ గప్పుధూళి మెత్తుకొనేవు
నిండుసింగారాన నాపె నీతో సరసమాడఁగా
అండనే తట్టుపుణుఁగు అలఁదుకొనేవు

చ. 3: పెద్దకొప్పులమేల్మంగ పేరురముపై నుండఁగా
నిద్దపుసొమ్ములు మేన నించుకొనేవు
గద్దం శ్రీవేంకటేశ కాఁగిట నాపె గూడఁగా
కొద్దిమీర నారగించి కొలువై వుండేవు

రేకు: 1362-5 కాంబోది సం: 23-371

పల్లవి: కామినిసరసములే కామధేనువులుగావా
రామలతిట్ల కింత రవ్వసేయఁదగవా

చ. 1: వెలఁదినవ్వుల వెన్నెలలు గాసీ నీపై
చెలువుఁడ చిత్తానఁ జీఁకటేలయ్యా
ములువాఁడికొనగోరు మోపినయందు కేమాయ
వలపు లింతేసి నీకు వడిఁ బెట్టఁదగునా

చ. 2: వనితచెమటలనే వానలు గురియఁగాను
వెనకటియలుకలవెట్ట యేలయ్యా
వెనుకొని పూబంతిని వేసితే నందుకేమాయ
చనవులు నీ వింత చండిపెట్టఁదగునా

చ. 3: అలమేల్మంగ కాఁగిట నామనియై వుండఁగాను
అల రతిఁ దనియనిఅక్కరేలయ్యా
పిలిచి శ్రీవేంకటేశ పెనఁగితేనేమాయ
మొలకసిగ్గు తప్పుడే మూఁటగట్టఁదగునా

రేకు: 1362-6 పాడి సం: 23-372

పల్లవి: అటుగాన నీపాదాల కన్నియు విన్నవించితి
తటుకునఁ దెలుసుకో తగినట్టు నీవు

చ. 1: నంటున నీమోము చూచి నవ్వులు వచ్చీనాకు
సొంటులు సోదిం చద్దముచూచుకోరాదా
ఇంటిలో తననేరమి యెఱఁగరాదు తనకు
కంటకమై యెదిరికిఁ గానవచ్చుఁగాని

చ. 2: వింతైననీమాట విని వెరగయ్యీ నాకైతే
అంతయు వద్దిచెలుల నడుగరాదా
దొంతినే తనకల్లలు తోఁచవుతనకెపుడు
వంతుల దగవు చెప్పేవారికిఁగాని

చ. 3: తరితీపునారతులు తలఁపయ్యీ నాకైతే
సురతపునీచదువు చూచుకోరాదా
గరిమ నలమేలుమంగను శ్రీవేంకటేశ నీ
వరుదై నన్నేలితివి యాపె నేలరాదా

రేకు: 1363-1 ముఖారి సం: 23-373

పల్లవి: అప్పటి నీనేరమికి నది చాలునా
చెప్పరానిసేవలెల్లాఁ జేతువుగాక

చ. 1: పంతపుమాటలయాపె పలకీనా నీతోను
వింతలుగా నీవెంత వేఁడుకొన్నాను
చెంతనుండి నీవు నిన్నఁ జేసినచేఁతలకు
మంతనపు మొక్కుల సమ్మతిసేతువుగాక

చ. 2: నాలిచలపాదియాపె నవ్వీనా నీతోను
యీలీల జాణతనా లెంతాడినాను
కోలుముంద్రై నీమేన గుఱుతులుండినందుకు
యేలికవై నా కందిఇత్తువుగాక

చ. 3: రాతిగుండెలమేల్మంగ యీతల నిఁక లోఁగీనా
కాతరాన నాడి యెంత కదిమినాను
యేతులశ్రీవేంకటేశ యెమ్మెలు చూపివందుకు
యీతల రొమ్ముపై నాపె నిడుకొందుగాక

రేకు: 1363-2 రామక్రియ సం: 23-374

పల్లవి: నాకు వెఱవఁగనేల నాలితనాన
యీకడ మోనాననుండే వెందాఁక నీవు

చ. 1: వెలఁదియాడేమాఁట వింటివా వోయి
మలసి తానట నీకు మఱఁదలట
కలువదండ ఇచ్చుట కద్దా వోయి
కలది గలట్టె తారుకాణించుకోరాదా

చ. 2: కామినిసేసేసన్నలు గంటివా వోయి
రామను నీ విక్కడికి రమ్మంటివట
ఆమించునీవుంగరము ఆపెదా వోయి
దీమసాన నాపె నీవుఁ దెలుసుకోరాదా

చ. 3: యింతి నిన్నుఁ గూడెఁ జనవిచ్చితా వోయి
జంత శ్రీవేంకటేశ తా సవతియట
యింతట నలమేల్మంగ నన్నేలితివి
వింతగా నాపె నీవు విచారించుకోరాదా

రేకు: 1363-3 సౌరాష్టం సం: 23-375

పల్లవి: ఇదివో మంచివేళ యిఁకనెన్నఁడు
యెదుటనే మరుని జయించవచ్చు నిప్పుడు

చ. 1: కాంతనిలువెల్లా నీకు కనకపురథము
బంతినున్న పిఱుఁదులే బండికండ్లు
పొంతనున్న కుచములే పూవులగుత్తులు నీకు
ఇంతటను మరుని జయించవచ్చు నిపుడు

చ. 2: వెలఁదిపయ్యదకొంగు విజయధ్వజము నీకు
చెలువబొమ్మలే సింగిణివిండ్లు
అలరినచూపులే అక్షయబాణములు
యెలమి మరుని జయించవచ్చు నిపుడు

చ. 3: అలమేల్మంగకాఁగిటి హస్తములే పగ్గాలు
చెలిఁగినపెనుఁగొప్పే శిఖరము
నెలవై శ్రీవేంకటేశ నీవే రథికుఁడవు
యిలలోన మరుని జయించవచ్చు నిపుడు

రేకు: 1363-4 శ్రీరాగం సం: 23-376

పల్లవి: దేవతలు సేవించఁగా దివ్యదుందుభులు మ్రోయ
శ్రీవల్లభునిభావము చెలులెల్లఁ జూడరే

చ. 1: నిండుసింగారముతోడ నిలవుగోణముగట్టి
అండఁ బన్నీటిమజ్జన మవధరించి
దండిగాశిరసున తడిసూదులు చుట్టుక
వుండెడిదేవునిభావ మువిదలుచూడరే

చ. 2: కప్పురకాపు మేన కలయఁగ మెత్తిమెత్తి
చిప్పిలఁ దట్టుపుణుఁగు చికిలిసేసి
చొప్పుగానవరత్నాలసొమ్ములు మేనఁజాతి
ఇప్పుడున్న హరిభావ మింతులెల్లఁ జూడరే

చ. 3: అలమేలుమంగ నురమందు నెలవుకొలిపి
తలకొన నంతటాఁ బూదండలు వేసి
చెలరేఁగియారగించిశ్రీవేంకటేశ్వరుఁడు
కొలువైవున్న భావము కొమ్మలెల్లఁ జూడరే

రేకు: 1363-5 పాడి సం: 23-377

పల్లవి: ఎఱఁగవుగాక మీఁదటెత్తు నీవు
కలికరించి తిట్టితే కాదనఁగఁగలవా

చ. 1: పొద్దు వోదా నీకదేమి పొరుఁగున నుండఁగాను
కొద్దిమీరఁ జెఇ చాఁచి కొంగువట్టేవు
సుద్దులెల్లా మావి నేను సూడు నిన్నుఁ బట్టితేను
వొద్దికఁ బంతిమియ్యక వూరకుండవచ్చునా

చ. 2: యెగసక్కెమా నాతో ఇంటిలో నే నుండఁగాను
అగడైన మాటలెల్లా నాడవచ్చేవు
మొగమోటములు మాని మోవ నిన్ను నాడితేను
తగవున నూఁకొనక తలఁగఁగవచ్చునా

చ. 3: చలములా నాతోను అలమేల్మంగా రమ్మని
నెలవై నీవురముపై నించుకొనేవు
సొలపులెల్లా మాని సొంపుగ శ్రీవేంకటేశ
కలసితి నిఁక నీవు కాదనఁగవచ్చునా

రేకు: 1363-6 సాళంగం సం: 23-378

పల్లవి: ఏల వేఁడుకొనీనేనే నెఱుఁగుదు నంతయును
కాలమందే నాపైఁ దనకరుణ యెఱఁగనా

చ. 1: మఱవరానిమాటలు మనసున నుండఁగాను
యెఱుకతోడితగుల మేల పాసీనే
గుఱుతైనయటువంటి కొంగుము ళ్ళుండఁగాను
తెఱవమఱఁగున చింతించనేఁటికే

చ. 2: సేసినతనసుద్దులు చెవి నిండియుండఁగాను
యీసులేల పుట్టినే యెరవేడదే
బాసలు తానిచ్చినవి బండారాన నుండఁగాను
వాసు లెంచుకొని వట్టివసివాడు లేఁటికే

చ. 3: వొసరి తనకాఁగిలి వురము నిండుండఁగాను
గునిసిశ్రీవేంకటేశుఁ గొసరనేలే
తనిసెల మేల్మంగను తానే నేనైయుండఁగాను
పెనఁగి తను నింకాను పెరరేఁచనేఁటికే

రేకు: 1364-1 రీతి గౌళ సం: 23-379

పల్లవి: రమణి గుట్టుననుంటే రవ్వసేయనేఁటికి
మమత మాపైఁ గలిగేమగుడిరారాదా

చ. 1: మొఱఁగుసిగ్గులతోడ మొలకచన్నులతోడ
మఱఁగున నుండి నీతో మాటలాడీని
చెఱఁగువట్టి యేలతీసేవు వెలుపటికి
తెఱవమనుసు నీవే తెలుసుకోరాదా

చ. 2: జమళియాసలతోడ సళుపుఁజూపులతోడ
సముకాననేనీతో సన్నసేసీని
క్రమ మెఱుఁగక యేల గరిసించే వీడ నిట్టే
తిమురుచు, యేకతానఁదెలుసుకోరాదా

చ. 3: మొగముకళలతోడ మోహపుఁజెమటలతోడ
తగిలితగిలి నిన్నుఁ దమిరేఁచీని
నగి శ్రీవేంకటాద్రిపై నన్ను నాపె నేలితివి
తెగడి గోవిందరాజ తెలుసుకోరాదా

రేకు: 1364-2 అమరసింధు సం: 23-380

పల్లవి: ముందుముందుగా నీవే మొక్కవయ్యా
అందుఁగాని తీరదు యీయాయంగననెంజెరివి

చ. 1: అంతరంగమున నీవేమని యానతిచ్చితివో
యింతి యేల అలిగెనో యెఱఁగమయ్యా
పంతగాఁడవు నీవైతే బలిమిసేయఁగరాదు
యెంతైనా బలు వీకెవంతువాసులు

చ. 2: అఱిముఱి నేమిసేయ నవధరించితివో
తెఱవేల కోపించెనో తెలియదయ్యా
మఱి నీవు దొర వీఁక మాకు బుద్ధి చెప్పరాదు
నెఱవుగ నాకెకైతే నీకంటే రాజసము

చ. 3: శ్రీవేంకటేశ నీవెట్టు చెంది మన్నించితివో
ఆవనిత మెచ్చె నరుదదందితిమయ్య
దేవుఁడవు విన్నొకరు తిద్దరాదు కూడితివి
దేవులాకెకైతే నెడతెగనిసంతోసము

రేకు: 1364-3 ఆహిరి సం: 23-381

పల్లవి: వనితల సొలపులె వలపులపంటలు
పెనఁగులాట గలితే ప్రియములే కావా

చ. 1: తివిరి మగవానికే తీపులై యుందురుగాక
సవతులు తమలోన సంతమయ్యేరా
తవిలి నీవేల ఇందరి నొక్కటిసేసేవు
జవళి నీ కామేకులు చవులుగావా

చ. 2: మొగిఁబెండ్లిపీఁటమీఁద మోనాన నుందురుగాక
వెగటై లోనికివస్తే వెంగేలేకావా
జగడాలు మానుమని సారె బుద్ధులు చెప్పేవు
నగుతా నీ కవియెల్ల ననుపులు గావా

చ. 3: శ్రీవేంకటేశ్వర నిన్నేచెంది కూడుదురు గాక
తాపుల తమలోనిపంతాలు మానేరా
యీవేళ నీ వేలితివి యెపుడు వారొక్కటే
యీవిధములెల్ల నీకు యితవులు గావా

రేకు: 1364-4 మాళవిగౌళ సం: 23-382

పల్లవి: ఇచ్చకములాడేటి ఇల్లాలను
పచ్చిగా నొకరివలె భ్రమయించనేరను

చ. 1: తలఁచుకొమ్మనవే తా నాడినమాటలు
తెలుసుకొమ్మనవే చింతించి బుద్ధులు
నిలుచున్నాఁడు వాకిటనే తనతో నేమనేన
పలికి వొకరివలె భ్రమయించనేరను

చ. 2: చదువుకొమ్మనవే సారె మరుశాస్త్రాలు
వెదకుమనవే తనవింతసేఁతలు
యెదుట నుండఁగ తన కిట్టె నే మొగమోడితి
పదరివొకరివలె భ్రమయించనేరను

చ. 3: సిరులఁ జూడుమనవేసేవలిందరివిని
కరఁగుమనవే తనగట్టిమనసు
యిరవై శ్రీవేంకటేశుఁ డెనసె నేనే మెచ్చితి
పరగనొకరివలె భ్రమయించనేరను

రేకు: 1364-5 సాళంగ నాట సం: 23-383

పల్లవి: అనవలసినమాఁట అంటిమిగాక
గునిసి యప్పటి నేల కొసరేము

చ. 1: వలపు నీవు చల్లఁగ వచ్చివచ్చి వేఁడుకోఁగా
చలము నీతోనేల సాదించేము
తలుపు నీవు ముయ్యఁగ దండనుండి చెనకఁగ
పెలుచుఁదనాననేల పెనఁగేము

చ. 2: సరసము నీవాడఁగ చల్లనిచూపు చూడఁగ
గొొరుబుసేసి నిన్నేల కోపగించేము
సొరిది నీవు నవ్వఁగా చుట్టరికాలు చెప్పఁగా
విరసాన నిన్ను నేల వెంగెమాడేము

చ. 3: కందున మో వియ్యఁగాను కాఁగిలించి కూడఁగాను
నింద నీపై వేసి యేల నేరమెంచేము
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కిందటిచేతలెల్లా కెరలించేమా

రేకు: 1364-6 హిందోళ వసంతంసం: 23-384

పల్లవి: నిన్నుఁజూచి నవ్వు వచ్చీ నేఁడు నాకు నిందుకే
యెన్ని చూచితే ను యెదురీదఁ గలదా

చ. 1: చేముట్టి నీతో నవ్వితే చెలరేఁగి తిట్టేవు
భామతో మారుకొనఁగఁ బంతమా నీకు
నాములువేసేటియుట్టిననలు వాండ్లైతేను
బూమిలోనఁ గోపగించేపురుషులు గిలరా

చ. 2: గోర నిన్ను నూఁదితేను గొబ్బున సూడువట్టేవు
బీర మింతిపైఁ జూపేది పెద్దరికమా
కోరి వురముమీఁదికి కుచములు వేఁకమైతే
బోరన నింతిఁ గోపించేపురుషులు గలరా

చ. 3: కందున నిన్నుఁ గూడితే కరఁగేవు మనసెల్లా
మందలించి యీాకెమీఁదిమచ్చికా ఇది
అంది శ్రీవేంకటేశుఁడ అదరము దీపనుచు
పొంతితివి నీకంటె పురుషులు గలరా

రేకు: 1365-1 శంకరాభరణం సం: 23-385

పల్లవి: మాటలేమిగలిగినా మరి విన్నవించేను
నీటుతోడినిన్నుఁ జూచి నేనేమనేను

చ. 1: చేయిమీఁదఁజేయివేసి సిగ్గుదేర మాటలాడి
చాలయు సన్నలుసేసి చలివాపేవు
మాయలెల్లా నేరుతువు మర్మము లెరుఁగుదువు
నీయెడ కియ్యకొనక నే నేమనేను

చ. 2: వొడివట్టి కాలుదొక్కి వొడఁబరచుకొంటాను
మడుపునవ్వులు నవ్వి మట్టుపెట్టేవు
కడువేగిరకాఁడవు గర్వమెల్లానీసొమ్ము
నిడివిగా మన్నించఁగ నేనేమనేను

చ. 3: చెలఁగి కాఁగిలించుక చెక్కులు గోరనొక్కి
సొలచి రతులనెల్ల జొక్కించేవు
యెలమిశ్రీవేంకటేశ యిన్నిటా జాణఁడవు
నెలకొని పెండ్లాడఁగ నే నేమనేను

రేకు: 1365-2 సామ వరాళి సం: 23-386

పల్లవి: ఇప్పటి కేమైనాను యియ్యకొనవే
చొప్పులన్నియును మారి సోదించేవేకదవే

చ. 1: సిగ్గులువడకువే చెలువుండు మాటాడఁగ
వొగ్గి యేమిటికైనా వూఁకొనవే
వెగ్గళించి యందేమైనా వెలుతులు గలిగితేను
యెగ్గుతో గేలిసేయవే ఇన్నియు వెనకను

చ. 2: కమ్మి వాపసులెంచకువే ఘనుఁడు నీతో నవ్వితే
యెమ్మెల కెందుకైనాను ఇచ్చగించవే
నెమ్మి నందులో నేమైనా నెరుసులు గలిగితేను
నెమ్మది గేలిసేయవే నిక్కుచు వెనకను

చ. 3: చింతలో లోఁగకువే శ్రీవేంకటేశుఁ డంటఁగ
చెంతలఁ గాఁగిటఁ గూడి సేవసేయవే
పొంతఁ గూడితి నందులో వింతేమి గలిగినాను
బంతినే గేలిసేయవే పచ్చిగా వెనకను

రేకు: 1365-3 లలిత సం: 23-387

పల్లవి: మంచివాఁడ వౌదువయ్యా మానవు నీబేఁటము
నించినే మొకటిసేయ నీ వొకటి సేసేవు

చ. 1: కొలువు సేసి యలసి కొమ్మ పవ్వళించితేను
చెలులము పాదాలొత్తి సేవసేయఁగా
చెలఁగి అంతలో వచ్చి సేదదేరిచేనంటా
పెలుచుఁజన్నులు వట్టి పిసికేవు నీవు

చ. 2: మఱి నీతోఁ బెనఁగి కోమలి యాఁకలిగొంటే
చెఱకుఁబిచ్చెలు నేము చేతనియ్యఁగా
నెఱి నంతలో వచ్చి నేను తోడయ్యేనంటా
మొఱఁగి మోవి తీపు మోవి కందిచ్చేవు

చ. 3: ఇన్నిటా నిన్నుఁ గూడి ఇంతి జలకమాడితే
కన్నెలము తడిసూళ్ళు కదునొత్తఁగా
సన్నల నంతలో వచ్చి సందడి శ్రీవేంకటేశ
వున్నతపుకొనగోర నొత్తేవు నీవు

రేకు: 1365-4 ఆహిరి సం: 23-388

పల్లవి: ఆనతియ్యఁగదవే ఆదియు మానంతోసమే
పూవినసిగ్గుల వింత పొరలఁగనేఁటికే

చ. 1: చెలరేఁగిచెలరేఁగి చెలులతో మాటాడేవు
మలసియాతఁడు నిన్ను మన్నించెనటే
సెలవులనే నవ్వులుచిమ్మిరేఁగి వున్నవి
అలమి అన్నిటా నిన్ను నాదరించెనా

చ. 2: భావించిభావించి యట్టె పాటలెల్లాఁ బాడేవు
సేవలకు మెచ్చాతఁడు చెక్కు నొక్కెనా
కావిరి వేడుకలనుఁ గడునుబ్బీ నీమేను
మోవియిచ్చి యాతఁడు నీమోహము చేకొనెనా

చ. 3: చొక్కిచొక్కి తమకాన సొరిదిఁ బులకించేవు
యెక్కువ శ్రీవేంకటేశుఁడిట్టె కూడెనా
పుక్కిటివిడెముతోడఁ బొదలుచు మురిసేవు
చక్కనియాతఁ డింతేసి చన విచ్చెనా

రేకు: 1365-5 సామంతం సం: 23-389

పల్లవి: చాలదా యీ భాగ్యము సరివారిలోనెల్ల
తాలిమితోఁ గంటిమి సంతసమాయ మాకును

చ. 1: ముద్దులు నీతో గునిసి మొగమిచ్చమాటలాడి
కొద్దిమీర నినుఁ జేకొనఁగా యాకె
వొద్దిక సేవలు సేసి వొడివట్టుకొని నవ్వి
దిద్దుకొని పనులకుఁ దిప్పెఁగా ఆకె

చ. 2: సోయగపూపు చూచి చొక్కి నీమీఁద నొరగి
ఆయములు గరఁగఁ చాలారెచ్చెఁగా ఆకె
చాయలు సన్నలు జూపి సంగడినే కూచుండ
చేయంటి వలపులఁ జిక్కించెఁగా ఆకె

చ. 3: కమ్మరాను నెలయించి కాఁగిట నిన్నుఁ గూడి
కిమ్ములను నిన్ను మరిగించెఁగా ఆకె
ఇమ్ముల శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యెమ్మెలతో నిందు కప్పణిచ్చెఁగా ఆకె

రేకు: 1365-6 దేశాళం సం: 23-390

పల్లవి: మేమును నీవారమే మేనవారమే
సాములుసేసి వలపు చల్లవయ్యా

చ. 1: యెక్కడలేని పరాకు యెంతైనాఁ గద్దు నీకు
చొక్కపుఁజేపుల మమ్ముఁ జూడవయ్యా
తక్కక జూజమాడేతమి యెంతైనాఁ గద్దు
అక్కరై మాతో ముచ్చటలాడవయ్యా

చ. 2: కన్నచోటనే చుట్టరికము లెంతైనాఁ గద్దు
చిన్నదాన నా పొందు సేయవయ్యా
పన్నిన కతలమీఁదిబాఁతి యెంతైనాఁ గద్దు
విన్నపాలు మాచేతివి వినవయ్యా

చ. 3: కూరిమిసతులతోడి కూట మెంతైనాఁ గద్దు
కోరి నన్ను రతులఁ జేకొనవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మేరలు మీరక యిట్టె మెచ్చవయ్యా

రేకు: 1366-1 రామక్రియ సం: 23-391

పల్లవి: కాముకుఁడైన వానికి ఘనము గొంచెము లేదు
యేమీ ననఁగరాదు ఇదివోనీసుద్దులు

చ. 1: ఆఁటదియైతేఁజాలు నంటుకొనేవు గక్కున
వాఁటమైనసూదిరాతివలెనే నీవు
కూటమిలో గొల్లవారిగొల్లు నీకునితవాయ
యీటువెట్టి చూడఁబోతే నిదివో నీసుద్దులు

చ. 2: ముక్కు మొకముఁ జూడవు ముదితైతేఁ జేకొనేవు
నిక్కినతృణగ్రాహినీలమువలె
గక్కన నంగడిదానిగందము నీకితవాయ
ఇక్కువఁ దెలుపఁబోతే ఇదివో నీసుద్దులు

చ. 3: నెలఁతనుఁ బట్టపుదేవులఁగాఁ జేసుకొంటివి
వెలలేనట్టిపరుసవేదివలె
కలగంపపెండ్లిండ్లు కన్నచోట నితవాయ
యెలమి శ్రీవేంకటేశ ఇదివో నీసుద్దులు

రేకు: 1366-2 ఆహిరినాట సం: 23-392

పల్లవి: వట్టివేసాలు సేసేవు వనితలెల్లాఁ జూడఁగా
ముట్టివచ్చితే నీవు మూఁకలో నొకతెవు

చ. 1: కాంతుఁ డింటికి రాఁగాను గక్కున మానుపవద్దా
ఇంతకర్తవైనదాన వెందు వోతివే
చెంత రమణుఁడు నీకు చేతికి లోనాయనట
ఇంతులు నగరినిండా యేడనుండి వచ్చిరే

చ. 2: చేరి విడెమియ్యఁగాను చేఇ పట్టుకొనవద్దా
యీరీతి బలిమిదాన వెందు వోతివే
ఆరయ నాతఁడు ను ఆడినట్టె ఆడునట
సారెకు నాతఁడు మాతో సరస మోట్లాడీనే

చ. 3: సమ్మతి నన్ను నేలె సన్న సేయవలదా
యెమ్మె లింతగలదాన వెందు వోతివే
నెమ్మి శ్రీవేంకటేశుఁడు నీమదిలో నుండునట
కమ్మర మమ్మెట్లాను కడుమన్నించితిరే

రేకు: 1366-3 పాడి సం: 23-393

పల్లవి: ఒకటంటే వొకటనకొద్దు దోసము
మొకమిచ్చలాడక మొరయవచ్చితినా

చ. 1: చలములు నీతోనుసాదించవచ్చితినా
వలపులు పచరించవ్చితిఁగాక
తొలిలొలి నిను నిట్టె దొమ్మిసేయవచ్చితినా
చెలరేఁగి సేవలెల్లాఁ జేయవచ్చితిఁగాక

చ. 2: పంతముల నీతోను పనిగొనవచ్చితినా
వంతులకు విడిమియ్యవచ్చితిఁగాక
మంతనాన నీతోను మచ్చరించవచ్చితినా
వింతెలెల్లా నీకు విన్నవించవచ్చితిఁగాక

చ. 3: ఆసలఁబెట్టి నిన్నునలఇంచవచ్చితినా
వాసితో నీవు గూడఁగావచ్చితిఁగాక
బాసతో శ్రీవేంకటాద్రిఁ బాయనిగోవిందరాజ
మోసపుచ్చవచ్చితినా మొక్కవచ్చితిఁగాక

రేకు: 1366-4 సామంతం సం: 23-394

పల్లవి: నిన్ను నిఁక నేమందు నన్ను నే దూరుటగాక
కన్నుల నవ్వు నవ్వేవు ఘనమైనమోహమా

చ. 1: చిగురునామోవిగంటి చిత్తగించి చూడవయ్య
యెగసక్కేలకు నీవే యెంతసేసితి
తగిలి సారెకు రాఁగా తెగి ఇటువలె నీవు
ఆగడుసేసితిగాక అది నాపై మోహమా

చ. 2: జాడల నాచన్నులపై చందురులఁ జూడవయ్య
యేడలేనిచలముల ఇంతసేసితి
వేడుకై వద్దనుండఁగా వేసరి ఇందరిచేత
ఆడుకోఁజేసేవుగాక అది నాపై మోహమ

చ. 3: వుమ్మడి నాముంజేతులకుమ్మెలిటు చూడవయ్యా
యెమ్మెల నీకూటముల యింతసేసితి
నెమ్మది శ్రీవేంకటేశ నీకాఁగిటఁ జొక్కితేను
అమ్ముద్ర నించేవుగాక అది నాపై మోహమా

రేకు: 1366-5 బౌళి సం: 23-395

పల్లవి: వెడ్డువెట్టి నేమెల్లా వేసరితిమి
అడ్డివెట్ట కిప్పుడే రావయ్య్య లోనికిని

చ. 1: పదరేటివాఁడవు పంతగాఁడవు మొదల
యెదుటనుండి నపతి నేమంటివి
మదిమదిఁ బవ్వళించి మాటలాడ దెవ్వ రితో
అదె వేఁడుకొందువు రావయ్య్య వొద్దికిని

చ. 2: కోపకాఁడవు మరి కోడెకాఁడవు మొదల
యేపురేఁగి యేకతాన నేమంటివి
ఆపొద్దుననుండియును ఆరగించకున్నది
యీపాటినే రావయ్య్య ఇచ్చకము సేతువు

చ. 3: శ్రీవేంకటేశుఁడవు చెలికాఁడవు మొదల
యీవిధానఁ గూడుతానే యేమంటివి
సేవలు నేము సేయఁగా సిగ్గులతో నున్నది
యీవు లిత్తువు రావయ్య్య ఇన్నిటా నేర్పరివి

రేకు: 1366-6 వరాళి సం: 23-396

పల్లవి: వద్దు వద్దు వలపులు వాఁటములు సేయక
తిద్దుకో మాగుణము దినదిన బెంబడి

చ. 1: పంతములాడి నీతో పచారించి సొలయఁగా
వింతవారమూ నేము వేమారును
చెంతల నీవూడిగముసేసి బల్లిదులమింతే
వంతులేల పట్టేవువారివీరితోడను

చ. 2: కరకరిఁబెట్టి నీతో గామిడితనాలు చూప
పొరుగువారమా నేము పొద్దువొద్దును
అరుదుగా నీకు నిచ్చలడి బల్లిదుల మింతే
తొరలించనేమిటికి దొమ్మివారితోడను

చ. 3: నెయ్యములు చూపి నీతో నేరుపులు వచరించ
వియ్యపువారమా నేము వచిచనవిడి
కొయ్య శ్రీవేంకటేశ్వరకూడి బల్లిదుల మింతే
ఇయ్యకొల్ప నింతేఁటికి ఇంటివారితోడను

రేకు: 1367-1 సాళంగ నాట సం: 23-397

పల్లవి: కంటిఁగంటి నీవిద్యలు కానీలేరా
కంటమాల యిచ్చేవు కానీలేరా

చ. 1: చోప్పులెత్తి నీవంక చూడఁగానే నామీఁద
కప్పురము చల్లేవు కానీలేరా
చెప్పరానినీమేనిచెనకులు వెదకితే
కప్పేవు నీపచ్చడము కానీలేరా

చ. 2: రతిరాజతంత్రాలరహస్యా లడిగితే యే॥
కతములాడవచ్చేవు కానీలేరా
యితరపుసొమ్ము లివి యేడవని అడిగితే
కతలెల్లాఁజెప్పేవు కానీలేరా

చ. 3: యిక్కువ నీమతకము లెరిఁగి నే నవ్వితేను
గక్కనఁ గాఁగిలించేవు కానీలేరా
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
కక్కసించితే మెచ్చేవు కానీలేరా

రేకు: 1367-2 నాదనామక్రియ సం: 23-398

పల్లవి: ఎదురు చూచిచూచి యేఁకారితిని
యిదివో నీవిట్లానైతే యేమనఁగవచ్చును

చ. 1: పిలిచితే రారాదా ప్రియుఁడను నాకంటా
చెలరేఁగిచెలరేఁగి చెప్పుకొందువు
అలరి యమ్మేదొకటీ నసిమలోదొకట్టైతే
వెలఁదుల కెటువలె వేగించవచ్చును

చ. 2: చెప్పినట్లు సేయరాదాచేతలోనివాఁడనని
అప్పటకప్పటికి నీవు ఆడుకొందువు
చిప్పిల విత్తొకటిని చెట్టొకటీ నైతేను
తప్పనిసతుల కెట్టుదరియించవచ్చును

చ. 3: చేరి కాఁగిలించరాదా శ్రీవేంకటేశుఁడ నీ
వీరీతిఁ గూడితినవి యెంచుకొందువు
నేరుపరలమేల్మంగ నేనూ నీవూ నొక్కట్టైతే
ఆరీతికాంతలకెట్లు అవుఁగాదనఁగవచ్చును

రేకు: 1367-3 పాడి సం: 23-399

పల్లవి: చెలిమిఁ బాయకుండేటిచెలికత్తెను నేను
వలనై నీచిత్తము వచ్చుఁగదాయిపుడు

చ. 1: మఱవరానిమాట మగువ నీతో నాడె
గుఱుతుగాఁగఁ దలఁచుకొందువో లేదో
యెఱుకలు సేయుమనె యెచ్చరించుమనె నన్ను
కఱకుమాట లాడుట గాదుగదా నిన్నును

చ. 2: సేయరానిచేఁతలు చెలియ నీమీఁదఁ జేసె
చేయంటి చూతువో లేదో సిగ్గువడక
కాయము విన్నంటుమనె కందువ దెలుపుమనె
రాయడించితినని దూరవుగదా ఇపుడు

చ. 3: నగరానినవ్వు నీతో నవ్వెనలమేల్మంగ
అగడై శ్రీవేంకటేశ అవునో కాదో
నిగిడి కూడితి విట్టె నీతో నన్ను మెచ్చుమనె
జగతిఁ గేరడమై తోఁచదుగదాయిపుడు

రేకు: 1367-4 భైరవి సం: 23-400

పల్లవి: ఇన్నిటికి నీకు మొక్కే మెఱఁగి మన్నించవయ్యా
వన్నెలమాసేఁత లెట్టువలసినా వచ్చు

చ. 1: సరసపుమాటలు సారె నీతో నాడుదుము
యరవుల నీకవి యెగ్గులో తప్పో
పురిగొనే యాసలను బొమ్మల జంకింతుము
వరుసల నీచిత్తము వచ్చునో రాదో

చ. 2: కొదలుచు నేము నీకొంగువట్టి తీతుము
యిది దెలియదు నీకు నితవో కాదో
పదిమారులు నిన్ను భావించి నవ్వుదుము
వుదుటున సమ్మతింతువో సమ్మతించవో

చ. 3: ఘనమున నిన్ను నట్టె కాఁగిలించి కూడుదుము
వెనక నెఱఁగ మది వేడుకో వెట్టో
తనిసి శ్రీవేంకటేశ దాయక పాయకుందుము
యెనసితి వింకా నీకు యింపో సొంపో

రేకు: 1367-5 ఆహిరినాట సం: 23-401

పల్లవి: ఏల కైలాటాలు వెట్టే విదేమోయి
పేలరివై మామీఁదఁ బెట్టేవా వోయీ

చ. 1: బుద్ధులు చెప్పితినట పొంచి నీకు నేనంటా
గద్దించీ యీాకె నన్ను కద్దా వోయి
వద్దవుండకుండా నేనే వలలఁబెట్టితినట
అద్దుకొని మాఁటలాడీ నది గద్దా వోయి

చ. 2: గెర వా(వ్రా?) సితినట యా కెఇంటికి నేఁగకుండా
కరకరించీ నాపె కద్దా వోఇ
కొరకొర కాను కందుకొనకుండాఁ జేసితినట
ఆరసీఁదానే మర్మాలు అవునా వోయి

చ. 3: సన్నలు సేసితినట సారె నన్నుఁ గూడుమని
కన్నుల నవ్వీ నాపె కద్దా వోయి
యెన్నఁగ శ్రీవేంకటేశ యిద్దరి మమ్మేలితివి
నిన్ను నే సాకిరిగోరే నిజమా వోయి

రేకు: 1367-6 వరాళి సం: 23-402

పల్లవి: చాలుఁజాలు నూరకుండు సతులెల్లా నవ్వేరు
కేలుచాఁచి తిట్టేటిపేలరీఁడు గలఁడా

చ. 1: యెగసక్కేలకుఁ జెలు లేమైనా నాడుదురు
పగటునబీరములు పచరింతురు
పొగరున,నీ వందుకు బుజ్జగించవలెఁగాక
మగువతోఁ గోపగించేమగవాఁడు గలఁడా

చ. 2: కామించి రమణులు కడుసేఁతలు సేతురు
ప్రేమమున పంతములు బెరయింతురు
వేమరు నిట్లఇతే వేఁడుకొనవలెఁగాక
రామలతోనలిగేటి రమణుఁడు గలఁడా

చ. 3: అలవోకగానెలఁత లన్నిటాను నవ్వుదురు
బలిమి శ్రీవేంకటేశపై కొందురు
కలిసితి విటువలెఁగరుణించవలెఁగాక
చెలులతో నెగ్గులెంచేచెలువుడుగలఁడా

రేకు: 1368-1 శుద్ధ వసంతం సం: 23-403

పల్లవి: సంగతెఱఁగవద్దా జాణలకును
చెంగట నొకరిచేత చెప్పించుకోనేఁటికి

చ. 1: చేయెత్తి మొక్కఁగఁబోయి సిగ్గువడీఁ జెలియ
చాయల పయ్యదకొంగు జారీనంటాను
వేయరాదా తెర నీవు వెలఁదిసిబ్బితి వాయ
పాయపుమదాన నింత పచ్చిసేయనేఁటికి

చ. 2: పూడిగాలు చేయఁజూచి వొగ్గి కొంకీఁ జెలియ
వేడుకతో పోఁకముడి వీడీనంటాను
మేడలోని కేఁగరాదా మెలుఁతవెరపు దీర
కోడెతనమున వింత గోరసేయనేఁటికి

చ. 3: చేపట్టి తియ్యఁగఁబోయి చింతించీఁ జెలియ
పూవులకొప్పు వదలిపారలీనంటా
వోవరిలోఁ గూడరాదా పువిద సంతసించఁగ
శ్రీవేంకటేశుఁడ ఇంత చిమ్మిరేఁచనేఁటికి

రేకు: 1368-2 ఆహిరి సం: 23-404

పల్లవి: ఊరకుండుటే నాకు వుచితి మీమేళ; గాక
యీరసాన సారె సారె యెట్టు సాదించేను

చ. 1: కపటాన ఇంతులఁ గలసినవాఁడవు
నెపములు చెప్పఁగనేరవా నీవు
కపురై నీమోమున కళలునిండుకుండఁగ
అపరాధాలు నిన్ను నేమనియెంచేను

చ. 2: వలచి కాముకుఁడవైవచ్చినట్టివాఁడవు
మలసి ఆనవెట్టకమానేవానీవు
మెలుపుమచ్చెములు నీమేన నిండివుండఁగ
తలమోచి యెన్నెన్ని తప్పులు పట్టేను

చ. 3: గరిమఁ గాఁగిట నన్నుఁగలసినవాఁడవు
నిరతమై ఇన్నిటామన్నించవా నీవు
తెరలి శ్రీవేంకటేశ దిష్టమై నీవుండఁగ
కురులంటేనీయం దెట్టు కొఱత లెంచేను

రేకు: 1368-3 గౌళ సం: 23-405

పల్లవి: మమ్మునెట్టు దలఁచేవుమనసునను
యెమ్మెల నెక్క డౌతా నెఱఁగకవుంటివి

చ. 1: కలకల నవ్వునవ్వి కప్పురము చేతికిచ్చి
మొలకచన్నులవాఁడిమొనలుమోపి
కలికితనాలనిన్ను కరిఁగించఁగా నట్టె
యెలమి నిన్ను నీ వెఱఁగకవుఁటివి

చ. 2: అందపుమాటలాడిఆయములు గోరనంటి
పొందికల పరపుపై పొద్దులు వుచ్చి
పందెములాడుచు నాపె భ్రమయించఁగా నట్టె
యెందునుఁగిందునుమీఁదు నెఱఁగక వుంటివి

చ. 3: పెనఁగి సారాసారెకు బిగ్గఁ గాఁగిలించుకొని
వొనర శ్రీవేంకటేశ వొద్దికఁ గూడి
అనువునఁ దాఁ దనిసి అప్పణియ్యఁగా, మమ్ము
యెనసితి విందాఁకా న దెరఁగకవుంటివి

రేకు: 1368-4 శంకరాభరణం సం: 23-406

పల్లవి: కంటివిగా వోయి నీకాంతలాగులు
వెంటవెంట వచ్చి యేల వేసాలు సేసీని

చ. 1: చెంగట నీతో నవ్వి చెక్కులు నొక్కితినంటా
యింగితాన నీకె నాతోనేల పోరీవి
కొంగువటుకొని నిన్నుఁ గొసరినంటాను
జంగిలిగా దూరి యేల సాదించీని

చ. 2: పరగ నిన్నుఁ గాఁగిటఁబట్టి పెనఁగినంటా
విరసాన నీపె యేల వెంగెమాడీని
కరఁగించి నాపయ్యదఁ గప్పితి నీమేనంటా
సరికిబేసికి నేల జంకించీని

చ. 3: గుట్టున నే నిన్నుఁ గూడి కొసరితి నంటాను
వుట్టిపడ నీపె యేల వుప్పటించీని
అట్టె శ్రీవేంకటేశ ఆపెఁ గూడితివి తొల్లె
నట్టనడుమఁదానేల నవ్వు నవ్వీని

రేకు: 1368-5 నాదనామక్రియ సం: 23-407

పల్లవి: రమణునితోడనే రాజసమెల్లాఁ జూపేవు
సముకాననే వలపు చల్లవద్దా నీవును

చ. 1: గద్దరిచూపులు చూచి కాఁకాలేల సేసేవు
అద్దుకొని పతి కిచ్చుకా లాడరాదా
పెద్దరికాన నాతఁడు ప్రియములు చెప్పఁగాను
సుద్దుల మంచితనము చూపవద్దా నీవును

చ. 2: వెక్కసపు నవ్వు నవ్వి వెంగెము లేలాడేవు
చెక్కునొక్కి కడుఁబొందు సేయరాదా
చక్కఁదనాల నతఁడు చనవులు మెరయఁగా
ఇక్కువైనమోవితేనె ఇయ్యవద్దా నీవునుమర

చ. 3: ఆరీతిఁ బంతములాడి ఆనలేల పెట్టేవు
తారుకానగా రతులఁ దనుపరాదా
యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె విన్నింతలోనె
మేరమీర కిపుడిట్టె మెచ్చవద్దా నీవును

రేకు: 1368-6 రామక్రియ సం: 23-408

పల్లవి: ఏమి నీవొళ్లఁ గల్లలేమైనాఁ గలవో
చేముంచి కొసరరాఁగాశిరసువంచేవే

చ. 1: యెదురుగావచ్చి నీకే యితవు సేయరాఁగా
చెదరుచు నీవేల చిన్నఁబోయేవు
వెదకి వచ్చి నీకు విడెము నే నియ్యరాఁగా
పెదవులు దడిపి సిబ్బితిఁ బొందేవు

చ. 2: వొద్దనే కూచుండి నిన్నువుపచరించరాఁగా
అద్దుకప్రియాలుచెప్పే వప్పటి నీవు
సుద్దులు చెప్పుచు నీతో చుట్టరికానకు రాఁగా
కొద్దిమీర నీకు నీవే కొంకి లోఁగేవు

చ. 3: కాఁగిలించుకొని నీతోకాఁపురము సేయరాఁగా
మూఁగినమోవిగంటికి మరఁగిడేవు
చేఁగదేరఁ గూడి మొక్క శ్రీవేంకటేశ నే రాఁగా
వేఁగాటిపిఋఁదు చూచి వెరగందేవు

రేకు: 1369-1 కన్నడగౌళ సం: 23-409

పల్లవి: వాసితో బ్రదికేయట్టివనిత నేను
సేసవెట్టినవాఁడవు సేసినట్టు సేయరా

చ. 1: సాటివెట్టవద్దు గానిసతులతోడుత నన్ను
పాటించి నీతొత్తుఁజేసిపనిగొనరా
మాటలకోరువఁగాని మనసులోఁగలట్టెల్ల
చీటికిమాటికి నీవు చేఁతలెల్లఁ జేయరా

చ. 2: వంకలాడవద్దుగాని వంతులసతులలోన
కొంకులేక నీపాదాన కోరి చిమ్మరా
బొంకులకు నోపఁగాని పొరుగిరుగులు మెచ్చ
సంకేలేక నీయిచ్చల సాదించరా

చ. 3: మేకుసేయవద్దు గానిమెలుఁతలయెదుటను
పైకొని నీబలిమెల్ల పచరించరా
యీకడ శ్రీవేంకటేశ యెనసితి విట్టె నన్ను
చీకాకులకుఁ జాల చేకొని మన్నించరా

రేకు: 1369-2 మంగళకౌసిక సం: 23-410

పల్లవి: తరుణికి మేర మీరఁ దగవౌనటే
వొరసి యాతఁడు గాఁగా నోరిచో నింతేసికి

చ. 1: చలముసాదించేవు సరసములాడుతానే
చలువుఁడేమో తొల్లిసేసెనంటాను
మెలఁగి పెనఁగఁగానే మేనెల్ల జీరలువారె
వొలసి యాతఁడు గాఁగానోరిచె నింతేసికి

చ. 2: నారువేసేవు కోపము నవ్వులు నవ్వుతానే
తేరకత్తె నెవ్వెతెనో తెచ్చెనంటాను
చేరి మాటలాడఁగానే చిల్లులువోయఁజిత్తము
వూరకే యాతఁడుగాఁగా నోరిచె నింతేసికి

చ. 3: గయ్యాళించేవు రతులఁగాఁగిటఁ గూడుతానే
నెయ్యపువిద్య లేడనో నేర్చెనంటాను
ఇయ్యెడ శ్రీవేంకటేశుఁ డెనయఁగానేలలసే
వొయ్యనే ఆతఁడుగాఁగా నోరిచె నింతేసికి

రేకు: 1369-3 దేశాళం సం: 23-411

పల్లవి: ఏమయ్యా రట్టుసేసే వింతకుఁ గలమానేము
జాముజాముకు నిన్ను జరసేటివారమా

చ. 1: చనవియ్యఁగానీతోసరి మాటాడితిఁగాక
కినిసితే నిన్ను పలికించగలమా
వనితలము కొసరేవార మింతేకాక
పెనఁగి బత్తిగొట్టానఁబెట్టఁగలమా

చ. 2: చెక్కు నొక్కఁగా నీతో సెలవి నవ్వితిఁగాక
దిక్కరించితే వోజకుఁ దేఁగలమా
ఇక్కువనున్నవారముఇచ్చాడఁగలముగాక
గుక్కక వట్టివేడుక కొనవేయఁగలమా

చ. 3: నీవే నన్నుఁ గూడఁగాను నిండుకవుండితిఁగాక
దేవరవలె నుంటే బోదించఁగలమా
శ్రీవేంకటేశ నేము సిగ్గుతోవారము గాక
వోవరిలోపలిపొందు వొడిఁబెట్టఁదగునా

రేకు: 1369-4 శ్రీరాగం సం: 23-412

పల్లవి: చుట్టిచుట్టి మొగమేమి చూచేవు నీవు
దిట్టవై నీలో నీవు దెలుసుకోరాదా

చ. 1: మగఁడ వెంతసేసినా మచ్చరము నాకు లేదు
నగవు రాకమానదు నాసెలవికి
అగడు సేసితినంటా అందుకు నీవు దూరేవు
విగిడిన నీచేఁతలు నీవు మానరాదా

చ. 2: కొంక కెవ్వతెఁ దెచ్చినా కోపము నాకు లేదు
జంకించక మానవు నాజంట బొమ్మలు
అంకెకత్తె నైతినంటా అప్పటి నుప్పతించేవు
సంకెదీరనీకునీవే సాదవు గారాదా

చ. 3: వలపెందుకు జల్లినాను వైరము నాకు లేదు
సొలయకమానవు నాసూటిమాఁటలు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి గబ్బినంటా
తొలుతనే యీసుద్దులు తలపెట్టరాదా

రేకు: 1369-5 మళవి సం: 23-413

పల్లవి: ఇందరిలోనానైతే యేమనీ నాపె
కందువ నడుగరాదా కానుకలిచ్చీని

చ. 1: వొరసివొరసి నీవు వొకటొకటాడఁగాను
శిరసువంచుక చెలిసిగ్గువడీని
గరిసించ యీాడనేల కాంక్ష నీకుఁ గలితేను
తెరలోనికేఁగరాదా తెలిపిచెప్పితిని

చ. 2: నడమనడుమ నీవు నవ్వులెల్లా నవ్వఁగాను
చిడుముడితో నాపె సిగ్గువడీని
పెడరేఁచ నిఁ(నిం?) తయేలప్రియము నుండితేను
వడిఁ బాన్పు చేరరాదావన్నెలు సేసీని

చ. 3: చెలఁగిచెలఁగి నీవు చేఁతలెల్లాఁ జేయఁగాను
జిలిబిలితనముతో సిగ్గువడీని
వలపు నీకు గలితే కలసి శ్రీవేంకటేశ
తలుపు మూసుకోరాదా దైవారీఁ బనులు

రేకు: 1369-6 సాళంగం సం: 23-414

పల్లవి: ఒకటుండఁగాను వేరొకటి సేసేవు నీవు
ప్రకటించి వింతవారు పైపై నిన్నాడరా

చ. 1: నానఁబెట్టి నానఁబెట్టి నాతో మాఁటలాడేవు
కానుకిచ్చినట్టియాపె కాచుకుండఁగా
వూనినవలపులతో వొడివట్టి పెనఁగేవు
మేనుమేనుసోఁక (కి?) నాపె మెరసివుండఁగాను

చ. 2: చిడుముడితోడుత చేఇవట్టి తీసేవు
కడుఁబాదాలొత్తేయాపె కాచుకుండఁగా
వడియుఁజెమటలతో వలపులు చల్లేవు
బడిబడినున్న యాపె బాఁతిపడఁగా

చ. 3: నమ్మించి శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలేవు
రొమ్ము మీఁదనున్న యాపె రుచులియ్యఁగా
చిమ్ముచు మోవితేనెలు సేనలుగాఁ జిందేవు
రమ్మనిపిలిచినాపె రతియియ్యఁగాను

రేకు: 1370-1 దేశాక్షి సం: 23-415

పల్లవి: ఆవిభునికిఁ జెప్పు మంగనరో యీసుద్దులు
యీవల తానే తెలిసీ యెరింగించవలెనా

చ. 1: సతి నీవు పాఁ (పాం?) దైతే సగఁబాలిదాననేను
అతనితో చండివోరేయట్టిదాననా
ఇతవుగా నవ్వితే నిందుకులోనే నేను
మతకానసాదించి మట్టుపెట్టఁగలనా

చ. 2: తొయ్యలి సేసవెట్టితే తొలుతటిదాన నేను
గయ్యాళించి యాతని గాత సేసేనా
ఇయ్యకొని మొక్కితేను ఇందుకులోనే నేను
కొయ్యతనమున రేఁగి కొంగంటఁగలనా

చ. 3: కొమ్మ నీవు గూడితేను కుడిపక్కదాన నేను
రమ్మని శ్రీవేంకటేశు రచ్చవేసేనా
ఇమ్ములఁ గలసితివి ఇందుకులోనే నేను
యెమ్మెల కాతనితోడ యెడవాయఁగలవా

రేకు: 1370-2 నారాయణి సం: 23-416

పల్లవి: కామిని నిధానమై కలిగె నీకు
నేమెల్లాఁ బొగడఁగా నీదివో బదుకు

చ. 1: మొగము చూచినవ్వి మొనగోరు దాఁకించి
చిగురుమోవితేనె చిమ్మిరేఁగఁగా
వొగరుమాట లాడి వొడివట్టితీసె నాపె
నెగడినజాణఁడవు నీదివో బదుకు

చ. 2: విరులదండ వేసి వేడుకతో సన్నసేసి
పరగ నీమీఁదటిపాటలు వాడి
పరిమళములు పూసి బలిమితోఁ బెనఁగె
నిరతినెరజాణవు నీదివో బదుకు

చ. 3: వీడెము చేతికిచ్చి వీఁపుమీఁదఁ జేయివేసి
వాడుదేరఁ గూడె నాపె వన్నెలు సేసి
యీడనె శ్రీవేంకటేశ యెనయించె నన్ను నీతో
నీడనుండే సుకించేవు నీదివో బదుకు

రేకు: 1370-3 రామక్రియ సం: 23-417

పల్లవి: నేము నీ కితవైనట్టే నేరుచుకొనేమయ్యా
మోము చూచి మంచితనములకు లోఁగావు

చ. 1: వొక్కమాటే యాపెనీతో వుద్దండాలు నేసిసేసి
మొక్కలానఁ దిట్టితేనె మోహింతువు
వెక్కసాన నేమెంత వినుతులు సేసినాను
కక్కసమేగాని మతి గరఁగదు

చ. 2: వాసిరేఁచుకొని యాపె వచ్చినప్పుడే నిన్ను
చేసోఁక నవ్వితేనే చెలఁగుదువు
సేసవెట్టి నేమెంత సేవలెల్లాఁ జేసినాను
ఆసలు పైపైనేకానీ ఆయములు సోఁకవు

చ. 3: అట్టుగానాపె కాఁగిట నట్టె రసము లొలుక
చుట్టి పట్టి కూడితేనేచొక్కుదువు
యిట్టె శ్రీవేంకటేశ యితవుగా నేఁ గూడితి
గట్టిప్రియములే కాని కాదనఁగఁజాలవు

రేకు: 1370-4 వరాళి సం: 23-418

పల్లవి: మంకుఁదన మేమిటికి మగువలకు
అంకెకు వచ్చి యిచ్చకమాడరాదా యిపుడు

చ. 1: నేటిపతితో మాకు నగక వుండితేను
యెగసక్కెమై వుండదా యెవ్వరికైనా
వెగటేమి గలిగినా వెనక సాదింతుగాని
మొగము చూపి చేయెత్తి మొక్కరాదా యిపుడు

చ. 2: పలుమారుఁ బిలువఁగఁ బలుకకవుండితేను
అలిగినట్టుండదా అందరికిని
మలసి నీచలమెల్లా మాపు చూపుదువుగాని
యెలమిఁ జేతికి వీడెమియ్యరాదా యిపుడు

చ. 3: ఆతఁడు గాఁగిలించఁగా నట్టె కాఁగిలించకుంటే
యేతులని యెంచరా యింతులెల్లాను
యీతల శ్రీవేంకటేశు నింకాఁ గూడుదువుగాని
చేతనైనపాటి సేవసేయరాదా యిపుడు

రేకు: 1370-5 పాడి సం: 23-419

పల్లవి: ఏమి చెప్పేరే బుద్దులు ఇద్దరు నొక్కటే తాము
సాములెంత సేసినాను చనవులై వుండు

చ. 1: చెలువపురమణుఁడు సేఁత లేమిసేసినాను
యెలమి మోహించునింతికింపులై వుండు
తలఁచుకొంటే నవే తగులాయములై వుండు
కలిమితో మేనికిసింగారములై వుండు

చ. 2: ననుపైన నాయకుఁడు నవ్వులెన్ని నవ్వినాను
యెనసినకామినికిఇంపులై వుండు
తనివోనివేడుకకుఁ దరితీపులై వుండు
పెనఁగినప్పుడెల్లాను ప్రియములై వుండు

చ. 3: యీరీతి శ్రీవేంకటేశుఁ డెంత కాఁగిలించినాను
యీరసములెల్లా మాని ఇంపులై వుండు
తారుకాణలైవుండు తమకములై వుండు
వూరేటియమృతమెల్లా వుట్టిపడివుండు

రేకు: 1370-6 లలిత సం: 23-420

పల్లవి: అర్ధమరాతిరికాఁడ అలపు చూడక వచ్చె
వొదికతోఁ బీఁటపై గూచుండఁ బెట్టుకోవయ్యా

చ. 1: సారె జాఱుఁదురుముతో సతి నీ ఇంటికి రాఁగా
జీరల చెమటగారీఁ జెక్కులవెంట
చేరి సురటి విసరి చెంగలువలు ముడిచి
గారవించి పరపుపైఁ గాఁగిలించుకోవయ్యా

చ. 2: పయ్యదకొం గెడలఁగఁ బరువున రాఁగాను
కయ్యమడిచీఁ జన్నులు కదలఁగను
చెయ్యి వురమున మోపి చెంగావిదుప్పటి గప్పి
వుయ్యాలమంచము మీఁద వొద్దికచూపవయ్యా

చ. 3: గందపుబొట్టు కలసి నిన్నంటరాఁగా
చిందేటిమోవితేనెలు చిప్పిలీని
కందువ మోవి యాని కస్తూరి నుదుటఁ బూసి
పొందుల శ్రీవేంకటేశ పొసఁగించుకోవయ్యా

రేకు: 1371-1 ద్రావిడ భైరవి సం: 23-421

పల్లవి: మండాటా లిఁకనేల మాపుదాఁకాను
వుండినయట్లనే వొనగూడుమనవే

చ. 1: మనసులోకపటాలు మతకరిమాటలు
కనుఁగొన్నయప్పుడే కానరాదా
తనకేఁటియానలు తగదనే వారెవ్వరు
మనలోచుట్టరికాన మన్నించుమనవే

చ. 2: తిరిగేటితిమ్మటలు తెమలనివేసాలు
గరువపునవ్వులోనే కానరాదా
సిరినేల వొడఁబాటు చాలున (చెల్లద?) నేవారెవ్వరు
కరుణగలిగినట్టే కయికొనుమనవే

చ. 3: రాఁగినచలములు రమించేవలపులు
కాఁగిటిలోననే కానరాదా
మాఁగఁబెట్టనేల మోవి మరిగి నన్నిటు గూడె
దాఁగక శ్రీవేంకటేశు దయఁజూడమనవే

రేకు: 1371-2 మంగళకౌసిక సం: 23-422

పల్లవి: వెసఁ గాఁపురము సేయ విచ్చనలి(వి?) డి
ముసగసలేఁటికి ముదితలతోడను

చ. 1: గరిమ గుఱుతు చెప్పఁగానే చుట్టరికమాయ
తెరమఱఁగుకు రాఁగాతేరె వావి
తరుణికి నీకును తగులు కాముఁడే సేసె
శిరసువంచుక యేల సిగ్గువడేవు

చ. 2: తప్పకచూడఁగానే దైవారెఁ బొంతనాలు
చిప్పివి విడేలియ్యఁగాఁ జేకూరెఁ బెండి (బెండ్లి?)
కప్పురగందికి నీకుఁ గంతుఁడే వొజ్జలాయ
అప్పటి ఇంకానేలఅనుమానాలయ్యా

చ. 3: పానుపుపైఁ బండఁగానే పలియించె సంసారము
నానె శ్రీవేంకటేశ నీనవ్వులమోవి
మానవతికిని నీకు మరుఁడే సేస లందిచ్చె
పూనిపట్టి మరియేల బోదించ నిపుడు

రేకు: 1371-3 పాడి సం: 23-423

పల్లవి: గడుసవంటా నిన్ను కన్న వారెల్లా నాడేరు
జడిగొని యాదరించఁగవద్దా నీవు

చ. 1: చెలఁగితొలుత నీతో సెలవుల నవ్వె నాకె
కలువపువ్వులవేసె కమ్మటి నాకె
పిలిచి పెదవులవే ప్రియములు చెప్పె నాకె
మెలఁగి యిఁ (యిం?) తటనైనా మెచ్చవద్దా నీవు

చ. 2: సారెకు మోవి చూపి చవులుసేసె నాపె
కూరిమి గొసరి గోరగీరె నాపె
ఆరీతి వేరుసేయకుమని విడెమిచ్చె నాపె
నీరతులఁ దనిపి మన్నించవద్దా నీవు

చ. 3: గక్కునఁ గాఁగిటఁ గూడి కడుఁ బచ్చిసేసె నాకె
లక్కవలెఁ గరఁగించి లాలించె నాకె
యెక్కువ శ్రీవేంకటేశ యేలితివినన్ను నిట్టె
నిక్కమును నీదయేనించవద్దా నీవు

రేకు: 1371-4 వరాళి సం: 23-424

పల్లవి: పచ్చులాయకట్టినట్టు బయలు పందిలైనట్టు
గచ్చులైన్నైనాఁ గలవు కైకొనేముగాక

చ. 1: మచ్చిక నీమాఁటలు దీమపుమెకమువంటివి
కుచ్చితాన మెల్లనే తగులఁదీసేవు
పచ్చివెచ్చియైయుండు పడఁతులకేల్లాను
యెచ్చరి నీవాడినట్టె యియ్యకొంటగాక

చ. 2: మాయల నీ నవ్వు లివి మచ్చుమేపులవంటివి
చాయల సన్నల నాసానిలఁ బెట్టేవి
మూయక మూసినట్టుండు ముద్దరాండ్లకెల్లాను
తోయక నీకిచ్చలాడదొరకొంటగాక

చ. 3: చేనకేనీకాఁగిలి జిగురుఁగండెవంటిది
అనువుగాఁ జొక్కించి అంటుకొనేది
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
తనిసి వేడుక లోలో దైవారుటగాక

రేకు: 1371-5 మాళవిగౌళ సం: 23-425

పల్లవి: ఎవ్వ రేమనిరి నిన్ను వేగిరపడేవు
జవ్వనపుమంకులేల చాలు నుండవయ్యా

చ. 1: పంతపుమాటలకేమి పైపై నీ మోహము చూచితే
కాంతుఁడ నీగుణమెల్లాఁ గానరాదా
అంత కోపకాఁడవా అన్నిటా మంచివాఁడవే
సంతరొదలేల యీడఁజాలు నుండవయ్యా

చ. 2: వొట్టులు వెట్టుకోనేల వొట్టే నించుక వుండితే
యిట్టె నీసరితలెల్లానెఱఁగరాదా
గట్టువాయవాఁడవా కడునేరుపరివే
జట్టి తరితీపులేల చాలు నుండవయ్యా

చ. 3: నేమము వలుకనేలనేఁడు నిన్నుఁ గూడితిమి
దీమసపునీవలపు తెలియరాదా
గామిడివాఁడవాశ్రీవేంకటగిరి దేవుఁడవే
సాముల బిగువులేల చాలు నుండవయ్యా

రేకు: 1371-6 ఆహిరి సం: 23-426

పల్లవి: కన్నియ ముద్దరాలు కడుఁబిన్న
యెన్నికనీకాతరాన కింతకోపునా

చ. 1: చెక్కులవెంటఁగారీ చెలియకుఁ జెమటలు
అక్కరతో రతి నెంత యలయించితివో
ముక్కున నిట్టూర్పులు మునుకొని రేఁగెను
పెక్కు విధముల నెంత పెనఁగితివో

చ. 2: మడమెలదాఁకా వీడె మగువ నెరిఁగురులు
తడవి యెంత సదమదము సేసితో
కడింగి కస్తూరి బొట్టు కడజిందువందులాయ
అలాగ మర్మము లెంత అంటితివో

చ. 3: చిమ్ముచుఁ గన్నుల నదె చిందీ నిద్దురలింతి
యెమ్మె జాగర యెంత సేయించితివో
కమ్మి శ్రీవేంకటేశుఁడ కాఁగిలింపించుకొంటివి
కిమ్ముల సిగ్గు లెంతేసి కెరలించితివో

రేకు: 1372-1 పళవంజరం సం: 23-427

పల్లవి: ఏల కోపగించి చూచే వీతనిదిక్కటే నీవు
తాలిమి సేసుకొంటేఁ బంతముదప్పీనా

చ. 1: వెక్కసపుఁగొప్పతఁడు విడిచితే నేమాయ
పెక్కునెరిఁదుమ్మిదలు బెదరీనటే
పిక్కటిల్లుఁగుచములు పిసికితే నేమాయ
యిక్కువ నందలిబిగు వింతలో మానీనా

చ. 2: వొప్పుగా నాతఁడు నీవొడినట్టితే నేమాయ
ముప్పిరి నీపోఁకముడి ముద్రదప్పీనా
అప్పటిఁ బిరుఁదు చేతనంటితే నేమాయనే
గొప్పతన మంతలోనేకొంచమయ్యీనా

చ. 3: శ్రీవేంకటేశుఁడు గోరఁ జెనకితే నేమాయ
సోవల నీపులకసనులు వంగీనా
కైవశముసేసుకొని కలసితే నేమాయ
నీ వలమేల్మంగ వాతనికి జంటగాదా

రేకు: 1372-2 పూర్వ గౌళ సం: 23-428

పల్లవి: అందరివలెనేచూచే వప్పటి నన్ను నీవు
సందడి మందమిరేలు చల్లఁగా నేను

చ. 1: సరసములాడుతానే చలము సాదించె నాపె
యిరవైతి నింతసేయ నే నోపఁగా
తరుణి పాదాలొత్తుతా తానే తాఁకించే గోరు
వొరసి మేరలుదప్ప నోపఁగా నేను

చ. 2: కదిసి మాటాడుతానే కాఁకలురేఁచె నాపె
యిదివో నేనైతేను ఇంతకోపఁగా
చదురంగమాడుతానే సారెసారె నుఁ దిట్టె
వుదుటున గాతసేయ నోపఁగా నేను

చ. 3: గారవానఁ గూడుతానే గంటిసేసె మోవి యాపె
యీరీతి నిన్ను జరయ నింతకోపఁగా
కోరి శ్రీవేంకటగిరి గోవిందనన్నేలితివి
వూరకే నిన్ను దూరనోపఁగా నేను

రేకు: 1372-3 మంగళకౌసిక సం: 23-429

పల్లవి: ఆకెఱుఁగు నీవెఱుఁగు దంతేసి మాకననేల
సాకిరి యడిగితేను సముకాననాడేము

చ. 1: చలములు నీతోను సాదించ నాకేమిటికి
చెరి(లి?) వద్దికిఁ బోరాదా చెప్పీఁగాని
యెలమి నీ వెక్కడనోయేమేమో సేసితివట
కొలఁదితో నవీఁ గొన్ని కొంతగొంత వింటిమి

చ. 2: యెదుటనే మోవిచొప్పు లెత్తంగ మాకేమిటి?
సుదటి నడుగరాదా చూపీఁగాని
చెదరించనేల నీకు ప్రేమ మెందో వున్నదట
అదనఁ బొరుగువారు ఆడఁగానే వింటిమి

చ. 3: వేమారు నిన్ను మాకు వెరసించనేమిటికి
కోమలికి మొక్కరాదా కూడీఁగాని
నేమపుశ్రీవేంకటేశ నీవే యీకె నేలితట
కామిని లిందరునుఁ బొగడఁగా వింటిమి

రేకు:	1372-4 తెలుఁగుగాంబోది సం:	23-430

పల్లవి:	ఇంతి నీకు మీఁదెత్తీ ఇట్టే వలపు
	కాంతుఁడ చేకొనవయ్య కడలేనివలపు

చ. 1:	చిగురుఁగత్తిపై దార చిమ్మిరేఁగేవలపు
	బిగువునామనివేళ పెడరేఁచేవలపు
	మొగిలు కన్నులఁ గంటే మోనచూపేవలపు
	నిగిడి పూవుటమ్ముల నిండువాఁడివలపు

చ. 2:	చూపులంటితేనే వొళ్లు జుమ్మురనేవలపు
	యేపుమాటలనే నాములెక్కీటివలపు
	పైపై సెలవినవ్వుల భ్రమయించేవలపు
	కాపైనవెన్నెలలోనికడువేఁడివలపు

చ. 3:	పానుపుపైఁ గూడితేనే పచ్చి చూపేవలపు
	పూనిన మోవితేనెకు పొత్తుసేసేవలపు
	కానుకై శ్రీవేంకటేశ కాంత నిట్టె యేలితివి
	నానీ నీమన్ననలను ననుపైనవలపు

రేకు: 1372-5 నాదనామక్రియ సం: 23-431

పల్లవి: మట్టుమీర నేమిటికి మాకు నీసేవే చాలు
చుట్టాలమే యెట్టుండినా సొరిది నీ కెపుడు

చ. 1: చిల్లర పొందులెల్లాను జీరలై నీమేన నంటె
వెల్లవిరిఁ దుడిచితే వెసఁబోవునా
పల్లదాన నాకొంగు పట్టేవు నీవప్పటిని
వల్లమయ్యీ అంటించుకోనోపము నీమేనివి

చ. 2: కిమ్ములవారి మాటలు కెంపులై నీమోవి నంటె
అమ్మరో యెంతదాఁచినా నణఁగుండీనా
చిమ్ముచు మాతో నీవు చేరి నవ్వే వప్పటిని
వొమ్మునా మాకింతేసి నీవొళ్లిసింగారములు

చ. 3: చిత్తజరతు లేడవో చెమటలై మేనఁగారీ
వొత్తి యెంతదుడిచినా వూరకుండీనా
ఇత్తల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
వుత(త్త?) కువై వుండీనా నీవొడ్డినయాలసలకు

రేకు: 1372-6 గౌళ సం: 23-432

పల్లవి: మీకిద్దరికే తెలుసు మీరివచ్చేపనులు
సాకిరి నితరులకు చక్కఁబెట్టరాదు

చ. 1: చలపాదివాని నంత దండపెట్టఁబనిలేదు
చెలరేఁగి ఇచ్చకమే సేయవలెను
నెలకొన్న రమణిని నీవు నట్లానైతేనె
పొలఁతుల కింక మరి బుద్ధిచెప్పరాదు

చ. 2: మంకువోజవానితోడ వచ్చరించఁబనిలేదు
అంకెకు వచ్చినట్టెల్లా నాడవలెను
సంకెలేక నీవూ నాజాడలనే మెలఁగితే
పొంకపుఁజుట్టాలకు బుద్ధిచెప్పరాదు

చ. 3: దొరపాటివానితోడ దూరఁగఁబనిలేదు
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
సరిగా నీవూ నట్టే సమరతి నొత్తితేను
పొరుగిరుగువారికి బుద్ధిచెప్పరాదు

రేకు: 1373-1 ముఖారి సం: 23-433

పల్లవి: ఇదివో ఇప్పటిమాట ఇంకానేమేమి గలవో
యెదుట నే నిట్టే పంతమిచ్చితినంటివట

చ. 1: మచ్చికతో నీవు నాకె మంతనము లాడుకోఁగా
వచ్చి నాతో పొంచువిన్నవారు చెప్పిరి
కుచ్చి నీచెక్కులమీఁద గోరుదీయిమంటివట
వచ్చి యాపెకే నీవు వలతునంటివట

చ. 2: పన్ని నీవు నాపెను బాసలు సేసుకోఁగాను
కన్నవారే నాతో నీకడఁ జెప్పిరి
సన్నల నెదురాడనిచన విస్తినంటివట
చిన్నైనాఁ బెద్దదేవులఁ జేసేనంటివట

చ. 3: ఆడ నాపెఁగూడి నాకై అప్పణ లిప్పించుకోఁగా
వూడిగపువారే నావొద్దఁ జెప్పిరి
జాడల శ్రీవేంకటేశ సరిగా నన్నేలితివి
వోడక యిందూ నందూ వుండేనంటివట

రేకు: 1373-2 సాళంగ నాట సం: 23-434

పల్లవి: ఇది యెంతగా బోదించె యెవ్వతో నీకు
ఆదనాయఁ దెరలోని కంకెల రావయ్య

చ. 1: సాదాలుపిసికేదాన పైపై నిందలాడేనా
లేదుసుమీనీగుణాలు లెక్కవెట్టితి
సాదనై మొక్కేచేత సారె గోరుదీసేనా
సేదదేర మేలుతోడ చెక్కులు దువ్వితిని

చ. 2: నీకు నాలనైనదాన నేఁ బంతాలు చూపేనా
నాకున సత్తువచూడవలె నంటివి
కైకొని మోవియిచ్చి కారములుచూపేనా
కోకొమ్మని తేనెలకు గుంటలు సేసితిని

చ. 3: వూడిగపుదాన నీపై వొగిఁ బాదము చాఁచేనా
వాడికరతుల నిన్ను వలపించితి
కూడితి శ్రీవేంకటేశ కొసరులు నెరపేనా
వీడెములోనివిందులు వీడుదోడాడితిని

రేకు: 1373-3 హిందోళం సం: 23-435

పల్లవి: నీకేల వెఱపు నిన్నెవ్వ రేమని రీడ
పోకలఁబో కాపె నిట్టె బోగించరాదా

చ. 1: అంగన మాటలాడితే నాయములు గరఁగేవు
చెఁగలించిచూచితేనే చెమరించేవు
ముంగిట నిలిచితేను ముంచి పులకించేవు
పొంగినాస నీ కాపెను బోగించరాదా

చ. 2: కందువల నవ్వితేను గక్కన భ్రమసేవు
అంది కానుకలిచ్చితే సలసేవు
సందడి నీకు మొక్కితే సారె నుసురనేవు
పొందులు సేసు కీపెను బోగించరాదా

చ. 3: వాపులు నీకుఁ జెప్పితే వలపులు రేఁగేవు
చేవట్టి తీసితేనె చిక్కువడేవు
శ్రీవేంకటేశ్వరుఁడ చేరి నన్ను నేలితివి
బూవానఁ బెట్టుకాపెనుబోగించరాదా

రేకు: 1373-4 సామంతం సం: 23-436

పల్లవి: ఒక్కపానుపుమీఁదనే వున్నార మిద్దరము
పక్కనవలపు యెట్టు పంచియిచ్చేవు

చ. 1: కోరి నే మాటడుగఁగ గోరనాపె వూఁదఁగాను
యీరీతినిద్దరిసంది నెట్టు చిక్కితి
నేరుపు చూతము నీవు నెరజాణఁడ వందురు
బారపువలపు యెట్టు పంచియిచ్చేవో

చ. 2: నవ్వులు నే నవ్వఁగాను నాట నాపె మొక్కఁగాను
ఇవ్వల నిద్దరిసంది నెట్టు చిక్కితి
జవ్వనపువాఁడవు చతురత నేరుతువు
పవ్వళించి వలపెట్టు పంచియిచ్చేవో

చ. 3: సారె మోవి నే నానఁగ చన్నుల నాపె వొత్తఁగ
యీరీతి నిద్దరిసంది నెట్టుచిక్కితి
కోరి శ్రీవేంకటేశుఁడ కూడితివి మమ్మిద్దరి
పైరులవలపు యెట్టుపంచియిచ్చేవో

రేకు: 1373-5 మధ్యమావతి సం: 23-437

పల్లవి: ధర నెఱఁగవా యీతగవు జాణడవు నీవు
సరసము విరసము సరిపెట్టఁదగునా

చ. 1: కొసరికొసరి నిన్ను కొఁ(కొం?) గువట్టి తియ్యఁగాను
విసరి పూవులఁగాని వేసేవు
అసురుసురై యట్టె ఆఁటది వలచిరాఁగా
రసికుఁడు మొగవాఁడు రాయిడించఁదగునా

చ. 2: కలసి మెలసి నేను కందువకుఁ దియ్యఁగాను
వెలుపల నుండి నీవు విఙ్ఞపీఁగేవు
అలరుచు నాఁటది యాసలు పైఁజల్లఁగాను
బలిమిని మొగవాఁడుపంతమాడఁదగునా

చ. 3: కైవశమై నే నిన్ను కాఁగిటఁ గూడఁగాను
శ్రీవేంకటేశుఁడ నీవు సిగ్గువడేవు
చేవదేర నాఁటది చేరి మోవి ఇయ్యఁగాను
కావరించి మొగవాఁడు గంటి సేయఁదగునా

రేకు:	1373-6 ముఖారి సం:	23-438
పల్లవి:	ఏంటికి వేసాలు సేసే వెందాఁకాను
	అఁటదాని దయఁజూచి యాదరించరాదా
చ. 1:	రతికి వేడుకపడి రమణి వద్దనుండఁగా
	కతలేమిచేప్పేవు జాగరముగాను
	యితవుగాకుంటే నానతియ్యరాదా వొకమాట
	చతురత నాడీఁగాని చదరంగమ్మైనను
చ. 2:	జవ్వని మోవితేనె సారెసారె నడుగఁగ
	నవ్వులేమి నవ్వేవు నాఁటకానను
	చివ్వన నీవియ్యనంటే త వా(వ్రా?) సి చూపరాదా
	తవ్వి వానగుంతలైనా తా నాడీఁగాని
చ. 3:	చక్కనింతి గాఁగిలించి చన్నుల వొన్నిత్తఁగాను
	మొక్కులేమిమొక్కేవే మోపులుగాను
	ఇక్కువ శ్రీవేంకటేశ యేలితి పందెమీరాదా
	పక్కన నాడీఁగాని పగడసాలైనను	ఏఁటి ॥

రేకు: 1374-1 మేచ బౌళి సం: 23-439

పల్లవి: అలిగివుండిననన్ను ఆయములంటీఁదాను
నెలకొన్న కూటమికి నేనూఁ వలెనా

చ. 1: చుట్టరికములు సేయ సుదతు లెందరు లేరు
ఇట్టె పాదాలు విసుక నెందరు లేరు
వట్టనడుమ నవ్వులు నవ్వఁగ నెందరు లేరు
నెట్టుకొన వేఁడుకొనీ నేనూఁ గావలెనా

చ. 2: అంచెల సేవలు సేయ నప్పటి నెందరు లేరు
యెంచఁగ బంతికూటికి నెందరు లేరు
మించి విడేలందుకొను మెలుఁత లెందరు లేరు
నించి చెక్కులు నొక్కని నేనూఁ గావలెనా

చ. 3: వలచి దినదినము వరుస కెందరు లేరు
యెలమిఁ దన్నుఁ బొగడ నెందు లేరు
అలరి శ్రీవేంకటేశుఁడంతలోనె నన్నుఁ గూడె
నెలకొని బుజ్జగించె నేనూఁ గావలెనా

రేకు: 1374-2 వరాళి సం: 23-440

పల్లవి: తాను సేసినపనులు దక్కవలెనంటాను
నానఁబెట్టుక లోలోనే నవ్వులు నవ్వీనే

చ. 1: తగవులు చెప్పరాదు తనను నేమీ ననరాను
మగువ సవతిగాఁగా మాటాడితినే
అగడు సేసితినంటా అదె నెపము సేసుక
పగటున పానుపుపై పవ్వళించియున్నాఁడే

చ. 2: వలపులు రేఁచరాను వాడులు వెట్టుకోరాను
చెలికత్తెగాఁగా నటు చెనకితినే
చలము సాదించెనంటా సాకిరు లందరిఁబెట్టి
వెలయఁగ దోమతెర వేసుకవున్నాఁడే

చ. 3: కల్లమోపరాను తన్ను కరకరంచరా నాకె
చెల్లెలుగాఁగాఁ బెండ్లి సేసితినే
ఇల్లిదె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను మీరెనంటా
పల్లదానఁ గాఁగిలించి పాయకున్నాఁడే

రేకు: 1374-3 సామంతం సం: 23-441

పల్లవి: ఏల సిగ్గులువడేవు యేమోయి
వేళతోడఁ జనవిచ్చి వెసఁ గొనవోయి

చ. 1: చెక్కుచేతితో నొకతె చింతలచిగురులమ్మీ
గుక్కకిట్టె వెలవెట్టి కొనవోయి
ముక్కుమీఁదివేలితోడ మోవిపండ్లమ్మీవి
నెక్కొన్న వలపుతోడ నీవు గొనవోయి

చ. 2: చలికప్పుచేతులతో సతి నిమ్మపండ్లమ్మీ
కొలచినందె కొలచి కొనవోయి
పులివచ్చిసిగ్గులు వొడఁబెట్టు కమ్మీని
నిలువుసరసమున నీవు గొనవోయీ

చ. 3: కమ్ముకొన్ననవ్వులను కప్పురపులప్పలమ్మీ
కొమ్మను కాఁగిటి రతిఁ గొనవోయీ
నెమ్మది శ్రీవేంకటేశ నీవు నన్నేలితి వాకె
నేమ్మనములోనఁ గొంత నిండుదకొనవోయీ

రేకు: 1374-4 దేశాళం సం: 23-442

పల్లవి: వేటొకటిగాఁ జూడకు వేడుక నావూడిగము
మీఁటి నే విన్నవించి మెప్పించితి నిపుడు

చ. 1: కోపగించుకోకుమీ గోరుదీసితినంటా
చేపట్టి రతెచ్చురిక సేసితినింతే
చాపలానఁ గసరకు చన్నుల నొత్తితినంటా
రాపాడి నీవురము సాంరించితి నిపుడు

చ. 2: ముంచి యెగ్గుపట్టకుమీ మోవి గంటిసేసెనంటా
కొంచక బూవపుపాత్తు గూడితినింతే
పంచల జంకించకుమీ పట్టిపెనఁగినంటా
పెంచపునీసిగ్గు విడిపించితి నే నిపుడు

చ. 3: గక్కున నలయకుమీ కాఁగిటఁ గూడితినంటా
పెక్కువిధముల మేలు పెంచితినింతే
పక్కన శ్రీవేంకటేశ పాయకుమీ దూరెనంటా
వెక్కసపునవ్వులు నవ్వితి నే నిపుడు

రేకు: 1374-5 శుద్ధ వసంతం సం: 23-443

పల్లవి: ఇంక నోజకువచ్చినా యెంత బుద్దిచెప్పినాను
బింకపు మోహాన రట్టు పెట్టితివి యీపెను

చ. 1: వుంకించి నీవొడివట్టి వొకటొకటె నిన్నాడీ
మంకుది; నెతో నెంత మందెమేళము
జింకించి నేనెడచొచ్చి సారెవద్దన్నా మానదు
తెంకి నింత రాఁగఁజేసితివినీవే యీకెను

చ. 2: కొప్పువట్టి నిన్నుఁ దీసి కొసరీఁ గూరిములెల్లా
ఇప్పుడే నీతోడి నీ కెంత గర్వము
చెప్పుచు నేఁ గనుసన్న సేసినాఁ దా నెఱఁగదు
చిప్పిల గట్టువాయఁ జేసితివి నీ వీపెను

చ. 3: గోర గీరి కాఁగిలించి కుచముల నిన్ను నొత్తి
తారసిల్లీ; తన కెంతదంటతనము
చేరి నిన్ను నెనసి సిగ్గువరచినఁ బోదు
మేరలు శ్రీవేంకటేశ మీరించితి వీపెను

రేకు: 1374-6 కుంతల వరాళి సం: 23-444

పల్లవి: చదివితినందువు జాణనందువు
యెదుటఁ గొంచేవు రాజ్య మెట్ల నేలితివో

చ. 1: అఁటదియైతేఁజాలు నట్టె చూచి భ్రమతువు
యీటుతోడ యెగ్గుసిగ్గు లెంచవు నీవు
పాటలువాడితేఁజాలు భ్రమసి చొక్కుదువు
వాఁటముగఁ; దొల్లి దొడ్డవాఁడ వెట్లనైతివో

చ. 2: మొగము చూచితేఁజాలు మొక్కులే మొక్కుదువు
సొగిసి నవ్వేవారిఁ జూడవు నీవు
పొగడి మెచ్చితేఁజాలు పొందులెల్లాఁ జేతువు
తగవుతోఁ దొల్లి దొరతన మెట్లఁ జేతువో

చ. 3: సరుసఁ గూచుంటేఁజాలు చలపట్టి కూడుదువు
సరవితోదొడ్డు గొంచములెంచవు
గొరబై శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
పొరిఁ దొల్లి గొల్లెతలభోగమెట్లఁ జేతువో

రేకు: 1375-1 సౌరాష్ట్రం సం: 23-445

పల్లవి: అతిత నింతసేతురా అవునయ్యా
తతితో నవ్వులు రాఁగా తలవంచుకొనెను

చ. 1: సింగారించుకొని రాఁగాచిమ్మనఁగోవినీరు
అంగనపై జిమ్మితివి అవునయ్యా
చెంగావిదువ్వటము చిప్పిలి యంటుకొంటే
అంగాలెల్లఁ గానరాఁగా నట్టె సిగ్గువడెను

చ. 2: కిన్నెర మీటుతా రాఁగా గిన్నెలఁ గప్పురధూళి
అన్నిటా మంచిపోసితి వౌనయ్యా
వున్న తపుఁగొప్పు వీడి వొగిఁ గాళ్లఁదొడరఁగా
కన్నులుమూసుక నిన్నుఁ గాఁగిలించుకొనెను

చ. 3: చెంది నీ కొప్పుఁటరాఁగా చెంగలువ రేకులను
అందియంది వేసితివి అవునయ్యా
గొందినె శ్రీవేంకటేశ కూడి మేను చొక్కరాఁగా
సందడి నీపచ్చడము సరిఁ గప్పుకొనెను

రేకు: 1375-2 కాంబోది సం: 23-446

పల్లవి: ఇంతి నీవూ నాడుకోఁగా నేకాంతములెల్ల వింటి
దంతపుటింటిలోనివి దాఁచక చెప్పవయ్యా

చ. 1: పూసగుచ్చినట్టుచేప్పే బుద్ధులెల్లా వింటివా
సేసవెట్టినట్టిపాలు చేకొంటివా
బాసడిగినట్టెల్లాఁ దప్పక నీవిచ్చితివా
ఆసుద్దులు వినవేడుకయ్యీఁ జెప్పవయ్యా

చ. 2: పాదా లాపె పిసుకఁగ పరిణామించితివా
ఆదిగొని పాడఁగాను ఆలించితివా
పాదులు గిలిగించఁగా పక్కన నవ్వితివా
కాదుకూడదన నేను కలట్టే చెప్పవయ్యా

చ. 3: సరసములాడఁగాను చనవులిచ్చితివా
మెరసి వూడిగాలెల్ల మెచ్చితివా
యిరవై శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
అరుదాయ నాపెచేత లవియుఁ జెప్పవయ్యా

రేకు: 1375-3 ఆహిరి సం: 23-447

పల్లవి: చెక్కు నొక్కి వేఁడుకొని చేతులెత్తి మొక్కే నీకు
నేక్కొన్ననీసతి నేను నేరము లెంచే(చ?) కుమీ

చ. 1: మనసు నొవ్వదుగదా మగువను జంకించితే
ఘనమోహ మాపెమీఁదఁ గలదు నీకు
కనుఁగొంటే సవతులు గరిసించక మానరు
పనివడి అవెల్లా నీపైఁ బెట్టుకోకుమీ

చ. 2: సిగ్గులు పడవుగదా చెలి నేతువలెత్తితే
అగ్గలమై నీకెపుడు నాపె ప్రాణము
దగ్గరఁ గూచుంటే పడితలింతురు ఆఁడువారు
దిగ్గన నవెల్లా నీమీఁదికిఁ దీసుకోకుమీ

చ. 3: సూడులు వట్టవుగదా సుదతి నే పంగించితే
యీడ శ్రీవేంకటేశ నీకీపె చుట్టము
కూడితవి నను నిట్టె పాడి యెంతురు కాంతలు
వేడుకలవెల్లా నీవు వేసరుకోకుమీ

రేకు: 1375-4 రామక్రియ సం: 23-448

పల్లవి: అప్పుడే మఱతురా అంగన సేసిన మేలు
చొప్పులెత్తఁగా నణఁచుట నీవెఱఁగవా

చ. 1: ఆకడ నెవ్వతో నిన్ను నట్టె తుటారాలాడఁగ
యీకె సన్న సేసి మాన్పె నదెఱఁగవా
పైకొని యప్పటి నీపయిఁ జేయిచాఁచఁగాను
చేకొని నీకడ్డమువచ్చినది యెఱఁగవా

చ. 2: కడఁగి యెకతె నీపై గట్టిపూబంతి వేయఁగా
యెడచొచ్చి పట్టుకొనె నిదెఱఁగవా
జడియకంతలో నిన్ను సరిఁ గిందవేసుకొంటే
బెడిదాన నిన్ను మీఁదఁబెట్టినదెఱఁగవా

చ. 3: వొద్దనున్నచెలి నిన్ను వొగిఁ గాఁగిటఁగూడితే
తిద్ది తానూఁ గలసినది యెఱఁగవా
యిద్దరూ నుండఁగానే యిటు నన్ను నేలితివి
బద్దుల శ్రీవేంకటేశ పాడి నీవెఱఁగవా

రేకు: 1375-5 మంగళకౌసిక సం: 23-449

పల్లవి: అడుగరాదా బుద్ధిఆపెనే నీవు
కడనుండే వారికిఁగాఁ గాఁకలఁబడుదురా

చ. 1: మేనవారితోడనే మేలమాడుదువుగాక
నాననిజాణతనాలు నాతో నేఁటికి
కానికిచ్చే యాపెకే కప్పుర మిత్తువుగాక
తానకమైవుండేనాకుఁ దమ్ములమిడుదురా

చ. 2: మునుపటిదేవులనే మోపఁజెనకుదుగాక
ననచనినగవులు నాతో నేఁటికి
పనులు సేసేయాపెనే పైపై మెత్తువుగాక
మనికైవుండే నన్ను మన్నించవలెనా

చ. 3: పమ్మి రొమ్ముపై యాపెకే బాసలు సేతువుగాక
నమ్మికయానలువెట్ట నాతోనేఁటికి
కమ్మర నాపెనే శ్రీవేంకటేశ కూడుదుగాక
యెమ్మెకు నన్ను నేలితి వింత సేయఁదగవా

రేకు: 1375-6 తెలుఁగుగాంబోది సం: 23-450

పల్లవి: చే చాఁచవయ్యా నీకుఁ జిక్కెఁ గానికె
కాచినపూచినకలగంపలతో కానికె

చ. 1: చెనకినగోరొత్తులచే కానికె
మొనలచన్నులు నీకుమునుగానికె
చనవులనవ్వు దరిశనకానికె
కనుచూపులే మంచికప్పురపుఁగానికె

చ. 2: వలపుల మొక్కు దీపావళికానికె
కలయికమాటలు వుగాదికానికె
వెలలేని మోవిపండు విందుకానికె
కలికిసిగ్గులు మించుఁగప్పురకానికె

చ. 3: ననుపులకూటమి కట్నము కానికె
పొనుఁగుమోవిసోఁకులు బూమికానికె
యెనసితివి శ్రీవేంకటేశ నన్నును
పనిగొనేరతులు పైపై తొట్లెకానికె

రేకు: 1376-1 మళవిశ్రీ సం: 23-451

పల్లవి: మమ్ము నేమియడిగేవు మాపుదాఁకాను
సమ్మతిగా సేసలు చల్లుకోరాదా

చ. 1: చెలికి వలతువట చెప్పనేల నీసుద్దులు
కలయ నీవాడకు గక్కన రారాదా
కలిమిని యాపెవుంగరము నీచేతనుంటే
తెలువనేల వావి గద్దియపై నుండరాదా

చ. 2: అగనకు బాసయిస్తివట మరేల సిగ్గులు
యింగిత యెఱిఁగి విడెమియ్యరాదా
ముంగిటనీమోవిమీఁద మొల చాపెగురి వుంటే
సంగతిగ నట్టే పంపు సారెఁ జేయరాదా

చ. 3: అతివఁ గూడితివట అప్పటినేల మరపు
రతులచవులెల్లా మరపఁగరాదా
యితవై శ్రీవేంకటేశ ఇద్దరూ నెనసివుంటే
సతమై రాజ్యమేలుచు చనవియ్యరాదా

రేకు: 1376-2 సాళంగ నాట సం: 23-452

పల్లవి: అయ్య జియ్యలు వెట్టేనీయాఁడువారము
పయ్యదకొంగునఁ గట్టేపాటివారమా

చ. 1: కాంతయాడాటాన కాఁకదేరినవాఁడవు
చెంతల వలసించనేర్పినవాఁడవు
దొంతిమోవుల దోమటిదొడికినవాఁడవు
పంతాలు నీతో నాడేపాటివారమా

చ. 2: సరసపుమటాలనే సంతవెట్టిన వాఁడవు
సరి నవ్వుఁగప్పురాలే చల్లేవాఁడవు
తొరలింపుసిగ్గులకు దోసిలొగ్గినవాఁడవు
పరగ నీకాళ్ళు దొక్కే పాటివారమా

చ. 3: కొలఁదిమీరినచనుఁగొండలలో వాఁడవు
మెలుపు శ్రీవేంకటాద్రిమీఁదివాఁడవు
అలమేల్మంగను నే నన్నలమినవాఁడవు
కలసినరతులు పొగడే పాటివారమా

రేకు: 1376-3 ఆహిరి సం: 23-453

పల్లవి: ఇంతితోటియేలాటా లెందాఁకాను
చింతదీర చెక్కునొక్కి సేదదేర్చవయ్యా

చ. 1: చలము లేమిటికయ్య సతితోను
వలచిన మేలు చూడవద్దా నీవు
జలజలఁ జమరించె చందపుమేను
కలసి కాఁగిటిలోనె కాఁకదేర్చవయ్యా

చ. 2: పంతము లేమిటికయ్య పడఁతితోను
యింత(తి?) సేసినవ్వాడిగా లెంచఁగవద్దా
మంతనాన నిట్టూర్పుల మలసీ నిదె
పొంతనే మరుతంత్రాల బుజ్జగించవయ్యా

చ. 3: గుంపెన లేమిటికయ్య కోమలితోను
యింపులు దలఁచవద్దా యిప్పుడైనాను
పెంపున నలసె నీతో బెరయుచును
అంపక శ్రీవేంకటేశ ఆదరించవయ్యా

రేకు: 1376-4 శ్రీరాగం సం: 23-454

పల్లవి: వినరమ్మ యీసుద్దులు వెలఁదులాల
కొనబుకాఁడుగదమ్మ గోవిందరాజు

చ. 1: వీడెము లందియ్యఁగాను వింజామరలు వేయఁగా
వోడక చెలులు పాదాలొత్తఁగాను
మేడలోనఁ బవళించి మెత్తనిపరపుమీఁద
కోడెసేఁతలు సేసీని గోవిందరాజు

చ. 2: అట్టె నాట్యములాడఁగ అంకించిపాడఁగాను
ఇట్టునట్టు వీణలు వాఇంచఁగాను
వొట్టుక మలఁగుమీఁద నొడ్డోలగమై యున్నాఁడు
గుట్టుతోడివాఁడుగదె గోవిందరాజు

చ. 3: పరిమళాలు పూయఁగ పలువిందులు వెట్టఁగ
సిరియు భూమియుఁ బెండ్లిసేస చల్లఁగా
తిరుపతిలోన నొద్దిక శ్రీవేంకటేశుఁడై
గొరబై నవ్వీఁగదె గోవిందరాజు

రేకు:	1376-5 పాడి	సం:	23-455

పల్లవి:	నీకంటెఁ జలమరి నెలఁతకుఁ జెప్పరాదు
దాకొని నీవు నవ్వితే తానే కాఁగిలించీని

చ. 1:	పయ్యదమీదఁద నీవు పన్నీరు చల్లఁగాను
వొయ్యనే లోలోనే తిట్టె వువిద నిన్ను
కయ్యమడిచీ నిందుకగా కాఁకలఁ బొరలనేల
వుయ్యాలపైకి రారాదా వొక్కటిసేసేను

చ. 2:	పువ్వుల చెండునఁగొని పూఁచి నీవు వేయఁగాను
జవ్వని బొమ్మల నిన్ను జంకించెను
అవ్వల నిందుకుఁగాను అసురుసురననేల
పవ్వళించరాదా వద్ద పంతాలు దిద్దేను

చ. 3:	శ్రీవేంకటేశ నీవు చెలిగుబ్బ లంటఁగాను
కావరించి యాకె మోవి గంటిసేసెను
చేవదేర నిందుకుఁగా సిగ్గులు వడఁగనేల
బావించి కప్రమీరాదా బత్తి నేఁ జేసేను

రేకు: 1376-6 సామంతం సం: 23-456

పల్లవి: తగునయ్య నీకిన్నియు దైవపురాయ
మొగమునఁ గళనిండె మోహనరాయా

చ. 1: మీఱుచు మాటలాడి మెలుఁత చెక్కుల వెంట
జాఱించితిగా చెమట జాణరాయ
ఆఱడిమాఁటలాడి అట్టె పట్టినీవు
చూఱగొంటివిగా సిగ్గు సుగుణరాయ

చ. 2: మంతనాన నవ్వుతానే మర్మములు గరఁగించి
వింతలు సేసితివిగా విటరాయ
అంతలోనే పైకొని అధరపుఁదేనే లిచ్చి
చెంతఁ జొక్కించితివిగా చెలువరాయ

చ. 3: పులకలు పెడరేఁచి పొందులెల్లాఁ జేసి యీకెఁ
జెలరేఁగించితివిగా సింగారరాయ
బలురతుల నోలార్చిపలుమారు మన్నించి
చిలికితివిగా మేలు శ్రీవేంకటరాయా

రేకు: 1377-1 వరాళి సం: 23-457

పల్లవి: కూడినవేళనే బాసగొనవలెను
వాడలు దిరిగితేనే వంచరాదుసుమ్మీ

చ. 1: సిగ్గులువడుకువే చేపట్టి తీసితేను
వెగ్గళించినవ్వకువే వేఁడుకొంటేను
అగ్గమై నీయింటికి రమ్మననే రమణుని
నిగ్గులవెనక మరినేరరాదుసుమ్మీ

చ. 2: కొంచకువే నీతోను కోరి మాటలాడితేను
వంచకువే శిరసు నీవాఁడసనఁగా
మంచము వేయవే నీమగనికిఁ బవ్వళించ
యించుక మఱచినాను యేఁకరేవుసుమ్మీ

చ. 3: తరితీపు సేయకువే తగఁ గాఁగిలించుకొంటే
వరుస వెరగేఁటికే వావి చెప్పఁగా
ఇరవై శ్రీవేంకటేశుఁ డేలె నిన్నఁక మెచ్చవే
వొరసితే రతులిఁక వుడివోవుసుమ్మీ

రేకు: 1377-2 ఆహిరినాట సం: 23-458

పల్లవి: అండనుండవేనామారు; అతనికి నాకుఁబోదు
దండిగానాపై దయను తనే వచ్చీఁగాని

చ. 1: మనసులో నాబత్తి మఱవకుమనఁగదే
వనితలు పెక్కు గలవాడు తాను
అనిశము నాకానికె అందుకొమ్మనఁగదవే
ఘనమైనసంపదలు గలవాఁడు తను

చ. 2: తగిలిన నాసేవ తలఁచుకొమ్మనఁగదే
మగటిమితో పొత్తులమగఁడు తాను
సొగిసి నాలేకలు చూచుకొమ్మనఁగదే
అగపడిఅట్టే లోలుఁడై వుండుఁ దాను

చ. 3: సోఁకిననాగోరితాఁకు చూచుకొమ్మనఁగదే
వాఁకపురతిసాములవాఁడు తాను
యేఁకటశ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్నుఁ గూడె
పోఁకవెట్టి పెండ్లాడినపురుషుఁడే తాను

రేకు: 1377-3 బౌళి సం: 23-459

పల్లవి: ఇందుకా నీదొరతన మిందరిలోన
కందువల నిందు నేమి గట్టుకొంటివయ్యా

చ. 1: సెలవుల నే నవ్వితే శిరసువంచేవు నీవు
కలదా యేమైనాను కల్ల నీమేన
నిలువు నూరు వండీని నీవంక చూచితేను
తొలుసారే యేపనికి దొరకొంటివయ్యా

చ. 2: చేసన్న నేఁ జేసితేను సిగ్గులువడేవు నీవు
మూసి దించి నింద నీపై మోచెనా నేఁడు
ఆసఁ దేనె లుట్టిపడినట్టె నీతో మాటాడితే
వోసరించ కెంతవని కొడిగట్టితివయ్యా

చ. 3: కానుక నే నిచ్చితేను కాఁగిటఁ గూడేవు నీవు
వూని యిందుకే కాచుకున్నాఁడవో
ఆనుక శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
నీనేరుపు లెంతెంత నేరిచితివయ్యా

రేకు: 1377-4 సాళంగ నాట సం: 23-460

పల్లవి: ఇప్పుడే వేగిరమేల ఇన్నిటికిని
కప్పురమిచ్చేవేళ కనిపించేఁగాని

చ. 1: కాంతమీఁద నీకునిట్టెకడుమోహమై వుండఁగా
యెంత నే విన్నవించినా యితవయ్యీనా
ఇంత గలితే నీవు మాఇంటికి వచ్చేవేళ
దొంతరనానేరుపులు తోడుచూపేఁగాని

చ. 2: వుమ్మడి నాపె నీవును వొడివట్టి పెనఁగఁగ
రమ్మని నేఁ బిలిచితేరతికెక్కీనా
సమ్మతైతేఁ గనక నీసరసమాడేటివేళ
పమ్మి నా ప్రియములెల్లఁ బచరించేఁగాని

చ. 3: మరిగిమఱఁదలిపై మనసువెట్టుకుండఁగ
గరిమనేఁబైకొంటే కనుపట్టీనా
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
యిరవై నన్నేలితివియిఁక మెచ్చేఁగాని

రేకు: 1377-5 రామక్రియ సం: 23-461

పల్లవి: అవధరించవయ్యా ఆపెకలికిచేతఁలు
తివిరి చెమటమంచు దిగుపారించీని

చ. 1: తేనెగారే మోవితోడ తేట మాటలాడుతాను
కానుకిచ్చి యాపె నిన్నుఁ గరఁగించీని
సానఁబట్టే చూపులను చలములు రేఁపుతాను
వీనులపండువగా విన్నపాలు సేసీని

చ. 2: జంకెనబొమ్మలతోడ సరసములాడుతాను
లంకెలపొందుల నాపె లళి రేఁచీని
కుంకుమ గుబ్బలమీఁది గురుతులు చూపుతాను
కొంకునుఁగొసరు లేక కొంగులు వట్టీని

చ. 3: వెన్నెలనవ్వులతోడ వేడుకలు నెరపుతా
కిన్నెరమీఁట్లనాపె గిలిగించీని
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
సన్నల నిన్నుఁగూడితే చవులు తా నించీని

రేకు: 1377-6 సామంతం సం: 23-462

పల్లవి: ఇదివో నాభాగ్య మేమిచెప్పేది
మదనగురుఁడు నన్ను మన్నించెను

చ. 1: జాణతనాలాడఁగాను సరసుఁ డందుకుమెచ్చి
ఆణిముత్యముల కంఠహార మిచ్చెను
వీణె నేను వాయించఁగ వేడుకతోడ నట్టె
రాణించిన సతులలో (తో?) రతికిఁ జెప్పించెను

చ. 2: ఇచ్చకములు సేయఁగా యీతఁడే అందు మెచ్చి
పచ్చలకడియము లప్పటి నిచ్చెను
పచ్చితోడ తనమీఁది పాటలెల్లాఁ బాడఁగాను
పచ్చడముకొంగు నాపైఁగప్పెను

చ. 3: చేరి కాఁగిటఁగూడి శ్రీవేంకటేశుఁడు మెచ్చి
పేరుకల నీలాల పెండె మిచ్చెను
నేరి చలమలేల్మంగను నేఁ దన్నుఁ బొగడితేను
సారెసారె నన్ను నేలి చనవిచ్చెను

రేకు: 1378-1 లలిత సం: 23-463

పల్లవి: ఎక్కడ పరాకుసేసే వెందాఁకాను
వెక్కసపుఁ దమకాన విడెమియ్యరాదా

చ. 1: చిడుముడినవ్వుతోడ చెలి నిన్నుఁ గొసరఁగా
తొడపైఁ బెట్టుకోరాదా దొరవు నీవు
నడియుఁజెమటతోడ వలపులు చల్లఁగాను
తుడువరాదా నీవు దుప్పటికొంగునను

చ. 2: వాలుక చూపులతోడ వనితనీకు మొక్కఁగా
పాలించి పైకొనరాదా పతివి నీవు
మేలములాడుచు నీతో మేనరికము చెప్పఁగా
ఆలిఁగాఁ బెండ్లాడరాదా ఆదరముతోడను

చ. 3: అలమేలుమంగ నిన్ను నట్టె కాఁగిలించుకోఁగా
చెలఁగి మోవియ్యరాదాశ్రీవేంకటేశ
చలమిబలిమి నీకు చవులు వుట్టించఁగాను
పలుమారు మెచ్చరాదా భావము దెలియను

రేకు: 1378-2 దేశాళం సం: 23-464

పల్లవి: జాణతనమెంచవద్దా సతులయడాటాన
వీణె వాయించినదాఁకా వేగిరమా

చ. 1: మొగముచూడఁగానే మొక్కులు మొక్కేయాపెను
అగడుసేసి పెనఁగి యలయింతురా
తగలి యదియుఁగాక తమకించి యంతలోనే
బిగువుకుచము లిట్టె పిసుకుదురా

చ. 2: సిగ్గుతోడ విన్నపాలు నేటియాపెను
బగ్గనను గోరగీరి పచ్చిసేతురా
నిగ్గున నంతటఁబోకనీయుతులెల్లా మెరసి
వెగ్గళించి పోఁకముడి వీడఁజేతురా

చ. 3: గుట్టుతోడ వీడెమిచ్చి కూడేటియాపెను
అట్టువేసి నేర్పు రచ్చనట్టె వేతురా
ఇట్టె శ్రీవేంకటేశ యీయలమేలుమంగను
గట్టిగానేలి వింత కందునఁ జొక్కింతురా

రేకు: 1378-3 పాడి సం: 23-465

పల్లవి: అట్టె కానీలేవే అతఁ డింతేయిత్తసేసె
నెట్టన నే నిన్నాళ్ళు నిన్నెఱఁగనా

చ. 1: జడియుచు మరిసేవు సవతుల యెదుటనే
కడలేని సంపదల గర్వమా యిది
బడిబడి నందరిలో పంతములే నెరపేవు
వొడలిలో వుప్పులిల్లేవుదుటా యిది

చ. 2: దొరకొని కెలసేవు తోడివారు వినఁగానే
మరు తంత్రములోని మదమా యిది
పరగ బంగారుపీఁటపయి విఱ్ఱవీఁగేవు
కరఁగిన మనసులో గజరా యిది

చ. 3: కూడి శ్రీవేంకటపతిఁ గొసరేవు మాయెదుట
జాడల నీతఁడిచ్చిన సలిగా యిది
వోడక యక్కచెల్లెండ్ల రొమ్మ సమ్మతిసేసేవు
నీడల నేనేర్చిననేరుపా యిది

రేకు: 1378-4 మళవి సం: 23-466

పల్లవి: ఎప్పుడూఁదనవారమే యేడనున్నాను
వొప్పాయి వలపు లూరకుండుమనఁగదవే

చ. 1: సరసములాడఁబేతే సరి నలపులు చిక్కు
కరకరించఁగఁబోతే కాఁకలు రేఁగు
తెర దియ్యఁగబోతే తరితీపులే కడుమించు
వొరయనేఁటికి వూరకుండు మనఁగదవే

చ. 2: చలము సాదించఁబోతే చండితనములు వుట్టు
బలిమి చూపఁగఁబోతే పంతాలు హెచ్చు
గిలిగించఁబోతేను గీరలు వొళ్లెల్లా నిండు
వులివచ్చి సేయకూరకుండుమనఁగదవే

చ. 3: బట్టబయలీఁదించఁబోతే భావము చిక్కులువడు
గుట్టులు చూపఁగఁబోతే కుప్పలౌఁదమి
ఇట్టె శ్రీవేంకటేశుఁడింతలోనే నన్నుఁ గూడె
వొట్టు చెల్లె నీఁక నూరకుండుమనఁగదవే

రేకు:	1378-5 బౌళి	సం:	23-467
పల్లవి:	ఔనటవే ఇంకా నేమందునే నేను
వైనవైనాలుగా నన్నీ వా (వ్రా?) సిత్తునటవే
చ. 1:	చెల్లునే తాఁజేసినచేఁతలెల్లాను
వెల్లవిరాయఁ బనులు వేగినంతాను
కల్లలూఁగానే తన చక్కనిమాఁటలూ
పల్లదాన నన్నిటాను పంతగాఁడే తాను
చ. 2:	మెచ్చిరే యందరూఁ దనమేకులెల్లాను
పచ్చితనమెల్లా బంగారాయనే
తచ్చనలూఁగావే తన తగవులునూ
వొొచ్చెములేని గుణాల వొరపరే తానూ
చ. 3:	దక్కెనే తనకు మంచితనమెల్లాను
మొక్కినట్టే వరమిచ్చె ముమ్మాటికిని
యిక్కువతో నన్నుఁ గూడి యిచ్చె మేలెల్లా
వెక్కసపు శ్రీవేంకటవిభుఁడే తానూ

రేకు: 1378-6 ఆహిరినాట సం: 23-468

పల్లవి: ఆఁడువారి నీ వింతాఆగడాలు సేతురా
పోఁడిమిఁజెమటఁ దోగె పొంచి పయ్యెదెల్లాను

చ. 1: కొప్పువెట్టుకొనఁగాను కొమ్మకరమూలములు
తప్పకచూచి నీ వంతలో నవ్వంగా
చిప్పిలుసిగ్గున నాకె చేతులదుముకొంటేను
ముప్పిరిగొని మోముపై ముంచుకొనె నెరులు

చ. 2: కోక గట్టుకొనఁగానుకొమ్మెరుఁగైనతొడలు
జోకలుగా నీవట్టె చూచి నవ్వంగా
కాకరిసిగ్గునను మో కారించుక కూచుంటే
ఆకెమొల నూలిగంట లట్టె కుప్పవడెను

చ. 3: హారములు వెట్టుకోఁగా నందపుచన్నులు చూచి
నేరిచి శ్రీవేంకటేశనీవు నవ్వంగా
ఆరీతి సిగ్గున నిన్ను నట్టె కాఁగిలించుకొంటే
కూరిమితోఁ బులకలుకోరి జాజుకొనెను

రేకు: 1379-1 భైరవి సం: 23-469

పల్లవి: ఇటువంటిచెలినేల యెలయించేవు
తటుకునఁ గాఁగిలించి దయఁజూడవయ్యా

చ. 1: యేపొద్దునీతో నవ్వ నెఱుఁగు నింతేకాని
కోపగించ నెఱఁగదు కొమ్మ యఁ(యం?)తైనా
చూపుల నినుఁజూచి చొక్కఁగ నెఱుఁగుఁగాని
యేపునఁ దలవంచఁగ నెఱఁగ దెప్పుడును

చ. 2: చలపట్టి నీతో సరసమాడ నెఱుఁగుఁగాని
యెలమిఁ బలుకకుండ నెఱఁగ దీకె
వలచి ప్రియము చెప్పి వంచుకోనెఱుఁగుఁగాని
అలుగఁగ నెఱఁగ దెంతైనా నీతోను

చ. 3: పానుపుపైఁ గాఁగిలించి పైకొననెఱుఁగుఁగాని
ఆనలువెట్టినాఁ బాయనెఱఁగదు
యీనెపాన శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి
తేనెమో వెఱుఁగుఁగాని తెగువయెఱఁగదు

రేకు: 1379-2 పాడి సం: 23-470

పల్లవి: చిట్టకీనివలెఁ దాను చిన్న చేఁతలెల్లాఁ జేసీ
యెట్టు దెలియఁగవచ్చు నెఱఁగనే నేను

చ. 1: కప్పుర మిచ్చేనంటా కందువకుఁ జేయి చూపి
తప్పించి కండచక్కెరలప్పు వెట్టెను
విప్పక నిజమనుచు విడెములో వేసుకొంటిఁ
గప్పి తములము తీపుగాఁగా నుమిసితినే

చ. 2: ఇదె నూరినకస్తూరి ఇచ్చేనంటా ముందు చూపి
మెదిగిన మరియము మేని కిచ్చేనే
పుదుటున నౌనంటా వొడల నేఁ బూసుకొంటి
సదరాన వెట్టగాఁగా జలక మాడితినే

చ. 3: విరుల పాన్పిచ్చేనంటా వెసఁ బెద్దరాశి వోసి
యెరవులేకుండాఁ దాను టు దాఁగెనే
పరగఁగా నిమ్మనుచుఁ బవ్వళించితే నందు
తరి శ్రీవేంకటేశుఁడు తాఁ గూడె మొక్కితినే

రేకు: 1379-3 సామంతం సం: 23-471

పల్లవి: విన్నవించితిమి నీవిద్యలెల్లాను
అన్నియుఁ జెప్పీఁగాని ఆకె నీకు బుద్దులు

చ. 1: వెలలేని వలపుల వేడుకకాఁడ
పలు సరసంబుల పగిడికొండ
నిలువులయెమ్ముల నీటుకాఁడ
పిలిచీ రావయ్య ప్రియురాలు

చ. 2: చల్లేటికర్పూరపుజాజరకాఁడ
గొల్లెతలమానములకొల్లకాండ
చల్లువె నవ్వుల సటకాఁడా
యిల్లిదె పిల్చీ రావయ్య యితవురాలు

చ. 3: వంకచందురులచెక్కువన్నెకాఁడా
కొంకతక కూడె నిన్నాపె కోడెకాఁడా
అంకెల శ్రీవేంకటాద్రి ఆసోదకాఁడా
బింకానఁ బిలిచీ రామయ్య బిత్తరాలు

రేకు: 1379-4 శుద్ధ దేశి సం: 23-472

పల్లవి: మాతోఁ బంతాలాడేవు మరి నీవు
కాతరాన నాపెకు కడుఁగించుపడవా

చ. 1: మగువ మోవికి యాకు మడిచి నీవందియ్యఁగా
జిగిఁ గోనగోరు ఆపె చెక్కు దాఁకెను
పగటున నందుకుఁగాఁ బలుమారు దిట్టితేను
మొగము చూచి చేయెత్తి మొక్కవా నీవపుడు

చ. 2: చెలియకుఁ బత్తితోడ సేవలెల్లాఁ జేయఁగాను
కొలువులోనాపె కట్టుకంగు జారెను
కులికి యంతలోన కూరిమిఁ గోపగించితే
పెలుచుఁదనాలు మాని ప్రియములు చెప్పవా

చ. 3: కాంతను నీవు గూడి కప్పురునోటికీఁగా
వింత పలుసోఁకలువెల్లవిరాయ
పొంతనే శ్రీవేంకటేశ బొమ్మల జంకించితేను
బంతినే కానుకలిచ్చి బంటనయ్యేననవా

రేకు: 1379-5 దేశాళం సం: 23-473

పల్లవి: నే నెఱిఁగినవే తొల్లి నీసుద్దులు
మానఁగదవయ్య నీమతకము లెల్లను

చ. 1: నీవున్న యిక్కు లెఱింగి నెలఁత యీడకే వచ్చే
సేవసేయ రమ్మని చెప్పించితివో
వోవల నీవప్పటిని వొట్టేల పెట్టుకోనేవు
దేవరపు గావా నీవు దిమ్మరితనానకు

చ. 2: తప్పులేక నీవన్నట్టె తారుకాణమాట లాడె
వొప్పుగఁ బదరుకొంటివో తొలుతే
కప్పికప్పి నీవేల కడునొడఁబరచేవు
యెప్పుడు రాజవుగావా యీవిద్దెలకును

చ. 3: నెక్కొని శ్రీవేంకటేశ నీవు నవ్వినట్టె నవ్వె
యెక్కడఁ గూడితిరో యింతకముందే
చెక్కులేల నొక్కేవు చిప్పిల నన్నిట్టె కూడి
గక్కనను గరువవుగావా యీయెమ్మలకు

రేకు: 1379-6 వరాళి సం: 23-474

పల్లవి: ఇవి గొన్ని నేర్పితివి యీడానాడాఁ దిరిగాది
తనిలి యొక్కటొక్కటే తలఁపునఁ బారునా

చ. 1: వంతునేల వెట్టేవు వాసులేల రేఁచేవు
పొంతనుండి నీకదేమి పొద్దువోదా
బంతికేల పిలిచేవు బసలేల సేసేవు
కాంతల గన్నప్పుడే కడునెమ్మె వచ్చునా

చ. 2: చేతులేల చాఁచేవు సిగ్గులేల తడవేవు
రాతిరిఁబగలు నీరపమాయనా
ఘాతలేల సేసేవు కన్నులనేల మొక్కేవు
జాతుల నీకాఁడువారు సదరములయిరా

చ. 3: గుబ్బలేల చెనకేవు గురులేల వ్రాసేవు
వుబ్బి మదనకళలు వొళ్లు నిండెనా
నిబ్బరాన శ్రీవేంకటనియల నన్నేలితివి
అబ్బుపుసతులమే యంత నీకుఁ బ్రియము

రేకు: 1380-1 కాంబోది సం: 23-475

పల్లవి: తొలుతనే మంకువారు దొడ్డివారు
చలములు సాదించితే జడుతురా చెలులు

చ. 1: సిగ్గువడి యుండఁగాను చెలి యలిగెనంటాను
యెగ్గులువట్టి తిట్టేవు యేమయ్యా
తగ్గక నీచేసినచేఁతలూఁగాక అందుమీఁద
వెగ్గళించితేఁ జెలులు వెఱతురా యిపుడు

చ. 2: పవ్వళించి వుండఁగాను పడఁతి మాటాడదంటా
ఇవ్వల రవ్వసేసే వేమయ్యా
కువ్వలై నీమేనిమీఁద గురుతులూనుండఁగాను
జవ్వనాన జంకించితే సైఁతురా ఇందుకు

చ. 3: పట్టి కాఁగిలించుకోఁగా బలిమిసేసీనంటా
ఇట్టునట్టుఁ బెనఁగేవు వేమయ్య
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి మగువను
వెట్టికిఁ గొసరితేను విడుత (తు?) రా పంతము

రేకు: 1380-2 శంకరాభరణం సం: 23-476

పల్లవి: వేగిరమేల వేయనీవోలా
ఆగతులెల్లాను అయ్యీఁగాని

చ. 1: వలవనిజోలి వలపువిరాలి
యెలమిని జరపే వేమిటికి
తెలిసితి నేనూ దిష్టముగాను
చెలిమి నిజమయితేఁ జెప్పేఁగాని

చ. 2: గరివడ్డ పెసరు కందువకొసరు
యెఱిఁగినపనులే యేమిటికి
గుణియాయ నాకు గుదిగొన్నకాకు
తఱి వచ్చినప్పుడే తలపించేఁగాని

చ. 3: కొండలనునుపుగొనకొన్ననునుపు
యెండలు నీడలు యేమిటికి
అండనె శ్రీవేంకటాధిప నన్నే లితివి
పండుమోవి తేనె పరపేఁగాని

రేకు: 1380-3 నాదనామక్రియ సం: 23-477

పల్లవి: మెత్తనిమనసుదాన మిక్కిలి నేనూ
హత్తి నీవాడినట్టెల్లా నాడేనయ్యా

చ. 1: యిప్పటినీనవ్వు లివి యెన్నిటికైనావచ్చు
వుప్పటించనోప నూరకుండవయ్యా
దప్పిదేరె నిన్నుఁ జూచి దయవుట్టీ నంతలోనే
చెప్పేటిప్రియాలు నాకే సెలవాయన్యయ్యా

చ. 2: రొక్కపునీమాటలు రొంపిలోనికంబాలు
యెక్కడికెక్కడ మరి యెందాఁకానయ్యా
మొక్కేటినీవేసాలకు మొగమోట గనమాయ
ముక్కువనీచేఁతలు సమ్మతైనట్టే అయ్యా

చ. 3: కందువనీరతు లివి కట్టినమంచిచద్దులు
చెంది నిన్నుఁ గూడితి తనిసితినయ్యా
అందపు శ్రీవేంకటేశ ఆసవుట్టీఁ గమ్మటిని
చందపునీమోవిలోనే చలిగొంటినయ్యా

రేకు: 1380-4 ధన్నాసి సం: 23-478

పల్లవి: ఇందరిలో నీసుద్దులు యేమిచెప్పేవు
కందువతో నేకతానఁ గరుణించరాదా

చ. 1: చెంగలువకన్నులను చెలి నిన్నుఁ జూచితేను
అంగమెల్ల బులకించెనని యాడేవు
యింగితాన వలపులు ఇంత నీకుఁ గలిగితే
కంగుదీర నికె నిట్టె కాఁగిలించరాదా

చ. 2: కప్పురపుఁబలుకులకాంత నీతో మాటాడితే
అప్పుడే నే భ్రమసితినని యాడేవు
ముప్పిరిగఁ దమకము ముందు నీకింత గలితే
కప్పి పచ్చడముతోనే కాఁగిలించరాదా

చ. 3: వెన్నెలనవ్వులతోడ వెలఁది నిన్నుఁ గూడితే
అన్నిటాను భ్రమసితినని యాడేవు
మన్నించి శ్రీవేంకటేశ మనసు లేకములైతే
కన్నప్పుడెల్లా నిట్టె కాఁగిలించరాదా

రేకు: 1380-5 రామక్రియ సం: 23-479

పల్లవి: కాదనేమా నేము నీ గయ్యాళితనములకు
ఆదెసనీదెసను నీవాడినట్టే అయ్యాని

చ. 1: పంతమాడి నిన్ను నంత పరచఁగ నోపుదుమా
చెంత నుండి నీసేవ సేసేముగాక
యింత నీకు వేడుకై తెనెందునో యేమింక నేము
అంత వేగిరించకుమీ ఆడినట్టె అయ్యాని

చ. 2: సరికిబేసికి నిన్ను సాదించ నోపుదుమా
పెరరేఁచి చిత్తము దర్పించేముగాక
కరుణ నీకుఁ బుట్టితే కానిమ్మనఁగ వలదా
అరుదుగాఁ గోరకునీవినట్టె అయ్యాని

చ. 3: శ్రీవేంకటేశ నినను జీరదియ్య నోపుదుమా
మూవంకఁ గూడితి మిఁక మొక్కేముగాక
యీవలమన్నించితేను యెప్పుడూ నీవారమే
ఆవిధాన నింకా నీవాడినట్టె అయ్యాని

రేకు: 1380-6 దేవ గాంధారం సం: 23-480

పల్లవి: రావయ్యా వో రామయ్యా
తావుకొని నిన్నుఁ దలఁచీని

చ. 1: చిప్పిలుఁజెమటలు చెక్కుల వెంటాఁ
గుప్పళించీ నిదె కోమలి
దప్పిదేరుచును తన పెదవుల
పిప్పిగట్ట నిన్నుఁ బిలిచీని

చ. 2: చల్లుఁబులకలు చన్నులనిండా
జల్లన నించీని జవరాలూ
వెల్లి నిట్టూర్పులువెలయ నీయింటి
కల్లదె వచ్చి ని న్నడిగీని

చ. 3: సిగ్గుల మొక్కులు చేతుల రెంటా
వొగ్గుచు నీకిచ్చీ నువిద
యెగ్గుల శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి
అగ్గలపు రతు లవే కొసరీని

రేకు: 1381-1 సింధురామక్రియ సం: 23-481

పల్లవి: మేలే మెట్టుండినాను మేనవారము
జాలిఁబెట్టి నిన్ను మరి చండిసేసేనా

చ. 1: కూరిమి గలితేఁజాలు కొసరితే నేమాయ
యేరా నీతోనే నెగ్గుపట్టేనా
గారవించితేఁజాలు కడనుంటే నేమాయ
రారా నిన్నంతేసి రవ్వసేసేనా

చ. 2: కూడామాడా నుంటేఁజాలు గోరగీరితే నేమాయ
ఆడరా యేమైనామాట లవుఁగాదనేనా
వేడుక గలితేఁజాలు వెక్కసమైతేనేమాయ
పాడాదప్పకురా నీతో పంతమాడేనా

చ. 3: నవ్వులు నవ్వితేఁజాలు నాలిసేసితే నేమాయ
జవ్వనమద మిదౌరా సాదించేనా
ఇవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నివ్వటిల్లెరా మన్నవ నీకెదురాడేనా

రేకు:	1381-2 ఆహిరి	సం:	23-482

పల్లవి:	నెలంత మేనియలపు నీదిగాదా
	లలి వివియల్లాఁ జూచి లాలించవలదా

చ. 1:	వలపులవసివాడు వనితకు నుండఁగాను
	చలము లింకానేల సరసుఁడవు
	చెలసచెమటలు చెక్కులపై నుండఁగాను
	కలఇకరతులను కరుణించవలదా

చ. 2:	వెడయాస పులకలు వెలఁదికి నుండఁగాను
	బెడసుఁబరాకులేల ప్రియుఁడవు
	తడఁడేతమకముతలఁపులో నుండఁగాను
	అడరిమోవి ఇచ్చి ఆదరించవలదా

చ. 3:	కూడినసంతోసము కోమలికి నుండఁగాను
	గాడఁబెట్టనేల శ్రీవేంకటేశుఁడవు
	వోడక నిట్టూర్పులు వొగిఁ బుక్కిట నుండఁగ
	నీడలను నిలిచి మననించఁగవలదా

రేకు: 1381-3 శంకరాభరణం సం: 23-483

పల్లవి: కొంకకువే యఁకఁ గోమలి
పొంకమయినట్లఁ బొసఁగీఁగాని

చ. 1: ధరలోపల మతి తమకము గలిగిన
సరసపుమాటలు చౌలౌను
వొరసి చూడవే వోపిక గలిగిన
వరుసకు రమణుడు వచ్చీఁగాని

చ. 2: మునుకొని పైపై మోహము గలిగిన
చనవులు మనవులు చవులౌను
పెనఁగవె వొకపరి ప్రియము గలిగితే
చొనిపి విభుఁడు దయఁజూచీఁగాని

చ. 3: సేవసేయఁగా చిత్రము గరఁగిన
యేవేళ రతులు యితవౌను
వాని దెలుపఁగా వచ్చి నన్నెనసె
శ్రీవేంకటేశుఁడుచెలఁగీఁగాని

రేకు: 1381-4 మాళవిగౌళ సం: 23-484

పల్లవి: వెంగెమాడేనా నిన్ను వేగినంతాను
సంగతిగా మొదల విచ్చకురాల నేను

చ. 1: పగచాటేనా నీతోఁ బక్కన నవ్వేఁగాక
యెగసక్కేలు నీవు యెంతసేసినా
తెగనాడేనా నీవే దేవరవనేఁగాక
సగటున నీమోవి పచ్చియై వుండినను

చ. 2: కోపగించేనా నిన్ను గుట్టున మెచ్చేఁగాక
మాపుదాఁకా నీవెంత మట్టుమీరినా
రాఁపుసేసేనా నిన్ను రసికుఁడవనేఁగాక
తోపునూకుడుగ నెంతదూరు నీపై నుండినా

చ. 3: బొమ్మల జంకించేనా పొగడుచు నుండేఁగాక
దిమ్మరివై నీవెటు దిరిగినను
యెమ్మెలెంచేనా శ్రీవేంకటేశుఁడ వనేఁగాక
సమ్మతించి నన్నుఁగూడి సదమదమైనను

రేకు: 1381-5 ముఖారి సం: 23-485

పల్లవి: ఊరకే కరఁగునా వుక్కురాతిగుండె నీది
సారెకు విననవించఁగా సమ్మతించితివి

చ. 1: చెప్పరానియటువంటిసేవలెల్లాఁ జేయఁగాను
తప్పకుండా నేఁడు నీ చిత్తము వచ్చెను
నొప్పుగా నెప్పుడు నీవొద్ద నిట్టె వుండఁగాను
కప్పి యన్నటా నీవుకరుణించితివి

చ. 2: యేడలేనియటువంటిఇచ్చలెల్లా నాడఁగాను
వాడలోనవెల్లా నాకె వలచితివి
జాడతోడ రేపుమాపు సారెసారె మొక్కఁగాను
యీడులేనిచనవులు యిచ్చితివి నీవు

చ. 3: మిక్కిలిరతులఁ గూడి మీఁదమీఁద మెప్పించఁగా
మక్కువదేవులఁగా మన్నించితివి
నిక్కపుశ్రీవేంకటేశ నీవె యిన్నియును నేర్పి
వొక్కటై నన్నేలి మోవి వొసగితిని

రేకు: 1381-6 పాడి సం: 23-486

పల్లవి: ఇంతి యివి చూచితేను యేమనునో
అంతటిలో నొకవుపాయము చూచుకోవయ్యా

చ. 1: కూరిమితోడుత నిన్నుఁ గొమ్మ పిలువఁగనంపె
చేరి మా యింటికిని విచ్చేయవయ్యా
జీరలు నీబుజములుః సేనగా నున్న వివిగో
గారాబానఁ బచ్చడము కప్పఁగదవయ్యా

చ. 2: కమ్మరాను యెదురుగాఁ గానుక లప్పటి నంపె
వుమ్మడిని మేడలోఁ గూచుండవయ్యా
సొమ్ములు వింతలు నేఁడచ్చుగా నీమేన నివే
నెమ్మది నందుకు మాట నేరుచుకోవయ్యా

చ. 3: బత్తితోడుతను నీకు పానువు వరచె నిదె
కొత్తగా శ్రీవేంకటేశ కూడఁగదయ్యా
హత్తి పెరవాసనలు అవిగో శ్రీసతి యంపె
బత్తితో నేలితివికప్రము పూసుకోవయ్యా

రేకు: 1382-1 దేశాళం సం: 23-487

పల్లవి: తానెరుఁగు నేకతపుతనచేఁతలు
యీనిజములెల్ల మీయెదుటనేకాక

చ. 1: తప్పులేదని మంచితగవులే చెప్పీని
అప్పుడాడిమాట లాడెనటవే
దప్పి మోమునఁ దేర దయలు వుట్టించీని
యిప్పు డిందాఁకా దా నిట్టుండెనా

చ. 2: నడుమ నూరక ఇచట నవ్వులే నవ్వీని
వుడివోనియాచలము లున్నవటవే
విడువ కిటు నాయెదుట వేసాలు సేసీని
అడరి తనవోజ నే నది యెఱఁగనా

చ. 3: మొగమోటమునఁ దాను మోహములే చల్లీని
వగకాఁడు అపుడిట్ల వచ్చెనటవే
తగిలి శ్రీవేంకటోత్తముఁడు నన్నిటు గూడె
వెగటుఁగూరిము లపుడు వెలయించెనా

రేకు: 1382-2 ముఖారి సం: 23-488

పల్లవి: ఈ మేలు దలఁచుకో యెప్పుడును నీమతిలో
సాములు సేసి నీతో చలము నెరపదా

చ. 1: కొంతగొంత నాచెక్కు గోర నీవు గీరితేను
పంతములాడితినా పదరితినా
రంతుల వేరొకతైతే రవ్వనేసి నీమేను
యెంతైనా నొకటికి యినుమడిసేయదా

చ. 2: పలుమారు నామోవిపై పలుసోఁకులు నించితే
బలిమిసేసితినా పదరితినా
వెలయ వేరొకతైతే వింతలుగా విన్నపటి
యెలయించి వొకటికి యినుమడి సేయదా

చ. 3: చందపుశ్రీవేంకటేశ చన్నులొత్తి కూడితివి
పందెములు గొంటినా పదరితినా
విందులవేరొకతైతే వేసాలెల్లాఁ జూపి
యిందరిలో వొకటికి యినుమడిసేయదా

రేకు: 1382-3 గౌళ సం: 23-489

పల్లవి: చేకొని నీసేవలెల్లాఁ జేసేఁగాని
యీాకడ నిట్టె నీవు మాయింటికి రావయ్య

చ. 1: గొల్లెతలు వలచిరి కోరినట్టెసేసితివి
చెల్లునయ్య నీచేసినచేఁత లెల్లాను
మెల్లనే నీవంటుకోఁగామేమిఁకఁ గాదనేమా
ఇల్లిదివో వున్నది మా యింటికి రావయ్యా

చ. 2: పదిమారువేలింతులపతివైతి వెమ్మె మించె
యెదురు లేదయ్య నీకు నేమిటాను
పుదుటునఁ జెనకఁగా వోపననేమా నేము
యెదిగెఁ జన్ను లిదె మా యింటికి రావయ్యా

చ. 3: పట్టపుదేవులు గద్దు పనులెల్లాఁ జక్కనాయ
తొట్టుకొంటివయ్య మేలు వొమ్ము నీకును
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వేఁటికనేమా
యిట్టె నీపారుగే మాయింటికి రావయ్యా

రేకు: 1382-4 దేశాక్షి సం: 23-490

పల్లవి: కానీవయ్య అందుకేమి కానవచ్చె నీసుద్దులు
గోనాలగొందుల వింత గుట్టు సేసుకొందువా

చ. 1: పెనఁగి సారెకు నిన్ను ప్రియురాలు విలువఁగ
కొనగానలనే నీవు కొంకేవు
చెనకులు నీమేనఁజేసెనో యెవ్వతెయైనా
నినుఁగల్లమోవకుంటే నీవిట్లా జేతువా

చ. 2: వొగ్గుచు గందము నీకు వువిద వుయ్యరాఁగాను
సిగ్గులుపడుచు చెక్కు చేతఁబెట్టేవు
వెగ్గళమై నీమేన వింతవాసన లున్నవో
యెగ్గులచేత లేకుంటే యింతేసి లోఁగుదువా

చ. 3: మొక్కి యింతి గూడి నీకు మోవితేనె లియ్యఁగాను
అక్కు మోవఁ దలవంచి అట్టె నవ్వేవు
పక్కన శ్రీవేంకటేశ పలుసోఁకు లున్నవో
తక్కు లింతేసి లేకలుంటే తప్పించుకొందువా

రేకు: 1382-5 ఆహిరినాట సం: 23-491

పల్లవి: అలిగితినా నీతో అవుగాదని యంటినా
తలపులో నున్నాడవుదయచూడరా

చ. 1: ఆనలేల పెట్టేవు ఆసలేల రేచేవు
మోనమున నున్నదాన ముద్దరాలనే
కానీలేరా నావంటి కాంతలు నీకుఁ గలరు
దానికేమి అట్లానేదయ చూడరా

చ. 2: చెక్కులేల నొక్కేవు సిగ్గులేల పుట్టించేవు
ఇక్కడనే వున్నదాన హితురాలనే
దిక్కులను మరి నీవు తెచ్చుకొంటి వింతులను
తక్కక నన్నట్లానే దయచూడరా

చ. 3: యేల కాగిలించేవు యెంత వొడబరచేవు
యీలాగుల నున్నదాన యిల్లాలనై
అలరి శ్రీవేంకటేశ ఆడ్లఁ బెండ్లాడితివి
తాలిమి నన్నట్లానే దయచూడరా

రేకు: 1382-6 బౌళి రామక్రియ సం: 23-492

పల్లవి: ఇందుకేల లోఁగేవు యెప్పుడూ నీకుఁ గలదే
మందలించి దూరను మరిగితి నిన్నును

చ. 1: చిగురుమోవిగంటికి సిగ్గులువడఁగనేల
మొగము చూడవయ్య మొక్కే నేను
ఆగడు సేసినదాని ననవయ్య; నేము నిన్ను
యెగసక్కేలాడేమా యేల నీకు వెఱపు

చ. 2: బడలిక గాకుండా పలుకకుండఁగనేల
కడుఁజేయి చాంచవయ్య కానుకిచ్చేను
జడియ నలయించినసతినే అనుటగాక
సడిఁబెట్టేనా నిన్ను సారెనేల వెఱపు

చ. 3: అంగపువాసనకుఁగా అండకు రాకుండనేల
కొంగి శ్రీవేంకటేశ కూడితి నేను
అంగడిఁ బెట్టినదాని ననరా; నే నలమేలు
మంగను నన్నేలితివి మరి యేల వెఱపు

రేకు: 1383-1 శంకరాభరణం సం: 23-493

పల్లవి: ఇందుకు జంకించనేలే తాను
సందడి నావల్ల చల మున్నదా

చ. 1: వొద్దద్దుండఁగా వొరసీఁ జన్నులు
పెద్దరికానకుఁ బెనఁగేనా
సుద్దులు చెప్పఁగా సోఁకె నాకెమ్మోవి
వుద్దండము లిందుకు నున్నవటే

చ. 2: వీడె మియ్యఁగా వెస గోరు సోఁకె
జాడతో తను నే సాదించేనా
పాడఁగానే తనపైఁ జెమట చిందె
యాడనే పంతాలు హెచ్చెనటే

చ. 3: సరసమాడఁగా సమరతు లబ్బెను
నెరసి దొరతనము నించితినా
కరుణించి శ్రీవేంకటేశుఁడు గూడె
గురుఁడు మరునికినిఁ గొంకెనటే

రేకు: 1383-2 ఆహిరినాట సం: 23-494

పల్లవి: దొరవు సారెకు నిన్ను దూరవచ్చునా
యిరవై నీవే మమ్ము నేలేవు గాక

చ. 1: మనసువచ్చితే నీవే మన్నించేవుగాక మమ్ము
యెనలేక కొసరంగా నేమి వచ్చిని
వనములతీగెలు వసంతకాలమునాఁడు
ఘనమై పూచినపాటే కాచీఁగాక

చ. 2: కరుణ నీకుఁ బుట్టితే కలసేవుగాక నేఁడే
వరుసఁ బెనఁగఁగాను వచ్చేదేమి
గరిమ నేరులు వానకాలమున మేఘాలు
కురిసినపాటి నీళ్లు పారుఁగాక

చ. 3: యేలితి శ్రీవేంకటేశ యీడేరించేవుగాక
కాలమెల్లాఁ గోరఁగాను కలిగేదేమి
తాలిమితోఁ జెఱకులు తతికాలమునాఁడు
చాలా ముదిరినపాటి చవిపుట్టుఁగాక

రేకు: 1383-3 నాగ గాంధారి సం: 23-495

పల్లవి: నాకు నవే గురి నీకు నేను సాక్షి
దాకొని నన్ను నిట్టె దయఁజూడఁగదరా

చ. 1: యేరా నీమాఁట లెందాఁకా నాడేవు
గారవించి నాకుఁ గాఁగిలీరా
చేరి చూడఁగానే చెక్కులెల్లాఁ జెమరించె
తారుకాణాయ వలపు దయఁజూడఁగదరా

చ. 2: జఱపులఁ బెట్టఁగానే సరివొద్దులాయను
మఱి పచ్చడము గప్పి మన్నించరా
చిఱునవ్వు నీది చూచి చిమ్మిరేఁగెఁ బులకలు
తఱి నీకే తెలుసును దయఁజూడఁగదరా

చ. 3: గక్కన నీవు గూడఁగా గనమాయ కోరికలు
మొక్కేఁగాని నాకు మోవియ్యారా
నిక్కి శ్రీవేంకటేశుఁడ నినుఁజూచి దప్పిదేరె
దక్కితివి నిన్ను నిట్టె దయఁజూడఁగదరా

రేకు: 1383-4 నాదనామక్రియ సం: 23-496

పల్లవి: ఎటువలె నమ్మించీనే యిఁకఁ దనచిత్తము
ఆటమటముల కోప నడుగరే ఆతని

చ. 1: మొగముచూచునందాఁకానేమంచినయెడమాటలు
నగినదాఁకానే నంటునేర్పులు
తగులైనదాఁకానే తలపోఁతలెల్లాను
అగపడ్డదాఁకానే ఆసలన్నియును

చ. 2: ననుపైనదాఁకానే నయగారితనములు
మనసుగన్నదాఁకానే మంతనములు
చనవిచ్చుదాఁకానే సముకపుఁగొలువులు
యెనసినదాఁకానే యిచ్చకములు

చ. 3: తతి గూడుదాఁకానే తరితీపులన్నియును
రతిఁ జొక్కుదాఁకానే సమ్మతి మొక్కులు
యితవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
సతమైనదాఁకానే చవులెల్లాను

రేకు: 1383-5 హిందోళ వసంతం సం: 23-497

పల్లవి: మంచికాలమాయ మరునిరాజ్యాన
కొంచక యీతనిఁ గొనియాడరే

చ. 1: సరసమాడఁగఁ జవులు పుట్టెను
గరిమ నావిభుఁ గంటిరటే
తెరదియ్యఁగానే తేనెమోవి నూరె
కరుణ నామీఁదఁ గలిగెనే

చ. 2: కానుక లియ్యఁగఁ గాంక్షలు పుట్టెను
వీనినేరుపులు వింటిరటే
నానుపుఁజెమట నవ్వులు రేఁచెను
మానక నిన్నిట్టె మరిగెనే

చ. 3: పూవుల వేయఁగఁ బొందులు గూడెను
శ్రీవేంకటేశు మెచ్చితిరటే
చేపట్టి తియ్యఁగ చెలఁగెఁ గళలు
వానితో నాకిట్టె వలచెనే

రేకు: 1383-6 నాగ వరాళి సం: 23-498

పల్లవి: భోగిచవయ్యా మంచిభోగములెల్ల
తీగెసాగినమోహమే దిష్టసంపదాయను

చ. 1: పలుకుఁదేనెలు నీపైఁ బలుమారుఁ జిందఁగాను
కలిమిఁ బన్నీటిజలకములాయను
కలికి నవ్వులు నట్టె కలయఁగఁ జల్లఁగాను
అలరి కప్పురకాపునైమించెను

చ. 2: జిగి సింగారరసము చేరి నీపై నొలుకఁగా
పొగరుమించులతట్టుపుణుఁగాయను
మగువకాంతులు నిన్ను మచ్చికతో నొరయఁగా
సొగసుగాఁ జాతుకొన్న సొమ్ములాయను

చ. 3: అలమేల్మంగ నీపురమందు నెలవుకొనఁగా
బలిమి నన్నిటా నీభాగ్యమాయను
యెలమి శ్రీవేంకటేశ యీకె నినుఁ గూడఁగాను
కలకాలమును నిట్టె కాణాచాయను

రేకు: 1384-1 దేవ గాంధారం సం: 23-499

పల్లవి: నీయంతవట్టుకు నీవు నెరవాదిని
పాయపుసతులమేనిబడలి కెఱఁగవు

చ. 1: తగవు జెప్ప జాణవు తరుణులకై తేను
యెగసక్కెపునీచేత లెంచుకొనవు
మొగము చూచితే నీకు మోనినే నవ్వులు వచ్చు
అగడైనకాంతలు అలసే దెఱఁగవు

చ. 2: అందాలు సేయనేర్తువు అంగనలమాటఁలు
విందుల నీసుద్దులైతే విచారించవు
చెంది నీకు మొక్కి తేను సిగ్గులు పైపైనే వుండు
కందువ చెలులలోనికాఁక నీవెఱఁగవు

చ. 3: వొక్కటి సేయనోపుదు వొరటైనసవతుల
తక్కరి శ్రీవేంకటేశ తరి యెంచవు
మిక్కిలి కూడితే నలమేల్మంగనని చొక్కేవు
దక్కినట్టివనితలతచ్చన లెఱఁగవు

రేకు: 1384-2 వరాళి సం: 23-500

పల్లవి: తనంతనే మంచివయ్యా తరవాతిపనులెల్లా
యెనసి యాతని వంక లెట్టు దిద్దే మిపుడు

చ. 1: మలసి వొడఁబరచ మనవసమా ఆతఁడు
తెలిసి మాటలనే పందిలి వెట్టీని
కలికి చెనకితేనే గడును విడుచుఁగాక
చెలుల మీతని నేమిసేయఁగల మిపుడు

చ. 2: తాటించిపెనఁగ మనతరములా యీతఁడు
తేటలనేరుపులు గాదెలఁబోసీని
నాటించేయింతిగోరిక నయానకు వచ్చుఁగాక
యేటతోఁ జెలుల మింతే యేమిసేసే మిపుడు

చ. 3: చిమ్మిరేఁచ నోపుదుమా శ్రీవేంకటేశ్వరుఁడూ
ముమ్మడిఁ దననిజమే మొలపించీని
పమ్మి యలమేలుమంగ పైకొనఁగాఁ గూడెఁగాక
ఇమ్ముల నిద్దరిభావ మెట్టు మెచ్చే మిపుడు

రేకు: 1384-3 పాడి సం: 23-501

పల్లవి: బంతిపక్షములనే బదుకదొరకొంటివి
వింతవింతచవులే వెదకేవు

చ. 1: ఆపె చేపట్టుకుండఁగా అట్టె నాతో మాటాడేవు
తీపులను జంకించి తిట్టదా నిన్ను
యేపున వొకతె నీకు నేఁకారఁగానే నీవు
పైపైనే మాకింత బత్తిసేసేవు

చ. 2: కన్నుల నాపె మొక్కఁగా కడు నాతో నవ్వేవు
సన్నల ముందలవట్టి సాదించదా
మున్నీటనుండి యొకతె మొగము చూడఁగానే
వన్నెలుగా నామీఁద వలపు చల్లేవు

చ. 3: విందువెట్టి యాపె నీకు విడెము చేతికియ్యఁగా
కందువఁ గూడుతా నన్నుఁ గాఁగిలించేవు
అంది నే నలమేల్మంగ నాపె నీకుఁ జొక్కఁగాను
పొంది శ్రీవేంకటేశుఁడ భోగించేవు

రేకు: 1384-4 లలిత సం: 23-502

పల్లవి: ఎంత తాలిమిగలదా యీమగువ
వింతలు సేయక నిన్ను వేఁడుకొనెను

చ. 1: యెనలేనిచేఁతలు నీవేమేమి సేసినాను
ననుపుసేసుక ఆపె నవ్వు నవ్వెను
కొనబుతనాన మరి గురు లెన్నియుండినాను
చనవుసేసుక మోవి చవిగొనెను

చ. 2: కడనుండి యెందురేసికాంతలఁ దెచ్చుకొన్నాను
బడిబడి నీమీఁద బత్తిసేసెను
తడవుగా నాడనుండే తగ నిప్పుడు వచ్చినా
వొడివట్టి తీసి నీతో నొనగూడెను

చ. 3: పొరచి తమ్ములము నీపుక్కిటనే వుండఁగాను
గారవించి కాఁగిటఁ గలసె నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యెంత రతిసేసినాను
ఆరయ నోపనక అట్టె సమ్మతించెను

రేకు: 1384-5 మంగళకౌసిక సం: 23-503

పల్లవి: చెప్పఁగదరా నాతో సిగ్గువడక
చొప్పులెత్తి చొప్పులెత్తి సొలసి యేమనెరా

చ. 1: పంతాన మాయింటికి పలుమారు రాఁగాను
యింతి నీ మొగము చూచి యేమనెరా
చెంతల నేఁ డప్పటి నీచెక్కుల రేకలు చూచి
మంతనానఁ జెవిలోన మఱియు నేమనెరా

చ. 2: చెచ్చెర నీవు నాచేతికి లోనైవుండఁగా
యెచ్చుకుందులాడి యాపె యేమనెరా
పచ్చిచెమటలమేను బాఁతిపడి కాఁగిలించి
విచ్చనవిడిచి నీతో వెంగేన నేమనెరా

చ. 3: మఱఁగులేక నీవు నామంచముపై నుండఁగాను
యెఱిఁగి కొసరి నిన్ను నేమనెరా
యెఱుకతో శ్రీవేంకటేశ యేలితి విద్దరి
జఱసి నిన్ను మెచ్చి సమ్మతించేమనెరా

రేకు: 1384-6 సామంతం సం: 23-504

పల్లవి: రాఁగదే నీవొప్పు రమణుని కిట్టె
చేఁగలుదేరియు చిగురాయనే

చ. 1: చెక్కులచేతఁత (చేతు?)లు సిగ్గుల మొక్కులు
అక్కరతో నీకమరెనే
అక్కజమై పతి కవి చూడఁజూడ
తక్కక తలపోఁతలై మించెనే

చ. 2: పలచనినవ్వులు పయ్యదకప్పులు
చెలియ నీకైతేసింగారమే
నెలవై నీవిభునికి నివియెల్లా
అలరి సందించి ఆసలాయనే

చ. 3: కారేటిచెమటలు కాఁగిలింపులును
నేరుపుతోడుత నీభాగ్యమే
యీరీతి శ్రీవేంకటేశ్వరుని కివి
పొరపురతికిఁ జవులై వున్నవే

రేకు: 1385-1 రామక్రియ సం: 23-505

పల్లవి: ఎవ్వరు గలిగినాను యింత నేరరు
నివ్వటిల్లినదొరవు నీవౌదువే

చ. 1: మఱి వలసించితివి మచ్చితో రమణుని
మెఱసి నేర్పరులలోమేఁటివౌదువే
వెఱ సించుకంతా లేక వెంటవెంటఁ దిప్పితివి
నెఱతనపుజాణవు నీవౌదువే

చ. 2: చొక్కించి విభునిమేనిసొ మ్మిప్పించుకొంటివి
నెక్కొన్నబాగ్యజీవిని నీవౌదువే
చెక్కునొక్కి నీపనులు సేయించుకొంటివి
నిక్కముఁబంతకత్తెవు నీవౌదువే

చ. 3: ఇయ్యెడ శ్రీవేంకటేశు నిన్నిటానుఁ గూడితివి
నెయ్యపువాసికత్తెవు నీవౌదువే
వొయ్యనే అతని నన్ను నొనగూరిచితి విట్టె
నియ్యందే దయగలదు నీవౌదువే

రేకు: 1385-2 తెలుఁగుగాంబోది సం: 23-506

పల్లవి: పిన్నతనాలే సేసేవు పెద్దవెరిగి
నినపములెల్లాఁ జేసి వేసరితి

చ. 1: యిదివో నీ నిందఁకా నేడ నుంటివయ్యా
వెందకివెదకి నిన్ను వేసరితి
వదలక పసపెటువలె నంటెనయ్యా
కదిసి తోమి తోమి కడిగి వేసరితి

చ. 2: యిటువలె పనులు నీవేమి సేసితివయ్యా
విటతనా లిని చూచి వేసారితి
ఘటన నెవ్వతె నేస్తకాఁడ వైతివయ్యా
అటమటాలెల్లా దిద్ద అప్పుడే వేసరితి

చ. 3: నాడిక నెవ్వతె యలవాటు సేసెనయ్యా
వీడెపుమోవి యిచ్చి వేసారితి
యీడనే శ్రీవేంకటేశ యేలుకొంటి వేనయ్యా
కూడిన నీరతు లెంచికొని నే వేసరితి

రేకు: 1385-3 నాదనామక్రియ సం: 23-507

పల్లవి: ఆవునయ్యా మంచివాఁడ వౌదువయ్యా
యివలానవలా నిన్ను నింతసేయఁజెల్లునా

చ. 1: అంగనచే నొకమాఁట అప్పణ యిప్పించరాదా
చెంగట నీచెప్పినట్లు సేసేఁగాని
ముంగిటను నీవూడిగమున కంపినంతలోనే
యెంగిలిగా నీకు నే నింత సేయఁజెల్లునా

చ. 2: చెలిచేతఁ దనకిది సెలవనిపించరాదా
అలరి నీతోఁ బెండ్లాడేఁగాని
కలికి నాచేత నీకు కాని కంపినంతలోనే
యెలమి నిన్నింటుకొని యింతసేయఁజెల్లునా

చ. 3: వనితచేత నాకు వంతు పెట్టించుకోరాదా
వొనర శ్రీవేంకటేశ వూఁకొనేఁగాని
చెనకి నీతో మాట చెప్పి రమ్మన్నంతలోనే
యెనసితిని నన్ను నే నింత సేయఁజెల్లునే

రేకు: 1385-4 శంకరాభరణం సం: 23-508

పల్లవి: పొంచి నీతొల్లిటిపొందులు చూతము
మించి నిజమైతే మెచ్చేనయ్యా

చ. 1: తెరమఱుఁగున తెలిన మాఁటాడె
అరుదంది నీవు ఆలించేవు
తాతెయౌ అరవసి యెఱుఁగుదునా ఆపె యెవ్వతెయౌతా
శిరసెత్తి నాతోఁ జెప్పవయ్యా

చ. 2: చేయించాఁచి నిన్ను చెండున వేసెను
సోయగాన నట్టె చూచేవు
దాయకపాయక తలఁచుకొంటివా
యీయెడ నా కానతియ్యవయ్యా

చ. 3: గక్కనఁ బైకొని కాఁగిలించుకొనె
చిక్కి ధ్యానములు సేసేవు
యిక్కువ శ్రీవేంకటేశ నన్నేలిటు
చొక్కి నవ్వేవు నాసుద్దు లివయ(యా?)

రేకు: 1385-5 శుద్ధ వసంతం సం: 23-509

పల్లవి: కపటాలు వద్దుగాక కాంతలతోను
యిపుడు చెల్లదా నీకు యెంతసేసనాను

చ. 1: తమకాన నాపె పేరు తడవితి వింతేకాక
మమకారము నామీఁద మఱచేవా
భ్రమసితినంటా నాతో బాసలు సేయఁగనేల
జమళి నెందరైనా దోసములా నీకేమీ

చ. 2: ననుపున నాతోడ నవ్వితి వింతేకాక
యెనసి నన్ను మన్నించ కేల మానేవు
పనిపరాకంటా నొడఁబఱచఁగ నింతయేల
తనివి చాలకుండితే తగదా నీకేమీ

చ. 3: సొలసి మొక్కఁగా నాపెఁ జూచితి వింతేకాక
కలసితివి నన్ను నీకడ మున్నదా
తొలుతటిపొందులంటా తొరలించ నిపుడేల
చెలితో శ్రీవేంకటేశ సిగ్గా నీకేమీ

రేకు: 1385-6 సింధురామక్రియ సం: 23-510

పల్లవి: మేలు మేలయ్యా నిన్ను మెచ్చితిమి
తలిమితోడుత నేఁడు తగ వెటీఁగితివా

చ. 1: సముకాన మెచ్చేవు సారెసారెఁ బొగడేవు
రమణిగుట్టెఱఁగవా రతులఁ దొల్లి
చెమటలు దుడిచేవు చేసురటి విసరేవు
నెమకి చుట్టరికము నేఁ డెటీఁగితివా

చ. 2: చెక్కులిట్టె నొక్కేవు శిరసిట్టె దువ్వేవు
చక్కఁదనములు నీ వెంచనా తొల్లి
అక్కరతోఁ బొదిగేవు ఆసలెల్లాఁ జూసేవు
యిక్కువతో వలపులు యిప్పుడెటీఁగితివా

చ. 3: కందునలు చూపేవు కాఁగిటు నించేవు
పొందులు యివెల్లాఁ దలపోయవా తొల్లి
అంది శ్రీవేంకటేశుఁడ అంగనఁ గూడితి విట్టె
అందపువేడుకలు నేఁడట్టె యెటీఁగితివా

రేకు: 1386-1 ముఖారి సం: 23-511

పల్లవి: వెలయఁ బెండ్లాడితివి వెఱపేఁటికి
వెలకా వేగు నుండఁగా వెఱపేఁటికి

చ. 1: పాడిపంతము లెరిఁగి బ్రదికించేమొగఁడవు
వేడుక నీవు సేయఁగ వెఱపేఁటికి
వాడికసతులలోన వలసినయట్టు మన్నించి
వీడెము నియ్యఁగాను వెఱపేఁటికి

చ. 2: ఆస యిచ్చినవాఁడవు ఆదరించిననామీఁద
వేసితివి నీచేయి వెఱపేఁటికి
యీసుద్దులెల్లా విని యెదుటనే నీవుండి
వేసారక బాసియ్యఁగ వెఱపేఁటికి

చ. 3: ఘనుఁడ శ్రీ వేంకటేశ కాఁగిలించి నన్ను నేలి
వెనుబలమై యుండఁగా వెఱపేఁటికి
పనితోడ రతులను పంతమిచ్చి సారెసారె
వినయాలు సేయఁగాను వెఱపేఁటికి

రేకు: 1386-2 రామక్రియ సం: 23-512

పల్లవి: నయమున నెంతయినా నవ్వవయ్యా
జయముగా నీకుఁ జేయిచాఁచితే నేమాయను

చ. 1: వేడుకై తేఁజాలు నీకు వేమారుఁబువ్వులను
వీడుపడకుండా నన్ను వేయవయ్యా
కోడెకాఁడవు మొదల కొమరెవయసుదాన
యీడనే పంతము నేను యిచ్చితే నేమాయన

చ. 2: చలము చెల్లితేఁజాలు సరుగఁ బన్నీటను
చలువగా వసంతము చల్లవయ్యా
బలిమికాఁడవు నీవు బత్తిగలదాన నేను
వొలిసి నీచేఁతలకు నోర్చితే నేమాయను

చ. 3: కావలసితేఁజాలు కాఁగిలించి నీవు నన్ను
యీవల నిన్నిటాను యేలవయ్యా
శ్రీవేంకటేశుఁడ నీవుచేకొన్నయాలను నేను
మోవరాని వలపుతో మొక్కితే నేమాయను

రేకు: 1386-3 పాడి సం: 23-513

పల్లవి: చూతముగా నేఁడు నీసుగుడతనములెల్లా
యేతులకు నెంచితే వూరెల్లా గొల్లెతలే

చ. 1: వంతుల కింతలు నీపై వలపులు చల్లేరు
యెంతని మోచేవయ్య్య ఇప్పుడు నీవు
దొంతులు వెట్టే రప్పటి దొడ్డదొడ్డకుచముల
అంతటి కీవురమెట్టు ఆనుకొనీనో

చ. 2: మోపులెత్తుకొ నిందరు మోవితేనె లొసఁగేరు
యేమి సేసేవయ్య్య నీవు యీఁతామోఁతలు
వాములు వేసేరు నీపై వడిగా రేపల్లెవారు
నోముచు నీతురుమెట్టు వోరుచుకొనీనో

చ. 3: సొలసి కన్నుఁగలువ చూపులనుఁ బూజించేరు
కొలఁదెట్టు పెట్టేవయ్య్య కుప్పలాయను
అలమి నిన్నుఁగూడి అందరముఁ బిలిచేము
వెలయ శ్రీవేంకటేశ వీను లెట్టు వొందీనో

రేకు: 1386-4 భైరవి సం: 23-514

పల్లవి: ఏమి గలిగిన నేనే యిముడు కొందుఁగాక
వేమారును నీగుట్టు వెలివేతునా

చ. 1: చెలరేఁగి నీవు నాతో చెప్పినమాటలెల్లా
అలరి తెరమాఁటున నాపె వినెను
చెలువుఁడ నేనే చెప్పితినంటా నీవు
పలికేవు నే నిన్ను బయలుపరతునా

చ. 2: ననిచి నాతో నాపెనునవ్విన నవ్వులెల్లా
తనకుఁదానే యెట్టో తాఁ జూపెను
ఇనుమడిగా నేనేయెరిఁగించితినంటా
గునిసేవు నే నిన్ను కొరత లెన్నుదునా

చ. 3: ఆపెసేసినగుఋతు లట్టెచూపినవెల్లా
వైపుగాఁ దెలిసె నెవ్వరు చెప్పిరో
యేపున శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
రూపించేవు నే నిన్ను రొచ్చులు సేయుదునా

రేకు: 1386-5 మాళవిగౌళ సం: 23-515

పల్లవి: తటితో నీచేతిదింతే ధర్మపుణ్యము
యెఱుఁగుదు మన్నియు నిన్నేమనేమయ్యా

చ. 1: చెక్కిటిచేతితోడ సిగ్గులనవ్వులతోడ
తక్కక చెలి యింటిలో తా నున్నది
చొక్కటాలాడేవు నీవు సుదతులతో యీడ
యిక్కడ నిందరము నిన్నేమనేమయ్యా

చ. 2: సింగారభావాలతోడ చెంపచెమటలతోడ
అంగన మేడలోన ఆసాస నున్నది
ముంగిటనీవైతేను కమ్ముక రచ్చలు సేసేవు
ఇంగితము గంటిమి నిన్నేమనేమయ్యా

చ. 3: కన్నులతేటలతోడ కడుఁదమకముతోడ
యెన్నిక నీకాఁగిటిలో యింతి వున్నది
మన్నించి శ్రీవేంకటేశ మంచముపై నున్నాఁడవు
యిన్నిటాను జాణఁడవు నిన్నేమనేమయ్యా

రేకు: 1386-6 దేశాళం సం: 23-516

పల్లవి: ఏల తప్పులువట్టేవు యిట్టె నన్ను మన్నించు
తాలిమితో నుండితేనే తగ నీ కుచ్చితమా

చ. 1: నీటుననన్ని విధాలా నీచేత నేఁ దనిసితి
మాటలాడకుండితేనే మంకుఁదనమా
చీటికిమాటికి లోలో సిగ్గులనుఁ దలవంచి
గాఁటానఁ జూడకుండితే గర్వమా ఇది

చ. 2: మలగుపై నొరగుండిమరి నీవు రాఁగాను
తలుపు మూయవచ్చితే దంటతనమా
పొలసి నీవు నన్నుఁ బూవులను వేయఁగాను
కలఁగక వుండితేనే గట్టువాయినా

చ. 3: రట్టుగాను నీవు మాటలిట్టె నాతో నాడఁగాను
గుట్టుతోడ నుండితేనే గొంటుఁదనమా
యిట్టె శ్రీవేంకటేశ యేలి కాఁగిలించితివి
నెట్టన నిన్ను మెచ్చితేనిండినరాజసమా

రేకు: 1387-1 ఆహిరి సం: 23-517

పల్లవి: మంచివాఁడ వౌదువయ్య మగువ నింత యేఁతురా
అంచెల నిప్పుడే నీవు ఆదరించవలదా

చ. 1: మగవాఁ డేమిసేసినా మాటలే పెంతురుగాక
తగవులఁబెట్టుదురా తరుణులు
సొగిసి నీ వెంతేసిజూజగాఁడవై నాను
తగులువిరిపందేలు తరుణు తాడుదురా

చ. 2: చలము సాదించేవానిజంకింతురు గాక
బలువులు చూపుదురా పడఁతులు
వెలలేనివలపులవేఁటకాఁడవు నీవైతే
చలివాసి తమగాలు సకియ లెక్కుదురా

చ. 3: చేవలు మీరినవానిఁ జేవట్టి తీతురుగాక
వావాతఁ దిట్టుదురా వనితలు
శ్రీవేంకటేశ యీపెనుచేరి నీవెంత గూడినా
కావిరిఁ దమగుట్లు కాంతలు చెప్పుదురా

రేకు: 1387-2 బౌళి సం: 23-518

పల్లవి: ఇట్టె ఆదరించరాదా ఇఁకనై నాను
అట్టాయ నిందరిలోన నెట్టన యీరమణి

చ. 1: పట్టెమంచముపై నీవు పవ్వళించి వుండఁగాను
బట్టబయ లాపె వచ్చి పాదాలొత్తీని
గుట్టున నీవది యెఱుఁగుదువో యెఱఁగవో
వెట్టిసేవలు సేసెను వెలఁది యిందాఁకను

చ. 2: సందడిఁ బరాకై నీవు చదురంగమాడఁగాను
అంది యీకె చెవిలో నేకాంతమాడీని
విందువలె నీ వవి వింటివో వినవో కాని
మందుల నూరె మగువ యిందాఁకను

చ. 3: కొండపై శ్రీవేంకటేశ కొలువై నీ వుండఁగాను
నిండుఁజన్నుల నొత్తీని నిన్ను నాపె
అండనే నన్నేలితివి అది చూచితివో లేదో
బండుసేసెనిన్నిటాను పడఁతి ఇందాఁకను

రేకు: 1387-3 సామంతం సం: 23-519

పల్లవి: ఆనతీవయ్య అనుమానించక
దానికేమి యింకఁ దప్పుగాదు

చ. 1: రవ్వలుసేసిటు రావైతివి నిన్న
నవ్వులు నవ్వఁగ నమ్మితిని
యెవ్వరో చెప్పఁగ నీడ నున్నాఁడవు
చివ్వన వలపులు చే చిక్కీనా

చ. 2: అగడుగ నాకెఅండనే వుంటివి
మొగము చూడఁగా మొక్కితిని
వెగటుదీరఁగ వీడెమిచ్చేవీడ
తగవుతో దయదలఁచితివా

చ. 3: దీ(ధీ?)రత వెంటనే తెచ్చితి వొకతెనుఁ
గోరి మన్నించఁగఁ గూడితిని
యీరీతి శ్రీవేంకటేశ చొక్కితి విందు
యేరా చనవెల్లా నిచ్చితివా

రేకు: 1387-4 హిందోళం సం: 23-520

పల్లవి: నీవల్ల వచ్చినమేలు నీకే తెలుసును
ఆవటించి నేను వినే నానతీవయ్యా

చ. 1: తక్కక నిన్ను నిట్టె తప్పకచూచితేను
చెక్కునఁజేయివెట్టుక సిగ్గువడేవు
చక్కని నీమేనికిమచ్చములేమైనా వచ్చెనో
అక్కరతో నే నెఱఁగ నానతీయవయ్యా

చ. 2: నెయ్యముతోడుత విట్టె నీమీఁదఁ జేయివేసితే
వొయ్యనే చేతులెత్తి వొడ్డుకొనేవు
నెయ్యాన మరుముద్రలు నెలఁతలెల్లా నించిరో
ఆయ్యెడఁగలసుద్దులు ఆనతీవయ్యా

చ. 3: ముచ్చట శ్రీవేంకటేశ మోవితేనె లడిగితే
రచ్చల నవ్వుతాను శిరసువంచేవు
యెచ్చరి నన్నుఁ గూడితి వింకా నేమిదలఁచేవో
అచ్చలాన నాకిట్టె ఆనతీవయ్యా

రేకు: 1387-5 ముఖారి సం: 23-521

పల్లవి: ఏమీ ననకురే యిచ్చకములే యాడరే
చేముంచి నవ్వకురే సిగ్గువడీ నాతఁడు

చ. 1: గందము మేనఁబుయ్యరే కప్పురము నోటికీరే
యెందుండి వచ్చెనో విభుఁడింత యలసి
విందువలె మరి నేను వెనక మాటాడేఁగాని
చెంది మీరు మాటాడరే సిగ్గువడీ నాతఁడు

చ. 2: దప్పికిఁ బన్నీ రియ్యరే తామరలు ముడువరే
కప్పి యేపనిసేసెనో కడునలసి
చప్పుడుగాక వెనక సంగడిఁ గూచుండేఁగాని
చిప్పిల మీరుండరే సిగ్గుపడీ నాతఁడు

చ. 3: చేసురటి విసరరే శ్రీ వేంకటేశుఁడు నేఁడు
రాసికెక్క నన్నుఁ గూడె రతి నలసి
వేసరక యీసేసలే వెనకఁ బెట్టేఁగాని
సేసలు మీరు వెట్టరే సిగ్గుపడీ నాతఁడు

రేకు: 1387-6 సాళంగం సం: 23-522

పల్లవి: పాయపువాఁడవు నీకు వచ్చి సేఁతలు బాఁతా
ఆయములు దెలిసియు నడిగేఁగాక

చ. 1: చెక్కులఁ గళలు నిక్కె చేవదేరెఁ గెమ్మోవిని
యెక్కడఁ గలిగెనయ్య యివి నీకు
చక్కనిరమణులలో సాముసేసేవాఁడవు
అక్కరా నీకిని వూర కడిగేఁగాక

చ. 2: చెంగలించె నీకన్నులు చెమరించె మేనెల్లా
అంగవించి యేడఁజేరెనయ్యా నీకు
అంగడివలపులకు ఆసపడేటివాఁడవు
అంగమేకాదా నిన్ను నడిగేఁగాని

చ. 3: ముంచెఁ గాఁగిట వాసన మూఁపులు మూఁడాయను
కొంచక యెందు నంటించుకొంటివయ్యా
యెంచుకొని శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అంచల నీసాజమే అగిగేఁగాక

రేకు: 1388-1 రామక్రియ సం: 23-523

పల్లవి: కపటపునీసుద్దులు కన్నవేకావా
నెపమున నీనేరుపు నెఱపఁగవలెనా

చ. 1: నేనూ నాతఁడూ నొకటే నీవేమిచెప్పేవే
కానీలేవే యింతయేల కాఁతాళించేవే
దానికేమే సవతివౌత యెఱఁగరా నిన్ను
సోనలుగావలపులు చొరవేయవలెనా

చ. 2: ఆతఁడు నన్ను మన్నించు నందు కేమిసేసేవే
రాతిరిఁబగలునేల రాఁపుసేసేవే
గాతల నీకుఁ బొత్తుగలుగుట చూపనేల
యీతరవాతనే నీవు యింత నవ్వవలెనా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జెనకి కాఁగిటఁ గూడె
కావించి నీవిట్టె ఇచ్చకములాడవే
వాని నీకుఁ గలుగుట వాడవారే యెఱఁగరా
దేవరవలెనే ఇంత తెలుపఁగవలెనా

రేకు: 1388-2 పాడి సం: 23-524

పల్లవి: ఇటువంటిదే పో యెదిరిఁజేసినచేఁత
ఘటన నట్టె తనకుఁ గలుగక పోదు

చ. 1: వలపులు కడుఁజూపి వాడికలుపచరించి
పలుమారు రమణుని భ్రమయించేవు
బలిమినే నీవిట్లా పంతాలు మెరయఁగానే
చెలపచెమటలు నీచెక్కిళ్ల నిండెఁగదా

చ. 2: తమకములు గొనవేసి తాలిములు ధూపించి
జమళివలపులఁ బతి సాదించేవు
సముకాన నీబింకాలు సారెకు నెరపఁగానే
కొమరెమదము నిన్ను గొబ్బున ముంచెఁగదే

చ. 3: భావించి చూపు చూచి పైపై వినయాలు చేసి
శ్రీవేంకటేశ్వరుఁ గూడి చిత్తగించేవు
సావధానమున రతిసాములు సేయఁగానే
నీ వలమేల్మంగవు నేర్చితివిగదవే

రేకు: 1388-3 లలిత సం: 23-525

పల్లవి: ఏమి విన్నవించేము ఇంకా నీకు
కామునిఁ గన్నతండ్రివి కరుణించవయ్యా

చ. 1: వేమరుఁ దరుణిమీఁద వెల్లావిరి సేసేవు
కాముని గరిడిలోనికాఁతాళము
గోమున నీసుద్దులకు గొల్లెత లెట్టోరిచిరో
గామిడివిద్యలకెల్లా ఘనుఁడవుగావా

చ. 2: పొనుఁగక వొకమాఁటే పోగులుగాఁ బోసేవు
వనితమీఁదటను జవ్వనమదము
యెనసి పదారువేల నెంతయెలఇంచితివో
వినుపైనయాసోదము నీసొమ్మేకాదా

చ. 3: బత్తితోడ సేసలుగా పడఁతిపైఁజల్లేవు
చిత్తములోపలఁ బులిసినగజరు
యిత్తల శ్రీవేంకటేశ యింతి నిన్నెట్టు కూడెనో
వుత్తముఁడ నీపనుల కొక్కఁడవే నీవు

రేకు: 1388-4 ముఖారి సం: 23-526

పల్లవి: ఎక్కుడేమి సేసినాను యెట్టువచ్చునో పనులు
చక్కనిసతులతోడ నంతముగావయ్యా

చ. 1: చెందిననీసతులలో చిగురుఁగొమ్మా చేఁగే
యెందరితో సాముసేసే వేమయ్యా
అందరును సరసములాడినట్టే నీవాడి
సందడి గుట్టుసేసుక చక్కనుండవయ్యా

చ. 2: కొమ్మలమోపులలోన కొనమొదలును తీసే
యెమ్మెలకుగరిసించే వేమయ్యా
యెమ్ముల నిచ్చుకముల కిచ్చుకములే సేసి
సమ్మతి నడిగినట్టె చనవియ్యవయ్యా

చ. 3: యాడనున్న సతులము ఇందరు నీకొక్కవారే
యేడ గొలఁది గూడితి వేమయ్యా
జోడై యలమేల్మంగనుఁ జూచినట్టే కృపఁ జూచి
వోడక శ్రీవేంకటేశ వొద్దనుండవయ్యా

రేకు: 1388-5 శుద్ధ వసంతం సం: 23-527

పల్లవి: వరుసగావివరుస వత్తురా తాను
అరసి నీవొకమాటు అడుగరాదా

చ. 1: మిక్కిలి నీతో నేను మేలములాడఁగాను
అక్కరతోఁ జూడవచ్చే నాపె యెవ్వతో
ఇక్కువచెప్పి నీవే యీడకు రమ్మనంటివో
యెక్కువైనతనవొళ్లి యెడ్డతనమో

చ. 2: పొందుల నీవు నాపొత్తుల నారగించఁగా
విందులు చెప్పఁగవచ్చీ వెలఁదెవ్వతో
యిందుకు నీవు ఆసలేమైనాఁ బెట్టితివో
దిందుపడి తనలోనిదిట్టకూళతనమో

చ. 3: నేనలమేల్మంగనై నిన్నుఁ గూడివుండఁగాను
కానుక లియ్యఁగవచ్చీఁ గాంత యెవ్వతో
పూని శ్రీవేంకటేశుఁడ పొంది నీమతకమో
తానే నేరుచుకొనినదంటతనమో

రేకు: 1388-6 పాడి సం: 23-528

పల్లవి: నీకే తెలుసుఁగాక నెరజాణతనమెల్లా
పైకొని నిన్నుఁ గొసరేపాటివారమా

చ. 1: పంతమాడేవారితోడ బలుపు చూపుటగాక
మంతనాన నవ్వఁగాను మన్నించవద్దా
వింతవాఁడనా నీవు వెలఁదిలా గెఱఁగవా
పొంతనుండి విన్నవించి పోదిసేయఁగలమా

చ. 2: చలపట్టినవారితో సాదించుటగాక
మలసి మొక్కేటివారి మన్నించవద్దా
పెలుమనసా నీది ప్రియము నీ వెఱఁగవా
తలఁపించి నీమీఁదితరవుకత్తెలమా

చ. 3: గరివించినవారితో గరిసించవలెఁగాక
మరిగి కూడినవారి మన్నించవద్దా
అరిది శ్రీవేంకటేశ అలమేలుమగ యీకె
పురముపై నుండఁగా నిన్నొడబఱిచేమా

రేకు: 1389-1 ఆహిరినాట సం: 23-529

పల్లవి: సిగ్గువడ వించుకంతా చెలరేఁగేవు నీవైతే
యెగ్గులుపట్టేవారెల్లా నేమందురో

చ. 1: ఇంతి నీవు నందలాన యెదురుబడి నెక్కి
వింతలుగా నేఁగేవు వీదివీదులు
కంతలసోరణగండ్ల కడమవారెల్లాఁ జూచి
యెంతేసియాసులతోడ నేమందురో

చ. 2: సరిగా గుఱ్ఱముమీఁద సతియు నీవును నెక్కి
వరుసలను నేఁగేరు వాడవాడల
విరతిలో మేడలెక్కి నీసతులెల్లాఁ జూచి
చెరపులకాఁతాళాన నేమందురో

చ. 3: అలమేలుమంగఁ గూడి అట్టె పల్లకిమీఁద
చెలరేఁగి యేఁగేవు శ్రీవేంకటేశ
కొలిచివచ్చేటినీకొమ్మలెల్లా నట్టె చూచి
యెలమి వేడుకవుట్టి యేమందురో

రేకు: 1389-2 మాళవిగౌళ సం: 23-530

పల్లవి: ఒకరిఁ దడవితేను వోరుతురా
మొకము చూడఁగానే మొరతురుగాక

చ. 1: చేతనొడ్డించుకోఁగానే చెలిని పువ్వుల వేసే
వేతుల కిందరిలోన నిదేమయ్యా
కాతరించి యాపె నిన్నుఁ గసరుచుఁ దిట్టఁగాను
నీతరుణులెల్లాఁ జూచి నిన్ను నవ్వే రిదివో

చ. 2: సిగ్గుతోడఁ గొంకఁగానే చెనకుచు కొనగోర
అగ్గలమై చన్నులంటే వదేమయ్యా
బెగ్గిల నాపె నపేదవి గంటి సేయఁగా
నిగ్గుల నీవనితలు నిన్ను నవ్వే రదివో

చ. 3: అలమేలుమంగ వచ్చె ననఁగానో కొంగువట్టే
వెలమి శ్రీవేంకటేశ యేమయ్యా
కలసి ఆపె నిన్నుఁ గళలంటి చొక్కించఁగా
నెలకొన్న కాంతలెల్ల నిన్ను నవ్వే రదివో

రేకు: 1389-3 సామంతం సం: 23-531

పల్లవి: ఇప్పటి కెఱఁగరాదు యెంత నేము చెప్పినాను
తప్పు నీపై మోచితేనే తలవంచేవుగాని

చ. 1: ఆపె చెప్పినమాటలట్టె తారుకాణవచ్చె
యేపున నాతో బాసలేల సేసేవు
ఆపనుల నీమోవి అద్దములోఁ జూడరాదా
నీపట్టుకు సిగ్గుపడి నిజమాడేవుగాని

చ. 2: అందరు నిన్నాడుకొనే వవి నేఁడు నిజమాయ
చెంది యమరించవేల చెల్లఁబెట్టేవు
సందడి నీచెక్కు లవి చమరి చూచుకోరాదా
అందపురేకలకు నీ వటు నవ్వేవుగాని

చ. 3: దొడ్డికాడిగొల్లెలదూరులు దిష్టములాయ
వొడ్డుకోనేల శ్రీవేంకటోత్తమ నీవు
జిడ్డు చూచుకోరాదా చెలెల మేలుమంగను
అడ్డము లే కేలితివి అట్టు మెచ్చేవుగాని

రేకు: 1389-4 సాళంగ నాట సం: 23-532

పల్లవి: నీవు గడించినమేలు నీవే యెఱుఁగవలె
సోవల నిదే దిష్టము చూచుకొనవయ్యా

చ. 1: అలమేలుమంగ మేనియౌవనరాజ్యమున
మొలకలపులకలు మొలచెను
బలిమితో వలపులపంటలునుఁ బండె నిదె
కలలెక్కలు విందువు గక్కన రావయ్యా

చ. 2: లంకెలై యీకామినిలావణ్యజలధిలోన
వుంకువ కోరికలు వోడల వచ్చెను
సంకెలేక తమకపుసరకులుపచారించె
సుంకపుటాదాయము లెంచుకొనఁగదయ్యా

చ. 3: రచనల నీకెసింగారములతోఁటలోన
కుచముల బంగారు కొప్పెర లుండె
వుచితాన శ్రీవేంకటోత్తముఁడ నిన్నుఁ గూడె
ఇచటనే దాఁచుకొని యిట్టె బదుకవయ్యా

రేకు: 1389-5 దేశాక్షి సం: 23-533

పల్లవి: ఏలినవాఁడవు నీ ఇచ్చలోనివారము
యేలాగున నడిపినా ఇంతా సంతోసమే

చ. 1: మలసి నీమాటలకు మారుమాట లాడనేల
వొలసి వూఁకొంటాను వుండుదుఁగాక
చలపాదివాఁడవు నీజాడలు విడువ వెందు
చెలరేఁగి ఇట్టె చవిసేసుకొనే విన్నియు

చ. 2: చేసుకొన్నబాసల నీచేఁతకు చేఁత మాకేల
వొసరించి నీకు లోనై వుండేఁగాక
ఆసోదకాఁడవు నిన్నన్నిటాఁ దనుపరాదు
వాసితోనే మెచ్చి సేవలు సేసే విపుడు

చ. 3: చేవదేరెఁ గూడితివి సిగ్గుకు సిగ్గిఁకనేల
వోవరిలో నవ్వుకొంటానుండేఁగాక
శ్రీవేంకటేశుఁడవు చెల్లుబడి విడువవు
భావించి నీవారమై బతికేము నేము

రేకు: 1389-6 పూర్వ గౌళ సం: 23-534

పల్లవి: చెప్పవయ్యా వినేఁగాని చెవులు చల్లఁగా నేఁడు
దప్పిదేరి నీమనసు తమకించెనా

చ. 1: వలపులనీసుద్దులే వడిగాఁ జెప్పేవు నాతో
వెలయ వింకా నవి వేడుకయ్యీనా
మొలకలు చన్నులంటా ముందరనే పొగడేవు
అలర నందుపై నీకు ఆసలు పుట్టీనా

చ. 2: నావద్దనే కూచుండి నవ్వులెల్లా నవ్వేవు
చేవదేరి నీమదము చిమ్మిరేఁగెనా
బావించి నేఁ బండుండఁగా పక్క నిట్టె పండుఁడేవు
కావలసి నామీఁద కరుణ వొడమెనా

చ. 3: తప్పకిట్టె నామోము తతిగొని చూచేవు
ముప్పిరి నాకింత మోహించితివా
కప్పి శ్రీవేంకటేశుఁడ కాఁగిలించి కూడితివి
యెప్పుడు నాకీచనవు లియ్యదొరకొంటివా

రేకు: 1390-1 వరాళి సం: 23-535

పల్లవి: ఇంకానేల మఱఁగులు ఇద్దరికిని
పంకించక సోబానఁ బాడేము నేము

చ. 1: సురటి విసరీ నీకుఁ జూడరాదా ఆపె దిక్కు
శిరసువంచుక యేల సిగ్గవడేవు
ఇరవుగా నెరిఁగిరి ఇందరు నీసుద్దులు
పరగఁగ సోబానఁ బాడేము నేము

చ. 2: ఆకుమడిచిచ్చీ నీకు నంది పుచ్చుకొనరాదా
చేకొని మరీనేల సిగ్గువడేవు
జోకల మైగురుతు సారిది బాఇటఁబడె
పైకొలిపి సోబానఁ బాడేము నేము

చ. 3: వూడిగము సేసీయాపె నొనగూడి మెచ్చరాదా
చేడెలు చూడఁగానేల సిగ్గువడేవు
కూడితవి నన్ను నిట్టె కోరి శ్రీవేంకటేశుఁడ
పాడితోడ సోబానఁ బాడేము నేము

రేకు: 1390-2 శ్రీరాగం సం: 23-536

పల్లవి: చిత్తమురా విన్నపము సేసేఁగాని
తత్తరించ కివ్వలికి దాఁటిరావయ్యా

చ. 1: వలపు లీఁతలబంటి వాసులు రొమ్ములబంటి
పొలసితే మాటలు పుక్కిటిబంటి
అలసి అవ్వలనుండి అడిగేవు మాగుట్టు
తలపోఁతయేరులు దాఁటిరావయ్యా

చ. 2: చింతలు చెక్కులబంటి సిగ్గులు పెందొడ్లబంటి
మంతనా లన్నియుఁ జీలమండలబంటి
బంతి నెదురురేవుల పైకొని లోఁతర సేవు
దంతపు మేడకు నిట్టె దాఁటిరావయ్యా

చ. 3: కూటమి చంకలబంటి కోరికె చన్నులబంటి
మూటగట్టు సరసాలు మొలబంటి
యీటున శ్రీవేంకటేశ యెనసి నన్ను మెచ్చేవు
తాటించి నీవిట్లానే దాఁటిరావయ్యా

రేకు: 1390-3 పాడి సం: 23-537

పల్లవి: చేయినట్టెనంటా నేల చెలువుని@ దిట్టేవు
ఆయములు గర@గ@గా ఆసపడవలదా

చ. 1: చిక్కనితేనెలతో నీచిగురాకుమోవి చూచి
వుక్కున నీపతికి నోరూరకుండునా
గక్కన నీమోము చంద్రకళదేర@గా@ జూచి
పక్కన నీకు నట్టె బా@తిపడవలదా

చ. 2: పట్టె@డేసివట్రువనీ బంగారుచన్నులు చూచి
చుట్టి యాతనిచూపులు సో@క@దగదా
జట్టిగ నందపునీజఘనచక్రము చూచి
రెట్టించి వలపులు రే@గ@గవలదా

చ. 3: సావధానముల నీచక్క@దనములు చూచి
యీవేళ శ్రీవేంకటేశు@ డెనసె నౌనె
తావుల నీకొప్పును బిత్తరిచూపులును@ జూచి
యీవులిచ్చి నిన్ను నురమెక్కించుకోవలదా

రేకు: 1390-4 ఆహిరి సం: 23-538

పల్లవి: నిన్ను మెచ్చఁగలఁగాని నిష్ఠూరాన కోపను
నిన్నటివలెనే నేఁడు నిల్పఁగరాదా

చ. 1: యెన్ని లేవు నీసుద్దులు యిప్పుడు చెప్పేనంటేను
వున్నతి మొకదాకిరి నుందానఁగాక
పన్ని యప్పటి నాతో బాసలేల సేసేవు
యెన్నఁగ గుట్టుతో నుండనియ్యఁగరాదా

చ. 2: నాకుఁ గొత్తా నీసేఁతలు నమ్మి ఇయ్యకొనేనంటే
చేకొని వెల్లావిరులు సేయఁగాక
సాకిరేల తెలిసేవు సతులనందరిఁ దెచ్చి
తూకొని తొల్లిటివెల్లా దొంతిఁబెట్టేవు

చ. 3: కానరావా నీగుణాలు కమ్మటిఁ బొగడేనంటే
నానఁబెట్టి కొంతగొంత నవ్వేఁగాక
పూని శ్రీవేంకటేశుఁడ పొందితివి దూరనేల
మాని పంతమిచ్చితిని మన్నించరాదా

రేకు: 1390-5 కాంబోది సం: 23-539

పల్లవి: ప్రియముచెప్పేదే మేలు బిగియనేఁటికి
క్రియగూడుమామాటలఁ గృపసేయవయ్యా

చ. 1: పంతగారిసతి నిన్ను బట్టినదెల్లాఁ దప్పే
యెంతని వుత్తరమిచ్చేవేమయ్యా
వింతగా చేతులువట్టి వేఁడుకొని విడెమిచ్చి
పొంతనే యేకతమాడి బుజ్జగించవయ్యా

చ. 2: చెందిన వాసికత్తె సేసినదెల్లాఁ జేఁతే
యెందాఁకాఁ దారుకాణించే వేమయ్యా
కందున నవ్వులు నవ్వి కడుఁ బచ్చడము గప్పి
ఇందరిలో గారవించిఇచ్చలాడవయ్యా

చ. 3: మానవతులైన వారిమాటలెల్లాఁ గదవులే
ఆనలేల పెట్టుకొనే నదేమయ్య
ఔను కడపరాయఁడవై శ్రీవేంకటేశుఁడ
తానకమై దూరితిని దండనుండవయ్యా

రేకు: 1390-6 మళవి సం: 23-540

పల్లవి: ఎందాఁకా వంకలుదిద్దే వీతనిసుద్దలు నాతో
పందెగాఁడై తానిట్లా బదుకనీఁగదవే

చ. 1: చెల్లుబడిగలవారు సేసినదెల్లాఁ జేఁతే
అల్లదె ఔఁగాదని ఆడఁగనేల
పల్లదాన నేఁ దప్పులు పట్టేటిదాననా
బల్లిదుఁడై తానిట్టా బదుకనీఁగదవే

చ. 2: పంతగాండ్లైనవారు పట్టినదెల్లా మాఁటే
యెంతకెంత తనగర్వా లెంచఁగనేల
పొంతనుండి నేఁ దనకు బుద్ధినేరిపేదానా
బంతి నుండి తానిట్లా బదుకనీఁగదవే

చ. 3: కూరిమిగలుగువారు కూడినదెల్లాఁ గూటమి
సారెకుఁ గోసరి యింతజఱయనేల
యీరీతి శ్రీవేంకటేశుఁ డెనసె నింకఁ బాసేనా
బారకుఁడై తానిట్లా బదుకనీఁగదవే

రేకు: 1391-1 సామంతం సం: 23-541

పల్లవి: మొక్కేము నీకును ముందుముందుగా నేము
మక్కువసేసి ఇట్టె మన్నించవయ్యా

చ. 1: తలఁచి నీవే నన్ను దయఁజూచుటగాక
కొలఁదిమీరి యెందాఁకఁ గొసరేను
చలము సాదించేనంటే సతులము నే మెదురా
మలసి ఇంతటనైన మన్నించవయ్యా

చ. 2: పనివడి నీవే నాపై బత్తిసేయుటగాక
కొనగొనల నెందాఁకాఁ గొసరేను
మనసు సోదించేనంటే మంకులము నే మెంత
మనసిచ్చి యిపుడైనా మన్నించవయ్యా

చ. 3: గరిమల నీవే నన్నుఁ గలసి మెచ్చుటగాక
కురులంటి యెందాఁకఁ గొసరేను
యిరవై శ్రీవేంకటేశ యేలితి విల్లాల నేను
మరగి యింతటనైనా మన్నించవయ్యా

రేకు: 1391-2 రామక్రియ సం: 23-542

పల్లవి: సతుల మిందరమును సంతోసించేము
తతివచ్చె నీక నిట్టె దాఁచకువయ్యా

చ. 1: కన్నులనే నవ్వుతాను కలకల మాటాడుతా
వున్నది చెలియ నేఁడు వుల్లసానను
మన్నించిననీసుద్దులు మాతోఁ జెప్ప సిగ్గువడీ
అన్నియు నీవైనా నానతియ్యవయ్యా

చ. 2: మోమునఁ గళదేరుతా ముచ్చటలు నెరపుతా
వేమారుఁ జెలరేఁగీని వేడుకలను
నీమోహపుగుఱుతులు నే మడిగితే దాఁచీ
ఆముకొని నీవైనా నానతియ్యవయ్యా

చ. 3: మోనిఁదేనె లొలుకతా ముంచిసరసమమాడుతా
వోవరిలో నిన్నుఁగూడి వున్నదిపుడు
శ్రీవేంకటేశుఁడ నే మెచ్చితేఁ దానే తలవంచీ
ఆవిధము నీవైనా నానతియ్యవయ్యా

రేకు: 1391-3 పాడి సం: 23-543

పల్లవి: మావలె నుండవలదా మనసు మనసుఁ బొంది
కైవశ మాతఁడు నాకుఁ గలకాలమెల్లను

చ. 1: చనవరినందువు జాణ ననుకొందువు
యెనలేనిరమణుని నేల దూరేవే
పెనఁగి పెద్దరికాలు పెంచేది యెఱఁగము
ఘనమై మీగుట్టు నేఁడు కానవచ్చె మాకు

చ. 2: నీవే మించితి నందువు నేరుపరినందువు
యీవల నాతని కెంత యేఁకారేవే
భావించి వేసాలు నీవు పచరించే దెఱఁగము
కావిరి వలపు తారుకాణాయ మాకు

చ. 3: యెమ్మె చెల్లునందువు యెనసితి నందువు
చిమ్మి శ్రీవేంకటేశుపై చేఇ వేసేవేమె
నెమ్మినాతఁడె నన్నేలె నీమనసు యెఱఁగము
తెమ(మ్మ?)లైన సంతోసము దిష్టమాయ మాకు

రేకు: 1391-4 కురంజి సం: 23-544

పల్లవి: ఏమయ్య తగవు నీవెఱఁగనిదా
కామించితే బిగిసే విక్కడి జాణతనమా

చ. 1: కోరికతో నిన్ను నాపె కొంగువట్టి తియ్యఁగాను
సారె సిగ్గులువడేది జాణతనమా
నేరుపుతో బత్తి గడు నీమీఁదఁ జేయఁగాను
యీరీతి గుట్టుసేసే విది జాణతనమా

చ. 2: గోమునఁ బెంచినయట్టిగుబ్బల నిన్నొత్తఁగాను
సాముసేసే నాపెతోను జాణతనమా
నేమముతోఁ గానుకిచ్చి నిన్నుఁ దప్పకచూడఁగా
ఆమనినవ్వులు నవ్వే వది జాణతనమా

చ. 3: కడలేనినిబ్బరాన కాఁగిట నిన్నుఁ గూడఁగా
జడిసేవు రతులకు జాణతనమా
అడరి శ్రీవేంకటేశ ఆపె నీకు మొక్కఁగాను
తొడరి కొసరే నింక దొమ్మి జాణతనమా

రేకు:	1391-5 భైరవి	సం:	23-545

పల్లవి:	గక్కన చెక్కునొక్కేవు కమ్మటి నీవు
	కిక్కిరిసిన వేడుకఁ గృపఁ జూడవయ్యా

చ. 1:	నేరుపరిసతినైతే నీతో మాటాడుటగాక
	వూరకుండేముద్దరాల నోపుదునా
	గారవించి యింతయేల కదిసి వెడ్డువెట్టేవు
	మారీతి నీవెఱఁగవా మన్నించవయ్యా

చ. 2:	చన్నులు గొప్పలైతే సరివెనఁగుదుఁగాక
	చిన్నదాన నే నింతేసికిఁ గలనా
	యిన్నిటా సారెకునేల యిచ్చకము సేసేవు
	కన్నులెదుట నుందాన కరుణించవయ్యా

చ. 3:	మిక్కిలి ప్రౌఢనైతే మేలములాడుదుఁగాక
	యిక్కువ సిగ్గరికత్తె వింతసేసేనా
	వొక్కటైతివి శ్రీవేంకటోత్తమ యేల దూరేవు
	తక్కులఁబెట్టక యిట్టె దయఁజూడరాదా

రేకు: 1391-6 శ్రీరాగం సం: 23-546

పల్లవి: ఏమయ్య నన్నేల యెలయించేవు నీవు
చేముంచి నీపాదాలసేవ సేసేదానను

చ. 1: వంతుకు నందరివలె వలచినదాననా
కాంతుఁడ నీవు మన్నించేకాంతను నేను
దొంతివావులు చెప్పేటిదోమటిలో దాననా
మంతనాన నెలకొన్న మచ్చికలోదానను

చ. 2: పూసుకవాసుకవచ్చే పొరుగులదాననా
రాసికెక్కే పట్టపురమణి నేను
వేసాలకుఁ గొసరేటివింతపొదులదాననా
సేసవెట్టి పెండ్లాడినచేతిలోని దానను

చ. 3: ముంచి కూడపెట్టుకొన్న మూఁకలోనిదాననా
కంచపుఁబాలకూళ్ళ కామిని నేను
యెంచఁగ శ్రీవేంకటేశ యేలితి వేడోదాననా
మించిననీవురముపై మేనదాననేను

రేకు: 1392-1 సౌరాష్ట్రం సం: 23-547

పల్లవి: ఏలయ్య మాతోడియేలాటాలు
కేలెత్తి మొక్కేము కృపఁజూడవయ్యా

చ. 1: చల్లలమ్మేవారిసంగడి నుండఁగ
యెల్లవారు నిన్ను నేమందురు
గొల్లఁడాయ రాచకొడుకు వీఁడంటా
తొల్లే మధురలో దూరిరి నిన్ను

చ. 2: ఆలఁగాపరై అడవి నుండఁగ
యీలీలఁ బౌరులు యేమందురు
బాలుఁడాయ పరబ్రహ్మము వీఁడంటా
పోలిమితోఁ గరిపురజను లనిరి

చ. 3: బండిబోయిఁ (యఁ?) డవై పొఁజులలో నుండఁగ
యిందువిండ్లవారేమందురు
దండి శ్రీవేంకటోత్తముఁడాయ వీఁడంటా
నిండుఁదిరుపతినిలయము నగిరి

రేకు: 1392-2 కన్నడగౌళ సం: 23-548

పల్లవి: చెక్కు చేతి తోడ చింతించేదేకాక
అక్కలాల మిమ్ము నిఁక నన(గఁ జోటేది

చ. 1: చెంతనున్నచెలులే చెలువునికి లోనైతే
మంతన మెవ్వరితోడ మాటలాడేది
కాంతునిమాటలవొరగలు మీరే దిట్టితేను
యెంతటివారికినైనా యెట్టు దరించేది

చ. 2: పిలిచితెచ్చేటివారే ప్రియునిఁ గలసితే
చలములెవ్వరితోడ సాదించేది
బలిమి నాతనికిఁగా బాసకు మీరే వచ్చితే
యిలమీఁద చుట్టరికా లెట్టుసేసేది

చ. 3: కాఁగిలించఁబెట్టేవారే కందువలు సోఁకించితే
చేఁగదేర నెవ్వరిపై సేసవెట్టేది
ఆఁగి శ్రీవేంకటేశుమో నప్పుడే నాకిప్పించితే
పొఁగిన మీనేర్పు లెట్టు భావించేది

రేకు: 1392-3 హిందోళ వసంతం సం: 23-549

పల్లవి: చెలులాల మీరూరకే చేతికి కానికియ్యరే
తలంచుకొని యన్నిటాఁ దానే మన్నించీని

చ. 1: పిలిపించ నెంతదాన సెనఁగఁగ నెంతదాన
తలఁపులోపలివాఁడు తానే వచ్చీని
చెలరేఁగి పెండ్లాడినాడు చేపట్టినాఁడు తొల్లె
కొలచినందే కొలచి కొత్తసేయవలెనా

చ. 2: అగడుసేయఁగనేల ఆకులు వ్రాశంపనేల
తగులాయమైనవాఁడు తానే వచ్చీని
నగి సేసవెట్టినాఁడు నమ్మించినాఁడు తొల్లె
విగిడినందే విగిడి నిందవేయవలెనా

చ. 3: చొక్కించఁగా నెట్టో సొలయఁగా నది యెట్టో
దక్కి నాకుఁ గలవాఁడు తానే వచ్చీని
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డితఁడే వచ్చి నన్నేలె
మొక్కినందే మొక్కి మరి మోపుగట్టవలెనా

రేకు: 1392-4 దేశాళం సం: 23-550

పల్లవి: ఎలయింపుఁజేఁతల నీ వెంతసేసేవు
చలములు సాదించక చనవియ్యరాదా

చ. 1: మాటలకుఁ దలపెట్టి మనసెల్లా భ్రమఇంచి
అఁటదాని వింతయేల అలఇంచేవు
నీటున బుసకొట్టుచు నిలుచుండెప్పటనుండి
గాఁటానఁ బానుపునను కలయఁగరాదా

చ. 2: బట్టబయలు నవ్వించి పరాకులు పుట్టించి
చుట్టమైన యీపెనేల సూడువట్టేవు
దట్టపుఁ జెమటతోడ తప్పకచూచీ నిన్ను
నెట్టుకొన్న రతులఁ దనివిసేయరాదా

చ. 3: చేతులు మీఁదవేసి చిమ్మిరేఁచి వలపుల
కాతర మీకె కంటించి కాఁగిలించేవు
యీతల శ్రీవేంకటేశ యెనసి నీకింతి మొక్కీ
రాతిరిఁబగలు నిట్టె రమియించరాదా

రేకు: 1392-5 బౌళి సం: 23-551

పల్లవి: చెల్లుఁజెల్లు వోయి నీవు సేసినంతాను
కొల్లున నవ్వేవు నీకొంగుపట్టఁగాను

చ. 1: పంతగాఁడవావోయి పలుమారుఁ బెనఁగేవు
చెంతనుండి నీసేవసేయఁగాను
వింతవాఁడవోయివెరగంది చూచేవు
మంతనాన నేఁడునీమర్మము లంటఁగాను

చ. 2: అందగాఁడవా వోయి అడినట్టె ఆడేవు
అంది నే సుద్దులు నిన్ను నడుగఁగాను
మందడీఁడవా వోయి మంకులెల్లా నెరపేవు
విందు చెప్పి చెక్కునొక్కి వేఁడుకొనఁగాను

చ. 3: నాతికాఁడవా వోఇ నంటునఁ దలవంచేవు
కోలుముంద్దై కాఁగిలో కొసరఁగాను
యీలీల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
బాలుఁడవా మోవిచ్చితే పచ్చిగాఁ జేయఁగాను

రేకు: 1392-6 పాడి సం: 23-552

పల్లవి: బలిమాయ ఇఁక నిట్టే బతుకరమ్మా
తలమోచి సవతులు దగ్గరఁజోటేది

చ. 1: ఇచ్చక మాతఁ డాడితే నియ్యకొందువు నీవైతే
హెచ్చిన నేరుపరులే ఇద్దరును
పచ్చిదోఁచె మీమోవుల పనులెల్లఁ జక్కనాయ
తచ్చి సవతుల కిఁకఁ దగులఁజోటేది

చ. 2: సన్న నాతఁడు చూచితే సారె మొక్కుదువు నీవు
ఇన్నిటా జాణలే మీరిద్దురును
కన్నులఁ దేటలు నిండె కాయములు పులకించె
కన్నవిన్నసవతులు కలయఁజోటేది

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ డేలె సేవ సేసితివి నీవు
యీవల నావల ఘనులిద్దరును
వావి చూచి నన్నుఁ గూడె వరుస వితఁడే నేఁడు
భావించి సవతులికఁ బదరఁజోటేది

రేకు: 1393-1 దేశి సం: 23-553

పల్లవి: ఏల సిగ్గులుపడేవే యెందాఁకాను
వేళవేళతోఁ బతికి విడెవియ్యవే

చ. 1: పండినపంటవంటిది పాయపునాఁటిమదము
నిండుఁజెరువువంటిది నెయ్యపుటాన
వుండనుండ నని లోలో నుడివోవకుండును
అండనుండినపతికి నప్పగించవే

చ. 2: పెరతేనియవంటిది ప్రియములతమకము
విరివాసనవంటిది వేడుకనవ్వు
సరికిబేసికి నవి చవిదప్పకుండాను
దొరకె నాతనికే విందులు సేయవే

చ. 3: చేవ చిగురువంటిది చెందినకాఁగిటిరతి
భావము సొంపువంటిది పైకొన్నమేలు
వానితోఁ గూడితి విఁక వరుసదప్పకుండాను
శ్రీవేంకటేశ్వరుని సేవ సేయవే

రేకు: 1393-2 బౌళి రామక్రియ సం: 23-554

పల్లవి: సమ్మటూరిచెన్నుఁడా జాణఁడ వౌదువయ్య
పమ్మి యన్నిటాను చెల్లుబడియాయవలపు

చ. 1: తమ్మిపువ్వుల వేసేవు తప్పకచూచితినంటా
దొమ్మిసేసేవు పాదముతొక్కితినంటా
నిమ్మపండు పిండేవు నిన్ను నే దొబ్బితినంటా
ముమ్మాటికిని ముయికి ముయ్యాయ వలపు

చ. 2: కోరి పన్నీరు చిమ్మేవు కొంగు నేఁ బట్టితినంటా
గీరేవు గోరను గిలిగించేనంటా
యేరా చన్నులు విసికే విట్టె కొప్పంటితినంటా
మారుకొ వొకటి కినుమడి మాయ వలపు

చ. 3: కప్పురము చల్లేవు కాఁగిట బిగించితినంటా
గుప్పేవు పరిమళాలు కూడితినంటా
యిప్పుడే శ్రీవేంకటాద్రి నేలితివి మెచ్చేనంటా
చప్పుడు మోవితేనెల జంటాయ వలపు

రేకు: 1393-3 ఆహిరి సం: 23-555

పల్లవి: ఎన్నఁ డెఱిఁగేవు నీవు ఇంటి నీపైఁ జేసేబత్తి
సన్న యెరిఁగి ఇప్పుడే చనవియ్యరాదా

చ. 1: చెలియ నీకుఁ గతలు చెప్పి చెప్పి దప్పిగొనె
యెలమిఁ గప్పురబాగా లియ్యరాదా
మెలుపునఁ బాదాలొత్తి మేనెల్లఁ జెమరించే
వెలయ సురటిఁగొని విసరరాదా

చ. 2: సతి వూడిగాలు సేసి సారెకు మేను బడలె
ఇతవుగా మోవిపండు ఇయ్యఁగరాదా
తతితో జూజాలాడి తమకించి బుసకొట్టె
పతివి నీతొడమీఁదఁ బవ్వళింపించరాదా

చ. 3: మగువ నీతోఁ గూడి మనసు నివ్వెరగందె
జిగిగోర నెచ్చరిక సేయఁగరాదా
నిగిడి శ్రీవేంకటేశ నీతో జాగరాలు సేసె
మిగులా నిండురతలు మెప్పించరాదా

రేకు: 1393-4 సామంతం సం: 23-556

పల్లవి: కంకణసూడిగెముల కామినివి యీ
యంకెల నీభావమెల్లా నానతియ్యవే

చ. 1: వెలఁది మొక్కేవు నీవు వేమారు మరునికే
మెలుపై నీకీలుగంటు మిట్టిపడఁగా
పులుకుఁగుచములతోనూఁగేటిసరులతో
నలపే విదేమిగోరే వానతియ్యవే

చ. 2: గరిమ నోమేవు నవు కంతునిఁ బూజలు సేసి
శిరసుచెమట మేనఁ జిందఁగాను
వరుస నూరుపులతో వలగొని బడలేవు
అరిది నీతలఁపెల్లా నానతియ్యవే

చ. 3: మంతనాన నొడిగేవు మదనమంత్రములే
దొంతిపులకలు మేనఁదొడరఁగాను
యింతి నీవు శ్రీవేంకటేశు నీకాఁగిటఁ గూడి
అంతలో నవ్వినదేమి ఆనతియ్యవే

రేకు: 1393-5 భూపాలం సం: 23-557

పల్లవి: మరుఁడు సేసినయట్టిమాయ లివి
కరఁగె మే నిందు లోనుగాకుండవచ్చునా

చ. 1: తరుణినీపతిఁ బాసి తమకాన బడలవు
విరహ మిందరి కొకవిధమేకాదా
పెడరేఁచి కూరిములు పెట్టినపాట్లనెల్లాఁ
బొరలక మన కవి పొంతఁ దోయవచ్చునా

చ. 2: నెవ్వగఁ జిత్తములోన నీకేల చింతింప
జవ్వన మిందరి కొకసరిగాదా
యెవ్వరేకాలమునందు యెట్టుండవలె నట్టు
దవ్వుచేరువలు నమ్మి తప్పించవచ్చునా

చ. 3: చెక్కిటిచేతితోడ చెలులపై నొరగేవు
చక్కఁదన మిందరికి జయమేకాదా
యెక్కువతో శ్రీవేంకటేశు డిదె నిన్నుఁగూడె
కక్కసమేఁటికి నిఁకఁ గాదనగవచ్చునా

రేకు: 1393-6 ఆహిరి సం: 23-558

పల్లవి: మెలుఁతలు బెళుకుల మఱసినను
నిలువునఁ గాంతలో నీడలు నిలిచె

చ. 1: మలవుల నాడుచు మగువలు నీపై
సొలసిసొలసి నినుఁ జూడఁగాను
నిలువున నీమై నీలపుసరులై
కలువదండలై కలగొన బెరసె

చ. 2: మునుకొని యిద్దరు మురిపెపునడపుల
చెనకి కరజములఁ జెన్ను గను
పెనగొనువజ్రపుఁబేరులసొమ్ములు
తనుకాంతులలోఁ దగులములాయ

చ. 3: తిరుపుగొనుచు నినుఁ దేఁకువ నొరయుచు
సరుసనె నగవులు చల్లినను
గరిమల శ్రీవేంకటపతి నీకివి
తెరమరఁగురతుల తేజములాయ

రేకు: 1394-1 సౌరాష్ట్రం సం: 23-559

పల్లవి: మాటలాడఁగదవే మంకులేఁటికి
నాఁటుకొనీతఁడు నీతో నవ్వు నవ్వఁగాను

చ. 1: చెఱఁగేల కట్టేవే చెక్కుచేయేల పెట్టేవే
మఱి యెదుటనే నీమగఁ డుండఁగా
నెఱులేల ముడువవే నేలనేమి వ్రాసేవే
తఱితో నీతఁడు నీదండ నుండఁగాను

చ. 2: చెమటేల తుడిచేవే శిరసేల వంచేవే
తమకిం చీతఁడు నిన్ను దప్పిదేర్చఁగా
సమమై యేల మొక్కేవేసారెనేల యలసేవే
జమళి నీతఁడు నీచన్ను లంటఁగాను

చ. 3: దిక్కులేల చూచేవే తెరయేల వేసేవే
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గూడఁగా
చొక్కి యెంత కోసరేవే సొలపు లెంతసేసేవే
మిక్కిలి యీతఁడే నీతో మేలమాడఁగాను

రేకు: 1394-2 సాళంగ నాట సం: 23-560

పల్లవి: కూరిమి నెక్కవయ్యు నాకుచదుర్గాలు
యేరీతినైనా వారి నేమనఁగఁగలవు

చ. 1: యేతలచూచినా సతులెందరై నా నుండఁగాను
నాతోనే సారెసారె నవ్వు నవ్వేవు
కాతరించి వారెల్లానొక్కటై దొమ్మి సేసితేను
యేతులు మెరసి నీవు యేమనఁగఁగగలవు

చ. 2: కుచ్చినట్టు యిందరూ నీకొలువు సేయఁగాను
మచ్చికసేసి నాతోడనే మాటలాడేవు
పచ్చిగా నందరు నిన్ను బలిమిఁబై కొంటేను
హెచ్చి నీవింతటిలోన యేమనఁగఁగలవు

చ. 3: కుచ్చినట్లు యిందరూ నీకొలువు సేయఁగాను
మచ్చికసేసి నాతోడనే మాటలాడేవు
పచ్చిగానందరు నిన్ను బలిమిఁబైకొంటేను
హెచ్చి నీవింతటిలోన యేమనఁగఁగలవు

రేకు: 1394-3 ముఖారి సం: 23-561

పల్లవి: నిలుచున్నా డల్లవాఁడె నివ్వెరగుతో
తలఁపెల్లఁ జేకొని దగ్గరనే తరుణి

చ. 1: తప్పకచూచుచు నట్టె తలఁచు నిన్నాతుమలో
పుప్పొడిగా జుంజుకొనఁబులకించును
వుప్పతిల్లువిరహాన వూరకే గోర గీరు
దప్పిదేరనిమ్మని దగ్గరవే తరుణీ

చ. 2: అడుగిడుఁ గాఁకలార అరగంటఁ గెంపు నించు
అడవిలోనే తిరుగు నాసోదాన
కడువలపులు రేఁచు కందువమాయలు సేసి
తడవి నీపతి వాఁడే దగ్గరవే తరుణి

చ. 3: సిగ్గులు నిడువఁజూచు చిమ్ముల నెయఁజొచ్చి
నిగ్గుదేర నిన్నుఁ గని నెయ్యముతోడ
అగ్గమై శ్రీవేంకటేశుఁ దంతలోనె నిన్నుఁగూడె
తగ్గక దినము నిట్టె దగ్గరవే తరుణి

రేకు: 1394-4 సామంతం సం: 23-562

పల్లవి: ఆయనాయఁ జాలుఁజాలు నట్టె వుండరా
చాయలపలుకు లివి చవులయ్యీనా

చ. 1: యెంతవడి నావద్ద నిచ్చకమై వుండినా
పంతపునీతలఁ పెందుఁ బారకుండీనా
ఇంతలేసియానలు నీ వెన్ని వెట్టుకొన్నాను
కొంతైన నామనసు గొని నమ్మీనా

చ. 2: కడఁగి నీవెంత నన్నుఁ గాఁగిలించుకుండినాను
కడవారిమీఁద నీకుఁ గాఁక మానీనా
విడువక నీవెంత వేసరక బొంకినాను
వుడివోని నామనసు వొడఁబడీనా

చ. 3: కొంకక నీవెంత నాతో గుట్టుసేసుకుండినాను
వుంకువనీతమకము లుండనిచ్చీనా
పొంకపుశ్రీవేంకటేశ భోగపుఁగాఁగిట నన్ను
కంకిగాఁ గూడితివి నేఁ గాదనేనా

రేకు: 1394-5 మాళవిగౌళ సం: 23-563

పల్లవి: ఇలమీఁద నివి గొన్ని యింద్రజాలాలా నీ
కులుకువలపు నాపై గురిసేయవలెనా

చ. 1: యెదురై మొక్కేవు నాకు యేడలేనివినయాన
యిది గొంత ఆరడే నా కిందరిలోన
పొదివి నీవెఁ(వెం?) దైన భోగించి వచ్చి యీాడ
వెదకి నాపైఁ జొప్పు వేయవలెనా

చ. 2: పెట్టెడి నాపెండె మిది పెట్టుకొంటి విందరిలో
ముట్టి నాకు నిది గొంత మోచిదింపులా
గుట్టున నీచేఁతలును గుణములు వెడ్డువెట్టి
బట్టున మామాటలే యాబడి సేయవలెనా

చ. 3: ఇందాఁకా యేఁచి నన్ను యిప్పుడే శ్రీవేంకటేశ
పొందిలి విననయు నీకుఁ బొద్దువోకల
మందలించి నే నీకు మన్నించు సతి నింతే
అంది నాకు వింతప్రియము చెప్పవలెనా

రేకు: 1394-6 శంకరాభరణం సం: 23-564

పల్లవి: ఓపో ఇదేఁటి నవ్వు లూరకుండవే
నాపలుకు నింటి నిఁక నవ్వులేకావా

చ. 1: యేమే వచ్చితివి నీవెన్నఁడు లేమివో
కామిని నీరమణుఁ డీకడ కంపెనే
యేమి పనిగలిగె నేఁడేఁటి కొత్తలే
ఆ మాఁటకే పో నన్నడుగనేలే

చ. 2: మగిడి యాసద్దులేల మరిమాఁ టేలే వో
మగువ నీవిభుఁడు రమ్మనుమనెనె
యెగసక్కెములు నాతో వినియుఁ గొన్నా యేమో
నిగిడి యాతనిగుట్టు నీవెఱఁగనా వా

చ. 3: తనిసితి నింక తడవకువే నీ
వెనకనె వాఁడె శ్రీవేంకటేశుఁడు
అననేమున్నది నిన్ను నాయఁబదవే మీ
మనసు లెనసె నింకా మఱఁగేఁటికే

రేకు: 1395-1 సామంతం సం: 23-565

పల్లవి: కంటిమి నీలో మేలు కాంతల మిందరమును
జంటవాయ కతనితో సతమై వుండఁగదే

చ. 1: సెలవి నవ్వు లుండఁగా చెక్కుపై చేఇఁకనేలే
మలసేనీపతితోడ మాటలాడవే
వలపు లోన నుండఁగ వట్టి యలుక లింకేల
కలయికకు రమ్మని కప్పుర మియ్యఁగదె

చ. 2: కనుచూపు పదరంగ కాఁకలు మేనిపైనేలే
చెనకి విభునిమీఁద చేఇచాఁచవే
మనసు బాఁతిపడఁగ మంకుదనములవేల
మొనసేటిరతులకు మోవి చూపఁగదవే

చ. 3: భావము కలశుండఁగ పంతపుమోసములేలే
శ్రీవేంకటేశ్వరుఁ గూడి చెలరేఁగవే
వాని కొఁగిట నుండఁగ వట్టితరివీపులేల
వోవరిలో నుండుమని వుంగరాన నొత్తవే

రేకు: 1395-2 ముఖారి సం: 23-566

పల్లవి: చందురుఁడు నుదఇంచె జల్లున వెన్నెలగాసె
చందములు సేసుకొని సమకృతించరాదా

చ. 1: దొరకొనినమాటల దొంతులు నీవు వెట్టంగ
యెరపుల మారుత్తరా లేమిచ్చేము
తరుణి వాతనికి నాతఁడు నీకు రమణుఁడు
మరిగి నీకోపమెల్ల మానరాదా ఇఁకను

చ. 2: యెంచి అతనినేరాలే ఇటు వాములు వేయఁగ
అంచెల నెందాఁకా నేము ఆడుకొనేము
కొంచ కాతఁడుబాసిచ్చె గురిగా నిలిచితివి
ఇంచుకంత మోవితేనె లియ్యరాదా ఇఁకను

చ. 3: కేరడపునవ్వులే కిమ్ముల వెదవెట్టఁగ
సారెసారె నిన్నెట్ల సాదించేము
కోరి శ్రీవేంకటేశుఁడు గూడె నీవు గూడితివి
వూరడై వొక్కుమ్మడి నీవుఁడరాదా ఇఁకను

రేకు: 1395-3 భైరవి సం: 23-567

పల్లవి: ఏమనిన వడిఁబడు నీవేళను మీ
రేమాటకైన నిట్టె ఇయ్యకొనరే

చ. 1: చిత్తము గోమలము చిగురింతే దేహము
వొత్తి విన్నవించకురే వోపదు చెలి
గుత్తపురమణి నీపై గోపగించి వున్నదిదె
అత్తి యాకె ఆడినట్టే ఆడరే మీరు

చ. 2: తెగువలే ఘనము దీమసము గొంచము
వొగి నౌఁగాదనకురే వోపదు చెలి
మిగులా విరహమున మేరమీరి వున్నది దె
మొగమిచ్చలే సేసి ముచ్చటాడరే

చ. 3: కూటమి వెగ్గళము కూడపెట్టెఁ జలము
వూరకుండరే మీరు వోపదు చెలి
కోరి శ్రీవేంకటేశుఁ గూడుకొనెఁ దనుఁదానే
చేరిచేరి యిఁదరును సేన చల్లరే

రేకు: 1395-4 చెంచుమలహరి సం: 23-568

పల్లవి: ఒకటొక టింక నాకు నుడువలసె
మొకమిచ్చుమాటలకు మొదలుకొనవలసె

చ. 1: అతనితో నేఁడు నే నలిగి వుండఁగఁగదా
వెతఁబొంది మదనునికి వెఱవవలసె
తతి నంతలో విభుఁని దలపోయఁగాఁగదా
మతిఁ గరఁగి నామేను మఱపందవలసె

చ. 2: విరహతాపపు(ము?) వెదవెట్టఁ బొరలఁగఁగదా
గరిమనాచెలులతోఁ గసరవలసె
జరసి నాతమకములు చలముకొనఁగాఁ గదా
సిరులఁ బతి పంతములు చెల్లించవలెసె

చ. 3: పెనఁగి తొల్లిటిరతులు పెరచేఁచఁగాఁగదా
మునుప నే నతనికి మొక్క వలసె
చనవు శ్రీవేంకటేశ్వరుఁడియ్యఁగాఁగదా
తనివొంది కలసి సంతములు గావలసె

రేకు: 1395-5 సాళంగ నాట సం: 23-569

పల్లవి: అతఁ డెంతవిలిసిన నలిగిరావు నీ
కతమున నింకేమి గాఁగలదో

చ. 1: చూచినట్టు రాదు సూనసాయకుని
రాచకార్య మిది రమణి
ఆచిలుకల గుబ్బుపుదళములు మించె
నేచె నిన్నిఁక నవి యేమనునో

చ. 2: తలఁచినట్టు రాదు తగ వసంతుని
బలమెంత గలదొ పడఁతి
నలువంకఁ గోవిల నల్లఁబనిగాదుసుమ్మీ
బలములు మోహరించెఁ బనిగాదుసుమ్మీ

చ. 3: కదిసినట్టు రాదుకడు శ్రీవేంకటేపతి
చిదుముగోరికొన చేకత్తుల
అదన నినుఁ గూడె అతనిబలముల
కెదిరి పలికితివి యిందాఁకాను

రేకు: 1395-6 రామక్రియ సం: 23-570

పల్లవి: ఎవ్వరంటాఁ జూచేవు యింతిని వోనాయకుండ
జవ్వని యారతిరాజసంపదే కాదా

చ. 1: చెలియచిత్తములోని చిత్తజునమ్ము లేకావా
చిలుకుఁజూపరలై చిమ్మిరేఁగెను
చలువైన నెమ్మోము చందురు వెన్నెలే కాదా
పలచనినవ్వులై పచ్చిదేరెవి

చ. 2: సతికొప్పు మేఘముజడివానలేకావా
మితిలేనిచెమటలై మేన నున్నవి
చతురై నడిమియాకసపు మెఱుఁగులేకావా
తతితో బంగారువన్నె తళుకు లివి

చ. 3: కుత్తికలో గోవిలకూఁతలు నేఁ డివె కావా
కొత్తయి నీకాఁగిటిలో గుమ్మరించేవి
హత్తినశ్రీవేంకటేశ అంగననీకూటములు
మొత్తమి వొంగేటిభావములసొంపుగాదా

రేకు: 1396-1 సామంతం సం: 23-571

పల్లవి: ఇతరులతరమా యింతేసి
అతిరాజసమున నీ వాడితిగాక

చ. 1: కల్లయు నిజమునుఁ గానక పతితో
నుల్లస మాడఁగ నుచితములా
బల్లిదురాలవు పట్టపుదేవివి
చెల్లుఁగనక అటుసేసితి నీవు

చ. 2: వెనకముందు భావించక నీపతి
పెనగొని యిటు గోపించితివి
వెనుకొని యీతనివిరహము నీపైఁ
జనవునుఁ గులుఁగఁగ జందములాయ

చ. 3: అకట నతమక మాఁపఁగ లేకే
మొకమోడక చెయి ముంచితివి
వెకలియైన శ్రీవేంకటేశ్వరుఁ
డొకటని కూడఁగ నొద్దికలాయ

రేకు: 1396-2 సాళంగం సం: 23-572

పల్లవి: కన్నవారెవ్వరు దీనిఁ గాంతలాల
యెన్నియైనా మీరిట్టె యేమఁటకుఁడీ

చ. 1: వొక్కటై నిలిచె మేన నొరసి వొరసి చన్ను
జక్కవల కిదెపుట్టె జగడములు
గక్కన నట్టనడుమ గడిదేరె నింతలోనె
యెక్కడెక్కడిపనులు యెటు వచ్చునో

చ. 2: కొమ్మ కనుగుండుమీలు కోరి బొమ్మలవిండ్లు
యెమ్మెలకు నిరుమేలా నేట్లాడీని
దిమ్మురేఁచే చెలికొప్పు దిక్కులు చీఁకటి సేసె
కమ్ముకొన్కన దెటువంటి కాలమహిమో

చ. 3: కంతునిబాణములై నకరపల్లవములకు
అంతరంగమ్మై పుట్టెననురాగము
యింతలో శ్రీవేంకటేశుఁడింతి నిట్టె కూడఁగాను
బంతినే తొల్లియు నేతపము సేసెనో

రేకు: 1396-3 గుండక్రియ సం: 23-573

పల్లవి: ఘనుఁడ నీకియ్యాట గలితేఁ జాలు తొల్లి
యెనసి పొందినసతు లెట్టుండి రేమీ

చ. 1: తరునితురుము నీకు దాగిలిముచ్చులాడ
నిరవాయ రమణుఁడ యిదివో నీకు
అరిదిఁ గుచుగిరులు అచ్చనగండ్లాడ
వొరసాయ నిదివో నీకున్నవేమీ నేల

చ. 2: వెలఁది మోము నీకు వెన్నెలపులుఁ గమాడ
నెలవాయ నింతలోనే నీకిదివో
చిలుపచెమటలెల్ల చిమ్మనగోవాటలాయె
యిలపై నెక్కడిసుద్దు లేమైనా నేమీ

చ. 3: కోమలికెమ్మోని నీకు గుజ్జనఁగూళ్లాయ
గామిడి శ్రీవేంకటేశు(శ?) కాఁగిటిలోనే
కామించువారినెల్లా గలసితి విట్లానే
నేమరు నెందరైన వేసటనీకేది

రేకు: 1396-4 ముఖారి సం: 23-574

పల్లవి: ఇపు డిన్నిటికి సై రించవలెఁగా
కపటా లిన్నియు మీఁదఁ గనుకొనేఁగాని

చ. 1: యేడ లేని మచ్చికల కింత చిక్కినవేళ
నాడ(డి?) నెట్టెల్లానే నాడవలెఁగా
వేడుకైతేఁ జాలుఁగాక విసుగనేఁటికి నే
సూడునట్టియ యప్పుడైనాఁ జూచుకొనేఁగాని

చ. 2: పంతపునాకోరికెలబారికిఁ జిక్కినవేళ
వింతలు నీవేమనిన వినవలెఁగా
మంతనాన నాతోడ మాటలకుఁ బనిలేదు
అంతయు నీరతివేళ నాడుకొనేఁగాని

చ. 3: చిత్తము నీకొప్పగించి చేతికిలోనైన వేళ
కొత్త నీచెఁ(చేఁ?) తల కియ్యకొనవలెఁగా
పొత్తులశ్రీవేంకటేశ పొందితివి చాలు నీ
తత్తరపులచ్చనల దాఁచుకొనేఁగాని

రేకు: 1396-5 భూపాలం సం: 23-575

పల్లవి: ఇప్పుడేమి దప్పిపోయ వింతలోనె
కప్పుక యాతఁడు నాపైఁ గరుణించీఁగాక

చ. 1: విడువనిపతిఁ బాసి విరహానఁ బొరలఁగ
పడఁతులిందరి కాడఁబట్టాయఁగా
యెడరైతి నొకవేళ యేమిసేయవచ్చు మాటఁ
బడవలెఁగాక ఇట్టె పదరనేలే

చ. 2: అలిగి యాతఁడు నేను నవ్వలిమోమైతే
పొలఁతులకును నవ్వఁబొద్దాయఁగా
తలము దప్పినవేళ దానికేమి గొరాయ
వలసినట్లయ్యీని వగవకువే

చ. 3: యెన్నికతో శ్రీవేంకటేశుఁడు గూడఁగ నన్ను
మున్నిటివారిసొంపు మూలఁబడెఁగా
అన్నువ నప్పటిచేఁత లట్లాయ నేఁ డిప్పు
డిన్నిటాఁ బంతము చెల్లె నీఁకనేఁటికే

రేకు: 1396-6 శంకరాభరణం సం: 23-576

పల్లవి: ఎప్పటికి విన్నపము ఇదియేసుమ్మీ
తప్పక నీవొడఁబాటు తరుణికి నీవు

చ. 1: వలపుచవులు చూపి ॥జేకొంటి వింక
తలఁపున వేరొండుఁ దలఁచుకుమీ
కలసి వుందువుగాని కడదఁకా నిట్లానే
చెలఁగి తియ్యనినోరఁ జేదు చవిగాదు

చ. 2: యిందరు నెఱఁగఁ జెలి నింతగా మన్నించితివి
కందులేనిచనవిచ్చి కరుణించుమీ
చందమున నాకెమాఁట జవదాటకుండవయ్యా
విందువెట్టిఁ బగ వద్దు వేడుకయ్యా నీఁకను

చ. 3: వూరకుండినరమణి నొక్క టొక్కటె చేసి
చేరి కూడితివి రతిఁ జెలగించుమీ
యీరీతి శ్రీవేంకటేశ యీబంగారుకొండ
గారబానఁ జేపట్టి కడమేల నీకు

రేకు: 1397-1 సామంతం సం: 23-577

పల్లవి: చెల్లఁబో తియ్యనినోరఁ జే దేలయ్యు
కల్లనిజములు నొక్కట నుండఁగా

చ. 1: మొదలఁ జెలియమీఁద మోహము చల్లినవాఁడ
విదివో కమ్మరఁ గాఁకలేల చల్లేవు
కదిసి కూటములు కపటము లొకచోటఁ
బొదలించితే కపటము లొకచోటఁ

చ. 2: ప్రేమపుటాసలు మతిఁ బెంచినవాఁడవు
యేమన్నా నూరకుండే విదేమయ్యా
తామసాలుఁ దత్తరాలుఁ దగులగట్టేనంటే
భూమిలోన నిటువంటిపొందు గలదా

చ. 3: కంచపుమోవిపొత్తు కలిగి కూడినవాఁడ
విచుకంత పరవళ మిదియేలయ్యా
సంచితవలపు జవ్వనాలు సరిగావా
యెంచఁగలశ్రీవేంకటేశ్వరుఁడా

రేకు: 1397-2 కాంబోది సం: 23-578

పల్లవి: నామేనే యెంతసేసె నాయెడకు
కామించి కడవారు గాఁబోయేరా

చ. 1: యెవ్వరి నేమనలేక ఇందరుఁ జూడఁగానే
జవ్వసభారముచేత జడియఁగానే
పువ్వకపూచినయట్టు పులకజొంపము మేనఁ
గువ్వనిపేరులవలె గుదిగోసీనే

చ. 2: ఇన్నియు నోరుచుకొని ఇంతుల దూరఁగలేక
కన్నులపెట్టె పొద్దు గడపఁగను
పున్నరీతినే వుండి వొట్టినచూపులు నాకు
పున్నమ వెన్నెల నీడై పొందు వచ్చినే

చ. 3: చక్కఁదనములన్నియుఁ జవిచేసుకొనీనే
చెక్కిటిచేతితోడఁ జింతించఁగా
యిక్కడనె శ్రీవేంకటేశుఁడు గూడఁగాను
మక్కున సరవశాన మఱపాయెనే

రేకు: 1397-3 ముఖారి సం: 23-579

పల్లవి: ఎన్నఁడును నిట్టివల పెఱఁగనమ్మ
తన్నుఁదానె పులకించి తనివందీని

చ. 1: పతిఁ జూచిచూచి తా పరవశమందె నీ
యతివ కన్నులనే మోహము చల్లీని
మతిలోనే కరఁగిని మలగుపై నొరగీని
రతులు దలఁచి నివ్వెరగువడీని

చ. 2: చిప్పిలుఁ బ్రియము లింతి చెలులతోఁ జెప్పీని
వుప్పతిల్లుఁగోరికలు నోలలాడీని
రెప్పలు ముయ్య నేరక రిచ్చవడి యిందరిలోఁ
జెప్పరాని కోరికలఁ జెంగలించీని

చ. 3: కమ్మరఁగమ్మరఁ దమకములెల్లఁ బెడరేఁచి
కొమ్మ దనయాసలెల్లఁ గుమ్మరించీని
సమ్మతై శ్రీవేంకటేశ్వరుఁడు గూడఁగ నిట్టె
చిమ్ముఁజెమటలచేత సేదదేరీని

రేకు: 1397-4 ఆహిరి సం: 23-580

పల్లవి: ఎంతేసి కాఁగలదో ఇన్నియును నిట్లాయ
యెంతవింతలు వొడమె నెదురెదురనె

చ. 1: పడఁతివేనలి జారి పగలు చీఁకట్లాయ
వొడలఁ బులకలు చుక్కలు రక పొడమె
తొడరి కనుబొమ్మలను ధూమకేతువు దోఁచె
పొడమెనుత్పాతములు పూటఁపూటఁకును

చ. 2: పరిగొనుచు విరహంపుపతిసూర్యుఁ డుదఇంచె
వొరిమఁ జెమటల జలధు లుప్పొంగెను
ఇరవైననిట్టూర్పు లేడుగాడ్పులు విసరె
పరగ విపరీతంబు పైపైనె మెరసె

చ. 3: జడిగొనుచు కుచగిరులు చంద్రశకలము లలరె
నగవులను నిచ్చపున్నమ లాయను
సొగిసి శ్రీవేంకటేశుఁడు చెలియఁగూడఁగా
పగలు రేయును నేరుపడదాయను

రేకు: 1397-5 ఆహిరినాట సం: 23-581

పల్లవి: రమణుఁడ నీమై రచన లివి
చెమటల చెలియకు చెలువాయ

చ. 1: తరుణికి నీపైఁ దప్పులు వెదకఁగ
సరసపుమాటలు చవులాయ
విరహపుఁదరుణికి వెన్నెలమోమే
పరితాపపువైభవ మాయె

చ. 2: సుదతి నిన్నుఁ గని సొలపులు సొలయఁగ
ముదితకు నవ్వులమోమాయ
కదలే తురుమునఁ గొంత నడవఁగా
కుదురుఁ గుచములకుఁ గులుకాయ

చ. 3: చెలి నిను గోళ్లఁ జెక్కు నొక్కఁగా
తెలి నునుమోవికిఁ దీపాయె
వెలఁది కిపుడు శ్రీవేంకటేశ్వరుండ
అలుకలు దీరఁగ ననువాయె

రేకు: 1397-6 కేదార గౌళ సం: 23-582

పల్లవి: ఏమిటికిఁ దలపోఁత యీస్సీ రోఁత
వేమారు ననలేను వెల్లవిరి నేను

చ. 1: చెంగావినీమోవిచెలువెల్లా దేవి దేవి
యెంగిలైనచీకాకు యేఁటికి నాకు
సంగతాయ నటు వోర సారె నేల నిన్నుదూర
యింగితపునీగుణాలు యెఱిఁగితిఁ జాలు

చ. 2: మొక్కేటిది యీమొక్కు మున్నీటిచెలులు పెక్కు
తొక్కితొక్కి కోపానఁ దోసిన వోల
యిక్కడఁ దలఁచరాదు యేమనినఁ గడువాదు
పెక్కుమాఁట లింకనేల పెనఁగేటివేళ

చ. 3: కాఁగిటినీకూటములు కన్న చోటివోటములు
తోఁగిననాతోడిపొందు దొరకు విందు
దాఁగక శ్రీవేంకటేశ తనువు లొక్కట రాసె
కాఁగినకాఁకలు దేరె కందువలు చేరె

రేకు: 1398-1 వరాళి సం: 23-583

పల్లవి: మాటలాడఁబోయి చెలి మందమిరియాలు చల్లె
నీటుగాదు మేటిగాదు నీకే పోదయ్యా

చ. 1: చూపులఁ గొసరబోయి సోయగాన జంకించె
కోపము నిలుపలేక కోమలి నిన్ను
కోపుల సవ్వఁగఁబో ఇ గుంపించె కాఁకలెల్ల
యీపడఁతి కన్నె ఇంతె యెగ్గునకువయ్యా

చ. 2: తగులనాడఁగబోయి తప్పులెంచీ నీమీఁద
అగడైన విరహాగ్ని నాఁపఁగలేక
మొగము చూడఁగబోయి మొక్కె నొకచేత నీకు
ఇగురుఁబోఁడిభావ మియ్యకొనవయ్యా

చ. 3: సరసమాఁడఁగఁబోయి సరుగ నీకాలు దొక్కె
ఇరవైన శ్రీవేంకటేశుఁడ నేఁడు
కరఁగి కూడఁగబోఇ కాఁగిటిలో నిన్ను మెచ్చె
తరుని ఇట్టె నీకుఁదగుఁగదవయ్యా

రేకు: 1398-2 ఆహిరి సం: 23-584

పల్లవి: ఆకెకును నీకుఁబాయనిచుట్టరికముగన
చేకొందు విప్పుడే విచ్చేయవయ్యా

చ. 1: ధరఁ గొలని తామరలు తమనుఁ డుదయంబైన
విరివిఁ జెఁగలించి వికసించును
తెరవముఖకమలమ్మైతే నీవు రాకుంటే
వెరవార నాయకుఁడ వికసించదు

చ. 2: సంతతముఁ గలువ లివి చందురుని రాకలకు
వింతగాఁ బై పై నే వికసించును
యింతియీకనుఁగన లివియ్యైతే నీవదన
కాంతిచంద్రుఁడు రాక కడువిరియవు

చ. 3: మినుకు మయూరములు మేఘోదయంబైన
తనయిచ్చ వేడుకల తగనాడును
యెనలేని శ్రీవేంకటేశ యిటువలె నేఁడు
వనితఁ గూడకయున్న వహికెక్కడు

రేకు: 1398-3 సామంతం సం: 23-585

పల్లవి: మరులు దెలివియు నాయ మాటలైన నాడరే
అరమోడ్పుఁ గన్నులనే లలసీఁ జెలియ

చ. 1: తరుణిమై చెమరించె తలఁపెందు నున్నదో
విరహపుఁజింతలలో వెదకీని
కురులెల్ల నెరివిచ్చె గుణ మెందు దాఁగెనో
పరవశములోఁ జిక్కి భావించీ నిదివో

చ. 2: చెక్కులెల్లఁ బులకించె చిత్తమేమిసేసెనో
మొక్కుల శిరసువంచి మొరసీని
ముక్కున నూర్పులు ముంచె ముందు నేమి గాఁగలదో
నీకుఁ గుచగిరులతో నిలువీఁదీ నదివో

చ. 3: సిగ్గులెల్ల నుడివోయ చేఁత లింక నేఁటివో
కగ్గని శ్రీవేంకటేశు కాఁగిటిలోన
అగ్గపువేడుక లబ్బె సంగనవోముఫలాన
తగ్గుమొగ్గులెల్లాఁదీరి తమకించీ నిదివో

రేకు: 1398-4 ముఖారి సం: 23-586

పల్లవి: ఎంతైన మాగుణాలు యిటువంటివేకాని
అంతటి నీఘనతే అది యెంచుకొమ్మీ

చ. 1: తలఁపు నిలువలేక తమకింతుఁగాని నాపైఁ
గలమోహ మెరుఁగుదు ఘనుఁడ నీవు
చెలులము గాన మాకుఁ జెల్లు నేమాటాడిన నీవు
నిలువుగంభీరుఁడవు నీకుఁ బోదుసుమ్మీ

చ. 2: సంగడి మచ్చరమున సారెఁ గోరుదుఁగాని
అంగపునీమన్నన నే నదెరుఁగుదు
కంగి చందచలాక్షులముగాను మాజాడలవింతే
వండడమైననీవరు నెంచుకొమ్మీ

చ. 3: చనవున బొమ్మలనేజంకించితిగాక నీ
వెలసినమహిమ నే నెరుఁగుదును
మనువై సరతుల సలయపుమామతి మిది
వోవరి శ్రీవేంకటేశ వొగిఁ దెలుసుకొమ్మీ

రేకు: 1398-5 దేశి సం: 23-587

పల్లవి: నేనింతగబ్బినైన నీకుఁ బోదుగా
నీనెలఁతనైనఁ గాన నీకుఁ బోదుగా

చ. 1: పెరిగి నాకుచములు పెద్దపెద్ద కొండలైనా
నెరసులేక సాధించ నీకుఁ బోదుగా
సిరులనా మోవి ఇది చిగురైనా చేవసేయ
నిరతి నోరమణుఁడ నీకుఁ బోదుగా

చ. 2: పలుద నాకురు లివి వంకరకొంకరలైనా
నిలిపి చిక్కుదియ్య నీకుఁ బోదుగా
నలువై నాకన్నులందు నల్లఁదెల గలిగిన
నెలకొని మెచ్చమెచ్చ నీకుఁ బోదుగా

చ. 3: గారవపుఁగాఁగిటను కాలు చేఇ దాఁకినాను
నేరమెల్ల మఱవక నీకుఁ బోదుగా
కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నామనసు
నీరైనఁ బాలైన నికుఁ బోదుగా

రేకు: 1398-6 శ్రీరాగం సం: 23-588

పల్లవి: చెప్పరాదు చూపరాదు చిగిరించీభావమెల్ల
తప్పునిజవ్వనపువసంతవేళోకాని

చ. 1: అతనిసుద్దులు వింటే అంగ్గమెల్లఁ జెమరించె
రతి నాచిత్తపుమోహరసమోకాని
తతిఁ జేరుకొంటేను తనువెల్లాఁ బులకించె
అతనుబాణములకు ఆయమోకాని

చ. 2: కందువలు దలఁచితే కన్నుల నీళ్లురాలీ
విందులయానందముల వెల్లులోకాని
చెఁదిన నీముద్దు చూచి జిగి గుండె జల్లురనీ
చందురువెన్నెలకుప్ప జారెనోకాని

చ. 3: శ్రీవేంకటేశు గూడి నెలవి నవ్వులు చిందె
చేవదేర నాలోనిసిగ్గులోకాని
నీని జారినంతలోనే నీకు సంతసము నిండె
యేవిధానఁ దానే చనవిచ్చెనోకాని

రేకు: 1399-1 సామంతం సం: 23-589

పల్లవి: అతనిగతు లొౌరుల కలవడునా
తతి నెటుచూచిన ధగధగమెరుపు

చ. 1: ముందర దెలియక మొదలు చేకొనక
గొొందినే కూరిమి గొొసరేవు
అదరివలెనా అతనిచిత్తము
యెందుచూచినా యింపులయెరపు

చ. 2: రెప్పల నవ్వక రేసుల భ్రమయక
తప్పులె యెన్నెదు తమకమున
చెప్పుదురతు లాచెలువ లతనికే
కుప్పులు దెప్పులు కోరిక కొొసరు

చ. 3: ఘూతలు దియ్యక కసరులు దుయ్యక
ఆతఁడిట్ల నీకలవడునా
శ్రీతరుణీపతి శ్రీవేంకటపతి
యేతెరు వేగిన యేనుగవీధి

రేకు: 1399-2 తెలుఁగుగాంబోది సం: 23-590

పల్లవి: సతిచక్కఁదన మెంతో సరసునిమోహమెంతో
చతురిక లిందరును సరిఁజూడరమ్మా

చ. 1: కాంతకన్నులు వ్రాసి కడలు వ్రాయఁగ రాక
చింతోడఁ దలవంచెఁ జెలివిభుఁడు
పంతపునడుము వ్రాసి బయలువ్రాయఁగ రాక
కొంతదడ వుస్సురనెఁ గోమలిప్రాణేశుఁడు

చ. 2: కలికికుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయఁదొడఁగెఁ బంతపునిభుఁడు
నలినాక్షిమోము వ్రాసి నవ్వులు వ్రాయఁగ రాక
నిలువున వెరగందె నెలఁత రమణుఁడు

చ. 3: వనితకాఁగిటఁ దన్ను వ్రాసి రతి వ్రాయలేక
తనువెల్ల మఱచెను తమకమున
వెనకముందర వ్రాసి వేడుక వ్రాయఁగ రాక
చినుకుఁజెమట వ్రాసె శ్రీవేంకటేశుఁడు

రేకు: 1399-3 వరాళి సం: 23-591

పల్లవి: పదరిన మాకాపని గాదు
ఇదియే విన్నప మింకొఁ జుమ్మీ

చ. 1: నిలువన నాతఁడు నినుఁగని నవ్విన
కెలసి బొమల జంకించితివి
చలమీడేరక నరికిసరాయను
కల దిఁక సంతముగావలెఁజుమ్మీ

చ. 2: ఆసల పతి నిన్నుఁడగ్గిఁ జెనకిన
వోసరి కుచముల నొరసితివి
తాసులవలె మీతమకుము లలరెను
యీసుల తెమరఁగింతేసుమ్మీ

చ. 3: ఘనుఁడగు శ్రీవేంకటపతి గూడఁగ
మనసున నిప్పుడె మఱచితవి
చనవులు మనవులు చందములాయను
వినయమే విభునికి వేడుకసుమ్మీ

రేకు: 1399-4 సౌరాష్ట్రం సం: 23-592

పల్లవి: అప్పటి మానవు నాపై నానవెట్టేవు
యెప్పటి నీగుణములు యెంధుఁ గొత్తలౌనా

చ. 1: నిన్నటివునుకుల నీజాడలెల్లఁ గంటిమి
అన్నియు నాతో నీ వాడవలెనా
యెన్నరానిబాసలెల్ల యేల మనఇద్దరిలో
సన్నకు సన్నలే చాలుచాలు నుండరా

చ. 2: అటువంటివాఁడవని అంటినా నిన్నేమైనా
కటకట ఇంతకెల్లఁ గలనా నేను
కిటుకుఁగూటమికంటె కిందటి మనపొందు
లటు దలఁచుకొనుట అదియే మేలు

చ. 3: యింతలోనే యేమిదప్పె యెట్లైన నేమాయ
ఇంత నన్ను బుజ్జగించే విది వేలెనా
చెంతలఁ గూడితి నన్ను శ్రీవేంకటేశ్వర
యింతి నింతే నీకు నే నెదురాడేనా

రేకు: 1399-5 ముఖారి సం: 23-593

పల్లవి: విరిగినట్టిబండివారే వెట్టివారుగాక నీవు
యెరవు సతము సేసుకొంటి నేమి సేతువే

చ. 1: సొలిఁతి నీవు అతనిఁ బలువంబోఁ ఇనట్టిపొద్దు లేడ
నిలువుఁజెమటతోడియలపు నీకిదేడదే
వెలుఁగు చేను మేసినట్టివిధము దోఁచె నీ యందు
అలసిసొలసి నిన్ను నీఁక నాడనేఁటికే

చ. 2: యింతి నేను విరహమునను యెదురు చూచుటేడ; నీవు
వింతపులకగముల విట్టివీఁగు టేఁటిదే
కంతుసంచకారులోనె కల్ల దోఁచె నీయందు
మంతనమున నీతోడిమాట లేఁటిదే

చ. 3: వనిత శ్రీవేంకటేశ్వరుఁడు దానే నన్నుఁ గూడె
చనవిమనవి నితనితోడి సన్నలేఁటికే
తనరి వీఁపు గానరాఁగ దాఁగినట్టి చందమాయ
వెనక నాకుఁ బ్రియము చెప్పి వేఁడనేఁటికే

రేకు: 1399-6 ఘంటారవం సం: 23-594

పల్లవి: ఇప్పటిగతి యిదె యెంచినను
కప్పినభ్రమయో కరుణో యెఱఁగ

చ. 1: తలఁపున నాపతిఁ దలఁచినంతలో
నెలకొని ముందట నిలిచె నిదె
కలసినట్లనే కమ్మరఁ దోఁచీ
కలయో నిజమో కపటమో యెఱఁగ

చ. 2: అడుగిడీనే నేఁ డలిగిననాఁడే
బడివాయనిపతిభావ మిదే
అడియాలంబులు అవెయివె నాపై
తడయనితగులో తమకమో యెఱఁగ

చ. 3: గక్కన శ్రీవేంకటపతి నాకును
నిక్కపుఁగూటమి నెంపె నిదే
యిక్కువ లివివో ఇందాఁకానే
యెక్కడ నేమో యేదియు నెఱఁగ

రేకు: 1400-1 లలిత సం: 23-595

పల్లవి: అపుడే నీకు లోనైతి నిదే నీ
రపమిఁక నాబీరము చెల్లీనా

చ. 1: తేటలమాటలఁ ద్రిపురాంగనలను
కూటువఁ గూడినకొనబలిమి
పాటైరుకుమిణి బలిమినె తెచ్చితి
గాఁటపునిను నేఁ గాదనఁగలనా

చ. 2: తిరముగ మందలఁదిరి గెడిమగువల
వెరవునఁ గూడినవిటుఁడవు
అరిదిఁ బదార్వేలతివల నేలిన
దొరవిటు చెనకినఁ దోయఁగఁగలనా

చ. 3: చలిమిని బలిమిని జలధికన్యనుఁ
గలసిన శ్రీవేంకటపతివి
మలసి నీవు నన్ను మన్ననఁ గూడితి
వెలమి నగించే వింతకుఁ గలనా

రేకు: 1400-2 శంకరాభరణం సం: 23-596

పల్లవి: వాసియు వన్నెయుఁగలవనిత నేను, నీవు
వెసర వెందురునైనా వెరతు నే నిందుకు

చ. 1: వొద్దువొద్దు వాదులేల వుమ్మడినే వుండనీరా
కొద్దిమీరి బడలించుకొననేంటికి
కద్దు నీకు నలవాటు కడు శిశుపాలునిచే
నద్దలింపులఁ బడితి వంతకు నే నోపను

చ. 2: పట్టఁబట్టకురా నిన్ను బలిమి నంతేసి నేఁడు
గుట్టున నుండరా నీవు గొంత యేఁచక
యిట్టునట్టు వెన్నలకు నిండ్లిండ్లెల్లా దూరి
కట్టువడితి రోలఁ గలమా నే మెందును

చ. 3: పోకుపోకు మంత నీవు పొందితి శ్రీవేంకటేశ
చేకొని పెదమనసుచేతవాఁడవు
కాకరివై యనసూయ కడరుబాలుఁడవైతి
నీకు నిది మెచ్చుగాక నెరి మాకుఁ దగునా

రేకు: 1400-3 తెలుఁగుగాంబోది సం: 23-597

పల్లవి: ఇన్నియుఁగూడెమ యింతికిని
నిన్నటి మాఁటలు నిజపొంతువులు

చ. 1: పులకల మొలకలవున్న మనాఁడే
తలిరుఁబోఁడికినిఁ దలఁబాలు
సొలపులనగవుల సోమవారమునఁ
గలయురతుల కంకణదారములు

చ. 2: ననుపుగ చిత్తానక్షత్రంబున
వినుకలిఁ బెట్టినవీడెములు
పనివడి చెలి సౌభాగ్యయోగమున
కొనచూపులకొంగుముడిసిరులు

చ. 3: మిక్కిలికూటవుమిథునలగ్నమున
తొక్కేటిపాదపుదోమట్లు
గక్కన శ్రీవేంకటపతిచెనకులు
వొక్కట నెదరినవుంకువలు

రేకు: 1400-4 శంకరాభరణం సం: 23-598

పల్లవి: ఉనిద విరహమున నొ౦గిపడె మన
కివల నీకెతో నిది యేపాటు

చ. 1: చిత్తము చెదర౦గ చెంత పూవుల
నెత్తులుగట్టీని లేమ
యిత్తలనత్తల నెడనెడ దండలు
గుత్తము రారో కొమ్మకు౦దాడు

చ. 2: పాసి విభునితో బాదంబున భువి
వ్రాసె౦ జిత్తరువు వగ౦ దరుణి
యీసతిచెలులము యింక వేమైనా౦
జేసినచే౦త చేయకపోదు

చ. 3: గాదిలి శ్రీవేంకట౦తి కాంగిట
సేదుదేరము చెలియకును
మోద మిప్పుడుగా మొనకొనె మనకును
యేదెస నుంటిమి యిందా౦కాను

రేకు: 1400-5 సాళంగ నాట సం: 23-599

పల్లవి: ఆతఁడు మొదలనే యనంగుఁడూ
రతివసంత మిటు రాదు గదా

చ. 1: కోమలిశిరసునఁ గూడెను యిప్పుడు
యేమిగారణముననో యీయలులు
ఆమనికుచముల నలబడి పుట్టెను
కామునిక వగతి గాదు గదా

చ. 2: యితలఁ జెలిమో మింతయుఁ గైకొనె
కొత్తగ నయనచకోరములు
కుత్తికకోవిలకూఁతలు రేఁగెను
చిత్తజబలి మిటుచెడదుగదా

చ. 3: కొమ్మజన్వనము కొల్లలు చేరెను
కమ్మర శ్రీవేంకటపతికి
నెమ్మది నెంతయు నిలిపె నీతఁడే
యిమ్మడి మరుఁడయి యేఁచఁగదా

రేకు: 1400-6 ఆహిరినాట సం: 23-600

పల్లవి: ఇద్దరిజాణతనము లెటువంటివే యిందు
వొద్దనున్న చెలులాల వోటవంత మేది

చ. 1: హత్తినసతియుఁ బతి యలిగి మాఁటాడమని
వొత్తి యానవెట్టుకొని రొకరొకరు
మొత్తమి నాకె దనకు మొక్కి నభావ మతఁడు
చిత్తరువులో వా(వ్రా?) సిన చెలిఁ జూచి నగెను

చ. 2: బలిమి నొకరొకరిఁ బట్టమని పంతమాడి
చలపట్టి మారుమంచము లెక్కిరి
నిలువుటద్దములోని నెలఁత నీడరూపు
చెలువుఁడు దగ్గరించినఁ జెలి నగెను

చ. 3: అంగనము శ్రీవేంకటాధిపుఁడు నధరము
యెంగిలి నియ్యమని యెన్నికఁ గూడి
ముంగిటి కెంపులు పంటిమొనలనే మోవిమీఁదఁ
జెంగట నించినఁ బతి చెలిఁ జూచి నగెను

రేకు: 1401-1 ఆహిరి సం: 24-001

పల్లవి: ఇద్దరిగుణంబు లివి ఇంతులాల
చద్దికిని వేఁడికిని సంగడించీని

చ. 1: వొలసి సూర్యునిలోన నుండేటియలవాటు
గలదుగన విరహాగ్నిఁ గలఁగఁ డతఁడు
పొలిఁతిదేహము మొదలఁ బూఁదీగెగనక ఇదె
వలరాచకాఁకచే వాడఁబారీని

చ. 2: సరిలేని పంచశరగురుఁడుగన పైకొన్న-
విరిబాణములకెల్ల వెఱవఁ డతఁడు
గరిమ నీచెలిమనసు గంటిలేనిదిగనక
వరుస లోలో మెఱుఁగువలెనె దాఁగీని

చ. 3: శ్రీవేంకటాద్రిపైఁ జెలఁగుదేవుఁడుగనక
యీవనిత కుచగిరుల నిటు మరిగెను
యేవంక నీచెలియ ఇందుకే కోరెఁగన
భావమున సంతసము పచ్చిదేరీని

రేకు: 1401-2 ముఖారి సం: 24-002

పల్లవి: ఎంత గబ్బితనమే నీకింతటిలోనే తొల్లె
యింత నీ కుపదేశ మిచ్చినదె కదరా

చ. 1: పడఁతి నాపేరు నీవు పాదమున వ్రాతురటె
అడియాలముగ నింతె అందుకేమిరా
వొడికములైతే నీవురమున వాయరాదా
యెడ చాల దందుఁ గుచా లిమ్ముకొనెఁగదరా

చ. 2: నీలపు బెండెములోన వీడ భావింతురటే
తాలిమి నా ప్రియమింతె దానికేమిరా
అలాగైతే నాయద్దపు జెక్కులు గావా
చాలుకొన్నకళ లందే సందుకొనీఁగదరా

చ. 3: కూరిమి నాచెక్కు కొనగోర నంటుదురటే
ఆరసి కూడితివి నన్నందుకేమిరా
యీరీతి శ్రీవేంకటేశుడ నేఁ గాదా
తేరకొన విన్నియు నీ తేకువ గా దటరా

రేకు: 1401-3 గుండక్రియ సం: 24-003

పల్లవి: నే నెఱఁగనా వోరి నీ మహిమ
కానవా యిన్నిటాఁ బాలు కడుఁదెల్లనౌట

చ. 1: ఇంతలో నాతో నీవేడలేనిబీరాలు
కొంత గొంత వాఁడిసేసి కుమ్మరించేవు
యింతటివాఁడవు నీ విటుగాకుండితే భూమి-
నింతటాను ముంటికొన కింతవాడి గలదా

చ. 2: కానీ కానిమ్మని కమ్మరఁగ్రమ్మర దూరి
పానిపట్టుక నన్నుఁ బగచాటేవు
యేనెలవున నీకు యింతిసత్తి లేకుండితే
మానిపై నిమ్మపండు మరియేల పులిపె

చ. 3: నీవిట్టె నన్నుఁగూడి నివ్వెరగైన నా-
భావమిదేమని పలికేవు
శ్రీవేంకటేశ నీచేతే కాకుండితే
మోవితేనెకు గంటి మొదలఁ గలిగెనా

రేకు: 1401-4 రామక్రియ సం: 24-004

పల్లవి: అంత సిగ్గువడకువే అతివ నీవు
పంతమునఁ దెలియవే పాయమెల్ల గడువు

చ. 1: గొంది నొక్కసింహమట కొండలు మోచినదట
ఇందుముఖులనడుమె యిరవట
కందువ యీ పొడుపుడుఁగత యిది నీవు నాకు
అందముగ నానతీవే ఆరునెల్ల గడువు

చ. 2: మొగి నొక్కక తామరలో మోవిపండు పండెనట
జిగిఁదేనె వావాతఁ జిందెనట
మగువ యీయారచి మతి నీవు దెలియవే
తొగరు నీపలుకుల తుదదాకా గడువు

చ. 3: కంతునిగురుతు రెండుగంబములమేడట
దొంతివలపులసిరి దొలఁకునట
ఇంతి నేను శ్రీవేంకటేశుడ యీకత
మంతనాన నిన్నుఁ గూడి మరపించేగడువు

రేకు: 1401-5 ఆహిరి సం: 24-005

పల్లవి: ఈరీతివలపు లొకటి కినుమడాయ విభుడ
కోరికలు కోటానఁగోటి సతికాయ

చ. 1: సుదతి నీరాక కెదురుచుచేటియాసలను
కదిసి నగుమోమెల్లఁగన్నులాయె
యిదె నీకడకు నాకె యేతెంచుఁ దమకమున
అదన మునిముంగిలెల్ల నడుగులే యాయ

చ. 2: వెలది నీసుద్దెల్ల వినియేటివేడుకల
వెలలేనిపులకలే వీనులాయె
పలుమారు నీతోడఁ బలికేటికాంక్షలను
నిలువెల్ల నంగనకు నివ్వెరగులాయ

చ. 3: కమలముఖి నీరతులఁ గలయునిబ్బరమునను
కొమరైన చన్నుగవ కొండలాయ
చెమటచే నిద్దరికి శ్రీవేంకటేశ్వరుడ
తమకములు తనువులును తడబాటులాయె

రేకు: 1401-6 సామంతం సం: 24-006

పల్లవి: చెలులాల వూహించి చెప్పరమ్మ
నిలువెల్ల మురిపెమే నిండకుండీనా

చ. 1: అంగన విభువి జూచి అరనవ్వు నవ్వె నిట్టె
యింగితానఁ గడమ నవ్వెందు దాచెనే
అంగమెల్ల మెఱుగులే అందు దాఁచ నిమ్ములేదు
వుంగిటి గనుగొనల నుండకుండీనా

చ. 2: జలజాక్షి పతిఁ జూచి సగము మాటలఁ దిట్టె
యెలమిఁ గడమదొడ మెందు దాఁచెనే
తలఁపెల్ల దమకమే దాఁచ జోటు లేదెందు
పలుకుఁబంతములోనె పైకొనకుండీనా

చ. 3: కోమలి శ్రీవేంకటేశుఁ గూడి పరవశమందె
యేమరి కోరికలెల్ల నెందు దాఁచెనే
ప్రేమలెల్ల పెనవులే పిరిదియ్యఁ జోటులేదు
దోమటి రతులలోనే తోచకుండీనా

రేకు: 1402-1 దేసాళం సం: 24-007

పల్లవి: అన్నియు నీయందే అమరెనట
కన్నియ ఇందుకు మారుగత చెప్పవే

చ. 1: కలువలు వికసింపఁ గమలములై తోఁచె
గలికి విన్నిట నీకత చెప్పవే
అలులంటా బడిఁబోతే అన్నియు నీలములాయ
కలగాదు ఇది యొక్కకత చెప్పవే

చ. 2: జక్కవలు గండుమీది సరిఁ బైడికుండలాయ
గక్కన విచారించి కత చెప్పవే
మక్కువతో బులినాలు మదనచక్రములాయ
కక్కసము మాని నాకీకత చెప్పవే

చ. 3: ఆకసము చూడజూడ నదె సింహమాయ నట
కాకుగాదు ది యొక్కకత చెప్పవే
యీకడను శ్రీవేంకటేశుఁడను నే నిన్ను
పై కొన్న దిది యొక్కకత చెప్పవే

రేకు: 1402-2 మాళవి సం: 24-008

పల్లవి: పొలిఁతి జవ్వనమునఁ బూవక పూచె
యెలమి నిందుకు మనమేమి సేసేదే

చ. 1: సతి చింతాలతలలో సంపెంగపూవులు పూచె
మతివిరహపుమేన మల్లెలు పూచె
అతనునితలపోఁత నడవిజాజులు పూచె
హితవు తెలియ దిఁక నేమిసేసేదే

చ. 2: తొయ్యలిచెమటనీట దొంతిదామెరలు పూచె
కొయ్యచూపుఁగోపముల గుంకుమ పూచె
కయ్యపువలపులఁ జీఁకటిమాకులు పూచె
నియ్యెడఁ జెలియభావ మేమిసేసేది

చ. 3: మగువరతులలోన మంకెనపువ్వులు పూచె
మొగిఁ గొనగోళ్లనే మొగలి పూచె
పొగరు శ్రీవేంకటేశుపొందులఁ గప్రము పూచె
ఇగురుఁబోండ్ల మిక నేమసేసేదే

రేకు: 1402-3 ఆహిరి సం: 24-009

పల్లవి: కాంతయేమీ నెఱఁగదుగాని
చెంతల నీగతి చెప్పరే చెలులు

చ. 1: చిత్తజు నమ్ములు శిరసున ముడవఁగ
గెత్తుకెట్ల దాఁకెనో గాని
గుత్తపుఁజెక్కుల కుంకుమచెమటలు
జొత్తులు గారీఁ జూడరే చెలులు

చ. 2: చలువమేనిపై సరులహారములు
చెలఁగిఁ నాని మొలచెనో కాని
పులకల మొలకలఁ బొదలినపయిరులు
వెలసె నిదివో భావించరె చెలులు

చ. 3: ఘనుఁడగు శ్రీ వేంకటపతి గూడఁగ
చెనకి గుఱుతు సేసెనోకాని
వెనకముందరల వింతలు వొడమెను
కనుగొనరే యిది గక్కన జెలులు

రేకు: 1402-4 ముఖారి సం: 24-010

పల్లవి: నగవింతే యేమనినా నాకు బోఁపునా
మొగమేడ అద్దమేడ ముచ్చటలుగావా

చ. 1: మగువ నాతోఁ నలిగి మారుమంచ మెక్కినాను
తగిలి నామన సందు దగ్గరిరాదా
తగులుగలచోటికి దవ్వేమి చేరువేమి
మొగులేడ నీరేడ మొత్తమై తిరుగవా

చ. 2: పైపై నాచేత నన్ను బట్టనీక తోసినాను
చూపులైన నిన్ను నవి చుట్టుకొనవా
పాపరాదు పాలుగలపాయపువారిపొందు
తీపు లేడ పూవులేడ తేనెలై కురియవా

చ. 3: చాయపాట్టే నన్ను గూడి సరిమేను మఱచితే-
నేయెడ నారతిచేత లెచ్చరించవా
పాయరాదు శ్రీవేంకటపతినైననన్నును
రేయేడ పగలేడ రిచ్చల బైకొనవా

రేకు: 1402-5 ఆహిరి సం: 24-011

పల్లవి: నాకెట్ల దెలుసు నిన్ను నమ్మఁగలదానఁగాక
యీకడాకడ నీయిత వెట్లున్నదో

చ. 1: శిరసువంచక లేమసిగ్గే నిను@ జూచి నవ్వె
అరియ నీవాకె కేమౌదువోకాని
వొరసి నాపై నీవు వద్దనుందు వింతేకాక
యిరవై యెఱఁగకుండ యేమిసేతువో

చ. 2: మచ్చిక నొకవనిత మాట దగులఁగ నాడె
యిచ్చుట నీకును నాకె కేపొందులో
వచ్చి నాయెదుట ముగుదవలె నుందు వింతేకాక
యెచ్చుట నెవ్వరియిండ్ల కేఁగుదువో నీవు

చ. 3: నిక్కుచు నొకసతి నీకాలు దొక్కెనిదె
యెక్కడ మీయిద్దరిలో నేపంతమో
యిక్కువ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెక్కువ నీతను వెట్ల నెందెందు మోచెనో

రేకు: 1402-6 దేవగాంధారి సం: 24-012

పల్లవి: నవ్వకురా నీ నటనలను నీ-
జవ్వన మందే చక్కనయ్యీఁగాని

చ. 1: మఱవకురా నీమాటలు యీ-
జఱపులలోనే సరిచూపేను
వొఱగకురా సారె వొఱపులను తెర-
మఱఁగుల మొఱఁగుల మంచిదయ్యీఁగాని

చ. 2: చిమ్మకురా చూపు చివుకనను నీ-
దిమ్ముఁగాఁకలనే తెలిపేను
కమ్మకురా నీగర్వము యివి
కమ్మర నీరతిఁ గందముగాని

చ. 3: బిగియకురా కడుఁబ్రియమునను యీ-
బిగువుఁగాగిటనే పెనచేను
తగు శ్రీవేంకటధరణీశ నన్ను
మిగులఁ గూడితి విది మెచ్చేఁగాని

రేకు: 1403-1 శ్రీరాగం సం: 24-013

పల్లవి: సూడగదవమ్మ సాక్కి యేల తంగీ
జేడుఁగోనేటిసెలమకరతను

చ. 1: కూపెట్టుసదువులకొనలపేరిటివాడు
పూపకొడుకు గని బూము లేలేటివాడు
సాపనీటికిందిపతి సంకబెట్టుక
తీపులు తిరుమలదేవరైనాఁడే

చ. 2: పుల్ల వెలుగులోనిబోనపుతరివాడు
తెల్లనిమెఱుఁగుల తెరలఁ దేలేటివాడు
గుల్ల సేతఁబట్టి కొండపై నిలుసుండి
పల్లెవాటువేసి వరము లిచ్చెను

చ. 3: సీఁకటిమ్మైవాఁడు సీలపలపువాఁడు
ఆకుదండలే తలనటుమోసినాడు
దీకొని పాముపై తేలి వుండినవాఁడు
యీాకడ శ్రీవేంకటేశు డైనాఁడె

రేకు: 1403-2 ముఖారి సం: 24-014

పల్లవి: చెక్కిటిచే యిదియేల చింతయేల
చక్కనయ్యా నిన్నియును చాలుఁజాలు నుండరా

చ. 1: మేరతో నాయాసలకు మితిలేదు తతిలేదు
వోరి నీమాటల కెందు నూరటలేదు
దూరలేను నే నిన్ను తొరలింపువినయాలు
సారె నీవుఁ జేయలేవు చాలుఁజాలు నుండరా

చ. 2: దోమటినాచూపులకుఁ దుదమొదలును లేదు
గామిడినీచేఁతలకు గడ లేదు
వేమారు నిన్ను నిక వేసరించలేను నాతో
సామునేయలేవు నీవు చాలుజాలు నుండరా

చ. 3: మమత నాకాఁగిటికి మట్టులేదు గుట్టులేదు
తమకపునీమతికిఁ దనివి లేదు
చెమరించె మేనెల్లా శ్రీవేంకటేశ యిది
సమరతులాయ నింక చాలుఁజాలు నుండరా

రేకు: 1403-3 ఆహిరి సం: 24-015

పల్లవి: అందరికి నావంటిఆసే కాదా
యిందుకేల వెఱవు నీ వెదురేఁగవయ్యా

చ. 1: మగిడి మగిడి చూచి మాటలాడ నూఁకించి
చిగురుఁబెదవి వంచి సిగ్గువడీని
మగుల నొయ్యనే చేరి మంతనాన బుజ్జగించి
పగడవాతెర నొక్కి పరికించవయ్యా

చ. 2: పొలసి పొలసి ఇంతి బొమ్మముడి వచరించి
మలసి పయ్యదకొంగు మాఁటుసేసీని
నెలకొన్న తొల్లింటినీయా కెయొడఁబాటు
సలిగెతోఁ జెల్లించి చనవియ్యవయ్యా

చ. 3: ఇక్కువల నాకె నిన్ను నెలఇంచఁగానే నన్ను
మక్కువచేఁతల నిట్టె మన్నించితివి
గక్కన శ్రీవేంకటేశ కపటము లిఁక మాని
అక్కరదీరఁగ నాకె నాదరించవయ్యా

రేకు: 1403-4 రామక్రియ సం: 24-016

పల్లవి: నాకు నివియే నవ్వులూః వీరు
దాకొని కదిసినదవ్వులూ

చ. 1: మానవయ్య నీమాటలూ యేల
తేనెలో నివే తేటలూ
నేనెఱిఁగినవె నీచేఁతలూ భువి
మోనములలోని మోఁతలూ

చ. 2: చాలుఁజాలు నీసన్నలూః కడు
పోలఁజూచినపొన్నలూ
సోలి మును నేజూచినవే నేఁ-
డీలాగై కడునేఁచీ నివె

చ. 3: చెల్లవిక నేల సిగ్గులూ నేడు
మొల్లపులకలే ముగ్గులూ
వెల్లవిరి శ్రీవేంకటేశ మన-
చల్లుఁగూటమే సంకెసేసె

రేకు: 1403-5 శంకరాభరణం సం: 24-017

పల్లవి: నెమ్మది నున్నాఁడ విదె నీకేమయ్యె మంచి
నెమ్మిపం డారగించేవు నీకేమయ్యా

చ. 1: నీలీల నీళ్లపై తేట నీకేమయ్యాః యీ-
నేలకింద నుండితివి నీకేమయ్యా
యేల నిన్ను మరుతాప మేమిసేసినిః నీ-
నీలిమేను కందులేదు నీకేమయ్యా

చ. 2: నిక్కము బొంకుసేసేవు నీకేమయ్యా యిట్టె
నిక్కిచూచి దాగేవు నీకేమయ్యా
యెక్కడిమోహములు నీకేమియు నేల
నిక్కు సగ్గు లెఱగవు నీకేమయ్యా

చ. 3: నిద్దుర గంటఁబెట్టవు నీకేమయ్యాః వట్టి
నిద్దురేల పాయ్యేవు నీకేమయ్యా
గద్దరి శ్రీతిరువేంకటవిభుడః నన్ను
నిద్దపుఁగాఁగిట గూడి నీకేమయ్యా

రేకు: 1403-6 సాళంగనాట సం: 24-018

పల్లవి: కాయముఁ బ్రాయముఁ బో కలిగినది
యేయెడ నాతఁడు నీవు నెంచినను

చ. 1: చెక్కిటి చేతితోడ సిగ్గువడే విదియేమే
చొక్కపు విభుఁడు నిన్నుఁ జూచెనంటాను
వొక్కనిమిషములోనే ను(వు?) డివోవు నివియెల్ల
గక్కన నాతఁడు నిన్నుఁ గదిసినను

చ. 2: మంతనాన మాఁటకు మాఁటాడ విదియేమే
పంతపువిభుఁడు నీతోఁ బలుకఁగాను
యింతలోనే యనుమాన మిఁకనేల తగులాయ
చెంతల నాతఁడు నిన్నుఁ జెనకఁగను

చ. 3: చెలరేఁగే విదియేమే శ్రీవేంకటేశుడు
యెలమిఁ గూడి చన విచ్చెనంటాను
తొలుత నే నిందుకే పో తొడఁగి చెప్పినదెల్లా
మెలుపున నీడేరె మీకిఁకను

రేకు: 1404-1 శంకరాభరణం సం: 24-019

పల్లవి: అతివ యేగతినైనా నలసినాను
యితవై కొన్నిటికైనా యింపాయఁగా

చ. 1: మేఁ(మెం?)డైన విరహాన మెలుత కన్నులనీరు
నిండుగొలఁకులై నిగుడఁగాను
గండు మీలకైనాఁ గడు నందులోనుండి-
నొండొకటికిని దా నొకమన సవుగా

చ. 2: పరిపరివిధములఁ బానుపుపైఁ బొరలఁగా
శిరసుతురుము వీడి చెదరఁగను
నిరతి నలులకైనా నెలఁతమైవాసన
సరుసఁ గైకొనఁగ ముచ్చట దీరెఁగా

చ. 3: కడుఁగడుఁదమకాన కదిసి యింతలోనె
పడఁతి శ్రీవేంకటపతిఁ గూడఁగా
జడియుఁ బరవశాన సారెసారెకు మేన
యెడలేని పులకల కిరవాయఁగా

రేకు: 1404-2 ముఖారి సం: 24-020

పల్లవి: ఇది ఇట్లనౌత నే నెఱఁగ గాక
తుదిముట్ట నప్పుడే తోవ గనుకొననా

చ. 1: సొగసి నా కడియాస చూపేరుగాక నను఼
దగిలి నిక్కము నతడు దాఁ దలఁచెనా
మిగుల మీమాట నమ్మితిఁగాక ఇంతలో
మగుడ నే నొకతెగువ మది నెంచుకొననా

చ. 2: యెడమాటలోననే యేమితమకమోకాక
వెడఁగుబతి విచ్చేయ వేళలేదా
బడలితిరి చాలు నిఁక బట్టుకున్నప్పుడే
అడరి నాలో వలపనట్లనే కానా

చ. 3: చెలఁగి నామనసుఁ దెలిసితిరి మీ రిటుగాక
సొలసి శ్రీవేంకటేశుడు మానునా
చెలులాల మీపలుకు చెల్లె నే మిద్దరముఁ
గలసితిమి యిట్లైతే గలకలన నగనా

రేకు: 1404-3 గుజరి సం: 24-021

పల్లవి: చూడఁజూడ నిది వట్టి జోలి గాక, నీ-
జాడ లివి మంచివైతే సమ్మతులుగావా

చ. 1: లాగుల నింతటనుఁ దెల్లనివెల్లాఁ బాలైతే
యేగతి భూమిలో నే మేమి గాదు
ఆగతినే పెట్టుకొన్న ఆనలే నిజమైతే
వేగుదాఁకా మరునికి వేదములై యుండవా

చ. 2: సారెకు దిక్కులనుఁ బచ్చనిదెల్లాఁ బైఁడౌతే
కోరి యవి యెంత సేసుకొనరాదు
కూరిమితో నీవొళ్లిగుణములే చక్కనైతే
సారపువలపులకు సాకిరులై వుండవా

చ. 3: పొందినకాఁగిటిలోనిపులకలే పూవులైతే
చెందిన శ్రీవేంకటేశ చెప్పరాదు
కుందణపుఁగుత్తికలో కునుకునే కతలైతే
పందెపురతులకివి పచ్చియై నిలువవా

రేకు: 1404-4 శ్రీరాగం సం: 24-022

పల్లవి: ఎట్టయిన నేమి నీవు యేమన్న నేమి నీవు
యిట్టె లోనయ్యేవు యింత చాలదా

చ. 1: కొమ్మ నీచే నాతఁ డంత కోపానఁ బడేనేమి
తమ్మిపువ్వు వాటు నొవ్వఁదాకిననేమి
అమ్మ నీ వవ్వలిమొగమైనా నాతనికేమి
ఇమ్ముల యెదుట నున్నాఁ డింతచాలదా

చ. 2: మగువ నీ కతనితో మాడాడకున్న నేమి
నొగిలి యాతఁడు నీచే నొచ్చిన నేమి
మొగమీక నీవెంత మోవఁగ నాడిననేమి
నగకున్నఁ గన్నులనే నవ్వు చాలదా

చ. 3: ఆది గొని నీ వతని కడ్డము లాడిననేమి
వేదనల నిప్పుడెంత వేఁచిన నేమి
ఆదరించే వేంకటేశుఁ డలమేలుమంగనాచా-
రీదెసఁ బిలువుమనీ నింతచాలదా

రేకు: 1404-5 శంకరాభరణం సం: 24-023

పల్లవి: ఇప్పుడే విచారించుకో యింతయు నీవు
అప్పుడు నాతో నౌఁగా దనరాదు నీకు

చ. 1: యిందరివలెనే నీవిప్పటికిఁ గూడి నన్ను
సందడిఁ బెట్టేనంటే సమ్మతించ రా
పందెమాడినట్లనే పదియుఁ బదియుగా, నా-
కందువనే వుండవలె కలకాలము

చ. 2: తక్కులుఁ దెక్కులు నాడి తగులఁ దీసుక నా-
యిక్కువలంట(టే?) నంటే నియ్యకొన రా
వొక్కటినొక్కటి నా వొడఁబాటు నాకంటే
మక్కువ నితరులను మన్నించరాదు

చ. 3: యీయెడనే శ్రీవేంకటేశ నాకు దక్కితివి
నీయింతులు వరుసంటే నే నియ్యరా
యేయెడ బలుకుబంత మేకముగ నా కాగిట
రేయుఁబగలు బాయక రిచ్చవడవలెనా (రా?)

రేకు: 1404-6 శ్రీరాగం సం: 24-024

పల్లవి: ఎఱిఁగించవలయు నిప్పుడిపుడే నీ-
కఱకఱి నిన్నియుఁ గసరకుమీ

చ. 1: చెలి నీపతిపై చిందులపాటలు
పలుమఱు నీలోఁ బాడగను
అలులివి విని తానటుఁ దమపిల్లల
పిలుపని మూఁగిన బెదరకుమీ

చ. 2: అందపునడపుల నటునీపలికెదు-
రిందువదన నీవేఁగగను
కందువనంచలు గతియిది దమదని
సందడిసేసిన జడియకుమీ

చ. 3: వోడక శ్రీవేంకటోత్తముకాఁగిట
మేడెపుఁగుచములు మెరయఁగను
యీడను జక్కవలివి తమజాతని
జోడుగవాలినజోఁపకుమీ

రేకు: 1405-1 సామంతం సం: 24-025

పల్లవి: ఎవ్వరము నేమిచెప్పే మిటమీఁదను
నివ్వటిల్లుఘనుఁడవు నీచిత్త మిఁకను

చ. 1: నిలువెల్లా వలపులే నెలఁతకు నేపొద్దు
పలుకెల్లా నీమీఁది పాటలందునే
తలఁపెల్ల నీపైతమకమే కలదెల్ల
నెలకొన్నపనులకు నీచిత్త మికను

చ. 2: చూపులెల్లనీపైనే సుదతి కీపులకల-
మోపులెల్లా నీమీఁది మోచిదింపులే
తీపులయాసలు నీతేనెలమాటలందే
నీపాదమానసుమ్మీ నీచిత్త మిఁకను

చ. 3: కాయము నీకాఁగిటనే కలికిజవ్వనపుఁ-
బాయమెల్ల నీరతి బంధములనే
యేయెడ శ్రీవేంకటేశ యీకెకు నీకుఁ దగు
నీయిచ్చలాయ నేడు నీచిత్తమికను

రేకు: 1405-2 పాడి సం: 24-026

పల్లవి: ఆతురమే నెలవాయనమ్మా యీ-
యేతులునుఁ దాలిములు యెరవౌట యరుదా

చ. 1: డిందుపడి సొబగులకు ద్రిష్టిదాఁకినయట్లు
అందమే పరితాపమాయనమ్మా
చెంది హృదయఁ(యం?) బెల్ల చేకొన్నరమణుఁడే
పందెమడిచినయట్ల పగయౌట అరుదా

చ. 2: సొలపులఁ గనుచూపులకు సోఁకు సోఁకినయట్లు
అలసత మైమఱుపు లాయనమ్మా
పిలిచి విభుఁగూర్చుటకు పెరరేఁచు నెచ్చెలులె
కలలోని చెలిమివలె కడకేఁగు టరుదా

చ. 3: చెప్పనరుదగుమరునిచేఁతవలె తరుణితురు-
మప్పుడే చిందువందాయనమ్మా
యిప్పుడే శ్రీవేంకటేశకు కాఁగిట నింతి-
వొప్పులే తప్పులై వొత్తగిలు టరుదా

రేకు: 1405-3 పాడి సం: 24-027

పల్లవి: గరిమతో నిన్నిటాఁగలనీకు
బెరసిననామీదఁ బ్రియమున్నదా

చ. 1: తనురోమరోమరంధ్రములను బ్రహ్మాండ-
జననసంహారవిచారములు
మనసున నీకివి మంత్రములై నన్నుఁ
గనుఁగొని కరుణించఁగలదా వేళ

చ. 2: కన్నుల శీతోష్ణకారణములు దోచి-
యున్నచంద్రుడు రవియును మించఁగా
నన్నుఁ బాయుచుఁగూడ నలిరేఁగనేకాక
యిన్నిటాఁ బనులు నీకిఁకఁ గలవా

చ. 3: కడలేనినీమేనఁ గలుగుదేవతలను
బడిబడిఁ బలుమారుఁ బలికింపుచు
విడువక ననుఁగూడి వేంకటేశ్వర నెత్త-
మడరి యాడఁగ నీకు నదనున్నదా

రేకు: 1405-4 శంకరాభరణం సం: 24-028

పల్లవి: మంజుతనౌ పరిమళతి సతిః సు-
ధాంజనం తే విహరణ మిదం

చ. 1: గమన మయతి సతి కబరి చలతి సతి
కిమితి కిమితిముఖే నిరతి సతి
కమలాననే త(వ)గతిః కథం భో
సుముఖమయా వద సుకరమి దం

చ. 2: మహతి వీక్షణే మదం కిరతి సతి
రహసి మనసి సంభ్రమతి సతి
మహితే తే గరిమానం కిం మా-
మిహ వద భవదిష్ట మిదం

చ. 3: స్వయంస్వయం సంశయో హరతి సతి
నయనై(నే?) కించిన్నమతి సతి
శ్రీయఃపతి స్తే శ్రీవేంకటపతి
ఆ(ర?) యం ప్రియస్తే యత్న మిదం

రేకు: 1405-5 మధ్యమావతి సం: 24-029

పల్లవి: నమ్మరా నామాట నీవు నగవు గాదు
కమ్మర నాబలిమెల్లఁ గనుకొనరా

చ. 1: మాఁటలాడి మాఁటలాడి మగిడి చూచేవు నీవు
యేఁటికి నీకింత వెఱపేల వచ్చెరా
నీఁటున నెవ్వతెయైనా నిన్ను నేమిసేసినాను
గాఁటముగ నీవిట్టె కాచుకొనేరా

చ. 2: చేరి చేరి నావొద్ద శిరసువంచేవు నీవు
వారించి యిది నీకెవ్వతే చెప్పెరా
యీరీతి నిందుకుఁగా నెవ్వతె గోపించినాను
ఆరసి నే నీసంది కడ్డమయ్యేరా

చ. 3: కూడిమాడి నాగోరికొనలకే యలికేవు
వోడక శ్రీవేంకటేశ వూరకుండరా
ఆడనీడ నెవ్వరు నీ కడ్డముగా వచ్చినాను
వేడుక నే నాడుకొనే వేసరకురా

రేకు: 1405-6 శ్రీరాగం సం: 24-030

పల్లవి: దేవదుందుభులు నలుదిక్కులందు
తావులనే వేవేలు ధ్వనులియ్యఁగాను

చ. 1: వేంకటాద్రిదేవుఁడదే వేడుకతోఁ బెండ్లాడీ
లంకెల నిప్పుడే కమలాదేవిని
కొంకక ముప్పదిమూఁడుగోట్లు దేవతలాల
వుంకువ విచ్చేయరో మహోత్సవవేళ

చ. 2: వనజనాభుఁడు నిత్యవైభవానఁ జేకొనె
అనయము నిదివో యాదిలక్ష్మిని
మునులాల భుషులాల ముంచినభూసరలాల
సొనిసి యిందరుఁగూడి సుముహూర్త మనరో

చ. 3: సురకన్యలాల భూసురనాగకన్యలాల
మరిగికూడీ నలమేలుమంగ నితఁడు
నిరతి శ్రీవేంకటనిలయుని నీకెను
యిరవుగ దీవించి యిందరునుఁ బాడరో

రేకు: 1406-1 సామంతం సం: 24-031

పల్లవి: ఒక్కటికి నురిగట్టే వొంటికి దాయిగట్టే-
వెక్కువ గోవాళవిద్య లీడఁ జేయవలెనా

చ. 1: నిక్కినిక్కి యాకెఁ జూడ నిడివి యాడకు నీడ
అక్కడికే పోరాదా అంతగలితే
మొక్కిమొక్కి నన్నుఁజూఁచి మూఁగసన్నలేలసేయ
ఇక్కడికే రారాదా యింతగలితేను

చ. 2: చెప్పిచెప్పి పంపనేల సెలవుల నవ్వనేల
అప్పటి నీ వేఁగరాదా అంతగలితే
తిప్పితిప్పి నాతోనుఁదెగి జాణతనమేల
యిప్పుడే మన్నించరాదా యింత గలితేను

చ. 3: పూచిపూచిఁ మాని నాతో బూమెలు సేసేవుగాక
ఆచాయ నుండవా నీ వంతగలితే
చేచేతఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
యీ చలమే నీకు దక్కె నింత గలితేను

రేకు: 1406-2 ముఖారి సం: 24-032

పల్లవి: ఆరజమైతిని అంగడికెక్కితి
తారుకాణ లిక దనతోనేలా

చ. 1: పూవక పూచెను పున్నమవెన్నెల
కావక కాచెను కంతుబాణములు
యీవల నిఁక మరి యేలా మాఁటలు
ఆవలఁ దనచెలు లాడే రదివో

చ. 2: కానక కనెనట కమ్మఁజెఱకువిలు
పూని వినకవినెఁ బొత్తులగాలెట
నానాఁటికి నివె నడచీ సుద్దులు
తానే యెఱుఁగును తమకములేలా

చ. 3: పాఁకెను తీగెలు బయలుపందిలులు
మూఁకలు విచ్చెను మొకరితుమ్మిదలు
యీకడ శ్రీవేంకటేశుఁడు గాఁగిటఁ
జేకొనె నిదె మదిఁ జింకలవేలా

రేకు: 1406-3 తెలుగుఁగాంబోది సం: 24-033

పల్లవి: ఇదియే దిష్టము భూమి నింతులఁజేసినచేత
యెదురెదురనే తాఁకు నెఱఁగరే చెలులు

చ. 1: పంచబాణములు నేఁడు పడఁతిపై నేసెఁగాన
పంచమహాపాతకుఁడు భావజుఁడే పో
యెంచ విందువఁ కనేపో ఇందరిలో రూపులేక
అంచెల నంతరభూతమై యుండవలనె

చ. 2: విరహపుటింతి నింత వెరపించెఁగాన రేఇ
సరిలేనిరాకాసి చందురుఁడే పో
తిరమై నేఁడిందువంక దినములు నొక్కకళ
సురలెల్లఁ దినఁగాను సుక్కువడఁగలిగె

చ. 3: కందువ నేటియింతి కాఁగిట గలయఁగాను
యిందు జాణ శ్రీవేంకటేశుఁడే పో
మందలించి ఇందుననే మగువలపాలిటికి
ముందుముందే పురుషోత్తముడు దానై వెలసె

రేకు: 1406-4 సామంతం సం: 24-034

పల్లవి: మరలి యేపనియైన మమ్మడుగవేఃమీరు
గరిమఁ గలసి ఇంకాఁ గలవా యెన్నకలు

చ. 1: కామిని నీపతి నీతోఁ గడుసరసమాడితే
యేమే నామోము చూచే వింతలోన
యేమేమో మీలో సుద్ది మీరిద్దరే యెరుఁగుదురు
కాముని తంత్రములపైఁ గలవా యెన్నకలు

చ. 2: కలికి నీపతిఁ నీతోఁ గన్నులనే నవ్వితేనే
యెలమిఁ జెలులము నే మేమిసేతుమే
నెలనైనమీసన్నలు నేఁడు మీకే తెలుసును
కలిమి పూబాణాలపైఁ గలవా యెన్నికలు

చ. 3: యీకడ శ్రీవేంకటేశుఁ డింతి నిన్నుఁ గూడితేనే
మేకొని మమ్మెల్లా నీవు మెచ్చేవేమే
యేకమైనరతుల మీరిద్దరునుఁ గంకణాలు
గైకొని కట్టినమీఁద గలవా యెన్నికలు

రేకు: 1406-5 శ్రీరాగం సం: 24-035

పల్లవి: మించి కాలము కిందుమీఁదాయనే
ఇంచుకంత దెరఁగు లే దేమిసేతమే

చ. 1: ధరలో మరునెలవు తలఁపులో చిత్తరువు
తరుణిమాటలలోనే తఱచాయనే
విరహపుటెండవేఁడి విరులకొసలవాఁడి
ఇరవాయనా యెందు నేమిసేతమే

చ. 2: కట్టలేని గాలిమోపు కడలేనివినుకులు
దట్టమాయ నీమగువతగువులనే
గుట్టులేని తమకము కోవిలలో సముకము
యె(యి?)ట్టె నాకిది యబ్బె నేమిసేతమే

చ. 3: వానలేనివరదులు వడలేనిదప్పులును
మానివికాఁగిటిలోనే మక్కళించీనే
పానినశ్రీవేంకటపతిగాన నన్నుఁగూడె
యీనెలఁత మెప్పించె నేమిసేతమే

రేకు: 1406-6 రామక్రియ సం: 24-036

పల్లవి: తనిసితి నిఁక నవి తడవకువే వాని-
మనసు దెలియఁ గంతుమాయలయినఁ జాలవు

చ. 1: చిత్తరువుమాఁకులకు జిగురులు గలుగునా
హత్తినతనవలపూ నటువంటిది
పొత్తుల నటుండనీవే పొందగుపతిగుణాలు
యిత్తల నే నెంచేనంటే యిసుమైనఁ జాలదు

చ. 2: నెమ్మి నెండమావులలో నినుపునీరుండునటే
అమ్మలాల తనబాస లటువంటివే
కమ్మర నింకా నేవే కాంతునిమోవిమీఁద
సొమ్ములవి యెంతమంటెఁ జుక్కలైన జాలవు

చ. 3: కందువైనకతలకుఁ గాళ్లు గలుగునటే
అందమైనతనసుద్దు లటువంటివే
పొందినశ్రీవేంకటేశు భోగము చెప్పఁబోతే
యెందును రేలు బగళ్లు నెన్నియైనఁ జాలవు

రేకు: 1407-1 శంకరాభరణం సం: 24-037

పల్లవి: రమ్మనీ రావయ్య రాఁపు వొద్దు
కొమ్మ మనసు నిలిపె (పెఁ?) గొంతవొద్దు

చ. 1: సమ్మతి నీరాకకు సకినాలు చూచి చూచి
కొమ్మ మనసు నిలిపెఁ గొంతవొద్దు
వుమ్మడి నంతటఁ దనవొరపుసింగారాల
ఇమ్ములఁ బొద్దు గడిపెం తనివొద్దు

చ. 2: గారవానఁ జెలుల నీకడకంపి, నీరూపు
కూరిమితోఁ దలపోసెఁ గొంతవొద్దు
ఆరసి నీసుద్దులెల్లా నందరితోఁ జెప్పి చెప్పి
యీరీతిఁ బొద్దువుచ్చె నింతవొద్దు

చ. 3: చిప్పిలేటితమకానఁ జిత్తముతో సమరతి
కుప్పసేసెఁ గోరికలఁ గొంతవొద్దు
ఇప్పుడే విచ్చేసి నీవు ఇంతిని శ్రీవేంకటేశ
తెప్పిరఁగూడితి విట్టె దినము నేపొద్దూ

రేకు: 1407-2 ముఖారి సం: 24-038

పల్లవి: ఇంతలోనే విభుఁడ మాకేమి దప్పెనుః నేడు
వింతలుగాఁ దినదిన వేము దీపువో

చ. 1: నీవు మమ్ముఁ జెనకక నిలిచితేఁ జాలుఁగాక
భావజు చెఱకువింటఁ బండు వండెఁబో
తావుల నీబాస నీవే తప్పితేనే చాలుఁగాక
పూవుబాణములపంట పొల్లువోదు వో

చ. 2: కదునింతదీమసము గలిగితేఁ జాలుగాక
చిదుముడి చిగురుల చేగలెక్కెఁబో
వడి నీమాటలు మఱవకవుంటేఁజాలుగాక
గుడిగొన్నవెన్నెలలే కొంగుముడి వో

చ. 3: శ్రీవేంకటేశ నన్నుఁ జేరితేనే చాలుఁగాక
సోవల మోవుల నిట్టే జున్ను వెట్టేఁబో
తావి నాఁకాగిట నిట్టె దక్కితేనే చాలుఁగాక
యేవేళఁ బులకలే ఇరవైనసేసవో

రేకు: 1407-3 సామంతం సం: 24-039

పల్లవి: పడఁతి ఇటని విన్నపము సేయవే తాఁ
గడదాఁకా నిందుకైనఁ గలఁడుగా తాను

చ. 1: సరి నిపుడైన విచారించెఁగా నన్ను
కురిసి విరహమే పై కుప్పసేసెఁగా
మరునికాఁకల నామన సిది యేమైన
గరిమతో సూడువట్టఁగలఁడుగా తాను

చ. 2: తలఁచి తనకు నాపై దయపుట్టెఁగాః నాకు
వలపులు మించనైనా వరమిచ్చెఁగా
చెలఁగి యాసలచే నాజీవ మెంతబడలినఁ
గలిమితో సేకరించఁగలఁడుగా తాను

చ. 3: గక్కన విచ్చేసి నన్నుఁ గాఁగిలించెఁగా నేఁడు
యెక్కుడైన శ్రీవేంకటేశ్వరుఁడు
దిక్కయి నన్నిట్లానే దినదినమునుఁ గూడ
కక్కసము గానివాఁడు గలఁడుగా తాను

రేకు: 1407-4 సామంతం సం: 24-040

పల్లవి: ఒక రొకరికె మన మొద్దిక గాదాః నీకు
వెకలిరతుల ముందువెనక గానా

చ. 1: కోమలి నీకుచములు కొండలైతే నామీది-
చేమలుచెట్లుఁబో నాచేతులివి
యేమిటా నీజవ్వనమే యెక్కుడుఁగా నెంచుకొంటే
ఆమీఁదిఫలభోగ మది నేఁ గానా

చ. 2: కలికి నీకన్ను లివి కమలము లనుకొంటేఁ
దొలకు నాచూపులునుఁ దుమ్మిద లివి
చెలువాన నీవెంట చెలరేఁగినా నీకు
అలరి యెవ్వరిపను లంతకు నేఁ గానా

చ. 3: అంగన నీచెమటలే అంబుధియైతే నేఁ
జెంగలించి వోలలాడే శేషశాయిని
సంగతి నీకూటమే సారెకు మెచ్చపు నేఁ
గంగులేని శ్రీవేంకటపతిఁ గానా

రేకు: 1407-5 తెలుగుఁగాంబోది సం: 24-041

పల్లవి: తరుణి కిచ్చకమే తగిన దిది
నిరతము నతివలునేర్చినప (ఫ?)లము

చ. 1: అంగన నెవ్వరు నవ్వుఁగాదనకురే
కంగి విరహమునఁ గాఁగినది
చెంగటఁ బతితో చెలి నొనగూర్చుటే
సంగతి మన మిచ్చుటఁ గలఫలము

చ. 2: ఇంతి నెవ్వరును యిది యేమనకురే
పంతపుటాసల భ్రమసినది
యింతనంతటా యెడమాఁటల మతి-
చింత వాపుటే చెలులకు ఫలము

చ. 3: వెలఁది యిదివో శ్రీవేంకటపతితో
మలయురతుల మెయి మఱచినది
చెలువునిమర్మపుచేఁతలు చూచేటి-
చెలుములు మన మిటు సేసినఫలము

రేకు: 1407-6 భైరవి సం: 24-042

పల్లవి: ఇటమీఁద మీచిత్త మెట్లోకాని
కుటిలకుంతలిపొందే గుణము వో విభుడా

చ. 1: యింతి నీకు మేడమీఁద నెదురుచూచినచూపు
దొంతులై పెరిగి మరుతూపులాయను
యింతట విచ్చేయకున్న యివియిన్నియునువేపై
చెంతల వడ్డికిఁ బారు చెప్పితిఁబో విభుఁడా

చ. 2: వాలినయాసలతో వనిత వలపులెల్ల
చాలుకొని శాఖోపశాఖలాయను
తాలిమి నింతటనైనా దయదలఁచకవుంటే
కాలఁ జేతఁ బెనగొను కనునో విభుఁడా

చ. 3: మెలుఁత జవ్వనమెల్ల మించినసొబగుఁలెల్లా
గలయురతులఁ జెప్పఁ గతలాయను
యెలమి శ్రీవేంకటేశ యిట్లఁ గూడకుండితే
తలపోఁతే ఘనమవును తప్పదువో విభుఁడా

రేకు: 1408-1 సామంతం సం: 24-043

పల్లవి: ఇన్నిటా నే నీకు లోనయినదానరా
పన్నిన నీచిత్తము నాభాగ్య మింతేకాని

చ. 1: పెలుచునానడుము నీపిడికిటిలోని దింతే
చెలగి నీవెటువలసిన జేయరా
మొలకలనాకుచములే కడుఁగల్లరులు
వులుకనినీవానివోపి కింతేగాని

చ. 2: కడు నాచెలువము నీకనుచూపులోని దింతే
అడరి నే నిన్నవుఁగానదన గలనా
కొడిమిగిలిననాగోళ్ళివి కడువాఁడి
బడిబడి నీవానిబలిమింతే కాని

చ. 3: కమ్మనినామేను నీకాఁగిటిలోని దింతే
నెమ్మది శ్రీవేంకటేశ నీయిచ్చరా
దిమ్మురేఁచి మఱపించీఁ దియ్యనినామోవి యిది
తెమ్మలైననాలోనిదీమసమే కాని

రేకు: 1408-2 తెలుగుగాంబోది సం: 24-044

పల్లవి: ఏడ గన్న నీకు మొక్కే దిందు కింతేపో
ఆడుకోకు నీపంతా లందు నిందు నికను

చ. 1: నడుమేల బడుగాయ నవ్వులేల తెలుపాయ
వెడగునీగుణములు వినివినిపో
జడిమాట లెందాకా జాలించు మిక గోడ
గడిగితే నసలేపో ఘనుడ ఇన్నిటాను

చ. 2: కురులేం చీకటాయ గోళ్లేల వాండ్లాయ
సారిది నీచేతలు నే జూచిచూచి పో
వోరిమ నీయాసలు నొట్లు నాతో నేల
సరిం బిప్పి నమలితేం జప్పనే పో విభుడా

చ. 3: చెక్కులేల చెమరించెం జిత్తమేల ముదమందె
నెక్కొని శ్రీవేంకటేశ నిన్నుం గూడే పో
తక్కిన విన్నియు నేల తప్పులవే వొప్పులాయ
చిక్కినపులకెల్ల సేస లేపో ఇకను

రేకు: 1408-3 శంకరాభరణం సం: 24-045

పల్లవి: ఇంతిచెలువమే యీతనికి
కంతునిచేఁతల గలసినవేళ

చ. 1: చిత్తజకేళి నీచెలికుచగిరు లివి
హత్తినరమణుని కాథ(ద?)రువు
నెత్తమితావులనిట్టూర్పుగములు
కొత్తగుబడలికకును పరిహరము

చ. 2: వలపులాకటికి వనితలధర మిది
చెలువునికిపు డమసినవిందు
చెలపచెలపమైచెమటలపన్నీరు
తెలియఁగ చలివందిరివో పతికి

చ. 3: పట్టుగొమ్ము యీపడఁతి దేహలత
గట్టిగా శ్రీవేంకటపతికి
యిట్టె యిన్నియు నీకెకు నితనికి
పట్టినవెల్లా బంగారములు

రేకు: 1408-4 లలిత సం: 24-046

పల్లవి: అంత సిగ్గువడక నీవానతీవయ్యా నీ-
యంతరంగమేల దాఁచ నానతీవయ్యా

చ. 1: కడుసరుసుఁడవట ఘనుడ నీమోమందు-
నడరిన కళలెల్ల నానతీవయ్యా
వొడికమై నీమోవినున్న కెంపు లివి యెన్ని
అడియాలముగ నాకు నానతీవయ్యా

చ. 2: మిక్కిలిజాణఁడవట మేనిమీఁదిచెమటలు
అక్కట యెందుండి వచ్చె నానతీవయ్యా
గుక్క కిట్టె యేయింతిగుబ్బలపైకుంకుమో నీ-
యక్కుమీద నంటినది యానతీవయ్యా

చ. 3: యెసఁగి శ్రీవేంకటేశ యిట్టె కాఁగిటిలోన
నసురుసురేల వచ్చె నానతీవయ్యా
ముసిముసినగవుతో మునిఁగి నాకొనగోరి-
కసమిచ్చి యేల లోఁగే వానతీవయ్యా

రేకు: 1408-5 మంగళకౌసిక సం: 24-047

పల్లవి: తెలివకుఁబతివైతివి గాక
గళిసించినఁ గడుఁఘనమా నీవు

చ. 1: చూచినవెల్లా సొంపుముత్యములు
పూచినపువ్వులె పున్నములు
లాచినవెల్లా లాగవేగములు
యీచెలిసొబగుల కెదురా నీవు

చ. 2: పలికినవెల్లాఁ బసనివజ్రములు
నిలువునఁ దురుమే నీలములు
కలిగినపులకలె కనకపుమొలకలు
జలజలోచనకు సరియా నీవు

చ. 3: కాఁగిటివెల్లాఁ గంతునిరచనలు
మూఁగినరతి నిను ముంచె నిదె
చేఁగల చిగురుల శ్రీవేంకటపతి
వీఁగేటిరమణికి వింతా నీవు

రేకు: 1408-6 సామంతం సం: 24-048

పల్లవి: ఊరకే మరునిపొంజు లూరఁగూటాలు
ఆరసితే వట్టిజూబు లివి నీకు నెదురా

చ. 1: కొలనిలో తుమ్మిదలు కొమ్మలపై కోవిలలు
బలము లింతేపో భావజునికి
నెలఁత నియ్యంద్దైతే నెరిఁగలతుమ్మిదలుఁ
బలుకుఁగోవిలలునుఁ బంతమాడీఁగదవే

చ. 2: తీగలపై విరులును తియ్యనితుంటచెఱకు
చేగలయమ్ములు విల్లుఁ జిత్తజునకు
సోగలబొమ్మలవిల్లుఁ జూపులయమ్ములు నీకు
యీగతుల నింతి నీకు వెడయవుగదవే

చ. 3: యెక్కడో చందురుఁడును యెడవుల చల్లగాలి
మక్కువైన తోడు దొన మదనునికి
గక్కన శ్రీవేంకటేశు కాఁగిటినీకై తేను
వొక్కచో వదనచంద్రుఁ డూరుపే గాలిగదే

రేకు: 1409-1 మాళవి గౌళ సం: 24-049

పల్లవి: ఆణికాఁడవట యంతటికి
జాణవు తెలియము సరిగొనవయ్యా

చ. 1: ముంగిట చెమటలముత్యపుఁ బూసలు
అంగన లోలో నమ్మీనదె
ఇంగితంపువెల లెరుఁగుదువటవో
యంగడిబేహారి యవి గొవవయ్యా

చ. 2: మొల్లమి మాచెలి మోవిమాణికము
అల్ల వెలకు నీ కమ్మీనదె
తొల్లి నీవు సూదులవాట్లచేఁ
గొల్ల లడిగితట కొనవయ్యా

చ. 3: విడుదలచూపుల నీలంబులు నీ-
వడిగినంతకే యమ్మీనదే
పడతిఁదె శ్రీవేంకటపతి నీ విదె
యెడయనికాఁగిట నిటు గొనవయ్యా

రేకు: 1409-2 నాదరామక్రియ సం: 24-050

పల్లవి: ఊరకున్న నుండెఁగాక వోరుపునను
గారవించి చేకొనినఁ గాదనఁగగలవా

చ. 1: అలిగినప్పటివేళ ఆయఁబోయగాక నీవు
చల మిట్టె కడదాఁకా సాదించేవా
చెలి నీకుఁ జెల్లినంతం చెల్లదా విభునికి
బలిమిఁ బట్టినను నోపననఁగఁగలవా

చ. 2: యెచ్చినకోపపువేళ యేమయిన నాయఁగాక
పెచ్చువెరిగే పదేమే బిగియుచును
యిచ్చట నాతఁడు నిన్ను యింత వేఁడుకొనఁగాను
పచ్చిసేయ నిఁక నంత పలమారుఁ జెల్లునా

చ. 3: తడసి యొక్కొకవేళ తప్పుఁదారుఁగాక నీవు
కడదాఁకా నీపంతమే కైకొంటివి
కడఁగి శ్రీతిరువేంకటపతి నన్నుఁ గూడె
అడరి నీవేడుకల కడ్డ మెందూఁ గలదా

రేకు: 1409-3 ఆహిరి సం: 24-051

పల్లవి: ఇంతలోననే యివి రెండూ
చింతలుఁ దమకములు చెలువుఁడ నేఁడు

చ. 1: చెనకుల నీకడ చెనకులు వింటేఁ
దునియనిచిత్తముఁ దుత్తుమురౌ
మునుకొని యిప్పటిమోహము చూచిన
అసలుఁగొనలునై యాసలు వొదలు

చ. 2: ఇంచుకవడి నీ విటురాకుండిన
కంచుఁబెంచు నౌఁ గాయమిది
అంచెలఁ గన్నుల నటు నిన్నుఁ గంటే
పొంచినముదములఁ బులకలు మొలచు

చ. 3: కదియుచు నీ వాకడిమోమైతే
చెదరి కోరికలు చిందరలౌ
యిదె నన్ను శ్రీవేంకటేశ్వర యిటువలె
పొదిగినమోములఁ బొత్తులు గలయు

రేకు: 1409-4 శంకరాభరణం సం: 24-052

పల్లవి: మనసిజసముద్రమదనమిదె
కనుగొను మింతటఁ గాంతుఁడ నీవు

చ. 1: సతి చింతామతిజలనిధి తరువఁగ
అతిగరళపువిరహము వొడమె
తతి నాపిమ్మటఁ దమకపుఁగోర్కుల-
లతల కల్పకపులాకలు వొడమె

చ. 2: పొలఁతికూరిములఁ బొంగులు వొంగఁగ
పులకల తారలు వొడమె నవె
ఫలమై సాత్త్వికభావపుఁజంద్రుఁడు
నిలువునఁ బొడమఁగ నేరుపు లలరె

చ. 3: సుదతి దానే నీచొక్కపుఁగాగిట-
నదనున నిందిరమై పొడమె
కదిసిన శ్రీవేంకటపతి నీదెస
యదరామృత మయ్యతివకుఁ బొడమె

రేకు: 1409-5 గుండక్రియ సం: 24-053

పల్లవి: కటకటా మీదటికద యెందో
తటుకునఁ బతి దయదలచఁగవలదా

చ. 1: కంచుమించులగుగగనపునడు మిది
అంచగమనమే ఆధరువు
పొంచినఆరునఁ బొదుపుసేసుకొని
వుంచపుగట్టున నున్నదిగాక

చ. 2: నిగ్గులు నీడలు నెలఁతవదన మిది
యెగ్గుసిగ్గులకు నెడగలదా
బెగ్గిలి కన్నులఁ బెద్దసేసుకొని
ముగ్గులనవ్వుల మురిసీఁగాక

చ. 3: పరువపుగరువపుపాయపుమన సిది
తరుణియాసకే దరిదాపు
యెరవుగ శ్రీవేంకటేశుఁడు గూడఁగ
సరవు లివిన్నియు జయమయి నిలిచె

రేకు: 1409-6 మంగళకౌసిక సం: 24-054

పల్లవి: ఇంత సేయఁగా నీకిందు యేమివచ్చెనే నీవు
యింతివేకావా చెలి యిదియేమే

చ. 1: అలరిచేతలవిభుఁ డాతఁడేడ నేనేడ
చాలుఁజాలు నింత నీకు చలమేఁటికే
మూలనుండేవారిఁ దెచ్చి ముంగిటఁ వేసేనంటా
యేల యిట్టె బోదించే విదియేమే నీవు

చ. 2: మాయదారివిభుఁడెంత మరిగిననేనెంత
ఆయనాయ ననునేల యలయించేవే
వోయమ్మ చల్లవేఁడై వున్ననన్ను నతనితో
యీాయెడనే కూడుమనే విదియేమే నీవు

చ. 3: యింతలోనే శ్రీవేంకటేశుఁడే దక్కె నిట్లు
సంతముసేసితిని మెచ్చఁగవలెనే
పంతము పలుకు నొక్కపాటిగా మెలఁగునాపై
యెంతకెంతమమకార మిదియేమే నీవు

రేకు: 1410-1 లలిత సం: 24-055

పల్లవి: అతినతలఁపు దెలియఁగరాదా నీ-
మతిలోనికాఁకలెల్ల మందలించేఁగాని

చ. 1: అన్నియుఁ జెప్పేఁగాని యతఁడంపినట్టిచెలి-
విన్నపమంతయు నీవు వినరాదా
యెన్నిక లంతటిమీఁద నెట్టువలసిన నయ్యీ
కన్నులఁ గన్నంతనే గారవించుమీ

చ. 2: ఇద్దరితలంపులకు నిక్కువ చెప్పేఁగాని
పెద్దరికమున నాకెఁ బెంచరాదా
గద్దరిచలములేల కలది కలిగినట్టె
వొద్దిక నన్నియు నీ వొప్పుగొనుమీ

చ. 3: వెలఁదిఁ బుత్తెంచి తా వెంటనే శ్రీవేంకట-
నిలయుండు వీఁడె వచ్చె నీవు రారాదా
తెలిసి ఇద్దరుఁ గూడితిరి మాకిందరి కిదె
సెలవు నీపతి నిదె చిత్తగించుమీ

రేకు: 1410-2 తోండి సం: 24-056

పల్లవి: ఏమి దలఁచుకొంటివో ఇన్నాళ్లకు
నీమన సింతటనే తనివిఁబొందెనా

చ. 1: వూరకే కొలనిలోన నోలలాడేమగువల-
చీరలేల తీసితివి చిన్నారివాండా
చేరి యంతటనుఁ బోక చేతులెత్తి మొక్కుమనే-
వేర యెంతకెత్తుకొంటి వేడ కొత్తరా

చ. 2: బాలుఁడవై మాఇండ్ల పాలారగించి ఇంకా
పాలిండ్లపై చూపు పచరించేవా
చాలదంటూ మాకేలు చాచి యందుకొమ్మనేవు
మేలుమేలు నీగుణాలు మెచ్చితిమిరా

చ. 3: ఇంతు లున్నారన కిట్టె యీఁదులాడే విందు వచ్చి
ఇంతలోనె శ్రీవేంకటేశుఁడ నీవు
పంతము చేకొని మమ్ముఁ బచ్చిగాఁ గూడితివిట్టె
ఇంతచేసి మరి చీర లిచ్చితివి చాలదా

రేకు: 1410-3 బౌళి సం: 24-057

పల్లవి: మేకులాఁడిగదె యలమేలుమంగ
ఆకె యీతనికే తగు నలమేలుమంగ

చ. 1: చెక్కులచెమటలతో చెలువునియెదుటనె
మిక్కిలి చొక్కీ నలమేలుమంగ
మొక్కలాన చెలులతో ముచ్చటలు చెప్పి చెప్పి
అక్కడే చూచీఁ గదె ఆలమేలుమంగ

చ. 2: చాలుకొని పతితోఁ జల్లు వెదమాటలనె
మేలములాడీ నలమేలుమంగ
తాళమొత్తి పాటపాడి తనలోనే నవ్వీని
ఆలరివిభునివద్ద నలమేలుమంగ

చ. 3: యీడ నిట్టె శ్రీవేంకటేశుని మెప్పించి కూడె
మేడెపుఁగాఁగిట నలమేలు మంగ
వీడెపురసములనే వీడుదోడై రతులలో
ఆడుకోలుమాఁట లాడీ నలమేలుమంగ

రేకు: 1410-4 ఆహిరి సం: 24-058

పల్లవి: తానట నన్నట తలఁచునటా
యీనిజమంతము నెఱిఁగేఁగాక

చ. 1: పిలువనంపునట ప్రియుఁడట
చెలి నీవు ప్రియముసేతునట
పలుమాఁటల కిఁకఁ బనులేల నే
వలరాజావలస వచ్చేఁగాక

చ. 2: చేకొని యిట విచ్చేసునట తా
నాకయి వసమయి నడచునట
రాకకు నామతి రాయవునా
నీకొరకు వలపు నెఱపేఁగాక

చ. 3: శ్రీవేంకటగిరిచెలువఁడట
కావలెనని నన్నుఁ గలసెనట
యీవలనావల యిద్దరికి
పూవుఁబరిమళపుఁ బొందులెకాక

రేకు: 1410-5 శంకరాభరణం సం: 24-059

పల్లవి: దొడ్డిపట్టుమానినులదొమ్మికాఁడా
అడ్డములేని చేఁతలయాతఁడవా నీవు

చ. 1: చెంగట గోపికలఁ జెలరేఁగి యొకమాఁటే
జంగిలిగా మోహములు చల్లఁగాను
యింగిత మెఱిఁగి నీవు యిందరి కిన్ని రూపులై
అంగవించికూడినట్టియాతఁడవా నీవు

చ. 2: కోరికమీర మునులకొమ్మలెల్ల నీకు విందు
పేరులేనిరుచులతోఁ బెట్టఁగాను
కూరిమి చేకొని యట్టె గోపాలకులఁగూడి
ఆరగించివచ్చినట్టి ఆతఁడవా నీవు

చ. 3: ముందు గలుగ నీకు మోహమున రుకుమిణి
కందువ చెప్పి పుత్త్యాఁగఁ గైకొంటిని
యిందుకోపో యిందరు మోహించిరి శ్రీవేంకటాద్రి-
యందలివిట్ఠలుఁడనే అతఁడవా నీవు

రేకు: 1410-6 ఆహిరి సం: 24-060

పల్లవి: చూడఁ బసిబాలగాని జూటుగదమ్మా తా-
నాడినట్టె ఆడకుంటే సగ్గలమయ్యీని

చ. 1: కొట్టలేదు తిట్టలేదు కూరిమితోఁ దనచెక్కు
ముట్టితేనే యేడిచీని మొఱలువెట్టి
యెట్టిచిన్నబిడ్డఁడమ్మ యెంత యెత్తుకొన్నమానఁ-
డట్టె యంతకంతకు సగ్గలమయ్యీని

చ. 2: అద్దలించఁ జేయుఁ దనయంగదూళిఁ దుడిచిన
పొద్దువోక నేలబడి పొరలాడీని
వుద్దండీఁడు గదనమ్మ వుట్టిపాలలోనఁ బాద-
మద్దకుమంటేనే యగ్గలమయ్యీని

చ. 3: అంగడి నెఁద్దైనఁ దా నాడివచ్చి పయ్యెద-
కొంగుఁ గప్పుమని మాతో గువిశాడీని
జంగిలై శ్రీవేంకటేశ్వరుడ యెంగిలిముద్దు-
లంగవించ నొల్లమంటే అగ్గలమయ్యీని

రేకు: 1411-1 మాళవి సం: 24-061

పల్లవి: అంగనచేసినపుణ్య మందకపోదు -
చెంగటఁజూడరమ్మ చెలులాల మీరు

చ. 1: దొంతరపూవులపూజ తొయ్యలి సేయఁగఁబోలు
చింతతో నిట్టె చేయి చేర్చె నేఁడు
యింతి నీలపురాసు లిలఁ జారలియ్యఁబోలు
చెంతఁ దురుమటు జారి చిక్కువడె నదివో

చ. 2: దిట్టయై కోరి యఖండదీప మెత్తఁగఁబోలు
నిట్టచూపే చూచీని నివ్వెరగై
జట్టిగొని పన్నీటఁ జలిపంది రిడఁబోలు
పుట్టిపడి చెమటల నోలలాడె నదివో

చ. 3: వనిత మోవిపండు వాయనమియ్యఁగఁబోలు
మొనసి శ్రీవేంకటేశు మోవి చేకొనె
తనివోక చెప్పరానితపము సేయఁగఁబోలు
యెనసి ఇద్దరుఁ గూడి యేకమై రిదివో

రేకు: 1411-2 సామంతం సం: 24-062

పల్లవి: అటు గాన నీకు లోనైతిఁగాక యీ
చిటుకు లిన్నియు నీచేతివేకదే

చ. 1: కంతునియమ్ములైతే కతలలోనేకానీ
ఇంతి నీచూపులైతే నివె దిష్టము
కాంతిమెఱుఁగులైతే కాలవేలాలఁగాని
చెంత నీమేనిమించు చేగలుదేరీనే

చ. 2: మెలుపువెన్నెలలైతే మిన్నులపైసుద్దు లింతే
కలికి నీనవ్వులైతేఁ గడుఁజేరువ
చిలుకపలుకులు పెంచవుఁబోలికలు గాని
అలరు నీమాటలెల్ల నచ్చముగదే

చ. 3: వొట్టినచిగురులెల్ల నొగరువేసీఁగాని
గట్టిగా నీమోవి తెనెగారీఁగదే
యిట్టివేళ శ్రీవేంకటేశుఁడఁగనక నాకు
దిట్టవై నీకాఁగిలిచ్చి తిరమైతివే

రేకు: 1411-3 ఆహిరి నాట సం: 24-063

పల్లవి: ఎంతనేర్చెనే యీమగువా
పంతమె నెరసీఁ బాయముమీఁదా

చ. 1: చుక్కలపొడవగు సుదతిచన్నుఁగన
జక్కన లెగరుచు జరయఁగను
గక్కన కిన్నెరకాయగూండ్లఁ
దొక్కిపట్టి తంత్రులుమీఁటీని

చ. 2: గుట్టున నుండక కొప్పుతుమ్మిదల -
తెట్టెలు చెదరఁగఁ దెరవ యిదె
కట్టిడిగోళ్లకత్తులబోనునఁ
బెట్టుచు శ్రుతులే బిగిఇంచీని

చ. 3: యిత్తరి శ్రీవేంకటేశ్వరుఁ గూడఁగఁ
గుత్తికలోపలికోవిల లా-
బిత్తరియధరపుఁ బిల్లఁగోవిలో -
నొత్తి నిలిపి తనివొందించీని

రేకు: 1411-4 కాంబోది సం: 24-064

పల్లవి: తీపులతననిజాలు దేవ రెరుఁగు
పైపై నాతోనేల పదమనవే

చ. 1: వెన్నెలరసములు వేఁడని బదుకఁగాని
యెన్నికఁ దాఁజేయుకాఁక లివియుఁ గొన్నా
నిన్ననే వింటిని తాను నేరకాడినట్టిమాట
పన్నేటిమాయలు మాని పదమనవే

చ. 2: అచ్చపుఁబాయమే బరవై యుండఁగాఁదా -
నిచ్చేటికానిక లందే దిదియు గొంతా
హెచ్చినయీవినయాల నిన్నిటా నేఁ దనిసితి
బచ్చెన యీగచ్చులేల పదమనవే

చ. 3: నినుపువిరహమున నివ్వెరగై యుండఁగఁ దా-
నెనసినపరవశ మిది యొకటా
వనితి శ్రీవేంకటేశ్వరుఁడు గూడె నింకఁ
బనిగలదిక్కునకుఁ బదమనవే

రేకు: 1411-5 కాంబోది సం: 24-065

పల్లవి: సుదతి నొకటొకటనే చూడరే దిష్టంబు
పొదలువిరహంబు లో బొదలఁగా నేఁడు

చ. 1: అంగన మీనాక్షియ్యైనందు కిదె దిష్టంబు
కంగి పతిఁబాసి ఇటు గను ముయ్యదు
అంగవించి కమలముఖియగుట కిది దిష్టంబు
పొంగుఁ జెమటలనీటఁ బొదలీని నేఁడు

చ. 2: మగువ వుత్తడియనెడిమాట కిది దిష్టంబు
పొగరు వలపులకాఁకఁ బుటమెక్కెను
అగడుతో శైలకుచయగుట కిదె దిష్టంబు
చిగురుఁబులకలచేఁతఁ జెలఁగీని నేఁడు

చ. 3: అతివ బింబాధరై యలరుటకు దిష్టంబు
తతిని శ్రీవేంకటోత్తముఁడు దొడికె
మితిఁ గంబుకంఠియ్యై మెఱయుటకు దిష్టంబు
రతిరాజతంత్రముల రవళిగొనె నేఁడు

రేకు: 1411-6 సాళంగనాట సం: 24-066

పల్లవి: మందులు మాఁకులు మఱియేలా
అందులనే గుణమయ్యీని

చ. 1: చుంగలనీతెలిచూపులు రమణుని-
కంగజబాణములయి తాఁకె
రంగగు వీడెపురసములకారము -
లెంగి లనక పతి కియ్యఁగరాదా

చ. 2: వెడ నీనవ్వులవెన్నెల విభునికి
వడిగల యండయి వడదాఁకె
అడరఁగ నతిరస మమృతరసాయనము
వొడలి కిత వతని కొసఁగఁగరాదా

చ. 3: చెలి నీకుచములు శ్రీవేంకటపతి -
కలయిక రుచులయి కళదాఁకె
కులికేటిగోళ్లకొనయెచ్చరికల
తెలియఁగ మఱపులు దెలుపఁగరాదా

రేకు: 1412-1 శ్రీరాగం సం: 24-067

పల్లవి: ఏమాయ వింతలోనే యిదియెల్లాను
కామునితంత్రములకుఁ గడుఁబోది గాదా

చ. 1: అతివిరహపుఁగాఁక నతని దూరితినంటా
మతిలోఁ బొడిఁబడేవు మాటిమాటికి
సతి నీవొక్కతెవేయా? జవ్వనాన బడలిన -
యతివలు పతుల నేమైనా నాడుదురు

చ. 2: పాయపువిభుఁడు నిన్నుఁ బట్టరాఁగా గోపానఁ
జేయిఁ దీసికొంటినంటాఁ జింతించేవు
యేయెడ నెవ్వరికైనా నీపాటి లేకుండితే
వోయమ్మ చవులౌనా వుడివోనిరతులు

చ. 3: చెనకునీకాఁగిట శ్రీవేంకటేశ్వరుఁ
జనుఁగొండ లొత్తైనంటాఁ సంచలించేవు
మనసిజుగరిడిలో మల్లడి నొక్కరొక్కరి -
పెనకువలకు నివి ప్రియమేకాదా

రేకు: 1412-2 ముఖారి సం: 24-068

పల్లవి: అదివో కనుఁగొను మది యొకతె
యెదుటనే నెలకొనె నిది యొకతె

చ. 1: తేటలమాటలఁ దెర లదె కట్టీఁ
గాటుకకన్నులకలి కొకతె
జూటరిచూపులఁ జొక్కులు చల్లీ
నీటుగర్వములనెలఁ తొకతె

చ. 2: ముసిముసినవ్వులు మోపులుగట్టీ
రసికుఁడ నీపై రమణొకతె
కొసరులఁ గుచములఁ గోటలు వెట్టీ
మిసమిసమెఱుఁగుల మెలుఁతొకతె

చ. 3: కాయజకేలికిఁ గందువ చెప్పీ
చాయలసన్నల సతి యొకతె
యీాయెడ శ్రీవేంకటేశ కూడి నిను
వోయని మెచ్చీ నొకతొకతె

రేకు: 1412-3 కాంబోది సం: 24-069

పల్లవి: నీట ముంచు పాల ముంచు నీచిత్తము నీకుఁ
జాటితి నింతేసి దూరఁజాలఁబో నే నిఁకను

చ. 1: యెక్కువతలఁపు నీపై నేపొద్దు నాకైతే-
నెక్కడెక్కడో నీయెన్నికలు
వెక్కసాన సారెసారె విన్నవించలేను నీ-
కెక్కినది నాజన్మ మింతేపో యిఁకను

చ. 2: నీపేరు చెవులవినేయాసే నాకైతేఁ
బైపూతలేపో నీభావములు
యేపున మొకమోట మేమియు నిన్ననలేను
పాపపుణ్యము నీపాలిదేపో యిఁకను

చ. 3: మన్నన నీకాఁగిటిలో మరపులే నాకైతేఁ
బన్ని మరురేకలే నీపనులెల్లను
యెన్నిక శ్రీవేంకటేశ యిపుడు నేఁ గోరినట్టి -
వన్నియు నాయ నమ్మికాయఁబో నా కిఁకను

రేకు: 1412-4 ముఖారి సం: 24-070

పల్లవి: మేరకు మేర నుండటే మెచ్చుటగాక
కోరి వాదులాటలేలే కొలమునాండ్లకును

చ. 1: నిక్కినిక్కి పతిఁజూడ నీకునెంట చెల్లుఁబడే
వొక్కటై యాతఁడు నావొద్ద నుండఁగా
పుక్కిటి వీడెము చూపి బూటకము సేసేవు
మొక్కలము లింతయేలే మొగనాండ్లకును

చ. 2: సన్న సేసే వాతఁడు నాసంగడినే వుండఁగాను
యెన్నఁడు నాలాడు నీ వెఱఁగవటే
కన్నుల సొలసేవేమే కమ్మర నాతని నీవు
యిన్నేసిచేఁతలేలే యిల్లాండ్లకును

చ. 3: చెంది గోరు దియ్యనేలే శ్రీవేంకటేశుఁ డిట్టె
పొంది నాతోఁ బరవశంబున నుండఁగా
కందువ బైపై నీవు కాతరానఁ దిరిగేవు
సందడి సేయఁగనేల సవతాండ్లకును

రేకు: 1412-5 భైరవి సం: 24-071

పల్లవి: చెల్లఁబో నన్నుఁ జెనకి చెనకించుకొననేల
చిల్లర నీ మేనిమీఁది చెనకులే చాలవా

చ. 1: ననుఁగని వూరకైన నవ్వేవు కిమ్ముల నీ-
పను లిందరికి నవ్వుఁబాటుగాదా
నిను నీవు చూచుకోవు నెయ్యమి నన్నొరసేవు
వొనర నీమే నిందరు నొరయుట చాలదా

చ. 2: వెల్లవిరి నిజమే వేమారు నెరపేవు
కల్లతోడ నిజ మోపఁగలదటరా
బల్లిదాన దొడ్డదొడ్డబాసలెల్లఁ జేసేవు
తొల్లి జెల్లనిమాడకు దొడ్డముద్రే కాదా

చ. 3: మెచ్చి నన్నుఁ గూడితివి మేలపుశ్రీవేంకటేశ
యిచ్చుట మెరమెచ్చులే యిందాఁకా గాదా
పచ్చిచేసే వింకా నీపడఁతులచేత మున్ను
పచ్చివెచ్చి మాటలనుఁ బడినదేచాలదా

రేకు: 1412-6 శంకరాభరణం సం: 24-072

పల్లవి: మేలుమేలు ఇన్నిటాను మించితివిగా
యీలాగువాఁడవౌత యెఱఁగము నేము

చ. 1: నవ్వు నవ్వకంత నీవు నాతో సారెకు నేఁడు
నవ్వినట్టె వున్నది నీనామముజాడ
జవ్వనపుబొమ్మలనే జంకించే విందుకుగా
యెవ్వతె నేరిపె నీకు నింతలేసివెల్లను

చ. 2: నిక్కిచూడ కంత నీవు నిలిచి కమ్మర నన్ను
నిక్కినట్టె వున్నది నీనిట్టతురుము
చక్కనై నీ కిదియునుఁ జందమాయ నెందరికి
మొక్కినాను వీడకుండు మోసలేదు నీకు

చ. 3: చెక్కునొక్క కంత నీవు చేరి నన్నుఁగూడుమని
చెక్కునొక్కినట్టె నీసేసలముద్దు
మిక్కిలి శ్రీవేంకటేశ మెరయుజాణవు నీవు
నిక్కము నీకాఁగిటిలో నేరుపుమీ నాకు

రేకు: 1413-1 లలిత సం: 24-073

పల్లవి: ఒకటిపై నొకటి నీవుపాయాలు
వెకలినీవిద్యలెల్ల వెల్లవిరి గావా

చ. 1: సందడి నాచేఇ ముట్టి సరసాలాడేకొరకే
పందెమాడవచ్చేవు పలుమారును
మందలించి నాచేత మాటలాడించవలసి
అందపుఁగత లడిగే వది నే నెఱఁగనా

చ. 2: యేరా నాకుచగిరు లిటు ముట్టేయందుకుంగా
హారములు చిక్కుదీసే పది మేలురా
గోరికొన దాఁకించేకొరకుఁగా చెక్కుముట్టి
యీరీతి వేడుకొనే విన్నియుఁ దెలిసెరా

చ. 3: యీకడ నన్నుఁ గూడేఇందుకుఁగా నింతసేసి
యేకతమాడేనంటా నెనసితివి
పైకొని శ్రీవేంకటేశ బడివాయకుండా న-
న్నాకుమడిచిమ్మనేవు అవురా నీవు

రేకు: 1413-2 శంకరాభరణం సం: 24-074

పల్లవి: అన్నిపనులు మీకే అమరుఁగాక నేము
కన్నుల నన్నియుఁ గనుగొంటిమిగాక

చ. 1: మీరే తెలియవలె మీలోనిజగడాలు
మారుఁ డెఱఁగవలె మరి మీఁదను
వూరకే మీమాఁట లూఁకొనేచెలులము
కోరి సాకిరి చెప్పఁగూడునా మాకు

చ. 2: చనవు లియ్యఁగవలె చలములు మానవలె
మనసు లెనయవలె మరి మీఁదను
యెనయఁగలిగినట్టియిద్దరి మిమ్ముఁ జూచి
కనుసన్నఁ గోపించఁగలమా నేము

చ. 3: శ్రీవేంకటేశ నీచిత్త మియ్యఁగ -
నీవనితాఁ గూడె నిటు నిన్నును
పూవుఁబరిమళపు పొందులమీలోని-
భావాలు మాకెల్లఁ బలుకఁగవసమా

రేకు: 1413-3 పాడి సం: 24-075

పల్లవి: మొకమోటములకెల్ల మొదలు నేను
వెకలినీతమకము విడిపించఁగలనా

చ. 1: ముద్దులనీమోము చూచి మొక్కకుండలేను నీతో
గద్దించి నే నలుగఁగఁగలనా
పొద్దువొద్దు నేఁ దలఁచి పులకించికుండలేను
వద్దని నీగుణములు వారించఁగలనా

చ. 2: చేరి నేను ముచ్చటలు చెప్పకుండలేను నీతో
ధీరత నేఁ జలము సాదించఁగలనా
పేరుకొని సారెసారెఁ బిలువకుండఁగలేను
దూరి దూరి నే నిన్నుఁ దుచ్చమాడఁగలనా

చ. 3: సతమైన నిన్నుఁ గూడి సంతసించకుండలేను
ఇతరులవలె నెగ్గు లెంచఁగలనా
రతివేళ నిన్నుఁ గడురాయడించకుండలేను
పతిగా శ్రీవేంకటేశ పంతమియ్యఁగలనా

రేకు: 1413-4 ముఖారి సం: 24-076

పల్లవి: ఇందుమీఁద సతిభావ మెట్లౌనో యేమౌనో
విందుగాఁ జెలువునికి విన్నవించరే

చ. 1: కోవిలకూఁతకుఁగానే గుండె జల్లురని చెలి
పూవకపూచినయట్టు పులకించె
మావినుండి యంతలోనే మదనభూతము సోఁకె
పోవులైనపుప్పొడినే పోయరే బడిమి

చ. 2: కోమలి చందురుఁడనే కొరవిదయ్యముఁ జూచి
దీమస మింతయు మాని దిగులందెను
తేమలైనవెన్నెలల దిమ్ముపట్టి నిలువున
మైమఱచెఁ గప్పురాన మంత్రించరే

చ. 3: ఇంతలో శ్రీవేంకటేశుఁ డిందుకు విచ్చేయఁగాను
చింతదీర మేనెల్లఁ జెమరించెను
వింతలైనరతులలో విరహపుసోఁకు వాసె
కంతుచిగురాకురక్ష గట్టరే యంగనకు

రేకు: 1413-5 సామంతం సం: 24-077

పల్లవి: పట్టరాదు వొకటికిఁ బది యౌదువు
అట్టె నీవన్నట్టే యవునౌఁ దలఁగరా

చ. 1: యీఁతలు మోఁతలు నీకుయీడకు రాఁ బొద్దులేదు
వూఁతగొని అక్కడనే వుండవయ్యా
చూఁతలకు మోరతోపుసుద్దులవాఁడవు నీ -
లేఁతనవ్వు నెఱుఁగుదు లేలే అంటకురా

చ. 2: అసలు రేసులు నీకు అంతకెల్ల నేనోప
వేసపునీరాజసాలు విడువవయ్య
మోసపోతి ననవద్దు ముదితలయెడలందు
దోసపులూట్లు మాని తోతో తొలఁగరా

చ. 3: సిగ్గులు నెగ్గులు నీకుఁ జెప్పిచూపనేల మాకు
వొగ్గిననీతొక్కుమట్టు కోరువమయ్యా
వెగ్గళించి ఇంతలో శ్రీవేంకటేశ కూడితివి
బొగ్గరపుఁ జింతలెల్ల పోపో మెచ్చాయరా

రేకు: 1413-6 ముఖారి సం: 24-078

పల్లవి: కదిసినమీఁద నింకఁ గడమనేల
చెదరె పలుకలెల్ల చిత్తగించు చెలిని

చ. 1: కొమ్మమతి కోరికలు కోటానఁగోట్లై
కుమ్మరించీ నీమీఁది కొనచూపులే
దిమ్ముఁగాఁకలే సారెఁ డెగనినిట్టూరుపుల
చిమ్ముఁజొచ్చె నిఁకనేల చిత్తగించు చెలిని

చ. 2: వనిత తమకమెల్ల వడిఁబెట్టీ నీమీఁద
చినుకు చిత్తడిమేనిచెమటలను
నినుపువిరహమున నివ్వెరగై నేఁడు
జినుగాయఁ దాలిములు చిత్తగించు చెలిని

చ. 3: తరుణినేరుపులెల్లఁ దండోపతండాలై
దొరయఁ గాఁగిటిలోనే తోడుచూపీని
యిరవుగ శ్రీవేంకటేశ కూడితి విట్టె
మరిగి తరములేక మన్నించు చెలిని

రేకు: 1414-1 శంకరాభరణం సం: 24-079

పల్లవి: ఎంతగబ్బితనమే నీ కింత లోననే
మంతనపువినయాల మానినివి నీవు

చ. 1: కొండవంటిదొర వచ్చి కోరి వాకిట నుండఁగా
అండనున్నచెలులు ప్రియము చెప్పఁగా-
నిండుకొన్నచలమున నిలుచున్నదానవు నీ -
గుండె యెంతరాయే కడుఁగోమలివి నీవు

చ. 2: చేరి నీవిభుఁడు నిన్ను చెట్టవట్టి వేఁడుకోగా
కోరికలు నీలోనే కొనసాగఁగా
మారుకొన్నయలుకతో మాటలాడే వతనితో
సారె నింతవెగటేలే జవ్వనివి నీవు

చ. 3: ఇంతటి శ్రీవేంకటేశుఁ డెనసి బాసలియ్యఁగా
సంతమై మరుబలమే సాకిరిగాఁగా
వింతరతులను చొక్కి వెరగుతో నుందానవు
చింత ఇఁకనేలే మేలు చేకొన్నదానవు

రేకు: 1414-2 బౌళి సం: 24-080

పల్లవి: ఒక్కమాఁటే ఇంతయేల వోరుచుకొనేవు
వెక్కసపునీమతికి వేడుకయ్యీఁగాని

చ. 1: మచ్చరము గలిగిన మాటమాటలఁ బతికి
లచ్చన నీకొనగోరిలాగు చూపవే
యెచ్చుకుందు లిద్దరిలో నేమేమి గలిగినా
పచ్చిపచ్చిరతులలోపలఁ దేరీఁగాని

చ. 2: చలమెంత గలిగినా సారెసారెఁ బతికిఁ
గులుకుఁజూపులలోనే కుప్పళించవే
చెలఁగి ఇద్దరికి నెఁజెరి వెంత గలిగినా
పలుకులరసాల బచ్చిదేరీఁగాని

చ. 3: ఆస లెన్నిగలిగిన నటు శ్రీవేంకటపతి
బాసలకూటములలోఁ బచరించవే
గాసి మాని మతిలోని కడమదొడమలెల్ల
సేసలతమకములో సిగ్గుదేరీఁగాని

రేకు: 1414-3 బౌళి సం: 24-081

పల్లవి: ఇంతేపో యెడమాట లిఁకనేఁటికి తా-
నంతే వంగళమైతే నంతకంటె నేను

చ. 1: వొయ్యారములతనవొప్పు చూచే తనిసితి -
నయ్యో నిం కానేలే ఆసుద్దులు
గయ్యాళియై తనకన్నులనే మొక్కితేను
వెయ్యేసి మతిలో దీవించితినే నేను

చ. 2: నానాగతులు తననవ్వులలోనే తనిసితి
ఔనే యింకానేలే ఆసుద్దులు
తానే ముచ్చటమాట తలఁపులోఁ బాదుకొంటే
మోనాన నూఁ కొంటి మొదలనే నేను

చ. 3: గద్దరికోపము తనకాఁగిటనే మఱచితి-
నద్దివో యింకానేల యాసుద్దులు
వొద్దనే శ్రీవేంకటేశు- డూరడించి యిచ్చీ మోవి
చద్దివేఁడి కింక నిట్టె చవిగొంటి నేను

రేకు: 1414-4 గౌళ సం: 24-082

పల్లవి: ఒకరొకరిమనసు లొక్కటాయను
మొకమొకములు చూచి ముచ్చటాడినట్లు

చ. 1: మానినినవ్వినవ్వు మరునిబాణపుబూవు
సానదీరి పతి కొక్కసరి వచ్చెను
ఆనకమ్మై మారుకుమా రాతనిచూపులు ఇంతి-
కోనలకుచము లందే గురిదాఁకినట్లు

చ. 2: వనితయాడినమాట వంచినపూఁదేనెవూఁట
ఘనుని కొక్కటి తారుకాణాయను
వెనుకొని యంతలోనె విభునిమొక్కులు అతి -
వినయము లచ్చోనే వియ్యమందినట్లు

చ. 3: చెలియత త్తరములు చేఁతలబిత్తరములు
యిల శ్రీవేంకటపతి కితవాయను
యెలమిని సతిరతి యితనికాఁగిటిలో
కలకాలమును నట్టె కాణాచైనట్లు

రేకు: 1414-5 గుండక్రియ సం: 24-083

పల్లవి: వద్దు నన్నుఁ జెనకకుర వాదేఁటికి
చద్దివేఁడికి సొలపుజంకెనలు మేలు

చ. 1: వొలసినొల్లముల పొం దొనరించుకంటేను
అలవోకలైనపొలయలక మేలు
కలసీకలయనిమనసు కసిగాటుకంటేను
తలపులో నడియాసతమకమే మేలు

చ. 2: పచ్చివెచ్చులకూర్మి పచరించుకంటేను
కొచ్చి వూరకయుండుగుట్టు మేలు
వచ్చియును రాములను వడిఁబొరలుకంటేను
మచ్చరము మాని మెఇ మఱచుటే మేలు

చ. 3: తనిసియునుఁ దనివోనిరతులకంటేను
కనుఁగొనుచుఁ జెలఁగుసంగతులే మేలు
యెనలేని శ్రీవేంకటేశ యిన్నిటికంటే
నినుఁగలసియున్ననా నేరుపే మేలు

రేకు: 1414-6 ముఖారి సం: 24-084

పల్లవి: అంత కోపితేనే మమ్ము నట్టె నగుమీ
చెంత నీవు చెనకిన చెనకక మానము

చ. 1: వొక్కటంటే రెండనక వుండుదురా యెవ్వరైనా
మక్కువ ముందర చూచి మాటాడరా
యెక్కువైనదొరవైతే యేలుదుగాని భూమెల్ల
చక్కనిమావద్దనుంటే జరయకమానము

చ. 2: మెఱిచిన నుఱుమక మిన్నైన నుండదట
గుఱి నీచేతలు చూచి కోపము రాదా
నెఱజాణవైతే నీకునీవే వుండేవుగాని
నెఱయ సరికిబేశౌ నిలువకమానము

చ. 3: ముయికి ముయి వెట్టేది మున్నిటివారితగవు
నియతి నీవు మెచ్చిన నేను మెచ్చితి
ప్రియుఁడ శ్రీవేంకటేశ పెంపునఁ గూడితి నన్ను
నయమున గుఱుతులు నాటించకమానము

రేకు: 1415-1 శంకరాభరణం సం: 24-085

పల్లవి: ఇట్టెపో ధర నెవ్వరికి తాఁ
బెట్టినమమతే పెడకొలి మవును

చ. 1: తనియనికోర్క్యులు తరుణి వెంచఁగ
మనసే యెడపై మలగొనెను
తనుఁ దా నందునె తడఁబడి ముందర
వెనకయు నెఱఁగక వెరగులు వడెను

చ. 2: తలిరుఁబోఁడి పతిఁ దలఁచఁగఁ దలఁచఁగఁ
బులక లమ్ములై పొదిగొనెను
నిలువున నందుల నిబిడపుసందడిఁ
దొలఁగరాక తోదోపులఁ బడెను

చ. 3: కాఁగిట శ్రీవేంకటపతిఁ గూడఁగ -
నాగనియాఁకై యలవడెను
చేఁగచిగురుతనచేఁతే యిటులై
రాఁగినవలపుల రాయిడిపడెను

రేకు: 1415-2 శ్రీరాగం సం: 24-086

పల్లవి: నీవనఁగ నేమనఁగ నేరమేకాక
దోవలేని దోవలనుఁ దొక్క నెట్టువచ్చునే

చ. 1: కోరిననీకోరికకు గురి గలిగినగాక
ఆరయ నొ౯ఁగాదని యాడవచ్చును
పూరకె బట్టబాయిట నులివచ్చిమాటలను
దూరన గొలలేసినఁ దుద నెందు దాకునే

చ. 2: పొసఁగ నీపతిపేరు పొందుగఁ జెప్పినఁగాక
కొసరి బలిమిఁ దోడుకొని వత్తుము
పసపుఁజీరవాని బట్టుమని యాడితేను
దెసల మాబోఁటి కెట్టు దెలియఁగవచ్చునే

చ. 3: యిక్కడ శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నుఁ జూచి
వొక్కమనసున నింక నుందుముగాక
తెక్కువఁ గడవలోన దీపము ముట్టించిన
దిక్కులఁ దేజములెల్ల దీపించివుండును

రేకు: 1415-3 బౌళి సం: 24-087

పల్లవి: ఇప్పట నుండియు నీతో నింత యేలరా నా-
తిప్పరానిచేతఁలందే తేటపడీఁగాక

చ. 1: నీ వేమిసేతువుర నిన్నుఁ జూచి యాడలేని -
యీవల నామొగమోట మింతసేయఁగా
కోవరపునామనసు కోపము మించినప్పుడు
కావలసినపనులు గానుపించీఁగాక

చ. 2: తప్పేమీ నీవంకఁ దలరా నీతో నలిగి
యప్పటి మాటాడేనా యాసలుగాక
యెప్పటికి నింతయేల ఇద్దరి మనలోలోని-
చిప్పిలుఁగాఁకలే బుద్ధిచెప్పీ నింతేకాక

చ. 3: ఇందులో నీకడమేది ఇట్టె నిన్నుఁ బైకొని నే
ముందు నిన్నుఁ జెనకనిమోసముగాక
విందుగా శ్రీవేంకటేశ వింత నీనాకూటమికిఁ
జందమైన గురుతులే సాకిరయ్యీఁగాక

రేకు: 1415-4 ముఖారి సం: 24-088

పల్లవి: కనుఁగొనరే యిరుగడ చెలులూ
పనివడి యివి యేర్పరచఁగఁగలరా

చ. 1: ముదితనవ్వులును మొగిఁ బతికాంతులు
గుదిగొని యిరుదెసఁ గూడఁగను
యిది దిన మిది రే యిపుడని యెఱుఁగక
ముదముల చెమటల మునిఁగిరి దాము

చ. 2: కలికికోరికలుఁ గాంతునియాసలు
కలసెను మనసులఁ గౌ లనిసి
తలఁపుల నివియే తడఁబడఁజేయఁగ
నిలువున నూరకె నివ్వెరగైరి

చ. 3: అతివనేరుపులు నటు శ్రీవేంకట-
పతిరతులు నొకట బలుసుకొని
చతురతనంబుల సందడిసేయఁగ
యితవగుకాఁగిట నెడమీరైరి

రేకు: 1415-5 సామంతం సం: 24-089

పల్లవి: ఎన్నఁడు నెఱఁగమమ్మ యింతులాల
కన్నెకు నెందుండివచ్చెఁ గాఁకలెల్ల నిపుడు

చ. 1: తలపోఁతే ఘనమాయఁ దరుణికి నేపొద్దు
నెలవై కుచగిరులు నిక్కఁగాను
అలరి మీఁదటిపను లైనరీతి నాయఁగాని
కలిగెఁబో యేడలేని కాఁతాళ మిపుడు

చ. 2: చెక్కుఁచేయి ఘనమాయఁ జెలియకు నీవేళ
నిక్కి జవ్వనము మేన నిలువఁగాను
యెక్కు వమదనకళ లేచినప్పు డేచెఁగాని
దక్కెఁబో తమకములతడఁబా ట్లిపుడు

చ. 3: వేడుకలే ఘనమాయ వెలయు శ్రీవేంకటేశుఁ-
డీడ నేఁ డీయింతి నెనయఁగాను
మేడెపుఁజెమటలెల్ల మించినాను మించెఁగాని
కూడెఁబో రతులలోని కూటము లిన్నియును

రేకు: 1415-6 శంకరాభరణం సం: 24-090

పల్లవి: నిక్కి మానతియ్యవయ్య నేఁడైనను
పక్కన నీసుద్దులెల్లఁ బచ్చిదేరీ నిపుడు

చ. 1: వేడుక నీపలుకులు వినరానివేదాలు
కూడేది గొల్లెతలగుంపుఁగాఁగిలి
ఆడేటి దొకటి నీయసిమలోని దొకటి
యీడ నాతో నాడుమాఁట లివియైన నిజమా

చ. 2: పూఁతలనీకతలెల్లఁ బుణ్యపుఁదెరువులె
చేఁతలు రుకుమిణిఁ దెచ్చినముచ్చిమి
వాఁత వ్రాసే దొకటియు వక్కణించే దొకటియు
బాఁతిపడి నీవుసేసేబాసలు నమ్ముదునా

చ. 3: చేకొని నీవుండేది శ్రీవేంకటాచలము
ఆకడితలఁపులు పదారువేలు
యీకడఁ బలుకుఁబంత మెక్క నన్నుఁ గూడితివి
కాకరినీపనులే లోకమున సమ్మతము

రేకు: 1416-1 దేసాళం సం: 24-091

పల్లవి: సేయనీవే యెమ్మెలెల్లాఁ జేసెవెల్లా
బాయిటఁ దనకుఁ జిక్కెఁ బండినకొల్లా

చ. 1: పన్నినమరుఁడు బెట్టుపాయ మిది తట్టుముట్టు
యెన్ననేల యింతేపో యిది నాగుట్టు
విన్నవించి సారెసారె వేసఁట దనకు బుట్టు
వన్నెలేలే యిఁకఁ దనవలసినట్టు

చ. 2: బూక లెంతయినఁ గద్దు పోయ నిదే కడుఁబొద్దు
వాకునిష్టూరములేలే వద్దువద్దు
యీకడ నేనేమనిన నింతయుఁ దనకే ముద్దు
చేకొనినతనసుద్ది చెప్పరాని బద్దు

చ. 3: అంతలోనే తనపొందు ఆధరపానమే విందు
వింతయ్యైనరతులే వెనకముందు
యింతటి శ్రీవేంకటేశుఁ డిపుడే విచ్చేసె నిందు
పంతము చెల్లఁగఁ గూడేభావము చేకొందు

రేకు: 1416-2 పాడి సం: 24-092

పల్లవి: జవ్వన మందరి కొక్కసరియే కాదా
ఇవ్వల నింతేసి చేసి యేల యేఁచేవే

చ. 1: మదనునియమ్ముఁవాఁడి మగువ నీచూపువాఁడి
వెదచల్లువలపులు వేఁడివేఁడి
మదిఁ దమకము నిండె మాటలనే పొద్దువోయ
యిదివో యీగతి నన్ను యేలయేఁచేవే

చ. 2: చందురువెన్నెలజోలి సతి నీనవ్వున నాలి
సందడిఁ గోరికలెల్ల జాలిమాలి
కందువ చిత్తము రాఁగె కాఁకలు మేనున మూఁగె
ఇందులోనె నీవు నన్ను యేల యేఁచేవే

చ. 3: పడి నమృతపుబావి వనిత నీమోవియీవి
జడియుఁగాఁగిటిపొందు జమళిఠీవి
కడ శ్రీవేంకటపతిఁ గనక కూడితి నేను-
నెడయ నింతటిమీఁద యేల యేఁచేవే

రేకు: 1416-3 రామక్రియ సం: 24-093

పల్లవి: ఇంతో నేఁ డిట్టె తోఁచె నిది యొక్కకాలము
కాంత కిన్నియు మేలుకాల మాయనే

చ. 1: కన్నుఁగొనల నిదివో కారుమెరుఁగులు మించె
వున్నతి తురుముమేఘ ముదఇంచెను
సన్నపుచెక్కుచెమట జడినట్టి కురిసీని
కన్నెభావ మిది వానకాలమాయనే

చ. 2: తలపోఁత విరహపుతాపపుటెండలు గానె
వెలయ నూరుపుగాలి విసరీని
తలచూపరాక చిత్తజునిపొఁజులు మూఁగి
కలికిమై వేసవి కాల మాయనే

చ. 3: సంతమై శ్రీవేంకటేశ్వరుఁడు గూడఁగ నిదె
మంతనపుఁబులకల మంచు ముంచెనే
చింత లిన్నియునుఁ బాసి చిత్తములు చెంగలించె
కాంతచందము చలికాల మాయనే

రేకు: 1416-4 కాంబోది సం: 24-094

పల్లవి: ఇందుకెల్ల నాకుఁ జనవిచ్చితో లేదో
అందరు వినఁగ నాకు నానతియ్యవే

చ. 1: వెలఁది నావిన్నపము వింటివో లేదో యే -
పలుకైన నన్ను నిట్టె పాలింతువు
అలుకెంత గలిగిన నతనిమీఁదా నీ -
తలఁపున్న నిఁక నేమిఁ దడవకువే

చ. 2: కోమలి నాదండము చేకొంటివో లేదో ఆతఁ-
డేమనిని నవియెల్ల నిందుకొనవే
నీమది నింతగోపము నిలుపుదురా
యీమాఁట తనదేకా నెంచుమనెనే

చ. 3: నిచ్చలును నన్ను మన్నింతువో లేదో నేఁ-
డిచ్చటను శ్రీవేంకటేశుఁ గూడితి
మెచ్చితి రిద్దరు మీరు మీ నను యివి
తచ్చన లింతేకాక తగ్గుమొగ్గులా

రేకు: 1416-5 గుండక్రియ సం: 24-095

పల్లవి: తెలిసె నీగుణమెల్లాఁ దేటతెల్లమై
కలఁడన్నవారికెల్లాఁ గలిగినట్టేపో

చ. 1: తచ్చనైన తలఁపులో దాఁగివుంటివో కాని
ఇచ్చట నేఁ దలఁచితే నెదురైతివి
మచ్చికఁ బ్రంహ్లాదుఁడుమా లోనఁగలఁడంటే
నచ్చట నుండితివి నేఁ డటువలెనేపో

చ. 2: చూపులోనఁ గనుపాపచొప్పున నుందువో కాని
యేపున నెందుఁ జూచిన నింతా నీవే
పైపై పదారువేలు పడఁతులకును పెక్కు-
రూపులై నిలిచినవరసవలెనే పో

చ. 3: పంతపునాకాఁటిలోఁ బాతురాడితివోకాని
దొంతివెట్టి రతులెల్లఁ దోడుచూపితి
యింతలోనే శ్రీవేంకటేశుఁడ నీదాసులకు
సంతతము నీకృప సతమైనట్టేపో

రేకు: 1416-6 భూపాలం సం: 24-096

పల్లవి: తెలుసుకో నీపేరు దేవుఁడవట
కలగాదు నిజతారుకాణలట

చ. 1: అల్లాడ నొకలేమ అడిగితినసనె నిన్ను
వల్లెగా నీకేమిగావలెనోకాని
చల్లుఁజూపుల జవరాలు చక్కనిది యాకెరూపు
యెల్లచోటఁ దనపేరు యిందిరయట

చ. 2: మక్కువ నాడినమాఁట మఱవకుమనె నిన్ను
యెక్కువ నీవాకెతోడ యెన్నఁడోకాని
తొక్కినపదములోని దొమ్మివేళఁ దోఁచునట
చిక్కుల జెప్పినఁ బచ్చినదేరునట

చ. 3: యింతలోనే వచ్చి తా నీయెదుట నిన్నియు ననె
మంతనాన యెంతటితమకమోకాని
వింతగా శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితి విట్టె
మంతుకెక్కె విన్నియు నీమహిమలట

రేకు: 1417-1 ఆహిరి సం: 24-097

పల్లవి: ఏమిసేతు నీకు నే నీయింత నింతె
నీమేలే నామీఁద నెరపుమీ ఇపుడు

చ. 1: చిత్తములో నన్ను దయసేయఁగా నాలో
తత్తరాన నుండలేక తాఁకనాడితి
ఇత్తల నాతమకమె యింతసేసె నాతప్పు-
లెత్తి నీవాడిన నవి యెన్నైనఁ గలవు

చ. 2: యెదుట నీవుండఁగానే ఇందాఁక నెడసిన-
వుదుటుఁగాఁతాళాన నుప్పటించితి
కదిసినజవ్వనపుఁగాఁకఁ బడ్డదానఁగన
తుదమొద లెఱఁగ విందుకు నలుగకుమీ

చ. 3: అక్కున నీవు నన్ను నలమఁగా నంతలోనె
గక్కన నే ముందు నిన్నుఁ గాఁగిలించితి
యెక్కువ శ్రీవేంకటేశ యెప్పుడును నీకు నే
మక్కువసతిఁ గనక మనసు చూచితిని

రేకు: 1417-2 వరాళి సం: 24-098

పల్లవి: అప్పుడైనా సంతోసమౌనా నీకు
యెప్పుడుఁ గూటమికంటె నిదియే మేలు

చ. 1: యిప్పడు నీగుణము నే నెఱిఁగి కమ్మర నీ -
కప్పినవలలకుఁ జిక్కకపోదు
యిప్పటి యీవెదఁ బొందేయిందుకంటే నామోహ-
మొప్పగించి వొక్కచోట నుండుటే మేలు

చ. 2: ఇటువంటినీవెకా నేనెంత నిన్నుఁ గొసరి
అటని నాతమక మాఁపలేను
చిటిపొటియలుకల చిందువందై యుండుకంటె
తటుకునఁ దెగువైనతలపోఁతే మేలు

చ. 3: విన్నవేపో తొల్లియు శ్రీవేంకటేశ నాలో-
నెన్ని యిట్టె నిన్నుఁ గూడి యెడయలేను
మన్ననరతుల మైమఱచి నే నుండుకంటె
వున్నతి నీగోరితాఁకు కోరుచుటే మేలు

రేకు: 1417-3 ముఖారి సం: 24-099

పల్లవి: మేలైన నాలైన మెచ్చే నాకు
ఆలకించి తను నవ్వఁగాదనఁబోయేనా

చ. 1: యింతవిచారమేల యిందుకుఁగాను ఆతఁ-
డెంతసేసిన నదే యితవు నాకు
సంతసమైతే దనకు జాలుగాక నే -
నెంతకోరిచిన నేమాయరా

చ. 2: వేమారుఁ దనకు నే విన్నవించనోప నిట్టె
యేమని యానతిచ్చిన యింపే నాకు
దీమసాన నీవేళఁ దీరకున్న మానెఁగాక
ప్రేమ మీఁదటికైనాఁ బెంచకుండీనా

చ. 3: పలుమారుఁ బంతమిచ్చి పలుకఁగాని యెంత
చలిమైన బలిమైన సమ్మతే నాకు
వలసి శ్రీవేంకటేశ్వరుఁడు గూడెఁ గాక
తొలుత నిటులైతే నే దూరఁబొయ్యేనా

రేకు: 1417-4 సామంతం సం: 24-100

పల్లవి: పలుకుఁబంతము నొక్కపాటి గావద్దా
చెలుములు నలుకలు చెల్లునా విభుఁడా

చ. 1: ఇంతలో నీమాటలకు నెగ్గులెంచేవాఁడవైతే
చెంతల నన్ను ముందు చెనకనేల
సంతముగాకుండ రేపు జంకెన కోరువలేవు
కొంతగొంత తెగి కొంకఁగూడునా విభుఁడా

చ. 2: కొనగొనచేఁతలకే కోపగించేవాఁడవైతే
చనవిచ్చి సరసాలు జరపనేల
అనుకోకుండఁగలేవు అందుకు నిలువలేవు
వనధిలో లోఁతెంచవలెనా విభుఁడా

చ. 3: మత్తిలి మైసోఁకులకే మఱపొందేవాఁడవైతే
కొత్తగా శ్రీవేంకటేశ గుంపెనింతేల
హత్తినకూటమివలె నతిరాజసమువలె
తత్తరాలుఁ దామసాలుఁ దగునా విభుఁడా

రేకు: 1417-5 గుండక్రియ సం: 24-101

పల్లవి: ఓడలు బండ్ల వచ్చు నొక్కవేళ దానికేమి
కూడినమీఁదటఁగాని కూరిమి లేదు

చ. 1: నీవు విచ్చేసినదాఁకా నెలఁత ప్రియము చెప్పె
సేవలు నీవాకె కిఁకఁ జేయవలసె
తావులఁ దగులయినదాఁకానేపో యెవ్వరికి
యేవల జొరక లోఁతెఱఁగరాదు

చ. 2: అంకెకు వచ్చినదాఁకా నాడినట్టె యాడెఁ జెలి
ఇంక నీవాకెకుఁ బంతమియ్యవలసె
పొంకము లట్లనేపో భూమిమీఁద నెవ్వరికి
లంకెలఁ బెనఁగ కిట్టె లావెరఁగరాదు

చ. 3: ఇప్పు డింతపడి నిన్ను నింతి రతులఁ జొక్కించె
పిప్పిగా నాకెమెఇ మఱపించవలసె
యెప్పుడు శ్రీవేంకటేశ ఇంతికి నీకిదియేపో
ముప్పిరిమాటలఁగాని ముచ్చట వోదు

రేకు: 1417-6 వేళావళి సం: 24-102

పల్లవి: ఆతనికి నిది పరాకౌనో కాదో
కాతరపుభ్రమ నేఁ గాచుకున్న దానను

చ. 1: యెప్పుడు వచ్చునో విభుఁ డేమని పలుకునో
అప్పుడు నేరరాదంటూ నేను
రెప్పవెయ్యక కన్నుల రేఁగి రేఁగి కనుగొంటాఁ
జప్పు డాలింపుచు నే నిచ్చట నున్నదానను

చ. 2: యెదురుగఁ బోకున్న యేమని యెగ్గుపట్టునో
అదనేదో విభునికినంటా నేను
వెదచల్లుఁగూరిమితో వేఁగు దివ్వె వెట్టుకొని
నిదుర గంటికి రాక నిలుచున్నదానను

చ. 3: యింతలోనె శ్రీవేంకటేశుఁ డిందు విచ్చేసి
యెంతకెంత నన్నుఁగూడె నిదె యంటాను
సంతసపుఁబులకల జడియుచుఁ గరఁగుచు
వింతరతుల విఱ్ఱవీఁగుచున్నదానను

రేకు: 1418-1 లలిత సం: 24-103

పల్లవి: కోరి బిడ్డఁడంటాం గంటి గోవిందుని
సారెసారె దూరనేల చందమాయనే

చ. 1: వెల్లిమడుగు లీఁదఁబోవు వెడఁగు కొండ లెత్తఁబోవు
చుల్లరీఁడు మా కులందు సురిగి తిరుగునే
వల్లెతాట రోలఁగట్టువరచినను పరచినను
యెల్లనాఁడు మానఁడింక నేమిసేతువే

చ. 2: వేఁడుకొనఁ బెచ్చుపెరుగు వెరపఁ డింత తల్లికైన
వాఁడియడవిఁ దిరుగు బండి వాలఁదన్నెనే
పోఁడిమలర నెంత నేము బుద్ది చెప్పినాడువినఁడు
వీడేటి బాలుఁడమ్మ వింత చూడరే

చ. 3: చెలులనెల్ల బంగపెట్టి చేఁతలందె కలికియాయ
పులుమీఁద నెక్కి తోలి పుడమి వెలసెను
మెలఁగి శ్రీవేంకటాద్రిమీఁద నిలిచె వింతలోనె
యెలమి నతఁడు చేయుచేఁతలెల్లఁ గంటిరే

రేకు: 1418-2 గుండక్రియ సం: 24-104

పల్లవి: అప్పటి నీచెలు వంతయును
కుప్పలుఁదెప్పలు కోరికలాయ

చ. 1: వాయలేక ననుఁ బలుమరుఁజూచే
సోయగంపునీచూపు లివి
సేయనిములుకులచిలుకలు మదనుని-
సాయకకోట్లచందములాయ

చ. 2: అడుగిడఁజాలక ఆడినమాటలె
బడిబడిఁ బలికేపలుకు లివి
జడిగొనుముత్యపుసరులై విరులై
విడువని వెన్నెలవేఁడియు లాయ

చ. 3: ముచ్చట వాయక మోహదాహమున-
నిచ్చేటి మోవులయీవు లివి
విచ్చనవిడి శ్రీవేంకటేశ నీ-
తచ్చనకూటపుతలపోఁతలాయ

రేకు: 1418-3 నాగవరాళి సం: 24-105

పల్లవి: ఇద్దిరతలఁపు లవె యింపు లవె మీలోన-
నద్దినకోరిక లవె అంపరాదా మమ్ము

చ. 1: నెలతరో నీవిదె నీవిభుఁ డల్లవాఁడె
పలికిన మామాఁటపట్లు నవె
తలఁపులుఁ దలఁపులుఁ దలకూడె మీలోని-
యలుక లిన్నియుఁ దీరె నంపరాదా మమ్ము

చ. 2: కప్పిన నీచూపు లవె కాంతునిరూప మదె
తెప్పలఁదేలేటిమీతెలుపు లవె
వొప్పన సేసితిమి మిమ్మొకరొకరిని మీకే
అప్పుడే చలము చెల్లె నంపరాదా మమ్ము

చ. 3: చిమ్ములనిచేతు లవె శ్రీవేంకటపతి-
కమ్మినతమకమలకాఁగి లదె
దొమ్మిగాఁ గూడితి రిట్టె దోమతెరమంచములో
అమ్ముడుజీతము లాయ నంపరాదా మమ్ము

రేకు: 1418-4 ముఖారి సం: 24-106

పల్లవి: ఔలే నేనే మీకు నలసైతిని
తేలించేవు యింతు కిదే చాలుఁగాదా

చ. 1: ఆరీతి నన్ను నిట్టె యాడవచ్చుఁ గాక మరు-
బారిఁ జిక్కి నావలెఁ బడవచ్చునా
నేరుపు మెరసి మీకు నెలఁత లిందరు నన్ను
దూరినట్టె యాతనిని దూరరాదా పోయి

చ. 2: అప్పటప్పటికి నన్ను నలుగకుమని బుద్ది
చెప్పవచ్చుఁగాక నాకుఁ జేయవచ్చునా
యెప్పటి మావొడఁబాట్లెఱఁగక నన్నునే మీ-
రుప్పటించే రాతనినే వుప్పటించరాదా

చ. 3: అంచెల నిందరును మీ రాతినిని నన్ను దగ్గ-
రించవచ్చుఁగాక తమి రేఁచవచ్చునా
యెంచఁగల శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడె
మించి యేకచిత్తాన మెచ్చరాదా యిఁకను

రేకు: 1418-5 ముఖారి సం: 24-107

పల్లవి: ఇన్నియుఁ గన్నవే కావా యిఁకనేఁటికే
పున్నమవెన్నెల పండి పొల్లపొయ్యీనా

చ. 1: యెన్నరానికాఁకతోడ నిప్పటినీచలములు
ఇన్నియుఁ జూతముగాక యెందువోయేనే
నిన్నఁ గుప్ప కోపములు నేఁ డాళ్లింతే గాక
యెన్నటివే కావా మీహృదయములు

చ. 2: విందువలె నామాట వినక సేసేచేఁత
కందము గాక నేనెక్కడ వోయేనే
ముందటికన్నులకంటే మొనవాండ్లనచన్ను-
లందమాయఁగాక చూపు లప్పటివే కావా

చ. 3: వేఁడివేఁడిరతుల శ్రీవేంకటేశ్వరుఁ గూడి
యేడు నిమిషము దోఁచె నిదిగదవే
నేఁడే పెండ్లి నీకు నేఁడే నాగవల్లి
పోఁడిమాయ మీలోని భోగములు

రేకు: 1418-6 రామక్రియ సం: 24-108

పల్లవి: ఎంతలే దాతనిమోహ మేమి చెప్పేవే
యింత నన్ను నాలించ విది పరాకా

చ. 1: ఆయలేవే చాలుఁజాలు అతనికి నేనేలే
వేయువేయువలపులవేడుకకాఁడు
పాయమునఁ దనమీఁది భ్రమఁ బడే నింతేకాక
యీయెడ నాపైఁ దన కిది పరాకా

చ. 2: యెంచనేలే చెలియ తా నెక్కడెక్కడనైనాను
కంచపుఁబొత్తుసతులగమికాఁడు
వంచినచూపుల నేనే వలలఁ జిక్కితిఁగాక
యీఁచుకంతయినఁ దని కిది పరాకా

చ. 3: అందము సేయఁగనేలే యందుకేమి పెక్కిండ్ల-
విందు గాఁడా యాతఁడు శ్రీవేంకటేశుఁడు
పందెమాడి నన్నుఁగూడెఁ బాయకిట్టె తన కింక
యెందరు గలిగినాను యిది పరాకా

రేకు: 1419-1 సాళంగం సం: 24-109

పల్లవి: మొదలనే యీజోక మోసపోక
పొదలించవలెఁగాక పొద్దువోక

చ. 1: నెలంతకు నీకుఁ బోదు నేరమి యెందును లేదు
యెలమి మీఇద్దరిలో నేలవాదు
కలఁచి చూచె నింతే కంతునికిఁ బొద్దు వోదు
వలచినమీఁదఁ బాయ వసముగాదు

చ. 2: ఇంతలేని వొట్లేల ఇద్దరికి నీలీల
పొంతనే లేచినయట్టిపొద్దువేళ
వంతుల దెప్పల దేలవద్దు వద్దు మీవోల
కొంత గొంత పంతమిచ్చి కొసరనేల

చ. 3: యిన్నియు నింతటఁ దీరె యెన్నికలు చేకూరె
చెన్నుమీరెఁ గూరిములు సిగ్గులు జారె
వన్నెల శ్రీవేంకటేశ్వరునకు నీకు సారె
మన్ననకూటమిలోన మంతనాలు చేరె

రేకు: 1419-2 సామంతం సం: 24-110

పల్లవి: మేలు మేలు నీజాడ మెచ్చితి నేను నీ-
వీలాగు గాకున్న నెన్ని కవుదువా

చ. 1: కన్నుల నేఁ జూచితేనే కవకవ నవ్వేవు
వున్నతి నీకు నాకు నేవూరిపొందురా
యిన్నేసిజాణతనము నీవు నేరకున్న
మున్ను రుకుమిణి నీకు మోహించునా

చ. 2: ఇంతుల నేఁ బిలిచితే నేమియని దగ్గరేవు
కొంతైన నే నిన్నుఁ బేరుకొంటినటరా
పొంత నిట్టె వుప్పువేసి పొత్తుగలయ వచ్చేవు
పంతము లేకుంటే శ్రీపతి వవుదువా

చ. 3: ఇట్టె నేనేకతమైతే నిటు నన్నుఁ గూడితివి
వొట్టిననీకు నాకు వొడఁబాటురా
దిట్టవు శ్రీవేంకటేశ తెగు వింత లేకుండితే
జట్టికాఁడ నీకు నేను సతమవుదునా

రేకు: 1419-3 లలిత సం: 24-111

పల్లవి: వలపెందుఁ జల్లినా వద్దనకువే
చలిగాలి యొకచోట సతమయ్యీనా

చ. 1: పైపై నీవిభుఁ డేపడఁతినో చూచెనంటా
కొపగించే వది యట్టే కొనసాగీనా
దీపించి మెఱుఁగులు దిక్కులెల్ల మెఱిచిన
రూపురేకై వొకచోట రూడికెక్కీనా

చ. 2: కోరిక నెవ్వతెపైనో కూరిమి నించెనంటా
దూరె వాతని నవి తుదకెక్కీనా
కారుకమ్మేవానలోనఁ గడఁగి పుట్టినయట్టి -
నీరుబుగ్గ లొకచోట నిజమయ్యీనా

చ. 3: శ్రీవేంకటేశుఁ డేచెలిఁ దొల్లి కూడెనంటాఁ
గావరించే వవి నీవు గంటివా నేడు
ఈవేళ నినుఁ గూడె నిట్టె పో భువిమీఁదఁ
బూవుఁ బరిమళము లెప్పుడు రెండవునా

రేకు: 1419-4 సాళంగనాట సం: 24-112

పల్లవి: పులుఁగునెక్కేటి పెద్దబొమ్మెలవాఁడు
కలికిచేఁతల నించీఁ గానరటే మీరు

చ. 1: పాముమీఁదనాడించినయట్టిబాలజోగిపిన్నవాఁడు
వాములవెన్నలుదినేవలుకాఁడు
చేముంచి కొండలెత్తేసిద్ధవిద్యలవాఁడు
కామినులాల వచ్చెఁ గానరటే మీరు

చ. 2: పొంచినరాకాసిఁ జంపి భూతనాథుడైనవాఁడు
పెంచెము గట్టుక వెరపించేవాఁడు
అంచెల విప్రవినోదై తిరిగేటివాఁడు
కంచుమిఁచై తిరిగాడీఁ గానరటే మీరు

చ. 3: విడివిడిచేతులతో విద్యములయాటవాఁడు
అడవిఁగాచేటిగంగ్యావులవాఁడు
చెడనివరములిచ్చే శ్రీవేంకటాద్రివాఁడు
కడు నెందు చనె వీనిఁ గానరటే మీరు

రేకు: 1419-5 సామంతం సం: 24-113

పల్లవి: అన్నియును నొక్కజడే యనవచ్చునా
కన్నుల పండువగాఁ గనవలెఁగాక

చ. 1: సన్నమాయ నెన్నడును చన్నుదోయిఘనమాయ
కన్నియ కీరెండు నంగములేకావా
యెన్ననేల యిందులోనేయెచ్చుకుందులాయనంటా
పన్నిన వారివారి భాగ్య మింతేకాక

చ. 2: నవ్వులు దెలుపులాయ నలుపాయ కనుచూపు
జవ్వనిమేనివిలాసములే కావా
యెవ్వరి కేమనవచ్చు ఇందుకుఁగా మనమున
నొవ్వులేల తా మున్ను నోచినంతేకాక

చ. 3: చెదరెఁ గెంపుల మోవి చెక్కులెల్లఁ జీరలాయ
ముదితపలుకులకు ముంగిలేకాదా
వెదచల్లె మచ్చిక శ్రీవేంకటేశుఁడిదె కూడె
మదనుఁడు సేసినట్టిమాయ లివి గాక

రేకు: 1419-6 సామంతం సం: 24-114

పల్లవి: రతి నీపలుకులకు రామనడపులకు
గతిగూడఁ గడమ రాగము సేయుమీ

చ. 1: పిల్లఁగోవిరపములు బెరయించఁగా నదే
గొల్లెతలమట్టెలకుఁ గూడె సుతి
పల్లవపుఁ బద్దముల పాటలు వాడుచుఁ
గల్లగాదు కడమ రాగము సేయుమీ

చ. 2: ముందు నీసంకపురవ రమునకు గోపికలెల్ల
కుందణపు టందెలకుఁ గూడె సుతి
చిందుల రాగములు చిలికించి చిలికించి
కందువులఁ గడమ రాగము సేయుమీ

చ. 3: పెనఁగేనీవూరుపులు పెరుగమ్మేకాంతల-
కొనగోరితాఁకులకుఁ గూడె సుతి
చెనకిత విందరిని శ్రీవేంకటేశ్వర
కనుచొక్కి కడమ రాగము సేయుమీ

రేకు: 1420-1 శ్రీరాగం సం: 24-115

పల్లవి: ఇందుకుఁగా నేమన్నా నెరవు తాను
ఇందరు నీతారుకాణ లెఱఁగనివా

చ. 1: వొల్లనిసతులమాట వొప్పులునుఁ దప్పులవు
చల్లనిచూపులయినచల్ల వేఁడవు
చెల్లుబడి నిచ్చకపుఁజేఁతలెల్ల మోఁత లవును
యెల్లవారు వివియెల్ల నెఱఁగనివా

చ. 2: మనసెనయనిచోట మక్కువలే తక్కువలౌ
తనివోనినవ్వులు తాపము లవును
చనివిచ్చి చెనకినవరసాలు విరసాలౌ -
నెనయవియీభావా లెఱఁగనివా

చ. 3: కూరిమిలేనిచోట కొసరులే కసరులౌ
కోరి చేకొనిన నివే కూటములౌ
వేరులేక కలసె శ్రీవేంకటేశుఁడిదె నన్ను
యీరీతి నింతులెల్లా నెఱఁగనివా

రేకు: 1420-2 ముఖారి సం: 24-116

పల్లవి: ఇటువలెనేపో నీయెన్నికలు నీ-
ఘటన చిన్నియు నీవే కానవుగాక

చ. 1: జడియునీమాఁట నీకుఁ జక్కనేకాదా
కడవారి కియ్యకోలు గావలెఁగాక
విడువక వేముచవి వేమెరుఁగనా యే -
యెడ నెవ్వారైనా నెఱుఁగుటగాక

చ. 2: మిక్కిలినీచేఁత నీకు మెచ్చేకాదా
దిక్కులవారికి నిన్నీఁ దెలుసుఁగాక
చొక్కి దసరూపు దానే చూడవచ్చునా
యెక్కడా నద్దములోనే యేరుపడుఁగాక

చ. 3: నేనును శ్రీవేంకటేశ నీవే కావా
ఐనప్పటి మఱపంతేకాక
తేనెతీపు తేనియకు తెలివియౌనా యిట్టె
పూని చవిగొన్నన్నుబోఁటి కింతేకాక

రేకు: 1420-3 సామంతం సం: 24-117

పల్లవి: తనువు తనదిగాని తలఁపు నీది
పెనఁగి మాఁకునఁ దీగె బెరసినయట్లు

చ. 1: మోమునఁ గన్నులుగాని మోహపుఁజూపులు నీపై
కామినిభావము చెప్పఁ గతలాయను
తామరలు కొలనిలోఁ దరులఁ బరిమళము
వేమారు నిండుకొన్నవిధమాయ నిపుడు

చ. 2: చెలితో మాటలుగాని చిమ్ముచేఁతలు నీపైఁ
గలిగినవిధమెట్లాఁ గనుఁగొనుమీ
చిలుకలు వనములఁ జెలరేఁగుపలుకులు
వలరాజునమ్ములకు వాఁడివెట్టినట్లు

చ. 3: పురముపై నుంటేకాని పువిదప్రాణము నీపై
గరిమల శ్రీవేంకటవిభుఁడ
సరిలేనిమీలోనిసరసపుఁగూటములు
ఇరవాయఁ బాలు నీరు నేకమైనగతిని

రేకు: 1420-4 సామంతం సం: 24-118

పల్లవి: ఏపులేల వూఁపులేల యెడమాటలేల ఇఁక
రాపులెల్లాఁ జక్కనయ్యీ రమ్మనవే తన్నును

చ. 1: అసము దించక బీరాలాడీఁగాక తాను
నసిగాటుఁ దత్తరము నాకంటెఁబో
ముసిముసి నవ్వు వచ్చీ మోముమోము చూచితేను
రసికుఁ డన్నిటానౌను రమ్మనవే తన్నును

చ. 2: తెచ్చుకోలుఁదెలివితో తెగువలాడీఁగాక
నచ్చుకొట్టే వినయాలు నాకంటెఁబో
పెచ్చువెరిగేది చూచి పెదవులే గొణఁగీని
రచ్చలో సుద్దులు మాని రమ్మనవే తన్నును

చ. 3: ప్రియమునఁ గాఁగిలించి బిగిసీఁగాక తాను
నయగారిమేమఱపు నాకంటెఁబో
దయ శ్రీవేంకటపతి తానే నన్నుఁ గూడె
రయమున దినమును రమ్మనవే తన్నును

రేకు: 1420-5 దేశాక్షి సం: 24-119

పల్లవి: అంగన లాతనివేళ అరసిరారో
సింగారరాయఁడు యేమిసేసీనో యీవేళ

చ. 1: వుప్పవడమౌ నిఁతక వువిదయుఁ దానీవేళ
అప్పుఁడు దధ్యన్నము లారగించు నీవేళ
అప్పుడే మొకమజ్జన నువధరించు నీవేళ
ఇప్పు డేమిసేసీనో యెఱఁగ మీవేళ

చ. 2: తిరువారాధనవేళ తిరువందికాపువేళ
అరిది యప్పాలు నన్నాలారగించు నీవేళ
దొలరకొలు నీవేళ తోదోపు లీవేళ
సిరివరుఁడిపు డేమిసేసునో యీవేళ

చ. 3: యిట్టే యలమేలుమంగ యేకతమాడేవేళ
చుట్టి రా సంగరంగాలు చూచేవేళ
మెట్టి శ్రీవేంకటపతి మెరసి యేఁగేవేళ
చెట్టాపట్టాలతో రతిఁ జెలఁగు నీవేళ

రేకు: 1420-6 శంకరాభరణం సం: 24-120

పల్లవి: ఒకటి గూడినను వేరొకటికిఁ బొసఁగును
వికటాలై నీవలన వేదనలే చెలికి

చ. 1: కమలాక్షిగనక యీకన్నీటికొలను దగు
తమకపుమేనికాఁక తగదు గాని
తమిఁ గీరవాణిగాన తగుఁ బొదలుమాఁటలు
అమరౌ చెదరినయట్టి నెరిపురులు

చ. 2: జక్కనకుచగనక సరిఁ దాపరవి మేలు
నిక్కి వెల్లనిమేనివెన్నెలఁ గూడదు
అక్కటా చిగురుఁబోడి కగుఁ జెమటలమంచు
గక్కన నిట్టూర్పు పెనుగాలి గాదుగాని

చ. 3: మదగజయానగాన మఱపుమదము దగు
అదనఁ గిందుపడేదే యది చెల్లదు
యెదుట శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
కదియ కింతయేఁచినకపటమే నేరమి

రేకు: 1421-1 సామంతం సం: 24-121

పల్లవి: నిక్కి నాతమకానకు నీవే కావలెఁగాక
యెక్కువ నన్నిటు గాన నెవ్వరున్నా రిఁకను

చ. 1: కోపగించి విన్నయితేఁ గొసరుదు నేను నన్నుఁ
బైపైనే బుజ్జగించి పాయలేవు నీవు
చాపలాన గొణఁగుచు సాదింతు నే నిన్ను
తీపుమోవి నాకు విచ్చి తేలింతువు నీవు

చ. 2: వేగిరించి విన్నయితే వెంగెమాడుదు నేను
బాగుగా నందుకు నీవు పకపక నవ్వుదువు
ఆగతి నడుగరానివైనా నడుగుదు నేను
సోగల సాదించి తెచ్చి చొక్కింతువు నీవు

చ. 3: ముందుముందే కాలజిమ్మి మొక్కులు మొక్కుదు నేను
అందుకంటే మునుప నన్నాదరింతువు నీవు
ఇందుకే శ్రీవేంకటేశ యెనసితి నే నిన్ను
కందువలఁ గరఁగించి కైకొంటివి నీవు

రేకు: 1421-2 శ్రీరాగం సం: 24-122

పల్లవి: మీరేమి దూరకురే మెలుఁతలాల
ఆరసి నే నెఱుఁగుదు నతనిగుట్టెల్లా

చ. 1: సొలసి యెవ్వతెదిక్కు చూచినఁ దాఁ జూచెఁగాని
మెలుపున నాతఁడు నామీఁదికన్నే
అలరి యీమాటలు తానాడిన నాడెఁగాని
కలదెల్లా నామీఁది కలవరింపులే

చ. 2: ననుపై యెవ్వతెతోఁ దా నవ్వితేనే నవ్వెఁగాని
చనవై నాతోనే పో సరసమెల్లా
చెనకి యెక్కడఁ బొందుసేసితేఁ జేసెఁ గాని
పెనఁగి నాపైనే పో ప్రియమెల్లను

చ. 3: వరుసిచ్చి యెందుండివచ్చినఁ దా పచ్చెఁగాని
సరి నాకాఁగిటనే పో సమరతులు
ఇరవై శ్రీవేంకటేశుఁ డయినఁ దా నాయఁగాని
పురముపై నన్ను మోఁచె నున్నవంతా లేఁటికి

రేకు: 1421-3 బౌళి రామక్రియ సం: 24-123

పల్లవి: రమణిజవ్వనము రామరాజ్య మిఁక
అమరఁగ నిటు గొనియాడరె చెలులు

చ. 1: కాంతకుచంబుల ఘనదుర్గంబులు
కాంతి జక్కనలు గజబలిసె
పొంతనె పిఱుఁదనుపులినపుఁదిప్పలు
మంతుకెక్కె నదె మదనుఁడు బలిసె

చ. 2: సతివలయపుముఖచక్రవాక మిదె
అతికళల చంద్రుఁ డదె బలిసె
మతకముతోఁ గచమండలరాజ్యము
మితిమీరిన తుమ్మిద లిటు బలిసె

చ. 3: తరుణీరతుల బంధపుబహురాజ్యము
నిరతి శ్రీవేంకటవిధి బలిసె
ఆరయ నతనిపుర మందుకుఁ బతిగా
సిరులుమించ నీచెలియును బలిసె

రేకు: 1421-4 బౌళి సం: 24-124

పల్లవి: వెలఁదివిరహ మెంతో విన్నవించితిమి నీకు
తలఁపుఁ దలఁపు మీకే తారుకాణలైనవి

చ. 1: మాట లెందున్నవోకాని మగువకోర్కులు నీ -
తేటలమోవియందే తిరమైనవి
నీటుఁజూపు లెందున్నవో నివ్వెరగై పూర్పులెల్లా
కూటున నీముద్రలపైఁ గుమ్మరించినవి

చ. 2: వివర మెందున్నదో వెలఁదికి వీను లివె
తవిలి నీసుద్దులందే తావైనవి
వువిదకు గమన మెందున్నదో పాదములు
యివల నీవున్నవీది కిటు మొకమైనవి

చ. 3: పంత మెందున్నదోకాని పడఁతికి వినయాలు
చెంతల నీదూతికకే సెలవైనవి
యింతలో శ్రీవేంకటేశ యిట్టే విచ్చేసి చెలని
సంతసానఁ గూడఁగాను జయము చేకొన్నది

రేకు: 1421-5 సామంతం సం: 24-125

పల్లవి: ఇద్దరి కిద్దరే సరి యీడుకు జోడుకుఁ దగు
గద్దరికన్నులఁ జూడఁగలిగెఁగా మనకు

చ. 1: పంతపు చెలిచన్నులు పసిఁడికాంతులకు
కాంతునిపీతాంబరపు కాంతులు సిరి
దొంతుల చెలినీలపుతురుము కాంతులకు
వంతుల మేనినీవర్ణము సరి

చ. 2: జలజాక్షివెలలేని జఘనచక్రమునకు
చలమరివలకేలిచక్రము సరి
కులికేటి యీయింతికుత్తికశంఖమునకు
చలివాయ రమణునిశంఖము సరి

చ. 3: కమలాక్షి శ్రీవేంకటపతిఁ గూడుటకు
రమణుఁడంటిన సమరతులు సరి
తమితోడ నిద్దరిక తారుకాణలై నట్టి -
సముకపు మోహముల సంతసములు సరి

రేకు: 1421-6 సాళంగం సం: 24-126

పల్లవి: నీకు నీవే చూచుకొమ్మీ నీయందు నేరమి
మాకుఁ దెలియదు యేమి మఱఁగోకాక

చ. 1: సెలవుల నగితేనే సిగ్గులకు వెలితా
కలికి నీయందు నేమి గనెనో కాక
కులికి మాటాడితేనే గుట్టులేనిదాయనా
వెలి నీచేఁత కదేమి వేఁగెనోకాక

చ. 2: తప్పకచూచితే పంతమునకు వెలితా
చెప్పరానిపని యేమిసేసితోకాక
యిప్పుడే తలవంచితే యెమ్మెలకు హీనమా
అప్పుడే యేయాయము నీవంటితోకాక

చ. 3: బొమ్మల జంకించితేనే పొందులకు వెలితా
సొమ్మల నీగో రేడ సోఁకెనోకాక
నెమ్మది శ్రీవేంకటేశ నెలఁతఁ గూడితి విట్టె
పుమ్మడితమక మెంత వుండెనో కాని

రేకు: 1422-1 సామంతం సం: 24-127

పల్లవి: రమణుఁడు దానై సరవ్వే నాకుఁ జాలు
భ్రమగావితనివోనిపంతమే చాలు

చ. 1: ఆడుకోలుమాటలు తా నాడనీ మానసీ నే -
నాడినమాటల కోర్చె నంతే చాలు
వాడుచుఁ దా నవ్వనీ నవ్వకమాననీ ఇఁక
యీడ నాచేఁతల కోర్చె నిదియో చాలును

చ. 2: పెన్నిధిఁ బానుపునకుఁ బిలువనీ మాననీ నే
సన్న సేసితేఁ దెలిసేసరవే చాలు
మన్నించి మాటాడనీ మాటాడకుండనీలే నేఁ
గన్నులఁ జూచినమెచ్చేఘనతే చాలును

చ. 3: ఆఁగి నాకు వలవనీ అటుగాక మాననీ
కాఁగిట నన్నుఁగూడినకతలే చాలు
ఆగతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
యీగతి నేకములైతి మిదియే చాలును

రేకు: 1422-2 సాళంగనాట సం: 24-128

పల్లవి: మేలు మేలుగా నీవు మెరయుటింత
యీలాగు నాకొరకు నింతసేసితివిగా

చ. 1: చెల్లెఁగా లంకలోనికిఁ జెప్పిపుత్తెంచినమాట
మల్లడిగా నల్లహనుమంతునిచేత
వల్లెగాఁ గొండలచేత వారిధి గట్టుట యెంచ
ఇల్లిదె నాకొరకుఁగా నింతసేసితివిగా

చ. 2: యెక్కెఁగా నీచలము నింద్రచంద్రాదులఁ గూడి
చక్కఁగా రావణు నట్టె చంపినవంక
పక్కనను వనచరబలము గూర్చుట యెంత
యెక్కువ నాకొరకుఁగా నింతసేసితివిగా

చ. 3: అందెఁగా నీకోరిక నన్నులమీ కూడినవంక
అందరుఁ జూడఁగా నీ వయోధ్యలోన
పొందిరి శ్రీవేంకటేశ పురమున మోచితివి
ఇందునే నాకొరఁకుగా నింతసేసితివిగా

రేకు: 1422-3 మంగళకౌసిక సం: 24-129

పల్లవి: కందువమీనిచ్చకల్యాణమునకు
అందములాయను అదన నివి

చ. 1: కలువలసేసలు కలికికి నీకును
సొలవక చూచేటిచూపు లివి
చిలుకులు మొల్లలసేసలు మీలో
నలుగడ ముసిముసి నవ్వులివి

చ. 2: తామరసేసలు తలకొనె మీకును
మోము మోమొరయుముద్దు లివి
సేమంతిసేసలు చెలియకు నీకును
చేమిరిగోళ్లచెనకు లివి

చ. 3: సంపెంగసేసలు సమరతి మీకును
ముంపులవూర్పులమూఁక లివి
యింపుల శ్రీవేంకటేశ చెలిఁ గలసి
సంపదఁ దేలితి చనవు లివి

రేకు: 1422-4 నాదరామక్రియ సం: 24-130

పల్లవి: ఏమిమాయసేసితివో యెవ్వఁ డెఱుఁగుర నిన్ను
నాముపలపుఁ దలకు నాకు నెక్కెరా

చ. 1: మాయపునీసుద్దులకు మాటలాడకుండేనన్న
కాయపునాపాయమే కాఁక రేఁచీరా
సోయగానఁ గోపగించి చూపుల జంకించేనన్నా
బాయట నాచెమటలు వచ్చిరేఁచీరా

చ. 2: పొరపొచ్చెముల నిన్ను బొమ్మల జంకించేనన్నా
అరిది నామొగమోటా లడ్డగించీరా
సరవి నీవొట్లకు చక్కఁగా నవ్వేనన్న
సరిగా నాపులకలు సందండించీరా

చ. 3: గొబ్బున నీమోవి గని గుక్కిళ్ళు మింగేనన్నా
అబ్బురపుఁ బరవశ మట్టె ముంచీరా
పుబ్బున శ్రీవేంకటేశ వొగి నన్నుఁ గూడితివి
తబ్బిబ్బై నామతులు తడఁబడీరా

రేకు: 1422-5 సామంతం సం: 24-131

పల్లవి: ఎంతకెంత జాణతనా లిఁకనైనాను
యింత చాలదా మన కిఁకనైనాను

చ. 1: బొమ్మల జంకించఁబోతే బొట్టు కస్తూరెల్ల రాలె
యెమ్మెలు మానవే నాతో నిఁకనైనాను
పిమ్మట గొణఁగఁబోతే పెదవికెంపులు రాఁగె
ఇమ్ముల నొక్కటిగారే ఇఁకనైనను

చ. 2: తప్పకచూడఁగఁబోతే తనువెల్లఁ జెమరించె
యెప్పటివలె నుండవే ఇఁకనైనాను
గొప్పగా నవ్వఁగఁబోతే కొప్పు గడువెడజారె
యిప్పటిబింకాలు వద్దే యిఁకనైనాను

చ. 3: ముందటఁ దిట్టఁగఁబోతే మొగమోటములు నిండె
ఇందు కేమిసేసేవే ఇఁకనైనను
అందమైన శ్రీవేంకటప్పఁడని నన్ను
యెందునుఁ బాయపు గూడి యిఁకనైనను

రేకు: 1422-6 ముఖారి సం: 24-132

పల్లవి: ఏదాయనేమి రొట్టె కింతా రెవేకాదా
దాదాత మోచెఁ బని తానే నేఁగానా

చ. 1: కలికి మాటాడకున్న కంకణాలే మాటలాడీ
మలసి యవే తననూరు గావా
కులికి తాఁ జూడకున్న కుచాలు దలెత్తిచూచీ
అలర నవే తనయంగములుగావా

చ. 2: చిత్తములోఁ దూరకున్న చెవులైన మాఁట దూరీ
మత్తిల్లి యవే తనమారుగాదా
పొత్తుకుఁ బిలువకున్నదోస మొక్కటియయ్యీ
కొత్తగా నదియు నొక్కకూటమే కాదా

చ. 3: కాయములు వేరైతే కాఁగిలి వొక్కటేయయ్యీ
మాయల నేనే తనమారు గాదా
చేయారఁ గూడితి నిట్టె శ్రీవేంకటేశుఁడను
చాయలు సన్నలు నొక్కసరియే కాదా

రేకు: 1423-1 శుద్ధ వసంతం సం: 24-133

పల్లవి: బాలికిగాని యింతి ప్రౌఢగాదు ఆకె -
చేలకొంగంటుచును మచ్చికసేయవయ్యా

చ. 1: నీవు వచ్చేదెఱఁగక నెలఁత నిన్నుఁ దాడి
చేవల్ల నిన్నటుచూచి సిగ్గువడెను
యీవల నాసిగ్గుదేర ఇంతితోడ సుతి గూడి
తోవ చూపి చూపి ఇట్టె తోడు వాడవయ్యా

చ. 2: నాటకసాల లోన నాతి యాడి నిన్నుఁగని
చీటికిమాటి నిట్టే సిగ్గువడెను
నీటున నాసిగ్గుదేర నీవు కోపులెత్తియెత్తి
తూఁటరితనముతోడ తోడాడవయ్యా

చ. 3: కాఁగిటికిఁ జేయి చాఁచి గక్కున నీమోము చూచి
చేఁగలనవ్వులు నవ్వి సిగ్గువడెను
యీగతి శ్రీవేంకటేశ యింతిసిగ్గుదేరఁ గూడి
కాఁగిటనే నించి నించి కళదాఁకించవయ్యా

రేకు: 1423-2 శంకరాభరణం సం: 24-134

పల్లవి: మనసులు చూచేమతమేల
కొనలచేఁతలకు గొత్తలివేల

చ. 1: నెలఁతవలపులకు నిట్టచూపే గురి
యెలమి మాపలుకు లిఁకనేలా
చిలుకుముదములకు చిఱునవ్వులె గురి
యిలఁ దారుకాణ లిఁకనేలా

చ. 2: చిత్తపుఁగరఁగుకు చిఱుఁజెమటే గురి
యిత్తల ముసగన లిఁకనేల
హత్తినకూర్మికి నండనునికె గురి
పొత్తులబాసలు పూఁచఁగనేలా

చ. 3: కాఁగిటిరతులకు కళలమోమే గుఱి
ఆఁగినయెడమాఁట లివి యేలా
యీగతి శ్రీవేంకటేశ కూడితివి
జాగులసరసపుసట లిఁకనేలా

రేకు: 1423-3 సాళంగం సం: 24-135

పల్లవి: ఇంతే నాతలపోఁత లింతికి మరేమి లేదు
కాంతుఁడ సతిచలము కాంక్షదీరుదాఁకనే

చ. 1: చెలిచెక్కుచేయి నిన్నుఁ జేరినయందాఁక
నిలుచుం డెదురుచూపు నినుఁ గనుదాఁకనే
అలపుటనురుసు లంగము లంటినదాఁకా
మలయుమోనము నీతో మాటలాడుదాఁకనే

చ. 2: కసరులుఁ, గొసగులు కాఁగిలించునందాఁక
వసివాడు లెల్ల నిన్ను పంపించుదాఁకనే
పసురుఁ బులకలెల్ల పైపడి చెనకుదాఁక
ముసిముసి గుంపెనలు నీమోని యానుదాఁకనే

చ. 3: మిక్కిలి పై కాఁకలెల్ల మేను చెమనించుదాఁక
సుక్కుల సిగ్గులు కనుచొక్కుదాఁకనే
పక్కన శ్రీవేంకటేశ పడఁతియు నీవు నిట్టె
వొక్కటౌట కలకాల మొద్దికౌదాఁకనే

రేకు: 1423-4 గౌళ సం: 24-136

పల్లవి: అసురల శిక్షించ నమరులఁ బాలించ
వెసఁ గొలువిమ్మనరే విన్నపాలకాంతలు

చ. 1: యేకతాన దేవుఁ డున్నా డింతులరతిఁ దగిలి
దాకొనడపసతులు దగ్గరరమ్మ
యీకడ నింతవొద్దు వోయినదీ నెరఁగఁడు
దాకొని జంకముకాంతలు విన్నవించరే

చ. 2: పూని యిందిరపాటలో నోలలాడుచున్నవాఁడు
బోనపుటింతు లెదుటఁ బొడచూపరే
పానిపట్టి నెత్తమాడేవరాకై వున్నవాఁడు
పూని గడేరమువారు పొంచియెచ్చరించరే

చ. 3: శ్రీవేంకటేశుఁ డదె శ్రీసతిఁ గూడున్నాఁడు
ఆవేళఁ బూవులు గందా లందియ్యరే
భావించి రాజసాన నభయహస్త మిచ్చినాఁడు
దైవ మాతనినే నమ్మి తరుణలు మొక్కరే

రేకు: 1423-5 రామక్రియ సం: 24-137

పల్లవి: రమణునికడకేఁగి రతి సలుపఁగరాదా
అమరపు మీకు మీకు నలుక లింకేలే

చ. 1: చిత్తజునికే తగు శివునికే తగుఁగాక
యిత్తల మతిలో మంట యింతి నీకేలే
పొత్తుల పాముకుఁ దగు పొంచి నీలాహికిఁ దగు
మొత్తపునిట్టూర్పుగాలి ముదిత నీకేలే

చ. 2: జక్కవలకే తగు చందురునికే తగు
నిక్కి పొద్దొకలాగులు నేఁడిది యేలే
చక్కఁదేంట్లకే తగు సంపెంగలకే తగు
చొక్కులకొప్పు చెదరు సుదతి ఇంకేలే

చ. 3: మోవిపండ్లకే తగు మొనచిలుకకుఁ దగు
యీవల నీమోవిగంటి యిప్పుడే యేలే
శ్రీవేంకటేశ్వరుఁడు చింతదీర నిన్నుఁ గూడె
భావము లొక్కటాయఁ బదర నింకేలే

రేకు: 1423-6 బౌళి రామక్రియ సం: 24-138

పల్లవి: కొలచి నాశాంతమే కోపము చూపీ
చెలు విది దెలుపరె చెలువుఁ డేమనునో

చ. 1: మఱి కొసరిన బొమ్మలు ముడివడె నవె
యెఱఁగనిపతిమతి యెట్టుండెనో
పెఱిమకు నగితేఁ బెదవులు గదలెను
తఱి నిందుకుఁ బతి తా నేమనునో

చ. 2: పుదుటున నడచిన పూర్పులు గిసరెను
యెదుటఁ జెలు లతని కేమనిరో
వదలుఁదురుమిడినవడి మోము మఱలె
తుద రమణుఁ డెంత దూరెనో తాను

చ. 3: కొనచెయివట్టిన గోరటు నాఁటి
యెనసి యతనిరతి యెట్టుండెనో
ఘనుఁడగు శ్రీవేంకటపతిఁ గూడితి
తననాగుఱుతులు దాఁగనివెట్లో

రేకు: 1424-1 బౌళి సం: 24-139

పల్లవి: అయ్యో యేమి చూచే నతివ దప్పక యిట్టె
పయ్యద కొంగల్లార్చి పలికించవయ్యా

చ. 1: చెక్కులవెంటఁగారేచెమట దుడువవయ్య
యిక్కడ నీకుఁ గైదండ యిచ్చి యలసె
లక్కవలెఁ గరఁగినలావణ్యరస మిదో
కక్కసపుఁగొప్పు మేఘపుజడివానలో

చ. 2: సురటి విసరయ్య సుదతి నీకొప్పు దువ్వి
అరుదుగ నసురుసురాయ నిదె
పరిపరిజవ్వనముపైఁ బరవశమో
మరుసముకములోని మాటలతేటలో

చ. 3: తమల మొసఁగవయ్య తరుణి నీమేను సోఁకి
తమకపురతిఁ జొక్కి దప్పిగొనెను
అమరఁగ శ్రీవేంకటాద్రీశ యిదియెల్లా
గొమరెవయసునను కోరినకోరికలో

రేకు: 1424-2 తెఁలుగుఁగాంబోది సం: 24-140

పల్లవి: మేలు మేలు మగువా మేరదప్పఁ దగవా
ఆలరిసేఁతలు సేసే వౌనౌనే నీవు

చ. 1: కన్నులైతేఁ తే దేటలు ఘాతలైతే మేఁటులు
యెన్నడు నేరిచితివే యింతి నీవు
సన్నలైతేఁ జాయలు జాడలైతే మాయలు
అన్నిటా జాణవౌదు వవునౌనే నీవు

చ. 2: తనువైతేఁ జిగురు తలఁపైతేఁ దగరు
ననుపైతి వెట్లాడే నాతి నీవు
పెనఁగితే నగవు బీరమైతే బిగువు
అనుమానమెల్లఁ దీరె అవునవునే నీవు

చ. 3: మోవియైతేఁ దీపులు మోహపురాఁపులు
వావి దెలిపితి వౌనే వనిత నీవు
శ్రీవేంకటేశుఁడ నేఁ జేకొంటిఁ గాఁగిట నిన్ను
ఆవిధమే చేకొంటి వవునౌనే నీవు

రేకు: 1424-3 రామక్రియ సం: 24-141

పల్లవి: నవ్వి నవ్వి జగడాలు నాఁటినేఁటి విగడాలు
ఇవ్వల నీపతితోనే యేలమ్మ నీకు

చ. 1: కడుఁ బెదవి కదలీకదలనిమాటలు
వడిఁ గసరులతోడివాలుఁజూపుతేటలు
పుడుకుఁ జెక్కు చెమట లూరేటివూటలు
యెడలేదు యింతలోనే యేలమ్మ నీకు

చ. 2: ఆరితేరినపయ్యదమరఁగు మొరఁగులు
నీరుకమ్మే చెక్కుచేతినిండునివ్వెరగులు
ఘోరపుఁగన్నీట మించు గుబ్బలకరఁగులు
యీరీతి వింతలోనే యేలమ్మ నీకు

చ. 3: వుండనుండ నంతలో నిట్టూరుపుటుసురులు
బండుబండై పులకల పైరులపసురులు
అండనె శ్రీవేంటేశకుఁ డాదరించి కూడె నేఁడు
యెండలెల్లా నీడలాయ యేలమ్మ నీకు

రేకు: 1424-4 నాదరామక్రియ సం: 24-142

పల్లవి: ఎఱుఁగుదు మమ్మలాల ఇంత నాకుఁ జెప్పనేల
తఱవాతి పనులకుఁ దానే కాఁడా

చ. 1: సొలసి చూచి చూచి చూపులనే చిక్కించి
తలవంచుకొన్నవాఁడు తానే కాఁడా
తొలుతనుండియు మోరతోపులనే తిరిగాడి
తలవాకిటనున్న తానే కాఁడా

చ. 2: పొగరు గుణాలచేతఁ బొడవెక్కి పొడవెక్కి
తగనికోపాలవాఁడు తానే కాఁడా
బగివాసి కాఁకచేత పరకాంతలను బొందే -
తగవుల ధర్మరాజు తానే కాఁడా

చ. 3: వుండ నుండ సిగ్గుదేరి వూరఁగలబుద్ధులతో
దండిరాతి గుండె వాఁడు తానే కాఁడా
కొండల శ్రీవేంకటాద్రిఁ గోరి నన్నుఁ గూడె
తండినవలపువాఁడు తానే కాఁడా

రేకు: 1424-5 మాళవి గౌళ సం: 24-143

పల్లవి: కన్నవారెవ్వరు నేఁడు కాంతజవ్వన మిది
పన్నిన విభుఁడ నీభాగ్యమాయఁగాక

చ. 1: పట్ట ఁబసయేది పడఁతినడుమ నేఁడు
బట్టబయలపు అందు భావనేకాదా
అట్టిట్టిఁనగ నేది అంగనతురుము నేఁడు
పుట్టుమేఘమిట మింటిపాడవేకాదా

చ. 2: యెంచఁగఁ జోటేది యింతికనుచూపు లివి
కంచుమించులట చెప్ప కథలేకాదా
పొంచిదాఁచఁజోటేది పొలఁతికుచము లివి
పెంచెపుజక్కవలట బెదరేవేకావా

చ. 3: తలపోఁత యేది కాంతకు శ్రీవేంకటపతి -
వలపట మతి పరవశమేకాదా
తలఁగఁ జోటేది తడఁబడేరతులలో
పలుకుఁబంతము లెల్ల పదరుటేకాదా

రేకు:	1424-6 బౌళి	సం:	24-144

పల్లవి:	ఘనుఁడ నీవలననే కాంత కబ్బెఁగాక ఇవి
అనువుగానచోట నంటునా గుణము

చ. 1:	అంకెల నీమోవికెంపు లటు చూచి చెలియకు
కింకలఁ గనుఁగొనల కెంపులెక్కెను
పంకజము లేవూరు పచ్చిచిగు రేవూరు
అంకెల నొక్కటొక్కటి కంటునా గుణము

చ. 2:	జాఋఁజెమటలమెయి సరులముత్యాలు చూచి
చీఋముత్యా లొలికె నీచెలచెక్కుల
తీఋటద్దా లేవూరు తీగెసోగ యేవూరు
ఆఋడి నొక్కటొకటి కంటునా గుణము

చ. 3:	కడుఁ జంద్రాభరణాలు కరములఁ జూచి నీకు
పడఁతికుచాల చంద్రాభరణా లంటె
బడిఁ దూండ్లేవూరు పయిఁడికుండ లేవూరు
అడరి శ్రీవేంకటేశ అంటునా గుణము

రేకు: 1425-1 ముఖారి సం: 24-145

పల్లవి: నిచ్చఁబండుగలు సేసీ నెలఁత ఇదివో నేఁడు
తచ్చినపులకపూవుదండలతోను

చ. 1: కన్నులపండుగ సేసెఁ గాంత నిన్నుఁ గనుఁగొని
సన్నపునునుఁ జెమటజలకాలతో
విన్ననైన తరితీపువిందుల కజ్జాయముతో
కన్నెలెల్ల నీనవ్వులకప్పురాలతోను

చ. 2: వీనులపండుగ సేసె వెలఁది నీపేరు విని
ఆనకపుఁ గూరిమిగంధాక్షలతో
కానుకైనర మదరాగముల విడేలతో
సేనల సిగ్గులవింత చిలుపాలతోను

చ. 3: కాఎగిటిపండుగసేసె కామిని నీకూటముల
వాఎగేటివూర్పుల మోఎత వాద్యాలతో
రాఎగిన శ్రీవేంకటేశ రతులభోగములతో
సాగినసరసముల సంతసాలతోను

రేకు: 1425-2 సామంతం సం: 24-146

పల్లవి: ఇటమీఎద నీచిత్త మెటువలసినవి జేయి
కుటిలపురషుణుఁడు గురిలేదు వలపు

చ. 1: తుమ్మిదరవము విని తొంటిహెగ్గాళేలంటా
తమ్మికంటి యాసలతో దగ్గరిపోయి
వుమ్మడిఁ దప్పకచూచి వుల్లమెల్ల వక్కలై
సొమ్మసిల్లె నిఁకఁ జెప్పి చూపరాదు వలపు

చ. 2: కలికిచంద్రోదయము ఘనుఁడ నీపఁజుల -
వెలుఁగంటా నెదురేఁగి వెలఁది నేఁడు
చలివాయ నవి చూచి చంచలించి వెరగంది
అలివేణి పులకించె నాఁపరాదు వలపు

చ. 3: పచ్చనితోఁపులు చూచి పట్టునీగొల్లెనంటా
ఇచ్చగించి కొమ్మ నీఇంటికిఁ బోయి
అచ్చుట శ్రీవేంకటేశ అటు నిన్నుఁ గని కూడె
మచ్చికతమకముల ముట్టులేదు వలపు

రేకు: 1425-3 సాళంగం సం: 24-147

పల్లవి: సరిబేసు లవియివి సరిసరియే
తరుణిచెలువములు దైవారినట్లు

చ. 1: కాంతకాటుకలకనుచూపులకును
శాంతపు నవ్వులు సరిసరియే
వింతగఁ గస్తూరివీణెలలోపల
కాంతులఁ గప్పురము గలసినయట్లు

చ. 2: ముదిత చింద్రికమోవికిఁ దెల్లని -
చదురుదంతములు సరిసరియే
కదిపిన సంధ్యాకాలములోపల
వుదయ చంద్రరుచి వొలికినయట్లు

చ. 3: చెలికుచములకు శ్రీవేంకటపతి -
చలువకాఁగి లిది సరిసరియే
మెలుపగుఁగొండలమీఁదట నల్లని -
బలుపగుమేఘము పైకొన్నట్లు

రేకు: 1425-4 ముఖారి సం: 24-148

పల్లవి: పాయపురమణుఁడ నీపంత మింక నెట్లనో
ఆయములే విపరీత మాయఁబో నేఁడు

చ. 1: వుపమించిఁ జందురుఁడు వుదయమైతే భూమి
తపిఇంచి చీఁకట్లు తలఁగుఁగాని
కపురునాతురుము చీఁకటి నీమోము శశి
వుపరిసురతమున నోడించె నేఁడు

చ. 2: ఆలరికొండలమీఁద నంబరపు మేఘములు
గాలికి వాలి నిండాఁ గప్పుఁగాని
నీలమేఘము వంటినీపై నాకుచగురు
లోలి నుపరతియందు నొగి వాలె నేఁడు

చ. 3: తేరిమీఁద మదనుఁడు తెలివొందుఁగాని యందు
నేరుపు శ్రీవేంకటేశ నీనాయందు
బీరపుమరునిమీఁద పిరిఁదితేరు వారె
ఆరితేరి రతి వింతలాయఁబో నేఁడు

రేకు: 1425-5 సామంతం సం: 24-149

పల్లవి: అల్లదివో నాయకుఁడ అప్పుడు నేఁ జెప్పినది
వొల్లనే వొయ్యారి బాగై నిలుచున్నది

చ. 1: కొండుకగుబ్బలమీఁద కుంకుమ పూసినది
అండనే వలిపయ్యద గప్పినది
మెండుగఁ గస్తురినామమె నుదటఁ బెట్టినది
కొండలరాయఁడ నీకు గురియై తానున్నది

చ. 2: చిప్పిలు నిలువుఁ గొప్పున సేసవిరులది
కప్పురవిడేలఁ గన్నుల నవ్వేటిది
పుప్పతిల్లు సొమ్ములతో నొరపుమించినది
అప్పఁడ నీచేఁతలకు నందమై తా నున్నది

చ. 3: చేపల నిన్ను దగ్గరి చెఱఁగు వట్టినది
యీవల నీభావమెల్ల వింతగాఁ జేసినది
శ్రీవేంకటేశుఁడ నీచిత్తము వట్టినది
సావితో నీరతులలలో సదమదమైనది

రేకు:	1425-6 రామక్రియ	సం:	24-150

పల్లవి: రాసబలుపువాఁడు రామ నాతఁడు వాఁడే
మోసపోక మనము మొక్కవలె వాఁడే

చ. 1: అడవికాటగాండ్లగ్గిలోఁ గఱులువేయ
వడఁబొడమినయట్టివాఁడు
నిడుపమోరలపెద్దనీలికోఁతులనెల్ల
బడిబడిఁ దిప్పినబలువింటివాఁడు

చ. 2: పుటగా నీరాలు దొబ్బుచు పెనుమడుగెల్లా
అటునిటుఁ బూడిసి యాతఁడు
తటుకున మింటి పెద్దదయ్యాలకోసము
కిటుకురాకాసుల గెలిసినవాఁడు

చ. 3: గామిడై బూమెల్ల గద్దెవేసుక యేలి
ఆమనిసేసినయాతఁడు
గీము శ్రీవేంకటగిరులలోనను
దోమటి సీతతో దొరయాయ వాఁడే

రేకు: 1426-1 సాళంగం సం: 24-151

పల్లవి: అప్పటినుండియుఁ జూడ రమ్మలాల
నొప్పగింత మిఁక పతి కువిదవిరహము

చ. 1: పొంతే తామెరలైతే పొద్దుగూఁకినమీఁద
అంతఁ దెల్లవారుదాఁకా నరమోడ్చును
ఇంతికనుఁదామెరలయితే రేయిపగలు
యేఁతైన మొగియుట యెఱఁగ మెప్పుడును

చ. 2: జక్కవలు వొకవేళ సరున గూఁటిలోన
వొక్కరీతి గుట్టున దాంగుండుంగాని
చక్కనిచెలిచనుజక్కవలైతే నందు
తక్కకపయ్యదగూఁట దాఁగుటే కానము

చ. 3: చిగురుఁదీగెలు భూమిఁ జలపచెలపనీట
తగిలి నానాఁటికిఁ దనియుఁగాని
మగువ శ్రీవేంకటేశుమలయుమేఁదీగెలైతే
తగినరతిఁ జెమటఁ దనియుట గానము

రేకు:	1426-2 సాళంగనాట	సం:	24-152

పల్లవి:	ఏఁటిమాఁట యేదులతీఁట
	జీటకపువానిసుద్ది చెప్పకురే మీరు

చ. 1:	కన్నులఁ దప్పకచూచు కాఁకనేసి తలతీసు
	సన్నలఁ బెక్కులు దవ్వు సారెసారె నవ్వును
	కన్నెనాఁడే వీనిచేత కంటిమి వింటిమి నాతో
	యెన్ననేలే వీనిసుద్దు లెంచకురే మీరు

చ. 2:	ఆడుగులో మోసపుచ్చు నలుగు నేమిటికైన
	పడఁతి నలమిపట్టు పలువుర నంటును
	వడిపడి వేసరితి పనిలే దంతేసిదూర
	యెడనెడ వీనిగుణా లెంచకురే మీరు

చ. 3:	మానములు గోలుపుచ్చు మారులేక కాలుదొక్కు
	మోసమున నంతలోన మొక్కు మొక్కుమనును
	యీనిజము శ్రీవేంకటేశునికిఁ గలజాడ
	యే నెఱుఁగుదును ఇఁక నెంచకురే మీరు

రేకు: 1426-3 లలిత సం: 24-153

పల్లవి: ఎన్నిటి కిఁకఁ దా నెడరయినచో
కన్నియ నింతటఁ గావఁగవలదా

చ. 1: కలువ వాఁడియట ఘనచందురుఁడట
యెలమిఁ జెలినిట్ల నేఁచేదా
బలుచుట్టముగలఫలము విరహదెస
కలసిమెలసి యిటు కావఁగవలదా

చ. 2: చందనగందెట చలువగాలియట
యిందునె చెలి నలయించేదా
అందపుచుట్టఁ బైనఫల మిపుడు
కందువ నిట్టె కాచుట యరుదా

చ. 3: అతిశయిలకుచయట శ్రీవేంకట -
పతియట కాఁగిట భ్రమసేదా
చతురత నిరువురసరసవువేళల
అతిశయసంఘము లలరుటగాక

రేకు: 1426-4 ముఖారి సం: 24-154
పల్లవి: ఏమి సేసితివో యింతిని నీ -
మోము చూచి చూచి మొక్కీనదె
చ. 1: చెక్కులకాంతులు చెదరఁగా
నక్కువడఁ జెలి నవ్వీనదె
ముక్కున నూర్పులు మొరయఁగా
సొక్కుచు సోలుచుఁ జూచీనదె
చ. 2: చెమట నీపైఁ జిప్పిలఁగా
కొమరె సిగ్గునఁ గొంకీనదె
వుమురుఁగు చాలవొత్తులు
గములపయ్యదఁ గప్పీనదె
చ. 3: వొగిఁ దమకము లొలుకఁగా
చిగురుఁదేనెలు చిందీనదె
నగు శ్రీవేంకటనాయకుఁడా నీవు
తగఁ గూడినవి తలఁచీనదె

రేకు: 1426-5 మాళవి గౌళ సం: 24-155

పల్లవి: తలఁ పొకటియు నాచేఁతయు వేరొకటియాయ
సొలసి యెగ్గులెంచేవుసుమ్మీ వోవిభుఁడా

చ. 1: సొలసినచూపుననుఁ జూచేపరాకున
తొలుత నాపలుకులే దూరీ నిన్ను
తెలిసి నీరూపు చింతించేపరాకున
వలనైనకాల నేల వ్రాసీ నీపేరు

చ. 2: బడి నీసుద్దులు వినేపరాకున నీవు రాఁగా
జడియునాతనువు మంచము దిగదు
కడువిరహపువెదఁ గాఁగేపరాకున
సిడిసి కన్నీరు నీపైఁ జిమ్మీ నాగోరు

చ. 3: పచ్చిగాఁ గూడేటి నిబ్బరపుఁ బరాకున
గచ్చునాకుచాలు నిన్నుఁ గాఁడివారీని
మచ్చిక శ్రీవేంకటేశ మర్మపుఁబరాకున
యిచ్చ నాచెమట నిన్ను నీఁదులాడించీని

రేకు: 1426-6 తెలుగుఁగాంబోది సం: 24-156

పల్లవి: ఎవ్వ రేమిసేతురు యెక్కడి కెక్కు మామాఁట
యివ్వల నిచ్చాడువారి కింతేపో దోసము

చ. 1: పట్టరాదు ముట్టరాదు పడఁతిచిత్తముకాక
పట్టరాదు నీమనసు పతివి నీవు
వొట్టినమోహ మామెకు వొలసీనొల్లమి నీకు
యిట్టేసేసినమరుని కింతేపో దోసము

చ. 2: చెప్పరాదు చూపరాదు చెలియతమకములు
చెప్పరాదు మారుమాట చెంగట నీకు
ముప్పిరిచింత యాకెకు ముదము నీకుఁ జేసిన -
యిప్పటిపూవుబాణాల దింతేపో దోసము

చ. 3: ముయ్యరాదు తియ్యరాదు ముదితరెప్పలచూపు
ముయ్యరాదు నీకు నిఁక మోవికెంపులు
నెయ్యము శ్రీవేంకటేశ నెలఁతఁ గూడి తింతలో
ఇయ్యెడ మెచ్చనివారి కింతేపో దోసము

రేకు: 1427-1 శంకరాభరణం సం: 24-157

పల్లవి: ఏకతపువేళ మీరెవ్వరుఁ బోకురమ్మా
చీకాకునెరులతో సిగ్గువడీ వాఁడే

చ. 1: ముసిమి నధరపానమున మోవికెంపులు దేరి
కొనరుసంభోగముల కొప్పు జారి
వెస వీడుదోడావీడెములఁ బచ్చిదేరి
వుసురు నూరుపులతో నున్నాఁడు వీడే

చ. 2: చిందరవందరలైన చెమటలఁ దొప్పఁదోఁగి
కందువ గోరి గురులు కడురాఁగి
గందపుఁగుచాలచొప్పు గట్టిపురమున నాఁగి
పొందిన సింగారాల పొద్దుపుచ్చు వాఁడే

చ. 3: తెల్లనికన్నుల మోముతేటలలో నోలలాడి
వెల్లవిరి నిందిరను వేడుకఁ గూడి
చల్లంగా బండాతుకూరి జనార్ధనుఁడై
యెల్లగా శ్రీవేంకటేశుఁ డిరవాయ వాఁడే

రేకు: 1427-2 ముఖారి సం: 24-158

పల్లవి: తలంచరా దీజాగు దగ్గరీ రమణుం డిట్టె
చెలులతోఁ జెప్పఁగానె సిగ్గువడీఁ జెలియ

చ. 1: గుబ్బలపైఁ గప్పినట్టికోమలిపయ్యద నేఁడు
పుబ్బునఁ జల్లనిగాలి వొగిఁ దలఁగించఁగా
అబ్బురాన రమణుఁడు అది చూచి నవ్వితేను
జిబ్బిలుం జెమటతోడ సిగ్గువడీం తెలియ

చ. 2: పడంతిపలిపము పైఁ బచ్చిగా వసంతుఁడు
వడియుఁ బూఁదేనెలవాన గురిఇంచఁగా
వెడభావములు చూచి విభుండు నవ్వితేను
చిడుముడి పాటుతోడ సిగ్గువఁడీ జెలియ

చ. 3: ఇంతలో శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడితే చిలుక
చెంతనే యద్దముగవిసెన చించఁగా
పంతమున నందు వీడ పతి చూచి నవ్వితేను
చింతదేరి తలవంచి సిగ్గువడీఁ జెలియ

రేకు: 1427-3 సామంతం సం: 24-159

పల్లవి: చెల్లెఁ గదె నీమాట చెంచెత నీకు
చెల్లుబడిగలచోటఁ జెప్పనేఁటికయ్యా

చ. 1: చిగురుఁబయ్యద యేలే చెంచెత నీకు
చిగురు మాయడవిలో సేనాసేన
నిగురుఁబసిండిచేల నీకేలయ్యా మా.-
పగటుమెరుపు గొంతపసిఁడి రాలె

చ. 2: చిల్లపూవుదండలేలే చెంచెత నీకు
చెల్లెఁబో మాకులమీఁద సేనాసేన
చల్లఁగా నీకుఁ దొళసిసరమేలయ్యా
యిల్లిదె మాయేటిదరి నింతా నిదే

చ. 3: చేరితివిగదె నన్ను చెంచెత నీవు
చేరె నాకాఁగిటి కదె సేనాసేన
ఆరయ శ్రీవేంకటేశ అవునవునయ్యా
నీరువంక తుంగవైతి నిజమరివయ్యా

రేకు: 1427-4 భూపాలం సం: 24-160

పల్లవి: ముద్దుగారఁగా నిదె ముంగిట నిలుచున్నాఁడు
వొద్దికేంగి చెలులెల్ల వూరడించరే

చ. 1: వేఁకువజాామున లేచి వేడుక క్రిష్ణుఁడు తల్లి
ఆంకలయ్యీ నసుచు వొయ్యనె మంచము దిగి
కాంకలతో వసివాడి కన్నులు పులుముకొంటా
యేఁకరుచు నున్నవాఁడు యెత్తుకోరే బిడ్డని

చ. 2: బాలులతో వూరనెల్లఁ బరువులు వెట్టి పెట్టి
చాలుకొని యాడి యాడి జామెక్కంగా వచ్చి
కేలుచాఁచి వెన్నడిగి కిందుపడీ యంతలో
బేలులై వుండఁగనేల పెట్టరే బిడ్డనికి

చ. 3: మట్టమద్యాన్నపువేళ మలయుచు నింటిలోనే
చట్టులపెరుగు వేండీ చాలఁ బెట్టరే మీరు
పట్టపుశ్రీవేంకటాద్రిపై కీలుకొనె నిదె
అట్టిట్టనక వీని నాదరించరే

రేకు: 1427-5 బౌళి సం: 24-161

పల్లవి: బాపు బాపు మాతోనే పంతమేలోయి
చేపట్టితి వింతలోనే చెల్లునోయి

చ. 1: నల్లఁబల్లిచెన్నుఁడా నవ్వేవు సారెసారె
ఇల్లిదె చూతువు గాని యిందు రావోయి
గొల్లదోమటాయ నేఁడు కోరి నీతో సరసాలు
చల్ల వేండిసేసుకొంటే చాలులేవోయి

చ. 2: గోపికలవిటుఁడా కొంగుపట్టే వేమోయి
యీపొరి చూతువుగాని ఇందురావోఇ
మూపులు మూఁడాయ నీమొక్కినమొక్కులకెల్ల
రాపైన వుప్పుగప్పురములాయనోయి

చ. 3: నగు శ్రీవేంకటగిరి నల్లఁబల్లి చెన్నుఁడా
యెగసక్కె మిఁకనేల ఇందు రావోఇ
తగుఁదగు నీకు నాకు తనిసితి నిఁక నోయి
చిగురుఁజేవనుకొంటి చిత్తగించవోయి

రేకు: 1427-6 ఆహిరి సం: 24-162

పల్లవి: భువిఁ దనవారిఁ బాసి పొరుగువారిఁ గూడిన
అవునా వొక్కటఁ బుట్టెనని ఇంతేకాక

చ. 1: రమణివిరహవేళ రాఁపుతురుము వీడి
గములై తూలాడీఁ గన్నులపొంత
కమలపుతుమ్మిదలు గండుమీలపైవ్రాల -
నమరునా వొక్కచోటివని యింతేకాక

చ. 2: చెలియచింతావేళ చిందినకన్నీటిసోన
తొలరి కుచములపైఁ దొలఁకీ నట్టె
వెలిఁ జకోరా లెనసి వెడజక్కవలవద్ద
నిలుచునా వొకజాతినేమ మింతేకాక

చ. 3: కాంత రతివేళ శ్రీవేంకటపతినెమ్మోము
దొంతియై కెమ్మోవిమీఁద దొరకె నిదె
అంత పాలచందురుఁడు అమృత మాసపడిన
యింత చెల్లునా వొక యిక్కువనికాక

రేకు: 1428-1 శ్రీరాగం సం: 24-163

పల్లవి: కాంత నీవుగలచోటు కలిమిగలుగుచోటు
కాంతుని కితరమెల్లాఁ గడగడ చోటు

చ. 1: సతి నీమోమెత్తుటే చంద్రోదయమౌట
అతివ నీతలవంపు అస్తమానము
మితి నీచూచినచూపే మించిన సూర్యోదయము
రతి రెప్పమూయుటే యారవియస్తమానము

చ. 2: పొలఁతి నీవు నవ్వుటే పున్నమపెనుఁబండుగ
మలసి కోపించుటే యమాసదినము
అలరి మాటాడినదే ఆమనికాలము నీవు
వొలసీవొల్లమి నుండు టుడివోపుఁగాలము

చ. 3: యింతి నీవు గూడుటే యెన్నిక విరహవేళ
అంతో మైమఱచుటే యానందవేళ
పంతపు శ్రీవేంకటాద్రిపతికి నీవిట్లనే
మంతనాన నుండుటే మరుజన్మవేళ

రేకు: 1428-2 ముఖారి సం: 24-164

పల్లవి: ఏమైన నాయఁగాక యింత చాలదా
ఆమీఁద నీవు నన్నాదరించకుందువా

చ. 1: తెగి నన్నుఁ గోపించితేఁ గోపింతువు గాక
వగగా వెనక వగవక మానేవా
వెగటు చెప్పుడుమాఁట వింటే విందువుగాక
నిగుడి వనిత నీవు నిజపట్టేవా

చ. 2: అలిగి నీ వావలిమోమైతే నవుదువుగాక
చలివాయ మతిఁదలఁచకమానేవా
కలఁగి నీచలమిది గట్టియైతే నాయఁగాక
మెలుఁత నీదయ నాకు మెత్తనేకాదా

చ. 3: సారిది చూపుల నాఁటఁజూచితేఁ జూతువుగాక
సరుస చల్లనినవ్వు చల్లకుండేవా
పరగ శ్రీవేంకటాద్రిపతివైన నన్నుఁ గూడి
కరగతి వింతగాక గాతసేసేవా

రేకు: 1428-3 శంకరాభరణం సం: 24-165

పల్లవి: నిక్కమమ్మ యశోద నియ్యాన
అక్కడ నెవ్వరోకాక అటువంటివాఁడా

చ. 1: వీఁడుగదె బాలుఁడు వెన్నలు దొంగలీ నేఁడు
కాఁడువో అదేమోసి గబ్బిగొల్లెత
చూడఁగదె నీవు సోయగపు చేతిజిడ్డు
ఆడేవు కల్లలేకాక అటువంటివాఁడా

చ. 2: చిక్కెఁగదె మీవాఁడే చేరి పెరుగుదొంగ
పొక్కాలదేమోపి బొంకుగొల్లెత
పుక్కిట నిదిగదె పొంగినట్టిమీఁగడలు
అక్కటా నీభ్రమలింతే అటువంటివాఁడా

చ. 3: యిదివో శ్రీవేంకటేశుఁ డింతేసి సేసినాఁడు
పదమే నీవేమనేవు బద్దుగొల్లెత
అదివో నీమాఁటలైతే అన్నియుఁ జెల్లెనమ్మ
అదనాయ మీకు నాడ నటువంటివాఁడా

రేకు: 1428-4 భైరవి సం: 24-166

పల్లవి: చెప్పరాదు చూపరాదు చెలియమోహము నేఁడు
వుప్పతించి దూరీ పతి కొప్పగించవె

చ. 1: తలఁ పెంతవేఁడోకాని తరుణిమైకాఁకలైతే
వెలి నంటరాదు చేత విరహవేళ
వల పెంత చిక్కోకాని వాలినయీనెరులైతే
కలగలపైన చిక్కు కడగానరాదు

చ. 2: కోరికలెన్నోకాని గుబురుఁబులకలైతే
యేరి యెంచరా దెవ్వరి కీవేళను
నీరసమై గుండె యెంత నీరాయనోకాని
యేరులచెమటలైతే నెడతెగవు

చ. 3: యెంత అలయికోకాని యీ యింతియధరమైతే
వంతుల నప్పుడే కడువసివాడెను
రంతుల శ్రీవేంకటేశురతి యెంత నిబ్బరమో
చెంతల నీవేళ మార్పు చిమ్మిరేఁగెను

రేకు: 1428-5 కొండ మలహరి సం: 24-167

పల్లవి: తరవాతి పనులెల్లాఁ దానే యెఱుఁగు
సిరులవిభుని కిట్టె చెప్పరే చెలులు

చ. 1: మనసులోపలి చింత మాఁటలకు గుఱిగాదు
తనివోనితమకాలె తామే యెఱుఁగు
తనువులోపలికాఁక తచ్చిచూప గుణిగాదు
మునుపువెనకల నామోహమే యెఱుఁగు

చ. 2: కన్నులచూపులయాస గట్టిసేయ గురిగాదు
కన్నెలాల నాకోరికలే యెఱుఁగు
పన్నినజవ్వన మిది పట్టిచూప గురిగాదు
వెన్నెలవంటినానివ్వెరగే యెఱుఁగు

చ. 3: వాడిన నామోవితేనె వారవట్టగురిగాదు
సూడువట్టినట్టిపలుసోఁకు లెఱుఁగు
యీడనెశ్రీవేంకటేశుఁ డిట్టె విచ్చేసి నన్ను
కూడినకూటమి మేనిగుఱుతులే యెఱుఁగు

రేకు: 1428-6 దేవగాంధారి సం: 24-168

పల్లవి: ఒక్కరీతినే వుండరా నీకు
మొక్కేను నాతో మొఱఁగకురా

చ. 1: బెళకులమాటలు పెంచకురా నేఁ
దెలిసిన నటు తలదియ్యకురా
ములుచెనకులకే ములుగకురా
నలుగడ వికవిక నవ్వకురా

చ. 2: బిరుదునఁ బెచ్చులు పెరుగకురా కడు -
బరనగుబతి మిటు పట్టకురా
తిరుగులఁ బగ సాదించకురా
యెరవులకాంతల నేఁచకురా

చ. 3: వేగమె సిగ్గులు విడువకురా
వాగులకలికివి భళిభళిరా
యీగతి శ్రీవేంకటేశ్వరుఁడా నను
బోగించి కూడితివి పొందాయరా

రేకు: 1429-1 సాళంగం సం: 24-169

పల్లవి: చాలుఁజాలు నిన్నింత జరయనేల
నీలాగులెల్లఁ గంటిమి నీవు నీవేకావా

చ. 1: వంకదిద్ద వసమా వాఁటపుయేరులకెల్ల
అంకెల నీగుణములు అట్టివెకావా
లంకెఁబెట్టవశమా లావున మేఘములను
ఇంకనేల నీమనసు ఇట్టిదేకాదా

చ. 2: కట్టిపెట్టవశమా గాలి ముడియగాఁగ
వొట్టిననీమోహమును నట్టిదేకాదా
కట్టుకొనవశమా కానరానిపట్టుచీర
వట్టినీవినయములు వలసినవేకావా

చ. 3: లెక్క పెట్టవశమా లీలతోడఁ జుక్కలెల్ల
యిక్కడ నారతు లిట్టివేకావా
గక్కున శ్రీవేంకటేశ కలసితి విట్టె నన్ను
చక్కనిసరస మిఁక సమ్మతేకాదా

రేకు: 1429-2 నాదరామక్రియ సం: 24-170

పల్లవి: ఇంతిసింగారము నేఁడు యెట్టున్నది
కంతునిదీమము రూపై కలిగినట్లాయ

చ. 1: నివ్వటిల్లుతురుములో నెలఁతముడిచినట్టి -
యివ్వలఁ గమ్మవిరు లెట్టున్నవి
పువ్వుఁదేనె లంటిరాఁగా పువ్వులెల్ల తుమ్మిదల
అవ్వల వెంటనే వచ్చి అనినట్లాయ

చ. 2: కందువకుచములపై కామిని పూసినయట్టి -
యిందులో గందపుఁబూత లెట్టున్నవి
చందురుని వెన్నెలలు జక్కనలు సారెదాఁగె
అందుకే వెన్నెలలెల్ల అనినయట్లాయ

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చెలిఁగూడేరతివేళ
యీవల మోవిగుఱుతు లెట్లున్నవి
దేవుఁ డితనికి మీఁదెత్తినయమృతముకోని
వేవేలు ముద్రలు పయివేసినయట్లాయ

రేకు: 1429-3 సామంతం సం: 24-171

పల్లవి: నయగారిసటకాఁడ నారసింహా నీ -
ప్రియమెల్లాఁ గంటి వింటి పెనునారసింహా

చ. 1: వేరేమారురూపై వెలనే వింతిమాటున
చేరి యేమిసేసితివో శ్రీనారసింహా
సారె నోరు దెరచేవు సతితమ్ములము నీకుఁ
గారమై తోఁచెనోకాక ఘననారసింహా

చ. 2: తీగెనవ్వు నవ్వేవు తెరవ నీమర్మమెత్తి
చేగదేర నేమనెనో శ్రీనారసింహా
వేగమే చెమరించేవు వెలఁదిదగ్గరనుండి
యేగతిఁ గళలంటెనో యిట నారసింహా

చ. 3: అంతలోనే బుసకొట్టే వంగనకాఁగిట నీవు
చెంత నెట్టు గూడితివో శ్రీనారసింహా
దొంతిగా శ్రీవేంకటాద్రిఁ దొడ నిఁతిఁ బెట్టుకొంటి
పంతమిచ్చితి అవుభళనారసింహా

రేకు: 1429-4 బౌళి రామక్రియ సం: 24-172

పల్లవి: అట్టైకాదా మరి అవునయ్యా నీ -
పుట్టుగెల్ల నిట్టె పోపోవయ్యా

చ. 1: వుద్దండాన నీవే వొగిఁ గాలుదొక్కి
గద్దించేవు నీవే కానీవయ్యా
అద్దలించఁగానే ఆయము లంటే
పొద్దువోదో నీకు పోపోవయ్యా

చ. 2: దాకొని నీకొంగు దాఁకించి నీవే
మేకొని తిట్టేవు మేలయ్యా
పూఁకొనకుండిన వొత్తిమాఁటాడేవు
బూకలింతేశేల పోపోవయ్యా

చ. 3: కందువల నీవే కాఁగిలించిపట్టి
యిందులోనే జంకించే వేమయ్యా
చిందేటినవ్వుల శ్రీవేంకటేశుఁడ
పొందితివి నన్నుఁ బోపోవయ్యా

రేకు: 1429-5 హిందోళ వసంతం సం: 24-173

పల్లవి: తొయ్యలి వెంగెములాడ దోసముసుమ్మీ
చయ్యన నీతో నింత చాలదా యేమీ

చ. 1: యిద్దరిలో నీకు మోహ మిచ్చితిఁజుమ్మీ అవురా
కద్దు కద్దు నీమాఁట కల్లలా యేమీ
పెద్దగా నీపై నానవెట్టేఁజుమ్మీ అంత
వద్దువద్దు నీ వట్టివాఁడవా యేమీ

చ. 2: అఱిడిఁ గానుక నీకే యంపితిఁజుమ్మీ
మీఱి యెంతసేసేది మేలుదా యేమి
జాఱిననీపై వలపు చల్లితిఁజుమ్మీ నీకుఁ
బాఱిపాఱి నాతోనె పంతమా యేమీ

చ. 3: మించిన శ్రీవేంకటాద్రిమేఁటి నేఁ జుమ్మీ యింత-
వంచనతో నాకుఁ జెప్పవలెనా యేమి
అంచెలఁ గూడితి నన్ను నప్పుడేసుమ్మీ యివె
పొంచిపొంచి చెప్పేవు పొద్దువోదా యేమి

రేకు: 1429-6 సామంతం సం: 24-174

పల్లవి: చేసినదే చేఁతా చెల్లుబడిగలచోట
సేసకొప్పువిభుఁడ నీచిత్తమింతే ఇఁకను

చ. 1: విన్నదే వినికి వివేకించినచోట
కన్నదే కానుపు మరి గలయుచోట
వున్నదే వునికి వోపికెగులగుచోట
చెన్నగువిభుఁడ నీచిత్త మింతే యిఁకను

చ. 2: ఆడినదే మాట ఆయమెఱిఁగినచోట
కూడినదే కూటమి చేకొనుచోటను
వేడుకలే వేఁటవీడుదోడాడేచోట
జేడుమోహపువిభుఁడ చిత్తమింతే యిఁకను

చ. 3: యెంచినదే యేలికవివి యెగ్గుతప్పులేనిచోట
నించినదే మోహము నీనాచోట
యెంచఁగల శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
చెంచెత నింతే నీచిత్త మింతే యిఁకను

రేకు: 1430-1 లలిత సం: 24-175

పల్లవి: ఓ పోబాలకి నాతో నోపుదువటె
చేపట్టు జలధి దాఁట చిన్నివోఁడేకాదా

చ. 1: పువ్వుగాని పిందెగాని పూఁపవయసుపడుచ
యివ్వల నన్నుఁ జెనకే వేలే నీవు
పువ్వులపూఁపలే కావా పొదలిఫలించేవి
చివ్వల వోరమణుఁడ చెల్లదటయ్యా

చ. 2: నల్లగాని తెల్లగాని నాఁటుఁజూపులపడుచ
యెల్లచూపి మాఁటలాడేవేలే నాతో
నల్లదెల్లలే కావా నడురేయి పగలయి
చిల్ల రేలెండలయ్యీ చింతించవయ్యా

చ. 3: తగ్గులేని మొగ్గులేని తమకపుకాఁగిటను
యెగ్గుసిగ్గులేక కూడేవేమే నన్ను
తగ్గుమొగ్గులేని యట్టిదైవపుశ్రీవేంకటేశ
అగ్గమైతి వంతనిచ్చి ఆడనేఁటికయ్యా

రేకు: 1430-2 రామక్రియ సం: 24-176

పల్లవి: అదియే కాదా సతత మాతనికి తన కిపుడు
పదియవస్థలఁ బొంగి భ్రమసేఁగాక

చ. 1: పతిఁ బాసి విరహమున పానుపే పామనుచు
అతివ యల్లన లేచి అవలి కేఁగె
సతి యంతలోఁ గొలన జలకేలి కేఁగి యది
మతిఁ బొంగుజలధనుచు మారుమో మిడియ

చ. 2: తరుణి తామరయిల్లు తపనమండలమనుచు
అరమరచి కాఁకలనె యలసె నదివో
మరిగి మట్టెలరవము మంత్రశాస్త్రం బనుచు
వెరవెడలి తనలోనె వెరగందె నదివో

చ. 3: చెలియ దనకుచగిరులు శ్రీవేంకటాచలపు-
నిలువుశిఖరములనుచు నిధుల నిలిచె
వలచి శ్రీవేంకటేశ్వరుఁ డపుడు గూడఁగా
తలఁపులును దనువులును తారుకాణాయ

రేకు: 1430-3 ముఖారి సం: 24-177

పల్లవి: పలుకులకొలఁదే కాక పంత మేఁటికి మాను
చెలువునిఁ గలయుమతమే చింతించరాదు

చ. 1: కలికితమకముకొలఁదే ఘనమైనచెమట లివి
అలుకలకొలఁదివే అసురుసురులు
చలములకొలఁదివే సరిలేని చింతలును
యెలమి నిందుకు నీవు యేల విసిగేవే

చ. 2: కోపముకొలఁదివే కొనల కనుకెంపు లవి
రాఁపులకొలఁదివే రతికాఁకలు
చూపులకొలఁదివే సొఁపైనకాంక్ష లివి
కోపు లిందుకు నీవు గొణఁగుకొన నేలే

చ. 3: కూటములకొలఁదివే గుజ్జులైనపులక లివి
నీటులకొలఁదులే నివ్వెరగులు
చాటి శ్రీవేంకటేశ్వరుఁ గలసితివి నేఁడు
యేఁటికిఁక పలుబుద్ధు లెంచుకొననేలే

రేకు: 1430-4 ముఖారి సం: 24-178

పల్లవి: ఇంతకంటె నెవ్వరికి నెచ్చరాదు కుందరాదు
వంతలఁదగరై తాఁకవచ్చునటవయ్యా

చ. 1: వోఁగునూతులౌభళేశ వొద్దికి నీచెలి డాసె
సాగినసభలలోన చలివాసె
రేఁగినకోపము మాసె రేయే పగలు సేసె
చేఁగల నీకేమి సేసు చెప్పఁగదవయ్యా

చ. 2: నారసింహ కాలుఁదొక్కె నాతి నీకుఁ జేత మొక్కె
గారవపుమోహము అఁగన చొక్కె
సారెకు నీచెక్కునొక్కె జారినకురులు చెక్కె
చేరి యేమిసేసు నిఁక చెప్పఁగదవయ్యా

చ. 3: శ్రీవేంకటేవ ముఁదె శ్రీసతి నీకాఁగి లొందె
భావజురతులలోన ఫల మందె
పూవులలోనిపిందె పొడమినట్టు పొందె
సేవ లింక నేమిసేసుఁ జెప్పఁగదవయ్యా

రేకు: 1430-5 పాడి సం: 24-179

పల్లవి: వలచినదానఁగాన వడినే లోనైతిఁగాక
అలుగఁ దగదా నీతో నలుగలేఁగాక

చ. 1: ఆడనుండి యెడమాఁట లాడించినప్పుడే నిన్నుఁ
గూడకుండఁదగదా నే గూడితిఁగాక
మేడపై నెవ్వతెతోనో మేలమాడఁగా నిన్నుఁ
జూడకుండఁదగదా నే జూచితిఁగాక

చ. 2: తలఁచినప్పుడే రాక తడసినప్పుడే నిన్ను
పిలువకుండఁ దగదా నేఁ బిలుతుఁగాక
బలిమి నావొద్దనుండి బహుపరాకైనప్పుడే
కంయకుండఁదగదా నేఁ గలసితిఁ గాక

చ. 3: మిగుల నన్నుఁ గూడి మేనుమఱచినప్పుడే
నగకుండఁదగదా నే నగితిఁగాక
చిగురుమేనితుమ్మలూరిచెన్నుఁడా శ్రీవేంకటేశ
తగఁ బంతమిచ్చితే దక్కి మెచ్చితిఁగాక

రేకు: 1430-6 కాంబోది సం: 24-180

పల్లవి: నావలెఁ గావు నీవు నటనఁ బరాకే నీకు
భావజుఁ డేకాంగి గాన పలుదొమ్మి కోపఁడో

చ. 1: వాకై నీఇంటికి నేవత్తుగాని నీవు రావు
యేకమనసులు గావు ఇది యేమొకో
మూకల మరునియమ్ము ముందు నన్నుఁ నాఁటినిన్నుఁ
గైకొని వెనక నాఁటఁ గడుమొద్ద వొయనో

చ. 2: నేనే తమకింతుఁ గాని నీవు తమకించవేర
పూవికె లొక్కటి గావు బుద్ది యేదొకో
మోనమున మరుకాఁక ముందు నన్నుఁ దాఁకి నిన్నుఁ
దానకమై సోఁకి యంతటఁ జల్లనారెనో

చ. 3: కిట్టి నేనే ను పరతికిని బోతిఁ గాక నీవు
పట్టి నాకిన్నిటాఁ గిందుపడితి విదె
యిట్టె శ్రీవేంకటేశ యెదుట మరుఁడు నన్ను
నెట్టనఁ గరుణఁ జూచి నిన్ను మరి చూచెనో

రేకు: 1431-1 లలిత సం: 24-181

పల్లవి: పచ్చిసేయ వసమా పడఁతులభావ మిది
గచ్చుల మదనగతి గరఁగుటగాక

చ. 1: వంక దిద్దవసమా వనిత నీకురు లవి
అంకెల సింగారమాయవనుటగాక
మంకు దీర్చవసమా మది ఇంచుకుచముల
పొంకపుఁ గటూరమే పొగడుతగాక

చ. 2: సాదుసేయవసమా చంచలపుఁగనుచూపు
మేదకాన మేలనుచు మెచ్చుటగాక
భేదించవసమా బెడిదపునీపిఱుఁదు
సోదించరాక లోలోఁ జొక్కుటింతేకాక

చ. 3: చవులెంచవసమా జవ్వని నీయధరము
వివరించి పలుముద్ర వేయుటగాక
నవమై శ్రీవేంకటాద్రి నాదుఁడ గనక నిను
కవగూడితిని యిదె కాణాచిగాక

రేకు: 1431-2 శంకరాభరణం ఏకతాళి సం: 24-182

పల్లవి: కంటిరా నీగుణమెల్ల కడగడనే
పంటమోవితేనెకాఁడ పాలగిరిరాయఁడా

చ. 1: నిన్ననే వూఁకొంటిరా నేఁడు నీమాఁటలకు
వున్నవెల్ల మావి యిఁక నూరకుండరా
వెన్నవంటిమన సింతే వెత కోపరా
పన్నినమాయలకాఁడ పాలగిరిరాయఁడా

చ. 2: ఇప్పుడే మెచ్చితిరా నీఇటమీఁదిచేఁతలకు
చెప్పనేల విచ్చివిచ్చి సిగ్గులయ్యీరా
కొప్పు జారెఁ గోరికకు గురిలేదురా
పప్పులాయ దాలిమెల్ల పాలగిరిరాయఁడా

చ. 3: అంతలో మఱచితిరా ఆయము నీవంటేనని
సంతమైతి నీకాఁగిట చాలుఁజాలురా
యింతటిజాణఁడ నీకు ఇటు మొక్కేరా
పంతపుశ్రీవేంకటాద్రి పాలగిరిరాయఁడా

రేకు: 1431-3 పాడి సం: 24-183

పల్లవి: ఒకటి కొకటికిని వొరపాయ యీా -
వెకిలిజవ్వనము వింతై నట్లు

చ. 1: సతితురుములోనిశామంతివిరులు
రతిసమయంబున రాలఁగను
తతిఁ జెమటవాన తగఁ గురియుటకును
గతిఁ జిలుకలాడుగరిమెలు దోఁచె

చ. 2: రమణికుచంబులు రతిబందంబున
క్రమమున సారెకుఁ గదలఁగను
కమలపు మొగ్గలు కంతుసమరమున
జమళి నదరుసూచనవిధమాయ

చ. 3: పొలఁతిమేనిపైఁ బూసినగందము
కలయికఁ గరఁగుచుఁ గారఁగను
యెలమి శ్రీవేంకటేశు మోహరస-
మొలుగులు వారుచు నుండినరీతి

రేకు: 1431-4 కాంబోది సం: 24-184

పల్లవి: చాలదా నాకింత నిన్ను సరి గన్నులఁ జూచేది
వేళవచ్చినఁ దామెర విరియక మానునా

చ. 1: అలిగి నీవవ్వలిమోమైనా నవుదువుగాక
తలపు నామీఁదనే తగులుగాదా
మొలచి రత్నదీప మేమొకమై తానుండినాను
వెలుఁగు ఇంటిలోనెల్ల వెలయకుండీనా

చ. 2: యెమ్మెల నీ విటు నన్ను నెంతవొల్లకుండినాను
దిమ్ముల నీసతిననేతేజము లేదా
కమ్మర శశిఁ గొన్నాళ్ళు కళలుదీసివుండినా
నెమ్మది మరికొన్నాళ్లు నిండకుండీనా

చ. 3: పట్టినచలము మాని పంతము నాకిత్తుగాక
ముట్టి నేను గతిగూడ మొక్కకుండేనా
గుట్టున శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
పుట్టినపూవున బిందె పొడమకుండీనా

రేకు: 1431-5 మేచ బౌళి సం: 24-185

పల్లవి: వెదకరే చెలులాల వీదివీదులను వీని
కదిసి ముద్దాడినదాఁకాఁ గలఁగీఁ జిత్తము

చ. 1: యేకడ మాటలాడీనో యింతక నే డింట నుఁటే
అక్కరతోఁ బదిమారు లారగించును
చొక్కపుఁగృష్ణుఁడు యెందుఁ జూచీనో వినోదాలు
చిక్క పుఁగచ్చుకాయలు చేతనే మీటుచును

చ. 2: యెవ్వరెత్తుకున్నవారో, ఇంతక ముంగిట నుంటే
చివ్వన నగుచు నాచేయి వట్టును
నివ్వటిల్లుఁ గృష్ణుఁ డెందు నేఁడు పరకైనాఁడో
ఇవ్వల నుంటేఁ గన్నవెల్లా నడుగును

చ. 3: యెంత సంతసమైనదో ఇండ్లిండ్లవెన్నలు దిని
రంతుతోఁ బదుచులతో రాయడించఁడు
ఇతలో శ్రీవేంకటేశుఁ డెదురుగావచ్చి తన్ను
మంతనానఁ గాఁగిలించి మాయ చూపెను

రేకు: 1431-6 సాళంగం సం: 24-186

పల్లవి: నీకు వలయుపనికి నీవే వెతకి వచ్చితి
శ్రీకాంతుఁడవు ఇట్టె చేకోనవే నన్నును

చ. 1: నిన్నుఁ బాసి లంకలోన నెయ్యపుసీతాదేవి
పన్ని విరహానఁ దపము సేయఁగా
వున్నతపుఁగొండలచే వూరక జలధిఁగట్టి
చెన్నగురావణుఁ జంపి చేకొనవా ఆకెను

చ. 2: నీవే కావలెనని నిన్నుఁ గోరి రుకుమిణి
తోవలఁ బెండ్లికి నెదురుచూడఁగా
దావతితో నంతలోనే ద్వారకనుండి వచ్చి
చేవల దుష్టులఁ జంపి చేకొనవా ఆకెను

చ. 3: పాయపురమాదేవి పాలజలధినుండి
కాయజకేలికి నినుఁ గనుగొనఁగా
యీయెడ శ్రీవేంకటేశ యిందుకే జలధి దచ్చి
చేయిచ్చి వుర మెక్కించితివిగా యాకెను

రేకు: 1432-1 రామక్రియ సం: 24-187

పల్లవి: నీకు నిచ్చకమాడ నేర్తుఁగాక యిట్ల
గాక నీ కెదురాడఁగలనా నేను

చ. 1: చలివిడిచి నాయకుని సాదించుఁ గడు నొకతె
అలరి తను నెడసితే నలుగు నొకతె
వొలసి నొల్లమియైన వొగిఁ గోపగించు నొకతె
నిలిచి ఇంతటిపనికి నేర్తునా నేను

చ. 2: సరవిఁ దప్పక విభుని జంకించుఁ గడు నొకతె
సరసంబులాడితే జఱయు నొకతె
వరుస వంతెడలినను వాదించు మరి యొకతె
పరగ నింతేసి కొడఁబడుదునా నేను

చ. 3: అంకపురతుల లోన నలయించుఁ బతి నొకతె
మంకుమర్మపుఁగళల మఱచు నొకతె
ఇంకేల శ్రీవేంకటేశ కూడితివి నను
వుంకువల వెనకఁ దడవుదునా నేను

రేకు: 1432-2 ఆహిరి సం: 24-188

పల్లవి: మాఁటలేల మనసుకు మనసే సాక్షి
యేఁటికిఁ బరాకు సేసే వింతిఁ గావవయ్యా

చ. 1: కామినితాపమునకుఁ గప్పినపయ్యద సాక్షి
చేమిరిచింతకు చెక్కుచేయే సాక్షి
వాములవూరూపులకు వాడినమోవే సాక్షి
యేమరిపాటు విచ్చేసి ఇంతిఁ జూడవయ్యా

చ. 2: పడియుఁగన్నీటికిని వట్రునగుబ్బలే సాక్షి
తడుపుఁజెమటలకు తనువే సాక్షి
చిడుముడియలతకు చెదరుఁగురులే సాక్షి
యెడసేయక విచ్చేసి ఇంతిఁ గావవయ్యా

చ. 3: నీకెదురుచూచుటకు నిట్టచూపులే సాక్షి
పైకొన్నయవస్థలకు పానుపులే సాక్షి
చేకొని శ్రీవేంకటేశ చేరి కూడితి వింతట
యీకడ నిట్టే కరుణ నింతిఁ జూడవయ్యా

రేకు: 1432-3 ముఖారి సం: 24-189

పల్లవి: కన్నచోట ప్రియమెల్లఁ గార్యవశమె
యెన్నిచూచినా విభుఁడ ఇంతేపో వలపు

చ. 1: యేయెడ వేరొకచోట ఇతవైనమనసుంటే
కాయికపువలపులు గడతేరవు
చాయలసన్నలమాట సరియైనమోహమైతే
ఆయములు సరిదాఁకు నంతేపో వలపు

చ. 2: వినుకలివిరహాన వేగిరపుఁదమితోడ
కనుకలి గన్నమీఁదఁ గడతేరదు
కనుకలివినుకలి గట్టియైనకూరిమైతే
యెనసి యెప్పుడుఁ బాయ దింతేపో వలపు

చ. 3: యెప్పుడు నెగ్గులుదప్పు లెంచరానికూటమైతే
చెప్పుడువారిబుద్ది చెవి దూరదు
యిప్పుడె శ్రీవేంకటేశ యిటు గూడితివి నన్ను
అప్పుడే దక్కితివి నీవంతేపో వలపు

రేకు: 1432-4 శంకరాభరణం సం: 24-190

పల్లవి: అవియేపో నేఁడు మాతో నంటిసేసేతపములు
వివరించుకొని యిట్టె విచ్చేయుమనవే

చ. 1: కొండలకొట్టగొనల గోరమైన తపములు
పండుఁబలములలోని పచ్చిమేఁతలు
గుండెదాఁకేమంత్రాల కుత్తికలో జపములు
దండకారుణ్యాన నాఁడు తాఁ జేసెఁగా

చ. 2: యేరులలో మునుకలు యెక్కువఆచారాలు
ఆరీతిమోనముతోడియానందాలు
కోరికోరి చలివేఁడి కోటికోటినేమాలు
చేరి యీరీతిఁ దపాలు సేసినాఁడుగా

చ. 3: సమ్మతించఁజేసిన యాసనభేదబంధాలు
వుమ్మడి యన్యోన్యపుయోగాలు
దొమ్మి శ్రీవేంకటపతి తొల్లిసేసె నట్లనె
రమ్మని నేఁడును నారతిఁ జేసెఁగా

రేకు: 1432-5 నాదరామక్రియ సం: 24-191

పల్లవి: పొలఁతిదేహమే భూమండలమై
కలకాలంబునుఁ గాణాచాయ

చ. 1: కొమ్మకుచంబులకులపర్వతములు
నెమ్మదిఁ గలుగఁగ నేఁ డిదివో
పమ్మిన జవ్వనభారము మోవఁగ
తమ్మినదన కాధారంబాయ

చ. 2: కాంతగమనముల ఘనదిగ్గజములు
కంతునిబలమై కలుగఁగను
పంతమున పిఱుఁదుభారము మోవఁగ
యింతినటనలకు నిది గతియాయ

చ. 3: చెలియారనియెడి శేషుడు గలుగఁగ
అలతురుము భార మానె నిదె
వెలయఁ గూడె శ్రీవేంకటపతి యీ -
కలికిని యిదియే కడుఁగతలాయ

రేకు: 1432-6 ముఖారి సం: 24-192

పల్లవి: మాతో నేఁటికి నేను మగువ నింతే నీ -
చేఁతలెల్ల యేడనైనాఁ జేయవయ్యా

చ. 1: జలధి యీఁదేచోట, శైలము మోచేచోట
సొలసి నీబలిమెల్లఁ జూపవయ్యా
యిల దవ్వఁబోవుచోట, హిరణ్యునిఁ జంపుచోట
పలుకుఁబంతాలెల్లఁ బచరించవయ్యా

చ. 2: నీవు మిన్నందేచోట, నెత్తుటఁ దోఁగే చోట
సోవల నీమురిపేలు చూపవయ్యా
దీవుల కేఁగేచోట, తెగి వెన్న దినుచోట
చేవదేర మాయలెల్లాఁ జేయవయ్యా

చ. 3: సిగ్గులదేరుచోట, చెంతలఁ బారేచోట
యెగ్గులుదప్పులుఁ బోయి యెంచవయ్యా
అగ్గమైతి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడి
వెగ్గళపుకపటాలు విడువవయ్యా

రేకు: 1433-1 పాడి సం: 24-193

పల్లవి: పతిఁ బెడఁబాసిఫల మిదివో
అతివకు ద్రిష్టాంతమైనరీతి

చ. 1: కన్నులఁబెట్టినకాటుకరసములు
కన్నెకు నిరుదెసఁ గమ్మీనిదె
పున్నమచంద్రుఁడు పొరిఁ దనలోపల-
నున్నకందు వెలినుమిసినరీతి

చ. 2: గురుకుచములపై కుంకుమచెమటలఁ
గరఁగి యిరుదెసలఁ గారె నిదె
సరి జక్కవలటు చంద్రోదయమున-
నొరలిన విరహం బుమిసినరీతి

చ. 3: శ్రీవేంకటపతి చెలి నిటు గలయఁగ
మోవితేనియలు మొనపె నిదె
చేవదేరుమరుచిగురుబాణమటు
వోవల నాములె వుమిసినరీతి

రేకు: 1433-2 వరాళి సం: 24-194

పల్లవి: మీకు మీకే కానవచ్చు మిన్నులపై మెఱుఁగులు
మాకు నెట్టు దెలుసు మీమనసులమాయలు

చ. 1: యేమిటికే చెలియ నీవితఁడు యెదురెదుర
మోము మోము వంచితిరి ముసిముసిసిగ్గులతో
తామెరకుఁ దామరే ధరఁ జంద్రుఁ డాయనో మీ-
మోముటద్దములలోని మొరఁగులు గంటిరో

చ. 2: యేపనికే మగువ మీరిద్దరూను మీలోన
చూపుఁజూపు సరిదాఁకె సొలపుల చొక్కితిరి
యేపుఁగలువల కవె యిటు తామెరలాయనో
మేపుమీనములు జంటై మేఁతలు మఱచెనో

చ. 3: యెక్కడివే వనిత మీకిద్దరికెమ్మోవులందు
చుక్కలుఁజుక్కలే సురవొన్నలై పూచె
వొక్కటై శ్రీవేంకటేశుఁ డొద్దికైనలెక్కలో
చక్కనిరతుల మీరు సరిబేశాడితిరో

రేకు: 1433-3 ముఖారి సం: 24-195

పల్లవి: చక్కనిమానిని నీసరి యెవ్వరే
యెక్కువైననీభావ మెంచిచూడవసమా

చ. 1: కోమలి నీకుచముల కొండలకొనలపొంత
వోముచు మించి నిలిచె నొకసింహము
కాముఁడు జఘనమనేకట్టు బండిమీఁద బెట్టి
దీమముతో వేటలాడీఁ దేరిచూడవసమా

చ. 2: పడఁతి లేఁజిగురులపాదపుటడవిలోన
నడపుల యేనుగులు నటియించఁగా
తొడలరటికంబాలతోఁ గట్టి దీములుగా
బడిబడి వేటలాడీ భావించవసమా

చ. 3: అంగనముఖమనేటి అంబుజాకరముపొంత
ముంగిటఁజూపులలేళ్లు మోహరించఁగా
కఁగనిశ్రీవేంకటేశుకాఁగిటిభావానఁ గట్టి
చెంగటనే వేటలాడీఁ జిత్తగించవసమా

రేకు: 1433-4 దేసాళం సం: 24-196

పల్లవి: ఆరజమేల సేసే వట్టే కాదా
యేరా ముందటిపొందు లిట్టేకాదా

చ. 1: కన్నులసన్నలు గొంత కమ్మటినానలు గొంత
అన్నిటా నీవే జాణఁడ వట్టే కాదా
పన్ని వినయాలు గొంత బలిమిచేఁతలు గొంత
యెన్నికాయ నీతగవు యిట్టేకాదా

చ. 2: ముసిముసినవ్వు గొంత ముంగిటనే జోలి గొంత
అసుదా నే నీకింత అట్టే కాదా
అసురుసురులు గొంత ఆయము లంటేది గొంత
యిసుమంతపనికిఁగా నిట్టేకాదా

చ. 3: మోవి యానేది గొంత ముంటిపోట్లునుఁ గొంత
అవటమాయ నీకు నట్టే కాదా
శ్రీవేంకటేశ నన్ను సేసవెట్టి కూడితివి
యేవేళ నీమోహ మిట్టేకాదా

రేకు: 1433-5 నాగ గాంధారి సం: 24-197

పల్లవి: విపరీతము లివి వినరాదు
వుపమలెల్ల మీవొద్దనె కలిగె

చ. 1: వువిదవదనచంద్రోదయవేళను
రవియగుసూర్యప్రభ నీవేఁగఁగ
యివల నవల మీయిద్దరివలననే
దినమును రాతిరి దెలియఁగఁ గలిగె

చ. 2: అంగనతురుముమహిర్ని శివేళను
రంగగు సూర్యప్రభ నీవేఁగఁగ
సంగడి వెలుఁగును సరిఁ జీఁకటియును
చెంగట మీయందే చెప్పఁగఁ గలిగె

చ. 3: కాంతమోవి చుక్కల నిండువేళ
రంతుల సూర్యప్రభ నీవేఁగఁగ
యింతట శ్రీవేంకటేశ్వర మీయందే
కాంతులుఁ గళలునుఁ గలయుట గలిగె

రేకు: 1433-6 నాదరామక్రియ సం: 24-198

పల్లవి: ఏమమ్మ మగువా నీ వింతసేతురా
తామసించనేఁటి కిఁక దయఁజూడవమ్మా

చ. 1: తగిలి తప్పకచూచు తలవంచు నంతలోనే
నిగిడి చింతారతి నేలదవ్వును
మగువ నిన్నిటువాసి మానుపడి వూరకుండు
అగడాయ నీపతి నదె చూడవమ్మా

చ. 2: దీనతతోఁ జిన్నఁ బోవు తెగువలే తలపోయు
తానే యేకతాననుండి తమకించును
మోమునఁ దెల్లఁబారు మోహించిన విరహాన
మానిని నీవే వచ్చేసి మరి చూడవమ్మా

చ. 3: కొచ్చినకాఁకలచేఁ బైకొంగువేయనెఱఁగఁడు
మెచ్చుగ మెట్టినచోటే మెట్టి భ్రమయు
అచ్చపు శ్రీవేంకటేశు నలమేలుమంగ నీవు
పచ్చిసేసి కూడితివి పంతమేఁటికమ్మా

రేకు: 1434-1 ముఖారి సం: 24-199

పల్లవి: ఏఁగివచ్చుఁగాని యీతఁ డింటనింట వాడవాడ
మూఁగినయీసింగారమోహనముతోడను

చ. 1: పెట్టినకస్తూరిబొట్టు బేంట్లెగయకుండ
కట్టినహారము లెందుఁ గదలకుండ
నిట్టతురుమువిరులు నవ్వటిల్లి రాలకుండ-
నిట్టె అందలముపై నెక్కించరే

చ. 2: మొగిఁ జెంగావిరెంటెము నెరి విరుగకుండ
చిగురుమోవిగచ్చు చెదరకుండ
అగలు గందపుఁబూఁత అందునిందు నంటకుండ
యెగనెత్తి అందల మెక్కించరే

చ. 3: కూడినకూటములగుఱుతులు మాయకుండ
వీడెపుమదము చొక్కు విడువకుండ
వేడుకకాఁడైన శ్రీవేంకటేశు నండ నన్ను
యీడుదోడై యందలాన నెక్కించరె

రేకు: 1434-2 సామంతం సం: 24-200

పల్లవి: చుక్కలు మెరసీని సూర్యుఁ డెండలుగాసీ
తక్కులు మొక్కులు మాని దగ్గరి రారా

చ. 1: నానీనాననినీనాలి మాటలు నా-
వీనులు సోఁకినంత వెచ్చనాయరా
కానీకానీ నీకడమలెల్లా
తానే మెచ్చయ్యీఁగాని దగ్గరి రారా

చ. 2: వీడీ వీడనినీవింతనవ్వులు నా-
వాడికమతిఁ గాఁడి వాండ్లాయరా
జోడుగూడిన నిన్నీ జోకలయ్యీని మరు -
దాడి ముట్టకతొల్లె దగ్గరి రారా

చ. 3: పాసీపాయనినీపన్నుఁ గాఁగిలి
రాసి నాకుచములు రవ్వాయరా
ఆసల శ్రీవేంకటాధిప నేను వలపు
తాసునఁ దూఁచేఁగాని దగ్గరి రారా

రేకు: 1434-3 ముఖారి సం: 24-201

పల్లవి: అక్కడఁ జెలియలపు యిక్కడ నీగెలుపు
యిక్కడ నక్కడఁ గంటి మిఁక నీచిత్తము

చ. 1: వ్రాసేటి నేలలవ్రాఁత వాఁకలచెమటయీఁత
గాసిలు నూర్పులమోఁత కాంతపాలాయ
బేసబెల్లిలేనగవు పిలువఁగానే బిగువు
వేసాలయీతగవు విభుఁడ నీపాలు

చ. 2: చెలిమూపుపై నొరగు చిత్తములో నివ్వెరగు
చలిజింతలపారుగు సతిపాలాయ
వెలినుండేనిక్కచూపు వెడబొంకు రేపుమాపు
నిలువులతరితీపు నీపాలాయ

చ. 3: కాఁగిటిలో తమకము కదిసినగమకము
దాగి యిట్టెసముకము తరుణిపాలు
వేగి శ్రీవేంకటపతివేడుకైనసమరతి
యీగతి మెచ్చినమతి యిది నీసాలాయ

రేకు: 1434-4 ఆహిరి సం: 24-202

పల్లవి: తనువు బడలెను తలఁపు భ్రమసెను
యెనసినతా నెఱుఁగు నిఁక నేఁటిదే

చ. 1: మంతనాన నుండితేను మనోరథాలవెద
కాంతునిఁజిత్తానఁ గంటేఁ గన్నీటివెద
కాంతలలోఁ జెప్పఁబోతే కందువసిగ్గులవెద
యెంతటానుఁ బొద్దువోదు యేమి సేసేదే

చ. 2: చెలులలోన నుంటే చెప్పుడుబుద్దులవెద
వెలినుంటేఁ జందురుని వెన్నెలవెద
తొలఁగి నిద్దురవోతేఁ గలలోన నీవెద
యెలమి నింతటిమీఁద నేమిసేసేదే

చ. 3: యిచ్చుట శ్రీవేంకటేశుఁడింతలో విచ్చేసి కూడె
కొంచ్చి నూర్పులబుసకొట్లవెద
మెచ్చురతిబంధముల మించుఁజెమటలవెద
హెచ్చి: వెదలెల్లఁ దీరె నేమి సేసేదే

రేకు: 1434-5 ధన్నాసి సం: 24-203

పల్లవి: చూడరమ్మ నిచ్చకొత్తసొద్యమ లాయ
వేడుకవిభునిచేత వెల్లవిరులాయ

చ. 1: అతను విరహవేళ అందపుఁగురులు జారి
అతివనొసలిపైఁ దూలాడఁగాను
సతినాసికమనేటి సంపెంగపూదావి సోఁకి
అతిఘోరపలులు తూలాడినయట్లాయ

చ. 2: ఆఁపలేక పతికడ కంగన యలపుతోడ
యేపున మెల్లమెల్లనె యేఁగఁగాను
చేపట్టి నెన్నడిమిసింహపుగాలికిఁ గరి
కేపున నేఁగుచు నలికేటివిధమాయ

చ. 3: యింతలోనె శ్రీవేంకటేశుఁ డెదురుగ వచ్చి
కాంతఁ గూడఁగ రతిఁ గరఁగఁగాను
పొంతఁ జంద్రోదయమున పొలఁతిగుబ్బలచంద్ర -
కాంతము గరఁగినచొక్కపువిధమాయ

రేకు: 1434-6 రామక్రియ సం: 24-204

పల్లవి: ఒకటొకటి గూడ దోయమ్మ నీయందే
నకలము నెటువలె సంతము సేసితివే

చ. 1: తానకపునీకుచాలు దంతికుంభాలఁ బోలితే
యీనడుము సింహమునేల పోలనే
అనిపట్టి నీకన్ను లంబుజాలఁ బోలితేను
ఆననము చందురుని నదియేల పోలెనే

చ. 2: అతివ నీచేతులు బిసాంగములఁ బోలితేను
యితవై నడపు హంసనేల పోలెనే
చతురత నాసికము సంపెంగఁ బోలితేను
తతి నీకురులు తుమ్మిదలనేల పోలెనే

చ. 3: నేవళపునీయారు నీలాహిఁ బోలితేను
యీవల మేను మెఱుపునేల పోలెనే
శ్రీవేంకటేశుమోవి చిన్నికెంపు లంటించి
ఆవేళ దంతాలు వజ్రాలై యెట్టు వోలెనే

రేకు: 1435-1 సామంతం సం: 24-205

పల్లవి: ఎప్పుడెప్పుడంటా నిచ్చగించీ వాఁడే
చిప్పిలు నీపతిఁ జేకొనవమ్మా

చ. 1: పలుకుఁదేనెలు పారఁజల్లి చల్లి
చిలుకుఁజూపులు చిమ్మి చిమ్మి
కులుకునవ్వులఁ గొసరికొసరి
చెలువునిఁ బేరఁ బిలువవమ్మా

చ. 2: సారెకు బొమ్మల జంకించి జంకించి
కూరిమి లోలోఁ గొచ్చికొచ్చి
తోరపుఁజెమటలఁ దొప్పఁదోఁగితోఁగి
చేరి నీపతిపయిఁజేయి చాఁచవమ్మా

చ. 3: గుబ్బలకొసలఁ గుదించి కుదించి
జొబ్బిలు నీమోవిఁ జూపిచూపి
వొబ్బిలి శ్రీవేంకటోత్తముఁ గూడితి
అబ్బురా లీతని నంటించవమ్మా

రేకు:	1435-2 శంకరాభరణం	సం:	24-206
పల్లవి:	ఇదియే పరమయోగ మిద్దరికి విభుఁడా
	అదన నవిచినద్రిష్టాంతమాయ నిపుడు
చ. 1:	వెలి మనమిద్దరము వేరై వుందుముగాని
	తలఁపులోపలను యిద్దర మొకటే
	వొలసి యద్దములోన నొకరూపే రెండై
	తెలసినట్లనేపో ద్రిష్టాంతమిపుడు
చ. 2:	పేరు లిద్దరికి నిట్టె భేదమై తోఁచీఁగాని
	తారుకాణగుణము లిద్దరి కొకటే
	కోరినమాఁటొకటే కొండశలలో రెండవు
	తేరిచూడ విదియేపో ద్రిష్టాంత మిపుడు
చ. 3:	శ్రీవేంకటేశ నీనాచేఁతలే వేరులుగాని
	కేవల మిద్దరికి కాఁగిలి వొకటే
	పూవుగుత్తి వొకటే పూఁపలు వేరైనట్లు
	దేవ యిన్నిటికి నిదె ద్రిష్టాంత మిపుడు

రేకు: 1435-3 తెలుగుగాంబోది సం: 24-207

పల్లవి: ఏమిటికే వున్నవెల్ల నింత చాలదా
ప్రేమమే కడకు నాపైఁ బెంచె నిది చాలదా

చ. 1: తలఁపులోఁ దనరూపు తలఁచఁగ దలఁచఁగ
యెలమి మెయి చెమరించె నిది చాలదా
వెలి దనగుణములు వినఁగ వినఁగ నాకు
నిలువెల్లఁ బులికించె నేఁడే చాలదా

చ. 2: యింగితానఁ దనకు నే నెదురుచూడఁ జూడఁగ
అంగమెల్లఁ గాఁకరేఁగె నది చాలదా
చంగనఁ దాఁ బవ్వళించేశయ్యపైఁ బొరలితే
రంగుగాఁ గళలు దాఁకె రతి నది చాలదా

చ. 3: తాను నేను నంతవింత దగ్గరఁగ దగ్గరఁగ
ఆనకమై నవ్వువచ్చీ నది చాలదా
పూనిన శ్రీవేంకటేశుఁ డొద్దికతో నన్నుఁ గూడె
యీనేటిసంపదలెల్ల నిచ్చె నది చాలదా

రేకు: 1435-4 హిందోళ వసంతంసం: 24-208

పల్లవి: అదె చూడరె మోహనరూపం
పదిగొల్లుగలభావజరూపం

చ. 1: వెలయఁగఁ బదారువేలుమగువలను
అలవమినఘనమోహనరూపం
వలచిననందప్రజముగొల్లెతల
కులుకుఁజూపులకు గురియగురూపం

చ. 2: యిందిరావనిత నెప్పుడుఁ దనవుర -
మందునిలిపిన మోహనరూపం
కందువభూసతికాఁగిటిసొంపుల -
విందులు మరిగిన వేడుకరూపం

చ. 3: త్రిపురసతుల బోధించిరమించిన
అపురూపపుమోహనరూపం
కపురుల శ్రీవేంకటపతియై యిల
నుపమించగరానివున్నతరూపం

రేకు: 1435-5 సామంతం సం: 24-209

పల్లవి: సకల లొకేశ్వరులు సరుసఁ జేకొనువాఁడు
అకలంకముగఁ బుష్పయాగంబు

చ. 1: వివిధ పుష్పములతో వేదఘోషములతో
అవల దిరువాముడియ నంగనలయాటతో
కవివంది నుతులతో కమ్మఁబూజలతోడ
నవధరించీఁ బుష్పయాగంబు

చ. 2: కప్పురపుటారతుల ఘనచందనముతోడ
తెప్పలధూపముల తిరువందికాపుతో
వొప్పుగఁ బణ్యారములు వొగిఁ బెక్కువగలతో
అప్పఁ డందీఁ బుష్పయాగంబు

చ. 3: తగుచ త్రచామరాలతాంబూలములతోడ
పగటుతో నీరీతి పదిపూజ లందుకొని
జిగిమీరెఁ జూడరే శ్రీవేంకటేశ్వరుని -
అగణితంబగు పుష్పయాగంబు

రేకు: 1435-6 రామక్రియ సం: 24-210

పల్లవి: చూడవమ్మ చెలియ యీ చుట్టుపట్టు నతని
వోడక యెప్పుడు నావొద్దఁ బాయఁ డితఁడు

చ. 1: కలికి నావిభుఁడు రాఁ గలగంటి నంతలో నే -
నలరి ముచ్చటమాటలాడితి నేను
చలివాయఁ దములము చవిగొంటి మేలుకొంటి
తలఁగి యాతఁ డింకెందు దాఁగి రాఁడోకాని

చ. 2: కిమ్మరను నేనొకకల గంటి నాతని -
నుమ్మగిలి కాఁగిట నే నొద్దికైతిని
చెమ్మఁజెమటలు మేనఁ జిమ్మిరేంగి వున్నవివె
అమ్మరో యతనిఁ గాన నండనుండె నిపుడు

చ. 3: నెయ్యమున నెదుటనే నిక్కలగాఁ గంటి నిదె
యియ్యెడ శ్రీవేంకటేశుఁ డెనని కూడె
ముయ్యక మలసె నాలో ముదములు సమకూరె
పయ్యగమఱగుఁలోనె పచ్చి సేసె నితఁడు

రేకు: 1436-1 శంకరాభరణం సం: 24-211

పల్లవి: ఆడనుండే యేమిగల్లా నానతియ్యరా
యేడనున్నా మనసులు యేకమౌటే చాలును

చ. 1: కొప్పుతుమ్మిదలు నాకు గొబ్బున బెదరుఁ జేసు
దప్పితో నవ్వు నవ్వక తలరా నీవు
అప్పటి కన్నుఁజకోరా లవి యులుకునో యేమో
చప్పుడు సేయక నీవు చక్కఁజాడ నుండరా

చ. 2: చన్ను జక్కవలు నేడు సరిగ కదలుం జేసు
సన్నలు సేయకు మింతె చాలించరా
అన్నువనానడవుల, అంచలు బెగడుఁ జేసు
నన్నుం బేరుకొనకురా నటనల కిపుడు

చ. 3: కుత్తికలో నాయెలుఁగుకోవిన బెదరుఁ జేసు
హత్తి నన్నుఁ జెనకకు మంతేసి నీవు
పొత్తుల శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టె
సత్తుగ నేనీకు సతమైతిఁ జాలదా

రేకు:	1436-2 రీతి గౌళ సం:	24-212

పల్లవి:	ఆయనాయ వెంగెమేలే అతివా నీ -
ఆయమే తాఁకీ మాట లందుకేమి సేతురా

చ. 1:	కప్పురమిందవే వోకలికీ మాకు -
నుప్పులవు నీకప్పురా లొల్లము పోరా
తప్పునాడే వదియేమే తరుణీ వోరి
తప్పులెవ్వ రెందున్నవో తలఁచుకో నీవు

చ. 2:	నిమ్మ పండిందవే వో నెలఁతా ఆ -
నిమ్మపండే పాఁపరవును నే నొల్లరా
చిమ్మేవు సట లిదేమే చెలియ మేన
చిమ్మురేఖ లెవ్వరందో చిత్తగించు నీవు

చ. 3:	కుంకుమపూ విందవే వో కోమలీ:	నీ -
కుంకుమలే పుప్పొడౌను కూడుకొంటేను
యింకనేలే కలసితి నింతీ: వోరి
యింకపు శ్రీవేంకటేశ యిద్దరిచెమటలు

రేకు: 1436-3 సామంతం సం: 24-213

పల్లవి: అందు కంటినటే నీ యందము లెంచితిఁగాక
చిందేటి నామోహము నీచేతఁ జిక్కెఁగదరా

చ. 1: నడుము పిడికెఁడంత నాతి నీకుచములైతే
బడి నొకటే పట్టెఁడంత
యెడ నాయంగము లివి యెంతలెంతలైనాను
చిడుముడి నిన్నయు నీచేతిలోనేకదరా

చ. 2: మొగము గొడిఁదెఁడంత మోహనపుఁగనుదోయి
చిగురుఁబో డిదియేమే చేరఁడంత
యెగసక్కె మిఁకనేల యేర నే నెట్టుంటినాను
జిగి నాసింగారము నీచేతిలోనేకదరా

చ. 3: సుదతి నీయడుగులు జుట్టెఁడంత, దేహమైతే
సదరమైనయేడు జానలంత
కదిసితి విదె శ్రీవేంకటపతి విటు నన్ను
చెదరని నేను నీచేతిలోనే కదరా

రేకు: 1436-4 రామక్రియ సం: 24-214

పల్లవి: ఆతఁడు బత్తిసేయఁగా నన్నీ నమరె నీకు
కాతరాన విడెమిచ్చి కాఁగిలించఁగదవే

చ. 1: సంతోసానఁ బెనఁగఁగా జగడము లేదుగాక
పంతములాడుకొంటే పచ్చిదేరదా
వింతలేక వుండఁగానే వేడుకలు వుటెఁగాక
వంతులు వాసు లెంచితే వలపు గలుగునా

చ. 2: ననుపు గలుగఁగానే నవ్వు లితవాయఁగాక
చెనకితే చలములు చిమ్మిఁరేగవా
వినయము చూపఁగానే వెలెసెఁగాక పొందులు
మనసు రాకుండితే మర్మములు గరఁగునా

చ. 3: యిట్టె సేసలు చల్లఁగా నియ్యకోళ్లాయఁగాక
వట్టిసిగ్గున నుండితే వాడికలౌనా
నెట్టన శ్రీవేంకటాద్రివిలయుఁడు నిన్నుఁ గూడె
చుట్టరికమెంతైనా సొంపులే పుట్టించవా

రేకు: 1436-5 వరాళి సం: 24-215

పల్లవి: ఏమాయ నందుకు నీవే కొంకేవు
దీమసపునీపట్టపుదేవుల నేను

చ. 1: యింతవడి నీవు రాక యీడ నాడా నుంటినంటా
యెంత నన్ను వేఁడుకొనే వేమిచెప్పేది
పంతమున నీమేనఁ బచ్చిసేఁత లున్నవంటా
చెంతనున్న నాతోనేల సిగ్గువడేవు

చ. 2: నిలుచుంటే నాపె పచ్చి నీచెఱఁగు వట్టెనంటా
పలుమారునేల వొడఁబరచేవు
కలలో నాపెఁ గదిసి గక్కన మేలుకొని
యెలమి నామోము చూచి యేల నవ్వేవు

చ. 3: వూడిగపువారి మేను లొరసె ని న్నంటాను
యేడలేనియానలు నీవేల పెట్టేవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జాడఁదప్పకుండా నాతో సరసమాడేవు

రేకు: 1436-6 నాదరామక్రియ సం: 24-216

పల్లవి: నిండుజాణ వన్నిటాను నీవే యెఱుఁగుదువు
అండనుండి సతులచే నాడించుకోరాదు

చ. 1: తలఁపుకొలఁదినే తమి రేఁచవలెఁగాని
వలపంతఁబెట్టరాదు వనితలను
పులక లెసఁగఁ గుచములు ముట్టవలెఁగాని
బలిమిఁ బిసికి తడఁబరచఁగరాదు

చ. 2: కూరిములు దలకొన కురు లంటవలెఁగాని
బారెఁడేసి వెంట్రుకలు పట్టఁగరాదు
నేరుపుతోనే కాఁగిటనించి కూడవలెఁగాని
బీరానఁ గుదించి పిరివీకు సేయరాదు

చ. 3: మోహముకొలఁదినే మోవి యానవలెఁగాని
సాహసాన పలు సోఁకించఁగరాదు
యీహల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
బాహుమూలా లంటి కడుఁ బచ్చిసేయరాదు

రేకు: 1437-1 లలిత సం: 24-217

పల్లవి: చాలునే నీమాఁటలు చాలు మూలకెక్కెరా
వేలఁ జూపేవా పదారువేలవాఁడ వౌదురా

చ. 1: వొంటినుండాన వదేమే వొంటియు నొంటకె పోరా
అంటఁగా వోచెలియ గోరంట కొనెరా
గొౌటుజాణతనమేలే కూళతనాలేలరా
కంటినే నీజాడ బండికంటిజాడలటరా

చ. 2: వీడనాడేవేమే నీవీడనాడ నుండఁగఁబో
జోడుగదే నేను అవురా జోడగుటౌళి
మేడిసేవటే నీవు మేడిపండె నీగుణాలు
వోడ వేమిటాను నీవావోడతో దూలమురా

చ. 3: యింతయేలే నాతోఁ గారింతలు నీవల్లనే పో
సంతమైతినే వో వసంతకాఁడవా
పంతపు శ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితిఁగదే
పంతము పాడియుఁగలపడఁతిరా నేను

రేకు: 1437-2 తోండి సం: 24-218

పల్లవి: ఇతరము లేదే యింతి నీపతికి
ప్రతిదినదినమును ప్రభాతవేళ

చ. 1: అంగన నీమోము అద్దము విభునికి
కంగుదేరి మేల్కనువేళ
పొంగేటికుచములే పూర్ణకుంభములు
వింగళమై వెలివెడలేడివేళ

చ. 2: అతివ నీతొడలే యరఁటికంభములు
చతురునికిఁ బ్రవేశపువేళ
రతిఁగరములే తోరణపుఁజిగు రలరె
అతనుముహూర్తపు టావేళ

చ. 3: సుదతి నీకెమ్మోవి సూడిదెఫల మిది
అదన మీరహస్యపువేళ
కదిసిన శ్రీవేంకటపతికిని నీ -
వెదిటివిధానమ వెప్పటివేళ

రేకు: 1437-3 ఆహిరి నాట సం: 24-219

పల్లవి: పంతమాడఁదడవా పచ్చిదేరీ నవికాక
కాంతునికిఁ దడవా కె కొనీననికాక

చ. 1: కోపగించఁదడవా కొనచూపులకన్నుల
ఆపని తా నెఱిఁగీ ననికాక
రాఁపుగా నాడఁదడవా రంతులవెంగేలఁ దన్ను
వైపుదనబా సెంచుక వచ్చీననికాక

చ. 2: యెగ్గువట్టఁదడవా యెదుటఁ దనచేఁతకు
నిగ్గులమీఁదటను మానీనవికాక
వెగ్గళించఁదడవా వేగిరించి తనకంటె
సిగ్గుదేరి తాఁ బ్రియముచెప్పీననికాక

చ. 3: జంకించఁదడవా సమరతులను నేఁడు
కొంకి శ్రీవేంకటేశుఁడు కూడెనవికాక
సుంకుల నవ్వఁదడవా సారిది సెలవులను
వుంకువగా మేన గోరు వూఁదీననికాక

రేకు: 1437-4 ఆహిరి సం: 24-220

పల్లవి: తలఁచుకో నావల్లఁ దప్పులే
వెలయ నిన్నింతసేయ వేడుకా నాకు

చ. 1: తమితోఁ బాయక నాదండ నీవే వుండితేను
సముకాన నిన్ను దూరఁ జలమా నాకు
అమరఁగ నీవాడినఅమాటే తప్పకుండితే
జమళి నలిగియుండ సంగతా నాకు

చ. 2: సన్నల నీ విచ్చినచనవే చెల్లించితేను
నిన్ను నేరము లెంచఁగ నేరుపా నాకు
మున్నిటి వొడఁబాటు ముందె నీవుచెప్పింపితే
విన్నపముసేసి యంప వినోదమా నాకు

చ. 3: గట్టిగా నీవు నన్నుఁ గాఁగిలించుకొంటేను
అట్టె కొంగువట్టితియ్య నాపా నాకు
నెట్టన శ్రీవేంకటేశ నేఁ డిట్టె నన్నేలితివి
అట్టుసేయ నాగుండె బాయా నాకు

రేకు: 1437-5 తెలుగుఁగాంబోది సం: 24-221

పల్లవి: ఏమి సేసేవోకాని ఇఁకను నీచిత్తము
వేమారు సుద్దు లడిగీ వెలఁది యింటిలోను

చ. 1: ఆడుకోలునీమాఁట లాసలు పుట్టించఁగాను
వాడికె నెదురుచూచీ వనిత నీకు
పాడినపాట నీపే రప్పటిఁ దలఁపించఁగాను
జాడ నిన్నడుగనంపె సకియలచేతను

చ. 2: తాలిమితో నీగుణాలు తమకము రేఁచఁగాను
పోలించి పూవుల వేసీఁ బొలఁతి నిన్ను
వేలనున్న వుంగరము వేడుకలు రేఁచఁగాను
కేలెత్తి నీకు మొక్కీఁ గెలనిసన్నలను

చ. 3: చుట్టరికపునీరాక సొంపు నిగిడించఁగాను
ఇట్టె నిన్నుఁగాఁగిలించీ నీకాంత నేఁడు
గట్టిగా శ్రీవేంకటేశ కలసి నీవుండఁగాను
నెట్టన నిన్నుఁ బొగడీ నెలఁతలలోను

రేకు: 1437-6 సామంతం సం: 24-222

పల్లవి: ఏకతాన మీ రుండఁగా ఇన్నిసింగారాలునాయ
మేకొని చెలు లిందుకే మెచ్చేరు నిన్నును

చ. 1: సకియనెమ్మోమునఁ జంద్రోదయఁబాయ
వెకలినవ్వులనె వెన్నెల గాసె
చికురభరము వీడి చీఁకటి యంతలో జారె
తొకుతొకులాడేరతుల నీవు గూడఁగా

చ. 2: పన్నెమోవిచిగురున వసంతకాలము వచ్చె
చిన్నిపలుకులఁ బుట్టె చిగురలెల్లా
వున్నతపుఁగుచముల నొనరెఁ దమ్మి మొగ్గలు
కన్నె నురమున నీవు గాఁగిలించగాను

చ. 3: మరుతేరు చూపట్టె మగువపిఱుఁదునను
సిరిమించెఁ గాళెలు చిఱుఁదొడల
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
గరిమల నీవిట్లాఁ గరుణించఁగాను

రేకు: 1438-1 శంకరాభరణం సం: 24-223

పల్లవి: నీదాక వలెనా నెగడె మరుబలాలు
భేదము లేదని వింటిఁ బెంచితిమె నేము

చ. 1: పలుకకువే నీవు పడఁతీ యీ -
పలికేచిలుకలు నీప్రతి గాదా
కులుకకువే నీకుచములు యీ -
పొలయుజక్కవలు ఆపోలికే కాదా

చ. 2: సోవలఁ బాడకువే సుదతీ యీ -
కోవిలపాట లందలిగుణమే కాదా
చేవదేర నవ్వకువే చెలియా యీ
కావరపువెన్నెల లాగతులే కావా

చ. 3: మీఁదఁ జేయివేయకువే మెలుఁతా
పోదిగొన్నతీఁగె లాపారుగేకాదా
నాదించి శ్రీవేంకటాద్రినాథుఁడ నేనూ నన్ను
సోదించి కూడితి నీ సొమ్మయితిఁ జాలదా

రేకు: 1438-2 రామక్రియ సం: 24-224

పల్లవి: నాలుకతుదనే పో నానావిధములును
యేలేపతికడకు నిప్పుడే రాఁగదవే

చ. 1: చింతించఁజింతించ చిత్తములోనే నుయ్యి
అంతలో సంతసించిన నదే కొండ
పంతమున సలిగితే ప్రాణనాయకుఁడే పగ
చెంతగూడిన నాతఁడే చేతిలోనిదేవుఁడు

చ. 2: కన్నుమయ్యఁ గన్నుమయ్యఁ గప్పిన దింతాఁ జీకటే
అన్నిటాఁ జూడఁజూడఁగ నదే వెలుఁగు
పన్ని మనసురాకున్నఁ బలుకెల్లా వెంగేలే
తిన్ననై యెనయుచోటఁ దిట్టులే దీవెనలు

చ. 3: పరుసము చేతనుంటేఁ బట్టినదెల్లా బంగారే
యెరవై పూరకవుంటే విను మినుమే
యిరవైన శ్రీవేంకటేశురతులే యలపు
పరవశము గోరిన వచ్చికారముఁ దీపే

రేకు: 1438-3 ముఖారి సం: 24-225

పల్లవి: వింతచెలి వద్దనుంటే వెలఁదికి సిగ్గుగాదా
యెంతైనా నెరఁగదు యెటువంటియాఁటది

చ. 1: ఇంతి తనకాఁతాళాన ఇద్దరముఁ గూచుండఁగా
సంతలో సుద్దులు చెప్పీ సారెసారెకు
మంతన మాడేనంటా మనసు పట్టఁగలేక
చెంత నేకతములాడీ చెవిలోనే తాను

చ. 2: యీకె దనవేడుకతో యెదుట నే నుండఁగానే
ఆకుమడిచియ్యవచ్చీ నదే నీవద్ద
నీకుఁ బాదాలొత్తేనంటా నెపములు సేసుకొని
చేకొని కూచుండీని చేరి పానుపుమీఁద

చ. 3: తతి నిన్నుఁ గూడేయాసఁ దలుపు దెరచుకొని
రతిసేయవచ్చీఁ గాఁతరాన నీడకు
యితవై శ్రీవేంకటేశ యిప్పుడే నన్నేలితివి
సతి పెనఁగాడేనంటా మతకము సేసీని

రేకు: 1438-4 కాంబోది సం: 24-226

పల్లవి: నీకు నాపె గలుగుట నీభాగ్యమే
చేకొని కాఁపుర మిట్టె సేయఁగదరయ్యా

చ. 1: మగువ నీతోనాడితే మాటలఁ దేనెలు గారీ
నగితే సెలవుల వెన్నెల వెల్లీని
సగటునఁ బొలసితే బంగారుపొడి చిందీని
మొగి నాపె నురమున మోవఁదగునయ్యా

చ. 2: తమకించి చూచితేను తామెరరేకులు గప్పీ
చెమరించితే ముత్యాలచేరు లూరీవి
సముకాన నిలిచితే జవ్వనము దొట్టీని
అమరునయ్య నీకంటె నాపెపేరు మునుప

చ. 3: యిట్టె కాఁగిలించుకొంటే యిలు నిండీ సిరులెల్ల
మెట్టితే నవరత్నాలు మెండుకొనీని
నెట్టన శ్రీవేంకటేశ నేడు మమ్ము నేలితివి
వొట్టుక యిల్లిటముగా నుండదగువయ్యా

రేకు: 1438-5 సామంతం సం: 24-227

పల్లవి: ఇప్పు డాతనిమనసు యెట్టున్నదో తెలియరే
చెప్పినట్టు మీమాఁట సేసేఁగాని

చ. 1: వొనరినపొందులైతే వొడఁబరచుటఁగాక
మనసు రాకుండితేను మాటాడేదేమి
కనువిచ్చి చూచితేను కానుక యీవచ్చుఁగాక
మునుపే తలవంచితే ముందరికి వత్తురా

చ. 2: ఆసపడి యుండితేను అట్టె నవ్వవచ్చుఁగాక
వేసరఁగాఁ జెనకితే వేడుకయ్యీనా
వాసితోనే నడిపితే వాడికై వుండుటగాక
వేసాలకు వేఁడుకోంటే వినయమేమిటికి

చ. 3: కలసి కాఁగిలించితే కరఁగఁగవచ్చుఁ గాక
తలఁచి గుట్టున నుంటే తనివయ్యీనా
అలరి శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
నెలవై నిన్నటిరతి నేఁటిక వచ్చీనా

రేకు: 1438-6 సాళంగనాట సం: 24-228

పల్లవి: ఏమినేరుపే నీది యింటికిఁ బిలిచే వతని
కామించినవాడు వేళగాచియుండఁగాను

చ. 1: వొక్కతెవే నీవతని నొడిఁ బెట్టుకొనేవటే
పిక్కటిల్లి యిల్లునిండాఁ బెండ్లాలుండఁగా
అక్కర ఁజేపట్టేవేమే ఆతనిముంజేతివే
పెక్కుకంకణదారాలు పెట్టేఁడుండఁగాను

చ. 2: నెమ్మి నాతనిపైఁ బత్తి నీపాలికే వచ్చెనటే
యిమ్ములఁ గాంతలు మేడలెక్కిచూడఁగా
కమ్మినేఁడు నీచుట్టరికమే చెప్పేనదేమే
వుమ్మడి వావులవారు వూరెల్లా నుండఁగాను

చ. 3: కలయ నతఁడు నీకే కాణాచియటవే
చెలు లెందరైనా వచ్చిసేవసేయఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నుఁ గూడె
వలపులెల్లా నీతనివాకిట నుండఁగాను

రేకు: 1439-1 సాళంగనాట సం: 24-229

పల్లవి: ఏమి పంతాలాడేవే యిటువంటివాఁడు వీఁడే
కామించి నేఁ గైకొంటిఁ గాదనఁగఁగలవా

చ. 1: యెలయించనేరుతువా ఇన్నిటా జాణఁ డితఁడు
పిలువఁగనేరుతువా పెలు చితఁడు
పలికించనేరుతువా బలవంతుఁడితఁడు
కలయఁగనేరుతువా గట్టువాయ ఇతఁడు

చ. 2: నగ నీవోపుదువా నాలికాఁడు యీతఁడు
తగులఁనోపుదువా దంట ఇతఁడు
బిగియఁగనోపుదువా ప్రియవాది యీతఁడు
జగడించనోపుదువా సరసుఁ డితఁడు

చ. 3: చెనకగఁగలవా చిక్కనివాఁ డితఁడు
తనిఇంచగలవా వుద్దండుఁ డితఁడు
యెనసెను శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను
పెనఁగఁగఁగలవా ముప్పిరి ఘనుఁ డితఁడు

రేకు: 1439-2 బౌళి సం: 24-230

పల్లవి: వనితకు నెంతమేలువాఁడవో కాక
యెనసి నవ్వేవు తగ వెంచుకొనవద్దా

చ. 1: పూపచన్నులు వట్టితే పోపొమ్మని జంకించఁగా
ఆపెతోనే మాటలాడే వప్పటి నీవు
యేపున వేఁడుకొంటే యిందాఁకా బిగిసెను
చేపట్టితి వంతలోనే సిబ్బితైనా వలదా

చ. 2: పూవుల నీవు వేసితే పూఁచి నిన్నానలువెట్టె
చేవట్టి తీసే వాపెనే చెల్లఁబో నీవు
భావించి నీవు చూచితే పయ్యెద పైఁ గప్పుకొనె
వావులు చెప్పవచ్చేవు వాసెఱఁగవద్దా

చ. 3: గుట్టునఁ గాఁగిలించితే కొప్పువట్టి తీసె నిన్ను
ఇట్టె మోవడిగేవు ఇంకా నీవు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
జట్టి గొంటి వందరిని జంటసేయవలదా

రేకు: 1439-3 దేసాళం సం: 24-231

పల్లవి: నీగుణ మెఱిఁగేనంటా నే నుందానను
యీగతి నూరకుండితే యెగ్గులు సేయకుమీ

చ. 1: మనసు వేరొకతెపై మరిగి నీ కుండఁగాను
పెనఁగఁగఁబోతేను ప్రియము గాదు
పనివడి చూపు లాపెపైఁ బారివుండఁగాను
వినుకొలువు సేసితే వేసటలై వుండవా

చ. 2: తేరకొని నీ వొకదిక్కున నవ్వఁగాను
చేరి యంతమొక్కినాను సెలవయ్యీనా
కోరి పరాకున నాముకొని తలపోయఁగాను
సారె నిన్నుఁ బిలిచితే సందడిలో వినేవా

చ. 3: సూటిగా నీ వవ్వలిసుద్దులెల్లా వినఁగాను
మేటినాసరసములు మెచ్చులయ్యీనా
చోటిచ్చి నన్నేలితివి చొక్కుచు శ్రీవేంకటేశ
వాటముగా నిఁకను నీవలపు లీడేరవా

రేకు: 1439-4 పాడి సం: 24-232

పల్లవి: ఎప్పుడా నావాడఁవే యెఱుఁగుదు నే నాసుద్ది
చిప్పిల నన్నునీవు చేపట్టి వదలవు

చ. 1: జంకించ నోపఁగాని సరసమాడే నీతో
మంకు చూపనోపఁ గాని మాటలాడేను
కొంకి వూరకుండనోపఁ గొసరిఁ జేతుల మొక్కే
సంకెలేక మోహించి యేసతిఁ దెచ్చుకొన్నాను

చ. 2: పంతములాడఁగాని పాదాలసేవ సేసేను
చింతతో నట్టగఁగాని చెక్కునొక్కేను
వింతగా మెలఁగఁగాని వేడుకచుట్టమ నయ్యే
వంతుకు నీ వేమగువవద్ద నుండినాను

చ. 3: తప్పులేమీ నెంచఁగాని తగిలి పొగడే నిన్ను
వుప్పతించఁగాని నీవొడి వట్టేను
ఇప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొప్పులెత్తనేల నీ వేసుదతిఁ గూడినాను

రేకు: 1439-5 రామక్రియ సం: 24-233

పల్లవి: ఏమిసేసీ నింటిలోనె యెప్పుడు వచ్చీఁ దాను
ప్రేమతో నున్నాఁడ నేను పిలువరే మీరు

చ. 1: మొనసి చెలియ నాముందర నిలిచినట్టు
పెనఁగి కాఁగిటిలోన బెరసినట్టు
తనివార మోవియిచ్చి దప్పిదేరిచినయట్టు
మనసున మెలఁగీని మాటలాడినట్టు

చ. 2: చెలరేఁగి నాయొద్ద సెలవుల నగినట్టు
సొలయుచు నాదిక్కు చూచినయట్టు
నలిగె మెరసి నాతో సరసమాడినయట్టు
కలలోనఁ బొరసీని కప్పురమిచ్చినట్టు

చ. 3: చెక్కునొక్కి నామీఁద సేసలు చల్లినట్టు
గక్కనఁ బయ్యద నాపైఁ గప్పినయట్లు
యిక్కడ నే శ్రీవేంకటేశుఁడ దానే వచ్చి
నిక్కముగా నన్నుఁ గూడె నిండీ నింకా నాసలు

రేకు: 1439-6 బౌళి రామక్రియ సం: 24-234

పల్లవి: ఎగ్గుపట్టఁ బనిలేదు యింతులతోను
సిగ్గువడ్డకామిని చెక్కు చేతఁ జేర్చును

చ. 1: పనిమాలినపనికి పంతముతో రమణుని
చనవుగలయాఁటది సాదించును
పెనఁగి బుద్ధిచెప్పితే బిగియుచుఁ జెలులతో
వొనరనిసణఁగులు వూరకే రాలుచును

చ. 2: పిలువకతొలుతే ప్రేమములు తానే చల్లి
బలిమిక తై యైనది పైకొనును
వలదన్నా విడువదు వడ్డి వారు చూడఁగానే
కొలఁదిమీర నతనిఁ గొంగువట్టి తీసును

చ. 3: తడఁబడ దెంతైనా తాలిమి నిలుపలేక
కడుఁదమకించినది కాఁగిలించును
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
బడివాయఁకిఁక దాను పాలుపడివుండును

రేకు: 1440-1 శుద్ధ వసంతం సం: 24-235

పల్లవి: ఇన్నిఁ జూచేవుగాక యేల నిన్ను రట్టుసేయ
పన్ని సీత కొక్కెతకే బతిమిసేసుకోవా

చ. 1: చెంతల నన్నేకాని చెలులఁ గైకొననంటా
పంతములాడుకొనవా పలుమారును
మంతుకెక్కి నీ వప్పటి మఱచితివేమోకాక
వింతసతులఁ బదారువేలఁ జేకొనవా

చ. 2: నాకే మోహించితిగాని నాతుల బెండ్లాడనంటా
సాకిరులు వెట్టేవా సతులనెల్లా
పైకొని యేకడ నీవు పరాకైతివేమోకాని
కాకుగాఁ బురాంగనలఁ గతలఁ గఱపవా

చ. 3: కమ్మి నాకాఁగిటఁ గూడి కాంతల నటంనంటా
యెమ్మెలెల్లా నెఱపవా యిప్పుడే నాతో
పమ్మి శ్రీవేంకటేశ్వర భ్రమసితివేమోకాని
కొమ్మలైనగొల్లెతలఁ గూడి చెలఁగవా

రేకు: 1440-2 మాళవి గౌళ సం: 24-236

పల్లవి: అవియు నవియు మరునమ్ములే కావా
వివరింప భావములు వేరువేరైతోఁచెను

చ. 1: చెలిమాటుననుండి వేసినతామెరపువ్వు
కలికి నీపతికిని కానికాయను
మొలకగుబ్బలతమ్మి మొగుడ లంటఁగ నీవు
అలమి పైకొంటేను అవె పూజలాయను

చ. 2: కోమలి దవనపుచిగురుగుత్తి వేసిన
చేముంచి సన్నతనికిఁ జేసుటాయను
ఆమని మోవిచిగురు అంతలోఁ జవిచూపిన
వేమారు వలపులకు విందులాయను

చ. 3: యీవేళ నీజాజిదండ యిదె మెడ వేసితేను
శ్రీవేంకటేశునికి మచ్చికలాయను
కూవలై నీమేన జాజుకొన్నపులకవిరులు
మోవ నితనిఁ గూడఁగా ముగమాయను

రేకు: 1440-3 వరాళి సం: 24-237

పల్లవి: వేడుకకాఁడ వౌఁదువు వెఱపేఁటికి
పాడిపంతా లెంచి నేను పచారించనేఁటికి

చ. 1: కొంకులేక నీవూ నాపెఁ గూడినందుకు నీమేని-
పంకపుఁజెమటే చెప్పీ బాసలేఁటికి
ఇంకనేమి నీవాపెను ఇంటఁ బెట్టుకున్నందుకు
అంకెఁ జెలులచే వింటి నాడనేఁటికి

చ. 2: కలికిచన్నుల మీఁదిగందము నీమేన నంటె
చెలులెల్లా నెరిఁగిరి సిగ్గులేఁటికి
వెలయ న న్నిందుకు వేఁడుకొనే విటు నీవు
తలఁచినట్టెల్లానాయ దాఁచనేఁటికి

చ. 3: చెంతల నాచెల్లెలంటాఁ జెప్పేవు చుట్టరికము
వింతలు నీవల్లఁ గంటి వేసాలేఁటికి
ఇంతటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చింతలేదు యిఁక గుట్టు సేయనేఁటికి

రేకు: 1440-4 సాళంగం సం: 24-238

పల్లవి: ఏల నిన్ను దూరేము యెఱఁగమా నే మంతేసి
మేలు నిన్ను మెచ్చితిమి మేఁటిదొర వౌదువు

చ. 1: వాసి వంతెరిఁగి నీవు వరుసతో నడపితే
యీసడించవచ్చేరా యెవ్వరైనాను
సేసవెట్టినట్లనే సేవలు సేయించుకొంటే
తోసి పోనాడేవారికి దోసము గాదా

చ. 2: తగువు దప్పక నీవు దండనే కాచుకుండితే
యెగసక్కెము లాడుదురా యెవ్వరైనాను
తగులై నీవందరిపై దయగలిగుండఁగాను
పగలు నీపైఁ జూప పంతమా యేమైనా

చ. 3: గుట్టుతోఁ గూడి నీమంచిగుణము నెరపఁగాను
యిట్టునట్టుఁ గొసరరా యెవ్వరైనాను
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
రట్టుసేయము రావయ్య యిట్టె మాయింటికి

రేకు: 1440-5 రామక్రియ సం: 24-239

పల్లవి: వెనక నీకు మొక్కి వేఁడుకొనీఁగాని చెలి
మునుపఁ బంతములాడి మొఱయకువయ్యా

చ. 1: యెనసివుండినచోట నేమాఁటైనా నాడుదురు
పెనఁగులాడేవేళ బిగుతురు
పనులు సేయఁగాను పాదములు చెయి సోఁకు
వనితల నెగ్గుపట్టవలదయ్య నీవు

చ. 2: తప్పకచూచితేను తరితీపులెల్లా రేఁగు
కుప్పవడ నవ్వఁగాను కొప్పు వీడును
కప్పురము చవిగొంటే కడునెంగిలి యంటును
అప్పుడే యింతుల జరయఁగఁ దగవుగాదు

చ. 3: వేడుకమాట లాడితే వెంగెములైతోఁచును
కూడేపానుపుపైని సిగ్గులు జారును
యీడనె శ్రీవేంకటేశ యేలితి నీపె నింతలో
జాడతో సతి నలయించకువయ్య యిఁకను

రేకు: 1440-6 కాంబోది సం: 24-240

పల్లవి: నిన్నుఁ జూచి తనివంది నిలుచున్నది
వున్నతి నీసతివలె నుండవద్దా వలపు

చ. 1: వినివిని నీమాఁటల వెరగుతోడ నున్నది
ననుపుఁజేతలకును నవ్వుచున్నది
చనవు నీవియ్యఁగాను సంతోసముతో నున్నది
యెనసి రతిసలుప నెఱఁగకవున్నది

చ. 2: తప్పక నీవు చూచితే తగులమితో నున్నది
వొప్పగఁ జేయివేసితే వొగ్గుచున్నది
కప్పిన పయ్యదంటితే కరఁగుతాఁదా నున్నది
దప్పికి మోవియడుఁగ దలపోయుచున్నది

చ. 3: చేరి నీవు చెనకితే చిమ్మిరేఁగుతానున్నది
యీరతి నీకాఁగిఁట బెంపెక్కివున్నది
గారవాన నేఁడు శ్రీవేంకటేశుఁ గూడఁగాను
నేరుపుతో నీవురాన నెలకొనివున్నది

రేకు: 1441-1 రామక్రియ సం: 24-241

పల్లవి: చెలులాల మీతోఁ జెప్పసిగ్గయ్యీ నాకు
చలముతో మోవితేనె సారెకు నిచ్చీని

చ. 1: చూడవే యీతఁడు నన్ను సుద్దులేమి యడిగీని
యేడలేనివారు తనయింట నుండఁగా
ఆడ వేఁగినంతాఁ దాను ఆపెవద్దనుండి వచ్చి
వేడుకతో నావద్దివీణె వాయించీని

చ. 2: కంటినే యిప్పు డితనికతకారిచేఁతలెల్లా
వొంటి నేనుండఁగా నావొడి వట్టీని
తొంటిపొందులవారెల్లా తోడనే కాచుకుండఁగా
అంటీనే నాపయ్యద అందరూఁ జూడఁగానే

చ. 3: తగునే యీతనికి యీతరితీపువలపులు
పగటురతులఁ గూడి పైకొనీని
జిగిమీర నవ్వుతాను శ్రీవేంకటేశ్వరుఁడు
మిగులా నావసమై మెచ్చుల మెచ్చీని

రేకు: 1441-2 శ్రీరాగం సం: 24-242

పల్లవి: ఇప్పుడు నీవు వచ్చితి విది చూచి నా కదివో
చొప్పుగా రెండుభావాలు చూపిచెప్పరాదు

చ. 1: తక్కక యెడసి నిన్నుఁ దలఁచఁగాఁ దలఁచఁగా
యెక్కడచూచినా నీవై యిదే తోఁచేవు
వెక్కసపునీసుద్దులే వేమారు వినఁగాను
మక్కువ వీనులకు నీమాటలే వుండీని

చ. 2: వరుసతో నీరూపు వ్రాయఁగా వ్రాయఁగాను
అరుదై చేతికిఁ జిక్కినట్టె తోఁచీని
సరవి నీగుణములు సతులతో నాడుకోఁగా
తొరలీ నీపేరే నాతుదనాలికెకును

చ. 3: కందువ నీకుగానే కలఁగనఁగా గనఁగా
అంది కాఁగిటఁగూడినయట్టె తోఁచీని
విందుగా నన్నిపుడె శ్రీవేంకటేశ కూడితివి
చందముగా నాకన్నిటా సతమై యేలితివి

రేకు: 1441-3 బౌళి సం: 24-243

పల్లవి: ముందు నిన్నెఱఁగమా యేమూల నుంటివే
సందుసుడి నింతలోనే సవతివైతివే

చ. 1: సతులసుద్దులు చెప్పి చనవరివైతివే
అతనికి పాదాలొత్తి యాలవైతివే
సతతము నవ్వినవ్వి జాణకత్తె వైతివే
పతితోఁ బెనఁగులాడి బాఁతివైతివే

చ. 2: మెచ్చుగా వావులుచెప్పి మేనదానవైతివే
తచ్చన చేసి యీతని తగులైతివే
మచ్చికఁ గొలువుసేసి మంచిచుట్టమవైతివే
యిచ్చకము సేసితివి కిటు దొరవైతివే

చ. 3: వట్టి సాఁకిరులు చెప్పి వాడికదానవైతివే
బట్టబయలు మొక్కి నేర్పరివైతివే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నేలినాఁడు
జట్టిగొని నీవతనిసతమైతివే

రేకు: 1441-4 వరాళి సం: 24-244

పల్లవి: ఊరకె యిందరివలె నుందుముగాక
మారుకొని నిన్నడుగ మాకేల యిఁకను

చ. 1: యిచ్చకము లాడేవారి విందు రమ్మందురుగాక
యెచ్చుకుందులాడేవారి నియ్యకుందురా
పచ్చిచేఁతలు నీమేనఁ బాదుకొని వుండితేను
మచ్చికతోఁ జెప్పిచూప మాకేల ఇఁకను

చ. 2: మగువలఁ దెచ్చేవారి మన్ననసేతురుగాక
తగుబుద్ధిచెప్పేవారిఁ దాము మెచ్చేరా
అగడు సేవేచెలులు అండఁగాచుకుండఁగాను
మగిడి నీ కడ్డమురా మాకేల ఇఁకను

చ. 3: వెలయాండ్లయినవారి వేడుక చూతురుగాక
బలిమి నిల్లాండ్లమీఁద బత్తిసేసేరా
యెలమి శ్రీవేంకటేశ యేలితి విప్పుడు నన్ను
మలసి మర్మములెత్త మాకేల యిఁకను

రేకు: 1441-5 శంకరాభరణం సం: 24-245

పల్లవి: చలమో పలమో సతి నీకు
పిలువఁగఁ బిలువఁగఁ బెనఁగేవూ

చ. 1: తగిలి యతఁడు నినుఁ దడవఁగనూ
చిగురుఁజేతులను చిమ్మేవూ
అగపడి సరసములాడఁగనూ
నిగిడి బింకములు నెఱపేవూ

చ. 2: నంటున నాతఁడు నవ్వఁగనూ
గెంటసంబులను కెలసేవూ
అంటి యతఁడు నిను నలమఁగనూ
యింటికి రమ్మని యెలయించేవూ

చ. 3: శ్రీవేంకటేశుఁడు చెనకఁగనూ
భావ మెఱింగియుఁ బదరేవూ
యీవేళ విన్నితఁ డెనయఁగను
పూవుల వేయుచుఁ బొదిగేవూ

రేకు: 1441-6 మంగళకౌసిక సం: 24-246

పల్లవి: మగవాని కేఁటి యెగ్గు మాపుదాఁకాను
తగిలి భోగించినదే దక్కినదిగాక

చ. 1: మునుకొని యాపెగుణములు నాతోఁ బొగడేవు
వనతఁ దెచ్చుకొనఁగా వలదనేనా
మనసాకతెఁ గోరఁగా మాటలు నాతోనాడఁగా
యెనసినట్టయ్యీనా యేఁకరేది దోసము

చ. 2: వెలి నాపె నీకిచ్చినవిడెము నాకిచ్చేవు
వలపెంతగలిగినా వలదనేనా
చెలిమి నీ కందుండఁగా చేయి నాపైఁ జాఁచఁగాను
ఫలమేవంక వచ్చునో పచ్చారేది దోసము

చ. 3: జోడుగా నాపెఁగలసి చుట్టరికాలు చెప్పేవు
వాడికె సేసుకొనఁగా వలదనేనా
ఆడ నాపె రాఁగా నన్నుఁ గూడితి శ్రీవేంకటేశ
వేడుక నట్టె మొకము వేలించేది దోసము

రేకు: 1442-1 పాడి సం: 24-247

పల్లవి: తలఁచమైతిమి మీతగులాయము
చెలినిన్నేమి సేసినాఁ జెల్లునయ్యా నేఁడు

చ. 1: వలచివచ్చినవారు వాకిటఁ గాచుకుండఁగ
తొలుతే విన్నీకె యేల తొంగిచూచీని
సలిగె గలిగితేను సాదించకపోరాదు
తలిరుఁబోఁడికి నిది తగునయ్యా నేఁడు

చ. 2: కోరి సతులెల్లా నీకుఁ గొలువులుసేయఁగాను
వూరకే వచ్చి తాను నీవొడిపట్టీని
యీరీతి మీపొందులౌత యెఱఁగమైతిమి నేము
కూరిమికాంతకు నిదె గుణమయ్యా నేఁడు

చ. 3: నెట్టుకొని సవతులు నీపాదము లొత్తఁగాను
గట్టిగా నీవద్దఁ బండి కాఁగిలించీని
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి మమ్మిందరి
జట్టిగొన్నయింత కిది సాజమయ్యా నేఁడు

రేకు: 1442-2 ఆహిరి సం: 24-248

పల్లవి: ఇంతకంటె నేమసేతు యింతులాల చెప్పరే
అంతటా నావోజలు తానన్నీ నెఱుఁగునే

చ. 1: చెల్లఁబెట్టవద్దుగాని సేసినచేఁత చెప్పితే
చల్లఁగానే అందుకిట్టె సంతోసించేనే
కల్లకు నోరువఁగాని కాంత నెవ్వతెఁ దెమ్మన్నా
యెల్లవారుఁ జూడఁగానే ఇంటికిఁ దెచ్చేనే

చ. 2: దాఁచుకొనవద్దుగాని తనమేనిగురుతులు
పూఁచి నాకుఁ జెప్పితే నిప్పుడు మెచ్చేనే
రేఁచవద్దుగాని వొకరీతి గుట్టుననుంటే
పూఁచకదాఁచక నేనూ నొద్దికై మొక్కేనే

చ. 3: వింత సేయవద్దుగాని వెస నాకెఁ బెండ్లాడితే
పంతము లాడక సోబానఁ బాడేనే
ఇంతలోనె శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
బంతి నాపె దేవరఁగా భావించేనే

రేకు: 1442-3 గౌళ సం: 24-249

పల్లవి: ఇందుకు సిగ్గువడఁగ నింత యేఁటికి
కందువై ననీవలపు కట్టిపెట్టవచ్చునా

చ. 1: యేకగ నెవ్వరిమన సెట్టుండినా నుండెఁగాక
అకెకు నీవు విడెమంపఁదగదా
వాకున నే మాడుకొన్న వారికే తెలుసుఁగాక
ఆకడ నీ వాకెకుఁ బ్రియముచెప్పఁదగదా

చ. 2: కంటగించి సవతులు కాఁతాళింతురుగాక
నంటున నీ వాకెతోడ నవ్వఁదగదా
అంటి తాము సన్నసేసుకొంటేఁ గొవిరిగాక
జంటతో నీవాకెమోవి చవిగొనఁదగదా

చ. 3: దూరి తాము నిన్ను కాలుదొక్కితేఁ దొక్కిరిగాక
ఆరసి నీవాపెఁ బెండ్లియాడఁదగదా
కూరిమ నన్నేలితివి గొబ్బున శ్రీవేంకటేశ
గారవించి నీ వందరిఁ గరుణించఁదగదా

రేకు: 1442-4 సామంతం సం: 24-250

పల్లవి: ఇందుకే వెరగయ్యీని ఇటు నిన్నుఁజూచి నాకు
కందువ నీనేరు పెల్లాఁ గానవచ్చెనే

చ. 1: పొదిగి నాపతితోను పొత్తుల మాటలాడేవు
కదిసి చుట్టరికము గలపేవు
అదనఁ బెండ్లిపీఁటపై నండఁ గూచుండవచ్చేవు
ఇదివో నీజాణతన మేమి చెప్పేదే

చ. 2: ఆతనివదినెనంటా నట్టె వావులు చెప్పేవు
కాతరాన వట్టివూడిగాలు సేసేవు
చేతిలోనివిడేనకు చెఱఁగు నీవొగ్గేవు
యేతరి నీయాసోద మేమిచెప్పేదే

చ. 3: యిద్దరము నుండఁగాను యేకతములాడేవు
అద్దుక యితనికి పయ్యెద గప్పేవు
వొద్దిక శ్రీవేంకటేశుఁ డొనర నన్నేలినాఁడు
యిద్దెన నీమంచితన మేమిచెప్పేదే

రేకు: 1442-5 నాదరామక్రియ సం: 24-251

పల్లవి: ఎంతవేడుకోకాని యింతి నీపైని
కాంత నేలుదు రావయ్య కాచుకున్నది

చ. 1: చెలియకు నీసుద్దులు చెప్పినంతలోననే
చెలపచెమట లవే చెక్కులనిఁడె
అలరి నీవుంగరము అట్టె పొడగంటానే
మొలకనవ్వులు నిండె మోవిమీఁదను

చ. 2: నీచెలనని ముందట నిలుచున్నయపుడే
లాచి మోమునన నెల్లాఁ గళలు దేరెను
చూచి నీకానవాలునేఁ జూపేనని యడిగితే
కాచుక మైఁబులకలు కమ్ముకొని మించెను

చ. 3: నీరాక యెఱిఁగి యిట్టె నేఁ దలుపుదెరచితే
చేరి నీ కెదురువచ్చి సిగ్గువడెను
యీరీతి శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
తారుకాణ వచ్చితేను తగ నన్ను మెచ్చెను

రేకు: 1442-6 శ్రీరాగం సం: 24-252

పల్లవి: ఆసపడ్డచెలులకు నాతురబంధుఁడు తాను
రాసికెక్క నింతలోనే రావద్దా తాను

చ. 1: పెక్కుమారులు తను నేఁ బేరుకొని పిలువఁగా
పక్కున నారమణుఁడు పలుకవద్దా
దిక్కులనెల్లా నేను తేరకొని వెదకఁగా
చొక్కఁగఁ దనరూపము చూపఁగవద్దా

చ. 2: అసురుసురై తన్ను నటు నేఁ దలఁచఁగాను
వెస నాచన్నులపైఁ జేఇ వేయవద్దా
కొసరి తనపొందులు కోరుకొనివుండఁగాను
ముసిపిదీర మాఁటలు ముంచియాడవద్దా

చ. 3: వెలలేని జవ్వననా వేడుకపడి వుండఁగా
కలసి కాఁగిట నన్నుఁగై కొనవద్దా
అలరి శ్రీవేంకటేశుఁ డంతలో నన్నిదె కూడె
మలసి యెప్పుడు నిట్టె మన్నించవద్దా

రేకు: 1443-1 శ్రీరాగం సం: 24-253

పల్లవి: గుట్టుతో నుండుటే మేలు గుణవంతురాలికి
ఇట్టె నీవు వలెనంటే ఇయ్యకొనఁదగును

చ. 1: పక్కనఁ జూచినచూపు భావించి చూచినచూపు
మొక్కలాన నింతికుచములపై నాఁటె
ఇక్కునలంటి నిన్ను యెవ్వతె చెనకినాను
మిక్కిలి నీకూళతనమే మీదఁమిక్కిలౌను

చ. 2: తగుల నాడినమాట తమితో నాడినమాట
వొగి నాపెకుఁబట్టినవుంకువాయను
జిగి నిన్నెవ్వతె ఇఁకఁ జెఱఁగువట్టితీసినా
వెగటై యెడ్డతనమే వెల్లావిరియౌను

చ. 3: సంతసించినట్టినవ్వు సరసమాడిననవ్వు
ఇంతలో నాపెకాఁగిటి కిరవాయను
చెంతల శ్రీవేంకటేశ చేరి నన్నుఁ గూడితివి
వంతడిగితే నాపెకు జంతతనమౌను

రేకు: 1443-2 రామక్రియ సం: 24-254

పల్లవి: జీరదీసేనా నీపై నాచిత్తమేమి యరసేవు
చేరి నీ చెప్పినట్టెల్లా సేవసేవతుఁగాక

చ. 1: కన్నుల జంకించితేను కాదనేనా నిన్ను
సన్నల నీవు దిట్టితే సాదించేనా
చన్నులు విసికితేను చలపట్టిపెనఁగేనా
అన్నిటా నీచేతఁకు లోనైవుండుదుఁగాక

చ. 2: కొప్పువట్టి తీసితేను కోపగించేనా నిన్ను
చిప్పిలఁ జెనకితేను చేయివట్టేనా
ముప్పిరి గోరనూఁదితే తప్పించుకోఁజూచేనా
యెప్పుడూ నీకిచ్చకమై యెనయుదుఁగాక

చ. 3: బలిమి నీవు పైకొంటే పంతములాడేనా
వల పెంతరేఁచినాను వలదనేనా
యెలమి శ్రీవేంకటేశ యింతో నన్నేలితివి
తొలుతటివలెనే సంతోసింతుఁగాక

రేకు: 1443-3 శుద్ధవసంతం సం: 24-255

పల్లవి: తానెంట నేనెంత తలపోసి చూచితేను
కానికిచ్చి తనమతి కరఁగించేనా

చ. 1: కేలుచాఁచి నాగుబ్బలు గిలిగించీ నూరకే
నాలికాఁడు తనతో నవ్వేనా నేను
పాలుపడి నన్ను నిట్టె పాదాలు విసుకుమనీ
మేలువాఁడు తను మెప్పించేనా

చ. 2: పలుమారు నాతోను పైకొని పెనఁగీని
చలపాదివాఁడు తాను సాముసేసేనా
తిలకించి యిటు నన్ను దిష్టించి చూచీని
బలిమికాఁ డన్నిటాను పంతమాడేనా

చ. 3: జోడుగూడి నన్నిట్టె చొక్కించీని రతులను
కోడెకాఁడు తన్ను నే గోరగీరేనా
యీడనె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నాదరించె
పాడిగలవాఁడు తాను బాసగొనేనా

రేకు: 1443-4 దేసాళం సం: 24-256

పల్లవి: ఇదియే నావిన్నపము యిఁకఁ దనచిత్తము
వదలక పైకొంటేఁబో వసమయ్యీనా

చ. 1: మగఁడు దా నియ్యకొంటే మంచిదౌఁగాక వలపు
మగువకుఁ గలిగేఁబో మంతుకెక్కునా
తగులమితో వింటే తగనింపౌఁగాక మాట
జిగిఁ దనతో నాడేఁబో సెలవయ్యీనా

చ. 2: చేరి తా నాదరించితే చెల్లుబడౌఁగాక నవ్వు
వూరకే నాకు వచ్చేఁబో వొద్దికయ్యీనా
గారవించి కైకొంటే కడునాటుఁగాక చూపు
యీరీతి నేఁ జూచితిఁబో యితవయ్యీనా

చ. 3: తమకించి తా వంటితే తగులౌఁగాక కాఁగిలి
చెమరించి పొందితిఁబో సిగ్గుమానీనా
నెమకి నన్నుఁ గూడె తానె శ్రీవేంకటేశుఁడు
అమరేఁబో పనులెల్లా నంటువాసీనా

రేకు: 1443-5 మాళవి గౌళ సం: 24-257

పల్లవి: సరిగా మన్నించవద్దా సవతుల నందరిని
సారిదిఁ దమమోములు చూచుకోనే రిందరు

చ. 1: సముకాన నుండి యాపె సలిగెలు చూపఁగాను
తమితో నవ్వులు నవ్వి తనరఁగాను
జమళిఁ జేతులు వేసి సాము నీతోఁ జేయఁగాను
చెమటల తాముఁజూచి సిగ్గువడే రిందరు

చ. 2: తగిలి తగిలి యీకె తతిగొని చూడఁగాను
మిగులా సరసమాడి మెచ్చఁగాను
పొగరునీచేతలకు బొమ్మల జంకించఁగాను
అగపడి కరఁగేరు ఆసతో నిందరును

చ. 3: అలమేలుమంగ నిన్ను అంటి కాఁగిలించఁగాను
చెలరేఁగి అట్టె సారెఁ జెనకఁగాను
యెలమి శ్రీవేంకటేశ ఇదె నీవోజ మెచ్చఁగా
సొలసి తామునుఁ గూడి చొక్కి రిందరును

రేకు: 1443-6 బౌళి సం: 24-258

పల్లవి: మీరిద్దరు నొక్కటే మేమెంతటివారము
కోరి మిమ్ము నిట్టె కాదుగూడదనఁగలమా

చ. 1: సిగ్గువడియుండి నాపెఁ జెఱఁగువట్టి తీసితే
యెగ్గులెల్లా నిన్ను నాపె యెంచకుండునా
వెగ్గళించి చెలులతో వేమారు నానతిచ్చేవు
బగ్గనఁ బంతమిప్పించి పాడిదిద్దఁగలమా

చ. 2: కొలువులో నుండఁగాను కొమ్మచన్ను లంటితే
చలపట్టి నిన్ను నిట్టె జంకించవద్దా
తలకొని నీవింరు కందరి సాకిరివెట్టేవు
పిలిచి మిమ్ముఁ గాఁగిలింపించఁ గలమా

చ. 3: మంతనమాడేయలమేల్మంగనుఁ జెనకితేను
పొంతఁ జన్నుల నిన్నొత్తి పొందకుండునా
ఇంతలో శ్రీవేంకటేశ యెనసితి వీకెను
వంతువెట్టి మీ కింకాను వాసిరేఁచఁగలమా

రేకు: 1444-1 దేవగాంధారి సం: 24-259

పల్లవి: అటుగాన బలిమిసేయఁగరాదు రమణుని
యెటువలెనైనాను యిచ్చకమే మేలు

చ. 1: చనవుగలకొలఁదే సరసాలు
ననిచినకొలఁదే నగవులు
వినయముకొలఁదే వేడుకలెల్లా పట్టి
పెనఁగరా దింతులకు ప్రియునితోను

చ. 2: మన్ననకొలఁదివే మాటలు
సన్నలకొలఁదివే సంగాతాలు
అన్నిటా మెచ్చుకొలఁదే ఆదరింపులు పతిని
మిన్నక కొసరరాదు మెలుఁతలకు

చ. 3: చుట్టరికము కొలఁదే సొలపులు
పట్టినకొలఁదినే పంతములు
అట్టె శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
అట్టుగా నన్నేలితి వాఁడి సేయరాదు

రేకు: 1444-2 శంకరాభరణం సం: 24-260

పల్లవి: తా నెఱఁగఁడా యీతగవులెల్లా
వీనులకు నింపుగాను విన్నవించఁగదరే

చ. 1: సేసవెట్టి పెండ్లాడి చెలియను మగవాఁడు
వేసటతోఁ బెడవాడ వేయఁదగునా
ఆసకొలిపి రప్పించి యాపె నంతలో మొఱగి
పోసరించి వేరొక్కతెఁ బొందఁదగునా

చ. 2: చిట్టంటుచేఁత చేసి చేతికి విడెమిచ్చి
గుట్టుతోఁ బరాకు సేసుకొనఁదగునా
అట్టె సరసములు తా వాడుతా నేఁ జూడఁగానే
నట్టనడుమ నాపెతో నగఁదగునా

చ. 3: తాలిమితో నాకాఁగిటఁ దగిలి పెనఁగుతానే
లాలించి యెవ్వతెనో తలఁచఁదగునా
ఆలించి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
మేలువాఁడు నాకుఁ దాను మితిమీరఁదగునా

రేకు: 1444-3 ఆహిరి సం: 24-261

పల్లవి: ఇదివో నావిన్నపము ఇఁకనేమి ననవోప
యెదలో వలపు నీవే యెరుఁగుదువు

చ. 1: చలపాదిదానఁ గాను సాదించేటిదానఁ గాను
తలకొని నిన్నుదూరేదానఁ గాను
వలపులకాంకల వసివాడనోపక
వెలినుండి నీకు విన్నవించేదానఁ గాని

చ. 2: పెనఁగేటిదానఁ గాను బిగిసేటిదానఁ గాను
తనియక కక్కసించేదానఁ గాను
మనసు నీకొప్పగించి మాటల నిన్నుఁ బోగడి
వినయముతో విన్నవించేదానఁ గాని

చ. 3: విరసపుదానఁ గాను వెక్కసపుదానఁగాను
తరితీపుతోఁ గలసేదానఁ గాని
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
వెరవుతో మొక్కి విన్నవించేదానఁగాని

రేకు: 1444-4 కేదార గౌళ సం: 24-262

పల్లవి: మీరెఱఁగరటరే మెలుఁతలాల
చేరి నన్నెంతేసి గరిసించేరే చెలులు

చ. 1: వల పెంత గలదని వర్ణించి యడుగనేల
తలపెంతగలిగె నెంతము నంతే
చెలిమి కొలఁది వెట్టి చెప్పిచూపఁగరాదు
కెలయు రాకొట్ల కిచ్చగించుటే కొలఁది

చ. 2: సింగారము లెక్కవెట్టి చెలఁగి వర్ణించనేల
అంగమెంట గలిగెను అంతానంతే
తోఁగిచూపు లాసలకు తొడర నెందాఁకాగురి
పంగెనలేక కలసి పాయకుండుటే గురి

చ. 3: రతికాంక్ష కొలవెట్టి రచ్చలో వర్ణించనేల
పతిఇతవెంత తనభావమూ నంతే
తతి శ్రీవేంకటేశుఁడు తా నలమేలుమంగను
సతమై కూడియుండేది సాజమే యిద్దరికి

రేకు: 1444-5 పాడి సం: 24-263

పల్లవి: చెప్పరాదా నాతోను చెవులారా వినేఁగాని
వుప్పుతిలుఁజెమట లే లూరీనయ్యా మేనను

చ. 1: వాడికమాట లాడి వచ్చేనంటాఁ జెప్పిపంపి
యేడనుంటివయ్యా నీ విందాఁకాను
జాడదప్పక నాతోనే సరసములాడితివి
వీడె మెవ్వతిచ్చెనయ్యా వేడుకతో నీకు

చ. 2: బలిమి నన్నుఁ బెండ్లాడి బాసలెల్లా నాకిచ్చి
తలఁచే దెక్కడనయ్యా తమితో నీవు
కలదెల్లా నామీఁదనే కందువవలపు నీకు
చెలి మేడఁ గల్గెనయ్యా చెలులతో నేఁడు

చ. 3: తామెరపువ్వున వేసి తగ నన్నుఁ గాఁగిలించి
యేమగువఁ జూచేవయ్య ఇప్పుడు నీవు
ఆముక శ్రీవేంకటేశ అలమేల్ మంగనే నేను
కామించి నన్నేలితివి కానీవయ్యా మెచ్చితి

రేకు: 1444-6 బౌళి సం: 24-264

పల్లవి: నీముందరికి రారాదా నేండు వెలయాండ్లకు
ఆముకొని సరసములాడవచ్చేవు

చ. 1: చుట్టపువరుస నాపె సుద్దులు నీకుఁ జెప్పఁగా
గట్టిగాఁ గాలుదొక్కేవు కడనుండి
గుట్టుతోడ నీవొద్దఁ గొలువు సేయఁగాను
చిట్టంటుచేంతలు చేసి చెక్కులు నొక్కేవు

చ. 2: నెలఁత వేడుకలకు నీమొగము చూడఁగాను
చెలరేఁగి చన్నులపైఁ జేఇ వేసేవు
సెలవుల నవ్వుకొంటా చెంగట నిలుచుండఁగా
కలువపువ్వుల వేసి కాంగిలించేవు

చ. 3: సారె నీమాటలు విని సంతోసాన నవ్వితేను
గారవించి పచ్చడము గప్పి కూడేవు
ఆరసి శ్రీవేంకటేశ అలమేల్ మంగను నేను
సారె నన్నేలి యాపెను జంటలు సేసేవు

రేకు: 1445-1 బౌళి సం: 24-265

పల్లవి: నీసుద్దులు వింటేను నిచ్చకొత్తలు నీకు
ఆస యెంతైనాఁ గద్దు ఆఁడువారి మీఁదను

చ. 1: యేడనుండితి విందాఁకా నెవ్వతె నీతో మాటాడె
జాడతో నీపొందులెల్లా సాగివచ్చునా
వేడుకకాఁడవు తొల్లె వేసారవు నీ వెపుడు
వాడికగా మాఇంటికి వచ్చితివి నేఁడు

చ. 2: సేయవలసినదేమి చెంత నీకేమి ప్రియము
కాయజకేలి నీమతి కాఁకదేరెనా
చాయసేసుకోఁ గలవు జాణతనాలు నేర్తువు
చేయిమీఁదుగా మముఁ జెనకి నవ్వేవు

చ. 3: యెట్టివి నీతలఁపులు యెన్నఁడు నీకాంగిలి
నెట్టుకొన్ననీకోరికె నెరవేరెనా
యిట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గుట్టున మమ్మేలితివి కోవిదుఁడ వౌదువు

రేకు: 1445-2 హిందోళ వసంతంసం: 24-266

పల్లవి: ఎటువంటి యాగడములు యీపెసుద్దులు
కటకటా నీవే యిది గయ్యాళి యనవా

చ. 1: కమ్ముల సతులెల్లను కేరికేరి నవ్వఁగాను
తమ్ముల మొసంగేవు యీతరుణికిని
యెమ్మెలకు నీవీపెను యేమేమి సేసినాను
ఇమ్ముల సిగ్గువడని దేఁటియాఁటదనరా

చ. 2: చెంత నున్నవారెల్లా చెవులు మూసుకొనఁగ
యెంతపచ్చిమాట లాడే వీపెతోను
వింతసేసి నీ వెంతవేడుకకాఁడవై నాను
ఇంతేసి బట్టడియైతే నేంటియాం టదనరా

చ. 3: చేరి వూడిగపువారు శిరసులు వంచుకోఁగా
సారెఁ గాఁగిలించె వీసతిని నీవు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
యేరా నన్నేలితి వాపె నేఁటి యాఁటదనరా

రేకు: 1445-3 లలిత సం: 24-267

పల్లవి: చూతువు రావమ్మా నీసుతుని యశోదమ్మ
బూతులం దిట్టీ వద్దంటే పొలంతులనెల్లను

చ. 1: పొడవాటివుట్లెక్కి బుడుగులతోడివన్నె
తొడికిపెట్టీఁ దనతోడివారికి
కడవలపాలమీగడలు దేవుకతిని
కడకుం బాలెల్లాఁ గార కంతలుసేసీని

చ. 2: అక్కజపురోళ్లెకిక అట్టుగపై దాఁచిన-
చక్కిలాలు నురుఁగులుఁ జవిగొనీని
వెక్కసానఁ బట్టరాక వీదులం బారాడుతాను
మొక్కలాన నెత్తుకొంటే ముద్దులువెట్టీని

చ. 3: పన్నారుదొంతు లెక్కి బానలపెరుగు నేయి
చెన్నుమీర నారగించి చేరి నవ్వీని
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్ మంగవిభుండు
వన్నెలఁ గ్రిష్ణుఁ డింటింటివాకిటఁ బొంచీని

రేకు: 1445-4 దేసాళం సం: 24-268

పల్లవి: ఇందరివినోదానవే యిట్లున్నాఁడు
చెంది సొమ్ములెల్లాఁ బెట్టి సింగారించరే

చ. 1: మేడలోన నున్నవాఁడు మిక్కిలితమకమున
పాడించుకొంటా నున్నాఁడు భామలచేత
వూడిగపుసతులాల వొద్ద నుండఁగదరే
వీడెమీరే అడపము వెలఁదులాల

చ. 2: పరగ గద్దెపై నుండి పాత్రకత్తెలచేత
గరిమ నాడించుకొంటా కడుఁజొక్కీని
సిరులఁ గట్టికవారు సేయరే బరాబరి
వరుస నాలపట్టాలవారెల్లా విసరరే

చ. 3: శ్రీవేంకటాద్రి నున్నాఁడు జిగి నలమేల్ మంగను
యీవేళఁ గూడియున్నాఁడు యీ దేవుఁడు
వేవేగం దెరవేయరే వెసం జనవరులాల
బూవపుసవతులాల పొగడరే మీరు

రేకు: 1445-5 మాళవి సం: 24-269
పల్లవి: వేసాలెల్లాఁ జేసేవు వింతవానివలెనే
పాసికూడి వలపించ పంతమా నాకు
చ. 1: వూని చెలులచేత నన్నొడంబరపించేవు
ఔనయ్య నీమాటకు నే నడ్డమాడేనా
అనుకొని సొమ్ములు నా కంతలోనే వొసగేవు
కానీవయ్యా నే నాసోదకత్తెనా ఇపుడు
చ. 2: వరుసతో నూరకైనా వావులు నన్నడిగేవు
వొరసి నీ వంటఁగా నే నోపననేనా
గరిమతో వీడెమిచ్చి కడు నుబ్బు రేఁచేవు
తరితీపుతోడి విదరవెల్లిదాననా
చ. 3: అదరిపాటున వచ్చి అట్టె కాఁగిటఁ గూడేవు
యెదుట నన్నేలంగా నిన్నెలయించేనా
అదన శ్రీవేంకటేశ అలమేల్ మంగనే నేను
పదరి నీతో నేను పాసివుండంగలనా

రేకు: 1445-6 నాగ వరాళి సం: 24-270

పల్లవి: ఈపాటివాడఁవు మాయింటికే రారాదా
యేపొద్దూ నీతమకమే యింతసేసీఁగాక

చ. 1: సతులెల్లాఁ జూడఁగాను జారఁదీసేవు పయ్యద
రతికి వేళలేదా యీరవ్వ వలెనా
పతివైతేనేమి మాకుఁ బాటించవద్దా సిగ్గు
అతిజవ్వనము నిన్ను నాడించీఁగాక

చ. 2: కొలువులోపలనే సిగ్గులు మోవ మాటాడేవు
వలపు పచ్చిసేతురా వాసివలదా
యిలపై జాణండవై తేనేమి మాకు వద్దా గుట్టు
పెలుచుందనము నిన్ను పెడరేఁచీఁగాక

చ. 3: వూడిగము సేయఁగానే వొద్దికఁ గాఁగిలించేవు
యీడుజో డెఱఁగవద్దా యించుకైనాను
యీడనె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కూడితివి నీకరుణే గురిసేసీఁగాక

రేకు: 1446-1 దేవగాంధారి సం: 24-271

పల్లవి: కాదని వేసరేవా కరుణించినవాఁడవు
పాదుకొని వొద్దనే పాయకుందువుగాక

చ. 1: నన్ను నింతగా నేలి నమ్మించినవాఁడవు
విన్నపము సేయనేల వేమారు నీకు
సన్నలాచాయలా నాచనవులు చెల్లించి
మన్నించి నీవే యెరిఁగి మనిసేవుగాక

చ. 2: అట్టె నాచే సేవగొని ఆదరించినవాండవు
దిట్టనై నాగుణములు తెలుపనేల
నెట్టన నీమహిములు నీవే తలఁచుకొని
రట్టుగా నను రక్షించే విట్టె నీవేకాక

చ. 3: పొత్తున నన్నుఁ బెట్టుక భోగించినవాఁడవు
బత్తి నీకుఁ జేసిచూపఁగనేల
హత్తి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సత్తుగాఁ గూడితివి మెచ్చఁగఁదగుఁగాక

రేకు: 1446-2 బౌళి రామక్రియ సం: 24-272

పల్లవి: నే నితండు మాటాడితే నీవు అడ్డాలు రానేల
అనుక నీవే నాతో నటు సన్న సేసేవే

చ. 1: యేతులు నీకు గలితే యింటిలోం జేతువుగాక
కాతరించి యిందరిలో గర్వమేఁటికే
నీతులు నేరుచుకొంటే నీవే నడతువుగాక
పోతరించి నీవు మాకు బుద్ధిచెప్పనేఁటికే

చ. 2: తనివితోడఁ జక్కనిదానవైతే నౌదుగాక
యెనలేనిమురిపెములు యీడనేఁటికే
యెనసి చుట్టమవైతే నెట్టయిన నౌతగాక
మొనసి మాకిటు నాయములు చెప్పనేంటికే

చ. 3: సేయ నోపికగలితే సేవలు సేతువుగాక
పాయపుమదముతోడి పంతమేఁటికే
యీయెడ శ్రీవేంకటేశుఁ డే నలమేలు మంగను
పాయక నన్నుఁగూడె నీపస చెప్పనేఁటికే

రేకు: 1446-3 సామంతం సం: 24-273

పల్లవి: చేరి నన్నుఁ జూచి యేలసిగ్గువడేవు
నేరుపు నీకెంతగద్దో నే నెరిఁగేఁగాని

చ. 1: ఆస నీకుఁ గలిగితే నాతనిపాదా లొత్తవే
మూసిదాంచనేల నీమోహ మీడను
సేసవెట్టవలసితే చేతులు చాఁచవే
వేసాలేల వద్దనే వీఁడే వున్నాండు

చ. 2: మనసు నీకు వచ్చితే మాటలెల్లా నాడవే
యెనలేక గుబ్బితిలినేలే లోలోను
పని నీకుఁ గలిగితే పానుపుపైఁ బండుండవే
అనుమానించఁగనేల ఆడనే వున్నాఁడు

చ. 3: వేడుకైతే చేతనున్నవిడె మిప్పించుకోవే
వాఁడుమోముతోడ నవ్వఁగవలెనా
కూడె శ్రీవేంకటేశుఁడు కోరి యలమేల్ మంగను
వాడిక మెచ్చవే నాకువలచివున్నాఁడు

రేకు: 1446-4 మాళవి గౌళ సం: 24-274

పల్లవి: చెలులాల చూడరే యీచెలిభాగ్యము
అలమేలుమంగ యీకె కబ్బెను యీభాగ్యము

చ. 1: పతిదయగలిగినపడఁతి దీభాగ్యము
అతఁడు మాటమీరనీ దది భాగ్యము
సతతముఁ బాయక జంటైవుండేది భాగ్యము
అతివలెందరుగల్లా నది యేమిచెప్పేరే

చ. 2: మగండుమన్నించినమగువది భాగ్యము
సొగిసి యాతఁడు మోహించుట భాగ్యము
వెగటులేనిరతుల వేసరనిది భాగ్యము
మగువలవలపులు మరి యేమిచెప్పేరే

చ. 3: శ్రీవేంకటేశుఁ డేలె మచ్చిక నీసతిది భాగ్య-
మావేళ నాతఁడు మెచ్చినది భాగ్యము
తావుకొని యెప్పుడూఁ దనవాఁడౌటే భాగ్యము
యేవనితలనేరుపు లిఁక నేమిచెప్పేరే

రేకు:	1446-5 పాడి	సం:	24-275

పల్లవి:	ఏఁటికిఁ గొసరవలె నీతఁ డిన్నిటా జాణ
	చాటువగా తానే నాకుఁ జనవిచ్చీఁగాక

చ. 1:	ఆలినేటేటివాఁడే అన్నిబుద్ధులునుఁ జెప్పు
	లాలించి భోగించనేర్చు లాగులుగాను
	మేలుగలిగినవాఁడే మిక్కిలివేడుక చూపి
	పాలించి మేలములాడి పనిగొననేర్చును

చ. 2:	సేసలు వెట్టినవాఁడే సిగ్గుతో వహించుకొని
	వాసితో మనుపనేర్చు వన్నెకెక్కను
	ఆసకొలిపినవాండే ఆదరానఁ గాఁలించి
	వేసటలేక వలపు వెలయించనేర్చును

చ. 3:	రతిఁ గలసినవాండే రమణతో మోవియిచ్చి
	మతికి సంతోసముగా మన్నించును
	ఇతఁడు శ్రీవేంకటేశుం డే నలమేలుమంగను
	ఇతవెరిఁగి సారెకు నెనయఁగనేర్చును

రేకు: 1446-6 ఆహిరి సం: 24-276

పల్లవి: వేగిరించి చూచితేను విరసమౌ వలపెల్లా
బాగుగా నిచ్చకములే పచరించవలెను

చ. 1: పతిచిత్త మెరిఁగి గొబ్బన మాటాడఁగవలె
హితవుచూచుక విడె మియ్యవలెను
తతి దెలుసుకొని యత్తరి సేవసేయవలెను
చతురతతో మెలఁగే జవరాలికి

చ. 2: చనవిచ్చినప్పుడే సరసమాడఁగవలె
వొనరఁ జాంచితే పాదా లొత్తవలెను
విన నింపుగలిగితే విన్నపము సేయవలె
పెసఁగి పైకొనరాదు ప్రియురాలికి

చ. 3: నాటినపొందులైతేను నవ్వులు నవ్వఁగవలె
చోటిచ్చితే పక్కనుండి చొక్కించవలె
యీటున శ్రీవేంకటేశ యిట్టి దలమేలుమంగ
కూటము లిట్టె చెల్లు గుణవంతురాలికి

రేకు: 1447-1 కాంబోది సం: 24-277

పల్లవి: సంతోసించుకొందుఁగాక సతినై నేను
వింతలుగా మరి విన్నవించేటిదేంటిది

చ. 1: యెందరు సతులుండినా యేలేటివాండవు నీవు
పొందేటివేడుకలభోగము నీది
ముందే నేర్పులకెల్లా మూలపుగుణము నీది
విందుల నింక నేము విన్నవించేదేఁటిది

చ. 2: వారివారిపై పెరిఁగి వలపించుకొంటివి
గారవించనేరిచినకరుణ నీది
కోరికెరిఁగి లాలించుకొనేది నీకీరితి
చేరి నీకు విన్నపము సేసే దిఁక నేటికి

చ. 3: యిచ్చ యెరిఁగికల సేఇంపులు నీచతురత
మచ్చికరతులలోని మహిమ నీది
హెచ్చినశ్రీవేంకటేశ యే నలమేలుమంగను
విచ్చనవిడి నీకు విన్నవించేదేఁటిది

రేకు: 1447-2 సాళంగనాట సం: 24-278

పల్లవి: ఆపెఋఁగు నీ వెఋఁగు దాలోనిపనులెల్ల
యేపున విన్నవించితి మిదిగో చెలులము

చ. 1: యేమని చెప్పెంపుదువో యేవేళ వత్తువో యని
కామిని యాడ నీవేళ గాచుకున్నది
నీమన సెట్టువచ్చునో నీవూడిగ మబ్బుటెట్టో
యీమేర నుందానననె యెంచుకొంటా నున్నది

చ. 2: యెప్పుడుమోము చూతువో యేసన్నసేతువోయని
చొప్పుగా నీవంకే చూచుకవున్నది
మెప్పించుకొందునో నీవు మేలమాడుదువోయని
చప్పు డాలించుకొంటా నచ్చుట నదె వున్నది

చ. 3: కందువకుఁ బిల్తువో ఇక్కడఁ గూడుదువోయని
పొంది నీపానుపుమీఁదఁ బొంచుకున్నది
అందపు శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చెంది నీకాఁగిటఁ గూడి చెలరేఁగుచున్నది

రేకు: 1447-3 సామంతం సం: 24-279

పల్లవి: ఏమిసోద్యమే యీవేళ సతికి
కాముని బలములు కైవశమాయ

చ. 1: సుదతి నీదుపఁ జూలవెలుఁగంటా
వుదయచందురుని కెదురేఁగి
ముదమునఁ గాళెలమోతలనుచు మరి
కొదమతుమ్మిదలకూఁతల కలరె

చ. 2: తోడనె టెక్కెపుదొడ్డపవుఁజులని
నీడలతరువులు నిక్కి చూచి
కేడించుగాలికిఁ గెరలినపుప్పొడి
చూడ ధూళియని వేడుకపడియె

చ. 3: చింత దీర నీసేసపాలనుచు
చెంతనె విరులకు శిరసొగ్గి
యింతలో శ్రీవేంకటేశ నీవేలఁగ
సంతసమునఁ దనచందము దెలిసె

రేకు: 1447-4 వరాళి సం: 24-280

పల్లవి: ఈకెసంది నీసంది నెరవున్నదా
చేకొన్నదాఁకా గుట్టుసేసీ నింతేకాక

చ. 1: చెలినేలినవాఁడవు చెఱఁగువట్టఁగరాదా
కొలువులో సిగ్గుగాఁ గొంకీంగాక
తలఁపు నీ వడుగఁగాఁ దగ విన్నవించరాదా
మలసి పరవశము మైమఱచీఁగాక

చ. 2: నీవు వసంతమాడంగా నీపై మారు చల్లరాదా
సోవల సాదుఁదనము చూపీఁగాక
పూవుల నీవు వేయఁగా పొంచి పట్టుకొనరాదా
ఆవల మరుబాణాలని మానెఁగాక

చ. 3: వొట్టి రతివేళ నీకె నురమెక్కించుకోరాదా
ముట్టి దోసము గాకుండా మొక్కీఁగాక
అట్టె శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
గట్టిగా నీ యిచ్చెరిఁగి కాంగిలించీఁగాక

రేకు: 1447-5 హిందోళ వసంతం సం: 24-281

పల్లవి: ఇందాఁకా నేనున్నజాడ యేమని చెప్పుదునయ్యా
కందువ నాచెమటలు కమ్మి పుప్పొంగించెను

చ. 1: మంచిమాట నీవాడఁగాను మనసొక్కటాయను
పెంచినకోవిలకూఁతాఁ బ్రియమాయను
మించి నీవు నవ్వఁగాను మేను చల్లనాయను
పొంచి ఇంటిలోవెన్నె లిప్పుడు చుట్టమాయను

చ. 2: నీవీడకు రాఁగానే నిర్మల ములాయను
ఆవేళ నావూర్పుగాలే అలపార్చెను
కైవశమై నీవు గాఁగా కాఁపురము లీడేరెను
తావుల నాకొలనిలో తామరపొందాయను

చ. 3: కదిసి నీ వేలఁగా నిక్కడ నిట్టే చెలఁగితి
ఇదే నాపనముతీగె లింపులాయను
అదన శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మొదలిజవ్వనమే ముదము నొందించెను

రేకు: 1447-6 బౌళి సం: 24-282

పల్లవి: వద్దనేమా తానే మాతో వచ్చి వొడఁబరచితే
ఇద్దరికిఁ దానే మూల మిన్నిటికిం గదవే

చ. 1: తెగరానిమంకులకు తెలిపిచెప్పుట మేలు
తగులైనయెడకు నాదరించం బాడి
పగ సాదించరానిచో పక్కనఁ గూర్చుట దగు
తగవులు మాలో మాకు తానే తేర్చఁదగునే

చ. 2: అదలించరానివారి నట్టె వేఁడుకొంటే నీతి
సుదతులవాదు దీర్చుట సంగతి
వదలరానివారినెవ్వగా మాన్పుట పుణ్యము
పొదిగి తానే మమ్ము బోదించఁదగునే

చ. 3: మచ్చరపుసవతుల మట్టుపెట్టుట మంచిది
యెచ్చినవాసికత్తెల నేలుట గిర్తి
మచ్చిక నలమేల్మంగమగఁడు శ్రీవేంకటేశుఁ-
డిచ్చ మమ్ముఁగూడి తానే యీడేర్చఁదగునే

రేకు: 1448-1 కన్నడ గౌళ సం: 24-283

పల్లవి: అతనితో నావిన్నప మదే యనవే
కాతరపునావలపు కారుకమ్మీననవే

చ. 1: యెప్పుడూఁ దా మన్నించేది యెఱుఁగుదుననవే
యిప్పటినాతమి వోర్వనియ్యదనవే
తప్పులేదు తనమాట దయగలండనవే
రెప్పలెత్తి చూచుదాంకా రేఁచీ నావలనవే

చ. 2: తిరమైననాపైబత్తి తెలిసితి ననవే
సరి విరహానఁ బడఁజాల ననవే
కరుణించి నన్నిఁకను కంటి నన్నీననవే
మరిగించి వట్టిజోలి మరియేఁటికనవే

చ. 3: తగ నన్నుఁ గూడినాఁడు తలఁతు నే ననవే
తెగనిరతులఁ గాంక్ష దీరదనవే
జిగి నలమేల్ మంగను శ్రీవేంకటేశుఁడు తాను
మిగులా నన్నేలినాఁడు మెచ్చితి నేననవే

రేకు: 1448-2 ఆహిరి నాట సం: 24-284

పల్లవి: అయ్యో తనకేల లోఁగ నది నాసంతోసమే
నెయ్యపువిభుఁడు తాను నేఁ గాదనేనా

చ. 1: ఘనుండు తా నెవ్వతెతోఁ గామించి నవ్వినాను
యెనలేని వేఁడుకతో నిట్టె చూచేనే
మనసిచ్చి యాపెకు తా మాటప ట్టేమిచ్చినాను
వొనగూడి యందుకెల్లా నొడఁబఱచేనే

చ. 2: తలఁచి యాపెపొందు తాఁ గోరినా నీడకు
పిలుచుక వచ్చి వొద్దఁబెట్టే నే నేను
చెలి నెంత పెద్దసేయఁ జిత్తానఁ గలిగినాను
కల కాల మాపె కూడిగముసేసేనే

చ. 3: యిరవుగఁ దా మిద్దరూ నెనసి వుండితేను
పరగఁగఁ బఱచేనే పానుపు నేను
సిరుల నలమేల్ మంగ శ్రీవేంకటేశుఁడు తాను
సరి నన్ను నేలినాఁడు చనవు చేకొంటినే

రేకు: 1448-3 కాంబోది సం: 24-285

పల్లవి: మెలుఁత ధైర్యమునకు మెచ్చవద్దా
తొలుత నీవన్నిటాను దొడ్డవాఁడ వౌదువు

చ. 1: తరుణికి నీమీఁది తలపు గద్దుగనక
విరహమైన మేలే వెతలేదు
మరిగి నీమీఁది ప్రేమ మనసు నిండెఁగనక
సరుగం జిత్తజునకు వెరవ దెంతైనను

చ. 2: అంగన ప్రాణములు నీయాన నున్నవిగనక
వెంగలినిట్టూర్పులకు వేసరదు
వుంగరము నీది వేలనుండఁగా జూచీఁ గనక
కుంగదు తమక మెంత కొచ్చియెచ్చరించినా

చ. 3: చెలఁగి పాయము నీకు సెలవుసేసెంగనక
తలకొన్నచింతలకు తలఁకదు
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు నీ-
వలరి కూడితి విఁక నందుకు జడియదు

రేకు: 1448-4 ముఖారి సం: 24-286

పల్లవి: నే నెంతడిదానను నీకేఁటికి లోఁగను
తానకమై యంత మొకదాకిరి సేసేవు

చ. 1: చెలులుగలవాఁడవు చెల్లును సరసమాడ
వలచివాఁడవు నవ్వఁగఁ జెల్లును
తలఁపుగలవాఁడవు తమకించాఁ జెల్లును
బలిమిం దార్కాణంచఁ బనియేమి నీకు

చ. 2: వేడుకగలవాఁడవు వినోదమాడఁగఁ జెల్లు
యీడైనవాఁడవు చనవియ్యఁ జెల్లును
వాడికైనవాఁడవు వద్దఁబెట్టుకోఁజెల్లు
పాడిచెప్పి నన్ను నొడఁబఱచ నేమిటికి

చ. 3: కరుణగలవాఁడవు కాంగిలించుకొనఁజెల్లు
యెరపులేనివాఁడవు యెనయఁజెల్లు
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సరవిఁ గూడితి వెన్నిచనవు లిచ్చితివి

రేకు: 1448-5 దేసాళం సం: 24-287
పల్లవి: నీయిచ్చలోదాన నేను నీయితవే చూతుఁగాక
ఆయింతిని మారుకొని నరుదా నాకు
చ. 1: యెలమి నీచిత్త మెప్పు డెట్టుండునో అనికాక
నెలఁతతోఁ బంతమాడనేరనా నేను
చెలికి నేమేమి బాసచేసితివో అనికాక
తలకొని మట్టుపెట్టఁదడవా నాకు
చ. 2: యీసతిపై నే మోహ మెంతగద్దో అని కాక
వూసివాసు లెంచి మీరనోపనా నేను
వేసటతో నీమోము విన్ననౌనో అనికాక
తోసి యాపెయెమ్మె మాన్పదొడ్డా నాకు
చ. 3: చెలఁగి నీవేడుకలు చెల్లింతు ననికాక
యలయిం చాపెను గెల్వ నెదురా నాకు
అలమేల్ మంగనే నేను అట్టె శ్రీవేంకటేశుడ
కలసితాపెను సాటిగలదా నాకు

రేకు: 1448-6 గౌళ సం: 24-288

పల్లవి: కొమ్మలకు నిట్టివోజ కోటిసేసును
సమ్మతిగా నడచుటే సంసారఫలము

చ. 1: నను పెంతగలిగినా నాయకుని యెడాటాన
వినయములే వన్నె వెలఁదికిని
చన వెంటయిచ్చినాను సరసమాడేటివేళ
పెనగకుండుటే కడుఁబెద్దరికము

చ. 2: యెగ్గులేక వలచి తానెంత పచ్చిమాఁటాడినా
సిగ్గు నెరపుటే వన్నె చెలియకును
వెగ్గళించి యాతఁ డెంతవేడుకకు నవ్వానాను
వొగ్గి గుట్టుతో నుండు టొరపరితనము

చ. 3: వొలిసి శ్రీవేంకటేశుఁ డురముపై నిడుకొన్నా
లలి మొక్కుటే మేలు యలమేల్ మంగకు
కలసి మెలసి యెంతకాఁపురము చేసినాను
తలఁపులో మెలఁగుటే తగవైననేరుపు

రేకు: 1449-1 సామంతం సం: 24-289

పల్లవి: చెలులు తన్నెవ్వరెంతచేసినాఁ జేసిరిగాని
వలవనిగర్వాలు వారె కట్టుకోనీవే

చ. 1: పొదిగి తనగుణాలు పొగడఁగఁదగుఁగాక
అద నెఱఁగక వెంగెమాడఁదగునా
వెదకి తానున్నచోటు విచారించఁదగుంగాక
యెదుటఁ బరాకుతో నెలయించఁదగునా

చ. 2: వైళము తాఁ జెప్పినటువలెఁ జేయఁదగుంగాక
నాలిసేసి తనతోఁ బెనఁగఁదగునా
మేలుసేసినందుకు మెచ్చఁగఁదగుగాక
కూళతనమున మరీఁ గొసరఁగఁదగునా

చ. 3: వొక్కటై పొందుసేసితే నొడఁబడఁదగుఁగాక
చక్కఁగా నెడమాటాడించఁగఁదగునా
ఇక్కడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
దక్కె నాకు నతఁడు నే దమకించఁదగునా

రేకు: 1449-2 ముఖారి సం: 24-290

పల్లవి: నీవే నన్ను మన్నించేవు నేఁ గొసరే దేమున్నది
యీవలనావల నిన్ను నెచ్చరించనేఁటికి

చ. 1: చక్కనినిన్నుఁ జూచి సతులు వలతురేకా
మక్కువ నీవు వారి మానరాదుగా
యెక్కువగా నిందరిలో నేలేవని వుందానఁగా
ఇక్కడ నాభాగ్యము యెంచఁగనేమిటికి

చ. 2: మదనగోపాలుఁడవై మర్మాలు గలఁతువుగా
పొదుగక ఇంతులకుఁ బోరాదుగా
అదనఁ బట్టపుదేవి నయ్యేనని మొక్కితిఁగా
పదిమారులును నీతోఁ బచారించనేఁటికి

చ. 3: ఇదె శ్రీవేంకటేశ్వర యిరవై వున్నాఁడవుగా
పదారువేలు కాంతలపతివైతిగా
అదన నలమేల్ మంగనైననేఁ గూడితిఁగా
అదివో నీసుద్దులు నే నడుగఁగనేఁటికి

రేకు: 1449-3 ఆహిరి సం: 24-291

పల్లవి: చూడ మాకు వేడుకయ్యా సోద్యపునీఁచేతలెల్లా
వీడరాని పొందులైతే వెలవెట్టవచ్చునా

చ. 1: చెక్కు చెమరించెనంటా చేసురటి విసరేవు
యిక్కువ నాకెపై నీకు నెంతమోహమో
చక్కనివదనమని సారె సారెఁ బొగడేవు
పిక్కటిల్ల నీకె యెంతప్రియమో ఇపుడు

చ. 2: కడు దిష్టదాఁకకుండా కప్పేవు పైపచ్చడము
తడయక లోలో నెంత తగులాయమో
బడిబడి గుబ్బలపై పన్నీరు చిలికించేవు
అడరి నీ కిది యెంత అపురూపమో

చ. 3: గాలి యెండా సోఁకకుండా కాఁగిట నించుకోనేవు
యీలీల నలమేల్ మంగ యెంతచుట్టమో
యేలితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
ఔలే నీమదిలోన నాసోదమెంతో

రేకు: 1449-4 శ్రీరాగం సం: 24-292

పల్లవి: నీవుసేసేటిమాయలో నేఁగొన్నమరులు జాడో
చేవమీర నేఁ జేసేసేఁత నీకే సెలవు

చ. 1: యేకతాన నుండి మాట లెన్నియైనాఁ దలపోతు
యీకడ నీమోము చూచి ఇట్టె మొగమోడుదు
రాక నీవుండితేఁ గాతరాన కడుఁజింతింతు
చేకొని నీవద్దనుంటే చెలరేఁగి నవ్వుదు

చ. 2: యేయింతిఇంట నీవున్నా యీసునఁ గడకుమత్తు
నీయాదరింపునఁ జెంది నే సంతోషించుకొందు
తోయరానిజవ్వనాన తొడికిపట్టఁగఁజూతు
చేయి నీవు వేసితేను చిత్తము గరఁగుదు

చ. 3: కోరి నిన్ను నంతలోనే కూడి మందెమేళమౌదు
సారె నీవు దెలుపఁగా చనవున మొక్కుదు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నేరుపున నీ వేలఁగా నిన్నే నే నమ్ముదును

రేకు: 1449-5 బౌళి సం: 24-293

పల్లవి: ఏల నాతో నానతిచ్చే విచ్చకపుమాటలెల్లా
ఆలకించి లినఁగాక అవుఁగాదనేనా

చ. 1: మగువకుఁ దొల్లే నీవు మాట యిచ్చినవాఁడవు
నిగిడి పొందుసేయక నీవు మానేవా
చిగిరించి పూచికాచినయట్టిమామిడి
తగఁ బండ్లు పండక తా మానీనా

చ. 2: తేరకొన నీఇంటికిఁ దెచ్చుకొన్నవాఁడవు
గారవించి కూడక ఇంక మఱచేవా
అరనార మేనిమీఁద నలఁదినకస్తూరి
కోరి పరిమళము చేకొననంటేఁ బోవునా

చ. 3: వొద్దఁ బెట్టుక నీపాదా లొత్తించుకొనేవాఁడవు
వొద్దికమగఁడవై నీవుండకుండేవా
కద్దులే శ్రీవేంకటేశ కలసె నలమేల్ మంగ
అద్దములో నీడవలె నంటువాసీనా

రేకు: 1449-6 పాడి సం: 24-294

పల్లవి: ఆడకేల మమ్ముఁ బిల్చీననరే వోచెలులాల
వేడుకమాటలాడ వెస మీరు చాలదా

చ. 1: కందువ నాపెఁ దాను కాఁగిలించుకుండఁగాను
చెంది సతు లెవ్వ రెట్టు సేవసేసేరు
యిందుకు రమ్మనవే యేపనులు గలిగినా
అంది సేసేయు సిగ్గరిఆఁడువారము

చ. 2: మునుపుపాన్పుపైఁదాముముసుగువెట్టుకుండఁగా
యెనసి యెవ్వరు విడెమియ్యవచ్చేరు
చెనకి మావద్దికిఁ జేఇ చాఁచుమనవే
ఘనమైనర వాసివన్నె గలవారము

చ. 3: మేలి మలమేల్ మంగను మెడఁగట్టుకుండఁగాను
కాలుదొక్కి యెవ్వరెట్టు కలసేరు
యేలినాఁడు శ్రీవేంకటేశుఁ డింతలోనె మమ్ము
వోలిఁ దాము) మన్నించఁగా నుండేటివారము

రేకు: 1450-1 మంగళకౌసిక సం: 24-295

పల్లవి: అతిరాజసపువాఁడు అన్నిటాఁ దాను
సతులచేఁ జెప్పినంపీ సారె వచ్చేనంటాను

చ. 1: చెలులతో మాటాడితే చిగురించు వలపులు
కలసిమెలసి వుంటే కాఁక రేఁగును
మలసి నవ్వు నవ్వితే మర్మములెల్లాఁ గరఁగు
వొలసి తా నింతేసి కోపఁగలఁడటనే

చ. 2: చెనకితేఁ జెమటలు చెలమలవలె నూరు
ననిచి మోము చూచితే నాటుఁ జిత్తము
పెనఁగితేఁ దమకము పెరుగుఁ గోటికొండలై
వొనరి యిట్టిపొందుల కోపఁగలఁడటవే

చ. 3: పొసఁగఁజేయి చాఁచితే పులకలు మోసులెత్తు
కొసరితే కోరికలు కుప్పలైనిండు
యెసఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలు మంగను
వొసపరై కూడె నింత కోపఁగలఁడటవే

రేకు: 1450-2 ముఖారి సం: 24-296

పల్లవి: ఏమిసేసే నిక్కడను యెంతపని గద్దు నీకు
కోమలి నీరాకలే కోరుకొని వున్నది

చ. 1: ఇచ్చకమాడేనని నీ కితవరి నయ్యేనని
కొచ్చి చెలులతో నెంచుకొంటా నున్నవి
ముచ్చటాడేనని సతి మోముచూచి మొక్కేనని
విచ్చేసే వాడకునని వేళగాచుకున్నది

చ. 2: చనవరినయ్యేనని సరసమాడేనని
మనసులో సంతోసించి మరిగున్నది
పెనఁగులాడేనని ప్రియములు చెప్పేనని
తనివోనిరతులకుఁ దమకించి వున్నది

చ. 3: చిత్తము దెలిసేనని చేకొని కూడెనని
హత్తి పాన్పుపై నాయిత్తమై వున్నది
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కొత్తలుగా నేలితి విక్కువ నింకా నున్నది

రేకు: 1450-3 భైరవి సం: 24-297

పల్లవి: అప్పటి నాతో మాటాఁడీ నదివో తాను
యిప్పుడు తనగుణాన కెనవత్తు నటవే

చ. 1: పలుమారు సొలసితి పైపైఁ దన్ను దూరితి
కలువల వేసితిఁ గాఁక చల్లితి
వలపు నన్నింతసేసె వాసులు పంతము రేఁచె
మలసి తనకు నేను మంచిదాననటవే

చ. 2: బొమ్మల జంకించితి పొదుగఁగాఁ బెనఁగితి
చిమ్మితి గోళ్ల గుంపించితి సారెకు
నెమ్మనము చలపట్టె నిక్కించె మందెమేళము
యిమ్ములఁ దనకు నేను హితురాలనటవే

చ. 3: చన్నుల నొత్తితి మోవి చవిగొంటిఁ దమితోడ
కన్నులనే మెచ్చితి కాఁగిలించితి
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్ మంగను నేను
వున్నతి నన్నేలినాఁడు వుపకారినటవే

రేకు: 1450-4 దేసాళం సం: 24-298

పల్లవి: వాఁడివో తాఁ గొసరఁగా వద్దనేనటే
నేఁడు నాముందర వచ్చి నిలుచున్న దిపుడు

చ. 1: పలుకులేఁటికే నాతో జంతగత్తెతేఁ బతిని
వలపించుకొనఁగాను వద్దనేనటే
యెలమి నాతఁడు విడెమియ్యఁగాఁ జూడఁజాలక
వెలి నుండి తానేల వేసాలు సేసీనే

చ. 2: పెద్దరికా లింతయేలే ప్రియముచెప్పి యతని
వద్దికి రప్పించుకోఁగా వద్దనేనటే
అద్దు కాతఁడు నాచన్ను లంటఁగా యేపురేఁగి
గద్దించి చూడఁగా నందుఁ గలిగేదేందే

చ. 3: వేడుకైతే నౌఁగాకేమి విచ్చనవిడి నితని
వాడికై కలయఁగాను వద్దనేనటే
యీడనే శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
కూడె నన్ను నీకఁ దాను గొసరేదేఁటిదే

రేకు: 1450-5 ఆహిరి సం: 24-299

పల్లవి: తానిఁక నెప్పుడు నాపై దయదలఁచీనే
ఆనవెట్టి యాతనినే యడుగరే చెలులు

చ. 1: కలువ లేమిటికిఁ గారింపులాయనే
తలపోఁత లేఁటికిఁ దరవాయనే
చిలుకపలుకులేల చిరుచేఁదులాయనే
అలరినరమణుని నడుగరే చెలులు

చ. 2: కాసేటివెన్నెలలేల కడువేఁడులాయనే
ఆసలు జిగురులై యే లంటుకొనెనే
వాసనైన గాలి యేల పడ చల్లఁజొచ్చెనే
ఆసుద్దలెల్లాఁ బతి నడుగరే చెలులు

చ. 3: పొదలతుమ్మిదలేల పొంచి తమిరేచీనే
ఆదరుఁజన్నులేల ఆముకొనినే
అదన నలమేల్ మంగనైన నన్ను తాఁ గూడె
అదె శ్రీ వేంకటేశ్వరు నడుగరే చెలులు

రేకు: 1450-6 రామక్రియ సం: 24-300

పల్లవి: ఎట్టు దప్పించుకోవచ్చు యెంతపంతము లాడినా
పట్టరాని జవ్వనము బయలీఁతలు

చ. 1: చెలిచూపులు పతిని చిక్కించే అడియాసలు
తలవంచుకొనుటలే తరితీపులు
కలికిసన్నలు మంచికంకణదారములు
సొలపులసిగ్గులే చొక్కుమందులు

చ. 2: ముద్దులపలుకులే మునుకొన్న చిలుకలు
అద్దలింపుజంకెలు పాయనిలంకెలు
చద్దివేఁడికొసరులు జారనియెలఇంపులు
అద్దుకొన్నతిట్లవి మచ్చుమేపులు

చ. 3: వినయపుసరసాలు వీడరానిజిగురులు
చనవులకాఁగిళ్లు సరిబేసులు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్ మంగను
పొనుగని మీరతు లెప్పుడు నీడుజోడులు

రేకు: 1451-1 గౌళ సం: 24-301

పల్లవి: కానీలేవే చెలియా కంటిమి నీగుణాలెల్ల
కానవచ్చె నీవు పొత్తుఁ గలసితివేమో

చ. 1: వాడికతో రమణుఁడు వచ్చితే రానీఁగదవే
వేడుకగా నేనే విన్నవించేఁగాని
ఆడుమన్న మాటలు నీ వాడవేమో యతనితోఆడునుండాతఁడు పరాకై వూరకుండునా

చ. 2: ముప్పిరి నేనున్నదిక్కు మొగమైతేఁ జాలునే
చొప్పులెత్తి నేనే అన్నీఁ జూపేఁగాని
యెప్పుడు నీమొగమోటా లేమిగలవోకాక
తప్పక యేపొద్దూ నన్నే తలఁచకవుండునా

చ. 3: యెలమి శ్రీవేంకటేశుఁ డిటు పవ్వళించనీవే
అలమేల్ మంగఁ గనక అలమేఁగాని
కలసితి నీవతనిఁ గదిసి వచ్చితివేమో
మలసి తా నిన్నాళ్లు మఱచి యట్టుండునా

రేకు: 1451-2 రామక్రియ సం: 24-302

పల్లవి: నీ వెప్పుడే నావాఁడవే నీమన్నన నాకుఁ గద్దు
వేవేలు భావించకుమీ వేడుకిది చాలును

చ. 1: విన్నవించితినంటా విచారాలఁ బెట్టకుమీ
పన్ని నీచిత్తానఁ గలపాటే చాలును
సన్నలు సేసితినంటా సారెకు నలయకుమీ
వన్నెల నీయంత నీవు వచ్చినదే చాలును

చ. 2: వలచి వుందాననంటా వంతలఁ బొరలకుమీ
తలఁచుకొన్నప్పటినీతగులే చాలు
సొలసి మొక్కితినంటా చూచి వగవకుమీ
కలసి యేలేనంటా నీకరుణే చాలును

చ. 3: ముందర నుందాననంటా మొగమోట బొంకకుమీ
చెంది నన్నుఁ గూడితిని శ్రీవేంకటేశ
అందపుటలమేల్ మంగ నంటినని నవ్వకుమీ
సందడి రతిపరవశము లివె చాలును

రేకు: 1451-3 శంకరాభరణం సం: 24-303

పల్లవి: వాసులురేసులు వద్దిఁకను
సేసలు చల్లుఁడు చెల్లును మీకు

చ. 1: చనవునఁ బొరలీ సలిగెలఁ జెనకీ
ననుపునఁ గొసరీ నలినాక్షి
పెనఁగకు నీవిఁక పెంచకు చలములు
మనవి చేకొనుము మగఁడవు నీవు

చ. 2: నగవున సొలసీ నంటునఁ బొదిగీ
తగవున నొరసీ తలోదరి
వెగటులు నెరపకు వింతలు సేయకు
బిగియకు చేకొను ప్రియుఁడవు నీవు

చ. 3: ముచ్చటలాడీ ముద్దులు చిలికీ
మెచ్చీ నిను నలమేలుమంగ
ఇచ్చల శ్రీవేంకటేశ కూడితివి
మచ్చికఁ జెలఁగు రమణుఁడవు నీవు

రేకు: 1451-4 సామంతం సం: 24-304

పల్లవి: వాకిట నేల వున్నాఁడు వద్దికి రమ్మనవే
చేకొని నేఁజెప్పినట్టు సేసేటిదానను

చ. 1: తన కితవైతేను తాలిమితో నుండుఁగాక
వనితలతో నవ్వఁగా వద్దనేనటే
చన వెవ్వతె కిచ్చినా సమ్మతించి వుందుఁగాక
వెనకనే తెచ్చుకోఁగా వెంగెమాడేనటవే

చ. 2: అంగన తనకు బాఁతియైతే నియ్యకొందుఁగాక
కొంగువట్టి పెనఁగఁగాఁ గోపించేనటే
సంగడిఁ బెట్టుకున్నాను సారె మెత్తుఁగా కాపెను
సింగారించుకొమ్మనవే చెల్లదనేనటవే

చ. 3: వాడికఁగా నడపితే వావిసేసుకొందుఁగాక
వూడిగపుకాంతకుఁగా నొరసేనటే
యీడనే శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కూడె నన్ను నీకెఁకుగాఁ గొసరేనటే

రేకు: 1451-5 రామక్రియ సం: 24-305

పల్లవి: కంటిమిగా నేఁడివెల్లా కన్నులారాను
ఇంటనే నీతపములు యీడేరెఁగా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చేసీ నీకు నూడిగాలు
చెలికి నెంతచన విచ్చితవో నీవు
కొలువులోపల నుండి కొప్పు నీకు దువ్వీని
వెలయ నదెటువంటి వేడుకో నీకు

చ. 2: కొసరి కొసరి నీకుఁ గూరిమితో వీడెమిచ్చీ
పొసఁగ నెంతచవులువుట్టెనో నీకు
ముసిముసినవ్వుతో నీమొగమే తప్పకచూచీ
సుసరానఁ గళలెంత సోకెనో నీకు

చ. 3: చెనకి చెనకి నిన్నుఁ జేరి చేరి కాఁగిలించీ
తని వెట్టు గలిగెనో తగిలి నీకు
యెనసితి శ్రీవేంకటేశ యలమేల్ మంగను
మన సొక్కటాయ నేమిమర్మమో నీకు

రేకు: 1451-6 ద్రావిళభైరవి సం: 24-306

పల్లవి: ఏమమ్మా యీపంతములు యెన్నఁడూనెఱఁగము
ప్రేమతో మీఇద్దరికిఁ బ్రియములే కలవి

చ. 1: మనసు లెనసి నీతో మంచిమాటలాడఁగాను
విని వూఁకొనఁగవద్దా విభునితోను
కొనగొంగు వట్టుకొని కూరిములు చల్లఁగాను
కని సంతోసించవద్దా కమ్మటి నీవు

చ. 2: చెలరేఁగి నీతోను చిరునవ్వు నవ్వఁగాను
తలయెత్తి చూడవద్దా తగిలి నీవు
మొలకచన్నులు సారె ముట్టిముట్టి పెనఁగఁగా
లలిఁ గాఁగిలించవద్దా లావున నీవు

చ. 3: వురముపై నిడుకొని వూడగాలు గొనఁగాను
సిరుల మెచ్చవద్దా శ్రీవేంకటేశు
అరుదుగాఁ గూడితివి అలమేలుమంగవు
సరసమాడఁగవద్దా సారె నిటువలెనే

రేకు: 1452-1 కాంబోది సం: 24-307

పల్లవి: నేనేమి నెఱఁగను నిన్నేకాని
మోనాన నాలోనున్న మోహమెల్ల నీది

చ. 1: కన్నెదాననైననన్ను కలికిఁ జేసితివి
పిన్నచన్ను లింతేసిగాఁ బెంచితివి
తిన్నని నామోవినిండా తేనెలే పూరించితివి
పన్నిననాజవ్వనభారమెల్లా నీది

చ. 2: కందువ నామోమున కళలెల్లా రేఁచితివి
పొందుగ చూపుల వాఁడి పుట్టించితివి
చిందేటిచెమటతోడ సిగ్గువడ నేరిపితివి
అందపునాసింగార మదియెల్లా నీది

చ. 3: మలసి మాఁటలలోని మర్మముఁ దెలిపితివి
కలసి దేవులఁగాఁ గైగొంటివి
అలమేల్ మంగను నేను అన్నిటా శ్రీవేంకటేశ
తలఁచుకో నాచక్కఁదనమెల్లా నీది

రేకు: 1452-2 నాదరామక్రియ సం: 24-308

పల్లవి: నీచిత్తమే యెఱుఁగు నే నెంతదాన
కాచి నన్ను నేలి యిట్టె కనుఁగొనవయ్యా

చ. 1: మచ్చిక నీతోడిది మాఁటలు చెలితోడివి
కొచ్చినచెమటలు చెక్కులమీఁదివి
కచ్చుపెట్టి కోరికలు కాఁగిటికి లాచినవి
యిచ్చట నావిన్నపము లేమిచెప్పేనయ్యా

చ. 2: తలఁపు నీమీఁదిది తనువు పానుపుపైది
లలి నిట్టూర్పులు గుబ్బల నొరసేవి
యెలమి చూపులు నీకు యెదురులు చూచేవి
బలమి నాయాస లెంతపచారించేనయ్యా

చ. 3: నవ్వులు సెలవులవి నాకూటమి నీరతిది
చివ్వన నాకాఁపురము సిగ్గుమీఁదిది
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నివ్వటిల్లఁ గూడితివి నిన్నేమనేనయ్యా

రేకు: 1452-3 ముఖారి సం: 24-309

పల్లవి: మూసి మంతనములేల ముసిముసి నవ్వులేల
చేసినచేఁతలెల్లాఁ జెప్పించుకోరాదా

చ. 1: సెలవుల నవ్వీ చెలి యేఁటికో కాని
నెలకొన్నసింగారాల నిన్నుఁ జూచి
వెలి నేమిసేసితివో వెస నీకెఁ బిల్చి నీవు
కలిగినవెల్లాఁ దారుకాణించుకోరాదా

చ. 2: వొద్దఁ బాయకున్నది వువిద యేఁటికో కాని
పొద్దుపొద్దు గాచుక నీపొంత నెపుడు
సుద్దు లేమిగలవో ఆచొప్పు లాపెనే యడిగి
బద్దులు తెలిసి నింద పాపుకొనరాదా

చ. 3: మెచ్చి సన్న సేసీ యలమేల్ మంగ యేఁటికో కాని
కొచ్చి శ్రీవేంకటేశ నీకొలువులోన
ఇచ్చల బానుపుమీఁద యిద్దరుఁ గూడితి రిదె
హెచ్చి యీకెచే విడె మిప్పించుకోరాదా

రేకు: 1452-4 రామక్రియ సం: 24-310

పల్లవి: ఎంతకెంత చలములు యేల రేఁచేవు
చెంతలఁ జనవులిచ్చి చేకొనఁగరాదా

చ. 1: వద్దనున్న కాంతలను వాసులు వుట్టించితేను
పెద్దరికాల కెంతైనాఁ బెనఁగుదురు
బుద్ధిచెప్పి తగవులు దిద్దదొరకొంటేను
ఇద్దరూఁ దమమాట లెన్నైనాఁ జెప్పుదురు

చ. 2: సవతులైనవారి సారెఁ బంతా లెక్కించితే
జవళితో సణఁగులు చల్లుదురు
తవిలి వొద్దని మరి తగఁ జేతఁబట్టితేను
తివురుచు మీఁదమీఁద దీకొనఁగఁజూతురు

చ. 3: యెట్టనెదిటివారి నెడమాట లాడితేను
పెట్టరాని వొట్లెల్లాఁ బెట్టుకొందురు
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గుట్టున నన్నేలితి వాకొమ్మలాఁ గూడరాదా

రేకు: 1452-5 హిందోళం సం: 24-311

పల్లవి: ఇంతకంటే వేడుక లేమి చెప్పేది
కాంతల కెప్పుడు నివి గలుగఁగవలయు

చ. 1: పడఁతికి నెంచిచూడ పాయమే సింగారము
జడియనివొరపే చక్కఁదనము
విడువనితనగుట్టె వింతవింత విలాస్తము
చిడుముడిమురిపెమే చెలఁగు విభ్రమము

చ. 2: మునుకొన్న పెనుసిగ్గే మోహనాకారము
తనలోని యణఁకువే తరితీపు
చెనకేవొయ్యారము చెప్పరానిచెలువము
వినయమె యెప్పుడూ వెలలేనిగుణము

చ. 3: చిట్టకపుఁజేఁతే చిమ్మిరేఁచేటిసొబగు
నెట్టుకొన్న వోరుపే నేరుపెల్లాను
ఇట్టి శ్రీవేంకటేశ ఇన్నిటా నలమేలుమంగ
పట్టపుదేవియాయ నీభావమే వొప్పిదము

రేకు: 1452-6 వేళావళి సం: 24-312

పల్లవి: ఘనుఁ డన్నిటాఁ దాను కంటి తనగుణమెల్లా
మునుపనే పాదాలకు మొక్కితి నే ననవే

చ. 1: సరసము తా నాడుటే చనవిచ్చినట్టుగాదా
శిరసు వంచుకొంటేనే చేకొంటగాదా
తెరవేయిమంటేనే వద్దికిఁ బిలుచుటగాదా
యిరవాయఁ దనమేలు యేల చెప్పీ నాకును

చ. 2: మాటలు తా నాడితేనే మచ్చిక చల్లుటగాదా
చోటిచ్చినదే వలపు చూపుటగాదా
నాటఁగా మోముచూచుటే నమ్మిక లిచ్చుటగాదా
వాంటముగా తనపొందు వాసిపంపు నేఁటికే

చ. 3: మెచ్చి కాఁగిలించితేనే మించి కలయుటగాదా
ఇచ్చగించుటే రతికి నెరుకగాదా
యిచ్చట శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
తచ్చి నన్నుఁ గూడె నింకాఁ దలఁపించవలెనా

రేకు: 1453-1 దేశాక్షి సం: 24-313

పల్లవి: కాముకులైనవారికి కల్పవృక్షమువంటిది
గోమునఁ బెంచితే నెలకొను సంతోసములు

చ. 1: మొగములు చూచితేనే మొలచును వలపులు
చిగిరించు మాటలాడి చెనకితేను
అగపడి నిలిచితే నల్లుకొనుఁ బ్రియములు
నగినంతలోననే నసలెత్తు నాసలు

చ. 2: కాయములు సోఁకితేను కలఁగు మకరందము
ఆయము లంటితే ఫలమందు నపుడే
చాయలా సన్నలా సరసములనె పక్వమౌను
దాయక పాయకుండితే తరితీపులెక్కను

చ. 3: తమకపురతులను తతి యెప్పుడైనా నౌను
జమళితలపోఁతల చవులు పుట్టు
అమర శ్రీవేంకటేశుఁ డలమేల్ మంగఁ గూడఁగా
మమతలనే వసంత మహిమలు నిండెను

రేకు: 1453-2 పాడి సం: 24-314

పల్లవి: మాకేలే ఇటువంటిమందెమేళాలు తనతో
మేకొని సేవలుసేసి మెప్పించుటగాక

చ. 1: వేడుకకత్తెలకు వేసాలు సేయవచ్చు
చూడఁగానే యెంతైనా సొలయవచ్చు
పాడిపంతా లెంతైనాఁ బచారించఁగవచ్చు
యేడనుఁడైనా తన్ను నెలఇంచవచ్చును

చ. 2: కన్నులను జంకించి కాఁతాళించఁగవచ్చు
సన్నలుసేసి వూరకే సాదించవచ్చు
విన్నపాలు సేసిసేసి వేడుకలు రేఁచవచ్చు
చన్నుల నొత్తుచు లోలో జరయఁగవచ్చును

చ. 3: చేయరానిచేఁత సేసి చెక్కులు నొక్కఁగవచ్చు
వేయిమాటలైనా నాడి వేఁడుకోవచ్చు
యీయెడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
చాయతో నన్నేలె నిఁక సమ్మతించవచ్చును

రేకు: 1453-3 లలిత సం: 24-315

పల్లవి: ఎంత గుణవంతురాలు యీసతి నీకు
చెంత నిన్ను మెచ్చుఁగాని చిడుముడిపడదు

చ. 1: యేమి నీవుసేసినాను ఇచ్చకమే ఆడుఁగాని
కామిని యెంతైన నీతోఁ గాఁతాళించదు
జాము వోయి వచ్చినాను సంతోసించుకొనుఁగాని
మోము చిన్నఁబుచ్చుకొని మొక్కలాన దూరదు

చ. 2: నిగిడి పరాకైనా నిన్ను నెచ్చరించుఁగాని
మగువ నీనేరాలెంచి మరి పాయదు
మిగులా నీ వెవ్వరితో నగినాఁ జెలఁగుఁ గాని
యెగసక్కెమున నిన్ను నెరపులు సేయదు

చ. 3: పిలువక నీ వుండినా పెనఁగి పైకొనుఁగాని
చలములు నీతోను సాదించదు
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మెలగి నీవుగూడినమేలు మరవదు

రేకు: 1453-4 తెలుఁగుఁగాంబోది సం: 24-316

పల్లవి: ఇంతవిరహాగ్నిచేత నేల వెరగందితివి
చింతదీర మాదిక్కు చిత్తగించఁగదవే

చ. 1: మానిని నీరమణుఁడు మాటలాడినట్లయ్యీ
వీనుల నీ వాలకించి వినఁగదవే
పానుపుపై నాతఁడు నీపక్కనే వున్నాఁడోయోమో
చేనంటి నీ విప్పు డిట్టె చెనకఁగఁగదవే

 చ. 2: కచ్చుపెట్టి వాకిటఁ గడుచప్పుడయ్యాని
వచ్చీఁ బేరుకొని పిలువఁగగఁదవే
చొచ్చి సోరణగండ్లఁ జూచుకొంటావున్నాఁడేమో
తచ్చి సెలవుల నీవింతట నవ్వఁగదవే

 చ. 3: గక్కన యెందుండోవచ్చి కాఁగిలించి నిన్నుఁ గూడె
వొక్కమనసున నిఁక నుండఁగదవే
అక్కరో శ్రీవేంకటేశుఁ డలమేల్ మంగవు నీవు
చక్కఁగా మావిన్నపాలు సరివచ్చెఁగదవే

రేకు: 1453-5 మధ్యమావతి సం: 24-317

పల్లవి: బలిమి సేయఁగరాదు పడఁతులాఁ బురుషులా
చెలులాల యిదెరిఁగి చేరి పొందుసేయరే

చ. 1: మనసొక్కటైతేను మాటలూ నొక్కటే యౌను
తను వోరుచుకుంటేను తలఁపూ నోరుచును
కనుఁగన కింపైతేను కడుపున కింపౌను
పనులకు మెచ్చేవారు పాటలకూ మెత్తురు

చ. 2: చేతికి లోనైతేను చేఁతలకూ లోనౌను
ఆతుమకుఁ దగులైతే అసలుకూఁ దగులు
నీతులు సమకూడితే నిజములూ సమకూడు
కాతర మొల్లనివారు కపటమూ నొల్లరు

చ. 3: పిన్ననాఁడు గుణియైతే పెద్దనాఁడూ గుణియౌను
నన్నుఁ దాఁ గూడెఁగనక నవ్వు లొనగూడెను
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
మన్నింపించుకొన్నవారు మరిగించుకొందురు

రేకు: 1453-6 బౌళి సం: 24-318

పల్లవి: ఇంతు లేమెరుఁగుదురు ఇన్నీ నోరుచుకోవయ్య
యెంతైనా నీకుఁబోదు యేలేటివాఁడవు

చ. 1: సవతులజగడాలు సారె దిద్దఁబోతేను
రవళితో దూరుదురు రమణునిని
వివరముగా మరి వేఁడుకొనఁబోతేను
చివుకురంటాఁ బైని చేతులు చాఁతురు

చ. 2: కచ్చుపెట్టి విడేలిచ్చి కలపఁగఁబోతేను
యెచ్చుగుందు లెంతురు యెగ్గులు వట్టి
గచ్చులుసేసి యట్టె కాఁగిలించఁబోతేను
పచ్చారుతా మంచాలపైఁ బవ్వళించివుందురు

చ. 3: అంతలో నీ విద్దరి నండఁబెట్టుకోఁ బోతే
పంతాన నొట్లువెట్టి పచారింతురు
బంతినే యలమేల్ మంగపతివి శ్రీవేంకటేశ
కాంతలఁ గూడితి వికఁ గడు నిన్ను మెత్తురు

రేకు: 1454-1 సాళంగనాట సం: 24-319

పల్లవి: ఇన్నిటా నేర్పరి దాని కిదే బుద్ది
సన్నేటిఁగి మెలఁగితే చవులౌను పొందులు

చ. 1: యేలినవానితో సతి యెంత చనవరియైనా
వేళెరిఁగి మాటాడితే వేడుకలౌను
పిలుచు నొక్కొకవేళ వేసరుకొంటేఁ దాను
తాలిమితో నుండితేనే దయవుట్టును

చ. 2: కలసినయడాటానఁ గడుఁజక్కనిదైనాను
తల పెరిఁగి నవ్వితేఁ దమిరేఁగును
అలిఁగినసమయాన నాతఁడే మన్నించి
పిలిచినఁ బలికితే ప్రియము గలుగును

చ. 3: శ్రీవేంకటేశు తోడ జిగి నలమేల్ మంగవు
నీవైన నిచ్చకమైతే నిల్చుఁ గాంక్షలు
అవటించి సమరతి నాతఁ డలయించితేను
కైవశమై కలసితే కరఁగును మనసు

రేకు: 1454-2 వసంతవరాళి సం: 24-320

పల్లవి: చేరి నన్నుఁజూచి యేల సిగ్గువడేవు
మారుకొని యాపెతో మాఁటాడవలదా

చ. 1: కొసరి కొసరి నిన్నుఁ గొంగువట్టితీసి నాపె
పొసఁగి చేతికిలోనై పొందవయ్య
ముసిముసినవ్వుతో నీముందరఁ జెమట గార
అసురుసురయ్యీనేలో అడుగరాదా

చ. 2: ముద్దు ముద్దువలె నాపె మోముఁ దప్పక చూచీ
కద్దో యేమైనా మీలోఁ గనుసన్నలు
దిద్ది కస్తూరినామముఁ దీర్చీ నీనొసలను
అద్దుక మెచ్చుఁగవద్దా ఆపెసేసేబత్తికి

చ. 3: తనివారాఁ దనివారా తా నిన్నుఁ గాఁగిటఁ గూడీ
ఘనుఁడవు నీయప్పణగాఁ బోలును
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్ మంగను
నను నిదె ఆకె యున్నది సంతోసించెను

రేకు: 1454-3 వరాళి సం: 24-321

పల్లవి: ఎటువంటివాఁడవు ఇంతపొందైనచోట
తటుకనఁ బైకొనక తడవులుసేతురా

చ. 1: పడఁతి చెక్కులదాఁకా పయ్యదగప్పుకొంటా
పెడరేఁచి ఇంటిదాఁకాఁ బిలిచె నిన్ను
వుడివోనిజవ్వనాన నూరకే మలసుకొంటా
వొడివట్టి తియ్యఁగాను వోపనందురా

చ. 2: ఇరవైనఆసలతో నెప్పుడు వత్తువోయంటా
సురటి మాఁటువెట్టుక చూచీ నిన్ను
మురిసేన నీతోను ముద్దుల గురుసుకొంటా
గరిమ సన్నసేయఁగా గక్కన బిగుతురా

చ. 3: సారెసారె మోవితేనేచవులు చూపుకొఁటా
నేరుపుతోఁ గాఁగిట నించీ నిన్ను
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చేరి యెదురు చూడఁగా సిగ్గున నవ్వుదురా

రేకు: 1454-4 దేసాళం సం: 24-322

పల్లవి: కాఁకల నొకటొకటె గడించుకొనేవు నీవె
సోఁకించి నీమేను నేసోదించవచ్చితినా

చ. 1: వేడుకకు నీతో నవ్వితిఁగాక యేమైనా
తోడనే కేరడాలు నీతోఁ జేసేనా
యీడ నీవొంటి నుండఁగా ఇటు తోడుండితిఁగాక
జాడతో నమ్మక నీసంగడికి వచ్చేనా

చ. 2: చక్కనినీరూపు నే నాసలతోఁ జూచితిఁగాక
టెక్కులకు చూపులు నాటించవచ్చేనా
మక్కువగలిగి నిన్ను మాడలాడించితిఁగాక
వెక్కసపు నీసుద్దులు వెల్చుకొనేనా

చ. 3: కందువల నిన్ను మెచ్చి కాఁగిలించుకొంటిఁగాక
సందడిఁ బెనఁగి నీపై సత్వ చూపేనా
ఇందునె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అంది కూడితివి నిన్ను నాఱడిఁ బెట్టేనా

రేకు: 1454-5 మాళవి గౌళ సం: 24-323

పల్లవి: ఇటువంటివోజగల దిందరిలో నెక్కుడు
తటుకన రతులకుఁ దగు లైనదానికి

చ. 1: చలము గలుగవలె సరసమాడేయందు
పలుకులు నేరవలె బడినుంటేను
తెలివి చూపఁగవలె తేటగా మొకమునను
చలివాసి పతివద్ద జాణైనదానిక

చ. 2: యిచ్చగించ చూడవలె యేకాంతమైనప్పుడు
విచ్చనవిడి గావలె వేడుకవేళ
కొచ్చి నవ్వవలెఁ దనుఁ గోరి యెదిరించితేను
పచ్చిగా విభునివద్దఁ బ్రౌడైనదానికి

చ. 3: చేరి యలమేలుమంగ సేవచేసేసమయాన
కూరిమి నంటఁగవలె కొంగువట్టితే
యీరీతిఁ గూడె శ్రీవేంకటేశ నిన్ను నలమేల్ మంగ
మేరతో నీవద్ద నిట్టె మేలుగలదానికి

రేకు: 1454-6 అమరసింధు సం: 24-324

పల్లవి: ఏ నెంత నీవెంక యేల గొరబుసేసేవు
పూని నన్ను నింతేసి పొగడేవు నీవు

చ. 1: వింతవింత చేతలకు వేడుకకాఁడవు నీవు
సంతసుద్దులునేర్చిన జాణకాఁడవు
సంతోసపు నగవుల జాజరకాఁడవు, నీవు
యెంతైనా నే నిన్ను నెలయించఁగలనా

చ. 2: వూరివారినెల్లా మెచ్చేవుబ్బరికాఁడవు
కారణము లేక వచ్చే గండికాఁడవు
గోరగీరి యేరుసేసేకొనబుకాఁడవు నీవు
కేరడము లాడి నిన్ను గిలిగించఁగలనా

చ. 3: ఆలయక రతిఁగూడె ఆసోదకాఁడవు నీవు
కొలఁది మీరినయట్టి కోడెకాఁడవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి వీఁక నిన్ను గరిసించఁగలనా

రేకు: 1455-1 సామంతం సం: 24-325

పల్లవి: ఎటువంటిభాగ్యమో యీపెకు నేఁడు
తటుకనఁ దాను దొరతనము మెరసెను

చ. 1: చద్దికి వేఁడికి నీవు సారెసారె వేఁడుకోఁగా
పెద్దరికమున కాపె బిగిసీ నీతో
యిద్దరు నిద్దరేయని యీడనున్నసతులు మీ-
సుద్దులు వొగడుకొంటా చూచేరు మిమ్మును

చ. 2: వుమ్మగిలుఁ జెమటతో వొడివట్టి తియ్యఁగాను
యెమ్మెలకే పెనఁగీ నిట్టె నీతో
అమ్మరో నీవాకెకు అరవి సమత్తువేమో
చిమ్మిరేఁగి తరితీపు చిందీ మీవల్లను

చ. 3: నెట్టనఁ దమకమున నీవు గాఁగిలించుకోఁగా
బట్టబయలీఁదీ యాకె భ్రమసీ నీతో
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గట్టిగా నన్నేలితివి కంటిమి మీపొందులు

రేకు: 1455-2 సామ వరాళి సం: 24-326

పల్లవి: వెలలేని మహిమలవే సొలవాఁడు
పలుకు లీడేరె నిఁక భావించనేఁటికి

చ. 1: చెలిమి చేసినవాఁడు చేతికి లోనౌఁగాక
పిలువఁగానే నాతో పెనఁగనేలే
కలువల వేసినాఁడు కాఁగిలించుకొనుఁగాక
యెలఇంపుఁజేఁతలతో నెక్కడ చూచీనే

చ. 2: తగులనాడినవాఁడు తనివి నొందించుఁగాక
జిగిఁ జేఇ వట్టఁగానే సిగ్గులింతేలే
నగినాఁడు మొదలనే నాటుకొని వుండుఁగాక
మొగమెదుటనే యేల మోహము దాఁచీనే

చ. 3: చెనకి కూడినవాఁడు చిత్తగించ మెచ్చుఁగాక
పనివడి మొక్కఁగానే పరాకులేలే
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చి మరియేమి చాయలు దిద్దీనే

రేకు: 1455-3 బౌళి సం: 24-327

పల్లవి: ఇంతి యేమిసేసీనంటా యేల వేళ యడిగేవు
చెంత నీకెదురుచూచి చిమ్మిరేఁగీనయ్యా

చ. 1: చిలుకలఁ జదివించీఁ జెలులఁ గూడి
కలువదండులు గట్టీఁ గందువ నుండి
మొలవఁబెట్టీ జాజులు మునుకొని
వెలది పూఁదోఁటలో విహరించీనయ్యా

చ. 2: గుదిగుచ్చీ తామరలు గుట్టుతోడను
కదిమి తుమ్మిదలమూఁకలు రేఁచీని
సదరానఁ బన్నీరు చల్లులాడీని
వుదుటునఁ గేళాకూళి నోలలాడీనయ్యా

చ. 3: పొంచి పొంచి చల్లగాలి పొందుసేసీని
కొంచక వెన్నెలలెల్లాఁ గూడపెట్టీని
నించి శ్రీవేంకటేశ్వర నిన్నలమేల్మంగ కూడె
మంచముపైఁ గాఁగిట నెమ్మది నున్నదయ్యా

రేకు: 1455-4 ముఖారి సం: 24-328

పల్లవి: మట్టుతోనే సొలయవే మగనితోను
దిట్టవై పదరితేను దిద్దుకొనరాదు

చ. 1: మాఁటలాడవచ్చుఁగాని మర్మములు నాఁటితేను
గీఁటించి మీఁదటఁ బెల్లగించంగరాదు
కాటుకకన్నుల సన్న గావించవచ్చుఁగాని
పోటీవెట్టి యడిగితే పోల బొంకరాదు

చ. 2: నవ్వు నవ్వవచ్చుఁగాని నడుమ నెగ్గువట్టితే
వువ్విళ్ళూర మందువోసి వుడుపరాదు
పవ్వళించి వుండఁగాను పాదా లొత్తవచ్చుఁగాని
చివ్వనఁ గాఁగిలించితే సిగ్గువడరాదు

చ. 3: మొక్కు మొక్క వచ్చుఁగానిమోములఁటుకొంటేను
కక్కసించి నీరువోసి కడుగరాదు
అక్కున శ్రీవేంకటేశు కలమేల్మంగవు నీవు
ఇక్కడ నన్నేలినాఁడు యెలయించరాదు

రేకు: 1455-5 భైరవి సం: 24-329

పల్లవి: నీమోహము కొలఁదివే నేఁజేసేప్రియము లివి
చేముంచి ఇన్నిటికి నీచిత్తము నాభాగ్యము

చ. 1: కతలెల్లా విన్నవించఁగలదానఁగాక నీకు
హితైయుండిన దింక నెట్టు దెలుసు
తతి నీకు విందుచెప్పేదానఁ గాక కూరాకులు
మతి కింపులయ్యేవి మరి యెట్టు దెలుసు

చ. 2: ఆడుమంతే నీతో జూజ మాడఁగలదానఁగాక
యీడ నీకు వేడుకౌత యెట్టు దెలుసు
కూడిమాడి నీగుణాలు కొనియాడేదానఁగాక
జాడతో సమ్మతించేటి చంద మెట్టు దెలుసు

చ. 3: చేరివుండి వూడిగము సేయఁగలదానఁగాక
యీరీతి నీవు మనిఁచె దెట్టు దెలుసు
ఆరయ శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
గారవించి యేలితివి గతు లెట్టు దెలుసు

రేకు: 1455-6 పాడి సం: 24-330

పల్లవి: నీవు సేసినచేఁతలు నేఁడు మామీఁద నున్నవి
యీవల నప్పటి మమ్మునేల దూరేవు

చ. 1: పెదవిపై కెంపులు బిగువులు వట్టుండఁగా
యెదురుమాటలు నీతో నేఁటి కాడేము
కడలుఁ గన్నుల నిద్ర కదుఁ గమ్ముకొనఁగాను
ఇదివో నిన్నుఁ గసరి యేలచూచేము

చ. 2: పట్టఁగానే గరివడి పాలిండ్లు వుండఁగాను
బెట్టి యేలపెనఁగేము బీరాన నీతో
గుట్టున జెమట మడుగులు గట్టుకొనఁగాను
జట్టిగొని ఇంకా నెంత సరసమాడేము

చ. 3: సిగ్గువడ్డచిత్తము చిమ్మిరేఁగి వుండఁగాను
వొగ్గిరతులకు నెట్టు వొడిగట్టేము
నిగ్గులశ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెగ్గులేక కూడితివి యెంత మెచ్చేము

రేకు: 1456-1 దేసాళం సం: 24-331

పల్లవి: ఇందుకోరకే నిన్ను నింతేసి కొసరితిమి
సందడిఁ బంతాన నిన్ను జరయముసుమ్మీ

చ. 1: మలసి సొలసి నిన్ను మాటలాడించకుండితే
తలఁపు దెలుసునా తరుణులకు
పిలిచి ని న్నింటికి రప్పించకుండితే నీ-
వలపుకొలఁ దెఱిగవచ్చునా మాకు

చ. 2: చెనకి చెనకి నిన్ను చిమ్మిరేఁచకుండితేను
ఘనుఁడవు నీగుణము కానవచ్చునా
తనువు సోఁకించి నీకు తమి వుట్టించకుండితే
అనిశము నీగుట్టు అరయఁగవచ్చునా

చ. 3: కరఁగించి మరిగించి కాఁగిలించకుండితేను
సరి నీవేడుక చెల్లించఁగవచ్చునా
ఇరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పరగ నన్నేలితివి పాయ నిఁక వచ్చునా

రేకు: 1456-2 ముఖారి సం: 24-332

పల్లవి: ఎవ్వరూ నేమి చెప్పేరు ఇంతడి నాయకుఁడవు
రవ్వగా నీవే తెలిసి రక్షింతువుకాక

చ. 1: వలచితినంటాను వనిత చెప్పుకొనునా
సలిగె ఇచ్చితివంటా సాదించునా
తలఁ పెరుఁగుదునని తమకించి కొసరునా
చెలియ నేలేది నీచేతి దింతేకాక

చ. 2: కాయము సోఁకినంతనే కాంత గర్వించునా
పాయపుదానినని పంతమాడునా
చేయి నీవు వేసితేనే చిరునవ్వు నవ్వునా
ఆయింతివేడుకలు నీయాస యింతేకాక

చ. 3: చక్కనిదియ్యైతేనే సతి నిన్ను జంకించునా
వెక్కసాన మెచ్చితేనే విఱ్ఱవీఁగునా
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
వొక్కటైతి విదెల్లా నీ వోపి కింతేకాక

రేకు: 1456-3 వరాళి సం: 24-333

పల్లవి: ఇంత సేయకుండితే నీ విచ్చగింతువా
సంతోసించేదానివలెఁ జవిచూపె మోవి

చ. 1: బచ్చెనమాటలు నీతోఁ బచరించి
కొచ్చి కొచ్చి సొలసీని కోమలి నిన్ను
మెచ్చేదానివలెనే మేకులుసేసి
కుచ్చి కాఁగిలించుకొని కుమ్మరించీ వలపు

చ. 2: ననుపుసేసుక నీవు నవ్వు నవ్వి
చనవులు నెరపీని సారెకును
చెనకేదానివలెను చెక్కులు వట్టి
పెనఁగుతానే యింకాఁ బ్రియములు రేఁచీని

చ. 3: జంకెనచూపులు నీపైఁ జాఁచి చాఁచి
అంకెల జన్నుల నొత్తీ నప్పటిఁ దాను
లంకెల శ్రీవేంకటేశ లావున నలమేల్మంగ
తెంకి రతులనుఁ గూడి తెమలించీ సిగ్గులు

రేకు: 1456-4 దేశాక్షి సం: 24-334

పల్లవి: కడలేని గుణములఘనుఁ డాతఁడు
వెడవెడగా నేఁటికి వెరగువడేవే

చ. 1: గాఁటముతో నాతఁడు గారవించి పిలువఁగ
చీటికిమాటికినేల సిగ్గువడేవే
చోటిచ్చి యాతఁడు నీతో చుట్టరికము చెప్పఁగ
జూటవై మనసులేల సాదించేవే

చ. 2: పెద్దరికములు సేసి పెనఁగఁగ నాతని-
వద్దనుండి శిరసేల వంచేవే
సుద్దులు నిన్నడుగుతా సొగకన్నులఁ జూడఁగ
కొద్దెఱిఁగియునునేల గుట్టుసేసేవే

చ. 3: కైవశమై యాతఁడు కాఁగిలించి నిన్నుఁ గూడె
వేవేగ మొక్కుచు నెంత వేఁడుకొనేవే
నీవలమేలుమంగవు శ్రీవేంకటేశుఁడు తాను
యీవేళ నిన్ను మన్నించెయెత కోసరేవే

రేకు: 1456-5 శంకరాభరణం సం: 24-335

పల్లవి: కన్నచోటనే నీకు కందికుడుము
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా

చ. 1: పున్నమ వెన్నెల లవె పోగులాయను
సన్నజాజిననలు జాజుకొనెను
చెన్నుమీరె వింతటాను చిరుముత్యాలు
పన్నినసంసారము ఫలమందెను

చ. 2: పదారువన్నెలపైఁడి పరిమళించె
సదరాన తరితీపు జాలువారెను
పొదలె మరురాజ్యము పొద్దువొద్దుకు
ముదిరి పువ్వులవాన ముంచుకొనెను

చ. 3: పెరిగె పూవలెల్లానుఁ బిందెలాయను
యిరవైన చుట్టరిక మిల్లు నిండెను
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
సరుస నీ వెనయఁగా సరిబేసులాయను

రేకు: 1456-6 కేదార గౌళ సం: 24-336

పల్లవి: ఇటులానే నీసుద్దులు యేమైనా నంటుకొందువు
కటకటా యిటువలెఁ గాకు సేయవచ్చునా

చ. 1: కోమలి చన్నులమీఁది కుంకుమగందపుఁబూత
ఆముకొని పచ్చడాన నంటుకున్నది
గామిడితనాన నాపైఁ గప్పితి వెగసక్కేన
యేమిసేతు నిన్ను నిందు కెవ్వరికిఁ జెప్పుదు

చ. 2: తొయ్యలికొప్పువిరులు తొరలినసవరము
కొయ్యతనాన ముడుచుకొంటివి నీవు
యియ్యెడ నేమరిపాటు ఇటు నాకు ముడిచితి
నియ్యంత నీవెఱఁగవు నిన్నిఁక నేమందును

చ. 3: చెలివట్టుకుండినచేతిలోలి వీడెము
లలిఁ గైకొని నీతమ్ములము వెట్టేవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి విఁక నిన్ను గరిసించనేఁటికి

రేకు: 1457-1 శుద్ధవసంతం సం: 24-337

పల్లవి: వేసరనివలపులవిభుఁ డాతఁడు
సేసపాలు మీఁదఁ జల్లి చెనకఁగరాదా

చ. 1: అరజాన దూరనేల ఆతని వేఁడుకోనేల
వూరకే దొరతనాన నుండఁగరాదా
మేరమీరి నవ్వనేల మిక్కిలిపంతమీనేల
నీరువంక తుంగవలె నెలకొనరాదా

చ. 2: యెగసక్కేలాడనేల యిచ్చకము సేయనేల
నగుతాఁ జుట్టరికమే నడపరాదా
వెగటై మెఱయనేల వినయము చూపనేల
చిగురులో చేఁగవలె చెలువొందరాదా

చ. 3: మనసు సోదించనేల మర్మములు చెప్పనేల
వొనగూడి రతులలో నోలాడరాదా
అనుగుశ్రీవేంకటేశుఁ డలమేలుమంగవు నీవు
వినుపులో నీడవలె నెలకొనరాదా

రేకు: 1457-2 ఆహిరి నాట సం: 24-338

పల్లవి: నావిన్నపము వినవే నలినాక్షి
చేపమీర నీకు బుద్ధిచెప్పితిఁజుమ్మీ

చ. 1: చనవరితనమును సాదించుకంటేను
వినయముతో విభుని వేఁడుట మేలు
కనుచూపు నాటఁజూపి కాఁతాళించుకంటేను
మనసు రంజిల్లఁగా మాటాడుటే మేలు

చ. 2: పంతములు నెరపుచు బయలీఁదించుటకంటే
చెంతనుండి ప్రియములు చెప్పుట మేలు
వంతుల నొట్లువెట్టి వలలఁబెట్టుటకంటె
చింతదీర నూడిగాలు సేయుట మేలు

చ. 3: పల్లదానఁ గాఁగిలించి పచ్చిగాఁ జేయుటకంటె
చల్లఁగా వలపు సారెఁ జల్లుటమేలు
కొల్లఁగా నలమేల్ మంగ కూడె శ్రీవేంకటేశుఁడు
చిల్లరసిగ్గులకంటె చెనకుట మేలు

రేకు: 1457-3 ముఖారి సం: 24-339

పల్లవి: మఱి యేఁటివిన్నపము మాపుదాఁకాఁ జేసేము
గుఱిగా నీవే తెలుసుకోవయ్యా ఇపుడు

చ. 1: కచ్చువెట్టి నీరూపము కన్నులఁజూచి యింతి
అచ్చపుమోవితేనకు నాసపడీని
కొచ్చి కొచ్చి వీనుల నీగుణములు వినివిని
ఇచ్చలో నీపొందులకు నేకరీ దాను

చ. 2: ననుపున సెలవుల నవ్వుతానే అప్పటిని
చెనకి యిట్టె నీపై చేయివేసీని
వొనర నీవద్దఁ బాయకుండివుండి తమకించి
పెనఁగులాడుచు సారెఁ బ్రియముచెప్పీని

చ. 3: ఇందు నందు నిందాఁకా నెడమాటలాడించి
కందువతోఁ దానే వచ్చి కాఁగిలించీని
అందపు శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
మందలించి నీయెదుట మచ్చిక చల్లీని

రేకు: 1457-4 వరాళి సం: 24-340

పల్లవి: ఇటువంటి దౌత వల పెరఁగ నిన్నాళ్ళును
తటుకన రాఁగారాఁగా తరితీపులాయను

చ. 1: వెలనున్నయంతపడి విరహములై యుండి
కలసినమీఁదట కలయై తోఁచె
తలఁచినయంతవడి తమకములై నిండి
సులభానఁ దనువులు సోఁకితే వేడుకాయ

చ. 2: వినుకలియంతవడి వెడయాసలై ముంచి
కనుకలిఁ దనియందె కాయమెల్లాను
పెనఁగినయంతవడి బీరములు నాటుకొని
చనవిచ్చితేఁ గడుచవులౌ మెరసెను

చ. 3: చెంగటనున్నంతవడి సిగ్గులు మిక్కిలిరేఁగి
ముంగిటఁ గాఁగిలించితే ముచ్చటలాయ
రంగుగ నే నలమేలుమంగను శ్రీవేంకటేశ
అంగవించి నీ వేలితి వందాలాయ రతులు

రేకు: 1457-5 మంగళకౌసిక సం: 24-341

పల్లవి: దయపుట్టీ నీకు నీకె తమకించి చెప్పనేల
నియతాన నీకెమేలు నెరవేర్చవయ్యా

చ. 1: చెక్కునజారేచెమట సెలవులఁ జిఋనవ్వు
చక్కనిమాటలలోని సాదింపులు
పిక్కటిల్లుఁ జన్నులపై పెడఁబాసినపయ్యద
అక్కరతో నీవే చూడ నవధరించవయ్యా

చ. 2: వీడినవెన్నుపై కొప్పు వేమారులు నిట్టూర్పులు
వీడెపే మోపిమీఁది వింతసన్నలు
వాడుదేరేమేనిపై జవ్వనమదముసొంపులు
వేడుకతో నీవె ఇన్ని విచారించవయ్యా

చ. 3: మనసులో తలపోఁత మర్మములబయలీఁత
తనివోనిచూపులలో తరితీపులు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్ మంగను
చనవిచ్చి ఇంకా నీవే సరసమాడవయ్యా

రేకు: 1457-6 సామంతం సం: 24-342

పల్లవి: ఎటువంటివోజ యీపె కెటువంటివొడికము
కుటిలకుంతలి నీకే కోమలి గాఁదగును

చ. 1: మగువ నీవు రాఁగాను మంచముపై నుండి లేచి
నిగిడి చెక్కుచేతితో నిలుచున్నది
తగులమిసేసి నీవు దండఁ గూచుండుమనగా
పగటున మెల్లనె నీపాదా లొత్తీని

చ. 2: నీవు మోము చూచితేను నీచేతికి బాగాలిచ్చి
కావించి యాకుమడిచి కాచుకున్నది
ఆవేళ మోము చూచి అటు నీవు నవ్వితేను
పూవులు నీకు ముడిచీ బుజముమాటునను

చ. 3: పెనఁగులాడఁగా నిన్ను బెరసి కాఁగిట నించి
మునుపఁ దమ్ములానకు మోవి చాఁచీని
యెనసె శ్రీవేంకటేశ యీాకె యలమేలుమంగ
తనిసి నీరతులను దై లువారీని

రేకు: 1458-1 సామంతం సం: 24-343

పల్లవి: ఎటువంటి యాఁటదైనా ఇంతకోపునా
తటుకున నిది చూచి దయవుట్టె మాకును

చ. 1: వెలనుండి యాపె నీవేళలు గాచుకుండఁగా
చెలితో మాటలాడేవు చెల్లునా నీకు
సొలవక ఆపె నీసుద్దు లాలకించఁగాను
కిలకిల నవ్వే వీడ కేరడముగాదా

చ. 2: గాఁటముగా నాడ నాపె కానుకవట్టుకుండఁగా
పాటలు వినే విక్కడఁ బంతమా నీకు
సూటిగా నీరూపము సోరణగండ్లఁ జూడఁగా
జూటవై పరాకయ్యేవు సోద్యముగాదా

చ. 3: తలుపు దెఱచుకొని తానే వచ్చివుండఁగాను
చలనమునఁ జెనకేవు సంగతా నాకు
అలమె శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
తలఁపెరిఁగి యేలేవు తగవేకాదా

రేకు: 1458-2 పాడి సం: 24-344

పల్లవి: వెంగెమాడేనా నిన్ను వినవా నాజాడ మున్ను
సంగతిగా బుద్ధిచెప్పి చవివుట్టించేఁగాక

చ. 1: అందమాయ నీమాటలు ఆపెతో మొగమోటలు
పొందుసేసే వప్పటిని పూఁటవూఁటలు
నిందలాడేమా నేము నీవిట్టె చూచేవు మోము
విందులుగా నీసుద్దులు విన్నవించేఁగాక

చ. 2: తొలఁకీ మోవినవ్వులు తురుము నిండెఁబువ్వులు
యెలమి నింకానేల యెడదవ్వులు
చలము నీపై లేదు సరవిఁ జెప్పకపోదు
వలపు సూడిదెవట్టి వాసిరేఁచేఁ గాక

చ. 3: కంటిమి నీచేఁతలు కరుణ కివె పూఁతలు
దంటతనములకు యీఁతలు మోఁతలు
ఇంటనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నంటున నీవిచ్చినమన్నన చూపేఁగాక

రేకు: 1458-3 లలిత సం: 24-345
పల్లవి: వెనకతియ్యనేఁటికి వేసారఁగనేఁటికి
పెనఁగఁగనద్దా నీకుఁ బ్రియమైనదాఁకాను
చ. 1: పనివడి నీవు నాతో పచారించి చెప్పఁగాను
వినవద్దా నీమాటలు వేడుకతోను
కనుఁగొని నీవు నాతో కాఁపురము సేయఁగా
కొనియాడవద్దా నిన్ను కోరిక లీడేరను
చ. 2: మంతనాన నీవు నామనసురా మెలఁగఁగా
సంతోసించవద్దా నిన్ను సారెసారెకు
చింతదీర నీవు నాకు చేతికి లోనై వుండఁగా
ఇంత బత్తి సేయవద్దా ఇంపులు మీరఁగను
చ. 3: తగవు దప్పక నీవే దయతోడ నేలఁగాను
తగఁ గాఁగిలించవద్దా తమితోడను
మగిడి శ్రీవేంకటేశ మన్నించి నన్నుఁ గూడఁగా
పొగడఁగవద్దా నిన్ను బూమెల్లా నెఱఁగను

రేకు: 1458-4 దేసాళం సం: 24-346

పల్లవి: ఎఱఁగమా నీగుణము ఇంతవింతవారమా
మెఱసి ఇన్నిటా నిన్ను మెచ్చుటింతేకాక

చ. 1: చనవుగలుగువారు జడియఁగనేమిటికి
మనసెరిఁగినవారు మండాడనేల
కనుసన్ననుండేవారు కాఁతాళించనేమిటికి
ననిచి నీచేఁతలకు నవ్వుటింతేకాక

చ. 2: తగుదలాయమ్మైనవారు తత్తరించనేమిటికి
మొగమోటయినవారు మొరయనేల
తగవునడపేవారు తప్పించుకోనేమిటికి
సొగిసి నిన్నుఁ దప్పకచూచుటింతేకాక

చ. 3: గుట్టుతో మెలఁగేవారు కొసరఁగనేమిటికి
చుట్టములైనవారు జుణుఁగనేల
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చిట్టకములేక సంతోసించుకొంటగాక

రేకు: 1458-5 కురంజి సం: 24-347

పల్లవి: చెక్కుచెమటలతోడ సిగ్గులకు లోనైతి
తెక్కలివలపులకుఁ దెరఁగేది యిఁకను

చ. 1: మనసిచ్చి నీవు నాతో మాటాలాడఁగా నేను
వొొసర నేమని నీకు నుత్తర మిత్తు
చెనకి వేడుకతోడ చెయివట్టి పెనఁగఁగా
యెనసి నీయెదుట నే నిఁక నేమిసేతు

చ. 2: సొక్కుచు నామోము నీవు సూటిగాఁ జూడఁగాను
తక్కక నేనేమని తలఁచుకొందు
పక్కన నీవు నేఁడు నాపైఁ జేయివేయఁగా
దక్కి నే నేరీతి నీచిత్తమురా మెలఁగుదు

చ. 3: ముచ్చటతో నీవు నామోవితేనె లానఁగాను
ఇచ్చగించి యేరీతి నింపు వుట్టింతు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మెచ్చఁజేసి నీభావ మేమిటఁ బచారింతును

రేకు: 1458-6 ఆహిరి సం: 24-348

పల్లవి: సుదతి వున్నభావము చూడఁగరాదా నీవే
పదిమారులును నొడఁబరచఁగనేఁటికి

చ. 1: సేసపాలు దైవారె చిప్పిలీఁగఁ జెమరించె
ఆసలు లోలో నిండె ఆయాలు గరఁగె
రాసికెక్కెఁ దమకము రచ్చఁబడె వలపులు
వేసరక యెందాఁకాను విన్నవించె మీఁకను

చ. 2: కోరిక లీరికె లెత్తె గుంపులాయఁ బులకలు
వూరెను మోవితేనెలు వొదగె నిట్టూర్పు
నారుకొనెఁ గూరిములు ననిచెఁ జిఱునవ్వులు
తారుకాణగా నెంత తలఁపించే మీఁకను

చ. 3: కళలు మోమున ముంచె కన్నులఁ జెంగావి మించె
పలుకులఁ బచ్చిదేరె పరగె వేడుకలు
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సలిగెఁ గూడె నిన్నెంత సాదించే మీఁకను

రేకు: 1459-1 వరాళి సం: 24-349

పల్లవి: చెలి యిఁక నేమిసేసు సేయఁగలసేవ సేసె
నెలకొన్న విభుఁడవు నీ వెఱఁగవా

చ. 1: చిగురుఁబెదవివంచి చెప్పినయట్టిప్రియాలు
తగిలి నీతోఁ గొసరేతలపోఁతలు
మొగము చూచిచూచి మొక్కినట్టిమొక్కులు
నిగిడి నే జప్పనేల నీ వెఱఁగవా

చ. 2: యిచ్చకముగా నీకు నిచ్చినయట్టికానుక
కొచ్చి నీపైఁ జల్లినకూరిములు
విచ్చనవిడిని నిన్ను వేఁడుకొన్న వేడుకలు
నిచ్చ నెచ్చరించనేల నీ వెఱఁగవా

చ. 3: సన్నల మోవిచూపిన జాలువారే తేనెలు
కన్నుల నవ్వి చేకొన్న కాఁగిలింపులు
యెన్నఁగ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిన్నుఁ గూడె నిన్నియును నీ వెఱఁగవా

రేకు: 1459-2 కన్నడ గౌళ సం: 24-350

పల్లవి: ఏమని విన్నవించేము యింక నీకును
కామినిభాగ్యము మరి కలది నీచిత్తము

చ. 1: చెలికి నీవు బత్తిసేసినచేఁతలు
తలకొని యేపొద్దూఁ దలపోఁతలు
చెలరేఁగి మరుఁడువ్రాసినవ్రాఁతలు
కొలఁదిమీరిననీకొనగోరిగీఁతలు

చ. 2: ఆకెతోడ నీవు సారె నాడినయట్టిమాఁటలు
కైకొని నమ్మినవె బంగారుమూఁటలు
జోకలుగ మోవితేనెసోనవూటలు
నీకు నేఁడు గలిగె నన్నిటాఁ బూఁటవూఁటలు

చ. 3: చిత్తగిం చిద్దరూఁ గలసినపొందులు
హత్తినలోలోని మోహపువిందులు
యిత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
కొత్తలుగాఁ గూడినసిగ్గుల కివె సందులు

రేకు: 1459-3 మాళవి గౌళ సం: 24-351

పల్లవి: చిమ్మిరేఁగినటువలె సేసినదే చేఁతగాక
దొమ్మిసరసములోన తొలఁగఁ జోటున్నదా

చ. 1: సెలవుల నవ్వు నవ్వ చెంగలిచూపులఁ జూచి
పలుకులఁ దరితీపు పచరించి
నిలుచున్న దిదె చూడు నీవేల సిగ్గువడేవు
వలపులజాజరకు వాసివంతు లెంతురా

చ. 2: చన్నులు కానుకచూపి సంగడిఁ గొలువుసేసి
సన్నలనే ప్రియములు చాలాఁ జెప్పి
యిన్నిటా నిన్నుఁ గొసరీ యెక్కడ పరాకు నీకు
పున్నమవెన్నెలపొళ్లు పూచి కుప్పసేతురా

చ. 3: తనువున నిన్నొరసి తమకము పెడరేఁచి
వినుకలిఁ గనుకలి వింతసేసి
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మనసులోఁ బాలు దాగి మరి లెక్కసేతురా

రేకు: 1459-4 ముఖారి సం: 24-352

పల్లవి: ఎట్టుసేసినా నమరు ఇంతటిదొరవు నీవు
గట్టువాయతనమేల కరుణించరాదా

చ. 1: చెలి పనివడి నీతో చెవిలోన విన్నవించఁగా
మలసి వేరొకతెతో మాటలాడేవు
యెలమి నాపె నిన్ను నేమీ ననఁజాలక
సెలవుల నవ్వు నవ్వీఁ జిత్తగించరాదా

చ. 2: చివ్వన నీసతి నీచేతికిఁ గానుకియ్యఁగా
అవ్వలియాపె నుంగర మడిగేవు
నివ్వటిల్ల నిందుకుఁగా నెమ్మి నందాలుసేసుక
పువ్వులవేసీ నిన్నుఁ బొందుచూపరాదా

చ. 3: అసల నలమేల్మంగ అట్టె కాఁగిలించుకోఁగా
నేసవెట్టే విందరిపై శ్రీవేంకటేశ
యేసుద్దులూఁ దడవక యిన్నిటాఁ బొగడె నిన్ను
లాసి నీరతులకు లాలించరాదా

రేకు: 1459-5 సౌరాష్ట్రం సం: 24-353

పల్లవి: ఇంచుకంతా నలయిక యెఱఁగ విదేమయ్య
వంచీ శిరసు నీవు వద్దనుండఁగాను

చ. 1: చెలరేఁగి చెమటలు చెంపలవెంట జారీ
బెళకుచుఁ జెలి నీతోఁ బెనఁగఁగాను
మెలుపున నొండొంటితో మీటై చన్నులు రాసీ
చలవట్టి నీతో సరసమాడఁగాను

చ. 2: పైపైఁ బెదవులను పలుకుఁదేనెలు చిందీ
మాపుదాఁకాఁ జనవిచ్చి మాటాడఁగాను
రాపునఁ బెనఁగువటీ రమణీహారములెల్ల
దాపున నీచెనకులు తప్పించుకోఁగాను

చ. 3: మునుకొని నొసలిపై ముంగురులు జారీని
ఘనమైనరతి నిన్నుఁ గలయఁగాను
యెనసె శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నినుపాయ నిట్టూర్పులు నిన్నుఁ గాఁగిలించఁగా

రేకు: 1459-6 శ్రీరాగం సం: 24-354

పల్లవి: ఏమని తలఁచితివో ఇందాఁకాను
యేమరఁజుమ్మీ నేను యిందాఁకాను

చ. 1: తచ్చి తచ్చి యిట్టె నీచిత్తము రావలెనంటాను
యిచ్చకములే యాడితి నిందాఁకాను
పచ్చినీచేఁతలు చూచి పదరఁజాలక నే-
నెచ్చరికతో నుండితి నిందాఁకాను

చ. 2: మదిలోన నీవు నన్ను మన్నింతువంటాను
యెదురెదురే చూచితి నిందాఁకాను
కదిసి నిన్ను మాయింటికడకుఁ బిలిచేనంటా
యిదివో కాచుకుండితి నిందాఁకాను

చ. 3: నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యెట్టు నిన్ను పొలసితి నిందాఁకాను
గట్టిగా నన్నేలితివి కైవశమై నీవు నాకు
యిట్టిట్టని తెలియను యిందాకాను

రేకు: 1460-1 దేశాక్షి సం: 24-355

పల్లవి: అదివో నీదేవులు నీయక్కునఁ జెలువొందీని
యెదుట నీకు నాపె ఇన్నిటాఁ దగును

చ. 1: భామ నీకు నేపొద్దు పరతంత్రము
అమనిరతులలో మోహనయంత్రము
దామెనపలుకుల మదనయంత్రము
సాముసేసేనీకాఁగిటి స్వతంత్రము

చ. 2: నెలకొన్న నీకు మాణిక్యము
పొలసేచూపులకెల్లా పుష్పచాపము
కలిగె నీకింతటి శ్రింగారరూపము
యిల నీమహిమ వెలయించేప్రతాపము

చ. 3: తన్నుదానే నీకును చిత్తరంజనము
నిన్నుఁ గూడేకళలతో నిరంజనము
యెన్నఁగ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చెన్నగు నీవనేటినిక్షేపాన కంజనము

రేకు: 1460-2 దేవగాంధారి సం: 24-356

పల్లవి: ఆనతియ్యవలె నాకు నడిగే నిదివో నిన్ను
వూనినవలపు నాకు నుంకువ లిచ్చితివా

చ. 1: ప్రియములు నీవు చెప్పినయట్టయ్యీఁగాని
నయగారినీచేఁతలు నమ్ముదునా
దయదలఁచితే నిన్నుఁదగిలి మెచ్చేఁగాని
నియతపునీగుణాలు నే నెరిఁగేదాననా

చ. 2: దినదినకొత్తలెల్లాఁ దెలుసుకొనేఁగాని
యెనసిన నీపొందిక నియ్యకొందునా
చనవున మోవిచ్చేవు చవులుచూచేఁగాని
ఘనమైన నీమా టతికడచేటిదాననా

చ. 3: సరసములాడేవి సమ్మతులయ్యీఁగాని
పురిగొన్ననీనేరుపు పొగడుదునా
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
గరిమ నన్నేలితివి కడు సంతోసింతునా

రేకు: 1460-3 పాడి సం: 24-357

పల్లవి: ఇన్నాళ్లవలెఁ గావు యివే నీమోముకళలు
తన్నుఁదానే మీఁదమీఁద దైలువారీ నిపుడు

చ. 1: చెలఁగి యాతఁడు నీకుఁ జెప్పిపంపినమాటలు
వెలఁదిరో వీనులారా వింటివటవే
సొలవక నీకిచ్చినసురటిలో తనరూపు
నిలుకడైనభావము నీమతి నిల్చెనటే

చ. 2: ననిది నీదిక్కు చూచి నవ్వినయట్టినవ్వులు
పెనగి సంతోసాలై పెరిగెనటే
చెనకి నిన్నెచ్చరించి చిమ్మిరేఁచినసిగ్గులు
తనివొందించి నిన్నింకాఁ దలఁపించెనటవే

చ. 3: గుదిగొన నిన్నుఁ దాఁ గూడినకూటమి
కదిసి నిన్ను నేర్పరిఁగాఁ జేసెనటే
యిదె శ్రీవేంకటేశుఁడు యే నలమేలుమంగను
వెదకి నన్నేలె నీకు వేడుకాయనటవే

రేకు: 1460-4 ముఖారి సం: 24-358

పల్లవి: ఇంతేసి నేరుతువుమా నే మిల్లాండ్లము
సంతోసాన వారి నన్నూ సరిగాఁ జూచేవు

చ. 1: కన్నుల నవ్వఁగఁదగు కడుఁజేతలాడికి
చన్నుల నొత్తఁగఁదగుఁ జలపాదికి
విన్నపాలు సేయఁదగు వెస మాటకారికి
సన్నలు సేయఁగఁదగు చనవరిదానికి

చ. 2: సిగ్గులు వడఁగఁదగు చిన్ని పెండ్లికూఁతురుకు
దగ్గరి వుండఁగఁదగు దంటదానికి
వెగ్గళించి నవ్వఁదగు వెఱపులేనియింతికి
వొగ్గి చెనకఁగఁదగు నుదుటైనదానికి

చ. 3: పెనఁగి పిలువఁదగు బీరపుతరుణికి
పనిగొని కూడఁదగు పంతగత్తెకు
నిను శ్రీవేంకటేశ్వర నే నలమేలుమంగను
యెనసితి నాకు దగు నిచ్చకపుదానికి

రేకు: 1460-5 సాళంగనాట సం: 24-359

పల్లవి: ఇప్పుడుగాక నీపగ టేఁకనెన్నఁడే
చెప్పరాదు నీసేఁతలు చెల్లెఁగా నేఁడు

చ. 1: వంతులకుఁ బెనఁగేవు వాసులకు జుణిఁగేవు
యెంతలేదు నీయెమ్మె లేమిచెప్పేదే
పంతములు మెఱసేవు పైకొని జఱసేవు
కాంతుఁ డిచ్చినచనవు గద్దుగా నీకు

చ. 2: చెక్కు చేత మోపేవు సిగ్గు లెల్ల నాఁపేవు
అక్కజపుదొరవు నీ వౌదువే మేలు
కక్కసించి సొలసేవు కాఁకల మలసేవు
నిక్కి జవ్వనమదము నిండెఁగా నీకు

చ. 3: సన్నలనే మొక్కేవు సారెఁ గాలుదొక్కేవు
పన్నినవీపుదు టేఁకఁ బట్టఁగరాదే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నన్నుఁ గూడె వేడుకలు ననిచెఁగా నీకు

రేకు: 1460-6 వసంతవరాళి సం: 24-360

పల్లవి: కన్నుల చల్లఁగా మిమ్ముఁ గనుఁగొంటిని
సన్నలా చాయలా నిఁక జరయఁగనేఁటికి

చ. 1: అనుమానమెల్లఁ దీరె ఆకె నీవూఁ గూడితివి
మనసొక్కటాయఁగా మాటలేఁటికి
చెనకులు గరివడె చెక్కులఁ జెమట నిండె
వెనకముందర లెంచి విచారించనేఁటికి

చ. 2: మొగమోట లొనగూడె ముందర నున్నారు మీరు
తగవాయఁ బనులెల్లా దాఁచనేఁటికి
జిగిఁ గళ లెదురెక్కె సిగ్గులు ముంగిటఁ బడె
తగిలెఁ జుట్టరికము తడఁబాటులేఁటికి

చ. 3: తారుకాణయ రతులు దక్కె సంతోసములెల్లా
చేరెఁ బంతములు నే డె చింతలేఁటికి
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కోరి నన్ను నేలితివి గుట్టుసేయనేఁటికి

రేకు: 1461-1 లలిత సం: 24-361

పల్లవి: మనసిచ్చి యాతనితో మాటాడరాదా
యెనసినమీఁదట యెరవులు గలవా

చ. 1: చెప్పరాని ప్రియములు సేయరానిబాసలు
అప్పుడే వింటివి గదే యతనిచేత
కొప్పుమీఁది సేనలు గోరికొనగురుతులు
ఇప్పుడే నింపించుకొంటి విఁకనేలే సుద్దులు

చ. 2: పెట్టరానిఆనలు పెనఁగరానిచేఁతలు
గట్టిగాఁ గంటివిగదే కాంతునివల్ల
చుట్టరికపుఁదనాలు చూపులలో నవ్వులు
గుట్టునఁ జేకొంటివి కొంకనేలే నీకును

చ. 3: తలఁచదానిపొందులు తనియరానిరతులు
కలిగెఁగదే విభునికాఁగిట నేఁడు
అలమేల్మంగను నేను అతఁడు శ్రీవేంకటేశుఁ-
డెలమి నన్నేలినాఁడు ఇయ్యకొనవెలనే

రేకు: 1461-2 రామక్రియ సం: 24-362

పల్లవి: ఓపమయ్యా నీతో నవ్వ నూరకే వుండేముగాని
చేపట్టి నీవే యేలితే సేవ సేసేఁగాని

చ. 1: కూరిమిలేనిచోట కుమ్మరించి కుమ్మరించి
సారెసారె నవ్వినాను చౌకలౌను
మేరలు మీరేయప్పుడు మేనవారికైనాను
గోర గీరితీఁజాలు గొప్పయేరై వుండును

చ. 2: యెగ్గులువట్టేవారు యెచ్చరించి యెచ్చరించి
వొగ్గి సరసమాడినా నొల్లఁబట్టౌను
వెగ్గళించవలసితే వింతలేని వారికైనా
దిగ్గనఁ గొసరితేను తీగెసాడు మాటలు

చ. 3: ఆయమెఱిఁగినవారు ఆదరించి యాదరించి
చేయివట్టి తీసినాను చెమట లూరు
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పాయక నన్నేలితివి పంతమాడేవారమా

రేకు: 1461-3 ఆహిరి సం: 24-363

పల్లవి: చెప్పవే నీవే బుద్ధి సిగ్గయ్యీ నాకు
చిప్పిలీ వలపులెల్ల చిత్తములో నాకు

చ. 1: మాటలఁ దేనెలు గారీ మచ్చికల నోరూరీ
యీటువెట్టి యీతఁ డివి యేడ నేర్చునే
కోటిసేయ నవ్వు నవ్వీ కొంగువట్టి పెనఁగీని
గాఁటపువిభునితో నేఁ గమ్మటి నేమందునే

చ. 2: పిలుపులఁ దమి నిండీ ప్రియములఁ బంట పండీ
చలమరి యెటువంటిజాణఁడే తాను
తలపోఁత గడురేఁచీ దప్పిదీర మోవిఇచ్చీ
బలిమికాఁ డితనితో పంతమెట్టాడుదువే

చ. 3: కన్నుల సన్నలు చూపీ కాఁగిట నాసలు రేపీ
పన్ని ఇన్నిటాఁ దాను పంతగాఁడౌనే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నన్నుఁ గూడె యెప్పుడు నాకే మోహించునే

రేకు: 1461-4 బౌళి సం: 24-364

పల్లవి: వట్టిపరాకులు సేయవద్దు నీకు నిఁకనేల
గుట్టు నే మెఱుఁగుదుము కొంక నీకేఁటికిని

చ. 1: వేసరక వూడిగాలు వేమరుఁ జేసీ నీకె
పూసగుచ్చినట్టు నీకు బుద్ది చెప్పీని
వాసులువంతు లెంచక వద్దనే కాచుకున్నది
నీసము కాన నదిగో నెలఁతఁ జూడరాదా

చ. 2: కైపసము సేసుకొని కన్నుల నిన్ను నవ్వీని
వావులు నీతోఁ జెప్పి వలపించీని
పూవులు ముడిచి నీతో పొందులు నటించీని
దేవులాయ విన్నిటాను తెరవేసుకోరాదా

చ. 3: పానుపుపైఁ గూచుండి పాదాలు విసికీని
మేనిపై గందము పూసీ మెల్లనే తాను
ఆనుక శ్రీవేంకటేశ అలమేలు మంగ యీకె
పూని నిన్నుఁ గాఁగిలించె పొగడఁగరాదా

రేకు: 1461-5 మాళవి గౌళ సం: 24-365

పల్లవి: ఊరకే నన్ను మెచ్చీని వొద్దికైనదాననంటా
యీరీతి నన్నుఁ బొగడె నేపనికి వత్తునే

చ. 1: చనవుగలుగువారు సంగడి నుండఁగఁదగు
మనసునమ్మినవారు మాటాడఁదగు
పనిగలిగినవారు పట్టిపెనఁగఁగఁదగు
యెనసి నన్ను మన్నించె నెందులోనిదాననే

చ. 2: తగవెరిఁగినవారు తరితీపు సేయఁదగు
మొగమిచ్చులాడేవారు మొక్కఁగఁదగు
నగనేరిచినవారు నయము చూపఁగఁదగు
యిగురుమోవి ఇచ్చె నేమనఁగఁగలనే

చ. 3: మేనరికమైనవారు మేకులు సేయఁగఁదగు
పూని పాయరానివారు భోగించఁదగు
యే నలమేలుమంగను యీతఁడు శ్రీవేంకటేశుఁ-
డీనెపాన నన్నుఁ గూడె నేమని చెప్పుదునే

రేకు: 1461-6 శంకరాభరణం సం: 24-366

పల్లవి: శిరసు వంచకు మిఁక శ్రీనరసింహ నీ
సిరు లెన్నైనాఁ గలవు శ్రీ నరసింహ

చ. 1: చెలి నీతోడపై నెక్కె శ్రీనరసింహ
చెలరేఁగె నీమోము శ్రీనరసింహ
సెలవుల నవ్వుదేరె శ్రీనరసింహ నీమై
చెలప చెమట లుబ్బె శ్రీనరసింహ

చ. 2: చేరఁడేసికన్ను ల శ్రీనరసింహ
చీరుమూరాడీ వలపు శ్రీనరసింహ
చీరకొంగంటేవేమీ శ్రీనరసింహ
చేరె నీకు నామేలు శ్రీనరసింహ

చ. 3: చేవల్లకు వచ్చితివి శ్రీ నరసింహ నా-
సేవలెల్లా మెచ్చితివి శ్రీనరసింహ
శ్రీవేంకటాద్రి మీఁది శ్రీనరసింహ
చేవమీరె నీవేడుక శ్రీనరసింహ

రేకు: 1462-1 సాళంగనాట సం: 24-367

పల్లవి: ఎదురుఁగొండ లెక్కి ఇందిర గాఁగిలించఁగా
పెదపెదచన్ను లెంత పిసికేవు నీవు

చ. 1: ముసిముసినవ్వు నవ్విమొక్కుచునిన్నుఁగూరిమి
గొసరఁగాఁ జెలినేల కొంగువట్టేవు
సుసరానఁ జెమటార నురటి చేఁబట్టి నీకు
విసరఁగా నీకె నెట్టు వేసేవు పూవులను

చ. 2: కన్నులను జంకించి కమ్మటి నీచెవిలోన
విన్నవించఁగా నేమి విఱ్ఱవీఁగేవు
సన్నలనే వలపులు చవిచూపి నీవొద్ద
కిన్నెర మీఁటఁగా నెట్టు గిలిగించేవు

చ. 3: పానుపుపైఁ బవ్వళించి పయ్యద నీకుఁ గప్పి
వూని చెనకఁగా నెంట బుజ్జగించేవు
అనుక శ్రీవేంకటాద్రి నౌభళాన నిన్నుఁ గూడి
తానకమై తొడెక్కఁగా తగమన్నించేవు

రేకు: 1462-2 రామక్రియ సం: 24-368

పల్లవి: చెన్నలర భూపతిచెరువుకాడ నున్నాఁడు
వెన్నెలబాయిట నాడీ వేంకటేశుఁడు

చ. 1: వాడలవాడలవెంట వనితలపొందు చేసీ
వేడుకకాఁడుగదమ్మ వేంకటేశుఁడు
జాడలు మీరి యప్పటి జాణతనాలాడీని
వీడెపుమోవితోడ వేంకటేశుఁడు

చ. 2: సాదువలె నందరిచన్నులపైఁ జేయిచాఁచీ
వీదరవెల్లితనాల వేంకటేశుఁడు
ఆదిగొని గొల్లెతల నాసలఁబెట్టీఁ దాను
వేదవేద్యుఁడైనట్టి వేంకటేశుఁడు

చ. 3: ననుపైనసతులెల్ల నంటునఁ గానుకియ్యఁగా
వినయాలు చేకొనీ వేంకటేశుఁడు
యెనసి నన్నునేలి యిప్పుడ నావిన్నపాలు
విన నవధరించె శ్రీవేంకటేశుఁడు

రేకు: 1462-3 ఆహిరి సం: 24-369

పల్లవి: నామన సెలుఁగాఁ దొల్లె ననిచినదాననౌత
కామించి యేఁచగఁవద్దు గక్కన రమ్మనవే

చ. 1: యెడమాట లాడించి యెంతపొద్దు జరపీనే
అడియాసలనే యెంత అలయించీనే
వుడివోనిచూపులను వురులొడ్డీ నిది యేమే
చిడియనివలపులఁ జిమ్మిరేఁగేదానను

చ. 2: మొగమొగా లెదుటను మోహ మెంతరేఁచీనే
నగవునఁ గాఁక లెట్టు నటియించీనే
పగటుఁజేఁతలు చూపి బయలేల యీఁదించీనే
మిగులాఁ దమకముల మించివున్నదానను

చ. 3: మన్ననలు నాకు విచ్చి మద మెంత యెక్కించీనే
కన్నుసన్నలనే యేమి గారవించీనే
వున్నది శ్రీవేంకటేశు డుద్దగిరికృష్ణుఁడై
నన్నుఁ గూడె తనపొందు నమ్మికైనదానను

రేకు: 1462-4 సామంతం సం: 24-370

పల్లవి: చూడఁ బిన్నవాఁడుగాని జూటుఁదనాల నెక్కుఁడు
యేడ చూచినా దాను యీవిట్ఠలుఁడే

చ. 1: గోవులలో విహరించేగోవిందుఁడు పెక్కు-
వావుల గోపికలకు వల్లభుఁడు
చేవమీరి ముద్దుల శ్రీకృష్ణుఁడు
యేవల్లఁ జూచినాను యీవిట్ఠలుఁడే

చ. 2: రాసక్రీడలలోని రాజీవాక్షుఁడు
ఆసఁ బదారువేలఁ బెండ్లాడినవాఁడు
బాసతో రుక్మిణీసత్యభామసమేతుఁడు
యీసుద్దుల వెలసీ నీవిట్ఠలుఁడే

చ. 3: వింతమధురాంగనలవేడుకకాఁడు
చెంతఁ గొలనిసతుల సిగ్గులవాఁడు
కాంత లక్ష్మిపతి శ్రీవేంకటేశ్వరుఁడు
యింతా వినోదించీ నీవిట్ఠలుఁడే

రేకు: 1462-5 ముఖారి సం: 24-371

పల్లవి: ఎఱుఁగుదు నే నీమోహ మింతిఁ బిలుచుకోరాదా
మొఱఁగి వేసా లింత నాముందర నేఁటికి

చ. 1: వెలఁదిమాటలు నీకు విన వింపులౌఁగాని
చలముతోడుత మొగచాటు గాదు
తలకొని మొక్కితేను దయ పుట్టుఁగాని మరి
యెలమిఁ బరాకుసేయ నెంతైనా గొలుపదు

చ. 2: ఆపెనవ్వినవ్వులు అందములై యుండుఁగాని
రాపుల నెగసక్కేలై రచ్చకెక్కవు
చూపులఁ దరితీపులు సోద్యములై తోఁచుఁగాని
కైపులై యెంతైనాను కడుఁ జప్పఁగావు

చ. 3: నీదేవులు చెనకితే నేరుపులై మించుఁగాని
ఆదిగొని వేసటలై యలపు గాదు
యీదెస శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
పోది నెంతైనా తనపొం దెప్పుడు వీడదు

రేకు: 1462-6 వరాళి సం: 24-372

పల్లవి: ఎంత నేరపితివో యీపెకు నవు
చెంతలఁ దొల్లి నేరదు చిమ్మిరేఁగీ నిప్పుడు

చ. 1: బత్తిసేసి రమణి నీపైఁ జేతులు వేసి
సత్తుగా వీఁపునఁ దనచన్నులు రాసీ
మొత్తమున వలపులు ముచ్చటల నెగపోసి
కొత్తపుపాయాల నిన్నుఁ గొసరీ నదివో

చ. 2: మనసులోపల నీమంతనములే కోరి
నునుపైననీమోవికి నోరూరీని
చెనకి నీకాఁగిటికి సిగ్గులతోనే చేరి
చనవులు నెరపీని సారెసారె నదివో

చ. 3: చెలరేఁగి నీమీఁదిచిందు లిన్నియునుఁ బాడి
బలిమిసేసి నీతోఁ బంతములాడి
యెలమి నన్నేలితివి ఇట్టె నిన్ను నాపె గూడి
అలరి శ్రీవేంకటేశ యందిమెచ్చీ నదివో

రేకు: 1463-1 కాంబోది సం: 24-373

పల్లవి: కాదనేవారెవ్వరు కడుఁజలి వాసె నీకు
యీదెస ముందువెనక లెంచనేల ఇఁకను

చ. 1: పొందు నీకుఁ గలిగితే పోఁదోయవచ్చునా
అందుకోవయ్యా విడె మాపెచేతను
కందువ నాపెతో పొత్తుగలసినవాఁడవు
నిందలకు వెఱవఁగ నీకేల ఇఁకను

చ. 2: వొడఁబాటు గలిగితే వోపననవచ్చునా
కడఁగి యాపెతోఁ బెనఁగకువయ్యా
వొడిగట్టుకొని యాపె నొద్దఁబెట్టుకున్నాఁడవు
వెడ విచారాలు సేయ వేరేయేల ఇఁకను

చ. 3: వావి నీకుఁ గలిగితే వలదనవచ్చునా
వేవేగఁ బెండ్లాడి నీవు వెలయవయ్యా
యీవల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
కైవసమయినమీఁద కడమేల యిఁకను

రేకు: 1463-2 భైరవి సం: 24-374

పల్లవి: నాపై బత్తి గలఁడే నావిభుఁడు
యేపొద్దూ నాసంతోస మేమని చెప్పుదునే

చ. 1: చెనకక తనతోను సిగ్గువడి నే నుండఁగా
మనసిచ్చి తానే నాతో మాటలాడీనే
తనివొంది నాలో నేనే తలవంచుకుండఁగాను
చనవిచ్చి యప్పటిని సరసములాడీనే

చ. 2: చాయసేసుక కంబముచాటున నే నుండఁగాను
చేయివట్టి తీసి నాచెక్కు నొక్కీనే
కాయమెల్లా పయ్యదను కప్పుకొని వుండఁగాను
ఆయములంటి నన్ను నాదరించీనే

చ. 3: వేడుకతోఁ దనవొద్ద వేళగాచుకుండఁగాను
వాడుదేర నింత నన్ను వలపించీనే
యీడనే శ్రీవేంకటేశుఁ డెదుట నే నుండఁగాను
కూడి నన్ను నిందరిలో కొంకక యీడేర్చెనే

రేకు: 1463-3 పాడి సం: 24-375

పల్లవి: నీవారైనవారి నేము గారవించ వద్దా
యీరీతి నే మోరిచినదింతా నీకే సెలవు

చ. 1: ఇత్తల నీచెలులను యెట్టైనఁ బొగడేము నీ-
చిత్తము వచ్చితేఁజాలు చింతయేఁటికి
బత్తితో నాపెచేనిమ్మపండు కిందికి జారితే
యెత్తి నే మిచ్చితే నది హీనమూఁ గాదు

చ. 2: మంతనాన నీదేవులమాటున బదికేము నీ-
పంతము వచ్చితేఁజాలు పదరనేలా
బంతి నాపె కెచ్చరిక పరాకులు చెప్పితేను
యెంతైనా మా కందువల్ల నెగ్గులూఁ గావు

చ. 3: యీడ నీసతిసలిగె నిట్టె నిన్నుఁ గూడేము
వేడుక నీ కైతేఁజాలు వీఁగనేఁటికి
పాడితో నన్నేలితివి పక్కన శ్రీవేంకటేశ
ఆడ నాపెచెల్లెలనైనది వొచ్చెము గాదు

రేకు: 1463-4 సౌరాష్ట్రం సం: 24-376

పల్లవి: నే నెంతటిదానను నీ విన్నిటా ఘనుఁడవు
మోసముతో నిన్నుఁ జూచి మొక్కు టింతేకాక

చ. 1: అమరఁగ నాయకుఁడు ఆదరించితేఁ గాక
తమకించవచ్చునా తరుణులకు
మమకారమునఁ గొంత మన్నించితేఁగాక
సముకాన జింకించి సాదించవచ్చునా

చ. 2: మక్కువతో మగవాఁడు మాటలాడితేఁగాక
కక్కసించవచ్చునా కామినులకు
చక్కఁగా సిబ్బితివాపి చనవిచ్చితేఁగాక
పక్కనుండి పంతములు పచారించవచ్చునా

చ. 3: శ్రీ వేంకటేశ్వర నీవే చిత్తగించితేఁగాక
సోవలకే పెనఁగవచ్చునా మాకు
యీవేళ నన్నేలితివి యిటువలెనైతేఁగాక
దేవులనై కొంగువట్టి తెమలించవచ్చునా

రేకు: 1463-5 హిందోళ వసంతం సం: 24-377

పల్లవి: తలఁచుకో యింకా నీవే తగవులన్నియు నేఁడు
సిలుగులాఁడిసుద్దులు చెప్పలేము గాని

చ. 1: చేతికిలోనైనసతి చెప్పించుకోదు ప్రియము
నీతియెఱిఁగిన దెందూ నేర మెంచదు
ఆతుమలో మెలఁగేది అవుఁగాములు చూడదు
యేతరికత్తెగుణాలే యెఱఁగముగాని

చ. 2: ఇతవరియైన కాంత యెరవులు సేయదు
సతమైన దేమనినా చలపట్టదు
మతి నమ్మికై నది మర్మములు దడవదు
కతకారదానిమాయ కానలేముగాని

చ. 3: తగులైనమానిని తరితీపు సేయదు
నగనేరిచినది యెన్నఁడు దిట్టదు
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
యెగసక్కెపు దానిజా డెట్టుండునో కాని

రేకు: 1463-6 కుంతలవరాళి సం: 24-378

పల్లవి: ఎఱుఁగుదు నీగుణములేల చెప్పేవు
మఱఁగైనట్టే వుండు మర్మములు సోఁకును

చ. 1: పన్ని నీవెంతేసి మాతోఁ బంతములాడినా నాపెఁ
గన్నులఁ జూచితే నీకుఁ గళ రేఁగును
యెన్నఁగ నే గుట్టుతో నెంత వోరుచుకుండినా
సన్న లాపె సేసితే సారెఁ దమివుట్టును

చ. 2: చెలరేఁగి నీలోన సిగ్గులెంత నెఱపినా
లలి నాపె నవ్వితే నెలకొను నాస
చలపట్టుకొని రాజసమున నూరకుండినా
వెలలేని వేడుకలు వెల్లవిరిసేసును

చ. 3: వట్టిసటలకు నీవు వలపులు దాఁచినాను
గట్టిమాఁట లాపేడితేఁ గాయ మలరు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చుట్టరిక మెంచితేనే సొంపులెల్లాఁ గలుగు

రేకు: 1464-1 శ్రీరాగం సం: 24-379

పల్లవి: పతికి విన్నవించరే పడఁతులాల
సతమైతా నిఁక నాకు చనవు లిమ్మనవే

చ. 1: వెలలేనివేడుకకు వేస టెంతైనాఁ గాదు
తలపోఁతరతులకుఁ దనివి లేదు
మొలకనవ్వులకును మొగచాటు చెప్పరాదు
యెలమితో నామోహ మెంతని చెప్పుదునే

చ. 2: తగులైన మీఁదట తనపొందు విడువదు
జిగిమించే తమకము చెప్పఁగూడదు
మొగవిచ్చకుండేసిగ్గు మొలచి పసివాడదు
యిగిరించె నావయసు యెటువలె దాఁతునే

చ. 3: కూడియున్నభావము గుదిగొని పాయదు
వీడెపుమోవిగుఱుతు వింతసేయదు
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలో నన్ను నేలె
యీడుజోడయినభోగ మెంతైనాఁ గలదే

రేకు: 1464-2 కాంబోది సం: 24-380

పల్లవి: రాకుంటే దోసముసుమ్మీ రమణివొద్దికి నీవు
జోకగా నేరీతి నాపెఁ జొక్కులఁబెట్టితివో

చ. 1: సంతోసాన నున్న దిదె సారెఁ జిరునవ్వులతో
మంతనాన నేమంటివో మగువతోను
వింతవింతసింగారాల విఱ్ఱవీఁగీ నింటితోన
అంతరంగమున కెన్ని ఆసలు వెట్టితివో

చ. 2: గుత్తపుఁజెమటలే కుమ్మరించీని సతి
చిత్తగించి యెట్లాఁ జూచితివో నీవు
బొత్తుగాఁ బాన్పుపై నీపొందులే కోరుకున్నది
ఇత్తల నమ్మిక లెన్ని ఇచ్చితివో నీవు

చ. 3: ఆముకొని తమకించి అట్టె నీకాఁగిటఁ గూడీ
యేమిసన్నసేసితివో యీఇంతికి
యీమేరనే శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నేమముతో నెంతేసి నేరుచుకొంటివో

రేకు: 1464-3 ఆహిరి సం: 24-381

పల్లవి: వట్టియలుక లేలే వద్దే నీకు
గుట్టు తెలిసితి నిఁకఁ గూడరాదా యితని

చ. 1: వొడఁబడఁజెప్పితేను వొక్కమనసై వుండు
కడునమ్మెలఁగితేఁ గాదనరాదు
ఆడియాలాలు చూపితే ననుమానమే లేదు
తొడరి విభుని నీవు దూరఁ జోటే దిఁకను

చ. 2: తగవులు నెరపితే దాకొను సంతోషము
చిగిరించ నవ్వితేను చింత దీరును
మొగమోటఁ బైకొంటే మోహములు దైవారు
మగని నొఁగాదన మరియేలే ఇఁకను

చ. 3: యిఁటికి విచ్చేసితేను యియ్యకోలొఁ బొందులు
జంట వాయకుండితేను సతమౌఁ బ్రేమ
నంటున శ్రీవేంకటనగపతి నిన్నుఁ గూడె
అంటి నీవితని జరయఁగనేలే ఇఁకను

రేకు: 1464-4 ఆహిరి నాట సం: 24-382

పల్లవి: ఆఁటది గర్వించితేను అంతట మట్టెరఁగదు
పాటించి యాతఁడు నీకే పాలుపడె నటవే

చ. 1: వంతుపెట్టుకొని పతివద్దఁ గాచుకుందానవు
యెంతగద్దె నీచనవు ఇందరికంటే
ఇంతలోనే చెవిలోన నేకతాలూ నాడేవు
చింతదీర నీమాటే సేసునటే యీతఁడు

చ. 2: పరగ నాతనికి నీపచ్చడము గప్పేవు
పొరుగున నెన్నటిపొందులే నీకు
తెరవేసుకొనుచు చేతికి విడెమూ నిచ్చేవు
సిరులఁబనులు నీకుఁ జెప్పెనటే యాతఁడు

చ. 3: కలసిమెలసి నీవు కందువలు చెప్పేవు
చెలరేఁగి నీకు బాస సేసెనటవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
తెలిపి నిన్నిట్లానే దిద్దెనటే యీతఁడు

రేకు: 1464-5 దేవగాంధారి సం: 24-383

పల్లవి: తా నెరగఁడా యీతగవు లెల్లెడలను
నేనేమైనా తనమీఁద నెపాలు వేసేనా

చ. 1: రతివేళమాఁటలు రచ్చలకు నెక్కవు
యితవైనవారికి యెగ్గులేదు
పతికిని సతికిని పాయదు చుట్టరికము
అతిమోహములకును అడ్డాఁకలేదు

చ. 2: సిగ్గువడ్డయంతలోనే చేరదు తమకము
వెగ్గళించినా నవ్వులు వేసటగావు
వొగ్గి వేఁడుకొంటేనే వోదు గదు బీరము
కగ్గనిపొందులలోన కపటము లుండవు

చ. 3: చనవరిచేఁతలు సాదింపులు గావు
యెనసినకూటమికి నెర వేడది
ఘనశ్రీవేంకటేశుఁడు కదిసె నన్నింతలోనె
వినయముగలచోట వెగటై తోఁచదు

రేకు: 1464-6 తెలుగుఁగాంబోది సం: 24-384

పల్లవి: ఎన్నేసి విద్యలు నేర్చె నీరమణి
చెన్నుమీరె నిన్నిటాను చిత్తగించవయ్యా

చ. 1: వనితచెమటలనె వానలు గురిసీ నదె
నినునవ్వులనె వెన్నెలగాసీని
పనులుసేసేవూర్పుల పయ్యరగాలి విసరి
చెనకీ నీదేవులు చిత్తగించవయ్యా

చ. 2: విరహపువేడుక వేసఁగియెండలు గాసీ
సొరిఁది సిగ్గులనే మంచులు గప్పీని
వరుస మోవితేనెల వసంతకాలము చూపీ
సిరుల నీవేడుకలు చిత్తగించవయ్యా

చ. 3: కందువచూపులనే కడుమెఱుఁగులు చల్లీ
అందపురతులనే వియ్యము లందీని
యిందుకె శ్రీవేంకటేశ యేలితి వీకెను నేఁడు
చిందీ నదె తరితీపు చిత్తగించవయ్యా

రేకు: 1465-1 వేళావళి సం: 24-385

పల్లవి: ఎవ్వరు నేరుతురు నేఁ డిటువంటినేరుపులు
నివ్వటిల్లుఁజేఁతలను నిన్నే మెప్పించేను

చ. 1: చెక్కుఁచెమట దుడిచె చెలి సురటి విసరె
వెక్కసమై నీ కెంత వేడుకాయనో
చక్క వద్దఁగూచుండి జారినతురుము దిద్దె
మకుకవ నీవలపులు మానుపఁగవసమా

చ. 2: వొంటినే కొలువుసుసె వొయ్యనే పాదము లొత్తె
పెంటలుగా నీకెంట ప్రియమాయెనో
అంటిముట్టి పెనఁగుతూ నాయములు గరఁగించె
వెంటనే యీవోజ లిఁక విడపించవసమా

చ. 3: సారెకు పయ్యెదఁ గప్పి సంగడినే మాటలాడె
కోరిక నీకెటువలెఁ గూడెనో నేఁడు
గారవించి శ్రీవేంకటేశ నన్నేలితివి
తారుకాణనీసుద్దులు దాఁచ నిఁక వసమా

రేకు: 1465-2 గౌళ సం: 24-386

పల్లవి: ఆతడేమీ సేసినాను అదియు నాభాగ్యమే
కాతరించి నేనెట్టు గరిసింతునే

చ. 1: కలువపూవులు వేసి కడఁగి యాచేతనే
కులికి విభుని నెట్టు గోర నంటేనే
వలపులు చల్లిచల్లి వరుస నప్పటి నేనే
చలపట్టి యెటువలె జంకింతునే

చ. 2: సరసమాడుచు నవ్వి చక్కఁగా నానోరనే
యిరవుగా పలుసోఁకు లెట్టు నింతునే
గిరికుచముల నొత్తి కినిసి యంతటిలోన
విరహము రేఁచి యెట్టు వేరెవేరె వుందునే

చ. 3: కందువరతులఁ గూడి కమ్మటి నాకాఁగిటనే
విందువలె సారె నెట్టు వేసరింతునే
అంది శ్రీవేంకటేశుఁడు ఆదరించి నన్ను నేలె
మందెమేళమున నేట్టు మాఁటల మెప్పింతునే

రేకు: 1465-3 పాడి సం: 24-387

పల్లవి: మీవలెనే వుండవద్దా మేటియైనజాణలెల్లా
భావించి తెలియలేక పదరఁగ నేలా

చ. 1: మొక్కలము లేఁటికి మోహముగలవారికి
మిక్కిలి వివేకాన మించుటగాక
వెక్కసపుఁదమకాన వేఁడుకొనె నిన్నాతఁడు
తక్కక నీ వందుకుఁ దగ నియ్యకొంటివి

చ. 2: కోపగించనేమిటికి కూటమిగలవారికి
వోపికతో నిన్నిటికి నోర్చుటగాక
చేపట్టి నిన్నాతఁడు చెనకి నవ్వులు నవ్వె
తీపులమోవి యొసఁగితివి నీ వతనికి

చ. 3: వింతసేయనేమిటికి వేఁడుకగలవారికి
అంతరంగాన సంతసమందుటగాక
యింతలోనే శ్రీవేంకటేశుఁడు నిన్నేలినాఁడు
కాంతపు నీవాతనిఁ గాఁగిలించుకొంటివి

రేకు:	1465-4 భైరవి	సం:	24-388
పల్లవి:	మేలుమేలనచు మిమ్ము మెచ్చేఁగాని
	సోలీ మీవద్దఁ గూచుండేచో టియ్యవయ్య
చ. 1:	విందముగాని నీవు వేడుకలెల్లా మెరసి
	ఆందముగాఁ జెప్పవయ్యా ఆపెసుద్దులు
	చెంది సిగ్గులువడక శిరసు వంచుకొనక
	ముందర నిలుచుండి నీమోము చూపవయ్య
చ. 2:	చూతముగాని యాపె సోయగపుగురుతులు
	యీతరిఁ బిలువవయ్యా యెటువంటిదో
	యేతుల కోపననక యింతటిలోనే నగక
	నీతలఁపుఁ దెలుసుకొనే నిందు రావయ్యా
చ. 3:	ఇయ్యకొందముగాని యీసతి జాణతనాలు
	ఇయ్యెడఁ బచారింపించనీవయ్యా నీవు
	నెయ్యపుశ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
	వుయ్యాలమంచము మీఁద నుండఁగదవయ్య

రేకు: 1465-5 ముఖారి సం: 24-389

పల్లవి: ఏకతానకు రారాదా యిప్పుడే కావలెనా
కాకుసేసి యిందరిలోఁ గత లడిగేవు

చ. 1: కనుఁగొనలనే నిన్ను కామిని జంకించఁగాను
చెనకేవు సారెసారెఁ జేయి చాఁచి
వనితలు చూడఁగాను వట్టిసిగ్గున నుండక
గొనకొని యాపెనేల కొంగువట్టేవు

చ. 2: చక్కఁగా నీమోము చూచి సన్నలు సేయఁగాను
చెక్కిలి నొక్కి యిట్టె సేసవెట్టేవు
తక్కక నీ వింతలోనే తగ గుట్టుసేయక
వొక్కటై చన్నులనే వొరసుకొనేవు

చ. 3: తీపుగారేమోవి చూపి తెరవేసుకొనఁగాను
చేపట్టి కాఁగిట నించి జీరదీసేవు
రాపుల శ్రీవేంకటేశ రతుల జంకించితివి
పైపై నింకా నెంత పసలు చూపేవు

రేకు: 1465-6 పూర్వ గౌళ సం: 24-390

పల్లవి: వట్టియనుమానమేల వద్దనున్నాఁ డితడు
చుట్టమైనవాని నెంత సోదించేవే

చ. 1: చెలిమిసేసినవాఁడు చేతిలోనివాఁడు కాఁడా
తలఁపులోపలివాఁడు తగులేకాదా
పిలిచినవాఁడు కడుఁబ్రియములు చూపఁడా
సొలసి యాతనినేల చూచి జరసేవే

చ. 2: యింటికివచ్చినవాఁడు యియ్యకొనిమాటాడఁడా
అంటిముట్టిపెనఁగేవాఁ డాదరించఁడా
చంటిపై గోరొత్తేవాఁడు చనవు లొసఁగఁడా
జంటైనపతితోనేల సాములు సేసేవే

చ. 3: కూరిమిచూపినవాఁడు కూడినవాఁడే కాఁడా
సారెకు నవ్వినాఁ డిఁక సమ్మతే కాదా
యీరతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్ను నేలె
గారవించి యిఁకనేల కతలు సేసేవే

రేకు: 1466-1 సామంతం సం: 24-391

పల్లవి: ఇటువలె నుండవద్దా యేకమైనవలపులు
తటుకన(దరితీపు దైలువారీని

చ. 1: మనసు నమ్మికయైతే మంతనము లింపులౌను
కనుసన్న మెల(గితే కడువేడుకౌను
తనివి గలిగితేను తాలిములు నిలుచును
యెనసినమీపొందులు యేమని మెచ్చేమే

చ. 2: మాట లొడ(బడికైతే మచ్చికలు సమకూరు
కూటము లొద్దికలైతే గుట్టు చెల్లును
పాటించి మొగమోడితే పనులన్నీ(జక్కనౌను
యీటులేని మీగుణాలు యెన్నెనీ చెప్పేమే

చ. 3: నగ నేరుచుకొంటే నాటుకొను(బ్రియములు
తగులాయమైతేను తమి రే(గును
అగపడి శ్రీవేంకటాధిపుఁడు నిను(గూడె
ఇగురు(బోడి మీలీల లేమని నుతింతుమే

రేకు: 1466-2 గౌళ సం: 24-392

పల్లవి: చూడవయ్యా ఇంకా నాపెచొక్కపుఁజక్కఁదనాలు
వేడుకకాండపు తొల్లె వెలయకుండుదువా

చ. 1: మాటలఁ దేనెలు గారీ మక్కువల నోరూరీ
తేటలువారీ నాపెతెలిగఁన్నుల
ఆఁటదానిఁ గంటే నీవు ఆసోదకాడఁవు
పాటించి నీ విది గంటే భ్రమయకుండుదువా

చ. 2: నవ్వుల వెన్నెల గాసీ నంటున వింతలు చూపీ
రవ్వలు సేసీని సింగారపుఁ జేఁతల
జవ్వనమదము సంతసమునకుఁ బుట్టినిల్లు
వువ్విళ్లూర నింత గలితే వోర్వఁగఁగలవా

చ. 3: చెనకులు దుదిముట్టీ సిగ్గులనుఁ బాలకట్టీ
వినయములే తొట్టీ వెస రతుల
యెనసితివి శ్రీవేంకటేశ యీకెను నన్నూ
పెనఁగితి విందువంకఁ బ్రియ మందకుందువా

రేకు:	1466-3 పాడి	సం:	24-393

పల్లవి:	వలపు మొగచాటైనవారికి నిట్టేకాదా
	నెలకొన్న దొరవుగా నీ వేమిసేతువు

చ. 1:	విచ్చలపుజవరాలు నీవద్దనే వుండఁగాను
	మచ్చికతోడనే మాటలాడేవు
	ఇచ్చగించి వీడెము నీకియ్యఁ గాచుకుండఁగాను
	పచ్చిదే నాచన్నులపైఁ జేయివేసేవు

చ. 2:	చనవరినీదేవులు సరసములాడఁగాను
	ననుపున నన్నుఁ జూచి నవ్వు నవ్వేవు
	వినయముతో నాపె విందు నీకుఁ జెప్పఁగాను
	మొనసి నీ విపుడు నామోవి యడిగేవు

చ. 3:	పెండిలాడినాపె నాతోఁ బెనఁగుతా నుండఁగాను
	అండనే నన్నుఁ గూడి ఆదరించేవు
	నిండుకొన్న మచ్చికలు నీపై నారటిల్లఁగాను
	కొండలశ్రీవేంకటేశ కోరి నన్ను మెచ్చేవు

రేకు: 1466-4 దేశాక్షి సం: 24-394

పల్లవి: ఆన తియ్యవయ్యా మాకు నామేలు వినేముగాని
కోమలికిఁ బొంతనాలు గూడెనా నీకు

చ. 1: చలముగొని యాపెను సారెసారెఁ జూచేవు
మలసి నీకుఁ బెండ్లాడ మనసయ్యీనా
చెలరేఁగి యప్పటిని చేయి మీఁదవేసేవు
యెలమితో వారివారు ఇచ్చిరా నీకు

చ. 2: తీపులమోవినిండ తేనియలు జొబ్బిలీవి
ఆపెకు నీకును మాట లందెనా నేఁడు
కాఁపురము సేసేనంటా కాచుకొనివున్నాఁడవు
ఆపాటి చుట్టరికమ లాయనా నీకు

చ. 3: పానుపుపై నాపెచేతఁ బాదా లొత్తించు కొనేవు
అనుకొని బువ్వము పొత్తబ్బెనా మీకు
పూని శ్రీవేంకటేశ్వర పొంచి నన్ను నేలితివి
మేనరికా లిద్దరికి మెరసెనా ఇపుడు

రేకు: 1466-5 సాళంగనాట సం: 24-395

పల్లవి: మీకు మీకు నమరును మిక్కిలివేడుకలెల్లా
కైకొని నేమెల్లాఁ జూడఁగంటిమిగదే

చ. 1: సింగారరాయఁడుగదే చిత్తజిగురుఁడుగదే
అంగవించి నిన్నుఁ బెండ్లాడినవాండు
బంగారుపతిమవు పాలవెల్లికూఁతురవు
అంగన నీవు దేవులవైతివిగదే

చ. 2: కాంచనపుదట్టివాఁడు కౌస్తుభపుమణివాఁడు
మంచితనమున నీకు మగఁడుగదే
మించుసిరులదానవు మేటితమ్మిపైదానవు
యెంచఁగ నితనిపుర మెక్కితివిగదవే

చ. 3: చేతులు నాల్గిటివాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
ఆతుమగా నిన్ను నేలి అలరెఁగదే
యీతల శ్రీకాంతవు యిన్నిటా నేరుపరివి
యీతని కెప్పుడు నీవు యిరవైతివిగదే

రేకు: 1466-6 బౌళి సం: 24-396

పల్లవి: వారివారిసహజాలు వన్నెకెక్కివుండుఁగాని
యీరసానఁ దలంచితే యెక్కువలై తోఁచవు

చ. 1: సతులు పెక్కుమాఁటల జరయుదు రూరకైనా
మతిలో నెగ్గుపట్టఁడు మగవాఁడు
చతురతలు మెరసి జంకింతురు సొలతులు
తతి నెంచఁబోతేను తప్పుగాఁ గైకొనఁడు

చ. 2: జవ్వనులు కాంతాళించి సణంగులు రాలుతురు
రవ్వలుగా నలుగఁడు రమణుఁ డెందు
పువ్వులఁగొని వేతురు బుజముల నొరతురు
నవ్వుతానే వుండుంగాని నలిరేఁగి తిట్టఁడు

చ. 3: జట్టిగొన్నమానినులు సమరతి మీరుదురు
గుట్టు బయట వేయండు గుణవంతుఁడు
గట్టిగా శ్రీవేంకటేశ కడపలో నన్నేలితి-
వెట్టఇనాం దనవిభుఁడే ఇన్నిటాను ఘనుఁడు

రేకు: 1467-1 రామక్రియ సం: 24-397

పల్లవి: తానేల నవ్వులు నవ్వీ దంటలముగామనుచు
పూని కొలువులో మీరఁబోలదనికాక

చ. 1: నేరరా పతితో నాడ నెలంతలు సరసాలు
ఆరయ మందెమేళ మౌననికాక
చేరి చెనకనోపరా చేతులు చాఁచి చాఁచి
సారెకుఁ దమసిగ్గులు జారీననికాక

చ. 2: జూటుఁదనాన పంతాలు చూపఁగనోపరా
ఆఁటదాని కోజలుగావనికాక
సూటిగాఁ గన్నులఁ జూచి సొలయఁగనోపరా
కాటుకవన్నెలకప్పు గప్పీననికాక

చ. 3: నెట్టనఁ దమకములు నెరపఁగనోపరా
గుట్టు బయలయ్యీనంటాం గొంకుటగాక
యిట్టె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చుట్టమై నన్నేలఁగా సోద్యమయ్యీఁగాక

రేకు: 1467-2 ధన్నాసి సం: 24-398

పల్లవి: చిత్తగించరాదా నీవే చెలి యట్లనున్నదో
కొత్తగా నే విన్నవించేగురుతు లేమున్నవి

చ. 1: తరుణీ నీకూటములు దలపోసి తలపోసి
శిరసువంపులతోడఁ జిమ్మిరేఁగెను
వరుస నీకొప్పువీడి వాసనకుఁ గడుఁజొక్కి
నిరతపుఁదమకా నివ్వెరగైవున్నది

చ. 2: నెమ్మదిఁ జిత్తరువులో నీరూపు చూచిచూచి
పమ్మినకోరికలలో పచ్చిదేరెను
తెమ్మలుగా నీసుద్దులు దిక్కులనెల్లా విని
వుమ్మగిలునట్టూర్పులు నుస్సురనీ నిపుడు

చ. 3: మన్నించఁగా నీకాఁగిట మర్మములు సోఁకి సోఁకి
చన్నులపై పులకల జడిసీ నిదె
యిన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిన్ను మెచ్చి పొగడుతా నించుకొనెఁ గళలు

రేకు: 1467-3 దేసాళం సం: 24-399

పల్లవి: తలపించరే చెలు లాతనికి నిది
పలుక నేమున్నది తాఁ బనిగొంటగాక

చ. 1: జిగిమించి విన్నపాలు సేయఁగనేర్తునా
తగ నన్ను మన్నించ తనకే పోదు
చిగురుఁజేతుల దన్నుఁ జెనకనేరుతునా
బిగివాయ కిలఁ దనభారమింతేకాక

చ. 2: సారిదిఁ దనకు నేఁ జుట్టమయేయదానా
దరిచేర్చి బుద్ధిచెప్పఁ దానేకాక
వరుసలఁ దనకు నే వలచేయంతదానా
గరిమతో దానికీర్తి గట్టు కొనేఁ గాక

చ. 3: పానుపుపైనుండి తన్నుఁ బైకొనఁగవచ్చునా
కానిమ్మని తానే నన్నుఁ గలసినాఁడు
అనుక శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
నానావిధాల నాతో నవ్వినాఁడుగాక

రేకు: 1467-4 శంకరాభరణం సం: 24-400

పల్లవి: ఆరుదరుదు నిన్నుఁ బెండ్లాడినవారిభాగ్యము
సిరులనీమహిమలు చెప్పఁ గొత్తలు

చ. 1: ముప్పిరిగొనఁ గని మోవి చూచితే
దప్పులుదేరు నందరు తరుణులకు
కప్పిన నీమేనితావిగాలి విసరితే
అప్పుడే విరహపుటలయిక మానును

చ. 2: మనసారా నీతోను మాటలాడితే
ఘనముగా నెమ్మోములఁ గళలెక్కును
చనవిచ్చి నీవు మాసంగడిఁ గూచుండితే
తనివిఁబొందు గక్కనఁ దనువులెల్లాలను

చ. 3: చేతనంటి నీమేనిసేవ సేసితే
కాతరపుఁ గోరికలు కడుఫలించు
యీతల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నీతితో నన్నేలితివి నిండు నీఁక కీర్తులు

రేకు: 1467-5 సామంతం సం: 24-401

పల్లవి: ఊరకేల సిగ్గువడే వుపాయాలు నేఁ జెప్పితే
ఆరీతి నీవిన్నపము లన్నీఁ జేసుకొనవే

చ. 1: జలజాక్షి నీపిత మజ్జనమింట నున్నావాఁడు
జలక మందియ్యవే సంతోసానను
చెలువుఁడు మైమర్ధన చేయుమనునో యేమో
తలగడయుం జాపాఁ జేత యామఱకువే

చ. 2: శిరసారుచుకో నందే చిత్తగించునో యేమో
విరులివె కొంపోవే విడెము గోవే
గరిమ నలసితేను కడుఁజెమరించునేమో
సురటి గందవొడీ నించు కేమరకువే

చ. 3: రతికిఁ బిల్చునో యేమో రాననరాదు నీకు
తతి వింతలోఁ బిల్చి తా నిన్నుఁ గూడె
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చతురుఁడు నన్నూ నేలె సవతుల మౌదుమే

రేకు: 1467-6 వరాళి సం: 24-402

పల్లవి: ఆపెకు నీకుఁ దెలుసు నవి యెట్టివేడుకలో
పైపై సవతులము పచారించఁగలమా

చ. 1: వింతగా నీమోము చూచి వెలంది నీతో నవ్వె
ఇంతలోనే గురుతులు యేమిగనెనో
సంతోసముతోడ నీసంగడి నిలుచున్నది
అంతరంగపుమాట యెట్టాసతి ఇచ్చితివో

చ. 2: సముకాన నప్పటిని సన్న సేసి నిను మెచ్చె
తమకాన నీమేనేడ తన్ను సోఁకెనో
చెమటలు గారఁగాను చేతులెత్తి నీకు మొక్కీ
ప్రమదాన నెటువంటిపనులు సేసితివో

చ. 3: కందువ నలమేల్మంగ కాంగిలించుకొనె నిన్ను
చెంది నీమన్నన నెట్టు చేకొనెనో
యిందరి మమ్ము శ్రీవేంకటేశ యేలుకొంటివి
పొంది నీదేవుల కెట్టు పొసంగఁ జెప్పితివో

రేకు: 1468-1 సాళంగం సం: 24-403

పల్లవి: కంటిమయ్యా నీచేఁతలు కన్నులతుదల నేఁడు
నంటున లేదంటానే ఆనలు వెట్టుకోనేవు

చ. 1: పైపై నీవెక్కడనో పరాకై వుండితేను
ఆపె నీ మొగము చూచీ నంతలోనను
దాపుగా నప్పటి నీవు తనదిక్కు చూచితేను
రాపుగా సిగ్గుతోడ శిరసు వంచుకొనీని

చ. 2: వొద్ది మలగుపైవి వొరఁగి నిద్రించితేను
అద్దుకొనీఁ జన్నుల నీయందపుఁజేయి
నిద్దిరించే దానివలె నెమ్మిఁ గన్నులు మూసితే
తిద్దే వాపెహారమును తేటతెల్లమిగను

చ. 3: నన్నుఁ గాఁగిలించుకొని నాతో నీవు మాటాడంగా
సన్నల మోవి చూపీని సారెకు నాపె
ఇన్నిటా శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిన్న కాపెకతలకు మింగకు గుక్కిళ్ళు

రేకు: 1468-2 శుద్ధవసంతం సం: 24-404

పల్లవి: చెల్లు నీ వందుకు నింత సేయవలదా
కల్లగాదు నీవల్లనే కంటిమి యీనేరుపు

చ. 1: చెక్కు నొక్కి నీవద్ది చెలియకు నింతలోనే
పుక్కిటి తమ్ములమిడి బుజ్జగించేవు
ఇక్కువ నెవ్వతనైనా ఇంటికి రమ్మంటివో
వొక్కమాటే యీపె నింత వొడఁబరచేవు

చ. 2: దొడ్డసొమ్ములెల్లాఁ బెట్టి తొడిఁబడ నప్పటికి
వెడ్డువెట్టి సారెసారె వేఁడుకొనేవు
అడ్డమై వేరొకతె నిన్నాసలఁ బెట్టినదో
వొడ్డుకొనకుండా వింత వొడఁబరచేవు

చ. 3: సన్నలు నాకుఁ జేసి సరి నిట్టె యీకెఁ గూడి
మిన్నక యెంతేసినమ్మిక లిచ్చేవు
ఇన్నిటా శ్రీవేంకటేశ యే నలుమేలుమంగను
వున్నతిఁ జనవులిచ్చి వొడఁబరచేవు

రేకు: 1468-3 ముఖారి సం: 24-405

పల్లవి: ఎంతగబ్బి ఇదియని యేల తిట్టేవు
మంతనాన నీ కది మంచిదేకాదా

చ. 1: చనవు లొసఁగితేను జవ్వనులు మానుదురా
గొనకొని రమణునిఁ గొసరక
తనువులు సోఁకితేను తమకించకుండుదురా
పెనఁగులాడుతాను ప్రియములు చూపరా

చ. 2: సేసవెట్టి పెండ్లాడితే సిగ్గుతోనే వుందురా
వాసులువంతులుఁ జూపి వలపించక
ఆస నీవు గొలిపితే అట్టె పైకొనకుందురా
రాసికెక్క పచారించి రవ్వసేయక

చ. 3: మరిగించి కూడితేను మట్టుతో నుండుదురా
సరసములాడి మోవి చవిచూపక
ఇరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సిరులఁ గూడితి వాపెచెల్లె లూరకుండునా

రేకు: 1468-4 ఆహిరి సం: 24-406

పల్లవి: పదారువేలు సతులపతివి నీవు
సుదతి వెంగెమాడదుసుమ్మీ యీపట్టుకు

చ. 1: మొక్కిమొక్కి చెలియ నీముందరనే వుండఁగాను
తక్కక సిగ్గుతోనేల తలవంచేవు
నిక్కి వెరొకతెవద్ద నీ వుండఁగాఁ గనెనో
ఇక్కడ నీ వందుకుఁగా నేఁటికి లోఁగేవు

చ. 2: వేడుకతో నాపె నిన్ను వేమారు నుతించంగాను
యీాడ ముసుఁగువెట్టుక యెంత నవ్వేవు
పాడితో నీ వెవ్వతెకు బాస లియ్యఁగా వినెనో
తోడనే నీవప్పటి నిందులకేల కొంకేవు

చ. 3: నెమ్మది నలమేల్ మంగ నిన్నుఁ గాఁగిలించఁగాను
అమ్మరో నీవెంతేసిప్రియాలు చెప్పేవు
కమ్మి శ్రీవేంకటేశ నీకత లీపె దెలిసెనో
సమ్మతించె నిందుకుఁగా చంద మెంతసేసేవు

రేకు: 1468-5 సామవరాళి సం: 24-407

పల్లవి: నేమేమి నెఱఁగము నిజమని వుండుదుము
నీమహిమలెల్లాను నీకే తెలుసును

చ. 1: తగవులు చెప్పేవు తరుణులకును మాకు
నగవులు నవ్వేవు నయగారాల
మొగములు చూచేవు మూఁకమీఁదనెల్లాను
యెగసక్కెపునీమోహ మెవ్వతెపై నున్నదో

చ. 2: అసలెల్లాఁ బెట్టేవు అండఁ గూచుండుమనేవు
వేసార కందరికిని విడేలిచ్చేవు
సేసలు పైఁ జల్లేవు చేతులు సారెఁ జాంచేవు
వాసిగా నెవ్వరిమీఁద వలపు నీకున్నదో

చ. 3: పాదాలు పైఁ జాంచేవు బాగుగ నొత్తుమనేవు
కైదండలు పట్టుకొని కాఁగిలించేవు
యీదెస శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
పోదితో నన్నేలితివి పొందు లిఁకెందున్నవో

రేకు: 1468-6 హిజ్జిజి సం: 24-408

పల్లవి: నే మెంత విన్నవించినా నువ మామాది వినేవా
ఆముకొని మమ్ము సుద్దులడిగేవు నీవు

చ. 1: యేకటాన నుండి యాపె యేమనిచెప్పెనో బుద్ది
ఆకుమడిచి ఇచ్చి యేమని నేర్పెనో
ఆకడ బోనము వెట్టుడప్పు డేమి బోదించేనో
మాకుఁ దెలియదు నీమతకములెల్లాను

చ. 2: సింగారపుం దోటలోన చేరి యేబాస గొనెనో
సంగతి గొల్చులో నెట్టు జట్టిగొనెనో
యెంగిలిపొత్తువేళల నేమని భ్రమఇంచెనో
చెంగ నెఱఁగము నీచిత్తములోపనులు

చ. 3: నెలకొన్నరతివేళ విన్నెంత నలపించెనో
అలమేల్ మంగ శ్రీవేంకటాధీశుఁడా
తలఁచుక వచ్చి నేందు తగ మమ్ము నేలితివి
మలసి తోచఁదాయ నీమర్మము లెవ్వరికి

రేకు: 1469-1 వరాళి సం: 24-409

పల్లవి: ఎట్టుసేసిన నీచేఁత కెప్పుడు లోనే నేము
బట్టబయలీందనేల భాగ్యము నీచేతిది

చ. 1: చెలువుఁడవు నీ వేమి చెప్పిన వినేముగాక
చలమరితనమేల సాదించనేల
వలచినవారము వద్దనే వుండేముగాక
అలిగి పండుండనేల అవుఁగాదననేల

చ. 2: యేలినవాఁడవు నీయిచ్చ మెలంగేముగాక
జోలిమాట లాడనేల సొలయనేల
నీలోని వారము నిండుకవుండేముగాక
జాలి నీకు రేఁచనేల జంకించనేల

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడవు చేకొని మొక్కేముగాక
పూవుల వేయఁగనేల పొనుంగనేల
యీవేళ నలమేల్ మంగ నిటు నీకాఁగిటిదాన
వేవేలుగాఁ గూడితివి వేసరించనేల

రేకు: 1469-2 మాళవి గౌళ సం: 24-410

పల్లవి: మాకు నిట్టె తోఁచీ నీమర్మము నేండు
కాకు సేయరా దీసుద్ది గలిగినట్టున్నది

చ. 1: చెప్పుదునా వోయి నీచిత్తములోపలి మాఁట
కప్పి సిగ్గులువడవుగదా నీవు
చొప్పులెత్తి నీమొగము చూచితేనే కానవచ్చు
ముప్పిరి నాపెకు నీవు మోహించినట్టున్నది

చ. 2: వుపమింతునా వోయి వొడలినీవుద్యోగాలు
కపటముతో నవ్వవుగదా నీవు
నెపములే కందు నీవు నలిచితేనే తెలుసు
యిపుడే నీ కాపెకుఁ బొందెనసినట్టున్నది

చ. 3: యేరుపరతునా వోయి ఇరవైననీగుణాలు
గారవముతో మెచ్చవుగదా నీవు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
చేరి నన్నేలితి వాకెఁ జేకొనినట్లున్నది

రేకు: 1469-3 పాడి సం: 24-411

పల్లవి: అటువంటివాఁడా యాతఁ డౌనే నీవు
కుటిలమేలే యెదిరిగుణము లెరంగవు

చ. 1: తేనెగారేమాటలాడి తీపులెల్లాఁ బుట్టించి
నానఁబెట్టేవు వలపు నాపతితోను
మేనెల్లఁ జెమరించెను మెరసి యీతని కిట్టె
మానవుగా ఇటువంటి మాయలాఁడి మాటలు

చ. 2: నిద్దరించేవాని లేపి నేరుపులెల్లాం జూపి
బుద్దులు చెప్పేవు నావిభునికి నీవు
కొద్దిమీర నాస మీరె కూరిమి నీతని కిట్టె
వద్దే వుద్దండాల వట్టిజోలికత్తేవు

చ. 3: పసలుగా మొక్కు మొక్కి పాదాలు గుద్దేనంటా
వెసఁ గాంగిలించేవు శ్రీవేంకటేశ్వరు
యెసగ నలమేల్ మంగ నేను నాకుగఁ డితఁడు
కొసరకువే యెంత కోడేజవరాలపు

రేకు: 1469-4 సామంతం సం: 24-412

పల్లవి: కంటిమి మీవేడుకలు కన్నులతుదల నేము
వింటి మిన్నాళ్లు సుద్దులే వీనులపండుగలు

చ. 1: సిగ్గువడివుండఁగాను చెలిచేఇ వట్టి తీసి
యెగ్గులేక తొడమీఁద నిడుకొంటివి
అగ్గమై యంతటఁబోక ఆపెఇంటికే వచ్చి
కగ్గులే కాపెవాకిలిఁ గాచుకవున్నాఁడవు

చ. 2: తలవంచుకుండఁగాను తక్కక నెమ్మొగమెత్తి
వెలయ మూపుపైఁ జేయి వేసితివి
చలువగా వప్పటిని చన్నులపై నీవొరిగి
మెలుపున నాపెతోనే మేలము లాడేవు

చ. 3: గుట్టుతోడ నుండఁగాను కొంత కలమేల్ మంగను
నెట్టనఁ గాఁగిటఁ గూడి నించితి కృప
అట్టె శ్రీవేంకటేశ ఆపెకే నీవు మఱి
చుట్టమవై మమ్మునేలి చొక్కులఁబెట్టేవు

రేకు: 1469-5 సౌరాష్ట్రం సం: 24-413

పల్లవి: పట్టకువయ్యా మాకొంగు బలిమిసేసి
గుట్టుతో వారముగాక కొసరేటివారమా

చ. 1: నిమ్మకాయలంతేసి నిక్కుఁజన్నులవారము
అమ్మరో నీతో మాటలాడఁగలమా
చిమ్ములసిగ్గులలోనే చిందువందయ్యేవారము
పమ్ముచు నీతో నంతేసిపంతములవారమా

చ. 2: మెల్లనే పిడికెఁడంతమించు నడిమివారము
చెల్లఁబో నీతో పొందుసేయఁగలమా
చల్లువలపులచేత జాజరకాడే వారము
వుల్లము గరఁగ నిన్ను నొరసేటివారమా

చ. 3: పుటపుట మొలచేటి పూఁపవయసు వారము
కటకటా రతి నిన్నాఁగఁ గఁ గలమా
ఇటు శ్రీవేంకటేశ్వర యే నలమేలుమంగను
తటుకనఁ గూడితివి తప్పేలెంచేవారమా

రేకు: 1469-6 దేసాళం సం: 24-414

పల్లవి: మాకుఁ జూడ నిదిమేలు మనసు నీ కెట్టున్నదో
చేకొని నీకు నితవు చెప్పితిమి నేము

చ. 1: వనితపయ్యదలోని వట్రువచన్నుగుబ్బలు
కనుఁగొంటివా వోయి గక్కున నీవు
పెనఁగి నీవురమునఁ బెట్టుకొంటేఁ గనక
చెనకేరతుల నీవు చేసిన భాగ్యము

చ. 2: తెలివైనమోము లోని తేనెగా రేయాకెమోవి
తలఁచుకొంటివో లేదో తగిలి నీవు
నెలకొన నీనోరిలో వించుకొంటేఁగనక
తలకొని నీవు సేయుతపము లీడేరును

చ. 3: మెచ్చులనలమేల్ మంగమేనిమీఁదివాసనలు
యిచ్చల శ్రీవేంకటేశ యెఱుఁగుదువా
పచ్చిగా నీమేన నిండాఁ బట్టించుకొంటేఁ గనక
అచ్చుగాఁ గూడితి నీకు నమరె వలపులు

రేకు: 1470-1 మాళవిగౌళ సం: 24-415

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిట్టె నీసతి భావము
కామించినచందమో కడఁగుసింగారమో

చ. 1: చెలియ నీమోము చూచి చెక్కులఁ జెమట చిందె
వలపులో అదియ జవ్వనమదమో
నిలువున నంతలోనె నిట్టూర్పు నిగిడించె
కలసేటివేడుకలో కందువతమకమో

చ. 2: కాంత నీవద్దనుండి కళలతోఁదైవారె
చింతావిరహమో చిందెడుప్రేమో
మంతనపుమాటలాడి మఱి చిరునవ్వు నవ్వె
చెంత నీ పై ఆసలో సిగ్గులమొలకలో

చ. 3: అలమేలుమంగ నిన్ను నపుడే కాఁగిట నించె
తలకొన్నకోరికో తగులాయమో
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నిన్ను నెనసె
తలఁపులముచ్చటో తనమనోరథమో

రేకు: 1470-2 ఆహిరి సం: 24-416

పల్లవి: ఇంక నీచిత్తము యెట్లనైనఁ గావుము
పొంకమాయ నాకు నీకు పొందులెల్లఁ దొలుతనె

చ. 1: తలఁపు నీ వెరుఁగుదువు తగవు నీకుఁ దెలుసును
మలసి విన్నవించనేల మాఁటిమాఁటికి
బలిమిసేయనేఁటికి పరాకు నీకు లేదు
నిలిచి యేడనుండినా నీవారమే

చ. 2: వింటి నీగుణములు వెలసె నీచరితలు
జంట నాకు నీవు గలవు జరయవలవదు
అంటె నీమోహము ఆదియు నీప్రభావము
ఇంట నెపుడు నున్నాండ విదియ మాకులాభము

చ. 3: చనవు లిప్పు డొసఁగితివి సరసమునఁ జెనకితివి
పెనఁగఁదగదు నీవు నాకుఁ బ్రియుఁడవౌదువు
వినుమ అలమేల్ మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తనివి రతుల మమ్ము నింత తగులుసేసుకొంటివి

రేకు: 1470-3 పాడి సం: 24-417

పల్లవి: ఏమని యానతిచ్చేవో ఇందుకు నీవు
వేమరుఁ జెలికత్తెలు విచ్చిచెప్పరాదు

చ. 1: కాంత నీవుం గూడుండఁగా కమ్మటి నొక్కతె రాఁగా
చెంతనే దాఁచుకొంటివి చెరఁగుఁ గప్పి
వింతగా నాకెకొంగు వేరొకవన్నెది సంది-
నంతలోఁ జూచి సందేహము నిన్నడిగె

చ. 2: వీడె మాకె ఇచ్చేవేళ వేరొకచెలి రాఁగాను
వోడక మలఁగుదండ నుంచుకొంటివి
తోడనె యాకెనీడ గోడపై నుండఁగాఁ గని
జోడు గంటి మేడదని సొలసి నిన్నడిగె

చ. 3: కమ్మిపీ ణాపె వాఇంచంగా కిమ్ముల సతి రాంగా
సొమ్ములలోఁ బెట్టి యీకె నెమ్మిం గూడితి
పమ్మినయలమేల్ మంగపతివి శ్రీవేంకటేశ
ఇమ్ముల నాకెఁ గని యేమౌనని యడిగె

రేకు: 1470-4 గౌళ సం: 24-418

పల్లవి: చుట్టరికమైనచోట సూడువట్టనేఁటికి
గట్టియాయఁ బనులెల్లా కానిమ్మనవయ్యా

చ. 1: చెక్కునొక్కి యాపె నిన్నుఁ జేరి వేఁడుకొనఁగాను
నిక్కనినవ్వుతోనేల సిగ్గువడేవు
వుక్కుమీరి యావేళ నిన్నొరసెనో కొనగోరు
ఇక్కడ నందుకేమియు నెంచవద్దు రావయ్య

చ. 2: కోరి ప్రియమెల్లాం జెప్పి కొంగువట్టి పెనఁగఁగా
తేరకొననేల యాకె దిక్కుచూచేవు
అరీతులఁ దొక్కుతొక్కులాడఁగాఁ గాలు దాఁకెనో
సారె నందుకేమి దోసముగాదు రావయ్య

చ. 3: అలమేలుమంగ నిన్ను నటు గాఁగిలించఁగాను
తలవంచుకొని లోలోఁ దమకించేవు
యెలమి శ్రీవేంకటేశ యిక్కువ లెంతసోఁకెనో
కలసితి రిఁకేమిఁ గొంకఁగవద్దు రావయ్య

రేకు: 1470-5 సాళంగం సం: 24-419

పల్లవి: ఎవ్వరెంత పెనగినా నేమాయను
నవ్వుతా నుండే నేను నావాఁడే అతఁడు

చ. 1: ననుపుగలుగువారు నాయకునితోడుత
మనవులు చెప్పితేను మానుపరాదు
కనుఁగొంటా నుండుదము కాంతలసరితలెల్లా
నను మన్నించు నాతఁడు నావాఁడే యెపుడు

చ. 2: కొలువేసేసేవారు కోరి సేవలుసేసి
వలపులు చల్లితేను వద్దనరాదు
తెలుతము తమతమతెరఁగులెల్లా నేఁడు
నలి నన్ను మన్నించె నావాఁడే యతఁడు

చ. 3: యేతులఁ బెండ్లాడిన వా రెంతసరసాలాడినా
కాతరించి పెనఁగినాఁ గాదనరాదు
యీతల శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
నాతగులై నన్నుఁ గూడె నావాఁడే యతడు

రేకు: 1470-6 ఆహిరి సం: 24-420

పల్లవి: విన్నపమిదె నీకు వినుము వద్దు పరాకు
ఇన్నిటా నీకు మేలు యిట్టె చెలి నేలు

చ. 1: వేడుకకు వెలలేదు వెలఁదికి నీకుఁ బోదు
వాడికైనవల పింక వసముగాదు
యీడువచ్చు నిద్దరికి నింపులు మాయిందరికి
జోడుగూడు విచ్చేయు మాసుదతినగరికి

చ. 2: యెప్పుడుఁ గలదు పొందు యీకెమోవి నీకువిందు
కుప్పలుగా నిన్ను వేఁడుకొన్నదే సందు
చెప్పనేఁటికి యలపు చిత్త మీకెపైం గొలుపు
నెప్పునఁ గాఁగిటఁ గూడీ నీకరుణ నిలుపు

చ. 3: అలమేల్మంగదేవులు అన్నిటాఁగూడేవావులు
నెలకొనెఁ గన్నులను నిండుఁగావులు
నిలిచి శ్రీవేంకటేశ నీరతులే ఇంతసేసె
వెలలేని నవ్వుల వెన్నెలలు గాసె

రేకు: 1471-1 వరాళి సం: 24-421

పల్లవి: కూచుండఁబెట్టుకోరాదా కొమ్మను తొడమీఁదట
యీచాయనేల లోఁగేవు యెవ్వరు వద్దనేరు

చ. 1: చెక్కులఁ జెమటగార చెలి నిన్నుఁ గొల్చి వచ్చె
జక్కువలఁ బోలేటిచన్ను లదర
అక్కర యెంతో నీకు నప్పటనుండీ నాపె-
దిక్కు చూచి సంతోసానఁ దెప్పలఁ దేలేవు

చ. 2: క్రుమ్ముడి జారఁగ నింతి కోరి కైదండ నీకిచ్చె
తమ్మిమోమున నిండాను దప్పులుదేరె
కమ్మి నీకరుణ యెంతో కరఁగి ఇందులకుఁగా
సమ్మతిగాఁ జనవిచ్చి సారె బుజ్జగించేవు

చ. 3: మతిచొక్క నలమేలుమంగ నీకుఁ బాదాలొత్తె
సతముగాఁ బులకలు జాజుకొనను
తతిఁ గూడితి వీకెను దాకొని శ్రీవేంకటేశ
ఇతవుగా మెచ్చి మెచ్చి ఇంపులుచల్లేవు

రేకు: 1471-2 ముఖారి సం: 24-422

పల్లవి: కాదనేమా నీ వాపెఁ గాఁగిలించుకొనఁగాను
యీదెస మమ్మింత భ్రమఇంచకువయ్యా

చ. 1: అట్టె ఆపెకుఁ జుట్టమవైతే నౌదుగాక మమ్ము
వట్టిపరాకులు సేయవలదయ్యా
చుట్టి మాటలాడ సందుచూచుకొంటేఁ గొందుగాక
దిట్టవై విడెము మమ్ముఁ దేనంపకువయ్యా

చ. 2: చొప్పుగా నీవాపెదిక్కు చూచితే చూతువుగాక
కప్పురము మాకన్నుల గుప్పకువయ్యా
చిప్పిల బొంద ననుపుసేసుకొంటేఁ గొందువుగాక
విప్పుచుఁ బచ్చడము పైఁగప్పకువయ్యా

చ. 3: పిలిచి యాపెకు సొమ్ము పెట్టితేఁ బెట్టుదుగాక
వెలచెప్పి పందేలు వేయకువయ్యా
చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడవు
ఇల మమ్ము నేలితి వెంతవాఁడవయ్యా

రేకు: 1471-3 పాడి సం: 24-423

పల్లవి: కలికివి నీవెరఁగనితగవు లున్నవా
చెలులము నే మింత చెప్పిచూపవలెనా

చ. 1: వాడికగా రమణుఁడు వలపులు చల్లితేను
యీడనే సిగ్గున శిరసేల వంచేవే
వేడుకతో చందురుఁడు వెన్నెలలు గాసితేను
జోడుగాఁ గలువలు మెచ్చుగ వికసించవా

చ. 2: మంతనాన నాతఁడు మాటలు నిన్నాడించితే
పంతముతో మోనములు పచరింతురా
వంతలేక వనముల వసంతుఁడు పైకొంటే
బంతినే కోవిలలునుఁ బలుకఁగవలదా

చ. 3: సారె శ్రీవేంకటేశుఁ డిచ్చటఁ గాఁగిలించితేను
కూరిమి నలమేల్ మంగ కూడితి వౌనే
మేరతోడఁ గొండమీఁద మేఘము వాలితేను
చేరిచేరి మయూరాలు చెంగలించి ఆడుఁగా

రేకు: 1471-4 దేసాళం సం: 24-424

పల్లవి: ఎక్కడ పరాకో నీకు నెఱఁగము
యిక్కువఁ గొలువుసేసే మిదివో నేము

చ. 1: పట్టెమంచము మీఁదటఁ బవ్వళించి నీ వుండఁగ
అట్టె పాదాలొత్తి నాకె అండఁగూచుండి
చిట్టంటుసేఁతల నీకు సేవసేసేరు గొందరు
ముట్టి సారెసారె నీకు మొక్కేము నేము

చ. 2: చేతి మీఁద నీవిట్టె శిరసు వెట్టుకుండఁగా
యీతలను తొడచాఁచె నీకె నొకతె
కాతరాన వేళ్లఁ జిటుకలుదీసేరు గొందరు
జాతిగా నీమేను చూచి సంతోసించేము నేము

చ. 3: పన్ని యలమేలుమంగ పైపై సన్నలుసేయఁగా
వున్నది శ్రీవేంకటేశ వురముమీఁద
వన్నెలతో నిరుమేలా వలపించేరు గొందరు
మన్నించి మమ్మేలితివి మలసేము నేము

రేకు: 1471-5 కాంబోది సం: 24-425

పల్లవి: ఏమిసేతు నావలపే యింతసేసె నన్నును
కాముకులైనవారికత లిటువంటివి

చ. 1: చక్కనినీమోము చూచె సందడిపరాకున
మక్కువతో నీకు మొక్కమఱచితిని
వెక్కసపునీకతలు వినేపరాకున
చిక్కనిప్రియము నీకుఁ జెప్పమఱచితిని

చ. 2: సారెసారె నీతో సరసములాడేపరాకున
చేరి కానుకియ్య మఱచితి నపుడు
మేరలేక నీతోనవ్వే మిక్కిలి పరాకున
పేరుకొని మాయింటికిఁ బిలువమఱచితి

చ. 3: కొలువు నీకుఁ జేసేటికూరిమిపరాకున
మలసి నిన్నుఁ జెనకమఱచితి
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ
తెలిపి నన్నేలితే నుతించమఱచితివి

రేకు: 1471-6 మంగళకౌసిక సం: 24-426

పల్లవి: అపుడైనా నాపెచెప్పినట్టెల్లాఁ జేయవద్దా
నెపమున నన్నుఁ జూచి నీవు సిగ్గువడేవు

చ. 1: వలపులు చల్లిచల్లి వాడికగా నిన్నింటికి
పిలువఁగ వచ్చెఁగా ప్రియురాలు
వొలిసీనొల్లమితో నీ వూరకే వుండితేను
తెలిపి నీవొడివట్టి తీసెఁగా నిన్నును

చ. 2: దయవుట్టఁజెప్పి నీతోఁ దమయింటఁ బెండ్లియని
ప్రియమున నక్షంతలు పెట్టెంగా నీకు
క్రియ యెఱఁగియు నీవు కిమ్మలం బరాకైతే
నయమున మొక్కి నంటునను వేఁడుకొనెఁగా

చ. 3: పెనఁగి నిన్నందలానఁ బెట్టి ఇంటి కిట్టె తెచ్చి
చనవునఁ గూడెఁగా సారెసారెకు
యెనసి యలమేల్ మంగ కిరవై శ్రీవేంకటేశ
నను నేలితివి యాకె ననిచెఁగా నీకు

రేకు: 1472-1 నాదరామక్రియ సం: 24-427

పల్లవి: ఆసపడ్డవారి నింత అలయింతురా
దోసము రాకుండాను కందువ నుండవోయి

చ. 1: వన్నెలెల్లాఁ బెట్టుకొని వద్దనే కొలువసేయు -
చున్నది యీపెఁ జూడవోయి నీవు
సన్నలెల్లాఁ జేయుచును సారెకు నేఁకరీ నీకు
మన్నించి వట్టిపరాకు మానవోయి

చ. 2: వేడుకతో నీవద్ద విసుపులేక సారెకు
వూడిగాలు సేసీఁ జూడవోయి నీవు
నీడవలెఁ బాయక నీకె తపము సేసీని
జాడతోఁ జిత్తానఁబెట్టి చనవియ్యవోయి

చ. 3: అంటిముట్టి సరసములాడీ సారె నీతో
వొంటి యీపెఁ గాఁగిలించవోయి నీవు
ఇంటనే శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
జంట నేలితి వాకెతో సరినవ్వవోయి

రేకు: 1472-2 బౌళి సం: 24-428

పల్లవి: పంతమునఁ గసరితేఁ బతికి సేవయగును
వింతసేనుకొనరాడు వివేకపుసతికి

చ. 1: సోలి సవతులు యెన్ని సొలసి మాటాడినా
తాలిమే వలెను వుత్తమురాలికి
యేలాటా మాడి మగని కెంతయెమ్మెలు చూపినా
వాలాయించి సంతోసించవలె నేరుపరికి

చ. 2: తవిలి తనపాటికి తరుణులు వెనఁగితే
చవిచేసుకొనవలె జాణకత్తెను
రవళి దాఁ జూడఁగానే రమణునితో నవ్వితే -
నవల దా గూడి నవ్వనగు నయగారికి

చ. 3: పొరుగువా రతనికి బొంచి సన్నలుసేసితే
పరాకు సేయగఁదగు బాగరికిని
ధర నలమేల్ మంగ వాతడు శ్రీవేంకటేశుఁడు
వరుసఁ గూడి తిట్టుండవలెఁ జతురికకు

రేకు: 1472-3 ముఖారి సం: 24-429

పల్లవి: అంతేసి దొరతనాలయాకె యీపె
కొంతపుఁజూపులఁ జట్టిగొనినాకె యీపె

చ. 1: మట్టుమీరి లేకలంపి మాటమాత్రముననే
అట్టె యింటికి రప్పించినాకె యీపె
చుట్టమవలెను నీసొమ్ములెల్లాఁ దనమెడఁ
బెట్టుకొని నిన్ను మెప్పించినయాకె యీపె

చ. 2: చెంగటనే సేయరానిచేత సేసి నీవలపు-
లంగడిఁబెట్టినయట్టియాకె యీపె
కొంగువట్టి నీతోను కూరిములు గొసరుచు
అంగవించి చన్నులొత్తినాకె యీపె

చ. 3: సెలవుల నవ్వునవ్వి చెక్కులు నొక్కుచు నిన్ను-
నలుకలుదీర్చినయాకె యీపె
అలమేలుమంగను నేననఁగా శ్రీవేంకటేశ
కలసితి విదే నాసంగడియాకె యీపె

రేకు: 1472-4 శ్రీరాగం సం: 24-430

పల్లవి: నీవే నన్ను నిట్టె మన్నించేవు గాక
భావించి నీతో నింత పదరఁగనేఁటికి

చ. 1: కన్నులఁజూచిననీవు కరుణించనేరవా
విన్నప మేమిసేసేము వేగినంతాను
సన్నఁగొలిపించుకొని చనవియ్యనేరవా
ఇన్నిటా నిన్నుఁ గొసరి యెచ్చరించనేఁటికి

చ. 2: మాట లాడినవాఁడవు మరుగఁగనేరవా
చీటికి మాటికి నిన్నుఁ జెనకనేల
యీటునఁ బాదాలు చాఁచి యెనయఁగనేరవా
చోటిమ్మని యప్పటిని సొలయనేమిటికి

చ. 3: నవ్వినవాఁడవు నాతో నంటుసేయనేరవా
రవ్వసేసి నీమతి కరఁచనేఁటికి
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పువ్విళ్లూరఁ గూడితివి వొరయఁగనేఁటికి

రేకు: 1472-5 శంకరాభరణం సం: 24-431

పల్లవి: చెప్పఁగబుద్ది నీకుఁ జెప్పితి మిదె
యెప్పుడూ మావల్ల దొసమేమి లేదుసుమ్మీ

చ. 1: పక్కునఁ జెలిచన్నులపైఁ గేలు చాఁచేవు
యెక్కుడుగొండలవంటి వింత కోపేవా
జక్కవలవంటివి చన్నులు నావియైతేను
చొక్కముగ నీయనువు చూచుకొనరాదా

చ. 2: యేనిగెతొండాలఁబోలే ఇంతి తొడలమీఁదట
ఆనించేవు నీపాదము లంతకోపేవా
పూని యనఁటికంబాలపోలికే నాతొడలైతే
దీనివల్ల నీయనువుఁ దెలుసుకోరాదా

చ. 3: అడరుచు నద్దపుమోమాపెను మోవిమ్మనేవు
తడవి శ్రీవేంకటేశ దానికోపేవా
బడి నలమేల్మంగను పద్మము నామొకమైతే
కడఁగి నన్నేలితివి కనుకోరాదా

రేకు: 1472-6 వరాళి సం: 24-432

పల్లవి: నెమ్మది నీవోజలు నే నెఱఁగనా
అమ్మరో నే నిన్ను సుద్దు లడిగితినా

చ. 1: వింటిని మాటలు సారె వేఁడుకొనే వెంత నన్ను
యింటికి విచ్చేతుగాక యీడనేఁటికి
అంటే ననరాదుగాక ఆనలేల పెట్టేవు
నంటున నీవినయాలు నమ్మనంటినా

చ. 2: వోడక నాకొంగువట్టి వొడఁబరచే విప్పుడు
యేడలేని రసము లీడనేఁటికి
వీడెమిచ్చేయప్పుడే వేడుకలయ్యీఁగాక
తోడనే కాఁగిలించే విందుల కెగ్గుపట్టేనా

చ. 3: గుట్టున నన్నేలితివి కోరి బత్తిగలనని
యిట్టె సాకిరి దెలిపే వీడ నేఁటికి
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టరికపుమనసు సోదించవచ్చితినా

రేకు: 1473-1 రామక్రియ సం: 24-433

పల్లవి: ఇది యెంతగర్వియని యెంచేవుగనక నీవు
మది నింతయును నీమన్ననేసుమ్మీ

చ. 1: ఆఁటదానఁగనక నిన్నటు సొలయుదుఁగాక
గాఁటాన నే నుండేది నీకరుణేకాదా
వీటిలో చవులుపుట్ట వెంగెములాడుదుఁగాక
నీటున నే మెలఁగేది నీలాలనేకాదా

చ. 2: జవ్వనిఁగనక నిన్ను సాదించి జంకింతుఁగాక
చివ్వన నావలపు నీచేతిదే కాదా
నవ్వుతా నీకిచ్చకమునకుఁ బెనఁగుదుఁగాక
రవ్వల నానేరుపు నీరచనేకాదా

చ. 3: అలమేల్ మంగఁగనక ఆసకొలుపుదుఁగాక
కలుగునాపంతము నీఘనతేకాదా
వెలయ శ్రీవేంకటేశ వినోదము సేతుఁగాక
నలిగెతో నారతి నీ సమ్మతేకాదా

రేకు: 1473-2 శ్రీరాగం సం: 24-434

పల్లవి: ఇట్టుండవలదా మోహ మెంచిచూచితే
అట్టె చెలులు చూచి అచ్చెరువందేరు

చ. 1: చెంగలించు నీమోము చెలిఁ గనుగొంటేనే
చెంగటఁ జేరితే కళ చిమ్మిరేఁగు
అంగమెల్లఁ బులకించు ఆకెమాటలు వింటేను
యింగిత మెరిఁగితిమి యెంత మేలువాఁడవో

చ. 2: పడదేరుదువు నీవు పనితఁ బేరుకొంటేను
అడియాలములు చూచి హరుషింతువు
తడబడుఁ దమకము తగ నాపెఁ దలఁచితే
యెడయక కంటిమి నీవెంట మేలువాఁడవో

చ. 3: ఆయాలు గరఁగుదువు అలమేల్ మంగ ముట్టితే
చాయదేరు నీమోవి చవిగొంటేను
పాయక కూడితి విదె భావిం చేకెఁ జూచేవు
యీయెడ శ్రీవేంకటేశ యెంతమేలువాఁడవో

రేకు: 1473-3 బౌళి సం: 24-435

పల్లవి: ఎవ్వరు వెంగెములాడనేల నిన్నును
పువ్విళ్లూర సంతోసాన నుండుదువుగాక

చ. 1: మగువ తేనెలుగార మాటలాడితే నీకు
తెగనిరతులతరితీపు లౌఁగాక
నిగనిగనిమోవి వెన్నెలనవ్వు నవ్వితేను
అగపడి కడుఁజల్లనౌఁగాక నీమనసు

చ. 2: సుదతి తమ్మిరేకుల చూపుల నిన్నుఁ జూచితే
కొదలే కింపు గుబులుకొనుఁగాక
అదనఁ జెమటలతో ఆపె నీపాదా లొత్తితే
కదిసి తనివిఁబొందుగాక నీతనువు

చ. 3: చెలియ తీగెలవంటిచేతులఁ గాఁగిలించితే
బలువలపులపంట వండుఁగాక
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నెలవై నన్నేలితివి నిండుఁగాక కరుణ

రేకు: 1473-4 పళవంజరం సం: 24-436

పల్లవి: ఆసపడుదురు నీకు నంగనలు గనుఁగొని
దోసముగా దందులకు దొరవైతేనేమి

చ. 1: యెనలేని మోహమున నెవ్వతైనా సొలయును
మనసిచ్చి యెవ్వతైనా మాటలాడును
ననుపున నెవ్వతైనా నవ్వఁజూచు నీతోను
వినయము సేయదంటా వెనఁ గోపించకుమీ

చ. 2: దంటయైనది యొకతె తమకించు నీకుఁ గాను
వొంటి నుండితే నొకతె యొడివట్టును
అంటి చన్నులనే వొత్తు నండనేయుండి యొకతె
ఇంటిలోనే మొక్కదంటా నెగ్గులు పట్టకుమీ

చ. 3: బత్తిగలజవరాలు పైకొని చెనకును
అత్తుకొన్న ముద్దరుల ఆయము లంటు
ఇత్తల శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
సత్తుగా నీయాలనైతి సాదించెననకుమీ

రేకు: 1473-5 కాంబోది సం: 24-437

పల్లవి: పొద్దువోనిచెలులాల బూటక మేమిసేసేరె
వొద్దికి నాతనిఁ దేరె వొనగూడీ నన్నియు

చ. 1: యెక్కడలేని చలువ లెన్నైనాఁ గలిగినాను
మక్కువ వెన్నెలవేఁడి మాన్పఁబోయీనా
వెక్కసపుచెలులాడే వేడుకమాట లెన్నైనా
వొక్కకోవిలకూతఁ నుడుపఁబోయినా

చ. 2: వట్టివేళ్లఁ గట్టి యాలవట్టా లెన్నివిసరినా
తట్టి మలయానిలభూతముఁ జోపీనా
ఇట్టె కేళాకూళిలోన నెంత యీఁదులాడించినా
ముట్టినవిరహపునాములు దించీనా

చ. 3: బచ్చెనచిత్తరు చూపి పరాకు లెంతసేసినా
అచ్చుపుమనసిజుని నడఁచేరటే
ఇచ్చల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వచ్చి తీనే నన్నుఁగూడె వారించీనా వలపు

రేకు: 1473-6 భైరవి సం: 24-438

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నింతికి నీచందములు
ప్రేమము నీచిత్తమునఁ బెట్టుకొనవయ్యా

చ. 1: చెలియకు నీ విప్పుడు చేరి మోము చూపితేను
కలువలకును శశిఁగనినట్టాయ
వలచి నీవు వద్దికి వచ్చితే పవనమునకు
యెలమి వసంతుఁడు యేతెంచినట్లాయ

చ. 2: కోమలికి నీవింతలో కోరి పొందుసేసితేను
తామరలకు రవి నేస్తమైనట్టాయ
కామించి నీ విట్టె కాఁగిలించుకొంటేను
గోమునఁ గొండలపై మేఘుఁడు వాలినట్టాయ

చ. 3: నెలఁతపై నీవు చూపు నిల్పితే జవ్వనసీమ
వొలసి మరునిటెక్కె లుంచినట్లాయ
అలమేల్ మంగఁ గూడితి వదె శ్రీవేంకటేశ్వర
నెలవై బొందిఁ బ్రాణుఁడు నిలిచినట్లాయ

రేకు: 1474-1 ఆహిరి సం: 24-439

పల్లవి: ఇంతకంటె మరి ఫల మేమని చెప్పఁగలదు
సంతతమైనవలపే సంసారఫలము

చ. 1: సతికి జవ్వనమె జన్మమందిన ఫలము
పతి యాదరించినదె ఫలము
మతికి నింపుగా మంచిమాటాడిన ఫలము
అతికాంక్ష నెప్పుడుఁ బాయకుండుటే ఫలము

చ. 2: ననుపున మోముచూచినప్పుడు నవ్వుటే ఫలము
చనవిచ్చి ఆడేసరసమే ఫలము
మనసు తనివిదీర మర్మములంటుటే ఫలము
కనుఁగొనఁ జూచిచూచి కరఁగుటే ఫలము

చ. 3: ప్రియముతో మేనుసోకఁ బెనఁగినదే ఫలము
నయమునఁ జూపేటిసన్నయే ఫలము
జయమై శ్రీవేంకటేశ్వర యలమేల్మంగను
నియతి గూడితి వీఁక నీవే ఫలము

రేకు: 1474-2 దేసాళం సం: 24-440

పల్లవి: విన్నప మేమి సేసేము వేగినంతాను
యెన్నికగా నాపెచన వీడేరించవయ్యా

చ. 1: నెలత నీ కిచ్చినకానికఁ దలంచుకోవయ్య
తళుకుఁగన్నులసన్న దలఁచవయ్యా
అలరిసేసిన వినయము దలఁచుకోవయ్య
యెలమి నాపెకడకు నిట్టె రావయ్యా

చ. 2: మక్కువతో నాడినమాఁట దలఁచుకోవయ్య
తక్కక యాపెవలపు దలఁచుకోవయ్యా
మొక్కిన చిన్నిచేతులమోడ్పు దలఁచుకోవయ్య
యిక్కువనున్నది యిట్టె యింటికి రావయ్యా

చ. 3: వడి నిన్నుఁగొల్చినభాము దలఁచుకోవయ్యా
తడయక సేసేసేవ దలఁచుకోవయ్యా
అడరి శ్రీవేంకటేశ ఆకె యలమేలుమంగ
యెడయక కూడితివి యిప్పుడు రావయ్యా

రేకు: 1474-3 సామంతం సం: 24-441

పల్లవి: నీవు రాంగా వలపుల నిండెను బండారములు
చేవదేరెం బనులెల్లా చిత్తగించవయ్యా

చ. 1: వనితమై చెమటలవానలు నిండాఁ గురిసె
మనసెల్లాఁ జిగిరించె మచ్చికలకు
ఘనమైనపులకల కమ్మని జాజులుమించె
కనుఁగొనవయ్యా చనుకనుఁగాయలు నవె

చ. 2: నతిమోవితేనెల చాలాఁ బంటలు పండె
తతిఁ గళలచే వసంతము వచ్చెను
సతమై నిట్టూర్పుల చల్లగాని విహరించె
రతి జూడవయ్యా మోహరసములును నవె

చ. 3: కూరిమి నలమేల్ మంగకోరికెఁ దీగెలువారె
గారవపుతమకము కాఁగిటఁ బాంకె
యీరీతి శ్రీవేంకటేశ యీకె నిట్టై యేలితివి
సారె భోగించవయ్యా జవ్వనవన మదె

రేకు: 1474-4 శ్రీరాగం సం: 24-442

పల్లవి: ఎట్టి పరవశమో యెటువంటితమకమో
బెట్టి ముంజేతిచిలుక పిల్చినా నెఱఁగదు

చ. 1: నిన్నుం జూచేపరాకున నెలఁత చన్నులమీంద
సన్నదువ్వటపుకొంగు జారినది యెఱఁగదు
మన్నించి నీవు దనతో మాటలాడేపరాకున
వున్నది నీకొనగోర నొత్తిన నెఱఁగదు

చ. 2: పలుమారు నీతోనవ్వే పరాకునఁ దాఁగట్టిన-
వలిపముచెమట పైవడి నంటు టెఱఁగదు
తలపోఁత నీమీఁదం దగిలినపరాకున
తెలిపి నీవు చెయివట్టి తీసినా నెఱఁగదు

చ. 3: నెట్టన శ్రీవేంకటేశ నిన్నుఁ గూడేపరాకున
అట్టె అలమేలుమంగ ఆలయనెఱింగదు
గుట్టునఁ దిరుపతిలో గోవిందరాజవై యుండే-
మట్టుఁ దెలిసి పొందులు మఱవనెఱఁగదు

రేకు: 1474-5 వరాళి సం: 24-443

పల్లవి: పాఁతవలపో ఇది పరగఁ గొత్తవలపో
యీఁతలుమోఁతలునై యిటువలె నుండెను

చ. 1: తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొనె నాకె
యెలమిఁ దా వావి నీకు నేమౌనో కాని
మలసి యీ భావము మాకుఁ జూడనై తేను
వలపులవలవేసి వంచితీసినట్లుండె

చ. 2: గక్కన మాటాడఁ బూఁచి కడమదా గుక్కుకొనె
చక్కని మీయిద్దరిలో సన్న రెట్టివో
యిక్కువ లివి మాలోన నెరిఁగి తెలుసుకొంటే
మక్కువమచ్చులు మేపి మంత్రించినట్లుండె

చ. 3: సెలవుల నిన్ను నవ్వి చేరి కాఁగిటనుఁ గూడె
నలి మీచుట్టరిక మెన్నటిదో కాని
అలమేలు మంగ పతివైన శ్రీవేంకటేశ్వర
యిల మీరే చంద్రుడు వెన్నెలవలె నుండె

రేకు: 1474-6 ముఖారి సం: 24-444

పల్లవి: నే నేమిటిదానను నేరు పెంతగలిగినా
వూని నాకుఁ జనవు నీవొసఁగ నీభారమే

చ. 1: నిక్కముగ నే నెంత నీమీఁద మోహించినాను
నెక్కొని యీడేరించ నీభారమే
వెక్కసమై యేపొద్దు నీవేళ నేఁ గాచుకుండినా మక్కువతోఁ జేకొని మన్నించ నీభారమే

చ. 2: దట్టముగా నే నప్పటి దయవుట్ట మాటాడినా
నెట్టుకొని కరుణించ నీభారమే
చుట్టు చుట్టి నీపై నేను సొలపులు చల్లినాను
చిట్టకము లేక భువిఁ జెల్లించ నీభారమే

చ. 3: చెలరేఁగి నేనెంత సేసినాను
నిలిపి మెచ్చులు మెచ్చ నీభారమే
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అలరఁ గూడితి వీఁక నన్నియు నీభారమే

రేకు: 1475-1 దేశాక్షి సం: 24-445

పల్లవి: అడుగరే యీమాట అవునో కాదో
బడిబడి నిందరిలోఁ బచారించవలెనా

చ. 1: యీతల నేవిన్నవించేదేమి సారెసారెకు
అతఁడే యెరుఁగునే అన్నియును
ఘాతల నామీఁదనే కరుణఁగలఁడు తొల్లె
నీతులుగా నిఁక వేరే నేరుపఁగవలెనా

చ. 2: పూనివట్టి నే నిప్పుడు పొంచి యెచ్చరించేదేమి
తానే యెరుఁగునే తలఁపులెల్లా
యీనెలవులనే నన్నే యేలుకొని వున్నవాఁడు
వీనుల నే నింతేసి వివరించవలెనా

చ. 3: మఱవకుమని నేను మరి వేఁడుకొననేల
యెఱుఁగునే శ్రీవేంకటేశ్వరుఁడే
అఱిముఱి నన్నుఁ గూడె నలమేల్ మంగను నేను
గుఱిసేసి యింకా మఱి కొసరఁగవలెనా

రేకు: 1475-2 ఆహిరి నాట సం: 24-446

పల్లవి: ఉత్తమనాయకుఁడవు వువిదలయడాటాన
బత్తిసేయవివాఁడవా పదరితిఁగాక

చ. 1: నన్ను నీవు మఱచేవా నాలోనితమకమున
పన్ని చెలులచేఁ జెప్పిపంపుదుఁగాక
మన్నించకుండుదువా మనసుపట్టఁగలేక
విన్నపములెల్లాఁ జేసి వేగిరింతుఁగాక

చ. 2: కరుణించవా నీవు కాఁకల కోర్వఁగలేక
విరుల నెచ్చరికగా వేతుఁగాక
పరగ నింటికి రాక పరాకులు సేతువా
సరి నిన్ను రమ్మనుచు సారెఁ బిలిచేఁగాక

చ. 3: చన వీయవా నీవు సారె సారెఁ బెనఁగుతా
చెనకి ప్రియము నీకు జెప్పేఁగాక
నిను శ్రీవేంకటేశ్వర నే నలమేలు మంగను
యెనసితి నిందుకుఁగా నెటిఁగింతుఁగాక

రేకు: 1475-3 సామంతం సం: 24-447

పల్లవి: ఎంతప్రియము గలిగె నంత పొదలు వలపు
వింతలే కాఁటదానికి వినయమే నేరుపు

చ. 1: చిత్తమురా మాటలాడి చెలువునిమీఁదట
బత్తిచూపవలెఁగాక పడఁతికిని
కొత్తగా నేరాలువేసి కూరిమిఁ గొసరుకొంటా
హత్తి వెంగెములాడేది అది యేఁటినేరుపే

చ. 2: సముకాన నిలుచుండి సరసములాడి పతిఁ
దమకించవలెఁగాక తరుణికిని
జమళి వద్దనే వుండి సారెకు నలుగుకొంటా
అమరని కాఁక చల్లే దది యేఁటినేరుపే

చ. 3: అలమేలు మంగవలె నటు శ్రీవేంకటేశ్వరుఁ
గలయఁగవలెఁగాక కామినికిని
పెలుచుఁదనాన రతిఁ బెనగులాడుకొంటాను
అలయించి చొక్కించే దది యేఁటినేరుపే

రేకు: 1475-4 ఆహిరి సం: 24-448

పల్లవి: ఇన్నిటా మన్నించితివి యిప్పుడు నేఁ గాదంటినా
సన్నల జంకించ మచ్చరమా నాకు

చ. 1: కవగూడి నీకరుణ గలిగితే, జాలుగాక
సవతుల సాదించ చలమా నాకు
జవళి నీ విట్టె వుంటే సంతోసించుకొందుఁగాక
వివరించి నాదడువ వేడుకా నాకు

చ. 2: చింతదీర నాసేవ చేకొంటేఁ జాలుఁగాక
కాంతల నుంకించి తిట్ట గర్వమా నాకు
ఇంత నన్నెత్తుసేసితే ఇటు నిన్ను మెత్తుఁగాక
పంత మందరితో నాడ పగటా నాకు

చ. 3: కొద్దిమీరి నన్నీరీతిఁ గూడితేఁ జాలుఁగాక
వొద్దివారినెల్లా దూర నొరటా నాకు
గద్దరినా యలమేల్ మంగను శ్రీవేంకటేశ్వర
వొద్దిక నన్నుఁ గూడితి వొడఁబాటా నాకు

రేకు:	1475-5 రామక్రియ	సం:	24-449

పల్లవి:	మగువ యెంతటిదైనా మగవానికిఁ గిరుదే యీ-
తగవు నీ వెఱిఁగి యీతనికి మొక్కఁగదే

చ. 1:	మంచి మాటాడితేఁ బతిమనసు గరఁగుఁగాక
ఇంచుక నిష్ఠూరమైన ఇయ్యకోలౌనా
వంచన కలిగితేనే వాడిక లింపవుఁగాక
మించి నడవఁగఁబోతే మెరమెర పుట్టదా

చ. 2:	సరసములాడితేను చవులెల్లాఁ బొడముఁగాక
విరసాన నుండితేను వేడుకలౌనా
మరుగఁజేసుకొంటేను మచ్చిక నిలుచుఁగాక
యెరవుసేసుకుండితే నెనయునా పొందులు

చ. 3:	ముందరినే నవ్వితేను మొగమోట పుట్టుఁగాక
సందడిఁ దలవంచితి సమ్మతులౌనా
అంది నలమేల్ మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁ
డిందు నిన్నుఁ గూడె నిఁక నిచ్చకమే మించదా

రేకు: 1475-6 పాడి సం: 24-450

పల్లవి: వాకిటఁ గొలువున్నాఁ డు వనిత నాపతితఁడు
చేకొని వచ్చి నిట్టె చిఁన్నబోనేలే

చ. 1: ముక్కవఁ దలఁచుకొంటే మనసెల్లాఁ జిగిరించు
చెక్కు చేతఁ బెట్టితేను చింత రేగుఁను
ముక్కుమీఁద వేలిడితే ముంచును నివ్వెరగులు
యెక్కడలేని విరహమేల పెంచేవే

చ. 2: అట్టె యెదురుచూచితే నాసలెల్లాఁ బొకొను
నెట్టనఁ దమకించితే నిండుఁగాఁకలు
పట్టెమంచ మెక్కితేనే పరగుఁ దలపోఁతలు
దట్టముగా నెంతజోలి దవ్వుకొనేవే

చ. 3: వుసురసురంటేను వూరకే మే నలసు
యెసఁగించితేఁ గోరిక లెలయించును
పలగా నలమేల్ మంగపతి శ్రీవేంకటేశుఁడు
వెస నిన్నుఁ గూచె నిఁక విచారములేలే

రేకు: 1476-1 సాళంగనాట సం: 24-451

పల్లవి: నిన్నెమనేదే నీకు నింతేసి నేరిపి
పన్నుకవుండినయట్టిపతి నంటగాక

చ. 1: కాంతునికిచ్చే కానుక కమ్మి నీవందుకొనేవు
యెంతచనవరిదాన వేమిచెప్పేదే
వింతగా విన్నవించితే వెస నీవు వూఁకొనేవు
మంతుకెక్క నీవనితమారైతివటవే

చ. 2: చెలువునికి మొక్కితే చేరి నీవు దీవించేవు
యిల నెంత నేర్పరివే యేచసుద్దులే
సెలవి నేనవ్వితేను సిగ్గులు నీవు వడేవు
కులికి యాతనిచేఁతకు గురి నీవటవే

చ. 3: శ్రీవేంకటేశుఁ గూడితే చేత నన్ను మెచ్చేవు
నీ వలమేలుమంగ వన్నిట జాణవే
ఆవేళ నేఁ జుట్టిచ్చితే ఆకు నీ వందుకొనేవు
దేవుల వితనిగుట్టు తెలిసితివటవే

రేకు: 1476-2 సామంతం సం: 24-452

పల్లవి: కోరినట్టె ఆయ నీకు గోవిందుఁడా మా-
కూరిమి మఱవకుమీ గోవిందుఁడా

చ. 1: క్రొమ్మెఱుఁగుచూపుగోవిందుఁడా
కుమ్మరించేవు వలపు గోవిందుఁడా
కుమ్మెవో గోర నొత్తకు గోవిందుఁడా నీ -
కొమ్మలెల్లా నవ్వేరు గోవిందుఁడా

చ. 2: కొలనిలోవారము గోవిందుఁడా నీకుఁ
గొలువుసేసేము గోవిందుఁడా
కొలము గొల్లెతలము గోవిందుఁడా
కొలకొల నవ్వుదురా గోవిందుఁడా

చ. 3: కుందణపుచాయమేని గోవిందుఁడా
గొందినేల పవ్వళించ గోవిందుఁడా
చెందె ని న్నలమేల్ మంగ శ్రీవేంకటేశ నిన్నాడు-
కొందుముసుమ్మీ నేము గోవిందుఁడా

రేకు: 1476-3 బౌళి సం: 24-453

పల్లవి: ఎక్కుడు గొసరఁబోతే యేపనికివచ్చునయ్య
మక్కువ గలిగినంత మన్నించవయ్యా

చ. 1: పంతముకొలఁదులె పలుకులెల్లా
మంతనము కొలఁదివే మనవులును
బంతి వడ్డించేకొలఁదే పరఁగవిందు
చెంతఁ జేరినకొలఁదే చేకొన్న చనవులు

చ. 2: ననుపుకొలఁదివే నగవులును
చనవుకొలఁదివే సరసములు
పెనఁగినకొలఁదివే ప్రియములును
వినయము కొలఁదివే వెసఁ జుట్టరికాలు

చ. 3: కూడినకొలఁదివే కూటములు
వాడికకొలఁదివే వలపులును
యీడనే శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
వేడుక నేలితివి వావి కొలఁదే వర్తన

రేకు: 1476-4 పాడి సం: 24-454

పల్లవి: రావయ్య్య మాఇంటికి రవ్వసేయ మాకేటికి
భావించి నీ యిచ్చలోనే పరగేముగాక

చ. 1: కందువైన జవ్వనపుకాంతల కేఁటిచలము
చెంది పతికిఁ బ్రియము చెప్పేటే కాక
మందలించి సారెసారె మరియేఁటిమాటలు
పొందులు దెలిపి నీతోఁ బొసఁగుటేకాక

చ. 2: యెచ్చట మానాపతులకేల వెంగెములాడను
నిచ్చ నీసేవలు సేసి నిక్కుటగాక
పెచ్చువెరిగి యందాఁకాఁ బెనఁగఁగవచ్చు నిఁక
విచనవిడిని నిన్నే వేఁడుకొంటగాక

చ. 3: ఇట్టె వలచినదాని కింత పెనఁగఁగనేల
గుట్టున నలమేల్ మంగఁ గూడుటగాక
నెట్టన శ్రీవేంకటేశ నే నీకు నాలనే
వొట్టిననీరతులలో నోలలాడుటగాక

రేకు: 1476-5 రామక్రియ సం: 24-455

పల్లవి: నేనేమి బాఁతే తననెలఁతలెల్లా నుండఁగ
మేనుఁ గాఁగిలించి యేమి మెచ్చీనే నన్నును

చ. 1: కందువైననాపై తనకరుణ గురుతుగాక
యిందలో నాచక్కఁదనా లెంతచెప్పీనే
మందలించి నాతోనన్నమాటలే గుఱుతుగాక
పొందుల నానేర్పులెల్ల పొగడీనే తాను

చ. 2: కిమ్ముల నన్నేలేతనకీరితే గుఱుతుగాక
యిమ్ముల నామంచిగుణ మేమిచెప్పీనే
సమ్మతించి నాకిచ్చినచనవే గురుతుగాక
పమ్మి నేఁ దనకుఁజేసే బత్తి యెంతో చూపీనే

చ. 3: కోరి తా నన్నుఁ గూడినకూటమే గురుతుగాక
యీరీతి నావినయము లేమిసేసీనే
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్ మంగను నేను
చేరి నన్నుఁ గూడెను నాచేఁత లేఁటిచేఁతలే

రేకు: 1476-6 సామంతం సం: 24-456

పల్లవి: అల్లనాఁ డెఱఁగవా ఆకెవో యీకె
పెల్లుగా నీతమ్ముమలము పెట్టించుకొనదా

చ. 1: అంగనతో మాటలాడి ఆయములు గరఁగుతా
సంగాతాలు సేయవా చావడిలోను
సంగడినే నిలుచుండి సారెఁ జెమరించుకొంటా
కొంగుఁగొంగు మోయఁగఁ గొలిపించుకొనవా

చ. 2: భావించి చూచిచూచి పరవశమందు కొంటా
వావులు దెలుపవా వాకిటనుండి
పూవుల వేసి మోహాన బుసకొట్టుకొంటాను
సోవగా సతిచే నాకు చుట్టింపించుకొనవా

చ. 3: గుట్టుతోనే నవ్వి మేను గుబ్బతిలఁ బులకించి
ఇట్టె కాఁగిలించుకోవా ఇంటిలోనను
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టి నన్నేలి యీకె కీసుద్దులెల్లఁ జెప్పవా

రేకు: 1477-1 పలవంజరం సం: 24-457

పల్లవి: వద్దనేమా నిన్నును వలపు దాఁచవచ్చునా
బుద్ధులెల్లా నీకు నేను బోదించేదాననా

చ. 1: సేసకొప్పు వంచివంచి చెలి నీకు మొక్కఁగాను
చేసూటినే నీవేల సిగ్గువడేవు
అసపడి యప్పటి నీఅండ నిలుచుండఁగాను
మూసినముత్యమవై నామోమేమిచూచేవు

చ. 2: చేతులు చాఁచి నీకు చేరి కానుకియ్యఁగా
నాతికి నీవేల సన్నలుసేసేవు
కాతరాన నీదిక్కు కన్నుల నాపె చూడఁగా
యీతల నాతోడుత నేఁటికి నవ్వేవు

చ. 3: సారెకు విన్నాకె గూడి సరసములాడఁగాను
గారవించి నన్నెంత కాఁగిలించేవు
యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మేరమీరి నన్ను నేమి మెచ్చు మెచ్చేవు

రేకు: 1477-2 ముఖారి సం: 24-458

పల్లవి: ఇందుకొరకే వచ్చితి నిదె నీసముకానకు
చందము సేయఁగ నీవే చతురుఁడవయ్యా

చ. 1: చేరఁడంతలుకన్నుల చెలి నిన్నుఁ జూచితేను
మూరెఁడంతపొడవుక్రుమ్ముడి వీడెను
యీరుదియ్యఁ బేనువచ్చె నిదివో నీపై వలపు
సారెసారె యీపనులు చక్కఁబెట్టవయ్యా

చ. 2: జుట్టెడేసిపాదములజోటి నీవద్దికి రాఁగా
పట్టెఁడేసిచన్నులపై పయ్యద జారె
అట్టె కలి ముదిరి మెట్టాయ నీతో పొందులు
నెట్టన నీతబ్బిబ్బులు నీవే దిద్దవయ్యా

చ. 3: గొరెఁడంతచంద్రవంక గురుతు నీకుఁ బెట్టితే
బారెఁడు గాఁగిట గూడి పంతమిచ్చేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నీరుకొద్ది తామరాయ నేఁడు మెచ్చవయ్యా

రేకు: 1477-3 బౌళి సం: 24-459

పల్లవి: ఏటికయ్యా నీతో మాకు యేలాటములాడాను
చీటికిమాటికి, సంతోసించుటేకాక

చ. 1: సులభమా నీతోను సొలసి మాటాడేది
అలరి నీ కిచ్చలాడేఆఁటదానను
తలవంచుకొని నీదండ నిట్టె కాచుకుండి
చెలగి నీ చెప్పినట్టుసేసే దింతేకాక

చ. 2: గరువమా నాకు నిన్నుఁ గదిసి తప్పకచూడ
ఇరవుగఁ బెండ్లాడినయిల్లాలను
వరుసతో నీచిత్తమువచ్చినట్టే సేవసేసి
బెరసి నీచేత మెప్పించుకొంటగాక

చ. 3: యెమ్మెలా నీతో నేను యెలయించి నవ్వునవ్వ
నెమ్మి నలమేల్ మంగను నీదేవులను
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పుమ్మడిరతులఁ గూడి వుండు టింతేకాక

రేకు: 1477-4 శ్రీరాగం సం: 24-460

పల్లవి: ఆకె యదె పిలువరే అందరు నోచెలులాల
చేకొని పతివేడుక చెల్లించవలెను

చ. 1: మగువ దనునాడినమాటలు దలఁచుకొంటా
తగినచక్కఁదనాలు తలఁచుకొంటా
నగుతాఁ బొందుసేసిననునుపుఁ దలచుకొంటా
వొగి లోనఁ బవళించి వున్నాఁడు రమణుఁడు

చ. 2: పడఁతిపక్కనుండినభావము దలఁచుకొంటా
తడఁబాటురతులెల్లాఁ దలఁచుకొంటా
కడుమనోరథములు కల్పించి తలఁచుకొంటా
వుడివోనివేడుకతో నున్నాఁడు రమణుఁడు

చ. 3: అలమేలుమంగచేఁత లన్నియు దలఁచుకొంటా
తలకొన్ననేరుపులు దలచుకొంటా
కలసి ఇప్పుడు తొంటికతలు దలఁచుకొంటా
వెలయుచున్నాఁడు శ్రీవేంకరమణుఁడు

రేకు: 1477-5 పాడి సం: 24-461

పల్లవి: ఎంత నేరుచుకొంటివే ఇన్నిటికి గురిగాను
కాంతునిఁ జూపి యెఱఁగనియట్టుందానవు

చ. 1: అంది పతితో నేకతమాడ నేరుతువుగాని
అందరిముందర మాటలాడనేరవే
కందువ నన్ను నప్పటి గయ్యాళిఁ జేసి, నిన్ను-
నొందిలి యేమాడిన నోరుచుకుందానవు

చ. 2: పిలిచి యాతని నింటఁ బెట్టుకోనేర్తువుగాని
అలరి మావరుసకు నంపనేరవే
పలుమారు నేవచ్చినపనులు రట్టు కెక్కించి
చలమునే సాదించితే సాదవైయుందానవు

చ. 3: కోరి శ్రీవేంకటేశ్వరుఁ గూడగఁనేర్తువుగాని
చేరి మాకు వినయాలు సేయనేరవే
నేరిచి నన్నితడేలె నే నలమేలు మంగను
సారె నే నవ్వితే సంతోసాననే వుందానవు

రేకు: 1477-6 గౌళ సం: 24-462

పల్లవి: పూవులవాసనలెల్లా పుణుఁగున బట్టినట్టు
వావులే మీలోమీకు వైపులాయనయ్యా

చ. 1: కొలఁది మీర నీకింతి కొలువులు సేయఁగాను
నిలిచి యాపెమోము నీవు చూడఁగా
వలపు తీఁగెలువారి వరుస మీ యిద్దరికి
అలరి మీకాఁగిళ్ల నల్లుకొనెనయ్యా

చ. 2: పచ్చిదేర నీతో నాకె పలుమారు మాటాడఁగా
విచ్చన విడిగా నీవు వినఁగాను
కుచ్చి మీమనసు లివి గుదిగొనఁ జిగిరించి
తచ్చి మోవులలో నేస్తాలు సేసీనయ్యా

చ. 3: అక్కునఁ దిరమై నీకు నలమేల్ మంగ వుండఁగా
దక్క సొమ్ములలో నీవు దాఁచుకుండఁగా
పక్కన మీకోరికలు ఫలించి శ్రీవేంకటేశ
చొక్కపుమీరతు లీడుజోడాయనయ్యా

రేకు: 1478-1 ఆహిరి సం: 24-463

పల్లవి: ఎంత వుపకారివి యేమని పొగడుదును
వింతచేఁతలను నాకు వేడుకసేసితివి

చ. 1: ఆసలుగా నీగురుతు లటు గొన్ని పెట్టి పంపి
పాసివున్న విరహతాపము మాన్పితి
సేసవెట్టినగురుతు చెప్పిపంపి అప్పటిని
వేసటలు దీర నన్ను వెడ్డువెట్టితివి

చ. 2: తనివార నాకు నేడు తతితో నీరూపు చూపి
మనసులోపలిచింత మానిపితివి
చెనకి చేయిమీఁద చేయివేసి యింతలోనే
తనువుపైకాఁకలార దప్పులు దేర్చితివి

చ. 3: గక్కన నింటికి వచ్చి కాఁగిట నన్నుఁ గూడి
ఇక్కడ నాకోరికె లీడేర్చితివి
నిక్కము శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చొక్కపురతుల నన్నుఁ జొక్కించి యేలితివి

రేకు: 1478-2 సాళంగనాట సం: 24-464

పల్లవి: ఏఁటిజోలి చేకొంటివి యెంతవిరాళి
నీటున నింతికడకు నేఁడే రారాదా

చ. 1: కలికికన్నులచూపు కడలేని తరితీపు
మొలకచన్నులు నీవు మోఁచేటిమోపు
తెలిసిచూడ వలపు తెగరానిరారాఁపు
కలిగె నింతికడకు గక్కన రారాదా

చ. 2: వనిత చిగురుమోవి వన్నెలైనచెంగావి
దినదినమును నీకు తియ్యనితావి
చెనకి మీయిద్దరికిఁ జెప్పితి నే నిండువావి
యెనసె నింతకడకు నిప్పుడే రారాదా

చ. 3: అలమేలుమంగ మాఁట అమరుఁ గోవిలపాట
కలయికలకు నిదె కాఁగిటిపూఁట
యెలమి శ్రీవేంకటేశ యీకెఁ గూడితి విచ్చోట
తలచి యింతికడకుఁ దప్పక రారాదా

రేకు: 1478-3 శ్రీరాగం సం: 24-465

పల్లవి: ఇంక నీచిత్తముకొలఁ దెట్టయినాఁ గరుణించు
అంకెల మావిన్నపము లవధరించవయ్యా

చ. 1: సలిగె గలిగితేను సరసము లమరును
వెలినున్నవారికి వేసాలందురు
కలసినచుట్టాలైతే సొలయఁగజెల్లును
బలిమి వింతవారికిఁ బనిలేదు

చ. 2: యెనసినవావులైతే యేమిసేసినాఁ జెల్లు
మనసురానివారికి మాయలందురు
ననుపైనకాంతలు పెనఁగితే నీడేరు
చెనకఁ బెరవారికి చేతికి లోఁగారు

చ. 3: తగులైనవారికిఁ దమకించఁ బాడియౌను
సొగయనివారికి సోద్యమందురు
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
మొగి నన్నేలితివి కిమ్ములవారి కబ్బదు

రేకు: 1478-4 దేసాళం సం: 24-466

పల్లవి: ఔదువే దొడ్డదాన వతని దక్కఁగొంటివి
యీదెస నీనేరుపులే యెన్నికాయఁ జెలియా

చ. 1: యెలమిఁ గొలువుసతు లెందరు లేరు పతికి
తలఁపునఁ బాయినిదే తరుణిగాక
వల పెంతలేదు మరి వంతులకు వలవఁగా
కలయిక కింపైనదే వలయుఁగాక

చ. 2: పూనిమాట లెన్నిలేవు పొలఁతు లాడితేఁ బతి-
వీనులఁబట్టినవే వేడుకగాక
నానఁబెట్టె దేమరుదు నవ్వుల సెలవులను
నానాఁటిసరసముల నాఁటవలెఁగాక

చ. 3: చెలిమి యెంతలేదు శ్రీవేంకటపతికి
అలమేల్మంగ నీపొందే యమరుఁగాక
మెలుపున నన్నుఁ గూడె మేలింకా నెంతలేదు
అలరి నీవలె మెఱయఁగవలెఁగాక

రేకు: 1478-5 సాళంగం సం: 24-467

పల్లవి: ఆనతియ్యవయ్య నాకు నందముగ వినేగాని
నానదుగదా నవ్వితే ననుపు గావలెను

చ. 1: ఆసపడి నాయింటికి నటు సారెఁ బిలువఁగ
వేసట గాదుగదా వింతలై నీకు
వాసితో నీతొడ యెక్కి వలపులు చల్లఁగాను
దోసము గాదుగదా తొడిఁబడ విపుడు

చ. 2: వొగ్గి యందరిలో నిన్ను నొడివట్టి పెనఁగఁగా
సిగ్గులు గావుగదా చేకొని నీకు
అగ్గమై చన్నులుదాఁక నండ నేఁ గూచుండితేను
యెగ్గయి తోఁచదుగదా ఇప్పుడు నీకు

చ. 3: పలుమారు నే నీకు పాదము లొత్తఁగాను
అలయిక గాదుగదా అంతలో నీకు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి మొగచాటు గాదుగదా నీకు

రేకు: 1478-6 బౌళి సం: 24-468

పల్లవి: అన్నివిన్నపములును అందులోనే వున్నవి
వున్నతిఁ జెలికత్తెల మొద్దికతో నేము

చ. 1: ఆపెయంపినకానిక యవధరించితివా
చూపులఁ దప్పక లెస్స చూచితివా
చేపట్టి ముక్కునఁ దావి చిత్తగించితివా
ఆపనుల కేమంటి నానతియ్యవయ్యా

చ. 2: యింతియంపినవారము యెఱుఁగుదువా మమ్ము
చెంతల మావినయములు చెవి సోఁకెనా
వింతలైనగురుతులు విచారించుకొంటివా
అంతరంగానఁ బట్టినా ఆనతియ్యవయ్యా

చ. 3: అలమేలు మంగ వచ్చె నండఁ బెట్టుకొంటివా
వెలయఁ గాఁగిట గారవించితివా
ఇల శ్రీవేంకటేశ్వర ఇన్నిటా జాణవు నీవు
అలరే మాపనులెల్లా నానతియ్యవయ్యా

రేకు: 1479-1 సామంతం సం: 24-469

పల్లవి: మట్టుమీరి మెలఁగితే మరేమున్నది
చుట్టరికమెరిఁగినసూటికత్తెలకును

చ. 1: ప్రియముచెప్పుట మేలు బిగియకుండుట మేలు
నయగారిసతికిని నాథునితోను
క్రియతో మాటాడవలె కినియకుండఁగవలె
నియతమైనయట్టినెలఁతలకు

చ. 2: చెప్పినట్టు సేయఁదగు చేతికి లోనుగాఁదగు
తప్పనిమగువకును తనపతితో
చొప్పెరిఁగి నవ్వుటొప్పు సొలయకుండుట యొప్పు
ముప్పిరి గొనఁగఁ గడుమోహించినవారికి

చ. 3: కొలువుసేయుట పాడి కూరిమిచల్లుట పాడి
కలికియైనచెలికి కాంతునితోను
నెలవై శ్రీవేంకటేశ నిన్నలమేల్ మంగ గూడె
యెలమి నిదేబుద్ధి యిల్లాండ్లకును

రేకు: 1479-2 వరాళి సం: 24-470

పల్లవి: ఊడిగపుదానను వువిదకు నీకు నేను
వేడుకకాఁడ మీకత వెలయించరాదా

చ. 1: యీకాంతను వలపించి ఇంతసేసినయందుకు
దాకొని నీచేఁతలు తలఁచరాదా
రాక నీవిందాఁక నుండి రవ్వసేసినందుకు
నీకుఁ జేతులెత్తి మొక్కి నిలుచుండరాదా

చ. 2: పంతాన నీకెఁ బిలిచి పరాకైవుండినందుకు
కొంతగొంత నే నిన్నుఁ గొనేడరాదా
అంతలోఁ దలఁచుకొని ఆదరించినయందుకు
సంతోసించుకొని నిన్ను సారె మెచ్చరాదా

చ. 3: కమ్మర నీకెఁ గూడి గడుసుపడినందుకు
చిమ్మిరేఁగి ప్రియములు చెప్పఁగరాదా
ఇమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నీదేవిని
పమ్మి మిమ్మిద్దరినిఁ దప్పకచూడరాదా

రేకు: 1479-3 పాడి సం: 24-471

పల్లవి: అది చూచి నాకు వేడుకాయను నేఁడు
యెదలోని నీకప్పు డెట్టుండెనో కాని

చ. 1: చెలిని చెవిలోపలఁ జేరి యేకతాలాడఁగ
పులకించె మేను గొబ్బున నీకును
మొలకనవ్వులు నీపై ముంచిముంచి చల్లఁగాను
జలజలఁ జెమరించె చక్కనినీచెక్కులు

చ. 2: కోమలి నీకు లోనికొలువులు సేయఁగాను
ఆముకొనఁ జెంగలించె నదె నీమోము
కోమలపుచనుఁగవకొనలు దాఁకించఁగాను
ప్రేమతో మూపులు మూఁడై పెనగొనె నీకును

చ. 3: వనిత యెదుటనుండి వలపులు రేచఁగాను
వొనర నీమర్మములు వుప్పొంగెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
పెనఁగి నీకాపెకుఁగా బెరసెను కళలు

రేకు: 1479-4 నాదరామక్రియ సం: 24-472

పల్లవి: సిగ్గున నూరకుండితే సేసినవాఁడవే నీవు
బెగ్గిలక సాకిరిచెప్పే నేను నీకును

చ. 1: కలలోన వేరొకతె కాఁగిటిలో నిన్నుఁగని
వెలఁది మేల్కని నీతో వెంగెమాడీని
యెలమిఁ దెలియలేక యేలపెట్టుకొనో వాన
కలికియు నీవుఁ దారుకాణించుకోరాదా

చ. 2: వొొక్కతెతో రతి నీకు నూహించి తానే భ్రమసె
చక్కనినీమోము చూచి సాదించీని
చెక్కుచేతితో నేల చింతించే విందుకుగా
గక్కన నిద్దరుఁ దారుకాణించుకోరాదా

చ. 3: పొరుగాపె పొందులు పోలికలు చూచుకొని
సరికిబేసికి నిన్ను జంకించీని
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యాకె
కరుణించి నిన్నుఁ దారుకాణించుకోరాదా

రేకు: 1479-5 కన్నడ గౌళ సం: 24-473

పల్లవి: చెలిఁ గావు మరుఁ డింత సేయఁజొచ్చెను
సెలవుల నవ్వులే సిగ్గురేఁచ జొచ్చెను

చ. 1: చెక్కుపైఁ జేయిడుకొని చింతించఁగాఁ జెలియకు
వుక్కుమీరి పెంజెమట లూరఁ జొచ్చెను
వెక్కసపు విరహాన వెరగుతో నుండఁగాను
మిక్కిలి నిట్టూరుపులు మించఁజొచ్చెను

చ. 2: యెదురుచూచి నీరాక కేఁకరుచునుండఁగాను
పొదలుచుఁ దమక ముప్పొంగఁజొచ్చెను
అదన నీపొందులకు నలయుచునుండఁగాను
తుదలేని కోరికలు తొడరఁగఁజొచ్చెను

చ. 3: తగిలి నీవలపులదప్పులఁ బొరలఁగాను
దగదొట్టి సందు లదరఁజొచ్చెను
జిగి నలమేల్ మంగ శ్రీవేంకటేశుఁడ నిన్ను
మిగులఁ గూడఁగా మేలు మెరయఁగఁజొచ్చెను

రేకు: 1479-6 బౌళి సం: 24-474

పల్లవి: పలికెనంటే గడుఁబచ్చిదేరును
చెలపచెమటలతో చెక్కులు నొక్కినది

చ. 1: మనసున నెన్నటికి మఱవకు మిఁక నీవు
ననుపున నిటు నన్ను నమ్మించినది
యెనసి మరీనొకటి యెఱుఁగుదు వది నీవు
పెనగి యేకతమునఁ బ్రియము చెప్పినది

చ. 2: వడి నాచుట్టరికము వదలకు మిఁక నీవు
కడలేక బత్తి నాపైఁ గలిగినది
చిడుముడిఁ దొల్లె నాకుఁ జెప్పిపంపితివి
అడియాలముగ నాఁడె యాసలఁబెట్టినది

చ. 3: పరగ నాకాఁగిటఁ బాయకు మిఁక నీవు
సిరుల నాపై దయసేసినది
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
గరిమ గూడితివి తార్కాణలయినది

రేకు: 1480-1 బౌళి సం: 24-475

పల్లవి: ఇంకనేల వెంగెమాడ వియ్యకోలైనపనికి
సంకెలేనిచనవున జట్టిగొంటగాక

చ. 1: చిగురుఁబెదవిమీఁద చిమ్ముచుఁ దీపులు చల్లి
మగువ నిన్నుఁజే మాటలాడఁగా
నగవచ్చునా నీతో నంటుచేసుకొని నాకు
వొఁగి బరాకులు చేసుకుండటగాక

చ. 2: సొలపుఁ జూపులలోన సూటిమెఱుఁగులు చల్లి
జలజాక్షి నిన్ను సారె జంకించఁగా
పిలువచ్చునా నిన్ను పెనఁగచు మాఇంటికి
కొలువులో నవ్వుచేసుకొనుటగాక

చ. 3: కొమరెగుబ్బలచేత గురుతులు సోఁకించి
రమణి నిన్నేకతాన రతిసేయఁగా
అమర నలమేల్మంగ నౌదును శ్రీవేంకటేశ
తమి నిన్నుఁగూడి యిట్టె దై వారుటగాక

రేకు: 1480-2 ముఖారి సం: 24-476

పల్లవి: చూచేవారికిఁ జూడ చుట్టమువలెనున్నాఁడు
యేచి యీతనికతలు యెన్నియైనాఁ గలవు

చ. 1: ఆసలనే పెట్టిపెట్టి ఆయములంటి నన్ను
పోసరించి కడువలపులు రేఁచెనే
వోసరించి జూజాలాడి వూరకే సుద్దులు చెప్పి
వేసాలు చేసినాఁడే వేగినంతా నితఁడు

చ. 2: సరసములాడియాడి సన్నలనే మోవిచూపి
మరిగించి ప్రియముల మచ్చికలు చూపెనే
సొరిది వీడెములిచ్చి సొమ్ములెల్లా మెడఁబెట్టి
తెరమఱఁగున దప్పి దేర్చె నితఁడు

చ. 3: మచ్చికలు రేఁచిరేఁచి మన్ననలు నాకొసగి
హెచ్చి ఇంతసేసి నేఁ డిటు గూడెనే
అచ్చపు శ్రీవేంకటేశుఁ డట్టె పువ్వులను వేసి
రచ్చఁబెట్టి ఇందాఁకా రాఁపుసేసె నితఁడు

రేకు: 1480-3 పాడి సం: 24-477

పల్లవి: ఏఁటికి వేగిరపడే విప్పుడే నీవ
తేటతెల్లమైనప్పుడు తెలిసీఁగాని

చ. 1: కొమరెపాయపుసతి కొలువులో నుండఁగాను
భ్రమసివున్నాఁ డతఁడు పలికీ నటే
సముకాన నాపె వచ్చి చవులు వుట్టించఁగాను
తమకించివున్నవాఁడు తలఁచీనటే

చ. 2: చక్కఁదనముల యాపె సరసములాడఁగాను
చొక్కినాఁ డెదిరివారిఁ జూచీనటే
చెక్కునొక్కి మరియును చేఁతలెల్లాఁ జేయఁగాను
అక్కరతో నున్నవాఁడు ఆదరించీ నటవే

చ. 3: పొందులు చేసినయాపె పొత్తుకు వచ్చివుండఁగా
విందుచెప్పవచ్చితేను వినీనటవే
అందపు శ్రీవేంకటేశుఁ డంతలొనె నిన్నుఁగూడె
మందెమేళమైనవాఁడు మఱచీనటే

రేకు: 1480-4 కాంబోది సం: 24-478

పల్లవి: పదరేవు రతులకు పంతమా యిది
పదపడి బిగిసేవు పంతమా యిది

చ. 1: యెడమిచ్చి ప్రియముతో నింటికిఁ బిలువఁగాను
పడఁతితోఁ బెనఁగేవు పంతమా యిది
చిడుముడి నీతో నవ్వి చెమరించె మేనెల్లా
బడలిక చూడవు పంతమా యిది

చ. 2: జలజాక్షి చన్నులు నీసంగడినే వున్నవంటా
పలుమారు బిసికేవు పంతమా యిది
కలికికన్నులచూపు కాఁడిపారె నిన్నునంటా
బలిమితోఁ దిట్టేవు పంతమా యిది

చ. 3: తరుణి నీపాదాలకు దండములు వెట్టఁగాను
పరసతులఁ జూచేవు పంతమా యిది
యిరవై శ్రీవేంకటేశ యేలితి విన్నిటా నీఁక
పరగఁ దమకించేవు పంతమా యిది

రేకు: 1480-5 నాగ వరాళి సం: 24-479

పల్లవి: నేరుపరి నందువు నెలఁతలలోనెల్లా
కూరి మెంతగలిగినా కొసరఁగవచ్చునా

చ. 1: వలచినదాననంటా వాసిక త్తైనంటాను
చెలరేఁగి పతితోడఁ జెప్పేవు నీవు
చలివాసివుందానవు చన వెంత గలిగినా
పొలంతికి తన్నుఁ దానే పొగడుకోవచ్చునా

చ. 2: నిన్నే నమ్మితి నంటా నేం బాయనోపనంటా
యెన్నేసివేసాలు సేసే విప్పుడే నీవు
పన్నుకొని వచ్చితివి బలిమికత్తైవైతేను
కన్నియకు నింతేసి కరతలు గలవా

చ. 3: చేయెత్తి మొక్కతినంటా సిగ్గుతో నుందాననంటా
ఆయములంటి కూడితి వంతలో నీవు
యీయెడ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను దొరవైతే
పాయపుదానికి నింత పచ్చిసేయఁదగునా

రేకు: 1480-6 సామంతం సం: 24-480

పల్లవి: చెలఁగి కొలువులోన సిగ్గులువడఁగవద్దా
బలువుఁడవైతేనే ప్రహ్లాదవరదా

చ. 1: వడియుఁ జెమటతోడ వంచినమోముతోడ
తొడమీఁదఁగూచున్న తొయ్యలితోడ
జడిసేనీవలపులు సంకి బేసికిఁజూచి
పడఁతులెల్లా నవ్వేరు ప్రహ్లాదవరదా

చ. 2: నిట్టూరుపులు మీర నిద్దుర గన్నులఁ దేర
గుట్టుతో విన్నాపె గోర గీర
గట్టిగా నీవాపెను కాఁగిలించి వదలక
పట్టుకుండఁగా నవ్వేరు ప్రహ్లాదవరదా

చ. 3: సింగపుమోము మెఱయ చిమ్ముఁజూపులుబెరయ
అంగన కాఁగిట నొయ్యన దొరయ
రంగుగ శ్రీవేంకటాద్రిరాయఁడనై మన్నించఁగా
పంగెనల నవ్వేరు ప్రహ్లాదవరదా

రేకు: 1481-1 సాళంగనాట సం: 24-481

పల్లవి: నాటెను నీకూరిమి నారసింహా
నాటకములెల్లాఁ గంటి నారసింహా

చ. 1: కోమలు లిందరు నీపైఁ గోరి సేసలు చల్లంగ
నామొగ మేమిచూచేవు నారసింహా
వేమరు వాడవారెల్లా విన్నపాలు సేయఁగాను
నామాటే చవులాయ నారసింహా

చ. 2: యేతులఁ జెంచెత నీతో నేకతమాడినసుద్ది
నాతో దాఁచఁగనేల నారసింహా
జాతులఁ బెట్టుచు నీవు సారెనేల చెనకేవు
నాతుల నీకేమిబాఁతి నారసింహా

చ. 3: పనితో నిద్దరమునుఁ బాయక కూడుండఁగా
ననిచె మనపొందులు నారసింహా
తనిసి నీరతుల దయఁజూచి యేలితివి
నను శ్రీవేంకటగిరి నారసింహా

రేకు: 1481-2 రామక్రియ సం: 24-482

పల్లవి: అట్టుసేయ కిఁక నీవు ఇట్టె రాఁగదే
పట్టపుదేవులవైన బలవంతురాలవు

చ. 1: యెదురుఁగొండ లెక్కితివేమే వోచెలియా
యెదురుఁ గొండలచన్ను లెదనుండఁగా
వదలక నల్లఁగలువల వేసే వదియేమే
కదిసి నీచూపులే కలువలై వుండగా

చ. 2: యేరు నడుమఁ బెట్టుక యెలయించే విదియేమే
యేరువంటియారు నీకు నిదె వుండఁగా
సారెకు లేఁతతీగెలు జళిపించే విదియేమే
గారాపుతీఁగెలే నీకరములై వుండఁగా

చ. 3: పొంది వొక్కచోఁ దరితీపులు వుట్టించేవేమే
ముందుముందే తీపులు నీమోవి నుండఁగా
అందపుశ్రీవేంకటాద్రి నహోబలమునను
ఇందిరపు నీకు నేనే ఇరవైవుండఁగను

రేకు: 1481-3 ఆహిరి సం: 24-483

పల్లవి: వనిత నీపతి నేఁడె వచ్చీఁగాక
మనసులోనివలపు మలయుచుండఁగను

చ. 1: దప్పిదేరే వదియేమే తరుణి నీ నింతలోనే
చిప్పిలుమోవితేనెలు చిమ్మిరేఁగఁగా
కప్పినకాఁకలతోడ కడువసివాడే వదియేమే
కప్పురపునగవులు కలిగుండఁగాను

చ. 2: వుమ్మగిలే విదియేమే వువిద నీపూరుపుల-
తెమ్మెరలచలువలు తెటపడఁగా
కుమ్మరింపుఁజెమటలు కురిసేవు నీ విదియేమే
కమ్మి చూపుచాతకాలు కలిగివుండఁగను

చ. 3: వీడిననెరిచీఁకటి వెలఁదిరో నించేవేమే
తోడనే మోముకళలూ తొలఁకఁగాను
అడనె శ్రీవేంకటేశుఁ డప్పుడే నిన్నుఁ గూడె
యేడాలేనిమఱపేలే యింపు నీకుండఁగను

రేకు: 1481-4 సామంతం సం: 24-484

పల్లవి: ఔనే మంచిదానవు అతఁ డుటువంటివాఁడా
పూని వేడుకొనఁగదే పొందుగలవానిని

చ. 1: కన్నులు గొప్పలంటాను కడుజింకింతురటవే
మన్నించి నిన్నేలినమగవానిని
సన్నలు నేరుతునంటా సాదింతురటవే
ఇన్నిట జాణఁడఇనఇటువంటివానిని

చ. 2: వాఁటములు చేతులంటా వడిఁ బెనఁగుదురటే
మేటితనాన నుండేటిమేనవానిని
మాటలు నేరుతునంటా మగుడ నాడుదురటే
కూటమికి గురుతైన కొండవంటివానిని

చ. 3: చన్నులు గట్టులంటాను జడియ బిగింతురటే
విన్నాణపునేర్పుల శ్రీవేంకటేశుని
కిన్నెరకు నేర్తునంటా గీఁటి చూపుదురటే
పన్నినట్టి వలపులపట్టమేలేవానిని

రేకు: 1481-5 బౌళి రామక్రియ సం: 24-485

పల్లవి: మాతో నేమిచెప్పేవే మాపుదాఁకాను
ఆతనిని చిలుకచే నాడించవలదా

చ. 1: చేరి నవ్వవచ్చుఁగాక చేయిసోఁకఁ జెనకితే
వోరుచు కెవ్వరికైనా నుండవచ్చునా
ధీరత ఇంతలేకుండితే నప్పుడే యతనిపై
కోరి వేరొకటివెట్టి దూరుసేయవలదా

చ. 2: జూదమాడవచ్చుఁగాక సులభాన గెలిచితే
వాదులేక యీను విడువఁగవచ్చునా
పాదుకొని నీవింత పంతమాడేదానవు
మోదపు నీచెలులచే మోసపుచ్చవలదా

చ. 3: తమి రేఁచవచ్చుఁగాక తగురతిఁ గినిసితే
తెమల కందుకు సమ్మతించవచ్చునా
అమర శ్రీవేంకటేశు నటు గూడినదానవు
మముబోంట్లచే మారుమలయించవలదా

రేకు: 1481-6 సామ వరాళి సం: 24-486

పల్లవి: ఎదురుబడి నున్నారు నిద్దరు నేకతమున
అదను చూచి యీడకు నాతని రప్పించవే

చ. 1: సన్నల నాతనితో సరసములాడనీవే
కిన్నెరమీఁటుల గిలిచంచనీవే
విన్నపము లేమైనా వెలఁది చేసుకోనీవే
నన్నేల పిలిచేవు నడుమ నీవాడకు

చ. 2: బత్తిగలిగినట్టాఁ బాదాలు విసుకనీవే
గుత్తవు గుబ్బల బతిఁ గుమ్మనీవే
కొత్తగా నవ్వులు నవ్వి కూరిమి గొసరనీవే
పొత్తులకాఁగిటనేల పొదుగుమనేవు

చ. 3: తిరముగా లోలోనే తెరవేసుకోనీవే
గిరికుచములంట భోగించనీవే
అరిది శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నుఁ గూడె
సురతపు రహస్యాలచొప్పు వెదకుదురా

రేకు: 1482-1 సామంతం సం: 24-487

పల్లవి: ఎంతవనికోకాని యెఱఁగ నేను
చెంతనే తెలుసుకో నేఁ జెప్పితి నీసుద్దులు

చ. 1: వదలేజారుఁ దురుము వైపుగా ముడుచుకొంటా
కదలుఁగన్నులచూపు కాఁడిపారఁగా
మదమువలెనే పెంజెమటలు చెక్కులఁ గార
వెదకీ నెవ్వతో నిన్ను వీదులవీదులను

చ. 2: అడఁచి చన్నులపైఁ బయ్యద బిగిఇంచుకొంటా
కడలేని నిట్టూర్పులు కడుమఁగాను
తడఁబడఁ బెదవుల తమ్మబేంట్లు రాలఁగా
అడిగీ నీవున్నచోటు అంగవలనెల్లాను

చ. 3: వుక్కుమీరి కరముల వొడిమీదఁ బెట్టుకొని
మిక్కిలి నీకాపె పొందు మీఁ దెత్తఁగా
ఇక్కడ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడేవు
చొక్కుచు నీమేడదిక్కే చూచీఁ దా నదివో

రేకు: 1482-2 సాళంగనాట సం: 24-488

పల్లవి: వేడుకకాఁడుగదమ్మ విట్ఠలేశుఁడు
వేడెమియ్య వచ్చిని విట్ఠలేశుఁడు

చ. 1: సరుస రుక్మిణిదేవి సత్యభామయుఁ జెనక
వెరవులు వెదకీని విట్ఠలేశుఁడు
సరసములాడుకొంటా సారెకు వలపులు చల్లీ
విరుల దండలతోడి విట్ఠలేశుఁడు

చ. 2: చన్నులంటి గోపికల సన్నలఁ దిట్లు దిట్టీ
వెన్నదిన్ననోరితోడి విట్ఠలేశుఁడు
కన్నులఁదప్పక చూచి కలువపువ్వుల వేసీ
వెన్నెలనవ్వులతోడి విట్ఠలేశుఁడు

చ. 3: అగడపుఁజేత సేసి ఆయములుసోఁకఁ గూడె
వేగిరకాఁడు గదవే విట్ఠలేశుఁడు
బాగుగ శ్రీవేంకటాద్రిఁ బాయక నన్నేలి మెచ్చీ
వేగ జామునునుండి విట్ఠలేశుఁడు

రేకు: 1482-3 రామక్రియ సం: 24-489

పల్లవి: భూపతి చెరువుకాడఁ బొంచి తిరువేంకటేశుఁ-
డేవున నన్నేలయించి యెంతచేసెనే

చ. 1: యిట్టె సింగారించుకొని యింటికి నే రాఁగాను
గుట్టుతోనె వచ్చి తా నాకొంగు వట్టెనే
వొట్టువెట్టి నే దన్ను వొద్దనఁగానే పెఁడి-
పట్టెమంచ మెక్కించుక పచ్చిచేసెనే

చ. 2: మలసి వెన్నెలలో మట్టెలమోతతోడ
మెలఁగఁగా వచ్చి నాతో మేలమాడెనే
చెలరేఁగి తప్పించుక సిగ్గుతో నే నుండఁగానే
కులుకుగుబ్బలమీఁద గుఱుతులు నించెనే

చ. 3: మిన్నక ముసుఁగుతోడ మేడమీఁద నెక్కఁగానే
సన్నచేసి నామోవి చవిగొనెనే
కన్నుల నే వద్దనించి కలకల నవ్వఁగానే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడెనే

రేకు: 1482-4 దేసాళం సం: 24-490

పల్లవి: ఏమి దప్పకచూచేవు యెగసక్కెమాడ నేను
వేమారు మొక్కే నేను వెన్నముద్దక్రిష్ణుఁడా

చ. 1: కోడెకాఁడవై నీవు కోరి చన్నులంటఁగాను
వాడుమోముతోఁ దలవంచీఁ జెలి
ఆడానీడాఁ దిరిగాడి అన్ని నేరుచుకొంటివి
వీడె మియ్యఁగదవోఇ వెన్నముద్ద క్రిష్ణుఁడ

చ. 2: గొల్లెతలవాడలోని గోళ్లు మీఁటఁగాను
తెల్లమి నొక్కతె వచ్చి తిట్టీ నిన్ను
బల్లిదుఁడ వౌదువు బాసలు సేయకు మిఁక
వెల్లవిరాయఁ బనులు వెన్నముద్దక్రిష్ణుఁడ

చ. 3: సేసవెట్టుతానే వచ్చి చిమ్మిరేఁగఁ గూడఁగాను
వాసులు వంతులు నీపై వంచీ నీకె
ఆసల శ్రీవేంకటాద్రి నంతలో నన్నేలితివి
వేసారకు రతులను వెన్నముద్దక్రిష్ణుఁడా

రేకు: 1482-5 మాళవి గౌళ సం: 24-491

పల్లవి: ఈవేళ నీమన్నన యిన్నేసి కలిగెఁగా
కైవశమైతే నీమతి కరఁగీఁగాని

చ. 1: చీటికిమాటికి నీవు సిగ్గువడినా నీతో
మాటలాడఁ గలిగెఁనా మాపుదాఁకాను
చాటువగా నేఁ డప్పటి సరసమే చాలదా
కూటమిగలప్పటికిఁ గూడేవుగాని

చ. 2: భావము నీకెక్కడను పరాకైవుండినా నీకు
సేవసేయఁ గలిగెఁనా చేచేతను
వావులు దెలుపుచు నీవద్దనుండుటే చాలదా
యేవేళనైనా నీమోవి యిచ్చేవుగాని

చ. 3: యెవ్వతెకాఁగిట నీవు యెందుండినా నీతోను
నవ్వు నవ్వఁగలిగెఁగా ననుపుగాను
యివ్వల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
రవ్వగాఁ గూడితి విట్టే రక్షించేవుగాని

రేకు: 1482-6 సౌరాష్ట్రం సం: 24-492

పల్లవి: కాదనేనా ఇఁక నీపైఁ గాఁతాళించేనా
సాదవైతి వన్నిటాను సంగతాయఁ బనులు

చ. 1: చేయరానిచేఁత చేసి చెక్కవట్టి వేఁడుకోఁగా
ఆయనాయ నిందువంకనైనదేమి
నాయ మెవ్వరు చెప్పేరు నాకు నీకు నడుమను
చాయకుఁ దెచ్చుకొంటివి సంగతాయఁ బనులు

చ. 2: జాలిఁబెట్టి మాటలాడి సమ్మతిగాఁ జేయఁగాను
చాలుఁజాలు నిందువంక సాదించేదేమి
తాలి మెక్కడ నున్నది తవిసితి మిద్దరము
పోలికలు చూపేవు పొసఁగె నీపనులు

చ. 3: వెంట నాకెఁ దోడితెచ్చి వేరేమరఁగు వెట్టఁగా
కంటిఁగంటి నిందువంకఁ గలిగేదేమి
ఇంటివద్ద శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
జంటవై నెలకొంటివి చక్కనాయఁ బనులు

రేకు: 1483-1 రామక్రియ సం: 24-493

పల్లవి: ఎన్నిలేవు నీసుద్దులు యెరిఁగినవేళ కన్ను-
సన్నలు సేసేవు కడుసాదువలెనె

చ. 1: కాతరాన నాపె నీపై కప్పురము చల్లెనంటా
యేతులకు నందరితో నేమి చెప్పేవు
చూతముగా నీవాకెతో చుట్టరికము మానేవా
నీతితోడ మాటాడేవు నిజమరివలెనే

చ. 2: వాకుచ్చి యప్పటి నాపె వరుసతోఁ దిట్టెనంటా
సాకిరేల పెట్టేవు సతులనెల్లా
యీకడనే పచ్చిదేరీ నిదివో నీయాచారాలు
పైకొని సాదించేవు పంతగానివలెనే

చ. 3: రవ్వలుగా నేఁ డాపె రచ్చలోఁ జెనకెనంటా
నవ్వులు నవ్వేవు నీవు నాతులెదుట
చివ్వన నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
తవ్వేవు వలపులెల్లా తగవరివలెనే

రేకు: 1483-2 తెలుగుఁగాంబోది సం: 24-494

పల్లవి: చెలులము మామాఁట సేయవచ్చు నిదివేళ
చెలఁగి యిదే నెప్మ చేసుకొనఁగదవే

చ. 1: పలుమారుఁ బిలిచినాఁ బలుకవు పతితోడ
చలపాదితనమేలే సకియకును
అలిగినందుకు గుఱుతౌనిది మెచ్చితిమి
వల పిఁక నాఁపరాదు వల దియ్యకొనవే

చ. 2: అంకెలఁ బెనఁగఁగాను ఆతనితో బిగిసేవు
మంకుఁదన మిదియేలే మగువకును
జంకించు వంచుకొన సందౌనిది నీకు మేలు
లంకె వాపరాదు యిఁక లలిఁ గాఁగిలించవే

చ. 3: సేసవెట్టఁగా నవ్వేవు శ్రీవేంకటేశుతోను
బేసబెల్లితనమేలే ప్రియురాలికి
చేసినపొందుల కివి చెల్లు నే మెచ్చఁగితిమి
వాసి గూడి మానరాదు వచ్చి మోవి ఇయ్యవే

రేకు: 1483-3 పాడి సం: 24-495

పల్లవి: మఱవఁగఁ బోలుదురు మనసులోపల మీరు
తఱితోడ నేనైనాఁ దలపించే నీకను

చ. 1: మేడమీఁదఁ గూచుండి మేమువచ్చే దెఱఁగక
ఆడరా జాణతనా లాపెయు నీవు
ఆడనెకాదా మరీనందుకొంటిరి విడేలు
వేడుకై నే నడిగితే వెరగందే రిపుడు

చ. 2: సింగారపుఁదోఁటలోన చేరి నేము నుండఁగానె
అంగవించి నవ్వుకోరా ఆకెయు నీవు
చెంగట నప్పుడేకాదా చేసన్న చేసుకొంటిరి
సంగడి నేఁ జూచితేను సాదించే రిపుడు

చ. 3: పట్టెమంచము మీఁదను పాదాలు నే నొత్తఁగానే
అట్టె కాఁగిలించుకోరా ఆకెయు నీవు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
చుట్టరికాలు చెప్పితే సోద్యమందే రిపుడు

రేకు: 1483-4 సాళంగనాట సం: 24-496

పల్లవి: ఊరకే తానేల నన్ను వొత్తుకవచ్చీనే వీఁడు
పోరచిగాఁ జెలులాల బుద్ధిచెప్పఁగదరే

చ. 1: తియ్యనిమోవులఁ గావా తెఱవలు వెంగేలాడి
చయ్యాటాలఁ బతులను సాధించేది
పయ్యదలోనున్న యట్టి పాలిండ్లేకావా
గయ్యాళిరతులలోన కడునాటేవి

చ. 2: చల్లనిచూపులే కావా సారెసారె భ్రమయించి
వల్లెవేసి వలపుల వలఁబెట్టేవి
పెల్లున మంచినున్ననిపిఱుఁదు లివే కావా
జల్లన గుండెగరఁచి సడిఁబెట్టేవి

చ. 3: నయగారి తనములనగవు లివే కావా
ప్రియము వుట్టించి పెడరేఁచేవి
నియతి శ్రీవేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
క్రియతో నారూపేకాదా కెరలించేది

రేకు: 1483-5 కాంబోది సం: 24-497

పల్లవి: ఈమాట విన్నవించరే యింతులాల విభునికి
దీమసపునాగుణము తెలియదా మీకు

చ. 1: బాస దప్పవద్దుగాని పరకాంతల నింటికి
వాసితోడఁ దెచ్చుకొంటే వలదనేనా
ఆసకొల్పవద్దుగాని అక్కడఁ దా నెటువలె
వేసా లెన్నిచేసినా వెంగెమాడేనా

చ. 2: పంతమాడవద్దుగాని భావించి నామే లెఱిగి
యెంత నాతో నవ్వినా నేఁటికనేనా
వింతసేయవద్దుగాని వేడుకకాఁడవై ఇట్లు
సంతోసానఁ దిరిగినా సాదించేనా

చ. 3: జోలిఁ బెట్టవద్దు చోటిచ్చి పానుపుమీఁద
యేలాగునఁ గూడినా యెమ్మెలాడేనా
వేళతోడ నన్నును శ్రీవేంకటేశుఁ డిదె కూడె
మేలములెన్నియాడినా మితిమీరేనా

రేకు: 1483-6 సాళంగం సం: 24-498

పల్లవి: అడుగరే యీమాట ఆతని మీరందరును
యెడయనిచోటను ఇగిరించుఁ బ్రియము

చ. 1: పొరపొచ్చమగుచోట పొసఁగవు మాటలు
గరిమ నొరసితేను కలఁగు మతి
సరవులు లేనిచోట చలము వెగ్గళమవును
వొరసి పెనఁగేచోట నుమ్మగిలు వలపు

చ. 2: వొలసీనొల్లనిచోట వొనరవు నగవులు
బలిమి చేసేటిచోట పంతమురాదు
అలుకలు చూపేచోట అమరదు వినయము
చలివాసివుండేచోట చండిపడుఁ బనులు

చ. 3: ననుపులేనిచోట నమ్మికచాలదు పొందు
అనుమానమైనచోట నంటదు రతి
యెనసినాఁడు శ్రీవేంకటేశుఁడు నన్నింతలోనె
తనివిలేనిచోట దైవారుఁ గోర్కులు

రేకు: 1484-1 వరాళి సం: 24-499

పల్లవి: ఏల సాములు సేసే వింతితోడను
జాలిఁబెట్ట కిఁక మోవి చవులియ్యరాదా

చ. 1: బాయిటఁ బవ్వళించి పడఁతిచన్నులు నీవు
చేయిచాఁచి పిసికేవు సిగ్గువడఁగా
రాయిడేల చేసే వారయ రాలవంటివి
వేయైన నీచేతులకు వెనకతీసీనా

చ. 2: యేఁకటతోఁ బానుపుపై యిరవైవుండినయింతి
పోఁకముడి విడిచేవు పొరలఁగాను
వేఁకపువలపులకు వేసినముడియ ఇది
తేఁకువ నీచేఁతలతో దీకొనీనా

చ. 3: మాఁగినమోవితోడ మంతనాన వున్న సతిఁ
గాఁగిటనే కుచ్చేవు కడునవ్వఁగా
దాఁగరానిచోటది తమితో శ్రీవేంకటేశ
పొఁగిననీయాసలకు పంతమిచ్చీనా

రేకు: 1484-2 ఆహిరి సం: 24-500

పల్లవి: చలమేలే యీతనిచనవు చేకొంటగాక
పెలుచైనవానితోడఁ బెనఁగఁగరాదు

చ. 1: తడయక పతి యెంతతరితీపులఁ బెట్టినా
పడఁతికి వేసరఁగఁ బాడిగాదు
చిడుముడి మరి నేమి సిగ్గులుమోవనాడినా
కొడిమ లెన్ని యతనిఁ గోపగించరాదు

చ. 2: కమ్మటి నేలినవాఁడు కాఁక యెంతసేసినాను
కొమ్మ కెప్పుడు నొడ్డించుకొనఁగరాదు
కమ్ముకొని యంతలోనే కడుబలిమిసేసినా
దిమ్ముఁరేఁచి యతనితో దీకొనఁగరాదు

చ. 3: పొంద్దైనవాఁ డెట్ల్ పొద్దులు గడపినాను
చందనగంధికి మీరి సాదించరాదు
అంది శ్రీవేంకటేశ్వరుఁ డదివో నిన్నుఁ గలసె
అందగాఁ డితని నెందు నలఇంచరాదు

రేకు: 1484-3 హిజ్జిజి సం: 24-501

పల్లవి: తనలోనే సిగ్గువడి తలవంచుకొన్న దిదె
మనవి చేకొని ఇట్లె మన్నిఁచవయ్య

చ. 1: సతి నీపైఁ జేయివేసి సంగాతాలెల్లాఁ జేసి
రతికిఁ బిలువఁగాను రమ్మనవద్దా
ఇతివరివైనదెల్లా నిందుకొరకా నీకు
మతిలోనిమే లెఱిఁగి మన్నించవయ్యా

చ. 2: మంతన మిందాఁకా నాడి మచ్చిక పాటలు వాడి
ఇంతలో మోవెడుగఁగా నియ్యఁగవద్దా
బంతి నీచుట్టరికము పరాకుసేసేకొరకా
మంతుకెక్క సేసవెట్టి మన్నించవయ్యా

చ. 3: వేడుకతోఁ జెక్కు నొక్కి వేమారు నీకు మొక్కి
వాడిక చూపఁగా నీవు వలపవద్దా
కూడె నిన్నలమేల్మంగ కొసరేకొరకా మేడా
మాడుగు శ్రీవేంకటేశ మన్నించవయ్యా

రేకు: 1484-4 సామంతం సం: 24-502

పల్లవి: గొల్ల దానఁ గదవయ్య గోవిందుఁడా
చిల్లరచేఁత లేఁటికిఁ జేసేవు గోవిందుఁడా

చ. 1: వుంగరమేలడిగేవు వువిదలు చూడఁగాను
కొంగువట్టితీసి నీవు గోవిందుఁడా
అంగవించి యొఁసగితి వల్లనాఁడె నాకు నిది
సింగారాలు నీకు బాఁతే చెల్లఁబో గోవిందుఁడా

చ. 2: వొడి యేల సోదించేవు వూడిగపువా రుండఁగా
కొడిమెల కోప నేను గోవిందుఁడా
కడలేనిరతులనుఁ గాఁగిలించితి వప్పుడే
తడవకు మర్మము లుద్దండపుగోవిందుఁడా

చ. 3: చన్నులేల పట్టేవు సవతులు నవ్వఁగాను
కొన్నేసిసుద్దులు చెప్పి గోవిందుఁడా
ఇన్నిటా శ్రీవేంకటాద్రి నిరవై నన్నేలితివి
మన్నించ పాయకుమీ ప్రేమమున గోవిందుఁడా

రేకు: 1484-5 పాడి సం: 24-503

పల్లవి: కామిని యందరిలోనాఁ గడుగోల
నీమనసుకొలఁదికి నేర్పవయ్యా కతలు

చ. 1: సెలవుల నవ్వఁగాను చేతులెత్తి మొక్కఁగాను
చలము సాదింతురా సతులతోను
అలిగివుండినదని అగడుసేసే వూరకే
చెలి యేమిసేయవలెఁ జెప్పవయ్యా బుద్ధులు

చ. 2: గుట్టుననే వుండఁగాను కొలువులు సేయఁగాను
బట్టబయలీఁదింతురా పడఁతులను
గట్టువాయతనమని కన్నవారితోఁ జెప్పేవు
చుట్ట మీకె నీవు చేసిచూపవయ్యా చేఁతలు

చ. 3: చెంతనే కూచుండఁగాను జిగిఁబాదాలొత్తఁగాను
పంతములాడుదురా భామలతోను
ఇంతలోఁ గూడి శ్రీవేంకటేశ కడుఁ గొసరేవు
వింతలే నివింకాఁ జదివించవయ్యా రతులు

రేకు: 1484-6 బౌళి సం: 24-504

పల్లవి: తేనెలు మోవి నూరె తెల్లవారెను
నానెఁ జెమటల మేను నవ్వితి నేననవే

చ. 1: గోరికొన వాఁడేయ కుచములు వేఁడేయ
గారవాన నేఁడు తనకాఁగిటిలోన
తారుకాణ లిదె వచ్చె తమకము గడుహెచ్చె
చేరి నన్ను మన్నించి చిత్తగించుమనవే

చ. 2: నిట్టూర్పులు బెట్టాయ నేరుపులు రట్టాయ
పట్టరానివయసుతో పానుపుమీఁద
నెట్టుకొనె నడియాస నిజమాయఁ దనబాస
యెట్టఇనాఁ దనమాట లియ్యకొంటిననవే

చ. 3: వేడుకలు మతి నిండె వెస వలపిదె పండె
మాడుపుటింటిలో తెరమఱఁగునను
యీాడనె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
వీడే లందుకొంటి మిఁక వేసరవద్దననే

రేకు: 1485-1 దేసాళం సం: 24-505

పల్లవి: నీకొలఁది వారమా నేమెల్లాను
పైకొని మమ్ముఁజూచి బతుకఁగఁగదవే

చ. 1: నలపే గుటిగాక వనితకుఁ బతికిని
సొలసి సొలసి యేమి జోలిదవ్వేవే
పిలుపే గుటిగాక ప్రియముగలయందుకు
బలవంతములేల పచారించేవే

చ. 2: పాయమే గురికాక బగివాయనివారికి
చాయలా సన్నలా నేమిసాదించేవే
కాయమే గుటిగాక కడలేని రతులకు
నాయములేల గడించి నవ్వు నవ్వేవే

చ. 3: వేడుకే గురిగాక వెలలేని పొందులకు
ఆడా నీడాఁ గూడి యెంత అలయించేవే
పాడితో శ్రీవేంకటాద్రిపతి నన్ను నిదె యేలె
జోడుగూడి నీవేల చొప్పులెత్తేవే

రేకు: 1485-2 రామక్రియ సం: 24-506

పల్లవి: ఇప్పుడే సిగ్గువడే విందరము నుండఁగాను
ముప్పిరి నేర్చుకొంటివి మునుప నీసుద్దులు

చ. 1: సరసములాడితేను చవిపుట్టు వలపులు
తరితీపు సేసితేను తమిరేఁగును
వొరశొరసి నవ్వితే నుల్లములు గరఁగును
సొరిది నీపతి నిటె చొక్కించఁగదవే

చ. 2: తప్పకచూచితేను తలకొను నాసలు
నెప్పునఁ బెనఁగితేను నిండు ముదము
దప్పిదేరఁ గొసరితే తతపోఁత లుప్పతిల్లు
చిప్పిల నీ వితనికి సేవసేయఁగదవే

చ. 3: సారెసారెఁ జెనకితే సమ్మతించు మనసులు
కోరి కాఁగిలించుకొంటే కూడుఁ బ్రేమము
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనే
మేరతో నీవునుఁ గూడి మెప్పించఁగదవే

రేకు: 1485-3 లలిత సం: 24-507

పల్లవి: వినరాదు నీసుద్దులు విని పూరకుండరాదు
ఘనుఁడైనపతినేల కరకరించేవే

చ. 1: చేరివచ్చి నిన్నాతఁడు చెక్కునొక్కి వేఁడుకోఁగా
సారెసారె నీవేల సాదించేవే
కూరిమి గొసరి నీకుచ్చుల పట్టితీసితే
దూరి నీవెంతేసి దుండగాలాడేవే

చ. 2: విందువలె మోవిఇచ్చి విడెము చేతి కియ్యఁగా
సందడిం చాతని నెంతజంకించేవే
కందువనుండి పెనఁగి కాఁగిలించుకొనఁగాను
మందెమేళమున నెటు మారుకొనేవే

చ. 3: ఇంటిలో శ్రీవేంకటేశుఁడిట్టె నిన్నుఁ గూడఁగాను
అంటిముట్టి రతి నెంత అలఇంచేవే
నంటున సెలవులను నవ్వులెల్లా నవ్వఁగాను
దంటవై కమ్మటినేల తమకించేవే

రేకు: 1485-4 మంగళకౌసిక సం: 24-508

పల్లవి: ఈరీతి వేరొకతైతే ఇద్దరిని వింతసేసు
సైరణతో నున్న దెంతసాదోకాని

చ. 1: పువ్వుల నాపెను నీవు వూఁచివేయఁగాఁ జూచి
నివ్వెరగుతో నీకె నిలుచున్నది
యెవ్వరి నేమీ ననదు యెగసక్కెములాడదు
జవ్వని తానికి యెంతసాదోకాని

చ. 2: వనితపై నీవు గడువసంతమాడఁగఁ జూచి
తనలోనే తాను చింతతో నున్నది
కనలి కోపించదు కాతరాన నలుగదు
చనవుమెరసీ నెంతసాదోకాని

చ. 3: పట్టపుదేవులు నీవు బైకొని కూడఁగాఁ జూచి
గట్టిగాఁ గాఁగిట నిన్నుఁ గలశున్నది
యిట్టె శ్రీవేంకటేశ యేమీ నిన్నుఁ దడవదు
జట్టిగొని మొక్కీ నెంతసాదోకాని

రేకు: 1485-5 నాదరామక్రియ సం: 24-509

పల్లవి: బుద్ధి చెప్పవయ్యా నీపొలఁతికిని
వుద్దండాన నీవలనివుపేక్ష యిదెనరా

చ. 1: యెవ్వతో నీవెంట వచ్చి యెమ్మెలెల్లా నాడుకోఁగా
నవ్వటిల్ల నీకె విని నిన్ను దూరెను
పువ్వువలె నీకుఁగానే పూనుకవచ్చీఁ దాను
యెవ్వరైనా నీమతక మిదియెల్లా ననరా

చ. 2: కావరించి యెప్పటిని కటారువట్టుక వుండి
నీవద్ద నే నవ్వఁగాను నిన్ను దూరెను
ఆవేళఁ దా నందుకుఁగా నౌఁగాదనవచ్చీని
యీవల నీసలిగెలే యెంతసేసీ ననరా

చ. 3: జట్టి గొనేదియుఁగాక సరుసనే కూచుండి
నెట్టనఁ గాఁగిలించఁగా నిన్ను దూరెను
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి మాచెలిని
అట్టుగా నీతగవు లాఖిడిఁబడె ననరా

రేకు: 1485-6 దేసాళం సం: 24-510

పల్లవి: ఎంతవడిదాఁకానే నీయెలయింపులు
పంతము లిప్పుడే నీవు పచరించఁదగునా

చ. 1: వెలయ నన్నీఁజేసినవిభుడే వేఁడుకొనఁగా
చలపాదితనమేల సకియకును
వలచినవలపులు వడి నెదలో నుండఁగ
వెలుపల వట్టిగుట్టు వెదచల్లఁదగునా

చ. 2: ఆసలఁబెట్టియేఁచినయాతఁడే పైకొనఁగాను
వేసదారియలుకేలే వెలఁది నీకు
సేసవెట్టినపెండ్లి చేతిలోనే వుండఁగాను
బేసబెల్లిబిగువులు పెనఁచఁగఁదగునా

చ. 3: వెక్కసపుసుద్దుల శ్రీవేంకటేశుఁడే కూడఁగా
కక్కసించ నింతయేల కాంతరో నీకు
మిక్కుటపురతిసొంపు మేనిమీఁద నుండఁగాను
జక్కనగుబ్బల నొత్తి జఱయఁగదగునా

రేకు: 1486-1 శుద్ధ వసంతం సం: 24-511

పల్లవి: కాంతలెల్లా నేటిఁగిరి కందువ మీసుద్దులు
చెంతనుండి ఇంత రట్టుసేసుకొందురా

చ. 1: జలజాక్షికొప్పులోనిసంపెంగపువ్వులు రాలె
పెలుచుఁదనాన నీవు పెనఁగఁగాను
తిలకించ యప్పటిని తెరలోనికిఁ దియ్యఁగ
గలగల నందెలు గజ్జెలుఁ గదలెను

చ. 2: అంగనగుబ్బలమీఁదిహారములు చిక్కువడె
రంగుగా నంటిముట్టి సరసమాడఁగా
చెంగటనే గిలిగించి చిమ్మిరేఁగ నవ్వించఁగా
సింగారపుఁ బయ్యదల్లా చెమటఁ దడిసెను

చ. 3: కామినినిట్టూర్పుల గాలి విసరఁగఁజొచ్చె
ఆమనిరతుల నాకె నలయించఁగా
యేమరించి శ్రీవేంకటేశ నీవీఁకె గూడఁగా
దోమటిమోవితేనెలు తొటతొట నూరెను

రేకు: 1486-2 బౌళి సం: 24-512

పల్లవి: ఇన్నాళ్లు నెఱఁగవైతి వింతేసి నీవు
సన్నలా చాలయా నాపె చదివించెను

చ. 1: యితరసతులతో నీ వెపుడు మాటాడకుండా
వ్రతము వట్టించెనా వనిత నీకు
సతమై నమ్మనచోట చలము సాదించుమని
నుతికెక్క బుద్ధులెల్లా నూరిపోసెనా

చ. 2: యేచి రతివేళ మోవి యెంగి లంటించకుమని
ఆచారాలు నేరిపేనా అంగన నేఁడు
చేచేతఁ గాఁగిలించితే సిగ్గులువడేయట్టుగా
లాచి నీమనసులో మొలవఁబెట్టెనా

చ. 3: తడవి చెనకినాను తలవంచుకొనుమని
గడుసరిఁ జేసెనా కామిని నిన్ను
ఆడరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
వుడివో కీగుణ మాకె వుపదేశ మిచ్చెనా

రేకు: 1486-3 సౌరాష్ట్రం సం: 24-513

పల్లవి: నీకెంత ఇతవైనదో నే నెఱఁగను
కాకు సేసి నవ్వేరు కాంతలెల్లా మిమ్మును

చ. 1: పంతములకే వచ్చిని పరాకుచేసినాఁ బోదు
వంతులకే పెనఁగీని వనిత నీతో
యెంత చనవిచ్చితివో ఇందరిలో నీపెను
వింత లివి గనుఁగొని వెరగయ్యీ నాకు

చ. 2: వాడికనవ్వులు నవ్వీ వదన్నా మానదు
యీడువట్టు కొనవచ్చీ నింతి నీతోను
యేడ బాసలిచ్చితివో యీకె నింతసేసేనని
చూడఁజూడ నింతలోనే సోద్యమయ్యీ నాకు

చ. 3: చలములకే పైకొనీ చాలునన్నా విడువదు
బలుములే చూపీని భామ నీతోను
యెలమి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
అలరి యాపెసుద్దుల కరుదయ్యీ నాకు

రేకు: 1486-4 ముఖారి సం: 24-514

పల్లవి: కొమ్మలిద్దరు నుండఁగాఁ గొంకీఁగాని
చిమ్ముఁజూపులతో లాచీ నిదె నీయెదుట

చ. 1: వేడుకైనసుద్ది నీతో విన్నవించ సిగ్గువడీ-
నాడ నాకె నానవెట్టి యడుగవయ్యా
బేడుకోలుఁదనమున పెండ్లి మాట గాఁబోలు
చూడు ముసిముసినవ్వు చూపీ నీయెదుట

చ. 2: కలికి మాటుననుండి కానుకలియ్య సిగ్గువడీ
తిలకించి చేయిచాఁచి తీసుకోవయ్యా
అలనాఁ డేమంటివో నేఁ డాపనికిగాఁబోలు
తెలుసుకో లాలించితే తెలిపీ నీయెదుట

చ. 3: ముందర నీకు నిలిచి మొక్కుతానే సిగ్గువడీ -
నందుకుఁ గాఁగిట నీవు నలమవయ్యా
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
అందుకో విడెము నీకు నందిఇచ్చీ యెదట

రేకు: 1486-5 శంకరాభరణం సం: 24-515

పల్లవి: ఇద్దరుఁ గూడితి రీసు లిఁకనేల
వొద్దికాయ నాతనితో నొక్కటి గాఁగదవే

చ. 1: చనవు వెగ్గళమైతే జడియనేల
మనసు లేకములైతే మరుగనేల
వొనరినపొందులైతే నొరయనేల
వినయానఁ బతిచేతివిడె మందుకొనవే

చ. 2: యితవులైవుండితేను యెరవులేల
రతు లొనగూడితేను రవ్వలేల
ప్రతినలు చెల్లితేను పంతములేల
మతకము లెల్లా మాని మాటలాడఁగదవే

చ. 3: వేడుకలు వుట్టితేను వేసటలేల
జోడై వుండినచోట సోదించనేల
యీడనే శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను
జాడతో నాతనిమోవి చవిగొనఁగదవే

రేకు: 1486-6 మాళవి గౌళ సం: 24-516

పల్లవి: నీవెట్లా నుండినాను నీకేమయ్యా
మావంటివారికి నేమము వలెఁగాక

చ. 1: మగవాఁ డేమిసేసినాను మరి యేడా నెగ్గులేదు
తగవులు దప్పినాను తప్పులెంచరు
జిగిమీరి సిగ్గువిడిచినాఁ గాదనియనరు
మగువలనై తేను మనసు లొరతురు

చ. 2: దొరపాటివానికి దోసము గలదనరు
విరసాలు చేసినాను వెఱపులేదు
పొరపొచ్చాన నుండినా బుద్ధులుచెప్ప రెవ్వరు
తరుణుల మాఁటలే తగ ఱట్టుసేతురు

చ. 3: వేడుకకాని సేఁతలు వెల్లవిరిగాఁ జేయరు
యేడనుఁడి వచ్చినాను యేమీననరు
కూడితిని నన్ను నేడు కూరిమి శ్రీవేంకటేశ
చేడెలు నీవద్దనుంటే చెలఁగి నవ్వుదురు

రేకు: 1487-1 శ్రీరాగం సం: 24-517

పల్లవి: రమ్మనవే రమణుని రతికేలికి
పమ్మినతరితీపులభావ మొక్కటే

చ. 1: చెమటలఁ దొప్పఁదోఁగేసింగారాలే వింతగాని
తమకము సరియే తనకు నాకు
మమకారములతోడిమాఁటలే వింతగాని
సుముఖపుమొగమోటచూపు లొక్కటే

చ. 2: నగువేళ సెలవులనవ్వులే వింతగాని
తగులమి సరియే తనకు నాకు
అగపడ్డప్రియములఅసలే వింతగాని
వెగటుగాని మోవులవిందు లొక్కటే

చ. 3: పలుమారు గాఁగిటిలో పంతములే వింతగాని
తలఁపులు సరియే తనకు నాకు
అలమి శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
కలకాలముఁ బాయనికాంక్ష లొక్కటే

రేకు: 1487-2 ఆహిరి సం: 24-518

పల్లవి: ఎంతచేసినా నీకు నెదురాడేనా
బంతినే మమ్మేల వొడఁబరచేవు నీవు

చ. 1: మాట లెన్నిలేవు నీవు మాపుదాఁకా నాడితేను
చాటువగా నేము వినఁజాలముగాక
వాఁటమై యుందాఁకా నాపెవద్ద నుండి వచ్చి నేఁడు
పాటించి మమ్మేల వొడఁబరచేవు నీవు

చ. 2: చేఁత లెన్నిలేవు నీవు చెంతనుండి చేసితేను
వూఁతగాఁ దప్పకచూడనోపముగాక
పాఁతపడఁతికి నిట్టె బాసలెల్లాఁ జేసివచ్చి
బాఁతితో మమ్మేల వొడఁబరచేవు నీవు

చ. 3: మొక్క లెన్నిలేవు నీవు మునుకొని మొక్కితేను
నెక్కొని సమ్మతించనేరముగాక
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పక్కన మమ్మేల వొడఁబరచేవు నీవు

రేకు: 1487-3 బౌళి సం: 24-519

పల్లవి: అప్పటిఁ గొసరనేల ఆసోదమా
తప్పక నన్నుఁ జూచినతగనిదె చాలదా

చ. 1: అరిదివలె మాయింటి కటు నీవు వచ్చితేను
వరుసకు రానంటా వాదింతునా
గరిమ నీపాటివుపకారము చేసిననిను
సరుస మెచ్చుటగాక సాదించవచ్చునా

చ. 2: మచ్చిక నెట్టకేలకు మాటలు నీవాడితేను
ఇచ్చకములాడవంటా యీసడింతునా
విచ్చ నీచుట్టరికము నెరపినయట్టునిన్ను
రచ్చ నుతించుటగాక రాఁపుసేయవచ్చునా

చ. 3: చేయిచాఁచి ఇన్నాళ్లకు చెనకి కాఁగిలించితే
కాయము చొక్కించవంటా కాఁతాళింతువా
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేండు
పాయకవుండుటగాక పంగించవచ్చునా

రేకు: 1487-4 దేసాళం సం: 24-520

పల్లవి: సాదించనేఁటికి నీవు సారెసారెకు
భేదములేక కూడితే పెనఁగులాడేమా

చ. 1: చెంగటనుండి నీవు చేసినదెల్లాఁ జేయఁగా
అంగనలము మాలో నేమాడుకోరాదా
సంగతిగా నీవు తొల్లె సాదువలె నుండితేను
పంగించి నిన్నటు భంగపరచవచ్చేమా

చ. 2: వుడివోనిచిన్నలు నీవొళ్లిమీఁద నుండంగాను
నడుమ మాలో నేము నవ్వుకోరాదా
సడిలేని గుణముతో చక్కఁగా మెలఁగితేను
కొడిమెలు గట్టి నిన్ను కోపగించేమా

చ. 3: కప్పి యందరివి నీవు కాఁగిలించకూడఁగాను
చొప్పులు మాలో నేము చూచుకోరాదా
యెప్పుడూ శ్రీవేంకటేశ యెడయక యేలితేను
తప్పులెంచి నీసుద్దులు తారుకాణించేమా

రేకు: 1487-5 గౌళ సం: 24-521

పల్లవి: మంచివానివలెనే మాటలాడేవు
అంచెల వచ్చితి విట్టే ఆప్పు డెందువోయేవు

చ. 1: చింతతో నే నుండఁగాను చెవిలో నేకతమాడే-
వెంతలేదు నీవలపు యేమిచెప్పేది
కాంతచేఁ బిలువనంపి కాచుకుండితి నిందాఁకా
అంతటా వెదకించితి నప్పు డెందువోతివి

చ. 2: విరహాన నే నుండఁగా వెనకనే నిలుచుండి
యెరవులు చేసుకొనే వేమి చెప్పేది
సరుగ నీరాకలకు సగినాలు చూపించితి
అరుదుగా బత్తిసేసే వప్పు డెందువోతివి

చ. 3: నవ్వేరగై నే నుండఁగా నీవె నన్నుఁగూడితివి
యెవ్వరుండుటా నెఱఁగ వేమి చెప్పేది
రవ్వగా శ్రీవేంకటేశ రతికి నిన్నే కోరితి
అవ్వలిమోమై నవ్వే వప్పు డెందువోతివి

రేకు: 1487-6 సామంతం సం: 24-522

పల్లవి: ఇట్టుండవలదా ఇద్దరివలపులు
దట్టమాయ రతితమకము లిపుడు

చ. 1: కల గని రమణుఁడు కాంతకుఁ జెప్పఁగ
కలకలనవ్వీఁ గడు నాకె
తలకొని యందేమి తగులఁగ నాడెనో
కలుగఁబోలు నిదె కంటిమి సిగ్గు

చ. 2: పొద్దు వోకకత పొలఁతికిఁ జెప్పఁగ
అద్దలించె మరి యాతనిని
వుద్దండా లందులో నున్నవి యేఁటివో
కద్దుగాఁబోలును కంటిమి సిగ్గు

చ. 3: వరుసతో నీతఁడు వావులు చెప్పఁగ
వొరిసి గోరఁ జెలి యూఁదె నిదె
సిరులఁ గూడె నీ శ్రీవేంకటేశుఁడు
కరఁగఁ బోలును కంటిమి సిగ్గు

రేకు: 1488-1 ఆహిరి నాట సం: 24-523

పల్లవి: ఏమేమి నీవు సేసినా నితవే నాకు
గామిడితనాన నిన్నుఁ గాదుగూడ దనను

చ. 1: వొద్ద నీవ్వేతెఁ బెట్టుకొన్న సంతోసముగాని
గద్దించి నీమీఁద మతి గలఁగదు
పొద్దున రాకుండితేను బుద్దులు చెప్పుదుఁగాని
అద్దపుమోము చిన్నఁబో దందుకల్లా నాకును

చ. 2: నీ వెందు వలచినా నేను సమ్మతింతుఁగాని
ఆవలిచెలులుతోడ నాడుకో నేను
చేవమీర నేడసుద్ది చెప్పినా నవ్వుదుఁగాని
వేవేలైనా నిన్ను వెంగెముగాఁ జూడను

చ. 3: వొక్కతెసొమ్ములు నీమైనుంటేఁ బొగడుదుఁగాని
గక్కన నేనెంతైనాఁ గాఁతాళించను
నిక్కపుశ్రీవేంకటేశ నే నలమేలుమంగను
మక్కువ నన్నేలితివి మఱవ నే నిఁకను

రేకు: 1488-2 సామంతం సం: 24-524

పల్లవి: చిత్తమెట్టో యెఱఁగను చెలువుఁడ నీకు
మెత్తనిమనసుదాన మిక్కిలి మోహింతును

చ. 1: వెలి నెవ్వతైనా నిన్ను వెంగెమాడి నవ్వుఁగాని
పొలసి నేనైతే నిన్నుఁ బొగడుదును
పొలయలుకఁ గొందరు పొంచి నిన్నెలయింతురు
కలఇకలనే వూడిగముసేతు నీకును

చ. 2: కాతరించినది నిన్నుఁ గన్నుల జంకించుఁగాని
చేతులెత్తి మొక్కుదును చేరి నేనైతే
యేతరివాండ్లు నిన్ను యెందుకైనాఁ బిలుతురు
యీతల నిల్లాలనై నీఇంట నే నుండుదును

చ. 3: చలమరైన దొకతె సాదించుఁగాని నిన్ను
పిలిచి ప్రియముసేతుఁ బ్రేమ నేనైతే
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అలర నేలితివి నిన్నన్నిటా నే మెత్తును

రేకు: 1488-3 పాడి సం: 24-525

పల్లవి: నామన సేమిచూచేరే నడుమ నోచెలులాల
ఆముకొని నావిభునిఆత్మలో నుందానను

చ. 1: ప్రేమముగలవనిత ప్రియములు చెప్పఁగాక
యేమైన రమణుని కెదురాడునా
కామించి వచ్చినది కడుబత్తిసేసుఁగాక
సామాన్యపుఁబనులకు సాదించునా

చ. 2: తగుచుట్టమైనది తలఁపులో వచ్చుఁగాక
వెగటుగా నడచిన వేసారునా
నగ వెరిఁగినది మిన్నక ఇయ్యకొనుఁగాక
యెగసక్కెమాడినా యీసడించునా

చ. 3: కడువితవరైతేను కాఁగిటఁ జొక్కించుఁగాక
యెడసినతప్పులెల్లా నెంచుకొనునా
బడి నలమేల్మంగను పతి శ్రీవేంకటేశుఁడు
తడయక నన్నేలేవింతటి గోరకుండు నా

రేకు: 1488-4 ఆహిరి సం: 24-526

పల్లవి: విరహమే తోఁచదు విభుఁడ నీతో నాకు
మరిగినయిటువంటి మరు లెటువంటిదో

చ. 1: తక్కక యేపొద్దు నాకుఁ దగులైవుందువుగన
పక్కనున్నట్టే వుందువు పాసివున్నాను
అక్కరతో ముచ్చటాడే అలవాటు గద్దుగన
వొక్కటైమాటాడినట్టేవుందు వూరకుండినాను

చ. 2: కాచు కెప్పుడు మోమునఁ గట్టినట్టుందువుగన
చూచినట్టుందువు నీవు చూడకున్నాను
యేచి కలలోనా నీవే యెనసివుందువుగన
యీచొప్పే మతిలో నుండు యే పరాకైనాను

చ. 3: యెలమి నాఇంటిలోనే ఇరవై వుందువుగన
తలఁపులోనే వుందువు దండనున్నాను
అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
అలముకుందువు నీ వరుదైవున్నాను

రేకు: 1488-5 వరాళి సం: 24-527

పల్లవి: తానేల సిగ్గువడీనే తడవ నేను
పూని తన్ను దేవరఁగాఁ బూజింతు నేను

చ. 1: అలసివచ్చినవాని కటు విసరుదుఁ గాని
అలరి యాపనులెల్ల్ నడుగ నేను
చెలపచెమటలెల్లా చేతనే తుడుతుఁగాని
జలకమాడి రమ్మని సాదించ నేను

చ. 2: నిదుల కన్నుల నుంటే నేఁ బాదాలొత్తుదుఁగాని
చెదరుచు యెఱుకలు సేసుకో నేను
పెదవులు వాడితే దప్పికి విడెమిత్తుఁగాని
పొదిగి మొగము చిన్నఁబుచ్చుకొన నేను

చ. 3: చిత్తజచిహ్నాలు చూచి చేరి కాఁగిలింతుఁగాని
వొత్తి యాడవని మరీ నొరయ నేను
హత్తెను శ్రీవేంకటేశుఁ డలమేల్మంను నేను
కొత్తలుగా నేలె నిఁక కొసర నేను

రేకు: 1488-6 ముఖారి సం: 24-528

పల్లవి: ప్రియములు చెప్పఁగను బిగియనేల
రయమున లోనికి రమ్మనవే నీవు

చ. 1: వలచినదానికి వాసు లెంచుకోఁదగదు
చెలిమిగలదానికి చింత వలదు
కలసిన యిల్లాలికి కాదుగూడదనరాదు
పిలువవే నీమగనిఁ బేరుకొని యిపుడు

చ. 2: పాయలేని దానికి పంతాకుఁ బనిలేదు
పాయపుదానికి నెగ్గుపట్టనేఁటికి
చాయకత్తైనదానికి సాదించి పోరఁగూడదు
చేయివట్టి తియ్యఁగదే చెనకి యీతనిని

చ. 3: చుట్టమైనదానికి సోదించి చూడఁగరాదు
గుట్టెరిఁగినదానికి గుంపించనేల
ఇట్టె శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనే
ముట్టి కాఁగిలించుకోవే ముదమందీఁ దాను

రేకు: 1489-1 సాళంగనాట సం: 24-529

పల్లవి: ఏమయ్యా నీతో నాకు నెంతమందెమేళము
నీమోము చూచుకుండుటే విధానముగాదా

చ. 1: చనవిచ్చితినంటాను జాణతనాలాడేదా
వినయముతో నీమాట వినుటగాక
చెనకితివంటాను చేతులు పైఁజాఁచేదా
మనసెరిఁగి మొక్కుటే మంచిదిగాక

చ. 2: కై దండ వట్టితివంటాఁ గాళ్ల నిన్నుఁ దొక్కేదా
ఆదెస నీదయగల్తే నయ్యీఁగాక
సాదనంటాఁ బొగడితే చన్నులు దాఁకించేదా
పోదితో గర్వములేక పొదుగుటగాక

చ. 3: కలసితివంటా బింకముతోడఁ బెనఁగేదా
మెలుపునీరతులకు మెచ్చుటగాక
అలమేల్మంగను నేను అట్టే శ్రీవేంకటేశ్వర
తలఁపులో మెలఁగుటే తగవుగాక

రేకు: 1489-2 దేసాళం సం: 24-530

పల్లవి: చెలులభాగ్య మాతనిచిత్తముగా
తలకొని యాఁకారఁ దమకేఁటికి

చ. 1: పెక్కుసతులమగఁడు ప్రేమ వొకతెపైనుంటే
తక్కినకాంత అడుగఁ దమకేఁటికి
చిక్కనిచెమటమేనఁ జిప్పిలఁగ దొరకంటే
తక్కరితనాల నవ్వఁ దమకేఁటికి

చ. 2: మనసుపెట్టినవాఁడు మాటొకతెతో నాడితే
తనువులఁ గాఁకరేఁగఁ దమకేఁటికి
కనుఁగొని యాతనికాంక్షలు దీరకుంటే
తనియఁడంటా దూరఁ దమకేఁటికి

చ. 3: కడువేడుక్కెనవాఁడు కాఁగి లొకతె కిచ్చితే
తడఁబడి పైకొనఁ దమకేఁటికి
పడఁతెలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
తడయ కేలితే సిగ్గు దమకేఁటికి

రేకు: 1489-3 తెలుగుఁగాంబోది సం: 24-531

పల్లవి: ఎంత చెప్పుదును మోహ మీతనిమీఁద
చింతించఁజాల నే కక్కసించినట్టౌనను చు

చ. 1: కడుసింగారపుమేను కసుగందునోయని
జడిసి తప్పకచూడఁజాలనే నేను
యెడయక తనసుద్దు లెవ్వతె వినీనోయని
నుడుగఁగఁ జాలనే నోరెత్తి నేను

చ. 2: నెమ్మది నిండుమనసు నీరై కరఁగునోయని
సమ్మతిఁ జన్నుల నొత్తఁజాలనే నేను
కమ్మటి వలలఁబెట్టి కదిమినట్టౌనోయని
చిమ్ముచు నవ్వఁజాలనే సెలవుల నేను

చ. 3: చినుకురతిఁ జెమట చిమ్మిరేఁగునోయని
పెనఁగఁగఁజాలనే బెట్టుగా నేను
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తనివొందించఁజాలనే తమితోడ నేను

రేకు: 1489-4 సామంతం సం: 24-532

పల్లవి: ఓయమ్మ నేనెంతదాన నూడిగము సేసేఁగాక
పాయనివోసకులాల పతితో మీరవరే

చ. 1: వెక్కసమై తనకు నే విన్నపాలు సేసుకోఁగా
యెక్కడ నుండులో చిత్త మేమిసేతునే
చక్కనితనరూపము సారెఁ జూడఁగా నెవ్వతె-
దిక్కు చూచునో రెంట దెప్పరమై వుండఁగా

చ. 2: యేకతానకువచ్చి నే నింపులువుట్టించేనంటే
యేకాంతను రమ్మన్నాఁడో యెఱఁగఁగదే
చేకాను కిచ్చితేను చెలకైదండ వదలి
పైకొని నిమ్మపండ్లభార మానవలెఁగా

చ. 3: కనుసన్నలనే వచ్చి కాఁగిలించుకొనేనంటే
పెనఁగేటిరతులలో ప్రియ మెట్టిదో
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చినాఁడు తానే సంతోసించవలెఁగా

రేకు: 1489-5 ఆహిరి సం: 24-533

పల్లవి: వెలది యిట్టుండితేను విభునిచిత్తము వచ్చు
బలవంతకోలైతే పలుక నేమున్నది

చ. 1: పతి పరాకైవుండితే పైపై నెచ్చరించవలె
మితితో సన్న యెఱఁగి మెలఁగవలె
యితవైనమాటలాడి యింపుల మెప్పించవలె
తతితోఁ గొలువసేసి దండ నుండవలెను

చ. 2: మొగమెత్తి చూచితే మోహము చల్లఁగవలె
నగితేఁ గమ్మటీ మారు నగవలె
బిగువుఁజన్ను లంటితేఁ బ్రియపడి వుండవలె
జిగిఁ జెనకితే గుట్టుచేసుకోవలెను

చ. 3: వేడుకతో మన్నించితే వినయము చూపవలె
జోడై యేకతాన రతిఁ జొక్కించవలె
యీడనె శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
కూడితి మిందరి కివే గుణాలు గావలెను

రేకు: 1489-6 బౌళి సం: 24-534

పల్లవి: తగిలి నాచేతలలో తప్పులు లోఁగొనవయ్య
మొగిచినచేతులతో మొక్కేను నీకును

చ. 1: శిరసు మజ్జనమార్చి విరులు నే ముడువఁగా
ఆరిది నాగోరేడనంటెనో నిన్ను
గరిమ నీమేన నిండా కస్తూరి నేఁ బూయఁగాను
వొరసి నాగుబ్బ లెంత వొత్తెవే నిన్ను

చ. 2: మిక్కుటపు సొమ్ములు నీమేన నిండాఁబెట్టఁగాను
చెక్కుల నాచెమటెంత చిందెనో నీపై
అక్కరతో విడెమిచ్చి అండ నిలుచుండఁగాను
గక్కన నానీడ యెంత గప్పెనో నీపైని

చ. 3: గాఁటపునీరతుల నేఁ గాఁగిలించి కూడఁగాను
సూటి నానిట్టూర్పు లెంత సోఁ కెనో నేఁడు
యీటున శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
తాటించి నావలపెంత తగిలెనో నేఁడు

రేకు: 1490-1 ముఖారి సం: 24-535

పల్లవి: బాపుబాపు నీవంటిపతికి నిల్లాలనైతి
నీపై వలపే నాకు నిచ్చకల్యాణము

చ. 1: యెంత నోమునోఁచెనో యీచనుఁగొండలు, నేఁడు
వంతుల నీకరపల్లవములు ముంచె
వింత లెట్టిభాగ్యము గావించెనో చెక్కుటద్దాలు
పొంత నీరూపమునీడ పొలయఁగలిగెను

చ. 2: యేమి దపము చేసెనో యీకన్నుఁగలువలు
నీముఖచంద్రునిపొందు నెమ్మిఁ గలిగె
కామించి యేమి పుణ్యమో కందువనామోవిపండు
వోముచు నీమూర్తికి నుపారమాయ

చ. 3: యెన్నటితగులాయమో యీబాహులతలకు
వన్నె నీరతి చెమటవాన గలిగె
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
కన్నెనాటనుండి నీతో కాఁపురము గలిగె

రేకు: 1490-2 భైరవి సం: 24-536

పల్లవి: ఏమని పొగడుదు నీ విట్టివాఁడవు
కామినులపాలిటికి కల్పవృక్షమైతివి

చ. 1: మగువలు యేమాడినా మనసే కలఁగునా
తగునీగుణము సముద్రమువంటిది
సొగసి యెంత సోదించి చూచినాఁ గానవచ్చునా
మిగులా నీమన సిట్టె మిన్నునేలవంటిది

చ. 2: కిమ్ముల నెవ్వతె నిన్ను కినిసినాఁ జెదరునా
నమ్మననీదయ విధానమువంటిది
నెమ్మి యెంతగలిగినా నెట్టనఁ జంచలించునా
పమ్మిననీమన్నన పైఁడికుండవంటిది

చ. 3: చిక్కించు కెవ్వరు నిన్ను చెందినా మొగచాటౌనా
తక్కక నీరతి యమృతము వంటిది
ఇక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిక్కిలి నన్నేలితివి మేలుగలవాఁడవు

రేకు: 1490-3 సామంతం సం: 24-537

పల్లవి: నిలుచున్నాఁ డదె నీయెదుటా
నిలువునఁ గాఁగిట నించఁగదే

చ. 1: చలమునఁ బతి నిటు సాదించకువే
బలిమి చూపి కడుఁబదరకువే
వెలఁబడ సణఁగులు వెదచల్లకువే
నెలకొని యెమ్మెలు నెరపకువే

చ. 2: పంతము లీగతిఁ బచరించకువే
కొంతపుఁజూపులఁ గొసరకువే
దొంతరబీరాలు తొరలించకువే
చెంతల నూరక చెనకకువే

చ. 3: యెదుటనుండి బయలీఁదించకువే
పెదవుల గొణఁగుచు బిగియకువే
యిదివో శ్రీవేంకటేశుఁడు నన్నేలె
ఆదన రతుల నీ వలయకువే

రేకు: 1490-4 ఆహిరి సం: 24-538

పల్లవి: మరునిబలాలమీఁద మనకేల వైరము
పరగఁ గూడినమీఁద పగ యెంచఁదగును

చ. 1: తుమ్మిదలఁ బోల్చితే తొయ్యలికొప్పు నెరులు
తెమ్మలుగా పువుటమ్ములతేనెలు దాగు
తమ్మిరేకులఁ బోలుచఁదగు కాంతకన్నులు
నెమ్మి నావేళఁ జంద్రుఁడు నిలువరా దెదుట

చ. 2: ధర గొండలఁ బోల్చితే తరుణి చన్నుఁగవ నేఁ-
డిరవై గాలి మెలఁగ నెడమియ్యదు
కరికుంభాల చెలిపిరుఁదు వోలిచితేను
సరిఁ జెఱకువిల్లని చప్పరించును

చ. 3: అతివను బంగారుబొమ్మని తగఁబోల్చితేను
ఇతవై మన్మథకళ లీపెనే చేరు
ఇతఁడు శ్రీవేంకటేశుఁ డీలేమ యలమేల్మంగ
మతి నిద్దరిఁబోలితే మదనుని గెల్తురు ||మరు.

రేకు: 1490-5 గౌళ సం: 24-539

పల్లవి: చక్కనివాఁడ వన్నిటా జాణవు నీవు
యిక్కడ నాసంతోష మెంతనఁగవచ్చును

చ. 1: కన్నుల నన్నుఁజూచితే కాఁగిలించినట్టవును
సన్నసేసితే వలపు చల్లినట్టౌను
చిన్నినవ్వు నవ్వితేను సేసవెట్టి నట్టౌను
విన్నవించ నెట్టువచ్చు వేడుక నాలోనిది

చ. 2: సారె మాటాడితే మోవి చవిగొనన ట్టౌను
చేరితేనే మేలెల్లా వచ్చినయట్టౌను
నేరుపుతోఁ జెనకితే నెమ్మిఁబెండ్లాడినట్టౌను
పేరుకొన నెట్టువచ్చు ప్రియములు నాకు

చ. 3: మతి నీవు దలఁచితే మర్మము సోఁకినట్టౌను
రతిఁ గూడితేను కరఁగినట్టౌను
యితవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
తతిఁ బాయకుండితేను దక్కినట్టౌను

రేకు: 1490-6 సాళంగం సం: 24-540

పల్లవి: నావోజలే రమణుఁడ నన్ను నింతసేసీఁగాక
నీవొళ్ల నేమైనాను నేరములు గలవా

చ. 1: హత్తి నీతో నే మాటలాడ సిగ్గువడితేను
చిత్తముతో తమకము చిమ్మిరేఁచీని
మొత్తానఁ గూరిమిదాఁచి మోమువంచుకొంటేను
యెత్తించీఁ గమ్మటిఁ దామే ఇవివో నాయాసలు

చ. 2: అడఁకువతో నే నాయగ్గలిక మాన్పుకొంటే
నడుమ నావేడుకలు నవ్వించీని
బడినుండే నామనసు పరాకు సేసుకుంటే
బెడిదపుజవ్వనము పెడరేఁచీని

చ. 3: కదిసి నే వినయానఁ గాఁగిలించుకుండితేను
యిదె నామైమఱపులు యెనయించీని
అదన శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
పొదిగి నాపొందులే బోదించీని

రేకు: 1491-1 మాళవి గౌళ సం: 24-541

పల్లవి: ఇట్టుండవద్దా పతికి నీడుజోడై నవనిత
మట్టుమీర దెంతైనా సమ్మతి నుండుఁగాని

చ. 1: వలచిన కామిని వాసివంతు లెంచదు
చెలరేఁగి చెప్పినట్టు సేసుఁగాని
తలఁపులో మెలఁగేది తనగర్వము చూపదు
నెలకొన్న ప్రియములే నించుఁగాని

చ. 2: మరిగిన దెప్పుడును మనసు విరుచుకోదు
తరితీపు దప్పకుండా తగులుఁగాని
సరిఁ బొందుజరపేది సణఁగులు రాల్చదు
కరఁగమాటాడి అలుకలు దేర్చుఁగాని

చ. 3: కలపుకోలైనది కడువేసరించదు
పొలసి రతిఁ జవులు పుట్టించుఁగాని
అలమేలుమంగ గూడె నదె శ్రీవేంకటేశ్వరుఁ-
దెలిపి తెలిపి రతిఁ దేలించుఁగాని

రేకు: 1491-2 పాడి సం: 24-542

పల్లవి: ఇతవే నెరపవలె యీరీతి నీవలె
మితిలేనినీగుణాలు మెచ్చితినే చెలియా

చ. 1: నెపములు వేయరాదు నేరుపరిపతిమీఁద
వుపమించి యాడరాదు వొడ్డుకోరాదు
కపురులు చూపరాదు కాఁక వచరించరాదు
యెపుడూ సాదించరాదు ఇల్లాలికి

చ. 2: మనసు నొప్పించరాదు మరి మారుకోరాదు
గునియరా దలయించి కొసరరాదు
చనవున మీరరాదు సవతులఁ దిట్టరాదు
తనుఁ బొగడుకోరా దుత్తమురాలికి

చ. 3: తగ వడుగఁగరాదు తారుకాణఁ బెట్టరాదు
పగటు మెరయరాదు పదరరాదు
తగు నలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుడు
మగఁడాయ నీవంటి మంచి ప్రియరాలికి

రేకు: 1491-3 శ్రీరాగం సం: 24-543

పల్లవి: ఎటువంటివేడుకలో యెదలోనే గుబ్బతిలీ
కుటిలకుంతలినేర్పు కొనసాగీనయ్యా

చ. 1: చెలగి తప్పకచూచు సిగ్గుతోఁ దలవంచు
తలఁపులో నీరూపు దలపోసును
సెలవులనే నవ్వు చెలికిఁ బ్రియముచెప్పు
కలికిభావము చెప్పఁ గతలాయనయ్యా

చ. 2: కోరును మనోరథాలు గుట్టుతోడనే కరఁగు
సారె నేకాంతాన నుండు సంతోసించును
చేరి మాటాడ నూహించు చెమరించు మేనెల్లా
నీరజాక్షిచందములు నీవే యెంచుకోవయ్యా

చ. 3: పవళించు పానుపుపై భావరతి నోలలాడు
కవగూడి నీవు రాఁగాఁ గడుమెచ్చును
ఇవల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
జవరాలి కూటములు సంగతేయనయ్యా

రేకు: 1491-4 సామంతం సం: 24-544

పల్లవి: తానే వచ్చీఁగాక తరవులు వెట్టనేల
కానుకలు మీచేనంపి కక్కసించవలెనా

చ. 1: తలఁపులం బారితేనే తనువులు సోఁకినట్టు
అలయించి యతనిమే నంటవలెనా
చెలిమిసేసితేనే చేతికిలోనైనట్టు
చెలులచే రమ్మని చెప్పించవలెనా

చ. 2: కమ్మి సుద్దులు వింటేనే కాఁగిలించుకొన్నట్టు
సమ్మతిచేసి చేతులు చాఁచవలెనా
పిమ్మటఁ బేరుకొంటేనే ప్రేమం దనివైనట్టు
రమ్మని పిలిపించి రతిసేయవలెనా

చ. 3: యీడకు విచ్చేసితేనే యెడవాయకుండినట్టు
జోడైయుండ నొడఁబఱచుకోవలెనా
కూడె శ్రీవేంకటేశుఁ డిక్కున నలమేల్మంగను
జాడతోడ తనమోవి చవిచూపవలెనా

రేకు: 1491-5 నాదరామక్రియ సం: 24-545

పల్లవి: విభునిఁ దోడుకవచ్చే వెస నన్నీ మంచివయ్యీ
యిభయానకుఁ జేయరే యిట్టే వుపచారాల

చ. 1: వెలఁదికిఁ జందురుఁ డీవేళఁ జుట్టమవుఁగాని
కలువలు కొప్పున గక్కన వించరే
కలపుకోలున చల్లగానలి మన్నించుఁగాని
మలయజ మలఁదరే మందుగాను మేనను

చ. 2: ముద్దియకుఁ దాపరవి మొకమోడి వుండుఁగాని
వొద్దికఁ దామరపైఁ గూచుండఁబెట్టరే
గద్దరివసంతునకుం గడునిచ్చకమౌఁగాని
పొద్దువొద్దునకు పైపైఁ బుప్పొడి చల్లరే

చ. 3: పన్నుకొని మేఘానకుఁ బరిణామ మవుఁగాని
చిన్న నెమ్మళ్లవాసిన చీర గట్టరే
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డీకె యలమేలుమంగ
యిన్నిటా విచ్చేసికూడె యింటనే వున్నాఁడు

రేకు: 1491-6 బౌళి సం: 24-546

పల్లవి: వట్టిపెనఁగులాటల వలపు చవులు గాదు
గుట్టుతో మెలఁగితేను గుణములు హెచ్చును

చ. 1: మనసు లెనసితేను మాటలు ప్రియములౌను
ననుపు గలిగితేను నమ్మికలౌను
చనవులు సతమైతే సరసము లింపౌను
వినయాలు చూపితేను వేడుకౌను పొందులు

చ. 2: సిగ్గువడ నేరిచితే చేఁతలు తరితీపౌను
యెగ్గులెల్లా మానితేను ఇతవౌఁ బొందు
వెగ్గళించి పొగడితే విభావాలు చెలరేఁగు
వొగ్గి వేఁడుకొంటేను వుల్లములు గరఁగు

చ. 3: తలపోఁత లొనరితే తమకము గడురేఁగు
నెలకొన నవ్వులను నిఁడు ముదము
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి మిద్దరముఁ గలుగుఁ జనవులు

రేకు: 1492-1 ముఖారి సం: 24-547

పల్లవి: అన్నిగుణాలను నీవే అధికుఁడవు
కన్నె నిన్నుఁ బొగడుతా కడుసంతోసించెను

చ. 1: మొగమోటగలవాఁడు మోనాన నూరకుండు
తగవెరిఁగినవాఁడు దయదలఁచు
నగవెరిఁగినవాఁడు నంటునను సమ్మతించు
తగులమిగులవాఁడు దండఁ బాయకుండును

చ. 2: వలచినవాఁడు కైవసమై మచ్చికసేసు
తలఁపొక్కటైనవాఁడు దాఁటఁడు మాట
నిలుకడైనవాఁడు నెట్టుకొని పొందుసేసు
పలుకనేర్చినవాఁడు పచరించుఁ గూరిమి

చ. 3: సన్నయెరిఁగినవాఁడు సరసుఁడై మెలఁగును
మన్నించనోపినవాండు మర్మములంటు
ఇన్నిటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
పన్నికూడితివి నీపంతము లీడేరెను

రేకు: 1492-2 పాడి సం: 24-548

పల్లవి: కడలేని పరాకులు గలవాఁడవు
జడియ కెప్పుడును మాచనవు చేకొనుమీ

చ. 1: చేపట్టి యెప్పుడును చిత్తాన మఱవకుమీ
ఆపె నీకు నాచేఁ జెప్పియంపినమాట
చూపట్టివున్నది శిరసున ముడుచుకొనుమీ
మాపటంత వేసినకమ్మనితమ్మిపూవు

చ. 2: చెలరేఁగి నీయరచేతనే పట్టుకుండుమీ
నిలిచి కానుకిచ్చిననిమ్మపండు
పలుమారు కన్నులను భావించి చూడుమీ
వలనుగా సురటిపైవాసినచెలిరూపు

చ. 3: చక్కఁగా తరితీపుతో చవిసేసుకొనుమీ
మొక్కుతాం జూపినయట్టిమోవిపండు
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ గూడె
తక్కక యేపొద్దును దయ నేలుకొనుమీ

రేకు: 1492-3 ఆహిరి సం: 24-549

పల్లవి: తానే యెఱుఁగుఁగాక తఱవాతిపనులు
పూనిపట్టి తనునెట్టు బోదించవచ్చునే

చ. 1: పట్టరానిది వయసు పంచరానిది వలపు
కట్టిపెట్టరానివి కనుచూపులు
మెట్టరానిది మనసు మీరరానివి వాసులు
యెట్టుసేసినా విభుని నేమని సొలతునే

చ. 2: చెప్పఁగరానిది సిగ్గు సేయరానిది నగవు
కప్పి పెట్టరానివి చక్కఁదనములు
తిప్పరానిది గుణము తెంచరానిది కోరికె
అప్పటి నీతనిం గాధన నెట్టువచ్చునే

చ. 3: తనియరానిది రతి దాఁటరానిది పొందు
మొనసి మానరానిది మొగమోటము
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చనవిచ్చెఁ దను నెట్టు సాదించవచ్చునే

రేకు: 1492-4 దేసాళం సం: 24-550

పల్లవి: రమణుఁడు పిలిచీని రావే చెలియ నీవు
తమకమే వలెంగాక తరుణులకు

చ. 1: తలఁపుకొలంది మంచితనమే వలెఁగాక
చలపాదితనమేల సరసులకు
వెలలేని మాటల వినయమే వలెఁగాక
సొలపువెంగెములేల సుగుణలకు

చ. 2: కోటిసేయ వలపులు కుమ్మరించవలెఁగాక
నీటుతో గర్వములేల నేర్పరులకు
మేటిసరసములాడి మెఱయఁగవలెఁగాక
జూటుందనములేంటికి సొంపుదొరలకును

చ. 3: నయగారితనమున నవ్వు నవ్వవలెఁగాక
రయమున దాంగనేల రసికులకు
నియతి నన్నేలినాఁడు నేఁడు శ్రీవేంకటేశుఁడు
క్రియతో వేసరనేల కిమ్ముల దేవుళ్లకు

రేకు: 1492-5 పాడి సం: 24-551

పల్లవి: ఇన్నిటా జాణలైనవా రెరుఁగుదు రీయింపు
చెన్నుగా దైవము తొల్లె సేసిన దీయింపు

చ. 1: వేసగికాలమునాఁటివెన్నెల లింపు
సేసలు వెట్టేయప్పటి సిగ్గు లింపు
వేసరక అత్తవారివిందులు యింపు
మోసపోనియట్టిరతి మోవితేనే లింపు

చ. 2: అట్టే వసంతపు చల్లులాట లింపు
జట్టిగొన్నప్పటి సరసము లింపు
వెట్టదీర దప్పికి వీడెము లింపు
గుట్టుతో నుండేయప్పటి కొసరులే ఇంపు

చ. 3: కడుఁజెమటకు చల్లగాలి యింపు
గుడిగొన్న కాఁగిటికి కూటము లింపు
అడరి శ్రీవేంకటేశ అలమేల్మంగకు నీకు
నొడఁబాటుమాటల వుచితము లింపు

రేకు: 1492-6 నాదరామక్రియ సం: 24-552

పల్లవి: ఈకెకు నీకుఁ దగు వీడుజోడులు
వాకుచ్చి మిమ్ముఁ బొగడవసమా యొరులకు

చ. 1: జట్టిగొన్ననీదేవులు చంద్రముఖిగనక
అట్టె నిన్ను రామచంద్రుఁ డనఁదగును
చుట్టమై కృష్ణవర్ణపుచూపులయాపెగనక
చుట్టుకొని నిన్ను కృష్ణుఁడవనఁదగును

చ. 2: చందమైనవామలోచన యాపె యౌఁగనక
అందరు నిన్ను వామనుఁ డనఁదగును
చెంది యాకె యప్పటివి సింహమధ్యఁగనక
అందినిన్ను నరసింహుండని పిల్వఁదగును

చ. 3: చెలువమైనయాపె శ్రీదేవి యగుఁగనక
అల శ్రీవక్షుడవని యాడఁదగును
అలమేల్మంగ యహిరోమాళిగలదిగన
యిల శేషాద్రి శ్రీవేంకటేశుఁ డనఁదగును

రేకు: 1493-1 ఆహిరి సం: 24-553

పల్లవి: చిత్తగింతువు రావయ్య్య చెలియబాగులు నేఁడు
ఇత్తల విన్నవించ నేనెంత దానను

చ. 1: వలిపపయ్యెదలోని వట్రువచనుగుబ్బలు
తొలుత నీకాఁగిలి కెదురుచూచేయట్టున్నవి
తిలకించి నీదేవులతేనెలయధరములు
చెలఁగి నీకు విందులుచెప్పేయట్టున్నవి

చ. 2: వెక్కసపుఁదళుకుల వెడదకన్నులచూపు
మిక్కిలి నిన్నుఁ బూజించ మీఁదె త్తినట్టున్నది
తక్కళ ఇంతిచేతులు తలఁబాలు వోయ నీపై-
నుక్కుమీర సూత్రవెట్టి వొడ్డినట్టున్నవి

చ. 3: నెమ్మది శ్రీవేంకటేశ నీ కలమేల్మంగ మేను
కమ్మి నీమెడఁ దాళిగాఁ గట్టేయట్టున్నది
పమ్మి నీవే దయంజూచి పడఁతిఁ గూడితి విట్టె
వుమ్మడా నీకు నీపె వొనరినట్టున్నది

రేకు: 1493-2 ముఖారి సం: 24-554

పల్లవి: గుట్టుసేసుకున్నాఁడవు కోరి యందరిముందర
తొట్టెనో వేడుకలెల్లా దొరవై వున్నాఁడవు

చ. 1: ఆతివఁ జూచినచూపు అచ్చొత్తినట్ల నీ-
మతిలో నున్నదో మాటలాడవు
తతి నాకెమాటలు తఱచై నీచెవులలోఁ
బతినాదా లిచ్చీనో పరాకైతివి

చ. 2: అంగనమోవితేనెలఅన్ను వట్టెనో నీకు
వుంగిటిగొన్నట్టు వూరకున్నాఁడవు
సంగడి నాపెమైతావి సారె వాసనవచ్చెనో
అంగవించి యందే వోలలాడుతానున్నాఁడవు

చ. 3: అలమేలుమంగరతు లట్టె మరిగితివో
వెలయుచు నిలువున వెరగందేవు
అలరి శ్రీవేంకటేశ ఆకె నిన్ను బోదించెనో
తలచి నన్నుఁగూడి తమకించేవు

రేకు: 1493-3 కాంబోది సం: 24-555

పల్లవి: ఉపచరించఁగరాదా వువిద గడునలసె
నెపమున వురుటెల్ల నెరపీ నీమీఁదను

చ. 1: నలినాక్షి గరిడిలో నంటునఁ గేళిసేసె
మలసి చెక్కులను చెమటగారఁగా
వల పందులోనె చల్లి వాసనగుబ్బలు మోపి
నలువంక నీకు నభినయము చూపీని

చ. 2: తెరమఱఁగున వచ్చి దేశిశుద్ధాంగములను
సరవి నాడి చూపులు సళుపుచును
తిరుపుగొని కమ్మటి తీగెచేతులటు చాఁచి
పరగ నంగరంగవైభవము మెరసీని

చ. 3: పదములఁ జిందుజక్కిణి బహుతాళమానముల-
నిదె నాట్యమున నిన్ను నింతి మెప్పించె
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
గదిసి చూడఁగా మతిగరఁగించీని

రేకు: 1493-4 వేళావళి సం: 24-556

పల్లవి: ఏల తమకించేవయ్యా ఇంతలో నీవు
మేలిమిసగినములు మించీని యెగుటను

చ. 1: ఆలులఁ జూడవయ్యా అంగనతురుముమారు
చెలఁగి యద్దాలఁ జూడు చెక్కులమారు
అల చందురునిఁ జూడు మాకెమొగముమారు
అలుకదేరె నాకె నీయండకు వచ్చీని

చ. 2: చిగురులు చూడవయ్య చెలియధరముమారు
తగులతలఁ జూడు హస్తములమారు
సొగిసి జక్కవలనుఁ జూడు కుచములమారు
మగువ తెరదీసి నెమ్మది నిన్నుఁ గూడీని

చ. 3: హత్తి తామరలఁ జూడు మమురుఁబాదాలమారు
పుత్తడిబొమ్మఁ జూడు పొలిఁతిమారు
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
బత్తితోఁ గలసె నింకఁ బాయకవుండీని

రేకు: 1493-5 పాడి సం: 24-557

పల్లవి: ఎఱిఁగనజాణలది ఇట్టి మోహము
మఱవరా దాలికి మగనికి మోహము

చ. 1: వినయము చేసితేను వెగ్గళించు మోహము
ననుపు చక్కనయితే నాటు మోహము
యెనసినమాటలైతే యీడేరు మోహము
మనసురా మెలఁగితే మాననీదు మోహము

చ. 2: యేపొద్దుఁ గాచుకుండితే యిరవౌను మోహము
యేపుమీరి పైకొంటే ఇంపు మోహము
కోప మెందు లేకుండితే కొనసాగు మోహము
చూపు నెట్టుకోఁ జూచితే సులభమౌ మోహము

చ. 3: ఇచ్చకమే నెరపితే నియ్యకోలౌ మోహము
నిచ్చకొత్తగాఁ గూడితే నిండు మోహము
వచ్చి శ్రీవేంకటేశుఁడే వదలక నన్ను నేలె
తచ్చితచ్చి కొసరితే తగులౌను మోహము

రేకు: 1493-6 బౌళి సం: 24-558

పల్లవి: వారిబత్తి ఇయ్యకొనవలెఁగాక
యేరీతినైనా మేలే యేమిసేయవచ్చును

చ. 1: యెలమి నీ వాడానీడా నెందరిఁ బెండ్లాడినాను
చలమరిదాననా సాదించ నేను
కలరు నీకుఁ జుట్టాలు కామినులు యెందరైనా
యెలయింతు రందుకు నీ కేమిసేయవచ్చును

చ. 2: బెరసి యెవ్వతె వెంటఁబెట్టుక నీవు దెచ్చినా
విరసపుదాననా వెంగేలాడను
సరవు లెఱుఁగుదు నా జాడలన్నియు వింటి
ఇరుమేలా నుండేముగా కేమి సేయవచ్చును

చ. 3: ఇంతలో నాముందర మీరిద్దనునుఁ గూడినాను
వింతయైనదాననా విడనాడను
ఇంతట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెంతలేదు నీయాసోద మేమిసేయవచ్చును

రేకు: 1494-1 రామక్రియ సం: 24-559

పల్లవి: చెప్పేదాఁకాఁ దరితీపు చేరి వింటే వేడుక
చొప్పుగా నీకత నాకు సూచించవే చెలియ

చ. 1: పసిఁడితీగెను మంచిపద్మము వికసించె
కసరక పామేల కాచుకున్నది
యెసగి మొల్ల మొగ్గలు ఇందుకె కూటమి గూడె
చెసల నీకత నాకుఁ దెలుపవే చెలియా

చ. 2: కంతుబాణమున నారికడపుఁగాయలు గాచె
చెంత బోఁకబోదె యేల చెలువొందెనే
అంత సింగారదామము లందుకుఁ దోడువచ్చె
బంతినే యీకత నాతోఁ బలుకవే చెలియా

చ. 3: పూవుమీఁదికొమ్మ కల్పభూజముతోఁ బెనగొనె
వావిరి మెఱుగు మొయిలు వన్నెవెట్టెను
యేవేళ శ్రీవేంకటేశు కీయలమేలుమంగ
దేవులాయ నీకతతెఱఁగేదే చెలియా

రేకు: 1494-2 బౌళి సం: 24-560

పల్లవి: ఈ సుద్దులు విన్నవించు మెఱఁగఁడేమో తాను
వేసరక రమ్మనవే విచారించుఁ బనులు

చ. 1: తమ్మి చందురునితోడ డాకొని యేకాంతమాడె
యిమ్ముల సూర్యుఁ డంతలో యెండలుగాసె
కమ్మర నందుకుఁ గానే కప్పుకొనే మేఘము
రమ్మనవే చూచుఁగాని రమణుని నీడకు

చ. 2: వట్టివేసగిని గాలివానలు గురియఁగఁ జొచ్చె
పట్టపగలు చీఁకటిపంట పండెను
చుట్టుక మరునమ్ములు సురసుర సుక్కెనవె
ఱట్టుసేయక పతిని ఇట్టె రమ్మనవే

చ. 3: పొదిగొన్నతీగెలు పూచి పుప్పొడి రాలె
యెదిరించి చకోరము లింపుసొంపెక్కె
ఇదివో శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కదిసినాఁ డిట్లానే కమ్మటి రమ్మనవే

రేకు: 1494-3 సామంతం సం: 24-561

పల్లవి: వాకిట వచ్చివున్నాఁడు వాఁడివో నీరమణుఁడు
చేకొని వుపచారాలు చెప్పవలదటవే

చ. 1: పొంతనే చుట్టరికాన పొందులు చేసినవారు
యెంతైనా యెగ్గులుఁ దప్పు లెంతురటవే
చింతదీర మాఁటపట్టుచేసుకొన్న యట్టివారు
వింతవా రేమిచెప్పినా విననేర్తురటవే

చ. 2: వొనరఁగఁ బ్రాణములు వొక్కటైవుండినవారు
తనివోనిముచ్చటలు దాఁతురటవే
చనవున రతికి నాసలఁబొరలేటివారు
పెనఁగక సిగ్గులెల్లాఁ బెంతురటవే

చ. 3: విచ్చనవిడిని తాము వేడుకపడినవారు
కొచ్చికొచ్చి గుట్టునఁ గొంకుదురటవే
అచ్చపుశ్రీవేంకటేశుఁ డలమేల్మగవునీవు
తచ్చి కూడితిరి నవ్వఁదగవులౌనటవే

రేకు: 1494-4 మాళవి గౌళ సం: 24-562

పల్లవి: ఇట్టిది కాలమహిమ ఇఁకనేల మరఁగు
గుట్టుదెలిసినవారు కూడఁజెప్పఁగదరె

చ. 1: నంటున జక్కవలపై నల్లఁబులుగులు వాలె
అంటి తామరాఁ జిగురూ నల్లిబెల్లేయ
పెంటతుమ్మిదలపై పిచ్చిలఁ బాలు గురిపె
జుంటితేనె దొండపండు చూరలాడెను

చ. 2: వెదకి చిలుకలూఁ గోవిలలూఁ జీరుమూరాడె
గుదిఁ జంద్రశకలాలఁ గూర్మ మెక్కెను
చెదరి యుద్ధములలో చీఁకటి తీగెలువారె
పొదిగెఁ గారుమెఱుఁగుఁ బువ్వులదండలు

చ. 3: పువ్వుమీఁది వాసనకుఁ బొంచి డాసెను మొయిలు
కువ్వలై మరురాజ్యము కొటారుకెక్కె
మవ్వపుటలమేల్మంగమగఁడు శ్రీవేంకటేశు-
నివ్వల నడిగి మాకు నెరిఁగించరే

రేకు: 1494-5 వరాళి సం: 24-563

పల్లవి: ఏమిసేసితివోకాని ఇంతిని నీవు
చేముట్టక పువ్వులచెండున వేసీని

చ. 1: ముక్కర గదలఁగాను ముసిముసినవ్వు నవ్వి
చెక్కుచేతితో చెలి సిగ్గువడీని
చుక్కబొట్టువెట్టినకస్తూరిబేంట్లు రాలఁగా
చక్కనినిన్ను బొమ్మల జంకించీని

చ. 2: మించులమొగపుతీగె మెఱవఁగా మళ్లిచూచి
అంచె నిన్నుఁగని శిరసటు వంచీని
కంచపుమోవితేనె కడు నుట్టిపడఁగాను
పెంచి వలపుల నీతో బీరములాడీని `

చ. 3: కంకణా గల్లనఁగా గక్కనఁ బాదాలొత్తి
పొంకముగాఁ గూడి గొబ్బున మెచ్చీని
అంకెల శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
కుంకుమచెమటలెల్లాఁ గురిసీ నీపైని

రేకు: 1494-6 దేసాళం సం: 24-564

పల్లవి: ఏరుపరచఁగరావు యెవ్వరిసొమ్ములో యివి
చేరి నిన్ను నడిగేము చెప్పవయ్య తగవు

చ. 1: అలులు నరచంద్రుడు నతనుని విండ్లును
కలువలు సంపెఁగయుఁ గమ్మఁజిగురు
పలుచనియద్దములు పచ్చిపోఁకయు శ్రీలు
చెలియసింగారాలో చిత్తజునిపొఁజులో

చ. 2: తిన్ననిసంక్కును మంచితీగెలునుఁ దామరలు
చిన్నిజక్కవ పిల్లలు సింహమును
యెన్నరావిచిమతరి ఇసుకదిబ్బలును
కన్నెసింగారాలో ఇవి కామునిబలములో

చ. 3: అనటికంబములును అమ్ములపొదులును
మినుకుఁగూర్మములు మించువ జ్రాలు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
వనితసింగారాలో వలరాజుమూకలో

రేకు: 1495-1 మంగళకౌసిక సం: 24-565

పల్లవి: మగువకు లోఁగనేల మగవాఁడవు
నిగిడి బుద్ధులుచెప్పి నిలిపే నే నాపెను

చ. 1: బత్తి నేఁ జేయఁగా నీవు పరాకున నున్నాఁడవు
చిత్తములో తలపోఁత చెప్పరాదా
యెత్తల నెవ్వతైనా నిన్నేమైనా నాడినాను
వుత్తరువు చెప్పే నేను వొద్దు నీకు వెరపు

చ. 2: ఆకుమడిచియ్యఁగాను అవ్వలి మోమైనాఁడవు
దీకొని చూచేచూపు తిప్పుకోరాదా
నీకాంత లెవ్వరైనా నిన్ను నేరాలెంచితేను
నీకు నడ్డమయ్యేఁగాని నిమ్మలాన నుండుము

చ. 3: చెయ్యెత్తి మొక్కఁగాను సిగ్గుతో నున్నాఁడవు
తియ్యనినోరను నన్ను దీవించరాదా
వొయ్యనే శ్రీవేంకటేశ వొద్దకై నన్నేలితివి
చయ్యాటాలు మాన్పేఁగాని సతిఁ జూపునాకు

రేకు: 1495-2 బౌళి సం: 24-566

పల్లవి: అతిన కొక్కతేవే నీవాలవైతివా
యేతులు నెమ్మెలు నీవు యిందే చూపేవా

చ. 1: యిచ్చకములెల్లా నాడి యితవరివైవిభుని
మచ్చికలు రేపి భ్రమలఁబెట్టేవు
కచ్చువెట్టి నేమెల్లాఁ గాచుకుండఁగా నీకు
యిచ్చోటఁ జెల్లుబడి ఇఁక నెంత గలదే

చ. 2: వట్టినవ్వులెల్లా నవ్వి వద్దనుండి యాతని-
చుట్టమవై మాటలనే చొక్కించేవు
అట్టె నీ మిందరమును ఆసపడివుండఁగాను
నెట్టుకొని నీబలిమి నెరపఁగవలెనా

చ. 3: చెనకి కాఁగిట నించి శ్రీవేంకటేశ్వరుని-
మనసు రంజిల్లఁజేసి మరిగించేవు
యెనసె నీతఁడే మమ్ము నీడుజోడైతిమి నేము
తనియవు నీవింకా తమకించఁదగునా

రేకు: 1495-3 వరాళి సం: 24-567

పల్లవి: ఆపె నెంతపొగడేపు అన్నిటా నేర్పరియని
తీపులు పుట్టించేవారు తిట్టినా దీవెనలు

చ. 1: చనవుగలసతులు సాదించితే నమరు
ననుపైనవారలు నవ్వితేఁ .జెల్లు
మనసువచ్చినవారు మంతనమాఁడగఁదగు
యెనసినచోటిపొందు లితవులై తోఁచును

చ. 2: చుట్టరికమైనవారు సొలసినా వేడుకౌను
గుట్టెఱిఁగినవారు దీకొనినా మెచ్చు
పొట్టఁబొరుగువా రేతప్పులు వట్టినాఁ బొసఁగు
దిట్టసతు లొడివట్టితీసితే సమ్మతము

చ. 3: ఆసపడివచ్చినవా రాయములంటినా మేలు
బాసగొన్నవార లెంతపైకొన్నా లెస్స
వాసితో నన్నేలితివి వలచి శ్రీవేంకటేశ
సేసవెట్టినవా రెంతచెనకినా మంచిది

రేకు: 1495-4 సామంతం సం: 24-568

పల్లవి: పిలిచి చేకొనవయ్యా ప్రియురాలిని
సులభాన వచ్చె మేలు జోలి ఇంతవలెనా

చ. 1: సొలసి సొలసి చూచి చొరువల కిటు లాచి
యెలయించీ నిన్ను నీకె యెవ్వతోకాని
యెలమి నీవేళనే యెక్కడ పరాకు నీకు
వలపు తనంతరాఁగా వద్దనఁగవచ్చునా

చ. 2: వచ్చి వచ్చి మాటలాడి వన్నెలుగాఁ బాటవాడి
ఇచ్చీ నీకు విడెము యెవ్వతోకాని
పచ్చిగా నీకీవేళ పనులెల్లాఁ గలిగెనా
మచ్చికచుట్టరికము మఱవఁగఁదగునా

చ. 3: వినయములెల్లాఁ జేసీ వేడుక చన్నులరాసి
యెనసె నిన్నిప్పుడే యెవ్వతోకాని
నిను శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
చెనకి దక్కఁగఁగొంటి సిగ్గు నెరపుదురా

రేకు: 1495-5 భైరవి సం: 24-569

పల్లవి: పట్టరానికాఁతాళానఁ బదరేఁ గాని
దిట్టైన దానవు నీకు దీకొనఁగఁజెల్లునే

చ. 1: కాఁతుఁడిచ్చినసలిగెగలదానవుగనక
పంతములాడఁగవద్దా పలుమారును
బంతినుండి యాతనితో పకపక నవ్వేవు
ఇంతటిదానవు నీకు నెట్టుండినాఁ జెల్లునే

చ. 2: ఆతఁడున్నగద్దె యెక్కి అండవాయవుగనక
యేతులు నెరపవద్దా యిచ్చటను
చేతులు చాఁచి పతినిఁజేరి సాములుసేసేవు
బీతిలేనిదానవు పెనఁగఁగఁజెల్లునే

చ. 3: బలిమి మగనిచేత బాసగొంటివి గనక
చలము సాదించవద్దా సారెసారెకు
యిల నన్నలె శ్రీవేంకటేశుఁడని మెచ్చేవు
అలమేలుమంగవు నీకమరు నన్నియును

రేకు: 1495-6 ఆహిరి సం: 24-570

పల్లవి: నీమన సెఱఁగనా నిన్ను దూర దోసము
కామించినవారి పొందు కైకొందువుగాక

చ. 1: అంగనలు చెనకితే నౌఁగాదనేవాఁడవా
అంగవించి యందుకు లోనౌదువుగాక
కొంగువట్టితీసినాను కోపగించేవాఁడవా
ఇంగితమెఱిఁగి చనవిత్తువుగాక

చ. 2: వెలఁదులు మాటాడితే వేసరేటివాఁడవా
వెలయ నెంతవడైనా విందువుగాక
వలపులు చల్లితేను వద్దనేటివాఁడవా
కెలన నియ్యకొని భోగింతువుగాక

చ. 3: పెనఁగి కాఁగిలించితే బిగిసేటివాఁడవా
యెనసి రతులఁ జనవిత్తువుగాక
ఘనుఁడ శ్రీవేంకటేశ కైకొని నన్నేలితివి
మనసిచ్చి యందరిని మన్నింతువుగాక

రేకు: 1496-1 రామక్రియ సం: 24-571

పల్లవి: ఒకరు చేసినభాగ్య మొకరికి నేల వచ్చు
మొకము చూచినప్పుడే మొక్కీని తాను

చ. 1: సొలసి సొలసి నీతో సుదతి మాటాడఁగాను
పొలసి తానేమి వినీ పొంచులు యీకె
కలువరేకులవంటికన్నుల నాపె చూడఁగా
నిలుచున్నది యెదుట నెరవాదై తాను

చ. 2: ననుపున నాపె నీతో నవ్వులెల్లా నవ్వంగాను
పనివడి తానేమి పైకొనీ నీకె
చనవునఁ దనమోవిచవు లాపె చూపఁగాను
నునుపునఁ దానేమి నోరూరీ నీపె

చ. 3: చెక్కు నొక్కి నేం డాపె సేవలెల్లాఁ .జేయఁగాను
కక్కసించి యేల యీపె కాఁగిలించీని
మక్కువ శ్రీవేంకటేశ మరి నన్ను నేలితివి
తక్కక యింకానేమి తడవీఁ దాను

రేకు: 1496-2 వసంతవరాళి సం: 24-572

పల్లవి: వద్దు వద్దు సతి నింత వలలఁబెట్టకు మిఁక
సుద్దులు చెప్పఁగఁబోతే సూడువట్టును

చ. 1: శిరసువంచినదాని సిగ్గులువడినదాని
వొరసి చెనకఁబోతే వొట్టువెట్టును
మరలి చూచేదాని మాటలాడి దూరేదాని
గరిమఁ గరకరైతే కాతాళించును

చ. 2: కూరిమిచల్లేదాని కొంగువట్టితీసేదాని-
నారసి యడ్డగించితే నద్దలించును
సారెకు నవ్వేదాని సంగడికి వచ్చేదాని
మారుకొని వలదంటే మచ్చరించును

చ. 3: ఆసపడివున్నదాని ఆయములంటేదాని
పాసి యెలయించఁబోతే పంతమాడును
నీసొమ్మయినదాని నేఁడు శ్రీవేంకటేశుఁడ
సేసవెట్టి కూడితివి చెలి నిన్ను మెచ్చును

రేకు: 1496-3 హిజ్జిజి సం: 24-573

పల్లవి: ఆఁటదాని కిచ్చకమే యమరుఁగాక
చీటికిమాటికి ఱట్టుసేయఁగవలెనా

చ. 1: రాయడించనేమిటికి రమణునియెడకును
సేయఁగలవిన్నపాలు చేసుకోరాదా
చాయగా నయము చూపి సాదించుకొనేమేలు
ఆయాలు మోపనాడితే నది సంగతౌనా

చ. 2: చనవుగలదంటాను జంకించనేమిటికి
మనసురా సేవసేసి మరువరాదా
ననుపుగా మోవి యిచ్చి నాటించుకొనేవలపు
పెనఁగి రచ్చఁబెట్టితే ప్రియములైవుండునా

చ. 3: బలిమికత్తెనంటాను పదరఁగ నేమిటికి
యెలమి నురమెక్కితి వెనయరాదా
అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డలయించితే రతు లావటమైవుండునా

రేకు: 1496-4 శుద్ధ దేశి సం: 24-574

పల్లవి: ఎంతలేటియాసోద మేది గొలఁది
సంతోసాన లోలోనే జడిగొనరాదా

చ. 1: తగవులు చెప్పఁగానే దప్పిదేరీ నీమోవి
అగడేల పన్నీట నద్దుకోరాదా
తగుబాస లియ్యఁగానే తనువెల్లా బడలెను
పగటునఁ గొంతవడి పవళించరాదా

చ. 2: చెంది సేసలు చల్లఁగానే చెమరించె మేనెల్లా
చందముగా గందవొడి చల్లుకోరాదా
అంది యింటింటి కేఁగఁగా అట్టె వేసటలు రేఁగె
పొందుగాఁ గొంతవూరట పుచ్చుకోరాదా

చ. 3: చెలుములు సేయఁగానే చిత్తమెల్లాఁ గరఁగెను
చెలఁగి గుండెబలిమి చేసుకోరాదా
నిలిచి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసితి విన్నిటాను కరుణించరాదా

రేకు: 1496-5 ముఖారి సం: 24-575

పల్లవి: అన్నిటాను దొరవైతే నైతివి గాక
నిన్ను నిట్టె మెప్పించనేరనా నేను

చ. 1: పడఁతికి మగనితో బలిమి వద్దనికాక
వొడివట్టి నిన్నుఁ దియ్యనోపనా నేను
కడలేని నిబ్బరానఁ గాలుదాఁకీననికాక
వుడివోనిసరసాన కోపనా నేను

చ. 2: చెల్లఁబో నీలోనివే సిగ్గువడేవనికాక
వొల్లనే నీతో మాటాడనోపనా నేను
పల్లదపురతులను భ్రమసేవంటాఁగాక నీ-
వుల్ల మిట్టే కరఁగించనోపనానేను

చ. 3: పుక్కట నీపెదవి కెంపులురేఁగీనవి కాక
వుక్కున నీమోవి యానవోపనా నేను
నిక్కి శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
వొక్కట నేలితి విందు కోపనా నేను

రేకు: 1496-6 సాళంగనాట సం: 24-576

పల్లవి: అప్పటి వత్తురుగాని ఆడనుండి యీడకు
యెప్పుడు మాయిల్లె మీకు నిక్కువైనచోటు

చ. 1: యెంతపని గలిగెనో యేకతమాడీ నాకె
వింతలుసేయక నీవు వినరాదా
కాంత యప్పటనుండి కాచుకున్న దిందుకే
యింతటఁ దెరలోనికి నిద్దరు నేఁగరయ్యా

చ. 2: పట్టుకున్నది కానుక పయ్యద మూసీ యేఁటిదో
అట్టె చేతులుచాఁచి అందుకోరాదా
చుట్టిచుట్టి లాచీని సుదతి తా నిందుకే
ఇట్టె కంబముమాఁటు కిద్దరు నేఁగరయ్యా

చ. 3: యేపున సన్నలుచేసి నెందుకో యలమేల్మంగ
చూపుల శ్రీవేంకటేశ చూడరాదా
యీపట్టున నన్నేలితి వింతి గోరినందుకే
యేఁపక నామంచముపై కిద్దరు నేఁగరయ్యా

రేకు: 1497-1 సాళంగనాట సం: 24-577

పల్లవి: ఏమిటికి బిగిసేవు ఇందరుఁ జూడఁగాను
ప్రేమ పుట్టించి యాతనిఁ బిలిచి తేఁగదవే

చ. 1: పెలుచవై వంతులకుఁ బెనఁగేవు రమణుని
వలపించుకొంటివా నావలెనే నీవు
పొలిఁతివై పుట్టితేనే భోగములు సరియౌనా
సొలసి నేర్పులఁ జవిచూపవలెఁగాక

చ. 2: వడిగా నాసంగడికి వచ్చేవు నాయకుని
కడుఁ బనిగొంటివా నాకైవడి నీవు
నడుమ సవతివైతే నావోజ నీకు వచ్చీనా
పెడఁబాయ కాతని మెప్పించవలెఁగాక

చ. 3: పుక్కట సేసలు చల్లి పొత్తుగలసే వాతని
దక్కఁగొంటివా నాచందమున నీవు
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిటు న న్నాతఁడె యేలె
నిక్కమైతే నీవు నిట్టే నేరవలెఁగాక

రేకు: 1497-2 శ్రీరాగం సం: 24-578

పల్లవి: చల మిఁక బనిలేదు జలజాక్షి కడుసాదు
యెలమితో నిట్టె మాయింటికి రారాదా

చ. 1: చేరి యింతి ప్రియములే చెప్పీ నిదే నీకుఁ జాటి
కోరికలైతే మదిఁ గోటానఁగోటి
మేర మీరరాదు యీపెమేనరిక మిఁకఁ బోదు
యీరీతి మమ్ము మన్నించి ఇంటికి రారాదా

చ. 2: కొమ్మ నిన్నుఁ దలపోసి కురిసీఁ జెమటవాన
చిమ్మి రేఁగేవలపైతే సేనాసేన
నమ్మిన చుట్టాలు మీరు నంటున నొద్దికైనారు
ఇమ్ముల నీకు మొక్కేము ఇంటికి రారాదా

చ. 3: యెన్నఁడుఁ బాయనిరతి యీకె నీమోహపుటాలు
విన్నపములెల్లాఁ జేసీ వేవేలు
చిన్ననాఁడె యీడుచూపె శ్రీవేంకటేశుఁడ యీపె
యెన్నికగాఁ గూడితివి ఇంటికి రారాదా

రేకు: 1497-3 గౌళ సం: 24-579

పల్లవి: ఇంతిదిక్కు చూడరాదా యెక్కడా పరాకు నీకు
అంతలోనే యేడలేని ఆసలు రేచీని

చ. 1: ముసిముసి నవ్వులు నవ్వి మోవిచవులు చూపి
కనుగాటువలపులు కాంత చల్లీని
ఇసుమంత మాటాడి యెదుటనే నిలుచుండి
కొసరికొసరి నీకొలువు సేసీని

చ. 2: తప్పక నిన్ను చూచి తగిలి వేమారు మొక్కి
దప్పిదేరఁ గాఁగిటికిఁ దమకించీని
వుప్పతిల్ల సన్నచేసి వొడివట్టి నిన్నుఁ దీసి
కప్పురవులప్ప నీకుఁ గానుకిచ్చీని

చ. 3: చెలరేఁగి సేవచేసి చేతులు నీపైఁ జాఁచి
వెలసినసంతోసాన విఱ్ఱవీఁగీని
యెలమిశ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
అలమి నిన్నాకె గూడి యరుదఁదీని

రేకు: 1497-4 శ్రీరాగం సం: 24-580

పల్లవి: కరుణించు మీచెలి కడుఁబిన్నది
సరసమాడేనంటా సముకాన నున్నది

చ. 1: నెలకొన్న వేడుకతో నీవెప్పుడు వత్తువంటా
కలికి యప్పటనుండీఁ గాచుకున్నది
మలసి తనతో నీవు మాటలాడినందాఁకా
తిలకించి లోలోనె తిమురుచునున్నది

చ. 2: మొనసి యెప్పుడు నీమొగము చూతునో యంటా
తనివోనితమకానఁ దగిలున్నది
చనవున నిన్నుఁ జేరి సరసమాడినదాఁకా
యెనలెనిమనసెల్లా నిక్కడనే వున్నది

చ. 3: కందువ నిన్నుఁ గాఁగిటఁ గాఁగిలించుకొనేనంటా
పొందులెల్లా మతిఁ జలపోయుచున్నది
యిందువచ్చి కూడితివి యీకెను శ్రీవేంకటేశ
విందులుగా మోవితేనె వేడుకొంటా నున్నది

రేకు: 1497-5 ఆహిరి సం: 24-581

పల్లవి: ఎంత నిన్నునెలయించీ నిదివో చెలి
కాంతుఁడవు నిన్నింత కరఁగించె నీచెలి

చ. 1: పక్కన నవ్వుతానే పంతములాడీఁ జెలి
చెక్కు నొక్కతానే గోరఁ జెనకీఁ జెలి
చక్కఁగాఁ దప్పకచూచి సారెకు జంకించీఁ జెలి
మొక్కుతానే చన్నులమొనలు చూపీఁ జెలి

చ. 2: సంగడిఁ గూచుండుతానే చలము సాదించీఁ జెలి
జంగిలిమాటలాడి జరసీఁ జెలి
చెంగలించి మోవి యాని చిన్నలు నించీఁ జెలి
సింగారించేయందులోనే చిమ్మిరేఁగించీఁ జెలి

చ. 3: పాటలు నీపైఁ బాడి బయలీఁదించీఁ జెలి
చీటికిమాటికి రతిసేసీఁ జెలి
నీటున శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
కోటిసేయ ని న్నప్పటిఁ గొసరీఁ జెలి

రేకు: 1497-6 ముఖారి సం: 24-582

పల్లవి: అమరని మాటలేలన ఆడేవు నీవు
తమకము గడునిండె దట్టమాయఁ గాంక్షలు

చ. 1: దాఁపురమేల సేసేవు తరుణితో నిందాఁకా
కాఁపురము సేయవా కంటిఁబో నేను
యేఁపకు నన్నిఁక నీవు యేలపెట్టుకొనే వాన
రాఁపాయ నీవలపు రచ్చకెక్కె సుద్దులు

చ. 2: పోల బొంకనేమిటికి పొలఁతితో నిందాఁకా
మేలములాడుకొనవా మెస్తిఁబో నిన్ను
జాలిఁబెట్ట కిఁక నీవు సారె నొడఁబరచకు
చాలుకొనెఁ దమకము జారఁజొచ్చె సిగ్గులు

చ. 3: వేసాలకేల లోఁగేవు వెలఁదిమీఁదట నిట్టె
సేసలెల్లాఁ బెట్టవా చేకొని నీవు
ఆసల శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
పోసరించె వేడుకలు పొలుపొందె రతులు

రేకు: 1498-1 సామంతం సం: 24-583

పల్లవి: ఇన్నాళ్లవలెఁ గాదు యేమనినాఁ గెరలేవు
సన్నల నెవ్వతెచేతిసడికి లోనైతివో

చ. 1: ఇంతి యెంత దూరినాను యెగ్గుగాదు విభునికి
వింతవింతసంతోసాలై వెలయుఁగాని
పంతగారితనమునఁ బదరే వదేమి నీవు
మంతనాన నెవ్వతెచే మాటఁబాడినాఁడవో

చ. 2: మగువ కాఁతాళించితే మగనికి నెగ్గుగాదు
మిగులా వేడుకలై మెరయుఁగాని
తగవులఁ బెట్టి సారెఁ దడవే వదేమి నీవు
పగటున నెవ్వతెచె భంగపడినాఁడవో

చ 3: రమణి కాలుదొక్కితే రమణుని కెగ్గుగాదు
తమితో సమరతులే తగులుఁగాని
జమళి శ్రీవేంకటేశ జరసే వదేమి నీవు
అమర నెవ్వతెచెత నప్పణ గొన్నాఁడవో

రేకు: 1498-2 దేసాళం సం: 24-584

పల్లవి: అప్పణిచ్చి రిందుకు నీయంగనలెల్లా
చెప్పితి సంతోసాలు సిగ్గులెల్లాఁ దేరెను

చ. 1: యేడనైనాఁ దిరిగాడి యేమైనాఁ జేతువుగాక
వేడుకకాఁడవు నీకు వెరపేఁటికి
ఆడేవారెవ్వరు నిన్ను అనుమానించకు మిఁక
తోడనే మగవానికి దోస మెందూ లేదు

చ. 2: నిమ్మసం డెగరవేసి నీటు చూపుదువుగాక
యెమ్మెకాఁడవు వినయ మిఁక నేడది
సమ్మతించి రిందరును సటలుసేయకు మిఁక
నెమ్మది మేనవానికిని నింద లే దెప్పుడును

చ. 3: కొంకులేక కూడితివి కూరిమితో నిటు నన్ను
అంకెకాఁడ విఁక నీకు వలపున్నదా
పొంకమైరి నీసతులు పొందుము శ్రీవేంకటేశ
వుంకువవెట్టినపతి కొదుగఁగవలదు

రేకు: 1498-3 పాడి సం: 24-585

పల్లవి: తనువుఁ దనువు సోఁకె తమకము దైవారె
చెనకఁగా వద్దనఁగం జెల్లునటే ఇఁకను

చ. 1: పవ్వళించి యుండినపతి పాదా లొత్తుమనఁగాను
నవ్వులు నవ్వుదురటే నాలికత్తెవై
యెవ్వరుఁ జూడకుండాను ఇట్టె నేఁ దెరవేసేను
చివ్వన సిగ్గులువడఁ జెల్లునట్టే ఇఁకను

చ. 2: ఆసపడి నిన్ను నిట్టె ఆకుమడిచిమ్మనఁగా
వేసాలు సేతురటవే వింతదానవై
వోసరించ కిటు మీకు నొడఁబడఁజెప్పె నేను
సేసవెట్టి తలవంచఁ జెల్లునటే ఇఁకను

చ. 3: ముందె కాఁగిలించుకొని మోవితేనె ఇమ్మనఁగా
మందెమేల మౌదురటే మంకుదానవై
గొందె నలమేల్మంగవు కూడె శ్రీవేంకటేశుఁడు
చెందె మేలెల్లా జరయఁజెల్లునటే ఇఁకను

రేకు: 1498-4 హిందోళ వసంతం సం: 24-586

పల్లవి: ఇందుకు మెచ్చిరి నీఇంతులెల్లాను
చందమామ నీపనులు చక్కఁగూచుండవయ్యా

చ. 1: నెలఁతపాదముతోడ నీపాదము పెనచి
నిలుచుండి కాఁగిట నించె వాకెను
అలిగి లోనికిఁ బోయేయప్పు డింత సేసితివి
ఇలలో జాణవౌదువు ఇట్టె కూచుండవయ్యా

చ. 2: మొనసి చెలిపయ్యద ముంజేతఁ జుట్టుకొని
తనివారఁ బిసికే వందపుగుబ్బలు
పెనఁగి తప్పించుకోఁగా ప్రేమతో సాదించితివి
ఘనుఁడవైతివి నేఁ డిక్కడఁ గూచుండవయ్యా

చ. 3: అలమేల్మంగచెక్కున నటు నీచెక్కు పొందించీ
తలవంచుకొన్నా పెచింత మాన్పితివి
బలిమి శ్రీవేంకటేశ పంతపాకెఁ గూడితివి
అలరితి రొక్కమనసాయఁ గూచుండరయ్యా

రేకు: 1498-5 సాళంగం సం: 24-587

పల్లవి: దేవులనయ్యేనంటా తివిరీఁ దాను
చేవదేర నాపెఁ గొంత చేపట్టఁగరాదా

చ. 1: చుట్టమనై నీతోను సుద్దులెల్లాఁ జెప్పఁగాను
వెట్టికి వచ్చి తానేల వెంగెమాడీని
గట్టిగా నాపెకు విది కడువేడుకైతేను
అట్టె కడమమాటెల్లా నడుగఁగరాదా

చ. 2: బత్తిచేసి నే నీకు పాదాలు పిసుకఁగ
తత్తరించి తానేల తప్పువట్టీని
హత్తి తనకు నేరుపు లంతేసి కలిగితేను
కొత్తలవెట్టో తెలుసుకొని చూడరాదా

చ. 3: అలమేలుమంగనై నిన్నటు గాగిలించుకోగా
యెలమిఁ దానేల వచ్చి యేఁకారీని
అలరి శ్రీవేంకటేశ ఆస లాపెకుఁ గల్గితే
పిలిచి యందూఁ గొంత పెనఁగించరాదా

రేకు: 1498-6 శంకరాభరణం సం: 24-588

పల్లవి: ముద్దులుగారీ మోమునను
వొద్దిక నేమైన నొసగరె చెలులు

చ. 1: చెక్కులవెంటాఁ జెమటలు గారీ
యెక్కడ నాడెనొ యిందాఁకా
చక్కఁ గృష్ణునికి జలకము సేయరె
నెక్కొని కాఁగిట నించరె చెలులు

చ. 2: పొరిఁబొరి నిట్టూర్పులు గడురేఁగెను
పరువులు వెట్టెనొ పడుచులతో
సరుగన శైత్యోపచారము సేయరె
యిరవుగ నుయ్యల నిడరే చెలులు

చ. 3: చుట్టుకొన్నజడ చొల్లెము జారెను
వుట్టులు గొట్టెనొ వుదుటునను
పట్టి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁ-
డిట్టిపనులవా రెంచరె చెలులు

రేకు: 1499-1 సామంతం సం: 24-589

పల్లవి: కంకణము గట్టవయ్యా కలికికిని
అంకెల నీకుఁ దలఁపయ్యేటట్టుగాను

చ. 1: యెప్పుడు నీమనసులో నింతిని మఱవకుండా
కుప్పెలువంటిచన్నులు గుఱుతుచూచుకోవయ్యా
నెప్పునఁ బెక్కుసతులనే స్తముగలవాఁడవు
తప్పక వారిలో నీకె తడఁబడకుండాను

చ. 2: ఇందుముఖి యందరిలో నెరకైవుండేయట్టుగా
ముందే చక్కఁదన మురమున వాసుకొనవయ్య
పొందు లెంద్దైనాఁ జేసి భోగించేవాఁడవు
సందడి ననుమానము సారె రాకుండాను

చ. 3: ఇదె యలమేలు మంగ నేలితివి ననుపుగా
పదిమారు లీకేపేరు పాటముసేసుకోవయ్య
పదరి శ్రీవేంకటేశ పదారువేలనేలితి-
వెదుగా నందు వెదకి యెంచుకోకుండాను

రేకు: 1499-2 బౌళి సం: 24-590

పల్లవి: ఆడనుండే లాగవేగా లాడవద్దు
యీడనే నీకాఁగిలి నాకిప్పుడే యిమ్మా

చ. 1: చెలిగట్టినచెంగావిచీర కొంగు గానవచ్చీ
మలసి నీపచ్చడము మాటునను
నెలఁత నీవద్దలేదని నిజము నెరపేవు
తెలిసె నాపానుపుమీఁదికి నీవు రమ్మా

చ. 2: తరుణిసొమ్ముల కాంతి తళుకున మెరిచీని
సరి నీనిలువుమేనిసందుసందుల
అరుదై యెవ్వతె దాఁచనని వొడఁబరచేవు
పరగ నిప్పుడే నాపక్కకు రమ్మా

చ. 3: వనితతనువువింతవాసనలు పొలసీని
నినుపుఁ జెమటగారే నీచెక్కులను
యెనసితి వేంకటేశ నేనలమేల్మంగ-
నొనర నాకెనుఁ జూపే నొద్దికతో రమ్మా

రేకు: 1499-3 పాడి సం: 24-591

పల్లవి: ఎవ్వరి నేమనఁగల మిప్పుడు నేము
నివ్వటిల్ల మిమ్ముఁజూచి నవ్వే మింతేకాక

చ. 1: నేరుపులన్నియుఁ జూపి నెలఁతపయ్యదకొంగు
సారెఁ దీసి యిట్టె సరసములాడేవు
ఆరితేరి నిన్ను నాపె అనవెట్టి పలుమారు
దూరుతాను పెంజెమట గోరఁ జిమ్మీని

చ. 2: వేడుకలు పుట్టించి వెలఁదిచన్నులమీఁద
తోడనే కుంకుమ పూసి దొమ్మిసేసేవు
వీడినతురుముతోడ వెస నిన్ను నద్దలించి
మేడెపురతికి నాకె మీరివచ్చీని

చ. 3: కందువఁ గాఁగిటఁ గూడి కాంతను శ్రీవేంకటేశ
సందడి మోవితేనె చవిచూచేవు
మందలించి నిన్ను నాకె మనసు రంజిలఁజేసి
ముందుముందె నీమర్మములు ముట్టీని

రేకు: 1499-4 ధన్నాసి సం: 24-592

పల్లవి: మాకు నీవు వెలిచేవా మాటమాటలా
ఆకెఁ బేరుకొనియైనా నానందించేవుగాక

చ. 1: తెలతెలవారఁగానే తెలివమొగముచూచి
వలపు చద్ది గట్టుక వచ్చితివి
చలాన నే నలిగితే జడిసేనా నీవేమైనా
తలపోఁతనైనాఁ గొంత తనుతువుగాక

చ. 2: పానుపు దిగుతా నీవు భామమోవి చవిచూచి
తేనెతావులు దప్పికిఁ దెచ్చుకొంటివి
పూని నేఁ బిలువకుంటే పొగిలేవా నీవేమైనా
దానియాసాసలనైనాఁ దనుతువుగాక

చ. 3: కన్నులు దెలిచుతానే కాఁగిటిలో నాకెఁ గూడి
అన్నిటా రతిసంబళా లందుకొంటివి
యెన్నఁగ శ్రీవేంకటేశ యెడసేవా నీవేమైనా
తన్నూ నన్నూఁ గూడితివి తనుతువుగాయ

రేకు: 1499-5 దేశాక్షి సం: 24-593

పల్లవి: మీకుమీరే తెలుసును మీఁదటెత్తు
పైకొని వూరివారికి పను లిందుఁ గలవా

చ. 1: చెక్కులు నీవు నొక్కితే సెలువుల నవ్వె నాకె
యెక్కువతక్కువలు నే మెఱఁగము
తక్కక చెలుల మింతే తగవు లేమడిగేరు
యిక్కడ సాకిరు లెవ్వరెట్టు చెప్పే రిఁకను

చ. 2: కన్నుల నీవు చూచితే కాఁతాళించి పల్కె నాకె
వున్నసుద్దులు దెలియ వూరకే మాకు
యెన్న నూడిగపువార మేఁటికి గురిసేసేరు
పన్ని ఇందు కెవ్వ రొడఁబరచవచ్చేరు

చ. 3: కలయ నీవు వచ్చితే కాఁగిలించుకొనె నాకె
తలఁపు లేర్పరచ నెంతటివారము
కొలువువారము వేడుకొనకు శ్రీవేంకటేశ
చలపట్టెవ్వరు మిమ్ము సాదించఁగలరు

రేకు: 1499-6 గౌళ సం: 24-594

పల్లవి: మగవాఁడవు నీవు మగువను నేనైతే
వెగటున నిన్నుఁ గడువెగ్గళించవచ్చేమా

చ. 1: కంటకమాడఁగ లేదు కసరుకొనఁగ లేదు
నంటున నే నీతోను నవ్వరాదా
వొంటే నందుకుఁగా నీవు వూరకే సాదించేవు
బంట పంతాలకు నీతో పైకొనవచ్చేమా

చ. 2: కొలదిమీరఁగ లేదు కొంగువట్టి తియ్యలేదు
సొలసి నిన్నుఁ దప్పకచూడరాదా
చెలకత్తెలకు నీవు చెప్పిచూపే విదియెల్లా
చలమిబలుములను జింకించవచ్చేమా

చ. 3: జోలిఁ బెట్టలేదు నిన్ను సోదనగొనఁగలేదు
మేలుమేలనుచు నిన్ను మెచ్చరాదా
యేలితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
గేలిసేసి యిఁక నిన్నుఁ గెరలించవచ్చునా

రేకు: 1500-1 శుద్ధ వసంతం సం: 24-595

పల్లవి: చేసినవెల్లాఁ జేసి సిగ్గువడనేమిటికి
బాసలు తన్నుఁ జేయించి భంగపెట్టనీఁకను

చ. 1: వొడఁబరచేఁగాని వొద్దికి రమ్మనవే
యెడమాట లాడించఁగా నేను వచ్చిని
పడఁతు లెందరినైనా బడిఁబెట్టుక రానీవే
కొడిమలు గట్టి తన్నుఁ గోపగించ నీఁకను

చ. 2: మొక్కులు మొక్కీఁగాని మోము చూపుమనవే
అక్కడ నుండఁగాఁ దన కయ్యేదేమి
చొక్కి వారిచ్చినయట్టిసొమ్ముతోనే రానీవే
దక్కె నాకుఁ దను నేమీ తప్పు లెంచ నీఁకను

చ. 3: పాదము లొత్తేఁగాని పవ్వళించుమనవే
సాగువలెఁ గూచుండేమి సాదించీని
యీాదెస శ్రీవేంకటేశుఁ డేలెఁ దానె రానీవే
ఆదిగొని బట్టుసేసి అలయించ నీఁకను

రేకు: 1500-2 రామక్రియ సం: 24-596

పల్లవి: వేడుకకాఁడై న యట్టి విభుఁడు గాక
కోడెతనాలు సేసీని గోలవాఁడా యీతఁడు

చ. 1: పసిఁడికుండలవుట్లు బాలకృష్ణుఁడు గొట్టఁగా
వెస నొక్కతె చన్నులు వీఁపు నాటఁ బట్టితీసె
యెసఁగి యాకుండలే యేవి యని తానంతలో
పిసికీఁ జేతులఁ బట్టి పిన్నవాఁడా యీతఁడు

చ. 2: కోనలజుంటి పెరలగుదులవుట్టి గొట్టఁగా
తేనెమోవిని గోవిందుఁ దిట్టె నొకతె
మోనమున నాతేనెమోవి తేనెగా సవి
పానిపట్టి చవిచూచీ పసిబిడ్డ యీతఁడు

చ. 3: పాలవుట్లు శ్రీవేంకటపతి గొట్టఁగా నొకతె
పాలవంటినవ్వు నవ్వి పదరి సిగ్గువరచె
పాలదియే పడఁతి సెలవినంటా
నాలితో వారవట్టీ సన్నపువాఁడా యీతఁడు

రేకు: 1500-3 దేవగాంధారి సం: 24-597

పల్లవి: కంటివా వోయి యీగయ్యాళితనాలు
గొంటరిసతులు కొంకుదురా

చ. 1: ప్రియముచెప్పి నేఁ బిలుచుకరాఁగా
నయాన తానేల నవ్వీ నీతో
భయమెఱఁగనిపడఁతు లెందైనా
యతాన నుండనేరుతురా

చ. 2: కానుకిచ్చి నేఁ గన్నుల మొక్కఁగా
తానేల దీవించీ దండనుండి
పూని సిగ్గుదలపోయనికాంతలు
కానీలే తగవుగ్గై కొందురా

చ. 3: గక్కన నే నిన్నుఁ గాఁగిలించుకోఁగా
మిక్కిలి తానేల మించీ నీకె
యిక్కడ శ్రీవేంకటేశ లాఁతివారు
తక్కిన సుద్దులు దలఁతురా

రేకు: 1500-4 ముఖారి సం: 24-598

పల్లవి: ఏల యెమ్మెలు చెప్పేవే ఇందరితోను
వాలాయించి యంత నీవు వక్కాణించనేఁటికి

చ. 1: సతులలో నీవుండఁగా జాణతనా లాడెఁగాక
అతనికి నీకుఁ దొల్లి యంతపొందా
బతిమా లింటికి రాఁగా పాదాలు పైఁజాచెఁగాక
ఇతవె నీపైబత్తియేమి చెప్పేదే

చ. 2: దిట్టవై నీవు నవ్వఁగా దిష్టించి చూచెఁగాక
నెట్టన నాతఁ డేవూరే నీ వేవూరే
చుట్టపువరుసగాఁగా చోటు నీకు నిచ్చెఁగాక
పట్టిచూచితేను నీపై పస యేమున్నదే

చ. 3: పిన్నదానవుగాఁ గాను ప్రేమఁ జన్ను లంటెఁగాక
నిన్నుఁ గూడ నాతఁడెంత నీవెంతే
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
సన్నల మీఇద్దరికి చవు లేమి చెప్పేదే

రేకు: 1500-5 హిజ్జిజ్జి సం: 24-599

పల్లవి: నీవు చేసినచేఁతలు నీకు నెరి ఫలియించె
యీవల నిందుకే చెలు లిందరు నవ్వేరు

చ. 1: కొలువుసేసేదానిఁ గొప్పువట్టితీసి నీవు
లలి నోరిలోఁ దమ్ములము వెట్టఁగా
బలిమి నాకె నీమోవిఁ బచ్చిసేఁతలెల్లాఁ జేని
మెలుపునఁ బంతములు మెరయక మానునా

చ. 2: కడలనున్నదానిఁ దొడలసంది నిడుక
జడియుచు నీవు సరసములాడఁగా
వడిసి కస్తూరి బొట్టువన్నె నద్ది వేల నందు
అడియాలముగ నాపె అచ్చు వాయఁదగదా

చ. 3: దండనున్నదాని నుద్దండాన శ్రీవేంకటేశ
గండుమీరి వేడుకతోఁ గాఁగిలించగా
బెండుపడ నీపురము బిగువుఁజన్నుల నొత్తి
చండిపెట్టి రతిఁ జొక్కించఁగ నిఁక వలదా

రేకు: 1500-6 దేసాళం సం: 24-600

పల్లవి: ఇంత తమకింతురా యిందరిలోనా
పొంతనే రట్టుసేతురా పొందైనచోటను

చ. 1: చెక్కుపైఁ జేఇడుకొని సిగ్గువడియున్నచెలిఁ
గక్కసింతురా రతికిఁ గాంకలు సేసి
పిక్కటిల్లుఁజన్ను లిట్టె పిసికి నంతటిలోనె
మొక్కళపుఁదనమేల మోహించినచోటను

చ. 2: పడఁతిమాఁటుననుండి భావించిచూచేఇంతి-
నొడివట్టి తీతురా వొరయుచును
తొడిబడ నీ వప్పుడే తొక్కేవు పాదములు
గడుసరితనమేల కలసినచోటను

చ. 3: పానుపుపై గుట్టుతోడఁ బవ్వళించి యున్నసతి
ఆసవెట్టి కూడుదురా ఆయములంటి
మోనాన శ్రీవేంకటేశ మోవి పిప్పిసేసితివి
దీనకపుఁదనమేల తిరమైనచోటను

రేకు: 1501-1 మాళవిగౌళ సం: 25-001

పల్లవి: నీవు మొదలిజాణవు నీకంటే జాణలు వారు
కావరపు నిన్నుఁ జూచి కనునల నవ్వేరు

చ. 1: గుట్టున నెవ్వతెనో కూడవలసి యందరి
నట్టే పనులు చెప్పి యంపేవు నీవు
నెట్టన గొంద రిందులో నీతలంపు తామెరిఁగి
చుట్టి చుట్టి నీవద్దనే సుద్దులు చెప్పేరు

చ. 2: పొద్దున నెవ్వరింటికో పోవలసి ఇంటివారి
నిద్దురలు వొమ్మనేవు నెమ్మది నీవు
వుద్దండపుకాంత లిది వూహించి తాము దెలిసి
వొద్దికతోఁబాదములు వొత్తేరు నీకును

చ. 3: సందడి నెవ్వతెతోనో సరసమాడవలసి
అందరి వసంతాలాడుమనేవు నీవు
ఇందె శ్రీ వేంకటేశ నే నెటింగితేఁ గూడితివి
విందు చెప్పి కొందరైతే వేడుకఁగూడేరు

రేకు: 1501-2 భౌళిరామక్రియ సం: 25-002

పల్లవి: ఎడఁగొల్లకత్తె నీకె నేమందును
నడుమఁ జుట్టరికాలు నడపీఁదాను

చ. 1: వంచనతో విందుచెప్పి వడి నిన్నుఁ దోడితేఁగా
కంచముపొత్తుకు నీకె గాచుకున్నది
మంచముపైనే నిన్ను మరి కూచుండఁబెట్టితే
లంచము మోవినియ్య లాఁచీఁదాను

చ. 2: పై కొని నీచేతికి బాగాలొసఁగితేను
ఆకుమడిచియ్య నీకె అమరినది
చేకొని పవ్వళించఁగఁజేసి నినానదరించితే
జోకల తాఁ బాదాలొత్తజోటుచేసుకున్నది

చ. 3: నేను నీవు కాఁగిటిలో నెయ్యము సలుపఁగాను
ఆనించి తనచన్నుల నంటుకున్నది
పూని శ్రీ వేంకటేశుఁడ పొంది నే సేసవెట్టఁగా
కానిమ్మని కంకణము గట్టీఁదాను

రేకు: 1501-3 వరాళి సం: 25-003

పల్లవి: నంటున రెండు విధాలు నడపీఁదాను
జంటచుట్టమైనవాఁడు సారె నేఁచ నేఁటికే

చ. 1: నాతో మాటలాడి ఇట్టే ననుపు సేసినవాడు
యేతుల నెవ్వతెఇంటి కేఁగఁ నేలే
చేతికి లో నైన వాఁడు సేవగొనుఁగాక తాను
కాతరానఁ బరాకులుగాఁ దనకేఁటికే

చ. 2: నామోము చూచి నేఁడు నవ్వులు నవ్వినవాఁడు
వేమారు విన్నపాలు వినఁగనేలే
కామించి నావద్దికి గక్కున వచ్చినవాఁడు
చేముట్టి సంగడివారిఁ జెనకఁగ నేఁటికే

చ. 3: గట్టిగా నన్నుఁ గాఁగిటఁ గలసినయట్టివాఁడు
ఱట్టు సేసి యొకతె కాఱడి గానేలే
ఇట్టె శ్రీ వేంకటేశుఁ డీతఁడే నన్ను మన్నించె
గుట్టుతోడ నేమిటికిఁ గొంక నిఁక నేఁటికే

రేకు: 1501-4 దేసాళం సం: 25-004

పల్లవి: అప్పుడు పరాకైవుండె నది యెఱఁగవు నీవు
ఇప్పు డాకె గనుఁగొని యేమనునో ఇఁకను

చ. 1: కప్పురపువసంతము కలికి నీపై నాడఁగా
డప్పిదేరె నక్కడిబడతలిక వాసె
కొప్పు ముడుచుకో ఇఁకఁ గొనగొంగు చెరువుకో
చొప్పు లాపె గంటేను సూడువట్టీ నిన్నును

చ. 2: గక్కన నీవు రాఁగానే కాంత పన్నీరు చల్లఁగా
చెక్కుచెమటెల్లా జారె సేదలుదేరె
చక్కదిద్దుకో నామము చందన మలఁదుకో
వెక్క సాలివెల్లాఁ గంటే వెంగెమాడీ నిన్నును

చ. 3: దగ్గర నీవు గూచుండేతరి పూవుల వేయఁగా
కగ్గియలంత దేరె కాకలు మానె
యెగ్గులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సిగ్గరి యాపె గంటేను చిమ్మరేఁచీ నిన్నును

రేకు: 1501-5 ఆహిరి సం: 25-005

పల్లవి: ఇద్దరుఁ గదిసినారు యెదురుబడి నున్నారు
పొద్దువొద్దునకు మిమ్ము బోదించవలెసె

చ. 1: పిలిచీ నూఁకొనరాదా ప్రియురాలు నిన్నునిట్టె
తలయెత్తి చూడరాదా దండ నున్నది
బలిమి బెనఁగరాదా పంతములే నెరపీని
చెలులముగన నేము చెప్పకుండరాదు

చ. 2: నవ్వీ మారు నవ్వరాదా నలినాక్షి నిన్నుఁజూచి
జవ్వన మంటఁగ రాదా సమ్మతించీని
పువ్వుల వేయఁగరాదా పొంచి సరస మాడీని
ఇవ్వల నేమిటు మిమ్ము యెచ్చరించఁదగును

చ. 3: కలసీఁ బెండ్లాడరాదా గక్కనఁ బానుపుమీఁద
తలఁపు చేకొనరాదా తమకించీని
యెలమి శ్రీ వేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
లలి నొడఁగూర్చి మిమ్ము లాలించే మీఁకను

రేకు: 1501-6 బౌళి సం: 25-006

పల్లవి: నలినాక్షుల కెల్లాను నవ్వు వచ్చీని
పెలుచుసరసములఁ బెడరేచ కిపుడు

చ. 1: కలకలనగవులు కాఁతాళపుతగవులు
సలిపే వందరితోను సారెసారెకు
తెలిసెను నీజాడలు తేటతెల్లమిగాను
పలుకుల నిఁక నేమీఁ బచారించ కిపుడు

చ. 2: మంతనపుఁబ్రియములు మాటలలో నయములు
వింతులుగా నెరపేవు వీదులనెల్లా
దొంతులై నిలిచె నవె తొల్లె నీనేరుపులు
సంతలఁ బెట్టి యమ్మకు చాలుఁజాలు నిపుడు

చ. 3: జవ్వనపుమదములు సమరతి ముదములు
నివ్వటిల్లఁ జూపేవు నెమ్మది నీడ
ఇవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
రవ్వలాయ వలపు పేరడిఁబెట్ట కిపుడు

రేకు: 1502-1 పాడి సం: 25-007

పల్లవి: ఏమి చెప్పినా జేసేను యెగ్గా నాకు
వేమారు నెంతచేసినా వెంగెమా నాకు

చ. 1: చేరి నన్ను వేఁడుకొని చెక్కు నొక్కరాఁగాను
సారెసారెఁ బెనఁగఁగ చలమా నాకు
గారవించి నీవు నన్నుఁ గతలు చెప్పుమనఁగా
వూరకే వుండఁగ నీతో వౌరటా నాకు

చ. 2: అగపడి మంచిమాట లాడఁగానే వేగిరించి
యెగసక్కేలాడ నీతో యెమ్మెలా నాకు
నగుతా నీవు నన్ను నమ్మించి బాస లియ్యంగా
పగటులు పచరించ పంతమా నాకు

చ. 3: పోదిసేసి విడెమిచ్చి పొందు నీవు నడపఁగా
కాదు గూడదన నీతో గర్వమా నాకు
యీదెస శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సాదించ నీతోడ రాజసమా నాకు

రేకు: 1502-2 సాషువరాళి సం: 25-008

పల్లవి: ఎందాఁకా మూసిమంతనా లేల సేసేవు
పందెగాఁడవై నీవే పడితళించ రాదా

చ. 1: అంకెల నీవద్ద నుండి యాపెయాడేమాటలెల్లా
వంకలొత్తి చక్కదిద్దవలెనా నీవు
పొంకముగా నేరకేంట పూనుక నీవే వచ్చి
తెంకి నుండి మాతోను దీకొనఁగరాదా

చ. 2: చుట్టిచుట్టి యా నాతో జూజాలాడి యోడఁగాను
రట్టుగా నెత్తులు చెప్ప ఇట్టె వలెనా
నెట్టన నీ కంతేసి (నెఁ (నెం?) జెరివి గలితేను
పట్టి నీవె సారెలు పన్ను కొనరాదా

చ. 3: ముంచి నాకాపె చెల్లెలై మొక్క నేరక వుండఁగా
వంచనఁ జేతులు కూడ వంచేవు నీవు
యెంచగ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నీవు
కొంచి యాపె యుండితే నీకు మొక్కించుకోరాదా

రేకు: 1502-3 శంకరాభరణం సం: 25-009

పల్లవి: చెప్పఁగ నేఁటికి సేసినమే లిఁక
చొప్పుగ నీవే చూచుకోనేవు

చ. 1: కన్నియ మాఁటల కసరఁగనోపక
సన్నటనే నిను జరసీని
అన్నిట ప్రౌఢవయసుదయితేఁగన
మొన్నటిసేఁతకు మొగమోడీనా

చ. 2: బాలకి నీతో పంతము నెఱపక
వాడిక చూపుల వడి సొలసీ
యీలాగున నీయీడుదియైతే
నాలితనమున వెనకతీసీనా

చ. 3: జవ్వని బొమ్మల జంకించనోపక
యివ్వల నిన్నిపు డెనసె నిదే
చివ్వన వింతది శ్రీవేంకటేశ్వర
రవ్వలు సేయక రతిఁ గోఁకీనా

రేకు: 1502-4 సామంతం సం: 25-010

పల్లవి: ఏమి సేయవచ్చునయ్య యిల్లాండ్ల కివియేల
వేమారు నిటువంటివే వేడుకాయ నీకును

చ. 1: కెలయుచు నింతి నీతో కిమ్ముల సారె నాడేటి
పెలుచుమాటలు నీకుఁ బ్రియమాయను
బలిమి బెనఁగి నీతోఁబై కొన్న సరసముల
చలపాదితనములు చవులాయను

చ. 2: కేరుచు నాపె నేఁడు కెలన నవ్వులు నవ్వే
అరజములే నీకు ననువాయను
చేరి చేరి యప్పటిని చేతిమీఁదఁ జేయివేసి
బీరపుపందెములే ప్రియమాయను

చ. 3: కందువఁ గాఁగిటఁ గూడి కమ్మటి నాకెకు నీకు
సందడిఁ బచ్చిసేఁతలే సాజమాయను
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
విందులు మోవితేనెలు వీదుదోళ్లాయను

రేకు: 1502-5 మాళవిగౌళ సం: 25-011

పల్లవి: నెమ్మది నుండవయ్య నీకు నంతా సంతోసమే
సమ్మతించకుండరాదు సవతుల కిఁకను

చ. 1: ముప్పిరిగొనంగ నీవు మోహించిన కామినులు
చప్పనిమాట లాడినా చవిపుట్టును
యెప్పుడు నీకొలువున నెడయకుండేవారు
తప్పులెంచి కొసరినాఁదమి రేఁగును

చ. 2: కోరి వేఁడి నీవుదెచ్చుకొనినసతులు నిన్ను
చేరి యేసేఁత సేసినాఁ జిత్తమువచ్చు
మేర మీరి నీచనవు మెరసినయట్టివారు
బీరము లెంతచూపినాఁబ్రియములై తోఁచును

చ. 3: మంతనాన నీ వెప్పుడు మన్నించేకాంతలు
వంతా లెంతనెరపినా బాంతియై యుండు
ఇంతలోన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వింతవా రెట్టునవ్వినా వేడుక వొడమును

రేకు: 1502-6 పాడి సం: 25-012

పల్లవి: బహుపరాకులు నీకు పనులెన్నైనా నాఁ గలవు
తహతహలెల్లా మాని తలఁచుకో పొందులు

చ. 1: కప్పుర మాపె యుంపఁగాఁ గానుకిచ్చి పొడగంటి
నిప్పుడు నావిన్నపాన కేమంటివి
ముప్పిరిగొని వున్నారు ముందర నావంటివారు
తప్పక నామోము చూచి తలఁచుకో పొందులు

చ. 2: చెంది యాపెలేకలు నీచేతికి నే నియ్యఁగా నీ
వందుకొన్నందుకు వడియాల మేది
యెందరైనా వచ్చి చెలు లింతకతొల్లె వున్నారు
దండిగా నారా కెరింగి తలఁచుకోపొందులు

చ. 3: నెచ్చెలి పిలువుమనె నిన్ను శ్రీవేంకటేశ నే
వచ్చినపనికి నీవు వచ్చేదెపుడు
రచ్చ నిందరు నున్నారు రతి కింతలో వచ్చి
తచ్చి యాకెఁ గూడితివి తలఁచుకో పొందులు

రేకు: 1503-1 సామంతం సం: 25-013

పల్లవి: చూచుకో ముందటిపని సూటిదప్పకుండాను
యేచి యీ కెగుణమెద్దో యెఱంగముసుమ్మీ

చ. 1: నమ్మికిచ్చి యాపెఁదెచ్చి నామొగము చూచి నీవు
కమ్మటి లోఁగుచు నిచ్చకము సేసేవు
దిమ్మరిమాటల యాపె దిక్కుల నీసుద్ది వింటే
యెమ్మల నేమిసేసునో యెఱంగముసుమ్మీ

చ. 2: పానుపుపై నాకెఁ బెట్టి పక్కననుఁ దెరవేసి
పూని నే రాఁగా నాతో పొందుసేసేవు
నానాబుద్ధులెరిఁగిననాతి యాపె ఇందుకుఁగా
యీ(యే?) నెపాన సాదించునో యెఱంగముసుమ్మీ

చ. 3: వొద్దికతో నాపెఁగూడి వొడివట్టి నేఁదియ్యంగా
బుద్ధిచెప్పి నన్ను నేలి బుజ్జగించేవు
అద్దిరా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
ఇద్దెస నెట్టొరసునో యెఱంగము సుమ్మీ

రేకు: 1503-2 ఆహిరి సం: 25-014

పల్లవి: ఇప్పటికోపము మీకిట్టె వుండీనా
వొప్పుగా నాతఁడు నీవు నొక్కటే కాదటవే

చ. 1: గుట్టుతోడ నీ విభుఁడు కొంగుపట్టి తీసితేను
పెట్టరానివొట్టులేల పెట్టేవే నీవు
చుట్టమై తనముచ్చట సుద్దులు నీకుఁ జెప్పితే
వట్టితప్పులెల్లా వేసి వాదింతురటవే

చ. 2: పాయలేక యీతఁడు నీపై బత్తిసేసి తేను
చేయరానిచేఁతవేల సేసేవే నీవు
నీయెడకు బాఁతిపడి నెయ్యములు చూపితేను
చాయలా సన్నలాజూచి చండిసేతురటవే

చ. 3: ఇవ్వల శ్రీవేంకటేశుఁడిటు నిన్నుఁ గూడితేను
నవ్వరాని నవ్వులేల నవ్వేవే నీవు
పువ్వులదండలు నీ కొప్పునఁ గడుజుట్టితేను
రవ్వగా నాతనిసిగ్గు రచ్చవేతురటవే

రేకు: 1503-3 పాడి సం: 25-015

పల్లవి: ఏల కొత్తలు సేసేవు ఇప్పుడే నాతో
మేలుతోడిదానవౌత మిక్కిలి నెఱఁగవా

చ. 1: కనుచూపులనేచూచి కాఁక లెంత చేసేవు
ననుపు చూపి యెంత నమ్మించేవు
మనసులు సోదించి మర్మమేల వెదకేవు
యెనసి మోహించిన దెరఁగవా నీవు

చ. 2: తరితీపులనుఁబెట్టి తమక మేల రేఁచేవు
పొరుగున నుండి యేమి పొద్దువుచ్చేవు
సరసములే యాడి చవులెంత మరపేవు
ఇరవైన దానవౌత యెరఁగవా నీవు

చ. 3: అసలనే చిక్కించి ఆయము లేఁటి కంటేవు
సేసవెట్టి నీవెట్టు సిగ్గుదేర్చేవు
వాసితోనన్నేలితివి వరుస శ్రీవేంకటేశ
యీసరి నలమేల్మంగ నెఱఁగవా నీవు

రేకు: 1503-4 వేళావళి సం: 25-016

పల్లవి: ఎఱఁగనట్టున్నాఁడవు యేల దాఁచేవు పొందులు
మఱఁగున నింతి నిట్టె మన్నించరాదా

చ. 1: చీటికిమాటికి నాపె సిగ్గులువడీ నీతో
గాలమైన నీదేవులు గాఁబోలును
సూటిదప్పకుండా నిన్నే చూచీ నప్పటి నాపె
బాటగాఁ దమకమెల్లాఁబై కొనఁగబోలును

చ. 2: నానఁబెట్టి ముసిముసినవ్వులు నవ్వీ నాపె
కానీలే నీయెరుకది గాఁబోలును
ఆనుకొని నీమాటలే ఆలకించి వినీ నాపె
పూని తన అసలెల్లా వుప్పొంగఁబోలును

చ. 3: అంది నీవురముమీఁద నటు నెలకొనె నాపె
కందువ నలమేల్మంగ గాఁబోలును
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అందాలుచేసేఁదాను అరుదుగాఁబోలును

రేకు: 1503-5 ముఖారి సం: 25-017

పల్లవి: కంటిమిగా యీ వేడుకలు నే మెల్లాను
నంటున మీ కెటువంటిననుపులో ఇపుడు

చ. 1: యెనసి యాకె నీవు నిద్దరు నుండఁగఁ జూచి
మనసొక్కటాయ నేఁడు మాకెల్లాను
మునుపటివలెఁ గాదు మొగములఁ గళలుబ్బె
వనితు నీకు నెటువంటి సంతోషములో

చ. 2: అలుకలుదేరి మేలమాడఁగా మిమ్మిటు చూచి
సెలవుల నవ్వు వచ్చెఁ జెలుల కెల్లా
చలముల మీవొట్లపడి వాసె సిగ్గుదేరె
తలపోఁత లెటువలెఁ దారుకాణ లాయవో

చ. 3: వరుసతో రతి చేసి వచ్చి మీరాక చూచి
అరుదాయ సవతుల కందరికిని
నిరతి శ్ర వేంకటేశ నే నలమేలుమంగను
దొరసి కూడతిని మీదో టిపొందు లెట్టివో

రేకు: 1503-6 ధన్నాసి సం: 25-018

పల్లవి: ఆసపడి వాసులెంచ నది యేఁటికే
పాసివుండలేని వాఁడు పదరఁగ నేఁటికే

చ. 1: తప్పక చూచినవాఁడు దండకు రావలెఁగాక
చిప్పిలఁ గలలోనేసిగ్గులేఁటికే
కొప్పు దువ్వినవాఁడు యిక్కువ లంటవలెఁగాక
దప్పిదేరెమోవితోడ తలవంచ నేఁటికే

చ. 2: మేలమాడినవాఁడు కామించి కూడవలెఁగాక
యీలాగు సెలవినవ్వు లిపుడేఁటికే
కాలుదొక్కిన వాఁ డిట్టె కరఁ గించవలఁగాక
తాలిమితోసారెసారెఁ దలపోఁత లేఁటికే

చ. 3: చేరి పెండ్లాడినవాఁడు చెనకఁగవలెఁగాక
ఆరీతి కాఁకలనలయఁగ నేఁటికే
పూరకె శ్రీ వేంకటేశుఁడొద్దికతో నన్నుఁ గూడె
తారసిలె వలపులు తడఁబాటులేఁటికే

రేకు: 1504-1 ముఖారి సం: 25-019

పల్లవి: రమణుఁడు మమ్మేల రవ్వసేసీనే
సముకాన నుండితేనే చవిపుట్టీనా

చ. 1: బలిమిసేసి యెంత పలుమాయ నవ్వినాను
వలపు గలంతేకాక వచ్చేదేమి
చలపట్టి యెన్నేసిసరసము లాడినాను
పిలువని పేరటము ప్రియమయ్యీనా

చ. 2: తతిగొని యెంత మొక్కి తమితోడఁ బెనఁగినా
యితవు కొలఁదేకాక యెుక్కుడున్న దా
నుతికెక్క నెన్నేసికానుకలు చేతికిచ్చినా
అతిరాజసమెకాక అంకెకు వచ్చీనా

చ. 3: వేడుకతో నొడివట్టి వేమారుఁదీసినాను
వాడికగల ట్టైకాక వసమయ్యీనా
యీడనె శ్రీవేంకటేశు డేలె నింతలోనె నన్ను
వీడనిపొందులు మరివెగటయ్యీనా

రేకు: 1504-2 హిందోళవసంతం సం: 25-020

పల్లవి: వెరగంది వున్న దాన విభు నేమీ ననలేక
చురచురఁబంతాలాడీ చోద్యమయ్యీనే

చ. 1: చెక్కులఁ జెమట గారె సిగ్గులు మోమునఁదెరె
యెక్కడిమాటలు పతి నేమనేనే
పక్కులు గట్టెను మోవి పైకొనెఁ గన్నులకాని
తక్కక నాతో నింక తా నేమనీనే

చ. 2: నెఱులకొప్పు వదలె నిట్టూర్పులు పొదలె
యెఱఁగి యుండియుఁ దను నేమనేనే
తఱచాయ నలపులు తతిగొనె వలపులు
వఱివచ్చె రతులకు తానేమనీనే

చ. 3: సెలవినవ్వులు మించెచిత్తము చెంగలించె
యెలమి శ్రీ వేంకటేశు నేమనేనే
నలి రేఁగి పందెమాడె నన్నుఁ గాఁగిటఁ గూడె
తలఁగరా దిఁక నెందూ తా నేమనీనే

రేకు: 1504-3 పాడి సం: 25-021

పల్లవి: చిత్తమెఱింగి సేవలు సేయుటగాక
హత్తి నీతోడఁ బెనఁగి అలఇంచఁదగవా

చ. 1: యెంతచనవరినైనా యింతి నింతె నీకు నేను
చింత నీ మోవి యెంగిలి సేయవచ్చునా
వింతసతు లెఱుంగక వెక్కసానఁ బైకనినా
పంతమాడి ఇందరిలోఁ బచ్చిసేయఁదగవా

చ. 2: నీవెంత మన్నించినా నే నూడిగపుదాననే
వేవేలైనాఁగాలు నీపై వేయవచ్చునా
కావరించి నిన్ను జారకామిను లెట్టుచేసినా
యీవిధాన మాకునెల్లా నెమ్మె చూపఁదగవా

చ. 3: అక్కున నెంత వుండినా అలమేలుమంగ నేను
వుక్కువంటిచన్నుల నిన్నొత్తవచ్చునా
యెక్కడివారు నీకున్నా యేలితివి నన్ను నేఁడు
గక్కున శ్రీ వేంకటేశ కడుమీరఁదగవా

రేకు: 1504-4 లలిత సం: 25-022

పల్లవి: ఇంత వెఱపేల నీ యిచ్చరాజవు
పంతముమెరసి నిన్ను బంగించమా

చ. 1: చేసినచేతలు నీకు చెల్లవలెనని వట్టి
బాసలు సేయుమీ పలుమారును
సేసవెట్టితివి తొల్లె చేకొంటివి నీ వారము
యేసుద్దులు గలిగినా యెగ్గు లెంచేమా

చ. 2: మనసున నీ పనులు మఱవవలసి నాకు
వినయాలు సేయకుమీ వెల్లవిరిగా
వొనరఁ నేఁ జిన్ననాటనుండి నీ కిచ్చకురాల
నినుఁ జూచి నేరము లెంచేమా

చ. 3: సురతములో నిన్నక్కడిచొప్పు లెత్తకుండాను
పరవశ జేయకుమీ పక్కన నన్ను
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
గరిమ నన్నేలితివి కాకుసేసేమా

రేకు: 1504-5 భైరవి సం: 25-023

పల్లవి: నీవైనా విన్నవించవే నిష్ఠూరము గుండాను
తావుకొన్న మొగమోట తలఁచు నా కిపుడు

చ. 1: చెప్పఁజాలఁగాక తానుసిగ్గువడీనంటగాను
అప్పటనుండి నందరు నాడేమాటలు
తప్పనిబొంకనియట్టిదంటయ్యె తానున్నాఁడు
వొప్పుగ నే వెరగంది వుందాననే యిపుడు

చ. 2: మందలించఁజాలఁగాక మనసు నొచ్చీనంటాను
గొందిసంది తనమేనిగురుతులెల్లా
చందాలు సేసుక ఇట్టె సాదువలె నున్నాఁడు
అందుకే నే నవ్వి నవ్వి యలసితి నిపుడు

చ. 3: యెచ్చరించఁజాలఁగాక ఇంతలో లోఁగీనంటా
రచ్చలకెక్కినతనరతులెల్లాను
అచ్చపు శ్రీవేంకటేశుఁడల మేలుమంగక నేను
మచ్చికతోఁ దన్ను గూడి మరిగితి నిపుడు

రేకు: 1504-6 లలిత సం: 25-024

పల్లవి: ఇంక నేడసుద్ది నీవు యెవ్వరికి లోనయ్యేవు
సంకెవిడిచిన మీఁద సంగతౌనా దూరను

చ. 1: చక్కఁదనములు చూపి జాణతనములె యాడి
చిక్కించుకొనెఁగా నిన్ను చిత్తిణి యాసె
ఇక్కువ లంటి నిన్ను నెవ్వరు తమిరేఁచినా
కక్కసమై వుండుఁగాక కరంగీనా మనసు

చ. 2: మోవితేనెలు కురిసి ముసిముసినవ్వు నవ్వి
కైవసము చేసుకొనెఁగా నిన్నాపె
భావించి యెవ్వతెకైనాఁ బనికివచ్చేవా నేఁడు
నీవోజ నిలుచుఁగాక నేర్పులు వచ్చీనా

చ. 3: పూడిగాలెల్లఁ జేసి వూరకే చన్నుల నొత్తి
కూడెఁగా శ్రీవేంకటేశ కోరి నిన్నా పె
యీడ నలమేలుమంగనయిననన్ను నేలితివి
వెనుకై వుందువుగాక వింతగా జూచేవా

రేకు: 1505-1 ఆహిరి సం: 25-025

పల్లవి: మాటలైనా నాడరాదా మనసిచ్చి
చోటిచ్చి పిలువరాదా చుట్టమైన వాఁడవు

చ. 1: తటితో నీ వింతలోనే తలవంచుకుండనేల
తెఱవ నీకు మొక్కీ దీవిఁరాదా
యెఱుఁగునో నీమర్మము లేమైనా నీ కె తొల్లి
వెఱవనేఁటికి నీవు వేడుక కాఁడవు

చ. 2: వింతవా రున్నారంటా వేడుక దాఁచఁగనేల
ఇంతి బత్తిసేసీఁ జనవియ్యఁగరాదా
చెంతనుండి ఇప్పుడే సిగ్గయ్యీనో నీకేమైనా
చింతించనేఁటికి సిరిగలవాఁడవు

చ. 3: తలపోసి లోలోనే తమక మఱపనేల
చెవియ పందెము వేసీఁ జెయ్యొగ్గరాదా
అలవేలుమంగ నేను అన్నిటా శ్రీ వేంకటేశ
కలసితి గుట్టేఁటికి కతకారివాఁడవు

రేకు: 1505-2 బౌళి సం: 25-026

పల్లవి: ఏంటికి నెరగువడే వెఱఁగని వానివలె
చాటిచెప్పి సణఁగులు చల్లనా నేను

చ. 1: మంతనాన మీరిద్దరు మాటలాడుకొనఁగాను
వింతలుగా వీనులార విననా నేను
యింత సేసితినిసుమ్మీ ఇఁక లేదనుకుమని
చెంతనుండి నీకెఱఁగ జెప్పనా నేను

చ. 2: యెనసి నీవో నాకె ఇట్టె కాఁగిలించుకోఁగా
ననుపులు(ల?) మిమ్ముఁ జూచి నవ్వనా నేను
కనుఁగొంటగిఁజుమ్మీ మీతగవు మఱవకుమని
వొనర నీచెక్కు నొక్కనా నేను

చ. 3: వోవరిలో మోవితేనె లొకరొక రిచ్చుకోఁగా
మీవద్దనే కూచుండి మెచ్చనా నేను
శ్రీవేంకటేశుఁడవు జిగి నలమేల్మంగను
చేవదేరఁ గూడి సేవసేయనా నేను

రేకు: 1505-3 వరాళి సం: 25-027

పల్లవి: నా మొగము చూచి యెంత నగుతా సిగ్గుపడేవు
కామించిన వాని నిన్ను కాకుసేసేనా

చ. 1: పెక్కుసతులను నీవు పెండ్లాడి వచ్చితివంటా
వెక్కసాన నిన్నుఁ గదు వెంగెమాడేనా
చిక్కించుక వారు నిన్నుఁ జెలరేగి తిట్టిరంటా
అక్కడా నిక్కడా నిన్ను నాడుకొనేనా

చ. 2: వాడవారితోడ నీవు వసంతాలాడేవంటా
జాడగాదని నిన్ను సాదించేనా
వాడిక నా సందడిలో వారికాళ్ళు దాఁకెవంటా
యీడ నిన్ను గేలిసేసి యెత్తిపెట్టేనా

చ. 3: కన్నవారినెల్లా నీవు కాఁగిటఁ గూడితివంటా
సన్నలా చాయలా నిన్ను జంకించేనా
అన్నిటా నలమేల్మంగ నైననన్ను నేలితివి
చెన్నుగా శ్రీ వేంకటేశ సిగ్గువఱచేనా

రేకు: 1505-4 గుజ్జరి సం: 25-028

పల్లవి: కోపగించి పతినేల కొసరే రే చెలులాల
మాపుదాఁకా సొలసినా మతి గరఁగీనా

చ. 1: నగుతా నేమాడినాను నమ్మికయ్యై తోఁచుఁగాక
యొగసక్కేలాడితేను ఇయ్యకోలౌనా
తగులమి గలిగితే తలఁపు గలుగుఁగాక
మొగము చూడకుండితే మోహ మేడుండునే

చ. 2: సరవితోఁ బిలిచితే సమ్మతించవచ్చుఁగాక
బిరుదున గద్దించితే ప్రియమయ్యీనా
సరిమేను సోఁకితేను చవులెల్లాఁ బుట్టుఁగాక
విరసాన వీఁగితేను వేడు కేడ నుండునే

చ. 3: ననుపై నడచితేను నాఁటుగాక మోహము
కొనగొన నుండితేను కూటమబ్బీనా
యెనసె శ్రీ వేంకటేశుఁడే నలమేలుమంగను
ననుఁ గూడె నలుక మానక యేల వుండు నే

రేకు: 1505-5 రామక్రియ సం: 25-029

పల్లవి: ఇన్నాళ్ళ వలెఁ గాదు ఇటు నీవుండేలాగు
అన్నిటా నీకు నతఁడే అసమిచ్చెనా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చిరునవ్వులు నవ్వేవు
మలసి ని న్నతఁ డట్టె మన్నించెనా
కళదేరీ నీ మోము గర్వము నీకెక్కుడాయ
అలరి యీ పెద్దరిక మాతఁడే వొసగెనా

చ. 2: ఆళాపించి ఆళాపించి అట్టె పాటలు వాడేవు
లాలించాతఁడు నీతో మేలము లాడెనా
రాలీఁ గొప్పున విరులు రాఁపుకత్తె వైతివి
ఔలే యీమురిపెము లాతఁడే నేరిపెనా

చ. 3: పవళించి పవళించి పానుపుపై నలసేవు
కవగూడెనా శ్రీ వేంకటేశ్వరుఁడు
ఇవల నలమేల్మంగ ను తా నన్నేలినాఁడు
అవసరించేవు నీకు నాతఁడే రమణుఁడా

రేకు: 1505-6 భైరవి సం: 25-030

పల్లవి: నగుతా నీయిచ్చకొద్ది నడతాఁగాక
యెగసక్కెముగా నీతో యీసడించేనా

చ. 1: తలఁచుకో బాసలని తగవు నడపుమని
పలుమారు నీతోను పచారించేనా
పలుకు నమ్మితినని పాసితే దోసమని
సొలసి యొక్కతెవలె సోఁకనాడేనా

చ. 2: చిన్నదాన నేనని చెలులు దూరుదురని
కన్నచోటుల నే కరకరిఁ బెట్టేనా
నిన్ను నీవెంచుకొమ్మని నెపమేది లేదని
విన్నపాలుసేసి నిన్ను వేసరించేనా

చ. 3: కూడితివి నీవని కూరిమి చుట్టమనని
యీడా నాడా నేతులు నే నిటు చూపేనా
తోడనే శ్రీవేంకటేశ దొరయ నన్నేలితివి
వాడికె కిట్టె రాఁగా వలదనేనా

రేకు: 1506-1 సామంతం సం: 25-031

పల్లవి: నీకేలే వెఱపునేఁడు సవతులఁ జూచి
కైకొని కన్న వారిదే కంటి గురుమగాదా

చ. 1: నిలుచున్నాఁ డదివో నీయెదుట రమణుఁడు
పిలిచి పీఁటవెట్టవే ప్రియురాలవు
తొలుతనే యాతఁడు పొత్తులమగఁడైతే నేమి
వలచిన వారిదే వలపింతే కాక

చ. 2: మాటలాడీ నదివో మనసిచ్చి అతఁడు
పాటించి వొఁకొనవే పలుమారును
కూటమికి తావచ్చి గుట్టున నుంటే నేమే
వాటమైనచోటికి మచ్చుఁగదే నీరు

చ. 3: చేరవచ్చె నదివో శ్రీవేంకటేశ్వరుఁడు
గారవించి కాఁగిటఁ గలయఁగదే
వారకపురతిఁ బరవళ మీకఁడై తేనేమే
తారుకాణయినచోట తమిరేఁచుఁగదవే

రేకు: 1506-2 మాళవిగౌళ సం: 25-032

పల్లవి: తప్పక యేమి చూచేవు గత నాదిక్కు
యెప్పుడును నీవోజలేల మానే విపుడు

చ. 1: ఆకె నీవు నేక తాన నాడుకొన్నమాటలెల్లా
మాకుఁ జెప్పేవా నీవు మాపుదాఁకాను
మైకొని నాకాతరాన మఱచి నే నడిగితే
యీాకడ నమరఁజెప్ప కేల మానే విపుడు

చ. 2: సిగ్గుదేరిరతివేళ జేసుకొన్న మీచేఁతలు
తగ్గి దాఁచుకొనక ఇంతటఁ జూపేవా
వెగ్గళించి తమకాన వెరవక సోదించితి
యెగ్గులేకొడఁబఱచ కేల మానే విపుడు

చ. 3: కలసినప్పటి మీలోఁగలిగిన వేడుకలు
నలిరేఁగి నేరిపేవా నన్నేలితివి
మెలఁగి శ్రీ వేంకటేశ మిక్కలి నిన్నొరసితీ
యెలమి సమ్మతిసేయ కేల మానే విపుడు

రేకు: 1506-3 వరాళి సం: 25-033

పల్లవి: నెమ్మది నిచ్చకాలాడ నేఁడు గలిగెతివిగాక
నమ్మిక నా కియ్యఁగా సన్నల మాన్పవలదా

చ. 1: పొంతనే యాతనికిఁగా పూనుక వచ్చేవు నీవు
యెంత బత్తిగలదాన వేమిచెప్పేదే
వింతగా నన్నుఁ బెండ్లాడి వెసఁ దెచ్చుకొనె నాఁడు
మంతనాన వద్దనక మరియెందు వోతివే

చ. 2: పాడితోడ నాతనిపలుకు చెల్లఁ బెట్టేవు
యేడ నేరుచుకొంటివే నీ వీసుద్దులు
తోడివారిలో నన్ను దొరకత్తెఁ జేసేవేళ
ఆడ వచ్చి బుద్ధిచెప్పి అడ్డగించవలదా

చ. 3: వొక్కటై శ్రీవేంకటేశునొద్దఁ గాచుకుందానవు
యెక్కడే నీయాసోద మిందరిలోనా
గక్కన నన్నేలినాఁడు కాఁపురము సేయఁగాను
తొక్కవైతివి పాదము తొడిఁబడ నీవు

రేకు: 1506-4 కాంబోది సం: 25-034

పల్లవి: ఇంక నేడసుద్దులు యెవ్వరు నేమిచెప్పేరు
వంకలొత్తి మూడిఁజొచ్చి వాత వెళ్లివత్తునే

చ. 1: వొల్లనే వద్దఁగూచుండి వొనగూడ మాటలాడి
బల్లిదురాలవైతివే పతి యెదుటను
అల్లన నీవు గోరినట్టాతఁడు నీసొమ్మాయ
చెల్లునే ఇంతటా నీకుఁ జేసినట్టేల్లాను

చ. 2: మచ్చికఁ బాదములొత్తి మంచముమీఁదట నెక్కి
అచ్చమై యాతనికి నిల్లాల వైతివే
కచ్చుపెట్టి యాతఁడు నీకైవసరమైవున్నవాఁడు
అచ్చివచ్చునే నీకు నాతనిపై వలపు

చ. 3: వీడెమిచ్చి తమిరేఁచి వెలయఁగఁ దెరవేసి
తోడనే కాఁగిటఁ గూడి దొరవైతివే
వోడక శ్రీవేంకటేశు డొద్దికై నిన్నుఁ గూడఁగ
యీడేరితి వౌదువు నన్నితఁడే యేలెఁగదే

రేకు: 1506-5 శ్రీరాగం సం: 25-035

పల్లవి: అందరిలో నీవు నన్ను నాసకొలిపేవుగాక
పొందు నీకే కలిగితే భోగించవా

చ. 1: చిత్తము రా నీ సేవ సేగలఁగాక నీకు
బత్తి గొట్టానఁ బెట్టేనా పలుమారును
వత్తునఁటా జెప్పంపేవు వారివీరిచేత నేఁడు
వొత్తి నే నంతక తొల్లి వొద్దంటినా

చ. 2: సముకాన నుండి సరసము లాడఁగలఁగాక
తమకము రేఁచేనా తగిలి నీకు
చెమటలు గారఁగాను చేతులు చాఁచేవు నీవు
అమరఁ గాఁగిలించఁగా నౌఁగాదనేనా

చ. 3: ననుపు సేసుక నీతో నవ్వు నవ్వఁగలఁగాక
పెనఁగి గుణము చక్కఁబెట్టేనా నేను
యెనసితివి శ్రీ వేంకటేశ ఇంతలోనే నన్ను
వొనర కెన్నండైనా వొడ్డుకొంటినా

రేకు: 1506-6 కన్నడ గౌళ సం: 25-036

పల్లవి: ఏమనఁగవచ్చు నిఁక నింతా నీమహిమలే
ఆముకొన్నవలపు నీ కచ్చివచ్చెఁగా

చ. 1: అలరి యాకెకు నెంత ఆసవెట్టితివో నీవు
సెలవుల నవ్వుకొంటాఁ జెలరేఁగీని
నలువంక చనవెల్లా నాకె కలదని వుంటి
కలిగెఁగా నీపె నొకతె నీకు నిపుడు

చ. 2: మట్టుమీర మరీ నెంత మన్నించితివో నీవు
పట్టెమంచ మెక్కుకొని పాయకున్నది
తొట్టనగర్వము లాడ దొరనై నే నుందానను
నెట్టనఁ దానూఁ గొంత నేర్చెఁగా యీపనులు

చ. 3: అంది శ్రీవేంకటేశ్వర ఆకె నెట్టు గూడితివో
చిందుఁజెమటల చెలి సిగ్గువడీని
కందువ నిన్నుఁ బెండ్లాడి కైకొంటి సిరులెల్లా
విందువలె తా వచ్చెంగా వినోదముగాను

రేకు: 1507-1 సౌరాష్ట్రం సం: 25-037

పల్లవి: ఆకె యెటువంటిది నా కానతీవయ్యా
చేకొని యిద్దిఁ బెండ్లిసేసే నిన్నిపుడు

చ. 1: పడఁతిచన్నుల మీఁద పాదాలద్దుకొంటాను
అడరినకాఁక చల్లార్చుకొనేవు
యెడసి యెవ్వతో నిన్ను యేఁపులఁ బెట్టఁగఁబోలు
కడునీతమక మెల్లా కానవచ్చె నాకును

చ. 2: జలజాక్షిపయ్యద సారెఁ గప్పుకొంటాను
వొలుకుఁజెమట తడియొత్తుకొనేవు
వలపించెవ్వతో వుమ్మగిల నిన్నుఁ జేయఁబోలు
వెలి నీవిరహమెల్లా వెల్లవిరులాయను

చ. 3: జవ్వని మోవితేనెలు చవిగొని తొడిఁబడ
అవ్వలిరతులదప్పి యాఁపుకొనేవు
ఇవ్వల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
దవ్వులాకెపొందు లిందెతారుకాణ పచ్చెను

రేకు: 1507-2 రామక్రియ సం: 25-038

పల్లవి: ఇందాఁకా రాఁడంటానేల సాదించేవు
ముందుగా నీ వితనికి మోవి ఇయ్యఁగదవే

చ. 1: పిలువఁగఁబిలువఁగ బిగిసేవు పతితోను
చలమరితనమేలే సతికి
చెలపలచెమటలు చెక్కుల వడియఁగ
అలయుచుఁ బెనఁగీ నతనిఁ జూడఁగదె

చ. 2: చూడఁగఁజూడఁగ జునిగేవు తెరలోన
జాడదప్పఁగనేలే సతికి
వాడు మోముతోడ వలపులు చల్లుచు
యీడనే వున్నాఁడు తనిఁ జూడఁగదె

చ. 3: చెనకఁగఁజెనకఁగ శ్రీవేంకటేశునెడ
చనవియ్యకుండనేలే సతికి
తనిసి నీకాఁగిటఁ దగ నన్ను మెచ్చి మెచ్చి
యినుమడి మన్నించె నితనిఁ జూడఁగదె

రేకు: 1507-3 కుంతలవరాళి సం: 25-039

పల్లవి: నీవొళ్లిచేఁతలు నీవు చూచుకొనవు
యీవల నన్నుఁ బొదిగే మేమందు నిఁకను

చ. 1: పెదవికెంపులు రేఁగఁబ్రియములు చెప్పేవు
వెదచల్లునూర్పులతో వేఁడుకొనేవు
మదము దొలఁకఁగాను మచ్చికలు చల్లేవు
యెదుల నిన్నుఁ జూచి యేమందు నిఁకను

చ. 2: వాడుఁబువ్వులు గాలఁగా వచ్చి నాతోఁ బెనఁగేవు
వీడెపు సెలవులతో విందచెప్పేవు
జాడతోడ వలపుల సరసములాడేవు
యీడ నీసముకలమున నేమందు నిఁకను

చ. 3: గందవొడి మైరాలఁగా కాఁగిలించి కూడేవు
సందుకొని మోవితేనె చవిగొనేవు
చిందేటిచెమటతోడ సిగ్గువడక నవ్వేవు
యిందుకు శ్రీవేంకటేశ యేమందు నిఁకను

రేకు: 1507-4 దేసాళం సం: 25-040

పల్లవి: చాయవాటుసేసుకొని సరుసఁ గూచుండుగాక
నాయములేల పెట్టీనే నాటకపువిభుఁడు

చ. 1: కన్నుల జంకించితినా గద్దించితినా బొమ్మల
చిన్నఁబోయి తానేల సిగ్గువడీనే
అన్నువ మోవిమీఁదఁ జిట్టంటుచేతఁ లుంటేనేమి
చిన్న వాటిపనులు తీసివేయఁగవచ్చునా

చ. 2: చొప్పులు వెదకితినా సోఁకఁగ నాడితినా
తప్పక చూచి తానేల తలవంచీనే
కప్పిన పచ్చడమెల్లా కడుఁబసపై తేనేమి
యెప్పుడు గలదే తన కేమి సేయవచ్చును

చ. 3: చలము సాదించితినా జంపులు నడపితినా
నలువంకఁ జూచి యేల నవ్వులు నవ్వీనే
యెలమి శ్రీవేంకటేశుఁడిట్టె తాను నన్ను నేలె
వలపు వెంట వచ్చితే వారించ నేఁటికే

రేకు: 1507-5 ఆహిరినాట సం: 25-041

పల్లవి: ఈతఁ డెట్టుండినా నేమి యింతులాల
కాతరించి వెంగమాడి గయ్యాళించఁదగవా

చ. 1: నగేవారివలెనే నాయకుని భావమెల్లా –
నగడుగాఁ జేతురా అక్కలాల
మొగము చూడఁగదరే మోహము నాపైఁ గురిసీ
తగ నితనిమీఁదట తప్పు లెంచఁదగవా

చ. 2: చుట్టాలవలెనే వుండి చొప్పులెత్తి మీ రితని –
గుట్టు బాయట వేతురా కొమ్మలాల
యెట్టుచేసినా నేమి నాయింటనే తా నున్న వాఁడు
నెట్టుకొని యీతని నేర మెంచఁదగవా

చ. 3: మంచివారివలెనే మాటలు వెలుచుకొని
పొంచి సిగ్గువరతురా పొలఁతులాల
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
అంచెల నీతనినింకా అలయించఁదగవా

రేకు: 1507-6 లలిత సం: 25-042

పల్లవి: ఏల తలవంచుకొనే వెఱఁగనివానివలె
కోలుముందుగా నాపె కొలువు సేసీని

చ. 1: సొలసి సొలసి నిన్నుఁ జూచి అల్లదె యింతి
తలపోఁతవలపుల దైలువారీని
నలిరేఁగి ముసిముసినవ్వులతో నప్పటిని
చెలులలకు నీసుద్దులు చెప్పి చూపీని

చ. 2: మక్కువైన నీవాడేమాటలు చెవుల విని
వెక్కసపుసంతోసాన విఱ్ఱవీఁగీని
వుక్కుమీరి నీవుండేవొయ్యారిబాగులకు
అక్కరతో కోరి వేఁడీ నాసపడీని

చ. 3: వొయ్యనే నిన్నుఁ గదిసి వూడిగాలెల్లా జేసి
తియ్యమోవి యాని దప్పిదేర్చుకొనీని
యెయ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సయ్యన నిందుకు దానూ సారెఁ బొగడీని

రేకు: 1508-1 హిజ్జిజి సం: 25-043

పల్లవి: నీవు నాతోనై తేను నిజములే నెరపేవు
భావించితే నీవొళ్లనే పచ్చిదేరీఁ జేఁతలు

చ. 1: అప్పుడు నీవు నేను వాడుకొన్న మాటలెల్లా
చెప్పె నీకె నాతోను చెలరేఁగును
నెప్పునఁ బొంచువినెనో నీ వెరుక సేసితివో
చొప్పులెత్తే యీకెఁ జూచి సోద్యమయ్యీ నాకు

చ. 2: పొందు సేసి ఇద్దరము పొత్తు గలసినసుద్ది
మందలించె నీపె నాతో మర్మము లెంచి
సుందుసుడిపోలికలో చక్కని నీమతకమో
యెందుకైనా నీకెవచ్చీ నెటువంటి మహిమో

చ. 3: పానుపుపై మనము నిబ్బరానఁ గూడినరతి
తా నీకె తారుకాణగాఁ దలఁపించీని
పూని తానాడ నుండెనో బోదించఁగా దెలిసెనో
దీనవె శ్రీ వేంకటేశ తేటలెల్లమాయను

రేకు: 1508-2 ముఖారి సం: 25-044

పల్లవి: కలిగినట్టు చెప్పమీ కల్లలాడక నీవు
వలతునంటాఁ జెప్పేవు వడిగా నాతోను

చ. 1: తలఁపులోఁ బారువా తప్పక నారూపము
పిలువఁగ నోరికి నా పేరు వచ్చునా
కలలోన నీవు నన్ను కాఁగిలించి కొన్నట్టేనా
చెలులతో నాగుణాలు చెప్పి పొగడుదువా

చ. 2: మనసు గరఁగునా (నా) మాటలు వింటే నీకు
తనువు సోఁకించితేను తమి రేఁగునా
ననిచి నాచెలిఁ గంటే నంటు సేతునా నీవు
కొనబైన నారాక కోరుదువా యెపుడు

చ. 3: సూటిగా నాయింటివంక చూచితే వేడుకలౌనా
యీటున నేఁ బేనఁగితే ఇచ్చకమౌనా
గాఁటపు శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
మేటి నావినయాలకు మెత్తువా నీవు

రేకు: 1508-3 పాడి సం: 25-045

పల్లవి: నిన్నుఁ జూచి వోర్చుకొని నే నుందానను
తన్నునింతకజంకించి తగ బుద్ధిచెప్పనా

చ. 1: యింటిలోన నీవు నేను నేకతములాడఁగాను
కంటివిగా ఆపె యెంత గయ్యాళించీని
నంటునను నీతో నేను నవ్వులు నవ్వఁగాను
వింటివిగా తా నాడేవెంగేలెల్లాను

చ. 2: పలుమారు మనమున్న పానుపు దప్పక చూచీ
తెలిసెఁగా నీకు నీకే దిట్టతనము
యెలమి మనవలపు లెగసక్కేలు సేయఁగా
బలిసెఁగా చల మీకెపై నీకు నిపుడు

చ. 3: యెంచఁగ శ్రీ వేంకటేశ యిద్దరముఁ గూడుండంగా
ముంచెఁగా ఆపెపంతాలు మొత్తమై నీకు
పొంచియుండి మనలోని పొందులెల్లాఁ దలపోసి
నించెఁగా తనరతుల నేరుపులెల్లాను

రేకు: 1508-4 మంగళకౌసిక సం: 25-046

పల్లవి: దొడ్డవాఁడైనవానికి దోసము లేదు
వొడ్డారా లేమి సేసినా వొద్దనేవా రెవ్వరే

చ. 1: తప్పకచూచితేనే తనవొళ్లి నేరమెల్లా
కప్పి పూరివారికెల్లాఁ గానరాదా
ఇప్పుడే ఇందుకుఁగాను యేలబాసలుసేసీని
చొప్పుగా తప్పు గలితే సోదించేవా రెవ్వరే

చ. 2: మాటదీసి మాటాడితే మర్మములు మనవెల్లా
తేటతెల్లమీగా మాకుఁ దెలియరాదా
చాటి ఇందరిచేశాను సాకిరులేల చెప్పించీ
గాఁటాన మీరివచ్చితేఁ గాదనేవా రెవ్వరే

చ. 3: సంగడి గూచుండితేనే సరిఁ దనవల పెల్లా
యింగితాకారములోనే యెఱఁగరాదా
చెంగట నన్నేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
కొంగు దాఁ బట్టితే నియ్యకొననివా రెవ్వరే

రేకు: 1508-5 నాదరామక్రియ సం: 25-047

పల్లవి: ఇంక నేమిచేసు జెలియింతకంటెను
కంకణాలచేతులెత్తి కడుమొక్కుచున్నది

చ. 1: నిలిచి నీవు చేసిన నేరము లెంచనొల్లక
నలినాక్షి వూరకె మోనాన నున్నది
వెలయ నిన్ను గద్దించి వేసరించనొల్లక
తళుకుఁజెక్కులతోడ తలవంచుకున్నది

చ. 2: గోమున వీ సతులను కోపించనొల్లక
లేమ పాన్పుపైఁ బవళించి వున్నది
ఆముకొన్ననీగుణాల కలుగఁగనొల్లక
నాముువార సెలవుల నవ్వుకొంటా నున్నది

చ. 3: చెంగట నిన్ను రతుల సిగ్గువరచనొల్లక
అంగన యిట్టె పరాకై వున్నది
రంగుగఁ గూడితివి యీరామను శ్రీవేంకటేశ
పొంగుచు సంతోసానఁ బొగడుచు నున్నది

రేకు: 1508-6 కాంబోది సం: 25-048

పల్లవి: అతఁడు యేమిసేసీనే అంగనలాల
చతురుఁడు పాదాలు చాఁచె నింతె మీపైని

చ. 1: చిప్పిల లోలోనే యెంత సిగ్గులువడేరే మీరు
దప్పిదేర మగనిపాదా లొత్తుతా
కొప్పులు జారఁగా యేమి కొంచి చూచేరే యతని
వుప్పటితిల్లుతమకాన వుమ్మగిలుతాను

చ. 2: నంటునను ముసిముసినవ్వులు యేల నవ్వేరే
జంటలై యితనివొద్ద సరిఁగూచుండి
అఁటిముట్టిసన్నల యేమాడుకొనేరే యతని
రెంటెముమరుగుతోనే రిచ్చలువడుతాను

చ. 3: చేకొని కూడి యెంతేసి చెమటలే కురిసేరే
జోకల వొకరొకరు చొక్కుకొంటాను
కైకొని మిమ్మేలె శ్రీ వేంకటాద్రి గోవిందరాజు
శ్రీ కాంతవు భూకాంతవు సేవలెన్ని సేసేరే

రేకు: 1509-1 ఆహిరి సం: 25-049

పల్లవి: ఏమని విన్నవించేనే యింకాఁ దనకు
నేమముతో నుండఁగా మనినంచీఁ దానే నన్నును

చ. 1: బాసగొననేమిటికి పంతమాడనేమిటికి
సేసవెట్టి పెండ్లాడిన చెలులకును
వాసితోడ నింటిలోన వలపు మీఁదెత్తుకొని
వేసరకుండితే నది విభునికేసెలవు

చ. 2: కల్లబెంచనేమిటికి కాఁతాళించ సేమిటికి
యిల్లాండ్లయినయట్టిఇంతులకును
చల్లఁగాఁ గన్నులఁ జూచి చలపట్టి కొలువులో
నల్లంత నుండఁగాను అతనికే సెలవు

చ. 3: పట్టిపెనఁగ నేఁటికి బయలీఁదించనేఁటికి
పట్టపు దేవుళ్ళయినపడఁతులకు
ఇట్టె శ్రీ వేంకటేశుఁడేలె నన్ను నేఁ దనకు
నెట్టన మొక్కఁగా నితనికి నింతా సెలవు

రేకు: 1509-2 కేదారగౌళ సం: 25-050

పల్లవి: ఏఁటికి నీవే వచ్చేవు యెందుకై నాను
పాటించి యాతఁడు నీకే బాస లిచ్చెనటవే

చ. 1: బత్తిగలదాననంటా పతికిఁ బూనుకవచ్చి
వుత్తరాలిచ్చేవు మాతో నొకటొకటె
హత్తి యాతఁడు నీవాఁడో అవ్వల నెవ్వతెవాఁడో
చిత్తములోపలఁ దెలిసితివటవే

చ. 2: చనవరిదాననంటా సవతులలోనెల్లా
పెనఁగే వాతనికిఁగా బింకము చూపి
కనెనో యిది యాతఁడు కడుఁబరాకై వున్నాఁడో
తనర నీసేవ యాతని కెక్కెనటవే

చ. 3: అండనుండేదాననంటా అట్టె శ్రీవేంకటేశుకై
దండిగా వేఁడుకొనే వందరిలో నన్ను
కొండవలె నన్ను నేలె కూటమి మనలో నెందో
అందుకాచి నీవతిని నడిగితివటవే

రేకు: 1509-3 నాదరామక్రియ సం: 25-051

పల్లవి: ఏమే యెడమాట లేలాడించే వాతనితో
కామించి నీపతియున్న కడకు రాఁగదవే

చ. 1: దాకొని వద్దనుంటే నే తగులౌఁగాక మోహము
ఆకడ తెరమాటైతేనందునా పొందు
రాక దరచైతే మొకదాకిరి గలుగుఁగాక
చేకొని గర్వాననుంటే చిత్తము గరఁగునా

చ. 2: మాటలాడుతానుంటేనే మర్మములు సోఁకుఁగాక
నీటున మోనాననుంటే నిండునా తమి
కూటమికిఁ బెనఁగితే కొనసాగుఁగాక రతి
జూటుఁదనానఁ గొంకితే చుట్టరిక మబ్బునా

చ. 3: పట్టి కాఁగిలించితేనే పచ్చిసిగ్గు దేరుఁగాక
గుట్టున నెంత వుండినా కోరినట్టౌనా
ఇట్టెశ్రీవేంకటేశుఁ డేలెఁగాక నిన్ను నేఁడు
జట్టి గొనకుండితేను చవులు రెట్టించునా

రేకు: 1509-4 హిందోళం సం: 25-052

పల్లవి: ఎంతవేడుకో నీకు నింతిసేసే సేవలు
చెంతనుండి చూచేమాకు సిబ్బితయ్యీ నిపుడు

చ. 1: కొప్పులోని మొగలి రేకులతావి దొలఁకగాను
చెప్పీ నేకతమునీకు చెవిలోనికే
చిప్పిలుఁజెమటలెల్లా చేతుల జొబ్బలఁగాను
అప్పుడే పాదములొత్తీ నంగ మల్లాఁ దడియ

చ. 2: చెక్కులజవ్వాది నీముఁజేతులపైన వడియఁగా
మొక్కీ నీవు చెనకఁగా మోహాన నీకె
పుక్కిటితమ్ములము గొబ్బున నీమ్మైఁ జెదరఁగా
మిక్కిలి నవ్వీఁ గుంచమే కొని విసరుచు

చ. 3: గుబ్బల నలఁగిన కుంకుమ నీమ్మై నంటఁగా
వుబ్బునఁ గాఁగిట నించి వొరసీ నీకె
అబ్బురాన నన్నేలితి వన్నిటా శ్రీవేంకటేశ
నిబ్బరానఁ దానూఁ జేసీ నీకు నూడిగములు

రేకు: 1509-5 వరాళి సం: 25-053

పల్లవి: ఏల పురుఁడు వెట్టేవు యీపెతో నన్ను
నీలాగు లిటువంటివే నన్నిఁక నేమందును

చ. 1: వేఁకపునీ(నా?) గుబ్బలతో వెలయ నీమనసారా
తూఁకువ కాపె చన్నులు తూఁచి చూడుమా
సోఁక నిద్దరికన్నులు సొరిది నీచేరలను
తేఁకువఁ గొలచి చూచి తెలుసుకొమ్మా

చ. 2: బారెఁడేసినా నెరులపాటి వాపెనెరులును
యేరీతి నుండీనో ఇప్పుడీడువెట్టుమా
గారాపునాపాదాలసంగతి నాపెకాళ్లును
కేరడాలు మాని నీవు గెర వా(వ్రా?) సుకొనుమా

చ. 3: పిక్కటిల్లునాపిరుఁదు ప్రేమ నాపెజఘనము
లెక్కసేసి నీవు కాఁగిలించి మెచ్చుమా
ఇక్కువ శ్రీవేంకటేశ యేలితి విద్దరి మమ్ము
పక్కనిదుకొని మమ్ముఁ బాయ కిట్టె వుండుమా

రేకు: 1509-6 బౌళి సం: 25-054

పల్లవి: ఎట్టున్నదో నీచిత్తము యెద్దౌతా నెరఁగరాదు
ముట్టి నీవు చూడఁగాను మోహించితి నేను

చ. 1: చివ్వన నే విన్నపాలు సేయఁగాను వినివిని
నవ్వులు నీవు నవ్వంగా నమ్మితి నేను
జవ్వనమదాన నేను సన్న సేయఁగా నప్పుడే
పవ్వళించఁగా నాసలభ్రమసితి నేను

చ. 2: బెరసి నీకొంగువట్టి పెసఁగితే నటు నీవు
శిరసు వంచఁగా సంతోసించితి నేను
వొరసి పాదాలొత్తితే వూరకే నీవుండఁగాను
వొరిమితోఁ జెంగలించి వుండితి నేను

చ. 3: వేడుక నేఁ గూడేవేళ వెరగంది నీవుండఁగా
జోడువాయవని మతిఁజొక్కతి నేను
వాడికకుఁ బిల్వంగా నావంకైతే శ్రీవేంకటేశ
వీడెము చేతఁబట్టుక వెలసితి నేను

రేకు: 1510-1 మధ్యమావతి సం: 25-055

పల్లవి: మాతో నేమిచెప్పేరే మగువలాల సుద్దులు
ఆతఁడే నేరుచు మిమ్ము నంకెకు రాఁజేయను

చ. 1: సవతిమచ్చరములు సరుస రేఁచినవాఁడు
తివిరి మీతగవులు దిద్దనేరఁడా
చవిగొని మీ మోవులు చప్పఁగాఁ జేసినవాఁడు
కవగూడియుండఁగ నొక్కటిసేయనేరఁడా

చ. 2: పంతములు మీలోమీకు పైపై నెక్కించినవాఁడు
బంతినే మీబలి మేర్పరచనేరఁడా
ఇంతలో మీ చక్కఁదనా లీడువెట్టి చూచేవాఁడు
చింతదీర మిమ్ము సంతోసించనేరఁడా

చ. 3: తడయక మిమ్ముఁగూడి తమివుట్టించినవాఁడు
చిడుముడినిచ్చకాలు సేయనేరఁడా
అడరి శ్రీవేంకటేశు డాతఁడే నన్నేలినాఁడు
జడిగొని అందరికి జనవియ్యనేరఁడా

రేకు: 1510-2 పాడి సం: 25-056

పల్లవి: కలకాల మిందులకే కాచుకుంటివా
చెలికతె(త్తె?) వైనా నేమి సిగ్గుదెచ్చుకొంటివే

చ. 1: చెక్కులపై చెమటలు సెలవుల నగవులు
యెక్కడనుండి వచ్చెనే ఇంతలోనీకు
చొక్కపునాపతిఁ బిలుచుకరా నంపితి నింతే
చక్కఁగా నిప్పుడే యెట్టు సందించుకొంటివే

చ. 2: మోవిమీఁది చెనకులు ముంగురులచెదరులు
వేవేగ నమరెఁగదే వేడుకతోను
సోవల నాతనిమ్మైఁ గస్తూరి పూయునుంటి నింతే
తావుకొని యెటువలెఁ దగిలించుకొంటివే

చ. 3: నిలువునఁబులకలు నిట్టూరుపులగములు
సులభాన నబ్బెఁగదె సొంపున నేఁడు
కలసే శ్రీ వేంకటేశుఁ గాచుకుండుమంటి నింతే
లలిఁ జుట్టముగా నెటువలెఁ జేసుకొంటివే

రేకు: 1510-3 బౌళి సం: 25-057

పల్లవి: నీవే తెలుసుకొనేవు నెట్టన నాగుణమెల్లా
వేవేలువిధాల నిన్ను వేసరించేనా

చ. 1: చెలఁగి నీదేవులని చేరి మన్నింతువుగాక
బలిమిచేసి నీకొంగు పట్టితీసేనా
వలపెరిఁగి నీవే నావద్దికి వత్తువుగాక
పెలుచుఁదనాన నిన్నుఁ బిలిపించేనా

చ. 2: నీమాట దలఁచుకొని నీవే నన్నేలుటగాక
ఆముకొని పెనఁగి నిన్నలఇంచేనా
చేముట్టి నీ విప్పుడే నా సిగ్గు దేరుతువుగాక
గామిడినై రతి నిన్నుఁ గక్కసించేనా

చ. 3: చుట్టరిక మెంచి నన్నుఁజూచి కాఁగిలింతుగాక
నెట్టనఁ గూడవంటాను నేరమెంచేనా
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
జట్టిగొంటి నిఁక నిన్ను సాదించేనా

రేకు: 1510-4 వళ పంజరం సం: 25-058

పల్లవి: ఇన్నాళ్లుఁ బడుచ వేమీ నెరఁగవంటా నుంటిమి
కన్నులారా నీయందుఁ గంటిమి వేడుకలు

చ. 1: చెలరేఁగి లోలోనే చిరునవ్వులు నవ్వేవు
వలపులతలపోఁతవరుసా ఇది
అలయుచు సొలయుచు నసురుసురయ్యేవు
కొలఁదీరినరతికోరికా ఇది

చ. 2: చిట్టంటుఁ జెమటలతో సిగ్గువడేవు నీవు
దట్టమైనపాయపుమదములా ఇది
గుట్టుతోడఁ బులకల గుబ్బతిల్లే విప్పు డిట్టె
మట్టు లేనితమకపుమర్మమా యిది

చ. 3: యీడనే పానుపుమీఁద నెదురులు చూచేవు
కూడేటి ఆసలకెల్లా గురుతా ఇది
పాడితో శ్రీవేంకటపతి నిన్ను నన్ను నేలె
వేడుకఁ జూచేవు వెల్లవిరులా యిది

రేకు: 1510-5 గౌళ సం: 25-059

పల్లవి: ఏల నన్ను మొరఁగేవు యెఱఁగనంటా నీవు
వాలాయ మాకెఁ గూడఁగా వద్దంటినా

చ. 1: బాయిటఁ దిరిగేయట్టిపావురాల నాకుఁజూపి
ఆయెడ నాకెతో మాటలాడేవు నీవు
చేయి నామీఁదట వేసి చెనకి పైకొంటానే
పాయలేక యాకెమీఁదఁ బాదము చాఁచేవు

చ. 2: వమ్ముచు నీచేతి నిమ్మపండు నాముందర వేసి
కొమ్మచేత విడె మందుకొనేవు నీవు
నమ్మించి నామోము చూచి నవ్వులు నవ్వుతానే
వుమ్మడి సన్నల నాపె నొడఁబరచేవు

చ. 3: గరిమ నివ్వలఁ గాఁగిలించుకొంటానే
తెరమాటున నాపె నొద్దికఁ గూడేవు
సిరుల శ్రీవేంకటేశ సేస నాపైఁ జల్లుతానే
మరిగిం చాపెను నీవు మర్మము లంటేవు

రేకు: 1510-6 సాళంగనాట సం: 25-060

పల్లవి: మొదల నేనైతేను మొకదాకిరిదానను
చెదరక తనబత్తి చేకొంటి ననరే

చ. 1: యిచ్చకము లాడఁగాను యెగసక్కే లాడరాదు
కచ్చుపెట్టి మొక్కఁగాక కాదనరాదు
మచ్చికలు చూపఁగాను మచ్చరము సేయరాదు
యెచ్చట నున్నాఁడు విభుఁ డేమి సేతునే

చ. 2: చుట్టరికము సేయఁగా సూడువట్టఁగరాదు
అట్టె యీడు రాఁగా వద్దనఁగరాదు
నెట్టుక బాససేయఁగా నేరమిచేయఁగరాదు
యెట్టూ ననరాదు నవ్వీ నేమి సేతువే

చ. 3: పైకొనికాఁగిలించఁగా సంతయే లాడఁగరాదు
ఆకుమడిచిమ్మనఁగా నలయరాదు
యీకడ శ్రీవేంకటేశుఁడేలెనన్ను నింతలోనె
యేకమాయ వలపులు యేమిసేతునే

రేకు: 1511-1 శ్రీరాగం సం: 25-061
పల్లవి: ఎంత నన్ను వేఁడుకొనే విందుకుఁగాను
వింతగా నాపంతము నీవే కనుఁగొనవే
చ. 1: వేసరకుంటేఁజాలు విన్నప మెట్టైనాఁ జేసి
ఆసవెట్టి నీపతిఁ జయ్యన తెచ్చేనే
చేసూటి కానికలు చేకొంటేనే చాలుఁగాని
సేసవెట్టి నీకుఁ బెండ్లిసేసే యాతనిని
చ. 2: మొదలనే దిష్టించి నా మొగము చూచితేఁజాలు
కదిసి నీచేతికి లోఁగా జేసేనే
చెదరనిమన్ననతో సెలవినవ్వితేఁజాలు
సదరాన నీపొందుకు సమ్మతించఁజేసేనే
చ. 3: సరవిగా నాముందర చక్కఁగా నిల్చితేఁజాలు
యిరవుగా నీతలఁపు లీడేర్చేనే
అరుదై శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
పరగ నీతో నెప్పుడుఁ బాయకుండఁ జేసేనే

రేకు: 1511-2 వరాళి సం: 25-062

పల్లవి: ఈతఁ డిందాఁకా రాఁడఁటా నెదురులు చూచితివి
యేతులకు నిప్పుడేలయెగసక్కేలాడేవే

చ. 1: పిలువఁగా బతిలోను పెనఁగేవు సారెకు నీ
బలిమెంత గలదేపడఁతీ
చెల రేఁగి నిన్నుఁ గూడఁగా శిరసు వంచుకొనేవు
చల మెందాఁకానే నీకు సకియా

చ. 2: మంతనాన నిన్న తఁడు మర్మములు ముట్టఁగాను
పంతము లాడుదురటే భామినీ
సంతసాన నీమగఁడు సరసములాడఁగాను
చింతించ నింకానేలే చెలియా

చ. 3: కూడఁగా శ్రీవేంకటేశుఁ గొసరే వప్పటి నీకు
వేడు కెంత గలదే వెలదీ
జోడు గూడి వుండఁగానే సొలసి తమకించేవు
సూడు వెదకఁగ నేలే సుదతీ

రేకు: 1511-3 మాళవి సం: 25-063

పల్లవి: ఇంకా నేల తలఁపించీ నిపుడునాకు
అంకెకుఁ దెచ్చి తాను అవి యేడ సుద్దులే

చ. 1: మాటలాడవచ్చుఁగాని మనసు నమ్మించరాదు
యేఁటికి నొడఁబరచీ నీతఁడు నన్ను
గాఁటపుతనచేఁతలు కన్నులారఁ గంటి నేను
యేఁట వెట్టి యాడఁగాక ఇఁక నేడసుద్దులే

చ. 2: అండకు రావచ్చుఁగాని అలుక మానుపరాదు
బెండ నాతోనేలపెనఁగాడీనే
వుండనుండఁ గానవచ్చె నోజలు తనవి నేఁడు
వండును వలపులు అప్పటి నేడసుద్దులే

చ. 3: చెనకఁగవచ్చుఁగాని సిగ్గు విడిపించరాదు
వినయాన నన్ను నెంత వేఁడుకొనీనే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనే నే మెచ్చితి
యినుమండించెను మోహ మిదియేడసుద్దులే

రేకు: 1511-4 సామంతం సం: 25-064

పల్లవి: మందులో మంత్రాలో నీకు మరి పంపు చేసుకొనె
సందడి నీపెండ్లాడినసగినాలు మంచివే

చ. 1: చనవిచ్చినాఁడు, మోవిచవి నీకుఁ జూపినాఁడు
అనిశముఁబతి నీకు నచ్చివచ్చునే
య(యె?) వసి పాయఁడు నీఇచ్చలోనే మెలఁగును
పొనుఁగ కిద్దరికిని పొంతనాలు గూడునే

చ. 2: నెలపై ఇంట నున్నాఁడు నీమాటచెల్లించినాఁడు
వెలయ నీవు గూడినవేళ మంచిదే
సులభాన దక్కె నీకు చొక్కుచు నిన్ను మరిగె
బలిమి నీవునోమినఫలము లీడెరెనే

చ. 3: వేడుక పుట్టించి నాఁడు వెస నిన్నుఁ గూడినాఁడు
పాడిదప్ప కాతఁడు నీపాలిటివాఁడే
యీడనె శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
జోడైనచుట్టరికము సూటికెక్కెఁగదవే

రేకు: 1511-5 ఆహిరి సం: 25-065

పల్లవి: ఏమసేతు నే నింక నెందుకొాదునే చెలియ
ప్రేమముఁ బలము రెండూఁ బెనఁగొనీఁగదె

చ. 1: ఆతఁడు చేసినచేఁత కాతనినే చేసేఁగాక
దూతికవు నిన్నుఁజేయ దోసముగదే
కాతరించి నే నిన్నుఁగనక యేమి సేసినా
చేతులారా నాతనినే చేసినట్టుగదవే

చ. 2: గద్దించినపతినే గక్కనఁ జెనకుటగాక
వద్దనున్న దాని ముట్టవచ్చునటవే
అద్దుకొని యేమైనాఁగాని ఆతనిమారుగా నిన్నుఁ
గొద్దిమీరితే నందుకుఁగోప మారుఁగదవే

చ. 3: శ్రీవేంకటేశ్వరుని చేరి కొసరుటగాక
సేవకురాలిఁ దడవఁ జెల్లునటవే
యీవేళ నన్నుఁ గూడె నీతఁడే నిన్నంటె
మూవంకలా నాతనినే మోచి వచ్చుఁగదవే

రేకు: 1511-6 బౌళి సం: 25-066

పల్లవి: మంచిదానివలెనే మనతోడఁ బొందు సేసి
కంచముపొత్తునఁబెట్టి కాకుసేసీ నాపె

చ. 1: యీకడఁ దా నెలయించి యింటికిఁ దోడుకవచ్చి
నాకు నీకు విడెమిచ్చి నవ్వీ నాపె
యేకతానకు బిలిచి యిద్దరిఁ గూచుండఁబెట్టి
చేకొని యందరికినిఁ జెప్పి చూపీ నాపె

చ. 2: యెడయక నిన్నూ నన్నూ నిట్టె సిగ్గులు దేర్చి
నడమఁ దాఁ దెరవేసి నవ్వీ వాపె
జడియ కిట్టె తనసకినలమంచ మిచ్చి
సడిఁబెట్టి రతులు రచ్చలవేసీ వాపె

చ. 3: యిమ్ముల నొక్కొకరి నింతోఁ బెండ్లిసేసి
నమ్మి యేడాఁ జెప్పనని నవ్వీ నాపె
నెమ్మది శ్రీవేంకటేశ నిన్నుఁదా నిపుడు గూడి
రమ్మని లోలోఁగాఁపురముసేసీ నాపె

రేకు: 1512-1 వేళావళి సం: 25-067

పల్లవి: కంటినే నీవోజలెల్లా కన్నుల యెదుట నేఁడు
ఇంటిలోనఁ గాచుకొని ఇందుకే వుందానవా

చ. 1: పన్ని ఇద్దరము నొక్కపానుపుపై నుండగాఁను
సన్నలేమిసేసేవే సరసునికి
కిన్నెర వాయించేవంటా కెలన నిలుపుకొంటే
చన్నులమెఱుఁగు చూపి చవులుసేసేవా

చ. 2: కగ్గులేక మాలో నేము కాఁగిలించుకోనఁగాను
సిగ్గులేక రేఁచేవే చెలువునికి
యెగ్గులేదు విడెము మాకిచ్చేవంటా నుండితే
దిగ్గన మాటాడి మోవితీపులు చల్లేవా

చ. 3: మేలపురతులఁ గూడి మేము నవ్వుతా నుండఁగా
యేల మొక్కేవే శ్రీవేంకటేశ్వరునికి
ఆలవట్టము విసరేవంటాఁ బరాకై వుండితే
ఆలవై ఆతనికి నీ వాసకొలిపేవా

రేకు: 1512-2 కన్నడగౌళ సం: 25-068

పల్లవి: తప్ప నేమిటాఁ దనకు తనమనసు
యెప్పుడు తానే దిక్కు; యిఁక దనమనసు

చ. 1: మానితి నాచలమెల్ల మాట చెప్పినట్టె వింటి
తా నేమిసేసినాఁ దనమనసు
కానుక చేతికిచ్చితి కదుఁ దన్ను వేఁడుకొంటి
మానిని నింతే నేను మఱి తనమనసు

చ. 2: నగితిఁ దనతో నేను నమ్మి యిట్టె వుందానను
తగ వెంత నడపినాఁ దనమనసు
మిగులా బందుగురాల మేనరికము చెప్పితి
మగడు తానా కైనాఁడు మరి తనమనసు

చ. 3: అలుగ నెన్నఁడూను అట్టె తన్నుఁ బొగడుదు
తలఁపెల్లాఁదా నెరుఁగు దనమనసు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
మలగొనె నామనసు మరి తనమనసు

రేకు: 1512-3 వరాళి సం: 25-069

పల్లవి: ఏల తలవంచే వందు కేమాయను
కీలు నాకుఁదెలుసు మిక్కిలిఁ దగవాయను

చ. 1: చిప్పిలఁగఁ బొడమిన చెక్కుల నీచెమటలు
తప్పక చూచితే నాపెఁదలఁపాయను
వుప్పతిల్లునీసుద్దులు వూడిగపుసతులెల్లా
చెప్పఁగానే వినివిని సిగ్గులాయను

చ. 2: వేడుక నీ చిటికన వేలనున్న వుంగరము
కూడినమీరతులకు గుఱుతాయను
యేడనుఁడో విచ్చేసితి విన్నిటా దొరవు నీవు
వీడె నిదె నీకొప్పు వెరగాయను

చ. 3: కమ్ముకొన్న నీమోముకళలు దైవారఁగాను
నెమ్మది నిద్దరిపొందు నిజమాయను
యిమ్ముల శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
నమ్మికతో నాకు నేఁడు నవ్వులాయను

రేకు: 1512-4 రామక్రియ సం: 25-070

పల్లవి: చూచితే మంచివాఁడవు చుట్టమవై వున్నాఁడవు
యేచి యెట్టు సోదించి యెఱిఁగేమో నిన్నును

చ. 1: తగిలి సరసములే తఱచుగా నాడేవు
నగవులే నవ్వేవు నన్నుఁజూచి
యెగసక్కెమో నిజమో యేదౌతా నెఱఁగము
నిగిడి రతికి నెట్టు నిన్నుఁ బిలిచేను

చ. 2: మీతిమీరి వూరకైనా మెచ్చులే మెచ్చేవు
అతిమోహములే చల్లే వప్పటి నాపై
మతకమో నాపైబత్తో మరి యేర్పరచరాదు
సతమై నీమీఁదఁ జేయిచాఁచ నెట్టు వచ్చును

చ. 3: అడియాలాలే చెప్పి ఆసలెల్లాఁజూపేవు
కడఁగి నిలుచుండఁగాఁ గాఁగిలించేవు
యెడయక శ్రీవేంకటేశ నీ కిది ప్రియమో
కడుజాణ వౌదువు కాదనఁగఁ గలనా

రేకు:	1512-5 కాంబోది సం:	25-071

పల్లవి:	నన్నుఁజూడవే యితఁడు నంటున నేలినాఁడు
మన్నన యింత లేకుంటే మరి యది వనితా

చ. 1:	కందున తనవిభుఁడు కడునెంత మన్నించినా
అందరితో నాడుకొనే దది వనితా
చందముగా నాతఁడు చనవిచ్చి వుండఁగాను
మందలించి కొసరేది మరి యది వనితా

చ. 2:	గుటుతోడ నాతఁడు కొంగువట్టి తీసితేను
అట్టె యెమ్మెలఁ బొదలే దది వనితా
జట్టిగొని యాతఁడు సరసము లాడితేను
మట్టుమీద నవ్వేది మరి యది వనితా

చ. 3:	గారవించి శ్రీవేంకటేశుఁడు గూడితేను
ఆరీతి నవ్వులు నవ్వే దది వనితా
కూరిమి నాతఁడే చెక్కు గోరికొనవొత్తితేను
చేరి మారుకుమారు సేసేది వనితా

రేకు: 1512-6 ధన్నాసి సం: 25-072

పల్లవి: ఆయవాయ నుండవయ్యా అన్నిటా సంతోసించితి
నాయము లింకా నెంత వడసేవు నీవు

చ. 1: మాటలాడనేరిచినమగ వానితోడుత
అఁటది సారెకు నెదురాడఁగలదా
వాఁటపునీవనితలు వద్దనే కాచుకున్నారు
యేఁటికి దొంతులువెట్టే వేడలేనిసుద్దులు

చ. 2: మిక్కిలిజాణతనాలుమెరఇంచే వానితో
మక్కువైనమానాపతి మారుకొనీనా
వెక్కసపునీగుణాలు వీనుల నిండెను మాకు
చక్కటువేల దిద్దేవు సరుస నీచేఁతలు

చ. 3: ఆనవెట్టి నమ్మించి ఆసకొలిపేనీతోను
దానికి మాబోంట్లు జవదాఁటవచ్చునా
యీనెపాన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కానీలే యే(యీ?) గతి నీఁడె కరుణ నామీఁదను

రేకు: 1513-1 మాళవిగౌళ సం: 25-073

పల్లవి: ఇందరితో వట్టియెమ్మె లేమిచెప్పేవు
మందలించి వద్దనేమా మారుకొని మిమ్మును

చ. 1: తచ్చనకాఁ డాతఁడు దాయక పాయక వుండె
ఇచ్చకురాలవు నీవు ఇద్దరు సరే
అచ్చలాన మీలో మీకు నచ్చివచ్చు వలపులు
విచ్చనవిడిఁ బెండ్లాడి వెలయరే యిపుడు

చ. 2: మరగించనేర్చును మర్మము లంటి యతఁడు
కరగించనేర్తువు కాఁగిట నీవు
పొరుగే మీకిద్దరికి పొందు లిట్టె జరగును
పరగ నొక్క మనసై బతుకరే యిపుడు

చ. 3: నవ్వనోపు నాతఁడు నయమున నీతోను
రవ్వసేయ నోపుదువు రతుల నీవు
యివ్వల శ్రీవేంకటేశుఁ డిట్టే నిన్నూ నన్నూ నేలె
వువ్విళ్లూర సంతసాన నుండరే యిపుడు

రేకు: 1513-2 ముఖారి సం: 25-074

పల్లవి: అంటే ననరాదు నిన్ను నాఅడిసేసె ననేవు
జంటల నీకెరుకగా సన్నసేయనా

చ. 1: వాకిట నే నుండఁగానే వడి నిన్ను దూరంగానే
ఆకెయింటి కేఁగవా అప్పుడు నీవు
కాకుసేసితి ననేవు గామిడితనాలసేవు
నీకు నీకే యించుకొమ్మా నీవోజలు

చ. 2: పేర నేఁ బిలువఁగానే ప్రియములు చెప్పఁగానే
ఆ రీతి నాపెతో మాటలాడవా నీవు
యీరసించితి ననేవు యెగ్గువట్టితి ననేవు
తారుకాణ సేసుకొమ్మా తగిలి నీసేఁతలు

చ. 3: కమ్ముక నేఁ జూడఁగానూ కనకవ నవ్వఁగానే
నెమ్మిఁ గాఁగిలించ వా నీవే ఆపెను
నమ్మించి శ్రవేంకటేశ నన్ను నిట్టె యేలితివి
సమ్మతించఁ జేసుకొమ్మా సారెకు నీమనసు

రేకు: 1513-3 లలిత సం: 25-075

పల్లవి: ఇంతసేసితివి నీవే ఇంటిలోనున్న నన్ను
పంత మెంచి చూచితే నాపాటిదా ఆపె

చ. 1: అంచెల నన్ను రప్పించి అట్టె నే నిలుచుండఁగా
మంచముపై నాకెతోనే మాటలాడేవు
పొంచి యందుకుఁగా పువ్వులచెండు వేసితే
కొంచక తానేల అందుకొని నీకె నడుమ

చ. 2: సన్నలు నాకుఁ జేసి సరి నే నీతో నవ్వంగా
చెన్ను మీర నాపెమీఁదఁ జేయి చాఁచేవు
యెన్నఁ దమ్మితూఁడు నీపై నిందుకుఁగాఁ దాఁకించితే
ఇన్నిటాఁ దానేల యీపె యెడచొచ్చీ నడుమను

చ. 3: కంకణము నాకుఁ గట్టి కాఁగిట నే నించఁగాను
సంకెలేక ఆపెదిక్కు సారెఁ జూచేవు
అంకెల శ్రీవేంకటేశ అడ్డము తెర దీసితే
ఇంకాఁ దానేల లోని కేతెంచీ నడుమ

రేకు: 1513-4 దేశాక్షి సం: 25-076

పల్లవి: మాకేఁటికి దాఁచేరు మర్మములు మీలోనివి
మేకొనతరులకు మీమేనులే గురి

చ. 1: పొలఁతికి మీకును పొందులైనందుకు మీ
సెలవినవ్వులలోనిసిగ్గులే గురి
మెలుపుఁదమకములు మిక్కుటమైనందుకు
సొలపుఁగనుసన్నలచూపులే గురి

చ. 2: యెందును మీతలపోఁత లీడేరినందుకు
కందువ మీమోములకళలే గురి
అందుకొని మీమనసు లట్టె కరఁగినందుకు
చిందేటిమీచెమటలచిత్తడే గురి

చ. 3: వేమరు మీరు వెరచి వెరపుదేరినందుకు
మాముందర మీరాడేమాటలే గురి
యీమేర శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ఆమనివేడుకల కొయ్యారాలే గురి

రేకు: 1513-5 నాదరామక్రియ సం: 25-077

పల్లవి: అప్పుడు వద్దని వల పాఁపరాదు
వొప్పుగ నిన్నలమితే వోరువఁగఁ గలవా

చ. 1: యీరీతి మీరిద్దరు నేకతములాడుకోఁగా
మేరతో వినవచ్చునా మించి యొకతె
ఆరసి యేల పిలిచే వండకు రమ్మని మమ్ము
చేరవచ్చితే నాస చిమ్మి రేఁచకుండునా

చ. 2: పరగ నాపె నీవుఁ బవళించివుండఁగాను
సొరిది మిమ్మెవ్వరైనాఁ జూడవచ్చునా
తెరయెత్తి చేయివట్టి తియ్యనేఁటికి మమ్మును
వొరసితేఁ దమకము లుమ్మగిలకుండునా

చ. 3: కందువ నొకరొకరు కాఁగిలించుకుండఁగాను
అందుకొని తేరకత్తె లంటవచ్చునా
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మందలించితే రతులు మర్మములు ముట్టవా

రేకు: 1513-6 బౌళి సం: 25-078

పల్లవి: అన్నిటాఁ జక్కటులే నీ వాడుకొనేవు
విన్నవారుఁ గన్నవారు వెస నిన్ను నవ్వరా

చ. 1: బెరసి నీవాకెమీఁదఁ బెండ్లాడినందుకు
తరుణి యేమనినానుఁదగవేకాదా
గరిమ నీవప్పటిఁగంకణము గట్టుకరాఁగా
ఇరవుగాఁ జూచి చూచి యెట్టోరిచె నీకె

చ. 2: కతలుగా బాసికము గట్టుకవచ్చినందుకు
సతి యేమిసేసినాను సంగతేకాదా
మితిమీర నాపెఁదొడమీఁదఁ బెట్టుకవుండఁగా
మతిలోఁ గాఁతాళించక మానవెట్టువచ్చును

చ. 3: కమ్మటి నాపెను నీవు కాలుదొక్కినందుకు
కొమ్మయే మెంచినా నియ్యకోలే కాదా
ఇమ్ముల శ్రీవేంకటేశ యీపె నిట్టె కూడఁగాను
నెమ్మది వెంగే లిఁక నిన్నాడవలదా

రేకు: 1514-1 సామంతం సం: 25-079

పల్లవి: వింటిమి మీకతలెల్లా వీనులపండుగగాను
ఇంటిటా మీగుణా లెన్నుకొనే రిందరు

చ. 1: మనసుగరగ నీతో మాటలాడనేర్పు నాపె
ననుపు సేసుక మరి నవ్వనోపును
పనిమాలినపనికి భ్రమతువు నీవును
అనిశము మీసుద్దులే ఆడుకొనే రిందరు

చ. 2: బత్తిచేసి వద్దనుండి పాదాలు విసుకు నాపె
హత్తి నీకూడిగాలు సేయఁగనోపును
కొత్తకొత్తవలపులే కోరుదువు నీవును
పొత్తుల మీపొందు తలపోసుకొనే రిందరు

చ. 3: తగిలి సారెకు రతిఁ దమిరేఁచగల దాపె
జిగిమీర నీకు బుద్ధిచెప్పనోపును
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
మిగులా మీతగవులే మెచ్చే రిందరు

రేకు: 1514-2 దేసాళం సం: 25-080

పల్లవి: చేసినట్టెల్లా నీకుఁ జెల్లెఁగాక
వాసులు వంతులుఁబట్టి వద్దనేమా నిన్నును

చ. 1: కన్నుల నిన్నుఁజూచితే కాయమెల్లాఁ జెమరించె
కన్నెకు నీకునుఁ బొందు గలుగఁబోలు
నన్నుఁజూచి నీవేల నవ్వులు నవ్వే వప్పటి
యెన్ని సేసినా నేరము లెంచేమా నిన్నును

చ. 2: చేకొని యెదుట నుంటే సిగ్గులు వడీఁదాను
ఆకెకు నీకును మాటల మరఁబోలు
వాకునఁ బిలిచితేను వంచేవు శిరసప్పటి
కాకుసేసి నీచేఁతలు కాదనేమా నిన్నును

చ. 3: పానుపు చేరి వుండితే దావము గరఁగీనాపె
నానాఁడే మీకిద్దరికి నసుచఁబోలు
పూని శ్రీ వేంకటేశుఁడ పొందితివి నన్నప్పటి
దీనికిఁగా నింతలో సాదించేనూ నిన్నును

రేకు: 1514-3 పాడి సం: 25-081

పల్లవి: చెలికత్తెఁ గనక నేఁజెప్పక పోదు
కలవంటిది వలవు కడమలు సేతురా

చ. 1: పువిళ్లూరఁ బిలిపించి వూరకే నీ వుండఁగాను
నివ్వెరగుతోడ నాపె నిలుచున్నది
యెవ్వరు మాటలాడించే రిద్దరు సిగ్గువడేరు
పువ్వువంటి(ది) జవ్వనము పొద్దు గడపుదురా

చ. 2: పనివ డింటికి వచ్చి పరాకు సేసుకుండఁగ
కనుదాఁకా మంచముసంగడి నున్నది
యెనయఁగ మిమ్మిద్దరి నెచ్చరించేవా రెవ్వరు
గనివంటిది వేడుక కట్టిపెట్టవలెనా

చ. 3: చేయి కాఁగిటికిఁ జాఁచి చిరునవ్వుతో నుండఁగా
ఆయములు నిన్నంటుచు నాకె వున్నది
యీయెడ శ్రీవేంకటేశ యిద్దరి మెచ్చ నెవ్వరు
చాయవంటిది రతి రచ్చల వేయవలెనా

రేకు: 1514-4 మాళవిగౌళ సం: 25-082

పల్లవి: చెప్పకువే నీసుద్దులు చెలులతోను
ఇప్పుడిట్టె సవతుల మెంత సేయనేరమే

చ. 1: మగఁడు మన్నించఁగాఁనే మంతు కెక్కె నీమాటలు
సగియించకుంటేను చవివుట్టీనా
మొగమోట గలుగఁగా ముసిముసినవ్వు వచ్చె
యెగసక్కేలై తేను యెనసీనా పొందులు

చ. 2: సరస మాతఁ డాడఁగాసలిగె పనికివచ్చె
పరాకుసేసుకుండితే బాఁతెయ్యీనా
పరగఁ గూడరాఁగానే పంతమెల్లా నీడేరె
విరహము రేఁచితేను వేడుక వుట్టీనా

చ. 3: శ్రీవేంకటేశుఁడు దొరఁ జేయఁగా నన్నీ నమరె
కైవసము గాకుండితే కాఁకదేరీనా
యీవల నన్నేలఁగానే యిన్నీఁదారుకాణవచ్చె
భావ మెఱఁగకుండితే పగటు చూపట్టునా

రేకు: 1514-5 లలిత సం: 25-083

పల్లవి: మేలు మేలు నీసతిని మెచ్చి రిందరు
యీలాగు నీవే తగుదు విటువంటిదానికి

చ. 1: తప్పు కిట్టె చూచితేను తలవంచుకొనవద్దా
కప్పినజవ్వనపుసిగ్గరిదానికి
చిప్పలఁ జెనకితేను చిరునవ్వు నవ్వవద్దా
నెప్పునఁ దెలివిగల నీరుపదిదానికి

చ. 2: యెలమిఁ జేయి వేసితే యిచ్చగించి వుండవద్దా
దొరసినయట్టి గుట్టుతోడిదానికి
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి సతినిట్టె
తిరమాయ సిరులు నేదేవులైన దానికి

రేకు: 1514-6 ఆహిరినాట సం: 25-084

పల్లవి: అడ్డమురామైతిమని అట్టె మమ్మేల దూరేవు
వెడ్డువెట్టి నవ్వఁగా నీవేడుకంటా నుంటిమి

చ. 1: తివిరి యెందుండో వచ్చి తిట్లు నిన్నుఁ దిట్టఁగా
వువిద నీ దేవులంటా నొదిగుంటిమి
చెవిలో నేకతమాడి చేతఁ జెక్కు లదమఁగా
అవల నీకెతో (నీకేదో?) చుట్టమంటా నుంటిమి

చ. 2: తొంగిచూచి నీసొమ్ములు తొడిఁబడఁ బెట్టుకోఁగా
అంగనేకర్తగాఁబోలునని వుంటిమి
చెంగటనుండి నీకొప్పు చేచేతఁదగిలించి
వంగఁదియ్యఁగా నీకు వదినంటా నుంటిమి

చ. 3: శ్రీవేంకటేశ ఆపె చేరి పాదము దొక్కఁగా
సేవకురాలంటా పాన్పుచెంత నుంటిమి
భావించి నన్నేలితివి పట్టపలమేల్మంగను
ఆవనిత నిన్నంటగా ఆఁడుజెట్టెనుంటిమి

రేకు:	1515-1 భైరవి	సం:	25-085
పల్లవి:	ఇచ్చెరిఁగి సేవలు సేయించుకోవదా
మచ్చికతోడ నన్ను మన్నించేవాఁడవు
చ. 1:	నిద్దిరించేవేళ నన్ను నీవేల లేపితివి
వొద్దఁ గాచుకున్నసతి యుండఁగాను
అద్దుకొని నాపై బత్తి అంత నీకుఁ గలిగితే
అద్దమరాతిరిదాఁకా నలయించవలెనా
చ. 2:	తొడ చరచి నన్నేల అడిగేవు విడెము
అడపమువనిత నీ కందియ్యఁగా
కడుఁదమకము నాపైఁ గలవాఁడవై తేను
అడియాసలఁ బెట్టి నన్నలయించవలెనా
చ. 3:	బలిమిచేసి నన్నెంత పచ్చిచేసి కూడితివి
అలమేల్మంగ నీవురమందు నుండఁగా
యెలమి శ్రీవేంకటేశ యిద్దరము నితవైతే
అలవోకగా నన్ను నలయించవలెనా

రేకు: 1515-2 ముఖారి సం: 25-086

పల్లవి: నేఁడే యింత సేయకుంటే నింద వాయదు
పోఁడిమితో విన్నవారు పొంచి నవ్వే రిందుకు

చ. 1: జాడతో నీతమ్ముఁలము సతి యడుగఁగ వచ్చి
యేడదోయనుచు సందేహించుకొనెను
తోడనే నమ్మికగాను తోడుకవచ్చి యాకెతో
వోడక యానలువెట్టి వొడఁబరచవయ్యా

చ. 2: తెఱలి నీమోవితేనెతీపు చవిగొని ఇంతి
మఱెవ్వతెంగిలో యని మది నెంచెను
తఱితోడ నాపెలోనితడఁబాటులెల్లాఁ దీర
గుఱియైనబాస చేసి కొంకు దేర్చవయ్యా

చ. 3: అంది నీవురము గంద మలమేల్మంగ యలఁది
యెందుఁ దెచ్చిశివోయంటా యీసడించీని
ఇందునే శ్రీవేంకటేశ యెరపరికము వాయ
కందువఁ దారుకాణించి కాఁగిలించవయ్యా

రేకు: 1515-3 పాడి సం: 25-087

పల్లవి: తగు నీకు నిట్టిజాణతనము లెల్లా
మిగులా మావంటివారు మెచ్చిరి నిన్నిపుడు

చ. 1: పడఁతి విడెమియ్యఁగా జన్నులు చేతఁబట్టేవు
చిడిముడితోఁ జన్నులు చేతబట్టేవు
జడియ కాపెపయ్యద సారెసారె సోదించేవు
బడి నీవిడెమేమైనా పయ్యదలో నున్నదా

చ. 2: ఇంతి కైలా గియ్యఁగాను యెఱఁగని వానివలె
వింతలేక ఆపెవొడి వెసఁబట్టేవు
పొంతనే యప్పటి నాపెపోఁకముడి విడిచేవు
కాంతవొడిలో నీకుఁగైదండ వున్నదా

చ. 3: కలికి యద్దము చూపఁగా భ్రమసేవానివలె
నిలిచి యాపెచెక్కుల నీడచూచేవు
మలసి శ్రీవేంకటేశ మరీఁ దమకించి కూడే
వలమేల్మంగచెక్కుల నద్దము నీకున్నదా

రేకు: 1515-4 ఆహిరి సం: 25-088

పల్లవి: తలఁచుకొనఁగదే యాతనివల్ల నేరమేది
యెలమిఁ దారుకాణలే ఇన్నియుఁగావా

చ. 1: పచ్చిపోఁకఁగొని నీగుబ్బ లాతఁడు వేసెనంటా
కొచ్చికొచ్చినీవేల కోపగించేవే
ముచ్చటగా నీచన్నులు మొలచేయప్పటివేళ
అచ్చముగా నాపోఁకలంతేసివే కావా

చ. 2: తామరతూఁడున నీచెయి దాఁకించెనంటాను
వేమారు నాతని నెన్ని వెంగే లాడేవే
భూమిలో నీకరములు పోలించి చూచితేను
ఆమని తామరతూండ్ల అందములే కావా

చ. 3: తతి నీమెడ ముత్యాలదండ దగిలించెనంటా
మితిమీరినసిగ్గు లేమిటికె నీకు
అతఁడు శ్రీవేంకటేశుఁడల మేల్మంగవు నీవు
రతిచెమట ముత్యాలరాసులే కావా

రేకు: 1515-5 వరాళి సం: 25-089

పల్లవి: ఏకతాన నుంటిరి మీరిద్దరు నిందాఁకాను
జోకతో రారయ్యా మీరు; చూచేను మీరూపులు

చ. 1: ఇంతిపాట లిందాఁకా నీడేర వింటివా
చెంత నామేలుకు సంతోసించుకొంటివా
బంతి నుండి యవి నీవు పాటములు గొంటివా
వింతలుగాఁ జెప్పవయ్యా వినేను మీసుద్దులు

చ. 2: మగువచేసిన సేవ మనసునఁ బట్టెనా
తగ నందు లోలుఁడవై తగిలితివా
మగుడియట్టె నీకు మర్మము గరఁగెనా
వెగటునా దానతీ వినేను మీసుద్దులు

చ. 3: అలమేలుమంగ పురమందు నీకు నిలిచినా
కలఇకలెల్లా మెచ్చి కైకొంటివా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వెలయ నాకెరుఁగించు వినేను మీసుద్దులు

రేకు: 1515-6 శ్రీరాగం సం: 25-090

పల్లవి: గుట్టుతోడనున్న నన్ను గొొరబేల సేసీనే
దిట్టతనము నేఁ జూపితే గయ్యాళి యనఁడా

చ. 1: సరసమాడినవాఁడు సంగడిఁ గూచుండుఁగాక
సొరిది నామనసెంత సోదించీనే
తెరవేసుకున్న వాఁడు తెచ్చి విడె మిచ్చుఁగాక
అరసి నన్నప్పటి నెం తడుగవచ్చీనే

చ. 2: సెలవి నవ్వినవాఁడు సిగ్గులు దేరుచుఁగాక
అలసి తానింకా నేమి అందుకాచీనే
పిలిపించుకొన్నవాఁడు ప్రియమునఁ గూడుఁగాక
వొలిసి నన్నెందాఁక నొడఁబరచీనే

చ. 3: చెనకినవాఁడిట్టె చేరి కాఁగిలించుఁగాక
చనవిచ్చి మీతో నేమి సన్న సేసినే
యెనసె శ్రీవేంకటేశుఁడింతలో నన్ను
తనిసి రతుల నెంత తప్పక చూచీనే

రేకు: 1516-1 ఆహిరి సం: 25-091

పల్లవి: భామతోడి పొందు నీకు భాగ్యము గాదా
చేముట్టి సరసమాడి సిగ్గుదేర్చరాదా

చ. 1: కలువరేకులవంటికన్నులఁ దేలించి చూచి
మలసి సొలసి నీతో మాటలాడీని
పిలిచి వద్దఁ గూచుండఁబెట్టుకొని కాఁగిట
కలయరాదా యేల కాఁకలుసేసేవు

చ. 2: చిగురుఁదీ గెలవఁటిచేతులనే నీకు మొక్కి
నగినగి నీతోనే నంటుచూపీని
బగివాయకుండా నీవు పచ్చడము మీఁదఁ గప్పి
తగవు నెరపరాదా తడవేల సేసేవు

చ. 3: పసిడికుండలవంటిపాలిండ్ల నిన్నొరసి
కొసరి వూర్పులఁ దావికుప్పళించీని
యెసగ శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి యిట్టె
వసమై యుండఁగరాదా వరుసేల సేసేవు

రేకు: 1516-2 శంకరాభరణం సం: 25-092

పల్లవి: అందు కేమిదోసము ఆనతియ్యఁగదవయ్యు
యిందరి నీవేలేది యెఱఁగమా యెపుడు

చ. 1: బోన మాయితము సేసి పాలీఁతి విలువఁగాను
ఆనాతినే విడె మడిగేవు
పూని యేడనైనా నీవు బోజనము సేసితివో
యేనెలఁతవిఁ(విం?) దైవా నియ్యకొంటివో

చ. 2: కంచముపట్టుసేసి కాంత గూచుండు మనఁగా
మంచినీళ్లిమ్మనేవు మఱి నాపెనే
అంచెలఁ బిండిపంటలే యారగించి వచ్చితివో
పొంచి యెవ్వతైనా వొక్కపొద్దు చెప్పెనో

చ. 3: కలవెల్లా వడ్డించి కడి యెత్తు మనఁగాను
అలమి మోవితేనియ లడిగేవు
యెలమి శ్రీవేంకటేశ యేకారము నంజితివో
నెలవై నన్నుఁ గూడితి నీకు నిదేప్రియమో

రేకు: 1516-3 రామక్రియ సం: 25-093

పల్లవి: మాముందరఁ దెచ్చి యెంత మట్టుమీర నవ్వేవు
ప్రేమగలితే లోనికిఁ బిలుచుకోరాదా

చ. 1: నీకు నాకెకును నేఁడు నేస్తమంత గలితేను
కైకొని నీమెడఁగుచ్చి కట్టుకోరాదా
వాకముగ దొరఁజేయవలసితే నీముందర
కోక వరచి యందుపైఁ గూచుండఁబెట్టరాదా

చ. 2: నెలఁతపై మోహము నిలుపరాకుంటేను
సొలసి పయ్యదలోను చొచ్చుకోరాదా
తలకొన్నయాకెచక్కఁదనము నీకుఁ బాఁతైతే
పొలుపుమీర వర్ణించి పొగడరాదా

చ. 3: సుదతికి నీకు నిట్టె చుట్టరికమై తేను
కదిసి యెంగిలిపొత్తు గలయరాదా
యెదుట శ్రీ వేంకటేశ యిట్టే నన్ను నేలితివి
పొదిగే వాపెను నీవీఁపున నిలుపరాదా

రేకు: 1516-4 కాంబోది సం: 25-094

పల్లవి: రావయ్యా ఇఁకనైనా రమణి వేఁడుకొనేని
వావిరి నీకెతో నింత వాసు లెంచఁదగునా

చ. 1: పంతమాడరాదుగాని పచారించి నవ్వవచ్చు
మంతనాన సతికిని మగనితోను
వింతసేయరాదుగాని వెంగెమైనా నాడవచ్చు
చెంతఁదనమాట చెల్లించేవానితోను

చ. 2: సిగ్గుపడరాదుగాని చేరి జంకించఁగవచ్చు
కగ్గక తనపై బత్తిగల వానితోను
వెగ్గళించరాదుగాని వేమారుఁ గొసరవచ్చు
నిగ్గులఁ దన్ను మన్నించే నెరజాణతోను

చ. 3: రచ్చఁ బెట్టరాదుగాని రతిఁ బెనఁగఁగవచ్చు
యెచ్చుటా నెగ్గుపట్టనియిష్టునితోను
మచ్చరించరాదు గాని మనసు గరఁచవచ్చు
కచ్చు పెట్టికూడే శ్రీవేంకటేశుఁడ నీతోను

రేకు: 1516-5 నట్టనారాయణి సం: 25-095

పల్లవి: చూచినవారు నవ్వరా చొప్పులెత్తి నన్నైనా
లాచి నాతోడుతను మేలములాడీ యిప్పుడే

చ. 1: కొప్పు దువ్వి కొలువులో కొనగోరఁ జెనకీని
చెప్పరే పతికి బుద్ది చెలులాల
చప్పుడుసేయక యెంత సన్న సేసిన మానఁడు
ఇప్పుడు సిగ్గువడఁడు ఇందరిలోఁ దాను

చ. 2: ముట్టీ నందరిముందు మొకము దప్పక చూచీ
రట్టుసేయుమనరే రామలాల
గట్టుతోఁ బరుసేసుకొనివాను యెఱుఁగఁడు
కట్టఁగడవా రిందుకు కాకుసేయరా

చ. 3: సరిపాదము దొక్కీని సంగడివారుండఁగాను
తెరవేసుకొమ్మనరే తెరవలాల
ఇరవై శ్రీ వేంకటేశుఁడింకా రతిఁ దనియఁడు
సిరులఆసోదము చెప్పరా దితనికి

రేకు: 1516-6 బౌళి సం: 25-096

పల్లవి: పచ్చిదేరె నీపనులు భామలముందరనెల్లా
కచ్చుపెట్టి ఇంక నీకుఁగాదన నేమున్నది

చ. 1: వావులు చెప్పుకొంటాను వద్ద నాపె వుండఁగాను
నీ విందరిలోఁ దారుకాణించుకోవద్దా
భావించక నీ వెక్కడో పరాకున నుండితేను
ఆవిధము నీకు సమ్మతైనట్టేకాదా

చ. 2: గుఱుతులు చూపియాపె కొలువులు సేయఁగాను
పిఱితీసి నీవు తప్పించుకోవద్దా
తఱితో నిప్పుడు మొకదాకిరితో నుండితేను
యెఱఁగెఱఁ గిదియెల్లా నియ్యకొంటేకాదా

చ. 3: సరసములాడి యాపె చన్నుల నొత్తఁగాను
వరుసతోఁ జేతనంటి వారించవద్దా
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
గరిమ నూరకుండితే కైకొంటేకాదా

రేకు: 1517-1 హిజ్జిజి సం: 25-097

పల్లవి: నీ వెఱఁగనివి లేవు నెరజాణవు
భావించి మీవలపులు పచారించవలెనా

చ. 1: పడఁతిచూపులలోనే పదివేలు విన్నపాలు
అడియాలము లన్నియు నందే వున్నవి
అడుగనేఁటికి మమ్ము ఆపె నిట్టె కరుణించు
విడిముడిగా నిఁక విచ్చి చెప్పవలెనా

చ. 2: లలననవ్వులలోనే లక్షలై నయిచ్చకాలు
కలవెల్లా నందులోనే కానిపించీని
తెలుపనేఁటికి నిన్నుఁ దెఱవను మన్నించు
వెలలేనిసిగ్గులెల్లా వెలియవేవలెనా

చ. 3: కోమలికాఁగిటిలోనే కోటికోటివినయాలు
ఆముకొని యెంచిచూడ నందే వున్నవి
చేముంచి నేఁటి కాపెను శ్రీ వేంకటేశుఁడ యేలు
ప్రేమపురతులు నీతోఁ బేరుకుచ్చవలెనా

రేకు: 1517-2 లలిత సం: 25-098

పల్లవి: వద్దనేమా మమ్ముఁ దాను వాసిరేఁచవద్దుగాక
పొద్దొకవింతలుగాను భోగించనీవే

చ. 1: తరుణి యిందరిలోనా తనకు బాఁతైతేను
సిరులపీఁట వెట్టి పూజించనీవే
గరిమి నాపెమాటలు కడువేడుకైతేను
వొరసి యేపొద్దుఁ జెవులొగ్గి విననీవే

చ. 2: పడఁతికిఁ దానిచ్చినబాస మీరరాకుండితే
బడ బెట్టుక తిరిగి బదుకనీవే
అడరి యాపెపై బత్తి ఆఁపరాక వుండితేను
పుడమి నాపెగుణాలు పొగడనీవే

చ. 3: మదిరాక్షికాఁగిలి మరిగి తా నుండితేను
కొదలేనిరతులనుఁ గూడనీవే
ఇదె తాను శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గలసె
వదల కీసుద్దు లాపెవద్దఁ జెప్పనీవే

రేకు: 1517-3 మధ్యమావతి సం: 25-099

పల్లవి: ఆతనినేల సాదించే రంగనలాల
చేతికిలోనైనదాఁకా సేవసేసే మిఁకను

చ. 1: పతియైన వానికి పట్టరానివలపైనా
సతులు పెక్కయితేనే చౌకలౌను
రతి నందరికిఁ గడురసమైనమోవితేనె
తతిగాక వుండితే నెంతయుఁ జప్పనౌను

చ. 2: కూరిమి చుట్టమైనాను గుట్టువిడి చేపొద్దు
సారె మాటాడితే మొగచాటౌను
కోరి వేడుకతోడ గొనకొన్ననవ్వులు
పేరఁబెట్టుకొంటెనే పెనుఁగాక లవును

చ. 3: అంటి వేరొక్క తెపొందు లాసపడేవానికి
వెంటవెంటఁదిరిగితే వేసటౌను
నంటున నిదివో కూడె నన్ను శ్రీవేంకటేశుఁడు
దంటతనానఁ బైకొంటే తరితీపు లౌను

రేకు: 1517-4 శ్రీరాగం సం: 25-100

పల్లవి: పతిమీఁది మోహపు పడఁతికిట్టుండవద్దా
సతతము నీహితవే సారెఁగోరీఁదాను

చ. 1: బలిమి బయ్యదకొంగు పట్టి నీవు దీసి తేను
సెలఁతకొప్పువిరులు నీపై రాలెను
అలరి యందుకు మరుఁ డమ్ములు గురిసెనంటా
కలికి భ్రమసి నిన్ను కాఁగిలించుకొనెను

చ. 2: వొట్టుక నీవాపెను వొరసి పెనఁగితేను
తొటికమ్మెకప్పురపుదూ (ధూ?) ళి నిన్నంటె
నెట్టనఁ జందురుఁడు వెన్నెలచొక్కు చల్లెనంటా
గట్టిగాఁ దెలియలేక కాఁగిలించుకొనెను

చ. 3: ఇమ్ముల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే
నెమ్మిఁ జెమటబొట్లు నీమై నిండెను
చిమ్మి యీతఁడు నించినసేసలే పైకొనెనంటా
కమ్మర నచ్చెరువంది కాఁగిలించుకొనెను

రేకు: 1517-5 పళవంజరం సం: 25-101

పల్లవి: రామయ్య్య ఇఁకనేల రవ్వసేసేవు వలపు
కైవసమయినవారిఁ గారించవలదు

చ. 1: ఆఁపరానితమితోడ నాపె యెదురుచూడఁగా
మాపుదాఁకాఁ జెలులతో మాటలాడేవు
కాఁపురాలు సేసేమని కాచుకున్న వారి నింత
యేఁపులఁ బెట్టితే నిన్ను నెట్టు నమ్మేరిఁకను

చ. 2: ప్రేమతోడ నిన్ను నాపె పేరుకొని పిలువఁగా
నామోము దప్పక చూచి నవ్వు నవ్వేవు
కామించివచ్చినయట్టికాంతలనింతసేసితే
యేమగువలై నాను యెట్టు నమ్మేరిఁకను

చ. 3: కమ్మి యల మేలుమంగ కాఁగిలించుకొనఁగాను
చిమ్ములల నీలోనే యేల సిగ్గువడేవు
ఇమ్ముల శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
యెమ్మెకాఁడవై తేఁ బరులెట్లు నమ్మేరిఁకను

రేకు: 1517-6 ఆహిరి సం: 25-102

పల్లవి: చూతువు రావయ్యా నీసుదతి వున్నలాగులు
యీతల విన్నవించఁగ నెవ్వరు నేరుతురు

చ. 1: చిత్తమెల్లా నీమీఁద చేతులు చెక్కులమీఁద
కొత్తకొత్తచెమటలు గుబ్బమీఁద
తత్తరముమదిలోన తా నున్నది తెరలోన
హత్తై నీపై వలపులు అంగన కీరీతిని

చ. 2: చెప్పేమాట చెలితోడ చిరునవ్వు సిగ్గుతోడ
దప్పి కప్పురపుమోవి లప్పతోడను
కొప్పుజారెఁ జెంపసంది కోరికె నీతని(ను) సంది
వుప్పతిల్లీఁ దలపోఁత లువిద కీరీతిని

చ. 3: పులకలు నిలువెల్లా పొందికలే కాఁగిలెల్లా
పిలుపుఁబ్రియములే పెదవులెల్లా
కలసితి వింతలోనె కాంతను శ్రీవేంకటేశ
కలిగె వేడుకలెల్లా కలికి కీరీతిని

రేకు: 1518-1 సాళంగనాట సం: 25-103

పల్లవి: ఎడమాటాడించ నేల యెమ్మెలఁ బెనఁగనేల
వొడఁబడవలెఁగాక వొక్కటైనవారికి

చ. 1: వలపులు మొదలనే వా(వ్రా)సివున్నవి నుదుళ్ల
చలపాదితనమేల సరసులకు
మొలచినతరితీపు మోవితేనెల నున్నది
యెలయింపు లేఁకనేల యెనసినవారికి

చ. 2: తనివోనికోరికలు దాఁచివున్నవి మతుల
కినియనేఁటికి నెఱిఁగినవారికి
నినుపులై పాయములు నిండివున్నవి మేనుల
అనుమానించఁగనేల ఆపగలవారికి

చ. 3: పరగినరతులెల్లా పాఁతివున్నవి కాఁగిళ్ల
నెరసులు మరియేల నేర్పరులకు
గరిమ శ్రీవేంకటేశ కలసితి రిద్దరును
పొరపొచ్చా లేఁకనేల పొఁ(ప్రొం)దైనవారిక

రేకు: 1518-2 నాదరామక్రియ సం: 25-104

పల్లవి: వక్కణించి చూడ మగవాఁడవు నీవై తేనేమి
పక్కన నింతులఁ గంటే పట్టలేవు మనసు

చ. 1: మగువ యెవ్వతో తెరమఱఁగునఁ బాడఁగాను
తగిలె నాపెమీఁద నీతలఁపెల్లాను
మొగము చూచితే నెంతమోహింతువో నీవిఁకను
మిగులా నెంచిచూచితే మెత్తన నీమనసు

చ. 2: కామిని యెవ్వతో లోన గాలిపడె గాడించఁగ
కామించి యానందానఁ గరఁగితివి
ఆముకొని మేనుమేను నంటితే నెట్టుండుదువో
దీమసాన మరిగితేఁ దిప్పలేవు మనసు

చ. 3: సతి యెవ్వతో మెలఁగుచాటునఁ జేయిచాఁచఁగా
రతికెక్కి వేడుకల రమించితివి
ఇతవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
గతియని నమ్మితేను గట్టిది నీమనసు

రేకు: 1518-3 పాడి సం: 25-105

పల్లవి: గుట్టుతోనే నుండిన నాగుణ మెంచఁడు
ఇట్టె తా నెట్టగుండినా నేమిసేయవచ్చునే

చ. 1: కొలువులో నే నుండఁగా కొంగువట్టి తీసిని
చులకఁదనము గాదా చూచేవారికి
బలుదొర తాను సిగ్గువడ నేరకుండితేను
యెలమిఁ దన్నిందరిలో నేమిసేయవచ్చునే

చ. 2: బంతినుండి పెండ్లిపాట వాడఁగా నన్నుఁ జెనకీ
ఇంతయు వెగటుగాదా ఇంటి వారికి
పంతగాఁడు తన కెరపరికము లేకుండితే
ఇంతినైననాకుఁ దను నేమిసేయవచ్చునే

చ. 3: విందుచెప్పి వడ్డించఁగా వెస నామోవి సోఁకించీ
అందె నగుఁబాటుగాదా అండవారికి
కందువఁ గూడె శ్రీవేంకటేశు తానె నన్ను
ఇందె తెరవేసె నిఁక నేమిసేయవచ్చునే

రేకు: 1518-4 సౌరాష్ట్రం సం: 25-106

పల్లవి: మఱి నీవేమిసేసినా మంచిదేకాక
జఱసి నిన్ను మార్కొన చలమా యిది

చ. 1: చెలరేఁగి నీవు నాచేతికి విడెమియ్యఁగా
బలిమిఁ బట్టకుండఁగా పంతమా యిది
వెలలేనివేడుకతో విరుల నన్ను వేయఁగా
మలసి తప్పించుకొన(న) మదమా ఇది

చ. 2: అదిగొని నీవు నాఆయములు ముట్టఁగాను
కాదని చేపట్టితోయ గర్వమా యిది
అదరించి నీవు నన్ను అలుకలు దేర్చగాను
సాదించ నీతోడి మచ్చరమా ఇది

చ. 3: నగుతా శ్రీవేంకటేశ నన్ను నీవు గూడఁగాను
యెగసక్కేలాడ నాకు యెమ్మెలా యిది
తగినరతుల నన్నుఁ దనియఁగఁ జేయఁగాను
సొగిసి నేఁ గొసర నాసోదమా యిది

రేకు: 1518-5 ముఖారి సం: 25-107

పల్లవి: ఏల రట్టుసేసుకొనే నిదె నీవె నీవలపు
వాలాయించక నేఁ దలవంచు కొనరాదా

చ. 1: కామినిముఁ(ముం?) జేయి నీవు కైదండ వట్టుకొని
నామోము చూచినందుకు నగరాదా
ఆముక యాపెదండ నీ కటు చెమట గారఁగా
యేమీననక పరాకై యిట్టుండరాదా

చ. 2: నేరుపుతో నాపెసొమ్ము నీమెడఁ బెట్టుకరాఁగా
నీరెంటెము నీకుఁ గప్పి నే దాఁచరాదా
చేరిచేరి యాపెకుఁగా చిత్తమెల్లాఁ గరఁగఁగా
కోరి యెఱఁగమిసేసుకొని వుండరాదా

చ. 3: కూడికూడి యాపె నీవు కుచ్చి కాఁగటిలించుకోఁగా
వేడుకతో నేఁ దెరవేయరాదా
యీడనె శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
తోడనే నీమోవి గుఱుతులు వెట్టరాదా

రేకు: 1518-6 మాళవిగౌళ సం: 25-108

పల్లవి: చెల్లుబడిగలనాఁడే చేఁతలిన్నీ నమరును
చల్లఁగా నిప్పుడే నీసలిగె మెఱయవే

చ. 1: పచ్చిదేరె సిగ్గులు పట్టరాదు యెగ్గులు
మచ్చిక నాతనితోనే మాలటాడవే
రచ్చకెక్కె గరువము రతి కిదె పరువము
వచ్చినాఁడు పతి నిట్టె వలపించుకొనవే

చ. 2: వెలసె నీనవ్వులు వెంగే లీఁక దవ్వులు
చలివాసె నిఁక సరసములాడవే
తలకొనెఁ బొదులు దక్కె మోవివిందుట
కలుపుకోలు సేసుక కాఁగిలించుకొనవే

చ. 3: నెట్టుకొనెఁ జూపులు నిండెఁ దరితీపులు
దట్టమై యీతని కిఁకఁ దమిరేఁచవే
అట్టె శ్రీవేంకటేశుఁ డల మేలుమంగను
గుట్టుపడ నన్నుఁ గూడెఁ గోరి మెచ్చఁగదవే

రేకు: 1519-1 బౌళి సం: 25-109

పల్లవి: నీవేల సిగ్గువడేవు నెట్టన నన్నుఁజూచి
భావించ నీవన్నిటా పంతగాఁడవు

చ. 1: తగవులఁబెట్టేనా తారుకాణించవచ్చేనా
జిగి నీవు సేసినచేఁతలకెల్లా
అగడు నేఁ జేసేనా అంతటా నాడుకొనేనా
పగటుతో నీవేమిటాఁ బరగినను

చ. 2: నెరసులు వెదకేనా నిష్టూరము వేసేనా
నిరతపునాజవైననీమీఁదను
యెరవులు సేసేనా యెగ్గులు నేఁ బట్టేనా
సరస మెవ్వతెతోడ సారె నీవాడినను

చ. 3: చలము సాదించేనా జంకించి పెనఁగేనా
నిలువెల్లాఁ దమిరేఁగి నీవుండినా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
అలమేలుమంగ నింతె అవుఁగాదనేనా

రేకు: 1519-2 నట్టనారాయణి సం: 25-110

పల్లవి: ఎంత తమకించేవు యేమోయి
మంతనమాడేనంటా మారుమలసేవు

చ. 1: నిగిడి యలిగితినా నీకు నీవే వేగిరించి
నగనైతినంటా గోరు నాటించేవు
యెగసెక్కెపుదాననా యేమేమో భావించి
మొగము వంచితినంటా ముంగురులంటేవు

చ. 2: చలము సాదించేనా సరి నింతలో నింటికిఁ
బిలువనంటాఁ జన్నులు పిసికేవు
బలిమికత్తెనా నీతో పంతముగ నూరకైనా
పలుకనాఁ గొంగువట్టి తీసేవు

చ. 3: వాసితోఁ గాఁగిలించనా వట్టినెపములు వేసి
రాసి యలసితినంటా రవ్వసేసేవు
ఆసల శ్రీవేంకటేశ అలమేల్మంగనే నేను
వేసారనంటా నన్ను వేడుకతో మెచ్చేవు

రేకు: 1519-3 గుజ్జరి సం: 25-111

పల్లవి: కోపగించుకొనదూ కొసరి నిన్ను దూరదు
వోపికతోఁ దన కెంతవోరుపో కాని

చ. 1: చెక్కటి చేతితోడ సిగ్గుపడీ జవరాలు
పక్కనఁ జన్నులు నిమ్మపంట వేయఁగా
తక్కన నీమోము చూచి తలవంచుకొనీఁ దాను
మక్కువతోఁ గొనగోర మర్మము లంటఁగను

చ. 2: మలఁగుమాటున నుండి మచ్చిక నవ్వీఁ జెలి
చలివాపి నీవు సరసములాడఁగా
వెలయ నీమాట విని వెరగునొందీఁ దాను
తలకొన్న రతులెల్లాఁ దలపిఁగాను

చ. 3: ముచ్చటతో నిన్నుఁ గూడి మొక్కీ నలమేలుమంగ
పెచ్చురేఁగి కాఁగిటిలోఁ బెనఁగఁగాను
ఇచ్చగించి శ్రీవేంకటేశ నిన్ను మెచ్చీఁదాను
నిచ్చలాన మోవితేనె నీవియ్యఁగాను

రేకు: 1519-4 వరాళి సం: 25-112

పల్లవి: ఎంత తక్కరీఁడీతని నేమందునే
బంతినే నాకు వలపు పంచి పెట్టీని

చ. 1: చెలిఁ దాను బాసలుచేసుకోఁగా నే వచ్చితే
కెలన నన్నందుకే సాకిరివెట్టీనే
నిలిచి నే నంతలోనె నివ్వెరగుతో నుండితే
కలుపుకోలుతనాలు గలుగఁజేసీనే

చ. 2: వొక్కపొత్తున నిద్దరు నుండఁగా నే వచ్చితే
చిక్కించు కెంగిలిలో నాచేతులద్దీనే
తక్కక నే మొగమోటఁ దలవంచుకొంటేను
వొక్కటిగాఁ జుట్టరిక మొనరఁ జెప్పీనే

చ. 3: ఆకెఁ దానుఁ గాఁగిట నలరఁగ నే వచ్చితే
కోక నామీఁదఁ గప్పి కొంకుదేర్చీనే
ఆకుమడిచిచ్చీ నాపె అలమేలుమంగ నేను
యీకడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నేలెనే

రేకు: 1519-5 సాళంగం సం: 25-113

పల్లవి: తనంత వచ్చినదెల్లా తరితీపు లేలొను
పెనఁగులాటలమీఁదఁ బ్రియము లౌఁగాక

చ. 1: కానుకిచ్చినాపె వద్దఁ గాచుకుండఁగా నెక్కడో
మానినులతో నీవు మాటలాడేవు
పూనిపట్టి విడెమిచ్చేపొలఁతి యటుండఁగాను
మానక చేయిచాఁచేవు మరొక తేమీఁదను

చ. 2: చేరి వుండినాపె నిన్నుఁ జెనకుచునుండఁగాను
వూరివారిఁ జూచి నీవు వువ్విళ్లూరేవు
కోరినీకుఁ బాదాలొత్తేకొమ్మ నీతో నవ్వఁగాను
తేరకత్తెలతో నేల తెగడవచ్చేవు

చ. 3: కొలువుసేసేయాపె కోరివేఁడేఁ దగులఁగా
నలమేల్మంగరతికి నాసపడేవు
యెలమి శ్రీవేంకటేశ ఇందరు నీ కుండఁగాను
లవి మోహపుటాపెమేలము మెచ్చేవు

రేకు: 1519-6 దేసాళం సం: 25-114

పల్లవి: ఆపె వచ్చినప్పు డన్నీ నయ్యీఁగాని
వోపుదునా దొరవు నీవొగిఁగాచుకుండను

చ. 1: పిలిచే వాకెను నీవు ప్రియపడి; నేనైనాఁ
జెలిమారు సేవచేసేఁ జెప్పవయ్యా
అలఁదేణఁ(నం?) టా గంద మట్టి చేఁబట్టుకున్నాఁడ
వలరి నావురముపై నందాఁకా దాఁదవయ్యా

చ. 2: వెదకే వాపెను నీవు; వేడుకతో నే నుందాన
యెదుట; నాపని యానతియ్యవయ్యా
ఇది విడె మాకెకు మీఁదెత్తుకొన్నాఁడ; వందాఁకా
పొదిగి నాపుక్కిట నిప్పు డుండనీవయ్యా

చ. 3: చూచే వాపె కెదురు; సుద్దులు నేఁ జెప్పేను
చేచేత నీవెట్టయినాఁ జెనకవయ్యా
యేచి శ్రీవేంకటేశుఁడ యే నల మేలుమంగను
కాచి నన్నేలితివి ఆకాంతమారే నేనయ్యా

రేకు: 1520-1 శంకరాభారణం సం: 25-115

పల్లవి: ఎంత నేరుచుకొన్నది యీాచిన్నది
చెంత నుండే నిన్ను నిట్టె చేకొన్నది

చ. 1: చిగురుఁబెదవిమీఁదిచిన్నలూా
సగముమాటలతోడిసన్నలూా
నగియేటి పెలవులనయములూా
బిగిసేటికాఁగిటిప్రియములు

చ. 2: తనివోక చెలులతో తలపోఁతలూా
ననుపు లేపొద్దుమానని చేఁతలు
పనివడి నీమీఁదిపాటలూా
మొనసి యెప్పుడు నీతో మొగమోటలు

చ. 3: వద్దనుండి పైఁజల్లీ వలపులు
అద్దుకొనీ రతిలోని యలపులు
వొద్దికై శ్రీవేంకటేశ వొనగూడితి వీకెను
కొద్దిమీరె బింకములు కూడినపొంకములు

రేకు: 1520-2 సింధురామక్రియ సం: 25-116

పల్లవి: చూడ నిట్టున్నది గాని జూటుఁదనమే మేనెల్లా
యీడ నేర్చుకోరాదా యీపెచేత నీవు

చ. 1: మనసుమర్మ మెఱుఁగు మాటలాడనేర్చు నాపె
వినరాదా వీనులార వేడుకతోడ
పెనఁగులాడఁగనోపు ప్రియములు చెప్పనోపు
చెనకఁగవలదా నీచేతులకొలఁది

చ. 2: చలిమి బలిమి గద్దు చవులు వుట్టించు నాపె
చెలిమి సేయఁగరాదా సిగ్గుపడక
మొలకచన్నుల నొత్తు మొనసి పాదములొత్తు
పిలిచి బుజ్జగించితే పెద్దరికముగాదా

చ. 3: కేరి కేరి నీతో నవ్వు కిందుపడి మొక్కునాపె
సారెకుఁ గూడఁగరాదా సమరతుల
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఆరమణిపొందులు నీ కంకెకెల్లా వచ్చును

రేకు: 1520-3 సావేరి సం: 25-117

పల్లవి: ఎంత నన్నుఁ బొగడేవు యెటువలె బుజ్జగించి
వింతదాననా నీకు వినయపుటాలను

చ. 1: కోరికతో మగఁడు యేకోమలితో నవ్వినాను
నేరము లెంచనిదే నెలఁత
అరజాన తనమేన జీరలు దీయించుకొంటే
గారవించి పచ్చడానఁ గప్పినదే మగువ

చ. 2: వేడుక యేసతిమీఁద విభునికిఁ గలిగినా
తోడుకవచ్చినదే తొయ్యలి
కూడేవేళ యెంతేసియెక్కుడు ప్రియాలు చెప్పినా
ఆడుకోక వుండినదే అంగన

చ. 3: పచ్చిగారమణుఁడు యేపడఁతి బెండ్లాడినాను
ఇచ్చకమై యుండినదే ఇంతి
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిచ్చలు నావంటిదే నీకు దేవులు

రేకు: 1520-4 సామంతం సం: 25-118

పల్లవి: నీకుఁ బోదు నాకుఁ బోదు నీవేల సిగ్గువడేవు
కాకుసేసి నీ మీఁద కాఁతాళించేనా

చ. 1: యెంత నీవేమి సేసినా ఇచ్చకమాడుదుఁగాక
వంతములాడేనా పతివి నీవు
చెంతఁ జేరకుండితేను చేవట్టి తీతుఁగాక
వింతదానివలె నిన్ను వెంగెములాడేనా

చ. 2: నీవెంతపరాకై వున్నా నిన్ను నెచ్చరింతుఁగాక
రావంటా నిన్ను దూరేనా రమణుఁడవు
కైవసము గాకుండితే కరుణ వుట్టించుఁగాక
వేసేలైనా నీకుఁ గడువేసట వుట్టించేనా

చ. 3: కడల నీవుడినాను కాఁగించుకొందుఁగాక
చిడుముడి పడేనా శ్రీవేంకటేశ
యెడయక మన్నించి యేలితివి నన్ను నేఁడు
తొడిఁబడ నిందరిలో దూరుసేసేనా

రేకు: 1520-5 నాగవరాళి సం: 25-119

పల్లవి: తానే తెలుసుకొనీఁ దరుణిలాగు
వీనులలో మనమిట్టె విన్నవించవలెనా

చ. 1: చనవుగలదానికి సరసములాడఁజెల్లు
ననుపుగలదానికినవ్వఁ జెల్లు
వినయపుదానికి వేడుకలెలాఁజెల్లు
మనమేలే యాతనిమర్మము లెత్తఁగను

చ. 2: మందెమేళపుదానికి మారుకొనివుండఁజెల్లు
అందగారిదానికి పై యాడఁ జెల్లును
పొందుచేసిన దానికి పొగడఁగఁ జెల్లును
మందలించి మన మిట్టె మనుపఁగ వచ్చునా

చ. 3: పాయరానిదానికి పంతములాడఁజెల్లు
మాయదారిదానికి మలయఁజెల్లు
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
వేయైనా మనమిఁక విడిపించగలమా

రేకు: 1520-6 రామక్రియ సం: 25-120

పల్లవి: చిత్తగించు మౌబళేళ శ్రీసతివిలాసములు
ఇత్తలా నత్తలా మీకు నిచ్చకము లాయను

చ. 1: యెదురుఁగొండలపై నుండి ఇంతి మోము చూపితేను
అదియే నీకు నిలువుటద్ద మాయను
వదలుఁబయ్యెదలోనివట్రువచన్ను లావేళ
కదిసి నీకుఁ జూపినకానుక లాయను

చ. 2: పొన్నలనీడలలోన పొలఁతి నిన్నుఁ జూడగా
సన్నలగప్పురవువసంత మాయను
మన్ననదేవులు నీకై మాటలు నీతో నాడఁగ
పున్నతపుమీరతలు కుంకువ లాయను

చ. 3: చెంది భవనాళి దాఁటి చేతులు నీపై జాచఁగా
పొందుగా తమ్మివిరులపూజ లాయను
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నాకె గూడఁగా
యెందు చూచినా వేడుక లెక్కు డాయను

రేకు: 1531-1 ధన్నాసి సం: 25-121

పల్లవి: ఇంతితోడ నీవేల యెదురాడేవు
సంతరించినవాఁడవు చనవియ్యవలెను

చ. 1: పలపుగలవానికి వాసు లెంచఁబనిలేదు
చెలు లేమిచెప్పినానుఁ జేయవలెను
కలపుకొలైనచోటఁ గడువింత సేయరాదు
వొలిసినట్టల్లాను వొడఁబడవలెను

చ. 2: మగఁడైనపిమ్మటను మరి యెరవేమిటికి
తగుసతులకు లోనై దక్కవలెను
జగడించరానందుకు చలములు మరియేల
నగినయట్టే నవ్వి ననుచఁగవలెను

చ. 3: విడువరానిపొందుకు వేరుచేసుకోఁదగదు
పడఁతులమాట నడపఁగవలెను
యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
వుడివోనివేడుకల వొద్దిక గావలెను

రేకు: 1531-2 శంకరాభరణం సం: 25-122

పల్లవి: సవతులమైనా నేమి సమ్మతించితిమి నేము
జవళి సరసములు సరినెంతవేడుకో

చ. 1: మాటలాడఁగదవే మనసిచ్చి పతితోను
యేఁటికి సిగ్గులువడే వెవ్వరున్నారు
సూటిగా వినఁగదవే సుద్దులు చెప్పీ నతఁడు
నీటున నెమ్మొ నెరప నీతో నెంతవేడుకో

చ. 2: జఱసి కూచుండఁగదే సన్నలు సేసీఁ దాను
చిఱునవ్వు నవ్వనేల చిన్న దానవా
నెఱులుదువ్వించుకోవే నేరుతుననీ నితఁడు
తఱితోఁ దొడయెక్కవే తన కెంతవేడుకో

చ. 3: ఇట్టె అందుకోవే విడెమిచ్చీ శ్రీవేంకటేశుఁడు
గుట్టు సేయకిఁక నీకు కొంకు దేరెను
నెట్టన నన్నుఁ గూడి నీపైఁ జేతులు చాఁచీ
దట్టపుటాసలతో బొందఁగ నెంత వేడుకో

రేకు: 1531-3 బౌళి సం: 25-123

పల్లవి: ఏమిచెప్పేది నీయాస యంతకైనా నోపుదువు
ఆముకొన్ననిన్నుఁ జూచి అరుదయ్యా నాకును

చ. 1: సెలవిన వ్వొకతెతో చేసన్న లొకతెతో
యెలమిఁ జేసేవు వలపెందు నున్నది
కొలువు చేసేసతులు కోటానఁగోట్లు
అలరి యెవ్వరి వాఁడ వానతియ్యవయ్యా

చ. 2: శిర సొక్కతెతొడపై జిగిఁబాదా లొక్కతెపై
ఇరవాయ,నీమనసు యేడనున్నది
యిరుమేలా నూడిగపుటింతులు సేనాసేన
యెరవులేక యిందరి నెట్టు మన్నింతువయ్యా

చ. 3: వొక్కతెఁ గాఁగిటఁగూడి వొక్కతె మోవి యానేవు
ఇక్కువై నీభావ మెట్లున్నది
ఇక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నిక్కము నిఁ(ని: ?) తేసి యెట్టు నేర్చుకొంటివయ్యా

రేకు: 1531-4 గౌళ సం: 25-124

పల్లవి: నావలె నుండవలదా ననిచి నీతో నవ్వుతా
చేవమీరి పరాకేల చేసుకొనీ నాపె

చ. 1: చనవిచ్చి నీవు గడుసరసము లాడఁగాను
పనివడి యేల సిగ్గులవడీ నాపె
పెనఁగి పెనఁగి నీవు ప్రియములు చెప్పఁగాను
విని విననెట్టు యేల వెరగందీ నాపె

చ. 2: పచ్చిగా నీవుచన్నులపైఁ జేయివేయఁగాను
కొచ్చి పయ్యదేల మూసుకొనీ నాపె
కచ్చుపెట్టి నీవు తన్నుఁ గాఁగిలించుకొనఁగాను
పెచ్చువెరిగి తానేల బిగిసీ నాపె

చ. 3: గట్టున నింటిలో నీవు కొంగువట్టి తియ్యఁగాను
పెట్టరానియానలేల పెట్టీ నాపె
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
చుట్టుక తానేల కూడి సొలసీ నాపె

రేకు: 1531-5 తెలుగుగాబోది సం: 25-125

పల్లవి: కఁతుఁ డేమిసేయునమ్మా గరిమ నోచెలులాల
కాంతలకుఁ బతులకు కలసాజ మిదియే

చ. 1: పిలుపులే లోలోనఁ బ్రియములు పుట్టించేవి
తలపోతలే గడుదమిరేచేవి
పలుకుల నేరుపులే భావాలు గరగించేవి
సెలవునవ్వులే చింతలు వాపేవి

చ. 2: తనివోని చూపులే తరితీపు సేసేవి
ననువులే పాయనీక నమ్మించేవి
వినయములే నిండువేడుకలు నెరపేవి
చెనకులే వొండొరుల సిగ్గులు ముంచేవి

చ. 3: జడిగొన్న కోరికలె చవులు వొడమించేవి
యేడవాయకుండుటలే యెనయించేవి
అడరి శ్రీ వేంకటేశు కలమేలుమంగకును
పుడివోని యీపొందులే వొద్దికలై వుండేవి

రేకు: 1531-6 కాంబోది సం: 25-126

పల్లవి: బుద్ధిచెప్పరే పతికి పొలఁతులాల
అద్దుక యిట్టే జలకమాడుతా నుందాననే

చ. 1: చెఱఁగుమాసి నేను సిగ్గుతో నుండఁగాను
అఱలేక నన్నితఁ డేలంటవచ్చీనే
నెఱియ మోనముతోడ నిలుచుక నే నుండఁగా
మఱియు నన్నితఁడేల మాటలాడించీనే

చ. 2: పాపివున్నతమకానపరాకై నే నుండఁగాను
వేసరక విరులను వేసీ నిదేలే
రాసివిరహానం గప్పురము మేనఁజల్లుకోఁగా
దోస మెఱఁగక యేల దోసిలొగ్గీనే

చ. 3: చెలరేఁగి నే మణుఁగుచీర గట్టుకొనఁగాను
కలసియిప్పుడే యెట్టు కాఁగిలించీనే
యెలమి శ్రీవేంకటేశుఁడిటు నేఁ గుచుకుండఁగా
బలిమిసేసి యెంతపచ్చిగాఁ గూడీనే

రేకు: 1532-1 ఆహిరి సం: 25-127

పల్లవి: ఏల లోఁగేవు రాఁగదే యిదివో నీరమణుఁడు
నాలిసేయరాదు గాని నవ్వు నవ్వవచ్చును

చ. 1: మచ్చరమే వద్దుగాని మాటలన్నీ వాడవచ్చు
అచ్చముగా మగనితో నంగనలకు
కుచ్చితే సేయరాదు కోరి జంకించవచ్చు
రచ్చకెక్కవలచినరసికులకు

చ. 2: పంతమాడవద్దుగాని పట్టిపెనఁగఁగఁవచ్చు
వింతలుగా రమణికి విభునితోను
చెంతఁ బాయరాదుగాని సేవలు సేయఁగవచ్చు
సంతసాన మేలమాడేసరసులకు

చ. 3: వేసరఁగరాదుగాని వేడుకలు చూపవచ్చు
ఆసపడ్డనాధునితో నతివలకు
చేసూటిగా నిన్ను నేలె శ్రీవేంకటేశ్వరుఁడు
యీసులేదు మీవంటియితవరులకును

రేకు: 1532-2 బౌళి సం: 25-128

పల్లవి: ఏమైనా గుణము తా నెఱఁగనిదా
ఆముకొని లోలోఁ దానే ఆలకించీఁగాక

చ. 1: సేసవెట్టిన వాఁడు నాచేతికిలోనైన వాఁడు
ఆసల నేఁపుదురా అట్టె తాను
వాసిగలదాననేను వలచిన దాన నేను
వేస రొక్కపరియైనా వెంగెమాడేనా

చ. 2: మనసెఱిఁగిన వాఁడు మాట నాకిచ్చిన వాఁడు
పెనఁగులాడుదురా బెట్టుగాఁ దాను
చనవు గలదు నాకు సరసము లబ్బె నాకు
తనమీఁద సారెసారెఁ దప్పులెంచేనా

చ. 3: చెక్కులు నొక్కిన వాఁడు సిగ్గులు దేర్పినవాఁడు
కక్కసించి నవ్వుదురా కలసి తాను
ఇక్కువల శ్రీవేంకటేశుఁడు తాఁగూడె నన్ను
దక్కినాఁడు తను నేఁ బంతము గొనేనా

రేకు: 1532-3 ముఖారి సం: 25-129

పల్లవి: నీవుచేసినచేఁతలు నీమీఁదికి వచ్చె
ఆవేళ నీభాగ్యమిదియాతఁ డేమిచేసునే

చ. 1: చనవునఁ బెనఁగఁగా చంటిమీఁద గోరు దాఁకె
కనలి విభునినేల కడు దూరేవే
పొనింగి దాఁగఁగఁబోతే పోఁకముడి వెడజారె
యెనలే కాతనివల్లనెంచ నేర మేదే

చ. 2: నంటున నీవు నవ్వంగా నడుమ నీకొప్పు వీడె
జంటయైనపతినేల జంకించేవే
దంటవై మాటలాడఁగా తమకము కడురేఁగె
వెంటవెంటఁ బతినేల విరుల వేసేవే

చ. 3: అండనే కూచుండఁగాను ఆయములెల్లాఁ గరఁగె
నిందు శ్రీవేంకటేశుపై నెపములేలే
దండిగా మోవి ఇచ్చితే తన్నుఁ దానే కళదాఁకె
వొండొరులు మీలో మీరు వొరయ నేమిటికే

రేకు: 1532-4 పళపంజరం సం: 25-130

పల్లవి: అదియునుఁ జూతముగాని ఆనతీవయ్యా
కదిసేవు నాపై బత్తిగలదా నీకు

చ. 1: చలపట్టి నాతోను జాణతనా లాడేవు
నెలకొన్న యీమోహము నిజమా నీకు
కలపుకోలు చేసుక కాఁగిలించుకోవచ్చేవు
చెలిమి యీడేర నిఁక సేసేవా నీవు

చ. 2: విడువక నాతోను వేసరక నవ్వేవు
వుడివోకకూడేమన సున్న దా నీకు
అడరి నా మొగము నీ వాసపడి చూచేవు
బడిబడి నాతో నీవు పాయక వుండేవా

చ. 3: నమ్మికలెల్లా నొసఁగి నన్నుఁ గడులాలించేవు
నెమ్మది నాయెడ దయ నిండెనా నీకు
యిమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కుమ్మరింపుఁగోర్కి దలకూడెనా నేఁడు

రేకు: 1532-5 కన్నడగౌళ సం: 25-131

పల్లవి: ఇందరును వినఁగాను యెంతసిబ్బితై వుండునో
మందలించి మంచముపై మాటలాడుకోరాదా

చ. 1: కాంత యేవిన్నపానకో కాచుకున్నది నీవద్ద
వింతలుగా నాలకించి వినరాదా
అంతవడిలోన నుండి అప్పటి వచ్చేముగాని
పొంత నిద్దరును తలపోసుకొనరాదా

చ. 2: లలన యెందుకో నీకు లాచి కొలువులు సేసీ
అలరి యాపను లాపె నడుగరాదా
బలిమి నందాఁకాను పరాకై వుండేముగాని
వెలి నాపె నీవు వెల్లావిరిచేసుకోరాదా

చ. 3: అంగనాకాంక్ష యెంతో ఆసపడీ నీయెదుట
చెంగట నాపెచనవు చెల్లించరాదా
రంగున శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
సంగతిగా నవ్వుకొంటా సరి మీరుండరాదా

రేకు: 1532-6 లలిత సం: 25-132

పల్లవి: ఎంత నేరుచుకొన్నది యీవనిత
బంతి నీపెచేఁతలకు భ్రమయకుండుదురా

చ. 1: తొడమీఁదఁ గూచుండి తొయ్యలి నీమోము చూచి
కడుఁదేలగిలవేసీఁ గనుఁగొనలు
వొడివట్టుకొని నిన్ను వొయ్యారపుమాట లాడి
వెడరేఁచీ వలపులు ప్రియముతో నీకును

చ. 2: గుట్టున నీతో సొలసి గుబ్బలు నీపై సోఁకించి
అట్టడితనాన జఋసీ గోరను
అట్టె మోవి చూపి అరచేతఁ జెక్కునొక్కి
వొట్టియాసలు వుట్టించీవొద్దికతో నును

చ. 3: పయ్యద నీకుఁ గప్పి బలిమితోఁ గాఁగిలించి
వుయ్యాలమంచ మూఁచీ నుబ్బూఁతలను
ఇయ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నెయ్యాన దా రతిసేసీ నేర్పులతో నీకును

రేకు: 1533-1 లలిత సం: 25-133

పల్లవి: ఇటువంటిపొందులకు నింతినేల వొరసేవు
నటలకు నవ్వినాను చవిగాకపోదు

చ. 1: యెసనెట్టుకొని సతు లెంత పతిఁ దిట్టినాను
కొసరులై సతు లెంతపతిఁ దిట్టినాను
కసరి చేతికి లోనుగాక పెనఁగితేను
అసమునఁ దరితీపు లౌఁగాక మానదు

చ. 2: కన్నులను జంకించి కామిని లెట్టలిగినా
సన్నలై తోఁచుఁగాని చలమెక్కదు
కన్నచోట నిన్ను చూపుగాఁడిపారఁ జూచినాను
ఇన్నిటా వలపు రేఁచి యెనయించకుండదు

చ. 3: అంగనలు గోరగీరిఆయము లెంతంటివాను
సింగారమే మించుఁగాని చింతెరఁగదు
రంగుగ శ్రీవేంకటేశ రతి నీకె గూడె నిన్ను
సంగడి జాణతనాలు చాయలకే వచ్చును

రేకు: 1533-2 పాడి సం: 25-134

పల్లవి: అంకెకాఁడ వోఁగునూతులౌభ ళేశ
పొంకమాయ నీసతిపొందు మఱవకుమీ

చ. 1: తగులనాడినమాట తమితోఁ జూచినచూపు
మగువనేరుపు లివి మఱవకుమీ
చిగురుమోవివిందు సిగ్గుతోడి మురిపెము
నిగిడించినా పెను నీవు మఱవకుమీ

చ. 2: సెలవి నవ్వినవ్వు చేతుల మొక్కిన మొక్కు
మలయజగందిచేత మఱవకుమీ
కొలువులో సరసము గుట్టుతోడివినయము
యెలమి నీకెగుణము లిఁక మఱవకుమీ

చ. 3: మేనిపై నొత్తినగోరు మిక్కుటపుకాఁగిలి
మానినిచేసిన మేలు మఱవకుమీ
పూని శ్రీవేంకటేశుఁడ భోగములవొడఁబాటు
నానాఁడే ఇచ్చినది యెన్నఁడు మరవకుమీ

రేకు: 1533-3 బౌళి సం: 25-135

పల్లవి: చెలఁగి నీవెట్టుండినాఁ జెల్లదా యెమ్మి (యేమి?)
తల వంచుకొని యేల తగఁ జింతేంపు

చ. 1: చనవు చేసుకొని సతి నీవద్దఁ గూచుండి
యెనసి నవ్వితే నీవు యెగ్గుపట్టేవు
ఘనుఁడ వేమిచేసినాఁ గాదనేటివారెవ్వరు
పనిలేనిపని కేల పక్కన లోఁగేవు

చ. 2: కూడేవేళ నీ మేనిగుఱుతు లాపె చూచి
వేడుకతో మెచ్చితేనే వెంగెమ నేవు
కోడెకాఁడ నీగుణము కొలఁదికి దిద్దరాదు
చేడెలముందర నేల సిబ్బతిపడేవు

చ. 3: అడియాల మంపఁగానే అంగన వచ్చి చన్నుల
కడునొత్తితేనేల గర్వమనేవు
యెడయక శ్రీవేంకటేశ నీవు మగఁడవు
బడినే కూడితి వేల బాసలు సేసేవు

రేకు: 1533-4 వసంతం సం: 25-136

పల్లవి: మాపు దాఁకా విన్నపాలుమరియేఁటికి
పైపై నీదేవులౌటే భాగ్యమింతేకాక

చ. 1: వలచినకాంత యీకె వాసు లెంచఁబనిలేదు
చెలరేఁగి వినయము చేసుటగాని
నిలువెల్లా దమకమే నీతో నెట్టలిగీని
కలది నీవూడిగమే గతి ఇంతేకాక

చ. 2: తగువైనసతి యీకె తప్పులు పట్టంగరదు
అగపడి ఇచ్చకము లాడుటగాని
మొగమోట దరచాయ మొక్కలాన దూరలేదు
నిగిడి నీతో నవ్వుటే నేరు పింతేకాని

చ. 3: కూడినమానిని యీపె గుంపెనలు చూపరాదు
వేడుకఁ గాఁగిలిమ్మని వేఁడుటగాని
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నిన్నేమని
జాడతోడ మోవేనుటే సరవితేకాక

రేకు: 1533-5 అమరసింధు సం: 25-137

పల్లవి: ఇదివో నీసుద్దులెల్లా నిటువంటివి
మదమున నీతో మారుమలయఁగఁగలనా

చ. 1: తగిలి నీవ్వాడిగవుదానను నే మొక్కితేను
నగుతానే సరసము నాతో నాడేవు
వెగటుగా మాయక్క వింటే నిందు కేమనును
యెగసక్కెఁడవు సంగ తెఱఁగవుగాక

చ. 2: గక్కన నే దూతికను కానుక నీ కిచ్చితేను
చెక్కునొక్కి నామీఁదసేసవెట్టేవు
చక్కఁగా మాయేలికసాని గంటే నేమనును
తక్కరీఁడ వీతగవు దలఁచవుగాక

చ. 3: చెలికత్తె వాపెమారు సేవ నీకుఁ జేసితేను
కలసి శ్రీవేంకటేశ కాఁగిలించేవు
తిలకించి మాయమ్మ దెలిసితే నేమనును
బలిమికాఁద విదేయీ భావిఁచవు గాక

రేకు: 1533-6 దేవగాంధారి సం: 25-138

పల్లవి: అక్కచెల్లెండ్ల మిద్దరమైతే నైతిమిగాక
చక్కఁగా జాణతనాలు సరిదూఁచవచ్చునా

చ. 1: యెంతయినా సవతుల యీడుకు రావచ్చుఁగాక
వంతు లడుగవచ్చునావలపు నేఁడు
సంతోసానఁ బతిమోవి చవిగొనవచ్చుఁగాక
జంతిఁ బెట్టుకోవచ్చునా పాయ మెవ్వరికిని

చ. 2: రాసు లొకచోటఁ గాఁపురము సేయవచ్చుఁగాక
వామి వేయవచ్చేనా వాసులు నేఁడు
నాముకొన నాతనితో నవ్వునవ్వవచ్చుఁగాక
దోమటిగాసిగ్గులెల్లదొడ్డిఁబెట్టవచ్చునా

చ. 3: వొద్దిక చుట్టాలు పొందు లొనగూడవచ్చుఁగాక
వద్దనఁగవచ్చునా వాపులునేఁడు
అద్దుక శ్రీవేంకటేశు డలమె నిన్నును నన్ను
గద్దించి నేరుపులెల్లా గాదెఁ బోయవచ్చునా

రేకు: 1534-1 దేసాళం సం: 25-139

పల్లవి: ఓపమయ్య నే మంతేసివుమ్మడికొలువులకు
చేపట్టి నీ వేలితేను సేవచేసేఁగాని

చ. 1: నీవునాపెఁ గూచుండఁగా నేనీకు మొక్కితేను
భావించ సగ మాపెకుఁ బాలురాదా
యీవలను వేరొకతె ఇంట నిన్నుఁ బొడగంటే
తావుల నేంపెకుఁ బెద్దరికము రాదా

చ. 2: పొత్తుల నాపె వుండఁగా బువ్వము నేఁ దొడికితే
హత్తిననగమెంగిలి ఆపెది గాదా
బత్తితోడ నే నీకు పచ్చడము గప్పితేను
తత్తరించి ఇందు కాపె తనలోలో నవ్వదా

చ. 3: తమ్ముల మాపె కిడఁగా తరవాత నేఁ గై కొంటే
ఇమ్ముల ముందువెనక లిందునే కాదా
నెమ్మది శ్రీవేంకటేశ నీవె కూడితి విద్దరి
కమ్మిరనమారతులెల్లాఁ గలగప గాదా

రేకు: 1534-2 రామక్రియ సం: 25-140

పల్లవి: ఏమిటాసన్న యెఱఁగవేమే నీవు
కామించె నిన్ను నతఁడు కదియవే నీవు

చ. 1: యేకతాన నున్న వాఁడు యెదురుచూచీ నీకు
ఆకడ నాతనితో మాటాడవే నీవు
మేకొని నిద్రలేచె మెరసి నీవంక చూచె
ఆకులు వక్కలు జేతి కందియ్యవే నీవు

చ. 2: పిలిచినాఁడు నిన్ను ప్రియముచెప్పీ నీకు
యెలమితో దోమతెర యెత్తవే నీవు
బలిమిఁ బాదాలు చాఁచెపంతములెల్లా రేఁచె
సులభాన నొల్లనే పిలసుకవే నీవు

చ. 3: మనసుపెట్టినాఁడు మరిగివున్నాఁడు నీకు
ననుపుచేసుక కొంత నవ్వవే నీవు
చెనకి సరసమాడె శ్రీవేంకటేశుఁడు గూడె
వొనరి యేపొద్దూఁ బాయకుండవే నీవు

రేకు: 1534-3 మధ్యమావతి సం: 25-141

పల్లవి: ఎనసి యాతఁడు మేము నెట్టుంటి మేమి
చొనిపి నీ కోరికలు చూచుకొనరాదా

చ. 1: విచ్చలవిడి నింకాను విన్నపము చేసుకోవే
పచ్చిదేర పతి నొడఁబరచుకోవే
యిచ్చకము చేసి బాసలెల్లా నిప్పించుకోవే
రచ్చలను మావలపు రవ్వసేయవలదు

చ. 2: ననుపున నాతనితో నవ్వులిట్టె నవ్వవే
చనవున నీమోవి చవిచూపవే
పెనఁగులాడి నీవు ప్రియములు నెరపవే
మనసులు సోదించి మమ్మొరయనేఁటికి

చ. 3: కలసి నీ వాతనిఁ గాఁగిలించుకొనవే
వెలి నుండి నీ యింటివిందు చెప్పవే
అలరి శ్రీవేంకటేశుఁడాతఁ డిట్టె నన్ను నేలె
కలికితనాల మరి కాఁతాళించఁదగదు

రేకు: 1534-4 ఆహిరినాట సం: 25-142

పల్లవి: కనుఁగొనవయ్య యీపెగామిడితనము లెల్లా
తనకుఁదానే వట్టితమి బొరనీని

చ. 1: సందడి నీకాలుదొక్కి సారె సారె నీతో నవ్వి
అందరితో నాడుకొనీ ఆలనంటాను
చెంది నీవు ముడిచివేసినపూవులు ముడిచి
కందువతో మురిసీనికడుదొరనంటాను

చ. 2: పాదుకొన నీవద్దిపనులు చేసి యందరి
సాదించీఁ దా నేలికసానినంటాను
సాదువలెఁ బళ్లెముప్రసాదము తా నారగించి
సోదించి కులము చెప్పీఁ జుట్టమనంటాను

చ. 3: పరగ నీవుగట్టినపచ్చడపురేకు గట్టి
వరుసకు వచ్చీఁ జనవరినంటాను
యిరవై శ్రీవేంకటేశ యెనసితి నిటు నన్ను
పరఁదుక కాఁగిలించీఁ బాయలేనంటాను

రేకు: 1534-5 శుద్ధవసంతం సం: 25-143

పల్లవి: ఎడగొల్లకత్తెవు నిన్నేమి చెప్పేది
అడియాలాలెల్లాఁ జూపే వౌదువే నేర్పరివి

చ. 1: సందడిఁ బెండ్లాడనాపె నరసము లాడఁగాను
కందువ నుండినయాపె కాచుకుండఁగా
యెందుండో వచ్చి నీవు యీతఁడు నామగఁడంటా
అందరిలోఁ గొంగువట్టే వౌదువే నేర్పరివి

చ. 2: యెదురువెట్టినయాపె ఇంటికిఁ బిలువఁగాను
మొదట వచ్చినయాపె ముంచి నవ్వఁగా
పొదిగి నీ కితఁడు పొందనాలు గూడెనంటా
అదనఁ గాఁగిలించేవు అవుదువే నేర్పరివి

చ. 3: పిలిచి తెచ్చినమాపె ప్రియపడి వుండఁగాను
కలసి నాపెను నేనే కలిగుండఁగా
యెలమి శ్రీవేంకటేశుఁ డతఁడు నాపారుగంటా
అలరి చెనకఁజూచే వౌదువే నేర్పరివి

రేకు: 1534-6 శ్రీరాగం సం: 25-144

పల్లవి: తఱి నింతి యే మెఱుఁగు తనయాసోదమే పెంచీ
నెఱవాది వింతటా మన్నించవలెఁగాక

చ. 1: కొసరి కొసరి నిన్నుఁ గొంగువట్టి తీసితీసి
అసురుసులై చెలి యలసీ నదె
వసముగాని పతిని వంచుకొనఁబోతేను
సుసరమా నీవే దయఁజూడవలెఁగాక

చ. 2: పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు చెప్పి చెప్పి
చలిమి బలిమితోను జడిసీ నదె
తలఁపుకొలఁదిగాని తగులమిఁ బెనఁగితే
నలవియౌనా నీవే యాదరింతుగాక

చ. 3: పొదిగి పొదిగి నీపొందు సేసికూడి కూడి
సదమదమ్మై నవ్వు చల్లీ నదె
యిదె శ్రీవేంకటేశ నీ వెనసితి విటుగాక
సదరమా యింకా నీవే చనవిత్తుగాక

రేకు: 1535-1 మాళవి సం: 25-145

పల్లవి: సతులపట్టుకు నింతచండి సేతురా
తతిగొంటి వెటువంటితగవో నీది

చ. 1: మనసు రంజిల్ల నీతో మాటలాడీ నీదేవులు
పనిలేని దిప్పుడేడ పరాకో నీకు
వొనర నప్పటి నీవొడివట్టి తియ్యఁగాను
పెనఁగేవు యెటువంటిబిగువో నీది

చ. 2: యెరవులేక చేతెలెత్తి మొక్కీ నీదేవులు
శిరసువంచే వెంతసిగ్గో నీకు
గరిమ నీ మొగమే కనుఁగొనుచుండఁగాను
తరల వేమిటా నెంతతాలిమో నీకు

చ. 3: కప్పురము మోవిని(కి?) చ్చి కాఁగిలించీ నీదేవులు
ముప్పిరిఁ గూడేవు యెంతమోహమో నీకు
యిప్పుడే శ్రీవేంకటేశ యీకె నిన్ను మెచ్చఁగాను
చొప్పునఁ గొసరే వెంతాసోదమో నీది

రేకు: 1535-2 నాదరామక్రియ సం: 25-146

పల్లవి: ఎంత గుట్టుచేసుకొని యిక్కడ నున్నాఁడవు
చెంత నాపె చెప్పినట్లు చేయఁగరాదా

చ. 1: తేనెపదవుల నీతోఁ దెఱవ మాటలాడె
కానుకవట్టెను చెనుఁగవ నీకును
నానఁబెట్టి సెలవులనవ్వులు నీపైఁ జల్లె
కానిమ్మని యాపెయింటికాడకురారాదా

చ. 2: వెస నీ కొలువు చేసి వినయములెల్లాఁ జూపె
పొసఁగ నిచ్చకములఁ బొందుచేసెను
సుసరవువలపులఁ జుట్టరికము నెఱపె
కొసరీ నాపెవద్దఁ గూచుండరాదా

చ. 3: మక్కువఁ బాదములొత్తి మమ్మములెల్లా రేఁచె
మిక్కిలి రతులఁగూడి మెప్పించెను
చక్కని శ్రీవేంకటేశ సన్నల నొడఁబరచె
చొక్కపునేర్పుల నాపెఁ జొక్కించరాదా

రేకు: 1535-3 రామక్రియ సం: 25-147

పల్లవి: వట్టివిచారములేల వాదు లడువంగ నేల
రట్టడిపతిని చెలు లిట్టె రమ్మనరే

చ. 1: ననచినఁగాని మరి నవ్వు రాదు
పెనఁగులాడినఁగాని ప్రియములేదు
తనిసినఁగాని సంతసముగాదు
చెనకి నప్పుడు గాని సిగ్గు విడదు

చ. 2: బలిమి చేసినఁగాని పంతము రాదు
కలసినఁగాని లోలో కాఁక దేరదు
తలఁచినఁగాని యట్టె తమి రేఁగదు
వలచినఁగాని గర్వము నిండుకొనదు

చ. 3: సరసమాడినఁగాని చవి పుట్టదు
యెరవులేకున్నఁగాని యింపుగాదు
ఇరవై శ్రీవేంకటేశుఁ డెనసె నన్నుఁదానె
సరవితో నున్నఁగాని ముచ్చటలెల్లాఁ బాయవు

రేకు: 1535-4 దేసాళం సం: 25-148

పల్లవి: జాణలై నయట్టివారిజాడ లివి
నాణెమైన పొందు లిటు నడవఁగవలయు

చ. 1: తగవు దప్పకుండితే తగులమి యెడయదు
తెగనాడకుండితేను తియ్యదు ప్రేమ
జగడించకుండితేను జారదు చుట్టరికము
బగివాయకుండితేను భావ మెరపు గాదు

చ. 2: కక్కసించకుండితేను కాఁపురము లీడేరు
వెక్కసము గాకుండితే వేడుక గల్గు
మొక్కలము విడిచితే మునుకొనదు చలము
వొక్కరీతినే వుండితే వుడివోదు ననుపు

చ. 3: పంతాలు చూపకుండితే పాదుకొను మొగమోట
మంతనము గాకుండితే మైకొన దాన
ఇంతలో శ్రీవేంకటేశ యీకె నీవుఁగూడితిరి
చెంతఁ జేచాఁచకుండితే సిగ్గులెల్లా విడవు

రేకు: 1535-5 బౌళి సం: 25-149

పల్లవి: ఎఱఁగమా నీగుణాలు ఇందిరిలోన
మఱవక మమ్ము నిట్టె మన్నించవయ్యా

చ. 1: మంతనాన మాపుదాఁకా మాటలాడి తనియవు
యెంతలేదు నీయాసోద మేమి చెప్పేది
చెంతల గోర గీరినా సిగ్గులువడవు నీవు
ఇంతటి నీవాసిపట్టు యెంచఁగ నేమున్నది

చ. 2: ననుపున నాతోను నవ్వు నవ్వి వేసారవు
పనిపూనినబిరుదుబంట వౌదువు
చెనకి యెంత దూరినా శిరసు వంచుకొనవు
పనుపడ నీపంతాలు పచారించనేఁటికి

చ. 3: కడఁగి నన్నుఁ గూడి కాఁగిటిలో నలయవు
యెడయక నీనేర్పు లెట్టు మెచ్చేది
కడుఁబెనఁగినాను లోఁగవు శ్రీవేంకటేశ్వర
బడిబడి నీపొందు పాయ దెన్నటికి

రేకు: 1535-6 ముఖారి సం: 25-150

పల్లవి: చూపవయ్య నా కాపెను సుదతియెటువంటిదో
పై పై తమక మింత పనిగొనవలదా

చ. 1: యేపున నీ నిమ్మపండు యెవ్వతె కానుకిచ్చెనో
ఆపెమారుగాఁ జూచే వప్పటినుండి
మోపుచు కన్నుల మరమున కద్దుకొనే విదె
యేపొద్దుఁ దరితీపులు యిట్టుండవలదా

చ. 2: యీవేళఁ దామెరపువ్వు యెందు దొరకెనో ఆపె
చే వట్టినట్టు పట్టి చే వదలవు
తావి చూచే వప్పటిని తలపై నిడుకొనేవు
పూవువంటివల పింత పోదిసేయవలదా

చ. 3: వలయపుభరణు లేవల్ల నీకుఁగలిగెనో
కలికిచన్నులమారు కాఁగిలించేవు
అలరి శ్రీవేంకటేశ అప్పటి నన్నేలితివి
కలపుకో లిటువలెఁ గలుగఁగవలదా

రేకు: 1536-1 దేసాళం సం: 25-151

పల్లవి: అన్నిటా జాణఁపై నాఁడు ఆలను నేను
పన్ని తనచిత్తము పట్టనెటు నేర్తునే

చ. 1: యిచ్చకమాడఁగవలె ఇంతులకుఁ బతితోను
పచ్చిగా నవ్వఁగవలె పైకొనవలె
మచ్చరించరాదు మరి మంకులు చూపఁగరాదు
నిచ్చఁదనపొందుసేయ నేనెట్టు నేర్తునే

చ. 2: వూడిగము సేయవలె వొద్దికతో విభునికి
వేడుక సేయఁగవలె విడె మీవలె
పాడిపంతా లెంచరాదు బలిమిఁ దోయఁగరాదు
జాడమీరి తను నెట్టు జరయఁగనేర్తునే

చ. 3: చెనకఁగవలె తానె శ్రీవేంకటేశుఁడు రతిఁ
బెనఁగవలె కాఁగిట బెరయవలె
గునియఁగరా దెఁ(దెం?) తైనా గుట్టు నరపఁగరాదు
మనసిచ్చి నన్ను నేలె మాన నెట్టు నేర్తునే

రేకు: 1536-2 సౌరాష్ట్రం సం: 25-152

పల్లవి: నీపతి బత్తిగలఁడు నే నెఱుఁగుదు
దాపుగ నామాట లివి తలఁచుకోవే

చ. 1: సరసములాడుటే జడిగొన్న మోహము
శిరసు వంచుకొనుటే సిగ్గుఁబాట్లు
గరిమ నవ్వు మిక్కిలి ఘనమైనతరితీపు
సరిచూడవే వలపుజాడ లివి

చ. 2: చెప్పరాని వినయాలే చిత్తములో ఆసలు
తప్పక చూచుటే తగులాయము
వుప్పతిల్లుఁ జెనకులే వుడివోని తమకము
తిప్పరానికాంక్ష లివి తలుచుకోవే

చ. 3: మొగములు చూచుటే మంచినఇచ్చకములు
బగివాయకుండుటే చేపట్టినపొందు
అగపడి నిన్ను నేలె అదెశ్రీవేంకటేశుఁడు
మగనికి నీకు నీమర్మము లెంచుకోవే

రేకు: 1536-3 వరాళి సం: 25-153

పల్లవి: వింటివా నామాట నీవు విభుఁడవు
నంటు నీవు చూపకున్నను నగుఁబాటౌను

చ. 1: యెలమి నాపె నీపై నెంతమోహమోకాని
మలసి మలసి నీతో మాటలాడీని
కలసి మెలసినీవు కడులాలించకుంటేను
నెలకొన్న నేరమినీవొళ్లిదే అందురు

చ. 2: మదిలోన నీకెంతమరిగినదో కాని
పొదిగి పొదిగి నీతో పొందుసేసీని
అదెరిఁగి నీవిప్పు డాకెఁ గూడకుండితేను
గుదిగొన్న మేలాన కూళతన మందురు

చ. 3: యెనసి ఇంతి నీరతి(ని) యెట్టు గూడితివో కాని
తనిసి తనిసి నిన్నుఁ దగ మెచ్చీని
ఘనుఁడ శ్రీవేంకటేశ కరుణ యింతగాకున్న
చనవరితనాననకు చపచపనందురు

రేకు: 1536-4 మాళవిశ్రీ సం: 25-154

పల్లవి: చెలులమునిన్నేమిసేయఁగలము
నెలఁతభాగ్యములెల్లా నీవల్ల నున్నవి

చ. 1: యిందుముఖితో సరసమెంత మీరి యాడినాను
అందుకు ని న్నోఁగాదని ఆడవచ్చునా
మందలించి వలపులు మట్టు పెట్ట వసగాదు
యెందును యీపెకాఁపుర మిదె నీచే నున్నది

చ. 2: వనితను నీ వెట్టు వడి నెలఇంచినాను
పెనఁగి చాయలకు రప్పించఁగలమా
మనసులో తమకము మానుపఁగ నెట్టువచ్చు
వినయాన యీపెమొక్కు వెస నీపై నున్నది

చ. 3: సతిఁ గాఁగిటఁ గూడితి సరవు లేమడిగినా
రతులనేరుపు లేర్పరచఁగలమా
తతితో శ్రీవేంకటేశ తగులు మానుపరాదు
సతమై యీపెకోర్కి నీచనవున నున్నది

రేకు:	1536-5 శుద్ధదేశి సం:	25-155

పల్లవి:	ఎంత వేగిరకాఁడ వేమయ్యా నీవు
చెంత నూరకుండఁగానే సేసలు చల్లేవు

చ. 1:	సెలవి నవ్వులతోడ సిగ్గువడి వుండఁగానే
బలిమి నాపెచన్నులు పట్టితీసేవు
నిలువుఁదమకమున నివ్వెర గందఁగానే
కొలఁదిమీరఁగను గక్కునఁ జెనకేవు

చ. 2:	తగు నీపై తలపోఁత తలఁచుకుండఁగానే
చిగురుఁబెదవి యాని చిమ్మి రేఁచేవు
మొగము చూచి నీపై మోహములు నెరపఁగా
బిగువుఁగాఁగిట నొత్తి పిప్పిసేసేవు

చ. 3:	ముద్దులు గునిపి నీతో ముచ్చటలడఁగానే
అద్దుకొని రతికేలి నలయించేవు
గద్దించి శ్రీవేంకటేశ కన్నుల మొక్కఁగానే
పెదరికానకు సారెఁ బెనఁగులాడేవు

రేకు: 1536-6 వరాళి సం: 25-156

పల్లవి: మఱచితివేమో కాక మగువలనెల్లాఁ జూచి
మెఱయఁగ నీచేతలు మెచ్చనానేను

చ. 1: నెప్పున మాయింటికినిన్నిట్టె విచ్చేయుమని
అప్పుడే చెలిచేఁ జెప్పియంపనా నీకు
కొప్పు దువ్వుకొంటాను కుందనపు మేడమీఁద
చిప్పిలుమోవిని సన్నసేయనా నీకు

చ. 2: మనసులో పాఁ(పాం?) దులు మరి యెచ్చరికగాను
మునుకొని చేతులెత్తి మొక్కనా నీకు
నొనుగకుండా నిన్ను పువ్వులచెండున వేసి
నినువుగా తమియెలా నించనానీకు

చ. 3: పాటించి నాచన్నులు పయ్యద జారఁగ(గఁ?) దీసి
సూటిగఁ గానుకగాను చూపనా నీకు
యీటున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గాఁటపునామేలు తారుకాణించనా నీకు

రేకు: 1537-1 సామంతం సం: 25-157

పల్లవి: అటువంటిది గాకుంటే అఁటదందురా
సటలెల్లా నెరపీని చాటిచెప్పఁదగును

చ. 1: వుంద్దండపుమాట లాడి వువిద చన్నుల నొత్తి
అద్దుకొని నీ కిట్టె ప్రియాలు చెప్పీని
సుద్దు లెంతనేర్చునో సూటిగా నిన్నిట్లానే
తిద్దుకొనె కాఁగిటికి దేవులు గాఁదగును

చ. 2: కాతరించి వొడివట్టి కామిని లోనికిఁదీసి
చేత నిన్నాయము లంటి చెక్కు నొక్కిని
యేతు లెంతవేడుకో ఇటువలె నీముందర
ఆతుమగాఁ జెప్పి ఆకె నీకుఁదగును

చ. 3: సొదువలె నిన్నుఁ బిల్చిసతి మోవి గంటిసేసి
పాదాలకు మొక్కి నీకుఁ బంతమిచ్చీని
పోదితో శ్రీవేంకటేశ బూపతిచెరువుకాడ
ఆదిగొని నిన్నుఁ గూడె ఆకె నీకుఁ దగును

రేకు: 1537-2 మాళవి సం: 25-158

పల్లవి: లకిమమ్మ కాఁగిలిచ్చి లావుల మెచ్చీ
సకలము మేలు సరసము లాడరయ్యా

చ. 1: కొండలపడవనీడ(?) కోరిన చెంచులవాడ
వుండి నవ్వే వౌనయ్య వువిదతోడ
నిండెను వలపు లాడ నీమో మాకె చూడ
పెండిలి మీకిద్దరికిఁ బెనగోనీనయ్యా

చ. 2: గొప్పమాఁకులకోన కురిసేటి నిచ్చవాన
వుప్పతిల్లి చేయివేసే వువిదమేన
చిప్పిలీఁ జెనుటసోనసిగ్గులు లోలో నాన
కప్పెను మీ కిద్దరికిఁ గడుమోహాలయ్యా

చ. 3: భవనాశియేటిదండపడఁతికోర్కులునిండ
జవళి నీవద్ద నందు సంగడిఁ బండ
తివిరి శ్రీ వేంకటాద్రి సుగ్రీవ నారసింహా
వివరించ నిద్దరికి వేడుకాయ నయ్యా

రేకు: 1537-3 బౌళి సం: 25-159

పల్లవి: నంటునఁ గనకగిరి నారసింహా
వెంట వెంట నాకుఁగానే వేడుకపడేవు

చ. 1: చేముట్టి కొలువులోన సిగ్గు విచారించక
నామేను చెన కేవు నడుమ నీవు
కామినులు వసంతము కడు నీపైఁ జల్లరాఁగా
ప్రేమ నాపయ్యదలోనఁ బెనఁగి దాఁగేవు

చ. 2: వొద్దనుండి చెలులెల్లా నూడిగాలు సేయఁగానే
అద్దుక నాతో నవ్వే వప్పటి నీవు
వుద్దంటాన మేనవారు వొడివట్టి తియ్యఁగానే
గద్దరితనాన నన్నుఁ గాఁగిలించుకొనేవు

చ. 3: సంగతి విచారంచక సరిఁ బొరుగువారింట
యెంగిలిసేసేవు మోవి ఇప్పుడే నీవు
చెంగట శ్రీవేంకటేశ జిగిఁ బేరటాండ్లు చూడ
చెంగలించి నామీఁద సేసలువెట్టేవు

రేకు: 1537-4 రీతిగౌళ సం: 25-160

పల్లవి: ఏమయ్యా వేడుకకాని కేడ దోసము
వేమారు నీదేవులకై విన్నవించేఁగాక

చ. 1: సంగడించి మాటాడుతాఁ జవి చూచితివి మోవి
యెంగిలని చూడవద్దాయింతిని నేను
వెంగలితనానఁ దొల్లి వెన్నలుమఁ బాలును
దొంగిలినవాఁడనిదూరుకు నోడేవా

చ. 2: సముకాన నవ్వుతానే సరిఁగాఁగిలంచితివి
చెమటని చూడవద్దా చిప్పిలి మేన
గుమితానఁ జల్లలమ్మే గొల్లతలనేలిన
తమకి వంతేసిదొరతనాలు చూచేవా

చ. 3: అదరించి వేఁడుకొంటా నక్కున నిడుకోనేవు
పాదాలు దీఁకి సిబ్బితిపడఁగవద్దా
కాదనక దధిభాండు (డ?) గంపకిం దీఁగినవాఁడ
వీదెస శ్రీ వేంకటేశ యిందుకుఁ గొంకేవా

రేకు: 1537-5 నీలాంబరి సం: 25-161

పల్లవి: మగనికి నాలికిని మర్మము లివి
తగిలి పాయకుండితే తమకము రేఁగును

చ. 1: పచ్చిమాఁట లాడితేనే భావములు గరఁగును
యిచ్చకము సేసితేనే యింపు వుట్టును
కొచ్చి కొచ్చి కొసరితే గురుతౌఁ జుట్టరికము
వచ్చినట్టే వచ్చితేను వాడికలు గలుగు

చ. 2: వినయము చూపితేనే వెగ్గళించు మోహము
మనసు లెనసితేనే మన్నన లెక్కు
తనువులు సోఁకితేనే తడఁబడుఁ గోరికలు
ననిచి పైకొంటేనే నవ్వులెల్లా వచ్చును

చ. 3: కలుపుకోలు గలితే కాఁపురము లౌనరును
తలఁపు సరిదాఁకితే తగులుఁ గాంక్ష
యెలమి శ్రీ వేంకటేశ యింతి నేలితివి నీవు
చలివాయఁ గూడితేనే చవులౌను రతులు

రేకు: 1537-6 శంకరాభరణం సం: 25-162

పల్లవి: ఇంకా నేల చలము యేమి సేయఁగలము
అంకెకు వచ్చెను అధరామృత ఫలము

చ. 1: కలికి వనాలనీడఁ గడు నీ కెదురుచూడ
కులుకునవ్వులతోడఁ గొప్పు వీడ
చెలులెల్లాఁ జాచేరు జిగిఁ గౌను లసియాడ
బలిమిఁ జేకొనవయ్యబత్తితోఁ గూడ

చ. 2: సతి నీపాదాలు మెట్ట చన్నులు నీవు ముట్ట
తతి నిన్ను నిదె దిట్టతనాలఁదిట్ట
అతివలు సొలసేరు అంగాలఁ జెమట దొట్ట
సతతము మెచ్చవయ్యా జాణలు చేపట్ట

చ. 3: జలజక్షి నీపక్క సరసముల వేచొక్క
తలపోసీఁ దనచక్కఁదనాలు నిక్క
లలి శ్రీ వేంకటేశ నీలలన నీకు మొక్క
కలకాల మేలు మిక్కడ రతికెక్క

రేకు: 1538-1 ముఖారి సం: 25-163

పల్లవి: నాకుఁ గానవచ్చీ నీనటనలెల్లా
నీకుఁ జూడ నన్నియును నేరుపులై యున్నవి

చ. 1: తలకొని నాదిక్కు తప్పకచూచేవు గాని
తలఁపులో వేరొకతె తగిలున్నది
మలసి నిజాలకును మాటలు నాడేవుగాని
యెలమి నీకోరికలు యెక్కడనో వున్నవి

చ. 2: నడుమ నూరకె నాతో నవ్వులు నవ్వేవు గాని
అడరినవలపు విఁ(విం?) తై వున్నది
జడిగొని నాపైఁ జేయి చాఁచఁగ వచ్చేవుగాని
చిడుముడితమి వలసినచోట నున్నది

చ. 3: గట్టిగా నీకాయము నాకాఁగిట నున్నది గాని
చుట్టరికములెల్లాఁ జుట్టుకొన్నది
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్నేలితిగాని
రట్టడిపంతాలు రతి నిట్టె పాయకున్నవి

రేకు: 1538-2 మాళవిగౌళ సం: 25-164

పల్లవి: వట్టిసటలు సేసేవు వద్దికి రమ్మనుచును
పట్టి నేఁబెనఁగితేను పరాకు మానేవా

చ. 1: మన్ననగలసతితో మాటలు నీవాడఁగాను
విన్నపము నేఁ జేసితే వినేవా నీవు
సన్నలాచాయలా నాపె సరి నెలయించఁగాను
యెన్ని కానుక లిచ్చినా యిక్కడ చూచేవా

చ. 2: పిలిచితెచ్చినాపెతో బెరసి నీవు నవ్వఁగా
కలయ నే వచ్చితే కాఁగలించేవా
నిలుచుండి కొలువున నిన్నాపె యెలయంచఁగా
వలపు నేఁ జల్లితేను వసమయ్యేవా

చ. 3: జంగఁ గూచుండినఇంతిచన్నులు నీవు ముట్టఁగా
ఇంటికి రమ్మంటే నీ కితవయ్యీనా
అంటి నన్నుఁ గూడితివి అంతలో శ్రీవేంకటేశ
వొంటినెంతజంకించినా వొడఁబడడేవా

రేకు: 1538-3 దేసాళం సం: 25-165

పల్లవి: నీకొలఁది వారలా యీనెలఁతలెల్లా
నీకు నిదె చాలుగాదా నిమ్మలాన నుండవే

చ. 1: యేల నివ్వెర గందేవే ఇంతులనెల్లాఁ జూచి
అలరీఁ డీతని కెంద రాండ్లంటాను
జాలిఁబడ నేమిటికి సవతులతో నెల్లా
నాలిసేయ కాతఁడు నవ్వీనంటాను

చ. 2: యేమిటికి యేఁకరేవే యెవ్వరైనా నీతనితో
ఆముకొని సరసము లాడేరంటాను
మోము శిర సేలూఁచేవే మునుకొని దేవుళ్ళకు
వోముక యీతఁడు విడే లొసఁగీనంటాను

చ. 3: అదేల ముక్కుపై వేలంటుకొనేవే ఇందరు
ఇదె యీతనిపొత్తున నెనసేరంటా
అదన శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్ను నేలె
పదరకువే యీతఁడు పచ్చిదేరీ నంటాను

రేకు: 1538-4 కాంబోది సం: 25-166

పల్లవి: అప్పటితారుకాణ లౌనో కావో
తప్పక యీగురుతులు తలఁచుకో నీవు

చ. 1: ఇందాఁకా మాటలాడె యెరవులేక నీతో
యెందుండి వచ్చె నాపె యేమో నీకు
మందలించి యావేళనే మరీ నొక సోద్యము
అందుకొంటి వీడెము అపెచేత నీవు

చ. 2: కామించి చెక్కులు నొక్కి కదుఁ బాదాలకు మొక్కి
యేమికివీడుకొనె నీపె నిన్ను
దీమసాన నప్పటిని తేటపడె వేరొకటి
కోలమపుమోవి చవిగొంటివి సారెకును

చ. 3: సన్నలే సేసీ (సె?) నాపె సముకాన నుండి నీతో
యెన్నిక లెట్టివి కూట మెన్నఁ డబ్బెను
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పన్ని రతిఁ జొక్కిళి వాపడఁతిసేఁతలకు

రేకు: 1538-5 బౌళిరామక్రియ సం: 25-167

పల్లవి: మగువరో యీగతినే మగని వలపించవే
జిగి మఱవకుమీ నేఁ జెప్పినయీబుద్ధులు

చ. 1: మనసు లెనసితేను మాటలెల్లాఁ జపులౌను
ననుపు గలిగితేను నవ్వులు వచ్చు
చనవుమెరసితేను సంగాతము లీడేరు
వినయము చూపితే వేడుకలౌఁ బొందులు

చ. 2: అడియాసలు మించితే ఆయములు గరఁగును
యెడవాయకుండితేను హెచ్చు లంకెలు
వుడివోనిప్రేమలైతే వొనరుఁ దలపోఁతలు
అడరుఁ జుట్టరికములైతే నింపు లెసఁగు

చ. 3: విచ్చన విళ్తైతేను వలెయుఁ దమకములు
ముచ్చటలు నెరపితే ముంచుఁ గళలు
ఇచ్చట శ్రీవేంకటేశుఁడేలే నిన్ను నింతలోనె
పచ్చిదేరఁ జెనకితిఁ బరగును రతులు

రేకు: 1538-6 పాడి సం: 25-168

పల్లవి: రచ్చలోఁ బెనఁగుదురా రామలతోడ
యిచ్చెరిఁగి కలసితే నింతులు వలతురు

చ. 1: యిక్కడనేల చెనకీ నింకి రమ్మనవే
చెక్కు నొక్కి తనసేవ చేసే నేను
మొక్కళపుఁదనమేలే మొగవాఁడైన వానికి
కక్కసించకుండితేనే కాంతలు వలతురు

చ. 2: దిగ్గనఁ గొంగేల పట్టీ తెరవేయుమనవే
బగ్గన నొంటినే వొడఁబరచే నేను
వెగ్గళించనేఁటికే వేడుకగలవానికి
సిగ్గుతోడ నుండితేనే చెలులు వలతురు

చ. 3: చన్నులేల పిసికీఁ బచ్చడము గప్పుమనవే
విన్నవించి వేడుక గావించే నేను
అన్నిటా శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
సన్నలఁదా నవ్వతేనే సతులు వలతురు

రేకు: 1539-1 ముఖారి సం: 25-169

పల్లవి: ఆనతియ్యవయ్యా నాకు నాసుద్దులు
తానకమై ఇందాఁకాఁ దలపోసుకొంటిని

చ. 1: చెలఁగి నిన్నాపె చూచి సెలవుల నవ్వఁగాను
తెలయక నిన్నడిగేఁ దెల్లమిగాను
బలిమి నప్పటి గాపెపైఁ జేఇవేయఁగాను
నిలుచుండి నాలోనే నివ్వెర గందితిని

చ. 2: సారెసారె నాపె నీతో సన్నలు సేయఁగాను
కారణాలు విచారించ గడగడల
మేరమీరి నీతోమరి మేలము లాడఁగాను
ఆరీతినే సంతోసించే నందుకే నేను

చ. 3: గక్కన నాపె నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
చొక్కి పొంతనాలు చూచే సారిది నేఁడు
ఇక్కడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితిని
పెక్కులాగుల నిందుకే ప్రియమందే నిపుడు

రేకు: 1539-2 కేదారగౌళ సం: 25-170

పల్లవి: ఏమి చెప్పేది నీభాగ్య మిన్నిటా రమణుఁడ
దోమటి మిమ్ముఁ జూచి సంతోసమాయ నాకు

చ. 1: మొక్కలానఁ దనచనుమొనలు నీవీఁపు సోఁక
చిక్కుదీసీ నీనెరులు చెలియ
వెక్కసపుఁ గొప్పులోని విరులు నీపై రాల
నిక్కి కుంచెవేసీని నీపైఁ గేలు చాఁచి

చ. 2: కందువతోఁ దొడాఁ దొడాఁ గదియ నీవద్ద నుండి
గందము వూసీ నీకుఁ గలికి
చిందేటిచెమటనీటి చిత్తడి నీమేన నంట
చెంది సొమ్ములెల్లాఁ బెట్టి సింగారించీ నీకును

చ. 3: చలువమోవితీపువాసన నీముక్కున నిండ
తిలకము ను దిద్దీఁ దెఱవ
కలసితి నన్ను శ్రీ వేంకటేశ బేఁటెరాయ
అలమీఁ గాఁగిట నాపె నాయములు గరఁగా

రేకు: 1539-3 పాడి సం: 25-171

పల్లవి: తేరిచూడు మిదివో నీదేవులదిక్కు
సారెసారెఁ దనమోవిచవులు చూపీని

చ. 1: పొంచి నీమోము చూచీ పొలఁతిఁతల
వంచి సిగ్గులు పచరించీ నదె
పెంచీ నాసలుఁ గడుఁబ్రేమమున లోలో
నించీ సెలవులను నిండునగవులు

చ. 2: సొలసి మాఁటలాడీ సుదతిఁ నీతోఁ
గలసి మెలసి యాడి యలసీ నదె
మలసీనీముందురను మంతనానను
వలసినట్ల నీపై వలపు చల్లీని

చ. 3: పొంది నీకాఁగిటను పూఁబోణి
చిందీఁ జెమట లంది యంది
చెందితి విటు నన్ను శ్రీవేంకటేశ్వర
సందినుండి తాను చనవు సేసీని

రేకు: 1539-4 సామంతం సం: 25-172

పల్లవి: ఇంత వొలపక్షపాతి వెట్లైతివి
బంతినే నామీఁదఁ గడుఁబత్తిసేసే విపుడు

చ. 1: వేడుకతో నేకతాన విన్నవించిన నామాట
లాడుకొంటివా అపుడే ఆకెతోడను
వీడెము నే నిచ్చినది వెస నాకెవొడిఁ బెట్టి
యీడ నామొగము చూచే వేమిగట్టుకొంటివి

చ. 2: యేపుననీవురమున నిటు నే మెత్తినకస్తూ
రాపెకుఁ బెట్టితివా అపుడే నీవు
మాపుదాఁకాను ఇంటిలో మగువఁ బెట్టుకవుండి
యీపొద్దు నన్నుఁటవచ్చే వేమనేది నిన్నును

చ. 3: ప్రేమమున నీతోనేను పెండ్లాడినగురుతు
కామినికిఁ జూపితివా కానుకగాను
ఆముకొని శ్రీవేంకటాధిప నన్నేలితివి
దోమటి నిద్దరికిఁ గాంతుఁడ వైతి విపుడు

రేకు: 1539-5 కాంబోది సం: 25-173

పల్లవి: ఏమి చెప్పేరే యెమ్మె లెందాఁకా మాతో
వేమరు నవ్వినదే వేడుక సరసము

చ. 1: పగటున వనితలు పదివేలు గలిగినా
మగఁడుచేపట్టినదే మరి దేవులు
తగిలి యన్నిటా వేగుదాఁకా నొడఁబర చినా
అగపడి చెల్లుబడియైనదే మాట

చ. 2: కొలువులు సేసియెంత కూరిములు గోసరినా
పిలుపు గలిగినదే ప్రియము
కలపుకోలున నెంత కాఁపురము సేసినాను
సలిగెతోడిదే సతమైన మన్నన

చ. 3: జమళిపొంతనాలు సారె నెంత గూడినాను
తమిగలిగినదే తగులాయము
గుమిగా నిన్ను నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
సమరతివిభవాలే చవులకుఁ జవులు

రేకు: 1539-6 పాడి సం: 25-174

పల్లవి: ఇంకనేల నిన్ను నేరా లెంచ నేను
కొంకుదేరి లోంగితేను కూళతనము

చ. 1: మచ్చిక గలిగితేను మంచిమాఁట లాడవలె
కుచ్చితము నెరపితే కూళతనము
యిచ్చకమే వలసితే యెరవు లేకుండవలె
కొచ్చి కొచ్చి కొసరితే కూళతనము

చ. 2: పొందు లోన గూడితేను భోగించి చొక్కఁగవలె
గొంది నలుగఁగబోతే కూళతనము
చందములైతేసరసములాడవలెహెచ్చు
కుందులు వెదకఁబోతే కూళతనము

చ. 3: నెట్టనఁ గూడేవేళనేరుపు చూపఁగవలె
గుటు చేసుకుండితేను కూళతనము
అటుగా శ్రీవేంకటేశ యిట్టె నన్నేలితివి రా
కొట్టు లిఁకనెగ్గులంటే కూళతనము

రేకు: 1540-1 లలిత సం: 25-175

పల్లవి: వాకిట నందరుండఁగా వడిగా లోనికివేఁగి
యేక తాన నున్నపతి నెట్టు చెనకితివే

చ. 1: పాయకవిభునివద్దఁ బాదములొత్తితివా
ఆయములు గరఁగెనా అట్టె నీకు
యీయెడ వినవేడుకయ్యీ నింకానాతోఁ జెప్పవే
చేయి మీఁదాయ నీఁకసిగ్గువడనేఁటికి

చ. 2: మనసారా నాతనీతో మాట నీవాడితివా
తనివిఁ బొందితివా తలిమితోడ
నినుఁ జూచి వెరగయ్యీ నిలువవే నామందుర
చనవరి వైతివి సట లీఁక నేఁటికి

చ. 3: శ్రీ వేంకటేశ్వరు సేవలెల్లాఁ జేసితివా
నీవలపు లీడేరెనా నిమ్మలానను
యీవల నన్నుతఁ డేలె నిట్టె కనుఁగొనవే
నీవే సవతి వైతివి నేఁడు లోఁగనేఁటికే

రేకు: 1540-2 మంగళకౌసిక సం: 25-176

పల్లవి: ఎటువంటి జాణవైతి విదివో నీవు
తటుకన నవ్వినవ్వి తనియ వాసోదమా

చ. 1: అంగవించి నాచేత నందరూ వినఁగాను
వెంగెము లాడించుకొను వేడుకా నీకు
కొంగువట్టితియ్యఁగాను కోపగించి నే నిన్ను
జంగిలితిట్టు దిట్టితే సంతోసమా నీకు

చ. 2: వెనుకొని నీకొప్పువీడినందాకా నాచే
పెనఁగులాడించుకొను ప్రియమా నీకు
కొనగోరు సోఁకి నీమై కుమ్మెలు నాటఁగా
చెనకించుకొన నంత సింగారమా నీకు

చ. 3: దిట్టవై నాచేతను తేనెగా రేనిమోవి
ఇట్టె గంటిసేయించుకో యితవా ను
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
గుట్టుతోడ నింతసేయఁ గోరికా నీకు

రేకు: 1540-3 ఆహిరి సం: 25-177

పల్లవి: ఏల సిగ్గులువడేవు యేమిటికి లోఁగేవు
కాలుదొక్కఁగా నిన్నుఁ గాదుకూడదనేమా

చ. 1: ననుపుసేసుక నాతో నవ్వులు నవ్వేవాఁడవు
వొనరఁ బొందుసేయఁగా వొద్దనేమా
తనివోక దిష్టించి తగులఁ జూచేవాఁడవు
పెనఁగులాడఁగాను తప్పించుకొనేమా

చ. 2: మక్కువలు చూపి మోపి మాటలాడేటి వాఁడవు
పక్కకు రాఁగాను చేపట్టకుండేమా
అక్కరతో నాకు నింత ఆసపడేటివాఁడవు
ఇక్కువ లంటఁగా నీకు నెదురాడేమా

చ. 3: చలపట్టి నామోని చవులడగేవాఁడవు
మలసి పెండాడఁగాను మారుకొనేమా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నేఁడు
వెలయ మన్నించఁగాను వింతగాఁ జూచేమా

రేకు: 1540-4 శుద్ధవసంతం సం: 25-178

పల్లవి: అన్నిటాను కడుజాణ వౌదువే నీవు
సన్న లాతఁడు చేసితే జంకించేవు నీవు

చ. 1: కాటుకకన్నులఁ జూచి కడుసొలసిసొలసి
మాటాడనేతువౌనే మగనితోను
నీటున నప్పటి నుండి నిన్నాతఁడు వేఁడుకోఁగా
పాటించినీ వెంతవొడఁబరచేవేకమ్మటి

చ. 2: జవ్వనపుసింగారముసారెసారెఁ గురియుచు
నవ్వున నవ్వనేరుతువే నాథునితోను
పువ్వుల నాతఁడు నిన్నుపూఁచిపూఁచివేయఁగాను
మువ్వంకానొడ్డించుకొంటా మొక్కేవేమే నీవు

చ. 3: వెలలేనివలపులు వేమారుఁజల్లిరతులఁ
గలయనేర్తువే శ్రీవేంకటేశుతోను
చెలరేఁగి సేస లాతఁడువెట్టంగా
నిలిచియిచ్చకమెంతనెరపేవేనీవు

రేకు: 1540-5 కాంబోది సం: 25-179

పల్లవి: ఇట్టుండవలదా యిద్దరికి సంతోషాలు
మట్టుమీరి తలపోఁత మఱవలే రెపుడు

చ. 1: యెన్నటిపొందులో కానియీకెకు నాతనికిని
సన్నలా చాయలా మోవి చవిగొనేరు
ఇన్నిటాను పొంతనాలె యెట్టు గూడెనోకాని
పన్నిన తమకములఁ బాసి వుండలేరు

చ. 2: తగుల మెట్టిదో కాని తనకునుఁ దనకును
పగటున మోములు తప్పక చూచేరు
మొగి నోఁచిననోములు మున్నిటి వెట్టివోకాని
నగవులే పెంచక మానఁగజాల రిదివో

చ. 3: వేడు కెట్టిదో కాని శ్రీవేంకటేశ్వరు కింతికి
వోడక రతికళల నుల్లసించేరు
కూడిననేరుపు లెంత గురులు సోఁకెనోకాని
జోడయినకాఁగిలి యెచ్చోటా విడువరు

రేకు: 1540-6 భైరవి సం: 25-180

పల్లవి: నీకింతయేలె వెఱవు నీకు మగఁడాతఁడు
చేకొని నీచనవెల్లాఁ జెల్లించురాదా

చ. 1: చీటికి మాటికి నీవు సిగ్గులు వడేవుగాని
నాటుకొనఁ బతితోను నగరాదా
కూటమి గోరి సంగడిఁ గూచుండ లోఁగేవుగాని
వోటలేక కుచముల నొరయ రాదా

చ. 2: చనవులా మనవులాసాదించవచ్చేవుగాని
మనసిచ్చి యాతనితో మాటాడరాదా
తనియక మోవి చూచి దప్పులు దేరేవుగాని
వినయానఁ దములము వేఁడుకోరాదా

చ. 3: అలపులా సొలపులా ఆయాలు ముట్టేవుగాని
పిలిచి శ్రీవేంకటేశుఁ బెండ్లాడరాదా
బలిమి నన్నిటా నొడఁబరచుకొంటివిగాని
మలసి రతుల నిట్టె మన్నించుకోరాదా

రేకు: 1541-1 రామక్రియ సం: 25-181

పల్లవి: చూచేవారికెల్లాను చూడఁ గొత్తలు
యేచినమీమహిమలు యేమిచెప్పే దపుడు

చ. 1: గందము నీవు చల్లఁగా కాంత సరసమాడఁగా
చందమామ మీచేఁతలు సరికి బేసి
విందునీ కాపె చెప్పఁగా వెస నీ వియ్యకొనఁగా
ఇందరిలో మీసంతోసా లేమి చెప్పే దపుడు

చ. 2: ఆయములు నీవంటఁగా ఆపె నవ్వులు నవ్వఁగా
చాయకు వచ్చె వలపు సాటికి బేటి
కాయ మాపె వొరయఁగా కన్నుల నీవు చొక్కఁగా
యీయెడ వినోదము లేమిచెప్పే దపుడు

చ. 3: సరుగ నీవు గూడగా చన్నుల నాపె వొత్తగా
ఇరవాయ సమరతు లీడకు నీడు
సరి శ్రీ వేంకటేశ్వర సన్నలు మీలోఁ జేయఁగా
యెరవులే దెరిగితి మేమి చెప్పేదపుడు.

రేకు: 1541-2 దేసాళం సం: 25-182

పల్లవి: ఎంతరాజసము చూపే వీకెయెదుట
చెంతలనే మమ్మును చిమ్మిరేఁతురా

చ. 1: కొండలెక్కి నీకుఁ జనుఁగొండలు చూపీ మారు
గొండపై నుండిన నీకుఁ గోమలి
రెండుచేతులుఁ జాఁచి కూరిమి నందు కొనరాదా
అండనున్న లకిమమ్మ నలఇంతురా

చ. 2: పండుండి నీకు మోవిపండు చూపి యెలఇంచీ
పండువెన్నెలబయట పడఁతి
నిండునీవదనమున నక్కించి చేకొనరాదా
మెండైనలకిమమ్మతో మేకుసేతురా

చ. 3: కొనబుఁదనాన గోరికొన చూపీ పెండ్లిసేసు
కొనవవలెనని నీకుఁ గోమలి
యెనసితివి శ్రీవేంకటేశ నీ వౌభళేశుఁడ
ననరాదా లకిమమ్మ కటు మాటదాఁతురా

రేకు: 1541-3 మాళవి సం: 25-183
పల్లవి: నన్ను నేలినాఁ డితఁడు నరసింహుఁడు
అన్నిటాను జాణఁడు ప్రహ్లాదనారసింహుఁడు
చ. 1: నగవులవాఁడుగదె నరసింహుడు
వెగటులేనివాఁడు వీరనరసింహుఁడు
నగముపైనున్న వాఁడు నరసింహుఁడు
అగపడె మనకుఁ బ్రహ్లాదనరసింహుడు
చ. 2: ననవిలుతునితండ్రి నరసింహుడు
కనకపుకాశ(సె?) వాఁడు గజనరసింహుడు
ననుపుపొందులు సేసే నరసింహుఁడు
అనిశము బాయడు ప్రహ్లాదనరసింహుడు
చ. 3: నాతో సరసమాడీ నరసింహుఁడు నా
చేతికి నుంగరమిచ్చె శ్రీ నరసింహుడు
యేతుల శ్రీవేంకటాద్రి నిదే యహోబలమున
ఆతుమలోఁ బాయఁడు ప్రహ్లాదనరసింహుఁడు

రేకు: 1541-4 సామంతం సం: 25-184

పల్లవి: ఊరకె వున్నాఁ డదె వోపిక చూపఁగవద్దా
నేరుపున నామాట నిజపట్టుఁగాని

చ. 1: సరసమాడేటివాఁడు సంగడికి రావలదా
సొరిదినాగోరిలావు చూచుఁగాని
పొరుగున నున్నవాఁడు పోరచి యడుగవద్దా
సరుస నామోవితీపు చవిచూచుఁగాని

చ. 2: యెమ్ములు సేసేటివాఁడు యెదుటనే వుండవద్దా
కమ్మటి నాచేఁతలెల్లాఁగనుగొనుఁగాని
దిమ్మరీఁ డయినవాఁడు తిరుగ మాటాడవద్దా
దొమ్మి నాగబ్బితనము తోడ వినుఁగాని

చ. 3: కలసి కూడేటివాఁడు కాఁగిలించుకొనవద్దా
తిలకించి నావలపు తెలుసుఁగాని
యెలమి శ్రీవేంకటేశుఁడింతలోనె నన్ను నేలె
బలిమిఁబెనఁగవద్దా పచ్చిదేరుఁగాని

రేకు: 1541-5 బౌళి సం: 25-185

పల్లవి: ఎంచుకొమ్మా నీకునీవే యీతగవులు
మంచితనానఁ జెలిని మన్నించవయ్యా

చ. 1: వంతులకు వాసులకు వనితలు సొలచితే
వంతమాడిరంటా యెగ్గుపట్టఁదగునా
వింతలుగాఁ దీగెలు వసంత కాలానఁ జిగురు
యెంతపెంచినా నందు కిచ్చగించవలదా

చ. 2: ననుపై నరమణులు నవ్వులెంత నవ్వినాను
ఘన గర్వములంటాను కాదందురా
యెనసి వానకాలాన యేరులు మించిపారితే
యెనలేనివేడుకతో నీఁదులాడవలదా

చ. 3: రతివేళ వనితలు రాఁపు నిన్నుఁజేసితేను
తతిగొని నీవూఁ గడుఁదమకింతురా
క్షితి నాఁడుఁగోవిలలు చెలఁగి యెంత వుండినా
సతమై శ్రీవేంకటేశ సారె వినవలదా

రేకు: 1541-6 మాళవి సం: 25-186

పల్లవి: మాపుదాఁకా మాటలేల మాతోఁ జాల
పైపై నున్నది నీపై నిదెవోలా

చ. 1: చెలిఁ గొంగువట్టి తీసి చేయిమీఁదఁ జేయివేసి
యెలమి వలపురేఁచే వెగపోసి
మెలుపునఁ జందురుఁడు మీమీఁద వెన్నెల గానీ
కలయరాదావిభుఁడ కలికిని డాసి

చ. 2: మగువయిల్లు చొచ్చి మచ్చికలఁ జనవచ్చి
నగవులునవ్వేవు నడుమఁ గొచ్చి
పగటున వలరాచలబలము పొఁజులై వచ్చీ
జగడము మానరాదా జవరాలిమెచ్చి

చ. 3: రమణిఁగాగిఁ గూడిరతులనే వసివాడి
తమితోమన్నించితివి తగు నీవాడి
నమమై శ్రీవేంకటేశ చల్లగాలి విసరాడీ
చెమట లార్చుకోరాదా సిగ్గులువీడి

రేకు: 1542-1 రామక్రియ సం: 25-187

పల్లవి: నేమా విన్నవించితిమి నీచిత్తము
కామినిభావము చూచి కరుణించు మిఁకను

చ. 1: అడయాసఁ గొంతవద్దు అట్టె నీవు వచ్చేవనే
తడఁబాటుతోడి చింత గొంతవొద్దు
యెడమాట లాడించే ఇంకాఁ బొద్దు జరపే
బడలెఁ జెలియ ఇఁకఁ బట్టలేదు మనసు

చ. 2: వేడుకలఁ గొంతవొద్దు వెస నీ కెదురుచూచి
కూడేనని తమితోడఁ గొంతవొద్దు
పాడుచు నీపైఁబాటలు బలుమారు వొద్దువుచ్చె
వోడక గుట్టుననుండి వోర్వలేదు తాపము

చ. 3: వినుకలిఁ గొంతవొద్దు వేగ నీవు మన్నించి చే
కొని కాఁగిలించఁగాను కొంతవొద్దు
యెనసితివి శ్రీవేకేంటేశ ఇంతలో నీకెను
తనిసె నిన్నిటా నిఁకఁ దడవదు నేరమి

రేకు: 1542-2 మాళవిగౌళ సం: 25-188

పల్లవి: ఇంకా నేమి గడమే ఇంతిరో నీకు
అంకెలను పతిపురమందు నిలిచితివే

చ. 1: అతనినీసొమ్ముగాను అన్నిటానునోమితివే
కాతరాన నిందులకే కాచితివౌనే
చేతులెత్తి మొక్కి చేకొంటివే మనసు
యీతల నీవును మా యీడుకు వచ్చితివే

చ. 2: నిక్కుతానే వలపులు నీసొమ్ము సేసుకొంటివే
దక్కఁగొని మగనితోఁ దతిగొంటివే
వెక్కసాన నిట్టె వెంటవెంటఁ దగిలితివే
నెక్కొని మావలె నన్నీ నేరుచుకొంటివే

చ. 3: పొంచి శ్రీవేంకటేశుకే పొంతనాలు గూడితివే
కొంచక ఆసలకెల్లా గురియైతివే
యెంచఁగనీతఁడే మమ్ము నేలినవాడుఇంతలోనే
పంచల మాకుఁగా విన్నపములూఁ జేసితివే

రేకు: 1542-3 సౌరాష్ట్రం సం: 25-189

పల్లవి: ఏమీ నెఱఁగనికన్నె నింతసేతురా
కామిని ననుచు నెట్టు కనుగొనవచ్చునే

చ. 1: నేరుపుననే వచ్చి నీకుఁగలవలపెల్ల
దారకానఁ దోడాపెకుఁ దగిలించితి
పోరచిగా నీతోను పొందుసేసే వారికెల్లా
యేరీతి సేతువో నిన్ను నెట్టు నమ్మవచ్చునే

చ. 2: మంచిమాటలెల్లా నాడి మగువను నీమగని
కంచము పొత్తు నెట్టు కలపితివే
పొంచి నీచుట్టరికానఁ బోరలేటి వారికల్లా
యెంచుకొని మఱి యింకా నేమిసేతువో

చ. 3: చే వట్టుకొని వచ్చి శ్రీవేంకటేశ్వరునిఁ
దోవ రాకుండాఁ బాదము దొక్కించితివి
వావిరినీపొరుగులవారినెల్లా నీతనితో
చేవమీరిపెండ్లిడు సేతువమ్మా యిపుడూ

రేకు: 1542-4 కురంజి సం: 25-190

పల్లవి: మఱి యేఁటివిన్నపాలు మాపుదాఁకాను
నెఱితనాన మొక్కఁగా నీచిత్తమిఁకను

చ. 1: వేమారు నే వేడుకోగా వెరపు దెలిసె నీకు
గామిడి వైతివి నిన్ను గరగించేనా
దోమటి సతులతో నే దోసిటిపాలపెండ్లి
నీమీఁదఁ జన్నగా నీ చిత్తమికను

చ. 2: సరసములాడుఁ(డఁ)గాను చలివాసె నీ కిన్నిటా
గొ౯రబైతి వెందుకైనాఁ గొ౦క జూచేవా
దొ౯ర సతుల లోన తోడుగూడఁ జెనకగా
నిరతి మేటి విన్నిటా నీ చిత్తమిఁకను

చ. 3: గక్కన నిన్నుఁ గూడగా కందువలెల్లాఁ దెలిసె
యెక్కువైతి విన్నిటా నీ వ్రవయ్యేవా
మక్కువ శ్రీ వేంకటేశ మన్నన దేవుళ్ళలో
నిక్కపుమేలు గంటి నీ చిల్లమిఁకను

రేకు: 1542-5 నాదరామక్రియ సం: 25-191

పల్లవి: ఎంత దంటతనమయ్యాయీయింతికి
బంతిని యితవేకాక బలిమి చూపీనా

చ. 1: కెలయుచు నింతి నీతో కేరికేరి నవ్వనా
సెలవుల మీదనే చిందుగాక
చెలరేఁగి చెలరేఁగి చేయిచాఁచి పెనఁగినా
కొలఁదివాఁడి కొనగోరి వాఁ(వ్రాఁ?) తగాక

చ. 2: బిరుదులు పచరించి బెట్టిమాఁట లాడినా
వొరయుచుఁ బెదవుల నొయ్యనేకాక
సరసములాడుతాను సంగడిఁగూచుండినా
వురముమీఁద నెక్కి వుండుగాక

చ. 3: సిగ్గులు విడిచి నిన్నుఁజెయివట్టి తీసినా
వొగ్గి నీసాదాలసేవ నొనరుఁగాక
నిగ్గుల శ్రీవేంకటేశనీవు నాపెఁ గూడితిరి
వెగ్గళించి లోఁగినా వియ్యమందీఁగాక

రేకు: 1542-6 వరాళి సం: 25-192

పల్లవి: మూలనున్న వారినేల ముంగిట నేసేవు; నిన్ను
తాలిమితోఁ దడవితే తడవరాదా

చ. 1: శిరసువంచినయోపెఁ జెనకేవు సారె సారె
వరుస నీతో నవ్వవచ్చెనానేఁడు
మరిగి నుండఁగా మరికొంగువట్టేవు
అరుదుగ సరసములాడవచ్చెనా

చ. 2: పంతముతోనున్న యోపెఁ బలికించవచ్చేవు
వంతులకు ముచ్చటాడవచ్చెనా నీతో
చింతతోడ నుండఁగాను చెక్కులునొక్కేవునీవు
కాంత నీతోఁ బెరఁగఁగవచ్చెనా

చ. 3: ఆకుమడిచియ్యఁగానట్టె కాఁగిలించితివి
యీకడ మందెమేళాన కిటు వచ్చెనా
చేకొని మన్నించితివిశ్రీవేంకటేశ్వర
దాకొని నిన్నిందాఁకాఁ దమకించవచ్చెనా

రేకు: 1543-1 ముఖారి సం: 25-193

పల్లవి: ఇంతికి నీకుఁ దగవులిదివో చెప్పేము నేము
రంతుసేయరాదుగాని రవ్వసేయవచ్చును

చ. 1: తెగనాడరాదుగాని తేనెగారే మోవి నిన్ను
తెగడి తెగడి ఇట్టె తిట్టవచ్చును
నగవద్దుగాని నీనటనలు పచారించి
వెగటు లేకుండానువెంగమాడవచ్చును

చ. 2: జంకించరాదుగాని సతికినీతిరుమేను
అంకించికొనగోర నంటవచ్చును
మంకు చూపవద్దుగాని మనసిచ్చి యన్నిటాను
కంకిసేసిరతులనుకాఁగిలించవచ్చును

చ. 3: వేసరుకోరాదుగాని వేడుకతోనిన్నుఁగూడి
ఆసచూసి సన్నలు సేయఁగవచ్చును
యీసు లీక వద్దుగానియిట్టెశ్రీవేంకటేశ
సేసవెట్టి కూడెఁ జెలి చేరి మెచ్చవచ్చును

రేకు: 1543-2 నాదరామక్రియ సం: 25-194

పల్లవి: ఎప్పుడును నీవోజలేల మానేవు
చిప్పిలు వలపు లింత చిమ్మిరేఁచెఁగాక

చ. 1: చలపాదివాఁడవౌత సారెకు నే నెఱఁగనా
బలుతమకానఁ గొంగువట్టితిఁగాక
పిలిచితే నివెప్పుడు బిగిసేది యెఱఁగనా
పెలుచుఁదమకమునఁ బేరుకిఁగాక

చ. 2: మాయదారివాఁడవౌత మలసి నే నెఱఁగనా
నాయము నడపేనంటా నమ్మితిఁగాక
చేయి మీఁద వేసితేనే చిక్కిలోఁగే దెఱఁగనా
ఆయము లంటి సరసమాడితిఁగాక

చ. 3: వేడుకకాఁడవా(వౌ?) త వెసనే నెఱఁగనా
పాడితో నే నీకు మొక్కి పై కొంటిగాక
యీడనే శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
జాడ దప్పేవా నేనే జరసితిఁగాక

రేకు: 1543-3 హిజ్జిజి సం: 25-195

పల్లవి: ఈయింతివల్ల నేరమి ఇంచుకంతైన నున్నదా
చేయి చాఁచఁగా నీతో సిగ్గువడరాదా

చ. 1: చెలి నిన్నుఁ దప్పక చూచెనంటానే తగిలేవు
సొలసి నీవు దిట్టఁగాఁ జూడవద్దా
నలిరేఁగి నీతోను నవ్వెనంటాఁబై కొనేవు
గిలిగించఁగాఁ గిలకిల నవ్వరాదా

చ. 2: సతి మాటలాడెనంటా సారెసారెఁ బొదిగేవు
కత చెప్పఁగా మారుగత వద్దా
తతితో జంకించెనంటా తమకించఁజూచేవు
రతి మర్మ మంటఁగా బిరాన జంకించరాదా

చ. 3: కాంత నీకు మొక్కెనంటా కాఁగిలించి కూడితివి
పంతపుఁబతికి మొక్కఁ బాడిగాదా
ఎంతైనా శ్రీవేంకటేశ ఇద్దరి కిద్దరే సరి
యింత నీవు మన్నించితే యియ్యకొనవలదా

రేకు: 1543-4 గుజ్జరి సం: 25-196

పల్లవి: ఏమయ్యా పాడిపంతా తెలఁగనివా నీవు
వేమముతోనిద్దరునునీకు సరిగారా

చ. 1: పనివడి యాపె నీతో పంతములెల్లా నాడఁగా
వొనరి యీపె నీతో నూరకుండువా
చనవుచేసుక యాపె సంగడిఁగూచుండఁగాను
వెనకదిక్కున నీకె వేరె కూచుండునా

చ. 2: చెంతనుండి యాపె నీకు సేవలెల్లాఁ జేయఁగాను
ఇంత నంతఁ గొలువులు యీకె సేసునా
మంతనాన ఆపె నీమర్మము లంటఁగాను
వింతకతలు చెప్పునా వెలఁది యీకె

చ. 3: పొత్తుల రతులనాకె భోగించఁగా నీకు
బత్తులే సేసునా పైపై నీకె
కొత్తగా శ్రీవేంకటేశ కూడె నాకెనిన్నుఁ దొల్లె
పుత్తలపు వేడుకల నురమెక్కెనీకె

రేకు: 1543-5 కేదారగౌళ సం: 25-197

పల్లవి: పురుషవిరహ మిదె పొలఁతి నీమగనికి
గరిమతోనిండుకొనెఁగాఁగిలించఁగదవే

చ. 1: పెలుచుఁదనాన నీవు పెడచేత మొక్కినదే
తలఁచుకరమణుఁడు తమకించునే
కలకల నవ్వుతా కన్నులఁజేచినదే
చెలరేఁగి అండనున్న చెలులకుఁ జెప్పునే

చ. 2: మందెమేళమున నీవు మాలాడినవి యెల్ల
అంది కలవరించేటియప్పు డాడునే
దమంటాఁ గుపనిడెమిచ్చినయలవాటున
చెంది యిట్టె సారెసారెఁ జేయి చాఁచునే

చ. 3: చెక్కు నొక్కి యేకతానఁ జెనకి కూడినందుకే
చొక్కుచు వానందాన సుముఖుఁడౌనె
ఇక్కడ శ్రీవేంకటేశు నెనసితి వింతలోనె
యెక్కువ నిందాఁకారను యెదురులు చూచెనే

రేకు: 1543-6 పాడి సం: 25-198

పల్లవి: ఇదిగో నీమగఁ డున్నా డిఁక నెన్నఁడే
పదివేలకు నీమేలు పచారించవలదా

చ. 1: జక్కవలు చన్నులట చకోరాలు కన్నులట
యెక్కువతో యురియక యేల మానేవే
చెక్కులే యుద్దములట చిగురు మోవియట
వెక్కసమై నీ వింత విఱ్ఱవీఁగవలదా

చ. 2: అలులు నీకురులట అంబుజము మొగమట
యెలమి నెమ్మోలు చూప కేల మానేవే
పులినపుఁబిరుఁదట తిలపుష్పనాస వట
మెలఁగి నీ వింతేసి మితిమీరవలదా

చ. 3: నెమ్మది లతాంగివట నిత్యజవ్వనివీనట
యిమ్ముల నీరాజసము లిఁక నెన్నఁడే
చిమ్ముచు నీనాయకుఁడు శ్రీవేంకటేశుఁడు గూడె
పమ్ముచునీవన్నెలిట్టె పచరించవలదా

రేకు: 1544-1 ఆహిరి సం: 25-199

పల్లవి: కన్నె ముద్దరాలు నీతోగట్టివాయితనముదా
సన్నల చాయలనేచలపాదిఁ జేతురా

చ. 1: సిగ్గుపడి లోలోనే శిరసు వంచుకోఁగానే
వెగ్గళించి చెలినేల వేఁడుకోనేవు
వొగ్గుచుఁ జేతుల సారె నొడ్డుకొంటాఁ దిట్టఁగానే
బగ్గనఁబోఁకముడివట్టి విడిచేవు

చ. 2: మొక్కుచుఁ బయ్యదకొంగు ముసుఁగువెట్టుకోఁగానే
గుక్కకచన్నులమీదగోర గీరేవు
పక్కన నీదువురము పాదమునఁ జిమ్మఁగానే
అక్కున నదిమి సతిఅయా అంటేవు

చ. 3: అద్దలించిజంకించి అనలెల్లాఁ బెట్టఁగాను
వుద్దండాన మోవిఁగెంపు లొనరించేవు
సుద్దుల శ్రీవేంకటేశ సుదతిఁ గూడితి నిట్టె
కొద్దిమీరఁగూడినానుకోరికఁ దనియవు

రేకు: 1544-2 దేసాళం సం: 25-200

పల్లవి: సేయనీవే అతఁడిట్టె సేసినంతాను
కాయకపుఁబ్రియములు గట్టిపడీనా

చ. 1: వెక్కసా లాడకువే నావిభునితోను
నిక్కి వంకలు దిద్దఁగ నీవసమా
కక్కసానఁ బెట్టకువే ఘనని నీవు
పక్కనఁ దలపోఁతలు పాటివచ్చీనా

చ. 2: నెరుసులు వట్టకువే నీవతనిని
దొరతనము వంచఁగ దోఁటి గలదా
పెరచేఁచకువే యీకఁ బ్రియములెల్ల
తెర మరుగుఁడగానే తేటతెల్లమవునా

చ. 3: కొంగువట్టి తియ్యకువే గురిగా నీవు
జంగిలిసరసములు చవి వుట్టీనా
కంగు వాయ శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
అంగడినవ్వులలోనే ఆస మానీనా

రేకు: 1544-3 సాళంగనాట సం: 25-201

పల్లవి: ఏల పూసుకవచ్చేవు యింతేసి నీవు
వేలికొనఁ బెనఁగఁగా విదిలించరాదా

చ. 1: కూరిమిగలదానవు కొంగువట్టె నాతఁడు
నేరమి నన్నేలెంచేవే నీవు సారెకు
భారపుగుబ్బలమీఁదిపయ్యద దీసి నన్ను
గోకరు దియ్యఁగా నాతనిఁ గోరి తిట్టరాదా

చ. 2: పట్టపుదేవులవు నీపతి నాతో మాఁటాడితే
అట్టుచేసే వీడ నన్నూఱకే నీవు
మెట్టిపట్టు కాతఁడు మేనవాని పయిమోవ
చుట్టి కాఁగిలించఁగాను సూడువట్టరాదా

చ. 3: యిచ్చకురాలవు నాకు నితఁడు విడె మియ్యఁగా
కొచ్చికొచ్చి వెంగెములే కుప్పవెట్టేవు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడఁగాను
పచ్చిరతులఁ జొక్కించి పంతమాడరాదా

రేకు: 1544-4 లలిత సం: 25-202

పల్లవి: నీపంతము లీడేరె నేరుపరి వౌదువయ్యా
ఆ పనులునాకుఁజెప్పి అలిఁ జేసుకొంటివి

చ. 1: చలముగల వారికి సాదించరానిదేమి
చెలులుగలవారికి సిగ్గులేని
మలసి మలసి నాతో మంతనము లాడియాడి
అలరి వలపు రేఁచి ఆలిఁజేసుకొంటివి

చ. 2: వేసరనివారికి వెగ్గళ మేమున్నది
ఆసలుగల వారికి నలపులేని
వాసితోను నీవు మావాకిటనే కాచుకుండి
ఆసుద్దులు చెప్పిచెప్పి ఆలిఁ జేసుకొంటివి

చ. 3: తాలిమిగలవారికి తగులని వేమున్నవి
యేలినవారికి నడ్డ మేమున్నది
యీలాగున శ్రీవేంకటేశ నీవు నన్నుఁగూడి
అలాగులనే నేఁడు అలిఁ జేసుకొంటివి

రేకు: 1544-5 సింధురామక్రియ సం: 25-203

పల్లవి: వేఱొకయాఁటదైతే వేసరు నీపొందులకు
అఱిడి కోర్తువు నీవు ఆసోద మెట్టిదో

చ. 1: చనపుచేసుక నిన్నుచన్నులనే నవొత్తితి
మనసురానవ్వునవ్వి మర్మమంటితి
పెనఁగి రతులనే బెండుపడఁ జేసితి
తనియ వెంతైన నీతమకమదెట్టిదో

చ. 2: పెదవితేనె లాని పిప్పిసేసితి నీమోవి
పదరి పచ్చిమాఁటల భ్రమయించితి
గుదికొన్నచూపులనేకొచ్చికొచ్చి చొక్కించితి
మదము దిగవునీమగతను మెట్టిదో

చ. 3: వూడిగాలు చేసిచేసి వొడలెల్లానిమిరితి
వాడికకూటములను వలపించితి
యీడనె శ్రీవేంకటేశ యిఁత నిన్నుఁ గొసరితి
వోడ నెఁ(వెం?) తయినానీవోపికింకా నెట్టిదో

రేకు: 1544-6 తెలుగు గాంబోది సం: 25-204

పల్లవి: చూడరే యెంతపగటు సుదతులాలా
వాడవారా తమలోనివంక లొత్తేవారు

చ. 1: మగనికి వాలికి మాఁటపలుకైతేమ
తగవులు దిద్దేవారు దండచెలులా
యెగసక్కేలకు తామే యెంతమేరమీరినా
అగపడి నేమెల్లా నడ్డాలు వచ్చేమా

చ. 2: తనకు నాపెకు లోలో తమకాలు రేఁగితేను
చనవున మెచ్చేవారు సవతులా
చెనకుచుఁదమంతనే సిగ్గులఁ బొరలఁగాను
పెనఁగి నేము రతికిఁ బెడరేఁచేవారమా

చ. 3: బావా మరదలుఁ గూడి పరవశమందఁగాను
యీవలఁబొరుగువారు యెచ్చరించేరా
శ్రీవేంకటేశ్వరుఁడే చేరి మమ్ము దమ్ము నేలె
వేవేలకయినాను విడనాడేమా

రేకు: 1545-1 ఆహిరినాట సం: 25-205

పల్లవి: పట్టకు నీవంతేసి బలిమిసేసి
తిట్టపెట్టి నీవు దిద్దనదానఁగానా

చ. 1: సన్నలేల సేసేవు సారెకు నీవు నాతో
కన్నదేకాదా నీతో కాఁపుర మెల్లా
చన్నులేల యంటేవు సతులముందర నెల్లా
పిన్ననాఁట నుండి నీవు పెంచినవేకావా

చ. 2: నగవులేల నగేవు నయగారితనముల
మొగముచూచి నీకు మొక్కితిఁగాదా
జిగి విడెమేలిచ్చేవు చెలఁగి నీతములము
పొగరుల నున్నది నాపుక్కిటనే కాదా

చ. 3: బాసలేల సేసేవు పలుమారునింకా నీవు
సేసలు వెట్టినది నాశిరసేకాదా
వాసితో శ్రీవేంటేశ నన్నుఁ గూడితివి
ఆసపడినది నాయఁగ మిదె కాదా

రేకు: 1545-2 సాళంగనాట సం: 25-206

పల్లవి: తక్కినవారికెలాఁ దరితీపు లందురు
మిక్కుటపుసరసము మీలో నమరును

చ. 1: తగునమ్మ యిన్నిటాను తరుణి నీకాతనికి
నగవమ్మ యాతనితో ననువునను
జిగి మీరొక్కరొకరు సేసినట్టెల్లాఁజెల్లె
మిగులా మీవొద్దికలు మీలో నమరును

చ. 2: కూడెనమ్మ సంసారము కోమలి మీయిద్దరికి
చూడవమ్మ అతనిపై సొలపుఁజూపు
తోడునీడలవలెను దొరకె మీవయసులు
మేడుపుమీరతులివి మీలో నమరును

చ. 3: పండెనమ్మ వలపులు పడఁతి మీకొర్కులకు
వుండవమ్మ యీతనివొద్దనే నీవు
అండనే శ్రీవేంకటేశునంకెలే నీయంకెలాయ
మెండగుమీకూటములు మీలో నమరును

రేకు: 1545-3 లలిత సం: 25-207

పల్లవి: ఎవ్వరితో గొడవేల యిడునులఁబడనేల
రవ్వగా నీసతిఁగూడి రాజ్యమేలవయ్యా

చ. 1: నిండునిదా(ధా?) నమువంటినెలంత యెదుటనదె
కొండలవంటి గొప్పకుచము లవె
వెండిఁబైఁడి వంటివేడుక ప్రియము లవె
వుండవయ్య యీకెవద్ద నొక్క మనసునను

చ. 2: వసంత కాలమువంటి వాలినజవ్వన మదె
ముసరుఁదేనె వంటిమోవి యదె
పసనిముత్తేలవంటి పైపైసిగ్గులు నవె
రసికుండ విన్నిటాను రమియించవయ్యా

చ. 3: చవులవిందువంటిసరసపుమాఁట లవె
కవగూడేయటువంటి కాఁగిళ్లవె
యివల శ్రీవేంకటేశ యిద్దరూ నెనసితిరి
పవళించి యిట్లానే పాయకుండవయ్యా

రేకు: 1545-4 పాడి సం: 25-208

పల్లవి: ఏమేమి సేయఁగాను ఇంకా నేమేమి వుట్టునో
నేమముతోనుండేనయ్యా నేరుతునా నేను

చ. 1: సారెకును నవ్వఁగాను చలములు రేఁగెను
మేరమీరి మొక్కఁగాను మించెఁబంతము
పేరుకొని పిలువఁగా బిగినే వింతటిలోనె
వూరకుండేనయ్యా నీతో వోపుదునా నేను

చ. 2: వేడుకతో మాటాడఁగ వెంగెము లందులో నుండె
వాడకెకు గదిసితే వాసిపుట్టెను
వూడిగలు సేసితేను వొద్దికఁ గాలు దాఁకెను
జాడతో నుండేనయ్యా సాదించఁగలనా

చ. 3: తప్పక చూడఁగాను తమకములెల్లా నిండె
కప్పురాన వేసితేను కళదాఁకెను
ఇప్పుడు శ్రీవేంకటేశ యెనసితివిటు నన్ను
మెప్పించి వుండేనయ్యా మేరమీ రే దానవా

రేకు: 1545-5 రామక్రియ సం: 25-209

పల్లవి: ఎంతలేదు నాయాస యేమి చెప్పేను
పంతమున నీవల్ల బతు కెల్లాఁ గలది

చ. 1: నీచిత్తము నామీఁద నిజముగాఁ బారితేను
యేచిన నావలపెల్లా నీడేరును
పూచినపూవులలోన పూఁపలు బలువైతేనే
కాచినకాపెల్లా నట్టె కడుఫలియించును

చ. 2: చనవిచ్చి నీవు నాతో సరసములాడితేనే
యెనసిననాసేవ లీడేరును
వెనుకొన్నసంపదలు వెంట వెంటఁ దిరిగితే
యెనలేని రాజసము లింతా నీడేరును

చ. 3: సేసవెట్టినట్టె(ట్టి?) నీవు చెప్పినట్టు సేసితేను
వేసరనివాకాఁగిలి వేడుకలౌను
యీసులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
లాసి నీటికొలఁదే లలితోఁ దామెరలూ

రేకు: 1545-6 ఆహిరినాట సం: 25-210

పల్లవి: ఏమిసేసితినయ్య నీవింత యగడు సేసేవు
ఆమనివలపులెల్లా నంగడి వేసేవు

చ. 1: నవ్వులకు నీతోడు నంటుమాఁట లాడితేను
రవ్వగాఁ జెప్పేవు తోడిరమణులతో
పువ్విళ్లూర నీమోవి నూరేతేనె లానితేను
అవ్వల నాపలుసోఁకులని చూపేవు

చ. 2: పూని యెఱుకకుఁ జేయి బుజముపై వేసితేను
మేనుగోరుసోఁకెనంటా మిట్టిపడేవు
దాని కేమనుచు నిన్నుఁ దప్పకచూచితేను
వేనిపట్టి సిగ్గులతో బెట్టి నవ్వేవు

చ. 3: కడుమెరమెచ్చులకుకాఁగిలంచుకొంటేను
అడపముసతివిడె మందిమ్మ నేవు
యెడయక శ్రీవేంకటేశ నీకుమొక్కితేను
తొడిఁబడఁ దెరవేసి దొమ్మిసేసేవు

రేకు: 1546-1 హిజ్జిజి సం: 25-211

పల్లవి: నిజమునుఁ గల్లయు నీమేననే వున్నది
బుజము చేపుమానీబొంకు లిఁక నేఁటికి

చ. 1: సాదించేవు మాటల చలపాదితనమేల
లేదా నీకాపెపొందు లేలే నీవు
వాదించే వప్పటి నాతో వనితలెల్లా వినఁగా
సాదవానీవేమైనా సట లింకా నేఁటికి

చ. 2: ఆడేవు నీయాచారాలు అంత దోసాలేఁటికి
చూడవా నీ వాపెదిక్కు సూటిగా నేఁడు
వోడక తగవాడేవు వూరివా రెరిఁగినపనికి
జాడ దప్పనివాడవా సట లింకా నేఁటికి

చ. 3: కలకల నవ్వేవు గుట్టువాయితనమేల
వలవవా ఆపెకు వంతుల నీవు
యెలమి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
చలివాసితి విన్ని టాను సట లింకా నేఁటికి

రేకు: 1546-2 కేదారగౌళ సం: 25-212

పల్లవి: నన్నేల యెచ్చరించేరే నాకు మఱవు గలదా
పన్ని యింతమాత్రానకు పదరగనేలే

చ. 1: కందువ లంటినప్పుడే గక్కనఁ జెనకేఁగాక
సందడిలో వలపులు చల్లనేలే
విందువలెఁ బిలిచితే వేడుక నూఁకొనేఁగాక
అందరివలెనే మాటలట్టెయాడనేలే

చ. 2: వలెనన్నప్పుడు నేనే వచ్చేఁగాక వద్దికి
కొలువులోపలఁ బతిఁ గొసరనేలే
నెలకొన్నప్పుడే తన నేరుపులు మెచ్చేఁగాక
పొలసితేఁ బేరుకొని పొగడగనేలే

చ. 3: నగినప్పుడే మలు నాఁటఁ బొడగనేఁగాక
మొగము వంచుకుండఁగా మొక్కనేలే
పగటున శ్రీవేంకటపతి తానే నన్నుఁ గూడె
అగడుసేసి రతుల నలయించనేలే

రేకు: 1546-3 నారాయణి సం: 25-213

పల్లవి: బుద్దెడిగే నిను నేను బోదించనేరుతువు
యిద్దరము నున్నారము యేమందురా

చ. 1: పలుమాట లాడితేను బహుభాషి నందువు
మలసి కోపించితేను మంక నందువు
అలిగితే నీతోడి అంకెకత్తె నందువు
యెలమి నీతోడి గాడ కేమిసేతురా

చ. 2: కన్నుల జంకించితేను గయ్యాలి నందువు
చన్నుల నే వొత్తిచే చలమందువు
సన్నల చేసితే నీతో సటలు చూపె నందువు
యెన్ని లేవు నీసుద్దు లిటువంటివేరా

చ. 3: అట్టె కాఁగిలించుకొంటే ఆసకత్తె నందువు
గుట్టున నూరకుండితే గొంట నందువు
నెట్టుక శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
యిట్టిదివో నీ నేరుపు యెదురాడరా

రేకు: 1546-4 ఆహిరి సం: 25-214

పల్లవి: ఇంతినేల నేరాలెంచేవు నీవు
జంతలవలెనే నీతో సరసములాడునా

చ. 1: పిలిచి నిన్నోకమాఁటు పేరుకొంట చాలదా
పలుమారు నుతించునా బట్టువలెను
నెలకొని నీవద్దనిలుచుంట చాలదా
బలిమిఁ బై పడునా వసురమువలెను

చ. 2: మొక్కె నీకుఁ జేతులెత్తి మొదలనే చాలదా
దిక్కనఁ బాదాలంటునాఁ దీగెవలెను
గక్కున నిన్నుఁ గన్నులఁ గనుఁగొంట చాలదా
మిక్కుటమై చూచునా మించ లేదు(డి?) వలెను

చ. 3: ఇట్టె కాఁగిలించి నిన్ను నెనయుట చాలదా
పట్టి కడు నురుపునా బంతివలెను
గుట్టున శ్రీవేంకటేశ కొంత నవ్వెఁ జాలదా
తొట్టి సకిళించునా తురగమువలెను

రేకు: 1546-5 ముఖారి సం: 25-215

పల్లవి: మంచివాఁడ వౌదువయ్యా మాటలేఁటికి
వంచిననాతురు మెల్ల వదలఁదీసితివి

చ. 1: వాడిననీమోము చూచి వద్దికి నే వచ్చితేను
వీడెమిచ్చే వంతలోనే వేగిరాననను
వోడక దొరవంటాను వుపచారము చూపితే
యీడుగా నమోవెల్లా నెంగిలిసేసితివి

చ. 2: వొంటి నీ వున్నాఁడవంటా వూరకె తోడుండఁగాను
అంటి నన్నుఁ బైకొనేవు అవునయ్య నీవు
జంటైనచుట్టరికాన సహాయమునెరపితే
గెంటక వాచీరగిజిగిజిగాఁ జేసితివి

చ. 3: నిద్దిరింతువోయని నేఁ దొడ చెఱచితేను
గద్దించి కాఁగిటనన్నుఁ గలసితివి
అద్దో శ్రీవేంకటేశ అన్నిటా మొగమోడితే
వుద్దండపురతులలో నోలలాడించితివి

రేకు: 1546-6 గౌళి సం: 25-216

పల్లవి: ఈపాటివాఁడు తాను యిందాఁకా నేమిసేసె
కాపుగా నే నీడ నిట్టె కాచుకుండనా

చ. 1: యెలమి నిందాఁకాఁదా నేడో పరాకై వుండి
తలఁచినప్పుడే తనతమి నామీఁద
వలసినచోట నెల్లా వలపెల్లా జల్లి వచ్చి
పలికినప్పుడే తనబత్తి నామీఁద

చ. 2: తిన్నవై వూరెల్లాను తిరుగాడివచ్చి నన్నుఁ
గన్నప్పుడే తన కాంక్షలెల్లాను
చిన్నిమదనమంత్రాలఁ జిక్కివుండి నామాఁటలు
విన్నప్పుడే తనవేడుకెల్లాను

చ. 3: వాడలో సతులఁ బొందివచ్చి వాకాఁగిటిలోనఁ
గూడి యిప్పుడేచెప్పీ గుట్టు మాకును
యీడనె శ్రీవేంకటేశుఁడిరవై నామోముచూచి
వాడికె నప్పుడే చూపీ వన్నె మాకును

రేకు: 1547-1 రీతిగౌళ సం: 25-217

పల్లవి: ఏమి యీడువెట్టుకొనే వింతికి నీకు
సాములరతుల నీతో సరిదూఁగునయ్యా

చ. 1: నివే మన్నించితేను నెలఁత నీకంటెను
యేవలా వీసమంత యెక్కుడయ్యా
భావించి నీ వాపెపాదాలకు మొక్కితేన
ఆవేళ నేలికసాని యౌవయ్యా

చ. 2: నీపాదము చాఁచితేనునెలఁత నీకంటెను
యేపున నిన్ను మోఁచిన దెక్కుడయ్యా
చేపట్టి నీ వాపెచెప్పినట్టువినేయందు
కోపగించకు నీ కాపె గురువయ్యా

చ. 3: నీవలపు గలిగితేను నిన్నుఁగూడి చొక్కించీ
యీవిద్యలనన్నిటాను యొక్కుడయ్యా
వో వోయి శ్రీ వేంకటేశ పురమెక్కఁగనక నీ
దేవులునీపాలింటి దేవరయ్యా

రేకు: 1547-2 శంకరాభరణం సం: 25-218

పల్లవి: ఒడఁబరతురుగాక వొప్పుగా నడచేనని
నడుమఁ గొసరితేను నమ్ముNా చెలియా

చ. 1: మనసున నొకటి మాఁటల నొకటిఁ
బెనచి దూరుదురు ప్రియురాండ్లు
ఘనుఁడవు నీవైతేకలవెల్లాఁ జేసివచ్చి
ననువులు నటించితే నమ్ముNా చెలియా

చ. 2: నగవులో నొకటి నటనల నొకటీ
యెగసక్కే లాడుదురు యింతులెల్లా
మగఁడవు నీవైతే మతకానఁదిరిగాడి
నగరిలో నుంటేను నమ్ముNా చెలియా

చ. 3: సన్నల నొకటి జంకెనల నొకటీఁ
బన్ని చెనకుదురుపడఁతులెల్లా
వున్నతి శ్రీవేంకటేశ వొనగూడితి వీపెను
నన్ను నమ్మించితే నమ్ముNా చెలియా

రేకు: 1547-3 నాదరామక్రియ సం: 25-219

పల్లవి: ఇన్నాళ్లవాఁడవై యెనసివుండఁగరాదా
వన్నెలు వెట్టుక రాగా వడి నవ్వు వచ్చీని

చ. 1: మంతనాననీవు నేనూ మాఁటలాడినట్లానే
పంతమూఁ బాడీ నెఱింగి పలుకరాదా
యింతలోనే నీవిట్లా యెవ్వరోమాటలు నేర్చి
వింతబాస లాడఁగాను వేరె నవ్వు వచ్చీని

చ. 2: కలికరి నిద్దరము కాఁపురము సేసినట్లా
వొలిపు రాజసముతో నుండఁగరాదా
కలితలజంతలకతలు నేర్చుక వచ్చి
గిలికొని పొదుగఁగా కేరినవ్వు వచ్చీని

చ. 3: చేయిముట్టి నీవు నేనూఁ జెనకినయట్లానే
ఆయముఁ బ్రాయ మెఱింగి యలమరాదా
యీయెడ శ్రీవేంకటేశ యేడోరతులు నేర్చి
నాయెడ నీవు గూడఁగా నవ్వు వచ్చీని

రేకు: 1547-4 శుద్ధవసంతం సం: 25-220

పల్లవి: పిలువవే యీడకు బేసబెల్లియాతని
చిలుపాలు గాఁపించె సిగ్గులెల్లాను

చ. 1: వలవనిజోలిఁ బెట్టి వట్టిమాటలెల్లా నాడి
తలపోఁతవలపులఁదమి రేఁచెను
మొలకలనవ్వు మొనగోరికొన వ్రాసి
నిలువు నూరు పండించె నిన్న నెల్లాను

చ. 2: సరసము పైఁజల్లి జాగరాలు సేయింపించి
కరఁగించి మర్మముల కళ లుబ్బించె
తెరవేసి మరఁగున తేనెమోవి యాసచూపి
పరగించె నెమ్మెలెల్లా బలుమేడమీఁదను

చ. 3: కన్నుల సన్నలుసేసి కాయము కాఁగిట నించి
నన్ను నింతగాఁ జేసి నమ్మించెను
ఇన్నిటా శ్రీవేంకటేశుఁడిపుడు వచ్చి కలసె
విన్నపములెల్లాను వినె నిందాఁకాను

రేకు: 1547-5 వరాళి సం: 25-221

పల్లవి: సవతుల మింతే సరుసల నుంటిమి
దవనపువాట్లు తా నెఱుఁగు

చ. 1: మగువకుఁ దనకును మాన్పితి జగడము
తగవును ధర్మము తానెఱుఁగు
పగటు లేఁటివో పంతము లేఁటివో
తగులువిరులే యవి తా నెఱుఁగు

చ. 2: విరసపుసొట్లు విడుపుమంటి మిటు
తరవాతిపనులు తా నెఱుఁగు
సరసతలో యవి జాణతనములో
తరఁగులు మొరఁగులు తా నెఱుఁగు

చ. 3: జమళి నిద్దరిని సంగడిఁ గూర్చితి
తమకము సముకముఁదా నెఱుఁగు
భ్రమసి శ్రీవేంకటపతి నను నేలెను
తముల మెవ్వరిదో తా నెఱుఁగు

రేకు: 1547-6 దేవగాంధారి సం: 25-222

పల్లవి: ఎంతకెత్తుకొమ్మనేవు యేమయ్య వొకమాఁటే
వింతవింతవేడుకలువెలసేదాననా

చ. 1: చాయలకు నీతోను సరిపెనఁగుమనేవు
ఆయములంటే పాటియంత దాననా
పాయపుమదాన నీపడిగెము పట్టేదాన
రాయడించి నిన్నింతరవ్వసేసేదా ననా

చ. 2: ననుపుననీతోనునవ్వులు నవ్వుమనేవు
మునుకొని మందెమేళములదాననా
యెనసిననీమోవియెంగిలి సోఁకినదాన
పనిగొని నిన్నింత పరచేటిదాననా

చ. 3: కందువఁ గూడుమనేవుకాఁగిటిలోనున్న దాన
అందరిలో పోరచియ్యైనదాననా
విందుల శ్రీవేంకటేశ వేడుక నన్నే లితివి
అంది నీబూవపుదాన నడ్డమాడేదాన

రేకు: 1548-1 సామంతం సం: 25-223

పల్లవి: ఇద్దరిచేతలూ సరే ఇం నేమనేవే
పెద్దరికమే కలితే పెనఁగవే నీవు

చ. 1: వాలుక రెప్పలు నీవు వంచివంచి చూడఁగా
కాలుదొక్కి నందుకేపో ఘనుఁడితఁడు
వేలుఁగొప్పుతోడ నీవు వెంగెము లాడఁగాను
కోలుముందుగా నిన్ను గోర గీర నతఁడు

చ. 2: పలుమారు నీకునీవే పంతములు నెరపఁగా
చలపట్టి పయ్యదలో చన్నులంటెను
నలువంకఁ జెలరేఁగినవ్వు నీవు నవ్వఁగాను
తలకొనినీలోనితమిరేఁచె నతఁడు

చ. 3: మంతనానఁ జేయిచాఁచి మర్మములుచెనకఁగా
యింతోనె నీమోవి యెంగిలిసేసె
కాంతవు నీవుచెలరేఁగి కపపురవిడెమియ్యఁగా
వింతగానిన్నుఁగూడె శ్రీవేంకటేశుఁ డతఁడు

రేకు: 1548-2 వరాళి సం: 25-224

పల్లవి: నాలాగు నీ వెఱఁగవు నన్ను నొరసేవు నేఁడు
అలాగువాఁడవుగాన అయ్యో నీవు

చ. 1: చెంగట నీకొక మొక్కు చేరి నేనే మొక్కి తేను
వెంగెములై తోఁచెనిదె వేరే నీకు
కంగిననీచేత లేమిగలిగినా దాఁతుఁగాక
అంగడివేతునా అయ్యో నేను

చ. 2: చేపట్టి నిన్ను గోరఁ జెనకిసిగ్గువడితే
కోపములై తోఁచెనదే గురిగా నీకు
యేపనులు గలిగినా ఇయ్యకొందుఁగాకనిన్ను
ఆపాటికే దూరుదునా అయ్యో నేను

చ. 3: వలచి కాఁగి నీతో వడిగాఁ బెనఁగి తేను
బలిమియై తోఁచె నిదే పైపై నీకు
కలితేఁ జలము శ్రీవేంకటేశ నీపైనా
అలరి కలతునా అయ్యో నేను

రేకు: 1548-3 మాళవిగౌళ సం: 25-225

పల్లవి: అవి నామీఁదఁ బెట్టకు మప్పటి నీవు
కవగూడ నేర్చితివి కతలుగా నీవు

చ. 1: నగితే నేమిఁగాదు నలుగురిలో నాను
తగినమాటలాడు తరమెఱిఁగి
జగతిలో నానాజాతిసతులవంకాఁ బోయి
తెగడనేర్పితి పలుదెఱఁగుల నీవు

చ. 2: బత్తైతే నేమిఁగాదు పరు లిందరూ మెచ్చ
యెత్తైనచేఁత సేయి యితవెరిఁగి
సత్తైనగొల్లెతలతో సాములు సేసిసేసి
కొత్తరతులు నేర్పితి గుఱుతుగా నీవు

చ. 3: మరిగితే నేమిఁగాదు మావింటివారిలోనెల్లా
నిరతితో మన్నించు నేరు పెరిఁగి
పరగ శ్రీవేంకటేశ పైపై నన్నుఁ గూడితివి
యెరవులు నేర్పితివి యిన్నిచోట్లా నీవు

రేకు: 1548-4 పాడి సం: 25-226

పల్లవి: కలగూరా వలపేమి గనముగ గొసరంగ
పలుకుఁబంతము నొకపాటి గావలదా

చ. 1: చలమే ప(ఫ)లమా సారె సారె రమణుఁడు
పిలిచితే రారాదాబిగియనేల
కలయక మానేరా కాపిరాలు సేసేవారు
చెలికత్తియలచేతఁ జెప్పించుకొందురా

చ. 2: చెక్కుచేయే సింగారమా చేరెతఁడు మాటాడఁగా
గక్కన మాటాడరాదా కమ్మటి నీవు
వొక్కటిగాక మానేరా వొడఁబాటుగలవారు
వుక్కటగా వట్టిరాఁపులు సేసుకొందురా

చ. 3: మంకుఁదనమే వుంకువా మరి శ్రీవేంకటేశుఁడు
సంకెదీర నిన్నుఁగూడె చన వీరాదా
అంకెగాక మానేరా ఆలుమగఁడైన వారు
సుంకముగార దమలోన సలయించుకొందురా

రేకు: 1548-5 బౌళి సం: 25-227

పల్లవి: ఇవియెల్లా మాకేల ఇల్లాండ్లము నేము
అవియెల్లా నెచ్చరించు మాపెకే నీవు

చ. 1: వలపులలోపలి వాసు లేమిగలిగినా
నెలఁతకు నన్నియును నేరుపవయ్యా
పలుకులతోపలిపాడిపంతములునట్టే
అలవాటు సేయవయ్య అపెకే నీవు

చ. 2: పమ్మిన చూపులలోని పగ టేమిగల్లాను
కొమ్మచేతనేచూపించుకోవయ్యా
యెమ్మెలకునాతోఁ జెప్పే వింతేసికతలునేఁడు
అమ్మరో మాకేల చెప్పు మాపెకే నీవు

చ. 3: మంతనపురతులలో మఱఁగు లేమిగల్లాను
యింతికినీ వుపదేశ మియ్యవయ్యా
చెంతల శ్రీవేంకటేశ చేరి నన్నుఁగూడితివి
అంతటను బాససేయు మాపెకే నీవు

రేకు: 1548-6 శంకరాభరణం సం: 25-228

పల్లవి: దీకొని నిన్నిటు తిట్టుదురుగాక
బూకలుగా మరిపొగడేరా

చ. 1: నీతో సరసము నేర్చినవారికి
యేతులు నమరును యెట్టయినా
పోతరంపువెడపారుగుగొల్లెతలు
నీతులవినయము నెరపేరా

చ. 2: సూడిదె నవ్వులు చుట్టపువారికి
యీాడుగఁ జెల్లునుయెట్టయినా
దూడల యావులదొడ్డివనిత లిటు
పాడిపంతమునఁ బలికేరా

చ. 3: సందడిరతు లివి చదివిన వారికి
యెందున దెలుసును యెట్టయినా
అందపు శ్రీవేంకటాధిప మంకులు
విందులఁ గలయకవిడిచేరా

రేకు: 1549-1 గుజ్జరి సం: 25-229

పల్లవి: మమ్మేల పొగడేవు మాఁటిమాఁటికి
చిమ్ముచు మాతోడిపొందు సేసేదేకాక

చ. 1: చెయ్యారా నేముసేసేసేవ లేమి వున్నవి
ఇయ్యకొని నీవు మమ్ము నేలేదేకాక
వేయ్యై నా నేము సేసేవిన్నపము లేమున్నవి
వొయ్యనే చనవిచ్చి వొద్దికొాటగాక

చ. 2: పైపై నేము సేసేబత్తు లేమి వున్నవి
వోపి నీవు మావద్ద నుండేదేకాక
యేపొద్దు మావినయములెంచ నేమి వున్నవి
కాపాడి మాపాటిటఁ గలిగేదే కాక

చ. 3: కందువ నేము గూడి కరఁగించే దేమున్నది
అంది నీవు భోగించే దదియే కాక
యందరిలో శ్రీవేంకటేశ నన్నేనసితివి
మందలించ నేమున్నది మరుగుటే కాక

రేకు: 1549-2 రామక్రియ సం: 25-230

పల్లవి: ఎవ్వ రెట్లుండిరేమి యింతిదిక్కే ఆడవయ్యా
నివ్వటిల్ల నానవెట్టీ నేరుపుతో నదివో

చ. 1: తటినాపె గెల్చుదాఁకాఁ దగవులు చెప్పవయ్యా
గుటిగాఁగ నిన్నే యాపె కోరి వచ్చెను
యెటుకతో నీదాక్షిణ్య మిందులోనే వున్నదయ్య
మొటఁగును నట్టే నీమోము చూచీ నదివో

చ. 2: అతివకు సంతోసమౌనట్టే మాటాడవయ్య
కొతుకక సాకిరులు గోరీ నిన్నే
తతితోడ నాపెనే పెద్దరికము సేయవయ్య
అతిశయముగ నిన్నే ఆసపడి నదివో

చ. 3: అంగన గెలిచితి వనవయ్యవొక్కమాఁటే
బెంగవలెఁ గోరివచ్చి పెనఁగీ నీతో
సంగతి శ్రీవేంకటేశసరిగాఁ జేసితివయ్య
కొంగువట్టి మమ్మిద్దరిఁ గూడితి విల్లిదివో

రేకు: 1549-3 వరాళి సం: 25-231

పల్లవి: పెల్లి చెట్టు మందుగాదు పెరిగి యెంతవుండినా
పల్లదాన నే నీకు బాఁతైతి నిపుడా

చ. 1: సరసమాడేటివారు సంగడినే వుండఁగాను
తరవాత మాతో జాణతనా లాడేవు
కెరలినవారు కుచగిరుల నిన్నొత్తఁగాను
వెరసుగానేల వుండవింట వేసేవు నన్ను

చ. 2: వాడికసతులు వచ్చి వసమై నీ కుండఁగాను
యీడనున్నమమ్మునీవు యెలయించేవు
తోడఁబెండ్లాడేవారు దొమ్మి నిన్నుఁ జేయఁగాను
వీడె మిమ్మనచు నన్ను వేసరించేవు

చ. 3: కందువకు వచ్చివారు కడలనే వుండఁగాను
అంది నన్నుఁ గాఁగిలించి అట్టె కూడేవు
చెందిన వారుండఁగాను శ్రీవేంకటేశ నన్ను
మందలించి పైకొని మన్నించేవూ

రేకు: 1549-4 ముఖారి సం: 25-232

పల్లవి: ఇంతబాఁతిపడేవాని నేల మాకు దక్కరించ
చెంత నిదే వెన్నచిట్టిఁజిట్టెండేసి వలపు

చ. 1: చేలకొంగువట్టితిసిగ్గువడఁగామానము
వాలుకరెప్పలు వంచివంచి చూచేవు
అలదొట్టివారము నేమంతేసి యెఱఁగము
వాలదుత్త దుత్తఁడేసి పట్టవయ్య వలపు

చ. 2: పెల్లుగఁ జేతులు పాపి పెనఁగఁగానే గుబ్బలు
కొల్లలుగాఁ జేతఁబట్టి గోర గీరేవు
గొల్లెతలమెఱఁగము గొప్పజాణతనములు
చలదుబ్బ దుబ్బేఁడేసిచల్లేమువలపు

చ. 3: కాయపుమదము గారఁగానే శ్రీవేంకటేశ
సోయగానఁ గూడి మరీ సోదించేవు
నేయమ్మే వారము నవ్వనేరము పోసే మిదే
చేయి చాఁచు పెర్గుచిప్పఁ చిప్పఁడేసి వలపు

రేకు: 1549-5 దేసాళం సం: 25-233

పల్లవి: ఇందుకేమి దోసమాయెగ్గులెంచె వింతలోనె
పొందుసేసినట్టివారు భోగింతురుగాక

చ. 1: సిగ్గులు పడుదురా సేవలు సేసేవారు
వెగ్గళించి నీపై జేయివేతురుగాక
వొగ్గి వూరకుండుదురా వొద్దనుండినట్టివారు
అగ్గలపుసరసము లాడుదురుగాక

చ. 2: మాఁటలాడకుండుదురా మనసులు గన్నవారు
యేఁటికై నా నిన్ను నేరా లెంతుగాక
నీటు చూపకుండుదురా నీసరిఁ గూచున్న వారు
మేఁటిరతులను మితిమీరుదురుగాక

చ. 3: అలమి కూడకుందురా ఆయములంటినవారు
చలపట్టి పాదములు చాఁతురుగాక
యెలమి శ్రీవేంకటేశ ఇద్దరిఁ గూడితి విట్టె
సొలసి నేర్పులు తోడు చూపుదురుగాక

రేకు: 1549-6 భైరవి సం: 25-234

పల్లవి: ఆనతియ్యవయ్యా నాతో నామేలు వినేనేను
తానకమ్మై ఇన్నిటాను తనివి నందించెనా

చ. 1: మొక్కలాన నేఁడు నీమోమునఁ గళలు నిండె
చెక్కులు నొక్కెనా ఆపె సేదదేర్చెనా
చిక్కనిచెమటలతో చిందువంద్దై వున్నాఁడవు
కక్కసించి మరీ నట్టె కాలుదొక్కెనా

చ. 2: నవకపు సెలవులనవ్వు వెన్నెలలు గాసీ
చవి చూపెనా మోవి; చాఁచెనాచేయి
అవల నీ వల్లాఁ జూచి అలసేవు నీలోనే
జవళిఁ గాఁగిటిలోనే సాముసేయించెనా

చ. 3: చిత్తగించి నన్నుఁ జూచి సిగ్గులుపడే విదె
పొత్తు గుడిపించెనా భోగించెనా
యిత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
హత్తించెనా పొందు అట్టె యిందు వచ్చెనా

రేకు: 1550-1 శుద్ధవసంతం సం: 25-235

పల్లవి: వెనకటివలె నిఁక వేసరేనా నీతో
అనువుగా నీచెప్పినట్లు సేసేమయ్యా

చ. 1: మానినులఅలుకలు మాటలాడుదాఁకానే
నానినచలములెల్లా నవ్వుదాఁకానే
యేనెపము లేదు మమ్ము నెంతేసి వేఁడుకొనేవు
ఆనుకొని నీచెప్పినట్లు సేసేమయ్యా

చ. 2: సిగ్గులు గక్కన నీవు చేయి చాఁచినందాఁకానే
యెగ్గులు మంతనమున నెనయుదాఁక
వొగ్గుచు మమ్మిందుకుఁగా వూరడించే వింతేసి
అగ్గలము నీచెప్పినట్టు సేసేమయ్యా

చ. 3: కడమ లేమిగల్లానుకన్నుల జూచుదాఁకానే
జడియుటెల్లా మేలుచల్లుదాఁకానే
కడిఁగి శ్రీవేంకటేశ కలసితి వింతేసి
అడరి నీవు చెప్పినట్టే సేసేమయ్యా

రేకు: 1550-2 శ్రీరాగం సం: 25-236

పల్లవి: చెలి యింతసేసెనంటా చిమిడేవు విరహాన
తలఁపులకాఁకలలో తగుల నేది

చ. 1: చక్కెరమోవిమీఁదిసరసపుమాటలలో
యెక్కువతక్కువమాట లెంచ నేవి
గుక్కక కలువరేకులవంటి చూపులలో
పిక్కటిల్లి గుండెదాఁకి బెదర నేది

చ. 2: జలజపు మొగడలచన్నుల వొత్తులలోన
నులివచ్చిగా నాఁటి నొవ్వఁగ నేది
చెలరేఁగి చిగురుల చేగోరి చెనకులలో
నలువంక మర్మములు నాఁటఁగ నేవి

చ. 3: బత్తితో నీకాఁగిటిపరవశములలోన
తత్తరపుగయ్యాళితనము లేవి
యిత్తల శ్రీవేంకటేశ యింతి నన్ను నెనసెను
మత్తిలి విరహ మిఁక మలసినా నేది

రేకు: 1550-3 మాళవిగౌళ సం: 25-237

పల్లవి: ఏలోయి మమ్ము నీవు యెంతఁగా జూచేవు నేఁడు
యీలాగు భ్రమసియెడల మానేము

చ. 1: మనసువచ్చినసతి మాట నీతో నాడఁగాను
పనిలేనిపని నీతోఁ బలికేమా
కనుసన్నలనే మాతోఁ గాఁపురాలు సేసేవు
కొనచీఁటి మోహపుఁగూళలమా నేము

చ. 2: బత్తిగలయాపె నీతోఁ బైకొని పెనఁగఁగా
హత్తినీతో సరసము లాడేమా
పొత్తులమన్నన లిట్టె పొరలించేవు మామీఁద
మొత్తమిగా నిన్ను నంట మూఢులమా

చ. 3: ఆరీతి నాపె నిన్ను నట్టె కాఁగిలించఁగాను
మేరలు మీరి నీతోమేకు చూపేమా
యీరితి శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి
మోరతోపు లీఁకఁజేయ ములుచలమా

రేకు: 1550-4 సామంతం సం: 25-238

పల్లవి: కడుదూరురే మీరు ఘనుఁ డాతఁడు
కడమతమకమెల్లాఁ గానవచ్చీ నిపుడు

చ. 1: సెలవి నవ్వినవాఁడు చేయి చాఁచకుండునా
పిలువనేలే తానే ప్రేమసేసీని
పలుకనట్టే వుండు బత్తి నాపైఁ గలఁడు
పశువులవలపులుసన్నల నెఱఁగనా

చ. 2: కన్నుల జూచినవాఁడు కాతరించకుండునా
పన్ని యెచ్చుకించకురే పైకొనీఁ దానే
మిన్నక పరాకైనా మన్నన నాకే వొసఁగు
కన్నెరికపుమదము కంటే నెఱఁగనా

చ. 3: కదిసి కూచున్నవాఁడు కాఁగిలించకుండునా
వదరకురే కూడి బాసయిచ్చీని
ఇదివో శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నిన్నిటాను
పెదవిపై గుఱుతులు పెట్టె నాఁ డెఱఁగనా

రేకు: 1550-5 సాళంగనాట సం: 25-239

పల్లవి: తమకాన నున్నవాఁడు దండ నాతఁడు
సమరతులకుఁ జేయి చాఁచరాదా యిపుడు

చ. 1: కత లేమిచెప్పేవే కాంతునితో వేగినంతా
రతులకుఁ దెరవేయరాదా యిఁక
పతిగా నేమినవ్వేవే పలుమారు నతనితో
యితవుగా బాగా లొత్తిఇయ్యరాదా ఇపుడు

చ. 2: భ్రమల నేల పెట్టేవే బడిబడి నెందాఁకా
జమళి నీవే ముందు చనవీరాదా
అమరె నేమి చూచేవే అతనిది కృప్పటిని
క్రమముగాఁ గాఁగిలించు గక్కన నీ విపుడు

చ. 3: చెక్కులేమి నొక్కేవే శ్రీవేంకటేశ్వరుని
దక్కఁగూడితి వీ మేలు తలఁతుగాక
మక్కువల నిఁకనేమి మర్మాలు సోదించేవే
చిక్కఁగా సరసములు చిమ్మఁగదే యిపుడు

రేకు: 1550-6 బౌళి సం: 25-240

పల్లవి: నీగుట్టు చెఱుచనేల నేఁడు మాకు
వేగిరించ కింకా నీవేడుకే యెఱుఁగు

చ. 1: పంతము నీ వాడఁగాను పకపక నవ్వువచ్చె
నంతవాఁడ వౌదువయ్యా అందుకేమి
బంతినే యిందరిలోనాఁ బడితళించుముగాని
మంతనాన నీచేఁత నీమనసే యెఱుఁగు

చ. 2: వట్టియాచారాలఁబోఁగా వడినాకు సిగ్గు వచ్చె
యెట్టైనా నీకు జెల్లు నేలయ్య్య
రట్టుసేయఁగాని నే నిట్టే; రచ్చలో నంత
మట్టులేనిమర్మాలు నీమనసే యెఱుఁగు

చ. 3: తమకించి కూడఁగాను తారుకాణలెల్లా వచ్చె
సముకాన నంతవద్దు సటలేలయ్యా
అమరె శ్రీవేంకటేశ అట్టె మారుకు మారేల
మమకారము నాపై నీమనసే యెఱుఁ

రేకు: 1551-1 వరాళి సం: 25-241

పల్లవి: నీవు గోరినట్టే యాయ నేఁడాపెవలన నీకు
చేవదేరి వలపులు చిమ్మిరేఁగెనా

చ. 1: వలపలడాపలాను వడిగాఁ గొసరె నిన్ను
చెలియవిన్నపములు చెవి సోఁకెనా
కలికితనములెల్లా కన్నుల నీపై నించె
సొలపుఁజూపులు నీలో సూటిఁ బారెనా

చ. 2: మొగము విచ్చివిచ్చి ముందుకలుగనె నవ్వె
మగువసరసములు మతిఁ బట్టెనా
చిగురుమోవితేనెచిప్పిల విందులు వెటె
తగిలినీవేడుకలు తనివొందెనా

చ. 3: కప్పురబాగాలు నీకు గక్కనఁ జేతి కందిచ్చె
చెప్పరానికానికానికలు చేకూరెనా
ఇప్పుడు శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
అప్పణ గలిగెనా ఆపె వేఁడుకొంటివా

రేకు: 1551-2 సౌరాష్ట్రం సం: 25-242

పల్లవి: ఎందుకైనాఁ దానేవచ్చీ నేమిసేతునే
యిందరివాఁడూఁ దానే యేమిసేతునే

చ. 1: గద్దరి సవతులము కాఁతాళాన నుండఁగాను
యిద్దరి నొక్కటిసేసీ నేమిసేతునే
పెద్దరికాన నొటు పెట్టుకుండఁగా నిదె
వద్దన్నా బొత్తులఁబెట్టీ వడి నేమిసేతునే

చ. 2: చయ్యాటపుమాటలు సారెసారె నాడఁగాను
యియ్యకోళ్లుగాఁ జెప్పీ నేమిసేతునే
కయ్యములు వద్దంటా గక్కనఁ బ్రియాలు చెప్పి
ఇయ్యరానిబాసలెల్లా నిచ్చీనేమిసేతునే

చ. 3: మరిగి మాఁటు సేసుక మామాఇండ్ల నుండఁగా
ఇరుమేలాఁ బెట్టుకొనీ నేమిసేతునే
అరుదై శ్రీవేంకటేశుఁ డక్క చెల్లెండ్లము మ
మ్మిరవుగాఁ బెండ్లాడె సేమిసేతునే

రేకు: 1551-3 పాడి సం: 25-243

పల్లవి: దొర మోహించఁజూచితే తుదమొద లెరఁగఁడు
ఇర వెక్కడౌతాఁ గాన విస్సిరో వయసా

చ. 1: చక్కని ఇంతి నీమోము సారెసారెఁ జూచిచూచి
చెక్కునొక్కి వలపులఁ జిమ్మిరేఁగేవు
యెక్కువసతులు వద్ద నెవ్వరుంటా నెఱఁగవు
యెక్కడ వోయ సిగ్గు లిస్సిరో వయసా

చ. 2: చన్నులు గదలఁగాను సతి నీతో నవ్వితేను
చెన్నుమీరఁ గరంగుతాఁ జెమరించేవు
అన్నిటా నీచేఁతలకునాడేవారినెఱఁగవు
యెన్నికి నిబుద్ధి ఇస్సిరో వయసా

చ. 3: మురిపానఁ జెలి నీతో ముద్దులమాట లాడితే
సరుగఁ గాఁగిటఁ గూడి చనవిచ్చేవు
గరిమ శ్రీవేంకటేశు గంభీర మెఱఁగవు
యెరవైతి విందాఁకానిస్సిరో వయసా

రేకు: 1551-4 ఆహిరి సం: 25-244

పల్లవి: ఇంతి నీదేవులు నీవు యెంతసేసినాఁ జెల్లు
మంతు కెక్కితివి నీకు మరియేల వెఱపు

చ. 1: వలవనిజాగు సేయవద్దుగాక మాతోను
తెలిపి చెప్పితేనేపో దేవరపు
చెలి నేఁపి ఇంత రట్టుసేయవద్దుగాక నీవు
నెలకొ నేమిసేసినా నీకేమి వెఱపు

చ. 2: వట్టినవ్వులెల్లా నవ్వవద్దుగాకఆపె నిట్టె
తిట్టితే నీవేపో దవరవు
చుట్టపువరుసనే సూడువెనఁగఁగవద్దు
పట్టి నీపిడికిటిలో బెట్టు యేల వెఱపు

చ. 3: నాలిమాఁటలాడి కల్లనమ్మికలు వద్దుగాక
తేలించకున్న నీవే దేవరపు
యీలీల శ్రీవేంకటేశ యెనసితి వీలేమను
తాలిమితో మేలాయఁ దగ దిఁక వలపు

రేకు: 1551-5 నాదరామక్రియ సం: 25-245

పల్లవి: ఇప్పుడు వేగిరమేలే ఇంతినీకు
తప్పులెల్లా మాని పతి తానే వలచును

చ. 1: నెయ్యము గలుగుచోట నెరుసు లేమిగల్లాను
కయ్యము లడువనేల కాంతలకు
వొయ్యనే ఆరమణుని కూడిగాలు సేయఁగాను
కొయ్యతనాలెల్లా మాని కూరిములు సేసును

చ. 2: చేతికి లోనైనయెడ సిలుగు లేమి పుట్టినా
కాతరించి దూరనేల కాంతలకు
ఆతుమైనయాతని నన్నిటాఁ బొదుగఁగాను
యేతులకుఁదాఁ దానే యిరవై నిలుచును

చ. 3: చనవు గలిగినందు సారెఁ బరాకై నాను
కనలి తిట్టఁగనేల కాంతలకు
యెనసి శ్రీవేంకటేశు నిచ్చలో నిట్టెవుండఁగ
మనసున బత్తిగల్లి మన్నించు నిచటా

రేకు: 1551-6 కాంబోది సం: 25-246

పల్లవి: కాంత యేమిసేసునే ఘనుఁడు తానేకాక
చెంతలఁ దనకే మరిఁ జేత మొక్కవలదా

చ. 1: చలపట్టి తానే యెచ్చరికలు సేయఁగాను
యెలమి నాపెకుఁ బంతా లేల మానీనే
నెలకొని తానింతేసి నేరుపులు నేరుపఁగా
బలిమిమెరసి యింత ప్రౌఢ గాఁదగదా

చ. 2: పొరుగున నుండి తానే పోదులెల్లాఁ జేయఁగాను
అరసిమేరలుమీర కాపె తక్కునా
పెరరేఁచి తాను నట్టే వేఁడుకొని వుండఁగాను
విరసముగాక వెల్లవిరులు గావలదా

చ. 3: వద్ద నుండి తా నేఁడు వంకలెల్ల నొత్తఁగాను
అద్దుకొని ఆపె మాటలాడఁదగదా
ఇద్దరి శ్రీవేంకటేశుఁ డిటు మమ్ముఁ గూడఁగాను
వొద్దికై సవతులెల్లా నొక్కటి గావలదా

రేకు: 1552-1 ముఖారి సం: 25-247

పల్లవి: ముంచుకొంటే పొదులెల్లా మొగచాటౌనో యేమో
పెంచేవు వేడుకలు పెనఁగువడఁగను

చ. 1: గిలిగించే విటు నన్నుఁ గేరికేరి నవ్వుమని
పలుమారు నవ్వితేనుపాటివలదా
చలి వాసి మొక్కనంటా జంకించే వప్పటిని
చలి వాసితే వలపు చప్పనే కాదా

చ. 2: పెడరేఁచేవు సిగ్గులు బెట్టి కాఁగిలించుమని
కడుఁ గాఁగిలించితేను కాఁక పుట్టదా
విడువక కొసరేవు వింతచూపు చూడుమని
చిడుముడిఁ జూచితేనుచిత్తము నోనాఁటదా

చ. 3: నేరిపే వొక్కటొక్కటే నెయ్యపుమాటాడుమని
మారు మాటాడఁగఁబోతే మంకు రేఁగదా
యీరీతి శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
గారవించే విభియెల్లా ఘనతలుగావా

రేకు: 1552-2 శుద్ధకేశి సం: 25-248

పల్లవి: కాఁకల యెప్పటనుండి కాచుకున్నదో
మూఁకమొక్కులెల్లాను మొక్కీ నిదె నీకును

చ. 1: తమకించి రావంటాఁ దగ నీతో నలిగితే
క్రమ మెఱఁగి తానేల కదిసీ నాపె
అమరఁగ నఁ(నం?) తలో నిన్నట్టై కాఁగిలించుకొంటే
చెమటచేతులఁ దాను సేవసేసీ నీకును

చ. 2: దిక్కుల నీచేఁతలకు తిట్లు నేఁ దిట్టితేను
యెక్కువఁ దాఁజెవిలోన నిచ్చలాడీని
అక్కర నందుకుఁగాను అట్టె నేఁ బొదిగితే
మక్కువతో సారె నాకుమడిచిచ్చీ నీకును

చ. 3: నీవిచ్చినచనవున నీమోవి యానితేను
కావరానముట్టి వూడిగాలు సేసీని
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె ముసుఁ గిడుకొంటే
ఆవలఁదా మఱఁదల ననుకొనీ నీకును

రేకు: 1552-3 శంకరాభరణం సం: 25-249

పల్లవి: ఆసోదకాఁడవై యంటితివి ముందే
వేసర కెట్లా వేగిరించేవయ్యా

చ. 1: మందగొల్లెతలు మాఁటలాడే రదే
యెందరి కుత్తర మిచ్చేవయ్యా
విందులు వెట్టేరు వేవేలు మోవుల
యెందుకని వొగ్గేవేమయ్యా నీవు

చ. 2: నీరాణివాసాలు నీకు మోహించిరి
యేరీతిఁ జనవు లిచ్చేవయ్యా
కోరి యప్పటిని కొంగులు వట్టిరి
మేరతో నెట్ల మెప్పించేవయ్యా

చ. 3: పట్టపుదేవుళ్లు పైకొని రిప్పుడే
యెట్టొడఁబరచే వేమయ్యా
యిట్టె శ్రీవేంకటేశ నన్నేలితి
అట్టడి విందుకు దిట్టవయ్యా

రేకు: 1552-4 వరాళి సం: 25-250

పల్లవి: అతఁడే యెఱుఁగునూ అన్ని సుద్దులు
చేతిలోని దానని చెప్పరే విభునికి

చ. 1: దయగలవానికిఁ దప్పులెంచఁ జోటు లేదు
ప్రియపడేవానికి బిగియరాదు
నయగారివానిమతి నాఁటదు నిష్ఠూరము
క్రియ గూడఁదనకు మొక్కితి ననరే

చ. 2: తగులైన వానికి దండనుండి పాయరాదు
నగేవానికి పొంతనాలు గలవు
మొగమాడే వానిపై మోయ దపరాధము
అగపడితిఁ దనకు నాల ననరే

చ. 3: యేలినవానికి నేమెట్టున్నాఁ దనకుఁబోదు
లాలించేవానికి మొక్కలముదగదు
యీలీల శ్రీవేంకటేశుఁడిట్టె తానన్నుఁ గూడె
వేళావేళలఁదన్ను వేఁడుకొంటి ననరె

రేకు: 1552-5 సాళంగనాట సం: 25-251

పల్లవి: ఎక్కడ పరాకు నీకు నెఱఁగరాదా
నిక్కము వలపించేయెన్ని కలెల్లా నున్నవి

చ. 1: చెప్పఁబూఁచీ పిగ్గు లాపె చెవి యొగ్గరాదా
తప్ప కిట్టె కాఁగిలించేతమి వున్నది
చిప్పిల నేఁటికి దీరీఁ జేయీ చాఁచరాదా
వుప్పతిల్లఁ గరఁగించేవుద్యోగ మున్నది
తేనేమోవి యియ్యఁబూఁచీఁ దెరవేయరాదా
ఆనించి నిన్ను మెప్పించేఆస లున్నవి
నానవేసీ సరసము నవ్వు నవ్వరాదా
తానకమై నినుఁబొఁ(బొం?) దేతలపోఁత లున్నవి
ప్రేమ రతిఁ గూడఁబూఁచీఁ బిలువఁగరాదా
నీమనసురప్పించేనేరు పున్నది
యీమేర శ్రీవేంకటేశ యెనసితివి నన్ను నీ
వామగువఁ గూడితివి ఆగుఱుతు లున్నవి

రేకు: 1552-6 దేసాళం సం: 25-252

పల్లవి: వయసు మొయిలువంటిది వట్టిజాగేల
ప్రియము చేకొనరాదా పెరరేఁచీ నతఁడు

చ. 1: చలపాదితనమేల సంగడిఁ గూచుండవే
చలువుఁడు నీకొంగు చేరి పట్టీని
బలిమిఁ బెనఁగనేల పనులకు లోఁగావే
తెలిపి చెప్పి మాటల తీపు చల్లీని

చ. 2: గొప్ప రాఁగతనమేల కోరి విడెమియ్యవే
చిప్పిలఁగ వేఁడుకొని చేయొగ్గీని
ముప్పిరి సిగ్గిఁకనేల మోమెత్తి చూడఁగరాదా
వుప్పతిల్ల నవ్వునవ్వి వొడివట్టీ నిదివో

చ. 3: రట్టడితనములేల పట్టికూడి చక్కరాదా
యిట్టె శ్రీవేంకటేశుఁ డెనసె నిన్ను
గుట్టుసేసుకొననేల కూటమి మెచ్చఁగరాదా
నెట్టన నీ కిన్ని యును నేరపీ నొద్దికలు

రేకు: 1553-1 గౌళ సం: 25-253

పల్లవి: తోలుబొమ్మలము నీవే తొడరి యాడింతుగాక
యీలీల నుండిననేము యేమి సేతుమయ్యా

చ. 1: నేరువు గలిగికా నీతో మాటాడుట
కూరిమి గలిగికా కొసరుటా
సారమెఱఁగనయట్టి చప్పని వారము నేము
యీరీతి నూరకుండక యేమి సేతుమయ్యా

చ. 2: నీమన సెఱిఁగికా నిన్నుఁ గరఁగించుట
నేను మెఱిఁగితేఁగా నిన్నుఁ బొందుటా
చేముట్టి పెనఁగలేనిసిగ్గరివారము నేము
యీమేర నుండుముగాక మేమిసేతుమయ్యా

చ. 3: చనవరులమైకా సందులెల్లాఁ జేకొనుట
ఘనులమైతేఁగా కైకొనుటా
యెనసితివి శ్రీవేంకటేశ మమ్ము మన్నించి
యినుమడై యుందుంకాక యేమి సేతుమయ్యా

రేకు: 1553-2 బౌళి సం: 25-254

పల్లవి: నీవే బుద్ధిచెప్పవయ్య నేననఁ దగవుగాద
వావాత నింతిసి వరరఁ జేసితివి

చ. 1: నంటు నేసుకొని నీతో నయమునవే నవ్వి
గొంటరయాపె యేల కోపగించీని
బంటుబంటుతనమా పడితాళించవచ్చీని
దంటఁ జేసితివి నీవే తరుణి నింతేసి

చ. 2: చాయనేసుకొని నీతో సరసములాడితేను
ఆయము లేలె త్తీన అప్పటిఁ దాను
మాయలేల సేసీన మందు మంత్రవాదివలె
గాయగంటి సేసితివి కలికి నింతేసి

చ. 3: చవిచేసుకొని నిన్ను సఁ(సం?)గతిగాఁ గూడితేను
అవణించి తానేల ఆసచూపీని
యివల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
జవళి నన్ను నాపె సరవి నేసితివి

రేకు: 1553-3 ఆహిరి సం: 25-255

పల్లవి: నీ వింతేసి నేర్చితివి నీపతిని వలపించ
కావరము రేఁచేది నీకనుచూపే చెలియా

చ. 1: చక్కనినీవిభునికి చలము వుట్టించేదెల్లా
చెక్కుచేతితో డినీసిగ్గులే యమ్మా
అక్కజమై మీఁదమీఁద నాసలు వుట్టించేవి
మొక్కలు మొక్కేనీమురిపెమే చలియా

చ. 2: మచ్చికపతికి నీమర్మములు గరఁచేవి
మెచ్చులనీకుచముల మెఱుఁగే చెలీ
యిచ్చట నిన్ను మరిగి యెందునుఁ బాయనీనిది
యచ్చకపుమాఁటల నీయితవులే చెలియా

చ. 3: శ్రీవేంకటేశ్వరునిచిత్తము రప్పించేది
ఆవేళ నీరతులే అలమేల్మంగ
భావించ కాఁగిటఁ గూడి పంతము లిప్పించేవి
నీవేడుకలరతినేరుపులే చెలియా

రేకు: 1553-4 సామంతం సం: 25-256

పల్లవి: ఏల దూరీ నేల కొంకీ నేల వోలలు వేసీని
చాలుఁ జాలదని నే జరసేనటే

చ. 1: సిగ్గరితనముననే చేరి వుండేదానఁగాక
నిగ్గులఁ దనతో నేను నిష్టూరినటే
వొగ్గుచు మానాపతినై వోరుచుకుండుదుఁగాక
వెగ్గళించి తనతోను వేసరించేన టే

చ. 2: ఇలువరుస యెంచుక యిచ్చలో మెలఁగేఁగాక
చలములు తనతోను సాదించేనటే
వెలలేని వినయాలు వేవేలు చెప్పదుఁగాక
పలుమారు నాడరానిపంత మాడుదునటే

చ. 3: యిల్లాలితనముననే యెనసి వుండుదుఁగాక
మల్లాడి తనతో మారుమలతునటే
ఇల్లిదె శ్రీవేంకటేశఁ డిప్పడిట్టె నన్నుఁ గూడె
వొల్లనే యప్పటిఁ దను నొరసేనటే

రేకు: 1553-5 శుద్ధవసంతం సం: 25-257

పల్లవి: అందరివల్లా నీవే ఆరడయ్యేవనకాకా
పందెమడచినయట్టు పట్టియ్య నోపనా

చ. 1: నవ్వులకు నొకమాటు నన్ను నీవు చెనకితే
రవ్వలు సేసిరి నీరమణులెల్లా
జవ్వను లిందరిలోనా సాదులా తా మేమైనా
పువ్వకపూచె ననుచు పురిఁ జాటనోపనా

చ. 2: మచ్చికతో నీవు నేఁడు మాయింటికి వచ్చితేను
పచ్చిసేసేరు నీతొంటిపడఁతులెల్లా
నిచ్చనిచ్చా నీవిద్దయలు నేరనివారా తాము
గచ్చుల తమగు ట్టంగడి వేయనోపనా

చ. 3: కందువతో నవు నన్నుఁ గాఁగిలించి కూడితేను
నిందలు గట్టేరు యీనేలఁతలెల్లా
అందపు శ్రీవేంకటేశ అంగ్లు గారా తాము నీకు
మందగొల్లెతలనెల్లా మర్మాలెత్తనోపనా

రేకు: 1553-6 దేసాళం సం: 25-258

పల్లవి: నీజాడ లన్నియు నే నెఱఁగనా నీవు
వోజలు రెండుచోట్లా నొనరించే విపుడు

చ. 1: కాయకపు నవ్వులకు కడుఁ జల్లేవు మామీఁద
ఆయమైనమనసు నీకాపెమీఁదనే
చాయలు సన్నలు నిందు సారెసారెఁ జూపేది
చేయిమీఁదుగా నాకెఁ జేసేటిచేఁతలు

చ. 2: ఇచ్చకపుమాటలను యెలఇంచేవు మమ్మ
నిచ్చళవుసరసము నెరపే వందు
లచ్చనలకొనగోరు లలి మోపేవు మామీఁద
ముచ్చటఁ గాఁగిలినిండా ముంచియెత్తే వాపెను

చ. 3: పొరచికూటములఁ బొందితివి మమ్మను
నేరుపులరతులెల్లా నించితి వాడ
యీరీతి శ్రీవేంకటాద్రి నీటు గోవిందరాజవై
కూరిమి రెంటాఁ బెంచి కొసర నందేఁటికి

రేకు: 1554-1 ఆహిరి సం: 25-259

పల్లవి: నిన్నుఁ బొందినవారికి నేరమి యేది
సన్నల నందుకైనాను చన వియ్యవలదా

చ. 1: అంగన నీకుఁ జేసినయపరాధ మేమీ లేదు
చెంగి చెంగి రాకుండఁ జెల్లునా నీకు
వుంగరాలవేళ్లనే వొడివట్టి తీసె నిన్ను
సంగ తది దలఁచైనా చనవియ్యవలదా

చ. 2: సతి నీతో నలిగినసడి యించుకా లేదు
తతిఁ బరాకులు సేయఁదగునా నీకు
పతివంటా వేఁడుకొనీ పలుమారు చెక్కునొక్కి
సతమై యీమేలెంచి చనవియ్యరాదా

చ. 3: చలి నిన్ను నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడవని
యెలమి నీవలసేదే యెన్నికా నీకు
పలుమారు నీకు మొక్కి బాసలెల్లఁ జేకొనె
చలములు మాని యిట్టె చనవియ్యవలదా

రేకు: 1554-2 ముఖారి సం: 25-260

పల్లవి: చలియ దానే నిన్నుఁ జేరవచ్చెను
బలువుఁడ వౌదువు పంతగాఁడ వౌదువు

చ. 1: దవ్వులమండిననిన్ను దగ్గర రమ్మనుచును
జవ్వని పువ్వుల వేసి సన్న సేసెను
అవ్వల నీవే మరుసమ్ములంటా నొడ్డుకొని
పవ్వళించే విట్టే యింతీవానుపుమీఁదను

చ. 2: ఆకడిమోమైనవిన్ను నట్టె తన్నుఁ జూడుమని
యీకాంత కప్రాన వేసి యెచ్చరించెను
మేకొన చంద్రుని చలిమణుఁగురులని తోసి
చేకొని చంద్రగావిచీర గప్పకొంటివి

చ. 3: భ్రమసివుండిన నిన్నుఁ బట్టి తన్నుఁ గూడుమని
గుమితాన నవ్వు నవ్వి గోర నూఁదెను
నెమకి శ్రీవేంకటేశ నీభాగ్యచిహ్నలని
కమలాక్షి రతుల గక్కఁన గూడితివి

రేకు: 1554-3 భైరవి సం: 25-261

పల్లవి: ఇందుకేపో మోనమున నేమీ ననుకున్నదాన
ముందుముందే చెనకితే మొగచాటై వుండును

చ. 1: పిలిచితేరానిఁ బెనఁగులాటకుఁ జొచ్చి
బలిమినేయఁగబోతే పసురువేసు
నిలిచి మాటాడకుంటే నేరుపులు పచరించి
చలము సాదించఁబోతే చవిదప్పును

చ. 2: మొక్కితేఁ జూడనివాని మొగ మెదుటనే వుండి
పుక్కట నవ్వు నవ్వితే పులుసువేసు
అక(క్క?) రెరఁగకుండఁగా నాయము లంటియంటి
చక్కులు నొక్కఁగఁబోతే సెలవు లేదు

చ. 3: కాఁగిట నలసేవానిఁ గరఁగించఁబోతేను
వీఁగుచు నొగరొగరై వెగటువేసు
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
మాఁగినమోవియ్యకుంటే ముందువేసును

రేకు: 1554-4 దేసాళం సం: 25-262

పల్లవి: ఇంతి గుణనాథ్యురాలు యిటువలెఁ జేతురా
వంతులకు వచ్చినట్టె వచ్చుటగాక

చ. 1: పెద్దరికానఁ జెలియ పీఁటమీఁదఁ గూచుండఁగా
గద్దరితనాన నీవు కాఁతాళించేవు
కొద్దిమీరఁ జిన్నఁబుచ్చుకొని మోము వంచె ని
వుద్దండపుజం కెనల కోరుచునా యాకె

చ. 2: సిగ్గరితనానఁ జెక్కు చేతఁ బెట్టుకుండఁగా
బగ్గడితనాన నీవు పదరుదురా
వెగ్గళించలేక తానే వెలవెలఁ బుచ్చుకొనె
కగ్గునీబింకములకుఁ గలదా యాకె

చ. 3: గోలయై పానుపుమీఁద గుట్టున నట్టె వుండఁగా
పేలరివై కాఁగిట బిగియించేవు
లాలించి శ్రీవేంకటేశ లలన నిన్నుఁ గలసె
నీలావరితనానకు నేరుచునా యాకె

రేకు: 1554-5 శంకరాభరణం సం: 25-263

పల్లవి: అన్నీ మెచ్చుయ్యాని అందుకేమే
నిన్నటిసుద్దులు నే నెఱఁగనా

చ. 1: చలమునెరపేసాదవే నీవు
చెలులతో నేమి చెప్పేవే
ములుచతనపుముద్దరాలవే
నెలఁతరో నిన్ను నే నెఱఁగనా

చ. 2: చక్కనినవ్వులసానరాయివే
మిక్కిలి యేల నమ్మించేవే
చిక్కనసిగ్గులచింతకాయవే
నిక్కపునీసుద్ది నే నెఱఁగనా

చ. 3: తెగనమాఁటలతేనెవే నీవు
మొగము చూచేల మొక్కేవే
నగి శ్రీవేంకటోన్నతుఁడు నన్నేలె
నిగిడి నీగుట్టు నే నెఱఁగనా

రేకు: 1554-6 తెలుగుగాంబోది సం: 25-264

పల్లవి: ఏమోయి నన్ను నేరాలెంచఁగ దోసముగాదా
రామను నాతోడిదేల రావోయి నీవు

చ. 1: పిలువనా మాయింటికి ప్రియము చెప్పనా
సొలసి వూరకే దూరి చూచేవుగాక
వెలయ నీతో నవ్వనా విడెము చేతి కియ్యనా
చలములు పైపై నే సాదించేవుగాక

చ. 2: కొంగువట్టితియ్యనా కూరిములు నించనా
పంగించి యేలో యెగ్గుపట్టేవుగాక
సంగతిగా మొక్కనా సరసములాడనా
జంగిలివేసా లిటు చల్లేవుగాక

చ. 3: బలిమిఁ బైకొననా పట్టి కాఁగిలించనా
అలసితివేమో గోర నంటేవుగాక
అలరి శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
తలపించనా రతిఁ దనయవుగాక

రేకు: 1555-1 శంకరాభరణం సం: 25-265

పల్లవి: కల దీయింతికి గర్వాలు యెత్తి
పొలసీ నీవుట్టుపూర్వాలు

చ. 1: విడువ దె(దెం?)త్తైనా దుస్సీ నీ
పడఁతి నీమీఁద పంతాలు
బడిబడి నీపై నట్టె చాఁపీని
కొడిమచూపులకొంతాలు

చ. 2: క్రియగూడ నిన్నుఁ గిందుమీఁదు సేసీ
ప్రియురాలిఁ జూడు బీరాలు
రయమున నీరతికేలిలోనే
నియత నిన్నెంచీ నేరాలు

చ. 3: కలసి నిన్నిట్టె కాఁగిట ముట్టీని
అలమేలుమంగ ఆయాలు
యెలమి శ్రీవేంకటేశ సరసాన
తలఁగక యాడీ దాయాలు

రేకు: 1555-2 సాళంగనాట సం: 25-266

పల్లవి: అందు కేమయ్యా నే నడ్డమాడేనా
చంది వద్దనేనా చెనకేవు రతికి

చ. 1: పగటున నన్నునేల పైకొని వేడుకొనేవు
నగుత యెఱుఁగనా నాతో నీవు
జగడాలదాననా చనవరీకాంతను
తగవు నే నెఱుఁగనా నాతో నీవు

చ. 2: చెలిమిసేసి నన్ను చెక్కునొక్కే వప్పటిని
వలచు టెఱుఁగనా వడి నా(నీ?)కును
చలము సాదించేనా సలిగె గలదానను
తలఁపు నే నెఱుఁగనా దగ్గరేవు రతికి

చ. 3: కన్నుసన్నలనే చూచి కాఁగిటఁ బెనఁగే విదె
మన్నించే దెఱుఁగనా మంతనానను
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పన్ని కూడే దెఱుఁగనా పదరేవు రతికి

రేకు: 1555-3 నాదరామక్రియ సం: 25-267

పల్లవి: ఇన్నియు నిందే వున్నవి యెఱఁగుకో నీకు నీవే
నిన్ను నేమీ నననేల నీచి త్త మిఁకను

చ. 1: పలుకఁబోతే నీతో పంతములై తోఁచీని
కలఁగి వూరకుంటేను గర్వ మయ్యీని
సొలపులు నెరపితే సూడువట్టినట్టయ్యీని
నెలకొని వుండే నేను నీచిత్త మిఁకను

చ. 2: నగఁబోతే నీతోను నాఁటకమై తోఁచీని
పగటు చూపఁగబోతే బలిమయ్యీని
మొగమిచ్చ లాఁడబోతే మొఱఁగులై నిలిచీని
నిగిడి నే నుండఁగాను నీచిత్త మిఁకను

చ. 3: తప్పక కొంగువట్టితే దంటతనమై తోఁచీని
రెప్పలెత్తి చూడఁబోతే రేసువుట్టీని
అప్పుఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నెప్పునఁ గూడితి మిది నీచిత్తమిఁకను

రేకు: 1555-4 పాడి సం: 25-268

పల్లవి: ఎందాఁకానే సిగ్గు లెవ్వరికి సెలవే
కందువ నీనేర్పులకు కడమగాదా

చ. 1: పట్టరారు ముట్టరాదు బలిమినే పెనఁగేవు
యెట్టివే నీకుచములు యెందు కెక్కేనే
గుట్టునఁ బయ్యదలోన గూఁట వేసుకుండఁగాను
తొట్టుకున్నపాయానకు దోసమురాదా

చ. 2: చెప్పరాదు చూపరాదు చిమ్మిరేఁగి తిట్టేవు
ముప్పిరి నీమొలనూలు మూలదాఁచేవా
వుప్పతిల్లుమానము వొడిఁ బట్టుకుండఁగాను
అప్పుడే కన్నెరికాన కావతి రాదా

చ. 3: నగరాదు తెగరాదు నంటునఁ గాఁగిలించేవు
చిగురు నీమోవితేనె చిందనేఁటికే
జిగి నలమేల్మంగవు శ్రీవేకటేశుఁడ నేను
తగులైతి మింపులకుఁ దగవేకదా

రేకు: 1555-5 వరాళి సం: 25-269

పల్లవి: ఎంత రాతిమనసే యింతిరో నీది
ఇంత నిన్ను వేఁడుకొనే దిది చూడవలదా

చ. 1: బత్తినేసి మాటడఁగాఁ బదరకువే పతితో
చిత్తగించి వినరాదా చెలియ నీవు
హత్తినిన్నుఁ బాసెనంటా నదె చూచేవుగాని
యెత్తినచేతుల మొక్కేటిది చూడవలదా

చ. 2: చనవిచ్చి నవ్వఁగాను జంకించకువే నీవు
కనువిచ్చి చూడరాదా ఘాతలేఁటికి
మునుపనే రాఁడంటా మొరఁగే చూచేవు గాని
యెనసి పంతమిచ్చిన దిది చూడవలదా

చ. 3: నిన్ను నిట్టె కూడఁగాను నివ్వెర గందకువే
మన్నించరాదా ఇఁక మచ్చికాయను
అన్నిటా శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
యెన్నికతోఁ గలసితి రిది చూడవలదా

రేకు: 1555-6 బౌళి సం: 25-270

పల్లవి: సతు లిందరితోడాను సాములు సేసేనీతో
మతకాన నేమెట్టు మాటాడేమయ్యా

చ. 1: విన్నవించఁగానే నీవు వేగిరించే వింతలోనే
సన్నలు సేయఁగానే సాదించేవు
కన్నుల మొక్కఁగానే కరఁగించే వప్పటిని
యిన్నిటా నీకు త్తరువు లెట్టు చెప్పేమయ్యా

చ. 2: దగ్గరఁ గూడుండఁగానే తమకించే వింతలోనే
సిగ్గులు వడఁగానే చెనకేవు
వొగ్గి విడెమియ్యఁగానే వొడివట్టే వప్పటిని
యెగ్గుదీర నూడిగము లెట్టు సేసేమయ్యా

చ. 3: సెలవుల నవ్వఁగానే చెక్కు నొక్కే వింతలోనే
తలఁచఁగానే కాఁగిటఁ దగిలి
అలమేలుమంగను నే నట్టె శ్రీవేంకటేశుఁడ
యెలమి నన్నేలితివి యెట్టు మెచ్చేమయ్యా

రేకు: 1556-1 లలిత సం: 25-271

పల్లవి: ఏఁటికి దాఁచే విందు రెరిఁగినపనులివి
నీటుతో నానతియ్యవయ్య నీవు నాతోను

చ. 1: గక్కన నవ్వు నవ్వి కానుకిచ్చె నీ కాపె
యెక్కడి సుద్దులయ్యా ఇద్దరికిని
మొక్కుమొక్కి చెవిలోన ముచ్చట విన్నవించెను
నిక్క మాన తియ్యవయ్యా నీవు నాతోను

చ. 2: సళుపుఁజూపు చూచి సన్నసేసె నీకాపె
మెలుపు లెట్టివయ్య మీలోనను
పిలిచి పేరుకొన పెదవులు గదలించె
నలి చాన తియ్యవయ్య నీవు నాతోన

చ. 3: కొంగువట్టి తీసి నీకు గురుతులు దలఁపించె
సంగ తెటువంటిదయ్య సరస మీకు
అంగపు శ్రీవేంకటేశ అలమేలుమంగను నే
యింగిత మాన తీవయ్య యిట్టె నాతోను

రేకు: 1556-2 మంగళకౌసిక సం: 25-272

పల్లవి: సిగ్గువిడిచి పనులు సేతురా నీవు
వెగ్గళించి యీచేఁతనే వెలఁది చెప్పించెను

చ. 1: చెంతనుండి యాపె నీకు చేతుతెత్తి మొక్కి తేను
వంతులకుఁ జేసేవు వంచన నీవు
వింతవారు చూచితేను వెస నిన్ను నవ్వరా
యెంతటిది యిది యని యింతి నాడుకొనరా

చ. 2: పైకొనియాపె నీపై పదములు వాడితేను
ఆకడ నాపెపై పాఁ(ప?) దా లట్టె వాడేవు
దాకొని పొరుగు వారు తగ వింటేనే నవ్వరా
కాకుసేయించిననీకాంత వాడుకొనరా

చ. 3: అలమేల్మంగ నీపాదా లరతఁ గట్టుకొంటేను
పిలిచి యాపెను రానఁ బెట్టుకొంటివి
కలసి శ్రీవేంకటేశ కన్నవారే నవ్వరా
బలువురా లిదియని భామ నాడుకోరా

రేకు: 1556-3 బౌళి సం: 25-273

పల్లవి: అందుకే నేనూ నట్టే అందాలు సేసుకొంటి
ఇందుముఖుల బెల్లించ నెన్నఁడు నేరిచెనే

చ. 1: చలమున సాదించగా చన విచ్చినవాఁడాయ
సెలవిఁ దిట్టితే నవ్వులు సేసుకొనీని
పలుక కూరకుండితే భావము గరఁగె ననీ
యెలమి నిన్నేసివిద్య లెన్నఁడు నేరిచెనే

చ. 2: జంకించితే నాకుఁదాను సన్నసేసిన వాఁడాయ
కంకిగ వెంగెమాడితే కతసేసీని
బింకాన నేఁ జూచితేను ప్రియము సేసుకొనీని
ఇంకా మానఁడు మెచ్చి నెన్నఁడు నేరిచెనే

చ. 3: పెనంగితే నంతలోనే బెరసిన వాఁడాయ
గనముగా మొక్కితేను కాఁగిలించీని
మనసిచ్చి యలమేలుమంగను నేనేకనక
యెనసె శ్రీవేంకటేశుఁ డెన్నఁడు నేరిచెనే

రేకు: 1556-4 శ్రీరాగం సం: 25-274

పల్లవి: ఏమని చెప్పుదమమ్మ యీతనిసౌభాగ్యము
కోమలపుజవ్వనము గురుతై నట్టుండె

చ. 1: వొట్టుచుఁ గప్పురకాపు వూడిగపురవారెల్ల
అట్టె దేవునికి నలఁదఁగాను
దట్టముగ మంచితెల్లఁదా మోరపూవునను
ముట్టి అవయవముల(లు?) మొలచినట్టుండె

చ. 2: తనివొంది గిన్నెలతోఁ దట్టుపుణుఁగులు దెచ్చి
పానుపొందఁ దిరుమేనఁ బుయ్యఁగాను
పనివడి గొప్ప నిడుపాటి నేరేడుఁబండు
కనుపట్ట పురుషాకారమైనట్టుండె

చ. 3: అలమేలుమంగ నురమందుఁబెట్టి సొమ్ములెల్లా
పలువిధముల నించి భావించఁగాను
అలర శ్రీవేంకటేశుఁ డనెడి పుప్పొడిరాశి
వెలయ మరుఁడు ముద్రవేసినయట్టుండె

రేకు: 1556-5 సామంతం సం: 25-275

పల్లవి: ఎవ్వరెక్కుడో మీఇద్దరిలోన
జవ్వనమే పైఁజల్లి సొందిచె నిన్నును

చ. 1: తెలిఁగన్నులవాఁడవు తేటమాటలవాఁడవు
వలవకుందురా నీకువనితలెల్లా
చలమరికాంత యాకె చనవుగలది యాకె
మొలకనవ్వులనే మోహింపించె నిన్నును

చ. 2: ఇచ్చకపువాఁడవు ఇన్నిటాను జాణవు
మెచ్చకుందువా నిన్ను మెలఁతలెల్లా
నిచ్చపెండ్లికూఁతు రాపె నెయ్యము సేసిన దాపె
పెచ్చు రేఁగి ఇంపుల మెప్పించె నిదెనిన్నును

చ. 3: సేసచల్లేవాఁడవు శ్రీవేంకటేశుఁడవు
ఆసపడకుందురా అంగనలెల్లా
వేసర నలమేల్మంగ వివరి యన్నిటా నాపె
వాసిఁ గూడి యాసలలో వడి ముంచె నిన్నును

రేకు: 1556-6 పాడి సం: 25-276

పల్లవి: వట్టి నిష్ఠురమే ఇంతే వద్దే యింత
నిట్టచూపు చూచితేనే నీకుఁబాలు వచ్చీనా

చ. 1: పగటులు సారెసారెఁ బచరించి మాకు నీవు
తగవు లేమిచెప్పేవే తరుని నేఁడ
వొగి మంచితనాననే వొలపక్షా లాడేవు
నిగిడి యీకూటమిలో నీకుఁ బాలు వచ్చీనా

చ. 2: నెఱతనములు చూపి నీవు మీఇద్దరిలోనా
వొణగులు దిద్దేవు వువిద నీవు
కఱకటి నిచ్చలాడి కలయవేసేవు నిన్ను
నెఱమానవులలోన నీకుఁ బాలు వచ్చీనా

చ. 3: అలమేలుమగను నే నాతఁడు శ్రీవేంకటేశుఁ
డలుకలఁ దిద్దితివి అవునే నీవు
కలగొన మొక్కించి కాఁగిలించితి విట్టె
నెలకొన్న యీవేడుక నీకుఁ బాలు వచ్చీనా

రేకు: 1557-1 ఆహిరి సం: 25-277

పల్లవి: ఇద్ది మోహరసము లేరులై పారఁజొచ్చె
నిద్దురవోకున్న వాఁడు నీరమణుఁడు

చ. 1: సెలవి నవ్వినవ్వు చెక్కులవెంటఁ గారఁగాను
చెలి యేల పెట్టితివే చెక్కునఁ జేయి
జలజలఁ జెమటలు చెక్కుల వెంటఁ గారఁగా
నిలిచి చూచీ నదె నీరమణుఁడు

చ. 2: మురిపెపుజవ్వనము మొనచన్నులఁ గారఁగా
శిరసేల వంచేవేచెల్లఁబో నీవు
నిరతపుటాసలు నిలువెల్లాఁ గారఁగాను
నెరపీని సరసాలు నీరమణుఁడు

చ. 3: పిలుపు నీమాటలలో ప్రియమెల్లాఁగారఁగాను
అలమేలుమంగవుయేమనేవేనీవు
ఇల శ్రీవేంకటేశుఁడు ఇదె ని న్నురము మీఁద
నిలిపె ముద్దుగారఁగా నీరమణుఁడు

రేకు: 1557-2 వరాళి సం: 25-278

పల్లవి: నేరుపుతో నీదాననై నిండుకుండేను
వోరికొట్లు గొట్ట ని న్నో పమయ్యా

చ. 1: వాసికి రేఁచుక తిట్టి వంగివంగి మొక్కఁబట్టె
యీసుల నీతోడివాదులేలయ్యా మాకు
చేసూటి నీతోఁ బెనఁగి చెక్కులు నొక్కఁగఁబట్టె
వోసరించి నిన్నొరయనోపమయ్యా

చ. 2: కన్నులను జంకించి కడువేఁడుకొనఁబట్టె
యెన్నిక నీతోనలుగనేలయ్యా మాకు
పన్నినీతో మచ్చరించి పంతములియ్యఁగఁబట్టె
వున్నతితో మాట మీరనోపమయ్యా

చ. 3: చలముసాదించఁబోయి చవులు చూపఁబట్టె
యెలమినిను గద్దించనేలయ్యా మాకు
అలమేలుమంగను నేనదె శ్రీవేంకటేశుఁడ
వొలిసి కూడితిఁ బాయనోపమయ్యా

రేకు: 1557-3 పాడి సం: 25-279

పల్లవి: ఏమినేరుతునే నేను ఇన్నిటాఁ దాఁదేరినాఁడు
సాములు సేయఁ దనతో సరిదాననటవే

చ. 1: సరసానఁ దా నన్ను సన్నసేసి పిలిచితే
అరసి నేను గోర నంటనటవే
పొరిఁబొరిఁ దా నన్ను బొమ్మల జంకించి తేను
సరిగా నేను చలము సాదించనటవే

చ. 2: కోరి బెట్టిమాటలను కూరిమిఁదాఁ గొసరితే
తేరకొన నేఁ దన్నుఁ దిట్టినటవే
బీరమునఁ గొంగువట్టి పెనఁగి తాఁ బైకొంటే
తారుకాణగాఁ జన్నుల దాఁకించనటవే

చ. 3: తలయెత్తితా నన్నుఁ దప్పక చూచితేను
మెలుపుఁగన్నులనవ్వి మీరనటవే
అలమేలుమంగ నేఁదానట్టె శ్రీవేంకటేశుఁడు
కలసె నిందుకుఁదన్ను గద్దింతునటవే

రేకు: 1557-4 భైరవి సం: 25-280

పల్లవి: మగువ నేమీ నెఱఁగ మన్నించవయ్యా
అగడుసేసి నన్ను ఆయా లంటవలెనా

చ. 1: వాలుకచూపులు నీపై వంచఁజాలనంటినంటా
యేల నీవు నాశిరసెత్త్యేవయ్య
కాలు దాఁకీనంటా నిన్నుఁ గదిపి కూచుండఁజాల
పాలించి పయ్యదకొంగు పట్టి తియ్యవలెనా

చ. 2: సారెకు సెలవి నవ్వఁజాల భ్రమసేవంటా
కేరడాన యేల గిలిగేంచేవయ్య
దూరనేల నిన్నంటా తొడఁగి మాటాడఁజాల
మేరనుండవయ్య మందెమేళ మింత వలెనా

చ. 3: గక్కనఁ బెనఁగజాలఁ గడునలసేవంటా
ఇక్కువఁగూడితి రతి యింకా వలెనా
అక్కున శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
దక్కితివి నాపైని తమకము వలెనా

రేకు: 1557-5 దేసాళం సం: 25-281

పల్లవి: ఇన్నిటామూలము యీతనిరూపు
యెన్నఁగ నుపములకు నిరవైనట్లుండె

చ. 1: కమలనాభునికిఁ గప్పురకాపు మేన
సముచితముగఁ బైపైఁ జాతినపుడు
అమృతము దచ్చేవేళ అట్టె మనఁ దుంపురులు
తమితోడ నిండుకొని దట్టమైనట్టుండె

చ. 2: దైవశిఖామణికి తట్టుపుణుఁగు మేనను
చేవమీర నించి సేవసేయపుడు
వేవేలుగా యమునలో వేమారునీఁదులాడఁగా
కావిరి కాళిమ నిండాఁ గప్పినయట్టుండె

చ. 3: అలమేలుమంగతోడ నట్టె శ్రీవేంకటపతి
కెలమిసొమ్మువెట్టి యెంచినపుడు
కులికి గొల్లెతలను కూడఁగా గుబ్బలమీఁదఁ
గలపసపెల్లా వచ్చి కమ్ముకన్నట్లుండె

రేకు: 1557-6 పాడి సం: 25-282

పల్లవి: అంటి నిన్నుఁ బాయలేని దాపెతలనే వేగెనా
వెంటవెంటఁ దిరుగరా వెలఁదు లెల్లాను

చ. 1: తలకొని నీమోము తప్పకచూచితేను
వలవరా యెటువంటివనితలైనా
సెలవుల నేపాటైనా చిరునవ్వు నవ్వితేను
మొలవవా పులకలు మోపులకొలఁదులు

చ. 2: చనవుల నీతోను సరసములాడితేను
మనసులు గరఁగరా మగువలెల్లా
యెనసి నీతోఁగన యేపాటి మాటాడినాను
తనుఁదానె కాఁగిళ్ళు తగులుకోకుండునా

చ. 3: నివ్వటిల్లుతమకాన నీమేనుసోఁకితేను
నివ్వెరనుఁ బొందరా నెలఁతలెల్లా
రవ్వగా శ్రీవేంకటేశ రతి నలమేలుమంగ
యివ్వలఁ గూడినందుకు హెచ్చవా వేడుకలు

రేకు: 1558-1 హిజ్జిజి సం: 25-283

పల్లవి: ఎవ్వరిది నేరుపో యీాఇంతినీలోనను
జవ్వనపుమదముసాదించె నిన్నును

చ. 1: నిక్కినిక్కి చూపులనె నీమనసు గరఁగించె
చక్కెరమోవి చూపి చల్లె వలపు
చొక్కు నొక్కి బుజ్జగించి సిగ్గులు దేరిచె నీపె
పక్కన రేపల్లలోనబాలుఁడై నన్నిన్నును

చ. 2: సెలవుల నవ్వులనేచెమటలు పుట్టించె
పొలసి ఇచ్చకముఁ బులకింపించె
నెలకొన విడెమిచ్చి నిందురతులకుఁ దీసె
బలిమి యశోదయింట బాలుఁడై ననిన్నును

చ. 3: మంతనానకుఁ బిలిచి మరిగించె నిన్ను నిట్టె
పంతపుఁ జేఁతలనే పచ్చి సేసెను
యింతలో శ్రీవేంకటేశ యెనసె నలమేల్మంగ
బంతినే ఆవులఁ గాచేబాలుఁడైనన్నిన్నును

రేకు: 1558-2 ముఖారి సం: 25-284

పల్లవి: కంటివిగా వోయి నీకాంతలసుద్ది
దంటతనము(దాము(దమకించేరు

చ. 1: నిన్ను(జూచేపరాకున నివ్వెరగై నేనుండ(గా
సన్నలు సేసుకొనేరు సవతులెల్ల
యెన్ని కె నీ చేతలకు యిచ్చగించి నేనుండ(గా
అన్నిటా దామేమిటికి నబ్బురపడేరు

చ. 2: అంతలో నీమాటలే అలకించి నే విన(గా
ఇంతేసిగుజగుజలేల తమకు
ఇంతలో నీకు విడెమియ్య(గా(జూచిచూచి
వింతగా నప్పటినేల వెంగెమాడేరు

చ. 3: యేకతము లాడుతా నిట్టె వద్ద నుండ(గా
కాకుసేసి తామేల కా(తాళించేరు
కైకొని శ్రీవేంకటేశ కాగిట నేనుండ(గాను
మేకొని తామేటికి మెచ్చు మెచ్చేరు

రేకు: 1558-3 లలిత సం: 25-285

పల్లవి: కోరికలు కొనసాగె గోవిందరాజ
మేరమీరి ఇట్లానే మెరసితివా

చ. 1: బాలుఁడవై రేపల్లెలోఁ బాలుదాగేవేళ
యీలీలలనే పవళించి యిరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లెత లూఁచి పాడఁగా
ఆలకించి విని పాట లవధరించితివా

చ. 2: కొంచక మధురలోనఁ గుబ్బుఇంట నీలాగుల
మంచాలపైఁ బవళించి మరిగితివా
చంచులద్వారకలోన సత్య బామతొడమీఁద
ముంచి యీరీతి నొరగి ముచ్చటలాడితివా

చ. 3: పరియారువేలింతులపాలిండ్లు తలగడలై
పొందల నిటువలనే భోగించితివా
యెదుల శ్రీవేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదిరించక శ్రీభూమినీళలఁ గూడితివా

రేకు: 1558-4 సామంతం సం: 25-286

పల్లవి: దేవరవు గావా నీవు తెమలి యీపనులకు
కావరపువనితలు కదిసితేఁ జాలును

చ. 1: చెక్కులఁ గళలు మించె చేతులఁ జెమట నిండె
చొక్కపుఁజూపుల నాపె చూచితే నీకు
నిక్కెఁ బులకలు మేన నిద్దుర జారెఁ గన్నుల
జక్కన నాపె నీకుఁ బాదా లొత్తితేను

చ. 2: సెలవుల నవ్వు వచ్చెఁ జెంగలించె మోమెల్లా
సొలపుమాటల నాపె సోఁకనాడితే
నిలువెల్లా ముదమందె నెగడెఁ గోరిక మది
చలి వాయ మోవి యాపె చవిచూపఁగాను

చ. 3: చేరె నీకుఁ దమకము సిగ్గులు లోలో నణఁగె
కూరిమి నాపె నిన్నుఁ గూడఁగాను
యీరితి శ్రీవేంకటేశ ఇంపులాయ రతులెల్లా
గారవించి యాపె నిన్నుఁ గైకొనఁగాను

రేకు: 1558-5 ఆహిరి సం: 25-287

పల్లవి: ఇంతలోనే వేగిరముతేఁటికి నీకు
చెంతల నీపెచనవే చెల్లింతువుగాక

చ. 1: నగుతా నాడినమాట నాయములఁ బెట్టుదురా
జిగి నీయింతిని ముద్దు సేతురుగాక
నిగిడి సొలసేమాట నేరములు సేతురా
మొగమోడి ఆపెకు మొక్కు టింతేకాక

చ. 2: సరసమాడినమాట చలము సాదింతురా
సిరుల నన్నిట పెద్దసేతురుగాక
దొరతనపుమాటలకు దొమ్మి నీవు సేతురా
సురతపుమర్మములు సూచించుటగాక

చ. 3: వేడుక కాడినమాట వెంగెములు సేతురా
కూడి చనవులుగఁ జేకొందురుగాక
యీడనె శ్రీవేంకటేశ యెనసెనిన్నీ పెమాట
చూడఁజూడ నియ్యకొని చొక్కు టింతేకాక

రేకు: 1558-6 కాంబోది చిఅ సం: 25-288

పల్లవి: ఆకెచక్కఁదనము చూచట్టె నీవు భ్రమసితి
దాకొని చనవు లిచ్చి దండకు రారాదా

చ. 1: చెక్కుల చెమట గార చేతులెత్తి మొక్కీ నాపె
యెక్కడ పరాకై చూచే వేమయ్య నీవు
మొక్కలపుతేనె గార మోవినే విందులు చెప్పీ
ఇక్కువ నీ వెరింగి యియ్యకొనరాదా

చ. 2: కరఁగి కరఁగి చూచి కన్నులనే మేలు చల్లి
మరగీ నీకేమిటికి మంతనములు
శిరసువంచి నవ్వుల సిగ్గులకానుకలిచ్చీ
సరసతలను చేయిచాఁచఁగరాదా

చ. 3: ఆయములు సోఁకించి అట్టె కాఁగిట నించీ
పాయపుమదాన, నేల పలుకవిట్టె
చాయల శ్రీవేంకటేశ సతి నిన్ను దక్కఁగొనె
దాయివెట్టి రతెలెల్లా తలఁచుకోరాదా

రేకు: 1559-1 రీతిగౌళ సం: 25-289

పల్లవి: మగవానితో నింత మంకు గలదా
వొగరులుమానవే వోయమ్మ నీవు

చ. 1: వారివీరిమీఁదఁ బెట్టి వల్లెవాటుఁబయ్యదతో
వేరెవేరేనేరుపుల వెఁగెమాడేవు
నీరమణుఁ డానలెల్లా నీతోఁ బెట్టుకొనీ
వూరకుండఁబట్టదటె వొయమ్మ నీకు

చ. 2: పొరుగుకాంతలఁ జూపి పొందుగాఁ జేతులువట్టి
తరవు వారిపైఁ దోసి తమిరేఁచేవు
గరిమ నాతఁడై తేను గక్కన నిన్ను ముట్టీని
వొరయ నంతయేఁటికే వొయమ్మ నీకు

చ. 3: మేరమీరి వూడిగపువారిమీఁద నింద గట్టి
గారవించిఅతనినే కాఁగిలించేవు
ఆరయ దూరదురటె అట్టె శ్రీవేంకటేశ్వరు
వూరటలేక కూడి వోయమ్మ నీవు

రేకు: 1559-2 నారాయణి సం: 25-290

పల్లవి: గుట్టుగలవాఁడవంటాఁ గోరి నమ్మివుంటిమి
రట్టుసేతురా ఇంత ఇట్టె రమణులను

చ. 1: మంతనాన నీమోవిపై మచ్చికఁ జేసినచేఁత
యెంత వెల్లవిరిసేసే విందరిలోన
చెంతల మనసుగరఁచినచెమటలెల్లాను
పంతానఁ గాలువలుగాఁ బారింతురా

చ. 2: చలువై నరతిలోనిసాములరహస్యములు
వెలి నిట్టూర్పులుగాను వెళ్లవేతురా
తలఁపులోపలిమేలు తగిలినచొక్కులెల్లా
తెలిఁగన్నులయందునే దిష్టము చూపుదురా

చ. 3: గక్కనఁ గూడినయట్టి కాఁగిటిలో సిగ్గులెల్ల
మిక్కిలి సెలవులను మెరఇంతురా
ఇక్కడ శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
తక్కక యాసోదానఁ దమకింతురా

రేకు: 1559-3 ముఖారి సం: 25-291

పల్లవి: ముందే యెఱఁగవలె మోచివచ్చేపనులు
చెంది చేయిముంచితేను సిగ్గులేడ నుండును

చ. 1: వలదేలే చలము వనితకు నింతేసి
కలయక పోరాదు కాంతునితోను
పిలిచీ నాతఁడై తేను బిగిసేవు నీవైతే
బలిమి సేసితే మరి పంతమేడ నుండునే

చ. 2: మంకుఁదన మేఁటికే మానినికి నింతేసి
అంకెకు రాకుండేవా అతనితోను
వంకలాడీ నాతఁడైతే వాదించేవు నీవైతే
సంకెలేక పెనంగితే చలమేడ నుండునే

చ. 3: ఆరితేరి రవ్వలేలే అంగనకు నింతేసి
మారు నవ్వక మానేవా మగనితోను
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
గోరి గీరి చెనకితే గుట్టు లేడ నుండునే

రేకు: 1559-4 భల్లాటి సం: 25-292

పల్లవి: ఇదివో నీసరసము యీ౦తలు మో౦తలు నాయ
నదులాయఁ గరఁగుల నవ్వు లే౦టికయ్యా

చ. 1: వొడివట్టి పెనఁగితే పువిదకుచ్చల వీడె
తొడిఁబడఁ బట్టఁబోరే తురుము జారె
నిడుపులై ముంచుకొంటే నెరులే ముసుఁగాయ
నడుమఁ జిక్కు సిగ్గులు నవ్వు లే౦టికవయ్యా

చ. 2: మునుపఁ జెనకబోతే ముగింకెక్కెఁ జన్నులు
పొనిఁగితే మీఁదఁ గప్పె పువ్వుదండలు
మనసున నెంచ నవే మఱఁగుల తెర ఆయ
ననుపు కిందుమీఁదాయ మఱఁగుల తెర ఆయ

చ. 3: మలసి కాఁగిలించితే మనసు లేకములాయ
తెలిసి పొందితే మోవిఁ దేనె గారెను
కలసితి రిద్దరును గక్కన శ్రీవేంకటేశ
నలినలి ఆయ రతి నవ్వు లే౦టికయ్యా

రేకు: 1559-5 ముఖారి సం: 25-293

పల్లవి: కన్నవారినెల్లాఁ గూడి కతలఁ గరచితివి
నిన్ను దూరఁ బనిలేదు నీపాపమా

చ. 1: పలికి సారెసారెకు బాసలు సేసేవు నాతో
నెలఁత నీ కివియెల్లా నేరుపఁబోలు
మొలచినగుణముతో మునుపటివలె నుంటే
నెలకొని నాతోను నిజమాడవా

చ. 2: మొదలనే నీవు నాకు మొక్కలు మొక్కవచ్చేవు
సుదతి నీకు చేసూటి చూపఁగఁబోలు
చెదరక నీమనసు చేతికి లోనై వుండితే
సదరాన నీ వింత చంచలింతువా

చ. 3: కనుఁగొని బలిమినే కాఁగిలించవచ్చేవు
వనిత నిన్నిటులానే వంచుకోఁబోలు
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
ఇనుమడిబుద్ధులు నీ వెఱఁగనివా

రేకు: 1559-6 నాదరామక్రియ సం: 25-294

పల్లవి: రతికెక్కెఁ బనులు నీరప మాయను
మతకరినీమాటకు మారాడకుండఁగను

చ. 1: నాతో నీవునవ్వినవ్వినయగారితనాలనే
కాతరించి యంతలోనే కాఁగిలించేవు
నీతు లెఱుఁగుదువు నీనేరుపు మంచిదిగాదా
చేతికి లోనైనవారు సేవ గలుగఁగను

చ. 2: చెక్కులు మెల్లనే నొక్కి సిగ్గులెల్లా విడిపించి
మొక్కలాన దగ్గరి నామోవి యానేవు
వొక్కపొత్తు గలసె నీవోపిక మంచిదిగాదా
అక్కరతో సతులు నీయంకెకు రాఁగాను

చ. 3: బేసబెల్లి తనమున పీఁటమీఁదఁ గూచుఁడి
సేసవెట్టి పెండ్లాడి చిమ్మిరేఁచేవు
వాసితో శ్రీవేంకటేశ వైపుగ నన్నేలితివి
యీసరిత మావంటివారింపులు చల్లఁగను

రేకు: 1560-1 దేవగాంధారి సం: 25-295

పల్లవి: ఇదివో నీవు సేసిన యెమ్మెలు
గుదులాయ మోవిమీఁదికుమ్మెలు

చ. 1: కన్నులఁ జూచినప్పటికాఁకలు
అన్నిటాఁ జెలికిఁ గొమరాఁకలు
విన్నవించుదాఁకా విఱ్ఱవీఁకలు
మున్నాడీఁ బులకలమూఁకలు

చ. 2: చెక్కుల నీవుసేసినచేఁతలు
మొక్కలపుసవతుల మోఁతలు
యిక్కువవలపులెల్లా యీఁతలు
పుక్కిటిబంటితలపోఁతలు

చ. 3: సుదతిఁ బెట్టిన నీ చొక్కులు
చెదరని రతులలో చిక్కులు
యిదివో శ్రీవేంకటేశ యిద్దరి మిమ్ముఁ గూడించె
మొదల నాపెచేతిమొక్కులు

రేకు: 1560-2 శంకరాభరణం సం: 25-296

పల్లవి: ఆయాలు దొరలివచ్చినందులోననే
చాయలా సన్నలా సిగ్గు చల్లితేనే చాలదా

చ. 1: తాలిమిగలవారికి తమకించ నేఁటికి
చాలుకొని వచ్చితేనే చాలదటవే
వేళగాచేవారికి వెక్కసము లేఁటికి
సోలగిలఁ జెక్కుచేతఁ జూచినదే చాలదా

చ. 2: నేరుపుగలవారికి నీటు చూప నేఁటికి
మేరతో దగ్గరనుంటే మేలుగాదటే
దారకపువారికి దంటతనా లేఁటికి
చేరవచ్చి బుద్ధులెల్లా జెప్పితేనే చాలదా

చ. 3: సరసులైన వారికిసాదించనేఁటికి
ధర నిచ్చకమాడుటే తగదటవే
యిరవై శ్రీవేంకటేశు డేలె నన్నిందుకొరకె
సరిత లెరిఁగి మోవి చవిగొంటే చాలదా

రేకు: 1560-3 ఆహిరి సం: 25-297

పల్లవి: ఏల నాకు నానతిచ్చే వెందాఁకాను
వాలాయించి నీపొందు వాడికాయను

చ. 1: ముయ్యంచున నీవు నాకు మోహించినమోహమెల్లా
తియ్యని నీమోవియందే దిష్టమాయను
ఇయ్యెడ నీవు నాకు నిచ్చేటిచనవులెల్ల
చయ్యన నీనవ్వులనే సతమాయను

చ. 2: మచ్చికతో నీవు నన్ను మన్నించే మన్ననలెల్లా
కొచ్చి చూచేచూపులనే గురుతాయను
తచ్చి నీనాసంది తగులాయములెల్లాను
హెచ్చినసరసముల నిరవాయను

చ. 3: ఇట్టె నీవు నన్ను నెడయనిబాసలెల్లా
నెట్టుకొన్నరతులలో నిజమాయను
గట్టిగా శ్రీవేంకటేశ కలసిననీకూటమి
వొట్టిన యిచ్చకముల నుఁ(నుం?)కు వాయను

రేకు: 1560-4 వరాళి సం: 25-298

పల్లవి: ఎటువంటిదానవే యెన్నటికే మొగమోట
పటుగతి నీ కతఁడు పంతవియ్యఁగాను

చ. 1: తలవంచనేమిటికే తరుణి నీనాయకుఁడు
పిలిచి నీచేయివట్టి పెనఁగఁగాను
చలము లింకా మరియు సాదించనేమిటికె
వెలలేనివేడుకల వేఁడుకొనఁగాను

చ. 2: చింతించ నేమిటికె చెక్కు చేతనుఁజేర్చి
సొంత నాతఁడు నిన్నుఁ బొదుగఁగాను
ఇంత బిగువేమిటికే యెదుటనే నిలుచుండి
మంతనమున నినను మన్నించఁగాను

చ. 3: సిగ్గులివి యేమిటికే శ్రీవేంకటేశ్వరుఁడు
అగ్గమై కాఁగిటనే అలమఁగాను
యెగ్గు లేమిటికే నేఁ డిచట సంతోసముతో
వెగ్గళపురతులలో వెలయించఁగాను

రేకు: 1560-5 మాళవిగౌళ సం: 25-299

పల్లవి: ఆయనాయ నందుకేమీ ఆసోద మెంతైనఁ గద్దు
చేయి చాఁచి యింకానేల చెనకేవు నీవు

చ. 1: యెప్పటివాఁడేకావా యెన్ని బాసలు సేసినా
మెప్పించి మమ్మెట్లా నమ్మించేవు నీవు
కుప్పళించి యెఱ్ఱనుంటే కుంకుమ కస్తూరవునా
చిప్పిల మమ్మేల యిఁత చెనకేవు నీవు

చ. 2: యెన్నఁబోతే నీవేకావా యెంతపొందుసేసినాను
ఇన్నటా మాకెట్ల నీ వింపుసేసేవు
కన్నులకుఁ దెల్లనేం గందవొడి కప్రమౌనా
చెన్నుమీర నింకానేల చెనకేవు నీవు

చ. 3: యెంగిలైననీవే కావా యెంత రతిఁ గూడినాను
సంగతిగా మాకు నెట్టు చలిసేసేవు
సంగడి శ్రీవేంకటేశ జవ్వాది పుణుఁ గవునా
చెంగట నున్నాఁ డవేల చెనకేవు నీవు

రేకు: 1560-6 నాట సం: 25-300

పల్లవి: తిట్టితే నేమిసేతువు దేవరవైనా నైతివి
గట్టు వాయతనమునఁ గాలువొక్కేవు

చ. 1: చయ్యనఁ బరాకుమీఁద సకులతో మాటాడఁగా
పయ్యదకొంగు వట్టి భ్రమయించేవు
వుయ్యాలమంచముపై వూరకే వినోదించఁగ
గయ్యాళితనాన వచ్చి కాఁగిలించేవు

చ. 2: వెలయఁగఁ గొనగోళ్ళ వీణె వాఇంచఁగాను
మలసి యదరిపు మర్మమంటేవు
పొలుపుమిగుల నేను పువ్వులు ముడుచుకోఁగా
కెలపుఁజేతల నేమి గిలిగించేవు

చ. 3: ఇదివో ముచ్చటతో నే నేకతాన నుండఁగాను
కదిసి రతుల గూడి కరఁగించేవు
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చెదరక మొక్కఁగాను చెక్కునొక్కేవు

రేకు: 1561-1 రామక్రియ సం: 25-301

పల్లవి: సవతుల మింతేనేము సటలకు లోనయ్యేమా
రవళితో నేము మిమ్ము రవ్వసేసేమా

చ. 1: యీకడ నాకడాను యెదురుబడి బాసలు
ఆకెకు నీకే తగు నందు కేమయ్యా
సాకిరులేల పెట్టేవు సతులెరిఁగినపనే
దీకొనిమీగుణములు తిప్పవచ్చేమా

చ. 2: మత కాన మీలోనిమారుకుమారు నవ్వులు
అతివు నీకే తగు నందు కేమయ్య
చతురతేమిచూపేవు చల్లఁగా నన్నిఁ గంటిమి
కతకారిమీసుద్దులు కదనఁగలమా

చ. 3: ముందువెనకలఁ గూడేముయికిముయిరతులు
అందములే ఇద్దరికి నందుకేమయ్య
సందడి శ్రీ వేంకటేశ సరిగాఁ గూడితి మమ్ము
పందెమాడి మిమ్మునేముపచ్చిసేసేమా

రేకు: 1561-2 హిందోళం సం: 25-302

పల్లవి: ఇంతయేలే దోషమూ ఇన్నిటా ఘనుఁడు దాను
అంతలో నాకాళ్లేల అంటవచ్చీని

చ. 1: మచ్చరము మానితివనే మంకులు విడిచితినే
చెచ్చెర నీచెప్పినట్టు సేసేనే
ఇచ్చకములాడేనే ఇంక నేమీ ననవే
ఇచ్చట నాకేల పంతా లియ్యవచ్చీనే ఇంత

చ. 2: చలములు మానితివనే జవదాఁటనే ఇఁక
పలికినట్టే నేనూఁ బలికేనే
వలపు గానుకిచ్చేనే వాదు లడువనే ఇఁక
బలవంతమున నేల బాసలిచ్చీనే

చ. 3: తప్పు లిఁకఁ బట్టనే తనమాట గాదననే
యెప్పుడూఁ దనమన్నన లియ్యకొనేనే
వొప్పుగా శ్రీవేంకటేశుఁ డొనగూడె నన్ను నిట్టె
యిప్పుడే యెంగిలిమో వేలడిగనే

రేకు: 1561-3 ముఖారి సం: 25-303

పల్లవి: ఇంకనేల వెఱపులు యిన్నిటాను చలివాసె
సంకెలేక బొమలనే జంకించీనీఁకనూ

చ. 1: సతికి మాఁటలాడఁగ చనపు లిచ్చితివి
యితవై సేవకు వేళ లిచ్చితివి
వెతదీర నాపెకు విచ్చనవిడాయ నీఁక
మితిమీర నేముందర మెరసీ నిన్నిటాను

చ. 2: అంగన నవ్వులు నవ్వ ఆసలు వెట్టితివి
చెంగట సలిగెలెల్లాఁ జెల్లించితివి
అంగవించినరతుల నాపె రపమాయ నీఁక
సింగారాన రాజ్యము సేసీ నీవద్దనూ

చ. 3: మగువ నిన్నుఁ జెనక మన్నించితివిప్పు డిట్టె
పొగరురతులఁ గూడి బోధించితివి
నిగిడి శ్రీవేంకటేశ నాఁడాపెపంతము వచ్చె
పగటునమమ్మిట్టే బతికించీ నీఁకనూ

రేకు: 1561-4 కాంబోది సం: 25-304

పల్లవి: నీకు నాకు నొకఁడే నెయ్యమైన నాయకుఁడు
జోకలాయఁ బొందులెల్లా జోలి ఇఁక నేఁటికే

చ. 1: తమకించనుఁటికే తలపోఁతలెల్లాను
సముకాననే తేరీ సవతి వింతే
చెమటచేతుల మనచేతు లితఁడె పట్టె
భ్రమసితి మీతనికి పంతా లిఁకనేఁటికే

చ. 2: కాతరించనేఁటికే కావలసినపనులు
అతనివల్లనే తేరీ ఆండ్ల మింతే
యేతులమాటలనే యిద్దరిని బుజ్జగించె
ఆతుమలు దనిసితి మార డింక నేఁటికే

చ. 3: వేగిరించనేఁటికే వేడుకపడేవెలా
భోగములోనే తేరీఁ దోఁబుట్ల మింతే
యీగతి శ్రీవేంకటేశుఁడిట్టె నిన్ను నన్నుఁ గూడె
బాగుగా జోక్కిలి మిఁక పలునవ్వు లేఁటికే

రేకు: 1561-5 ధన్నాసి సం: 25-305

పల్లవి: కాంతలచేత నిన్నిటా కాయగావఁబోలు మేను
యెంతైనా బంకించడు యిచ్చగించీ నందుకే

చ. 1: సరస మెంతాడినాను సమ్మతించీనన్నిటికి
వెరవఁ డెందుకై నాను వేడుకకాఁడు
గొరబులుగా గోరకుమ్మెలువో నూఁదినాను
పెరరేఁచి సారెసారె ప్రియపడీ నందుకే

చ. 2: నవ్వులెన్ని నవ్వినానుననుపు సేసుకొనీని
వువ్విళ్లూరి జడియఁ డుబ్బరికాఁడు
కువ్వలుగా నురమున కుచములు దాఁకించినా
రవ్వలై సిగ్గువడఁడు రతికెక్కీ నందుకే

చ. 3: కాఁగిలెట్టు బిగించినా కరఁగీ లోలోననె
వీఁగక నన్నిట్టె కూడె వేగిరకాఁడు
చేఁగదేర్చినాను మోవి శ్రీవేంకటేశ్వరుఁడు
మాఁగనీఁడువలపులు మన్నించీనందుకే

రేకు: 1561-6 వరాళి సం: 25-306

పల్లవి: ఏఁటికి వేగిరించేరేయెఱఁగనిదాననటే
కూటమి గలుగుదాఁ కాఁ గొసరరాదు

చ. 1: బలువుఁడయినయట్టిపతితోడ సతులకు
చలము సాదించరాదు జంకించరాదు
వలవకతొలుతనేవాడికగాఁబేరుకొని
పిలువఁగ రాదు మరి బిగియారాదు

చ. 2: వెక్కసమయినయట్టివేడుక కాని నంత
కక్కసించరాదు మతి కరఁచారాదు
నిక్కిచూడకుండఁగాను నేరుపులు వచరించి
పెక్కుమాట లాడరాదు పెనఁగారాదు

చ. 3: చేతికిలోనైనయట్టి శ్రీవేంకటేశ్వరుని
కాతరించరాదు మరి కాదనారాదు
యీతఁడే నన్నిటు గూడి ఇచ్చకుఁడై వుండఁగాను
యేతులు నెరపరాదు యెలఇంచారాదు

రేకు: 1562-1 సౌరాష్ట్రం సం: 25-307

పల్లవి: కొండవంటిదొర దాను గోవిందరాజు తన
గుండె రాఇగాదా తొల్లి గోవిందరాజు

చ. 1: చేరి తనపాదాలు చేకొని పిసుకఁగానే
కూరిములు గొసరీని గోవిందరాజు
నేరుపుతోఁ జెప్పినట్టె నేము నిట్టెసేయఁగానే
గోరిచీని వలపలుగోవిందరాజు

చ. 2: చప్పుడు గాకుండానుసరసములాడితేను
కుప్పళించీ పెంజెమటగోవిందరాజు
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కఁగాను వచ్చిదేర
గొప్పగొప్ప మాటలాడీ గోవిందరాజు

చ. 3: గరిమల నిద్దరముఁ గాఁగిలించుకొంటేను
కురిసీ మోవితేనెలు గోవిందరాజు
ఇరవై శ్రీవేంకటేశుఁ డీతఁడే నేము గూడితే
గొరబుసేసీఁ జన్నులు గోవిందరాజు

రేకు: 1562-2 మాళవి సం: 25-308

పల్లవి: తల దడిసినపుడేచలి వాసెను
చెలరేఁగుటేకాకసిగ్గువడేవా

చ. 1: గొల్లెతలు నీవును గోకులములో నుండి
అల్లిఁ దామోరలవలె నల్లుకొంటివి
వెల్లవిరిగా నే నెంత వెంగెము లాడినాను
చెల్లుబడులేకాకసిగ్గువడేవా

చ. 2: అగడుగ మరియుఁ బదారువేలసతులతో
తగుఁదీగెలు మాఁకులై తగిలితివి
తగదనినే నెంత తప్పులు ని న్నెంచినాను
జిగిమీరుదువుగాక సిగ్గువడేవా

చ. 3: భావించఁగా నీ వప్పటిఁ బట్టపుదేవుళ్ళతోడ
పూవునుఁ బుప్పొడియ్యైపొందితివి
యీవల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చేవదేర నే నవ్వితే సిగ్గువడేవా

రేకు: 1562-3 దేసాక్షి సం: 25-309

పల్లవి: ఎంత చులుకఁగఁ జూదే వేమయ్య నీవు
కాంత నీపై వలపులుగడ్డెమువేసీనా

చ. 1: చనవు గలుగఁగానుసారెకుఁ గొసరీ నింతి
మనసు నీకురాకున్నమాటలాడీనా
చెనక రాఁగా నీచేతులుదాఁబట్టెఁగాక
వెనవెనకకుఁ బోతే వెన్నడించీనా

చ. 2: సమ్మతించి నీవుండఁగాసరసమాదె నీపె
కొమ్మ నీకువేసటైతే గోర గీరినా
రమ్మనఁగా నీతోడవై రమణి గూచుండెఁగాక
వుమ్మడి నీ వూరకుంటే వొద్దికి వచ్చీనా

చ. 3: కందువకునీవు రాఁగాఁ గాఁగిలించుకొనెఁ జెలి
పొందునీకు లేకుందితే భోగించీనా
విందుగా మోవియ్యఁగా శ్రీవేంకటేశ కూడెఁగాక
సందడి బరాకైతేచలపట్టీనా

రేకు: 1562-4 కన్నడగౌళ సం: 25-310

పల్లవి: ఎగ్గులుఁదప్పులు నెంచనేఁటికే నాకు
అగ్గలమై తనమేలు ఆతుమలోనుండును

చ. 1: వెలి నెవ్వతెవద్ద వేడుకతో నుండినాను
తలఁపులోనే వుండుఁ దా నాకును
పలుకు లెవ్వరితోడఁ బలుకుతా నుండినాను
చెలఁగి తనమాట నాచెవి సోఁక వుండును

చ. 2: నంటున నెవ్వరితోడనవ్వులు దా నవ్వినాను
అంటి నామోమునఁ గట్టినట్టే వుండును
దంటతనాన నెందెందు తప్పక తాఁ జూచినాను
సొంటులు సోదించి నన్నుఁ జూచినట్టే వుండును

చ. 3: గక్కననేకాఁ (కాం?) తలఁ గాఁగిలించి కూడినాను
ఇక్కడ నన్నుఁ గూడిన ట్టింపైవుండును
యెక్కువ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నునేలినాఁడు
తక్కక సంతోసముదక్కినట్టె వుండును

రేకు: 1562-5 పాడి సం: 25-311

పల్లవి: విన్నవించవలె నీకు వేడుకఁ దొలుదొలుతే
యెన్నిక సేసెఁజుమ్మీ యెగ్గుపట్టవలదు

చ. 1: నీవు మాటలాడినట్టె నేనూ మాటలాడితేను
తావిబెల్లములోఁ బంచరాచ చల్లుట
వోవరిలో నే నిందుకువుప్పనిచ్చనితిట్లు
యీవలనే నాడేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు

చ. 2: మొక్కిన నీ మొక్కులకు ముంచి నేనూ మొక్కితేను
మక్కళించి అల్లులుఁ దామర లల్లుట
చిక్కుదీరఁ గొనగొళ్ల చిమ్మిరేఁచి కొంత గొంత
ఇక్కువ లంటేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు

చ. 3: సిగ్గులమీఁద సిగ్గులు చేరి నేనూ నెరపితే
వొగ్గి ముత్యాలును వజ్రాలు నర్చించుట
అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
తగ్గక గర్వించేఁజుమ్మీ యెగ్గుపట్టవలదు

రేకు: 1562-6 బౌళి సం: 25-312

పల్లవి: మే మెఱఁగ మిటమీఁద మీకే తెలుసును
ఆముకొన్న సుద్దులెల ఆపె నడుగవయ్యా

చ. 1: చేరఁడేసికన్నుల చెలి నిన్ను నడిగెను
వూరకే జాణతనాలే వొరశాడీని
కెరడపునవ్వులతో కేలెత్తి మొక్కె నీకు
అరసీఁ గడమసుద్దు లాపె నడుగవయ్యా

చ. 2: కొండలంతలు చన్నుల కొమ్మ నిన్ను వెదకెను
దుండగపుమాటల దూకుచుండెను
పండు మోవితేనెలాపె పంతములు నెరపెను
అండ నేమిగికోకాని ఆపె నడుగవయ్యా

చ. 3: చక్కనివనిత నీపైఁ జల్లె వలపులెల్లాను
పిక్కటిల్లు ప్రేమములు పెంచి పొగడె
ఇక్కువెఱిఁగి శ్రీవేంకటేశ నీవు గూడితివి
అక్కజపు మేలెల్లా ఆపె నడుగవయ్యా

రేకు: 1563-1 సామంతం సం: 25-313

పల్లవి: ఇదివో నీవెలఁగవు యెంతటి దనేవు ఆపె
సదరాననే యన్నిటాఁ జలము సాదించెను

చ. 1: తేటపడ నింతి నిన్ను తిట్టు దిట్టదుగాని
గాటారింపుమాటలనే కల్లలాడెను
పాటించి ని న్నిందరిలో పంతము గొనదుగాని
చీటికి మాటికిఁ బంపు సేయించుకొనెను

చ. 2: చేయి చాఁచి నీమీఁదఁ జెనక దింతేకాని
ఆయము లంటుతానే అలయించెను
రాయడించి నిన్ను నిట్టె రవ్వసేయదనికాని
చాయలనే నీమోవి చప్పఁజేసెను

చ. 3: మెలుపున నీతోను మితిమీర దింతేకాని
కెలసి రతులనెల్లాఁ దిందుపరచె
కలసితి విటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
తొలుతనే యిపె నిన్ను దుష్టుఁ జేసెను

రేకు: 1563-2 పళపంజరం సం: 25-314

పల్లవి: వేవేలకు మాకు నింక వెఱవఁగ బనిలేదు
సేవలు నే మేమైనాఁ జేతుము నీకిఁకను

చ. 1: తాలిమిగలవాఁడవు తరుణులెల్లా నాడేటి
మేలములకెల్లా నీమే నోరుచును
చాలుకొని చిన్ననాఁడు సాముసేసినదియెల్లా
పాలుమలకుండా నేఁడు ఫలిఁచెను

చ. 2: ధీరుఁడ వౌదువు నీవు తెరవలాడే వెంగేల
మారుమాటలకెల్లా నీమన సోర్చును
దూరుగాఁగ శిశుపాలు తుచ్ఛపుమాటలచేత
వారివీరిలోన నలవవాటుసేసుకొంటివి

చ. 3: బలువుండ వౌదువు భామలచన్నులు మోవ
పలుమారు నీజవ్వనపాయ మోర్చును
అలమేల్మంగ నేలితి వందుకే శ్రీవేంకటేశ
తలఁప గోవర్ధనమందరము లెత్తితివి

రేకు: 1563-3 బౌళి సం: 25-315

పల్లవి: అట్టే కాని రారాదా అదదియుఁ జూతువు గాని
ముట్టి నా చన్నుల గోరు మోపఁగా నోపుదువా

చ. 1: మగిడి మగిడి నాతో మాటలాడవచ్చేవు
తగవుకు వచ్చేవా తప్పక నీవు
యెగసక్కేలకు నాతో నేలాటము లాడేవు
నగవులు నిజాలకు నవ్వఁగనోపుదువా

చ. 2: మొనసి నాతోను సాములు సేయఁజూచేవు
పెనఁగులాడ వచ్చేవా పిరి దూరి
ననుపులు సేసుకొని నన్ను నీవు గొసరేవే
చనవున నిట్టానే సరి దూఁగఁగలవా

చ. 3: కలసి మెలసి నన్నుఁ గాఁగిలించఁజూచేవు
బలిమి చూప వచ్చేవా పలురతుల
అలరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
చలపట్టి యేలితివి జవదాఁటేవా

రేకు: 1563-4 వేళావళి సం: 25-316

పల్లవి: సేసినవారికి మరి సేసినంతే పుణ్యము
దోసము లేదు నాయందు దూరకుమీ ఇఁకను

చ. 1: అదిగొని రమణుఁడు అంగనలతో నవ్వఁగా
సాదుఁదన మెక్కడిది సవతులకు
యేదెస వేసవియైతే యెండలు గాయకుండునా
తోదోపున మమ్ము నీవు దూరకుమీ ఇఁకను

చ. 2: నాలికాఁడై మగవాఁడు నానాదిక్కులు దొక్కఁగా
గోలతన మెక్కడిది కోమలులకు
వేళఁ జంద్రోదయమైతే వెన్నెల గాయకుండునా
తోలితోలి మమ్ము నీవు దూరకుమీ ఇఁకను

చ. 3: ఆనుక శ్రీవేంకటేశ అన్నగతులుఁ జెప్పఁగా
మౌన మిపు డెక్కడిది మాకెల్లాను
కానీలే పూచేవనము కాయలు గాయకుండునా
తూనికతోఁ గూడితివి దూరకుమీ ఇఁకను

రేకు: 1563-5 లలిత సం: 25-317

పల్లవి: నీకెప్పుడూ నీవోజ నాకైతే నావోజ
చేకొని యీరెండూను చెల్లు నిదే మనకు

చ. 1: యేమగువలమాట కెంత నీవు లోనైనా
నీమాటలోనిదాన నే నెప్పుడు
చేముట్టి నీ వెవ్వరిచేఁ జెనకించుకొనినాను
ఆముక నీచేతికి లోనైనదాన నేను

చ. 2: నంటున నేయింతులతోనవ్వులు నీవు నవ్వినా
గొంటరి నీనవ్వులకు గురి నేను
ఇంటింట నీవెవ్వరికి యిచ్చకములు సేసినా
జంటైనని కిచ్చకము జరపుదు నేను

చ. 3: కందువ నీ వేసతులకాఁగి కాసపడినా
అంది నాయాసలు నీపై నంటింతును
ఇందరి శ్రీ వేంకటేశ యెనసి నన్నేలితివి
పొందుసేసి నీతోను భోగించితి నేను

రేకు: 1563-6 దేవగాంధారి సం: 25-318

పల్లవి: పట్టరానివయసుతో బలిమి సేసేముగాక
యెట్టు నేఁడు బాఁగియ్యై రితరులు నీకు

చ. 1: భామినిమాటలెల్ల పంచమవేదము నీకు
ప్రేమపుమోవితేనె పెండ్లివిందులు
సాముసేసేటిగరిడి సతమైనకాఁగిలి
యేమిటికి మాటలాడే వెవ్వరితో నీవు

చ. 2: అంగనతోడి సరస మంకెల రాజ్యపదవి
సంగడినవ్వులు నీజన్మఫలము
ముగిటిధానాలు మొనగోరి సరసాలు
యెంగిలివలపులేల యెవ్వరితో నీకు

చ. 3: కాంతపురమె నీకు కందువ సింహాసనము
పంతపుకూటములే పట్టబద్ధము
ఇంతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యెంత కెంత సడ్డయేల యెవ్వరితో నీకు

రేకు: 1564-1 బౌళి సం: 25-319

పల్లవి: ఎటువంటి వాఁడవయ్యా ఇదేమయ్య
ఘనల నన్నేల గయ్యాళిఁ జేసేవు

చ. 1: కోరి ఇంటిలోనినన్ను కొలువులోనికిఁ బిల్చి
సారె ఇందరిలో సరసములాడేవు
వూరకే గుట్టుతోడనుండే నాచన్నులమీఁద
జీరలుగా గోర గీరి సిగ్గు విడిపించేవు

చ. 2: వూడగముసేసేనన్ను వోగిఁ దొడపై నిడుక
తోడుతోడ నీ విట్టే దొరకఁ జేసేవు
వాడినమోవితోడుత వంచిన నాశిర సెత్తి
యీడుజోడు లెంచ కిట్టె యెంగిలిసేసేవు

చ. 3: మానాపతియైననన్ను మరి పెండ్లిచవికలో
కానిమ్మనిసేసవెట్టి కాఁగిలించేవు
యీనయమున శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పూని ఇట్టె మన్నించి భోగించేవు

రేకు: 1564-2 సామంతం సం: 25-320

పల్లవి: చాలవా నీమన్ననలు సముకాన నివె మాకు
కేలు చాఁచి కొసరేనాకిమ్ముల నింకాను

చ. 1: ఆదికొని నీవు నాతో నట్టె యేల పెసఁగేవు
కాదంటినా నీతో పొందు కలకాలము
పోదితో నప్పటినేల పొదిగి వేఁడుకొనేవు
సాదించేనా నీతో చలము లింకాను

చ. 2: గుట్టుగోడ నీవేల కొంగుపట్టి తీసేవు
వెట్టిచుట్టాలమా నిన్ను వేసరించను
బట్టబయల నింతేల పైపైఁ దమకించేవు
తట్టి నామనసు నీకు దాఁచేనా ఇంకాను

చ. 3: కందువ లాలించి యేల కాఁగిట బిగించేవు
నింద లెంచి తప్పు మోపి నిన్ను మీరేనా
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
అందుకోలుజాణతనా లాడేనా ఇంకాను

రేకు: 1564-3 దేసాళం సం: 25-321

పల్లవి: నన్ను జూచి నీవేమి నవ్వేవిక
సన్నల జాయల నీకు జయమాయనే

చ. 1: వేలివుంగర మిచ్చెను విభుడు నీ కిప్పు డిట్టె
యేలవమ్మ సవతుల నిందరి నిక
పాలించె గప్రబాగాలు పలుమారు నింతలోనె
చాలుకొన్న కాంతలను సాదించవే

చ. 2: బల్లిదుడు సరిగద్దెపై గూచుండబెట్టుకొనె
చెల్లెండ్లకు బనులు చెప్ప గదవే
అల్లదె నీతో నవ్వి అపమిచ్చె నీ కిన్నిటా
చెల్లు మాచె వూడిగాలు సేయించుకోవే

చ. 3: శ్రీవేంకటేశుడు నీచేయి వట్టి పెండ్లాడె
లావుల బట్టపుదేవులవు గావే
యీవల నాకాగిటను యీత డిరవయినాడు
కైవశమై మాకెల్లా గర్తవైతివే

రేకు: 1564-4 ఆహిరి సం: 25-322

పల్లవి: నీవల్ల దోసము లేదు నేనే వయోమదమున
సేవలు సేయక గుట్టు సేసితిగాన

చ. 1: చనవెల్లా నిచ్చితివి సముకాన నీవు నా
మనసులోనిదే కడుమంకుగాని
పెనగితి వింతేసి ప్రియపడి, నేనే నీకు
చెనకజాలక బిగిసితిగాని

చ. 2: సిగ్గులెల్ల దేర్చితివి చేయి వట్టి నీవైతే
వెగ్గళించి విదిలించి వేసితిగాని
దగ్గరి పొదిగితివి తమకాన నన్ను నిట్టె
కగ్గుదేరి వూరకె కైకోనైతిగాని

చ. 3: ఆదరించి కూడితివి అన్నిటా శ్రీవేంకటేశ
ఆదిగొని పంతాలు నే నాడితిగాని
నీదయెల్లా నించితివి నిండా నాపై నిట్టె
సాదించి వేడుక నిన్ను జట్టిగొంటిగాని

రేకు: 1564-5 నాదరామక్రియ సం: 25-323

పల్లవి: బుద్ధిచెప్పవయ్య నీవు పొరుగులవారికెల్ల
పొద్దు వోచా అటువంటి పొలతులకెల్లను

చ. 1: చెంగట నీకు నేను సేవ చేసుకుండగాను
యెంగిలిరతి కెవ్వతానేల వచ్చీని
కంగులేక నీవు నేను కాపిరము సేయగాను
అంగడిజాణతనాల కదేమి గారణము

చ. 2: ప్రేమముతో నీపెండ్లి పీటపై నే గూచుండగ
సామజయానలేల సన్నసేసేరు
దీమసాన నీపట్టపుదేవులనై వుండగాను
ఆమనిపచ్చలవల పదెమి గారణము

చ. 3: శ్రీవేంకటేశ నీచేయి నే బట్టుకుండగా
వేవేల కెవ్వరికేల వేగిరములు
కైవశమై నీవు నన్ను గలసి మెచ్చు మెచ్చగా
ఆవలివారినవ్వు లదేమి గారణము

రేకు: 1564-6 రామక్రియ సం: 25-324

పల్లవి: ఊరకుండుమనవే వొద్దు వొద్దు వేగిరము
పేరఁబెట్టుకొంటి నింతే ప్రియమైనవలపు

చ. 1: తా నాకు మేలువాఁడు తనకు నే మేలుదాన
ఆనలు వెట్టఁగనేఁటి కందిరలోన
నే నెఱఁగనా తననిజము లన్నియును
నానఁబెట్టుకొంటి నింతే నవ్వులకు వలపు

చ. 2: సేసవెట్టినాడు తాను చేఇ వట్టి పెండ్లాడితి
బాసలు సేయఁగనేలే పలుమారును
అసపడ్డదాన నేను అన్నిటా జాణ తాను
రాసిచేసుకొంటి నింతే రవ్వయినవలపు

చ. 3: అట్టె శ్రీవేంకటేశుఁడల డలమేలుమంగ నేను
పట్టి పెనఁగఁగనేలే పంతము లిచ్చి
నెట్టన తా నన్నుఁ గూడె నే మెవ్వరందు లేదు
గట్టిసేసుకొంటి నింతే కందువైనవలపు

రేకు: 1565-1 ఆహిరి సం: 25-325

పల్లవి: నేవీ దయదలఁచేవు నేను వేగిరించనేల
యేవిధాననైనా నీకు నిచ్చలాడేనా

చ. 1: బలిమి సేయఁగనోప పంతములాడఁగనోప
వలపు నీపైఁ జల్లి వద్ద నుండేను
చలము సాదించనోప సారె వేసరించనోప
యెలమి నీకుఁ జేతులెత్తి మొక్కేను

చ. 2: నేరము లెంచఁగనోప నెపములు వేయనోప
మేరతోడనేనవ్వి మెచ్చే నిన్ను
కేరడా లాడఁగనోప కెలసి జంకించనోప
కూరిమి గొసరి నీకొలువు సేసేను

చ. 3: సిగ్గులు వడఁగనోప చితింప మరియోప
యెగ్గులేక నిన్నుఁ గూడి ఇరవయ్యేను
అగ్గలమై శ్రీవేంకటాధిప నన్నేలితివి
వొగ్గి నీమాటల కెల్లా నూఁకొనేను

రేకు: 1565-2 సాళంగం సం: 25-326

పల్లవి: ఇంచుకంత సిబ్బితి లేదేమే నీకు
కొంచక యెలయింతురా కొలువతో విభుని

చ. 1: కలసేయప్పటివేళ కాఁగిలించుకొంటగాక
మలసి తమకింతురా మగవానితో
పిలిచినప్పటివేళ ప్రియాలు సేతురుగాక
బలుములు చూపుదురా పంతగానితోను

చ. 2: చేయి చాఁచినప్పుడే సేవలు సేతురుగాక
రాయడులు సేతురా రమణునితో
ఆయములంటినవేళే అంకెకు వత్తురుగాక
కాయ మలఇంతురా ఘనుఁడైన వానిని

చ. 3: రతిసమయమునవే రచన చూపుటగాక
కతలు చెప్పుదురా కాంతునితో
ఇతవై శ్రీవేంకటేశుఁ డితఁడే నిన్నుఁ గూడె
తతిఁ గొసరుదురా తనఇచ్చు వానిని

రేకు: 1565-3 శ్రీరాగం సం: 25-327

పల్లవి: విన్నపము వినవయ్య వేసరుకోకువయ్య
వెన్న లారగించవయ్య వెస నున్న నుండును(?)

చ. 1: కొప్పు జారెఁగదవయ్య కోనతిరువెంగళప్ప
ఇప్పుడే యెవ్వతె నన్ను నంత సేసెను
పిప్పి సేసి మోవి ప్రియానవే తేనె లాని (నె?)
కప్పురు వేసుకొమ్మీ దప్పి గొనకుండును

చ. 2: గోరు మేన నున్నదయ్య కోనతిరువెంగళప్ప
యీరీతి నిన్ను నెవ్వెతె ఇంత సేసెను
సారెకుఁ జెమరింపించె చన్నుల నొత్తి మేను
కోరి విసరించుకొమ్మీకొంచి నానకుండును

చ. 3: కూడెఁగదయ్య కళలు కోనతిరువెంగళప్ప
యీడనే యెవ్వతె నిన్ను ఇంత సేసెను
వేడుకతోనేలితి శ్రీవేంకటేశుఁడనే నన్ను
వీడెము సేసి నాకిమ్మీ వేసటగాకుండును

రేకు: 1565-4 సామంతం సం: 25-328

పల్లవి: ఇంతలో విచారము లిట్టుండెను
పంతాలు దున్నకముందే పంట పండెను

చ. 1: చండి హిరణ్యాక్షనితోడ సరసములాడఁగా
అందనుండే చెలి మారుగొండ లెక్కెను
కొండుకపాయాన నొంటి గుహలో? గూచుండఁగాను
దుండగము సేసేవంటా తొడ యెక్కెను

చ. 2: పాడితోఁ బగర గెల్చి పారుపత్యాలు సేయఁగా
యీడనేసరిగద్దె నెదురెక్కెను
యీడులేనిదొరవైయెడ మిచ్చుకుండఁగాను
తోడివారికంటే ముందు తొడ యెక్కెను

చ. 3: వెల్లవిరిఁ బ్రహ్లాదునివినుతులు వినఁగాను
వొల్లనే సంతతము నీవుర మెక్కెను
అల్లదె శ్రీవేంకటేశ అహోబలాననుండఁగా
తొల్లిటినీలకిమమ్మ తొడయెక్కెను

రేకు: 1565-5 దేసాళం సం: 25-329

పల్లవి: అప్పటి నవ్వేవు ప్రహ్లాదవరదా
అప్పసపుకాంతలప్రహాదవరదా

చ. 1: కన్నవిన్నసతులెల్లా కంకిసేసినా నొర్చితి
వన్నిటా శాంతుఁడవుప్రహ్లాదవరదా
న న్నొడఁబరచనేల నయగారిమాటల నీ
వన్నట్టే ఆయనుప్రహ్లాదవరదా

చ. 2: లాసుక యెంగిలి మోవులకు నోరు దెరచేవు
ఆసోదకాఁడవయ్యు ప్రహ్లాదవరదా
రాసికెక్కి నాచెవిలో రహస్య మానతిచ్చేవు
ఆసుద్దు లెఱఁగనా ప్రహాలదవరదా

చ. 3: చెంది యహోబలమున శ్రీవేంకటాద్రిమీఁద
అంది పెండ్డాడితివి ప్రహాదవరదా
మందెమేళమున నిన్ను మచ్చికతోఁ గొసరితే
అందాల మెచ్చితివి ప్రహ్లాదవరదా

రేకు: 1565-6 లలిత సం: 25-330

పల్లవి: ఏలల దాఁచేరు వలపు లిందరు నెరిఁగినదే
వాలాయించినపనికి వాసివంతు లున్నవ

చ. 1: సిగ్గువడనేమిటికి చేతికి లోనై వున్నది
అగ్గలము నవ్వరాదా ఆపెతోను
వెగ్గళించి మాముందర వేసాలు చేసేవుగాక
అగ్గమై యేకతవేళ నడ్డాఁకలున్న వా

చ. 2: తలవంచనేమిటికి తారుకాణై వున్నది
సొలసి నీకాంక్షదీరఁ జూడఁగరాదా
కొలువులోపలఁగాఁగా గుట్టు నెరపేవుగాక
మెలఁగి పానుపుమీఁద మితిమీర లున్నవా

చ. 3: ఆస దాచ నేఁటికి ఆయము సోఁకివున్నది
సేసవెట్టి కూడరాదా శ్రీవేంకటేశ
దోసము లేదంటాఁగా దొమ్మినిందరిఁ గూడితి
లాసినయారతివేళలను పంతాలున్న వా

రేకు: 1566-1 భూపాళం సం: 25-331

పల్లవి: నీ వెఱఁగనిదా యేమి నేనెంత విన్నవించే
కైవశమై వుండఁగానే గయ్యాళిఁ జేసేవు

చ. 1: నగితేను నీతోను నంటు నటించఁగ వద్దా
మొగము చూచితేను మొక్కవద్దా
పగటునఁ బేరుకొంటే పైపైనూఁ కొనవద్దా
వెగటున మమ్మేల వీరిడిఁ జేసేవు

చ. 2: మన్నించితే నీతోను మాటలాడనైనవద్దా
కన్నుసన్నలు చేసితేకరఁగవద్దా
చన్నులు నీ వంటఁగాను జంకించనైనవద్దా
ఇన్నిటా మమ్మిందుకేల యెడ్డలఁ జేసేవు

చ. 3: చెనకఁగ నీతోను చెలిమి సేయఁగవద్దా
పెనఁగితే నించుకంత బిగియవద్దా
యెనసితివి శ్రీవేంకటేశ చమ్మటూరిలోన
తనియక మమ్మునేల దంటలఁ జేసేవు

రేకు: 1566-2 ధన్నాసి సం: 25-332

పల్లవి: రావే యెక్క డిసుద్ది రాఁపుసేతురాపతిని
సేవలు చిత్తమురాదు సేయఁగదవే

చ. 1: చిగురులోపలిచెఁగ చిత్తములోపలికాంక్ష
మొగములోఁగళలై మొలచెఁగదే
యెగసక్కెమాడెనటె యెఱఁగనటె నేను
మగనితో నలుకలు మానఁగదవే

చ. 2: పాలమీఁదిమీఁగడ పాయములోనిమదము
జాలువారీఁ జెమటలై చన్నులఁ గదే
యేల నీతోఁ జలమటె యిచ్చక మెఱఁగనటె
కాలుదొక్కి వుండఁగాను కాఁతాళించనేఁటికే

చ. 3: కనకముతోనవన్నె కాఁగిటిలోని ప్రియము
కనుచూపువేడుకలై కలిగెఁగదే
యెనసె శ్రీవేంకటేశు డిద్దరికిఁ జెలిఁగదే
ననుపై మీరిట్టె మీలో నవ్వఁగదరె

రేకు: 1566-3 ముఖారి సం: 25-333

పల్లవి: ఆఁటదాని కోపవా అంతేసి నీవు
యీటువెట్టి సలిగె నీ విచ్చినదే కాదా

చ. 1: చలములేని మగువ సాదించ నోపునా
వలెనని యాపె నీతో వాదించీఁగాక
బలిమి లేకుంటేను పంతమాడనోపునా
కలుగఁగానే నిన్ను గద్దించెఁగాక

చ. 2: నేరుపులేని మగువ నీతో పొందుసేసునా
చేరి యందుకొరకె చెనకీఁగాక
బీరములేని యాపె పెనఁగఁగ నోపునా
దీరత సాదజముగాన దీకొనెఁగాక

చ. 3: ననుపులేని మగువ నవ్వ నీతో నోపునా
వొనరఁగానే చన్నుల నొత్తీఁగాక
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వెనక కిందుకే యాపె విడె మిచ్చెఁగాక

రేకు: 1566-4 సాళంగనాట సం: 25-334

పల్లవి: మారుమాట లాడకురే మగుడ నాతనితోను
చేరి చెప్పినట్టెల్లాఁ జేసే నేను

చ. 1: చలపాదితనమే సాజమైనవాఁడు
వలచితే విడుచునా వనితలను
పెలుచుఁదనాలకెల్ల పెంటవట్టయినవాఁడు
వొలిసి విరహమున కోరువఁగలఁడా

చ. 2: వుద్దండపుచేఁతలకే వొడిగట్టినవాఁడు
గద్దించితే మానునా కాంతలనెల్ల
పొద్దుపొద్దు మాయలచే పోదికాఁడయిన వాఁడు
అద్దుకొన్న ప్రియాలెల్లా నాడి పొందకుండునా

చ. 3: తమకమే వొకరూపై తనివినొందని వాఁడు
జమళిఁ గూడకుండునా సతులఁగంటే
అమర శ్రీవేంకటేశుఁ డన్నిటా నన్ను నేలె
సమమోహములు పైపైఁ జల్లుకొనవలదా

రేకు: 1566-5 దేసాళం సం: 25-335

పల్లవి: అందరి నడుగవయ్య అదేమని
సందడి నొకరొకరు సన్నలు సేసేరు

చ. 1: పలుమారు నీవు నాకు బాసలెల్లాఁ జేయఁగాను
నలువంకల సతులు నవ్వేరు నిన్ను
కలయ నాగుబ్బలపై గందము పూయఁగాదు
చలి వాసి తామేల జాణతనాలాడేరు

చ. 2: అట్టె నీవు విడెమిచ్చి అసలు చూపఁగాను
దిట్టతనముననదె తిట్టేరు నిన్ను
గుట్టున నీవు కొప్పు దువ్వి ముడువఁగా
పొట్టఁ బోరుగున నుండి పొగడ వచ్చేరు

చ. 3: గక్కన నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగాను
చొక్కుచు సోలుచు వచ్చి చుట్టా ల య్యేరు
చిక్కితివి కడపలో శ్రీవేంకటేశ్వర నాకు
మక్కువతో నీదిక్కు మగిడి చూచేరు

రేకు: 1566-6 హిందోళ వసంతం సం: 25-336

పల్లవి: వింతదాననా నేను వేమరు నింత సేయను
అంతరంగమే నేను అడ్డమాడ ననవే

చ. 1: తలపోఁతలేకావా తమకములు రేఁచేవి
చలములే కావా మతిసాదింపించేవి
నిలువు మొక్కులేకావా నివ్వెరగుఁ బొదించేవి
అలసితి నన్నాను అంతకోపననవే

చ. 2: సిగ్గరితనమేకాదా చేతికి లోను సేసేది
కగ్గనినవ్వులేకావా కాఁక రేఁచేవి
వొగ్గినమాఁటలేకావా వొడివట్టి తీయించేవి
అగ్గమై వుందాననిఁక సంతకోపననవే

చ. 3: కందువ చూపులేకావా కాఁగిటఁ బెనఁగించేవి
సందడి వలపేకాదా చవిసేసేది
యిందుకె శ్రీ వేంకటేశుఁడింటికి విచ్చేసి కూడె
అందమాయ వేఁడుకొనీ నంతకోపననవే

రేకు: 1567-1 శంకరాభరణం సం: 25-337

పల్లవి: ఔనయ్య మరి యడుగనేఁటికి
నాని వయసులు నయము లెచ్చె

చ. 1: కొలువులోపల కొమ్మ మాఁటాడితే
నిలువెల్లా నిదె నీకుఁ జెమరించె
చెలు అది చూచి సిగ్గులు పడిరి
చలి వాసె నేఁడు జంటవలపు

చ. 2: సరసము నీతో పతి యాడితేను
గొరబాయ నీమెయి గోరిచెనకులు
పొరుగువారెల్ల చూచిరి
తెర దీసె నిదె తెగ నాసలు

చ. 3: కాఁగిటిలో నిన్ను కాంత గూడితేను
మాఁగి నీమోవి మంచితేనె చిందె
ఆఁగిరి శ్రీవేంకటాధిప సవతులె
యేఁగుఁబెఁడ్లి సేసె నీడనే రతుల

రేకు: 1567-2 కన్నడగౌళ సం: 25-338

పల్లవి: మన్నించువమనవే మమ్మేల పైకొనుమనీ
చన్నుల నొత్తఁగాను చలము లెట్లుండునో

చ. 1: తప్పక తనుఁ జూచితే తనువెల్లాఁ జెమరించె
యిప్పుడే మేలమాడితే నెట్లుండునో
చిప్పిల వొద్దికి రాఁగా సిగ్గులెల్లా వెడజారె
తప్పి చేయి దాఁకితేను తమకా లెట్లుండునో

చ. 2: మంచిమాఁటలాడితేను మనసెల్లా వెరగందె
యుంక కొంగు వట్టితే యెట్లుండునో
వంచనతో నొరసితే వలపులు చిమ్మిరేఁగె
కంచముపొత్తుకు రాఁగా కాంక్ష లెల్లుండునో

చ. 3: సెలవి నవ్వు నవ్వితే చెక్కులెల్లాఁ బులకించె
యెలమిఁగాఁగిలించితే నెట్లుండునో
అలరి శ్రీవేంకటేశుఁడంతలోనె నన్నుఁగూడె
బలిమి సేయఁగబోతే పంతము లెట్లుండునో

రేకు: 1567-3 పాడి సం: 25-339

పల్లవి: ఇద్దరు నిద్దరే మరి యెరవులేల
వొద్దికలై లోలోన వొనరుటగాక

చ. 1: చెలిమి సేసినమీఁద సిగ్గులువడఁదగునా
కలసి కూడేటితమకములేకాక
వలపు గలిగి తలవంచుకోఁదగునా
సొలసి యట్టె యెదురు చూచుటలే కాక

చ. 2: సరసమాడినమీఁద జగడము దగునా
తరితీపులకు లోనై దక్కుటగాక
గొరబై వొలవుకొని కొంకు మరి తగునా
తెరదీసీ వొద్దికలై దీకొనుటేకాక

చ. 3: కాఁగిలించుకొన్న మీఁదఁ గపటము దగునా
అంగినమోవులవిందు లందుటగాక
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడిదె నిన్నుఁగూడె
తోఁగుఁజెమటలతోడ తొలఁకుటగాక

రేకు: 1567-4 నాదరామక్రియ సం: 25-340

పల్లవి: ఏలే యిందరిలో నా యెమ్మెలేఁటికే
నీలోనివలపులు నే మెఱఁగమా

చ. 1: తలవంచుకొనకువే తరుణి
చలములు పతితోడ జాళెలఁ బోసేవా
బలిమిఁ బెనఁగకువే పలుమారును
వలవనిబిగువులు వడ్డి కిచ్చేవా

చ. 2: పంతములాడకువే పడఁతీ
సంతతపుమాఁటలసంత పెట్టేవా
యింతేసినవ్వుల నలయించకువే
బంతినే యెగసక్యాలపైరు విత్తేవా

చ. 3: వేసాలు చూపకువే వెలఁదీ
పాసినకాఁకలపొందు పచరించేవా
యీసరి శ్రీవేంకటేశుఁ డేలెనిన్నును
ఆస మోవితేనెవిదు లడ్డముదోసేవా

రేకు: 1567-5 నట్టనారాయణి సం: 25-341

పల్లవి: మగవాని కలుకేల మగువలతో
చిగిరించె వలపులు చింతలేఁటికయ్యా

చ. 1: దొంతరమాఁటలాడేది దొరకొని దూరేది
కాంతలము మా కెపుడు కలసాజమే
యెంత కెంతనుచు నీవు యెగ్గులువట్టేవు నేఁడు
వింతదానఁగాను నాకు విడె మియ్యవయ్యా

చ. 2: తేరకొనఁ జూచేది తిట్లూరకే తిట్టేది
కోరి వచ్చి పైకొన్న మాగుణము లివి
యేరేతి వాఁడవునీవు యెన్నటి కెన్నటిసుద్ది
ఆరయ నీకు మొక్కే నండకు రావయ్యా

చ. 3: కందువకుఁ దీసేది కాఁకలెల్లాఁ జల్లేది
అందిపొందేమారతిఅంగము లివి
యిందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
ముందుముందే నాకు మోవి యియ్యవయ్యా

రేకు: 1567-6 మంగళకౌశిక సం: 25-342

పల్లవి: గుట్టుతోడివారినేల రట్టు సేసేవు
జట్టిగొని కొసరంగ సన్నెఱఁగవు

చ. 1: కొమ్మ నిన్ను జూచి చూచి కొప్పు దువ్వుకొనుటెల్లా
రమ్మనుటగాదా యేల రంతు సేసేవు
కమ్మర నప్పటి నీకతల కూరకుండుట
సమ్మతించుటగాదా సన్నెఱఁగవు

చ. 2: చెలియ నీమొగమై సిగ్గుపడుటెల్లాను
కలసేకొరకేకాదా కాఁతాళించేవు
పొలయుట నీముందర పొందుసేసేనని నీతో
చలపట్టుటగాదా సన్నెఱఁగవు

చ. 3: సతి నీసంగడినుండి సరసమాడుటెల్లాను
రతికిఁదీసుట గాదా రావా(పా?) డేవు
యితవై శ్రీవేంకటేశ యీకె యిట్టె నిన్నుఁ గూడె
చతురత లివిగావా సన్నెఱఁగవు

రేకు: 1568-1 రామక్రియ సం: 25-343

పల్లవి: వట్టిజోలికిఁ బిలువవద్దు గాని
పట్టినవలపులెల్లాఁ బంచిపెట్టవా

చ. 1: కందున నాతఁడు నిన్నుఁ గలువల వేసితేను
యిందుముఖుల మొగము లేమి చూచేవే
పొందులకుఁ దోడువచ్చి వూఁచి పెనఁగేరుగాని
దెము గెల్చినరతి పంచిపెట్టేవా

చ. 2: కూరిమి నాతఁడు నిన్నుఁ గొలువులోఁ దిట్టితేను
వారిజాక్షులకు నేల వడిఁ జెప్పేవు
సారె నతనిని మారు సాదించేరు గాని, వాని
పొరకామినులలెల్లాఁ బంచిపెట్టేవా

చ. 3: సంగతి నాతఁడు నీచన్ను లంటి కూడితేను
సంగడిచెలులకేల సన్న సేసేవు
చెంగట శ్రీవేంకటేశుఁ జెనకేరుగాని మేలు
పంగించక చెలులకు పంచిపెట్టేవా

రేకు: 1568-2 ముఖారి సం: 25-344

పల్లవి: ఇదె నీకు లాభము యెంచి చూచుకొంటేను
పదాలు వాడే నేను; భ్రమయించ కికను

చ. 1: పంత మెంత లేదు నీతో పలుమారు నాడుకొంటే
అంత నిన్ను మీర దోసమని కాక
కాఁతల నాతోఁ జెప్పకు కాఁకలు వుట్టించకు
సంతోసాన నున్న దాన సమ్మతించి నేను

చ. 2: నేరుపెంత లేదు నీపై నిందలెల్లా మోపితేను
ఆరీతిఁ జేయ దోసమని కాక
వారి వీరిఁ జూపకు వాసులు వుట్టించకు
కోరికతో నున్నదాన గుట్టుసేసి నేను

చ. 3: చలమెంత లేదు నీతో సారె సారెఁ జూపితేను
అలఇంచఁ గదుదోసమని కాక
యెలమి శ్రీవేంకటేశ యెరవు సేయకు నన్ను
కలసి నే నున్నదాన కాలమెల్లా నేను

రేకు: 1568-3 బౌళి సం: 25-345

పల్లవి: అట్టె ఇయ్యకోలు గొంటే నన్ని యును మంచిదవును
అట్టడితనాల నేల గుట్టు సేసేవు

చ. 1: చనవుమెరసి యాపె సంగడిఁ గూచుంటేను
చెనకీనంటా నీవు సిగ్గువడేవు
మనసు నొవ్వకుండా మాటలు నిన్నాడితేను
యెనలేనివెంగేలందు యేల పట్టేవు

చ. 2: తగులు గలిగి యాపె తఱచుగా నవ్వితేను
యెగసక్యాలంటా నేల యెగ్గుపట్టేవు
మొగము చూచినందుకు ముద్దుటుంగర మిమ్మంటే
అగడాయఁ బనులంటా ఆనలు వెట్టేవు

చ. 3: ఘనమోహముతో నాపె కాఁగిలించుకొంటేను
తనువు సోదించె నంటాఁ దల వంచేవు
యెనసె శ్రీవేంకటేశ యిచ్చకము నీకుఁ జేసె
కనుచొక్కి మెచ్చి మెచ్చి కప్పుర మిచ్చేవు

రేకు: 1568-4 మధ్యమావతి సం: 25-346

పల్లవి: ఎవ్వరిఁ గాదనఁగల వేమిసేసినాఁ జెల్లు
ఇవ్వల నాకు బాసలేల సేసేవయ్యా

చ. 1: వరుసకు వచ్చినట్టి వనితలెల్లా నీకు
అరుదుగ మందెమేళా లయనయ్యా
పొరుగున నుండేయట్టిపొలఁతులందరూను
మురిపేననాడే పెద్ద మొగమోట మయ్యా

చ. 2: కొలువున నుండి నట్టికోమలు లందరును
సలిగెలఁ బెనఁగేదే సాజమయ్యా
పలువూడిగాలు సేసేభామల కందరికి
చలివాసి కూడేది 'మజ్జాతి' నీక నయ్యా

చ. 3: యెడమాట లాడేటి ఇంతులకెల్లా నీవు
కడలేనిరతులకుఁ గాణాచయ్యా
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెడయనిచుట్టరిక మిది నాకునయ్యా

రేకు: 1568-5 రీతిగౌళ సం: 25-347

పల్లవి: ఏల దూరేరే మీరు యింతులాల రమణుని
వేల గాచుకుండితేను వేడుకేకదే

చ. 1: నగకుండితే నేమాయ నాతితోడ వద్దనుండి
మగనిసేవ సేసితే మంచిదేకదే
జగడించితే నేమాయ సమ్మతించి వెనకను
మిగులా మేలమాడితే మేలేకదే

చ. 2: మొక్కకుండితే నేమాయ ముందువెనకైనామ
మక్కువ మోము చూచితే మంచిదేకదే
కక్కసించితే నేమాయ కప్పురము చేతికిచ్చి
మిక్కిలి పెనఁగినాను మేలేకదే

చ. 3: ఆడకుండితే నేమాయ అందరిగారిమాఁటలు
మాడలు రాలేజంకెలు మంచిదేకదే
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనె యీపెఁగూడె
మేడెపురతికూటమి మేలేకదే

రేకు: 1568-6 శంకరాభరణం సం: 25-348

పల్లవి: ఏఁటికి భ్రమసేవే యెదురుబడి
చాటీఁ గొసరులు చన వియ్యవయ్యా

చ. 1: సిగ్గరితనమున చిడుముడిఁ జేతులు
వొగ్గీ విడెఁ (డెం?) బొసగవయ్యా
నిగ్గుల నూరక నిలుచున్నది చెలి
బగ్గున నీతొడపయి నిలుపవయ్యా

చ. 2: కొమరెతనంబునఁ గొంకుచుఁ బిలిచీ
ప్రమదంబున నిటు పలుకవయ్యా
చెమటమేనితోసెలవుల నవ్వీని
అమరఁగ గాఁగిట నంకించవయ్యా

చ. 3: వాసితనంబున వంచినశిరసున
సేసలు వెట్టీఁ జెనకవయ్యా
అసల శ్రీవేంకటేధిప కలసితి
యీాసిరులతోనే యేలవయ్యా

రేకు: 1569-1 ముఖారి సం: 25-349

పల్లవి: కలది గలట్టె యాడు కాదనేమా
నిలుకడైన పనికి నీ కేల వెఱవ

చ. 1: సానఁబట్టకు చూపులు సాధించెనఁటా నాపై
ఆనలు వెట్టకు మరి అది దోసము
నానఁబెట్ట కంతేసి నవ్వులు నా మోము చూచి
నే నేమఁ(మం?) టిని నిన్ను నీకేల వెఱవు

చ. 2: కోపగించ కంత నీవు కొచ్చికొచ్చి యడగితే
పైపై సాకిరి యేల బయలయ్యీని
మోపుగట్ట కంత నీవు మొక్కులు యేకత మవునా
నీపంతము లీడేరె నీకేల వెఱవు

చ. 3: వేగిరించ కంత నిన్ను వింతుగాఁ బొగడితే
సాగఁబెట్టకు బొంకులు చవులు గావు
బాగుగా శ్రీవేంకటేశ పంతాన నన్నేలితివి
నీగుణము చక్కనాయ నీకేల వెఱవు

రేకు: 1569-2 సాళంగనాట సం: 25-350

పల్లవి: పద్దు రావయ్యా యేల వాసులకుఁ బెనఁగేవు
యిద్దరూ నిట్లా నుంటే మేమఁనఁగలము

చ. 1: పాయలకు వచ్చి సతి సరసములాడఁగాను
యీయెడఁబరాకు నీవేల సేసేవు
చేయిపట్టు కిందాఁకా చెలిని వేఁడుకొంటిమి
చాయల వేఁడుకో నీతో సారె నిఁ(ని?) కా వలెనా

చ. 2: యెట్టకేల కాపె నీతో నిటు మాటలాడుఁగాను
గుట్టైతోడ నీవేల కొంకఁజూచేవు
మట్టున నిందాఁకా నాపెమంకులు దెలిపితిమి
తిట్టపెట్టి నీమంకు తెలుపఁగవలెనా

చ. 3: తమకించి ఆపె నిన్నుఁ దగిలి కాఁగిలించఁగా
చెమటమేనితోడ సిగ్గులువడేవు
అమర శ్రీవేంకటేశ ఆపె నింతకుఁ దెచ్చితిమి
వుమురుకూటపునిన్ను నొడఁబరచేదా

రేకు: 1569-3 బౌళి సం: 25-351

పల్లవి: ఎగ్గో తప్పో నేనెఱఁగనయ్యా
సిగ్గు విడిపించఁగాను చెక్కు నొక్కితి

చ. 1: చనవు గలుగఁగానుసారెసారెఁ బెనఁగితి
ననుపు గలుగఁగాను నవ్వితిని
కనుఁగొని చూడఁగానుకదిసికూచుండితి
మనసునీ వియ్యఁగాను మాటలాడితి

చ. 2: సన్నలు సేయఁగాను సరసములాడితి
చన్నుల గోరొత్తఁగాను సమ్మతించితి
మన్నించి నీ వంటఁగాను మంతనాన కియ్యకొంటి
యెన్నిక నీవు సేయఁగా నిరవైతిని

చ. 3: కలసి మెలఁగుండఁగా గాఁపురము సేసితి
చలివాయు నీమోవి చవిగొంటిని
యెలమి శ్రీవేంకటేశ యిప్పుడూనుఁ గూడితిని
తెలుపఁగ నీపట్టుపుదేవుల నేనైతిని

రేకు: 1569-4 కురంజి సం: 25-352

పల్లవి: అనరాదు తన్ను నేమీ నందరిలోన
చనవు సారా సారె జాణతనాలిఁటికే

చ. 1: నగనేలే తనకూ నాతోఁబతి చెనకితే
యెగసక్కే లాఁటదాని కేల మానునే
మగనాలింతే తాను మానాపతితనము
తగుఁగాక యిటువంటిదంటతన మేఁటికే

చ. 2: సన్నలేలే తనకూ సరస మాతఁ డాడితే
యెన్ని కలు సవతుల కేల మానునే
చిన్నది యింతే తాను సిగ్గులు వడుతా నిట్టె
మన్ననతో నుండుఁగాక మందటాడనేఁటికే

చ. 3: మాటలేలే తనకూ మమ్మాతఁడు గూడితేను
యీటు వెట్టేది చెల్లెండ్ల కేల మానునే
పాటించి శ్రీవేంకటాద్రిపతి యిట్టె నన్ను నేలె
నాటవలె నుండుఁగాక నన్ను మీరనేఁటికే

రేకు: 1569-5 ద్రావిళభైరవి సం: 25-353

పల్లవి: కూరిమి గొసరితేనే కోపగించీనా
మేరమీర నెగ్గు లేవి మీలోనను

చ. 1: పంతముగోనీనా పతివి నీయడాటాన
యింతికి నీమొగమోట మెఁ(మొం?)తైనాఁ గద్దు
యింతలో నేల లోఁగేవు యీమాట విని యాపె
చింతతో జేయెత్తి మొక్కి సిబ్బతిపడీని

చ. 2: తగవుకుఁ దీసీనా తరుణి నీసుద్దులకు
మిగులఁ బ్రియములు నీమీఁదనే కద్దు
మగువ నేలఁ పేవు మనసు గరఁగి యాపె
తగినకానిక లంపి తమక మందీని

చ. 3: వాసివంతు లెంచీనా వలపులో కతలకు
సేసలు నీమీఁదఁ బెట్టి చెలిమి సేసీ
అసల శ్రీవేంకటేశ అంతలో గూడితి వీపె
తాసువలెఁ దులఁదూగి తనివిఁ బొందీని

రేకు: 1569-6 నారాయణి సం: 25-354

పల్లవి: ఏమని యాడుకొందురో యెప్పటికతనసతులు
వేమరు నీపనులకు వింతదాననా

చ. 1: తముల ముమియఁగాను తానేమి చుచీనే
చెమరించఁగానేల చేత నంటీనే
అమరకున్నఁ బయ్యెద అదేల చక్కఁబెట్టీనే
తమకించ నే నంతటిదాననా

చ. 2: పువ్వులు ముడుచుకొఁగా పొంచి చేయేల చాఁచీనే
నవ్వఁగా నేమిటికి సన్నలు సేసీనే
పవ్వళించితినంటాను పయినేల వొరగీనే
తవ్వేవు రతుల కంతటిదానవా

చ. 3: సురటి విసరుకోఁగా సొరిది కేల వచ్చీనే
కరఁగితే దానేల కాఁగిలించీనె
యిరవై శ్రీవేంకటేశు డేలె నిట్టె నన్నుఁ దానె
తరవాతపనుల కంతదటిదాననా

రేకు:	1570-1 కాంబోది సం:	25-355

పల్లవి:	ఇదిగో నాగుణము; యెంతకు నేరవు నీవు
పొదిగే నెంతవాడైనా నా పొద్దువోదు నాకు

చ. 1:	చేరి నీవు నాకెంత చెప్పినట్లు సేయకున్నా
వూరటై యిచ్చకపునో రూరకుండదు
అరీతి బుద్ధులుచెప్ప నందరూఁ గలరు నీకు
పోరాడనేమిటికి పొద్దువోదు నాకు

చ. 2:	యీవల నాచెనకులు ఇయ్యకోలు గాకుండినా
సేవసేసేనాచేతులు సిగ్గువడవు
వానితో సరసమాడేవారే నీకు నూరెల్లా
పూవులు నీకు ముడిచేఁ బొద్దువోదు నాకు

చ. 3:	కందువ నీ విట్టే నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
విందుల నాయాసలు వీడుపడవు
సందడి శ్రీవేంకటేశ సారె నన్నుఁ గూడితివి
పొందునఁ దనియ నేను పొద్దేవోదు నాకు

రేకు: 1570-2 గుండక్రియ సం: 25-356

పల్లవి: ఇదిగో నాగుణము; యెంతకు నేరవు నీవు
పొదిగే నెంతవడైనా పొద్దువోదు నాకు

చ. 1: చేరి నీవు నాకెంత చెప్పినట్లు సేయకున్నా
పూరటై యిచ్చకపునో తూరకుండదు
అరీతి బుద్దులు చెప్ప నందరూఁ గలరు నీకు
పోరాడనేమిటికి పొద్దువోదు నాకు

చ. 2: యీవల నాచెనకులు ఇయ్యకోలు గాకుండినా
సేవసేసేనాచేతులు సిగ్గువడవు
వావితోసరసమాడేవారే నీకు మారెల్లా
పూవులు నీకు ముడిచేఁ బొద్దువోదు నాకు

చ. 3: కందువ నీ విట్టే నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
విందుల నామాసలు వీడుపడవు
సందడి శ్రీవేంకటేశ సారె నన్నుఁ గూడితివి
పొందునఁ దనియ నేను పొద్దువోదు నాకు

రేకు: 1570-3 గుజ్జరి సం: 25-357

పల్లవి: ఏమిసేసినాఁ దగు ఇట్టె నీకును
కమిరనులై తేఁజాలు కైకొలుపవత్తురు

చ. 1: చెల్లుబడిగా సుద్దులు చెలులతోఁ జెప్పేవు
కల్లలై ననీమాటలు కాదనేరా
మల్లాడి అలిగినమావంటి వారినైతే
వల్లదాన నిట్టె వొడఁబరతురుగాక

చ. 2: అందాలుగానిపనులు అమరించే వప్పటిని
పొందుగా నీచేఁతలు పోఁదోసేరా
సందడిలోఁ జెనకినసరసపుమమ్మునైతే
యిందమని పంతములు ఇప్పింతుగాక

చ. 3: తగనంటా నీమేలే తారుకాణించే విదిగో
వెగటని నీవిద్యలు విచారించేలా
అగపడి శ్రీవేంకటాధీశ కూడితివి
మొగమోడేమాచేతనే మొక్కింతురుగాక

రేకు: 1570-4 వరాళి సం: 25-358

పల్లవి: ఇంకనేలె వేగిరము యెదుటనే వున్నవాఁడు
సంకెలు దీరినందుకు చలమే గురి

చ. 1: తానే వచ్చీఁగాని తరవులు వెట్టకు రే
నానినవలపులకు నవ్వే గురి
ఆనలు వెట్టఁగనేల అన్నియును నెరుఁగును
తానకమైనందుకు తాలిమే గురి

చ. 2: చెప్పినట్లు సేసీఁగాని చేయివట్టి తియ్యకురె
ముప్పిరిఁ గాంక్షలకును మొక్కులే గురి
తప్పులువట్టఁగనేల తమక మెప్పుడుఁ గద్దు
చిప్పిలుఁబొందులకును సిగ్గులే గురి

చ. 3: గక్కున మన్నించీఁగాని కాఁతాళించి దూరకురే
చొక్కినకరఁగులకు చూపులే గురి
యెక్కువ శ్రీవేంకటేశుఁ డీడ నన్నంటుక కూడె
దక్కి నావాఁడైనందుకు తను విదే గురి

రేకు: 1570-5 హిందోళం సం: 25-359

పల్లవి: ఎటువంటివాఁడవయ్యా యెఱఁగవా నీవేమైనా
సటకానివలెనే సన్నలు సేతురా

చ. 1: జవ్వనభారముచేత జడిసేటికోమలినీ
రవ్వలు సేతురా రాదంటాను
నవ్వుచు సంతసముతో నగరిలో నుండఁగాను
పవ్వళించి నీవీడఁ బంతములాడుదురా

చ. 2: నిచ్చలపువలపున నివ్వెరగుతో నుండఁగా
పచ్చిగాఁ దిట్టుదురా పలుకదంటా
మచ్చికమగువలతోమాటలాడుచుండఁగాను
అచ్చముగా నీవువచ్చి అయము లంటుదురా

చ. 3: కలసి తమకమునఁ గరఁగుచునుండఁగాను
ములుగోరు నాటింతురా మొక్కదంటాను
అలరి శ్రీవేంకటేశ అన్నిటా నేలుకొంటివి
వెలలేనిరతులను వేసాలుసేతురా

రేకు: 1570-6 పాడి సం: 25-360

పల్లవి: ఎంత సేసే వేమోయి యెఱఁగరా ఇందరును
చింతకాయకజ్జాయమై చిప్పిలీఁ దమకము

చ. 1: పలికి యెవ్వరినైన భ్రమఇంచనేరవా
వెలఁదుల నమ్మించ నీవిద్యగాదా
పలుమారు మాతోనేల బాసలు వేయవచ్చేవు
సెలవినవ్వులలోనే చేఁగలెక్కీ నిజము

చ. 2: చేయిచ్చి వాడవారిని చిక్కించుకోనోపవా
చాయలు సేసుక మెచ్చ జాణవుగావా
కాయకపుననుపేల కలయఁగఁబెట్టేవు
తోయరానివావులనే దొడ్డిఁ జిక్కెవలపు

చ. 3: సేసవెట్టి ఇంతులనుఁ జేరి పెండ్లాడఁ గొంకేవా
వాసులు రేఁచఁగ దేవరవు గావా
ఆసల శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
బేసబెల్లిరతులలోఁ బెంటలాయఁ గళలు

రేకు: 1571-1 పళ పంజరం సం: 25-361

పల్లవి: అప్పుడు దామే కూడి రంతరంగా లెనసి
దప్పితోడ రమణుఁడు తమకించీ నిపుడు

చ. 1: మొనగోరి వ్రాఁతతోడ మోమువంచి యాపె నీతో
యెనలేక మాటలాడీ నెంతవడైన
పెనఁగి తాఁ గూడదు పిరితీసివుండలేదు
మనవి నిద్దరికేడ మాటలాడఁగదరే

చ. 2: కిందిచూపులతోడను కెరలుచుఁ జెమరించి
అందిచ్చీ విడెము పతి కప్పటనుండి
పొందులకుఁ బెనఁగదు పొలయక మానదు
చందముల నిద్ధరికి సంతత్సము సేయరే

చ. 3: సెలవినవ్వులతోడఁజెక్కులెల్లాఁ బులకించె
కలసి కాఁగిలి చీఁ గాఁక్షల నీకె
యెలమి శ్రీవేంకటేశుఁ డీపె నిట్టె యేలెను
చలివాసె లోలోనే చనవు లిప్పించరే

రేకు: 1571-2 ఆహిరి సం: 25-362

పల్లవి: ఎవ్వరిఁ బోలుదు నేను యేఁటికి బాఁతి
నవ్వుచు నాపైనేల ననుపు చల్లేవు

చ. 1: చెలిమిసేసే వరలు సేనాసేన లుండఁగా
యెలమి నాపయ్యద నీవేల పట్టేవు
తలపోఁత లిందరిపై తగులై వుండఁగాను
చెలఁగి నారూపమేల చిత్తానఁ బెట్టేవు

చ. 2: కానుకలిచ్చే వారు కలసి నీకుండఁగాను
అనుక నాచన్నుల అందుకొనేవు
వీనులు చెలులు సేసేవనినపాలు వినఁగాను
మానక నతోనేల మాటలాడేవు

చ. 3: కూరిమిసేసేటివారు కొంగువట్టుకుండఁగాను
గారవించి నన్ను నేల కాఁగిలించేవు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్ని నింపులై వుండఁగా
మేరమీరి ఇంతయేల మెచ్చులు మెచ్చేవు

రేకు: 1571-3 బళహంస సం: 25-363

పల్లవి: మీకుమీరే వొకటైతే మేలుగాక
యీకడాకడివారెల్లా యెనఇంచఁగలరా

చ. 1: జగడములెల్లాఁ బాసె సతితో మాటలాడఁగా
నగవులు వొడమెను నంటు సేయఁగా
చిగిరించె వలపులు సిగ్గులు విడువఁగాను
పొగరులచెలులెల్లా బుద్ధిచెప్పఁగలరా

చ. 2: ఆయములు గరఁగెను అట్టె తప్పక చూడఁగా
చేయిఁజేఇ మీఁదాయ చెనకఁగాను
కాయము లుప్పొంగెను కందువలఁ బెనఁగఁగా
చాయవాటుసతులెల్ల జంటసేయఁగలరా

చ. 3: తమకములు రేఁగెను తలఁపు లొక్కటిగాఁగా
జమళికూటము లబ్బె చలపట్టఁగా
అమర శ్రీవేంకటేశ ఆపె నీవూ బొందితిరి
కొమరెవనితలెల్లఁ గొంకు దీర్పఁగలరా

రేకు: 1571-4 ఆరిబి సం: 25-364

పల్లవి: అటువంటివారమే అందరము
తటుకన మమ్ము నేల తగ వడిగేవు

చ. 1: సాదై యుండినయాపెను సవతులకని వెట్టి
సేదదేర్చి గయ్యాళిగఁ జేసితివి
సాదించి బొమ్మల నిన్ను జంకించక మానునా
దాదాత మమ్ము నేల తగ వడిగేవు

చ. 2: యేనెపమోఱఁగనాపె నెగ్గులెంచ నేరిపి
నానాట నిందరికి మొనవెట్టితివి
నానఁబట్టినచూపుల సాదించవలదా నిన్ను
దానదకిఁగా మమ్ము నేల తగ వడిగేవు

చ. 3: పీఁటపైఁ బెండ్లియాపెఁ బెద్దరికా లిచ్చి కూడి
మేఁటి కాంతలమాటలు మీరించితివి
గాఁటపు శ్రీవేంకటేశ కత గరచె నన్నిటా
తాటించి మమ్మేల యిఁకఁ దగ వడిగేవు

రేకు: 1571-5 వేళావళి సం: 25-365

పల్లవి: మామమంటే మీమాటలకు మానఁబోయీనా
మోనాన నూరకుండరే ముద్దుగారీ వీఁడు

చ. 1: వేడుకపడి వీఁడు వెన్నలు దొంగిలనీరే
వాడలవాడల నట్టే వలవనీరే
కోడెకాఁడై తిరిగీని కొంగులు వట్టఁగనీరే
జాడలెటిఁగినయట్టిసాదుఁగొయ్య వీఁడు

చ. 2: చనవు మెరసీనేమో చన్నులు ముట్టఁగనీరే
తనియఁడేమో కాఁగిటఁ దగులనీరే
చెనకీనేమో మీపై చేతులు చాఁచఁగనీరే
ననిచివుండరే మీరు నసగొంటు వీఁడు

చ. 3: ఆసపడీనేమో తేనె కధరము లంటనీరే
పాసివుండఁజాలఁడేమో పైకొననీరే
వేసరక మిమ్మేలె శ్రీవేంకటాద్రి కృష్ణుఁ డిదె
అసుద్దులెల్లా మెచ్చరే అగడీఁడు వీఁడు

రేకు: 1571-6 ఆహిరి సం: 25-366

పల్లవి: మమ్మునేల దూరేవే మాఁటిమాఁటికి
చిమ్మి యిట్టె చేనకఁగ సిగ్గుపడఁగలమా

చ. 1: వలసినట్టెల్లా నీవు వరము లిప్పించుకోవే
యెలమి సవతుల నీ వేలేనంటా
కలిగినట్టెల్లా నీవు కాఁపిరాలు సేయవే
వలచి నీయింటికి వచ్చినవిభునిని

చ. 2: పెక్కుమారు లట్టె నీవు ప్రియాలు చెప్పించుకొవే
వెక్కసపుటెమ్ములతో వెలసేనంటా
మొక్కులు మొక్కించుకొని మోహములు చల్లవే
పిక్కటిల్లుఁదమకాన పెండ్లాడినవానిని

చ. 3: సంతమువచ్చినట్టెల్లా పనులు సేయించుకోవే
చెంత నీచెప్పినట్టె సేసేనఁటా
యింతలో శ్రీవేంకటేశుఁ డీడ నిట్టె నన్నుఁ గూడె
వంతులు వెట్టవే నీవు వద్దనున్న వానిని

రేకు: 1572-1 శుద్ధదేశి సం: 25-367

పల్లవి: లేలే వేసాలమాటలే యాడే వప్పటికి
వేలరితనాలు నీతోఁ బెంచవచ్చేమా

చ. 1: వున్నతి నేఁ గదిమితే వొడ్డించుకొనేవు నా
చన్నుల మొనలు నిన్ను సాదించీనా
సన్నలు సేసి తేనె జడిసే వంతటిలోనే
కన్నుల తేటలు నిన్నుఁ గరఁగించీనా

చ. 2: కేలెత్తి మొక్కితేను కెరలి యానవెట్టేవు
వాలారుగోళ్లు నిన్ను వంచుకొనీనా
మేలములాడితేనే మెత్తనై వసివాడేవు
యేల మాఁటలు మర్మము లెత్తిపెట్టీనా

చ. 3: యిక్కువ లంటితేను యిట్టె నన్ను దూరేవు
గక్కున కాఁగిలి నిన్నుఁ గట్టివేసీనా
తక్కక శ్రీవేంకటేశ తగిలి నన్నేలితివి
పెక్కులైనరతులెల్లా పెడరేచీనా

రేకు: 1572-2 సింధురామక్రియ సం: 25-368

పల్లవి: ననవంటియాఁటదాని నలఁగించవొద్దయ్య
మనసునఁ గలిగితే మన్నించేవుగాక

చ. 1: సిగ్గులు నీమీఁద వేసి చెలి యూరకుండఁగాను
వొగ్గుచునవ్వుమంటాను వొడివట్టేవు
నిగ్గులఁ గన్నెలనెల్లా నీవిట్లాఁ జేసితివా
బగ్గున యెగసక్కేలఁ బైకొనేవుగాక

చ. 2: పంతము నీకప్పగించి పరాకున నుండఁగాను
కాంతను గోర గజెనకి కరఁగించేవు
పొంత కొత్తజవ్వనులఁ బొందితివాఇట్లానే
బంతిరాజసాన రట్టుపరచేవుగాక

చ. 3: కందువ కాఁగిటఁ గూడి కళదేరుచుండఁగాను
అందుకొని మెచ్చుమంటా ఆనవెట్టేవు
పందెపు శ్రీవేంకటేశ పడుచులెడ యిట్టే యా
సందడినీగజరులు చల్లేవు గాక

రేకు: 1572-3 బౌళి సం: 25-369

పల్లవి: నీకేతెలుసునయ్య నే మేమనేము నిన్ను
రాకపోకతరితీపు రసముగారీనా

చ. 1: కాంతతోడ వేరొకతెకతలెల్లాఁ జెప్పిచెప్పి
బంతినే సారెకునుఁ గోపాలు రేఁచేవు
ఇంతేసి నీవు సేయఁగా యీపె నిన్నుఁ దిట్టఁగాను
చెంతనున్న వలపులు చిగిరించెనా

చ. 2: వుదివకు నీసతులవుంగరాలు చూపిచూపి
కవకవనవ్వుచుఁ గాఁకలు రేచేవు
చని నీవు వుట్టింపఁగా సతి నీతోఁబెనఁగఁగా
నవకపువయసులు ననలొత్తెనా

చ. 3: యీసతికి వాడవారియీడులెలాఁ బెట్టిపెట్టి
ఆస వుట్టించి కాఁగిట నానింపించేవు
బాసల శ్రీవేంకటేశ పైకొనఁగా నిద్దరికి
పాసికూడినరతులు పంటవండెనా

రేకు: 1572-4 భైరవి సం: 25-370

పల్లవి: తనకే తెలుసునే తఱి వాతిమాఁటలు
చనవరినై యుంటే జాణతన మవుఁగా

చ. 1: రచ్చలఁ దన్నుఁ బొగడిరవకత్తె నేనైతినే
యిచ్చకమే ఆడిమాడి ఇట్లయితినే
పచ్చిగాఁ గొసరితేనే పంతగత్తె నైతినే
నెచ్చెలుల వలె నుంటే నేరమేమీ గాదుగా

చ. 2: తనుఁ గొంగుపట్టీతీసి దంటాదాన నైతినే
యెనసి మొక్కులు మొక్కి యిట్లయితినే
కనువిచ్చి చూచితేనే గట్టువాయ నైతినే
తనయంత నేనుంటే తప్పులేమీ లేవుగా

చ. 3: అంది యిట్టె కాఁగిలించి ఆసకత్తె నైతినే
యిందుకు రమ్మనఁగానే యిట్టయితినే
ముందె శ్రీవేంకటేశుఁడు మోహమున నన్నుఁ గూడె
యిందరివలెనే వుంటే యొగసక్కే లవుఁగా

రేకు: 1572-5 ముఖారి సం: 25-371

పల్లవి: ఇందరూ నెరిఁగినందు కింత యేఁటికే
అందమైననీగుణము అవి నాకు వింతా

చ. 1: సరసమాడేవారితో జగడా లడువనేల
తరవాత నాడేజాణతనాలేకాక
తెరమఱఁగుకు రమ్మా తెట్టఁదెరువుననేల
గొౌరబైనమాటలెలా గుదిగుచ్చవలెనా

చ. 2: సేసవెట్టే వారితో సిగ్గునఁ బెనఁగ నేల
వాసులతోడ శిరసువంచుటగాక
యీసరుసఁ గూచుండుమా యీడానాడాఁ బంతమేల
బాసలుసేసినవెల్లా బచారించవలెనా

చ. 3: పొందుసేసేవారితో బూటకా లేమినేల
సందుకొని రతికిఁ జేఇ చాఁచుటగాక
ముందె శ్రీవేంకటేశ మోహాన నన్నేలితివి
సందడిడే లిట్టె సారెఁ బట్టవలెనా

రేకు: 1572-6 గౌళ సం: 25-372

పల్లవి: అందుకు నేమోపము ఆపె నడుగుమనవే
సందడించి ఇందుకుఁగా చలమేఁటికనవే

చ. 1: వుప్పటించవలదు వూడిగపువారి నింత
చెప్పినటెల్లాఁ దనకు సేయమానేము
కుప్పంచి మమ్ము నిట్టె కొంగువట్టి తియ్యఁగాను
ఇప్పుడు మాయేలికెసా నేమైననదా

చ. 2: సిగ్గువాపవలదు చెలికత్తెలము నేము
వొగ్గుచు నేపొద్దు వొద్దనుండేవారము
అగ్గలపుసరసా లట్టెమాతో నాడఁగాను
నిగ్గుల మమ్మంపినాపె నేరములు వేయదా

చ. 3: ఇంతసేయవలదు ఇద్దరి వారము నేము
వింతలేక తమకెల్ల విశ్వాసులము
బంతి శ్రీవేంకటేశుఁడు పైకొని నన్నుఁ గూడఁగా
యింతకుఁ గర్తయినాపె యెగసక్కే లాడదా

రేకు: 1573-1 ముఖారి సం: 25-373

పల్లవి: నీతలనే వేగెనటే నెలంత యీసుద్దులు
అతని ననేముగాక ఆఁడువారు కేరవా

చ. 1: పనిగలయప్పుడే పంతములెల్లా నాడేది
పెనఁగవచ్చితే నట్టె బిగిసేది
చెనకఁజూచినవేళే చేరి బాస లడిగేది
వొనరఁదుచ్చపువారివోజ లింతేకా

చ. 2: నగవచ్చినప్పుడేనంటుకొనఁ దిట్టేది
మొగము చూచినంతనే మునిఁచేది
తగిలి వెనుకొంటేనే తరితీపు సేసేది
జగతిఁ జిత్తిణివారిసాజ మింతేకా

చ. 3: రతికిఁ దీసినప్పుడే రాజసము చూపేది
తతి వచ్చితేనే లోలోఁ దమకించేది
యితఁడె శ్రీవేంకటేశుఁ డిందరి మనలఁ గూడె
మితిమీరేది కాంతలమేకు లింతేకా

రేకు: 1573-2 కుంతలవరాళి సం: 25-374

పల్లవి: మాతో నింతేశాల మందెమేళము
కాతరానఁ దిట్టవయ్యా గయ్యాళులనీవు

చ. 1: చలివాసి నీతోను సరసములాడేమా
మలసేమా మానాపతిమగువలము
కెలసి కెలసి నీవే కేరికేరి నవ్వవయ్యా
పిలిచేనీరట్టడిప్రియురాండ్లలోను

చ. 2: పచ్చిసేసి నీపైని పంతములు నెరపేమా
యిచ్చకములాడేయట్టియంతులము
కుచ్చికుచ్చి నీకునీవేకొంగువట్టి తియ్యవయ్య
మచ్చరించేనీ కాఁగిటిమంకుగొల్లెతలమా

చ. 3: బాసలిమ్మంటా నిన్ను బలుములు సేసేమా
సేసవెట్టి పెండ్లాడినచెలులము
అసల శ్రీవేంకటేశ అంకెలఁ జెనకవయ్యా
రాసి నీతోఁ బెనఁగేటిరాఁగవనితలను

రేకు: 1573-3 లలిత సం: 25-375

పల్లవి: ఇంక నేమనేము నిన్ను ఇచ్చకమాడేముగాక
అంకె వచ్చెఁ బనులెల్లా అవునయ్యా

చ. 1: సేయరానిసేఁతలెల్లాఁ జేసివచ్చి మాతోను
చాయలకు మొరఁగేవు చతురుఁడవు
పాయపువాఁడవు తొల్లె బలుదొర వందుమీఁద
చేయి మీఁదాయ నీకుఁ జెల్లునయ్యా

చ. 2: నగరానినవ్వు లాడ నగి వచ్చి మావొద్ద
సగము పంచి పెట్టేవు చతురుఁడవు
మొగమోడుదువు తొల్లె మోహ మెక్కు డందుమీఁద
చిగిరించెఁదమకము చెల్లునయ్య

చ. 3: మొక్కరానిమొక్కు లాడ మొక్కి శ్రీవేంకటేశుఁడ
చక్కట్లు చెప్పేవు చతురుఁడవు
చిక్కితివి నాకుఁ దొల్లె శ్రీపతి వందుమీఁదట
చెక్కులెల్లాఁ జెమరించెఁ జెల్లునయ్యా

రేకు: 1573-4 బౌళి సం: 25-376

పల్లవి: ఆఁటదాన వవుదువే అందరిలోన
మాటలు నీతో నాడి మరిఁగేదే

చ. 1: కన్నుల నీ నవ్వులకు కలికినీచేఁతలకు
వన్నెల నీరహనుఁడు వలచెఁగదే
చన్నుల నీ మొనలకు చవుల నీమోవికి
పన్నికకాఁకలతోడ బాఁతిపడీఁగదవే

చ. 2: బిత్తరినీచూపులకు పిరుఁదుబిగువులకు
బత్తిసేసి పాయలేక పైకొనీఁగదే
గుతపుపాదములకు గొప్పతురుమునకు
మత్తిలి యేపొద్దును మరులాయఁగదవే

చ. 3: కందువనీకాఁగిటికి గళకాంతులకును
అందుక శ్రీవేంకటేశుఁ డలమెఁగదే
పొందులజవ్వనానకు భోగపురతులకును
ముందుముందే లోలుఁడై మొక్కెఁగదె

రేకు: 1573-5 రామక్రియ సం: 25-377

పల్లవి: ఎవ్వరివాఁడవు నీవు యిద్దరిఁ దోయఁగరాదు
పవ్వళించవయ్యా ఇటె పాపము రాకుండాను

చ. 1: పాదపుటందెలు మ్రోయ పడిఁతి నిన్నుఁ గంటానే
అదిగొని వచ్చె నీపై ఆస యెట్టిదో
ఆదెస వేరొకతె నిన్నట్టె యింటికి రమ్మంటా
గోదిలి కొసరుచును కంగువట్టి తీసెను

చ. 2: కదలు గుచాలతోడ గందము గస్తూరి నీకు
సుదతి అందిచ్చె నెంత చుట్టరికమో
అదనెరిగి వొకతె అట్టె పూవు లియ్యవచ్చి
చెదరకుండాఁ బట్టి చేతులపై మొక్కెను

చ. 3: తొరలిపట్టె నొకతె తురుముచెదర నిన్ను
గరిమ శ్రీవేంకటేశ రదలుమని
బెరసి నాబోఁటి దిట్టె ప్రియమునఁ బనఁగెను
మురిపేనఁ గూడితిని మొగమోడవలసె

రేకు: 1573-6 వరాళి సం: 25-378

పల్లవి: మగవాఁడైతేనే సిగ్గు మానవలెనా
యెగసక్కె మవుఁ బని యింటికి రారాదా

చ. 1: యెందుకైనా నవ్వేవారి నెఱఁగవు తమకించి
పందెము వేయఁగానే పట్టేవు చేయి
విందువేడకకానికి వెసలఁబెట్టినకత
యిందులోనే నెరపనేల యింటికి రారాదా

చ. 2: సొరది సోరణగండ్లఁజూచేవారి నెఱఁగవు
సరిబేసి వట్టుమంటే చన్నులంటేవు
గరిమఁ బట్టినదే కందిగురుమన్న కత
ఇరవు చూపనేల ఇంటికి రారాదా

చ. 3: అనుక శ్రీవేంకటేశ ఆడేవారి నెఱంగవు
కానుకలిచ్చేవేళనే కాఁగిలించేవు
మోనమున నందరిలో ముట్టితే మూయాయఁగత
యీనవ్వులలోఁ గంటిమి ఇంటికి రారాదా

రేకు: 1574-1 గుండక్రియ సం: 25-379

పల్లవి: ఎదుల నున్నది యీపె యెడమాటలాడే నేను
యెదఁగపటముమాని యేమనేవయ్యా

చ. 1: చెలిమిసేయ నేరక సిగ్గులువడీ నింతి
పలుకనేరక నిన్నుఁ బాడీ నిదె
వలపుచల్లనేరక వద్దనే కాచుకున్నది
యెలమి నిందుకు మరి మేమనేవయ్యా

చ. 2: వొత్తి పిలువనేరక వొడివట్టుకొనీ నింతి
బత్తులు సేయనేరక పైకొనీ నిదె
తత్తరించనేరక తప్పక చూచీ నట్టె
యెత్తినమదాన మరి యేమనేవయ్యా

చ. 3: కతలు చెప్పనేరక కాఁగిలించుకోనీ నింతి
మతకములు నేరక మలసీ నిదె
రతుల శ్రీవేంకటేశ రమించితి వీపె నిట్టె
యితవాయ నిఁక మరి యేవనేవయ్యా

రేకు: 1574-2 మేఘరంజి సం: 25-380

పల్లవి: చూచి చూచి మేము తన్ను సూడులువట్టేముగాక
యేచి అందరిలోఁ దనయెన్నిక గాదా

చ. 1: సతమాయఁ బతిపొందు సలిగెలన్నియుఁ జెల్లె
వెతదీరెఁ దనకు గర్వించవలదా
జతనాన మెల్లనే సంగడిఁ గూచుండఁ జొచ్చె
అతివేడుకలు తన కవునేకాదా

చ. 2: చెక్కులఁ గళలు నిండె సిగ్గులు నవ్వులఁ దేరే
వెక్కసమై తాను విఱ్ఱవీఁగవలదా
వక్కణతో సవతులవరుసవంతుకుఁ జొచ్చె
మిక్కుటమై తనచేయి మీఁదేకాదా

చ. 3: చేవదేరెఁ గెమ్మోవి విరసుక్రుమ్ముడి జారె
దేవులాయఁ దన కిదె దిష్టముగాదా
శ్రీవేంకటేశ్వరుఁడు చేరికూడె నిందరిని
కైవసమాయఁ బనులు ఘనురాలెకాదా

రేకు: 1574-3 తోండి సం: 25-381

పల్లవి: పెండిలిపీఁట యెక్కి బిగియనేల
వండి వండనట్లాయ వట్టిప్రియాలనవే

చ. 1: వేడుకకు వెలలేదు వెన్నెలకు గురిలేదు
వీడె మిప్పించవే మోవివిందులాయను
యీడనే వుందాన నేను యెఱుఁగు నిన్నీఁదాను
కూడుమనఁగదే వాసి గోడపైసున్నము

చ. 2: సూరియునిఁ జూడరాదు చుక్కలెల్లా నెంచరాదు
పోరచివెట్టించవే వొత్తు గలసె
కూరిమిసేసితి నేను కొంగువట్టినాఁడు తాను
కోరుకోవీవే సిగ్గు గోనెమీఁది తౌడు

చ. 3: వావిగడిగితేఁ బోదు వల పాల్లనంటేఁ బోదు
సేవలు సేయించవే చెలిమి గూడె
కైవశము నేను శ్రీవేంకటేశ్వరుఁడు తాను
బావించనీవే మేలు పాలమీఁది మీఁగడ

రేకు: 1574-4 మాళవిగౌళ సం: 25-382

పల్లవి: తెలుసుకొనేవు నీవు దినదినగతులను
సొలసితే నావంటిసులభము లున్నవా

చ. 1: చనవరికాంతవల్ల సళుపుఁజూపులెకాక
పెనఁగఁబోతే నందుఁ బ్రియమున్నదా
ననుపైనకాంతవల్ల నగవే మిక్కిలిగాక
తనివోనిరదులతో దప్పిదేరనున్న దా

చ. 2: జారకాంతవల్ల పొందుచవి వేగిరమేకాక
కోరినట్టెల్లా నుండి కూడనున్న దా
తేరవచ్చే కంతవల్ల తీరుకుఁ దేనేకాక
పోరచి నంకెకును భోగించనున్నదా

చ. 3: కొత్తయినకాంతవల్లకొంకులు సిగ్గులుఁగాక
హత్తి సుసరాన రతి యందనున్న దా
ఇత్తల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
యెత్తినసంతోసము నీ కిటువలె నున్నదా

రేకు: 1574-5 ఆందోళి సం: 25-383

పల్లవి: ఇందరెరిఁగినపని యేల బాసలుసేసేవు
ముందుముందే ఆపెకు యొక్కవయ్యా నీవు

చ. 1: నగుతా నీవేకాదా నాతో మాటలాడఁగ
అగపడల్లంతనుండి ఆపెఁ జూచెను
యెగసక్కేలు సేయక యేల మానీ నిఁక నేఁడు
మొగమోడేయట్టుగాను మొక్కవయ్యా నీవు

చ. 2: సమ్మతించి నీవు నేను చదురంగమాడఁగాను
యెమ్మెల కెరుకసేసి యెత్తు చెప్పెను
కమ్మి నిన్నుఁ దిట్టుటకు కారణమిదేకాదా
ముమ్మాటికి సెలవు మొక్కవయ్యా నీవు

చ. 3: యెలమి నీవును నేను ఇంటిలోఁ గూచుండఁగాను
తలుపు దెరచి యాపె తానే వచ్చెను
చెలఁగి పొందవలదా శ్రీవేంకటేశ్వర నిన్ను
ములువాఁడిగోరు సోఁక మొక్కవయ్యా నీవు

రేకు: 1574-6 బౌళి సం: 25-384

పల్లవి: ఎంతవేగిరకాఁడవు యేమోయి
దొంతివేసా లిట్టె వెన్నెతోడఁ బెట్టరా

చ. 1: చెక్కులు నొక్కితేనే చివుకనఁ గసరేవు
మొక్కితేనే బూతులను ముంచి తిట్టేవు
పక్కున నవ్వఁగానే పైకొని పంతమాడేవు
మొక్కళము వెన్నతోఁ బాముచుఁ బెట్టిరా

చ. 2: మొగము చూచితేనే మొనగోరఁ జెనకేవు
యెగసక్కేలాడితేనే యెమ్మెచూపేవు
పగటునఁ బెనఁగితే పట్టి సాములు సేసేవు
బిగువులు తోడంటి పేరఁబెట్టిరా

చ. 3: కదిసి పైకొంటేనే కరంగి లోనయ్యేవు
పొదిగితేఁ గాఁగిలించి భోగించేవు
యిదిగో శ్రీవేంకటేశ యింతాఁ గలయఁగొనేవు
మదములనన్నియును వుమ్మడిఁ బెట్టిరా

రేకు: 1575-1 ధన్నాసి సం: 25-385

పల్లవి: ఇద్దరికిఁ దెరమఱఁ గిదే కలది
వుద్దండాలకుఁ బెనఁగకుండవయ్య నీవు

చ. 1: సతులకుఁజలము జవ్వనపుఁ బొలము
తతి వలపులకు నుత్తమఫలము
పతికిఁ బతిగా నీవు పంతమాడనింతయేల
రతుల గడివోకుండా రావయ్య నీవు

చ. 2: చెలులకు మతిపట్టు చిత్తజానిచేపట్టు
బలులై (వై?)నఅసలకుఁ బాయనిమెట్టు
మలసి ఇందుకుఁగాను మారుకొన నీకేల
కొలఁది మిగులనుఁ జేకొనవయ్య ప్రియము

చ. 3: వనితలకు మంకులు వాసుల కెల్లా నంకెలు
వెనకముందరికి వేవేలు లంకెలు
ఘనుఁడ శ్రీవేంకటేశ గక్కునఁ గూడితి విట్టె
ననుపుసేసుక యిట్టె నవ్వవయ్య నీవు

రేకు: 1575-2 పాడి సం: 25-386

పల్లవి: మగవాఁడట తనఇచ్చటమారుకొనేనా; ఇందుకు
చిగిరించెను జవ్వన మిఁకఁ జెల్లుననరె తనకు

చ. 1: అడిగితినా తను బాసలు అపుడే యేఁటికిఁ జేసీ
నొడిగితినా నేనే మాటలు నూఁటికి నొకటైనా
విడువఁడు కొంగెంతైనా వేసరుకొన్నా మానఁడు
చిడుముడిబుద్ధులు చెప్పరె చెలులాల మీరైనా

చ. 2: యేమాయనే తనసుద్దుల కెదురాడే వారెవ్వరు
కాముకునికిసత్యంబులు గలవా యెందైనా
చేముట్టిచీ విడెము సిగ్గులువడినా నెరఁగఁడు
యేమందునే మీరైనా నింటికి రమ్మనఁగదరే

చ. 3: మఱఁగేఁటికి విచ్చనవిడి మాన్యం బిచ్చితిఁ జేఁతలు
తఱితోడనే మన్నించీఁ దాఁదానే నన్ను
కఱితల శ్రీవేంకటపతి గక్కన నన్నిటు గూడెను
మేఱయఁగ బొగడరే ఇంతట మీరైనా నితని

రేకు: 1575-3 లలిత సం: 25-387

పల్లవి: ఇచ్చటనుండీ నేల యే నిన్ను వేసరించ
అప్పుడు చెప్పే నీకు నందపునాబుద్దులు

చ. 1: నామాటలే నీకు నంటునఁ జవాయనా
కామినులమాటలెల్లఁగాదనేవు
చేముట్టిననాసేవ చిత్తానకు వచ్చెనా
కామించినసేవలెల్లా కడకుఁ దోసేవు

చ. 2: నాతోడినవ్వే నీకు నయములై వుండెనా
ఆతలివారినవ్వులందుఁ జౌరవు
యీతల నేనునీకు నితవరినైతినా
యేతులవారినవ్వు లియ్యకొనే(న?) వు

చ. 3: నిక్కము నాకూటములే నీకుఁ బ్రియమాయనా
అక్కడసవతులపొం దాసవడవు
నెక్కొని శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
వెక్కసపువారిఁ జూచి వెరగునొందేవు

రేకు: 1575-4 దేసాళం సం: 25-388

పల్లవి: చెల్లునయ్య నీవుసేసేచేఁత లన్నియు
కల్లగాదు మొక్కే నీకు కాంక్ష రేఁగఁగాను

చ. 1: యొగసక్కేలాడక నీవేమిసేతువయ్యమమ్ముఁ
జిగురుఁగైదువయింత సేయగాను
నగరెక్కుకొని నీవు నవ్వు నవ్వవలదా
పగటుమాజవ్వనముపసురు లెక్కించఁగా

చ. 2: మానముపైఁదిట్టక మరి యెన్నఁడయ్యా నీవు
పూనిననావలపు లుప్పొంగఁగాను
దానికేమి నీవు నాతోఁ దతిగొనవలదా
మోనాన నాచూపు నీపై ముడిగొనఁగా

చ. 3: ఇట్టె నన్నుఁ గాఁగిలించకేల వూరకుండేవయ్యా
జట్టినాకోర్కులు కొనసాగఁగాను
గుట్టునశ్రీవేంకటేశ కూడితివి మండెములో
బెట్టగురతులు నాలోఁ బెనగొనఁగా

రేకు: 1575-5 ఆహిరి సం: 25-389

పల్లవి: ఇంచుకా నోరువఁజామ్మీ యేమైనా నంటివిగాని
అంచెల నావద్దనే యాతనిఁదిట్టేవు

చ. 1: ఆడినమాట కుత్తర మట్టె ఇయ్యవలెఁగాక
యీడ వచ్చి యాతనినేల దూరేవే
వాడలోనే నాతనికి వలపుల సతినంటా
తోడనే నాముందర నేతులు నెరపేవు

చ. 2: నవ్వినందు కాతనితో నవ్వు నవ్వవలెఁగాక
రవ్వగా నాతోనేల రంతుసేసేవే
నివ్వటిల్ల నాతనికి నేను చుట్టమనంటా
కువ్వగా నాముందరనే కోపాలు చూపేవు

చ. 3: చేసినచేఁత కతినఁ జేసి చూపవలెఁగాక
వాసితో మాఇంటికేల వచ్చి చూచేవే
బాసల శ్రీవేంకటేశు పట్టపుదేవులనంటా
మోసదీర నాముందర మొక్కులు మొక్కేవు

రేకు: 1575-6 భైరవి సం: 25-390

పల్లవి: మేలుమే లైరౌర మెచ్చితిర నే నిన్ను
ఆలించి మన్నించు మన్నిటా నన్ను

చ. 1: అలుకలకు మూలమా ఆయంబులంటేది
చలములకు మూలమా సరియాఁకలు
పలుకులకు మూలమా పైకొనుచు నవ్వేది
నెలవులకు మూలమా నివ్వెరగులు

చ. 2: జంకెలకు మూలమా చనవు లిటు మెరసేది
మంకులకు మూలమా మచ్చరములు
లంకెలకు మాలమా లావుననే పెనఁగేది
అంకెరతిమూలమా అడియాసలు

చ. 3: కూడుటకు మూలమా గుట్టుతోఁ గొసరేది
వాడికకు మూలమా వసమౌటలు
యీడనె శ్రీవేంకటేశ నను నేలితివి
జోడౌట మూలమా చూపులప్రియములు

రేకు: 1576-1 సామంతం సం: 25-391

పల్లవి: చల మింతేకాక మమ్ము సారెసారెఁ బొదిగేది
వలెనంటే లోకములో వనితలు లేరా

చ. 1: అలిగినవారితోడ నట్లె పెనఁగనేల
వెలయాండ్రు మరిలేరా వీదివీదుల
పలుకనివారి నేల పలికించే వప్పటిని
కెలసేసతులు నీకుఁ గెలన లేరా

చ. 2: వూరకున్నవారినింత వొడివట్టి తియ్యనేల
ఆరితేరినచెలు లవ్వల లేరా
సారె నంటికాంతలను చలముసాదించనేల
తేరకాడుమగువలు దేశములో లేరా

చ. 3: అలసియుండినవారి నాసలఁబెట్టగ నేల
పిలిచేయింతులు లేరా పెక్కుచోట్ల
బలిమి శ్రీవేంకటేశ పైకొని నన్నేలితివి
వలచిననన్ను వంటివారు నీకు లేరా

రేకు: 1576-2 శంకరాభరణం సం: 25-392

పల్లవి: ఇంతికి నీకును వాసి యీపాటి నున్నది
యెంతకు నోవపు నీవు యేమనేము నిన్నును

చ. 1: చెక్కునఁ జేయివెట్టుక సిగ్గులువడీ నాపె
నెక్కొని సారె నాడేటినీమాఁటలకు
పక్కన నీవైతే నవ్వుఁబాట్లకు వెరవవు
వెక్కసాన నీవిచ్చనవీళ్లాయ వలపు

చ. 2: నంటునఁ దలవంచుక నవ్వులు నవ్వీ నాపె
అంటిముట్టి చెనకీ(కే?) నీయాసోదాలకు
గొంటుపడి నీకైతే గుట్టించుకంతా లేదు
పెంటలై పైపైఁ బెచ్చువెరిగీ నీవయసు

చ. 3: తెరమఱంగున నుండి దిష్టించిచూచీ నాపె
సరసములాడేనిసరితలకు
గరిమ శ్రీవేంకటేశ కలసితి వాపె నిట్టె
యెరవులు లేక నీకు విరవాయ మనసు

రేకు: 1576-3 నాదరామక్రియ సం: 25-393

పల్లవి: ఇంకానేల వెఱపు యీ(ఁ)తకు లో(ఁ)తున్నదా
వంకలొత్తి చక్కఁ జేయ వద్ద నే నుందానను

చ. 1: చెలరేఁగి నీవింత సిగ్గులువడుదురా
పెలుచుమాటల నాపె పిలువఁగాను
తలవంచుకోకువయ్య కలసాజమే ఇది
చెలువ లెవ్వరేమనినాఁ జెప్పనే నుత్తరము

చ. 2: పక్కన నీవింతలోనే పరాకులు సేతురా
తెక్కుల నీకొంగువట్టి తియ్యఁగాను
తక్క కేమి నవ్వేవయ్య తగిలెఁ దొల్లె మనసు
చిక్కిన వారికినెల్లాఁ జెప్ప నే నుత్తరము

చ. 3: సారె నీవింతలో సన్నలు సేయుదురా
గారవించి కాఁగిటఁ గలయఁగాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితి విఁ(వి?) దరి నిట్టె
చేరి నీకు నాకెకును చెప్ప నే నుత్తరము

రేకు: 1576-4 వరాళి సం: 25-394

పల్లవి: ఇప్పుడే చెప్పఁగవలె యెదలోనఁ గలమాట
తప్పకుండా బాసగొని తగిలేఁజుమ్మీ

చ. 1: వద్దనవచ్చునా నిన్ను వడిఁ గొంగువట్టఁగాను
వొద్దిక మాటాడ కూరకుండుదుఁగాక
బద్దుల నీ విదిగాక పానుపు పైకి రమ్మంటే
పెద్దరికమన్నా నను పెనఁగేఁజుమ్మీ

చ. 2: కోపించవచ్చునా నిన్ను కొసరి మేలమాడితే
వోపినట్టె వొద్ద నిలుచుందుఁగాక
కైపుల నీ విదిగాక కాఁగిలించుకొమ్మంటే
పైపైఁ దగదన్నా నను పదరుదుఁజుమ్మీ

చ. 3: తిట్టఁగవచ్చునా నిన్ను తేజాన నన్నుఁ గూడితే
యిట్టె శ్రీవేంకటేశ యెనతుఁగాక
రట్టుసేసి యిదిగాక గుట్టున నవ్వేనంటే
దిట్ట యిదియన్నా నను దీకొందుఁజుమ్మీ

రేకు: 1576-5 దేసాళం సం: 25-395

పల్లవి: ఏల కోపగించుకొనే వుంకుఁగాను
తాలిమి నీమతి కిది తనివిగాదా

చ. 1: జంగిలిసతుల నిన్ను సారెసారెఁ గూడఁగట్టి
వెంగేలు నే నాడితేను వేడుకగాదా
అంగజముద్రలు నీపై నట్టె నెలకొనెనంటే
అంగడిఁ బెద్దరికము అది నీకుఁ గాదా

చ. 2: కందువైన వలపులకతలలో నిన్నుఁ గూర్చి
ఇందరితో జెప్పితేను ఇంపులుగావా
దిందుపడె నూరివారితిట్లు నీకుఁ జెప్పితే(?)
విందుల నీవీనులకు వంతలుగావా

చ. 3: అయాలంటాసందడిలో నాఁడువారి నంటించితే
పాయపునీమదానకు బలిమిగాదా
యీయెడ శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
లాయపురతులు నీకు లక్షణాలుగావా

రేకు: 1576-6 బౌళి సం: 25-396

పల్లవి: నీవల్లనే వచ్చె నిది నే నింత నేరుతునా
చేవల్లకు వచ్చితేను శిరసెందుకు మోఁచునో

చ. 1: చేరి నీవు చెనకఁగ సిగ్గు నేఁ బడఁగలనా
మారుకుమారు సేయక మానవచ్చునా
గోరు దాఁకించితినంటా కొసరుచుఁదిట్టేవు
యీరీతి నీతో పొందు యేమి సేఇంచునో

చ. 2: మాటలు నీవాడఁగాను మౌనము నాకుఁ గలదా
యీటుకు నేఁ బెనఁగక యెట్టు మానుదు
వాఁటమై నవ్వితినంటా వద్దికిట్టె దగ్గరేవు
చాటి నీతో సరసము చవులెంతసేసునో

చ. 3: కొంకక నీవు గూడఁగాను గుట్టు నేఁ జేయనున్నదా
అంకెల నిట్టె కాఁగిట నలరితిని
ఇంకా శ్రీ వేంకటేశ యెంతకెంత జరసేవు
లంకెలసమరతుల లావు లెంతవచ్చునో

రేకు: 1577-1 గౌళ సం: 25-397

పల్లవి: అప్పటి నామీఁదనే యపరాధాలా
తప్పులు మోపఁగరాదా తగిలి నీమీఁదను

చ. 1: అప్పుడు నీవాడిన్టియామాటలే నాకుఁ
జెప్పరాదా చెలులతోఁ జెలరేఁగి
ముప్పిరి నీమేననున్న మూఁకచంద్రవంకలెల్ల
రెప్పలెత్తి చూడరాదా రేసుదీర నాకును

చ. 2: సేసినట్టితొల్లిటినీసేఁతలు నాకడితాన
వ్రాసుకొనరాదా యేమి వహికెక్కను
మాసీమాయనియట్టి మచ్చములు నీకుండఁగా
వేసరక నవ్వరాదా వెతదీర నాకును

చ. 3: కలిగిననీగుణాలే కాంతలతో మెచ్చిమెచ్చి
తలపోసుకొనరాదా తమితోడను
యెలమి శ్రీవేంకటేశ యిప్పుడిట్టె కూడితివి
చలము సాదించరాదా సమరతి నాకును

రేకు: 1577-2 సామంతం సం: 25-398

పల్లవి: ఏమిసేయవచ్చు నీవే యిందరికి గుఱ్రైతివి
కామించినవారికి మగఁడవు గావయ్యా

చ. 1: తడవుగాఁ జూచేయట్టితరుణులచూపులకు
యెడయక నీరూపము యెంగిలాయను
కడుగుకొంటేఁ బోదు కాంక్షలలోపలిజిడ్డు
వడిగా వారిచన్నులఁ దుడుచుకోవయ్యా

చ. 2: తలపోసేకంతలచిత్తములకు నీవయసు
కలగం పై పడిగముగతి యాయను
వెలఁచితేఁ బోదు మరి వేడుకలు మెఱుఁగెక్కు
చెలఁగి వారిమోవులఁ జికిలిసేయవయ్యా

చ. 3: దోమటినీదేవుళ్ళకందువలకాఁగిళ్లకు
ప్రేమ నీవురము పెండ్లిపీఁటాయను
ఆమని శ్రీవేంకటేశ అంటు వోదు పొరలితే
వామిగా నన్నుఁగూడితి వారిఁ బిలువవయ్యా

రేకు: 1577-3 దేసాక్షి సం: 25-399

పల్లవి: మేనవారినేల మేకులు సేసేవు
ఆనలు వెట్టకు ఆయాలంటి

చ. 1: కూరిమిగొసరి కొంగేల పట్టేవు
ఆరీతిఁ బెనఁగకు మంతేసి
వూరకే పొందఁగా నొద్దంటినా నేను
సారెకుఁ దూరకు చండిసేసి

చ. 2: యెలయించి మాతో నేఁటికి నవ్వేవు
అలయించకుమీ అంతేసి
పలుకఁగా నీతో పంతాన నుంటినా
చలము చూపకు జాగుసేసి

చ. 3: యెనసి మాకొప్పు యేమి జారించేవు
అనువాయఁ బోర కంతేసి
చెనకనైతినా శ్రీవేంకటేశుఁడ
పెనఁగకు మిఁక బేండుసేసి

రేకు: 1577-4 సౌరాష్ట్రం సం: 25-400

పల్లవి: అంత సేసినట్టిమీఁద తసేసితే నేమాయ
దొంతినున్న వలపులు దోమటికి రావా

చ. 1: తీపున నిందాఁకా నిన్నుఁ దిట్లు దిట్టిననోరు
చేపట్టి నీకుఁ బ్రియాలు చెప్పఁగలేదా
దాపలాన నీమీఁదఁ జాఁచి పెనఁగినచేయి
మోపుచు నొసల నీకు మొక్కనోపదా

చ. 2: అలుకలకు గురియై అవ్వలి మోమైనమోము
పెలుచుమోపువు విందు పెట్టఁగ లేదా
మొలకపాయములను మొనచూపినచన్నులు
గిలిగింతరతులను కిందుపడనోపవా

చ. 3: సారాసారెసణఁగుల జంకించనట్టికన్నులు
నారుకొన్న వేడుకల నవ్వఁదగదా
యీరీతి శ్రీవేంకటేశ యింతి నీవురము యెక్కె
నుపులరతులను నిన్నిట్టె మెప్పించదా

రేకు: 1577-5 గుజ్జరి సం: 25-401

పల్లవి: నే నెంత వోరుచుకొన్న నీ వెఱఁగవు
కానీరా అందుకేమి కడఁబడెనా

చ. 1: చలపాదితనమా సారె పైఁబడవచ్చేవు
నిలుచుండఁగానే నానీడ దొక్కేవు
బలిమి వేరొకతైతే పంతమున నీచేఁతకు
తలవట్టి తీసి నోటఁదమ్మ వెట్టదా

చ. 2: గటు వాయతనమా కాలు మీఁద వేసేవు
గట్టినాచన్నుల చిప్పగతు లాడేవు
రట్టడియైనదైతే యిట్టె నిన్నుఁ జెప్పరాని
తిట్టు దిట్టి కళలంటి దిమ్ము రేఁచదా

చ. 3: కతకారితనమా కాలు మీఁద వేసేవు
రతిలో శ్రీవేంకటేశ రాయడించేవు
యితరులైతే నిన్ను యీచేఁతకు కొంగువట్టి
బతిమి నానలు వెట్టి పంతములు గొనదా

రేకు: 1577-6 కాంబోది సం: 25-402

పల్లవి: నీచేఁతలోనిదాన నిన్ను వేఁడుకొనే నిదె
కాచెఁ బూచెఁ గోరికలు కలవకు సిగ్గులు

చ. 1: నవ్వులు నే నవ్వితేను నన్నేల యానవెట్టేవు
చివ్వన మతిలో మాఁట చెప్పుమనుచును
వువ్విళ్ళూరించకుమంత వొద్దు దోసము లేదను
జవ్వనము సరిదాఁకె సాదించకు చలము

చ. 2: సరసములాడితేను సరిఁ గొంగేల పట్టేవు
తరవాతఁ గొనగోరు దాఁకెననుచు
గొరబుసేయకు మమ్ము గుట్టున నుండఁగనిమ్ము
దొరతనము లీడేరె తొక్కకు నాపాదము

చ. 3: మొగము నేఁ జూచితేను మొక్కులేల మొక్కేవు
సగటుఁ గూరిములు పైఁబా ననుచు
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
బిగువుఁగాఁగిలి నిట్టె పిసుకకు చన్నులు

రేకు: 1578-1 భల్లాటి సం: 25-403

పల్లవి: నీనేరుపు చూతము నిండుసాము సేతము
పూని చెక్కులను గోర పొందుగా వ్రాతము

చ. 1: కప్పురవిడెము దేవే కైదండ నాకు నీవే
దప్పిదేరిచేఁగాని దగ్గరిరావే
తప్పకేమిచూచేవే తాలిమెల్లాఁ దెచ్చుకొవే
వొప్పుగ పూవులవాలు వొడ్డుకోవే

చ. 2: గందము నాకుఁ బూయవే కరము పైవేయవే
అందుకేమి నాచెప్పినట్లు సేయవే
అంది చన్నుల రాయవే ఆస వెన్నెల గాయవే
గొందినున్న నీపయ్యదకొంగు దియ్యవే

చ. 3: కమ్మి కాఁగిట నించవే కడుసిగ్గులు దించవే
తమ్ములమిడితి నీఁకఁ దలవంచవే
కమ్మర శ్రీవేంకటాదిఘనుఁడ నన్నేలితివి
రమ్మనుచు; నాతోడిరతి పెంచవే

రేకు: 1578-2 రామక్రియ సం: 25-404

పల్లవి: అందుకేమి దోసమా అన్నియు నే నెఱఁగనా
చెందివున్న దాన నెట్టుసేసినాఁ జేయవయ్యా

చ. 1: పిలిచితేనే పతులు పెనఁగఁగఃజూతురు
అలిగితే మొక్కుదురు అతివలకు
కలయఁగ జూచితేనుకడుఁ గిందుపరతురు
చలము సాదించితేను చనవిత్తురు

చ. 2: నగితేనే సారాసారె నాలిసేయఁజూతురు
పగచాటితే నట్టె పైకొందురు
తగుల మాటాడితేను తప్పు లెంచఁజూతురు
మొగము చూచి తిట్టితే మోహింతురు

చ. 3: వలపు పైఁజల్లితేను పట్టారడిఁ బెట్టుదురు
అలరి సిగ్గున నుంటే సగింతురు
కలసితి విటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
యిలలో మనపొందుల కిందరునుమెత్తరు

రేకు: 1578-3 ఆహిరి సం: 25-405

పల్లవి: నీవే యానతీరాదా వీనుల నే వినేఁగాని
మావంటివారికి మాటమేదయ్యా

చ. 1: కన్నులఁ దిట్టితే నీపై కాఁతాళ మందువు
చన్నుల నొత్తితే నీతో చలమందువు
యెన్ని చూచితే నీపొందు యెందుకైనా వచ్చునిఁక
కన్నెలైన వారికెల్లా గతి యేదయ్యా

చ. 2: వచ్చీరాకవుండితే వాసికత్తె యందువు
చొచ్చిమాటాడితేనే యాసోదమందువు
రచ్చలవేసితే నీకత రంటికిని గురియౌను
మచ్చిక నీలేమలకు మనువేది యిఁకను

చ. 3: నెమ్మది నూరకుండితే నేర దిది యందువు
కమ్మరఁ గొంగువట్టితే గయ్యాళందువు
ఇమ్ముల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సమ్మ తించెచెలులకు చనవేది యిఁకను

రేకు: 1578-4 మాళవి సం: 25-406

పల్లవి: ఎందాఁకా బుద్ధిచెప్పే విప్పుడు మాకు
ముందరనే వున్నదాన ముట్టుకు మమ్మును

చ. 1: నేరుపరులై నవారు నీతోఁబొందుసేసేరు
నేరనివారు గలితే నిందుకుండేరు
దూరనేల పోరనేల తొల్లె నీయింటిలోన
సారె జరయకు నన్ను జారుఁగొప్పుదానను

చ. 2: పాయరానియట్టివారు భ్రమసి లోనయ్యేరు
చాయపాటువారెల్లా చక్కనుండేరు
రాయడేల రంతులేల రతికెక్కి పానుపుపై
చేయి చెక్కునఁ బెట్టుక సిగ్గుతో నుందానను

చ. 3: మునుపవచ్చినవారు మొక్కలానఁ గూడురు
వెనకవచ్చినవారు వేరే కూడేరు
యెనసితివి శ్రీవేంకటేశ యింతలోనె నన్ను
తనిసి నే నున్న దాన తక్కించకు మిఁకను

రేకు: 1578-5 రామక్రియ సం: 25-407

పల్లవి: ఏల లేదనేవు నాతో యిట్టె మచ్చము లుండఁగా
పోలించి యాపె నిన్ను బొంకుమనఁబోలును

చ. 1: అదె నీపాదాల నంటె నతివకస్తూరిబొట్టు
మొదల నీకేమిటికో మొక్కఁబోలును
కుదురుగుబ్బలమీఁదికుంకుమ నీమేన నంటె
కదిసి నీవుర మిట్టె కాఁగిలించఁబోలును

చ. 2: వంచినశిరసుపై వాడుఁబూవులెల్లా రాలె
కొంచక రతుల నిన్నుఁ గూడఁబోలును
నించిననీచెక్కులపై నెరసెఁ దమ్ములమటు
మంచులకళలు రేఁగ చుంబించఁబోలును

చ. 3: వొళ్లఁబూసినపసుపు వొద్దిక నీమేన నంటె
చెల్లుబడి నీతో సాముసేయఁబోలును
యెల్లగా శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడితివి
చల్లఁగా నీకు నాపె సన్న సేయఁబోలును

రేకు: 1578-6 శంకరాభరణం సం: 25-408

పల్లవి: ఇంతట నున్నార మిదియె చాలును
యెంతసేసినా నెటిఁగేనా

చ. 1: నాలుకచూపులు వసమై యాకెకు
కేలుచాఁచి తమకించేవు
యెలాగులు సే మెట్లఁ బొదిగినా
మేలేలనుచు మెచ్చేవా

చ. 2: పిలుకుఁదేనేలకు భ్రమసి యాపెకును
వలచి నీశిరసు వంచేవు
పిలిచి నే మినుడు ప్రియములు చెప్పిన
తలఁపులోపలను తగిలీనా (లేవా?)

చ. 3: నిండుఁగాఁగిటను నిలిచి యాపెతో
అండనె సరసములాడేవు
పండె శ్రీవేంకటపతి నాభాగ్యము
దండిగఁ గూడితి తనిసేవా

రేకు: 1579-1 శుద్ధవసంతం సం: 25-409

పల్లవి: ఏఁటికిఁ గొంకేవు నీవు యెవ్వరున్నా రీడను
నాఁటుకొన్న మోహములు నడపరాదా

చ. 1: వాలుకచూపులయాపె వంచివంచి మాటాడఁగా
నాలిసేసి నీవేల నవ్వే వీడ
బేలవై; యేకతానకుఁ బిలిచి మాటాడరాదా
యీలాగుల మీకోరిక లీడేరీఁగాని

చ. 2: చనుమొనలు చూపును సరసములాడఁగాను
నినుపునిట్టూర్పులేల నించే వీడ
మనసు గరఁ దొల్లె మన్నించి కూడఁగరాదా
వెనకటిసిగ్గు లె ల్లా వీడీఁగాని

చ. 3: పంతము నెరపి కొంగువట్టి యాపె దియ్యఁగాను
చెంత నాపైఁ జేయిచాఁచి చెనకే వీడ
వంతుకు శ్రీవేంకటేశ వడి నన్ను నేలితివి
చింత వాపరాదా తానే సెలవిచ్చీఁగాని

రేకు: 1579-2 ఆహిరి సం: 25-410

పల్లవి: మంకుఁదన మేదే నాకు మగువలాల
అంకెకుఁ దా నెట్టు చెప్పె నట్టుసేసేనే

చ. 1: కపటమున్నదా నాకుఁ గడునెంతైనాఁ దనపై
అపుడే మరచితి నే నట్టికోపము
వుపమలఁదా నేఁటికి నొడఁబరచీనే నన్ను
తపముతో నున్న దాన తనకొరకే

చ. 2: చలము సాదించేనటే సారెసారెఁ దనతోను
చెలఁగి తనవోజలు చెప్పితి నింతే
పలుమారుఁదా నేఁటికిపంతము లిచ్చీ నాకు
వలచి యెప్పుడుఁ దనవసమై యుందానను

చ. 3: కాదనేనటే తన్ను కాఁగిలించి కూడె నన్ను
సోదించి చూచితి నాఁడే సొంపులెల్లాను
యీదెస శ్రీవేంకటేశుఁ డింతగా మన్నించె నన్ను
మోదముతో నున్న దాన మొదలనుండియును

రేకు: 1579-3 పాడి సం: 25-411

పల్లవి: ఏఁటిమాటలాడేవు యేల దూరేవు
నీటులు మెరసెనా నేఁడు మాచెలి

చ. 1: ననుపుగలుగుచోట నవ్వేనింతేకాని నిన్ను
వనిత కెగసక్కేమా వడి నీతోను
పెనఁగులాటవేళ కొనగో రంటించెఁగాక
నినుఁ బగసాదించెనా నేఁడు మాచెలి

చ. 2: పట్టి మేనవానిచోట బలువు మెరసెఁగాక
రట్టుసేసునా రామ ఇట్టె నిన్నింత
చుట్టమవంటా నిన్ను సొలసె నింతేకాక
తిట్టులు నిన్నుఁ దిట్టునా తెగి మాచెలి

చ. 3: కూటమిగలుగుచోట గురుతులు నించెఁగాక
యీటునఁ బచ్చిసేసునా యింతి నిన్నును
గాఁటాన శ్రీవేంకటేశ కాఁగిలించెఁగాక యీపె
నాఁటిమాఁట కింతసేసునా మాచెలి

రేకు: 1579-4 కాంబోది సం: 25-412

పల్లవి: ఇందరికి దిష్టము యీపనులు
సందడంచీ లోలోన సకలమర్మములు

చ. 1: మనసే మర్మము మచ్చికలకెల్లాను
తనుసోఁకులే మర్మము తనివికిని
చెనకులే మర్మము చెలరేఁగివున్నందుకు
కనుఁగొనరే యిద్దరికతలూ గానవచ్చె

చ. 2: నగవులే మర్మము ననుపులకెల్లాను
మొగమాటమే మర్మము ముదములకు
బిగువులే మర్మము పెడరేఁచేపనులకు
తగవు చెప్ప రే వీరి తమకము నిండెను

చ. 3: కోరికలే మర్మము కూటములకెల్లాను
మేరమీరుటే మర్మము మేకులకును
యీరీతి శ్రీవేంకటేశుఁడింతలోనె నన్ను నేలె
తేరుచరే తమమేలు తేటతెల్లమిగను

రేకు: 1579-5 సామవరాళి సం: 25-413

పల్లవి: ఏల వేగిరపడీని యెఱఁగఁడా తానేమి
పోలించి యీందాఁకాఁ దన్ను బోదించవలెనా

చ. 1: మనసునఁ గలితేను మరి బాససేయనేల
పెనఁగఁ జోటు గలితే ప్రియములేల
తను నమ్మివున్న దాన తగవు దానే యెఱుఁగు
వెనకఁ దగిలి విన్నవించవలెనా

చ. 2: వలపు గలిగితేను వాడవారిసాకిరేల
నిలుకడ గలచోట నేరుపులేల
కలసివుందాన నేను కైకొన్నాఁడు తొల్లె తాను
పొలసి సొలసి యింకాఁ జొక్కించవలెనా

చ. 3: వేడుకకుఁ బెండ్లాడి వేరెవావి చెప్పనేల
యీడుజొడై వున్నచోట యెన్నికలేల
కూడె శ్రీవేంకటేశుఁడు గొబ్బునఁ దానే నన్ను
మేడెపురతుల నింకా మెప్పించవలెనా

రేకు: 1579-6 నారాయణి సం: 25-414

పల్లవి: అతఁడు గలితేఁజాలు అన్ని పనులను మేలే
యీతల నిన్ను జరయనేఁటికమ్మా మాకు

చ. 1: చలముగలవారిని సమ్మతించఁ జేయరాదు
సలిగెగలవారిని సాదించరాదు
కలిమిగలవారిని కాదుగూడదనరాదు
యెలమి నీతోడివాదు లేఁటికమ్మా మాకు

చ. 2: నాలితో నుండేవారి నవ్వించఁజేయరాదు
గేలిసేసేవారిని గెంటించరాదు
మేలమాడేవారిని మేరలు మీఱఁగరాదు
యీలీల నిన్ను జంకించనేఁటికమ్మా మాకు

చ. 3: మౌనాననుండేవారిని మాటలాడించఁగరాదు
నానాగుణమువారి నమ్మించరాదు
పూని శ్రీవేంకటేశుఁడు పొసఁగ నన్నేలె నిదె
యేనెపాలు వేయ నీతోనేఁటికమ్మా మాకు

రేకు: 1580-1 కేదారగౌళ సం: 25-415

పల్లవి: ఎందాఁకాఁ గాచుకుండు నేవనిత వచ్చునో
చెందినవుపకారము చేకొనవయ్యా

చ. 1: గట్టిచనుఁగవ నిట్టె కానుకియ్యవచ్చె నాపె
చుట్టవువరసమేలు చూపవచ్చెను
వెట్టదీర మోవితేనె విందుచెప్పవచ్చె నాపె
గుట్టుతోఁ బొడచూపించుకొనఁగదవయ్యా

చ. 2: చిక్కనిజవ్వనరాజ్యసీమ న(ని?) న్నేలించవచ్చె
పెక్కుత(వ?) లపులు వెదవెట్టవచ్చెను
ఇక్కువనేత్రచకోరా లింపులు చూపఁగవచ్చె
అక్కజాన నన్నీఁ జూచి ఆదరించవయ్యా

చ. 3: కాఁగిటిసమ్మంధము కలయఁ జెప్పఁగవచ్చె
చేఁగదేర సేవలెల్లఁ జేయవచ్చెను
వీఁగక శ్రీవేంకటేశ వేడుక నన్నే లితివి
ఆంగి రతిఁదమకించీ నలపు దేర్చవయ్యా

రేకు: 1580-2 హిజ్జిజి సం: 25-416

పల్లవి: ఎఱఁగనట్టే వున్నాఁడ వేమీ నీవు
నెఱయఁ దెరమఱఁగు నీవే తేరుచుమీ

చ. 1: నెలఁతల్లిద్దరిసంది నిజము నిన్నుఁగోరితే
మలకలమలకల మాటలాడేవు
కలది గలట్టె చెప్పు కాఁపురము నిన్ను మోఁచి
తెలిసి కాంతలవాదు తేరుచుమా నీవే

చ. 2: సవతుల శాంతాలజాడలు నిన్నడిగితే
నవకపుసెలవుల నవ్వు నవ్వేవు
వివరించు తప్పొప్పులు వేడుకలు నీసొమ్మే
తివిరి పాడిపంతాలు తేరుచుమా నీవే

చ. 3: సరిఁ బెండ్లికూఁతులను సంతము సేయుమంటే
శిరసెత్తి చూచి చూచి సిగ్గువడేవు
నిరతి శ్రీవేంకటేశ నేరుపెల్లా వీవొళ్లిదే
తిరమై నన్నేలితివి తేరుచుమా నీవే

రేకు: 1580-3 లలిత సం: 25-417

పల్లవి: ఎవ్వరెవ్వరితలఁపు లెట్లున్నవో
యివ్వల నాకుఁదెలియ దేమనేవ(న?) య్యా

చ. 1: మచ్చరము గలితేను మనసు లొక్కటిగావు
కుచ్చితము గలితేనే గుణము లేదు
తచ్చనలు గలితేను ద్రైవారదు నిజము
యిచ్చట నన్నుఁజెనకే వేమనేనయ్యా

చ. 2: నాసివంతులు గలితే వలపు చవిపుట్టదు
ఆసలే పెక్కుగలితే ఆతుమారదు
రేసులు గలిగితేను రేపుమాపు నలపులే
యీసరి నన్నుఁ బొదిగేవే మనేవయ్యా

చ. 3: బిగువు గలిగితేను బీర మెంతటాఁబోదు
నగవు గలిగితేను నను వు లవును
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
యెగసక్కేలెల్లాఁ బాసె యేమనేనయ్యా

రేకు: 1580-4 తోండి సం: 25-418

పల్లవి: ఎందు వోయే నేను ఇక్కడనే వున్న దాన
అందుకోలువలపులు అనుచరించరాదా

చ. 1: ముప్పిరి మాతోనీవు ముచ్చటలాడవచ్చేవు
కప్పురమిచ్చినయాపె కాచుకుండగా
అప్పటి వచ్చినపని అడుగరాదా ఆపెను
చిప్పిల వెనక నన్నుఁ జెనకేవుగాని

చ. 2: సారెకు నాతో నేమిచదురంగాలాడేవు
కోరివచ్చినాపె వొద్దఁ గూచుండఁగా
సైరణతో నీ వాపెచనవు చెల్లించరాదా
గారవించి మరి నన్నుఁ గుదిసేవుగాని

చ. 3: కందువతో నన్ను నెంత కాఁగిలించుకొనే విటె
సందడిఁ బెండ్లాడి నాపె సన్న సేయఁగా
వొందిలి యాపెను నీవు వొడఁబరచఁగరాదా
ఇందు శ్రీవేంకటేశ నన్నేననేవు గాని

రేకు: 1580-5 దేసాళం సం: 25-419

పల్లవి: అయనాయ నుండవయ్య అన్నిటా నేరుపరివి
పాయము పెచ్చువెరిగీఁ బలుకులలో నను

చ. 1: గందపుఁబూఁతబేంట్లు కస్తూరివాట్లు
చిందిచింది రాలిరాలి చిట్లఁజొచ్చె
యెందాఁకా నవ్వు నవ్వే విందరుఁ జూచేరు నిన్ను
చెం(చెం?) జెమటలు నీచెక్కుల వెంటాను

చ. 2: మించుఁగొప్పువిరులు మెడనున్న సరులు
పొంచిపొంచి చెదరుచుఁ బొనుఁగఁజొచ్చె
యెంచరాని మాటలెల్ల యెందాఁకా నాడేవు
ముంచీ నిట్టూర్పులు ముక్కునిండాను

చ. 3: కంకణాలమోఁతలు కాఁగిటిలో చేఁతలు
పొంకపు శ్రీవేంకటేశ పొలయఁజొచ్చె
కొంకన నన్నే లితివి గుటెందాఁకాఁ జేసేవు
అంకెలఁ దేనెలుగారీ నధరమునిండను

రేకు: 1580-6 బౌళి సం: 25-420

పల్లవి: నీకు దేవులను నేను నేరమెంచేనా
పైకొని నాయంత వచ్చి బలిమిచూపేనా

చ. 1: పక్కున నాతో నీవు పంతములు నెరపినా
నిక్కినిక్కి చూతుఁగాక నిన్నుదూరెనా
వెక్కసపుసతులను వేవేలు దెచ్చినాను
మొక్కులే మొక్కుదుఁగాక ముంచి కోపించేనా

చ. 2: ఆరడిఁబెట్టి నన్నెంత అట్టె మాటలాడినాను
తేరకొనఁ జూతుఁగాక తిట్టు దిట్టేనా
బీరాన మాతో నెంత పెనఁగులాట లాడిన
చేం పొగడుదుఁగాక చిక్కులఁ బెట్టేనా

చ. 3: గచ్చులకు నన్ను నెంత కాఁగిట బిగించినాను
పెచ్చువెనఁగుదుఁగాక పిరితీసేనా
ఇచ్చట శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
మచ్చికైవుందుఁగాక మఱచేనా మేలు

రేకు: 1591-1 దేవగాంధారి సం: 25-421

పల్లవి: అన్ని తగవులు నీయందే వున్నవి
యెన్ని కవిచారము లేమిటికి నీకు

చ. 1: మునుపఁ గప్పురమిచ్చి ముదిత గాచుకుండఁగ
వెనక విడెమిచ్చినవెలఁదితో నవ్వేవు
చెనకేయక్కకంటెను చెల్లెలే ప్రియముగాదా
చెనయఁ బెద్దతనము లెవ్వరికి బాఁతి

చ. 2: పంతాన సేవసేసేటిపడఁతి పక్కనుండఁగ
చెంతనే మొక్కులు మొక్కేచెలిపైఁ జేయి చాఁచేవు
పొంతనున్న సతికంటె పొరుగాపె చవిగాదు
యెంతసేసే వినయాలు యెవ్వరికి బాంతి

చ. 3: సరసమాడేయాపె సంగడినే వుండఁగాను
వొరసి పెనఁగేనన్ను నొగిఁ గూడేవు
గొరబై శ్రీవేంకటేశ కొసరునే మేలుగాదా
యెవులపాఁతవల పెవ్వరికి బాఁతి

రేకు: 1591-2 శుద్ధవసంతము సం: 25-422

పల్లవి: పడఁతివలపులెల్లా బయటఁబడెను నేఁడు
కడలేనిప్రియముతోఁకాఁగిలించవయ్యా

చ. 1: సతిచెమటలేరులు చన్నులవెంటఁ గారఁగాఁ
దతితో సిగ్గులువడీఁదా నిన్నుఁ జూచి
మతితోఁబరవశాలు మచ్చికలుఁ దొట్టఁగాను
రతిఁ దేలగిలఁ జూచీ రవ్వగా కన్నులను

చ. 2: చెలియ సంతోసాలు చేరి మోమునఁ దేరఁగా
తలవంచుకొని చూచీ తనదిక్కు
సెలువల నగవులు చిందుచుఁ జిమ్మిరేఁగఁగా
నిలువుటద్దముదిక్కునీడలుచూచీని

చ. 3: అంగన తమకములు అట్టె పైపైఁ బెనఁగగా
కంగులేక చూచీ నాకాఁగిటిదిక్కు
ముంగిట శ్రీ వేంకటేశ ముందు నీవు గూడఁగను
పంగెనలేనిచనువు భావించి చూచీని

రేకు: 1591-3 ఆహిరి సం: 25-423

పల్లవి: అందువంకనైనఁ గొంత అసిఁబోవుఁ దమకము
చందురునింటి మోము చక్కఁ జూడవయ్యా

చ. 1: సముకాన నాపె నిన్ను సారెసారె దూరఁగాను
చెమరించి చెక్కుచేతఁ జింతించేవు
చిమిడీ వలపులెల్ల చిత్తములోనే నీకు
అమర మాటకుమాట లాడవయ్య ఇఁకను

చ. 2: చేరిచేరి సణఁగుల చేతులు పైచాఁచఁగాను
వూరకే తలవంచుక వున్నాఁడవు
పేరుకొని మేనిమీఁద పెనుజవ్వనమదము
వారుకొనె సెలవుల నవ్వవయ్య ఇఁకను

చ. 3: వూవులచెండున వేసిపొందు లాపె దెలుపఁగా
శ్రీవేంకటేశ్వర నీవు సిగ్గువడేవు
యీవేళనే కూడితివి యిద్దరిసేసలు నిండె
చేవదేరఁ గతలెల్లాఁ జెప్పవయ్యాయిఁకను

రేకు: 1591-4 ఆహిరినాట సం: 25-424

పల్లవి: ఊరకే లోనౌదువా వుడిబడి వారికెల్ల
మేరమీరి యాపెనే మెచ్చవలెనయ్యా

చ. 1: మెల్లనిమాటలాడి మెలుఁత నిన్ను భ్రమించె
చల్లనినవ్వులు నవ్వి సాదించెను
మొల్లలతురుము చూపి సుదతి నిన్నుఁ జొక్కించె
చెల్లునయ్యాఆపె మేమిసేసినాను నిన్నును

చ. 2: సోయగపుచూపు చూచి సుదతి నిన్నుఁ జొక్కించె
ఆయాలు చన్నులనొత్తి అసరేఁచెను
పాయపుమదము చిమ్మి భావమెల్లాఁ గరఁగించె
నోయంతవాని నాపె నేర్చునయ్యా పొందను

చ. 3: వేవేలు చేఁతలు చేసి వెలఁది నిన్ను మొప్పించె
చేవదేరే రతులను చిక్కించెను
యీవేళ శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
ఆవేళ కాపె రాజు అవునయ్య నీకును

రేకు: 1591-5 వరాళి సం: 25-425

పల్లవి: ఎవ్వరిముందరఁ జేసే విట్టై వట్టిసటలెల్లా
నివ్వటిల్ల నీవిద్యలు నే నెఱఁగవా

చ. 1: మొగమోటలేక యెంతమొక్కలాన నాపె నిన్ను
యెగసక్కే లాడినా నీ కింపులేకావా
తెగువలుమీర నట్టె దిమ్మరితనములను
నగినా నీ కవియెల్లా ననుపేకావా

చ. 2: బలువుగాఁ దా మెరలఁబట్టి నీ మేను దాఁగ
చలమున వేసినానుచవులేకావా
కొలఁదిమీర నీచెక్కు కొనగోరిముద్రలు
వెలయఁగ గీరినాను వేడుకలేకాదా

చ. 3: గుట్టుతోడ నీవురము గొప్పగొప్పచన్నులను
గట్టిగా దాఁకించిన నీఘనతేకాదా
యెట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మెట్టి యాకె నిన్నేలిన మేలేకాదా

రేకు: 1591-6 హిందోళవసంతం సం: 25-426

పల్లవి: ఎంత చుట్టమో నీకు నిదివో ఆపె
సంతసపువలపుల జడిసీ నాపె

చ. 1: తేనెగారే పెదవుల తేటమాఁటలాడీ నాపె
నానఁబెట్టి సెలువుల నవ్వీ నాపె
సానఁబెట్టినచూపులు జళపించీ నీపై నాపె
మోనముతో బొమ్మలను మొక్కీ నాపె

చ. 2: నిండుఁ జెక్కుటద్దములనీడలు చూపీ నాపె
గండుఁదుమ్మిదకొప్పుతోఁ గదిమీ నాపె
కొండలవంటిచన్నులకొనలు దాఁకించీ నాపె
మెండుఁజిగురుచేతుల మెచ్చు మెచ్చీనాపె

చ. 3: ఆయపు మెఱుఁగుమేన ఆసలురేఁచీ నాపె
పాయపుసిగ్గులచేత భ్రమించీ నాపె
మోయరానిపిఱుఁదుల మురిపెముచూపీ నాపె
యీయెడ శ్రీవేంకటేశ యెనసె నిన్నాపె

రేకు: 1592-1 దేసాళం సం: 25-427

పల్లవి: ‘‘ఓపో అదేడసుద్ది వొశక్క
కోపగించుకొందురటె గొబ్బున నోశక్క

చ. 1: చెల్లుబడిగలవాఁడు చేతికి విడెమియ్యఁగ
వొల్లనందురటవె వోశక్క
గొల్లదానవంటా నీకొంగువట్టి తియ్యఁగాను
మల్లాడుదురటవే మరియు నోశక్క

చ. 2: వుద్దండాన నాతఁడు వుబ్బుబ్బి పిలువఁగాను
వొద్దికి రాకుండుదుర టె వొశక్క
ముద్దుముద్దువలె నీపై మోహమోల్లాఁ జల్లఁగాను
గద్దించి తిటుదురటె కమ్మటి వోశక్క

చ. 3: ఆరితి చుట్టరికాలు అట్టె నీతోఁ జెప్పఁగాను
వూరకుండుదురటవె వోశక్క
ఆరయ శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడెను
గోర గీరుదురటవె కొసరి వోశక్క

రేకు: 1592-2 సాళంగనాట సం: 25-428

పల్లవి: నీవిభుఁడు గేలిసేసీ నిన్నుఁ జూచి
యీవలఁ దాలిమి లేదు యింతలోనిదానవా

చ. 1: శిరసు వంచనేఁటికే సిగ్గుపడనేఁటికే
గరిమ నీపతిఁగంటే కళదాఁకెనా
చెరలాట లేఁటికే చెమరించనేఁటికే
సరసములాడితేనే కరఁగితివా

చ. 2: పులకించనేఁటికే పొంచి నివ్వెరగేఁటికే
తలఁపులోనే కూటమి దక్కెనా నీకు
అలయఁగ నేఁటికే అసురుసురేఁటికే
సొలపుఁజూపులలోనె సోఁకెనా వలపులు

చ. 3: గుట్టుసేయనేఁటికే కొప్పు వీడనేఁటికే
అట్టె చేయిచాఁచితేనే ఆయనాపొందు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁడు నిన్నుఁగూడె
ముట్టినపానుపుపైనే ముంచెనాకోరికలు

రేకు: 1592-3 కాంబోది సం: 25-429

పల్లవి: ఒక్క మొగనాండ్లకు వొరటులెందాఁకానే
వెక్కసపుఁబొత్తు గూడి వేడుకతో నుందమే

చ. 1: అప్పుడు నేనన్నమాట లన్నియు నోరుచుకోవే
చెప్పినప్రియములు చేకొనవే
యెప్పుడూ నక్కచెల్లెండ్ల మేఁటికే మనలో వాదు
కప్పినపందులతోడ కాఁపురాలు సేతమే

చ. 2: మనలో నిఁక సవిమచ్చరాలు మానుదమే
వొనర బాసలు సేసుకుండుదమే
సనుపుఁజుట్టాలమూ నవ్వుతాఁ జెలఁగుదమే
మనసు లొక్కటిగాఁగ మచ్చికలు సేతమే

చ. 3: యెగ్గులునుఁ దప్పులును యెన్నఁడు నెంచవలదే
వొగ్గి వరుసవంతులనొద్దికొదమే
సిగ్గుదేర నిన్నూ నన్నూ శ్రీవేంకటేశుఁడు గూడె
తగ్గనియానందాన తనివి నొందుదమే

రేకు: 1592-4 ముఖారి సం: 25-430

పల్లవి: కొలువుసేసే వారము కొరత లెంచఁగలమా
పిలుపు లిద్దరికి మీ పెదవుల నున్నవి

చ. 1: చనుమొనలు దాఁకఁగ జవ్వాది నీ కాపె పూసె
కనుఁగొనలనే చొక్కి కరఁగితివి
చొనిపి మమ్మిఁక నేమిసుద్దులు నీ వడిగేవు
చెనకిచెనకులు చెక్కులపై నున్నవి

చ. 2: సొమ్ము సొమ్ముతో రాయఁగ సురటి విసరీ నాపె
కిమ్ములఁ గరఁగి పులకించితివి
మమ్ముఁ జూచి సిగ్గువడ మరి యేమిటికి నీకు
చిమ్మెటినవ్వులు మీ సెలువుల నున్నవి

చ. 3: పాదముఁబాదము దాఁకఁ బవ్వళించివున్నదాపె
యీదెసఁ గాఁగిట నీవు యెనసితివి
పొదిగా శ్రీవేంకటేశ పొందితివి మమ్ము నిట్టె
మోదపుఁగళలు మీమోములు నిండున్నవి

రేకు: 1592-5 సామవరాళి సం: 25-431

పల్లవి: ఈఁతకు మిక్కిలి లోఁతు యిఁక లేదు
బాఁతిపడ నేమనఁగా భయమేల నీకు

చ. 1: నీమనసు రావలసి నెలఁతఁ దోడితెచ్చితి
యేమి సేయవలెనయ్యా ఇంకా నీకు
కామించి యానతీవయ్యా కడుసిగ్గువడనేల
నేమెల్లా గలుగఁగాను నీ కేమిగడను

చ. 2: వేడుకలు గావలసి విడే లిద్దరి కిచ్చితి
వోడక సేయించుకో వో యుచితా లింక
చూడరాదా నాదిక్కు సూటిగా మఱఁగులేల
వూడిగము నేఁజేయఁగా వొదుగ నీకేల

చ. 3: కూటమి మీకు వలసి గొబ్బునఁ దెరవేసితి
యేఁటికి నెరపరికా లింకా నీకు
నీటున శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
చోటిచ్చి నే లోఁగఁగా సుద్దులు మరేఁటికి

రేకు: 1592-6 పాడి సం: 25-432

పల్లవి: కట్టరో కలువడాలు గక్కన వాకిళ్లను
పట్టరో వులుపలు శోభనద్రవ్యములును

చ. 1: తిరుకొడి యొక్కెనదె దేవునికల్యాణానకు
గరుడపటము పెఁ(పైఁ?) డి కంబమందును
ధరపై బ్రహ్మాదిదేవతలెల్లాను వచ్చిరదె
వరుసతో వాయిద్యాలు వాయించరో

చ. 2: ముంచి హోమములు సేసి మునులు సంభ్రమమున
అంచెల గడియ కుడు కట్టి పెట్టిరి
పెంచముగఁ దెరవేసి పెండ్లిపీఁట వెట్టిరదె
మించఁ బేరంటాండ్లు నర్మిలిఁ బాడరో

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యలమేల్మంగయు
యీవేళఁ దలఁబాలు ఇట్టె పోసిరి
బూవములు పొత్తునను భుజియించి రిప్పు డిట్టె
వేవేలకుఁ గప్పురపువిడె లియ్యరో

రేకు: 1593-1 శ్రీరాగం సం: 25-433

పల్లవి: నేఁడాతనిసంపదెల్ల నీభాగ్యము
పోఁడిమితో వలపులు పోగులువోసీని

చ. 1: చలపాదినతమేల సకియతో నవ్వఁగదే
చెలువుఁడు మాటలనే సిగ్గరేఁచీని
పళువులఁజూపుల నీవు చక్కఁజూడఁగదవే
కలసొమ్ములెల్లాను సింగారించుకొనీని

చ. 2: మంకుఁదన మింతయేల మాటలైనా నాడఁగదే
అంకెల నిన్నాతఁడిట్టె ఆదరించీని
బింకపుబీరాలు మాని పెదవి లంచమియ్యనే
కంకణము నీ కతఁడు గట్టఁజూచీని

చ. 3: పంతము లప్పటినేల పానుపుపైఁ గూచుండవే
చెంత శ్రీవేంకటేశుఁడు చేయివట్టీని
ఇంతటలమేల్మంగ విన్నిటా మెచ్చవే
మంతనపురతులను మక్కళించీని

రేకు: 1593-2 సామంతం సం: 25-434

పల్లవి: ఎంత సలిగిచ్చితివి యీపెకు నోయి
సంతతము ను నిది సాజమా వోయి

చ. 1: మిన్నక నీతో నేనుమేలములాడితినంటా
కన్నుల జంకించీ నాపె కంటివా వోయి
చన్ను మొనలను నిన్ను సారెఁ దకించితినంటా
వెన్నాడి తిట్టవచ్చీని వింటివా వోయి

చ. 2: వలపు నీమీఁదఁ జల్లి వద్దఁ గూచుండితినంటా
యెలమిఁ బైకొనివచ్చీ యిదేఁటిదోయి
చలివాయ నీకు మోవిచవులు చూపీనంటా
మలసి సాదించీ నేఁటిమందెమేళమోయి

చ. 3: పరగ నీతో నేను పక్కనఁ గూడితినంటా
వరుసవంతుకుఁ దాను వచ్చీనోయి
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
సరవిఁదా నన్నిటికి సమ్మతించెనోయి

రేకు: 1593-3 గౌళ సం: 25-435

పల్లవి: ఎప్పుడూ నాపె నీసొమ్మె యెందు వోయీని
చెప్పరానివలపు నీచేతిలోనెకాదా

చ. 1: కన్నెనీతోఁ గోపగించి కదిసి మాటాడదంటా
యెన్ని ప్రియములు చెప్పే నెందాఁకాను
సన్నలదిట్టుదిట్టి చలము సాదించీనంటా
వన్ని యానలేల పెట్టి వంకిం(గిం?) చేవు

చ. 2: మంతనాన నాపె నీతో మాటలాడకున్నదంటా
సంతమేల ఇచ్చేవు పదరి నీవు
చెంత నిన్ను గేలిసేసి సెలవి నవ్వీనంటా
యింత యాల మొక్కేవు యిందరిలోను

చ. 3: అలమేలుమంగ నిన్ను అంటకోకుమనీనంటా
లలి శ్రీవేంకటేశ యెంత భ్రమసేవు
అలమి బలిమిఁబట్టి ఆపె నిన్నుఁ గూడెనంటా
నిలువున నీవేల నివ్వెరగయ్యేవు

రేకు: 1593-4 మాళవి సం: 25-436

పల్లవి: నీకే తెలుసునయ్య నీచేఁతలు
యేకొలఁది కాకొలఁది కెందుకైనా వచ్చును

చ. 1: నాతో నీవు నవ్వఁగ నగకుండవచ్చునా
యీతల నందుకే చన్నులేల పట్టేవు
ఘాతల మోనాన నుంటే కడు గర్వినవా
యేతుల దొరలపొందు లెందుకైనా వచ్చును

చ. 2: వూరకే మాటాడితే నే నూఁకొనకుండవచ్చునా
మేర మీరి నీపాదము మీఁద వేసేవు
కోరి గుట్టున నేనుంటే కుచ్చితమిదనవా
యీరీతి నీతోడిమేలా లెందుకైనా వచ్చును

చ. 3: గుట్టున నీవు గూడఁగఁ గూడకుండవచ్చునా
వొట్టి యందుకే గురుతు లొనరించేవు
అట్టె శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
యెట్టయిన నీమన్నన లెందుకైనా వచ్చును

రేకు: 1593-5 దేసాళం సం: 25-437

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యేమందు నిన్ను
సంతతవువలపులు చల్లువెదలాయను

చ. 1: సిగ్గువడకుండరాదా చింతలెల్లఁ బాపేఁగాని
యెగ్గు లెంచకుండరాదా యెనసేఁగాని
తగ్గక నీవును నేను తతిగొని మొక్కఁగాను
వెగ్గళించి చెమటలు వెల్లావిరులాయను

చ. 2: చెఱఁగు విడువరాదా చెప్పినట్లు సేసేఁగాని
మఱఁగుకు రారాదా మాటాడేఁగాని
గుటిగాఁగ నిద్దరము కూరిములు గొసరఁగా
కలకుఁబ్రల్లదములు కడుఁబెంటలాయను

చ. 3: వీడె మందుకోరాదా వేడుకలు సేసేఁగాని
చూడరాదా నాదిక్కు చొక్కించేఁగాని
యీడుగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కూడితివి వెరగులు కోటానఁగోటా(ట్లా?) యను

రేకు: 1593-6 పాడి సం: 25-438

పల్లవి: కంటివా నీకన్నులను కాంతభావములు
వింటివా నాభావములు వీనుల నీవు

చ. 1: నిలువుటద్దములోన నిన్నుఁ దన్ను నీడచూచి
నలినాక్షి సెలువుల నవ్వు నవ్వెను
మొలకచన్ను లందులో మోఁచెను నీమేననంటా
తలవంచుకొని పయ్యదను మూసుకొనెను

చ. 2: పదములో నిన్నుఁ దన్నుఁ బాడుకొని మదిరాక్షి
చెదరనిచెక్కుచేత సిగ్గువడెను
అదన మర్మపుసందు అందులోసరిదాఁకితే
తుదలేని చెమటలఁ దొప్పఁదోఁగెను

చ. 3: తలఁపులో నిన్నుఁ దన్నుఁ దగుల గాఁగిటనుంచి
అలమేలుమంగ కూడె నట్టె నిన్నును
అలరి శ్రీవేంకటేశ అందులో నీమోవి యాని
నిలువెల్లాఁ గళలతో నిండుకున్నది.

రేకు: 1594-1 రామక్రియ సం: 25-439

పల్లవి: వట్టిబీరపుమాటలు వద్దు నాతోను
జట్టిగొని నామోవిచవి నీ వెఱఁగవా

చ. 1: పక్కన నీతో నేను పంతమాడుకొనఁగాని
యిక్కువ కాకంటె హితు లెవ్వరున్నారు
గుక్కక నీవప్పటిని గుట్టు సేసే వింతే కాక
మిక్కిలి నాపైఁజేసిన మేలు నీ వెఱఁగవా

చ. 2: వింతలుగ నీతో నేను వేసాలు నెరపఁగాని
యింతులు నావలె సేవ లిటు సేసేరా
మంతుకెక్కి నీవప్పటి మఱఁగు పెట్టేవు గాక
అంతటి నాపై తమక మాఁపఁగలవా

చ. 3: ఆరీతి నీతో నేను ఆనవెట్టుకోఁ గాని
నేరుపులు నావల్ల నీ వెఱఁగవా
ఔరా శ్రీ వేంకటేశ అలమేలుమంగనేను
తారుకాణరతులెల్లా దాఁచఁగలవా

రేకు: 1594-2 కన్నడగౌళ సం: 25-440

పల్లవి: ఎంతవాఁడవయ్యు నిన్ను నెఱిఁగేపాటివారమా
దొంతరసిగ్గులనెల్లఁ దొరలించుకొంటివి

చ. 1: చలము సాదించనేర్పుజాణవుగనక నీవు
బలిమి నాపెచేయి వట్టితివి
వలపులకీ లెఱుఁగువాఁడవుగనక నీవు
వెలయుఁగ బోఁకముడి విడిచితివి

చ. 2: దొరతనముగలట్టిదొడ్డ వాఁడవుగనక
సరసాన నాపెకొప్పు జారించితివి
అరుదుగఁ బంతమే కూడైన వాఁడవుగనక
పరగఁ జన్నులమీఁదిపయ్యద దీసితివి

చ. 3: గబ్బితనము ల శ్రీవేంకటపతిగనక
నిబ్బరపలమేల్మంగ నీవు గూడితి
పుబ్బరితనములకు నోపేవాఁడవుగనక
గొబ్బున నన్నేలి యీాకెఁ గొలిపించితివి

రేకు: 1594-3 ఆహిరి సం: 25-441

పల్లవి: నేరములేని పతిపై నెరుసు లెంచఁగనేలె
గారవముఁ గాఁతాళముఁ గలుపుదురా

చ. 1: మాఁటలలోనే తేనెలు మనసులోనే నూనెలు
యేఁటికి నీపతియెడ కింతవలెనా
వాటలలోఁ గొసరులు పరుపుపై నుసురులు
నాటకాన రెండు నిట్టె నడుపుదురా

చ. 2: చూపులలోనేసిగ్గులు సోఁకులలోనే యెగ్గులు
ఆపొద్దుననుండి యింత అలఇంతురా
చేపట్టులలో మొక్కులు చెనకులలో తొక్కులు
నీపంతాన నివిరెండు నేరుపుదురా

చ. 3: దవ్వులనే వలపులు దగ్గిరితే బులుపులు
నవ్వుతానే యిటులానే నాలిసేతురా
రవ్వ శ్రీవేంకటేశుఁడు రతి యలమేల్మంగవు
బువ్వపుమోపులు రెండు పొక్కఁజేతురా

రేకు: 1594-4 కాంబోది సం: 25-442

పల్లవి: చుట్టరికము సేసితే సూడువట్టేవా
గుట్టుతో మాటాడితేను రట్టుసేసేవే

చ. 1: కొప్పు దువ్వి నీ కాతఁడు గొజ్జంగలు ముడువఁగా
అప్పుడే గోరుదాఁ కెనంటా దేవే
గొప్పయినచన్నులపై కుంకుమపూయఁగాను
ముప్పిరిఁ బిసికెనంటా మోము వంచేవే

చ. 2: వేఱె నిన్నతఁడు గారవించి సింగారించరాఁగా
జాటించీఁ బోఁకముడెంటా జింకించేవే
మీఱినసొమ్ములెల్లా ని మెడనిండఁ బెట్టఁగాను
తూఱి కాఁగిలించేనంటా దూరుసేసేవే

చ. 3: వొడివట్టి నిన్నతఁడు వురముపైఁ బెట్టుకోఁగా
నడుమఁ బెండ్లనంటా నవ్వు నవ్వేనే
అడరి శ్రీవేంకటేశుఁ డల మేలుమంగ నిన్ను
చిడుముడిఁ గూడెనంటా సిగ్గువడేవే

రేకు: 1594-5 సాళంగం సం: 25-443

పల్లవి: కన్న మాటాడకపోదు కలది గలిగినట్టె
యిన్నిటాను నీచిత్త మెట్టుండునో యికను

చ. 1: వంతులకు చెలులెల్లా వద్దనున్నా రింతెకాక
కాతుఁడవు నీమనసు గానఁగలరా
పంతాన నందిరి నీవు భ్రమఇంచే వింతెకాక
కొంతైనా నొకరిమీఁదఁ గూరిమి నీకున్నదా

చ. 2: సిగ్గుపడ కిందరు నీసేవసేసే రింతె కాక
దగ్గరి నిన్ను వంచుకోఁ దాము గలరా
అగ్గలమై పైకొనఁగ నాసకొలిపేవు గాక
నిగ్గుల చుట్టరికము నీకెందైన నున్నదా

చ. 3: ప్రేమముతో నిన్ను నిట్టె పెండ్లాడి రింతెకాక
చేముట్టి కొనగోళ్ళఁ జిమ్మఁగలరా
ఆముక శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
యీమేర నన్నుఁ గూడితి వితరము గలదా

రేకు: 1594-6 బౌళి సం: 25-444

పల్లవి: అందాలు సేసుకోలేవు అయ్యో నీవు
యిందుముఖి నీసంది యెరవులు గలవా

చ. 1: వలసనిజోలబెట్టి వాదు లడిచీఁగాక
అలిగెనా యింతినీతో అప్పటనుండి
చెలరేఁగి మోహమున చిమ్ముచుఁ దిట్టీఁగాక
బలిమిసేయఁగ నీతో పగటా సతికి

చ. 2: తనియనియాసతోడ తప్పకచూచీఁగాక
గునిసి నిన్నాపె నేఁడు కోపగించెనా
మనసుతమకమున మరియూఁ బెనఁగీఁగాక
కినియ నీతో నేమి కేరడమా చెలికి

చ. 3: కరగినమతితోడ కాఁగిలించుకొనీఁగాక
గరువము చూపెనా కాంత నీతోను
అరయ శ్రీవేంకటేశ అలమేలుమంగ నిన్ను
యిరవుగఁ గూడెఁగాక యెమ్మెలాయీలేమకు

రేకు: 1595-1 లలిత సం: 25-445

పల్లవి: నీకొలఁదివారమా నేమెల్లాను
కైకొని యీపనులకె కాచుకున్న వారము

చ. 1: సారెఁ గొప్పు దువ్వుతాను చన్నులనొత్తీ నాపె
ఆరీతి నందె పరాకైనాఁ డితఁడు
చేరి విన్నపా లేమిసేసేవే విభునికి
నేరిచి మాటాడించితే నీవేపో సతివి

చ. 2: పరిమళము (ము?) లందుతా పైఁదొడవేసీ నాపె
కరఁగీఁ జెమటల గక్కన నాతఁడు
యెరవుల యాతనికి యేమివిడెమిచ్చేవే
మరగించుకొంటేను మరి నీవే సతివి

చ. 3: సొమ్ములెట్టుత నెనసెఁ జొక్కి యలమేలుమంగ
పమ్మి శ్రీవేంకటేశుఁడు భ్రమసినాఁడు
యిమ్ముల మనల నేలె యింతలో నేమిమొక్కేవే
యెమ్మెలునెరపకుంటే యింక నీవే సతివి

రేకు: 1595-2 పూర్వగౌళ సం: 25-446

పల్లవి: చుట్టమై యీతఁడు రాఁగా సూడువట్టేవే
చెట్టపట్టి తియ్యఁగాను సిగ్గువడేవే

చ. 1: పాటించి యీతఁడు నీకు బాసలెల్లాఁ జేయఁగాను
నీటుతో నీవేమిటికి నిందలాడేవే
చీటికిమాటి కాతఁడు చేయివట్టి తియ్యంగాను
నాఁటఁజూచి యేమిటి కానలువెట్టేవే

చ. 2: గుట్టుతో ముందర పతి కొండవలె నుండఁగాను
దిట్టతనముననేల తిట్టుదిట్టేవే
బెట్టుగాఁ జేరఁబిలిచి ప్రియములుచెప్పఁగాను
పుట్టిపడి నీవేల వొపననేవే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడఁగాను
కావరించి నీవేల కాఁతాళించేవే
మోవి యీతఁడే నీకు ముందరనే యియ్యంగాను
చేవమీద నేల గంటిసేసిచూపేవే

రేకు: 1595-3 నారాయణి సం: 25-447

పల్లవి: ఇద్దరినేరుపులు నిదె వేళ
సుద్దులెల్లాఁ జెప్పి పతిఁజొక్కించవే

చ. 1: చనవుగలుగువారు చలము సాదింతురా
ననుపులనే వలపు నాఁటింతురు
మనససెరిఁగుండియును మగని నింత సేతురా
కినుక నవ్వుసేసుక కేలెత్తి మొక్కవే

చ. 2: తగులమిగులవారు తప్ప పట్టుదురా
మొగమోటనే కళలు మెలపింతురు
తగవరివిబునిబంతములాడి దూరుదురా
బిగువుగుట్టు సేసుక ప్రియములు చెప్పవే

చ. 3: అసలుగలుగువారు ఆరడిఁబెట్టుదురా
సేసవెట్టి చేతిలోనె చిక్కింతురు
బాసిచ్చిన శ్రీవేంకటపతిఁ గూడి పంగింతురా
యీసులువాసులు సేసు కిచ్చకములాడవే

రేకు: 1595-4 ఆహిరి సం: 25-448

పల్లవి: దయదలఁచవలదా తరుణిమీఁద
ప్రియములు రాసివోసి బేరమాడీ నదివో

చ. 1: మంతనాన నీతోను మాటలాడి మాటలాడి
యెంతైనా దనియదు యీరమణి
వింతైననీ మోము వేడుకతోఁ జూచిచూచి
కొంతైనా రెప్పలు మూసుకొనఁజాల దిదివో

చ. 2: నలువంక నీతోను నవ్వులు నవ్వి నవ్వి
యెలమితోవేసరదు యీరమణి
చలివాసి చెనకుచు సరసములాడి యాడి
చలము మానుఁగలేదు సంగడినే ఇదివో

చ. 3: గక్కన నిన్నింతలోనె కాఁగిటఁ గూడికూడి
యిక్కువలు మఱవదు యీరమణి
వెక్కసపురతుల శ్రీవేంకటేశు బొంది పొంది
మిక్కిలివేడుకతోడ మించీ నీపె యిదివో

రేకు: 1595-5 దేవగాంధారి సం: 25-449

పల్లవి: ఎందాఁకా నలుకలు యేఁటికి నీకు
మందలించి యాతనితోమాటలాడరాదా

చ. 1: వేడుకగలవారికి వేసారుకోఁదగునా
జోడైనవారి కెచ్చుకుందులేలా
మేడెపురతివారి మేకు లింత వలెనా
చూడవే యాతనిదిక్కు సొల సిఁక నై నాను

చ. 2: సమ్మతులైన వారికి చలములు దగునా
చిమ్ముఁజూపులవారికి సిగ్గులేలా
దొమ్మివలపువారికి యెమ్మె లింత వలెనా
రమ్మని పిలువవే రమణుని నండకు

చ. 3: నవ్వునవ్వేవారికి నాయములు దగునా
రవ్వలైనవారికి బీరములేలా
యివ్వల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
నివ్వటిల్ల మెచ్చవే నేరుపుల నీతని

రేకు: 1595-6 నారాయణి సం: 25-450

పల్లవి: చిత్తగించవయ్యా నీవు సేసిన భాగ్యమిదివో
కొత్తకొత్తసణఁగుల కొచ్చి చూచీని

చ. 1: చెలి నీకు విడెమిచ్చి సిగ్గుపడుతా నట్టె
మలసి తలవంచుక మాటలాడీని
అలిగినదీఁ గాదు ఆసలు విడువలేదు
చలివాయ వలపుల సాముసేసిని

చ. 2: కాంత నీకొలువుసేసి కంబముమాఁటున నుండి
కొంతగొంత కొంకుతోడ కుంచవేసీని
పంతము నెరపలేదు పైకొనక మానదు
చెంతలఁ దమకముతోఁ జిమ్మి రేఁగీని

చ. 3: తొయ్యలి నీసేవ సేసి దోమతెరలో నుండి
కయ్యములన్నియుఁ దీరఁ గాఁగిలించీని
గయ్యాళితనము లేదు కడు నవ్వకమానదు
యియ్యెడ శ్రీవేంకటేశ యిరవయ్యీని

రేకు: 1596-1 వరాళి సం: 25-451

పల్లవి: అంత యేల వొరసేవు అప్పటి నన్ను
కాంతలకు నీమోవి గాడిపట్టుగాదా

చ. 1: నలసెల్లా నాదెకాక వాసులెంచిచూచితేను
పలువురనేలేనీకుఁ బాటి వున్నదా
బలిమిసేసి నాచేతఁ బడితలింపించితేను
వెలలేనినీ కాఁగిలి విడిదిల్లుగాదా

చ. 2: సిగ్గెల్లా నాదెకాక చేరి యెరుకపరచితే
వొగ్గినయాసలనీకు వోజ వున్నదా
అగ్గలమై నీవు గడునంత నన్ను రెఁచితేను
తగ్గనినీమే నన్నిటా దాయిమానుగాదా

చ. 3: పంతమెల్లా నాదెకాక భావించి చూచితేను
యింతులకు మొక్కేనీకు యెమ్మెవున్నదా
ఇంతటి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
పొంతలనే శిరసిది బొడ్రాయి గాదా

రేకు: 1596-2 సాళంగనాట సం: 25-452

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యింతులయడాటాన
వింతవింతచేఁతలను వీరిడిఁ జేసెవు

చ. 1: మేరమీరి యాపె నీతో మేలములాడెనంటా
తేరకొనఁజూచి కొప్పు జారఁదీసేవు
గోర గీరి యట్టె నిన్ను కోపగించి అట్టెనంటా
సారెసారెఁ గొంగువట్టి సాదించేవు

చ. 2: బింకముగా నాపె నీతో బెట్టుగాఁ బెనఁగెనంటా
పొంకాన పూవుబంతిని పూఁచి వేసేవు
అంకెల నంతలో నిన్ను అద్దలించి చూచెనంటా
సంకెలేక వుద్దండాన చదురులాడేవు

చ. 3: గయ్యాళితనాన నాపె కాఁగిలించుకొనెనంటా
వుయ్యాలమంచముమీఁది కొగిఁదేసేవు
నెయ్యపు శ్రీవేంకటేశ నిన్నిట్టె చొక్కించెనంటా
తియ్యనిమోవి యిచ్చి దీకొనేవు

రేకు: 1596-3 దేశాళం సం: 25-453

పల్లవి: నామొక మట్టె చూచి నవ్వే వదేమయ్యా
కోమలి నొకతెఁ బేరుకొనవయ్య నీకును

చ. 1: వరుసకు నొకసతి వచ్చి కాచుకున్నది
సరసాన కొకయింతి చాలివున్నది
మరగించేననొకతే మాటలాడుచున్నది
తెరలోని కెవ్వతెనుఁ దెత్తునయ్య నీకును

చ. 2: నిదురకు నొకభామ నీతోఁ జెప్పమన్నది
పెదవితేనె కొకతె ప్రియపడీని
సదరాన వలపులు చల్లీ నొకవనితె
కదియ నెవ్వతెకు నుంగర మంపేవయ్యా

చ. 3: పగడసాలాడ నొకపడఁతి గాచుకున్నది
నగుతా నొకతె నిన్ను నాఁటఁజూచీని
అగపడి కలసితి వందరి శ్రీవేంకటేశ
తగ నన్నేలితివి చిత్తమింకా నెందున్నది

రేకు: 1596-4 వరాళి సం: 25-454

పల్లవి: ఏమిసేయవచ్చు భాగ్యా లెవ్వరి కెట్టుండునో
ఆమనికాలము గాఁగా నగ్గు వాయ నదివో

చ. 1: కొంగువట్టి తియ్యఁగాను కొమ్మ సిగ్గువడితేను
కంగి కోపగించెనంటా కాఁకరేఁగేవు
చెంగటఁ జవిగొంటేను చప్పనాయను

చ. 2: పగటుమాటలాడఁగ పడఁతి నవ్వు నవ్వితే
యెగసక్కేలంటా లోలో యీసడించేవు
వెగటుగాఁ జెప్పఁబోతే వొగరులాయఁ బ్రియము
మిగులా వడ్డించఁబోతే మించి కారమాయను

చ. 3: యీదెసఁ బెనఁగఁగాను ఇంతి సరసమాడితే
పాదము దాఁకించెనంటా పంతమాడేవు
సాదించి శ్రీవేంకటేశ జంకించితేఁ బులుసాయ
దాదాతఁ గూడితేను తరితీపులాయను

రేకు: 1596-5 దేసాళం సం: 25-455

పల్లవి: ఇందరిలోనానీకు నేఁటికి రట్టు
పొందులు సేసుక అట్టె బుజ్జగించవయ్యా

చ. 1: వీడెము చేతికిచ్చి వెలఁది నీతోనవ్వఁగ
యేడ చూచేవయ్య నీకు నెంత పరాకు
ఆడరానిమాటలాడి నందుకే కోపగించుక
కొడెకాఁడ వాపె నిట్టె కుస్తరించవయ్యా

చ. 2: చేసన్న చేసి ఆపె చెనకి నిన్నుఁ జూడఁగ
యేసుద్దులు చెప్పేవయ్య ఇదె నాతోను
వాసితో నిందుకే యాపె వట్టినేరములు వేసీ
వేసాలగుట్లు మాని వేఁడుకొనవయ్యా

చ. 3: అలమేలుమగ నిన్ను నట్టె కాఁగిలించఁగాను
నిలుచుండే వేమయ్య నివ్వెరగుతో
అలరి శ్రీవేంకటేశ అందు కాపె పురమెక్కె
చెలి నేను; ఆపెనే చెక్కునొక్కవయ్యా

రేకు: 1596-6 పూర్వగౌళ సం: 25-456

పల్లవి: ఇద్దరితమకములు ఇటు నీకే తెలుసును
సుద్దులు చెప్పఁగ మరి చోటున్న దా

చ. 1: చెక్కు చేతఁబట్టుకొని చిరునవ్వు లేఁటికే
మక్కువ నీవల్లనే మోమాఁట దోఁచీని
అక్కడ నాతఁడు నీతో నాడేమాటఁలకు
యిక్కడ నావునికి యిటు సరివచ్చెనా

చ. 2: యెదురుగా వచ్చివచ్చి మేమి తప్పక చూచేవే
అదన నీవల్లఁ బనులన్నీ నున్నవి
చెదర కాతఁడు దలఁచేటితలపులకును
మదిలో నామర్మానకు మరి సరివచ్చెనా

చ. 3: మిక్కిలి వేడుకతోడ మెచ్చు లేమి మెచ్చేవే
తక్కక నీవల్ల మేలు దయిలువారీని
యిక్కువఁ గూడె శ్రీవేంకటేశుడలమేల్మంగ నే
నిక్కడా నక్కడా నన్ని నిటు సరివచ్చెనా

రేకు:	1597-1 పాడి	సం:	25-457

పల్లవి:	ఎంతసేసితిరే నన్నుయేమిరే మీరు
రంతుల వాని నీడకు రప్పించలేనా

చ. 1:	అంగనలమోము చూచి అతఁడిట్టె నవ్వఁగాను
యెంగిలినవ్వు నేనూ నవ్వేదా
అంగడిజాణతనాలు అందరతో నాడఁగాను
జంగిలిసరసములు సారె నేనూ నాడేదా

చ. 2:	మచ్చికనందరితోను మాట లాతఁ డాడఁగాను
ఇచ్చట మూఁకమాటలు ఇప్పు డాడేదా
వచ్చివచ్చి అందరిపై వలపులు చల్లఁగాను
కచ్చుపెట్టి నావలపుఁ గలయవేసేదా

చ. 3:	శ్రీవేంకటేశ్వరుఁడు చెలులఁ బిలువఁగాను
వోవరిలోనే నుండి వూఁకొనేదా
వావు లందరిపై వేసి వడిఁదానే నన్నుఁగూడె
యీవలవలమేల్మంగ నెరవులు సేతువా

రేకు: 1597-2 సౌరాష్ట్రం సం: 25-458

పల్లవి: తానే నామీఁదటఁ దొల్లె దయగలఁడు
కానిమ్మని వొడఁబడేఁగపట మేఁటికే

చ. 1: బాఁటుదప్పే మావాఁడా తాను మఱవ నేననరే
యేఁటికి వానలు వెట్టీ యింతలోననే
చాటిచెప్పీఁ దనడాగు చన్నుల పైననరే
కోటికిఁ బడగెత్తె కొసరనేమిటికే

చ. 2: మేలెంచనివాఁడా తాను మేకొంటిననరే
యీలాగునేల మొక్కీ ఇంతలోననే
వోలవేసీ నావేల నుంగర మీదెనరే
యీలాగుచనవులందు యెరవు లేమిటికే.

చ. 3: సిగ్గువడేవాఁడా తాను చెనకితి ననరే
యెగ్గులేకనన్నుఁ గూడె ఇంతలోననే
అగ్గమై శ్రీవేంకటేశుఁడల మేలుమంగ
అగ్గలమాయ వలపు అలయనేమిటికే

రేకు: 1597-3 ఆహిరి సం: 25-459

పల్లవి: ఏమయ్యా నీవెఱఁగవా యేలా ఇంత సేయించేవు
దామెనజగడాలకు తానా యెదురు

చ. 1: సలిగెలు పట్టుకొని సతి మాటలాడీఁగాక
తలఁకక నే నాడితే తానా యెదురు
నెలవై దిట్టతనమునేరుచుక వచ్చెఁగాక
తలమని జంకించితేతానా యెదురు

చ. 2: తోడునెట్టుకొని చెలి తుటారించవచ్చీఁగాక
దాడిగా నేదికొంటేతానాయెదురు
యేడో కన్నుసన్నలకు యెమ్మలు సేసీఁగాక
తాడుపడక పైకొంటే తానా ఎదురు

చ. 3: చెప్పుడుబుద్ధులకును చేయెత్తి మొక్కీఁగాక
తప్పులు నేఁబట్టేనంటే తానా యెదురు
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
దప్పిదేరఁ గూడితివి తానా యెదురు

రేకు: 1597-4 లలిత సం: 25-460

పల్లవి: ఈపాటివాఁడవు యెట్టు పందుసేసితివి
వోపికగలవారికి వొదుగనేలా

చ. 1: పిలిచీఁగదయ్యా నిన్నుఁబ్రియురాలు
చెలఁగి యేల పరాకుసేసుకొనేవు
చెలులము మేము వింటే సిగ్గయ్యీనా
బలవంతులకు మరి భయమున్నదా

చ. 2: బాగాలిచ్చీ నీప్రాణబందుగురాలు
చేవ(గ?) దేర నీవెల చేయొగ్గవు
నీగుణాలు చూచి నేమునేరమెంచేమా
వేగిరపువారి కింత విచారించనున్నదా

చ. 3: యెనసీఁగదవయ్యా నీయిచ్చకురాలు
మనసిచ్చి నీవేల మాఁటలాడవు
అనుఁగు శ్రీవేంకటేశ అలమేలుమంగ యాపె
ఘనులైనవారికికడుఁగొంక నున్నదా

రేకు: 1597-5 నాదరామక్రియ సం: 25-461

పల్లవి: ఎగ్గువట్టేవు గనక యిదివో వోయి
సిగ్గుతోడ నుండేనన్ను చిత్తగించవోయి

చ. 1: మొగము చూచి నీకు మొక్కేనంటా రాఁగాను
నగవు వచ్చీవోయి నాసెలవుల
పగటుననే నీకు వాదాలొత్తేనంటా రాఁగా
జిగిఁ జెమటలు చేతఁ జిప్పిలీనోయి

చ. 2: వేడుకతోడనీకు విడెమిచ్చేనంటా రాఁగా
తోడనే తమకములు తొలఁకీనోయి
వోడక నీపానుపుపై వొద్దనుడేనంటా రాఁగా
నీడలరెడుచేతులు నిన్నలమీనోయి

చ. 3: మిక్కిలి నేనిన్నుఁ గూడి మెచ్చేనంటా రాఁగాను
పెక్కుపరవశములు పెరిగీనోయి
అక్కరై శ్రీవేంకటేశ అలమేలుమంగనేను
తొక్కరాఁగా నీపాదము తొలుతే మీఁదోయి

రేకు: 1597-6 సామంతం సం: 25-462

పల్లవి: నీవు గోవిందరాజపు నెరజాణపు
మోపులుచూపి వారు మోహము చల్లేరు

చ. 1: కొలువులోపల నిన్నుఁ గొసరి కొసరిచూచి
చెలు లిద్దరును నిన్నుఁ జెనకేరు
వలపులు మక్కళించి వన్నెదే రేనీ మోమున
కళలు రేఁచి రేఁచి కమ్మటి నవ్వేరు

చ. 2: పానుపుమీఁదట నీకుఁ బాదము లొత్తియొత్తి
మానిను లిద్దరు నీతో మాటాడేరు
పూని యాసలు రెట్టించి పొత్తుల నీమేనెల్లా
మైనమువలెఁ బెనఁగి మచ్చిక రేఁచేరు

చ. 3: వోవరిలోపల నుండి వొడివట్టి నినుఁ దీసి
శ్రీవనితా భూవనితాఁ జె(జం?) ది కూడేరు
యీవలనావలా మొక్కి శ్రీవేంకటపతివైన
గోవిందరాజ నీగుణము మెచ్చేరు

రేకు: 1598-1 లలిత సం: 25-463

పల్లవి: సందుసుడి నేమికి సరి నింతసేసేవు
కందువకు రాఁగా బింకము చూపరాదా

చ. 1: చిత్తరువువా(వ్రా?) సేవేళ చేరి పరాకై నదంటా
అత్తి చనుమొనలేల అదిమేవు
బత్తిగలవాఁడవైతే పానుపుమీఁదికి రాఁగా
చిత్తమువచ్చినసేఁత సేసి చూపరాదా

చ. 2: కంటమాలిగుచ్చేవేళ కడుననువాయనంటా
అంటేవు మర్మములు నీ వంతలోననే
నంటుగలవాఁడవు నవ్వుతా విడెమియ్యఁగ
వొంటినీబలిమి చూపి వొరయఁగరాదా

చ. 3: కాఁపురము సేసేవేళ కడు సందడైనదంటా
యేపునఁగాఁగిలంచి యెనసితివి
యీపాటివాఁడవు ఇప్పుడే శ్రీవేంకటేశ
వోపినట్టులా రతుల వొద్దిక గారాదా

రేకు: 1598-2 సాళంగనాట సం: 25-464

పల్లవి: ఇంతలేసి కావలెనా యింకాను నీ
బంతిభోజనాలే చాలుఁ బాలించ మమ్మును

చ. 1: పట్టకుమీ నీవు నన్నుఁ బలుమారును నీ
వెట్టివలపుల చేతవే సరితిమి
గుట్టెఱుఁగుదువు మాతో కొసరు లే నీ
చుట్టరికములె చాలుఁ జొక్కించ మమ్మును

చ. 2: చెప్పకుమీ ప్రియములు చేరి నాకునూ నీ
తప్పనిఆనలచేతఁ దనిసితిమి
యెప్పటివాఁడవే మాఇచ్చకాలేల నీ
కప్పురవిడేలే చాలుఁ గరఁగించ మమ్మును

చ. 3: నవ్వకుమీ నీవునాతో నయములనునీ
పువ్వులవాటులచేతఁబొదలితిమి
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితి నీ
బువ్వపు మోవే చాలు పొసఁగించ మమ్మును

రేకు: 1598-3 పాడి సం: 25-465

పల్లవి: చెప్పినట్టె సేయవయ్య చెలికి నీవు
చిప్పిలి నీవుద్దండాలు సేయుకువయ్యా

చ. 1: కంతునియమ్ము లవిగో కాంతకొప్పులో నున్నవి
పంతగాఁడ వాతురుముపట్టకువయ్య
చెంతలఁ బెదవు లవి చిగురుటడిదములు
అంతేసిమాటలు నీ వాడించుకోకువయ్యా

చ. 2: చందురువిషములు సతి నవ్వులలో నవె
కిందుపడాపెచెక్కులు గిల్లకువయ్య
కందువఁ బయ్యదదె జక్కవలకొడ్డినవల
దిందుపడ నీవు ముట్టి తియ్యకువయ్యా

చ. 3: చలిగాలినాములు సతిమేనివాసనలు
కలసితి వీఁక బెళకకువయ్యా
అలమేలుమంగ యీకె అన్నిటా శ్రీవేంకటేశ
కలకాలమును నబ్బెఁగైకొనవయ్యా

రేకు: 1598-4 పళపంజరం సం: 25-466

పల్లవి: ఇంతేసియాసోదకత్తె లెందరో ఇంకా నీకు
సంతసపుఁదమకాన చండి పెట్టీఁగాక

చ. 1: సతితోడ నీవిటే జాణతనా లాఁగడాను
అతివ వేరొక్కతె నిన్నద్దలించీని
మతకాన నూరఁజుట్టమవు నీ వెవ్వరిసొమ్ము
తతితోడ నెఱఁగక తమకించీఁగాక

చ. 2: అంగనవొకతెకు నీ వాసపడి పెనఁగఁగా
జంగిలికా వేరొక్కడె కొంగువట్టీని
అంగడిపరమిళ మందరివాఁడవు నీవు
సంగడిఁ దనసమ్మంటా సాదించీఁగాక

చ. 3: అలమేలుమంగ నీకు నటె వురమొక్కగాను
వెలఁది భూకాంత వీఁపెక్కీని
పొలసి శ్రీవేంకటేశ బువ్వపు మోవి నీది
కలసినచనవునఁ గడుమెచ్చీఁగాక

రేకు: 1598-5 శ్రీరాగం సం: 25-467

పల్లవి: ఏమని విన్నవించేము యెందాఁకా నీతోను
కామినిసుద్దులు యెప్పఁగతలాయ నీకును

చ. 1: చప్పరములోన నుండి సారె సారె నుస్సురంటా
కప్పురములే యడుగుఁ గాంతలను
ముప్పిరినంతటిలోన ముంగిట వచ్చి నిలిచి
రెప్పలు వేయక చూచు వొప్పుగునీరాకకు

చ. 2: గందము వూసుకొని కడునుడు కెత్తెనంటా
అందుకొనుఁ బన్నీరు అప్పుడప్పుడే
విందుగాఁగ మోవితేనె వెస నీకు మీఁదెత్తుక
చెంది ప్రియాలు చెప్పెంపు చెలుల నీవద్దికి

చ. 3: పరగఁ బరపుమీఁద పైకొనఁగా నిన్నుఁ గూడె
సిరులుమీరఁగ నిట్టె శ్రీవేంకటేశ
సరసపుమాటలలో సన్నలు సేసి సేసి
పెరరెంచుఁ దమకము పెనఁగుచు నీకు

రేకు: 1598-6 ఆహిరినాట సం: 25-468

పల్లవి: కూడితి రిద్దరు మీరు కొండగెండవలె
మోడామోడిమాఁటల ముచ్చట దీరినా

చ. 1: నిలుచున్నాఁడతడు నీమీఁది మోహమున
పిలువవే ఇకనైనాఁ బ్రియమురాలవు
చెలులు యెడమాటులు చెప్పిరాగా మాపుదాకా
తలఁపులలో నీతహతహ వాసీనా

చ. 2: నవ్వు నవ్వీ నాతఁడు ననుపైనచనవున
ఇవ్వల నెదురుకోవే హితురాలవు
రవ్వగా నొద్దికవారలు రాయబారాలు సేసితే
జవ్వనపు మదాలగజరు దీరీనా

చ. 3: దగ్గరివచ్చెనాతఁడు తమితోఁగూడేనంటా
కగ్గ కా శ్రీవేంకటేశుఁ గాఁగిలించవే
తగ్గ కూడిగపువారూమేంత పచ్చి చేసినా
యెగ్గు లేని మీరతికి నీడువచ్చీనా

రేకు: 1599-1 వరాళి సం: 25-469

పల్లవి: వేగిరకానికి నేఁడు వెసఁ బెట్టునున్నట్టు
ఆగడాలు సేయవచ్చే వాస ఇంకా నెంతో

చ. 1: విన్నపాలు సేయఁగానే వేమరు బుద్దెడిగేవు
కన్నులను మొక్కఁగానే గరిసించేవు
చన్నుల నొత్తఁగానే సాములు సేయవచ్చేవు
ఇన్నిటా వేగిరించేవు యేమి దలఁచితివో

చ. 2: విందుచెప్పరాఁగానే వెసఁ జవు లడిగేవు
పొందులు నేఁ జేయఁగానే పొదిగేవు
కందువకుఁ బిలువఁగా కడుఁదమకించేవు
సందడిఁ బెండ్లాడేవు జాణతన మెట్టిదో

చ. 3: పానుపుపైఁ బండఁగానే పదరి కాఁగిలించేవు
ఆనుక మోవియ్యఁగానే ఆసపడేవు
కానీలే శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
సానఁబట్టేవు చూపులు సమరతు లెట్టివో

రేకు: 1599-2 కాంబోది సం: 25-470

పల్లవి: నీకుఁ జూడ వినోదాలై నిండుకవున్నవి గాక
కైకొన్నపతి గుండెలోగాలములుగావా

చ. 1: తలఁపులోఁ దగిలి యాతని భ్రమయించేవి నీ
మొలకనవ్వులేకావా ముదిత నేఁడు
చలివాసి రమణుని సారెకుఁ బైకొలిపేవి
పలచని పెదవిపై పలులేకావా

చ. 2: ఆయాలుసోఁకి యాతనియాసలు పెడరేఁచేవి
సోయగపునీకనుచూపులేకావా
వాయపుమదములు గొబ్బన నూరఁజేసేవి
చాయల మెఱుఁగుల నీచన్నులేకావా

చ. 3: చిందువందుగా మేను చెమరింపజేసేది
కందువరతుల నీకాఁగిలేకాదా
అందపు శ్రీవేంకటేశు నన్నిటానుఁ గూడితివి
సందడించేమీ ఇద్దరిసన్నలేకావా

రేకు: 1599-3 పాడి సం: 25-471

పల్లవి: ఎంత వేగిరకాండ వేమయ్య నీవు
మంతనాన యెట్లుండిన మచ్చిక లమరును

చ. 1: సిగ్గువడ్డకోమలిని చెఱఁగువట్టి తీసేవు
యెగ్గువట్టి తిట్టితేను యేమిసేసేవు
వొగ్గక ముసుఁగిడఁగ వొడివట్టి పెనఁగేవు
బగ్గనఁ బాదమంటితే పడఁతులు నగరా

చ. 2: పఱపుపై నున్న దాని బలిమిసేయఁ జూచేవు
యెఱిఁగి గోర గీరితే యేమిసేసేవు
చిఱునవ్వు నవ్వితే చేరి యానలు వెట్టేవు
నెఱయా నొట్టువెట్టితే నీవు తిద్దఁగలవా

చ. 3: కవకవనవ్వే దానిఁ గాఁగిలించి కూడేవు
యివలఁ బచ్చివేసితే నేమిసేసేవు
జవళి శ్రీవేంకటేశ సతినిఁ(ని?) త మీరితివి
వివరించి కొసరితే వెల్లవిరిగాదా

రేకు: 1599-4 మాళవిగౌళ సం: 25-472

పల్లవి: కంటిమి మీఇద్దరెందు కట్టిన యెచ్చరికెలు
జంటలై వున్నందుకును చలము లెచ్చరికె

చ. 1: చెలిమిసేసేయందుకు చెనకులే యెచ్చరికె
యెలయింపులకు సన్న లెచ్చరికె
వలపులకును తలవంపులే యెచ్చరికె
పిలిచి చేకొనుటకు పెనఁగు లెచ్చరికె

చ. 2: ముందర నిలుచుటకు మొక్కలే యెచ్చరికె
యెందుకును సరసము లెచ్చరికె
కందువల నుండుటకు కతలే యెచ్చరికె
చిందేటికరఁగులకు సిగ్గులే యెచ్చరికె

చ. 3: కదిసి కూడుటకును కాఁగిలే యెచ్చరికె
హృదయాలకు నవ్వులే యెచ్చరికె
అదన శ్రీవేంకటేశుఁ డన్నిటా నిన్ను నెనసె
ముదములకు నప్పటిముచ్చట లెచ్చరికె

రేకు: 1599-5 రామక్రియ సం: 25-473

పల్లవి: ఉండవయ్య యించుకంత వుడుకువట్టీ వలపు
దండిగా వెనకముందుఁ దలపించేఁగాక

చ. 1: మంతనపునీమాటలు మఱచితినా నేను
కాంతలతో జేప్పఁగాక కాకయ్యేవంటా
వంతుకు మాటలాడితే వాఁడివోయనా యేమి
చింతదీరఁ జెవిలోనే చెప్పిచూపేఁగాక

చ. 2: మళ్లీ నీసేవ సేయక మానితినా నేను
వొళ్లల్లాఁ బచ్చుయ్యీ్యానంటా నుందానఁగాక
వొల్లనే నవ్వు నవ్వితే వుండివోయనా యేమి
ఇల్లిదె విడెమిచ్చి యెచ్చరించేఁగాక

చ. 3: వొద్దికైన నీరతుల కొడిగట్టనా నేను
పెద్దరికమునీదంటాఁ బెనఁగేఁగాక
బుద్ధితో శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టె
వొద్దనేనా నిన్ను నింకా వొరసేఁగాక

రేకు: 1599-6 వరాళి సం: 25-474

పల్లవి: ఆయనాయ వొద్దులేవే అలసితివి
రాయడించీఁ జన్నుదోయి రవ్వయ్యీ నుండవే

చ. 1: తగవులు చెప్పనేలే తగ నాతనికి నాకు
నగవులు నగనేలే నడుమ నీవు
యెగసక్కేలాడనేలే యింతలోనే వేగిరించి
దగ దొట్టీఁ జాలుఁజాలు తతి నూరకుండవే

చ. 2: వాసులు పుట్టించనేలే వడి నాతనికి నాకు
మోసాలు చూపనేలే మొక్కలానను
వేసాలు సేయనేలే వేమారు నన్నుఁ జూచి
ఆసలఁ జెమట రేఁగీ నట్టె వూరకుండవే

చ. 3: సాకిరిచెప్పఁగనేలే సరి మాయిద్దరిలోన
ఆకడ నాడుకోనేలే అందరితోడ
పైకొని శ్రీవేంకటపతి నన్ను నిట్టె కూడె
చీకాకుగాఁ గొప్పువడీ సిగ్గుతోడ నుండవే

రేకు: 1600-1 ముఖారి సం: 25-475

పల్లవి: దొడ్డవానిఁ బంతము తొడిఁబడకఁ గొనరాదు
వెడ్డువెట్టుటే నేర్పు వేడుకతో నిన్నును

చ. 1: చక్కఁగా నీతో నేను చలము సాధించరాదు
ఇక్కడ నీతోఁ బొందు లెట్టు గూడీని
తొక్కేవు నాపాదము తొలఁగుమనఁగరాదు
మొక్కకు నే దీవించితి మొలనే నిన్నును

చ. 2: వాసులకు నీతోను వాదులడువఁగరాదు
సేసవెట్టి నీపై నెట్టు చేయి చాఁచేము
ఆసపడేవు నాకు అవుఁగాదనఁరాదు
బాసలు సేయకు నమ్మి భావించితి నిన్నును

చ. 3: మిగుల నీతో మందెమేళము సేయఁగరాదు
నగుతా నిన్నెట్లా నానలు వెట్టేది
అగపడి శ్రీవేంకటాధిపతి నన్నేలితివి
పొగడే వప్పటి నన్ను; పొదిసేసే నిన్నును

రేకు: 1600-2 దేసాళం సం: 25-476

పల్లవి: కడపరాయఁడు నీకు కప్పురమందిచ్చీ వాఁడె
మడిచియ్యవే కు మనసిచ్చీ నతఁడు

చ. 1: ప్రియములు చెప్పఁగాను పెనఁగకువే నీవు
నయాగారాలు చూపఁగా నవ్వకువే
నియతాన మొక్కఁగాను నిట్లింత యేఁటికే
క్రియగూడ నియ్యకోవే కేలుచాఁచీ నతఁడు

చ. 2: చేరి మోమే చూడఁగాను సిగ్గులువడకువే
కూరిమి గొసరఁగానుకోపమేఁటికే
గారవించి పిలువఁగా కాఁతాళించకువే
పేరుకొని పాడఁగదే పెరరేఁచీ నతఁడు

చ. 3: గక్కునఁ గాఁగిలించఁగా గయ్యాళించకువే
ఇక్కువ లంగఁగఁ గోప మిఁకనేటికే
అక్కరతో శ్రీ వేంకటాధిపతి కడపలో
వొక్కటాయ మెచ్చఁగదె వొద్దనున్నాఁడతఁడు

రేకు: 1600-3 బౌళి సం: 25-477

పల్లవి: ఇట్టిదివో నీమహిమ యేమని పొగడేమయ్య్య
తిట్టినాను మోవిమీఁదతేనెలే తొరుగవా

చ. 1: జలజాక్షితో నీవు సరసములాడఁగాను
చెలరేఁగి చెక్కులెల్లఁ జెమరించెను
మొలకచన్నులు నీవు ముట్టితేఁగనక ఇఁక
వలపెల్ల జడివట్టి వానలై కురియవా

చ. 2: మచ్చికల నీకెతోను మాటలునీవాడఁగాను
కచ్చుపెట్టిపులకలుకడునిండెను
అచ్చుగాఁ గాఁగిట నించి యము లంటితే నిఁక
పచ్చికోరికలెల్లాను పాలుకొని పండవా

చ. 3: చెనకుచు నవ్వులనె సేసలు నీవు వెట్టంగ
గనియై మోముననిండుఁగళ లుబ్బెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విపుడింకా
చనవులు తీపులెక్క చవులుముదురవా

రేకు: 1600-4 దేశిసూళాది సం: 25-478

పల్లవి: వలెవలెనని వలచితినట తనవలలకు లోఁగానటరే ఇఁక
వలమో చలమో నాకును పతితో జగడములా
నెలఁతలు దన కెందరు గలిగిన నేనే సతమని తెలియరె
పొలమెల్లాఁదిరిగినతేఁటికి పూఁబోదయే సెలవుగదే
వాక్యం
ఆనఁగదరె వోచెలులాల అతినితోడుత నీమాటలె
వినయంబున నే నడవఁగ శ్రీవేంకటపతి కిది దగవా
రామక్రియ, మఠెం
అల్లనాఁ డొకతెతోడ నట్టె మాటలాడఁగాను
చల్లఁగా నేనే చూచి జంకించితినా
పల్లదమాడితినటె పైఁడివంటిమాటనైన
చిల్లరే మానఁడాయ శ్రీవేంకటేశ్వరుఁడు
వరాళి, రూపకం
తానాడినమాటలెల్లా దలచుమని
కోనేటియనికి నాగుబ్బలమీదటను ఆనవెట్టరె
బౌళి, ఝంపె
వెగ్గళముగ సారెకు నిక వెంగెములాగడగజాలను
సిగ్గరితనమున గొసరెద శేషాచలపతిని
పాడి, తివుడ
అలిగి సాదించదగ దంజనాద్రీశ్వరుని
గలికిచూపులనె మది గరగజేసెదను
నాట, ఆటతాళం
చనవుగలిగిన సరసమమరును సముకమున నే మనసు దెలిసెద
మునుప నడుగరె మదజనకుని ముద్దుటుంగము
శ్రీరాగం, ఏకతాళి
మాయింటికి నేడు రాగా మంకులూ బొంకులు దేరె
వేయినేల నే మొక్కెనే వేంకటరాయనికి
అలరివరతుల దొయ్యలులాల నన్ను
గలసె వేడుక శ్రీవేంకటవిభుడు

రేకు: 1600-5 పాడి సం: 25-479

పల్లవి: అప్పుడే వచ్చినదాన నందరిలోన
వుప్పుఁగప్పురము సరా వొద్దే నీవు

చ. 1: కన్నులమొక్కితిని కాలూఁ దొక్కితిని
యెన్నికకుఁ దనయాల నింకానేమే
నన్నునేల పిలిచీనే, నాఁడునాఁడే పుచ్చుఁబుచ్చుఁ
బున్నమలౌతెలుఁగవా పోవే నీవు

చ. 2: చేరువనే వుంటిని సేసాఁ బెట్టితిని
యీరుదియ్యఁ బేనువచ్చు నేలే నీవు
తారుకణ లిప్పుడేలే; తనసుద్ది చెప్పుఁజెప్పఁ
జేరమరాయని చెల్లఁబెట్టేఁబదవే

చ. 3: నీటున నవ్వితిని నెట్టనఁ గూడితిని
యేఁటికి శ్రీవేంకటేశుఁ డేమనీఁ దాను
మూఁటమాట లింతయేల; మోవితేనె లూరనూర
నూటలాయఁ దనకు నే నొద్ది కైతిఁ బదలే

రేకు: 1601-1 ముఖారి సం: 26-001

పల్లవి: పంతగాఁ డప్పటి నన్నుఁ బైకొననేలే
పొంత చెమటలలోనె పుంగుడయ్యేఁగాక

చ. 1: మక్కువలేనివిభుఁడు మాటలాడఁ బనియేమే
వొక్కమనసునఁ దానే వుండుగాక
చిక్కని నవ్వులతోనే సెలవి గొణఁగనేలే
వుక్కవలపుల నేనే వుమ్మగిలేఁ గాక

చ. 2: మనసురానిపతి మముఁ దిట్టఁబనియేమే
తనరాజసముతోనే దైవారుఁగాక
కనుచూపుఁగోపముతో కాఁకపులకలతోనే
తనరూపు దలపోసి తమకించేఁగాక

చ. 3: అలిగినరమణుఁడు ఆసపడి కూడనేలే
పిలిచినదాఁకా నుండి పెనఁగుఁగాక
చెలఁగి వేడుకతోడ శ్రీ వేంకటేశుఁడు దానె
కలఁడు నాకు గతెని కళదేరేఁగాక

రేకు: 1601-2 కాంబోది సం: 26-002

పల్లవి: దొడ్డవానితోడిపొందు దొరకినంత చాలదా
గొడ్డేరే మరికొంత కొసరూ వలెనా

చ. 1: తలఁచితి నపుడే తనరూపము మతి
కులికి కన్నులఁ గనుఁగొనవలెనా
బలిమి వీణెలోనఁ బాడితిఁ దనపదాలు
మలసి ఇంకా వేరే మాటలాడవలెనా

చ. 2: సేనవెట్టితి నపుడే చేతులకొలఁదులను
మూసి మంతనాల నేను మొక్కవలెనా
ఆసల నారూపు వాసింయంపితిఁ బటమునను
రాసికెక్క నే నింటికి రావలెనా

చ. 3: కూరిమితో నపుడె కొనగోరఁ జెనకితి
కోరి వేరే కాఁగిట నేఁ గూడవలెనా
ఆరయ శ్రీ వేంకటేశు నంటితి మీ మాఁట వింటి
నేరుపులు మీతోను నెరపఁగవలెనా

రేకు: 1601-3 సాళంగనాట సం: 26-003

పల్లవి: శౌభలేశ వోఁగునూతులౌభలేశ
శోభనము నీకు నాకు జోడుగూడెఁగాదా

చ. 1: వున్నతి గిరు లెక్కితి వోఁగునూఁతులౌభళేశ
యెన్నిక నాకుచగిరు లెక్కరాదా
యెన్నఁగ నిట్టూరుపులతో యేఁటికైనా నలసేపు
అన్నిటా నారతులలో నలయరాదా

చ. 2: ఆకసము మోవ రూప మందితి విందరిలోన
ఆకసము నానడుము నంటరాదా
పైకొని వెన్నెలలోనఁ బతి గాఁగ నవ్వేవు
మేకొని నాసరసాన మించి నవ్వరాదా

చ. 3: తెరచి నోరు ముయ్యవు తియ్యని ఆసలతోడ
సొరది నామోవి చవిచూడరాదా
అరిది శ్రీ వేంకటాద్రి నటు గూడి నేఁడీడ
నరసింహరూపమైతి నాటకము గాదా

రేకు: 1601-4 ముఖారి సం: 26-004

పల్లవి: విన్నపము నొకటే విచ్చే సేదీ నొకటే
అన్నివనులాయ మమ్ము నంపేవో అంపవో

చ. 1: చిత్తమెల్లా నిగిరించెఁ జెక్కులెల్లాఁ జెమరించె
కొత్తవలపు సతికి గోరమాయను
జొత్తులవిభుఁడు నిన్నుఁ జూచినయప్పటినుండు
వత్తివలెనాయ మేను వచ్చేవో రావో

చ. 2: పరగ తురుము జారె పచ్చిపులకలు మీరె
పురుటుఁబాయము సతి కొమ్మదాయను
సరసాన నీవు నవ్వు చల్లినయంతటనుండి
యెరవాయ నిద్దురులు యెనసేవో లేవో

చ. 3: నిట్టూరుపులు రేఁగె నివ్వరగు లవె మూఁగె
యట్టె కన్నెకాఁగలి యింతాయను
గట్టిగా శ్రీ వేంకటేశ కలిసితివి యింతిని
వొట్టి యీడనే యెప్పుడు నుండేవో వుండవో

రేకు: 1601-5 శంకరాభరణం సం: 26-005

పల్లవి: ఎక్కువైనదొర దాను యిల్లాల నేను
వొక్కటి గమ్మనీఁ దాను వొయమ్మ వెరతునే

చ. 1: మొక్కితి నేఁ జేతులెత్తి మోనాన నుండితిని
చిక్కుదేరె నింక నేమి సేయుమనీనే
పక్కన నవ్వితి నే నప్పటిఁ దలవంచుకొంటి
యెక్కువతక్కువ లింక నిందులోన నేలే

చ. 2: దగ్గరి విడెమిచ్చితి దవ్వులనే నిలుచుంటి
సిగ్గువిడిచింక నేమి సేయుమనీనే
నిగ్గుల నిక్కి చూచితి నే నింటిలోని కేఁగితి
వెగ్గల మింతకు నెరవేసా లేలే

చ. 3: పాదము లొత్తితిని పానుపుపైఁ బండితిని
సేదదేరె నిఁక నేమి సేయుమనీనే
ఆదరించి శ్రీ వేంకటేశుఁ డిటు గూడె
వాదులెల్లఁ దీరె నిఁక వంతువాసు లేలే

రేకు: 1601-6 రామక్రియ సం: 26-006

పల్లవి: మేలుమేలు జాణవౌదు మెస్తిరా నిన్ను
పోలికెకు నవ్వితేనే బూమెలు సేసేవా

చ. 1: చేరలంతలు కన్నులఁ జిమ్మి తిట్టే విట్లైతే
మారుకుమారు దిట్టేఁబో మానరా నీవూ
కోరేటిదేవుఁడవైతే గుడిలోనే వుందుగాక
చేరి మొక్కినట్టివారిఁ జెఱఁగు వట్టేవా

చ. 2: సన్నసేసి బొమ్మలనే జంకించే విట్లైతే
నిన్నుఁ గమ్మర జంకించే నిలరా నీవు
వున్నతపుదొరవైతే వూళ్ళేలుదువుగాక
వన్నెలవిడె మిచ్చితే వావి చూచేవా

చ. 3: సంగడిఁ జేయిముట్టి సరసములాడే విట్లైతే
పంగించి నే నట్టేసేసేఁ బదరా నీవు
రంగుగ శ్రీ వేంకటేశ రాజువలె నుందుగాక
వుంగిటి నిన్నుఁ గూడితే వురమెక్కించేవా

రేకు: 1602-1 శంకరాభరణం సం: 26-007

పల్లవి: తనిసితి మన్నిటాను(దలవయ్యా
కనుసన్నె లెల్ల(గంటి(గానీవయ్యా

చ. 1: పిలువా నేరుతువు బిగియా నేరుతువు
పలికినపాటే చాలు(బట్టకువయ్య
చలమొ పలమొ చనవిమనవు లింక(
గలిగినపాటే చాలు(గానీవయ్యా

చ. 2: కర(గించ నేరుతువు కాకుసేయ నేరుతువు
వరుస నా(డే చాలు వద్దువద్దయ్య
సరసమో విరసమా సారెసారె వినయాలు
యిరవైనపాటే చాలు యింతేలయ్యా

చ. 3: తత్తరించ నేరుతువు తరితీవు నేరుతువు
బత్తిగలంతే చాలు బాసలేలయ్యా
అత్తి శ్రీ వేంకటపతి ఆదరించి కూడితివి
పొత్తు నత్తు(గూడె నింక బూటకమేలయ్యా

రేకు: 1602-2 ముఖారి సం: 26-008

పల్లవి: చూతమువో నీబలిమి జోలి యింతేల
కాతరించి పడనేల కానీలే యిఁకను

చ. 1: రమ్మంటే నలిగేవు రావుగాఁగ ములిగేవు
నిమ్మపంట వేసితేనే నీకు నొచ్చెనా
వుమ్మడి నాకొనగోర నూఁదితే నేమిసేతువే
యెమ్మెలఁ బంతగత్తె వెందువోయే విఁకను

చ. 2: వంక చూచితే నవ్వేవు వట్టిసటలఁ బెట్టేవు
కుంకుమనీరు చల్లితే గురిదాఁకెనా
బింకపునీకుచములు పిసికితే నేమందువో
తెంకినే యీచలమెల్లఁ దెలిసెఁబో ఇఁకను

చ. 3: కాఁగిట సిగ్గుపడేవు కలిసితే నవ్వేవు
కాఁగినమన సొక్కటై కళదాఁకెనా
ఆఁగి శ్రీ వేంకటపతి నదె మెప్పించితి నన్ను
చేఁగల నాచలమెల్లఁ జెల్లెగదె ఇఁకను

రేకు: 1602-3 లలిత సం: 26-009

పల్లవి: అన్నిసింగారాలు నీకె అమరుఁగాక
యన్నిటా దేవతలు నిన్నిందుకే మెచ్చేరు

చ. 1: చందురునివంటిమోము జలజాలే కన్నులట
యిందిర నీకే తగు నీ కొత్తలు
గొంది నొకటొకటికిఁ గూడవందు రివి నీకు
పొందై పాలవెల్లి తోడఁబుట్లే కావా

చ. 2: ముక్కు సంపెంగవంటిది ముంగురులు తేంట్లట
ఇక్కువలు నీకే తగు నీ కొత్తలు
అక్కున వరలక్ష్మివి హరి వసంతమాధవుఁ
డెక్కడా మీ కిద్దరికి యెనయికే కాదా

చ. 3: ధర నడుము సింహము తగు గజగమనాలు
తిరమై శ్రీ వేంకటేశుదేవు నీకే పో
నరసింహుఁడై యుండి కరిఁగాటినట్టివాని-
సురత మందితిగాన చుట్టమువేకొవా

రేకు: 1602-4 శ్రీరాగం సం: 26-010

పల్లవి: మంతనపుసన్నలేల మానరమ్మ
చెంతలఁ జేరితే వీఁడు సిగ్గువడీనమ్మా

చ. 1: నుదురెల్ల జెమరించె నూఁగుదూళిమేనితో
అదె వీధి నాడివచ్చెనమ్మ కృష్ణుఁడు
కదిసి గోపికలకాఁగిటఁ బెనఁగెనంటా
నిదులఁ గొంద రేఁటికి నిందవేసేరమ్మా

చ. 2: సారె జారేకాసె తోడ చల్లేటి ముద్దులతోడ
ఆరితేరి బుసకొట్టీనమ్మా కృష్ణుఁడు
తారి వెన్న ముచ్చిలఁగాఁ దరిమితే వచ్చెనంటా
నేరమివేసి మీరేల నిందలాడేరమ్మా

చ. 3: తేనెగారేమోవితోడ తేఁకువ శ్రీ వేంకటాద్రి-
నానుక నిలుచున్నాఁడోయమ్మ కృష్ణుడు
కానుక నింతులకే కాచుకున్నాఁ డితఁడంటా
నేనే వినఁగ నేల నిందలాడేరమ్మా

రేకు: 1602-5 దేసాళం సం: 26-011

పల్లవి: పోపో యెదువోయేవో పోయి రారాదా
కోపులవెనుక నన్నుఁ గూడేవుగాని

చ. 1: పక్కన నాతోమాటపలుకు లాడేవుగాని
యెక్కడో పరాకు నీకు నిదెఱఁగనా
చక్కఁజూచి నాతోనే సటలు సేసేవుగాని
చిక్కనినీమతిలోనిచింత వేరేరా

చ. 2: యెదురైనవాఁడవై యిటు నిలిచితిగాని
అదన నీతమకము లవి వేరేపో
ముదముల నూరకైన మోవినే నవ్వేవుగాని
కదిసిననీమేనికాఁక వేరేరా

చ. 3: కళలు సోఁకఁగ నన్నుఁ గాఁగిలించితివిగాని
తలమోచివచ్చినట్టితమి వేరేపో
యెలమి శ్రీ వేంకటకకేశ యిపు డొక్కటాయఁగాని
కలదాననేని నీకుఁ గడమేది లేదురా

రేకు: 1602-6 మంగళకౌసిక సం: 26-012

పల్లవి: సవతి చుట్టరికాలు జగతిలోఁ గలవా
వివరించుకొంటగాక వినయా లింకానా

చ. 1: వద్దు వద్దు వాదులు వలవనిపోదులు
యిద్దరి జాడలు గంటి మింకానేలే
అద్దో నీ వేమి సేతు వాతనివల్లనే కాక
కొద్దిమాలి నే నీతోఁ గొసరే దింకానా

చ. 2: కాతరపుటానలు కడుఁబచ్చిమేనులు
యీతనికి నీకె తగు నింకానేలే
వోతరుణి యేసినవాఁడుండఁగ నమ్మేమిసేయ
తోతో నీకును నాకు దొమ్ము లింకానా

చ. 3: చాలుఁజాలు బాసలు చక్కనాయ రేసులు
యీలకూరల కుప్పు చాల దివి యింకానా
ఆలరి శ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
వాలుకరెప్పలు నీపె వంచె దింకానా

రేకు: 1603-1 సామంతం సం: 26-013

పల్లవి: వట్టినేరా లెంచ కిఁక వచ్చేవో రావో
చుట్టరికాలలో యింత సూడుఁబాడుఁ గలదా

చ. 1: బొమ్మల జంకించితేనే వూఁచి మాటాడుత గాదా
కొమ్మకు నీమీఁద నింత కోపమున్నదా
వుమ్మడిగా నవ్వితేనే వుంకువ వెట్టుత గాదా
ఇమ్ముల నీతో నాకె యెగసక్కేమాడెనా

చ. 2: తప్పక చూచినదే తగులఁదీసుటగాదా
అప్పుడే యాకె నిన్ను నదలించెనా
అప్పటి నెదుటనుంటే యాసపడుటగాదా
వుప్పతించి ఆకె నిన్ను నొరయఁగవచ్చెనా

చ. 3: సంగడిఁ గూచుండితేనే సమరతి యౌతగాదా
చుంగుల నీతో బలిమి చూపవచ్చెనా
రంగగు శ్రీ వేంకటేశ రమణిఁ గూడితి విట్టె
చెంగట నప్పుడే నేను చెప్పినదేకాదా

రేకు: 1603-2 కాంబోది సం: 26-014

పల్లవి: పట్టిజోలి దవ్వనేల వచ్చేవో లేదో
ఇట్టే తారుకాణించ ఇది నాకుఁ దడవా

చ. 1: ముందట నీ వుండఁగాను మొగమోట మంటిఁగాక
ఇందు నిన్నుఁ గోపగించ నెంతలేదు
అంది చేయి వేయఁగాను అన్నీ మరచితిఁగాక
నిందలు నీ పై వేయ నేఁడు నాకుఁ దడవా

చ. 2: ముంచి నీవు నవ్వఁగాను మోహమే చల్లితిఁగాక
యెంచి నీతో నలుగఁగ నెంతలేదు
మంచానాకుఁ దియ్యగాను మనసుగలిగెఁగాక
పెంచి నీతో మారుకొని పెనఁగఁగడవా

చ. 3: గక్కనఁ గాఁగిలిచఁగఁ గళవట్టి వుంటిగాక
ఇక్కువఁ బచ్చిసేయుఁగ నెంతలేదు
చెక్కునొక్కి కూడితివి శ్రీ వేంకటేశ నన్ను
మొక్కితిఁగాక నిన్ను మోసపుచ్చఁదడవా

రేకు: 1603-3 వరాళి సం: 26-015

పల్లవి: అంగడిఁ బెట్టుకోకు నీయాచారాలు
చెంగట నన్నాడించితే చెల్లఁబెట్టేఁ బదరా

చ. 1: కానికానితిట్లేల కాఁకలతో వొట్లేల
తేనెవంటినీగుణాలు తెలిపేవేరా
పూని కొంగు వట్టనేల బొమ్మల జంకించనేల
నానఁబెట్టి పరులతో నవ్వవా నీవు

చ. 2: నిక్కి నిక్కి వాదులేల నెలఁతలపొదులేల
మొక్కినట్టే నీతప్పు మోపేవేరా
లెక్క లేనియానలేల లేఁతమాయ లిఁకనేల
చక్కనిసతులతోడ జాణతనాలాడేవా

చ. 3: సారెసారె సన్నలేల సందిగొంది చిన్నెలేల
బీరమేల నిన్నే మెప్పించేలేరా
అరసి నేఁడు శ్రీ వేంకటాధిప కూడితి నన్ను
వోరి నీవింతకతొల్లె వొకరి నెఱఁగవా

రేకు: 1603-4 దేసాళం సం: 26-016

పల్లవి: మాటొకటి చేఁతొకటి మతకమై యుందిగాని
మూఁటవలపులే కాని మోహము దెలియరా

చ. 1: చిత్తములోపల నీకు చింత యెందున్నదోకాని
గుత్తపుఁగళలు దేరీ గురి నీమోము
యెత్తి(న) విరహానసుండే ఇటునాయలపు చూచి
రిత్త వగచేవుగాని కొత్త లివెక్కడోరా

చ. 2: కాయముమీఁదట నీకుఁ గాఁక యెట్టున్నదోకాని
చాయల చూపుల నీకు సంతసమే పో
పాయముతో నిన్నిఁబాసి పడియున్ననన్నుఁ జూచి
మాయల కెత్తితిగాని మచ్చికేమీఁ గానరా

చ. 3: కూడినకూటములోనఁ గోరి కెట్టున్నదో కాని
నీడ నీభావము నివ్వెరగులే
యీడనే శ్రీ వేంకటేశ యేకమైతి మిద్దరము
వీడనాడితి నిందాఁకా విరసాలు లేవురా

రేకు: 1603-5 ఆహిరి సం: 26-017

పల్లవి: ఇంకనైనఁ గరుణించవేమయ్య శ్రీ-
వేంకటేశ మాఇంటికి విచ్చేయవయ్యా

చ. 1: చింతజలధి దాఁటఁ జెక్కుచేయి తేపసేసి
కాంత నీ కెదురుచూచీఁ గదవయ్యా
కొంతపుఁ గోరికలనే కొండవాఁకఁ దనజడ
ఇంతలో నిచ్చనసేసీ నిది చూడవయ్యా

చ. 2: వెడ చింతచీఁకటికి వెలుగుగా నిట్టచూపు
కడఁగి పంజువట్టె రాఁగదవయ్య
అడరి తమకమనేఅడవి దాఁట నిదెనిట్టూర్పు
యెడ గుఱ్ఱముగఁ జేసి యెక్క నిదె కోవయ్యా

చ. 3: మదనానలం బార్చ మంతనానఁ జెమటల
నదులు వరపి నిన్ను నవ్వెనయ్య
యిదివో శ్రీ వేంకటేశ యింతలోఁ గూడగ నిన్ను
మదిరాక్షి నీపొందు మరవలేదయ్యా

రేకు: 1603-6 శ్రీరాగం సం: 26-018

పల్లవి: వాడలవాడలవెంట వసంతము
జాడతోఁ జిల్లేరు నీపై జాజర జాజర జాజి

చ. 1: కలికి నవ్వులే నీకుఁ గప్పుర వసంతము
వలచూపు కలువల వసంతము
కులికి మాటానిడదే కుంకుమ వసంతము
చలమునఁ జిల్లె నీపై జాజర జాజర జాజ

చ. 2: కామిని జంతెన నీకుఁ గస్తూరివసంతము
వాములు మోహపు నీటి వసంతము
బూమెల సరసముల పుప్పొడి వసంతము
సామజగురుఁడ నీపై జాజర జాజర జాజ

చ. 3: అంగన యధర మిచ్చె యమృత వసంతము
సంగడి శ్రీ వేంకటేశ సతిఁ గూడితి
ముంగిటరతిచెమట ముత్తేల వసంతము
సంగతాయ నిద్దరికి జాజర జాజర జాజ

రేకు: 1604-1 శుద్ధవసంతం సం: 26-019

పల్లవి: అందరునుఁ గన్నపనే అంతే చాలు
గొందికి నన్నుఁ దియ్యకు కోపము వచ్చీని

చ. 1: చెప్పరాదు నీబత్తి చెక్కులవెంటాఁ గారి
ముప్పిరి జారినకొప్పు ముడిచేవు
దప్పిదేరితి నప్పుడే తనిసితి నీవంక
కప్పుర మియ్యకు నాకుఁ గాఁకలు రేఁగీని

చ. 2: యెంతలేదు నీనిజము యెదుటనే వుట్టిపడి
అంతకంతకె నామీఁద నానవెట్టేవు
చింత వాసె నీవంక సిగ్గులెల్లాఁ దీరితిని
మంతనమాడకు నాతో మచ్చుకా లెక్కీని

చ. 3: సాకిరేల నీగుణాలు సరివచ్చి వుండఁగాను
కైకొని కాఁగిట నన్నుఁ గలసితివి
మేకొని శ్రీ వేంకటేశ మెచ్చితి నిన్నన్నిటాను
నాకు నీకు బాసలేల నవ్వులువచ్చీని

రేకు: 1604-2 ఆహిరినాట సం: 26-020

పల్లవి: ఎవ్వరు నేమి చెప్పేరే యింతులు నీకు
జవ్వనిరో యిద్దరును జంటనుంటే మేలు

చ. 1: యెనసినచోటికిని యెగ్గుదప్పు లెంచనేల
చనవి మనవితోడిసంతమే మేలు
ననువుగలచోటికి నాయాలకుఁ బనిలేదు
తనలోనే సంతసించె తగుపొందే మేలు

చ. 2: ఆయములంటినచోటి కనుమానా లిఁకనేల
పాయముతోఁ గరఁగేటిబాగులే మేలు
పాయరానివావులకుఁ బరుల నడుగనేల
చేయిచేతఁ బుట్టినట్టిచెనకులే మేలు

చ. 3: వలచినచోటికి వాసివంతు లిఁకనేల
బలిమి చూపక కిందుపడుటే మేలు
యెలమి శ్రీ వేంకటేశు నిప్పు డిట్టె కూడితివి
చలము దీరెను మీలో సమ్మతులే మేలు

రేకు: 1604-3 బౌళి సం: 26-021

పల్లవి: లేనివిచారములేల లేవే యింక
మానుపడి వుండనేల మానవే యింత

చ. 1: చెలువుని తురుమిది చెదరితే నేమాయ
వలపు రట్టు సేతురా వద్దే యింత
అలసి సొలసి వుస్సరంటే నిందేమాయ
చలివాయ నాడనేల చాలదా యింత

చ. 2: రమణుఁ డింతటనే పరాకైతే నేమాయ
తమకము చెరుతురా తగదే యింత
అమరినమరు రేక లవి యుంటే నేమాయ
కొమరుమిగిలినాఁడు కోపేమేలే యింత

చ. 3: వాడుమోము నీయెదుట వంచితేనే యేమాయ
వీడనాడఁ బనిలేదు విడవే యింత
వేడుకతో నిన్ననే శ్రీ వేంకటేశుఁ డిటు గూడె
పాడిఁబంతమెల్లాఁ జెల్లె బాసలేలే యింత

రేకు: 1604-4 ముఖారి సం: 26-022

పల్లవి: మాకుఁ జూడ వెరగాయ మగువచందము నేఁడు
సేకరముగా చలము చెల్లించకుండీనా

చ. 1: అందరిలో నిన్ను నేమి ఆడఁజాలకే పో
చెది చెలి పాదానఁ జిమ్మె నిన్నును
ఇందుముఖికోపమెంతో యేకాంతాన నీవుండితే
చిందరవందర పచ్చి సేయకుండీనా

చ. 2: సముకాన నిన్ను నిట్టె సంకించలేకెపో
తమితో గొణఁగి తిట్టీ తనలోనవె
రమణిమైకాఁక యెంతో రతివేళ నిన్నెంతే
జమళిమై వోసరెల్ల సాదించకుండీనా

చ. 3: కడుమొగమోటమునఁ గాదనలేకె పో
తడయక గుట్టుతోడఁ దగఁ గూడెను
యెడయని శ్రీ వేంకటేశ నీపై మోహమెంతో
పడఁతి నీవే తానై భ్రమయించకుండీనా

రేకు: 1604-5 భైరవి సం: 26-023

పల్లవి: ఉండనిమ్మననే నన్ను వూరకే యీాడ
చండివడీ నేమన్నా చాయల యీాగుణము

చ. 1: తనతో నే నవ్వఁబోతే తతిగొనీ సిగ్గులు
చెనకి చేయంటఁబోతేఁ జెమరించీని
మనసునఁ దలఁచితే మర్మములు గరఁగీ
వెనకటిపొందే చాలు వెఱతు నే నిఁకను

చ. 2: దగ్గరి కూచుండఁబోతేఁ దమకించీఁ దనువు
వెగ్గళించి చూడఁబోతే వెరగయ్యీని
నిగ్గుల మాటడఁబోతే నిలువెల్లాఁ బులకించీ
అగ్గమైతిఁ దొల్లె తన కాయనాయ నిఁకను

చ. 3: రతులు మెచ్చఁగఁబోతే రాఁగీఁ బెదవులు
యితవై కాఁగిలించితే నేకమైతిని
సతమై శ్రీ వేంకటాద్రిసరసుఁడు గూడె నన్ను
అతిమోహమున మించిననేల యిఁకను

రేకు: 1604-6 సాళంగం సం: 26-024

పల్లవి: అందితిఁ బొందితి నల్లనాఁడే తన-
కందువ లింకాఁ గడమా నేఁడు

చ. 1: వలవనిజోలిఁక వద్దనవే తన-
తలఁపులోన నుందాన నిదే
బలిమి సేయ నిఁకఁ బనిలేదు తాఁ
గలఁడు నేరి గలను కడమా యిపుడు

చ. 2: వూరకె మాఁటలు వొద్దనవే తమ-
వారము గామా వలసినను
సారెకుఁ బెనఁగఁగఁ జవిగాదు
కారణము గలదు కడమా యిఁకను

చ. 3: తగవు లేమిటికిఁ దగదనవే తా
నగినప్పుడే నే ననిచితిని
పగటు శ్రీ వేంకటపతి ననుఁ గూడెను మై
గగురుపొడిచె నిఁకఁ గడమా యిపుడు

రేకు: 1605-1 శంకరాభరణం సం: 26-025

పల్లవి: ఏమి గలిగె మీ కిందనను
ఆమనిజవ్వెన మణచఁగఁదగునా

చ. 1: చనవున నొకపరి సతి నినుఁ గొసరిన
కనలి నీవు నలుగఁగఁ దగునా
తనువులు బడలెను తగ నిద్దరికిని
మనసులచలములు మానఁగఁదగదా

చ. 2: అంటకుమని చెలి యటు నినుఁ గొసరిన
నంటునీకు మానఁగఁ దగునా
ఇంటిలోననే ఇద్దరు నలసితి—
రంటినకోపము లాఁపఁగఁ దగదా

చ. 3: నటనలకుఁ జెలియ నాఁటఁగఁ జూచిన
సటలకుఁ దలవంచఁగఁ దగునా
ఘటనల శ్రీ వేంకటపతి కలసితి-
వటుగన చెలితో నవు డిది దగదా

రేకు: 1605-2 నాదరామక్రియ సం: 26-026

పల్లవి: నిండుఁబాయముఁ గాయము నీసొమ్ము
కొండలరాయఁడ నీవే గురి యింతే కాక

చ. 1: పంతము నీతోడ నేఁ బలికేనా ఆఁటదాన
చెంతఁబుణ్యాపాపము నీచేతి దేకాక
యింతగా వలపించితి వెడమాఁట లిఁకనేల
కంతు గురుఁడవు నీవే కనుఁగొంట గాక

చ. 2: చూపుల నిన్నింకా నే సొలసేనా యింటిదాన
తోపు నూకుడెల్లా నీకే దోసముగాక
తీపులఁబెట్టితి నీవే తిరుగనాడఁగనేల
శ్రీ పతి విన్నిటాను నీచిత్త మింతేకాక

చ. 3: కాఁగిట నిన్నింకా నేఁ గాదనేనా మేనదాన
చేఁగయుఁ జిగురు నీకే సెలవుగాక
వీఁగక కూడితివి శ్రీ వేంకటేశ యిటు నన్ను
పొఁగినపతివి నీకే ఫల మింతేకాక

రేకు: 1605-3 వరాళి సం: 26-027

పల్లవి: సారె జారుఁబయ్యదతో సతినేల వేల వ్రాసి
గారవించి బుద్ధిచెప్పి కైకొనరాదా

చ. 1: చిత్తములోపలిమాట చెప్పి సిగ్గువడి యదె
జొత్తువలెఁ జెమరించె సదతిమేను
చిత్తజగురుఁడ యాకెఁ జెక్కు నొక్కు సేదదేర్చి
అత్తుకొని నీవు మాట లడుగఁగరాదా

చ. 2: కూడినట్టి మొగమోట కూరిమి గొసరలేక
వాడు మోమై తలవంచె వనిత నేఁడు
నీడకుఁ జేవట్టి తీసి నిండుఁగాఁగిట నదిమి
వేడక నవ్వు నవ్వించి వింతసేయురాదా

చ. 3: రతివేళ తమకాన రాఁపు నిన్నుఁ జేయలేక
మతి మఱచి చొక్కెను మగువ నేఁడు
ఇతవై శ్రీ వేంకటేశ యిక్కువఁ గూడితి విట్టె
మితిమీర నాకెచేత మెప్పించుకోరాదా

రేకు: 1605-4 శుద్ధవసంతం సం: 26-028

పల్లవి: ఎవ్వరి మెచ్చఁ దగవు యిద్దరిలో రామరామ
రవ్వగా సురలు విచారముసేసే రిందుకే

చ. 1: దశరథు యజ్ఞములో తగ నీవు జనియింప
దశకంఠుమేనఁ బుట్టె దావాగ్ని
వశమైన శాంతితో వర్ణనకెక్కితి నీవు
దశకంఠుఁ డంటి నట్టిధర్మ మందె సమసె

చ. 2: నెఱిఁ దొల్లి సీతకిఁగా నీవు విల్లెత్తఁగానను
చెఱకు విల్లెత్తె నీపైఁ జేరి మరుఁడు
విఱిగె నీవెత్తివట్టి విల్లయితే నెంతైన
విఱుగ కాతనివిల్లు వేసఁ బెండ్లిసేసెను

చ. 3: శ్రీ వేంకటాద్రిమీఁదఁ జేరి యెక్కితివి నీవు
ఆ వెలఁది నీవుర మట్టె యెక్కెను
దేవుఁడైవై ఇందరిలోఁ దిరుగాడుదువు గాని
వోవల నాకైతే నీపై వున్నచోనే వున్నది

రేకు: 1605-5 ఆహిరినాట సం: 26-029

పల్లవి: సతి వెఱువు దెలిపి చనవింక నియ్యరాదా
చతురుఁడ నీకాకెతో చలము లింకానా

చ. 1: వనిత నీచెక్కులపై వలపు వ్రాయఁగలేక
కొనగోర నేల వ్రాసిఁగోరి కెట్టిదో
ననిచి మరుశాస్త్రము నాలుకఁ జదువలేక
వెనక నీపేరు చదివీఁ బెదవులనె

చ. 2: తరుణి నీకుమదనమంత్రము నేరుపలేక
సిరుల చేసన్నలను చేసుకొనీని
అరుదురగా నీమోహము లెక్క వెట్టలేక
పొరలి చింతలఁ దలపోసీని

చ. 3: చెలియ నీమోము చూచి సిగ్గులు చల్లఁగలేక
మొలకమోవిని లోలో ముంచి నవ్వీని
కులికి శ్రీ వేంకటేశ కూడి నిన్నుఁ బాయలేక
నిలువురతులతోడ నిన్ను లాలించీని

రేకు: 1605-6 మంగళకౌసిక సం: 26-030

పల్లవి: ఎన్నైనఁ గలవు పను లేమనీనే
చిన్ననగవున నాసిగ్గు వాపుమనవే

చ. 1: చిక్కువడ్డనెరులతో చింతతోడి మనసుతో
యిక్కడ నుందాన నన్ను నేమనీనె
వెక్కసానఁ దనకేకా విరహాన నింతైతి
చక్కఁజేసి తానే యీపడి వాపుమనవే

చ. 2: కమ్మఁజెమటలతోడఁ గాఁగినమేనితోడ—
నిమ్ముల నుందాన న్ను నేమనీనే
నెమ్మదిఁ దనకొరకే నివ్వెరగున నుందాన
రమ్మని తానే నాతో రాఁపు వలదనవే

చ. 3: మనసుకోరికలతో మంచుఁబులకలతోడ
యెనసితిఁ దనతో నే నేమనీనే
యెనలేక శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
తనకేకా యిటులైతి దయఁజూడుమనవే

రేకు: 1606-1 రామక్రియ సం: 26-031

పల్లవి: ఏఁటికి యెక్కినవాని కేనిగె గుజ్జౌనౌ కాదో
మేఁటితనపంతమెల్ల మీఁదాయఁ జాలదా

చ. 1: చేసినచేఁతలు గాక చెలువుఁ డందుకుఁదోడు
మాసియు మాయనియట్టిమాయలుఁ గొన్నా
మోసము నాదేకాదా మొన్న నలిగినదాన
వాసితో నుండకుండితే వచ్చుఁబో నేరములు

చ. 2: దయమాలి తా రాక తాపమురేఁచుటగాక
నయగారితనముల నవ్వులుఁ గొన్నా
క్రియ నే నెఱఁగఁగాక కిమ్ముల నే నుండఁగాను
ప్రియము చెప్పఁగఁబోతే బిగియక మానునా

చ. 3: అలసి సొలసి కామెరాఁక లాఁగుతాఁ గాక
కలసిరతివేళ కతలుఁ గొన్నా
యెలమి శ్రీ వేంకటేశు నిట్టె కూడినదాన
వులవచ్చి సేయకుంటే వొరయఁగఁజెల్లదా

రేకు: 1606-2 సామంతం సం: 26-032

పల్లవి: ఆడనుండి మోవి దిట్టే వంతేకాదా వలపు
బూడిదెలో వసంతమా పోపో అంతేకాదా

చ. 1: నేనేడ నీవేడ నీతోడివారమా
ఆనలువెట్టఁగవచ్చే వంతేకాదా
దానికేమి గొరతా తతిలేదు మితిలేదు
మానవుగా జగడాలు మరి యంతేకాదా

చ. 2: దాఁపనేల రాఁపులేల తడవవచ్చితిమా
ఆపెచేతఁ బిలిపించే వంతేకాదా
పై పై నింకానేల పంతనాలు మంతనాలు
మాపుదాకా సరసము మరి యంతేకాదా

చ. 3: వన్నెలంత వాసులెంత వద్దనేటిదాననా
అన్నిటా వేసాలు చల్లే వంతేకాదా
వున్నతి శ్రీ వేంకటాద్రి నుండి వావిలిపాటిలో
మన్నించితి రామచంద్ర మరి యంతేకాదా

రేకు: 1606-3 రామక్రియ సం: 26-033

పల్లవి: పిలువరే వానిఁ బ్రియము చెప్పిన
పొలసి తానేల పొయ్యీనే

చ. 1: తళుకునఁ జూచి తలవంచుకొంటి
అలసి యేమైన నంటినటే
చెలువుఁడు తానే సిగ్గువడీ నింతే
యెలమి మాయింటికి యేల రాఁడే

చ. 2: ఆడికలు వింటి నట్టె మఱచితి
తోడుత నేమైన దూరితినా
వేడుకకాఁడై విచారించీ నంతే
వోడి వాకిట నేలున్నాఁడే

చ. 3: కపటాలు దీరె కాఁగిలించుకొంటి
చపలపుఁదప్పు సాదింతునా
యిపుడె శ్రీ వేంకటేశుఁడు గూడెను
వుపమలయాన లొద్దేలే

రేకు: 1606-4 సాళంగం సం: 26-034

పల్లవి: ఎంతైన మానఁడు పతి యేమోకాక
ఇంతటఁ దానే పదరె నాడరాదు గాక

చ. 1: వట్టినపయ్యదకొంగు పాయఁదియ్యఁ దడవా
చుట్టుపువరుస గొంత చూచితిఁగాక
తిట్టినట్టె నావిభునిఁ దిట్ట నాకుఁ దడవా
మెట్టిపట్టుక మిమ్మెల్ల మెప్పించితిఁ గాక

చ. 2: వేడుక చెక్కునొక్కఁగ విదలించఁ దడవా
ఆఁడదానికేలంటా నటు వుంటిఁగాక
లేఁడు నామోవి యంటఁగ నే వొట్టువెట్టఁ దడవా
నాఁడు చేసినచేఁతకు నవ్వుకొంటిఁగాక

చ. 3: గక్కనఁగాఁగిలించక కసరుకోఁ దడవా
వొక్కమోహములు చూచి వొప్పితిఁగాక
చిక్కితి వావిలిపాటి శ్రీ రఘునాథ నీ కీ—
యిక్కువ శ్రీ వేంకటాద్రి నిరవైతిఁగాక

రేకు: 1606-5 బౌళిరామక్రియ సం: 26-035

పల్లవి: ఊరకే నన్ను రేఁచక వుండనియ్యరా
కోరికెల్లా రాసులైతేఁ కోటానఁగోట్లు

చ. 1: చిత్తము నొచ్చీనంటా సెలవి నవ్వితిఁగాని
వొత్తి మేనిక కలైతే వోరువరాదు
బత్తి చెరుచఁగరాక పట్టఁగా లోనైతిఁ గాని
యెత్తిననాసిగ్గులైతే యెన్నైనాఁ గలవు

చ. 2: మన సెట్టుండునోయంటా మాట నే నాడితిఁగాని
పెనఁగి పెదవులైతే బెండుపడీని
నను పెట్టానోయంటా నాఁటఁగఁ జూచితిఁ గాక
నినుపు నాయాసలైతే నిండాఁ బండఁగలవు

చ. 3: వరుసదప్పీనంటా వాసికిఁ గూడితిఁ గాక
సురతపువలపులు జొబ్బిలీ నిదె
గరిమ శ్రీ వేంకటేశ కలసితి మిద్దరము
పరవశములయితే పట్టరాదు నాకు

రేకు: 1606-6 రామక్రియ సం: 26-036

పల్లవి: రాతిఁ బతిమసేసినరామచంద్ర నీ—
చేతిలోనిదాస నింతే శ్రీ రామచంద్ర

చ. 1: వట్టిరట్టు సేయ కిఁక వద్దు రామచంద్ర
నెట్టన నే దూరనోప నిను రామచంద్ర
వొట్టితిఁ బ్రేమము నీపై వో రామచంద్ర మమ్ము
వట్టిజాలిఁ బెట్ట కిఁక వద్దు రామచంద్ర

చ. 2: విన్నపాలు వేయునేల విను రామచంద్ర మా—
కన్నులకు నీవె గురి ఘనరామచంద్ర
యెన్నిక నన్నుఁ బాయకు మిఁక రామచంద్ర
నిన్ను నన్ను నెంచుకొమ్మి నీవు రామచంద్ర

చ. 3: ఆయము లంటితివి నెయ్యపురామచంద్ర వొక్క—
పాయమే ఇద్దరికిని బలురామచంద్ర
ఆయెడ వావిలిపాటి హరిరామచంద్ర
చేయార శ్రీ వేంకటాద్రిఁ జెందితి రామచంద్ర

రేకు: 1607-1 పాడి సం: 26-037

పల్లవి: ఆఁడుఁగొల వచ్చుఁ జూమ్మీ ఆచారా లింతైతే
నేఁడు గామించితిఁ జూమ్మీ నిన్ను రఘునాథ

చ. 1: తొంగిచూచి నంతలోనే దోసము వచ్చీనా
అంగవించి వలచిన ఆఁడుదానను
ముంగిట మాటాడితేనే మోనము దప్పీనా
యెంగిలౌనా మోవిపండు ఇంతలోనే నీకును

చ. 2: పాదము సోఁకించితేనే పంతములు దప్పీనా
వీదిఁబోతాఁ జెనకినవెలఁది నేను
పొద్దై సంగడినుంటే బతిమి వొయ్యీనా
సోదించి కళలు నీకు జొబ్బిలీని ఇపుడే

చ. 3: తొడమీఁద నిడుకొంటే దొరతనము వొయ్యీనా
బడిబడిఁ దిరిగాడే పడఁతి నేను
కడఁగి శ్రీ వేంకటాద్రిఘనుఁడ వావిలిపాటి -
వొడయ రాఘవ కూడి వొద్దికఁ బాయకుమీ

రేకు: 1607-2 ఆహిరి సం: 26-038

పల్లవి: మారుమాట లంత నేర మరి విన్నపాలు నేర
శ్రీ రామచందురుని చిత్త మింతేకాక

చ. 1: కన్నుల నెదురుచూచి కరఁగేటిదానఁ గాక
సన్నసేసి పిలువను సరిదానసనా
మన్నించి తాఁజూచితేను మనసిచ్చేదానఁ గాక
అన్నిటా నే నెడమాట లాడించేదాననా

చ. 2: ఆనవాలుగా నుంగర మందుకొనేఁ గాక
నేనే పైకొన నంతనీటుదాననా
పూని తా విచ్చేసితేను పొడగనేదానఁ గాక
కానుకలు సారె నంపి కాఁక రేఁచే దాననా

చ. 3: సోదించి నన్నుఁ గూడితే చొక్కేటిదానఁగాక
కాదుకూడదని దూరఁ గడదాననా
సాదించి వావిలిపాటిజయరామ యేలితివి
ఆదియై శ్రీ వేంకటాద్రి నంతదాననా

రేకు: 1607-3 బౌళి సం: 26-039

పల్లవి: నేటఁగాకుండితే రేపే నేరిచీఁ గాక
తేటకన్నులకుఁ గెంపు దెచ్చుకోఁ గలనా

చ. 1: కానీకానీవే కన్నుల నవ్వీఁ దాను
పైనే, విచ్చినమేడిపంటిబోనము
దానికేమి యింతలోనె తాఁ జేసినందుకెల్ల
తేనెవంటి పెదవుల తెగనాడఁగలనా

చ. 2: కాదంటేఁ బోదుగదే కాఁకలురేఁచీఁ దాను
పోది సేయనేల లక్కపూసకపులు
వాదులేల తా నన్ను వలెనని పట్టఁగాను
యీాదెల మెత్తనిచేత నీఁకఁ దోసేనా

చ. 3: ఆయనాయ నందుకేమి ఆరడిఁబెట్టీఁ దాను
యేయెడ నెక్కినవాని కేనిగె గుజ్జే
ఆయపు శ్రీ వేంకటాద్రి నదె వావిలిపాటను
పాయపురాముఁడు గూడె పంతమాడేనా

రేకు: 1607-4 సాళంగనాట సం: 26-040

పల్లవి: సిగ్గరి పెండ్లికూఁతుర సీతమ్మ
దగ్గరి సింగారబొమ్మ తలవంచకమ్మా

చ. 1: అల్లనాఁడే రాఘవుడు హరివిల్లు విరిచెను
యెల్లి నేఁడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుఁడు నిన్నిచ్చీనట వీఁడె
వెల్లవిరి నీమాట వినవమ్మా

చ. 2: అదె పెండ్లితెర యెత్తి రండనే వసిష్ఠుఁ డుండి
చదివీ మంత్రాలు సేన చల్లనమ్మా
మొదల రామునికంటె ముంచి తలఁబాలు వోసి
సుదతి యాతని మోము చూడవమ్మా

చ. 3: కంకణదారాలు గట్టి కాలుదొక్కితివి మీరు
పొంకాన బువ్వ మందరో పొత్తుల నమ్మ
వుంకువ వావిలిపాట నుండి శ్రీ వేంకటగిరి
తెంకుల నిన్నుఁ గూడి తిరమాయనమ్మా

రేకు: 1607-5 రేవగుప్తి సం: 26-041

పల్లవి: ఔనేఔనే ఆయఁ బని
పూని వలపు మోపి పోయీనా తాను

చ. 1: మగిడిమగిడి మమ్ముఁ జూచీనే
మిగులఁ దనాస నామీఁదఁ బారెనా
తగవీ నగవూఁ దా నెఱఁగఁడా
సగము నవ్వితి నేను జాణవునే తాను

చ. 2: మలసి మలసి మాఁటాడీనే
అలరి యంతలో నే నాలనైతినా
చలిమి బలిమీ సాదించీనా
యెలమి బలిమీ సాదించీనా

చ. 3: చేరి చేరి చేయి వేసినే యిట్టె
సారెకు ననుఁ గూడి చవిగనెనా
రారె వావిలిపాటిరాఘవుఁడు
ఈరీతి శ్రీ వేంకటేశుఁడే తాను

రేకు: 1607-6 నాదరామక్రియ సం: 26-042

పల్లవి: వచ్చెను నీరమణుఁడు వసంతమాధవుఁడై
ఇచ్చగించి చేకొనవే యెదురేఁగి నీవు

చ. 1: పూచెఁబో నీ సెలవుల పున్నమ వెన్నెల నవ్వు
కాచెఁబో చన్నుల నిమ్మకసుఁగాయలు
రాచిలుక లెలిఁగించి రమణి నీ పలుకుల
యేచెను వసంతకాల మిదె నీ పాయమున

చ. 2: చిందెఁబో నీమేన నట్టె చెమటల రసములు
అందెఁబో చేతులకు నీ యాయపుఁజన్ను
మందలాయఁ దుమ్మిదలు మరి నీ తురుమునను
చందపు నీ కోరికలే జాజరవసంతము

చ. 3: పండెఁబో నీకెమ్మోవిఁ బల్లదొర లింతలోనె
నిండెఁబో చల్లనిగాలి నీ పూర్పుల
అండనె శ్రీ వేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
బొండుమల్లెపానుపువో పులక జొంపములు

రేకు: 1608-1 వరాళి సం: 26-043

పల్లవి: కాదనినందుకు నీవు గలితేఁజాలు
నీ దాననైతిఁగాక నించనోప నిఁకను

చ. 1: చక్కని నీ వదనమే చంద్రోదయము నాకు
చుక్కలేని మోవి మీఁది సూదివాట్లు
వెక్కనపు నీ నవ్వు వెన్నెలపులుఁగములు
వొక్కటైతి నలుగ నేనోప నీతో నిఁకను

చ. 2: నీ మేనిచెమటలు నిండినట్టిమంచు నాకు
అమనివూరుపులే పయ్యరరగాలి
కోమలపుఁబులకలె కూరిమి గుజ్జనఁగూళ్ళు
యేమిగల్లా నియ్యకొంటి నెదురాడనోపను

చ. 3: కాఁగిననీరతిపొందే కందువరాతిరి నాకు
మూఁగిన పరవశాలే ముంపునిద్దుర
వీఁగక శ్రీ వేంకటేశ వేడుక నీసరసమే
పొఁగినట్టితలఁబాలు పదరకు మికను

రేకు: 1608-2 ఆహిరినాట సం: 26-044

పల్లవి: రామా రామా రాజీవనయనా
కామించి నినుఁ జూచె గక్కన మా చెలియ

చ. 1: యింతి పిలువనంపె నెడమాటలేలా
యింతలో విచ్చేయు ఎన్నికగాక
చెంత నిందులకుఁగా సెలవి నవ్వేలా
పంతముతో నాకెఁ బాలింతు గాక

చ. 2: తరుణి పూవుల వేసె తలవంచనేలా
సరినీవు మోహమే చల్లుదుగాక
నిరతి నిందుకుఁగా నివ్వెరగేలా
మరిగి యాకెను నీవే మన్నింతుగాక

చ. 3: మగువ కాఁగిటఁ గూడె మరి సిగ్గులేలా
వెగటురతుల విఱ్ఱవీఁగుదుగాక
వగల శ్రీ వేంకటేశ వావిలిపాటిరామ
మిగుల సీతతో మెఱుతువుగాక

రేకు: 1608-3 కాంబోది సం: 26-045

పల్లవి: చెల్లఁబో యీా తగవు చెప్పరే మీరు
వెల్లవిరి యిందుకేపో వెరగయ్యా నాకు

చ. 1: వూరకుండఁగ నాతో వొద్దిక మాటలాడీని
కారణములేనిపొందు కద్దా బూమి
వూరికెల్ల తా జాణ వుప్పవేసి పొత్తుగూడీ
నారుకొన్నయిందుకేపో నవ్వువచ్చు నాకు

చ. 2: తలవంచుకుండఁగాఁ జిత్తరువులే చూపవచ్చీ
పిలువనిపేరటము ప్రియమయ్యీనా
బలువు చూడవే వీఁడు బండిగట్టీ చింకలను
తలఁపున యిందకేపో తమివుట్టీ నాకు

చ. 3: సిగ్గుతో నే నుండఁగాను చెక్కునొక్కవచ్చీని
దగ్గరి చేత మొక్కఁగా తప్పుగలదా
నిగ్గుల శ్రీ వేంకటాద్రినాలయుఁడు నన్నుఁ గూడె
తగ్గులే కిందుకేపో సంతసమయ్యీ నాకు

రేకు: 1608-4 ముఖారి సం: 26-046

పల్లవి: చెలులాల యీమాట చెప్పరె మీరు
నిలువునఁ గరఁగితి నిజమాతిఁ దనకు

చ. 1: కన్ను సన్న సేయఁబోతే కసరై తోఁచెనేమో
విన్నపించి తోడుకరావే విభుని
మిన్నక కనే నవ్వఁబోతే మించి వెంగెమాయనేమో
అన్నిటాఁ దెలుసుకొనీ నలుకేలే తనకు

చ. 2: గొప్పమాట లాడఁబోతే కోపమైతోఁచెనేమో
చెప్పరే యాతని కిది చెల్లదని
రెప్పలెత్తి చూడఁబోతే రేసులై తోఁచెనేమో
తప్పులెల్లా వొప్పులయ్యీఁ దడవేలే ఇఁకను

చ. 3: రతికి మంచమెక్కితే రాజసమై తోఁచెనేమో
యితవుగాఁ దనమాతి యెగ్గు వాపరే
సతమై శ్రీ వేంకటేశ్వరుఁడు న న్నిటు గూడె
కతలాయ వలపులు కడమేమే తనకు

రేకు:	1608-5 సామంతం	సం:	26-047

పల్లవి:	మానలేనే పొందు మానలేనే నిన్ను మానలేనే
	ఆనెను మోహము నేఁ డంటవే నాదేహము

చ. 1:	చక్కఁదనములతేట చల్లనివెన్నెలవూట
	వొక్కమాటడవే నీ వొద్దిక మాట
	చక్కెరవింటిలో తూపు జవ్వనములో నీరూపు
	గక్కనఁ జూడవే కడకంటిచూపు

చ. 2:	యింపుఁజిగురుఁజప్పర మిన్నిటిలో బిత్తరము
	సొంపుగఁ జాఁచవే నీసోగకరము
	సంపదల ముజ్జగము చందురునిసోయగము
	జంపులేల యెత్తవే నీసవరనిమొగము

చ. 3:	మదనుని తేరుజోక మంచిమెఱుఁగుల రేక
	యెదురు చూడఁగ వచ్చే విట్టి నీరాక
	ఇదె శ్రీ వేంకటగిరి నిరవై వావిలిపాటఁ
	బొదలిన రాఘవుఁడఁ బొందితి నదె

రేకు: 1609-1 వసంతం సం: 26-048

పల్లవి: సారె వేరేపను లేడ సంతోసమేకాక
తారుకాణేల విభుఁడ తగులమేకాక

చ. 1: మనసుగలసినచో మరి కోప మేడది
యెనసి యేమి సేసినా యింపులే కాక
చనవుగలుగుచోట సారె వెరపేడది
చెనకిచేఁతలెల్లఁ జెల్లుబడే కాక

చ. 2: సరివలచినచోట చంచలము లేడవి
తరితీపులఁ గరఁగేతములే కాక
అరుదందిచూచుచోట నడ్డాఁక లేడవి
మురిపెపుఁబ్రమములముచ్చటలే కాక

చ. 3: యిచ్చగించియున్నచోట యెడమాఁట లేడవి
పచ్చిగాఁ గూడినయట్టిపగటే కాక
అచ్చపు శ్రీవేంకటేశ అప్పుడే నన్నేలితివి
తచ్చన లిన్నఁకనేవి తనియుటే కాక

రేకు: 1609-2 శంకరాభరణం సం: 26-049

పల్లవి: కామినిబతు కిది కతలాయ
వేమరుఁ జూతువు విచ్చేయవయ్యా

చ. 1: వెడఁగు నిట్టూర్పులు విసరఁగ విసరఁగ
పడఁతినెన్నడుమె బయలాయ
చిడుముడి లోలోఁ జింతించఁ జింతించ
జడిగొను చెమటలు జలనిధులాయ

చ. 2: పొరిజవ్వనమునఁ బొరలఁగఁ బొరలఁగఁ
గరిమఁ దురుము చీఁకకట్లాయ
విరహపుఁగరాఁకలు వెడలఁగ వెడలఁగ
పరగినమనసే పాతాళమాయ

చ. 3: కలయఁ గోరికలు కదుమఁగఁగదుమఁగ
పులకలమొలకలు పోగాయ
యెలమిని శ్రీ వేంకటేశ నీవు సతి—
నొలసి కూడఁగా నొక్కమనసాయ

రేకు: 1609-3 దేవగాంధారి సం: 26-050

పల్లవి: ఏమమ్మ వూరకుండే వెశోదమ్మా
యీ మేఁటిబలకృష్ణుడు నేమరకువమ్మా

చ. 1: బండి దన్నెఁ బట్టరమ్మ బాలునిపాదము నొచ్చీ
కొండ యెత్తె నొకచేతఁ గోరి వీఁడు
యెండనె మాఁకులసంది కేఁగకుండాఁ బట్టరమ్మ
దండిబాలుఁ డేమెఱుఁగు దగ్గరుండరమ్మా

చ. 2: పాముఁ బట్టీఁ బట్టరమ్మ పసిబిడ్డఁడేమెఱుగు
దామెనకోడెలఁ గొట్టీఁ దానే వీఁడు
కామించి మాఁకులెక్కీఁ గాదని మానుపరమ్మ
బూమెల యీ బాలునికి బుద్ధి చెప్పరమ్మా

చ. 3: గాలికేఁగీఁ బట్టరమ్మ కడుశిశు వేమెఱుగు
పాలువెన్నలు దొంగిలీ బాలుఁడు వీడు
ఆలిరయ్యై శ్రీ వేంకటాచలము మీఁది కెక్కె
ఆలుఁదాను నున్నాఁ డదె చూడరమ్మా

రేకు: 1609-4 సామంతం సం: 26-051

పల్లవి: ఇంతిభాగ్య మిఁక మేమునఁగల దిదె
సంతస మబ్బెను సరుసనె మీకు

చ. 1: వీనుల కివివో వెలఁదికిఁ దొడవులు
సోనల నీ నిజసుద్దులును
కానుక లివివో కంటిమి చెలిపై
నానినచూపులు నాయకుఁడా

చ. 2: వొడలికి నివివో వుంకువలు చెలికి
వెడ నీనవ్వుల వెన్నెలలు
పుడుగర లివివో వొదిగెను నీ చేతి-
బడిబడి సన్నలు పడఁతికి విభుఁడా

చ. 3: మనసుకు నిదివో మంచినిధానము
అనుగుఁబానుపున నలము రతి
యెనసితి శ్రీ వేంకటేశ యిన్నిటా
చనవిచ్చితి విటు సతికి రమణఁడా

రేకు:	1609-5 శుద్ధవసంతం	సం:	26-052

పల్లవి:	వీఁడివో అలవిజయరాఘవుఁడు
	పోఁడిమిఁ గొలువునఁ బొదలీఁ జెలియా

చ. 1:	రాముఁడు లోకాభిరాముఁడు గుణ-
	ధాముఁ డసురలకు దమనుఁడు
	తామరకన్నులదశరథ తనయుఁడు
	మోమున నవ్వీ మొక్కవె చెలియా

చ. 2:	కోదండధరుఁడు గురుకిరీటపతి
	పోదిగ సురముని పూజితుఁడు
	ఆదిమ పురుషుఁడు అంబుదవర్ణుఁడు
	నీదెస చూపులు నించీఁ జెలియా

చ. 3:	రావణాంతకుఁడు రాజశేఖరుఁడు
	శ్రీ వేంకటగిరి సీతాపతి
	వావిలిపాటిలో వరమూర్తి దానై
	వోవరిఁ గొలువుల నున్నాఁడే చెలియా

రేకు: 1609-6 నాదరామక్రియ సం: 26-053

పల్లవి: ఏఁటికి మా మాఁట లిటమీద
మేఁటిసరసముల మెరసితి రిపుడే

చ. 1: కలికి నినుఁ గలయఁ గట్టెను తొలుతనె
పలచని నగవుల బాసికము
నిలువున నీవును నించఁగఁ గైకొనె
సొలపులచూపులసూసకము

చ. 2: యింతి పెదవులనె యిచ్చెను నీకును
వింతగాఁ బెండ్లివిడేలు
సంతసవు మలవు చల్లఁగఁ గైకొనె
యింతటఁ బులకల నివె తలఁబాలు

చ. 3: భోగపురతులనె బువ్వము దొడికెను
చేఁగలసిగ్గులే చిలుపాలు
యీగతి శ్రీ వేంకటేశుఁడ కూడితి
బాగుగా సోబానఁ బాడేము నేము

రేకు: 1609-7 పాడి సం: 26-054

పల్లవి: మేలు విచ్చిచెప్పరాదు మేడిపంటి బోనము
కాలమందే కంటి వింటిఁ గత లేఁటికనవే

చ. 1: మొక్కేననీ వీఁడు ముందట నిదేమే తొల్లి
మొక్కినదేవరకే మొక్కమనవే
చెక్కిటిది నాచేయి చిత్తము దనకు రాయి
యిక్కువలు గరఁగీని యేమందునే

చ. 2: వట్టీ నూరకె తాను పయ్యద నాచెఱఁగు తాఁ
బట్టినచలము చెల్లెఁ బదమనవే
మెట్టినది పాఁతర మీరి చెప్పె కొండెము
యెట్టైనాఁ జేయనీవే యొదురెవ్వరే

చ. 3: తగిలీ నూరకె తాను తతిగొని వెంటవెంట
తగిలె మోహము నాకుఁ దనిమీదనె
చిగురొత్త నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడు
తగవాయఁ బనులెల్లా తారుకాణలేలే

రేకు: 1610-1 సౌరాష్ట్రం సం: 26-055

పల్లవి: ఏలే యింతేసిచేత యీఁతా మోఁతా
వేళ వచ్చినదాఁకా వెరగులే చాలు

చ. 1: తప్పక చూడవెరతు తలవంచుకో వెరతు
అప్పటప్పటి సుద్దులు అవెచాలు
కప్పురము లంటనేల కాఁకలఁ బొరలనేల
తెప్పలచెమటనీటఁ దేలుటే చాలు

చ. 2: దగ్గరి రా నేనోప తప్పించుకొననోప
తగ్గుముగ్గనేనిపాటి తరగులే చాలు
వొగ్గి తనవిడె మొల్ల వొగరొగరననొల్ల
సిగ్గువడ్డ చెక్కుచేతిచింతలే చాలు

చ. 3: మంతనమాడ నేనొల్ల మర్మము చొక్కించనొల్ల
వంతుకు తాఁ గూడేటివరుసే చాలు
కాంతుఁడు శ్రీ వేంకటాద్రి కడపరాయఁడు నేఁడు
పంతమిచ్చి నన్నుఁ గూడె భాగ్యమాయఁ జాలును

రేకు: 1610-2 శ్రీరాగం సం: 26-056

పల్లవి: ఏల నన్ను వేఁడుకొనే విటు నీవె నేఁ గాన
తీలుపడనేర నేను తెలివేకాని

చ. 1: నగి నగి తిట్టినాము నాతో నలిగినాము
వెగటులేదు నాకు వేడుకేకాని
మొగసి మాటాడినాను మోనాన నీవుండినాను
జగడములేదు నాకు చనవే కాని

చ. 2: కన్నులఁ గొసరినాను కాఁకల విసరినాను
చిన్నఁబోదు నామోము చెలువే కాని
సన్నలనే తిట్టినాను చాయలనన్నాడినాను
యెన్న నెగ్గుగాదు నాకు నితవే కాని

చ. 3: పై కొనక మానినాను పరాకు సేసినాను
నా కెందు నెరవు లేదు నలుపేకాని
శ్రీ కాంత నేను నీవు శ్రీ వేంకటేశుఁడవు
యేకమైతి మెదురేది యిచ్చకమే కాని

రేకు: 1610-3 భైరవి సం: 26-057

పల్లవి: వలచిన పతితోడ వాఁడి మాట లాడనోప
మలసి నానవ్వులే మల్లెపూజ గాదా

చ. 1: గొప్పలు నాకుచములు కొండలఁ బోలుచనేలా
ఒప్పుగుపతిఁ గాఁగిట నొత్తనేలా
దప్పిదేర నవియే తామరలఁ బోలిచితే
నెప్పున మా యిద్దరికి నిచ్చపూజ గదా

చ. 2: మచ్చిక మాకనుచూపు మరునమ్ములననేల
నచ్చుదాఁక నా విభుని నాటించనేల
కచ్చుపెట్టి అవియే కలువలఁ బోలిచితే
మచ్చికైనమాలోని మంచిపూజ గాదా

చ. 3: తనువు తీగెననేల తక్కక వొరయనేల
అనుగుఁబూవుఁగోమలినంటే మేలు
ఘనుఁడు శ్రీ వేంకటేశుకాఁగిటఁ గూడితి నేను
చనువున మాలోనిసరపూజ గాదా

రేకు: 1610-4 శంకరాభరణం సం: 26-058

పల్లవి: మాఁటలేలరా యిఁక మాఁటలేల
మాఁటలేలరా మాయకాఁడా

చ. 1: చూచి చూచే చొక్కించితి
యేచి నీ చేఁత కేమందురా
కాచెఁ బూచెను కాఁగిట చన్నులు
లోఁచి చూడకు లోనైతి నీకు

చ. 2: నవ్వి నవ్వే నమ్మించితి
ఎవ్వరును నిఁక నేమనేరు
రవ్వసేసెను రాఁపగు వలపులు
తవ్వ కిఁక జోలిదక్కితి నేను

చ. 3: చేరి చేరి చేకొంటివి యింత
దూరఁబోతే దోసమిఁక
యేరా శ్రీ వేంకటేశ్వరుడా
రార కడపలో రతికెక్కెఁ బనులు

రేకు: 1610-5 తెలుగుగాంబోది సం: 26-059

పల్లవి: వీది వీధి జెప్పఁగానే వింటిమి నేము
కాదుగూడదననేల కంటిమిగా కొత్తలు

చ. 1: చెంగావి చూపులును సేమంతిపువ్వులును
యింగితానఁ జెలికబ్బె నేడవో కాని
అంగన నింతసేసినయతఁ డెంతజాణఁడో
ముంగిటఁ జూచినదాఁకా ముచ్చటయ్యీ మనసు

చ. 2: కప్పురపుమాటలను కస్తూరి వూర్పులు
యిప్పుడే కలిగె చెలి కేడవో కాని
దెప్పర మింతరేఁచిన దేవర యెంతటివాఁడో
తప్పక చూచినదాఁకా తమకించీఁ దనువు

చ. 3: ముత్తేల పులకులు ముంగారు చెమటలు
యిత్తలఁజెలికి నబ్బె నేడవో కాని
చిత్తగించి కూడినాఁడు శ్రీ వేంకటేశుఁడట
అత్తి నాకుఁ బొడచూపె ఆసగించీ గుణము

రేకు: 1610-6 పాడి సం: 26-060

పల్లవి: చాలదా యీ జనమము చల్లఁగా మీరిట్లుంటే
పాలుగల ఆకె యెంతభాగ్యము సేసినదో

చ. 1: సతి సేనకొప్పుతోడ చంద్రవంక బొట్టుతోడ
ఇసుమంతనవ్వు చిందె నేఁటికో కాని
అసురుసురయ్యాని అప్పటినుండి నామేను
యెనగ నీకు నాకె యేమౌను చెప్పరా

చ. 2: పచ్చఁబట్టు పయ్యదతో భారపు గుబ్బలతోడ
ఇచ్చుట నీవంక చూచె నేఁటికోకాని
వెచ్చనైతి నిది చూచి వేసాలు మాని నాతో
వచ్చేనని యాసపెట్టి వచ్చితివో చెప్పగా

చ. 3: ముత్తేలకమ్మలతోడ ముంజేతిసొమ్ములు చూపి
యెత్తి నీకు సన్నసేసి నేఁటికో కాని
చిత్తగించి కూడితివి శ్రీ వేంకటేశుఁడ నన్ను
హత్తి మా యిద్దరిలోని నౌఁగాము లెంచరా

రేకు: 1611-1 సాళంగనాట సం: 26-061

పల్లవి: ఏలే తనకు నాకు నేఁటిమాటలే మమ్ము
తేలించి యెడమాటాడి తీరవలెఁగాక

చ. 1: లేవే నేఁ బిలిచితే లెక్కసేసీనా తాను
చావివోయ వుమినాకి చవుతమా ఇఁక
వావాత నేనుఁ దాను వాదించితే నవ్వరా
వేవేలు నాయఁబోయ వెనకకే పొందులు

చ. 2: ఔనె దొరతో నెదురాడవచ్చునా నాకు
మానిపండ్లు రాలితే మానికిందనే
తా నొకటి నే నొకటి తలపోఁత ఇన్నాళ్లు
నానాట మోహములు నాముపేసీఁగాక

చ. 3: వద్దె యిఁక నాతో వట్టి వట్టి సరసాలు
అద్దో ముంజేకంకణాన కద్దనూ యిఁక
గద్దించి శ్రీ వేంకటాద్రి కడపరాయుఁడు గూడె
పొద్దు వొద్దుకు వింతైన భోగములే కాక

రేకు: 1611-2 బౌళి సం: 26-062

పల్లవి: ఎంతవేగిరకాఁడవు యేమి సేతువొ
పంతగాఁడ ఇట్లయితే పనులెల్లా దక్కెను

చ. 1: నట్టుకొట్టి నాలో నే నవ్వితేఁ దిట్టవచ్చేవు
పట్టితే నేమి సేతువో బాపురా నీవు
వెట్టైన చెమట దీర విసరితేఁ గసరేవు
ఇట్టె గురు లేడవంటే నిఁక నేమిసేతువో

చ. 2: తప్పక నేఁ జూచినదే తగలి యెగ్గులెంచేవు
ఇప్పుడే వెంగెమాడితే నేమి సేతువో
వొప్పుగా సన్న సేసితో వొకటొక టాడేవు
తప్పులే నిన్నుఁ బట్టితే దాని కేమి సేతువో

చ. 3: మోవి ఇచ్చినంతలోనే మోనానా సిగ్గువడేవు
యీవల గంటిరేఁచితే నేమిసేతువో
వేవేలు వచ్చెను శ్రీ వేంకటేశ నీవు నన్ను
కైవసమై కూడితివి ఘనతెంత సేతువో

రేకు: 1611-3 దేసాళం సం: 26-063

పల్లవి: నీవే తెలుసుకొమ్మీ నీ వోపిక
యీవల నేఁ గాదనేనా యింత కోపఁగలవా

చ. 1: చిగురాకు గెమ్మోవి చెంచువారము నీకు
వొగరై తోఁటునేమె వొద్దురా నేము
సొగుసులేళ్లవంటిచూపులు మావి పెక్కు
వగలై మిన్నులఁ బారీ వంచుకొనఁగలవా

చ. 2: సరవి కొండలవంటి చన్నులనేము నీ—
వురమెల్ల నొత్తుఁజేసు నొద్దురా నేము
కరికుంభములవంటి కటితటము యీ—
అరిది నడవివారి నాపఁ గలవా

చ. 3: చిల్లెరతీగెలవంటి చేతులు మావి నీ—
వొళ్లెల్ల నరడుఁజేసు వొద్దురా నేము
మెల్లనే శ్రీ వేంకటేశ మేకొలిపి కూడితివి
బల్లిదుఁడ వౌదుగాక పంతమాడఁగలవా

రేకు: 1611-4 ఆహిరి సం: 26-064

పల్లవి: పచ్చిసేసి వెచ్చిసేసి పాయ మింత నలఁచనేలా
మచ్చికెల్లఁ జూతుగాని మాపటంత రారా

చ. 1: మాఁచనోలిచెన్నుఁడి మాటలాడి మమ్మునింత
రేఁచనేల వుండవోయి రేలుఁబరగల్లును
దాఁచలేము మోహమును తమకమింత గలిగితేను
యేఁచనేల వీదివీది యింటికింక రారా

చ. 2: వేణునాదమోహనా వెలిగోరు మోపి మోపి
జాణతనము లాడనేల చక్కనుండరా
ప్రాణ మింత కోపదూను పలుకులేమి గలిగినాను
వీణెలోనె తెలుతుగాని వెంట వెంట రారా

చ. 3: నందగోపనందనా నవ్వినవ్వి మమ్ము నేడు
కందువందు చేయివేసి కరఁగఁజేసితి—
విందుగూడినట్టు శ్రీ వేంకటాద్రి నుండి వచ్చి
దిందుపడతి మాఁచనోల దినదినంబు రారా

రేకు: 1611-5 సౌరాష్ట్రం సం: 26-065

పల్లవి: ఏమాఁట కే మాఁట యేలరా
నామోము చూడవే నవ్వే నేను

చ. 1: వద్దు వోరా వాదులు వొక్క-
సుద్ది చెప్పే రావే సొలయక
కొద్ది నుండదురా కోపము అయితేఁ
గదు లేవే నిన్నుఁ గలసే నేను

చ. 2: సారె నేలరా చలము మరి
కోరికెల్లఁ జెల్లె కొంకువాసెనే
మేరమీరేవేరా మెల్లనే తొల్లె
తేరపనులకునుఁదెగువేలే

చ. 3: చెల్లెరా నీ చేఁతలూ
అల్లనాఁడె నే నంటిఁగదె
వెల్ల విరయితి శ్రీ వేంకటేశ నిన్నుఁ
గొల్లగాఁ గూడితి కొసర నేలే

రేకు: 1611-6 నాదరామక్రియ సం: 26-066

పల్లవి: ఈఁతగాదు మోఁతగాదు ఇంతేలోతు మోహము
చేఁతసేసి యిఁకనైనా చెక్కునొక్కవే

చ. 1: వలపు పుక్కిటిబంటి వలిత విభునితోడ
మలసి సొలసి యిట్టె మాఁటలాడవో
చలము చంకలబంటి సరసము లాడితేను
కలసి మెలసి యిట్టె కాఁగిలించవే

చ. 2: కోరికె పిక్కలబంటి కొంకుదేరవలసితే
యేరీతినైన నాతనింటి కేఁగవే
తారుకాఁ మొలబంటి దగ్గరఁబోయినప్పుడే
కూరిమితో తొడమీఁదఁ గూచుండవే

చ. 3: పాయము రొమ్ములబంటి భావించి చూచితేను
ఆయెడ శ్రీ వేంకటేశు నటు గూడవే
ఆయము కుత్తిబంటి ఆతఁడిట్టె నిన్నుఁగూడె
మోయుచు మదనమంత్రములు వినిపించవే

రేకు: 1612-1 కాంబోది సం: 26-067

పల్లవి: ఏల నన్ను దూరేరే యెదాఁకాఁ బోరేరే
చాలుఁజాలు నన్నిటికి సమ్మతించే నేను

చ. 1: అప్పుడే యాతనితో మాటాడించవద్దు గాని
చెప్పరమ్మ మీ బుద్ది సేసే నేను
చెప్పరాని చేఁతలెల్లా చెల్లఁబెట్టవద్దు గాని
వొప్పుగా మారెందుకైనా వొడఁబడే నేను

చ. 2: దుట మమ్మిద్దరిని ఇంత రేఁచవద్దు గాని
వొదిగి నీయానలోనే వుండు నేను
ముదిరిన మా కోపములు దిద్దవద్దు గాని
యెదురాడ కెంతకైనా నియ్యకొనే నేను

చ. 3: నాయము వెట్టిద్దిరిని నవ్వించవద్దుగాని
కాయపుఁగోప మారితేఁ గదిసే నేను
ఆయుమంటి శ్రీ వేంకటాధిపుఁడు నన్నుఁగూడె
వేయునేల మీ మాఁటే వింటిఁగదే నేను

రేకు: 1612-2 కేతారగౌళ సం: 26-068

పల్లవి: మాయలేల రారా మనకేఁటి కలుక
పోయినవల్లాఁ బొల్లు పొద్దువోయ నిఁకను

చ. 1: పలికితే దోసమా పలుమారుఁ బిలువఁగ
యెలమిని పరకాంత లీడ నున్నారా
వలతునందువు నాకు వారివీరితోడ నేల
కలది లేని దిఁదే కానవచ్చె నాకు

చ. 2: చూచితేనే దోసమా నే చొక్కి యెదుట నుండఁగ
నాచుబొమ్మచారితనము దప్పినా
యేచి మనకూట మిఁక నిందరును మెత్తరు
తాచి నేఁడు ఇందులోనే తారుకాఁలాయఁగా

చ. 3: మనసిచ్చితే దోసమా మంచిమాట లాడఁగాను
మినుకునీజవ్వనము మీఁదువోయీనా
చెనకఁగఁ గూడితివి శ్రీ వేంకటేశ నన్ను
మునిపితే ముయాయ మోహ మెందుఁ గలదే

రేకు: 1612-3-- సం: 26-069

పల్లవి: దగ్గరితే నిఁతసేసె తా నదేమే
యెగ్గుసిగ్గు లెంచఁ జోటు ఇందులో నేదే

చ. 1: తక్కించి పొరుగునను తాను నేను వుండఁగానే
చెక్కిటికి చేయివచ్చె సేసేదేమే
కక్కసించి రాకపోక కన్నుల నే చూడఁగాను
లక్కవంటిమనసాయ లాగు నిఁక నేలే

చ. 2: తాము నేను నొక్కవీధి తగ నడచినంతేనే
మానుపడె మేనెల్లా మరిఁకనేమే
నానుపుగా తానునేను నవ్విన యంతటిలోనే
తానకమాయ వలపు తారుకాణ లేలే

చ. 3: తలపోసి తలపోసి దగ్గిరినయంతలోనే
కలసె కాఁగిట నన్నుఁ గత లేలే
చెలఁగి శ్రీ వేంకటేశు చేరినఫలములాయ
నిలువే నివ్వెరగాయ నేర మెంచనేలే

రేకు: 1612-4 ముఖారి సం: 26-070

పల్లవి: అతివ గుట్టుననున్న దండాఁగాను
చెతురుఁడ వీఁకనైన సంగడి కేఁగరాదా

చ. 1: సేసకొప్పు వంచినది చెక్కుచేత మించినది
ఆసగా యేమాటయిన నాడరాదా
మూసిన ముత్యమయినది ముంగిటనిలుచున్నది
మేసుల ఆకెతోడ మేలమాడరాదా

చ. 2: నిట్టూర్పు నించినది నిండాఁజెమరించినది
నట్టుకొట్టి ఆకెఁ గొంత నవ్వించరాదా
మెట్టి నేల వ్రాసినది మేలు నీకుఁ జెప్పినది
వట్టి యాఁకె పానుపుపై పాలార్చరాదా

చ. 3: నివ్వెరగుతో నున్నది నీమనసెల్లఁ గన్నది
రవ్వగా ఆకె నిట్టె రమ్మనరాదా
యివ్వల శ్రీ వేంకటేశ యింతసేసి కూడితివి
నివ్వటిల్లుఁ గోమలికి నిజమియ్యరాదా

రేకు: 1612-5 తెలుగుగాంబోది సం: 26-071

పల్లవి: ఈవలవు నాకేయా యిందరికి నిట్లానే
దైవముసేసినమాయో తప్పు కిట్టె చెప్పరా

చ. 1: కన్నుల నిన్నుఁ జూచి కనురెప్ప వెట్టఁజాల
అన్నిటా సతులుఁ బతు లలిగే దెట్టో
సన్నపునవ్వులు నవ్వి చాలునని మానఁజాల
తిన్ననికాంతలు పతిఁ దిట్టే దెట్టో

చ. 2: మాటలాడి మాడలాడి మాట ముగిఇంచఁజాల
చాటువగా దంపతులు జంకించే దెట్టో
కూటపుకాఁగిట నించి కొంత వదలఁగఁడాల
మాటున తెరవేసేటిమంతనము లెట్టో

చ. 3: భావరతిఁ గడుఁజొక్కి పక్కనఁ దెలియఁజాల
మోవి గంటిసేతురనేమొక్కలు మెట్టో
వోవల శ్రీ వేంకటేశ వురమెక్కించితి నన్ను
వేవేలకు బొందులు వేరనఁగ నెట్టో

రేకు: 1612-6 బౌళి సం: 26-072

పల్లవి: నీ వేమి సేతువయ్య నే వచ్చుటేదోసము
ఈ వేళ వెన్నెలగాసీ నిదియేపో దోసము

చ. 1: వలచినజవరాల వద్దనఁగ దోసము
కలిగినట్టాడకున్నఁ గడు దోసము
యెలమి నీ యంత నీ వెఱఁగవు దోసము
మలసి యింతనేసినమరునిదే దోసము

చ. 2: చెంగటిచెలులు బుద్ధిచెప్పనిది దోసము
యింగితపుమతి రాయయినది దోసము
కంగించి రానీనియట్టి కాంతలదే దోసము
బంగార దైవము దయపుట్టించనిదోసము

చ. 3: తొట్టినసంపదలతో దొరవైన దోసము
వట్టినేరాలు నిన్నెంచేవారి దోసము
ఇట్టె శ్రీ వేంకటేశ యింతి గూడితివి నేఁడు
తట్టినట్టిందరికి నింతటఁ బాసె దోసము

రేకు: 1613-1 దేసాళం సం: 26-073

పల్లవి: ఓయమ్మ తనపొందు వొల్లకుందునా
చేయివట్టి తీయనేలే చెలులు నన్నిపుడు

చ. 1: దగ్గరి మాటాడ నాకుఁ దడవా తనతోను
యెగ్గుదప్పులౌనని యెంచేఁ గాక
నిగ్గులసరస మాడనేరనా కొంతైనా
సిగ్గరితనాన కేనేఁ జింతించేఁ గాక

చ. 2: సొలపుఁ జూపులఁ దన్నుఁ జూచు టరుదాతన-
తలఁపు దెలియలేక దాఁగే గాక
సెలవినవ్వు దనపై చిలికించనేరనా
కొలఁదిమీరునోయని కొంకే గాక

చ. 3: కాఁగిలించి ఇట్లనె కరఁగించకుందనా
మూఁగినయాసలు చూపి మోపితిఁగాక
తోఁగెను చెమట నాకుఁ దోడనె శ్రీ వేంకటేశ
ఆఁగి రతిఁ జొక్కించితి వందుకే కాక

రేకు: 1613-2 శ్రీరాగం సం: 26-074

పల్లవి: సరస మాకొకపాత్తే చంద్రమందానిలాదులు
యెరవై మమ్మింత యేఁచీ నేమిసేతు వీనిని

చ. 1: చెంగటఁ జల్లనిగాలి సీతనంటి వచ్చీనా
యంగమంటియును నింకా నారదు కాఁక
అంగనచూపు చందురు నంటె నాచూపును నంటె
అంగజతాప మారదాయఁ జూడు తమ్ముఁడా

చ. 2: యెనసి అఇదువిరులే ఇద్దరిని సోఁకినవి
ఘనమై మానవు తమకము లింకాను
వొనరె మనసులలో వొకరొకరి రూపులు
కనుఁగొనియు రతులఁ గరఁగవు మేనులు

చ. 3: కట్టితి లంకపట్టము గట్టితి చింతాజలధి
అట్టె సీతఁగూడితిఁ బాయదు చెమట
గట్టిగా వావిలిపాట ఘన శ్రీ వేంకటగిరి
జట్టిగా నున్నాఁడఁ రామచంద్రుఁడ నే నిదివో

రేకు: 1613-3 శంకరాభరణం సం: 26-075

పల్లవి: అవి నాకాఁగిట నమరీనా
జవళిమాఁటలకు జాణవుగదరా

చ. 1: పలుకవదేమే పడఁతీ నా—
పలుకులు చిలుకలపలుకులె పో
యిల నీరూపున కెనయౌనా యిటు
పొలఁతులఁ జిలుకలఁ బోలుచరటరా

చ. 2: చూపులఁ జూడవే సుదతీ నా—
చూపులు మదనుని తూపులెరా
యేపున నీ కందుకేమివనె
పోపో ఆసరి పోల్తురు గదరా

చ. 3: అలమవె కాఁగిట నతివా
అలమీఁ దీఁగెలె ఆమారు
కలసితి శ్రీ వేంకటవిభుఁడను నే
పొలఁతి నీలతలనె పోల్తురుగదరా

రేకు: 1613-4 సాళంగనాట సం: 26-076

పల్లవి: తాపసులడవి యేడ తరుణి యేడ
బాపు బాపు రామచంద్ర భావించి చూడుమా

చ. 1: సీతఁ బాసి బంగారు సీతఁ బెండ్లియాడితివి
ఆతలఁ బరస్త్రీల నంట వందురు
చేతులార ముత్తేలసేస వెట్టె నీకు ఆ—
చేతనుఁజెక్కు మోపి చింతించే కొరకా

చ. 2: వెంటనే భూమిజఁ బాసి వేరేభూమి చేకొంటి
జంటనే సత్యముగలజాణ వందురు
వింటివంక నీకు నాకె వేడుకఁ జేరి మరు—
వింటిబారిఁబడి యొంటి వేఁగేటికొరకా

చ. 3: కొడుకులవంకఁ బెండ్లికొడుకవై జానకి—
నడరి కమ్మరఁ బెండ్లియాడితివి
తొడిరి శ్రీ వేంకటాద్రిఁ దోడనె వావిలిపాట
కడఁగి రాముఁడవై కరుణించే కొరకా

రేకు: 1613-5 బౌళి సం: 26-077

పల్లవి: ఏదుముల్లుచెంచెతా ఏఁటికే యింతా
వాదులకు నీవు రాకు వద్దు వద్దు ఇఁకను

చ. 1: వీఁకవింటి చెంచెతా వీఁచి కోసేవేఁటివే
వోఁకలవిడేలువో వొగరుగాని
ఆఁకపాలముగదే అందుకు లోనైతివే
యేఁకటైతేఁ జాలుఁగాని యేరుకోరా నీవును

చ. 2: పిలిచుంగుచెంచెతా పేరు లవి యేఁటివే
వోలి నవి జీడివివో వొమ్మువు గాని
చాలి నాకు నియ్యఁగదే చవిగొన నోపుదును
యేలరా తొల్లె ఇవి యెంగిలాయఁగదరా

చ. 3: మోవితేనె చెంచెతా మొగిఁ బూసేదేఁటికే
కావిరాతిగందము వో కాఁకవుఁగాని
నీవు నన్నుఁ గూడితివి నీసొబగు నాకు నంటె
శ్రీ వేంకటేశ్వర చిక్కులింకా నేలరా

రేకు: 1613-6 పాడి సం: 26-078

పల్లవి: అడుగరే చెలులార ఆమాఁటే ఆతని
విడువక పంతగాఁడై విట్టువీఁగీఁ దాను

చ. 1: నెమ్మి యమునలో నీఁదనేరిచినవాఁడు నాతో
ఇమ్ముల వలపుమడు గీఁదఁగలఁడా
దిమ్మరై అడవులెల్ల తిరిగినగోపాలుఁడు
సొమ్ములనా జవ్వనము చొరఁగలఁడా

చ. 2: బొందినే గోవర్ధనపుకొండ లెత్తినట్టివాఁడు
యిందులో నాచన్నుఁగొండ లెత్తఁగలఁడా
పందెమాడి గోపికల బడలించినట్టివాఁడు
అందపురతులు నన్ను నలఇంచఁగలఁడా

చ. 3: మించుఁబిల్లఁగోవి మోవి మెరసినవాఁడు నా—
చుంచుఁ బిల్లఁ గోవిమోవి సోఁకఁగలడా
యెంచఁగ శ్రీ వేంకటేశుఁ డింతలోవిచ్చేసి కూడె
ఇంచు భావబంధాల కీయకొనఁగలడా

రేకు: 1614-1 ముఖారి సం: 26-079

పల్లవి: ఇంకనైనా రమ్మనవే యిట్టే తాను
అంకెలఁ బొందైనచోట నంతేలే తాను

చ. 1: కన్నులఁ జూచినచూపు కలువరేకై తాఁకె
యెన్న నది మరుబాణ మెఱఁగఁడా తాను
సన్న సేసినట్టిచేయి జలజలమై మీఁదఁబారె
మున్నిటి యమ్మకుఁ దోడు ముంచీనా తాను

చ. 2: మచ్చిక నవ్వినవ్వు మామిడిపువ్వయి తాఁకె
ఇచ్చఁ జిత్తజునమ్మౌత ఎఱఁగఁడా తాను
అచ్చపు బొమ్మజంకెన లశోకమై తాఁకె
కొచ్చి మరియు నంపె పైకొసరా తాను

చ 3: కప్పురము వంటిమాట కమ్మని జాజై తాఁకె
యెప్పుడు పంచబాణాల నెఱఁగఁడా తాను
ఇప్పుడే శ్రీ వేంకటేశుఁ డేఁగివచ్చి నన్నుఁ గూడె
కప్పి కానివి మంచివికాఁ జేసె తాను

రేకు: 1614-2 భైరవి సం: 26-080

పల్లవి: సమ్మతించినాచోటికి చవిగా దొకరి బుద్ధి
నెమ్మది నాకె తలఁపు నీవె యడుగవయ్యా

చ. 1: ఆకె నీవైఁ గన్నవేసె నందుకు నీ వియ్యకొంటి -
వేకచిత్తమైనచోట నెడమాఁటలా
యేకత మేమిగల్లా నిట్టె నీవు విచ్చేసి
ఆకెతో నాడుకోవయ్య అయ్యో నే మోపము

చ. 2: కూడి మాడి వుండుదురు గుణములు మీ కొక్కటే
యీాడ మాచేఁ బిలిపించే వింతివి నీవు
పాడిఁబంత మెఱఁగవా పడఁతిని నోరినిండా
ఆడనే పిలువవయ్య అయ్యో నేము నేరము

చ. 3: నిక్కి సన్న సేసితివి నెలఁత సెలవి నవ్వె
వొక్కటైనచోట నింకా నొడఁబాట్లా
చక్కని శ్రీ వేంకటేశ సతిఁ గూడితివి యాకు
ఇక్కువ మడిచీవయ్య యీవేళ దగ్గరము

రేకు: 1614-3 దేసాళం సం: 26-081

పల్లవి: పేరఁబేర వలపులు పెంటలయ్యీని
నేరుపులు లోలోనే నింతముగాని

చ. 1: తేనెగారేమోవిమీఁద తీపుమాట లాడకువే
మోనమున నాకు గడుమొగచాటాయ
నూనెగారేచెక్కులపై నున్నఁజే యిడకువే
సోనలై జీరుకువారీఁ జూపులకు నాకు

చ. 2: తళుకుదంతాలమీఁద తగ నవ్వు చిందకువే
తెలుపు రేయిపగలుఁ దెలియనీదు
చిలుకుఁజూపులలోన సిగ్గులు నించకువే
తలపోఁత నా మనసు తగిలి పోనీదు

చ. 3: పిక్కటిల్లుఁ జన్నుతో బిగువున వీఁగకువే
మక్కువ నాకాఁగిటికి మారుకొనీని
యెక్కువైన శ్రీ వేంకటేశుఁడు నేఁ గలసితి
మొక్కకువే సారె నట్టె మోఁపులై నిండీని

రేకు: 1614-4 కన్నడగౌళ సం: 26-082

పల్లవి: ఇంతసేసెఁగా మాయ ఇద్దరిమాయెడను
చింతించే నిందుకే పతిచిత్త మెటులుండునో

చ. 1: తప్పక తాఁ జూచినాను తలవంచి చూడనైతి
అప్పుడే రాఁడాయనని ఆ కోపాన
చిప్పిలఁ దా నవ్వినాను సెలవిని నవ్వనైతి
చెప్పుడుమాటలు విన్న చిత్తపుఁగోపానము

చ. 2: కాలు దాఁకినాను నేను కడఁగి మొక్కనైతి
చాలి వొట్టువెట్టుకొన్నచలానను
కేలువట్టి తీసినాను కినిసి లోఁగా నైతి
జాలిమనసెఱఁగని సందేహమునను

చ. 3: మచ్చికఁ దాఁ జెనకఁగా మారు నేఁ జెనకనైతి
పచ్చియైన సిగ్గుమీఁది పరాకున
తచ్చి శ్రీ వేంకటపతి తానే నన్నిటు గూడె
యిచ్చకమైతి నిప్పుడే యెక్కువ మోహానను

రేకు: 1614-5 శంకరాభరణం సం: 26-083

పల్లవి: చెలులాల బలిమిసేసేరు గాని
బలిమి వలచితే పసలేదు సుమ్మీ

చ. 1: ఆడినమాఁటకును నడ్డము చెప్పక
కూడేఁగాని కొరతసుమ్మీ
వోడక పిలువఁగ వూఁకొంటిఁ గాని
జాడతో గదిసిన చవిగాదు సుమ్మీ

చ. 2: తానే యీవేశ తగులఁగ నలుకలు
మానేఁ గాని మఱచు సుమ్మీ
పూని మొక్కఁగా పొదిగితిఁగాని
కానీలే తనమతి గానఁ జుమ్మీ

చ. 3: కాఁగిట నించఁగ కదిసేఁ గాని
చేఁగ పంతములు చెల్లె సుమ్మీ
వీఁగక యిటు శ్రీ వేంకటపతిగాన
నాఁగువార నే నవ్వేఁ జుమ్మీ

రేకు: 1614-6 మధ్యమావతి సం: 26-084

పల్లవి: తనసొమ్మ్మే వున్నదాన తమకమేలే
నన్నుపైనదే చాలు నగితి నే ననవే

చ. 1: తేనెలమాఁటలు నాఁడె తీపులాయ తనవల్ల
కానివొట్లతో నేఁడు కారములాయ
వూని యింక నేమన్నా నొగరౌనో చేఁదౌనో
మోనాన నుండుటే మేలు మొక్కితి నే ననవే

చ. 2: అల్లనాఁటితనచూవు లుప్పటికి నీడలాయ
యిల్లిదె తన్నుఁ బాయఁగ యెండలాయను
వెల్లిగా నిఁక నేమన్నా వేఁడౌనొ వాండ్లౌనో
వెల్లివిరి సేయనేల వెరగైతి ననవే

చ. 3: పొందినపొందులు నాఁడె పూఁపలాయఁబిందెలాయ
చెంది నేఁడె దోరలాయ చేరికూడఁగా
అందిన శ్రీ వేంకటేశుఁ డంటితేనె పండ్లాయ
మందెమేళ మింతచాలు మరవకు మనవే

రేకు: 1615-1 సామంతం సం: 26-085

పల్లవి: చింతతోడ నన్నుఁ జూచి సిగ్గువడుకొంటిగాక
యింతలో నీతెరువు రా మిందుకేల కోపము

చ. 1: చెక్కునఁ జేయిడఁబోతే శిరసుపువ్వులు రాలె
అక్కరతో నవ్వితిఁబో అందుకే నేను
నిక్కిచూచి జంకించేవు నిన్ను నేఁ దడవితినా
చక్కని వీ రమణుఁడ చాలుఁజాలుఁ గోపము

చ. 2: నిట్టూరుపు నించఁబోతే నిండ మేను చెమరించె
అట్టె కసరుకొంటిఁబో అందుకే నేను
నెట్టిన దూరే వందుకు నీతో నలిగితినా
వట్టినేరా లీడ లేవు వద్దు వద్దు కోపము

చ. 3: కాఁకల నొరగఁబోతే కందువ నీ మేను సోఁకె
ఆఁకల బెదరితిఁబో అందుకే నేను
యేఁకటతో శ్రీ వేంకటేశ యిట్టె కూడితివి
వూఁకొనఁగఁ జోటులేదు వుడివోయఁ గోపము

రేకు: 1615-2 సామంతం సం: 26-086

పల్లవి: అప్పటి బలిమిసేసే రయ్యో మీరు
వుప్పు గప్పురమువలె వుండకుండీనా

చ. 1: పై తరవు లింతయేల పట్టకురే చెలులాల
ఆతఁడేడ నేనేఁడ అయ్యో మీరు
రాతి రింటిపొందులెల్ల రాతిరికే ఆయఁబోయ
యీతల వేగెఁ బొద్దు ఇప్పుడుండీనా

చ. 2: చందమామగుటుకలు సారెసారెఁ జెప్పఁబోతే
అందునిందు నెడతాఁకే రయ్యో మీరు
నిందవచ్చెఁ దనకుఁగా నిండెను రేకలు మేన
సందేహమెల్లఁ బాసె సరివచ్చినా

చ. 3: చిత్తమునెంజరి దీరి శ్రీ వేంకటేశు నిన్ను
హత్తించితిరి మేలు అయ్యో మీరు
పొత్తులచుట్టాలు మీరు భోగములు మాకు నబ్బె
కొత్తలాయి నవ్వులు కొఱతయ్యీనా

రేకు: 1615-3 ముఖారి సం: 26-087

పల్లవి: చేసినంతఁ జెల్లుఁబోరా చేతికి నే లోనైతి
రాసికెక్కినంతమీఁద రంతులు వంతులనే

చ. 1: కోరి దవ్వులఁ జూచితే కొండలెల్ల నున్నవే
చేరువైతే చెట్లూనుఁ జేమలింతే
పోరచివోరమణుఁడ పొందుదాఁక మినయాలె
తారుకాణ లటమీఁదఁ దాఁటలుఁదూఁటలుసే

చ. 2: మక్కువఁజూచిన నెండమావులెల్లఁ జెరువులే
నిక్కము వెదకఁబోతే నేల మిన్నే
చక్కఁగా మాటాడుదాఁక చల్లనివే నీ గుణాలు
వొక్కటైన మీఁద మరి వొలసీనొల్లములే

చ. 3: కడఁజూడ జలధికి కల్లలు బుల్లలునే
నడుమ నాఁడిముత్యాలు నవరత్నాలే
యెడయఁగా శ్రీ వేంకటేశ నిన్ను నంటిఁగాని
బడి నన్నుఁ గూడితివి బాగులు లాగులునే

రేకు: 1615-4 సాళంగనాట సం: 26-088

పల్లవి: చెల్లుబడి యింతగాఁ జేసితివమ్మా
పల్లదాన నుట్లకుఁ బండుగాయనమ్మా

చ. 1: కోలలెత్తుక వుట్లు గొట్టీ నేఁ డల్లవాఁడె
మేలు మేలు యశోద మీబాలుఁడు
బాలులఁ గూడుక వీదిఁ బారాడి నల్లవాఁడె
బేలుఁదనమున లెస్స పెంచితివోయమ్మా

చ. 2: ఇంటివారు వుండఁగానే యిండ్లు చొచ్చీ వాఁడె
దంటతనా లివి మీకు తగునమ్మా
అంటఁబారి పట్టుకొంటే ఆయములు దాఁకించె
జుంటితేనేమోవు లివి చూడవమ్మా

చ. 3: కాదుగూడదనఁబోతే కాఁగిలించీ నిదె వీఁదె
ఆదెస నీదేఁటినవ్వు లవునమ్మా
సాదై శ్రీ వేంకటాద్రి సరసమాడీనమ్మా
యీాదెస మమ్మిటు గూడె నేమిచెప్పేమమ్మా

రేకు: 1615-5 ధన్నాసి సం: 26-089

పల్లవి: పదియుఁ బదియుఁగాను పతినీకె వలచెను
పొదిగి నీరమణుని భోగించవమ్మా

చ. 1: రెప్పవెట్టక చూచెను తప్పక లోఁ జింతించె
చప్పరించె దొండపండు సరి మోవెంటా
కప్పి నీ సింగారాలు కడుమెచ్చి లోనాయ
అప్పటనుండి పిలిచీ నాడకు రావమ్మా

చ. 2: తాపమున వేఁడుకొనీ తల్లినైనఁ గోపగించీ
యేపొద్దు నిన్ను వచ్చె వెదకి యెడసివుండీ
యేపున నీడకు వచ్చె నిదివో నీకుఁ గానె
పైపై నెదురుకొని పచ్చి సేయవమ్మా

చ. 3: మానుపడ్డటై వుండి మరి నీ కాఁగిట గూడీ
ఆనుకొని రాతిగుండెయై నిలిచెను
కానిమ్మని శ్రీ వేంకటపతి కొడఁబడి
డొనె పురమెక్కితి వంతదానవమ్మా

రేకు: 1615-6 శ్రీరాగం సం: 26-090

పల్లవి: ఎట్టున్నదో మీ చిత్తా లెవ్వ రెఱుఁగుదురు
జట్టిగొని యింతలోనే జాగులేఁటికయ్యా

చ. 1: మనసిచ్చి నీతోను మాటలెల్లా నాడెఁ జెలి
చనవిచ్చి యేమన్నా సమ్మతించెను
తనువిచ్చి నీయెడకుఁదగినకాఁగిటఁ గూడె
తనియ వేమిచ్చినాను తమకించేవయ్యా

చ. 2: పేరుకొని నీమీఁదిబీరపుఁ బదాలు వాడె
తేరకొని నిన్నుఁ జూచి తేలిమెచ్చెను
మారుకొని సరసాన మాఁటికి మాఁటికి నవ్వె
కోరుకొని వుంటి వింక కొసరేఁటికయ్యా

చ. 3: పులకించెఁ దనమేను పొందిన నీరతులలో
చిలికించె వలపులు చెక్కులునొక్కి
పలికించె నీవు రతిఁ బరవశమైతేను
వులికించేవు శ్రీ వేంకటోత్తముఁడ గోరను

రేకు: 1616-1 దేశాక్షి సం: 26-091

పల్లవి: వనిత జవ్వమున వసంతకాలము వచ్చె
నని చి నీవు రాకుంటే నాయముగాదయ్యా

చ. 1: పట్టపగలె యిటు పంకజాలు ముకుళించె
ఇట్టె విచారించ వీది యేలయ్యా
నెట్టన వేసవిలోన నీరు చిచ్చు గొనెఁ దీగె
పట్టి విచాంచకుంటేఁ బాపమయ్యా

చ. 2: వుండుండె యకాలాన వూరకె సేమంతి వూచె
అండనట్టె తన్నడుగ వదేలయ్యా
నిండుఁ జింద్రుఁ డుదయించె నిక్కెవు కలువ లిదె
దండి విభుఁడవు నీకుఁ దగదయ్యా

చ. 3: అద్దమరాతిరి గాకె అదె దిరిశము వూచె
సుద్దులెల్ల మాని చెలిఁ జూడవయ్యా
వొద్దిక శ్రీ వేంకటేశ వునిదఁ గూడితి విట్టె
పొద్దు పొద్దు పువ్వులు నీ పూజలయ్యా

రేకు: 1616-2 రామక్రియ సం: 26-092

పల్లవి: ఊరకే నేరుమూసుక వుండలేము చూచిచూచి
చేరి నేము చెప్పినట్లు సేయవయ్య్య నీవు

చ. 1: పాయకురమణి గాన పంతానకే పెనఁగీని
చేయివట్టి తీసినా చేరఁగరాదు
ఆయము సోఁకినమాట ఆడితే నేకేమాయ
వోయయ్య్య నీ కోపమున కోపమయ్య్య నేము

చ. 2: సిగ్గువడేసతిగాన శిర సట్టె వంచీని
వొగ్గి పేరఁ బిలిచిన నూరకున్నది
దగ్గరి నీవు పైకొంటే తగవు నీకేమీ దప్పు
వెగ్గళించేరాజసము వెఱతుమయ్యా

చ. 3: కాఁగినరమణిగాన కడు బడలియున్నది
ఆఁగి నేమేమిచెప్పినా నడ్డమాడదు
దాఁగక శ్రీ వేంకటేశ తరుణిఁ గూడితి నీవే
యేఁగుఁబెండ్లి ఆయ నేఁడు యిమ్మకొంటివయ్యా

రేకు: 1616-3 ఆహిరి సం: 26-093
పల్లవి: ఎందాఁకా జలమింక నియ్యకోవయ్యా
కందువ నీచెప్పినట్టె కానీవయ్యా
చ. 1: కోపగించఁగలందుకుఁ గోపగించితిమి మీతో
నాపనికి నింక నీతో నవ్వేనయ్యా
తీపుల నీటేఁతలకుఁ దెగి పంతాలే యాడితి
మోపిచూసి ఇఁక నీకు మొక్కేనయ్యా
చ. 2: అట్టె నీవు రానందుకు నవ్వలి మోమైతి నింతే
యెట్టు విలిచిన వచ్చే నిదిగో వయ్యా
చుట్టపువరుసలెల్లఁ జూచిచూచి సొలసితి
జట్టి నీవేమి సేసినాసమ్మతించేనయ్యా
చ. 3: అప్పు టావేగిరమున ఆన వెట్టుకొంటి నేను
యిప్పుడు లేదనవయ్యా యేమయ్యా
వొప్పుగ శ్రీ వేంకటేశ వొనగూడి కతులను
మెప్పించఁగ నే నిన్ను మెచ్చితినయ్యా

రేకు: 1616-4 కాంబోది సం: 26-094

పల్లవి: ఎవ్వనిఁ దలఁచితివే ఎక్కడే మోహించితివే
చివ్వనఁ జెప్పవే నాతో సిగ్గుపడనేఁటికి

చ. 1: చెక్కులేల చెమరించె చెలియ నీ కిదె నేఁడు
వెక్కసపుటెండలతో వేసవి రాదు
గక్కున నీమేనేల కడుఁ బులకించె నేఁడు
వక్కణింప నింక జడివానలు రావు

చ. 2: వెలువెల్లఁబారనేలే వెన్నెలబొమ్మవలె
అలరు శారదసమయంబు గాదు
పలకేనీమోవి నేల పక్కులుగట్టే నేఁడు
కలికి యిప్పుడు మంచుకాలము గాదు

చ. 3: కప్ప నేల పయ్యదను కాలమిది చలి గాదు
చెప్పలేదు వసంతము చిగిరించెను
దప్పిదేర నిటు గూడె తరగ నిన్ను నింత చేసె
యిప్పుడా శ్రీ వేంకటేశుఁ డేడనున్నాఁడే

రేకు: 1616-5 ఆహిరానాట సం: 26-095

పల్లవి: ఇంతకుమిక్కిలి మాఁట యేమియు నాడకుమనె
అంతయు నీ వెఱుఁగుదు వటమీఁదననచు

చ. 1: పడఁతి నీకుఁ గప్పురపలుకు గానుక యంపె
వడి నీ మాఁటలు నీకే వచ్చెనంటాను
తడయక మరి మొల్లదండలు నీవద్ది కం పె
నడుమనే తనపాట నవ్వులారయ ననుచు

చ. 2: పుచ్చిననీలాలదండ గొబ్బున నీకు నంపె
మచ్చిక నీచూపు నీకె మరలెనంటా
అచ్చపుబంగారుబొమ్మ నదియును నీ కంపె
యిచ్చితిఁబో తనదేహ మిదె కొమ్మనుచు

చ. 3: తోడనే చెలియ నీకు దొంతరపువ్వులు నంపె
కూడినకూకటకములకు గురుతంటాను
యీడవె శ్రీ వేంకటేశ యిద్దరుఁ గూడితి రిట్టె
వేడుక తొల్లటివెల్లా వీడుకు వీడనుచు

రేకు: 1616-6 తెలుగుగాంబోది సం: 26-096

పల్లవి: చెలులాల కోరిటు చేరి నుతించఁగ
అలమేల్మంగకు నమరినది

చ. 1: పూవుబాణములు పాదినేసె మరుఁడు
కావవి నవ్వులు కాంతవి
భావించ మందపవనుఁడు మలసెను
తావివూరు పిది తరుణిది

చ. 2: మొదల నారదుఁడు మోయించె వీణెను
అదిగాదు మాఁట లంగనవి
చదల నదివో యరసంజ వొడమె నిటు
మదరాగము లవి మానినివి

చ. 3: మెఱుఁగులు మెరచీ మింటను మేఘము
యెఱఁగలేరు కళ లింతివి
అఱిముఱితీగె మాకంటెను కా దింతి
యెఱుకల శ్రీ వేంకటేశునిఁ గూడె

రేకు: 1617-1 రామక్రియ సం: 26-097

పల్లవి: అప్పఁ జెల్లెండ్ల మింత ఆతఁడు నవ్వీ నంతనె
ఇప్పుడు వేరుగఁ జూచె విది యేమే నీవు

చ. 1: వోరగండ్లఁ జూచేది వొక్కొక్కమా టాడేది
యీరసాలువలెఁ దోఁచి నిదేమే నీవు
కేరి కేరి నవ్వేది కేరడము లాడేది
నేరుచుకొంటివి నాతో నీకేలే వొరిట

చ. 2: బొమ్మలు ముడవెట్టేది పొరపొచ్చము సేసేది
యెమ్మెల రేసులు దోఁచీ నిదేమే నీవు
దిమ్ములఁ జెమరించేది తీగెసాగె నూఁకొనేది
కమ్మరఁ గమ్మర నీకు గలిగెఁగా నేఁడు

చ. 3: ముక్కున నుసురనేది మొగము వంచుకొనేది
ఇక్కువసేఁతలు దోఁచీ నిదేమే నీవు
తెక్కుల శ్రీ వేంకటాద్రిదేవుఁ డిట్టె నన్నుఁ గూడె
వొక్కమనసున నింక నుండవే నీవు

రేకు: 1617-2 ఆహిరినాట సం: 26-098

పల్లవి: అప్పుడే యెంతకు వచ్చె నదేరా నీవు
రెప్పలు నే వంచితేనే రేసు వుట్టెఁ బనులు

చ. 1: శిరసువంచి తిట్టి సిగ్గులుమోవఁ జెనకి
అరగన్ను మోడ్చి చూచె వదేరా నీవు
గరిమ నిన్ను జొక్కించి కళలంటి యిందు మారు
సరికిసరి నవ్వితే చక్కనయ్యెఁ బనులు

చ. 2: బొమ్మల నే జంకించి పోకుండా నాసలు వెట్టి
అమ్మరో కోపమురేఁచే వదేరా నీవు
తమ్మిమోము సోఁకఁజేసి తలఁపెల్లా మరపించి
కమ్మర సూడు వట్టితే కానవచ్చీ బనులు

చ. 3: బిగువుఁగాఁగిట నించి పెదవిఁబెదవి మోపి
అగుడుసేఁతలు సేసే వదేరా నీవు
జిగిదీర నేను నట్టే శ్రీ వేంకటేశ నిన్ను
మగుడఁ గూడితి నింక మంచిదాయఁ బనులు

రేకు: 1617-3 పాడి సం: 26-099

పల్లవి: మగువ నీవే మాతో మాటలో యాడవుగాని
తగవాయఁ బనులెల్ల తనిసితి మమ్మా

చ. 1: పూచెఁ బూచె వెన్నెలలు పున్నమచంద్రుని వద్ద
రాచిలుకలందు దోఁచె రంతు వనాన
వీచె నిదె చల్లగాలి వేడుక ముంగిట నిదే
యేచి మరురాజ్యమాయ నేవి గడమమ్మా

చ. 2: కుందనపుజక్కవలు కుంకుమలే కురిసీని
ముందుముందె లతలను ముత్తేలువండె
కందువతో నాకసము గంటు వదలె నింతలో
కందువ నామని మించె గడమేఁటిదమ్మా

చ. 3: తుమ్మిదలు చెలరేఁగెఁ దొడరి యాడకాకడకు
వుమ్మడి నుగ్గుదేనియ లుట్టిపడెను
కొమ్మరొ శ్రీ వేంకటేశుకూట మిది గాఁబోలు
సమ్మతించితిమి మేము చాలదా వోయమ్మ

రేకు: 1617-4 భైరవి సం: 26-100

పల్లవి: వద్దు వద్దు బలిమి వచ్చె మాకుఁ జెలిమి
పెద్దరిక మింతే చాలు పేరడయ్యీఁ జలము

చ. 1: మాటలాడనేలరా మాణిక్యాలు రాలీని
తేటలనీకన్నుల తేలింపే చాలు
వాటము సేయకురా వలపులు మామీఁద
కూటములు చాలకుంటే కొసరలేము

చ. 2: చెక్కులు నొక్కకురా చిత్తమెల్లాఁ జిల్లులై
తక్కరితనాలయెడతాఁకులే చాలు
తొక్కకురా పాదమున తొల్లె అన్నియు నాయ
అక్కడనుండి చెలుల నంపినదే చాలు

చ. 3: నవ్వులు నవ్వకురా నారుకొన బులకించీ
వువ్విళ్లూర సంగడిఁ గూచుండుటే చాలు
రవ్వలాయ మారకపురముచెన్నరాయ నేఁడు
యివ్వల శ్రీ వేంకటాద్రి నిటు నన్ను గూడఁగా

రేకు: 1617-5 సామంతం సం: 26-101

పల్లవి: చెల్లఁ, జెల్లెఁ, బనులెల్లఁ, జేఁత లింకేలే
కొల్లలాయ వలపులు కొసరు లింకేఁటికే

చ. 1: చెక్కిఁట, బెట్టిన చేత సేసవెట్టితివి నీవు
యెక్కడా రమణి నీకు నేలే చింత
ముక్కునబుట్టినవేల ముదమంది మెచ్చితివి
చక్కనాయ, బనులెల్ల జాణతనా లేఁటికే

చ. 2: తిట్టిన పెదవిపైనే తేటనవ్వు లచె నిండె
పట్టినచలము చెల్లె బదరనేలే
కొట్టఁగొన తలులు కోరి మొదలికి వచ్చె
చుట్టువరుస మించె సోఁకనాడనేఁటికే

చ. 3: వాడిన వదనమున వడి గళలెల్లా నిండె
వేడుకలే దైవారె వేసట లేలే
కూడితి శ్రీవేంకటేశు గూరిమి గడపలోన
పాడిఁబంతాలెల్లఁజెల్లె పచ్చిసేయ నేఁటికే

రేకు: 1617-6 శ్రీరాగం సం: 26-102

పల్లవి: ఒంటి నూరకేలుందాన వోయమ్మ పతి
జంట నిన్నుఁ జేయివట్టె సంగడి నుండవమ్మా

చ. 1: అంగన నీచెక్కు లివి హరికి నద్దములమ్మ
ముంగిటినవ్వులు మంచిముగ్గు లోయమ్మా
అంగవించిననీచూపు లతనికి సొమ్ములమ్మ
పొంగారు మాటలు తేనె బోనము లోయమ్మా

చ. 2: అతివ నీ పూరుపులె ఆలవట్టము లోయమ్మ
తతి మేనిమెఱుఁగు లారతులమ్మా
మితిలేని నీకుచాలు మెత్తని యొరగులమ్మ
అతనికి నీకొను వయ్యాళి బయలమ్మా

చ. 3: తరుణి నీ కరములు తామరల పూజలమ్మ
ధర నీభావ మాతని తల పోయమ్మా
మరిగిన యలమేలుమంగవు శ్రీవేంకటేశుఁ -
డురముపై హారముగా నునిచె నిన్నమ్మా

రేకు: 1618-1 ఆహిరి సం: 26-103

పల్లవి: అందుకేపో నిన్ను తూరనాడితి మిందరిలోనా
ఇందుముఖిభావ మిది ఇఁకను నీ చిత్తము

చ. 1: చిత్తము నీపై నిలిపి చెలితో ముచ్చట చెప్పి
తత్తరించి తనమాఁట తా మరచె
కొత్తగా మోవిని నవ్వి కోపమే బొమ్మల నించి
చిత్తరు పతిమవలె చేఁతలెల్లా మరచె

చ. 2: చెప్పినసుద్దులే చెప్పీ సేసినచేఁతలే సేసి
అప్ప డేమంటినోయని అడిగీఁదానె
రెప్పల తుదల సిగ్గు రేసులై నిట్టూర్పులను
దప్పిదేరేమేనితోడ తడఁబాటుఁ బొందెను

చ. 3: అంతలోనే నిన్నుఁ జూచి అంగన కన్నీరు నించి
పంతపుఁ గారిమితో నీపై నొరగెను
ఇంతసేసె కూడితివి ఇప్పుడే శ్రీవేంకటేశ
వింతగాఁ గళలఁ జొక్కి వేడుక నలసెను

రేకు: 1618-2 దేసాళం సం: 26-104

పల్లవి: దగ్గరి ఇంకాకేల తలపోఁతలు
వెగ్గళపు మోవిఁదేనె వెల్లివిరియఁగను

చ. 1: చెక్కు చేయి ఇఁకనేలే శిరసు వంచఁగనేలే
అక్కరతోఁ బతి నిన్ను నాదరించఁగ
చక్కఁ జూడ విదియేలే చలము లింకానేలే
వొక్కటై నేమిందరము నొడఁరచఁగను

చ. 2: వాడుమోము ఇఁకనేలే వలవనిమోనమేలే
యీడనే విభుఁడు నీతో ఇంత నవ్వఁగా
ఆడుకొన నిఁకనేలే అప్పటి వేసటలేలే
యేడలేని తమకము లెద నుండగాను

చ. 3: కన్నులు ముయ్యఁగనేలే కాఁకలఁ బొరలనేలే
అన్నిటా శ్రీవేంకటేశుఁ డండ నుండఁగా
పన్నిన మాయ లివేలే పంతపు బిగువు లేలే
వున్నతపు మీమోహా లొద్దికె కూడియును

రేకు: 1618-3 శ్రీరాగం సం: 26-105

పల్లవి: కానకుంటి మిందాఁకా కంటి మాడకుఁ బోదము
కీలే అందుకేమి కళవళ మేలయ్యా

చ. 1: తొంగి చూచె నదె సీత తూరుపునఁ దమ్ముఁడా
సంగతిఁ జందురుఁ డింతె సతి గాదయ్యా
చెంగట నే వెదకఁగా జేరి నవ్వీఁ జూడరాదా
రంగగు వెన్నెల లింతే రామచంద్ర చూడుమా

చ. 2: పొంచి చేతఁ బిలిచీని పొద దండ నదె సీత
అంచెలఁ దీగె ఇంతే అటుగాదయ్యా
యెంచనేల దవ్వులను యెలిఁగించీ వినరాదా
పెంచవు నెమలి గాని పిలుపు గాదయ్యా

చ. 3: నిలుచుండి చూచె నదె నిండుఁగొలఁకులో సీత
కలువ లింతే ఆపెగాదయ్యా
కలికి శ్రీవేంకటాద్రిఁ గాఁగిలించె నిదె నన్ను
తలఁపుతో నాకె నిన్నుఁ దగిలుండునయ్యా

రేకు: 1618-4 రామక్రియ సం: 26-106

పల్లవి: పట్టకు నన్ను బలిమిఁ బదవే నీవు
అట్టె యానలు వెట్టే వదేమే నీకింత

చ. 1: కడు నిందరియెదులు కాకుగాఁ బేరెలుపున
బడి నన్నుఁ బిలువక పదవే నూవు
యెడ సెలిగతినంటా యీాడ కాతనిఁ బిలిచే
వడరి వద్దన్న మాన వదేమే నీకింత

చ. 2: మరిగిన మగవాని మాపేరు దలఁపించి
పరగ వచ్చేఁగాని పదవే నీవు
దొరచేతి నిమ్మపండు దూరుగా నా కిచ్చేవు
అరసేవు మా మనసు అదేమే నీకింత

చ. 3: గట్టున శ్రీవేంకటేశుఁ గూరిచితి విటు నన్ను
పట్టినచలము చెల్లెఁ బదవే నీవే
వొట్టి జాణతనా లొకటొకటే యాతనితోడ
అట్టె కేరుచుఁ జెప్పేవు అదేమే నీకింత

రేకు: 1618-5 శుద్ధవసంతం సం: 26-107

పల్లవి: ఊరకున్న యాఁటదాని నొరయుటెల్ల
కూరిమితో రతిసేయఁ గోరుటే కాదా

చ. 1: మాటలాడించినదే మతిలోనియాస గాదా
నాటఁజూచుటే వలపు ననుచగాదా
తేట నవ్వులే పొందుల తెరువు చూపుట గాదా
పాట వాడుటే తమి పైఁ జల్లుట గాదా

చ. 2: గక్కనఁ బొలయుటలు కాఁకలు సేయుట గాదా
అక్కరఁ గొనెట మే గుట్టరయఁ గాదా
తక్కరి జాణతనాలే తగులవేసుట గాదా
ఇక్కువఁ బేరడుగుటే ఇంపు రేఁచఁ గాదా

చ. 3: కొప్పునెరుసు దీసుటే కూడేటి భావము గాదా
యెప్పుడూ వద్ద నుండుటే ఇన్నియుఁ గాదా
వొప్పుగ శ్రీవేంకటేశ వొకటొకటే సేసి
కప్పి కలసితి విదే కడు నేర్పు గాదా

రేకు: 1618-6 బౌళి సం: 26-108

పల్లవి: వద్దు సుమీ చెప్పితిమి వాసిగల దొరవు
ముద్దు ముద్దు వలె నీకు మొక్కితినేను

చ. 1: నిమ్మపంట వేతుఁజుమ్మీ నిందలు గట్టుదుఁజుమ్మీ
యెమ్మెలకు నీవు మమ్ము నేమన్నాను
బొమ్మల జంకింతుఁ జుమీ బూతునఁదిట్టుదుఁజుమీ
చిమ్ముచు నీవేమి మమ్ముఁ జెనకినాను

చ. 2: కడకంటఁ జూతుఁ జుమీ కాఁకలు చల్లుదుఁ జుమీ
వడిగా మావెంట నీవు వచ్చితేను
కొడిమ లెన్నుదుఁ జుమీ కోపాన సాదింతుఁజుమీ
బడలివుందానఁ గొంగు పట్టితేను

చ. 3: జీరవారఁ దీతుఁజుమీసెలవి నవ్వుదుఁ జుమీ
పేరుకొని నీవు మమ్ముఁ బిలిచితేను
యేరా శ్రీవేంకటేశ యేమన్నా మానక కూడి
ఆరీతి నేలితి విఁక నట్టే అవుఁ జుమ్మీ

రేకు: 1619-1 దేవగాంధారి సం: 26-109

పల్లవి: కోపముఁ దీరినమీఁదఁ గూడేఁగాని
యీ పొద్దు కెదిరిమెచ్చు కింత చాలురా

చ. 1: సెలవి నీవు నవ్వఁగా జేరి మేను నవ్వేఁగాని
అలరి నామతినైతే నలుకలేరా
నిలిచి నీవు చూడఁగా నేనూఁజూచితిఁగాని
బలు దొరవైన నీతో బాడి గాదునా

చ. 2: మాటలాడఁగా నీతో మాటలు నే నాడేఁగాని
మాటి మాటికి నాకు సమ్మతిగాదురా
కూటమిఁ బిలువగా నే గుట్టున నూఁకొంటిఁగాని
యీటునఁ గూడినదాఁకా యెరెరవేరా

చ. 3: కాఁగిలించఁగా నిన్నుఁ గాఁగిలించేఁగాని నేను
కాఁగిన నామేనిమీఁదికాఁక చూడరా
దాఁగక శ్రీవేంకటేశ తలఁపులో చింతవాసె
ఆఁగిన నీరతిలోన నలసితిరా

రేకు: 1619-2 దేసాళం సం: 26-110

పల్లవి: ఏమని వర్ణించునొకో ఇఁకఁ బురాణములెల్ల
వేమారుఁ గొత్తలాయ విశ్వలోకపతికి

చ. 1: పాలజలనిధిలోన పలుమారుఁ దేలఁగాను
నీలవర్ణమెల్లఁ చేయి నిండుఁ దెలుపైనట్టు
మేలిమి కప్పురకాపు మేన నిండఁ నించఁగాను
పోలికె వేరొక్కటాయ పురుషోత్తమునికి

చ. 2: వేడుకఁ గాళిందిలోన వేమారు నీఁదఁగాను
ఆడనే కమ్మర నలుపైనట్టు
తోడనే తట్టుపుణుఁగు తొప్పఁదోగ నించఁగాను
జాడ వేరొక్కటాయ సర్వేశ్వరునికి

చ. 3: అలమేలుమంగ నురమందునే నిలుపఁగాను
అలరి బంగారువర్ణమైనట్టు
నలుగడ సొమ్ములతో నానావర్ణమలు
నిలిచె శ్రీవేంకటనిలయమూరితికి

రేకు: 1619-3 పాడి సం: 26-111

పల్లవి: నీడ నుండి యలసేవు నిక్కి చూచి సొలసేవు
జోడైనపతికింతాఁ జూపరాదా నీవు

చ. 1: కప్పురపుఁ బలుకులు కలికి నీ పలుకులు
ముప్పిరి జెమటవాన మోహపుసోన
చిప్పిలునీమోవితీపు చిత్తజునివింటికోపు
ఇప్పుడీ భావానఁ బతిఇంటికి రారాదా

చ. 2: జక్కవ పక్షులతీరు సతి నీవయ్యద జారు
చెక్కిట ముత్యాలముగ్గు చెలి నీసిగ్గు
చొక్కపు వెన్నెల పువ్వు సుదతి నీ లేఁత నవ్వు
చుక్కలనీపతి వద్దఁ జూపవద్దా యిపుడు

చ. 3: కామిని నీతొంగి చూపు కారుమెరుఁగులరూపు
దోమటి నీకొప్పుతీరు తుమ్మిదనారు
ఆమని శ్రీవేంకటేశు నంతలోనె కూడితివి
వేమరు నాతని మీఁద విఱ్ఱవీఁగవమ్మా

రేకు: 1619-4 దేవగాంధారి సం: 26-112

పల్లవి: హరి నిన్నుc బిలిచీన అదిగో వమ్మా
తెరమఱc గిcకనేల తియ్యవమ్మా

చ. 1: చిత్తరు పతిమవంటి చెలియా
యిత్తల పతికి విడె మియ్యవమ్మా
కొత్తమెఱుcగుc బోలిన కోమలి
మొత్తమి కూరిమిపతిమోము చూడవమ్మా

చ. 2: బంగారుబొమ్మవంటి పడcతి
అంగవించి పతితో మాcటాడవమ్మా
అంగజు శరమువంటి అతివె నీకు
నంగతన మిది యాల నవ్వవమ్మా

చ. 3: చంచుల చిగురువంటి జవ్వని
కొంచక శ్రేంకటేశుc గూడితివమ్మా
మించుcదమ్మిలోని యలమేలుమంగా
యెంచి యెద్దరును మమ్ము నేలరమ్మా

రేకు: 1619-5 శంకరాభరణం సం: 26-113

పల్లవి: ఎన్నఁడు నెఱఁగమమ్మా యిటువంటి కొత్తలు
కన్నె ముద్దరాలో కాక కాంతుని మోహనమో

చ. 1: హరి చెక్కుటద్దములయందుఁ దనరూపు చూచి
పరసతిఁ దెచ్చెనంటాఁ బతి దూరీని
అరుదుగఁ దానే నవ్వి యాకె గందవొడి చల్లె
సరివచ్చె నిదియంటా జంకించె బొమ్మలము

చ. 2: పతి కంఠమునఁ జంద్రాభరణము వెట్టి యే
సతి చంద్దవంకలంటా సాదించిని
తతిఁ దనచూపులందుఁ దామెరలై నిండితేను
రతి నాకె వేశెనంటా రమణుని దూరెను

చ. 3: కాంతుని కాఁగిటఁ దనకమ్మవాస నంటితేను
వింతవాస నేడదంటా వెరగందెను
యింతట నా శ్రీవేంకటేశుఁ డన్నీదెలుపగా
చెంత నలమేలుమంగ చేకొని తా నమ్మెను

రేకు: 1619-6 ముఖారి సం: 26-114

పల్లవి: రారాఁపు లిఁకనేల రావే నీవు
సారెకుఁ బతి విలువఁ జలమా నీకు

చ. 1: వేడుకలు దైవారె వెన్నెల నవ్వులు గారె
యేడకేడ పతిమాఁట లియ్యకొనవే
కూడుటే కావలె నొండె కోపమే కావలె నొండె
నీడనుండే యెండ దాఁకి నీకుఁ జుల్లునా

చ. 2: మొక్కిన చేతులు రాసె మెకమోటములు వాసె
యిక్కువ విభునితేఁత కియ్యకొనవే
మక్కువైయుండుట వొండె మత్సరమైయుండుటొండె
వెక్కసాలు వినయాలు వెలయించఁ జెల్లునా

చ. 3: చిత్తములు సరివచ్చె సిగ్గులెల్లా గురివిచ్చె
యెత్తి శ్రీవేంకటేశే లియ్యకొనవే
యిత్తల గూడితిరి మీరిద్దరును నొండొండె
మత్తిలి తొల్లిటిపొందు మరవఁగఁ జెల్లునా

రేకు: 1620-1 పాడి సం: 26-115

పల్లవి: చెక్కుచేయి నీకేలే చెలులతోఁ జెప్పనేలే
చక్కనివిభునితోనే జంట నుందు గాక

చ. 1: వలచిన నీకు నిఁక వాసులునుఁ జుల్లునటె
కొలఁదిగా నవ్వు సేసుకొనుట గాక
చెలిమినాటినమీద సిగ్గులునుఁ జెల్లునటె
జలిమి నాతనికంటెఁ బైకొందు గాక

చ. 2: మాట పట్టిచ్చినచోట మతకాలు చెల్లునటె
వోటైనా నందాలు సేసుకొనుట గాక
యీటున సరసమాడి యెగ్గులెంచఁ జుల్లునటె
కూటములే గురిసేసుకొను టింతే కాక

చ. 3: కాఁగిటఁ గూడినవేళ కళవళ మిఁకనేలే
వీఁగనిరతుల విఱ్ఱవీఁగుదు గాక
ఆఁగితి శ్రీవేంకటేశు నలములుమంగ నీవు
లోఁగనేలే యిన్నిటికి లోనౌట గాక

రేకు: 1620-2 వసంతవరాళి సం: 26-116

పల్లవి: మగవాఁడు తాను మానిని నేను
తగవులఁ బెట్ట నిందు తనకుఁ జోటేదే

చ. 1: నిక్కి నిక్కి తాఁజూచె నే నందుకు నవ్వితిని
యెక్కువైన రమణుఁడు యేమనీనే
వెక్కసపు నిమ్మపంట వేసె నేఁ బులకించితి
తక్కిన సుద్దులేల తడవీనే తాను

చ. 2: రమ్మని పేరఁ బిలిచేరంతున నే నూఁకొంటి
యెమ్మెలకు విభుఁడు నన్నేమనీనే
కమ్మరఁ దా సన్నసేసె కాయము నే మరచుంటి
అమ్మరో యింకా నన్నాడ జోటేదే

చ. 3: కందువఁ దాఁ గాఁగిలించె కరఁగితి నట్టె నేను
యిందుకు శ్రీవేంకటేశుఁ డేమనీనే
అంది తానె మోవి ఇచ్చె నలములుమంగ నేను
ముందవెన కించచూడ మొరఁ గిందుఁ గలదా

రేకు: 1620-3 భూపాళం సం: 26-117

పల్లవి: అప్పు డెంత చొక్కితివో అది నా మతిఁ దలఁచి
ఇప్పుడే వెరగందితి నింతలో వేగినది

చ. 1: కనకపుటందెలతో కలలోన నొకసతి
ననుపు నీ చేయి వట్టి నవ్వినది
మునుపు నీ మోము చూచి ముచ్చటెల్ల దీరనట్టె
మనసిచ్చి నీతో నొక్కమా టాడినది

చ. 2: కీలుగుంటు వేసుకొని కేలు చాఁచి నీ మీఁద
వలవేసి వలుల నొరగినది
పోలించి నీకుఁగాఁ బూనుకవచ్చొకతెతో
ఆలరితనా వాదులడిచినది

చ. 3: కాఁగిలించి నీ మేను కరఁగించి తాఁ గరఁగి
పాఁగిన మై చెమటలఁ బరగినది
దాఁగక శ్రీవేంకటేశ తతి నదె నిక్కలాయ
ఆఁగి పురాన నాకె అలమేల్మంగయినది

రేకు: 1620-4 మధ్యమావతి సం: 26-118

పల్లవి: ఔలేరా గుణము అలిగిన వానివలె
తేలించె తమకము తెలిసెఁబో నాకును

చ. 1: సుద్దులు చెప్ప వదేర సారిది నీమోవి మీఁద
అద్దిన కెంపులు రాఁగీనని యంటానో
అద్దొ కన్నులఁ జూచి ఆదరించ వదేర
నిద్దుర కన్నుఁగొనల నిండెనంటానో

చ. 2: దగ్గరి కూచుండవేర తగు వింతవాసనలు
బగ్గన నా మీఁద నిట్టె పారీనంటానో
సిగ్గునఁ దలవంచేవు చెల్లఁబో నీవిదియేర
అగ్గలపు మోము కళ లవి గనేనంటానో

చ. 3: కాఁగిలించవదియేర గక్కున నేఁ గూడఁగాను
కాఁగిన నీమేని కాఁక గనేనంటానో
వీఁగక శ్రీవేంకటాద్రి విభుఁడ కూడితి రతి
మాఁగిననే నలమేలుమంగ నంటానో

రేకు: 1620-5 సాళంగనాట సం: 26-119

పల్లవి: పురుషులలోనెల్లా పురుషోత్తముఁడు వాఁడె
తిరుతేరు మీఁద నేఁగీ దేవదేవోత్తముఁడు

చ. 1: చెక్కులు మెరవఁగాను సేసముత్యాలు రాలఁగా
యెక్కువైన తేరమీఁద నేఁగీవాఁడె
క్కువలు గరఁగుచు యిరుమేల నొరగుచు
చిక్కని నవ్వులు నవ్వీ చెలులతో వాఁడె

చ. 2: నిమ్మంట వేసుకొంటా నిక్కి నిక్కి చూచుకొంటా
యెమ్మెలకుఁ దేరిమీఁద నేఁగీ వాఁడె
తమ్ములము సారెఁ జేసి తగవల్లెవాటువేసి
చెమ్మఁజెమట గందాలఁ జెలరేఁగీవాఁడె

చ. 3: అలయుచు సొలయుచు నలమేలుమంగఁ గూడి
యెలమిఁ దిరుతేరుపై నేఁగీ వాఁడె
బలిమి శ్రీవేంకటాద్రిపతి యీ పెండ్లికొడుకు
నిలువుఁ జక్కఁదనాన నిండుకొనీ వాఁడె

రేకు: 1620-6 శంకరాభరణం సం: 26-120

పల్లవి: వద్దు వద్దు మాతో వాదులుఁ బోదులు
పొద్దు వోయ నీకుఁ బోరాదా

చ. 1: పట్టకు పట్టకు పయ్యద దొలఁగీ
అట్టె వుండి మాఁటలాడు నాతో
నిట్ట చూపు చూచి నీవేల నవ్వేవు
పొట్టఁ బొరుగునఁ బొద్దు వోదా

చ. 2: పిలువకు మమ్ముఁ బెను వేసటయ్యీ
నిలిచతేఁ జాలు నీ వెదుట
నిలిగి నిలిగి నీవేల దూరేవు
యెలమి నీకెప్పు డిదే పనా

చ. 3: నొక్కకు నాచెక్కు నునుగోరు నాఁటీ
మొక్కినంతెచాలు మున్నునీవు
యెక్కుడు శ్రీవేంకటేశ కలసితి
యిక్కువ మొఱఁగులు యిఁకనేలా

రేకు: 1621-1 దేశాక్షి సం: 26-121

పల్లవి: ఇందాఁకాఁ బొడగాన మిటువంటివి
ఇందిరారమణి భావ మిప్పుడే సొంపెక్కెను

చ. 1: మగువ నెమ్మోము తామరపువ్వు వికసించె
తగు విభుఁడనే సూర్యోదయవేళను
నిడిడి నెన్నడుమనే నెమలియుఁ జెలరేఁగె
మిగుల విభునికాంతి మేఘోదయమున

చ. 2: సతి కనుఁగవలనే చకోరములు నిక్కె
అతనిసన్న వ్వువెన్నెలలామనివేళ
జతనాన పిరుఁదనే సైకతము నీరుపట్టె
రతి రమణుని కృపారసవేళను

చ. 3: అంగనదేహవల్లి అంతయునుఁబులకించె
రంగగు శ్రీ వేంకటేశురతివేళను
ముంగిట చెలి చెమటముంగారు లవెముంచె
అంగజసాములచేత నలసినవేళను

రేకు: 1621-2 మంగళకౌసిక సం: 26-122

పల్లవి: ఎక్కడ పరాకుసేసే వేఁటి సుద్దులు చెప్పేవు
చెక్కు చేయి దీసి యిట్టె సేస చల్లరాదా

చ. 1: ముంమణిదంతములు మెరువఁగ మాటలాడీ
చెంచెలాక్షి నీతోడ సారెసారెకు
వంచిన మోవితేనె వడియఁగా నవ్వు నవ్వీ
యించుకంత చెలిదిక్కు యిటు చూడరాదా

చ. 2: కమ్మఁ దామెరలవంటి కరములు చాఁచిచాఁచి
కొమ్మ నినను సన్నసేసీఁ గూరిమితోడ
వుమ్మ పన్నీటి చెమట నుసురసురనుకొంటా
దిమ్మరేచీ వలపులు దిష్టించరాదా

చ. 3: పచ్చని తీఁగెలవంటి బాహుమూలముల నిన్ను
పుచ్చి కాఁగిలించి పట్టీ కోమలి నేఁడు
ఇచ్చెరిఁగి శ్రీవేంటేశ కూడితివి ఇట్టె
ముచ్చటసిగ్గిఁకనేల మోము చూపరాదా

రేకు: 1621-3 ఆహరి సం: 26-123

పల్లవి: ఎక్కడౌతా నెఱఁగదు ఇంతి నీమీఁది యాసల
చెక్కులెల్లఁ బులకించె చెల్లఁబో నీవలపు

చ. 1: గుబ్బలపై పట్టుంచుకొంగు జారుతెఱఁగదు
అబ్బురపడి మాటాడీ అప్పటి నీతో
గొబ్బున సంపెఁగలకొప్పు వీడు తెరఁగదు
నిబ్బరాన నవ్వీ చెలి నిండెఁబో నీ వలపు

చ. 2: చెమట కస్తూరి బొట్టు చెదరిన దెరఁగదు
తమకాన నిన్నుఁ జూచీ తప్పక మోము
జమళివడ్డాణము జారినది యెఱఁగదు
కొమరె నీమాట విని కూడెఁబో నీవలపు

చ. 3: అందెలు దిక్కుల గల్లురనే దది యెఱఁగదు
ఇందుముఖి కాఁగిలించీ ఇంపురతుల
విందుగఁ గూడితివి శ్రీవేంకటేశ మాసతిని
ముందువెన కెరఁగదు ముంచెఁబో నీ వలపు

రేకు: 1621-4 రామక్రియ సం: 26-124

పల్లవి: మించి దేవాంగన లిట్టె మెచ్చేరమ్మ
యెంచ నలమేలుమంగ యెంతదానవమ్మా

చ. 1: మాటలనే వూరడించి మచ్చికలఁ బొద్దు వుచ్చి
నీటునఁ జతిఁ దేలించ నేరుతువమ్మ
పాటలనే కరఁగించి పంతములు మరిగించి
చాటువ నాతనిఁ గూడ జాణవమ్మా

చ. 2: నగుతానే రప్పించి నటనల మెప్పించి
తగుఁబతి దక్కఁగొన దంటవమ్మా
పగటుల భ్రమయించి బడినుండే వలపించి
చిగిరించి జేయఁ బతిచిత్తము వత్తువమ్మా

చ. 3: కాఁగిటనే చొక్కించి కందువల మొక్కించి
ఆఁగి పతియురమెక్కే వప్పుడే యమ్మ
పాఁగిన శ్రీవేంకటేశు పట్టపురాణివి నీవు
నీఁగని వేడుకతోఁచ నీవారమమ్మా

రేకు:	1621-5 ముఖారి సం:	26-125

పల్లవి:	ఇంత చాలదా నాకు యిందరిలో రమణుఁడ
	సంతసాన నీకు మొక్కే సరసుఁడ విందుకు

చ. 1:	చింతలన్నియునుఁ బాసె సిగ్గు లన్నియునుఁ దేరె
	ఇంతలోనే విభుఁడ నీ వేడకు రాఁగా
	మంతనాలు సరివచ్చె మర్మములన్నియుఁగొచ్చె
	దొంతులైన మాటలు నాతో నాడఁగాను

చ. 2:	కపట మింతయుఁ బాసె కాఁకలెల్ల చల్లనారె
	ఇపుడు నా చెక్కు నొక్కి యెనయఁగాను
	తపమెల్లా ఫలిఇంచె తలఁపులు సరిగూడె
	అపురూపముగ నాతో నంది నవ్వఁగాను

చ. 3:	వలపులు దైవారె వాడికెలు తుదమీరె
	వెలయ నాపై చేయి వేయఁగాను
	కలికి శ్రీవేంకటేశ కాయము లొక్కటి యాయ
	సొలపు రతుల నన్నుఁ జొక్కించఁగాను

రేకు: 1621-6 కాంబోది సం: 26-126

పల్లవి: ఒయ్యనే దగ్గరరమ్మ వూడిగపుసతులు
అయ్యో విసరరమ్మ అలశున్నవాఁడు

చ. 1: మెఱయుఁజెమటలతో మెత్తని పరపు మీఁద
వొఱగి పవ్వళించినాఁ డొత్తగిలి
జఱయుమాటలతోడ చాఁచిన పాదములతో
గుఱియైన సతులతో గోవిందరాజు

చ. 2: తెల్లని కన్నులతోడ తేనె గారుమోవితోడ
చెల్లుడిఁ బవ్వళించె శేషునిమీఁద
వెల్లిగొను వూర్పులతో వెన్నెల నవ్వులతో
కొల్లవలపులు చల్లీ గోవిందరాజు

చ. 3: బొడ్డు వూప కొడుకుతో పుక్కిటి వీడెము తోడ
వొడ్డిన రతులలోన నోలలాడీని
వెడ్డువెట్టి కూడెను శ్రీవేంకటేశుఁ డింతులను
గొడ్డువోని వరముల గోవిందరాజు

రేకు: 1622-1 రామక్రియ సం: 26-127

పల్లవి: ఏమీఁ దన్నుఁ దడవము ఇదివో తాను
సామాన నుండిన నాతోఁ జలమా తాను

చ. 1: వొద్ద వచ్చికూచుండేది వూరకైనా నవ్వేది
వద్దన్నా మానఁ డిదేఁటి వలపే తాను
సుద్దులు చెప్పవచ్చేది చూపులఁ దేలించేది
చద్దికి వేఁడికి నాతోఁ జలమా తాను

చ. 2: పువ్వులు పైఁ జల్లేది బొమ్మల జంకించేది
యెవ్వరి ముందరనైనా నిదేమే తాను
రవ్వగాఁ బేరుకొనేది రమ్మని చేయివట్టేది
జవ్వనులతోడ నింతచలమా తాను

చ. 3: గక్కనఁ గాఁగిలించేది కప్పుర మియ్యవచ్చేది
అక్కర నిన్నిటా జాణఁడౌనే తాను
యెక్కువ శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁగూడె
జక్కవకుచము లంటీఁ జలమా తాను

రేకు: 1622-2 సామంతం సం: 26-128

పల్లవి: తడవాయ నేము వచ్చి తతి వచ్చెఁ జెలియకు
కడుదక్కె రావయ్య్య కాంతభాగ్యములు

చ. 1: పూచెను జవ్వనము పొలఁతి మైపులకల
కాచెను నిమ్మపండ్లు ఘనకుచాల
వాచవుల దొండవండు వడిఁ జండెఁ గెమ్మోని
చూచివత్తురావయ్య్య సుదతి భాగ్యములు

చ. 2: పలికెఁ జిలుకలు పడఁతి మాటలలోనె
తొలఁకెఁ జల్లని గాలి దొమ్మి వూర్పుల
వలపుల కందువల వసంతకాలము వచ్చె
తెలిసివత్తు రావయ్య్య తెరవ భాగ్యములు

చ. 3: చెమటల కొలఁకులు చెలిమేన దైవారె
తమి నవ్వువెన్నెలలు దట్టమాయను
అమర శ్రీవేంకటేశ అంగనఁ గూడితి విట్టె
రమియింతు రావయ్య్య రమణి భాగ్యములు

రేకు: 1622-3 బౌళి సం: 26-129

పల్లవి: ఎంత చెప్పినా మానవు ఇది యేఁటికే
వింతసేసి రమణుని వెంగెమాడ నేఁటికే

చ. 1: చెక్కునొక్కి నీవు బుద్ధి చెప్పరాదా తొలుతనె
ఇక్కడ నాతని తప్పు లెంచనేఁటికె
చక్కనిపతిని నీవు జంట వాయకుండరాదా
నిక్కిచూచి నేఁడతని నిందలాడ నేఁటికే

చ. 2: ఆయమంటి మొదలనే ఆనవెట్టించుకోరాదా
వాయితప్పి యిప్పు డిఁక వాదు లేఁటికే
చేయివేసి కాఁగిటనే చిక్కించుకొనరాదా
బాయిటికిఁ దీసి వేరె పగచాటనేఁటికే

చ. 3: యెదుట శ్రీవేంకటేశు నిన్నియు నడుగరాదా
అదన నాతనిపై వేగంపనేఁటికే
వుదుటురతులఁ గూడి వొక్క బుద్ధినుండరాదా
అదివో వురమెక్కియు ననుమేఁటికే

రేకు: 1622-4 ముఖారి సం: 26-130

పల్లవి: వనిత నిన్నిటా నీవు వహించుకోక పోదు
వెనక ముందరి కిదె విన్నపము సుమ్మీ

చ. 1: జవ్వన భారమెల్లా సతికుచముల నిండె
మువ్వంక విభుఁడ నీకు మోవక పోదు
చవ్వన మోహరసాలు చెమటలై దైవారె
పువ్వవిఱ్ఱూరుచు నీకు నోలలాడవలసె

చ. 2: కామాని కోరికెలెల్లా కనుచూపులై మెఱసె
దీమసాన నాది నీవే తీర్చక పోదు
ఆమనిగుణాలు మోవియందుఁ దేనెలై వుబ్బె
గోమున నీవిది చవిగొనక పోదు

చ. 3: పొంచిన తమకములు పులకముత్తెములాయ
యెంచి నీమై నని సింగారించక పోదు
చంచుల శ్రీవేంకటేశ సతిఁ గూడితిని యిట్టె
కంచపు పొత్తులు మీకు కలయఁగఁ గలిగె

రేకు: 1622-5 సింధురామక్రియ సం: 26-131

పల్లవి: ఇందరు బుద్ధులు చెప్పే దిందాఁకానే
కందువఁ గూడితి రిదె కాఁక లిందాఁకానే

చ. 1: యేఁటి కిఁకి మాఁటలు యెదురైతి రిద్దరు
గాఁటపుటలుకలు దగ్గరుదాఁకే
నాఁటెఁ దొల్లె మోహము నవ్వులఁ బొద్దు గడప
చోటులేదు చలములు సోఁకినందాఁకానే

చ. 2: వొద్దు వొద్దు కొసరులు వొక్కటైతి రిద్దరును
సుద్దులెల్లా మేనులు సుక్కుకాఁకానే
కొద్దిమాలె కోరికెలు కొంకులుఁగొసరు లిఁక
పొద్దు లేదు పంతములు పొందినందాఁకానే

చ. 3: చాలు చాలు సిగ్గులు సమ్మతైతి రిద్దరును
తేలింపులన్నియు మీలో తేరుదాఁకానే
ఆలరి శ్రీవేంకటేశ అలమేలుమంగానీవు
వేళతోఁగూడితిరి యీవేడుకౌదాఁకానే

రేకు: 1622-6 సాళంగం సం: 26-132

పల్లవి: నీ వెఱఁగనివి లేవు నెఱజాణవు
మోవితేనె కడునైతే మొగచాటౌనయ్యా

చ. 1: దగ్గరి కూడుట కంటె తలపోఁతలే ఇతవు
వెగ్గళమైతేఁ గాదు విడువవయ్యా
సిగ్గుతో నవ్వుటకంటే చిమ్ముఁదిట్టులే యితవు
బక్కన నీకు మొక్కేము పదరకువయ్యా

చ. 2: యెనసివుండుటకంటే యెరవెరవే యితవు
పనిలేదు పెనఁగక పదవయ్యా
తనిసి మాటాడుకంటే దవ్వులమాఁటే యితవు
కొనకెక్కె వలపులు కొసరకువయ్యా

చ. 3: కాఁగిట నిద్రించుకంటె కాఁకఁ బొరలు టితవు
తోఁగితిఁ జెమటలచే తొలవయ్యా
వీఁగక శ్రీవేంటాద్రి విభుఁడ కూడితి విట్టె
దాఁగ విఁక వేడుకలు దక్కితి నోయయ్యా

రేకు: 1623-1 శంకరాభరణం సం: 26-133

పల్లవి: ఎంతైన మాన వివి యేమి సేతునే
వింతల నాలోని గుట్టు వెళ్లవేసీఁబాయము

చ. 1: మనసులోపలి మాట మతిలోనే దాఁచితేను
తనువునఁ జెమటలై దైవారీనే
మునుకొన్నసిగ్గులెల్ల మోవిపై నణఁచితేను
వెనక నవ్వువెన్నెలై వెల్లి విరిసీనే

చ. 2: గక్కనఁ గోరికలెల్ల కాయములో దాచితేను
చిక్కుల పులకలై చిగిరంచీనే
మక్కువనా వలపులు మరుగునఁబెట్టితేను
చిక్కని నిట్టూరుపులై చేగలు దేరీనే

చ. 3: తమకములకుఁ గాక తలవంచుకొంటేను
జమళిఁ బరవశమై జాజు కొనీనే
అమరి శ్రీవేంకటేశుఁ డంతలోనె కూడఁగాను
గములైన సంతసాలు కళలు మీరీనే

రేకు: 1623-2 సాయంతం సం: 26-134

పల్లవి: ఆసోదపుదాననన్నా నంటివిగాని
పాసి వుండలేఁ జుమ్మీ పాయకుందు గాని

చ. 1: సారె నీతో మాటలాడి చాలించఁ జాల నేను
తేలించి యొక్కమాఁటే తీతుఁగాని
ఆలించి నీతోడి నవ్వు అలసియు మానలేదు
కేలిఁ దలఁచి తలఁచి కేరుదుఁగాని

చ. 2: తగిలి నీవద్దనుండి తనియెదు నా మనసు
సొగిసి నీమోము సారెఁ జూతుఁగాని
బిగువుఁగాఁగిట నిన్నుఁ బెనఁగియుఁ దమివోదు
అగవ డప్పటప్పటి కప్పళింతుఁగాని

చ. 3: గక్కన నీరతిఁ జొక్కి కంటికి నిద్దుర రాదు
పెక్కు రతిబంధములఁ బ్రేరేఁతుఁగాని
ఇక్కువ శ్రీవేంకటేశ ఇట్టె యెంత గూడినాను
అక్కరై నీమోవితేనె కాస గింతుఁ గాని

రేకు: 1623-3 ముఖారి సం: 26-135

పల్లవి: అంత మమ్ముఁ జెనకు మందుకేమి
ఇంత నీతోఁ జెప్పనేల ఇప్పు డందుకేమి

చ. 1: వాములుగా బొంకనేర వట్టివంతా లాడనేర
ఆమాటే మఱవకు మందుకేమే
నీ మచ్చము లెంచ రాము నిన్నుఁ దడవఁగరాము
ఆముకొని మమ్ము నవ్వే వందుకేమి

చ. 2: తప్పులు వట్టఁగనేల తారుకాణించఁగనేల
అప్పుడే చెప్పేఁగాని అందుకేమి
రెప్పలెత్తి చూడవద్దు రేసులు పుట్టించవద్దు
చప్పఁ జేసేవు వలపు సారె నందుకేమి

చ. 3: కొంగువట్టి తియ్యలేదు కూరిమి గొసరలేదు
అంగవించి కాఁగిలించే వందుకేమి
రంగగు శ్రీవేంకటేశ రవ్వసేయ నిఁకనేల
యెంగిలి సేసితి మోవి యిఁక నందుకేమి

రేకు: 1623-4 దేవగాంధారి సం: 26-136

పల్లవి: పిలువరే కృష్ణుని పేరుకొని యింతటాను
పొలసి యారగించే పొద్దాయ నిపుడు

చ. 1: వెన్నలారగించఁబోయి వీదులలోఁ దిరిగీనో
యెన్నరాని యమునలో యీఁదులాడీనో
సన్నల సాందీపనితో చవఁగబోయినాఁడో
చిన్నవాఁడాకలి గొనె చెలులాల యిపుడు

చ. 2: మగువల కాఁగిళ్ల మఱచి నిద్దిరించీనో
సొగిసి యావులఁ గాచే చోట నున్నాఁడో
యెగువ నుట్లకెక్కి యింతులకుఁ జిక్కినాఁడో
సగము వేఁడికూరలు చల్లనాయ నిపుడు

చ. 3: చెంది నెమలి చుంగుల సింగారుంకొనీనో
ఇందునే దేవరవలె ఇంటనున్నాఁడో
అందుపు శ్రీవేంకటేశుఁ డాడివచ్చె నిదె వీఁడె
విందుల మాపొత్తుకు రా వేళాయ నిపుడు

రేకు: 1623-5 సామంతం సం: 26-137

పల్లవి: ఆకె నీకే తగు సమరుఁ బొడ్లికి
పోఁక ముడిచితిమి పొలఁతికి నేము

చ. 1: కొండల వంటివి కోమలి కుచములు
బండగు రాలురప్పులుఁ గావు
దండనే నెమ్మోవు తామెరవంటిది
గుండుమూఁకరేకులవలెఁ గాదు

చ. 2: మెలుఁతనెరిఁదురుము మేఘము వంటిది
అలరు గాలిగొట్టది గాదు
చెలవపు నడుమిది సింహమువంటిది
పొలసి అడవిఁగాఁపురమటు గాదు

చ. 3: సతిమేను మెఱుఁగు చాయ వంటిది
తతితో మెరిచటు దాఁగదు
యితవగు శ్రీవేంకటేశ యీ చెలికిఁ
బతివై కూడితివి పలుకెడగాదు

రేకు: 1623-6 శంకరాభరణం సం: 26-138

పల్లవి: ఏమిగట్టుకొంటి వింతి యేమనె నిన్ను
తామసించక నీ బాస తలఁచుకోరాదా

చ. 1: యింటికిఁ బిలువవచ్చె యిటు నీవు రాకుండఁగా
వెంటనే కోపము మాని విచ్చేయరాదా
నంటున నీ మోము చూచి నవ్వునవ్వెనిదె యాకె
దంటతనమునఁ గొంత తలయెత్తరాదా

చ. 2: కన్నులఁ దప్పక చూచీఁ గాంత నీ వూరకుండఁగా
పన్ని నీవే యెదురేఁగి పైకొనరాదా
మిన్నకైనా నీ మీఁద మెలపు మాటలు చల్లీ
వున్నతి నీ వందుకెల్లా నుత్తరువీరాదా

చ. 3: గక్కనఁ జెలియ నిన్నుఁ గాఁగిలించె ముందుముందె
చెక్కునొక్కి యీచనవు చెల్లించరాదా
మక్కువ శ్రీవేంకటేశ మంకుదేరి కూడె నాకె
అక్కడ మీముచ్చటలే యాడుకొనరాదా

రేకు: 1624-1 ఆహిరి సం: 26-139

పల్లవి: అంటివా తన్నేమైనా నావగింజంతైనా మాట
కంటిచూపు తాఁ జూచె కన్నులలో నున్నవి

చ. 1: ఆయలేవే తనమాట కందాలు చెప్పఁగవచ్చీ
చాయసేసుకొన్నఁ బోఁడు సాదించీని
చేయారఁ దనమేనిచిన్న లివె చేనిపంట
కోయిలకాలే చెప్పీఁ గోప మేఁటికనవే

చ. 2: పోనీవే తనుఁదానె పొగడీఁ దన నిజము
మానేనన్నాఁ బోనీఁడు మళ్లఁదీసీని
అనలేలే తనగుణ మదె గొండంటి మెత్తన
నానఁగానే కానవచ్చీ నయమైతేఁగనక

చ. 3: కద్దులేవే తనకాఁక కాఁగిటనే చూపవచ్చీ
వొద్దన్నా మానఁడు నాపై వొళ్లు వేసీని
వొద్దికె శ్రీవేంకటేశుఁ డొనగూడె తననేర్పు
తిద్దనేల నీరుకొలఁది తామెర గాదా

రేకు: 1624-2 రీతిగౌళ సం: 26-140

పల్లవి: ఇతవైనప్పుడే పతి యీడకు వచ్చీఁగాని
చతురుని నిందుకుఁగా జంకించనోపనే

చ. 1: చనపుగల్గుమాట చక్కనై యిన్నిటాఁ జెలులు
మనసెసనిన పొందు మఱపుఁ గాదు
ననుపులేనిచోట నగవులకైనాను
పెనఁగితేఁ జలమెక్కు పిలువ నేనోపనే

చ. 2: ముసిపి దీరనిచోట మోనమైనా నింపులే
సుసరమయిన చోటి సుద్దులే చని
కసిగాటు మోహముతో కలగంప వలపులు
పిసికితేఁ బుసురౌను పిలువ నే నోపనే

చ. 3: చేరి సరసపు వేళఁ జేసినదెల్లాఁ జేఁత
యీరీతి శ్రీవేంకటేశుఁ డిటు గూడెను
పూరకే యిట్లఁ గాక వొకరీతి నైతేను
పేరుకొని సారెసారెఁ బిలువ నేనోపనే

రేకు: 1624-3 హిందోళవసంతం సం: 26-141

పల్లవి: సింగారరసములోనఁ జీకాకులేలే
అంగన నీవే నేను అనుమాన మేలే

చ. 1: మాణికాల పెట్టెవంటి మగవ నీనోర నన్ను
జాణనిష్ఠూరా లిన్నేసి చల్లఁదగదే
ఆణిముద్యాల చిప్పలయంతలు గన్నుల నన్ను
రాణించు వేఁడిచూపుల రమణి చూడకువే

చ. 2: చెల్నిచందురువంటి సతి నీ మోమున నన్ను
చల్లు వెడబొమ్మలను జంకించనేలే
యెల్లగాఁ జిగురువంటి వివిగొ నీ కరములు
వెల్లవిరిగాఁ బట్టితే విదిలించనేలే

చ. 3: బంగారువోపరివంటిపడఁతి నీ కాఁగిటిలో
చెంగలింపు సిగ్గులనే చీఁకటు లేలే
రంగగు శ్రీవేంకటాద్రిరాడఁడఁ గూడితి నిన్ను
ముంగురల నీలాలముసుఁ గింకనేలే

రేకు: 1624-4 దేసాళం సం: 26-142

పల్లవి: పట్టకువే చలమింత పైపై నీవు
యెట్టయిన నీవు నేను యిద్దరము నొక్కటే

చ. 1: చూడకువే వాఁడిచూపు చురుకనీ నా మనసు
అడకువే వేఁడిమాఁట ఆయమంటీని
యేడనైనఁ గర్మఫల మెదిరికిఁ జేసినంత
తోడనే మరలివచ్చు దోసమిది వలెనా

చ. 2: దాఁచకువే నీ గుణము తమకించీ విన్నదాఁక
కాఁచకువే కుచయుగముల కాఁకరేగీని
యేఁచకు ముయికి మఱ యేడనుండినాఁ బోదు
రేఁచినదే వమ్ము సేసీ రిచ్చల యీమాయ

చ. 3: నవ్వకువే నీవు నన్ను నాఁగువారీ వలపులు
దవ్వులఁ జేయి చాఁచకువే తతి వచ్చెను
యివ్వల నిన్ను శ్రీవేంకేశుఁడఁ గూడితి నిట్టె
జవ్వనము నీకు నాకు సరియే యీతగవు

రేకు: 1624-5 ఆహిరినాట సం: 26-143

పల్లవి: చలువకు వేఁడికిని సరి సరి యింతేకాక
అలయించి మీఁది పొందు లవియేలే నాకు

చ. 1: పిలిచినప్పుడు రాక బిగిసి వెనక వచ్చి
యెలమిఁ బైకొనఁగా నదేఁటికే నాకు
తొలుత రాళ్లవేసి తోడఁ బూవుల వేయఁగ
కలదా అందేమైన కానీవే తాను

చ. 2: నవ్వినప్పుడు నవ్వక నాతో మర్నాఁడు వచ్చి
ఇవ్వల సరసమాడీ నేఁటికే నాకు
నెవ్వగా నీరువట్టైతే నేయి చేతికివచ్చి మరి
అవ్వలఁ బన్నీరిచ్చితే అనునౌనా తాను

చ. 3: చూపులనే కరఁగక సోఁకులఁ గాఁగిటఁ గూడా
యేపునఁ గరఁగఁగా నదేఁటికే నాకు
పైపై శ్రీవేంకటాద్రి పతితో నే నొక్కటైతి
కోపాన నేనంటి నింతే కొసరేలే యిఁకను

రేకు: 1624-6 భైరవి సం: 26-144

పల్లవి: మేలు మేలే జవ్వని మెచ్చితిఁ బో నిన్నును
తాలిమిఁ దెలిసెఁగాక తారుకొణ లేఁటికే

చ. 1: కప్పర మిచ్చె నంటివి కాఁకరేఁగె నంటివి
యెప్పటి కెప్పటి మాఁట యేది నిజమే
రెప్పలు మూసితివి రేసులుఁ జేసితివి
గుప్పిటి నీ వలపులు కొలఁదెంచఁగలనా

చ. 2: కాలుఁ దాకించితివి గక్కన మొక్కితివి
యేల నీ కింత పగటు యేమందమే
యీలీల నీకు గొణఁగు యిందులోనే సణఁగు
లేలే నీ సుద్దు లివి లెక్కవెట్టవసమా

చ. 3: చెఱఁగూ బట్టితివి సేసాఁ బెట్టితివి
యెఱిఁగిన నీ చనవు నియ్యకొంటినే
మెఱయ శ్రీవేంకటాద్రి మేఁటినై నిన్నుఁగూడితి
తఱి నీ చేఁతకుఁజేఁత తతివచ్చెఁ గదవే

రేకు: 1625-1 పళవంజరం సం: 26-145

పల్లవి: అందుకే తా నెగ్గువట్టీ నంతేకాక
పొందిన పతికి మీరే బుద్ధి చెప్పరమ్మా

చ. 1: కోపగించితినటనే కొంగవట్టి తియ్యఁగాను
వోపనంటాఁ బెనఁగితి నూరకే నేను
పైపైఁ దిట్టితినటే వచ్చిమాట లాడఁగాను
కోపులఁ బెదవులనే గొణఁగితిఁ గాక

చ. 2: కైకోనటవే నేను గబ్బితనాల నుండఁగ
ఆకడ నే నవ్వలి మోమైతిఁ గాక
జోకఁ దాఁ బిలిచినట్టి చోటికి రానటే నేను
యేకతానఁ దా నుండఁగా ఇంట నుంటిఁగాక

చ. 3: కూడివుండనటే నేను గొబ్బున నుమ్మగించఁగా
వాడు వాకిటికేఁగి వంతనుంటిని
వేడుక శ్రీవేంకటాద్రివిభుఁడు నన్నిటు గూడె
పాడిపంతా లెఱఁగనా భ్రమసితిఁ గాక

రేకు: 1625-2 పాడి సం: 26-146

పల్లవి: ఓపమే చాలును యింతకోపమే నేము
చేపట్టి యిద్దరి సరిసేసీ దాను

చ. 1: పడఁతిపైకోపాన పతి నేమైనా నందు
అడరి నిష్ఠూరిఁ జేయకురే నన్ను
ముడికాఁ డిద్దరిమీఁద మొకమోటమే తనకు
అడఁచీనా యిద్దరివా దాడకేలే నేను

చ. 2: పట్టకురే నన్ను మీరు పలుమారు రమ్మనుచు
అట్టె సవతివద్ద నాతఁ డున్నాఁడు
ఇట్టె కల్లఁగకలిగితే యెవ్వరిఁ గోపించలేదు
అట్టిట్టు విభుని కెదురాడఁ దతి గాదు

చ. 3: అంత గలితే మీరు ఆకెను రాకుండఁజేసి
చెంతలఁ దోడుకరారే శ్రీ వేంకటేశు
యితలో నా ఇంట నుండె యీతఁడిదెనన్నుఁగూడె
వింతసతులఁ గుంటేను వేసటయ్యీ నాకు

రేకు: 1625-3 భైరవి సం: 26-147

పల్లవి: పట్టివిడిచినమాట పడితాళించె నిదివో
యిట్టె నోరారుతువు నీ వెందరినైనా

చ. 1: చాలులేరా నేఁడె నాకు సరివచ్చె నామతికి
కాలమందే నమ్మినట్టి కల్ల గలదు
కోలగాచి పందెమాడి కోపగించఁ జాలఁగాక
వోలి నీవురాన సతి వున్న దది గాదా

చ. 2: కద్దు లేరా నావొళ్లి కల్లలే నీ వేమి సెతు
వొద్దఁ గాచుకుండకుంటే వూరకుందురా
చద్దికి వేఁడికి వాదు చవిగాదనుచుఁగాక
అద్దివో నీ వీఁపు మీఁద నంగన గాదా

చ. 3: తగులేరా నీకు నాకు తారుకాణించఁగ నేల
మొగమోట నున్నదే నా మోసము గాదా
నగుతా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి నేఁడు
నిగిడి నీ శిరసుపై నేనే కాన

రేకు:	1625-4 భైరవి	సం:	26-148

పల్లవి:	ఆతనితలఁపు గంటి రంత చాలదా నేఁడు
చేతిచెక్కతోడ వట్టి చింతనకేలమ్మా

చ. 1:	వీడెమిచ్చెఁ జాలదా వేగించితే నేమాయ
తోడ మాటలాడకుంటే దోసమా యేమి
వాడికాయ సందడినే వలపింత చాలదా
సూడుఁబాడు పంతాలకుఁ జోటేదమ్మా

చ. 2:	ఆలనైతిఁ జాలదా అలిగుంటే నేమాయ
కాలుదొక్కని దొక్కటే కడమింతే పో
వేలు వెట్టి యిమ్మగొనె వెనకకే చాలదా
నాలుక బెల్లాలు చూపె నాయము గాదమ్మా

చ. 3:	యింటికివచ్చెఁ జాలదా యేడ నున్న నేమాయ
వొంటి మోవి పిప్పెయిన దొక్కటె కాక
అంటి పట్టి శ్రీవేంకటాద్రిపతి నన్నుఁగాడె
వెంటఁ బాయలే మిఁక వెలితి లేదమ్మా

రేకు: 1625-5 సాళంగనాట సం: 26-149

పల్లవి: వేళలేదు పొద్దులేదు వేగిరించీని
వోలవేసీఁ జూపులనే వూరకున్న మానఁడు

చ. 1: అంతేపో వోయమ్మ అదేమే వీఁడు
వింతవావి నామీఁద వేసి నవ్వీని
యెంతయినఁ బోనీఁడు యెంగిలిమోవి మాఁటలు
దొంతులు వేరుచవచ్చీ తొలమన్నా మానఁడు

చ. 2: పోపో అదేడమాఁట పొద్దువోదటే
రేపుమాపు రమ్మంటా రేసు చల్లీని
వోపనన్నఁ బోనీఁడు వుంబడిపొత్తు చేతుల
మోఁపవచ్చీ నాకుచాల మొక్కినాను మానఁడు

చ. 3: తగునే యేమని చెప్పె తానే వీఁడు
మెగమోడితేనే చేయి ముంచి కూడెను
నిగిడి శ్రీవేంటాద్రినిలయుఁడు నన్నుఁ గూడి
సగము సరసమాడి చాలునన్న మానఁడు

రేకు: 1625-6 సౌరాష్ట్రం సం: 26-150
పల్లవి: కడు నిన్ను దూరనోప కానీవయ్యా
కడమలిన్నియుఁ బాసెఁ గానీవయ్యా
చ. 1: నీ కితవైతేఁజాలు నీనెలఁత లేమన్న
కైకొనేము అందుకేమి కానీవయ్యా
ఆకెకు నీవు వలపు ఆకె నీకు వలవనీ
కాకు సేయకుంటేఁజాలుఁ గానీవయ్యా
చ. 2: యింటి వచ్చిన మేలు యేడ నుండినా మేలు
కంటిమి నీగుణమెల్లా గానీవయ్యా
నంటున నిట్టె నవ్వు నవ్వకుంటే యాకెఁ జూపి
కంటకాలాడు చాలుఁ గానీవయ్యా
చ. 3: మాఁగినకోపము దీర మాఁటల బుజ్జగించితి
కాఁగినకాఁకలు జారెఁ గానీవయ్యా
పొఁగి నీకు సతమయి పరచిత్తము మానితి
కాఁగిన శ్రీవేంకటేశ కానీవయ్యా

రేకు: 1626-1 వేళావళి సం: 26-151
పల్లవి: ఏమనిన మామాట యెగ్గులౌనో తప్పులౌనో
కామిని వొద్దనె ఇన్నిఁ గందువు రావయ్యా
చ. 1: ముత్తెపుఁ జిప్పలలోన ముంగారు లవె ముంచె
పొత్తుల గాలి నువ్వుఁ బువ్వునఁ బుట్టె
నిత్తుమిది గాలిమాతో నీలిమాటో కానరాదు
అత్తి చెలి ఆనతిచ్చీ ఆడకు రావయ్యా
చ. 2: చెలఁగు నద్దాల మీఁద చిగురు లవె పెట్టె
పులుగు జక్కవలపై పూపులు పూచె
వలరాజుమాయ లివో వలపు మిక్కటమిదో
తలఁచుకొందువు చెలిదండకు రావయ్యా
చ. 3: అందుకోలై దొండపంట నమృతరసము పుట్టె
చిందఁబోసె తీఁగెమీఁద చిమ్ముఁగళలు
అందపు శ్రీవేంకటేశ అంగనఁగూడితి విట్టె
దిందుపడ సతిఁ గూడ దినము రావయ్యా

రేకు: 1626-2 బౌళి సం: 26-152

పల్లవి: బాపు బాపు కృష్ణా బాలకృష్ణా
బాపురే నీ ప్రతాప భాగ్యు లివివో

చ. 1: బాలుఁడవై రేపల్లెఁ బాలు నీ వారగించఁగ
పాల జలనిధి యెంత భయపడెనో
ఆలించి తొదలుమాట లాడనేరుచుకొనఁగ
యీలీల ననురసతు లెంత భ్రమసిరో

చ. 2: తప్పటడుగులు నీవు ధరమీఁదఁ బెట్టఁగాను
తప్పక బలీంద్రుఁ డేమి దలఁచినాఁడో
అప్పుడే దాఁగిలిముచ్చు లందరితో నాడఁగాను
చెప్పేటివేదాలు నిన్నుఁ జేరి యెంత నగునో

చ. 3: సందడి గోపికల చంకలెక్కి వున్ననాఁడు
చెంది నీ పురము మీఁది శ్రీసతి యేమనెనో
విందుగ శ్రీవేంకటాద్రి విభుఁడవై యున్న నేఁడు
కందువైన దేవతలఘనత యెట్టుండునో

రేకు: 1626-3 పాడి సం: 26-153

పల్లవి: మీఁద మిక్కిలి పనులు మీ చిత్తము
యీఁదితిని మోహజలధిప్పుడే నేనయ్యా

చ. 1: కన్నులఁ జూచినంతనే కరఁగితిని । యిఁక
నిన్ను నేము సోదించనేరమయ్య
యెన్నిలేవు నాయాస లెంచబోతేను । నీవు
మన్నించినకొలదీ మాకుఁ జాలునయ్యా

చ. 2: నవ్వులు నవ్వినంతనే ననిచతిని । ఇఁక -
నవ్వలిపనులు నిన్ను నడుగనయ్య
యెవ్వ రేమిబుద్ధి చెప్పే రిటమీఁదను । నీవు
అవ్వలివ్వలినుం డెప్పుడైనా రావయ్యా

చ. 3: ఇంటికి వచ్చినంతనే యెనసితిని
వొంటి నిన్నుఁబాసి వుండనోపనయ్యా
నంటున శ్రీవేంకటేశ నన్నుఁగూడితి । నీ
వంటి నన్ను జెక్కు నొక్కి తది చాలునయ్యా

రేకు:	1626-4 వరాళి	సం:	26-154

పల్లవి:	ఏమన్నాఁ జేయవయ్య ఇయ్యకొనే నిఁక నేను
	నీ మనసు నేఁ దెలియనేర కింతే కాక

చ. 1:	మించి చేయిపట్టఁగ గాదనేనా నేను
	యేమందురో మావారనే దిందుకే కాక
	దోమటి నానవెట్టఁగ దోసేనా ఇట్టె నన్ను -
	నామని సిగ్గులు ముంచె అందుకింతే కాక

చ. 2:	కొంగునట్టి తియ్యఁగాను కోపగించేనా నిన్ను
	పొంగేటి సతవతులచే పోరుకే కాక
	చెంగటఁ బిలువఁగాను చేరని నా గర్వమా
	అంగపుఁ జమట నిన్ను నంటీనని కాక

చ. 3:	మించిన నీ కాఁగి లిట్టె మెచ్చుకున్న దానవా
	ఇంచుక పరవశమై యిందుకే కాక
	అంచెల శ్రీవేంకటేశ ఆదరించి కూడితివి
	మంచిదానఁ గానా వొక్కమాఁట కింతే కాక

రేకు: 1626-5 సామంతం సం: 26-155

పల్లవి: కందములో ఇఁకమీఁద కడమదొడమలెల్ల
చెంది నావద్దనే వుంటేఁ జెల్లదా వంతము

చ. 1: తా నాడఁగ నేనాడఁగఁ దారుకాణ లీడనేల
పోనీవే కడుఁగడుఁ బొద్దు వోయను
మేని మీఁది గురుతులు మేనిమీఁదనుండఁగాను
నానఁ బెట్టీ నిజములు నవ్వరాదా ఇందుకు

చ. 2: తా ముట్టఁగ నే ముట్టఁగఁ దడబాట్లీడనేల
యేమి సేసీ జేయనీవే ఇంతలోనేమి
దోమటిఁ దనచేఁతను దొంతులనే వుండఁగాను
యేమరించి కాఁగిలించీ నిది మేలుగాదా

చ. 3: తాఁగూడఁగ నేఁగూడఁగ తమకము లీఁకనేల
చేఁగదేర రతులెల్లఁ జెప్పఁగ నేల
వీఁగక శ్రీవేంటాద్రి విభుఁ డిట్టె నన్నుఁ గూడె
యేమరించి కాఁగిలించీ నిది మేలుగాదా

రేకు: 1626-6 లలిత సం: 26-156

పల్లవి: ఏ మంద మీకెతోడ నిందుకే వెరగయ్యీ
యీామై పాదాలు గడుగ నిదియు నేమైనది

చ. 1: ఇదివో కృష్ణుడు మా ఇంటిపాలు నేయిఁ ద్రాగి
చెదర రుత్తకుండలు సేసి పోఁగాను
యెదుట యశోదఁ దెచ్చి యిటె చూపఁబూతేను
అదన నీరాళ్లుఁ గూరాళన్నియుఁబాలైనది

చ. 2: అలవీది వొకలేమ అమ్ముడుఁబండ్లగంప
కొల్లలాడీ కృష్ణుఁడని కోరి చెప్పఁగా
చల్లరపు టాగడాలు చూపఁబోతే గంపనిండా
పెల్లుమాణికా లున్నవి బేలుపోయ మాఁటా

చ. 3: పంతపు శ్రీవేంకటాద్రి పతియైన కృష్ణుడు
యెంతటి మాయలవాఁడో యేమిమందులో
అంతటిబాలుని వట్టియారడిఁ బెట్టితిమని
చెంతల యశోద దూర చిన్నఁబోవవలసె

రేకు: 1627-1 గౌళ సం: 26-157

పల్లవి: ఇందుకేఁగాఁగంటివమ్మ యిట్టిదయ్యమును నీవు
కందువ నిందుకు నుజ్జు గలదో లేదో

చ. 1: వెన్నలెల్ల తా మెసఁగి వేళ్లు తా క్రిష్ణుఁ డా ఇంటి
చిన్నికోడలిమూఁతి నించి కే చమరె
వెన్న మూఁతి చూచి అత్త వేగమె కోడలిఁ గొట్టె
ఇన్నేసి ఆగడాలు యీతని వోయమ్మా

చ. 2: వొకరింటి పురుగు దా గొగి రుత్తబాన లెల్ల
యెగ సక్కేలకుఁ బొరుగింటఁ బెట్టెను
వొకరొకరి మొత్తిరి హోరాహోరిగాఁగాను
కకపిక నవ్వుకొంటా కడనుండె నమ్మా

చ. 3: వొట్టుచు బాలునినోర వొకబానెఁడు జున్ను
పెట్టి తురిగి వచ్చె వూపిరి వెళ్లదు
యెట్టయిన నీవె సుమ్మీ యీపిన్నవానికిని
పట్టిశ్రీవేంకటపతి బలువుఁడో యమ్మా

రేకు: 1627-2 పాడి సం: 26-158

పల్లవి: మోసపోకు రమ్మలాల ముందెరిఁగి కృష్ణుఁడు
ఆసల నవ్వే రెవ్వరి నంత వచ్చి సేసెనో

చ. 1: యేకతానఁ జెవిలోన యెవ్వరికిఁ జెప్పరాని
పైకొని బూతు లాడీని బాలుఁడావీఁడు
వోకాంతపండ్లాని వొడి గొప్పై వున్నదంటా
చేకొని చేచాఁచీని శిశువా వీఁడు

చ. 2: ముంచి ముద్దువెట్టేనంటా మోవి నేమో సేయవచ్చె
పంచనుండేదుష్టుగాక పడుచా వీఁడు
అంచెల నప్పలప్పలని వచ్చి కాఁగిలించి
చంచుల మేనెల్ల గీరె సన్నమా వీఁడు

చ. 3: చలిగోనీనని వచ్చి సరి నాపయ్యద గప్పి
చెలఁగి కోకెల్లాఁ దీసె చిరుతా వీఁడు
తెలసి శ్రీవేంకటాద్రిక్రిష్ణుఁడు ఇందరి నిట్టె
కలగొనె మూలమూల కతకారి వీఁడు

రేకు: 1627-3 సాళంగం సం: 26-159

పల్లవి: కావలసినపనులు కాకమానీనా నీవు
కావరాన ముకుఁదాట కాలుగుచ్చేవేలరా

చ. 1: కానీ కానీ నీవేమన్నాఁ గాదనరా । యిట్టె
ఆనించక పిలువవద్దంటి మింతేరా
మేనవావి నీకు నాకు మెరసెఁ దొల్లె । నేఁడె
నానఁబెట్టి సెలవుల నవ్వవలెనటరా

చ. 2: ఆయనాయ నిందరిలో ఆరడేలరా । నీవు
చాయలకు మొక్కఁగానే చాలునంటిరా
పోయినపొద్దులు వోయఁ బొందకుండేమా । నీవు
చేయి మించి ఇంతలోనే చెనకనేఁటికిరా

చ. 3: కంటిఁగంటి నీమాట కల్ల గాదురా । నీవే
ఇంటికి వచ్చితి వన్నీ నియ్యకొంటిరా
నంటున శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి । ఇఁక
బంటు పంతమా ఇది ప్రతిన లేఁటికిరా

రేకు: 1627-4 గుజ్జరి సం: 26-160

పల్లవి: అవ్వలిమో మిదియేల అలుక లింకా నేల
జవ్వని మీఁదఁ బ్రియము చల్లఁగదవయ్యా

చ. 1: చెవి నీపై చింతకు చెక్కిటిచేయే సాక్షి
కలవిరహానకు మెయికాఁకే సాక్షి
నెలకొన్నయాసలకు నిట్ట చూపులే సాక్షి
తెలుసుకొందువుగాని దృష్టింపవయ్యా

చ. 2: నిండుఁగాతాళమునకు నిట్టూర్పులే సాక్షి
దండి తమకమునకు తబ్బిబ్బు సాక్షి
చండివడ్డ కోరికెకు జాగరములే సాక్షి
వుండవెల్లా నిఁకనేల వొకటి గావయ్యా

చ. 3: కాఁగిటికి లాచుటకుఁ గదిసియుండుటే సాక్షి
మాఁగినమనసునకు మనసే సాక్షి
పాఁగిన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
నాఁగువారీ వేడుకలు నవ్వు నవ్వవయయ్యా

రేకు: 1627-5 దేవగాంధారి సం: 26-161

పల్లవి: బలిమి సేయక నీవు పదవమ్మా
చెలియ నా మన విది చేకొనవమ్మా

చ. 1: ననుపు లేనిచోట నవ్వుకంటెను
జునిఁగి వాదులడుఁచుట సుఖము
మనసురానిచోట మాటలాడుట కంటె
మునుపనే తనలోన మానమే సుఖము

చ. 2: ప్రేమలేనిపతిఁ బిలుటకంటెను
సోమరై వేగించుట సుఖము
కామించనిరతిఁ గరఁగుటకంటె
ఆమారు కంబము నలముట సుఖము

చ. 3: వొల్లమి సరిఁగూచుండుటకంటె
చల్లఁగ దొలఁగుట సమ సుఖము
యెల్లగ శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
కొల్లగ నిదియే కోరుట సుఖము

రేకు: 1627-6 నాదరామక్రియ సం: 26-162

పల్లవి: అన్నియు నే నెఱుఁగుదు నందుకేమి
సన్న సేసీ యాకె నిన్నుఁ జిక్కఁ జూడరాదా

చ. 1: కప్పరమిచ్చి యాకె గైకొనఁగ రాదా
అప్పుడే నా మోము చూచె వందుకేమి
చెప్పియంపినది యేమో చెలియి మాటలు విను
యెప్పుడు నీవద్ద నుండు దెందు వొయ్యే నేను

చ. 2: మొక్కులు మొక్కి అకెముచ్చట దేరుచరాదా
యెక్కుడు నీతో నవ్వే విందుకేమి
దిక్కులనే కోపగించి తిట్టీ నిన్నదిగో
అక్కడి దీవెనఁ బొందు అలిగేనా నేను

చ. 3: కాఁగిలించి ఆకె నిట్టె కరఁగించరాదా
ఆఁగి నన్నుఁ గూడితిని అందుకేమి
మూఁగుచుఁ గామలాపురమునఁ గంచిరాయఁడనై
చేఁగదేర నేలితివి శ్రీవేంకటేశుఁడా

రేకు: 1628-1 ముఖారి సం: 26-163

పల్లవి: చాలుఁబో యీా పొందే చవులు నీకును
ఆలించి యేమి సేసినా ఆయము

చ. 1: అచ్చపు గుట్టున నుండవయ్య నీవు ।నీతో
హెచ్చి నిజమాడరాదు యీాకాలము
ఇచ్చకము లాడువారే ఇతవు నీకు ।నిన్నుఁ
బచ్చిగా నేమన్నాను పసురువేసీని

చ. 2: అంటిముట్టి సరసా లేలయ్యా నీవు
యింటిచెట్టు మందు గాదు యీాకాలము
వెంటఁదిరుగాడువారే వేడుక నీకు । నిన్ను
దంటనై నేనేమన్నాఁదగవు దప్పీని
అలయించేవు రతి నేలయ్యా నీవు
యెలమిఁ గాఁగిలే చాలు నీ కాలము
బలిమి శ్రీవేంకటేశ పట్టి గూడితిని నన్ను
తొలఁగి నిన్నేమన్నాను దోసము వచ్చీని

రేకు: 1628-2 రామక్రియ సం: 26-164

పల్లవి: ఆడఁబోతే వచ్చి దోఁచీ నంటే చాలు
యీడ నాకుఁదెలియుట కింగితమే చాలు

చ. 1: చెప్పరానిమాఁటలకు సెలవినవ్వే గురుతు
అప్పటి నిన్నడిగానా అంతే చాలు
వుప్పతిల్లే కూరిమికి వున్సరనుటే గురుతు
ముప్పిరిఁ గొసరకుమీ మొదలిదే చాలు

చ. 2: పక్కన రమ్మనుటకు పవ్వళించుటే గురుతు
యెక్కుడు సుద్దుల కేమి యింతేచాలు
చిక్కి నాకు వేఁగుటకు చిరుఁజెమటే గురుతు
నిక్కి చూడకుమీ ఇఁక నేలవ్రాఁతే చాలు

చ. 3: దిమ్మురతిఁ జొక్కుటకు తేలగింపులే గురుతు
కమ్మర నలయించేనాకాఁగిలే
నెమ్మది శ్రీవేంకటాద్రినిలియుఁడనైన నన్ను
వుమ్మడిఁ గూడితిని యీ వొడఁబాటే చాలు

రేకు: 1628-3 సామంతం సం: 26-165

పల్లవి: ఇంకానా నేనూ యిస్సీ రోఁత । తన
వంకలాడేవారిపొందు వదలకుమనవే

చ. 1: అప్పుడే నేనాడనా అడకు నే రానని
యిప్పుడే పిలువనంపె యిదేమో కాక
చెప్పరమ్మ చెలులు చిల్లులాయఁ జిత్తము
తప్పునిబొంకనివాఁడు తాఁదానే కడనే

చ. 2: కంటా నే నవ్వనా కాంతాఁ దానుఁ గూడుండఁగ
ఇంటికిఁ దానేల వచ్చె నిదేమో కాక
అంటకురమ్మ మీరు ఆయనాయఁ దగవులు
తుంటరి తన బాసలు తొల్లిటిసే కడనే

చ. 3: దగ్గరితే మొక్కనా తనతో నే మొకమోడి
యెగ్గుదీ బుజ్జగించీ యిదేమో కాక
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
సిగ్గరిపెండ్లికొడుకు చేలువుఁడే కదవే

రేకు: 1628-4 శంకారభరణం సం: 26-166

పల్లవి: మూల నున్నవారి నీవు ముంగిట వేసితి నీవే
నాలికాఁడ నేము నీతో నవ్వవచ్చితిమా

చ. 1: యెగ్గువట్టేవాఁడవు ఇంటికి రమ్మనేల
బగ్గన నీయంత నీవే బదుకరాదా
సిగ్గువడేవాఁడవు చేయి మాపైఁ జాఁచనేల
కగ్గి దవ్వుల నుండఁగఁ గాదు గూడ దంటిమా

చ. 2: అంతకోపగాఁడవు ఆయము లంటగనేల
కొంత దొరతనముతోఁ గూచుండరాదా
వంతమాడేవాఁడవు బడిబడి రావేల
కొంతపు నీకు బత్తి గొట్టానఁ బెట్టితిమా

చ. 3: కాఁగిలించేవాఁడవు కాఁకలు సేయఁగనేల
నీఁగని మంచితనమే నెరప రాదా
దాఁగక శ్రీవేంకటేశ దక్కఁ గూడితిని నన్ను
పాఁగినరతుల నిన్నుఁ బచ్చ గా నాడితిమా

రేకు: 1628-5 వేళావళి సం: 26-167

పల్లవి: తనసంది నాసందిఁ దలపోఁతలా
వెనకముందు మరి వినుకొనేఁగాకా

చ. 1: వద్దనేనా నేనూ వడిఁ దా విచ్చేసితేను
గద్దరిమా కోపమెంత కట కటా
అద్దలించఁగలమా ఆతనితో బలిమా
తిద్దరాని తనమేలు తెలిసేఁగాక

చ. 2: యెదురాడేనా నేను యేమని తాఁజెప్పినాను
గదరుకోఁజోటేది కటకటా
పదరేటిదాననా పతియౌత గానా
అదనైన యందాఁకా నాలకించేఁగాను

చ. 3: వొల్ల ననేనా నేను వూరకే తాఁగూడఁగాను
కల్ల దాఁ జేసెనంటినా కటకటా
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గాఁగిలించె
చెల్లించేఁ దనచనవు చెప్పుకొనేఁ గాక

రేకు: 1628-6 నాదరామక్రియ సం: 26-168

పల్లవి: చేతనైనపాటిసేవ సేయఁ గలదాన నింతే
ఆతల నీచిత్తమెట్టో అది నే నెఱఁగను

చ. 1: నిద్దిరించేవో కొంత నీ కన్ను లెఱ్ఱనున్నవి
వొద్దనే మంచమూ నదె వోవరీ నదె
తిద్దుకొనేవో కస్తూరి తిరుమణి చెదరెను
అద్దమిదె మొకమదె అవ్వల యెఱఁగను

చ. 2: జలకమాడేవో నీవు సారె మేను చెమరించె
కొల నదె తడియొత్తుఁ గోకలూ నవె
వలెనో విడెము నీకు వాడి మోవి తెల్లఁబారె
కలయడ మదివో కడమ యెఱఁగను

చ. 3: విసరుకొనేవో నీవు అసురును రయ్యేవు
పసనైనసుర టిదె బయలూ నదె
పొసఁగ శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టె
పొసఁగితి నెసఁగితి బూటకా లెఱఁగను

రేకు: 1629-1 వరాళి సం: 26-169
పల్లవి: వేళలేదు పొద్దులేదు వేగిరించే వింతలోన
నీలాగు లెఱఁగరు నిందలాడేరు
చ. 1: చెక్కులు నొక్కకుమీ చేతిగోరు నాటుఁజేసు
యెక్కువ మావారు చూచి యేడదనేరు
పక్కన నవ్వకుమీ పడఁతు లింద రున్నారు
చక్కఁగా నిందరిలోన సందేహించేరు
చ. 2: మించి పై నొరగకుమీ మేనితావు లంటుఁ జేసు
అంచెలఁ జుట్టాలు పక్కా లాడుకొనేరు
మంచానకుఁ దియ్యకుమీ మరి తుము చదరి
చుంచుల మాయత్తవారు చొప్పునట్టేరు
చ. 3: బెట్టిమాట లాడకుమీ పిమ్మట రట్టౌఁ జేసు
పొట్టఁ బొరుగువారెల్లఁ బొంచు వినేరు
గట్టిగా శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి విట్టె
పట్టి నీ మాయ కిందరు భ్రమశున్నారు

రేకు: 1629-2 ఆహిరి సం: 26-170

పల్లవి: బలుగుండెదానఁగాన బదికేఁ గాని
మలసి నివ్వెరగైతి మనసు నీదనవే

చ. 1: యెడమాటఁ గొంత వొద్దు యెదురుండి కొంతవొద్దు
కడపితిఁ దను నేఁ గలసేనంటా
అడియాసలే నిండె అంతటాఁ దా రాడాయ
పడలేను విరహానఁ బ్రాయము నీదనవే

చ. 2: తనుఁ దలపోసి కొంత తనరూపు వాసి కొంత
పెనఁగితి నన్నుఁ దాఁ బిలిచీనంటా
వినుకలే ఘనమాయ విడెమూఁ దా నంపఁడాయ
దిన మొక్కయేఁడాయ దేహము నీదనవే

చ. 3: కలలోనఁ గూడి కొంత కమ్మలు నడపి కొంత
నిలిపితి దీమనము నీవే నేనంటా
పలికి శ్రీవేంకటాద్రిపతి దా విచ్చేసి కూడె
చలఁగితి సంతసాన చిత్తము నీ దనవే

రేకు: 1629-3 లలిత సం: 26-171

పల్లవి: తారుకాణ నివి ఇట్టె తప్పదు గాక
తారి తారి తమకానఁ దమకించేఁ గాక

చ. 1: తరుణి విలువఁబోయి తానుసించి రాదాయ
వరుసెరిఁగి నాపతి వచ్చీనో కాక
అరిది నాయెడమక న్నదరీ నేఁ డిపు డిట్టె
సారిది నాప్రాణేశుఁ జూచేనో కాక

చ. 2: మక్కువఁ బతిఁ దలఁచి మర్మములు గలఁగె నే-
నక్కడఁ బతికిఁ దలైఁతినో కాక
ఇక్కువైనదంతపుటింటిలోనే చప్పుడయ్యీ
వుక్కుమీరి యీడనే తా నున్నాఁడో కాక

చ. 3: పరగఁ బరవుపై నాపతి కాఁగిటిలోఁ గూడె
గరిమ నిందాఁక కలగంటినో కాక
యిరవై శ్రీవేంకటేశుఁ డితఁ డెంతమాయలాఁడు
సరసములే నాతో జరపెనో కాక

రేకు: 1629-4 శంకరాభరణం సం: 26-172

పల్లవి: నీళ్లడిచితే నేఁడేల రెండయీా
నోళ్లు మాలోనే నొడిగితిమి

చ. 1: దాపగుమేనేలే దవ్వుల నున్నవి
చూపు లొండొరుల సోఁకినవి
మాపుదాఁకా నేము మాటల నెడాడి
పైపై నూరకె బడలితిమి

చ. 2: పెనఁగేవంతాలే బిగిసివున్నవి
మనసులు రెండు మాఁగినవి
పనిమాలి నేమే బాసలుసేయుచు
తనివోక తిట్టే దప్పిగొంటిమి

చ. 3: కందున మోహాలే కాఁగిళ్ల నున్నవి
అంది మోవికెంపు లంటినవి
యెందును మీగుట్టు యెఱఁగమైతిమి
చెందితివి చెలి శ్రీవేంకటేశా

రేకు: 1629-5 శ్రీరాగం సం: 26-173

పల్లవి: ఘనుఁడా నీమన సెంతగట్టో కాక
నినుఁజూచి వెరగంది నేననేఁగాక

చ. 1: నిట్టూర్పుగాలిచేత విలువఁ గలదా యింతి
నెట్టనఁ జనుఁగొండలే నిలిపెఁగాక
పుట్టిపడుమదనాగ్ని కోరుపఁగలదా మేన
జట్టిఁజెమటయేరులే చల్లార్చెఁగాక

చ. 2: తుఱుము చీఁకటి ముంచె దూరఁగలదా యింతి
నెఱయ మోముచంద్రుఁడు నెగడెఁగాక
తఱిఁ బులకవాములు తరుణి మోయఁగలదా
పిఱిఁదిబండి గలుగ బీరమెక్కఁ గాక

చ. 3: వలపనేనామెక్కి వనిత యేమైనఁగాదా
బలిమధరామృతాన బతికెఁగాక
నెలపై శ్రీవేంకటేశ నీవిట్టె సతిఁ గూడఁగ
తెలిసి నీవురముపైఁ దిరమాయఁ గాక

రేకు: 1629-6 నాదరామక్రియ సం: 26-174

పల్లవి: పాటి పాటి జగడాలు పనిలేదయ్యా
మీఱితే మీఁదటిమాఁట మీకుఁ జెప్పనయ్యా

చ. 1: యిట్టె కోపగాంతుగాని యింటికి రాకుండలేవు
వొట్టులు సత్యాలు నీకు నొమ్మవయ్యా
వట్టిసటలే కాక వావిచడ మందుగద్దా
బెట్టి నిన్నుఁ బిలువఁగఁ బెనఁగకువయ్యా

చ. 2: వెంగేనఁ దిట్టుదుగాని వేఁడుకొనకుండ లేవు
చెంగటి బొమ్మలజంకె చెల్లదయ్యా
అంగవించితే నీళ్లడచితే రెండౌన
కొంగువట్టి తియ్యఁగాను గుట్టు నీకేలయ్యా

చ. 3: గరిమె మెఱతుగాని కాఁగిలించకుండలేవు
పొరపొచ్చా లిఁక నీకుఁ బొసఁగదయ్యా
ఇరవై శ్రీవేంకేశ యేలితివి నన్ను నిట్టె
తెరమఱఁ గిఁకనేల తెలిసితివయ్యా

రేకు: 1630-1 ముఖారి సం: 26-175

పల్లవి: ఏమని విన్నవించేము ఇంతిభావ మిదివో
నీ మనసుకొలఁ దిఁక నెలఁతకుఁ బ్రియుఁడా

చ. 1: గందాన బొట్టువెట్టఁగఁ గాంతకు నిట్టూర్పు రేఁగె
పొందగుగాలికి నది పుట్టినిల్లంటా
విందుగాఁ దామెరిచ్చితే విరహ సూర్యుఁడు మించె
అందులోఁ జుట్టరికము లమరునంటాను

చ. 2: కలికి మేఘవన్నె గప్పితేఁ జెమటవాన
గలిగె నదియే తమకాలమంటాను
బలిమిఁ జిగురుపాన్పు పరచితేఁ బులకలు
వెలిఁ బూచె వసంతపువేళ వచ్చెననుచు

చ. 3: కాంత చంద్రశాల కేఁగ కన్నుఁగలువలు విచ్చె
పొంతనే వొండికటికిఁ బొందౌనంటా
ఇంతలో శ్రీవేంకటేశ యిటు నీవు గూడఁగాను
సంతసాలు దైవారి చవులాయ నివియె

రేకు: 1630-2 రామక్రియ సం: 26-176

పల్లవి: ఏడనేడ నెవ్వతెచే యేమిచేఁత బడితివో
నీడలు యెండలు నాతో నీవు నడవకురా

చ. 1: అక్కరై మాటలాడేవు అసురుసురు ననేవు
యెక్కడ నున్నది చిత్త మిది యేమిరా
పక్కన నవ్వునవ్వేవు పరాకు సేసుకొనేవు
కక్కసపునీవలపు కానరాదురా

చ. 2: దగ్గరి విడెమిచ్చేవు తలయు వంచుకొనేవు
యెగ్గుసిగ్గు ననుమానా లెంతగద్దురా
వొగ్గి కళలు చూపేవు వూరకైన వాడేవు
దిగ్గన నీవిధమేదో తెలియఁగరాదురా

చ. 3: కాఁగిటనే కలసేవు కన్నులును మూసేవు
నీఁగని నీ పొందులకు నిజమేదిరా
పొఁగిన శ్రీవేంకటేశ భ్రమఇంచి కూడితివి
వీఁగవు రతుల నిఁక వివరించరాదురా

రేకు: 1630-3 పాడి సం: 26-177

పల్లవి: ఆంగడిఁ బడెను వాదు లతివకు నీకుఁ బోదు
జంగిలిసటలు మాతోఁ జాలు రారాదా

చ. 1: వెన్నెల సెలవిఁ గారీ వేడుకలు దైవారీ
యెన్నేవు చెలియకోప మిందులో నేది
కన్నులనే కప్పురాలు కరముల నుప్పరాలు
వన్నెకెక్కెఁ జెలియందు వడఁబడనేఁటికి

చ. 2: మేనిపైఁ గమ్మనితివి మీం తేనెలు మోవి
యీ నెలఁత నీ మీఁద నీరసమేది
మోనముతోడి గుట్టు ముదితకు వట్టిరట్టు
కానఁబడి వుండఁగానుఁ గడమేలెంచేవు

చ. 3: మాటలోని వెరగు మరునియింటిపొరుగు
చాటువ నింతికి నబ్బె చల మిందేది
పాటించి శ్రీవేంకటేశ పైపైఁ గూడితివింక
యేఁటికి వట్టి సుద్దులు యియ్యకోలు మాకు

రేకు: 1630-4 గుండక్రియ సం: 26-178

పల్లవి: నీకునీవే పదరేవు నేనేమీననను
కైకొని యేరా నీవు కన్నులు మూసేవు

చ. 1: చేరలంతలుకన్నుల చేరి జంకించితినో
కోరి నిన్నుఁ బెదవుల గొణఁగితినో
కేరి సెలవుల నవ్వి కేరడమాడితినో
యేరా సిగ్గుడేవు యింతలోనే నీవు

చ. 2: జక్కవ చన్నుల నిన్ను సారె నొరసితినో
వెక్కనపు మాఁటలు వెంగెములాడినో
మక్కువ నీమేనిమీఁదిమచ్చము వట్టితినో
తక్కక యేరా నీవు తలవంచేనిపుడు

చ. 3: కాఁగిలించి నీమేన ఘాతలు సేసితినో
తోఁగిసరతుల సరిదూఁగనైతినో
దాఁగక శ్రీవేంకటేశ తగ నన్నుఁ గూడితివి
మాఁగుచు నేరా నీవు మఱచేవు మేను

రేకు: 1630-5 భైరవి సం: 26-179

పల్లవి: చల్లఁగా బతుకవయ్య సమ్మతైనపాటే చాలు
వొల్లకున్నా బుద్ధిచెప్పే వొడఁబాటు లేలా

చ. 1: తొలుత రానికోపాన దూరితిఁగాక నిన్ను
వలపుగలంతేకాక వచ్చేవా నీవు
తలఁచి తలఁచి నీకే తగ వొప్పింతుఁగాక
అలయించి నిన్నుఁదెచ్చేయంత బలిమేలా

చ. 2: తత్తరించి కొంగువట్టి తమి రేఁచితిఁ గాక నీ -
చిత్తముము వచ్చినఁగాక సేసేవా నీవు
పొత్తులకూటమి నీకే పుణ్యము గట్టుదుఁగాక
బత్తి గొట్టాన బెట్టేటి వంతము నాకేలా

చ. 3: యెదుట నుండఁగా నిన్ను ఇన్నియు నవ్వితినేను
అదనైనఁదాఁకఁగాక అంటేవా నీవు
ఇదివో శ్రీవేంకటశ ఇప్పుడే కలసితివి
ముదమైన రతి చాలు మొక్కలములేలా

రేకు: 1630-6 వరాళి సం: 26-180

పల్లవి: వద్దు వద్దు మాతోడ వైతాళాలు
వొద్దు నిన్నుఁ జెనకితే వొల్లననఁగలవా

చ. 1: అసము దించని మాఁట లాడితే నాడుదుగాని
పిసికి పిసికి వొట్టు వెట్టుకోకురా
పసురు వేసీ మవి వలచనిచిగురాకు
కసిగాటు సేసితేను కాదనఁగఁగలవా

చ. 2: చెల్లినదొరతనాలు సేసితేఁ జేతువుగాని
కెల్లురేఁగి నీవు కోపగించుకోకురా
ముల్లు ముంటనే తీరీ ముసలమేఁటికి నే -
నిల్లిదె కాలుదొక్కతే నెదురాడఁగలవా

చ. 3: గుట్టునఁ గాఁగిట నన్నుఁ గూడితేఁ గూడుదుగాని
నట్టుకొట్టి నీవంత నవ్వవద్దురా
ఇట్టె శ్రీవెంకటేశ యేలితివి రతులను
పట్టి కళదాఁకించితే భావించఁగలవా

రేకు: 1631-1 మాళవి సం: 26-181

పల్లవి: ఆరగించి కూచున్నాఁ డల్లవాఁడె
చేరువనే చూడరే లక్ష్మీనారసింహుఁడు

చ. 1: ఇందిరనుఁ దొడమీఁద నిడుకొని కొలువిచ్చి
అందపునవ్వులు చల్లీ నల్లవాఁడె
చెందినమాణికముల శేషునిపడగెమీఁద
చెంది వరాలిచ్చీ లక్ష్మీనారసింహుఁడు

చ. 2: బంగారుమేడలోన పచ్చలగద్దియలమీఁద
అంగనలయాట చూచీ నల్లవాఁడె
రంగగుసొమ్ములతోడ రాజసపువిభవాల
చెంగట నున్నాఁడు లక్ష్మీనారసింహుఁడు

చ. 3: పెండెపుఁ బాదము చాఁచి పెసచి వొపాదము
అండనే పూజలుగొనీ నల్లవాఁడె
కొండల శ్రీవేంకటాద్రి గోరి యహోబలమున
మొండుగాను మెరసీ లక్ష్మీనారసింహుఁడు

రేకు: 1631-2 రామక్రియ సం: 26-182

పల్లవి: వేఁగిరమా కోనతిరువెంగళేశ నిండెఁ
దేగవు వలపు కోసతిరువేంగళేశ

చ. 1: కాయమెల్లఁ బులకించె గక్కన నీచేయి నాపై
వేయఁగానే కోనతిరువేంగళేశ
బాయిటనే ఇదె నా గుబ్బలపై పయ్యదకొంగు
తీయకుమీ యంత కోనతిరువెంగళేశ

చ. 2: కొల్లున నీవు నవ్వితే కొప్పువిరులు పైరాలె
వెల్లవిరిఁ గోనతిరువెంగళేశ
చెల్లెనీకు నామేనఁ జేసినచేఁతలు తేట
తెల్లమాయ నిదె కోనతిరువెంగళేశ

చ. 3: భావించి కూడితి విట్టె పంతములు వచ్చె మాకు
వేవేలుఁ గోనతిరువెంగళేశ
శ్రీవేంకటాద్రి మీఁద చిత్తమెల్లో గంటి నిదె
దేవుఁడ విన్నిటాఁ గోనతిరువెంగళేశ

రేకు: 1631-3 సామంతం సం: 26-183

పల్లవి: అప్పుడే యెగ్గులు వట్టీ నలిగితినా
తప్పకుండా మెదల సూత్రపు బొమ్మనా

చ. 1: యేమన్న నూరకుందాన నిఁక నేమి గావలెనే
దోమటిఁ దా నవ్వితే నే తోడు నవ్వేదా
తా మాటలాడెనంటా దగ్గరి నే మాటలాడ
కోమలమయినపెద్ద కొండసెలనా

చ. 2: తలవంచుకున్నదాన తనతో నేఁ గోపమేదే
నిలిచి తాఁ జూచెనంటా నిక్కి చూచేదా
అలసి తాఁ జేయివేసె అట్టె నేనూఁ జేయివేయ
బలిమిఁ బంతాలతోడ వందమాడేనా

చ. 3: ఆఁగి తనకొమరాఁక నట్టె వుండఁగ తాను
కాఁగిలించినప్పుడే నేఁగాఁగిలించేదా
చేఁగదేరఁ గూడె నిట్టె శ్రీవేంకటేశ్వరుఁడు
యేఁగించె (చ?) వెంట నే యింత తోడునీడనా

రేకు: 1631-4 బౌళి సం: 26-184

పల్లవి: ఆనసుమ్మీ యిఁక నీకు నౌభళేశ
మోనమేల మాఁటలాడు మొక్కే నౌభళేశ

చ. 1: కాయమెల్లఁ జెమరించె కడుబడలితి విదె
ఆయనాయఁ జాలుఁ గోప మౌభళేశ
ఆయులు గరఁగించి అండకు వచ్చితి నేను
మాయలేల నవ్వరాదా మాతో నౌభళేశ

చ. 2: మెఱుఁగుమోవి వాడె మిక్కిలి బునకొట్టేవు
అఱిముఱి మఱవేల యౌభళేశ
గుఱిగా నీకొనగోరు గుబ్బలు సోఁకించితి నీ -
మఱపులు చెల్లవిఁక మాను మౌభళేశ

చ. 3: కలసితి మిద్దరము కన్నులనె కెంపుదేరె
అలయకు మిఁక నీవు ఔభళేశ
తలపోఁతలు మనకు తారుకాణ లివె వచ్చె
బలిమి శ్రీవేంకటాద్రిపతి యౌభళేశ

రేకు: 1631-5 సామంతం సం: 26-185

పల్లవి: సంగడిజాణతనాల సటకాడ
అంగడివలపు వల్లే వడ్డమాడనోపరా

చ. 1: కన్నులచే నవ్వినవ్వి కడుఁగొప్పు దువ్విదువ్వి
వెన్నెలమాయలు సేయ వస్తివా వోరి
చన్ను లంటకుమీయంటే చాఁచేవు మానానకు
ఇన్నేసి నేరకుండితే నెట్టు బతికేవురా

చ. 2: చెక్కులిటు నొక్కి నొక్కి చేతులు వేసివేసి
మక్కువనీచేతఁ లిందు మాపేవా వోరి
తొక్కకుమీ పాదమంటే దొరసె వావి యనేవు
యెక్కవమాఁటలు దయ్యు మిచ్చేఁగా వోరి

చ. 3: పానువుపైఁ జేరిచేరి పైఁ గొంగు వేసి వేసి
పూనిన కళలు రేఁచి పొందేవా వోరి
మోనాన నే నుండమంటే మొక్కుమొక్కికూడితివి
కానీలే శ్రీవేంకటేశ కైవసమైతివిరా

రేకు: 1631-6 దేసాళం సం: 26-186

పల్లవి: కుందనపుఁబిల్లఁగోవి గోపీనాథా । మాపైఁ
జిందేవు మోహరసాలు చిన్నిగోపీనాథ

చ. 1: కొలనిలోపలిమాతో గోపీనాథా । యేల
కులికి నవ్వు నవ్వేవు గోపీనాథా
కొలువు మొక్కు మొక్కేము గోపీనాథా నీ
చలము చెల్లితేఁ జాలు జాణ గోపీనాథా

చ. 2: గొబ్బున మాచీరలిమ్ము గోపీనాథా । మా
గుబ్బలపైఁ గాఁక రేఁగె గోపీనాథా
గుబ్బతిల్లీఁ దయకమే గోపీనాథా । నీ -
కబ్బితి మేమైన జేయువయ్యు గోపీనాథా

చ. 3: కుప్పవడె మాసిగ్గు గోపీనాథా । మా -
కొప్పు జారె ముడువుమా గోపీనాథా
వొప్పుగ శ్రీవేంకటాద్రినుండి వచ్చి కూడితివి
అప్ప తొండామారేగుళ్ల ఆదిగోపీనాథా

రేకు: 1632-1 లలిత సం: 26-187

పల్లవి: కొనకెక్కె వలపులు గోపీనాథ । మన -
మనసొక్కటాయ నింక మదనగోపీనాథా

చ. 1: కొమ్మరుపదారువేల గోపీనాథా । నీకు
గుమ్మెలాయ మోమెల్ల గోపీనాథా
కుమ్మరింపురాగాల గోపీనాథా । అంత
చిమ్మకు నీవంతములు చిన్నిగోపీనాథా

చ. 2: కోరినకోరికె చెల్లె గోపీనాథా । యింకాఁ
గూరిమేల కొనరేవు గోపీనాథా
గోరు సోఁక నీయకు మీ గోపీనాథా । సమ -
తారుకాణలాయ నిన్నీఁ దగు గోపీనాథా

చ. 3: కొండుకపాయాలు సరి గోపీనాథా । యిఁక
గుండెపట్టి వుండరాదా గోపీనాథా
కొండల శ్రీవేంకటాద్రి గోపీనాథా । పొందు
తొండమారేళ్ల గూడె దొర గోపీనాథా

రేకు: 1632-2 సామంతం సం: 26-188

పల్లవి: ఏమని వొడఁబరచే వెట్టు సేసేవో కాని
సోమరి వలపులలో సుడిగొనున్నాఁడు

చ. 1: దంతపు వెన్నెలలతోఁ దగ నీవు మాటలాడఁ
గొంతపు నీ చూపులైతేఁ గొచ్చిపారీని
యింతలో నీ చక్కఁదన మిటు దారామోనఁ జూసె
పంతపు నీ రమణుఁడు భ్రమసి వున్నాఁడు

చ. 2: సెలవి నవ్వుల నీవే సేమంతులు చల్లఁగాను
మొలకచన్నులు పైపై మొనలెత్తీని
మెలువు నీసొమ్ములెల్లా మృదువులో వాఁడిచూసె
వెలిసేమీననలేక వెరగైయున్నాఁడు

చ. 3: కందువకాఁగిట నీవు కలసి మొలఁగఁ గాను
ముందరనే నీ తురుము ముడి వీడీని
చెంది పురుషోత్తమాన శ్రీవేంకటేశ్వరుఁడు
అందునిందు వచ్చి కూడి యులసివున్నాఁడు

రేకు: 1632-3 శంకరాభరణం సం: 26-189

పల్లవి: ఇంతి సేసినమేలు కిదియా । నీవు
వంతుకు వంతే వైపాఁ గాక

చ. 1: వెన్నెలరేకులు వెదచల్లీనదె
కన్నుల నీపయిఁగలికి
సన్నపు బొమ్మల జంకెన చీఁకటి
పన్ని నీ వేఁటికిఁ బతి చల్లేవు

చ. 2: తామరచేతులఁ దగఁ బూజించీ
నామనిసన్నల నతివ
వేమరు సిగ్గులవెడమంచపుడే
గోమునఁ బతిగాఁ గురియించేవు

చ. 3: నెలఁతకుచంబుల నిమ్మపండు లవె
చలఁగి కానుకిచ్చెను నీకు
బలిమి శ్రీవేంకటపతి విటు చేకొని
పలచనికెమ్మోవి పతి యిచ్చితివి

రేకు: 1632-4 ముఖారి సం: 26-190

పల్లవి: పొత్తులనుగఁడుగన పూనుకవచ్చితి నేను
బత్తిసేయ వద్దంటినా పట్టకుమంటిఁగాక

చ. 1: సొలసి కన్నులఁ బతిఁ జూడఁగా వద్దంటినా
ఆలిగి వుప్పతించవద్దంటి గాక
మలయుచు నీవు మంచిమాటాడవద్దంటినా
వలవనినేరా లెంచవద్దంటిఁగాక

చ. 2: కడ లేక పొందు సేయఁగా నే వద్దంటినా
వడివెట్టి పెనఁగఁగ వద్దంటీఁ గాక
చిడుముడిఁ గొలుపులు సేయఁగా వొద్దంటినా
వడదాఁక వెంటఁ దిప్పవద్దంటిఁ గాక

చ. 3: కాంత యీతనికాఁగిటఁ గలయవొద్దంటిని
వంతల గుబ్బల నొత్తవద్దంటిఁ గాక
యింతలో శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁగూడె
వంతు వద్దంటినా జోలి వద్దంటిఁగాక

రేకు: 1632-5 బౌళి సం: 26-191

పల్లవి: నిజములే పచరించు నెమ్మది నిన్నాళ్లుఁ దాను
భజన నన్నియు నేఁడు బట్ట బయలాయనే

చ. 1: పొద్దు వోయినాఁదాఁకా పొలఁతితో మాటలాడి
నిద్దిరించి వుండినది నే నెఱఁగనే
సుద్దులు చెప్పేనంటా చూచి మేలుకొలిపితే
ఇద్దరు నన్నుఁ జూచి తామేల సిగ్గుపడేరే

చ. 2: చిడుముడి నిందాఁకా చెలికి సింగారించి
బడలి తానున్నదా భావించనే
వడిఁ దలుపు దెఱచి వద్దికి నే వచ్చితేను
తడవి తమలోఁదాము తలలువంచేరే

చ. 3: యింపుల శ్రీవేంకటేశుఁ డీవనిత రతిఁ గూడి
సొంపుమొగచాటైనది చూడనైతినే
జంపులేక నే వచ్చి సరిఁగాఁగిలించుకొంటే
ముంపులఁ జూచి తామేల మొనసి నవ్వేరే

రేకు: 1632-6 కాంబోది సం: 26-192

పల్లవి: మగఁడు చెప్పినపని మగువకుఁ జేయవలె
తగవులన్నియు నేఁడు తలఁచుకో నీవే

చ. 1: ఇప్పుడేల లోఁగోవే యింతిఁ దోడుకరమ్మని
అప్పణగా నీవు నాతో నానతియ్యవా
చెప్పుట మరచితివో చింతతోఁ బరాకైతివో
తప్పులేదు నావల్ల తలఁచుకో నీవే

చ. 2: వెఱగులేల పడేవు విడె మాసె కిమ్మని
జఱసి కొలువులోన సన్నసేయవా
మరి దొరతనమో మగువల మొరఁగేవో
తఱి యఱఁగనా నేను తలఁచుకో నీవే

చ. 3: తెలుపుమనే వాకెఁ దెరవేయుమనెనని
వలుకఁగ సిగ్గుపడి భావించుకోవా
యిల నేలితివి మమ్ము నిద్దరి నీజాడలెట్టో
తలర శ్రీ వేంకటేశ తలఁచుకో నీవే

రేకు: 1633-1 రామక్రియ సం: 26-193

పల్లవి: ఎడసిన నొకసకి యెనసిన నొకసకి
పడఁతికి నెటువంటిభాగ్యమో కాని

చ. 1: చింతాజలధిఁ బాసి చేరె నినుఁ జెలి యంటే
వంతచెమటజలధి వచ్చె నొకటి
చెంతల నీ విరహపు చీఁకటిఁ బాసె నంటే
కాంతకు తురుముచీఁకటి ముంచుకొనెను

చ. 2: కొండలంత కోరికెలు గొచ్చి నినుఁ గూడెనంటే
అండనే చనుఁగొండ లడ్డమాయను
వెండివలె దేహమెల్లా వెల్లఁబారి మానెనంటే
వెండి కంటెఁ దెల్లనాయఁ వెలఁదికి కన్నులు

చ. 3: మురునమ్ముల కంతలు మాని నినుఁ బొందెనంటే
సిరుల పులకలచే చిల్లులాయను
సరుగ శ్రీవేంకటేశ సతిఁ గూడితిని నేఁడు
ఇరవై తొల్లిటివెల్లా నియ్యకోలే ఆయను

రేకు: 1633-2 శంకరాభరణం సం: 26-194

పల్లవి: నవ్వువచ్చీ మాకైతే నాఁటకపు నిన్నుఁ జూచి
రవ్వలాయ నీ కతలు రాఁగారాఁగాను

చ. 1: రమణుఁడు వచ్చెనంటే రాగము కన్నుల నుబ్బె
కొమరె పాయపు సిగ్గే కొసరీఁగాని
కమలాక్షి నీ గుట్టు కంటిమి నేమింతలోనే
చెమరించె చెక్కు లింకాఁ జెప్పవేమే మాకు

చ. 2: పతి యెలుఁగు వింటేనే వచ్చి దోఁచెఁ గళలెల్ల
కతకిరి మోనమేలో కదిమీ నిన్ను
సతి నీ వలపు మా యిచ్చుటనె వెల్లవిరాయ
ఇతవై మై పులకించె నేల దాఁచే విపుడు

చ. 3: అతఁడు దగ్గరితేనే ఆడితివి సరసము
కాతరాన నీకుచాలే కప్పేవుగాని
యేతరి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁగూడె
యీతల నివ్వెరగైతి వెంతనేరుపరివే

రేకు: 1633-3 పాడి సం: 26-195

పల్లవి: కూడి సుఖించుటకంటె కూడుదమనేదే ఇంపు
తాడువడి వుండుకంటే తరితీపే ఇంపు

చ. 1: దగ్గరి వుండుటకంటే దవ్వుల నినుఁ దలఁచి
అగ్గలపురతిఁ జొక్కే ఆసలే ఇంపు
సగ్గక పానుపుమీఁద చలివాసి వుండుకంటె
సిగ్గుతోడఁ గొనచూపు చిమ్ముటే ఇంపు

చ. 2: సరికి జేసికి నీతో సరసములాడుకంటె
మరుగుచునుండే యెడమాటలే ఇంపు
సరుగ నీ మీఁద జేయి చాఁచి కాఁకఁదీరుకంటె
వరుసఁ బూవుల చెండువాట్లే ఇంపు

చ. 3: అగవడ్డరతులచే నలసి నిద్రించుకంటె
దిగువుఁ గాఁగిటిలోని ప్రియమే ఇంపు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
పగటుల నుండుకంటే పచ్చిసేయు టింపు

రేకు: 1633-4 ముఖారి సం: 26-196

పల్లవి: వింతవారివల్లనైతే వెసనిన్నీ సమ్మతౌను
చెంతల నావల్లనైతే చిత్తమెట్టువచ్చునో

చ. 1: తప్పకుండా నీ వొళ్లి తగవులే నెరపేవు
చెప్పరాదా నీమాట చెలులతోను
అప్పుడే వారె తెలిపే రొఁగాములెల్లా నీకు
చిప్పిల నే నేమనినా చిత్తాన నెట్టుండునో

చ. 2: వోపికతో నీకునీవే వూరకే మెచ్చుకొనేవు
చూపరాదా నీ సేఁత సుదతులకు
రూపించేరు వారే నీనేరుపులెల్లా నొక్కమాఁటే
దీపించ నే నేర్పరచితే నేమందువో

చ. 3: నిలువఁబెట్టేవు నీ నిజములే పలుమారు
తెలుపరాదా నీవొద్దితెఱవలకు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వెలయ నేఁ గొసరితే వేడు కెంతవుట్టునో

రేకు: 1633-5 నాదరామక్రియ సం: 26-197

పల్లవి: ఊరకేల భ్రమసేవు వొగినేల పొగడేవు
నేరమా నేమందరము నీకే తెలిసీని

చ. 1: కతలు తొల్లె భూమిఁ గలవె కావా నేఁ డీ
సతి నీతోఁ జెప్పఁగానే చవులాయను
గతులైన చూపులు కన్నుల సాజమే కాదా
తతి నాపె చూడఁగా నీమతి నాటీఁగాక

చ. 2: అందరిచ్చేకానుకలు అరచేతిలోవేకావా
ఇందుముఖి యియ్యఁగా నీ కింపాయఁగాక
చిందేటి నవ్వు లింతులసెలవులవే కావా
చెంది యాపె నవ్వఁగా నీ కందమాయఁగాక

చ. 3: వింతమొక్కలు లోకులవినోదములే కావా
యింతి మొక్కఁగా రతికెక్కెఁగాక
ఇంతలోన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చెంత నాపెఁ గూడఁగా నచ్చెరువాయఁగాక

రేకు: 1633-6 గుజ్జరి సం: 26-198

పల్లవి: సారె సారె మమ్మునేల సాకిరివెట్టేవు నీవు
ఆరజముగా నిన్ను నౌఁగాదనఁగలమా

చ. 1: చెప్పేటి మాటలెల్లాను చెవులొగ్గి వింటగాక
తిప్పిచెప్పి నీ గుణాలు తిద్దఁగలమా
అప్పటప్పటికి యిచ్చలాడ నోపుదుముగాక
చొప్పులెత్తి నిన్నింతేసి సోదించఁగలమా

చ. 2: సూటిగా నీ సేసేచేఁత చూడఁగల మింతేకాక
సాటికి బేటికి నిన్ను సాగించేమా
యీటువెట్టి వొకమాటు యెచ్చరించు టింతే కాక
గాఁటమైన నీ మనసు కరఁగించఁగలమా

చ. 3: నంటున నీ వునికికి నవ్వుటే తగవుగాక
అంటిముట్టి యేమైనా నిన్నాడఁగలమా
ఇంటిలో శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి
జంటలమిమ్మిద్దరి మెచ్చక మానఁగలమా

రేకు: 1634-1 ఆహిరి సం: 26-199

పల్లవి: వనిత నీకుఁ గడవారము గాము
వొనరిన వలపులు వొక్కసరే సుమ్మీ

చ. 1: వంచిన నా కనుఁగలువలకు చుట్టము నేఁడు
అంచెల నీమోముచంద్రుఁ డదియే సుమ్మీ
యించుకంత అనుమాన మిఁకనేల నీకునాకు
కంచపు పొత్తులు మోవిఁ గలసుఁజుమ్మీ

చ. 2: నెలఁత నీ నడపు నెమలికి చుట్టము
మెలుపు నా నీలవర్ణమేమే సుమ్మీ
పలుకుల చిలుకలు పడఁతి నీకును నాకు
కులము పొఁగెన నొక్క గూఁటివాయ సుమ్మీ

చ. 3: వనిత నా జవ్వన వసంతునికి చుట్టము
దినము నీ బాహలనే తీఁగెలే సుమ్మీ
యెనసితి శ్రీవేంకటేశుఁ డను నే నిదె
తనువులుఁదనువులు తారుకాణ సుమ్మీ

రేకు: 1634-2 రామక్రియ సం: 26-200

పల్లవి: ఎండమావి నీరుసేసే వేమే నీవు
అండనుంటేఁగాక దవ్వులైతే నవిగావా

చ. 1: అతఁడు నిన్నుఁ బిలిచీనదిగదె నాకుఁ
బతిగాఁజిలుకలే పలికీఁ బోవే
తతి నిందుకే యతఁడు తా నవ్వీనే అట్టె
వెతకితే నందు మారువెన్నెలలు గావా

చ. 2: తప్పకచూచీఁ గదె తగ నతఁడు నా -
ముప్పిరిఁ జూపుల మారు మొల్లలే పోవే
చెప్పి చేయిచాఁచి సన్నసేసీఁగదే
చెప్పిలు నాచేతి మారు చిగుళ్లుఁ గావా

చ. 3: అలమీఁ గాఁగిట నిన్ను నాతఁడే కదే నేఁ
గలసినట్టే తీగెలు కలసీఁ బోవె
బలిమి శ్రీవేంకటాద్రిపతి నిన్నుఁ జొక్కించె
నిలువునఁ జొక్కించేనానేరుపులే కావా

రేకు: 1634-3 వరాళి సం: 26-201

పల్లవి: నెలఁత నేమి చెప్పేవు నిన్నే చెప్పవలెఁ గాక
తిలకించి ఇటువలె దిద్దుకొన వశమా

చ. 1: కన్నులనే మాటలాడి కప్పురాన నేసె నిన్ను
కన్నెఁ దెచ్చి యింతకల్కిగాఁ జేసితివి
సన్నల చాయలనే చల్లె వలపులు నీపై
పిన్ననాఁడిని వెన్నతోఁ బెట్టించితివేమో

చ. 2: వేలనే మెచ్చులు మెచ్చి విరులు నీపై గుప్పె
బాలఁదెచ్చి యింతనేరుపరిఁ జేసితి
వాలిక చూపులు నీపై వంచె నొక్కమాటె నేఁడు
పోలికలు నాఁడె నూరిపోసితివేమో

చ. 3: పిడికిట విడెమిచ్చి బిగువుఁ జన్నుల నొత్తీ
పడుచుఁ దెచ్చిఁ దిట్టఁగా గడుఁ జేసితి
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
బెడఁగుటాన మొలవఁ బెట్టితివేమో

రేకు: 1634-4 భైరవి సం: 26-202

పల్లవి: విరహతాపముచేత విసిగె నిందాఁకాను
యిరవై మొక్కులు మొక్కి నిదివో నీ దేవుఁడు

చ. 1: చెంపలఁ జెమటఁగారీ సెలవుల సిగ్గు లూరీ
గుంపుగట్టి మూఁపుమీఁదఁ గొప్పుజారీని
పెంపుడుఁజిలుక చేత పీఁటమీఁదఁగూచున్నది
ఇంపుతోడఁ జిత్తగించు ఇదివో నీ దేవుడు

చ. 2: మోమునఁ గళలుమూఁగీ ముక్కన నిట్టూర్పు రేఁగీ
వేమరుఁ జన్ను లురాన విట్టువీఁగీని
తామెరపువ్వు ధరించి దండనె కాచుకున్నది
యేమని మాటాడవయ్య ఇదివో నీ దేవుఁడు

చ. 3: కాయమెల్లా బులకించీ కాఁగిలిరతికిఁ బొంచీ
తీయని కెమ్మోవిమీఁద తేనెలు మించీ
పాయపు శ్రీవేంకటేశ పానుపుపై నిన్నుఁగూడె
యీయెడ నలమేల్మంగ ఇదివో నీ దేవుఁడు

రేకు: 1634-5 పాడి సం: 26-203

పల్లవి: వెలయ నానతీవయ్యా వినే నేను
తలపోఁతలో నీకుఁ దమకము గలదో

చ. 1: పంచనున్న నీ సతితో పంతాలు నే నాడఁగాను
మంచి మాటలెల్లా నీవు మాతో నాడేవు
పొంచి ఎవ్వరైనా నిన్నుఁ బొగడఁగవలశో
నించి నీదయ నాపై నిజాలకుఁ గలదో

చ. 2: చాయలకు నీ ఇంతితో చలము సాదించఁగాను
సేయరాని వినయాలు సేసేవు నీవు
నాయగాఁడవు గనక నమ్మించవలయశో
యీయెడ నిట్టె నీవే నన్నేలుకొనేవిధమో

చ. 3: అలమేల్మంగ నీచెలి ఆపెకు నే మొక్కఁగాను
సులభుఁడవై నాకు సొమ్ములిచ్చేవు
యెలమి శ్రీవేంకటేశ యెవ్వరైనాఁ జెప్పిరో
వలెనని నీవు నాకు వలచిన తెరఁగో

రేకు: 1634-6 బౌళి సం: 26-204

పల్లవి: ఎంత బాసలు సేసినా యెవ్వరును నమ్మకు
చెంత నీ ముచ్చుము ఆపెచేత నుంది గనక

చ. 1: నీ వేలి వుంగరము నెలఁత దాఁ బెట్టుకొని
వావి చెప్పీ నీకుఁదాను వదినంటాను
కావిరి నీవిఁక లోనుగాక వుండినాను నీ-
దేవులనే అడుదురు తెలివ లిందరును

చ. 2: గిద్దించి నీ మెడనున్న కంఠమాల దాఁ బెట్టుక
సుద్దులెల్లాఁ జెప్పీని చుట్టమనంటా
బుద్దుగాదనుచు నొకడఁబరచి యేమిచెప్పినా
అద్దుక నీ పొందుదని అడుదురు సతులు

చ. 3: కడియాలు నీ చేతివి గక్కనఁ దాఁ బెట్టుకొని
అడియాలాలు చెప్పీని ఆల నంటాను
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగను
జడియఁ గూడితి వాకెసవతెందు రింతులు

రేకు: 1635-1 బౌళి సం: 26-205

పల్లవి: పదరంగవచ్చుఁగాని పంతమియ్యరాదు మరి
పొదిగి ఇంతేసి నీకు బుద్ది చెప్పవలెనా

చ. 1: అలుగఁ బోతే నీకే అదరించవలసీని
బలిమి చెల్లదు నీకుఁ బక్కన మాతో
తలవంచుకొంటేను తమకించ వలసీని
తెలిసినదే తేటతెల్లమిగావలెనా

చ. 2: వుల్లసాన నవ్వఁబోతే వొడఁ బరచవలసీ
కల్లగా దిప్పటియట్టు గాదు మీఁదను
వొల్లక బిగియఁబోతే నుస్సురనవలసీని
యెల్లవారుఁ జూడఁగాను ఇంతేసి వలెనా

చ. 3: కాలుఁ దొక్కఁబోతేను కడు మొక్కవలసీని
చాలుఁ జాలు నిఁకనేల చలపాదాలు
యేల యింక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
మేలు మేలు సారెసారె మేలమాడవలెనా

రేకు: 1635-2 ముఖారి సం: 26-206

పల్లవి: నీమన సింకా రాదు నే నేమి సేతురా
యేమాట కామాట ఇంతేల దూరులు

చ. 1: అంటినా నిన్నేమైన నందరిలోఁ బచ్చిసేసి
కంటకములాడితినా కపటాలెత్తి
వెంట వెంట నీ గుట్టు వెల్లవిరిసేసితినా
ఇంటిలోన నున్నదాన నిఁక నేలదూరులు

చ. 2: రమ్మంటినా నిన్ను రమణివద్ద నుండఁగ
సొమ్మల మోవికెంపులు చూడఁబోతిని
నెమ్మది నీ యానలలో నేఁదప్పువట్టితిని
వుమ్మడినే వున్నదాన నూరకేల దూరును

చ. 3: యీడ నన్నుఁ గూడి చిత్త మేడ నున్నదంటినా
వాడుమోము తెల్లఁ బారవద్దంటినా
యీడులేక శ్రీవేంకటేశ కూడితివి నన్ను
వేడుకతో నున్నదాన వేయేల దూరుదు

రేకు: 1635-3 దేసాళం సం: 26-207

పల్లవి: పూజ లందురుఁ జేసేదే పుష్పయాగము
ఆజి నర్జునుఁడు చేసినది పుష్పయాగము

చ. 1: మొదల శ్రీసతిచేతి మోవానకమలమే
పొదల నీకెపుడును పుష్పయాగము
గుదిగొన మిమ్మిద్దరిఁ గూడించే మరువిరులు
పొదిగి పూజించిన పుష్పయాగము

చ. 2: మాలాకారుఁ డిచ్చిన మధురలో పూదండ
పోలింప నీకు నదె పుష్పయాగము
కేలితో నారదుఁ డొసగిన పుష్పయాగము
భూలోకమున నీకుఁ బుష్పయాగము

చ. 3: తొరలి అలమేల్మంగతురుమువిరులే నీకు
పొరసి నీవురముపై పుష్పయాగము
సిరులతో మునులెల్ల శ్రీవేంకటాద్రీశ నీకు
పారిఁ బొరిఁ జేసేరు పుష్పయాగము

రేకు: 1635-4 రామక్రియ సం: 26-208

పల్లవి: ఎంత అట్టుసేసుకొనే విందుకుఁ గాను
వింతలుగా నన్ను నెట్టు వేఁడుకొనేవు

చ. 1: అట్టె యాడనుండితేనే అలిగిన జాడలా
బెట్టిమాఁట లాడితేనే పెనుఁగోపమా
పొట్టఁ బొరుగున నుంటే పొంచులు వినుటలా
యిట్టు నట్టు వట్టి దూరు లేల దూరేవు

చ. 2: తప్పక చూచితేనే తగఁ జొప్పు వెదకుటా
నెప్పున నెందుంటివంటే నేరమెంచుటా
యిప్పుడు లోన నుండితే యెలయించిన చందమా
వుప్పతించి మమ్మునేల వోవలు సేసేవు

చ. 3: సెలవుల నవ్వితేను చేరి యెగసక్కేమా
కలువల వేసితేను కాఁతాళమా
అలమేలుమంగ నేను అట్టె శ్రీవేంకటేశ
యెలమి నన్నుఁ గూడితి వేల సాదించేవు

రేకు: 1635-5 నాదరామక్రియ సం: 26-209

పల్లవి: తప్పితారినపనికి తగ నేమి సేయవచ్చు
చిప్పిల నేఁ గంటినంటా సిగ్గువడనేఁటికి

చ. 1: చెక్కుపై చెమట చెలి చేతఁ దీసివేసితేను
మిక్కుటమై సంగడి నీమేన నిండెను
అక్కజపు గందవొడి యందుపైఁజల్లుకోవయ్య
చొక్కపు సతులు నీపై చొప్పులెత్తకుండాను

చ. 2: కొప్పు వేఁకము గాఁగాను కొమ్మ విదలించితేను
పుప్పతిల్లి విరులు నీవొళ్లిపై రాలె
దుప్పటి మఱఁగుగాను తోడనే కప్పుకోవయ్య
ముప్పిరిఁ గాంతలు నిన్నుఁ దప్పులెంచకుండాను

చ. 3: నిన్ను నలమేలుమంగ నెమ్మదిఁ గాఁగిలించితే
చన్నుల మీఁది కుంకుమ చాలా నంటెను
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పన్నీరు చల్లుకోవయ్యా కన్నె లాడకుండాను

రేకు: 1636-1 శ్రీరాగం సం: 26-210

పల్లవి: ఉమ్మడినే వుండినట్టే వుండనియ్యరా
కమ్మి యేమైనఁ బైఁడికత వో నా పొందులు

చ. 1: మట్టులేక నీవు నన్ను మాటలాడించకురా
గట్టి వజ్రపుదంతాలగని మానోరు
చెట్టముట్టి నీవు నన్నుఁ జెమరించకురా
వెట్టయయిన వలపులవెల్లి వో నామేను

చ. 2: మాటలాడి నీవు నన్ను మరిగింపించకురా
కాటుక కన్నుల గీము గందు నామోము
ఆఁటదానఁ బెనఁగి నన్నలయింపించకురా
గాఁటపుటెఱ్ఱని గోళ్లగాతలు నాచేతులు

చ. 3: బచ్చెనరతుల నన్ను భ్రమయింపించకురా
మచ్చుల పాయములోని మంపు నామతి
ఇచ్చట శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నిచ్చ కల్యాణమునకు నెలవు నా వంతము

రేకు: 1636-2 పాడి సం: 26-211

పల్లవి: ఇంక నేలే కొసరు ఇదె అసురుసురు
సంకెదేరె తనకిన్నీ సరివచ్చె ననవే

చ. 1: పనిలేనిపిలుపు బయలీఁతవలపు
వొనర నెంతసేసినా వొల్లనొల్లనే
మనసుముట్టనిమాఁట మాయామృగము వేఁట
తనకె ఇన్నియుఁ జెల్లు తతి వచ్చె ననవే

చ. 2: వచ్చి వెచ్చి నవ్వులు పసలేని రవ్వలు
తచ్చి వేసి నా మీఁద దనిసితినే
నిచ్చ నిచ్చ అసలు నెరులపై సేసలు
అచ్చుపడెఁ దన కిన్నీ వద్దము లేదనవే

చ. 3: చెల్లుబడియానలు చెమటలసోనలు
కల్లగారు యిందుకు నేఁ గరఁగితినే
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
మొల్లమాయ రతులివి మొక్కితి నే ననవే

రేకు: 1636-3 గౌళ సం: 26-212

పల్లవి: అందువల్లఁ గానవచ్చీ నన్నివేడుకలు నీకు
సందుసుడిమోహమెల్లా చవిగొనరాదా

చ. 1: సవతుల నిద్దరిని సరిఁ బెనఁగు మనేవు
యివల నీ కందువంక నేమివచ్చెను
జవళి నొకరొకరిసత్వ చూడవలసితే
తివిరి నీ కాఁగిట సోదించి చూడరాదా

చ. 2: పొలఁతుల మిద్దరిని పూఁచి పందేలాడించేవు
యెలమి నీ కందువంక నీమి వచ్చెను
నెలకొని వారివారి నేర్పు చూడవలసితే
కలదెల్లా యేకతానఁ గనుఁగొనరాదా

చ. 3: ఇంతుల నిద్దరి నొరయించేవు శ్రీవేంకటేశ
ఇంతసేయఁగా నీకు నేమి వచ్చెను
పంతాన నన్నేలితివి బత్తి వారిపయిఁ గలితే
అంతలోనే నీవు పెండ్లాడి చూడరాదా

రేకు: 1636-4 సామంతం సం: 26-213

పల్లవి: ఏమీ ననఁ బనలేదు యియ్యకొనుటే మేలు
కామించినవాఁడవు కలయఁగ నేరవా

చ. 1: గట్టిగా నీవు సేసిన కల్లలైనా నిజముగా
నెట్టన నిలుపఁబెట్టనేరవా నీవు
దిట్టవై వాడలోసతిఁ దెచ్చుకొన్నవాఁడవు
చుట్టరికాలు కలయఁ జూపి చెప్పనేరవా

చ. 2: వచ్చి వచ్చి యాపె నెరవాదిఁ జేసినవాఁడవు
నిచ్చలునుఁ గొనియాడ నేరవా నీవు
కచ్చు పెట్టి వల పొడిఁగట్టు కొన్నవాఁడవు
దిచ్చరివై మమ్ము సమ్మతించఁజేయనేరవా

చ. 3: పుక్కట నన్నిటా నీవు బోగించినవాఁడవు
నెక్కొని ప్రియము చెప్పనేరవా నీవు
యిక్కువ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గక్కన నామోము చూచి కడు నవ్వనేరవా

రేకు: 1636-5 హిందోళం సం: 26-214

పల్లవి: తానేల దూరీని దంటదాన నంటాను
మోనాన నుండితేను ముమ్మాటికి మొక్కనా

చ. 1: చలములు సారె సారె సాదించ వద్దు గాక
తలఁపుకొలఁది నుంటే తగదనేనా
బలిమిఁబెనఁగితేను పంతమాడుకొందుఁ గాక
పిలిచి లాచించితేను ప్రియములు చెప్పనా

చ. 2: ఆయములు ముట్టి ముట్టి అలఇంచవద్దు గాక
చాయసేసుక వుంటేను సమ్మతించనా
రాయడిఁ జన్ను లంటితే రవ్వగా జంకింతుఁగాక
నాయములు నడపితే ననుపుతో నవ్వనా

చ. 3: బాసలెల్లాఁ జేసి చేసి భ్రమయించవద్దు గాక
ఆసయిచ్చి కూడితేను అట్టే మెచ్చనా
సేసవెట్టి కూడినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
వేసరక వుండితేను వేడుక చెల్లించనా

రేకు: 1636-6 ఆహిరి సం: 26-215

పల్లవి: ఏరాలిఁ బొగడఁగా యేమీ ననము గాక
మీ రింతేసిజాణలు మీకే తెలుసునే

చ. 1: జక్కవలు చన్నులట చందురుఁడు మోమట
వక్కణించి సింగారము వర్ణించేదేమే
ముక్కు సంపంగిపువ్వట మొగిఁ గొప్పు తేఁటులట
మిక్కిలితగవరులు మీకే తెలుసులే

చ. 2: కరికుంభజగనట ఘన సింహమధ్యయట
ఇరవుగా నెరి గిది యెట్టు వోల్చేరే
సరిగురు లురులట చకోరాలు కన్నులట
మెరమెచ్చుమాటలు మీకే తెలుసులే

చ. 3: చేతులు తామరలట చెమట లేమంచట
యేతులకు బురుణించ నింత యేఁటికే
యీతల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
మీతరుణి బాగులెల్లా మీకే తెలుసులే

రేకు: 1637-1 శంకరాభరణం సం: 26-216

పల్లవి: ఎంతనేర్చెనే యీా కలికి
ఇంతులకేఁటికే ఇంతేసి పగటు

చ. 1: చలములు నెరపుచు సవతుల దూరుచు
సలిగెలఁ బొరలీ జపరాలు
చెలవుని సొలయుచు చేతులు చాఁపుచు
కెలపుల నగవులఁ గెరలీని

చ. 2: సొటికిఁ బెనఁగుచు సణఁగులు రాల్చుచు
నీటులన మురిసీ నెరజాణ
మాటల గునియుచు మదమున మొరయుచు
జూటుఁదనంబునఁజూచీని

చ. 3: మంతనామాడుచు మలయుచు నవ్వుచు
పంతములాడీ పసలాఁడి
యింతలో శ్రీవేంకటేశుఁడు నన్నేలె
పొంతనుండి ననుఁ బొగడీని

రేకు: 1637-2 నాదరామక్రియ సం: 26-217

పల్లవి: చిత్తగిచవయ్య నీకు సిగ్గులు వడఁగనేల
కొత్తగాను తనలోనికోరి కెంతగలదో

చ. 1: వాలుకచూపులు నీపై వంచి మాటలాడీఁ జెల
తాలిమిలేని మనసుతమి యెట్టిదో
వేళగాచి విన్నవించీ వేసర దెంతెనాను
వాలియించి నీయెడకు వల పెటువంటిదో

చ. 2: చన్ను లొరయఁగను నీ సంగడిఁ గూచుండీఁ దాను
సన్నల నీతోడిరతిచవి యెట్టిదో
తన్నుఁదానె నవ్వునవ్వీ తనియఁదెంతైనాను
యిన్నిటా నీమీఁదటియేఁకట యేలాగుదో

చ. 3: గక్కనఁ బాదాలొత్తుతా కాఁగిలించీ నీ దేవుఁడు
వెక్కసమైన తన వేడు కెట్టిదో
యిక్కువ శ్రీవేంకటేశ యీకెను మన్నించితివి
మొక్కుతానే నెంచి మెచ్చి ముదము బొందినదో

రేకు: 1637-3 వరాళి సం: 26-218

పల్లవి: అమరఁ జెప్పే వప్పటి అందరితోడా నీవు
తిమురుచు నీ సుద్దులు తేట పడకున్నవా

చ. 1: అందెలరవళితోడ ఆపె వెంటరాఁగాను
విందువలె నా చప్పుడు వినకున్నారా
కందువ సొమ్ముల మాణికములు వెలుఁగఁగాను
అందులో చీఁకటితప్పు అణఁచఁగ వచ్చునా

చ. 2: కోవిలఁకూతలతోడ కోరి యాపె మాటాడఁగా
ఆవల పొరుగువారు ఆలకించరా
వావిలి పుష్పకోమలి వాసనలు నిండుకోఁగా
మూవంకల నీచేతలు మూసి దాఁచవశమా

చ. 3: గుట్టున నీవ్దనె కొలువై ఆపె వుండఁగా
చుట్టరిక మందురును చూడకున్నారా
ఇట్టె శ్రీవెంకటేశ యేలితివి నన్ను నేఁడు
రట్టు తొల్లిటాపె పొందాఁబడి కెక్కఁ దగదా

రేకు: 1637-4 సాళంగనాట సం: 26-219

పల్లవి: ఎవ్వరికిఁ జెప్పేవే యీ సుద్దులు
నవ్వు వచ్చీ నిన్నుఁ జూచి నీకు నాకే యిపుడు

చ. 1: చనవరిదానవు సముకానఁ బతికి నీ -
మనవులు చెప్పేవు మాటిమాటికి
పనిగల దానవు పాదాలు పట్టుకొని
పెనఁగే వాతనితోను పెద్దరికమునను

చ. 2: సందుసుడిదానవు చప్పన వుప్పన చేసి
విందులు చెప్పవచ్చేవు విభునికిని
పొందుగలదానవు పూనుకవాసుకవచ్చి
గందము వూసేవు మేన కడు బత్తితోను

చ. 3: చుట్టరికపు దానవు సొలసి కాఁగిలించేవు
యిట్టే నీవు శ్రీవేంకటేశ్వరుని
వట్టువాడిగపుదానవు వడి నన్ను నీతఁడేలె
మట్టుమీరి మెచ్చేవు మాకు నితవరివి

రేకు: 1637-5 హిందోళవసంతం సం: 26-220

పల్లవి: జఱయుచు మీ వలపు సరిబేసులాయ నేఁడు
గుటిగా బెఁజెమటలు కురిసీ మేనులను

చ. 1: కొంకక నీ వ్రూఁదినట్టి కొనగోరుతాఁకులకు
జంకెన చూపులు నీపైఁ జల్లీ జెలి
కొంకపు పయ్యదకొంగు పారలఁదీసినందుకు
మంకుల వొట్టువెట్టి మారుకొనీని

చ. 2: సంగడిఁ జన్నులమీఁద చాచిన నీపాదాలకు
ముంగిటి సిగ్గులు పై పై ముంచీఁ జెలి
ముంగురులు వట్టి తీసి మోవి చవిగొన్నందుకు
కెంగేలు గీలించి గిలిగించీని

చ. 3: శ్రీ వేంకటేశ కాఁగిట చిమ్మి రేఁగిన యందుకు
నీ వదనాన బాగలు నించీఁ జెలి
చేవమీర నింతలోనె చేరినన్ను నేలితివి
భావించి మెచ్చి మెచ్చి పంతమాడీని

రేకు: 1637-6 మేచబౌళి సం: 26-221

పల్లవి: వట్టి విచారములేల వాడలు దిరుగనేల
చుట్టమవయ్యేవుండి సూడువట్టరాదా

చ. 1: యింతితోడ నవ్వినవాఁడ వింటికి రారాదా
చెంతలనే యీాడ రచ్చ సేయఁగ నేల
పంతగాఁడ వైతేఁగన పడఁతులనెల్లాఁ గూర్చి
చింతదీర తగవులు చెప్పించుకారాదా

చ. 2: మోము చూచినవాఁడవు మొగిఁ గూచుండఁగరాదా
సాము లేమిసేసేవు సటలకును
నేమముగలితేఁగన నెలఁతలఁ గూడపెట్టి
కామ శాస్త్రములు చూచి గతి గనరాదా

చ. 3: మోవి యిచ్చినవాఁడవు ముచ్చటాడరాదా
శ్రీవేంకటేశ యేల సిగ్గు పడేవు
కావరమెక్కితేఁగన కాంతలను మందడిగి
భావములో కసటెల్లా బాపుకొనరాదా

రేకు: 1638-1 బౌళి సం: 26-222

పల్లవి: చెప్పకుండితేఁ బోదిఁక చెలికత్తెలము నేము
కప్పి అన్నిటి కాపెనే కాఁగిలించరాదా

చ. 1: తవిలి ఇంతులతోడ తారుకాణకు వచ్చేవు
పువిద నీ ఇంటిలోన నున్నది లేదా
వివరించి నిజములే వేమారు నెరవేవు
అవల నీ మేన నున్న దాపె సొమ్ముగాదా

చ. 2: వోపుదునంటా నీవు వొట్లు వెట్టుకొనేవు
మాపుదాఁ నాపెతోడ మాటలాడవా
పైపై నిట్టె మాతో బాసలు సేసేవు గాక
యేపొద్దు నాపె చింత నీయెదలోనఁగాదా

చ. 3: పలుమారు యీ నేమమే చారించవచ్చేవు
యెలమి యీమోవి ఆపె యెంగిలి గాదా
నెలవై శ్రీవేంకటేశ నేఁ డీకెఁగూడితివి
అలరి యీపొందు లాపె అనుమతే కాదా

రేకు: 1638-2 లలిత సం: 26-223

పల్లవి: మేలయ్యా నీభాగ్యము మెచ్చితి నేను
పొలించి మిమ్ముఁ జూచి పొగడేరు సతులు

చ. 1: కొండలు(ల?) వంటి చన్నులు కొమ్మఁ గలిగితేను
నిండుఁ గళలు దేరీ నీ నెమ్మోమునను
దండి వేఁక మాపెకును తగు సంతోసము నీకు
వొండొరుల కెటువలె నొనగూర్చె దైవము

చ. 2: తీపులతో నాకె మోవి తేనేలు గారఁగాను
వోపికెతో మిక్కిలి నోరూరీ నూకు
రూపమెల్లా నాపెకు రుచులెల్లా నీకును
యేపున నిద్దరిని యెట్టు గూర్చె దైవము

చ. 3: పెంపుడరఁటులవంటి పెందొడ లాపెకుఁగల్తే
ముంపునఁ బులక లెట్టు మొలచె నీమై
సంపద లాపెకు నాకు సమరతి నీకును
ఇంపుతో శ్రీవేంకటేశ యెట్టు గూర్చె దైవము

రేకు: 1638-3 పాడి సం: 26-224

పల్లవి: నాకేల వెరచేవు నడుమ నీవు
నీ కిచ్చురాల నింతే నిన్ను మీరేనా

చ. 1: సారె జారేవచ్చుడము చక్కఁగప్పవచ్చితిఁగా
కీరీతి నీమేనఁ జొప్పులెత్తఁగవచ్చితినా
గోర దిద్దఁగ నామము కూరిమిఁ జూచితిఁ గాక
పోరి నొసలి లత్తుకబొట్లు చూచితినా

చ. 2: ఆకుమడిచి నీమోవి కంది నే నిచ్చితిఁగా
రేకగా మోవికెంపులు రేఁగఁగ నిచ్చితినా
పైకొని నీ చెమటలు పయ్యద నొత్తితిఁగాక
కాకుసేసి నిన్ను చనుఁ గవల నొత్తితినా

చ. 3: కందువ నీచెలిలో నేకతము లాడితిఁగాక
నిందలు గడించి నేఁడు నీతో నాడితినా
యిందునె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అందాలు సేసితిఁగాక యాఱడి సేసితినా

రేకు: 1638-4 రామక్రియ సం: 26-225

పల్లవి: తొల్లిటి నాకంటెను దొడ్డదా తాను
పల్లదాలు నేర్చితేనే బలిమి గలిగీనా

చ. 1: రమణునియెదుటనే రాజసముచూపీని
తిమురుచు నిందుఁగాని తేటపడదా
తమకించి మురిసీని తా నిన్నాళ్లదేకాదా
కొమరె వయసైతే నెక్కుడుగర్వ మెక్కెనా

చ. 2: మగఁడు లినఁగానే మాట లెన్ని యాడీనే
పగ టిందుఁగాని యేరుపడదాయనా
నగీ నూరకయైనా నాతులలోనెల్లాను
మిగులా వలచితేనే మేర మీరవలెనా

చ. 3: శ్రీవేంకటేశువద్దనే చేఁత లెన్ని సేసీనే
కావర మిందునఁగాని కానిపించదా
యీవేళఁ దన్నుఁగూడి యీతఁడే నన్ను నేలె
వావి చెప్పీ దీనివల్ల వన్నె వచ్చెనా

రేకు: 1638-5 శంకరాభరణం సం: 26-226

పల్లవి: నే మేమనేము నిన్ను నీకేల సిగ్గుపడ
దీమసాన మీరిద్దరుఁ దెలుపుకోరే

చ. 1: చెలపల చెమటలు చెక్కుల పులకలు
వలపుకొలఁదిఁగాక వచ్చీనటే
మలకలమాట లాడి మాతోనేల మొరఁగేవు
అలవాఁడే నీ విభుఁడు అడుకోఁగదే

చ. 2: కనుఁగొన చూపులును కడలేనియాసలును
ననుపు కొలఁదిగాక నాటేనటే
మనసుమర్మాలు చెప్పి మమ్మేల నమ్మించేవు
పనివడి మగనికే బాస తీయఁగదవే

చ. 3: నయగారి సేఁతలును నవ్వుల సొలపులును
ప్రియము కొలఁదిఁగాక పెరిగీనటే
నియతాన నీవు గూడి నేఁడు నన్నేలించితివి
క్రియ శ్రీవేంకటేశుఁడే కెరలించవే

రేకు: 1638-6 నాదరామక్రియ సం: 26-227

పల్లవి: తనుఁ దడవితేనే తడవఁగ వలెఁ గాక
చనవిచ్చి మిగులాను సాదించీ తాను

చ. 1: అందరు సతులు మాటలాడుకోఁగా నీతఁడు
మందలించి సందుసుడిమా టాడీఁదాను
పొందుగాఁ గొమ్మలు వంచి పువ్వులు గోయఁగాను
మందెమేళముననుు వేమరు నవ్వీఁదాను

చ. 2: చెలు లొక్కరొకరే సింగారించు కొనఁగాను
అలరుచువచ్చి చీర లందిచ్చీఁదాను
పొలయుచు నేఁడు వనభోజనాలు సేయఁగాను
అలమి పొత్తుల నుండి ఆరగించీఁదాను

చ. 3: మేరమీరి చెలులెల్లా మేడమీఁద నుండఁగాను
కోరి వరుసవెట్టుక కూడీఁదాను
యీరీతి శ్రీవేంకటేశుఁ డీమెయింటికి రాఁగా
పేరుకొని సేసలెల్లాఁ బెట్టేఁదాను

రేకు: 1639-1 లలిత సం: 26-228

పల్లవి: నేమంత నేరుతుమా నేరుపులు తనతోను
గామిడి సతులయందే కనుఁగొను మనవే

చ. 1: బలిమిఁ జేసేపనులు పంతగత్తెలుఁగాక
కలుపుకోలు గులుగుకాంతలకేలే
చలము సాదించేది మచ్చరపు వారికిఁగాక
సులభులై యుండిన చుట్టాలకేలే

చ. 2: రా రాఁపుఁదనములు రవ్వలవారిఁగాక
సారె నోజగలిగిన సతులకేలే
బీరమలు నెరపేది బేసబెల్లులకుఁగాక
మేరతోఁ బెండ్లాడినమేనవారికేలే

చ. 3: అలయించి కూడేది గయ్యాళిమేంట్లకుఁగాక
వలచిన గుట్టుతోడి వనితకేలే
యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁడిట్టె నన్ను నేలె
సొలపులు మావంటి సుదతులకేలే

రేకు: 1639-2 మంగళకౌసిక సం: 26-229

పల్లవి: ఏమయ్య చూచినవారు ఇందరును నగరా
నీ మనసు గరఁగితే నిండకుండ రాదా

చ. 1: చెప్పరాని విన్నపాలు సేసుకొంటి నల్లనాఁడె
అప్పటి నేమిటికాడే వా మాటలు
చిప్పిలుఁజెమటలతో చేతులెత్తి మొక్కితిని
ఇప్పుడేల చేయిచాఁచే వింకా నీవు

చ. 2: ఇవల నీసేవసేసి ఇన్నిటా మండాడుకొంటి
అవియేల తలఁచేవు ఆసుద్దులు
చివురుఁ జేతులను నీచెక్కు నొక్కి వేడుకొంటి
జవళి నేమిటికి నాసలఁబెట్టే విప్పుడు

చ. 3: ముట్టుకుమనుచు నీతమ్ములము నేఁ జవిగొంటి
అట్టే విడువరాదా ఆకతలు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
చుట్టమ నయితి నెంత చొక్కులఁ బెట్టేవు

రేకు: 1639-3 దేసాళ సం: 26-230

పల్లవి: నీవెంతసేసినా నీకె నిన్ను మీరీనా
కావరించేవు మచ్చము గనేనంటా నీకెను

చ. 1: చలపట్టి నీవేల సాదించవచ్చేవు
నలినాక్షి గోర నూఁదె నవ్వుతా నిన్ను
మలసి యంతేసి దిమ్మరితిల్లు దిట్టేవు
చలిగొనఁ బన్నీరు చల్లెనంటా నీపెను

చ. 2: పంతములాడఁగ నేల పలుమారు నాకెతోను
వింతవింతమాటలడే వేడుకకును
పొంతనుండి వూరకైనా బొమ్మల జంకించేవు
దొతిఁబెట్టి పాదములఁ దొక్కెనంటా నీపెను

చ. 3: వాసులేల నెరపేవు వడి నలమేల్మంగతో
రేసువోఁ జుట్టిరికమే పూసె నీకును
అసవెట్టి శ్రీవేంకటాధిప కూడితి విట్టె
సేసకొప్పు వంచి బత్తిసేసెనంటా నీపెను

రేకు: 1639-4 పాడి సం: 26-231

పల్లవి: పలుమారు మాకె మాకె బాఁతిడే మింతేకాక
తలఁకేవే కోరికలు దక్కివున్న విపుడు

చ. 1: శిరసుపై సేసెవెట్టి చేత విడెమిచ్చి చెలిఁ
దెలవేసి రతికిని దిద్దకొంటివి
తొరలించి యెవ్వరు పొందులు నీతో జేయకున్నా
సిరులతో వెఱచేవా చెతఁజిక్కివేడక

చ. 2: పక్కఁబెట్టు కాపెతోడ పచ్చిమాటలెల్లా నాడి
చెక్కునొక్కి కైవశము సేసుకొంటివి
తక్కించి యెవ్వతె నీకుఁ దరితీపు సేసినాను
కక్కదలేవా కు కడుఁ దనివొందెను

చ. 3: మంచముపై నిడుకొని మనసు రంజిల్లఁ జేసి
పెంచి యలమేలుమంగఁ బెండ్లాడితివి
యెంచి నన్నుఁ గూడితివి యిప్పుడే శ్రీ వేంకటేశ
పొంచేవా నీవలపులు కొల్లలాయ నెదుట

రేకు: 1639-5 నాగవరాళి సం: 26-232

పల్లవి: ఊరకుండితేఁ గనుక వుడివోవు పాయము
దూరి బుద్ది చెప్పి పతిఁ దోడితేఁగదరే

చ. 1: బడి వాయకుండితేనే భావములు గరఁగును
వొడలు సోఁకితేఁ దమి పుట్టిపడును
నిడువక చూచితేనే వేడుకలు పెచ్చురేఁగు
చిడుముడి మాఁటాడితే సిగ్గు గొంత దేరును

చ. 2: సెలవుల నవ్వితేనే చేఁగలించు మోహము
పిలిచి పేరుకొంటేనే ప్రియము పుట్టు
వలపులు చల్లితేనే వాడికలు దైవారు
చెలిమి సారెఁజేసితే చేతికి లోనౌను

చ. 3: సరసము లాడఁగానే చవులు వెగ్గళమవును
గరిమలఁ బెనఁగితే కళలు నిండు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తిరమై వుండితే మోవితేనెకు నోరూరును

రేకు: 1639-6 రామక్రియ సం: 26-233

పల్లవి: ఇటమీఁద నీవు మరి యేమిసేసేవు
చిటుకన నేమే అక్కచెల్లెండ్ల మైతిమి

చ. 1: తతిగొని చేప్పేవు తగవులు నీకు నీవే
యితవరివలెనే యీకెకు నాకు
మతకారివాఁడవు నీ మర్మము నేనెఱుఁగుదు
సతుల మిద్దరమును సంతమైతి మిపుడు

చ. 2: నెట్టుకొని సాకిరై నిలిచేవు నీవే వచ్చి
చుట్టము వలెనే వుండి సారిది మాకు
గుట్టువాయవాఁడవు నీ కతలు నే నెఱుఁగుదు
గుట్టున బాసలు సేనుకొంటిమి నే నిపుడు

చ. 3: యీవేళ పొందులు విడే లిచ్చేవు చేత నీవే
భావ మరఁటివలెనే పైపై నీవు
శ్రీవేంకటేశ్వరుని చత్తము నేనెఱుఁగుదును
యీవర సవతులమై యీడేరితిమిపుడు

రేకు: 1640-1 సామంతం సం: 26-234

పల్లవి: ఎంత తమకపడేవు యింతలో నీవు
వింతగాఁ జెనకి తెరవేయఁగవలెనా

చ. 1: బలిమేల సేసేవు పయ్యదేల ముట్టేవు
అలరి మాట గలితే నానతీరాదా
పిలువఁగా వస్తి నింతే పెనఁగినదానఁ గాను
కలయ లోనికిఁ దీసి గడెవెట్టవలెనా

చ. 2: సన్నలేల సేసేవు సారెనేల నమ్మించేవు
చెన్నుగా వలసినట్టు సేయఁగరాదా
మననించఁగా నవ్వే నింతే మట్టుమీరేదానఁ గాను
మిన్నక నావొడి వట్టి మేడ యెక్కవలెనా

చ. 3: గోరనేల దూరేవు కొప్పేల దువ్వేవు
కూరిమిఁ బెండ్లాడితివి కూడఁగరాదా
యీరీతి శ్రీవేంకటేశ యెడసేటిదానఁ గాను
చేరి పచ్చడము గప్పి చెక్కు నొక్కవలెనా

రేకు: 1640-2 ఆహిరినాట సం: 26-235

పల్లవి: ఇందాఁకా నోరిచితి ఇంత చాలదా
కందువలెల్లాఁ దారుకాణించవలెనా

చ. 1: కక్కస మేమిటికే కడు నవ్వనోనంటే
వొక్కరీతి చాయసేసు కుండఁగవద్దా
తక్కరీఁడు తనచేఁత తనమనసే యురుఁగు
వెక్కసమ్మై నేనే యింత విచ్చి చెప్పవలెనా

చ. 2: వేగిర మేమిటికే వెనకఁ బలిచేనంటే
చేగదేరకుండా గుట్టుసేయఁగవద్దా
ఆగడీఁడు తనసుద్దులవి దలఁచుకొమ్మను
తీగెసాగ నందరిలో తెలుపఁగ వలెనా

చ. 3: చలము లేమిటికే విచారించుకొనేనంటే
కొలఁదితో నందు కియ్యకొనవద్దా
అలరి శ్రీవేంకటేశుఁ డంతలోఁ దా నన్నుఁ గూడె
మెలఁగి యింతలోఁ దన్ను మెచ్చు మెచ్చవలెనా

రేకు: 1640-3 శ్రీరాగం సం: 26-236

పల్లవి: చెలులాల విభునికిఁ జెప్పరే బుద్ది
చలపట్టి తను నింత సాదించవచ్చునా

చ. 1: మాటలు పొంకములాయ మనసు లొక్కటులాయ
గాఁటపునేర్పు తనందే కానవచ్చెను
వొటలేక తనతో నే నూఁకొనేటిదాననా
యేఁటికిఁ జెప్పీ సుద్దు లెంతవడైనాను

చ. 2: సేసలు కొప్పున నిండె సెలవుల నవ్వు నిండె
అసలువెట్టఁగ తానే అన్నిటా జాణ
వేసరక చేఁతలు భావించి చూచేదాననా
వొసరించి నను నెంత వొరసీఁ దా నిపుడు

చ. 3: కోరికలు దైవారె కూటములఁ జెల్లవారె
సారెకు వలపు తానే చవిసేసెను
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
పేరడి నింకా నెంత పెనఁగీ రతులకు

రేకు: 1640-4 కురంజి సం: 26-237

పల్లవి: ఎట్టు మఱవఁగవచ్చు నిటువంటి నీసుద్దులు
చుట్టమవైతివిగా సులభాన నిపుడు

చ. 1: నిగిడి నిన్ను జంకించి నే నాడినమాటలకు
నగితివిగా నీవు నాతోను
జిగి నీలుజాలమీఁద చేతులు చాఁచినందుకు
మొగము చూచితిగా మోదముతో నేఁడు

చ. 2: ఇచ్చకముతో నీకుఁ జేయెత్తి మొక్కినయందుకు
మెచ్చితివిగా నీవు మీఁదమీఁద
పచ్చిగా పానుమీఁద పాదములొత్తినందుకు
కుచ్చితివిగా కాఁగిట గురుతుగా నన్నును

చ. 3: వొొక్కటై ఇందాఁకా కొలువులు సేసినయందుకు
తొక్కితివిగా పాదము దోమటిగాను
ఇక్కువ నన్నేలితివి ఇంతలో శ్రీవేంకటేశ
చిక్కితివిగా నాపాల చెల్లుబడి నిచటా

రేకు: 1640-5 ముఖారి సం: 26-238

పల్లవి: బాపుబాపు మెచ్చితినే పడఁతి నిన్ను
రేపు మాపు నితనినే మరిగించుకొంటివి

చ. 1: సేయరానివినయాలు సేసిసేని రమణుని
చాయకుఁ దెచ్చుకొంటివి జాణవౌదువే
పాయకుండాఁ జెప్పరానిబాస సేఇంచుకొంటివి
నీయంతటి దెవ్వతె నెలఁతలలోనను

చ. 2: కడలేనికతలును కారణాలుఁ జెప్పి పతి -
నొడఁబరు కొంటివి వొద్దికాయనే
జడియక సేవసేసి చన విప్పించుకొంటివి
కడు నీగుణములు పొగడ నెట్టు వచ్చునే

చ. 3: పలుమారు మోవితేనెపదనులు చూపి చూపి
వెలయఁ గూడితివి శ్రీవేంకటేశ్వరు
యెలమితో నన్ను నేలె యీతఁడే అప్పటి నేఁడు
బలిమి నీతో నెట్టు పచరించవచ్చునే

రేకు: 1640-6 దేశాక్షి సం: 26-239

పల్లవి: కడవారు చెప్పతేను కదువెంగెమై వుండు
అడరి నీచేతులనే అంటి చూచుకోవయ్యా

చ. 1: వనితచెవుల నున్న వజ్రాల కమ్మలవొత్తు -
లొనర నీచెక్కులపై నున్నవి నేడు
మునుకొన్నవలపుల ముద్రలవె నున్నవి
తనర కు నివే యద్దము చూచుకోవయ్యా

చ. 2: కాంతనుదుట నున్నకస్తూరి వట్రున బొట్టు
అంతలోనే నీనొసల నంటివున్నది
చెంత నీరతికి నీలచ్చెన గురుతైవునది
వింతగా గోర గీరి వీవే చూచుకోవయ్యా

చ. 3: కలికికన్నుల నున్నకాటుకరేకలు నీ
పలచనికెమ్మోవి పాంగి వున్నవి
అలరి శ్రీవేంకటేశ ఆసె నన్నుఁ గూడితివి
చలివాయ నీపెదవి చాంచి చూచుకోవయ్యా

రేకు: 1641-1 వరాళి సం: 26-240

పల్లవి: నాతో నేమినవ్వేవు నడుమ నే వద్దనేనా
కాతరాన, నియ్యరాదా కప్పురబాగాలు

చ. 1: వేడుకకు వెలలేదు వేసాలకు గురిలేదు
ఆడవయ్యా మాటలెల్లా ఆపెతోడను
వాడిక రట్టెఱఁగదు వలు సిగ్గెఱఁగదు
చూడరాదా ఆపెమోము సూటిదప్పకుండాను

చ. 2: పాయము తప్పించదు భావము కొంచమెంచదు
సేయవయ్యా ఆపెదద్ద సేఁతలెల్లాను
కాయము తనివందదు గర్వము భయమందదు
వేయరాదా పందె మాపె వేయుమన్నట్టెల్లాను

చ. 3: కోరిక చాయకు రాదు గుణము కొనితేరాదు
చేరవయ్యా రతి కాపె చిత్తము రాను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మేరమీరకుండరాదా మెచ్చినందాఁకాను

రేకు: 1641-2 గౌళ సం: 26-241

పల్లవి: ఇప్పటనుండి మాటలేలరా వోరి
కొప్పువట్టి తీసినఁగా కోపము మానేది

చ. 1: చెక్కులపై, జేఁతలెల్లాఁ జేసినయప్పుడుగా
తక్కక నే నాడినపంతము వచ్చేది
పిక్కటిల్లు నీమోవి పిప్పి సేసినప్పుడుగా
చిక్కించి నామనసు నెంజిరివి దూరేది

చ. 2: సొగ్గు వాపి ప్రియములు చెప్పింకొన్నప్పుడుగా
తగ్గ కిందరిలో నాఁటదాన నయ్యేది
వొగ్గి చెప్పరానిపని కొడిగట్టించితేఁగా
నిగ్గుల నా కోరికలు నెరవేరేది

చ. 3: పాదాలపై యానకు లోఁబరచినప్పుడాగా
కాదనక నాచలము గానవచ్చేది
యీాదెన శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిటు
మోదమున నేఁడుగదా మొక్కులు చెల్లేది

రేకు: 1641-3 దేసాళం సం: 26-242

పల్లవి: కన్నులపండుగవై కానవచ్చె మీనుద్దులు
అన్నిటాఁ గడమ లేదు అనుమానాలేలా

చ. 1: వెలఁది శిరసుమీఁది విరులు నీపై రాలె
అలరి నీ చెమటలు ఆమెపైఁ జిందె
కలగంపలాయ మీ కందువైన వలపులు
యెలమి నప్పటి మాఁట లింకానేలా

చ. 2: ముదిత కరకజఁడ ముంజేతఁ దగిలె నీకు
అదె నీ కంటసరులు ఆపెపై నిండె
యెదుబడి మించె ఇద్దరి మీసింగారాలు
కొద దీరె మనసులఁ గొంచించనేలా

చ. 3: పువిదచన్నులు నీపురముపై వెలవెట్టె
కవనీకరము లాకెకాఁకిట కెక్కె
యివల శ్రీవేంకటేశ యిప్పుడే నన్నేలితివి
చవులాయ మీరతులు చాటి చెప్పనేలా

రేకు: 1641-4 శ్రీరాగం సం: 26-243

పల్లవి: చొక్కులఁబెట్టీ నేఁడు చూడవే తాను
పక్కన నిందరిలోన బయట వేతునా

చ. 1: తను నేమో అంటినంటా తారుకాణించుమనీని
వెనకటిసుద్ది వెల్లవిరిసేతునా
కొనచూపులఁజూచితే కొంగువట్టి పెనఁగీని
పనుపడ్డతనచేఁత వచ్చి సేతునా

చ. 2: వొడి వట్టితినంటాను వూరకే సోదనిచ్చీని
కడలేనిదొర తన్ను కాకుసేతునా
తడవి నవ్వితినంటా తగిలి యానవెట్టీని
అడఁకువ తనగుట్టు ఆరడిఁబెట్టుదానా

చ. 3: అట్టె చేయి వట్టితేను అడియాలా లిచ్చీని
రట్టుసేసి తన్ను రచ్చ నిట్టె వేతునా
యెట్టైన శ్రీవేంకటేశుఁ డింతలో నన్నేలినాఁడు
బెట్టి తనమోవియంతా పిప్పిసేతునా

రేకు: 1641-5 రామక్రియ సం: 26-244

పల్లవి: ఇందరు నీపెద్దరికా లెఱుఁగుదురే
సందడి సరసమాడ చలమరి వౌదువే

చ. 1: చెంతనుండి యంటిముట్టి సేవలెల్లాఁ జేసేవు
యెంతచనవరివే యీాతనికిని
బంతినుండి కూరల పలుచువులు చెప్పేవు
కాంతునిపై ఇంత బత్తిగలదాన వౌదువే

చ. 2: వట్టివేసాలఁ బూసుక వాసుక వచ్చే వీతని
కట్టు నిట్టుఁ జుట్టమవు నౌదువే నీవు
ట్టబయలు నడుమఁ బలుమారు మురిసేవు
బిట్టువాగెలఁ బెండ్లిపేరటాల నౌదువే

చ. 3: కందువఁ బాన్పుపై నుండి కాఁపురాలు సేసేవు
చెంది దేవులతము చెల్లువే నీకు
ఇందునే వేంకటేశుఁ డేలె నను నీకతాన
పందెమా డీతని నింతపనిగొంటి వౌదువే

రేకు: 1641-6 సామంతం సం: 26-245

పల్లవి: ఎటువంటి దొరతన మేమి నేరుచుకొంటివి
తటుకన నీకు నీవే తగ వెంచవలదా

చ. 1: ఆరగించ రమ్మని ఆపె నిన్నుఁ బిలువఁగా
చేరి నీసతికి విందు చెప్పుమనేవు
నేరపుతో వలచిన నీకుఁ బ్రియ మింతేకాక
యీరసపువనితలు ఇంత కోపఁగలదా

చ. 2: వేడుకతో నప్పటి విడేము కియ్యఁగాను
కూడా నున్నచెలి నందుకొమ్మనేవు
ఆడ నీవదినెయ్యైతే ఆపె నీకు దొడ్డుగాక
యీడుజోడు సవతులు యింత కోపఁగలరా

చ. 3: ఆకె కాఁగిటఁ గూడి అట్టె నిన్ను మెచ్చఁగాను
మేకొని నీ దేవులనే మెచ్చుమనేవు
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీకడాకడిసతులు యింత కోపఁగలరా

రేకు: 1642-1 లలిత సం: 26-246

పల్లవి: చూడరమ్మ సతులాల సోబానఁ బాడరమ్మ
కూడున్నది పతిఁ జూడికుడనాచారి

చ. 1: శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపుఁ గళ కేమరుదు
కోమలాంగి యీ చూడికుడుతనాచారి

చ. 2: కలశాబ్ధికూఁతురట గంభీరాల కేమరుదు
తలఁప లోకమాతయట దయ మరి యేమరుదు
జలజనివాసియట చల్లఁదన మేమరుదు
కొలఁదిమీర యీ చూడికుడనాచారి

చ. 3: అమరవందితయట అట్టె మహి మేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీవేంకటేశుఁ దానె వచ్చి పెండ్లాడె
కొమెరవయసు చూడికుడుతనాచారి

రేకు: 1642-2 బౌళి సం: 26-247

పల్లవి: నమ్మితిఁగదవే నిన్ను నాకుఁ జెల్లెలవంటాను
కమ్మరి నాతనితోడ కాకు సేతురటవే

చ. 1: వింటినే నా చెవులను విభునితో నీ వాడఁగా
అంటలేదనుచునేల ఆనవెట్టేవే
దంటవు నీవామాట తలఁచుకొనవే నీవే
టున నే నాడేనంటే నాకే సిగ్గయ్యీని

చ. 2: ఇట్టె కంటినే నాకన్నులెదుట సన్నసేయఁగా
గట్టిగా నాకేల మతకము సేసేవే
రట్టడివి నీవే యాగుట్టు దెలుసుకోవే
వొట్టి నే నడిగేనంటే వొగి నవ్వు వచ్చీని

చ. 3: నెఱిఁ బట్టుకొంటిఁగదే నీవే లేక లంపఁగాను
గుఱిగాక యేల మఱఁగులు వెట్టేవే
యెఱిఁగి శ్రీవేంకటేశుఁ డిద్దరి నేలినాఁడు
మఱి చూచుకొనేనంటే వెఱగయ్యీ నాకు

రేకు: 1642-3 వరాళి సం: 26-248

పల్లవి: వొద్దఁ గూచుండఁ గదవే వొడివట్టి తీసిసి
గద్దించి సొలతురా కాంతునితోను

చ. 1: చెలువుఁ డేమిసేసినా చేతికి లోనౌట గాక
చలము సాదింతురా సారె సారెకు
పిలిచి మాటాడితేను ప్రియము చెప్పుట గాక
బలిమిఁ బెనఁగుదురా పంతముతోను

చ. 2: జఱిశాతఁ డేమనినా సమ్మతించుట గాక
కఱకటిఁ బెట్టుదురా కాఁతాళానను
పఱపు పైకి రమ్మంటే బత్తి సేయుదురు గాక
వెఱగుతో బంకింతురా వేసటతోను

చ. 3: శ్రీవేంకటేశుఁ డేలితే చేకొని మెచ్చుట గాక
యీవలిమోమోడుదురా ఇంతసిగ్గుతో
వేవేగ నవ్వఁగాను వేడుకపడుటగాక
పూవులచెండునఁ గొని పొంచిపొంచి వేతురా

రేకు: 1642-4 కాంబోది సం: 26-249

పల్లవి: ఇచ్చకురాలఁ దొలుతే యేఁటికి లోఁగే నేను
విచ్చ నాతో సరసము నేఁడుగాక యెన్నఁడే

చ. 1: వొత్తి గుబ్బులు విసికీ వొద్దన్నా మానఁడు
చిత్తము వచ్చినయట్టు సేయుమనవే
హత్తి వలచినదాన నౌఁగాదనఁగరాదు
తత్తరపావయసు తన సొమ్ము గాదా

చ. 2: లవి మోవి పిప్పిసేసీ లావణ్య మొఱఁగఁడు
అలరి తా నాడినదే ఆట యననే
కులమునాలను తనకోరిక మానువరాదు
తలఁప నాభావమెల్లా తనసొమ్ము గాదా

చ. 3: మనసు గరఁగించీని మట్టుతోడ నిలుపఁడు
యెనసినాఁ డిఁక దనయిచ్చ యనవే
అనుగు శ్రీవేంకటేశు కడ్డమాడఁగాదు
తనరి నాసంతోసము తనసొమ్ముగాదా

రేకు: 1642-5 కురంజి సం: 26-250

పల్లవి: నేరుతువే అన్నిటాను నెపాననే వలపించ
మేరమీరే వింతలోనే మెచ్చులాఁడి వౌదువే

చ. 1: తెరలోని కిట వచ్చి తీగెసాగ మాటలాడి
వొరసేవే రమణుని వూరకే నీవు
సిరిమించ నవ్వు నవ్వి చేఁతల నట్టే కదిసి
సరమాడే వప్పటి జాణవౌదువే

చ. 2: చెంతలనే కూచుండి చేతులఁ బాదా లొత్తుతా
మంతనాన యీతనిమర్మము లంటేవు
కొంత మోవిసన్న చూపి గుబ్బులు మెయిసోఁకించి
దొంతిఁబెట్టేవు పొందులు దొరవౌదువే

చ. 3: వీడెము చేతకిచ్చితే వెసఁ బచ్చడము గప్పి
కూడేవు శ్రీవేంకటేశుఁ గూరిమితోను
యీడ నన్నేలె యీతఁడే యెఱుకలు సేసుకొని
జోడువాయ వెప్పుడును సుగుణవు నౌదువే

రేకు: 1642-6 ఆహిరి సం: 26-251

పల్లవి: చల్లఁగా బతుకవయ్య జాణతనాలు నేర్తువు
యెల్లచోట నీఁక దప్పు లెంచేమా నిన్నును

చ. 1: నేను విన్నవినికికి నీవుండేవునికికి
కానీలేరా అన్నీఁ దారుకాణ వచ్చెను
ఆసలేల పెట్టేవు అమరనేల చెప్పేవు
దానికేమి యెవ్వరైనాఁ దడవేరా నిన్నును

చ. 2: చేరి నాపూహలకు చేసేటి నీ చేఁతలకు
సారెకు నౌరా నేఁడు సరివచ్చెను
యీరీతేల కిందుపడే విచ్చకాలేల సేసేవు
నీరపమైతే నౌఁగాక నిలిపేరా నిన్నును

చ. 3: యిట్టె నేఁ గూడిందుకు యెన్నిక నీరతులకు
గట్టాయరా నీగుణాలు కతలాయను
నెట్టన శ్రీవేంకటేశ నీ వెంతవేఁడుకొనేవు
చుట్టమవైతివి యిఁక సోదించేరా నిన్నును

రేకు: 1643-1 ముఖారి సం: 26-252

పల్లవి: ఎఱఁగవచ్చెనే నేఁడు యెమ్మెలెల్లాను
తఱియాయ విభునిసాదము లొత్తఁగదవే

చ. 1: చలపాది తనమైతే సంగడిఁ గూచుండనేల
తలఁపు మానలేని కాఁతాళము గాక
అలుకే నిజమైతే అసలు చూపఁగనేల
కలిగి వలపుల గతులు గాక

చ. 2: కోపమే కలిగితేను కొసరు మాటాడనేల
రూపులేని కోరికలరుచులు గాక
రాఁపుల మచ్చరమైతే రమ్మని పిలువనేల
ఆఁపరాని తమకపుటలమట గాక

చ. 3: సిగ్గులే నిజమైతే సేవలు సేయఁగనేల
అగ్గలపురతుల చయ్యాటము గాక
యెగ్గులేక శ్రీవేంకటేశుఁ డెట్టె నిన్ను నేలె
బగ్గన నిదెల్లా నీ భాగ్యమే కాక

రేకు: 1643-2 మాళవిగౌళ సం: 26-253

పల్లవి: ఇందరయ్యా విడేలు మీ కిద్దికిని
పొందులు మఱవద్దు పొసఁగిన చోటను

చ. 1: ముచ్చటలాడఁగవలె మొగము చూడఁగవలె
మచ్చరమేటికి నాలిమగనికి
కొచ్చి కొచ్చి నవ్వవలె కూడి మాడి వుండవలె
వొచ్చెము లెంచఁగవొద్దు వొనరినచోటను

చ. 2: కాఁపురాలు సేయవలె కాయములు సోఁకవలె
తోపునూపు డేమిటికి దొరలకును
యేపొద్దుఁ బెలఁగవలె ఇంటిలో మెలఁగవలె
కోపాలొద్దు చుట్టాలై గురియైనచోటను

చ. 3: రమ్మని పిలువవలె రతుల మెప్పించవలె
దొమ్మి జగడమేలేల దొడ్డవారికి
ఇమ్ముల శ్రీవేంకటేశ యీకె నీవూఁగూడితిరి
కమ్మలఁ జెప్పఁగ వుద్దు కలసి చోటను

రేకు: 1643-3 భైరవి సం: 26-254

పల్లవి: అవధరించవయ్యా ఆపె సేసే చేఁతలు
తివిరి చేతులు చాఁచీ దిట్టయేతులాఁడి

చ. 1: చిక్కి నవ్వులు నవ్వి సిగ్గులు పైఁ జిలికించి
మొక్కినిదె కొలువులో ముద్దరాలు
వెక్కసపుమాట లాడి వేడుకలు పచరించి
కక్కసించీ రతులకు కతకారివనిత

చ. 2: తేఁటలచూపులు చూచి తీపుల పైఁ బడనిచ్చి
నాటించీ గోరు నీపై నాలికత్తె
వాఁటముగా పై నొరగి వలుదచన్నుల నొత్తి
గాఁటపు సన్నలు సేసీ గయ్యాళి మగువ

చ. 3: దొంతరసాముల సేసి దోమటి మోవి దొడిగి
వింతగాఁ గాఁగిటఁ గూడీ వేసదా రీకె
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
రంతుసేసీ నిన్ను మెచ్చి రచనల తరుణి

రేకు: 1643-4 వరాళి సం: 26-255

పల్లవి: నీతో నేమిచెప్పేవు నాయము లేమడిగేవు
కాతరించితే సతులు కడు మీరకుందురా

చ. 1: పూడిగము సేసేయట్టి పువిదలతో నవ్వితే
యీడుజోడై నీ బుజ మెక్కకుందా
వాడలోన దిరిగాడేవారితో జూజమాడితే
కూడినపందెము నిన్నుఁ గొనకుందురా

చ. 2: కొలవు సేసేవారితో కోరి సరసమాడితే
అలరి మాటకు మాట ఆడకుందురా
వెలపలివారిఁ దెచ్చి వెస లోన నిడుకొంటే
చలపట్టి నీతోడి సరికి రాకుందురా

చ. 3: కడవారచేత నీవు కానికె లందుకొంటే
సుడిగొని మోవి చవిచూడకుందురా
కడఁగి శ్రీవేంకటేశ కమ్మర నన్నేలితివి
విడెమందుకొన్నవారు వియ్యమందకుందురా

రేకు: 1643-5 సాళంగం సం: 26-256

పల్లవి: చేయవే యతనివద్ద సేతలెల్లాను
దాయనే నీతో నేను తప్పు లెంచేనటవే

చ. 1: చెలువుని సొలసేవు చేరి మాట లడిగేవు
కలికితనాలు నీకు గలవే కదే
పలుమారు నవ్వేవు పానుపుపైఁ గూచుండేవు
చలమున యీవిద్యలు సాదించితి గదే

చ. 2: కన్నుసన్నలు సేసేవు కాఁపురాన మెప్పిచేవు
అన్నియు నీమేనికినమరుఁ గదే
వన్నెలు వెట్టుకొనేవు వద్దఁ గూచుండవచ్చేవు
పన్నిలమాయలకు నేర్పరివి గదే

చ. 3: మోవితేనె లడిగేవు మొక్కలెల్లా మొక్కేవు
రావాడిరతులకు రాజవు గదే
యీవేళ శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నిట్టె
దేవుళ్లిందరికిని దేవరపు గదవే

రేకు: 1643-6 సామవరాళి సం: 26-257

పల్లవి: ఇద్దరము సరిగాదా ఇదివో నీకు
పెద్దరికా లెక్కించేవు ప్రియమా నీకు

చ. 1: మగువకు నసమిచ్చి మాటలెల్లా నాడించి
తగవు దిద్దవచ్చేవు తగునా నీకు
యెగసక్కేల కిద్దరి నెదురుబడి నిలిపి
జిగిఁ బంతాలు రేఁచేవు చెల్లునా నీకు

చ. 2: వెంటఁ బెట్టుకొని వ్చి వెలఁది నెసకొలిపి
జంటలు సేయవచ్చేవు చలమా నీకు
దంటతనములు నేర్పి తారసిల్లఁ జేసి మమ్ము
వొంటి సిగ్గువరచేవు వుచితమా నీకు

చ. 3: పానుపుపై నాకెఁ బెట్టి జలిమి నన్నుఁ గూడేవు
పూని శ్రీవేంకటేశ అబ్బురమా నీకు
అనుకొని యిద్దరిని అక్కఁ జెల్లెండ్లఁ జేసి
నానఁ బెట్టేవు వలపు నగవా నీకు

రేకు: 1644-1 మేఘరంజి సం: 26-258

పల్లవి: నెట్టన రెంటికి వచ్చు నీ జాడలు
గుట్టువాయతనమో కరణించు విధమో

చ. 1: చిత్తము రంజిల్లఁ జేసి చెక్కులఁ గస్తూరి వ్రాసి
హత్తి యెంత బుజ్జగించే వాఁటదానిని
ఇత్తలఁ జేసినకల్ల యేమైనాఁ దొల్లి కలదో
కొత్తలైన నీమంచిగుణ మిట్టిదో

చ. 2: భావము సోఁకఁబలికి పన్నీరు పైఁ జిలికి
మూవంకలాఁ జొక్కించేవు ముద్దరాలిని
ఆవల మర్మములు నీయందు నేమైనాఁగలవో
నీవొళ్లఁ గలిగిననేరు పిటువంటిదో

చ. 3: చేసిన సేవకు మెచ్చి చేతికి విడెమిచ్చి
బాస ఇచ్చి కూడితివి పంతగత్తెను
అసల శ్రీవేంకటేశ అది నీ వినోదమో
వాసికి నిందరి నిట్టె వలపించేసాజమో

రేకు: 1644-2 హిందోళం సం: 26-259

పల్లవి: నెమ్మది నలుక దీర్చు నీవైనాను ఆపె
నిమ్మపండు చేత నంటు నీవైనాను

చ. 1: యెఱిఁగియు చిత్తములో యేఁటికో చింతించీ నీకె
నెఱవుగా నవ్వవయ్య నీవైనను
తఱి గందమిచ్చితే చేతనే పట్టుకవున్నది
నెఱఁపూత పూయవయ్య నీవైనాను

చ. 2: వొయ్యనే తలవుంక వూరకే తా నున్నది
నెయ్యాపూమా టాడవయ్య నీవైనాను
పయ్యదలోఁ దెచ్చినట్టిబాగా లట్టె వున్నవి
నియ్యంత విడెమీవయ్య నీవైనాను

చ. 3: యెలమిఁ బానుపుమీఁద ఇంత గుట్టుతో నున్నది
నెలకొని కూడవయ్య నీవైనాను
కలసి శ్రీవేంకటేశ కాచుకున్నది సేసకు
నిలువునఁ బోయవయ్య నీవైనాను

రేకు: 1644-3 గౌళ సం: 26-260

పల్లవి: అది లెస్స తెలుసుకో అప్పుడు విడువరాదు
వెదకి నాపైఁ జేయి వేసేవు నేఁడు

చ. 1: వోపుదువా ఆపెతోను వొడ్డాఁ బెట్టా మాటలాడ
యీ పొద్దున మా ఇంటికి యెట్టు వచ్చితి
ఆపఁగలవా కోప మాపె నిన్ను జంకించితే
చూపుల నన్ను దప్పకచూచేవు నీవు

చ. 2: సేయనోపుదువా ఆపె చేరి బాస సేయుమంటే
యీాయెడ నా చనుఁగవ యిట్టె అంటేవు
నాయానకు రాఁగలవా నమ్మనంటే ఆపెతోను
చేయిమీఁదుగా నాపై సేసలు వెట్టేవు

చ. 3: నిలువఁగనోపుదువా నేర మాపె యెంచితేను
కొలఁదిమీరఁగ నన్నుఁ గూడితివి
యెలమి నాపెకు పంతమియ్యకుండ గలవా
నలి శ్రీవేంకటేశుఁడ నవ్వేవు నాతోను

రేకు: 1644-4 రామక్రియ సం: 26-261

పల్లవి: కానీలే అందుకేమి కద్దావోయి
వూని యాకె నీ యింట నున్నదని వింటిమి

చ. 1: పోలించ నీ కాపెకునుఁ బొందు గద్దని వింటిమి
ఆలించి ఆమాట దోయవని వింటిమి
యేలేనని నీవు బాసలిచ్చితివని వింటిమి
శీలముతో విందారగించితివని వింటిమి

చ. 2: నంటున నాపెగోరు మేన నున్నదని వింటిమి
అంటువాయని చట్టమవని వింటిమి
యింటిలో నేపొద్దు కాఁగి లెడయవని వింటిమి
దంటతనపు మీయేకతములెల్ల వింటిమి

చ. 3: సేయరాని వినయాలు సేయుదువని వింటిమి
ఆయాలు మోచినరతు లవి వింటిమి
యీయెడ శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
చాయల నన్ను మన్నించే సంగతులు వింటిమి

రేకు: 1644-5 వరాళి సం: 26-262

పల్లవి: మనసులో గుబ్బతిల్లీ మర్మము లెల్లా
కొనవేసీ చూపరాదు గురిలేని ఆస

చ. 1: చేరి నీమోము చూచితే సెలవుల నవ్వువచ్చీ
వూరకే తలవంచుక వుండఁగరాదు
ఆరీతి నీవు దొరవు ఆఁటదాన నే నింతే
తారుకాణించఁగరాదు తలఁపులోవలపు

చ. 2: చెవి నీమాటలు వింటే సిగ్గులెల్లాఁ జిమ్మిరేఁచీ
తవిలి పరాకుచేయఁ దగవు గాదు
యివల నీవు మగఁడ విటు నీకు నే నాలను
రవళి నాడుకోరాదు రతులలో సుద్దులు

చ. 3: అంటి కాఁగిలించుకొంటే ఆయములెల్లా గరఁగు
అంటినసాతమకము అణఁచఁజాల
యింటిలోన శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వెంట వెంట మాన్పరాదు వేవేలు వేడుకలు

రేకు: 1644-6 శంకరాభరణం సం: 26-263

పల్లవి: చిత్తగించు మిదె చెలువుఁడవు
మెత్తపు వలపులు ముంచీని

చ. 1: పుత్తడిఁ బోలినపాలఁతి నీ రూపము
చిత్తరువున వ్రాసీ నిదివో
గుత్తపు గుబ్బల గురిగా మోపుచు
బత్తులు చేసీఁ బలుమరును

చ. 2: వలరాజు ప్రతిమవంటిది నీపేరు
చలములఁ బలకలఁ జదివీని
అలరి పురంబున అచ్చుగా నొత్తుచు
సులభాన మోహము చూపీని

చ. 3: చక్కెర బొమ్మయినసతి నీకాఁగిలి
గక్కన కణఁజముగాఁ గట్టి
యిక్కువ శ్రీవేంకటేశ నిన్నెనయుచు
అక్కరదెలిపీ ననువుగను

రేకు: 1645-1 రీతిగౌళ సం: 26-264

పల్లవి: నామోము చూచి చూచి నన్నేమి బుద్దెడిగేవు
కాముకుకు నీతి యెక్కడైనాఁ గలదా

చ. 1: నెమ్మది నీతో నేను నేరుపుల మాటలాడి
వుమ్మడి వుండేఁ గాని వొరయనోప
కమ్మటి నీకు నిచ్చఁపుఁ జేఁతలెల్లాఁ జేసి
సమ్మతి మొక్కేఁ గాని సాదించనోప

చ. 2: అప్పటప్పటికి నీతో సంకెలకు నవ్వు నవ్వి
కొప్పు దువ్వేఁగాని కడుఁ గొసరనోప
యెప్పుడు చూచినా నీకు యెవ్వతెనైనాఁ దెచ్చి
నెప్పున మెప్పించేఁగాని నీరప మెంచనోప

చ. 3: పూడినట్లనే కూడి కొలువులోపన నీచే
వీడె మందుకొనేఁగాని వెంగనకోప
యీడనే శ్రీవేంకటేశ యేలితివి కడపలో
పాడి నెరపేఁగాని పంగించనోప

రేకు: 1645-2 బౌళి సం: 26-265

పల్లవి: చూపవయ్యా నాకెపెను సోద్యమయ్యీని
మోపుగట్టీ వియయాలు మోహమెంతగలదో

చ. 1: తెరమఱఁగున నుండి తియ్యని మాట లాడి
తరితీపు సేసీని తా నెంతటిదో
విరులు నీపైఁ జల్లి వేడుక నవ్వులు నవ్వి
తరపువెట్టీ వలపు తగ నెంత నేర్చెనో

చ. 2: పానుపుపైఁ బవళించి పదనుగా సన్నసేసి
నానఁ బెట్టీఁ దమకము నను పెట్టిరో
సోనలచూపులు చూచి చొక్కల మొక్కులు మొక్కి
సానఁబట్టీఁ గొనగోళ్లు చల మెంతగలదో

చ. 3: బలిమిగాఁ గాఁగిలించి భావము గరఁగఁజేసి
మొలపించీఁ బులకలు ముదమెట్టిదో
అలమె శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
వెలయించె నీకరుణ వినోద మెంతటిదో

రేకు: 1645-3 పాడి సం: 26-266

పల్లవి: రమణుండ నేఁడు నీరవమాయను
తమకించే విది మంచితగవాయను

చ. 1: సొరిది నీవు సేసినచొప్పు లెత్తి యాడఁగాను
విరులఁగొని యాపెను వేసేవు నీవు
మరిగి విన్న కతలు మర్మములు సోఁకితేను
మరునమ్ములు నడుమ మనికాయను

చ. 2: తలకొన్న నీ కళలు తరుణి చూడఁగాను
జల జలఁ బన్నీరు చల్లేవు నీవు
చలరేఁగినయాసలు చిమ్మిరేఁగి మొలచితే
చలపాది వెడమంచు సందడించెను

చ. 3: కదిసిన నీ రతులు కాంత గడు మొచ్చఁగాను
వొదిగి గంధము మేనఁ బూసేవు నీవు
పొది జవ్వనవన ముప్పొంగితే శ్రీవెంకటేశ
చెదరక వట్టిమాకు చిగిరించెనె

రేకు: 1645-4 కాంబోది సం: 26-267

పల్లవి: ఏఁటికి ననుమానము యెందాఁకాను
కూటమిగలచోటికి గుట్టు సేయగలదు

చ. 1: వరుసకు నాపె నేఁడు వచ్చెఁగా నీవద్దికి
వెరవేది లోపలికి విచ్చేయరాదా
పరగ నాపై వలపు పండి పొల్లవోయీనా
దొరాపాటివికి దోసమే లేదు

చ. 2: ఆసతో నీమోము చూచీ నదివో యీ జవరాలు
సేసవెట్టి పెండ్లాడి చేకొనరాదా
బాసలు నాకిచ్చితేనే పరిసిపోయీనా
ఆసరిఁ గోడెకానికి నంటుముట్టు లేదు

చ. 3: పొరుగుపొరచి వచ్చి పొలసీ నీనేస్తగత్తె
గరిమ నీ పచ్చడము గప్పఁగరాదా
యిరవై శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
సిరులుగలవానికి చింతించఁదగదు

రేకు: 1645-5 ద్రావిళ భైరవి సం: 26-268

పల్లవి: నీతలఁపు లీడేరె నెలఁత నీకు దక్కె
రాతిరిఁ బగలు నింత రవ్వలేలా

చ. 1: ఆపెతో మాటలాడితి వందుకొంటివి కానికె
పైపైఁ గొంకుదేరెను పలుకులేలా
మోపులుగా నవ్వితివి మొగము చూచితివి
మాపుదాఁకా నిఁక వట్టిమాఁటలేల

చ. 2: సతిఁ గొంగుపట్టితివి సరసములాడితివి
సతమాయను మనువు సాదించనేల
యితవులు చేకొంటివి యింటి కిట్టె వచ్చితివి
కతలెల్లాఁ జెప్పి నిన్ను కాతరించనేల

చ. 3: కూటములు మెచ్చితివి కొమ్మఁ బెండ్లాడితివి
సూటికెక్కె వలపులు సుద్దు లింకేల
యీటున శ్రీవేంకటేశ యే నలములుమంగను
గాట్రాన నన్నేలితివి గరిసించనేల

రేకు: 1645-6 నాదరామక్రియ సం: 26-269

పల్లవి: అప్పుడే కానఁగవచ్చీ నౌఁగాము లెల్లాను
చిప్పిలు జవ్వనముపై చేయివెట్టరాదా

చ. 1: చండి పోరి నీవు నాతో సాములేల సేసేవు
వుండఁ బట్టదా నీకు నోజతోడను
కండగర్వ మెంతే నీకు గలికితేఁగనక యీ -
కొండలవంటి చన్నులు కుచ్చి యెత్తరాదా

చ. 2: గుట్టుతోడ నవ్వు నవ్వి గురులేల వేసేవు
పట్టరాదా నీవొళ్లిపాయము నేఁడుఁ
బట్టబయ లీఁదేనని పంతము నీకింత గల్తే
కిట్టి నా నడుము పిడికిటఁ బట్టరాదా

చ. 3: తలపోసి నన్ను నిట్టె తమకించి కూడేవు
నిలువరాదా మనసు నీయంత నీకు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అలమేలుమంగ నేను అక్కువ నించరాదా

రేకు: 1646-1 సామంతం సం: 26-270

పల్లవి: మన్నించు మామాటలు మగువను దయనేలు
సన్నలు రాఁపుసేయకు జవరాలిని

చ. 1: చలపట్టి యెంచరాదు సడిఁబెట్టఁగారాదు
చెలరేఁగి కడుమోహించినకాంతను
అలఇంపించఁగవద్దు ఆస చెరుచఁదగదు
పిలువకే వచ్చిన ప్రియురాలిని

చ. 2: చిమ్మిరేఁచఁ బాడిగాదు సిగ్గువరచ దోసము
సమ్మతించి కాచుకున్న జలజాక్షిని
పమ్మి నవ్వనీదగదు పైకొనకుండు టొచ్చము
నెమ్మది సరసమాడే నేరుపరిసతిని

చ. 3: బాసియ్య నది నేరమి పరాకుసేయుట నీతి
సేసవెట్టి కూడిన మచ్చిక సతిని
వాసితో వేంకటేశ వడి నలమేల్మంగను
తాసువలెఁ గూడితివి తగిన యీయింతిని

రేకు: 1646-2 దేసాళం సం: 26-271

పల్లవి: తప్పులు వట్టఁగనేల తరుణులను
కప్పురముమోవి నిచ్చి కాఁగిలింతురు

చ. 1: పెనఁగు రమణుఁడు ప్రియములు చెప్పినాను
చనవుగలసతులు జంకింతురు
తనిసి తమతమపంతము లీడేరినమీఁద
వెనక నప్పటి మరి వేఁడుకొందురు

చ. 2: యెడయక నాయకుఁడు ఇచ్చక మాడినాను
కడుపొందైనవారు కాఁతాళి తురు
తడయక రతులను తమకు లోనైనవేళ
చిడుముడిఁ జేయరాని సేవలెల్లాఁ జేతురు

చ. 3: అసల శ్రీవేంకటేశ ఆయలు నీ వెంతంటినా
సేసలు వెట్టినవారు చిమ్మిరేఁతురు
నీసరి నలమేల్మంగ నీవుర మెక్కినమీఁద
వాసుల నందరు నిట్టె వంతులకు వత్తురు

రేకు: 1646-3 ఆహిరినాట సం: 26-272

పల్లవి: తగునా నీ కింతవేసిదంటతనాలు
నగినంతలోనె యావలు వెట్టఁజెల్లునా

చ. 1: కలికి తనపతికి గందము కానుకంపితే
బలిమిఁ దీసి యేల కంబానఁ బూసేవే
వెలయ నప్పటి నాపె వీడెము వెట్టి యంపితే
పలుమారుఁ జెలులకు పంచిపెట్టనేఁటికే

చ. 2: మంచిపువ్వుదండ లాపె మగనికి నంపితేను
కొంచకేల నీమంచముకోటఁ జుట్టేవే
మించుఁగడియా లాకె మెలుఁతచే నంపితేను
పించేవు నీపాదమునఁ బెట్టవచ్చునటవే

చ. 3: యెనసి శ్రీవేంకటేశుఁ డిట్టె పాన్పు వేయించితే
మొనసి నీవేల పాదమునఁ దొక్కేవే
అనిశము నేలె నీతఁ డలమేలుమంగవు నిన్ను
తనిసి యాపెకు నీఁక దాఁచవచ్చునటవే

రేకు: 1646-4 శంకరాభరణం సం: 26-273

పల్లవి: అన్నిటా జాణఁడ వైతే నౌదువుగాని
కన్నచోటెల్లాను కాంతను దూరకుమీ

చ. 1: పంతములేలాడేవుఁ బయలేలీదించేవు
యింతేసికి నోపునా యీపె నీతోను
చెంత మోము వంచుకొని సిగ్గుపడి నున్న నింతే
జంతల నాడినయట్టు సకియ నాడకుమీ

చ. 2: వేసాలేల సేసేవు వెగ్గళించేల నవ్వేవు
గాసిఁబెట్టితే నోర్చునా కిమిని గోల
మూసినముత్తెమువలె మోసమున నున్న దింతే
యీసడపువారివలె నీకె నెంచకుమీ

చ. 3: జాగులేల సేసేవు చలముల సాదించేవు
యీగతి నలమేల్మంగ యిచ్చగించునా
బాగుగా శ్రీవేంకటేశ బత్తితోఁ గూడె నింతె
భోగపు టింతులవలె పొలఁతిఁ జేయకుమీ

రేకు: 1646-5 సామంతం సం: 26-274

పల్లవి: అంతటి బలువురాల వౌదువే నీవు
చెంత నుండి మచ్చికలు సేయించుకొంటివి

చ. 1: వలసినచోటికి వాసు లెంతురటవే
పిలిపించుకొంటివి ప్రియునిచేత
మలసే నీ పంతాలు మగనితోడనా
యెలమిఁ జేతికి విడె మిప్పించుకొంటివి

చ. 2: ఆసపడి వున్నచోట అలయింతురటవే
బాస సేఇంచుకొంటివి పతిచేతను
యీసట లీతరితీపు లిక్కడఁ జూపుదురా
రాసికెక్క నింటికిని రప్పించుకొంటివి

చ. 3: వొక్కటైనచోటికి వొడ్డింకొందురటనే
చెక్కు నొక్కించుకొంటివి చెల్వునిచేత
వెక్కసపునేర్పులు శ్రీవేంకటేశుకొరకా
మిక్కిలి యీతనిచేత మెప్పించుకొంటివి

రేకు: 1646-6 ముఖారి సం: 26-275

పల్లవి: ఇందాఁకా రాఁడంటా పతినేల దూరేవే
కందువ నెదురుకొని కాఁగిలించుకొనవే

చ. 1: పగవారికైనాను పంతములిచ్చుట మేలు
మొగమోట మతిలోన ముంచుకొంటేను
జగడములాడినాను నగుతా నుండుట మేలు
పగటుఁ జుట్టరికము పాయరాకుండితేను

చ. 2: కడుఁగోపినైనాను కనిపొగడుట మేలు
వడి నందుఁ బనిగొనవలసితేను
తడవవచ్చినఁ దానె తప్పించుకొనుట మేలు
వొడఁబాటు బాసలు వొనరి వుండితేను

చ. 3: వెక్కసియైన దొరను వేఁడుకొనుటే మేలు
యెక్కడా సుకము తన కెడవైతేను
చక్కని శ్రీవేంకటేశ్వరుఁడు నిన్నిదె కూడె
మొక్కుటమేలు రతి ముచ్చటైతేను

రేకు: 1647-1 మాళవి సం: 26-276

పల్లవి: వాఁడు గదె ప్రహ్లాదవరదుఁడు
నాఁడాడినమాటలకు నవ్వీని చూడరే

చ. 1: పంతములెల్లాఁ జెల్లించె ప్రహ్లాదవరదుఁడు
వంతుక్కింఁచెఁ బ్రహ్లాదవరదుఁడు
బంతి విడేలు పెట్టెను ప్రహ్లాదవరదుఁడు
ఇంతటి నారమణుని నేమని చెప్పుదునే

చ. 2: బలిమిఁ జన్ను లంటె నీ ప్రహ్లాదవరదుఁడు
వలపు నించెఁ బ్రహ్లాదవరదుఁడు
పలుకుఁబంత మీడేర్చెఁ బ్రహ్లాదవరదుఁడు
అలరించె నిన్నిటా నేమని పొగడుదునే

చ. 3: పన్నుగ శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదుఁడు
వన్నెగాఁ గూడెఁ బ్రహ్లాదవరదుఁడు
పన్నినమాయ దెలిపె ప్రహ్లాదవరదుఁడు
యిన్నిటా నీతనిసుద్దు లెన్నెని నే మెత్తునే

రేకు: 1647-2 దేసాళం సం: 26-277

పల్లవి: విరులదండలతోడి విట్ఠలేశా । నీవు
యెరవులేనివాఁడవు యెపుడు విట్ఠలేశా

చ. 1: విచ్చేయు మా ఇంటికి విట్ఠలేశా । నీకు
విచ్చనవిడాయ నిది విట్ఠలేశా
విచ్చి చెప్పే నిటు నీకు విట్ఠలేశా । నాకు
నిచ్చినబాస దప్పకు మిఁక విట్ఠలేశా

చ. 2: వీడె మియ్యఁగదవోయి విట్ఠలేశా । కడు-
వేడుకకాఁడవు నీవు విట్ఠలేశా
వీడుజోడాయ వలు విట్ఠలేశా
పాడిఁ బంతాలెల్లఁ జెల్లె బాపు విట్ఠలేశా

చ. 3: విడిచేవు పోఁకముడి విట్ఠలేశా । యెంత
వెడమాయకాఁడవయ్య విట్ఠలేశా
కడఁగి శ్రీవేంకటాద్రిఁ గలసితివి
అడియాలముగ నన్ను నౌఁర విట్ఠలేశా

రేకు: 1647-3 రామక్రియ సం: 26-278

పల్లవి: చూడఁ బిన్నవాఁడుగాని సుద్దులైతే వేవేలు
వొడక వింతలుసేసీ వుద్దగిరి కృష్ణుఁడు

చ. 1: సెలవినవ్వులతోడ చెలులమోములు చూచి
పలీ ముద్దుమాటల బాలకృష్ణుడు
చలపాదాగొల్లెతల చనుఁగొండలతోడుత
తులఁదూచీఁ వలపులు దొంగాడుఁ గృష్ణుఁడు

చ. 2: తప్పుటడుగులతోడ తరుణలకెల్లాను
చిప్పిల ముద్దులువెట్టీ చెన్నకృష్ణుఁడు
ముప్పిరియాసలఁ బొంది ముదితలవొడిలోన
వొప్పుగా జేతులు చూఁచీ నుద్దగిరికృష్ణుఁడు

చ. 3: గట్టి వెన్నుముద్దతోడ కాంతాలను మరిగించి
పట్టపగలే కూడీ గోపాలకృష్ణుడు
ఇట్టె విజనగరాల యెమ్మెలెల్లాఁ జూపీని
చిట్టకపుఁ జేఁతల శ్రీవేంకటకృష్ణుడు

రేకు: 1647-4 బౌళి సం: 26-279

పల్లవి: అదరిపాటు వచ్చి అప్పుడే నీవు
పదిమారులును యేల పంతాలాడేవే

చ. 1: వలపు నిలువలేక వద్దనున్న చెలులతో
కలికితనాల నెంత కాఁతాళించేవే
బలువుఁడాతఁడు నీపై బత్తి చూచుకొంట గాక
సొలసి మలసి యేమి సోదించేవే

చ. 2: విరహ మాఁపఁగలేక విభని మొగము చూచి
మరులుకొలిపి యేఁటిమాట లాడేవే
సరసుఁ డాతఁడిచ్చినచనవే చూచుట గాక
తిరిగి తిరిగి యెంత తెలుపవచ్చేవే

చ. 3: మనసు వారించలేక మచ్చిక శ్రీవేంకటేశుఁ
బెనఁగి కాఁగిట నెంత బిగెంయించేవే
నను నిట్టె యేలినాఁడు ననుపే చూచుటగా
పనిపడి యింకా నెంత పచారించేవే

రేకు: 1647-5 నాదరామక్రియ సం: 26-280

పల్లవి: బుద్ది చెప్పవయ్య నేను పూఁచి వినేను
గద్దరిఁగా నెపుడు సిగ్గరిదాన నేను

చ. 1: ఆమగువకు నీవు అన్నిటా మోహింతు వంటి
యేమనవలెను నానతీవయ్యా
గామిడిదానఁ గాను కతలు నీవే నేరుపు
కామించి వచ్చిన వాసికత్తెనే నేను

చ. 2: చాయల నాపెకు నీకు సరిఁ బొందుసేసితి
సేయవలసినపని చెప్పవయ్యా
రాయడించేదానఁ గాను రచ్చలఁబెట్టకు నీవే
పాయముతోడిమానాపతిదాన నేను

చ. 3: కూడా నీతోనున్నాపెకూటములు చూచితి
చూడవలసిన వింకాఁ జూపించవయ్యా
వోడక భూపతిచెర్వువొద్ది శ్రీవేంకటేశ్వర
జాడ నన్నేలితివి యిచ్చకురాల నేను

రేకు: 1647-6 శుద్ధవసంతం సం: 26-281

పల్లవి: చెప్పవయ్య నాతోను చెలి నీకెంత చుట్టమో
తెప్పల భూపతిచెర్వు తిరువెంగళప్పఁడా

చ. 1: ముంచి తేనెలుగారేమోవినే మాటలాడీని
అంచగమన యెవ్వతో అదె నీతోను
చంచుల కనుఁదమ్ముల సారె సన్నలు సేసీని
యెంచరానివేడుకతో యిదె నీతోను

చ. 2: చిప్పిలఁగ నోరూర సెలవుల నవ్వు నవ్వీ
అప్పటిని నే డెవ్వతో అదె నీతోను
వొప్పుగ శిరసు వంచి వూరే సిగ్గులువడీ
యిప్పు డిందరుఁ జూడఁగ యిదె నీతోను

చ. 3: మొగిఁ జిమ్మిరేఁగ చన్నుమొనల మోహము చల్లీ
అగడుగ నెవ్వతో అదె నీతోను
జిగి నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ
చిగిరించ మొక్కి మచ్చీ నిదె నీతోను

రేకు: 1648-1 సాళంగం సం: 26-282

పల్లవి: ఏమి సేసు నాతఁడు యెందరికని వోవును
నేమములు నేర్పకురే నెలఁతలాల

చ. 1: అక్కడనుండి వచ్చి ఆ పరాకై వున్నాఁడేమో
కక్కసించకురే వో కాంతలాల
నెక్కొని యలసి వచ్చి నిద్దురతో నున్నాడేమో
పక్కన లేపకురే పడఁతులాల

చ. 2: వలపు చపుల సోఁకి వడిఁ జొక్కివున్నాఁడేమో
బలిమిసేయకురే భామలాల
యెలమి నాపెకు బాస ఇచ్చి వచ్చినాఁడేమో
చలము సాదింకురే జలజాక్షులాల

చ. 3: తగిలి వారిరూపులు తలఁచుకొనీనో యేమో
అగడుసేయకురే యంగనలాల
జిగి శ్రీవేంకటేశుఁడు సింగారవనములోన
నగి కూడెఁ గోనేటిలో నన్ను నింతులాల

రేకు: 1648-2 వరాళి సం: 26-283

పల్లవి: ఎంతేసి నేరిచినాఁడు ఇటు చూడరే
కాంతలాల దాఁగీ వీఁపు గానాఁగా నీతఁడు

చ. 1: చెక్కులపై వడిసేటి చెమటలు చూడరే
చక్కనిమోములో సిగ్గు చల్లీఁ జూడరే
నెక్కొనఁగ బుసకొట్టే నేరుపులు చూడరే
పక్కనఁ దన నిజము పచరించీ నీతఁడు

చ. 2: కడలేనితనమేనికళలెల్లాఁ జూడరే
అడియాలపుఁబులక లటు చూడరే
బెడిదమై జారిన పెనుఁదురుము చూడరే
వొడఁబరచీ నన్ను వొద్దికతో నీతఁడు

చ. 3: తెల్లనికన్నుల మించుతేటతెలివి చూడరే
తొల్లిటిమోవిపై గురుతులు చూడరే
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డిప్పుడు దా నన్ను గూడె
కల్లలు నిజముసేసి కరఁగించీ నీతఁడు

రేకు: 1648-3 బౌళి సం: 26-284

పల్లవి: ఏల రట్టుసేసేవోయి యిదిగో ఆపె
తాలిమి సిగ్గరిదాన దండనున్నదాపె

చ. 1: కోలుముందై మన మాడుకోనేటిమాటలెల్లాను
ఆలకించి వినవచ్చె నదివో ఆపె
వోలి సదమదములై వున్న మనపొందులెల్లా
వొలిమితోఁ జూడవచ్చె పొరుగున నాపె

చ. 2: యీరీతి నేకతమున ఇద్దరము నుండఁగాను
కేరడాన నవ్వవచ్చెఁ గెరలి యాపె
సారె నొకరొకరము చనవులు మెరయఁగా
మేరమీరఁ దానువచ్చె మిక్కిలి నాపె

చ. 3: యిత్తల నీవును నేను యెనయుచు నుండఁగాను
పొత్తులుగలయ వచ్చె పొదిగి యాపె
బత్తితో శ్రీవేంకటేశ పైకొన్న మేనవారము
కొత్తవావి చెప్ప వచ్చెఁ గొసరి యాపె

రేకు: 1648-4 గౌళ సం: 26-285

పల్లవి: ఏమి సేతునయ్యా నీ విందరికి సముఁడవు
ఆముకొని నినుఁ జూపి అందరి దూరీని

చ. 1: యెట్టకేలకుఁ దనతో యెన్నఁడో నవ్వితివంటా
వట్టిసలిగెఁ బొరలీ వంతుకు నాపె
గుట్టున నొకకడ నీకొలువు సేసితినంటా
బట్టబయలు గర్వించి పరచీ సవతుల

చ. 2: తెరమఱఁగున నీవు దృష్టించి చూచితివంటా
దొతనాల మురిసీ దోడనె యాపె
ఇరవెఱఁగక నీవేమో మాటాడితివంటా
బెరసి పెచ్చు వెరిగీ ప్రియురాండ్లతోను

చ. 3: వూరకే యెప్పుడో పాదా లొత్తించుకొంటివంటా
తేరకె వేసాలుసేసీ దిక్కుల నాపె
గారవించి నేఁడు శ్రీవేంకటేశ నన్నేలితివి
దూఁరజూచీ నీ పట్టపుతొయ్యలులఁ దాను

రేకు: 1648-5 సాళంగనాట సం: 26-286

పల్లవి: ఇదివో నీ భాగ్యము లిన్నిటా మెరసెనమ్మ
సదరాన నిటువంటి జన్మము గావలదా

చ. 1: చెంతనుండి యాతఁడు నీ చెప్పినట్టు సేయఁగాను
పంతాలాడుకొననేలే పడఁతి
యింతటి సవతు లింద కియ్యకొని వుండఁగాను
సంతతము నీకుఁగల చలము లీడేరెనే

చ. 2: సారెకు నాతఁడు నీ చనవు చెల్లించఁగాను
యీరీతి నెమ్మెలు చూప నింకా నేలే
నేరుపున సరివారు నీకింద నడవఁగాను
కూరిమితో నీవుగోరే కోరికె పలించెనే

చ. 3: కుచ్చి శ్రీవేంకటేశుఁ డక్కున నిన్నుంచకుండఁగా
ఇచ్చకొలఁది నవ్వేవు యింతేసి యేలే
వొచ్చము లే కింతులెల్లా వూడిగాలు సేయఁగాను
తచ్చి నీవు పట్టిన వ్రతములు చేకూరెనే

రేకు: 1648-6 ముఖారి సం: 26-287

పల్లవి: ఏమిగాఁ జూచినాఁడే ఇప్పుడు నన్ను
వేమారు తను నంత వేసరించేదానినా

చ. 1: కొప్పు దువ్వి న న్నితఁడు కొసరి వేఁడుకొనీని
అప్పటిమాటలకే నే నలిగేనటే
తప్పకచూచి నన్ను తగ నవ్వు నవ్వించీ
తప్పు లెంచి నేఁ దనతో తమకించేదానినా

చ. 2: పెనఁగి నావొడివట్టి ప్రియములు చెప్పీఁ దాను
వెనకటి సేఁతలకు విసిగే నటే
కనుసన్న సేసి నన్ను కమ్మటిఁ జొక్కించీని
మనసు సోదించి తనమర్మాలెత్తే దానినా

చ. 3: చేతులు చాచిఁ నన్నుఁ జెనకి కాఁగిట నించీ
రాతిటి పంతములకు రావాడేనటే
యీతల శ్రీవేంటేశుఁ డీతఁడిట్టె నన్నునేల
యేతులకు నే దనతో యెదురాడేదానినా

రేకు: 1649-1 పాడి సం: 26-288

పల్లవి: అన్నిటా జాణఁడు దాను అదెఱఁగఁడా
కన్నెపాయపుమదము కారుకొనె ననరే

చ. 1: చెలులచే నేనింకాఁ జెప్పిపంపవలెనా
తలఁపులోపలిమాట తా నెఱఁగఁడా
చెలప చెమట నిండె చెక్కులునుఁబులకించె
కొలఁదిలేని వలపు గుబ్బతిల్లీ ననరే

చ. 2: జిగిఁ గడితాన వ్రాసి చేతి కియ్యవెలనా
తగఁ జేసేపనులెల్లా తా నెఱఁగఁడా
నిగిడె నివ్వెరగులు నిట్టూర్పు లివె రేఁగె
చిగిరింపుఁదమకము చిమ్మిరేఁచీ ననరే

చ. 3: యితవైనరతులెల్లా యెచ్చరించవలెనా
తతి నాప్రియములెల్లా తా నెఱఁగఁడా
సతమాయఁ గూటము లిచ్చుటఁదా శ్రీవేంకటేశుఁ
డతి సంతోషము నాకు నలవడె ననరే

రేకు: 1649-2 కాంబోది సం: 26-289

పల్లవి: ఊరకుండఁగదరే వువిదలాలా
మేరతోడివారికి మితిమీరవచ్చునా

చ. 1: సలిగెగలవారికి సరసములాడవచ్చు
బలిమిగలవారికి పైకొనగవచ్చు
వలపుగలవారికి వాడికలు చూపవచ్చు
అలవోకవారికెల్లా ఆయా లంటవచ్చునా

చ. 2: చుట్టరికపువారికి సుద్దులు చెప్పఁగవచ్చు
దిట్టతనపువారికి దీకొనవచ్చు
నెట్టుకొన్నవారికి నేరుపులు చూపవచ్చు
కట్టఁగడవారికెల్లాఁ గాఁతాళించవచ్చునా

చ. 3: తగుగలులగలవారికి తమకము లెంచవచ్చు
సొగిసినవారికి సొలయవచ్చు
అగపడి శ్రీవేంకటాధిపతి నన్ను నేలె
వెగటైనవారికెల్లా వేసరించ వచ్చునా

రేకు: 1649-3 సాళంగం సం: 26-290

పల్లవి: వేళైనదాఁకా మా విడిదికిఁబోయివచ్చే
డాలుమీద సిగ్గులు వడఁగనేల యిఁకను

చ. 1: కొలువులో నుండి చెలి కొసరి మాటాడఁగాను
కలకల నవ్వు నవ్వి కాఁగిలించేవు
తిలకించి యిద్దురును తెరవేసుకొనరాదా
వలవనిజోలి యాడ వద్దు వద్దు ఇఁకను

చ. 2: యేకతాన నుండి యాపె యెగసక్కేలు సేయఁగా
దాకొని తొడలపైఁ బాదాలు చాఁచేవు
లోకులు మెచ్చఁగ మేడలోనికైనఁ బదరాదా
కైకొని పూరకుండఁ దగవు గాదు ఇఁకను

చ. 3: గక్కన శ్రీవేంకటేశ కాంత నిన్నుఁ గూడఁగాను
ఇక్కడ నన్నేలితివి ఇంతలోననే
మక్కువ మీకు గలితే మా యింటికి రారాదా
పిక్కటిల్లీ వలపులు పెనఁగకు మిఁకను

రేకు: 1649-4 రామక్రియ సం: 26-291

పల్లవి: ఇద్దరును నొకటైతి రిఁకనేఁటికి
బుద్ధులు బోదించఁబోతే వొసఁగీనా ఇపుడు

చ. 1: చేయెత్తి నీకు మొక్కె చెలియి కానుకలిచ్చె
చేయరాని విన్నపాలు సేసె నీతోను
నాయకుఁడ నీవాకెను నమ్మించితి వన్నిటాను
నాయములు చెప్పఁబోతే నవ్వు రాదా ఇఁకు

చ. 2: చేరి యాపె కూచుండె చిత్తము రా సేవసేసె
కూరిమి వేఁడుకొంటాఁ జెక్కులు నొక్కెను
నేరిపితి వీకతలు నీసొమ్ము సేసుకొంటివి
కారణా లడుగఁబోతే కడమ యేదిఁకను

చ. 3: సేసెవెట్టె నీపై నాకె చెలరేఁగి విడె మిచ్చె
ఆనతో శ్రీవేంకటేశ అక్కునఁ జేర్చె
వాసులెంచి నీవు నన్ను వలెనని కూడితిని
రాసికూటా లెంచఁబోతే రవ్వగాదా ఇఁకను

రేకు: 1649-5 కాంబోది సం: 26-292

పల్లవి: చెక్కుచేయిఁ దియ్యరాదు సిగ్గులుపడక పోదు
ఇక్కువ నా తడఁబాటు నేమిసేతునే

చ. 1: మొక్కఁగా వీడినకొప్పు ముడుచుకొనఁగఁబోతే
పక్కనఁ జన్నులమీఁదిపయ్యద జారె
దక్కెఁ దనవంతము తలఁచినట్టె ఆయ
యెక్కువనా తమకము నేమిసేతునే

చ. 2: మీటఁగా గట్టినవీణెమెట్టు చక్కఁబెట్టఁబోతే
పాటించి బాహుమూలాలా బయటఁబడె
సూటిఁబడఁ దననేర్పు చూచిన చూపు లీడేరె
యీటులేనినావలపు నేమిసేతునే

చ. 3: వొరయఁగా వదలిన వొడ్డాణము పట్టఁబోతే
మురిపెపునాపోకముడి వీడెను
సరుస శ్రీవేంకటేశు సరసము నెరవేరె
యిరవైన పరవశ మేమిసేతునే

రేకు: 1649-6 శంకరాభరణం సం: 26-293

పల్లవి: చూడవయ్య నీ సుదతివిలాసము
వేడుకకాఁడవు విభుఁడవు నీవు

చ. 1: వున్నమవెన్నెల పోగులువోసీ
సన్నపు నవ్వుల జవరాలు
వన్నెలఁ గుంకుమ వసంతమాడీ
యిన్నిటాఁ గళలతో యీ మెఱుఁగుఁబోఁడి

చ. 2: పాటించి తుమ్మిదపౌఁజులు దీర్చీ
కాటుక కన్నుల కలికి
సూటి జక్కవల జోడలరించీ
నాటకపు గతుల నాభిసరసి

చ. 3: అంగజు రథమున హంసలు నిలిపీ
కంగులేని ఘనగజగమనా
యింగితపు శ్రీవేంకటేశ నిన్నెనసె
వంగెన సురతపు పల్లవాధరి

రేకు: 1650-1 శ్రీరాగం సం: 26-294

పల్లవి: వెన్నెలఁ గాయఁగాను వేసవందురా
మన్ననలు చేకొని నెమ్మది నుండఁగదవే

చ. 1: పగటున నాతఁడు పకపక నవ్వఁగాను
యెగసక్కేలెల్లా నీవే యేలాడేవే
తగినట్టెల్లా నప్పటిఁ దగవులు నెరపఁగ
నిగిడ నీ వింతలోనే నింద వేతురా

చ. 2: పొదిగి నీ శిరసున పువ్వుల ముడువఁగాను
గుదిగొని నీ పతని గోర గీరేవే
వెదకి యతఁడు నీ వెంట వెంటఁదిరుగఁగా
పదిలాన మంచముపైఁ బవ్వళింతురా

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్ను జేరి కాఁగిలించుకోఁగా
చేవమీరి వేల సిగ్గు పడేవే
భావించి పెక్కురతులఁ బచారించి కూడినాడు
తావుల నీ నేర్పు చూపి తమకింతురా

రేకు: 1650-2 మాళవిగౌళ సం: 26-295

పల్లవి: తనకేమే చెలియా దండకు రమ్మనవే
జునిగి తెరలో తొంగిచూడ నింత యేఁటికే

చ. 1: వింగదె యీ మాట విభుఁడు యెవ్వతెతోనో
చెనకి గరిడీసాము సేసెనట
కొనగోరు సోఁకెనట గొబునఁ జెక్కులమీఁద
వొనరి సిగ్గున లోన నున్నాఁడట

చ. 2: చూడవే యీతఁడే మరి సొగిసి వేరొకతెతో
వేడుక వసంతములాడినాఁడట
వీడక ఆకె తీగెట వెంట్రుకలఁ జిక్కెనట
వోడ కొకరితోఁ జెప్పకున్నాఁడట

చ. 3: అడుగఁగదె శ్రీవేంకటాధిపతి నాతోనే
యెడయక చెప్పి నన్ను నేలె నేఁడు
అడియాలాలాయనట అండనే యిద్దరి పొందు
జడియక యిన్నిటాను చలివాసినాఁడట

రేకు: 1650-3 బౌళి సం: 26-296

పల్లవి: మేలు మేలు కాంతలకు మేకుసేయ నేరుతువు
తాలిమితో నన్నిటా నాదరించనేరుతువు

చ. 1: పంతగాఁడ వౌదువు పదారువేలు సతుల
బంతిఁబెట్టి వొక్కమాటే భ్రమఇంచితి
యెంతవాఁడనైనా నౌదు వెమ్మెలకు సీతాదేవి-
నంతవట్టువారు జూడ నగ్గి బాస గొంటివి

చ. 2: అలరుక్మిణిఁ బెండ్లాడి ఆకెయన్నను బోదించి
లలి సంతోసముగా సెలవు సేసితి
పాలసి సత్యభామకు పూవు దెచ్చి చేతికిచ్చి
యెలమి సవతులలో నెక్కుడు సేసితివి

చ. 3: వీఁపున భూకాంత నిల్లి వేడుకతో శ్రీలక్ష్మిని
మోపుగా నే పొద్దు నురమున నించితి
కాపాడి మిక్కిలి ననుఁ గరుణించి కాఁగిలించి
యేపున శ్రీవేంకటేశ యేలి మన్నించితివి

రేకు: 1650-4 ఆహిరి సం: 26-297

పల్లవి: తలఁచిన తలఁపులు తలకూడీఁ గాక ఇఁక
కలిగిన నీ బత్తి కడమవడీనా

చ. 1: యెవ్వతె రానికోపమో యెదలోనఁ బెట్టుక నే
నవ్వినాను వూరక వున్నాఁడవు నీవు
తవ్వితే నిసుకపాఁతరవంటిది వలపు
మవ్వపు వేడుకతోడ మాటలాడవయ్యా

చ. 2: వుమ్మడి నెందకేఁగేవుద్యోగ మున్నదో నీకు
రమ్మని నేఁ బిల్వఁగాఁ బరాకు మానవు
చిమ్మిరేఁగి వూరేటిచలమవంటిది తమి
యెమ్మె చూప నెంతలేదు యింటికి రావయ్యా

చ. 3: అక్కడ నెక్కడిమాఁట లాలకించుకున్నాఁడవో
యిక్కువలు నే నంటినా యేమీ ననవు
చక్కని శ్రీవేంకటేశ జలధివంటిది యాస
యెక్కువ నన్నేలితివి యిట్టె వుండవయ్యా

రేకు: 1650-5 దేసాళం సం: 26-298

పల్లవి: రట్టడి కడపరాయఁ డిట్టె వీఁడు
గట్టిగా నేఁడిపుడు తగవు దేర్చరే

చ. 1: చెలము సాదించరాదు సముకానఁ గొంచరాదు
పలుమారు మాటలాడి పదరీ వీఁడు
మొలకచన్నులు నావి మొనలెత్తీఁదనమీఁద
చెలులార మాకు బుద్ధిచెప్పఁగదరే

చ. 2: పందెములడువరాదు పంతము విడువరాదు
కందువలు చూపి పొత్తుగలసీ వీఁడు
అందపు నాచూపు లివి అంటుకొనీఁ దనమీద
చందపు మావలపులు చక్కఁబెట్టరే

చ. 3: తమక మాపఁగరాదు తాలిమి చూపఁగరాదు
అమర గూడె శ్రీవెకటప్పఁడు వీఁడు
చెమటల నామేను చేఁతసేసీఁ దనమీఁద
జమళి మమ్మిద్దరిని సారె మెచ్చరే

రేకు: 1650-6 సామంతం సం: 26-299

పల్లవి: కోరికె లీడేరె నేఁడు కోనేటిరాయ । ఇట్టె
కూరిముల వూటుకూరికోనేటిరాయ

చ. 1: కుమ్మరించేవు సిగ్గులు కోనేటిరాయ । యీా -
కొమ్మలెల్లఁ జూడఁగాను కోనేటిరాయ
కొమ్మువంటి కొనగోరఁ గోనేటిరాయ । మేను
కుమ్మెలుగా నొత్తకుమీ కోనేటిరాయ

చ. 2: కొప్పుగడు వెడజారె కోనేటిరాయ । నిండా
గుప్పేవు సెలవినవ్వు కోనేటిరాయా
కుప్పళింపుఁ జెమటలగోనేటిరాయ । యెంత
గొప్పవాఁడవయ్య నీవు కోనేటిరాయ

చ. 3: కొండికపాయ మమరెఁ గోనేటిరాయ । పైఁడి
గొండెలపచ్చడముతో గోనేటిరాయ
అండనే శ్రీవేంకటాద్రి నలరి నన్నేలితివి
కొండలలో నెలకొన్న కోనేటిరాయ

రేకు: 1651-1 కాంబోది సం: 26-300

పల్లవి: ఏమి సేఇంచుకొంటివి యేమందు నిన్ను
కామించినవారికెల్లా కాఁతాళము పుట్టదా

చ. 1: చీటి వ్రాసి యెవ్వతే నీ శిరసునఁ జెక్కినది
చాటువగా నేనది చదువుకొంటి
తాటించి నీ మోవెల్లా తన యెంగిలేయట
ఆఁటది యీ మాట వింటే అంట సిగ్గు గాదా

చ. 2: కోరి ముద్దుటుంగరము కొంగుతోఁ గట్టినది
తేరి చూచి ఇది నేఁ దెలుసుకొంటి
బోరున నీమేను తానే భోగించినదనియేమో
బారచాఁచె నీకాఁగిలిపైఁ బంతము గాదా

చ. 3: పూవులదండ నీ మెడఁ బూఁచి సింగారించినది
శ్రీవేంకటేశుఁడ నేను భావించుకొంటి
నీ వొళ్లెల్లాఁ దనకే నిర్మాల్యమనుటిది
యీవేళ నన్నేలితివి యిఁక గొత్తగాదా

రేకు: 1651-2 ముఖారి సం: 26-301

పల్లవి: ఇందాఁకా నేడ నుంటివి యెదురుచూఁచె నీకు
చిందీ సెలవి నవ్వు చిమ్మిరేఁగుచు

చ. 1: ముద్దుల పెదవిమీఁద ముక్కర గదలఁగాను
వుద్దండపు మాట లాడె నువిద నిన్ను
కొద్దిమీరి నొసలిపై కుంతలా లల్లాడఁగాను
గుద్దించీ బొమ్మల నీపై కాతరానను

చ. 2: మెఱుఁగుఁ జెక్కులమీఁద మించుఁజెమటలు నిండ
వుఱిముఱిమి చూచీని వొరసి చెలి
జఱసి చన్నులమీఁద జూరుఁబయ్యదతోడ
గుఱిగాఁ జేతులు చాఁచి కొసరీ బీరానను

చ. 3: చక్కనిమేననెల్లా జాజుకొనఁ బులకించి
మిక్కుటమ్మై కూడె నలమేలుమంగ
ఇక్కువ లంటి శ్రీవేంకటేశ నిన్ను మెప్పించి
చొక్కించె రతుల నేఁడు సులభానను

రేకు: 1651-3 లలిత సం: 26-302

పల్లవి: నీ వల్లనే యీ చేఁతలు నెట్టన బాయిటఁ బడె
కావరించఁ జుమ్మీ ఇచ్చకము సేసితిఁగాని

చ. 1: పవ్వళించి వుండఁగాను పక్కనఁ దెరవేసితే
నవ్వు లేమి నవ్వేవు నాతో నీవు
యెవ్వతెకుఁ గాచుకుండే దెరఁగఁ జుమ్మీ నేను
చివ్వన నుపచారము సేసితిగాని

చ. 2: వేళతో వేగించఁగాను విడేలు వద్దఁ బెట్టితే
ఏల సిగ్గులవడేవు యింతలో నీవు
వాలాయించి వేరొకతె వచ్చేది యెఱఁగఁజుమ్మీ
మేలిమి వూడిగాన మెప్పించితిఁగాని

చ. 3: వురాన నలమేల్మంగ వుండఁగా నీకు మొక్కితే
వెరవు లేమి యెంచేవు వేసాన నీవు
నిరతి శ్రీవేంకటేశ నే నిన్నుఁబెండ్లాడితి
విరసముగాదు సుమ్మీ వేడుకగాని

రేకు: 1651-4 బౌళి సం: 26-303

పల్లవి: నెరవేరెఁ బనులెల్లా నీ భాగ్యమాయ నిఁక
వెరగువడి నీవేమి విచారించేవయ్యా

చ. 1: నెట్టుకొని జవరాలు నీ పాదాలు గుద్దఁగాను
చుట్టి యెవ్వతె కెదురు చూచేవయ్యా
ముట్టి మడిచినయాకు మోవికి నందియ్యఁగాను
గుట్టున లోలలో నేమి గోరేవయ్యా

చ. 2: సమ్మతించి నీతో నాపై సరసములాడఁగాను
కిమ్ముల నే మాట లాలకించేవయ్యా
కుమ్మెలుగా నురమున కుచముల నొత్తఁగాను
పిమ్మట నెక్కడ పెండ్లిమీఁట యెక్కేవయ్యా

చ. 3: అలమేలుమంగ నిన్ను నదె కాఁగిలిఁగాను
అలరి యేఁటికి వెరగందేవయ్యా
యిల శ్రీవేంకటేశ న న్నీకె యేలించఁగాను
నలువంక మరియేమి నవ్వు నవ్వేవయ్యా

రేకు: 1651-5 వరాళి సం: 26-304

పల్లవి: వెంగెమాడఁ బనిలేదు వెస నొకరొకరికి
సంగతాయ పొందు జమళి నిద్దరికి

చ. 1: పొత్తులఁ గుండి యాపె పూఁచి చేతికియ్యఁగా
ఇత్తల వందిచ్చేవు ఇదివో నాకు
బత్తి నీవు నాపైని పడఁతికి నీ మీఁదను
హత్తి వున్న విద్దరిపుణ్యములు మంచివే

చ. 2: ఆకె దనతొడమీఁద నటు నిన్నుంచుకొనఁగ -
నీ కడ నీతొడపై నన్నిడుకొంటివి
నీకు నేను ప్రియమైతి నీ వాపెకు బాఁతైతివి
పైకొని ఇద్దరి తపః ఫలములు మంచివే

చ. 3: వెలినుండి వచ్చి యాకె వేడుక నిన్నుఁ గూడితే -
నలమేల్మంగనైన నన్నలమితివి
వలతువు నీవు నాకు వనిత నీకు మోహించె
యెలమి శ్రీవేంకటేశ యీరెండు మంచివే

రేకు: 1651-6 హిందోళం సం: 26-305

పల్లవి: ఇందు కాపెను రప్పించు యెవ్వరైరేమి
విందులకుఁ దిరుగఁగా వెంగెమాడేనా

చ. 1: యీపొద్దు వొంటి నుండఁగా యింటికిరమ్మంటిఁగాక
ఆపెతో మాటలాడఁగా అదేలనేనా
యేపున నీతలఁపోత యెఱఁగ కాడితిఁగా
కాపురాలు సేయఁగాను కాదనేనా

చ. 2: నివ్వెరగుతో నుండఁగా నిన్నెంచరించితిఁ గాక
యెవ్వతెకు మోమించినా యేఁటికనేనా
నివ్వటిలులు నీ గుణము నిశ్చఇంచనైతిఁ గాక
అవ్వలఁ బెండ్లి పనికి ఆరడి సేసేనా

చ. 3: పానుపుపై నుండఁగాను పాదము లొత్తితిఁగాక
యేనెలఁతకుఁ బొంచినా యెడచొచ్చేనా
కానిమ్మని నన్ను శ్రీవేంకటేశుఁడ కూడితివి
మానని చుట్టరికము మఱపించేనా

రేకు: 1652-1 సాళంగనాట సం: 26-306

పల్లవి: సంతకూటాలవారెల్లా సతమయ్యేరా
మంతుకెక్కిన నామేలు మఱవకు మీఁకను

చ. 1: పంతమాడేదానఁ గాను పలుమారు నీతోను
రంతుసేయని ఇచ్చకురాలఁ గాని
బంతికూటిసతులెల్ల పనికివత్తురా నీకు
వంతుకుఁ, బెండ్లాడినటువంటివారే కాక

చ. 2: కక్కసించేదానఁ గాను కాదుకూడదని నీతో
దక్కివుండే చిత్తములోదానఁ గాని
పక్కఁ గూచున్నవారెల్లా బందుగులౌదురా నీకు
గక్న నీకు మేనరికపువారే కాక

చ. 3: వేసరించేదానఁగాను వేడుక శ్రీవేంకటేశ
ఆసతో నిన్నుఁ గూడిన ఆలఁగాని
వేసాలపొరుగువారు వేళకొదిగేరా నీకు
వాసి నింట వరుసకు వచ్చేవారే కాక

రేకు: 1652-2 సామవరాళి సం: 26-307

పల్లవి: ఇంత గద్దా వట్టి రట్టు యెందాఁకాను
పంతము నెఱపుదురా పతితోను

చ. 1: పిలిచేతే రావలె ప్రియము చేకొనవలె
చలపాదితనమేలే సతికి
సులభాన నవ్వవలె సూటికిఁ బెనఁగవలె
బలిమి చూపుదురా పతితోను

చ. 2: కడుఁబొందు సేయవలె కనుసన్న నుండవలె
గుడుసుఁదనము లేలే కాంతలకు
అడరి మాటాడవలె అంకెకు లోఁగావలె
బడి బడి సొలతురా పతితోను

చ. 3: యింగిత మెఱఁగవలె ఇచ్చకము సేయవలె
వెంగలితనము లేలే వెలఁదికి
అంగవించి కూడితివి అలమేల్మంగవు నీవు
పంగింతురా శ్రీవేంకటపతితోను

రేకు: 1652-3 రామక్రియ సం: 26-308

పల్లవి: కంటిమి నేఁ డీకొత్తలు కన్నుల పండుగలాయ
జంటలైన మీలోని జాణతనా లెట్టివో

చ. 1: కోమలపు నీకాంత గుబ్బలపై మెఱుఁగులు
మోమున నీకు గళలై ముంచుకొన్నవి
యేమి సూత్రమోకాని ఇందుకునందుకు నేఁడు
తామర మొగ్గల సొంపద్దముపై నిలిచెను

చ. 2: కడు మంచి జవరాల కనుగవతేటలు నడుమ
నడుమ మోవిమీఁద నవ్వులాయను
యెడయక యీారెంటికి నేమిగారణమోకాని
అడరి కలువలనిగ్గంటెఁ జిగురులను

చ. 3: అలమేలుమంగ నీయండఁ బాయకుండితేను
నెలవై శ్రీవేంకటేశ నీవు గూడితి
యెలిమి నాపై నీకు నెన్నటి పొందోకాని
కలసి మెఱుఁగుదీవె కల్పకముఁజెందెను

రేకు: 1652-4 దేసాళం సం: 26-309

పల్లవి: అన్నిటా భాగ్యవంతుఁడ వౌదు వయ్యా
సన్నలు సేసీ నిదె చక్కని జవరాలు

చ. 1: మోము చూచి నీ మీఁద మోహము చల్లీ నేఁడు
ప్రేమగలసేసపాల పెండ్లికూఁతురు
చేముట్టి సరసమాడి సేవలెల్లాఁజేయఁజొచ్చె
ఆమని నవ్వులతో మోహపు దేవులు

చ. 2: మల్లాడి యడుగులకు మడుగులు వరచీని
చెల్లుబడిగలిగిన చెలిమికత్తె
వుల్లము గరఁగను నీ బడివట్టి పెనఁగీని
బల్లిదురాలైన నీ పాయరాని చుట్టము

చ. 3: గక్కన నిన్నుఁజూచి కాఁగిటఁ బాయక కూడె
మిక్కిలినేర్పుల యలమేలుమంగ
ఇక్కవతో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పక్కఁ బాయ దక్కుమీఁది బంగారు పతిమ

రేకు: 1652-5 మాళవిగౌళ సం: 26-310

పల్లవి: దేవ దేవ జగన్నాథ దివ్యమూరితి
చేవదేరే సింగారన చిత్తగించు మిఁకను

చ. 1: కలికి పిఱుఁదు నీకు ఘనచక్రముల తేరు
బలుచనుగుబ్బల పైఁడి కుండలు
అలరిననడపులె హంసవాహనములు
కెలన నీకెఁగైకొని గెలుపుము మరుని

చ. 2: వరుస మించుఁ బయ్యద వ్రాతలపెనుటెక్కెము
యిరుదెసల చెక్కులె యివె యద్దాలు
మొరయుగంటలతోడిమొలనూల్లె పగ్గములు
వరగ నీకెఁ బెండ్లాడి పచారించు పంతము

చ. 3: కొదలేనిహారమచే కుచ్చుల పూదండలు
చదల నలమేల్మంగే సామ్రాజ్యము
యెదుట శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
వదలక మన్నించి వన్నెకెక్కు రతుల

రేకు: 1652-6 బౌళి సం: 26-311

పల్లవి: కాంత వద్దనే వున్నది కాఁగిలించుకొమ్మనవే
వంతల నెవ్వరైనాను వలదనేరా

చ. 1: యెన్ని వేసాలు సేసీనే యీతఁ డాకెకు వలచి
వెన్నెలలు వేఁడులంటా వెరగందీని
విన్నవారుఁ గన్నవారు వెస నవ్వేదెటుఁగఁడు
వన్నెల పూవుటమ్ములువాండ్లనీని

చ. 2: యింత బూటకములేలే యీపె భ్రమలకు లోనై
కంతుఁడు దోసకారెని కడు దూరీని
చెంతల నిందరిలోనా సిగ్గుపడ నేరఁడు
పొంతనున్న చలిగాలి బూత మనీని

చ. 3: ఆగడాలు నేర్చెఁగదె అలమేలుమంగఁ గూడి
సోగ కన్నులను నవ్వి సొంపు మీరీని
యీగతినె శ్రీవేంకటేశుఁ డిదె నన్ను నేలె
బాగుగా బెక్కురతుల పంతమాడీని

రేకు: 1653-1 శుద్ధవసంతం సం: 26-312

పల్లవి: ఎంతకు నేరవు నీవు యేమిచెప్పేది
చెంతల నీ వేసాలకు సిగ్గయ్యీ నాకు

చ. 1: తెలమఱఁగున నాపె దిష్టము కత చెప్పఁగా
వరుస మాచెలి విని వచ్చెను నేఁడు
శిరసెత్తి నీమాటలే చెల్లఁబెట్టే వప్పటిని
అరుదయ్యీ నిన్నుఁ జూచి అంతలోనే నాకు

చ. 2: సంగడిఁ గూచుండి యాపె సరసములాడఁగాను
చెంగటఁ జూచివచ్చి చెప్పె మాసతి
అంగడిఁబడ్డవలపు అంతలోనే దాఁచేవు
వుంగిటి నీవోజకు నవ్వులు వచ్చీ నాకు

చ. 3: గక్కనఁ బాన్పుపై నాకె కాఁగిట నిన్నుఁగూడఁగా
ఇక్కువఁ దెలిసివచ్చె నిదె మాకాంత
వొక్కటై శ్రీవేంకటేశ వొగి నన్నుఁ గూడితివి
చొక్కి యలమేల్మంగను సాద్యమయ్యీ నాకు

రేకు: 1653-2 కాంబోది సం: 26-313

పల్లవి: అడుగరే ఆతనినే అవునోకాదో
వెడ వెడ మాటలెల్లా వేడుకలౌనా

చ. 1: మనసురానిచోట మగుడి మగుడి వచ్చి
చనవులు నెరపితే సంగతులౌనా
పెనఁగుతా నుండఁగాను ప్రియములు పచారించి
చెనకఁబోతేఁ దనకు చేతికి లోనౌదురా

చ. 2: చలము సాదించేవేళ చవులు సేసుకొని
పిలిచి విందుచెప్పితే ప్రియము లౌనా
వలపు చాలకుండఁగా వడివెట్టి వడివెట్టి
బలిమిఁ గాఁగిలించెతే బత్తి సేతురా

చ. 3: సిగ్గువడివుండఁగాను చెక్కునొక్కి వేఁడుకొని
వొగ్గి విడెమిచ్చితు వొడఁబాటౌనా
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
కగ్గులేక కూడె నీకఁ గపటము లెంతురా

రేకు: 1653-3 పాడి సం: 26-314

పల్లవి: ఆడకుఁ బోయిరావయ్యా అన్నీ విన్నవించేఁగాని
యీడ మాతోడిపొందులు యేకాలముఁ గలవే

చ. 1: చిత్తము రంజిల్ల నీవే చెప్పినట్టల్లాఁ జేసి
మెత్తనిమాట లాడి మెప్పించె నాపె
గుత్తపు గుబ్బలు పోఁక కొప్పు నీకుఁ జక్కఁబెట్టి
చిత్తజకేళికి నిన్నుఁ జిమ్మిరేఁచె నాపె

చ. 2: తనపైఁ బరాకుసేసి తమి నీకు బుట్టించి
వినయములనే దక్కఁగొనె నిన్నాపె
కొనగోలు మోవ చెక్కుఁలను జవ్వాది మెత్తి
కనుసన్న రతులకుఁ గైకొలిపె నాపె

చ. 3: తెమఱఁగుకుఁ దీసి తియ్యనిమోవి యొసగి
మరిగించె నలమేలుమంగే యాపె
గరిమ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
సరసపునవ్వులు చవిచూపె నాపె

రేకు: 1653-4 సామంతం సం: 26-315

పల్లవి: ఆపెకు నీకుఁ దెలుసు నంతంగపు సుద్దులు
కోపగించఁ బనిలేదు గోవిందరాజ

చ. 1: యెంత చనవిచ్చితివో యీపెకు నీవు నేఁడు
వంతులు వాసులుఁ బట్టీ వడిగా నీతో
పంతగత్తె గానోపు పలుమారు నీకె నిన్ను
కొంతపుఁ జూపులఁ జూచీ గోవిందరాజ

చ. 2: యేరీతి వొడఁబాటో యీకెనీసందిఁ దొల్లి
మేరతో మాటాడి మందెమేళముఁ జూపీ
నేరుపరి గాఁబోలు నిన్నుఁ గుడుఁబచారించి
కూరిములు గొసరీని గోవిందరాజ

చ. 3: బాసలేమి సేసితివో పలుమారు నీకె నీతో
రాసికెక్కఁ గూడి మేరలు మీరీని
వేసాలది గాఁబోలు శ్రీవేంకటాద్రి నన్నేలఁగా
గోస నాసచేసీని గోవిందరాజ

రేకు: 1653-5 కాంబోది సం: 26-316

పల్లవి: ఊరకే గుట్టుతోడుత నుండుటగాక
కూరిముల పచరించి కొసరఁగవచ్చునా

చ. 1: దయదలఁచుక నీవే దండకు వచ్చితిగాక
నయాన నిన్ను రప్పించ నావనమా
నియతపు నీ బాస నెరవేర్చుకొంటిగాక
ప్రియమున నీ గుణము భేదించవచ్చునా

చ. 2: లోకము మెచ్చవలసి లోనైతివిగాక
నాకు చేకొని నిన్ను గరఁగించే దానా
యీకడ నీ కీర్తికి ఇటు నన్నేలితిగాక
దాకొని చిత్తము రా నేస్తము సేయవచ్చునా

చ. 3: తగవెంచుకొని నన్ను తతిఁ బెండ్లాడితిగా
తగుఁబొంతనాలు నీకు తలఁపించేనా
నగుతా శ్రీవేంకటాశ నన్ను మన్నించితిగాక
మిగులా నిన్నొరయుచు మెప్పించవచ్చునా

రేకు: 1653-6 లలిత సం: 26-317

పల్లవి: మందలించి యతనికి మంచిదానివలెనే
యిందులోనే చూపేవే ఇతవు లెల్లాను

చ. 1: అవ్వలి నీరమణుని నాడఁగలవెల్లా నాడి
నవ్వితిననే వవునే నాలికత్తెవు
పువ్వులను నొవ్వవేసి పుప్పొడి మోమునఁ జల్లి
నివ్వటిల్ల వసంతము నే నాడితిననవు

చ. 2: చెనకులు మేన నిండా సేయఁగలవెల్లాఁ జేసి
పెనఁగితి ననేవేమే బేసబెల్లివి
కొనచూపులనుఁ జూచి కొంగువట్టి చేతఁ దీసి
లనువుగా వేఁడుకొంటినని యాడేవేమే

చ. 3: అలయించి రతిఁగూడి అంగము లెంగిలిచేవి
వలచినజాడనేవే వైపులాఁడివి
యెలమి శ్రీవేంకటేశు నిటు నన్ను నొనగూర్చి
తెలిపి యందరికిని ద్రిష్టము చూపేవే

రేకు: 1654-1 వరాళి సం: 26-318

పల్లవి: నవ్వు వచ్చీ మిమ్ము జూచి నాకు నేఁడు
కువ్వలై వలపు గుదివచ్చినట్లాయను

చ. 1: పెట్టినపయ్యదకొంగు పెనుచెమటలచేత
గుట్టుతోడనే చెలికి గుబ్బల నంటె
పట్టరానిసిగ్గుతో నీ పచ్చడము గప్పుకొనె
నెట్టుకొన్న రమణుఁడ నీ భాగ్యము లాయెను

చ. 2: మోవిదొండపండు సతిముంజేతి చిలుకచే
కావరించి తొడుకఁగా గంటి వడెను
వావిరి సిగ్గుతో నీ వదనానఁ జిక్కించె
రేవగలు విభుఁడ కోరిన కోర్కులాయను

చ. 3: జలజాక్షి నిలువెల్లా జవ్వనమదముచేత
చెలరేఁగి పులకలు చిమ్మేఁగెను
కలిగి సిగ్గుతో నిన్నుఁ గాఁగిలించుకొనె నేఁడు
నెలవై శ్రీవేంకటేశ నీకు వేడుకాయను

రేకు: 1654-2 పాడి సం: 26-319

పల్లవి: చెప్పరాదు నీవు వలచిన సొంపులు
లప్పలై రాలె గందము లగ్గదింపులు

చ. 1: కలికి నీపైఁ జల్లీ కనుచూపులు
తలపోయ నీకవి తరితీపులు
తొలఁకించీఁ జన్నులను తోదోపులను
మలసితే ముకొనీ మరుతూపూలు

చ. 2: చెంది సెలవులఁ జిమ్మీ చిఱునవ్వులు
యిందరిలో నీకు నవి యెడదవ్వులు
కందున నీతో సిగ్గులు కమ్మ బువ్వులు
దిందుపడ్డ యీపెకొప్పు తేఁటికొవ్వులు

చ. 3: కెరలి చేకొనీ నీ కాఁగిటిపొందులు
మరుగకు నీకు నవి మాటుమందులు
మురిపేనఁ గూడి యిచ్చె మోవివిందులు
యిరవై శ్రీవేంకటేశ యిదె సందులు

రేకు: 1654-3 రామక్రియ సం: 26-320

పల్లవి: నిరతపుజాణ వపుదు నేరుపరి వౌదువు
సరసమెంతాడేవు చాలు నుండఁగదవే

చ. 1: వుక్కువంటిది నీగోరు వొగ నాటుఁజేసుఁ బతి
చెక్కులేల నొక్కేవే చెలియ
మొక్కు అప్పటి నీ ముద్దుటుంగర మాతని -
చక్కనిపాదము లొత్తీఁ జాలు నుండఁగదవే

చ. 2: కొండలవంటి చన్నులు కుమ్మెలుగాఁ దాఁకుఁ జేసు
అండనేల కాఁగిలించే వతివా
పండే వాతని పక్కను బంగారువంటినీమేను
చెండిగాఁ గాఁకలు సేసీఁ జాలు నుండఁగదవే

చ. 3: అమ్ములవంటివి కన్ను లాయము లంటుఁ జేసు
పమ్మి యాతని చూచేవు పడఁతీ
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డిటు నన్ను నేలినాడు
సమ్మతిగాఁ గూడితివి చాలు నుండఁగదవే

రేకు: 1654-4 సామంతం సం: 26-321

పల్లవి: సిగ్గువడి నీలో నీవే చిరునవ్వేల నవ్వేవు
అగ్గలమై మాతోనైనా నాలోచించరాదా

చ. 1: వెలఁది నీచెవిలోన విన్నవించినయందుకు -
నలరి మారుత్తరము లానతీరాదా
చలివాయ గోర నూఁది సన్నసేసినయందుకు
తిలకించి యీపెచేతఁ దెలుసుకోరాదా

చ. 2: చీటి వ్రాసి నీచేతికి చెలి యిచ్చినయందుకు
పాటించి యుద్ధములు చెప్పఁగరాదా
తాటించి ప్రియములు చెప్పితప్పక చూచినందుకు
జూటరితనాన మేను సోద నియ్యరాదా

చ. 3: కాఁగిటిలో వినయాలు కాంత సేసినయందుకు
చేఁగదేర నిందరిలోఁ జెప్పుకోరాదా
వీఁగక శ్రీవేంకటేశ వెస నన్నుఁ గూడితివి
మాఁగిన మోవి యిచ్చి మన్నించరాదా

రేకు: 1654-5 ఆహిరినాట సం: 26-322

పల్లవి: ఇటు నీకు మగఁడైతే నిది యలవాటులా
కటకటా జంకించేవు కసుగందదా

చ. 1: సన్నలకు లోనైన జవ్వను మగవాని
కన్నుల నింత చూచితే కాఁడి పారదా
పిన్నదానవైనుండి బెట్టిమాట లాడేవు
చెన్నుఁడాతని వీనులు చీదరలు గొనవా

చ. 2: యేఁకటతోనుండేటి ఇచ్చకపురమణుని
కాఁకలనవ్వు నవ్వితే గరివడదా
వీఁకతో నీ నాయకుని వెసఁ జన్నుల నొత్తేవు
తేఁకువ నాతనిమే నొద్దికఁ గాయగావదా

చ. 3: చిత్తము కోమలమైన శ్రీవేంకటేశ్వరుని
తత్తరించి పొందితిని తమి రేఁగదా
యిత్తర నన్నేలినాఁడు యిందరిలోపల నేఁడు
కొత్తలు సేసితే మతి గుబ్బతిల్లదా

రేకు: 1654-6 శంకరాభరణం సం: 26-323

పల్లవి: ఏమే యిది నీ వెఱఁగనిదా
కామించి సొలయఁగా గసరుదురా

చ. 1: నంటున నీతో నవ్వేరమణుని
గొంటుఁదనంబున గుంపితురా
అంటుచు నీచన్ను లటు గని మొక్కఁగ
వెంటగా నానలు పెట్టుదురా

చ. 2: తమకపు టాసల తప్పక చూచితే
సముకానఁ బతిని జఱయుదురా
ప్రమదంబున నీ పాదము దొక్కఁగ
జమళి బొమ్మలను జంకింతురా

చ. 3: శ్రీవేంకటేశుఁడు చేరి కూడె నిను
లావగురతుల నలయింతురా
కావరించి మరీఁ గాఁగిలించఁగా
ఆవలఁ బంతాలాడుదురా

రేకు: 1655-1 గౌళ సం: 26-324

పల్లవి: నీ గుట్టు దెలియరాదు నిండుక వున్నాఁడవు
యేగతి నీసేవ సేతు మెఱఁగించవయ్యా

చ. 1: చెక్కులపైఁ జెమటలు జిగిమించి వూరఁ జొచ్చె
యెక్కడఁ దలఁచితవో యెఱఁగ నేను
చక్కని నీ కెమ్మోని జడియుచు వసివాడె
పెక్కుమాట లెవ్వతెతో బెఱసి యాడితివో

చ. 2: నిలువెల్లాఁ బరాకులె నెయ్యమునఁ గానుపించె
వల పెందునున్నదో నీవైపు దెలియ
తిలకింప నీ కన్నులతేటలలో కెంపు మీరె
తలఁక కెవ్వతెదిక్కు తప్పక చూచితివో

చ. 3: సిగ్గులు మోమున ముంచి సెలవుల నవ్వు దేరె
వొగ్గి యెవ్వతెఁ గూడితివో ఇదెంచను
యెగ్గులేక శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
కగ్గుదేరె నెటువంటికతలు నేర్చితివో

రేకు: 1655-2 దేసాళం సం: 26-325

పల్లవి: నే మెఱఁగమా అది నీవు చెప్పనేమిటికి
కాముకుఁడైనవాఁడవు కఱఁగఁగ నేరవా

చ. 1: వక్కణతో నాపెకు వలచినవాఁడవు
గక్కన నింతేసి పొగడనేరవా
చిక్కించుక సేవలెల్లాఁ జేయించనవాఁడవు
మిక్కిలి నీ వాపెను మెచ్చనేరవా

చ. 2: కోరి వేఁడి యాపెఁ దెచ్చుకొనిన యట్టివాఁడవు
గారవించి మన్నించ మిక్కడ నేరవా
కారుకమ్మఁ బచ్చడము గప్పిన యట్టివాఁడవు
సారె సారె సిగ్గులెల జరపఁగ నేరవా

చ. 3: చలమున నాకెమోవి చవిగొన్నవాఁడవు
సొలసి సొలసి లోలోఁ జొకనేరవా
కలసితి విటు శ్రీవేంకటగిరీశ్వర నన్ను
తలఁచి ఇద్దరిని సంతము సేయనేరవా

రేకు: 1655-3 బౌళి సం: 26-326

పల్లవి: నీమాటలు నిన్నె మోచె నెలఁతవంతము చెల్లె
యేమనేవు మాతో నానతియ్యవయ్య యిపుడు

చ. 1: వలచి యాపె నీమై వడిఁ జేఁతలు సేసితే
చెలితో మారుకుమారు సేసే నంటివి
సెలవి నవ్వులతోడ చేతులెత్తి మొక్కె నీకు
మలయుచు నీ వింక మారు మొక్కఁగలవా

చ. 2: గుట్టుతో నాపె నిన్నుఁ గోరి తిట్టు దిట్టితేను
అట్టె మాటుమాట లాడే నంటివి
బెట్టి యెలుఁగెత్తి నిన్ను ప్రియము చెప్పిపొగడె
పొట్టఁ బొరుగున నాపెఁ బొగడఁగఁ గలవా

చ. 3: ఇచ్చగించి యాపె నీకు యెంగిలిమోవి ఇచ్చితే
ఇచ్చినందుకును సరి ఇచ్చేనంటివి
కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడి మడిచి యాకిచ్చె
నిచ్చలు నిట్టె యాపెకు నీవూ నియ్యఁగలవా

రేకు: 1655-4 రీతిగౌళ సం: 26-327

పల్లవి: అన్నిటా నాగుఱమెల్లా నాతఁ డుఁగు
నిన్ను మెప్పింనేర్చిన నెరజాణ నేను

చ. 1: రెప్పలెత్తి చూచి నీవు రేసులు వుటించకువే
యెప్పుడు రమణునికి ఇల్లాల నేను
చప్పనిమాట లాడి చవులు దప్పించకువే
చిప్పిల నీతో సాగుసేసిన దాన నేను

చ. 2: సెలవుల నవ్వునవ్వి సిగ్గులువరచకువే
తలఁపులో నుండే మేనదాన నేను
బలిమిఁ బట్టి పెనఁగి బయలీఁదించకువే
చలములకైతే నీతో సరిదాన నేను

చ. 3: మరిగించి నీ వింత మనసు సోదించకువే
తిరమై శ్రీవేంకటేశుదేవుల నేను
పొరి నీ వాతనిఁ గూడి పొత్తులు గలపకువే
సిరుల నీ కొద్దికైన చెల్లెల నేను

రేకు: 1655-5 నాదరామక్రియ సం: 26-328

పల్లవి: సవతివి నీ విన్నిటా జాణవైతివి
వువిదరో యింటిలోన నుండె తనిసితిమే

చ. 1: చనవరివౌదువే సంగడిఁగూచుందానవు
ననిచెనే మీ పొందులు నవ్వే రిద్దరు
యెనసి మేమైతేను యింతేసి నేరమైతిమే
మొనసి పెండ్లాడినందె మొగిఁ దనిసితిమే

చ. 2: పొందైనదాన వౌదువే పూనుక వచ్చేవు నీవు
ముందే చుట్టాలవుదరే మొక్కలాడేరు
పందేలు వేసి నీవలె బయలీఁదించ మైతిమే
కందువఁ గంకములు గట్టి తనిసితిమె

చ. 3: బత్తిగలదానవె పైపై సేవలు సేసేవు
పొత్తు మీకుఁ గలసునే బువ్వా లందేరు
యిత్తల శ్రీవేంకటేశుఁ డిటు నన్ను నేలినాఁడు
హత్తి సేసలువెట్టినయందె తనిసితిమే

రేకు: 1655-6 కాంబోది సం: 26-329

పల్లవి: పడఁతి నింతె నన్నేల వచ్చిసేసీనే
తడఁబడ నీ సుద్దులు తనకే యమరునే

చ. 1: బగ్గన నాలిమగనిఁ బలకతో వాసి తెచ్చి
సిగ్గువడఁగానే నాచేతి కిచ్చీనే
యెగ్గులేక యిది దన కెవ్వతె నేర్పెనో కాని
అగ్గమైన దొరలకు నవి వోజలటవే

చ. 2: గబ్బియాడోమాఁటలు చిల్కలకెల్లాను నేరిపి
వుబ్బించి మాయింటికాడ నొప్పగించీనే
జొబ్బిల నే పొస్తకానఁ జూచుకొనెనోకాని
నిబ్బరపుజాణనికి నేమ మిదియటవే

చ. 3: చప్పుడు సగినాల మంచముపై నన్నుంచుకొని
కప్పి తలవంచుకోఁగాఁ గాఁగిలించే
ఇప్పుడె శ్రీవేంకటేశుఁ డెక్కడఁ దెచ్చెనోకాని
తప్పలేని ఘనుననకు తగ నిదౌనటవే

రేకు: 1656-1 ఆహిరినాట సం: 26-330

పల్లవి: ఇంతి నేలుకోవయ్య యిది మొదలు
వంతులకు బెట్టీ నిదె వలపుల వెదలు

చ. 1: మగువ నీకు గొనెమరులు
వెగటుగఁ గాముఁ డేసె విరులు
నిగిడి వీడెఁ గొప్పు నెరులు
తగ నీకుఁ గానుకిచ్చె తనుకుచగిరులు

చ. 2: సుదతి నీ కెదురంపెఁ జూపులు
తుద నొక్క టొకటిపై తో దోపులు
మదితలపోత రేపుమాపులు
దియ కింత సేతురా కడుఁ దరితీపులు

చ. 3: మోవి నిండెఁ జిరునవ్వు మొలకలు
పూవకపూచె మేనఁ బులలు
యీవేళ శ్రీవేంకటేశ యెనసితివి
సోవగా మాఁటలలోనఁ జుట్టకు మలకలు

రేకు: 1656-2 తెలుగుగాంబోది సం: 26-331

పల్లవి: విరిదమ్మివాఁడేయ విరహము వేఁడేయ
పరగ నాతనికి పంతమియ్యరాదా

చ. 1: వేఁడుకొనేవు చెలుల విభునిఁ గూరుచుమని
వేఁడుకోరాదా ఆ విభుని నీవే
పోఁడిమిఁ బగవట్టేవు పున్నమచందురు మీఁద
నేఁడే యీతని పాదాలు నీవు వట్టుకోరాదా

చ. 2: మరుని మీదుదీసి మరి మొక్కుకొనేదాన-
వరసి మొక్కఁగరాదా ఆతనికిని
బెరసి కోవిలలకు ప్రియముచెప్పేదానవు
సిరలు నాతనికే చెప్పరాదా ప్రియము

చ. 3: మంతనానఁ జిలుకతో మాటలాడేదానవు
ఇంతలో మాటాడరాదా యీతనితోనే
అంతటా శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నుఁ గూడె
రంతు సేసేటిదానవు రతి సేయరాదా

రేకు: 1656-3 పాడి సం: 26-332

పల్లవి: తలఁచుకోఁడుగాక తనలాగులు
ఇల రెంట దెప్పరాన ఇతనౌనా వలపు

చ. 1: మనసేల రేఁచీనే మర్మమేల దాఁచీనే
చనుఁగవకేల చెయ్యి సారెఁ జాఁచీనే
మొనసి యొకతె నురమునఁ బెట్టుకొన్నాఁడు
ననిచి యాపెయినాను నగదా ఇందుకును

చ. 2: తరితీపేల సేసీవే తమి యేల మూసీనే
విరుల నేఁటికి నన్ను వేసీనే
శిరసుపై నొకతెను చేరి యెక్కించుకొన్నాడు
అరసి యాపెఇనా వెంగేలాడదా ఇందుకును

చ. 3: సన్నలనేల పొంచీనే చలమేల పెంచీనే
కన్నచోటనెల్లానేల గరిసించీనే
నన్ను శ్రీవేంకటేశుఁడు నమ్మించి బుజాన మోచె
చిన్నిగోలదైనా రట్టు సేయదా యిందుకును

రేకు: 1656-4 ముఖారి సం: 26-333

పల్లవి: అన్నియు వేసాలే మాకు నలుకేడది
మన్నించు మా ముందరనే మతకము లేఁటికి

చ. 1: వుప్పతిల్ల నాకె నీవు వొకరొకరి మొకాలు
రెప్పలెత్తి చూడఁగాను రేసులేడవి
తొప్పఁదోఁగు జెమటలతోడ మీ సెలవుల
చిప్పిల నవ్వఁగాను చింతలేడవి

చ. 2: సంగతిగా మీలోమీరు సరసములాడుకొంటా
కొంగులు వట్టుండఁగా కోపాలేడవి
యెంగిలి మోపులతోడ యేకమై పానుపుమీఁద
సంగతిఁ బెనఁగఁగా మచ్చరములేడవి

చ. 3: కైవసమై యిట్టలను కనుసన్నలకు లోలో
భావములు గరఁగఁగా పంతాలేడవి
యీవల శ్రీవేంకటేశ యెనసితిరి రతుల
చేవదేరెఁ బనులెల్లా సిగ్గులేడవి

రేకు: 1656-5 దేసాళం సం: 26-334

పల్లవి: అట్టేకానీ అందుకేమి అవునోయి
తొట్టివున్నది మదము దొరవౌదువోయి

చ. 1: నిన్నుఁ బిలువవచ్చిన నెచ్చెలి చెక్కుపై గోరు
వున్నతి నేల తీసితివోయీ నీవు
అన్నిటా నీపాలిటి ఆపె నేనైతినా
కన్నులార నీ సుద్దులు కానవచ్చెనోయి

చ. 2: చేదివ్వె తెచ్చిన నాచెలి చన్నులమీఁద -
నా దెస నేమో వాసితి వౌనావోయి
దాదాత నాపెకాంక్ష దానిపైఁ జూపితివా
వేదుగా నీసేఁత వెల్లవిరియాయ నోయి

చ. 3: చాకానుకిచ్చిన నాచెలియ మోవిమీఁద
కుగాఁ జేసితిపట కద్దా వోయి
యీకడ శ్రీవేంకటేశ యిద్దరి మమ్మేలితివి
దీకొని నీ యాసోదాలు తెలిసితిమోయి

రేకు: 1656-6 నాదరామక్రియ సం: 26-335

పల్లవి: ఎంతలేదన్నా నవి ఏల మానీని
చెంతల నీవేడుకలు చెల్లింతువుగాక

చ. 1: పఱపుపై నీకు నాపె పాదములు గుద్దఁగాను
తఱితోడి వలపులు దైవారవా
నెఱి సురటి విసరి నిన్ను నిట్టె చూడఁగాను
గుఱిలేనికోరికలు గుబ్బతిలవా

చ. 2: వేసరక సారెసారె విడెము నీ కియ్యఁగాను
ఆసలు నీమతిలోన నల్లుకొనవా
రాసికెక్క నీతో సరసములెల్లా నాడఁగా
పోసరించి తమకము పారిఁ బిక్కటిల్లదా

చ. 3: పాయక యేపొద్దు నాపె పక్కనే పండుండఁగాను
ఆయాలంటి పరవశమందదా మేను
యీయెడ శ్రీవేంటేశ యేలితివి నన్ను నేఁడు
చాయల నీజవ్వనము సఫలము గాదా

రేకు: 1657-1 ఆహిరి సం: 26-336

పల్లవి: చలమేల వద్దు జాణఁడవు యీ పొద్దు
యెలుఁగెత్తి విన్నవించే ఇంటికి రారాదా

చ. 1: మమ్మునేల లోఁచేవు మర్మాలేల రేఁచేవు
కమ్మర మాపైనేల కాలు చాఁచేవు
తమ్మిపువ్వు కడువాఁడి దండనే వెన్నెల వేఁడి
ఇమ్మల నింతటనైనా ఇంటి రారాదా

చ. 2: సన్నలేల చేసేవు సడి యేల వేసేవు
చన్నులపై వాఁతలేల సారె వాసేవు
చిన్నిగాలికాఁక బెట్టు చిలుకలపలుకు రట్టు
యెని మాయలు సేసేవు ఇంటికి రారాదా

చ. 3: ఆసలేల పెట్టేవు అట్టె కొంగేల పట్టేవు
వాసికి నాపాద మెంత వడి మెట్టేవు
వేసరక నన్నును శ్రీవేంకటేశ కూడితివి
యీసుద్దులన్నియు వింటి నింటికి రారాదా

రేకు: 1657-2 నారాయణి సం: 26-337

పల్లవి: పులకల మొలకలవున్నమ తోడనె కూడె
అలివేణి నీపతితో నాడవే వసంతము

చ. 1: మాటలు తీగెలువారె మక్కువలు చిగిరించె
మూటలకొద్దినవ్వులు మొగ లెత్తెను
వాఁటపు జవ్వనాను వసంతకాలము వచ్చె
ఆఁటదానవు పతితో నాడవే వసంతము

చ. 2: చెమటరసము లూరె సిగ్గులు పూవక పూచె
తిమురుఁ దరితీపుల తేనె లుబ్బెను
క్రమమునఁ దమకముగద్దియ మదనుఁ డెక్కె
అమర నీపతితోడ నాడనే వసంతము

చ. 3: కడుగోరితాఁకులు కాయము కాయలుగాచె
బడినే కెమ్మోవిని పండు వండెను
యెడలేక శ్రీవేంటేశుఁడిట్టె నిన్నుఁ గూడె
అడరి నీపతితోనే ఆడవే వసంతము

రేకు: 1657-3 పాడి సం: 26-338

పల్లవి: ఎందు వోయీ మనబత్తి యెప్పుడునుఁ గలదె
వొందిలిఁ గొతదడవు వూరకుండఁగదవే

చ. 1: చనువుగల్గుకాంత జంకిచి పతిఁ దిట్టితే
గునిసి నీవేల ఆపెఁ గోపగించేవే
వనజాక్షి! తలపోయ వారువారు నొక్కటే
వొసర నన్నీఁ జూతము వూరుండఁగదవే

చ. 2: బాసలుకొన్నకామిని పైకొని పెనఁగితేను
యీసుతోడ నడ్డాలు నీవేల వచ్చేవే
ఆసల నిద్దరికిని అన్నీ సమ్మతులే
వోసరించి తెలుతము వూరకుండఁగదవే

చ. 3: సిగ్గులు విడిచినాపె శ్రీవేంకటేశుఁ గూడితే
యెగ్గులు వట్టుచు నీవేల నవ్వేవే
తగ్గుమొగ్గు లేమీ లేవు తమలోన నింపులే
వొగ్గి మనములాఁ గూడె నూరకుండఁగదవే

రేకు: 1657-4 వరాళి సం: 26-339

పల్లవి: నవ్వేవారి నెఱఁగవు నాలుగుదిక్కులా నుండి
యివ్వల వాసి వద్దా ఇంతిరో నీకు

చ. 1: సెలవి నవ్వులు నవ్వి చేసన్నలు సేసి
కలువపువ్వుల వేసి కాతరించేవు
వలవనిపతిమీఁద వట్టి బత్తి సేయఁగాను
కలిగినదేమే యిందు కాంతరో నీకు

చ. 2: ఆయములు గోర నంటి ఆరజపుమాట లాడి
కాయము చేత నిమిరి గరిసించేవు
చాయాకాని కింతలేసిచవులు పుట్టించబోతే
ఆయెడ నేమీ లాభము అతివరో నీకు

చ. 3: కప్పురపు విడె మిచ్చి కాగిటిలో రతిఁ గూడె
చిప్పిల శ్రీవేంకటేశుఁ జిమ్మిరేఁచేవు
అప్పుడే నన్ను నేలె ఆతనిపైఁ గొసరఁగా
చెప్పవే కూడినదేమి చెలియరో నీకు

రేకు: 1657-5 మాళవిగౌళ సం: 26-340

పల్లవి: సూటిగాఁ దప్పక మోము చూడవయ్యా
చాటున నీ విందుకెంత జడిసివుండేవు

చ. 1: జిగిమించు సిగ్గులేల సెలవుల నవ్వులేల
మగువతో మొగమెత్తి మాటాడరాదా
యెగసక్కేలకు నిన్ను యేమీ నన్నది గాదు
నిగిడి ఇంతిలోనే నీవేల లోఁగేవు

చ. 2: ముంగిటివెరపులేల మొగమోట యింతయేల
అంగన యిచ్చినకాను కందుకోరాదా
వెంగేనకు నిన్ను నీకె వెస రట్టుసేయదు
చెంగట నీ విందుకేల చింతించుకొనేవు

చ. 3: బట్టబయ లీఁదనేల భావించుకొననేల
గుట్టుతో నాపె నిట్టె కూడఁగరాదా
రట్టుగా శ్రీవేంకటేశ యిట్టె యాపె పంగించదు
మట్టుతో నేలితి వనుమానించనేమిటికి

రేకు: 1657-6 పాడి సం: 26-341

పల్లవి: ఇంకనేలే మరఁగులు ఇన్నియుఁ దేటపడె
పంకించి నివ్వెరగులు పడనేలే

చ. 1: పొందైనయాపె సుద్దులు బొంకక చెప్పుమంటేను
అందగారిమాటలేల ఆడీనే తాను
విందమంటా నే ననేకవేడుకతో నుండఁగాను
చెంది యందరిలోఁ దాను సిగ్గులు వడుదురా

చ. 2: పెల్లున నాపె నిందుకుఁ బిలిపించుకుండఁగాను
చెల్లఁబో వట్టిగుట్టే సేసీనే తాను
చల్లఁగా నిద్దరిఁ జూచి సంతోసించుకొందమంటే
పల్లదానఁ దలవంచి పరాకున నుందురా

చ. 3: చెలరేఁగి యాపెచేత సేసలు వెట్టించగాను
నలువంకఁ జూచి యేల నవ్వీనే తాను
యెలమి శ్రీవేంకటేశుఁ డిటు తానే నన్నుఁ గూడె
వలపు పొగడఁగాను వద్దందురా

రేకు: 1658-1 మాళవి సం: 26-342

పల్లవి: నిన్నుమాపే తనకు నేను లోనసరే
యెన్ని చేసినాఁ జేసె ఇఁకనేలే వెఱపు

చ. 1: పొలఁతు లిందరు దను పొది సేసి పొగడఁగా
అలయుచు నే వెంగేలాడే దానసా
పలుమారు వద్దివారు బత్తులు సేయఁగాను
నెలఁత నే నొక్కతెనే నిష్ఠూరినా

చ. 2: ఇంటికాడిసతులెల్లా యిచ్చకము సేయఁగాను
జంటనుండి నేనే కడుఁ జెండి పోరేనా
వెంటనే చుట్టరికాలు వీరెల్లాఁ జెప్పఁగాను
గొంటరితనాన నేను గొరబుసేసేనా

చ. 3: సేనవెట్టినవారెల్లా చేకొని పంతాలియ్యఁగా
యీసున నేనే యెలయించే దానసా
ఆసల శ్రీవేంకటేశుఁ డట్టె తా నన్నుఁగలసె
పోసరించి తనకు నే బుద్ధి చెప్పేదానసా

రేకు: 1658-2 మంగళకౌశిక సం: 26-343

పల్లవి: ఎక్కడెక్కడోసుద్దుల కెంత సేసేరు
నిక్కి యాపెఁ జూచితేను నింద నీపైవేయరా

చ. 1: జవ్వనితో నీ వొకసన్న సేసితివంటాను
రవ్వలుగా నాడేరు రమణులెల్లా
పువ్విళ్లూర నీవుగన వొద్దఁ బెట్టుకుండితేను
చివ్వన సోబానఁ బాడి సేసవెట్టుండేరా

చ. 2: ఆపెమీఁద నీచూపు లటు గొంత నాటెనంటా
మూపులు మూఁడై కొంగులు ముళ్లు వేసేరు
యేపునఁ దొడపై నీవు యీసె నెక్కించుకొంటేను
కాఁపురపు బాసికాలు కట్టకమానేరా

చ. 3: పమ్మి యాపెపై నీవు పాదాలు చాఁచితివంటా
దిమ్మురైఁగి ఇందరు నీదేవు లనేరు
ఇమ్ముల శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
కమ్మర నందురును నీ కైవశమే యనరా

రేకు: 1658-3 బౌళి సం: 26-344

పల్లవి: కొమ్మ కెంత ఆసోదమో కొలువులు సేయవచ్చె
రమ్మని చేరఁబిలిచి రతిసేయరాదా

చ. 1: చుట్టి చుట్టి నీతో నాకె సుద్దులు చెప్పఁగ వచ్చీ
బట్టబయలెమ్మెలు చూపఁగ వచ్చీని
గుట్టుతో నుండఁగా నీకు కొప్పులు వెట్టఁగవచ్చీ
అట్టె లోనికి బిలిచి అదరించరాదా

చ. 2: కమ్మటి నింటిలో నెల్లా కాఁపురాలు దిద్దవచ్చీ
చిమ్మిరేఁచి ఇచ్చాకాలు సేయవచ్చీని
తమ్మిపువ్వు గానుకిచ్చి తలఁపులు చెప్పవచ్చీ
సమ్మతించి ఇయ్యీని చనవియ్యరాదా

చ. 3: చలరేఁగి చలరేఁగి సేవలు సేయఁగవచ్చీ
మొలకనవ్వులు నవ్వి మొక్కవచ్చీని
యెలమి నన్నేలితివి యిప్పుడే శ్రీవేంకటేశ
బలిమి నాపెనుఁ గొంత పనిగొనరాదా

రేకు: 1658-4 భైరవి సం: 26-345

పల్లవి: నెలఁతరో రమణుని నేరమెంచనేఁటికే
చలము సాదించవచ్చే సతులకుఁగాక

చ. 1: మగనాలేటికే మంకుఁదనాలవొట్లు
తెగనాడే వీరిడికత్తెలకుఁగాక
మొగమోటదానికేలే మొనగోరితాఁలు
అగడైనరతుల గయ్యాళిదానిఁగాక

చ. 2: గుట్టుతోడిదానేలే గొరబు బొమ్మజంకెలు
రట్టడితనముల కరాళికిఁగాక
చుట్టపుదానికేలే సూడుఁబాడు సొలపులు
దిట్టతనమున నవ్వేతెక్కలికిఁ గాక

చ. 3: పెండ్లికూతురుకేలే పెనఁగొన్న పంతములు
దండితనాలను మేనదానికిఁగాక
అండనే శ్రీవేంకటేశుఁడాతఁడే నిన్నుఁ గూడె
బెండుసేయ నీకేలే పెరవారికిఁ గాక

రేకు: 1658-5 దేవక్రియ సం: 26-346

పల్లవి: తానేతలఁచుకొని దయఁ జూచీని
ఆనించి కానుకలెల్లా నందియ్యరే

చ. 1: మాటతప్పేమిసేసీ మచ్చిగలితేఁ జాలు
పాటించి రమణుఁడే పంతమిచ్చీని
గాఁటాన నాతనినేల గాసిసేసేరే మీరు
చీటివాసి తనబాస చేతికియ్యరే

చ. 2: నడతప్పేమిసేసీ నమ్మి గలితేఁ జాలు
విడువ తానే వచ్చి వేఁడుకొనీని
వడిఁబెట్టి మీరేల వట్టిదూరులు దూరేరే
ముడెగట్టి తన నవ్వు ముంగిటనే పెట్టరే

చ. 3: తవనతప్పేమిసేసీ తానే కూడితేఁ జాలు
యివల శ్రీవేంకటేశుఁ డిట్టె యేలీని
తవిలి యీతనినేల తగవులఁ బెట్టేరే
జవకట్టి తనమేలు చాటి చెప్పరే

రేకు: 1658-6 నాదరామక్రియ సం: 26-347

పల్లవి: మంచివాఁడవయ్య నీవు మమ్మేల రట్టు సేసేవు
ముంచి నీకు మొక్కేము మన్నించవయ్యా ఇపుడు

చ. 1: పలికినట్టే నీతోఁ బలుమనేవు నన్ను
మెలుఁత కింతేసి మందెమేళమేఁటి
బలిమితో వసంతము పైఁజల్లుమని యాడేవు
వలపులు గనమైతే వరుసదప్పుదురా

చ. 2: సరికి బేసికి నీతో సారెఁ బెనఁగు మనేవు
తరుణిని నాకింత వుద్దండాలేఁటికి
పరగ జూఁజాలాడి పందము గొనమనేవు
మురిపెము గనమైతే మొకళము లెంతురా

చ. 3: మెట్టినట్టి నీపాదము మొట్టుమనేవు నన్నిటు
పట్టపురాణి నాకింత పంతమేఁటికి
యిట్టె శ్రీవేంకటేశ యెనసితివి రతుల
చుట్టరికము గలితే సొంట్లు సోదింతురా

రేకు: 1659-1 భూపాళం సం: 26-348

పల్లవి: నావంక దోసము లేదు నలినాక్షులాల మీరు
కేవలమై ఇందుకు సాకిరిసుండి ఇపుడు

చ. 1: విందులు చెప్పవచ్చిన వెలది మోవి తీపంటా
అందుకొని చవిగొనీ నదివోతాను
ఇందు కిట్టె తమయక్క యెరిఁగితే నేమియను
ముంద రెరఁగఁడు తాను మొక్కలీఁడు చూడరే

చ. 2: నిమ్మపండ్లు చేతీరే గానియ్యఁగా నాచన్నులె
నిమ్మపండ్లు మంచివంటా నిక్కి తినీనే
వుమ్మడినీసుద్దులు మాయమ్మ వింటేనేమియను
కొమ్మలాల యీతఁడు కక్కూర్తికాఁడు గదరే

చ. 3: చేరి పిల్వవచ్చిననెచ్చెలి తనవేడుకంటా
యీరీతి నన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
సారె నిది మాయేలికెసాని వింటే నేమియను
కారుకొన్నజాణకాఁడుగదరె నేఁడితఁడు

రేకు: 1659-2 ధన్నాసి సం: 26-349

పల్లవి: ఇక్కడ నేమి సేసేవు యెంతవని గద్దు నీకు
గక్కన నాపెమేలు కందువు రారాదా

చ. 1: చెక్కుచేతితోడిచింత చిరిచేఁదులవంత
ముక్కువీఁది వేలు మరుముంగిటివాలు
అక్కజపులతలపోఁత అజ్జాఁడు వాసినవాత
చొక్కపు నీసతిలాగు చూతువు రారాదా

చ. 2: తప్ప చూచేటి చూపు తడఁబాటుతోదోపు
ముప్పిరిశిరసువంపు మోచిదింపు
చిప్పిల సిగ్గులమొక్క చిత్తజుఁ డిడిన చిక్కు
చొప్పుగ నీఇంతిలాగు చూతువు రారాదా

చ. 3: చెదరునిరిఁగురులు చిమ్ముఁగూటపుగురులు
పొదిగొన్న అడియాస వూఁచినసేస
యిదివో శ్రీవేంకటేశ యింతలో బెండ్లాడితివి
సుదతి, నీదేవిలాగు చూతువు రారాదా

రేకు: 1659-3 గౌళ సం: 26-350

పల్లవి: ఎన్నిలేవు నీవిద్య లేమి సేసేది
ఇన్నిటా నీ మోహము నా యెడనే పూసేవు

చ. 1: సందడించే పూడిగపు సతులెల్లా నుండఁగాను
గొందినుండి నన్ను నేల కొంగునట్టేవు
నిందలకు వెఱచేవా నేమము నీకున్నదా
ఇందులో నీ పెద్దరిక మిప్పుడే చూపేవు

చ. 2: కప్పములు దెచ్చుకొన్న కాంతలెల్లా నుండఁగాను
చిప్పిల నామీఁదనేల చేయి చాఁచేవు
తప్పుఁగులము లెంచేవా తగురూపాలు చూచేవా
ముప్పిరి నీ దొరతనములు పచారించేవు

చ. 3: కోరి కొలువులుసేసే కొమ్మలెల్లా నుండఁగాను
పేరుకొని వచ్చి నన్నే పెండ్లాడేవు
యీరీతి శ్రీవేంకటేశ ఇంతేసి విచారించేవా
గారవించి నన్నుఁ గడు కాఁగిట నించేవు

రేకు: 1659-4 శుద్ధవసంతం సం: 26-351

పల్లవి: చెప్పఁగదె మీసుద్దులు చెవులార వినేము
తప్పక వలపులెల్లా తారుకాణ వచ్చెనా

చ. 1: వేఁగినంతా నేకతాలు విభునితో నాడితివి
చేఁగదేర విడేలు సేసితివి
యీగతిఁ జుట్టరికా లిద్దరికిఁ గలసెనా
భోగపురతులకెల్లా పొంతనాలు గూడెనా

చ. 2: యెదురుబడి నుండి యింపులుగా నవ్వితివి
మొదలఁ జూచుకొంటిరి మొకమొకాలు
సదరాన మీలో మీకు సగినాలు లెస్సాయనా
మదనతంత్రముల మీమనసు లెనసెనా

చ. 3: గక్కనఁ శ్రీవేంకటేశుఁ గాఁగిలించుకొంటివి
చిక్కించుక సేవలెల్లాఁ జేసితివి
యిక్కువ నీతఁడె నన్ను యిచ్చగించి రతిఁగూడె
చొక్కపు మీపెండ్లికి సోబానఁ బాడిరా

రేకు: 1659-5 హిందోళం సం: 26-352

పల్లవి: నీకే తెలుసునే నెలఁత యీ గరిమలు
దాకొని నీలోనీవే తలఁచుకోఁగదవే

చ. 1: పిలిచి యాతినిముందు పేరుకుచ్చి దూరనేల
వెలయఁగ నంతలోనే వేఁడుకోనేలా
చలువయు వేఁడియును సరి నొక్కచో నుండునా
చలరేఁగి మరుఁడు చేసినచేఁతగాక

చ. 2: పిక్కటిల్లఁ దొలిసారి బీరములాడఁగనేల
పక్కన నీవాతనికి వంతమీనేలా
నెక్కొని చీఁకటియు వెన్నెలాఁ గూడించవచ్చునా
చిక్కించుక మరుఁడు చేసినచేఁత గాక

చ. 3: పొదిగి శ్రీవేంకటేశుఁ బొం దెలయించనేల
ముదమున నింతేసి మొక్కఁగనేల
కదిసి కల్లా నిజము గాడిఁగట్టవసమా
చెదరక మరుఁడు చేసిచేఁత గాక

రేకు: 1659-6 సాళంగనాట సం: 26-353

పల్లవి: అవులేవే యెమ్మెలేమి ఆడుకొనేవే
చివురైన మీఁద మరి చేవగాకపోదు

చ. 1: నగవచ్చుఁగాని మారి నగినట్టె తమలోన
జిగిమీరఁ బొందులు సేయరాదు
మొగమోటలుఁ గలవు ముంచి యంకెకు రాకుంటే
అగడు సేసేకోపము లణఁచఁగరాదు

చ. 2: మాటలాడవచ్చుఁగాని మాటలాడినట్లానే
మేటియైన రతులను మెప్పించరాదు
పాటించి మొక్కఁగఁదగు పంతములు మీరితేను
నీటునఁ జుట్టరికాలు నెరపఁగరాదు

చ. 3: పెనఁగఁగవచ్చుఁగాని పెనఁగినయట్టానే
చనవులు చెల్లించి జరపరాదు
యెనసితివి శ్రీవేంకటేశు కరుణయు మించె
ననునేలె నీతని మానఁగ నిఁక రాదు

రేకు: 1660-1 ఆహిరి సం: 26-354

పల్లవి: నీవిభుఁడు నిన్నుఁ జూచి నివ్వెరగుతో నున్నాఁడు
వేవేగఁ గాఁగిలించవే మోహనాంగి

చ. 1: తియ్యనిమాటలతోను తేనెలేల చిందేనే
చయ్యటపు సణఁగుల చక్కెరబొమ్మ
నెయ్యపు చన్నుల పైఁడి నిగ్గులేల దులిపేవే
వుయ్యాల మంచము మీఁద నో మెరుఁగుఁబోఁడి

చ. 2: పువ్వుల తురుములోను పుప్పొడి యేల రాల్చేవే
నవ్వుల మొల్లల మోహనపు లతిక
జవ్వనపు మదమున జాజర లేలాడేవే
రవ్వలైన వసంతపు రాజీవనేత్రి

చ. 3: వడిగా నిట్టూర్పుల వాసన లెంత నించేవే
కడుఁ జల్లఁదనమున కప్పురగంది
అడరి శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నేలినాఁడు
కడఁగి యేలలసేవే కరికుంభ జఘన

రేకు: 1660-2 మంగళకౌశిక సం: 26-355

పల్లవి: ఈ సుద్దు లెఱుఁగుదునా యిల్లాల నేను
నాసరుస నుండి యేమి నవ్వేవు నీవు

చ. 1: నేమముతోఁ గాచుకుండి నీ కొలువు సేసె నీకె
యేమి వోజలు నేర్పెనో యిందాఁకా నీకు
గామిడివి నీవు దొల్లె కతలకారి యాపె
నామోము చూచి యేల నవ్వేవు నీవు

చ. 2: చనవరై పొస్తకాలు చదువుతానుండె నీకె
మనసెందు మరపెనో మచ్చికె నీకు
యెనయ నాసోదకాఁడ వేల యింపులాఁడి యీకె
ననిచి నాతో నేమి నవ్వేవు నీవు

చ. 3: పానుపుపై నీవుండఁగా పాదాలు పిసికె నీకె
పూని యెంతలయించెనో పొందుల నీకె
అనుక శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
నానఁబెట్టి నీతో నెంత నవ్వేవు నీవు

రేకు: 1660-3 గుజ్జరి సం: 26-356

పల్లవి: మంచివానితో నింత మంకులేఁటికి
కంచము పొత్తు గలసి కైకొనఁగరాదా

చ. 1: పట్టపుదేవులనంటా పాయపుదాననంటా
అట్టుగా దూరనేలే యాఁబడి పతిని
గుట్టుతోడివాఁ డతఁడు గుణము కోటిసేసును
చుట్టరికమే నెరిపి సొంపు మీరరాదా

చ. 2: ఆయ మెఱుఁగదునంటా అతఁడు బాసిచ్చెనంటా
చేయి వట్టి తియ్యనేలే చెలువునిని
దాయగాఁ డతఁడు మంచితనమే నిలువెల్లా
చాయసేసుకొని మోవి చవిచూపరాదా

చ. 3: భావ మెఱుఁగుదునంటా పచ్చిగాఁ గూడితినంటా
కావరించనేలే శ్రీవేంకటేశ్వరుని
యీపల నన్నేలినాఁడు యీతనికి సరిలేరు
వాపులు గలయఁజెప్పి వద్ద నుండరాదా

రేకు: 1660-4 రామక్రియ సం: 26-357

పల్లవి: వనితలతోనేల పట్టిగుట్టు
చనవిచ్చితే వలపు చప్పనయ్యీనా

చ. 1: చెక్కు నొక్కినవాఁడవు సేసవెట్టితే నేమాయ
తక్కక నీమీఁదట తప్పు మోచీనా
మొక్కించుకొన్నవాఁడవు మోవి ఇచ్చితే నేమాయ
వెక్కసపు నీ పంతము వెలితయ్యీనా

చ. 2: కరఁగించినవాఁడవు కాలుదొక్కితే నేమాయ
వొరయ నీగుణము వేరొక్కటయ్యీనా
సరి నవ్వినవాఁడవు చన్నులంటితే నేమాయ
గరిమఁ జుట్టరికము గడ్డము వేసెరా

చ. 3: పెండిలాడినవాఁడవు పెనఁగితే నేమాయ
దుండగపుఁదమకాన దొమ్మిసేసేరా
అండ శ్రీవేంకటేశ నీ వటు మెచ్చితేనేమాయ
కొండుకపాయపు నిన్ను కొంగువట్టేరా

రేకు: 1660-5 వరాళి సం: 26-358

పల్లవి: నీకే తెలుసు నివి నీవు చేసిన చేఁతలు
జోకతే నీ మహిమలు చూడమఱచితివి

చ. 1: చెక్కులమెఱుఁగు చూచి చిత్తానఁ దలఁచుకొంటా
మక్కువ నీ కొప్పు చూడ మఱచితిని
చక్కని నీమోవి చూచి సంతోసానఁ దనివొంది
చొక్కపు నీగళరేఖ చూడమఱచితివి

చ. 2: కచ్చుపెట్టి నీ నుదుట కస్తూరి నామము చూచి
మచ్చుపు నీమోవి చూడ మఱచితిని
అచ్చపు సింగారాల నమరిన రూపు చూచి
చొచ్చి నీమేను సోదించచూడ మఱచితిని

చ. 3: నెట్టుకొన్న కళలతో నీనిలువెల్లాఁ జూచి
మట్టున నీ బుజాలు చూడమరిచితిని
ఇట్టె శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గూడి చూచి
చుట్టి చుట్టి మర్మాలెత్తి చూడ మఱచితివి

రేకు: 1660-6 పాడి సం: 26-359

పల్లవి: మాకేలయ్యా ఇంత నీతో మారుకొనను
చేకొని ఇట్టె అందాలు సేసుకొంట గాక

చ. 1: చెక్కులపై చెమటలు చిగిరింపుఁ బలకలు
యెక్కడి వనెడిగితే నేమందువొ
ముక్కున నిట్టూరుపులు ముంచిన మోముకళలు
నెక్కొనె నీకనియంటే నీచిత్త మెట్టుండునో

చ. 2: కనుఁగొనల నిద్రలు కాయముపై యలపులు
ఘనమాయనంటే నెంత కాఁతాళింతువో
వెనుకొన్న సన్నలును వేవేలు తమకములు
పెనగొనీనంటే యెంత బీరములాడుదువో

చ. 3: పెదవిపై వసివాడు పిక్కటిలుఁ బరాకులు
యిదివోయని చూపితే నెంత మెత్తువో
అదన శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
కదిసి గరిసించితే కైవస మెట్టౌదువో

రేకు: 1661-1 దేవగాంధారి సం: 26-360

పల్లవి: పలుకులు నేర్చితివే పడఁతీ
పలుకులు కప్పురపుభరణిలో నున్నవి

చ. 1: విన్నపము చేసుకోవే విభునికిని తొల్లె
విన్నసుద్దు లిఁకనేలే వేమారును
సన్నలైనాఁ జూపవే సముకానను
సన్నలు వెట్టుదురా సారె వలపులకు

చ. 2: మొక్కవే చేతులెత్తి ముమ్మారును
మొక్కలీఁ డతఁడు చూడ మొగమెత్తీనా
మిక్కిలి కాఁగిలించవే మేటివిభుని యివె
మిక్కిలి తీరిచెనే యిమ్మెయిఁ జనుజక్కవలు

చ. 3: బంతికిఁ బిలువవే నీపతిని నేఁడు పూ -
బంతినే వేటులాడితి బలుమారును
చింతదీరఁ గూడితివి శ్రీవేంకటేశు -
చింతనీడ చల్లఁగదె చెప్పరే మీరు

రేకు: 1661-2 తెలుగుగాంబోది సం: 26-361

పల్లవి: మగువభావము చూచి మన్నించవయ్యా
వెగటుగా మోవితేనె విదువెట్టీని

చ. 1: చెక్కుమీఁదఁ జేయిపెట్టి సెలవుల నవ్వు నవ్వి
తక్కక తనమోహము దాచీఁ జెలి
పక్కనఁ బాపట దువ్వి పరాకులు పచరించి
గక్కనఁ దనసిగ్గులు గాదెఁ బోసీని

చ. 2: వాలుకరెప్పలు వంచి వదనానఁ గళరేఁచి
చాలా నీపైఁ దమకము జరపీఁ జెలి
తాలిమి వాట్టూర్పు చల్లి తలపోఁతలెల్లాఁ బెంచి
వోలిఁ దనయాసలెల్లా వొడిఁగట్టుకొనీని

చ. 3: పయ్యద జారఁగఁదీసి పలుమారుఁగాఁగిలించి
నెయ్యమెల్లా నీమీఁద నెరపీఁజెలి
యియ్యెడ శ్రీవేంకటేశ యేలితివి యీకె నిట్టె
చయ్యన రతులెల్లాను జట్టి సేసీని

రేకు: 1661-3 గౌళ సం: 26-362

పల్లవి: ఇంతటివాఁడవయ్యా నిన్నెట్టు గెలువఁగవచ్చు
కాంతల భ్రమఇంచే కనుకట్టువాఁడవు

చ. 1: ముప్పిరి వాస్తలాఘనములనే ఇంతి చన్నుల
చిప్పగతులాడేటి సిద్ధుఁడవు
తప్పక మదనమంత్రాలనే చెమటనాన
రప్పించనేరిచిన ఇంద్రజాలవువాఁడవు

చ. 2: పలుమణులు సోఁకించి పడఁతిమైఁ బులకలు
వెలయఁగ మొలపించే విద్యవాఁడవు
పలచని కొనగోరిబదనికలు సోఁకించి
కళలు రేఁచి చొక్కించే గబ్బిటౌళికాఁడవు

చ. 3: చిత్తజభూతము బంపి చెలుల నాకరిషించి
తత్తరించి కూడేటి భూతనాథుఁడవు
మత్తిల శ్రీవేంకటేశ మన్నించితి విటు నన్ను
వుత్తమ వినోదాల యోగిపురుషుఁడవు

రేకు: 1661-4 భైరవి సం: 26-363

పల్లవి: ఎంచ నెట్టు వచ్చు నమ్మ ఇలమీఁద నీకొత్తలు
పంచశరు బలమేలే భామ సింగారములు

చ. 1: తామరల విరులపైని తగుశాలిగర్భములు
ఆ మీఁద నరఁటులును అంగజు తేరు
చీమకదొంతరకొన సింహపుఁగొౌదమ వాలె
యేమని పొగడవచ్చు నింతిసింగారములు

చ. 2: జక్కుల సరుసనే జంటతామరతూండ్లు
అక్కడ శంఖముమీఁద నమరెఁ బోక
చొక్కవు గురులును జోడైన యుద్దములు
యెక్కువల కెక్కుడాయ నింతి సింగారములు

చ. 3: ఇరవై సంపెఁగవువ్వు ఇరువంక శ్రీకారాలు
అరచంద్రుఁడు దుమ్మిది లన్నిటిమీఁద
నిరతి శ్రీవేంకటేశ నీకాఁగిటిలోపల
గరిమఁ గీర్తన కెక్కె కాంత సింగారములు

రేకు: 1661-5 ఆహిరి సం: 26-364

పల్లవి: ఆనతియ్యవే మాతో నానతిమన్ననలెల్లా
పూని సంతోసాన నిన్నుఁ బొగడేము గాని

చ. 1: జల జలఁ జెమరించె జాజుకొనఁ బులకించె
తలఁపులోనివలపు దాఁచనేఁటికే
కళలు మోమున రేఁగె కానవచ్చెఁదమము
చెలుల మింతే మాతో సిగ్గువడ నేఁటికే

చ. 2: కొప్పు గడువెడఁజారె గురుతు లాడాడ నిండె
చిప్పిల నేఁడే పరాకుసేయనేఁటికే
దప్పిదేరెఁ బెదవుల దగదొట్టె నూర్పుల
యెప్పుడును నీవారమే యిఁక నేలే మఱఁగు

చ. 3: కన్నుల నిద్దుర దేరె గందపు బేంట్లు రాలె
సన్నలా చాయలా వట్టిసట లేఁటికే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డిదివో నిన్నుఁ గూడె
యెన్న నూడిగపువార మిఁక నేసాలేఁటికే

రేకు: 1661-6 రామక్రియ సం: 26-365

పల్లవి: చెల్లఁబో సిగ్గు లేదటె చెల్లెల
అల్లన నిన్నెంచుకోవే అక్కరో నేఁడు

చ. 1: సేసకొప్పుల వదలె చెల్లెలా
ఆసుద్ది బావ నడుగు మక్కరో నీవు
సేసితివే బలుచేఁత చెల్లెలా
ఆస నీవంటిదే కాదా అక్కరో నాకు

చ. 2: చెంది నిన్ను నమ్మితిఁగా చెల్లెలా
అందుఁ బాలు గద్దు గదె అక్కరో నాకు
చిందువందాయ వావులు చెల్లెలా
అంది నీమారె నేను అక్కరో నేఁడు

చ. 3: చిన్నదానవంటా నుంటిఁ జెల్లెలా
అన్నిటా నీవే పెంచితి వక్కరో నన్ను
చిన్నలు నీమేన నిండెఁ జెల్లెలా
అన్నిటా శ్రీవేంకటేశుఁ డక్కరో కూడెనో

రేకు: 1662-1 సౌరాష్ట్రం సం: 26-366

పల్లవి: నీవంటివారమే కామా నేమెల్లా నింత సేసేమా
కావరించి కడునేల గయ్యాళించేవే

చ. 1: సిగ్గువడ్డదానవు శిరసు వంచుకుండఁగ
వొగ్గి పతితోనేల వొడ్డారించేవే
వెగ్గళించి ఇవీఁ గొన్నివేసాలు సేసేవుగాక
యెగ్గులేని సతులు నివి వోజలటవే

చ. 2: పంతపుదానవు నీ వప్పటి గుట్టు చూపక
కాంతుని నింతేసి యేల గరిసించేవే
యెంత లేదు ఇవీఁ గొన్నియెమ్మెలు సేసేవుగాక
ఇంతలోఁ జూచినవార లిది మెత్తు రటవే

చ. 3: వొట్టు వెట్టుకున్నదాన వూరకే వుండుటగాక
కిట్టి శ్రీవేంకటేశుఁ గాఁగిలింతురటే
గట్టిగా న న్నితఁ డేలె తలు చెప్పేవుగాక
యిట్టె సవతులకు నింత దగునటవే

రేకు: 1662-2 రామక్రియ సం: 26-367

పల్లవి: ఈతని గెలుచుటు నిదే వుపాయము
నీ తగవులెల్లాను నెరపవే నీవు

చ. 1: మనసు వచ్చినప్పుడు మాటలాడీఁగాని తాను
మునుప నాతనికిని మొక్కవే నీవు
ననుపైనవేళను నవ్వులు నవ్వీఁగాని
వొనరఁగ వద్దనే గూచుండవే నీకు

చ. 2: యితవైతేఁ గనక తా నింటి వచ్చీఁ గాని
చతురత సేసలు చల్లవే నీవు
తతిగొని మోవితీపు తానే చూపీఁగాని
మితిమీరఁ బొగడుచు మెచ్చవే నీవు

చ. 3: తమకము రేఁగితేను తానే పెండ్లాడీఁ గాని
అమర నాతని గోర నంటవే నీవు
సమరతి శ్రీవేంటేశ్వరుఁ డిదె నిన్నుఁ గూడె
సముకాన చేఁతలు పచారించవే నీవు

రేకు: 1662-3 ముఖారి సం: 26-368

పల్లవి: ఇంకానేల వట్టియాన లేమిటికిఁ బెట్టేవు
అంకెఁ జూచితే గురుతు లద్దములో నున్నవి

చ. 1: యీతల నాపె నీవు యెదరించినప్పుడే
చూతమువో మీలోని సుద్దులెల్లాను
మాతో నింతేసి యేల మరఁగులు వెట్టేరు
కాతరపుమేఁతలు కాయలుగాచున్నవి

చ. 2: మనసిచ్చి మీరిద్దరు మాటలాడినప్పుడే
వినేముగా వీనుల మీ వేడుకలెల్లా
పెనఁగి మావద్దనేల బేరి బోకొట్టవిచ్చేరు
దినము మీ సరితలు తీగెలు వా రున్నవి

చ. 3: అలమేలుమంగ నీవు నంటూడినప్పుడే
తెలియరాదా మోములతేటలెల్లాను
మలసి శ్రీవేంటేశ మమ్ము నెంత మన్నించేరు
వలపులమీరతులు వాండ్లెక్కివున్నవి

రేకు: 1662-4 హిందోళవసంతం సం: 26-369

పల్లవి: ఎటువంటివాఁడవయ్యా యేమయ్యా
తటున మొక్కితేను తలవంచేవు

చ. 1: కొసరితే దోసమా కూరిమి గలుగుసతి
యెసగ సాదించేవుఇందరిలోన
వునురనఁదగదా వుడివోని విరహాన
కసుగాటు మాటల గరిసించేవు

చ. 2: చెనకఁగరాదా చేతికిలోనైనయాపె
పనివడి జంకించేవు పంతమాడుతా
తనిసి యలయరాదా తమకపుఁగాఁకలకు
పెనఁగుచు బీరానఁ బెచ్చురేఁగేవు

చ. 3: అలమితే నేమాయ అలమేలుమంగ నిన్ను
చలరేఁగి గుంపించేవు శ్రీవేంకటేశ
తలపోయవలదా తగిలినరతులను
పలుసోఁకులనుఁ గడుఁ బచ్చి సేసేవు

రేకు: 1662-5 ఆహిరినాట సం: 26-370

పల్లవి: వట్టి విచారములేల వడఁబడ నిఁక నేల
నెట్టన నన్నేలుకొనే నేరపు నీ దిఁకను

చ. 1: కన్నుల నిన్నుఁ జూచితి కానుక చేతికివచ్చితి
యెన్నికలు మరియేమీ నెఱఁగ నేను
విన్నపముఁ జేసితి వేవేగ ను మొక్కితి
పన్ని నన్ను రక్షించేటి భారము నీ దిఁకను

చ. 2: ఇంటికి వచ్చితి నీకు నిచ్చకము లాడితి
దంటతన మెఱఁగ నీ తరుణి నేను
నంటునను వేఁడుకొంటి నయమే పచరించితి
పెంటాగా నన్నమన్నించే ప్రియము నీ దిఁకను

చ. 3: పొగడితి నన్నిటాను పొందులెల్లాఁ జేసితి
తగినవుపాయాలు దలఁచ నేను
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
మొగి నన్నుఁ గూడితివి ముదము నీ దిఁకను

రేకు: 1662-6 శంకరాభరణం సం: 26-371

పల్లవి: చుట్టమైతే యాతనికి బోడై వుందువుగాక
జట్టిగొని ఇఁకనేమి సాదించేనే

చ. 1: యెదుటఁ జిత్తమురానే యిచ్చకమాడుదుగాని
పదరి మాటాడకువే పలుమారును
మొదలఁ బదారువేలసుదతులవాఁ డతఁడు
వెదకి నీ విఁకనేమి వెంగెమాడేవే

చ. 2: సెలవుల నవ్వుతానే సేవలు సేతువు గాని
మలసి చేచాఁచకువే మాటిమాటికి
తలఁకక చీఁకటి తప్పు చేసేవాఁ డతఁడు
చలపట్టి యిఁకనేమి చక్కఁ బెట్టేవే

చ. 3: కైవసమై నీ విట్టె కాఁగిటఁ గూడుదు గాని
చేవమీరి యిఁక రట్టు సేయకువే
శ్రీవేంకటేశుఁడు సర్వ జీవాంతరాత్మకుఁడు
దేవులవు యిఁకనేమి తిద్దుకొనేవే

రేకు: 1663-1 ముఖారి సం: 26-372

పల్లవి: కానీవయ్యా అందుకేమి కాదనేమా నిన్నును
నానఁబెట్టి యందరితో నవ్వేవు నీవు

చ. 1: చిత్తము నీకొకవంక చిమ్ముఁ జూపు లొకవంక
మత్తిలి యప్పటి మాతో మాటలాడేవు
బత్తి నీ కెక్కడనని భావించి నమ్మఁగవచ్చు
పొత్తులవిభుఁడవై పొదిగేవు నీవు

చ. 2: చెను లొరితోడ చేసన్న లొకరితోడ
పెనఁగులాట నాతో బెరయించేవు
ననుపు నీ కెందునని నలి నేర్పరపవచ్చు
తనివోనిచుట్టమవై తగిలేవే నీవు

చ. 3: వలపులు వాడలోన వాడికలు వూరిలోన
కలసేవు నీవే నా కాఁగిటిలోన
యెలమి శ్రీవేంకటేశ ఇంపు లెట్టు గానవచ్చు
తలఁపు కొద్వాఁడవై తనిపేవు నీవు

రేకు: 1663-2 ద్రావిళ భైరవి సం: 26-373

పల్లవి: నీవల్లనే టిమే నేఁడు యీా కొతలెల్లాను
భావించుక పైకోనేటి పడఁతియుఁ గలదా

చ. 1: మగఁడు నాలుఁ గూడి మంతనము లాడేవేళ
యెగసక్కేలకు తొంగి యేల చూచేవే
సొగిసి మరుతంత్రానఁ జొక్కివుండేటివారి
నగడు సేసేయట్టి ఆఁటదియుఁ గలదా

చ. 2: కందువఁ దామిద్దరును కాఁగిలించొన్నవేళ
గొంది నీవు వ్వద నేల కూచుండేవే
పొంది పానుపుమీఁద భోగించేయట్టివారి
అంది సిగ్గువరచేటి అతివయు గలదా

చ. 3: అట్టె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగఁ గూడఁగ
గుట్టునఁ జన్నుల నెంత గుచ్చియెత్తేవే
తొట్టుకొని మోవులవిందులు చివిచూచేవారి
నెట్టనఁ బచ్చిసేసేటి నెలఁతయుఁ గలదా

రేకు: 1663-3 బౌళి సం: 26-374

పల్లవి: ఎంతరాతిమనసో నీకెప్పు డిఁకఁ గరఁగీనో
పొంత సిగ్గువడీ నీతోఁబొందేటి వేడుకను

చ. 1: కొప్పు వీడు తెలిఁగదు గు జారు టెలిఁగదు
తప్పక నిన్ను జూచీ దరుణి
దప్పిచేరీఁ బెదవుల తడఁబడీఁ దత్తరాన
అప్పునుండి మాటలాడీ నిబ్బరాననుు

చ. 2: చెలులనుఁ దలఁచదు చింత నిల్లు దలఁచదు
కొలువులు నీకుఁ జేసీ కొమలి
పులకలు మేన నించి పొంగుఁ జెమటల నీఁదీ
బలిమి నీతోఁ బెనఁగీ పంతపుటాసలను

చ. 3: వెస నలయికెంచదు వెనకముం దెంచదు
పొసఁగ నిన్నుఁ గూడుచుఁ బొలఁతి
యెసగ శ్రీవేంకటేశ యేపురేఁగి రతులను
పసగా సరసమాడీ బహుపరాకునను

రేకు: 1663-4 దేశాక్షి సం: 26-375

పల్లవి: అంతదొడ్డదానవా అందరికంటె నీవే
మంతుకెక్క నీవే ముందు మాటలేలాడేవే

చ. 1: వంతులకే పెనఁగేవు వాసులకే వచ్చేవు
ఇంతయుఁ గానవచ్చె నీ యెమ్మెలు నేఁడు
బంతినే సతులకెల్ల బాగా లాతఁ డియ్యఁగాను
చెంత నీవు ముందే వచ్చి చెయ్యేల చాఁచావే

చ. 2: తప్పక మోము చూచేవు తగవులే వెదకేవు
చెప్పరాదే నీపగటు చెలులలోన
అప్పటిఁ బొత్తుల నాతఁ డందరిని నిడుకోఁగా
కప్పి ముందే డి నీవు గ్కన నే లెత్తేవే

చ. 3: దొరతనాలు సేసేవు తొంటివావులు చెప్పేవు
సరవి నన్నిటా నీవు జాణవౌదువే
యిరవై శ్రీవేంకటేశుఁ డిందరినిఁ గూడఁగాను
పురమెక్కి ముందే రతి నోలలాడేవే

రేకు: 1663-5 కాంబోది సం: 26-376

పల్లవి: అడుగరే చెలులాల ఆతనినే యీమాట
బడి వాసి వచ్చుతేను బాసగొనవలదా

చ. 1: చెలిమి వేరొకతెతోఁ జేసిన యారమణుని
సొలసినఁగాక యీసులు దీరీనా
వెలినుండి వచ్చి వట్టివినయాలు సేసేవాని
చలములు సాదించక సమ్మతియ్యీనా

చ. 2: తగ నావద్దనుం డాపెఁ దలఁపోసే మగవాని
యెగసక్కేలాడక యింపు వుట్టీనా
అగడుఁజేఁతలు సేసి యమరఁ జెప్పేవాని
నిగిడి పంగించక నెఁ జిరివి దీరునా

చ. 3: యెందునైనా భోగించి యెంగిలైవుండినవాని
అంది పన్నీటఁ గడుగ కఁకె వచ్చీనా
జెంది నాతో నా సుద్దులు చెప్పేటి శ్రీవేంకటేశు
సందడిఁ గూడి నవ్వక చవి గానవచ్చునా

రేకు: 1663-6 మాళవిగౌళ సం: 26-377

పల్లవి: పట్టపుదేవులము ప్రాణేశ్వరి వీతనికి
రట్టు సేసితే నవ్వరా ఇట్టె ఇందరును

చ. 1: యెనసి నీపతి బాస లెవ్వతెకో చేసెనంటా
మనసునఁ బెట్టుకొని మాటలాడేవు
పనివడి ఇఁక నొడఁబడక దిద్దఁబోతేను
నిను మోచిరాదా ఆనేరుపు నేరములు

చ. 2: యెఱిఁ గెవ్వతోమేనిసొ మ్మీతనిమై నుండఁగ
గుఱుతుగాఁ బట్టుకొని గుంపించేవు
వెఱపు దెలుపుకొని వెల్లవిరిసేయఁబోతే
మెఱయవా యిట్టైతే మీఁదఁ బుణ్యపాపాలు

చ. 3: శ్రీవేంకటేశుఁ డెవ్వతోచేతికి లోనాయనంటా
కావరించి యీతనితో కాఁతాళించేవు
వేవేగ నిన్నుఁగూడే నీ విభునిఁ జూచి నవ్వితే
చేవదేర వానియందే చేఁతమోఁతలును

రేకు: 1664-1 సామంతం సం: 26-378

పల్లవి: నీవు చేసిన చేఁతలు నీవే తలఁచుకొనేవు
కావరించి నీతోఁ దారాణించనేమిటికి

చ. 1: ఇచ్చకమాడినందుకు ఇయ్యకొనవలెఁగాక
అచ్చట గతసించి ని న్నడుగనేల
కుచ్చి కాఁగిలించఁగా జేకొని లోఁగావలెఁగాక
పెచ్చువెరుగుచు నీతోఁ బెనఁగనేమిటికి

చ. 2: చెక్కులు నీవు నొక్కఁగా చెలరేఁగవలెఁగాక
వెక్కసించి నీతో విఱ్ఱవీఁగనేల
గక్కనఁ బాదము దొక్కఁగా మొక్కవలెఁగాక
మిక్కిలి జంకించి మితిమీరఁగనేమిటికి

చ. 3: కడు నీవు మన్నించఁగా కలయఁగవలెఁగాక
బడి బడి వట్టి సిగ్గు వడఁగనేల
కడఁగి శ్రీవేంకటేశ గక్కన న న్నేలితివి
అడరి మొచ్చుటగాక అలయనేమిటికి

రేకు: 1664-2 హిజ్జిజి సం: 26-379

పల్లవి: నన్నేమి యడిగేనే నాయకుఁడు నాకుఁ దాను
సన్నలఁ దన్ను దిద్దుక చాయకు దేవసమా

చ. 1: వూరఁ జుట్టమైనవాఁడు వొదిగి వుండఁగనేలే
ధీరత యిండ్లవెంట్లఁ దిరుగుఁగాక
జీరదీయించుకొన్నాఁడు సిగ్గులువడఁగనేలే
వొరలేనివలపుల కొడిగట్టుఁ గాక

చ. 2: ఆసలు వెట్టినవాఁడు అనుమానించఁగనేలే
సేసవెట్టించు కందరిఁ జెనకుఁగాక
బాసలిచ్చినాఁడు ఇంకాఁ బంతాలు నెరపనేలే
వేసాలు మాని విచ్చనవిడి నుండుఁగాక

చ. 3: వేడుకపడినవాఁడు వెఱపు మఱపులేలే
వాడిక కిందరి గూడి వచ్చుఁగాక
యీడనె శ్రీవేంకటేశుఁడేలినాడు నన్ను నేఁడు
తోడఁ దోడ రతులకు దొరకొనుఁగాక

రేకు: 1664-3 బౌళి సం: 26-380

పల్లవి: కడు నిన్ను దూరవద్దు గర్వము తగవెంచదు
బడినున్నతరితీపు పంత మెంచదు

చ. 1: మిక్కుటపుఁ దమకము మీఁదుగిందు మెంచదు
వెక్కసపుటడియాస వేసటెంచదు
యెక్కువైన మోహము యెగ్గుసిగ్గు లెంచదు
పిక్కటిల్లిన చలము ప్రియ మెంచదు

చ. 2: వీడనిచుట్టరికము వింతతన మెంచదు
వేడుక యెదిరివల్ల వెరపెంచదు
వోడక వైరము మొగమోటమేమీనెంచదు
యీడైన కూటమి అలయిక నెంచదు

చ. 3: మనసులో తలపోఁత మరియేమీనెంచదు
గొనకొన్నరతికేళి కొలదెంచదు
యెనసితి విటు నన్ను యిదివో శ్రీవేంకటేశ
తనివోని సరసము తప్పేమీనెంచదు

రేకు: 1664-4 శ్రీరాగం సం: 26-381

పల్లవి: చూడవే వో చెలియరో జూట రీతఁడు
వేడుకలకు నవ్వులు వెదచల్లీ నీతఁడు

చ. 1: వొప్పయిన తనవేలివుంగరము నీదె యంటె
అప్పటి నానాలువెట్టీ నౌనే యీతఁడు
కుప్పెతోడిసవరముగురుతు నేఁ బట్టితేను
తప్పకచూచీ నన్నుఁ దగునే తా నీతఁడు

చ. 2: కట్టిన కంఠమారము కడుఁ గొత్త యిది యంటే
వట్టితుకాణలకు వచ్చీ నీతఁడు
కట్టుకొన్న దిది దట్టి గాదు చీర యంటే
యెట్టె యీవిగా నాకు నియ్య వచ్చీ నీతఁడు

చ. 3: కేలనున్నపూబంతి భోగించినది యౌనంటే
సోలిఁ దననేమములే చూపీ నీతఁడు
కోలాటపు పతిమల గొప్పసుర టేడదంటే
వేళతో నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు

రేకు: 1664-5 పాడి సం: 26-382

పల్లవి: ఇందుకంటె నేమిసెతు నింకా నేను
నింద నీపైఁబడీఁ జుమ్మీ నీ చిత్త మిఁకను

చ. 1: కొమ్మ నీ చూచినచూపే కొండ సేసుకొని నమ్మి
కమ్మి తలపోసుకొంటాఁ గాచుకున్నది
రమ్మన వెరచుఁగాని రాక కెదురుచూచీ
నెమ్మది నెరిఁగించితి నీచిత్తమిఁకను

చ. 2: కొచ్చి మీనవ్విన నవ్వే కొంగుముడియగా నెంచి
కచ్చుపెట్టి తమితోడఁ గాచుకున్నది
అచ్చలాన జలిమిసేయదుగాని పొందుగోరీ
నిచ్చలు నీపై పరాకే నీచిత్త మిఁకను

చ. 3: కోరీ నీవాడినమాటకుఁ గోటికిఁ బడిగెత్తి
గారవానఁ బనుపుపైఁ గాచుకున్నది
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నీవు గూడితివి
నీరూపే తప్పక చీ నీచిత్తమిఁకను

రేకు: 1664-6 మధ్యమావతి సం: 26-383

పల్లవి: సవతిగనక నీ జాడలెల్లాఁ గానవచ్చె
జవళిమాపొందు లివి సతమాయనిపుడు

చ. 1: కాంతుఁడు నేనూఁ దారుకాణకు వచ్చితే నీవు
సంతసాకిరి చెప్పేవు జాణవౌదువే
వంతుల నిద్దరికిని వావి గూడునాయంటే
పంతము కోలఁదనేవు బాపురే నీవు

చ. 2: వొల్లనే మాలో బాసలవొడఁబా టడిగితే
గొల్లదోమటి సేసేవు గుణివౌదువే
ఇల్లిదె వొండొరులకు నీడౌనా యని యంటే
చెల్లుబడెంతేయనేవు చెప్పరాదె నీవు

చ. 3: నమ్మి శ్రీవేంకటేశ్వరు నన్నుఁ గూరుచుమంటేను
దొమ్మి నవ్వులు నవ్వేవు దొరవౌదువే
సమ్మతించి నేమే కూడి సరివయసులాయంటే
మిమ్ముఁ జూచుకొమ్మనేవు మేలుమేలే నీవు

రేకు: 1665-1 దేసాళం సం: 26-384

పల్లవి: ఇంకనేది వుపాయము యెంచిచూచుకొనవయ్యా
పంకపుఁజెమటల గుబ్బతిలుతా నున్నది

చ. 1: కిన్నెర వాయించుకొంటా కెరలి తానములకు
తన్నుఁదానె మెచ్చి చొక్కుతా నుండఁగా
వున్నతి నీ వంతలోనె వొద్దికి వచ్చితేఁ జూచి
చెన్నుమీరఁ దలపంచి సిగ్గువడి వున్నది

చ. 2: పదములు చెప్పుతాను పాడి యాయర్థములెల్లా
నుదుతులకెల్లాఁ జెప్పిచూపుచు నుండి
యెదుట నీమోము చూచి ఇంతలోనె మొఱఁగుచు
మదిరాక్షి చెక్కు చేయిమాటు చేసుకొన్నది

చ. 3: రతి చిత్తారు వాయుచు రాఁపువినోదములు
అతిమదనకళల నలరి ఇట్టె
కతగా శ్రీవేంకటేశ గక్కన నిన్నుఁ గూడి
మితిమీరి సంతోసాన మెరయుచు నున్నది

రేకు: 1665-2 ముఖారి సం: 26-385

పల్లవి: నీయంతవట్టుకు మేలు నెమ్మి నిరవంకలాను
పాయము నెఁ జెరువులు భామలిద్దరికి

చ. 1: వొట్టి తన మగఁడంటా వొడివట్టె నిన్నొకతె
చెట్టవట్టి తీసీని చేరి యొకతె
పొట్టఁ బొరుగున వలపులు తీపులఁబడె
చుట్టమ వెప్పుడు నీవు సుదతు లిద్దరికి

చ. 2: వేడుకకాడవంటా విందువెట్టె నీకొకతె
వాడికెకు వీడెమిచ్చె వడి నొకతె
ఆడికెకు నడుమ నందతుకులాయఁ బ్రియాలు
కూడేటి నిధానమవు కొమ్మలకిద్దరికి

చ. 3: మేనవాఁడవంటాఁ దాను మెచ్చి కూడె ని న్నొకతె
పూని కాఁగిలించుకొనె పొంచి యొకతె
నేను నీవుఁ గూడఁగాను నేరపు నాపాలఁ జిక్కె
పూని శ్రీవేంకటేశుఁడ పువిదలిద్దరికి

రేకు: 1665-3 వరాళి సం: 26-386

పల్లవి: చూచి చూచి మాకు నేఁడు సోద్యమయ్యీని
యేచి నీమొగము చూచి యేమీననఁజాలనే

చ. 1: చొప్పలెత్తి మాటలాడి సోగకన్నులనుఁ జూచి
వుప్పతించి పతి నెంత వొరసేవే
తప్పఁడు బొంకఁ డతఁడు తగవెరిఁగినవాఁడు
ఇప్పుడు నిన్నుఁ బెండ్లాడి ఇంత రట్టుకెక్కెనే

చ. 2: పుక్కట సన్నలుసేసి బొమ్మలను జంకించి
చక్కనియీతని నెంత సాదించేవే
మొక్కలీఁడు గాఁడు పోఁడు మొగమోట గలవాఁడు
వెక్కసాన నితనితో వెల్లవిరియాయనే

చ. 3: తరితీపులఁ జెనకి తమకము గడురేఁచి
ఇరవై శ్రీవేంకటేశు నెంత గూడేవే
తరలఁడు మరలఁడు తగ నన్ను నేలినాఁడు
సరసము నీతో నాడి సదమదమాయనే

రేకు: 1665-4 శుద్ధవసంతం సం: 26-387

పల్లవి: ఏల యెఱఁగవోకాక యీకె నింత సేసితివి
నీలీల లిన్నియును నిన్ను మోచిరాదా

చ. 1: పచ్చిమాటలాడి ఇంతిభావము గరఁగఁజేసి
ఇచ్చట సిగ్గులెల్లా బాయిట వేసేవు
రచ్చల సవతులెల్లా రమణి నాడుకొంటేను
విచ్చలు నిదింతయును నిన్ను మోచి రాదా

చ. 2: చెప్పరానిచేఁత సేసి చిప్పిలఁ జొక్కఁగఁజేసి
చొప్పులెత్తి మర్మాలు సోదించేవు
పుప్పతించి యిందుకుఁగా వువిదలు నవ్వితేను
నెప్పున నీ మహిమలు నిన్ను మోచి రాదా

చ. 3: వెడరతులనుఁ గూడి వెరగందఁగాఁ జేసి
చిడుముడి వలపులఁ జిమ్మిరేఁచేవు
యెడనెడఁ దోడివారు యెగసక్కేలాడితేను
నిడివి శ్రీవేంకటేశ నిన్ను మోచిరాదా

రేకు: 1665-5 సాళంగనాట సం: 26-388

పల్లవి: తక్కినవారి కింత తగునా నేఁడు
వెక్క సిగనక నిన్ను వేమారు దూరీని

చ. 1: సలిగెగద్దు గన సతి నీతో మారుకొని
మలసి వొడ్డాఁ బెట్టా మాఁటలాడీని
బలిమికత్తెగనక పైకొని పెనఁగి నీవు
తలకొని చెనకఁగా దప్పించుకొనీని

చ. 2: మనసెఱుఁగుఁగనక మగువ మర్మములెత్తి
కనుసన్నలనె తిట్టి గద్దించీని
మునుపటాలుగనక మొగిఁజన్నులంటితేను
వొనర సిగ్గున నీకు నొట్లువెట్టీని

చ. 3: బాసగొన్నదిగనక బడి నలమేలుమంగ
ఆసలిచ్చి రతిఁగూడి అలయించీని
సేసవెట్టితివి నాకు శ్రీవేంకటేశ్వర
వొసరించ కప్పటి నీవురముపై నిక్కీని

రేకు: 1665-6 దేవగాంధారి సం: 26-389

పల్లవి: ఎన్నిపోలికలకు నీ విరవైతివి
వన్నెల పెండ్లికొడుకువలె నుంటివి

చ. 1: పొలఁతులు నీవుఁ గూడి పువ్వుల వసంతమాడి
లలి సింగారపుఁ దోటవలె నుంటివి
బలువుగా నప్పటిని పన్నీట వసంతమాడి
తొలుకరికాలమువలె నుంటివి

చ. 2: కడలేనివేడుకతో కప్పుర వసంతమాడి
వడిఁ జుక్కలలో చంద్రునివలె నుంటివి
జడిగొని కుంకుమ వసంతములు సారెనాడి
గుడిగొని మాణిక్యాల కొండవలె నుంటివి

చ. 3: తిరముగ నీవు ముత్తెముల వసంతమాడి
వరుసఁ బాలజలధివలె నుంటివి
నిరతి శ్రీవేంకటేశ నీవు నలమేల్మంగయు
సురతవసంతమాడి సోనవలె నుంటివి

రేకు: 1666-1 లలిత సం: 26-390

పల్లవి: ముందరనున్నవలపు మొగిచాల్లాయఁగా
పందెమేవేసితే నాపాటిదయ్యీనా

చ. 1: తెరవేసుసాని నీతో తియ్యనిమాటలాడి
తరితీపు పుట్టించె తరుణి
మరిగి యందుకే నీవు మరులు కొంటివిగాక
సరివట్టి చూచితే నాసాటి వచ్చీనా

చ. 2: తలుపుమాటున నుండి తటుకనఁ దొంగిచూచి
తలఁపులోఁ దమిరేఁచీ తక్కరిచెలి
పలుమారు నందుకే బాఁతి పడితివిగాక
సలిగె చూపితే నా సవతు రాఁగలదా

చ. 3: పచ్చడములోను చొచ్చి పక్కనఁ గాఁగిలించి
గచ్చుల ని న్నెలయించెఁ గలికి
అచ్చపు శ్రీవేంకటేశ అలమేల్మంగనయి నేను
ఇచ్చగించి కూడితే నాయీడు వచ్చీనా

రేకు: 1666-2 పాడి సం: 26-391

పల్లవి: ఏల ను బాఁతిపడి యెంత వొడఁబరచీని
ఆలరీఁడు తను నెట్టు ఆసలఁబెట్టేనే

చ. 1: యెదురు మాటాడరాదు యేమని అడుగరాదు
కదిసి తనచే నెట్టు కత వినేనే
కదిమి వొత్తఁగరాదు కాలు చేయి వేయరాదు
పదపడి నేనెట్టు పక్కఁబండేనే

చ. 2: దారిదప్పి నవ్వరాదు తమ్ముల మిడఁగరాదు
పేరడిగా తన్ను నెట్లు పెండ్లాడేనే
గోర గీరరాదు కడుఁగొసరి తిట్టఁగరాదు
యీరీతివానితో నెట్టు యేకత మాడేనే

చ. 3: తప్పక చూడఁగరాదు తను బాసగొనరాదు
ఇప్పుడే శ్రీవేంకటేశు నెట్టు వంచేనే
కప్పి యలమేల్మంగ నే కడు నలఇంచరాదు
దప్పిదేర నన్నుఁ గూడె తన్ను నెట్టు మించేనే

రేకు:	1666-3 బౌళి	సం:	26-392

పల్లవి:	ఎటువంటిపరాకో యెరఁగలేవైతివి
తటుకన నిప్పు డిట్టె తలవంచుకొనేవు

చ. 1:	అండను న్నాపెఁ జూడక ఆవల వేరొకాపెను
కొండసేసి సారెసారెఁ గొనియాడేవు
దండిగా నది విని యీతరుణి జంకింతేను
వెండియు నీమోము వెలవెలఁజేసుకొనేవు

చ. 2:	పాదాలొత్తే ఆపెను భావించక మరపున
మోదించి వేరొకాపెను ముద్దాడేవు
ఆదెస నది చూచి నిన్నాకె యెరిఁగుంకొంటే
కాదనఁ జాలక నీవు కడు సిగ్గుపడేవు

చ. 3:	అలమేలుమంగ పురమందు నీకు నుండఁగానే
కెలసి భూకాంతఁ గాఁగిట నించేవు
అలరి శ్రీవేంకటేశ అందుకిట్టె నవ్వితేను
లలి నిద్దరితోను మేలములాడేవు

రేకు: 1666-4 వరాళి సం: 26-393

పల్లవి: ఇన్నాళ్లు నింత యెఱఁగ నిప్పుడే నేర్పుకొంటివి
చిన్నదానవై ప్రియము చెప్పించుకోవలనా

చ. 1: మక్కువల నీవు నాతో మాటలాడినంతలోనె
చిక్కని మోవితేనె చిందీనటవే
చెక్కుచేతితోడ వట్టిసిగ్గులువడే వప్పటి
యెక్కుడుగా నిందువల్ల నేమి గూడపెట్టేవే

చ. 2: నాతో నీవంగవించి నవ్వు నవ్వితే నేమాయ
ఆతల నీవాసి గొంత అరగీనటే
కాతరించి చెలులతో కడునేకాంతా లాడేవు
యేతుల నేకాలము నీకివే వోజలటవే

చ. 3: యింకనైనా నేనన్నట్టె యియ్యకొనఁగదవే
జకించి నీతోడివారు జరసేరటే
అంకెల శ్రీవేంకటేవుఁ డలమేల్మంగవు నీవు
లంకెలఁ గూడితివి ఈలాగు లివే మేలే

రేకు: 1666-5 సౌరాష్ట్రం సం: 26-394

పల్లవి: నే నీకు వింతదాననా నీకేల వెఱపు
పూని యిచ్చకముసేసి పొదుగఁగరాదా

 చ. 1: పడఁతి నీకు నింతబాఁతియైతేఁ జాలుఁగాక
తొడిఁబడ నీవొద్దికిఁ దోడితెచ్చేరా
అడరి యేమి చూచేవు అల్లార్చి యాపెదిక్కు
అడియాలమేమైనా నాడు నంపరాదా

చ. 2: వెలయ నీ కాపెమాట వేడుకైతేఁ జాలుఁగాక
పలుమారు నాడ నొడఁ బరపించేరా
పిలిచి పేరుకొనుచు ప్రియము లెంత చెప్పేవు
చెలరేఁగి వొక్కమాటే సేసవెట్టరాదా

 చ. 3: సరి నాపెరతి నీకు చవులైతేఁ జాలుగాక
తొరలించి తెచ్చి నీ పొత్తునఁ బెట్టేరా
ఇరవై శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
అరసి యాకెచే విడె మందుకొనరాదా

రేకు:	1666-6 దేసాళం సం:	26-395

పల్లవి:	చూచేము మీ వేడులు సోబానఁ బాడేము నేము
యేచిన మీకోరికలు యీడేర్చుకోరయ్యా

చ. 1:	మంతనమాడేటివేళ మరఁగులు వెట్టుదురా
చెంత నొనగూడె నిఁ సిగ్గులేడవి
పంతాలు ము నీడెరె పాడివెట్ట నిఁకనేల
బంతినే మీ వలపులు పచారించుకోరయ్య

చ. 2:	సరసమాడే యప్పుడు జంపులుఁ బనిలేదు
తెరవేసుకొంటిరి సాదించేదేమి
వెరపులెల్లా గంటిమి వేరే యిఁకఁ బొంకనేల
తరితీపుమీరతులు దక్కించుకోరయ్యా

చ. 3:	వీడెము లందుకొనియు విచారాలు సేతురా
జోడై వున్నారు ఇఁక సోదించనేల
యీడన శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తోడఁదోడ మీ యెమ్మెలు తొరలించుకోరయ్యా

రేకు: 1667-1 పళవంజరం సం: 26-396

పల్లవి: ఎక్కడ నేరుచుకొంటి విటువంటికతలు
మొక్కలపుదలపులు మోచుకొనఁగలవా

చ. 1: పొత్తులమాట లాడదేవు పూఁచి యేడ నేర్పితివో
బత్తితో నెవ్వరిపని పంచుకొందుము
మొత్తమై యందరుఁ గూడి మొనచన్నుల నొత్తితే
పుత్తలపడక నీవు వోరుపఁగలవా

చ. 2: మూఁకలచూపులు చూచే మోపులకొలఁదులుగ
తేఁకువ నెట్టేర్పరచి తీసుకొందుము
కాఁకల నిన్నొకమాఁటా కాంతలు కాఁగిలించితే
యేఁకట వేసరక నీ వెదురుకొనఁగలవా

చ. 3: మూఁటనవ్వులు నవ్వేవు మొగి నిచ్చకుండాను
యేఁట యెందు మోచునని ఇయ్యకొందుము
కూటమి నిన్నిందరముఁ గూడి పెండ్లాడితిమి
పాటించి శ్రీవేంకటేశ బాసలియ్యఁగలవా

రేకు: 1667-2 తోండి సం: 26-397

పల్లవి: నేను తనకు నెదురా నేరుపరి కడుఁ దాను
రానంటా నన్నేల దూరీ రతివిరహమున

చ. 1: పంతములాడేటివాఁడు బలిమి చూపుమనవే
మంతనాన విరులేసే మరునితోను
రంతులు నాతోనేల రవ్వగా వాదించుఁగాక
చింతలురేఁచేయట్టిచిలుకతోను

చ. 2: మేరతోనేల సాదించీ మించి కోపించుమనవే
సారె వెన్నెలల వేఁచే చందురుపైని
గోరడి నన్నేల కొని గుంపించి పైకొనుఁగాక
సారెకును విసరేటి చలిగాలిపైని

చ. 3: పెనఁగి కూడేటివాఁడు బీరము చూపుమనవే
కినిసి తొడరేవసంతునియెదుటా
యెనసి శ్రీవేంకటేశుఁ డెమ్మెలు మెరయుఁగాక
వెనకముందరితనవెలఁదులయెదుటా

రేకు: 1667-3 ఆహిరి సం: 26-398

పల్లవి: విన్నదాఁకా తహతహ విడువదేమోకాని
పన్ని సిగ్గువడ్డైతే పచారించ నిన్నును

చ. 1: ఇప్పుడేమేకతమాడె ఇంతి నీతో నిందాఁకా
చెప్పరానిమాటలైతేఁ జెప్పవలదు
తప్పక చూచె నదేమి దండ నుండి యాపె నిన్ను
కప్పి యది దాఁచేదైతే గాసిఁబెట్ట నిన్నును

చ. 2: సన్నలేల సేసె నీతో జలజాక్షి ఇందాఁకా
మిన్నక రహస్యమైతే మీలో నుండనీ
చిన్ననవ్వు నవ్వె నేమీ సెలవులఁ దానే యాకె
నిన్ను సోఁకివచ్చేదైతే నే నడుగ నిన్నును

చ. 3: కానుక లేమిటికిచ్చె కలికి నీ కిందాఁకా
పూని గుట్టు సేసేదైతే పోరాడవద్దు
ఆనుక శ్రీవేంకటేశ అదేమీ నన్నేలితివి
కానియాకె అప్పణయితే కాఁతాళించ నిన్నును

రేకు: 1667-4 ఆహిరి సం: 26-399

పల్లవి: ఏల తలవంచుకొనే వింతలో నీవు
నీలాగు నే నెఱుఁగుదు నీకేల వెఱవు

చ. 1: తగవులఁ బెట్టేనా తారుకాణించవచ్చేనా
మొగము చూచి యాపెకు మొక్కితివంటా
యెగసక్కేలాడేనా యెరుకసేసుకొనేనా
పగటుటన నటు కొంగుపట్టితివంటాను

చ. 2: తప్పులు నీపై వేసేనా తగుల నిన్నాడేనా
యిప్పుడే యీపెకుఁ గానుకిచ్చితివంటా
చొప్పులెత్తి చూపేనా సొంట్లు సోదించేనా
వొప్పుగునీమోవి నెంగి లున్నదంటాను

చ. 3: నెపములు వెదకేనా నీచేఁతకు నవ్వేనా
వుపమించి యీడానాడా నుండితివంటా
కృపతో నన్నేలితివి కెరలి శ్రీవేంకటేశ
నిపుణత నొరసేనా నివ్వెరైతివంటాను

రేకు: 1667-5 ఛాయానాట సం: 26-400

పల్లవి: చెల్లఁబో తపసు వండి జడవేలయ్య
కొల్లగా వలపు లమ్మిఁ గొనుకొనవయ్యా

చ. 1: జఱసి జెరసి యాపె సరసములాడఁగాను
నెఱిఁ బరాకైవుండేవు నీవదేమయ్యా
తఱితోడ రతులకుఁ దరవులు వెట్టఁగాను
మఱొకతెతో మాటాడ మరేలయ్యా

చ. 2: చేయిముట్టి నిన్ను నాకె చెనకుచునుండఁగాను
యేయెడ చూచేవు నీవు యిదేమయ్యా
ఆయములు సోఁకించి ఆసలెల్లఁ జూపఁగాను
చాయసేసుకున్నాఁడవు సరి నదేమయ్యా

చ. 3: యెచ్చరించి నిన్ను నాకె ఇట్టె కాఁగిలించఁగాను
పచ్చినవ్వులు నవ్వేటిపని యేమయ్యా
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యిచ్చకుఁడ విద్దరికి నెట్టయితివయ్యా

రేకు: 1667-6 రామక్రియ సం: 26-401

పల్లవి: వలపు సిగ్గెఱఁగదు వడి నేమిసేయవచ్చు
అలసి యాఁడికలకుఁ గలఁగదు మనసు

చ. 1: పిలిచి నీవైతేను ప్రియములు చెప్పే నాపెకు
చెలి నిన్నాడేమాటైతేఁ జెప్పరాదు
బలిమి నిందులకెల్లా పడిగెమట నీమోవి
వెలయ నీకిది విని విరుగదు మనసు

చ. 2: అడుగులకు మడుఁగు లటు నీవు వరచేవు
బడి నాపెగర్వమైతే పట్టరాదు
అడరి నీవు రాఁగాను ఆపె పాన్పుపై నున్నది
చిడుముడు నిది చూచీఁ జెదరదు మనసు

చ. 3: నిగిడి మొగమోటలు నీవు నడపేవుగాని
తగ నాపెపంతాలైతేఁ దలఁచరాదు
నగుతా శ్రీవేంకటేశ నన్ను నిట్టె గూడితివి
తగిలి నీ కాపెరతిఁ దనియదు మనసు

రేకు: 1668-1 ముఖారి సం: 26-402

పల్లవి: ఏఁటికి గేలిసేసేవు ఇందరిముందరా మమ్ము
గాఁటాన నవ్వఁదడవా కాదనికాక

చ. 1: జంకెనచూపుల నిన్ను సాదించఁదడవా
మంకుఁదన మేఁటికనేమాటకుఁగాక
కంకణాలచేయి వేసి కాకురేఁచఁ దడవా
అంకెల నాఁటది గబ్బియందురనికాక

చ. 2: వలపించి నిన్ను నిట్టె వంచుకొనఁదడవా
చలమరి ఇదియనేసడికిఁగాక
పెలుఁదనాన నీతో పెనఁగఁగఁ దడవా
యిల నాలుమగఁడనే యెన్నికకుఁ గాక

చ. 3: పంతములు నీతోను పచరించఁ దడవా
ఇంతరట్టు సేసేది యేలనికాక
చెంత నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ
యెంతైనా మెచ్చఁదడవా యెమ్మెలని కాక

రేకు: 1668-2 పూర్వగౌళ సం: 26-403

పల్లవి: పొందినవారము నేము బుద్ధులు చెప్పక పోదు
పందెములు వేసి మీరు పంతాలు మెరయరే

చ. 1: అగడుగా జగడించే రాతనికి నీకును
తగవు చెప్పే రావే తరుణి
మగవాఁడు పట్టఁజెల్లు మగువ దిట్టఁగఁ జెల్లు
వెగటున మీలో మీరు వెనకతియ్యకురే

చ. 2: వుమ్మడినే పెనఁగేరు వుద్దండాలు మెరయుచు
సమ్మతించఁ జెప్పే రావే సకియ
దిమ్మరితన మాతనిది దిట్టతనము నీది
నెమ్మది నింకా మీరు నేర్పులు మెరయురే

చ. 3: తత్తరించి అలిగేరు తమకించి కూడేరు
పొత్తునఁ గంపే రావే పొలఁతి
ఇత్తల శ్రీవేంకటేశుఁ డీతఁడు నన్నేలె మేలు
హత్తి యిద్దరు నిద్దరే అంకెల సాదించరే

రేకు: 1668-3 శ్రీరాగం సం: 26-404

పల్లవి: ఆపెలాంచనము మోయనర్హమా నీకు నేఁడు
యేపున మీపొందు మాకు నెరిఁగించవలెనా

చ. 1: కోమలిగుబ్బలమీఁదిగురిగింజ పేరు
నీమెడ వేసుకొంటివి నేరుపుతోను
ఆముకొన్నమగవాఁడ వాఁటదానవయ్యేవా
యేమిటి కొకరిసొమ్ము ఇయ్యవయ్య ఇఁకను

చ. 2: కలికినొసలనున్న కపురుబేగడబొట్టు
పెలుచవై నీనుదుటఁ బెట్టుకొంటివి
చెలఁగి బలుదొరవు చెంచుదాన వయ్యేవా
యెలమి నెరపులసొ మ్మియ్యవయ్య ఇఁకను

చ. 3: అంచగమన తురుమునందుండేపికిలికుచ్చు
మించఁగ నీకొప్పుమీఁద నుంచుకొంటివి
కొంచక శ్రీవేంకటేశ గొల్లదాన వయ్యేవా
యెంచఁగ నన్నేలితివి సొమ్మియ్యవయ్య ఇఁకను

రేకు: 1668-4 సామంతం సం: 26-405

పల్లవి: ఇనానల్లదాఁకా నీ వెందువోతివే
మన్ననలు మెఱయక మానుదురటే

చ. 1: నెట్టన నాతనిమీఁద నిందలాడేదానవు
ఇట్టె తుకాణిచ కేలుందానవే
పట్టపగలాయ నీతో పంతాలాడే విట్టె
కట్టుమట్టులు సేసే దిఁక మరియెన్నఁడే

చ. 2: పైకొని పిమ్మటనే పదరేదాన వెదుట
దీకొన కటు వెనకతీతురటవే
కాకుసేసేనంటాను కాచుకున్నదానవు
యీకడ మొకమోటలు యిఁకనేఁటికే

చ. 3: యెగ్గులేపట్టేనంటా నెంచుకున్నదానవు
సిగ్గువడి యింత జాగుసేతురటవే
అగ్గమై శ్రీవేంకటేశుఁ డాతఁడిదె నన్నుఁ గూడె
కగ్గుదే నీయెమ్మెలు కానవచ్చెనే

రేకు: 1668-5 హిందోళవసంతం సం: 26-406

పల్లవి: ఇల్లాలిచేతలా యివియెల్లాను
కొల్లకత్తెవలెఁ బుచ్చుకొంటివి వుంగరము

చ. 1: మందెమేళమున నీమగనితో సారెసారె
పందెము వేయుచు పకపకనవ్వేవు
చెంది నీమీఁది కతనిఁ జేయివట్టి తీసుకొంటా
కందవ లంటేవు యెంతగబ్బివే నీవు

చ. 2: కమ్మటి గర్వమున నాగడములాడి యతని
దొమ్మిసేసి పెనఁగుతా తొడ యెక్కేవు
కమ్మఁబూవుబంతిని కళదాఁక వేసుకొంటా
చిమ్మేవు నీకొనగొర నెంత చేఁతలాడివే

చ. 3: పిక్కటిల్లు మదమున బిగువుఁజన్నుల నొత్తి
చెక్కునొక్కి బుజముపై జీరదీసేవు
అక్కరతో శ్రీవేంకటాధిపుఁడు నన్నుఁ గూడె
కక్కసించే విపుడెంతకలిగివే నీవు

రేకు: 1668-6 గౌళ సం: 26-407

పల్లవి: నేనా విన్నవించితి నీ చిత్తముకొలఁదిఁక
సేసిపట్టి వానితోడఁ బెనఁగఁగఁగలవా

చ. 1: కొప్పుదువ్వేనంటాను కొరి వేడుకపడేవు
ముప్పి మురునమ్ములమూఁక లున్నవి
నెప్పునఁ గస్తూరిబొట్టు నెన్నుదుట దిద్దేవు
కప్పి బొమ్మలవిండ్లు కాచుకున్నవి

చ. 2: మోవితేనియలనుఁ గమ్ముకొని యాసగించేవు
భావజుని చిగురాకుఁబట్టె మున్నది
మోవరాని మొగపులమొలనూ ళ్లంటేవు
తావుకొని చక్రము లాదండనే వున్నది

చ. 3: పంతముతో మూసినపయ్యద జారఁదీసేవు
వింతలె జక్కవ లవే వేగు లున్నవి
యింతలో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సంతోసాలు మనసులో చాలుకొన్నవి

రేకు: 1669-1 ముఖారి సం: 26-408

పల్లవి: ఇంతవొలపక్షము నీవేల సేసేవు
పొంత నీమరుఁడే మీకు పూఁటవడెనా

చ. 1: మగువ లింద రుండఁగ మనసిచ్చి యాకెతోన
మగిడి మగిడి నీవు మాటలాడేవు
తగులున ఇద్దని తతిగొని మదనుఁడు
పొగరుఁ బువ్వుల నేసి పొందుసేసెనా

చ. 2: సవతులందరు నీతో సరసములాడఁగాను
నవముగా నాపెతోనే నవ్వు నవ్వేవు
కవగూడి మీలో మీకే కైవసము సేసేనని
జవళితోఁ గంతుఁడు బాసలు సేసెనా

చ. 3: వొయుచు నీదేవుళ్లు వూడిగాలు సేయఁగాను
కరణతో నీవాకెను కాఁగిలించేవు
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పురుఁడించి కాముఁ డిట్టె బుద్ది చెప్పెనా

రేకు: 1669-2 పాడి సం: 26-409

పల్లవి: మీరైనా బుద్ధిచెప్పరే మెలుఁతలాల
దార దప్పనివానికి తగవులౌనటవే

చ. 1: మంతనమాఁడేటివాఁడు మరేల రొదసేసీని
పంతగాఁడయినవాఁడు పైకొననేలే
వంతులు వెదకేవాఁడు వాసులెంచవలెనటె
ఇంతా విచారించుకొంటే నివి వోజలటవే

చ. 2: చట్టమైవుండేటివాఁడు చొక్కులఁ బెట్టనేఁటికే
నెట్టుకొన్నవానికి నేరమేడదే
జట్టిగొన్నవాఁడట చలము సాదింతురటే
దట్టపు దొరైనవాఁడు తమకించునటవే

చ. 3: రతుల మెప్పించేవాఁడు రవ్వసేయనేఁటికే
చతురుడయినవాఁడు చలమేఁటికే
ఇతవై శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
గతియై నన్నేలినాఁడు కాఁతాళించునటవే

రేకు: 1669-3 బౌళి సం: 26-410

పల్లవి: మతకరితనములు మాతో నేమిటికి
తతివచ్చినందుమీఁద దాఁవచ్చునా

చ. 1: నను నడుగనేఁటికి నంటున నీ సుద్దులు
మనసెఁగనికల్ల మరి వున్నదా
వెనకచుట్టరికము విచారించవచ్చేవు
తనవుసోఁకని యట్టి తగులాయ మున్నదా

చ. 2: నేరుపుల నీమాటలు నేఁడు నాతో నెరపేవు
నోరెరఁగనియట్టి నుడువున్నదా
దారదప్ప నెవ్వైతెను దలఁచనని యాడేవు
కోరికెకులోనుగాని కూరి మున్నదా

చ. 3: గిలిగించినా నీవు కేలిఁ బంతాలు చూపేవు
సెలవినవ్వుల రానిసిగ్గులున్నవా
నిలిచి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసితివి నీవల్లఁ గడమున్నదా

రేకు: 1669-4 సామంతం సం: 26-411

పల్లవి: ఆతఁడే మన్నించీఁగాక అందుకేమె చెలులాల
కాతరింపైకొంటే కడువేసటగాదా

చ. 1: వేడుకతో నుంటేనే విన్నవించవచ్చుఁగాక
యేడో పరాకైవుటే నెందుకెక్కును
కూడేబత్తి గలిగితే కొసరఁగఁ జెల్లుఁగాక
వీడు జోడై వుండఁగాను వెక్కసమైతోఁచదా

చ. 2: మచ్చికై తా నుండితేనే మాటలాడవచ్చుఁగాక
ఇచ్చగించకుండఁగాను ఇంత యేఁటికి
పచ్చిదేర నవ్వితేనే పట్టిపెనఁగుటగాక
యెచ్చుకుందు లాడఁగాను యెరవులే కావా

చ. 3: తలఁపు గలిగితేనే తమకించవచ్చుగాక
చలముతో నుండఁగాను చవి యేడదే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
అలమేలుమంగ నేను ఆస గడు మీరదా

రేకు: 1669-5 వరాళి సం: 26-412

పల్లవి: ఇల్లాలఁగనక నిన్నేమీనననోపను
వుల్లముతో బెట్టుకొని వుండితేనే చాలును

చ. 1: అంతరంగములుగాను ఆపె నీవు నాడుకొన్న-
వింత వింత మాటలెల్లా వింటిమి నేము
చెతల నీతో నవి చెప్పఁబోతే సిగ్గయ్యీని
మంతనానఁ దలఁచుకో మరి నీకు నీవే

చ. 2: చెంది మీరిద్దరు లోలోఁ జేసుకొన్న చేఁతలెల్ల
కందువ గన్నులెదుటఁ గంటిమి నేము
అందరిలోఁ జూపఁబోతే అవి గడుఁ బచ్చిదేరీ
పొందులుగాఁ గనుకో ఇప్పుడు నీకు నీవే

చ. 3: ఱట్టుగా మీకాఁగిటియాఱడి నింతయు
నెఱిఁగి గుట్టున బైకొని నవ్వుకొంటిమి నేము
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
అట్టె నన్నేలితివి పాయకు నీకు నీవే

రేకు: 1669-6 దేసాళం సం: 26-413

పల్లవి: చెల్లఁబో యెన్నాళ్లైనాఁ జిన్నదానవా
వొల్లవె నీవాతని వొడివట్టరాదా

చ. 1: వలపేల దాఁచేవే వాసులేల రేఁచేవే
వెలయఁ బతికి విన్నవించరాదా
తలఁపేల మఱేవు తమియేల విరిచేవు
పిలిచి ఆయాలుసోఁక బెనఁగరాదా

చ. 2: సిగ్గులేల పెంచేవే శిరసేల వంచేవే
వొగ్గి నీ చనుమొనల నొత్తరాదా
తగ్గి యేఁటి కలసేవు దానికేల సొలసేవు
వెగ్గళించి పొందు వెల్లవిరిసేయరాదా

చ. 3: నేమమెంత సేసేవా నేలలేమి వాసేవే
ఆముకొని సరసములాడఁగ రాదా
వేమరు శ్రీవేంకటేశు వెస నీవు గూడితివి
యీమెయి నలమేల్మంగ విరపుకోరాదా

రేకు: 1670-1 సామవరాళి సం: 26-414

పల్లవి: ఈపాటివాఁడవు నీ కిఁకనేల వెఱవు
ఆపనులకే నీవు ఆసపడేవు

చ. 1: తప్పక నిన్నుఁ జూచి తలపులో భావించి
చిప్పిలఁగఁ జెమరించేఁ జెలియ
ఇప్పుడు నీ వది చూచి యెగపోసి దిగపోసి
దప్పిదేరి వుస్సురంటాఁ దమకించేవు

చ. 2: నీచేయి పట్టుకొని నిలువునఁ గరఁగుచు
పూచినట్టు పులకించి బొలఁతి
ఆచాయలకే నీవు ఆసలెల్లాఁ బెడరేఁచి
తాచిక కళలతోనే దైవారేవు

చ. 3: మాటలు నీతో నాడి మచ్చికలఁదనివొంది
మేఁటికాఁగిలిచ్చీ నలమేలుమంగ
యీటున శ్రీవేంకటేశ ఇందుకే రతి మెప్పించి
సాటికి బేటికిఁ గడుసంతసిల్లేవు

రేకు: 1670-2 నాదరామక్రియ సం: 26-415

పల్లవి: ఏల వేసాలు సేసీనే యిప్పుఁడు మాతోఁ దాను
వోలి నన్నిఁటికి నోర్చి వూరకుండుఁగాక

చ. 1: చెక్కుపై గొరిడితేను సిగ్గువడఁ దనకేలే
అక్కడివారు తన్ను నాడుకొనేరా
వెక్కసపు మగవాఁడు వెఱతురా సతులకు
వుక్కుమీరి చట్టువలె నుండవలెఁగాక

చ. 2: మెవి గంటిసేసితేను మూసుకొనివుండనేలే
తావు లెవ్వరైనాఁ జూచి తన్ను నవ్వేరా
చేవమీరిన దొర చెలులకు లోఁగుదురా
వావిరి నన్నిటా మాకెవలె నుండుఁగాక

చ. 3: వురముపై నెక్కితేను వుదుటులు తనకేలే
తరుణులెవ్వరైనాను దగదనేరా
ధర నలమేల్మంగను తాను శ్రీవేంకటేశుఁడు
అరిదిఁ బువ్వును వాసనానై యుండుఁగాక

రేకు: 1670-3 ఆహిరి సం: 26-416

పల్లవి: ఇచ్చకమే సేయవలె ఇన్నిటికి లోఁగావలె
తచ్చి ఇదె నీతి సుమ్మీ దంతులకెల్లాను

చ. 1: తగవులఁ బెట్టరాదు తమకించి యాడరాదు
మొగము చూచి చూచి మగవానిని
అగడు సేయఁగరాదు అలముటఁబెట్టరాదు
నగి నగియైనాను నాథుడైనవానిని

చ. 2: ఆరజము సేయరాదు అలుకలే పెంచరాదు
నేరములే పైవేసి నిండు దొరను
గోర గీరఁగరాదు కోపము సేయఁగరాదు
కోరి వినోదానకైనా గుణియైనవానిని

చ. 3: వేసరుకొనఁగరాదు వింతగాఁ జూడఁగరాదు
ఆసుద్దులకు శ్రీవేంకటాద్రీశుని
సేసతోఁ గూడితివి మించి యలమేల్మంగవు
బాసిచ్చి నిన్నేలిన యీపాయరాని వానిని

రేకు: 1670-4 దేసాళం సం: 26-417

పల్లవి: సేయవయ్యా చేయఁగల చేఁతలెల్లాను
నీయంత లేనితగువ నేరుపఁగవచ్చునా

చ. 1: తలఁపులు రూపించి ముందరఁబెట్టవచ్చునా
వలపు లంగడిఁబెట్టవచ్చునా తెచ్చి
పలుకులు మూటగట్టి బండారించవచ్చునా
చలమరి నీగుణాలు చక్కఁబెట్టవచ్చునా

చ. 2: పట్టరానివయసున బయలీఁదవచ్చునా
వట్టినవ్వులెల్లా నానఁబెట్టవచ్చునా
కట్టఁగడ వావులెల్లా గాదెఁ బోయవచ్చునా
దట్టమైననీయాసలు తలఁగించవచ్చునా

చ. 3: వుడివోనినీబాసలు వొడిఁబెట్టవచ్చునా
చిడుముడి నీరతులు చెప్పవచ్చునా
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగనేను
యెడయక నన్నేలితి వీఁక దూరవచ్చునా

రేకు: 1670-5 ముఖారి సం: 26-418

పల్లవి: చెలులాల మీకేలే చెల్లఁబో వొలపక్షాలు
మలసి సరిగాఁ జూచి మమ్ము నొడఁగూర్చరే

చ. 1: ఆడనే వున్నాఁడు తాను ఆసలాసలనే పెట్టి
యేడలేని బుద్దులు మీరేల చెప్పేరే
వేడుకకు వలవఁగా వెన్నెలలు వేఁడులాయ
యీడనుండే యెంత బయలీఁదించేరే

చ. 2: కన్నులఁ దప్పక కాఁకలే రేఁచీ దాను
ఇన్నియుఁ దెలిసి యేల యెడతాఁకేరే
చెన్నుమీరఁ దలఁచఁగా చిగురులు వాండ్లాయ
సన్నల నావొడివట్టి చవులెంత చూపేరే

చ. 3: ఇప్పుడే యీడు వచ్చి ఇంటిలో బండుండీఁ దాను
కప్పురమబ్బీ మీరేల గడెవెట్టేరే
తప్పనెలమేల్మంగను తాను శ్రీవేంకటేశుఁడు
అప్పుడే నన్నేలె నెంత ఆఱడిఁబెట్టేరే

రేకు: 1670-6 పాడి సం: 26-419

పల్లవి: కాంతలాల యెటువంటిగామిడితనాలవాఁడే
కొంత గోర గీరితేనే గొబ్బునఁ దిట్టీనే

చ. 1: వొప్పుగాఁ బదారువేలువువిదల నేట్టేలెనే
కొప్పువట్టి నేఁ దీసితే కొచ్చి చూచీని
అప్పటి భూకాంతమగఁడటవే తా నిన్నిటాను
కప్పి నా చనుఁగొండలు కదువేఁగు లనీని

చ. 2: యేడలేనిగొల్లెతల కెట్టు మగఁడాయనే
వేడుకఁ దమ్మిఇడితే వెడనీఁగీని
పాడితోడ నెనమండ్రు పట్టపుదేవుళ్లటవే
కూడి నేఁ దొడెకితే సిగ్గులు వడీని

చ. 3: వీఁపునా రొమ్మునా నెత్తి వెలఁదుల మోచెనటె
పై పై నేఁ గాలు దొక్కితే బడలీఁ దాను
యేపున శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తీపుమోవి చవిగొంటే తేనెలూరించీని

రేకు: 1671-1 మాళవి సం: 26-420

పల్లవి: పచ్చిమాట లాడేవు బయకాఁడా
గచ్చులు సేతురా నీవు కాతరీఁడా

చ. 1: తలుపేల మూసేవు తమియేల రేఁచేవు
వెలలేని వలపుల వేడకకాఁడ
చెలుల నేలంటేవు సిగ్గులేల ముట్టేవు
కొలఁదిలేని రతుల కోడెకాఁడా

చ. 2: కొప్పేల దువ్వేవు కొంగేల పట్టేవు
దప్పిదేరేకాఁకలదాయగాఁడా
తప్పు యేల చూచేవు తవనలేల పెట్టేవు
ముప్పిరిఁ గళలు రేఁచే మొక్కలికాఁడా

చ. 3: నవ్వులేల నవ్వేవు నయములేల చూపేవు
జవ్వనుమదముల జాజరకాఁడ
యెవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నివ్వటిల్లు చేఁతల నీటకాఁడ

రేకు: 1671-2 తెలుగుకాంబోది సం: 26-421

పల్లవి: నిండినజవ్వనమెల్లా నీచేతిది
చండిపెట్టి చూచి నిన్ను జంకించేనా

చ. 1: వెలయఁగ నీవు నన్ను వేడుకఁ బెండ్లాడితవి
చలపట్టి నే నిన్ను సాదించేనా
చెలఁగి యెవ్వతొఁందు చేసినాఁ జేతువుగాక
తలఁపున నీపైఁగాఁతాళించేనా

చ. 2: కందున దొల్లె నీవు కంకణము గట్టితివి
యెందుకైనా నేనీతో నెదురాడేనా
విందవై యెవ్వరితో నవ్వినా నవ్వుదుగాక
నిందవేసి నిన్నుఁ గడునేర మెంచేనా

చ. 3: కామించి నీవు నన్నుఁ గాఁగిలించి కూడితిని
యేమిసేసినా నదియేఁటి కనేనా
యీమేర శ్రీవేంకటేశ యెట్టున్నా నుందువుగాక
వేమారు నిన్ను నిఁక వెగ్గళించేనా

రేకు: 1671-3 కన్నడగౌళ సం: 26-422

పల్లవి: ఇందుకు నీ చిత్త మిఁక నెట్టున్నదో
కందువ జోలిఁ బెట్టక కరుణించవయ్యా

చ. 1: తెరదీసి మోముచూచి తీపుమోవికే లాసి
సరసపుఁగాఁకల చలిగాసీని
తరుణి నీ కింతగాను తపములు చేసి చేసి
వెరవులు వెదుకుచు విరుల వేసీని

చ. 2: చేయివట్టి సన్నసేసి సిగ్గులెల్లాఁ గూడపెట్టి
దాయపు వలపులను దండగట్టీని
కాయజకేలికి నీకుఁ గమ్మటి వేడెలువెట్టి
ఆయములు ముట్టి ముట్టి యానలు వెట్టీని

చ. 3: కప్పురము నోరికిచ్చి కాఁగిటిరతుల మెచ్చి
యిప్పుడే పానుపు మీద యెడమిచ్చీని
నెప్పున శ్రీవేంకటేశ నిన్ను నిన్నిటాఁ దచ్చి
చెప్పరానిచేఁతలెల్లాఁ జేసి హెచ్చీని

రేకు: 1671-4 ఆహిరి సం: 26-423

పల్లవి: వేగిరమా యిప్పుడేమి విభుఁడవు నీవు నాకు
భోగించేయప్పుడే నీవు పొసఁగి వుండేవు

చ. 1: ఘనుఁడవు నిన్నుఁ గడు కరకరించ నేఁటికి
మనసువచ్చినప్పుడే మాటలాడేవు
పనివడి గిలిగించి బలలించనేమికి
ననిచినప్పుడే నీవు నవ్వు నవ్వేవు

చ. 2: వెంట వెంటఁ దగులుచు విన్నవించనేమిటికి
యింటి వచ్చినప్పుడే యియ్యకొనేవు
దంటతనమున నీతోఁ దమకించనేమిటికి
నంటుగలయప్పుడే నావాఁడ వయ్యేవు

చ. 3: కైవసము గమ్మనుచు కాఁతాళించనేమిటికి
భావించి చూచినప్పుడే పైకొనేవు
శ్రీవేంకటేశుఁడవు చిమ్మిరేఁచనేమిటికి
యీవేళ నన్నేలితివి యిఁక నిట్టే మెచ్చేవు

రేకు: 1671-5 రామక్రియ సం: 26-424

పల్లవి: తొల్లే నీయాల నేను దోసానకు లోనుగాను
చల్లనాయ నామనసు జరయనేలయ్యా

చ. 1: బాసికము గట్టితివి భామకాలు మెట్టితివి
చేసినచేఁతలు నీకుఁ జెల్లెనయ్యా
బాసలెల్లా నీడేరె పచ్చినవ్వులు దైవారె
యేసుద్దులు విన్నవించ నిఁకనేలయ్యా

చ. 2: పెండిలిపీఁ టెక్కితివి ప్రేమిఁ జెక్కునొక్కితివి
అండనే సతికిఁ బతివైతివయ్యా
దుండగాలెల్లా దక్కె సంతోసాలు చేచిక్కె
చండిపెట్టి నిన్ను నంత సాదించనేలయ్యా

చ. 3: వీడెము లందుకొంటివి వెలఁది గైకొంటివి
తొడనే నీకోరికెలు దొరసేనయ్యా
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వొడక రతుల నిన్ను నొరయ నేలయ్యా

రేకు: 1671-6 సామంతం సం: 26-425

పల్లవి: వేఁడుకోఁగాఁ జెలులతో విఙ్ఞవీఁగే వింతేకాక
నేఁడాపె తానే వచ్చితే నీకేమన వచ్చును

చ. 1: చలపాదితనములు సతులకు నింతేకాక
వలచినయట్టిమగవాని కేఁటికి
చెలరేఁగి యాపె నిన్ను చెనకి పైకొంటేను
నిలువున గరఁగక నీ వోర్వఁగలవా

చ. 2: పనిమాలినవొట్లు పడఁతుల కింతే కాక
ననిచినయట్టిప్రాణనాథు కేఁటికి
మనసిచ్చి యాపె నీ మర్మములు ముట్టితేను
తనివోని తమకము దాఁచుకొనఁగలవా

చ. 3: దిట్టతనపు మాటలు తెఱవల కింతేకాక
నెట్టన శ్రీవేంకటేశ నీకేఁటికి
గట్టిగా నిన్నాపె గూడి కాగిట నిట్టెవుండితె
గుట్టెల్లాఁ జెప్పక మతి బెట్టుకొనఁగలవా

రేకు: 1672-1 రీతిగౌళ సం: 26-426

పల్లవి: సరి నిచ్చమాడితే చాయకువచ్చుఁ బనులు
నిరతపువారి కివి నేరుచుకొనవలయు

చ. 1: సలిగెలఁ బొరలేటిసతితోను రమణుఁడు
చలము సాదించఁబోతే చండిపడును
పెలుచుగుణముదానిఁ బిలిచి పెనఁగితేను
చలరేఁగి పంతములే చిమ్మిరేఁగును

చ. 2: మందెమేళపుటింతిని మస్తరించవలెఁగాని
ఇందరిలో జంకించితే యీసురేఁగును
సందుసుడికత్తెకు నాసలు చూపవలెఁగాని
గొందుల నణఁచఁబోతే గొణఁగుచుఁ దిట్టును

చ. 3: మొగమోట సతితోను ముచ్చటలాడుటే మేలు
వెగటు బంతాలైతే వేసటౌను
నిగిడి శ్రీవేంకటేశ నే డీఁకె నేలితివి
పగటుటు నెరపితేఁ బచ్చిదేరుఁ బ్రియము

రేకు: 1672-2 భైరవి సం: 26-427

పల్లవి: ఇంకనైనా రాఁగదవే ఇదె నీ విభుఁడు వచ్చె
లంకెలఁ బెనఁగితేను సంకెలేక వుండును

చ. 1: చనవులు గలిగితే చలము పనికిరాదు
మనసు లెనసితేను మంకులు మాను
తనవులు సోఁకితేను తటితో సిగ్గులు వీడు
కనుచూపులు నాటితే కాఁకలు చల్లారును

చ. 2: పలుకు లొడఁబడితే భయమేమియును లేదు
వలపు లొనఁగూడితే వాసులుండవు
కొలువులు గలిగితే కోరి యెడమాట లొద్దు
సెలవి నవ్వు లూరితే చింతలు పొదలవు

చ. 3: ఆయములంటితేను అరగొరలే లేవు
పాయక వద్దనుండితే పంగెము గాదు
యీయెడ శ్రీవేంకటేశు నెనసితి విపు డిట్టె
చేయిచ్చి సేసవెట్టితే సిలుగెల్లాఁ బాసును

రేకు: 1672-3 బౌళి సం: 26-428

పల్లవి: ఆయలే సటలేఁటికి నప్పటి నీవు
ఆయములు గరఁగీనా ఆకె వుండఁగాను

చ. 1: సేవలు సేసేనంటే సెలవయ్యీనా నీకు
ఆవల వేరొకతెపై నాస వుండఁగా
మోవితేనె లడిగితే మోహము పుట్టేనా
తావుకొని యాపె నీదండ నుండఁగాను

చ. 2: చెక్కులెంత నొక్కినాను సిగ్గులు మానీనా
చొక్కించి సతులెదుటఁ జూడఁగాను
మక్కువ నే జల్లితేను మనసు వచ్చీనా
చక్కఁగా నాపె చెయ్యి చాఁచుకుండఁగాను

చ. 3: వంతుకు నే నవ్వితేను వలపుల రేఁగీనా
సంతతము నాకె రతి చవి చూపఁగా
యింతలోనె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వింతగా నాకెఁ గూడవా వెసనే నుండఁగాను

రేకు: 1672-4 బౌళి సం: 26-429

పల్లవి: ఓరుచుక ఇన్నిటికి నూరకుండుటే మేలు
యేరీతి వంచుకోవచ్చు నిటు నిన్ను విభుఁడా

చ. 1: చందమామగుటకలు సారె నీ మంచితనాలు
పందెమాడే చెరకులు పనులు నీవి
సందెకాడమఱఁగులు చక్కని నీ చేతలు
యెందుకని దూరేము ఇఁక నిన్ను విభుఁడా

చ. 2: యెండమావులనీళ్లు ఇటు నీతో సరసాలు
వండవండనట్లు నీవలపులెల్లా
పండినబూరుగులు నీపచ్చిదేరే సిగ్గులు
చండిపెట్టనేల నిన్ను చలమరివిభుఁడా

చ. 3: తంగేటిపైజున్నులు తచ్చన నీ పొందులు
ముంగిటినిధానాలు మోవితేనెలు
చెంగటఁ గూడితి విట్టె శ్రీవేంకటేశుఁడు నన్ను
పంగించనేల నిన్ను పాయరాని విభుఁడా

రేకు: 1672-5 సామంతం సం: 26-430

పల్లవి: తన కొంక చింత నాతల పదిగాదుగాని
కనలి సవతులచే గాసిబడనోపనే

చ. 1: దప్పిదేరే మోముతోడ తలవంచుకున్న నాకు
కప్పురమిచ్చి యీతడు కళరేఁచీనే
అప్పటిఁ బానుపుమీఁద నసురుసురనఁగాను
చిప్పిల మర్మములంటి సిగ్గువుట్టించీనే

చ. 2: పట్టిన చలముతోడ పంతముతో నున్న నన్ను
బట్ట బయలు మాఁటాడి పలికించీనే
దిట్టతనము సేసుక తెరవేసుకుండఁగాను
చుట్టరికాలు నెరపి చొక్కించవచ్చీనే

చ. 3: యెవ్వరి ననఁగలేక నివ్వెరగై నుండగాను
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డిటు గూడెనే
నవ్వులకు నే నిటు సన్నలు సేసి మొక్కఁగాను
పువ్వుల వేయుచుఁ గడు పొందెలెల్లా జేసీనే

రేకు: 1672-6 శ్రీరాగం సం: 26-431

పల్లవి: ఊరకున్నవానినేల వొడివట్టుకొమ్మనీనే
మేరమీరి యీతగవు మీరే యెరుగుదురే

చ. 1: నగినపతితో మారునగితే నమరునే
తగిలి చేయిచాఁచితే తమకించవచ్చునే
మొగము చూచితేను మొక్కవచ్చునేమరి
మొగి నింటికి వచ్చితే మోహించఁ జెల్లునే

చ. 2: వొనరఁ బిలిచితేను వూఁకొనఁగఁదగునే
మనసు రా మాటాడితే మాటాడఁబొసఁగునే
యెనసి పొందుసేసితే ఇచ్చగించఁబాడియౌనే
చెనకితే వలపులఁ జెలరేఁగు టొప్పునే

చ. 3: కాఁపురము సేసితేను కానిమ్మనఁ జొప్పడునే
పై పై నాసగించితే బాఁతిపడనగునే
యేపున శ్రీవేంకటేశుఁడింతలోఁ దానన్నుఁగూడె
తీపుల మోవి యొసఁగితే మెచ్చఁగూడునే

రేకు: 1673-1 దేసాళం సం: 26-432

పల్లవి: నేడు గొత్తలా నాకు నీ సుద్దులు
వేడి చూపితే వెన్న వేవేగఁ గరఁగదా

చ. 1: కొసరక నీ చేఁతలు గుట్టుసేయవలెఁగాక
పిసికితేఁ గడుఁగడుఁ బసురుగాదా
పొసఁగ నీ గుణములు పొగడఁగ వలెఁగాక
ముసుఁగులు వెట్టితేను ముగ్గు వేయదా

చ. 2: పాయరానినీ మాటల బయలీఁదవలెఁగాక
నాయానకుఁ దీసితేను నాముకొనదా
చాయలకు నీ ప్రియము చవిగొనవలెఁగాక
రాయడించ జూచితేను రాఁపుకెక్కదా

చ. 3: కూడిననీకూటములు కూడపోయవలెఁగాక
ఆడా నీడా నెరపితే నంటుకొనదా
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
ఆడుకొనఁబోయితే నానందము గాదా

రేకు: 1673-2 రామక్రియ సం: 26-433

పల్లవి: ఎంత బలిమికత్తెవు యేమే నీవు
మంతనమాడకుండాను మానిపేవా నీవు

చ. 1: కామించి యాతఁడు నాసంగడి గూచుండెనంటాను
యేమేమి మాటలాడేవే యింతలో నీవు
నీ మగఁడే నాచేతికి నిమ్మపండిచ్చెనంటాను
గామిడిచేఁత చేసేవు కానీవే నీవు

చ. 2: ఇంతలో నాతఁడు మా ఇంటికి వచ్చెనంటాను
యెంతేసి నవ్వులు నవ్వే వేమే నీవు
దొంతరవలపుతో నా తొడపైఁ బండున్నాఁడంటా
పంతములే నెరపేవు పైకొనుచు నీవు

చ. 3: కడఁగి పాన్పుపై నన్ను గాఁగిలించుకొనెనంటా
యెడచొచ్చి కూడేవు యేమే నీవు
అడరి శ్రీవేంకటేశుఁడాతఁడు నీవాఁడంటా
బడివాయక వుండేవు పచ్చిదేర నీవు

రేకు: 1673-3 పాడి సం: 26-434

పల్లవి: ఇంత పచ్చిసేయనేల ఇల్లాల నేను
అంత వలసితే వెలయాండ్ల నడుగరాదా

చ. 1: ముప్పిరి నాడఁగరాక ముంచి నే సిగ్గువడఁగ
చెప్పరానిమాటలకు చెవియొగ్గేవు
అప్పటిని వేడుకైతె నంగజశాస్త్రములెల్ల
తప్పకుండాఁ జదువుక తనివందరాదా

చ. 2: యేడా రట్టుసేయక ఇన్నియు నే దాఁచఁగాను
చూడరానిచేఁతలకు సూటి చూచేవు
తోడనే నీకితవైతే తొయ్యలుల యంగాలెల్లా
జోడుగా నాటకసాలఁ జూచుకొనరాదా

చ. 3: పాయపు మదముతోడఁ బట్టి నేఁ బెనఁగఁగాను
సేయరానిపనులకు జేఇచాఁచేవు
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
ఆయాలు చెలికత్తెల నాలోచించరాదా

రేకు: 1673-4 సామంతం సం: 26-435

పల్లవి: చేతికొద్దివాఁడ ఆఁడు చెలియరో నీకు
రాతిరిఁ బగలుఁబొంది రాఁపు సేయరాదా

చ. 1: అండనుండి సొలసేవు అంతలోనె అలసేవు
నిండుఁ దగవరియైన నీరమణుని
చండివెట్ట నోపుదువు సాదించనేరుతువు
బొండుమల్లె పాను పదె భోగించరాదా

చ. 2: పంతములే మెరసేవు పలుమారు జరసేవు
మంతనాన నుండినట్టిమగవానిని
వంతులు వెదకుదువు వాసికిఁ బెనఁగుదువు
దొంతిబోనా లివిగో పొత్తుల నుండరాదా

చ. 3: కప్పురము లిచ్చేవు కాఁగిటనే వుచ్చేవు
కప్పినయాసల శ్రీవేంకటేశ్వరుని
యిప్పుడు దా నిన్నుఁ గూడె యీతఁడిట్టెనన్నునేలె
చిప్పిలుఁగెమ్మోవి యిదె చేకొనఁగరాదా

రేకు: 1673-5 ముఖారి సం: 26-436

పల్లవి: ఇద్దరము నున్నారము యెవ్వరి మగఁడవయ్యా
వొద్దిక బందేలు వేసుకొన్నార మిపుడు

చ. 1: హత్తి నేము తగవు నిన్నడుగఁగవచ్చితేను
పొత్తులమాట లాడి పొదిపేవు
ఇత్తల నీవే కావా ఇంతసేసినవాఁడవు
బత్తిగలవాఁడు వలె పరాకు సేసేవు

చ. 2: జంట నొకరొకరము చనవులు మెరసితే
యింటిలోనే సరిగాను యింపు చల్లేవు
రెంటికి గుర్రై వలపురేఁచినవాఁడవు నీవే
అంటి ఆయములుముట్టి ఆసలు చూపేవు

చ. 3: వరుస నే మొకమాటే వావులు నీకుఁ జెప్పితే
కెరలి మమ్మిపుడే కాఁగిటఁ గూడేవు
నిరతి శ్రీవేంకటేశ నీవే తగిలితివి
పరగ నాపై మన్ననే పచారించేవు

రేకు: 1673-6 నాదరామక్రియ సం: 26-437

పల్లవి: ఏమయ్యా తాఁకితలఁచ విదివో నీవు
నేమపుఁ జెలిపై దయ నించే రిందరును

చ. 1: పంతములాడదు నీతో బాసలు నిన్నడుగదు
యెంతేసి ప్రియాలు చెప్పీ నిందరిలోన
చెంతల నెప్పుడు నీ చిత్తమెట్లానున్నదో
కాంతఁ జూచితే మనసు గరఁగీ నందరికి

చ. 2: చలములు మెరయదు జగడించదెపుడును
చెలిమి యెంత నెరపీఁ జెలి నీతోను
యెలమి నీ విటమీఁద నెటువలె మన్నించేవో
పొలతి భావము చూచి పొగడే రందరును

చ. 3: పెనఁగ దెంతైనాను బిగిసి మాటాడదు
యెనసి కాఁగిటఁ గూడె యిట్టె నిన్ను
ఘన శ్రీవేంకటేశ నీకాయ మెంత చొక్కెనో
వనితఁజూచి మొక్కవచ్చే రిందరును

రేకు: 1674-1 ధన్నాసి సం: 26-438

పల్లవి: తగుఁదగు నీకు నివి తప్పుగాదు
జగడించేనా నేను సారెఁగొంచనేఁటికి

చ. 1: చలరేఁగి నీవాపెకుఁ జెప్పిపంపిన సుద్దులు
యెలమి నాపె నాకు యెరిఁగించెను
కలిగినపను లివి కమ్మటి దాఁచఁగనేల
వలదనేనా నేను వట్టి మఱఁగేఁటికి

చ. 2: సుదతికి నీవిచ్చినసొమ్ము లన్నియును నాకు
ముదమున జూపి కడు ముచ్చటాడెను
గుదిగొన్న వలపులు గుట్టు సేయఁగనేల
యెదుటఁ గోపగించేనా ఇఁకఁ గొంకనేఁటికి

చ. 3: మగువఁ గాఁగిటఁ గూడి మన్నించినమన్ననలు
పగటున మెచ్చి నాతోఁ బచారించెను
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
యెగసక్కె మాడేనా యిన్నిబాసలేఁటికి

రేకు: 1674-2 రామక్రియ సం: 26-439

పల్లవి: కైలాటాలు వెట్టవద్దు కాంతల మిద్దరము
మేలము లాడుచు నిన్ను మెప్పించుకోరాదా

చ. 1: నగ వెంతైనా నీవు నాలికాఁడ వడిగితే
తగవైనాఁ జెప్పరాదా దయతో మాకు
వొగి నీమాటకు లోను వొట్లు వెట్టుకొన్నారము
మొగమిచ్చి నవ్వి మాచే మొక్కించుకోరాదా

చ. 2: చూడవు కానుకదిక్కు సొరిదిణ బట్టుకుండణగా
వీడెమైన నియ్యరాదా వేడుకతోను
జాడతో నీవారమై సమ్మతించి వున్నారము
జోడు గూడి మాకు నిట్టె చుట్టమవు గారాదు

చ. 3: మానవు నీ పంతములు మాతో శ్రీవేంకటేశ
తెనెమోవైనా నీరాదా దిష్టము గాను
ఆనుకొని కూడితివి అంతలో మమ్మిద్దరిని
తానకమై నీరతులు తలఁపించుకోరాదా

రేకు: 1674-3 పాడి సం: 26-440

పల్లవి: ఇచ్చకము సేసుకొని ఇయ్యకొనుటగాక
రచ్చలోన సారె సారె రవ్వసేయనేల

చ. 1: దొరయైనసతి సవతుల నెందరిఁ దెచ్చినా
యెరవులేని ఇల్లాలి కేల కోపము
సిరుల కొనగోరిలచ్చెన లెన్ని నించుకొన్నా
విరసము చేసుకొని వెంగెమాడనేల

చ. 2: చలపాదిమగఁడు విచ్చనవిడిఁ దిరిగితే
వలచినదేవులకు వాదించనేల
వొలసి యెందరిచే సేవలు సేయించుకొన్న
బలిమితోడుత కడుఁ బంగించనేలా

చ. 3: జిగి శ్రీవేంకటేశుఁడు చేరి యెంత పెండ్లాడినా
మిగులాఁ బంతకత్తెకు మీఱఁగనేలా
నగుతా నిన్నుఁ గూడె నాయకుఁ డీతఁడే నేఁడు
వెగటైన సిగ్గులకు వెరగందనేలా

రేకు: 1674-4 ఆహిరి సం: 26-441

పల్లవి: ఆకెకు నీకుఁ దగు నన్నిటా మెచ్చితి మిమ్ము
వాకున నేరుపరచి వక్కాణించనేలా

చ. 1: సన్నలా చాయలా నాపె సణఁగులు రాల్చఁగాను
విన్నకన్నయట్టినీకు వేడుక గాదా
వన్నెలాను వాసులాను వలపు నీపైఁ జల్లఁగా
ఇన్నిటా సంతోసము లింకఁ జెప్పనేలా

చ. 2: ఆకడా నీకడా నీతో నాపె పంతాలాడఁగాను
కైకొన్న పతివి నీకు ఘనతగాదా
మేకులకు మెచ్చులకు మేలము నీతో నాడఁగ
జోకగాఁ దరితీపులు చూపిచెప్పనేలా

చ. 3: మునుపావెనకా నీకె మోహించి నిన్నుఁ గూడఁగా
ననుపై నేఁడు నీకు నవ్వులు గావా
ననుఁ గూడితివి నేఁడు నంటున శ్రీవేంకటేశ
వినయాలు పలుమారు వెసఁ జెప్పనేలా

రేకు: 1674-5 ముఖారి సం: 26-442

పల్లవి: చెప్పరాదే నీ మోహము చెలియ నేఁడు
కప్పురవిడేలలోనే కంటిమి యిన్నియును

చ. 1: పొనుఁగ కాతనితోడ పొందుసేసితేనెట్టో
వినుకలికే యింత వేడుకపడేవు
చనవిచ్చి యప్పటిని సరసమాడితే నెట్టో
కనుకలినే ఇంత కడుఁదమకించేవు

చ. 2: పరగ నేకతమున బాసగొంటే నింకనెట్టో
తొరలిపుమాటకే హత్తుకోవచ్చేవు
సరవితో ననుపైతే జట్టిగొనే దిఁకనెట్టో
చొరవలకే ఇంత చొక్కి మెచ్చేవు

చ. 3: తేనెమోవి సోఁకితేను తిరమయ్యీ దిఁకనెట్టో
పానుపు చేరినందుకే పసమించేవు
యీనెపాన నిన్ను నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
ఆనుక నవ్వినందుకే అరుదందేవు

రేకు: 1674-6 దేవగాంధారి సం: 26-443

పల్లవి: అందరికిఁ గలచాలే యంగనలాల
పొందుసేయవలెఁగాక పోరాడనేఁటికే

చ. 1: పట్టఁగరాదు మనసు పాయరాదు చెలిమి
ఇట్టి బుద్దులు చెలు లేమిచెప్పేరే
జట్టి గొన్నవాఁ డతఁడు సమ్మతైనదాన నేను
చుట్టాలింతే మీరు మమ్ము జోడువాపనేఁటికే

చ. 2: మచ్చిక మానుపరాదు మర్మాలు దాఁచఁగరాదు
రచ్చవేసి నన్ను నేల రాయడించేరే
మెచ్చి పెండ్లాడె నతఁడు మేనదానఁదొల్లె నేను
నెచ్చెలు లింతే మీరు నేరాలెంచనేఁటికే

చ. 3: ఆస విడిపించరాదు ఆనంద మాఁపఁగరాదు
వేసరించి నన్నునేల వెంగేలాడేరే
సేసవెట్టి నన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
నాసరివారె మీరు నవ్వు నవ్వనేఁటికే

రేకు: 1675-1 దేసాళం సం: 26-444

పల్లవి: తెలుసుకోవయ్యా నీవే తెల్లమిగాను
అలివేణితో నవ్వి ఆదరించు మిపుడు

చ. 1: మొక్కలాన నొకమాట ముంచి యాపె సొలసితే
వెక్కసాలాడేవు నీవు వెల్లవిరిగా
యెక్కువైన కోవిలల యెలుఁగులు నిడివైతే
చక్కగా మరు నందుకు సాదించఁదగవా

చ. 2: జవ్వనమదాన నాకె జంకించి చూచితేను
పువ్వులచెండునఁ దాఁకఁ బూఁచివేసేవు
పువ్వులేల్లా నమ్ములపాదులలో బాణాలైతే
నివ్వటిల్ల వసంతుని నేర మెంచఁదగవా

చ. 3: తమకించి యాపె నిన్ను దండిగుబ్బల నొత్తితే
అమరఁ గాఁగిటిలోనే అలయించేవు
జమళి శ్రీవేంకటేశ జక్కవలు మదించితే
తిమిరి యాచెలిని సాదించ నీకుఁదగవా

రేకు: 1675-2 వరాళి సం: 26-445

పల్లవి: ఎంతవాఁడైనాఁగాని యేమాయ నేఁడు
పొంత నీకు వలపించి పొత్తునఁ బెట్టెనే

చ. 1: మాటలాడితేఁజాలు మట్టుకుఁదెచ్చే నతని
యేటికి మనికితము ఇంతిరో నీకు
సూటిగా నామో మతఁడు చూచితేఁజాలుఁగాన
వాఁటముగా నతని నీవసము చేసేనే

చ. 2: అండనిలిచితేఁ జాలు అతని నొడఁబరచే
నిండుఁగాఁతాళ మేఁటికే నెట్టన నీకు
చండిసేయక కానుక చయ్యన నంటితేఁజాలు
పండిన మనసులోనిపంపు సేయించేనే

చ. 3: చెవులొగ్గితేఁ జాలు చెప్పి నీతోఁ బొందుసేసే
ఇవల విచారమేలే ఇప్పుడు నీకు
తవిలి వచ్చి కూడెను తానె శ్రీవేంకటేశుఁడు
తపనఁ దప్పక నీకు దక్కి వుండఁజేసేనే

రేకు: 1675-3 కాంబోది సం: 26-446

పల్లవి: అందుకే తల్లడిమందీ నంతరంగము
వొందిలినే పవ్వళించివున్నాఁడు లోనను

చ. 1: పెనఁగ నే నోపనంటి బిగిసినదానఁగాను
మనసున నెట్టుండెనొ మగనికిని
వినయాన మీరైనా విన్నవించరే చెలులు
వొనరఁగఁ జిన్నఁ బోయివున్నాఁడు లోనను

చ. 2: అట్టైరా సిగ్గువతితి నలిగినదానఁగాను
యెట్టని యాడుకొనునో ఇందరితోను
గుట్టుతో నీతని వేఁడుకొని సారెకు మొక్కరే
వొట్టుకొన్నచింతతోడ నున్నాఁడు లోనను

చ. 3: సరిఁ గాఁగిటఁ గూడితి చలపాదిదానఁగాను
ఇరవై శ్రీవేంకటేశు కెద్ది ప్రియమో
పరగఁ దనకు నిట్టై పంతమీయరే మీరు
వొరసి తా నవ్వుకొంటా నున్నాఁడు లోనను

రేకు: 1675-4 వరాళి సం: 26-447

పల్లవి: ఎంత కక్కూ్రితికాఁడే యీా రమణుఁడు
వింతైన తన వయసు వేడుకే నెరపీని

చ. 1: చెలప చెమటలు మైఁ జిప్పిలీననఁగానే
అలరి పెనఁగులాడుమనీ నీతఁడు
చలువైన తనమేను సరతయ్యే దెఱఁగడు
వలచినయట్టి కళవళమే చూచీని

చ. 2: యిదివో తేనెలమోవి యెంగిలినో రనఁగానే
అదన మాటాడుమనీ నప్పటిఁ దాను
పదరి అంటుముట్టని పరులాడే దెఱఁగఁడు
కదిసేటితన తమకమే యెంచుకొనీని

చ. 3: రతుల నా చన్నులు గీరకుమీ నీ వనఁగానే
తతిఁ గూడుమనుచుఁ గాఁతాళించీని
మితిమీర ననుఁగూడె మేను వొత్తేది యెంచఁడు
మతి శ్రీవేంకటేశుఁడు మదమే చూపీని

రేకు: 1675-5 శ్రీరాగం సం: 26-448

పల్లవి: ఒక్క మనసుగా నీకె వొడఁబాటయ్యీఁగాని
అక్కరతోడుతఁ గడునండకు రావయ్యా

చ. 1: చెలియసిగ్గులకును చెక్కిటి చేయిమాటు సాక్షి
లలి సంతోసాలకు పులకలే సాక్షి
చలివేఁడి ఆనలకు సన్నపు నవ్వులు సాక్షి
చలమేల మా మాటకు సరిచూచుకోవయ్యా

చ. 2: నెట్టుకొన్నకాఁకలకు నివ్వెరగులే సాక్షి
చిట్టకపు చింతకు చెమటే సాక్షి
దట్టపువలపులకు తడఁబాటే సాక్షి
గట్టిగా మామాట తారుకాణ చూచుకోవయ్యా

చ. 3: తీరనికరఁగులకు తేటలచూపులు సాక్షి
మేరతోడిపొందులకు మెచ్చులే సాక్షి
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి కాంత నిట్టె
సారపు మామాటల నిజము చూచుకోవయ్యా

రేకు: 1675-6 పాడి సం: 26-449

పల్లవి: ఎంతనేరుపరివి నిన్నేమిచెప్పేది
వింతవానివలెనే భావించేవా నీవు

చ. 1: సారెకుఁ జూచేవాఁడవు సన్నలు సేసేవాఁడవు
ఆరమణిపేరు నన్ను నడిగేవా
గారవించి యట్టె వుడుగరలంపేవాఁడవు
యీరీతిఁ దల) కుళము లెఱఁగవా నీవు

చ. 2: యింటికి రప్పించేవాఁడ విచ్చకమాడేవాఁడవు
అంటి నాతో నాపెసుద్దు లరసేవా
వొంటి నేకతములాడి వొరసి నవ్వేవాఁడవు
వెంటనే యాపె గుణాలు వెదకేవా నీవు

చ. 3: సరి నెడమాటలకు సతులనంపేవాడవు
తరుణి చెల్లెలంటా నిందలు గట్టేవా
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సరతి నన్నేలితివి చక్కటి దిద్దేవా

రేకు: 1676-1 దేవగాంధారి సం: 26-450

పల్లవి: ఏమని పొగడే మిదె నీరమణిని
కోమలపువయసు కోకిలవాణి

చ. 1: దొంతులువెట్టీఁ దోడనె వలపులు
కొంతపుచూపులకోమలి
సంతనసేసి సరసపుమాటల
వింతవేడుకల వెన్నెల పతిమ

చ. 2: విందులు చేసి వేమరు బ్రియముల
కందువనవ్వులకలకంటి
బిందెల నించీపెకగు సిగ్గులు
మందె మేళముల మదనునిశరము

చ. 3: పైరులు విత్తీ బలుతమకంబుల
మేరతో రతి నలమేల్మంగ
యీరీతి శ్రీవేంకటేశ నిన్నెనసె
సారపుగుణములజమళి మెఱుంగు

రేకు: 1676-2 ఆహిరినాట సం: 26-451

పల్లవి: ఏమిచేసినాఁ జేసితి విన్నిటా నీవేలికవు
నేమముమీరి తిట్టఁగ నీతియౌనా నాకు

చ. 1: కొలవులో నాపెను కొంగువట్టితివంటాను
చలము సాదింతునా సారెసారకు
మలసి నే జూడఁగానే మర్మములంటితివంటా
అలుగవచ్చునా నీతో అలనైనా నాకు

చ. 2: చన్నులంటి యప్పటిని సరసమాడితివంటా
చెన్నుమిర నిటు రట్టు సేతునా నేను
సన్నలుసేసి మోవి చవులుచూపితివంటా
నిన్నును జంకించ నిఁక నేరుపౌనా నాకు

చ. 3: గక్కుననుఁ దెరవేసి కాఁగిలించుకొంటివంటా
వెక్కసమాడుదునా శ్రీవేంకటేశుఁడా
అక్కర నలమేల్మంగనయిన నన్నుఁ గూడితివి
దక్కితి విఁకఁ గొసరఁ దగవౌనా నాకు

రేకు: 1676-3 సాళంగం సం: 26-452

పల్లవి: ఇంత యేల దాఁచేవు నేమెరిఁగితే నేమాయ
పంతాలకే కాదా నిన్నుఁ బచ్చిసేసేది

చ. 1: తరితీపులకెకాదా తరుణి నీవద్ద నుండి
పరి పరి విధముల పందె మాడేది
వొరటులకే కాదా వొడివట్టి తీసి నిన్ను
సరసములాడుతానే జంకించేది

చ. 2: పెద్దరికాలకెకాదా పెనఁగులాడుతా నిన్ను
గద్దించి నవ్వులు నవ్వి కాఁగిలించేది
వుద్దండాలకే కాదా వోరికొట్లను నిన్ను
పెద్దబెట్టుగా నూరకె పేరఁబిలిచేది

చ. 3: యెమ్మెలకేకాదా రతి నెనసి యలమేల్మంగ
వుమ్మడిఁ బాయక కొలువులుసేసేది
నెమ్మది శ్రీ వేంకటేశ నీవు నన్ను వేలితివి
ముమ్మాటికి గాదా నీ మోము చూచేది

రేకు: 1676-4 బౌళి సం: 26-453

పల్లవి: నాటిమాట నాటికాయ నాలితన మిపుడేల
కూటమి కియ్యకొనవే గురుతాయఁ బనులు

చ. 1: చెప్పినట్టల్లాఁ జేసి చెలువుఁడు వేఁడుకొనె
తప్పులెంచకువే ఇఁకఁ దరుణీ
దప్పిదేరే మోముతోడ దయపుట్ట మాటలాడీ
వుప్పతించి దూరకువే వొనగూడెఁ బనులు

చ. 2: ఇచ్చకము నీకుఁ జేసి ఇంటికి వచ్చెనితఁడు
పచ్చిసేయకువే ఇఁకఁబడఁతీ
ఇచ్చె నీకు బాసలెల్ల నిందరుఁ జూడఁగానె
తచ్చనలు మరియేలే తలకూడెఁ బనులు

చ. 3: తగవులెల్ల నెరపె తగిలె శ్రీవేంకటేటేశు -
డెగసక్కేన కోపునా ఇందువదన
నగుతానే నినుఁగూడె నయములు వచరించె
వెగటు లిఁకనేఁటికే వేడుకాయఁ బనులు

రేకు: 1676-5 దేసాళం సం: 26-454

పల్లవి: ఎట్టు గెలువఁగవచ్చు నింతవాఁడవు
గట్టిగా నీవే మమ్ముఁ గరుణించవయ్యా

చ. 1: చలము మెరసి నిన్ను జంకించేనంటేను
మలసేటిబీరపుమగవాఁడవు
వలపురేఁచి నిన్ను వంచుకొనేనంటేను
కలికికాంతలు పెక్కుగలవాఁడవు

చ. 2: పంతములాడి నిన్ను భ్రమఇంచేనంటేను
మంతుకెక్కిన రట్టడిమాసటీఁడవు
ఇంతలోనే మోవి లంచమిచ్చి చొక్కించేనంటేను
అంతకంతకును నీవు ఆసోదకాఁడవు

చ. 3: పట్టపుదేవులనె బలిమిఁ బెనఁగేనంటే
మట్టులేని రతులదిమ్మరివాఁడవు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవె
గుట్టుసేసేనంటే మేకుల యెమ్మెకాఁడవు

రేకు: 1676-6 పూర్వగౌళ సం: 26-455

పల్లవి: చూతములో నీ బలిమి సుదతిబలిమియును
యీతలానాతనా మీరిద్దరు నున్నారు

చ. 1: మంతనాన నాపె నీతో మాటలాడినప్పుడుగా
పంతములెల్ల నీవు పచారించేది
పొంతనుండి యప్పటినిపూఁచి నవ్వనప్పుడుగా
చింతదీర నావాపెకు సేసవెట్టేది

చ. 2: శిరసెత్తి నీవంక చెలి చూచినప్పుడుగా
పొరిఁబొరి పొందుసేసి బోదించేది
సరుగన మాటలాడి చలివాసినప్పుడుగా
తరవాతి పనులకుఁ దమకించేది

చ. 3: తతి నిన్నుఁ గూడి యీకె తనిసినప్పుడుగా
చతురతఁ బవ్వళించి కతచెప్పేది
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మితిమీరినయప్పుడుగా మెచ్చు మెచ్చేది

రేకు: 1677-1 వరాళి సం: 26-456

పల్లవి: చెలులము నేము నీకుఁ జెప్పేబుద్ధులు వినవే
చెలివాసి వుందానవు చల మెటువంటిదో

చ. 1: తప్పక చూచినవాఁడు దయసేయకమానీనా
ఇప్పుడేలే వేగిరము ఇంతిరో నీవు
ముప్పిరిగొని చెమట మోమెల్లా నిండె నీకు
కప్పి నీ మనసులోనికాఁతాళ మెట్టిదో

చ. 2: మక్కువచేసినవాఁడు మన్నించకమానీనా
వెక్కసాన దూరకువే వెలఁది నీవు
గక్కనను గెంపుదేరె కన్నుల తుదల నీకు
కక్కసించి తమకపుకాఁక యెంతవున్నదో

చ. 3: చేయిచాఁచినవాఁడు సిగ్గుదేర్చకమానీనా
రాయడించుకునే యిఁక రమణి నీవు
యీయెడ శ్రీవేంకటేశుఁడీతఁ డిట్టె నిన్నుఁ గూడె
చాయల మై పులకించె సంతోస మేరీతిదో

రేకు:	1677-2 ముఖారి సం:	26-457
పల్లవి:	వలచినదాని కింత వాసులెంచనున్నదా
	యెలయ నీవే పతికి విడెమియ్యఁగదవే
చ. 1:	సెలవుల నవ్వితేనే సిగ్గులు వడుదురా
	అలమి చన్నులు చేత నంటితేఁగాక
	పిలిచినంతటిలోనె పెనఁగులాడుదురా
	తిలకించి కొంగువట్టి తీసితేఁగాక
చ. 2:	సన్నలు సేసితేనే సణఁగులాడుదురా
	వున్నతితోఁ గొనగోర నూఁదితేఁగాక
	కన్నులఁ జూచితేనే కాఁకలఁ దిట్టుదురా
	పన్ని నే మర్మాలు సోఁక బలికితేఁగాఁక
చ. 3:	పచ్చడము గట్టితేనే పక్కన నలతురా
	కొచ్చి సదమదముగాఁ గూడితేఁగాక
	ఇచ్చ నిన్ను శ్రీవేంకటేశుఁడేలె మీరుదురా
	అచ్చపుటలమేల్మంగ వారడైతేఁగాక

రేకు: 1677-3 కాంబోది సం: 26-458

పల్లవి: ఇటువలెఁ జేసుబోఁ యెంతవారిని వలపు
తొటుకన గుట్టుచూపి దప్పులు దేరీని

చ. 1: తలవంచుకొన్న యాపె తమక మాఁపఁగలేక
బలిమి నీ మోము తప్పక చూచీని
తొలుతనే సిగ్గువడి తొయ్యలి ఆసలచేత
పెలుచుమాటల నీకు బ్రియము చెప్పీని

చ. 2: పంతములాడినయాపె పాయమువట్టఁగలేగ
ఇంతలోననే నీకు జేయెత్తి మొక్కీని
వంతువాసు లెంచుకొని వనిత కమ్మటి నేఁడు
ఇంతలోనే పిలువకే ఇంటికి వచ్చీని

చ. 3: యెడమాటాడించేయాపె ఇట్టె ఆస మాన్పలేక
తొడిఁబడ తానే నీపొందులఁ గూడీని
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
వుడివోనిరతి యిచ్చి వురమెక్కీని

రేకు: 1677-4 రామక్రియ సం: 26-459

పల్లవి: ఏమే చిన్నదానవా యింతిరో నీవు
నీమగనిఁ జూడరాదా నిన్ను మెచ్చఁగాను

చ. 1: శిరసేల వంచేవే సిగ్గులేల పెంచేవే
బెరసి యాతఁడు నీతోఁబెనఁగఁగాను
మరగి యేల పట్టీవే మాటలేల చుట్టేవే
అరుదై యాతడు సుద్దు లడుఁగఁగాను

చ. 2: చన్నులేల మూసేవే సన్నలేల సేసేవే
చెన్నుమీర నిన్నితఁడు చెనకఁగాను
వున్నతి నెంత లోఁగేవే వొడ్డుక యేల వీఁగేవే
వన్నెల నితఁడు నీకు వలవఁగాను

చ. 3: బలిమినేల నవ్వేవే పంతములేల తవ్వేవే
యెలమి శ్రీవేంకటేశుఁ డెనయఁగాను
అలమేలుమంగవు నీ వక్కున నెట్టొరసేవే
మలసి యీతఁడు నీకు మరుగఁగాను

రేకు: 1677-5 ఆహిరినాట సం: 26-460

పల్లవి: ఈతనిమనసెల్లా నీ వెఱఁగనిదా
ఘాతల సోదించి యేల కాకుసేసేవే

చ. 1: పొలసి యవ్వతెతోనుఁ బొందుసేయ ననఁగానే
చలపట్టి పతి నెంత సాదించేవే
అలుగననుచు నీతో నానలు వెట్టుకోఁగానే
సొలపుమాఁటలో నేల సూడు వట్టేవే

చ. 2: మక్కువఁ గడవారితో మాటలాడననఁగానే
వెక్కసాన నీవేల వెంగెమాడేవే
చొక్కి తనమేను నీకు సోదనలియ్యఁగానే
నెక్కొని యప్పటి నేల నిందవేసేవే

చ. 3: బెరసి నీమీఁద మరి పెండ్లాడననఁగానే
పరకాంతఁ దెచ్చి యేల పైఁదోసేవే
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
తొరలి నవ్వఁగా నేల దొమ్మి సేసేవే

రేకు: 1677-6 కాంబోది సం: 26-461

పల్లవి: చెప్పఁగదరే యీమాట చెలువునికి
ఇప్పుడు తనవుంగర మిదె నాచే నున్నది

చ. 1: బాసలు సేయఁగనేల బయలీఁదించఁగనేల
ఆసకొలిపి నామగఁడైనాఁడు తాను
వేసాలు నేనేమీనేర వెక్కసము లాడనేర
సేసపా లివిగో నా శిరసుపై నున్నవి

చ. 2: చెక్కులు నొక్కఁగనేల సిగ్గు విడిపించనేల
వొక్కటై నాయింటిలోన నున్నాఁడు తాను
పక్కనఁదన్నుఁ దడవ పాడిపంతాలు దడవ
చక్కగాఁ దన ముద్రలు చన్నులపై నున్నవి

చ. 3: కలువల వేయనేల కడు వేఁడుకొననేల
నలి శ్రీవేంకటేశుఁడు నన్నేలెఁ దాను
బలుములు చూపవద్దు పట్టి పెనఁగఁగవద్దు
చలఁగి తనసుద్దులు చిత్తములో నున్నవి

రేకు: 1678-1 రామక్రియ సం: 26-462

పల్లవి: దానికేమిదోసము తప్పు లెంచఁ జెల్లదు
అనుకొన్నమగవాని కాదరంచవలయు

చ. 1: మనసులు సోదింతురు మచ్చికలు చూపుదురు
కనుసన్న గావింతురు కాఁక సేతురు
గునుతురు సొలతురు గుట్టు దెలుసుకొందుకు
వనితలు పతిమీఁద వలపు చల్లుదురు

చ. 2: ఆసలెల్లా రేఁతురు ఆయము లంటుదురు
బాస సేయించుకొందురు భ్రమఇంతురు
పాసివుండ రొరతురు పైకొని పెనఁగుదురు
వాసి నింతు రిట్లానే వలపు చల్లుదురు

చ. 3: కడు సేవలు సేతురు కాఁగిటఁ గూడుదురు
బడివాయకుండుదురు పైకొందురు
యెడయక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వడి నావలె నిందరు వలపు చల్లుదురు

రేకు: 1678-2 నాట సం: 26-463

పల్లవి: ఎట్టు నమ్మవచ్చు నిన్ను నింత కాతరీఁడవు
యిట్టె యేపొద్దును నాయింటనే వున్నాఁడవు

చ. 1: అప్పుడే బాససేసితి వాపె ఇటు పొలసితే
తప్పక చూచేవు మతి దలపోసేవు
ముప్పిరిఁ దలవంచేవు ముదిత పాట పాడితే
కుప్పళించి పెంజెమట గురిసేవు మేనను

చ. 2: ఆయెడఁ బంతిమాడితి వాకె దండ గూచుండితే
కాయము సోఁకించేవు కరఁగేవు
నాయములు నడపేవు నడుమ నాపె నవ్వతే
పాయపు మదముతోడ భ్రమసే వెదుటను

చ. 3: అడరి నన్నేలితివి అస లాపె చూపితేను
కడు సిగ్గు విడిచేవు కాఁగిలించేవు
బడినే శ్రీవేంకటేశ పాయ కాపె నిలిచితే
వుడివోని రతులను నొరసేవు సారెను

రేకు: 1678-3 భైరవి సం: 26-464

పల్లవి: పతితో విరహమంది పాడి పాడి సొలసేవు
అతనినీతగవులు అటువలెఁగదవే

చ. 1: జక్కవలె చన్నులట చందురుఁడె మోమట
యెక్కడి చుట్టరికమే యీరెంటికి
నిక్కి అలులే కురులు నాసికమె సంపెంగ
వెక్కసపు నేస్తాలు వెగటాయఁగదవే

చ. 2: కరికుంభాలే పిరుఁదు ఘనసింహమే నడుము
సరిఁ బొందు లెటువలె జరగీనే
అరిది నెమలినడక అదివో నీ యారు పాము
గరిమఁ జెలిమి యెట్టు కడతేరీనే

చ. 3: తామెరలె కన్నులాయ తగునీనవ్వే మంచాయ
ఆముకొన్న కూటము లెట్టబ్బునే యిఁక
శ్రీమహాలక్ష్మివి నీవు శ్రీవేంకటేశుఁడతఁడు
నేమపు పొంతనా లెట్టు నెరవేరెనే

రేకు: 1678-4 మధ్యమావతి సం: 26-465

పల్లవి: మగవాఁడు భ్రమసితే మగువలు దెలిపేరా
తగులై వుండఁగానే తలఁచకుండుదురా

చ. 1: కడుఁ జల్లనిచూపుల కాంత నిన్నుఁ జూడఁగాను
యెడలేని కాఁకలు నీకేల రేఁగెను
వుడివోని కొనగోర నూఁది యెచ్చరించఁగాను
అడరి నివ్వెరఁగులు అమరునా నీకు

చ. 2: సంతోసపుమాటలు సతి నీతో నాడఁగాను
ఇంతలోనే వెడచింత లేల వచ్చెను
వింత వింత నగవులు వేమారు నవ్వఁగాను
చెంతనుండి పంతములు చెల్లునా నీకు

చ. 3: వాడికకాఁగిట నిన్ను వనితఁగూడఁగాను
యేడలేని తమకము లేల వచ్చెను
యీడనె శ్రీవేంకటేశ యీకె నిన్ను మెచ్చఁగాను
ఆడుకోలు బీరములు అందమౌనా నీకు

రేకు: 1678-5 శుద్ధదేశి సం: 26-466

పల్లవి: మొగమోటము దరచు మొదల నాకు
యెగసక్కే లాడనోప నీతని నేమందునే

చ. 1: కడు బ్రియాలు చెప్పగా కాదని పెనఁగరాదు
అడరి పైకొనఁగాను అలుగరాదు
విడియ మొసగఁగాను వేసారుకొనఁగరాదు
యెడసి ఇప్పుడు వచ్చె నీతని నేమందునే

చ. 2: మోముచూచి నవ్వఁగాను మొనసి తిట్టఁగరాదు
దోమటి దొడుకఁగాను తొలఁగరాదు
చేముంచి చెనకఁగాను సిగ్గులు వడఁగరాదు
యేమరించి కాఁగిలించీ నీతని నేమందునే

చ. 3: చనవు నాకియ్యఁగాను సమ్మతించననరాదు
పనులు చెప్పఁగాను ఓపననరాదు
యెనయుచు శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
యినుమడించె వలపు లీతని నేమందునే

రేకు: 1678-6 ఆహిరి సం: 26-467

పల్లవి: ఎట్టోరుచుకున్నాఁడవో ఇటువంటి వలపులు
దట్టపు నీశాంతానకు దయవుట్టీనాకు

చ. 1: యెక్కడ నెప్పుడు నిన్ను నెవ్వతె సేసెనో నీ-
చెక్కులరేకలు చూచి చిమిడీ మతి
మొక్కలాన నప్పటి నీ ముంగురులు నొసలిపై
చిక్కువడ్డవెల్లాఁ జూచి చెమరించీ నేను

చ. 2: బెడిదమై మరెవ్వతె పెనఁగి నిన్నోడించెనో
కడునీయలపు చూచి కంపించీ నేను
తొడిబడ నదె మోవితుదనున్నగంటి చూచి
కడలేని చింతతోడ కంటగించీ మొగము

చ. 3: జట్టిగొని మరెవ్వతె చన్నుల నిన్నొత్తెనో
గట్టి నీవురము చూచి కరఁగీ గుండె
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నెట్టన నీరతి చూచి నిగిడీ నానందము

రేకు: 1679-1 శ్రీరాగం సం: 26-468

పల్లవి: ఎటువంటిరాతిగుండె యీా చెలియది
ఇటులా బుద్ధిచెప్పినా నెంతైన గరఁగదు

చ. 1: మగవాని నెంతకైనా మట్టుపెట్టుకొనవచ్చు
మగువల చలములు మానుపరాదు
నగుతానే పంతగాని నయానకుఁ దేవచ్చు
జగడగత్తెను మరి చాయకుఁ దేరాదు

చ. 2: జూటరిపతిఁ జొక్కించి చుట్టముఁ జేసుకోవచ్చు
ఆఁటదానికోపము అణఁచరాదు
నీటున నుద్దండీని నేమానకుఁ దేవచ్చు
మేటిమొక్కళపుదాని మెప్పించరాదు

చ. 3: శ్రీవేంకటేశ్వరునిఁ .జెనకి కూడఁగవచ్చు
భావించి సవతి నొడఁబరచరాదు
యీావేళ నన్నేలె నీతఁ డీతనితో నవ్వవచ్చు
కావిరి గర్వపు కాంతఁ గరఁగించరాదు

రేకు: 1679-2 కేదారగౌళ సం: 26-469

పల్లవి: మంచిదాయఁ గానీవే మనభాగ్యమాయ నది
కంచముపొత్తు లెటులాఁ గలసెనో కాని

చ. 1: సెలవుల నవ్వు లూరె సిగ్గులు మోమునఁ గప్పె
అలరుచుఁ జెలులు యేకాంతమాడఁగా
తెలియరాదు మాట దీకొని యడుగరాదు
పలుకుఁబంతము లెట్టు ఫలించెనోకాని

చ. 2: నిక్కెను మేనఁ గళలు నిలువెల్లాఁ బులకించె
చక్కఁగా లేకలు లోలో జదువుకోఁగా
పక్కన సోదించరాదు బలిమిసేయఁగరాదు
ఇక్కువ వలపు లెట్టు యీడేరెనోకాని

చ. 3: చన్నుల జెమట నించె చవులు మోవి నెసఁగె
కన్నుల శ్రీవేంకటేశు గనుఁగొనఁగా
యెన్నిక లూహించరాదు యెరుకసేసుకోరాదు
వున్నతిరతు లివెట్టు వుప్పొంగెనోకాని

రేకు: 1679-3 శంకరాభరణం సం: 26-470

పల్లవి: ఇద్దురును నొకటే యెప్పుడును
బుద్ధులు చెప్పఁగఁ బొలఁతుల వశమా

చ. 1: చక్కనిపతితో జరయుచు నాడేవు
యెక్కడిమాట లివేమిటికి
లక్కవంటివె లలనలమనసులు
గక్కునఁ గరఁగును కరకరి యేలే

చ. 2: కందువ నాతనిఁ గడుజంకించేవు
యెందాఁకాఁ జల మేమిటికే
పొందగువయసులు పొద్దగు వింతలు
బిందెల దగులౌ పెనఁగఁగనేలే

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁ జెనకుచుఁ గూడేవు
యీవలఁ బంతము యేమిటికే
వేవేలు సిగ్గులు వెన్నెలవంటివి
చేవలుదేరును చిడుముడి యేలే

రేకు: 1679-4 వరాళి సం: 26-471

పల్లవి: ఆఁటది గూళయ్యైతే నందేమున్నది
మాటుసేసుకొని ఆకుమడిచిచ్చేవేమే

చ. 1: బత్తిసేసి నావద్ద పాయ కితఁ డుండఁగాను
పొత్తుల మాటాడి నీవు పొదిగేవేమే
గుత్తపుగుబ్బల నన్నుఁ గుచ్చి కాఁగిలించఁగాను
హత్తి వూడిగాలు సేసే వప్పటి నీ వదేమే

చ. 2: పాడితోఁ బగడసాలపందే లాతఁ డొడ్డఁగా
ఆడుమనుచుఁ బాసిక లందిచ్చేవేమే
వీడెము నా చేతికిచ్చి విందుల మో వియ్యఁగాను
నోడలఁ బెట్టి పతికి నోరూరే వేమే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నన్ను చిత్తగించి కూడఁగాను
వావులు చెప్పేవు సారె వాకిట నేమే
ఆవేళ దయసేసి ఆతఁడు నిన్నేలితేను
దేవులవై వచ్చి నాతో దీకొనేవేమే

రేకు: 1679-5 సౌరాష్ట్రం సం: 26-472

పల్లవి: ఇచ్చకపుమాటలు యిల్లాల నేను
దిచ్చరిమాటలు నేర తెలుసుకో నీవే

చ. 1: యిమ్ములఁ జేసేపనులెల్లాఁ జేసివచ్చి నాతో
సమ్మతించఁ జెప్పితివి చాలదా యిది
అమ్మరో యింకా నిన్ను నౌఁగాదనేదేమి
దిమ్ము రేఁగె వలపులు తెలుసుకో నీవె

చ. 2: చల్లఁగా నానావిధాన చవులెల్లాఁ జూచి వచ్చి
చెల్లబెట్టెవు సుద్దులు చింత యేటికే
వెల్లవిరి నింద నీపైవేయఁగా వచ్చేదేమి
తెల్లమాయఁ బనులెల్లా తెలుసుకో నీవే

చ. 3: బూమెల్లాఁ దిరుగులాడి పొందులెల్లా నేర్చి వచ్చి
కామించి నన్నేలితివి కడమ లేవి
గోమున శ్రీవేంకటేశ కొసరఁగా నిఁకనేమి
దీమసాన నే నవ్వితి తెలుసుకో నీవే

రేకు: 1679-6 హిజ్జిజి సం: 26-473

పల్లవి: ఏల మమ్ముఁ జెనకేవు యెంతటివారము నేము
మూలనుండి నీవారమై మొక్కేము గాక

చ. 1: యెగసక్కేలాడరాదు యెదురు మాటాడరాదు
నగనోపుదుమా నీతో నయముగాను
తగవులఁ బెట్టరాదు తారుకాణించఁగరాదు
జగడించఁగలమా చాయలా సన్నలను

చ. 2: వరుసలడుగరాదు వలపుచల్లఁగరాదు
సరసములాడేమా సమ్మతిగాను
తరవులు వెట్టరాదు తమకించి దూరరాదు
బెరసి కాఁగిట నిన్ను బిగిఇంచఁగలమా

చ. 3: గుట్టుసేసుకుండరాదు కూడితే మానఁగరాదు
బట్టబయలీఁది నిన్ను పనిగొనేమా
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పట్టినచల మీడేరె పచారించఁగలమా

రేకు: 1680-1 రామక్రియ సం: 26-474

పల్లవి: ఇంతసేసినఁగాక నీవేల చిక్కేవు
చెంతనే నే మున్నారము చేకొనఁగరాదా

చ. 1: తెరవేసుకొని యాపె తేనేలమాట లాడితే
కరఁగుచు గూడెనంటా కాఁతాళించేవు
విరులచెం డప్పటిని వెలి నీపై వేసితేను
తరితీపునఁ జేఁబట్టి తమకించేవు

చ. 2: సోరణగండ్ల నాకె సొలసి నిన్నుఁ జూచితే
మేరతో లోనికిఁబోఁ దిమిరి తూరేవు
గారవించి నయముగా కలకలనవ్వితేను
ఆరసి మదనరతి కటు పదరేవు

చ. 3: అట్టె కొనగోర నిన్ను నవ్వలనుండి వూదితే
గట్టిగా పారపుచేరి కలసితివి
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గుట్టు సేసితే సారెకు కోరి వలచేవు

రేకు: 1680-2 నాదరామక్రియ సం: 26-475

పల్లవి: ఇయ్యకొంటి నీ మాటలు యింకానేల
నెయ్యమెల్లాఁ గానవచ్చె నేర మెంచనేఁటికి

చ. 1: వెలయ నందరితోడా వేసరక నవ్వేవు
చలమరిసరసాలు సాజమే నీకు
పిలువకతొల్లె వచ్చి పీఁటమీఁదఁ గూచుండేవు
బలిమి తమకములు పచ్చిదేరె నీకు

చ. 2: సారిది నెందరినైనా సూటిగానే చూచేవు
తరితీపుల యాసలు తగవే నీకు
మరిగి నాతో నీవు, మాటలు నన్నాడించేవు
సురతాన నూరికెల్లా జుట్టుమవే నీవు

చ. 3: కమ్ముక యెందరినైనాఁ గాఁగిలించి కూడేవు
యిమ్ముల నిచ్చసోబనా లితవే నీకు
కమ్మర శ్రీవేంకటేశ గక్కన నన్నేలితివి
నెమ్మది నీ కీరితి నిండుకొనె నిపుడు

రేకు: 1680-3 ద్రావిళభైరవి సం: 26-476

పల్లవి: కడఁగి యాతఁడు నీకు గాచుకున్నాఁడు
పుడివోనిరతిఁ గూడి వోలలాడఁగదవే

చ. 1: వెలయ మాటాడవలె విభునితో నవ్వవలె
చలపాదితనమేలే సతులకును
తలవంచుకొననేల తప్పులు వెదకనేల
పిలిచీ నాతఁడు నిన్నుఁ బ్రియముచేకొనవే

చ. 2: అంకెలో మెలఁగవలె ఆయము లంటఁగవలె
మంకుదన మింతయేలే మగువలకు
జంకెనలు చూపనేల సడిఁ బెట్ట నంతయేల
పొంకాన నెదురుచూచీ పొత్తు కిట్టె రావే

చ. 3: గుట్టున నుండఁగవలె కూరిమిఁ బెనఁగవలె
వట్టి బింకా లివియేలే వనితలకు
చిట్టకములేల నిన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
గట్టెయ మీయెన్నికలు కాఁగిలించుకొనవే

రేకు: 1680-4 దేసాళం సం: 26-477

పల్లవి: ఏల వొడఁబరచేవు యెందాఁకా మమ్ము
చాలుకొన్న మీగుణాలు సరియుబేసియునే

చ. 1: నిండుక ఇందరిలోనా నీవు మంచివాఁడవే
కొండుకనీచేఁతలే గొరబు గాని
కొండలెల్లా నున్ననే కోరి దగ్గరి చూచితే
మెండుకొన్నరాలును మిక్కుటపు మాకులే

చ. 2: అలరిననీమోవి అమృతము వంటిదే
అలవోకమాటలే అగడుగాని
జలనిధియంతా మీరే చవిగొన చూచితేను
వొలుగులువారఁ గడునుప్పులై వుండును

చ. 3: శ్రీవేంకటేశుఁడ నీవు చింతించ దేవరవే
ఏవేళా నీకృప గడు నెక్కుడు గాని
భావింప నన్నేలితివి బలిమి తెంకాయమీఁదు
చేవదేరు లోపలెల్లా జిగిమించుఁ దీపులు

రేకు: 1680-5 సాళంగం సం: 26-478

పల్లవి: నీకెట్లితవాయనో నే నెరఁగను
ఆకడ నిన్నాడుకోఁగా నరుదాయ నాకు

చ. 1: కొత్తగా వేరొకసతి కొంగు నిన్నుఁ బట్టఁగాను
చిత్తమెల్లా నీరాయ సిగ్గున నాకు
వొత్తి యటమీఁద నీకు నొట్లెల్లాఁ బెట్టగాను
మత్తిలి కోపము రేఁగె మచ్చురాన నాకు

చ. 2: దాయక పాయక నిన్నుఁ దగవుకుఁ బిలువఁగా
కాయమెల్లాఁ జెమరించె కాఁకల నాకు
చేయిచాఁచి చేయరాని సేఁతలెల్లాఁ జేయఁగాను
చాయల పంతములెక్కె సముకాన నాకు

చ. 3: అవ్వల నిన్నాకె గూడె అట్టె నన్నుఁ గూడితివి
నవ్వులు సెలవిఁ దేరె నంటున నాకు
దవ్వులనుండే తాను తమకము రేఁచఁగాను
చివ్వన శ్రీవేంకటేశ చిమ్మిరేఁగె నాకు

రేకు: 1680-6 ఆహిరి సం: 26-479

పల్లవి: ఏమిటికి వెరవవు యెంత గట్టువాయువు
బూమె లింత నేరకుంటే పొద్దెట్టు వేఁగీని

చ. 1: సొలసి నిన్ను నేఁ జూచి చొప్పులెల్లా నెత్తితేను
వలపు చల్లితినంటా వడి నవ్వేవు
తలపోసి నీచేతలు తారుకాణ చేసితేను
నలి నిజమాడేనంటా నన్ను మెచ్చేవు

చ. 2: శిరసు ముట్టఁగా, నేను చేత నిన్నుఁ దోసితేను
సరసమాడితినంటా చనవిచ్చేవు
తెరవేసుకొని వొంటిఁ దేఁకువతో నుండితేను
సరవిఁ గూడఁ బిలిచే సన్న లనేవు

చ. 3: దగ్గరఁ గూచుండి నేను తలవంచుకుండితేను
సిగ్గువడివున్నదంటాఁ జెప్పుకొనేవు
యెగ్గులేక శ్రీవేంకటేశ కాఁగిలించుకొంటే
బెగ్గిల నీరతుల మెప్పించితి ననేవు

రేకు: 1681-1 ముఖారి సం: 26-480

పల్లవి: వింత వింత రుచులనె వేడుక వుట్టించవలె
ఇంతులనుఁ దోడుచూడు మిందు నొక్కొక్కతెనె

చ. 1: జాడల నీవెంత నాతో సరసము నెరపినా
ఆడినమాటలు సారె నాడరాదు
వాడికె రతులకును వడి నప్పణ ఇచ్చితే
కూడినట్లనె మరి కూడరాదు

చ. 2: సేసవెట్టి నీ వెన్నిసేవలు సేయించుకొన్నా
చేసిన సేఁతలు మరి సేయరాదు
మోసలేక నీవు మర్మములు గిలిగించితేను
రాసి నవ్వినట్టు మరి రతి నవ్వరాదు

చ. 3: యేచిన చక్కఁదనాన యెదుట నీ వుండితేను
చూచినట్లనె మరి చూడరాదు
చేచేత శ్రీవేంకటేశ చేకొని నన్నేలితివి
లాచి మెచ్చినట్లా వొల్లఁగె మెచ్చరాదు

రేకు: 1681-2 సాళంగనాట సం: 26-481

పల్లవి: ఊరకుండగానే యేల వొక్కొక్కట గడియించేవు
మేరతో నుండితేనే మెచ్చునిదాననా

చ. 1: వొడయఁడ వందరికి వొకతెఁ జూచి నీవు
నడుమ నవ్వితే నేను నవ్వవచ్చునా
పడఁతినింతే నేను పక్కన వినయముతో
అడఁకువ నుండితేనే అలిగినదాననా

చ. 2: వొనర మోహించి నీవు వొకతెగుణము లిట్టె
కొనియాడితే నేనుఁ గొనియాడేదా
నిను బెండ్లాడినదాన నేను కడు సిగ్గుతోడ
వొనరఁ దలవంచితే కినిసినదాననా

చ. 3: వొక్కటై కాఁగిటఁ గూడి వొకతెకుఁ బ్రియపడి
మొక్కితే నేను నాపెకు మొక్కవలెనా
నిక్కపు శ్రీవేంకటేశ నీవేలినదాన నేను
చొక్కివుంటి నాపైపై నీసున నున్నదాననా

రేకు: 1681-3 బౌళి సం: 26-482

పల్లవి: నీవే అలవైతివా నెయ్యమున నీతనికి
వావులు నే జెప్పితేను వంకలొత్తేవేమే

చ. 1: యిట్టె నాపతిమాటలు యెగ్గులు నేనెంచితేను
వట్టి చక్కట్లు చెప్పవచ్చే విదేమే
దట్టపుఁగాఁకలతోడ తప్ప కాతనిఁ జూచితే
పెట్టేవు మాటుగా జేయి బింకాన నిదేమే

చ. 2: తగిలి యాతనిచేత తారుకాణసేసితేను
బిగిసి లేదని యానవెట్టే విదేమే
నగుతా నాతనిమేను నాట గోర నూఁదితేను
వగచి మందులు వెట్టవచ్చే విదేమే

చ. 3: కందువ నాతనిమేను కాగిలించి కూడితేను
సందడి నలపార విసరే విదేమే
యిందులో శ్రీవేంకటేశుఁ డీతని నే నవ్వితే
అందుకోలు జాణతనా లాడి మెచ్చే విదేమే

రేకు: 1681-4 కాంబోది సం: 26-483

పల్లవి: ఏమిటికె చెలులాల యెంత నన్ను సోదించేరే
ప్రేమపునారమణుని బెడఁ బాయనోపనే

చ. 1: మొగమాట గలిగితే మోవ నెంతాడినాను
నగవులే సెలవి నున్నతి మించును
తగవే నడిపేనంటే తప్పుఁదోవకుఁ దీసితే
వొగరై తోఁచుఁగాని వొడఁబాటై వుండదు

చ. 2: చుట్టరికమైనచోట సొట్లెంత మోపినాను
మట్టులేని సంతోషమే మతిఁ దోచును
అట్టె తాలిమి గలితే ఆయములు నాటించినా
బుట్టుకే లోనౌఁగాని గుణము విడువదు

చ. 3: కూడివున్నవేళను గురుతు లెన్ని చేసినా
వేడుకలైవుండుఁగాని వెత రేఁగదు
యీడనె శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు
జోడుగూడే వుండుగాని సూటిదప్ప దెపుడు

రేకు: 1681-5 వరాళి సం: 26-484

పల్లవి: పాయపువాఁ డతఁడూ పడుచుఁదనము నీది
చేయరాని వినయాలఁ జెలఁగఁగాను

చ. 1: సిగ్గులు వడుదురటే చెలువుఁడు మాటాడితే
వొగ్గి తాఁ జేతికిలోనై వున్నాఁడు నీకు
వెగ్గళింతురటవే వెస నిట్టె మోహించి
తగ్గులేనిరతులకు దమకించఁగాను

చ. 2: శిరసువంతురటే చెనకి యీతఁడంటితే
సొరిది నిట్టె యెదురుచూచీ నీకు
గరిసింతురటవే కాఁకల నాతఁడు వొంది
పొరిఁబొరి నీ గుణాలు పొగడఁగాను

చ. 3: చిన్నబోఇవుందురటే చేరి యీతఁడు గూడఁగా
కన్నులఁ జూచినంతనే కరఁగీ నీకు
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నిన్నింతలో
పన్ని పెనఁగుదురటె బాఁతిపడఁగాను

రేకు: 1681-6 పాడి సం: 26-485

పల్లవి: కాంతగాగు ఇంకా మీఁదఁ గనేవు నీవు
చెంత నుండి నే నీకు చెప్పితి నీ సుద్దులు

చ. 1: బలిమిఁ గొసరెనట పంతమాడెనట ఆపె
చెలి నీతో ఆమాట చెప్పదాయనా
చలము సాదించెనట సాటికి బెనఁగెనట
వెలదిసుద్దులు నీవు వినవా ఇంకాను

చ. 2: యెద దట్టుకొనెనట యెమ్మెలల్లాఁ జూపెనట
యిదెల్లా నీ వంపినాపె యెచ్చరించదా
వుదుటున నవ్వెనట వూరకె జంకించెనట
కొదలేకివి దెలుసుకొనవా ఇంకాను

చ. 3: లోనికిఁ దా వచ్చెనట లోలో నిన్నుఁ గూడెనట
తానే నీ దూతిక మూసిదాఁచదాయనా
పూని శ్రీవేంకటేశుఁడ పొందితివి నన్ను నేఁడు
సోనల చంద్రకళలు చూడవా ఇంకాను

రేకు: 1682-1 ముఖారి సం: 26-486

పల్లవి: ఆఁటది చేసినమేలు అది విచారించవైతి
గాఁటానఁ బెనఁగుదురా కాతరానను

చ. 1: సింగారించుకొని యిట్టె చెలి నీ యండకు రాఁగా
ముంగురులంటుదురా మొక్కలానను
సంగతిగా మోవి చూపి చవులు వుట్టించఁగాను
కొంగువట్టి తీతురా గొరబుగాను

చ. 2: పుక్కిటివిడెముతోడ పొలితి నీతో నవ్వఁగా
పక్కనఁ బిసుకుదురా పాలిండ్లు
అక్కరతో నీకు విడె మందియ్యరాఁగాను
తక్కక గిలిగింతురా తత్తరానను

చ. 3: కడు మోహమున నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
బడల నలయింతురా పచ్చదేరను
అడరి శ్రీవేంకటేశ అంగన నిన్నుఁ గూడఁగా
తడవి వేగిరింతురా దప్పిదేరను

రేకు: 1682-2 దేసాళం సం: 26-487

పల్లవి: కూడుదు రారా ఇఁకఁ గొరతలేల
వేడుకలు దైవారీ విడెమైనా నియ్యరా

చ. 1: కద్దురా నీసుద్దులు కడఁగడల వింటిమి
వద్దురా యింతేల మమ్ము వలఁబెట్టేవు
ఇద్దరము వేగినంతా యిటువలె నుండఁగాను
నిద్దుర కన్నులఁ దేరీ నీవు నన్నుఁ జూడరా

చ. 2: మేలురా నీగుణములు మిక్కిలిజాణ నౌదువు
యేలరా నావద్దనుండే యెంతసేసేవు
కేలు రాజసాన నీవు గిలిగించి పట్టితివి
చాలు రాయడిసేసి చన్నులు ముట్టకురా

చ. 3: పోకురా ఇఁకనెక్కడా పొంచి నన్నుఁ గూడితివి
యీకురా పరకాంతల కిట్టి చనవు
చేకూర నన్నేలితివి శ్రీవేంకటేశుఁడ
నీకు రమణి నేనైతి నెయ్యమెల్లాఁ జూపరా

రేకు: 1682-3 బౌళి సం: 26-488

పల్లవి: నీవేల పంకించేవు నీకు నీకే
యీవలఁ బొడిమలు నీ కింకాఁ గట్టేరా

చ. 1: కందువ నిప్పుడు వచ్చి కతలెల్లాఁ జెప్పేవు
అందరు నెఱఁగరా ఆ సుద్దులు
చెంది యాచారలెల్లాఁ జేసేవు నా ముందరను
నింద లెవ్వరైనా నీ మీఁద నాడేరా

చ. 2: నలిరేఁగి యందరిలో నవ్వులెల్లా నవ్వేవు
చెలులకుఁ గొత్తలా నీచేఁతలెల్లాను
చలువలు వుట్టఁ గడు చదువులే చదివేవు
నిలువున నిన్ను నిఁక నేరము లెంచేరా

చ. 3: యీడనే కాఁగిట నించి యింతతో నన్నుఁగూడేవు
వాడవా రెరఁగవా నీ వలపెల్లాను
పాడిపంతాలు చెప్పేవు పక్కన శ్రీవేంకటేశ
యేడనైనాఁ గల్లతనా లెంచేరా నీమీఁదను

రేకు: 1682-4 శంకరాభరణం సం: 26-489

పల్లవి: ఆలిమగనికి నౌఁగాము లేడవి
మేలుగలిగితే మెచ్చుటగాక

చ. 1: జంకించనేఁటికి సారెకు నే నీ-
వంకలాడి కడు వలచితిని
మంకు గొల్లెతలు మందనుండి రాఁగా
కొంకక కూడితేఁ గూడితిగాక

చ. 2: అలుగనేఁటికి యప్పుడే నే నీ-
పలుకులకే భ్రమసితి
బలువ నీతల పదారువేపుర
కలిమి గైకొంటేఁ గైకొంటిగాక

చ. 3: సోదించనేఁటికి చొక్కి నిన్నుఁ గూడి
సాదించి నీమోవి చవిగొంటి
యీదెస శ్రీవేంకటేశ నీ వెవ్వరి
బోదించి పొందినాఁ బొందుదుగాక

రేకు: 1682-5 సాళంగనాట సం: 26-490

పల్లవి: కానీలేవే నీ విందరికెంటే నెక్కుడా
నానఁబెట్టి సరిఁగాఁగ నవ్వు నవ్వవలెనా

చ. 1: వంతులకే పెనఁగేవు వాసులకే తిరిగేవు
యింతటిలో నీకు నేడు యెమ్మె వచ్చెనా
కాంతలెల్లా వూడిగాలు కడుఁ బతికిఁ జేయఁగా
దొంతరై నీ వితనితొడ యెక్కవలెనా

చ. 2: మురిపెమే చూపేవు ముద్దులే గునిసేవు
దొరతనములే నీకు తొట్టుకొనెనా
వరుసకు నాడువారు వచ్చి నిలుచుండఁగాను
వొరసి యీతనిమీఁద నూఁదుకొనవెలనా

చ. 3: కప్పురమే యడిగేవు కాఁగిటనే కూడేవు
దప్పితో రతులు మీకుఁ దడఁబడెనా
ఇప్పెడె శ్రీవేంకటేశుఁ డింతతోనె నన్ను నేలె
అప్పుడే యీతనివురమందు నుండవలెనా

రేకు: 1682-6 వరాళి సం: 26-491

పల్లవి: ఇరుమొనసూదివలె నెందుకౌను నీమనసు
వొరసి నట్టనడుమ నున్నాఁడవు గాక

చ. 1: చెనకి గోరనూఁదుచు చెప్పినదె నీతోను
చనవులు మనవులు సారెకు నాపె
మన సక్కఁడనే కాక మామీఁద నున్నదా నీకు
చొనపి కన్నుల మమ్ముఁ జూచేవు గాక

చ. 2: సందడిఁ జన్నుల నొత్తి చవులు చూపీ నీతోను
పొందులును విందులును బోరున నాపె
కందువ లాడనేకాక కడునాస ఇందున్నదా
సందు సుడివలపులు చల్లేవు గాక

చ. 3: కూడి కాఁగిటిలోననే కూడపెట్టీ నీతోను
వాడికలు వేడుకలు వరుస నాపె
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వోడక రతుల నింకా నొరసేవు గాక

రేకు: 1683-1 లలిత సం: 26-492

పల్లవి: ఎవ్వరుండుటా నెఱఁగ వెంత సిగ్గువిడిచేవు
దవ్వు చెరువల నెంత తగవురా నీది

చ. 1: నలిరేఁగి వూరకైనా నవ్వులు నవ్వ వచ్చేవు
చెలఁగి యెవ్వతె నీకుఁ జెప్పెరా యిది
చలమున నీచేతులు సారెకుఁ బైవేసేవు
తలపోయ నెటువంటితమిరా నీది

చ. 2: కమ్మరఁగమ్మర నిట్టె కాణతాళలే నెరపేవు
నెమ్మది నెవ్వతె యింత నేర్పరా యిది
వుమ్మడి నిందరిలోనే వొడివట్టి పెనఁగేవు
పమ్మినేఁడు యెటువంటి బలుపురా నీది

చ. 3: కలుపుకోలుగ నిట్టె కాఁగిలించి కూడేవు
పొలసి యెవ్వతె యెగపోసెరా నీకు
అలమేలుమంగను నే నవుర శ్రీవేంకటేశుఁడ
మొలచిన దెటువంటి మోహమురా నీది

రేకు: 1683-2 దేవగాంధారి సం: 26-493

పల్లవి: ఎంతటిమోహమో యేమని చెప్పుదు
వింతరతులఁ గడువెలయించేవు

చ. 1: చెలప చెమటలు చెలిపైఁ దొరుగఁగ
వలపులు చల్లేవు వరుఁడవు
మొలకల పులకల మోసులు నాటఁగ
కెలయుచు నిటు కాఁగిట నించేవు

చ. 2: నిట్టూర్పు సురటుల నెలఁతకు విసరుచు
గుట్టున వలపులు గురిసేవు
తెట్టెల మోవులతేనెలు గారఁగ
తొట్టుకొనఁగ విందులు వెట్టేవు

చ. 3: వెలయఁగఁ గాఁగిలి విడిదలసేయుచు
చెలఁగి కాఁపురము సేసేవు
అలమేల్మంగను అదె శ్రీవేంకట -
నిలయుఁడ పొందులు నెరవేర్చేవు

రేకు: 1683-3 సింధురామక్రియ సం: 26-494

పల్లవి: మేలు మేలు నీ సుద్దులు మేనబావా
వోలవేయ కిఁక మాపై నో మేనబావా

చ. 1: బచ్చన మాటలాడి పలుమారు నవ్వఁగాను
మెచ్చితిఁగా నే నిన్ను మేనబావా
లచ్చెనలు మేననించి లావులఁ బెనఁగఁగాను
వొచ్చెము లేదంటిఁగా నీ కోమేనబావా

చ. 2: దట్టమై నావొద్దనె సందడి నీవు సేయఁగాను
మెట్టితిఁగా నీ పాదము మేనబావా
చుట్టమవై నాకు నీ సొమ్ములెల్లాఁ బెట్టఁగాను
వొట్టు లేదంటిఁగా నీ కోమేనబావా

చ. 3: తాలిమితో వెంటవెంటఁ దగిలి నన్నేలితివి
మేలుగా శ్రీవేంకటాద్రిమేనబావా
ఆలసంటాఁ బొగడేవు అలమేలుమంగ నేను
వోలివెట్టితివి నాకు నోమేనబావా

రేకు: 1683-4 శంకరాభరణం సం: 26-495

పల్లవి: ఎగ్గులుగా బట్టు కిఁక నీవూ
అగ్గలిక చెల్లు నాఁటదానికి

చ. 1: కూరిమి గొసరి కొమ్మ నీమీఁదను
సారెకు వలపులు చల్లీ నదె
పేరుకొని యట్టె పిలిచీఁ గమ్మర
మేరతో నగఁదగు మేనదానికి

చ. 2: అంట గాఁగిలించి ఆయాలు సోఁకఁగ
నంటున నీతో నవ్వీ నదె
వెంటవెట్టుకొని పెనఁగీ నింతలో
వెంట రా నమరు యింటిదానికి

చ. 3: అట్టె నిన్నుఁ గూడి యలమేలుమంగ
రట్టుగా నాసలఁ బెట్టీ నదె
గట్టిఁగా శ్రీవేంకటేశుఁడ నీతో
గుట్టు దగు సేసుకొన్నదానికి

రేకు: 1683-5 మాళవిగౌళ సం: 26-496

పల్లవి: ఇంకనైనా వుపదేశమిప్పించుకో యాపెచే
సంకెలేక యిటువలె సటకాఁడవైతవి

చ. 1: వెలలేని మాఁటలెల్లా వేసరక నీవాడఁగ
సొలసి వేరొక్కతెకుఁ జూపీఁ జెలి
నెలకొని యాకెవలె నేరవైతివి మోనము
కలకాలమును నిట్టె కతకారివైతివి

చ. 2: పచ్చిదేర నూరఁగలపనులెల్లా జేయఁగాను
చెచ్చెర నవ్వుల సన్నసేసీఁ జెలి
కొచ్చి నీవు నట్లానే గుట్టున నుండవైతివి
వచ్చి నేడు నీవుఁ గావడివాఁడవైతివి

చ. 3: కన్నచుట్టాలనెల్లాను కాగిలించుకొనఁగాను
మిన్నక యెక్కడనైనా మెచ్చీఁ జెలి
అన్నిటా శ్రీవేంకటేశ యలమేలుమంగ నేను
నన్నుఁ గూడితివి యిట్టె నాటకుఁడవైతివి

రేకు: 1683-6 మంగళకౌసిక సం: 26-497

పల్లవి: ఏమీ ననము నేము యిందుకు నిన్ను
దీమసాన నాపె గుట్టు తెలుసుకోవయ్యా

చ. 1: చెప్పసిగ్గువడే నదె చెలి నీతో మాటలు
అప్పుడే యేకతమున నడుగవయ్యా
తప్పుగాదు మఱఁగున దండనే వుండేముగాని
చప్పుడుసేయ కిద్దరు సందించుకోరయ్యా

చ. 2: నవ్వఁగ లోఁగీ నదె నాతి నీ మొగము చూచి
అవ్వలను వెడ్డువెట్టి అరయవయ్యా
ముప్వంకలాను చెవులు మూసుకవుండేవుగాని
నివ్వటిల్ల నాసుద్దులు నీవు వినవయ్యా

చ. 3: సన్నలే చేసీ నదె సకియ నీకాఁగిటికి
మన్నించి కలసితివి మరుగవయ్యా
యిన్నిటా శ్రీవేంకటేశ యిందే యెనసేముగాని
పన్నిన మీ వలపులు పచారించరయ్యా

రేకు: 1684-1 శంకరాభరణం సం: 26-498

పల్లవి: మాన వెపుడు నీ మతకములు
కానుకలిచ్చుట గరిసించుటలా

చ. 1: మొగము చూచితే మొక్కఁగ వలదా
యెగసక్కెములని యెంచేవు
అగపడి తెలియక అడిగేనింతే
దగవులఁ బెట్టఁగఁ దలఁచితివా

చ. 2: పూరక పిలిచిన నూఁకొనవలదా
కేరడములనుచుఁ గెలసేవు
కారణము దెలిపి కప్పితి నింతే
గారవములే యివి కడు వెంగెములా

చ. 3: మెలుపునఁ గూడిన మెచ్చఁగవలదా
చలములనుచుఁ గడు జరసేవు
యెలమితో శ్రీవేంకటేశ కూడితివి
అలమేల్మంగ నే అలయించితినా

రేకు: 1684-2 ఆహిరినాట సం: 26-499

పల్లవి: అదేల నీవాపెచేత నాడించేవోయి
సరదానఁ దన్ను నేను సాదించితినా

చ. 1: పైపై నిన్నే వెంగెములు పలికి దూరితిఁగాక
ఆపెనేమైనాఁ గోపించి అంటినా నేను
రాపుల నిన్నే కొసరి రాయడించితిఁగాక
చాఁపుచుఁజేతులఁ దన్ను జరసితినా

చ. 2: తివిరి నీ మేనునాఁట దిష్టించి చూచితిఁగాక
సవతెంటాఁ గన్నులను జంకించితినా
పవళించుమని నిన్నే బలిమి సేసితిఁగాక
తవిలి కేరడముతో తన్ను నే నవ్వితినా

చ. 3: చలపట్టి నిన్నుఁ గోరి సన్నలు చేసితిఁగాక
తలకొని చెల్లెలంటాఁ దడవితినా
నెలవై శ్రీవేంకటేశ నిన్ను నే మెచ్చితిఁగాక
అలమేలుమంగను నే నట్టె తన్నెంచితినా

రేకు: 1684-3 దేసాళం సం: 26-500

పల్లవి: సేసవెట్టినాపె యేమిసేసినాఁ జెల్లు
రాసికెక్కి నీ సుద్దులు రావయ్య యింటికి

చ. 1: తమకించి పైకొంటేఁ దప్పులు వెదకరాదు
సముకానఁ గొసరితే జరయరాదు
నెమకి గోరనూఁదితే నేరము లెంచఁగరాదు
ప్రమదానఁ జే చాఁచితే పంతమాడరాదు

చ. 2: సొలసి కొంగువట్టితే సూడుకు దగులరాదు
తిలకించి చూచితేను దీఁకొనరాదు
వలచి తిట్టుదిట్టితే వానికిఁ బెనఁగరాదు
కలయుచు నవ్వితేను కాఁతాళించరాదు

చ. 3: రతుల నలఇంచితే రాఁపులు సేయఁగరాదు
సతమై పంగించితేను సాదించరాదు
ఇతవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అతివ లేమనినాను అవుఁగా దనరాదు

రేకు: 1684-4 ఆహిరినాట సం: 26-501

పల్లవి: నీవు నేర్పితివో నెలఁతగుణములో
వేవేలు గనుఁగొని వెరగయ్యీని

చ. 1: సాములు సేయుచు సరసపు మాటల
ప్రేమ మిదెవ్వతె పెంచీని
దోమటి దొడికిన తొయ్యలి యుండఁగ
యీమగు వేఁటికె యిరవుకొనీని

చ. 2: కానుక లొసఁగుచు కమ్మరఁ గమ్మర
తానెవ్వ రిచటఁ దగలీని
తోనె పెండ్లి కూఁతురు నిలుచుండఁగ
ఆనుక నీకేల ఆసపడీని

చ. 3: కలకలనవ్వుచు గడుఁ బానుపుపై
చెలుముల తానేల చేసీని
అలమేలుమంగ నీ కదె వురమెక్కఁగ
బలు శ్రీవేంకటపతి యిది యొకతె

రేకు: 1684-5 నాగవరాళి సం: 26-502

పల్లవి: ఇందుకుఁగానే యింతి యింతసేసెను
అందుకులోనైనఁగాని ఆయములు నాఁటవు

చ. 1: వలపెంతగలిగినా వరునితోడుత సతి
చలపట్టి పెనఁగక చవిగాదు
సొలసి పాయఁగరానిచుట్టరికమైనాను
పిలిపించుకొన్నఁగాని ప్రియము లమరవు

చ. 2: చన వెంతగలిగినా సారెకు మాఁటలాడి
సొనిపి దూరక రతి సూటిగాదు
ననిచి ఎట్టుండినాను నవ్వుతాను
కొనగోర చెనకినఁగాని సొంపు చేకూడదు

చ. 3: తగు లెంతగలిగినా తమకము పెడరేఁచి
జగడించి కలయక చక్కఁగాదు
మగువ గూడితి విట్టె మన్నించి శ్రీవేంకటేశ
అగపడియున్నఁగాని ఆసలు దైవారపు

రేకు: 1684-6 హిజ్జిజి సం: 26-503

పల్లవి: తెలుసుకొందు మన్నియుఁ దెల్లమిగాను
కొలచి పెండ్లిపీఁటపైఁ గూచుండుమనవే

చ. 1: మనసులోఁ గలమేలు మాటలలోఁ గానరాదా
అననీవే నీవేల వద్దనే విపుడు
ననిచినతమకము నవ్వులలోఁ గానవచ్చీ
అనుమానా లేఁకనేల అండకు రమ్మనవే

చ. 2: జిగిగొన్నమన్ననలు చేఁతలలోఁ గానరాదా
మొగము చూడనియ్యవే మొక్కలమేల
మిగులాఁ గాఁక గలితే మేనిమీఁద గానవచ్చీ
వెగటు లేఁకనేఁటికి విడియ మిమ్మనవే

చ. 3: చొక్కపు వేడుకలెల్లా చూపులలోఁ గానరాదా
నిక్కి తెరదియ్యనీవే నేరమెంచక
యిక్కువ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
మిక్కిలి నివ్వెరగేల మేల మాడు మనవే

రేకు: 1685-1 రామక్రియ సం: 26-504

పల్లవి: అన్నిటా పంతగత్తెవైతేనేమి
సన్నలనే మోవిచూపి చవిగొనఁ గదవే

చ. 1: చలము లేమిటికే సాదించనేమిటికే
వలపులఁ బెనగొన్నవనితవు
పిలిచీ నిన్నతఁడు ప్రియముచెప్పీనతఁడు
మలసి యలుకలెల్లా మానవే యింతటను

చ. 2: పంతములాడఁగనేలే బలిమిచూపఁగనేలే
చెంతలఁ బెండ్లాడిన చెలియవు
కంతుని గురుఁడతఁ డక్కరైన పతి యతఁడు
చింతలెల్లఁ దీర సేవసేయవే యింతటను

చ. 3: కేరలించే విదేమే గేలిసేసేవేమే
మరిగినయలమేలుమంగవు నీవు
సిరిగలవాఁ డతఁడు శ్రీవేంకటేశుఁ డతఁడు
నిరతిఁ గూడితి వింపు నించవే యింతటను

రేకు: 1685-2 తెలుఁగుఁగాంబోది సం: 26-505

పల్లవి: ఇంక నీ మనసు యెనసె నావలపు
జంకించినంతనే జల్లనె మేను

చ. 1: తలఁపులోన నినుఁ దలఁచినమాత్రన
పులకల మొలకలు పొదలనివె
పిలిచి పేరుకొని ప్రియపడినంతనె
నిలువునఁ జెమటలు నిండె నివె

చ. 2: గుఱిగా నిను గనుఁగొనినయంతనె
గిఱిగొన నూర్పులు కెరలె నివె
చిఱునవ్వులు గడుఁజిందినంతనె
వెఱగులు కన్నుల వెలసె నివె

చ. 3: కైవశమై నినుఁ గలసినంతనే
భావపుముదములు బలిసె నిదె
శ్రీవేంకటేశ నే జిగి నలమేల్మంగ-
సేవల నారతు నెసగె నివె

రేకు: 1685-3 నాదరామక్రియ సం: 26-506

పల్లవి: తెలిసితి నీగుణాలు తేటతెల్లమిగాను
చెలరేఁగి నాకేల చెప్పేవు నీవు

చ. 1: తలవంపులే చెప్పీ దగ నీసుద్దులెల్లా
పలికేయానతి చెప్పీ బలునిందలు
లలి మైకాఁకలె చెప్పీ లాగుల నీ విరహము
పలుమారు నన్నే లొడఁబరచేవు నీవు

చ. 2: సెలవినవ్వులే చెప్పీ చిత్తములో యానందము
పులక జొంపాలే చెప్పీ బొందులెల్లాను
యెలమి శ్రీవేంకటేశ యిటు నిన్ను నేలితివి
సొలపులేఁటికి తోడుచూపేవు నీవు

రేకు: 1685-4 తెలుగుగాంబోది సం: 26-507
పల్లవి: ఓరువఁగదవే వొకయించుకవడి
నీ రమణుఁడు మన్నించీ నిపుడు
చ. 1: వెన్నెలలే పో వేసవి యెండలు
వున్నతి భువి విరహులకెల్లా
పన్నీరే వెంబాల వెల్లువలు
కన్నులెదుట నివి కాలమహిమలు
చ. 2: వడిఁ జిగురులెపో వజ్రాయుధములు
బడివాసినదంపతులకును
సుడిగొనుపుప్పొడి చొక్కుమందు లివి
కడకమెరసె నివె కాలమహిమలు
చ. 3: మొనసిన విరులే పో. మోహనాస్త్రములు
చనవున నలిగిన జాణలకు
యెనసితి శ్రీవేంకటేశ నలమేల్మంగ
కనుఁగొన నింపాయ కాలమహిమలు

రేకు: 1685-5 ఛాయానాట సం: 26-508

పల్లవి: ఎంతవోరుపో నీది యేమి చెప్పేది
పంతాన జంకించితేను పచ్చినవ్వు ముంచెను

చ. 1: చండిపెట్టి మాఁటలాడి సతి నిన్ను దూరఁగాను
నిండుకొనెఁ బులకలు నీ మేనను
కొండలవంటి చన్నుగుబ్బలు నిన్నొత్తగాను
అండనే నీమనసెల్లా నప్పుడే కరఁగెను

చ. 2: మునుకొని బలిమి నీ మోవి పిప్పి సేసితేను
తనివోని చెమటలు దైవారెను
పెనఁగి కరములను బిగ్గెఁ గాఁగిలించఁగాను
చెనకుల వలపులు చిమ్మిరేఁగె మీకును

చ. 3: కడలేని రతులను కదిమి నిన్నుఁ గూడఁగా
జడిగొని సంతోసాలు జాజుకొనెను
అడరి శ్రీవేంకటేశ అంగన నిన్నుఁ గూడితే
కడు నీమోమునఁ జంద్ర కళలెల్లాఁ దేరెను

రేకు: 1685-6 పాడి సం: 26-509

పల్లవి: అందరము నందరమె అవుఁగాదనఁగలమా
పొందులు గావించ నేర్చు పుష్పాస్త్రు డొకఁడె

చ. 1: బలిమికాడవు నీవు పాయపుదాన నేను
మెలుపురాలవంటివి మేఁటి చన్నులు
తలపోయ నిఁక మంచితనము లెట్టబ్బునో
వలరాజొక్కఁడె నేర్చు వైపులుగావింపను

చ. 2: నాములెక్కు నీ నవ్వులు నాతలము బెట్టదము
గామిడి నా చూపులు కడు గబ్బులు
యేమని పొసఁగించే దెవ్వరించు కోపుదురు
కాముఁడొక్కఁడె నేర్చు కైవసము సేయను

చ. 3: శ్రీవేంకటపతివి చేకొంటివి నీ దేవిని
హివిరి నావలపిది వలవంటిది
చేవదేరేరతులను చిక్కుదేరే దేగతినో
భావజుఁడొక్కఁడే నేర్చు పంత మీడేరించను

రేకు: 1686-1 శంకరాభరణం సం: 26-510

పల్లవి: తరుణి చిన్నగన తలవంచీ నిదె
సరసములాడుచు చనవీరాదా

చ. 1: వలచనియెలుఁగునఁ బాడీఁ జెలి నిను
వెలనుండి నీవు వినవయ్యా
చెలఁగి నిన్నుఁగని సిగ్గువడీ నిదె
నిలిచి కాఁగిటను నించఁగదయ్యా

చ. 2: వరుసఁ గరంబుల వ్రాసీ నీపేరు
సరుసఁ గూర్చుకొని చదువవయ్యా
గరిమ నందుకే మరఁగున నవ్వీ
తెల నీ విప్పుడే తియ్యఁగదయ్యా

చ. 3: సొలయుచునుఁ దోఁగి చూచీ నీ దిక్కు
జల జల సేసలు చల్లవయ్యా
కలసెను శ్రీవేంకటేశ నిన్నికె
యెలమి నీ కెమ్మోవి యియ్యఁగదయ్యా

రేకు: 1686-2 హిందోళవసంతం సం: 26-511

పల్లవి: మంచిదె నీ జన్మము మగువలలో నెల్లా
పెంచకె నీ కన్నులు పెద్దలాయఁగదవే

చ. 1: మొక మిచ్చమాఁటలే మునుకొని ఆడియాడి
వెకలివైతివిగదె వెలఁదీ
విక విక నవ్వి నీవు విభునిఁ జిమ్మిరేఁచఁగా
చికురము జారి కడుఁజీఁకటాయఁగదవే

చ. 2: పుబ్బున నాతని దిక్కు పుడివోక చూచి చూచి
గబ్బివైతివి గదవే కలికీ
నిబ్బరపు జవ్వనాన నీ వితని నొత్తఁగా నీ-
గుబ్బలు పోలించ పూవుగుత్తులాయఁగదవే

చ. 3: వావులు చెప్పుచు నీవు వరుసఁ గాఁగిట నించి
దేవులైతి గదె తెఱవ
యీవేళ శ్రీవేంకటేశు డీతఁ డిట్టె నిన్నుఁగూడె
వేవేళకు నీ మోవి విందులాయఁగదవే

రేకు: 1686-3 బౌళిరామక్రియ సం: 26-512

పల్లవి: గరిమ మీవేళ మీరు కాచుకున్నారు
యిరవాయ వలపులు యేమిసేతురయ్యా

చ. 1: పడఁతి యిచ్చకురాలు పైకొనీ నీకెప్పుడును
కడలేని నీవైతే కాతరీఁడవు
బడి బడి నిద్దరును పాయరాని బందుగులు
యెడపుల సతులెల్లా నేమిసేతురయ్యా

చ. 2: నెలఁత నీకు మేలుది నేమముతో నున్నది
నలి నీవైతే ప్రాణనాథఁ
పొలసి మీకిద్దరికి పోరాని నేస్తాలు
యెలమి సంగడికాంత లేమిసేతురయ్యా

చ. 3: శ్రీమహాలక్ష్మి యీకె జిగి నీవురమెక్కెను
నేనుపు శ్రీవేంకటేశ నీవు పతివి
ప్రేమాన మీ కిద్దరికి పెండ్లిసోబనము
యీ మగువలునుఁ గూడి రేమిసేతురయ్యా

రేకు: 1686-4 నాదరామక్రియ సం: 26-513

పల్లవి: ఇదివో రమణుఁడ యెమ్మెలకు
సుదతి వేఁడుకొనీ సొమ్ములకు

చ. 1: వెలఁది నిన్నుఁగని వేడుకమాటల
వలపుల చల్లీ వాడికెకు
తొలుకరిమెఱుఁగులు తొలఁకేటి చూపుల
సొలపుల నించీ సూటులకు

చ. 2: కాంత నీ యెదుట కందువ నవ్వుల
వంతులు వెట్టీ వాసులకు
వింత బాగులను వేడుక చెనకుల
పంతము చూపీ బలుములకు

చ. 3: వనిత నీ కాఁగిట వట్రువ చన్నుల-
మొన లటు చూపీ ముద్దులకు
యెనయుచు శ్రీవేంకటేశ నిను రతుల
వినయము చేసి విందులకు

రేకు: 1686-5 దేవగాంధారి సం: 26-514

పల్లవి: వద్దనేమా నిన్ను నేము వట్టిగజ రీడనేల
తిద్దవదు నీగుణాలు తెలుసుకోరాదా

చ. 1: తెలువ కానుకంపగాఁ దెచ్చిన చెలుల మింతె
అటిముటి జాణతనా లాడనేఁటికి
తఱఁగు మొఱఁగులేల దవ్వుగా దాపెకు నీకు
పిటిదియ్యకున్నదిదె పెనఁగఁగరాదా

చ. 2: చెలిమారు వూడిగాలు సేయఁగవచ్చితి మింతె
బలిమితో మాకొంగు పట్టనేఁటికి
కలగంప సటలేల కాచుకున్నదాకె నీకు
పలికి యాపె వొడఁబరచఁగరాదా

చ. 3: పడఁతివద్దికి నిన్ను బట్టి తీసితి నింతె
యెడచొచ్చి మమ్ము గూడ నింతయేఁటికి
కడఁగి శ్రీవేంకటేశ కలసితి వాకె నిట్టె
జడియకుండా మోవి లంచము లియ్యరాదా

రేకు: 1686-6 ముఖారి సం: 26-515

పల్లవి: ఇంచుకించుక వింటిని యీడా నాడా నాడుకోఁగా
కొంచించి నాతోఁ బలుకఁ గొంకేవు నీవు

చ. 1: తత్తరించి లోలోనే తలపోయనేమిటికి
చిత్తములోఁ గలమాట చెప్పరాదా
గుత్తపు గుబ్బల నిన్ను కోమలి నాట నొత్తనో
కొత్తగాఁగా సిగ్గువడి కొంకేవు నీవు

చ. 2: దంటవై దీమసమున దాఁచుకొననేమిటికి
నంటున వెల్లవిరిగా నవ్వరాదా
బంట పంతపురతుల భామ నిన్నోడించెనో
గొంటవై పచారించక కొంకేవు నీవు

చ. 3: తాటించి పరాకుసేసి తలవంచనేమిటికి
సూటిగా నా మో మిట్టె చూడరాదా
యీటున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కూటమి నాకెఁ గూడెనో కొంకేవు నీవు

రేకు: 1687-1 గౌళ సం: 26-516

పల్లవి: నీవేల కాఁతాళించి నెలఁతనుఁ తిట్టేవు
వోవరిలో సిగ్గువడవొద్దా యీపెకును

చ. 1: కొప్పుదువ్వుకొనఁగాను కోమలిఁ జూచి నీవు
చిప్పిలఁగ వెరగంది చెమరించేవు
గొప్పయైన పయ్యెదలో కుచములు గానరాఁగా
వొప్పుగా సిగ్గులు వడవొద్దా యీకెకును

చ. 2: చీర గట్టుకొనఁగాను చెలియవద్దికి వచ్చి
వూరకే చొక్కుచు నిట్టూర్పు వుచ్చేవు
తోరమైన మెఱుఁగారుతొడలెల్లా గానరాఁగా
వోరుపుతో సిగ్గుపడవొద్దా యీపెకును

చ. 3: పఱుపుపైఁ బండుండఁగా పక్క నీవూఁ బవళించి
అఱిముఱి రతిఁగూడి యలసేవు
మఱియు శ్రీవేంకటేశ మర్మములు గానరాఁగా
వొఱపుతో సిగ్గువడవొద్దా యీపెకును

రేకు: 1687-2 దేశాక్షి సం: 26-517

పల్లవి: ఏల వూరకుందానవు ఇద్దరముఁ జూచేము
మూలల నొదుగునేల మొక్కవే నీ పతికి

చ. 1: చెంగావిచీర గట్టి చెమటలు గారఁగాను
అంగమలయ వచ్చితి వద్దమరేయి
సంగతి గొలువున్నాఁడు సవరాజ్యమేలుదువు
ముంగిమురువులచేత మొక్కవే నీ పతికి

చ. 2: నించినయసోదముతో నిద్దుర గంటంబెట్టక
మంచమెక్కేవు కాదారి మాదారి పొద్దు
మించి మోవితేనే నీకు మీఁదెత్తుకొనున్నాఁడు
ముంచి కోలుదువుగాని మొక్కవే నీ పతికి

చ. 3: సరసపురతులను సాములెల్లా జేయుచును
విరతిఁ గాఁగిలించేవు నిశివేళను
అరిది శ్రీవేంకటేశుఁడట్టె మమ్మెల్లా నేలె
మురిపె మేమిటి కిఁక మొక్కవే నీపతికి

రేకు: 1687-3 శంకరాభరణం సం: 26-518

పల్లవి: వినయమేమేలు విట్టువీగుకంటె
పెనుతమకాలు బేలవైతివి

చ. 1: చెలరేఁగి నీకు సేవలెల్లాఁ జేసి
జలజాక్షి నిన్ను సాదించెను
పలుకుఁబంతము పడఁతి కీడేరె
బలిమికాఁడవై భ్రమసితివి

చ. 2: చెంతనుండి యీకె సెలవుల నవ్వి
కాంత నీ మనసు కరఁచెను
శాంతముననే సకియ గెలిచె
వింత మదమున విరహివయితి

చ. 3: చెలిమితో గూడి శ్రీవేంకటేశ ని-
న్నలమేలుమంగ వలపించెను
చలువతోడనే సతి పురమెక్కె
తలపుల నాకు దక్కితివి

రేకు: 1687-4 దేసాళం సం: 26-519

పల్లవి: మేలు మేలు అన్నిటాను మెచ్చితి నిన్ను
నాలితో నూరకుండితే నవ్వినంతే ఫలము

చ. 1: నగుతానే వచ్చి నీవు నాకు నాపెకును నేడు
తగవులు చెప్పగానే తనిసితిని
యెగసక్కేలే లాడేను యేమి వచ్చీ నిందువంక
మొగము చూచితేను మొక్కినంతే ఫలము

చ. 2: సమ్మతించి నిద్దరికి సరికి బేసికి నీవు
నమ్మికలియ్యగానే ఆనందించితిని
కమ్మటినేలదూరేను కానవచ్చినపనికి
కమ్మి నావద్ద నుంటేనే కైకొన్నంత ఫలము

చ. 3: వొట్టుక పానుపుమీఁద వొకరొకరిఁ దెలిపి
యిట్టె కాఁగిలించితేనే యిరవైతిని
నెట్టన శ్రీవేంకటేశ, నెమ్మది మమ్మేలితివి
అట్టె సేసచల్లితే పెండ్లాడినంతే ఫలము

రేకు: 1687-5 ఆహిరినాట సం: 26-520

పల్లవి: చెలులాల యేమి బుద్ధిచెప్పేరే నాకు
పిలుచుకరాఁగదరే ప్రియుని నిక్కడికి

చ. 1: తలఁపు లోలోననే దాఁచవచ్చుఁగాక మరి
వలపు దాఁచవచ్చునా వడి నెందైనా
చల మెప్పుడైనాను సాదించవచ్చుగాక
వలరాజు సాదించవచ్చునా పుడమిని

చ. 2: వన్నె లెమ్మెలకుఁ జూపవచ్చుంగాక తొడిఁబడ
చన్నులు చూపవచ్చునా సబలోనను
పన్నిన పంతమె కడుం బచారించవచ్చుఁగాక
సన్న దమకము పచారించవచ్చునా

చ. 3: వేడుకతో గొలువులో విడె మియ్యవచ్చుఁగాక
యేడనైనా మోవితేనె లియ్యవచ్చునా
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్నునేఁడు
కూడుమనవచ్చుఁగాక కొంచుమనవచ్చునా

రేకు: 1687-6 బౌళి సం: 26-521

పల్లవి: మగవాఁ డెటుండినా నమరుఁగాక
తగవుదప్పవచ్చునా తరుణులకు

చ. 1: కొలదితో కూరిములు గొసరుట యింతేకాక
బలిమిసేయుచు నిన్నుఁ బట్టవచ్చునా
వొలసి నొల్లములైనా వొద్దనే వుండుట గాక
తలఁగ వచ్చునా మరి తరుణులకు

చ. 2: వొట్టినమోహముతోడ నొడఁబరచుట గాక
దిట్టతనము నిన్ను దిట్టవచ్చునా
యెట్టు సేసినా మరి యిచ్చకమాడుటగాక
దట్టించి మీరవచ్చునా తరుణులకు

చ. 3: మొక్కుచుఁ బ్రియముతోడ ముందర నుండుటగాక
వెక్కసమై నీపై తప్పువేయవచ్చునా
యిక్కువతో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
తక్కి యలుగవచ్చునా తరుణులకు

రేకు: 1688-1 శ్రీరాగం సం: 26-522
పల్లవి: ఎట్టు నమ్మించవచ్చునే ఇప్పుడు నిన్ను
చుట్టి చుట్టి రమణుని సొలయవచ్చేవు
చ. 1: ముసుఁగు దెరచి నీమో మిత్రఁడు చూడఁగాను
కొసరే విదేమిటికే కొచ్చి కొచ్చి
యెసఁగి పానుపు మీఁద నిందాఁకా నిద్దిరించితే
పొసఁగ రతులయలపులని యాడేవు
చ. 2: మలఁగుపై నొరగుచు మాటలు నీతో నాడితే
బులియుచుఁ జూచేవేమే పొంచి పొంచి
కొలువున నిందాఁక కూచుండి వచ్చితేను
పొలసి యెవ్వతోచింతఁ బొరలీ ననేవు
చ. 3: కడనుండేతెంచి నిన్నుఁగాఁగిలించి కూడితేను
మెడయెత్తి నవ్వేవేమే మెచ్చి మెచ్చి
యెడయక శ్రీవేంకటేశుఁ డిందాఁకా వచ్చితే
పడఁతి దొరకకుంటే పైకొనె ననేవు

రేకు: 1688-2 పాడి సం: 26-523

పల్లవి: నవ్వేవారి నెఱఁగవు నడుమ నిన్ను
రవ్వచేసి యింతేసి రాజసము చూపేమా

చ. 1: వాసులకే వచ్చేవు వంతులకే పెనఁగేవు
సేసవెట్టితినంటావే చెలఁగేవు
నీసరివారమేకామా నేమెల్లా నాతనికి
ఆ సుద్దు లందరితోడా నాడుకోనేమా

చ. 2: దగ్గరఁ గూచుండేవు దంటమాట లాడేవు
యెగ్గు సిగ్గులు నెంచక యెదరించేవు
కగ్గని సవతులముకామా నీకు నేఁడు
వెగ్గళించి పంతములు వెదచల్లేమా

చ. 3: చేవమీరఁ జూచేవు చిరునవ్వు నవ్వేవు
కావరించీతనిఁ గూడి కడు మించేవు
శ్రీవేంకటేశుఁ డీతఁడు చెనకుచు మమ్ము నేలె
యీవేళ మేనరికాన యెమ్మె చూపేమా

రేకు: 1688-3 ఆహిరి సం: 26-524

పల్లవి: ఆయనాయ నీజాడల కడ్డాలాడేనా
రాయడించ కిఁకఁ గాతరాలేల యియ్యెడల

చ. 1: కలికితనాల లేనికత గడియించనేల
కలసినదాఁకా నెక్కడిసటలే
లలి నింత చాలదా నీ లాగరిచేఁతెల్లాఁ గంటి
కల కల నగక ఇక్కడికి రారాదా

చ. 2: జగడా లదేలే నీ చక్కఁదనాలఁ జాటక
యెగ సక్కేలింతటనే హెచ్చె ననేరా
అగడాయఁ గటకటా ఆడానీడా నీ యాస
తెగనాడఁజెల్ల దిఁక తెరదియ్యరాదా

చ. 3: సరసాన సారెసారె చల్లనికాఁకలె
గరగరఁగా తరగరి తనాలా
ఆరసి శ్రీవేంకటేశ అట్టె నన్నేలితివి
కరకరి యేల చక్కటి నంటరాదా

రేకు: 1688-4 సౌరాష్ట్రం సం: 26-525

పల్లవి: మనసుకు మనసే మరి సాక్షి
తనివోని తమక మింతటా రాసులాయను

చ. 1: కల గని చెలితోను కామిని యాడుకొనఁగా
కళలు మోమునఁనెల్లాఁ గడు నిండెను
యెలమి నాకెను నీవు యేమిసేసితివోకాని
పలుకరాక ముదము పచ్చిదేరె నదివో

చ. 2: తనతలఁపులోరతి దండవారితోఁ జెప్పఁగ
తనువునఁ బులకలు దట్టమాయను
పొనుఁగనిమీలోని భోగము లెటువంటివో
పెనఁగకే వలపులు పెనురాఁపు లాయను

చ. 3: నిన్నుఁ జూచి మంతనాలు నెఁలతలతో నాడఁగ
చిన్ని నవ్వు సెలవులఁ జిందఁ జొచ్చెను
ఇన్నిటా శ్రీవేంకటేశ యీకె నెంత గూడితివో
యెన్నరాకె నేరుపులు ఇటు వహి కెక్కెను

రేకు: 1688-5 కాంబోది సం: 26-526

పల్లవి: ఏఁటికి వేఁగిరపడే విప్పుడే నీవు
సూటిగా నిద్దరిదిక్కుఁ జూడఁగరాదా

చ. 1: వెలయఁగ నే వెనక విన్నవించేఁగాని నీకు
చెలరేఁగి యాపెమాట చెప్పనీరాదా
తలకొని మరి నీవు దగవు దిద్దేవుగాని
వెలుచుక సుద్దులెలా వినరాదా

చ. 2: సిగ్గరిదానను మరి సేవలెల్లాఁ జేసేఁగాని
యెగ్గులే సంగతులెల్లాఁ దెలుసుకొనేవుగాని
దిగ్గన సంగతులెల్లాఁ దేలుసుకొనేవుగాని
అగ్గమై మా కోరికె లడుగరాదా

చ. 3: కూడితి శ్రీవేంకటేశ గురుతయ్యేఁగాని నేను
ఆడ నాపెఁగూడి గోర నదుమరాదా
జాడతో మాలో మమ్ము సంతము సేసేవుగాని
పాడిపంతా లొండొరులఁ బచారించరాదా

రేకు: 1688-6 బౌళి సం: 26-527

పల్లవి: ఇంతటిది గలిగితే నీడేరు వలపులు
వింతతనము గానిదే వెస ఘనురాలు

చ. 1: వొగ్గి రమణుఁడు తన వొడివట్టి తీసినాను
సిగ్గుతోడ నుండినదే చెలియ
కగ్గులేక యాతఁడే కాతరించి చెనకితే
అగ్గమై వోరిచినదే యన్నిటా నేరుపరి

చ. 2: కూరిమితోడుతఁ బతి కొంగువట్టి పెనఁగితే
మేరలు మీరనిదే మెలుఁత
కోరి మర్మములెల్లా కొనగోర నంటితే
ఆరీతి నాడుకోనిదే యన్నిటా నేరుపరి

చ. 3: కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిలించి కూడితేను
వొప్పుకొని పాయనిదే వువిద
తప్పక వోచెలులాల తమలో సమ్మతులైతే
అప్పుడే గుట్టుసేసిన దన్నిటా నేరుపరి

రేకు: 1689-1 సామంతం సం: 26-528

పల్లవి: నే నటువంటిదాననా నిజమాడేదానను
తా నెట్టైనా నుండుఁగాక తలవంచనేఁటికే

చ. 1: అన్నిటాఁ గొసరితేను అట్టే తనతోనే కాక
కన్నవారితోనెల్లా కారణమేమే
నిన్నటనుండి తన్ను నిందలాడితి ననీని
వన్నెకాఁడేమిసేసినా వట్టి వెరపేఁటికే

చ. 2: తతి బంతము చూపినా తనవొద్దనేకాక
ఇతరకాంతలవద్ద నేమి గలదే
మితిలేక మాయింట నెమ్మెలు మెరసితిననీ
అతి రాజసపువాని కంత లోఁగనేఁటికే

చ. 3: కడు వలసినా తనకాఁగిటలోననే కాని
యెడసి తెరలో నుండనేమిటికే
బడి నన్ను శ్రీవేంకటపతి కూడిమెస్తిననీ
యెడవాయకున్నవాఁడు యింతవేసా లేఁటికే

రేకు: 1689-2 మాళవిగౌళ సం: 26-529

పల్లవి: మాసటీలా మీరేదైనా మగిడి మగిడి నేఁడు
గోస నాసచేసి యేల కొంచేవు నీవు

చ. 1: వేడుకకు నాకె నీపై వెసఁ జాఁచె నింతె చేయి
పాడిపంతా లిందుకేల పచారించేవు
ప్రోడగన యాపె నిన్ను బొమ్మల జంకించితేను
వోడక ఇందుకునేల వొరసేవు నీవు

చ. 2: తమకాన నొకమరి తడవె నింతె మాట
సముకాన సారె నేల సాదించేవు
అమరుఁ గనక ఇంతి ఆయములు ముట్టితేను
ప్రమదాన నింతేసి పరచేవు నీవు

చ. 3: తరుణి అడియాసల తప్పక చూచె నింతె
గరిమ నప్పటి నేల కాఁతాళించేవు
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వాకె మొక్కితే
బెరసి యప్పటి నెంత పెనఁగేవు నీవు

రేకు: 1689-3 బౌళి సం: 26-530

పల్లవి: చెలులము నేమైనాఁ జెప్పవలె బుద్ధి నీకు
అలుకలు పనిలేవు ఆఁటడి బెట్టకువు

చ. 1: మంతనానన్నువేళ మరి తగదే సిగ్గులు
పంతములాడేటివేళ భయములేల
సంతోషమైనప్పుడు చలపట్టఁగూడదు
రంతుల దూర కతని రమ్మనవే ఇంటికి

చ. 2: యెదురుబడివుండే యేల సాకిరు లడుగ
వుదుటులు నెరపుతా నొడ్డుకోవద్దు
చతురులాడేచోట జగడాలు పనిలేవు
పదరనేల యిట్టె పతి కిచ్చులాడవే

చ. 3: కూడితిరి మీ రిద్దరు గుంపెన లిఁకనేఁటికే
యీడైన చుట్టరికాన కెగ్గులేడవే
వేడుకతోడ నిన్ను శ్రీవేంకటేశుఁడు పెండ్లాడె
జాడతో యీతనిమీఁద జల్లవే యీసేసలు

రేకు: 1689-4 సామంతం సం: 26-531

పల్లవి: మమ్ముఁ జూచి నీకేల మఱఁగులు సేయ వింత
సమ్మతించి ఇఁకనైనా చనవీయరాదా

చ. 1: పరాకున నీవుండఁగా పాదములొత్తీనాకె
మరిగి ఇంకనైనా మాటాడరాదా
కరి కరిఁబెట్టరాదు కాఁకల సొలయరాదు
తరుణి వినయానకే దయఁ జూడరాదా

చ. 2: పవళించి వుండఁగాను బాగా లియ్యిచ్చి నాపె
అవలన నేమి చూచేవు అందుకోరాదా
జవళి జండిపెట్టదు చలము సాదించదు
జవరాలివూడిగము సారె మెచ్చరాదా

చ. 3: సిగ్గుతోడ నీవుండఁగా చెనకవచ్చీ నాపె
యెగ్గులేదు కాఁగిటిలో నెనయరాదా
నిగ్గుల నిట్టె పొగడీ నిన్ను శ్రీవేంకటేశుఁడ
అగ్గపు టలమేల్ మంగ నాదరించరాదా

రేకు: 1689-5 బౌళి సం: 26-532

పల్లవి: విచారించుకో నీవే వెనకా ముందరా నించి
పచారించి విభుఁడవు పంతమాడవలెనా

చ. 1: అండనుండి యిచ్చకములాడేవారము గాక
మెండుకొని నీమాట మీరేవారమా
నిండుకొన బ్రియములు నెలంతలు చెప్పితేను
కొండవంటి దొరకును కోపగించఁ దగదు

చ. 2: ననుపుతో మోముచూచి నవ్వేవారముగాక
కినిసి వూరకే తమకించేవారమా
తనవారైనా యట్టితరుణులు నిల్చితేను
ఘనుఁడైనవానికి కాదనగదగదు

చ. 3: సేవలెల్లాం జేసి బుద్ది చెప్పేవారముగాక
వావాత దూరి నిన్ను వంచేవారమా
ఆవేళ నలమల్ మంగనయి నిన్ను బెండ్లాడితి
శ్రీవేంకటేశ నీకు సిగ్గువడఁ దగదు

రేకు: 1689-6 వరాళి సం: 26-533

పల్లవి: చెప్పవయ్యా ఇఁక నేమి సేతము మనము నేఁడు
చెప్పరాని వలపులు చిగిరించఁ జొచ్చెను

చ. 1: వేడుకకు వెల దేమి వెన్నెల చేతికి రాదు
ఆడేటిసవతిమాట అందము కాదు
వీడె మియ్యవచ్చేవు విభుఁడవు నీవైతే
నీడనుండే యలసేను నే నిన్నుఁ జూచి

చ. 2: కోరికె కేడ మొదలు కుచా లెప్పుడుఁ గదలు
సేరుపుతోడియాసలు నిండువెదలు
చేరేవు నీవయితే సేసవెట్టినవాఁడవు
నీరులేక మునిఁగేను నిండు జెమటలను

చ. 3: సిగ్గుల కేడ నెలవు చేకొన నీవు గలవు
అగ్గమైన రతికి కాయమే వొళవు
నిగ్గులో శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
దగ్గరకే కూడితిమి తలఁపులో నిన్నును

రేకు: 1690-1 ఆహిరి సం: 26-534

పల్లవి: ఏమి సేతమె చెలి ఇవి నిన్నేంపఁగఁ జొచ్చె
నీమగనిఁ దోడితెచ్చే నిమ్మలాన నుండవే

చ. 1: చిత్తజునడిదాలైన చిగురాకులె మేయఁజొచ్చె
హత్తి కోవిలల కెందు నాజ్ఞ లేదు
బత్తిలేక వసంతుని పంటలెల్లా వీటిఁ బుచ్చె
కొత్తలైన చిలుకల కొవ్వు మాన్పలేరు

చ. 2: పోరుచుఁ జెఱకువింటి పూవుటమ్ము లంటఁ జొచ్చె
ఆరయ తుమ్మిదలకు నాజ్ఞలేదు
నేరుపుతో చందరువెన్నెలలు గ్రోలఁజొచ్చె
బీరపుఁ జకోరాలబింక ముడుపలేరు

చ. 3: మదనవేదాలెల్లా మాటల నమలఁజొచ్చె
అదె శారికల కెందు నాజ్ఞలేదు
కదిసి ఇంతలో శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గూడె
యెదిరించి వీరెల్లా నేమీఁజేయలేరు

రేకు: 1690-2 వరాళి సం: 26-535

పల్లవి: కలదిది సహజము కాంతలకు
నెలకొని యెటు కృప నించేవో కాని

చ. 1: నెపము లెఱుఁగుదురు నేర్పు లెఱుఁగుదురు
వుపమ లెఱుంగుదు రువిదలు
కపట మెఱంగరు కాంతుని సొలతురు
యిపుడిఁక నీమన సెటున్నదో

చ. 2: కూరిమి మఱవరు కూటమి మఱవరు
వోరుపు మరవరు వువిదలు
పోరులు మఱతురు పొరిఁ బతిఁ గలతురు
చేరి యేమి ఇఁకఁ జేయఁగఁగలవో

చ. 3: పొరుగుకు వత్తురు భోగించవత్తురు
వొరిమెకు వత్తురు వువిదలు
వెరపుతోడ శ్రీవేంకటేశ్వరుఁడ
యిరవుగఁ గూడితి వింపుమరేదో

రేకు: 1690-3 భైరవి సం: 26-536

పల్లవి: ఏంటికి నన్నెలయించి యింత చేసీనే తన-
కూటము లబ్బినదాకా కొలువులు సేసేనే

చ. 1: తమకించవద్దు గాని తనపనులు నామేను
చెమరించినందాఁకాఁ జేసేనే
భ్రమఇంచవద్దుగాని పక్కనఁదానామీఁద
మమత వుట్టినందాఁకా మాటలాడేనే

చ. 2: వేసరించవద్దుగాని వేడుకతోఁ దా నాపై
సెసవెట్టినందాఁకాఁ జేరి మొక్కేనే
పాసివుండవద్దుగాని బత్తిచేసినందాఁకా
లాసి తనతోనే మేలములాడేనే

చ. 3: చలపట్టవద్దుగాని చనవిచ్చునందాఁకా
కొలువులోఁ దొడమీఁదఁ గూచుండేనే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వెలసినందాఁకాను వేడుకచేసేనే

రేకు:	1690-4 బౌళి	సం:	26-537

పల్లవి:	ఏల సాదించీ దాను యెరఁగమి సేసుకొని
వాలాఇంచి ఆ సుద్దులు వాసితినే నేను

చ. 1:	మూలనుండి తనతోను ముచ్చటకే యాడుకోఁగా
ఆలకించి వింటినే యపుడే నేను
కేలిసలుపుచు లోలోఁ గిలకిలనవ్వుకోఁగా
వోలిఁ దమవాకిటనే వుండితినే నేను

చ. 2:	పట్టె మంచముపైఁ దాము పండుండఁగాఁ జెలులను
అట్టె సాక్షిపెట్టితినే యపుడు నేను
దిట్టలై నెరులు చిక్కుదీసుకోఁగా నాడ కేఁగి
గుట్టున నెఱుకసేసుకొంటినే నేను

చ. 3:	రంగుగఁ దామిద్దరును రతుల నలయఁగాను
అంగములు ముట్టితినే యపుడు నేను
అంగవించి శ్రీవేంకటాధీశుఁడె నన్నుఁగూడె
సంగడి సేసలు పైపైఁ జల్లితినే నేను

రేకు: 1690-5 వరాళి సం: 26-538

పల్లవి: ఎందుకైనా నోపుదువు యేల బింకాలడేవు
మందలించి చెనకితే మానుమనేవా

చ. 1: పాలుగలయాకె నీతో పంతములే యాడెఁగాని
కాలు దాఁకించితే నీవు కాదనేవా
చేలకొంగు వట్టి నిన్ను సిగ్గులే పరచెఁగాని
వాలాఇంచి పెనఁగితే వద్దనేవా

చ. 2: తగవెఱిగినయాపె తప్పక చూచెఁగాని
వొగి నొట్టువెట్టితే నోపననేవా
అగపడి యప్పటిని ఆయములే ముట్టెఁగాని
తగిలి కొప్పువట్టితే తగదనేవా

చ. 3: గక్కన గూడి యాపె కప్పురమె ఇచ్చెఁగాని
వొక్కటై విడెమిచ్చితే వొల్లననేనా
వుక్కున శ్రీవేంకటేశ వూరకె జంకించెఁగాని
వెక్కసాలేమియాడినా విననవేవా

రేకు: 1690-6 నాదరామక్రియ సం: 26-539

పల్లవి: చూచేయట్టి చెలులెల్లా సోద్యమందేరు
చేచేత మీమోహములే చెప్పిచూపీఁగదవే

చ. 1: పంతము లాతఁ డాడగ పక్కన నీవు నవ్వఁగా
వింతగాఁ జెమట వెల్లివిరిసీఁగదె
మంతనపుఁజేఁత లివి మరొక రెఱఁగరాదు
బంతి మీ సరసములు పచ్చి దేరీఁగదవే

చ. 2: చేరి యాతఁడు చూడఁగ సిగ్గులు నీవు చల్లఁగా
సారె మోమునఁ గళలు జడిసీఁగదే
తారుకాణఁ బెట్టరాదు తగవు దేరుచరాదు
కూరిము లిద్దరివిని కుప్పలాయఁగదవే

చ. 3: శ్రీవేంకటేశుఁ డంటఁగా జిగిఁ జన్నుల నొత్తఁగా
కోవరపుతత్తరాలు గురిసెఁగదే
యీవేళఁ గూడితిరి మిమ్మేమీ ననఁగరాదు
తావుల మీరతులెల్లా దైవారీఁగదవే

రేకు: 1691-1 ముఖారి సం: 26-540

పల్లవి: ఆపెవద్దికేలంపుదు వద్దో మము సారె సారె
కైపుసేతు రాచెలికత్తేల నందరిని

చ. 1: పడఁతి మోనాన నవ్వి పక్కన దాఁచెఁగాని
వొడికాన విన్నపాన కుత్తరమీదు
నడుమ నెట్టిగన్నేర ననలు పై వేసెఁగాని
బడి నీవు పిల్చేవంటే పక్కన రాదాయను

చ. 2: తగ నిన్నుఁ బేరుకొంటే తల దువ్వుకొనెఁగాని
అగపడి యందుఁ గొంత యాస చూపదు
అగడుగాఁ బువ్వులగుత్తి యట్టె పై వేసెఁగాని
మగటిమి నీ కమ్మపు మారుగమ్మ వెట్టదు

చ. 3: మిక్కుటమ్మై కేల యీణెమె ట్లెగముట్టెఁగాని
ఇక్కువ నీ సుద్దులకు నేమీ ననదు
అక్కర శ్రీవేంకటేశ ఆకె యలమేలు మంగ
ఇక్కడఁ గూడితివి నీవిటు నిండుకుండెను

రేకు: 1691-2 దేసాళం సం: 26-541

పల్లవి: చిత్తగించవయ్యా యీ సిరులెల్లాను
హత్తి నీ భాగ్యములే అన్నిటా మెరసెను

చ. 1: చక్కందనమే కాదా సతికి సింగారము
చెక్కటి చెయ్యే కాదా చెలువమెల్లా
నిక్కుఁజన్నులే కావా నిండినగంభీరములు
వొక్కటొక్కటే పొగడ నువిదలవసమా

చ. 2: జవ్వనపాయమె కాదా జడిగొన్నమోహనము
నవ్వేటి నవ్వులే కావా నానా భోగాలు
పువ్వుల కొప్పే కాదా పొందులెల్లారేచేది
ఇవ్విదాన వర్ణించ నీ తరుణులవశమా

చ. 3: కన్నుల చూపులే కావా కాఁగిటఁ గూడించినవి
సన్నలమోవులే కావా చవులయ్యేవి
అన్నిటా శ్రీవేంకటేశ అలమేల్మంగైనదీకె
మన్ననమీరతు లెంచ మా బోంట్లు నేరుతురా

రేకు: 1691-3 పాడి సం: 26-542

పల్లవి: ఇటువంటి రమణుని నెంతసేసేవే
అటు నిటు నవ్వీఁగాని అలుగఁడుగదవే

చ. 1: వొడ్డరము లాడఁడు వొడివట్టితీసి నిన్ను
వెడ్డువెట్టి వేఁడుకొంటే వేసరనేలే
జిడ్డుదేర నీవతనిఁ జేసిన చేఁతల కెల్లా
వొడ్డించుకొనీఁ గాని వోపననఁడుగదే

చ. 2: తత్తరించఁ డేమిటికి తములమొసగీ తాను
బత్తి నీపైఁ జేయఁగాను పంగించనేలే
యెత్తినమదాన నీవు యెంత కరకరించినా
హత్తుకవున్నాఁడు గాని అలయఁడు గదవే

చ. 3: చండి చేసి పెనఁగఁడు సన్నలనే మోవి చూపి
నిండు గాఁగిటఁ గూడఁగా నివ్వెరగేలే
అండనె శ్రీవేంకటేశుఁ డతఁడు నీరతులకు
దండిగా మెచ్చీఁగాని తలఁకఁడు గదవే

రేకు: 1691-4 సౌరాష్ట్రం సం: 26-543

పల్లవి: ఏమని విన్నవించేము యెందాఁకా నీతో
దోమటి దొడుకవయ్యా తొలుసారె చెలిని

చ. 1: చెప్పరానిమోహము చిత్తములో నున్నది
కుప్పళించే మదమెల్లా గుబ్బలపైనున్నది
కప్పిన కాఁకలెల్లాను కాయముపై నున్నవి
చొప్పుతోనె రావయ్యా చూతువు యీచెలిని

చ. 2: ఘనమైన అడియాస కన్నులనే వున్నది
మనుకొన్న సంతోసము మోముననే వున్నది
పెనగొన్న మాటలెల్లా పెదవిపై నున్నవి
కనుగొందువు రావయ్యా కమ్మటి యీచెలిని

చ. 3: కడలేనితమకము కాఁగిటిలో నున్నది
చిడుముడి సిగ్గులెల్లా సెలవుల నున్నవి
బడినే శ్రీవేంకటేశ భామ నిట్టె కూడితివి
యెడయకువయ్యా ఇట్టె యీ చెలిని

రేకు: 1691-5 పాడి సం: 26-544

పల్లవి: మాయలేల చూపేవు మాముందరనే
నీయింపు లివియెల్లా నేనెరగనా

చ. 1: వేడుకకు నాపె నీపై వెలగొని మీటితేను
పాడిపంతా లింతలోనే పచారించేవు
యీడ మాముందర గాగా యెగ్గులువట్టేవుగాక
కూడి యేకతానసైతే కోపగించగలవా

చ. 2: నవ్వుతా నప్పటి నాపె నంటున జంకించితేను
ఇవ్వల వాసులెంచేవు ఇప్పుడే నీవు
యెవ్వరైనా నాడేరంటా యేటికో లోగేవు గాక
పవ్వళించేపానుపుపై పట్టి పెనగేవా

చ. 3: వలచినయాపై నిన్ను వడిఁ గాఁగిలించితేను
కలసితివి నన్నిట్టై కాతరానను
నిలిచి శ్రీవేంకటేశ నే నలమేలు మంగను
చెలఁగే విట్లా నందూఁ జిత్తగించమెచ్చేవా

రేకు: 1691-6 లలిత సం: 26-545

పల్లవి: చెలుల మిద్దరికిని సేవలుసేసేవారము
యెలమి నీతలఁ పానతియ్యవయ్య యిఁకను

చ. 1: సోయగపుఁ జూపు చూచి సొంపులు నీకురేఁచి
పాయకున్నది నీవద్ద బడతి నేడు
మోయరాని మోపులాయ మోహములన్నియుఁగూడె
చేయఁగలపనులిఁకఁ జెప్పవయ్య మాకును

చ. 2: తమకపుమాట లాడి తనువుపై జేఇ వేసి
ప్రమదమె చల్లీ నీపై భామిని నేఁడు
గుమురులై పులకించె గుట్టున మతి గరఁగె
సముకాన నియ్యవయ్యా చనవులు మాకును

చ. 3: సెలవుల నవ్వు నవ్వి సిగ్గులు పలచఁజేసి
మెలఁగుచుఁ గూడె నలమేలుమంగ
చెలరేఁగె వేడుకలు శ్రీవేంకటేశ్వర
కలకామును మేలే కదవయ్యా మాకును

రేకు: 1692-1 రీతిగౌళ సం: 26-546

పల్లవి: కోరిన కోరిక లిట్టె కొనసాగక మానవు
నేరుపులెల్లా నేఁడే నించవలెఁగాని

చ. 1: పాలఁతులెదుట నీవు పొద్దు వోనిమాట లాడి
వలపులు రేఁచితివి వాఁటముగాను
తలవంచుకొని ఇఁకఁ దప్పించుకొంటేఁ బోదు
వెలయ రతుల విఱ్ఱవీఁగ వలెఁగాని

చ. 2: సిగ్గువడేవారిఁ వద్ద జేయరానిచేఁత సేసి
వెగ్గళము నవ్వితివి వేడుకగాను
బగ్గన నింతటిమీఁదఁ బరాకుసేయఁగరాదు
కగ్గులేక రతి కొడిగట్టవలెఁగాని

చ. 3: చెలికత్తియలతోడఁ జేరి యేకతములాడి
చిలికితివి యాసలు శ్రీవేంకటేశ
అలమేలుమంగ నేలి తొఁగాదనఁగరాదు
యలమి రతికిఁ జనవియ్యవలెఁగాని

రేకు: 1692-2 శుద్ధదేశి సం: 26-547

పల్లవి: ఆనతియ్యవయ్యా మాట అమర జోడించుకొని
వీనులారా నే నది విని మెచ్చేఁగాని

చ. 1: పచ్చిదేర నవ్వి నీకు బాదము లొత్తుచు నింతి
విచ్చనవిడి నన్నియు విన్నవించెను
కచ్చుపెట్టి నీవు నట్టె కన్నులా నోరా వింటివి
హెచ్చి ఇందువంకను మేలేమి గంటివయ్యా

చ. 2: చిమ్ముఁ జూపులనుఁ జూచి చేతివిడెమిచ్చి లేమ
యెమ్మెలఁ దనవలపు లెరుకసేసె
సమ్మతించితివి నీవు సరికి బేసికి నిట్టె
కమ్మర నీకేమి దారుకాణవచ్చె ననియా

చ. 3: యేకతానఁ గాఁగిలించి ఇట్టె యలమేలుమంగ
దాకొని శ్రీవేంకటేశ తలపించెను
ఆకడ నన్నేలియును అవియు నియ్యకొంటివి
కైకొని అందునా నేమి గట్టుకొంటివయ్యా

రేకు: 1692-3 పాడి సం: 26-548

పల్లవి: నే మెఱఁగమా యేమే నీ సుద్దులు
మాముందరనే యెంత మాయలు సేసేవే

చ. 1: బలిమిఁ గొంగువట్టితే పంతానకే పెనఁగేవు
చలమేల పతితోను సతులకును
తలంపులో వలపులు దట్టమైవుండఁగాను
వెలిబింకాలేల పెంచి వింతలు సేసేవే

చ. 2: చెక్కు నొక్కి వేఁడుకొంటే సిగ్గులనే పొరలేవు
వెక్కసమింత యేఁటికే విభునితోను
పుక్కిట నీముచ్చటలు పురవురమనఁగాను
మొక్కలపు గుట్టుతోడ మోనమేల చూపేవే

చ. 3: నంటునఁ గాఁగిలించితే నవ్వులే నవ్వేవు
వెంటనే వేసాలేల శ్రీవేంకటేశుతో
యింటనే యలమేల్మంగ వితనాలవై యుండఁగా
దంటతనముల నెంత తరితీపు సేసేవే

రేకు: 1692-4 వరాళి సం: 26-549

పల్లవి: తగదని చెప్పరే తరుణులాల
వెగటుఁ జేఁతల లేనివేసాలు చేసీని

చ. 1: సుద్దులడిగినవాఁడు సారిది వినవలదా
వొద్దిక నే జెప్పం బోతే నొడ్డుకొనీని
అద్దుకొని తనమర్మమందు నేమైనా నున్నదా
పొద్దువోక తానే మాటపోలిక లెంచీని

చ. 2: సన్నలు చేసినవాఁడు చనవియ్యవలదా
చెన్నలర నే నంటితే సిగ్గువడీని
యెన్నరానిగిలిగింత లేమైనా నందున్నవా
తన్నుఁదానే విఱ్ఱవీఁగి తప్పించుకొనీని

చ. 3: చేరఁ బిలిచినవాఁడు చెక్కు నొక్కవలదా
తారి గుబ్బల నొత్తితేఁ దప్పించుకొనీ
ఆరీతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగ నేను
నేరుపుతో నన్నుఁగూడి నీటులు చూపీని

రేకు: 1692-5 నాదరామక్రియ సం: 26-550

పల్లవి: నీవు మగవాఁడవు నెరజాణ వన్నిటాను
యే విధాన మన్నించినా నియ్యకొనేవారము

చ. 1: యెక్కువ తక్కువలై యెటువలె నుండినాను
చక్కనే నీమాఁటలు సబలోనను
వక్కణ లడుగనేల వంకలొత్తి దిద్దనేల
నెక్కొని యాచరితలు నీకే తెలుసును

చ. 2: నించిన చలముతోడ నేరిచినా నేరకున్నా
మంచివే నీచేఁతలు మహిమీఁదను
పొంచి యవి చూడనేల పోలిక వెదకనేల
అంచ నట్టినా నీ కన్నియు నమరును

చ. 3: చెంది యేగసక్కేలైనా చిత్తము వచ్చినవైనా
అందములేని నవ్వులు అతివలకు
నిందలేల శ్రీవేంకటనిలయ నన్నేలితివి
కందువ నిదెల్లా నీకుఁ గలిగినగుణము

రేకు: 1692-6 మంగళకౌసిక సం: 26-551

పల్లవి: వట్టికాతరాన నీవు వసివాడే రింతేకాక
చుట్టరికము నెరపి సొంపులెల్లా రేఁచదా

చ. 1: చెప్పినట్టు సేసేనని చిత్తము నీ సొమ్మని
అప్పుడే విన్నవించదా ఆపె నీతోను
యెప్పుడు నలుగనని యిచ్చకము సేతునని
ముప్పిరి నొడఁబరచి మోహమెల్లాఁ జూపదా

చ. 2: తానే నీవై యుండేనని దక్క వలచితినని
ఆనలెల్లాఁ బెట్టదా ఆపె నీతోను
మానలేని పొందులని మఱఁగులు వెట్టనని
కానుకలు నీకు నిచ్చి కడు బత్తిసేయదా

చ. 3: వెంగెములాడనని వెస నిన్నుఁ బాయనని
అంగజ కేలిఁ గూడదా యాపె నీతోను
రంగుగా శ్రీవేంకటేశ రతికెక్క చనవని
సింగారించుకొని వచ్చి సేసలెల్లాఁ బెట్టదా

రేకు: 1693-1 హిజ్జిజి సం: 26-552

పల్లవి: ఏల మమ్ము నొరసేవు యేలికవు నీవు మాకు
కోలుముందుగా మేలుకొద్ది చుట్టరికము

చ. 1: మన్ననగల కొలందే మందెమేళమంతయును
చన్నులు వచ్చినయంతే జవ్వనము
కన్నులు గొప్పలయితే మొగము చక్కనైమించు
విన్నవించే నేర్పుగలితే వీనుల కింపౌను

చ. 2: బలిమిగలయంతే వంతమెల్లా నీడేరు
వలచిన పాటే వాడికయును
సెలవినవ్వులలోనే చేఁతలెల్లా నేరుపడు
పిలుపులు చవులైతే ప్రియములు నాటును

చ. 3: వేడుకతోడి లంకె వెక్కసపుఁదమకము
వూడిగమెంత అంతే వుబ్బుఁజెమట
కూడితిని నన్ను నేడు కొంకక శ్రీవేంకటేశ
యీడైనరతులైతే యిచ్చకమై వుండును

రేకు: 1693-2 ఆహిరి సం: 26-553

పల్లవి: ఏమని చెప్పుదుమయ్యా ఇంతి నీపైగల బత్తి
నేమానఁ బూనుక వచ్చీ నీకుఁ గానేయిపుడు

చ. 1: నిడువాలుఁ జూపు చూచి నీమనసు నాటెనని
పొడిఁబడీ నంతలోనె పొలఁతి
కడునవ్వఁగా నీకుఁ గాఁక రేఁగెనోయని
వుడివోని తలపోఁత నుస్సురనీని

చ. 2: మచ్చిక మాటాడి నీమర్మము సోఁకెనోయని
కొచ్చి కొచ్చి లోలోనె కొంకీఁ జెలి
తచ్చి గుబ్బల నొత్తఁగా తనువు నొచ్చెనోయని
విచ్చనవిడి నప్పుడే వెరగందీని

చ. 3: నిన్ను వేగినంతాఁ గూడి నిద్దురలేదోయని
కన్నులు దేలగింపుచుఁ గాఁతాళించీని
ఇన్నిటా శ్రీవేంకటేశ యీపె నీవురమెక్కి
సన్నలా చాయలా నీకు సారె మొక్కీని

రేకు: 1693-3 ముఖారి సం: 26-554

పల్లవి: ఎట్టు నేరుచుకొంటివే యెమ్మెలెల్లాఁ జూపఁగ
పెట్టిరా వెన్నతోడను పిన్ననాఁడే మీవారు

చ. 1: ఇద్దరి మన తగవు దిద్ది తేరిచినవాఁడు
వొద్దనే వున్నాఁడుగదే వువిద
పెద్దరికే లింతులతో బెట్టుగా నాడుకొనేవు
సుద్దులు నీచేత విని సోద్యమయ్యీఁగదవే

చ. 2: జంటై మనమాటలకు సాకిరియైన చెలులు
వింటా నున్నారు గదవే వెలఁది
వెంటనే నే జాణనంటా వికవిక నవ్వేవు
కంటిమి నీగుణములు కతలాయఁగదవే

చ. 3: కందువ నిన్నూ నన్నూఁ గాఁగిటఁ గూడినవాఁడు
యెందును శ్రీవేంకటేశుఁ డితఁడే కదే
ముందే దొరతనాన మురిపెము చూపేవు
అందిపొంది నీవేసా లగడాయఁగదవే

రేకు: 1693-4 కాంబోది సం: 26-555

పల్లవి: ఎటువంటిదానవే యేమే నీవు
సటలు సేసే వాతఁడు చనవియ్యఁగాను

చ. 1: కన్నులనే సొలసేవు కాఁకలనే యలసేవు
మన్నించి యాతఁడు నీతో మాటలాడఁగా
సన్నలనే వొరసేవు సముకాన జరసేవు
మిన్నక, యప్పటిఁ దాను మించి నవ్వఁగాను

చ. 2: కూరిములు గొసరేవు కుంచెపట్టి విసరేవు
చేరి యాతఁడే నిన్ను జెనకఁగాను
నేరుపులు చూపేవు నెపములే మోపేవు
కోరి నీకు విడెము గక్కున నియ్యఁగాను

చ. 3: పంతములే యాడేవు పదములు పాడేవు
యింతలో శ్రీవేంకటేశుఁ డెనయఁగాను
సంతోసాలు నెరపేవు చవులెల్లాఁగరపేవు
బంతినే రతులు తాను పచారించఁగాను

రేకు: 1693-5 సాళంగం సం: 26-556

పల్లవి: చేకొని పూడిగాలెల్లాఁ జేయించుకొనవయ్యా
యీకడఁ గొలువవచ్చె నిదివో నిన్నును

చ. 1: పంతగాండవై వొంటి నీపానుపుపై నుండఁగాను
మంతనమాడవచ్చెను మగువ
చెంతల నీ మేనెల్లాఁ జెమరించియుండఁగాను
ఇంతలో విసరవచ్చె నిదివో నీకును

చ. 2: గరిమతో సంతోసానఁ గడుమించి నీవుండఁగా
సరసములాడవచ్చె సకియ
తరుణలపైఁ గాంక్ష తలపోయుచుండఁగాను
అరుదుగా నిన్ను బెండ్లాడవచ్చె నిపుడు

చ. 3: ఆదిగొని నిద్రలేచి ఆనందాన నుండఁగాను
పాదము లొత్తఁగ వచ్చెఁ బడఁతి
యీదెస శ్రీవేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
మోధముతోడుత నీకు మొక్కవచ్చెఁగూర్మిని

రేకు: 1693-6 పాడి సం: 26-557

పల్లవి: ఇంతకంటె నేమిసేతు విఁక నీవు
పంతము చేకొంటివి పడఁతిచే నీవు

చ. 1: వచ్చి వచ్చి నిన్నుఁ జూచి వలపులఁ గొసరఁగ-
నిచ్చితివి చనవు నీ వింతికిని
పచ్చిదేర నప్పటిని పానుపుపైఁ గూచుండి
మచ్చికసుద్దులు విని మరుగఁజేసితివి

చ. 2: సారెసారె జూజమాడి సరిఁ బొద్దుఁ గడపక
చేరి మన్నించితి విట్టె చెలియను
గారవించి యిప్పుడును కాయము గాయము సోఁక
పేరడి నీతో సరి పెనగజేసితివి

చ. 3: కూడి మాడి నీకాఁగిట గురుతులు ధరించఁగ
వోడక దొరఁ జేసితి వువిదను
యీడనె శ్రీవేంకటేశ యిట్టె నవ్వు నవ్వుచు
వేడుకైనరతులను వెలయఁజేసితివి

రేకు: 1694-1 శుద్ధవసంతం సం: 26-558

పల్లవి: అప్పటి నీ సుద్దలెల్ల అడుగఁ బుత్తెంచె నన్ను
తప్పకచూచినవాఁడు తాఁగాఁడా

చ. 1: నగుతా నండకు వచ్చి నాకు నాపెకును
తగవు చెప్పినవాఁడు తాఁ గాఁడా
జిగిమాపయ్యద లంటి సిగ్గుల నేము నవ్వఁగ
అగడు సేసినవాఁడు అప్పటి తాఁగాఁడా

చ. 2: జమళిపాన్పుమీద సరసాన నాపె నన్నుఁ
దమిరేఁచినవాఁడు తాఁగాఁడా
ప్రమదాన నిద్దరికి పంతములు సరిచేసి
తములమిడినవాడు తాఁగాఁడా

చ. 3: అరసి యక్కచెల్లెండ్లమైనను మ్మింతలోనే
దరిచేర్చి కూడినాఁడు తాఁగాఁడా
యిరవై శ్రీవేంకటేశుఁ డింటిలోననే వుండి
తిరమై మన్నించినాఁడు దేవుఁడు తాఁగాఁడా

రేకు: 1694-2 ముఖారి సం: 26-559

పల్లవి: ఏల వాసు లెక్కించేవు యెరఁగవా నీవేమైనా
గెలిసేసితే నేమైనాఁ గేరడమే కాదా

చ. 1: పంతమాడరాదుగాక బలువైన నా చన్నులు
యెంతటి కొండలకైనా యెక్కుడే కాదా
వంతుపెట్టరాదు గాక వాఁడినా కనుచూపులు
కంతునియమ్ములకంటె కడు వాండిగావా

చ. 2: సరిపెట్టరాదుగాక సంతతము నాతురుము
గరిమ జీంకటికంటె ఘనమే కాదా
పురుడించరాదుగాక పొందైన నాకరములు
పొరిఁ దిగెలకంటె నబ్బురములే కావా

చ. 3: రట్టు సేయరాదుగాక గుట్టున నాపిరుఁదులు
తొట్టి పులినాలకంటె దొడ్డలే కావా
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నెట్టన మనసొందులు నేరుపులే కావా

రేకు: 1694-3 బౌళి సం: 26-560
పల్లవి: ఇప్పటివేడుకే చూచీ నిదివో తాను
అప్పటప్పటికి తన కాడికలై వుండవా
చ. 1: చేతులారాఁ జేసేచేత చెప్పితే సిగ్గయ్యీ నాకు
ఆతనినే యడుగరే అతివలాల
కాతరపు మగవాఁడు కాదు గూడదనరాదు
యీతల నెవ్వతె విన్నా నేతువలెత్తేడరా
చ. 2: నోరునిండా మాటాలాడె నొడుగరా దందరిలో
చేరి పతి నడుగరే చెలులాల
దూరినా నియ్యకొనఁడు తూరవలచినవాఁడు
కారణాలు చెప్పఁబొతే కడవారు నవ్వరా
చ. 3: అక్కు మోవఁ గాఁగిలించె నట్టె వెరగయ్యీని
మొక్కి తన్ను నడుగరే ముదితలాల
ఇక్కువ శ్రీవేంకటేశుం డీతఁడే నన్నుం గూడె
తక్కక ఇందు కిందరు తప్ప కిట్టె చూడరా

రేకు: 1694-4 కాంబోది సం: 26-561

పల్లవి: తరుణిచేసిన చేఁత తగవే కాదా
సరికి బేసికి నిన్నుఁ జలము సాదించెను

చ. 1: ఇట్టె కానుకిచ్చి యాకె యెగుటనే వుండఁగాను
కట్టఁగడ యాపెనే చక్కఁ జూచేవు
దిట్టగనక యీకె నీ దిమ్మరి చేఁతలకు జేతఁ
బట్టిన నిమ్మపండు నీపై నిట్టె వేసెను

చ. 2: కేలువట్టుకున్నయాపె కిలకిల నవ్వఁగాను
మూలనున్న యాపెతోడ ముచ్చటాడేవు
తాలిమి గలదిగాన తగ నీ పరాకు దేర
కోలుముందుగా నిన్ను కొనగోర నొత్తెను

చ. 3: పోదిఁ గాఁగిలించినాపె పొంతనే వుండఁగాను
పాదమొత్తేయాపెను గొబ్బన గూడేవు
యీదెస శ్రీవేంకటేశ యీకె నేరుపరిగాన
మొదమున నీకు నిట్టె మొక్కు మొక్కి కూడెను

రేకు: 1694-5 పాడి సం: 26-562

పల్లవి: నీవేల జంకించేవు నెలఁతలదిక్కు చూచి
కావరించి సవతులు కాఁతాళించవలదా

చ. 1: సంగడి నుండి నీతో సరస మాకె యాడఁగా
అంగనలు దూరి నిన్ను నాడకుందురా
సింగారాలు చూపి చూపి చలరేఁగుచుండఁగాను
కొంగువట్టి తీశాకెతో గుంపించకుందురా

చ. 2: కొసరుచు నాకె నిన్ను కుచముల నొత్తఁగాను
కసరి ఇంతులు గొణఁగక వుందురా
మిసిమి దనసలిగె మెరయుచునుండఁగాను
పసగాఁ జేతులు చాఁచి పంతమాడ కుందురా

చ. 3: కందువనుండి నిన్నాపె కైవసమై కూడఁగాను
అంది చెలులెల్లా సొలయకవుందురా
ఇందుకె శ్రీవేంకటేశ ఇంతులెల్లాఁగలసిరి
ముందరియాపెను ఇట్టె మోచి దించకుందురా

రేకు: 1694-6 లలిత సం: 26-563

పల్లవి: ఔలే నిజము నిష్ఠూరమందురు లోకమువారు
నీలాగులు దడవితే నేడు సిగ్గయ్యీనా

చ. 1: పచ్చల వోవరిలోన బంగారు పీఁటల మీఁద
పచ్చిదేర నవ్వదా పడఁతి నీతో
తచ్చి నన్నెంత చూచేవు తలఁచుకో ఇంకా నీవే
అచ్చటి సుద్ది చెప్పితే నాయములు సోఁకెనా

చ. 2: పరగఁ దెరమాటున పక్కనే పవళించి
సురటి విసరదా సుదతి నీకు
అరుదందనేల నో నన్నియును తెలుసుకో
ఇరవుగాఁ జెప్పితేనే యెగసక్కె మాయనా

చ. 3: వుడవోని నీకాఁగిట వొద్దికైన రతులను
బడివాయక కూడదా భామం తోను
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
వడి నిన్ను మెచ్చితేనే వలపులు రేఁగెనా

రేకు: 1695-1 రామక్రియ సం: 26-564

పల్లవి: ఈపెకుఁ గలుగుబింక మేల నీకు లేదాయ
మాపుదాఁక నీవెంత మనసు చూచేవు

చ. 1: వొడ్డాఁ బెట్టా మాటలాడి వువిద జంకించఁగాను
వెడ్డువెట్టి నీవెంత వేఁడుకొనేవు
వడ్డివారినా ఆపె వలపులేమైనాను
యెడ్డవై నేఁడాఁట దానికేల కిందుపడేవు

చ. 2: సరికి బేసికి నింతి చలము సాదించఁగాను
అరుదుగా నింతేసి ప్రియాలు చెప్పేవు
గరివడీనా తనకందువైన ననుపెల్లా
మరిగి యిల్లాలికేల మతిలోఁ గొంకేవు

చ. 3: కోరి వేఁడియాపె నిన్ను కుచముల నొత్తగాను
సారె సారె నీవెంత చనవిచ్చేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చేరి పెండ్లికూఁతు కెంత సేసేవు చవులు

రేకు: 1695-2 కేదారగౌళ సం: 26-565

పల్లవి: నేఁడు నాభాగ్యమే కాదా నీ చిత్తము వచ్చినది
పోఁడిమి నిందుకుఁగానే పొగడేము నిన్నును

చ. 1: యెవ్వతె బుద్ది చెప్పెనో ఇంటికి వచ్చి నాతోను
నవ్వి సరసమాడేవు ననుపుగాను
రవ్వేతి నన్నులుమని రామచేఁ జెప్పిపంపితి
చివ్వన నిన్నుళ్లు వచ్చితివా ఇయ్యెడకు

చ. 2: యేమి దలచుకొంటివో ఇట్టె నన్నొడఁబరచి
కామించి చూచేవు నన్నుఁ గాతరానను
వేమారు నిన్నా మొన్నా విన్నపాలెల్లాఁ జేసితి
ప్రేమాన నిట్లాఁ దొల్లి పెట్టితివా సేస

చ. 3: మనసెట్టు గలిగెనో మమకరించి నీవు
యెనసితి విటు నన్ను ఇంతలోననె
అనువై శ్రీవేంకటేశ ఆసపడి నేనుండితి
తనిసే నందుండే యపుడు తనిసితినా

రేకు: 1695-3 పూర్వగౌళ సం: 26-566

పల్లవి: తానేల యెగ్గులువట్టీ తనమన సెరుఁగును
యే నెపము నెంచను యీడకు రమ్మనవే

చ. 1: సవతిపై కాఁకల వేసారి తను దూరీతి
వివరించి చూచుకొంటే వింతా తాను
పవళించి నాఁడందుకు పక్కన జిన్నఁబోయి
ఇవల దా మంచివాఁడే యీడకు రమ్మనవే

చ. 2: ఆకె యెమ్మెలెల్లాఁ జూచి ఆరడి తనుఁ బెట్టి
పైకొని తెలుసుకొంటే పగలా తాను
దాకొని బాసలుసేసి తనలోనే కరఁగుచు
యేకపోఁ దనకునేల యీడకు రమ్మనవే

చ. 3: అక్కతోడి వరసలు నట్టె తన్ను నాఁగితి
ఇక్కువ దలఁచుకొంటే యెరవా తాను
చిక్కి నన్నుఁ గూడినాఁడు శ్రీవేంకటేశ్వరుండు
యిక్కడా నక్కడా నేల యీడకు రమ్మనవే

రేకు: 1695-4 భైరవి సం: 26-567

పల్లవి: వేడుకకాఁడవు నీకు వెరపేఁటికి
యీడువెట్టి నీ సుద్దులు కేమీ ననమయ్యా

చ. 1: ఇంటిలోన నాకె మాట యేమని చెప్పెనో నీకు
వెంటవెంట వచ్చి నన్ను వేఁడుకొనేవు
దంటయైనవాఁడవు దైన్నమేటికిఁ నీకు
గొంటు నీసుద్దు లెవ్వతెకునుఁ జెప్పవయ్యా

చ. 2: సరుగున నాకె యేమి సన్నసేసెనో నీకు
అరుదుగా నన్నుఁ గడు నాదరించేవు
బిరుదుగలవాండవు ప్రియము చెప్పంగనేల
యెరవుల నీసుద్దు లేడాం దడవమయ్యా

చ. 3: ఇప్పు డిట్టె యాపె గుణమేమి నేర్పెనో నీకు
కుప్పళింపు జెమటతోఁ గూడితి నన్ను
వొప్పి శ్రీవేంకటేశుడ వొడ్డుకోనేటిఁకి నీకు
కప్పి నీసుద్దులు నే మగడు సేయమయ్యా

రేకు: 1695-5 వరాళి సం: 26-568

పల్లవి: పిలిచీ నీరమణుఁడు ప్రియము చేకొనఁగదె
కొలచితేఁ దమకము కుప్పలై నిలుచును

చ. 1: ఇచ్చకమెఱఁగనట్టి ఇంతి పొందు సేసితేను
మచ్చరము రేఁగును మగవానికి
విచ్చనవిడి నూరకె వెంగెములే యాడితేను
వచ్చి వచ్చి యేడాలేనివాసులే పుట్టును

చ. 2: చెంతనుండి కూడని చెలితోడ నవ్వతేను
పంతములే మిగులును పతివద్దను
రంతుచేసి యేకతాలు రచ్చలవేసితేను
చింతతోడ మిగులాను సిగ్గులే నెరసును

చ. 3: సమ్మతించఁజాలనిసతిఁ గాఁగిలించితేను
యెమ్మెలే మించు శ్రీవేంకటేశునకు
కమ్మి యాతఁడె నన్నేలె కతలిట్టె చెప్పితేను
నెమ్మన మలరం గడు నెయ్యములే పుట్టును

రేకు: 1695-6 కాంబోది సం: 26-569

పల్లవి: ఏఁటికిఁ బొడిఁబడేవు ఇంతమనికితముతో
సూటిగా వినేవారు చూచి ఇట్టె నవ్వరా

చ. 1: కలలో నెవ్వతో నిన్నుఁ గాఁగిలించుకొనెనంటా
వెలయ మాతోం జెప్పేవు వేసాలకు
కలికపై వల పింత గలిగినవాఁడవు
తొలుతె కాళ్లకు మొక్కి తోడి తెచ్చుకోరాదా

చ. 2: తరుణి యెవ్వతో నీ తలఁపునఁ బారెనంటా
కెరలి మాతోఁ జెప్పేవు కేరడాలకు
మరిగి యాపెమీఁదను మచ్చిక గలవాఁడవు
ఇరవుగా బాస ఇచ్చి ఇంటఁబెట్టుకోరాదా

చ. 3: దేవులు యెవ్వతో నేడు దిష్టముగాఁ గూడెనంటా
శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జేరి కూడేవు
తావున నాపెపై నింత తగులుగలవాఁడవు
కావరాన నాపె మెడఁగట్టుకొనరాదు

రేకు: 1696-1 వరాళి సం: 26-570

పల్లవి: నాకేల లోఁగేవు నడుమ నీవు
పైకొని నే నిందుకుఁగా పచారించేనా

చ. 1: కలికిఁ బొరుగాపెనుఁ గని నామోము చూచేవు
వలచి తెచ్చుకోఁగాను వద్దనేనా
మొలకచన్నులు గడుమొనలంటాఁ బొగడేవు
కులికి పట్టిచూడఁగా కోపగించేనా

చ. 2: సారె నాపె నవ్వంగాను సన్నలఁ జూపవచ్చేవు
చేరి కాఁగిలించుకోఁగా చేయివట్టేనా
చేరఁ డేసి కన్నులంటా చిత్తగించి బ్రమసేవు
ఆరసి పెండ్లాడఁగా నౌఁగాదనేనా

చ. 3: వెస నాపె మాటాడఁగా వినుమని నన్నేవు
వసముచేసుకోంగాను వారించేనా
కొసరి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
పసగాఁ జనవియ్యఁగా పంతమాడేనా

రేకు: 1696-2 మాళగౌళ సం: 26-571

పల్లవి: ఇంతిపైఁ గలుగు బత్తి ఇఁక మాకుఁ జెప్పనేల
వింత నీ నవ్వులలోనే వెసఁ గానిపించెను

చ. 1: గాఁటమై మాచెలిమీఁదఁ గలిగిన మోహమెల్లా
తేటలనీ మోము చూచే తెలిసె మాకు
తాటించి నీ మనసులో తమకములెల్లాను
మాటలు నీవాడేయందే మరి తెల్లమాయను

చ. 2: మలసి యాసకియను మన్నించేమన్ననలెల్లా
తిలకించి చూచినందే దిష్టమాయను
కలకాలమును నీవు కైవసమై వుండేదెల్లా
పలుమారు నీవున్న భావాననే తోఁచెను

చ. 3: అప్పటి నీవాదరించే ఆదరము లెల్లాను
కప్పురమీఁగానే యెరఁగఁగ వచ్చెను
ఇప్పుడిట్టె శ్రీవేంకటేశ ఇంతి నేలితివి
వొప్పులు నీరతులలో నొగి సరివచ్చెను

రేకు: 1696-3 పాడి సం: 26-572

పల్లవి: మమ్మేల సాదించేవు మాటిమాటికి
యెమ్మెల కాతఁడే నీ యెగుట నుండఁగను

చ. 1: బలిమిగాలదానవు పంతాన మగనితోనే
పిలిచి సాములుసేసి పెనఁగవమ్మా
చెలఁగి మాపైనేల చేతులు చాఁచేవు నీవు
కొలఁదిమీర నాతఁడే గురి నీవుండఁగాను

చ. 2: బింకముగలదానవు బిగిసి యాతనితోనే
సుంకుమోపి నీవుదుటు చూపవమ్మా
మంకు నీపెద్దరికాలు మాతో నింత యేమిటికి
వంకలొత్త నాతఁడే నీవద్దనుండఁగాను

చ. 3: నేరుపరిదానవు నేఁడు శ్రీవేంకటేశుతో
కూరిమిఁ గాఁగిట నించి కూడవమ్మా
సారె నన్నేలె నితండు సలిగెలు నెరపేవు
పోరచి నాతఁడే నీకు బుద్ధి చెప్పఁగాను

రేకు: 1696-4 ఆహిరి సం: 26-573

పల్లవి: నీమనసెట్టున్నదో నే నెరుఁగను
గామిడైనా నాయంగాని కాంతతో నవ్వితిని

చ. 1: సంగడి జాణతనాలు సతి నీతో నాడఁగాను
వెంగెమైనా నాయంగాని వింటానుంటిని
సంగతిగా నెలుఁగెత్తి సారె నిన్నుఁబాడఁగాను
పంగెనైనా నాయఁగాని పైపై మెచ్చితిని

చ. 2: ఆసరేఁచి ఆకె నీ యాయాలు ముట్టఁగాను
దోసమైనా నాయఁగాని తొంగి చూచితి
వోసరించ కప్పుడే నీ వూడిగాలు సేయఁగాను
వేసాలైనా నాయఁగాని వేడుకపడితిని

చ. 3: నెమ్మది శ్రీవేంకటేశ నిన్ను నాకె గూడఁగాను
యెమ్మెలైనా నాయఁగాని ఇయ్యకొంటిని
కమ్మర నన్నేలితివి కందువ కాపె రాఁగాను
దొమ్మియైనా నాయఁగాని తొల్లె రమ్మంటివి

రేకు: 1696-5 రామక్రియ సం: 26-574

పల్లవి: నీవంటి వలపే కాదా నెలఁతలకెల్లాను
కావరించి సవతులఁ గాకు సేతురా

చ. 1: రవ్వలేలసేసేరే రమణుని తోడత
అవ్వల నెవ్వతో మొక్కె నాతనికంటా
యివ్వలఁ గొలువులు నీ వితనికిఁ జేసేవేళ
నివ్వటిల్ల నాపెవచ్చి నిన్ను వెంగె చూడెనా

చ. 2: పంతములేలాడేవే పైకొని నీ వితనికి-
నింతలో నెవ్వతో విడెమిచ్చె నంటాను
కాంతపు నీ వితనికిఁ గాఁపురము సేసేవేళ
మంతనాన నాకె నీతో మచ్చరించ వచ్చెనా

చ. 3: సెలవినేల నవ్వేవే శ్రీవేంకటేశ్వరుని
లలి నెవ్వతో యీతని లాలించెనంటా
కులికి మీ రిద్దరునుఁ గూడి రతిసేసేవేళ
చెలఁగి యాపె మిమ్ము సిగ్గులు వరచెనా

రేకు: 1696-6 బౌళి సం: 26-575

పల్లవి: ఏఁటికిఁ బంతాలాడేవు యిప్పుడు మాతో
గాఁటపు నీ బలిమెల్లాఁ గానవచ్చీ నిపుడే

చ. 1: మచ్చిక నీకాఁగిటికి మనసు పెట్టినయాకె
కొచ్చి కొచ్చి యెప్పుడునుఁ గూడకుండీనా
కచ్చుపెట్టి సారెసారెఁ గానుకలిచ్చిన యాపె
చొచ్చి చుట్టరికమెల్లాఁ జూపకుండీనా

చ. 2: చలముమెరసి నీతో సన్నలు చేసిన యాపె
సులభాన మోవి చవిచూడకండీనా
వలపులు నీ మీఁద వదలకు చల్లినాపె
చలివాయ నీపైఁ జేయి చాఁచకుండీనా

చ. 3: ననుపున నీ వద్ద నవ్వులు నవ్వినయాపె
అనువుగా నిన్నుఁ బెండ్లియాడకుండీనా
యెనసితి విటు నన్ను యిదివో శ్రీవేంకటేశ
కొనగొలనే తానూఁ గొసరకుండీనా

రేకు: 1697-1 సామంతం సం: 26-576

పల్లవి: ఆయనాయ సుండరే యంగనలాల
పాయకువాని నంతేసి పరచఁగఁగలనా

చ. 1: నిచ్చ నిచ్చ నాతినిపై నేరము లెంచెదాననా
మెచ్చి మెచ్చి వలపుల మెరతుఁగాక
రచ్చవేసి చెలులెల్లా రమణుని నాడేరేమే
విచ్చనవిడి నవెల్లా వినఁగలనా

చ. 2: సారెసారె నాతని జరసేటిదాననా
చేరిచేరి కాఁగిటఁ జేకొందుఁగాక
తారుకాణఁ బతి నెంత తప్పులెంచే రిదియేమే
పూరకే నే నిందుకుఁగా వొడ్డారించఁగలనా

చ. 3: నవ్వి నవ్వి శ్రీవేంకటనాయకుఁ దిట్టేదాననా
తవ్వి తవ్వి రతులెల్లా దాటింతుఁగాక
ఇవ్వల నన్నుఁ గూడెను యీతని సాదించేదేమే
పువ్విళ్లూర మీ బుద్దుల కొడఁబడఁ గలనా

రేకు: 1697-2 దేసాళం సం: 26-577

పల్లవి: మగువలఁ జేకొనక మానవచ్చునా
నిగిడి సరసముల నేరుపరి యితఁడు

చ. 1: దప్పిదేరీ మోవినంటా తప్పులెంచనేఁటికే
కొప్పు జారెనంటాఁ బతిఁ గొసరనేలే
రెప్పలు దేలించెనంటా రేసులు చూపకువే
యెప్పుడుఁ బదారువేల నేలినవాఁడతఁడు

చ. 2: వాడె నలమోమనుచు వక్కణ లడుగకువే
తోడఁ జెమరించెనంటా దూరకువే
వేడుకకాఁడనుచు వెంగెము లాడకువే
మేడెపు గొల్లెతలకు మేఁటి మగఁడతఁడు

చ. 3: నిట్టూర్పు లేడవని నేరము లెంచకువే
వొట్టిఁ బులకలనుచు నొరయకువే
పట్టపు దేవుళ్లను బహుసతీజనులను
వెట్టలేక కూడేటి శ్రీవేంకటేశుఁ డతఁడు

రేకు: 1697-3 పాడి సం: 26-578

పల్లవి: చెప్పఁ గొత్తలాయ నీ చేసేటి కాఁపురము
దప్పిదేరే మోవితోడ తలవంచుకువే

చ. 1: కొడిమెలెన్నుచు నిన్నుఁ గోపగించి నంటాను
పడఁతికేల లోఁగేవు పంతగాఁడవు
అడరి నీ మర్మమెల్లా నాపెచేత నున్నదా
జడిశాపె దిక్కే నీవు సారెకుఁ జూచేవు

చ. 2: యీవలా నావలా యేతువలెత్తినంటా
దేవులకేల కొంకేవు దిట్టవాఁడవు
భావించ నింత నీపాలిటి దేవరాయనా
కావరించి మాట కతి కడవఁగఁజాలవు

చ. 3: దంటతనమున నిన్ను దప్పులెంచీనంటాను
ఇంటియాపెకేల వీఁగే వింతవాఁడవు
నంటున శ్రీవేంకటేశ నన్ను నేలితివి నేఁడు
అంటిముట్టి యాపెనే అప్పణడిగేవు

రేకు: 1697-4 హిజ్జిజి సం: 26-579

పల్లవి: నీవంటిదే కాదా నెట్టన నేఁ డాపె యాస
దేవులవైతే మరి తెలుసుకోరాదా

చ. 1: పతివద్ద నుండినభామనేల పిలిచేవే
కుతిలకుడిచి వట్టి కుచ్చితానను
ఆతని గూడగ నీకు ననువు గావలసితే
వెతదీర నొకతెర వేసుకొనరాదా

చ. 2: యింతి విడెమియ్యగాను యేల సన్నచేసేవే
కాంతునిపై నీవు వట్టి కాతరానను
యింతవేడుకైతే నీవు నితనిపచ్చడములో
కాంతకు మఱఁగుగాను కప్పుకొనరాదా

చ. 3: పరగఁ దామిద్దరునుఁ బవళించియుండఁగాను
అరసేవేలే వట్టి యాగడానను
గరిమ శ్రీవేంకటేశుఁ గైకొనఁగ మనసైతే
నిరతి నావలిపక్క నీవుండరాదా

రేకు: 1697-5 కన్నడగౌళ సం: 26-580

పల్లవి: ఎప్పుడు కరుణఁ జూచే వీయింతిని
కుప్పళించి మాఁటలనే కొసరీ నిన్నును

చ. 1: చిక్కనితేనెలు మోవిఁ జిప్పిలఁగాఁ జెలి నిన్ను
పెక్కు ప్రియములు చెప్పి పిలిచీ నిదె
మిక్కలి చెమటలెల్లా మేన నిట్టె తురుగగా
పిక్కటిల్ల రతులకుఁ బెనఁగీ నీతోను

చ. 2: తామెరలవాసనలు దట్టముగా దొలఁకఁగా
కోమలపుఁ జేతులఁ జెక్కు నొక్కి నిదె
కామించి కుచములల కాంతలు నీపైఁ గప్పఁగా
దీమసాన నొడివట్టి తీసీ నన్నింటికి

చ. 3: నంటున నవ్వు వెన్నెలనాము సెలవి నిండఁగా
అంటి చెవిలో నేకతమాడీ నిదె
జంటల శ్రీవేంకటేశ సమరతి సేసి నిన్ను
వొంటి నలపార్చి యిప్పు డొడఁబరచీని

రేకు: 1697-6 ముఖారి సం: 26-581

పల్లవి: బతుకరయ్యా మీరు పచ్చిదేరను
కతలుఁ గారణాలుగాఁ గంటిఁగా యీమేలు

చ. 1: యెలమి నేనుండఁగానే యీకె వచ్చి నీతోను
మలఁగమఱఁగుననే మాటలాడను
అలనీదేవులో యీకె ఆకె చెలికత్తెయో
కలిగె నీకు నేఁడు కంటిఁగా యీమేలు

చ. 2: దండ నేనుఁ జూడఁగానే తా వచ్చి నీమేను ముట్టి
చండిపెట్టి పెనఁగుతా సన్న చేసెను
మెండగు నీచుట్టమో మెలుత నీ పొరుగాపో
గండికాఁడ నీకు నబ్బెఁ గంటిఁగా యీమేలు

చ. 3: నీతో నేనుఁ గూడఁగానే నెట్టన వచ్చి యీసతి
యేతుల నిన్ను నెనసి యింతచేసెను
జాతిగల కొలమాపో చనవది వెలయాలో
ఘాతల శ్రీవేంకటేశ కంటిఁగా యీమేలు

రేకు: 1698-1 ఆహిరి సం: 26-582

పల్లవి: ఏమేమి సేసినాను ఇతవే కాక
కామించి మీరును నిచ్చకము లాడవలదా

చ. 1: ఇద్దరిమాతలఁపులు నేకమై వుండఁగాను
సుద్దలేమి చెప్పేరే సుదతులాల
కొద్దిమీరి వలపులు కోటికొండలై వుండఁగా
అద్దో పాయవచ్చునా ఆలికి మగనికి

చ. 2: యెప్పుడు నాతఁడు నేను ఇయ్యకొనివుండఁగాను
తప్పకచూచే రదేమే తరుణులాల
వొప్పుగువేడుకలలో నోలలాడుచుండఁగాను
అప్పుడే దూరవచ్చునా ఆలికి మగనికి

చ. 3: రవ్వ మొక్కరొకరము రతిఁ జొక్కి యుండఁగాను
నవ్వేరేలే యిప్పుడిట్టె నాతులాల
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డీతఁడు
అవ్వలేమి నెంచనేలే ఆలికి మగనికి

రేకు: 1698-2 బౌళి సం: 26-583

పల్లవి: ఱట్టుసేసుకొనకు మాఁటిడియేల నీకు నీవే
పట్టితినంతే నీకొంగు బయలీఁదనేఁటికే

చ. 1: అంటుకొని నీ వేపొద్దు నాపెవెంటఁ దిరుగఁగా
నంటున నీమోము చూచి నగరాదా
బంట పంతమా యేమైనాఁ బచారించ నీతోను
అంటి నింతే సన్నకు సన్నంత కెక్కు డేఁటికి

చ. 2: సంతము నీవు నాపె సరసము లాడఁగాను
మంతనాన నే నొక మాటాడరాదా
దొంతిపూఁటా యేమైనా తొడరి బలిమిసేయ
కొంత కొసరితి నింతే గురిసేయ నేఁటికి

చ. 3: ఆరితేరి యాపె పెండ్లియాడి వచ్చియుండఁగాను
కూరిమి నీ కాఁగిట నేఁ గూడరాదా
మోరతోపా యేమైనా మొక్కితి శ్రీవేంకటేశ
తారుకాణించితి నింతే తమకించ నేటికి

రేకు: 1698-3 పాడి సం: 26-584

పల్లవి: ఆనతిచ్చితే నేమాయ నందుకేమే
వూని నేమెంతడిగినా నూరకుండేవేమే

చ. 1: చక్కఁగా నీయాతనిసందివావి యెట్టిదంటే
చెక్కుచేతితో సిగ్గున జెందేవేమే
పిక్కటిల్లి మీ మేనుల పెంజెమట గారీనంటే
తక్కక ఇంతటిలోనే తలవంచేవేమే

చ. 2: గట్టిగా నీతో నాతనికతలు నేఁ జెప్పఁగాను
గుట్టుతో నుందానవు వూఁకొనవేమే
జట్టిగా మీముందరను సరివిడేలు వెట్టితే
నట్టనడుమ నూరకె నవ్వు నవ్వేవేమే

చ. 3: తెలిసి చెలులమెల్లాఁ దెరమరఁగు వేసితే
చులుకఁగాఁ బెనఁగుచు సొలసేవేమే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
చలివాయఁ బొగడితే సారె మెచ్చేవేమే

రేకు: 1698-4 కాంబోది సం: 26-585

పల్లవి: అడుగవే నాగుణము అది తానే యెరుఁగును
అడరి నేఁ గలపుకోలై వుండనటవే

చ. 1: పంతమాడవద్దుగాని పైకొని రమణుఁడు దా
వంతుకు నవ్వి తిట్టితే వద్దనేనటే
వింతసేయవద్దుగాని వేడుకతో నూడిగాలు
యెంత సేయించుకొన్నాను ఇయ్యకొననటవే

చ. 2: గుట్టుసేయవద్దుగాని కూడిమాడి నాతోను
గట్టిగాఁ బెనఁగితేను కాదనేనటే
రట్టుసేయవద్దుగాని యిట్టె రతి నేకతాన
యెట్టు సేయించుకొన్నాను యెగ్గులెంచేనటనే

చ. 3: వాసి చూపవద్దుగాని వడి శ్రీవేంకటేశుఁడు
ఆస నెంత గూడినాను అలసేనటే
వేసరించవద్దుగాని వెలయ నన్నేలినాఁడు
చేసిన మేలెల్లానుఁ జేకోనటవే

రేకు: 1698-5 నట్టనారాయణి సం: 26-586

పల్లవి: ఏల వేసాలు చేసేవు యెఱంగనివానివలె
ఆలేమ వదినెయంటా నానలు వెట్టేవు

చ. 1: నీవు నాపె యేకతాన నిలుచుండి నన్నుఁగని
చేవమీర సన్నలేల సేసేవిపుడు
దేవి దేవరావలె దిష్టముగా మిమ్ము గంటి
కావరాన నే నేమైనా కాఁతాళించి తిట్టేనా

చ. 2: మేడమీఁద మీరిద్దరుఁ గూడియుండి నన్నుఁగని
ఆడకేల పిలిచేవు అప్పటినన్ను
వీడని దంపతులని వెస మిమ్ముఁ దెలిసితి
పాడిదప్పి నిన్నేమైనాఁ బచ్చిసేయవచ్చేనా

చ. 3: పీఁటమీఁద నొండొరులు పెనఁగుతా నన్నుఁగని
మాటువెట్టి నన్ను నెంత మన్నించితివి
చాటి శ్రీవేంకటేశ యీసతి లక్ష్మియనివింటి
నీటున నిన్నేమైనా నేరములెంచేనా

రేకు: 1698-6 రీతిగౌళ సం: 26-587

పల్లవి: తమ జాడలేల మాను తతు లొనగూడితే
మమకారములు సేసి మరిగేముగాక

చ. 1: వెలయఁగ మదనునివింటినారిఁ దగిలితే
కలువ పువ్వులేకావా కాఁడిపారేవి
అలరి మిక్కిలి విరహపువేళ వచ్చితేను
చిలుకపలుకులే కావా చిమ్మిరేఁచేవి

చ. 2: లావుగా వసంతకాలము లెదిరించితేను
కోవిలకూఁతలే కావా గురిదాఁకేవి
వావి గలపినచోట వలపులగ్గలమైతే
చేవైనమనసే కాదా చింతసేసేది

చ. 3: సటలకలగినాను చెంద్రోదయమయితే
పటికపురాయే కాదా బాద పెట్టేది
యిటు శ్రీవేంకటేశుఁడు యేలినాడు నన్ను నేఁడు
అటు చల్లగాలే కాదా అలపార్చేది

రేకు: 1699-1 రామక్రియ సం: 26-588

పల్లవి: ఎంత వేగిరకాఁడ వేమయ్యా నీవు
వంతురాకతొలుతనే వలపు చల్లేవు

చ. 1: మొక్కేనని చేతులు మొగి నుద్యేగించఁగానే
దిక్కున నందుకు ముందే దీవించేవు
అక్కరతో నవ్వు నవ్వ నాఇతపడఁగానే
చక్కఁగా చేముంచి నీవు సరసమాడేవు

చ. 2: తొడిఁబడ మాటలాడ దొరకొనే ననఁగానే
చిడుముడి నప్పుడే మెచ్చితిననేవు
అడరి నీమోము చూడ ఆసపడేననఁగానే
జడియక నామోము సారెఁ దోఁగిచూచేవు

చ. 3: చన్నుల నొత్తేనని సవరించుకొనఁగానే
వున్నతిఁ గాఁగిట నించి వొద్దికయ్యేవు
చెన్నుగా శ్రీవేంకటేశ సేసవెట్టేననఁగానే
నన్ను నేలి నీవు కంకణము గట్టేవు

రేకు: 1699-2 శుద్ధదేశి సం: 26-589

పల్లవి: ఏమిచెప్పే వాకెసుద్ది యేరా నాతోను
నేమము గలదియ్యైతే నిండుకొని యుండును

చ. 1: యెమ్మెలు చెప్పుకొనేది యెందైనా నొకతెగాని
వుమ్మడి నిల్లాలైతే నూరకుండును
నమ్మిక బాసడిగేది నడుమంత్రపుదిగాని
ఇమ్ముల మేనదియ్యైతే నెదురాడకుండును

చ. 2: కోపగించు కొనియేది కోటికి నొకతెగాని
కాఁపురము సేసేదైతే కాఁగకుండును
ఆపసోపానఁబడేది ఆరడికత్తియఁగాని
వోపి బత్తి గలదైతే వొద్దికతో నుండును

చ. 3: కావరించి తిట్టేది గయ్యాళి యొకతెగాని
వావివర్తనదియ్యైతే వచ్చి మొక్కును
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి కూడితివి నేఁడు
దేవులైనది యైతేను దీని కిట్టె మెచ్చును

రేకు: 1699-3 ఆహిరి సం: 26-590

పల్లవి: తరుణిఁ జూచి నాకు దయపుట్టెను
పరగ నెందాఁకా నెంత పరచితివయ్యా

చ. 1: నిలువునఁ బులకించె నిండాఁ జెమటగారె
చెలి నేమిసేసితివి చెప్పవయ్యా
అలకలెల్లాఁ జెదరె ఆయములు గరఁగెను
సొలసి నీ బలిమెంత చూపితివయ్యా

చ. 2: కన్నులకుఁ గెంపెక్కె కడు నిట్టూర్పులు రేఁగె
కన్నె నప్పు డేమంటివో కదవయ్యా
చెన్ను మీరె నలపులు సెలవుల సిగ్గుదేరె
మిన్నక నీ నేర్పు లెన్ని మెరయించితివయ్యా

చ. 3: పఱపుపైఁ బవళించె పచ్చిదేరె మేనెల్లా
గుఱిగా నీసతినెట్లు గూడితివయ్యా
నెఱియ శ్రీవేంకటేశ నిండె కళలు మోమున
జఱసి సరసమేమి జరపితివయ్యా

రేకు: 1699-4 సామంతం సం: 26-591

పల్లవి: ఎవ్వరుండే రెఱఁగరు యెదుట సిగ్గువడవు
పువ్వులనే వేసేవు పూఁచి పూఁచి

చ. 1: వెస నాపెమాటలు వినవేడుకయ్యీనో
కొసరుచు నడిగేవు కొచ్చి కొచ్చి
యెసగ మోముచూడ నేఁకటతో నున్నాడవో
ముసుఁగువట్టి తీసేవు ముంచి ముంచి

చ. 2: మలసి సరసమాడ మనసాయనో నీకు
కెలయుచు నవ్వేవు కేరికేరి
చలివాసి మోవితేనే చవి నీకుఁ బుట్టెనో
పొలయుచు వేఁడేవు పొంచి పొంచి

చ. 3: అట్టె యాపె చన్నులపై ఆస నీకుఁ బుట్టెనో
గుట్టుతోడఁ గొలచేవు కోరి కోరి
నెట్టన శ్రీవేంకటేశ నేడలమేల్మంగ యాకె -
నిట్టె కూడి నన్నేలితి వెంచి యెంచి

రేకు: 1699-5 కేదారగౌళ సం: 26-592

పల్లవి: నీ వొళ్ళిదే కల్లగాక నెలఁత యేమిచేసు
యేవిధమైనా నాయ సేమిసేయవచ్చును

చ. 1: గుట్టుతోడియాటదానిఁ గొంగువట్టి తియ్యఁబోతే
తిట్టవద్దా యాపె నిన్ను దిష్టముగాను
పొట్టఁ బొరుగాపెతోను పూఁచి నవ్వఁబోతేను
యెట్టు చేసినాఁ జేసె యేమి సేయవచ్చును

చ. 2: వోరుపుది గలదియంటా వొకటొకటాడితేను
గీరవద్దా ఆపె నీ మై కేరడానను
వూరిలోనిసతి నీవు వొంటినుండి పిల్చితేను
యేరీతి మీరినా మీరె నేమిసేయవచ్చును

చ. 3: చెప్పినట్టు సేసునంటా సిగ్గులువరచితేను
తప్పు లెంచవద్దా నిన్ను దమకానను
అప్పడే శ్రీవేంకటేశ ఆపె నిట్టె కూడితివి
యెప్పుడు మెచ్చినా మెచ్చె నేమిసేయవచ్చును

రేకు:	1699-6 గౌళ	సం:	26-593

పల్లవి:	ఇందవయ్యా కానికె ని న్నింత దోడితెమ్మనె
	పొంద్దైనచోటను పొసఁగఁగవలదా

చ. 1:	వలచినదిగనక వనిత నిన్నుఁ బాసి
	యెలమి దూరితే నెగ్గులేల పట్టేవు
	చెలఁగి పెక్కుసతులఁ జేసుకొన్న వాఁడవు
	పలుమారు మాఁటలఁబడ కిఁకఁబోవునా

చ. 2:	అనుపైనది గనక నగుతా నీతోఁ బెనగి
	చెనకితే నాఁటడేల సేయవచ్చేవు
	వొనర నెందరికైనా నొడిగట్టినవాఁడవు
	తనివోని చేఁతలకుఁ దప్పించుకోవచ్చునా

చ. 3:	వురముపైది గనక వువిద నీరతులను
	వొరసికూడితేనేల వొడ్డుకొనేవు
	సరవి శ్రీవేంకటేశ జారపురుషుఁడవు
	తిరమైన చన్నులతో దీకొనఁగవసమా

రేకు: 1700-1 ముఖారి సం: 26-594

పల్లవి: ఎంత వేసరించవచ్చు యేపొద్దు నిన్ను
పంతగాఁడ నీ చిత్తము భాగ్యము నాది

చ. 1: నిచ్చ నిచ్చ నీకు నవ్వు నేరుపఁగఁగలనా
కచ్చు పెట్టి నీయంతనే కలితేఁగాక
మెచ్చులుగా వలపులు మెడఁగట్టఁగలనా
పచ్చిగా నాయందు నీకు బత్తి గలితేఁగాక

చ. 2: వొడివట్టి నిన్నొద్దఁ గూచుండఁ బెట్టఁగలనా
బడి నీయంతనే నన్నుఁ బైకొంటేఁగాక
గుడిగొనఁ జెమటలు కురియించఁగలనా
కడలేని తమితోడ గరఁగితేఁగాక

చ. 3: మలసి బలిమిచేసి మరిగించఁగలనా
చెలిమి నీయంతనే చేసితేఁగాక
యెలమి శ్రీవేంకటేశ అలమేల్మంగనై నేను
కలసితి నింకా నీవే కరుణింతు గాక

రేకు: 1700-2 సాంళగం సం: 26-595

పల్లవి: ఎంతటివాఁడవు నీవు యేమని మెత్తుము నిన్ను
పంతములు చెల్లించి పైకొంటివి నన్నును

చ. 1: సన్నసేయవచ్చుఁగాక సంగతికి వచ్చితేను
యెన్నికతోడుతఁ జనవియ్యవచ్చునా
పన్ని నవ్వవచ్చుఁగాక పైకొని పెనఁగితేను
నిన్నువలెఁ కూరిములు నించవచ్చునా

చ. 2: పొందు సేయవచ్చుఁగాక పొంతనుండి మొక్కితేను
చెంది చెప్పినట్టెల్లాను సేయవచ్చునా
అందుకొనవచ్చుఁగాక అట్టె వీడెమిచ్చితేను
యిందే నీవలెను మోవియ్యవచ్చునా

చ. 3: చేయి వేయవచ్చుఁగాక చేరి కాఁగిలించుకొంటే
ఆయములంటుతు కలయఁగవచ్చునా
యీయెడ శ్రీవేంకటేశ ఇట్టె నన్ను నేలితివి
నాయమెరిఁగి నీవలె నమ్మించవచ్చునా

రేకు: 1700-3 బౌళి సం: 26-596

పల్లవి: ఇంతిపై మొగమోటాన నేల లోఁగేవు
సంతసాన నీవు నాపె సందిసేయరాదా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి సేసలు చల్లీ నాకె
సెలవి నవ్వ నీవేల సిగ్గువడేవు
నిలువ దమకములు నిండుకున్న వాకెమీఁద
పిలిచి సరికి బేసిఁ బెనంగరాదా

చ. 2: వచ్చి వచ్చి నీ మీఁద వసంతమాడీ నాకె
తచ్చి తలవంచి యేల తడబడేవు
మచ్చికతో బులకలు మలగొన్న వాకెమేన
పచ్చి సరసా లెదురుబడి నాడరాదా

చ. 3: సారె సారె నిన్ను గట్టిచన్నుల నొత్తీ నాకె
కూరిమి నీవేల యింకా గుట్టుచేసేవు
యీరీతి శ్రీవేంకటేశ యేలితి వాకె, కాఁగిట
మేరతోడ నీడుజోడై మెలఁగఁగరాదా

రేకు: 1700-4 పళవంజరం సం: 26-597

పల్లవి: నిందుకొనియుండినదే నేరుపుగాక
కొండుక పాయపువానిఁ గోపగించవలెనా

చ. 1: యేదో సతులతో నీ వేలాటాలాడితివంటా
ఆడరాని మాటలు నే నాడవచ్చునా
వేడుకకానికి మరి వివరించ నేడ పాటి
చూడ నందుకు దోడు నిష్ఠురము గావలెనా

చ. 2: చాయలఁ బొరుగాపెకు సన్నలు చేసితివంటా
చేయరాని సేఁతలు నేఁ జేయవచ్చునా
దాయగాఁడైనవానికి దాక్షిణ్యమేమున్నది
రాయడి నిదీఁ గొంత రవ్వ సేయవలెనా

చ. 3: యెవ్వతెకైనా నీవు యిచ్చకముసేతువంటా
నవ్వరాని నవ్వులు నే నవ్వవచ్చునా
యివ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అవ్వల నింకా రతి నలయించవలెనా

రేకు: 1700-5 భైరవి సం: 26-598

పల్లవి: చెలువుఁడు చేసినట్టె సేయరాదా
సొలతురా నయములే చూపుదురు గాక

చ. 1: సరసమాతఁ డాడఁగా సణఁగు రాలుతురటె
వరుసతో నిచ్చగించవలెఁ గాక
శిరసెత్తి మాటాడఁగా సిగ్గులు వడుదురటె
సరగ మోహములు రేఁచఁగవలెఁగాక

చ. 2: చెక్కులాతఁడు నొక్కఁగా సెలసి జంకింతురటే
వక్కణతోఁ గడుమెచ్చవలెఁగాక
దక్కి చేయిచాఁచగాను తప్పించుకోఁదగునటే
యెక్కువ నీమోవితేనే వియ్యవలెఁగాక

చ. 3: కళ లాతఁ డంటఁగాను కాఁగిట మలతురటే
యలసినట్లాఁ గూడవలెఁగాక
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నలయింతురటే
కెలపు రతులను చొక్కించవలెఁగాక

రేకు: 1700-6 బౌళి సం: 26-599

పల్లవి: ఆతఁ డొక్కటి సేయఁగా అట్టె వొకటిసేయ -
కీతరిఁ జేకొనరాదా యెలయించనేఁటికి

చ. 1: ముప్పిరి నీరమణుఁడు మోహములు చల్లఁగాను
రెప్పలెత్తి చూడరాదా రేసులేఁటికి
తెప్పలుగా నవ్వఁగాను తేనె మోవి ఇచ్చి నీవు
దప్పి దేరుచుఁగరాదా తప్పులెంచనేఁటికి

చ. 2: చెలఁగి నీమేనబావ చెనకి పిలువఁగాను
పలుకరాదా వట్టిపంతాలేఁటికి
చెలిమి సేయఁగాను చేరి విడెమిచ్చి నీవు
అలపారుచఁగరాదా అడ్డమాడనేఁటికి

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేకొని కలయఁగాను
సేవలు సేయఁగరాదా సిగ్గు లేఁటికి
యీవల నిన్నురమున యిడుకొని వుండఁగాను
గావించి మెచ్చఁగరాదా పరవశమేఁటికి

రేకు: 1701-01 దేసాళం సం: 27-001

పల్లవి: అన్నిటా నేర్పరులైతి రౌనయ్యా
పన్ని పానుపుమీఁదటఁ బవళించరయ్యా

చ. 1: పెనఁగఁగఁ బెనఁగఁగఁ బెంజెమటలు గారిని
మనసు లొక్కటులాయ మానరయ్యా
వనితకు నీకును వలపులు సరిదాఁకె
ననుపు లొనగూడెను నవ్వరయ్యా

చ. 2: తగులఁగఁ దగులఁగ తమకములు రేఁగెను
తగు నిద్దరికి సిగ్గు దాఁచుకోరయ్యా
మొగముల నీకు నీకు ముంచె నివె కళలెల్లా
తగవాయ వేడుకలఁ దనివందరయ్యా

చ. 3: కూడఁగఁ గూడఁగ కూరిములు నిండుకొనె
జోడాయ మీతనువులు చొక్కరయ్యా
తోడనె శ్రీ వేంకటేశ దొరసె మీరతులెల్లా
పాడితో నేకాలమునుఁ బాయకుండరయ్యా

రేకు: 1701-02 వరాళి సం: 27-002

పల్లవి: ఏమిసుద్దు లడిగేవు ఇంకా మమ్ము
గామిడివైతి వనఁగా కడఁగి మెచ్చితిమి

చ. 1: వాడలలోనెల్లా నీవు వలపు చల్లితివని
వేడుకగా మాటలెల్లా వింటిమి నేము
వాడికతో నీకు నన్నివావు లొక్కటాయనని
ఆడుకోఁగా నేము వెరగందితి మిందరము

చ. 2: కోరికతో నీవు పెండ్లికొడుకవై యుండఁగాను
చేరి సంతోసాలెల్లాఁ జూచితిమి నేము
దూరుగా నీమోవి గొల్లదోమటాయ ననఁగాను
నారుకొన్న ప్రేమతోడ నవ్వితి మిందరము

చ. 3: సుదతులకెల్లాను చుట్టమవైనందుకు
కెలసి యానందానఁ జొక్కితిమి నేము
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి మమ్ము నేఁడు
కలసినరతులఁ బొగతిడి మిందరము

రేకు: 1701-03 పాడి సం: 27-003

పల్లవి: ఆఁటదానిఁ గంటేఁజాలు అట్టె లోలుఁడ వౌదువు
మాఁటల నాపెతోఁ గూడ మరచివచ్చితివా

చ. 1: తతితోడ నీ విప్పుడు తన ఇంటికి రావంటా
సతి నిన్నుఁ గొసరీని సముకానను
మితిలేనివాడలెల్లా మెట్టివచ్చితి విందాఁకా
వెతదీర నాడకుఁబో వేళ లేదాయనా

చ. 2: సారెఁ దనతో సరసములాడవైతివంటా
వూరకె తప్పులెంచీ నీవొద్దనే వుండి
నేరుపుతో కతలెల్లా నేరిచినవాఁడవు
యీరీతి నీపెవలపు యెరఁగలేవైతివా

చ. 3: అన్నిటాను తన్నుఁగూడి ఆయా లంటవైతివంటా
కన్నుల సన్నలు చేసీ కాఁగిటిలోను
ఇన్నిటా శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తిన్నఁగా నాపెవలపు తెలుసుకోవైతివా

రేకు: 1701-04 శ్రీరాగం సం: 27-004

పల్లవి: సుదతి నీచరితలు చూచీఁగాక
యెదిరించి పైకొంటే నేమనేవు

చ. 1: సింగారించుకొని వచ్చి చెలి నిలుచుండఁగాను
అంగవించి వద్దికి రమ్మని యనవు
కొంగువట్టి తీసి నిన్నుఁ గూరిమిగొసరి మోవి
యెంగిలి చేసితే నాపె నేమనేవు

చ. 2: కలువలు గానుకిచ్చి కాంత నీమోము చూడఁగ
పిలిచి యాపెఁగూచుండఁబెట్టు మనవు
బలిమి నిన్నుఁ బరపుపైఁ బవళించఁజేసి
యెలమి నాపె మీరితే నేమనేవు

చ. 3: అట్టె గందవొడి చల్లి అలమేలుమంగ నవ్వఁగా
దిట్టవై సిగ్గులుదేరఁ దెరవేయవు
గుట్టున శ్రీవేంకటేశ కూడె నిన్ను నీకె యిఁక
యెట్టు దమకించినాను యేమనేవు

రేకు: 1701-05 శుద్ధవసంతం సం: 27-005

పల్లవి: ఊరకున్నయాఁటదాని నొకటాడేవు
మేర మీరేనా నిన్ను మెరయించేఁగాక

చ. 1: రామలతో నీసుద్దులు రాఁపుగాఁ జెప్పెనా యింతి
బూము లెరఁగఁగ నిన్నుఁ బొగడేఁగాక
చేముట్టి నీమేన నిండాఁ జేఁతలెల్లాఁజేసెనా
సాములు నేరుతువని జరసేఁగాక

చ. 2: కినిసి నీపైఁ జెలి కేరడము నెరపెనా
ననుపు చేసుక కొంత నవ్వేఁగాక
యెనలేక నిన్నుఁ గడు యెంగిలి సేసెనా నేఁడు
చనవున మోవితేనె చవిచూపేఁగాక

చ. 3: అలమేలుమంగ నిను నలమటఁ బెట్టెనా
సొలపులరతి నీకుఁ జూపేఁగాక
యెలమి శ్రీ వేంకటేశ యీపె గోర నూఁదెనా
కళలనేర్పులు నీకుఁ దెలిపేఁగాక

రేకు: 1701-06 మధ్యమావతి సం: 27-006

పల్లవి: మీరైనా బుద్ధి చెప్పరే మెలుఁతలాల
యీరీతివానితో నే నేమనఁగఁగలనే

చ. 1: యేకతానఁ దాను నాపె యింటిలోన నుండఁగా మిమ్ము
సాకిరివెట్టుతలేదా సతులాల
దీకొని సాదించవచ్చి తిరిగి తిరిగి నాతో
యీకడ నీతని నే నేమనఁగఁగలనే

చ. 2: మనసిచ్చి తానుఁదాను మాటలాడుకొనఁగాను
వినిపించనా మీకు వెలఁదులాల
పనివడి యీమాటకు పరాకులు సేసీని
యెనసి యిట్టివానితో నేమనఁగఁగలనే

చ. 3: అన్నిటాఁ దాము జూజాలాడుకొనఁగా మీకు
సన్నలఁ జూపుటలేదా సకియలాల
చిన్నియలమేల్మంగను శ్రీ వేంకటేశుఁడు గూడె
యెన్నఁగ నన్నూ నేలె నేమనఁగఁగలనే

రేకు: 1702-01 శుద్ధవసంతం సం: 27-007

పల్లవి: రమణుఁడ నామన సరయవు గాక
సముకాననే సేసచల్లఁగ వద్దనేనా

చ. 1: యెమ్మెల వూరకే బయలీఁదించవద్దు గాని
కమ్మి నీ వింటికిరాఁగాఁ గాదనేనా
నమ్మికల కూరకే నవ్వు నవ్వవద్దు గాని
చిమ్ముచు బత్తితో నేమి సేసినా వద్దనేనా

చ. 2: అగడుగా యెడమాట లాడించవద్దు గాని
తగిలి చన్నులంటఁగాఁ దగదనేనా
సొగిసి యాసలఁబెట్టి జోలిసేయవద్దు గాని
వొగి నెంత పెనఁగినా నోపననేనా

చ. 3: ఇచ్చకములాడి నన్ను యెలయించవద్దుగాని
కొచ్చి యిట్టె యేలితివి కూడదనేనా
అచ్చపు శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
నిచ్చా సేవ సేయుమంటే నేర ననేనా

రేకు: 1702-02 ఆహిరి సం: 27-008

పల్లవి: ఓరుచుక గుట్టుతోడ నుందానఁ గాక
సారె నేఁ దడవితేను చండి సేసీ ననవా

చ. 1: కూరిములు చల్లఁగాను కోపగించరాదు గాక
నేరము లెంచేనంటే నీ యందు లేవా
తారుకాణించవచ్చేవు తగవులు నెరపేవు
నేరుపు లిందేమున్నవి నీ మన సెరఁగదా

చ. 2: యేకాంతమాడ రాఁగా యేమీననరాదు గాక
కాకు చేసితే మారాడఁగలవా నీవు
నీకు నీవే బిగిసేవు నిజములు చేసేవు
వాకుచ్చునేఁటికి నిన్ను వాడవా రెరఁగరా

చ. 3: చనవిచ్చి కూడఁగాను సాదించరాదు గాక
వెనకటి నీ సుద్దులు వినవచ్చునా
నిను శ్రీ వేంకటేశుఁడ నే నలమేలుమంగను
పెనఁగినా మనలోన భేద మున్నదా

రేకు: 1702-03 వరాళి సం: 27-009

పల్లవి: నీకేమి యిందరిలో నేనే రట్టైతిఁ గాక
చేకొని మగవాఁ డేమి సేసినాఁ జెల్లును

చ. 1: వెగటుగా నేను నీవెంటవెంటఁదిరుగఁగా
నగుఁబాటులాయఁగా నా వలపు
నిగిడి కట్టు గాచుక నీవాకిట నుండఁగాను
నగరు పుట్టెఁగా నేఁడు నావలపు

చ. 2: నేను నీవుఁ గూడుక నిండుసరసాలాడఁగ
నానాటఁ బెరిగెఁగా నా వలపు
పేని పట్టి నీతోడ బెనఁగులాడఁగాను
నానెఁగా చెమటల నా వలపు

చ. 3: కూరిములు నీమీఁద కొసరి నేఁ జల్లఁగాను
నారుకొని బలిసెఁగా నా వలపు
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నారతులె తెలిసెఁగా నావలపు

రేకు: 1702-04 వరాళి సం: 27-010

పల్లవి: ఏల నన్ను గబ్బియనే విందుకుగాను
చాలా నవ్వితిఁగాక చలమా నీతోను

చ. 1: తెరలోఁ దురుమువట్టితీసి దూరులెల్లా దూరి
సరసమాడితిఁ గాక చలమా నీతో
వొరయుచుఁ గాతరాన వొడివట్టితీసి రతి- -
సరవి చూపితిఁగాక చలమా నీతోను

చ. 2: బలిమిఁ జన్నుల నొత్తి పంతముతోడఁబెనఁగి
చలివాపితిఁగాక చలమా నీతో
ములువాఁడి కొనగోర నూఁది మోవిమీఁద గంటిసేసి
సలిగె చూపితిఁగాక చలమా నీతోను

చ. 3: కవగూడి యేకతాన కాఁగిటిలోఁ జొక్కించి
జవళిఁ బైకొంటిఁగాక చలమా నీతో
ఇవల శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చవులు చూపితిఁగాక చలమా నీతోను

రేకు: 1702-05 గౌళ సం: 27-011

పల్లవి: తానేల లోఁగీ నిదె తనలోఁదాను
వూనిన పంతములకు వోరసేనా నేను

చ. 1: పోరచిసతులతోను బొందు లెంతసేసినాను
తారుకాణించవచ్చేనా తనతో నేను
సారె సారె విన్నపాలు సతులచే వింటేను
ఆరసి చెప్పుమనుచు నడిగేనా నేను

చ. 2: చక్కఁదనా లెవ్వరిని చపులుగాఁ బొగడినా
కక్కసించి వద్దనేనా కమ్మటి నేను
కిక్కిరియ మరి నెంత కిందుపడి గూడినాను
చిక్కించు కెవ్వరికైనాఁ జెప్పేనా నేను

చ. 3: చెలులచే నేమేమి సేవలు సేయించుకొన్నా
చెలరేఁగి యాగడాలు సేసేనా నేను
యెలమి శ్రీ వేంకటేశుఁడేలినాఁడు తానె నన్ను
చలము లేమిటికైనా సాదించేనా నేను

రేకు: 1702-06 రామక్రియ సం: 27-012

పల్లవి: ఈకెకు నీకు నింకా నేమి ప్రియము
కైకొను మిందులో నీకుఁగలవెల్లాఁ బ్రియము

చ. 1: తగులైన రతులకు తలపోఁతలే ప్రియము
నగవుఁ జూపులకు సన్నలే ప్రియము
తెగని కోరికెలకు తియ్యమోవులే ప్రియము
పలుకుఁ జేఁతలకును పలుకులే ప్రియము

చ. 2: జట్టి గొన్నమోహాలకు సరసములే ప్రియము
చుట్టరికములకు మెచులే ప్రియము
నెట్టుకొన్న యాసలకు నిలుకడలే ప్రియము
గట్టియైనపొందులకు గర్వములే ప్రియము

చ. 3: మంతనాన నున్నందుకు మందె మేళాలే ప్రియము
పొంతనేరుపులకు నోర్పులే ప్రియము
ఇంతట శ్రీ వేంకటేశ యేలితివి చెలియను
సంతతపు కూటమికి చనవులే ప్రియము

రేకు: 1703-01 సామంతం సం: 27-013

పల్లవి: కంటిమి మీసరితలు కందువగాను
ఇంటికి రావయ్యా యీడనేల చెనకేవు

చ. 1: మగువయు నీవును మాటలాడుకొనఁగాను
చిగురాకు మోవులపై చిల్లులాయను
నగవులు లోలోనె నవ్వఁగాను దట్టములై
బిగువుఁ జెక్కుల మీఁదఁ బేంట్లాయను

చ. 2: తనియక వొండొరులు తమకానఁ బెనఁగఁగా
తనువున చెమటలు ధారలాయను
గొనకొని మీఁద మీఁదఁ గొచ్చి కొచ్చి చూడఁగాను
పొనుఁగక మెడలకు పూదండలాయను

చ. 3: చెలఁగి మీరిద్దరుఁ బై చేతులు చాఁచుకొనఁగా
పులకలు నిలువులఁ బోగులాయను
యెలమి శ్రీ వేంకటేశ ఇంతలో నన్నేలితివి
తలకొన్న వలపులు తారుమారులాయను

రేకు: 1703-02 పాడి సం: 27-014

పల్లవి: అట్టె కాచుకున్నదాన నప్పటనుండి
గట్టువాయతనమేల కరుణించరాదా

చ. 1: వాసితో నీసేవ సేయవచ్చి నేఁ గాచుకుండఁగా
ఆసలనే పెట్టేవు అప్పటనుండి
సేస నీపై నేఁ బెట్టఁగా చెమరించె నామేను
గాసిఁ బెట్ట కిఁకనైనాఁ గరుణించరాదా

చ. 2: పాయలేక నీకొంగుపట్టి నేఁ బెనఁగఁగాను
ఆయితాలే సేసేవు అప్పటనుండి
చేయి నీపైఁ జాఁచఁగాను చిమ్మి రేఁగె మైఁగాక
కాయకపు మాటలేల కరుణించరాదా

చ. 3: కందువనుండి నే నిన్నుఁ గాఁగిట (టి?)కిఁ బిలిచితే
అందాలుగా నవ్వు నవ్వే వప్పటనుండి
పొందితి విప్పుడు నన్ను పొసఁగ శ్రీ వేంకటేశ
కందుదేరె నిఁక నిట్టె కరుణించరాదా

రేకు: 1703-03 బౌళి సం: 27-015

పల్లవి: కూడినవేళ గుణము కొత్తలాయను
వేడుక వెదచల్లితే వెరగాయ నీకు

చ. 1: చాయల నాపెకు నీకు జగడము దిద్ది నేను
నాయముచెప్పితే నేఁడు నవ్వులాయను
కాయజ కేలిని నీవు కళదాఁకి చొక్కఁగాను
చేయివట్టి తీసితేను సిగ్గులాయ నీకు

చ. 2: వున్నతి మీరిడుకొన్న వొట్లు వద్దని నేను
విన్నవించి మొక్కితేను వింతలాయను
కన్నెపాయపుమదాన కడు వెరగందఁగాను
సన్నలనే మెచ్చితేఁ దచ్చనలాయ నీకు

చ. 3: మిమ్ముఁ జాయలకుఁ దెచ్చి మెరయఁ గూడించితేను
సమ్మతి శ్రీ వేంకటేశ చవులాయను
ఇమ్ముల నన్నేలితివి ఇంతలోనే వలపులు
కుమ్మరించితే రతులు గురులాయ నీకు

రేకు: 1703-04 సాళంగనాట సం: 27-016

పల్లవి: కాఁగిటికి వచ్చి నీవు కలసినప్పుడుగాక
మాఁగిన మోవి చూపఁగ మరి లాభమేమి

చ. 1: జట్టిగొని నాతోను సరసములాడేవు
వట్టి జోలి దవ్వఁగాను వచ్చేదేమి
చుట్టి చుట్టి యప్పటిని చుట్టరికాలు చెప్పేవు
బట్టబయ లందులో పనిగొనే దేమి

చ. 2: నానఁబెట్టి నీవు నాతో నవ్వులెల్లా నవ్వఁగాను
పూనిపట్టి ఇంతలోనే పొందేదేమి
మానలేక పై పై యెడమాట లిట్టె యాడించఁగా
కానిమ్మని ఇక మరి కట్టుకొనే దేమి

చ. 3: తేరకొని నాదిక్కే దిష్టించి చూడఁగాను
మేరమీరి నాపంతము మెరసేదేమి
గారవించి నన్నేలితి గక్కన శ్రీ వేంకటేశ
కోరికె చెల్లెను యింకాఁ గొసరేదేమి

రేకు: 1703-05 మంగళకౌసిక సం: 27-017

పల్లవి: ఏల వూరకుండానవు యిట్టే నివ్వెరగుతో
మూలఁ బొద్దు వుచ్చితేను ముచ్చట వాసీనా

చ. 1: మంతన మాడేవేళనే మాటలు వెలుచుకొని
కాంతుని చిత్తమెల్లాను కనుకోరాదా
సంతసతులలో (తో?) నెన్ని జాణతనా లాడినాను
యెంతైనా రతికేలికి నీడు వచ్చీనా

చ. 2: పెనఁగేటి వేళనే ప్రియునిచేఇదుకొని
చెనకి సేఁతకు సేఁత సేయరాదా
యెనయక రచ్చలోన యెంత చేయి ముట్టినాను
తనువులు సోఁకినట్లు దప్పిదేరీనా

చ. 3: భావించి కూడేవేళనే పై పైఁ బ్రియాలు చెప్పి
శ్రీ వేంకటేశు చనవు చేకొనరాదా
వొవరిలోఁగూచుండి వుపమ నెంత నవ్వినా
తావిమీకాఁగిటివలె తనివి నొందీనా

రేకు: 1703-06 దేశి సం: 27-018

పల్లవి: ఏల సేసేవు మాయలు యెందాఁకానైనాను
చాలుఁ జాలు నాపె కిట్టె చనవియ్యరాదా

చ. 1: చేరఁడేసి కన్నులాపె చేరి నిన్నుఁ జూడఁగాను
దారకపు నీచేఁతలు దాఁచఁగలవా
గోరగిరి వలపులయేరులు పైఁబరపఁగా
ఆరితేరే నీమనసు అడ్డ పెట్టఁగలవా

చ. 2: తీవెలవంటి చేతులవెఱవ నిన్నంటఁగాను
ఆవలికి నీకోరికె లంపఁగలవా
మోవి తీపు నాములెల్లా ముంచి తలకెక్కఁగాను
కావరపు నీమరులు కడు దించఁగలవా

చ. 3: కొండలంతలు చన్నులకొమ్మ నిన్నుఁ గూడఁగాను
అండ శ్రీ వేంకటేశ పాయఁగఁగలవా
దండి వేడుకల సంపదలు మీఁదఁ గప్పఁగాను
మెండైన పరవశాలు మీరఁగఁ గలవా

రేకు: 1704-01 దేవగాంధారి సం: 27-019

పల్లవి: తానేల సిగ్గువడీని తనతో నే నేమనేను
పూనిపట్టి చెలులాల బుద్ది చెప్పఁగదరే

చ. 1: చిప్పిలఁ దానూ నేనుఁ జేసుకొన్న బాసలకు
తప్పులెంచ నున్నదా తనపై నేను
కుప్పళించి పెంజెమటఁ గురియఁగా నే మొక్కితేను
పిప్పిగట్టఁ బెదవులఁ బిలువరే విభుని

చ. 2: సొగసి ఇద్దరికిని చుట్టరికమైనందుకు
తగదని కోపించేదా తనతో నేను
నిగిడి నిట్టూర్పులు నిండఁగా నేఁ బెనఁగేను
జిగి నన్ను నేలుమని సేయరే సేవలు

చ. 3: బెరసి మేనవారమై పెండ్లాడినయందుకు
వొరసి గోరగీరేనా వొళ్లిపై నేను
ఇరవై శ్రీ వేంకటేశు నిన్నిటా నేఁ బొగడేను
నిరతపు మన్ననలు నించుమనఁగదరే

రేకు: 1704-02 భూపాళం సం: 27-020

పల్లవి: ఏమేమి నేర్పెనో యీరమణి నీకును
వేమరు నాకె బుద్ధుల వెలసేవు నీవు

చ. 1: నెట్టన నిందాఁకా నాతో నిజములు పచరించి
ముట్టివచ్చితే నాపె మోము చూచేవు
గట్టిగా నేర్చుకొనింకాఁ గొన్ని గలిగితే
అట్టె మరఁగునఁ బోఇ అడుగఁగరాదా

చ. 2: జోకగా నప్పటనుండి చుట్టరికములే చూపి
దీకొంటే నాపెఁ దోడుదెచ్చుకొనేవు
మేకొని యాపె బలిమి మెరఇంచవలసితే
యేకతాన నుండి సాము లెరుఁగుకోరాదా

చ. 3: అంకెల నీవివి (నీవి?)ప్పు డిట్టె ఆసతోడ నన్నుఁగూడి
జంకించితే నీ వాపెకు సన్నసేసేవు
ఇంకా శ్రీ వేంకటేశ నేఁ డీఁడు చూపవలసితే
కొంకక నీయింట నిడుకొని వుండరాదా

రేకు: 1704-03 లలిత సం: 27-021

పల్లవి: విచారించుకోవుగాక వేడుకకాఁడవు నీవు
పచారించఁ బోతేను నీపై నిట్టె మోవదా

చ. 1: సొలసి మాటలాడేటి సుదతిని విభుఁడవు
పలుకులలో నెగ్గులు పట్టఁదగునా
వలపించితి వాకెను వద్దనుండనినేరమి
నెలకొని వెదకితే నీ వొళ్లిదే కాదా

చ. 2: కొసరి చేతులు చాఁచే కోమలిచేఁతలకుఁగా
యెసఁగ వాసులువంతు లెంచవచ్చునా
వెసఁ బెండ్లాడితి వేవేల కోర్వకుండితే
అసుదుగా నిన్నె దూరి అందరూను నాడరా

చ. 3: కందువ నిన్నుఁగూడిన కాంతను శ్రీ వేంకటేశ
పొందుల రతులయలపులు చూతురా
సందడిఁ బెనఁగితివి సారె మెచ్చకమానితే
కిందటి పనులకు నీకె దయపుట్టదా

రేకు: 1704-04 బౌళి సం: 27-022

పల్లవి: సేయఁగలట్టల్లా నీవు సేతువు గాక
పాయపు మదమువానిఁ బనిగొనవసమా

చ. 1: చెనకి యెవ్వతెకైనాఁ జేతులు చాఁచేవు నీవు
మనసు మర్మము లేమీ మరి యెంచవు
ఘనుఁడైన మగవాఁడు కడు మితిమీరితేను
చనవున నెవ్వరికిఁ జిక్కఁబెట్ట వచ్చునా

చ. 2: నంటున నెవ్వెతెఁ గన్నా నవ్వులు నవ్వేవు నీవు
అంట ముట్టఁ దగువేళ లని చూడవు
కంటులేని బలుదొర కక్కూరితి సేసితేను
యింటికాడ సతులెల్లా నిఁక దిద్దఁ గలరా

చ. 3: గక్కన నెవ్వతెఁ గన్నా కాఁగిటఁ గూడేవు నీవు
తక్కిన నేరుపు లేమీఁ దలపోయవు
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెక్కడా జాణైనవాని నెలయించనగునా

రేకు: 1704-05 కాంబోది సం: 27-023

పల్లవి: ఏమి సేతు నన్ను నేనే యేమనుకొందును
ఆముకొని నీపై మోహ మడ్డ పెట్టఁ జాలను

చ. 1: చలములకోపనూ సాదించ నోపను
వలవ నోపుదు నీకు వాసితోను
మొలకలు చన్నులూ మొగమెల్లాఁ గన్నులూ
సొలసి సొలసి నిన్నుఁ జూడకుండఁ జాలను

చ. 2: మాయలేమీ నేరనూ మచ్చరించ నేరను
పాయకుండ నేరుతు నీ పాదాల వద్ద
అ(అ?)యాలు దాఁకె సిగ్గులు అంటె నవ్వులముగ్గులు
చాయలా సన్నలా సరసము లాఁపఁజాలను

చ. 3: వేసాలు నేఁ జేయను వెస నిందవేయను
సేవ వేతు నీమీఁద శ్రీ వేంకటేశ
రాసి నీవే కొనగోళ్లు రతులు వెన్నెల పోళ్లు
బాసలిచ్చి కూడితివి పచ్చి సేయఁజాలను

రేకు: 1704-06 వరాళి సం: 27-024

పల్లవి: అన్నియు నేనెఱుఁగుదు నన్నుకోనేలా
కన్న విన్నవెల్లా నీ కతలే కదా

చ. 1: పెచ్చురేఁగి సారె సారె ప్రియములెంత చెప్పినా
మచ్చిక గరఁగేది నీమనసే కదా
ముచ్చటతో నిట్టె నే మొక్కు లెన్ని మొక్కినాను
కచ్చుపెట్టి చూచేవి నీ కన్నులే కదా

చ. 2: బోరన వేఁడుకొనుచు బుద్ధు లిన్ని చెప్పినాను
కోరి మంచిదయ్యేది నీ గుణమేకదా
గారవించి నేనెంత కరములు చాఁచినాను
మేరతో లోనయ్యేది నీ మేనేకదా

చ. 3: తలపోసి తలపోసి తమి యెంత రేఁచినాను
కలసి వుండేది నీ కాఁగిలే కదా
యెలమి శ్రీ వేంకటేశ యేలితివి నన్నీ నేఁడు
నెలకొన్నవాఁడవు నీవే కదా

రేకు: 1705-01 ఆహిరి సం: 27-025

పల్లవి: అద్దో యెక్కడిసుద్ది అంతేసి కోపఁగలనా
గద్దించ నీతో నాకుఁ బెద్దరికమా

చ. 1: చెలఁగి నీవేమి చేసినాఁ జేసితివి గాక
చలములు సాదించ సరిదాననా
సెలవుల నవ్వేవు నీ చిత్తము కొలఁది గాక
మలసి నే మారునవ్వ మందెమేళమా

చ. 2: కొచ్చి కొచ్చి నీ వెంత కొంగువట్టి తీసినాను
పచ్చిదేరఁ బెనఁగ కోపపుదాననా
యెచ్చరించి సారె సారె నిక్కువ లంటేవు నీవు
గచ్చుల నేనూ నొరయఁ గండ గర్వమా

చ. 3: యిక్కువ శ్రీ వేంకటేశ యేలితివంటా నేను
నిక్కి యెమ్మె సేయ నీతో నీటుదాననా
మక్కువచేసి నన్ను మన్నించితివి రతుల
అక్కరతోఁ గొసరఁగ ఆసోదమా

రేకు: 1705-02 నారాయణి సం: 27-026

పల్లవి: నమ్మ వే చెలి ఇందుకు నాపూఁట
వుమ్మడిఁ దలవంచుక వూరకుండనేలే

చ. 1: తప్పక చూచినవాఁడు తానే యింటికి రాఁడటె
దప్పులఁ బొరలి యేల తమకించేవే
కప్పురాన వేసి తాను కాఁగిటఁ బొందకుండీనా
చిప్పిలుఁగాఁకల నీకుఁ జిన్నఁబోనేలే

చ. 2: మాటలాడినవాఁడు మర్మము సోఁకించఁడటె
గాఁటపు విరహమునఁ గలఁగకువే
తేటగా నవ్విన తాను తేనెమోవి యొసఁగఁడా
చీటికి మాటికి నీకుఁ జింతించనేలే

చ. 3: సేసలు వెట్టినవాఁడు సిగ్గులు దేరుచఁడటె
వేసాలకు నీవేల వెరగందేవే
ఆసల శ్రీ వేంకటేశుఁడంతలో నిన్నిట్టె కూడె
రాసికెక్కె వలపు వెరపు లెంచనేలే

రేకు: 1705-03 భైరవి సం: 27-027

పల్లవి: పాయక నన్నేలుమని పడఁతులాల
నాయకునితోడుత విన్నపములు సేయరే

చ. 1: చింతలు వెల్లివిరిసెఁ జెక్కు పైకిఁ జేయి వచ్చె
ఇంతసేసె నా మన సేమి సేతునే
మంతనాన నుండరాదు మరేమిటాఁ బొద్దుపోదు
పంతగాఁ డితనితోఁ దప్పక చెప్పరే

చ. 2: పొదలె నిట్టూరుపులు పొందె నడియాసలు
యెదురెక్కె నా వలపు యేమిసేతునే
పదరితేఁ జవి గాదు పాసివుండఁ బనిలేదు
పుదుటువాఁ డితనికి నొడఁబడఁ జెప్పరే

చ. 3: తనువెల్లాఁ బులకించె తతిగొనెఁ జెమటలు
యినుమడించెఁ దమక మేమి సేతునే
చెనకి యింకేలవాదు శ్రీ వేంకటేశుఁడు సాదు
కొనబువాఁ డితఁ డిట్టె కూడుమని చెప్పరే

రేకు: 1705-04 గౌళ సం: 27-028

పల్లవి: ఎట్టు సేసినాఁ జేయి యేమనఁగఁగల నిన్ను
పట్టినవ్రతము నీకే పాలు పెట్టేఁగాక

చ. 1: అలుకల సొలయచు నట్టె నీతోఁ బెనఁగుచు
చలము సాదించేనా సారెసారెకు
తొలుత నమ్మించితివి దోసముఁబుణ్యము నీది
మెలఁగి పాయము నీకే మీఁదుకట్టేఁగాక

చ. 2: పొంతల చన్నులనొత్తి బొమ్మలను జంకించి
పంతము నీచేఁ గొనేనా బలిమితోను
చింతతో నన్నేలిన సిగ్గుపట్టెల్లా నీది
బంతి నాయాసలు నీపై వేసేఁగాక

చ. 3: నెట్టన నిన్నుఁ గూడితి నేరుపులెల్లాఁ జూపితి
అట్టె నిన్నలయించేనా ఆరడిగాను
కట్టుకో శ్రీ వేంకటేశ కడుఁ గీరితెల్లా నీది
జట్టిగొని యిఁక నీ కిచ్చకమాడేఁగాక

రేకు: 1705-05 శోకవరాళి సం: 27-029

పల్లవి: నన్ను నెంత మన్నించెనే నా రమణుఁడు
చన్నుల నొత్తఁగానైనా సరిగాఁబెనఁగెఁగా

చ. 1: అలయిచు నేఁ దన్ను నాడరాని మాటలను
సొలయఁగనైనా మోము చూచెఁగా నేఁడు
బలిమితో నప్పటిని పైకొని కానుకలిచ్చి
పిలువఁగనైనాను ప్రియము చేకొనెఁగా

చ. 2: కక్కసించి తనవేళఁ గాచుకుండి వినయాన
మొక్కఁగానైనా పాదము మోచెఁగా నేఁడు
చిక్కించుక సేయరాని సేవలెల్లాఁ జేసి చేసి
చెక్కు నొక్కఁగా నైనా చిత్తమిటు వచ్చెఁగా

చ. 3: పసగా నేకతమునఁ బానుపుపై నేనిట్టె
కొసరఁగానైనాను కూడెఁగా నేఁడు
యెసగ శ్రీ వేంకటేశుఁ డేలినాఁడు నే రతుల
నెస భోగించఁగ నైనా వేడుకతో నవ్వెఁగా

రేకు: 1705-06 లలిత సం: 27-030

పల్లవి: ఎటువంటి నీపై బత్తో యీకెకు నేఁడు
తటుకన నీ సుద్దుల తాలిమిఁ బొందీని

చ. 1: సెలవుల నవ్వు నవ్వి చేతులు నీపైఁ జాఁచి
తలపోఁతలనే కడుఁదనివందీని
పిలుపుల నొకకొంత పెనఁగులాటలఁ గొంత
చెలరేఁగి తనుఁదానె సేదదేరీని

చ. 2: అనువుగా మాటలాడి అండ నిట్టె కూచుండి
మనసులో తమకము మందలించీని
వినయపు సేవచేత వేమారు సన్నలచేత
నినుపు సంతోసాలు నించుకొనీని

చ. 3: సూటిగా నీమోము చూచి సొమ్ములు చేతఁ దడవి
వాఁటపు విరహమెల్లా వారించీని
యీటున శ్రీ వేంకటేశ యింతి నిట్టె యేలితివి
తాటించి నీరతులను దైవారీని

రేకు: 1706-01 వరాళి సం: 27-031

పల్లవి: వసివాడ నీకేల వనితలలో నెల్లా
సుసరాన నీ చేతనె సూడువట్టించెను

చ. 1: దప్పిదేరే మోముతోడ దగదొట్టి వున్నాఁడవు
యిప్పు డిట్టియాపె నిన్ను యేమిచేసెనో
చెప్పరాదా నీకేఁటికి సిగ్గులు వడఁగ నేఁడు
చొప్పుగా నీచేతనె సూడువట్టించెను

చ. 2: పలు చెమటలతోడ భ్రమ సివున్నాఁడవ్వ(వు?)
అలివేణి నిన్నెంత అలఇంచెనో
తెలివి దెచ్చుకోరాదా దీమసము మాతోనేల
సులభాన నీచేతనే సూడువట్టించెను

చ. 3: గుట్టుతోడ లోలోనే గుబ్బతిల్లి వున్నాఁడవు
పట్టపుదేవి నిన్నెంత పనిగొనెనో
ఇట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నాకె
చుట్టి చుట్టి నీ చేతనే సూడు వట్టించెను

రేకు: 1706-02 ముఖారి సం: 27-032

పల్లవి: తనకు లేకున్నా నేను తనపై బత్తి గలఁగా
తనంతనే నామీఁద దయదలఁచీనే

చ. 1: తలఁపుగలిగితేఁ గదా తా నిందుకు విచ్చేసు
వలవంతఁ గొసరఁగా వచ్చేదేమే
పిలువక రానంటా పెనఁగీఁ దా రమణుఁడు
వలపు గలంతే కాక వడి నెక్కుడౌనా

చ. 2: చేతికిలోనైతేఁ గదా చెప్పి నట్టెల్లాఁ జేసు
కాతరించి యేమనినాఁ గరఁగీనటే
యేతులఁ జేసేనంటా ఇప్పుడు దా నన్నడిగీ
రీతిఁ దన తమకము రేఁచవచ్చునటవే

చ. 3: ఇతవై యుండితేఁగదా ఇన్నిటికి నిచ్చగించీ
తతిగొని పైకొనఁగా తనిసేదేమే
సతమై శ్రీ వేంకటేశ్వరుఁ డిట్టె నన్ను నేలె
రతులలో ప్రియములు రవ్వ సేయఁ దగవా

రేకు: 1706-03 పాడి సం: 27-033

పల్లవి: చేరి మొక్కరే నామారు చెలులాల ఆతనికి
ఆరజము సేయరాదు అవుననరాదు

చ. 1: వెల్లవిరాయఁ బనులు వేడుకతోఁ దన్నుఁ జూచి
కొల్లువ నవ్వఁగరాదు కొసరా రాదు
పెల్లునఁ దా నింత చేసి ప్రియములు చెప్పఁగాను
పల్లదమాడఁగరాదు పైకొనరాదు

చ. 2: పయ్యదపైఁ జేఇ వేసి బాసలెల్లా నియ్యఁగాను
ఇయ్యకొనరాదు మరి యేఁచఁగరాదు
కొయ్యకాఁడై నాకుఁ గోరి మోవి యొసఁగఁగా
సయ్యాటమాడఁగరాదు జరయ రాదు

చ. 3: ఇంతలో శ్రీ వేంకటేశుఁ డేలి నన్నుఁ బొగడఁగ
సంతోసించుకొనరాదు సాదించరాదు
పొంతనే నాతో నెంగిలి పొత్తు దాఁ గలయఁగాను
పంతములాడఁగరాదు పాయఁగరాదు

రేకు: 1706-04 కాంబోదిసం: 27-034

పల్లవి: నీవంటి చుట్టము నాకు నిండు నిధానము గాదా
పూవుల నీ పాదములు పూజింతుఁగాక

చ. 1: చెనకి నీ వేమితప్పుచేసి వచ్చితివో నేఁడు
వినయములనే నన్ను వేఁడుకొనేవు
కినిసేనా నేనేమైనా కెలసి ఇందుకుఁగాను
చనవున నన్నిటికి సమ్మతింతుగాక

చ. 2: తిలకించి యెవ్వతెనుఁ దెచ్చుకొంటివో నీవు
పలువిధముల నాపై బత్తి సేసేవు
నెలకొని యీ పనికి నేరమి నీపై వేసేనా
పొలసి నిన్నిందరిలోఁ బొగడుదుఁగాక

చ. 3: పొందుల నెక్కడి తలపోఁతల నున్నాఁడవో
కందువ నన్నుఁగంటానే కాఁగిలించేవు
యెందైనా శ్రీ వేంకటేశ యెగసక్కెమాడేనా
అందపు రతుల నిన్ను నాదరింతుఁ గాక

రేకు: 1706-05 సౌరాష్ట్రం సం: 27-035

పల్లవి: రచ్చల నన్నేలయించీ రమ్మననే యిటు నేఁడు
మచ్చిక నాకు ఘనము మరి యేమి సేతునే

చ. 1: వుడివోని మాటలూ వుల్లాసపుఁ బాటలూ
యెడనెడఁ బచరించీ యేమి సేతునే
విడువదు మదము విరహమే వుమ్మదము
జడిసీ నామేన నిదె సరి నేమి సేతునే

చ. 2: పచ్చి వెచ్చి చేఁతలు బట్టబయలీఁతలు
యెచ్చరించీ నీకు నిఁక నేమి సేతునే
వచ్చె నాకిచ్చిన బాస వదలదు నాయాస
కొచ్చీ నిదె నావలపు కోరి కేమిసేతునే

చ. 3: సేసీనే నెపము సిగ్గులకేదే రపము
యే సుద్దులును నెరఁగఁ డేమి సేతునే
రాసికెక్క శ్రీ వేంకటరమణుఁడు దా నేలె
పోసరించీ నా ముదము పొంచి యేమిసేతునే

రేకు: 1706-06 దేశాక్షి సం: 27-036

పల్లవి: ఎంతమేలు గట్టుకొన్నా యిదె నీ చిత్తము కొద్ది
సంతోసములెల్లా నాయ సమ్మతించే నిఁకను

చ. 1: నన్ను నీ వెఱుఁగుదువు నాకు నీపై బత్తి గద్దు
విన్నవించ నేమున్నది వేఁగినంతాను
మన్నించితి వన్నిటాను మనసొక్కటాయ నేఁడు
సన్నల నేమి సేసినా సమ్మతించే నిఁకను

చ. 2: యేలుకొంటి విటు నన్ను ఇన్నిటా నమ్మితి నిన్ను
జోలితోఁ బెనఁగనేల చుట్టి చుట్టి
లాలన మీవల్లఁ గద్దు లాగాయ నా బతుకిది
చాలా నీ పొందుల కెల్లా సమ్మతించే నిఁకను

చ. 3: నీవు నన్నుఁ గూడితవి నేఁ దొల్లె నీ సొమ్మనయితి
వావులు చెప్పఁగనేల వరుసతోను
శ్రీ వేంకటేశ నీకు చెలఁగి దేవుల నైతి
సావి వోరాదు వలపు సమ్మతించే నిఁకను

రేకు: 1707-01 కురంజి సం: 27-037

పల్లవి: చాలుఁ జాలు నీవేల సాదించేవే
నీ లాగు లన్నియును నే నెఱఁగనటవే

చ. 1: చెంతల నాతఁడు నాకుఁ జెప్పినట్టు సేయఁగాను
పంతము లేలాడేవే పనిలేదు
కాంతలెదుట ముద్దుటుంగరము నాకిచ్చినాఁడు
వంతుకు నాతో బెనఁగవచ్చునటవే

చ. 2: పనివడి యీతఁడు నాపరపు పై నుండఁగాను
చనవున నేలంటేవే చవిగాదు
చెనకి నా చన్నులపై చేతులు వేసుకున్నాఁడు
గునిసి నన్నీడువెట్టుకొనవచ్చునటవే

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జేరి కూడివుండఁగాను
చేవమీర నేమిటికి చెప్పుకోరాదు
భావించి నన్ను రతులఁ బట్టము గట్టినవాఁడు
సేవించితి నిఁక వింత సేయవచ్చునటవే

రేకు: 1707-02 ముఖారి సం: 27-038

పల్లవి: సంతోసించే అందు కిట్టె సవతినైతే నేమి
చింతలేక చెప్పవయ్యా సిగ్గువడ నేఁటికి

చ. 1: ఆసలు సే సేవు నీవు ఆపె నీకుఁ జుట్టమా
సేసలు వెట్టితివా చేతుల కొద్ది
పోసరించి యన్నిటాను పొంతనాలు గూడెనా
మోసపోక చెప్పవయ్యా మూసి దాఁచనేఁటికి

చ. 2: వలపులు చల్లేవు వావులు గలసెనా
లలిఁ బోఁక ముడిచిరా లలనలెల్లా
కలిమి మెరసి నేఁడు కంత నడపించితివా
వెలయఁగఁ జెప్పవయ్యా వెరవఁగ నేఁటికి

చ. 3: సుదతిఁ గూడితి విట్టె సోబానఁ బాడించితివా
పొదలుచు మోవితేనె బువ్వా లంటెనా
ఇదివో శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొది గాకెఁ జెప్పవయ్యా బొంక నిఁక నేఁటికి

రేకు: 1707-03 పాడి సం: 27-039

పల్లవి: ఏమనేము నిన్ను యెగసక్కెఁడ విన్నిటా
ఆముకొన్న సటకాఁడ వౌదువయ్యా

చ. 1: మాటలాడవచ్చుఁగాక మనసులో కాఁతాళము
మూటగట్టవచ్చునా ముందరఁ దెచ్చి
సూటిచేసి నావలపు చూపుమనే వెదుటను
నీటు జాణతనాలు నేర్తువయ్యా నీవు

చ. 2: మొక్కు మొక్కవచ్చుఁ గాక మొగముపై నగవులు
మక్కు వేయ వచ్చునా మాపు దాఁకాను
అక్కరైన నావలపు లంగడిఁ బెట్టేవు నీవు
దిక్కులెరిఁగినయట్టి దిట్టవయ్యా నీవు

చ. 3: పొంది కూడవచ్చుఁ గాక పొంచి పొంచి మోవితేనె
బిందెఁ బోయవచ్చునా పెక్కుమాటలు (ల?)
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
కందు వెరిఁగిన యందఁగాఁడవయ్యా నీవు

రేకు: 1707-04 సామంతం సం: 27-040

పల్లవి: ఇంకా నెవ్వరూ వినరు యేఁటికి సిగ్గువడేవు
పంకించ కిందరి నొడఁబరచే నే నిపుడు

చ. 1: ముంచె మైఁ జెమటవాన మోవి నదె తేనె సోన
మంచముపైఁ బెనఁగితే మగువకును
వంచకు నీవు మోము వద్దనేమా నిన్ను నేము
ఇంచు కించుకే నీ సుద్దు లెరిఁగితి మిపుడు

చ. 2: కరఁగెఁ గస్తూరి పూఁత కలిగె నూర్పులమోత
సొరిది నీతో నుండఁగా సుదతికిని
వెరవు గలవు నీవు వెస నిది నాకు లావు
పరిపాటి నీ చేఁతలు బయలాయ నిపుడు

చ. 3: హెచ్చెఁ గాఁగిటిరతులు ఎరవాయ సంగతులు
వచ్చి నిన్నుఁ గూడఁగాను వనితకును
ఇచ్చల శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మచ్చికతో నీ పొందులు మరిగితి మిపుడు

రేకు: 1707-05 లలిత సం: 27-041

పల్లవి: ఇప్పుడు గలుగు బుద్ధి అప్పుడు లేదా
తప్పక మెలఁగితేను తగునని ఆడరా

చ. 1: వొద్దనుండి యాకె నిన్ను వొకటొకటె ఆడఁగా
గద్దించేవు బొమ్మలను కాంతను నీవు
కొద్దిమీర మింతేసి కోపకాఁడవు తొల్లె
వొద్దికైన వోజతోడ నుండఁగరాదా

చ. 2: నంటున నీ మోము చూచి నవ్వులెల్లా నవ్వఁగాను
కంటగించి కసరేవు కాంతను నీవు
ఇంటిలోనఁ బంతములు ఇంత నెరపేవాఁడవు
జంటవై అందరు మెచ్చ చక్క నుండరాదా

చ. 3: శ్రీ వేంకటేశ నిన్నుఁ జేరి కాఁగిలించుకోఁగా
కావరించి వొరసేవు కాంతను నీవు
యీవల నన్నేలితివి ఇంతగలవాఁడవు
మా వాఁడ విందరి నడుమనే వుండరాదా

రేకు: 1707-06 గౌళ సం: 27-042

పల్లవి: ఏమిటికి నప్పటిని వెలయించీని
కామించి యన్నియు నేనే కనుగొంటినే

చ. 1: సిగ్గువడ నేర్చునట సెలవి నవ్వనేరఁడా
అగ్గమై తనకు నన్ని యమరినవే
వెగ్గళించ నిఁకనేలే వేడుకకాఁడన్నిటాను
యెగ్గులెంచ తనలాగు లెఱుఁగుదునే

చ. 2: మాటలాడనోపునట మచ్చిక చూపనోపఁడా
బూటకాలన్నీఁ దనకు పొసఁగినవే
చాటిచెప్ప మరియేలే జాణఁడు యీపనులకు
యీటులేని తనసుద్దు లియ్యకొంటినే

చ. 3: సేస చల్లఁగలఁడట చెలఁగి కూడఁగలేఁడా
దోసములే దన్నియును దొరసినవే
వేసరనేలే తానే శ్రీ వేంకటేశుఁ డేలే నన్ను
పోసరించి రతులనుఁ బొసఁగింతునే

రేకు: 1708-01 శుద్ధవసంతం సం: 27-043

పల్లవి: తగు నీకూ నాపెకును తమకించి పెనఁగఁగ
మొగములు చూచుకోఁగా మొరయనేలే

చ. 1: చనవు గలిగినాపె సారె సారె నీతోను
మనవులు చెప్పఁగాను మచ్చరమేల
ననిచి యప్పటి నీతో నవ్వులెల్లా నవ్వఁగాను
కొన చూపులనుఁ జూచి కోపగించనేల

చ. 2: చిత్తము వచ్చిన యాపె చేరి నిన్నుఁ జెనకఁగా
హత్తుకొని నిన్ను వెంగేలాడఁగ నేల
బత్తిగలిగినది నీపైఁ బన్నీరు చల్లఁగా
కొత్త కొత్త మాటలను కొసర నేల

చ. 3: చుట్టమై యుండిన యాపె సారది నిన్నుఁ గూడఁగా
బట్ట బయలీఁదించి పంగించనేలా
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గుట్టు చేసుకొందుఁగాక గురిచూపనేలా

రేకు: 1708-02 దేశాక్షి సం: 27-044

పల్లవి: కడుగోల యీా చెలి కరుణించు మిఁక నీవు
అడియాలపు నవ్వులే అచ్చివచ్చు మీకును

చ. 1: వింత సేయవద్దుగాని వేడుకతో నాఁటదాని
నెంత సోఁకఁ బలికినా ఇతవే కాదా
ఇంతటివాఁడవు నీవు ఇంటికి వచ్చితేఁ జాలు
దొంతి నున్న వలపులే తోడయ్యీా మీకును

చ. 2: సిగ్గు వడవద్దుగాని సేసకు లోనైనదాని
అగ్గల మెంత నవ్వినా అరుదే కాదా
కగ్గులేని చట్టమవు కాయము ముట్టితేఁ జాలు
వొగ్గి తమకములే మేలొనరించీ మీకును

చ. 3: మఱవఁగవద్దు గాని మనసువచ్చినదాని
తఱి నెంతఁ గూడినాను తగవే కాదా
యెఱిఁగి శ్రీ వేంకటేశ యేలితివి మా చెలిని
జఱసి జాణతనాలే చవి చూపె మీకును

రేకు: 1708-03 ఆహిరి సం: 27-045

పల్లవి: ఇంతిఁ గనుఁగొనవయ్యా యెటువంటి మోహమో
బంతి మోవితేనియల బచ్చి దేరీని

చ. 1: చన్నులపై పయ్యద జారినదీ నెరఁగదు
నిన్నుఁ జూచే వేడుకను నివ్వెర గంది
వన్నెలఁ జెక్కుచెమట వడిసేది దలఁచదు
వున్నతపుఁ దమకాన నుమ్మగిలీని

చ. 2: వీఁపునఁ దనతురుము వీడినదీఁ దెలియదు
పై పై నీతో మాటలాడే పరాకునను
రాఁపుల నిట్టూర్పుల రవళి నాలించదు
యేపునఁ బరవశాన నీఁదులాడీని

చ. 3: వరుసతోఁ బోఁకముడి వదలినదీ నెంచదు
గరిమ సరసమాడే కాతరానను
యిరవై శ్రీ వేంకటేశ యేలితి వీకెను నేఁడు
సిరుల సంతోసానఁ జిమ్మి రేఁగీని

రేకు: 1708-04 దేసాళం సం: 27-046

పల్లవి: నీ జాడలెల్లాఁ దొల్లే నే నెరఁగనా
వోజతో నీ సుద్దులెల్లా వొప్పుగొనేఁగాక

చ. 1: మొనసి వొకరిమీఁద మోహమున్నదా నీకు
మనసు చూడవలసి మాటలాడేవు
చెనకి ఇంతలోననే చెల్లునా మందెమేళము
వొసర నేమనినాను వూఁకొనేఁగాక

చ. 2: సమ్మతించి ఇంతులను సరకుగొనేవా నీవు
నమ్మికల కూరకైనా నవ్వు నవ్వేవు
పమ్మి ఇంతటిలోననే బలిమి చూపవచ్చునా
ఇమ్ముల నీకతలెల్లా నియ్యకొనేఁగాక

చ. 3: అందపు గాంతలు నీకు నబ్బురమా యేమైనా
కందువల నన్ను నిట్టె కాఁగిలించేవు
అందుకు నింతలోననే ఆడేనా శ్రీ వేంకటేశ
సందడిలో నీకూటమి సంతోసించేఁ గాక

రేకు: 1708-05 హిందోళం సం: 27-047

పల్లవి: ఏమయ్యా ఇంతటిలోనే యేల లోఁగేవు
ఆముకొన్న నీవేడుక కడ్డగించేనా

చ. 1: చేరఁడేసి కన్నులాపె చెంగలించి చూడఁగాను
కూరిముతోఁ దలవంచుకొందురా నీవు
చేరి నన్నుఁ గని యేల సిగ్గువడే వింతలోన
తారుకాణ చేసి నీపైఁ దప్పు వేసేనా

చ. 2: వుంగరాల చేతులాకె వొడివట్టి తియ్యఁగాను
సంగతి గాదనుచు సన్న సే సేవు
చెంగట నే నుండఁగాను చెల్లఁబో యేల కొంకేవు
అంగడిఁబెట్టి వలపు లారడి చేసేనా

చ. 3: మొలకచన్నుల యాపె ముంచి కాఁగిలించుకోఁగా
చెలఁగి నాతో నేమి చెప్పవచ్చేవు
అలరి శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
నెలకొన్న పనులకు నిన్ను నవ్వేనా

రేకు: 1708-06 ఆహిరి సం: 27-048

పల్లవి: కటకటా వట్టిదూరు కట్టుకొందురా
సటలు సేయఁగనేలే జవరాలికి

చ. 1: అలుకలేమి గల్లాను అప్పటి కప్పుడే కాక
చలపాది తనమేలే సతికి
బలిమి నొడఁబరచే పతిమాఁట వింటకాక
పెలుచుఁ దనము లేలే ప్రియురాలికి

చ. 2: వొట్టిడుకొంటే వెనక నోజకు వచ్చుటగాక
గట్టువాయతనమేలే కామినికి
చుట్టమైన పతిమోము చూచితే లోఁగుట కాక
వెట్టఁ బొరలఁగనేలే వెలఁదికిని

చ. 3: పంతములాడుకొంటేను పైఁకొని మెచ్చుటగాక
వంతులు వాసులు నేలే వనితకు
బంతినే శ్రీ వేంకటాద్రి పతి నిన్నుఁ గూడె నిదె
పొంతనా లింకా నేలె పొలఁతికిని

రేకు: 1709-01 భైరవి సం: 27-049

పల్లవి: మా యింటికి రావయ్యా మాటలేఁటికి
చాయలా సన్నలా నీపై సంతోసమేనాకును

చ. 1: మోమునఁ గళలు దేరీ ముక్కున నిట్టూర్పు లూరీ
నీ మతకపు చేఁతకు నే నేమనేను
గామిడి వనఁగరాదు కల్ల మోపఁబనిలేదు
యేమైనా నీ పనులు ఇయ్యకోలే నాకును

చ. 2: చెక్కులఁ జెమట మించీ సెలవి నవ్వులు ముంచీ
నెకొన్ననీ యెమ్మెలకు నే నేమనేను
కక్కసించి నిఁక వద్దు కడువేగె నిదె పొద్దు
యెక్కడనుండి వచ్చినా ఇయ్యకోలే నాకును

చ. 3: మోవిపైఁ గెంపులు రాఁగీ భావమెల్లాఁ జిమ్మిరేఁగీ
నీవెంత కాకు సేసినా నేనేమనేను
శ్రీ వేంకటేశ ముందు చేకొను రతులవిందు
యీవేళ నన్నేలితివి ఇయ్యకోలే నాకును

రేకు: 1709-02 గౌళ సం: 27-050

పల్లవి: నీ వాపెకు మగఁడవు నేరుపరివి
సేవ లాపె చేసినవి చేకొనఁగరాదా

చ. 1: సరసమాడఁగఁబోతే చన్నులపై కొంగు జారె
కరముల మొక్కితే కంకణాలు జారె
శిరసు వంచి యందుకు సిగ్గువడి వున్న దిదె
తరుణి నుపచరించ దండకు రారాదా

చ. 2: పొంచి కానుకియ్యఁగాను పోఁక ముడి వదలెను
కొంచక పాదాలొత్తఁగా కొప్పు గదలె
అంచెల నంతలోననే అలసి నివ్వెరగొందె
చెంచెలాక్షి సేదదేర్చి చనవియ్యరాదా

చ. 3: గందము నీకుఁ బూయఁగా కాఁగిటిలోనఁ దగిలె
సందడిఁ బల్కఁగా మోవి చవులు రేఁగె
అంది శ్రీ వేంకటేశుఁడ ఆనందించుకొన్నది
ఇందుముఖి బాలఁ జిక్కి ఇంపు చూపరాదా

రేకు: 1709-03 బౌళి సం: 27-051

పల్లవి: వరుసకు నీమగఁడు వచ్చీఁగాక
సరసురాలగు నీకుఁ జలపట్టనేఁటికి

చ. 1: వాసితోడఁ బతిమీఁద వలపు గలదానికి
వేసరఁగనేఁటికే వేమారును
రాసికెక్క నేఁడు సింగారమున నుండి నీకు
సేసకొప్పు వేఁకమంటాఁ జింతించనేఁటికే

చ. 2: పనివడి నాయకునిఁ బాయలేని దానికి
పెనఁగఁగ నేఁటికే బిగియుచును
వెనుకొని జవ్వనాన విఱ్ఱవీఁగే యట్టి నీకు
చనుఁగవ గట్టి యంటా జడియఁగ నేఁటికే

చ. 3: అన్నిటా శ్రీ వేంకటేశునాలవైన దానికి
సన్నసేయనేఁటికే సముకమున
వెన్నెల నవ్వులతోడ వేడక పడే నీకు
కన్నులివి గొప్పలంటా కావరించ నేఁటికే

రేకు: 1709-04 వరాళి సం: 27-052

పల్లవి: ఏల కిందుపడేవు నాకెంత ప్రియాలు చెప్పేవు
యేలాగు నడచినా యదురేది నీకును

చ. 1: కల్లలాడవద్దు గాని కడఁ బొందు సేసి వచ్చి
చల్లఁగా నాతోఁ జెప్పితే సంతోసించనా
చెల్లదా నీకేమైనా చేసిన చేఁతలెల్లా
బల్లిదుఁడవు తొలుతే భయమేల నీకును

చ. 2: మూసి దాఁచవద్దుగాని మోహమెందు గలిగినా
ఆసతి దోడి తెమ్మంటే నౌఁగాదనేనా
దోసమెంచేరా నిన్ను దొరవు గావా నీవు
బాస ఇచ్చి ఇఁక సిగ్గువడనేల నీకును

చ. 3: వాదించ వద్దుగాని వాడవారిఁ గూడినాను
సాదవై నావద్దనుంటే సమ్మతించనా
యీదెస శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
ఆదుకొన రతులబ్బె నల పేల మీకును

రేకు: 1709-05 దేసాళం సం: 27-053

పల్లవి: ఇందుకే పెండ్లాడితివి యెరిఁగి మమ్ము
చెంది మావూడిగాలైనా జేకొనఁగవలదా

చ. 1: జలజాక్షితో నీవు సరసములాడి యాడి
అలసేవు కమ్మటిని అంతలోననే
వెలినున్న మాచేత విసరించుకొనరాదా
పలుమారు నేము సే సే పని యేమి నీకు

చ. 2: అప్పుడే యాపె పొత్తున ఆరగించి యారగించి
దప్పిఁ బొరలేవు కడుఁదమకమున
ఇప్పించుకొనరాదా వీడె మేతులకు మాచేత
వొప్పుగా నేమి చెప్పినా నోపమనేమా

చ. 3: సరిగా మీరిద్దరును సాములు చేసి చేసి
పొరలుచుఁ బానుపు పై బుసకొట్టేవు
బెరసి మమ్మేలితివి పిసికించుకొనరాదా
సిరుల శ్రీ వేంకటేశ సేవచేసే మిపుడు

రేకు: 1709-06 ఆహిరి సం: 27-054

పల్లవి: మేలయ్యా నీ సుద్దులకు మెచ్చితి నేను
నీలాగు లోరసితే నేఁడు గొత్తయ్యీనా

చ. 1: చనవున నాపె నీతో జాణతనాలాడెనంటా
పెనగొని యెన్నేసి బీరా లాడేవు
మనసురాని యెడల మంచితనాలు సేసితే
యెనసినంతేకాక యెక్కుడయ్యీనా

చ. 2: వొద్దనుండి యాకె నిన్ను వొడివట్టి తీసెనంటా
గద్దించి యెందాఁకా బింకాలు చూపేవు
పెద్దరికానకు నెంత ప్రియముతో మొక్కినాను
తిద్దుకొనే మంటేను చేతికి లోనయ్యీనా

చ. 3: కమ్మర నప్పటి నాపె కాఁగిలించుకొనెనంటా
నమ్మించి బాసలు మిన్నక చేసేవు
ఇమ్ముల శ్రీ వేంకటేశ యేలితివి మా చెలిని
సమ్మతాయ నిఁక మరి జంట వాసీనా

రేకు: 1710-01 శ్రీరాగం సం: 27-055

పల్లవి: పిలువరే రమణునిఁ బ్రియము తోడ
నెలఁతవు యీతగవు నీ వెఱఁగవా

చ. 1: మనసు రంజిల్లఁ జేసి మగనిఁ బైకొంట కాక
చనవు గలిగితేను సాదింతురా
ననుపు చేసుకొని నవ్వుటే నేరుపుకాక
కినిసి వెంగెములాడి కెరలింతురా

చ. 2: చల్లని మాటలాడి జట్టిగొనవలెఁగాక
చెల్లుబడిగలదంటా చెనకుదురా
మెల్లనే సేవచేసి మెప్పించవలెఁగాక
పల్లదాన నేరాలెంచి పంగింతురా

చ. 3: కందువలఁ జేఇ చాఁచి కాఁగిలించవలెఁగాక
మందె మేళమాయనంటా మారుకొందురా
యిందునె శ్రీ వేంకటేశుఁ డీతఁ డిట్టె నిన్నుఁ గూడె
అందపు మోవిపై కెంపు లలరింతురా

రేకు: 1710-02 ఆందోళి సం: 27-056

పల్లవి: ఎట్టు మఱవఁగవచ్చు యిటువంటి చేఁతలు నా
గుట్టు చేకొంటివిగా నీ కుచ్చితానను

చ. 1: నవ్వులే సారెకు నవ్వి నావలపు లిందరిలో
రవ్వలఁ బెట్టితివిగా రాజసానను
పువ్వులనే వేసివేసి పొద్దులు గడపి యాస
లువ్విళ్లూరించితిగా వుదుటునను

చ. 2: మాటలే ఇందాఁకా నాడి మర్మములు గరఁగించి
నాటకమే చూపేవుగా నమ్మికతోను
పాటించి సేవలుగొని బయలీఁతలనే పెట్టి
జూటవై మించితివిగా చుట్టరికమునను

చ. 3: చేతులు పైఁ జాఁచి చాఁచి సిగ్గులు వడఁగఁజేసి
జాతులఁ బెట్టితివిగా సరాసానను
యేతుల శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కాతరాన మీరేవుగా కాఁగిటిలోను

రేకు: 1710-03 గౌళ సం: 27-057

పల్లవి: క్షితి నిట్టినేరుపు సీతాదేవికిఁ గలిగె
తతితోడ దశరథ తనయుని యెడను

చ. 1: పతి చిత్త మెరిఁగి తప్పక వూడిగము చేసి
అతనినే తన దైవమని తలఁచి
సతమై యనేక వుపచారములఁబోషించి
వ్రతము గైకొని యుండవలయు సతికిని

చ. 2: పరపురుషుఁ జూడక ప్రాణేశ్వరునే కోరి
సరవితో నతని ప్రసాద జీవియై
దొరసి యెడవాయక తోడు నీడయై యుండి
వరుస మీరక యుండవలయు సతికిని

చ. 3: యెదురాడక శ్రీ వేంకటేశ్వరు కిందిరవలె
కదిసి యతని కిచ్చకముగ గూడి
అదనెరిఁగి యేపొద్దు నంకెకు లోనైవుండి
వదలక బత్తిసేయవలయు సతికిని

రేకు: 1710-04 రామక్రియ సం: 27-058

పల్లవి: ఊరకె గుట్టు చేసుక వుండుట గాక
వారి వీరివలె దూరవచ్చునా నాకును

చ. 1: యెప్పుడుఁ దా నాడా నీడా నేమి సేసి వచ్చినాను
తప్పులెంచవచ్చునా తనతో నాకు
చిప్పిలఁ దనచెక్కుల చెమట లెంత గారినా
చొప్పులెత్తవచ్చునా చూచి చూచి నాకును

చ. 2: సిగ్గువడక తా నెంత చిమ్మిరేఁగి వుండినాను
యెగ్గు పట్టవచ్చునా యిదివో నాకు
అగ్గమై తా నందరిలో నటు సరస మాడినా
వెగ్గళించవచ్చునా వింతలుగా నాకును

చ. 3: కాంతుఁడు తా నెటువలె కాఁగిటఁ బెనఁగినాను
పంతమాడవచ్చునా పక్కన నాకు
ఇంతటా శ్రీ వేంకటేశుఁ డిదె తానె నన్నుఁ గూడె
వంతులు వెట్టవచ్చునా వలపులు నాకును

రేకు: 1710-05 నాగవరాళి సం: 27-059

పల్లవి: తొల్లి ఇంత నేరుతువా దొరవైతే నౌదుగాక
చల్లఁగా నిన్ను రేఁచేది జాణ ఆపెకాదా

చ. 1: తగవులు చెప్పేది తమకము పుట్టించేది
అగపడి నీకేపొద్దు నాపె కాదా
నగవులు నవ్వేది ననుపులు సేసేది
నిగిడి యన్నిటా దిద్దె నిన్ను నాపె కాదా

చ. 2: గుట్టు నీకుఁ జెప్పేది కొలువులు సేయించేది
అట్టె నిన్నుఁ బనిగొనే దాపె కాదా
చుట్టరికము చేసేది సారిది గద్దె యెక్కేది
పట్టపు దేవులైన దిప్పటి టాపె కాదా

చ. 3: కడు నిన్ను మెచ్చినది కాఁగిటఁ జొక్కించినది
అడియాలాలు చేసిన దాపె కాదా
యెడయక శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
వొడఁబరచెను నిన్నిప్పుడు నాపె కాదా

రేకు: 1710-06 నాదరామక్రియ సం: 27-060

పల్లవి: మాటలాడవచ్చుఁగాని మరి లేదనఁగరాదు
సూటి దప్పకుండా నిట్టె చూచుకొమ్మీ పనులు

చ. 1: నెచ్చెలి తోడుతఁ దన నేరాలు నీవెంచఁగాను
విచ్చనవిడి నాతఁడే వింటా నున్నాఁడు
యెచ్చరించ వచ్చితి నీ కితవరి దాననై
కచ్చు పెట్టి మీఁదటెత్తు గనుకొమ్మీ యిఁకను

చ. 2: పలుమారు నందరితో పంతాలు నీవాడఁగాను
నలిరేఁగి తెరమాటుననే వున్నాఁడు
తెలిసి దాఁచఁగరాదు తెగ నీ చుట్టమ నేను
యెలమి నందుకుఁ దగ నెంచుకొమ్మీ బుద్దులు

చ. 3: ప్రమదాన నీతో నేమో పలుకుచు నుండఁగాను
తమితోడఁ బానుపుమీఁదనే వున్నాఁడు
సుముఖుఁడై యేలె నిన్నుఁజూచి శ్రీ వేంకటేశుఁడు
తెమలక విన్నవించే దిద్దుకొమ్మీ సుద్దులు

రేకు: 1711-01 దేవక్రియ సం: 27-061

పల్లవి: నీ వేడుక చెల్లించేదే నేరుపు నాకు
భావించుకొనలేక పదరేవు గనక

చ. 1: హత్తి నీతో నవ్వఁ జూమీ ఆపె వద్ద నుండఁగాను
చిత్తములోపలను కొంచేవు గనక
పొత్తుల నారగించఁగా పొంచి తొంగిచూడఁ జూమీ
మత్తిలి సిబ్బితితోడ మానేవు గనక

చ. 2: కొంగువట్టి తియ్యఁ జూమీకొమ్మతో మాటాడఁగాను
చెంగట నీవటు చింతించేవు గనక
పొంగి విడే లందుకోగా పోరచి యడుగఁ జూమీ
సంగ తెఱఁగక నీవు జారేవు గనక

చ. 3: చెక్కు నొక్కఁజూమ్మీ నిన్ను చెలిమోవి యానగాను
చిక్కి చిన్నఁబోయి యలసేవు గనక
ఇక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కక్కసించఁజూమ్మీ యాపెఁ గాదనేవు గనక

రేకు: 1711-02 పాడి సం: 27-062

పల్లవి: పొద్దువోక నే నూరకే పొదిగేఁగాక
తిద్దరాని గుణములు తీరువడీనా

చ. 1: పొరలింపు మాట లాడి పొద్దుగడపేవాని
కరకరిఁబెట్టఁగాను కలిగేదేమీ
గొరబైన వలపులు కుప్పచేసి రమణుని
దరవులు వెట్టఁగాను తనివయ్యీనా

చ. 2: చుట్టరికములే చూపి చొక్కులఁబెట్టేవాని
నెట్టుకొని సొలయఁగా నిలిచేదేమి
బట్టబయలు నవ్వులు పచరించి రమణుని
జట్టిగొని పెనఁగఁగా సవులయ్యీనా

చ. 3: ఆయము లూరకే యంటి ఆసలఁబెట్టేవాని
చేయిచాఁచి చెనకఁగా చేరేదేమి
యియ్యెడ శ్రీ వేంకటేశుఁ డీతఁడే నన్నుఁగూడె
వేయైనాఁ దనకు నిఁక వేసటయ్యీనా

రేకు: 1711-03 బౌళి సం: 27-063

పల్లవి: నవ్వేవారి నెఱఁగఁడు నలువంకఁ దన్నుఁ జూచి
దివ్వెలెత్తుఁబొద్దుకాడ తివిరీ నిదేఁటికే

చ. 1: చెక్కులవెంటాను పెంజెమటలు గారఁగాను
యెక్కడనుండి వచ్చెనే ఇప్పుడితఁడు
పుక్కిటిబంటియైన బుసకొట్ల తోడుత
మక్కళించి యెటువంటి మాట లాడీనే

చ. 2: విరులు కొప్పుననుండి విడి విడి రాలఁగాను
బిరుదుతో తా నెంత పెనఁగాడీనే
గరిమతో నిద్దురలు కన్నులనే తేరఁగాను
పరగ పాన్పుపై నెట్టు పవళించీనే

చ. 3: అలపులు తనమేన నటు తొట్రు కొనఁగాను
పిలిచి కాఁగిట నెంత బిగియించీనే
యెలిమి శ్రీ వేంకటేశుఁడీతఁడే తా నన్నుఁ గూడె
కొలువులోపల నెంత కొనియాడీనే

రేకు: 1711-04 ఆందోళి సం: 27-064

పల్లవి: ఏమినన వూరకుండి యేమి గట్టుకొని నేఁడు
నా మీఁద జేఇ వేయవద్దా నవ్వేవాఁడుతాను

చ. 1: వలపు రేఁచినవాఁడు వాడుదేర్చి బుజ్జగించి
కలయఁగ వద్దటవే కాఁగిట నేఁడు
పిలువనంపినవాఁడు పెనగొన్న సిగ్గుల
చలి వాపవద్దటవే సారెకుఁ దాను

చ. 2: సరసమాడినవాఁడు చవిగొన మోవి ఇచ్చి
ఇరవుకోవద్దటవే ఇంతలో నేఁడు
శిరసువట్టినవాఁడు చేసన్నలకు లోనై
మరుగఁగవద్దటవే మంచివాఁడు తాను

చ. 3: పానుపు చేరినవాఁడు బలిమైన నాచన్నులు
ఆనుకొనవద్దటవే అంకెల నేఁడు
సేనగా రతులఁగూడె శ్రీ వేంకటేశుఁడు నన్ను
యీా నేర్పు చూపవద్దా యిన్నాళ్లు తాను

రేకు: 1711-05 దేసాళం సం: 27-065

పల్లవి: అందుకేమి దోసమా అన్ని పనులునుఁ దేరీ
చెందుచు నాచేఁతలెల్లాఁ జేసి చూపె నీఁకను

చ. 1: పానుపు పైఁ బవళించి పాదాలు నాపైఁ జాఁచి
మానలేక సతితోడ మాటలాడేవు
కానీరా నీతలపులు కానవచ్చె నాకు నేఁడు
నేనాపెఁ జెనకకుండా నెపము చేసితివి

చ. 2: కోరి పచ్చడము గప్పి కుచములు నావి వట్టి
నారుకొన కాంతతోడ నవ్వు నవ్వేవు
నేరుతువౌరా మేలు నే నాపె దడవకుండా
వూరటగా నిదియొక వుపమ చేసితివి

చ. 3: తెరలోననే వుండి తియ్యని నామోవి యాని
గరిమతో నంగనను కాఁగిలించేవు
యిరవై శ్రీ వేంకటేశ యే నాపెఁ గారించకుండా
సరవితో నిటువంటి చందము చేసితివి

రేకు: 1711-06 సౌరాష్ట్రం సం: 27-066

పల్లవి: వివా (చా?) రించుకొమ్మనవే విభునిఁ దనలోఁదానె
పచారించితే వలపు పై పైనే వున్నది

చ. 1: మెక్కలీఁడైనవాఁడు మోహములు చల్లితేను
వెక్కసములై మించదు వెలఁదికిని
చొక్కి వినయపు సతి సొలపుల దిట్టితేను
అక్కర గలుగు పతి కమృతమై తోఁచును

చ. 2: పల్లదీఁ డైనవాఁడు పచ్చిమాటలాడితేను
వుల్లములో నుండి (డు?) కెత్త దివిదకును
మెల్లనే నయగారైనమెలుఁత వెంగెమాడితే
చల్లఁగా నాయకునికి చవులై పరగును

చ. 3: కాతరీఁడైనవాఁడు కన్నులను మొక్కితేను
ఘాతలై వేసరించవు కామినికిని
యీాతల శ్రీ వేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁగూడె
రాతిరి బగలు నాకు రతికెక్కె ముదము

రేకు: 1712-01 సామంతం సం: 27-067

పల్లవి: ఏమి నేరుచుకొంటివి యెగసక్కేలు
నీమతకమంతయును నీకే తెలుసును

చ. 1: వలపులు మున్ను రేచి వద్దికి వచ్చితే మరి
చలములు సాదింతురా సకియలను
పిలిచి పేరుకొనఁగా ప్రియమున నూఁకొంటే
పలుకకుండుదురా పంతముతోను

చ. 2: అగ్గలముగా నవ్వి ఆయములు గరఁగితే
సిగ్గులు వరతురా చెలువలను
వొగ్గి యాసలు పుట్టించి వూరకే కాలుదొక్కితే
యెగ్గులు వట్టుదురా ఇంతలోనను

చ. 3: జట్టిగాఁ గాఁగిటఁ గూడి సమరతిఁ గొసరితే
తిట్టులు దిట్టుదురా తెఱవలను
ఇట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
గుట్టు సేతురా ఇఁకఁ గూరిమితోను

రేకు: 1712-02 దేశాక్షి సం: 27-068

పల్లవి: ఏమి చెప్పే రిఁక నీకు యెంత లేదీ సంతోసము
వేమరు నిన్నాపె ఇంత వెలయించెఁగా

చ. 1: మనసు రంజిల్లఁ జేసి మంతనము నీతో నాడి
తినివిఁ బొందించెఁగా తరుణి నేఁడు
చనుఁగవ దాఁకించి సంగడినే కూచుండి
పెనుపొందని మోహము పెడరేఁచెఁగా

చ. 2: సెలవుల నవ్వు నవ్వి చేరి నీకుఁ బాదాలొత్తి
అలపెల్లాఁ దేర్చెఁగా అంగన నేఁడు
సొలపుఁ జూపులఁ జూచి సురటి నటువిసరి
యెలమి నీకోరికె లీడేర్చెఁగా

చ. 3: కప్పురపు విడెమిచ్చి కాఁగిట నిన్నుఁ గుచ్చి
నుప్పిరిఁ జొక్కించెఁగా ముదిత నేఁడు
ఇప్పుడె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నీవు
తప్పక నిన్నాపె యింత తమిరేఁచెఁగా

రేకు: 1712-03 వరాళి సం: 27-069

పల్లవి: తలఁచి యిటువంటివే తప్పించుకొనఁ బట్టె
చెలులాల విభునికిఁ జేరి విన్నవించరే

చ. 1: వొగ్గి నేఁడు తా నాపె నొడివట్టఁగాఁ జూచితి
సిగ్గులు వడడుఁగదా చెలువుఁడు
అగ్గలమై ఇందుకుఁగా అట్టె తన్ను దూరితి
యెగ్గులు వట్టఁడుగదా ఇప్పు డితఁడు

చ. 2: యెనసి యిద్దరుండఁగా నింటిలోనికి వచ్చితి
మనసు నొవ్వదుగదా మరి తనకు
యెనలేని తమజాడ లెరుకలుచేసుకొంటి
వెనకతియ్యఁడుగదా వెలుపున నితఁడు

చ. 3: కచ్చు పెట్టి యాపె కూడిగము సేయఁగా వద్దంటి
మచ్చరించుకోఁడుగదా మగఁడు తాను
తచ్చి శ్రీ వేంకటేశుఁడు తను నేఁ బెండ్లియాడితి
రచ్చలఁ బెట్టఁడుగదా రతులెల్లాను

రేకు: 1712-04 లలిత సం: 27-070

పల్లవి: ఇప్పటనుండి మాటలేల నీతోను
తప్పు మోపకుండితేను తారుకాణించరాదా

చ. 1: సన్నలనే నీగుణము చాయకుఁ దేకుండితేను
నన్నుఁజూచి నీ వప్పుడు నగరాదా
చిన్ననాటి నా పంతాలు చెల్లించుకోకుండితేను
వున్నతితోఁ బెట్టరాని వొట్టు వెట్టరాదా

చ. 2: చుట్టరికానసనే నిన్ను సూడు వట్ట కుండితేను
అట్టే నన్ను యెగసక్కే లాడరాదా
రట్టు సేసి నిన్నింటికి ఇట్టె రప్పించకుండితే
పట్టిన చలాన సిగ్గుపరచఁగరాదా

చ. 3: పచ్చిగా రతులఁ గిందుపడఁ జేయకుండితేను
కచ్చుపెట్టి మరి నీవు కాదనరాదా
ఇచ్చట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మచ్చికలు చూపి నాతో మారుకొనరాదా

రేకు: 1712-05 శుద్ధ దేశి సం: 27-071

పల్లవి: నిన్నుఁ జూచి వెరగయ్యీ నేఁడు మాకిందరికిని
యెన్నికె కెక్కినవాఁడ వింత సేయఁదగునా

చ. 1: సిగ్గువడఁగానే చెలిఁ జేయివట్టి తీసేవు
యెగ్గనౌ యెవ్వరుంటా నెఱఁగవు
అగ్గలము మోహమైతే నాడేవారిఁ జూడవద్దా
వొగ్గి మగవాఁడ వింత కొడిగట్టఁదగునా

చ. 2: తప్పించుకొనఁగానే తరుణి చన్ను లంటేవు
ఇప్పుడేఁటి కనవు నీ యెమ్మె మానవు
ముప్పిరిఁ జుట్టమవైతే ముందువెన కెంచవద్దా
చెప్పరాని దొరవైతే చేఁత సేయఁదగునా

చ. 3: తెరవేసుకొనఁగానే దీకొని ఇంతిఁ గూడేవు
అరిదిపడవు సారె నంటువాయవు
ఇరవై శ్రీ వేంకటేశ యేలితివి మమ్మునెల్లా
సరసుఁడ వింతేసి వేసాలు సేయఁదగునా

రేకు: 1712-06 కాంబోది సం: 27-072

పల్లవి: పవ్వళించు మిపుడిట్టె పానుపుమీఁద
దవ్వులనే యీవేళ తలవంచేవయ్యా

చ. 1: రవ్వలాయ నామోహము రచ్చకెక్కె నీ తగవు
నవ్వినటులనే వుండి(డె?) నాకు నీకును
పువ్వువంటి జవ్వనము పూఁచరాదు దాఁచరాదు
చివ్వన నీవేఁటికి సిగ్గువడేవయ్యా

చ. 2: మేర మీరె నావేడుక మెరసెను నీచలము
నారుకొనెఁ గోరికెలు నాకు నీకును
భారమైన తమకము పట్టరాదు ముట్టరాదు
దారకాన నీవేల తలపోసేవయ్యా

చ. 3: కడు మించె నా కాగిలి కానవచ్చె నీగుణము
నడుమఁ బంతము దక్కె నాకు నీకును
యెడయక శ్రీ వేంకటేశ యేలితివి నన్ను
తడఁబడి నీవేల దప్పిదేరేవయ్యా

రేకు: 1713-01 ముఖారి సం: 27-073

పల్లవి: ఇన్నిటా జాణవు నీకు యెవ్వరు గుద్ది చెప్పేరు
యెన్నికె కెక్కిన నీ ఇంటిలోనివారము

చ. 1: అక్కరతోడఁ బొరుగాపె నిన్నుఁ జెనకఁగా
చెక్కు నొక్కి నన్ను నెంత చిమ్మి రేఁ చేవు
పుక్కిటిబంటి వలపు పోరచి నీకురాఁగాను
పిక్కటిల్ల నిందు వెలవెట్టి కొనవలెనా

చ. 2: వేడుకతో నాపె నేఁడు విందు నీకుఁ జెప్పఁగాను
యీడ నిట్టె మాపొత్తుకు నేల వచ్చేవు
వీడని చుట్టరికము వెంట వెంటఁ దగులఁగా
యీడు వెట్టి మాపొందుల కేఁకరఁగవలెనా

చ. 3: కూరిమితోడుత నాపె కొంగువట్టుకుండఁగాను
గారవించి నన్ను నెంత కాఁగిలించేవు
ఆరీతి శ్రీ వేంకటేశ అందుఁదరితీపు లూరె
ఆరసి మామోవితేనె లడుగఁగ వలెనా

రేకు: 1713-02 గౌళ సం: 27-074

పల్లవి: వేగిరింతునా యెంతవేసట గలిగినాను
చేగదేరితే వలపు చిమ్మిరేఁగీఁగాక

చ. 1: యెక్కడనైనాఁ బతి యేమి సేసి వచ్చినాను
వెక్కసాలాడవచ్చునా వెలఁదికిని
పెక్కులాఁగులఁ బెనఁగి ప్రియములు చెప్పఁగాను
మక్కువ నాతఁడే మరి మన్నించీఁగాక

చ. 2: నెట్టన నాతని మేన నిండా గురుతు లుండినా
పట్టి చూపవచ్చునా పడఁతికిని
గుట్టుతోడనే వుండి కొలువులు సేయఁగాను
జట్టిగొని యాతఁడే చనవిచ్చీఁగాక

చ. 3: యెలమి శ్రీ వేంకటేశుఁ డెంత రతిఁ గదిమినా
అలఇంచవచ్చునా అంగనకును
మెలఁగి నావలెఁ గూడి మేర మీరకుండఁగాను
చలువఁగాఁ దానే మోవి చవిచూపీఁగాక

రేకు: 1713-03 పాడి సం: 27-075

పల్లవి: పరిణాములాయ నాకు పంతము లీడేరెను
ఇరవై మాదీవెన లింకా నేలు సతుల

చ. 1: మొనసి నీతో సరసములాడఁగా నేఁడు నాకు
చనవిచ్చితివిగా సముకానను
మనసిచ్చి యప్పటిని మాటలాడేయట్టుగాను
ననుపు నటించి ఇట్టె నవ్వించితివిగా

చ. 2: సన్నసేసి ఇప్పుడు నీసంగడిఁ గూచుండే యట్టు
మన్నించితివిగా మక్కువతోను
వన్నెల నీతో నేను వాడిక నవ్వు నవ్వఁగా
యెన్నికఁగా బెద్దరికమిచ్చితివిగా

చ. 3: మేడలోన నన్నుఁ గూడి మేనరికపు వావులను
గూడి కెక్కించితివిగా వేడుకతోను
తోడనె శ్రీ వేంకటేశ దొరఁజేసి యిందరిలో
యీడేరించితివిగా యిన్నిటా నన్ను

రేకు: 1713-04 పళవంజరం సం: 27-076

పల్లవి: ఎటువంటిజాణవు నిన్నేమనేది
తటుకన నిందు కెంత తమకించే విపుడు

చ. 1: కందువ నాపె నీవుఁ గాఁపురాలు సేయఁగాను
సందడి సరసమాడ సంగతా నాకు
విందువెట్టి ఆపె నీకు విడెము చేతికియ్యఁగా
నందుకొని నేను నీకు నాకుమడిచిత్తునా

చ. 2: పువ్విళ్లూర నీవు నాపె వొక్క పాన్పుపై నుండఁగా
చివ్వన వలపు చల్లఁ జెల్లునా నాకు
నివ్వటిల్లఁ బొంచి యాపె నీమోము చూడఁగాను
నవ్వులు నవ్వుదునా నడుమ నేను

చ. 3: రట్టుగా నాపె నీవు ఇట్టె రతిసేయఁగాను
వెట్టి కూడిగాలు సేయ వేడుకా నాకు
ఇట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చుట్టమ నయినమీఁద చొప్పలెత్తనేఁటికి

రేకు: 1713-05 సాళంగం సం: 27-077

పల్లవి: చేసినట్టల్లా మీకుఁ జెల్లుఁ గాక
బాస చేసుకొన్న మిమ్ముఁ బచారించఁగలమా

చ. 1: బలిమికాఁడవు నీవు పట్టపుదేవు లాపె
యెలమి సాకిరులు నే మెట్టుచెప్పేము
వలపెల్లా నీ సొమ్ము వాసులెల్లా నింతిపాలు
కలిగినట్లనే తగవు దిద్దవసమా

చ. 2: చక్కని జాణవు నీవు వదురులాఁడి యాపె
పక్కన మిమ్మెట్టు వొడఁబరచేము
యిక్కువ లెఱుఁగుదువు యియ్యకొనెనాపె తొల్లె
యెక్కువ తక్కువ లేక యిచ్చలాడ నోపేమా

చ. 3: శ్రీ వేంకటేశుఁడవు చెలియ భావజు తల్లి
చేవదేర నే మెట్టు సిగ్గు వాపేము
కైవశ మాపెకు నీవు కాదన దాకె నీమాట
వేవేలకుఁ గూడితిరి వినుతించఁదరమా

రేకు: 1713-06 సాళంగనాట సం: 27-078

పల్లవి: ఎఱుకమాలినదాని నేమనేది
అఱిమఱిలేక నీవు నందె కూడుకొంటివి

చ. 1: చన్నులపైఁ బయ్యెర చక్కఁబెట్టుకొంటాను
సన్నలనే మాటలాడీ సతి నీతోను
యెన్ని నేర్చె వెడమాయలివి నీకుఁ బ్రియమాయ
కన్నవారెల్లా నవ్వేది కటకటా చూడదు

చ. 2: మలయుచుఁ బుక్కిటి తములము మారుచుకొంటా
సెలవుల నవ్వు నవ్వీఁ జెలి నీతోను
నిలువెల్లా వేసాలే నీవందుకు భ్రమతువు
చెలులు గేలిగొనేది చెల్లఁబో యెరఁగదు

చ. 3: వాఁడినకెమ్మోవి తేనెవాసనలు చల్లుకొంటా
కూడీని శ్రీ వేంకటేశ కొమ్మ నీతోను
జాడలీపె విట్లానే; సరి నన్ను నేలితివి
ఆడవారు సంతోసించే దయ్యయ్యో తా మెచ్చదు

రేకు: 1714-01 ఆహిరి సం: 27-079

పల్లవి: అలయికెరఁగవద్దా ఆఁటదాని యెడలను
యెలుఁగెత్తి తిట్టితేను యేమి సేసే విఁకను

చ. 1: మొక్కి మొక్కి చేతులెత్తి ముదిత వొడ్డించుకోఁగా
కక్కసించి చెనకేవు కాతరానను
జక్కవలఁ బోలిన మునుముక్కులు
ఇక్కడ నిన్ను నాటితే నేమిసేసేవిఁకను

చ. 2: చుట్టి చుట్టి పాదాలపై సుదతి యానవెట్టఁగా
అట్టుగాఁ గాఁగిలించే వాఁడిగా నీవు
దిట్టలయిన చకోరాల తీరుల కన్నుల చూపు
లిట్టె నిన్ను సొలసితే నేమి సే సేవిఁకను

చ. 3: మళ్లి మళ్లి రతులను మగువ నిన్నుఁ గూడఁగా
పల్లదాన నవ్వేవు పచ్చిదేరను
మెల్లనె వజ్రాలవంటి మెరుఁగు గోరు లంటితే
యెల్లగా శ్రీ వేంకటేశ యేమి సేసే విఁకను

రేకు: 1714-02 కన్నడగౌళ సం: 27-080

పల్లవి: చిత్తగించరాదా ఈ చెలి భావము
బత్తిగలవారము చెప్పకపోదు నీకును

చ. 1: కలికి నీయింటికి రాఁగా యెదురుతాఁకై
తళుకున నిన్నుఁజూచి తలవంచెను
వెలలేని వలపుల విన్నపము సేయఁబోఇ
సెలవుల నవ్వుదేర సిగ్గువడె నదివో

చ. 2: అంగన కానుక నీకియ్యఁగ చేఇఁ జేఇ దాఁకి
చెంగటనే కళరేఁగి చెమరించెను
సంగతిగా నూడిగాలు సారెకుఁ జేయఁగ వచ్చి
అంగవించి పరవశమంది వున్న దిదివో

చ. 3: పొలఁతి సేసలు చల్లఁబూని మీకుఁ దారుకాణై
తలఁపు లొక్కటులై తమకించెను
యెలమి శ్రీ వేంకటేశ ఇప్పుడె నిన్నుఁగూడి
బలిమి నీతోఁ బెనఁగి పచ్చిదేరె నదివో

రేకు: 1714-03 గౌళ సం: 27-081

పల్లవి: తలఁచుకో మీఁదటెత్తు తత్తరపడవలదు
చలములు మాని ఇఁకఁ జక్కనుండరాదా

చ. 1: కాంత తోడుత నీవు కాఁతాళించి పెనఁగేవు
అంతేసి కోపుదువా అప్పుడు నీవు
పంతమాడవచ్చుఁగాని బలిమి చూపు టరుదు
సంతమై మీలో మీరు చక్కనుండరాదా

చ. 2: మగువ పిలువఁగాను మారుకొని బిగిసేవు
అగడు కోపుదువా అప్పుడు నీవు
నగవచ్చుఁగాని వెనక వేఁడుకోరాదు
జగడాలు మాని ఇఁకఁ జక్కనుండరాదా

చ. 3: కలికి పానుపుమీఁద కాఁగిటిలో మించేవు
అలయనోపుదువా అప్పుడు నీవు
చెలఁగి శ్రీ వేంకటేశ చెప్పవచ్చుఁ జూపరాదు
సలిగె మెరసి మీరు చక్కనుండరాదా

రేకు: 1714-04 సౌరాష్ట్రం సం: 27-082

పల్లవి: సేసినట్టెల్లా నీకుఁ జెల్లదా నేఁడు
సేస పాలెల్లాఁ జిందీ చేరి నవ్వకిఁకను

చ. 1: చొప్ప లెత్తనేల నాకు సోదించనేఁటికి నిన్ను
యెప్పుడు నీవోజలు నే నెరిఁగినవే
తప్పించుకో నెట్టు వచ్చు తారుకాణలైనచోట
పిప్పిగట్టీ మోవి యానవెట్టుకోకు మిఁకను

చ. 2: పంగించగా నేమివచ్చీ పంతమాడాఁ బనిలేదు
సంగతి నీవలపులు సాజమే నీకు
ముంగిట వేసుకోరాదు మూలనున్న సిగ్గులు
వెంగెమయ్యీ సారె సారె వెసఁ జూడ కిఁకను

చ. 3: పెనఁగఁగవద్దు నీతో బెట్టు నిన్ను దూరనోప
ఘనమైనయాస నీకు గలిగినదె
యెనసి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిదె
తనివయ్యీ రతులను తమకించ కిఁకను

రేకు: 1714-05 కాంబోదిసం: 27-083

పల్లవి: కాచుకున్న దిందుల కీ కలికి యప్పటినుండి
యేచి చనవియ్యరాదా ఇఁకనేల లోఁగను

చ. 1: చెప్పరాదా కతలెల్లా చెవులొగ్గి వినీ నాపె
కప్పురపు వాసనల గాఁకదేరను
వొప్పి కాఁగిలించరాదా వొడివట్టితీసీ నాపె
చిప్పిలుఁ బెంజేమటలచే నలపారను

చ. 2: చేరి విడెమియ్యరాదా చేతులు చాఁచీ నాపె
సారెకు మైసోఁకుల చలివాయను
నేరుపుతో నవ్వరాదా నీ దిక్కు చూచీనాపె
వూరేటి మోవితీపుల నొగి దప్పి వాయను

చ. 3: పంతముతోఁ జూఁచరాదా పాదములొత్తీ నాపె
మంతనపుఁజేఁతల మనసారను
ఇంతలో శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సంతోసమే పెంచరాదా చవులెల్లా రేఁగలు

రేకు: 1714-06 గుజ్జరి సం: 27-084

పల్లవి: అప్పుడే నీ వానతియ్యవైతివి గాక
చెప్పరాని పనులైతే చెవులొగ్గి వినేనా

చ. 1: మక్కువ నీవు చూపఁగా మాటలాడితిఁగాక
కక్కసమై తోఁచితేను గాసిఁబెట్టనా
తక్కక లాలించఁగాను దండనుండితిఁగాక
మిక్కిలి వేసటలైతే మేరతోనే వుండనా

చ. 2: చనవు నీ వియ్యఁగాను సంగడిఁ కూచుంటిఁగాక
మనసు రాకుండితేను మల్లు వోరేనా
వినఁగానే నీ కన్నియు విన్నవించితిఁగాక
ననుచకుండితే గుట్టుననే నీకు మొక్కనా

చ. 3: కందువకు రాఁగాను కాఁగిటఁ గూడితిఁగాక
మందటలాడఁబోతేను మత్సరించేనా
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
అందగారితనమైతే నట్టె నిన్ను నవ్వనా

రేకు: 1715-01 కాంబోది సం: 27-085

పల్లవి: రమణుఁడు నన్ను నెంత రవ్వచేసీనే
అమరఁగఁ జెలులాల అట్టె విన్నవించరే

చ. 1: సరసమాడితేనేమి సంగడి నుండితేనేమి
గరిమఁ గూడినట్ల కాంక్షఁ దీరీనా
సరులు దిద్దితేనేమి సన్నలు చేసితేనేమి
అరిదిఁ బెండ్లాడినట్లు అక్కర వాసీనా

చ. 2: పయ్యద ముట్టితేనేమి భావించి చూచితేనేమి
తియ్యని మో విచ్చినట్టు దిష్టమయ్యీనా
వొయ్యనే నవ్వితేనేమి వొడివట్టితేనేమి
ఇయ్యెడఁ గాఁగిలించిన ట్టిచ్చకమయ్యీనా

చ. 3: పొత్తుకు వచ్చితేనేమి పూవుల వేసితేనేమి
హత్తి వినోదించిన ట్లందమయ్యీనా
ఇత్తల శ్రీ వేంకటేశుఁ డేలీ నన్ను నిట్లానే
బత్తిసేసీ నిఁకఁ దనుఁ బంగించవచ్చీనా

రేకు: 1715-02 దేసాళం సం: 27-086

పల్లవి: అన్నిటా భాగ్యవంతుఁడ వౌదువయ్యా
కన్నులెదిటి నిధులు కాంతలు నీ కెప్పుడు

చ. 1: సందడిఁ బాదము దొక్కి సరిఁ బెండ్లాడితినంటా
ముందు ముందే చుట్టరికములు చెప్పేవు
యెందరిఁ గైకొంటివో యిటువలెనే తొల్లి
అందుకోలువావు లిట్లు అబ్బె నీకు నిపుడు

చ. 2: చెలఁగి పోచిళ్లు చల్లి సేసలు వెట్టితినంటా
మలసి పెండ్లివిడేలు మాకుఁ బెట్టేవు
ఇల పై నెవ్వరెవ్వరి నిట్లాఁ జేసుకొంటివో
లలిఁ బొరుగు నేస్తాలు లాభించె నిపుడు

చ. 3: మెచ్చి కాఁగిలించుకొని మేనదాననని
కుచ్చి పెండ్లికూఁతురంటా గురి సేసేవు
ఇచ్చట శ్రీ వేంకటేశ ఇది నీకు నలవాటో
చెచ్చెర నీ కోరికలు సిద్ధించె నిపుడు

రేకు: 1715-03 వరాళి సం: 27-087

పల్లవి: నే నెప్పుడు నున్నదాన నీపాలిటిదానను
పూనిమీఁదెత్తిని వలపులు చేకొనరాదా

చ. 1: మొనగోర నిన్ను నూఁది మోహ మాకె పైఁ జల్లి
కనుసన్నలఁ బిలిచీఁ గందువలకు
ననునేల చెనకేవు నాతో నేమి నవ్వేవు
మనసుపెట్టి నాపెను మన్నించరాదా

చ. 2: కెలసి సరసాలాడి కెలు గేలఁ గీలించి
సొలయుచుఁ బెనఁగీ నీసురతానకు
బలిమేల చేసేవు పట్టనేల నాచెరఁగు
కలయవచ్చినాపెను కాఁగిలించరాదా

చ. 3: చిగురు మోవి చూపి సిగ్గులెల్లాఁ గూడపెట్టి
తగిలి చేయి చాచీ నీతములానకు
అగపడి శ్రీ వేంకటాధిప నన్నేలితివి
జిగి నేఁకరేయాపెను చేతనంటరాదా

రేకు: 1715-04 మంగళకౌసిక సం: 27-088

పల్లవి: సిగ్గువిడిచినమీఁద చెల్లదు పోదు
యెగ్గుగాదు తనకుఁ జెయ్యెత్తి మొక్కే ననెరే

చ. 1: వలపు వెగ్గళమైతే వాదించఁ బనిలేదు
చలమెప్పుడైతే వంచన చెల్లదు
కెలయఁ జొచ్చితే మరి కిందుమీదు లెంచరాదు
తలఁచుకొమ్మనవే యీ తగవు లాతనిని

చ. 2: ననుపు లొనగూడితే నమ్మిక లడుగవద్దు
మనసు రాకుంటేను మాటలేఁటికి
పెనఁగు లాడఁబోఁతే ప్రియములు చవిగావు
కనుఁగొనమనరే యీ గతులు తా నెరుఁగు

చ. 3: చుట్టరికమెనసితే చెప్పులెత్త మరియేల
వెట్టి నవ్వునవ్వితేను వేడుకేడది
ఇట్టె శ్రీ వేంకటేశుఁడేలినాఁడు నన్ను నేఁడు
గుట్టుతో నుండుమనవే గుణమెల్లాఁగంటిని

రేకు: 1715-05 అమరసింధు సం: 27-089

పల్లవి: తగవెంచుకొన వలదా తరుణికిని
మగఁడై కైకొన్నవాఁడు మరి యేమి సేసునే

చ. 1: జక్కవలవంటి నీ చన్నులు విసికెనంటా
వెక్కసా లాడే వదేమే విభునితోను
మిక్కిలి మరుబాణాలు మేలు గడురేఁ చఁ గాను
మక్కువ గలుగువాఁడు మరి యేమి సేసునే

చ. 2: చెంతనుండి నీ తురుము చేతఁ బట్టి తీసెనంటా
పంతము లాడేవేమే పతితోను
వింత వింతలై వయసు వేడుకలు పుట్టించఁగా
మంతనాన వున్నవాఁడు మరి యేమి సేసునే

చ. 3: చనవుతో నిప్పు డిట్టె సరసము లాడె నంటా
యెన సేవేమే శ్రీ వేంకటేశ్వరుతోను
తనువులో తమకము తతిగొని నుండఁ గాను
మనసు పెట్టినవాఁడు మరి యేమి సేసునే

రేకు: 1715-06 బౌళి సం: 27-090

పల్లవి: అందరు నొక్కసరిగా నాడకు నీవు
మందలించి మమ్ము నిట్టె మన్నింతువు గాని

చ. 1: ప్రియ మెరిఁగినకాంత బిగియదు పిలిచితే
నయగారి దెప్పుడు నానలు వెట్టదు
నియతిగలిగినది నేరము లేమీ నెంచదు
క్రియ దెలిసినదెందూ గినుకనుఁ జొరదు

చ. 2: గుట్టుతోడిదైతేను కూరిములు గొసరదు
చుట్టరికమైనది యీసులు రేఁచదు
నెట్టన వలఁచినది నిందలు పైవేయదు
దిట్టయైనది గక్కనఁ దెగువలు చూపదు

చ. 3: ఇచ్చకమై యుండేది యెరవులు సేయదు
వొచ్చములేనిది తగవులఁ బెట్టదు
యిచ్చట శ్రీ వేంకటశ యేలితివి నన్ను నేఁడు
మచ్చిక సేసినది వేమరు కెదురాడదు

రేకు: 1716-01 కొండమలహరి సం: 27-091

పల్లవి: ఇయ్యకొంటి రావయ్యా యీడకు నీవు
పయ్యదలో చన్నులంటి బాససేయ నేఁటికి

చ. 1: వనితలెందరు నీపై వలపులు చల్లినాను
మనసుగలచోఁ గాక మాటలాడేవా
వినయ మప్పటి నీకు వేమారుఁ జేసినాను
ననుపైనచోటఁగాక నవ్వు నవ్వేవా

చ. 2: నియతాన మరెందరు నిన్నుఁ బెండ్లాడినాను
దయగలచోటఁ గాక తమకించేవా
రయమునఁ దాము నిన్ను రతి కెంత దీసినాను
ప్రియము గలచోఁగాక బెరసి కూడేవా

చ. 3: నిగిడి ఇందరు నిట్టె నిన్నుఁ గాఁగిలించుకొన్నా
తగులు గలచోఁగాక తనివందేవా
జిగి నన్నుఁగూడితివి శ్రీ వేంకటేశ్వరుఁడవు
సొగసిన చోటఁగాక సొంపు నెరపేవా

రేకు: 1716-02 పాడి సం: 27-092

పల్లవి: పడఁతు లిందరిలోనా బత్తి నాకే నెరసీని
వుడివోనిచేఁతల నన్నోడించవలెనా

చ. 1: ఆమని తనరతుల నలసి నే నుండఁగాను
యేమిటికి వేడుకొనీ నింకాఁ దాను
ప్రియము గలవాఁడవు ప్రియ మెంత చేసీని
సోమించి ఇప్పుడే నాకుఁ జూపఁగవలెనా

చ. 2: ముట్టి తన చెనకుల ములుకుచునుండఁగాను
అట్టె యేల తడవీని అప్పటిఁ దాను
దిట్ట తానే ఇన్నిటాను తెలిసి రిందరు నేఁడు
మెటి(ట్టి?) తన బీరాలు మెరయఁగ వలెనా

చ. 3: నను పైన సరసాన నవ్వుతా నేనుండఁగాను
పెనఁగి యెంత కూడీనే బెరసి తాను
ఘనుఁడైన శ్రీ వేంకటపతి తానౌను
చనవిచ్చి యీవేళనే జట్టిగొనవలెనా

రేకు: 1716-03 తోండి సం: 27-093

పల్లవి: నాతో నేమి చెప్పేరు నాటకపు మీ సుద్దులు
నీతితో మిమ్ము మట్టున నిలిపేనా నేను

చ. 1: యెగసక్కెపు మాటలు మీరిద్దరు నాడుకోఁగా
తగవులు చెప్పేనా దండ నే వుండి
అగపడి పెట్టరాని ఆనలెల్లాఁ బెట్టుకోఁగా
మగటిమి మెరసి నే మానిపేనా మిమ్మును

చ. 2: పైకొని మీరిద్దరును బాసలు చేసుకొనఁగా
సాకిరై నే నుండేనా సందుసుడిని
వాకులు దెరచి లోలో వావులు దెలుపుకోఁగా
ఆకడీకడనుండి మిమ్మోఁగాదనగలనా

చ. 3: కలసి యాకె నీవుఁ గడు నివ్వెరగందఁగా
యెలమి నే గోర నొత్తి యెచ్చరించేనా
అలమి శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
బలిమిచేసి నేను పంతము లాడేనా

రేకు: 1716-04 వరాళి సం: 27-094

పల్లవి: ఏమి గట్టుకొంటివి నీ విందువంకను
కామించినమే లొక్కటే కట్టుకొనరాదా

చ. 1: కలువపువ్వుల వేసి కాఁకలు మీఁదటఁ జల్లి
చలువకు వేఁడికి సరిచేసేవు
తలుపు గొబ్బున మూసి తనువుఁ దనువురాసి
చెలరేఁగి వలపులు చిమ్మిరేఁచేవు

చ. 2: నెయ్యమున నవ్వు నవ్వి నిమ్మపండ్లనే రువ్వి
చయ్యాటాల రెండు సరిచేసేవు
పయ్యాడి శిరసు దువ్వి పంతములు లోలోఁదవ్వి
వుయ్యాలమంచముమీఁద వొల వేసేవు

చ. 3: కప్పరము నోరికిచ్చి కనుఁగొనలనే కొచ్చి
చప్పుచారుసరసాల సరిచేసేవు
యిప్పుడె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వుప్పతిల్లుఁ దమకము లొనఁగూరిచేవు

రేకు: 1716-05 ముఖారి సం: 27-095

పల్లవి: ఊరకే వుండఁగరాదు వొరసి యడుగరాదు
తారుకాణించుకోవలె తప్పులు లేకుండాను

చ. 1: కొలువులోపల నుండి కొమ్మ నీతో నవ్వఁగాను
చెలరేఁగి నీవెంత సిగ్గువడేవు
యలమి మీలో నవి యెటువంటి మర్మములోతెలుసుకోవలె మాకు తేటతెల్లమిగను

చ. 2: పగటున మోహించి పడఁతి సన్నసేయఁగా
మొగము చూచి నీవెంత మూసి దాఁచేవు
వొగి మీలో నివి యెట్టి వొడఁబాటు సుద్దులో
తగ విచారించవలె తనియుదీరఁగను

చ. 3: ముందు ముందుగా నీకు ముదిత మోవియ్యఁగాను
సందడిలోననే వుండి చవి గొనేవు
అంది శ్రీ వేంకటేశుఁడ అట్టె నన్ను నేలితివి
పొందులు చూడఁగవలె పొందొక వింతలుగా

రేకు: 1716-06 పాడి సం: 27-096

పల్లవి: చూడనే మంచివాఁడవు సుద్దులెన్నైనాఁ గలవు
వాడికెనే చొక్కింతురా వంతున నీవు

చ. 1: క్రియలెఱుఁగుదునంటా కేరి నవ్వనేర్తునంటా
బయలీఁదింతురా నీవు పడఁతులను
దయఁగలవాడనంటా తప్పులెంచ నేనంటా
నయాననే సాదింతురా నడుమ నీవు

చ. 2: సోఁకించితి గోరనంటా చుట్టమనయితి నంటా
చీఁకటి దవ్వింతురా చెలువలను
వాఁకమాయ వలపంటా వన్నెకాఁడ నేనంటా
యాఁకట నలయింతురా అప్పడే నీవు

చ. 3: యిట్టె కూడితినంటా యిన్నిటా జాణఁడ నంటా
గుట్టు విడిపింతురా కొమ్మల నీవు
కట్టుగా శ్రీ వేంకటేశ నెట్టన నన్నేలితివి
మట్టుమీర మన్నింతురా మక్కువతో నీవు

రేకు: 1717-01 రీతిగౌళ సం: 27-097

పల్లవి: ఇద్దరము నున్నారము యిదివో నేము
బుద్దులు మీరు చెప్పితే పొసఁగేమునేము

చ. 1: పగటులదాన నేను పంతములవాఁడు తాను
తగవులు దేర్చరే తరుణులాల
చిగురులవేటు నాది సేవంతివాటు తనది
జగడాలు దిద్దరే సతులాల వొరసేటిదాన నేను

చ. 2: వుద్దండపువాఁడు తాను సర
సరవులు చెప్పరే సకియలాల
గౌరబైనమాట నాది కొసరుమాట తనది
వరుసఁ గూరచరే వనితలాల

చ. 3: చెలఁగి శ్రీ సతి నేను శ్రీ వేంకటేశుఁడు తాను
అలుకలు మానుపరే యంగనలాల
తలపోఁత యిది నాది తమకమెల్లాఁదనది
కలసితిమి మెచ్చరే కామినులాల

రేకు: 1717-02 ఆహిరినాట సం: 27-098

పల్లవి: ఇంక నిన్ను నేమనేది యెరఁగితి నీ గుణాలు
అంకెలనే తమిరేఁచి యెలయఁజేసితివి

చ. 1: నగేవంటా నుంటిఁగాని నాలిసేసె పొద్దువుచ్చి
పగలు సాదించేది భావించనైతి
యెగసక్కేల నేమీనెఱఁగనిఁదాన నన్ను
తెగరానిబాసలిచ్చే తెల్లవారించితివి

చ. 2: మెచ్చేవంటా నుంటిఁగాని మేకులకు మాటలాడి
గచ్చులఁబెట్టేది యెరఁగలేనైతి
బచ్చన సరసముల పయ్యదలో చేయి చాఁచి
తచ్చనమైసోఁకులనే తనివందించితివి

చ. 3: కూడేవంటా నుంటిఁగాక కోక గప్పి నిద్ర వుచ్చి
యీడ గేలిసేసేది యెంచనైతి
తోడనే శ్రీ వేంకటేశ దొరయ నన్నేలితివి
వీడెమిచ్చి యిన్నటాను వెలయఁజూచితివి

రేకు: 1717-03 దేసాళం సం: 27-099

పల్లవి: మాపుదాఁకా మాతోడి(డ?) మాటలేఁటికి
తీపులఁబెట్టి యాపె తెమలించీ నిన్నును

చ. 1: మనసు వచ్చిన మాట మరి విన నింపౌను
చనవు గలుగు మాట చవివుట్టును
వినయము తోటి మాట వేడుకలు కడు రేఁచు
వినవయ్య నీకు నేఁడు విన్నవించీ నాకె

చ. 2: వొడఁబాటైన మాట వుల్లము గరఁగఁజేయు
వుడివోనిమేలుమాట వొద్దికైవుండు
అడియాలమైనమాట ఆసలెల్లాఁ బొడమించు
విడువని తమకాన విన్నవించీనాకె

చ. 3: తారుకాణలైనమాట తలఁపించు మర్మములు
నేరుపుతోడిమాట నించు వలపు
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్నునేఁడు
చేరి చేరి కాఁగిలించి చెప్పి చూపీ నాకె

రేకు: 1717-04 మాళవిగౌళ సం: 27-100

పల్లవి: ఇయ్యకొంటి రావయ్యా యీడకే నీవు
పయ్యద నీవంటఁగా పదరనేమిటికి

చ. 1: వలపు గలిగితేఁగాక వంతులకు సారె సారె
చలము సాదించఁబోతే చవిపుట్టీనా
అలరి ఇంకానేల ఆ సుద్దులు దడవఁగా
అలమి పైకొనేనీతో నలుఁగనేమిటికి

చ. 2: చిత్తము వచ్చినఁగాక చేయివట్టి నీతోను
వొత్తి విన్నవించఁబోతే వొడఁబడేనా
తత్తరించనేమిటికి తలఁచిన పనులాయ
కొత్తలుగా నవ్వఁగాను కొసరనేమిటికి

చ. 3: ఆదరించితేఁగాక ఆసోదానఁ గాఁగిలించి
ఆదుకొని పెనఁగితే నందమయ్యీనా
యీదెస శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సాదవై యుండిన నన్ను జంకించనేమిటికి

రేకు: 1717-05 రామక్రియ సం: 27-101

పల్లవి: ఓరుపుతో చట్టువలె నుండుఁగాక
ఆరజీఁడైనవానికి నౌఁగాము లేడని

చ. 1: యేడలేని వనితలు యెన్నిమాట లాడినాను
వేడుకకానికి మరివెత యేడదే
పాడి దప్పి యప్పటిని పైకొని గుంపించినాను
కోడెకాఁడైనవానికి కోపమేడది

చ. 2: చేగదేరి యందరును చేతులు పై చాఁచినాను
వేగిరకానికి మరి వెరపేడదే
వేగి నంతాఁ గాఁక చల్లి వేసటలఁ బెట్టినాను
ఆగడపువానికి నటు సిగ్గులేడని

చ. 3: పడఁతులెందరు గూడి బలిమిఁ బెనఁగినాను
గడుసరివానికి పొంకము లేడవి
అడరి శ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁగూడె
యెడయనివానికి నెగ్గులేడవి

రేకు: 1717-06 మంగళ కౌసిక సం: 27-102

పల్లవి: మే మింతేసి కోపము మీకు మీకే యలవాటు
ఆ మొరగులెల్లా మీకు నలవాటు

చ. 1: కాకరిమాటలును కాఁతాళపు సొలపులు
ఆకెకు నీకు నవి యలవాటు
రాకపోక తరితీపు రచ్చలలో యెమ్మెలును
ఆకొలఁది కాకొలఁది యలవాటు

చ. 2: కేరి కేరి నవ్వులును కేఁకరించే సన్నలును
ఆరజము లవియే మీకలవాటు
బీరపు బొమ్మ జంకెలు బిగిసేటి ప్రియముల
నారి తేరితిరి లోలో నలవాటు

చ. 3: చిడుముడిమంతనాలు చిమ్మిరేఁగే పెనఁగులు
అడియాలా లెప్పుడూ మీకలవాటు
యెడయక శ్రీ వేంకటేశ మమ్ము నేలితివి
అడరే మీగుణాలు మీకలవాటు

రేకు: 1718-01 ధన్నాసి సం: 27-103

పల్లవి: చెప్పి పంపవలెనటె చెలువుఁడు నా వొద్దికి
వొప్పుగొంటి రమ్మనవే వొద్దనేనా తన్నును

చ. 1: మనసులే కలసితే మరి యెడమాటలేల
గొనకొన్న సంతోసానఁ గూడుటఁగాక
చనవు వెగ్గళమైతే జగడాలు మరియేల
ననిచి వేసటలేక నవ్వుట గాక

చ. 2: కూరిములే కలిగితే గుణాలు వెదకనేల
నేరుపు లొండొరులపై నించుటకాక
కోరికె లేడేరితేను కొసరఁగ నిఁకనేల
మేరతోడి చేఁతలకే మెచ్చుటగాక

చ. 3: చేతికి లోనైతేను సిగ్గులు వడఁగ నేల
కాతరాన రతులెల్లా గైకొంటగాక
యీతల శ్రీ వేంకటేశుఁడిదె తానే నన్నుఁ గూడె
కోతరపుఁ బ్రియములఁ బొసఁగుటగాక

రేకు: 1718-02 దేశాక్షి సం: 27-104

పల్లవి: ప్రేమముతో నిందరినిఁ బెండ్లాడితివి
కామించి యేరీతి నేలి కరుణించేవయ్యా

చ. 1: కలికి కాఁగిటిలోనే కాపురము సేయఁగాను
వెలఁదులకెల్లా నిఁక వేళ యేడది
చలపట్టి యేపొద్దు సరసము లాడఁగాను
మలసి ఇతరులకు మరి వేళ యేడది

చ. 2: చనవున నాపె మించి సారె మోవి యానఁగాను
వెనకటిసతులకు వేళ యేడది
కనుఁగొని యట్టె తనకతలే నీకుఁ జెప్పఁగా
మనవి చెప్పేవారికి మరి వేళ యేడది

చ. 3: చెంత నీ శిరసుమీఁద సేస లాపె వెట్టఁగాను
వింత సవతులకెల్లా వేళ యేడది
ఇంతలో శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మంతనపు చుట్టాలకు మరివేళ యేడది

రేకు: 1718-03 దేసాళం సం: 27-105

పల్లవి: ఇంతటివాఁడవు నిన్ను యేమని పొగడేము
బంతినే నాపాలిటి భాగ్య ఫలమవు

చ. 1: తగవు దప్పక యేలే తగుమగవాని పొందు
జగములో పతికి సంసారఫలము
మొగమోటగలవాని ముచ్చట మాటల చవి
తెగని తంగేటి జుంటి తేనెలలో తేట

చ. 2: సరవితో మనిపేటి సరసునికాఁగిలి
నిరతిఁగాంతకు నిండు నిధానము
నిరతపుజాణకానినెయ్యముతోడి నవ్వు
సురతపు మర్మముల సొబగుల సోన

చ. 3: భావమెరిఁగి కూడేటి ప్రాణేశు కూటమి
కైవశమై ఫలియించే కల్పతరువు
యీవేళ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చేవదేరిన వలపు చేతిలో మాణికము

రేకు: 1718-04 వరాళి సం: 27-106

పల్లవి: నీవేమి సేతువు నిన్ననఁగఁ బనిలేదు
చేవదేరఁ జేసినవి సిగ్గులే కావా

చ. 1: వుడివోనియట్టి యాస లొకటొకటె రేఁచి
బడలించినది నాప్రాయమే కాదా
అడరి నీ మోము చూపి ఆయములు గరఁగించి
తడఁబరచినది నా తమకమే కాదా

చ. 2: తనువుపైఁ గాఁకరేఁచి తరితీపు చేసినది
మొనసిన నాలోని మోహమే కాదా
వొనర నీరతులకు నుడిగట్టఁజేసినది
వెనువెంటఁ దిరిగే నావేడుకే కాదా

చ. 3: నా యిచ్చ కొలఁదినే నన్ను నిన్నుఁ గూడించి
పాయనీకుండినది నాభాగ్యమే కాదా
యీయెడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చాయకుఁ దెచ్చినది యీ సరసమే కాదా

రేకు: 1718-05 హిందోళ వసంతంసం: 27-107

పల్లవి: ఇంతులాల చూడరే యెటువంటివాఁ డితఁడు
అంతటిలో నేమిటికి నానవెట్టుకొనినే

చ. 1: తగవులు చెప్పఁగాను తనిసి వూఁకొంటిఁగాక
యెగసక్కెము చేసినా యెంతైనాను
మగువనైతేనే తనమర్మము నేనెఱఁగనా
జిగిమించ తానేల సిగ్గువడీనే

చ. 2: దండనే కూచుండఁగాను తప్పక చూచితిఁ గాక
చండి పెట్టి వెంగెముగా సాదించితినా
నిండిన జవ్వనినైతేనే తన్ను జంకించేనా
దండిగలవాఁడిందుకు తలవంచనేఁటికి

చ. 3: చనవిచ్చి కూడఁగాను చన్నుల నొత్తితిఁగాక
మొనలు పైఁ జూపేనా మొక్కలానను
వనిత నేనైతేనే వాసులకు మీరేనా
యెనసె శ్రీ వేంకటేశుఁ డేల వేఁడుకొనినే

రేకు: 1718-06 తెలుఁగుఁగాంబోది సం: 27-108

పల్లవి: విన్నవించరే వెలయ నీతనికి
సన్నలాఁ జాయలా జరగదు పొందు

చ. 1: కనుగొన చూపులఁ గాంక్షలు దీరవు
కినియనిరతి బెనఁగినఁగాని
మనవులు చెప్పిన మర్మము గరఁగదు
పెనఁ(పెన?) గొని తనువులు బెరసినఁగాని

చ. 2: యేతుల నవ్వుల నెనయదు కాఁగిలి
చేతులు పైఁజాఁచినఁగాని
దూతికల కతనఁ దొలఁగవు చలములు
నీతి వినయములు నెరపినఁగాని

చ. 3: సేసలు వెట్టిన సిగ్గులు వీడవు
రేసులులేక మీరినఁగాని
యీసరి శ్రీ వేంకటేశుఁడే నన్నేలె
ఆసలు విడువవు అలపులే కాని

రేకు: 1719-01 భూపాళం సం: 27-109

పల్లవి: మెచ్చాయనయ్యా నేఁడు మీ యిద్దరివినోదాలు
పచ్చి దేరేనవ్వులతో భామ సిగ్గువడెను

చ. 1: మలఁగుపై నొరగుండి మగువ కిన్నెరలోన
వలచి నీపై గీతాలు వాఇంచఁగాను
వలిపె తెరమాటున తలవూఁచి మెచ్చితివి
అలరి యానీడ గని యాపె సిగ్గువడెను

చ. 2: పువ్వుతిల్లి యేకతాన నుండి నాటకసాలలో
నప్పుడు నీపై చిందుల కాపె యాడఁగా
చొప్పులు సోరణగండ్లఁ జూచి నీవు చెలితోడఁ
జెప్పఁగాఁ జప్పుడు విని జిగి సిగ్గు వడెను

చ. 3: పొద్దువోక నీరూపు పూఁచి చిత్ర పలకపై
కొద్దిమీర వ్రాసి పరాకున నుండఁగా
వొద్దికతో శ్రీ వేంకటోత్తమ కాఁగిలించితి
వద్దరిపాటున దానూ నటు సిగ్గువడెను

రేకు: 1719-02 బంగాళం సం: 27-110

పల్లవి: ఏమి సేయవచ్చు నందుకేమి చింతించకు
సాములనాతోడి పొందు చక్కదిద్దీఁ బనులు

చ. 1: వేగిలే చెవ్వతెమో వెసఁ జూచి వచ్చితివో
చేగదేర నాగోరు నీచెక్కు దాఁకెను
వాగమై యెవ్వతె నీకు వచ్చినవేళ గుణమో
ఆగడపు మాటలకు నటు గురియైతివి

చ. 2: యెక్కడ నెవ్వతె మోవియెంగి లంటిన దోసమో
నిక్కి నాపలుసోఁకులు నీసందులంటె
కక్కసాన నెవ్వతెను కాఁగిలించి వచ్చిన ఫలమో
తొక్కుల నీమేను నాచేతోదోపులఁ జిక్కెను

చ. 3: తొరవి యెవ్వతెకాలు దొక్కిన భాగ్యమహిమో
వొరసి నా చన్నులు నీవురము నాఁటె
ఇరవై శ్రీ వేంకటేశ యెవ్వతెమేలు వంకనో
పరగ నా ఇంటఁ గూడి పాయక నీవుంటివి

రేకు: 1719-03 ఆహిరి సం: 27-111

పల్లవి: వట్టి సిగ్గు లిఁకనేల వలపులు దైవారె
జట్టిగొని నవ్వేదే జాణతన మిఁకను

చ. 1: సంగడిఁ గూచున్నదాకె చన్నుల నొత్తీనాపె
ఇంగిత మెఱఁగవు నీ కేడ పరాకు
వుంగరము వేలఁ బెట్టి వొడఁబడ మాటలాడి
సంగతిగా మన్నించుటే జాణతన మిఁకను

చ. 2: చెనకి నవ్వీనాపె సేసలు వెట్టీనాపె
యెనసివుండఁగా నీకేడ సిగ్గులు
మనసు రంజిల్లఁజేసి మర్మములు సారె నంటి
చనవిచ్చి మన్నించుటే జాణతన మిఁకను

చ. 3: కలువల వేసీ నాపె కాఁగిటఁ గూడీ నాపె
యెలమిఁ బెండ్లాడఁగా నీకేడ వెరగు
అలమి శ్రీ వేంకటేశ అట్టె సంతోసించఁ జేసి
సలిగె యిచ్చి మెచ్చుటే జాణతన మిఁకను

రేకు: 1719-04 వరాళి సం: 27-112

పల్లవి: వేగిరించఁ బనిలేదు విభునితోను
చేగదేర నవ్వితేనే చేతఁ జిక్కు నితఁడు

చ. 1: వాసులెల్లా రేఁచీని వలపుల లోఁచీని
వేసరకువే నీవు విభునితోను
ఆసలు నీకు గనము ఆతఁడు నీపై బత్తి
సేసినట్టు సేసితేను చేతఁ జిక్కు నితఁడు

చ. 2: మంతనాలెల్లా నాడీని మనసులు సోదించీని
వింత లీకఁ జేయకువే విభునితోను
పంతము నీ విచ్చితివి పాయలేఁడు నిన్నతఁడు
చెంతనే కాఁచుకుండితే చేఁతఁ జిక్కు నతఁడు

చ. 3: సరసములాడీని సారె నిన్నుఁ గూడీని
విరసాలేవే శ్రీ వేంకటేశుతో
మరిగిన దేవులవు మగఁడు నీకు నతఁడు
శిరసువంచి మొక్కితే చేతఁజిక్కు నతఁడు

రేకు: 1719-05 నాదరామక్రియ సం: 27-113

పల్లవి: ఒద్ద నిద్దరున్నారు వొడ్డోలగమై వున్నాఁడు
కొద్దిమీరి లోకమేలే గుణవంతుఁ డతఁడు

చ. 1: తమకమే కలిగితే తానే నాయింటికి వచ్చీ
రమణుని దూరకురే రామలాల
సముకమున నే నుంటే చనవు తానే యిచ్చీ
తిమురుచు నీతనితో దీకొనఁగ వచ్చునా

చ. 2: మన్నించవలసితే మాటలు తానే యాడీ
సన్నల నాడించకురే సతులాల
పన్ని నే సేవసేయఁగా భావము దానే కరఁగీ
విన్నపము లిట్టె చేసి వేఁగిరించవచ్చునా

చ. 3: కరుణ గలిగితేను కాఁగిటఁ దానే కూడీ
పరుసా లాడకురే పడఁతులాల
ఇరవై శ్రీ వేంకటేశుఁ డీతఁడిదె నన్ను నేఁడె
అరుదై పెనఁగఁగాను అవుఁగాదనవచ్చునా

రేకు: 1719-06 హిందోళవసంతం సం: 27-114

పల్లవి: ఎక్కడ పరాకు నీకు నేఁటికి వచ్చి సిగ్గులు
మక్కువ నీపైఁ జల్లీ మాఁటలాడవయ్యా

చ. 1: సానఁబట్టిన చూపులు సతి నీపై వెదచల్లి
కానుకలిచ్చీ నిదె కైకొనవయ్యా
వానల చెమటలు మైవడియంగఁ దనచన్ను
లానుకొని విన్నవించీ నాలకించవయ్యా

చ. 2: సెలవుల నగవులు చిడుముడిఁ బచారించి
పలుమారు పాదాలొత్తీ పైఁజాఁచవయ్యా
లలిఁ దొడలకాంతులు వలిపెములోఁ జూపట్ట
కొలువుసేసీ యిదె చే కొనఁగదవయ్యా

చ. 3: కొనగోరి తాఁకులు గురుతై ఆయములంట
యెనసి కాఁగిట నించీ నేలుకోవయ్యా
ననిచి శ్రీ వేంకటేశ నంటున సేసలు వెటీ(ట్టీ?)
వనిత యిన్నిటాఁ జనవరిఁ జేయవయ్యా

రేకు: 1720-01 గౌళ సం: 27-115

పల్లవి: ఎంత సేసే వేమయ్యా ఇంతలోననే
మంతనములాడితేనే మలసేటిదాననా

చ. 1: వాఁడి గోరఁ జెక్కునొక్కి వదనము చేతనెత్తి
వేఁడుకొనే విట్టె నన్ను వింతదాననా
పోఁడిమి నండకు వచ్చి పొత్తనఁబెట్టుకొంటివి
నేఁడు నన్ను మన్నించితే నీ సరిదాననా

చ. 2: చుట్టరికములు చెప్పి చొక్కులఁబెట్టి తగిలి
అట్టె పొదిగేవు నీవియ్యపుదాననా
బెట్టుగా సరసమాడి ప్రేమఁజన్నులంటితివి
నెట్టుకొని నవ్వితేనే నీటు చూపేదాననా

చ. 3: గరిమఁ దప్పక చూచి కాఁగిటిలోపలఁగూడి
తొరలించేవు రతులు దొమ్మిదాననా
ఇరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిపుడు
మరిగించినంతలోనే మర్మమెత్తేదాననా

రేకు: 1720-02 వరాళి సం: 27-116

పల్లవి: నీ గుణమంతయుఁ దొల్లి నే నెరుఁగుదు
చేగదేరె వలపులు చెప్పకుమీ సుద్దులు

చ. 1: చనవరి గనక యీసతి జాణతనాలాడీ
వినరాదా ఇపుడు నీ వీనులారను
పనిమాలిన పరాకు పచారించే విదియేల
వనితల ముందరను వద్దు సుమ్మీ యెమ్మెలు

చ. 2: పెండిలాడెఁగనక ముప్పిరి గొనఁ బొలసీని
దండఁబెట్టుకొనరాదా తమితోడను
మెండుకొన్న గర్వము మెరశించ నిఁకనేల
పండెను నీ మనసిదే పట్టకుమీ యెగ్గులు

చ. 3: పట్టపుదేవి గనక పైకొని నిన్నుఁ గూడీ
గుట్టుతో నేలుకోరాదా కొంకుదేరను
నెట్టన శ్రీ వేంకటేశ నేరుపులు దాఁచనేల
దట్టమాయఁ గోరికలు తప్పకుమీబాసలు

రేకు: 1720-03 లలిత సం: 27-117

పల్లవి: ఎదురుబడి వున్నారు ఇద్దరు మీరు
సుదతి భావము లెంచి చూచుకొనవయ్యా

చ. 1: చెక్కునఁ జేఇ మాటుచేసి చిమ్ముఁజూపులనుఁజూచి
చొక్కీఁ దనలోఁదానే సుదతి
ముక్కర గదలఁగాను ముచ్చటాడి చెలికిని
దిక్కు చూపీఁ గమ్మటిని తెలుసుకోవయ్యా

చ. 2: బలువుగాఁ గొప్పువెట్టి పాపట దువ్వుకొంటాను
కొలువు సేసీ నీకుఁ గోమలి
పలువరుస మెరువఁ బదాలు నీపైఁ బాడి
కలువల నిన్ను వేసీఁ గనుకొనవయ్యా

చ. 3: పరగ నొత్తిలి నీ పాదముపైఁ జేయి చాఁచి
మరుకేలి నిన్నుఁ గూడి మగువ
నిరతి శ్రీ వేంకటేశ నీకిదె కానుకలిచ్చీ
సరిఁ దన చన్ను లివె సారె మెచ్చవయ్యా

రేకు: 1720-04 శంకరాభరణం సం: 27-118

పల్లవి: నీవు మాకు బురిగాక నేరము లిందేమున్నది
ఆవటించి మనసులో నౌఁగాము లున్నవా

చ. 1: శ్రీ పతివైన నీవు చేపట్టి నన్నేలితివి
యేపనులు చెప్పినాను యేమాయను
వోపి నీకు మొదలనే వూడిగపువారమట
యేపొద్దు చూచిన మాకు నెగ్గుపట్టనున్నదా

చ. 2: దేవుఁడవైన నీవు తేనెమోవి ఇచ్చితివి
భావించి నీవేమనినా పంగెమున్నదా
చేవమీరి నీకు నేను చేతిలోని దాననట
కావరించి నీతో మాకు కాఁతాళించనున్నదా

చ. 3: గక్కన శ్రీ వేంకటేశ కాఁగిలించి కూడితివి
యెక్కుడు నిన్నుఁ గొసర నేమున్నది
చిక్కని నవ్వుల తోడి సేసపాలదాననట
పక్కన నేఁ డిఁక నీతో పంతమాడనున్నదా

రేకు: 1720-05 నట్టనారాయణి సం: 27-119

పల్లవి: ననిచి మరీఁ గొంత నవ్వేవు గాక
కొనముట్ట నేము నీతోఁ గోపగించేమా

చ. 1: చనవు సేసుక నీతో సారె సారె నవ్వితేను
కనలి తప్పక చూచి కాఁతాళించేవు
పెనఁగి నీవింతేసి బిరుదు లెక్కించుకొంటే
వనితలమింతే నీతో వాదులాడేమా

చ. 2: కాయము పైఁ జేయివేసి కందువ లంటితేను
ఆయములు సోఁక నాతో నానవెట్టేవు
చాయలకు నీవింత చలము సాదించితేను
పాయపు వారము నేము పంగించేమా

చ. 3: నేరుపున నిన్నుఁ గూడి నివ్వెరగు నొందితేను
గోరికొన నెచ్చరించి గురి సే సేవు
యీరీతి శ్రీ వేంకటేశ యెంత పంతమాడినాను
మేరతోడి వారము మితిమీరేమా

రేకు: 1720-06 పాడి సం: 27-120

పల్లవి: అంతే పని గలితే నానతీవయ్యా
వింతవారమా నేము వెఱపేలయ్యా

చ. 1: తలఁపు లేకములైతే తగవుకుఁ బనిలేదు
చెలులసాకిరులేల చెప్పేవయ్యా
నిలుచున్నాఁడ వప్పటి నీ కెంత పనిగద్దో
యెలమి మాతో జోలి యెందాఁకానయ్యా

చ. 2: బాసలే నిజములైతే పదరఁగఁ బనిలేదు
గోసనాసగా వేఁడుకొన నేలయ్యా
ఆసపడ్డాఁడవు నీవు అడ్డమాడ దోసము
సేసపాలదాన నీ చిత్తమిఁకనయ్యా

చ. 3: కూడిన యిప్పటిమీఁద కొసరఁగఁ బనిలేదు
నోడలఁ బెట్టుచుఁ జెక్కునొక్కనేలయ్యా
యీడనే శ్రీ వేంకటేశ యెనసితివి పాయపు
వీడెమిచ్చెలసితివి వేగినంతానయ్యా

రేకు: 1721-01 లలిత సం: 27-121

పల్లవి: పొద్దువోని చెలులెల్ల బొమ్మలఁ గాటుక వెట్టి
రద్దము చూచుకో నీవు అదివో తగవు

చ. 1: నేరుపుగలయమ్మ నిక్కి నిక్కి చూచితేను
వోరుపుగలయమ్మ వొడివట్టితీసీ నిన్ను
యీరీతి నిన్నుఁ దిట్ట యెవ్వరి కేమి గారణ
మారసి వచ్చినవాఁడ వదివో తగవు

చ. 2: వేడుక నొక్కసతి విందుకుఁ జెప్పితేను
వాడికె గలయాపె వడ్డించె మోవి తేనెలు
ఆడుకో నీకునేల అందగాఁడవు నీవైతే
ఆడనీడఁ జెల్లఁబెట్టే వదివో నీ తగవు

చ. 3: మనువుకు వచ్చినాపె మంచానకుఁ బిలిచితే
చనవు గలిగినాపె సంగడిఁ గూచుండె నిదె
యెనసితి వొక్కమాటే యిద్దరి శ్రీ వేంకటేశ
అనువాయనన్నిటా నీ కదివో తగవు

రేకు: 1721-02 సాళంగనాట సం: 27-122

పల్లవి: వద్దు వద్దు నీ వంతేసి వైతాళాలు నీ
సుద్దులెల్లా నెఱుఁగుదు సోద్యపడనేఁటికి

చ. 1: చెక్కులేల గిల్లేవు చేరి వేడుకొనేనంటా
వక్కణించి నీవు మంచివాని వలెనే
కక్కసమేల పెట్టేవు కాఁగిలించుకొనేనంటా
వెక్కసమై నిన్నుఁ గడు వెగ్గళించే దానవా

చ. 2: ముందలేల పట్టేవు ముడిచేనంటాఁ బూవులు
చెంది నాకు నితవరి చేఁతవలెనే
సందడిఁ బెనఁగనేల సరసములాడేయట్టు
కందువ నీతో నేను కపటాలదానవా

చ. 3: ఆయములే లంటేవు అంగవించికూడేనంటా
చాయల నాకు దక్కిన సాదువలెనే
యీయెడ శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
వోయయ్య నిన్ను మెచ్చక వొరసేటి దానవా

రేకు: 1721-03 తోండి సం: 27-123

పల్లవి: అవురవురా బాలుఁడా ఆయమంటే వింతలోనె
సారెసారె ముద్దులెల్లా చల్లేవేరా బాలుఁడ

చ. 1: ముంగిటనున్నవారి మూలకుఁ బిలిచి నీవు
యెంగిలి సేసేవు మోవి యేరా బాలుఁడ
అంగవించి బెట్టిమాట లాడెనంటా నోరుమూసి
వుంగరాలవేళ్లనేల వూఁచేవేరా బాలుఁడ

చ. 2: యేకతమాడేనంటా యేడేడో బూతుమాటలు
పైకొని ఆడేవేరా పసిబాలుఁడ
కాకుసేయకు మనుచు కమ్మర పరాకుగాను
కేకిసలై గిలిగించి కేరేవేరా బాలుఁడా

చ. 3: అప్ప లప్ప లాడే నంటా నంతలోనె కాఁగిలించి
చిప్పిలఁ గూడితి వవురా చిన్నిబాలుఁడా
మెప్పించి శ్రీ వేంకటాద్రిమీఁద నన్ను నురమున
తెప్పలఁదేలించితివి దిమ్మరి వోబాలుఁడా

రేకు: 1721-04 పళవంజరం సం: 27-124

పల్లవి: ఆకెకు నీకుఁ దెలుసు నన్నిపనులు
యీకడ మమ్ము నట్టె యేమి చూచేవయ్యా

చ. 1: కతకఱచిన మాట కలికి నీతో నాడె
యితవుగా నవ్వితిని ఇందుకు నీవు
రతికెక్కితిరి మీరు రచ్చల నిన్నిటా నేఁడు
చతురత మమ్ము నేమి సారెఁ జూచేవయ్యా

చ. 2: సేయరాని చేఁత నీ చెక్కుల నట్టె సేసె
చాయలకు నీవవి సమ్మతించితి
బాయిటఁ బడెను మీ పై పై వలపులెల్లా
మీయెడ నీవు మమ్ము నేమి చూచేవయ్యా

చ. 3: కనురెప్ప మఱఁగైతే కాఁగిలించుకొనె నాపె
మనసిచ్చి, కరఁగె నీ మర్మములు
ననిచి శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి యిట్టె
యినుమడించెను మోహ మేమి చూచేవయ్యా

రేకు: 1721-05 ఆహిరినాట సం: 27-125

పల్లవి: అనకువే నీవు నన్ను అవుఁగాదనుచు నేఁడు
కనుగిరుపుల సేఁత కంటివటే నీవు

చ. 1: తియ్యని మాఁటలలోనే తెరమరఁగులు చేసీ
వొయ్యనే వినవే నీవు వోచెలియ
వెయ్యింటి కొకటి నేను విచ్చిచెప్పఁబోతేను
కయ్యములకుఁ దిరిగీ కంటివటే నీవు

చ. 2: సెలవినవ్వులలోనే చెనకులు వెదచల్లీ
తలఁచుకుండవే యిది తరుణి నీవు
చలివాపి నేనిది సాఁకిరివెట్టఁగఁబోతే
కలపీఁ దన పంతాలు కంటివటే నీవు

చ. 3: కందువ సిగ్గులలోనే కాఁగిటను నన్నుఁ గూడె
అందియ్యఁ గదవే విడె మతివ నీవు
విందులమో విచ్చితి శ్రీ వేంకటేశుఁ డితనికి
గందము వూసీ నిదె కంటివటె నీవు

రేకు:	1721-06	నాదరామక్రియ	సం:	27-126

పల్లవి:	అటని మానఁగలేవు అన్నిటాను నీ పొందు
	యెటువలెఁ జేసినాను యియ్యకొంటి మిపుడు

చ. 1:	చనవునఁ దిరిగేము సారెసారె నీ వద్ద
	మనసుమర్మ మెఱఁగ మరిగితిని
	వెనకటి నీ చెలులు వేమారు నేమందురో
	తనిసి వున్నారము నీ తగవులచేతను

చ. 2:	సలిగెకుఁ బెనఁగేము సంగతిగా నీకు లోనై
	కొలచిన గుణముల కొలఁది చూడ
	పెలుచు నీ చేఁతల ప్రియ మెట్లా నున్నదో
	సొలసితి మిపుడు మా సోఁగల కన్నులను

చ. 3:	ఆసలనే కూడితిని అరమరపుల నిన్ను
	వాసుల నీరతులలో వైపు దెలియ
	సేసవెట్టితివి నాకు శ్రీ వేంకటేశ్వర నీవు
	రాసికక్క(కెక్క?) నీవలపు రచ్చలఁ బెట్టితిమి

రేకు: 1722-01 సామంతం సం: 27-127

పల్లవి: మొదలివారము నేము మోహమెపుడు గలదే
మదమత్సరము లిఁక మాకేఁటికే

చ. 1: కొత్తపెండ్లికూఁతురవు కోరి వెంగేలాడఁ జెల్లు
వొత్తి నేమైతే నింతేసి కోపమమ్మా
హత్తిన వింతొకచూపు అందురు వేఁడొకచని
మత్తిలి నీ వోజలు మాకేఁటికే

చ. 2: యిగురు వలపులాన వేమైనఁ జేయఁజెల్లు
యెగసక్కే లింతేసి కెరఁగమమ్మా
చిగురు పాన్పు మెత్తన చెలఁగి ననలు వాఁడి
మగువ నీమతకాలు మాకేఁటికే

చ. 3: వేడుకకత్తెవు నీవు వేమారుఁ గూడఁజెల్లు
జాడతో వేసరించఁగఁ జాలమమ్మా
యీడుతో శ్రీ వేంకటేశుఁ డిద్దరి నొక్కటఁగూడె
మాడుపుటింటిలో సిగ్గు మాకేఁటికే

రేకు: 1722-02 పూర్వగౌళ సం: 27-128

పల్లవి: రావయ్య మా ఇంటికి రచ్చలో నుండఁగనేల
కైవసమైతివి నాకుఁ గలఁగకు మిఁకను

చ. 1: నవ్వుల కేమనినాను నమ్మిదు నీమాటలెల్లా
మవ్వపు నీ చేఁతలును మంచి వందును
యెవ్వరేమి చెప్పినా నీ కెదురు పూనుకవత్తు
ఇవ్వల నా మోము చూచి యేల లోఁగేవయ్యా

చ. 2: చెనకిన చెనకులు చెలరేఁగి ఇచ్చగించు
పెనఁగినా వేఁడుకొని ప్రియము రేఁతు
మనసు మరచినాను మర్మములు దలఁ పింతు
ననిచి సిగ్గుల మించ నాతోను వలెనా

చ. 3: చప్పనై కలసినాను చవులట్టె పుట్టింతు
తప్పులు గలిగినాను దాఁతు నన్నియు
ఇప్పుడు శ్రీ వేంకటేశ ఇచ్చగించి కూడితివి
ముప్పిరిఁ దొంటిపనికి మొక్కఁగ నేమిటికి

రేకు: 1722-03 ముఖారి సం: 27-129

పల్లవి: ఎదిటి పతము లేల ఇంటిలోనికి రారాదా
కదియఁగ మెచ్చుకుంటే గడుసవనేను

చ. 1: నిన్ను నేను చెనకఁగ నేమపుమాట లాడేవు
యెన్నికబాస లెవ్వతె కిచ్చినాఁడవో
చన్నుల నొత్తి చూడఁగ సరుసఁ గరఁగకుంటే
వన్నెల రాయివంటివాఁడవనే నపుడు

చ. 2: ఆయములు బుట్టితేను ఆచారాలు చెప్పేవు
యేయెడ నెంత చదివి యెరిఁగితివో
సోయగపుమో వియ్యఁగా చొక్కి లోను గాకుండితే
చాయల మాకువంటిజడుఁడ వనేను

చ. 3: మలసి కాఁగిలించితే మంచిపొద్దు వెదకేవు
బలు శ్రీ వేంకటేశుఁడ పంతమెట్టిదో
వెలయ నేఁ గూడితి వేసా లిఁకఁ జెప్పు కుంటే
తొలఁగుచు మొరసేటి తుమ్మిద వనేను

రేకు: 1722-04 ముఖారి సం: 27-130

పల్లవి: సేసినపాపము నేఁడు చెప్పకపోదు
నీ సుద్దులు నాగుణము నీకే తెలుసును

చ. 1: మచ్చికనీచెలులతో మాటలే యాఁడుదుఁగాని
మచ్చరము మతినైతే మానదు
ఇచ్చకమాడుదు నీతో యెడనెడ వెంగేలు
విచ్చనవిడి నాడక విడువను

చ. 2: వాడిక నీ చెలులతో వంతుకు నంపుదుగాని
యేడలేనికోపమెల్లా ఇందుకొందును
వీడెము నీవిచ్చితేను వేడుకఁ గైకొందుఁగాని
యేడదోయనుచు లోలో నెంచుకొందును

చ. 3: నీ కాంతలు మొక్కితేను నేనూ మొక్కుదుఁగాని
రాకలఁబోకల రారాఁపుసేతును
యీకడ శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
కైకొంటిఁగాని నీరతి కమ్మటిఁ బోలుదును

రేకు: 1722-05 కాంబోది సం: 27-131

పల్లవి: ఎఱఁగక దగ్గరితే నెడ్డనందురు
వెఱవక నాకిందుకు వివరించు విభుఁడా

చ. 1: నున్నని చెక్కులమీఁద నూఁగరేఁగెఁ బులకలు
సన్నపు చెమట మేన జాలువారెను
అన్నియు నాకుఁగానొ అవ్వల వేరొకతెకొ
యెన్నికవలపు నాకు నెఱిఁగించు విభుఁడా

చ. 2: తెలుపెక్కెఁ గన్నులను తేరకొనప్పటనుండి
కళలెక్కె మోమునను కడుఁగడును
తలఁపు నామీఁద నుందో దవ్వుల నెక్కడనుందో
యెలమి నీవేడుక నాకెఱిఁగించు విభుఁడా

చ. 3: నవ్వులు సెలవులను నారుకొనె మీఁదమీఁద
రవ్వఁగా శ్రీ వేంకటేశ రతిఁ గూడితి
యివ్వల నాపై మన్ననో యెవ్వరైనాఁ జెప్పిరో
పవ్వళించితివి నాపై పచారించు విభుఁడా

రేకు: 1722-06 తోండి సం: 27-132

పల్లవి: మా తోడి గొడవేల మాపుదాఁకా నీకును
యీతలఁ జింతనసేయు మింకా నీ విపుడు

చ. 1: చెలరేఁగి యాపె నీకుఁ జెప్పిన బుద్ధులెల్లా
తలఁచి తలఁచి నీకు దాఁటరాదుగా
చలమున నాపె నీకు చదివించినవొజ్జలు
నెలవుల యిఁకఁ గొన్ని నేరుచుకో ఇపుడు

చ. 2: వొద్దనుండి యాపె నీకు వుపదేశించినదెల్లా
తిద్దరానివేదములై తిరమాయఁగా
పొద్దు వొద్దు నీకు నాపె బోదించిన గురువు
సుద్దులెల్లా మరవక చొక్కుము నీవిపుడు

చ. 3: చెక్కు నొక్కి కూడి యాపె నేసినట్టి విన్నపాలు
చక్కనై మదనరహస్యములాయఁగా
యిక్కువ శ్రీ వేంకటేశ యెనసితి విటునన్ను
తక్క కాపె అప్పణించె దైవము నీకిపుడు

రేకు: 1723-01 దేసాళం సం: 27-133

పల్లవి: చాలుఁ జాలు మాతోను సటలేఁటికి
కోలు ముందుగా మాతో గుట్టు సేయవలెనా

చ. 1: పంతగాఁడవు నీమోవి పచ్చి ఇంతేటికాయ
చింతలేనివాఁడవేల చెమరించేవు
బంతినున్నా రిద్దరును భావములు గానవచ్చె
కొంత గొంత మాతోను గుట్టుసేయవలెనా

చ. 2: మనసుగలవాఁడవు మాటలేఁటికాఁడవు
కినిసినవాఁడవేల కిందుపడేవు
పెనఁగేరు మీలోని ప్రియమెల్లఁగానవచ్చె
కొనబుఁజేఁతల మాతో గుట్టు సేయవలెనా

చ. 3: తమకించనివాఁడవు తగవులేల పెట్టేవు
తెమలనివాడవేల తేరి చూచేవు
అమర శ్రీ వేంకటేశ ఆపె నన్నుఁ గూడితివి
గుమతాన మాతో నింత గుట్టు సేయవలెనా

రేకు: 1723-02 మాళవి సం: 27-134

పల్లవి: ఏఁటికి సిగ్గువడేవు ఇంకా నీవు
గాఁటపు నీమోహనము కడగురుతులేదే

చ. 1: బలిమి నీజవ్వనమే పట్టఁగరాదుగాని
అల నీ చన్నులు వట్టే దదేమి దొడ్డే
చలపట్టి పంతములు సారె నాడరాదుగాని
మలసి నీ మర్మముల మాట లాడవచ్చునే

చ. 2: వల పింతంతని చెప్పవశముగాదుగాని
కొలఁదివట్టేనే నీయెక్కువ పిరుఁదు
విలువ వెట్టఁగరాదు వేయైనా నీవేడుకకు
తులఁదూఁచవచ్చు మనదొమ్మి సమరతులు

చ. 3: పెనఁగేటి నీగుట్టు భేదించరాదుగాని
చెనకి పోఁకముడి మచ్చికఁ దీసేనే
యెనసితి శ్రీ వేంకటేశుఁడ నయిన నాకు
చనవిచ్చితివి ఇన్ని సాదించవచ్చునే

రేకు: 1723-03 పాడి సం: 27-135

పల్లవి: ఊరకే వున్నాఁ డితఁడు వోరుపుతోడ
ఆరీతి మాటలాడ అరుహమా ఇపుడు

చ. 1: మంతనము లాడెనంటా మగువతో నీవతని
నెంతకెంత సేసేవే ఇప్పుడు నీవు
వంతులు దప్పకవుండవచ్చీఁ గాక రమణుఁడు
అంతేసి మాటలకు నరహమా ఇతఁడు

చ. 2: అంగనచేతి విడెమాకు నందుకొనె నంటా
యెంగిలి మాటాడకువే యెగసక్కేన
జంగిలిలో నీతోడ సరసము నాడీఁగాక
అంగమంటి ఇంతసేయ నరుహమా ఇతఁడు

చ. 3: మేడమీఁదనున్న చెలి మేలమాడి కూడెనంటా
ఆడుకొనే వింతలోనె అందరితోడ
వోడక శ్రీ వేంకటేశుఁ డొడివట్టి నిన్నుఁగూడె
ఆడ నీడా గేలిసేయ నరుహమా ఇతఁడు

రేకు: 1723-04 వరాళి సం: 27-136

పల్లవి: ఆపె గలిగుండఁగాను అనుమానాలిఁక నేల
కోపగించేమా నేము కొంకనేల నీకును

చ. 1: పూసగుచ్చినట్టు నీకు బుద్ధులు చెప్పీ నాకె
వేసరక వినవయ్య వేమారును
ఆసలాసలఁ దిరిగే మంతనింత నీవెంట
వీసమంత మమ్ముఁ జూచి వెఱపేల నీకును

చ. 2: తెమలించి నీగుణాలు తిద్దుకవచ్చీ నాపె
అమర నడవవయ్య ఔఁ గాదనక
తమకించి నీ యింట తావై వుండేము నేము
విమలపు మమ్ముఁ జూచి వెఱపేల నీకును

చ. 3: నెయ్యమున నిన్నుఁగూడి నేరుపరిఁ జేసీ నాపె
ఇయ్యకోలు గొనవయ్య ఇందరిలోన
చయ్యనఁ గూడితిమి ఇచ్చటనే శ్రీ వేంకటేశ
వెయ్యయినా మమ్ముఁ జూచి వెఱపేల నీకును

రేకు: 1723-05 దేసాళం సం: 27-137

పల్లవి: దేవర విన్నిటా నీకు దేవుల నేను
నీవనిత నెప్పుడూను నేర మెంచకువయ్యా

చ. 1: చెక్కు నొక్కి నీకు నేను సేసినట్టి వినయాలు
వక్కణగా నీ మనసు వచ్చునా నేఁడు
కక్కసించఁగదా నీకుఁ గప్పురవిడె మిచ్చితి
దక్కివున్నదానను నాతప్పు లెంచకువయ్యా

చ. 2: పాదము లొత్తి నే నీపనుల నుండిన మేలు
యీదెస నీవూడిగాల కెక్కేనా నేఁడు
తోదోపులు గావుగదా దొమ్ములుగా నే మొక్కితి
ఆదినుండి నిన్నే కోరే మౌఁగాదనకు వయ్యా

చ. 3: కందువనీకాఁగిటను కలసిన భోగములు
చెంది నీకు నిన్నిటాను సెలవా నేఁడు
సందడి సేయఁగదా నీ సరుస శ్రీ వేంకటేశ
యెందును నీ మేనవార మెరవుగాకువయ్యా

రేకు: 1723-06 గౌళ సం: 27-138

పల్లవి: మీఁటితే నవిసీ నవె మిక్కిలి మీపాయములు
వాఁటమై నవ్వఁగదవే వాసులేఁటికి

చ. 1: మొగము చూచిన మీఁద మోనము లేమిటికే
తగినమాటాడవే ఆతని తోడను
వొగరాయ నలుకలు వొడిని (ని?) డె వలపులు
చిగురు మోవియ్యఁగదే సిగ్గులేఁటికి

చ. 2: తనువులు సోఁకె నిఁక తలవంపు లేఁటికే
మనసియ్యఁగదవే రమణునికిని
కొనసాగెఁ దమకము గురులేసె మదనుఁడు
చెనకి కాఁగిలించవే చింతలేఁటికి

చ. 3: ఆయములు గరఁగెను అనుమానాలేఁటికే
చేయిచాఁచి కూడవే శ్రీ వేంకటేశు
రేయాయఁ బగలెల్ల రిచ్చలాయ మీరతుల
చాయకు వచ్చితి విఁక సటలేఁటికే

రేకు: 1724-01 సాళంగనాట సం: 27-139

పల్లవి: ఏరా నీ గుట్టెల్ల నే నెఱఁగనిదా
తేరి చూడరాదా మమ్ము తెఱవలలోనను

చ. 1: తోడనే వెలితౌనా నీ దొరతనమునకును
నీడల నావద్ద నిట్టె నిలుచుంటేను
జాడ దప్పీనా నీ జవ్వనమదమునకు
వీడెము నా కందిచ్చితే వెలఁదులలోనను

చ. 2: ఇంచుకంత దరగీనా యిప్పటి నీ సత్తువలో
పంచల నా చెప్పినట్టి పని సేసితే
నించిన నీ చలములో నెరుసులు దొరలీనా
మంచముపైఁ గూచుండి మాఁటలాడితేను

చ. 3: వూరకె నీవు వెట్టిన వొట్టు నీపై మోఁచీనా
యేరా నాకుఁ బంతము లిచ్చితే నీవు
ఆరీతి శ్రీ వేంకటేశ అంతలో నన్నుఁగూడితి
తారుకాణౌనా నాతో తమకించితేను

రేకు: 1724-02 ఆహిరి సం: 27-140

పల్లవి: ఎంతకు నెంతేకాక యెక్కుడేఁటికి
మంతనాన బుద్ధి చెప్పి మన్నించరాదా

చ. 1: కన్నుల నీవు చూచితే కామిని యందుకుఁ బతి
చన్నుల నొత్తినదె సరియాయను
సన్నల నింకానేల చలములు సాదించేవు
కిన్నెర యదిగో మీఁటి గిలిగించరాదా

చ. 2: పలుకుల నవ్వితేను పడఁతి యందుకు నీతో
సెలవుల నవ్వినదే సెలవాయను
మలసి యప్పటి నేల మారుకొనఁ దలఁచేవు
వలపు చిత్తరువున వా (వ్రా?) సి చూపరాదా

చ. 3: ముట్టి నీవు చెనకితే మోహము రెట్టించ నాపె
పట్టి పెనఁగినదే బలువాయను
యిట్టె శ్రీ వేంకటేశ యిరవై యిఁకఁ బాయవు
గట్టిగా తలఁపు దీర కప్పుర మీరాదా

రేకు: 1724-03 బౌళి సం: 27-141

పల్లవి: అంగనమోహము నీపై నటువంటిదా
యింగిత మెఱఁగవా నీ వింత దొరవు

చ. 1: సిగ్గువడి యాపె నీతో శిరసు వంచుకుండఁగా
దగ్గర లోఁగే వదేమి దంటవాఁడవు
యెగ్గున నీ వలఁ(ల్లఁ?) దప్పు యేమైనాఁ గలదోనేఁడు
వొగ్గి నీకు ఆపె యిందు వొరటులాడీనా

చ. 2: కన్నెపాయ మటుగాన కాంత పలుకఁగ వుంటే
పన్ని యేల పైకొనవు ప్రౌఢవాఁడవు
యెన్నికలు యేమైనా యెంచుకొన్నవిఁగలవో
అన్నిటా నీ వేమనినా అవుఁగాదనీనా

చ. 3: నెలఁత నిన్నుఁ గలసి నివ్వెరగైయుండఁగాను
యెలయించకు శ్రీ వేంకటేశ్వరుఁడవు
అలుకదేరి కూడితి వాస లేమైనాఁ గలవో
చెలియ నీ చెప్పినట్లు సేయకమానీనా

రేకు: 1724-04 వరాళి సం: 27-142

పల్లవి: ఏది వాటి నీ మాటల కెదురాడేమా
సాదవౌదు విన్నిటాను సతిఁగూడరాదా

చ. 1: మొలకచన్నుల చెలి మొనలు నాటించితేను
బలు గబ్బి యిదియంటాఁ బంతమాఁడేవు
సెలవి నవ్వుల దిది సిగ్గులు పైఁ బూసితేను
అలరుచు గేలి సేసెనని యాడేవు

చ. 2: చెందమ్మిగోళ్ల చెలి చెక్కు లిట్టె నొక్కితేను
కందువ లంటించెనంటా గద్దించేవు
మందయాన యిది నిన్ను మలసి కాలుదొక్కితే
మందె మేళమనుచును మత్సరించేవు

చ. 3: ఆయ మెరిఁగిన చెలి యట్టె కాఁగిలించుకొంటే
చేయి ముంచెనంటా నీవే చిమ్మి రేఁగేవు
యీయెడ శ్రీ వేంకటేశ ఇట్టె యాపెఁగూడితివి
మాయలాడి యిదియంటా మన్నించేవు

రేకు: 1724-05 మాళవిగౌళ సం: 27-143

పల్లవి: ఏఁటికి చెక్కు నొక్కేవు యింకా నీవు
మాఁటికి మాఁటికి నీకు మంచిదాననా

చ. 1: తీపుల మోవులనే తేనెలు గారఁగ నాపె
మాపుదాఁకా నీతోను మాఁటలాడీని
కోపము రేఁగి నేనైతే గొణఁగి తిట్టితి నిన్ను
మా పొందే సేసే వప్పటి మంచిదాననా

చ. 2: సోఁగలకన్నులనే సోద్యాలు సేసి చేసి
తీగెలుసాగఁగా నాపె తేరి చూచీని
ఆగడములు సేసి నిన్ను అదరించితి రెప్పల
మాగురుతులే మెచ్చేవు మంచిదాననా

చ. 3: చిగురుఁ జేతుల నాపె శ్రీ వేంకటేశ్వర నిన్ను
తగిలి కాఁగిటఁ గూడె తమకానను
వొగరుఁగుచములను వొత్తి నే నిన్నుఁగూడితి
మగటిమినే నీక మంచిదాననా

రేకు: 1724-06 నాదరామక్రియ సం: 27-144

పల్లవి: ఒడివట్టితియ్యకు నే నోప నందుకు
చిడుముడిఁ బెనఁగేవా చిన్నదాన నేను

చ. 1: నీకు మోహించితి నేను నీ వప్పటి నెవ్వతెకు
యేకడ మోహింతువో యెవ్వఁ డెఱుఁగు
ఆకెను నన్నొకటి కమ్మనుచుఁ గూడఁగట్టేవు
మాకేల నీకేకాక మానినుల గొడవ

చ. 2: నీతో నవ్వితి నేను నీ వప్పటి నెవ్వతెతో
యేతులకు నవ్వుదువో యెవ్వఁడెఱుఁగు
చేతులువట్టించే వాపెచేతను నే నిక్కఁగాను
నీతితో నీవే బతుకు నేరము నేమంతేసి

చ. 3: నిన్ను నేఁ గూడితి నిదె నీ వప్పటి నెవ్వతెను
యెన్నికతోఁ గూడుదువో యెవ్వఁడెఱుఁగు
యిన్నిటా శ్రీ వేంకటేశ యిద్దర మొక్కటైతిమి
మన్నించవయ్యా మమ్ము మతకాలెఱఁగము

రేకు: 1725-01 దేసాళం సం: 27-145

పల్లవి: నేరుతువు కరియమాణిక్కె దేవుఁడా
నీరపము కరియమాణిక్కె దేవుఁడా

చ. 1: మక్కువ నాతోఁ బెనఁగి మంచానకుఁ దీసేవు
నిక్కమా కరియమాణిక్కె దేవుఁడా
అక్కరతో బత్తి సేసి ఆయము లంటేవు నాకు
నిక్కలాయఁ గరియమాణిక్కె దేవుఁడా

చ. 2: చేవదేర నీవు నన్నుఁ జేయివట్టి పెనఁగఁగా
నీవి జారెఁ గరియమాణిక్కె దేవుఁడా
కైవశమై పాయలేను కప్పురవిడేలకే
నీవద్దనే కరియమాణిక్కె దేవుఁడా

చ. 3: అచ్చపు గురుతులెల్లాఁ ఆనతిచ్చి రప్పించితి
నెచ్చెలిచేఁ గరియమాణిక్కె దేవుఁడా
ఇచ్చగించి శ్రీ వేంకటేశుఁడవై కూడితివి
నిచ్చలునుఁ గరియమాణిక్కె దేవుఁడా

రేకు: 1725-02 మధ్యమావతి సం: 27-146

పల్లవి: ఎగ్గుపట్టేవు గనక యెరవా నాకు
సిగ్గు విడిపించే నింతే చెల్లదా నాకు

చ. 1: చెన్నుమీర నిన్ను సాము సేయించేకొరకుఁగాక
చన్నుల నొత్తక నీతో చలమా నాకు
తిన్నని నీగుణ మిట్టె దిద్దుకొనే మింతే కాక
పన్ని నిన్ను జంకించఁ బంతమా నాకు

చ. 2: దక్కిన పెండ్లినాటి తగవు నేరిపేఁగాక
గక్కనఁ గాలు దాఁకించ గర్వమా నాకు
లక్కవలె గరఁగించి లావులు నెరపేఁగాక
పెక్కుమారులు వెనఁగ బిగువా నాకు

చ. 3: యెంగిలి పొత్తు గలసి యెనసే కొరకుఁగాక
సంగతిగా మోవియ్య రాజసమా నాకు
కుంగక శ్రీ వేంకటేశ కూడితి మేలుకే కాక
అంగమెల్లా నలయించ నంతపగా నాకు

రేకు: 1725-03 వరాళి సం: 27-147

పల్లవి: నే మెరిఁగిన పనికి నిజము నెరపనేల
భామలను వింతవారి భ్రమయించరాదా

చ. 1: మచ్చికల మనసుకు మనసే తారుకాణ
ఇచ్చల నీమోహము నాకేల చెప్పేవు
యెచ్చుకుంద లేమిగల్లా యెరఁగనివానితోనే
పచ్చిగాఁ దెలిపి చెప్పి పచారించరాదా

చ. 2: చేసినట్టి చేఁతలెల్లా చేతికిఁ జేయే దిష్టము
యీతల నీసన్న లింకానేల సేసేవు
ఘాతల నీ చెనకులు కడమవారిమీఁదనే
యేతులకు చూపి మోపి యెలయించరాదా

చ. 3: కందువయిన కాఁగిటి కాఁగిలే ముయికిముయి
విందువలె నన్నునేల వేఁడుకొనేవు
చెంది కూడితివి నన్ను శ్రీ వేంకటేశ్వర
పొందులు వొద్దివారితో బోదించరాదా

రేకు: 1725-04 శుద్ధవసంతం సం: 27-148

పల్లవి: ఇందువంక నేమి వచ్చి నేల తలవంచేవు
పందెములు వేసి వేసి పైకొందువుగాక

చ. 1: సరసములాడఁగాను చలము సాదింతురా
నొరసి విభునితో నవ్వుదురుగాక
శిరసువట్టుకుండఁగా సేసేదేమి నీ వీఁక
సరిగా నీకుచముల సాదింతువుగాక

చ. 2: వావు లిట్టె చెప్పఁగాను వాదులకు వత్తురా
సేవలెల్లా నాతనికిఁ జేతురుగాక
మోవ నాతఁడాడఁగాను ముందరిమాటిఁకనేది
కావరపుఁదిట్లను కరఁగింతు గాక

చ. 3: పట్టి కాఁగిలించుకోఁగా బలుములు సేతురా
వొట్టుక కాఁగిట గూడివుందువుగాక
గట్టిగాఁ గలసె శ్రీ వేంకటపతి పాయరాదు
జట్టి గొన్న రతులలో జంకింతువు గాక

రేకు: 1725-05 బౌళి సం: 27-149

పల్లవి: నీకే భారము మా నేరుపు లేమున్న వీఁక
వాకుచ్చి విన్నవించేటి వైపు లెట్టోకాని

చ. 1: చెలఁగి పెనఁగేఁగాని సేసవెట్టుతానే చేతు
లలసెఁ గొలిపీనొకొ ఆయమంటితే
తలఁపెల్ల భ్రమసెను దగ్గరి నిన్నుఁ జూచి
యెలమి నీ రతు లె ట్లెరిఁగీనో కాని

చ. 2: సరసములాడేఁగాని సరి నీతో నవ్వుతానే
కరఁగె నాయములెల్లాఁ గడమ లెట్టో
పరగెను పులకలు పైకొని నిన్నంటితేనే
తరవాతి పనులెట్టు దైవారీనోకాని

చ. 3: వుపమలెంచీ(చేఁ?)గాని వొగి నిన్నుఁ గూడఁగానే
తపము ఫలించె నాకు దైవికమెటో(ట్టో?)
రపమాయ శ్రీ వేంకటరాయ మనకిద్దరికి
నపురూపా లీఁక నెట్లయ్యీనో కాని

రేకు: 1725-06 శ్రీరాగం సం: 27-150

పల్లవి: ఎందాఁకా విన్నపాలు యేమి సేసేవు
కందువలు చూపఁగానే కరఁగీ నీ మనసు

చ. 1: యిచ్చకములే నీకు నెటువలె నాడవచ్చు
వెచ్చని వలపులే యెట్టు వేయవచ్చును
పచ్చికస్తూరి నూరి పట్టువెట్టుకొని వచ్చి
తచ్చి నీవద్దనుండఁగా దయవుట్టీఁ దానె

చ. 2: కూరిములే సారె సారెఁ గొసరఁగ నెట్టు వచ్చు
ఆరీతిఁ గన్ను లెట్టార్చవచ్చును
గారవాన నిమ్మ పండు కాంతవట్టుకవుంటే
నేరుపులు మించఁ గరుణించేవు నీవే

చ. 3: నయగారాల కెందాఁకా నవ్వులు నవ్వఁగవచ్చు
క్రియెఱిఁగిన నిన్నెట్టు గెలువవచ్చు
నియతి శ్రీ వేంకటేశ నిన్ను నేఁ గూడివుందాన
జయముగా రతులెల్లా చవివుట్టే నివుడె

రేకు: 1726-01 రీతిగౌళ సం: 27-151

పల్లవి: ఇన్నిటా భోగింతుగాక ఇఁక నెన్నఁడు
యెన్నికలు సమకూడె నియ్యకొనవయ్యా

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెప్పీ నాపె నీతోను
వెలఁది విన్నపములు వినవయ్యా
కులికి కులికి నిన్నుఁ గుచములఁ గుమ్మియెత్తీ
కలికి చేఁతలకుఁ గరఁగవయ్యా

చ. 2: సారె సారె నిన్నుఁ జూచి సన్నలెల్లాఁ జేసీ నాపె
తేరకొనఁ జూచి నీవు తెలియవయ్యా
కేరి కేరి నవ్వుతాను గీరీఁ జెక్కులు గోర
కూరిములన్నియునుఁ జేకొనవయ్యా

చ. 3: నిక్కి నిక్కి చూచి నిన్ను నెయ్యపుఁగాఁగిటఁ గూడె
యిక్కువ లంటుచుఁ జనవీయవయ్యా
అక్కరతో శ్రీ వేంకటాధిప నీరతి యింతి
దక్కగొనె నీమేలు చక్కఁగొనవయ్యా

రేకు: 1726-02 బౌళి సం: 27-152

పల్లవి: ఏఁటికి జాగులు సేసే వెందాఁకా సరసాలు
వాఁటము సేసీ యా పె పై వంచరాదా నవ్వులు

చ. 1: పంతము నీమీఁద వేసి పాదాన నేలలు వ్రాసి
చింతతోడ నున్న దదె చెలియ
వంతతో మారలుగక వద్దికి వచ్చి ఆపె
సంతోసపు మాటలాడీ చల్లరాదా వలపు

చ. 2: కెంపుఁగనుఁగవ మీర గీరునామము జార
తెంపుతోడ నున్నదదె తెఅ(ఱ?)వ
ముంపున నెగ్గుపట్టక ముచ్చటలు బుజ్జగించి
ఇంపులనే చెక్కునొక్కీ ఇయ్యరాదా చనవు

చ. 3: కాయమెల్లాఁ బులకించి కాఁకలు నీమీఁద నించి
చేయిచాఁచె నీకుఁగానే చెలియ
యీాయెడ శ్రీ వేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
తీయనిమోవి ఇచ్చి తిప్పరాదా చలము

రేకు: 1726-03 పాడి సం: 27-153

పల్లవి: అంతనేరుపరి మాయంగన నీతో నేఁడు
యింతసేసి దిష్టముగా నిటు చూపవలెఁబో

చ. 1: పలికినంతనే పోదు పాయపు బీరాలు నిన్నుఁ
గలసి కాఁగిటఁగూడి ఘాత చూపక
చలపట్టి నంతఁ బోదు సారపు నేర్పులు చల్లి
వలపించి వలచి భావము చూపక

చ. 2: చెంతఁ జూచినంతఁ బోదు చెనకి మర్మాలు కొచ్చి
పంతములు నెరపుచు పైకొనక
రంతు సేసినంతఁ బోదు రాసి చన్నులు నురము
వింతలుగ మెరయుచు వీడుజోడైయుండక

చ. 3: దగ్గరినంతనే పోదు తలఁపుఁదలఁపుఁ గూడ
నిగ్గుదేర రతిసేసి నీటుచూపక
అగ్గమె శ్రీ వేంకటేశ అతివ నీవుఁగూడితి
యెగ్గులెల్లాఁ దీర నిట్టె యియ్యకొనక

రేకు: 1726-04 భల్లాటి సం: 27-154

పల్లవి: ఇటువంటినే నీకు యేవి బాఁతెని వచ్చేవు
యెటువంటి నేర్పరివి యేమని నుతింతును

చ. 1: మనసు మర్మ మెరిఁగి మాటలాడనేర్చు నాపె
నిను వెంగేలాడనేర్తు నేనైతేను
పెనఁగక నీతో నాపె ప్రియము చెప్పఁగనేర్తు
చనవు సేసుక నేను సాదించ నేర్తును

చ. 2: మిక్కిలి చిత్తమెరిఁగి మెలఁగఁగనేర్చు నాపె
పిక్కటిల్లుఁ జన్నులు పైఁ బెట్టనోపుదు
గుక్కక నీ చేఁతలెల్ల గుట్టుసేయ నోపు నాకె
వెక్కసపు నీమోవి వెలయిచ్చ(వెలయించ?) నోపుదు

చ. 3: ననుపు సేసుక నీతో నవ్వ నాపె కడు జాణ
నిను నెచ్చరించి కూడ నే జాణను
యెనసితి శ్రీ వేంకటేశ్వర మమ్మిద్దరిని
యినుమడి నీవంక నిద్దరు జాణలము

రేకు: 1726-05 ముఖారి సం: 27-155

పల్లవి: ఇచ్చితిమి కానుక యింతక తొలుతే నీకు
తచ్చేము మా సిగ్గు దగ్గరిరావయ్యా

చ. 1: పంతము లేమీనాడరు పడఁతులయినవారు
చింతలనే వలపించి చిక్కింతురు
అంత నేరుపరివైతే అందుకేమి దోసమా
దొంతినున్నది మా గుట్టు దోసిలొగ్గవయ్యా

చ. 2: యెగసక్కెము సేయరు ఇంతులైన యట్టివారు
తగులాయములు చూపి దక్కఁగొందురు
నగ నీవు దొరకొంటే నాకు నీకు దోసమా
చిగిరించె మాకోరికె చేఇ చాఁచవయ్యా

చ. 3: కక్కసించి పెనఁగరు కాంతలయినవారు
గక్కనఁ గెమ్మోవి ఇచ్చి కాఁగిలింతురు
యెక్కువ శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గలసితి
పిక్కటిల్లె మా చన్నులు బిగిఇంచవయ్యా

రేకు: 1726-06 లలిత సం: 27-156

పల్లవి: దొరవౌదు విన్నిటాను దోసమెరఁగవుగాని
తెరమఱఁగే సుమ్మీ తెలిసె నన్నియును

చ. 1: నగితినా నీతోను నాలోని ప్రియములు
చిగురై వెడలెఁగాక సెలవులను
మొగము చూచి నీమోవినే యేల తిట్టేవు
వొగరే పులుసుగాదా వొరయకు నీవు

చ. 2: జంకిచితినా నిన్ను చనవు మనవులెల్లా
వుంకువలై నిండెఁగాక వొగి బొమ్మల
కొంకక దగ్గరి మమ్ము కొంగులేల పట్టేవు
సుంకులే పాలుకొనవా సుద్దులేల మాతోను

చ. 3: కాఁగిట బిగించితినా గక్కన శ్రీ వేంకటేశ
చేఁగలవలపులే చిక్కించెఁగాక
రాఁగి నీవు మమ్మునేల రచ్చలఁబెట్టి కూడితి
వాఁగి కెరుగునఁగాదా అట్టె వెన్న పుట్టేది

రేకు: 1727-01 పళవంజరం సం: 27-157

పల్లవి: ఏలయ్య నీకు నాకు యిన్నేసిమాటలు
మేలుగలదంతయును మెరయుఁగాక

చ. 1: తగులు గలుగువారు తగవులెంచనున్నదా
వెగటు లేమి సేసినా వెలయుఁగాక
తెగువులు గలవారు దిక్కులు చూడ నున్నదా
పగటులుగలవెల్లాఁ బచ్చి దేరుఁగాక

చ. 2: మనసునమ్మినవారు మతకమెంచ నున్నదా
చనవులన్నియు లోలో జరఁగుగాక
వినయముగలవారు వెక్కసాలాడనున్నదా
పెనఁగినంతవడి బీరములౌఁగాక

చ. 3: కాఁగిలించుకొన్నవారు కడమ వెట్టనున్నదా
చేఁగదేరఁ గూడితిమి చెల్లుఁగాక
మూఁగుచు శ్రీ వేంకటేశ ముంచి మనవంటివారు
తోఁగుఁ జమటలచేత దొమ్మియౌటఁగాక

రేకు: 1727-02 సాళంగం సం: 27-158

పల్లవి: ఆపె ఆతనిబుద్ధి అందాలకుఁదెచ్చీఁగాని
కోపుల సారెసారెఁ గొసరకురే

చ. 1: మొగము చూచినప్పుడు మోహము రెట్టించీఁగాని
జిగి నందాఁకాఁ గక్కసించకురమ్మ
నగిన యప్పుడు తానే నయానకు వచ్చీఁగాని
పగటు బలిమిచూచి పంతములాడకురే

చ. 2: మాఁటలాడినప్పుడే మంకులు మానీఁగాని
గాఁటానఁ జేయివట్టి పెనఁగకురమ్మ
కూటమివేళనే మేలు కొనలుసాగీగాని
పాటించి సారె సారెకు బలిమి సేయకురే

చ. 3: యేకాంతమయినప్పుడే ఇయ్యకోలయ్యీఁగాని
చేకొని ఇంతేసి రట్టు సేయకురమ్మ
యీకడ శ్రీ వేంకటేశుఁ డింతిని గక్కునఁ గూడె
వాకిచ్చి మీరేమి నిఁక పంతులు వెట్టకురే

రేకు: 1727-03 పాడి సం: 27-159

పల్లవి: పంతములేఁటికి పడఁటితోడ నీ
సంతసములే పైఁజల్లఁగదయ్యా

చ. 1: అనఁగుచుఁ బెనఁగుచు ఆయములంటుచు
చనవులు మెరసీ జవరాలు
కినియక యిఁక నీకేలు చాఁచి సతి
మనవులు చేకొని మన్నించవయ్యా

చ. 2: మొక్కుచు నిక్కుచు మొరఁగులు చూపుచు
దక్కఁగొనీ నిను దరలాక్షి
తక్కులఁ బెట్టక దయతో నవ్వుచు
చెక్కునొక్కి రక్షించఁగదయ్యా

చ. 3: కప్పుచుఁ బయ్యెద కాఁగిట బిగియుచు
పిప్పిసేసె నినుఁ బ్రియురాలు
యిప్పుడె శ్రీ వేంకటేశ కూడితివి
తప్పుదీర దయ దలఁచఁగదయ్యా

రేకు: 1727-04 సామంతం సం: 27-160

పల్లవి: ఇచ్చితివా కానికె తా నేమనీనే
తచ్చి తచ్చి తనమాఁట దలఁచుకొమ్మనవే

చ. 1: చిగిరించెఁ జిత్తము చెమరించె నామేను
యెగెసక్కెపు విభుఁడు యేమనీనే
నగవులాయ వలపు నావంటివారిలోనెల్లా
తగవైన తనబాస తలఁచుకొమ్మనవే

చ. 2: చిమ్మిరేఁగే వయసుచే చేవదేరీ నాయాసలు
యెమ్మెలరమణుఁడు తానేమనీనే
వుమ్మడి నున్నది గుట్టు వూరెల్లాఁబెనురట్టు
తమ్మిరేకు తనవాఁ(వ్రా?) త తలఁచుకొమ్మనవే

చ. 3: వెలిఁబడె సిగ్గులు వెరగాయరతులు
యెలమి శ్రీ వేంకటేశుఁ డేమనీనే
కలసెఁ దనకు నాకు కాఁగిటనే వావులు
తలపోసి యీ చేఁతలు తలఁచుకొమ్మనవే

రేకు: 1727-05 సౌరాష్ట్రం సం: 27-161

పల్లవి: ఏమి నవ్వేవే నాతో నింకా నీవు
వాములాయ వలపులు వట్టి జోలేలే

చ. 1: సరసము లాడఁగానే జాముహోయ నిదివో
తెరమరఁగుననే తెల్లవారెను
యెరవులేక విభుఁడు యేమీ ననఁజాలఁడు
వరవాత నీకనైనా వచ్చేవో రావో

చ. 2: ముంగురులు దిద్దగానే మొనలెక్కెఁ గొనగోరు
సింగారించుకోఁగానే సిగ్గుముంచెను
సంగతెఱిఁగినపతి చలములు సాదించఁడు
యింగిత మెఱిఁగి మోవి ఇచ్చేవో యీయవో

చ. 3: చేతులు పైఁజాచఁగానే సెలవుల నవ్వు ముంచె
గాతలఁ గాఁగిలించఁగ కాఁక దీరెను
యీతల శ్రీ వేంకటేశుఁ డిచ్చెరిఁగి నిన్నుఁగూడె
యేతుల యీవుపకార మెంచేవో యెంచవో

రేకు: 1727-06 లలిత సం: 27-162

పల్లవి: నీవు సేసే చేఁతలకు నేఁడు నాకు
తావున వూరకేవుండి తలవంచఁదగదా

చ. 1: తెలిపి చెప్పినదాఁకాఁ దెరఁదీసితినింతే
తలపోఁతే తెరగాదా తరవాతను
మొలకనవ్వులూరకె ముంచీఁగాక
సెలవుల చెలుల మోము చూచితే సిగ్గువడఁదగదా

చ. 2: మనసువచ్చినదాఁకా మాటలాడితినింతే
కనుచూపే మాటగాదా కడు గుట్టున
ఘనమై చెక్కుల వెంటఁ గళలుదేరీ నేలో
వనిత లిందరిలోన వాసి నుండఁదగదా

చ. 3: రతుల మెచ్చినదాఁకా రాజసాననుంటి మింతే
అతిరాజసము గాదా అరమరపు
యితవై శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
మితిమీరవలదా మెలఁతుల వొద్దను

రేకు: 1728-01 భైరవి సం: 27-163

పల్లవి: ఏమరిపాటున నింతి నింతసేతురా
దోమటాయ వలపులు తోడఁదోడ మాకును

చ. 1: నివ్వెరగుతోడఁ జెలి నిలుచుఁ(చుం?) డుండఁగాఁ జూచి
రవ్వై వుంటవింటఁ గప్పురాన వేసేవు
దవ్వుల నిన్ను నాపె అదరిపడి నిన్నుఁ జూచె
పువ్వుటమ్ములై తాకె పొంచి నీమర్మములు

చ. 2: చింతతోడఁ గడుఁ జెలి శిరసు వంచుకుండఁగా
పంతాన నాపెను పూబంతి చేసేవు
అంతలో చేతఁ దట్టితే నాపె గోరు నిన్ను సోఁకె
కంతునికై తప్పులాయ గక్కున నీమేనను

చ. 3: సిగ్గువడివున్న చెలిఁ జఱఁగువట్టి తీసేవు
బగ్గున నాపె గుబ్బలు పై మోపెను
యెగ్గనక శ్రీ వేంకటేశ మీరు గూడితిరి
వెగ్గళపురతులను వేవేలాయ వలపు

రేకు: 1728-02 ఆహిరి సం: 27-164

పల్లవి: ఇంతిని మన్నించుటకు నిదేవేళ
వింత సేయక లోనికి విచ్చేయరాదా

చ. 1: రచ్చలఁబడె వలపు రాసులై నిండె వలపు
యిచ్చట నాయకుడవు యేమి సే సేవు
పచ్చకప్పురపు ధూళిపాలాయ విరహము
తచ్చిచూచి ఇక దయఁతలఁచరాదా

చ. 2: దొంతులు నిండెఁ గోరిక దొడ్లు చొచ్చెఁగోరిక
ఇంతు లిందరిలో నీవు యేమి సే సేవు
చింత చెక్కిటిచేఁతికి సెలవాయ జవ్వనము
కాంతుఁడ వీపె నింతటఁ గరుణించరాదా

చ. 3: అడియాలమాయ రతి ఆయములంటెను రతి
యెడయకు మక్కడ నీవేమి సేసేవు
చిడుముడి గూడితివి శ్రీ వేంకటేశ సతిని
పిడికిటిపాలఁ గృపపెట్టఁగరాదా

రేకు: 1728-03 గౌళ సం: 27-165

పల్లవి: పెక్కు సతులు గలుగు పెండ్లి కొడుకవు
దిక్కని నమ్మితి నిన్ను దేవరపు నీవు

చ. 1: నవ్వులవలె నున్నవి నయాగారి నీమాఁటలు
పువ్వులవలె నున్నవి బూటకములు
జవ్వనపు దాన నేను సమ్మతింతు నెందుకైనా
యవ్వఁడెఱుఁగు నీగుణ మేమి సే సేవో

చ. 2: మేడలపాడవులాయ మెచ్చేటి నీ ప్రియములు
గోడకంటె దట్టము నీగుట్టు చేఁతలు
నీడవంటిదాన నేను నీ చెప్పినట్టె సేతును
పాడిబంతమెఱఁగను భాగ్యము నీ చేతిది

చ. 3: గుంపులు గుంపులు గట్టె కూడిన నీ భోగములు
దింపరాని మోపులు నీ తీగెమొక్కులు
ముంపుల శ్రీ వేంకటేశ ముంచి నే నిన్నుఁగూడితి
అంపలేను నే నిన్ను అడ్డమాడ కిఁకను

రేకు: 1728-04 వరాళి సం: 27-166

పల్లవి: ఎంత మందె మేళమని యెంచవద్దు నన్నును
పంతమున నుండితేను బయలు పరతును

చ. 1: మచ్చము పైఁబెట్టుకొని మౌనముతో నుండనేల
కొచ్చి పిడిచితే తలగుట్టుకొందురా
ముచ్చట నింతాఁ దిరిగి మొకము సుక్కించుకొంటే
పచ్చిగాఁ గఁ(గం?)బముమాటు బయలు పరతును

చ. 2: కపటాలు పైవేసుక కడఁ జేఇ చాఁచనేల
చపలుఁడవై కోపము సారె నేఁటికి
వుపములు వెదకేవు వొద్దనుండే ఇట్టయితే
అపుడే నీముచ్చిమి బయలుపరపుదును

చ. 3: ఇన్నియు బోధించి వచ్చి ఇట్టె సిగ్గువడనేల
వన్నెల మొక్కితే రాయివలె నుండేవు
నన్ను శ్రీ వేంకటేశుఁడ ననుపునఁ గూడితివి
పన్నిన నీ గుట్టెల్లా బయలుపరతును

రేకు: 1728-05 గౌళ సం: 27-167

పల్లవి: మోము చూచితిఁ గనక మొక్కితి నింతే
సాములు సేయకువయ్య చాటిచెప్పే నీకు

చ. 1: నిన్ను నేల తడవేను నీవాపెవద్దనుండఁగా
వన్నె నీమాఁటప్పగించ వచ్చితిఁగాక
సన్నలెల సేసేవు సారెకునేల లోఁగేవు
పన్ని వెఱవకువయ్య బాసయిచ్చే నీకు

చ. 2: అందుకే యేల నవ్వే నాపె నీ చెక్కు నొక్కఁగా
చెందిన నీవోజ సంతసించితిఁగాక
కిందుపడనేమిటికి గేలిసేయఁ గలంగకు
పందెము వేసినట్టె బాస ఇచ్చే నీకు

చ. 3: కయ్యానకేల వచ్చేను కాంత నీ సొమ్మయి వుండఁగా
వొయ్యనే కాఁగిలి నీ కొప్పించేఁగాక
ఇయ్యెడ శ్రీ వేంకటేశ ఇద్దరముఁగూడితిమి
పయ్యెద నీపైఁ గప్పి బాసయిచ్చే నీకు

రేకు: 1728-06 దేసాళం సం: 27-168

పల్లవి: కైకొనేఁగాక నేనిట్టె కాదనక
దీకొని నీసుద్దులు నేఁ దెలియనివా

చ. 1: పువ్వువలె నాపె నీ పొంత నుండితేఁజాలు
యెవ్వరితోడి సడ్డ యేలనాకు
పవ్వళించి మాతో పని పయిప చారము లింతే
నివ్వటిల్లు నీతో పొందు నేనెఱఁగనా

చ. 2: మొక్కు మొక్కి యాపె నీమోము చూచితేఁజాలు
యెక్కడెక్కడిసతులు యెంత లేదు
మొక్కలపు మాకొలువు మూకపాపులకు నింతే
చొక్కపు నీ గుణములు సోదించనివా

చ. 3: పుడివోక ఆపె నీవురముపై నుంటేఁజాలు
యెడపుల వారెల్లా నేమి బాఁతి
నడుమ శ్రీ వేంకటేశ నన్ను నిట్టె కూడితివి
తడవి నీమేలు నేఁ దలఁచనిదా

రేకు: 1729-01 బంగాళం సం: 27-169

పల్లవి: ఆతఁడు నీకుఁ దగు నాతనికి నీవు దగు
గాతలఁ జెలులమెల్లఁ గంటిమి యీనేర్పులు

చ. 1: కన్నులవాఁడి చూపేవు కమ్మనిమోవి ఇచ్చేవు
పన్నేవు మాయలు రెంటా బతితోను
నున్నని చెక్కులు నొక్కి నోటనే ప్రియాలు చెప్పి
మన్నించె నిన్ను నాతఁడు మారుకు మారుకును

చ. 2: నాటించేవు చన్నులను నవ్వేవు సెలవులను
యేఁటికే యీ పగటులు ఇరుదెసలా
కూటములు పచరించి గురుతులు సోఁకించి
చాటీ వలపతఁడు సరికి బేసికిని

చ. 3: కప్పురపు బాగాలిచ్చేవు కాఁగిట బిగించేవు
వొప్పించేవు దారా మోనా నొక్క చోటనే
ఇప్పుడే శ్రీ వేంకటేశుఁ డీఁడువెట్టుకొని కూడె
తొప్పదోఁగె ముదముల తులదూఁగె నితఁడు

రేకు: 1729-02 గౌళ సం: 27-170

పల్లవి: ఆపెకు నమరునా ఆరడి నీపనులు
వోపికగలవాఁడవు వోయమ్మ వెరవవు

చ. 1: సిగ్గువడివున్న చెలిఁ జెక్కు నొక్కఁబోతే
అగ్గలము గాదా అందరిలోన
యెగ్గులోని ప్రౌడదొర వెఱఁగరాదు నీకైతే
వొగ్గేవు నీవెందుకైనా వోయమ్మ వెరవవు

చ. 2: పాయపుఁ గోమలితోడఁ బట్టి వెనఁగఁగఁబోతే
రాయడివలె నుండదా రచ్చలోనను
మాయదారి మగఁడవు మఱఁగులేదు నీకైతే
వోయయ్య ఆడికలకు నోయమ్మ వెరవవు

చ. 3: గుట్టుతోడి వనితను కొంగువట్టి తియ్యఁబోతే
దిట్టతనమై వుండదా తెఱవలలో
ఇట్టి శ్రీ వేంకటేశ యీపె నిట్టె కూడితివి
వొట్టు సత్యములకును వోయమ్మ వెఱవవు

రేకు: 1729-03 పాడి సం: 27-171

పల్లవి: ఇంతి నిన్ను గదిమితే నేమనేవయ్య
వంతులెల్లానెంచుకొంటా వద్దఁగాచుకుండెను

చ. 1: మిక్కుటముగా నప్పుడు మీరు మీరుఁ బెట్టుకొన్న-
యెక్కువ తక్కువ వొట్లేమాయను?
ఇక్కడికి విచ్చేసితి వింతలోనె తప్పించుక
వెక్కసమై యాపె నిన్ను వెతకుతానుండెను

చ. 2: నగుతా నప్పుడు మీరు నంటుసేసి యాడుకొన్న-
యెగసక్కేపు బీరము లేమాయను
పగటున నామీఁదిపరాకున నున్నాఁడవు
తగిలి యీడకు వచ్చే దానంటా నుండెను

చ. 3: కూడి మావాకిట మీరు కొప్పులు వట్టి తీసిన-
యీడుజోడు సరసము లేమాయను
యీడ నన్నుఁ గలసితి వింతలో శ్రీ వేంకటేశ
మోడా మోడితనమున మొక్కేనంటా నుండెను

రేకు: 1729-04 లలిత సం: 27-172

పల్లవి: ఆయనాయ రావయ్య అంగనతోఁ గూడవయ్య
కాయజకేలిని వొక్కకత చెప్పవయ్యా

చ. 1: పువ్వువంటివలపు బుజముల దాఁకా మోఁచి
జవ్వనికుచములై జడిసీనిదె
నవ్వులనే పిండిరాలి నాములు చూపులఁ బారి
ఇవ్వల రచ్చల సేసే విది యేఁటిదయ్యా

చ. 2: చిగురువంటి మదము చెంపలవెంటా జారి
మగువకుఁ దురుమై మలసీనదె
వొగరు చెమటై వెళ్లి వుదుట పులక లుబ్బి
యెగసక్కేలేల చూపే విది యేఁటిదయ్యా

చ. 3: పండులవంటిరతుల పొగరు మెగానకుబ్బి
దిండు కట్టి చెలిమోవై తేనెగారీని
అండనె శ్రీ వేంకటేశ ఆయమంటి కూడితివి
యిందులెల్లా నిండెఁ దమి ఇఁక నేఁటిదయ్యా

రేకు: 1729-05 గౌళ సం: 27-173

పల్లవి: రాకు రాకు నీ వంత రవ్వసేయను
చేకొని పంతములు నాచేతిగోరనున్నవి

చ. 1: చలము సాదించఁగానె సరసములాడైన
నలయించకేలమానే నాసుద్దికి
నిలువున వినయాలు నీవెంత సేసినాను
కులికి నా కోపము గుండెలోనే వున్నది

చ. 2: గుఱిగా నలుగఁగాని గుంపెనమొక్కులనైన
యెఱిఁగించే నీగుణాలు యీా నీ చేఁతకు
తఱితోడ నీవెంత దయవుట్టఁ బెనఁగినా
మఱియును బీరాలు మా పెదవి నున్నవి

చ. 3: కొసరి నే దిట్టఁగాని కూడినకూటమినైన
పసచూపే నీ మోహపు పంతములకు
యెసగి శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గలసితి
వసదు నీ వలపు నా ఆతుమలో నున్నది

రేకు: 1729-06 హిజ్జిజి సం: 27-174

పల్లవి: నీకేల ప్రియము చెప్ప నెలఁతల కెవ్వరికి
వాకైనవారేకా నీ వనితలు

చ. 1: బింకమాడేయట్టి వేళ ప్రియములు చెప్పి నీకు
వంక లొత్తఁగలరుగా వద్దివారు
జంకించేటి సతులతో సందిమాటలాడియాడి
లంకెలు సేసేరుగా నీ లలనలు

చ. 2: తప్పు మోఁచినట్టి వేళ తగవులెల్లా నెరపి
వొప్పులు సేతురుగా నీ వొద్దివారు
అప్పటప్పటికి నింతు లలిగి వుండేవేళ
కప్పురవిడే లూడిగాలవారిత్తురుగా

చ. 3: వెగ్గళించినట్టి వేళ వేసాలెల్లా నీకుఁజూపి
వొగ్గి నిన్ను మెత్తురుగా వొద్దివారు
యెగ్గుదీర శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
సిగ్గులు వాపేరుగా నీ చెలిమికత్తియలు

రేకు: 1730-01 గౌళ సం: 27-175

పల్లవి: ఏమి విన్నవించేము యెందాఁకా నీతోను
నాలి(ము?) సేయకింతటను నవ్వు నవ్వవయ్యా

చ. 1: వలపులు తలు(ల?) చూపె వనిత కుచములను
బలు విరహపు వేళ పయ్యెదెడలి
చలివాసె సిగ్గులెల్ల జవ్వనమదమునను
తెలిఁగన్నులను సతిదిక్కుఁజూడవయ్యా

చ. 2: పయసు దైలువారె వనిత నెఱిఁగురుల
రయమునఁ గాఁకలెల్ల రారాఁపులె(లై?)
ప్రియమైన తేనెపండు బేఁటులెత్తీ నూర్వులను
దయతోడ నీ యింతిదండ చేరవయ్యా

చ. 3: వన్నెలు తళుకుచూపె వనితమొగమునను
యెన్న శ్రీ వేంకటేశ నీవిట్టె కూడఁగా
సన్నపు జెమటలను జడివట్టి జాలువారె
కన్నియ కిటువలెనే కపురమీవయ్యా

రేకు: 1730-02 దేసాళం సం: 27-176

పల్లవి: ఎంతవడి నీయలుక యెందాఁకా వొట్లు
పంతపు నీరమణుఁడు పైకొనీ నిదివో

చ. 1: చిలుకుఁదేరెను మోవిఁ జిందీ ననుచు నీవు
పలుకవదేమే పతితోను
కులుకుఁ గుచాల వుబ్బు కుంగీననుచు నిట్టె
అలమ విదేమే ఆతనిని

చ. 2: నునువాఁడి కొనగోరు నొగిలీ ననుచు నీవు
చెనకవదేమే చెలువునిని
అనుఁగు నీకనుచూపు లంటీ ననుచు నిట్టె
యెనయఁ జూడవేలే యీతనిని

చ. 3: పాయపు నీజవ్వనము పచ్చ గందీనని నీవు
చేయిచ్చి దగ్గరవేమే శ్రీ వేంకటేశు
యీయెడ నాతఁడే వచ్చి యిటు నిన్ను నేఁడు గూడె
నీయంత నెఱఁగవేమే నిండుదంటతనము

రేకు: 1730-03 సాళంగం సం: 27-177

పల్లవి: ఎక్కినవానికిఁ జూడ యేనిగె గుజ్జనుమాట
నిక్కముగా భువిలోన నీవల్ల గంటిమి

చ. 1: మొగము చూడఁగానే మూటమాటలాడేవు
తగునా ఆతనితోడ దంటతనము
నగేవానితోడ నీవు నంటుసేసి గొణగేవు
అగపడితేఁ బతి అలసతే నీకు

చ. 2: దగ్గరి రాఁగానే నీవు తలవంచుకొనియేవు
యెగ్గా ఆతఁడు నీకు యేమైనాను
వొగ్గి చేయిచాఁచేవాని నొడ్డుకొంటా బెనఁగేవు
వెగ్గళించకుండితేనే వింతవాఁడా ఇతఁడు

చ. 3: కొంగువట్టి తియ్యఁగానే గొబ్బున సిగ్గువడేవు
సంగతా ఇద్దరి మీసరసవేళ
యింగితాన శ్రీ వేంకటేశుఁడిట్టె నిన్నుఁగూడె
ముంగిట నిలుచుంటేనే ముచ్చటలు చెల్లెనా

రేకు: 1730-04 ముఖారి సం: 27-178

పల్లవి: వద్దు వద్దు కోపము వదినె నింతే నీకు
సుద్దులేల చెప్పేవు సొలసితి నిన్నును

చ. 1: మారుకొన్న దానఁగాను మాటాడినదానఁగాను
యేరా నాతోనేల యెగ్గు పట్టేవు
గీరితి నింతే గోర కెలని పరాకు రాఁగా
కూరిమి నిట్టే వేడుకొనేను నిన్నును

చ. 2: గుంపించినదానఁ గాను గొణఁగిన దానఁ గాను
తెంపున నేరా నన్ను దీకొనేవు
చెంపల చెమట జార చేతఁదుడిచితి నింతే
అంపలేను ఆయమంటి ఆదరించే నిన్నును

చ. 3: పొసివున్నదానఁ గాను పదరినదానఁగాను
వేసరక నన్నునేల వెడ్డువెట్టేవు
ఆసల శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
మోసలేదు నీకునాకు మొక్కమెచ్చే నిన్నును

రేకు: 1730-05 ఆహిరి సం: 27-179

పల్లవి: కానీవయ్యా అందుకేమి కాదనేనా
మోనాన నుండఁగ నిన్ను మోవనాడేనా

చ. 1: పొత్తుల మాఁటలలోనే బువ్వమారగించితిరి
అత్తి మోవులనే విడే లందుకొంటిరి
యెత్తిన చలముతోడ యేల నాతో బొంకేవు
కొత్తలుగ వేరే నిన్నుఁ గోపగించేనా

చ. 2: తెలినవ్వు సిగ్గులనే తెరలు వట్టించితివి
తలఁబాలు వోసితివి తమకముల
చలము సాదించి యేల సారె నానలు వెట్టేవు
వెలినుండి వేరే నిన్ను వెంగెమాడేనా

చ. 3: గొప్పకుచముల బూజకుండలునుఁ బట్టితివి
పిప్పిఁగాఁగ రతులను పెండ్లాడితివి
ఇప్పుడే శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నెప్పున నాపెకు నీకు నింద గట్టేనా

రేకు: 1730-06 సాళంగం సం: 27-180

పల్లవి: ఇక్కడ నిందరిలోన నేల లోఁగేవు
పక్కన సిగ్గువిడిచి, పదరాదా లోనికి

చ. 1: కొప్పు దువ్వేనంటా నాపెఁ గు(గొ?)మ్ముడి వట్టి తీసేవు
కప్పుర మిచ్చేనంటా కాలుదొక్కేవు
ముప్పిరి నీ యిద్దరిలో మూసిమంతనము లేల
యిప్పుడే నోటఁ బిలిచి యేఁగరాదా లోనికి

చ. 2: కతలు చెప్పేనంటా కనుసన్నలు సేసేవు
పతివెట్టేనంటాఁ జేయిపట్టి తీసేవు
యితవైతే మాముందర నింతేసి వగలేల
రతికేలి కాపె నీవు రారాదా లోనికి

చ. 3: పందేలు వేసేనంటా బలుములు సేసేవు
కందువలు చూపెనంటా గాఁగిలించేవు
యిందుకుఁగా శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
దిందుపడ నాపె నింకాఁ దియ్యరాదా లోనికి

రేకు: 1731-01 వరాళి సం: 27-181

పల్లవి: కాదని తొలఁగరాదు కైకొని మెలఁగరాదు
వీదరవెల్లి పొందులు విందులై వుండును

చ. 1: వలపుఁదేనెలమోవి వంచి నీవు మాటాడితే
తెలిసినవారికెల్లా తియ్యనుండును
కలసేటి నీ కాఁగిటి కాంతలకుఁ జూచితేను
యెలమిఁ బదారువేల యెంగిలై వుండును

చ. 2: చల్లనిమేనితో నీవు సారెఁ గాఁగిలించుకొంటే
యెల్లవారికినిఁ జూడ ఇంపై వుండును
పొల్లుగానినీ సతులు భోగించదొరకొంటే
గొల్లెతల మానముల గురుతులై వుండును

చ. 3: సింగారపుఁ గొనగోళ్లచేయి నీవు వేసితేను
అంగజముద్రలు వేవేలై వుండును
ఇంగితపు శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
సంగతి నీవే నాకు సమ్మతులై వుండును

రేకు: 1731-02 ముఖారి సం: 27-182

పల్లవి: కందువ కాఁగిటఁ గూడి కరఁగుచుందువుగాక
నిందలేని నీబోటికి నివ్వెరగు చెల్లునా

చ. 1: చనవరికత్తెలము జగడాలడుతుమా
చెనకి నీకే ప్రియాలు చెప్పేము కాక
పెనఁగుచు నీకునీవే బింకములు నెరపేవు
వనితలతోడ మగవానికింత గలదా

చ. 2: పట్టపుదేవులమింత పంతాలాడుదుమా
వొట్టుక నీవద్దఁ గాచుకుందుముగాక
వట్టినవ్వులు నవ్వేవు వాసులకుఁదిగిగేవు
దిట్టమగువలతోడ దీమసము వలెనా

చ. 3: వూడిగాలు సేసేవార మొరటులు పట్టుదుమా
వేడుకఁ గూడి బారము వేతుముగాక
యీడనే శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁగలసితి
జాడతోడి మాతోడ చలము సాదింతురా

రేకు: 1731-03 బౌళి సం: 27-183

పల్లవి: అందుకందుకును సరి ఆతఁడే జాణ
మందెమేళమున నిన్ను మన్నించెఁగదవే

చ. 1: మంచము పై నీవుండి మచ్చిక నాతఁడు రాఁగా
ఇంచుకంతఇన లేవ విది యేఁటిదే
పంచ నాతఁడు దిగువ పరపు పైఁగూచుండి
వంచుకొని నిన్నుఁ దనవద్దికిఁ దీసెఁగదే

చ. 2: పుద్దాలు మెట్టుకొని వొద్దికి నాతఁడు రాఁగా
పుద్దండాన నవి కడకూరుచవేమే
చద్దికి వేఁడికి నిన్ను జలకేళికిఁ దీసి
గద్దించి అంతలో నిన్ను గాఁగిలించెగదవే

చ. 3: వోరవాకిలి సేసె వొంటి నీవు లోన నుండి
రారమ్మన్నా నెదురుగా రావు గదవే
యీ రీతి శ్రీ వేంకటేశుఁ డిట్టె నిన్ను నేఁడు గూడె
తారుకాణ రతులెల్ల తలఁపించెఁగదవే

రేకు: 1731-04 సామంతం సం: 27-184

పల్లవి: రవ్వలైనా నాయఁగాని రాఁపైనా నైతిఁగాని
రివ్వల నీమోవితేనె రేఁచవద్దా ఇందుకు

చ. 1: చివ్వన నెందుండో వచ్చి చేముట్టి తీసి నీవు
నవ్వఁగా నీతో నేను నవ్వవద్దా
దువ్వటపుఁ బయ్యెదను తుడిచేవు నీచెమట
జవ్వనమదము నీ పైఁ జల్లవద్దా ఇందుకు

చ. 2: వొల్లనే వద్దఁ గూచుండి వొడివట్టి రమ్మంటా
గిల్లఁగా నేనూ నందుకు గిల్లవద్దా
మొల్లలు నీ కొప్పువెల్లా ముడిచేవు నా కొప్పున
పెల్లున నాతమ్ములము పెట్టవద్దా ఇందుకు

చ. 3: గక్కునను నీవు నన్నుఁ గాఁగిలించుకొనఁగానే
వుక్కువంటి నా చన్నుల నొత్తవద్దా
ఇక్కువ శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
మొక్కలములెల్లా మాని మొక్కవద్దా యిందుకు

రేకు: 1731-05 సాళంగనాట సం: 27-185

పల్లవి: కడు నేరుపరినంటా గర్వించేవు
జడియక యీవలపుసంగ తెరిఁగించవే

చ. 1: మాటలాడనేరుతువు మనసుకు మర్మమేదే
ఆఁటదాన విదెఱఁగనంటేఁ గొరత
యీటున నాతఁడు నీవు నిద్దరొ(రు) వొక్కరై
కూటపు నీ భారములగుఱుతెరిఁగించవే

చ. 2: సుద్దులన్ని నేరుతువు చూపులకు సూటేదే
కొద్దిమీరి ఇదెఱఁగకుంటే గొరత
చద్దిపండో వేఁడిపండో సరుస మీమోవులు
తిద్దుకొని నన్ను సమ్మతించఁ జేయవే

చ. 3: ముదురు జాణవు నీవు మోహానకుఁ జోటేదే
ఇది యెఱఁగకవుంటే ఇంతాఁ గొరత
కదిసి కూడె శ్రీ వేంకటేశుఁడు నిన్ను నన్ను
విదయ చందురులకు వేళ చెప్పవే

రేకు: 1731-06 ఆహిరి సం: 27-186

పల్లవి: గయ్యాళితనము నేర ఘనుఁడు నీ విన్నిటా
నెయ్యములు చూపి మాపై నేరుపులు చల్లుమీ

చ. 1: ముసి ముసి నవ్వులతో ముందర నిలుచుందాన
యెసగి యేమానాఁ జేయు మిప్పుడు నీవు
వసముగాక నీతో వాదులడువఁగ లేదు
పస ఇంతే కలది నాపడఁతి తనమున

చ. 2: చిఱుజెమటలతోడ చేయివట్టుకున్నదాన
యెఱిఁగి పాలిచ్చుకొమ్ము ఇప్పుడు నీవు
మఱఁగులదానఁ గాను మాట ఇంతేసాడనోప
గుఱి ఇదె కలది నాగుణములోపలను

చ. 3: తూలని ఆసలతోడ తొడమీఁద నున్నదాన
యీలీలఁ గలసితివి ఇప్పుడు నీవు
ఆలరితనము నేర అన్నిటా శ్రీ వేంకటేశ
వేళ యిదె నీకు నాకు విన్నవించుకొనను

రేకు: 1732-01 ఆహిరి సం: 27-187

పల్లవి: సరి నెఱిఁగించవయ్య జాడతో నడచేఁగాని
కరుణానిధిని నీకుఁ గన్నుల మొక్కేను

చ. 1: తెగరాని చుట్టాలకు దీమస మెంతైనాఁ గద్దు
నగవుల చుట్టాలకు నాలే కలరి
పగతోడి చుట్టాలకు పట్టినదెల్లాఁ బంతము
సొగిసిఇందులో నీవే చుట్టమవు నాకు

చ. 2: ఆసపడ్డవారికి నడ్డాఁకలే లేవు
వాసులు దలఁచుకొంటే వట్టినేరాలే
వేసరేటివారికి వింతలే లోకములెల్లా
యీసరి నెన్నుకొంటేను యెవ్వరు నీవు నాకు

చ. 3: కూడినట్టి నీకు నాకు గుణములే మీఁద మీఁద
వాడు దేరేవారికి వలవంతలే
యీడనే శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
పాడితో నున్నవారికి భాగభోగ్యాలే

రేకు: 1732-02 కాంబోది సం: 27-188

పల్లవి: ఉన్నదాన నేనూ వొకరీతి నిపుడు
తన్నుదానే అయ్యీఁగాని తమకించకురే

చ. 1: చనవులేని దాని చల మేఁటిచలమే
పెనఁగఁబోతేఁ గడుఁ బిరితీసును
నను నేల పొగడేవే నావిభుని ముందరను
వెనక నన్నీఁ జెప్పే వేగిరించకురే

చ. 2: సరసమాడనిదాని సలి గేఁటి సలిగే
వొరయఁ బోతే నది వొల్లఁ బెట్టపును
సరవులేలడిగేరే సారె సారె నన్నిపుడు
తెరదీసే నిటమీఁద తీదీపులు మానరే

చ. 3: చెల్లుబడిలేని దాని చెలి మేఁటిచెలిమే
మల్లాడఁబోతేను మట్టు మీరును
యిల్లిదె శ్రీ వేంకటేశు నిట్టె కూడించితివి
వెల్లవిరు లిఁకఁ జేసే వేడుకతో నుండరే

రేకు: 1732-03 హిందోళం సం: 27-189

పల్లవి: దానికేమి దోసమా తాను నేను నొకటయితే
మోనాననుండి చూచితే మొద లేరుపడదు

చ. 1: చలములేనివలపు సాదించవసమా
అలయిక బెట్టనుచు నందురుగాక
తెలిసినవారికే దిష్టమై వుండఁగాను
కొలఁది వెట్టఁగఁ బోతే గురిగా దొకటియు

చ. 2: ననుపుగాని పొందు నవ్వించవసమా
అనఁగి పెనఁగుమని యందురు గాక
విన నేర్చినవారే పనిగొన నేర్తురు
కినిసి మొక్కఁగఁబోతే కిందుపడు బనులు

చ. 3: గక్కనఁ గూడినమీఁద కాతరించవసమా
అక్కరదీర వలెననెందురు గాక
యిక్కువ శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
తక్కినవి దడవితే తడఁబడీ మనసు

రేకు: 1732-04 ఆహిరి సం: 27-190

పల్లవి: ఎందాఁకా నెడమాట లేఁటికి తలవంపులు
ముందర నుండితేఁ జాలు ముచ్చటెల్లఁ బాసును

చ. 1: నెఱజాణ రమణుఁడ నీకేమి బుద్ధి లేదా
మఱి పొరిగింతికైనా మానములేదా
మఱగేల మీలోన మాటలాడే అందుకుఁగా
తెఱవల నడిగితే తేటలెల్లమౌను

చ. 2: అంగజగురుఁడ నీవైనా మరచితివా
అంగనైనా దలఁచుక ఆడవద్దా
వుంగిటెల్ల నీలోన వొందినవే అందుకుఁగా
ముంగిట నుండితేఁ జాలు మోహమెల్లా రేఁగును

చ. 3: శ్రీ వేంకటేశ నీకైన చిత్తము నేఁడు వచ్చెనా
వావిరి నేఁ డాపెకైన వరుసాయనా
యీవల గూడితిరి మీరిద్దరును నొక్కమాఁటే
భావించుకొనుఁడు మీపంతమెల్ల దక్కును

రేకు: 1732-05 లలిత సం: 27-191

పల్లవి: నలుగడఁ దనయెమ్మె నాముందరనే యేల
సొలసి కొలిమిఁగూఁట సూదలమ్మవలెనా

చ. 1: పంతమాడనోపఁగాని బలిమెంతయినా గలదు
చెంతఁ దా నాతోనేల చెనకీనే
వంతులకు రాఁగా నీవల పెల్లా నాసామ్మే
వింతవారి వద్దఁ దనవిద్య చూపుమనవే

చ. 2: ఆనవెట్టఁ జాలఁగాని అన్నిటాను నిజమరినే
పానిపట్టి నన్ను నేల పచారించీనే
నానఁబెట్టఁగాని నా నవ్వులే సెలవులెల్ల
తానెందైనా సతులతో తమకించుమనవే

చ. 3: మత్సరించి పెంచఁగాని మంకులెల్లా నా సొమ్మే
ఇచ్చగించి నాతోనేల ఇయ్యకొనీనే
అచ్చపు శ్రీ వేంకటేశుఁడన్నిటాను నన్నుఁ గూడె
విచ్చి చెప్పి ఇందరికి వినిపించుమనవే

రేకు: 1732-06 బౌళి సం: 27-192

పల్లవి: ఆ మీఁది పనులు నన్నడుగనేల
చేముట్టి మీకు బుద్ధి చెప్పితి నింతే

చ. 1: కాదనేదానఁగాను కైకొలిపేదానఁగాను
గీద పోరి యేల సాకిరి గోరేవు
వాదడువకుఁ డనుచు వద్దనుండి నీవు నీవు
తోదోపు లాడఁగాను దొబ్బితి నింతే

చ. 2: అట్టయి మీతగవు దిద్ద జాతిగుండెదానఁగాను
వట్టియానలేల నాకుఁ బెట్టేరు మీరు
చెట్టవట్టి మీరిద్దరు సేసేఁమీలోని
చిట్టకాలు పాదమునఁ జిమ్మితి నింతే

చ. 3: లోఁచి వెలదానను లోనయినదానను
యీచాయ నన్నుఁగూడి యీ యింతిఁ గూడేవు
చే చేతఁ బెనఁగఁగ శ్రీ వేంకటేశుఁడ మిమ్ము
చూచి చూచి మీనేరుపు సోదించితి నింతే

రేకు: 1733-01 దేశాక్షి సం: 27-193

పల్లవి: ఇన్ని విన్నపములును ఇందులోనె వున్నవి
అన్నిటాను చెలియ పుణ్యము నీచే నున్నది

చ. 1: వలవ నేర్చినవారు వాదులాడనేరరు
పలుక నేర్చినవారు పగ నేరరు
వలవేసి సతిమీఁద వట్టి దూరులు గట్టకు
నిలువుఁ బతిమవలె నీముందర నున్నది

చ. 2: తగవు గలుగువారు దంటమాట లాడరు
మొగమోట గలవారు మొరఁగలేరు
బిగిసి కామినిమీఁద పెనఁగఁగఁ బనిలేదు
నిగిడి చిలుకవలె నీచేతిలో నున్నది

చ. 3: కూటమిగలుగువారు కొరతలే యెంచరు
మాట పట్టు గలవారు మచ్చరించరు
యీటున శ్రీ వేంకటేశ యీపె నీవుఁ గూడఁగాను
గాఁటపుఁ బెన్నిధివలె కాఁగిటలో నున్నది

రేకు: 1733-02 మాళవిగౌళ సం: 27-194

పల్లవి: వద్దు వెఱవకు తోడు వచ్చేఁగాని నీకు
యిద్దరిలో నాకుఁగా నీ వింత సేసేవా

చ. 1: కొనగోరు దాఁకించితే కోపగించుకొనేవు
చనవు సేసుక నిన్ను జరసితిని
వెనక నొక్కితె నిన్ను వెంగె మాడీనంటాను
తనువు రేకలకే తల్లడించేవు

చ. 2: గందము నేఁ బూసితేను కడు నలఁచివేసేవు
పొందులు సేసుక నిన్నుఁ బొదిగితిని
నిందవేసి యవ్వతైనా నిన్నుఁ దిట్టీనంటాను
విందుల సింగారాలకే వెరచి లోఁగేవు

చ. 3: తగిలి నేఁ గూడితేను తమకించితి విప్పుడు
మొగచాటుకాకుండా మోవి ఇచ్చితి
నగితి శ్రీ వేంకటేశ నమ్మితివి యింతివి
దగదొట్టి పయిపైనే తలవంచేవు

రేకు: 1733-03 పాడి సం: 27-195

పల్లవి: ఏమే విచారించే వెంతవని గద్దు నీకు
నాములువార నవ్వేటిననుపు కత్తెలము

చ. 1: అగ్గమై కంబము మాటునందు గొలువుసేయఁగ
వెగ్గళించి యెవ్వరంటా విచారించేవు
నిగ్గుల నీవెఱఁగవా నీతో సరసమాడి
సిగ్గులు విడిపించేటి చెలిమికత్తెలము

చ. 2: వెనకదిక్కుననుండి వింజామర వేయఁగాను
మొనసి యదరిపాటు మోము చూచేవు
ననుపు మఱచితివా నయగారాల నీచేత
పనులు సేఇంచుకొన్న పంతగత్తెలము

చ. 3: కడనుండి వచ్చి నిన్నుఁ గాఁగిట నేఁ గూడఁగాను
వెడమోవి లంచమిచ్చి వేఁడుకొనేవు
తడవి శ్రీ వేంకటేశ తగవు నీవెఱఁగవా
అడరి నీవు మన్నించే యాసోదకత్తెలము

రేకు: 1733-04 భైరవి సం: 27-196

పల్లవి: ఇంకనైనా నుపకార మెఱుఁగుకొమ్మీ
తెంకి నాగుణాలిట్టే తెలుసుకొమ్మీ

చ. 1: తప్పులు వట్టింతునా తరుణులచేతనెల్ల
చిప్పిల నందుకేమీఁ జిన్నఁబోకుమీ
కప్పింతునా నీమేని ఘాతలు కస్తూరివూసి
చప్పఁగాక ఇందుకైనా సంతోసించుమీ

చ. 2: కొంగులు వట్టింతునా గురుతైనవారిచేత
అంగవించి సిగ్గువడి అలయకుమీ
ముంగిట నాడింతునా ముందే నిజమరివని
చెంగట నాపంతములు చిత్తగించుమీ

చ. 3: నవ్వులు నవ్వింతునా నావంటివారిచేత
జవ్వనమదముచేత జడియకుమీ
ఇవ్వల శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నివ్వటిల్లు నా మోహము నీ వెఱుఁగుమీ

రేకు: 1733-05 ముఖారి సం: 27-197

పల్లవి: ఇందాఁకా నాపని యిటమీఁద నీపని
చెంది నిన్ను నిఁక రట్టుసేయఁ జూమ్మీ యిపుడు

చ. 1: చిత్తము వచ్చినదాఁకాఁ జేసితిని వూడిగము
పొత్తుకు వచ్చినదాఁకాఁ బొదిగితిని
కొత్తరతులను నన్నుఁ గొసరే వప్పటి నీవు
వొత్తి నిన్ను నలయించనోపఁ జూమ్మీ ఇపుడు

చ. 2: మొగము చూచినదాఁకా ముందు ముందే మాటాడి
తగిలినదాఁకా నీతోఁ దమకించితి
బిగువుఁగాఁగిట నాతోఁ బెనఁగే విందుకుఁ బతి
వొగరుగాఁజన్నులను వొత్తుఁ(త్తఁ)జూమ్మీ ఇపుడు

చ. 3: యేకతమఇనదాఁకా యియ్యకొంటిఁ బనులెల్ల
కైకొని కలయుదాఁకాఁ గదిమితిని
మేకుల శ్రీ వేంకటేశ మెచ్చి నన్నుఁ గూడితివి
ఆకడి వెంగేలు నిన్ను ఆడఁ జూమ్మీ ఇపుడు

రేకు: 1733-06 బౌళి సం: 27-198

పల్లవి: పంతములిచ్చిన మీఁదా బలిమేల
సంతకూటముల పొందు చవిచెప్పఁ జూతురా

చ. 1: చిగురాయఁ జిత్తము శిరసుకు (కొ?)మ్ముడి జారె
మగుడి మాతో నవ్వులు మానరాదా
యెగసక్కె లింతేసి యెవ్వతె నేరిపె నీకు
వొగరైతే వలపులు వొడిఁ బెట్టుకొందురా

చ. 2: గొప్పలాయఁ జన్నులు కొనగోరు గురులాయ
దప్పిదేర మమ్ము దయదలఁచరాదా
ఇప్పటినీవోజలు యెన్నాళ్లు చదివితివి
పిప్పి గట్టితే వయసు పిండి వేతురా

చ. 3: తేనె గారెఁ గేమ్మోవి తేటలాయఁ గనుచూపు
మోనాన నీపాద మిట్టె మోపరాదా
యీనయాన శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
నానితేనే రతులను నలి నలి సేతురా

రేకు: 1734-01 సౌరాష్ట్రం సం: 27-199

పల్లవి: ఆయనాయఁ జాలుఁ జాలు అంత మాకేల
పాయక సవతులకు పంతములు రేఁగవా

చ. 1: ననిచిన చెలి నీతో నవ్వులు నవ్వేనంటా
పనివడి మమ్ము నవ్వఁ బాలుపెట్టేవు
వెనుకొని నీకునంత వేడుకైతే నాయఁగాక
గునిసే సవతులకు కోపములు రేఁగవా

చ. 2: చెలియ నీమాటలకు శిరసు వూఁచీనంటా
వొలిసి మమ్మును శిరసూఁచుమనేవు
వలసిన నీకు నివి వైపైతే నాయఁగాక
పెలుచు సవతులకు బిగువులు వట్టవా

చ. 3: అంగన నీవోజలకు నట్టె చొక్కీనంటా
సుంగుల మమ్మూ నట్టె చొక్కుమనేవు
ముంగిట శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
వెంగలి సవతులకు విరహాలు నిండవా

రేకు: 1734-02 సాళంగం సం: 27-200

పల్లవి: నేనూ నాపెఁ గలిగిన నెరజాణవు
కానుకగా మీఁదటెత్తు కనుకొనవయ్యా

చ. 1: సగము ముసుఁగువెట్టి సతి నిన్నుఁ దొంగి చూచి
నగి నగి యేమో సన్నలు సేసెను
చిగురుఁ బెదవి వట్టి చిక్కించుక వున్నదాన
తగవెట్టు నెరసేవు తలఁచుకోవయ్యా

చ. 2: దోమతెర గొంత యెత్తి దొమ్మిఁ జేతులు దూరిచి
కామిని వ్రాసిచూపి కాఁక చల్లెను
ఆమని నీరతి నేను అల్లుకొని వున్నదాన
యేమిసేసే వీక బుద్ధి యెంచుకొనవయ్యా

చ. 3: చన్నులు వీఁపున నొత్తి సంగడివారి మొరఁగి
కన్నియ నిన్నిటువలెఁ గాఁగిలించెను
ఇన్నిటా శ్రీ వేంకటేశ ఇద్దరి నే నలముక
యెన్నిఁ గూడితి నీఁక నెట్టు బొంకేవయ్యా

రేకు: 1734-03 శుద్ధ వసంతం సం: 27-201

పల్లవి: మమ్మేమి చెప్పేవు మానినులము వుమ్మగిల నాపె నీ వొడివట్టి తీసును

ච. 1: నీకు మోహించినయట్టి నెలఁతదే భాగ్యము
కాకరితనాన నీకాలు దొక్కును
రాకొట్టులు గొట్టులు సాజసము చూపి మోపి
దాకొని నీవదనానఁ దమ్ములము వెట్టును

ච. 2: తక్కక నీ సేవసేసే తరుణిదే భాగ్యము
చెక్కుమీఁదఁ జేయివేసి సేదదేర్చును
చుక్కలువలె మోవిపై సూదివాట్లంటించును
గుక్కక పూవులు చెక్కుఁ గొప్పువట్టి తీసును

ච. 3: వావి నీకుఁ గలసిన వనితదే భాగ్యము
బూవపు టెంగిలి పొత్తు పొసఁగించును
యీవేళ శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
ఆవలి యీవలి వారితో నాపె నిన్నుఁ దిట్టును

రేకు: 1734-04 దేసాళం సం: 27-202

పల్లవి: నీవే ఆతఁడు గావా నేటిదాఁకా
వావిలి నాతనిలోని వలపు చేకొనవే

చ. 1: పంతములాడఁ జూచితే పలుకులిన్ని లేవు
చింతించఁ జూచితేను చిక్కెంత లేదు
యింతటికి సెలవు నీ యింటికి వచ్చె నాతఁడు
వింతలేక మనసుతో వేడుక చెల్లించవే

చ. 2: వాసులెంచఁ బోతేను వక్కణ లెన్ని లేవు
పాసితేను విరహతాప మెంత లేదు
ఆసపడి విభుఁడు నీయలుక దేరిచెనేఁడు
తాసువలె సరిదూఁగి తలఁపీడేరించవే

చ. 3: తగవులఁ బెట్టఁబోతే తప్పులెన్నేసి లేవు
చిగిరించి నవ్వఁబోతే సిగ్గెంతలేదు
అగపడి శ్రీ వేంకటాధిపతి నిన్నుఁగూడె
మొగమోడి రతులలో ముచ్చటలు చెప్పవే

రేకు: 1734-05 ఆహిరి సం: 27-203

పల్లవి: యేమని విన్నవించేము యెవ్వరినిఁ గాదనేము
కోమటిసాకిరులాయ గొబ్బున మామాఁటలు

చ. 1: సరసము లాడఁగానే జాముపోయఁ దెల్లవారె
తరవులు వెట్టి మాకు దగదొట్టెను
శిరసు వట్టి చెనకఁగఁ జెనకఁగ
తరుణి సిగ్గులువడి తలవంచె నదివో

చ. 2: యెగసక్కేలాడఁ గానే యెండగాసె నీడవచ్చె
తగవులు చెప్పి మాకుఁ దడవాయను
బిగువెక్కెఁ గుచములు పిలువఁగఁ బిలువఁగ
మగువ జవ్వనమున మదమెత్తెనదివో

చ. 3: చేతులు చాఁచఁగానే చీఁకటెల్లా వెన్నలాయ
నీతులు బోదించ మాకు నెపమాయను
యేతుల శ్రీ వేంకటేశ ఇట్టె నీవు గూడఁ గూడ
యీ తరుణి పురము పై నిరవాయ నిదివో

రేకు: 1734-06 దేశి సం: 27-204

పల్లవి: ఆఁటదాని చేతిదే ఆయపుఁగాఁపురమెల్లా
నీటున నీకన్నియును నేరుపఁగవలదా

చ. 1: నిన్ను దూరఁదగవా నీతోఁ బొందుసేసిన
వన్నెల సతుల దూరవచ్చుఁగాక
మిన్నక దొరతనాన మించి మత్తుడవై యుంటే
తినఁగాఁ దామెల్లా నిన్ను తిద్ది తీర్చవలదా

చ. 2: అలుగ నీతోఁ దగునా అండనున్న నీ సతుల
నలిని యేమిసేసినా నమరుఁగాక
కలసేటి జవ్వనపు గజరు నీకుఁ బట్టితే
తెలిపి నిన్నుఁ జాయకుఁదెచ్చుకొనవలదా

చ. 3: కొంగవట్టి నీగుణాలు కొసరితే నమరునా
సంగడి నీ ఇంతులఁ గొసరుట గాక
ముంగిట శ్రీ వేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
వుంగిటిగొన్న నిన్నుఁ దామొరయఁగ వలదా

రేకు: 1735-01 గుజ్జరి సం: 27-205

పల్లవి: మాతోడఁ దనకేల మచ్చరములు
పోతరించి తానేల పుల్లసిలీనే

చ. 1: మలసి మమ్మేల దూరీ మగఁడైనవానిఁ దానే
వలపించవలదా వనితైతేను
వెలయ నాతఁడు నావెంటవెంటఁ దిరిగితే
కలికి తానేల యింత కాఁకరేఁగీనే

చ. 2: సవతులఁ దానేల సాదించీ నాతనినే
యేవలఁ బోకుండా భ్రమయింపించరాదా
రవళి నాచెప్పినట్లు రమణుఁడు సేసితేను
చివుకునఁ దానేల చిమ్మిరేఁగినే

చ. 3: అండనున్నవారినేల అద్దలించీ నాయకుని
బందు బందు సేసి యట్టె పట్టుకోరాదా
దండి శ్రీ వేంకటేశుఁడు తానే నన్నిటు గూడె
బెండుపడి తానేల పెచ్చురేఁగీనే

రేకు: 1735-02 ముఖారి సం: 27-206

పల్లవి: ఎవ్వరి మాటలు నేనేల వినేను
దివ్వెలెత్త నియ్యవయ్య తేనెలు నించేను

చ. 1: నవ్వులకుఁ గడమా నాకు నీవు గలిగుండి
రవ్వలుగ మీఁద మీఁద రాఁపు సేయఁగా
పువ్వువంటిదాన నేను పూఁపవంటి విభుఁడవు
బువ్వానకు రావయ్యా బుద్ధిచెప్పే నేను

చ. 2: సంతోసాలు బాఁతే సారె నీవిందరిలోనా
చింతదీర వేఁడుకొని చెక్కు నొక్కఁగా
పొంత నిదె నావలపు పొరుగే పోనీవావి
మంతనాన వినవయ్య మాట చెప్పే నేను

చ. 3: ఆసకు లెక్కవున్నదా ఆయాలు మోవఁగ నీవు
సేసవెట్టి పెండ్లాడి చేరి కూడఁగా
వాసి నలమేల్ మంగను వడి శ్రీ వేంకటేశుఁడ
యీసులేక కూడితివి యెనశుండే నేను

రేకు: 1735-03 బౌళి సం: 27-207

పల్లవి: ఇస్సీ నే నెఱఁగనా యీపాటి నేను
అస్సోరాన నడచేనా అన్నిటా నేను

చ. 1: కేరి కేరి నీవద్ద గెలసి నవ్వుదుఁగాక
నేరములెంచేనా నీతో నేను
ఆరీతినే కొనగోర నాయము లంటుదుఁగాక
బీరము లాడేనా పెనఁగుతా నేను

చ. 2: చన్నుమొనల నరసి చవులు పుట్టింతుఁగాక
నిన్ను నానవెట్టేనా నీతో నేను
వన్నెలు చూపి మోపి వలపు చల్లదుఁగాక
కన్నుల జంకించేనా కసరుతా నేను

చ. 3: గక్కన నిట్టె నిన్నుఁ గాఁగిటఁ గూడుదుఁగాక
నిక్కి నిక్కి చూచేనా నీతో నేను
యిక్కువ శ్రీ వేకంటేశ యిరవైతి విటు నాకు
తక్కల నలయించేనా దక్కఁగొంటి నేను

రేకు: 1735-04 రామక్రియ సం: 27-208

పల్లవి: ఏకతాన నీ వుండుటెవ్వఁ డెఱుఁగు
ఆకడ నీవే వచ్చేవని యంటా నుంటిని

చ. 1: తెర వేసివుండఁగాను తిరిగివచ్చితి నేను
యిరవైన నీగుట్టు లెవ్వఁడెఱుఁగు
బెరసి నీకు నింతులు పెక్కు గలరు గనక
అరసి నీకు వేళగాదనియంటా నుంటిని

చ. 2: పానుపుపై నీవుండఁగా పలుకకుండితి నేను
యీనెపాన నీ మన సెవ్వఁడెఱుఁగు
వీనుల నీ సుద్దులెల్లా వింటానుంటిమి గనక
పూని యింతులతో రతిఁబొందేవని వుంటిని

చ. 3: చేతులు నీవు చాఁచఁగ సిగ్గుతోఁ దలవంచితి
యేతుల నీవలపులు యెవ్వఁడెఱుఁగు
యీతల శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁగూడితివి
రాతిరి వచ్చేవంటా రాజసాన నుంటిని

రేకు: 1735-05 పాడి సం: 27-209

పల్లవి: వింటేఁ గోపమురేఁగీ విన్నవారికి
దంటవౌదు వన్నిటాను తడవకు మిఁకను

చ. 1: మొగమోటలోనున్నది మోహము
నగినందులో నున్నది నను పెల్లాను
చిగురుబాసలు నాకుఁ జేయనేఁటికి నీకే
తగునా సుద్దులు మరి తడవకు మిఁకను

చ. 2: దట్టపుఁ జూపులలో నుంది తగులెల్లాను
గుట్టులోపల నున్నది గుణమెల్లాను
అట్టె మాతోనేల ఆనలు
దట్టమాయ నీవేసాలు తడవకు మిఁకను

చ. 3: కూడినందులో నున్నది కోరికె మాట
జాడలలోనే వున్నది చనవెల్లాను
యీడనె నన్ను శ్రీ వేంకటేశ కూడితి
తాడుమీఁది తపసులు తడవకుమిఁకను

రేకు: 1735-06 శుద్ధవసంతం సం: 27-210

పల్లవి: మాతో నేల లేదనేవు మాటిమాటికి
చేత దిష్టవై వుండఁగా చిత్తమునఁ బెట్టవు

చ. 1: చన్నుల నొరసె నాపె సారె గొప్పు దువ్వేనంటా
సన్న సేసి మాటలాడె సంగడి నంటా
యెన్నికతో నీకాపె యిఁక నేమి సేయవలె
చెన్నుమీర నింకా నీవు చిత్తమునఁ బెట్టవు

చ. 2: కదిసి కూచుండేనంటా కాలు దొక్కె నంతలోనె
వదినెనంటా నీతో వావి చెప్పెను
యెదుట నీకు దనివి యెంతట గాని నిండదు
చెదరదీవలపింకా చిత్తమునఁ బెట్టవు

చ. 3: ఆకు మడిచిచ్చే నంటా ఆయములెల్లా ముట్టె
చేకొనే వూడిగాలంటాఁజేరికూడెను
యీకడ శ్రీ వేంకటేశ యీడా నన్నుఁ గూడితివి
చీకాకు లాపెరతి చిత్తానఁ బెట్టవు

రేకు: 1736-01 బౌళి సం: 27-211

పల్లవి: ఆనతీవయ్యా నాతోను అల్లదివో చెలియ
పూని నీ మన్నన లెట్టు పొసఁగించేవయ్యా

చ. 1: దప్పిదేరే మోముతోడ తరుణి నిన్నుఁ బిలిచీ
అప్పుడాడిన మాట కేమంటివయ్యా
చిప్పిలుఁ జెమటతోడ చేసన్నసేసి నందుకు
ఇప్పుడు నీచిత్తములో నెట్టున్నదయ్యా

చ. 2: సిగ్గుతోడఁ దలవంచీ చెలులచేతనంపిన
అగ్గపుఁగానుక లేమ నందితివయ్యా
వెగ్గళించి ఆపె నిన్ను వేసినపూల చెండు
దగ్గరి నీకళ యేడ దాఁకెనయ్యా

చ. 3: కొంగువట్టి తీసి తానే కూరిమి గొసరితేను
వుంగిటి నీమొగ మెట్టోడివయ్య
ఇంగితాన శ్రీ వేంకటేశ కూడితి రిద్దరు
పొంగేటి వలపు లెందు వోసేవయ్యా

రేకు: 1736-02 మంగళకౌసిక సం: 27-212

పల్లవి: అందుకేమి నీతో నే మాడుకోము
చందముగాఁ బెనఁగితే సమ్మతించఁజేతుము

చ. 1: పంతమెల్ల నీడేరె నీ పడఁతికి
కాంతుఁడవు నీ కరుణ గలుగఁగాను
వంతులేల పెట్టేవు మావారి సంది నీ
వింత మన్నించితే నే మెంతకైనా గలము

చ. 2: చలమెల్లఁ జెల్లెను యీసతికి నేఁడు
బలువుఁడ విట్టె చేపట్టఁగాను
పిలువకు మిద్దరిని పేరువేర
వలచితే వలపులు వడ్డికిఁ బారింతుము

చ. 3: దొరతనమెల్ల వచ్చె దొయ్యలికి
సరుసఁ బెట్టుక నీవు చనవియ్యఁగా
యిరవై శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నిరతి నీవుండితేను నిన్నే మెప్పింతుము

రేకు: 1736-03 గౌళ సం: 27-213

పల్లవి: నీగుణమే ఆతని నిలువెల్లాను
చేగదేరెఁ బనులెల్లా చిత్తగించు మిఁకను

చ. 1: కాటుకకన్నులతోడికలికి నీ చూపులు
నాటఁగా నాతనిమేను నల్లనాయను
తేటలనీ యధరపుతేనె లిచ్చినయందుకు
యీటులేకాతనిమోవి యెఱ్ఱనాయను

చ. 2: చేరి నీవు నవ్వఁగాను చెమట ముత్తేలు రేఁగి
తేరి యాతనిభావము తెల్లనాయను
పూరట నీమేని పస పొరయఁగా నాతని
గారవపుఁబచ్చడము కడుఁ బసిమాయను

చ. 3: కోకొమ్మని నీవు నీకొప్పుదవన మాతని
కాకడ ముడువఁగా నంటి పచ్చాయ
యీకడ వేంకటేశు కీమంజిష్టి నీ పయ్యెద
పైకొని కప్పి కూడఁగా పంచవన్నె నాయను

రేకు: 1736-04 వరాళి సం: 27-214

పల్లవి: చెలి జాణగాకుండితే చేతుల బట్టఁగరాదు
యెలమి నీనానుడి యెఱఁగరా తాము

చ. 1: జట్టిగొని నీవు నాకు చనవియ్యఁగాఁ జూమీ
కట్టఁగడవారికెల్ల కాఁకరేఁగెను
వొట్టి వొకరినోములు వొకరికి వచ్చునా
దట్టమైనతమ వెట్టితన మింతేకాక

చ. 2: వుప్పటించి యింతలోనే వూరఁగలవారెల్ల
కప్పురమిచ్చితివంటా కాఁతాళించేరు
చిప్పిలి విత్తొకటియుఁ జెట్టొకటీ నౌనా
తప్పులెంచే తమ యెడ్డతన మింతే కాక

చ. 3: శ్రీ వేంకటేశ నీవు చేరి నన్నుఁ గూడితేను
యీవల సవతులెల్లా యిచ్చలాడేవు
చేవదేర రాజు వలచినదే దేవులు గాదా
తావులను తమమంకుదన మింతేకాక

రేకు: 1736-05 హిందోళం సం: 27-215

పల్లవి: నేనేమీ నెఱఁగఁజుమ్మీ మీచేఁతలు
పూనిపట్టి నీవేమి బుద్ధిదలఁచితివో

చ. 1: పంతములాడక నిన్ను బళియని మెచ్చితే
చింతతోడఁ దలవంచి సిగ్గువడేవు
వంతుకెక్కిన వెంగె మామరేమైనా నంటినా
కొంత గొంత నీవేఁటికిఁ గొంకేవోకాక

చ. 2: వాసులెల్లా నెంచక నీ వద్దికి నే వచ్చితేను
వోసరించి మొకమోడి వొద్దుకొనేవు
నీ సుద్దులు దడవేనా నిన్ను నే సోదించేనా
వీసమంత పనికేల విచారించుకొనేవో

చ. 3: కన్నుల జంకించక కాఁగిట నే నించితేనే
వెన్నెకాఁడవై కడు వెరగందేవు
యిన్నిటా శ్రీ వేంకటేశ యెరవు నీకుఁ జేసేనా
మన్ననలు నీవెంత మాకియ్య నున్నాఁడవో

రేకు: 1736-06 నాదరామక్రియ సం: 27-216

పల్లవి: బట్టబయలాయ నేఁడు పనులెల్లాను
గుట్టుతోడితమకము కోరి యెందాఁకానే

చ. 1: సేసపాల వలపులు చెంపలవెంటఁ గారి
లేసులాయఁ జెమటలు లేదనేవేమే
వాసికెక్కి కోరికలు వడ్డివారీఁ బతిమీఁద
మూసి మంతనాలు నాముందర నీకేఁటికే

చ. 2: సిగ్గుతోడి చెలుములు చీరవెంటఁ గారీని
కగ్గుదేరి మోముకళ కాదనేవేమే
బెగ్గోలు మొగమోట పేరడాయ నాతనికి
ముగ్గువంటి నవ్వులు నాముందర నీకేఁటికే

చ. 3: జవ్వనపు వేడుకలు చన్నులవెంటఁగారీ
నివ్వటిల్లీఁ గూటములు నివ్వెరగేలే
చివ్వన మనకూటాలు శ్రీ వేంకటేశ్వరు కబ్బె
మువ్వంక పంతాలు నాముందర నీకేఁటికే

రేకు: 1737-01 శుద్ధవసంతం సం: 27-217

పల్లవి: ఏడకేడ నీ బలువు యెంతవాఁడవు
యీడనె అన్నియుఁ గంటి మెంతవాఁడవు

చ. 1: కొమ్మ నీకుఁగలిగిన గుణము లడిగితేను
యెమ్మెలెల్లా నాడుకొంటి వెంతవాఁడవు
తమ్మిరేరు(కుఁ?) గన్నులను తరుణి నిన్నుఁ జూచితే
ఇమ్ములను విఱ్ఱవీఁగే వెంతవాఁడవు

చ. 2: అందముగా మేలు మేలని నిన్నుఁ బొగడితే
ఇందరిలో విఱ్ఱవీఁగే వెంతవాఁడవు
పందెగాఁడ వౌదువంటే పంతములు నెరపేవు
యెందుకని నిన్ను మెచ్చే నెంతవాఁడవు

చ. 3: పచ్చిదేరే నిన్నుఁ జూచి పాదాలకు మొక్కితేను
ఇచ్చగించి ఇయ్యకొనే వెంతవాఁడవు
మెచ్చుల శ్రీ వేంకటేశ మించి నన్నుఁ గూడితివి
యెచ్చుకుందులెల్లాఁదేరె నెంతవాఁడవు

రేకు: 1737-02 కాంబోది సం: 27-218

పల్లవి: ఓరిచేను నీసుద్దులు వొడఁబడ్డదాఁకాను
జీరవారెఁ జెక్కుమీఁదఁ జేయవయ్యా చేఁతలు

చ. 1: తప్పక చూచినందుకే తగవులఁ బెట్టేవు
ఇప్పుడు గొంగు వట్టితే నేమి సేతువో
కుప్పలై యిరుగు పొరుగులవారు చూచి చూచి
చెప్పేరు నీకు బుద్ది సేయవయ్య చేఁతలు

చ. 2: మాటలాడినందుకే మంకుఁదనాలు రేఁగేవు
యీటున వెంగెమాడితే యేమిసేతువో
జూటరిచెలులు నీ చుట్టాలయ్యే నవ్వేరు
చీటికి మాటికి నీవు సేయవయ్య చేఁతలు

చ. 3: చేయి చాఁచినందుకే సిగ్గులతోఁ బెనఁగేవు
యీయెడఁ గాఁగిలించితే నేమి సేతువో
పాయక శ్రీ వేంకటేశ పైకొని కూడితి నన్ను
చేయిమీఁదాయఁ బనులు సేయవయ్య చేఁతలు

రేకు: 1737-03 లలిత సం: 27-219

పల్లవి: ఇంతకుమిక్కిలిసుద్దు లెరఁగము నేమైతే
బంతుల నున్నవి నీపైఁ బాయపుఁగోరికలు

చ. 1: మెలుఁత చూపులనే మీల నెదురెక్కించే
వలవేసితివి నీవు వలపులను
సెలవుల నవ్వులనే చెలమలు దవ్వే నాపె
యెలఇంపు మాటల నీ వీఁదులాడితివి

చ. 2: సతి చన్నుమొనలనే జక్కవపిట్టల రేఁచే
తతి నురు లొడ్డితివి తమకముల
కతకారి మాటలనే కణఁజాలు గట్టెనాపె
రతిరాజు బండారాలు రతుల నించితివి

చ. 3: యింతి దననడపుల యేనుగల దీకొలిపె
దొంతి కూటాల వయ్యాళి దోలితివి
యింతలో శ్రీ వేంకటేశ యిద్దరముఁ గూడితిమి
వింత చుట్టరికముల వియ్యా లందితివి

రేకు: 1737-04 సాళంగం సం: 27-220

పల్లవి: ఎంత పాప జాతినో యెఱఁగనైతి
చింతదీర నిన్నిటికి చేరి మొక్కేఁ జుమ్మీ

 చ. 1: మొక్కలాన నీవద్ద ముసుఁగు వెట్టుకవుండి
పక్కనఁ బిలిచినాను పలుకనైతి
చెక్కునొక్కి నీవు నన్ను సేదలు దేర్చినాను
తెక్కులతో నేడలేని తిట్టులు దిట్టితిని

చ. 2: శిరసువట్టుక నీవు చేతులు చాఁచినాను
కురులంటకుమనుచు కోపగించితి
సరసమాడుచు నాతో చల్లఁగా నీవు నవ్వినా
అరగన్నుల జంకించి యానలు వెట్టితిని

చ. 3: వొడివట్టి తీసి నీవు వొడఁబరచినా నేను
విడుమని కాతరాన వేసారుకొంటి
అడరి శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁగూడితివి
తొడిఁబడ నిన్ను రతి దొమ్మి సేసితిని

రేకు: 1737-05 సాళంగనాట సం: 27-221

పల్లవి: మీఁటితే వారికెదురా మీఁదుఁగిందు నెంచికాక
ఆఁటదయ్యాఁ జుమ్మీ తాను ఆడనేలున్నాఁడే

చ. 1: తానేమి సేసీనే లోన, తరుణులు వాకిటను
కానుకలు దెచ్చుకొని కాచుకుండఁగా
లోనికేవత్తురు వారు లోకులు మెచ్చవలసి
మానవతులు గనక మట్టున నున్నారు

చ. 2: చప్పుడేమిసేసీనే సతులెల్ల దనచేత
కప్పురపు నోళ్ల నాడఁ గాచుకుండఁగా
వుప్పతించనేరరా వూరెల్ల మెచ్చవలసి
ముప్పిరి నిల్లాండ్లుగాన మోమోట నున్నారు

చ. 3: నన్నేలొడఁబరచీనే నాతులెల్లా గుంపుగట్టి
కన్నెపాయా లొప్పగించఁ గాచుకుండఁగా
నన్నుఁగూడె శ్రీ వేంకటనాయకుఁడు నే మెచ్చఁగా
చన్నుల తామునుఁ గూడి సమ్మతించున్నారు

రేకు: 1737-06 పాడి సం: 27-222

పల్లవి: ఎఱఁగవు నామనసు యెట్టిదౌతా నింకాను
తెఱవ నింతే నీతో దీకొనేనా

చ. 1: వేసాలో నిజమో వేడుకొనే విటు నన్ను
ఆసపడేదాన నీతో నలిగేనా
పాసివున్నవాఁడవై పలుమారూఁబొదిగేవు
వీసమంత పనికిఁగా విసిగేనా

చ. 2: చలమో బత్తిగలిగో చాఁచేవు నాపయిఁజేయి
వలచినదాన నేను వద్దనేనా
యెలయించినవాఁడవై యిచ్చకాలు సేసేవు
పెలుచుఁ బనికిఁగాను బిగిసేనా

చ. 3: నగవులో తగవుల నన్ను నిట్టె కూడితివి
మొగమోటదాన నేను మొఱఁగేనా
పొగరు శ్రీ వేంకటేశ బొంకి యాన వెట్టేవు
తగిన పనికిఁగాను తమకించేన

రేకు: 1738-01 సాళంగనాట సం: 27-223

పల్లవి: నేరుపులు పచరించ నే నీతోనా
ఆరితేరిన పనుల కమ్మరో నీతోనా

చ. 1: దిట్టవై మాటలాడేవు తెలుపుమంటా వచ్చేవు
నెట్టన జగడాలకు నే నీతోనా
పట్టిన చలముతో యీ పనులకే తిరిగేవు
మట్టుమీరి మాటలాడ మరి నీతోనా

చ. 2: పన్ని విందు లడిగేవు పంతములాడ వచ్చేవు
నిన్ను రమ్మని పిలువ నే నీతోనా
ఇన్నేసి నేరకుండితే యింతవాఁడవేలయ్యేవు
సన్నల నే నవ్వు నవ్వ సరి నీతోనా

చ. 3: బద్దులకుఁ బవళించి పాదాలు గుద్దుమనేవు
నిద్దుర వట్టించ నేఁడు నే నీతోనా
గద్దరి శ్రీ వేంకటేశ కాఁగిటఁ గూడితి నన్ను
కొద్దిమీరి రతుల దీకొన నీతోనా

రేకు: 1738-02 సింధురామక్రియ సం: 27-224

పల్లవి: వేగిర మేఁటికి నాకు వేయైనాను
చేగదేర నీవే దయసేసేవు గాక

చ. 1: పంతాలు నీతో నేను పచారించే దానవా
పొంతవుఁ జూపులఁ జూచి గుడిసేఁ గాక
వంతులు నే నాడేనా వలపులు చల్లఁగాను
చెంతల నీవే దయ సేసేవు గాక

చ. 2: చెనకితే నీకు మారు చేయి చాఁచేదానవా
కొనగోరి తాఁకులను కొసరేఁగాక
పెనఁగేనా నీతోను ప్రేమములు నీమీఁద
చినుకఁగా నీవే దయసేసేవు గాక

చ. 3: మిక్కిలి నీ రతులను మీరేటి దానవా
వొక్కటై ముయికిముయి వొప్పించే గాక
వెక్కసాలాడేనా శ్రీ వేంకటేశ నిన్నుఁ గూడి
చెక్కు నొక్కఁగాను దయ సేసేవు గాక

రేకు: 1738-03 పూర్వగౌళ సం: 27-225

పల్లవి: సటకాఁడు మిక్కిలిని సరసుఁ డీతఁ డిన్నిటా
తటుకన వలపించి దక్కించుకొనవే

చ. 1: సిగ్గులు వడకువే చెఱగువట్టీ నతఁడు
అగ్గలపువట్టి జాగు అదియూఁ గొంత
వొగ్గి యాతని మెల్లనే వొత్తుక వచ్చితి మిందు
వెగ్గళించి నీ యిల్లిఁక వెళ్లఁగ నియ్యకువే

చ. 2: నవ్వులు నవ్వకువే ననుపు సేసీ నతఁడు
అవ్వల నీ తరితీపు అదియూఁ గొంత
యెవ్వరు నెఱఁగకుండా నెలయించి తెచ్చితిమి
పవ్వళించే యింటిలోన బాస సేయించుకోవే

చ. 3: తలవంచుకోకువే దగ్గరనున్నాఁ డతఁడు
అలసివుండిన భావ మదియూఁ గొంత
యెలమి శ్రీ వేంకటేశు నిటు గూర్చితి నే నిన్ను
మలసి నీ కాఁగిటనే మరిగించుకొనవే

రేకు: 1738-04 మంగళ కౌసిక సం: 27-226

పల్లవి: కపటము లిఁకనేలే కన్ను లెదుట నున్నాఁడు
నెపములు వేసి యెంత నీటు చూపేవే

చ. 1: మంతనాలు గొంతవడి మాటలనుఁ గొంతవడి
యెంతవడి వట్టి జాగు లేమి సేసేవే
వంతుకు నాతఁడు వచ్చి వద్దఁ గాచుకున్నవాఁడు
కొంతపుఁ జూపులనేల కొచ్చి చూచేవే

చ. 2: నవ్వులనే కొంతవడి నటనలఁ గొంతవడి
యెవ్వతె మాటలు వింటి విది యేఁటిదే
బువ్వాన నాతఁడు నిన్ను బోంసేతము రమ్మంటే
పువ్వులవాటులనేల పూఁచి వేసేవే

చ. 3: సిగ్గులనే కొంతవడి సింగారాలఁ గొంతవడి
యెగ్గులుఁ దప్పులుఁ బట్ట నిందులో నేదే
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డాతఁడే తా నిన్నుఁగూడె
వెగ్గళించి మటీ నేల విఱ్ఱవీఁగేవే

రేకు: 1738-05 పాడి సం: 27-227

పల్లవి: ఏడ సుద్ది నన్నుఁ జూచి యేల కొంకేవు
ఆడా నీడా నిన్నొరయ నంకకత్తెనా

చ. 1: యిచ్చక మాడేదాన యెగ్గులు వట్టేనా
విచ్చన విడుల మీకు వెఱపేఁటికి
చెచ్చెర నింకా నీవు సేసినట్టె సేతుగాక
పచ్చి తిట్టు దిట్ట నీతో పంతగత్తెనా

చ. 2: లోనైవుండినదాన లోఁగి రట్టు సేసేనా
పేనిపట్టి మాఁట మఱపించనేఁటికి
నేనీడనుండఁగానే నీవే మన్నింతువుగాక
ఆనవెట్టి పెనఁగ నే నాసకత్తెనా

చ. 3: గక్కనఁ గూడినదాన కడమ వెట్టేనా
చెక్కు చేతితోడనీకుఁ జింత యేఁటికి
యిక్కడ శ్రీ వేంకటేశ యిరవై వుందువుగాక
పెక్కు బుద్దిచెప్ప నీకుఁ బెల్లి కత్తెనా

రేకు: 1738-06 నాదరామక్రియ సం: 27-228

పల్లవి: ఏమనినా నవ్వుదురు యిరుగుపొరుగువారు
తామసించఁ బనిలేదు తగులాయఁ బనులు

చ. 1: తెగువలేఁటికి పని తేటతెల్లమైనమీఁద
నగవులేకాక నాకు నీకు
మొగములు చూచితిమి మొక్కులునుఁజేకొంటిమి
తగునిఁక జెప్పవయ్య తలవాతి పనులు

చ. 2: చెంచలము లేమిటి కిచ్చటఁ జేతికి లోనైతే
మంచివే కాక మనమాటలెల్లాను
మంచమెక్కితిమి తెరమఱుగును వేసితిమి
యెంచనేమున్నది మరి యిటమీఁది పనులు

చ. 3: కనుసన్న లేమిటికి కాఁగిటఁ గూడియుండఁగ
మనసులేకమే మనకు నేఁడు
ననిచే శ్రీ వేంకటేశ నమ్మికలు చేకొంటిమి
కొనలుసాగేమే యీ కూడినట్టి పనులు

రేకు: 1739-01 పాడి సం: 27-229

పల్లవి: ఇరుమొనసూదివైతి వేమందు నిన్ను
తొరలీ సిగ్గులు నీ దొరతనము చూచి

చ. 1: చిగురువంటిమోవిని చేవదేరేవలపులు
మగువ నీకుఁజూపీ మాటలలోనె
తగిలే వప్పటి నన్ను తల రాయి సేసుకొని
నగవు వచ్చీ నాకు నన్ను నిన్నుఁజూచి

చ. 2: పువ్వులవంటి చేతుల పూఁపలవంటి వయసు
జవ్వని నీకుఁ జూపీ సన్నలలోనె
రవ్వగా నన్ను నంటేవు రాజసము చేసుకొని
నివ్వెరగయ్యీ నాకు నీ గుణము చూచి

చ. 3: చక్కెరవంటి మేనఁ జందమామ గుటుకలు
గక్కన నీకింతి చూపీ కాఁగిటిలోన
యెక్కువ శ్రీ వేంకటేశ యిటు నన్నుఁగూడితివి
నెక్కొని వేడుకపుట్టీ నీరతులు చూచి

రేకు: 1739-02 హిజ్జిజి సం: 27-230

పల్లవి: ఇంతకు నోపుదుమా ఇయ్యకొనఁగలమా
బంతులను వలపులు పచ్చివెచ్చై వుండును

చ. 1: తెరమఱఁగు మాటలు తీపులు దంపతులకు
గరిసించి యడిగితే గసిగట్టును
దొరవు నీతోడిపొందు తొలుతనే ప్రియములు
గెరసుదాటితేనే గిజిగిజై తోఁచును

చ. 2: మూఁకలోని నగవులు ముంగిటిపైఁడై వుండు
కాఁకలు వుట్టించఁబోతే కసుగందును
ఆఁకల నీఅడియాస అండనుంటే దమిరేఁచు
చీఁకటివడితే నదె చిందువందై జారును

చ. 3: పెండిలిలో పెనఁగులు ప్రియములై కడు మించు
గండి గడిచితే నది కలఇకౌను
కొండలౌ శ్రీ వేంకటేశ కూడిన నీనారతులు
చండియై కొసరఁబోతే సదమదమౌను

రేకు: 1739-03 బౌళి సం: 27-231

పల్లవి: ఇందుకే పో నిన్ను దూరే దెప్పుడు నోయి
దిందుపడ నీగుణాలు తెలుసుకో వోఇ

చ. 1: చెట్టవట్టి తియ్యఁగాను చేసన్న సేయఁగాను
వట్టి పరాకులు నేఁడు వలదోయి
నెట్టన నే నవ్వఁగాను నేరుపులు చూపఁగాను
కట్టగడ వారితోడి కత లేలోయి

చ. 2: చెక్కులు నే నొక్కఁగాను చిగురుమో వియ్యఁగాను
యెక్కడ చూచేవు చిత్తమెందున్నదోఇ
మొక్కులు నే మొక్కఁగాను మోహములుచల్లఁగాను
మక్కళించి చెలులతో మాటలేఁటికోయి

చ. 3: కమ్మర జంకించఁగాను కాఁగిలించుకొనఁగాను
యెమ్మెలునేతులు నింకా నేఁటికోఇ
నెమ్మది శ్రీ వేంకటేశ నీవే నన్నుఁగూడితివి
చిమ్ముల నావయసు నీచేతిది గదోయి

రేకు: 1739-04 సౌరాష్ట్రం సం: 27-232

పల్లవి: సంగడిఁ గూచుండ నీ సరివారమా
చెంగట నున్నాఁడవు నీ చిత్తమింతేకాక

చ. 1: కాంతలము నేము నీతో కాఁతాళించేవారమా
పంతములిచ్చిన మీఁదఁ బగలేఁటికి
కొంతపుఁ జూపుల జూచి గోలదాన నేమిసేసే
రంతుల విభుఁడవు నీరపమింతేకాక

చ. 2: కోమలుల మిటు నిన్ను కొసరేటివారమా
చేముట్టి మొక్కిన మీద సిగ్గులేఁటికి
మోము వంచుకొని నిన్ను ముద్దరాల నేమి సేసే
కోమలపువాఁడవు నీగుణ మింతే కాక

చ. 3: వనితల మిటు నిన్ను వడిఁబెట్టేవారమా
చనవు చేకొన్నమీఁద సడియేఁటికి
యెనసితివి శ్రీ వేంకటేశ నన్నింతటిలోనె
ఘనుఁడవు నీ వలపు కడు మించెఁగాక

రేకు: 1739-05 వరాళి సం: 27-233

పల్లవి: ఇందాఁకా రావైతివంటా యేల గరిసించేవే
మందెమేలమేల మంచిమాట లాడవే

చ. 1: వంకలాడవలెఁగాక వలచిన పతితోడ
అంకకత్తెవలెనేల అఱ్ఱదిమేవే
మంకులాడఁదగునా మగవానితోడ నీకు
కంకణాల చేత నిట్టె కాఁగిలించవే

చ. 2: చేరి నవ్వవలెఁగాక సిగ్గువడ్డ పతితోడ
తేరకత్తెవలెనేల తేలనాడేవే
బీరము చూపఁదగునా ప్రియునిముందట నీకు
గోరికొన కొంత సోఁక కొంగువట్టి తియ్యవే

చ. 3: చెక్కు నొక్కవలెఁగాక శ్రీ వేంకటపతితోడ
పుక్కటికత్తెవై యేల పొంచుకుండేవే
వొక్కటై యాతఁడు నిన్ను వురమునఁబెట్టుకొనె
దక్కఁగొని మదనముద్రలు నించవే

రేకు: 1739-06 లలిత సం: 27-234

పల్లవి: ఉండనుండఁ జవులౌను పువిదల వలపులు
మెండుగ నాపె నీతో మేలమాడీఁ గాని

చ. 1: పలుకకకుండఁగ నీతోఁ బంతమా ఆపె కేమి
తలపోఁత పరాకునఁ దగిలున్నది
బలిమికాఁడవు నీవు పట్టి పెనఁగఁగరాదా
మలసి యాపె నీతో మాఁటలాడీఁగాని

చ. 2: యెదురుకొనక నీతో నెమ్మెలా యాపెకేమి
వుదుటు మదమునను వోలలాడీని
చదురుకాఁడవు నీవు చనవులియ్యఁగరాదా
పొదిగి యాపె నీతో భోగించీఁగాని

చ. 3: సేవలు సేయక నీతో సిగ్గులా ఆపెకేమి
నీవిధాలు దెలుసుకో నిలుచున్నది
భావించి శ్రీ వేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
వేవేలుగా నాపై నిన్ను వెలయించీఁగాని

రేకు: 1740-01 సామంతము సం: 27-235

పల్లవి: ఎవ్వరికి నేమి వోదు యెదురాడేమా
నివ్వటిల్లఁ జేసేవారు నీవారే సుమ్మీ

చ. 1: నగవులు నీమాటలు నన్ను నేమి యడిగేవు
తగిలితేఁ జెప్పేరు యీతరుణులే
యెగసక్కెములు గావు యియ్యకోలు సేసే నింతే
నెగులుదీరిచేవారు నీవారే సుమ్మీ

చ. 2: నాటకాలు నీచేఁతలు నామోమే చూచేవు
పాటించితే తెలిపే రీపడఁతులే
యీటు వెట్టుకొన నీతో యింతా విచారించే నింతే
నీటున నడపేవారు నీవారే సుమ్మీ

చ. 3: నమ్మిౕతి నీపొందు లివె నాకేల బాస సేసేవు
సమ్మతించితే మెచ్చే రీసవతులే
కమ్ముక శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
నెమ్మదిఁ బొగడేవారు నీవారే సుమ్మీ

రేకు: 1740-02 ఆహిరి సం: 27-236

పల్లవి: ఎంత నీవు సేసినా నేనేల మానేన
పంతములు నెరపి నేఁ బైకొనేనంటాను

చ. 1: నెట్టన మొక్కులు మొక్క నేరుచుకుంటివి నీవు
తిట్టులు దిట్టి యేమైనాఁ దెలిపేనంటా
చుట్టమవై నాతోనే సుద్దులు చెప్పేవు నీవు
జట్టిగా నిన్ను జంకించి సాదించేనంటాను

చ. 2: వినయాలు చూపి నాతో వేసాలు సేసేవు నీవు
ననుపు నీచేఁతలకు నవ్వేనంటా
మనసు నమ్మినదాఁకా మందులు నూరేవు నీవు
పెనఁగి నేనిట్లానే చెల్లించే నంటాను

చ. 3: నిలువునఁ గాఁగిలించి నివ్వెరగందేవు నీవు
తలపించి నీ గుణాలు తడవే నంటా
అలర శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
చెలరేఁగి నిన్ను రట్టుసేసే నంటాను

రేకు: 1740-03 కాంబోది సం: 27-237

పల్లవి: సిగ్గులు విడుతురా చెల్లఁబో యెంతైనా
బగ్గన నన్నియు నేఁడు బాయిటనే పడెఁగా

చ. 1: మంతనాన నీవు నేను మాటలాడినసుద్దులు
అంతయు నాపె చెప్పీ నది యేఁటికి
వింతచుట్టా లిటు నీకు వేరే యెంత గలిగిన
పొంతనే రతులలోని భోగాలు చెప్పుదురా

చ. 2: మొక్కలాన నీకు నేను ముడిచినపువ్వులు
వొక్కట నాపె కొప్పులో నుండ నేఁటికి
తక్కక నీకు వేరే దాఁపిరము గలిగితే
వుక్కున నొకరి యెంగి లొకరికి నిత్తురా

చ. 3: కందువ మనయిద్దరి కాఁగిటి పరిమళము
అందమై యాపె చన్నుల నంటఁదగునా
యిందుకుఁగా శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
పొందుల సతులనెల్లా పొత్తు గలపుదురా

రేకు: 1740-04 ముఖారి సం: 27-238

పల్లవి: ఏమిటికయ్యు నీవు నన్నేల నిష్ఠూరిఁ జేసేవు
చేముట్టి నీపాదాల సేవ సేసే దానను

చ. 1: ఆపెవద్ద నుండఁగా అద్దలించనోపుదునా
దాపులను మొగమోటదాన నేను
కోపమెంత గలిగినా గురి నీపైఁ జూపుదువా
తీపుగా నీకు నామోవితేనె వూసేదానను

చ. 2: ఇంతి నిన్నుఁ గూడుండఁగ యెడరు నేఁ జేతునా
చెంత దోసాలకు వెఱచినదానను
పంతపుదాన నేనైతే బలిమి నీకు జూపేనా
యెంతైన నీవద్ద నిచ్చలాడేదానను

చ. 3: సవతై యింట నుండఁగ జగడాలడుతునా
కవగూడి బలఁగము గలదానను
ఇవల శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁ గలసితి
తవిలి నీకు నిట్టె తమకించేదానను

రేకు: 1740-05 తెలుఁగుఁ గాంబోది సం: 27-239

పల్లవి: ఏమిసేసినా నీచిత్త మింతయు నాభాగ్యము
వేమరు నీతో పొందు విడువలేఁ జుమ్మీ

చ. 1: కలరు పదారువేలు కాంతలు తొల్లె నీకు
వెలయ నేనలిగితే వెఱచేవా
నెలవై నాకైతేను నీవే యేడుగడయు
మలసి నీతో పొందు మానలేదు సుమ్మీ

చ. 2: చేరి నిన్ను గొల్లెతలు సిగ్గులెల్లా విడిచిరి
వారియాస గద్దు నాచేవాటు వడేవా
కోరిన కోరికకు గుఱుతు నీవే నాకు
భారపడి నిమిషముఁ బాయలేను సుమ్మీ

చ. 3: యిందిరయు భూసతియు నిరువంక నున్నవారు
చెంది నే దూరిన దూరు చెవిఁ బెట్టేవా
కందువ శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
నిందవేసి ఇఁక నిన్ను నేర మెంచఁజుమ్మీ

రేకు: 1740-06 పళపంజరం సం: 27-240

పల్లవి: ఎవ్వరేమి బోదింతురో యెఱఁగ నేను
పువ్వువలె నన్నుఁ బొందేవు పుణ్యము నీచేతిది

చ. 1: తరుణులలో నిన్ను తగవులఁ బెట్ట నోప
వొరసి నిన్ను మెప్పించనోపుదుఁ గాని
నెరతనీఁడవు నీవు నేరనిదాన నేను
పొరసి నన్ను నడపే పుణ్యము నీచేతిది

చ. 2: వుక్కుమీరి నిన్నుఁ గడునొత్తి మాఁటలాడనోప
వొక్కటైతే నొడఁబడనోపుదుఁ గాని
నిక్కి నీవు అట్టడివి నేనైతే గోలదాన
పుక్కట గాక మన్నించే పుణ్యము నీచేతిది

చ. 3: పలుమారు నీతోను పంతము లాడఁగనోప
వొలసి ప్రియము చెప్పనోపుదుఁగాని
యెలమి శ్రీ వేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
పొలసి నన్ను రక్షించే పుణ్యము నీచేతిది

రేకు: 1741-01 దేసాళం సం: 27-241

పల్లవి: మాతోనే యాడఁగరాదా మాటలేమి గలిగినా
యేతులు నెమ్మెలు సారె నిఁక నేఁటికి

చ. 1: పంతము నీ కీడేరె భ్రమసితి నిన్నుఁ జూచి
మంతన మాపెతో నింకా మరి యేఁటికి
చెంత నీ చేఇ మీఁదాయ చేయెత్తి నీకు మొక్కితి
ఇంతకంటె నవ్వు నేఁ డింకా నేఁటికి

చ. 2: కోరినట్టె ఆయ నీకు కొలువుదాన నేనైతి
యీరీతి నాపెతో సన్న లిఁక నేఁటికి
నేరుపరి వౌదువు నేనింత యెఱఁగనైతి
యేరా ఆపె మోము చూచే విఁక నేఁటికి

చ. 3: మెప్పించుకొంటివి నీవు మేలుదాన నైతి నేను
యెప్పటి కెప్పటి యాన లిఁక నేఁటికి
తప్పక శ్రీ వేంకటేశ తగ నన్నుఁ గూడితివి
యిప్పుడే వినయములు ఇఁక నేఁటికి

రేకు: 1741-02 వరాళి సం: 27-242

పల్లవి: ఉన్నవారిఁ దడవేనా వూరకె నేను
పన్ని యిట్టె తలపోసి భావించుకోవయ్యా

చ. 1: నీ యింతిపైఁ గోపించుట నీమీఁది వల పది
ఆయెడ వారిఁ దిట్టుట అది నీనుతి
చేయెత్తి సేసినచేఁత చెక్కులు నీకు నొక్కుట
పాయపు విభుఁడ ఇట్టె భావించుకోవయ్యా

చ. 2: వెంగెము నీసతి నాడుట వేడుక నీమీఁదిది
కంగి యాపె కలుగుట కైకొంట నిన్ను
కొంగువట్టి తీసుటెల్లా కూరుములే కొసరుట
పంగెన గా దిపు డిట్టె భావించుకోవయ్యా

చ. 3: సారె నీకాంత దూరుట సమ్మతి నిన్నుఁ జేసుట
వారిఁ దప్పకచూచుట వాడికె నీది
యీరీతి శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
భారము వేసుటగాదు భావించుకోవయ్యా

రేకు: 1741-03 ఆహిరి సం: 27-243

పల్లవి: ముందరెరిగి బదుకుమోహపుదాన నేను
సందడి జాణతనాలు చాలుఁజాలు నీకను

చ. 1: జగడాలదాననా సరసపుదానఁ గాక
యెగసక్కే లింతులచే నే లాడించేవు
నగినట్లనే వుండు నాట దా కొనగోరు
వొగరులు మాతోడ వొద్దు వొద్దు నీకు

చ. 2: పంతములదాననా పైకొనేటిదానఁ గాక
వంతులేల పెట్టేవు వాసు లెక్కించి
కాంతుఁడ ముదిరితేను కలియే మేడిదె గాదా
వింత గుణములు ఇఁక విడు విడు నీవు

చ. 3: అలుకలదాననా నెయ్యపుదాన నేఁ గాక
పలుకుల నన్ను నేల భ్రమయించేవు
యెలమి శ్రీ వేంకటేశ యెనసితి మిఁక నుప్పు
యిలఁ జిందితే రెట్టించు యేల జోలి మనకు

రేకు: 1741-04 దేసాళం సం: 27-244

పల్లవి: అపుడే లోనైతి నీతో నడ్డమాడేనా నీ
రసమాయ మమ్ము నిఁక రవ్వసేయనేఁటికి

చ. 1: మనసొక్కటైతేఁ జాలు మాట లెట్టున్నా నేమి
కొనమొదలేల దిద్దుకొనేవు నీవు
పెనఁగి చూచితి నీతో ప్రియము చెప్పిఁ జూచితి
వెనకటి సుద్దులకు వేఁడుకొన నేఁటికి

చ. 2: ప్రియముగలితేఁ జాలు బిరుదులాడితే నేమి
క్రియెటిఁగి ఇఁకనేల కిందుపడేవు
దయతోడ నుండితి నీదంటతనాన నుండితి
నియతపు నీసత్యాలు నెరపఁగ నేఁటికి

చ. 3: కూటమి గలితేఁ జాలు కొసరితేఁ దప్పేమి
మూటగట్టి మాకునేల మొక్కేవు నీవు
గాటపు శ్రీ వేంకటేశ కలసితి మెలసితి
పాటించి నీ బాసలు పచరించనేఁటికి

రేకు: 1741-05 ఆహిరినాట సం: 27-245

పల్లవి: ఏమనేము నిన్నిఁక యెంత సేసినా
నేమపువారము నేము నీచిత్తము కొలఁది

చ. 1: మగిడి మగిడి నీతో మాఁటలాడఁగాను నీకు
మొగచాటాయనేమో మోహము నాపై
యెగసక్కేలకు నాతో యెక్కడో వారి సుద్దులు
నిగిడి యానతిచ్చేవు నీచిత్తము కొలఁది

చ. 2: చనవు సేసుక యిట్టె సరసమాడఁగ నీకు
తనిసితి వేమో నాతో తమకముల
పనిమాలిన పనికి పరులసొమ్ములు దెచ్చి
నినువుగా నాకిచ్చేవు నీచిత్తము కొలఁది

చ. 3: యెరవు లేక నేను యిచ్చకాలాడఁగ నీకు
తరితీపు పుట్టెనేమో తతిరతికి
యిరవై శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నెరులాపెఁ బోలిచేవు నీచిత్తము కొలఁది

రేకు: 1741-06 మాళవిగౌళ సం: 27-246

పల్లవి: సరసుఁడ విన్నిటాను చలమేఁటికి
యెరపరికములేల యియ్యకొనరాదా

చ. 1: చేయెత్తి మొక్కితి నిన్నుఁ జెనకిన చేఁతలకు
వాయెత్తి పాడితి నీతో వాదు దీరను
యీయెడ నింకా నీకు నేమి సేయవలె నేను
మాయకాఁడ అలుగక మాటలాడవయ్యా

చ. 2: నవ్వులు నవ్వితి నీతో నానాటి యలపు దీర
పువ్వుల వేసితి సొలపులు దీరను
చివ్వన నింకా నీపైఁ జిత్త మెటువలె వచ్చు
రవ్వకాఁడ మాతోను రాయడించకువయ్యా

చ. 3: శిరసు వంచితి నీతో సిగ్గులు వడినందుకు
కరఁగించితిని నిన్ను కాఁక దీరను
దొరకె నారతి నీకు తుదమొదలే లేదు
నిరతి శ్రీ వేంకటేశ నేరుపు చెల్లునయ్యా

రేకు: 1742-01 శంకరాభరణం సం: 27-247

పల్లవి: ఊరకే నే గుట్టు సేసుకున్నదానఁ గాక నేఁడు
తేరి తప్పక చూచితే దిష్టము గాదా

చ. 1: మొగము చూచితే నీవు మొక్కేవు । నాకు
నగవు వచ్చీ నీ నయములకు
వొగరుతో నీవు వుండేవునికికిని । నిన్ను
తగవులఁ బెట్టితేను తప్పు మోవదా

చ. 2: చేయివట్టి తీసితేనే సిగ్గువడేవు । నా
కాయము చెమరించీ నీకతలకును
ఆయముగా నీవు వెట్టే యానలకును । యిట్టె
చాయల దీకొంటేను చలమే కదా

చ. 3: కోరి నిన్నుఁ బిలిచితే కొసరేవు నాకు
తారుకాణ లాయను నీతలఁ పెల్లాను
కూరిమి శ్రీ వేంకటేశ కూడితివి నన్ను
నేరుపుల మెచ్చితేను నీవే నేఁ గానా

రేకు: 1742-02 నట్టనారాయణి సం: 27-248

పల్లవి: చూడుమా నీవెఱఁగని సుద్దు లున్నవా
యేడ నున్నదో నీచిత్త మేమందు నీతోను

చ. 1: నగరాదు నీతోను నన్ను నిది యేఁటికని
అగడుగాఁ జెప్పుమంటా నానవెట్టేవు
నిగిడి నీభావము నీకు నీకే తెలుసుకో
యెగసక్కేలాడ నేర యేమందు నీతోను

చ.2: కన్ను సన్న సేయరాదు కాంతలతో నది నీకు
విన్నవించుమని నన్ను వేఁడుకొనేవు
యిన్నియు నీవే యడుగు ఇరుఁగు పొరుగువారి
యెన్ననేర నీగుణాలు యేమందు నీతోను

చ. 3: చంగనఁ బొగడరాదు సారె సారె నన్ను నీవు
వెంగెమో నిజమో యంటా విచారించేవు
చెంగటఁ గూడితి విట్టె శ్రీ వేంకటేశ నన్ను
యింగితా లలమేల్మంగ నేమందు నీతోను

రేకు: 1742-03 సామంతం సం: 27-249

పల్లవి: అడవి చెంచెతలము అంతేసి నేరము
నడుమ నీగోపికను నవ్వకుండేరా

చ. 1: పచ్చికస్తూరి గమ్మెట్టు పారిటాకు చీరపట్టు
బచ్చెన పసిఁడి కాకిపైఁడి బొట్టు
వచ్చితివి వలచి మావాకిటికి నీవు నేఁడు
నచ్చులఁ బురసతులు నవ్వకుండేరా

చ. 2: చిన్ని పొదల మేడలు చిగురాకు గోడలు
మన్ను మెకములలోని మావాడలు
వున్నాఁడవు మావద్ద నొంటి చుట్టరికముల
నన్నే మెచ్చి నిన్నిందరు నవ్వకుండేరా

చ. 3: జుంటితేనె మాకూడు సొంపుమాఁకులు మాతోడు
పంట కోవిలపాట మా పలుకులీదు
వొంటరి శ్రీవేంకటేశ కూడితివి మమ్ము నేఁడు
నంటున గొల్లసతులు నవ్వకుండేరా

రేకు: 1742-04 కాంబోది సం: 27-250

పల్లవి: ఏమి నేరిచితివి యేడలేని సుద్దు లేల
వేమారు గొల్లెతలును విడిచిరి సిగ్గులు

చ. 1: తేనెలుట్టిపడ నీవు తియ్యనిమాట లాడేవు
నానఁ బెట్టేవు వలపు నయములనె
లోను గాకెట్టు మాను లోలత నీ చేఁతలకు
దీనికే పురసతులు తేలిరి నీవాగెకు

చ. 2: వెన్నెల రసాలు గార వేడుకకు నవ్వేవు
కన్నులనే తరితీపు గాదెఁ బోసేవు
కన్నవారు విన్నవారు కాకు గాక మానుదురా
మున్నిందుకే చుప్పనాఁతి మోహించె నీకును

చ. 3: పాలుగారే సిగ్గులను బంతికూళ్లు గుడిపేవు
కేలు సాఁచి మర్మాలంటె గిలిగించేవు
యీలీల శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
ఆలకించి కబ్జ నీకు నన్నిటా వలచెను

రేకు: 1742-05 సాళంగనాట సం: 27-251

పల్లవి: ఎట్టి దేవరవు నీవు యెంతటివాఁడవు మరి
యిట్టె మమ్ము నీవిఁక యేల తడవేవు

చ. 1: మచ్చరాలులేనివారి మాఁటలెల్లాఁ జక్కనే
యిచ్చగించి వినేవారి యింపు చక్కన
ముచ్చటలెనసినట్టి మోహమెల్లాఁ జక్కనే
యెచ్చినమా చక్కఁదనా లేల పొగడేవు

చ. 2: చనవు గలుగువారి చందాలెల్లాఁ జవులే
ననుపుగలుగుచోట నవ్వు చవులు
పెనఁగనేర్చిన చోటి బిగువెల్లాఁ జవులే
యెనసి మామోవి చవులేల యడిగేవు

చ. 3: ఆయాలు సోఁకినవారి ఆసలెల్లా మంచివే
పాయపువారలచేపట్టు మంచిది
వేయిటికి నన్నును శ్రీ వేంకటేశ కూడితివి
నీయెడ మామంచితనా లేమి చెప్పే దయ్యా

రేకు: 1742-06 శంకరాభరణం సం: 27-252

పల్లవి: ఎవ్వరిభాగ్యం బెట్టుండునో
జవ్వనభారము చలివేఁడాయ

చ. 1: తిరుగ నాపె నినుఁ దిట్టులు దిట్టఁగ
సరవుల నీకవి చవులాయ
గిరికొన నీకు మొక్కిన మా మొక్కులు
వెరవున నీకవి వెంగెము లాయ

చ. 2: తగులఁగఁ జెలి నిను తమ్మను వేయఁగ
నగవున నీకది నయమాయ
వొగి నే నప్పుడు వొసఁగిన కానుక
పగటున నీ కవి పంగెములాయ

చ. 3: పడతి నీమీదను పాదము వేయఁగ
యెడయని రతులకు నితవాయ
బడి శ్రీ వేంకటపతి నాకూటమి
తొడిఁబడ శుభముల దొంతరలాయ

రేకు: 1743-01 బౌళి సం: 27-253

పల్లవి: ఇద్దరము మనలోన నెగ్గు లేడవి
గద్దించకుమీ నిన్ను ఘాతలు సేసితిని

చ. 1: వాసులకే పెనఁగేము వలచి వలచి నీకు
వేసరుకోకు మెంతైనా విడువరాదు
నీసరిఁ గూచుండుదుము నీవిట్టె మన్నించఁగానే
దోసము లేదనుమీ నేఁ దొక్కితి నీపాదము

చ. 2: చనవులే నెరపేము సారెకును సారెకును
మనసు దియ్యకు పొందు మానఁగరాదు మనవులు చెప్పుదుము మాకుఁ బంపు సేయఁగాను
యెనసి కడుగుకో మోవెంగిలి సేసితిని

చ. 3: యెమ్మెలే పచరించేము యెరిఁగి యెరిఁగి నీతో
కుమ్మరించకుమీ సిగ్గు కొదువలేదు
దిమ్ముల శ్రీ వేంకటేశ తేరి నన్నుఁ గూడితివి
సమ్మతి నోరుచుకొమ్మీ చన్నుల నొత్తితిని

రేకు: 1743-02 పాడి సం: 27-254

పల్లవి: ఇటువంటి సుద్దులకు యెరిఁది సాకిరైవచ్చు
విటకుక్కితనాలెల్ల వెరగందిచూతుము

చ. 1: తగవెరిఁగినవాఁడు తానే కనక మరి
జగడాలు దిద్దీని సవతులకు
తెగువగలదొకతె తిట్టదాయ నందులోన
పెగడతనాలెల్లఁ బ్రియముతో విందుము

చ. 2: అంకెల నెడమాటలు ఆడనేరుచుఁ గనక
వంక లొత్తి కూరిచీని వనితలను
కొంకలేకందొకతైనా గొబ్బునఁ జైక మోపదాయ
బింకపు తనలావులు పేరుకొని మెత్తుము

చ. 3: మంతుకెక్కి యీ పనికి మాసటీఁడు తానె కన
పంతము లిప్పించీని పడఁతులకు
వింతఁగా నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁ డిట్టె వచ్చి
ఇంతవని ఇప్పుడైతే యీడేరింతుఁ బనులు

రేకు: 1743-03 గౌళ సం: 27-255

పల్లవి: ఎందు వోయే నే నీకు నెప్పుడుఁ గలదాననే
గొందివలపులు చల్లి కూడవయ్య ఆపెను

చ. 1: కాలుదొక్కి సేసవెట్టి కప్పురము నోటికిచ్చి
జాలిఁబడీ నాపె నీతో సారె సారెకు
ఆలకించ వింతటను ఆఁడుఁగొల నీకేల
కూళతనములు మాని కూడవయ్య ఆపెను

చ. 2: కొంగువట్టి కొప్పుదువ్వి గోరికొన దాఁకించి
అంగమిచ్చీ నాపె నిన్ను నంతా నింతాను
ఇంగితమేమి నెరఁగ వింతులగోడు నీకేల
గుంగిలి గేలిసేయక కూడవయ్య ఆపెను

చ. 3: నవ్వునవ్వి నమ్మికిచ్చి నయముల చవి చూపి
రవ్వసేసీ నాపె నిన్ను రారాఁపుల
యివ్వల శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
కువ్వలుగా రతికేలిఁ గూడవయ్య ఆపెను

రేకు: 1743-04 సామంతం సం: 27-256

పల్లవి: నే మేమన్నా వెంగెమౌను నీ చిత్తము
నీ మోహము ఆపె సొమ్ము నీ చిత్తము

చ. 1: మక్కువ నాపెను నీవు మన్నింతువని నేను
నిక్కల గంటిని యింక నీ చిత్తము
చెక్కు చేతితో నిన్నే చింతించి నీ రాకలకు
నిక్కిచూచీఁ బలుమారు నీ చిత్తము

చ. 2: గాఁటాన మీరిద్దరును కాలుదొక్కి పెండ్లాడఁగ
నీటు సకినములాయ నీచిత్తము
పాటించి లేకలు నీకుఁ బంపెఁ దన సఖులచే
నేఁటి వరుస సుద్దికి నీచిత్తము

చ. 3: వచ్చితివి వాకిటికి వనిత లోన నున్నది
నిచ్చ పొంతనాలు గూడె నీ చిత్తము
పచ్చిగా శ్రీ వేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
నెచ్చెలు లెల్లా మెచ్చిరి నీ చిత్తము

రేకు: 1743-05 ఆహిరినాట సం: 27-257

పల్లవి: ఔనే నేరుచుకొంటి వప్పుడే నీవు
మౌనాన నాతనితోడ మందెమేళమా

చ. 1: మంకుతోడి వొట్లు మాయదారితట్లు
యింకా విభునితోడ నేమిటికే
జంకించేవు బొమ్మలను జరసేవు కన్నులను
బింకమున నిందువంకఁ బెద్దరికమా

చ. 2: నయగారి మొక్కలు నాఁటకపునొక్కులు
ప్రియునితో నిప్పు డిట్టె పెంచనేఁటికే
దయఁజూడు మిప్పుడే తప్పులెంచకితని
రయమున నింతలోనే రాజసములా

చ. 3: చేవదేరే సిగ్గులు చిరునవ్వుముక్కులు
శ్రీ వేంకటేశ్వరు మీఁదఁ జిమ్మేవేమే
యీ వల నితఁడే కూడె యియ్యకోలుగా నిన్ను
భావించ నీకిది నేఁడు బలుపంతమా

రేకు: 1743-06 పాడి సం: 27-258

పల్లవి: ఇంతి గడుముద్దరాలు యిన్నిటా జాణవు నీవు
మంతుకెక్క మెల్లనె సమతుసేయరాదా

చ. 1: చిగురాకుఁబెదవిమీఁదఁ జేవ దేరీ నదె సిగ్గు
మొగము చూచితేనే మొక్కీఁజెలి
నగుదురా యింతలోనే నంటున నింత సేసితి
వెగటుమాఁటలఁబెట్టి వెడ్డు వెట్టరాదా

చ. 2: అద్దపుఁజెక్కుల మీఁద ఆము కవిసీఁ గళలు
వద్దికి రమ్మంటేఁ దలవంచీసతి
అద్దో పచ్చి సేతురా అన్నియు నీ మహిమలే
పెద్దరికములు సేసి పెనఁగఁగరాదా

చ.3: నిట్టూర్పుగములతో నిగ్గులుదేరీ రతి
గుట్టు బయలు సేసితే కొంకిఁగాంత
ఇట్టే శ్రీ వేంకటేశ యెనసితి నిద్దరును
నెట్టుకొని సంతోసాల నిండుకుండరాదా

రేకు: 1744-01 భైరవి సం: 27-259

పల్లవి: ఎంతవాఁడవు నిన్ను నెవ్వఁడెఱుఁగు
సంతసాలు సేసి మోవి చవి చూపరాదా

చ. 1: మనసెవ్వఁడెఱుఁగు నీమతక మెవ్వఁడెఱుఁగు
ఘనుఁడ నీచేఁతలే కనేముగాక
పెనఁగేవు రమ్మంటా ప్రియములు చెప్పేవు
ననుఁబాయనని ఇట్టె నమ్మించరాదా

చ. 2: గుఱుతెవ్వఁ డెఱుఁగు నీ గుణమెవ్వఁ డెఱుఁగును
మెఱసే నీసుద్దులకు మెచ్చేము గాక
చెఱఁగు వట్టుకొనేవు చెక్కులు నొక్కవచ్చేవు
మఱఁగుల నీ సిగ్గులు మరి చెప్పరాదా

చ. 3: వలపెవ్వఁ డెఱుఁగు నీ వాడికె యెవ్వఁడెఱుఁగు
కలసిన నీ రతియే కనేము గాక
బలిమి శ్రీ వేంకటేశ పై కొంటివి నన్ను నిట్టె
నలువంకవారు మెచ్చ నమ్మించరాదా

రేకు: 1744-02 ముఖారి సం: 27-260

పల్లవి: ఆతనికి నాలవైతే నౌదువు గాక
యేతులు నెమ్మెలు మాతో నేమిటికి యిపుడు

చ. 1: నెయ్యాన నే నాతనిపై నెరుసు వెదకితేను
చయ్యాటాలకు రానేలే సారెకు నీవు
నియ్యంత నేనేరనా నీవే బత్తిగలవా
పుయ్యక దూలతనాల పొరకునే ఇప్పుడు

చ. 2: కోరి వేడి నే నాతని గూరిమి గొసరితేను
ఆరీతి నీవిపుడేల అందుకొనేవే
యీరసము నాకున్నదా యింత నీవు చుట్టమవా
వీరుత్తరాలు మాతోను విడువవే ఇఁకను

చ. 3: శ్రీ వేంకటేశ్వరుని చేకొని నేఁ గూడితేను
కావలించి నీవేల కాఁతాళించేవే
భావించ నే నేరనా పంతగత్తెవా నీవు
పూవుకుఁ దుమ్మిదవలె పొదిగే వేమిటికే

రేకు: 1744-03 వరాళి సం: 27-261

పల్లవి: నీచేతఁగాని కాదు నెట్టన నీపనులెల్ల
వాచవి తన సుద్దులు వద్దనఁగరాదా

చ. 1: నాతోడి వరుసదా నాతోడి వంతులదా
యేతులకు నీతో మేల మేల ఆడీని
చేతులు నేఁ జాఁచినాను సిగ్గువడ నేరఁడు
పోతరపు మగఁడవు బుద్ధి చెప్పరాదా

చ. 2: నేనెంత దా నెంత నేరుపు దన కేడది
నానఁబెట్టి నీతో నేల నవ్వు నవ్వీని
సానఁబట్టి నేఁ జూచితే సన్నకు మేలెఱఁగదు
పూనుకవచ్చి నీవైనా బుద్ధి చెప్పరాదా

ch.3: పెండ్లాడినదా నిన్ను పేరటమాపె యింతే
యిండ్లు దా దొంగిచూడనిది యేఁటికి
కండ్లనే జంకించితి గక్కన శ్రీ వేంకటేశ
ఆండ్లుగల పతిని ఆపె ననరాదా

రేకు: 1744-04 దేవ గాంధారి సం: 27-262

పల్లవి: పట్టకు పట్టకు నన్ను బలిమి నీవు
చుట్టుకొని యింత మమ్ము సోఁకఁగ నేమిటికి

చ. 1: సిగ్గులు నెగ్గులకును శిరసువంపులు దాపు
కగ్గులేని చెక్కులకు కళలుదాపు
నిగ్గులాపెచన్నులకు నీమే నిదియెదాపు
దగ్గరి మాకైదండదాపులు నీకేఁటికి

చ. 2: జలజాక్షి వయసునకు జవ్వనమదమె దాపు
సొలసే సొలపులకు చూపులు దాపు
పలు సోఁకులకు నెల్ల పచ్చి నీమోవె దాపు
తల నిద్రకు మా తొడదాపులు నీకేఁటికే

చ. 3: ననుపులిన్నింటికి నీ నవ్వేటి నవ్వులు దాపు
కనుచూపులకు రతికందువ దాపు
యెనసి శ్రీ వేంకటేశ యీడ నన్నుఁగూడితివి
మనసిజ తంత్రాలు మా మంచముదా పేఁటికి

రేకు: 1744-05 శంకరాభరణం సం: 27-263

పల్లవి: ఇంక నీతలఁపులెట్లానో
మంకునకును నామనసు గొలుపదు

చ. 1: నగి సరసమాడ నాలుక సమకొను
జగడాలడువఁగ సమకొనదు
మొగము చూచితే మొక్కును చేదోయి
తెగువలకైతే తెమలదు నాకు

చ. 2: నయమున నా చూపు ననుచును నీపై
భయపరచఁగ మరి పైకొనదు
ప్రియమునఁ బెనఁగఁగ పెరుగును చనుఁగవ
చేయి వదలదు నీ చెలువపు రతిని

చ. 3: జంకించవు నిను సారెకు బొమ్మలు
పొంకపు సన్నకుఁ బొదలీని
అంకెల శ్రీ వేంకటాధిప కూడితి
కంకిగ నలయదు కాయం బిదివో

రేకు: 1744-06 తెలుఁగుఁగాంబోది సం: 27-264

పల్లవి: ఎంత వేడుకో యిది నీకు
కొంత చెలియ సిగ్గునఁ బొదలీని

చ. 1: వదనకమల మటు వంచుక నీతో
కదిసి మాఁటాడీఁ గలికి
పెదవులపయి నీవు పెంచిన చేఁతకు
కొదలుచు కడు సిగ్గునఁ బొదలీని

చ. 2: గక్కనఁ బయ్యద గప్పుక నీవద్ద
సుక్కుచు మెలఁగీ సుదతి
జక్కవ చన్నుల చంద్రుల నించఁగ
గుక్కుచు కడు సిగ్గునఁ బొదలీని

చ. 3: నిట్టూరుపులను నిలిపి నిలిపి నిను
గుట్టునఁ బొదిగీఁ గోమలి
యిట్టె శ్రీ వేంకటేశ నీ వెనయఁగ
గొట్టు గెలిచి సిగ్గునఁబొదలీని

రేకు: 1745-01 భూపాళం సం: 27-265

పల్లవి: వేరా నాకు నీకు వింతదాననా
సారె సారెకును నిన్ను సంతోషింతుఁగాక

చ. 1: బలిమి నీవు నన్నుఁ బచ్చి యెంతసేసినాను
చలము సాదించేనా జంకించేనా
నెలకొన్న విభుఁడవు నీకు నూడిగపు దాన
చలివాసి నీగుణాలు సారె మెత్తుఁగాక

చ. 2: సతినంటా నీవు నాతో జాణతనా లాడితేను
పతి మాటలాడేనా బాస గొనేనా
మితిమీరి నీకు నే మేనరికమైనదాన
యితవై నీ సుద్దులెల్లా నియ్యకొందుఁగాక

చ. 3: సిగ్గుదీర నీవు నాపై చేతు లెంత చాఁచినాను
వెగ్గళించేనా మరి వేసరేనా
యెగ్గులేక శ్రీ వేంకటేశ నీ కూటమిదాన
నిగ్గుల నీతోఁ జనవు నెరపుదుఁగాక

రేకు: 1745-02 దేవ గాంధారి సం: 27-266

పల్లవి: మరిగినమీఁద నయ్యా మనమెంచుకొన్నట్టై
కరి (ర) కరిఁ బెట్టకురే కడుఁగడు మీరు

చ. 1: తలఁచఁగఁ దలఁచఁగ తానే యీడకు విచ్చేసె
కలుచ పరచకురే కాంతలాల
నెలకొన్నరమణుని నేనే సాదించేఁగాని
అలరి యప్పటి మాఁటలాడకురే మీరు

చ. 2: మన మాడేమనఁగానే మాటలాతఁడే యాడె
మనసు విరుచకురే మగువలాల
వెనకముందరికెల్లా వేడుక సేసేఁగాని
చెనకి యాతని రట్టు సేయకురే మీరు

చ. 3: చెఱఁగు నేఁ బట్టఁగానే చేరి యాతఁడు కూడె
గుఱిగా దూరకురే కొమ్మలాల
తఱి శ్రీ వేంకటేశుఁడు తాను నేను నొక్కటే
యెఱుఁగు నన్నియు నేరా లెంచకురే మీరు

రేకు: 1745-03 ఆహిరి సం: 27-267

పల్లవి: ఇంతితో మాటాడవయ్య ఇఁక నేఁటికి
చెంతలఁ జెలి వుండితే సిగ్గు వొయ్యీనా

చ. 1: తేనెలు గారేటి మోవి తి ట్లాపెఁ(పె) దిట్టితేను
దానినే మగతనము తక్కువయ్యీనా
నానఁబెట్టి సెలవుల నవ్వులు నవ్వితేనేమి
కోనలనీ బిరుదుకు కొంచెమయ్యీనా

చ. 2: చేగలు దేరేటి గోర చెక్కు లాపె నొక్కితేను
సాగిన దొరతనము చవుకయ్యీనా
బాగుగ నీ పాదమునఁ దొక్కితేను
వేగిరపుఁ బంతానకు వెలితయ్యీనా

చ. 3: పాలుగారే చన్నులను పైకొని యాపె యొత్తితే
మేలిమి నీమనసెల్ల మెత్తనయ్యీనా
యీలీల శ్రీ వేంకటేశ యింతి నిన్నుఁ గూడెనిదె
ఆలరి నీ వలపులు అంగడికెక్కీనా

రేకు: 1745-04 కన్నడ గౌళ సం: 27-268

పల్లవి: నిక్కమైన మాబతుకు నీ చేతిదే
యెక్కడి కెక్కడ మమ్మునేల కొసరేవు

చ. 1: యిందు రమ్మని పిలువ యేలుకొన్న దాననా
మందటలాడి పెనఁగ మంకుదాననా
విందులు చెప్పఁగ నీకు వియ్యాల దాననా
యెందుదాన మమ్ము నీవు యేలకొసరేవు

చ. 2: అండఁ గాచుకుండేనంటే అద్దికపుదాననా
దుండగానఁ బట్టి తియ్య దొమ్మిదాననా
బండుగా నవ్వులు నవ్వ పల్లదపుదాననా
యెండలెల్లాఁ బాపితివి యేల కొసరేవు

చ. 3: సారె నీకు బుద్ది చెప్ప చదివించే దాననా
మేరలు మీరఁగ నీతో మేనదాననా
ఆరితేరి శ్రీ వేంకటాధిప నన్నుఁ గూడితే (తి)
యీరీతి మొక్కితి నన్ను యేల కొసరేవు

రేకు: 1745-05 వరాళి సం: 27-269

పల్లవి: నమ్మితి నీ మాటలకు నాయ మేలయ్యా
సమ్మతించిన పనికి సాకిరేలయ్యా

చ. 1: ముచ్చటలు నాడితిరి మొదలనే నవ్వితిరి
తచ్చనలు మాతోడఁ దగదయ్యా
నిచ్చ నిచ్చ నీగుణాలు నే నెఱఁగని వున్నవా
అచ్చులౌదు రిన్నిటాను ఆనలేలయ్యా

చ. 2: కను సన్న సేసితిరి కల్లలు నిజా లంటిరి
పిన్నదాన నాతోనేల పెనఁగేవయ్యా
పన్నిన నీ మాయలెల్లా బయలు నేఁ జేయనివా
నున్నని చెక్కులు మావి నొక్కకువయ్యా

చ. 3: యేకతాలు నాడితిరి ఇందరి మెప్పించితిరి
మాకు మీకు నింత యెడమాఁట లేలయ్యా
కైకొని శ్రీ వేంకటేశ కందువ నన్నుఁ గూడితి
రేక చిత్తమాయ మీరు ఇట్టె వుండరయ్యా

రేకు: 1745-06 బౌళి సం: 27-270

పల్లవి: ఏమి చెప్పే నిఁక మరి యెందు చూచినాఁ దెగదు
కోమలపు సతులకు గురియైనవాఁడవు

చ. 1: చేర నీవు రాకుండఁగ చెలులఁ గోపించేనంటే
దూరరానియట్టి బలుదొరవు నీవు
నేరక వలచితిని నేనే అనుకొనేనంటే
సారమైన మేల్లిచ్చి సతమైనవాఁడవు

చ. 2: మది నిన్నుఁ బాసి వుండి మరునిఁ దిట్టేనంటే
వదలని మహిమ దేవరపు నీవు
పదరి నేనైనా గొంత పరాకై వుండేనంటే
యెదలోనఁ బ్రాణమవై ఇరవైన వాఁడవు

చ.3: శిజాగు నీవు సేయఁగాను సవతుల ననేనంటే
భోగించనేర్చిన వల్లభుఁడవు నీవు
బాగుగ నిన్నుఁ గూడితి పంతములాడేనంటే
చేగలుదేరినయట్టి శ్రీ వేంకటేశుఁడవు

రేకు: 1746-01 మాళవిగౌళ సం: 27-271

పల్లవి: నీయందునే కంటిమి నెట్టుకొన్న మంకులెల్ల
వాయెత్తితేఁ గోరుగొనేవారు గలరా

చ. 1: పంతము లేమిటికే బలువుఁడాతఁడు నీకు
అంతట నింతటనుఁ బ్రియాలు చెప్పఁగా
బంతినే దయదలఁచి పాలుఁగూడుఁ బెట్టితేను
వంతులకు నోకిలించేవారు గలరా

చ. 2: కోపము లేమిటికే కోడెకాఁడతఁడు నీకు
చేపట్టి నవ్వులు నవ్వి చెక్కునొక్కఁగా
యేపుల నిధానము యెదురుకట్ల నుంటే
వైపుల మారుమోమయ్యేవారు గలరా

చ. 3: సిగ్గులు నీకేఁటికే శ్రీ వేంకటేశ్వరుఁడు
దగ్గరి కాఁగిటఁగూడి తమకించఁగా
వొగ్గిన రతులలోన వూరకైనా వలపులు
వగ్గరించి చవిగొనేవారు గలరా

రేకు: 1746-02 ఆహిరి సం: 27-272

పల్లవి: ఇందు నున్న దందూ నున్న దింతా మోహము
కందువలెల్లా నిండె ఘనమైన మోహము

చ. 1: కన్నుల నిన్నుఁ జూచి కాంక్షలు తనివొందవు
వున్నతి రెప్పలతుద నుంది మోహము
చన్నులను నిన్ను నొత్తి జవ్వనము తనివోదు
పన్ని వురమునందే పాదుకొనె మోహము

చ. 2: పాటించి మాటలాడి భావము తనివందదు
వోటలేక పెదవుల నుంది మోహము
చిటకానఁ జెనకియు చేతులును దనివోవు
వూటువ గూడి గోళ్లకొన నుంది మోహము

చ. 3: నిక్కి నీ సేవలు సేసి నిలువెల్లాఁ దనివోదు
వొక్కటై దేహముమీఁద నుంది మోహము
గుక్కక శ్రీ వేంకటేశ కూడి ఇంకాఁ దనివోదు
పెక్కురతి బంధాలఁ బెనఁగొనీ మోహము

రేకు: 1746-03 శ్రీరాగం సం: 27-273

పల్లవి: ఇచ్చకురాల నీకు నింత సే సేనా
అచ్చువలె నుండ నిన్ను నంత సే సేనా

చ. 1: తగవులఁబెట్టె నాపె తమకించి తిట్టె నాపె
యెగసక్కేన నేనైతే యింత సే సేనా
నగుతానే వద్దనుండి నాయము దీర్చితిఁగాక
అగపడ్డనిన్ను రట్టు అంత సే సేనా

చ. 2: సన్నలు సేసె నాపె చలము సాదించె నాపె
యెన్నికలుగా నిన్ను యింత సే సేనా
పన్ని నే నడుమ నిన్నుఁ బట్టుక వుండితిఁగాక
అన్నిటా నాపెకు లోనై అంత సే సేనా

చ.3: కఱకటిఁ బెట్టె నాపె కాఁగిలించుకొనె నాపె
యెఱవులు చూపి నిన్ను నంత సే సేనూ
వెఱపు తోడుతను శ్రీ వేంకటేశ నేఁగూడితి
అఱలేక చొక్కి నిన్ను నంత సే సేనా

రేకు: 1746-04 ఆహిరి సం: 27-274

పల్లవి: నేరుపరినైతే నాఁడే నిన్నిన్నిటా మెప్పించనా
వూరకే నే మొగమోడి నుందానఁ గాక

చ. 1: మంకుదాననైతే నిన్ను మాటలాడ నిత్తునా
బింకపు దాననైతేను పెచ్చు రేఁచనా
అంకకత్తెనైతే గోర నాయము లంటించనా
పొంక మెఱఁగక నిన్నుఁ బొదిగేఁగాక

చ. 2: పంతగత్తెనైతే నీకు బలుములు చూపనా
వింతదాననైతే నిన్ను వేసరించనా
జంతదానివలెనైతే చలము సాదించనా
అంతేసి నేరక నీకు నాలనైతిఁ గాక

చ. 3: కపటపు దాన నైతే కాఁకలను ముంచనా
కపురులదాననైతే గతి గూడనా
యిపుడె నన్నుఁ గూడితి వెరిఁగి శ్రీ వేంకటేశ
వుపమించి చూడక నే నొక్కటైతిఁ గాక

రేకు: 1746-05 రామక్రియ సం: 27-275

పల్లవి: ఏమి నవ్వేవే నామాట యిది నీవెఱఁగనిదా
చేముంచి పరులకుఁ జేసినదివో యెప్పుడు

చ. 1: చనవరి వౌదువే సతి నీవు పతికిని
పొనుఁగక నాపై బత్తి కుట్టించరాదా
యెనసి తమకుఁదామే యెవ్వరైనా బతికేరు
ఘనత నొరుల వుపకార మౌటే యెక్కుడు

చ. 2: నేరుపరి వౌదువే నీ విభుని మా ఇంటికి
కోరి వేఁడి తోడితెచ్చి కూడించరాదా
ఆరీతి తాము భోగించిన దెవ్వరెరుఁగుదురు
పేరడిగాఁ జుట్టాలకుఁ బెట్టినదే యెక్కుడు

చ. 3: బలుదాన వౌదువే పక్కన శ్రీ వేంకటేశు
గలయించిట్టే మేలు గలుగరాదా
వలవ నేరరా తాము వనితలు లోలోన
వలపారులకుఁ జవి వడ్డించుటే యెక్కుడు

రేకు: 1746-06 సాళంగం సం: 27-276

పల్లవి: నీ తలనే వేగెనా నెలంత యిది
యీతలఁ బతిమాఁటలు యియ్యకొనఁగదవే

చ. 1: తలపోఁత లెక్కుడైతే తమకము గనమౌను
బలిమిఁ గలిగితేను పంతము రేఁగు
చలములు మిగిలితే సాదింపులు కొనసాగు
వలచినవారి కిది వదలని సాజము

చ. 2: కాఁకలు దఱచయితే కనుచూపు వాఁడౌను
ఆఁకవిరహములైతే ఆసమించును
వేఁకమైన వయసైతే వెరపులన్నియుఁ బాసు
యేఁకట గలవారికి యెప్పుడును సాజము

చ.3: సిగ్గులు దఱచయితే సెలవుల నవ్వు నిండు
నెగ్గళించఁ జూచితేను వేడుక దక్కు
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డప్పుడే నిన్నిదె కూడె
దగ్గరిన చుట్టాలకు తప్పదు యీసాజము

రేకు: 1747-01 గౌళ సం: 27-277

పల్లవి: ఒద్ద నున్నా రదిగో వ్రూరి వారెల్లా
ముద్ద గట్టే ఆసలెల్లా మోఁపు గట్టుకోరాదా

చ. 1: పంతములు నీతోనా బలుములు నీతోనా
ఇంతటి దొరవు నీతో నేమనవచ్చు
కాంతలము మమ్ము నేల కడు రట్టు సే సేవు
దొంతి నున్న వలపులు తోడికి తియ్యరాదా

చ. 2: చలములు నీతోనా సాదింపులు నీతోనా
యెలమి దేవరవు నిన్నేమన వచ్చు
చెలులము మమ్మునేల సిగ్గులు వరపించేవు
వొలుగులువారీ నవ్వు వొడిగట్టుకోరాదా

చ. 3: దిట్టతనము నీతోనా దీమసము నీతోనా
ఇట్టె శ్రీ వేంకటేశ నిన్నేమన వచ్చు
మెట్టుక కూడితి వలమేలుమంగనైన నన్ను
జట్టి గొన్న వేడుకలు జాళెఁ బోసుకోరాదా

రేకు: 1747-02 సౌరాష్ట్రం సం: 27-278

పల్లవి: చెప్పినట్టల్లా నీకుఁ జేసేనయ్యా
తప్పులుఁ దారులు మరి తలఁచకువయ్యా

చ. 1: చెనకిన దాననై చేరి మొక్కే నదివో
మనసులో చలములు మానవయ్యా
పెనఁగినదాననై ప్రియము చెప్పే నేను
యెనలేని బీరములు ఇఁక నేలయ్యా

చ. 2: తిట్టిన నోరనే దీవించే నిదివో
రట్టు సేయ కిఁక నీ విట్టె రావయ్యా
పట్టిన పంతము మేనఁ బనిసేసె నిదివో
ఇట్టు నట్టు మారుమాఁట లిఁకనేలయ్యా

చ. 3: కడుఁ జాఁచిన చేతనే కాఁగిలించే నిదివో
నడుమఁ గూడితి విట్టె నవ్వవయ్యా
అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
సడిదీర బొందితిని సంతోసించవయ్యా

రేకు: 1747-03 లలిత సం: 27-279

పల్లవి: చూచినవారు నవ్వేరు సుదతి నిన్ను
నీచేత జారినకొప్పు నీవు ముడుచుకోవే

చ. 1: యెవ్వరి నేరుపులు యెవ్వరికి వచ్చీనే
నవ్వినవారి సొమ్మే నాయకుఁడు
నివ్వటిల్లే చెమటతో నీవేల వెంగెమాడేవే
దువ్వటము పయ్యెదను తుడుచుకోవే

చ. 2: తట్టువడ నీవేల తగవులు చెప్పేవే
నెట్టుకొన్నవారి సొమ్మే నిండు భోగాలు
నిట్టూర్పుగములతో నీవేల యలసేవు
వెట్ట దీర సురటిని విసరుకోవే

చ. 3: మందగించి నీవేల మచ్చికలు చూపేవే
కందువయివవారి సొమ్మే కాఁగిటి రతి
అంది శ్రీ వేంకటేశుఁడు అలమేలుమంగ నేను
పొందితిమి యిఁక నీవు బువ్వానకు రావే

రేకు: 1747-04 వరాళి సం: 27-280

పల్లవి: ఇందరికి నొకచాలే యీ సుద్దులు
సందడి వలపు మొగచాటు దోఁచీ నీకు

చ. 1: చలము సాదించేవారు సారెకు నవ్వుదురా
అలిగినవారు నీ యండ నుందురా
యెలమి గొడవలెల్ల యేల కక్కేవు మామీఁద
పిలువరా చెప్పించే నీ ప్రియురాండ్ల చేతనే

చ. 2: తప్పులు వట్టేవారు తగిలి వీడెపిత్తురా
వుప్పటించేవారు నీతో నొద్దికవునురా
నెప్పున నీవేల మాపై నెపములు వేసేవు
చెప్పించే పిలువరా నీ చెలువలచేతనే

చ. 3: సొలసేటివారు నిన్ను చెక్కులఁ బెట్టుదురా
కలసితి నిదె శ్రీ వేంకటేశ్వరుఁడ
అలమేలుమంగ నేను అంత యేల కొసరేవు
తెలిపేఁ బిలువరా నీ తెఱవల చేతనే

రేకు: 1747-05 ముఖారి సం: 27-281

పల్లవి: ఏల వేగిరపడీనే యింతలోఁ దాను
మేలల్లా నొకరూపైన మెచ్చులాఁడు గాఁడా

చ. 1: అలిగి మాఁటాడనంటా అందుకే తా వేఁడుకొనీ
తలఁపులోఁ దలఁపది తన్నునే కాదా
పిలిచి పేర్కొన నంటా ప్రియములు చెప్పీని
తలకొన్న పాటలలో తనముద్ర కాదా

చ. 2: మొగమిచ్చి చూడనంటా మోహములు చల్లీని
తగిన నా వయసెల్లా తనకే కాదా
నగనంటా నటు నిటు ననుపులు పచరించీ
తెగడే సరసాలలో తేటలు తాఁగాఁడా

చ. 3: నేనే పై కొననంటా నెయ్యములు ముంచీని
నానిన తన కాఁగిలే నాది గాదా
తానే శ్రీ వేంకటేశుఁడు నే నలమేలుమంగను
కానుక యీ రతులెల్లా కతలై నిలువవా

రేకు: 1747-06 భైరవి సం: 27-282

పల్లవి: ఇల్లాండ్లేవూరు యీా రసము లేవూరు
చల్లనై నీ యంత నీవే సంతమౌట గాక

చ. 1: కందువలు దెలిపేనా కాంతలకు నీకును
నిందలాడే వారి మాఁట నే ననేఁగాక
అంది నిన్ను యిందుకుఁగా అపరాదాల నెంచేనా
సంది నీగుణాలు నీవే చక్కనౌట గాక

చ. 2: మచ్చరములు చూపేనా మగవలకును నీకు
పచ్చి చేఁత లెంచేవారిపాటి నేఁగాక
వొొచ్చెమని నిన్నిందుకు వొరయఁజూచేనా
యిచ్చల నీ తగవు నీ వెరుఁగుట గాక

చ. 3: చలములు సాదించేనా సతులకు నీకును
కొలవు వారి పొత్తులు కొసరేఁగాక
యెలమి శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
బెళకగ నీవే నాకు ప్రియమౌట గాక

రేకు: 1748-01 హిజ్జిజి సం: 27-283

పల్లవి: నావల్ల నైనదిది నీవల్ల నయ్యే దేదో
యీ వేడుకలకు వెల యెఱఁగ నే నిఁకను

చ. 1: మంతనాలు నీతో నాడి మై ముట్టి సరసమాడి
యింతైతి నీ రట్టు ఇందరిలోన
దొంతి వెట్టేవు వలపు దోమటి దొడుక వచ్చే
వెంత సే సేవో నీవు యెఱఁగ నే నిఁకను

చ. 2: కప్పురవిడే లంది కన్నులఁ గానుకలంది
వుప్పతింపులలోనైతి వొద్దివారిచే
కుప్పలు సే సేవు నవ్వు గోరి మొనలు చూపేవు
యెప్పుడు చనవిచ్చేవే యెఱఁగ నే నిఁకను

చ. 3: చేతులు నీపై వేసి చెరఁగు నీపై వేసి
యేతులెల్లా నాడుకొంటి యీ చెలులలో
కాతరించి కూడితివి గక్కన శ్రీ వేంకటేశ
యీ తరితీపు లెన్నేళో యెఱఁగ నే నిఁకను

రేకు: 1748-02 బౌళి సం: 27-284

పల్లవి: నీవంక నేరమేదే నిజమెంచి చూచితేను
పూవుల మొగ్గలే కావా పూఁపలకు మొదలు

చ. 1: పడఁతిరో నీ వదేమే పట్టాడే వాతనికిఁగా
యెడమాట లాడఁబోయి యెనసితివా
నడుమ విందారగించే నాలిక యటుండఁగాను
తొడికే చేయేకాదా తొలుతఁ బైకొనును

చ. 2: మానిని అదేమే వాని మంకులు చెల్లఁబెట్టేవు
కానుక లియ్యఁగఁబోఇ కలసితివా
మానలేక వలచిన మనసట్టే వుండఁగాను
కోనల చూపులే కావా గురి గాఁడి పారును

చ. 3: శ్రీ వేంకటేశ్వరు నన్నుఁ జేకొని కూడించితివి
నీ వొళ్లికడమ నిండ నెలకొంటివా
కైవశపు మేనికిని కాఁగిలి యటుండఁగాను
రావాడే చన్నులే కావా రతికెక్కు నడుమ

రేకు: 1748-03 లలిత సం: 27-285

పల్లవి: ఆపెకు మాకును నేఁడు అంతర మెంత
కాఁపురాలు వేరె వేరె కనుకొంట గాక

చ. 1: మాటలమందులు నూరి మరిగించుకొనె నాపె
యీాటు వెట్టుకోము నేము ఇల్లాండ్లము
చీటికి మాటికి నీతో సిగ్గులు వీడీని నాపె
కూటముల నేమైతే గుట్టుగలవారము

చ. 2: చెవిలో మంత్రాలు చెప్పి చే చిక్కించుకొనె నాపె
తివిరి వింతసేయము దేవుళ్లము
చవులుగా మోవి ఇచ్చి చనవులు చూపె నాపె
ఇవల నేమైతే నీకు ఇచ్చకపు వారము

చ. 3: జంగిలి మాయలు సేసి జట్టిగొన(నె) నిన్ను నాపె
కంగువెట్టుకోము నేము గరితెలము
అంగవించి శ్రీ వేంకటాధిప నన్నుఁ గూడితి
సంగతి నీకు నేమైతే సతమైన వారము

రేకు: 1748-04 మంగళ కౌసిక సం: 27-286

పల్లవి: అది నామేలే కాదా ఆ వనిత నేనే కానా
పొదిగొన న న్నిందు కిపుడే మెచ్చేఁగాక

చ. 1: దగ్గరి వచ్చెనా ఆపె తమకించెనా నీపై
సిగ్గులు వడక నాతోఁ జెప్పరాదా
వెగ్గళించెనా నిన్ను వెరపు నీకేమిటికి
నిగ్గులఁ బరిణామించి నిండుకొనేఁగాక

చ. 2: అంగన నీతో నవ్వెనా ఆకు మడిచిచ్చెనా
చెంగనేల నాతోఁ గొంత చెప్పరాదా
కంగు వెట్టేనా నీతో కల్ల గుట్టు నీకేఁటికి
పొంగుచు నీ గుణములు పొగడేగాక

చ. 3: కలిసితిరా ఇద్దరు కాఁగిలించెనా నిన్ను
చెలరేఁగి నాతో నిట్టె చెప్పరాదా
అలరి శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
చలివాసి యీరెంటికిఁ జనవిచ్చేగాక

రేకు: 1748-05 మాళవిగౌళ సం: 27-287

పల్లవి: ఎంత సే సేవు నాతోను యెరవులదాననా
వింతలుగాఁ జూచేనా వేడుక నీ పొందులు

చ. 1: కమ్మరఁగమ్మర నాతోఁ గడు బాసలు సే సేవు
నమ్మనా తొల్లి నిన్ను నాటకీఁడా
కుమ్మరించేవు వలపు గొనకొన్న ప్రియముల
సమ్మతించనా నేను సరి నీ యానతికి

చ. 2: అందు నిందు నిచ్చకము లట్టె యేల చూపేవు
పొంది నిన్నుఁ గోపించేనా బూటకీఁడ
చిందేవు వినయాలు చెక్కుల నొక్కులనే
నిందవేసేనా నీపై నీ మొగము చూచి

చ. 3: లలిఁదేనెగారే మోవి లంచమేల చూపేవు
కలయక మానేనా కాతరీఁడ
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరముఁ గూడితిమి
అల సేనా నే నిఁక అట్టె నీ రతులను

రేకు: 1748-06 లలిత సం: 27-288

పల్లవి: ఎచ్చరించవైతివంటా యేల నన్ను దూరేవు యీ
తచ్చనను గురిసేయఁదగవా నాకు

చ. 1: కన్నె నీకు వద్దనుండి కప్పురవిడె మియ్యఁగ
సన్నలు సేసి పిలువ సంగతే నాకు
పున్నమ వెన్నెలలోన పొందులు మీరు చేయఁగ
పన్ని నే వద్దికి రాను పాడియౌనా నాకు

చ. 2: మంచముపై నాపె నీవు మాటలాడుకొనఁగాను
పంచలఁ గానుకలియ్య భావ్యమా నాకు
మించిన వేడుకతోడ మీరిద్దరు నిద్రించఁగా
అంచెలను లేప నాయమౌనా నాకు

చ. 3: మచ్చికఁ గాంతనుఁ గూడి మా ఇంటికి రాఁగాను
వొచ్చములు మిమ్ము నెంచ వోజా నాకు
ఇచ్చగించి శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
రిచ్చల సిగ్గులువడ రీతియౌనా నాకు

రేకు: 1749-01 ఆహిరి సం: 27-289

పల్లవి: ఏమి సేసినా నీకు యెదురు విన్నవించము
కామించి మమ్ము మన్నించు కైవశపువాఁడవు

చ. 1: కారణములేనిమాట కడు నాతో నాడేవు
వూరకే, నామనసైతే వొడఁబడదు
ఆరితేరెఁ బనులు నీయంకె కెల్లా వచ్చితిని
దూరు నీపై వేసుకోకు దొడ్డవాఁడవు

చ. 2: పనిలేని సరసాలు పై పైనే నెరపేవు
ననిచి, నా సెలవుల నగవు రాదు
చనవులు సరివచ్చె సతమై వున్నారము
నిను మోవఁజేసుకోకు నిజాలవాఁడవు

చ. 3: చెప్పరాని సిగ్గులెల్లా సెలవుల ముంచేవు
దప్పిదేరి యందువంకఁ దమకించను
అప్పుడే శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
దెప్పరానఁ గూడితివి దీమసపు వాఁడవు

రేకు: 1749-02 బౌళి సం: 27-290

పల్లవి: మొగమోటదాన నేను మొదలనే, తనతోను
యెగసక్కేనకునైన యేకతము లేదా

చ. 1: చిత్తములోపలిమాట చెప్పఁజాలకుండితేను
వొత్తువెట్టీ మానఁ డూరకైనాను
పొత్తుల నున్నది కీలు భోగించినవాఁడు తాను
ఇత్తలఁ దనకు గొంత యేకతము లేదా

చ. 2: సిగ్గులు మీరిన చేఁత సేయఁ జాలకుండితేను
అగ్గలమై వెరిగించీ నందాఁకాను
వెగ్గళించె వలపులు వెఱపెఱఁగఁడు తాను
యెగ్గులు దీరుచుకోను యేకతము లేదా

చ. 3: ననుపైన సుద్దులకు నవ్వఁజాలకుండితేను
చెనకి మొగము చూచి చిమ్మిరేఁచీని
అనుగు శ్రీ వేంకటేశుఁ డలమేలుమంగ నేను
యెనసె నిప్పుడు తన కేకతము లేదా

రేకు: 1749-03 భైరవి సం: 27-291

పల్లవి: వెరపు లెరుఁగుదువు వేవేగ రావయ్యా
ఇరవైన అప్పణ నీ కిచ్చెఁ గదవయ్యా

చ. 1: దప్పి గొంటి నంటాను తరుణి నీ కెమ్మోవి
కప్పురము మారుగాను కైకొన్నదట
చెప్పె నాకు నానవాలు చేరి నాతో పొందుసేసి
ఇప్పు డిట్టె నాకు జనవియ్యవయ్యా

చ. 2: చలిగొనీ నంటాను సకియ నీ పచ్చడము
నిలువు గప్పులు గప్పీ నీతా నట
యెలమి నీ కిక్కువగా యీమాటే చెప్పుమనె
వలపుల నన్నుఁగూడి వదలకువయ్యా

చ. 3: తాను నీవు నొక్కటంటా తరుణి శ్రీ వేంకటేశ
నానిన రతులఁ గూడి నవ్వెనట
ఆనెలఁత వావి చెప్పె అలమేలు మంగ నేను
పూని నన్నుఁ గూడితివి పొంతనా లీవయ్యా

రేకు: 1749-04 రామక్రియ సం: 27-292

పల్లవి: ఎంతవాఁడవయ్యా నీవు యెక్కడెక్కడ
పొంత నీ జాణతనాలు పొగడేము నేము

చ. 1: మాటలనే తేనెలూరీ మంతనాన నోరూరీ
యేట వెట్టే నీ మహిమ లెక్కడ
తేటలు నీచేత విని దేహమెల్లాఁ జెమరించె
మూటలుగా నవ్వితిమి మొక్కేము నీకు

చ. 2: చూపులనే వాఁడి రేఁగీ సొలపుల నాసరేఁగీ
యేపున నీయెమ్మె లివి యెక్కడెక్కడ
తీపుల నీపాలఁ జిక్కి తిద్దుపడె గుణమెల్ల
మోపుగా వలచితిమి మొక్కేము నీకు

చ. 3: కందువల దమి వుట్టె కాఁగిట బీరము వుట్టీ
ఇందులోని నీ నేరుపు లెక్కడెక్కడ
పొందితి శ్రీ వేంకటేశ భోగము రతులకెక్కె
ముందర నింకొకమాఁటు మొక్కేము నీకు

రేకు: 1749-05 సాళంగం సం: 27-293

పల్లవి: ఇంత సేసినవాఁడవు యీడేర్చవయ్యా
కొొగిత్తైనా నీ దీమసము కొమ్మ కియ్యవయ్యా

చ. 1: వలపుల వడ దాఁకె వనిత నిన్నుఁ బాయగ
అలరి చలి మందుల కప్పణీవయ్యా
నిలువెల్లఁ జెమరించె నీతోడి సరసముల
పొలుపుగ మంచిగందవొడి గూర్చవయ్యా

చ. 2: ఆసల నుంగిటి గొనె అట్టె నీకెదురు చూచి
సేసచల్లుచు వద్దని చెప్పించవయ్యా
రాసికెక్కఁ బులకించె రతి నీయెడ మాటలు
వాసిఁ గుచ్చి ముత్తేలుగాఁ జేసి దాఁచుకోవయ్యా

చ. 3: రతిఁ బరవశమందె రవ్వగ నీవు గూడఁగ
సతిని కొనగోర నెచ్చరించవయ్యా
మతి నన్ను జంకించె నెమ్మదిని శ్రీ వేంకటేశ
తతివచ్చె నీ బాసలు దలఁచుకోవయ్యా

రేకు: 1749-06 వరాళి సం: 27-294

పల్లవి: నిజము లొలుకనేల నీకు నీకే మాతోడ
గజిబిజి చేఁతలనే గయ్యాళించే విపుడు

చ. 1: కపటము లేక మదిఁ గాఁతాళము వొడమదు
నెపము గలితేఁగాని నిందించరాదు
కపురుగ నీ యందె కంటిమి యీరెండు నేఁడు
వుపమ లిందరివలె వూరకుండ విపుడు

చ. 2: కన్నుసన్నలు సేయక కందువ నాస పుట్టదు
వెన్నెలు వెట్టితేఁగాని వెంగెము గాదు
ఇన్నియు నందరికి నీ విచ్చిన విద్యలు నేఁడు
విన్న కన్నచోట వెల్లావిరి సేసే విపుడు

చ. 3: దగ్గరి కూచున్నఁగాని తమకములు రేఁగవు
సిగ్గు విడిచినఁగాని చెనకరాదు
యెగ్గుదీర శ్రీ వేంకటేశ నన్నుఁగూడితివి
వెగ్గళించి రతులలో వెరగందే విపుడు

రేకు: 1750-01 గుజ్జరి సం: 27-295

పల్లవి: చెప్పకు చెప్పకు నాకు చేరి నీవు పచ్చిసేసి
చొప్పుగా నీవు చూచిన చూపులే గురుతు

చ. 1: మోహము గలవారికి మొగచాటు గలదా
దాహపుటడియాసలతము(గు)లే కాక
పోహణించి యేల నాకుఁబుట్టించేవు తరితీపు
యీహల మరునిపూవు టేట్లే గురుతు

చ. 2: ఇయ్యకోలైనవారికి యెరవులు గలవా
నెయ్యపు సరసములో నేరుపేకాక
వొయ్యనే ఇంతేసి యేల వొప్పగించేవు నీమేలు
ముయ్యక ముందు మొక్కిన మొక్కులే గురుతు

చ. 3: తగులు గలవారికి తచ్చనలు గలవా
నగిన సెలవులలో ననుపేగాక
అగపడి శ్రీ వేంకటాధిప నన్ను గూడితి
జిగిమీరఁ జేసినట్టి చేఁతలే గుఱుతు

రేకు: 1750-02 వేళావళి సం: 27-296

పల్లవి: ఎంత సేసే విందుకుఁగా యేల లోఁగేవు
వింతవారి వలె నిన్ను వేసరించేనా

చ. 1: పూసగుచ్చినట్టు నిన్నుఁ బొగడేటి దానను
రాసికెక్క నిందరిలో రవ్వసేసేనా
సేస వెట్టి ఇట్టె నీపైఁ జేయి చాఁచే దానను
వీసమంత పనికిఁగా వెంగెమాడేనా

చ. 2: నగుతానే నే నీకు ననుపైనదానను
తగవులఁబెట్టి నేఁడు తమకించేనా
మొగము చూచి సారె మొక్కేటిదానను
పగటుఁదనాలు సేసి పంతము చూపేనా

చ. 3: కొసరి కొసరి నిన్నుఁ గూడినట్టిదానను
కుసి గుంపు నీవలపు గోరసేసేవా
యెసగ శ్రీ వేంకటేశ యియ్యకొన్నదానను
సుసరి వైతివి నీపైఁ జొప్పులెత్తేనా

రేకు: 1750-03 ముఖారి సం: 27-297

పల్లవి: ఎలయించే అందులకు నెవ్వరమైతిమేని
పొలసి పూచినమీఁద పూఁపలయ్యీఁగాని

చ. 1: కందువలు నీకుఁ జూపి కాఁకలు మతిలో నించి
సందడిఁ బెట్టెఁగా ఆపె సారె సారెకు
అందుకొని నన్నుఁ జూడు మాపెకంటె భ్రమఇంచి
విందు వెట్టి కాలు దొక్కి వెంట దిప్పే నిన్నును

చ. 2: కొంగువట్టి తీసి నిన్ను కొలువులోపల నవ్వి
అంగడిఁ బెట్టెఁగా వల కాపె తొలుతె
సంగడిఁ జూడు నానేర్పు సరి నాపె వలెనే
అంగమంటి మీఁద మీఁద నాసలు రేఁచేను

చ. 3: కావరించి మొక్కు మొక్కి కాఁగిలించుకొని మెచ్చి
చేవదేర నాపె సేవ సేసెఁగా నీకు
శ్రీ వేంకటేశ నన్నుఁజేరి కూడితివి చూడు
వేవే లాపెకంటె వెల్లావిరి సేసే నిపుడు

రేకు: 1750-04 రేవగుప్తి – అటతాళం సం: 27-298

పల్లవి: కడమ లెక్కడి వింక కానవచ్చిన పనికి
జడిసి దోమటి విందు చవివుట్టీనా

చ. 1: మానిని మాటలే నీకు మదన రహస్యములు
నానఁగా నిన్న వెడుగ నాకుఁ దగవా
తేనెగారే అధరపు తేనెలు నీ తలకెక్కె
వీనుల(లు) వూరఁగతలు వినఁగూడినా

చ. 2: యింతి కానుకలు నీకు యిచ్చిన సంచకరువు
దొంతులైన వవి మాకు తోయవసమా
చెంతల నెగరవేయ చేతులకు నీకుఁ జిక్కె
యెంతవారు పిలిచినా నియ్యకొనేవా

చ. 3: పొలఁతిఁ కాఁగిలి నీకు భోగపు పెండ్లి చవికె
చెలులము మా యెదుట సిగ్గు వడేవా
కలగంపలాయఁ బొందు కడపలోపల నేఁడు
అలరి శ్రీ వేంకటేశ అడ్డమాడేవా

రేకు: 1750-05 నాదరామక్రియ సం: 27-299

పల్లవి: ఆతఁడే నీవు గావా అందుకేమే
కాతరపు సరసాలు కడురేఁచవలెనా

చ. 1: తమకపు రమణుఁడు దగ్గరఁ గూచుండితేను
జమళిసిగ్గు లేటికి జళిపించేవే
కొమరెపు నిన్నాతఁడు కొంగువట్టి పెనఁగితే
వుమురుకూటపుఁజూపు లుగ్గడించ నేఁటికే

చ. 2: నయగారి నీ విభుఁడు నవ్వులు నవ్వితేను
ప్రియమున బింకాలు పెనచనేలే
క్రియయెరిఁగి నీమీఁద కేలు చాఁచి కొసరితే
నియతపుఁ బెనువొట్లు నీకేఁటికే

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చెక్కులు నిన్ను నొక్కితే
నీవల రతుల భ్రమయించ నేఁటికే
కైవసమై నీవితఁడు కప్పుర విడె మిచ్చితే
వేవేగఁ గూడి మరి వెరగంద నేఁటికే

రేకు: 1750-06 సామంతం సం: 27-300

పల్లవి: మేలు మేలు జాణవౌదు మెచ్చితి నిన్ను
కాలు దాఁకి నంతలోనె కందువ లంటేవు

చ. 1: నెయ్యపు చేఁతలకెల్ల నేరుపరివంటేను
పయ్యెద కొంగు వట్టేవు పలుమారును
తొయ్యలుల రతికిని దొడ్డవాఁడ వంటేను
తియ్యని మో వడిగేవు తేకువ మెరయను

చ. 2: నంటున నీమోము చూచి నవ్వులు నవ్వితేను
వెంట వెంటఁ బొదిగేవు వేసారవు
వొంటరి వనుచు నీ కొలువును సేసితేను
అంటిముట్టి సరసములాడఁ జూచేవు

చ. 3: సమ్మతించి యిన్నిటాను చనవు చెల్లించితేను
దిమ్మరి విద్యలఁ గూడి తెరవేసేవు
నెమ్మది శ్రీ వేంకటేశ నీకు నే నెదురాడేనా
కుమ్మరించి వలపులు గురి సే సేవు

రేకు: 1751-01 దేసాళం సం: 27-301

పల్లవి: ఎందాఁకా వట్టి జోలి యెఱఁగనా నేఁ దొల్లి
చందమాయ సుద్దులెల్ల చాలుఁ జాలు నీఁకను

చ. 1: చెప్పుమంటా నన్ను నేల చేరి వెడ్డు వెట్టేవు
తప్పక చూచితేనే తలవంచితి
దప్పిదేరి నీమోవి దగదొట్టీ నిందువంక
చప్పుచారై యలసేవు చాలుఁ జాలు నీఁకను

చ. 2: ప్రియములు చెప్పి యేల పెనఁగ వచ్చేవు నాతో
నయములు చూపఁగాను నవ్వు నవ్వితి
క్రియలెల్లఁ గానవచ్చీ కేలు మీఁదై యిందువంక
జయమాయ వేగిరాలు చాలుఁ జాలు నీఁకను

చ. 3: కొంగువట్టి తీసి యేల కూడితి వింతటిలోనె
ముంగిటికి నీవు రాఁగా మోహించితి
అంగమాయ శ్రీ వేంకటాధిపతి ఇందువంక
జంగిలి కొసరు లెల్ల చాలుఁ జాలు నికను

రేకు: 1751-02 పాడి సం: 27-302

పల్లవి: దయగలవాఁడు తాను తప్పు లేఁటివే
నయగారి తనముల నవ్వింతుఁగాక

చ. 1: తలఁపెల్లఁ దానె తనకేఁటి విన్నపము
చెలఁగి తాఁ జేసినట్టు చేసుగాక
చెలువలేమి చెప్పేరు చేతఁ జిక్కెనిదె ముద్ర
వెలలేని వేడుకల వేగింతు గాక

చ. 2: పనులెల్లఁ దానె పట్టి పెనఁగేదేది
చనవిచ్చిన కొలఁది జరపుఁగాక
ననుపులేమెంచేము నాలుకనున్నది పేరు
కనుకలి వినుకలిఁ గైకొందుఁ గాక

చ. 3: కాఁగి లెల్లఁ దానె కందువకుఁ దీసేదేమి
మాఁగిన మోవితీపులు మరుపుఁగాక
చేఁగ దేరేదేమి తానె శ్రీ వేంకటేశుఁడు గూడె
వీఁగనిరతిఁ జొక్కించి వెలయించుఁగాక

రేకు: 1751-03 గౌళ సం: 27-303

పల్లవి: ఎంత నీరాజస మిదియేమే నీవు
పంతపుఁ జేఁతల నిన్ను భ్రమఇంచ నేరఁడా

చ. 1: చక్కని వదనమున సన్నచేసె నాతఁడు
యెక్కడి పరాకు నీకు యేమే నీవు
వెక్కసపు చన్నులతో విఱ్ఱవీఁగేవు గర్వాన
మిక్కిలి రతులనవి మెదుపఁగ నేరఁడా

చ. 2: చిలుకుగోళ్ల చేతుల చెయివట్టె నాతఁడు
యెలమి మూరు మలసేవేమే నీవు
నిలువుఁ దురుముతోడ నీవు కపటాలు చూపి
అలరి పంతాలు చూప నాతఁ డింత నేరఁడా

చ. 3: దొంతర సరసముల దొమ్మి చేసె నాతఁడు
యింతలోనె సిగ్గువడేవేమే నీవు
మంతనాన పయ్యదను మఱఁగువెట్టి కూడితి
వెంతైనా శ్రీ వేంకటేశుఁడిని మీర నేరఁడా

రేకు: 1751-04 మాళవిగౌళ సం: 27-304

పల్లవి: కడు లా వరవు దాను కానమా నేము
యెడపదొడపఁగాగ యెదిరించఁగలమా

చ. 1: నయగారి సటకాఁడు నన్నునేల తడవీనే
ప్రియురాండ్ల తోనే పెనఁగుఁ గాక
క్రియ యంత యెరిఁగితే కిమ్ముల కంబము లేదా
దయతోడిలేమలము తన కోపఁగలమా

చ. 2: కొత్త కొత్త కోడెకాడు గోళ్లేల రాఁచీనే
చిత్తము వచ్చినవారిఁ జెనకుఁగాక
వొత్తి రాచవలసితే నూరకే రాళ్లు లేవా
తత్తరపు టింతులము తన కోపఁగలమా

చ.3: నీటు శ్రీ వేంకటేశుఁడు నేనెట్టు నన్నుఁ గూడెనే
వాఁటమైన వారికే వలచుఁగాక
పాటించి పట్టి బిగించ బయలుకాఁగిట లేదా
తాటించి నిండురతిని తన కోపగలమా

రేకు: 1751-05 పాడి సం: 27-305

పల్లవి: ఔనే మంచిదాన వౌదువే నీవు
సానఁబట్టి వలపులు జళిపించేవు

చ. 1: చెలఁగి యాతఁడు నీకుఁ జెప్పేటి ప్రియాలకా
చలపట్టి దగ్గరక జంకించేవు
మొలకనవ్వులు నవ్వి ముంచిన మోహానకా
వలవని జాగుతోడ వంచేవు శిరసు

చ. 2: చిత్తగించి నీమీఁద జేయి వేసినందుకా
కొత్తలుగా నీవు కొనగోరఁ జిమ్మేవు
బత్తి సేసె నీకు మంచి బాగా లిచ్చి నందుకా
యెత్తిన మదముతోడ యీసడించేము

చ. 3: కుచ్చిపట్టి కాఁగిలించి కూడిన యిందులకా
హెచ్చి శ్రీ వేంకటేశ్వరు నెలయించేవు
బచ్చన సరసముల పంతమిచ్చినందుకా
విచ్చనవిడుల నీవు వేసాలు సేసేవు

రేకు: 1751-06 ఆహిరి సం: 27-306

పల్లవి: అవ్వలిమో మే(మేఁ)టికే అంతవానితో
నవ్వులు నవేటివేళ ననుపులే కాక

చ. 1: ఆఁటదానికేఁటికే అంతేసి చలములు
పేటగా మగవానితో ప్రియమేకాక
యీటువెట్టి నీకతఁడు యెంత కిందుపడినాను
చీటికి మాటికి సేవ సేయవలెఁగాక

చ. 2: మగువకు నేఁటికే మాసటీని పంతాలు
మొగము చూచి సన్నల మొక్కులే కాక
జగడము దీర నెంత చనవు నీకిచ్చినాను
మిగుల నీ వినయాలే మించవలె గాక

చ. 3: సతికి నింతేఁటికే సరిచేసి బింకాలు
యితవైన మనసుల యేకమేకాక
వెత దీర నిన్నును శ్రీ వేంకటేశుఁ డిదె కూడె
మితిలే కిందుకే నీవు మెచ్చవలెఁగాక

రేకు: 1752-01 శుద్ధదేశి సం: 27-307

పల్లవి: ఎందు వోయీ నతఁడు యేమనే నేను
చందమాయఁ బనులెల్ల చలమేలే ఇఁకను

చ. 1: తమకమెల్లాఁ గంటి తలఁ పెల్లా నీడేరె
రమణుఁ డన్నీ నెఱుఁగు రావే నీవు
కొమరె వయసుగాన కోడెకాఁడన్నిటా దాను
విమలమాయ మనసు విడువవే చెలఁగు

చ. 2: యీయకొంటిఁ దనసుద్దు లిందరు దన్ను మెచ్చిరి
రాయడించ కాతనిని రావే నీవు
చాయల నడతు నేను సరసుఁడిన్నిటాఁదాను
బాయట నందరుఁ జూడ పట్టకునే ఇఁకను

చ. 3: మతక మిందులో నేదే మచ్చికలు దైవారె
రతుల నన్నిటాఁ గూడె రావే నీవు
తతి శ్రీ వేంకటేశుఁడు తాను యీతని ఇంతిని
కత లీతనిప్రియాలు కైకొనఁగరాదా

రేకు: 1752-02 పాడి సం: 27-308

పల్లవి: అనుమానించక మాతో నానతీవయ్యా
పెనఁగి వారి పొందులు పెడరేఁతునా

చ. 1: చెనకి నవ్వినయాపె చేరి పుస్తరించుఁ గాక
పనిమాలి వేఁడుకోను పరులకేల
మనసు దిగ వేసుక మంతనాన నున్నాఁడవు
మునుపటి సతికే ఇమ్ములనే చెప్పుదునా

చ. 2: తిట్టినట్టి యాపె నిన్ను దీవించవలెఁగాక
కట్టఁ గడవారు మొక్కఁగా గారణమేల
వట్టి వేసటతోఁ దలవంచుక నీ వున్నాఁడవు
రట్టు సేసినతివనే ఇట్టె రప్పింతునా

చ. 3: కాలు దొక్కినాపె నిన్ను కాఁగిలించుకొనుగాక
యేల పొరుగువారికి నింతేసి పని
యీలీల శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁగూడితివి
ములనున్న తొంటి ఇంతిమొకము చూపింతునా

రేకు: 1752-03 బౌళి సం: 27-309

పల్లవి: మొగమోటదాన నేను మొక్కే నీకు
ఇగురుఁబోఁడిని నేను యెవ్వరి దూరుదును

చ. 1: సారె సారెఁ బొగడఁగ సన్నలు నీవు సేయఁగ
కోరి నిన్నుఁ దిట్టవచ్చి కొంకితి నేను
నేరములెంచఁగఁబోఇ నీకు లోనాయ మనసు
యీరీతినే వెరగైతి నెవ్వరి దూరుదును

చ. 2: ఇచ్చకము నెరపఁగ యెదురుగా నవ్వఁగాను
మచ్చరించవచ్చి యట్టె మానికి నేను
పచ్చిసేయ దొరకొంటి భ్రమయించె నా వయసు
యెచ్చరికె నాకు లేదు యెవ్వరి దూరుదును

చ. 3: వంచెనతోఁ గూడఁగాను వైపుగా శ్రీ వేంకటేశ
మించఁదలఁచి రతుల మెచ్చితి నిన్ను
కంచము పొత్తుకు వచ్చి కడు నోరూరించెఁ బొందు
ఎంచరాదు తరితీపు లెవ్వరి దూరుదును

రేకు: 1752-04 దేసాళం సం: 27-310

పల్లవి: చిత్తడి చెమటమేని శ్రీనివాసా! కడు
చిత్తిడి వాఁడవుగ దో శ్రీనివాస

చ. 1: చెల్లు నీకు నీచేఁతలు శ్రీనివాస! నా
చెల్లెలితో నవ్వితివి శ్రీనివాస
చెల్లఁబో యింతదొరవు శ్రీనివాస! నీ
చిల్లర విద్యలు బెట్టు శ్రీనివాస

చ. 2: చేరితిమి నీవద్ద శ్రీనివాస! మేను
జీరలాయ నింతలోనె శ్రీనివాస
చీరఁగారీ మా వయసు శ్రీనివాస! నీకుఁ
జేరువగా మా యిల్లు శ్రీనివాస

చ. 3: చిక్కని మాట లాడేవు శ్రీనివాస! మా
చెక్కిల్లా బాసెను నేఁడు శ్రీనివాస
చెక్కు నొక్కి కూడితివి శ్రీనివాస! వావి
చిక్కె శ్రీ వేంకటగిరి శ్రీనివాసా

రేకు: 1752-05 నాదరామక్రియ సం: 27-311

పల్లవి: చెప్పినట్టే సేతుఁగాక చేరి నీకు
తప్పులుఁ దారులు నెంచతగవేదీ

చ. 1: నిన్నుఁ జూచి నవ్వు వచ్చె నీమీఁది కోపము దీరె
అన్నిటా దొడ్డవాఁడవు ఆనలేల
కన్నుల నిన్ను గంటిమి కాయమెల్లాఁ జల్లనాయ
పన్నేటి మాయల కిఁకఁ బనియేది

చ. 2: మాఁట నీకుఁగా వెళ్లె మంకులెల్లఁ బెడఁబాసె
చాటువ గెలిచితిమి సాకిరులేల
నేఁటనే తప్పదిఁకను నీకు నేను పున్నారము
వాఁటాలు సేయఁగ నీవల్లనేది

చ. 3: కొనగోరు నిన్ను సోఁకె కూటము లందె కలిగె
పనిమంతుఁడవు వొడఁబాటులేల
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసితి మిప్పుడిట్టె
చనవు చేకొనుచోట సాదించ నేది

రేకు: 1752-06 రామక్రియ సం: 27-312

పల్లవి: ఇద్దరికి దైవము యెట్టు గూర్చెనో
గద్దరి తనములందె కలిగె కొసరులు

చ. 1: సొలసి సొలసి నిన్నుఁ జూచి నేనే భ్రమసితి
బలిమి నీ మనసెంత భ్రమసెనో
నలుపులు తెలుపులు నాకన్నులసాజము
తెలిసితే నలుపులుఁ దెలుపు నీ చేతలు

చ. 2: నలువంక నీతోడ నవ్వి నవ్వి యలసితి
అలరి నీ తనువెంత యలసెనో
మలకలు కొలుకులు మా కురులసాజము
అలరి మలకలు నీ యన్ని గుణములును

చ. 3: కావరించి నీ కాఁగిట కలసి నే వెలసితి
వేవేలై నీమోవి యంత వెలసెనో
శ్రీ వేంకటేశుఁడ మాకు సిగ్గులెల్లా సాజము
యీవల నీకు సిగ్గు లెందు వచ్చెనో

రేకు: 1753-01 కాంబోది సం: 27-313

పల్లవి: ఇదెఱఁగనైతి నేను యేమిసేతు నాయకుఁడ
చెదరి నీమతి కెంత సిగ్గాయనో

చ. 1: నిక్కి చూడఁబోతేను నీచేఁత బాయిటఁబడె
మొక్కఁబోతే కొనగోరిమొన దాఁకెను
చెక్కు నొక్కఁబోతేను చెమట చేతికి వచ్చె
చిక్కి నీకు నపుడెంత సిగ్గాయనో

చ. 2: మాఁటలాడఁబోతేను మర్మాలు దొరలివచ్చె
మూఁటగా నవ్వించితేను మోవిరేఁగెను
కూటమికి దగ్గరితే గురుతువాసన లుబ్బె
చీటికిమాటికి నెంత సిగ్గాయనో

చ. 3: ప్రేమఁ గాఁగిలించుకొంటే బేంట్లైరాలె గందము
ఆమని రతిసేసితే నన్నీ దెలిసె
నేమపు శ్రీ వేంకటేశ నీవు నేనుఁగూడితిమి
చేముంచి మెచ్చితే నెంత సిగ్గాయనో

రేకు: 1753-02 సామంతం సం: 27-314

పల్లవి: చీరలియ్యఁగదవోయి చెన్నకేశవా! చూడు
చేరఁడేసి కన్నుల వో చెన్నకేశవా!

చ. 1: పొత్తుల మగఁడవై పోరచినవ్వు నవ్వేవు
చిత్తిడిగుణములే లో చెన్నకేశవా
చిత్తరు పతిమలమై సిగ్గు నీ కొప్పించితి! నీ
చిత్తము నా భాగ్యము చెన్నకేశవా

చ. 2: యెమ్మెలకు జవ్వనాన ఇంతగాఁగ నోమితిమి
చిమ్మవోయి నీకరుణ చెన్నకేశవా
కమ్మటి నవ్వేవు మాతో కడలేదు నీయాస
చిమ్ముఁ జెమటల వో చెన్నకేశవా

చ. 3: గరిమ నందరి నొక్కగాఁడిఁగట్టి కూడితివి
శిరసుపూవులు రాల చెన్నకేశవా
ఇరవై శ్రీ వేంకటాద్రి యిదియంటాఁగూడితివి
గొరబు చేతలఁ గండిగోట చెన్నకేశవా

రేకు: 1753-03 రామక్రియ సం: 27-315

పల్లవి: చెనకుచు నీవే రట్టు సేసుకొంటివి
వనితలందరు నా వంటివారే కారా

చ. 1: కూరిమి గొసరుతాను గుణము చూపితిగాక
కోరి నిన్ను నింతసేయ కోపమా నీతో
ఆ రీతి నందరితోడ ఆ మాటేల చెప్పితివి
యేరా నీయింతులకెల్లా యెత్తిచ్చుట గాదా

చ. 2: నిక్కము విభుఁడవంటా నేరుపు చెప్పితిఁగాక
వెక్కసము లాడ నాకు వెంగెమా నీతో
చక్కగ నీ కొలువులో సాకిరులేల పెట్టేవు
యిక్కువ విన్నవారెల్ల నిదె పావసేయరా

చ. 3: రతివేళ గాగ నిన్ను రాశి కెక్కించితిఁగాక
పతికిఁ బతిసేయఁగ పంతమా నీతో
యితవై శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యితర సతులు నిన్ను యిందులకే మెచ్చరా

రేకు: 1753-04 ముఖారి సం: 27-316

పల్లవి: వద్దు వద్దు నీవంత వాదు వెట్టుకోకు మిఁక
తిద్ది రతులనే నిన్నుఁ దెమలించదా

చ. 1: పనివడి యాపె నీతో పంతమాడ నేటికి
చనుమొనలే చూపి సాదించదా
మనసెఱఁగవు గాక మానిని నీ యెడకు
కనుఁగొనలనే చూచి కరఁగించదా

చ. 2: కెలపుతిట్ల నిన్ను కిందుపరచనేఁటికి
సెలవినే నవ్వి యాపె చిమ్మిరేఁచదా
బలిమెఱఁగవు గాక పడఁతి నిన్ను నేఁచితే
పలచనిచేతలనే భ్రమయించదా

చ. 3: కైవశము సేయ నీతో కతలెల్లా నేఁటికి
మోవి తేనెలే చూపి మోహించపించదా
యీవేళ శ్రీ వేంకటేశ యింతి నీవు గూడితివి
వేవేలు సరసములు వెలయించదా

రేకు: 1753-05 అమర సింధు సం: 27-317

పల్లవి: ఆడనుండి వచ్చి నాకు ఆసపడేవు
జోడుకూడి నిన్ను రతిఁ జొక్కించదాయనా

చ. 1: పైపై నన్నుఁ జెనకేవు పాఁచి మేనితో వచ్చి
ఆపె వోపనప్పుడెల్లా నడ్డమా నేను
కోపము గాదుగా గొబ్బన నిన్నడిగితి
ఆ పాటి నిన్నుఁ దనివి నందించదాయనా

చ. 2: పట్టి విడె మడిగేవు పరఁగడుపునవచ్చి
వొట్టి యాపె వూడిగాల కూరటా నేను
దిట్టతనమున నిన్నుఁ దెలియవలసి యింతె
బెట్టుగఁ దమ్ములమైనాఁ బెట్టదాయనా

చ. 3: వంచి నామోము చూచేవు వరవాత లేచివచ్చి
అంచెనాచేఁతను చూడ నడ్డమా నేను
కొంచక శ్రీ వేంకటేశ కూడితివి నన్ను నీకు
మంచి మొగాలవారి నెమ్మదిఁ జూపదాయనా

రేకు: 1753-06 వరాళి సం: 27-318

పల్లవి: కానీ కానీ యందుకేమి కతలేఁటికి
మేనరికమే నీమెడగట్టీ నిఁకను

చ. 1: బత్తితోడ నేను నీపైఁ జేయి వేసితేను
హత్తి యదరిపడేవు అదేమీ నీవు
రిత్తవలపా నాది రేకకెక్కెఁ గొనగోరు
సత్తెముగలదైతేను జాణ జేసీ నిన్నును

చ. 2: తగవు నెరపి నీదగ్గర గూచుండితేను
అగడుగా నట్టె లోగే వదేమీ నీవు
మొగచాటా నా పొందు మొనలాయనా చన్నులు
తెగడి నిజాలదైతే దిట్టఁజేసీ నిన్నును

చ. 3: కలసి మెలసి నిన్నుఁ గాఁగిలించుకొంటేను
అలసి బుసకట్టే అదేమీ నీవు
మెలగి శ్రీ వేంకటేశ మెరసెనా జవ్వనము
బలిమి గలదియైతే బంటుఁ జేసీ నిన్నును

రేకు: 1754-01 సాళంగ నాట సం: 27-319

పల్లవి: కానీ కానీ యందుకేమి కనేము గాక
మోనాన నీకేవేళ మొక్కేమో నేము

చ. 1: నెట్టన నీ మగువలు నీతోనే నవ్వఁగాను
చుట్టాలమై యెన్నఁడిఁకఁ జూచేమో నేము
దిట్టలై యందురు నిన్ను తేఁకువతోఁ దిట్టఁగాను
వెట్టికి నేఁగతినుండి వినేమో నేము

చ. 2: పొలఁతులిందరు నిన్ను బొమ్మల జంకించఁగాను
చెలఁగి సాకి రెన్నఁడు చెప్పేమో నేము
అలగి వారు నీమీఁద నట్టె చేతులు చాఁచఁగ
తెలిపి మీవాదేగతిఁ దీర్చేమో నేము

చ. 3: కోరి నీ కొలువు వారు కొంగువట్టి తియ్యఁగాను
మారుకొని యన్నఁడవి మాన్పేమో నేము
యీరీతి శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁగూడితివి
తేరకత్తెల నేగతి దిద్దేమో నేము

రేకు: 1754-02 వరాళి సం: 27-320

పల్లవి: ఏకతములో సుద్దులు ఇందరిముందర నేల
దీకొని రతులోనే తెలుసుకోరాదా

చ. 1: చెప్పరాని మాటలకు సిగ్గులు వడుటే గురి
అప్పటి నేలడిగేవు ఆపెను నీవు
దప్పిదేరే మోములోనే తలఁపెల్లఁ గానవచ్చీ
తెప్పలఁదేలి ముచ్చట తెలుసుకోరాదా

చ. 2: సేయరాని సేఁతలకు సెలవినవ్వులే గురి
చాయల నేలొరసేవు సారెకు నీవు
కాయముపై కాఁకలనే కందువెల్లఁ గానవచ్చె
తీయనాయ వేడుకలు తెలుసుకోరాదా

చ. 3: ముట్టరాని పనులకు మొక్కులు మొక్కుటే గురి
గుట్టులేల విచ్చేవు కొంకక నీవు
ఇట్టె కూడితిరి మీ యెమ్మెలెల్లఁగానవచ్చె
దిట్టవు శ్రీ వేంకటేశ తెలుసుకోరాదా

రేకు: 1754-03 ఆహిరి సం: 27-321

పల్లవి: సవతు లిందరు నిన్ను సంతోసించేరిదె
రవళి నౌభళేశుని రాణి వౌదువమ్మా

చ. 1: ఆతనిమోము చూచితివదె తొడ యెక్కితివి
నీతి నీవెఱుఁగుదువు నీకేమమ్మా
ఆతుమార రమణుని అలుకెల్లఁ దీర్చితివి
రాతిరిఁ బగలు నట్టె రాజ్యమేలవమ్మా

చ. 2: వాసిఁ బంతాలాడితివి వలపించితి విభుని
నీ సరి గారెవ్వరున్ నీకేమమ్మా
సేస వెట్టి చెప్పినట్టు సేయించుకొంటి పనులు
ఆసఁ బట్టము గట్టుక అండనుండవమ్మా

చ. 3: ప్రియమునుఁ జెప్పితివి బిగ్గె గాఁగిలించితివి
నియతి నో లకిమమ్మ నీకేమమ్మా
దయతో శ్రీ వేంకటాద్రిఁ దమకించి కూడితివి
నయమై నరసింహాసనాన మించవమ్మా

రేకు: 1754-04 మాళవి గౌళ సం: 27-322

పల్లవి: వద్దన్నా మానదు చెలి వలపులు తోడంటి
పొద్దున నాపెకు నీకు బుద్ది చెప్పరాదా

చ. 1: నీతోడి (డ) మాటలు నే నెయ్యముతో నాడఁగాను
ఆతలఁ దా నేలాడీ నండ (నడ్డ) మాఁటలు
చేతులు చాఁచి నిన్ను చెక్కులిట్టె నొక్కఁగాను
ఘాతల తన గోరేల కడలు దాఁకించీని

చ. 2: సమ్మతించి నీమోము సారె నేనుఁ జూడఁగాను
దొమ్మిఁ దా నప్పటినేల తోఁగి చూచీని
చిమ్ముల సరసములు చేరి నేనూ నాడఁగాను
వుమ్మడిఁ జెనకీ నేల వూరకైనా దాను

చ. 3: కందువ నేను నీవు గాఁగిలించు కొనఁగాను
సందడిఁ గాలేల తొక్కీ జవళి నుండి
ఇందులో శ్రీ వేంకటేశ ఇద్దరముఁ గూడితిమి
నింద నీపైనేలవేసీ నిచ్చనిచ్చానవ్వి

రేకు: 1754-05 ఆహిరి సం: 27-323

పల్లవి: చాలు నూరకే రావయ్య సారె సారె రేఁచక
కోలుముంద్టై నీ ప్రియాలు కొంకులుదేరీ నవె

చ. 1: గరిసించరాదుగాని కాంతకు నీచేఁతలెల్లా
తెరమఱఁగు దీసితే తిద్దరానివే
వరుసతో రావుగాని వన్నెల నీగుణములు
తొరలించుకొంటేను దొమ్మిసేసేవే

చ. 2: వెలఇంచరాదుగాని వెలఁదికి నీ నవ్వులు
తెలిపి చెప్పఁగఁబోతే తీగెసాగేవే
తలఁచఁగరాదుగాని తప్పని నీబాసలెల్లా
ములిగి మోవఁగఁబోతే మోపెఁడేసివే

చ. 3: ఇయ్యకొనరాదుగాని యింతికి నీ కూటములు
చెయ్యారఁ గాఁగిట నేఁడు చేకొన్నవే
ఇయ్యెడ శ్రీ వేంకటేశ యిద్దరూ నొక్కటైతిరి
ముయ్యఁబోతే మీఁద మీఁద మొనలు చూపేటివే

రేకు: 1754-06 పాడి సం: 27-324

పల్లవి: నేరుపు చాలక నీవే నేరములెంచేవు గాక
సారె నీవు చెనకితే సరి దాఁ జెనకదా

చ. 1: వుండనుండ మోహములు వూటనీటి చెలమలు
మెండుగాఁ గొసరితేను మీసాలపై తేనెయుండు
దండి సిగ్గుతోఁ జెలి తలవంచితే నేమాయ
అండ నీవు నవ్వితేను ఆపె తానే నవ్వదా

చ. 2: సేయఁజేయ జెలుములు చెట్లపై కాయలు
రాయడించి పెనఁగితే రాలుఁబిందెలై వుండు
పాయపు వనిత నీతో పంతమాడితే నేమాయ
ఈయెడఁ జేఇ వేసితేను యీాపె నీపై వేయదా

చ. 3: కూడఁగూడఁ గూటములు గోరగీరిన యేరులు
వాడికలు లేకుంటే వానవెల్లులై వుండు
జాడతో శ్రీ వేంకటేశ సతి మించితే నేమాయ
వీడె మిచ్చెన సితివి వీడుకూళ్లు వెట్టదా

రేకు: 1755-01 లలిత సం: 27-325

పల్లవి: ఆపె నేను సవతుల మామాఁటె నామాట
తీపులు పుట్టించితిని తెలుసుకో ఇపుడు

చ. 1: ముందర నున్నది చెలి ముసి ముసి నవ్వులతో
విందులు వెట్టీ మీకు వీడెపుమోవి
చెంది నీకు మేలు సుద్ది చెప్పితి నిదివో నేను
ఇందుకు నాకేమి మెచ్చు ఇచ్చేవో ఇపుడు

చ. 2: చేయి చాఁచీ నాపె నీపై సేసపాల దోసిటితో
చాయల గప్పములిచ్చీ జంటచున్నులు
సోయగపు సగినాలు చూచి చెప్పితి నిదివో
తీయని నారుణ మెట్టు తీర్చేవో ఇపుడు

చ. 3: పొంకక కాఁగిలించీని కొనగోరి పంతాలతో
వుంకువలు వెట్టీఁ జనవుల రతులు
పొంకపు శ్రీ వేంకటేశ బుద్దులు చెప్పి కూడితి
నింకా నాకుఁ జనవు లెట్లిచ్చేవో యిపుడు

రేకు: 1755-02 తోండి సం: 27-326

పల్లవి: చేరి నీకు నేమెల్లా సేవ సే సేము
చేరఁడేసి కన్నులతో సిగ్గువడకిఁకను

చ. 1: చెందమ్మి రేకుల వేసె సేవంతిపూవులవేసె
కందువలు చెప్పెనాపె కలవెల్లాను
నిందమోఁచి నీవురాని నీకడమ ఇంతేకాని
పొందుల వెలితి లేదు పోరాదా లోనికి

చ. 2: పన్నీరు నీపైఁ జల్లె బాగాలునుఁ బెట్టి పంపె
విన్నపాలన్నియుఁ జేసె వెల్లవిరిగా
సన్నలు దెలుసుకోని జాణతనము నీదింతే
పన్ని వున్నది వలపు పదవయ్య లోనికి

చ. 3: తెర నీ నడుమ మోఁపె తెలిపి లోలోఁగూడె
శిరసీడ గురిచూపె సేసెఁ గతలు
తిరిగి నన్నుఁ గూడితి దిక్కయి శ్రీ వేంకటేశ
మరిగితివి రావయ్య మాఇంటిలోనికి

రేకు: 1755-03 దేశి సం: 27-327

పల్లవి: అంతేని మే మెఱఁగము ఆఁడువారము
సంతలో నేరుచుకొని జాణము గారాదా

చ. 1: కూడిమాడి వుండి నీతోఁ గోపగించితి ననేవు
వాడికెవారి నవ్వులు వచ్చీనా మాకు
వేడుక కాఁడవు నీకు వేగిరము గలితేను
నీడల నూరివారితో నీవు నవ్వరాదా

చ. 2: వోముక మారుమొగమై వూరకుందాన ననేవు
దోమటి గొల్లమాటలు తోఁచీనా మాకు
ప్రేమమున నీకు నింత పెక్కులాడవలసితే
నీమాటలు నా మాటలు నీవే యాడరాదా

చ. 3: కన్నులఁగంటానే వచ్చి కాఁగిలించుకో ననేవు
నిన్నటివారి నేర్పులు నేర్చేమానేము
అన్నిటా శ్రీ వేంకటేశ ఆయములంటి కూడితి
వెన్ని గలవు నీ పొందు లెనయఁగరాదా

రేకు: 1755-04 సామంతం సం: 27-328

పల్లవి: చిత్తగించు నీ వాపెను చెన్నరాయ! యీపె
చిత్తిణి గొడగుమట్టి చెన్నరాయ

చ. 1: చిక్కని గుబ్బల మీఁద చేయి నీవు వేసితేనే
చిక్కెను నీపాల నాపె చెన్నరాయ
చొక్కించి నీవు గోరు సోఁకించఁగా కమ్మటి నీ
చెక్కిటిపైఁ జేయివెట్టీ చెన్నరాయ

చ. 2: దిమ్మరి మాటలు యీ తెఱవతో నాడఁగాను
చెమ్మగిలఁ జెమరించె చెన్నరాయ
తమ్మిలము నీ విడఁగ తమకించి యట్టె యీపె
చిమ్మెను నీమీఁదను సిగ్గు చెన్నరాయ

చ. 3: ఆ రీతుల నేకతాన అలుకలు దేర్చఁగాను
జీరలు వొళ్లెల్ల నిండె చెన్నరాయ
యీ రీతి శ్రీ వేంకటాద్రి నిద్దరు నేకమైతిరి
చీరకొంగు వదలకు చెన్నరాయ

రేకు: 1755-05 నాగవరాళి సం: 27-329

పల్లవి: ఎట్టు వలసినఁ జేయు మిఁక నీవు
గుట్టు చక్కనైతేను కోరిక లీడేరును

చ. 1: చప్పనాయ నీమోవి సతులెల్లా నంజఁగాను
తెప్పిరి నే నంటఁగాను తియ్యనాయను
వుప్పుచాల దీలకూర కొల్లనివేళ నందురు
వుప్పొలి కినుమడౌను వొలిసిన వేళను

చ. 2: కడుఁ బిప్పాయ నీమేను కాంతలెల్లఁ బొందఁగాను
వడిసీ రసాలు నే నీవద్ద నుండఁగా
పుడిసెఁడౌను సిగ్గులు పుప్పించుకొనేవేళను
పిడికెడేసి వలపు పెట్టే సేసవేళను

చ. 3: బెండుపడె నీ మనసు పెనఁగి యిందరిచేతా
నిండుకొనెఁ దమి నేను నీవుఁ గూడఁగా
గుండె రాయౌ నొకవేళ కోపాన శ్రీ వేంకటేశ
కొండలౌను చన్నులివె కొంకుదేరేవేళను

రేకు: 1755-06 బౌళి సం: 27-330

పల్లవి: నేమా యెఱఁగ మిందుకు వేంకటేశ నేమా యెఱఁగమిందుకు
నేమము దలఁచుకొని నిలు నిలు మీఁకను

చ. 1: సారెకు నిన్నుఁ జూచితే జంకించనే బుద్దిపుట్టీ
చేరి చేరి నీవు నన్నుఁ జేసే చేఁతకు
ధీరత నీవు నవ్వితే తిట్లు నోటికి వచ్చీ
వూరకుండు చాలుఁజాలు వొద్దు వొద్దు ఇఁకను

చ. 2: సందడిఁ బెనఁగఁబోతే చన్నులకు వాండెక్కీ
చిందరవందర నీవు సేసే చేఁతకు
అందాలు చెప్పఁగఁబోతే అపనమ్మికలే తోఁచీ
పొందే ఆన లెన్నిలేవు పోకు పోకు మీఁకను

చ. 3: కుచ్చి కాఁగిలించుకుంటే కోరికులు దైవారీ
చెచ్చెర నీవు రతులఁ జేసే చేఁతకు
యిచ్చట శ్రీ వేంకటేశ యెనసితి మిద్దరము
విచ్చన విడాయ మంకు విడువిడు మీఁకను

రేకు: 1756-01 మంగళ కౌసిక సం: 27-331

పల్లవి: దీనికేమే దోసమా తీపు మొగచాటైతే
పూనుక నడుమఁ గొంత పులుసును నంజరా

చ. 1: మంచముపైఁ గూచుండి మాయలెల్లా నటిఇంచి
కంచము పొత్తు వలపు కలసితివే
అంచెల నా మానిసివై అంటుకొంటి వంతలోనె
యెంచేదేమి ఇఁక బాసలేల సే సేవే

చ. 2: వద్దనుండి పాటవాడి వరుసలు వెట్టుకొని
చద్ది కూటిపై నుమిసి సాదించితివే
అద్దుక రాయబారాలు ఆడుతానే మించితివి
తిద్దుక ఇంకానేల దిష్టాలు సే సేవే

చ. 3: అంకెలఁ బాదములొత్తి ఆయములు సోఁకించి
కంకి సేసి తగవులు గైకొంటివే
పుంకువై శ్రీ వేంకటేశుఁ డొనరె నా కాఁగిటను
పొంకాన నావశమైతి బుద్దులేల చెప్పేవే

రేకు: 1756-02 గౌళ సం: 27-332

పల్లవి: మమ్మేల వినుమనేరు మాటలు మీఇద్దరిని
నమ్మించి మీ చెలులము నవ్వుదుము గాక

చ. 1: తగువులు చెప్పనేల తలఁపు లేకములైతే
మిగిలేవి కడు మందెమేళాలే కాక
తెగువలు మరియేల తేరెను మీ జగడాలు
మిగుల మిమ్మిద్దరిని మెత్తుము గాక

చ. 2: వొడఁబరచఁగనేల వునుకొను చక్కనైతే
అడియాలములు మేను లమరుగాక
వడఁబడ నికనేల వచ్చెను మీ పంతములు
వుడివోని నుతులను వుబ్బింతువుగాక

చ. 3: బుద్ధులు చెప్పఁగనేల భోగములు గలసితే
కొద్దిలేని చనవులే కూడించుఁగాక
పొద్దున శ్రీ వేంకటేశ పొందితిరి సంబటూర
ముద్దుల చెన్నుఁడ మీకు మొక్కుదుముగాక

రేకు: 1756-03 పాడి సం: 27-333

పల్లవి: ఎంత లేదు వట్టి సట యీపె నీతోను
బంతిని నీవే సారెఁ బాలార్చేవు

చ. 1: చేకొని ఇందరిలోన సిగ్గులు వడీఁ జెలి
యేకతాన నుండరాదా ఇయ్యకొనీని
దీకొని వొడఁబరచితే నానలెల్లఁ బెట్టీ
దాకొని కాఁగిలించుమా తానే లోనయ్యీని

చ. 2: తప్పక చూడఁగ నీతోఁ దలవంచుకొనీఁ జెలి
కొప్పు వట్టి తియ్యరాదా కొంకుదేరీని
ముప్పిరిఁ జెనకితేను మొక్కలములెల్ల నాడీ
కప్పుమా పచ్చడ మిట్టె కరఁగీ నిక్కువలు

చ. 3: నానఁబెట్టితే వలపు నవ్వులు నవ్వీఁ జెలి
మానము లంటఁగరాదా మనసిచ్చీని
తానె శ్రీ వేంకటేశ దగ్గరి నిన్నుఁ గలసె
కానిమ్మని వినరాదా కతలు చెప్పీని

రేకు: 1756-04 ముఖారి సం: 27-334

పల్లవి: అంతసేసినట్టి నిన్నే అందుము గాక
యెంతకెంత వలపులు యింకా రేఁచేమా

చ. 1: వెన్నెల బయటనుండి వేసవి యెండలనేటి
కన్నెకు నేమని చెప్పఁగలము నేము
సన్నపుగాలిఁ జూచి జాజరకాఁడనఁగాను
విన్నవించేమా నేము వెలఁదికిని

చ. 2: ముడిచే పువ్వులు చూచి ముంచి మరునమ్ములనే
పడఁతి నేమని మట్టుపరచేము
నొడిగే కోవిలఁ జూచి పిడుగుల పక్షియంటే
తడవి యేమి చెప్పేము తరుణితోను

చ. 3: మలసే తుమ్మిదఁ జూచి మాసటీఁడని భ్రమసే
పొలితికి నేమని బుద్ధి చెప్పేము
అలరి శ్రీ వేంకటేశ అంతలో నీపెఁగూడితి
తెలిసె నిందు వంకనే దేవర చిత్తము

రేకు: 1756-05 సామవరాళి సం: 27-335

పల్లవి: ఇంక నేలే కొంకను యిద్దరము నున్నారము
సంకెలెల్ల దేరె నాకు చనవిచ్చుఁగాక

చ. 1: మచ్చిక సేసినవాఁడు మనసేమి చూచీనే
చెచ్చెర నా చెప్పినట్టు సేసుఁగాక
విచ్చన విడైనవాఁడు వెనకముం దేలెచ్చీనే
కుచ్చి కుచ్చి నామేలే కొసరు గాక

చ. 2: గక్కన నవ్వినవాఁడు కడమలేల పెట్టీనే
వెక్కసపుఁ జన్నులపై వెలయుగాక
వొక్కటైనవాఁడు నాతో నూరకే సిగ్గులేలే
నిక్కి నిక్కి రతినేర్పు నెరపుఁగాక

చ. 3: మంచముపై నున్నవాఁడు మఱఁగులేల పెట్టీనే
కంచపు మోవి యొసఁగి కైకొనుఁగాక
యెంచక శ్రీ వేంకటేశుఁడీడ నిట్టె నన్నుఁ గూడె
మించి మించి నాపొందులే మెరయుఁగాక

రేకు: 1756-06 వేఖావళి సం: 27-336

పల్లవి: మీరు మీరు నేకమే మేమును మీవారమే
కూరిమితో కొసరలు కోపమయ్యీనా

చ. 1: తెరమఱఁగు దీసితే తేరె మీకు సిగ్గులు
వొరసితే వలపులు వొడి నిండెను
గరిమ నందరికినిఁ గలిగిన దొక్కచాలే
సరసపు జగడాలు సతమయ్యీనా

చ. 2: మొగము చూచితేనే మొలచెను నవ్వులు
అగపడితే నీడేరె నాసలెల్లాను
తగిన వయసువారితలనే వేగె నీపని
బిగువుల బింకాలు పేరడయ్యీనా

చ. 3: మంతనాన నుండితేనే మనసు లేకము లాయ
సంతసించుకొంటేనే చలము వాసె
యింతలో శ్రీ వేంకటేశ యెనసితి రిద్దరును
బంతి నున్న రతివిందు పంగెనయ్యీనా

రేకు: 1757-01 సామంతం సం: 27-337

పల్లవి: ఎన్నటి కెన్నటి సుద్దు లెంచేవా నీవు
కన్ను లెదిటివారినే కరుణింతు గాక

చ. 1: వొద్దిక రాణివాసాలైవున్నవారిఁ దలఁచేవా
వద్దనున్నవానికే వలతుగాక
తిద్దిని నీగొల్లెత దిక్కు నీవు చూచేవా
పెద్ద మధురసతులే ప్రియమింతే కాక

చ. 2: వేడుకతో వరుసల వెలఁదుల నీవెంచేవా
వూడిగాలవారు నీవు నుండుదు గాక
యీడఁ బెండ్లాడినయట్టి ఇంతులనే తనిసేవా
కూడగొట్టు వనితలఁ గోరుదువు గాక

చ. 3: కప్పురపుఁబడివారి కతలు నీవు వినేవా
యిప్పు డురముపైవారి నెనతు గాక
తప్పక శ్రీ వేంకటేశ తగ నన్నుఁ గూడితివి
అప్పటి నీతొంటివారి నంటుదువుగాక

రేకు: 1757-02 రామక్రియ సం: 27-338

పల్లవి: ఉప్పుచిం దునుమడాయ వుండఁగానే నీ బదుకు
లప్పుల కస్తూరి పూఁత లాబమాయనయ్య

చ. 1: నే నీకు మేలుదాన నీవాపె మేలువాఁడవు
సానల నిద్దరిమేలు సరికి బేసి
నానెను చెమట నిట నడుమ నీమేనెల్ల
పానిపట్టి నీవలపు పండవండీనయ్యా

చ. 2: నవ్వితి నిన్నుజూ చాపెనవ్వులకు నీవు లోను
జవ్వన పిద్దరిమేలు సరికి బేసి
పువ్వుల పూజలాయ నీ భోగము మా జంటలను
పవ్వళించి నీకోరికె పలమందెనయ్యా

చ. 3: కూడితి నే నిన్ను నాపె కూటములు నీకు నచ్చె
జాడల మా కూటములు సరికి బేసి
యీడనె శ్రీ వేంకటేశ ఇయ్యకొంటి వీరెంటికి
పాడితో మోవులే నీకు పల్లదొరలయ్యా

రేకు: 1757-03 ఆహిరి సం: 27-339

పల్లవి: నాకొరకు విన్నవించ నన్ను భోగించేటి నీకు
జోకల యీయలమట సోఁకీనని కాని

చ. 1: సవతుల మాటలకు జడిసి నేఁ జిన్నఁబోఁగా
నవకమై నీకెట్ల నవ్వు వచ్చెనో
కవగూడే వప్పటి యీ కతలనే వేఁగినట్టి
ఇవల నామేనెట్ల నితవాయనో

చ. 2: వాడవారి చేఁతలకు వాడుదేరి నేనుండఁగా
జాడ నీకెట్ల సంతసములాయనో
తోడనే పొందేవు యీ విదు(ద్దు)లఁబడి నిట్టూర్పుల
వీడు పడ్డ నామోవెట్టు ప్రియమాయనో

చ. 3: దుండగీలసటలకు తోడనే నీ కొప్పించఁగా
గుండె దాఁకెట్లఁ జులుకులు వుట్టెనో
నిండుగ శ్రీ వేంకటేశ నేఁడెనసి మన్నించితి
దండి నీకు నాపై నెట్టు దయవుట్టెనో

రేకు: 1757-04 పాడి సం: 27-340

పల్లవి: ఇసుక తక్కరి వంటి దీ వలపు
అసము దించక నవ్వే వది నే నెఱఁగనా

చ. 1: చేరి నేఁ జెనకఁగాను చెనఁకేవు నీవు నన్ను
నీరు కొద్ది దామరాయ నీ వలపు
యీరీతి నెందు వోతివి ఇందాఁకా నే నీకు
నేరుపఁగా నేర్చితివి నే నెఱఁగనా

చ. 2: అండ సరసములు నే నాడినట్టే యాడేవు
నిండు రొంపిలో కంబము నీ వలపు
మెండుగా నేఁ దొలుతనే మేలుబంతి వెట్టియ్యఁగ
కొండసెలవై తూరేవు గుట్టు నే నెఱఁగనా

చ. 3: గుక్కక శ్రీ వేంకటేశ కూడినట్టె కూడేవు
నిక్కి యద్ధములోనీడ నీవలపు
పెక్కురతులు నేఁ దలఁపించఁగాఁ దలఁచుకొని
చొక్కి నన్నుఁ జొక్కించేవు సూటి నే నెఱఁగనా

రేకు: 1757-05 బౌళి రామక్రియ సం: 27-341

పల్లవి: కానీవయ్య్య నీమేలు గైకొంటిని
సానఁ బట్టిన చూపుల సంతసించే నీఁకను

చ. 1: చెప్పినట్టల్లా నీవు సేయని వాఁడవా నాకు
చెప్పుడు బుద్ధుల యింత సేసేవు గాక
తప్పక యిప్పుడైనా దయవుట్టెఁగా నాపై
చప్పుడుగా నవ్వు నవ్వి సంతసించే నీఁకను

చ. 2: రట్టుగా మా యింటికి నీవిట్టె రానివాఁడవా
పెట్టెడి వారి భ్రమలఁ బెద్దయితి గాక
గట్టిగా నేడైనాను కరుణించితి గా నన్ను
జట్టిగొని నిన్ను మెచ్చి సంతసించే నీఁకను

చ. 3: పెనఁగేవేళ నీ వింత బిరుదులాడేవాఁడవా
వొనరు నేస్తాలవారి వోజలు గాక
యెనసితి శ్రీ వేంకటేశ నన్ను మన్నించితి
చనవులు మెఱయుచు సంతసించే నీఁకను

రేకు: 1757-06 సౌరాష్ట్రం సం: 27-342

పల్లవి: అందుకే యెదురు చూచీ నాకె నీమోము
మందలించి మీలోపని మాకెల్ల దెలుసుఁగా

చ. 1: చిప్పిలఁగఁ జెమరించి సిగ్గువడీఁ జెలి యదె
చెప్పరాని మాఁట లేమి చెప్పితివో
నెప్పున నీ సేఁత లెల్ల నీవే తీరుచవలె
తప్పి నే మెల్లాను తగవు చెప్పఁగలమా

చ. 2: కాయమెల్లఁ బులకించి కాఁగిలించుకొనెఁ జెలి
ఆయము లెక్కడ నీవు అంటితివో
చాయ నీవే చూపినవి చక్కఁబెట్టవలె నీవే
చేయివట్టి నేము నిన్ను చిమ్మిరేఁచేమా

చ. 3: కొంగువట్టి నిన్నుఁ దీసి గొబ్బున నెనసెఁ జెలి
యింగితాన నెంత చనవిచ్చితివో
రంగు శ్రీ వేంకటేశ నీరతులు నీకే చెల్లు
సంగతి నేమెల్లా యివి సాదించేమా

రేకు: 1758-01 దేసాళం సం: 27-343

పల్లవి: విన్నపము నేఁ జేసేది వింటివా వోయి
కన్నెను నన్నిఁకనైన కరుణించవోయి

చ. 1: పక్కన నే నీతోను పంతము లాడితినంటా
యెక్కువ తక్కువ లాడీ యేమోయి యీపె
చక్కని నీమీఁది బత్తో సవతి మచ్చరమో
తెక్కువ నీ కిదేమైనాఁ దెలుసునా వోయి

చ. 2: చేయి చాఁచి నీమీఁద సేసలు చల్లితినంటా
రాయడించె నిన్న మొన్న రంతుల నీపె
పాయపు వికారమో పతిబందమో తాను
నాయము దిద్దనేర్తువా నంటున నీవోయి

చ. 3: నెమ్మది శ్రీ వేంకటేశ నిన్ను నేఁ గూడితినంటా
కమ్మటి తా నుస్సురని కరఁగీ నీపె
యెమ్మెలు దా నెరపెనో యెడ్డతనము చేసెనో
చిమ్ముల నింతట బుద్ది చెప్పేవా వోయి

రేకు: 1758-02 ఆహిరి సం: 27-344

పల్లవి: నీవు చేపట్టఁగాఁ గాక నే నిన్నాళ్లుఁ గొసరేనా
వావులు చేకొన్నమీఁద వరుస నీ చేతిది

చ. 1: చింతతో నే నుండఁగాను చెలులెల్ల నవ్వఁగాను
యెంత కెంత సేసేవు నీ కేమి గూడెనో
బంతినే నీకు మొక్కితి భవమెల్లా నీకిచ్చితి
పొంతల నిఁక మీఁదటి పుణ్యము నీచేతిది

చ. 2: కాఁకలతో నేనుండఁగా కడవారు మొరయఁగ
యేఁకట నూరకున్నాఁడ విది యేఁటిది
సోఁకఁగ నీ సొమ్ము నేను సొలసి సేవ సేసితి
ఆఁ కలరతులలోనిఆయము నీ చేతిది

చ. 3: నివ్వెరగుతో నుండఁగ నీ సతు లిచ్చలాడఁగ
చివ్వన నన్ను మన్నించే చిత్త మెన్నఁడు
ఇవ్వల శ్రీ వేంకటేశ యెనసితి మిద్దరము
జవ్వనపు విభవాల సరవి నీ చేతిది

రేకు: 1758-03 సౌరాష్ట్రం సం: 27-345

పల్లవి: ఎదురైతి మిద్దరము నేమందును
యెదలో నున్నది వల పేమందును

చ. 1: నన్ను నేనే చూచుకొని నా విరహ మెంచుకొని
ఇన్నిటా జాణవు నిన్ను నేమందును
సన్నలేమి సేసేవు చవులేమి చూపేవు
మన్నన సతిని యిఁక మరియు నేమందును

చ. 2: మునుపే వొడఁబాటులు మొగమోటము లిప్పుడు
యినుమడించె నీ నవ్వు లేమందును
తనివి లేదు నీకైతే తమకమే తఱచాయ
పెనఁగేటిదానఁ గాను పిలిచి యేమందును

చ. 3: పరపు పైఁ గూచుండి భావమెల్లాఁ జేకొని
ఇరవైన నీతోను యేమందును
గరిమ శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
వొరసితి నన్నిటాను వూరకే యేమందును

రేకు: 1758-04 కాంబోదిసం: 27-346

పల్లవి: నావలెఁ గాదువో యీపె నంటున నోరుచుకోను
చేవలు మీరఁగఁబోతే చెలి ఇంతకోర్చునా

చ. 1: చల్లనిచూపులఁ జూచి సళిపించినందులోనే
కల్ల లేమాడితివో ఆకాంత తోను
అల్ల నీవోజెఱఁగనా అంది నాతో నాడినట్టే
చిల్లరలీడ నాడితే చెవి ఇంత కోర్చునా

చ. 2: చాయలు సన్నలుఁ జేసి జంకించినందులోనే
చేయార నేమిసేసితో చేరి యీపెను
మాయలు నే నెఱఁగనా మమ్ము నీవు సేసినట్టే
సేయఁబోతే గొణఁగక చెలి ఇంతకోర్చునా

చ. 3: పక్కనఁ గాఁగిటఁ గూడి పచ్చిసేసినందులోనే
ఇక్కువ లెందంటితివో యీ ఇంతిని
తక్కించి శ్రీ వేంకటేశ తగ నన్నుఁ గూడినట్టే
చిక్కించుకొంటే నేఁడు చెలి ఇంతకోర్చునా

రేకు: 1758-05 పాడి సం: 27-347

పల్లవి: మెత్తనైతే దిగఁబడే మేకుల వాఁడవు నీవు
హత్తుకొనె నీలోని ఆస యెంత ఇఁకను

చ. 1: చల్లని చూపులఁ జూచి సరసములాడి ఇంతి
వెల్లవిరి సే సె నింకా వెలితేది
కొల్లున నవ్వుచు నింకా కొసరే వాపెను నీవు
అల్లనాఁడిఁ (డే) దక్కఁగొంటి వాస యెంత ఇఁకను

చ. 2: తగులఁగ మాఁటలాడి తనువులు సోఁకించి
వెగటుగా వలపించె వెలితేది
మొగమిచ్చులాడుతానే మొక్కేవాపెకు నీవు
అగడు సేసితివి నీ యాస యెంత ఇఁకను

చ. 3: కందువలు నీకుఁ జూపి కాఁగిట బిగించి కూడి
విందువెట్టి (ట్టె) నీకు మోవి వెలితేది
అంది శ్రీ వేంకటేశ నీ యక్కునఁ బెట్టుకొంటివి
అందాలుగా సింగారించేవాస యెంత ఇఁకను

రేకు: 1758-06 లలిత సం: 27-348

పల్లవి: కడనున్నవారు నేనే గర్వినందురు
కడురట్టు సుమ్మమ్మ కతలు యీతనివి

చ. 1: వేడుకలు దైవారె వెంగెములు మేన నిండె
యేడవారితో గొడవలేల తనకు
వాడికకు వచ్చితిమి వలసీ నొల్లనిపతిఁ
జూడరమ్మ చెలులాల సుద్దులు యీతనివి

చ. 2: కళలు మోమున మించె కాఁపురాలు వెంటవచ్చె
పలువుర మీఁద నెల్ల బాఁతియేఁటికి
వలచినదాన నేను వాసులు వెదకీఁదాను
తెలుసుకోరమ్మ మీరు తేటల యీ మాటలు

చ. 3: రచ్చఁబడెఁ దమకాలు రతికెక్కె వయసులు
తచ్చనల కిఁక నేమి తతి గాదు
పచ్చిగాఁ గూడితి నేను భ్రమసె శ్రీ వేంకటేశుఁ
డెచ్చుటఁ దలఁచరమ్మ యీతని భావములు

రేకు: 1759-01 ముఖారి సం: 27-349

పల్లవి: ఇంతులతో నిష్ఠూరము యేఁటి దొరతనము
వంతువాసు లెంచవు నీవంటివాఁడే ఘనుఁడు

చ. 1: అనువెరిఁగి సరసమాడవద్దా నీవలె
ననుచు నిన్నొక చెలి ఆడుకొనెను
మెనుకులే కింతులచే మెప్పించుకొంటివి గాన
నినుపుల జాణఁడవు నీదివో జన్మము

చ. 2: యెల్లవారికి నిచ్చక మెరిఁగి కూడుదువని
చల్లఁగా నిన్ను నొకతె సంతోసించెను
కల్లగాదు సతులకు కళలు రేఁతువుగాన
బల్లిదుఁడ నీదివో పట్టిన పంతము

చ. 3: నగుతా నాపెనుఁ గూడి నన్నునుఁ గూడితి విట్టె
తగవెరిఁగిద్దరము దక్కఁగొంటిమి
సగము పంచిచ్చితివి సరుగ నీవయ సెల్ల
నిగుడి శ్రీ వేంకటేశ నేరుపెల్ల నీదివో

రేకు: 1759-02 రామక్రియ సం: 27-350

పల్లవి: మిక్కుటపు సుద్దులు నీమీఁద నున్నవి
దక్కె నాకు నీ ప్రియము దాఁచఁగ నే నోపను

చ. 1: రవ్వలేల సేసేవు రాతిరెల్ల నీవు మాతో
నవ్విన నవ్వులు నీపై నాఁగు వారీని
పువ్విళ్లూరెఁ జెమటలు వుప్పొలి కినుమడాయ
జవ్వనమె పై తరవు సాదించ నే నోపను

చ. 2: పాఁచి కాఁగి లేమిటికి పట్టపగలే నీవు
రేఁచిన రేపులు దీన రెట్టి గొనీని
పూఁచి పులకలు నిండె పూఁప లెల్లఁ బిందెలాయ
దాఁచరాదు సిగ్గు నిన్నుఁ దప్పులెంచ నోపను

చ. 3: కొసరకు మిఁక నన్నుఁ గూడిన కూటమి నీకు
ముసరి యాస మురిగి ముమ్మడయ్యాని
వెస నీవు మన్నించఁగ విరహమే చవులాయ
పొసఁగ శ్రీ వేంకటేశ బొంకఁగ నే నోపను

రేకు: 1759-03 భైరవి సం: 27-351

పల్లవి: కానీవయ్య దానికేమి కై కొంటిని
మానా పతులైనవారు మట్టుపడవలదా

చ. 1: కోపమెంత నేనెంత కోరి నీవు మాటాడితే
వోపకున్నఁ గొంత కొంత వూఁకొందుఁగాక
తీపుల మగవాఁడవు తేనెలు గురియఁగాను
పైపై వలఁచినవారు భ్రమయక వుందురా

చ. 2: పంతమేడ నేనేడ బలిమి నీవు వట్టితే
చింతతో నున్నాఁ జనవు చెల్లింతుఁగాక
బంతినే మగవాఁడవు పాలు నీవు వోయఁగాను
మంతు కెక్క నోరూరక మానుదురా సతులు

చ. 3: చలమెట్టు నేనెట్టు సరి నీవు గూడఁగాను
అలిగినా మాని నిన్ను నంటుదుఁగాక
యెలమి శ్రీ వేంకటేశ యింత నీవు మన్నించఁగా
తలఁపు గలుగువారు తమకమే పెంతురు

రేకు: 1759-04 దేసాళం సం: 27-352

పల్లవి: ఏల పాట్లఁబడేవు యిందరు నీ పెట్టుఁ జట్లే
పాలు నేయైనఁ బోసేరు పై పై గొల్లెతలు

చ. 1: అలయకుమంత నీవు అట్టె మాపై నొరగేవు
పలుసతులఁ జెనకి బడలితివి
మలగు వేసితి మదె మంచము పైఁ బవళించు
పిలిచి పెట్టేరు దామే ప్రియురాండ్లు విందులు

చ. 2: దప్పిగొన కంత నీవు తగ మా మోవే యానేవు
వొప్పుగురతుల నస్సురుసరైతివి
కప్పురము కోవి నదె కైకొను పానకమైన
కప్పే రెవ్వరైనాను కాంతలు పయ్యదలు

చ. 3: కన్ను లార్చకంత నీవు కడునేల జోగిలేవు
కన్నెల మదాలు నీపైఁ గప్పెను నేఁడు
ఇన్నిటా శ్రీ వేంకటేశ యిటు నన్నుఁగూడితివి
పన్ని వూడిగెపువారు పాదము లొత్తేరు

రేకు: 1759-05 సాళంగం సం: 27-353

పల్లవి: ఆయలే యెంత లేదు నీయట మటాలు
వేయు మారులేల మమ్ము వేఁడుకొనే విపుడు

చ. 1: ఆరూడి(ఢి)గా నిన్నుఁ దిట్టి ఆయము లంటితేఁ దట్టి
నేరములెంచే సతులు నీకుఁ బ్రియము
చేరువ గాఁచుక వుండి సేవలెల్లా నీకుఁజేసి
మేరలు మీరని మమ్ము మెచ్చేవా నీవు

చ. 2: చెక్కులు సారెకు నొక్కి సిగ్గుతో పాదాలు దొక్కి
నిక్కి నిక్కి చూచేవారు నీకుఁ బ్రియము
మొక్కుచుఁ గందువ చూపి మోహములు రెట్టింపించి
మిక్కుటమైన వారి మెచ్చేవా నీవు

చ. 3: బలిమి నిన్నుఁ గలసి పంతములనే సొలసి
నెలకొని వుండేవారు నీకుఁ బ్రియము
యెలమి శ్రీ వేంకటేశ ఇట్టె నన్నుఁగూడితివి
మెలఁగి వొకపాటివారి మెచ్చేవా నీవు

రేకు: 1759-06 బౌళి సం: 27-354

పల్లవి: ఏల కొంగు పట్టేవు మేరుపరచుమంటాను
ఆలరి వనుచు సారె నాడేనా నిన్నును

చ. 1: వేడుకకు వెల లేదు వెన్నెల కడ్డము లేదు
వాడికెకు నీకు నెందు వావి లేదు
కోడెకాడఁ నీవీ మాఁట గొల్లెతలనే యడుగు
పాడితోఁ జీకఁటితప్పు పట్టితినా నిన్నును

చ. 2: కోరికకుఁ దుదిలేదు గుట్టు తుమ్మిదకు లేదు
వారించి నీ గుణముల వంకర వోదు
గారవపు నీమాఁట గందము కుబ్జ నడుగు
పేరుకొని నే నారడిఁ బెట్టేనా నిన్నును

చ. 3: నగవుకు వేళలేదు ననలకుఁ గంపు లేదు
తగిన నీ మనసుకు తనివి రాదు
నిగిడి శ్రీ వేంకటేశ నీవే నన్ను నడుగు
సొగిసి నన్నుఁ గూడితి సోదించేనా నిన్నును

రేకు: 1760-01 మాళవి గౌళ సం: 27-355

పల్లవి: సేయఁగలవెల్లాఁ జేసి చెవిఁబెట్టఁ డేమాట
దాయివలె నున్నవాఁడు బట్టు సే సెనంటాను

చ. 1: మారు మాట లాడకుంటే మరి వాదులే లేవు
చేరి తలవంచుకుంటే సిగ్గు దోఁచదు
నేరిచినాఁ డీ విద్యలు నెరజాణ తనమంటా
రారానే తనకొద్దే రవ్వలిఁకఁ జూతము

చ. 2: యెక్కడో పరాకైతే యెగ్గులు దప్పులు లేవు
పక్కన నవ్వు నవ్వితే భయము దీరు
చిక్కించుకొన్నాఁ డేడనో చిత్తడీ ముద్దులెల్ల
కక్కసించకువే తనకత లెల్లఁగందము

చ. 3: ముసుఁగు వెట్టుకవుంటే ముంచు దరితీపులెల్ల
కొసరకుంటే వలపు కొనసాగును
యెసఁగ శ్రీ వేంకటేశుఁ డి దెరిఁగి నన్నుఁగూడె
విసిగించకురే తన వేడుకలు చూతము

రేకు: 1760-02 సాళంగం సం: 27-356

పల్లవి: నవ్వేవంటా నుండితిమి నమ్మి యిందాఁకా
జవ్వనపు దానను సాదించక మానను

చ. 1: వలపులు రేఁచితివి వాసులెల్లఁబూఁచితివి
చెలుల సుద్దులు మాతోఁ జెప్పి చెప్పి
మలకల సట లివి మాతోనే వద్దు సుమ్మీ
పెలుచుఁబంతాలదానఁ బెనఁగక మానను

చ. 2: ఆసలు వుట్టించితివి ఆయాలు పట్టించితివి
వేసాల సతులఁ గొనవేసి వేసి
ఆ సుద్దులు మమ్ము నిఁక నల ఇంచ వద్దు సుమ్మీ
బేస బెల్లితనమునఁ బెనఁగక మానను

చ. 3: కన్నుల సన్నలు చేసి కాఁగిట సారెకు డాసి
పన్నితి మాయ లింతులఁ బాడి పాడి
మున్నిటి శ్రీ వేంకటేశ మోసములు వద్దు సుమ్మీ
కన్నెను నేఁ గూడితిని గద్దించకమానను

రేకు: 1760-03 ఆహిరి సం: 27-357

పల్లవి: నేరుపు లిన్నియు నీఁక నీ చేతిది
సారె వలపుల సంతోసాన నుందానను

చ. 1: కాఁకలు నీమీఁదఁ జల్లి కాఁతాళముతో నుండితి
చేఁకట నీవు పట్టితే సిగ్గువడితి
యేఁకటతో నీవే నన్ను ఇంతాఁ జేసేవాఁడవు
వేఁకపు జవ్వనముతో వెరంగైవుందానను

చ. 2: యేకతమైనపుడే నిన్నెల ఇంచేనంటా నుందు
వాకుచ్చి మాటాడితే నీవసమౌదును
పైకొని నీవే ఇంతా భ్రమ ఇంచేవాఁడవు
దా కొని మొగమోటకు దగులై వుందానను

చ. 3: నించిన రతుల నిన్ను నీరేనంటా నుండితి
అంచెల నీవు గూడితే నట్టె వుంటిని
నించి శ్రీ వేంకటేశుఁడ నీవింతాఁ జేసేవాఁడవు
దించని సంభ్రమముతో తిరమై వుందానను

రేకు: 1760-04 హిజ్జిజి సం: 27-358

పల్లవి: ఎంత కంతే చాలుఁ గాక యెక్కుడేఁటికి
వంతులకు మమ్మునేల వాసులు రేఁచేవు

చ. 1: మొగము చూచినందుకు మొక్కితేనే చాలదా
నగవు లిందుకుఁదోడు నగవలెనా
అగడుసేసి నీతో నలిగేటి వారమా
వెగటుగా మమ్మేల వింతలు సేసేవు

చ. 2: చేసన్న సేసినందుకు సిగ్గువడుటే చాలదా
ఆసపడి అండకురా నంత వలెనా
వీసమంత పనికిఁగా వేసరించే వారమా
రాసికెక్క మమ్మునేల రాఁపులఁబెట్టేవు

చ. 3: వొడివట్టిన యందుకు వూరకుండుతే చాలదా
సడిఁబెట్టి కాఁగిలించ సారె వలెనా
చిడుముడిఁ గూడితివి శ్రీ వేంకటేశ నన్ను
కడవారమా యేల కతలు సేసేవు

రేకు: 1760-05 సాళంగనాట సం: 27-359

పల్లవి: ఈసులు వాసులు మాకు నేల రేచేవు
నీ సూటికి రాని సేఁత నేము సే సేమా

చ. 1: ఆ రీతి కొపినవారు అలుగుదురింతే కాక
మారుకొని నే నీతో మచ్చరించేనా
పేరడి నీ కివి యెల్లాఁ బ్రియమైతే నౌఁగాక
మేరలు దప్పినపని మేము సేసేమా

చ. 2: అట్టడియైనవారు పట్టి బిగుతురుగాక
కట్టిడినై నే నీతో కాఁతాళించేనా
నట్టుకొట్టి నీకు నివి నవ్వులైతే నవుఁగాక
మెట్టిపట్టు కింతవని మేము సే సేమా

చ. 3: పలుకుఁ బంతాలవారు బలిమి సేతురు గాక
తొలుతనే నే నిన్ను దొమ్మి సే సేనా
యెలమి శ్రీ వేంకటేశ యెనసితి మిటు నీలో
మెలగుతా నింతవని మేము సే సేమా

రేకు: 1760-06 వరాళి సం: 27-360

పల్లవి: ఎంచినట్టు వడునా యెన్నికె లెవ్వరికైనా
దించని తమకమున తేరి నవ్వే నేను

చ. 1: గునియుచు నినుఁ బాసి కోపగించేనని వచ్చి
ననుపు నీ మాటలకు నవ్వే నేను
అనువుల నీ చేఁత నిన్నడిగే నేనఁగానే
ననుఁ జేయివట్టుకొంటే నవ్వే నేను

చ. 2: ఆలరి మాఁటలు నిన్ను నాడేనంటా వచ్చి
నాలి నీ యానల కిట్టె నవ్వే నేను
జాలిఁ బెట్టి బొమ్మల జంకించి వలచిన
నాలాగు లిటు చూచి నవ్వే నేను

చ. 3: కులికి కులికి నిన్ను గోరఁ జిమ్మేనని వచ్చి
నలి నలి మేను చూచి నవ్వే నేను
చెలఁగి మండెములోన శ్రీ వేంకటేశ కూడితి
నలువంక చెలులతో నవ్వేనేను

రేకు: 1761-01 వేళావళి సం: 27-361

పల్లవి: నీకు వేడుకైతేఁ జాలు నే మెట్టయినా నుండేము
యేకడ చూచిన నీవే యేలవయ్య రాజ్యము

చ. 1: తీపులు వుట్టించి నీవు తేరి సన్నలు సేయఁగ
కోపాలు రేఁగకుండునా కొమ్మలకు
ఆపె నేను యేమి సేతు మాడువార మెఱఁగము
యేపున నింతేసి సేసి యేలవయ్య రాజ్యము

చ. 2: ఆసలు రేఁచి నీవు అసము లిచ్చి నవ్వఁగ
వాసులు వుట్ట కుండునా వనితలకు
వోసరించదాపె, నేను వోరువఁజాల నిందుకు
నీసరి నిద్దరివంక యేలవయ్య రాజ్యము

చ. 3: మలసి కొంగులువట్టి మంచముపైకిఁ దియ్యఁగ
కళలు వుట్టకుండునా కాంతలకు
యెలమి శ్రీ వేంకటేశ యెనసితివి మమ్మును
యెలయించి యెలయించి యేలవయ్య రాజ్యము

రేకు: 1761-02 గౌళ సం: 27-362

పల్లవి: పదము దప్పినమీఁద పంతమిచ్చేవా
చెదరని ఆసలెల్ల చిత్తగించరాదా

చ. 1: చెప్పఁజాలక వలపు సిగ్గువడీఁగాని చెలి
చొప్పున మొకమువాడు చూడరాదా
కుప్పళించి ఇందరిలో గుట్టు విడువదుగాని
చిప్పిలె పెంజెమటలు చిత్తగించరాదా

చ. 2: గుటిగాని మనసే గుబ్బతిలీఁగాక చెలి
కటకున సురుసురు కన్గొనరాదా
తటి వచ్చినందాఁక తమకపడదుగాని
చిటినవ్వుతోడి చింత చిత్తగించరాదా

చ. 3: వొలుక కుండ వయసు వొట్టి నీ కొప్పించీగాని
సొలపుల మోముకళ చూడరాదా
యెలమి శ్రీ వేంకటేశ యెనసితి వీపె నిట్టె
చెలఁగి నిన్నదె మెచ్చీ చిత్తగించరాదా

రేకు:	1761-03	పాడి	సం:	27-363

పల్లవి:	కానీవయ్య అందుకేమి కై కొంటిని
యీ నిజమే నెరపితే నెందువోయీఁ బనులు

చ. 1:	చే పట్టి తీసి నాతోఁ జెలరేఁగి పెనఁగేవు
వోపితేఁ జాలుఁగాక వొద్దనేనా
తీపులెల్లాఁ జిలికించి దిమ్మరిమాట లాడేవు
యీ పట్టుకు నిన్ను మీరి యెందువోయీఁ బనులు

చ. 2:	వొత్తి నాకుఁ జెప్పరాని వూడిగాలు చెప్పేవు
చిత్తము వచ్చితేఁ జాలు సేవ సే సేను
పొత్తుకుఁ బిలిచి నన్ను పొలఁతుల నంటించేవు
ఇత్తల నీవే నేను యెందువోయీఁ బనులు

చ. 3:	పానుపుపైఁ గాఁగిలించి పంతాలకుఁ గూడేవు
దానికేమి తలఁచని తలఁపాయను
పూనుక శ్రీ వేంకటేశ భోగించితి మిద్దరము
యీ నయము నీకే చెల్లు నెందువోయీఁ బనులు

రేకు: 1761-04 వరాళి సం: 27-364

పల్లవి: మాది క్కేమిచూచేవు మాటి మాటికి
సాదుఁగొయ్యతనాలకు సాదించవలదా

చ. 1: ఆడుమంటాఁ బాడుమంటా నలఇంచితివి చెలి
వేడుక కాఁడవై నీవు వేఁగినంతాను
వీడె మిమ్మనుచు నీవు వేగిరించే వప్పటిని
జాడల నీవోజ కాపె జంకించవలదా

చ. 2: రమ్మనుచుఁ బొమ్మనుచు రవ్వ సేసితివి చెలి
దిమ్మరి ఊడిగేలనే తెల్లవారెను
కమ్మి యిట్టె నవ్వుమంటా కాఁతాళించే వప్పటిని
కొమ్మ నీచేఁతలకును కోపించవలదా

చ. 3: వుండుమంటాఁ బండుమంటా వూరడించితివి చెలి
అండనే శ్రీ వేంకటేశ అంకెలఁ గూడి
చండి పెట్టి పాదాలొత్త సమకట్టే వప్పటిని
మెండు నీయాసలు చూచి మేర మీర వలదా

రేకు: 1761-05 ముఖారి సం: 27-365

పల్లవి: గొల్ల దోమటాయ నేఁడు కొమ్మలకు నీతో పొందు
మెల్లనే సరసమాడ మేము నిట్టె వలెనా

చ. 1: వాసులకే మాటలాడి వట్టి చనవు సేసుక
రాసి కెక్కె రదివో నీరామలెల్లను
వేసరినఁ బోనీక వేడుక నవ్వులు నవ్వి
నీ సరికే వచ్చిరిగా నేఁడు వీరెల్లాను

చ. 2: సందడి జాణతనాలు సారెకు నీపై వేసి
కందువకే వచ్చిరిగా కాంతలెల్లాను
విందుల మోవులు చూపి వేమారుఁ గొలువుసేసి
యిందరైరిగా నీకు నిల్లాండ్లు

చ. 3: వసంతములాడుతానే వడి నిన్నుఁ గాఁగిలించి
యెసరెత్తిరిగా మోహాలింతు లెల్లాను
యెసఁగ శ్రీ వేంకటేశ ఇదె నన్నుఁగూడితివి
దొసకులు వేసిరిగా తొల్లిటివా రిపుడు

రేకు: 1761-06 బౌళి సం: 27-366

పల్లవి: ఇట్టె భ్రమసివుందాన యేమనీఁదాను
యెట్టకేలకు నవ్వితి మేమనీఁదాను

చ. 1: మొదలఁ దనపై నేను మోహము సేసినందుకు
యెదురుగుదురుగాను యేమనీఁదాను
పదరక తనకు నేఁ బంతము లిచ్చినందుకు
యిదివో యిందరు మెచ్చ యేమనీ దాను

చ. 2: చెంతలఁ జెప్పినట్టెల్లా సేసి మొక్కినయందుకు
యెంతగద్దు తనయాస యేమనీఁదాను
మంతుకెక్క నేఁ దనమాటలు నమ్మినందుకు
ఇంతలోనె వేగిరించి యేమనీఁ దాను

చ. 3: కనుసన్న చేసి తన్ను కాఁగిలించుకొన్నందుకు
యెనలేని సంతోసాన యేమనీఁదాను
చనవిచ్చి శ్రీ వేంకటేశ్వరుఁడె తా నన్నుఁగూడె
ఇనుమడితమకాలు యేమనీఁదాను

రేకు: 1762-01 రామక్రియ సం: 27-367

పల్లవి: అట్టు సేసెఁగాక మమ్ము ఆతిగుండెతో
గట్టిగ వాకిట వచ్చి కాచుకండనా

చ. 1: తనతో మాటాడనంటా తప్పులు వట్టేవాఁడు
యెనసి యీ పొద్దాయ యేడ నుండెనే
అనకుండరాదా మాట ఆయాలు సోఁకేవేళ
పెనఁగి ఇందాఁకా నేను పిలిపించనా

చ. 2: యెదురుగా రానంటా యెగ్గులు వట్టేవాడు
వుదుటు సేఁతలకేల వొడిగట్టెనే
వొదిగి వుండఁగరాదు వొరసి తా మించఁగాను
అదనఁ జెలుల నంపి ఆనలు వెట్టించనా

చ. 3: నేనే ముందు గూడనంటా నెరుసు లెంచేవాఁడు
పానిపట్టి తానేల పంతాలాడీనే
కానిమ్మంటాఁ బుట్టపర్తికాఁడ శ్రీ వేంకటేశ్వరు
యీనెపానఁ గూడితి నే నెచ్చరించనా

రేకు: 1762-02 వరాళి సం: 27-368

పల్లవి: నివ్వెరగుతో నాపె నిండుకున్నది
జవ్వనము రేఁచిపెట్టి చలమిఁకఁ దగునా

చ. 1: వొత్తి విన్నవించలేక వొద్ద నిలుచున్న దింతి
చిత్తగించి యామాట సేయరాదా
బత్తితోడ నియ్యరానిబాసలెల్లా నిచ్చితట
పొత్తు గుడిచితివట బొంకనింకఁ దగునా

చ. 2: కక్కసించలేక నీపై కాఁకలు చల్లీ నింతి
చిక్కుల ఆపె చనవు చెల్లించరాదా
మిక్కిలి యాపెకు నీవు మేలువాఁడవూనట
దక్కివున్నాఁడవూనట తచ్చ నింకఁదగునా

చ. 3: చేవట్టి తియ్యఁగ లేక సిగ్గులు వడీ నింతి
సేవలు సేయించుకొని చెల్లఁగరాదా
శ్రీ వేంకటేశ్వర ఇట్టె చేకొని కూడితివట
భావము మాలోనిదట పంత మిఁకఁ దగునా

రేకు: 1762-03 ఆహిరి సం: 27-369

పల్లవి: విన్నవించరే యీమాట వెలఁదులాల
పన్ని తన సుద్దులేమి బాయిట వేయనే

చ. 1: జగమెల్ల నెరఁగఁగ సతి నయితిఁ దనకు
తగ వించుకంతా దప్ప తనపాలికి
వెగటుగా దానెంత వేడుక కాఁడైనాను
నగేఁగాని వింతతనము సేయనే

చ. 2: సిగ్గు నెగ్గులు నెంచక చిత్తమురా నడచితి
దగ్గరి దక్కి వుంటిని తనపాలికి
వెగ్గళించి తనసేఁత వెల్లావిరులైనను
వొగ్గి తన్ను మెచ్చేఁగాని వొరటులు చూపనే

చ. 3: కలసి మెలసి వుండి కాఁగిలించుకొంటిని
తలఁపు వొప్పగించితి తనపాలికి
యెనసె శ్రీ వేంకటేశుఁడిఁక నేమి సేసినాను
చనవిచ్చేఁగాని మరి సాదించనేరనే

రేకు: 1762-04 కాంబోది సం: 27-370

పల్లవి: చుట్టపు వరుస వచ్చి సొలయుచు నున్నారము
తిట్టరుగదా తరితీపుల నున్నారము

చ. 1: తగవులు చెప్పఁగాను తప్పులేమీ రావుగదా
మిగులార సరసమాడే మీలోనను
నగవులు నగఁగాను నన్నేమి ననరు గదా
తగని కోపము మీ కాఁతాళములు చూచి

చ. 2: సాకిరై నిలువఁగాను సడి మాకు రాదు గదా
మేకుల పంతములాడే మీలోనను
రాకపోకలకు మమ్ము రవ్వలు సేయరు గదా
కాకరితనముల మీ కందువలు చూచి

చ. 3: నిక్కి మిమ్ముఁ గూడించఁగా నింద మాకు రాదు గదా
మిక్కిలి జవ్వనముల మీలోనను
యెక్కువ శ్రీ వేంకటేశ యిద్దరు నెనసితిరి
చొక్కించరుగదా మీమా సుద్దులెల్లఁ జూచి

రేకు: 1762-05 గౌళ సం: 27-371

పల్లవి: నిన్ను మోఁచి వచ్చినంటా నేరుపుల దిరిగేవు
సన్న లిట్టె సే సేవు నీజాడ నే నెఱఁగనా

చ. 1: మొగమిచ్చు లాడలేక మోనాన నుండితిఁగాక
తగవులే పలికితే తగుననా
జగడించి యాపె నేను సాకిరి నిన్నడిగితే
నగవులు నవ్వేవు నీ నాటకాలెఱఁగనా

చ. 2: యిచ్చకాలు సేయఁగాను యియ్యకోనైతిఁగాక
అచ్చముగా నడచితే నవుననా
మచ్చరించి యాపె నేను మంకులు దేరుచుమంటే
తచ్చనలు సే సేవు నీ తలఁపు లెఱఁగనా

చ. 3: చలపట్టఁగా నీతో సాదించకుండితిఁగాక
యెలమి శ్రీ వేంకటేశ యిందుకనేనా
అలమేలుమంగను నిన్నాపె నేనుఁ బిలిచితే
కలసితి విద్దరిని కత లివెఱఁగనా

రేకు: 1762-06 బౌళి సం: 27-372

పల్లవి: ఇందులోనఁ దప్పులేవి యేల నన్ను దూరేవు
నందనందనుఁడ నాలో నవ్వితి నేను

చ. 1: ఆమనిగా నిందాఁకా ఆపెమాఁటలా, డిప్పుడు
నామాఁట లాడఁగాను నవ్వితినేను
జాముదాఁక ఆపె దిక్కు సంతోసానఁ, జూచి చూచి
నామోము చూడఁగాను నవ్వితి నేను

చ. 2: పోయిన రాతిరి యెల్లా పొరుగింటి కాడ నుండి
నా యింటికి రాఁగాను నవ్వితి నేను
చాయల కాపె సుద్దులు సతులచేఁ దడవించి
నాయాలు నీవు చెప్పఁగా నవ్వితి నేను

చ. 3: అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
నడుమ నీవు గూడఁగా నవ్వితి నేను
యెడపుల యాపెఁ దచ్చి యిట్టె నాకు మొక్కించఁగా
నడవడి చూచి నిన్ను నవ్వితి నేను

రేకు: 1763-01 కాంబోది సం: 27-373

పల్లవి: చెప్పినట్టు సే సేఁగాని చెలివి నీవు
కుప్పళించీ నావలపు కొంత నాన నీవే

చ. 1: పెనగేటి విభునితో బిగియఁగరాదు నేను
చనవు గడు నిచ్చితే చలము వోదు
వెనుకొని నీవేల వేఁడుకొనే విటు నన్ను
తనుఁదానే నాయకుఁడు దండకు రానీవే

చ. 2: చెక్కునొక్కి పతితోడ సిగ్గువడరాదు నాకు
యిక్కడ నే నియ్యకొంటే యీసు దీరదు
వొక్కమాఁటే నన్నేల వొడఁబరచేవే యింత
తక్కించీనా యీతఁడే తమకించనీవే

చ. 3: కూడిన శ్రీ వేంకటేశుఁ గొంగువట్టరాదు నాకు
యీడైతి అలమేల్మంగ నెదురు లేదు
వేడుకాయ ఇకనేల వేసరించేవే నీవు
వీడెపుమో వితనికి విందువెట్టనీవే

రేకు: 1763-02 మాళవిగౌళ సం: 27-374

పల్లవి: నీ యెడకు నంతేసి నే మోపము
దాయిదండగా నవే తలఁచుకోరాదా

చ. 1: వోటలేక యెవ్వతో నిన్నొక చోటఁ దిట్టితేను
మాఁటలు నేర్చుకవచ్చి మమ్ము దిట్టేవు
పేటలుగ నీకు నవే ప్రియములైతేఁ గనక
చీటికి మాటికి కొండసెలఁ దిట్టరాదా

చ. 2: తొలుత మరి నెవ్వతో తురుము నిన్నుఁ బట్టితే
కొలఁది మీరఁగ మా కొప్పు వట్టేవు
యెలమి నవే నీకు యితవులైతేఁ గనక
పొలసి మొగళ్లెక్కి పూవులు గోయరాదా

చ. 3: నలిగా నందరిచేత నవ్వించుకొని వచ్చి
అలమేల్మంగను నన్ను అట్టె నవ్వేవు
కలసితిమి శ్రీ వేంకటేశుఁడ వేడుకైతే
సొలసి యద్దమునీడ చూచి నవ్వరాదా

రేకు: 1763-03 కేదారగౌళ సం: 27-375

పల్లవి: ఈపె యేమి సేసును యింతి గడు ముద్దరాలు
వోపిక నీకుఁ గలితే వొరసుకోవయ్యా

చ. 1: సిగ్గులువడే వారికి సెలవి నవ్వులు వచ్చు
యెగ్గువట్టి గరిసించ యేలయ్య నీకు
వెగ్గళించి ఇది నీకు వెంగములైతేఁ గనక
దిగ్గన నూరివారితో తెలుపుకోవయ్య

చ. 2: ముచ్చటలాడే వారికి మొక్కులు వేళమే వచ్చు
యెచ్చరి వుదిరిపడనేలయ్య నీకు
పచ్చిదేరి యిది నీకు పంగెములైతే గనక
కుచ్చి నీ పొరుగువారి కొంగు వట్టవయ్యా

చ. 3: వురముపై నుండేవారి కొద్దిక బీరము వచ్చు
యెరవుల పంతము లేలయ్య నీకు
అరిది శ్రీ వేంకటేశ ఆపె యలమేలుమంగ
సరిఁగూడె నొద్దివారి సాకిరెంచవయ్యా

రేకు: 1763-04 ఆహిరి సం: 27-376

పల్లవి: మరిగితి మిదె నిన్ను మా భాగ్యము
తరి తీపులఁబెట్టేరు దండనున్న చెలులు

చ. 1: గుఱ(ఱు)తులు నీ మేనివి గొబ్బున వెల్లావిరులు
మఱఁగులు మొఱఁగులు మా మాటలు
మఱి దొరవు గనక మానుపరావు పనులు
వొఱపుల నొరసేరు వొద్దనున్న చెలులు

చ. 2: తలఁపులు నీలోనివి దట్టపురాలవంటి
మలకలు మొలకలు మా వయసులు
బలిమికాఁడవు గాన పట్టరు నీగుణములు
సొలసేరు మమ్ము నైతే చుట్టాలైన చెలులు

చ. 3: గుదిగొన్న ప్రియములు కూడిన నీ కూటములు
మదములు ముదములు మా సిగ్గులు
అదె శ్రీ వేంకటేశుఁడ అలమేలుమంగ నేను
పదరరు మీతో మమ్ముఁ బాడేరు మా చెలులు

రేకు: 1763-05 దేసాళం సం: 27-377

పల్లవి: వింతవారు నిన్నేమన్నా వినఁజాలము
మంతుకు బదుకవయ్య మాకు సెలవుగను

చ. 1: చెక్కులును నొక్కితివి సెసలునుఁ జల్లితివి
యెక్కువైతి మింక మాకు నేమి గొరత
దిక్కుల సతులు నిన్ను దీవించేటట్టు గాను
మక్కువ బతుకు నీవు మాకు సెలవుగను

చ. 2: సెలవుల నవ్వితివి చేయి మాపై వేసితివి
చెలఁగితి మిఁక మాకు చింత యేడది
చెలిమి సేసినవారు చేయెత్తి మొక్కేయట్టుగ
మలసి బతుకవయ్య మాకు సెలవుగను

చ. 3: కందువలు చూపితివి కాఁగిటనుఁ గూడితివి
అంది యలమేల్మంగను అక్కర లేదు
ఇందునే శ్రీ వేంకటేశ యిరుగుపొరుగు వారి
మందలించి బతుకుమీ మాకు సెలవుగను

రేకు: 1763-06 పాడి సం: 27-378

పల్లవి: ఏల బలిమి సేసేవు ఇంతలో మమ్ము
వాలుక రెప్పల తలవంచుటే సుకము

చ. 1: మాయదారి వారి తోడ మంతనాలాడుట కంటె
చాయలు సేసుకుండుటే జాణతనము
చేయి మీఁదఇనవారిఁ జెనకుటకంటేను
ఆయమెరిఁగి నవ్వుటే అది మంచితనము

చ. 2: యేతులు నెరపేవారి యెదుట నిలుచుకంటే
దూత పనులు సేయుటే దొరతనము
కాతరించేవారితోడ కతలు చెప్పుటకంటే
నీతితో మోనానుండే నేరుపే నేరుపు

చ. 3: వేసాల నెరపేవారి వేడుక చూచుటకంటే
వాసితో జూజ మాడితే వై పైవుండు
ఆసల శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
నీసొబగు యిట్లానుంటే నిచ్చకల్యాణములు

రేకు: 1764-01 సామంతం సం: 27-379

పల్లవి: కొమ్మలు పాదాలొత్తఁగా గోవిందుఁడు
యెమ్మెలకే పవళించె నిదివో గోవిందుఁడు

చ. 1: సరిగా గొల్లెతలతో సరసాలాడి యలసి
నిరతితోఁ బవళించె నేఁడు గోవిందుఁడు
అరసి బృందావనాన ఆవులఁ గాచి వచ్చి
ఇరవుగఁ బవళించె నిదివో గోవిందుఁడు

చ. 2: కదిసి గోపాలులతో కచ్చుకాయ లాడివచ్చి
గుదిగొనఁ బవళించె గోవిందుఁడు
మొదల గోవర్ధనాద్రి మోఁపు మోఁచి వచ్చి నేఁడు
యెదుటనే పవళించె నిదివో గోవిందుఁడు

చ. 3: నించి శ్రీ వేంకటాద్రిని నిలిచిందుఁ బవళించె
కొంచక తిరుపతిలో గోవిందుఁడు
అంచెలఁ బదారువేల నలమి వారివరుస
లెంచుకొంటాఁ బవళించె నిదివో గోవిందుఁడు

రేకు: 1764-02 గౌళ సం: 27-380

పల్లవి: ఇందువంక నేమి గద్దు యెంత సేసినా
పొందినవాఁడు తానే బుద్ధి చెప్పీ మనకు

చ. 1: చలము లేమిటికే జగడా లేమిటికే
అలరి పొత్తులమగఁడాతఁ డుండఁగా
కులికి యంత గలితే కొంగువట్టుదము రావే
బలిమి వలపు దానే పంచిపెట్టీ మనకు

చ. 2: మచ్చర మేమిటికే మంతన మేమిటికే
అచ్చమయిన పురుషుఁ డాతఁ డుండఁగా
ముచ్చట యింత గలితే ముదులకింతము రావే
ఇచ్చిన చనవు దానే యేర్పరచీ మనకు

చ. 3: మంకు లివేమిటికే మరఁగు లేమిటికే
అంకెల శ్రీ వేంకటేశుఁ డాతఁ డుండఁగా
తెంకినే తానే కూడె తెలుసుకొందము రావే
సుంకుల సలిగెలెల్ల చూరలిచ్చీ మనకు

రేకు: 1764-03 హిజ్జిజి సం: 27-381

పల్లవి: ఇతరుల చేత నౌనా యాపనులు
తతి నన్నిటికి గురి తానే కదవే

చ. 1: బిగిసి యాపెయు నేను బీరము లాడేటివేళ
తగవుఁ జెప్పఁగలఁడు తా రమ్మనవే
అగడుగా నిద్దరము అవుఁగాదనుకొనేవేళ
వెగటు దీరుచు నిందు విచ్చేయుమనవే

చ. 2: బలిమి నొక్కొక్కరము పంతములాడేటి వేళ
సొలపు దీర్చ నేరుచుఁ జూడుమనవే
యెలమి మాలో నేము ఇంత రేసయిన వేళ
వలసినట్లు సేసును వద్దనుండు మనవే

చ. 3: దగ్గరి సవతులము తమకించేయట్టివేళ
సిగ్గు వాపి మమ్ముఁ గూడఁ జెల్లుననవే,
నిగ్గుల శ్రీ వేంకటాద్రినిలయుఁడు తాఁగలసె
వొగ్గితిమి మా చేఁతల కొడ్డుకోకుమనవే

రేకు: 1764-04 లలిత సం: 27-382

పల్లవి: ఏమని నే నాడినాను యీసడించేవు
వేమారు మీరలిగితే వేఁడు కొనఁదగదా

చ. 1: తగవు చెప్పితినా తరుణికి నీకు నేఁడు
అగడుమీవోజ తగదంటిఁగాక
తగులుగలదానను దండనున్నదానను
మగటిమి మీవాదులు మానుపఁగద గదా

చ. 2: గుట్టు వెళ్లవేసితినా కోమలికి నీకు నేను
పెట్టిన వొట్లు తలఁపించితిఁగాక
పెట్టిన సేసదానను ప్రియముతోడి దానను
మట్టులు మీరితే మిమ్ము మచ్చరించఁదగదా

చ. 3: చెనకులు రేఁచితినా చేతులు మిమ్ముఁబట్టి
పెనఁగించి మీవలపు పెంచితిఁగాక
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
చనవుగలదానవు సాదించఁ దగదా

రేకు: 1764-05 సామంతం సం: 27-383

పల్లవి: ఆపె వచ్చె అవునోకాదో అడుగవయ్య
యేపొద్దాయ జాగుల మమ్మేల పెట్టేవయ్యా

చ. 1: తప్పక చూచితేనే తలఁపెల్లఁ గానరాదా
చెప్పవలెనా నీచేఁతలెల్లాను
కుప్పళించె పెంజెమట గుబ్బన తురుము వీడె
దప్పిగొంటి నీసుద్దు లెందాఁక విందునయ్యా

చ. 2: వద్దఁగూచుండి నంతనే వలపెల్లఁ గానరాదా
ముద్దుమోము చూపి మాకు మొక్కవలెనా
చద్ది నిట్టూర్పులు రేఁగె జవ్వనము వేఁకమాయ
వద్దన వెఱతు నే నెవ్వరికిఁగానయ్యా

చ. 3: నిలుచుక వుండితేనే నిజమెల్ల గానరాదా
చెలరేఁగి సత్యమును సేయవలెనా
నెలవై శ్రీ వేంకటేశ నీవే నన్నుఁగూడితివి
అలసితి వీడెమిచ్చే నందుకొనవయ్యా

రేకు: 1764-06 బౌళి సం: 27-384

పల్లవి: ఇందుకే వెరగయ్యీ మా కిందులో నిన్నుఁజూచి
సందడిసరసముల చలముకొనేవే

చ. 1: కాఁకల విభునిఁ జూచి కనురెప్ప వేయవు
యేఁకట నీమది నింక నెంత గలదే
ఆఁకల మెడగట్టుక అతఁడు నీకున్నవాఁడు
వాఁకల వలపు పరవంజా కొనేవే

చ. 2: నున్నని మాటలాడియు నోరఁ గాయ వేయవు
యెన్నిక నీమది నింక నెంత గలదే
చన్నుల తుదలనే సరసుఁడు వున్నవాఁడు
పన్నిన రతులకెల్ల బార చాఁచేవే

చ. 3: నిండఁ గాఁగిలించుకొని నీలోనఁ దనియవు
యెండల నీడల యాస యెంత గలదే
అండ శ్రీ వేంకటేశుఁడు అంది పాయకున్నవాఁడు
గండి తమకము లెల్ల గాదెఁ బోసేవే

రేకు: 1765-01 వరాళి సం: 27-385

పల్లవి: మేలుదానరా నే నీకు మేలు దానరా
యేల యేఁచేవు ఇంటికి రారా
మేలుదానరా కొండలయ్య మేలుదానరా, అప్పకొండ మేలుదానరా

చ. 1: కోమలపు నాచన్నులు నీకు గురుతు కానిక లివిరా
చేముట్టి చేకొనరా, నీమోము చూపిమోవి యియ్యరా

చ. 2: తనువుపై నీచేఁతలు నిన్నుఁ దలపించు నే పొద్దును
చెనకుచు నిండుఁగాఁగిటనాతోమనసిచ్చిమాటలాడరా

చ. 3: పచ్చిగాఁగ నన్నుఁగూడితి నీ భావమునాలోఁజిక్కెను
మచ్చిక శ్రీవేంకటేశుఁడ నీపచ్చడము పయిఁ గప్పరా

రేకు: 1765-02 సాళంగనాట సం: 27-386

పల్లవి: కానీరా వోరి కానీరా
కానీరా అట్టె కానీరా నేఁడు
దానికి మాఁటిచ్చి తప్పవు నీవు

చ. 1: విందు నేఁ జెప్పఁగ వెనకతీసేవు
కందువ నీగుట్టు కంటిరా నేను

చ. 2: రాయడించి నిన్ను రతికిఁ బిలిచి
చేయి చాఁచినాను చిక్కవు నీవు

చ. 3: నావాఁడవై కూడి నవ్వే వాపెతోడ
శ్రీ వేంకటేశ్వర చెల్లుర నీకు

రేకు: 1765-03 పాడి సం: 27-387

పల్లవి: చక్కనుండవే మాతోడిజగడాలు నీకేల
నిక్కి లోనయినవారు నిన్నుఁ బోలరా

చ. 1: వచ్చి వచ్చి మాతోడి(డ) వంతులకే పెనఁగేవు
మెచ్చిన గొల్లెతలనాఁ డెందువోతివే
ముచ్చటదీర నితఁడు మోహించి తోసినయట్టి
నెచ్చెలు లింతకతొల్లి నీకొలఁదివారలా

చ. 2: వుండుండి నీవు మాతో వొరయఁగ వచ్చేవు
నిండి పదారువేలలో నీపేరేదే
గండికాఁ డితఁడు పొంది కదుపునఁబెట్టినట్టి
అండనున్న సతులు నీయంత నేరరయ్యా

చ. 3: నవ్వి నవ్వి మాతోను నంటుసేయఁదొడఁగేవు
యెవ్వతెవే పట్టపువారెనండ్రలో
రవ్వ శ్రీ వేంకటేశుఁడు రతి నన్ను నిటు గూడె
జవ్వనులు నీవలె సాదించనోపరా

రేకు: 1765-04 సామంతం సం: 27-388

పల్లవి: వారిగో వీరిగో వాడలవాడల
కోరిక మీరఁగ గోపాలులు

చ. 1: జోరునఁ గారీని చొక్కపువుట్లు
పేరని పాలును పెరుగును
వారలు వట్టేవు వాకిటివుట్ల
కూరిమిఁ గృష్ణుఁడు గోపాలులు

చ. 2: తొట తొట రాలీ దొండ్లయి వుట్ల
చిటిబెల్లాలును చిమ్మిరును
తటుకునఁ బట్టి దాపేరు పుక్కిళ్ల
గుటుకలు మింగి గోపాలులు

చ. 3: వానలు గురిసీ వరుస వుట్ల
తేనెలుం బండ్లు తెంకాయలు
ఆనేరు శ్రీ వేంకటాధిపతిఁ గూడి
గోనల గొందుల గోపాలులు

రేకు: 1765-05 పళవంజరం సం: 27-389

పల్లవి: ఇంత వుపకారి నైతి నిది నీకుఁ జాలదా
బంతిఁబెట్టితి వలపు భావించుకో తగవు

చ. 1: ఆలరి యాపె దిట్టిన ఆ తిట్లల్లా దాఁచి
జాలిఁ బెట్టనైతి నిన్ను చాలదా ఇది
పోలించి నీవు బొంకిన బొంకులెల్లా చెల్లఁ బెట్టి
మేలు మేలని మెచ్చితి మెచ్చవద్దా నన్నును

చ. 2: చివుకున ఆపెచేసే సేఁతలకు నడ్డమై
చవుకలు సేయనైతి చాలదా యిది
తవిలి నీవు దలఁచే తలఁపెల్లా నీడేరించి
కవ గూర్చినందుకు చొక్కఁగవద్దా మనసు

చ. 3: కలశాపె నవ్వఁగాను కాఁగిలించుకొని నిన్ను
చలములు మించి(చ)నైతి చాలదా ఇది
నిలిచి శ్రీ వేంకటేశ నెరవేర్చి నీపనులు
బలిమి సేసితిని చేపట్టవద్దా యిఁకను

రేకు: 1765-06 ఆహిరినాట సం: 27-390

పల్లవి: ఏఁటిదే మా వలపు యింతా నీదే వలపు
రోఁటితేఁ బదియుఁ బది రొక్కమాయ వలపు

చ. 1: నిట్ట చూపులై నీకు నిండుకొనె వలపు
ముట్టి వచ్చితే పెద్ద మోపాయ వలపు
అట్టె గొరసరాయఁ డాయగా నీవలపు
నట్టుక కంబముమాఁటు నవ్వులాయ వలపు

చ. 2: బూమి మీఁద వేఁడుకొంటే పొడవాయ వలపు
గోమున నొరసితేను కోపమాయ వలపు
వేమారు నడపులెల్ల వెదకించె వలపు
ఆముకొని గొల్లదోమటాయ నదె వలపు

చ. 3: వింతవారెదుట సిగ్గు విడిపించె వలపు
బంతినే వచ్చి రాతికిఁ బ్రాణమాయ వలపు
పంతము నీవియ్యఁగా మాపాలాయ వలపు
కాంతుఁడ శ్రీ వేంకటేశ కప్పెను నీవలపు

రేకు: 1765-07 సాళంగనాట సం: 27-391

పల్లవి: ఏల వచ్చెనే గర్వము ఇట్టే తనకు
తాలిమితో నుండితేను తానే ఆఁటది

చ. 1: పలుకుల పని యేమే పై పైనే ఆతని
తలఁపు దెలిసితేనే తానే ఆఁటది
చలములకు వచ్చె(చ్చి)నా సరసుఁ డాతనెదుట
తలఁగక నిలిచితే తానే యాఁటది

చ. 2: కినుక యింతేసేఁటికే కెరలించి రమణుని
తనివిఁ బొందించితేను తానే యాఁటది
చనవులఁ బొరలినా సంగడినున్న వానిని
తనవోజ పట్టించితే తానే యాఁటది

చ. 3: అప్పుడే బీరము వద్దే అందుండే వచ్చె నితఁడు
తప్పక తాఁ జూచితేనే తానే యాఁటది
యిప్పుడే శ్రీ వేంకటేశుఁ డింటిలోన నన్నుఁ గూడె
తప్పు లెంచ నోపితేను తానే యాఁటది

రేకు: 1766-01 సాళంగం సం: 27-392

పల్లవి: అంటి ముట్టిన పనులు ఆతఁ డెరుఁగు
వెంట వెంట మీరు నన్ను వేఁడుకొన నేఁటికే

చ. 1: నగిన దొక్కటే కాని నాకు నేమిఁ దెలియదు
అగవుఁ దగవు లెల్లా నాతఁ డెరుఁగు
జగడాలడిచితినా సరవితో నున్నదాన
వెగటుగా నన్ను మీరు వేఁడుకొన నేఁటికే

చ. 2: మొక్కిన దొక్కటే కాని ముందు వెనక లెంచను
అక్క డిక్కడి సుద్దులు ఆతఁ డెరుఁగు
తక్కులఁ బెట్టేనా తనదాననే నేను
వెక్కసాన మీరు నన్ను వేఁడుకొన నేఁటికే

చ. 3: కూడిన దొక్కటే కాని గుట్టు బాఇట వేయను
ఆడుకొలు బాసలెల్ల నాతఁ డెరుఁగు
యీడనే శ్రీ వేంకటేశుఁ డిరవుగా నన్నుఁ గూడె
వేడుకకు నన్ను నింత వేఁడుకొన నేఁటికే

రేకు: 1766-02 సామంతం సం: 27-393

పల్లవి: మే మెఱఁగమా తన్ను మెచ్చుల గొల్లెతలము
గోములు మరిగి రాసకొడుకాయ నిపుడు

చ. 1: పులుగు వంటి గుట్టము పొలము వంటిది యాలు
చిలువ వంటి పరపు సేరె(రెఁ) దనకు
తొలుత మాగొల్లవాఁడే దొరతన మబ్బెనంటా
కొలము దాసుక రాసకొడుకాయ నిపుడు

చ. 2: కొక్కరవంటి సంకము కుదురు వంటి కైదువ
అక్కుమీఁది కొక పూస అబ్బెఁ దనకు
యెక్కువ నావులఁ గాచె నిన్నాళ్లు మావొద్ద
గుక్కక మిక్కక రాసకొడుకాయ నిపుడు

చ. 3: పసపు వంటిది సీర పసిఁడిపతిమ సొమ్ము
యెసఁగ శ్రీ వేంకటాద్రి యెక్కుకొన్నాఁడు
వసముగాని సతుల(లు) వారిఁగూడి మమ్ముఁ గూడి
కొసరించుకొని రాసకొడుకాయ నిపుడు

రేకు: 1766-03 బౌళి సం: 27-394

పల్లవి: నీ మాఁటే నిజము నెలఁతలు పెక్కులైతే
మోములు చూచి చూచి మొగచాటే కాదా

చ. 1: వొప్పుగా ఆకెయు నేను వొక పోలి కనేవు
కప్పురము దిన్న నోటఁ గల్ల లాడేవా
యెప్పుడు దామెరపువ్వు లెచ్చుకుందులైతే నేమి
దెప్పరపు పువ్వుఁదేనె తీపె కాదా

చ. 2: వెగటై రెండు చేతుల విడే లొక్కప రిచ్చేవు
తగవరి వన్నిటాను తప్పఁజేసేవా
బిగిసి కంటమాలలో పిన్న పెద్దముత్తే లుంటే
జగతిఁ బెట్టేవారికి సరియే కాదా

చ. 3: యీవేళ నానలువెట్టి యిద్దరిని గూడితివి
శ్రీ వేంకటేశ్వర నీవు సిగ్గువడేవా
కైవశపు మొగవాఁడు కప్పనని కూరిచితే
భావించ రెండు చీరలు పచ్చడము గాదా

రేకు: 1766-04 శంకరాభరణము సం: 27-395

పల్లవి: ఓ యమ్మ యశోద వొద్దన్న మానఁడు
ఖోయని యారిచీ గోవిందుఁడు

చ. 1: పయ్యెద లెడలఁ బట్టెరు గొల్లెత
లొయ్యన తాఁ గొట్టీ నుట్లు
తియ్యనిపెరుగు తేనె వారవట్టీ
కూయఁగఁ గూయఁగ గోవిందుఁడు

చ. 2: చాడెలు దియ్యుచు సతులు నవ్వఁగ
ఆడవారిచన్ను లట్టె తీసీ
యేడకైన చాఁచీ లెత్తిన కోలలు
కోడెకాఁడు గదె గోవిందుఁడు

చ. 3: యెమ్మెలు నెరపీ యిందిరయుఁ దాను
అమ్మరో శ్రీ వేంకటాద్రి వీథులను
కమ్మి గోపికలు కాఁగిటఁ గూడఁగ
కుమ్మరించీ సిగ్గు గోవిందుఁడు

రేకు: 1766-05 నాదరామక్రియ సం: 27-396

పల్లవి: ఆనతీవయ్య యేమిటా నడ్డము లేదు నేఁడు
నేను నీకీ వూడిగాలు నేరుచు కొనేను

చ. 1: కొంత గొంత నీ నిలువుఁ గొప్పు జారివున్నదిదె
పంతమున నెవ్వతైనాఁ బట్టి తీసెనో
పొంతనె యెదుగాను నీ పుక్కిటఁ దమ్మ వున్నది
అంతరంగమైనచోట నాదాయము వచ్చెనో

చ. 2: తొలుతే నీ పచ్చడము తొప్పఁ దోఁగి వున్న దిదె
నిలుచుండఁగా నాపె పన్నీరు చల్లెనో
అలసి బుసకొట్టేవు అక్కడివారు నిన్ను
బలిమిఁ జెప్పఁ గారానిపనులు సేయించిరో

చ. 3: యీ రీతిఁ బూవుల దండ లిన్ని నీమెడ నున్నవి
పోరానివారే నీకు బూజ సేసిరో
చేరి యలమేల్మంగను శ్రీ వేంకటేశ కూడితి
వారసి బుద్ధి చెప్పిరో అందరూనుఁ దగరు

రేకు: 1766-06 బౌళి సం: 27-397

పల్లవి: ఇంకనైనా మొక్కవే నీ విన్నిటికి శలవుగా
కంకి సే సేవు వలపు కటకటా యేమే

చ. 1: యేకతానఁ బతితోడ నేమన్నా నమరుగాక
వాకుచ్చి ఇందరిలోనా వా దడతురా
ఆకడ నవ్వి నతఁడు ఆనలు వెట్టేవు నీవు
కాకు సే సేవు వలపు కటకటా యేమే

చ. 2: చెంతనుండే యట్టే వేళ చెనకఁగఁ జెల్లుఁ గాక
పంతమునఁ గొలువులోఁ బచ్చి సేతురా
సంతసించె నిన్ను నాతఁడు జంకించేవు నీవైతే
గంత గట్టేవు వలపు కటకటా యేమే

చ. 3: కూడిన యిప్పటి వేళ కొసరఁ దగవు గాక
యేడనైనా రట్టుసేసి యెచ్చరింతురా
యీడనె శ్రీ వేంకటేశుఁ డితవాయఁ గలసేవు
గాడిఁ బెట్టేవు వలపు కటకటా యేమే

రేకు: 1767-01 ముఖారి సం: 27-398

పల్లవి: ఎవ్వరి వసము గాఁడు యెత్తినవారి చే బిడ్డఁడు
నొవ్వక నోకి కన్న నీ నోముఫల మిదివో

చ. 1: వేగి లేచితే సుద్దులు వెన్నలు దొంగిలీ నవె
బాగై నీరాటే(డేఁ) రేవు పచ్చి సిగ్గులే
చేగదేరె బండె డేసి చేఁతలు ముంగిటనే
యీగతి బిడ్డఁడు వుట్టె నెశోద నీకమ్మా

చ. 2: పొద్దుఁగూకితే కన్నవి పొంచి చీఁకటి తప్పులే
మద్దులు విరిచీ నవి మంద బయట
పొద్దు మరిఁ బొడిచితే(తేఁ) బూతకి చంటికతలే
యెద్దువంటి బీరాలవాఁ డెంతసేసీ నమ్మా

చ. 3: నిచ్చ నిచ్చ వేసేవి నిండు గొల్లముంజులే
రచ్చ కెక్కినది గోవర్ధన మహిమ
ఇచ్చల శ్రీ వేంకటాద్రి నిరవాయ నీక్రిష్ణుఁడు
యిచ్చకాఁడు నేఁ డితని కెదురేడదమ్మా

రేకు: 1767-02 ఆహిరి సం: 27-399

పల్లవి: ఆఁడు జన్మమే మేలు అందరికిని
పోఁడిమితో నీవంటి పురుషుఁ డుండఁగను

చ. 1: గోపికల కొరకె కొండ గొడ గెత్తితివి
గోపికల కొరకె గోవులనుఁ గాచితివి
యీపాటి వాఁడవు ఇంతులఁ గంటేఁ జాలు
యేపనియైనాఁ జేతువు యెరిఁగితిమయ్య

చ. 2: పొంచి సత్యభామకుఁగా పువ్వులమాఁకు మోఁచితి
పొంచి సత్యభామవద్ద పోటుబంటవై మించితి
ఇంచుకంతా లోఁగవు ఇంతు లొద్దనుంటేఁ జాలు
యెంచ కన్నియుఁ జేతువు యెరిఁగితిమయ్య

చ. 3: మిన్ను సాదించి తెచ్చితి మెరసి పదారువేల
మిన్ననేలఁ గూడపెట్టి మించి రుక్మిణిఁ జేకొంటి
ఇన్నిటా శ్రీ వేంకటేశ ఇరవైతివి మాపాల
యెన్నియైనాఁ జేతువు నిన్నెరిఁగితిమయ్యా

రేకు: 1767-03 పాడి సం: 27-400

పల్లవి: చేరి నీకు విన్నపాలు సే సేవారమా
కూరిమితో నీవే పైకొందువుగాక

చ. 1: పిలువ నేరుతుమా పేరుకుచ్చి నిన్నంత
చెలరేఁగి నీవే లిచ్చేతువు గాక
సొలయ నేరుతుమా చూచి చూచి నేము నిన్ను
తలఁపులోపల దయదలఁతువు గాక

చ. 2: నవ్వఁగ నేరుతుమా ననుపుతో నీతోను
అవ్వల నీవే సరసమాడుదుగాక
రవ్వసేయ నేరుతుమా రాజసాన నీవే వచ్చి
పువ్వువంటి వలపు పైఁబోతువు గాక

చ. 3: మెచ్చఁగ నేరుతుమా మించి నన్నుఁ గూడితివి
చెచ్చెర నీవే సంతసింతువు గాక
యిచ్చకుఁడ శ్రీ వేంకటేశ మనరతులెల్ల
తచ్చి యాడనేరుతుమా తనుతువు గాక

రేకు: 1767-04 రామక్రియ సం: 27-401

పల్లవి: ఆసపడ్డపుడు రాక అలసినప్పుడు వచ్చి
వేసరించేవు రతికి వేళలు గానీరా

చ. 1: చివ్వనఁ దియ్యకురా చేయివట్టి నీవు నన్ను
పువ్వువంటిదాన నొప్పుల కోపను
ఇవ్వల బానుపుపై నీ కెదురు చూచుకొంటా
పవ్వళించి వుంటిని యే పరాకై వుంటివో

చ. 2: కప్పకురా పచ్చడము కాఁగిటిలో నీవు నాకు
కప్పురము వంటిదాన కాఁక కోపను
చెప్పరాని కోరికతో సిగ్గులెల్లాఁ బారవేసి
అప్పటినుండియు నుంటి నాడనేల నుంటివో

చ. 3: మిగులాఁ బిసుకకురా మించి నా చన్నులు నీవు
చిగురువంటి దానను చేఁత కోపను
తగిలి శ్రీ వేంకటేశ దక్క నన్నుఁ గూడితివి
అగపడి యుంటిని యేమనుచు నీవుంటివో

రేకు: 1767-05 ఆహిరి సం: 27-402

పల్లవి: నీవే నేరుతు నేఁ జసే వలపు
పూవు వంటిది గుణము బుద్ది చెప్పు నాకును

చ. 1: పాడి మెప్పించేనంటే పలచన నాయెలుఁగు
కూడి మెప్పించేనంటే కుచములు గట్లు
ఆడి మెప్పించేనంటే అంగాలు నీచూపు లంటె
యీడుదానఁ గాను నీకు నేమి సేతు నిఁకను

చ. 2: చెనకి మెప్పించేనంటే సిగ్గులే నానిలువెల్లా
తనివి మెప్పించేనంటే తమకించీ వయసులు
మనసిచ్చి మెప్పించితే మట్టుమీరె మోహము
నిన్ను(ను) నమ్మివున్నదాన నేరుపుమీ చేఁతలు

చ. 3: చూపుల మెప్పించేనంటే సూదులకంటే వాండ్లు
తీపుల మెప్పించేనంటే తేనె నా మోవి
యేపున శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యీ పనులకే మెచ్చితి యెంచకుమీ రతులు

రేకు: 1767-06 నాదరామక్రియ సం: 27-403

పల్లవి: ఎంత వాఁడిసే సే వేరా మమ్ము
కంతునియమ్ములకట్టలమా

చ. 1: ఆసపడి నీయంగము లంటితే
వోసరించి లోఁగేవు వొడ్డుకొంటా
దోసమెఱఁగవు తొయ్యలుల పొందు
సే సేమంటే చేతఁ జిక్కవద్దా

చ. 2: మరిగి నీమోవి మనసయ్యీనంటే
శిరసు వంచేవు సిగ్గుతోడ
సరవులెంచవు సతుల వలపు
పరగించేమంటే పలుకవద్దా

చ. 3: కూడి మాడి చన్నులకొనల నొత్తితే
వాడేవు యలసి వత్తి వలె
యీడనె శ్రీ వేంకటేశ నీదేవుల
మీకు వెనఁగితి మెంచవద్దా

రేకు: 1768-01 దేశాక్షి సం: 27-404

పల్లవి: మాపై బారాలు వేయకు మతకానను
చేపట్టినవాఁడవు నీచేతివే మహిమలు

చ. 1: రాసికెక్క నీవు మమ్ము రాఁపుసేసిన సుద్దులు
వాసికెక్కె మాగుణము వలపుతోను
ఆస యేమిటాఁ దీరదు అండకు నీవు రాఁగాను
సేసేటి పనులు నీచేతనున్న విఁకను

చ. 2: దొంతులు నిండెను నీవు తొల్లిచ్చిన చనవులు
వంతుల గాచుకుండె నావన్నెలమోవి
పంతము దీరదు నీవు పలుమారు వేఁడుకొన్నా
చెంతల మన్నించేది నీచేతిదే ఇపుడు

చ. 3: వేడుకాయ నీవాడించే వేమారు యెడమాటలు
వాడికాయ నవి నాకు వడదేరెను
వీడదు కాఁగి నిదె శ్రీ వేంకటేశ కూడితిమి
చేడె లేమి చెప్పేరు నీచేతివే భోగములు

రేకు: 1768-02 బౌళి సం: 27-405

పల్లవి: ఎంతైన నీ యాల నింతే ఇందులో తప్పులెంచకు
మంతనాన నీవు నామనవి చేకోవయ్య

చ. 1: విచ్చన విడిని నీతో వేమారు నవ్వితిని
ఇచ్చకమౌనో కాదో యెఱఁగ నేను
పచ్చిసేసి కమ్మటిని పైకొని చెనకితిని
మచ్చిక సేసుక నన్ను మన్నించవయ్య

చ. 2: పయ్యదకొంగు వట్టితే పలుమారు మొక్కితిని
ఇయ్యకోతానో కాదో యెఱఁగ నేను
నెయ్యపుమాట లాడఁగానే నీకు మారాడితి
చెయ్యారా నాచనవు చెల్లించవయ్య

చ. 3: కైవశమైతిననుచు కాఁగిలించి కూడితిని
యేవిధమో నీగుట్టు యెఱఁగనేను
శ్రీ వేంకటేశ్వర నీ చిత్తము నా భాగ్యము
యీ వలన నన్ను మెచ్చి యీడేర్చవయ్యా

రేకు: 1768-03 ఆహిరి సం: 27-406

పల్లవి: చెలు లింతే మీరేమి సేతురే నేఁడు
అలరి ఆతనిపంత మమరుఁ గాక

చ. 1: తలఁపు నే నెఱఁగనా తరుణులఁగంటేను
చెలిమి దాఁ జేసును సేయఁడునని
మలసిన మగవాని మా కనఁగవచ్చునా
చెలువుఁడు సేసినట్టే చెల్లుఁగాక

చ. 2: తనగుణ మెఱఁగనా తతి మానినులతోడ
పెనఁగును పెనఁగఁడు ప్రియాననని
ఘనుఁడైనవాని మాకు గద్దించవసమా
తనివిగలిగినంతా దక్కుఁ గాక

చ. 3: కరుణ నే నెఱఁగనా కడఁగి మావంటివారి
కరఁగించు కరఁగ దాఁగలఁడని
యిరవై శ్రీ వేంకటేశుఁ డిప్పుడిట్టె నన్నుఁ గూడె
అరుదైన నెరతన మమరుఁ గాక

రేకు: 1768-04 ముఖారి సం: 27-407

పల్లవి: ఆడుకోఁగలిగె మాకు నందరముఁ జెలులము
జాడల సతులు నీసరి యెవ్వరమ్మా

చ. 1: అదివో పతిఁ బిలువ నంపి రప్పించుకొంటివి
యెదుట నాపనితొడ యెక్కుకొంటివి
మెదలనియ్యక అట్టె మెడగట్టించుకొంటివి
వెదకి పువ్వులదండ వేసి తీసి కొంటివి

చ. 2: తేరాని వైనాఁ జెప్పి తెప్పించుకొంటివి నీవు
మేరలు సేసుక వీఁపుమీఁద నుంటివి
కూరిమి నీవే దక్కించుకొంటి వడవుల వెంట
చేరి పచ్చనిఅలమై శిరసు నిండితివి

చ. 3: విందుల నీవే పదారువేలు రూపులై మించితి
వెందు నీపేరే మొదల నెంపించితివి
కందువ శ్రీ వేంకటేశు కాఁగిటిలోపల నిండి
సందడిం చాతనిసర్వసంపదవు నైతివి

రేకు: 1768-05 సామంతం సం: 27-408

పల్లవి: మాకేల అవుఁ గాదన మగవారి తోడ నింత
నీకు ప్రియము గాకుంటే నీవు సేసేవా

చ. 1: చేరి నాచేతనే వారి సేవలెల్లాఁ జేయించేవు
నేరు పిది గాకుంటే నీవు సే సేవా
సారె మాట మాటలను జగడాలు దీఇంచెవు
నీరపము గాకుంటే నీవు చేసేనా

చ. 2: జరయుచు మాచేత సంగడి మాటాడించేవు
నెటిఁ దగవు గాకుంటే నీవు సే సేవా
గుఱులు బయటవేసి గుట్లెల్లా నెత్తిచ్చేవు
నెఱజాణవు గాకుంటే నీవు సే సేవా

చ. 3: ఆసలు పుట్టించి నన్ను నందరిలోఁ గూడితివి
నీ సూటికి రాకుంటే నీవు సే సేవా
వాసుల శ్రీ వేంకటేశ వన్నెలెల్లా నించితివి
నే సమ్మతించకుండితే నీవు సే సేవా

రేకు: 1768-06 సింధురామక్రియ సం: 27-409

పల్లవి: ఎదుట నుండిన వారినేల దూరేవు
పదియారు వేలవారిఁ బంగించవే

చ. 1: చూపుల నాతని దిక్కు చూచితేనే కోపించేవు
కాపురాలు సేసేవారి గానవటే
పైపై నే మాఁటాడితే పదరేవు యలుగులు
చాపేటి గొల్లెతలను సాదించవే

చ. 2: నడుమ వినోదాలు నవ్వితేనే గోణఁగేవు
కడనుండి పొందేవారిఁ గానవటే
తడవితినంటా నాపైఁ దమకించే వింతలోన
యెడపుల పువ్వులాపె నీడువెట్టుకోవే

చ. 3: శ్రీ వేంకటేశ్వరు సేవ సేసితేనే పెనఁగేవు
కావరించివుండేవారిఁ గానవటే
యీవేళ నాతఁడే కూడె యిద్దరిని వొక్కమాఁటే
నీవంటివారినే నేరమెంచవే

రేకు: 1769-01 మంగళకౌసిక సం: 27-410

పల్లవి: అలుకెల్లా మానితిని అట్టే కానీవే
చెలులాల మీకు నిది సెలవు గానీరే

చ. 1: తప్పు లెన్ని గలిగినా తన్ను నేఁ గోపగించేనా
అప్పటిమాటలు వింటి నట్టే కానీవే
అప్పస మందరు మీరు అండనుండి ఆతనికిఁగా
చెప్పేరట నేనూ నట్టే సే సేఁగాని

చ. 2: వొడ్డారపువాఁడైతే వొరసి నే నిందుకుఁగా
అడ్డమాడే దానా నీకు నట్టే కానీవే
వెడ్డు వెట్టకురే మీరు వింటిమాట; నాలికెను
జిడ్డంటునా అట్టే సే సేఁ గానీవే

చ. 3: వాసులు దాఁ బట్టితేను వద్దనేనా పొందులకు
ఆసపడ్డదాన నేను అట్టే కానీవే
వేసరరు మీరు శ్రీ వేంకటేశుఁ డిదె కూడె
సేసవెట్టితిని యిట్టె సే సేఁ గానీవే

రేకు: 1769-02 హిందోళ వసంతంసం: 27-411

పల్లవి: ఆతని మహిమో నాది అంత మెత్తని మనసో
యేతులు నెమ్మెలు మీతో నేమి చెప్పేనే

చ. 1: కోపగించి చూడఁబోయి గొబ్బుననుఁ గరఁగితి
చేపట్లకు దగ్గరి చేరి మొక్కితి
రాపులఁ బెనఁగఁ బోయి రతికేళికిఁ దీసితి
యేపున నాపంత మిఁక యేమి చెప్పేనే

చ. 2: జంకించఁ బోయి నా చనుకట్లు వదలితి
వంకలొత్తఁ బోయి వానివలఁ జిక్కితి
బింకములాడఁబోయి ప్రియములెల్లాఁ జెప్పితి
యింకా నా సుద్దులు నే నేమి చెప్పేనే

చ. 3: చలము సాదించఁబోయి సరసములాడితి
బలువు చూపఁగఁబోయి పట్టి కూడితి
యెలమి శ్రీ వేంకటేశుఁడెనసె నాతో నింత
యెలుగెత్తి నాగుణాలు యేమి చెప్పేనే

రేకు: 1769-03 గౌళ సం: 27-412

పల్లవి: మచ్చరించి మాపు దాఁకా మాఁటలేఁటికి
రచ్చలఁ బెట్టక యిట్టె రావయ్య లోనికి

చ. 1: వొత్తి నే విన్నవించఁగా వోజకు వచ్చేవా నీవు
చిత్తములోపలి మాట చెప్పితిఁగాక
తత్తరించి యంతలోనె తలవంచుకోనేల
కొత్తలు సేయక ఇంద కోవయ్య వీడెము

చ. 2: మొక్కఁగ నిప్పుడే నాకు మునుకొని వలచవా
వెక్కసాన నీపై వొల వేసితిఁ గాక
చెక్కు చేతితో నిప్పుడు సిగ్గువడ నీకేల
పిక్కటిల్లెఁ దమకము పెట్టవయ్య సేసలు

చ. 3: కొసరి నే నడుగఁగా గుట్టు నాకుఁ జెప్పేవా
యెసఁగి నా మనసు నీ కిచ్చితిఁ గాక
పొసఁగ శ్రీ వేంకటేశ పొందితివి నన్ను నేఁడు
అసురుసు రేఁటికి ఆఁపవయ్య వలపు

రేకు: 1769-04 శంకరాభరణం సం: 27-413

పల్లవి: ఇదివో మా బలు వీమాఁటే చెప్పరే
యెదుట నాతఁడు యేమనీనే

చ. 1: బింకము లాడేమా ప్రియుని తోడుత
జింకించి బొమ్మల సాదింతుము
అంకెకు లోనైన యంతటిమీఁదట
కంకిగ రతులఁ గక్కసింతుము

చ. 2: తప్పులించేమా తనతోడ నేము
రెప్పలెత్తి రేసు రేఁతుము
కప్పుర విడేలఁ గలసిన మీఁద
కుప్పల చెమటఁ గురియింతుము

చ. 3: సిగ్గువడేమా శ్రీ వేంకటేశుతో
బిగ్గెఁ గాఁగిటను బిగింతుము
యెగ్గులెంచక తా నిట్టె నన్నుఁ గూడె
వెగ్గళించితే వేఁడుకొందుము

రేకు: 1769-05 సింధురామక్రియ సం: 27-414

పల్లవి: మూఁకలో నెదుర(రె)దుర ముంగిట నుంటిననవే
యేఁకటతో మాయింటియిక్కు విదే యనవే

చ. 1: జమళి నా చూపులు చాఁచినదియే గుఱుతు
రమణుని నిక్కడికి రమ్మనవే
కొమరెచన్నులు తన కొలువు సే సే నపుడే
తమితోడ మఱవక తలఁచుకొమ్మనవే

చ. 2: మారుకొని తనతో నే మాఁటాడినదే గుఱుతు
చేరి నాతోడుత పొందుసేయమనవే
వూరెడి తేనెల మోవి వుపారమాయ నప్పుడే
తారుకణౌనో కాదో తలఁచు కొమ్మనవే

చ. 3: కొప్పు వీడఁగా నేను కొంగు వట్టుటే గుఱుతు
చిప్పిల మన్నించి దయసేయు మనవే
యిప్పుడే శ్రీ వేంకటేశుఁ డేడనుండో వచ్చి కూడె
తప్పక యీ భావము తలఁచుకొమ్మనవే

రేకు: 1769-06 నారాయణ దేశాక్షిసం: 27-415

పల్లవి: అంతటఁ బోనీయరా నిన్నాయములంటి కరఁచి
చింతదీర నప్పుడు నే సెలవిత్తుఁ గాని

చ. 1: యెక్కడో దవ్వాది చెవి నిడుక వచ్చినప్పుడు నా
చెక్కులఁ బూసుటే రతి సెలవా నాకు
దక్కించు కన్నిపనులు దండకువ చ్చొకమాటు
చిక్కని నవ్వు నవ్వితే సెలవా నాకు

చ. 2: యే యెడనో భోగించి యింటికి నిట్టె వచ్చి
చేయి మీఁద వేసితేనే సెలవా నాకు
చాయలకుఁ దిరిగాడి చక్కటికి నీవు సే సే
సేయరాని వినయాలే సెలవా నాకు

చ. 3: ఆసలక్కడ నిండించి అందరూఁ జూడఁగా నన్నుఁ
జేసుకొంటి వింతలోనే సెలవా నాకు
వాసికి శ్రీ వేంకటేశ వడి నొకమాటే నాతో
సేసవెట్టి కూడితివి సెలవా నాకు

రేకు: 1770-01 శంకరాభరణం సం: 27-416

పల్లవి: శమించుకోవయ్య సర్వాపరాధాలు
కొమరెవయసు గుణాలదాన

చ. 1: తొక్కితిఁ బాదము తొలుత నందుకు
మొక్కితి నిదివో ముమ్మాఁటికి
గక్కన నాచూపు కాఁడిన గంట్ల
చిక్కని నవ్వులు చిలికించేను

చ. 2: వొత్తితిఁ జన్నుల వొరటువాయఁగ
పొత్తిగఁ బూవులఁ బూజించేను
లత్తుక నంటిన లచ్చన నొసల
మెత్తేను గందము మీఁదనెల్లా

చ. 3: కూడితిఁ గాఁగిట కొసరు దీరఁగ
వీడెమింద శ్రీ వేంకటశ
వాడించితి మోవి వన్నెలు పుట్టఁగ
కూడ నే నెంచేను గుఱుతులు

రేకు: 1770-02 ఆహిరి నాట సం: 27-417

పల్లవి: మగువ లెంత మేటైనా మగవానికే లోను
తగవులు నెరపితే తప్పించుకొందురా

చ. 1: చెల్లుబడిగలవారు చేయివట్టి తీసితేను
పల్లదమాడుదురా పంతమా యిది
చల్లఁగా నలుకదీర జాజులు ముడిచితేను
తెల్లమిగాఁ గొప్పువట్టి తియ్యకుమందురా

చ. 2: కలపు కోలైనవారు కప్పురము చల్లితేను
బలిమి విదిలింతురా పంతమా యిది
కలపి బత్తితోడను కస్తూరి వూసితేను
అలమి మా చన్ను లంతేసి అంటకుమందురా

చ. 3: శ్రీ వేంకటేశ్వరుఁడు చెక్కునొక్కి కూడితేను
భావము సోదింతురా పంతమా యిది
మోవితేనె నీకు నిచ్చి మోహము నించితేను
చేవదేరీ నందు గంటి సేయకు మందురా

రేకు: 1770-03 నాదనామక్రియ సం: 27-418

పల్లవి: తనకేలే యీ మంకు తరుణుల కింతేకాక
చనవిచ్చినట్టి వాఁడు సమ్మతించుఁగాక

చ. 1: నెయ్యము సేసినవాఁడు నేఁడేల యెగ్గుపట్టీనే
వొయ్యనె నాచేఁతలకు నోర్చుఁగాక
తియ్యనిమాఁటలవాఁడు దిమ్మరిమాఁట లేఁటికే
పయ్యద లోనికి లోనై బతిమాలు గాక

చ. 2: చెనకిన యట్టివాఁడు శిరసేల వంచీనే
గునియక అన్నీ నియ్యకొనుఁగాక
ఘనుఁడైనయట్టివాఁడు కపటాలు దనకేలే
వెనకటి తనబాస విచారించు గాక

చ. 3: సిగ్గువాపినట్టివాడు సెలవిలో నవ్వదేలే
నిగ్గుల రితిప్రియాలు నేరుపుగాక
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డంటి తానె నన్నుఁ గూడె
తగ్గు లేక నాక దక్కి తమకించుఁగాక

రేకు: 1770-04 శ్రీరాగం సం: 27-419

పల్లవి: ఇప్పుడుగా నీవు నేను ఇద్దరమూ గూడితిమి
పుప్పొడిఁ దేనియు నొకపువ్వున నున్నట్టు

చ. 1: నిన్నుఁ బాసి కొంతవడి నీగుణాలు దలఁచితి
వెన్నెలగాసినయట్టు వేసఁగి లోన
విన్నవినుకులలోన వేడక నోలలాడుదు
వెన్నలు పుట్టిన యట్టు వేఁడిపాలలోన

చ. 2: తెరమఱఁగున నుండే తియ్యని మోవి చూపుదు
పెరలో తేనె వున్నట్టు పెరుగుతాను
సరుగ నీ చెలులతో సరసము లాడుదు
గరిమ మెఱుఁగు మేఘము నందుకొన్నట్టు

చ. 3: ఇట్టె దగ్గరుతానే యెదురుచేతులు చాఁతు
కట్టలు వరచినట్టు కన్నందుకెల్లా
రట్టుగ శ్రీ వేంకటేశ ముట్టి రతిఁ జొక్కించితి
పట్టుమని ఇచ్చినట్టు భాగ్యము లన్నియును

రేకు: 1770-05 కాంబోది సం: 27-420

పల్లవి: ఏల తమకపడేవే యేఁటికే యింత
కోలుముందై వలచితే గుదిగొనవలదా

చ. 1: తాలిమిగలదానికి తనంతనే వచ్చు మేలు
ఆలరి కత్తెకుఁ గద్దా ఆపసోపాలు
బేలనై నే నుండఁగాను పిలువకేవచ్చె పతి
వీవి కాతాళించుకొంటా వెంటనే వచ్చితివి

చ. 2: గుట్టు గలదానికి కోరినట్టల్లా నవును
రట్టడించితిఁ గద్దా యిట్టి రారాఁపు
కట్టఁగడ నే నుండఁగా కరుణించె నన్నితఁడు
వెట్టమాఁటలాడుకొంటా వెంటనే వచ్చితివి

చ. 3: కగ్గులేనిదానికి కైవశమౌఁ బనులెల్లా
కిగ్గాడిదానికిఁ గద్దా కీసకాట్లు
సిగ్గుతో నే నుండఁగాను శ్రీ వేంకటేశుఁడు గూడె
వెగ్గళించి దూరుకొంటా వెంటనే వచ్చితివి

రేకు: 1770-06 తెలుఁగుఁ గాంభో(బో)ది సం: 27-421

పల్లవి: ఏమంటా నుండెనో యిట్టే వేగినంతా
ప్రేమాన నిప్పుడు ప్రియము చెప్పీని

చ. 1: పొంచి నా విభుఁడు పొద్దుననే వచ్చి
అంచెల వేఁడుకొనానవెట్టీ
మంచిదానవే మంతనాన నీతో
యెంచుకొన్న సుద్దు లెటువఁగింతురా

చ. 2: యింతిరో నితఁడు యింటికిఁదా వచ్చి
పంతమిచ్చి నాకు బాససేసీని
యెంత సేసితివే యీాడ విరహాన
చింతించినవి యల్లఁ జెప్పుదురా

చ. 3: శ్రీ వేంకటేశుఁడు చేర నన్ను వచ్చి
చేవమీరఁ గూడి చేపట్టెను
నీవే నేఁ గానటే నిన్నమాపటంత
వేవేలు నాడితే వేగిరింతురా

రేకు: 1771-01 దేవగాంధారి సం: 27-422

పల్లవి: ఆతనికి లోనైతే నౌదువు గాక
ఆతుమైన చెలిమి నన్నంత సేయవలెనా

చ. 1: పలుమారు మాటాడించ పంతమా నాతోను
తలవంచుకుండేదాని తమకానను
యెలమి నాతనికే యెత్తియ్యవే మాటలు
కలఁగి వుండినవేళ గాసిఁబెట్టవలెనా

చ. 2: సారె నన్ను నవ్వించ చలమా నాతోను
వూరకే చింతించేదాని వుల్లసానను
కేరుఁగాని ఆతనినే గిలిగించవే నీవు
వూరకే వుండినదాని నుడికించ వలెనా

చ. 3: చేవట్టి కాఁగిలింపించ చెలిమా నాతోను
వోవరిలో నున్నదాని వొద్దికిఁ దీసి
శ్రీ వేంకటేశుఁడు గూడె చిమ్మిరేఁచవే యతని
కైవశమై వున్నదాని కదుమఁగ వలెనా

రేకు: 1771-02 దేసాళం సం: 27-423

పల్లవి: ఆడవద్దా నే మాఁటలు ఆపెకేమి
యీడకుఁ దోడి తెచ్చితి వికనేమి

చ. 1: నిక్కి నిన్నుఁ బాసి నేను నీ కెదురు చూచుకొంటా
అక్కడ నెంతవుండినా నాపెకేమి
వెక్కసపు నవ్వు నవ్వి వేఁడుకొనీ నిప్పు డిట్టె
దక్కీ దనపంతమెల్లా తనకేమి

చ. 2: నిలిచి బలిమినైనా నిన్నుఁ దోడితెచ్చేనంటా
అలసి నే వచ్చితేను ఆపె కేమి
అలుకలు నన్నుఁ దేర్చి అట్టె శాంతాలు నెరపీ
యెలయించెఁ దా మునుపే యిఁక నేమి

చ. 3: కదిసి శ్రీ వేంకటేశ కలసితి విపుడు నే
నదను గాచుకవుంటే నాపెకేమి
పొదిగి నాకు బొక్కి బొగడించుకొని నీచే
హృదయము చల్లనాయ నిఁక నేమి

రేకు: 1771-03 వసంతం సం: 27-424

పల్లవి: మేలు మే లీబుద్ధి వుట్టె మేఁటివి నీకు
మైలదీర మణుఁగాయ మంచిదాయఁ గాలము

చ. 1: తగవెంచి నేఁడు దయదలఁచితిగా కిన్నాళ్లు
నగవులే కావా నీవు నవ్వేటివి
వెగటుగ నాపైఁ జేయి వేసితివిగా కిపుడు
మొగము చూచేదా కాదా ముట్టుదాని వలెను

చ. 2: యేఁటికో కొంగువట్టితి విటమునుప లెల్లాను
మాటలే కావా సారె మాతో నాడేవి
కూటమికి నావద్దఁ గూచుంటివిగా కిపుడు
పోటి సరసాలే కావా పారుగాపె వినును

చ. 3: కాఁగిట శ్రీ వేంకటేశ కలసితి విదె నాఁడు
దాఁగిలి ముచ్చులే కావా తగురతులు
చేఁగదేర మన్నించి చెక్కునొక్కితిగా కిపుడు
ఆఁగుకవుండే కాదా అప్పుడే నీ వలెను

రేకు: 1771-04 వరాళి సం: 27-425

పల్లవి: ఏమి నవ్వేవే నాతో యిప్పుడే యెరిఁగించితి
గామిడైన పతి తొల్లే కైలాటకాఁడు

చ. 1: పాయపు దానవు నీవు పంతగత్తెనే నేను
చాయెరిఁగి మాటలాడు సముకానను
చేయి చిక్కి వున్నవాఁడు చెలువుఁడిద్దరికిని
తోయలేఁ డాతఁడు మన దొమ్మి వోపు కొలఁది

చ. 2: పిన్నదాన యించుకంత పెద్దదాన నిదె నేను
సన్నెరిఁగి నవ్వు నవ్వు సముకానను
ఇన్నిటా జాణఁడితఁడు యవ్వరెంత పెనఁగినా
మన్నించి విడేలువెట్టీ మన వోపు కొలఁది

చ. 3: దొరవు నీ వంతకంటే దొరను నేనూడిగాలు
సరవి యెఱిఁగి సేయు సముకానను
సిరులతో నిన్ను నన్ను శ్రీ వేంకటేశుఁడు గూడె
తెరమఱఁగింతే మన తెలివోపు కొలఁది

రేకు: 1771-05 హిజ్జిజి సం: 27-426

పల్లవి: సవతులమైన నేము సాదించక మానరాదు
పవళించి నీవొకతెపాలికే వచ్చునా

చ. 1: తెల్లవారి జామెక్కె తేనెలు గారీ మోవి
యెల్లవారుఁ గాఁపురాలు యిట్టె సేతురా
ఇల్లు వెళ్లఁడంటాఁ బతి కిచ్చేవు విడేలు
యిల్లాండ్లైనవారి నింతులెల్లా నవ్వరా

చ. 2: కలయ నేండలుగాసె కావి దేరీఁ గన్నులను
యెలమి నీవంటివారి నిటు చూడవా
అలసెనంటా బోనా లక్కడనే పట్టేవు
చలివాసి గరితలసరిత నిట్టేయా

చ. 3: పొద్దు మద్యాన్నమాయను భోగాలు మరిఁగితివి
అద్దో లోకము మెచ్చ నణఁకు వొద్దా
బుద్ధితో నీరేతిరి పొందఁడా శ్రీ వేంకటేశుఁ
డి ద(ద్ద)రు గేస్తురాండ్లమే యెంచుకోరా చెలులు

రేకు: 1771-06 గౌళ సం: 27-427

పల్లవి: ఎదిటికి రమ్మనవే యేమిచెప్పినాఁ జేసే
సదరమా నేనంత సటలు వద్దనవే

చ. 1: పిలువవచ్చేదానవు ప్రియములు నేరవా
అలిగినాతఁడే వచ్చి ఆడవలెనే
చెలియవు నీవు నేనుఁ జెప్పఁబోతే నొక్కటే
తలుపుమాటున నుండేతన కింత దగునా

చ. 2: వొక్కటి సే సేదాన వొడఁ బరచనేరవా
తక్కించి నాతఁడే ఇందు దగ్గరుగాక
మొక్కనేలే యాఁడుఁబొందు మొదలఁ గలిగినదే
కుక్కి నీచే కుదుళ్లలో గుజ్జాలఁ దోలించీనా

చ. 3: వొడివట్టినదానవు వున్న సుద్ది నేరవా
బడినే శ్రీ వేంకటాద్రిపతి తాఁ బట్టె
పడతివై వొప్పగించి పట్టి తెరవేసితివి
యెడయక నన్నుఁ గూడె యిఁక మరఁగేఁటికే

రేకు: 1772-01 ఆహిరి సం: 27-428

పల్లవి: ఎఱఁగను నేను నీతో యెదురుమాటలాడను
తఱి నీవే యెంచుకొని దయసేయవయ్యా

చ. 1: చొప్పున నీవు నన్ను చూచితే నేనూఁ జూడక
అప్పుడు దలవంచిన దపరాధము
చిప్పిలి ఆడుదాననై సిగ్గువడితి నిందుకు
తప్పేమిటఁ దీరు నీవే దయసేయవయ్యా

చ. 2: నిగిడి నీవు నవ్వఁగ నిండుసబలోన నేను
నగకవుండినదే నానేరమి(ము)
తగిలి కన్నెగనక దంటతన మొల్లనైతి
తగిన బుద్దులు చెప్పి దయఁజూడవయ్యా

చ. 3: గక్కన శ్రీ వేంకటేశ కాఁగిట నీవు గూడఁగా
యిక్కువలు గరఁగిన దిదియే తప్పు
మొక్కి యలమేల్మంగను మోహములెల్లా నించితి
తక్కక నన్ను మన్నించి దయఁజూడవయ్యా

రేకు: 1772-02 శ్రీరాగం సం: 27-429

పల్లవి: ఇంకనేల నీవే ఆనతియ్యవయ్యా నీ
అంకె దెలుసుకొనేను ఆనతీవయ్యా

చ. 1: పంతము దప్పదు నీతోఁ బలికిన మాత్రమున
యెంత లేదు వినే నాన తియ్యవయ్యా
చెంతల నీ చెప్పినట్టు సేసితే నాకేమాయ
అంతరంగమెల్ల నిట్టె ఆనతియ్యవయ్యా

చ. 2: పన్నె దరగదు నీ వద్ద నుంటే నేమాయ
యిన్నియు నాతో నానతియ్యవయ్యా
మన్ననకు లోనైతే మరి నాకు నేమాయ
అన్నిటా జాణవౌదువు ఆనతీవయ్యా

చ. 3: జవ్వనము సమయదు సారెఁ గూడితే నేమాయ
ఇవ్వలఁ జేకొంటి నానతియ్యవయ్య
రవ్వగ శ్రీ వేంకటేశ రతుల మించితి విట్టె
అవ్వలఁ దడవనని ఆనతీవయ్యా

రేకు: 1772-03 పాడి సం: 27-430

పల్లవి: బుద్ధిమంతురాల నైతి పూఁచి నీ కతాలను
ఇద్దరికి సంతోసము ఇదె జాణతనము

చ. 1: నిచ్చా నిన్ను సతంలతో నిందలుగట్టనోపక
ఇచ్చలాడ దొరకొంటి నిదివో నేను
తచ్చి నీతో నే నలిగి తలవంచుకో నోపక
ముచ్చటలు దీర నీ మోము చూచే విదివో

చ. 2: వుప్పతించి మచ్చము నీ వొళ్లఁ జూపనోపక
కప్పదొరకొంటి నీ గతులెల్లాను
తప్పు వేసి నీ సతుల తలఁగుమనఁజాలక
చెప్పరాని వూడిగాలు సేయించ నేర్చితిని

చ. 3: చలము సాదించి నిన్ను జంకించనోపక
అలమి కాఁగిలించితి నప్పుడే నేను
యెలమి శ్రీ వేంకటేశ యెనసితి మింతలోనె
సొలయనోపక నీ చుట్టమ నైతిని

రేకు: 1772-04 కాంబోదిసం: 27-431

పల్లవి: ఘనుఁడవు నీకేమిటాఁ గడమ లేదు
మనలో నిట్లనేల మరఁగెల్లాఁ బాసెను

చ. 1: యెప్పటికి నీచిత్త మొటువలె వచ్చి వుండు
అప్పటికిఁ దగుమాఁట లాడేనేను
ఇప్పు డడుగదేరి మా ఇంటికి విచ్చేయవయ్య
చెప్పినట్టే సే సేను నీసేఁతలెల్లా దక్కెను

చ. 2: యెవ్వతె పొందు సేసితి విదియును లోఁగొనేను
యివ్వల నీకెంత పంతమిచ్చే నేను
చివ్వన విసుకనేల శిర సించు కెత్తవయ్య
నవ్వినట్టే నవ్వేను నయము నీకాయను

చ. 3: యెటువలె మెత్తువు నీ యిచ్చకమే సే సేను
యిటువలెఁ గూడితివి యియ్యకొంటిని
ఘటన శ్రీ వేంకటేశ కంటి నలమేల్మంగను
తటుకన మొక్కితిని తలఁపు లీడేరెను

రేకు: 1772-05 నాదరామక్రియ సం: 27-432

పల్లవి: విన్నపాలు నేఁ జేసితే వెంగెమై తోఁచు
నిన్ను నీవే చూచుకొనే నేర్పు నీకు వలదా

చ. 1: యెగసక్కేనకు నిన్ను యెవ్వతె వొగడినాను
జిగితో నవ్వేవుగాని సిగ్గువడవు
మొగము చూచితే నీమోవినే మచ్చమున్నది
తగుఁదగదని యెంచి తలఁచుకోవలదా

చ. 2: గుట్టు దెలియవలసి కొమ్మ వొకతె మెచ్చితే
అట్టె యౌనంటా నీవు నంగవించేవు
పట్టి యిచ్చీ నీవొళ్ల పరకాంతల భోగాలు
రట్టయ్యే ననుచు పదరక వుండవలదా

చ. 3: యెంగిలి సేయవలసి యెవ్వతె వీడె మిచ్చినా
సంగతాయనంటా నట్టె చవిగొనేవు
కుంగక శ్రీ వేంకటేశ కూడితి నలమేల్మంగను
యింగితాకారాలు నీవే యెఱుఁగుకోవలదా

రేకు: 1772-06 లలిత సం: 27-433

పల్లవి: అందుకేమి రావయ్య అంతవాఁడవు
చందాలు సేసీ నిదె చక్కని నీరూపము

చ. 1: గొప్పలు మా చన్నులు కొంచము మానదుము
యెప్పుడు మా వొళ్ల లేవా యెచ్చుకుందులు
తప్పులు నీవల్లనుంటే తలవంచుకోనేల
కప్పిపోయ పూసినట్టి గందపుఁ బూఁతలును

చ. 2: తెల్లని మా కన్నులలో దిష్టించి నల్లగుడ్లు
అల్లుకొని రెండు నీపై నాడించేము
కల్లలు నీమాటలైతే కడు సిగ్గువడనేల
చెల్లు బడాయ నన్నీ నీ సేసిన బాసలనే

చ. 3: జంకెలు మా బొమ్మలున్ను సరి నవ్వు సెలవుల
వుంకువై శ్రీ వేంకటేశ వొక్కటైతిని
లంకె నలమేల్మంగను లలి భూసతిఁ దెచ్చితి
పొంకమాయ నీవిపుడు భోగించిన భోగము

రేకు: 1773-01 రామక్రియ సం: 27-434

పల్లవి: ఏల నీకు నింతగుట్టు యేమిగట్టుకొనే విందు
మేలిమిచేఁత నిండితే మెచ్చకుండేరా

చ. 1: కొత్తగందవొడి చల్లు కొనేవు నీమేనినిండా
చిత్తడి చెమటలకు సిగ్గయ్యీనా
హత్తి సే సేవు విడేలు అట్టె మోవి విప్పి యైతే
ముత్తరము చెలులెల్లా ముంచి నవ్వేరా

చ. 2: నేరుపుతో పువ్వుదండ నెత్తిఁ జుట్టుకొనేవు
బారపు జాఱు దురుము పట్టిఇచ్చీనా
సారె విసరుకొనేవు చప్పడుగా నింతలోనె
ఆ రీతి బుసకొట్లు నీకాఱ డయ్యీనా

చ. 3: ముదిత లిందరిలోనా ముసు(సుఁ)గు వెట్టుకొనేవు
మదనకళల కిది మరఁగయ్యీనా
కుదురై శ్రీ వేంకటశ కూడితి వలమేల్మంగను
పదరకు మింతలోనె పచ్చి దోఁచీనా

రేకు: 1773-02 ఆహిరి సం: 27-435

పల్లవి: ఆయఁ దొల్లె అన్నివను లాపెకేమి
ఆయా లెల్లాఁ జేకొనె నాపె కేమి

చ. 1: వీడె మిచ్చె నిన్నుఁ బట్టి వింతచేఁతలెల్లాఁ జేసె
ఆడనుండే నవ్వు నవ్వె నాపె కేమి
వాడుదేరఁజేసి నావద్దికి నిన్నంపి చూచీ
ఆడికెకు వెఱవదు ఆపెకేమి

చ. 2: చిప్పిల నెంగిలిసేసి చేరి నిన్ను నాకిచ్చె
అప్పసము గాచుకొన్న దాపె కేమి
వొప్పుగ నాయింటిలోనె వురమెక్కె తాను నీకు
అప్పుడు నిప్పుడుఁదానె యాపె కేమి

చ. 3: నేను తొలసిదేవిని నీపాదాలు పూజింపించి
ఆనుక తా విఱ్ఱవీఁగీ నాపెకేమి
తానె యలమేలుమంగ తగు శ్రీ వేంకటేశుఁడ
ఐనతగవు నెరపె నాపె కేమి

రేకు: 1773-03 ద్రావిళ భైరవి సం: 27-436

పల్లవి: ఏమి సేయవచ్చు నిఁక యిట్టుండెను నీ పుణ్యము
కామినుల భోగ మెంత కాఁగలదో నీకు

చ. 1: మంచివాఁడవె నీవు మంకువనితెను నేను
యెంచి మాతోఁ గూడి నీవు యెడ్డవైతివి
కంచము పొత్తున నేల కదిసి యారగించేవు
ఇంచుకంత యెంగి లంటి ఇఁక నెంత యౌదువో

చ. 2: తగవరివే నీవు తమకపుదాన నాతో
తగులఁగా నీవింత తక్కరివైతి
పగటున నేఁ బండేపానుపుపైఁ బండేవు
యెగువ దిగువలను యిఁక నెంత యౌదువో

చ. 3: అట్టె శ్రీ వేంకటేశుఁడ వలమేలుమంగ నేను
తొట్టి పురమెక్కించుక దొరవైతివి
బట్టిగొని అప్పటిని సరసములాడేవు
యిట్టె నీ జాణతనాల యిఁక నెంత యవుదువో

రేకు: 1773-04 వరాళి సం: 27-437

పల్లవి: మొగమేమి చూచేవు ముద్దరాలను
వెగటైనదానఁ గాను వెఱవకు మీఁకను

చ. 1: చలమెంత గలిగినా చనవే మెరసేఁగాని
బలిమిసేయను నీవు పంతగాఁడవు
అలుకెంత గలిగినా అందుకు మొక్కేఁగాని
వెలుపల దూర నిన్ను వెఱవకు మీఁకను

చ. 2: వాసి యెంత గలిగినా వద్దనే వుండేఁగాని
పాసిపోను నేరుపుల బలువాఁడవు
వేసటెంత గలిగినా వేడుకతో నుండేఁ గాని
వీసమంతాఁ బదరను వెఱవకు మీఁకను

చ. 3: కూరిమెంత గలిగినా కొంగువట్టుకుండేఁ గాని
మేరలు దప్పను నీవు మేనవాఁడవు
ఆరీతి శ్రీ వేంకటేశ అలమేలుమంగ నేను
వీరువారు నేమనేరు వెఱవకు మీఁకను

రేకు: 1773-05 సాళంగనాట సం: 27-438

పల్లవి: ఆతఁడు నీవాడినట్టె అన్నివనులనుఁ జేసు
శ్రీతరుణిని మమ్ము రక్షించవమ్మ

చ. 1: యేలవమ్మ మమ్మును యెక్కింతివి పతి వురము
నీలీల లేమి సేసినా నీకుఁజెల్లును
బాలకి వన్నిటా నీవు పనిగొంటి వాతనిని
కీలు నీచే నున్నది రక్షించవమ్మా

చ. 2: మన్నించవమ్మ మమ్ము మగఁడు నీచేతివాఁడు
సన్నల నీచేఁతలెల్లా సాగి వచ్చిని
అన్నిటాఁ జక్కనిదాన వటమీఁదట దొరవు
యెన్నికె కెక్కె నీబ్రదు కిఁకఁ గావవమ్మా

చ. 3: యీడేరించవమ్మ మమ్ము నిట్టె యలమేల్మంగవు
గూడితి శ్రీ వేంకటేశుఁ గోరినట్టెల్లా
యీడులేనిదానవు నే మూడిగాలవార మిదె
వేడుక లెల్లా నీసొమ్మే వెలయించవమ్మా

రేకు: 1773-06 ఆహిరి సం: 27-439

పల్లవి: నెట్టుకొన్న మగఁడవు నీవే కదా
యిట్టె నేఁ బదరఁగా యేమాయ నాకును

చ. 1: పంగించి నిన్ను బలిమిఁబట్టి పెనఁగఁగనేల
సంగడివారితో పాటు చాలదా నాకు
యింగిత మెఱిఁగి నేనిట్టె వుంటే మేలుగాక
యెంగిలి సేసుకోఁగా యేమాయ నాకును

చ. 2: వాదడిచి నిన్నుఁ గడువంచుక తిరుగనేల
సాదననిపించుకొంట చాలదా నాకు
నీదయ గోరుకవుంటే నీవే మెచ్చేవు గాక
యేదియని కొసరఁగా నేమాయ నాకును

చ. 3: సలిగె శ్రీవేంకటేశ సారె నీతోఁ జెప్పనేల
అలమేలుమంగవార మౌట చాలదా
వలపుతో నేనుంటే వచ్చి కూడితివి గాక
యెలమి రట్టు సేయఁగా నేమాయ నాకును

రేకు: 1774-01 దేసాళం సం: 27-440

పల్లవి: నేను నీవంటిదాన నేరమెంచేనా
దానికేమి నీలోనే తలఁచుకో పనులు

చ. 1: మగఁడు వద్ద నుండగా మాట మాఁటలను నీతో
జగడములడచేనా సాదవు నీవు
నగవు నీవు నవ్వఁగా నాకేల కోపము వచ్చీ
తగవులు నీవే చెప్పి తలఁచుకో పనులు

చ. 2: ఆతనికి నీవిట్టె ఆకు మడిచియ్యఁగాను
చేత నిన్ను దొబ్బేనా సిగ్గుదానవు
నీతితో నడవఁగాను నిన్ను దూరేనా నేను
దైతతన మెవ్వరందో తలఁచుకోపనులు

చ. 3: అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీ వేంకటేశు
డలిగేనా నే నీతో నంత దొరవు
మలసి విభునిచేత మన్నింపించితివి నేఁడు
తలఁపెల్లా నొక్కటాయ తలఁచుకో పనులు

రేకు: 1774-02 మాళవిగౌళ సం: 27-441

పల్లవి: మేలెఱఁగనిదానవా మిక్కిలి నేను
చాలుకొన్న నీగుణాలు చక్కఁగాక మానీనా

చ. 1: చెల్లుబడై నీవు నాకు చెప్పినట్టు సేయఁగాను
గొల్లెతల సుద్దులకే కోపగించేనా
చల్లఁగా నీవు నాతో సరసములాడఁగాను
వొల్లనే నీ నేరములు వోరు వలెనా

చ. 2: అంకెల నీవు నాయానకు లోనైవుండఁగా
ఇంక నెవ్వరిఁ దెచ్చినా యీసడించేనా
సంకెదీర నీవు నాకు చనవెల్లా నియ్యఁగాను
వుంకువై నీవు చెప్పఁగా నొడఁబడకుందునా

చ. 3: ఇంత నన్నుఁ గూడి వురమెక్కించుక వుండఁగాను
పంతాన నీవెంతవున్నా పాడిదప్పేనా
చెంతల శ్రీ వేంకటేశ సిగ్గుదేర నవ్వితివి
వంతువాసు లెంచి నిన్ను వలఁబెట్టేనా

రేకు: 1774-03 బౌళి సం: 27-442

పల్లవి: చనవు చెల్లించ నేర్చే సరసుఁడవు
నిను ముదు లడుగక నీఇల్లు చేకొంటిని

చ. 1: ఆసతోడ నిన్ను నేను అంటిముట్టి పెనఁగుదు
వాసివంతు లెంచను నే వనిత నైనా
సేసవెట్టిన సలిగె చిత్తమునఁ బట్టుకొని
నీ సిరులకెల్లాను నేనే కర్తనైతిని

చ. 2: సంతోసాన నీతోను సారె సారె నవ్వుదును
వింత సేసుకొనను నే వెలఁది నైనా
పొంతఁ జేయివట్టినదే భోగ్యము సేసుకొని
రంతుల నేనే నీరాజ్యమెల్లా నేలితి

చ. 3: గక్కన శ్రీ వేంకటేశ కాఁగిలించి కూడితిని
తక్కరి తనము సేయఁ దరుణినైనా
దక్కి నాపాల నున్నదే దరిదాపు సేసుకొని
వొక్క మనసున నీకు వొద్దికై నేనుంటిని

రేకు: 1774-04 సాళంగం సం: 27-443

పల్లవి: రామలకు సహజమే రమణుఁడు నేమి సేసు
మోములు చూచుకొందము మోనానఁ జెలులము

చ. 1: పూఁచినట్టి చేతిమొక్కు పురుషునిమీఁదను
చాఁచిన వెంగేలేల(ల్ల) సవతి మీఁద
తూఁచి చల్లీ నొక్కమాఁటే తొయ్యలి ఇద్దరిమీఁద
దాఁచుకొనీ వెడనవ్వు తా నడుమ నాతఁడే

చ. 2: కానుక తామెరపువ్వు ఘనుఁడుప్రాణేశునికి
సానఁబట్టినట్టి చూపు సవతికిని
ఆనించీ నిద్దరికిని అంగనఁ దానొక్కమాఁటే
నానవేసీ వలపులు నడుమ దా నతఁడే

చ. 3: చిందేటి మోవితేనె శ్రీ వేంకటేశ్వరునికి
సందడిఁగాకుండఁ దెర సవతికిని
పొందు సే సె నొకమాటే పొత్తుల నిద్దరికిని
మందలించీ నడుమను మాఁటలనే ఆతఁడు

రేకు: 1774-05 వరాళి సం: 27-444

పల్లవి: మంచిదాయ దానికేమి మమ్ముఁ గావ నీకే పోదు
నించి యింకా నీవే కరుణించేవు గాని

చ. 1: యెప్పుడు జవ్వనధర్మ మెఱఁగనివాఁడవా
చెప్పనేల నీకు నిదె చింతగాదా
తప్పక యీపని నాతలనే వేగినదా
చొప్పులు నాపైనే నీవు చూపేవు గాని

చ. 2: ముంచిన వలపులకు మొదలివాఁడవు గావా
యెంచనేల నీకు నిదె యితవు గాదా
పెంచి యీకతలు నాకె పేరువారి వున్నవా
అంచెలను నాకు ప్రసాదించేవు గాని

చ. 3: నే నిన్నుఁగూడిన రతి నీవు నేర్పినవి గావా
మేను ముట్టి నీవు నన్ను మెచ్చుఁ గలిగె
కోనేటి శ్రీ వేంకటేశ కొదదీర్చి కూడితివి
వీనులు చల్లఁగా నింకా వేఁడుకొనేవు గాని

రేకు: 1774-06 రామక్రియ సం: 27-445

పల్లవి: లేలే యాపె తిట్లు లెక్కసే సే విప్పు డిట్టె
చాలుఁజాలు మీకు లోలో చవులు గావా

చ. 1: తగవు లెన్నేసి లేవు దగ్గరి నీవు చెప్పితే
వెగటైన యందాఁక విందునే నేను
యిగురుఁబోఁడికి నీకు నెప్పుడునుఁ గలదే
పగుటున నాపె నీకు ప్రాణము గాదా

చ. 2: తారుకాణ యెంతలేదు తగవు నిలిపితే
కూరిమి నెందాఁకాఁ గనుఁగొందుము నేము
యీరీతి తచ్చనలు యిద్దరికిఁ గలదే
కోరినట్టె యాపె నీకు కొంగుపైఁడి గాదా

చ. 3: చందాలు సే సేకొనేవు సరి నాపెలోనైతే
యెందాఁకా నవ్వుదును యిందుకు నేను
చెంది నన్ను నేలితివి శ్రీ వేంకటేశ్వర నీవు
నిందలేక యాపెప్పుడు నీ నేస్తకత్తెకాదా

రేకు: 1775-01 సాళంగనాట సం: 27-446

పల్లవి: చూడవయ్య నీతో పొందు సులభమా ఇందరికి
వేడుక పైఁబూయక వేరే నీవు మెచ్చేవా

చ. 1: చెప్పినట్టె సేసి మీ చెలులకెల్లా నేను
నెప్పున నిచ్చలాడక నీవు మెచ్చేవా
చప్పుడు సేయక పై పై సరసము లాడుకొంటా
తప్పు నీపై లేదనక తగ నీవు మెచ్చేవా

చ. 2: మోమెత్తి పట్టుక నీకు మోహములు చల్లుకొంటా
నీ మనసు గరచక నీవు మెచ్చేవా
దీమసము సేసుకొని తెలివిదెచ్చుక సారె
ఆమని నవ్వు నవ్వక అటు నీవు మెచ్చేవా

చ. 3: కాతరించి విన్నపాలు కడు నీకు విన్నవించి
నీతో నిట్లాఁ గూడక నీవు మెచ్చేవా
యీతల శ్రీ వేంకటేశ యేలితివి నన్ను వలె
జాతినీతి నెరయక సరి నీవు మెచ్చేవా

రేకు: 1775-02 లలిత సం: 27-447

పల్లవి: ఇదివో మా సాజము యెఱఁగ విన్నవించితి
కదిసి మన్నించవయ్య కాదనము పనులు

చ. 1: వంకలొత్తీ నాపె నీవలపులు మాఁటలు
అంకెవచ్చి నట్టెల్లా నీవాడవయ్య
సంకెలేక నిజమాడి సాదించనేకాని
పొంకాలు సేయనేరము బూటకములెల్లాను

చ. 2: చక్క గప్పీ నాపె చక్కని నీమేని చేఁతలు
దక్కించు కొంటివి మమ్ము దగ్గరవయ్య
పక్కన నెరుసులుంటే బయటవేయనేకాని
మిక్కిలి దాఁచనేరము మెరమెచ్చులెల్లాను

చ. 3: పేరఁబెట్టీ నాపె నీపెలుచు మోవి తేనెలు
చేరి మాకు నియ్యవయ్య చేకొనేము
కోరి శ్రీ వేంకటేశ్వర కూడితివి సందునవే
ఆరీతిఁ జెప్పనేరము ఆయపు నీరతులు

రేకు: 1775-03 పాడి సం: 27-448

పల్లవి: భ్రమయకుమనరమ్మ పనిగద్దు యింకమీఁద
తమకించి తనవల్లఁ దప్పు వేసేవారమా

చ. 1: సిగ్గుతోడ నున్నదానిఁ జేరి యలిగితినంటా
యెగ్గులెల్ల గడిఇంచే వేడ లేనివి
కగ్గి యాడో ఆఁటదాని కాతాళాలఁ బడి వచ్చి
వెగ్గళించి మా మీఁద వెళ్లించవలెనా

చ. 2: మానాపతి నైనదాని మారుమాటలాడనంటా
సానఁబట్టేవు పంతాలు సారె సారె
నానఁబెట్టి తానెవ్వతోనాలిఁబడి ఇందు వచ్చి
ఆనుకొని మాగుణాలు అట్లాఁ జూచీని

చ. 3: రతి నలసినదాని రాజసము చూపినట్టు
కతలెల్ల గడిఇంచి కాఁగిలించీని
యితవై శ్రీ వేంకటేశుఁ డితఁడు నన్నే కూడి
యితర సతులవలె నిటు నన్ను మెచ్చీని

రేకు: 1775-04 ముఖారి సం: 27-449

పల్లవి: ఇప్పుడు దా దక్కెనేమో యెవ్వఁ డెఱుఁగు
చిప్పిలఁగ నవ్వితేనే సేసినవారు గార(రా?)

చ. 1: పొద్దువోక ఆతనితో పొందులు సేసుకొంటా
కొద్దిమీర గోళ్లేల గోడ రాచేవే
అద్దరిపాటు నే రాఁగా నటు కొంకితిరి గాక
వద్ద లేకుంటే కూడినవారు మీరు గారా

చ. 2: వంచిన శిరసుతోడ వాడికెలు సేసుకొంటా
మంచమెక్కి పతినేల మరిగించేవే
అంచెల నేఁ గనఁగాను ఆం(అం)తట నున్నారుగాక
ఇంచుకంత మఱఁగైతే ఇట్టె కూడుకొనరా

చ. 3: నవ్వి కాఁగిలించుకొంటా నమ్మిక లిప్పించుకొంటా
రవ్వలేల సేసేవే రాఁగా నేఁడు
యివ్వల శ్రీ వేంకటేశుఁ డెనసె నన్నింతలోనె
దవ్వుల నుంటేను పంతాలవారే కారా

రేకు: 1775-05 బౌళి సం: 27-450

పల్లవి: ఏల మమ్ముఁ గొసరేవు యెంతగద్దు నీయాస
వోలిఁ జెలులు నీరతి కోర్వఁగవశమా

చ. 1: పెదవిపై తేనెలు పేరుకొనవచ్చుగాక
పొదిగి తెచ్చి కుండలఁ బోయవశమా
కుదురు గుబ్బలమీఁద కుప్పసేయవచ్చు గాక
చిదిమి తెచ్చి వయసు చేతఁ బెట్టవశమా

చ. 2: సిరిమించే నవ్వులు సెలవుల నుండుఁ గాక
వరుసఁ జిత్తరువున వా(వ్రా)యవశమా
సరసపుఁ జూపు నీపైఁ జల్లఁగవచ్చుఁగాక
జరసేటి వేళ గంటే సరి జూప వశమా

చ. 3: కరఁగిన మోహములు కాఁగిటఁజూపుటఁగాక
బెరఇంచి వోర్పునఁ బెట్టవశమా
గరిమ శ్రీ వేంకటేశ కలసితి విటు నన్ను
తెరలోననే కాక తెలుపఁగ వశమా

రేకు: 1775-06 శ్రీరాగం సం: 27-451

పల్లవి: చెలులాల చూడరమ్మ చేసినది లేదందురు
అలివేణిబొంకు కంటే అదె జాణతనము

చ. 1: మొనమాట నే నాడితే మొలక నవ్వులు నవ్వి
తన మనసెఱఁగని తగ వున్నదా
యెనసిన రమణుఁడు యెదుటనే వున్నాఁడు
అన నేమున్నది తన కదె జాణ తనము

చ. 2: తప్పులు నేఁ బట్టితేను తానే పొందు సేయవచ్చి
నెప్పున తా నేరనినేరు పున్నదా
చొప్పులెత్త నిద్దరికి చుట్ట మీడ నున్నవాఁడు
అప్పసము గాచుకున్న దదె జాణతనము

చ. 3: మొగము నేఁ జూచితేను ముచ్చట సన్నలఁ జల్లీ
వెగటైన వినయాలు వెదచల్లఁడా
యెగ సక్కేన శ్రీ వేంకటేశుఁ డిట్టె మమ్ముఁ గూడె
ఆగడు దీర్చుకొనుట అదె జాణతనుమ

రేకు: 1776-01 సామంతం సం: 27-452

పల్లవి: సే సేటి మా సేఁతలెల్ల సింగారాలే
మూసిన ముత్తేలము మొనలంత చూపము

చ. 1: చూపులకు వాండ్లు సూటియై వుండును తొల్లె
కోపగించుకొన్నఁ బూవు కొత్తగా నీపై
నీ పనులకు మతిలో నీకు నీకే తోఁచీఁగాని
తీపులమోవివారము తెగవలు సేయము

చ. 2: వొత్తుఁ జన్నులు గట్టులై వుండేది సాజమే
మెత్తఁ జేసితేఁగావు మించి నీచేత
హత్తిన నీగుండెవంక నవి రాఇకొనెఁగాని
నిత్తెపుఁగోమలులము నిష్ఠూరము చూపము

చ. 3: చేతులకుఁ గొనగోళ్లు చిగిరించేది సాజమే
కాంతరించితేఁ బోము కలకాలము
యేతుల శ్రీ వేంకటేశ యెంచనేల కూడితిమి
ఆతుమైన వారము అంత రట్టు సేసేమా

రేకు: 1776-02 బౌళి సం: 27-453

పల్లవి: ఊరకుంటే నేమందువో వూడిగము సేయనని
ఆరూఢి నేఁ బైకొంటి ఆయము నేచేతిది

చ. 1: చేయెత్తి పిలిచితేను చేరి నే నిలిచితిని
యే యింతిఁ బిలిచితివో యెఱఁగ నేను
వాయెత్తి మాటాడితేనే వడిగా నేమీ యంటి
నీయిచ్చ దెలియఁగాని నేనే సంతోసించితి

చ. 2: మున్ను నీవు నవ్వితేనే యొక్కుచు నేనూ నవ్వితి
యెన్నికె లెవ్వతెపై యెఱఁగ నేను
కన్నులు విచ్చి చూచితే గక్కనఁ జెమరించితి
సన్న దెలియదు గాని చనవు చేకొంటిని

చ. 3: పానుపుపై నీవుండఁగా పైకొని నేఁ గూడితిని
యీనయము నాకే యౌత యెఱఁగ నేను
పూనితివి వలపులు పాదిగితి నే నన్నియు
దీనికె శ్రీ వేంకటేశ తేఁకువెల్లాఁ గంటివి

రేకు: 1776-03 శంకరాభరణం సం: 27-454

పల్లవి: అందాఁక నీరప మవుఁగాదనను
కందువ వేళనే కైకొనేఁ గాక

చ. 1: వలచినదాన వద్దనఁ గలనా
చెలఁగి నీ వేమి సేసినను
మొలక చన్నులు మోపేటి వేళనే
చలము లన్నియు సాదించేఁ గాక

చ. 2: కోరుకొన్నదాన కోపగింతునా
మేరలు నీ వెంత మీరినను
సారపుఁ గెమ్మోవి చవిగొనే వేళ
బీరములన్నియు పెనచేఁగాక

చ. 3: కూడి నట్టి దాన గుట్టు దాఁచేనా
యీడనే శ్రీ వేంకటేశ నిన్ను
మేడెపురతులమీఁద నున్న వేళ
పాడి పంతములఁ బంగించేఁ గాక

రేకు: 1776-04 సారాష్ట్రం సం: 27-455

పల్లవి: ఇతవరులమయ్యే ని న్నింతకుఁ దెచ్చితిమి
కతలకెల్ల నిక్కిన కడు దొడ్డవాఁడవు

చ. 1: చేరి నిన్నుఁ గూడేమంటా చెమట లంటింతుము
మేరతో కొప్పువిరులు మీఁద రాలును
యీరీతి మాతోడి పొందు ఇంతకుఁ దెచ్చెను నిన్ను
పోరచి నందరిచేత పూజగొనేవాఁడవు

చ. 2: మోవి తేనెలిచ్చేమంటా ముంచి యెంగిలి సేతుము
భావించి పెనఁగఁబోతే పాదాలు సోఁకు
వావులు మాతోడను వాఁటాలు సేసెను నిన్ను
దేవరవై ఇందరిలో తేజమైన వాఁడవు

చ. 3: రతుల మెప్పించేమంటా రసము లుబ్బింతుము
చతురత మాటలెల్లా సాదింపు లౌను
ఇతవై శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
సతులు పెక్కులు గల సవరనివాఁ డవు

రేకు: 1776-05 పాడి సం: 27-456

పల్లవి: దానికేమి తప్పు గాదు దయదలఁచు కొంటేను
వీనుల మామాటలెల్ల వినవమ్మ చెలియ

చ. 1: చలమెల్ల నొక్కటే సతులకుఁ బతులకు
బలిమి కొలఁదినే పంతాలు గాని
నిలుచున్నాఁడు నీపతి నేము వొడఁ బరచేము
నెలకొని ఇంతట మన్నించవమ్మ చెలియ

చ. 2: బిగువెల్ల నొక్కటే పెనఁగేటివారికి
నగవు కొలఁదినే ననుపుగాని
మొగము చూచీ నతఁడు మొక్కేము నేమెల్ల
నిగిడి యీవేళను మన్నించవమ్మ చెలియ

చ. 3: రతియల్లా నొక్కటే రసికుల కెల్లాను
మతులకొలఁదినే మరపు గాని
యితవై శ్రీ వేంకటేశుఁ డిదె కూడె మమ్ము మెచ్చ
సతమై నీ సరసాలు చల్లవమ్మ చెలియ

రేకు: 1776-06 భైరవి సం: 27-457

పల్లవి: వద్దు వద్దు రమ్మనవే వలవని జాగు లేల
నిద్దురకన్నులతేట నేనే యెరుఁగుదునే

చ. 1: మంచము మీఁదటి మాఁట మరచెనా తానేమైన
కంచము పొత్తుల చవి కానఁడా తాను
ఇంచుకంత వట్టి గుట్టులేల మాతోఁ జేసీని
నించేటి తన లాగులు నేనే యెఱుఁగుదునే

చ. 2: గుబ్బల గుజ్జనగూళ్లు గోర నూఁది చూడఁడా
వుబ్బుఁగవణపు పుక్కి లున్నదిగదె
మబ్బువయసు మదము మాపైనేల కప్పీనే
నిబ్బరపు తనతమి నేనే యెఱుఁగుదునే

చ. 3: బీరపు కాఁగిటిపస బిగిఇంచి మెచ్చఁడా
సారె జారుఁగొప్పు గురి సరసాలకు
యీరీతి శ్రీ వేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
నేరుపు నేరములెల్లా నేనే యెరుఁగుదునే

రేకు: 1777-01 రామక్రియ సం: 27-458

పల్లవి: ఒప్పగించితినంటాను వూరకేల మమ్మనేవు
నెప్పున నే మొరసితే నిన్ను సోఁకి రాదా

చ. 1: సలిగె గలిగినాపె సణఁగులు రాలిచితే
నిలువునఁ జేకొనఁగ నీకె హితవు
అలరి సవతులము అంది వాదు లడిచితే
నెలకొన్న మాఁటలెల్ల నిన్ను సోఁకి రాదా

చ. 2: చిత్తము వచ్చినయాపె చేతికొన దాఁకించితే
హత్తి నీకె సరసములై వుండును
పొత్తుల మగువలము పూనుకొని వచ్చితేను
నిత్తెమైన అలవాటు నిన్ను సోఁకిరాదా

చ. 3: కదిసిన యాపె నీ కందువలు రేఁచితే
యిదె శ్రీ వేంకటేశ నీ యెమ్మ(మ్మె)లు మించు
అదనుగాఁగా నేము అలమి భోగించితిమి
నిదురకన్నుల నవ్వు నిన్ను సోఁకి రాదా

రేకు: 1777-02 కాంబోదిసం: 27-459

పల్లవి: ఎడమాట లాడవే మా ఇద్దరి సందు
గడుసుఁ దనము మాన్చఁ గలనా యీతనిని

చ. 1: తగవెరిఁగితేఁ జాలు తప్పులు నేఁ బట్టేనా
మొగమెత్తుమనవే నే ముంచి చూచేను
జగడాలడువడట చలము సాదించేనా
నగుమనవే వలపు నానఁబెటే(ట్టే) ను

చ. 2: నేమముతో నుండునట నెరుసు నే నెంచేనా
ఆమాఁట ఆడు మనవే అంది విడేలు
ఆముకో వలచునట అనుమానించేనా
దోమటికి రమ్మనవే తొడికే నే మొదలు

చ. 3: పెనఁగఁగా నేరిచితే సిరి తీసేనా ఇఁక
చన విమ్మనవే ఇట్టె సమ్మతించేను
యెనసె శ్రీ వేంకటేశుఁ డెదురెదురనే నన్ను
వినుమనవే మనవి విందు మోవిఁ బెట్టేను

రేకు: 1777-03 బౌళి సం: 27-460

పల్లవి: విచారించుకోవు గాక వెనకముందు
పచారాలవలె బట్టఁబయట బెట్టుదురా

చ. 1: చెనకుచు మగవాఁడు సిగ్గువిడువఁగఁ జెల్లు
అనిశము విడువరా దాఁటదానికి
చనుఁగవ చూపుమంటా సారెసారెఁ దిట్టేవు
మొనలైవుండును అవి ముట్టితేనే నాఁటవా

చ. 2: కన్నచోటఁ బతులకు కడుఁ దమకించఁ జెల్లు
అన్నిటాను అణకువే ఆఁటదానికి
వన్నెలమోవి ఇమ్మంటా వచ్చి వచ్చి జంకించేవు
నున్నవై వుండును అది నోరూరింపించదా

చ. 3: యీడానాడా నినుబోఁటి కెమ్మెలాడుకోఁ జెల్లు
ఆడికెఁ బడఁగరాదు ఆఁటదానికి
కూడితివి రతి నన్ను గొబ్బున శ్రీ వేంకటేశ
వాడికై వుండును అది వ(ద)లపులు రేఁచవా

రేకు: 1777-04 ఆహిరినాట సం: 27-461

పల్లవి: కానవచ్చె నీగుణాలు గక్కన నద్దరిపాటు
ఆనుక మంకుఁదనాన కంతదాన వవుదువే

చ. 1: నెట్టుక ఆతఁడు నేనూ నీఇంటికి వచ్చితేను
అట్టె కూచుండి లేవవు అంతదానవే
చుట్టరికము సేసితే సూడువట్టే వింతలోనె
అట్టె నీపతి యెడకు నంతదాన వౌదువే

చ. 2: చాయసేసుకొని నేము సరుసఁ గూచుండితేను
ఆయముగా వొత్తుకోవు అంతదానవే
నాయములు నడపితే నటనలు సాదించేవు
ఆయలేని రమణుని కంతాదాన వౌదువే

చ. 3: చేతులు చాఁచి నేము చెక్కులు నిన్ను నొక్కితే
ఆతలీతలఁ దిప్పే వంతదానవే
యీతల శ్రీ వేంకటేశుఁ డిద్దరిఁ గూడెను వాఁడె
ఆతనియెడకు నీ వంతదాన వౌదువే

రేకు: 1777-05 భైరవి సం: 27-462

పల్లవి: వట్టి చింత నీకు నేల వంచిన శిరసులేల
పట్టుమా అందిచ్చే నాపె బాగాలు నీకును

చ. 1: కూరిమి గలవాఁడవు కోపాలఁ బడనోపవా
యీరసాలాపె యాడినా యేమాయ నీకు
చేరి మాముందరగాఁగా సిగ్గువడేవో యేమో
రారమ్మ వొక్కటిసేసే రమణిని నిన్నును

చ. 2: చెట్టవట్టినవాఁడవు చెనకులకు లోఁగేవా
యెట్టు నిన్నాపెసేసినా నేమాయను
గుట్టు గంటిమని మాకుఁ బొంకి వున్నాఁడవో యేమో
నెట్టుకొలిపేరమ్మా నెలఁతలు నిన్నును

చ. 3: తగిలిన నీవు రతి తప్పులకు నోపవా
యెగ సక్కే లా పేమన్నా నే మాయను
నగి శ్రీ వేంకటేశుఁడ నన్నూ నాపెఁ గూడితివి
జగడాలు దిద్దే రమ్మా సకియను నిన్నును

రేకు: 1777-06 తెలుఁగుఁగాంబోది సం: 27-463

పల్లవి: అట్టె కాదా ఆస నీ కెంతో
యెట్టుక యితనికి నీవొక్కెతవా

చ. 1: వాలుకచూపులు వంచితివి గదవే
యేలిన రమణుఁడు యేమనెనే
కోలుముందుగాఁ గోపములేలే
తాలిమి మా కిటు దయివారఁగాను

చ. 2: కొంచెపు మాఁటలఁ గొసరితివి గదవే
యించుక రమణుఁడు యేమనెనే
మంచమెక్కి మరి మంకు లదేలే
పొంచుక నేమెల్లా బొందితి మిదివో

చ. 3: కులికి కులికి రతిఁ గూడితివి గదవే
యెలయించిన పతి యేమనెనే
కలసితిమి శ్రీ వేంకటపతి నతనినే
వలపులుమాకును వంతాయ నిపుడు

రేకు: 1778-01 ఆహిరి సం: 27-464

పల్లవి: మెత్తనిది నా మనసు మేటివి నీవు
యెత్తిన యాసలదాన యేమిసేసే నిన్నును

చ. 1: కోపగించవచ్చి నేను గొబ్బున నీమోము చూచి
నాపంతము విడువకే నవ్వితి నేను
చేపట్టి నీ చిత్తము వచ్చినట్టె సేయవయ్య
యీపాటిదాన నేను యేమి సే సే నిన్నును

చ. 2: చేయి చాఁచేనని వచ్చి చిమ్ముల నీమాఁట విని
ఆయాలు గరఁగి లోనైతి నీకును
నీ యిచ్చలోనిదాన నేఁ డిట్టె మన్నించవయ్య
యీయెడఁ జేతిలోదాన నేమి సేసే మిందును

చ. 3: కూరిమి గొసరవచ్చి కూడితి నీకాఁగిట
నేరుపు గలిగినట్టి నీ మహిమలు
సారపు శ్రీ వేంకటేశ సతమైనయట్టిదాన
యీరసములేనిదాన నేమిసేసే నిన్నును

రేకు: 1778-02 సాళంగనాట సం: 27-465

పల్లవి: నావద్ద నున్నఁ దడవు నాఁటకాలేల
నీ విధమే యిది యంతా నీవే బుద్ధియ్యవోయి

చ. 1: వాసులకు నీపై నే వలపులు చల్లితేను
బేసబెల్లి తానేల పేఁడుకొనీని
ఆసపడితే వచ్చునా అవ్వలివారి సొమ్ము
నీసూటి మానిసి యాపె నీవే బుద్ధియ్యవోయి

చ. 2: చనవున నీతో నేను సరసము లాడితేను
పనిమాలినాపె తాను పంతాలాడీని
పెనఁగితేఁ బుట్టునా ప్రియములు లోలోన
నినుఁ జుట్టుకొనీ నాపె నీవే బుద్ధియ్యవోయి

చ. 3: జవ్వనాన నే నిన్ను సాదించి కూడితేను
పవ్వళించి తాను నట్టె పైకొనీని
యివ్వల శ్రీ వేంకటేశ యిద్దరము సరే నీకు
పువ్వక పూచె నీ కాపె బుద్ధియ్య వోయి

రేకు: 1778-03 నారాయణి సం: 27-466

పల్లవి: నలినాక్షి నిన్నుఁ జూచి నవ్వువచ్చె మాకెల్ల
చలపట్టితే పంతము చవుకాయను

చ. 1: తలఁచఁగఁ దలఁచఁగ తనలోనె మరు డుండె
చెలి బెదరి యట్టె నీచేయి వట్టెను
అలిగి యెవ్వరిమాఁట అటమున్ను వినదాయ
వులికి యిప్పుడు తానె వొక్కటాయను

చ. 2: చెక్కు చేతఁబెట్టఁగానే చిగురు బాణమాయ
గక్కన నీరెంటె మిఁమిం)తి గప్పుకొనెను
మొక్కే రమ్మన్నా రాదు మొదల నీ గాత వంక
చిక్కి నేఁడు తానే నీ చేతికి లోనాయను

చ. 3: కందువ నిద్దిరించితే కలలో నీవు గూడితి
విందుకే తా నిన్నుఁ గూడె యిచ్చకానను
సందడి శ్రీ వేంకటేశ సరివచ్చె మామాఁట
పొందిక లొక్కొక్కటికి పొదులై నిలిచెను

రేకు: 1778-04 దేసాళం సం: 27-467

పల్లవి: నేరిపేవు మాకు నిది నీటుతోడను
నీరచన నింత విచ్చి నేనాడవలెనా

చ. 1: సిగ్గు గలదైతే నిన్నుఁ జేవట్టి తీసునా నీవు
వెగ్గళించినా దా విఱ్ఱవీఁగుఁ గాక
కగ్గులేని బత్తిదంటా కడు నాతోఁ బొగడేవు
నిగ్గుల యిందలిమేలు నీసత్య మెఱఁగదా

చ. 2: యింగిత మెఱిఁగినది యెదురు నీతో నవ్వునా
సంగతి నిన్ను బొమ్మల జంకించుఁ గాక
చెంగట నీపె జూపి చేసన్నలు సే సేవు
అంగడి ఆడికాఁడవు అదెఱఁగవా

చ. 3: పొందెరిఁగినవి యైతే పొదుగంగఁ జూచునా
కందువల నుండే నిన్నుఁ గలసుఁగాక
యిందులో శ్రీ వేంకటేశ యీడుకు నన్నుఁ గూడితి
వందాలు మాలోనిని నీ యరచేతివే కావా

రేకు: 1778-05 సాళంగనాట సం: 27-468

పల్లవి: ఇదివో మా విన్నపము యెన్ని సేసినా
వుదుటొక్కటే వారి వుపమలు వింతలు

చ. 1: చలిమి బలిమిగల సతి నే నీకు
యెలయింపుఁ గాంతలు మరెందరు లేరు
వలపే సరి గాని వాడికె లెచ్చుకుందురు
అలరు లొక్కటే వాస నందులోన వేరులు

చ. 2: నంటున నీవు మన్నించే నగవు నాది
యింటింట మరి నవ్వులు యెంత లేదు
కంటి యింపే గురిగాని గాలి ముడె(డి) గట్టరాదు
వంటక మొక్కటైనా వడ్లపేరు వేరులు

చ. 3: గక్కన నీవు కూడిన కాఁగిలి యిది
యెక్కడి సతుల కాఁ గిలెంత లేదు
చక్కఁదనమే సొమ్ము సకలముఁ గలిగినా
యెక్కువ శ్రీ వేంకటేశ యితరులు వేరులు

రేకు: 1778-06 కన్నడ గౌళ సం: 27-469

పల్లవి: ఇతవుగా మతి కోప మింతయుఁ దీరిన మీఁద
కతకు గాఱ్ఱు చెప్పేఁ గడమ లేదయ్యా

చ. 1: నెలఁతలతో నిన్ను నిష్టూరాలాడుకొంటా
సొలయుచు నీకెదురు చూచుకొంటాను
అలసేటి వేళనే అండకు విచ్చేసితివి
కులికి యా నోరనే కొనియాడేమయ్యా

చ. 2: వూరకే నిన్ను సాదించే వుపమ దలఁచుకొంటా
సారె నీకుఁ గమ్మ వా(వ్రా)సి చదువుకొంటా
యీరీతి నే నుండఁగా నన్నింతలో మన్నించితివి
కూరిముల ఆనోరనే కొనియాడేమయ్యా

చ. 3: సరవి నీ బాసలు సాకిరులు వెట్టుకొంటా
ధర నీ చక్కఁ దనాలు తలఁచుకొంటా
వొరయఁగా శ్రీ వేంకటోత్తమ నన్నుఁ గూడితి
సరుగ యీ నోరనే సన్నుతించేమయ్యా

రేకు: 1779-01 కాంబోదిసం: 27-470

పల్లవి: కాదందునో అవునందునో గరిమలు నీవి చూచి
సోదించి తెలుసుకొని చొక్కితి నిట్టె నేను

చ. 1: నగితే నీ సెలవుల నయమ్మై వెన్నెల గాసీ
మొగము చూచితేను ముద్దు గారీని
యెగసక్కేలాడేనంటే యెట్టు మనసు గొలుపు
పగటు నీ చేఁతలకు బ్రమసితి నేను

చ. 2: మాఁటలాడి చూచితేను మంచితనాలే వూరీ
వాఁటపు నీ చూపులను వలపే నిండీ
ఆఁ టదాన జంకించ నందుకెట్టు వొడఁబడే
కూటువ నీ మన్ననల గురుతైతి నేను

చ. 3: సారెఁ గాఁగిలించుకొంటే సంతోసములే మించీ
కూరిమి నీవు గూడిన కూటమే చెప్పీ
యీరీతి శ్రీ వేంకటేశ యేమని పొగడవచ్చు
తారుకాణ నీరతులఁ దనిసితి నేను

రేకు: 1779-02 రీతిగౌళ సం: 27-471

పల్లవి: మేలు మేలు నీ గుణాలు మెచ్చితి నేను
తాలిమి మాకింత నుంటే తరుణుల మౌదుమా

చ. 1: వెరవున నే నెంత వేగిరించి దూరినాను
సరవి దప్పవు నీశాంత మెట్టిదో
యిరవుగ నీ గుండె ఇంత బలువు గాకుంటే
తెరలి పెక్కు సతులఁ దెచ్చుకొందువా

చ. 2: కాతరినై నే నిన్ను కరకరిఁ బెట్టినాను
ఆతుర పడవు యెంత అభ్యాసమో
భీతి విడిచింత నీకు బిరుదు గలుగకుంటే
ఘాతల గొల్లెతలఁ జీఁకటితప్పు సేతువా

చ. 3: నిబ్బరపురతి నిన్ను నే నెంత పెనఁగినాను
వుబ్బు సదు(డ)లవు యెంత వొట్టిన యాసో
గబ్బివై శ్రీ వేంకటేశ కడునీటు మీరకుంటే
తబ్బిబ్బులేక నన్నింత తప్పక యేలుదువా

రేకు: 1779-03 దేసాళం సం: 27-472

పల్లవి: అందరితోడి పాటు అట్టే కానీవయ్యా
సందడించి వేఁడుకోఁగా చలపట్టేనా

చ. 1: కప్పురాలు మాఁటలు కారాలు చేఁతలు
యెప్పుడు మీ పొందులు సతు లెట్టు సేతురో
తప్పు వట్టరాదు నీకు తమక మెంతైనా గద్దు
నెప్పున నీ యానతి నేఁ గాదనేనా

చ. 2: నిగరాలు బాసలు నెరుసలు మాయలు
మగువలు నీకే యెట్టు మరుపుదురో
తగవులే నెరపేవు దైవారీ వలపులు
నిగిడి నీ యానతి నేఁ గాదనేనా

చ. 3: చెలువము మొగము చెనకులు మేనెల్ల
బలిమి నీ యింతు లెట్టు భ్రమఁ జిక్కిరో
కలసితి విటు నన్ను గక్కన శ్రీ వేంకటేశ
నెలవై నీ యానతి నేఁ గాదనేనా

రేకు: 1779-04 వరాళి సం: 27-473

పల్లవి: వారు చెప్పినట్టు సే సేవారి వారము
యీరీతి పనుల కప్ప ణిప్పించుమా నాకును

చ. 1: కోరేటి యాఁడు వారము కోపాల కెల్లా మొదలు
యేరా నీతోడి పొందు కేమి బాఁతి
చేరి మమ్ముఁ జెనకేవు చేయి మేము చాఁచితేను
దూరు రాదా నీతొంటి తొయ్యలులచేతను

చ. 2: పంతపు మాటవారము పట్టినందుకెల్లా గురి
ఇంతటివారి మెప్పించ నెఱుఁగుదుమా
మంతనము లాడేము మరుచుమాటాడితేను
సంతసించేరా నీ సవతు లిందరును

చ. 3: వేడుకవేళ దానను వేవేలు రతుల పోగు
కూడితి శ్రీ వేంకటేశ గుట్టెరిఁగేనా
వూడిగేలకు మెచ్చేపు వొద్దనే నీదేవియని
తోడ నాపెసమ్మతే యింతు లెల్లా నవ్వేరు

రేకు: 1779-05 ముఖారి సం: 27-474

పల్లవి: తొల్లింత నేరవు నీవు దొరకొన్న కుచ్చితాలు
చల్లనిదే కాదా వెల్లి చాపకిందిది

చ. 1: పయ్యదలోపలినా బలుపుగుబ్బలు నీవు
చెయ్యంటక తెలుసునా జిగి నామేను
వొయ్యన నా మనసేమి వొరసేవు మాఁటలను
గయ్యాళితనా లెవ్వతె గరపెవో నీకును

చ. 2: పానుపు మీఁదట నాపంతపురతుల నీవు
మేనుచొక్క కెటఁగేవా మించు నాగుట్టు
మోనాన నుండి నాతమి ముందేమి వెలుచుకొంటి
వానటన లెన్నాళ్లనుం డట్టె నేర్చుకొంటివో

చ. 3: కాఁగిటిలోపలి నాకరఁగు లిట్లా నీవు
చేఁగదేరక నమ్మేవా శ్రీ వేంకటేశ
మాఁగినమోవి చేకొని మన్నించితి వెంతకెంత
వీఁగని మహిమ లెన్ని వేవేలు గలవో

రేకు: 1779-06 రామక్రియ సం: 27-475

పల్లవి: చెక్కునొక్కి మన్నించు చేతులెత్తి మొక్కేము
దిక్కుల కెక్కించి యిఁక దిగవిడువకుమీ

చ. 1: వనితలు నీకు బాఁతా వద్దనుండి సేవసేసి
మనసు పట్టేము గాక మా కొరకు
నిను మెప్పించే వారమా నీవారమన్నవారి
యెనసి మన్నించేదే యెక్కుడు నీ బిరుదు

చ. 2: నీ కెంద రిష్టులు లేరు నీ పొందు సేసి నిన్ను
మైకొని దక్కఁగొనేము మా కొరకు
నీకు నీడు వత్తుమా నీ సలిగె పట్టువారి
యీకడ మన్నించేది యెక్కు డిది సుమ్మీ

చ. 3: నిచ్చపెండ్లి యెంత లేదు నీకు నేము సేసవెట్టి
మచ్చిక చల్లేము గాక మా కొరకు
చెచ్చెరఁ గూడితి నన్ను శ్రీ వేంకటేశ నీవారి
హెచ్చించి మన్నించుటే యెక్కుడైన కీరితి

రేకు: 1780-01 సామంతం సం: 27-476

పల్లవి: భావించుకో రమణుఁడ పచారించితి మిదె
నీ విచ్చిన సలిగె నేరుచుకొన్నారము

చ. 1: కన్నుల జంకింతుము కాఁకలు చల్లుదుము
ఇన్నియు నీపై మోహమే యీసుగాదు
కన్నెలము నేమట కాంతుఁడవు నీవట
నిన్ను మీరే పను లేవి నీదయ గోరుదుము

చ. 2: అట్టె వెంగే లాడుదుము ఆయము లంటింతుము
గుట్టున నీతో పొందుకే కోపము గాదు
పట్టు మాకు నీవే యట బలిమి నీచేతిదట
నెట్టన నీ కెదురేది నేనెంత వారము

చ. 3: రతులఁ బెనఁగుదుము రాజసము చూపుదుము
ఇతవు నీకుఁ జేసేదే యెరవు గాదు
గతి మాకు నీవే శ్రీ వేంకటేశుఁడ కూడితివి
మతకాలు నీ మీఁదనా మచ్చికైనవారము

రేకు: 1780-02 ఆహరి సం: 27-477

పల్లవి: వీనులు చల్లఁగా ఇట్టె వినేఁగాక
యీనయగారి నీతో యెదురాడేనా

చ. 1: చందురుఁడు నీ చూపు ఆ చాయలది నామోము
సందడి నిందుకే యెట్టు సరియౌదును
చెంది నన్ను మన్నించి చెప్పేవు యీసమ్మంధము
ఇందు నీ చిత్తము కొలఁ దెదురాడేనా

చ. 2: పాము నీ పరపు ఆబాగులది నా యారు
సామిని యిందుకే యెట్టు సరి యౌదును
చేముట్టి చుట్టరికాలు చెప్పి నన్నుఁ బొదిగేవు
యేమనినా నీమాట కేదురాడేనా

చ. 3: చుట్టుఁ జక్రము కత్తి యా సూటివే నా కుచములు
జట్టిగా నిందుకే యెట్టు సరి యౌదును
గుట్టున శ్రీ వేంకటేశ కూడితివి వావులకె
యెట్టు నన్నేలినా నీకు నెదురాడేనా

రేకు: 1780-03 లలిత సం: 27-478

పల్లవి: ఇన్నిటా నీతనిచిత్త మెఱఁగి చేకొనవమ్మ
యెన్నటికి నలుగకు ఇచ్చకాలే వలెను

చ. 1: సిగ్గులేలే యితనితో చెలియ
సిగ్గుల గొల్లెతలను చేతులెత్తించె
వెగ్గళించకువే వీని వేమారు తొల్లి
వెగ్గళించిన సతిని వెసఁబిన్నఁజేసేను

చ. 2: యింటిలో దాఁగకువే యీత నెదుట
యింటిలోని గొల్లెతల నెంగిలి సే సె
దంట తనమేఁటికే తగ వీనితో
దంటల సురసతులఁ దానె లోఁగొనఁడా

చ. 3: ఆఱఁడిఁ బెట్టకువే యాతనిని
ఆఱఁడి గొల్లెతలను ఆండ్లఁజేసె
మీఱి శ్రీ వేంకటేశుఁడు మెచ్చి నిన్నేలె
మీఱినవారే కారా మెలుఁత లీతనికి

రేకు: 1780-04 రామక్రియ సం: 27-479

పల్లవి: బాపు బాపు నేఁజేసిన భాగ్య మెట్టిదో
తాపి కత్తెఁ జేసి నన్ను దయఁ జూచితివిగా

చ. 1: మనసొక్కటాయ నేఁడు మగువా నీవును రాఁగా
యెనసి వుండిన పొందు కిది గురుతు
ననిచిన వారము నాకు నీకుఁ బోవునా
ఘనమై యెక్కుడు వస్తే కైకొందువుగాక

చ. 2: నమ్మితి నీమాఁటలెల్లా నాయింట నీపెఁ బెట్టఁగా
యిమ్ములఁ గొంకుదేరుట కిది గురుతు
సమ్మతైన మనలోన సరవులు దప్పీనా
వుమ్మడివారు వచ్చితే వూరడింతుగాక

చ. 3: యెక్కువ భూసతిఁ గూడి యిటు నన్ను మన్నించితి
విక్కడ శ్రీ సతి వౌట కిది గురుతు
దక్కితి శ్రీ వేంకటేశ తప్పులు మనకు లేవు
మిక్కటపు యీపెరతి మెత్తువు గాక

రేకు: 1780-05 మధ్యమావతి సం: 27-480

పల్లవి: అంతా నీ మహిమే ఆఁటది యేమి యెఱుఁగు
పొంతల మమ్మెంత నీవు పొగడేవయ్యా

చ. 1: నీ వెవ్వితె మన్నించినా నేరుపు గలమ్మ యాపె
భావించి చూచితేనే పట్టముదాపె
కైవసము నీవైతేనే కలికితనాలదాపె
పోవులుగ మమ్ము నేమి పొగడే వయ్యా

చ. 2: సెలవి నీవు నవ్వితే సేసిన పుణ్యము దాపె
పలికితే నన్నిటాను బలిమి దాపె
సలిగె యిచ్చినప్పుడే సర్వానకుఁ గర్త యాపె
పొలసి మమ్మే యెంత పొగడేవయ్యా

చ. 3: కాఁగిట నీవు కూడితే కలిమిగలది యాపె
ఆఁగి కూడితి శ్రీ వేంకటాధిప నన్ను
పీఁగి యాపెననిందాఁకా పేరుకొంటి నన్ను నేనే
పోఁగెత్తి యట్లా నన్నుఁ బొగడేవయ్యా

రేకు: 1780-06 మాళవిగౌళ సం: 27-481

పల్లవి: నావద్ద నున్నాఁడు వీఁడె నావిభుఁడు
చేవ మీరఁ జూడరమ్మ చెలులాల మీరు

చ. 1: జాలిఁ బడి వూరఁగల సవతు లెంత చెప్పినా
యేలిన రమణునకు యేల పొయ్యీనే
చాలా నాపై బత్తిగల సరసుఁడు నాసామ్మే
కూళ సతులకు కష్టగుణమే దక్కెను

చ. 2: చూడఁ జాలని వారలు సూటి యెంత దప్పించినా
వేడుక నాపతి యేల విడిచీనే
వాడిక గల మగఁడు వసము నాకైనాఁడు
వాడ సవతులకు నెవ్వగలే నిలిచెను

చ. 3: పొద్దువోని మగువలు బోదించి పెనఁగినా
వొద్దనున్న యీతఁడేల వోరసేసీనే
గద్దరి శ్రీ వేంకటాద్రి ఘనుఁడు దా నన్నుఁ గూడె
బద్దుల కాంతలకు వుప్పతింపులే మించెను

రేకు: 1781-01 ఆహిరినాట సం: 27-482

పల్లవి: ఏమని నీకు మొక్కే నిటువంటిదాన నేను
ఆముకొని యప్పటిని ఆదరించేవు నన్ను

చ. 1: కదిసి నీదేవినైన గర్వాన నే నాడితిని
యెదురు మాటలు నీతో యెన్నియైనాను
మదన పరవశాన మరిఁ గొన్ని సేసితి
చెదరి యెవ్వరితోడాఁ జెప్పరాని చేఁతలు

చ. 2: మన్నించేవనుచు నీతో మందెమేళాల నవ్వితి
సన్నల చాయల నిట్టె సరిబేసికి
చిన్నదానఁ గనక నీసిగ్గులు విడిపించితి
కన్న వారికెల్లా నవి కమ్మని గురుతులు

చ. 3: కొసరి నీవు గూడిన కూటాలకు నే నొక్కితి
పసిమి నీ చెక్కులు నేఁ బలుమారును
యెసఁగితి శ్రీ వేంకటేశ నీకీడు గనక
రసికులకెల్లా నవి రహస్యపు కతలు

రేకు: 1781-02 తెలుఁగుఁగాంబోది సం: 27-483

పల్లవి: నీవిచ్చిన సలిగెనే నిన్ను నే నింత దూరితి
కావరించ కంత నీవు గరడిలోపలను

చ. 1: తప్పులేదు నీయందు తగిన జాణఁడవే
చప్పనాయ మోహము సారె నే రాఁగా
వుప్పఁ జేసి ఇంచుకంత వుండరాదా ఇంటిలోన
ఇప్పుడేల పదరేవు యెదురైన వేళను

చ. 2: వెగటు లేదు నీ యందు విభుఁడవు నాకు నీవే
మొగచాటాయ నారతి ముంచి పొందఁగా
పగటుఁదమి వుట్టించె పవళించరాదా యిఁక
మొగమేమి చూచేవు మొగసాల లోనను

చ. 3: కొఱత లేదు నీవల్లఁ గోరి శ్రీ వేంకటేశుఁడ
తఱితోఁ దరితీపాయ దమి రేఁచఁగా
గుఱిగాఁ గూడితి విట్టె గుట్టుతోడ నుండరాదా
మఱఁగేల దోమతెర మంచము లోనను

రేకు: 1781-03 పాడి సం: 27-484

పల్లవి: ఆపె ఎఱఁగనిదా అంత నీవు సే సే మేలు
తీపుల నీమోవి ఇచ్చి తిద్దుకొనరాదా

చ. 1: కూరిమిగలదానికి కోపము గలితేనేమి
చేరి యందులోనే చవి చేసుకోరాదా
నీరాక కెదురు చూచి నిన్నుఁ దిద్దితే నేమి
గారవించి నవ్వు నవ్వి కాఁగిలించరాదా

చ. 2: మనసిచ్చినదానికి మందెమేళమైతే నేమి
చెనకి యదె చవిచేసుకోరాదా
చనవు నీ వొసఁగఁగా జంకించితే నేమి
తనివంది రతుల చిత్తరిఁ జేయరాదా

చ. 3: పాయకున్న దానికి పంతమాడుకొంటే నేమి
సేయరాని సేవ చవిచేసుకోరాదా
యీయెడ శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
కాయముపై కళలంటి కడు మెచ్చరాదా

రేకు: 1781-04 సౌరాష్ట్రం సం: 27-485

పల్లవి: నీ సుకము చెరుతురా నీవారము
లాసి తనంత వచ్చేది లాభము గాదా

చ. 1: బండు బండుగా నెవ్వతె వట్టి నిన్నుఁ దీసినాను
కొండవలెఁ జూచుకుండే కొలువులోను
వెండియు నెవ్వతె వచ్చి వెంగెమాడి తిట్టినాను
అండ వూరకుండే వింటా నదె నా సేవ

చ. 2: పట్టి నిన్నెవుతె తన పనులు సేయించినాను
పొట్టఁ బొరుగున నుండే పొగడుతాను
రట్టడిరతి కెవ్వతె ఇట్టె నిన్నుఁ దీసినాను
అట్టె బయము దెలిపే నదె నా సేవ

చ. 3: విందు నీ కెవ్వతె వచ్చి వెంటనే చెప్పినాను
అందు నీ పొత్తుల నుండే నారగించఁగా
కందువ శ్రీ వేకంటేశ కలసితి విటు నన్ను
అందరికి నప్పణిచ్చే అదె నా సేవ

రేకు: 1781-05 నాదరామక్రియ సం: 27-486

పల్లవి: ఎఱఁగను మీరింతేసి యిద్దరిమాలో సన్నలు
వొఱపులు చూపనేల వున్నట్టేవుండరే

చ. 1: దయగల విభునికి తరుణులెల్లా సరే
నయము రేఁచుక మీరు నవ్వేరు గాని
క్రియ దెలుసుక నేము కినియ మాతనితోడ
ప్రియముగల యాటది బిరుదులాడునా

చ. 2: సారమైన జాణనికి సరసమెల్లా సరే
నేరుపులు పచరించి నిక్కేరు మీరు
తారుకాణై వుండఁగాను తప్పు లెంచ మాతనిపై
యీరీతి లోనైనచెలి యిచ్చాడక మానునా

చ. 3: శ్రీ వేంకటపతికి చెణకులెల్లా సరే
వావులు సేసుక మీరు వదిఁ(డిఁ) బొందేరు
యీవేళ నన్నుఁ గూడె యితఁడు మీరు మెచ్చను
కైవసమయిన యింతి కడుఁ దమకించునా

రేకు: 1781-06 శ్రీరాగం సం: 27-487

పల్లవి: ఇందాఁకా నిన్ను దూరితి నెఱఁగక రమణుఁడ
గొందిఁ బాసికూడిన కూటమేకా చవులు

చ. 1: విరహతాపము మాన్ప విచ్చేసితి వీడ విట్టె
వొరసితే నా కిదెంతవుపకారము
సరి నీవు నవ్వితేను చల్లనారె నా కోపము
మరుగఁ జేసిన యీ మన్ననెంత నాకు

చ. 2: అలపెల్లాఁ దీర నీచేయి అట్టె నాపై వేసితివి
వొలిసిన నా కిదెంతవుపకారము
పలికి మోము చూచితే పల్లవించె నా మనసు
కలకాలముఁ జేసిన కరుణెంత నాకు

చ. 3: విడువక యిపుడు శ్రీ వేంకటేశ కూడితివి
వొడలికి నా కిదెంతవుపకారము
అడియాల మిచ్చితివి అందరిలో యెంత కీర్తి
పుడివోని వలపుల కుంకువాయ నాకు

రేకు: 1782-01 మాళవిగౌళ సం: 27-488

పల్లవి: వద్దివారి నెఱఁగదు వలపులు నీమీఁద
వుద్దండానకే చల్లే(ల్లీ)వుదుటుగా యిది

చ. 1: చూపులు నీపై వంచి సాయగపుటెలుఁగున
తీపులుగా మాఁటలాడీఁదిట్టఁగా ఇది
కోపగించుకో దెంతైనా కొసరి కొసరి నిన్ను
రాపుగా జోలిఁ బెట్టీని రవ్వగా ఇది

చ. 2: సెలవుల నిన్ను నవ్వి చేయి మాఁటుసేసుకొని
లలి నీకు నెత్తిం (త్తి)చ్చీ లందుగా ఇది
పిలువకే తా వచ్చి పిరుఁదులు నిన్ను నెంచి
చలివాసీ రతులకు జాణగా ఇది

చ. 3: గక్కనఁ బైఁ జేయివేసి కలసీ ని న్నింతలోనె
మొక్కుమొక్కి ఇచ్చలాడీ ముగ్ధగా యిది
యిక్కడను శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
పెక్కుసుద్దు లడిగీని పెద్దగా యిది

రేకు: 1782-02 కాంబోది సం: 27-489

పల్లవి: ఇంకనేడ సద్దులు యీడేరితి విన్నిటాను
వంకలొత్తఁ బోతేను వంగుదువా సూటికి

చ. 1: చన్నుల కాఁకల నొత్తి చలివాపె నీకు నాపె
యెన్నికలు మీరి సేయకిఁక లోఁగేవా
నిన్న మొన్నటివారము నేఁడు మాకు వెఱచేవా
కన్నుల జంకించిన మాకల్ల ఇంతేకాక

చ. 2: కందువ చేఁతల మోవి కాయలు గాపించె నాపె
గొంది మోవిపండ్ల చవులు కోరకుండేవా
మందలించి కన్నెలము మా దిద్దుబడి వచ్చేవా
సందడించి పొరేటి మాసట లింతే కాక

చ. 3: కలసిన రతులచే కళలు రేఁగించె నాపె
పలుమారు మాతో సాము బడలించినా
కులికి శ్రీ వేంకటేశ కూడితివి నీవారము
అలమి పాయనిమాలో నాస లింతేకాక

రేకు: 1782-03 బౌళి సం: 27-490

పల్లవి: అన్ని బిన్నాణాలు నేర్తు వవునే నీవు
మన్నించిన జాణనికి మరి కోపమున్నదా

చ. 1: వూఁకొనని మాటలకు వుత్తరాలు చెప్పేవు
వీఁకల నాతఁడు నీకు వెఱచునటే
కాఁకల చూపులకేల కప్పురాలు నూరేవే
వాఁకమైన సరసుఁడు వద్దనీనా నిన్ను

చ. 2: మనసులో నవ్వులకు మరి వొడ్డించుకొనేవు
ఘనుఁ డాతనిచిత్తము కంటినటవే
పొనుఁగ నీమోవి నేల బోనాలు వండేవు
తనిసిన ప్రాణేశుఁడు తప్పులు వట్టీనా

చ. 3: కాఁగిటిలో రతులకు గాదెలు గట్టుకొనేవు
ఆఁగి శ్రీ వేంకటేశుఁడు అచ్చునటవే
వీఁగక యీతనిఁ గూడి విందు వెట్టేవు వలపు
చేఁగదేరెను ధీరుఁడు సిగ్గులు వడీనా

రేకు: 1782-04 ఆహిరి సం: 27-491

పల్లవి: కక్కసించనేఁటికి ఘనుఁడ నీ వప్పటిని
చెక్కు నొక్కేవు నీమాఁట సేయ ననేనా

చ. 1: చేరువఁ గూచుండితివి చేయిపైఁ జేయి వేసేవు
గారవించే వన్నిమేళ్లు గంటి నీవల్ల
సారపుఁగాంతలు చల్లే సణఁగుల కేమి సేతువు
వూరట నీతోడి పొందు వోపననేనా

చ.2: వీడెము నా కిచ్చితివి వేడుకలు రేఁచేవు
పాడితోడ నావలపు పండె నీవల్ల
వూడిగపు నీకాంతల వుప్పతింపుల కేమందు
మేడెపు నీరతులకు మెచ్చుననేనా

చ. 3: కలసితి విదె నాపైఁ గప్పురాలు చల్లేవు
నలువంకఁ దని వందె నామనసు
నిలిచి శ్రీ వేంకటేశ నీవారి నెట్టు నమ్మింతు
కొలఁది మీరితే నన్నుఁ గొరఁ తెంచేనా

రేకు: 1782-05 సాళంగనాట సం: 27-492

పల్లవి: ఎఱఁగదా నీమనసు యేల విన్నపము సేయ
యెఱుక సే సేవు మాతో నింతేసి వలెనా

చ. 1: పంతమిచ్చి (చ్చే) ఆఁడువారె పాలుమాలితేఁగనక
యెంత చెప్పినాఁ జెల్లు యేతులు నీకు
వంతుతో నీవద్దనుండి వాసికే సేవలు సేసే
అంతరంగమైన మాపై నంతేసి వలెనా

చ. 2: సిగ్గుగలవనితలే చేతులెత్తి మొక్కితేను
వెగ్గళించ నమరును వేవేలు నీకు
యెగ్గులుఁ దప్పులుఁబట్ట కిచ్చకము నీకు నాడే
అగ్గమైన మాపైనే అంతేసి వలెనా

చ. 3: మానాపతి మగువలు మతి గుట్టు విడిచితే
నీ నేరుపులే యంతటా నిలుచు నిందు
పూని శ్రీ వేంకటేశుఁడ భోగించితి నీకాఁగిట
అనుకొన్న మాపైనే అంతేసి వలెనా

రేకు: 1782-06 నాదరామక్రియ సం: 27-493

పల్లవి: మొదలనే చేతులెత్తి మొక్కినార మల్లనాఁడె
పదిఁ బదిగా నిఁక బతికించవయ్య

చ. 1: యెంత నీతో నలిగినా నేమీ ననక పోదు
వంతుకు నీవు వచ్చితే వద్దనఁ జాల
యింత మెత్తని మనసు యింతిని నిన్నేమి సే సే
పంతము నీ కిచ్చితిని పాలించవయ్యా

చ. 2: ఆలికిని మగనికిని ఆస లెప్పుడుఁ దీరవు
మేలిమి మాఁటాడితేను మెచ్చక మాన
తాలిమి మొగదాకిరి దానను నిన్నేమి సే సే
కాలమెల్ల నమ్మితిఁ గరుణించవయ్యా

చ.3: యిదివో నీవు గూడితి వియ్యకొనకుంటేఁ బోదు
అదన శ్రీ వేంకటేశ అవుఁగాము లెంచ
యెదుట నీ కిచ్చలాడి యిఁక నిన్ను నేమి సే సే
చదురుఁదనాల నిఁక చనవియ్యవయ్యా

రేకు: 1783-01 ముఖారి సం: 27-494

పల్లవి: ఇల్లు మంచము నున్నది ఇద్దరము నుండే మీడ
తెల్లమిగ నాకొసరు దిద్దుక రారాదా

చ. 1: ఆపెమోము చెమరించె నట్టె నీమై చెంగలించె
యేపున మీమోహాలు మాకేల దాఁచేరు
వోపిక నే మిందరము వుండితే నీకేమాయ
లోపలికిఁబోఁ ఇ అట్టె లోఁగొని రారాదా

చ. 2: తప్పక చూచీ నాపె తలఁపు నీ కందున్నది
ఇప్పుడు మీమోహాలు మాకేల దాఁచేరు
చెప్పక నే మెఱిఁగితే సిగ్గులు మీకేల వచ్చె
దుప్పటి మఱుఁగువట్టే తొక్కరాదా పాదము

చ. 3: సెలవి నాపె నవ్వె చే సన్నలు సేసితివి
యలమి మీ మోహాలు మాకేల దాఁచేవు
తొలుతే శ్రీ వేంకటేశ దొమ్మిగాఁ గూడితి మిట్టె
మలఁగుపై నున్న దాపె మాటలాడరాదా

రేకు: 1783-02 పాడి సం: 27-495

పల్లవి: ఇయ్యకొనవోయి మాట యేమోయి
నెయ్యపు నెచ్చెలులకు నీరాయ మనసులు

చ. 1: మొకము చూడఁగానే మోహము చల్లీ నాపె
యెకసక్కేలాడేవు యోమోయి
చికుర భరము వంచి సిగ్గు వడె నంతలోను
సుకానఁ జూచువారికి చురుకనె గుండెలు

చ. 2: సింగారించుకొనఁగానే చేయివట్టి తీసీనాపె
ఇంగిత మెఱఁగలేవు యేమోఇ
ముంగిట నివ్వెరగంది మోనన నున్న దిందుకు
సంగడినున్నవారికి జల్ల ననె మేనులు

చ. 3: కందువ నీ కుండఁగానే కాఁగిటఁ గూడె నాపె
ఎందరిని భ్రమఇంచే వేమోఇ
అంది శ్రీ వేంకటేశుఁడ అట్టె నన్నుఁగూడితివి
ముందు వెనకవారికి మూఁడేశాయ మూఁపులు

రేకు: 1783-03 లలిత సం: 27-496

పల్లవి: వట్టి వెఱపేలా నీకు వద్దనేనా నే నిన్ను
పొట్టఁ బొరుగు పోరచి పుచ్చుకొనరాదా

చ. 1: మలసి నీతో నాపె మాట చెప్పఁ దిరిగీని
వెలయ లోనికిఁదీసి వినరాదా
చలపట్టి మాతోడి సరసా లెందువోయీని
వెలినున్న వలపులు వెలుచుకోరాదా

చ. 2: ననుపున నాపె నీతో నవ్వేనంటాఁ బూఁచీని
మనసొగ్గి వేళయిచ్చి మన్నించరాదా
చెనకేటి మాచేతిసేవ లెందువోయీని
పెనగొనే ముచ్చటలు పిరి దూరరాదా

చ. 3: యింతలో నిన్నాపె గూడి యేతులకుఁ బొదిగీని
చెంతల నా చనవులు చెల్లించరాదా
వింతగా శ్రీ వేంకటేశ వెస నన్నుఁ గూడితివి
బంతి చుట్టరికములు పనిగొనరాదా

రేకు: 1783-04 వేళావళి సం: 27-497

పల్లవి: మరిగితిమి గనక మనభాగ్యమే యింతా
పరి పరి విధముల పంటవండె వలపు

చ. 1: చెవి సోఁకె నీ మాట సెలవికి నవ్వు వచ్చె
వివరించఁ బోతేను వింత వింతలు
రవళి మనపొందులు రవ్వలాయఁ బొరుగెల్లా
పవళించే ఇంటిలోనే పంటవండె వలపు

చ. 2: కన్నులనంటె నీరూపు కాయమెల్లాఁ జెమరించె
పన్ని చూపఁబోతేను బట్టబయలు
సన్నల మనమాటలు చలివాసె నిందరిలో
పన్నీటికాలువలఁ బంట వండె వలపు

చ. 3: చేతులఁ జిక్కె నీ రతిసిగ్గులు పలచనాయ
ఆతుమ దలఁచుకొంటే ఆనందాలు
ఘాతల శ్రీ వేంకటేశ కలసితి మిద్దరము
పై తరవు తమకాన పంట వండె వలపు

రేకు: 1783-05 వసంత వరాళి సం: 27-498

పల్లవి: నెరజాణ విన్నిటాను నేరుచుకొమ్మీ
వొరపైన సరసాలు కుంకువ సొమ్మీ

చ. 1: కలికి నీకు నంపిన కప్పురపుఁ బలుపులు
చలివేఁడి మోహాలకు చాకిరి సుమ్మీ
అలరి మాచేత నీకు నంపిన యెడమాఁటలు
తలపోఁత ధనానకు దాపిరము సుమ్మీ

చ. 2: పడఁతి నీకు నంపిన బంగారు సుర టిది
అడియాలపు రతుల కాసలు సుమ్మీ
వొడలిపై వ్రాసి నీకు వుత్తరాలుగా నంపె
వడిగొన్న సిగ్గులలో వక్క ణిది సుమ్మీ

చ. 3: యీవేళ నింతియంపిన యింద్రనీలపుంగరము
భావపు నీ కూటమికి ప్రాణము సుమ్మీ
వావిరి శ్రీ వేంకటేశ వచ్చి నిన్ను సతి గూడె
మోవుల మీ తేనెలు చిమ్ముల విందు సుమ్మీ

రేకు: 1783-06 గౌళ సం: 27-499

పల్లవి: ఎఱఁగమా మీరాజస మింతకతొల్లి
మఱఁగులు మాని నాతో మాఁటలాడరాదా

చ. 1: మొగము చూచి నేఁడు మొక్కించుకో నెంత లేదు
నగ వెంత లేదు నీకు నలినాక్షితో
తగ నీకు నాపెకును దగ్గరి వచ్చిన యట్టి
మగువను నాతో గొంత మాఁటలాడరాదా

చ. 2: వేడుక నాపెచేఁతకు వెరగంద వెంత లేదు
యీాడు జోడుగాఁ బెనఁగ నెంత లేదు
కూడితిరి మీరిద్దరు గురియై నే నింతలో
మాడలు రాలఁగ నాతో మాఁటలాడరాదా

చ. 3: చంచుల సన్నలు సేసి చనవియ్య నెంత లేదు
ఇంచు కించుకే కొసర నెంత లేదు
కొంచక శ్రీ వేంకటేశ కోరి నన్ను నేలితివి
మంచము పైనే నాతో మాఁటలాడరాదా

రేకు: 1784-01 గౌళ సం: 27-500

పల్లవి: ఏమి గట్టుకొంటివే ఇంతేసికుచ్చితాలను
నేమపు మాతమకాలు నించనీరాదా

చ. 1: మెలుపున నీ యెమ్మెలే లెరసేవు పతితోడ
చెలఁగి మా విన్నపాలు సేయనీరాదా
అలరి యీవేళనే అడ్డాలు పాలసేవు
సొలసి కన్నులఁ గొంత చూడనీరాదా

చ. 2: బయలు పడ నతని పరాకులే సేసేవు
నయమున మమ్ముఁ గొంత నవ్వనీరాదా
నియమించి ఆసోదాన నీవే కొంగువట్టేవు
రయమున నావద్దికి రానీరాదా

చ. 3: వూరకె నీవిభుఁడంటా వూడిగేలు సే సేవు
కూరిమి నాచేత సేవ గొననీరాదా
యీరీతి శ్రీ వేంకటేశుఁ డీతఁడిట్టె నన్నుఁగూడె
గారవాన నామేలల్లాఁ గననీరాదా

రేకు: 1784-02 సౌరాష్ట్రం సం: 27-501

పల్లవి: ప్రేమము నాపైఁ బూసేవు పెద్దరికము సే సేవు
యేమయ్య నాయకుఁడ నీ హృదయ మెఱఁగను

చ. 1: చనవు లిచ్చినవారు సరసము లాడఁ జెల్లు
మనసు లెనయువారి మాఁటలు చెల్లు
ఘనమోహములవారి గబ్బితనములు చెల్లు
యెనసి నే నిందులో నీకెవ్వరో యెఱఁగము

చ. 2: సిగ్గులు యెంచనివారు సేసేదల్లా నమరు
వెగ్గళించి వున్నవారి వేడు కమరు
బిగ్గెఁ గాఁగిలించువారు పెనఁగినంతా నమరు
యెగ్గులేదు ఇందులో నీకెవ్వరో యెఱఁగము

చ. 3: వావిగలమేనవారు వచ్చి కాలు దొక్కఁదగు
చేవ మీరినవారు మెచ్చితేఁ దగును
శ్రీ వేంకటేశ్వరుఁడ చేరి నన్నుఁ గూడితివి
యీవేళ నే నిందరిలో యెవ్వరో యెఱఁగము

రేకు: 1784-03 బౌళి సం: 27-502

పల్లవి: అనుమాన మిఁకనేల అంకెవచ్చె నీవేళ
వొనరి ఇట్టె వద్దనుండవయ్యా

చ. 1: కోపమెల్లాఁ జల్లవారె కూరిమికి నోరూరె
రాపులఁ బెట్టక యిట్టె రావయ్యా
తీపులు మోములు నిండె దిష్టమైన వలపు పండె
యేపున నీచేత విడె మియ్య వయ్యా

చ. 2: సెలవుల నవ్వు వచ్చె చెక్కిళ్లఁ జెమట హెచ్చె
చెలరేఁగి మా మొక్కులు చేకొనవయ్య
నిలువు నివ్వెరగందె నీకు నా విన్నపమందె
పిలిచి రతిఁ జొక్కించేఁ బెనఁగకువయ్యా

చ. 3: చనుల చంద్రులు నిక్కె సమరతు లివె దక్కె
మనసెల్లాఁ గంటి మిఁక మన్నించవయ్యా
ననిచె శ్రీ వేంకటేశ నాకు నీకుఁ బోదిఁక
యెనసితి మిద్దరము యిరవుకోవయ్యా

రేకు: 1784-04 వరాళి సం: 27-503

పల్లవి: ఇంతటఁగాని యెఱఁగ వేమిసేతు నీ బుద్ది
పంతపు నీగుట్టు నేఁడు బయటఁబెట్టితిని

చ. 1: వలపు పేరఁబెట్టి వాసి తచ్చి చల్లసేసి
కొలుచుకు నీకు నమ్మి గొల్లెత
పిలిచినా నెఱఁగవు పేరుకొని నే నిన్ను
కులికి యెచ్చరికగా గోర నిన్నూఁదితిని

చ. 2: కాఁకల నెయ్యి గాఁచి గసివెట్టీ సారె సారె
కూఁకటపాయపునీకు గొల్లెత
మాఁకువలె నున్నాఁడవు మన సాపె మీఁదఁ బెట్టి
సోఁకించితిఁ బల్లు నీ సోఁకు మోవి నిందుకు

చ. 3: నిండురతిఁ దరివట్టి నీకె వేల్పులకు మొక్కి
కొండలవంటి కుచాల గొల్లెత
అండనె శ్రీ వేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
గండి బొమ్మ జంకెనల ఘాతలు సేసితిని

రేకు: 1784-05 కాంబోది సం: 27-504

పల్లవి: ఇందరివలెనా నీ యిల్లాల నేను
కుంది నీవు తలవంచుకోకుమీ ఇఁకను

చ. 1: నీ మనసే పట్టి నేను నెరవేరుదుఁగాని
కైమీరి చేఁతలు సేసి గయ్యాళించను
మోమోటాన నీకు నే మొక్కులే మొక్కుదుఁగాని
వాములైన పంతాలను వాఁటాలు సేయను

చ. 2: యెంత సేసినా నీకు నిచ్చకమాడుదుఁగాని
వింతవారివలె నీపై వేగిరించను
మంతనాన మరి నేను మనవి చెప్పుదుఁగాని
కొంతము లెగరవేసి గురులు సేయను

చ. 3: చనవు సేసుక మోవిచవులు నేఁ జూతుఁగాని
వెనకటి సుద్దులకు వెంగెమాడను
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలసితి మిద్దరము
పనులెల్లాఁ జూపి నిన్నుఁ బైపై అట్టు సేయను

రేకు: 1784-06 శ్రీరాగం సం: 27-505

పల్లవి: నేనంత నిష్ఠూరిఁ గాను నీ యెడకు
కానున్న పనులే నీపై గట్టియాయఁ జుమ్మీ

చ. 1: చిత్తములోని దాన నీవు చెప్పినట్టు సేతు
చూచి చూచి నిన్ను నెట్టు సోఁకనాడేను
యేచి నీవు పట్టపగ లీపె నీవు నున్నందుకు
రా చిలుకలే మిమ్ము రవ్వసేసెఁ జుమ్మీ

చ. 2: తగులైనదాన నీకు తపము సేయుచుండుదు
వెగటుగ నీతో నేఁడు వెంగెమాడేనా
జిగి నాపెతో నీవు సేసిన సన్న లివ్వల
పగటునద్దము నిదె పట్టి యిచ్చోఁ జుమ్మీ

చ. 3: కూడిన కాఁగిటిదాన కోరి నీ కిచ్చ లాడుదు
వాడిక రతుల నిన్ను వంచుకొనేనా
యీడనె శ్రీ వేంకటేశ యెనసితి విటు నన్ను
వీడెపు నీ మోవి వెల్లా విరిసేసెఁ జుమ్మీ

రేకు: 1785-01 ఆహిరినాట సం: 27-506

పల్లవి: వద్దు వద్దు నాతోను వట్టి యెమ్మెలు చూపను
బుద్దులకు లోనై నీ పొంతనే వుందానను

చ. 1: ఆసలనేల పెట్టేవు ఆయములేల ముట్టేవు
సేసినట్టెల్లా నీ చేతకు లోను
వేసాల కొకరివలె వెరపించుకొన నేర
యీసులేక ఇదివో నీ ఇంటిలో నుందానను

చ. 2: యేఁటికి నవ్వు నవ్వేవు యెగసక్కే లేలాడేవు
మాఁటమాత్రమున నే నీమతిలోదాన
పాటించి యొకతెవలె పచ్చి సేయ నేనేర
చాటున నీపాదాల సరుస నుందానను

చ. 3: గోరనేల గీరేవు కొంగువట్టేల తీసేవు
కేరుచు నెప్పుడు నీకాఁగిటిలోదాన
చేరి నన్నుఁ గూడితివి శ్రీ వేంకటేశ్వర నేఁడు
యీరీతి నీ పచ్చడము యిక్కువ నుందానను

రేకు: 1785-02 తెలుఁగుఁగాంబోది సం: 27-507

పల్లవి: నాయకుఁడే ఇంతసేసె నా మోహము
పాయరాని భాగ్యముల పంతపు నామోహము

చ. 1: చవులుగా నీతోను సరసము లాడించె
నవకపువిధముల నా మోహము
చివురువంటి నాచేతు లెత్తి మొక్కించె
సవరఁదనముల నా జవ్వనపు మోహము

చ. 2: తగిన విరహవేళ దయ పుట్టించెను నీకు
నగవు సమేళముల నా మోహము
మగటిమి నీచేతి మన్ననలు చేకూర్చె
నిగిడి నామతిలోన నిండుకొన్న మోహము

చ. 3: రయమున నీ కాఁగిటిరసములు గురియించె
నయగారితనములనామోహము
నియతి శ్రీ వేంకటేశ నిన్ను నాతోఁ గూడించె
ప్రియముల నేపొద్దుఁ బెనఁగే నా మోహము

రేకు: 1785-03 సామంతం సం: 27-508

పల్లవి: చెప్పఁబోతే యీమర్మము సిగ్గు ముంచీని
పిప్పి దొరలె నీవల్ల ప్రియురాండ్ల కెల్ల

చ. 1: మంచిమాట లాడుతానే మనసు చొక్కించి నీచే
లంచము గొనెఁగా మోవి లలన
యెంచ నేమున్నది ఇఁక యెంగిలిసేసె నిన్ను
కంచము పొత్తు గలసె(పె) కాంతలకు నెల్లను

చ. 2: కన్నులను నవ్వుతానే గందము వూసిన మేన
చన్నుల ముద్ర లొత్తెఁగా సకియ
వున్నవెల్లాఁ జెప్పనేల వొకతెతో భోగించి
కన్నెలకెల్లా వడ్డించె కడమదొడమలు

చ. 3: సంగడిఁ గూచుండుతానే చక్కఁబెట్టుకొనె నిన్ను
రంగుగ శ్రీ వేంకటేశ రమణి
పొంగేటి జవ్వనమునఁ బొదిపి నిన్ను గూడి
ముంగిట మమ్మగూడించె ముదితలనెల్లను

రేకు: 1785-04 వరాళి సం: 27-509

పల్లవి: ఇది నీ పెద్దరికమే యెఱుఁగుకొమ్మీ
పదిలానఁ గప్పేది నీ పచ్చడమే నేను

చ. 1: చెనకి విభుడ నీవు చెప్పినట్టు సేయఁగాను
మునుకొని సవతులు మొక్కఁగాను
నినుపు గర్వముతోడ నీవు వచ్చే దెఱఁగక
వొనరి మంచము మీఁద నుందాన నెమ్మదిని

చ. 2: చింతదీర నీ సొమ్ములు చేరి నామేన నుండఁగా
పంతపు నీపై పదాలు పాడి మెచ్చఁగా
ఇంతట నీవు నమ్మిన దెఱఁగక పరాకున
యింతిపైఁ గాళ్లు చాఁచుక యెమ్మెతో నుందానను

చ. 3: శ్రీ వేంకటేశ నీవు చేయివేసి నన్నుఁగూడఁగా
భావించి చిలుకలట్టె పలుకఁగాను
యీవలఁ జెక్కునొక్కిన దెఱఁగక నీ మీద
కావిరిఁ జన్నులు మోవి కడు నూఁదె నిపుడు

రేకు: 1785-05 దేసాళం సం: 27-510

పల్లవి: ఇయ్యకోలు సేసే మీఁద నేమి గల్లాను
వియ్యపు సమ్మంధాలవిడె మిందవయ్య

చ. 1: ముచ్చట లాడేటి వేళ ముద్దులు గురుతుఁగాక
యెచ్చుకుందు లాడుదునా ఇప్పుడు నీతో
ఇచ్చకము సేసితివి ఇంటికి విచ్చేసి నీవు
అచ్చపు మామోవి విందు ఆరగించవయ్యా

చ. 2: కన్నుల నవ్వేటివేళ కందువ లంటుదుఁగాక
సన్నల నోరార్తునా సారెకు నీతో
మన్నన నా కిచ్చితివి మరులుగొంటివి నాకు
పన్నిన నా చన్నులఁ గప్పముఁ గొనవయ్యా

చ. 3: రతులఁ గూడేటి వేళ రసము లానింతుఁగాక
తతి దప్పింతునా మరి దాకొని నీతో
కతగా శ్రీ వేంకటేశ కలసితి మిద్దరము
మితిమీరి మోహముల మెప్పించు కోవయ్యా

రేకు: 1785-06 బౌళి సం: 27-511

పల్లవి: పట్టినంతే పంతము బలిమిగలవారికి
చిట్టకాలు మానుమాను చెప్పనా నీకును

చ. 1: చాలునంటే మానరాదా సరసాలు మాతోడ
కాలుదొక్కినందులోనే కానవచ్చెను
వాలుక చూపులు గొంత వంచవలెనా ఇంకా
మేలు మేలనుచు దొల్లె మెచ్చనా నిన్నును

చ. 2: అడిగితేఁ జెప్పరాదా ఆయములైన కతలు
కడు లోలో నవ్వినందే కానవచ్చెను
వొడ లేమి నిమిరేవు వూరకైనా నప్పటిని
గడుసుఁ జన్నుల మతి కరఁగించనా

చ. 3: యియ్యకోలు సేయరాదా యిప్పటి నీ చేఁతలెల్ల
కయ్యము పెట్టనీయందే కానవచ్చెను
వియ్యపు శ్రీ వేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
వుయ్యాల మంచము మీఁద నొరయనా నేఁడు

రేకు: 1786-01 శుద్ధవసంతం సం: 27-512

పల్లవి: ఒద్దు వొద్దు నన్ను నేల వొడఁ బరచేదే మీరు
సుద్దులు చెప్పినంతనే సూడు వాసెనటవే

చ. 1: నవ్వులేల నిజమౌనే నాయము నాయమే కాక
రవ్వకాఁడై నన్నెంత రచ్చ వేసీనే
పువ్వులు ముడిచినతల పూరి మోవవచ్చునా
యెవ్వతెఁ దాఁ బొగడినా నేల వినేనే

చ. 2: మొక్కులేల తగులౌనే మోహము మోహమే కాక
వెక్కసీఁడై నన్నునేల వెడ్డు వెట్టీనే
చిక్కని తేనెల మోవి చేఁదు మేయవచ్చునా
పక్కన సవతికేల పంత మిచ్చెనే

చ. 3: వేసటేల సతమౌనే వేడుక వేడుకే కాక
ఆసకాఁడై నన్ను నేల అంటుకొనీనే
బాస ఇచ్చి శ్రీ వేంకటపతి నన్ను నిదె కూడె
బేసబెల్లి వారికేల పిరితేసేనే

రేకు: 1786-02 రామక్రియ సం: 27-513

పల్లవి: నాలిసేయ నేమిటికి నాతో నీవు
ఆలరి తనములేల ఆనతియ్యరాదా

చ. 1: చేతులెత్తి మొక్కఁగాను చిటికనవేలు వట్టి
పాతురాడించిన యట్టు పట్టి తీసేవు
యేతులకు నీచేత యెట్టు వలసినా వచ్చు
ఆతుమలోపలిమాట ఆనతియ్యరాదా

చ. 2: కానుక నే నియ్యఁగాను గక్కున నా కొంగు వట్టి
సానదిప్పినట్లు దిప్పి సాము సే సేవు
అనుకొన్న యీ నటన లన్నిటికిఁ బొత్తేవుండు
ఐన దయ్యీఁగాని నిజ మానతియ్యరాదా

చ. 3: పాదాలు నేఁ బిసుకఁగా పైకొని కాఁగిటఁ బట్టి
సేదదేర నన్నుఁగూడి చెక్కు నొక్కేవు
యీదెస శ్రీ వేంకటేశ యిది గుమిత మార్గము
ఆదరించి నీ గుట్టు నా కానతియ్యరాదా

రేకు: 1786-03 సామవరాళి సం: 27-514

పల్లవి: సిగ్గువడ కంత నీవు చిత్తమెఱుఁగుదు నేను
యెగ్గు లెవ్వరెంచినా నియ్యకోలు నేను

చ. 1: కందువ నావాఁడవై కలిగి నీవుండఁగాను
యెందరినిఁ దెచ్చుకొన్నా నేమాయను
అందుకుఁగా దూరేరు అతివ లిందరు నిన్ను
విందువలె నీమాఁట విననోప నేను

చ. 2: యీడ నా చెప్పినట్టు ఇట్టె నీవు సేయఁగాను
యేడనుండి వచ్చినాను యేమాయను
వాడవారిందరు నిన్ను వడి నిందుకే నవ్వేరు
చూడఁ జాల నిది నేఁడు సోవలుగా నేను

చ. 3: ఆయమంటి నీవు నా కాఁగిటిలో నుండఁగాను
యే యింతిచే మొక్కించినా నేమాయను
యీయెడ నన్నుఁ గూడితివి చెలులెల్లా మెచ్చిరి
పాయలేను శ్రీ వేంకటపతి నిన్ను నేను

రేకు: 1786-04 ముఖారి సం: 27-515

పల్లవి: పొడగనే నిదె నిన్ను పొలఁతులు వేరె వేరె
అడియాలా లెత్తించే నే నందరిని నీకును

చ. 1: సెలవి నవ్వుల నిన్నుఁ జేతికి లోఁ జేసుకొన్న
కలికివో యీపె నీకుఁ గానుకిచ్చీని
మొలక చన్నులు చూపి మోహింపించె నిన్నీసతి
యెలయించె మాటలనే యీ వనిత

చ. 2: మోవితేనె చూపి నీచే మొక్కించుకొన్న దీయింతి
కేవల మెప్పుడు తా సాగిలి మొక్కీని
వావులు చల్లె(ల్లి) నిన్ను వలపించె నీ మగువ
పూవుల వేసి నిన్నుఁ బొందెను యీ తరుణి

చ. 3: గక్కనఁ గాఁగిటఁ బట్టి కరఁగించె నన్నీకాంత
చెక్కునొక్కి తానే ముందు సేసఁబెట్టీని
యిక్కువంటి శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
యెక్కుడైతి నిందరిలో నిందువంక నేను

రేకు: 1786-05 దేశాక్షి సం: 27-516

పల్లవి: చెప్పరాదు నీ సొంపు చిమ్మిరేఁగె వేడుకలు
కప్పురగందిమొగము కానవచ్చెను

చ. 1: కళలు రేఁగె నీ మోము కాంతఁ దలఁచుకొంటివో
వలనై యాపె యీడకు వచ్చేననెనో
తొలఁగక గవాక్షులు తొంగిచూచెనో నిన్ను
వెలినుండే తనెలుఁగు వినుపించెనో

చ. 2: పులకించె నీ చెక్కులు పొలఁతి సేస చల్లెనో
కలువరేకులదండ కాను కంపెనో
కొలఁది చన్నులు వ్రాసి గురుతులు వుత్తెంచెనో
పలుమారు నీ మీఁది పదములు వాడెనో

చ. 3: చెలవుల నవ్వుదేరి చెలి నీలోన నున్నదో
కలసి నీవురముపై కాపున్నదో
యెలమి మీరిద్దరును యేలితిరి మమ్మునిట్టె
అలరి శ్రీవేంకటేశ ఆపె బుద్ధి చెప్పెనో

రేకు: 1786-06 శుద్ధదేశి సం: 27-517

పల్లవి: నీవు సేసినదే చేఁత నీ విందుకు నోఁచితివి
యీవల నవ్వే వారి నెఱఁగము గాని

చ. 1: విన్నపము సేసినంతా వినీనంటాఁ బతితోడ
యెన్ని సన్నలు సేసేవే యెందాఁకానే
కన్నుల నవ్వేముగాని కాఁతాళించ మిందుకెల్లా
మన్నన నోరుపుగల మగఁడు గలిగెనో

చ. 2: వేసరఁడంటా నాతని వేగినంతాఁ బొదిగేవు
ఆస యెంత నీకు గద్దే ఆడఁజాలమే
నీ సూటికి వచ్చినట్టి నేస్తకత్తెలము నేము
సేసవెట్టిన యీతఁడు చేతిలో వాఁడాయనే

చ. 3: మొగమోడీ యీతఁడంటా ముంచి చన్నుల నొత్తేవు
యోగసక్యమా యిది యేఁటిదే యింత
తగ శ్రీవేంకటేశుఁడు తానే మమ్ముఁగూడె నేఁడు
తగ వెఱిఁగెఁ దా నంత తారుకాణ వచ్చెనే

రేకు: 1787-01 హిజ్జిజి సం: 27-518

పల్లవి: ఒద్ద నుండి యావేళ వుత్తరమిచ్చే నేను
పెద్దరిక మాతనిపైఁ బెనచరే యిపుడు

చ. 1: తలయెత్తి నేఁజూచితే తమకించి నవ్వినాఁడు
తలఁపెల్లా నొక్కటే తనకు నాకు
చెలులాల మీకేమైనాఁ జెప్పెనా అందలిమాట
అలిగివుందాన మీరే అడుగరే యిపుడు

చ. 2: సందడి నేఁ దగిలితే చాయలకే లోఁగినాఁడు
ముందు వెనకలు సరే మోహములోన
మందలించి మీ మనసు మఱఁగులు వాపెనా
వుందాన గుట్టునఁ బతి నొరయరే ఇపుడు

చ. 3: కాయము నే నొరసితే కాఁగిలించుకొన్నాఁడు
నాయములేల తప్పు ననుపైతేను
యీయెడ శ్రీవేంకటేశుఁ డెరిఁగెనా మీ భావము
చేయి మీఁదై వున్నదాన చెలఁగరే ఇపుడు

రేకు: 1787-02 లలిత సం: 27-519

పల్లవి: ఇప్పుడు నీ వేమాడిన యెమ్మెలందువు
చప్పుడు సేయక నుంటే చవివుట్టీ నపుడు

చ. 1: చలము సాదించవద్దు సవతి మచ్చరమున
చెలువునికి బుద్ధులు చెప్పవమ్మా
వలచిన సవతి నేను వద్దనుండే నావేళ
తెలుసుకొందము నీనా తేజమెల్లా నపుడు

చ. 2: కుచ్చితము సేయవద్దు గుణము మంకుఁ దనాన
పెచ్చు వెరిగి పతితోఁ బెనఁగవమ్మా
మెచ్చుల నాచనవులు మెరసేను ఆవేళ
కచ్చు పెట్టి నీ నా నేర్పు కనుకొంద మపుడు

చ. 3: మనసు చూడఁగవద్దు మాయదారి తనమున
యెనసి విభుని కప్పణియ్య వమ్మా
చెనకి నన్నుఁ గూడెను శ్రీవేంకటేశుఁడితఁడు
నిను మెచ్చి నీకరుణ నించుకొనే నపుడు

రేకు: 1787-03 ఆహిరి సం: 27-520

పల్లవి: ఏల జాగులు సే సేవు ఇట్టె రాఁ గదవయ్య
వేళ గాచుకొని చెలి విన్న వించు మనెను

చ. 1: చెలరేఁగి బాగాలు చేతఁ బట్టుకుండి నిన్నుఁ
బిలుచుకరమ్మని నీ ప్రియురాలు
పలు ప్రియములు చెప్పి పదివేలుగా నీకు
నలువునఁ దనమారు నన్నే మొక్కుమనెను

చ. 2: అందముగ సోబనపు టక్షతలు నీకుఁ బెట్టి
విందు చెప్పి రమ్మనె నీ వెలఁది
మందలిం చడుగులకు మడుఁగులు వరచుక
చెంది నీ వెంటఁగొలిచి చేరువ రమ్మనెను

చ. 3: కొత్తలుగా మోవి చవిగొందువంటా నిన్నుఁ దన
పొత్తుననుఁ బెట్టుమనె పొలఁతి
యిత్తల శ్రీ వేంకటేశ యేలితి వింతలోవచ్చి
మత్తిలి నిన్నే తాను మరిగితి ననెను.

రేకు: 1787-04 భైరవి సం: 27-521

పల్లవి: ఇంటికి రమ్మననే యెడమాఁట లికనేల
వింటిఁ దన సుద్దులెల్లా వేసాలిఁక నేఁటికి

చ. 1: చూడఁ జూడ వేడుకాయ సారిదిఁ దన చేఁతలు
యీాడ లిందరిలోఁ దను నమనేనే
కోడెకాఁడు మొదలనే గురుతులు మెయి నున్నవి
కూడి సంతోసించేఁగాక కొఱత లెంచేనా

చ. 2: వండ వండనట్లాయ వలచిన వలపులు
చండి సేసి తను నిఁక సాదించేనా
నిండుదొర తాను మరి నేరుచు మాఁటలెల్లాను
అండఁ బాయకుండేఁగాక ఆఱడిఁ బెట్టేనా

చ. 3: వూర నూర నూటలాయ నొద్దికఁ దనమోహము
మేర మీరి ఇఁకఁ దను మెచ్చకుండేనా
చేరి నన్నుఁ దానె కూడె శ్రీ వేంకటేశుఁడు
సారెకుఁబొగడేఁ గాక చదురులాడేనా

రేకు: 1787-05 పాడి సం: 27-522

పల్లవి: ఇంకనేల బొంకేవు యింత బాఁతి పడఁగాను
అంకెల నీ వాతని యానతి మీరకువే

చ. 1: అట్టె పాట పాడి యంతలో విభునిఁగని
గుట్టుతోడ సిగ్గువడి కూచుంటి వేమే
గట్టిగ వేడుకతోడఁ గడమని నేనంటా
పెట్టి దనపై నానలు పెనఁగక పాడవే

చ. 2: నీలోనే నవ్వుతా వచ్చి నెట్టన నాతనిఁ గని
తాలిమిఁ జెలియపొంత దా కొనేవేమే
ఆలించి తా నంతలో ని న్నందుకే వేడుకపడి
చేలకొంగు వట్టి తీసీ చిత్తము రా నవ్వవే

చ. 3: చేరి పవ్వళించియుండి శ్రీ వేంకటేశుఁగని
వూరకే లేచి నిలుచు కుండే వేమే
గారవించి వుండుమని కాఁగిలించుకొనీ నిన్ను
సారె నీవాతనితోడ జంటై పవ్వళించవే

రేకు: 1787-06 శంకరాభరణం సం: 27-523

పల్లవి: ఏఁటికిఁ బరాకు లిఁక నీకు
కోటి సేసు నిదె కోమలి వలపు

చ. 1: వినవయ్యా నా విన్నపము
మునుకొని నీకిదె మొక్కెనూ
పెనఁగకు సతి నినుఁ బిలిచీని
యెనయఁ బనులు నీ కెన్నైనఁ గలవూ

చ. 2: యియ్యవయా తనవిఁక నాకూ
యియ్యెడఁ గానుక లిచ్చేనూ
చెయ్యార సన్నలు సేసీఁ జెలి
నెయ్యము చూపఁగ నీ కిది వేళా

చ. 3: పలుకవయాతప్పక నాతో
నెలకొని వేఁడుకొనే నిన్నునూ
వెలఁది యేలితివి శ్రీ వేంకటేశుఁడా
యిల నీపంతము లీడేరె నిపుడూ

రేకు: 1788-01 ధన్నాసి సం: 27-524

పల్లవి: ఇందాఁకా వేఁగిరింత కిచ్చ నుంటిని
చెందితివిగా ఇట్టె చిత్తగించు నన్నును

చ. 1: చెనకినవాఁడవు చేపట్టక మానేవా
చనువులు గలుగు దాఁకా చక్కనుంటిని
నిను నెంచి చూచితేను నేరుపరి విన్నిటాను
యెనసి వొరసితివి యిఁకఁ జూడు నన్నును

చ. 2: నవ్వినట్టి వాఁడవు నమ్మించక మానేవా
రవ్వలైన యందాఁకా రాక వుంటిని
యివ్వల నీ మహిమలు యిందరుఁ దెలిసినవే
జవ్వనమే తరవాయ చక్కఁజూడు నన్నును

చ. 3: కూడినట్టి వాఁడవు గురుతు గాక మానేవా
యీడు చూచుకొన్నదాఁకా యింట నుంటిని
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పాడి పంతముల చేర భావించు నన్నును

రేకు: 1788-02 ఆహిరి సం: 27-525

పల్లవి: నీవు సేసినట్టి మాయో నే వలచిన వలపో
చేవలు మీరి యుండుదు సిగ్గువడు నిపుడు

చ. 1: అలుగ మనసురాదు అట్టె నీవేమి సేసినా
పిలుతు సారెకు నిన్నుఁ బేరుకొనుచు
తొలఁగ మనసు రాదు దొమ్మి నీవు సేసితేను
నిలుచుందు నీ యెదుట నీచేతికి లోనై

చ. 2: వెంగెమాడఁ గొలుపదు వింతలే నీవెట్టుండినా
సంగతిగా నవ్వుదును సరసమాడి
కంగువెట్టఁ గొలుపదు గర్వముతో నీవుండితే
యెంగిలిమోవి యడిగి ఇచ్చకమే సేతును

చ. 3: పంతమాడ సొగయదు పైకొని నీవు గూడితే
సంతోసాలే పుట్టింతు సారె సారెకు
ఇంతట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మంతనాలే ఆడుదు మచ్చిక దైవారును

రేకు: 1788-03 లలిత సం: 27-526

పల్లవి: చెఱకు దీపంటా నేమి సేయవచ్చునే
మఱి మరి విభునితో మారుకు మారే కాక

చ. 1: మనవి వినీనంటా మాపుదాఁకాఁ జెప్పుదురా
చనవు గలదంటాను సాదింతురా
చెనకనేరుతునంటా చేతిగోరు దాఁకింతురా
యెనసే మగవానితో నెంత కెం(కం)తే గాక

చ. 2: సరసమాడేనంటా సారెకుఁ బెనఁ గుదురా
ఇరవైనదాననంటా నెలఇంతురా
తరితీపు సే సేనంటా దండకు రాకుండుదురా
మరిగినమగనితో మట్టుకుమట్టే కాక

చ. 3: కూరిమిగలదంటాను కొసరి పైకొందురా
గారవించెనంటాను కక్కసింతురా
యీరీతి శ్రీ వేంకటేశుఁ డిప్పు డిట్టె నిన్నుఁగూడె
కోరి యేలినవానితో మేరకు మేరే కాక

రేకు: 1788-04 గౌళ సం: 27-527

పల్లవి: చేసన్నకే వచ్చి వానిఁ జెట్టవట్టి తియ్యనేల
బాసయిచ్చి నన్నునేలెఁ బదరకురే

చ. 1: మక్కువసేసినవాఁడు మన్నించనేరఁడా
కక్కసించి పతినేల కాకు సే సేవే
నిక్కమాతని మనసు నేనే యెఱుఁగుదును
మొక్కేఁగాక మీరేల మోపనాడేరే

చ. 2: కన్నులఁ జూచినవాఁడు కరుణించనేరఁడా
సన్నల నాతనినేల సాదించేరే
తన్నుఁదానె వచ్చీఁగాక తగవు దప్పఁ డతఁడు
పన్ని నేనే వేఁడుకొనే పైకొని దూరకురే

చ. 3: కదియవచ్చినవాఁడు కాఁగిలించ నేరఁడా
యెదుట నున్నవాని నే మెగ్గు లెంచేరే
యిదివో శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
వదలక సేవ సేసే వాసిఁ బెనఁగకురే

రేకు: 1788-05 నట్టనారాయణి సం: 27-528

పల్లవి: చిత్తగించఁ గదవయ్య చెలియసింగారము
హత్తి నీకు దేవులుగా నన్నిటాఁదగినది

చ. 1: కుప్పెసవరముతోడ కొప్పువెట్టె విరులతో
ముప్పిరి గీలించె ముత్తెముల పాపట
కప్పులుదేర నొసల గస్తూరి బొట్టమరించె
వొప్పుగా రత్నాలకమ్మ లొనరించె వీనుల

చ. 2: కంకణ సూడిగములు కైకొనె సందిదండలు
కొంకె మెడఁ బదకముహారాలు నించె
పొంకముగ చంద్రగావిపుట్టము ధరించుకొనె
లంకించె నొడ్డాణము బిల్లల మొలనూలును

చ. 3: పెట్టె నందెలుఁ బెండెము బెరయఁ బాదాలను
మట్టెలు మోఁతలతోడ మలయఁగాను
ఇట్టె శ్రీ వేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
పట్టము గట్టుక నీపానుపుపై నున్నది

రేకు: 1788-06 బౌళి సం: 27-529

పల్లవి: యెగ్గే తోఁదుగదా యెఱఁగఁ జెప్పఁగదవే
వెగ్గళపు రాజసాన వెలసీని యీతఁడు

చ. 1: సిగ్గువడి వుండితేను చిత్తమెట్టుండునో యంటా
దగ్గరి కాలు దొక్కితి దగవే కదే
అగ్గమై తలవంచితే నలిగితిన నీ నంటా
వొగ్గి సోఁక నాడితే నుచితమే కదవే

చ. 2: సంగడికి రాకుండితే చలమరి ననీనంటా
యెంగిలిమోవి యిచ్చితి యితనే కదే
కంగున మాఁటాడితేను గయ్యాళితనమౌనంటా
రంగు గుబ్బల నొత్తితి యింగితమౌ గదవే

చ. 3: గుట్టున నూ కుండితే కుచ్చిత మౌనోయంటా
బెట్టి(ట్టు) కాఁగిలించుకొంటి బ్రియమే కదే
యిట్టె శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
చుట్టమనయితి నిఁక సులభమే కదవే

రేకు: 1789-01 కాంబోది సం: 27-530

పల్లవి: ఇదివో నా తలపోఁత యేమి సేతును
కదిసి గాలి ముడియ గట్టరాదు గాని

చ. 1: వేగినంతా మాటలాడి వేసారదు నామనసు
జాగుకు నీ వోపవంటా జడిసేఁగాని
ఆగడీఁడవు తొలుతే అది సాదించినాఁడవే
ఆగతి నిన్నింత నేను అనరాదు గాని

చ. 2: నీమోవి తేనియలాని నిండదు నాలో నాసలు
కోమల మోరువదంటా కొంకేఁ గాని
కామించి తొల్లే అదియు కాయలుగాచి వున్నది
చేముట్టి యిప్పుడు రట్టు సేయరాదుగాని

చ. 3: బిగువుఁ జన్నుల నొత్తి పిరితియ్యదు పంతము
మొగి నీ వల సేవంటా మెరఁగేఁగాని
తగు శ్రీ వేంకటేశుఁడ దక్కి నన్నుఁ గూడితివి
నగితి విందుకు నే సన్నలు సేసేఁగాని

రేకు: 1789-02 దేసాళం సం: 27-531

పల్లవి: కాదనేమా నిన్నును కడు మెచ్చే మింతే కాక
సాదించితివి వలపు జాణకాఁడ వవుదువు

చ. 1: నయగారి మాటలెల్ల నాకుఁగా నేరిచితివి
క్రియ లెరుఁగుకొంటివి గేస్తురాండ్లలకు
దయదలఁతువు నీవు తరుణులైతేఁ జాలు
జయములే యెప్పుడును జాణకాఁడ వౌదువు

చ. 2: నగవులు సెలవుల నాకుఁగాఁ దెచ్చుకొంటివి
అగపడితి వట్టి పదారువేలకు
జిగిమించు గొల్లెతల సిగ్గులకు లోనైతివి
జగడము లేదు నీకు జాణకాఁడ వౌదువు

చ. 3: నంటున కాఁగిటఁ గూడి నాకే లోనైతివి
అంటక బాఁ పెతలవిం దారగించితి
వెంటనె శ్రీ వేంకటేశ వేడుకకాఁడవై
జంటవాయ విటు నన్ను జాణకాఁడ వౌదువు

రేకు: 1789-03 పాడి సం: 27-532

పల్లవి: ఇంతి గడుజవరాలు ఇంతట మన్నించరాదా
చెంతనుండి చూచిచూచి చిప్పిలీ మా మనసు

చ. 1: జల జలఁ జెమరించె జాజులు కొప్పున జారె
చెలితో నేమి సాములు సే సేవయ్య
తవిరుమోవి వాడి తమకము గదురేఁగె
మలసి యెందాఁకాను మాటలాడించేవయ్య

చ. 2: చెదరెను ముంగురులు చిట్లె గందపుబొట్టు
సుదతి నవ్వుల నెంత చొక్కించేవయ్య
వుదుటుగుబ్బలు రాసె నొయ్యనే పయ్యద జారె
ఇదె నీపాదా లొత్తించే వెందాఁకానయ్య

చ. 3: కన్నులఁ గెంపులు దేరె కళలు మోమున నిండె
కన్నె నెంత రతులను గదిమే వయ్య
ఇన్నిటా శ్రీ వేంకటేశ యేలితివి వేడుకతో
యెన్నేసి తరితీపుల నింపు పుట్టించేవయ్యా

రేకు: 1789-04 ఆహిరినాట సం: 27-533

పల్లవి: ఔనయ్యా నీవేమైనా నంటివి గాని
యీ నెలఁతఁ జిత్తగించు యేమనఁగ వచ్చును

చ. 1: మొలకలైన చన్నులే మోవరాని మోఁపు లౌను
కలికి కన్నులచూపు గాలపువేఁట
పలచని కెమ్మోవి పండి పచ్చితేనె గారు
కెలనఁ గాంతల నెట్టు గెలువఁగ వచ్చును

చ. 2: వేమరు నాడే మాటలే వెస నంటు జిగురులు
ఆముకొన్న బొమ్మజంకె లాసవలలు
దోమటి చుట్టరికాలు తోయఁగరాని తగుళ్లు
భామలగంటే మనసు పట్టనెట్టు వచ్చును

చ. 3: నేరుపుల వినయాలు నెరి నడపు నీడలు
కూరిమిచెనకులు చొక్కులమందులు
యీరీతి శ్రీ వేంకటేశ యీకె నిట్టె యేలితివి
చేరి సతుల రతులు చెప్ప నెట్టు వచ్చును

రేకు: 1789-05 ముఖారి సం: 27-534

పల్లవి: అద్దమరేతిరికాడ నానలేల పెట్టేవు
ఇద్దరికిఁ దగు నివి యింకాఁ గొంత వలెనా

చ. 1: పొరుగున నుండి యాపె పొందులు నీతోఁ జేయఁగ
విరులను సారె సారె వేయఁగాను
దొరకొని నీ మొగము తొంగి తొంగి చూడఁగాను
మరిగె నీమనసందు మరి యేఁటి సుద్దులు

చ. 2: యెదుటనే వుండి యాపె యెడమాటలాడించఁగా
పెదవి సన్నల నిన్నుఁ బిలువఁగాను
వెదకి వెదకి నీకు వేఁడుకొని మొక్కఁగాను
తుదకెక్కె నీ మోహము దూరనేల నిన్నును

చ. 3: పానుపు పైనుండి యాపై బత్తి నీపైఁ జేయఁగాను
నానఁబెట్టి పదరక నవ్వఁగాను
పూని శ్రీ వేంకటేశుఁడ పొంచి నన్ను నేలితివి
తానూ నిన్నుఁ బెండ్లాడె తప్పులేదు నీకును

రేకు: 1789-06 గౌళ సం: 27-535

పల్లవి: ఎదుటనున్నాఁ డతఁడు ఇదివో నా భాగ్యమున
పొదిగొనీ వేడుకలు పొంచి యేమి సేతునే

చ. 1: మొగము చూచేనంటే ముప్పిరిగొనీ సిగ్గులు
నగితే మందెమేళాలు నానుకొనీని
తగిలి పెనఁగేనంటే తతిగొనీఁ బులకలు
ఇగిలించీ నాకోరిక లిఁక నేమి సేతునే

చ. 2: విరుల వేసేనంటే వెస నాకు దయపుట్టీ
సరి గాఁగిలించేనంటే చన్ను లొత్తీని
మరిగించుకొనేనంటే మగనితో గర్వమయ్యీ
నిరతి నాగుణమిది నేనేమి సేతునే

చ. 3: కడురతిఁ గూడేనంటే కరఁగీ నాతని మతి
తొడపై నుంటే పాదముతుద దాఁకీని
యెడయక శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
తడఁబడీ నాయాసలు దాని కేమిసేతునే

రేకు: 1790-01 రామక్రియ సం: 27-536

పల్లవి: మొక్కే మీ వుపకారమునకు మేము నీకు
ఇక్కువకు చూపితివి యేమి గొరతయ్యా

చ. 1: పడఁతుల గర్వములు పతి యాదరించినంతా
జడియని నవ్వు సరసములంతాను
మడుపు మాట పలుకు మందె మేళములయంతా
యెడమిచ్చినాఁడవు మా కేమి గొరతయ్యా

చ. 2: సతమైన రాజసము చనవు లిచ్చినయంతా
రతులలో నేరుపులు రమించెనంతా
ప్రతిలేని వలపులు భావించుకొన్నంతా
ఇతవుగా మా కిచ్చితి వేమిగొరతయ్యా

చ. 3: మోవితేనియ విందులు ముంచి యాస గలయంతా
చేవమీరిన పనులు సేసినంతాను
శ్రీ వేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
యీవల నా మన్ననల కేమి గొరతయ్యా

రేకు: 1790-02 బౌళి సం: 27-537

పల్లవి: పచ్చిదేరెఁ బనులు పంతము లీడేరెను
ఇచ్చ యెఱుఁగుదును మా ఇంటికి రావోయి

చ. 1: మొదల మేను నీమోవి చూచి నోరూరితి
కొదవెట్టి ఇఁక నిన్నుఁ గోపగించేనా
వదలెఁ బయ్యదకొంగు వలపు నీరపమాయ
హృదయాలు గలసెను ఇంటికి రావోయి

చ. 2: సంగతిగా నిదివో నీ సరసానకు లోనైతి
రంగుగా నే నిఁక నిన్ను రవ్వ సే సేనా
అంగమెల్లఁ జెమరించె ఆయము నీవెఱుఁగుదు
వింగితాకారాలు గంటి నింటికి రావోయి

చ. 3: కతలుగా నేఁడు నీ కాఁగిటిలోనఁ జొక్కితి
పతిగా నే నిఁక నీతో పంతమాడేనా
సతమైనకళ లుబ్బె సమమోహములు నిండె
హితవై శ్రీ వేంకటేశ ఇంటికి రావోయి

రేకు: 1790-03 వరాళి సం: 27-538

పల్లవి: ఏకాంతములోని సుద్దు లెన్నఁడూ మఱవరాదు
యీకడఁ జెలియ నీతో నేమని చెప్పుదుమే

చ. 1: వీడిన నా తురుమున విరులు నిండా ముడిచె
వాడుదేర మోమున జవ్వాది సమరె
తోడనే చెక్కుఁచెమట దుడిచె కెంగేలను
యీడనే వోయమ్మ నీతో నేమని చెప్పుదునే

చ. 2: నుదుటికస్తూరి బొట్టు నునుగోరనే దిద్దె
అదనఁ గప్పుర మిచ్చె నలపు వాయ
చెదరినహారముల చిక్కులెల్లా నెడలించె
యిది యెట్టికొత్తో నీతో నేమని చెప్పుదునే

చ. 3: కోమలము నామేనంటాఁ కుంకుమ గందము పూసె
కామించి నేఁగోరినట్టె కరుణించెను
యీమేర శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను చనవిచ్చె
యేమి సోద్యమో నీతో నేమని చెప్పుదునే

రేకు: 1790-04 కన్నడగౌళ సం: 27-539

పల్లవి: ఎంత నన్ను వేఁడుకొనే విల్లాల నేను
చెంత నిట్టె యేలుకో నీ చిత్తములోదానను

చ. 1: మోవి చూపి నోరూరించె మొకమిచ్చుమాటలాడి
వావిచెప్పుకొనేయటువంటి దానవా
కావరించి సన్నసేసి కలపుకోలు సేసక
తావుకొని రతులకుఁ దగిలేఁటి దానవా

చ. 2: వాడిక వలపు చూపి వట్టి తరితీపు సేసి
జోడుకుఁ బెనఁగేటివాసులదానవా
వేడుక నవ్వులు నవ్వి వేసాలు ప్రియాలు చెప్పి
యేడనైనా మేలమాడే యేతుల దానవా

చ. 3: చనవులు సేసుకొని జక్కవ గుబ్బల నొత్తి
చెనకుచు నాసలు రేఁచే దానవా
యెనసితివి శ్రీ వేంకటేశ యింతలో నన్ను
పనివడి నేరుపులే పచరించే దానవా

రేకు: 1790-05 పాడి సం: 27-540

పల్లవి: ఆకె వింటే నేమైనా ననదా నిన్ను
మేకొని యింతేసి యాల మేర మీరేవు

చ. 1: నవ్వుతాఁ జెలియాడిన నసుపులమాటలెల్లా
యివ్వల నీవీపెకుఁ జెప్పీ(ప్పే) విచ్చకాలకు
నివ్వటిల్లఁ గానుకగా నీ కిచ్చిన కప్పురము
జవ్వనులకెల్లా నేల సారెకుఁ బెట్టేవు

చ. 2: పొంచి యాపె నీమైనిండాఁ బూసినతట్టు పుణుఁగు
యించుకించుకే చెలుల కేల పూసేవు
అంచెల నీమీఁది బత్తినంపిన జాజివిరులు
మించి కొలువుసతులమీఁద నేల చల్లేవు

చ. 3: వింతలుగా నాపె నీకు వేలఁబెట్టిన వుంగర
మింతలోఁ బొరుగువారికేల చూపేవు
కాంత నిన్నుఁ గూడిన యేకాంతము శ్రీ వేంకటేశ
రంతుల నిందరితోడ రవ్వలేల సే సేవు

రేకు: 1790-06 భైరవి సం: 27-541

పల్లవి: ఆడుకొంటేఁ బెద్దరికమే వుండుఁగాని
యీడు జోడై నన్నుఁ బాయఁ డెంతబత్తే ఇతఁడు

చ. 1: చెప్పిన నామాఁట విను సేసు నే పనులైనాను
అప్పసము నామేలువాఁడై వుండునే
తప్పక నాపై నానకు తానింతా జవదాఁటఁడు
యెప్పుడును నామీఁద నెంతబత్తే ఇతఁడు

చ. 2: మొగమోడు నాకుఁగడు ముచ్చటలు దాఁచఁడు
నగవుకైనా బొంకఁడు నాతోడను
తగ నా చెలుల గంటే దయతోడ నాదరించు
ఇగిరింపించు నామతి యెంతబత్తే ఇతఁడు

చ. 3: చెల్లించు నా సలిగెలు చేతికి లోనైవుండు
చల్లనిచూపులఁ జూచి చనవిచ్చునే
వెల్లవిరిగా నేలె శ్రీ వేంకటేశుఁ డిదె నన్ను
యెల్లవారిలో నామీఁద నెంతబత్తే యితఁడు

రేకు: 1791-01 సామంతం సం: 27-542

పల్లవి: కంటిఁగా తమ పొందులు కన్నులారాను
ఇంటిలో నా చుట్టరిక మెందువోయీనే

చ. 1: యే పొద్దూ బాయనివారి నెగసక్కేలాడనేల
కాఁపైపురాలు సే సేవారిఁ గలఁచనేల
రాఁపై వలచినవారి రవ్వలఁ బెట్టఁగనేల
ఆఁపరాని తమకము లడ్డపెట్టవసమా

చ. 2: ఆసపడివున్నవారి యనువు దప్పించనేల
బాససేసుకొన్నవారిఁ బాపఁగనేల
వేసారక వుండేవారి వెలికిఁ బిలువనేల
మూసిమంతనపు గుట్టు ముంగిటికి దే వచ్చునా

చ. 3: యెనసి వుండినవారి నెఱుకసేసుకోనేల
పెనఁగులాడేవారి బెల్లించనేల
నను శ్రీ వేంకటేశుఁడు నయముననే కూడె
పనులెల్లాఁ జక్కనాయ పదరఁగనేఁటికి

రేకు: 1791-02 సాళంగనాట సం: 27-543

పల్లవి: వట్టి నిష్ఠూరమేఁటికే వనితలకు
చుట్టరికము సేయఁగా సూడు వట్టఁదగునా

చ. 1: యెగసక్కే లేలాడేవే యెదుట నీ విభుఁడు నా
మొగము చూచితే నేను మొక్కఁగరాదా
నగనేలే నీ వప్పటి నా యింటి కితఁడు రాఁగా
సొగిసి నే నించుకంత చోటియ్య వలదా

చ. 2: వేసరుకోనేఁటికే వేడుకతో నాతఁడు
నాసంగడి నుండఁగఁ జెనకఁగరాదా
వాసులేల నెరపేవే వాలాయించి నా కాతఁడు
చేసన్నలు గావించఁగా సేవ సేయ వలదా

చ. 3: చేతులేల చాఁచేవే శ్రీ వేంకటేశుఁడు నాకు
ఆతఁడే విడెమియ్యఁగా నందుకోరాదా
కాతరించ నేఁకనేలే గట్టిగా నన్నేలినాఁడు
నీతో గూడె నన్నూ మన్నించె మెచ్చవలదా

రేకు: 1791-03 పాడి సం: 27-544

పల్లవి: సవతుల కీమాఁట సమ్మతిగాదు గాని
యివల నీవెటుండినా నిఁక నేఁ గాదనేనా

చ. 1: వద్దు నా కేమి చెప్పేవే వలచు నీ కాతఁడంటా
కద్దులేవే నీమాఁట కల్లఁగాదు
సుద్దులెల్లా వింటి నాఁడే సోద్యము గాదు నాకు
అద్దో నీ పెద్దరిక మందరు నెఱఁగరా

చ. 2: చూపనేలే నీ కాతఁడు సొమ్ము లిచ్చె నంటాను
యేపున నీకుఁ దగునే ఇటువంటివి
వైపాయ నీ సింగారము వడి సంతోసించుకొంటి
ఆపాటి నీ దొరతన మందరు నెఱఁగరా

చ. 3: పెట్టేవేమే విడేలు పెండ్లాడె నిన్నాతఁడంటా
గుట్టుగలవారి కిదే గుణముగాదా
యిట్టె శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
అట్టేకాదా మీపొందు నేఁ డందరు నెఱఁగరా

రేకు: 1791-04 నాదరామక్రియ సం: 27-545

పల్లవి: వినయమే మంచిది విభునితోను
ననుఁజూప కాతనితో నవ్వవే నామారు

చ. 1: వచ్చితేనేమే విభుని వద్దనఁగ వచ్చునా
మచ్చికతోఁ బీఁటవెట్టి మాఁటలాడవే
నిచ్చపెండ్లికొడుకుతో నిష్ఠూరము చెల్లునా
ఇచ్చకములే యాడవే ఇప్పుడే నామారు

చ. 2: వేఁడుకొంటే నేమాయనే వింతవాఁడా తానేమి
నాఁడే కోపమెల్లాఁ దీరె నావాఁడే తాను
ఆఁడుదానఁ దనతో నే నౌఁగాదనఁ బనియేమే
పోఁడిమితో వీడెమీవే పొద్దున నామారు

చ. 3: సరసమాడితేనేమే చవులుగాక మానీనా
యెరవు లేకుండితే మే లియ్యకొనవే
ఇనవై శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
గరిమ నీ విందుకుఁ బొగడవే నామారు

రేకు: 1791-05 దేసాళం సం: 27-546

పల్లవి: నేరుపే కలిగితేను నెయ్యము దానే కూడు
తారుకాణ వచ్చితేను తలఁపెల్లా నొక్కటే

చ. 1: మళ్లి మళ్లి చూచితేను మాఁటలెన్నైనాఁగలవు
వెల్లవిరిగా నన్నీ వింటినే నేను
చెల్లుబడి గలవారు సేసినదే చేఁతగాదా
యెల్లవారు వినఁగా నన్నే లొడఁబడచీనే

చ. 2: తప్పక చూచితేను తనివెంతైనాఁ దీరదు
వొప్పుగ తనవద్దనే వుందానఁగదే
యెప్పుడూనుఁ గలవారి నెవ్వరైనాఁ గాదందురా
ముప్పిరి నమ్మికలేల ముంచి తాఁ జేసీనే

చ. 3: వేడుకకు నవ్వితేను వెలవెట్ట వసగాదు
ఆడినట్టే దేవుల నేనైతిఁ గదవే
యీడనే శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
మేడెపు నారతు లెంత మేకొని మెచ్చీనే

రేకు: 1791-06 సామవరాళి సం: 27-547

పల్లవి: నీచిత్త మెట్టుండునో నిన్ను నే నడుగరాదు
చూచి చూచి వోర్వరాదు సుద్దు చెప్పవయా

చ. 1: ఆరగించితివో లేదో ఆపెఁ జూచే వేడుకలు
వూరకె మఱచి యట్టే వుంటివో నీవు
నేరుపుల జాగరాల నిద్ర వచ్చెనో రాదో
కోరి యీ విచారాననే గుబ్బతిలి వుంటిని

చ. 2: జలకమాడితో లేదో సతిఁ గూడే పరాకున
చెలప చెమటలనే చిప్పిలితివో
యెలమిఁ దెల్లవారిన దెరుక పడెనో లేదో
తలపోసి నీకుఁగానే తత్తరించి వుంటిని

చ. 3: సింగారించుకొంటో లేదో చెనకేటితమకాన
వుంగిటితో మోవికి నోరూరుచుంటివో
అంగవించి శ్రీ వేంకటాధిప నన్నేలితివి
చెంగలించి నీగుణమే చెప్పుకొంటానుంటిని

రేకు: 1792-01 రామక్రియ సం: 27-548

పల్లవి: నాతోనేల పెనఁగేవు నన్నెంతొడఁబరచేవు
ఆతనిచిత్త మెట్టిదో అడుగఁగరాదా

చ. 1: పన్ని సరసమాడితే పై కొంటగాక వూరకే
సన్నలు సేయఁగఁబోతే సమ్మతులౌనా
కన్నులెదుట నున్నాఁడు కదియఁగా వద్దనేనా
చిన్నదాన నేమీఁ జేయ సిగ్గయ్యీ నాకును

చ. 2: మలసి మాఁటాడితేను మచ్చిక చూపుటగాక
పిలిచి కొసరఁబోతే ప్రియములౌనా
కొలువులో విడెమిచ్చె గుట్టుసేయ నీకనేల
తెలిపి చెప్పెదనంటే తేనెగారీ మోవిని

చ. 3: గక్కనఁ దా నవ్వితేను కాఁగిలించుకొంటఁగాక
ఇక్కువలే యంటఁబోతే నితవులౌనా
అక్కరై శ్రీ వేంకటేశుఁ డంతలోఁ దా నన్నుఁ గూడె
చెక్కునొక్కి వేఁడుకోవే చిమ్మిరేఁగీ మనసు

రేకు: 1792-02 ముఖారి సం: 27-549

పల్లవి: ఈ మేటితోఁబుట్టేనట మాయలమేలుమంగ
ఆమేలే చూతురుగాని అవుఁ గాదనకురే

చ. 1: చూడరమ్మ అల్లవాఁడే చుక్కలరాజు
వేడుకలువెదచల్లే వెన్నెలరాశి
కూడపెట్టి దాఁచినట్టి కూడేటిబుద్ది
వోడక జలధిపాలి వుబ్బరిమందు ముద్ద

చ. 2: మెచ్చురే వాఁడె మరుని మేనమామ
మచ్చెముతోడి మట్టిమాని విత్తు
పచ్చిదేరే విరహపు పాముండే పుట్ట
కొచ్చి దేవతలపాలి గుజ్జనగూడు

చ. 3: యితఁడేసుండి శ్రీ వేంకటేశు మరఁది
తతిఁ బన్నీరూరే యమృతంపుఁ జలమ
సతులమోములఁ బోలేసరియలతి
గతి గూడిన పదారు కళల నిధానము

రేకు: 1792-03 ఆహిరి సం: 27-550

పల్లవి: కోరి వింద విటు రారే గొల్లెతలాల
మేరతో మన కతఁడు మేనమరఁది

చ. 1: ఆవుల మందలలోన నదె పిల్లఁదురు లూదీ
చేవమీరే వేడుకతోఁ జిన్ని కృష్ణుఁడు
పూవులతోఁటలోన పొంచి గొబ్బిళ్లఁ బాడీని
వేవేలు చందాలతోడ వెన్నముద్ద కృష్ణుఁడు

చ. 2: రచ్చకొట్టాలలో నుండి రాగాన నీలలువెట్టీ
గచ్చులు సేయుచు కోడెకాఁడు కృష్ణుఁడు
తచ్చి నీలాటిరేవుల తగిలి సన్నలు సేసీ
పచ్చిమాఁట లాడుకొంటా బాలకృష్ణుఁడు

చ. 3: దొరకొని యమునలో తుత్తురుఁగొమ్ము వట్టీని
అరుదుగా శ్రీ వేంకటేద్రి కృష్ణుఁడు
వరుసతోఁ గిన్నెరలు వాయించి ఇండ్లకువచ్చి
ఇరవై మనలగూడె నిట్టె ముద్దుఁ గృష్ణుఁడు

రేకు: 1792-04 కురఁ(రం)జి సం: 27-551

పల్లవి: నీగుణాలెల్లా వింటి నిన్న మొన్ననే
ఆగడా లేమిసేతువో అత్తింటి కోడలను

చ. 1: చద్దికి వేడికి నాతో సరసమాడవచ్చేవు
వద్దు సుమ్మీ వోయి మావారే మందురో
వుద్దండుఁడవు నీవైతే వొంటి నున్నదాన నేను
అద్దో నీవేమి సేతువో అత్తింటి కోడలను

చ. 2: నట్టింటిలోనికి వచ్చి నాతోను నవ్వేవు
చుట్టా లేమందురో నిన్నుఁ జూచుకొమ్మీ
పట్టెఁడేసి గుబ్బలదాన పాయపు వాఁడవు నీవు
అట్టె నన్నేమి సేతువో అత్తింటి కోడలను

చ. 3: వావి చెప్పి పక్కఁ బండి వలచి కాఁగిలించేవు
యీవల విన్న కన్నవారేమందురో
శ్రీ వేంకటేశుఁడవు చిన్ని చక్కనిదాన
ఆవటిం చేమి సేతువో అత్తింటి కోడలను

రేకు: 1792-05 నాదరామక్రియ సం: 27-552

పల్లవి: ఏడ నేరుచుకొంటివే యింతేసి దిట్టతనాలు
మేడెము గూడి చెలులు మెచ్చేరు నిన్నును

చ. 1: ముసి ముసి నవ్వులతో ముద్దు లేమి గురిసేవే
కొసరి విభునినిన్నుఁ గొలువులోన
కసుఁగాటు వలపుల కతకారి వవుదువే
వెస నిన్నుఁ జూచి చూచి వెరగయ్యీ నాకు

చ. 2: చెక్కిటి చేతితోడ సిగ్గు లేమి నెరపేవే
మొక్కలాన రమణుని మొగమెదుట
వెక్కసపుఁ జేఁతల వేడుకకత్తె వవుదువే
చొక్కుచు నీసుద్దులకు సోద్యమయ్యీ నాకు

చ. 3: సరికి బేసికి నుండి జాణతనా లేమాడేవే
పరగ శ్రీ వేంకటేశుపానుపు మీఁద
యిరవై నన్నితఁడేలె యిచ్చకురాల వవుదువే
తొరలి నీ బుద్ధికి సంతోసమయ్యీ నాకు

రేకు: 1792-06 లలిత సం: 27-553

పల్లవి: అటువంటి విద్యలు నీ యందు వున్నవి
నటన లెందూ నొల్లవు నాకే దక్కితివి

చ. 1: ముంచి యవ్వతెకైనాను మోహించిన మగవాఁడు
కొంచించు మాఁటలాడ కోమలులతో
వంచించక నమ్మికలు వడి నొసఁగినవాఁడు
అంచెల వట్టియాచారాలన్నియు నెరపును

చ. 2: ననిచి యెవ్వతెకైనా నమ్మిక లిచ్చినవాఁడు
యెనసి నవ్వఁ జాలఁడు యింతులతోడు
మనసిచ్చి యొక్కతెనే మరిగియుండినవాఁడు
చెనకిన లోనుగాక చెల్లించు నేమములు

చ.3: వాడికె నెవ్వతెకైనా వసమై యుండినవాఁడు
చూడనోడు నూరకైనా సుదతులను
యీడ నిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
యేడా నీవంటివాఁడు లేఁ డిచ్చక మిట్టుండును

రేకు: 1793-01 బౌళి సం: 27-554

పల్లవి: మేలు మేలు నీచేఁతలు; మెచ్చితి నిన్ను
వాలాయించి ఇందరిలో వలపించుకొంటివి

చ. 1: వెలినుండి కలఁకలు వెదకేవు మాఁటలకు
తలములు సోఁకించి తమకించేవు
ములుఁగుచు వలపులు మోకు గట్టి యెత్తేవు
తలఁచితే నేడనైనా తగఁ బొడచూపేవు

చ. 2: గుట్టునఁ గొలచినండే(దే) కొలచే వేపనికైనా
యెట్టి కులమైనా నట్టు నిట్టు సే సేవు
రట్టుగా సతులకై రాఁపులనే పెనఁగేవు
వెట్టికిఁ గొండయైనాను వేలనే యెత్తేవు

చ. 3: సిగ్గు లెగ్గు లెంచక చెలులతో మాఁటాడేవు
వొగ్గి తూరలెక్కేవు నీ వుద్దాండనను
అగ్గమై శ్రీ వేంకటేశ యన్నిటా జాణవౌదు
వెగ్గళించితే రూపులు వేవేలయ్యేవు

రేకు: 1793-02 సాళంగనాట సం: 27-555

పల్లవి: నేరుపరియౌ నీపె నెలఁతలలో నెల్లా
వూరకె నడుము దూరి వొట్టికాయ నీకును

చ. 1: పయ్యద చెరఁగు జారఁ బగటుతోడుత వచ్చి
వొయ్యనే మగువ నీ వొద్దఁ గూచుండె
యియ్యెడ నీకేమవునో యెంతపని గలిగెనో
నెయ్యాన నీతన సంది నేస్తమెల్లాఁ జూపెను

చ. 2: కంకణాలు గదలఁగా కడుసలిగె తోడుత
పంకించక ఇదివో నీ పాదా లొత్తెను
వుంకువ యేమిగొనెనో వొడఁబడి కెట్టిదో
అంకెఁ దనచుట్టరికమంతా నేఁడు చూపెను

చ. 3: గందపుబేంట్లు రాల గబ్బితనముననే
కందువ దెలిపి నిన్ను కాఁగిలించెను
చందముతో శ్రీ వేంకటేశ్వర నన్నుఁ గూడితివి
ఇందులకే మెచ్చి తనఇతవెలాఁ జూపెను

రేకు: 1793-03 పాడి సం: 27-556

పల్లవి: తెరవేయరే సిగ్గులు దేరీఁ దమకుఁదమకే
మరుఁడే బుద్దులు చెప్పీ మంతనపు వారికి

చ. 1: మనసుగలయు చోట మాటలు దానే తోఁచు
తనువులు సోఁకితేనే తమివుట్టును
పెనఁగులాడఁబూనితే ప్రియములు గడురేఁగు
మనము చెప్పవలెనా మగువకుఁ బతికి

చ. 2: చూపు చూపు నంటుకొంటే చుట్టరిక మొనరించు
యేపున నవ్వఁజొచ్చితే నిపులెసఁగు
కాఁపురాలు సేయఁగానే కళలు దానే కరఁగు
యీపనులు నేరిపేమా ఇంతికి విభునికి

చ. 3: యెప్పుడుఁ బాయకుండితే నేకములౌ మనసులు
ముప్పిరిఁ దగిలితేను మోహమెచ్చును
వొప్పిగఁ బానుపుమీఁద నొద్దికయ్యె వున్నారు
చెప్పనేల సతికిని శ్రీ వేంకటేశునకు

రేకు: 1793-04 వరాళి సం: 27-557

పల్లవి: కంటివిగా నేఁడు దీనికతకారి తనములు
పెంటవెట్టుకొని నీతో పెచ్చువెరిగీని

చ. 1: పాపట దువ్వుకొంటాను పడఁతి నీయెదుటను
పూఁప చన్నులు పయ్యదఁ బొదుగుకొంటా
చూపులు నాఁట రెప్పలు చొక్కి యల్లారుచుకొంటా
యీపె యెన్నిచేఁతలు నీయెదుటఁ జేసీని

చ. 2: తములము సేసుకొంటా తమకించీ లోలోనె
చెమటలు కొనగోరఁ జిమ్ముకొంటాను
బొమముడి వెట్టుకొని పొంచిపొంచి నవ్వుకొంటా
సముకాన నెంతేసి వేసాలఁ బొరలీని

చ. 3: కొప్పు చక్కఁబెట్టుకొంటా కూరిములు చల్లిచల్లి
చిప్పిలుమెయి సోఁక నిన్నుఁ జెనకు కొంటా
చొప్పుగా నీవు నన్నేలఁజూచి శ్రీ వేంకటేశుఁడ
ఇప్పుడు నీ ముందరఁ దా నేమినటించీని

రేకు: 1793-05 ముఖారి సం: 27-558

పల్లవి: సతి నీఁ జేసెనంటా సాకిరులేల పెట్టేవు
కతకారితనమింతే గరువముకాదయ్యా

చ. 1: పంతములు బిగువులు పలుకులు కొసరులు
కాంతల కెప్పుడు నివి గలిగినవే
చెంతఁ జెక్కిటిచేతులు చిరుసిగ్గులు నవ్వులు
ఇంతులకు సాజమిది యెగ్గుపట్ట రాదయ్యా

చ. 2: యెలఇంపుఁ జేఁతలును యెల్లిదాలు పల్లదాలు
అలివేణులకు నివి యలవాటులే
కలికితనములు బింకములు బీరములును
చెలువచందాలు రట్టుసేయఁగరాదయ్యా

చ. 3: సరసాలు జంకెనలు సరివాలుఁ జూపులును
సరసిజాక్షుల కివి సంగతులే
ఇరవై శ్రీ వేంకటేశ యీకె నిట్టె కూడితివి
తరుణుల వోజ లివి తగదనరాదయ్యా

రేకు: 1793-06 గౌళ సం: 27-559

పల్లవి: ఊరకే తెమలునా వుదుటైన నీమనసు
తారుకాణలు దెలిసి దయవుట్టీఁ గాక

చ. 1: తరుణి గుబ్బలు నిన్నుఁ దాఁకినప్పుడుగదా
మరిగి యాపె చెప్పినమాఁట విందువు
అరిది బొమ్మజంకెన లంటినప్పుడుగదా
వరుసలు దప్పకుండా వత్తువు నీవు

చ. 2: నిక్కి సేయరాని చేఁత నిన్ను మోఁచిననుఁ గదా
అక్కరతోఁ జేతికి లోనై వుందువు
కక్కసపుఁ జూపులు కాఁడిపారిననుఁ గదా
తక్కక యాపె నే పొద్దూఁ దలఁతువు నీవు

చ. 3: సొలపుఁ బలుకు నిన్ను సోఁకినంతటఁగదా
తలవంచి సిగ్గుతోడ దండవాయపు(వు)
చెలి నేలితి వింతలో శ్రీ వేంకటేశ్వర
కలసి యిట్లైతేఁ గదా కరఁగుదువు నీవు

రేకు: 1794-01 ముఖారి సం: 27-560

పల్లవి: నా దిక్కు చూచి నీవు నవ్వులెంత నవ్వేవు
దాదాత నీలోని తలఁపు లీడేరెను

చ. 1: సలిగె గలదానవు సరసములాడఁగదే
కొలువైవున్నాఁ డతఁడు కొంకఁగనేల
చెలుల మాఁటున నుండి సిగ్గువడ నేమిటికి
వెలయఁగ వలపులు నెల్లవిరులాయను

చ. 2: చుట్టమవైనదానవు సుద్దులు చెప్పఁ గదవే
యిట్టె నీఇంటికి వచ్చె నెరవులేల
వట్టి సన్నలుఁ జాయలు వల దిందరిముందర
తెట్టలైన మీ పొందులు తేటతెల్లమాయను

చ. 3: తగులుగల దానవు దండఁ గూచుండఁగదవే
మొగముచూచి నిన్నేలె మొరఁగులేల
తగు శ్రీ వేంకటేశుఁడు తానే నిన్నూ నన్నూ నేలె
జిగిమించి యీ కతలు చెప్పఁగొత్తలాయను

రేకు: 1794-02 సామంతం సం: 27-561

పల్లవి: చేరి నీతో సంగాతాలు సేయమనేవు నన్ను
గారవించి నీవే నన్నుఁ గరుణింతువు గాక

చ. 1: పులివట్టుకొని యాపె నొడఁబరచఁగ నీతో
నెడచొచ్చి మాఁటలాడ నెట్టు వచ్చును
అడరి మంచముమీఁద నట్టె మీరు గూచుండఁగా
నడుమ నప్పటి నీతో నవ్వ నెట్టు వచ్చును

చ. 2: యేకతానఁ దెరలోన నిద్దరూను నుండఁగాను
యీకడ నిన్నుఁ బిలువనెట్టు వచ్చును
మేకొని మీలో మీరు మించి విడేలు సేయఁగా
నాకు మడిచియ్య నీకు నది యెట్టు వచ్చును

చ. 3: ముచ్చట నొకరొకరు మొగములు చూచుకోఁగా
యెచ్చరించి సన్నసేయ నెట్టు వచ్చును
ఇచ్చట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నీడ
మెచ్చితి నెంతైనా నిన్ను మీర నెట్టు వచ్చును

రేకు: 1794-03 లలిత సం: 27-562

పల్లవి: అన్నిటా జాణఁడు అలమేలుమంగపతి
పన్ని నీకు మేలువాఁడై పరిగివున్నాఁడు

చ. 1: పట్టినదే పంతమా పతితోడ నీ కిప్పుడు
యిట్టె నిన్ను వేఁడుకోఁగా నియ్యకోరాదా
వొట్టి యప్పటనుండి నీవొడి వట్టుకొన్నవాఁడు
గట్టువాయ తనమేల కరఁగనే మనసు

చ. 2: చలములే సాదింతురా సారె సారె నాతనితో
బలిమిఁ బిలువఁగాను పలుకరాదా
కలపుకోలు సేసుక కాఁగిలించుకున్నవాఁడు
పెలుచుఁదనములేల పెనఁగవే రతిని

చ. 3: చేరి ఇట్టె బిగుతురా శ్రీ వేంకటేశ్వరునితో
మేరతో నిన్నేలఁగాను మెచ్చఁగరాదా
యీరీతి నిన్నుఁ బెండ్లాడె యెడయక వున్నవాఁడు
వీరిడితనములేల వెలయవే మరిగి

రేకు: 1794-04 శుద్ధదేశి సం: 27-563

పల్లవి: ఇంతవేడుక గలితే నింటికి విచ్చేయరాదా
చెంత నీవు చెప్పినట్టు సేవసేఁగాని

చ. 1: సిగ్గులే చీఁదరగొంటే చెలి ఇఁక నేమిసేసు
వొగ్గి కతచెప్పుమని వొడివట్టేవు
వెగ్గళపు వలపులవెల్లి యెట్టు యీఁదవచ్చు
అగ్గవకోరికలకు నాసపడేవు

చ. 2: నవ్వులే చిమ్మిరేఁచితే నలినాక్షి యేమిసేసు
చివ్వన మాఁటాడుమని చెక్కునొక్కేవు
పువ్వీళ్లూరే మోవితేనె పుట్టేఁగట్ట నెట్టు వచ్చు
పువ్వువంటి తమకము పొదిసేసేవు

చ. 3: పాయమే కారుకమ్మితే పడఁతిఁ దా నేమి సేసు
కాయజకేలి యిమ్మని కాఁగిలించేవు
యీయెడ శ్రీ వేంకటేశ యేలితి వలమేల్మంగను
చాయల నీచేఁత లిన్నిఁ జవులు సే సేవు

రేకు: 1794-05 కేదారగౌళ సం: 27-564

పల్లవి: చెప్పరాని నేరుపు లీ చెలివద్దనే వున్నవి
యిప్పు డెంచితే వావి నేమౌనో నీకు

చ. 1: చేటఁడేసి నవ్వులు సెలవుల నుండఁగానే
మూటఁడేసిమాఁట లాడీ ముదిత నీతో
గాఁటమైన చెమటలు కాలువలుగట్టి పారీ
వాఁటముగ నెందుండి వచ్చెనో తాను

చ. 2: పట్టెఁ డేసి గుబ్బలపైఁ బయ్య దుండఁగానే
పెట్టెఁడేసి సిగ్గులనుఁ బెనఁగులాడీ
నెట్టుకొన్న వేడుకతో నిట్టూర్పులు చల్లుకొంటా
గుట్టుతో నీవల పెందుఁ గూడపెట్టు కొనెనో

చ. 3: బారెఁడేసి వెంట్రుకల బలుకొప్పు జారఁగానే
చేరఁడేసి కన్నులఁ జూచీ నిన్నును
కోరి యలమేలు మంగకుఁబతి శ్రీ వేంకటేశ
యీరీతి నన్నేలితివి యెట్టి పొందో తనకు

రేకు: 1794-06 బౌళి సం: 27-565

పల్లవి: మాతోఁ జెప్పఁగదవే మగువ నీ సుద్దులెల్లా
యీతల నీ వేడుకలు ఇన్నీ నేఁడుఁగంటిమి

చ. 1: కన్నులఁ దేటలు నిండె కమ్మి మైఁ జెమట లూరె
వున్నతి యిందాఁకా నెందునుండి వస్తివే
సన్నపు నీ పెదవులు చాలాఁ బిప్పులు గట్టె
పన్ని యెవ్వరితో మాట పలుకు లాడితివే

చ. 2: గట్టి కొప్పు వెడ జారె కళలు మోమునఁదేరె
అట్టె యేపనుల నీ వలసితివే
కట్టిన చెంగావిచీర కడు నెరి విరిగెను(వీఁగెను)
బెట్టి(ట్టు) నీ వెవ్వరితోడఁ బెనఁగితివే

చ. 3: సెలవినవ్వు మెరసె చేఁతలు మేన నెరసె
అలరి సంతోస మెట్లబ్బెనే నీకు
అలమేలుమంగపతియైన శ్రీ వేంకటేశుఁడు
కలసెనో నిన్ను నే భాగ్యములు సేసితివే

రేకు: 1795-01 వరాళి సం: 27-566

పల్లవి: మొదలనే నేనైతే మొకదాకిరి దానవు
యెదురాడఁ జాల నిఁక నేమందునే

చ. 1: మంతనానఁ జుట్టి చుట్టి మాఁటలెల్లాఁ జెల్లఁబెట్టీ
నంతేసి గురుతులు మై నట్టె వుండఁగా
వింత వాసనలతోనే వేమారు వేఁడుకొనీని
యెంతనేరుపరి యీతఁ డేమందునే

చ. 2: సేసిన చేఁతలకెల్లాఁ జెల్లఁబో నెపాలు చూపి
లాసీ చిరునవ్వులు సెలవిఁ దేరఁగా
సేసపాలు రాలఁగానే చెప్పరాని బాస లిచ్చీ
యీ సుద్దులవటరతో నేమందునే

చ. 3: కానవచ్చిన పొందులు గంపఁగమ్మి పొసఁగించీ
ఆనుకొని తనచుట్టా లండ నుండఁగానే
పూని శ్రీ వేంకటేశుఁ డా పొందుతోనే నన్నుఁ గూడె
యీనాఁటకపు విభుని నేమందునే

రేకు: 1795-02 ఆహిరి సం: 27-567

పల్లవి: ఏమని చెప్పుదురయ్య ఇట్టిది నాకాఁపురము
నీ మేలులోనిదాన నేఁ జూమ్మీ రమణుఁడ

చ. 1: నిలిచి యొక్కకమారు నీ వాదరించినదెల్లా
తలఁచు కొంటేను చిత్తము గరఁగు
యెలిమిఁ బొద్దు వోకకు యెడనెడ నీగుణాలు
చెలులచే వింటేను చిప్పిలి సంతోసము

చ. 2: చేముంచి నీ వేకతానఁ జేసిన గురుతులెల్లా
నామేనఁ జూచుకొంటే నవ్వు వచ్చును
కామించి నీవంపినట్టి కస్తూరి నేఁ బూసుకొంటే
ప్రేమపుఁ దమకములు పెడరేఁగును

చ. 3: అద్దరిపాటుగాను నా యండకు నీవు వచ్చితే
కొద్దిమీరిన వేడుక గుదిగొనును
వొద్దికై శ్రీ వేంకటేశ వొగి నన్నుఁ గూడితివి
చద్దివేఁడి రతు లిట్టె సమకొనును

రేకు: 1795-03 పాడి సం: 27-568

పల్లవి: ఇట్టె నాకు బ్రియము లెంత చెప్పేవు
నెట్టుకొన్న నాగుణము నీ వెరఁగవా

చ. 1: చిత్తగించి నీవేమి సేసినా నియ్యకొనేఁగాక
ఇత్తల నా ఇచ్చల నీ కెదురాడేనా
బత్తితో నీమన్ననలు పదివేలుగాఁ జూచుక
మెత్తుగాక నీ యెడకు మేర మీరేనా

చ. 2: నాకు నీవే మానతిచ్చినా సమ్మతించేఁగాక
కాకరితనాల నీతోఁ గాఁతాళించేనా
పైకొన్న నీ యాదరణే కాణాచిగాఁ జేసుకొని
నీకితవై వుందుఁగాక నెపాలెంచేనా

చ. 3: యేరీతి నన్నేలినా నెనసి వుండేఁగాక
కూరిమి గొసరి నిన్ను గుంపించేనా
కోరి శ్రీ వేంకటేశ నీకూటమి కొండసేసుక
సారెకు మొక్కదుఁగాక సాదించేనా

రేకు: 1795-04 సాళంగం సం: 27-569

పల్లవి: పొద్దొక విధమై యుండు పొందు లెంచి చూచితేను
బుద్ది చెప్పేమాట విని వొద్దికి రమ్మనవే

చ. 1: వినుకలి యాసలు వింతచవులై తోఁచు
కనుకలిఁ దమకము గనమై తోఁచు
మనసులో తలపోఁత మరితరితీపై తోఁచు
యెనసిన మీఁద నన్నీ నింపులై తోఁచును

చ. 2: సరసపుఁ జెనకులు సమరతులై తోఁచు
పరగిన సన్నలు లాభములై తోఁచు
సొరిది మొగమోటలు చుట్టరికాలై తోఁచు
తరవాత నివియే తగుళ్లై తోఁచును

చ. 3: నెట్టుకొన్న కాఁగిళ్లు నిధానములై తోఁచు
గుట్టుతోడినవ్వులే గురులై తోఁచు
యిట్టె శ్రీ వేంకటేశుఁ డిన్నిటానునన్ను నేలె
చుట్టుకొంటే సంతోసాలు సులభమై తోఁచును

రేకు: 1795-05 శుద్ధ వసంతం సం: 27-570

పల్లవి: తా నెక్కడ నే నెక్కడ తగిలీఁదాను
వూని నన్ను వేఁడుకొనీ నోయమ్మ తాను

చ. 1: వొద్ద వచ్చి కూచుండి వొంటి నుండఁగా నన్ను
సుద్దులడిగీ నెంత చుట్టమే తాను
చద్దికి వేఁడికి వట్టి సన్న లూరకే సేసీ
వొద్దన్నా మానఁడు గదే వోయమ్మ తాను

చ. 2: పక్కన మోము చూచి పయ్యద జారితేను
చక్కఁ బెట్టీ నెంత యిచ్చకుండే తాను
చిక్కించుక యేకతము చెప్పేనంటాఁ జెవిలోన
వొక్కొక్కమాఁటే యాడీ నోయమ్మతాను

చ. 3: పూఁచి శ్రీ వేంకటేశుఁడు బోదించి బోదించి
రేఁచీ వావు లెంత మేనరికమే తాను
ఆఁచి కాఁగిలించి కూడి అంగడిఁబెట్టీ సిగ్గులు
పూఁచఁడు వాఁచఁడు సూడు వోయమ్మతాను

రేకు: 1795-06 కాంబోది సం: 27-571

పల్లవి: అన్నిటా జాణఁడు తాను, ఆటదాన నింతే నేను
విన్నపములా ఇఁక వెస నెచ్చరించేవి

చ. 1: యిట్టె తా నిన్ను మన్నించి యేలితే నేలెఁగాక నా
వట్టి వినయములా వలపించేవి
చుట్టమై తా వచ్చితేనే సులభమౌఁగాక నా
దిట్టచేఁతలా తన్నుఁ దెమలించేవి

చ. 2: సన్నెరిఁగి తానే నాతో సరస మానుత గాక
కన్నుల మొక్కులా తన్నుగరఁగించేవి
నన్ను నాదరించి తానే నవ్వితే నవ్వేఁగాక నా
చన్నుల మొనలా తన్ను సాదించేవి

చ. 3: గొనకొని తానే నన్నుఁ గూడితేఁ గూడెఁగాక నా
పెనఁగు లాటలా తన్నుఁ బెడరేఁచేవి
యెనసెను శ్రీ వేంకటేశుఁడు తానే నన్ను
చెనకులా తన్ను నేఁడు చిమ్మిరేఁచేవి

రేకు: 1796-01 హిజ్జిజి సం: 27-572

పల్లవి: నావల్ల గడమ యేదే నన్నేల గోరసేసీనే
యేవేళకావేళ ఇంపుసేయనైతినా

చ. 1: సూడిదెగాఁ దా నెవ్వతె సుద్దులు నాతోఁ జెప్పినా
వేడుకతోఁ జెవులొగ్గి విన నైతినా
యేడనుండి వచ్చినాను యెదురుకొని మోమెత్తి
జోడుగూడి తన దిక్కు చూడనైతినా

చ. 2: చిడుముడి వింత వింత సింగారాలతో నుండఁగా
నడుమ నందుకు మెచ్చి నవ్వనైతినా
కడువేఁడి చెమటలు గారఁగాఁ దనమేను
విడువక సురటిని విసర నైతినా

చ. 3: ఇట్టె పరిమళాలు యెవ్వరివి పూసుకొన్నా
గుట్టుతోడఁ గాఁగిలించుకొన నైతినా
నెట్టన శ్రీ వేంకటాద్రినిలయుఁడు నన్నుఁ గూడె
చుట్టరికము లెల్లాను చూపనైతినా

రేకు: 1796-02 లలిత సం: 27-573

పల్లవి: ఇవిఁగొన్నివట్టి ప్రియాలేల సేసీనే
తవిలి నాకాఁగిటను తనివొందుఁగాక

చ. 1: యింత నాపై బత్తి గల్తే నెడమాఁట లేఁటికే
మంతనాన తానే వచ్చి మాఁటాడుఁగాక
వింతలేక మెలఁగితే వెడసన్న లేఁటికే
సంతోసాన నందరిలో చనవిచ్చుఁగాక

చ. 2: మనసు నాపైఁ బారితే మళ్లి మళ్లి చూడనేలే
ననిచి వద్ద గూచుండి నవ్వుఁగాక
తనకే నే బాఁత్రైతే తలపోఁత లేఁటికే
చెనకి నారతులకుఁ జిత్తగించుఁగాక

చ. 3: దేవులఁ గావలసితే దెరమరగేఁటికే
మోవితేనెపొత్తులకు మొనయుఁగాక
శ్రీ వేంకటేశుఁడు చేరి తానే నన్నుఁ గూడె
పూవుల వేయ నేఁటికే పొందివుండుఁ గాక

రేకు: 1796-03 వరాళి సం: 27-574

పల్లవి: కడువెరగయ్యీ నీపె కతకారితనాలకు
బడిబడిఁ జిత్తగించి భావించుకోవయ్యా

చ. 1: వేడుకతో నాపె వినయపుమాఁటలాడీ
యేడ నేరిచెనోకాని యీ వేసాలు
వూడిగా లెల్లాఁ జేసి వొద్దనే కాచుకున్నది
జాడతో యిందుకే యెంత చదివినోకాని

చ. 2: అందుకొని సేవసేసి ఆస నీకుఁ బెడరేఁచీ
యెందుండి తెచ్చుకొనెనో యీనయాలు
పొందుగా నేపొద్దు నీపైఁ బొంచిపొంచి బత్తిసేసీ
చెంది ఇందుకెంత సాముసేసెనోకాని

చ. 3: సన్నలు సేసి నీమోము సారెఁ జూచి నవ్వీని
యెన్నఁడు సాదించెనో యీమాయలు
నన్ను నిట్టె కూడితివి నంటున శ్రీ వేంకటేశ
నున్నఁగాఁ దా యిందుకెంత నోమెనోకాని

రేకు: 1796-04 హిందోళం సం: 27-575

పల్లవి: ఇంతలేసి కోపునా యీపె నీతోను
మంతనాన గుట్టుతోనే మన్నింతువు గాక

చ. 1: కలువపూవుల వేసి కనుసన్న లటుసేసి
తలకొని జవరాలిఁ దమిరేఁచేవు
మొలకనవ్వులు నవ్వి మోవినే యాసలు చూపి
యెలయించి ఆఁటదాని నెంత సేసేవు

చ. 2: పన్నీరు మీఁదఁ జల్లి పక్కనఁ గందువ చెప్పి
కన్న చోటనే యింతిఁ గరఁ గించేవు
చన్ను లూరకే పొగడి సళుపుఁ జూపులఁ జూచి
అన్నిటాను ముద్దరాలి నలయించ నేఁటికి

చ. 3: కప్పురము నోరనిచ్చి కాఁగిటను బిగియించి
చొప్పులెత్తి పువ్వుఁ బోణిఁ జొక్కించేవు
యిప్పుడే శ్రీ వేంకటేశ యీకె నిట్టె యేలితివి
వొప్పుగ నీ యిల్లాలి వొగి బాయ కిఁకను

రేకు: 1796-05 శ్రీరాగం సం: 27-576

పల్లవి: ఇందాఁకా వెదకితివి యిదె నీవిభుఁడు వచ్చె
పొందులకోరికె లింత పోగువోయ నేఁటికే

చ. 1: వెక్కసపు నవ్వులనే వెన్నెలగా ఇంచవే
చెక్కిటిచేతి చింతల చీకు దవ్వక
పక్కన వయోమదానఁ బదను లెక్కించవే
యెక్కువ విరహముల యెండగాయ నేఁటికే

చ. 2: చెలువంపు మాటల చిలుకలఁ బిలువవే
కలఁక నిట్టూర్పు గాలి రేఁచక
కలువ కనుచూపులఁ జలువలు చల్లవే
తలపోఁత వుమ్మదాల దైవార నేఁటికే

చ. 3: వున్నతి నీమోవెత్తి చంద్రోదయము గావించవే
చిన్ని మోవి చుక్కలకై సిగ్గువడక
నిన్నుఁ గూడె శ్రీ వేంకట నిలయుఁ డింతటిలోనె
సన్నిల సంతోసాలు సందడించ నేఁటికే

రేకు: 1796-06 పాడి సం: 27-577

పల్లవి: కాఁపురాలు సేసేది యేకాలమో కాని
ఆఁపరాని తమకము లందుకోనే పట్టెను

చ. 1: వాసులకే పెనఁగీని వంతులకే లాచీని
వేసర దెంతైనాఁ జెలి విభునితోను
ఆసలనే పారలీని ఆయములే కరఁగీని
సేస వెట్టిన మొదలు చెనకనే పట్టెను

చ. 2: యెగ్గెఱఁగక నవ్వీని యిట్టె మోవికి నోరూరీ
అగ్గలికెంతో కాని అంగనకును
వొగ్గి సన్న లెల్లాఁ జేసీ వొయ్యారాలే చూపీని
సిగ్గులు వచారించి చీరగట్టాఁ బట్టెను

చ. 3: మునుపుగాఁగాఁగిలించీ ముచ్చటలే యాడీని
తనివి యంతటనో తరుణికిని
తను నింతలోఁ గూడె తగ శ్రీ వేంకటేశుఁడు
చనవులు చెప్పుకోను సంతోసించాఁ బట్టెను

రేకు: 1797-01 సామంతం సం: 27-578

పల్లవి: మగవానితో నేలే మందెమేళాలు
తగవెరిఁగి యాతఁడే దయఁజూచీఁగాక

చ. 1: ఇచ్చకములే సేసి ఇంపు చల్లవలెఁగాక
కొచ్చి కొచ్చి రమణునిఁ గొసరుదురా
అచ్చముగా సరసములాడి మెప్పించుటగాక
పెచ్చు వెరిఁగి బలిమిఁ బెనఁగుదురా

చ. 2: ననుపులు వచరించి నవ్వు నవ్వవలెఁగాక
చెనకి చెనకి పతిఁ జిమ్మిరేఁతురా
వినయపుఁ జేఁతలనే వెడ్డు వెట్టుదురుగాక
చనవుగలదంటాను సాదింతురా

చ. 3: తలఁపెరిఁగి రతులఁ దనియించవలెఁగాక
అలమి యలమి విభు నలయింతురా
యెలమి శ్రీ వేంకటేశుఁ డీతఁ డిట్టె నిన్నుఁ గూడె
కలికితనాల నింత గరిసింతురా

రేకు: 1797-02 శ్రీరాగం సం: 27-579

పల్లవి: చెలులాల చూడరే చెలియ చక్కఁదనము
తలఁచరా దింతంతని తలఁచుకుండారాదు

చ. 1: పోలుతమా జక్కవల పొలఁతి చన్నులు నేఁడు
పోలుచరా వవి పాయుఁ బొద్దుగుంకితే
మేలిమైన కురులు తుమ్మిదలని యందమా
ఆ లీల ననకు మవి యలుకు సంపెఁగలకు

చ. 2: యీడౌనా యీపెతోడ లేపున ననంట్లతో
యీడు గావు పొరపొచ్చే లెంచితే నవి
జోడుసేతమా మొగము సొరదిఁ జంద్రునికిని
జోడుగాదు దినమొకజోకవాఁ డతఁడు

చ. 3: యెనసేతమా చిగురు యీపె కరపాదాలకు
యెనసేయ కొకవేళ ఇవి ముదురు
పెనతమా యీలేమను ప్రేమ శ్రీ వేంకటేశుతో
పెనచనేల కూడిరి పెంపున నిద్దరును

రేకు: 1797-03 ఆహిరి సం: 27-580

పల్లవి: తమక మాపగరాదు తలఁపు నిలుపఁగరాదు
కొమరెపాయపు వలపు గుబ్బతిలఁ దొడఁగె

చ. 1: పిలుతునా యతని నేఁ బేరుకొని యొకమాఁటు
సొలతునా కొనగోరు సోఁకనొక్కి
తెలుతునా తనమనసు తేరకొన మాటాడి
యెలమి నాకోరికలు యీడేరు టెపుడే

చ. 2: వత్తునా నీవెంట వరుస నాతనిఁ జూడ
తెత్తునా ఇంటికిని తెలిపి చెప్పి
ఇత్తునా వీడెంబు యెదురుకొని చేతికిని
హత్తి యేమనునొకో యతఁడు నా యెడకు

చ. 3: వంతునా తనమీఁద వడిగొన్న మోహంబు
నింతునా రతిఁగూడి నేర్పులెల్లా
యింతలో శ్రీ వేంకటేశుఁ డిదె నను నేలె
సంతసపుఁ గోరికలు జంటలయి పెరిగె

రేకు: 1797-04 ముఖారి సం: 27-581

పల్లవి: తెలుసుకోవే నాబుద్ది తేట తెల్లమిగాను
ఇల నోరుపు గలితే నిన్నిటికి మంచిది

చ. 1: వెంగెము దొలుత నాడి వెనక వేఁడికోవద్దు
ముంగిటనుండే పతికి మొక్కుట మేలు
కంగు వెట్టుకొని పాసి కాఁకలఁ బొరలవద్దు
అంగజకేలి మరిగి యాసపడేదానికి

చ. 2: పూరకే వొట్టు వెట్టుక వుండలే కలయవద్దు
సారెకు గుట్టుతోనుండే శాంతమే మేలు
బీరముతోడఁ బెనఁగి ప్రియము చెప్పఁగవద్దు
మేరతో మగనిమీఁద మేలుగల దానికి

చ. 3: యెఱఁగక సిగ్గువడి యెదురు చూడఁగవద్దు
మఱఁగులేక తగిలేమచ్చికే మేలు
గుఱిగా నిన్ను నిప్పుడే కూడె శ్రీ వేంకటేశుఁడు
నెఱయ నీతఁడు దక్కు నీవంటి దానికి

రేకు: 1797-05 పాడి సం: 27-582

పల్లవి: ఏఁటికి వేగిరించేరే యింతులాల
దాఁటపుదొర యాతఁడే కరుణించీఁ గాక

చ. 1: మనసెఱఁగక తొల్లే మాటలె ట్టాడఁగవచ్చు
ననిచినఁగాక యెట్టు నవ్వవచ్చును
మునుకు వెనకెంచక ముచ్చట లెట్టాడవచ్చు
ఘనుఁ డాతని తలఁపు గనుకొందమే

చ. 2: సరసమాడక తొల్లె చవులెట్టు గొనవచ్చు
పిరిగొన సోఁకకెట్టు పెనఁగవచ్చు
తెరదియ్య కెటువలె తేరకొనఁ జూడవచ్చు
గరిమె నాతనిబుద్ధి గనుకొందమే

చ. 3: చేరువకు రాకతొల్లె సేస లెట్టు వెట్టవచ్చు
కూరిమెఱఁగక యెట్టు గొసరవచ్చు
యీరీతి శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
గారవిం చాతనిమేలు గనుకొందమే

రేకు: 1797-06 సౌరాష్ట్రం సం: 27-583

పల్లవి: సతికిఁ బంతము చూపఁ జనదు రమణుని తోడ
మితిమీర వినయమున మెలఁగంగవలెను

చ. 1: వలచి పైకొనిన నవ్వలి పరాకై యున్న
చెలఁగి పతి కిచ్చికము సేయవలెను
పలికినను వెస మరచి పలుక కుండిన నతని
కొలువుసేయుచు రతులఁ గొసరంగవలెను

చ. 2: కనుఁ గొనిన రాజసంబునఁ గనుఁగొనకయున్న
ననుపు చల్లుచు నతనిఁ జెనకంగ వలెను
పెనఁగినను గుట్టుతో బెనఁగ కూరకయున్న
చనవుసేసుక మోవి చవి చూపవలెను

చ. 3: సొరిది నవ్విన మనసు చూడ నటు నవ్వకున్న
నిరతమగుపొందు లటు నెరపంగ వలెను
అరిది శ్రీ వేంకటేశుఁ డాతఁడే నినుఁ గూడె
సరికి బేసికి నిటుల జట్టిగొన వలెను

రేకు: 1798-01 రామక్రియ సం: 27-584

పల్లవి: పొందుసేసి రతులు పండి పొల్లవోవనిత్తురటవే
సందడించెఁ దమక మతనిఁ జక్కఁజూడవే

చ. 1: కోటికొండలైన మనసుకోరికలకు గొలఁది లేదు
వాఁటమైన జవ్వనంపు వయసువారికి
వూటలగుచు మోహరసము లూరనూర నేరులవును
యేఁటి కింతసిగ్గు పతితో మాఁటలాడవే

చ. 2: అనలుఁ గొనలు సాగినట్టి యాసలు గడించ రావు
తనివిలేని చుట్టరికపు తగులువారికి
తనువు మీఁది చక్కఁదనము దట్టమగుచు మోపులవును
ననిచె నీకు సిగ్గువడక నవ్వు నవ్వవే

చ. 3: యెదురు దొట్టి వేడ్కలెల్ల యీఁతలాయ దాఁటరావు
వదరాని కాఁగిళ్ల వలపువారికి
యిదివో శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
ముదురుసిగ్గు లింకనేల మోవి చవులు చూపవే

రేకు: 1798-02 ఆహిరి సం: 27-585

పల్లవి: సదరమా ధైర్యంబు సతులకునుఁ బతులకును
చెదర కిటువలెఁ బొందు సేయవలెఁగాక

చ. 1: గుదిగొన్న తమకములు కూటములకునుఁ దగులు
పొదలు నేస్తములు వలపులకుఁ దగులు
సదమదపుఁ గోరికలు సరసంబులకుఁ దగులు
యెదురుచూపులు తెగనియింపులకుఁ దగులు

చ. 2: మునుకొన్న తలపోఁత మోవిచవులకుఁ దగులు
ననుపు లేపొద్దు మరి నవ్వులకుఁ దగులు
పెనగొన్న యడియాస ప్రియములకుఁ బెనుఁదగులు
చెనకుఁ జేఁతలు మదన చిహ్నలకుఁ దగులు

చ. 3: పొదిమాఁటలు మిగుల భోగంబులకుఁ దగులు
ఆదరింపులు సతములగుటకునుఁ దగులు
యీదెసల శ్రీ వేంకటేశుఁ డింతులఁ గూడె
పాదుకొను మొక్కులే పనులకునుఁ దగులు

రేకు: 1798-03 పాడి సం: 27-586

పల్లవి: సుదతినేర్పు లెవ్వరికినిఁ జూపిచెప్ప వసముగాదు
అదరిపాటు నీకు నాపె కందుకోళ్లాయను

చ. 1: విరులు నిండఁ గొప్పువెట్టి వెలఁది నిన్ను నిక్కిచూచి
సురటి చాటువెట్టుకొనుచు చొక్కి వలపు దాఁచెను
వరుసఁ జెమటఁ దొప్పఁదోఁగివలిపెపయ్యెదంటుకొనఁగ
శిరసువంచి వెనకమరలి సిగ్గుదేర నవ్వేను

చ. 2: అతివ వీణె మీఁటి నీవు యచట నాలకించు టెఱిఁగి
సతుల మాఁటుసేసి యొదిగి చదురుఁదనము దాఁచెను
మతిగరఁగి యంతలోనె మదనకళలు వుప్పతిలఁగ
రతులయాస చిలుకఁజూచి రమణ సన్నసేసెను

చ. 3: వనిత పరిమళములు వూసి వాసనలు నీమీఁదఁబొదువ
పెనఁగలేక గుట్టుతోనె బిగువులెల్ల దాఁచెను
యెనసితివి శ్రీ వేంకటేశుఁడ యీకె నిన్ని చందములను
చెనకుచును నినుఁ బలుదెఱంగుల చిత్తమలరఁజేసెను

రేకు: 1798-04 హిజ్జిజి సం: 27-587

పల్లవి: చూడఁ బిన్నవుగాని నీ జూటుఁజేఁత లెంచరావు
యీడు మిగిలినట్టి పగటు లెందు నేర్చుకొంటివే

చ. 1: చొక్కపుమోవిఁ దేనెలొలక సుద్దులు చెప్పుచునాయకునకును
చక్కనిమోము చూపి యతని చనవు చేకొంటివే
జక్కవచన్నులు దాఁకఁగదీసి చల్లుఁజూపుల మనసు గరఁచి
యెక్కడలేని కలికితనము లెందు నేర్చుకొంటివే

చ. 2: నవ్వులు చెక్కుల నారుకొనఁగ నయముఁ బ్రియముదైలువార
పువ్వుల వేసి యతని నెట్టు పొందుసేసుకొంటివే
దువ్వటంపు చెఱఁగు మొరయ తోడు దోడ సురటి విసరి
ఇవ్వల నతని మరపుకొనఁగ నెందు నేర్చుకొంటివే

చ. 3: సిగ్గుల చేఁతలు బయలు పడఁగ సేవలు సేసిచవులురేఁచి
వెగ్గళమైనయతని మన్నన వెలయఁ జేసుకొంటివే
నిగ్గుల శ్రీ వేంకటేశుఁడు నేఁడు నన్నుఁ గాఁగిటఁగూడె
యెగ్గులులేని రతులు నీవు నెందు నేర్చుకొంటివే

రేకు: 1799-01 నాదరామక్రియ సం: 27-588

పల్లవి: పతికి విన్నవించఁగదరే పడఁతులాల
యీకె తెలుఁగు కతలు చెప్పనేల యతఁడే కరుణఁజూచుఁగాక

చ. 1: చిమ్మిరేఁగి చెలియమేనఁ జెలప చెలప చెమట లూరె
వుమ్మగిలుచు మోహజలధి వుబ్బెనోకాక
ముమ్మరముగఁ గొప్పుగాను ముడిచినట్టి నెరులు చెదరె
అమ్మరో సంపెంగనాసిక కలులు బెదరెనోకాక

చ. 2: కారుకమ్మి మిగులఁ గలికి కన్నులందుఁ గెంపు దేరె
తోరమగుమదరాగరసములు తొట్టెనో కాక
నారుకొనుచు బులకగములు నవకముగను నిండుకొనియె
కోరికలు జవ్వనపుఁ బదనున కొనలుసాగెనో కాక

చ. 3: వెక్కసంపు టూర్పు లెపుడు విసరఁదొడఁగె లోలోనె
తక్కకీ తమకములు రతి కెడతాఁకుచున్నవోకాక
యిక్కడికిఁ దా వచ్చి మగువలు యేలెశ్రీ వేంకటగిరీశుఁడు
చక్కఁగా నిపు డీకె నోములు సఫలమాయనోకాక

రేకు: 1799-02 పాడి సం: 27-589

పల్లవి: ఎఱఁగ మింత వెకలివవుత ఇంతగాలము న్నుఁబెంచితి
గుఱుతు లెన్నఁడుఁ గాన మిపుడు కొత్తలాయనే

చ. 1: ముక్కుచెరమల నిట్టూర్పులు ముంచి చన్నులమీఁదఁబొలయఁగ
చెక్కిటి చెమటలు గోరికొనలనుఁ జిమ్ముకొంటాను
చిక్కులుదేరిన నెరుల పాపట చేత నొయ్యనే వొయ్యనదువ్వుచు
యెక్కడనుండి వచ్చేవే చెలియ యెంతబిన్నాణివే

చ. 2: వీడియు వీడని తురుములోని విరులు మెల్లనెరాలఁగాను
చోడుముట్టుచు వీనుల జవ్వాది సొరిది జారఁగా
వాడిన చిగురుమోవిమీఁది వన్నెలు చేత నదుముకొనుచు
యేడనుండి వచ్చేవే చెలియ యెంత వొయ్యారివే

చ. 3: మేలిమి పులక జాజినసలు మేనునిండ జాజుకొనఁగ
వాలుఁగన్నులకెంపుడాలు వలపు దెలుపఁగా
యీలీలఁ జనవులొసఁగి శ్రీ వేంకటేశుఁడు నినుఁగూడఁబోలు
యేల ఇంక బొంకులునెరప నెంతబిత్తరివే

రేకు: 1799-03 శంకరాభరణం సం: 27-590

పల్లవి: జవ్వనంబు రూపురేఖ చాలఁ గలిగినట్టి ప(ఫ)లము
పువ్వువంటి యాసతోడి పొందు కామధేనువే

చ. 1: మనసుమర్మమెరిఁగితేను మాటలెల్ల సమ్మతవును
చనవు గలుగఁజేసుకొనిన సలిగెఁగలుగును
పెనఁగ నేర్పు గలిగితేను ప్రియము లంతకంత కడరు
వనితలకును మగనిమీఁది వలపు కామధేనువే

చ. 2: తగ వెరింగి మెలఁగితేను తలఁపులెల్లఁ జక్కనౌను
నగుమొగంబు సేసుకొన్న నాఁటుఁ బ్రియములు
మిగులననుపు సేసుకొనిన మేలమాడఁ జవులు వుట్టు
చిగురు గలిగి కొనలు సాగు చెలిమి కామధేనువే

చ. 3: ఇచ్చకములు నెరప నెరప నిన్నిటాను మేలుగలుగు
కచ్చుపెట్టి కాచుకున్నఁ గలుగు వేడ్కలు
యెచ్చరించి శ్రీ వేంకటేశుఁ డిపుడె నిన్నుఁ గూడె
మెచ్చుఁజేసి కలయురతులమేలు కామధేనువే

రేకు: 1799-04 ముఖారి సం: 27-591

పల్లవి: ఈవిలాసంబులును యీా చక్కఁదనములును
భావించి చూడ నీపడఁతికే తగును

చ. 1: నలినాక్షి చెక్కులివి నవ్వు వెన్నెల పాలము
విలుసాముగరిడి బొమ్మలకు నొసలు
పలుకుఁజిలుకకు మోవి పంజరపు దండెంబు
నలిఁగుంతలములకాణాచి పెనుఁగొప్పు

చ. 2: గురు కుచము లివియే సిగ్గులకుఁ బుట్టిన ఇండ్లు
సరసముల కిరవు హస్తముల కదలు
సురత విభవముల దాఁపురమున నెయ్యపు బిరుఁదు
కరులయానముల నిలుకడ వనము తొడలు

చ. 3: అన్నువగు నడుము గుట్టనెడి సింహపు నెలవు
తిన్నని మొగము కళలు దేరు తెంకి
మన్నించి యేలితివి మరిగి శ్రీ వేంకటేశ
ఇన్ని సింగారముల లెనసె నీలలన

రేకు: 1799-05 ఆహిరి సం: 27-592

పల్లవి: విన్నవించరే పతికి వెలఁదులాల
సన్నలనే ఆసలెల్లా జాజుకొనెఁ గదరే

చ. 1: తలపోసి తలపోసి తమకము దైలువారె
మొలకలై పులకలు మోసులెత్తెను
పిలువఁగాఁ బిలువఁగా ప్రియములు చిమ్మిరేఁగె
కలికి భావము చెప్ప గతలాయఁగదరే

చ. 2: యెదురులు చూడఁ జూడ యెదురెక్కెఁ గోరికలు
ముదిరి నివ్వెరగులు ముప్పిరిగొని
వెదకఁగా వెదకఁగా వేడుకలు దొట్టుకొనె
సుదతి చందము లింత సూటికెక్కెఁగదరే

చ. 3: నవ్వి నవ్వి నట్లానే నాఁటుకొనె మమతలు
వువ్వ్వాళ్లూరి చెమటలు వూటలెత్తెను
ఇవ్వల శ్రీ వేంకటేశుఁ డింతలోనె కూడఁగాను
జవ్వని సంతోసాలు సతమాయఁగదరే

రేకు: 1800-01 ఆహిరి సం: 27-593

పల్లవి: ఏల తన్ను దూరేను ఇక్కడికి రమ్మనవే
తాలిమి గలిగితేను దయవుట్టుఁ గాక

చ. 1: ఇచ్చకము లాడితేను ఇందు రమ్మందును గాక
కొచ్చి వెంగేలాడితేను కూడునా పొందు
వచ్చినట్టే వచ్చితేను వలపు చవౌఁగాక
యెచ్చుకుంద్దై పెనఁగితే నెరవులే కావా

చ. 2: వినయముతో మొక్కితే వేడుకలు వుట్టుఁగాక
వొనరనియడియాస లొద్దిక లౌనా
ననపుతో నవ్వితేను నాఁటుఁగాక ప్రియములు
మనసురాని పనులు మరి ఇంపులౌనా

చ. 3: బత్తిసేసి పిలిచితే భావము గరఁగుఁగాక
వొత్తు కోళ్లనరతు లొడఁబడీనా
ఇత్తల శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్నుఁ దానె
హత్తి ఇంత లేకుండితే నాటపాట వలపు

రేకు: 1800-02 ముఖారి సం: 27-594

పల్లవి: ఎంతసేసెఁ జూడరే ఇంతి జవ్వనపాయము
అంతలోనె వేడుకలూ నట్టె యొన గూడెను

చ. 1: తెగనియాసోదము తీగెలు సాగిసాగి
సొగసి వలపులై చుట్టుకొనెను
తగులు విరులైనట్టి తమకము లుప్పతిలి
మొగము చూడఁగానే ముంచుకొనెఁ బ్రేమము

చ. 2: పులివచ్చి తలపోఁత లుమ్మగిలి వుమ్మగిలి
చెలికిఁ జుట్టరికమై చిగిరించెను
చలిమి బలిమితోడి సరసము లుక్కుమీరి
నిలువుకు నిలువే నిండె నివ్వెరగులు

చ. 3: చేవ మీరిన సిగ్గులు చిమ్మిరేఁగి చిమ్మిరేఁగి
వేవేలు మంతనములై వెల్లివిరిసె
శ్రీ వేంకటేశ్వరుని చిత్తజకేలి రతులు
యీవేళ నలమేల్మంగ కిరవాయఁ గళలు

రేకు: 1800-03 కాంబోది సం: 27-595

పల్లవి: ఏమి సేసితివో చెలి ఇంత నీకు మోహించె
చూమరసేయక ఇంతిఁ జూతువు రావయ్యా

చ. 1: వనిత చెక్కిటిచేత వలపులు దొంతివెట్టె
వొనరఁగ నాసలకు వొడిగట్టెను
తనివోని మంతనాల తమకము వెదవెట్టె
జునుగక రమణినిఁ జూతువు రావయ్యా

చ. 2: పక్కనఁ దలపోఁతల బయలువందిలి వెట్టె
చిక్కని చిరుసిగ్గునఁ జీరగట్టె
వొక్కలపుఁ గోరికల ముసుఁగు నిండాఁ బెట్టె
చొక్కముగ జవరాలిఁ జూతువు రావయ్యా

చ. 3: వసివాఁడుమోవి దేనె వైపుగానే వడివెట్టె
కొసరుచు గుట్టుననే గోడవెట్టె
యెసగ శ్రీ వేంకటేశ యేలితి వలమేల్మంగను
సుసరానఁ జెలినేర్పు చూతువురావయ్యా

రేకు: 1800-04 మధ్యమావతి సం: 27-596

పల్లవి: పెచ్చువెరిగీ నింతిప్రియములు లోలోనె
యిచ్చక మేమాడుదమే నెచ్చెలులాల

చ. 1: తమకము లుప్పతిల్లి దైలువారఁదొడఁగి
చెమరించె మేనెల్లా చెలియకును
కొమరెపాయ మందుపై కుప్పులు దెప్పలు నాయ
ఇముడక, వుపచారా లేమిసేతమే

చ. 2: తలపోఁత లుక్కుమీరి తడఁ బడఁగఁ దొడఁగి
పులకించెఁ జెక్కు లిట్టె పొలఁతికిని
పెలుచువలపు పెండ్లి పేరటముగా విడిసె
కలికి భావము చెప్ప గతలాయెనే

చ. 3: సరసము లెడచొచ్చి చవులు రేఁచఁ దొడఁగి
కరఁగించె నెమ్మనము కలికికిని
యిరవై శ్రీ వేంకటేశుఁ డింతలో నీసతిఁగూడె
యెరవులేనీతనితో నేమందమే

రేకు: 1800-05 ముఖారి సం: 27-597

పల్లవి: కడుమేటి జవరాలు కలికిచేఁతల కీలు
పిడికిటితలఁబాలు పెట్టీ నీకెఁ జూడరే

చ. 1: కన్నుల చూపులతేట కమ్మఁజెమటలవూట
పిన్నమొగముపై గొప్పు పెట్టినికోట
యెన్నఁగఁ గంఠనాదము ఇమ్ముల కోవిలపాట
యెన్నిటికి గురియాయ నింతిఁ జూడరే

చ. 2: జక్కవచన్నుల వొప్పు చక్కఁదనముల చొప్పు
పక్కన జారిననునుఁ బయ్యద కప్పు
అక్కజపునె న్నడుము అరిది సింగమునెప్పు
యిక్కువైన సింగారాల యీకెఁ జూడరే

చ. 3: సెలవి నవ్వుల నిగ్గు చిప్పిలు రతులసిగ్గు
కెలఁకుల మోవిమీఁదికెంపులకగ్గు
యెలమి శ్రీ వేంకటేశుఁ డిప్పుడిట్టె యీకెఁ గూడె
వెలలేని వేడుకల వెలఁదిఁ జూడరే

రేకు: 1800-06 భైరవి సం: 27-598

పల్లవి: ఈ సొబగు లెచటఁగల వీపె యందే కాక
వాసివంతుల నీకెను వర్ణింప వసమా

చ. 1: అతివ పద్మినిగనక యలికుంతలి యనదగు
సితచంద్రముఖిగాన జిగిఁ జకోరాక్షి యగు
తతిఁ బువ్వుఁబోడిఁగన తగులుఁ బికవాణి యన
చతురబిసహస్తగన శంఖగళ యగును

చ. 2: హరిమధ్యగన చెలియ ద్రికుచ యనదగును
గరిమ నాభి సరసిగన వళితరంగ యగు
పురుచక్రజఘనగన యూరుయుగ యనదగును
గురుహంసయానగన కూర్మపద యగును

చ. 3: కలిత కనకాంగిగన కాంతమణినఖ యగును
జలధి గంభీరగన సరసామృతాదర యగు
యెలమి శ్రీ వేంకటేశుఁ డెనసెఁగన సిరియగును
కలిత శృంగారగన కల్యాణి యగును

రేకు: 1801-1 శంకరాభరణం సం: 28-001

పల్లవి: పట్టరానిది వయసు పడఁతి నేమనవచ్చు
చుట్టమగుపతిఁ దెచ్చి చూపరే సతికి

చ. 1: దుమ్ములెగయఁగ వలపు దూరుపెత్తీఁ జెలియ
నుమ్మగిలుచున్న నిట్టూరుపులను
చిమ్మిరేఁగుచునున్న సిగ్గులు నానఁగఁ బెట్టె
చెమ్మఁ జెమటల నేమి సేతమే ఇఁకను

చ. 2: పుడివోనితమకముల నుమురఁబెట్టీఁ జెలియ
పొడవు దమకముల తలపోఁతలోన
యెడనెడల జిరునవ్వు లెండఁబోసీ నదివో
కడలేని విరహపుఁగాఁకలనుఁ జెలఁగి

చ. 3: గుదిగొన్న కోరికలఁ గూడపెట్టీఁ జెలియ
తుద నెదురుచూపుల కన్నుదోయి యందు
అదనెరింగి శ్రీవేంకటాధిపుఁడు గూడఁగా
సదమదపుకాఁగిటను సమరతులఁ బెనఁగె

రేకు: 1801-2 సామంతం సం: 28-002

పల్లవి: మే మెఱఁగమా యేమి మీ సుద్దు లిన్నియును
ప్రేమములు దమకములు పెనగొనీ మీకు

చ. 1: పలుకవే పతితోడ పగడవాతెరనోర
కులుకవే మచ్చికలు కొసరి కొసరి
చిలుకవే మోహములు సెలవినవ్వులతేట
నెలకొన్న వేడుకలు నీయందె కలవు

చ. 2: చూడవే నిడువాలుసోగచూపుల నితని
ఆడవే సరసంబు లంటివుట్టి
కూడవే కాఁగిటను గుబ్బచనుఁగవనొత్తి
వాడికెలు మిగుల నీవలననే కలవు

చ. 3: కలయవే పాన్పుపై కళలు మోమునఁ బొదల
వెలయవే రతిరాచవిభవములను
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁ డిపుడె నిను నేలె
కలికి చందములు నీకతననే కలవు

రేకు: 1801-3 గౌళ సం: 28-003

పల్లవి: పతిముందర నెంతేసి పగటులు చూపీనే
కతకారి చేఁతలనే కడుఁబరగినది

చ. 1: మాటలఁ దేనెలు గారీ మగువ నేరుపులను
తేటల వెన్నెలగాసీ తెలిఁగన్నుల
కోటిసేయఁ గొప్పువెట్టి కొనలు వేళ్ళఁ దురిమె
యాటులేదు దీనియెమ్మె లేమని చెప్పుదమే

చ. 2: నవ్వుల ముత్యాలు రాలీ నలినాక్షి చేఁతలను
జవ్వనపుఁబోడి చిందీ చన్నుఁగవను
పువ్వువంటి చీర గట్టి పొందుగా సొమ్ములు వెట్టె
ఇవ్వల నీకె సింగారా లేమని చెప్పుదమే

చ. 3: సన్నల మచ్చికలూరీ సతిసేయు నేస్తముల
వన్నెల కళలు దేరీ వదనమున
యిన్నిటాను తొల్లె నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
యెన్నరా దీవెయాసోదా లేమని చెప్పుదమే

రేకు: 1801-4 శంకరాభరణం సం: 28-004

పల్లవి: విన్నవించనెట్టు వచ్చు వెలఁదియున్నచంద మిదివో
కన్నులార నీవె చూచి గతులు దెలుసుకోవయా

చ. 1: తరుణి నిన్నుఁ దలఁచి తలఁచి తమకమూఁప నలవిగాక
శిరసు వంచి చింతలందు చిగురుగోయఁ దొడఁగెను
పురిగొనంగ నిన్నుఁబాసి పొద్దుగడపలేక కెరలి
సరుగ గాలిమంటపమున సాముశాయఁదొడఁగెను

చ. 2: వలపు నిలుపలేక కోరికలను తాడు వేఁడిపేఁడి
ఆలరి వేగుదాఁక ముత్తియములు గుచ్చఁ దొడఁగెను
కలయుదాఁక నోర్వలేక కడుఁబరాకు సేసుకొనుచు
నెలఁత తమ్మికొలఁకులకును నీరు నించఁదొడఁగెను

చ. 3: దప్పిదేర నీగుణాలు దడవి విరహ మార్చుకొనఁగ
కప్పురఁపుఁ బలుకులెల్ల గాదెఁ బోయఁ దొడఁగెను
యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
చెప్పరాని ననలఁ బూజసేయ నిన్నుఁ దొడఁగెను

రేకు: 1801-5 రామక్రియ సం: 28-005

పల్లవి: మగువలకుఁ బతులకును తొల్లె మరుఁడువ్రాసినవ్రాఁత లివి యా –
తగులుగలిగినవారికే భువిఁ దారుకా ణవుఁగాక

చ. 1: మచ్చికలుసతమైనవారికి మఱవు లేడవి యెంచిచూడఁగ
విచ్చనవిళ్ళుయినవారికి వెఱపు లేలుండు
యిచ్చకములలవడినవారికి యెగ్గుసిగ్గులు వెదకనేఁటికి
చెచ్చెరను సేసినవెచేఁతలు చెల్లుబళ్ళవుఁగాక

చ. 2: మనసులేకములయినవారికి మరియు సంశయమేల కలుగును
వినయములు నేరిచినవారికి వెగటులే లేవు
చనవులనె పెనఁగేటివారికి సరసవేళలఁ గొంకవలవదు
ఆనుఁగుఁ బ్రియముల నాడినవియే ఆట లవుఁగాక

చ. 3: పొందులకు లోనయినవారికి పొలయలుక లవి యేల చెందును
యెందు గపటములేని వారికి నీసులే రావు
కందువల శ్రీవేంకటశునింగలసి పాయకవున్న వారికి
యిందరికి రతిఁ బలుకుఁ బంతము లేకమవుఁగాక

రేకు: 1802-1 దేసాళం సం: 28-006

పల్లవి: కొమ్మచే నేమి సేయించుకొంటివయ్య
కమ్మటిఁ దామొక్కినట్టి కారణ మేమయ్యా

చ. 1: వెలఁది విన్నపములు వేమారుఁ జేసీ నీకు
సొలపుఁ జూపుల నిన్నుఁ జూచి చూచి
చెలరేఁగి యప్పటి నీచెక్కు నొక్కి వేఁడుకొనె
యెలమి మీ ముసగమ లేఁటివయ్యా

చ. 2: వింతగా నిన్ను నవ్వించి వేడుక లెల్లాఁ బుట్టించె
చెంతనుండి కొనగోరఁ జిమ్మి చిమ్మి
పంతపుగుబ్బల నొత్తి బలిమిఁ గాఁగిట నించె
అంతలేసి నీపను లవి యేఁటివయ్యా

చ. 3: కప్పురపులప్ప నీకుఁ గానుకగాఁ జేతికిచ్చె
చొప్పుగాఁ బ్రియాలు మోవిఁ జాసి చూపి
ఇప్పుడె శ్రీవేంకటేశ యిటు నన్నుణగూడితివి
అప్పటి నీసుద్దుల నెయ్యము లేఁటివయ్యా

రేకు: 1802-2 ఆహిరి సం: 28-007

పల్లవి: ఎదుట నున్నాఁ డితఁడు యేల సిగ్గులు వడేవే
అదనాయ సంతోసము లడఁచఁగ నేఁటికే

చ. 1: మనసు దెలుసుకొంటే మాటలాడఁగవలె
ననుపు గలిగితేను నగవలెను
పెనఁగనేరిచితేను పిలిచి పైకొనవలె
చనవు గలిగితేను సాదించవలెను

చ. 2: తగులాయ మైతేను తమకము చూపవలె
మొగమోట లబ్బితేను మొక్కవలెను
చిగిరించే యాసలకు చెప్పినట్టు సేయవలె
తగ వావులొనరితే దక్కి వుండవలెను

చ. 3: వేడుకలు వుట్టితేను విడెము లందుకోవలె
యీడైన వయసులైతే నెనయవలె
కూడె నిన్ను నిప్పుడే చేకొని శ్రీవేంకటేశుఁడు
వాడిక లిట్టే కలితే వలవఁగవలెను

రేకు: 1802-3 రామక్రియ సం: 28-008

పల్లవి: విన్నవించితిమి నీకు వెలఁదిభావములెల్లా
మన్నించు నింతట నీకె మరిగె నీరీతిని

చ. 1: అతివ ముంగిలెల్లాను అడుగిడుగాఁ దొక్కె
తతి నీ కదురువచ్చే తమకానను
కతలుగా మోమెల్లాఁ గన్నులు చేసుక చూచె
రతి నీ వింటికివచ్చే రాకలకును

చ. 2: జలజాక్షి పురమెల్లాఁ జన్నులుగానే పెంచె
చెలఁగి నిన్నుఁ గాఁగిలించే యాసల
పొలమెల్లానుఁ జిలుకపలుకులే వెదవెట్టె
నెలవుకు నిన్నుఁ బిలిచే నేరుపులను

చ. 3: కొమ్మ దననిలువెల్లాఁ గొప్పుగానే నిక్కిచ్చె
నెమ్మి సేసవెట్టించుకొనే వేడుకలు
యిమ్ముల శ్రీవేంకటేశ యంతలో వచ్చి కూడితి
వెమ్మెల నీకె వెలసె నిందుకే యిన్నిటాను

రేకు: 1802-4 భైరవి సం: 28-009
పల్లవి: సేయఁగల విన్నపాలు సేసితి మిదివో నీకు
నీయంతనే ఇంతిఁగరుణించవయ్య ఇపుడు
చ. 1: నివ్వటిల్ల నేపొద్దు నీకే యెదురుచూచి
జవ్వని యింతేసి ఇఁక జాలిఁబెట్టకు
పువ్వువలెఁ బానుపుపైఁ బొరలీని విరహాన
రవ్వసేయక చూతువురావయ్య లోనికి
చ. 2: తలఁచితలఁచి నీకే తమకించీ రతులకు
వలచినముద్దరాలి వడి నేఁచకు
అలసి కాఁకలచేత నసురుసురై వున్నది
నెలకొని ఇంతట మన్నించవయ్య యాకెను
చ. 3: కందువల నీకే కంకణము గట్టుకున్నది
యిందుముఖి కడుగోల యెలఇంచకు
చెందితి వీకె నింతలె శ్రీవేంకటేశుఁడ వచ్చి
యెందు నిట్టె కలకాల మేలవయ్య చెలఁగి

రేకు: 1802-5 ముఖారి సం: 28-010

పల్లవి: ఎట్టోరుచుకున్నాఁడవో యాపె సే సే చేఁతలకు
అట్టె నేము చూచి చూచి ఆఁపలేము నవ్వులు

చ. 1: నెత్తము పందెముతోడ నేను నీవు నాడఁగాను
యెత్తుచెప్పీ నీకు నాపె యెవ్వతోకాని
హత్తుక వద్దఁగూచుండి ఆటచూచేపరాకున
గుత్తపుగుబ్బల నొత్తీ కుమ్మెలుగా నీమేను

చ. 2: నేను నీవు నెదురు కిన్నెరలు వాఇంచుకోఁగా
తానాలు నీకు నేరిపీఁ దానెవ్వతో
వీనుల నీవాద్యాలు వినేటివేడుకలను
మేను బిగ్గెఁ గాఁగిలించి మెచ్చీ పిరివీకుగా

చ. 3: కందువ నిద్దరమును కతలు చెప్పుకోఁగాను
సందడి నూఁకొనీఁ దా నీసతి యెవ్వతో
చెంది నన్ను నేలితివి శ్రీవేంకేశుఁడ
అందె యెచ్చరికకు గోరంటించీ నీమెనను

రేకు: 1802-6 పాడి సం: 28-011

పల్లవి: ఆతని యిచ్చలోదాన నన్నిటా నేను
కాతరించవద్దు నన్నుఁ గరుణించీఁ దానే

చ. 1: చేరి యాతనికుణాలే చెలులాల పొగడరే
దూరకురే సారె సారె తొయ్యలులాల
కోరి కోరి వినయాన గుట్టుతోడ వేఁడుకొనరే
బీరానఁ కొంగువట్టి పెనఁగకురే

చ. 2: ఆసలఁ గాచుకుండరే యవసరమైనదాఁకా
వేసటలు చూపకురే వేలఁదూలాల
రాసికెక్కి వినయాన రమ్మని పిలువరే
గాసిఁబెట్టి గొబ్బునఁ గక్కసించకురే

చ. 3: కలపుకో లెటిఁగించి కాలుకలే యాయరే
చలపట్టకురే మీరు సతులాల
చెలఁగి తానే వచ్చి శ్రీవేంకేశుఁడే కూడె
బలిమి నింకా నతని పై పైఁ గొసరకురే

రేకు: 1803-1 ముఖారి సం: 28-012

పల్లవి: నీవెఱఁగవా తగవు నేము చెప్పే దేమున్నది
కైవశమైతివి నీవే కాదా యితనికి

చ. 1: చేరి చేరి యతఁడు నీచెఱఁగు వట్టెనంటాను
సారెకు బొమ్మల నెంత జంకించేవే
యారీతి నీ వెదుటికి నెలఇంచవచ్చితేను
నేరుపుతోఁ జెనకితే నేరమా ఇతనికి

చ. 2: వచ్చి వచ్చి యతఁడు నీవద్దఁ గూచుండెనంటాను
కొచ్చిచూ చతనినేల గుంపించేవే
ఇచ్చుట నీ చుట్టరిక మిటు నీవు నెరపఁగా
తచ్చి నీతోఁ బొందు సేయఁదగదా ఇతనికి

చ. 3: నొక్కి నొక్కి నీ చెక్కులు నునుగోర నూఁదెనంటా
వెక్కసముగా నేమి వెంగేలాడేవే
యిక్కడ శ్రీవేంకటేశునెదపై నీవుండఁగాను
చిక్కించుక రతిఁగూడఁ జెల్లదా యితనికి

రేకు: 1803-2 మాళవిగౌళ సం: 28-013

పల్లవి: ఎంతవేగిరకాఁడవు యేమయ్యా
కాంతుఁడవు ఆఁటదానిఁ గాకుసేయఁదగునా

చ. 1: చనవుగలదుగాన సరసములాడెఁ జెలి
పెనఁగి కుచము లింత పిసుకుదురా
ననిచి వావి చెప్పుఁగా నవ్వులు నీతో నవ్వె
చెనకి ఇంతేసి నీవు సిగ్గుపడఁ జేతురా

చ. 2: నీవు మన్నింతువుగాన నిమ్మపంట వేసె నింతి
మోవి గంటిసేసి పంతములాడుదురా
దేవులుగనక నిన్నుఁ దిలకించి కాలుదొక్కె
సోవలుగ మానము పై సోఁకఁగఁ దిట్టుదురా

చ. 3: చుట్టమ వుగాన నిన్ను సొలసి సలిగె చూపె
ఆట్టె రతిఁ గూడికూడి అలఇంతురా
నెట్టన శ్రీవేంకటేశ నీకుఁ దననేర్పు చెప్పె
బట్టబయలుగా దిట్టె పచ్చిగా నాడుదురా

రేకు: 1803-3 సాళంగం సం: 28-014

పల్లవి: చెప్పరాని సుద్దు లివి చెలులాల మా పొందులు
తప్పక సూచించరే తలఁపయ్యీఁ బతికి

చ. 1: నా మోహము తా నెరుఁగు నమ్మితిఁ దనమాటలు
యేమని విన్నవించేనే ఇంకాఁ దనకు
చేముంచి సేసలు వెట్టె శిరసెల్లా నిండె నాకు
ఆమేలు మఱవఁ దనయానతిలో దాననే

చ. 2: ఇన్నిటా మన్నించెఁ దాను ఇచ్చకురాలను నేను
సన్నల నెంతని తన్ను సాదించేనే
కన్నులఁ దప్పకచూచె కడు సంతోసించుకొంటి
యెన్నికలెల్లా నీడెరె నితవాయ ననరే

చ. 3: కంకణము దాఁగట్టె కరము చాఁచితి నేను
పొంకమాయఁ బనులెల్లాఁ బొదిగేదేమే
అంకెల శ్రీవేంకటేశుఁ డట్టె తా నన్నేలె నేఁడు
సంకెలెల్లాఁ బాసె నిట్టె చనవు లొసఁగెను

రేకు: 1803-4 వరాళి సం: 28-015

పల్లవి: తనకు బుద్దులు చెప్పేదాననా నేను
నను మన్నించి ఇంతేసి నవ్వీ నేమోకాక

చ. 1: ఆడుకోలు మాటలెల్లా నాపెరుఁగు తానెరుఁగు
యాడనున్నసాకిరు లేమడిగీనే
యాడుజోడై చుట్టరికాలెనసినవారు తాము
కూడిమాడి వుండినదే గురుతులు గాక

చ. 2: మనసులు మర్మములు మరి తమకే తెలుసు
ననిచి నాకేమిసన్నలు సేసీనే
పొనుఁగ కిన్నాళ్ళదాఁకా పొందైవున్నవారు తాము
వెనగొని పాయనిదే పెద్దరికము గాక

చ. 3: చెలి యలమేలుమంగ శ్రీవేంకటేశుఁడు తాను
నలిఁ దమవల పెంత నాకుఁ జూపీనే
అలరి నన్నేలినాఁడు ఆన్నిటా జాణలు తాము
నిలుకడై మెలఁగుటే నేరుపులుగాక

రేకు:	1803-5 సాళంగనాట	సం:	28-016

పల్లవి:	సేవించరో మొక్కరో చెలులాల నరులాల
కైవశమై వున్నవాఁడు కరుణాకరుండు

చ. 1:	బాసికము గట్టుకొని బంగారుగద్దెమీఁద
లాసి కూచున్నాఁడదివో లకిమమ్మతో
సూసకపువనితలు సోబానఁ బాడఁగాను
భాసురమై యొప్పె నదె ప్రహ్లాదవరదుఁడు

చ. 2:	మునులు చదువఁగాను ముంజేతికంకణాలతో
యెనసి లవ్వులు నవ్వీ నిందిరతో
అనయముఁ బేరఁటాం డ్లారతులెత్తఁగాను
పనివూని వరాలిచ్చీఁ బ్రహ్లాదవరదుఁడు

చ. 3:	పొలఁతులు వడ్డించఁగా బువ్వానఁ గూచుండి
చెలఁగి సరసమాడీ శ్రీదేవితో
యెలమి శ్రీవేంకటాద్రి నీతఁడే యెందుచూచినా
బలవంతుఁడై వున్నాఁడు ప్రహ్లాదవరదుఁడు

రేకు: 1803-6 భైరవి సం: 28-017

పల్లవి: చెలులాల యేమనిచెప్పుదునే యా సుద్దులు
అలరి యంతపెద్దరిక మందురంటాఁగాని

చ. 1: మరిగినట్టె యాపెతో మాటలాడీఁగాని
కరుణ నాపై నున్నది కాంతునికి
సిరులతోఁ గొలువులు సేయించుకొనీఁగాని
సారిదిఁ బతి కున్నవి చూపులు నామీఁదనే

చ. 2: బలిమి నందరివిన్నపములు వినీఁగాని
తలఁపు నామీఁదనే యాతని కున్నది
అలరి నాటకసాలయాటలు చూచుఁగాని
నెలకొన్నకోరికలు నెట్టన నాయందునే

చ. 3: పెక్కు సతుల నూరకె పెండ్లాడుఁగాని తాను
అక్కర నామీఁదనే యాతనికిని
చొక్కి శ్రీవేంకటేశుఁ డెచ్చోటనైనా నుండుఁగాని
యిక్కడ వచ్చి నన్నేలె యిరవు మాయింటనే

రేకు: 1804-1 గౌళ సం: 28-018

పల్లవి: మేలు మేలే యెంతవాఁడు మిక్కిలి సంతోసించితి
వాలాయముఁ గాదనకు వలతు నేననరే

చ. 1: పొగడితి తనగుణంబులు చెవులారా విని
తగిలితిఁ దలచక్కఁదనాలు చూచి
తెగడితిఁ దనతోను తేరి సరసాలాడఁగ
నిగిడి తా నిన్నిటాను నెరవాది యగునే

చ. 2: మెచ్చితిఁ దననేర్పులు మిగులా వేడుకతోడ
ఇచ్చితిఁ దనకు మోవి ఇతవెరిఁగి
యిచ్చితిఁ గాగిటతనుగురుతైన మన్ననకు
అచ్చముగ నెంచితేఁ దా నన్నిటాను జాణఁడే

చ. 3: చొక్కితిఁ దననెయ్యపుసొంపుగురుతులకును
దక్కితిఁ దనవాడికతరితీపుల
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డేనలమేలుమంగను
నిక్కముగఁ దా నన్నిటా నేరుపరిగదవే

రేకు: 1804-2 వరాళి సం: 28-019

పల్లవి: చెలులిందరుఁ జూడఁగా సిగ్గువడ వించుకంతా
కలికితనాల నెంతగయ్యాళించేవే

చ. 1: మాటలాడనేర్తునంటా మగనితో సారెసారె
తాటించి యంతేసికతలు చెప్పేవే
సూటిదప్పకుండాను సొలసి యట్టె యతని
కాటుకకన్నులఁ జూచి కరఁగించేవే

చ. 2: సాముసేయనంటా జమళి నీతనితోను
ఆముక యం (యెం) త పెనఁగులాడేవే నీవు
గామిడితన మునఁ బక్కన నవ్వి యాతనికి
మోముచూసి యెంతేసి దిమ్ములు రేఁచేవే

చ. 3: తానాలు నేరుతునంటా తగిలి యాతనిఁ బాడి
పూని చేఁతలెల్లా నెంత పోగువోసేవే
యేనలమేలుమంగను యేలె శ్రీవేంకటేశుఁడు
ఆనించి నీవింకా నెంత ఆసలఁబెట్టేవే

రేకు: 1804-3 బౌళి సం: 28-020

పల్లవి: మంచితనమువారికి మారుకొనేమిటికి
మించినవేడుకతోనే మెరయవలెఁగాక

చ. 1: సారెకు మాంటాడనేల చలము సాదించనేల
కేరడము లాడనేల కెలయనేల
వూరకె కొసరనేల వొడ్డించుకొననేల
చేరి సతి కిచ్చకమే సేయఁగరాదా

చ. 2: బలిమి చూపఁగనేల పంతములాడఁగనేల
సొలయనేల మనసు సోదించనేల
మలసి దూరఁగనేల మర్మము లెత్తఁగనేల
చెలువుని కింపుగొనే చెనకరాదా

చ. 3: వెంగెము లాడఁగనేల వేఁడుకోనప్పటినేల
ముంగురులంటఁగనేల మొక్కఁగనేల
సంగడి శ్రీవేంకటేశు సతి వలమేల్మంగవు
సంగతిగాఁ గూడితివి సరసమాడరాదా

రేకు: 1804-4 గౌళ సం: 28-021

పల్లవి: చెలులాల బుద్ధులెన్ని చెప్పేరే నాకు
చెలువుఁడే వలెనంటే సేసవెట్టేఁగాక

చ. 1: తలఁపొకచో నుండఁగా తమి యెట్టు రేఁచవచ్చు
పిలుపు లాలించఁగాను పెనఁగుటెట్టు
పలుపా(కొ) కచో నుండఁగా భావమెట్టు గరఁగీని
బలిమి నే నెటువలెఁ బైకొందునే యతని

చ. 2: నవ్వు లొకచో నుండఁగా ననుపెట్టు సేయవచ్చు
మువ్వంకలాఁ జూడఁగా మొక్కట యెట్టు
పువ్విళ్ళొక్కచో నుండఁగా వొడివట్టి యియ్యనేల
రవ్వసేసి నేనెట్టు రతికిఁ బిలుతునే

చ. 3: వేడు కొకచో నుండఁగా వెస నంట నెట్టువచ్చు
వాడికలు చూపఁగాను వద్దనుటెట్టు
పొడితో నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
కూడె నన్ను నింకానెట్టు కొసరుదునే

రేకు: 1804-5 పళవంజరం సం: 28-022

పల్లవి: కొంకకచెప్పవే యాకొత్తలు వినేఁగాని
లంకెగా నితఁడు నీకు లలిఁ జుట్టమటవే

చ. 1: తగిలి తగిలి నీవు తప్పకిట్టె చూచేవు
మగువరో నీకితఁడు మగఁడటవే
నగుతా నప్పటి నీవు నంటుఁ గడు నెరపేవు
పగటున నీకు మేనబావ యటవే

చ. 2: సంకెలేక యితనితో సారెకు మాఁటలాడేవు
కంకణము గట్టినట్టి కాంతుఁడటవే
అంకె నేపొద్దూ నీతని యండనే కూచుండేవు
బింకము తోడుత నీపెండ్లికొడుకటవే

చ. 3: సంతతము నీతనితో జాణతనాలే యాడేవు
మంతుకెక్క నీతఁడు మరవియటవే
యింతట శ్రీవేంకటేశుఁ డేనలమేలుమంగను
వింతగా నన్నేలె నీకూ విభుఁడటవే

రేకు: 1804-6 శంకరాభరణం సం: 28-023

పల్లవి: ఎంతని పొగడవచ్చు నింతటి నీదేవులను
సంతోసానఁ గూడితిని జాణవౌదువయ్యా

చ. 1: జిగిమించ ముద్దుగారే చిలుకపలుకులే
మగవ నోరనుడిగే మాఁట లెల్లాను
వెగటు లేని యట్టి వెన్నెలలపొగులే
చిగురుఁ బెదవులపై చిరునవ్వులెల్లాను

చ. 2: తొలుకరికాలపు తోరపు మెఱుఁగులే
సొలసి రమణిచూచే చూపులెల్లాను
పెలుచు గండుఁదుమ్మిదలపిల్లల మూఁకలే
నిలువుఁ గొప్పువెట్టినెరులెల్లాను

చ. 3: కడలేనికాంతుల కలకపుఁ గుండలే
పడఁతిగట్టిచన్నుల బాగులెల్లాను
అడరి శ్రీవేంకటేశ యలమేలుమంగయాకె
యెడయని నీభాగ్యమే యాగురుతులెల్లాను

రేకు: 1805-1 భైరవి సం: 28-024

పల్లవి: మచ్చికెంతగలిగినా మఱఁగు మొఱఁగులేదా
ఇచ్చ యెరిఁగి లోలోనే యెనయుటగాక

చ. 1: గుట్టుతోడ జవరాలు కుచములు దాఁచుకోఁగా
చుట్టమువలెనే తొంగిచూడవచ్చేవు
చిట్టకములు సేయఁగా సిబ్బితిగలయాఁటది
వొట్టువెట్టక మానునా వూరకె జంకించేవు

చ. 2: వాసితోడ ముద్దరాలు వదనము వంచుకొంటే
సేసకొప్పు జారఁదీసి చెక్కునొక్కేవు
బేసబెల్లిచేఁతలకు పేరుకలపూవుఁబోణి
యాసడించవలదా నీవేల తమకించేవు

చ. 3: వొజతోడ చదురాలు వోవరిలో నుండఁగాను
రాజసానఁ బచ్చిదేర రతిఁగూడేవు
తేజముతో మన్నించఁగా తేఁకువగల కోమలి
సాజపు శ్రీవేంకటేశ సంతోసించకుండునా

రేకు: 1805-2 బౌళి సం: 28-025

పల్లవి: సరివయసు లిద్దరికి సతములై వొనగూడె
యెరవులీఁకఁ బచరించనేఁటికే చెలియ

చ. 1: వెన్నవంటిది మనసు వెడకాఁకలకే కరఁగు
వెన్నెలవంటిది నవ్వు వేడుకొదవు
తన్నుదా నేఱఁగునీవు తతిగొన్నతమకములు
యన్నిలాగులఁ జలములేఁటికే చెలియా

చ. 2: విందువంటిది వలపు వింతలై చవిచూపు
మందువంటిదిచూపు మరిగించును
అంది పాయఁగనీవు అడియాసకోరికలు
ఇందులకుఁ బొలయలుకలేఁటికే చెలియా

చ. 3: (జి)చిగురువంటిది వావి చిక్కించి పెనఁగించు
(జి)చిగురువంటిది చెలిమి చెంగలించు
జిగిమించి నిన్నుఁ గూడె శ్రీ వేంకటేశ్వరుడు
యెగసక్కెముల సొలపులేటికా చెలియా

రేకు: 1805-3 లలిత సం: 28-026

పల్లవి: వట్టిసిగ్గులిఁకనేల వరవాతాను
చుట్టపువరుస నీకుఁ జూపుతానే వున్నది

చ. 1: యెక్కు డపరాకు నీకు నింతిఁ జిత్తగించరాదా
చొక్కపుఁ జూపుల నిన్నుఁ జూచీనదె
మక్కువతోడుత నిట్టె మాటపలుకాడరాదా
ఇక్కువ లరసుకొంటా ఇంటికి వచ్చినది

చ. 2: కోరివేఁడి నీదండనుఁ గూచుండఁ వెట్టుకోరాదా
నేరుపునఁ గొలువులో నిలుచున్నది
చేరవచ్చి ఆదరించి చేత నందుకోరాదా
మేరతో విడెమియ్యఁగ మీఁదెత్తుక వున్నది

చ. 3: చనవిచ్చి కొంతగొంత సరసమాడఁగరాదా
గొనకొని నీతో నవ్వుకొంటానున్నది
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలో నన్ను
పెనఁగరాదా యాపెతో ప్రియమున నున్నది

రేకు: 1805-4 శ్రీరాగం సం: 28-027

పల్లవి: నిరహము వలవదు రసికులు వినరో చాటుచుఁ జెప్పెద
తరితీపనుచెఱకున నిత్తరిఁ బండువండె నిదె

చ. 1: బగి వాయఁగరా దిఁక దంపతులకు నెక్కడ చూచిన
చిగురుకుఁ జేఁగలు వచ్చెను చిత్తజురాజ్యమున
తగిలి తగిలి కోవిలకూఁతలు మొగసాలలకెక్కెను
జగమున విరసపుఁబవనుఁడు చల్లవివాఁడాయ

చ. 2: పొసఁగఁగ నెవ్వరికైనను పొందులె జరపఁగ వలసెను
పసిమొగ్గలు వాడెక్కెను వసంతకాలమున
ముసగస లాడెడు తుమ్మిద మోతల చలములు చెల్లెను
సుసరముననె పగరాజును చుట్టమువాఁడాయ

చ. 3: కలఇకలే కలకాలము కాణాచులుగాఁ బరగెను
ఇలలో శ్రీవేంకటపతియిచ్చిన సంపదను
యెలమిని పదారువేలకు ఇతఁడే మగఁడై నిలిచెను
కలగొని మనసనియెడి చెలికాఁడునుఁ దోడాయ

రేకు: 1805-5 పాడి సం: 28-028

పల్లవి: ఒక్క టికొక్కటి లంకె లొనగూడెను
చొక్కపుసతిలాగులు చూడరమ్మ చెలులు

చ. 1: వుమ్మగిలు తలపోత లుల్లములో నుండఁగాను
చెమ్మఁజెమటలు గారీ చెక్కులవెంట
కమ్మమోవిఁదేనెలు కడు నిండుకొనఁగాను
తుమ్మిదకురులు వాళీఁ దొయ్యలిమోమునను

చ. 2: కాఁగిటికిఁ గోరికలు కాచుకొని వుండఁగాను
మూఁగీ నిట్టూరుపులు ముక్కున నిట్టె
లోఁగక యెదురుచూపులు కన్నులనుండఁగా
చేఁగలెక్కి పులకలు చిమ్మిరేఁగీ మేనను

చ. 3: నెట్టన నివ్వెరగులు నిలువున నుండఁగాను
చుట్టరికములు నోర సుద్దులాయను
ఇట్టె శ్రీవేంకటేశుఁ డింతి నేలుకొనఁగాను
దట్టమై యొప్పె రతులు తగులై చన్నులను

రేకు: 1805-6 గౌళ సం: 28-029

పల్లవి: వెంగెము లాడకురే విభునితోను
సంగతితో నతని కిచ్చకురాల నేను

చ. 1: అద్దమరేతిరికాడ నాతఁ డింటికి విచ్చేసె
గద్దెపీఁట వెట్టరే కాంతలాల
వొద్దికతో మాటలాడనోపుఁ గడునేరుపరి
సుద్దులెల్లా నడుగరే చుట్టపు వరుసను

చ. 2: అలసినచెమటతో నదె నిలుచున్నవాఁడు
జెలకము వట్టరే సతులాల
నెలకొన్న కన్నులను నిద్దురదేరీఁ దనకు
లలిఁ బానుపు వరచి లాలించరే

చ. 3: అందు నిందుఁ దిరిగాడి ఆఁకలిగొన్నాఁడేమో
విందువెట్టరే పతికి వెలఁదులాల
చెంచె నన్ను నింతలోనె శ్రీవేంకటేశుఁడితఁడు
పొందు లిందరికిఁ జేసీఁ బొగడరే మీరు

రేకు: 1806-1 శ్రీరాగం సం: 28-030

పల్లవి: చెలులాల పతిఁ గక్కసించకురే పలుమారు
యెలమితోడుతఁ దొల్లె యేలినాఁడు నన్నును

చ. 1: మరిగించి వొకమాఁటు మనసు వెట్టితేఁ జాలు
తరవాతిపనులెల్లా తా నెరుఁగును
గరిమ నాసలతోడఁ గన్నులఁ జూచితేఁ జాలు
వెరవులు పచరించి విన్నవించవలదు

చ. 2: మిక్కు టమైన వయసు మీఁదుకట్టితేఁ జాలు
మక్కువఁ దానే మరి మన్నించీని
అక్కరతో నేపొద్దునండ నుండితేఁ జాలు
పక్కన నిండుమోహము పచారించవలదు

చ. 3: సేయఁగల చేఁతలెల్లా సెలవు సేసితేఁ జాలు
చాయకువచ్చి తానే సతమయ్యీని
యీయెడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నేలినాఁడు
చేయి చాఁచి సారెసారెఁ జెనకఁగ వలదు

రేకు: 1806-2 పాడి సం: 28-031

పల్లవి: ఇంకనేల వట్టిగుట్టు లెదిరించె వలపులు
పొంకమాయ నీతనితో పొందులు చేకొనరే

చ. 1: చెంతనుండి రమణుఁడు చెక్కునొక్కి వేఁడుకొనీ
యెంతటిపనికైనాను యియ్యకొనవే
వింత వింతమాటలాడి వేమారును లాలించీ
సంతోసాన నందుకును సమ్మతించరే

చ. 2: సారె సారె వేడుకతో సన్నలు నీకుఁ జేసీ
మేరతోడ నన్నిటికి మేకొనరే
వూరడించి వూరడించి వొడఁబరచీ నిన్ను
ఆరీతి నాతనిచేత లంగవించరే

చ. 3: చెంది నిన్ను బుజ్జగించి సేసవెట్టి చనవిచ్చీ
కందువల నీవు నీట్టె కానిమ్మనవే
యిందరిలో శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్నేలె
మందలించి ఇప్పుడిట్టె మనసు చొక్కవే

రేకు: 1806-3 కాంబోది సం: 28-032

పల్లవి: మఱవకువే చెలియ మదనరహస్య మిది
యెఱుఁగుకొంటే మేలు ఇందులోనే వున్నది

చ. 1: సేయరాని వినయము సేసితే దంపతులకు
పాయనిచుట్టరికమై పైకొనును
యేయెడా మొగమోటము లెప్పుడు గలిగితేను
మోయరానిమోపులై మునుకొను మోహము

చ. 2: యేపొద్దు మంచితనాన నెనసితే జాణలకు
దాఁపురాలై వేడుకలు తతిగొనును
కాఁపురపుసరవులే కడుఁగడు కరపితే
ఆఁపరాని తమకము లలవడివుండును

చ. 3: తిరమైన రతులద్దితే నేరుపరులకు
సరసపల్లాపములు చవులు మించు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
వరుసతో మెలఁగితే వలపు లీడేరును

రేకు: 1806-4 నాట సం: 28-033

పల్లవి: పారరో యసురులు పంచబంగాళమై
వీరనృసింహుఁడు వెదకీ నదివో

చ. 1: వాఁడులై వున్నవి వజ్రనఖంబులు
మూఁడవక న్నదె ముంచీ మంటలు
వేఁడిమి చల్లి వెస నిట్టూర్పులు
వీఁడె నృసింహుడు వేదాద్రిమీఁద

చ. 2: కత్తులు నూరీ కఠినపుఁ గోరలు
కొత్తనురుగులటుఁ గురిసీ లాలల
కుత్తికలోపలఁ గులికీ నురుములు
హత్తె వీఁడె గరుడాచలమందు

చ. 3: శుభములు సురలకుఁ జూపీ పాదముల
త్రిభువనంబులును తిరుమేన నివిగొ
విభవంబుల శ్రీ వేంకటనాయకుఁ –
డభయంబొసఁగీ నహోబలమున

రేకు: 1806-5 సామంతం సం: 28-034

పల్లవి: ఒకటి కొకటికి లంకె పువిదలకుఁ బతులకును
మొకమిచ్చలనుఁ గలసి మొనయవలెఁగాని

చ. 1: పెలగొన్న చుట్టరికము ప్రియములకుఁ గారణము
ననుపులకుఁ గడలేని నవ్వులు గారణము
తనవోనియాసలకు తలపోఁతఁగారణము
మనసు లెనయుటకు సమ్మతులు గారణము

చ. 2: మరిగి తగులుటకు నెడమాట లవి గారణము
సరసముల కొడఁబడినచనవు గారణము
సురతములవాడికకు సొలపు లిటు గారణము
గరిమఁ జెనకులకు తమకములు గారణము

చ. 3: సంతతపు వేడుకకు జవ్వనము గారణము
మంతనపుఁ గూటమికి మనసు గారణము
ఇంతిరో శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడె
చెంత మీకిద్దరికి చెలిమి గారణము

రేకు: 1806-6 లలిత సం: 28-035

పల్లవి: అదివో లకిమమ్మ అహోబలేశ్వరుతోడ
పదివేలు చందముల పరగీ రతులను

చ. 1: సరుసనే కూచుండి జవళిఁ గొండలమీఁద
యిరులు చల్లులాడీ విభుఁడుఁదాను
పరిపరివిధముల భవనాశి దరులను
సరసములాడీని సాటికి చేటికిని

చ. 2: యెదురుఁగాఁగిళ్ళతోడ నెనసి మాఁకులనీడ
పెదవితేనె లానీని ప్రేమముననను
నిదినిధానాలవలె నిచ్చ వానపడలను
సదమదమై నవ్వీని చతురత మెఱసి

చ. 3: తొడఁదొడఁ గదియఁగ దోమటి గద్దెల నుండి
జడియక పెనఁగీని సమరతిని
యెడయక శ్రీవేంకటేశుఁడే నరసింహుఁడై
అడరఁగఁ బంట్లెడీ నతి సంతోసమున

రేకు: 1807-1 పళవంజరం సం: 28-036

పల్లవి: అన్నిటా నెరజాణఁ డాతఁడే యెరుఁగును
విన్నపములెల్లాఁ జేసి వేడుకఁ బొగడరే

చ. 1: ఆసలు రేఁచినవాఁడు అండకు రాకుండునా
సేసలు వేట్టివాఁడు చెనకఁగ మానీనా
వాసులెక్కించినవాఁడు వన్నెకెక్క మన్నించఁడా
గోసనాసఁ బతినేమీఁ గొసరకురే

చ. 2: తమి పుట్టించినవాఁడు దయ నాపైఁదలఁచఁడా
మమత లెంచినవాఁడు మరుగక మరచీనా
నెమకి వచ్చినవాఁడు నేఁడు నన్నుఁ గైకొనఁడా
సముకాన నాతని జరయకురే

చ. 3: చెక్కులు నొక్కినవాఁడు సిగ్గులు దేరుచఁడా
మొక్కకు లోనైనవాఁడు మునుకొని మెచ్చఁడా
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తక్కినచేత లీకఁ దడవకురే

రేకు: 1807-2 ఆహిరి సం: 28-037

పల్లవి: పిలువరే నాయకుని ప్రియములన్నియుఁ జెప్పి
తలఁపులో వేడుకలు దైవారుఁగాని

చ. 1: తనివోనిమోహములో తరవాయఁ జెలియకు
వినుకలి కథలెల్ల విరులాయను
గొనకొన్న కోరికలు కొమరాఁకలాయ నవె
యెనలేనివెడజాగు లిఁక నేఁటికే

చ. 2: పొదిగి యెడమాటలే పొదులై పనిగొనియ
యెదురుచూపులయాస లెదురు దొట్టె
ముదురుఁ దమకమెల్ల ముప్పిరిఁ బెనగొనియె
పొదిగొన్నవట్టి తలపోఁత లిఁక నీలే

చ. 3: తగులైన మచ్చికలు తరితీపులెసగించె
మొగమోట తాలిమిలు మొలపించెను
సొగసి శ్రీ వేంకటేశుఁడు తానె సతినేలె
నిగిడి దిన కొత్తలు నెరపనేమిటికే

రేకు: 1807-3 పాడి సం: 28-038

పల్లవి: ఆఁటది యింత కోపునా అంటిమోసువంటిది
మాఁటలనే లాలించి మరపుకోవయ్యా

చ. 1: సిగ్గరితనాన నాపై శిరసు వంచుకుండఁగా
యెగ్గుపట్టి వున్నదంటా యేల లోఁచేవు
నిగ్గుదేరఁ జేతులెత్తి నీకు నిట్టె మొక్కఁగాను
బెగ్గిలఁ గుచములేల పిసికేవయ్యా

చ. 2: ముగుదతనాన నాపె మోనముతో నుండఁగాను
నగుమంటా గోరనేల నాంటించేవు
తగిలి నీపాదాలపై దానె యానవెట్టఁగాను
తెగడి కొప్పువట్టేల తీసేవయ్యా

చ. 3: గోలతనమున నాపె గుట్టుసేసుకుంటఁగాను
చేలకొంగువట్టి యెంత చిమ్మిరేఁచేవు
యాలీల శ్రీవేంకటేశ యింతి పాదాలొత్తఁగాను
తాలిమితోఁ గూడి యెంత మేలమాడేవయ్యా

రేకు:	1807-4 పాడి	సం:	28-039

పల్లవి:	చూడఁ జాడ వేడుకయ్యా సుదతి నీబాగులు
	వాడలోన నీసుద్దులు వన్నె కెక్కెఁ జెప్పవే

చ. 1:	కొలఁది మీరిన నీ కోరకె నీడేరెనటే
	కళలుదేరీ మోమునఁ గలికి నీకు
	బలిమి నీవాడిన పంతములు చెల్లెనటె
	సలవుల నవ్వులు చిందీ నేఁడిపుడు

చ. 2:	మున్ననీవు నోఁచిన నోములు ఫలియించెనటె
	వున్నతి సంతోసాన నోలలాడేవు
	తన్నుఁదానె నీ యెన్నిక తారుకాణ వచ్చెనటె
	పున్నమచెద్రుని వలెఁ బొదలీ నీ మోము

చ. 3:	మగువలలోన నీ మనసొక్కటాయనటె
	మీగులా సొంపుల నీవు నెరసేవు
	జిగి నిన్నుఁ గూడెనటె శ్రీ వేంకటేశుఁడు
	నిగిడి రతిచిహ్నలు నిలువెల్లా నిండెను

రేకు: 1807-5 భైరవి సం: 28-040

పల్లవి: ఇంతి పరణామము నీ కిదివో విన్నవించితి
వింతసేయక లోనికి విచ్చేసి చూడవయ్యా

చ. 1: అలరి నీవు సతితో నాడినమాఁట దలఁచి
నలుగడ నవ్వినవ్వు దలఁచి
చెలిమి మిగుల నీవిచ్చినమన్నన దలఁచి
పులివచ్చి సిగ్గులతో లోలలాడుచున్నది

చ. 2: చేరి నీవు చెనకిన చెనకులెల్లాఁ దలఁచి
సారెకు నాడిన సరసము దలఁచి
కూరిమి వీరఁగ కొప్పుదువ్వుట తలఁచి
మీరాక కెదురుచూచి నెమ్మదిఁ దానున్నది

చ. 3: యేకదానఁ జేసిన నీ యిచ్చకములు దలఁచి
చేకొన్న కాఁగిటిలో మచ్చిక దలఁచి
యేకమై శ్రీవేంకటేశ యారతిముందె తలఁచి
మేకొన్న సంతోసమున మెచ్చుకొంటానున్నది

రేకు: 1807-6 సాళంగం సం: 28-041

పల్లవి: ఇది మా వేడుక గాదా యేల మాకు దాఁచేవు
వెదకఁ బోయిన తీగె యెదురుగా వచ్చెను

చ. 1: చిప్పిలుఁగళలతోడ చిరుఁ జెమటలతోడ
దప్పిదేరే వదేమె తరుణి నీవు
యెప్పటి చందము గాదు ఇప్పుటున్న నీ భావము
చెప్పఁగదవే మాతోను సిగ్గులేల ఇఁకను

చ. 2: చొక్కుదేరే కన్నులతో సారిది నిట్టూర్పులతో
మిక్కిలి యలసేవేమే మెలుఁత నీవు
యెక్కడ నబ్బెనోకాని యిటువంటి నీ సొబగు
నిక్కము చెప్పఁగదవే నీవేలకొంకేవు

చ. 3: వీడిన తురుముతోడ వెన్నెల నవ్వులతోడ
వేడుక నెరసేవేమే వెలఁదినీవు
నే (నేఁ)డు శ్రీవేంకటేశుఁడు నిన్ను రతిఁ గూడెనటె
వోడక చెప్పఁగదవే వొద్దికతో మాకు

రేకు: 1808-1 శ్రీరాగం సం: 28-042

పల్లవి: విన్నవించితిమి నీకు వెలఁది భావములెల్లా
మన్నించుటే ఇఁక మంచి జాణతనము

చ. 1: మరిగి పాయఁగలేక మగువ చెనకఁగాను
సరసము లాడేది జాణతనము
విరుల వేసి సన్నల వేమారుఁ బిలువఁగాను
మరుకేలిఁ బెనఁగేదే మరి జాణతనము

చ. 2: ననుపులు పచరించి నవ్వులు నవ్వఁగాను
చనవిచ్చి పైకొనేది జాణతనము
తనివోక సారె మోము తప్పక చూడఁగాను
మనసు చొక్కించేదే మరి జాణతనము

చ. 3: చెంతఁ గూడి చెప్పరాని సేవలెల్లాఁ జేయఁగాను
సంతోసించుకొనియెడి (యేది ?) జాణతనము
ఇంతలో శ్రీవేంకటేశ నీకె నిన్ను వేఁడఁగాను
మంతనానఁ గలసేదే మరి జాణతనము

రేకు: 1808-2 ఆహిరి సం: 28-043

పల్లవి: అందుకే దయపుట్టు నాతనికిని
యెందును వనితలకు ఇచ్చకమే మేలు

చ. 1: గఁటమున రమణుని గడవనాడుటకంటె
మాఁట మాఁటగాఁ బొగడే మచ్చికే మేలు
సాటిబేటికి బొమ్మల జింకించుటకంటే
సూటిగా మోము దప్పక చూచుటే మేలు

చ. 2: మోనముతోడ ముగము మునుచుకవుండుకంటే
నానఁబెట్టి సెలవుల నవ్వుటే మేలు
ఆనవెట్టుక వెనఁగి అదలించుటకంటే
కానుకిచ్చి వూరకుండే ఘనతే మేలు

చ. 3: చేరువనుండి లోలోనే సిగ్గులు వడుటకంటే
కూరిమితేఁ గాఁగిలించుకొనుటే మేలు
గారవించి నిన్ను శ్రీవేంకటేశుఁడు మెచ్చి యేలె
నేరుపుగలదానవు నీకు నిదే మేలు

రేకు: 1808-3 బౌళి సం: 28-044

పల్లవి: పతివద్ద నేఁడే నీవు పచరించేవు
కతకారితనా – లెందు గడిఇంచుకొంటివే

చ. 1: చిగురాకుమోవి మీఁది చిన్నలేఁతమాటలు
నిగిడి యెన్నఁడు నీవు నేరిచితివే
మొగమిచ్చలకుఁ జూచే ములువాఁడి చూపులు
తగిలి ఇన్నాళ్ళు యెందు దాఁచుకవుండితివే

చ. 2: గుత్తపు చెక్కు జెమట కొనగోరి చిమ్ములు
బిత్తరాన నెట్టు గూడపట్టుకొంచివే
చిత్తిణితనములోని చిరిసిగ్గులనవ్వులు
తిత్తిఁగట్టి యేడనుండి తెచ్చుకొంటివే

చ. 3: కదిసినయట్టిరతికళలలో గురుతులు
పొదపెట్టి యెట్టు గూడపోసుకొంటివే
అదన శ్రీవేంకటేశుఁ డట్టె నిన్ను నన్నూఁ గూడె
చదురుఁదనము లెన్ని సవరించుకొంటివే

రేకు: 1808-4 భైరవి సం: 28-045

పల్లవి: చిత్తాన మఱవక యాచెలి నిట్టె మన్నించు
వొత్తి విన్నవించే మీపె కొత్తపెండ్లికూఁతురు

చ. 1: సెలవుల నవ్వుదురు చేసన్నలు సేతురు
వలపులు చల్లుదురు వనితలు
అలతురు సొలతురు ఆయములంటుదురు
బలిమినెంతైనా నెగ్గుపట్టరాదు పతికి

చ. 2: చనవులు మెరతురు జంకింతురు బొమ్మలను
కనుఁగవ చూపులు కాఁడింతురు
వెనఁగుదు వూరకైను బిగుతురు పంగింతురు
యెనసి యెంతైనా నేరాలెంచరాదు పతికి

చ. 3: మందెమేళాన నుందురు మనసులుఁ గరతురు
కందువ రతికిఁ దీసి కాఁగిలింతురు
ఇందుముఖి నేలితివి ఇంతలో శ్రీవేంకటేశ
విందువలెఁ బాయకుండు వీడరాదు పతికి

రేకు: 1808-5 దేసాళం సం: 28-046

పల్లవి: చూచి చూచి నాకు గడుసోద్యముగ దయపుట్టీ
యెచి నీసేవే సేసే మా ఇంటికి రావయ్యా

చ. 1: వెలలేని వేడుకతో వేగినంతా నవ్వితివి
అలవోక సరసాల నాపెతోను
పలుకుఁదేనె తీపులు పై పైఁ జవి చూపితివి
అలపుదేర్చేఁగాని మాయాడకు రావయ్యా

చ. 2: మనసు దనియలేక మాపుదాఁకఁ బెనగితి –
వనేకరీతులా గోరి యాపెతోడను
వినోదించితివి చాలా విచ్చనవిడి నక్కడ
నిను సేదదీర్చను మానెలవుకు రావయ్యా

చ. 3: ఇక్కువలంటి యాసల నిందాఁకా భోగించితి –
వక్కజమైన రతుల నాపెతోడను
నెక్కొని శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
నిక్కము నిన్ను మెప్పించే నిచ్చలు రావయ్యా

రేకు: 1808-6 లలిత సం: 28-047

పల్లవి: నీకింత బాఁతైతిఁగా నేఁజేసినదే భాగ్యము
కైకొనవయ్యా పాదాలు గడిగే నే నీకును

చ. 1: వేడుక కొకమాఁట వెలఁదిచేఁ జెప్పిపంపి
వాడికల కిందాఁకా వచ్చితివేమో
యాడవారితోడ పొందు యెంతగద్దు అయినాఁగాని
వీడె మందుకోవయ్యా వీచ్చేసితి వీడకు

చ. 2: చనవిచ్చినటువలె సారెకుఁ దప్పక చూచి
మనసు సోదించ మాతో మాఁటాడేవేమో
చనకిన్నాళ్ళు సరకు సేతువా నేఁ డేమికొత్తో
ఘనతఁ గూచుండవయ్యా గద్దెపీఁట మీఁదను

చ. 3: సమ్మతి నోవరిలోన సరుస నన్నుఁ బెట్టుక
నమ్మికగా నాతోడ నవ్వేవేమో
యిమ్ముల శ్రీవేంకటేశ యెనసితి వందుకేమి
పమ్మి నీకుఁ జేత మొక్కే బాయకుండవయ్యా

రేకు: 1809-1 వరాళి సం: 28-048

పల్లవి: రావే యాతనికడకురమణి నేఁడు
నీవు నాతఁడుఁ బొందైతే నెమ్మది నుండుదురు

చ. 1: చేరి తనరమణుఁడే చెంకొంటేఁ జాలుఁగాక
సారె సారె దూరనేల సవతులను
ఆరితేరి యాతఁడే మాటాడితేఁ జాలుఁగాక
వీరిడై కోపించనేల వెడచిలుకలను

చ. 2: అక్కరగలవిభుఁడు యాసిచ్చితేఁ జాలుఁగాక
కక్కసించనేల చెలికత్తియలను
చొక్కి తనది క్కాతఁడు చూచితేఁ జాలుఁగాక
గక్కన జంకించనేల కంతునిబాణాలను

చ. 3: అడరి శ్రీవేంకటేశుఁ డబ్బితేఁ జాలుఁగాక
తడవనేల పెంచినదాదులను
యెడయ కింతలో వచ్చి యాతఁడే నిన్నుఁగూడె
కడుసగినాలు చూడఁగానేల యనులను

రేకు: 1809-2 పాడి సం: 28-049

పల్లవి: ఉద్దగిరికృష్ణఁ డాతఁ డొక్కఁడౌ జాణఁడంటువి
వెలయ లెందున్నామాకిద్దరికిఁ బొసఁగునే చెలియా

చ. 1: వెలఁ దాతనిగుణాలు వేగినఁతాఁజెప్పితివి
వెలయ నెందున్నాఁడే వెలఁది వాఁడు
కలఁ దాతఁ డందరికంటెఁ జక్కనివాఁ డంటి-
వలరఁ దోడితేవే నాయఁడకు నేఁడు

చ. 2: పాది గాతనినేర్పులు పొగడితి విందాఁకా
సుదతి మొక్కే విట్టె చూపవే నాకు
చదురుఁదనము రాజసము గలవాఁడంటివి
యెదిటికిఁ దానెప్పుడెపుడ వచ్చీనే

చ. 3: వడి నాతనికి నాకు వలపు వుట్టించితివి
కడఁగి నాతోఁ జుట్టరికము సేయవే
యెడయక శ్రీవేంకటేశుఁడే తానట నన్నుఁ
దడవి యేనినాఁడౌనె తప్పదు నీమాట

రేకు: 1809-3 నాట సం: 28-050

పల్లవి: నీపొందులెల్లా గంటిమి నేఁడు నీపంతాలుచెల్లె
భూపతిచెరువుచెంత భోగింపుచున్నాఁడవు

చ. 1: ముచ్చట లాడుకొంటా మొగములు చూచుకొంటా
హెచ్చి యెంతచనవిచ్చే వింతులకును
తచ్చనలు చూపుకొంటా తమకము లెంచుకొంటా
కొచ్చి యెంతనవ్వేవు కొలువులోను

చ. 2: పువ్వులను వేసుకొంటా వుప్పొడి చల్లుకొంటా
రవ్వలేమి సేసేవు రమణులను
వువ్విళ్ళూరించుకొంటాను వొడివట్టి తీసుకొంటా
చివ్వన నెంత పచ్చిగాఁ జెనకేవు నీవు

చ. 3: సన్నలు సేసుకొంటా చవులు వుట్టించుకొంటా
మన్నించి యెంతకూడేవు మగువలను
యెన్నికతో నన్నేలితి వింతలో శ్రీవేంకటేశ
చన్నులేల పట్టేవు సరసము లాడుతా

రేకు: 1809-4 భైరవి సం: 28-051

పల్లవి: మేలు మేలే యితెండు నేర్పును మెచ్చితి నన్నిటా నీతనికూటమి
కోలుముందై యిటులఁ గోర్పులు కొనలుసాగని దేఁటిదే

చ. 1: మనసు గరఁగఁగఁ జేయఁ జాలనిమాఁట లిన్నియు నేఁటివే
చనవు మిగులఁగ నోలలాడనిసరసములు మరియేఁటివే
తనివిఁ బొండఁగ రతులఁ గలయని తాలిముల గొడ వేఁటిదే
చెనకి చెనకించుకొని కొసరినిచేఁత లేమియు నేఁటివే

చ. 2: పెదవి తేనియ లొలుకఁ జెప్పని ప్రియము చేకాన నేఁటిదే
యెదురుచూపులయాసలను బయలీఁదని వల పేఁటిదే
సదమదంబుగఁ బుక్కిటితమ్ములము చవులుగొననిది యేఁటిదే
ముదురుఁ దమకము మీఁదఁ జల్లుచు మొక్కులాడని దేఁటిదే

చ. 3: చెలపచెమటలుగార సొలయుచు చిమ్మిరేఁగని దేఁటిదే
తలఁపుఁదలఁపునుఁ దారుకాణై తగిలి చొక్కని దేఁటిదే
యెలమితో శ్రీవేంకటేశ్వరుఁ డేలె నన్నిపు డతిముదంబున
చెలియ నీతో నిట్టివేడుక చెప్పి చూపని దేఁటిదే

రేకు: 1809-5 ముఖారి సం: 28-052

పల్లవి: ఎపుడు వత్తువోయనుచు యెదురు చూచీఁ జెలియ
వుపమించి చెప్పితిమి వువిదఁ జెందవయ్యా

చ. 1: నలఁతకనుగనువలకు వీమోముఁ జందురుని –
నలరంగఁ జూపగదవయ్య నేఁడు
కలికి చక్కఁదనంబు కడఁగి ప్రతిబింబించ
తళుకు నీచెక్కుటద్దములు చూపవయ్యా

చ. 2: నిరతి మెఇఁదీగెకును నీటాహుశాఖ లివి
అరదుగాఁ జూపఁగదవయ్య నేఁడు
సరిఁ జన్నుజక్కవలు జంటవాయకయుండ
తొరల తనుసూర్యకాంతులు చూపవయ్యా

చ. 3: గళనాద పకములకు కదునీజవ్వనమదము
అలమి చోటుగఁ జూపవయ్య నేఁడు
వలచి శ్రీవేంకటేశ్వర యాకెఁ గూడితిని
కలకాలమును నిటులఁ గరుణ చూపవయ్యా

రేకు: 1810-1 వేళావళి సం: 28-053

పల్లవి: ఇన్నిటా ఘనుఁడు తాను యెంచితే నే నెంతదాన
సన్నిధినుండి నాకు చనవిచ్చీ నితఁడు

చ. 1: చక్కనిదాననంటాను సారెసారెఁ బొగడీని
చెక్కునొక్కి వలపురేఁచీ నితఁడు
యెక్కడ నేరిచినాఁడో వేడలేని మాటలాడి
గక్కన నా మనసెల్లాఁ గరఁగించీ నితఁడు

చ. 2: నా మొగము చూచి చూచి నవ్వులెల్లా నవ్వీని
ఆముకొని చనుగుబ్బలంటీ నితఁడు
యేమి దలఁచుకున్నాఁడో ఇచ్చకములెల్లాఁ జేసి
కామించి మెచ్చులు మెచ్చి కాఁగిలించీ నితఁడు

చ. 3: కప్పరపువిడె మిచ్చి కడు నన్ను మన్నించీని
చెప్పరాని చేఁతలెల్లాఁ జేసీ నితఁడు
ముప్పిరి నెంతజాణఁడో మోహములెల్లాఁ జల్లి
ఇప్పుడే శ్రీవేంకటేశుఁ డింతసే సె నితఁడు

రేకు: 1810-2 శ్రీరాగం సం: 28-054

పల్లవి: ననిచి యాతనితోనే నగుత నుండెదఁగాక
చనవుగలిగినవెనక జరయఁదగునటవే

చ. 1: భావ మాతని మీఁదఁ బాదుకొలిపినవెనక
చెవదేరఁగ నలుగఁ జెల్లునటవే
కావరపువలపు లొడిఁగట్టుకుండిన వెనక
వావాతమచ్చికలు పదలఁదగునటవే

చ. 2: మిగుల నతనికి మోవి మీఁదుకట్టిన వెనక
జిగిమించి ఇఁకఁ బలుకఁ జెల్లునటవే
పగటుతో వయసు తనపాలఁ బెట్టినవెనక
మగిడి మొగమోట లటు మానెందగ నటవే

చ. 3: లవి భోగ మతనితో లంకెసేసిన వెనక
చెలిమి సేయక మరవఁజెల్లునటవే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో ననుఁగూడె
వెలలేనితమక మిఁక విడవఁదగునటవే

రేకు: 1810-3 సామంతం సం: 28-055

పల్లవి: ఏమందునే చెలియ ఇంతసేసెను వయసు
నామనసు చొక్కించి నమ్మించె వయసు

చ. 1: పుడివోని తమకముల నుబ్బురేచెను వయసు
కడఁగి యలుకలు దేర్చి కలపె వయసు
అడియాసలే పెంచి యారడిఁ బెట్టెను వయసు
బడిఁ గోరికలబయలు వాఁకించె వయసు

చ. 2: సాగిసి రాకల కెదురుచూడఁ జేసెను వయసు
తగిలించి రతుల కెడతాకించె వయసు
వెగటుగాఁ దెగువలకు వెఱపుఁదెలిపెను వయసు
జిగిమించి తలపోఁతఁ జిక్కించె వయసు

చ. 3: వొకరి కొకరికి లంకె లొనకఁజేసెను వయసు
మొకమోటలనె ననుపు ముంచె వయసు
వెకలియై కూర్చి శ్రీవేంకటేశుతో వయసు
ప్రకటమై నాకిట్ల ఫలియించె వయసు

రేకు: 1810-4 ఆహిరి సం: 28-056

పల్లవి: చెప్పఁగదవె చెలియ వినియెద చెవులు చల్లఁగ నతని సుద్దులు
కుప్పలుఁ దెప్పలా గాఁగఁ గూడిన గురుతు లెల్లనుఁదలఁచునా

చ. 1: తనకు నాకును తొల్లటి మాఁటల తారుకాణలు దలఁచునా
చెనకి చెనకి మర్మములంటఁగ సిగ్గులు వడుట దలఁచునా
చనవుతోడుత నడ్డాఁకలేక సరసమాడుట దలఁచునా
దినదినమును మోములు చూచుక తెప్పలఁదేలుట తలఁచునా

చ. 2: పానుపుమీఁదట మిద్దర మొక్కటై పాయకవుండేది దలఁచునా
ఆనలు మీరుచు సరకిబేసికి ఆయము లంటుట దలఁచునా
మేనులఁ జెమట లుప్పతిల్లఁగ మించిపెనఁగుట దలఁచునా
తానకమయినబోగములను దైలువారుట దలఁచునా

చ. 3: యెప్పుడుఁ దానును నేనును నెనసి యెరవులేనిది దలఁచునా
చొప్పుకఁ గలసిమెలసివుండేటి చుట్టరికములు దలఁచునా
తప్పక ..... నా ఇంటికి విచ్చేసి తానే నన్ను మన్నించి ఏలెను
ఇప్పటివలెనే శ్రీవేంకటేశుఁడు యింతటానన్నుఁ దలఁచునా

రేకు: 1810-5 రామక్రియ సం: 28-057

పల్లవి: వీఁడివో నీయెదుట నున్నాఁడు వేవేలుచుందాల లెరజాణఁడు
పోఁడిమితోడుతఁ గలకాలమును పొదిగి భోగించవే

చ. 1: సేసపాల పెండ్లికూఁతురవు చినదానవటవే నీవు
మోసులువార నవ్వుచుఁ బతికి మోముచూపవే
నీసరివారిఁజూచి చేఁతలు నేరుచుకొనవే కడమలేల
ఆసలురేఁగ సరసమాడి ఆయములంటవే

చ. 2: పోఁకలంతలుచన్నులదానవు బుద్దులు నేరుపవలెనా నీకు
యేఁకటవాయ మనసుఁగరఁచి యింపులు చల్లవే
వాఁకమైన జవ్వనపాయము వచ్చెను మతిలోఁదలఁచుకొనవే
తేఁకువతోడుత ముద్దుబలుకుల తేనెలు గురియవే

చ. 3: చక్కఁదనముల చక్కెరబొమ్మవు చవులు చూపఁగవలెఁగదవే
గక్కన శ్రీవేంకటేశుఁడు గూడె కాఁపురము సేయవే
మిక్కుటమైన కలికితనాల మెరసి దిక్కులమెప్పించుకొనవే
వెక్కసముగను రతుల మెప్పించి వేడుక సేయవే

రేకు: 1811-1 ఆహిరి సం: 28-058

పల్లవి: నీ విఁక నేమన్నాను నీకు నీతోడు
కైవసమాయఁ బనులు కడమ లే లిఁకను

చ. 1: వలిపెపయ్యెదలోని వాసనగుబ్బలతోడు
పలుకవే చలములు పచరించక
పలచనైన నీ పచ్చికెమ్మోవితోడు
సొలసి తలవంచక చూడవే నాదిక్కు

చ. 2: సిగ్గులుదాఁచికట్టి చెంగావి చీరతోడు
వొగ్గి పట్టవే విడెము వుద్దండాలేల
దిగ్గనఁ గస్తూరి యలఁదిన నీచంకలతోడు
దగ్గరి కూచుండవే వింతలేల నీకు

చ. 3: తరితీపు చూపుల నీతళుకుఁ గన్నులతోడు
గిరిగొన నీట్టె కాఁగిట నించవే
చిరిఁజెమటలతోడి శ్రీవేంకటేశుఁడ నేను
మెరసె నీనా పొందు మితిమీరి యిపుడు

రేకు: 1811-2 రామక్రియ సం: 28-059

పల్లవి: నీ చిత్త మిటమీఁద నేము చెప్పేటిదేమి
చేచేతఁ గూడి దయసేయ వలెఁ గాక

చ. 1: పేరుకొని యొకమాఁటు పిలుచు వూరక నిన్ను
కోరు మనసునను నీకూటంబులు
దూరు దైవంబు నటు తుదరెప్ప లందుఁగ –
న్నీరు నించును సారె నెలఁత నినుఁ దలఁచి

చ. 2: భావించి యొకమారు పలకపై నిను వ్రాసు
వేవేగఁ దలయూఁచ వరగుపడును
నీవు రాఁగలుగను నిట్టూర్పు నిగుడించు
పూవుఁ బాన్పునఁ బోరలు పొలతి నినుఁ దలఁచి

చ. 3: పక్కనను నొకమాఁటు బయలు నీతో నవ్వు
చెక్కు చేతనుఁ జేర్చు చింతించును
ఇక్కడనె శ్రీవేంకటేశ ఇదె కూడితివి
వెక్కసంబుగఁ బొగడు వెలఁది నినుఁ దలఁచి

రేకు: 1811-3 శ్రీరాగం సం: 28-060

పల్లవి: తగును మీ ఇద్దరికి తలఁచుకో నా మాఁట
నెగడె మీ కూటములు నిక్కములు నేఁడు

చ. 1: వదలఁదగునా ప్రియము వలపుగలవారికిని
యెదురుకొని వినయములు హెచ్చవలెఁగాక
చెదరఁదగునా మనము చెలిమిగలవారికిని
పొదలి ఇచ్చకములనే పొరలవలెఁగాక

చ. 2: విడువఁదగునా యాస వేడుకగలవారికిని
వుడివోని తమకమున నుండవలెఁగాక
కడవఁదగునా మాట కైవసపువారికిని
కొడిసాగఁబను లియ్యకొనఁగవలెఁగాక

చ. 3: మఱవఁదగునా మేలు మమతగలవారికిని
మెఱసి రతులను నేర్పు మించవలెఁగాక
వెఱవఁదగునా చనవు వెలఇంచువారికిని
యెఱిఁగి శ్రీవేంకటేశు నెనయవలెఁగాక

రేకు: 1811-4 ఆహరి సం: 28-061

పల్లవి: వీనికేలే వెఱవ నీకును విభునిపొందే సేయు మింకను
మానవే యింక చింత యాతని మన్ననలు చేకూరెను

చ. 1: తలఁపుఁ దలఁపునుఁ దారుకాణై తగిలి యుండినఁ జాలుఁగాక
కలువలునుఁ దామరలు నెవ్వరి గాఁడిపారీనే
పలుఁగుఁబలుఁకునుఁ బొసఁగనాడుక పదరకుఁడినఁజాలుఁగాక
చిలుకలునుఁ గోవిలలుఁ జేసేటిచేఁత లేమింక నున్నవె

చ. 2: మొగము మొగమునుఁ జూచుకొని యిటు ముచ్చటాడినఁ జాలుఁగాక
చిగురులునుఁ దీగెలును యెవ్వరిఁ జెనకవచ్చినే
నగవునగవునుఁ గలయనవ్వుచు ననిచివుండినఁ జాలుఁగాక
తగిలి చంద్రుడు చల్లగాలియుఁ దడవుపనులేమున్నవే

చ. 3: కరముఁగరమును సోఁక రతులనుఁ గాఁగిలినుఁ గాఁగిలిఁచినఁ జాలుఁగాక
మరుఁడు బలములుఁ గూడి యెవ్వరి మచ్చరించేరే
యిరవుకొని శ్రీవేంకటేశ్వరుఁ డింతలోఁదా నిన్ను నేలెను
తిరుగఁ దిరుగను విన్నవించేటి తెరఁగు లిఁక లేమున్నవే

రేకు: 1811-5 భైరవి సం: 28-062

పల్లవి: ఎంచి చూడ నెన్నిలేవు యాకె తలపోఁతలు
నించనవేడుక లిఁక నెరవేరుచవయ్యా

చ. 1: వూర నూర నూటలాయ నుడివోని తమకము
నీరుకొద్దిదామరాయ నిండుమోహము
గోరగీర నేరులాయ కొమ్మకోరికలెల్లాను
గారవించి యిఁకనైనాఁ గరుణించవయ్యా

చ. 2: పట్టఁ బట్టఁ బాములాయ పరగ నడియాసలు
ముట్టినదే ముయ్యాయ ముంచినేస్తము
చెట్టడువఁ జేటఁడాయ చెలరేఁగి వావులు
గుట్టుతోనే యిఁకనైనాఁ గొమ్మనేలుకోవయ్యా

చ. 3: చెప్పఁ జెప్పఁ గొత్తలాయ చెలియవిరహమిది
తెప్పపై వోలాయఁ దరితీపు లెల్లాను
యిప్పుడు శ్రీవేంకటేశ యింతి నిట్టె యేలితివి
తప్పక నీవిఁకనైనాఁ దగ మన్నించవయ్యా

రేకు: 1812-1 పాడి సం: 28-063

పల్లవి: తానే యెఱుగును అన్నిదగవులు దయఁదలంచీ నిపుడెరమణుఁడు
వూని యొకమాఁ టెచ్చరించవే పొసఁగు నోచెలియా

చ. 1: మచ్చికలుగలచోటి పొందులు మఱవలెటువలె వచ్చునే
ఇచ్చకముతోమెలఁగు సరసము లెరవు లే లగునే
వెచ్చువెరిగిన ననుపులెల్లను వెనలుగొనకే లుండునే
నచ్చుకొట్టక యిట్లనే విన్నసము సేయవే యతనికి

చ. 2: మరిగి పాయఁగరాని తగులమి మాననెటువలె వచ్చెనే
దొరసివుండినవయసు లేగతిఁ దొలఁగ దొబ్బేనే
సరవిగలవొడఁబాటుమాఁటలు చవులు రేఁచకవుండు నటవే
వెరవుతోడుత విన్నపము వేవేగఁ జేయవె యతనికి

చ. 3: తనివిదీరనిరతులసొంపులు తాళనెటువలె వచ్చునే
తనకుఁగా మీఁదెత్తుకుండినతమక మెటువలె దాఁతునే
యెనసె నను శ్రీవేంకటేశ్వరుఁ డిటకుఁ దానే వచ్చికరుణను
వినయమున నాసంతసంబులు విన్నవించవె యతనికి

రేకు: 1812-2 శంకరాభరణం సం: 28-064

పల్లవి: నీకు నతనికిఁ బోదు నేము చెప్పేటిదేమి
కైకొన్న మీకతలు కంటిమే చెలియా

చ. 1: తెగరాని పొందులకు తెలిసి వోరువఁగవలె
మొగమోట రిచ్చకము ముంచవలెను
నగనేర్చినందుకును నంటు చూపఁగవలెను
తగులయన రతులకును తరితీపువలెను

చ. 2: యెనయు నడియాసలకు లెడమాఁట లాడవలె....
ననుపులకుఁ గనుచూపు నాఁటవలెను
పెనగొన్నవేడుకకు ప్రియము చూపఁగవలెను
తనివిఁ బొందినయెడకు తగ మెచ్చవలెను

చ. 3: సమ్మతిఁచినపనికి సరినియ్యకొనఁగవలె
నమ్మినందుకు నిజము నడపవలెను
యిమ్ములను శ్రీవేంకటేశుఁ డిటు నినుఁగూడె
పమ్మికొనుచేత లిఁకాఁ బచరించవలెను

రేకు: 1812-3 ఆహిరి సం: 28-065

పల్లవి: ఎంతమోహమో కాని ఇతఁడు నీమీఁదను
సంతతముఁ బాయకిటు సరుస నున్నాఁడు

చ. 1: పలుకవే పతితోడ పగడవాతెర దెరచి
చిలుకవే సెలవులను చిరునవ్వులు
మొలకసిగ్గులివేల మోనంబు లింకనేల
కలయికకు వచ్చి ఇదె కాచుకొ న్నాఁడు

చ. 2: కనుఁగొనవె వొకమాఁటు కలువకన్నుల నితని
పెనఁగవే క్క(క?) రములను ప్రియము చల్లి
పొనిఁగేటి తమకమేల పొసఁగి గుట్టేఁకనేల
నినుఁగదియువేడుకను నిలుచున్నవాఁడు

చ. 3: కొసరవే యావేళ కూరిములు సారెకును
విసరవే సణఁగు లిటు వేమారును
వెస రతుల మరిగి శ్రీవేంకటేశుఁడుఁ గూడి
సుసరమున నీతోడఁజొక్కు చున్నాఁడు

రేకు: 1812-4 ముఖారి సం: 28-066

పల్లవి: నీవల్ల నే మైనాను నెరుసులు గలవో
వేవేలు నీ చందాలకు వెరగయ్యీమాకు

చ. 1: బత్తితోడ నాపె నీకు పచ్చడము గప్పితేను
చిత్తగించి నవ్వనేల చిఱునవ్వును
కొత్తగాఁ బూవులు దెచ్చి కొప్పు నీకుఁబెట్టితేను
హత్తి తప్పక చూచేవు అది యేమి యాకెను

చ. 2: అట్టె నీవద్దనుఁడినయద్దము చూడుమంటేను
చిట్టంటుఁదనాల నీకు సిగ్గులేఁటికి
గుట్టున సింగారాలు కొచ్చి కొచ్చి మెచ్చితేను
నట్టనడుమనేల ఆనలు వెట్టుకొనేవు

చ. 3: చేరి చేరి నీమేని చెమట దుడిచితేను
గారవిం చెంతలోనెంత కాఁగిలించేవు
యారీతి శ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
కూరిములు సారెనేమి గొసరేవు చెలిని

రేకు: 1812-5 దేసాళం సం: 28-067

పల్లవి: ఇద్దరము నొక్కటే ఇంతేశాలోయి
తిద్దుకొని యల్లుకొంటే తీగెలే పొదలుగావా

చ. 1: చలము సాదించితేను చట్రాయి నుగ్గులౌను
యిల గోరగీరితేను యేరైపారు
వలపు రేఁచవచ్చేవు వద్దు సుమ్మీ వయి నీవు
మొలకలే పెరిగితే మూకమాకులుగావా

చ. 2: పంతములాడుకొంటేను బయలెల్లా బందితౌను
చింతించితేను మంచము చెంతనే నుయ్యి
యెంత చెనకవచ్చేవు యేఁటికోయి వేసాలు
అంతటా పూపలైతేనే యట్టె పిందెలు గావా

చ. 3: కోరికలు వెంచితేను కోటానఁగోట్లౌను
పేరఁబెట్టితే పాలే పరుగౌను
యారీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నేరుపింత గలిగితే నీవే నేఁగానా

రేకు: 1813-1 ముఖారి సం: 28-068

పల్లవి: చెలుల మోములు చూచి చిరునవ్వు లేమిటికి
చెలఁగి యాతనిసేవ సేయవే ఇఁకను

చ. 1: మనసు లేకములైన మరియేల యెడమాఁట
వినయమే కలిగితే వింతలేదు
చెనకులకు లోనైన సిగ్గులకుఁ బనియేమి
వొనగూడి యతనితో నుండవే ఇఁకను

చ. 2: తేరిచూచన మీఁద తెరమఱఁగు లవి యేల
కూరిములు దొరకితేఁ గొసరవలదు
తారుకాణైనచో తగవులడుగఁగనేల
చేరి చుట్టరికంబు సేయవే ఇఁకను

చ. 3: సేసవెట్టినవెనకఁ జెప్పనేఁటికి వావి
బాసలే వొనరితేఁ బాయనేల
యీసరిని శ్రీవేంకటేశుఁ గూడితి విపుడు
వాసితో నీవితని వదలకువే ఇఁకను

రేకు: 1813-2 పాడి సం: 28-069

పల్లవి: రాఁపులు సేయక ఇఁక రావయ్యా
మాపుదాఁకా మాటలేల మరి ఇఁక రావయ్యా

చ. 1: కొచ్చి కొచ్చి సతిచేత కొలువుసేయించుకోఁగా
రచ్చకెక్కె వలపులు రావయ్యా
తచ్చి యాపె నిన్నుఁ బాసి తమకించీఁ బానుపుపై
నిచ్చట నేమిసే సేవు ఇఁక రావయ్యా

చ. 2: ఆయనాయ జాగులేల అంగనఁ జూచితేను
రాయైనాఁ గరఁగును రావయ్యా
చేయి మీఁదాయ నీకును చెల్లెను పంతములెల్లా
కాయజుపై యాన నీకు గక్కన రావయ్యా

చ. 3: సముకాన విన్నవించఁ జాలక చెలులచేత
రమణి విలువనంపె రావయ్యా
తమితో శ్రీవేంకటేశ తగవచ్చికె నేలితి
సమరతిఁ గూడ నిట్టే సంతతము రావయ్యా

రేకు: 1813-3 బౌళి సం: 28-070

పల్లవి: అంత నీకు వేడుకైతే నట్టే వెండ్లాడరాదా
ఇంతిసిగ్గులు రచ్చనేల వేసేవు

చ. 1: కాటుక కన్నుల నిన్నుఁ గాఁడఁ జూచెనంటాను
ఆఁటదానినేల నీవు అద్దలించేవు
గాఁటపుగుబ్బలు చూపి గబ్బితనాన నంటాను
నీటున నీకొపైనేల నెపాలు వేసేవు

చ. 2: నిక్కి మోవినే మాటాడి నిన్ను నోరూరించెనంటా
గక్కన మానినినేల కాకు సేసేవు
చక్కఁదనములు చూపి చవులు వుట్టించెనంటా
చిక్కించుక గోరనేల చిమ్మవచ్చేవు

చ. 3: మలసి నీముతరను మనసు గరఁచీనంటా
కలికి నెంతేసి బిగ్గెఁ గాఁగిలించేవు
యెలమి శ్రీవేంకటేశ యేలితి వీవనితను
నలిరేఁగి యెంతవడి నవ్వులు నవ్వేవు

రేకు: 1813-4 వరాళి సం: 28-071

పల్లవి: తలఁచితే సిగ్గయ్యీ దగ్గరనున్నాఁ డతఁడు
చెలులాల నాకు మీరు చెప్పరే బుద్ధులు

చ. 1: వినయమే మేసితే వెగటైతోఁచదు గదా
ననిచి పాదాలొత్తితే నవ్వఁడుగదా
తనుఁ దప్పక చూచితే దంట యిదెనఁడుగదా
చెనకి పతికి నెట్టు సేవలు సేతువే

చ. 2: కదిసి కూచుండితేను గర్వమి దెనఁడు గదా
యెదుట నుండితే నెలయించదు గదా
అదనఁ దలవంచితే నట్టె పెనఁగడుగదా
పొదిగి యాతనితోడ పొందులెట్టుసేతునే

చ. 3: చెవల్లఁ గాఁగిలించితే సిగ్గులు రేఁచఁడు గదా
మోవెడిగితేఁ బల్లు మోపఁడు గదా
యీవేళ శ్రీవేంకటేశుఁ డిందువచ్చి నన్నుఁ గూడె
యే వరుసల నితని నెంతని నే మెత్తునే

రేకు: 1813-5 కేదారగౌళ సం: 28-072

పల్లవి: సేయఁగల విన్నపము సేసితిమి నీతోడ
పాయ కిఁక నీయింతిఁ బాలించవయ్యా

చ. 1: అడియాసలనుఁ గొంత ఆతుమను తనివొందు
యెడమాఁటలనుఁ గొంత ఇంపొందును
కడుఁదమకములఁ గొంత కడపుఁ బొద్దులు సారె
పడఁతిచందంబు లివి పరికించవయ్యా

చ. 2: యెదురుచూపులఁ గొంత యెసఁగి సంతోసించు
మదరాగమునఁ గొంత మనసుపట్టు
వెదకేటిగతులఁ గొంత వేడుకలఁ జెలరేఁగు
సుదతిభావంబు లివి చూడఁగదవయ్యా

చ. 3: తలపోఁతలనుఁ గొంతదడవు మిక్కిలి చెలఁగు
వలపులను వొకకొంత వాడుదేరు
యెలమిఁ గూడితివి నీవిపుడె శ్రీవేంకటేశ
చెలియ నిటువలెనె దయసేయఁ గదవయ్యా

రేకు: 1813-6 లలిత సం: 28-073

పల్లవి: నీవే ఇది దలఁచి మన్నించితివి జవరాలి
భావించి యెంతని మెచ్చి పలికేము నిన్నును

చ. 1: నయాన గారవించితే నంటుసేతురు చెలులు
ప్రియములు చూపేతేను బెరయుదురు
నియతమే నడపితే నెట్టుకొని వలతురు
యెరఁగి మగవాఁ డంకెల నేలవలెను

చ. 2: ఇచ్చగించి కూడితేను ఇంపుసేతురు సతులు
మచ్చికలు చల్లితేను మరుగుదురు
అచ్చలాన నవ్వితేనే ఆయాలు గరఁగుదురు
కచ్చుపట్టి నాయకుఁడే కరుణించవలెను

చ. 3: చనవిచ్చి యేలితేను సతమౌదురు కాంతలు
ననుపు నటించితేను నమ్ముదురు
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో నీకెను
వనితకుఁ బతి విటువలెనే కావలెను

రేకు: 1814-1 భైరవి సం: 28-074

పల్లవి: నమ్మవే నామాఁటలు నవ్వులు గావు
పమ్మి నీమీఁదఁ గడు బత్తిగలఁ డతఁడు

చ. 1: చింతించ నీకేఁటికే చెక్కుచె య్యిదేఁటికే
వంతుకు నీరమణుఁడు వచ్చీఁగాక
సంతోసమే కలగిని సగినాలు మంచివయ్యా
వింతవేడుకనుద్దులే వినేవు నీవు

చ. 2: యెకతాలాడనేఁటికే యెవ్వరిదూరినేఁటికే
కైకొని యాతఁడే నిన్నుఁ గలసీఁగాక
నీకోరిక లీడేరి నీవున్నదిక్కు మంచిది
జోక నన్నిసోబనాలు చూచేవు నీవు

చ. 3: తలపోఁత లేఁటిక తలవంచనేఁటికే
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
వలపులు ఫలియించీ వచ్చినవేళ మంచిది
చెలరేఁగి సేవలింకాఁ జేసేవు నీవు

రేకు: 1814-2 నాదరామక్రియ సం: 28-075

పల్లవి: ఏమని చెప్పుదునే యిట్టిది నాయాందోళము
కామించాతని చిత్త మేగతి నున్నదో

చ. 1: మాటలాడినట్టుండు మరి నవ్వినట్టుండు
తాటించి విభునిరూపు దలఁచుకొంటే
గాఁటాన వచ్చినట్లుండు కరము చాఁచినట్లుండు
పాటించాతని సుద్దులు పలుమారు వింటేను

చ. 2: సరుసఁ గూచున్నట్లుండు సారెఁ జెనకినట్లుండు
ఇరవై తనమన్న లెంచుకొంటేను
విరుల వేసినిట్లుడు వేఁడుకొని నట్లుఁడు
గరిమఁ దనచేఁతలు గనుఁగొంటేను

చ. 3: చెక్కులు నొక్కినట్లుండు చేరికూడినట్లుండు
నెక్కొని పానుపుమీఁద నెలకొంటేను
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
దక్కె నా కితఁడు నేఁడు తానే గతి యంటేను

రేకు: 1814-3 పాడి సం: 28-076

పల్లవి: ఆడిగినాఁ జెప్పదా ఆంగన తనచేఁతలు
సుడిగొనీ వలపులం జూడరమ్మా

చ. 1: చెక్కునఁబెట్టినచేయిచిరుఁజెమటనొసలు
చుక్కలు గాసేటి మోవి చూడరామ్మా
జక్కువ చన్నులమీఁద జారిన పయ్యెదకొంగు
చొక్కవుకళలమోము చూడరమ్మా

చ. 2: నెరులు చెదరుఁ గొప్పు విరులు రాలేటి చొప్పు
సొరిది లేఁతనవ్వులు చూడరమ్మా
గరమతోడఁ జిట్లుగందాల ముంజేతి
సురతపు సింగారాలు చూడరమ్మ

చ. 3: పెనఁగే హారాలు మెడ ప్రేమఁ జొక్కేఁటి తనువు
జూనిఁగే శిరసు వంపు చూడరమ్మా
యెనసె శ్రీవేంకటేశుఁ డిందాఁకాఁ దను రతుల
చొనిపీ నేరుపులెల్లాఁ జూడరమ్మా

రేకు: 1814-4 సౌరాష్ట్రం సం: 28-077

పల్లవి: ఆతఁడు నీరతులకు నాస సేయఁగా
చేతులారా సేవ సేసి చిమ్మిరేఁచ వలదా

చ. 1: సెలవి నేమినవ్వేవే సిగ్గులేల పంచేవే
చెలిమిసేసి విభుఁడు చెక్కునొక్కఁగా
తలవంచుకొననేలే తమకమేల దాఁచేవే
కలికితనాల మతి కరఁగించవలదా

చ. 2: తొరలకేల లోఁగేవే తొంగి తొంగేమి చూచేవే
తెరయెత్తి యాతెండు నీదిక్కు చూడఁగా
సరియేమి వెనఁగేవే చన్నులేల మూసేవే
సరసముల నతని సాదించవలదా

చ. 3: మొక్కు లేల మొక్కేవే ముసుఁగేల వెట్టేవే
వొక్కటై శ్రీవేంకటేశుఁ డొడివట్టఁగా
గక్కన నెంత మెచ్చేవే కాఁగిట నెంత మించేవే
ఇక్కువలంటి నీగోర నెచ్చరించవలదా

రేకు: 1814-5 వరాళి సం: 28-078

పల్లవి: నే నెదుట నున్నదాన యా చేతలూఁ జూచేఁగాక
వీనులారా నీగుణాలు వినేఁగాని

చ. 1: వంతువెట్టుక మగని వలపించవలెఁ గాక
పంతాలు సవతులతోఁ బలుకనేలే
యింతే కలితే నతని నీయింటికి రప్పించుకోవే
కాంతవు నీపగటెల్లాఁ గానవచ్చీఁ గాని

చ. 2: సరుస నుండి యతని జట్టిగొ నవలెఁగాక
సరవారితోనేలే సాదిఁపులు
నెరవాదివైతేను మరుపుకోవలెఁగాక
తెరవ నీనేరు పెల్లాఁ దేటపడీఁ గాని

చ. 3: ప్రేమ శ్రీవేంకటేశుతోఁ బెనగఁగవలెఁగాక
యేమిటికే తమికించ యేరాండ్లతో
మోము చూడవే ఇతనిమందై నన్ను నీతఁడేలె
లేమవు నీకోరికలు లెక్కకెక్కీఁ గాని

రేకు: 1814-6 రామక్రియ సం: 28-079

పల్లవి: ఇంతట మన్నించరాదా యేమయ్యా
వింతసేయ కిఁకనైనా విచ్చేయవయ్యా

చ. 1: వేడుకతో వచ్చేవంటా వెలఁది గాచుకున్నది
యాడ నేమిసేసేవు యేమయ్యా
యేడలేని పనులును యెన్నైనాఁ గలవు నీకు
వీడె మందుకొందువు విచ్చేయవయ్యా

చ. 2: అందందే చెలులనెల్లా నంపె నిన్నుఁ బిలువఁగ
యెందాఁకా నవ్వులు నవ్వే వేమయ్యా
సందడిఁ గొలువుసేసే సతులు దరచు నీకు
విందారగింతువుగాని విచ్చేయవయ్యా

చ. 3: మనసు నీపై నిలిపి మరిగి యెదు రుచూచీ
యెనయరాదా యిట్టె యేమయ్యా
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి వింటిలోన
వినయము చేకొందువు విచ్చేయవయ్యా

రేకు: 1815-1 ముఖారి సం: 28-080

పల్లవి: మేలుమేలే నిన్నుఁ జూచి మెచ్చితి నేను
నాలాగు లింతకంటె నన్నుఁ జూడు మీఁకను

చ. 1: చన్నులను దాఁపురాలు సరసాన గాఁపురాలు
పన్నుక యెంతసేసేవే పతితోను
కన్నులను జాగరాలు కాఁగిటికి వేగిరాలు
చిన్నదాన వెంతేసి నేర్చితివే నీవు

చ. 2: చెలులతో మంతనాలు చేసన్నల బొంతనాలు
వెలయించే వేమిటికే విభునివొద్ద
కలసేటి కారణాలు పులకల దోరణాలు
కలగె నీకత లెట్టు గడిఇంచుకొంటివే

చ. 3: చదురుల బిత్తరాలు సమరతి తత్తరాలు
వెదచల్లేవపునే శ్రీవేంకటేశుతో
పుదుటుల పోతరాలు పుడివొని కాతరాలు
అదన నన్నియ నీకు నమరెనే నేఁడు

రేకు: 1815-2 మాళవిగౌళ సం: 28-081

పల్లవి: ఎట్టినోము నోఁచితివో ఇదివో నీభాగ్యము
చుట్టరికము లెల్లాను చూపవమ్మా

చ. 1: యెంతబత్తో నీమీఁద నింటికి వచ్చె నతఁడు
చెంతనుండి పూడిగాలు సేయవమ్మా
వంతుకు నీమీఁద నిదె వలపులు చల్లీని
వింతలు సేయక ఇఁక విడెమియ్యవమ్మా

చ. 2: యేమివేడుకోకాని యేకదాలు నీతో నాడి
వేమారు సుద్దులడిగీ వినవమ్మా
దోమటిఁ బాదాలు నీతొడలపైఁ జాఁచీని
మోము చూచి వేఁడుకతో మొక్కవమ్మా

చ. 3: యేరీతిమన్ననో నేఁడు ఇన్ని చందముల నేలె
చేరి ఇచ్చకములెల్లాఁ జేయవమ్మా
గారవించి నిన్ను శ్రీవేంకటేశుఁడు గరుణించె
కూరిమి నిటువలెనే కూడివుండవమ్మా

రేకు: 1815-3 ఆహిరి సం: 28-082

పల్లవి: చెలియున్నచందమైతేఁ జెప్పఁగరాదు
నెలకొని యెట్లా మన్నించేవో కాని

చ. 1: వేమారు చెలిసుద్దులు విన్నపాలు సేయఁగాను
యేమని వున్నదో చిత్త మెఱఁగమయ్యా
కామిని యంపినయట్టి కానుక నీకిచ్చితిమి
చేముట్టి కైకొంటి వేమిసేసేవో కాని

చ. 2: సతికడకు రమ్మని సారె నిన్నుఁ బిలువఁగా
ఇతవు నీకెట్టున్నదో యెఱఁగమయ్యా
అతివమొక్కులు నీకు నప్పగించితి మాపె –
కతలూ వింటి వెప్పుడు గలసేవో కాని

చ. 3: గుట్టుతోడ నింతికిఁగాఁ గొచ్చికొచ్చి కొసరఁగా
యెట్టున్నదో నీయెన్నిక యెఱఁగమయ్యా
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
చుట్టమ వైతివి యెంత చొక్కేవో కాని

రేకు: 1815-4 దేశాక్షి సం: 28-083

పల్లవి: చిత్తమెఱంగక లోలో సిగ్గుతోడ నున్నదాన
హత్తి నాకు నన్నిటికి నప్పణియ్యవయ్యా

చ. 1: సందడించి నీతోను సరసములాడఁగాను
అందరిలో మందెమేళ మనవుగదా
చెందినవూడిగాలు నీకుఁ జెలరేఁగి సేయఁగాను
యెందుకో లాచీనని యెంచవుగదా

చ. 2: గుట్టుతోడ నేపొద్దు కొలువులు సేయఁగాను
అట్టె వలపించవచ్చె ననవుగదా
చుట్టి చుట్టి నీతోను సుద్దులెల్లాఁ జెప్పఁగాను
బట్టబయ లీఁతలని భావించవు గదా

చ. 3: సరుస గూచుండి మోవిచవులు నిన్నడుగఁగా
అరుదంది యాసకతై ననవుగదా
ఇరవై నన్ను శ్రీవేంకటేశ ఇట్టె కూడితివి
వొరసితే చన్నులకు నొడ్డించుకోవుగదా

రేకు: 1815-5 బౌళి సం: 28-084

పల్లవి: నీవే నేరుతువే నేరుపులన్నియుఁ జెలి
కైవస మాతని నింతగాఁ జేసుకొంటివే

చ. 1: తలఁపులో మెలఁగితే తగులాయమౌఁగాక
చలములు సాదించితే చవిపుట్టీనా
చెలుములు సేసితేనే చెల్లుబడియౌఁగాక
బలుములు చూపితేను భావము గరఁగునా

చ. 2: నవ్వులు నవ్వితేనే నాటుఁగాక ప్రియములు
రవ్వసేసితే సేవలు రతికెక్కీనా
వువ్విళ్లూరఁ బెనఁగితే వొనరుఁగాక వేడుక
దవ్వులను మాఁటాడితే తనివయ్యీనా

చ. 3: వినయమే సేసితేను విచ్చనవిడియౌఁగాక
మనసియ్యకుండితేను మర్మమంటీనా
యెనసెను శ్రీవేంకటేశుఁ డింతలో నిన్ను
ననుపింత గాకుండితే నమ్మిక ఇంతౌనా

రేకు: 1815-6 వరాళి సం: 28-085

పల్లవి: నే నిన్ను వద్దనేనా నెపాలు వేసేవు గాక
కానిపనే ఇది యేమి కైకొనఁగవలదా

చ. 1: వనిత కూఁచిపట్టుక వావులెల్లాఁ జెప్పఁగాను
వినవద్దా నీకేల వెడసిగ్గులు
పెనఁగి విడెమియ్యఁగా ప్రేమ నందుకోవద్దా
పనిలేనియాచారాలు పచారించవలెనా

చ. 2: పువ్విళ్ళూర బుజ్జగించి వొడఁబరచఁగా మెచ్చి
నవ్వవద్దా నీకేల నాలితనాలు
నివ్వటిల్లు సోబనాలు నెరపేది మేలు గాదా
జవ్వనితో చలములు సాదించవలెనా

చ. 3: నెయ్యపుఁ జుట్టరికము నెరపఁగా నీవునట్టె
ఇయ్యకొనవద్దా నీకేల యెదురాడను
యియ్యెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నాకె-
నొయ్యనే నిన్ను బోదించు టుచితమే కాదా

రేకు: 1816-1 ఆహిరి సం: 28-086

పల్లవి: మరిగినచోటికి మంచితనమే మేలు
తరవాతి పనులెల్లా తానెఱుఁగు ననరే

చ. 1: తను నేమి దూరరాదు తమక మాపగరాదు
వినయాన మొక్కేనని విన్నవించరే
పెనఁగఁగరాదు మరి ప్రియము చెప్పకపోదు
తనరూపే మనసులో తలపోసే ననరే

చ. 2: పచ్చి కక్క సించరాదు వలపు నిలుపరాదు
వినయాన మొక్కేనని విన్నవించరే
కొచ్చి కోపగించరాదు కోరికనుడుపరాదు
నిచ్చాదనకతలే వినేనని యనరే

చ. 3: చెనకరాదు చెనకి సిగ్గులు పడఁగరాదు
తలమేలు దాననని తలఁపించరే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోఁదా వచ్చి నన్ను
తినిసితిఁ దానాకు తగులాయ ననరే

రేకు: 1816-2 రమక్రియ సం: 28-087

పల్లవి: ఇన్నిటా రట్టడివౌదు వెఱ్ఱఁగుదు నీ జాడలు
మన్ననలు చేకొంటివి మచ్చికలు చల్లవే

చ. 1: పంతా లాడవద్దుగాని పడఁతి విభునితోడ
చెంతనుండి విన్నపాలు సేసుకొనవే
వింతసేయవద్దుగాని వేడుకతో విడెమిచ్చి
సంతోసాలు రేఁచి మోవి చవిచూపవే

చ. 2: గబ్బితనా లొద్దుగాని కదిసి వినయముతో
వుబ్బురేఁ చూరక పాదాలొత్తఁగదవే
సిబ్బితింత వొద్దుగని చెలరేఁగి పొందుచూసి
గుబ్బలనొత్తి వలపు గుమ్మరించవే

చ. 3: గయ్యాళించవొద్దుగాని కాఁగిట శ్రీవేంకటేశు –
నియ్యెడఁ బొదిగి కడునింపులు చూపవే
కొయ్యతనా లొద్దుగాని కూడె నిన్నితఁడు నేఁడె
వొయ్యనొయ్యనే నేరుపు లొనరించవే

రేకు: 1816-3 బౌళి సం: 28-088

పల్లవి: ఎందాఁకా జూజాలాడే వింతులతోను
పొందెరిఁగి యాపెనిట్టె బుజ్జగించవలదా

చ. 1: సొలసి చెలియ నిన్నుఁ జూచి చూచి వేసారె
వెలినుండి విరులను వేసి వేసారె
పలుమారు నీపదాలు పాడిపాడి వేసారె
కలికిఁ దలెత్తి చూచి కరుణించవలదా

చ. 2: నవ్వుచు నీ యెదుట సన్నలు సేసి వేసారె
వువ్విళ్ళూరఁ గొనగోర నూఁది వేసారె
చివ్వనఁ బన్నీరు నీపైఁ జిమ్మి చిమ్మి వేసారె
జవ్వనితో మాఁటలాడి చనవియ్యవలదా

చ. 3: సంగడి వచ్చి కూచుండి చన్నుల నొత్తి వేసారె
చెంగటఁ దొడపై తొడచేర్చి వేసారె
యింగితము శ్రీవేంకటేశ యెరిఁగి వచ్చి
అంగనఁ గూడితి వింకా నప్పటి రావలదా

రేకు: 1816-4 హిజ్జిజి సం: 28-089
పల్లవి: ఇంకనేలదాఁచేవే యెరిఁగిన పనులకు
పొంకపు సంతోసాలఁ బొదలేమే నేము
చ. 1: సెలవుల నవ్వుదేరెఁ జెక్కులఁ జెమటగారె
తెలిగన్నులచూపులనుఁ దెల్లవారెను
పులివచ్చి మోవితేనె లువ్వుచు నువ్విళ్ళూరె
మలసి నీపతి నీతో మాఁటాడె నటవే
చ. 2: అట్టె తురుము వీడె నంగమెల్లా వసివాడె
దట్టపు సిగ్గులెల్లానుఁ దలకూడెను
రెట్టించి నిద్దురలదె రెప్పలనె యల్లాడె
లెట్టన నీరమణుఁడు నిన్నేలెనటవే
చ. 3: నీమైగురుతులు నిండె నిలువు నూరువండె
ఆము కాతనిసొమ్ము నీకమరుండెను
యేమి నోము నోఁచితివో యిదివో నీపక్కఁబండె
ప్రేమ శ్రీవేంకటేశుఁడు పెండ్లాడెనటవే

రేకు: 1816-5 సామంతం సం: 28-090

పల్లవి: వలపించఁబోయి నీవే వలచితివి
యిల నెంత జాణలకు నిట్టుండుఁ బనులు

చ. 1: ఆఱడిఁ బెట్టి యాతని నాసలేల కొలిపే వే
జాఱుఁ గొప్పంతక చక్కఁ బెట్టవే
మీఱి మీఱి యప్పటిని మేలము లేమాడేవే
జోఱునఁ గారీఁ దుడుచుకొనవే చెమట

చ. 2: మాఁటలఁ జొక్కించాతని మర్మమేల కరఁచేవే
గాఁటపు నీచీర లెన్స కట్టుకొనవే
నాఁటఁజూచి యాతని మనసెంత మరిగించేవే
పాటించి నీగుబ్బలపై పయ్యద గప్పుకోవే

చ. 3: చేతుల చాఁచి యతని సిగ్గులేల వరచేవే
నీతలపులోని తమి నీవెంచుకోవే
యాతఁడే శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నునేలె
కాతరమేల రేఁచేవే కడుమోహించితివి

రేకు: 1816-6 పాడి సం: 28-091

పల్లవి: ఇతఁడు నామగఁడౌట యెఱఁగవటే
రతికెక్కఁ జెనకేవు రమణుని నిపుడే

చ. 1: పొందులు చూపే వెదుటఁ బుక్కిటఁ దమ్మదాపేవు
యిందుఁగానియీపగటు యెరఁగరటే
కందువకు వచ్చేవు కానుకలు నిచ్చేవు
యిదరలో నా నీకు నెంత పని గలదే

చ. 2: సారె సారెఁ బొలసేవు చనవుతో సొలసేవు
నేరుపు లిందునఁగాని నెగడవటే
మేరమీరి నవ్వేవు మేలములు దవ్వేవు
వూరకే వలపులెల్లా నుమ్మగిలీ నటవే

చ. 3: జిగిచన్నులఁ గమ్మేవు చెమట గోరఁ జిమ్మేవు
తగులు నీకిందుఁగాని దాకొనంటే
నిగిడి శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నునేలె
మొగము చూసేవు నీకు మోహమెంత గలదే

రేకు: 1817-1 సామంతం సం: 28-092

పల్లవి: ఇన్నిటా సంతోసమాయ నిటు మిమ్మిద్దరిఁ జూచి
మన్నించినమన్ననలే మంతుకెక్కె నిపుడు

చ. 1: కలువ లెవ్వరిఁ గాఁడీ కంతుఁడెక్కడ నేసీ
నెలఁతను నీవు గరుణించితేఁ జాలు
చలువలే వేఁడియౌనా సతులకుఁ బతులకు
వలచినవలపులే వడిగొనీఁగక

చ. 2: చందురుఁ డెవ్వరు నేఁచీ చల్లగాలేమి సాదించీ
ఇందువదనను నీవేలితేఁ జాలు
గందము మొగజాటౌనా కాయములఁ బూసితేను
పొందు సేసినపొందులే పోదిసేసీఁ గాక

చ. 3: తుమ్మిదల కేడపగ దూరనేల చిలుకల
కొమ్మా నీవూ నిట్లానే కూడితేఁ జాలు
యిమ్ముల శ్రీవేంకటేశ యిచ్చక మెరవులౌనా
నెమ్మిఁ గోరినకోరిక నెట్టుకొనీఁగాక

రేకు: 1817-2 పాడి సం: 28-093

పల్లవి: మేటి నేరుపరులాల మెలుఁతలాల
కూటము లిద్దరికినిఁ గూరుచరె యెపుడు

చ. 1: చెప్పఁగానే నోరూరీ చెలువునిచేఁతలు
చొప్పులెత్తెతని నాకుఁ జూపఁ గదరే
కుప్పవడీ గోరికలు గుణములు వింటేను
వొప్పుగాఁ బొందులు నాకు నొనరించరే

చ. 2: వినవే వేడుకవుట్టీ విభుని చక్కఁదనాలు
అనువుగా నిద్దరి మాటాడించరే
మనసయ్యీ నాతనిమంచితనాలు చూడఁగా
యెనయఁగ నాతని నింటికిఁ దోడితేరే

చ. 3: తలఁచఁగానే వచ్చె తానె శ్రీవేంకటేశుఁడు
తెలుపరే నామోహము దేవునికిని
తిలకించి చూచి ఇట్టె తిరముగాఁ బెండ్లాడె
కలకాలమును నన్నుఁ గరుణించుమనరే

రేకు: 1817-3 దేసాళం సం: 28-094

పల్లవి: నీవెఱఁగవా చెలియ నెరజాణ విన్నిటాను
వావిరి నేఁ జెప్పనేల వలపుజాడ లివి

చ. 1: వినయము గలిగితే వేడుకలు సమకూరు
మనసెనసితేను ప్రేమము వుట్టును
ననుపు గలిగితేను నాఁటుకొను మోహము
వనితకుఁ బతికిని వలపురజాడ లివి

చ. 2: వోరుపు గలిగితేనే వొనరుఁ జుట్టరికాలు
నేరుపే కలిగితేను నేస్తమీడేరు
కూరిమి గలిగితేను కొనసాగు భోగములు
వారక యెవ్వరికైనా వలపుజాడ లివి

చ. 3: యిచ్చకము గలిగితే నింపులెల్లా నిండుకొను
ముచ్చట లొనరితేను ముదమలరు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
వచ్చి యిదె వున్నాఁడు మీవలపుజాడ లివి

రేకు: 1817-4 ధన్నాసి సం: 28-095

పల్లవి: కంకణము గట్టితివి కాంత నీకు దేవులాయ
ఇంక నిట్టె వుండరయ్య ఇది మా విన్నపము

చ. 1: దయతో మన్నించవయ్యా తరుణి నీకెప్పుడును
ప్రియురాలు సేసపాల వెండ్లికూఁతురు
నియతాన నేలవయ్యా నేరాలు వేయకువయ్య
నయగారి పాయరాని ననుపైనచుట్టము

చ. 2: కులశీలము గలది గుణవంతురాలు యాకె
నలినాక్షి నీకు మేనమఱఁదలు
తలఁపునఁ బెట్టవయ్య తగులు వాయకువయ్య
ఇలువరుసగలది యాడుజోడైనది

చ. 3: గరిమ నెల్లకాలము కాఁపురము సేయవయ్య
ఇరవైన జవరాలు ఇల్లాలు యాకె
మరిగి శ్రీవేంకటేశ మంచివేళఁ గూడితిరి
తరుణి నీమీఁద సంతతభక్తి గలది

రేకు: 1817-5 వరాళి సం: 28-096

పల్లవి: తరవాతి పనులెల్లాఁ దలచిత్తమే యెఱుఁగు
ఇరవై వున్నాఁడు తల కెచ్చరించేదేమే

చ. 1: పిలువఁగాఁ బిలువఁగా ప్రియములు సమకూరు
తలఁచఁగాఁ దలఁచఁగా తమి వుట్టును
చలపట్టి వలెనంటే సాదించవచ్చువలపు
కొలఁదిమీరి తన్ను నేఁ గొసరేదేమే

చ. 2: చెనకఁగాఁ జెనకఁగా చిత్తములు గరఁగును
పెనఁగఁగా బెనఁగఁగా బెరయఁ (యుఁ ?) బొందు
తనకే సమ్మతి యైతే తగులుఁ జుట్టరికము
వెనువెంటఁ దనకు నే విన్నవించేదేమే

చ. 3: చూడఁగాఁ జూడఁగాను సురతకాంక్షలు వుట్టు
కూడఁగాఁ గూడఁగా గందుకొను ముదము
యాడనె శ్రీవేంకటేశుఁ డింతలోఁదా నన్నునేలె
జోడువాయ మిఁక మరి చొక్కించే దేమే

రేకు: 1817-6 బౌళి సం: 28-097

పల్లవి: ఎన్నేసి చేఁతలు చేసీ నీపె నీముందరను
సన్నలా చాయలా నీకు చవులు చూపీని

చ. 1: అతివ నీమోము చూచీ నదె చిత్తగించవయ్య
కతచెప్పీ వినవయ్య కమ్మటి నీవు
తతెరింగి బత్తిసేసీ తగిలి చేకొనవయ్య
మతిలో నీ యాసోదము మరినెంతగలదో

చ. 2: పొలఁతి నీముందరను పొలసీ నదిగోవయ్య
కొలువులు సేసీఁ జే కొనవయ్యా
సెలవుల నవ్వీని చేరి చనవియ్యవయ్యా
తలకొన్న వలపులు తనకెంత గలదో

చ. 3: దిసి కూచున్నది కాఁగిలించుకొనవయ్యా
వొదిగి రతుల నిట్టె బోగించవయ్యా
అదన నన్నేలితివి యన్నిటా శ్రీవేంకటేశ
పొతలిన యాపె తలపోఁత లెంతగలదో

రేకు: 1818-1 కాంబోది సం: 28-098

పల్లవి: ఒరపు నేరుతువే వోయమ్మా
సరగున నతని నాసలఁబెట్టేవే

చ. 1: కలువకన్నులను కాఁటుకలొలుకఁగ
సొలసి యెంత పతిఁ జూతేవే
సెలవులఁ జిందేటిచిరునవ్వులతో
పలుకు లెంతవడి పచరించేవే

చ. 2: శిరసు పై నెరులు చెంపల జారఁగ
సరసము లెందాఁగ జరపేవే
అరిమురి గళబెళమను వయ్యెదతో
విరుల నే లతని వేసేవే

చ. 3: చనుమొనలఁ జెమట జడిగొని వడియఁగ
వొనరఁ బాదము లెట్లొత్తేవే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నను నిదె
పెనఁగుచు నాతని బెరసేవౌనే

రేకు: 1818-2 తలుఁగుఁగాంబోది సం: 28-099

పల్లవి: ఏమిసేతు నమ్మలాల యిదివో నాచందము
వేమరు నాతని కిట్టె విన్నవించరే

చ. 1: చెలరేఁగీఁ బులకలు చిగిరించీఁ గోరికలు
తలఁపులో నాతనిఁ దలఁచితేను
నిలువెల్లాఁ జెమరించీ లెట్టుకొనీఁ దమకము
చెలులచే నాతనిచేఁతలు వింటేను

చ. 2: నిరతిఁ గరఁగీ మతి నిట్టూర్పు లెచ్చీ ముక్కున
బెరయ నాతని నిట్టె పేరుకొంటేను
వెరగు లుప్పతిల్లీ వెక్కసమయ్యీ నాసలు
తిరిగి యాతనియింటి దిక్కు చూచితేను

చ. 3: పచ్చిదేరీఁ జెనకులు పైకొనీ సెలవినవ్వు
మెచ్చి యాతనిసొమ్ములు మేనఁ బెట్టితే
యిచ్చటికి వచ్చి నిన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
మచ్చికతో వేడుకయ్యీ మంతనాన నుంటేను

రేకు: 1818-3 వరాళి సం: 28-100

పల్లవి: ఇప్పుడే కంటిమి నేఁడు యీకొత్తలు
కుప్పలుఁ దెప్పలునాయ గురుతు లన్నియును

చ. 1: ముప్పిరి నీ సెలవుల ముదురువెన్నెలగాసీ
చొప్పుగా మోవిమీఁదఁ జుక్కలు గాసీ
కొప్పున నుండి మెల్లనె కురిసీఁ బువ్వులవాన
చెప్పవే నీకతలెల్లా సిగ్గులేల ఇఁకను

చ. 2: జిగిఁ జన్నుగొండల పై సెలయేరులు వారీ
మొగము పై జారిజారి మొయిలువారీని
మిగులాఁ జెక్కులమీఁద మెరుఁగుగళలు మించీ
తగ నాకు నూచించవే తలవంచనేఁటికి

చ. 3: మటి నీ కనుఁగొనల మాణికము లుప్పతిలీ
వుటకమై జాజినన లుప్పతిలీని
జటసి శ్రీవేంకటేశ్వరుఁడు నిన్నేలఁబోలు
యెటిఁగించవే నాకు నిట్టె సంతోసించేను

రేకు: 1818-4 ముఖారి సం: 28-101

పల్లవి: నీవుగలచోటనే యన్నియుఁ గలవు
చేవదేరీ నీమేన సింగారాలన్నియును

చ. 1: నిమ్మపండు కానుకగా నీవేమి ఇచ్చేవే చెలి
నిమ్మపండ్లంతలే కావా నీ చన్నులు
తమ్మిపువ్వు లెల్లాను తలనేలముడిచేవే
తమ్మిపువ్వులే నీహస్తములు గావా

చ. 2: చిలుక ముంజేతఁబట్టి చేరి పలికించనేలే
చిలుకపలుకే కాదా చెలి నీమాఁట
కొలువు సేసేవేమే కోరి వేఁడినంగజుని
కొలువుకూటమే కాదా కొమ్మరో నీ కాఁగిలి

చ. 3: చిగురుల నేల వేసేవే నీవు పలుమారు
చిగురువంటిదే కాదా చెలి నీమేను
జిగి నన్నుఁ గూడేవేమే శ్రీవేంకటేశుఁడనని
జిగిబిగి పొందులే మంచి కూటమి గాదా

రేకు: 1818-5 భైరవి సం: 28-102

పల్లవి: చిత్తగించవయ్యా యేమి సిగ్గులు వడేవు నీవు
తత్తరించీఁ దమకము తవ్వితవ్వి యిపుడు

చ. 1: పువ్వు వంటి జవ్వనము పొలఁతి మేనఁ బెట్టుక
వువ్విళ్ళూరీ నీయెదుట నుండి యిదివో
నవ్వులు సెలవులను నానవేసి నానవేసి
కువ్వవోసీ వలపులు గురుతుమాటలను

చ. 2: కడలేని కాంక్షలను కన్నులలో నించుక
పడఁతి నీమోము చూచీఁ బలుమారును
గుడిగొ న్నసరసాలు కొనగోర నించి నించి
చిడిముడి మూటగట్టీ చిమ్ముఁ జెనకులను

చ. 3: కందువైన రతులెల్లా కాఁగిటలో నిలుపుక
చిందీ మోవితేనెలు చేరి నీవద్ద
పొంది శ్రీవేంకటేశ భోగములఁ గూడికూడి
అందిచ్చీ నీకు సంతోసా లాసలాసలను

రేకు: 1818-6 గౌళ సం: 28-103

పల్లవి: ఇల్లాలికిఁ దగునటే యింతరట్టడితనము
వొల్లనే మితిమేరతో నొనగూడవలదా

చ. 1: రవ్వలుగా నవ్వేవు రతికిట్టె లాచేవు
చివ్వన పతిముందర సిగ్గువడవు
పువ్విళ్లూరఁ జన్నులను వూఁదేవాతని వీఁపున
ఇవ్వలఁ గొంచించవు యెంత మందెమేళమే

చ. 2: తప్పక మోము చూచేవు తగన మాటాడేవు
కుప్పళించేవు మోహము గుట్టెరఁగవు
ముప్పిరి నేడనైనాను మోవితేనె లడిగేవు
చెప్పరాదే వెరగయ్యా చెల్లఁబో నీ పగటు

చ. 3: తొక్కే వాతని పాదము దోమటికిఁ బెనఁగేవు
తక్క వాతని ఘనత దలఁచుకోవు
యిక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
చక్కఁ జూడవే నీవు జాణవౌదు విపుడు

రేకు: 1819-1 పళవంజరం సం: 28-104

పల్లవి: ఎంతబిత్తరాలు యిది యేమిచెప్పేది
కాంతుఁడవు నీవు నాకుఁ గలిగివున్నాఁడవు

చ. 1: కూరిములు నీమీఁద గుప్పలు వోసిపోసి
తూరుపెత్తి పోలిచుట్టీఁ దోడుతోడనె
నేరుపునఁ జెమటతో నిలువుఁగొలువునేసి
వూరఁబోసీఁ దమకము లుబ్బరితనానను

చ. 2: మంతనాన నీతోను మాటలెల్లా నాడి యాడి
దొంతిఁబెట్టీ వలపులు తోడుతోడనె
సంతోసాన నీవద్ద సారెకు నవ్వులెల్లాను
సంతఁబెట్టి యమ్మఁజూపి చవులు సేసీని

చ. 3: వొడ్డారాన జన్నుల నిన్నొత్తి పై పైఁ గూడి కూడి
దొడ్డిఁ బెట్టీ వలపులు తోడు తోడనె
జిడ్డుదేర మోవి యాని శ్రీవేంకటేశ మెప్పించె
వడ్డిగొనీ మన్ననల వనిత ని న్నిపుడు

రేకు: 1819-2 శ్రీరాగం సం: 28-105

పల్లవి: కంటిమే నీయందు నేఁడు కన్నుల పండుగగాను
పంటలైన సంతోసాలు పెనగొనీ నీకును

చ. 1: కలికితనాల మంచికనుఁగొనచూపులు
సెలవినవ్వులలోని చిరిసిగ్గులు
బలుచన్నులమీఁది పయ్యెదజారులును
వలపుఁదేనెమోవి వసివాడులు

చ. 2: సమ్మతించ నాడేటి సణఁగులమాటలు
చెమ్మఁ జెమటలలోని చే సన్నలు
వుమ్మగిలేవూరుపుల వుబ్బరిమోము కళలు
తమ్మల వుక్కిళ్ళ తరితీపులు

చ. 3: గుట్టుతోనే వెదచల్లే కొసరుల సళుపులు
తట్టమైన యాసల తమకములు
యిట్టె శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడఁగాను
నెట్టుకొన రతులలో నేరుపుల సిరుల

రేకు: 1819-3 సౌరాష్ట్రం సం: 28-106

పల్లవి: తానూ సవతినంటా తారుకాణకేల వచ్చీ
మానుమనరే యెమ్మెలు మదిరాక్షులాల

చ. 1: చెప్పరాని మాటలు చెవియొగ్గి వినరాదు
పిప్పిలో నిరసములు పిండుకోరాదు
వుప్పాఁ జప్పాగాని చవులుట్టిఁ బెట్టుకొనరాదు
చెప్పరే యాపెకు బుద్ది చెలియలాల

చ. 2: వలవని వలపులు వంచి వొడిఁగట్టరాదు
పిలువని పేరఁటము పెనచరాదు
మొలవనిమొలకలు మోపులు గట్టఁగరాదు
తెలుపరే యావిధము తెరవలాల

చ. 3: ఆఁపరానికోరికలు అంగడిఁ బెట్టఁగరాదు
చూపరాని గుఱుతులు చూడఁగరాదు
యేపున శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
మాపొందులు వొగడరే మగువలాల

రేకు: 1819-4 హిందోళవసంతం సం: 28-107

పల్లవి: పోలిచితే నీబాగులు పొద్దొక వింతలాయ
మేలు మేలు నిన్నుఁ జూచి మెచ్చేరే నీ చెలులు

చ. 1: ముచ్చటలాడీఁ దుమ్మిదమూఁకలు నీనొసలిపై
రచ్చకెక్కె జక్కవలు రాసి నక్కన
పచ్చితేరీఁ జిగురాకు పలుకులవాతెరను
గచ్చులనీసింగారాలు కతలాయఁగదవే

చ. 2: వెన్నెలలుగాసీని వేడుకనీసెలవుల
కన్నులఁ జకోరా లేకతమాడీని
మిన్నక జాజితీగె మేకొనుచు ననలొత్తీ
కన్నెరో సింగారాలు కతలాయఁగదవే

చ. 3: నెట్టుకొని చలిగాలి నిగిడీ నీముక్కునను
తొట్టీ నీపై వెరగుల తోడు తోడనె
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
గట్టిగ నీసింగారాలు కతలాయఁగదవే

రేకు: 1819-5 మాళవిగౌళ సం: 28-108

పల్లవి: ఏమని పొగడవచ్చు నిద్దరి నీ నేరుపులు
ఆముకొన్న జాణతనా లమరు నీకెపుడు

చ. 1: నాఁటుకొన నీవాడే నయగారితముల –
మాఁటలకే వలచెను మగువ
చీటికి మాటికి నీవు చెందమ్మికన్నులఁ జాచే –
జూటరిచూపులకే చొక్కి మరిగినది

చ. 2: పువ్విళ్ళూర నేపొద్దా నీపుడివోని సెలవుల –
నవ్వులకే తగులాయ నలినాక్షి
రవ్వలుగాఁ జెక్కు నొక్కి రతివేళ నీవిచ్చేటి –
నివ్వటిల్లు మోవికే నిన్ను మరిగినది

చ. 3: హత్తి నీవు పాయలేక ఆసయిచ్చి లాలించే-
బత్తికే నీపాలఁ జిక్కె పడఁతి
యిత్తల శ్రీవేంకటేశ యాకె నిట్టే యేలితివి
కొత్తగు నీచేఁతలకే కూడి మెచ్చినది

రేకు: 1819-6 తెలుఁగుఁగాంబోది సం: 28-109

పల్లవి: ఎంత నీపై వలపో యెటువంటి కూటములో
వింత వింత వినోదాల విచారాల వెల సె

చ. 1: గుట్టుతోడ నిన్నెదురుకానేటిపరాకున
గట్టిచన్నులఁ బయ్యద గప్పు మఱచె
చుట్టి చట్టి నీమొగము చూచేటి వేడుకను
అట్టె చెలిచేతియాకు అందుకోను మఱచె

చ. 2: మలసి నీతోడుతను మాఁటాడె తమకమున
తిలకము లొసలను దిద్ద మఱచె
నలువంత నీతోను నవ్వే నిబ్బరమున
తొలఁగుఁ జెక్కుఁజెమట దుడుచుకో మరచె

చ. 3: కందువకు నిన్నుఁ దీసి కాఁగిలించీయాసోదాన
ముందు ముందుగాఁ దలుపు ముయ్య మఱచె
యిందుముఖి శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
పంది (దె ?) మాడి కొనగోరఁ బచ్చిసేయ మఱచె

రేకు: 1820-1 కన్నడగౌళ సం: 28-110

పల్లవి: పచ్చిదేరి జవ్వనము పరువము వచ్చె నీకు
విచ్చనవిడాయ నేఁడు వేరులు మరేఁటేకే

చ. 1: వలిపెపయ్యెదలోని వలుద చన్నులకాంతి
వెలికి నురికీఁ గదే వెలఁది
సెలవుల నిండుకొన్న చిరుతనవ్వులసిగ్గు
పులియఁ బెట్టకువే పొద్దుకుఁ బొద్దుకును

చ. 2: రెప్పలమఱఁగునను రేఁగిన చింకచూపులు
వుప్పరా లెగసీఁగదే వువిదా
ముప్పిరిగొనీ సారె మోవిమీఁదఁబలుకుల
కుప్పలు వేయకువే కొసరులను

చ. 3: మురిపెపుఁ బిరుదులు మొలనూలిగంటలతో
సురతము చాటీఁ గదే సుదతి
యిరవైన శ్రీ వేంకటేశుఁడ నే నన్నుఁ గూడి
వెరగుల వడకువే వెలసె నీపొందులు

రేకు: 1820-2 రామక్రియ సం: 28-111

పల్లవి: నేరుపరి తొల్లె చెలి నీవు నెరజాణవు
యేరుపర చింకాఁ గతలేల చెప్పేవయ్యా

చ. 1: మాఁటలు నీవాడితేనే మన్నించేవని తెలిసె
నాఁట గోరనూఁదితేను నవ్వేవని తెలిసె
చోటిచ్చి రమ్మంటేనే చొక్కించేవని తెలిసె
యేఁటికి నాపెకు బత్తి యెంత చెప్పేవయ్యా

చ. 2: కొనచూపులఁ జూచితే కూడేవని తెలిసె
లనిచి చెక్కునొక్కితే నమ్మించేవని తెలిసె
చెనకఁగానే నీ చేతలన్నియుఁ దేలిసె
యెనసె నీతలఁపులు యేమి చెప్పేవయ్యా

చ. 3: లలిఁ జెయివట్టితేనే లాలించేవని తెలిసె
మొలక చన్ను లంటితే మోహమంతయుఁ దెలిసె
యలమి శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
యెలుగెత్తి నీవేడుక లెన్ని చెప్పేవయ్యా

రేకు: 1820-3 పాడి సం: 28-112

పల్లవి: పొలఁతులే వలపులపుట్టుగుల పొలములు
తెలియఁగ నెట్టువచ్చు దేవుఁడే యెఱుఁగును

చ. 1: సొలపుఁగన్నులు మించుఁజూపులవిత్తనములు
లలి దంతములు నవ్వులమొలకలు
పలుచని పెదవుల పలుకుల చిగురులు
తళుకుఁ జెక్కులు సొంపుఁగళల మారాకులు

చ. 2: బరయుఁ జేతులు రతిఁ బెనగొనే తీగెలు
కరములు చేఁతల కంగపు విరులు
సరుస జన్నులు మంచి జవ్వనపుఁ గాయలు
సరవిఁ జక్కఁదనాల సంసారపు పంటలు

చ. 3: కటిసొబగులు రతికాణాచి కణజాలు
కుటిలకుంతలాలే కొమ్మలబాగు
ఇటువలె శ్రీవేంకటేశ్వరుని వేడుకలు
విటవిటీ జనులందు వెల పై నీకతలు

రేకు: 1820-4 మాళవిగౌళ సం: 28-113

పల్లవి: చెప్పరాని ముచ్చటల చిన్నదానవు
ఇప్పుడిట్టె యిందరిలో నేమి నేర్చుకొంటివే

చ. 1: తగులనాడే యట్టి తరితీపు మాఁటలు
చిగురుఁ బెదవిమీఁది చిరుసిగ్గులు
మొగము చూపులలోని ముప్పిరిగొనే నవ్వులు
ఇగురుఁబోఁడివి నీవు యెక్కడ నేర్చితివే

చ. 2: పంతపు మాఁటల తోడి పచ్చి పచ్చి చేఁతలు
దొంతులు వేరిచేయట్టిదొరతనాలు
మంతనాన రేఁచేటి మఱఁగుల సొలపులు
యెంతకెంత జవరాల వెట్టు నేర్చుకొంటివే

చ. 3: తనివోని తమకపు తరితీపుఁ జెనకులు
వినయపు టిచ్చగింపు వేడుకలు
ఘనుఁడు శ్రీవేంకటకడపరాయనిఁ గూడి
యెనలేని సరసము లెందు నేర్చుకొంటివే

రేకు: 1820-5 దేసాళం సం: 28-114

పల్లవి: ఎందాఁకా పట్టిజోలి యేల సేసేవు
కందువకు పచ్చితివి కరుణించు మిఁకను

చ. 1: కొత్త కొత్త మాట లాడి కొమ్మ నీపదాలు వాడీ
చిత్తగించి వినవయ్య సిగ్గులేఁటికి
గుత్తపుగుబ్బలు చూపి గురుతు నీమై మోపీ
బత్తి చేకొని యాపెనుఁ బైకొనఁగరాదా

చ. 2: కన్నులఁ దప్పక చూచి కాఁపురములకు లాచీ
మన్నించి ఇంతటనైనా మాటాడరాదా
సన్నలనే మోని ఇచ్చి సముకాన నిన్ను మెచ్చీ
చెన్నుమీరఁ గాఁపురాలు సేయఁగరాదా

చ. 3: కూరిములు నీపై నించి గుట్టుతో రతికి బొంచీ
గారవించి వేడుకతోఁ గైకొనరాదా
చేరి నన్ను నేలితివి శ్రీవేంకటేశ్వర నేఁడు
నారుకొన నీపెతోడా నవ్వఁగరాదా

రేకు: 1820-6 భైరవి సం: 28-115

పల్లవి: ఇందులకే వెరగయ్యీ నిచ్చట నాకు
చెంది నాపై బత్తు వీడఁ జేసినే తాను

చ. 1: చెక్కులచెమటతోనే చెదరినకొప్పుతోనే
యెక్కడనుండి వచ్చీనే యిపుడు తాను
పుక్కిట తమ్మతోనే కొంత నిట్టూర్పులతోనే
ఇక్కువ లేలంటీనే యిదివో తాను

చ. 2: చిప్పిలుఁ గళలతోనే చిట్లుగందాలతోనే
తప్పక యేమి చూచినీ తగిలి తాను
కప్పినరెంటెముతోనే కరఁగుజవ్వాదితోనే
ఆప్పటి నన్నెంత చేరి నదివో తాను

చ. 3: చిమ్ముఁ జెనకులతోనే చిగురుసిగ్గులతోనే
యెమ్మె లెట్టు చూపీనే యెదుటఁ దాను
అమ్మరో శ్రీవేంకటేశుఁ డట్టె వచ్చి నన్నుఁ గూడె
పిమ్మట నెన్ని చెప్పీనే ప్రియాలు తాను

రేకు: 1821-1 ఆహిరి సం: 28-116

పల్లవి: ఎదురుచూచీఁ జెలియఇంటి కిట్టె రారాదా
ఇదివో ఇక్కడ నీవు యెమి సేసేవయ్యా

చ. 1: ప్రియములు చెప్పియెప్పి పిలువనంపనే పట్టె
నయముతోఁ జెలియకు నాథుఁడ నిన్ను
దయవుట్ట మాటలాడితగుల నిందాఁకాఁ బట్టె
నియతాన నెప్పుడు మన్నించేవయ్యా

చ. 2: తమితోడ నీరూపు తలపోయనే పట్టె
మమకారాన సతికి మగఁడ నిన్ను
సముకానకు లేకలు సారె వ్రాయనే పట్టె
జమళిగూడి యెప్పుడు చలవిచ్చేవయ్యా

చ. 3: కాంతలతో నీగుణాలు కడుఁబొగడనే పట్టె
ఇంతికిని శ్రీవేంకటేశుఁడ నిన్ను
యింతలో నీకెఁ గూడితి వీడకే నీవు వచ్చి
వంతులో దినము నిట్టె వరమియ్యవయ్యా

రేకు: 1821-2 సాళంగం సం: 28-117

పల్లవి: బుద్ధిచెప్పేము నీకు పుట్టినయింటివారము
పొద్దువొద్దు మగనికి పొందులు మరుపవే

చ. 1: గుత్తపు గుబ్బల నూఁది కొప్పు దువ్వవే పతి –
చిత్తమురా వేళగాచి సేవ సేయవే
హత్తి ఇచ్చకపుమాఁట లాడి పైకోవే
కొత్తపెండ్లికూఁతుర యాగుణాలెఱుఁ గుకోవే

చ. 2: వినయాలు చూపి చూపి వీడె మియ్యవే
ననుపులు సేసుకొని నవ్వు నవ్వవే
తనివారా భోగమిచ్చి తమిరేఁచవే
వొనరినకొమెరెవు వోజ నేరుచుకోవే

చ. 3: మోవితేనియ లోసఁగి మోము చూడవే
శ్రీవేంకటేశుఁ గూడి చెలగించవే
కైవసముగ మెలఁగి కాఁగిలించవే
యావల నలమేల్మంగ విన్నీఁ దెలుసుకోవే

రేకు: 1821-3 పాడి సం: 28-118

పల్లవి: అలమేలుమంగవు నీవౌనే పతిఁ జేకొంటివి
నెలకొని యాచేఁతలు నీవే నేరుతువే

చ. 1: మొగము చూడఁగనే ముంచుకొను నగవులు
నగఁగనే పెనగొని నాఁటుఁ దగులు
తగులఁగఁ దగులఁగాఁ దమకము చిగిరించు
చిగిరింపునాసలు చిమ్మిరేఁచువలపు

చ. 2: పలవఁగా వలపఁగా వడిఁబెట్టుఁ దలఁపులు
తలఁచఁగా నోరికబ్బు తానే పిలుపు
పిలువఁగాఁ బిలువఁగాఁ బెనలుఁగొనుఁజెలిమి
చెలిమి గడుఁ జేయఁగా చెలరేఁగు మనసు

చ. 3: మనసు పెట్టఁ బెట్టఁగా మల్లడిగొను ననుపు
ననుచఁగా ననుచఁగా నంటు లెనయు
యెనయఁగా శ్రీవేంకటేశుఁ డేలేగుట్టు గను
కనుఁగొనఁగానే చెంగలించు మొగము

రేకు: 1821-4 దేశాక్షి సం: 28-119

పల్లవి: వట్టిసిగ్గు లేఁటికి వద్దికి వచ్చె విభుఁడు
గట్టిగా నిద్దరు నిట్టె కాఁపురాలు సేయరే

చ. 1: చెలిమి పెంచఁజొచ్చితే చేఁగలెక్కును
బలిమిఁ బైకొంటేను పంత మలరు
కలిమి నొనగూడితే కడఁగు నింపు
అలమి చొక్కించవే అదివో నీ మగఁడు

చ. 2: కలికితనాలవంకఁ గళ లుబ్బును
చిలికితే వలపులు చిమ్మిరేఁగును
పలికి బొంకకుండితే బాస లీడేరు
కొలికికిఁ దెచ్చి పతి గూడవే రతులను

చ. 3: కలసి మెలఁగితేను కరఁగు మతి
సొలసి మాటాడితేను సొంపు గలుగు
వలసి నీకాఁగిటితే నలమేలు మంగ
వెలసీ నిదివో శ్రీవేంకటేశుఁడు

రేకు: 1821-5 సింధురామక్రియ సం: 28-120

పల్లవి: ఎంత ఆసోదకాఁడవు యేమి చెప్పేది
బంతిఁబెట్టి తమకమే పచారించేవు

చ. 1: చెంగలించి యాపె నీపై సేసపాలు చల్లఁగాను
యెంగిలి నామోవికి యేల లాచేవు
ముంగురు లంటి యప్పటి మొల్లలు ముడువఁగాను
సింగారించేనంటా నాపై చెయ్యేమి చాఁచేవు

చ. 2: కూరిమి గొసరి తాను కొంగవట్టి తియ్యఁగాను
యేరా నా చన్నులకు నీవే కోరేవు
గారవించి చెక్కు నొక్కి కమ్మటి వేఁడుకోఁగాను
నారుకాన నాతోను నవ్వులు నవ్వేవు

చ. 3: వొద్దిక నలమేల్ మంగ పురమెక్కుకుండఁగాను
పెద్దరికమున నన్నుఁ బెండ్లాడేవు
సుద్దులు చెప్పుతా మరి చూపుల నిన్నుఁ జూడఁగా
అద్దుక శ్రీవేంకటేశ యట్టె నన్ను నేలేవు

రేకు: 1821-6 దేసాళం సం: 28-121

పల్లవి: నీవెఱఁగవా బుద్ధి నీకు నేము చెప్పేదేమి
దేవులవు నీ విన్నిఁ దెలిసినవే

చ. 1: యెగ్గులు పట్టఁగరాదు యేమాడినా బతితోను
కగ్గి యలుగఁగరాదు గబ్బితనాన
సిగ్గులు వడఁగరాదు చేరి కొంగువట్టితేను
వొగ్గి యిచ్చగించి వూరకుండవలెఁగాని

చ. 2: పంతము లాడఁగరాదు బలిమిఁ బెనఁగితేను
వింతలు సేయఁగరాదు వెక్కసాననుు
చింతఁ దలవంచరాదు చెక్కు నొక్కి వేఁడుకొంటే
సంతోసాన వలపు పైఁ జల్లవలెఁ గాని

చ. 3: కసరులు చూపరాదు కాఁగిలించుకొంటేను
పొసఁగక యాఁపరాదు బూటకాననుు
యెసఁగి శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్ మంగవు
సుసరాన నిన్ను నిక జొక్కవలెఁగాని

రేకు: 1822-1 శుద్ధవసంతం సం: 28-122

పల్లవి: తరితీపు వలపుల తక్కరీఁడ
సిరులుఁ దొలఁకఁ బైపైఁ జెనకేవు నన్నును

చ. 1: వులివచ్చిమాఁట లాడి వువిద విలువఁగానే
కలువల వేసేసేరా కమ్మటి నన్ను
అలరి ప్రియములెల్లా నాపె నీకుఁ జెప్పఁగానే
చెలిమి సేసి యిట్టే చేరేవు నన్నును

చ. 2: ముప్పిరిఁగొనఁగ నవ్వి మొక్కులాపె మొక్కఁగానే
తప్పక చూచేవేరా తగిలి నన్ను
చిప్పిలుఁ గూరిమితోడ చేతికి విడెమియ్యఁగా
అప్పటి మోవితేనె లడిగేవు నన్నును

చ. 3: కచ్చుపెట్టి రతులకు గాచు కాపె వుండఁగానే
అచ్చముగఁ గూతేవేరా అంతలో నన్ను
కొచ్చి శ్రీవేంకటగిరి గోవిందుఁడవై యిద్దరి –
మచ్చికలకు చోనై మరిగేవు నన్నును

రేకు: 1822-2 సాళంగనాట సం: 28-123

పల్లవి: అట్టి నెరవాదివి నీవలమేలుమంగవు
నెట్టన నీరమణుఁడు నిన్ను మెచ్చీ నిందకు

చ. 1: ఇయ్యకొంచే మాఁటలెల్లా నింపులై యుండు
నెయ్యముగలిగినట్టి నెలఁతలకు
వొయ్యనే విచారించితే నుపమ వుట్టు
యెయ్యెడా నలుకలేని యింతులకును

చ. 2: వున్నది నేమిసేసినా నొడఁబాటౌను
సన్నయెఱిఁగినయట్టి సతులకును
విన్నకన్న సేఁతలెల్లా వేడుకై తోఁచు
అన్నిటా నొరుపుగల యతివలకు

చ. 3: కందువఁ దెలిసితేఁ గరఁగు మతి
అంది వివేకముగల యాఁడువారికి
యిందరిలో శ్రీవేంకటేశుఁడు గూడె
పొందు లిట్టివి నీవంటి పొలంతులకును

రేకు: 1822-3 నాదరామక్రియ సం: 28-124

పల్లవి: ఆమ్మరో యెంతటి సాహసివే నీవు
కమ్మర నాతఁడే నిన్నుఁ గరుణించీఁ గాక

చ. 1: వుడివోని వలపులు వొడిఁగట్టుకొని వుండి
జడియక పతినెంత జంకించేవే
చిడుముడిఁ దలఁబాలు శిరసు పైఁ బెట్టుకుండి
బడిబడి నతనితో పంతాలే లాడేవే

చ. 2: గట్టిగా నీతమకము గాదెలఁ బోసుకువుండి
అట్టె బింకాన నెంత యద్దనించేవే
మట్టులేని కోరికలు మనసులోఁ బెట్టుకుండి
నెట్టన నాతనినేల నేరము లెంచేవే

చ. 3: సమరతి జవ్వనము చన్నులపైఁ బెట్టుకుండి
కొమరెవు యిఁకనేల గుట్టుసేసేవే
అమర శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
తిమిరి యతని నెంత దిష్టించి చూచేవే

రేకు: 1822-4 ఆహిరి సం: 28-125

పల్లవి: విన్నవించరే యామాఁట విభుఁడెదుట నున్నాఁడు
ఇన్నిటా నన్నాదరించె నేమనినో ఇఁకను

చ. 1: తెగరానిచోట్లను దీమసమే సంగతి
నగరానిచోట్లను నాలి సంగతి
మొగమోడే చోట్లను మోనములే సంగతి
తగవులఁ బెట్టేనా తన చిత్తమిఁకను

చ. 2: పాయరానిచోట్లను పదరినిదే సంగతి
తోయరానిచోట్ల పొందులు సంగతి
ఆయము లంటుచోట్ల నంగవించుటే సంగతి
యాయెడఁ దనతో నేను యేమనేనే ఇఁకను

చ. 3: సమ్మతించినచోట్ల సరిఁగూడుటే సంగతి
నమ్మి కైనచోట్లను నంటు సంగతి
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
కమ్మి యెంత మన్నించినా గాదనేనా ఇఁకను

రేకు: 1822-5 శ్రీరాగం సం: 28-126

పల్లవి: అడుగవే చెలియా ఆతని నీవు
యెడయక తనతో నే నెగసక్కే లాడేనా

చ. 1: యెందుండి పచ్చితివంటే యేల తలవంచీనే
కందె నీమోవి యంటేను కతలేమి చెప్పీనే
గందము చిట్లెనంటే కడునేల జంకించీనే
చిందీఁ జెమటలంటేను సిగ్గువడ నేఁటికే

చ. 2: కొప్పు జారెనంటేను కొచ్చి యేల నవ్వీనే
వుప్పతిలీఁ గళలంటే వురిమి యేల చూచీనే
కప్పుకొ నీమేనంటే కందువలేల దాఁచీనే
దప్పి యెంత గొంటివంటే తలపోఁతలేఁటికే

చ. 3: వింతవాస లేడదంటే వినయాలేల సేసీనే
సంతోసించే వేమియంటే సారె వేఁడుకొనీనేలే
ఇంతసేసి శ్రీవేంకటేశుఁడు నిన్నిటు గూడె
చింత నీకెందున్నదంటే చెక్కునొక్క నేఁటికే

రేకు:	1822-6 గౌళ	సం:	28-127
పల్లవి:	ఏమీ తనకెంతచన వెన్నఁడూ లేమి
	కామించి వచ్చీ వావులు గలపుకొంటాను
చ. 1:	చేరి చేరి వూడిగాలు సేసీ నాకె నీకు నేఁడు
	నేరుపుతో సలిగెలు నెరపుకొంటా
	సారెకుఁ దఱచుగాను సరసము లాడీని
	పేరడి చుట్టరికము పెనచుకొంటాను
చ. 2:	మళ్ళి మళ్ళి వచ్చి నీతో మనవు లెల్లాఁ జెప్పె
	మొల్లల తురుముతోడ మురుసుకొంటా
	వెల్లవిరి నేపురేఁగి వికవికనవ్వీని
	చెల్లుబడిఁ దరితీపుసేసుకొంటాను
చ. 3:	కొచ్చి కొచ్చి యాసోదాల కొనచూపులనుఁ జూచి
	పెచ్చురేఁగీ గర్వములు పెంచుకొంటా
	యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
	తచ్చి నిన్ను తానూఁగూడి తగులుకొంటాను

రేకు: 1823-1 గౌళ సం: 28-128

పల్లవి: ఆతని మాఁటలో దాన వౌదువుగాక
నాతి నీ విభునితో నాలితనా లేఁటికే

చ. 1: మంతనాన నిద్దరికి మనసు లొక్కటులైతే
పంతములాడఁగ మరి పనియేమే
వింతలుగా కాఁపురపు వేడుకలు వుట్టితేను
చింతతో చెక్కిటఁబెట్టే చెయ్యేఁటికే

చ. 2: సులభాన బాయరాని చుట్టరిక మమరితే
పెలుచుగుం పెనలతో బిగువులేలే
మొలకనవ్వులతోడి ముచ్చట లబ్బితేను
చిలుకుఁ జూపులఁ జూచి సిగ్గువడ నేఁటికే

చ. 3: గొనకొన్న కూటములు గొబ్బునఁ బొసఁగతేను
తనివోని తమకము దాఁచనేఁటికే
యెనసెను శ్రీవేంకటేశుఁడు నిన్నింతలోనె
నినుపు మోనములతో నివ్వెరగులేఁటికే

రేకు: 1823-2 ద్రావిళభైరవి సం: 28-129

పల్లవి: ఏమినోము నోమితివే యింతకతొల్లి
కామించఁదగునే నీకు గక్కన నీవిభుఁడు

చ. 1: వెలఁది నీమాఁటలు విన నింపులు
కలికితనాలు చెప్పఁగడుఁగొత్తలు
తలఁప నీవినయాలు తరితీపులు
వలవ కెట్టుండునమ్మ వడి నీకు విభుఁడు

చ. 2: సూటి నీచక్కదనాలు చూడవేడుక
గాఁటపు నీ చూపులకు కరఁగు మతి
నీటు నీ సింగారమైతే నిచ్చపండుగ
కూటమిగా కెట్టుండునే కూరిమి నీ విభుఁడు

చ. 3: నెక్కొన్న నీ చిరునవ్వు నిండువెన్నెల
చొక్కపు నీ మోవితీపు జుంటితేనె
యెక్కుడాయ నీ భావాలిట్టె కాఁగిటఁ
జిక్క కెట్లుండు నిఁక శ్రీవేంకటవిభుఁడు

రేకు: 1823-3 సాళంగనాట సం: 28-130

పల్లవి: ఏమని పొగడవచ్చు నిట్టి మీ జాణతనాలు
భూమిలో చెల్లుబడై పొలుపొందుఁగాక

చ. 1: చిత్తములో పాయరాని చెలిమి మొలచితేను
కొత్తలైన కోరికలు కొడిసాగును
బత్తితోడి వినయాలు పాదుకొని వుండితేను
పొత్తుల భోగములకుఁ బోది యెక్కును

చ. 2: కన్నులకు మోము చూచే కాంక్షలు గలిగితేను
తన్నుఁదానే మాఁటలాడఁ దమిరేఁగును
అన్నిటా మంచి గుణాలు యలవడి వుండితేను
యెన్నిన వేడుకలెల్లా నీడేరును

చ. 3: యాడు జోడైన మేనుల నింపులు వొడమితేను
తోడఁదోడ సరసాలు తుదముట్టును
కూడి శ్రీవేంకటేశుతోఁ గూరిసి నిట్టె వుండితే
పాడిపంతములు మీలో ఫలియించును

రేకు: 1823-4 వరాళి సం: 28-131

పల్లవి: నీమీఁద బత్తిగలఁడు మీ రమణుఁడు
ఆముకొన్న చేఁతలు నీ కమరునే నేఁడు

చ. 1: సెలవి నవ్వులముగ్గు చిప్పిలుగళలనిగ్గు
కలికి కన్నులకెంపు కాయముసొంపు
పలుకుదేనెలసోన పరగుఁ జెమటవాన
అలివేణి నీకు నిన్నీ నమరునే నేఁడు

చ. 2: ముక్కున అసురుసు మోహపు ముద్దుఁగొసరు
జక్కవ చన్నులతీరు సరాలపేరు
చెక్కిటి జవ్వాదిరంగు జీరేటిపయ్యెదకొంగు
అక్కరో నీసింగార మమరునే నేఁడు

చ. 3: కొప్పుపై ముత్తేలసేస గుబ్బతిలే యడియాస
వొప్పయిన తెరచాటు వుండేటి నీటు
ముప్పిరిఁ గాఁగిట నించి ముంచి శ్రీవేంకటగిరి –
యప్పఁడేలె నిన్ని నీకు నమరునే నేఁడు

రేకు: 1823-5 సామంతం సం: 28-132

పల్లవి: సేయవే యాతనిసేవ చిత్తము రాను
యాయెడఁ గొంకంగనేలే యిల్లాండ్లకు

చ. 1: చలములే వద్దుగాని సరసమెంతైనా మేలే
అలుకలే వద్దుగాని ఆసలెన్నియైనా మేలే
బలుములే వద్దుగాని పంతుమ లెన్నైనామేలే
నెలకొనవలచిననెలఁతలకు

చ. 2: వాదించవద్దుగాని వాడిక లెన్నైనా మేలే
సోదించవద్దుగాని సొలపులెన్నైనా మేలే
బోదించవద్దుగాని పొరచి యెంతైనా మేలే
ఆదిగొని తమిగలయాఁడువారికి

చ. 3: నెపములు వద్దుగాని నేరుపు లెన్నైనా మేలే
వుపములు వద్దుగాని వొద్దిక లెన్నైనా మేలే
ఇపుడే శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నీవలెనే
తపము సేసిన తరుణులుకు

రేకు: 1823-6 నాదరామక్రియ సం: 28-133

పల్లవి: చెలియరో నీవెంత చేఁతలాఁడివే
వెలయ నిప్పుడే యెన్నివేసాలు సేసేవే

చ. 1: పెదవితేనెల తీపు బెరయించి పతితోను
ముదము రెట్టించి యెంతమాఁటలాడేవే
కదలుఁ గన్నుల చూపు కడఁగించి రెప్పలను
వదల కెందాఁగాను వలపు చల్లేవే

చ. 2: గొప్ప చన్నుల మెఱఁగు గులికి యడియాసలు
వుప్పతిల నెంతేసివుబ్బు రేఁచేవే
ముప్పిరి నీలాల కొప్పు మురిపేలు చూపి చూపి
చొప్పులువేసి యెంత చొక్కులఁ వెట్టేవే

చ. 3: చక్కని నీమొగమెత్తి సారెకు నయాలు నించి
పక్కన నవ్వుల నెంత భ్రమయించేవే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
నిక్కి నిక్కి చూచి యేమి నివ్వెరగందేవే

రేకు: 1824-1 ముఖారి సం: 28-134

పల్లవి: ఎంతచుట్టమోకాని యాపె నీకు
వింత వింతవేడుకల విందుచెప్పీ నీకును

చ. 1: తొంగిచూచి యాకె నిన్నుఁ దొరలఁగ మాటలాడి
అంగన విలిచి వీడెమందుకొమ్మనీ
ముంగిట కప్పటి వచ్చి ముంజేయివట్టి తీసి
చెంగటఁ గూచుండఁ బెట్టి సెవలెల్లఁ జేసెను

చ. 2: పన్నీరు చల్లిచల్లి పాదాలుగడిగి నీకు
చన్నుల పై మొత్తుకొని సారెఁ బూజించీ
కన్నులనే మొక్కుమొక్కి కాఁగిట యాసలు చూపి
అన్నిటాఁ జెప్పరాని ప్రియములెల్లాఁ జెప్పెను

చ. 3: ఆరగించఁజేసి నీకు నండఁ బానుపు వరచి
కోరి బాగాలొసఁగి యాకులు చుట్టిచ్చీ
చేరి నీవు గూడఁగాను శ్రీవేంకటేశుఁడ నేఁడు
నేరుపులెల్లా మెరసి నిన్నిట్టె మెప్పించెను

రేకు: 1824-2 పాడి సం: 28-135

పల్లవి: సిగ్గువడ దించుకంతా చెలులెల్లా నుండఁగాను
వెగ్గళించకుండా బుద్ది వేగమే చెప్పవయ్యా

చ. 1: వింతలేక నీతోను వేమారు నవ్వీని
కాంత యిదెవ్వతెయ్యా గబ్బితనాన
చెంతనుండి వూడిగాలు సేయవచ్చి నూరకైనా
ఇంతచేతలాఁడి నీకు నెట్టు గలిగెనయ్యా

చ. 2: చుట్టమువలనే నీకు సుద్దులెల్లాఁ జెప్పీని
రట్టడి ఇదెవ్వతెయ్యా రాఁపుఁదనాన
వట్టివావులు సేసుక వలపు నీపైఁ జల్లీ
పుట్టుఁ గతకారి నీకెప్పుడు దొరకెనయ్యా

చ. 3: చలపట్టి నీతోను సంగాతాలు సేసీవి
నెలఁత ఇదెవ్వతెయ్యా నీటుఁదనాన
కలసితి నిటు నన్ను గక్కన శ్రీవేంకటేశ
యెలయింపు నయగారి యెట్టు నీకబ్బెనయ్యా

రేకు: 1824-3 సామంతం సం: 28-136

పల్లవి: వెల్లవిరులాయ నేఁడు వేడుకనీచేఁతలెల్లా
యెల్లవారు సంతోసాన నిట్టె మెచ్చిరయ్యా

చ. 1: ములువాఁడి చెనకులు మోవిమీఁద నుండగాఁనే
వలపేల దాఁచేవు వద్దివారితో
చలపల చెమటలు చెక్కులపైఁ గారఁగానే
నెలకొన్న సిగ్గులు నీకేలయ్యా

చ. 2: గుఱుతైన వెడజారు కొప్పున నుండెంగానే
మఱఁగేల పెట్టేవు మగువలకు
కఱఁగిన భావములు కన్నులలో నుండఁగానే
చిఱునవ్వుతోనేల చిమ్మిరేఁగీవయ్యా

చ. 3: మునుకొన్న కళలెల్లా మోమునఁ దేరఁగానే
కను సన్నేల సేసేవు కడవారికి
యనసితివి శ్రీవేంకటేశ మమ్ము నిక్కడనే
అనుమానములతోడి ఆన లేఁటికయ్యా

రేకు: 1824-4 లలిత సం: 28-137

పల్లవి: చిన్నదానవా నీవు సిగ్గులేల పెంచేవు
సన్నలనే మోవితేనె చవిచూపవమ్మా

చ. 1: మొక్కేరు చెలులెల్లా మొగమెత్తి చూడవమ్మ
మక్కువ నీపతితోడ మాఁటాడవమ్మా
చక్కనిదాన వింతులచనవు చేకొనవమ్మ
పక్కన నీవాతనికి పాదాలొత్తమమ్మా

చ. 2: వేమారుఁ జేసె చెలుల విన్నపాలు వినవమ్మ
చేముట్టి విభునిసేవ సేయవమ్మా
మామండాటాలకు నీకు మన్నన లొసఁగవమ్మ
నాముదేర మగనితో నవ్వవమ్మా

చ. 3: భావించి నీచెలుల పంతము చెల్లించవమ్మ
శ్రీవేంకటేశుఁ డేలెఁ జెనకవమ్మ
కైవశమై యిందరికిఁ గాఁగరుణించవమ్మ
నీవు నీవూఁ గూడి యిట్టె నెలకొనరమ్మా

రేకు: 1824-5 మంగళకౌశిక సం: 28-138

పల్లవి: ఏమి సేసీనో విభుఁడు యెదురుచూచే నేను
ప్రేమపు సంతోసాలు పెనగొనీ నాకును

చ. 1: మగఁడు దనతోడుత మాఁటనాడినట్టుండు
తగులు మనసులోనఁ దలపోసితే
నగినట్లలేవుండు ననుపెట్టిదోకాని
ఇగిరించీఁ గోరికలు యేమిసేతునే

చ. 2: తమితో నొక్కొకమాఁటు తప్పక చూచినట్టుఁడు
మమత నాపతిమీఁద మరిఁ బెట్టితే
అమరివుండుఁ గాఁగిట నాస యెట్టిదో కాని
తిమిరించీ వేడుకలు దీని కేమి సేతునే

చ. 3: పానుపుపై నాతోను పరగ నవ్వినట్టుండు
మేను మేను మోఁకెనని మెదలించితే
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలో వచ్చి నన్నేలె
యానిజ మిప్పుడే కంటి నింకా నేమిసేతునే

రేకు: 1824-6 బౌళి సం: 28-139

పల్లవి: చెలిచిత్త మెఱఁగక చిమ్మిరేఁగే వింతేకాక
తలఁపు లిద్దరికిని తారుకాణే కాదా

చ. 1: చూపుల సొలసి నిన్నుఁ జూచె నింతేకాక వేరే
కోపగించుకొనెనా కొమ్మ నీతోను
పూపునఁ బూఁచి పూఁచి పుప్పులు పైఁజల్లెఁగాక
మోపులు గట్టి వేసెనా ముప్పిరిఁ బంతాలు

చ. 2: పొద్దువంక చూసి నీకు బొమ్మలార్చె నింతేకాక
అద్దలించివేసెనా యంగన నిన్ను
పెద్దరికాన నింటికిఁ బిలిచి వెనఁగెఁగాక
వుద్దండాలు సేసి నిన్ను వొడివట్టి తీసేనా

చ. 3: తోదోపుల నీతొడపైఁ దొడ వేస నింతేకాక
పాదము దాఁకించెనా పడఁతి నిన్ను
యాదెస శ్రీవేంకటేశ యెనయఁగా మెచ్చెఁగాక
నాదించి వినోదాలకు నవ్వించెనా నిన్నును

రేకు: 1825-1 సామంతం సం: 28-140

పల్లవి: రావే చూతువుగాని రమణి నీభాగ్యమాయ
నీవిలాసా లితని నేఁ డింతసేసెనే

చ. 1: కలికితనాల వీ కనుబొమ్మజంకెనలు
పిలిచేపెదవుల పై ప్రియములు
సెలవులఁ జిందేటి చిరుసిగ్గునగవులు
వలపించి రమణుని వాకిటికిఁ దెచ్చెనే

చ. 2: మునుకొని సొలసే నీములువాఁడి చూపులు
ననుపులు దొలఁకేనున్ననీ మాఁటలు
పెనచిపెట్టిన నీ పెనుఁగొప్పు మురిపేలు
ఘనుఁడైన విభుని నీకైవసము సేసెనే

చ. 3: కావరపుఁ జెలకుల గయ్యాళి నీ చేఁతలు
తావులు గుబులుకొనే తను సోఁకులు
భావములు గరఁగించే పంతపు సరసములు
శ్రీవేంకటేశ్వరు నిన్నుఁ జిక్కించి కూడించెనే

రేకు: 1825-2 పళవంజరం సం: 28-141

పల్లవి: తొలుత గుంపెన చూపి తోడనె ప్రియాలు చెప్పీ
అలివేణిఁ గరుణించు మాఁపలేదు మనసు

చ. 1: కాఁతాళించి చూఁచి నిన్నుఁ గమ్మటి వేఁడుకొనీని
యాఁతలు మోఁతలునాయ నింతి వలపు
బాఁతిపడి నిన్ను దూరి పాదాలకు మొక్కిని
చేఁతలకొలఁదిగావు చెలియపంతములు

చ. 2: రాఁవుగ నిన్ను జంకించి రతికిఁ జేసన్నసేసీ
పూఁపలుఁబిందెలునాయ పొలఁతి యాస
యేపుల నిన్ను సొలసి ఇచ్చకములే సేసీ
మోపులకొలఁది గావు ముదిత నేరుపులు

చ. 3: గండుమీరి నిన్ను నవ్వి కడవినయము సేసీ
కొండలుఁ గోట్లునాయ కొమ్మల కాంగిలి
వుండిండి శ్రీవేంకటేశ వుబ్బురేఁచి మోవియానీ
బండ్లకొలఁది గావు భామ కాఁపురములు

రేకు: 1825-3 పాడి సం: 28-142

పల్లవి: నా కితఁడు మోహించి నావద్దనే వుండఁగాను
యాకడ నీవేఁకరేవు యెంతజాణతనము

చ. 1: కచ్చు పెట్టుక పతికిఁ గంకణము గట్టవే
ముచ్చటదీరఁగ నీమోము చూపవే
నవిడితోవచ్చి వీడెము చేతికియ్యవే
ఇచ్చట నచ్చటనుండి యేమి దొంగిచూచేవు

చ. 2: అంతే బత్తిగలిగితే నన్నిసేవలుఁ జేయవే
మంతనాన కిటువచ్చి మాటలాడవే
వింతలుగా నవ్వు వేడుకలు చూపవే
తక్కక యెందాఁకాను తగిలి మొక్కేవు

చ. 3: అక్క రగలదానవు అక్కునఁ గట్టుకొనవే
చొక్కించి చుట్టరికము చూపఁగదవే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
తక్కక యెందాఁకాను తగిలి మొక్కేవు

రేకు: 1825-4 శ్రీరాగం సం: 28-143

పల్లవి: నీకు మేలుదీ చెలియ నిను జరయ దెన్నఁడును
చేకొనుము విన్నపము సేసితిమి రతుల

చ. 1: పంతంబులేమిటికి పతితోడ సతులకును
సంతసము రేఁచుసరసములుండఁగా
వింతవిరసములేల వెంగెంబు లేమిటికి
మంతనపురతులలో మచ్చికలె నేలు

చ. 2: పొలయలుక లేమిటికి బొమ్మజంకెనలతో
తిలకింపఁదగిన తరితీపు లమరు
పెలుచుగర్వములేల బిగియుచుఁ బెనఁగనేల
అలమి మెయిసోఁకు లడియాసలే తగులు

చ. 3: మొనసి వొల్లములేల మొగమెదుటనే వుండి
తనిసి సిగ్గులతోడ దగులవలయు
యెనసితివి శ్రీవేంకటేశ యాజవరాలి
వినయములతో బెనఁగువేడుకలే సతము

రేకు: 1825-5 ఆహిరి సం: 28-144

పల్లవి: ఇదివో నామొగమోట మేమని చెప్పుదునమ్మ
కదిసి నాచేత లేమిఁ గాదనఁడే యతఁడు

చ. 1: అప్పటికి నామాఁట లాడుదుఁగాని యతని
వుప్పతించి కోపగించనోపనే నేను
చెప్పరాని విరహాన జెంది కసరుదుఁగాని
తప్పులెన్ని సేసినాను తమకించఁజాలనే

చ. 2: పొంతనుండి యెందుకైనా బొమ్మల జంకింతుఁగాని
అతలో నాతని వీడనాడనోపనే
చింతతో రాకుండితేను చిట్టకాలు సేతుఁగాని
పంతము లందుకుఁగాను పచరించఁజాలనే

చ. 3: వుండుండి యొక్కొకపరి వొట్టులు వెట్టుదుఁగాని
మెండొడ్డి తనమాటలు మీరనోపనే
దండిగా నన్నేలఁగాను తనయిచ్చనుందుఁగాని
అండనే శ్రీవేంకటేశు నలఇంచఁజాలవే

రేకు: 1825-6 లలిత సం: 28-145

పల్లవి: ఇప్పుడేల సిగ్గువడే వెరఁగనిదాని వలె
ముప్పిరిగొన నిందరిముందరా నీవు

చ. 1: పెచ్చురేఁగి యేకతాన పెదవులు పిప్పిగట్ట
మచ్చిక నీతనితోను మాఁటలాడవా
వచ్చి వచ్చి లోలోనే వలపును చల్లి చల్లి
పచ్చిదేర నప్పటిని పకపక నవ్వవా

చ. 2: వేడుకతో మంచముపై వేవేలు చందాల
వీడెమిచ్చి మోవితేనె విందువెట్టనా
వాడికతోఁ గొసరుతా వాలికచూపులఁ జూచి
కూడఁబట్టి కాఁగిలించి కుచముల నొత్తనా

చ. 3: పరపుపై నీతనితో పచ్చిగాఁ బెనఁగుతాను
పొరలించి పొరలించి పొందుచూపవా
ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్ను నేలె
సరుసకు వచ్చి నీవు సన్నలెల్లాఁ జేయవా

రేకు: 1826-1 సాళంగం సం: 28-146

పల్లవి: అంతచక్కనివాఁడవు అన్నిటా జాణవు నీవు
సంతోసాన నుప్పంగీ సారెకు నామనసు

చ. 1: పొలసి నిన్నొకమారు పూఁచి తప్పక చూచితే
వలవక వుండుదురా వనితలు
నిలువున నెప్పుడైనా నీరూపు దలఁచుకొంటే
పులివచ్చి చెమటల నోలలాడకుందురా

చ. 2: సముకాన నీతోను సంగాతాను సేసితే
తమకించకుండుదురా తరుణులు
జమళి మేనులు సోఁక సరసము లాడితేను
మమతల నిన్ను నిట్టె మరుగక వుండుదురా

చ. 3: యాడుజోడై నిన్నుఁ గూడి యెడవాయ కుండితే
వేడుకఁ జొక్కకుందురా వెలఁదులు
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యేడవారూ నీపొందుల కేఁకరకవుందురా

రేకు: 1826-2 వరాళి సం: 28-147

పల్లవి: చెవకవే రమణునిఁ జేతులారాను
అనుమానించకు నిన్ను నన్నిటా మన్నించెను

చ. 1: చెలిమే కలిగితేను చేవట్టి పెనఁగవచ్చు
సలిగే లోన (మ) రితేను సాదించవచ్చు
వలపు సతమైతేను వాడిక సేసుకోవచ్చు
నిలువుకు నిలువే నీకేలే సిగ్గులు

చ. 2: మనసులు గలసితే మాఁటలాడఁగవచ్చు
వినయము లితవైతే వేఁడుకోవచ్చు
చనవులు నిజమైతే సరసము లాడవచ్చు
యినుమడించెఁ దమక మిఁకనేలే సిగ్గులు

చ. 3: చుట్టరిక మబ్బితేను సొలసి చూడఁగవచ్చు
గుట్టిచ్చితే కాఁగిలించి కూడఁగవచ్చు
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
మట్టుమీరె సంతోసము మరియేలే సిగ్గులు

రేకు: 1826-3 బౌళి సం: 28-148

పల్లవి: ఎప్పుడు మెచ్చేవోకాని యాకెను నీవు
చెప్పరాని గుట్టుతోడ చిమ్మిరేఁగీని

చ. 1: చెక్కిటికి మరఁగుగా చేయివెట్టుకొని యింతి
మక్కువలు చూపి నీతో మాఁటలాడీని
పక్కనఁ జన్నులమీఁదఁ బయ్యదఁగప్పుకొంటాను
మిక్కిలి సిగ్గులు నీమీఁదఁ జల్లీని

చ. 2: కన్నులు దేలించుకొంటా కానుకలు నీకిచ్చి
వెన్నెలపోగులుగాను వెస నవ్వీని
పన్నుకొన్న బిగువుతో పాపట దువ్వుకొంటాను
వున్నతి నీపొందులకు నూరకె లాచీని

చ. 3: పట్టరాని తమితోడ పాదమున వ్రాసుకొంటా
అట్టె నీకాఁగిటికి నాస సేసీని
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
పట్టుక తానిప్పుడే నీపాదా లొత్తీని

రేకు: 1826-4 పాడి సం: 28-149

పల్లవి: మనసులోనే దేవుఁడున్నవాఁడు మరి వేఁడుకొంటే వరములిచ్చీని
వినయముతోడ నంతరుఁగూటి విన్నపముచేసి మొక్కరే

చ. 1: కన్నెకు విభుఁడు మేలువాఁడై కదిసి నవ్వఁగఁగ లిగితేను
వెన్నెల ముగ్గులు దొక్కుదమనుచు వెలఁదులాలమొక్కరే
చన్నులమీఁదట నాతనిగోరు సతికి నాఁటించఁగలిగితేను
కొన్ననజాజిమొనలపైఁ దపము కొంకక సేయఁగ మొక్కరే

చ. 2: వెల్లవిరిగా నింతికి విరహవేదన మాని యతఁడు గూడితే
మల్లెలనేపెద్ద కొండాల రఁగ మగువలాల మొక్కరే
బల్లిదుఁ డాతఁడు యాకెతో మాఁటపలుకు లాడఁగలిగితేను
చల్లఁగాఁ గప్రపులప్పల నిట్టె వసంతము లాడఁగ మొక్కరే

చ. 3: మోమెత్తి యాతఁడు రమణిఁ జూచి మోహము చల్లఁగఁగలిగితేను
తామరపూవులఁ బూజసేయఁగ తరుణులాల మొక్కరే
గోమున శ్రీవేంకటేశుఁ డిట్లానే కూడి దోమట్లు గలయఁగలిగితే
భూమిలో తేనెలమోవి దొంతరబోనాలు వోయఁగ మొక్కరే

రేకు: 1826-5 రామక్రియ సం: 28-150

పల్లవి: వాకిట నుండే యేమి యడిగేవు వలవని సుద్దులు
యేకతమాయను యింటిలోనికి యేలుదువురావయ్యా

చ. 1: మగువవ్వూసిన కుంకుమ దుమ్ములో మలసి సాములుసేసినఁగాక
పగటుతో చనుసంగడాలెత్తుచు బలిమి చూపినఁగాక
తగిలి జంకెనబొమ్మలవిండ్లఁ దాఁగఁగఁగురులు యేసినఁగాక
నిగిడి యాపెనేరుపు లూరక నీకు నింతలోఁ దెలుసునా

చ. 2: సుదతి జవ్వనగరిడికి నెక్కి సారిది దాళాలు దొక్కినఁగాక
పెదవిమీఁదట గంటిదాఁకుదాఁకఁ బెనఁగినఁగాక
గుదికొన నీకెసింగారపుమేనిగోఁత మురమునమోచినఁగాక
వుదుటున నీపె జాణతనములు వూరకె నీకుఁదెలుసునా

చ. 3: ఇందుముఖి నిట్టె లాలించే మొక్కుల నెక్కు డుదండాలు దోసినఁగాక
పొందిపొంది జగజెట్టిరతులనుఁ బొరలినఁగాక
కందువ శ్రీవేంకటేశ మీరిద్దరు కాఁగిట నిట్టె గెలిచినఁగాక
చెందిన యాకె సేవలలోపలిచేఁత లూరకె తెలుసునా

రేకు: 1827-1 ముఖారి సం: 28-151

పల్లవి: కన్నెదానవైతేనేమి కాఁపురాలు సేసేవేళ
యెన్నేసి వేసాలు సేసే విదేమే నీవు

చ. 1: శిరసేల వంచేవే శిగ్గులేల పెంచేవే
సరుస నీరమణుఁడు సారె నవ్వఁగా
పరాకేల సేసేవే భావమేల మూసేవే
మరిగి యాతఁడు నీపై చల్లఁగాను

చ. 2: చెక్కు చెయ్యేల పెట్టేవే చెలులనేల తిట్టేవే
మక్కువతో నీవిభుఁడు మాఁటలాడఁగా
చక్కఁగా నేమి చూచేవే చాఁచి గోరేమి రాచేవే
అక్కరతో యితఁడు నిన్నంటివేఁడుకోగాను

చ. 3: చన్నులేల కప్పేవే సణఁగులేల గుప్పేవే
అన్నిటా శ్రీవేంకటేశుఁ డాదరించఁగా
మిన్నకేల సొలసేవే మెచ్చియంత యలసేనే
మన్నించీతఁడు రతులు మతి చొక్కించఁగాను

రేకు: 1827-2 వేళావళి సం: 28-152

పల్లవి: చుట్టి చుట్టి యారజము చూపనేలంటాఁగాక
నెట్టుకొన్నసతులెల్లా నీయంత నేరరా

చ. 1: చిలికేవు కొంతగొంత చిరుసిగ్గు లూరకైనా
సలిపే వతనితోడ జాణతనాలు
కలపేవు వావులు కడనుండి యప్పటిని
యెలమి నీనేరుపులు యెంతచూపేవే

చ. 2: నెరపేవు పలుమారు నీమురిపెము లెల్లాను
వొరసేవు చన్నులను వొద్దఁగూచుండి
గిరిపేవు కన్నులు జంకెనబొమ్మసన్నలతో
వరుసవెట్టుక యెంత వలపుచల్లేవే

చ. 3: తనిపేవు నీకు నీకే తగిలి సరసమాడి
గునిసేవు ముద్దులు కొంగుట్టుక
యెనసె శ్రీవేంకటేశుఁ డీతఁ డింతలో నన్ను
పెనఁగి నీవింకా నెంత ప్రియము చెప్పేవే

రేకు: 1827-3 కాంబోది సం: 28-153

పల్లవి: వెలయఁ జేపట్టితివి విడువరా దిఁక నీకు
బలువుఁడవు గనక పంతమిదే సుమ్మీ

చ. 1: మన్నించితి విన్నిటాను మచ్చికలు సేసితివి
వన్నెల నీకృప యిఁక వదలకుమీ
పిన్నదాన నెఱఁగను ప్రియములు చెప్పేను
యిన్నిటా బుద్దులు చెప్పి యేలుకొమ్మీ నన్నును

చ. 2: వలపించితివి నన్ను వాసితో నిలిపితివి
చెలిమి యిట్టె నడపఁ జిత్తగించుమీ
పలుకు లంతేసి నేర పదివేలకును మొక్కే
కలకాలమును కీర్తిగద్దుసుమ్మీ నీకును

చ. 3: చనవిచ్చితివి నాతో సరసము లాడితివి
మనవి చేకొని నన్ను మఱవకుమీ
యెనసితివి శ్రీవేంకటేశ నిన్నుఁ బొగడేను
దినము సంతోసము లందిచుమీ వేడుకను

రేకు: 1827-4 ధన్నాసి సం: 28-154

పల్లవి: ఎట్టు వలపించితో యాపెను నీవు
నెట్టన నీవిన్నిటాను నెరజాణవయ్యా

చ. 1: ననుపుసేసుక నీతో నవ్వులు నవ్వీఁ జెలి
పెనఁగి నీపైఁ గూరిమి పెంచీ నిట్టే
తనివోవ కప్పటిని తప్పక చూచీఁ దాను
యెనసె రతుల యాస యెంతోకాని

చ. 2: చేరి చేరి వినయాన సేవలు సేసీ నీకు
నేరుపులెల్లా చూపి నిన్నుఁ గొసరీ
సారెకు నీమీఁదను చల్లీఁ దమకములు
కూరి మెంత మూటగట్టుకొనీనో కాని

చ. 3: కాఁటపుగుబ్బల నొత్తి కాఁగిలించుకొని నిన్ను
మాఁటలే యడుగుతాను మతిఁజొక్కిని
యాఁటాన శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
తేటల దానింకా నెంత తెలిపె (పీ ?) నో కాని

రేకు: 1827-5 సాళంగనాట సం: 28-155

పల్లవి: మా పంతము లీడేరెను ,మనసొక్కటాయ నీకు
దీపించె మీ వేడుకలు తేవే విడేలు

చ. 1: తరుణి నీమతిలోన తలఁపులు దలకూడె
నిరతి నీపతివచ్చె నీ యింటికి
యిరవుగ నిదివో నిన్నిద్దరి గూరిచితిమి
పరమోఁట లింకనేల పట్టవే విడేలు

చ. 2: భామ నీ నోమిన నోము ఫలము చేకూడెను
ప్రేమతో నిన్నీతఁడు పెండ్లాడెను
గోమునఁ బానుపుమీఁదఁ గూచుండఁబెట్టితిమి
యేమి మెచ్చే వెందాఁకాను యియ్యవే విడేలు

చ. 3: కాంత నీ పిరుదులు కలవెల్లా నొనఁగూడె
యింతలో శ్రీ వేంకటేశుఁ డేలె నిన్నును
మంతనాన మీలో మీకు మచ్చికలు సేసితిమి
సంతతము నిట్టె వొసఁగవే విడేలు

రేకు: 1827-6 లలిత సం: 28-156

పల్లవి: మగవాఁ డొకరిసొమ్ము మరఁగులేల పెట్టేవే
తగఁ బూగుత్తికి తుమ్మిదలు చేరవలదా

చ. 1: కన్నులఁ బతిఁ జూచితేఁ గాఁగిలించినట్టయ్యీనా
మిన్నక యేఁటి కీకొడిమెలు గట్టేవే
సన్నలు సేసితేనే చాయలంటుకొనీనా
యెన్నేసి సణఁగులు నీవేల రాలిచేవే

చ. 2: ఆటలాడినంతలోనే మనసు చిక్కుకొనీనా
చాటుతా నీవేల యెగసక్కేలాడేవే
తేటగాఁ గొలువుసేసితే వావిగలసీనా
గాటముగా నీవెంత గయ్యాళించేవే

చ. 3: అండఁ గూచున్నంతలోనే ఆయములు దాఁకీనా
వుండుండి నీవెంత యిందు వుప్పతించేవే
నిండుకొని శ్రీవేంకటనిలయఁడు నన్ను గూడె
చెందితోడ నీవేమి సాదించేవే

రేకు: 1828-1 ఆహిరి సం: 28-157

పల్లవి: నిన్నే నమ్ముకున్నది నీకుఁ గంకణము గట్టి
అన్నీ నీవెఱుఁగుదువు ఆ(అ ?) ననేల ఇఁకను

చ. 1: య నాపెమాఁటలు విన్నపము సేసితిమి
యెలమిఁ గానుకలూను నిచ్చితిమి
పిలిచి పేరుకొని ప్రియములు చెప్పితిమి
నెలఁ తభాగ్యము మరి నీచిత్తమిఁకను

చ. 2: నీ విచ్చిన నమ్మికలు నీకుఁ దలఁపించితిమి
వేవేలు చందాల నిన్ను వేఁడుకొంటిమి
చేవదేర నందరము చేతులెత్తి మొక్కితిమి
దేవులాయ నిన్ను నీవే తెలుసుకొమ్మిఁకను

చ. 3: యిచ్చటికి నిన్నుఁ దెచ్చి ఇద్దరిఁ గూరిచితిమి
కచ్చు పెట్టి సంతోసాలు కనుఁగొంటిమి
యిచ్చగించి యేలితివి యిన్నిటా శ్రీవేంకటేశ
మచ్చికాయ నింతి నిట్టె మన్నించు మిఁకను

రేకు: 1828-2 భల్లాటి సం: 28-158

పల్లవి: నేరుతువు చేఁతలెల్లా నెరజాణవవుదువు
చేరి యాతనికి నీవు సేవలెల్లాఁ జేయవే

చ. 1: చిక్క నివెన్నెల లేల చిమ్మి కలయఁబెట్టేవే
రెక్క లపిట్టలనేల రేఁచఁజొచ్చేవే
చొక్కపు చిగురులేల చెక్కులపై నదిమేవే
తక్కక నీరమణుని దలయెత్తి చూడవే

చ. 2: తుమ్మిదల నెందాఁకా తొరలఁ గూడపెట్టేవే
తమ్మి రేకుల నెంతేసి దండగట్టేవే
ముమ్మరముగా మేన ముత్తే లెంత గూరిసేవే
నెమ్మదిఁ బతితో నోరు నిండా మాఁటలాడవే

చ. 3: వూవక వూచిన చింతఁ బులుసేల వదకేవే
కోవలికూఁతలనేల గొణఁగించేవే
యావేళ నిన్నుఁగూడి ఇన్నిటాను మన్నించె
శ్రీవేంకటేశ్వరునిఁ జేరి మొక్కి మెచ్చవే

రేకు: 1828-3 గౌళ సం: 28-159

పల్లవి: పంతములే లాడేవే పతితోను
ఇంతంతని నీకతలు యెట్టు చెప్పవచ్చునే

చ. 1: నగుతానే వచ్చి నాఁటుకొను వలపులు
మొగము చూడఁగానే ముంచును తమి
చిగురువలెఁ బొడమి చిమ్మిరేఁగు సరసాలు
మగువ యెట్టెరిఁగేమే మనసులో సుద్దులు

చ. 2: మాట మాట వాసులనే మరిగించుఁ గోరికలు
చీటికి మాటికి వచ్చు సెలవి నవ్వు
చాటి చెప్పి పొందు సాగఁజేయు ననుపులు
యాటువెట్టి మదరాగ మెంచ నెట్టువచ్చునే

చ. 3: యెదురెదురనే వుండి యెలఇందు సింగారాలు
కదిసి పాయనియ్యవు కడురతులు
ఇదివో శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
పదివేలకు వయసు పట్టనెట్టువచ్చునే

రేకు: 1828-4 బౌళి సం: 28-160

పల్లవి: ఏడలేని సిగ్గుతోడ నేల లోఁగేవు
యాడుదోడాయను మీకు నెప్పుడూఁ బాయకురే

చ. 1: ఇచ్చగించి వింటేను ఇంపులౌను మాటలు
కొచ్చికొచ్చి కొసరితే కూరిమి నిండు
విచ్చన వీళ్ళైతేను వేడుకలు సమకొను
మెచ్చుదాఁకాఁ బతితోను మేలములే యాడవే

చ. 2: నయమున నవ్వితేను నాఁటుకొను మోహము
ప్రియము చెప్పితే నంటు పెచ్చువెరుగు
ప్రియముట్టఁ జెనకితేఁ గెరలుఁదమకములు
నియతానఁ జొక్కుదాఁకా నేరుపులే చూపవే

చ. 3: మునుకొని పాదిగితే మొగమోట లుప్పతిలు
కనువిచ్చి చూడఁజూడ కరఁగుమతి
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నునేఁడు
తనివొందుదాఁకా నీతనితోఁ బెనగవే

రేకు: 1828-5 శంకరాభరణం సం: 28-161

పల్లవి: ఏమనిచెప్పుదు మీకెవిలాసము
దోమటిసరసము దొంతరలాయ

చ. 1: తీగెలుసాగీ తెఱవ యెలుఁగుల
సొగమోమునను సొలపడరె
చేగలుదేరీ చెంగలిచూపుల
బాగుల రమణునిబాగ్యంబాయ

చ. 2: తేనెలుగారీ తియ్యనిమాఁటల
నానీ సెలవుల నవ్వునివె
వానలఁ జెమటలు వడిపీఁ జెక్కుల
వూనినవిభునికి నుచితంబాయ

చ. 3: ముప్పిరిఁదొలఁకీ మోవిరసంబులు
కొప్పులోన నవె కుసుమములు
యిప్పుడు శ్రీవేంకటేశుఁడు గూడఁగ
చొప్పుగ నితనికి సొబనమాయ

రేకు: 1828-6 రామక్రియ సం: 28-162

పల్లవి: ఎవ్వరు బలులో చూత మిద్దరిలో నా
నివ్వటిల్ల లేరుపులు నేరుతువు నీవు

చ. 1: పలుకులనే నిన్ను బయలీఁదించీఁ జెలి
కలికితనాల మతి గరఁగించీని
నిలువుఁగొలువుసేసి నిన్నుఁ గడునెలయించీ
కెలసి నీవీపె నెట్టు గెలిచేవో కాని

చ. 2: చుట్టరికాలనే నిన్నుఁ జొక్కులఁబెట్టి జెలి
అట్టడిచేతల నిన్నాఁబడిసేసీని
గుట్టుతో నవ్వులు నవ్వి కోరి నిన్నాసలముంచీ
యెట్టు నీ వీపెతోఁ బంతా లెక్కించేవో కాని

చ. 3: అందపుఁజూపుల నిన్ను నాసలఁదేలించీఁ జెలి
సందడినే మోవి చూపి చవిరేఁచీని
విందువలె నన్నును శ్రీవేంకటేశ కూడితివి
మందలించి యాపె నెట్టు మరిపేవో కాని

రేకు: 1829-1 వసంతవరాళి సం: 28-163

పల్లవి: ఆతనవద్ది కంపితే నన్నీ గడించుకొంటివి
యాతలఁ జెప్పవే మాకు ఇఁకనేల దాఁచను

చ. 1: వన్నెల నీమోవిమీఁదివసివా ళ్ళెక్కడివే
యెన్నరానిమోవికళ లెక్కడివే
సన్నపుఁ జెక్కులమీఁది జారుఁజెమ టెక్కడిదే
యెన్నఁడూ లేని గురుతు లిప్పుడిట్టె కంటిమి

చ. 2: తేలింపుఁ జూపుఁ గన్నులతేట లివి యెక్కడివే
యేలాటపుచిరుసిగ్గు లెక్కడివే
నాలితనపు సెలవినవ్వు లివి యెక్కడివే
యాలీల నీగురుతు లిన్నీ నేఁడు గంటిమి

చ. 3: పచ్చిదొలఁకేటి మేనిభావము లివెక్కడివే
హెచ్చిననీసంతోసము లెక్కడివే
యిచ్చటికి వచ్చి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
యిచ్చకపు నీ గుఱుతు లివీఁ గొన్ని గంటి మి

రేకు: 1829-2 మధ్యమావతి సం: 28-164

పల్లవి: మందమేళ మింతయేలే మగనితోను
చెంది యిచ్చకములెల్లాఁ జేయవలెఁగాక

చ. 1: చెంతనుండి రమణుఁడు చెప్పి చెప్పి పంపఁగాను
యెంత సింగారించుకొనే వెందాఁగానే
అంతేపో వోయమ్మ అద్దమేమి చూచేవే
దొంతివలపుల నీకెదురుచూచీ నతఁడు

చ. 2: సరసుఁడు మేడలెక్కి సన్నలెల్లాఁ జేయఁగాను
సరు లేమి దిద్దేవే సారె సారెకు
సరవెరఁగవు రాజసములనే పొరలేవు
మరిగి నీతోడి పొందే మతిఁగోరీ నతఁడు

చ. 3: శ్రీవేంకటేశ్వరుఁడు చేవట్టి పెనఁగఁగా
మోవి నేమి మాఁటాడేవే మొక్కుమొక్కీవే
నీవు నాతఁడునుఁ గూడి నెమ్మది నిట్టె వుండితే
కైవసమై నీకెపుడూఁ గాణాచాయ నతఁడు

రేకు: 1829-3 పాడి సం: 28-165

పల్లవి: ఇట్టుండవలదా ఇంపులును సొంపులును
చుట్టమై యాతనిమోమే చూచుకొంటా నున్నది

చ. 1: మనసులో కరఁగులు మాటలలో మొరఁగులు
వనితకుఁ జూడరే చేవలుదేరీని
తనివోనికోరికలు తత్తరపుటీరికలు
పెనగొనీ బతిమీఁది ప్రియమెట్టిదో

చ. 2: వీనులనే వినుకులు వెడగోరి చెనకులు
తానకమాయఁ జూడరే తరుణికిని
పూనియున్న మక్కువలు వొద్దనుండే ఇక్కువలు
నానఁబెట్టీ నితనిపై ననుపెట్టిదో

చ. 3: సెలవుల నగవులు చేఁతలలో తగవులు
నెలకొనెఁ జూడరే నెలఁతకును
కలసి రతుల మారుమలసీ వినయములే
పలికీ శ్రీవేంకటేశుపై బత్తి యెట్టిదో

రేకు: 1829-4 శుద్ధదేశి సం: 28-166

పల్లవి: లలన నీకెంతైనా లాఁతిదా యేమి
తలఁ పింతగలితే సంతసమాయ మాకును

చ. 1: యెంత వేడుకొనుచు నీవేమి చెక్కులు నొక్కేవు
కాంతఁ బొత్తుకు రమ్మంటాఁ గాతరానను
చెంతనే బాలకిగాన సిగ్గుతో నుంటే నేమాయ
ఇంత నీకు బత్తైయితే నియ్యరాదా మోవి

చ. 2: ఆన లేలపెట్టివు ఆసలేల చూపేవు
పూని పక్కఁ బండుమంటా పొంచి యాసతో
మానవతిగన చెలిమాఁటున నుంటే నేమాయ
కానీలే నీకు నిచ్చేతేఁ గాఁగిలియ్యరాదా

చ. 3: కూడి యంత పెనఁగేవు గురుతులేల సే సేవు
వీడె మందుకొమ్మంటా వెక్కసానను
యాడనే శ్రీవేంకటేశ యేలితివి జవరాలి
వేడుకైతే నాకుచుట్టి వెలఁది కియ్యరాదా

రేకు: 1829-5 ఆహిరి సం: 28-167

పల్లవి: ఎడమాఁట లిఁకనేల యెచ్చరింపు లవేల
పడఁతులకుఁ బతుల కొడఁబాటులే కాక

చ. 1: వినయమే కలిగితే విరమంబు లెక్కడివి
మనసులే యెనసితే మరఁగేడది
చనవు సమకూడితే చలములకుఁ జోటేది
తనివోని మోహములు తావుకొనుఁగాక

చ. 2: మాటలే పొసఁగితే మచ్చరంబెందుండు
కూటమికి లోనైతే గొసరేడది
సూటిగా వలచితే సొలపులకు బనియేమి
గాఁటంపుఁదమకములు కమ్ముకొనుగాక

చ. 3: రతులు చేకూడితే రారాఁపు మరి
యితవు లిరవైతేను యెరవేడది
పతి నేలితివి నీవు సరుగ శ్రీవేంకటేశ
సతతంబు మీకుఁ గడుసంతసమే కాక

రేకు: 1829-6 నాదరామక్రియ సం: 28-168

పల్లవి: ఇదె తనకోరికె లీడేరె
పదివేలకుఁ దనభాగ్యంబాయ

చ. 1: కలికి జవ్వనము కారుకొనీ నిదె
వలపులపరువము వచ్చె నిదె
మొలకల చన్నులు మోసులెత్తెనవె
పిలిచి తేఁగదరే ప్రియుని నిచటికి

చ. 2: పువిదమోము కళ లుప్పతిలీ నివె
పవడవాతెరయుఁ బండె యిదె
నవకపు సిగ్గులు ననలొత్తీ నవె
వివరించిపతిని వెసఁదోడితేరె

చ. 3: యింతిచూపు తను నెదురుకొనీ నిదె
వింత చెలువములు వెలసీ నివె
యింతలో శ్రీవేంకటేశుఁడు దానె
కొంతఁ గూడె నెప్పుడు రమ్మనరే

రేకు: 1830-1 శ్రీరాగం సం: 28-169

పల్లవి: తెలియరా దీయింతితెఱఁగులును మొఱఁగులును
అలవాటుగలదుగన కవి నీకే తెలుసు

చ. 1: తలఁచు నినుఁ గాఁగిటను తలగడటు బిగియించు
చెలుల మొగములు చూచి సిగ్గువడును
కలయ నినుఁ బేరుకొను కడలఁ జెప్పకుమనుచు
చిలుకఁ గడుబోదించి చిఱునవ్వు నగును

చ. 2: పెదవి పై నిను సొలసి బింబఫల మటు సోపు
మదనకళ లెసఁగ దెరమఱఁ గిడుకొను
పుదుటుగుబ్బలను గోరొత్తు లటు వాసుకొని
పదకంబు వాఁటిపైఁ బాదుకొనఁజేసు

చ. 3: వరపు పై నిను వెదకి బయలు సరసములాడు
మరుచేఁతలని తెలిసి మనసు గరఁగు
నిరతి శ్రీవేంకటేశ నీవు గూడఁగఁ జెలియ
మరిగి యాకతలు వేమరు నెంచుకొనును

రేకు: 1830-2 శంకరాభరణము సం: 28-170

పల్లవి: చెలి పరిణామపు సుద్దులు చెప్పితి మిదివో నీకును
యెలమిని మావిన్నప మిది యిఁక నీచిత్తమయా

చ. 1: మంతనమున నీవాడినమాఁటలు దలఁచుక తలఁచుక
వంతల నొక్కొకపరి నీవలపులఁ జొక్కునయా
వింతలుగా నీవప్పుడు వేడుకఁ జేసిన చేఁతలు
చెంతలఁ దనతో మెలఁగేటి చెలులకుఁ జూపునయా

చ. 2: పానుపు పై నీవెనసినబాగులు చెప్పుక చెప్పుక
నానావిధముల లో లో నవ్వులు నవ్వునయా
తానకముగ నీవక్కడఁ దలకిచ్చిన యధరామృత
మూనినచవు లిటుగొనుచును వుబ్బుచునుండునయా

చ. 3: కూడుచు నీవటు చెనకినగుఱుతులు చూచుక చూచుక
వేడుకతోడుత నీరతి వేమరు మెచ్చునయా
యాడకు విచ్చేసి యేలితి వీకెను శ్రీవేంకటేశుఁడ
యాడును జోడై నీతో నిటువలె నుండునాయా

రేకు: 1830-3 ముఖారి సం: 28-171

పల్లవి: మేలుకు మేలేకాక మెరమెర లేమిటికే
పోలికలు మీకుఁ దగు పొందులెల్లాఁ జేయవే

చ. 1: కరుణించి యాతఁడు కలువల వేయఁగాను
శిరసువంచుకోనేలే చెలియనీకు
సరసములాడి నిన్ను సారెఁ గరఁగించఁగాను
తెరమాఁటా మాఁటలనే తేనెలెంత చల్లేవే

చ. 2: చుట్టరికములు నీతో చూచి చెప్పి తగులఁగా
గుట్టుతో నుందానవేమే కోమలి నీవు
నెట్టుకొని యాతఁడు నిన్నుఁజేరి చెనకఁగా
వట్టి సిగ్గుతోనేల వలపుదాఁచేవే

చ. 3: కోరి వేఁడి నీతోను కొచ్చి కొచ్చి నవ్వఁగాను
వూరకే వుండఁ గ నేలే వువిద నీకు
యారీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుమన్నించె
తారుకాణ వచ్చితే నెందాఁకా వెరగందేవే

రేకు: 1830-4 గౌళ సం: 28-172

పల్లవి: శిష్టులను మన్నించే శిశు వీతఁడు
దుష్టుల నణఁచి భూమిఁ దుదకెక్కు నీతఁడు

చ. 1: దేవకీదేవివసుదేవులకు జనియ్యించే
భావించఁ గృష్ణుఁడు పరబ్రహ్మము నేఁడు
శ్రావణ బహుళాష్టమి సమకూడె నడురేయి
యావేళ రోహిణి యిన్నిటను మంచిది

చ. 2: గండముతోఁ బుట్టె నదె కంసునికి మేనల్లుఁడు
పాండవుల కందరికి బావమఱఁది
దుండగపు భూభారము తొలఁగదొబ్బు నీతఁడు
యెండనీడ కన్నులవాఁ డిఁక నింతా మంచిది

చ. 3: ఆవు లీతనిపేరిట నచ్చివచ్చు లెంచి చూడ
వేవేల గొల్లెతలకు విట్టుఁ డవును
శ్రీవేంకటాద్రి నున్నాఁడు చేరి యలమేల్మంగతో
యీవలఁ బెద్దలు చెప్పి రిఁక నింతా మంచిది

రేకు: 1830-5 దేవగాంధారి సం: 28-173

పల్లవి: వేలఁ గట్టినట్టి వేవేలు చకిలాలు
కోలలెత్తుకొని కొట్టీ వీఁడె

చ. 1: పుట్టులు జతనము వోవో చెలులాల
రట్టడి కృష్ణుఁడు రావాడీని
గుట్టుతోనే వచ్చి గోపాలులుఁదాము
చుట్టి వెన్నలుఁబాలు జుట్టీ వీఁడె

చ. 2: దొంతులు జతనము దొడ్డుల సతులాల
ఇంతలోఁ గృష్ణుఁడు ఇదె వచ్చీని
రంతు సేసుకొని రయమున వీదుల
వింతగా నడుకులు వెదకీ వీఁడె

చ. 3: వాడలు జతనము వల్లవాంగనలాల
వేడుకఁ గృష్ణుఁడు వెలసీని
యాడనే శ్రీవేంకటేశుఁ డలమేల్మంగఁ
గూడి నీతో ముద్దు గునిసీ వీఁడె

రేకు: 1831-1 భైరెవి సం: 28-174

పల్లవి: పయ్యద మఱుఁగుసేసి పతినేల మొఱఁగేవు
నెయ్యంపు వేడుకలు నెరవేర్చు కొనవే

చ. 1: మొలకనవ్వులతేట మూటగట్టఁగరాదు
తలపోఁ తజలనిధులు దాఁటరావు
కలువకన్నులచూపు గాదెఁ బోయఁగరాదు
యెలమి నవలపు లీఁక నెట్ల దాఁచేవే

చ. 2: కుదురుగుబ్బల మెఱుఁగు కొలఁది వెట్టఁగరాదు
పెదవితేనెలతీపు పిండరాదు
ముదురుఁ దమకములు మరి మూలకొదుపఁగరాదు
యెదిటి నీచక్కఁదన మెట్ల దాఁచేవే

చ. 3: పరగునీచెలువ మేర్పరచి చెప్పఁగరాదు
మరుచేఁత లెంతైన మరవరాదు
సిరులనలమేల్మంగ శ్రీవేంకటేశుఁ డేలె
ఇరవాయ నీపొందులెట్ల దాఁచేవే

రేకు: 1831-2 గౌళ సం: 28-175

పల్లవి: సెలవుల నవ్వనేల సిగ్గులు వడఁగనేల
అలివేణిఁ బోదిసేసి ఆడరాదా మేలము

చ. 1: కూరిమితో నీకు కొమ్మ నిన్ను సొలసెను
నేరుపుల మాటలెల్లా నీతో నాడెను
చేరి యిఁక దరవాతిచేఁతలు నీచేతి దింతే
ఆరీతినే గారవించి యాడరాదా మేలము

చ. 2: వినయము లన్నీఁ జూపి వెలఁది నిన్ను మెప్పించె
చలవుసేసుక నీతో సరి వెనఁగె
తనర నిఁక మన్నించే తగవు నీచేతి దింతే
అనువుగా బుజ్జగించి ఆడరాదా మేలము

చ. 3: మరుగుచు నలమేలుమఁగ నిన్ను దమిరేఁచె
సరసము నీతోనాడి చవి వుట్టించె
సరుగ శ్రీవేంకటేశ సరి నీకెఁ గూడితివి
అరిమురి లాలించి ఆడరాదా మేలము

రేకు: 1831-3 పాడి సం: 28-176

పల్లవి: ఒక్కరికె ఇవియేల వొలపక్షమై దోఁచె
పెక్కు విధుముల నతనిఁ జెడరేఁచఁదగదా

చ. 1: సెరసంబులేకదా చవులుసేసెను రతికి
మరుతంత్రములు గదా మనసుఁ గరచె
తరతీపులె కదా తగులాయములు చేసె
తొరలించి తామె పతిఁ దోడితేఁదగదా

చ. 2: యెడమాటలే కదా యెలఇంచె మమతలకు
అడియాసలేకదా యగడు సేసె
నిడుదచూపులుగదా నెయ్యములు దగిలించె
బెడయకుండఁగ విభునిఁ బిలిచితేఁ దగదా

చ. 3: మొగమిచ్చలేకదా ముచ్చటలు దొరయించె
నగవు లివియేకదా నమ్మించెను
జిగి నింతలో వచ్చి శ్రీవేంకటేశుఁ డేలె
తగవుతో దిన దిన మితనిఁ గూర్చఁదగదా

రేకు: 1831-4 దేసాళం సం: 28-177

పల్లవి: ఇందరిముందర వలపేల దాఁచేవు నీ –
చందము లెఱుఁగుదురు సకులెల్లాను

చ. 1: లేకలేమి నా(వా?) సేవే లేటినేమి దువ్వేవే
వాకిటికి రమణుఁడు వచ్చి వుండఁగా
కాకుగా నెంత నవ్వేవే కతలెన్ని చెప్పేవే
పైకొని పన్నీటను పాదాలు గడుగవే

చ. 2: శిరసేల వంచేవే సిగ్గులెంత చూపేవే
సరస మాతఁడు నీతో సారె నాడఁగా
సరులెన్ని గట్టేవే జాగులేల లెరపేవే
పరగఁ గప్పురముతో బాగా లొసఁగవే

చ. 3: కొప్పెందాఁకాఁ బెట్టేవే గుట్టు నీవెంత చూపేవే
కప్పి శ్రీవేంకటేశుఁడు కాఁగిలించఁగా
చిప్పితి యెంత చొక్కేవే చెమటెంత గురిసేవే
విప్పుచు మోవితేనెల విందు వెట్టవే

రేకు:	1831-5 నట్టనారాయణి	సం:	28-178
పల్లవి:	ఏమే నీరమణుఁడు యెదుట నున్నాఁడు వీఁడె
దోమటిగా మోవి యిచ్చి దొమ్మిరేఁచఁ గలవా
చ. 1:	సళువుఁ జూపుల నీవు సారెకుఁ జూచేవు నీ –
కులుకు గుబ్బలనేమి కుచ్చి యెత్తేవా
పలుకుఁ బంతాలెల్లాఁ బచరించే వదియేమే
కెలసి రతుల నంత గెలువఁగఁ గలవా
చ. 2:	చెనకి బొమ్మల జంకించేవు చలపట్టి నీ –
మొనగోరి వాఁడేమి మోఁచి వచ్చీని
పెనఁగుచు గుంపెనలఁ బెచ్చువెరిగేవేమె
మనసుమర్మము లంట మరిగించఁ గలవా
చ. 3:	తక్కక యాసల గబ్బితనాలు చూపేవు నీ –
యక్కజపఁ గాఁగిలేమి యంటుకొనీనా
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
మిక్కిలి ఇందుకంటె మితిమీరఁ గలవా

రేకు: 1831-6 పాడి సం: 28-179

పల్లవి: ఇయ్యకోలైనమీఁద యెరవేలమ్మా
నెయ్యమున సంతోసాలు నించుకోరమ్మా

చ. 1: రమణుఁ డింటికి వచ్చె రతులను నిన్ను మెచ్చె
తమకించి తప్పు లెంచఁదగదమ్మా
చెమటలు మేన నిండె చిత్తములు మీకుఁ బండె
జమళి నిద్దరు సరసము లాడరమ్మా

చ. 2: చెలువుఁడు నీకు దక్కె చేరి నీ చెక్కులు నొక్కె
చలము లింతట నిఁకఁ జాలునమ్మా
మొలకనవ్వులు మీరె మోమునఁ గళలు దేరె
కలసిమెలసి మీ రొక్కటియై యుండరమ్మా

చ. 3: శ్రీవేంకటేశుఁడు గూడె చెంది నీతో జూజమాడె
యావేళ పంతాలాడ నేఁటికమ్మా
వావులు మీకు దొరసె వలపు లిట్టె మెరసె
పూవుఁ బరిమళమునై పొసఁగరమ్మా

రేకు: 1832-1 దేసాళం సం: 28-180

పల్లవి: చెలులాల రమణుని చేఁదలెల్లాఁ జెల్లనీరే
కెలనికిఁ జూడ మిక్కిలి వన్నెగాదా

చ. 1: చెలిమి సేసినవాఁడు సెలవుల నగనీరే
చలపట్టి యందుకెల్లా సాదించేనా
కలసిమెలసివున్న ఘనుఁడు చెనకనీవే
పెలుచనై యాతనితోఁ బెనఁగులాడేనా

చ. 2: కూరిమిగలుగువాఁడు కొచ్చి కొచ్చి చూడనీరే
గోరనూఁది యందుకు నే గుంపించేనా
చేరి పాయనట్టివాఁడు సిగ్గులెల్లా రేఁచనీవే
దారకురాలనై తన్నుఁ దగ దనేనా

చ. 3: చుట్ట మైనయట్టివాఁడు సుద్దులెల్లాఁ జెప్పనీవే
దిట్టనై నే నందుకెల్లా దేకొనేనా
యిట్టె శ్రీవేంకటేశ్వరుఁ డెనసె జొక్కించనీవే
అట్టె గర్వపుదాననై యవుఁగాదనేనా

రేకు: 1832-2 ఆహిరినాట సం: 28-181

పల్లవి: దయ నాపైఁ గలిగితే తానే మన్నించీఁ గాక
ప్రియములు రేఁచిరేఁచి పెనఁగఁగ నేఁటికే

చ. 1: ననుపుగలిగితెను నవ్వులు తానే వచ్చు
మనసు లెనసితేను మచ్చికవుట్టు
కనుచూపు నాటితేను కడునాస లుప్పతిలు
వెనుకొని పతినంత వేసరించనేఁటికే

చ. 2: వలపు లొనగూడితే వాడికలు సమకొను
తలపు సరిదాఁకితే తారుకాణలౌ
చెలిమి సతమైతేను చిమ్మిరేఁగుఁ దమకము
బలిమి నతనితోడఁ బదరఁగ నేఁటికే

చ. 3: వినుకలి దొరసితే వేడుకలు లెలకొను
యెనకులు దలకొంటే చేఁత లీడేరు
యెనసి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
గునిసి యాతని నిఁకఁ గొసరఁగ నేఁటికే

రేకు: 1832-3 వరాళి సం: 28-182

పల్లవి: వెఱవకువే చెలియా విభుఁడు బత్తిగలఁడు
యెఱుకతో నిన్ను నేలీ నివి యేమి సేసీనే

చ. 1: చందమామ పోలిక సకియ నీనెమ్మొము
చందనపు కొంగగాలి చాయ నీ వూర్పు
కందువ చిగురాకులగని మించుకెమ్మోవి
యెందుండినా నివి నిన్ను నేమిసేసీనే

చ. 2: జక్కవలతోడి యాడు చక్కని నీచనుఁగవ
చొక్కమైనతామరలజోడు కన్నులు
వక్కణించితే తీగెలవంటివి నీచేతులు
యిక్కువలంటి నిన్నివి యేమి సేసీనే

చ. 3: కోవిలపాట వంటిది కోమలవు నీయెలుఁగు
భావించఁ దుమ్మిదగుంపుబాగు నీకొప్పు
చేవదేర నిన్ను నిట్టె శ్రీవేంకటేశుఁడు గూడె
యేవేళా నివెల్లా నిన్ను నేమి సేసీనే

రేకు: 1832-4 వరాళి సం: 28-183

పల్లవి: ఏమందునే నేను యాతనితోడ
వేమారు నన్ను లాలించి వేఁడుకొనీఁ దాను

చ. 1: సరవెనఁగ వచ్చునా సాదించవచ్చునా
దొరతోడ నెంతైనా తొయ్యలులకు
తరుని చూడఁగదె యాతఁడు సారె సారెకు
విరిబంతులను వేసి పీడెమిచ్చీ నాకు

చ. 2: కాలు దాఁకించవచ్చునా కడుఁ జెనకవచ్చునా
యేలికతో వెరవక యింతులకును
తాలిమితో నడుగవే తానెంత నేనెంత
నాలికా డూరకే విచ్చి నవ్వులు నవ్వీని

చ. 3: వావులు చెప్పవచ్చునా వాడిక చూపవచ్చునా
శ్రీవేంకటేశుతో డాసి చెలులకును
యావేళ వినవే నేఁ డీతఁడే నన్నుఁ గూడె
మోవితేనె మరిగించి ముంచి నమ్మించీని

రేకు: 1832-5 హిజ్జిజి సం: 28-184

పల్లవి: చనవు చెల్లించరాదా సతికి నీవు
ననిచి యాపెతో నెంత నవ్వులు నవ్వేవు

చ. 1: మేలుగలయాటది మితిమీరవలదా
యేల నీవు కొచ్చి చూచే వీఁకె నిందుకు
వోలివట్టవచ్చినది వొడివట్టవలదా
పేలరితనాననేల పెనఁగులాడేవు

చ. 2: బత్తిగల జవ్వని గుబ్బల నొత్తవలదా
వొత్తీనంటా నీవేల వొడ్డుకొనేవు
హత్తిన చుట్టము నీకు నాసపడవలదా
తత్తరించి నిమ్మపంటఁ దాఁక నేలవేసేవు

చ. 3: కామించివచ్చినయాపె కాఁగిలించవలదా
చేముంచి సన్నలెందాఁకాఁ జేసి చూపేవు
ప్రేమముతో నేలితి వీపెను శ్రీవేంకటేశుఁడ
భామినితో రతివేళఁ బంతా లే లాడేవు

రేకు: 1832-6 రామక్రియ సం: 28-185

పల్లవి: వద్దని తోయఁగరాదు వడిఁ దమకించరాదు
సుద్దులెల్లాఁ జెప్పి చెప్పి చొక్కించీ నితఁడు

చ. 1: చనుఁగవ లంటవచ్చి జారఁదోసీఁబయ్యద
వినయపుమాఁటలను వేఁడుకొనీని
చెనకి చెక్కులు నొక్కి చిరునవ్వు నవ్వీని
యెనగొని చుట్టరికా లెంతసేసీ నితఁడు

చ. 2: పొందులు సారెకుఁ జేసి బుజముపైఁ జేయివేసి
విందులుగా మోవి యిచ్చీ వేడుకతోను
గందము పైఁ జల్లీని కనుసన్నలు చూపీని
సందడి రతుల కెంత చవిరేఁచీ నితఁడు

చ. 3: చేరి కాఁగిలించీని చేతికి బాగాలిచ్చీ
నేరుపు లెల్లాఁ జూపీ నేఁడు నాతోను
యారీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
గారవించి మరీ నెంత కరుణించీ నితఁడు

రేకు: 1833-1 కాంబోది సం: 28-186

పల్లవి: మగువకుఁ బతితోడ మందెమేళ మింత యేలే
తగిలి మంచితనాన దక్కఁగొనవలదా

చ. 1: నీకొలఁదివారమా నీ యంత నేరమా
యాకడ నీపగటులు యెట్టు చూపేవే
కాకరినవ్వు లెంతేసే గబ్బితనా లిదియేమే
చేకొని పతిముందర సిగ్గువడ వలదా

చ. 2: దేవులము నేమూఁ గామా దీకొనఁగ నోపమా
చేవదేర నెమ్మెలేమి చెప్పుకొనేవే
కావరపుమాఁట లెన్నే కత లెంత నేరుతువే
వేవేలైనా పతివద్ద వినయమే వలదా

చ. 3: సవతులము గామా జాణతనా లెఱఁగమా
జవళి సలిగెలేల సారెఁ బెంచేవే
యిల శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నుఁగూడె
కవగూడి పతి కిచ్చకమే సేయవలదా

రేకు: 1833-2 ఆహిరి సం: 28-187

పల్లవి: నీవేమి సేతువే నిన్ను నింతసేసిన –
భావజుని చెల్లుబడి పంత మింతేకాక

చ. 1: మచ్చికలు గెరలఁగా మరి యెంతోరుచుకొన్నా
అచ్చమైన తమకము లడచరావు
పెచ్చురేఁగి కోరికలు పెంటలై పెరుగఁగాను
హెచ్చిన దీమసములు యేడ నుండు నిఁకను

చ. 2: తలపోఁత లుండఁగాను తల యెంత వంచుకొన్నా
కులికినవ్వులు దాఁచుకొనఁగరావు
యెలమి నడియాసలు యేరులై వుప్పొంగఁగాను
బలిమిఁ జిరుసిగ్గులపను లెందు కెక్కును

చ. 3: జవ్వనము మెఱయఁగా చలమెంత సాదించినా
నివ్వటిల్లు చిత్తము నిలుపరాదు
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
రవ్వలైన విరహపురాఁపు లింకేమున్నవి

రేకు: 1833-3 బౌళి సం: 28-188

పల్లవి: ఏమే నీపంతమెల్లా నిటువంటిదా
నేమముతో నావలెనే నీటు చూపవలదా

చ. 1: చేరి నాతోఁ గాఁపురము సేయఁగా నాతని మీఁద
కూరిమి యెంత చల్లేవే కొత్తఁగా నీవు
నేరు పెంత గలిగినా సెలఁతల వలపులు
యారీతిఁ గాకుసేసే దెంతైనాఁ గలదా

చ. 2: కాతరించి నాతోను కమ్మటి మాటాడేవాని
చేతికి విడెమియ్యఁ జెల్లునా నీకు
పోతరము గలదంటా పొలఁతుల సిగ్గులు
యాతల బాయట వేసే దెందైనాఁ గలదా

చ. 3: చెలఁగి నాకాఁగిటిలో శ్రీవేంకటేశుఁ డుండఁగా
వెలినుండి నీవు నవ్వేవిధ మేఁటిదే
కలిమి గలిగితేను కామినుల భోగములు
యెలమి రవ్వలుసేసే దెందైనాఁ గలదా

రేకు: 1833-4 అమరసింధు సం: 28-189

పల్లవి: ఇంతకంటెఁ బని నీకు నెంతగలదు
కాంత యిచ్చులెనే వచ్చి కరుణించవలదా

చ. 1: చెతులెత్తి చేతులెత్తి చెలి సన్నసేయఁగాను
ఆతల నేమిచూచే వప్పటినీవు
కాతరించి రతులకు కన్నులనే మొక్కఁగాను
యాతలఁ పెరఁగినీవు యెనయఁగవలదా

చ. 2: యెచ్చరించి యెచ్చరించి ఇంతి పూవుల వేయఁగా
కొచ్చి జూజాలేమాడేవు గుట్టున నీవు
కచ్చు పెచ్చుకొనివచ్చి కానుక నీకియ్యఁగాను
అచ్చముగా మాఁటలాడి ఆదరించవలదా

చ. 3: వెడ్డువెట్టి వెడ్డువెట్టి వెలఁది కాఁగిలించఁగా
వొడ్డుక యేమి నవ్వేవు వూరకే నీవు
జిడ్డుదేరఁ జెనకఁగా శ్రీవేంకటేశ కూడితి –
వడ్డాఁక లేక ఇట్టె అంది పొందవలదా

రేకు: 1833-5 వరాళి సం: 28-190

పల్లవి: అందులకె విచారించే నప్పటినుండి
కందువకుఁ బెనఁగఁగా గబ్బి ననవు గదా

చ. 1: పచ్చిదేర నీతో నేను పక పక నవ్వఁగాను
అచ్చలాన మందెమేళ మనవుగదా
మచ్చికతో సారెసారె మాటపలు కాడఁగాను
రచ్చలోన నిది యెంత రట్టడెనవుగదా

చ. 2: సతమై యే పొద్దూ నే నీ సరుసఁ గూచుండఁగాను
అతిగర్వియంటా నన్ను ననవుగదా
తతిగొని యెప్పుడూ బాదమును నే నొత్తఁగాను
మితిమీరి మిక్కిలి గామిడి యనవుగదా

చ. 3: గుట్టుతో గాఁగిట నేను గుబ్బల నిన్నొత్తఁగాను
అట్టె యాసోదకతై ననవుగదా
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి విటునన్ను
బట్టువలెఁ గొనేడఁగ బగ్గడెనవుగదా

రేకు: 1833-6 పళపంజరం సం: 28-191

పల్లవి: సరిబేసివలపులు చవులే కావా
సొరిది నీ నేరు పెల్లాఁ జూపఁరాదా

చ. 1: కప్పురనా వేసెనంటా కాంతనేల తిట్టేవు
చిప్పిల బన్నీట నీవూఁ జిమ్మరాదా
ఆప్పటిఁ బాదము దొక్కెనంటానేల జంకించేవు
పిప్పిగాఁ గందువలంటి పెనఁగరాదా

చ. 2: గొొరు సోఁకించెనంటాను కొమ్మ నెంత సాదించేవు
చేరి నీవూ మోని గంటిసేయరాదా
కేరి కేరి నవ్వెనంటా కెరలి యేమిచూచేవు
మేరతో మారుకుమారు మేలమాడరాదా

చ. 3: పంతమాడె నీతోనంటా భామనేల గద్దించేవు
చెంత నీవూఁ గుచములు చెనకరాదా
ఇంతలో శ్రీవేంకటేశ యాకె నిట్టె యేలితివి
మంతనాన నీ రతులు మరిగించరాదా

రేకు: 1834-1 శంకరాభరణం సం: 28-192

పల్లవి: ఎంతవడేయ నిదేమమ్మా
దొంతిరతులకు నెదురుచూచీని

చ. 1: అలికులవేణి యంబుజపాణి
కలికి మగువ రాఁగదవమ్మా
మలయజగంధి మదనవిలాసిని
కలయికలకు పతి గాచుకున్నాఁడు

చ. 2: సామజగమనా చక్కెరబొమ్మా
కామిని యిఁక రాఁగదవమ్మా
భామాతిలకమ పసిఁడిసలాకా
నీమగఁ డదివో నిలుచుకున్నాఁడు

చ. 3: వొడికపు నెలఁతా వొప్పులకుప్పా
కడఁకలసతి రాఁగదవమ్మా
గుడిగొని తెరలోఁ గూడె నిన్నపుడు
యెడయక శ్రీవేంకటేశుఁ డున్నాఁడు

రేకు: 1834-2 మంగళకౌసిక సం: 28-193

పల్లవి: చిన్నదాననంటానే సిగ్గులేల పెంచేవు
సన్ననేసి మొక్కవమ్మా చతురుఁ డీతఁడు

చ. 1: చనవు నీకు నొసఁగి చవులుగా మాఁటలాడీ
వినవమ్మా యిదివో నీ విభుఁడు
చెనకి చెనకి నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకొనీ
పెనఁగకువమ్మా నీపైఁ బ్రేమగలఁ డితఁడు

చ. 2: కప్పురము నీపైఁ జల్లి కాచుకున్నాఁ డెదుటను
తప్పక చూడమ్మా యాతని మోము
చిప్పిలుమోవి చూపి సెలవుల నవ్వు నవ్వీ
తప్పించుకోకువమ్మా తమకించీ నితఁడు

చ. 3: గారవించి కూడి నిన్నుఁ గరుణతో మన్నించీ
చేరి కాఁగిలించవమ్మా శ్రీవేంకటేశు
సారెకు వలపు చల్లి సరసము లాడీని
మేరలు మీరకువమ్మా మేలుగలఁ డితఁడు

రేకు: 1834-3 మాళవిగౌళ సం: 28-194

పల్లవి: ఏకతపు మీచేఁత లిఁక నెట్టివో
జోకతో మీ సంతోసపు సొంపులెల్లాఁ గంటిమి

చ. 1: తళుకుఁ జూపుల నీవు తప్పక చూడఁగాను
చెలియమోమున నిండీ చిరునవ్వులు
పలుకుఁ బంతాల వొడఁబడికలు నీకెట్టివో
తెలియవుగాని మీ పొందికలెల్లాఁ గంటిమి

చ. 2: జఱసి సన్నలు నీవు సారెకునుఁ జేయఁగాను
మెఱసె బొమ్మజంకెన మెలుతకును
గుఱుతు లొండొరులకు గొనకొన్నవెట్టివో
యెఱఁగముగాని మీ ఇంపులెల్లాఁ గంటిమి

చ. 3: సాదించి వచ్చి నీవు చనుఁగవ ముట్టఁగాను
ఆదిగొనె నివ్వెరగు లంగనకును
యాదెస శ్రీవేంకటేశ యెన్నికలు మీకెట్టివో
సోదించముగాని మీ సుద్దులెల్లాఁ గంటిమి

రేకు: 1834-4 వరాళి సం: 28-195

పల్లవి: ఒకటి కినుమడాయ నువిదసింగారాలు
సకలముఁ జిత్తగించు జాణఁడవు నీవు

చ. 1: నిలువు దురు మొక్కటే నిండుఁజీఁకటిగాని
నెలఁత నవ్వులైతే వెన్నెల కుప్పలు
పలుచనికెమ్మోవి పచ్చిచిగురింతేకాని
అలరన దంతములైతే వజ్రములే

చ. 2: పట్టరాని నెన్నడుమే భావించసన్నముగాని
గట్టిచన్నులైతేను కడుగొప్పలు
అట్టె మెఱుఁగుఁదొడ లాఁదోఁకలై వుండెగాని
మిట్టలై నపిఱుఁదులు మిక్కిలి బటవులే

చ. 3: యించుకంతలు పాదాలే యెట్టని వన్నెయఁగాని
యెంచిచూడ మేనెల్లా హేమవర్ణమే
కొంచక శ్రీవేంకటేశ కూడితి వీకెను నేఁడు
మించిన యాపెవలపు మేలుమీఁది మేలు

రేకు: 1834-5 హిజ్జిజి సం: 28-196

పల్లవి: అన్నిటా జాణవైతి వప్పుడే నీవు
యెన్నేసిచేఁతలు సే సే విసుమంతదానవు

చ. 1: మాటలా డనేరుతువే మగనితో సారెసారె
వీటుచూపనేరుతువే నిలుచుండి
గూఁటముగా నిన్నుఁ జూచి కడువెరగయ్యీ నాకు
యీటుతో రట్టడివైతి విసుమంతదానవు

చ. 2: చెనకంగనేరుతువే చేతులారా నీవిభుని
వినయాలు నేరుతువే వేవేలుగాను
ఘనముగా నవ్వే నీవు కత గరచినందుకు
యెన సెంత జూటవైతి విసుమంతదానవు

చ. 3: చేరి మొక్కనేరుతువే శ్రీవేంకటేశ్వరునికి
కూరిమితోఁ గాంగిలించి కూడనేర్తువే
యారీతి నన్నితఁ డేలె యిందుకే నాకరుదయ్యీ
యేరుపరచకువే నీ విసుమంతదానవు

రేకు: 1834-6 ఆహిరి సం: 28-197

పల్లవి: ఏమని విన్నవించేము ఇంతిచందములు నీకు
ఆముకొన్న కరుణతో నాదరింతు గాక

చ. 1: వొప్పగు నిన్నుఁ దలఁచి వువిద పాన్పు మీద
నుప్పతిల్లుఁ జెమటల నోలలాడీని
ముప్పిరిగొన్నవయసు ముంచి యాసలు రేఁచఁగా
చెప్పరాని వలపుల జిమ్మిరేఁగీని

చ. 2: వొట్టిన నీగుణములు వొకటొకటే యెంచుక
అట్టె నిట్టూరుపుల నుయ్యాల లూఁగీని
గట్టిగా నీవిచ్చినవుంగరము చూచి చూచి
గుట్టుతో దమకముల గుబ్బతిలీని

చ. 3: గక్కనఁ జెలులు నీకతలు చెప్పఁగా విని
వెక్కసపుఁ బులకల విఱ్ఱవీఁగీని
యిక్కడ వచ్చి శ్రీవేంకటేశ యింతిఁ గూడితివి
పిక్కటిల్లు సంతోసాలఁ బెనగొనీని

రేకు: 1835-1 రామక్రియ సం: 28-198

పల్లవి: ఇన్ని నేరుపులు నీయెదుటనే పచరించీ
సన్నలనే నివీకెను సంతోసించవయ్యా

చ. 1: వలిపె పయ్యెదతోడ వట్రువగుబ్బలతోడ
కొలువుసేసీ నదె కొమ్మ నీకును
సెలవుల నవ్వుదేర చెమట చెక్కులఁగార
తెలిపీఁ దలవలపు తేరిచూడవయ్యా

చ. 2: వాసనపూఁతలు పూసి వన్నెలకుచ్చెల వోసి
ఆసలురేఁచీ నదె యంగన నీకు
లాసేటిచూపులు చూపి లలిఁ గొనగోరుమోపి
సేసీఁ దనచేఁతలు చిత్తగించవయ్యా

చ. 3: వాడికలఁ జెలరేఁగి వంతుల నేతులఁ దూఁగి
వీడెము చేతికిచ్చీ వెలఁది నీకు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తోడనె తానూఁ గూడీ పొందులు సేయవయ్యా

రేకు: 1835-2 దేపాళం సం: 28-199

పల్లవి: చెలియరో యన్నాళ్ళైనాఁ జిన్నదానవా
యెలమి నీవిభునికి నియ్యవే విడెము

చ. 1: నేరుపుగలయందుకు నెట్టుకమాటాడవలె
వోరుపుగల యందుకు వొడఁబడివుండవలె
కూరిమిగల యందుకు కూటమి నెరపవలె
వూరకే గోలతనాన నుందురా జవ్వనులు

చ. 2: చనపుగలయందుకు సరసమాడఁగవలె
ననుపుగయందుకు నవ్వుతానుండఁగవలె
వినయము గలయందుకు వేమారు మొక్కఁగవలె
పెనఁగుతా సిగ్గులెల్లాఁ బెంతురా జవ్వనులు

చ. 3: వేడుకగలయందుకు వేరు సేయకుండవలె
వాడిక గలయందుకు వైపుగా మెలఁగవలె
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్ను నేలె
తోడుగూడి వాసులకు జొత్తురా జవ్వనులు

రేకు: 1835-3 శంకరాభరణం సం: 28-200

పల్లవి: చిత్తగించుమిదె చెలియవిలాసము
పొత్తులుగలపీ భోగంబులకు

చ. 1: వెన్నెలరేకులు వెదచల్లీ నదె
సన్నల సలవుల సకియా
కన్నులమొక్కులు కానుకలొసఁగీ
నిన్నుఁ జూచి యిదె నివ్వెరగులను

చ. 2: జక్కవపిట్టల సంతముసేసీ
అక్కున గప్పుచు నతివా
చక్కనిమోవిని చవులటు గొలిపీ
నెక్కొని నీపై నేస్తంబులను

చ. 3: పలుకుఁ దేనియలు పలుమరుఁ జిలికీ
మెలుపురతుల నలమేల్ మంగ
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
అలరీ నీతో నదె సరసములా

రేకు: 1835-4 శుద్ధవసంతం సం: 28-201

పల్లవి: నీకొలఁదిదానసనా నీ యంత నే నేరనా
చేకొని యెంతేసి నీవు చేఁతలు సేసేవు

చ. 1: సరసములాడి యాడి సంగాతాలు సేసితివి
మరిగి నావద్దనున్న మగనితోను
తెరమరఁగున నుండి తేలించనేల వచ్చేవే
గరిమల నాకతఁడు కడుమేలువాఁడు

చ. 2: వలపులు చల్లి చల్లి వావి గడించుకొంటివి
బలిమి నావసమైన పతితోను
కొలువులోనే వుండి కోరి సన్నసేసేవేలే
కలకాలమితఁడు నాకడ మేలువాఁడు

చ. 3: కొప్పు దువ్విదువ్వి నీ కూటమి నెరపితివి
ఇప్పుడు నాశ్రీవేంకటేశునితోను
వొప్పుగ నన్నితఁ డేలె వొడివట్ట నేమిటికి
నెప్పుగ నీతఁడు నాకన్నిటా మేలువాఁడు

రేకు: 1835-5 మాళవిగౌళ సం: 28-202

పల్లవి: సిగ్గున దాఁచఁగరాదు చెప్పకపోదు
వొగ్గి వేఁడుకంటి మిదె వొప్పుగొనవయ్యా

చ. 1: పువ్వువంటి జవ్వనము పూఁటవూఁట కెచ్చఁగాను
నివ్వటిల్లె వలపులు నెలఁతకును
యివ్వల నింతి సుద్దులు యేమిచెప్పేమిఁక మీకు
రవ్వలు సేయక ఇట్టె రావయ్య యింటికి

చ. 2: పొట్టఁ బొరుగు నీ పొందు పొదులే కింపించఁగాను
నెట్టుకొని రమణికి నిండువావులు
వట్టిజోలి నీ ముందర వరవాతాలేమిటికి
గుట్టుతోనే రావయ్యా గక్కున నిట్టె యింటికి

చ. 3: చిత్తములోనియాసలు చిమ్మి గడురేఁచఁగాను
హత్తుకొనెఁ దమకము లంగనకును
కొత్తగా శ్రీవేంకటేశ కూడితి వీకె నింతలో
బత్తితో నిట్టె రావయ్యా బడి బడి నింటికి

రేకు: 1835-6 తెలుఁగుఁ గాంబోది సం: 28-203

పల్లవి: మగువ నేరుతువే మాఁటలు - నీవు
తగిలి తెలుసుకో తారుకాణలు

చ. 1: చెనకేనే వో చెలియా - నీ
చెనకులే కావా చెక్కులవి
పెనఁగకు చనుఁగవ పిసికేనే యవి
గనములు చేతికిఁ గడు గట్టులురా

చ. 2: నవ్వేనే వో నలిలాక్ష - నీ
నవ్వులు నిజమైనవి నేఁడు
జవ్వాది మేనఁ జమరేనే
పువ్విళ్ళుయ వలపూరిఁ గదరా

చ. 3: తలఁపించేనే తమకములు - ఆవి
తలఁచకతొల్లే తలకెక్కె
యెలమిని శ్రీవేంకటేశుఁడనే – నే –
నలమేల్మంగను ఆలనే కదరా

రేకు: 1836-1 కాంబోది సం: 28-204

పల్లవి: ఎంత యాకరీ నీకు యాతరుణి
పొంతనే వేడుక లెంత పొదిగీనో కాని

చ. 1: చెక్కులఁ జెమటగార సేసీ నీకు నూడిగాలు
యెక్కు డైనబత్తితో నీ యింతి
లక్కవలెఁ గరఁగుతా లలిరేఁగి నవ్వీని
వుక్కుమీరి వలపెంత వున్నదో కాని

చ. 2: మచ్చికలు చూపి చూపి మాఁటలెల్లా నాడీని
యిచ్చకము సేసుకొంటా యాయింతి
కొచ్చి కొచ్చి సారె సారెఁ గొలువులు సేసీని
పచ్చిదేరేయాస లెంత ప్రబలీనోకాని

చ. 3: కదిసి యేపొద్దు నీచక్కని మొగమే చూచి
యెదుటనే నిలుచుండీ యాయింతి
మొదల నన్నేలితివిముప్పిరి శ్రీవేంకటేశ
పొదిగీ నిన్ను పొందెంత పొదలీనో కాని

రేకు: 1836-2 నారాయణి సం: 28-205

పల్లవి: ఎటు వంటివాఁడవైతి వేమయ్యా నీవు
తటుకన నాఁడువారి దయఁజూడవలదా

చ. 1: మంతనాన నే నీతో మచ్చికమాటలాడితే
కాంతలతోఁ జెప్పి చెప్పి కాకుసేతురా
వింతలుగా నిన్నుఁ జేరి వేడుకనవ్వు నవ్వితే
అంతలోనే మాచేత లంగడిఁ బెట్టుదురా

చ. 2: చనవుతో నీకు నేను సన్నలు సేసితేను
వనితలకు జూపి రవ్వలు సేతురా
వినయాన సరసము వెరవక నే నాడితే
వెనకొని మా గుట్టు వెల్లవిరి సేతురా

చ. 3: కామించి నిన్ను నేనుఁ గాఁగిలించుకొంటేను
భామలకు నెచ్చరించి పచ్చి సేతురా
గోమున శ్రీవేంకటేశ కూడి మొక్కించుకొంటివి
ఆముకొన్న నావలపు లారడిఁ బెట్టుదురా

రేకు: 1836-3 వరాళి సం: 28-206

పల్లవి: చెప్పరాదు నీపగటు సిబ్బితిపడ వేమిటా
అప్పటి మురిసేవు నాయంతదానవా

చ. 1: యెంతకొప్పు వెట్టితివే యేమి నిక్కి చూచేవే
జంతవలె పతిమోము సారె సారెకు
పంతపు సతులు లాతనిపక్క నిట్టెవుండఁగాను
యెంతేసిచేఁతల నీవు యెలయించేవే

చ. 2: సింగారా లెంత చూపేవే చిరున వ్వేమి నవ్వేవే
అంగడి వీధినుండే యాతనితోను
చెంగట మేటామేటీలు సేవలెల్లాఁ జేయఁగాను
సంగతెఱఁగక యేమి చవులు రేఁచేవే

చ. 3: పందే లేల వేసేవే పై పై నేల పెనఁగేవే
యిందరిలో శ్రీవేంకటేశుఁ జొక్కించి
కందువఁ గూడిన నేము కాఁపురాలు సేయఁగాను
చెంది నీవప్పటినేల బెనకఁజూచేవే

రేకు: 1836-4 సాళంగనాట సం: 28-207

పల్లవి: తానెంత నీవెంత తన సుద్దు లివిగో
నీనూ నీవూఁ జుట్టాలమై నెమ్మది నున్నారము

చ. 1: ముంగిటికి వచ్చి వచ్చి మొకము చూపి నిన్ను
వుంగరమడిగెఁ జెలి వొయ్యనొయ్యనే
సంగడినే కూచుండి జాణతనాలెల్లా నాడి
యెంగిలి సే సె మోవి యాకె యెంత రట్టడి

చ. 2: సెలవుల నవ్వి నవ్వి చెతులెత్తి మొక్కి యిట్టె
మెలఁగి చన్నులు చూపె మెల్ల మెల్లనె
చెలుములు సేసి మరిచేరి సన్న నీకుఁ జూపి
యెలమిఁ బాదముదొక్కె నీకె యెంత రట్టడి

చ. 3: ఇచ్చకము లాడియాడి ఇంపులు నీపైఁ జల్లి
కొచ్చి కొచ్చి తమిరేఁచెఁ గూడఁగూడనె
యిచ్చుట శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
హెచ్చి గోరఁ దా నిన్నంటె యాకె యెంత రట్టడి

రేకు: 1836-5 పాడి సం: 28-208

పల్లవి: నా మొగము చూచి యేమి నవ్వులు నవ్వేవు నీవు
యీ మఱఁగు లీడేరె నెంత సేసేవు

చ. 1: చిత్తరుపతిమవలె చెలి నిలుచుకున్నది
హత్తి దండఁ గూచుండు మనఁగరాదా
బత్తిసేసి నీకు నదె బాగా లందిఇచ్చీని
కొత్తవలపు నీవందుకొనఁగరాదా

చ. 2: మేనమఱఁదలి వలె మెలుత సరసమాడీ
వీనులు చల్లఁగా నీవు వినఁగరాదా
ఆనుక గుబ్బల నీకు నాస చూపుకవున్నది
పేనిపట్టి వాఁటితోడఁ బెనఁగరాదా

చ. 3: వలరారజుతల్లివలె వనిత నీకుఁ గలిగె
మలసి యన్నిటా నీవు మన్నించరాదా
తలఁపుదెలిసి నన్ను దయఁజూచి యేలితివి
యెలమి శ్రీవేంకటేశ యీకెనూఁ గూడరాదా

రేకు: 1836-6 దేశాక్షి సం: 28-209

పల్లవి: ఎంతలే దీపెనటన లివియఁ గొన్ని
చెంత నన్నీఁ గానవచ్చె చెలియ రాగదవే

చ. 1: యేతరికాంతల సుద్దు లెవ్వరెరుఁగుదురమ్మా
ఆతఁడు వలచుఁ దనకంటాఁ జెప్పీని
పోతరించి పొద్దువోక బొమ్మల గాటుకవెట్టీ
యాతల నీపె వేసా లేమని చెప్పేదే

చ. 2: జూటు సతులచేతలు సోదించేవా రెవ్వరమ్మా
కూటమి నాతనిమేన గోరు చూపీని
కోటిసేయఁ బెదవిపైఁ గూరవండి కసవేరీ
యాటున నీపె గుణము లేమని చెప్పేదే

చ. 3: కావరపింతులజాడ గన్నవారెవ్వరో యమ్మా
శ్రీవేంకటపతివద్దఁ జేరి నవ్వీని
కావించి నన్నితఁడేలె కతకుఁ గాళ్ళుడిగీని
యావేళ యాపెనేరుపు లేమని చెప్పేదే

రేకు: 1837-1 బౌళి సం: 28-210

పల్లవి: ఈకె నేమూ దేవుళ్ళమై యిట్టె నీ కుండేముగాక
మాకు సమ్మతములాయ మరియేఁటిసుద్దులు

చ. 1: ముచ్చటలెల్లా నాడె మోహమున జవరాలు
ఇచ్చకము సేసె నీవూ నియ్యకొంటివి
విచ్చనవిళ్ళాయ మీకు వేడుకలు సమకూడె
మచ్చికాయ మాపుదాఁకా మరియేఁటి సుద్దులు

చ. 2: తెలిగన్నులనుఁ జూచె తియ్యనిమోవి చూపె
కలకల నవ్వె నీవూ గైకొంటివి
తలఁపులు సరివచ్చె తనిసె మీమనసులు
మలసె సంతోసాలు మరియేఁటిసుద్దులు

చ. 3: వుదుటగుబ్బల నూఁదె వొరసె నిన్నుఁ జెనకె
కదిసెఁ గాఁగిట నీవూఁ గానిమ్మంటివి
ఇదివో శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
మదిమది నున్నారము మరి యేఁటిసుద్దులు

రేకు: 1837-2 సౌరాష్ట్రం సం: 28-211

పల్లవి: ఇటు వంటి నీ సుద్దులు యెఱఁగ మిన్నాళ్ళును
తటుకనఁ జెప్పవే వింతలుగా మాకిపుడు

చ. 1: చెక్కులఁ జెమటలారీ చెంపలఁ దురుము జారీ
చిక్కని నవ్వులనే సిగ్గు దేరీని
చక్కని రమణి నీవు సాదువలెనే వుంటివి
యెక్కడ గడించుకొంటివే యీవలపు

చ. 2: మోమున గళలు గూడీ మోని గడువసి వాడీ
కామించి నీపోఁకముడి గక్కన వీఁడీ
సామజగమన నీవు సాదువలెనే వుంటివి
యేవిట గడించుకొంటివే యీవలపు

చ. 3: తావులు మైఁ జోడుముట్టీ తగు నీట్టూర్పులు దొట్టీ
పూవలై పులకలెల్లా గుంపుగట్టీ
నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ –
డేవల గడించుకొంటివే యీ వలపు

రేకు: 1837-3 పాడి సం: 28-212

పల్లవి: అట్టె నిన్నుఁ జూని అరుదయ్యా నా కప్పట నుండి
కట్టుకొని వలపెంత గాదెంబోసేవే

చ. 1: పెదవిపై తమ్ములము చేఁటులు రాలఁగాను
కదిసి విభుని కేమి కత చెప్పేవే
అదరు గుబ్బలపై పయ్యద వెడజారఁగా
యెదుటనుండి యాసలు యెంత చూపేవే

చ. 2: పూని చెమటలు మేన నూరుచు వడియఁగాను
పానుపుపై నుండి యేమి పాదాలొత్తేవే
పూనిన కొప్పు విరులు భుజాల పై రాలఁగా
మోనానఁ దప్పక యిట్టె మోమెంత చూచేవే

చ. 3: కరములు చాఁచుకొంటా కాఁగిటిలోఁ బెనఁగుతా
సరికిబేసికి నేమి సాము సేసేవే
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
వరుసకు నీవెంతవడి నాసపడేవే

రేకు: 1837-4 దేసాళం సం: 28-213

పల్లవి: వేడుకలే మీఁద మీఁద వెలయుఁగాక
జోడై మీరిద్ద రొక్కచోటనే వుండఁగాను

చ. 1: వెన్నలకెక్క డి వేఁడి విరుల కెక్కడి వాఁడి
కన్నెక విభుఁడు నీవు గలకాలము
సన్నలేల మొగచాటౌ చప్పనేలౌ మోవితేనె
యెన్నికతో నేపొద్దు నీవెదుట నుండఁగాను

చ. 2: చిత్తమున కేడ చింత సిగ్గులకు నేడ వంత
హత్తి నీ వీపె కాఁగిట నలరఁగాను
బత్తియేల విరసమౌ పాయమెట్టు పట్టవచ్చు
కొత్తలుగా నీ వీ రీతిఁ కొమ్మతో నవ్వఁగాను

చ. 3: వలపులకేది మితి వాసులకు నేది తతి
చెలిమి మీరిద్దరునుఁ జేయఁగాను
అలమేల్మంగ నేలితి వపుడె శ్రీవేంకటేశ
చెలి యాల మరచు నీచేఁతలు మించఁగాను

రేకు: 1837-5 శుద్ధదేశి సం: 28-214

పల్లవి: కంటిమి నీ సింగారాలు కన్నుల పండువుగాను
దంటవైనందుకు నీ చందములెల్లాఁ దగునే

చ. 1: పువ్వులు కొప్పున రాలె బుజము పై రేకలవె
యివ్వల నామోము చూచి యేమినవ్వేవే
కువ్వలాయఁ బులకలు కురిసె మేనఁ జెమట
జవ్వనివైనందుకు సప (ఫ ?) లము లాయనే

చ. 2: మోమునఁ గళలు దేరె మోవిమీఁద చేఁటులదె
చేముంచితి వికనేల సిగ్గువడేవే
ఆముకొనె నిట్టూర్పు లంగమునఁ బచ్చిదేరె
యామేర జాణవైనందు కిన్నియు నమరునే

చ. 3: కలగొనె సంతోసాలు కన్నులఁ దేటలవె
అలర మాకెంతేసి ప్రియాలు చెప్పేవే
చెలఁగె నీ వేడుకలు శ్రీవేంకటేశుఁడు గూడె
అలమేలు మంగవు నీకన్నియు నీడేరెనే

రేకు: 1837-6 ఆహిరి సం: 28-215

పల్లవి: మేలు గలితే నిందుకు మెచ్చవద్దా నీవిట్టె
యాలేమతో జాణతనా లెంతేశాడేవయ్యా

చ. 1: కలికితనాలనే కరఁగించె నీమనసు
చిలుకుఁ జూపుల నిన్నుఁ జిమ్మిరేఁచెను
నిలువుఁ గొలుపు సేసి నిన్ను మరిగించుకొనె
చెలితో నీవెట్టు సాముసేసేవయ్యా

చ. 2: నవ్వుతానే నీతోడ ననుపులు సేసుకొనె
వువ్విళ్ళూర మాఁటాడి వొడఁబరచె
విప్పటిల్లఁ గళలంటి నిన్ను నిట్టె దక్కఁగొనె
జవ్వని నీవెటువలె సాదించేవయ్యా

చ. 3: చుట్టరికముననే చొక్కులఁ బెట్టె నిన్ను
గుట్టుతోనే రప్పించుకొనె నింటికి
గట్టిగా శ్రీవేంకటేశ కందువఁ బెండ్లాడె నీతో
నిట్టె యలమేలుమంగ నెట్టు గెలిచేవయ్యా

రేకు:	1838-1 ముఖారి సం:	28-216

పల్లవి:	అతఁ డెంత నీవెంత అంతరము లెంచుకోము
చేతికి దొరకనంటా సేవలుసేసేవు

చ. 1:	చెలరేఁగి చెలరేఁగి సేసేవు విన్నపాలు
వెలయ నాతఁడు సారె వినీ నంటాను
మెలఁగే వెదుల మందె మేళమున నప్పటిని
నలుగడ నీతో నిట్టె నవ్వీనంటాను

చ. 2:	తగిలి తగిలి యాతనిమోము చూచేవు
నిగిడి నీముందరను నిలిచెనంటా
జిగిమించఁ గొనగోరఁ జెనకఁగ వచ్చేవు
వొగి మొగమాటమున నున్నాఁ డంటాను

చ. 3:	నానఁబెట్టి నానఁటబెట్టి సయగారాలు చూపేవు
కానిమ్మని నీచేఁతలఁ గైకొనీనంటా
యే నలమేల్మంగను నన్నేలె శ్రీవేంకటేశుఁడు
నీ నేరుపులు చెప్పేవు నిన్ను నిచ్చీనంటాను

రేకు: 1838-2 సాళంగం సం: 28-217

పల్లవి: నీకూ నీపెకుఁ దగును నేరుపు లెంచి చూచితే
చేకొని మెచ్చరయ్యా యా చెలియ సొబగులు

చ. 1: చక్కెర మోవిఁ దొలఁక సారెసారె మాటలాడీ
జక్కవచన్నులు చూపి చల్లీవలపు
రెక్కతుమ్మిద విరుల రేఁచిరేఁచి కొప్పువెట్టీ
చక్కఁజూడవయ్య యీసకియ పగటులు

చ. 2: సిగ్గులు సెలవిఁ బార చిరునవ్వు నవ్వీని
నిగ్గులు మేన నిండ నీతోఁ బెనఁగీ
వెగ్గళించి చూపులనే వెన్నెలలు వెదవెట్టీ
వొగ్గి చిత్తగించవయ్యా వువిద నటనలు

చ. 3: జోకలు కాఁగిటఁ దేర చుట్టరికము చెప్పీని
మేకులు మురిపెమున మెరఇంచీని
యాకెను శ్రీవేంకటేశ యేలితివి నన్ను మెచ్చి
మేకొనవయ్యా అలమేలుమంగ రతులు

రేకు: 1838-3 గౌళ సం: 28-218

పల్లవి: నీవెఱఁగవా తగవు నెఱజాణ విన్నిటాను
వేవేలకు నేమూ నీకు విన్నవించే మిపుడు

చ. 1: వలచినయాటదాని వద్దని తోయఁదగదు
తలకొని వెదకఁగా దాఁచఁదగదు
పిలిచి వేఁడుకోఁగాను పెనఁగ మరి తగదు
చెలియప్రియము లిఁకఁ జేకొనవయ్యా

చ. 2: చేయెత్తి నీకు మొక్కఁగా సిగ్గులు వడఁదగదు
ఆయము లంటఁగా నౌఁగాదనఁ దగదు
పాయక బత్తి సేయఁగా పరాకు సేయఁదగదు
యీయింతికోరిక లిఁక నీడేరించవయ్యా

చ. 3: తాలిమితోఁ జూడఁగాను తలవంచుకోఁదగదు
కేలువట్టి తియ్యఁగా జంకించఁదగదు
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
నీలాలకేచన విఁక లెరవేరించవయ్యా

రేకు: 1838-4 మంగళకౌసిక సం: 28-219

పల్లవి: ఇప్పుడు నీవు రాఁగాను ఇంత సంతోసించెఁగాని
వుప్పతిల్లుఁ గోరికల నువ్విళ్ళూరుచుండును

చ. 1: మగువతోఁ జెప్పింపినమాటలు
తగుల నీవు సేసిన తమ్మివాటులు
సొగసి జూజాలాడిన చోటులు
నిగిడి తలఁచుకొని నీకెదురు చూచును

చ. 2: చుట్టమవై నీ వంపిన సొమ్ములు
గుట్టుతో గుబ్బలపై నీగోరి చిమ్ములు
జట్టిగొన్న నీ సరసమ్ములు
నెట్టనఁ దలఁచుకొని నీకెదురుచూచును

చ. 3: పొలసి నీవు సేసిన పొందులు
విలసిల్లు నీమోవి విందులు
కలసి శ్రీవేంకటేశ యలమేల్మంగ
నిలిచి తలఁచుకొని నీకెదురు చూచును

రేకు: 1838-5 నాదరామక్రియ సం: 28-220

పల్లవి: ఎంత బత్తి గలవాఁడ వీకె మీఁదను
వింత మీ పొందులు చూచి వెరగయ్యె మాకును

చ. 1: కప్పురపు లప్పఁ గొని కాంతకొప్పు దాఁక వేసి
అప్పుడే వేఁడుకొనే వదేమయ్యా
రెప్పలెత్తి సారెఁ జూచి రెఁచితిఁగా వలపంటా
దప్పిదేర మోవిచ్చేవు తగుఁదగునయ్యా

చ. 2: మనసు చూడవలసి మర్మము సోఁకఁ దిట్టి
చనవిచ్చి లాలించేవు సంగతౌనయ్యా
కొనగోర గుబ్బలపై గురుతులుగా వా (వ్రా ?)ని
వినయాలు సే సే వెంత విద్యవాఁడవయ్యా

చ. 3: బలిమిఁ గాఁగిటఁ గూడి పచ్చిదేర వలపించి
సెలవుల నవ్వేవిది చెల్లునయ్యా
అలమి శ్రీవేంకటే యలమేల్మంగ నురాన
నిలిపి మన్నించేవు నెరవాదివయ్యా

రేకు: 1838-6 రామక్రియ సం: 28-221

పల్లవి: నాతో పొందు లేకఁ జూడు నాలికాఁడా
నీతలఁపులెల్లాఁ గంటి నీటుకాఁడా

చ. 1: వేడుకకాఁడవై నీవు వేగినంతా చెలులతో
వాడిక చూపితివిగా వన్నెకాఁడా
వీడెపు సెలవులతో వింత వింత మాఁటలాడి
యేడలేని నవ్వు నవ్వే వెమ్మెకాఁడా

చ. 2: వుమ్మడి నందరిమీఁద నువ్విళ్ళూర వలపులు
కుమ్మరించితివిగా కోడెకాఁడా
చిమ్ముచుఁ జెనకులనే సిగ్గులు రేఁచిరేఁచి
పమ్మిఁ జూపులఁ జూచేటిపంతగాఁడా

చ. 3: చేయిమీఁదుగా నావు చేరి యొకరొకరినే
ఆయము లంటితివిగా అందగాఁడా
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కాయజకేలిఁ గూడితి కతలకాఁడా

రేకు: 1839-1 సామంతం సం: 28-222

పల్లవి: బత్తిగల విభుఁడవు భామకు నీవు
యిత్తల నాకె చనవు యాడేరించవయ్యా

చ. 1: ముప్పిరివినయముతో మోవితేనె లూరఁగాను
చెప్పీఁ బ్రియాలు నీకుఁ జెలియా
కొప్పు నిక్కఁ బెట్టుకొని కూరిములు చల్లుకొంటా
ఇప్పుడిదె నీకు మొక్కి నింటికి రావయ్యా

చ. 2: సెలవుల నవ్వుకొంటా చేరి చేరి బుజ్జగించి
సొలసీ సారెకు నిన్ను సుదతి
వలపులు చల్లి చల్లి వాడికలు దలపించి
పిలిచీ నాపె సంగడిఁ బీఁట యెక్కవయ్యా

చ. 3: సన్నలు సేసి నీకు చవులెల్లాఁ గుట్టించి
చన్నులు మోపీ నీకు సకియా
యిన్నిటా శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
కిన్నెర వాయించీఁ గాఁగిట నించవయ్యా

రేకు: 1839-2 రీతిగౌళ సం: 28-223

పల్లవి: తానే యెఱుఁగు విభుఁడు తన ఇచ్చలోదాన
తానకముగా నన్ను దయఁజూడు మనవే

చ. 1: తలఁచితే వలపులు తామరదంపరలౌను
సొలసితే మాటలకుఁ జోటు గలుగు
వలెనంటే నాసలు వండవండనట్లవును
పలమారు నే విన్నపము సే సే దేమే

చ. 2: యెనసితే దమకము లీఁతలుమోఁతలునౌను
మనసు లేకములైతే మర్మము లంటు
అనువైతే చెనకులు అనలుఁగొనలుసాగు
పెనఁగిపెనఁగి తన్నుఁ బెరరేఁచే దేమే

చ. 3: కూడితే మొగమిచ్చలు కొండలుఁ గోటులునౌను
జోడువాయ కుండితేను సొంపు లెక్కును
యడ నన్నలమేల్మంగ నెనసె నింతటిలోనె
వోడక శ్రీవేంకటేశు నొరసే దేమే

రేకు: 1839-3 పాడి సం: 28-224

పల్లవి: ఆఁడువారిఁ గంటేఁజాలు ఆస నీకెంతైనాఁ గద్దు
పోడిమితోఁ మమ్మంటేవు పొద్దువోదా నీకు

చ. 1: యెచ్చిన తమకముతో నెదురులు చూచుకొంటా
కచ్చు పెంటి నీకు నాపె గాచుకున్నది
మచ్చికజాణతనాలు మాతో నేమి యాడేవు
అచ్చముగా మాతోపొందు లంతేసి కోపుదువా

చ. 2: కందువ నిన్నుఁ బెండ్లాడి కాఁపురము సే సేనంటా
పొందులకు నీతో నాపె వూఁచుకున్నది
చెంది మా చన్నులమీఁద చేతులేమి చాఁచేవు
అందముగ మాతో పొందు లంతేసి కోపుదువా

చ. 3: వేడుక నలమేల్మంగవిభుఁడు శ్రీవేంకటేశ
కూడేనంటా నాపె నిన్నుఁ గోరుకున్నది
వాడికగా మమ్ము నీడ వలపించి యేలితివి
ఆడుకోలు మాతోపొందు లంతేసి కోపుదువా

రేకు: 1839-4 ఆహిరి సం: 28-225

పల్లవి: చెలియ మోహము నీకుఁ జెప్పఁగ నలవిగాదు
మలసి నీవే యెఱిఁగి మన్నించుమికను

చ. 1: యెదురుచూచు నీకు యింతి నీ సుద్దులడుగు
వుదుటుఁ గోరికలతో నుస్సురనును
మదిలోనఁ దలపోసు మచ్చికతోఁ జెమరించు
పెదవులఁ దేనెలూరఁ బేరుకొని పిలుచు

చ. 2: ఆలకించు నీమాటలు ఆసలు దనలో నించు
వేళ గాచుకొని వుండు వేడుకతోను
మేలుదై దాఁ బొగడు నీమీఁది పదములు వాడు
చాలుకొని నీరాకకు సకినాలు చూచును

చ. 3: చేతులెత్తి నీకు మొక్కు సేసచల్లఁ దమకించు
కాత రించలమేల్మంగ కళలు రేఁగు
యాతల శ్రీవేంకటేస యేలితి వింతలో వచ్చి
రాతిరిఁ బగలు నీ రతులెల్లా మెచ్చును

రేకు: 1839-5 శ్రీరాగం సం: 28-226

పల్లవి: ఎటువలె మన్నింతువో యెంత మరిగెనో యాకె
అటువంటి జాణతనా లమరు మీకు మీకె

చ. 1: ఇంతి నీవాడిన మాట యెదలోన నమ్ముకొని
కంతునికి వెరవదు కాఁతాళించదు
మంతనాన నీమీఁది మచ్చికలు దలఁచుక
సంతతము లోలోనె సంతోసించుకొనును

చ. 2: ఇందుముఖి నీచనవు లిట్టె గట్టిసేసికొని
చందమామ గైకోదు జడియదు
చెంది నిన్నుఁ గూడే యాస చిత్తములోఁ బెట్టుకొని
అందెంది చెలులతోడ నాడుకొని మెచ్చును

చ. 3: అలమేలుమంగ నీ నెయ్యపురతులనుఁ జొక్కి
చలిగాలి కలుకదు జాలిబడదు
యెలమి శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
చెలఁగి ఇందుకే నీకు సేవలెల్లాఁ జేసును

రేకు: 1839-6 తోండి సం: 28-227

పల్లవి: చిన్నదానవైతేనేమి చెక్కు లునొక్కీ నాతఁడు
చన్నుల నొరసి నీవూ జయము చేకొనవే

చ. 1: చనవిచ్చి కొలువులో సారె సుద్దులడిగీ
మనసురా నాతనితో మాటలాడవే
పెనఁగి పెనఁగి నిన్నుఁ బ్రియమున లాలించీ
చెనకుచు నీవు నిట్టె చిరునవ్వు నవ్వవే

చ. 2: ముచ్చటతో నే పొద్దూ నీ మొగమే తప్పకచూచీ
కచ్చు పెట్టి యెదుటనే కాచుకుండవే
పచ్చడము గప్పి నీకు బాఁతి పడి వేఁడుకొనీ
పచ్చిదేర నియ్యకొని పాదాలు నీ వొత్తవే

చ. 3: లలిమీరి వేడుకతో లాచీ నీపొందులకు
కలపుకోలు సేసుక కాఁగిలించవే
యెలమి శ్రీవేంకటేశుఁడేలె నలమేల్మంగవు
కలకాలమును నీవూఁ గాఁపురము సేయవే

రేకు: 1840-1 ముఖారి సం: 28-228

పల్లవి: ఇటువలె నుండవద్దా ఇద్దరి మీ వొరపులు
ఘటిఇంచే మీ వేడుకలు దొరసునయ్యా

చ. 1: చందురునివంటి మోము సంపెంగ వంటిది ముక్కు
కుందణమువంటిది మేను కోమలికిని
కందువల రూపురేఖ కడుఁగడుఁ జక్కనిది
అందము లెంచితే నీకు నాకెకుఁ దగునయ్యా

చ. 2: చీఁకటివంటి తురుము సింహమువంటి నడుము
పోఁకలవంటి చన్నులు పొలఁతికిని
వేఁకపుఁ బిరుఁదుతోడ వింతసింగారము లవి
యేఁకటతో నీకు నాకె కిట్టె తగునయ్యా

చ. 3: అంచవంటి నడలది అంగజు దీమువంటిది
మించుఁదీగెవంటి దలమేలుమంగ
యెంచఁగ శ్రీవేంకటేశ యేలితివి జవరాలి
అంచెల నీపెకు నీకు నన్నిటా దగునయ్యా

రేకు: 1840-2 బౌళి సం: 28-229

పల్లవి: ఆతఁడెంత నీ వెంత అదేమే నీవు
యేతరితనము లింత ఇతవానీకు

చ. 1: మొగము చూచి చూచి మొలకనవ్వు నవ్వేవు
యెగసక్కే లకుఁ బతి నిదేమే నీవు
చిగురుమోవిమోటలఁ జిమ్మిరేఁగ సొలసేవు
వెగటుజాణతనాల వేడుకా నీకు

చ. 2: కులుకుగుబ్బ లదరఁ గొసరి సన్నసేసేవు
యెలఇంచే వితని నితేమే నీవు
చిలుకు గోరికొనలఁ జెనకి వేఁడుకొనేవు
వెలలేని సరసాలు వేడుకానీకు

చ. 3: గుట్టుతో వద్దఁ గూచుండి కొప్పు గడుదువ్వేవు
యిట్టె శ్రీవేంకటేశు నీదేమే నీవు
నెట్టన నన్నితఁడేలె నే నలమేలుమంగను
వెట్టికిఁ గూడె వతని వేడుకా నీకు

రేకు: 1840-3 సాళంగనాట సం: 28-230

పల్లవి: చిత్తిణి యాపె సుద్దులు చెప్ప గొత్తలు
బత్తి నీపైఁ జేసీ నెంత పగటో తనకు

చ. 1: మలసి మలసి చూచి మచ్చికతో నీకు లాచీ
పొలఁతికి నీ కెన్నటి పొందోకాని
చలియకు నీ దిక్కు చే సన్నలనే చూపీ
లలి నెంతటిపని గలదో తనకు

చ. 2: సిగ్గులు సోమున బెంచి సెలవులనవ్వు నించీ
అగ్గమైన తారుకాణ లవి యెట్టివో
దిగ్గనఁ గనుఁగొనల తేఁకువతో నీకు మొక్కీ
వెగ్గళమై నీపై నెంత లే (వే ?) సుకో తనకు

చ. 3: యే నలమేల్మంగను నన్నేలితి శ్రీవేంకటేశ
తానూఁ గొసరి నిన్నెంత తగులాయెనో
పానుపుపైఁ బండి నీకు పక్కన నెరుకసేసీ
పూనిన యాస లెంత పొదలీనో తనకు

రేకు: 1840-4 సామంతం సం: 28-231

పల్లవి: ఎంత నేరుపరి యాకె యెటువంటి కలికి
మంతనాన నెటువలె మన్నించేవే ఇకను

చ. 1: పొరుగు పోరచిగాను పొలంతి నీతోడుత
సరసము లాడి యాడి చవిరేచెను
తెరలోనికి రమ్మని తెలియ సన్నలుగాను
విరులను వేసి వేసి వేడుక పుట్టించెను

చ. 2: వాడికపొందులు తాను వనిత తేనియలూర
వాడుమోవి చూపి చూపి వలపించెను
వాడలో జక్కఁదనము వడిఁదనకే కద్దని
గోడ నిక్కి చూచి చూచి కోరికవుట్టించెను

చ. 3: చల్లు వెదలుగా నీతో సారెకు నలమేల్మంగ
మొల్లమిగా నవ్వి నవ్వి మోహింపించెను
వెల్లవిరిగా నిట్టె శ్రీవేంకటేశ కూడితివి
యెల్లచోటా మెచ్చి మెచ్చి యింపులు వుట్టించెను

రేకు: 1840-5 కాంబోది సం: 28-232

పల్లవి: నీవు సేసిన చేఁతలే నెలఁతమ్మోఁ గానిపించె
చేవదీ రెందుచూచినాఁ జెలఁగీ గురుతులు

చ. 1: చెలప చెలపలైన చెమటలతో డుత
వలపులు చెలిమేన వడిసీ నదె
అలపులు నిట్టూర్పులై ముని ముక్కునను
తలఁపులో మచ్చికలు తగిలీ నవె

చ. 2: మొనసి మొనసినట్టి మోము కళలతోడుత
పెనగొని తమకము పెరిగీనదె
ననుపుతో సెలవులనవ్వులు చెక్కులమీఁద
నినుపులై సిగ్గులు నిండీ నవె

చ. 3: చూడఁగఁ జూడఁగ నేఁడు సొంపగు గుబ్బలయందు
కూడిన మదరాగము గురిసీ నదె
యాడనె శ్రీవేంకటేశ యాకె యలమేల్మంగ
వేడుకలు నీవేలఁగా వెలసీ నవె

రేకు: 1840-6 దేసాళం సం: 28-233

పల్లవి: ఒయ్య నొయ్యఁ గానవచ్చె వువద సొబగులెల్లా
నెయ్యమున మెరసెను నెట్టుకొన్న చేఁతలు

చ. 1: జలజాక్షి వీనుల జవ్వాది కరఁగులు
చెలువపు చెక్కు చేతిసగ్గులమరఁగులు
మెలుపుఁ గళలమోము మించులమెరుఁగులు
తలకొనెఁ జూడరమ్మ తరుణ లిందరును

చ. 2: వనితమోని మీఁదటి వాడులేనివొళ్ళు
వెనుకొన్న నగవులవెన్నెలపొళ్ళు
తనువుపై చెమటచిత్తడివాన నీళ్ళు
మునుకొనెఁ జూడరమ్మా ముప్పిరి గొనియను

చ. 3: అలమేలు మంగమేన నడరెఁ బులకలు
నిలువున జారుకొప్పునెరులమలకలు
యెలమి శ్రీవేంకటేశుఁ డీపె నిట్టె కూడఁగాను
నెలకొనెఁ జూడరమ్మ నిక్కపు గురుతులు

రేకు: 1841-1 రామక్రియ సం: 28-234

పల్లవి: వెంగెము సేయదు సుమ్మీ వెలఁది
అంగవించి తెలిసితే నంతా నీపై మోహము

చ. 1: చిందేటి నీ మేనిమీఁది చెమటలు వొడగని
గందవొడి వుత్తెంచె కలికినీకు
కందువలఁ దిరిగాడి కడు దప్పిగొంటివని
పొందుగాఁ బన్నీరు చెంబు వుత్తెంచె నీకు

చ. 2: తిద్దుకో కస్తూరిబొట్టు తీరుగా నొసలనని
అద్దమిదె వుత్తెంచె నంగన నీకు
నిద్దురకన్నులకుఁ బూనినతేట లుప్పతిల్లు
పొద్దునఁ బచ్చకప్రము వుత్తెంచె నీకు

చ. 3: ఆవేళఁ గూడి యలపులార ముడుచుకొమ్మని
సేవంతులు వుత్తెంచె చెలియ నీకు
భావింప నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
పోవుల పెండ్లివిడెలు వుత్తెంచె నీకు

రేకు: 1841-2 హిందోలవసంతం సం: 28-235

పల్లవి: ఇందు నిన్నుఁ దెచ్చుకొంటి నిఁక నేమనీనో కాని
పందేలు వేసి పంతాలు పలికేఁబో యాకె

చ. 1: నేరుపుల మాఁటలాడి నెరజాణతనాలాడి
చేరి నీతోడుతఁ బొందుసే సేఁబో యాకె
కూరిములు వచరించి గురుతులు చెప్పి చెప్పి
కోరి నిన్ను లోనుసేసెకొనేఁబో యాకె

చ. 2: చుట్టరికములు చూపి చొక్కులను నిన్నుఁ బెట్టి
బెట్టుగాఁ జెనకి వలపించేఁబో యాకె
చుట్టి చుట్టి వచ్చి వచ్చి చూపులనే గిలిగించి
గుట్టుతోడ నిన్ను బాసగొనేఁబో యాకె

చ. 3: కానుకలు నీకొసఁగి కడుఁ గొలువులు సేసి
మానాన నిన్నాసలను నుంచేఁబో యాకె
యే నలమేల్మంగను నన్నేలితి శ్రీవేంకటేశ
తా నిన్నూ నిన్నాళ్ళుదాఁకా దగిలేఁబో యాకె

రేకు: 1841-3 పాడి సం: 28-236

పల్లవి: కూడిన సంతోసమే కొండసేసుకుందానవు
వోడక నిండురతుల నోలలాడవలదా

చ. 1: సరసమాడనే పట్టె చవులు చూడనే పట్టె
ఇరవై పతితో పొందు లెప్పుడే నీకు
తెరదియ్యనే పట్టె దిష్టించి చూడనే పట్టె
గరిమ నితనితోడి కాఁపురము లెన్నఁడే

చ. 2: చిఱునవ్వు నవ్వవట్టె సిగ్గులు వడనే పట్టె
యెఱుకతో మోవిగువ్వా లీఁక నెప్పుడే
గుఱుతులు సేయఁబట్టె గుబ్బలనొత్తనే పట్టె
మఱియు నితనిఁగూడే మంతనము లెన్నఁడే

చ. 3: సేవలు సేయనే పట్టె చెమరించనే పట్టె
యావల గాఁగిటీ చొక్కు లీఁక నెప్పుడే
నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ
డావటించి పొగడేనీ యలమెచ్చు లెన్నఁడే

రేకు: 1841-4 పళపంజరం సం: 28-237

పల్లవి: ఇన్నిటాఁ దగవరివి ఇఁక విన్నవించేదేమి
సన్నలనే మెలఁగుటే సంగతులు గావా

చ. 1: బత్తితోడ నాపె నీకు పాదా లొత్త రాఁగాను
గుత్తపు గుబ్బ లేఁటికి గోరనొత్తేవు
చిత్తగించి ఇంతేసి సిగ్గులు బయటవేసి
హత్తినయాఁటదాని నారడిఁబెట్టుదురా

చ. 2: అట్టె వీడెమిచ్చి నీకు నాకు మడిచియ్యఁగాను
చుట్టి మోవిపైఁ బల్లు సోఁకింతురా
మట్టుమీరి చెనకుచు మానము లంగడిఁ బెట్టి
గుట్టుతోడి యాఁటదాని గోరబు సేతురా

చ. 3: మచ్చికతో నలుమేలుమంగ నీతోనవ్వఁగాను
తచ్చి శ్రీవేంకటేశుఁడ తమిరేఁచేవు
మచ్చు వేసి యింతలోనె మనసెల్లాఁ గరఁగించి
ముచ్చటైనయాఁటాదాని ముంగిటఁ బెట్టుదురా

రేకు: 1841-5 గౌళ సం: 28-238

పల్లవి: ఇద్దరిపొందులు నేఁడు ఇందులోనె కానవచ్చె
కద్దులే మీలోని తారుకాణ లెటువంటివో

చ. 1: చెలరేఁగి చెలరేఁగి చెలి నీతో మాటలాడీ
కులుకుఁ జూపుల నెట్టుకొని చూచీని
వలపులు చల్లుకొంటా వాడికనవ్వులు నవ్వీ
అలర నీపెకు నెంత ఆసలు వెట్టితివో

చ. 2: సారెసారెకును నిన్ను చనవునఁ గొసరీని
కూరిమితోఁ గొలువు దాకొని సేసీని
నేరుపులు వచరించి నిండు సరసము లాడీ
యారీతి సన్నలు నీకూ నీపెకును నెట్టివో

చ. 3: చెనకి చెనకి నీకు సేవలెల్లాఁ జేసీని
గొనకొని వద్ద నెలకొని వుండీని
యెనసె శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
వొనరిన మీతొంటివొడఁబాటు లెట్టివో

రేకు: 1841-6 రమక్రియ సం: 28-239

పల్లవి: ఇప్పు డెరిఁగితి నేను యాపె నీకుఁ బ్రియమౌత
ముప్పిరి నన్నేలితివి మొక్కే నే నీపెకు

చ. 1: నిక్కి నిక్కి యాపె నేఁడు నీ మొగమే చూచీని
చొక్కముగ నెటువంటిచుట్టమో నీకు
నెక్కొని సారె సారెకు నీతోనే మాఁటలాడీ
యిక్కు వతోడుత నీపై నెంతబత్తో తనకు

చ. 2: వద్దికి వచ్చి నీతో వడిగా నవ్వులు నవ్వీ
యిద్దరికి మీలో సన్న లెటువంటివో
కొద్దిమీరి చెక్కునొక్కి కొచ్చికొచ్చి వేఁడుకొనీ
ముద్దు ముద్దువలె నెంతముచ్చటో తనకు

చ. 3: మోవితేనె లూరనూర ముంచి వుపారము చూపీ
వేవేలుగా నవి యెంత వేడుకో నీకు
యావేళ శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
దేవులాయ నీకు నెంతతేజమో తనకు

రేకు: 1842-1 వేళావళి సం: 28-240

పల్లవి: రమ్మనవే రమణుని రాఁపులు సేయఁగనేల
సమ్మతాయఁ బనులెల్లా జాగు లిఁక నేఁటికి

చ. 1: తనివోని తమకము తనమీఁద నుండఁగాను
మనసులో నాడుకోలుమాట లుండఁగా
చెనకిన చెనకులు చెక్కులపై నుండఁగాను
యెనసిన చుట్టరిక మెట్టు వాయనిచ్చునే

చ. 2: సొరిది నాచూపు తనుఁ జుట్టుకొని వుండఁగాను
సిరులకొప్పున తనసేస వుండఁగా
పొరిఁ దనతమ్ములము పుక్కిట నాకుండఁగాను
మరిగిన నాయాసలు మరవనేలిచ్చునే

చ. 3: చెప్పిన మనవి తనచిత్తములో నుండఁగాను
చొప్పుగా నామేనఁ దనసొమ్ము లుండఁగా
ఇప్పుడె శ్రీవేంకటేశుఁ నలమేలుమంగను
వొప్పుగ నన్నేలె నిఁక వొరయనేలిచ్చునే

రేకు:	1842-2 సామంతం	సం:	28-241

పల్లవి:	చూడనే పిన్నవుగాని సుద్దులోన్నైనాఁ గలవు
యాడువచ్చు నిద్దరికి నీఁకనేల సిగ్గులు

చ. 1:	మొగము చూపవే ముచ్చట దీరఁ బతికి
నగవే వొకమాఁటు నయగారాన
జిగురువంటివలపు చిత్తములో నంటుకొనె
ఇగిరించె జవ్వనము ఇఁకనేల సిగ్గులు

చ. 2:	కదిసి మాటాడవే కందువలు సోఁకఁగ
గుదిగొనఁ జెనకవే గుబ్బల నొత్తి
ముదరుఁ దేనియ లుబ్బి మోవిపై లుప్పలుగట్టె
యెదిరించెఁ దరితీపు లీఁకనేల సిగ్గులు

చ. 3:	మొక్కవే శ్రీవేంకటేశుముందర నిలిచి నీవు
అక్కరఁ గాఁగిలించవే యలమేల్మంగ
మిక్కుటపురతులెల్లా మేనితోనే పెనగొనె
యిక్కువలు గరఁగెను యిఁకనేల సిగ్గులు

రేకు: 1842-3 బౌళి సం: 28-242

పల్లవి: ఊరకున్నదానినేల వుబ్బురేఁచేవు
నేరుచుఁ జుమ్మీ యాకె నీమతి గరఁచను

చ. 1: నిక్కిచూచెనంటాను నిమ్మ పంటవేసేవు
వుక్కుగుబ్బల నిన్నాకె వొత్తీఁ జుమ్మీ
మొక్కఁగాను కొనగోరు మోచెనంటాఁగెరలేవు
చిక్కించుక నీపైఁ దాను చేఇ చాఁచీఁజుమ్మీ

చ. 2: కల కల నవ్వెనంటా కప్పురము చల్లేవు
నెలఁత జవ్వాది నీపైఁ నించీఁ రజుమ్మీ
కొలువులో పయ్యదకొంగు దాఁకెనంటాఁ దిట్టే -
వలరి మారుకుమారు అననోపుఁ జుమ్మీ

చ. 3: కందువకు వచ్చెనంటా కాఁగిట బిగించేవు
కిందుపడ నిన్ను రతి గెలిచీఁ జుమ్మీ
అందపు శ్రీవేంకటేశ యలమేలుమంగ యాకె
అందికూడితి విట్టె ని న్నగ్గళించేఁ జుమ్మీ

రేకు: 1842-4 భైరవి సం: 28-243

పల్లవి: ఇంతులకుఁ బతులకు నిక్కువ లివె
చెంతనున్న యాతనికి సేవ లిట్టె సేయవే

చ. 1: కనుచూపులలో నుండు కందువైన సన్నలు
పెనగులాటల నుండు ప్రియములెల్లా
వినయములందు నుండు వేడుకైనమొగమోట
ననుపులయందు నుండు నవ్వుల సరసము

చ. 2: కంచము పొత్తులనుండు కలయుచుట్టరికము
మంచిమాటలనె వుండు మమకారము
వంచెన మొక్కుల నుండు వాడికైన తరితీపు
నించిన నేర్పుల నుండు నెలకొన్న సిరులు

చ. 3: పచ్చిచేతలలో నుండు భావములకరఁగులు
ఇచ్చకములో నుండు ఇంపు లమరి
అచ్చపు శ్రీవేంకటేశునలమేల్మంగవు నీవు
కొచ్చి కొచ్చి యాగతుల కూడిమాడి వుండవే

రేకు: 1842-5 శుద్ధదేశి సం: 28-244

పల్లవి: ఎన్నైనాఁ గలవు పను లెక్కడ చూచినా నీకు
కన్నుల మాదిక్కు చూచి కరుణించవయ్యా

చ. 1: వెలఁదిమాటలు నీకు విన్నపము సేసితిమి
అలరి మారుత్తరము లానతీవయ్యా
తలఁపు దెలిసి నీకు తనమారు మొక్కుమనె
చెలఁగి మువ్మాటికిని చేకొనవయ్యా

చ. 2: లేమ నీ కంపినయట్టిలేక లిదె తెచ్చితిమి
మేమరుఁ జదువుకొంటి వేమనేవయ్యా
ప్రేమతోఁ దనకుఁదాను ప్రియములు చెప్పుమనె
మా మనవి చిత్తగించి మన్నించవయ్యా

చ. 3: అలమేలుమంగ గురు తదె నీకుఁ జూపితిమి
కలసి లోన నల్లదె కైకొనవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటువచ్చి కూడితివి
తలఁపు లెల్లా నీడేరె తగులై యుండవయ్యా

రేకు: 1842-6 పాడి సం: 28-245

పల్లవి: ఇన్నాళ్ళువలెఁ గాదు ఇప్పుడు నీవున్నజాడ
కన్నులపండుగలుఁగాఁ గానవచ్చె మాకును

చ. 1: మొగమునఁ గళలక్కె ముచ్చటలు గడు నిక్కె
మగువ నీపతివచ్చి మన్నించె నటే
నగవు సెలవిఁ దేరె ననిచి సిగ్గులు మీరె
మిగులా నాతఁడు నీకు మేలువాఁ డాయనటే

చ. 2: కన్నుల వెన్నెలగాసె కడుఁ గుచములు రాసె
యెన్నికగాఁ జన వాతఁ డిచ్చెనటవే
చిన్నిమోవి దేనెలుబ్బె చెక్కుల గురుతు లబ్బె
వున్నతి నీయింటిలోఁ దానున్నవాఁడటే

చ. 3: నొసలెల్లాఁ జెమరించె నునుమేను పులకించె
యెసఁగి శ్రీవేంకటేశుఁ డేలెనటవే
మసలక యలమేలుమంగవు పగలురేలు
వసమైతి వీతఁ డిట్టె వరమిచ్చెనటవే

రేకు: 1843-1 వరాళి సం: 28-246

పల్లవి: నిన్ను నాపెనుఁ జూచి నివ్వెరగందితి నేను
యిన్నేసిచేఁతలు మీకు నిద్దరికే తగును

చ. 1: వింత వింత మాటలాడి వెలఁది నీ యెదుటను
దొంతిఁబెట్టీ వలపులు తోడఁదోడను
పంతముతో నేరుపులు పచరించి పచరించి
యెంతకెంత సేసి యాకె యెలయించీ నిన్నును

చ. 2: వాడికెగా మోవితేనె వాసనలు చూపి చూపి
కూడపెట్టీ వేడుకలు గుట్టుతో డను
వీడెపు సెలవినవ్వు వెదచల్లి వెదచల్లి
నోడలఁబెట్టీ యీకెంత నోరూరించే నిన్నును

చ. 3: సారె సారె రతుకు సమ్మతించ వేఁడుకొని
తూరుపెత్తీఁ దమక మేతులతోడను
కోరి యలమేలుమంగ గూడినశ్రీవేంకటేశ
చేరి నన్నేలితి వాకె చిమ్మిరేఁచీ నిన్నును

రేకు: 1843-2 లలిత సం: 28-247

పల్లవి: నీవెఱఁగవా తగవు నేరుపరి విన్నిటాను
వేవేలుగతుల నేము విన్నవించే దేమి

చ. 1: చనవుగలుగుసతి సణఁగులు రాలిచితే
యెనసినపతి యెగ్గు లెంచరాదు
తనివోని తమితోడ తరుణులు జంకించితే
వినయముతో డుత వేఁడుకొనవలెను

చ. 2: వేడుకగల తరుణి వెక్కసములాడితేను
వాడికైనమగవాఁడు వద్దనరాదు
కూడినమందెమేళాన కొన్నులు గొసరితేను
పాడిపంతాలు నెరసి బత్తిచూపవలెను

చ. 3: చుట్టమైన జవరాలు సొలసి పెనఁగితేను
జట్టిగొన్న నెరజాణ సాదించరాదు
ఇట్టె యలమేలుమంగ నేలిన శ్రీవేంకటేశ
పట్టపుదేవులఁజేసి పాయకుండవలెను

రేకు: 1843-3 ఆహిరి సం: 28-248

పల్లవి: తెలుసుకోవయ్యా యాపె తెఱఁగు విచారించి
వులివచ్చితమితోడ నుమ్మగిల నేఁటికి

చ. 1: తేనెలూర పాటవాడి తెరలోన మాటలాడీ
యా నెలఁత చక్కఁదన మెటువంటిదో
తానాలు వుట్టి వీణెతంత్రులెల్లా బిగిఇంచు
గానవిద్య యాపె యెంత కడునెరవాదియో

చ. 2: పంతమున నవ్వు నవ్వి పయ్యదలో దాఁచుకొనీ
యెంతలేసి గొప్పలో యాపె చన్నులు
దొంతిఁ బెట్టి వలపులు తొంగి తొంగి చూచీని
చెంత నిట్టె యాపె యెట్టి చేఁతలాఁడియో

చ. 3: చెలులతోఁ జెప్పిపంపి సేసలు నీపైఁ జల్లీ
ఇలఁ గలికితనాల నెంతటిజాణో
యెలమి శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
తెలిపి పెండ్లాడె నెంత దిట్ట కతకారియో

రేకు: 1843-4 వరాళి సం: 28-249

పల్లవి: ఇంకా నేమియడిగేవు యిటు మమ్ము సుద్దులు
తెంకినే వినవయ్యా నీ దేవుళ్ళ సుద్దులు

చ. 1: పొలఁతి సెలవులను పున్నమవెన్నెలగాసె
కలసి చన్నులతో జక్కవలు రాసె
కులుకుఁ గుత్తికలోను కోవిలలు గూసెను
వసితే వినవయ్యా వలపుల సుద్దులు

చ. 2: పడఁతినోరఁ జిలుకపలుకులు వెడరేఁగె
తడవికొప్పునఁ దుమ్మిదలు మూఁగెను
చిడుముడి నడుమను సింహపుఁగొదమ దాఁగె
యెడయక వినవయ్యా ఇవిగో సుద్దులు

చ. 3: యాలేమపిరుఁదున నిసుకదిబ్బలు వెట్టె
కోలుముంధై మేన మెఱుఁగులు దొట్టెను
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
ఆలకించి వినవయ్యా అరుదైన సుద్దులు

రేకు: 1843-5 చాయానాట సం: 28-250

పల్లవి: సందు గలిగితేఁ జాలు చంకఁ బెట్టేవు
యెందరిఁ బెండ్లాడితివో ఇటువలె నీవు

చ. 1: వేడుకకు నీకు నాపె విందు చెప్పవచ్చితేను
యాడనే మోవితేనియ నిమ్మనేవు
వాడికకు వచ్చి నీవద్ద నిట్టె కూచుండితే
తోడనే యింతలో నీతొడ యెక్కుమనేవు

చ. 2: తామరపువ్వులు నీకు తగఁ గానుకిచ్చితేను
చేముంచి యాకెను నీవు చెయివట్టేవు
ప్రేమముతో విడెమిచ్చి ప్రియములు చెప్పితేను
గోమునఁ బెంచేచన్నులు గోర నూఁదేవు

చ. 3: మలసి యలమేలుమంగ మాటలు నీతో నాడితే
పలుమారు మోమే తప్పక చూచేవు
యెలమి శ్రీవేంకటేశ యాకె నిట్టె కూడితివి
సెలవుల నవ్వితేనే సేసవెట్టేవు

రేకు: 1843-6 మధ్యమావతి సం: 28-251

పల్లవి: ఎన్నికాయ లోకమున కివిగో మీ సొబగులు
అన్నిచందముల మీరు అమరివున్నారు

చ. 1: కొమ్మకును నీకును గూడినవేళ లెట్టివో
పమ్మికొన్న మీనోముఫల మెట్టిదో
కమ్మర మీపొందులు కంతుఁడెట్టు గూరిచెనో
ఇమ్ముల బాలును నీరు నెనసినట్టున్నారు

చ. 2: యిద్దరికిఁ బొంతనాలు యెటువలెఁ గూడెనో
అద్దుకొన్నమాటపట్టు లవి యెట్టివో
బుద్దులు వెన్నతోఁ బెట్టి బోదించినవా రెవ్వరో
వొద్దిక మోరుపుమేఘ మొనరినట్టున్నారు

చ. 3: వువ్విళ్ళూర మీమనసు లొక్కజాడ లెట్టాయనో
జవ్వనము లెటువలె సమమాయనో
యివ్వల శ్రీవేంకటేశ యాకె యలమేలుమంగ
పువ్వుఁబరిమళమునై పొసఁగి యున్నారు

రేకు: 1844-1 శ్రీరాగం సం: 28-252

పల్లవి: ఎంత మన్నించినా నీకు నీడుజోడయినదె
దొంతి సోబనాలతోడి తొయ్యలివో యాపె

చ. 1: కంకణదారాలు గట్టి కప్పురవిడెము లిచ్చి
అంకెలఁ గాలుదొక్కిన ఆపెవో యీపె
సుంకులు చెరిగించుక సారిదిఁ దోడనీళ్ళాడి
లంకెఁ బెండ్లిపీఁటెక్కిన లలనవో యీపె

చ. 2: తెరమఱఁగున నుండి దిగ్గన మొగముచూపీ
అరిమురి సేసవెట్టినట్టి ఆపెవో యీపె
సిరులఁ దాళిగట్టుక చేరి బువ్వా లారగించీ
సరి బాసికంబుల సకియవో యీపె

చ. 3: వూరల్లా నేఁగివచ్చి వొగిఁ గట్నా లిప్పించుక
ఆరతులెత్తించుకొన్న ఆపెవో యీపె
యారీతి నిలమేల్మంగ యీకె శ్రీవేంకటేశుఁడ
కూరిమి నీదేవులైన కొమ్మవో యీపె

రేకు: 1844-2 కాంబోది సం: 28-253

పల్లవి: మంచితనము సేసితే మచ్చికలు సతమౌను
ముంచి మొకదాకిరిగా మొక్కవే యీతనికి

చ. 1: సారెసారె మాటలు చవులుగా నాడితే
యారీతులనే పతి యేమిసేసి వచ్చినాను
చేరి చేరి ప్రియములే చెప్పువే యీతనికి .

చ. 2: కడుఁ జుట్టరికములో కలయ మెలఁగితేను
కడవారిమ్మైనాను కరఁగు మతి
గుడిగొని యాతనిమ్మై గురుతు లెన్నుండినాను
చిడుముడి నిచ్చకమే సేయవే యీతనికి

చ. 3: పిలిచి ప్రియముచెప్పి పెనఁగఁగఁ జూచితేను
కలయనివారికైనా కడఁగుఁదమి
యెలమి శ్రీవేంకటేడశుఁ డేలె నలమేల్మంగవు
చెలఁగికాఁపురములు సేయవే యీతనికి

రేకు: 1844-3 బౌళి సం: 28-254

పల్లవి: ఆతఁ డదె నిలుచున్నాఁ డండకు బిలుచుకోవే
నాతులకుఁ బతితోడి ననుపులే మేలు

చ. 1: తెగరానిచోటులకు తియ్యనిమాటలే మేలు
మొగదానికిరైన య(యె?)డ మొక్కులే మేలు
తగవు దప్పనియందు తాలిములే మేలు
వెగటేల పతికిఁక వీడె మియ్యవే

చ. 2: యెదురాడరానిచోట నియ్యకొనుటే మేలు
వదలనిపొందులకు వాడికే మేలు
చెదరవి యాసలైతే సిగ్గులువడుటే మేలు
పదరకిట్టె పతికిఁ బాదాలొత్తవే

చ. 3: గుట్టు విడువనిచోట కూడియుండుటే మేలు
మట్టుమీరరానిచోట మచ్చికే మేలు
నెట్టన నలమేల్మంగ నీకు నిన్నిటామేలు
యిట్టె శ్రీవేంకటేశు కితవుతోఁ గూడవే

రేకు: 1844-4 సామంతం సం: 28-255

పల్లవి: ఈవనిత నీకె తగు నెంత భాగ్యమంతురాలో
వేవేలు తెరఁగుల వెలసీ నీకాఁగిట

చ. 1: జక్కవ పిట్టలలలోని చక్కఁదనాలు చన్నులు
నిక్కుఁగొప్పు రంగైన నీలాల పుట్టు
ముక్కు సంపెంగపువ్వుల మోహన సింగారము
యెక్కడ గాఁ బొగడేము యీయింతి సొబగులు

చ. 2: చిగురుటాకుల మించు చలువము కెమ్మోవి
మొగము చంద్రకళలమునిముంగిలి
జగిగలనెన్నడుము సింహపుఁగొదమ యొప్ప
తగ నెట్టు పోలిచేము తరుణి యంగములు

చ. 3: మరుని బండికండ్ల మహిములు పిరుఁదులు
సరిఁ బాదములు జలజపు సొంపులు
నిరతి శ్రీవేంకటేశ నీదేవు లలమేల్మంగ
అరుదు లేమని చెప్పే మతివ చందములు

రేకు:	1844-5 పాడి	సం:	28-256
పల్లవి:	వంత కెంత నీసుద్దు లేమనవచ్చు
	అంతరంగమైన చెంత (చేఁత?) లంగడిఁబెట్టుదురా
చ. 1:	చెలియ సెలవులను చిరునవ్వు నవ్వఁగానె
	యెలమి నీవేకాంతము లేమాడేవు
	మొలక సిగ్గులతోడ మోము వంచుకొనఁగానె
	అలరి తొంగిచూతురా ఆపె మోము నీవు
చ. 2:	వనిత నీకొలువులు వాడికతోఁ జేయఁగానె
	పని చెప్పేవు పానుపు పరచుమని
	చననవున గుట్టుతోడ సన్న నీకుఁ జేయఁగానే
	పెనఁగి పచ్చిసేతురా ప్రియురాలి నీవు
చ. 3:	అలమేలుమంగ నీయక్కుమీఁద నుండఁగానె
	బలిమిఁ గాఁగిట నెంత బత్తి చూపేవు
	అలరి శ్రీవేంకటేశ ఆపె నిన్ను మెచ్చఁగానె
	పలుకులఁ జెప్పుదురా పంతమెల్లా నీవు

రేకు: 1844-6 ఆహిరి సం: 28-257

పల్లవి: ఈతలఁ పెరిఁగి నీవే యీకెను మన్నించవయ్యా
కాతరాన నీకుఁగానే కాచుకొని వున్నది

చ. 1: సారెసారె నిన్నుఁ జూచి సతి తన లోలోనె
వూరకె తమకమున నువ్విళ్లూరీని
చేరి నీవద్దఁ గూచుండి చిప్పిలు వలపులను
కోరికె తీరికె లెత్తఁ గురిసీఁ జెమటలు

చ. 2: మత్తిలి నీతోడుత మాటలాడి యాడి చెలి
చిత్తజ కేలి రతులఁ జిమ్మిరేఁగీని
హత్తి నిన్నుఁ జెనకేటి యాసలు మిక్కుటమై
కొత్త కొత్త వేడుకల గుబ్బతిలీ మనసు

చ. 3: గుట్టుతోడ మొక్కుమొక్కి కుచ్చి నిన్నుఁ గాఁగిలించి
అట్టె నివ్వెరగందె నలమేల్మంగ
గట్టిగా శ్రీవేంకటేశ కలసితి వీకె నిట్టె
వొట్టుకొన్న సంతోసాల నోలలాడీ నిపుడు

రేకు: 1845-1 దేవగాంధారి సం: 28-258

పల్లవి: ఇట్టే నన్నేలితివని యీకెతో నే విన్నవించే
చుట్టమువైన నీతో జోడాయ మీవలపు

చ. 1: నీకుఁగానే పూనుకొని నేరుపుమాట లాడఁగా
యీకె నీ దేవులని నే మెరిఁగితిమి
చేకొని నీవుంగరము చేతఁ బెట్టుకుండఁగాను
సాకిరి దెలుపనేల సంగతాయ వలపు

చ. 2: నీవు వూసిన కస్తూరి నెలఁతమేన నుండఁగా
??????????????????????
దేవర గురుతులెల్లాఁ తెలిసితిమి
భావ మేర్పరచనేల పచ్చిదేరె వలపు

చ. 3: నెలఁత పుక్కిట నిట్టె నీవు తమ్ముల మిడఁగా
కలసిన నీపొందులు కనుఁగొంటిమి
యెలమి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నిలుకడలై మీకు నెరవేరె వలపు

రేకు: 1845-2 భూపాళం సం: 28-259

పల్లవి: ఎవ్వరు వద్దనేరు నీవేమి సేసినా
జవ్వని వలచి వచ్చెఁ జనవియ్యరాదా

చ. 1: కొమెరవయసుకాంత కోరి నీతో మాటలాడీ
తమితోడ వినవయ్యా తలవంచక
చెమటలు గారఁగాను చేరి నీపాదాలొత్తీ
జమళిఁ దొడల మీఁదఁ జాఁచరాదా ఇపుడు

చ. 2: ననుపుగలయాఁటది నవ్వుల నవ్వీ నీతో
చెనకి యియ్యకోవయ్యా సిగ్గువడక
వినయముతో నీకు వీడెము చేతికిచ్చీ
కొనగోర (రు?) సోఁక నందుకొనరాదా ఇపుడు

చ. 3: దేవులలమేల్మంగనతివి నీకు నీకె మొక్కీ
వేవేగ నేలుకోవయ్యా వింతసేయక
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కైవశమై వుండరాదా కలసి నీ విపుడు

రేకు: 1845-3 ధన్నాసి సం: 28-260

పల్లవి: నీవేఁటికిఁ జింతించేవే నీమగఁడు నిన్ను నేలీ
కావలసిన పనులు కమ్ముకొనీఁగాక

చ. 1: తలఁపులో తమకము దట్టమై నెరిగితేను
చెలిమి మిక్కుటమై చేఁగయెక్కదా
తలకొన్న జవ్వనము తతివచ్చి పొదలఁగా
కలయిక రతులు పోఁకకుఁ బుట్టెఁ డమ్మవా

చ. 2: కందువచుట్టరికము కలుగఁ బెనఁగితేను
ముందు ముందే వలపులు మోపులుగావా
సందడించి మాటలు చవులుగా నాడితేను
యిందరికి మోహనరసా లేరులు గావా

చ. 3: తగులైన కోరికలు తారుకాణలైతేను
నగవులు సెలవుల ననలొత్తవా
జిగి నిన్నుఁ గూడె నిదె శ్రీవేంకటేశ్వరుఁడు
నిగిడి కాఁగిటిసొంపు నిచ్చపెండ్లి గాదా

రేకు: 1845-4 సౌరాష్ట్రం సం: 28-261

పల్లవి: చింతించకురే ఇఁకఁ జెలులాల
మంతుకెక్కె నిన్నీ మన్నించీలె కనకా

చ. 1: కలికి తుమ్మిదలు కడుఁ జుట్టాలు
పొలసి కురులు వాఁటిఁ బోలుఁగనక
కలదు మొగమోట మక్కడ శశికి
వెలలేని యీపెనవ్వు వెన్నెలలే కనకా

చ. 2: పడఁతికి చిలుకలు ప్రాణప్రదము
అడరి యీకె మాఁటలు అవే కనక
విడువరాని పొందు కోవిల లీపెకు
తొడరి యీపె యెలుఁగుతో సరి గనకా

చ. 3: అతివకు విరులు పాయని చెలిమి
తతి నీపె మేనితావిఁ దగుఁగనక
అతనుఁ దీపెకు నెనరైనవాఁడు
యితవై శ్రీవేంకటేశు నెనయించెఁ గనకా

రేకు: 1845-5 తెలుఁగుఁ గాంబోది సం: 28-262

పల్లవి: మనవారే యందరును మతి నెంచి చూచితేను
పెనగొన్న సంతోసాలే బెరసీ మీకిఁకను

చ. 1: చిత్త పాఁజులే కావా చిలుకలుఁ గోవిలలు
కొత్తవారంటానేల కొంకేవే నీవు
మత్తిలి కొసరితే నీమాఁట పలుకులో నివి
హత్తి వుండవలెఁగాక యట్టె దూర నేఁటికే

చ. 2: వసంతుని చుట్టాలే కావా తుమ్మిద మూఁకలు
మసలక వీఁటినేల మచ్చరించేవే
సొసఁగఁ దలకెత్తుక పూజించఁదగిన వివి
కొసరుచుఁ గోపగించుకొనకువే నీవు

చ. 3: చందురు సిరులే కావా జడిగొన్న వెన్నెలలు
నిందించ నేలే యవి నీమోము సొంపు
అందపు శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్నుఁ గూడె
పొందుసేయవే మేలు పొదలు సరసము

రేకు: 1845-6 పాడి సం: 28-263

పల్లవి: ఎన్ని వేసాలు నేరిచె నిదివో యీకె
నిన్నడిగేఁ జెప్పవయ్యా నేఁడు నాతో నన్నియు

చ. 1: చెలులచే నాపె నీకుఁ జెప్పిపంపినమాటలు
వెలలేని వేడుకతో వినుకొంటివా
కలికితనాల వారి కానుక నిమ్మనండ్లు
అలరుచుఁ జేతులారా నందుకొంటివా

చ. 2: పొందుగా నాపె నీకుఁ బుత్తెంచిన లేకలు
తుందుడుకులేక చదువుకొంటివా
చెంది తనరూపు వా(వ్రా?)సిన చిత్రపు పటము
కందువగా నీవు లెస్స కనుఁగొంటివా

చ. 3: యిక్కడికిఁ దానే వచ్చి యిచ్చిన యీపె వీడెము
పిక్కటిల్ల నీపుక్కిటఁ బెట్టుకొంటివా
యిక్కవగా శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వుక్కుమీర నాపెచేత నూడిగాలు గొంటివా

రేకు: 1846-1 భైరవి సం: 28-264

పల్లవి: మేలు మేలే నీకతలు మెచ్చిరి మగువలెల్లా
యీలాగులు నీగరిమ లేమని చెప్పుదమే

చ. 1: చెప్పేవు చుట్టరికాలు సేసేవు వినయాలు
దెప్పరాన పతినెంత తేలించేవే
కుప్పళించేవు ప్రియాలు గుదిగుచ్చేవు చూపులు
ఇప్ప డింతేసి చేతలు యెక్కడ నేర్చితివే

చ. 2: చూపేవు నయగారాలు చొక్కించేవు సొలపుల
నీ పంతము నింతేసికా నెరపితివే
రేపేవు వలపు లూరించేవు తమకము
యీపాయాన జాణతనా లెన్ని గరచితివే

చ. 3: యిచ్చకములే యాడేవు యింపులే వెదచల్లేవు
గుచ్చల నెన్నాళ్లనుండి కాచియుంటివే
యిచ్చల శ్రీవేంకటేశు నెనసితి విట్లానే
పచ్చిదేర నిన్నిటాను భాగ్యము సేసితివే

రేకు: 1846-2 ముఖారి సం: 28-265

పల్లవి: అందాలు సేనుక నీవూ నాకెతో నవ్వుత గాక
అందరిముందరా నీకూ నాన లింతేశాలయ్యా

చ. 1: పొలసివుండి వొచ్చినాపె పలుకు నేమ్మైనా నిన్ను
బాసలెన్ని సేసి వొడఁ బరచేవయ్యా
వాసిగలయాపె మాఁట వట్టి తప్పులెంచఁజూచు
తాసువలెఁ జూచి యెంత తారుకాణించేవయ్యా

చ. 2: వలచివచ్చినయాపె వలసినట్టు చేసు
సొలసి యెంత నీ వొడ్డించేకొనేవయ్యా
బలిమి గలిగినాపె పైకొని నీతోఁ బెనఁగు
చలమున బొమ్మలను జంకించనేలయ్యా

చ. 3: బత్తిగల యాపె గుబ్బల నొత్తి కాఁగిలించు
కొత్త సిగ్గులతో నేమి గుంపించేవయ్యా
ఇత్తల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చిత్తగించి కూడితివి చెనకఁగ నేలయ్యా

రేకు: 1846-3 కాంబోది సం: 28-266

పల్లవి: నిన్ను నెంచి చూచితేను నీకు నెవ్వరు సరి
మన్నించె నీరమణుఁడు మరియేల కొంకను

చ. 1: వనిత నీ జవ్వనము వలపుల కొటారు
పనుపడ్డ తుమ్మెదపాళము కొప్పు
గొనకొన్న గండుమీల కొలఁకులు కన్నులు
మనసిజ బలాలు నీమహిమలే కదవే

చ. 2: జలజాక్షి నీపురము చక్రవాకములు రచ్చ
మలయుఁ జల్లగాలికి మనికి ముక్కు
పలుకుఁ జిలుకలకు పంజరము నీనోరు
బలుమరు బలాలు నీ భావములే కదవే

చ. 3: అలమేలుమంగ నీమో మలచందురుని గీము
తళుపు మైసింగారాల దాఁపరము
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వలరాచబలాలు నీవసమే కదవే

రేకు: 1846-4 పాడి సం: 28-267

పల్లవి: నీవెరిఁగిన బుద్దులే నేమూ నీకుఁ జెప్పేము
యేవేళాఁ జెలులము నే మెచ్చరిచవలెను

చ. 1: పెనుఁగుచు సరసము పెంచితేఁ బెరుగును
వినయమే నెరపితే వేడుక పుట్టు
మునుకొని మొక్కితేను మొగమోట సమకూడు
మనసురా మెలఁగితే మగఁడు మన్నించునే

చ. 2: తగులు వాయకవుంటే తనుఁదానె దయవుట్టు
నగితేఁ జుట్టురికము నాఁటుకొనును
తగవు నడిపితేఁ బంతములెల్లా నీడేరు
మగువ వోరుపు గలితే మగఁడు మన్నించునే

చ. 3: ఇచ్చకమే చూపితేను యింపులౌను రతులెల్లా
యెచ్చరించి కూడితేను యితవైయుండు
కొచ్చి యలమేలుమంగఁ గూడె శ్రీవేంకటేశుఁడు
మచ్చిక నీతఁడే నీమగఁడు మన్నించునే

రేకు: 1846-5 దేసాళం సం: 28-268

పల్లవి: అదివో కాచుకున్నాఁ డప్పటనుండి నీవొద్ద
పొదిగొన్న రతులను భోగించరాదా

చ. 1: చలపాది తనమేల సాదింపు లిఁకనేల
పిలిచి పతిఁ గాఁగిట బెనఁగరాదా
మొలక సిగ్గులవేల ముసిముసి నవ్వులేల
తలిరుమోవి చూపి దప్పిదేర్చరాదా

చ. 2: వట్టిగుట్లివియేల వాసి వంతు లింతయేల
వొట్టుక యీతని పాదాలొత్తఁగరాదా
చుట్టి చుట్టి యాడనేల సొలపు జంకెన లేల
చుట్టరికము గలయ సుద్దులు చెప్పరాదా

చ. 3: తమకము దాఁచనేల తరితీపు సేయనేల
తిమురుచు నీవలపు తెలుపరాదా
అమరు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
మమతఁ గూడితి విట్టె మన్నింపించికోరాదా

రేకు: 1846-6 వరాళి సం: 28-269

పల్లవి: ఎంత చూచితే నేము ఇద్దరికి హితలము
కంచపు మోవుల గలగలపాయ వలపు

చ. 1: యింతి నీయవసర మెరిఁగిరా నంపె నన్ను
కాంత నీవు నున్నారు గద్దెమీఁదను
అంతలోనే రేఁ (రెం?)ట దెప్పలాయను మీవలపులు
వింత సుద్దు లింకేమని విన్నవింతునయ్యా

చ. 2: తరుణి నన్నంపె నీ తలఁపు దెలియుమని
పరిమళము వూసెవు పడఁతికిని
సరిబేసులైయున్నవి సంగడి మీ వలపులు
వెరవుతో నేమని విన్నవింతునయ్యా

చ. 3: అలివేణి నిన్నుఁ జూడనంపె శ్రీవేంకటేశుఁడ
అలమేలుమంగ వున్నదక్కున నీకు
కలసితివి ముప్పిరిగా నీపెను వలపులు
వెలసితి రేమని విన్నవింతునయ్యా

రేకు: 1847-1 వరాళి సం: 28-270

పల్లవి: నావాఁడనేయంటా నాకింత దెలుపనేల
కైవశమై వున్నాఁడవు కాంత లిదెరఁగరా

చ. 1: ఆనవెట్టకు నీమీఁద నట్టె వరవాతును
కానీలే నీ నిజమెల్లాఁ గనేముగాక
నానఁ బెట్టకు నవ్వులు నడుమ సెలవులను
యీనీజాణతనము లిందరు నెఱఁగరా

చ. 2: పట్టకు మాచన్నులు పైపైఁ బెరిగేపొద్దు
అట్టె దాక్షీకుఁడ వైతే నౌదువుగాని
గుట్టుతోఁ దలవంచకు గుబ్బతిలె వలపులు
నెట్టుకొన్న దొరవౌత నెలఁత లెఱఁగరా

చ. 3: పెనఁగులాడ కంతేసి బెట్టుగా మే నలసీని
యెనసితివి కోరికె లీడేరీఁ గాని
ఘనుఁడ నే నలమేల్మంగను శ్రీవేంకటేశ్వర
నను నీవు మన్నించేది నాతులెఱఁగరా

రేకు: 1847-2 ఆహిరినాట సం: 28-271

పల్లవి: ఏమని విన్నవించేము యీపె సుద్దులు
కోమలికోరికె లివి కోటానఁ గోట్లు

చ. 1: పడఁతుల నీగుణాలు పలుమారు నడుగును
వుడవోని సంతోసాల నుమ్మగిలును
తడయక కొంతవడి తలఁచు నీరూపము
వడియుఁ జెమటతోడ వలలఁ బొరలును

చ. 2: నిలుచుండి తొంగి తొంగి నీరాక కెదురుచూచు
పొలసి యడియాసల బొద్దు గడపు
పలుకు నీవుండినట్టే భావించి పానుపు మీఁద
అలరి తననీడ నీవని కాఁగిలించును

చ. 3: ఆకు మడిచి నీకిచ్చేనని నోర నందిచ్చు
పైకొని వోలలాడును భావరతుల
చేకొని ఇంతలో వచ్చి శ్రీవేంకటేశ కూడితి –
వీకె యలమేలుమంగ ఇప్ప డురమెక్కెను

రేకు: 1847-3 సామంతం సం: 28-272

పల్లవి: ఎవ్వరికిఁ గలవమ్మ ఇటువంటి సొబగులు
నివ్వటిల్ల నన్నియును నీకే తగుఁగాక

చ. 1: జక్కవగుబ్బల మీఁద జారేటి పయ్యదకొంగు
చెక్కులపై వడిసేటి చెమటనీరు
పుక్కిటి బంటియైన పొలపనిట్టురుపులు
ఇక్కువలై కనుపట్టె నేనోము నోఁచితివో

చ. 2: కడలేని బిత్తరపు కనుచూపుతేటలు
గుడిగొన రాలేటి కొప్పువిరులు
జడియక తొలఁకేటి చక్కని మోముకళలు
అడరి నీవు సేసిన దది యెంత భాగ్యమో

చ. 3: మొగి సెలవులఁ గమ్మేముసి ముసినగవులు
చిగురుఁబెదవి నూరే చిరుసిగ్గులు
జిగి నలమేల్మంగవు శ్రీవేంకటేశురాణివి
తగిలె నీకీరతులు తపమెంత సేసితివో

రేకు: 1847-4 భైరవి సం: 28-273

పల్లవి: సుదతికి మీరిందరూఁ జుట్టాలైన ఫలము
మదనుని వేఁడుకోరే మంచిదౌఁగాని

చ. 1: జలములలో నెల్లా చంద్రకాంతాలు చల్లరే
అలతామరలగర్వ మలణఁగుఁగాని
చలపట్టి వనముల జవ్వాది వాసించరే
మలయుఁ జిలుకలకు మాటుమందౌఁగాని

చ. 2: పొదలపై సంపెంగ పువ్వులు వెదచల్లరే
పుదుటఁ దుమ్మిదమూఁక లుడుఁగుఁగాని
పది దిక్కులను రఘుపతిపేరు దడవరే
గుదిగొన్న కోవిలలు కూయకుండుఁగాని

చ. 3: పాటలలో శంకరాభరణం మాళాపించరే
నీటు చల్లగాలి సొంపు నిలుచుఁగాని
యీటున శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
చాటించరే యిన్నిఁ దొంటి జాడల నుండుఁగాని

రేకు: 1847-5 వేళావళి సం: 28-274

పల్లవి: తనియదు నామనసు తమితో నీపొందుసేసి
యెనసినవేళ గుణ మెట్టిదోకాని

చ. 1: చేసన్న సేసినప్పడే చేరే నాకోరిక లెల్లా
పాసి వుండలేక కొంగు వట్టుదుఁగాని
వేసిన పూవులచెండు వెస మర్మములు రేఁచె
బేసబెల్లితనమునఁ బెనఁగుదుఁగాని

చ. 2: వీడె మిచ్చినప్పడే వెలసె నీమన్ననలు
వేడుకకు నీపై నోలవేతుఁగాని
వాడిక నీమాటలే వడి నన్ను నమ్మించె
జోడుగూడి యప్పటిని సొలతుఁగాని

చ. 3: తెరదీసినప్పడే దిష్టమాయ సోబనము
సరుగ నూరకే సేస చల్లేఁగాని
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సరిమోవిచ్చితి రింకాఁ జవిగొనేఁగాని

రేకు: 1847-6 నాదరామక్రియ సం: 28-275

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యేమి చెప్పేది
మంతనాన బుజ్జగించి మన్నించరాదా

చ. 1: అతివ నీవద్దనుండి ఆకుమడిచియ్యఁగాను
కత చెప్పుమని యెంత కక్కసించేవు
మితిమీరి సిగ్గుతోను మెల్లని నీకు మొక్కఁగా
చతురతలు నెరపి చన్నులే లంటేవు

చ. 2: నెట్టుకొని బత్తితోడ నీకుఁ బాదాలొత్తఁగాను
అట్టె మోవిమ్మని యాల ఆనవెట్టేవు
చిట్టకము లేక నిన్నుఁ జెక్కునొక్కి వేఁడుకోఁగా
వొట్టుక వలపులెంత వొడిఁబెట్టేవు

చ. 3: అక్కరతో నలపార నాలవట్ట మిడఁగాను
పక్కఁ బండుమని యెంత బాఁతి పడేవు
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
గక్కన వావి చెప్పఁగాఁ గాఁగిలించేవు

రేకు: 1848-1 దేసాళం సం: 28-276

పల్లవి: నిన్ను మోత్తునో యీపె నేరుపులు మెత్తునో
యిన్నియు మీకే తగు నేమందు నేను

చ. 1: మట్టులేక చేటెఁడేసి మాఁట లాపె యాడఁగాను
వెట్టికి వేసటలేక వినేవు నీవు
పట్టెడంతలు గుబ్బలు పయ్యెదలోఁ జూపఁగాను
చుట్టి చుట్టి రెప్పలెత్తి చూచేవు నీవు

చ. 2: పాంచి వావు లీపె నీతో పోఁకకుఁ బుట్టెఁ డమ్మఁగా
వంచక యాసలాసలఁ గూడ పెట్టేవు
కంచపుమోవితేనెలు కానుక నీకియ్యఁగాను
అంచలను చొక్కి చొక్కి యందుకే నోరూరేవు

చ. 3: సారెఁ జీరునగవుల జాజర పైఁ జల్లఁగాను
వూరకే వెరగువడి వుమ్మగిలేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మేరతో నిన్నుఁ గూడఁగా మెచ్చేవు నీవు

రేకు: 1848-2 పాడి సం: 28-277

పల్లవి: కంటిరటే చెలులాల కాంత సొబగులు నేఁడు
జంటల పోలికలు యీా సకియకే కలిగె

చ. 1: కొలఁకులనుఁ దిమ్మిదలు కోరి తపములుసేసి
నిలివెఁడేశై ఇంతి నెరులాయను
వలనైన చిలుకలును వనవాసములుసేసి
పలువిధములను ముద్దుఁ బలుకులై నిలిచె

చ. 2: జక్కవలు రాత్రులను సన్యాసములు సేసి
గక్కన నీపెకును చనుఁగవ యాయను
దిక్కులందు హంస లివి తీర్థయాత్రలు సేసి
చక్కని పాదములందు సరగతు లాయ

చ. 3: ఇమ్ముల గిరులను సింహా లేకాంతవాసము సేసి
నెమ్మి నలమేల్మంగకు నెన్నడుమాయను
పమ్మిక చంద్రుఁడు భూమి ప్రదక్షిణముగాఁజేసి
తెమ్మల శ్రీవేంకటేశుదేవులమో మాయ

రేకు: 1848-3 లలిత సం: 28-278

పల్లవి: ఇంతులకుఁ బతులకు నెరవున్నదా
సంతోసము లీడేరు సమ్మతులైతేను

చ. 1: ముచ్చట లాడఁగవచ్చు మోములు చూడఁగవచ్చు
ఇచ్చకమై మనసులు యెనసితేను
పచ్చిదేర నవ్వవచ్చు పట్టి పెనఁగఁగవచ్చు
కచ్చుక చుట్టరికము గలసితేను

చ. 2: సుద్దులు చెప్పఁగవచ్చు చూపుల సొలయవచ్చు
వొద్దకైన నేస్తము లొనరితేను
ముద్దులు గునియవచ్చు మొక్కులాడఁగవచ్చు
పొద్దు వొద్దు సరసాలు పొసఁగితేను

చ. 3: వాడికలు చూపవచ్చు వలపులు చల్లవచ్చు
తోడఁడోడ వయసులు దొరసితేను
యీడుజోడై శ్రీవేంకటేశ యలమేల్మంగను
కూడితివి మెచ్చవచ్చు గుణా లిట్టై(ట్ట?) యితేను

రేకు: 1848-4 నాగగాంధారి సం: 28-279

పల్లవి: అలమేలుమంగ నీవన్నిటా నొరపరివి
కలికి నీవొళ్ల నివి కంటిమే చెలియా

చ. 1: బలిమిగలవారికిని పంతంబు లీడేరు
కలిమిగలవారికిని గర్వమమరు
చలముగలవారికిని సరసంబు లనువుపడు
కలదెల్ల నీ వొళ్ల గంటిమే చెలియా

చ. 2: ననుపుగలవారికిని నవ్వినంతయుఁ జెల్లు
చనవుగలవారికిని జరగుఁ బొందు
మనసుగలవారికిని మలసి నెనఁగఁవచ్చు
ఘనతలివి నీవొళ్ల గంటిమే చెలియా

చ. 3: వెరవుగలవారికిని వేడుకలు నెలవుకొను
సిరులుగలవారికినిఁ జేరు కీర్తి
యిరవుకొని శ్రీవేంకటేశ్వరుఁడు నిను నేలె
గరిమి లివి నీవొళ్ల గొంటిమే చెలియా

రేకు: 1848-5 నాదరామక్రియ సం: 28-280

పల్లవి: పొందు సేయ నేరుచును పూఁచి మెల్లమెల్లనే
యెందరిని మరిగించెనో యిట్టానే యీతఁడు

చ. 1: పూరకున్న నాకుఁ దెచ్చి వుంగరము చేతికిచ్చి
మేరమీరి చెనకినీ మెల్ల మెల్లనే
వోరుచుకున్నా మానఁడు వొంటినుండఁగా నాతో
తేరకొన నవ్వు నవ్వి దిమ్మురేఁచీ నీతఁడు

చ. 2: గుట్టుతోడిదాన నాపె గురిగింజబంతి వేసి
మెట్టీ నాపాదాలు మెల్లమెల్లనే
వొట్టు వెట్టినా విడువఁ డొద్ద నిట్టె కూచుండి
వట్టి జాణతనా లాడి వావి చెప్పీ నీతఁడు

చ. 3: అక్కున నలమేల్మంగనైన నన్ను గారవించి
మిక్కుటమై కాఁగిలించీ మెల్లమెల్లనే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిదివో నేఁ బిన్నదాన
అక్కజపు రుతులను నాదరించీ నీతఁడు

రేకు: 1848-6 శుద్ధదేశి సం: 28-281

పల్లవి: నిన్ను నాపెఁ జూచితేను నేఁడు నాకు వెరగయ్యీ
యిన్నిటా నీమతకము లెంచుకోవయ్యా

చ. 1: కాంత యెవ్వతోకాని కాచుకున్నది వాకిట
మంతనానకుఁ బిలిచి మాఁటాడవయ్యా
వంతులకు నీతోడివావు లందరికిఁ జెప్పీ
యెంత చుట్టమో అది యెరుఁగు కోవయ్యా

చ. 2: చెలిమి నీతోఁ దాను సేసెనట యెన్నఁడో
లలి నీ వది యట్టె తలఁచుకోవయ్యా
అలరి నీవిచ్చినట్టి అడియాలములుఁ జూపీ
పిలిచి నీ పీఁటమీఁద బెట్టుకోవయ్యా

చ. 3: చెప్పి పంపితివట యే చెలియచేతనో రమ్మని
యిప్పుడే యాపనులు సేయించుకోవయ్యా
అప్పుఁడ శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
నెప్పున నన్నేలితివి నీవాకెఁ గూడవయ్యా

రేకు: 1849-1 సామంతం సం: 28-282

పల్లవి: అన్నిటా జాణవు నీకు నమరు నీజవరాలు
కన్నుల పండుగగాను కంటిమి నేఁ డిపుడు

చ. 1: సేయని సింగారము చెలియ చక్కఁదనము
మోయనిమోపు గట్టిముద్దుఁ జన్నులు
పూయకపూసిన పూఁత పుత్తడి మేనివాసన
పాయనిచుట్టరికము పైకొన్న చెలిమి

చ. 2: గాదెఁ బోసినమణులు కనుచూపు తేటలు
వీదివేసిన వెన్నెల వేడుకనవ్వు
పోదితో విత్తినపైరు పాదిలిన జవ్వనము
పాదుకొన్న మచ్చికలు పరగువలపులు

చ. 3: పుట్టగాఁ బుట్టిన మేలు పోగపు సమేళము
పెట్టెఁ బెట్టిన సొమ్ములు పెనురతులు
యిట్టె శ్రీవేంకటేశ యీ యలమేలుమంగను
నెట్టనఁ గూడితి వీకె నిండిన నిధానము

రేకు: 1849-2 రామక్రియ సం: 28-283

పల్లవి: చెలియరో నీమగఁడు చెప్పినట్టు మెలఁగఁగా
పలువచారములేలే భాగ్యవంతురాలవు

చ. 1: తలఁచినట్టి (ట్టె?) కాఁగా తమకించ నేమిటికే
పొలసి వలపు గాదెఁ బోతువుగాక
పలికినట్టె కాఁగా పదరఁగ నేఁటికే
పిలిచి విభుని నొద్దఁ బెట్టుకొందువుగాక

చ. 2: సేసినట్టె కాఁగాను చెక్కు చెయ్యేమిటికే
సేసవెట్టి పెండ్లి పీఁట చేకొందుగాక
వా(వ్రాఁ?)సినదె వాఁ(వ్రాఁ?) తగాఁగా వట్టి చలమేఁటికే
ఆసదీర మోవితేనె లానుదువుగాక

చ. 3: చూచినట్టె కాఁగాను సుద్దు లిఁక నేఁటికే
కాచుక రతులమేలు గందువుగాక
యేచి శ్రీవేంకటేశ్వరుఁ డేలె నలమేల్మంగవు
చేచేత సంతోసాలఁ జెలఁగుదువుగాక

రేకు: 1849-3 కేదారగౌళ సం: 28-284

పల్లవి: తరుణులాల యీకత తానే యెరుఁగుననే(న?)రే
సరుసఁదా మనిం(న్నిం?)చితే సంతోసించేఁగాక

చ. 1: అక్కునఁ బోసి చూపే నంటే గొల్లచల్ల గాదు
ఇక్కువైన నావలపు యేమి చెప్పేనే
పుక్కిటఁ బట్టవచ్చునా పొంగే సముద్రము
అక్కర మోవితేనియ లాసగించేఁగాక

చ. 2: పొంచి యెత్తి చూపేనంటే పూవుల చెండుగాదు
యెంచరాదు నాకోరిక యేమి చెప్పేదే
మంచు కుంచానఁ గొలవ మరి చెట్ల సమకూడు
అంచెఁ దనరాక కెదు రటు చూచేఁగాక

చ. 3: బాయిటఁ బెట్టెనంటే పంచవన్నె ముగ్గు గాదు
యీయెడ నాతమకము యేమి చెప్పేనే
చేయి చ్చులమేల్మంగ శ్రీవేంకటేశుఁడు తాను
పాయపు తన కాఁగిటఁ బాయకుండేఁ గాక

రేకు: 1849-4 సామంతం సం: 28-285

పల్లవి: చూడరమ్మ ఇంతులాల సుదతి చందము నేఁడు
వేడుకసింగారాలు వింత వింత లాయను

చ. 1: జక్కవ గుబ్బల మీఁది సరులు
వెక్కసపుఁ గొప్పులోని విరులు
చెక్కుటద్దపుఁ గాంతుల సిరులు
చక్కని యీకెకు నెన్ని సమకూడె గురులు

చ. 2: నిలువున నొయ్యారపు నీట్లు
వలపె పయ్యెద వల్లెవాట్లు
మలయు మోము సురటిమాట్లు
కుటుకునవ్వు లీకెకుఁ గొండలుఁ గోట్లు

చ. 3: కావరపుఁ బిఱుఁదుల కలిమీ
భావములో వలపుల బలిమీ
శ్రీ వేంకటేశుఁడు గూడెఁ జెలియలమేల్మంగను
చేవదేరె నీకెకు చెప్పరాని చెలిమీ

రేకు: 1849-5 శంకరాభరణం సం: 28-286

పల్లవి: అనుమానించఁగనేలా అవిగో నీచేఁతలు
దిన దిన కొత్తలెల్లా దిష్టమాయ మాకును

చ. 1: కొసరి యెవ్వతె నీతో కొంగువట్టి పెనఁగెనో
పసపల్లా నంటె నదె పచ్చడానను
యెసగి చెక్కులువట్టి యెంత వేఁడుకొనెనో
సుసరాన గోరికొన సోఁకులు చూపట్టెను

చ. 2: కమ్మటి నాపె యేరీతి కాఁగిట బిగించెనో
కుమ్మెలువోయి గుబ్బలగురు లున్నవి
యిమ్మల నీవొడివట్టి యెంత వొడఁబరచెనో
నెమ్మదిఁ గానుకిచ్చిన నిమ్మపండ్లు గంటిని

చ. 3: పాదాలకు మొక్కి యెట్టు పానుపుపైఁ గూడెనో
పోదితో మైతావి నీపైఁ బొలుపొందెను
పాదుగ నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యీదెస నన్నేలితివి యీకె నీకుఁ జట్టము

రేకు: 1849-6 లలిత సం: 28-287

పల్లవి: ఇంతు లెంత సేసినాను యియ్యకొనవలెఁ గాక
వంతులువాసు లెంచుకొంటే వాములై నిలువవా

చ. 1: వచ్చి వచ్చి పొలతురు వలచినవారలు
యెచ్చు గుందులు దడవ నేమున్నది
కొచ్చి చూతు రప్పటిని కోరికగలవారలు
పచ్చిసేసి నవ్వఁబోతే పంతములు రేఁగవా

చ. 2: వెంగెములే యాడుదురు వేడుకగలవారలు
యింగితా(త?) భావాలు చూడ నేమున్నది
పంగింతు రప్పటిని పాయని పొందులవారు
సంగతులు వెదకితే చలములు మీరవా

చ. 3: ఆయము లంటఁజూరుదు రాసగలవారలు
యేయెడ సాదించేమన నేమున్నది
చాయల శ్రీవేంకటేశ సతి యలమేలుమంగ
కాయజకేలిది మీకు ఘనతేకాదా

రేకు: 1850-1 వరాళి సం: 28-288

పల్లవి: ఇన్నిటా జాణవు నీవే యెఱుఁగుదువు
సన్నలనే పతిని వసము సేసుకొంటివి

చ. 1: నయాన నాగినమాట నమ్మికలు పుట్టించు
ప్రియాన మొక్కినమొక్కు ప్రేమ రేఁచును
దయతోడి యాదరింపు తగులాయములు సేసు
నియతాన మెలఁగేటి నేరువు లివి

చ. 2: మక్కువఁ జేసినచేఁత మనసులు గరఁగించు
చొక్కుచు నవ్విన నవ్వు సొంపు నిండించు
పక్కనఁ జూచిన చూపు పచ్చిదేర వలపించు
నొక్కొకన్న రతులలో నేరుపులివి

చ. 3: పొంచుక యుండిన సిగ్గు పొలఇంచు దరితీపు
మంచముపై కూటములు మరిగించును
యెంచి ని న్నలమేల్మంగ యేలె శ్రీవేంకటేశుఁడు
నించుకొన్న మీగుణాల నేరుపు లివి

రేకు: 1850-2 పాడి సం: 28-289

పల్లవి: జాగులేల సేసేరే సకియలాల
వేగమె యెచ్చరించరే వేడుక వుట్టుఁ గాని

చ. 1: వెలఁది చెప్పినమాటఁ విన్నవించరే పతికి
చెలులాల విని సంతోసించుఁగాని
మలసి యీజవరాలిమారు సొగిలి మొక్కరే
తిలకించి తానందుకు దీవించుఁగాని

చ. 2: కమ్మటి దేవులంపిన కానుక లొసఁగరే
కిమ్ముల నాపని చిత్తగించుఁగాని
రమ్మని పిలిచి యాపెరతికి విందు చెప్పరే
వుమ్మడిఁ జుట్టరికమై వొనగూడుఁ గాని

చ. 3: తెరలోఁ బెండ్లి కూఁతురు దిక్కు చక్కఁ జూపరే
సరసాలాపాలు జరుపుఁగాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోఁ దానెకూడె
గరిమలఁ బొగడరే కరుణించుఁగాని

రేకు: 1850-3 ముఖారి సం: 28-290

పల్లవి: ఆలిమగని జాడలు అందరికి నివియే
మేలుమీఁదుగా విభుని మెప్పించవే నీవు

చ. 1: వింత లేక మెలఁగితే వేడుక నెరపవలె
సంతోసించితేను మెచ్చఁగవలెను
మంతనానకు లోనైతే మరిగియుండఁగవలె
పంతము లాడఁగరాదు పతితోడఁ జెలికి

చ. 2: ననుపు గలిగితేను నవ్వులు నవ్వఁగవలె
మనసు లెనసితే సమ్మతించవలె
వినయాలు నేరిచితే వేమారు వేఁడుకోవలె
పెనఁగులాడఁగరాదు ప్రియునితో సతికి

చ. 3: వావు లేకములైతే వడిఁ బొందుసేయవలె
దేవులైతేఁ దనబత్తి దెలుపవలె
శ్రీవేంకటేశుఁ డేలితే సిగ్గులు మానఁగవలె
కావరించి మీరరాదు కాంతునితో నింతికి

రేకు: 1850-4 ముఖారి సం: 28-291

పల్లవి: మగవానితోనేల మందేమేళాలు
సొగసి యిచ్చకములే చూపవలెఁగాక

చ. 1: చేతులెత్తి మొక్కితేను చిత్తము గరఁగుగాక
యేతులకు జంకించితే నితవులౌనా
నీతితోడ మాటాడితే నిలుచుఁగాక మోహము
పోతరించి పలికితే పొందు లొన గూడునా

చ. 2: నగుతాఁ గొసరితే ననుపులు వుట్టుఁగాక
బిగిసి వూరకుండితే ప్రియములౌనా
మొగమోట గలిగితే ముచ్చట లీడేరుఁగాక
యెగ సక్కేలైతేను ఇంపులౌనా రతులు

చ. 3: గట్టిగాఁ గాఁగిలించితే కళలు దైవారుఁగాక
వట్టి సిగ్గున నుంటే కైవసము లౌనా
యిట్టే శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనే
నెట్టన నిటు గాకున్న నేరుపులు మించునా

రేకు: 1850-5 సామవరాళి సం: 28-292

పల్లవి: చూచితేఁ జిన్నవుగాని సుద్దులు కోటికొండలు
యేచి యీచేఁతలు సేయ నెట్టు నేరిచితివే

చ. 1: సెలవుల నవ్వుకొంటా చిత్తము గరఁగుకొంటా
చెలియ విభుని నెంత చిమ్మిరేఁచేవే
వలపుల చల్లుకొంటా వావు లడుగుకొంటా
సొలసి సొలసి యెంత చొక్కులఁ బెట్టేవే

చ. 2: కన్ను లారుచుకొంటాను కడు నెలఇంచుకొంటా
చన్నుల నొరసి యెంత జంకించేవే
సన్నలు సేసుకొటా సరసము లాడుకొంటా
పన్నుక యీతని కెంత పచ్చి సేసేవే

చ. 3: సంగడిఁ గూచుండుకొంటా సమ్మతులు సేసుకొంటా
అంగజ రతుల కెంత ఆస చూపేవే
చెంగట నింతలో నన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
యెంగిలిగా నీవూఁ గూడి యెంత లాచేవే

రేకు: 1850-6 శ్రీరాగం సం: 28-293

పల్లవి: ఏమని చెప్పదునే యివిగో తారుకాణలు
నీమతిఁ దలఁచుకోవే నెలఁత నామాఁటలు

చ. 1: కన్నులఁ జూచిన చూపు కడు నాసలు వుట్టించు
విన్న వినుకులు మరి వేడుక రేఁచు
పన్నిన యెడమాఁటలు భావములు గరఁగించు
యెన్నిలేవు మరుతంత్రా లెంచి చూచుకొంటేను

చ. 2: తలఁచిన తలఁపులు తమకము లుప్పతిల్లించు
సెలవి నవ్వినవ్వు చెనకింపించు
వలచిన వలపులు వాడికలు వొడమించు
పిలిచి నెప్పఁగరాపు పెండ్లి వేడుకలు

చ. 3: మంచముపై సరసాలు మర్మములు సోఁకించు
కంచముపొత్తు కాఁగిటఁ గలఇంచును
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నింతలోనె
పెంచు జవ్వనమదము ప్రియము లన్నియును

రేకు: 1851-1 సాళంగం సం: 28-294

పల్లవి: బాస ఇచ్చినవాఁడవై పరగితేనేమి నాకు
ఆసపడ్డదానిఁ గొంత యాదరించరాదా

చ. 1: పెనఁగి పెనఁగి నీకు ప్రియము చెప్పి నిందాఁక
ననిచి యాపెతోఁ గొంత నవ్వరాదా
వినయముతో నిన్ను వేఁడుకొనె నప్పటిని
చనవిచ్చి ఇఁక సరసము లాడరాదా

చ. 2: మొక్కు మొక్కి తేరకొన మోము చూచీ నేఁకటతో
మక్కువతో నిచ్చగించి మాటాడరాదా
చక్కఁగా నీకూడిగాలు సారె సారెఁ జేసీని
అక్కరతోఁ బాదాలొత్త నప్పణియ్య రాదా

చ. 3: కాఁపురాలు సేసేనంటా కాచుకవున్నది తాను
ఆప్రక నీచెలి చన్ను లంటఁగరాదా
చేపట్టి నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
యేపునఁ దనవలపు లియ్యకొనరాదా

రేకు: 1851-2 సామంతం సం: 28-295

పల్లవి: ఎరవుసేయ దెంతైనా నిన్నిటా నీదేవులు
పొరసి యీగుణాలతోఁ బొగడొందుఁగాని

చ. 1: వేడకకత్తెనది వేసారదు పతిపైని
జాడతో వలపులు చల్లుఁగాని
వాడిక గలిగినది వంతువాసు లెంచదు
కూడిమాడి కూరిములు కొసరుఁగాని

చ. 2: తగులాయమైనది తనియ దెంతైనాను
జిగిమించ నితవులే సేసుఁగాని
మిగులాఁ జుట్టమైనది మీరి పలుక దెప్పుడు
పగటున నోరుపులే పచరించుఁగాని

చ. 3: ఆసకురాలైన ది అలయదు రతులను
పాసి తొలఁగ దెప్పుడు పైకొనుఁగాని
సేసతో నిల్లాలైనది శ్రీవేంకటేశుఁడ నీకు
రాసికెక్క నిట్టె కాఁపురము సేయుఁగాని

రేకు: 1851-3 ఆహిరి సం: 28-296

పల్లవి: మనసులో తమకము మాకు నిట్టె కానరాఁగా
నను నెంత తేలించేవు నాటకుఁడ నీవు

చ. 1: పువ్వు వంటి జవ్వనము పొద్దొక వింతై రేఁచీ
రవ్వలు సేయక ఇట్టె రావయ్యా నీవు
పువ్విళ్లూరీఁ జెమటలు వూటలై నీమేనను
నవ్వు లేమి నవ్వేవు నాతో నింకా నీవు

చ. 2: కొడిసాగి కోరికలు గుంపులుగా నల్లుకొనె
అడియాసలేల విడె మందియ్యవయ్యా
కడఁగి నివ్వెరగులు కానవచ్చె నీవల్ల
వొడి యాల పట్టి పాడే వూరకే నీవు

చ. 3: చిమ్మిరేఁగిన సిగ్గులు చిడుముడి సందడించె
నెమ్మదిఁ గూచుండవయ్యా నీవు నావద్ద
యిమ్ముల శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
నమ్మిక లె న్నిచ్చేవు నయాననే నీవు

రేకు: 1851-4 రీతిగౌళ సం: 28-297

పల్లవి: గుట్టుతోడిదాన నన్ను గొరబేల సేసేవోయి
గట్టిగా సేసవెట్టితేఁ గాదంటినా నిన్ను

చ. 1: చన్నులంట వచ్చేవు జాణతనా లాడేవు
ఇన్నేసి చేఁతలకు నీకేమౌదునోయి
సన్న లూరకె సేసేవు సందులకు లాచేవు
కన్నవారెల్లా నిన్ను గామిడివాఁడనరా

చ. 2: కప్పురము చల్లేవు కతలెల్లాఁ జెప్పేవు
అప్పడే నీకుఁ జుట్టమనైతినావోయి
కొప్ప జొరఁదీసేవు కొనగోరఁ జెనకేవు
వుప్పతించేవారు నిన్ను నుద్దండీఁడవనరా

చ. 3: మోవితేనె లడియేవు మోము దప్పక చూచేవు
వావు లింత గలపఁగవలెనా వొయి
శ్రీవేంకటేశ నన్నుఁ జెలరేఁగి కూడితివి
యీవలావలివారు యిచ్చకుఁడ వనరా

రేకు: 1851-5 నాదరామక్రియ సం: 28-298

పల్లవి: ఎప్పుడు గరుణించేవు యేమయ్యా నీవు
చెప్పరాని వినయాలచే నిన్ను మెప్పించెను

చ. 1: చెక్కులవెంటఁ గారే చెమటలతోడనే
పక్కన నిందాఁకా జెలి పాదాలొత్తైను
ముక్కున నిట్టూరుపులు ముంచి బుసకొట్టఁగానే
అక్కరతోఁ గొంతవడి యాలవట్ట మిడెను

చ. 2: గుబ్బలపై రాలేటి కుంకుమ బేంట్లతోనే
వుబ్బునఁ జేసెను నీకు నూడిగా లెల్లా
గుబ్బతిలు విరులతో కొప్పు గొంత జారఁగానే
నిబ్బరాన సారె సారె నిన్నుఁ జూచి మొక్కెను

చ. 3: పెదవులపై నూరే పిచ్చిలు తేనెలతనే
పదిమారులును విన్నపము సేసెను
యెదుట శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
అదివో తమ్ములను ని న్నప్పటి నడిగెను

రేకు: 1851-6 భైరవి సం: 28-299

పల్లవి: పదివేలకు మామాఁట పాలించవయ్యా
ఇదివో చెలికోరిక లీడేరుచవయ్యా

చ. 1: చెప్పరాని ప్రియములు చెప్పమనె జవరాలు
వొప్పుగొని చిత్తగించి వూఁకొనవయ్యా
తప్పక తనపై దయదలఁచుకొమ్మనె నిన్ను
అప్పడవి యేఁటికో అవధరించవయ్యా

చ. 2: సేయరాని వూడిగాలు సేసితిఁ దా ననుమనె
ఆయెడ నింపైతే నీ వానతీవయ్యా
చేయెత్తి మ్రొక్కీ నమ్మాటికిని చెలఁగి మొక్కితినని
పాయక దేవర యీఁకఁ బరాకు మానవయ్యా

చ. 3: యెన్నరాని తలపోఁత నెదురుచూచితి ననె
విన్నపమిదె పెండ్లికి విచ్చేయవయ్యా
వన్నెగా శ్రీవేంకటేశ వచ్చి యిట్టె కూడితివి
కన్నె నిట్టె పాయక మన్నించవయ్యా

రేకు: 1852-1 పళవంజరం సం: 28-300

పల్లవి: గుట్టుతో మంచితనాలే కోరి చూపవలెఁగాక
యెట్ట యెదుటనే వుండి ఇంత యెలఇంతురా

చ. 1: వొడిఁగట్టినవలపు లుమ్మగిలుచుండఁగాను
సడిఁబెట్టి పతినేమి సాదించేవే
తడిసి పెంజెమటలు తనువులఁ గారఁగాను
పెడరేఁచి యాతనితోఁ బెనఁగులాడుదురా

చ. 2: కొప్పునఁ బెట్టిన సేస కొనికల జారఁగాను
కప్పి పయ్యెదతో నేమి గయ్యాళించేవే
చిప్పిల నవ్విన నవ్వు సెలవుల నించఁగాను
వుప్పతించి యాతనితో నొడ్డారా లాడుదురా

చ. 3: మనసులో కోరికలు మల్లడిగొనుచుండఁగా
వెనక ముందరలేమి వెసఁజూచేవే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేఁడు
చెనకులు మైనుండఁగా సిగ్గున లోఁగుదురా

రేకు: 1852-2 వరాళి సం: 28-301

పల్లవి: మంచితనమే మేలు మగవాని తోడుతను
మించి చెక్కునొక్కఁగానే మేర మీర నేలే

చ. 1: చిక్కని వెన్నెలతేట సెలవుల నుండఁగానే
చక్కఁగా విభునినేల జంకించేవే
మక్కువలు నిండుకొని మనసులో నుండఁగానే
చొక్కపు కనుఁగొనలు సొలయఁగ నేలే

చ. 2: పెనగొన్న మంచిమాట పెదవిపై నుండఁగానే
కొనగోరఁ జిమ్మేటి గుంపెన లేలే
నినుపులై మొగమోట నిలువున నుండఁగానే
ననుపుల సిగ్గులు నానఁబెట్ట నేలే

చ. 3: కడలేని యాసలు కాఁగిటిలో నుండఁగానే
చిడుముడితో జోలిసేయఁగ నేలే
యెడయక శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నేలె
విడెము నీకియ్యఁగానే వేగిరించ నేలే

రేకు: 1852-3 దేసాళం సం: 28-302

పల్లవి: ఎటువంటి వాఁడవయ్యా యేమయ్యా నీవు
తటుకన నీఁక దయదలఁచుకోవయ్యా

చ. 1: యెడమాట లాడించి ఇంతితోఁ బొందులు సేసి
తడవవు తాఁకవు తగవా నీకు
అడియాలా లెల్లాఁ జెప్పి ఆసలాసలఁ బెట్టి
వెడవెడగా నవ్వేవు వేడుకా నీకు

చ. 2: సన్నలు సారెకుఁజేసి చవు లీపెకుఁ బుట్టించి
పన్నుగ జూజూలాడేవు పంతమా నీకు
యెన్నికగాఁ బెండ్లాడి ఇక్కువలు గరఁగించి
వున్నాఁడ వెఱఁగనట్టే వుచితమా నీకు

చ. 3: తరితీపులను ముంచి తమకము లింత నించి
సరి జాగులఁ బెట్టేవు చలమా నీకు
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
సరులు దిద్దేవు యిదె సఁదా (సందా?) నీకు

రేకు: 1852-4 మధ్యమావతి సం: 28-303

పల్లవి: రమణికి నీకుఁ బోదు రావయ్యా
అమరు నిన్నికె యేమనినా నేమాయను

చ. 1: పంతము లాడుకొందురు పలుమారు సొలతురు
ఇంతులకు నివియెల్లా నెగ్గులు గావు
కొంతగొంత దూరుదురు కూరిమి గొసరుదురు
వింతలేని విభునికి వెగటు గాదు

చ. 2: చూపుల నద్దలింతురు చొప్పలు వెదకుదురు
రాపుల నివెల్లా నేరములు గావు
వోపి సరి వెనుగుదు రొట్లెల్లాఁ బెట్టుదురు
పైపై గుంపెనలెకాని పల్లదాలు గావు

చ. 3: బలుతురు పిలుతురు బొమ్మల జంకింతురు
తలపోసితే నివెల్లా తప్పలు గావు
యెలమి శ్రీవేంకటేశ యీాకె నిట్టె యేలితివి
మలసి వెరగందితే మరపులు గావు

రేకు: 1852-5 హిందోళ వసంతం సం: 28-304

పల్లవి: నామాఁట వినవయ్యా నవ్వులు మరెయ్యాఁగాని
కామించినప్పుడే కలయుటే మేలు

చ. 1: పలుకులఁ బెల్లవారె పంతమెల్లా నీడేరె
చెలియిచ్చిన కానుక చేకొనవయ్యా
వలపించినవాఁడవు వట్టి జోలిఁబెట్టవద్దు
పిలిచినప్పుడే వచ్చి బెరయుటే మేలు

చ. 2: సింగారించనే పట్టె సిగ్గులెల్లాఁ దుదముట్టె
అంగన నెప్పుడు గూడే వదేమయ్యా
వుంగర మంపిన వాఁడ వూరకే వుండఁగవద్దు
కొంగువట్టినప్పుడే కూడుటే మేలు

చ. 3: ముచ్చటలు గడురేఁగె మోవిపండ్లూ మాఁగె
నెచ్చెలిని యిప్పుడే మన్నించవయ్యా
యిచ్చటఁ బెండ్లాడితివి యీకెను శ్రీవేంకటేశ
మచ్చిక లిట్టే సేసి మరుగుమే మేలు

రేకు: 1852-6 నాగవరాళి సం: 28-305

పల్లవి: మరిగి వలచితేను మరి వేసరఁగరాదు
సరసము లాతనితో జరపవే చెలియా

చ. 1: యిచ్చకములే యాడితే యిగిరించు మనసులు
కొచ్చి కొచ్చి కొసరితే కూరిమి వుట్టు
కచ్చుక కాచుకుండితే కైవశములౌఁ బనులు
మెచ్చుఁ బతి తలఁపులో మెలఁగవే చెలియా

చ. 2: సారెకు మోము చూచితే సరి నాస లుప్పతిల్లు
చేరి సేవసేసితేను చెల్లుబడౌను
నేరుపుతో నవ్వితేను నిండుకొను సంతోసాలు
కోరి యీతనిఁ బాయక కొలువవే చెలియా

చ. 3: ననుపులే నెరపితే నమ్మికలు సతమౌను
వినయమే సేసితేను వేడుకలౌను
యెనసె శ్రీవేంకటేశుఁ డిందుకొరకె నిన్ను
వొనరి యిద్దరూఁ గూడి వుండరే చెలియా

రేకు: 1853-1 దేసాళం సం: 28-306

పల్లవి: అప్పటి మాతోడి పొందు లాసపడేవు
కప్పరము నీ వియ్యఁగా కాదు గూడదనేమా

చ. 1: జంకెన చూపులఁ జూచి జాజరపాటలు వాడి
అంకెలకుఁ దెచ్చుకొనె నాపె నిన్నును
కుంకుమ గుబ్బలు సోఁక కొనగోరఁ గొప్ప దువ్వి
కొంకక యిన్నిటా దక్కఁగొనెఁ గదవయ్యా

చ. 2: సెలవుల నవ్వు నవ్వి చేతులు నీపైఁ జాఁచి
వలపించుకొనెఁగా వనిత నిన్ను
సొలపుల మాటలనే చుట్టరికములు సేసి
యెలమి నిన్నింత యెలయించెఁగదవయ్యా

చ. 3: విడెము చేతికిచ్చి వేమారు సరసమాడి
వాడికె సేసుకొనెను వైపుగా నిన్ను
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జాడతోఁ దా నీపై సేస చల్లెఁగదవయ్యా

రేకు: 1853-2 మాళవిగౌళ సం: 28-307

పల్లవి: ఇప్పుడేల వేగిరించే వెంతలేదు నీ పగటు
కప్పురమువాసన లేకడనైనా దాఁగునా

చ. 1: మందలించి నీ యెమ్మెలు మాతో నాడవద్దుగాని
చెంది యాతనితోడనే చెప్పవే నీవు
అందరి ముందరాఁ బంతా లవి యాల నెరపేవే
కందువ నీపతివద్దఁ గానవచ్చీఁ గాక

చ. 2: వాడలోన నీరూపు వర్ణించుకోవద్దుగాని
సూడిదెగా నాతనికే చూనవే నీవు
వీడెవు మోవి సారెకు విచ్చి యేల నవ్వేవే
వేడుక నీపతివద్ద వెలవెట్టీఁగాక

చ. 3: నేరుపు లెక్కడనైనా నెరపఁగ వద్దుగాని
నీరచన లాతనిపై నించవే నీవు
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నేమనేవే
కోరిక నీపతివద్ద గొనసాగీఁ గాక

రేకు: 1853-3 కేతా (దా?) రగౌళ సం: 28-308

పల్లవి: కక్కసించనేమిటికే కాంతలాల
మక్కువ సేసెను తొల్లె మన్నించీఁగాక

చ. 1: నామోము తాఁ జూచితేను నవ్వులు నవ్వేఁగాక
వేమారుఁ బైకొంటేను వేసట గాదా
చేముట్టి చెనకితేను సేవలు సేసేఁగాక
ఆముకొని కొసరితే నందము లయ్యీనా

చ. 2: పేరుకొని పిలిచితే బెట్టి వూఁకొనేఁగాక
వూరకే మాఁటాడితేను వొద్దికయ్యీనా
తారుకాణ వచ్చితేనే తన్ను నెచ్చరించేఁగాక
సారె సారెఁ బెనఁగితే చాయకు వచ్చీనా

చ. 3: కావలెననిన దాఁకా కాచుకవుండేఁగాక
యీవల వేగిరించితే నిచ్చక మౌనా
చేవదేర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు నేఁడు
కావరించితే నిట్లా కళలు రేఁగీనా

రేకు: 1853-4 భైరవి సం: 28-309

పల్లవి: ఎంత బత్తో నీమీఁద యీరమణికి
సంతోసములెల్లా రేఁగ సరసమాడవయ్యా

చ. 1: కొప్పులో విరులు రాలఁ గులికి కులికి నవ్వీ
చప్పుడుగాఁ జెలి నీతో సారెసారెకు
కప్పురపు వాసనలు కడు బుగులు కొనఁగా
చెప్పీ నీకు బ్రియములు చిత్తగించవయ్యా

చ. 2: పయ్యదకొం గిటుజార పలుమారు జెనకీని
వొయ్యారపుఁ జూపులతో వొద్దనే వుండి
వుయ్యాల మంచముపైకి నూరకే సన్నలు సేసీ
చయ్యన నెంత వేడుకో చన వియ్యవయ్యా

చ. 3: సింగారించుకొని వచ్చి చేరి కొలువులు సేసి
సంగతిగా మాటలాడీ సతి నీతోను
రంగుగ శ్రీవేంకటేశ రతి నన్ను నేలితివి
అంగవించి యాకె నిఁక నాదరించవయ్యా

రేకు: 1853-5 పాడి సం: 28-310

పల్లవి: వేగమె రావయ్యా నీవు వెలఁది దినదినము
పోగులైన సంతోసాలు పోదిఁ బెట్టుకున్నది

చ. 1: భామ చిగురాకుమోవిఁ బళ్లెము వెట్టుకున్నది
ప్రేమపు వలపు దొంతిఁ బెట్టుకున్నది
నేమపుఁ గోరికలెల్లా నీ కెదురంపు కున్నది
కామతంత్రములు వొడిఁ గట్టుకున్నది

చ. 2: కప్పరపుఁ బలుకులు గాదెఁ బోసుకవున్నది
యెప్పుడూ మనసు మీఁదెత్తుకున్నది
కప్పి జక్కవచన్నులు కానిక వట్టుకున్నది
దెప్పరపు సిగ్గునను తెరవేసుకున్నది

చ. 3: కందువకాఁగిలి పాన్పుగాఁ బరచుక వున్నది
పొందుగ రతులు నీకుఁ బూఁచికున్నది
ఇందుకే వచ్చి శ్రీవేంకటేశ ఇంతిఁ గూడితివి
చెంది నవ్వు లింకా నీకు సేస వట్టుకున్నది

రేకు: 1853-6 పూర్వగౌళ సం: 28-311

పల్లవి: మొగ మిచ్చదానను మొదల నేను
తగులాయ రమ్మనవే దక్కెఁ దనపంతము

చ. 1: యిచ్చకమాడే పతిని యేమనఁగ వచ్చునే
కచ్చు పెట్టి చెనకఁగా కాదందునటే
కొచ్చి కొచ్చి నవ్వఁగాను గుంపించవచ్చునా
మచ్చికతో రమ్మనవే మాయింటికి నిఁకను

చ. 2: వీడెము చేతికియ్యఁగా వింతసేయవచ్చునా
వాడికలు చెప్పఁగాను వద్దందునటే
జోడు గూడి వుండఁగాను సొలయఁగవచ్చునా
వేడుకతో రమ్మనవే వీఁటిఁ (వింటిఁ?) దనమాఁటలు

చ. 3: పిలిచి కాఁగిలించఁగా పెనఁగఁగవచ్చునా
వలచి మోవియ్యఁగాను వంచింతునటే
యెలమి శ్రీవేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
తెలిసితి రమ్మనవే దిష్టమాయఁ బనులు

రేకు: 1854-1 ముఖారి సం: 28-312

పల్లవి: చల్ల లమ్మే వారమైతే సదరమైతిమా నీకు
యెల్ల చోటులకు వచ్చి యేల మొక్కేవయ్యా

చ. 1: అచ్చమైన గొల్లదాన నౌనయ్యా మంచివాఁడవు
పచ్చిమాట లాడుదురా పలుమారును
నిచ్చళమై నీచుట్టాలు నిండ వేగురున్నవారు
యెచ్చరించి సన్నసేసి యేల మొక్కేవయ్యా

చ. 2: ఆవులు మాఇలవేల్పు లంటకుమన్నాఁ బోనీక
కావరించి చెనకేవు గబ్బితనాన
పూవుల నేల వేసేవు పూఁపలయ్యా నా చన్నులు
యీవేళనే సన్నసేసి యేల మొక్కేవయ్యా

చ. 3: యీ యేఁడే కొమరెనైతి యెక్కుడైన గరితెను
చేయివట్టి సుద్దు లేమి చెప్పేవయ్యా
పాయపు శ్రీవేంకటేశ పంతాన నన్నేలితివి
యేయడా నీకెదురాడ నేల మొక్కేవయ్యా

రేకు: 1854-2 లలిత సం: 28-313

పల్లవి: ఎఱఁగనా నీసుద్దులు ఇప్పుడు మాఇంట వచ్చి
మెఱయుచు నన్నునేలి మెప్పించితివి గాక

చ. 1: యెవ్వతో మేడెక్కియుండి, యేనుఁగపై నీవు రాఁగా
అవ్వేళ చేయిచ్చి నిన్ను నందుకొనెను
వువ్విళ్లూరె మీలోని వొద్దిక లప్పుడు చూచి
జవ్వనులు మెచ్చి మెచ్చి సంతోసించుకొనిరి

చ. 2: తురగము నట్టె నీవు తోలఁగా మానిపైనుండి
విరులుగోసేలేమ నీవెనక నెక్కె
సరుగన మీ ఇద్దరి చందాలు పక్కనఁ జూచి
సరసిజాక్షులు నవ్వి జాణలౌదు రనిరి

చ. 3: నిగిడి పల్లకిమీఁద నీవు రాఁగాఁ బన్నాగము
దిగవేసి తనింటికిఁ దెచ్చె నొకతె
తగ శ్రీవేంకటేశ కాంతల నీపొందులు చూచి
మగువలందరు మిమ్ము మచ్చికఁ బొగడిరి

రేకు: 1854-3 తోండి సం: 28-314

పల్లవి: అప్పటిఁ బంతాలాడే వాపెతోడను
ఇప్పుడే రతి నలసే వెట్టు గెలిచేవయా

చ. 1: మాఁటలనే చెలియ నీమసల్లాఁ గరఁగించె
గాఁటపు గుబ్బల నొత్తి కళ రేఁచెను
చీటికి మాటికి నవ్వి సిగ్గులు జారఁగఁదోసె
యీటు వెట్టుకొని యీకె నెట్టు గెలిచేవయా

చ. 2: చెనకి చెనకి నినుఁ చేతికి లోఁజేసుకొనె
కనుచూపుల నిన్నుఁ జొక్కఁగఁజేసెను
పెనఁగులాటలనే ప్రియుములు పుట్టించె
ఇనుపమడించె నిన్నికె యెట్టు గెలిచేవయా

చ. 3: తగులై వద్దఁ గూచుండి తమకము వొడమించె
జగిమోవి చవి చూపి చెంగలించె
నిగిడి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి వలపించె
యిగిరించెఁ గోర్కు లీకె నెట్టు గెలిచేవయా

రేకు: 1854-4 భైరవి సం: 28-315

పల్లవి: ఇన్నిటాఁ దా నేరుపరి యిల్లాల నేను
చిన్నదానఁ బ్రియమెంత చెప్పీనే తాను

చ. 1: వొడఁబరచినమాఁట లూఁకొంటిఁగదవే
నడుమఁ దా నేమనినా నవ్వితిఁగదె
అడియాలాలు చెప్పితే నౌఁగాదనఁగదవె
తడవి నన్నేమిటికిఁ దగిలీనె తాను

చ. 2: చలపట్టి వేఁడుకొంటే సమ్మతించితిఁగదవె
సొలసితే తనమోము చూచితిఁగదె
అలరి విడెమిచ్చితే నందుకొంటిఁ గదవె
కొలఁది మీర నన్నెంత కొసరీనే తాను

చ. 3: పాదములు చాఁచితేను పట్టి వొత్తితిఁ గదవే
మోదమున మెచ్చితేను మొక్కితేఁగదే
యీదెస శ్రీవేంకటేశఁ డింతలోనే నన్నుఁ గూడె
పోదిసేసి నన్నేల పోదిగీనే తాను

రేకు: 1854-5 నాదరామక్రియ సం: 28-316

పల్లవి: సేసవెట్టి పెండ్లాడి సిగ్గులు వడితేఁ బోదు
బాస యిచ్చి నీకితఁడు బత్తి సేసీని

చ. 1: మనసిచ్చి యాతనితో మాఁటలాడఁగదవే
వినయాన ని న్నతఁడు వేఁడుకొనీని
పెనఁగక ప్రియములే పెంచి పెంచి చూపవే
మునుకొని చుట్టరికములే సేసీని

చ. 2: వేడుకతో నీమోవి విందు లిట్టె పెట్టవే
వోడక నీతోపొందు లొనరించీని
జాడతోడ వీనులారా సమ్మతించి వినవే
వాడికెతో మేనబావ వావులు చెప్పీని

చ. 3: యింటలో నీబలమెల్లా నితనికిఁ జూపవే
జంటయై నీకాఁ(కాఁగా?) టిలో సాముసేసీని
నంటు శ్రీవేంకటేశుఁ డున్నతిఁ గూడె మెచ్చవే
పెంటలైన రతులను పెచ్చు వెరిగీని

రేకు: 1854-6 రామక్రియ సం: 28-317

పల్లవి: ఇచ్చుక మెఱఁగవద్దా యేమే పతి లాలించఁగా
రచ్చ వేసేవు వలపురాఁపులివి యేలే

చ. 1: సరుస నాతఁడు నీమై జవ్వాది పూయ రాఁగా
సరి వెనఁగేవు యింత చలములేలే
పరగి జారిని నీ పయ్యద చక్కఁ గప్పఁగా
కరము బిగ్గెఁ బట్టేవు కక్కస మింతేలే

చ. 2: మన్నించి యాతఁడు నీతో మంచి మాఁట లాడఁగాను
సన్నల జంకించేవు యీసణఁగులేలే
మిన్నక కొసరి తనమీఁద నానవెట్టఁగాను
పన్ని నోరుమూసేవు పంతా లింత యేలే

చ. 3: మొక్కలాన నాతఁడు నీమోవితేనె లానఁగాను
వుక్కు గోర నూఁదే వింత వుద్దండాలేలే
చెక్కు నొక్కి నిన్ను నిట్టె శ్రీవేంకటేశుఁ డేలఁగా
మొక్కుచు వీఁగేవు వట్టి మొఱఁగు విఁకేలే

రేకు: 1855-1 సామంతం సం: 28-318

పల్లవి: ఇంతలో విచ్చేసితివి యీడకే మగువఁ జూడు
కాంత ఇదె నీరాక గాచుకొని వున్నది

చ. 1: వుమ్మగిలు జెమటలు వూరిచి కొనగోరను
చిమ్ముచు నీ సుద్దలే చెలితోఁ జెప్పె
కమ్మటి సంతోసాన కలికి కన్నుల నవ్వు
కుమ్మరించుకొంటా నీగురుతులే చూపె

చ. 2: పొంది పొంది నిట్టూర్పులు పుక్కిళ్ల నాఁచి యాఁచి
నించుకొంటా చెలితోడ నిన్ను సొలసె
వంచిన శిరసుతోడ వలపు పులకలతోఁ
బెంచి పెంచి నిన్ననే పేరుకొని పొగడె

చ. 3: నిలువు నివ్వెరగుతో నీరూపు మదిలోన
తలఁచి నీకు చెలి ముందరనే మొక్కె
వెలఁదిఁ గరుణతో శ్రీవేంకటేశ కూడితివి
నెలకొన్నరతుల నీనేరుపెల్లా మెచ్చెను

రేకు: 1855-2 శంకరాభరణం సం: 28-319

పల్లవి: చల్లరే హరిపై జాజరజాజ
చల్లఁగా సరసపు జాజరజాజ

చ. 1: సతతపు వలపుల జాజరజాజ
చతురులమాటల జాజరజాజ
సతమగు నవ్వుల జాజరజాజ
జతనపు సిగ్గుల జాజరజాజ

చ. 2: సముకపు కొసరుల జాజరజాజ
సమరతికరఁగుల జాజరజాజ
జమళి తమకముల జాజరజాజ
సమయని యాసల జాజరజాజ

చ. 3: జడియని పంతపు జాజరజాజ
సడఁగుల చేఁతల జాజరజాజ
జడిగొనుచెమటల జాజరజాజ
జడగొను పెనఁగుల జాజరజాజ

చ. 4: చలముల వొట్ల జాజరజాజ
సలియెలపగటుల జాజరజాజ
చలువల వినయపు జాజరజాజ
సళువుల చూపుల జాజరజాజ

చ. 5: సంగడి మూఁకల జాజరజాజ
జంగిలి మతకపు జాజరజాజ
సంగాత మమరిన జాజరజాజ
సంగతి యెరికల జాజరజాజ

చ. 6: సారపు మోవుల జాజరజాజ
సారెకుఁ బొలసేటి జాజరజాజ
సొరుచి మెచ్చుల జాజరజాజ
జారతనంబుల జాజరజాజ

చ. 7: సందడి కొలువుల జాజరజాజ
సందుల వొత్తుల జాజరజాజ
చందురుపాటల జాజరజాజ
సందె చీఁకటుల జాజరజాజ

చ. 8: చాలుకొను సతుల జాజరజాజ
జాలివిరహముల జాజరజాజ
చాలామరిగిన జాజరజాజ
చౌలూరించే జాజరజాజ

చ. 9: చెనుఁగవ గురుతుల జాజరజాజ
చనవుల కొసరుల జాజరజాజ
యెనసెను శ్రీవేంకటేశ్వరుఁ డీతని
చనుమానంబుల జాజరజాజ

రేకు: 1855-3 అమరసింధు సం: 28-320

పల్లవి: ఎంత ప్రియాలు చెప్పేవే యేడలేని యాసోదాన
వింత లే కాతఁడు గారవించెనంటాను

చ. 1: చెక్కులేల నొక్కేవే చిత్తమేల కలఁచేవే
మిక్కిలి పతితో మందెమేళానను
వక్కణ లెన్నడిగేవే వాడికేమి చూపేవే
మక్కువ నాతఁడు నిన్ను మన్నించెనంటాను

చ. 2: చన్నుల నెంత వొత్తేవే సరసమే మాడేవే
సన్నల నాతఁడేలిన సలిగెలను
విన్నపా లెంత సేసేవే విడే లెన్ని యిచ్చేవే
పన్నుక యాతఁడు నీపై బత్తిగలఁడంటాను

చ. 3: పచ్చిగా నెంత నవ్వేవే పైకొని యేల చొక్కేవే
యిచ్చ నాతఁడు గూడిన యెమ్మెలను
తచ్చి శ్రీవేంకటేశుఁడు తానే నిన్ను మరిగించె
వచ్చి యెంత తగిలేవే వలచెనంటాను

రేకు: 1855-4 సింధురామక్రియ సం: 28-321

పల్లవి: సేసే దేమే యిఁక వాని చిత్తము నాభాగ్యము
బాస యిచ్చినాఁడు నాకు బత్తిగలఁ డతఁడు

చ. 1: వలెనని వినేనంటే వాని సుద్దు లెన్ని లేవు
పలుకులఁ జెప్పేనంటే బండ్లు నిండు
తలఁచితే మనసులో దగులు జిగురువలె
కొలఁది వెట్టఁగరాక గుట్టుతో నుందాననే

చ. 2: నిక్కి చూచేనంటే వాని నిలువు నూరు పండు
చక్కఁదనా లెంచేనంటే సారె నొరూరు
తక్కక పొందుసేసితే తరితీపులు గనము
ముక్కుపై వే లిడుకొని మోనాన నుందాననే

చ. 3: చెనకే నంటే వాని చేఁతలు మీఁద మిక్కిలి
పెనఁగితే రతులను పెచ్చువెరుగు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేఁడు
వొనరి నివ్వెరగుతో నూరకే వుందాననే

రేకు: 1855-5 సౌరాష్ట్రం సం: 28-322

పల్లవి: చెప్పఁగలమాఁటలెల్లాఁ జెప్పితి నీకు
మెప్పించి నన్నేలితివి మేలుదానఁ జుమ్మీ

చ. 1: చలపట్టి వేగినంతా సరసములే యాడేవు
వలవని జాగరాలు వద్దు వద్దయ్యా
తలకొని నామేన గందము వూసే వప్పటిని
వులివచ్చి వలపులు వుప్పతిలీఁ జుమ్మీ

చ. 2: పిప్పి గట్ట మాపుదాఁకా పెనఁగి పొద్దువుచ్చేవు
చప్పని చెలిమి చాలుఁ జాలునయ్యా
ముప్పిరిఁ బన్నీరు నాపై ముంచి ముంచి చల్లేవు
చిప్పిలు నాజవ్వనము చిగిరించీఁ జుమ్మీ

చ. 3: పొద్దు వొద్దు తప్పకుండా పొంచి కాఁగిలించేవు
అద్దో యెతనేరుపరి వౌనౌనయ్యా
కొద్దితో శ్రీవేంకటేశ కూడి కప్రాన వేసేవు
వొద్దికై నాకళలంటి వువ్విళ్లూరీఁ జుమ్మీ

రేకు: 1856-1 సాళంగనాట సం: 28-323

పల్లవి: ఒక్కటంటే నొకటనేవోయి నీవు
వొక్కటైతే మనపొందు చక్కటాయఁగదవే

చ. 1: కన్నులు చూడవోయి కడుగొప్పలు
కన్ను లట్టె వుండనీ నీ చన్నులు చూచేనే
పొన్నపువ్వు లంపవోయి పొద్దు వొద్దున
పొన్నపువ్వు లంపితేనే సన్నలఁ దెలియవే

చ. 2: కతలు చెప్పవోయి కడు వినేను
కత లెఱఁగముగాని రతులు చెప్పేనే
తతులు రానియ్యవోయి దానికేమి
తతు లప్పుడే వచ్చె మితులు మీరేనే

చ. 3: వావి దెలుసుకో వోయి వలసితేను
వావి నేఁ దెలిసినదే మోవి యానేను
దేవుల నైతిఁగదోయి శ్రీవేంకటేశ
దేవులౌ(లు?) గాఁగానే నీసేవలు మెచ్చితినే

రేకు: 1856-2 శంకరాభరణం సం: 28-324

పల్లవి: అలమేల్మంగవు నీవు అక్కున నుందానవు
లలి నీగుణమెఱిఁగి లాలించీఁగాక

చ. 1: కొచ్చి కొచ్చి పలుమారుఁ గొసర నేమిటికే
మచ్చికతో నాతఁడే మన్నించీఁగాక
కచ్చుపెట్టి రతులకుఁ గక్కసించనేఁటికే
యిచ్చకము సేయఁగానే యెనసీఁగాక

చ. 2: విన్నపాలు నేసి సేసి వేసిరించనేఁటికే
తన్నుఁదానే నీపై దయదలఁచీఁగాక
చన్నుఁ గొండలనే వొత్తి చండిసేయ నేఁటికే
యెన్నికతో వేఁడుకొంటే నియ్య కొనీఁగాక

చ. 3: పిక్కటిల్లఁ జేయివట్టి పెనఁగఁగ నేఁటికే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డేలీఁగాక
తక్క నిన్నుఁ బెండ్లాడీ తమకించ నేఁటికే
చక్కఁగా సేవ చేసితే చనవిచ్చీఁగాక

రేకు: 1856-3 నాదరామక్రియ సం: 28-325

పల్లవి: ఏమి సేసినాఁ జెలుల కిన్నియు సమరుఁగాక
కోమలి వేడుక లెన్ని కూడపోసేవయ్యా

చ. 1: వుప్పతిల్లు గన్ను చూపు వొడ్డించుకోవచ్చునా
ముప్పిరిగొన్న నవ్వులు ముయ్యవచ్చునా
చెప్పరాని మాటలకు చెవులొగ్గవచ్చునా
కప్పరగంది నెంత గరిసించేవయ్యా

చ. 2: వుడివోని చుట్టరికా లొద్దనఁగవచ్చునా
తడఁ బడే తమకము దాఁచవచ్చునా
జడిగొన్న వలపుల చవుక సేయవచ్చునా
పడఁతితో నీఁక నెంత పంతమాడేవయ్యా

చ. 3: వులివచ్చి చెనకుల కోపననవచ్చునా
బలిమిఁ గూడితి వీఁకఁ బాయవచ్చునా
యెలమి శ్రీవేంకటేశ యీాకె యలమేలుమంగ
జలజాక్షి నీఁక నెంత సాదించేవయ్యా

రేకు: 1856-4 సామంతం సం: 28-326

పల్లవి: చనవు సేసుక మోవిచవులు గొందువు గాక
తనిసితిరి రతుల నిఁకఁ దలపోఁతలేలే

చ. 1: మొగము చూచినయపుడే ముంచుకొనుఁ దమకంబు
నగినయప్పుడే మిగుల ననుపు గులుగు
తగులు గలిగినచోట తరితీపు లుప్పతిలు
పగటుతో నతని మె(మొ?) డఁబరచనిఁకనేలే

చ. 2: సరసమాడినయపుడే సతమౌను మచ్చికలు
తెరదీసినప్పుడే తేరు సిగ్గు
తొరలనాడిన వేళ తుదిముట్టుఁ గోరికలు
పెరరేఁచి వలపులనుఁ బెనఁగ నిఁకనేలే

చ. 3: యెదుట నుండిన యపుడే ఇచ్చగించును మనసు
కదిసినప్పుడే మదనకళలు వొడము
అదన నలమేల్మంగ వతడు శ్రీవేంకటేశుఁ
డది గదవే నిన్నేలె నడుగ నిఁకనేలే

రేకు: 1856-5 రామక్రియ సం: 28-327

పల్లవి: చెప్పవే నాకొక బుద్ధి చెలియ వూహించి నీవు
యెప్పుడూ నాకోరికలు యీడేరునే కదవే

చ. 1: అనిశము నాచూపులు ఇతని మ్మైఁ బారఁగాను
మనసులో నన్నతఁడు మరచీనటే
వెనువెంట నాసుద్దులు వీనులలోఁ దగులఁగా
ఘనమ్మైన వలపు రేఁగనేవలెఁగదవే

చ. 2: గక్కన నేనంపిన కానుక చే నుండఁగాను
యెక్కడి పరాకులు యేలయ్యానే
తక్కిన నాతమకము తనపైఁ బొలయఁగాను
కిక్కిరించి నాపై దయ కెరలునే కదవే

చ. 3: చేరి నేఁజల్లిన సేస శిరసుపై నుండఁగాను
వేరొకతె పొందులను వెలసీనటే
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేల్మంగను
మేరతో నన్నేలే నిఁక మేలౌనే కదేవే

రేకు: 1856-6 శ్రీరాగం సం: 28-328

పల్లవి: అలమేలు మంగపతివని నిన్నెఱఁగదేమో
కలికి చేఁతలు నీకు గంపల నమ్మీని

చ. 1: నెరవాది తనమెంతో నీవెదుట నుండఁగా
తరుణి సిగ్గులనే దడి గట్టీని
గరిమలఁ దా నెన్ని కతలఁ గరచెనో
పెరరేఁచి వినయాలు పేరఁ బెట్టీని

చ. 2: కచ్చుక యెన్నాళ్లనుండి కాచుకుండెనో నీతో
తచ్చన మాఁటలనే దండగట్టీని
బచ్చెన వేసాలు నెంత పరగినదో కాని
పచ్చి నవ్వులనే తలఁబాలు వోసీని

చ. 3: తారుకొణగా నిన్నెంత దక్కఁగినుకొన్నదో
సారె సారె వలపుల జాజరాడీని
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కూరిమిఁ దానూఁ గొంత కొసరి లాచీని

రేకు: 1857-1 ఆహిరి సం: 28-329

పల్లవి: ఆసల నెదురుచూచీ అతివ నీకు
సేస చల్లి యిట్టె దయసేయఁగరాదా

చ. 1: మాఁటలనే కొంతవొద్దు మంతనాలఁ గొంతువొద్దు
యేఁటికి జంపులఁ బెట్టే విప్పుడు నీవు
ఆఁటదాని నింతేసి అలయించనేమిటికి
వాఁటమాయ వలపుల వచ్చితే రారాదా

చ. 2: పందే లాడ వేళలేదా పాట విన వేళలేదా
ఇందాఁకాఁ గాచుకుండితి నెంతపరాకు
పొందుసేసినట్టి చోట పొరపొచ్చాలు సేతురా
అందుకొంటివి కానుక లాడకే రారాదా

చ. 3: పిలిపించుకోవలెనా పెనఁగ నింట వలెనా
తలఁచుకోవద్దా యీకె తగులాయము
యెలమి శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
తిలకించి ఇట్టె దినదినము రారాదా

రేకు: 1857-2 పాడి సం: 28-330

పల్లవి: ఏమి చెప్పేదే నీ సుద్దు లెన్ని యయినాఁ గలవు
దోమటి నాగుణాలతో తులఁదూఁగేవటవే

చ. 1: చన్ను లెంత చూపినాను సరసమెంతాడినా
నిన్ననేఁటి మానిసివి నివే కదే
కన్ను లెంత గిరిపినా కతలెంత చెప్పినాను
యెన్నఁగ నాతోడ నీవు యీడువచ్చేవటవే

చ. 2: సారె నెంత నవ్వినాను సంగాతా లెంత సేసినా
నేరుపులు వచరించ నీవే కదే
చేరి యెంత గాచుకున్నా చేఁత లెన్ని సేసినాను
మేరతో నాతని నీవు మెప్పించే వటవే

చ. 3: ఇచ్చక మెంత సేసినా నింపు లెన్ని చల్లినాను
నిచ్చలుఁ గూడేదానవు నీవేకదే
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
పచ్చిరతులకు నీవూఁ బాలిదానవటవే

రేకు: 1857-3 ముఖారి సం: 28-331

పల్లవి: మఱి యేఁటిమాటలు మాపుదాఁకాను
యెఱుఁగవా నీవేమైనా నిఁక నీచిత్తమయా

చ. 1: చెప్పరాని ప్రియము చెప్పితి ననియఁ (యేఁ?) జెలి
అప్పటిని వేఁడుకొంటిననియఁ జెలి
తప్పక నీవన్నమాఁట తలఁచుకొమ్మనెఁ జెలి
యెప్పుడు గరుణించేవో యిఁక నీచిత్తమయా

చ. 2: ఇదె నీకు వయసు మీదెత్తితిననియఁ జెలి
అదనాయ నిన్నిట్టె రమ్మనియఁ జెలి
మదిలోనఁ దనబత్తి మరవకుమనెఁ జెలి
యెదురెదురే చూఁచీ నిఁక నీచిత్తమయా

చ. 3: మచ్చిక దయిలువార మన్నించుమనియఁ జెలి
అచ్చమైన నీదేవుల ననియఁ జెలి
యిచ్చల శ్రీవేంకటేశ యింతలో వచ్చి కూడితి –
వెచ్చరించితి విందాఁకా నిఁక నీచిత్తమయా

రేకు: 1857-4 శంకరాభరణం సం: 28-332

పల్లవి: కలిగెను నీవల్లఁ గంటి మీ వలపు
అలరి చెప్పఁ గతలాయను వలపు

చ. 1: పలువురు సొలయక పంతము నెరపక
అలుగక వుండిన దది వలపు
చలములు వెంచక సడఁగులు రాల్చక
కలసి మెలఁగుటే కందువ వలపు

చ. 2: వెంగెము లాడక వేసాల బొరలక
అంగము చూపని దది వలపు
చెంగక యేపొద్దు సిగ్గున లోఁగక
సంగడి నుండుటే సతమగు వలపు

చ. 3: తగవులు దప్పక తలఁపున మరవక
అగడులు సేయని దది వలపు
జిగి నినుఁ గూడెను శ్రీవేంకటేశుఁడు
మగువ నీకడరె మంచిది వలపు

రేకు: 1857-5 హిందోళ వసంతంసం: 28-333

పల్లవి: కోరి యెందుకైనా నియ్యకోవలెఁగాక
తారుకాణలైన మీఁద తప్పించుకోవచ్చునా

చ. 1: మక్కువ గలుగుకాంత మరి యేమాఁటలాడినా
అక్కరతో వినవలె నౌ ననవలె
యిక్కడక్కడివారు నిన్నేమందురోయంటా
తక్కక సిగ్గుతో నీకు తలవంచవచ్చునా

చ. 2: చుట్టమైన జవరాలు సొలసి యెంత నవ్వినా
గట్టిగా నోరువవలె కలయవలె
గుట్టుమీరి నీమీఁద గురుతులు మోచీనంటా
వొట్టినవలపు దాఁచి వూరకుండవచ్చునా

చ. 3: బత్తిగల కోమల పట్టి యెంత వెనఁగినా
చిత్తగించి కూడవలె చే కొనవలె
యిత్తల శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
కొత్తగా నాపె నెససి కొంక నింకవచ్చునా

రేకు: 1857-6 సామంతం సం: 28-334

పల్లవి: తగులమిగల చోట తగవు నెరపవద్దా
నిగిడి పొందులు సేయ నెరజాణఁ డతఁడు

చ. 1: చనవున రమణుని జంకించినదానవు
మనసు రంజిల్లఁ గొంత మాఁటాడవే
కొనచూపులనుఁ గడు కొచ్చి చూచిన దానవు
వినయానఁ జెక్కునొక్కి వేఁడుకొనఁ గదవే

చ. 2: యిందాఁకా నాసలఁ బెట్టి యెలయించినదానవు
కందువ లంటి మనసు గరఁగించవే
చెంది చెనకితే గోరఁ జిమ్మినట్టిదానవు
ముందుగానే మొక్కు మొక్కి మోవితేనె లియ్యవే

చ. 3: సరి వెనఁగి గుబ్బల సారె నొత్తిన దానవు
సురత గతులచేత జొక్కించవే
యిరవై శ్రీవేంకటేశు నింతసేసినదానవు
బెరసి చెప్పఁదగిన ప్రియమెల్లాఁ జెప్పవే

రేకు: 1858-1 మంగళకౌసిక సం: 28-335

పల్లవి: ఎంత పొందోకాని తొల్లి యీపెకు నీకు
వింతలేక చెనకీని వెల్లవిరిగాను

చ. 1: పొంచి పొంచి జవరాలు పూవుల నిన్ను వేసీని
కొంచ కిదె తెరమఱుఁగున నుండి
లంచముగ మోవి చూపి లాసి సన్నసేసీనిన్ను
మంచము పైకి రమ్మని, మఱవకు మిఁకను

చ. 2: బంగారు చిమ్మనఁ గోవిఁ బన్నీరు నీపైఁ జిమ్మీ
సంగతిగాను కంబము చాటున నుండి
చెంగట నుండి ముత్యాల సేసలు నీపైఁ జల్లీ
యింగితాన రతులకు నెచ్చరించీ నిన్నును

చ. 3: కంకణాల చేతులను కప్పురము నీకు నిచ్చీ
పొంకమై చెలి మాఁటునఁ బూఁచుక వుండి
అంకెల శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
కొంకక తా నిన్ను జేరి కొసరీఁ గూరిములు

రేకు: 1858-2 వరాళి సం: 28-336

పల్లవి: మేలు మేలు నీగుణాలు మెచ్చితి నేను
పోలించి యిలాగులనే భోగించవలెను

చ. 1: వేసరఁగరాదు మరి వేగిరపడఁరాదు
సేసవెట్టిన పతితో చెలులకును
వాసులు పట్టఁగరాదు వంతులడుఁగఁగరాదు
తాసువలె సరిదూఁగి దండ నుండవలెను

చ. 2: కన్నుల జంకించరాదు కరకరిసేయరాదు
మన్నన గలదంటాను మాటిమాటికి
యెన్నైనా వదలరాదు యెగ్గులు పట్టఁగరాదు
సన్నలనే మోవితేనె చవి చూపవలెను

చ. 3: సరివెనఁగఁరాదు చలము సాదించరాదు
మరిగిన రతివేళ మంచము మీఁద
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సరసములాడి ఇట్టె సమ్మతించవలెను

రేకు: 1858-3 బౌళి సం: 28-337

పల్లవి: ఆనతియ్యవయ్యా నాతో నక్కడి సుద్దు లెల్లాను
పూని నాకాఁగిట నిట్టె భోగించేవుగాని

చ. 1: ఇందాఁకా నీ వాకె ఇంటనుండి వచ్చితివి
విందు వెట్టెనా నీకు వేడుకతోను
గందము పూసుకొంటివా కానవచ్చీ మేనను
పొందుగ విడెమిచ్చెనా పుక్కిట నీకున్నది

చ. 2: నానిన చెమటలతో నవ్వుతా నున్నాఁడవు
పానుపు వరచెనా పాదాలొత్తైనా
వీనులలో నేమైనా విన్నపాలు సేసెనా
ఆనెనా చన్నులు వురమందు గురుతున్నది

చ. 3: గరిమతో సంతోసాలు కానిపించీ నీమోమున
సరసము లాడెనా చల్లెనా సేస
యిరవై శ్రీవేంకటేశ యీడ నన్ను నేలితివి
మరిగి తాఁ గూడెనా నీమనసులో నున్నది

రేకు: 1858-4 ఆహిరి సం: 28-338

పల్లవి: ఎంతని విన్నవించేము యింతి నీపైఁ గల బత్తి
సంతోసాన నీతో పొందు సారె మాకుఁ జెప్పడు

చ. 1: యెదురెదురే చూచు యేపొద్దు నిన్నే తలఁచు
మదిరాక్షి చెలులతో మంతనమాడు
చెదరిన సరులతో చెక్కు చెమటలతోడ
నిదుర గంటఁబెట్టదు నీపై తమి యెట్టదో

చ. 2: నీ మీఁది పాటలు వాడు నిలువునఁ జెంగలించు
ఆముకొని నిట్టూరుపు లడరించును
దీమసపు గుట్టుతోడ తెగని యాసలతోడ
నీమాటలే యాలకించు నీపై తమి యెట్టిదో

చ. 3: మలగు మీఁద మరగు మదనకళలు రేఁగు
కలలు గను నూరకె కాఁగిలించును
వెలఁది నిందు వచ్చి శ్రీవేంకటేశ కూడితివి
నిలిచి నిన్నుఁ బాయదు నీపై తమియెట్టిదో

రేకు:	1858-5 శ్రీరాగం సం:	28-339

పల్లవి:	ఇంతి విరహము మాన్ప నిదె వుపాయము
	దొంతి కత చెప్పరే సంతోసించుఁగాని

చ. 1:	కలువలు కొప్పనిండా కాంతకు ముడువరే
	అలచందురుఁడు చుట్టమై యుండుఁగాని
	తలకొని మేన గందము చాలాఁ బూయరే
	మలయానిలుఁ డీకెను మన్నించుఁగాని

చ. 2:	భామ వురమున రవి పడ(ద?)కము వెట్టరే
	భూమిఁ జక్రవాకాలెల్లా పొందౌఁగాని
	చేముందుగాఁ గమలాలచీర గట్టుకోనియ్యరే
	ఆమని తుమ్మిదలు సహాయమౌఁగాని

చ. 3:	వనిత చేతికి పంచవన్నె చిలుక నియ్యరే
	తనిసి మరుఁడు దయదలఁచుఁగాని
	యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నీకెను నేఁడు
	దినమూ నిట్టె సేయరే తిరమై యుండుఁగాని

రేకు: 1858-6 పాడి సం: 28-340

పల్లవి: ఆతని కితవై యటు నీవుండఁగా
కాతరించి నినుఁ గాదననేలే

చ. 1: చక్కని వనితకు సలిగెలు చెల్లును
మక్కువ గలిగిన మగనియెడ
వెక్కసమాడిన వేడుకయ్యై తోఁచు
కక్కసించి నినుఁ గాదన నేలే

చ. 2: ననుపుల ఇంతికి నగవులు చెల్లును
యెనసిన తన ప్రాణేశునెడ
పెనఁగి బిగిసినా ప్రియమ్మై తోఁచును
కనుసన్నల నిను గద్దించనేలే

చ. 3: జవ్వనపుసతికి సరసము చెల్లును
రవ్వగ వలచిన రమణు నెడ
యివ్వల శ్రీవేంకటేశుఁడు నన్నేలె
చివ్వన నీవావి చెప్పఁగనేలె

రేకు: 1859-1 ముఖారి సం: 28-341

పల్లవి: ఆపెమఱఁగున నీవెమైనాఁ జేసినది గద్దో
పూఁప సన్నలనే కడుఁబొద్దులు వుచ్చెను

చ. 1: బత్తిసేసి యాకె నీపై పదములు వాడఁగాను
యిత్తల నీవింతలోనే యేమి నవ్వేవు
కొత్తగా సింగారించుకొన్నందుకు మెచ్చఁగాను
చిత్తగించి నీవెంత సిగ్గువడేవు

చ. 2: కాయపు గురుతులపై కస్తూరి యలఁదరాఁగా
చేయివట్టి ప్రియాలెంత చెప్పవచ్చేవు
చాయల నీవలపులు సారెసారెఁ బొగడఁగా
ఆయములు మోచీనంటా నానలేల పెట్టేవు

చ. 3: ముచ్చటతో నాపె నీమోవితేనె లానఁగాను
ఇచ్చగించి పలుసోఁకు లేల దాఁచేవు
పుచ్చుకా శ్రీవేంకటేశ కొమ్మ నినుఁ బెండ్లాడఁగా
విచ్చన విడాయ నేల వేఁడుకొనేవు

రేకు: 1859-2 రామక్రియ సం: 28-342

పల్లవి: నీవేల సిగ్గువడేవే నెలఁతలలో
కావించి యందరికిఁ గలిగిన సాజమే

చ. 1: చిగిరించుఁ గోరికలు చిమ్మరేఁగు వలపులు
మగనిపై బత్తిగలమగువకును
మొగానఁ గళలునిండు మునుకొను నాసలు
తగ నిన్నియు నీయందే తారుకాణ వచ్చెనే

చ. 2: సెలవుల నవ్వుదేరు చెక్కులఁ జెమటలూరు
తలఁపు పతిపైనున్న తరుణికిని
పులకలు జాజుకొను పొడము నిట్టూరుపులు
కలవెల్లా నీయందే కనుఁగొంటిమే

చ. 3: తమకము నుప్పతిలు దైవారు వేడుకలు
రమణుని పొందుగల రామకును
అమర శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నుఁగూడె
జమళి మియందే ఇవి సరివచ్చెనే

రేకు: 1859-3 పాడి సం: 28-343

పల్లవి: ఇంతిగుణ మెఱఁగవా యేమైనా నీవు
వింతసేయక లోనికి విచ్చేయవయ్యా

చ. 1: సేసిననీచేఁతలకు చెలి యేమి నలుగదు
రాసికెక్కె నీ వేడుక రాఁగదవయ్యా
ఆసుద్ది దడవనని యానవట్టె నీమీఁద
చేసూటితో నీపె నీచిత్తములోనిదయా

చ. 2: యెటువలె నీవుండినా నెదురుమాఁటాడదు
సటగాదు రావయ్యా సమ్మతించెను
తటుకన లేచివచ్చి తానే మొక్కీ నీకు నదె
యిటుచూడు మిపె నీకు నిచ్చకురాలయ్యా

చ. 3: యెచ్చటనుండి వచ్చినా నెరవు సేయదు నిన్ను
చొచ్చి రావయ్యా యీడేరె చుట్టరికము
ఇచ్చటఁ గాఁగిలించె నిన్నిట్టె శ్రీవేంకటేశ్వర
పచ్చిదేరె నీకె నీపట్టపు దేవులయా

రేకు: 1859-4 దేసాళం సం: 28-344

పల్లవి: ఎవ్వరెరుఁగుదురయ్యా ఇట్టివి నీసుద్దులు
జవ్వనపు వేడుకల సరినోలలాడేవు

చ. 1: తలఁపునఁ బారెనో తరుణి తమగుబ్బలు
పలుమారు నిమ్మపండే పట్టియాడేవు
కలలోనవచ్చెనో కలికి చక్కనిరూపు
మలసి చిత్తరుపతిమల వా(వ్రా?)సేవు

చ. 2: విని నట్టాయనో నీకు వీనుల నాపె యెలుఁగు
అనుమానించక యట్టె యాలకించెవు
మునుకొని యాపై నీ మోమునఁ గట్టినట్టాయనో
పనివూని వేమారు భావించి చూచేవు

చ. 3: కూరిమి నాకెమోవిపై కోరికలు రేఁగెనో
సారె సారె గుక్కిళ్లు చవిగొనేవు
యీరీతి శ్రీవెంకటేశ యేలితివి నన్ను నేఁడు
గారవించి నాకొరికే కాదుగదా నవ్వేవు

రేకు: 1859-5 నాదరామక్రియ సం: 28-345

పల్లవి: ఎందాఁకా జూజాలాడేవేమే నీవు
అందంది నీతోడిపొందు లాసగించు నితఁడు

చ. 1: చక్కని నీమోము చూపి సరసము లాడవే
నిక్కి నిక్కి చూచీని నీరమణుఁడు
చెక్కు కొనగోర నొక్కి చిరునవ్వు నవ్వవే
మిక్కిలి నీతోఁ గడుమేలుగలఁ డితఁడు

చ. 2: సరుసనే కూచుండి చనుఁగవ నొత్తవే
విరులబంతుల వేసీ విభుఁడు నిన్ను
సరుగ మోవి యొసఁగి చవులు మరపవే
మరగ నేపొద్దూ నీపై బత్తిసేను నితఁడు

చ. 3: జోడుగాఁ గాఁగిట నించి సొంపులెల్లా రేఁచవే
వేడుకతో నున్నాడు శ్రీ వేంకటేశుఁడు
యీడైన రతులఁ గూడె యిచ్చకమే సేయవే
వాడికమకముల వలచు నీ కితఁడు

రేకు: 1859-6 సామవరాళి సం: 28-346

పల్లవి: ఏమని వున్నాఁడోకాని యిప్పుడు తనమతిలో
కామించినదాన నన్నుఁ గరుణించుమనవే

చ. 1: యిచ్చకమాడుదుఁగాని యెంచి వెంగేలాడవే
హెచ్చి తనసుద్దులు యెన్ని విన్నాను
మచ్చికలే సేతుఁగాని మరి నే నలుగనే
కొచ్చి తనమేన నెన్ని గురుతులున్నాను

చ. 2: కడు సంతోసింతుఁగాని కన్నుల జంకించనే
నడుమఁ దా నెవ్వతెతో నవ్వినాను
యెడయక మెత్తుఁగాని యెగ్గులు నేఁబట్టనే
తొడిబడ నెచ్చటఁ బొందులు సేసినాను

చ. 3: వినయమే సేతుఁగాని వెక్కసము చూపనే
పెనఁగుచు రతు లెంత పెంచినాను
యెనసె శ్రీవేంకటేశుఁ డీఁక ననుమానించనే
ననిచి తా నెటువలె నడచినాను

రేకు: 1860-1 దేసాళం సం: 28-347

పల్లవి: సేసిన నా చేఁతలెల్లాఁ జెల్లుఁగాక
వాసులకు నాయీగు వత్తురా కామినులు

చ. 1: కందువ నారమణుఁడు గలఁడు నన్ను మన్నించు
యెందరు సవతు లున్నా నేమాయనే
చెంది నా శిరసుమీఁద సేసపాలితఁడు వెట్టె
మందలించి నాతో మారుమలయఁగఁగలరా

చ. 2: ఘనుఁడు వేడుకతోడుతఁ గట్టె నాకుఁగంకణము
యెనలేని విరసము లేమిసేసీనే
వొనరఁగఁ దనముద్దుటుంగరము నాకు నిచ్చె
పనులెల్లా నీడేరె పరులు నాకెదురా

చ. 3: శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జిత్తగించి యేలినాఁడు
యీవలావలి సుద్దులు యెంత చెప్పేరే
కైవశమై నాతోనే కాపురము సేయఁజొచ్చె
దేవులనైతి నికఁ దెలుపఁగవలెనా

రేకు: 1860-2 బౌళి సం: 28-348

పల్లవి: ఏమనినాఁ దనతో నే నెదురాడేనా
వేమారుఁ దనకతలు వెలఇంచేఁగాక

చ. 1: చెప్పితిఁ గదవే తన చేఁతలెల్లా నీతోను
చొప్పుగా మేన గురుతు చూపితిగదే
తప్పక వద్దిచెలులఁదారుకాణించితిగదే
అప్పటి నింకానేల ఆనవెట్టుకొనినె

చ. 2: పట్టిఇచ్చితిఁగదవే భామ కంపినలేకలు
పెట్టిన సొమ్ములఁ దెలిపితిఁ గదవే
ఇట్టె చుట్టిరికము లేరుపరచితిగదే
నెట్టనఁ దగవు లెంత నెరప వచ్చీనే

చ. 3: పందే లాపెతో నాడఁగా పడితాళించితిఁ గదే
చిందినకప్పర మొప్పించితిఁ గదవే
విందువలె వచ్చి శ్రీవేంకటేశుఁడు నన్నేలె
సందడిలోఁ దానెంత చందాలు సేసీనే

రేకు: 1860-3 ముఖారి సం: 28-349

పల్లవి: వచ్చి యెంతదడవాయ వనిత నీవున్నాడకు
యిచ్చితివి మన్ననలు యీడేరించవయ్యా

చ. 1: చుట్టరికములు చెప్పి సుదతి నీకు మొక్కీ
అట్టె నీదండఁ గూచుండఁబెట్టుకొవయ్యా
నెట్టుకొని కానుకగా నిమ్మపండు చేతికిచ్చీ
గుట్టుతోడ నీవందుకొనవయ్యా

చ. 2: వివరించి సుద్దులెల్లా వెలఁది నిన్నడిగీని
చెవిలో నేకాంతము చెప్పవయ్యా
తివిరి మోవిసన్నలఁ దేనియలు గురిసీని
చవులుకొనుచు నీవు చనవియ్యవయ్యా

చ. 3: కోరికోరి జవరాలు కొలువులు నీకుఁ జేసీ
నేరుపుతోఁ గాగిట నించవయ్యా
చేరి పూనితి వింతలో శ్రీవేంకటేశుఁడ నీవే
సారె నిన్నికె చెనకీ సరసమాడవయ్యా

రేకు: 1860-4 సాళంగనాట సం: 28-350

పల్లవి: ఈతఁడొక్కఁడే యన్నిటా నెన్నిక కెక్కినవాఁడు
చూతమురారో చక్కని రీతి గలవాఁడు

చ. 1: సారెకుఁ బుటమెగరి సాముచేసినవాఁడు
ఆరితేరిన చిప్పలహరికెవాఁడు
పోరి కొమ్ముదారతోడి పోటుబంటయినవాఁడు
చేరి రిపులఁ జెండాడే చేకత్తులవాఁడు

చ. 2: పొంచి యడుగడుగుకుఁ బొదలేవాఁడు
చెంచలించక పగలు సాదించేవాఁడు
పెంచి శరణంటేఁ గాచే బిరుదువాఁడు
మించి యెలువఁగరాని మేటి బలువాఁడు

చ. 3: పరులనుఁ గడు సిగ్గు వరపించేవాఁడు
తొరలి తొక్కని చోట్లు దొక్కేటివాఁడు
సురలకు నేలికై సూడువట్టేవాఁడు
నిరతి శ్రీవేంకటాద్రి నెలకొన్నవాఁడు

రేకు: 1860-5 పళవంజరం సం: 28-351

పల్లవి: మెచ్చి రిందరును నిన్ను మేలు మేలే
కచ్చుపెట్టి చెలులము కంటిమే నీమేలు

చ. 1: చెలువుఁడు నిన్ను మెచ్చ సింగారించుకొంటి వౌనే
కొలువులో విడెమందుకొంటి వవునే
వలిపె పయ్యద పల్లెవాటు వేసికొంటి వౌనే
మెలఁగి నీ పగటులు మెరసితి వవునే

చ. 2: పతికి నింపులు వుట్ట పాటలు వాడితివౌనే
కతచెప్పి మతిఁ గరఁచితి వవునే
రతికి సన్నలుసేసి రప్పించుకొంటి వౌనే
చతురత లెల్లాను సాదించితి వవునే

చ. 3: మాటాడి శ్రీవేంకటేశు మరిగించుకొంటి వౌనే
కూటములు (ల?) మన్నన చేకొంటి వవునే
తేట తెల్లమిఁ బట్టపుదేవులవైతి వౌనే
నీటున నీతనివద్ద నెలకొంటి వవునే

రేకు: 1860-6 దేవగాంధారి సం: 28-352

పల్లవి: చూచి చూచి మీ పెండ్లికి సోబాన వాడేముగాక
మీచేఁత లిట్టివని మే మెంచఁగలమా

చ. 1: చెక్కులు నొక్కేవు నీవు సెలవుల నవ్వేనాపె
యిక్కువలు మీలోనివి యెట్టు దెలుసు
తొక్కేవు పాదాలు నీవు దొరకొని మొక్కీనాపె
పక్కన మీ భావా లేరుపరచఁ గఁ గలమా

చ. 2: చెనకఁచూచేవు నీవు సిగ్గులు వడీనాపె
యెనసిన నీసన్న లెట్టు దెలుసు
పెనఁగే వప్పటి నీవు ప్రియములు చెప్పీ నాపె
వెనుకొన్న మీ సుద్దులు వివరించఁగలమా

చ. 3: సరసమాడేవు నీవు చన్నుల నొత్తీ నాపె
యిరవైన మీ చయ్యాటా లెట్టు దెలు
గరిమ శ్రీవేంకటేశ కలసితివిటునన్ను
తెరలోని మీరతులు తెలుపఁగఁగలమా

రేకు: 1861-1 వరాళి సం: 28-353

పల్లవి: ఎన్నఁడు నెఱఁగమయ్య యిటువంటివలపులు
విన్నకన్నవారికెల్లా వెరగయ్యీ నిపుడు

చ. 1: వెలఁది నీగుణములు వినివిని తనియదు
తలపోసి తలపోసి తనియదు
సొలసి కన్నుల నిన్నుఁ జూచి చూచి తనియదు
యెలమి నీపై మోహ మింకా వెంతోకాని

చ. 2: అట్టె నీతోడుత మాటలాడియాడి తనియదు
తట్టి తట్టి పాదాలొత్తి తనియదు
చిట్టకపు కొనగోరఁ జిమ్మి చిమ్మి తనియదు
యిట్టె నిన్నుఁ గూడే వేడు కింకా నెంతోకాని

చ. 3: అచ్చపు నీమోవితేనె లానియాని తనియదు
తచ్చి తచ్చి నవ్వి నవ్వి తనియదు
కొచ్చి శ్రీవేంకటేశ్వర కూడిమాడి తనియదు
యిచ్చల నీపై తమక మింకా నెంతో కాని

రేకు: 1861-2 సామంతం సం: 28-354

పల్లవి: ఏల లోఁగేవు నీచేఁత నీకె యెరిఁగీనంటా
తాలిమిగల దాపెకు తగ నిన్నుఁబాయదు

చ. 1: చనవు సేసుక వచ్చి సతి నిన్నుఁ జెనకఁగా
పెనఁగి యేమిటికిఁ దప్పించుకొనేవు
కనుఁగొని యిట్టె నీ చక్కఁదనాలు వొగడఁగా
ననిచి సెలవులను నవ్వులేల నవ్వేవు

చ. 2: పలుమారు నీవున్న బాటులకు మెచ్చఁగాను
చెలఁగి నీవిందుకెంత సిగ్గువడేవు
మలసిమలసి నీతో మంచిమాట లాడఁగాను
తిలకించి చూచి పచ్చితిట్టు దిట్టనేఁటికి

చ. 3: కూరిమి నీ సుద్దులకు కుచ్చికాఁగిలించుకోఁగా
తారుకాణించుమనేల తలవంచేవు
యీరీతి శ్రీవేంకటేశ యీకే నిన్నుఁ బెండ్లాడె
గారవించి ఇపు డెంత కప్పర మిచ్చేవు

రేకు: 1861-3 లలిత సం: 28-355

పల్లవి: ఎంతేసి వేసాలు సేసీ నీతఁడు నేను
వింత వింత సుద్దులెల్లా వినరమ్మ చెలులు

చ. 1: మచ్చిక నా చూపులు మర్మములు గాఁడెనంటా
కొచ్చి కొచ్చి తనకొనగోర నూఁదీనే
కచ్చుపెట్టి నామాఁటలు కళలు రేఁగించెనంటా
కుచ్చితాన నందరిలో కొంగేల పట్టీనే

చ. 2: సెలవుల నా నవ్వులు సిగ్గులు వరచెనంటా
చలపాదితనమున చన్నులంటీనే
కలికి నాచేఁతలు కడు వలపించెనంటా
పెలుచు నామోవి యెంత పిప్పిసేసీనే

చ. 3: ఇట్టె నా చక్కఁదనము యెలయించెనంటాను
బట్టెగాఁ గాఁగిట సారె బిగించీనే
గుట్టుతోడ నారతులు గొనకొని మించెనంటా
వొట్టుక శ్రీవేంకటేశుఁ డోలలెట్టు వేసీనే

రేకు: 1861-4 కాంబోది సం: 28-356

పల్లవి: రమ్మనవే వొ చెలియా రమణుని మా యింటికి
కమ్మర నడుగనేల కాదనేనా నేను

చ. 1: కనుసన్నలనే వట్టికాఁక రేఁచవద్దుగాక
మనసారా మాటాడితే మంచిదే కదే
పెనఁగుచు నూరకే బిగియఁగవద్దుగాక
చనవిచ్చి మన్నించుటే సమ్మతౌనే కదవే

చ. 2: నాలిసేసి నాఁటకము నడపఁగవద్దుగాక
మేలము నాతో నాడితే మేలె కదే
వోలవేసి వలపించి వోరసేయవద్దుగాక
వేళతో వచ్చి కూడితే వేడుకే కదే

చ. 3: గుట్టుతోడ నెలయించి గోర సేయవద్దుగాక
యిట్టే వొద్దికై వుండితే నితవే కదే
చిట్టకము వద్దుగాక శ్రీవేంకటేశుఁడు నన్ను
నెట్టనఁ బెండ్లాడినాఁడు నేరుపిదౌఁగదవే

రేకు: 1861-5 మధ్యమావతి సం: 28-357

పల్లవి: ఎంతలేదు చుట్టరిక మెక్కడ చూచినా నీకు
మంతుకెక్కఁగ నామాఁట మన్నించి రావయా

చ. 1: విందుచెప్పి యాపె నీకు వేళగాచుక వుండఁగా
ఇందువచ్చి జూజాలు నీవేమాడేవు
పొందు లెన్నైనాఁ గలవు పూఁచి నివు వెదకితే
ఇందుముఖి యాన నీకు ఇట్టే లేచి రావయా

చ. 2: ఇంతి నీకుఁ బోఁకవట్టి యెదురెదురే చూడఁగ
పంతాన నిక్కడకు వచ్చి పాట వినేవు
వింతలైన వద్యలకు వేడకకాఁడ వౌదువు
దొంతుల నాకపై యాన తోయకిట్టె రావయా

చ. 3: వరుసకు వచ్చి యాపె వాకిట నిలుచుండఁగా
పొరుగువారితో నెంత పొద్దు సేసేవు
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వింటికి వచ్చి
తరుణిపై యాక లీక దాఁట కిట్టె రావయా

రేకు: 1861-6 బౌళి సం: 28-358

పల్లవి: ఈకెకు నీకును దగు యిన్నిటా నెంచి చూచితే
వాకుచ్చి యెంతని మిము వర్ణించవచ్చునయా

చ. 1: చెలి నీ గుణాలు విని చేతులెత్తి నీకు మొక్కె
అలరి నీ తోడి పొందు లాసగించెను
వలచి నీపేర లే వా(వ్రా?) యఁబూని సిగ్గువడి
కలికి సుద్దులు చెప్పఁ గతలాయనయ్యా

చ. 2: చక్కని నీమోము చూచె సతులతోడఁ బొగడె
అక్కరతో నాడనుండే యారతి యెత్తె
చొక్కి నీకుఁ గానుకియ్యఁ జూచి తనలోనే నవ్వె
మక్కువ చందమెంతని మరి చెప్పేమయ్యా

చ. 3: యింటికి నిన్ను రమ్మనె నింతలోనే కాఁగిలించె
జంటయై పానుపుమీఁద సరిఁ గూచుండె
వొంటి నీతో మాటలాడె నొద్దికై శ్రీవేంకటేశ
వింటిమి మీమచ్చికలు వేడుకాయనయ్యా

రేకు: 1862-1 దేశాక్షి సం: 28-359

పల్లవి: మగువకుఁ జనవిచ్చి మన్నింతువు గాక ఇఁక
మగిడి మగిడి యేమి మమ్మడిగేవయ్యా

చ. 1: యెలుత గుబ్బలు నీకు మీఁదెత్తుకవున్నది
పలచనిమోవి జన్నె వట్టుకున్నది
పలుకుఁదేనెలు నీకుపారము సేసుకున్నది
యెలమి నింకా సుద్దులు యేమడిగేవయ్యా

చ. 2: వుమ్మగిలి సింగారాలు వుడుపావట్టుకున్నది
తమ్మిమోము సూడిదెగా దాఁచుకున్నది
కమ్మిన మొక్కలు చేతఁ గానుకవట్టుకున్నది
ఇమ్ముల నింకా సుద్దులు యేమడిగేవయ్యా

చ. 3: నెట్టుకొన్న జవ్వనము నీసొమ్ము సేసుకున్నది
గుట్టున వలపు వొడిఁగట్టుకున్నది
నెట్టన శ్రీవేంకటేశ నీవె యీకెఁ గూడితివి
ఇట్టె యింకా సుద్దులు యేమడిగేవయ్యా

రేకు: 1862-2 ఆహిరి సం: 28-360

పల్లవి: నీవాపెకు వలచుట నే మెఱఁగమా
కైవసమై యివీఁ గొన్ని గడించేముగాక

చ. 1: వినుమని నీ కప్పుడే విన్నవించనానేను
వనిత తానే యీడ నచ్చునని
నినుఁబాసి మరి యాకె నిమిష మెరువఁగద్దా
మనసెరిఁగియు గుట్టు మానవైతివి గాక

చ. 2: హత్తి తారుకాణించనా ఆపె నీకు నేపొద్దూ
చిత్తమురా నూడిగాలు సేసునని
బత్తి నీపైఁ బెట్టినది పంతాలు నెరవునా
కొత్తరాజసము చూపి కొసరితివి గాక

చ. 3: సరుస దిష్టము చూపి సాకిరివెట్టనా నీకు
బెరసి నిన్నిట్టె యీకె పెండ్లాడునని
ఇరవై శ్రీవేంకటేశ యేలితి వీఁకఁ గొంకునా
సొరిది నాపె నేరుపు చూచితివి గాక

రేకు: 1862-3 రామక్రియ సం: 28-361

పల్లవి: చక్కని గుణవంతుఁడు సరి నీకు మగఁడాయ
యెక్కువైన నీభాగ్య మేమని చెప్పుదమే

చ. 1: నెలఁత నీ నోములు నేఁడె ఫలిఇంచెఁగదే
కలలు నీకిపుడె నిక్కలలాయెనే
పలికిన సగినాలు పతి వచ్చెఁగదవే
తలఁచఁగానే విభుఁడు తానే ఇందు వచ్చెను

చ. 2: తొల్లిటి మీ పూజలు తుదకెక్కెఁగదవే
యెల్లగా నీకోరికలు యీడేరెనే
చెల్లు బడి నీ పంతము చేకూడె గదవే
యిల్లిదివో నీరమణుఁ డెదుటనున్నాఁడు

చ. 3: నీ వెంచిన యెన్నికలు నెరవేరెఁగదవే
కావలసినవి తారుకాణలాయెనే
దేవుల వయితివి వావి దిష్టములాయఁ గదవే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరికూడినాఁడు

రేకు: 1862-4 గౌళ సం: 28-362

పల్లవి: నీ కొలఁదివారమా నేమెల్లాను
చేకొని పంతాలు మీతోఁ జెప్పకోముగాక

చ. 1: చుట్టమైన పతితోడ సొలతుము కాంతలము
గుట్టుతోనే జంకించి కొసరుదుము
అట్టె నీవంతటిలోనే యాతని దవులనంటా
బట్టబయలు నీవెంత పట్టిపెనఁగేవే

చ. 2: చనవుగ మగని సాదింతు మిల్లాండ్లము
నునుపునఁ గొనగోరు నాటింతుము
పనివడి నీవే కడు బత్తిగలదాననంటా
పొనుఁగ కాతని కెంత పూనుక వచ్చేవే

చ. 3: యేలిన శ్రీవేంకటేశు నెనతుము సతులము
కాలు దొక్కి రతులనుఁ గరఁగింతుము
మేలమాడి యాతనితో మేలుదాన నైతినంటా
చాలా నీవాతని కెంత చాయలు దిద్దేవే

రేకు: 1862-5 సామంతము సం: 28-363

పల్లవి: ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ
వింతలుగా నీకుఁగానే వెదకి తెచ్చితిని

చ. 1: అలివేణి జవరాలు అన్నిటానుఁ జక్కనిది
చిలుకపలుకుల దీ చెలియ
కలిగె నీకుఁ గన్నుల గలికి యీకె యొక్కతె
అలరి ఇట్టె పెండ్లి యాడుదువు రావయ్యా

చ. 2: యిందుముఖి కంబుకంటి యిన్నిటా నందమైనది
చందనగంది యీసకియ
పొందుగా దొరకె నీకు పువ్వుఁబోణి యొక్కతె
అంది యీకె నిట్టె పెండ్లి యాడుదువు రావయ్యా

చ. 3: జక్కవ చన్నులలేమ చక్కెదబొమ్మ బిత్తరి
చొక్కపు సింగారాల దీ సుదతి
దక్కె శ్రీవేంకటేశ యీతరణి నీకు నొకతె
అక్కరతో నిట్టె పెండ్లి యాడుదువు రావయ్యా

రేకు: 1862-6 ముఖారి సం: 28-364

పల్లవి: ఇందరిముందరా నీవు యెంత సేసేవు
కందువైన యేకతానఁ గరుణించరాదా

చ. 1: ముసి ముసి నవ్వులతో మోహన నుండినదాని
కొసరి కొసరి యేల కొంగువట్టేవు
కసుఁగాటు సిగ్గుతోటి కాంత నలయింతురా
యెసగి వొయ్యనే వీడెమిచ్చీఁగాక

చ. 2: చెక్కుల చెమటతోడ శిరసు వంచినదాని
కక్కసించి యిప్పుడేమి కాలు దొక్కేవు
పక్కనను గుట్టుతోడి భామను బట్టుసేతురా
గక్కనఁ దానే వూడిగము సేసీఁగాక

చ. 3: చనుఁగవ భారముతో సరసమాడేటి దాని
పెనఁగి కాఁగిట నెంత బిగియించేవు
ననిచి శ్రీవేంకటేశ నాతి నింత పైకొందురా
యెనసి రతుల నిన్ను నిఁ(విం?) కా మెప్పించీఁగాక

రేకు: 1863-1 దేశాక్షి సం: 28-365

పల్లవి: కూరిమి నీతోడిపొందే కోరుకున్నాఁడు
తారుకాణగా నాతనితలపీడేరించవే

చ. 1: జక్కవ చన్నులమీఁద సగినాలు చూచీఁ బతి
మొక్కుచుఁ బయ్యెద నేల మూసి దాఁచేవే
ఇక్కువఁ బలుకు చిల్క లేలుపురొప్పులు వినీ
మక్కువఁ గోమలి నీవు మాఁటలాడవే

చ. 2: కొప్పుఁదేఁటి నల్లఁబులుగులతీరు చూచీని
వొప్పగఁ జెలిమాఁటున నొదుగ నేలే
కప్పుకొని కనుపెంటిగరిమలే వెదకీని
యిప్పుడు నీమోము వంచ నిఁక నేఁటికే

చ. 3: మించు నడపు నెమళ్ల మెట్లు గతులు చూచీ
మంచి సు(శు?) భసూచనల మలయఁగదే
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
పొంచీ యెలుఁగుగొవిల పోచిళ్లు దెలుపవే

రేకు: 1863-2 బౌళి సం: 28-366

పల్లవి: నంటున నెవ్వతెతోనో నవ్వెనంటాను
జంటవాయ కెంతేసి సాదించేవే

చ. 1: చిగురువంటిది మోవి చిలుకపలుకు మాట
వెగటు లే కే లతని వెంగె మాడేవే
మొగము తమ్మివంటిది ముద్దుఁజెక్కు లద్దములు
అగడుసేసి నీవెంత అద్దలించేవే

చ. 2: కలువలే నీకన్నులు కారుమెరుఁగులే చూపు
చలపట్టి నీవెంత జంకించేవే
లలిఁ దీగెలు చేతులు లావణ్యము నీమేను
పెలుచు దనాన నెంత పెనఁగులాడేవే

చ. 3: పూవుఁబంతులు కన్నులు పులినాలు పిరుఁదులు
శ్రీవేంకటేశ్వరు నేమి చిమ్మిరేఁచేవే
వేవేగ నిన్నితఁడేలె వెలసె నీజవ్వనము
లావుగాఁ గాఁగిటు నెంత లంకించేవే

రేకు: 1863-3 రామక్రియ సం: 28-367

పల్లవి: నన్నుఁజూచి నాకు నాకే నవ్వు వచ్చీని
మిన్నక నాజవ్వనమే మేరలు మీరఁగను

చ. 1: వలచిన వలపులే వలలై తగులుకోఁగా
చెలుల దూరితే నేమి సేయఁగలవే
పలికిన పలుకులే బాసలై తొడరఁగాను
చలపట్టి బొమ్మలను జింకించఁబనేమే

చ. 2: కనుఁగొన చూపులే కడునాస పుట్టించఁగా
వెనక మరుని మీఁద వేసారనేలే
మనసు కొర్కెలే మర్మములు రేఁచఁగాను
పెనచి చెక్కిటఁ జేయిపెట్టఁగ మరేలే

చ. 3: కందువ చుట్టరికమే కాఁగిటఁగూరుచఁగా
సందడి సిగ్గులతోడ జరయనేలే
యిందుకే వచ్చి శ్రీవేంకటేశుఁ డిప్పడే నన్నేలె
అందుకోను సరసాల నంత యనఁగనేలే

రేకు: 1863-4 సాళంగవాట సం: 28-368

పల్లవి: మీకిద్దరికే తెలుసు మీలోని మర్మములు
పైకొని యెదురెదుర పచ్చిదేరీ సిగ్గులు

చ. 1: ముక్కల గదలఁగాను ముసి ముసీ నవ్వు నవ్వీ
చెక్కిటఁ జేయివెట్టుక చెలి నీతోను
యిక్కువలు గరఁగ నీ వేమంటివోకాని
పక్కన నడుగరాదు పచ్చిదేరీ సిగ్గులు

చ. 2: కంకణాలు గల్లనఁగా కాంత చేసన్నలు సేసీ
కుంకుమ చెమట కొనగోరఁ జిమ్ముతా
వుంకువ మీకెటువంటి వొడఁబాటులోకాని
పంకించక మీలోమీకు పచ్చిదేరీ సిగ్గులు

చ. 3: చిత్తము గరఁగఁగాను చేరి కాఁగిలించుకొని
గుత్తపు గుబ్బల నొత్తీ కొసరుకొంటా
పొత్తుల శ్రీవేంకటేశ పొందినరతు లెట్టివో
బత్తితో మీభావములఁ బచ్చిదేరీ సిగ్గులు

రేకు: 1863-5 శద్ధవసంతం సం: 28-369

పల్లవి: వింటివటే యీాతని వేసాల సుద్దులు నేఁడు
అంటే ననరాదుగాని ఆగడీఁడుగదవే

చ. 1: ఇంటికి వచ్చినాఁడు నా ఇచ్చలోనే వుండుఁగాక
నంటున వింతవారితో నవ్వఁగనేలే
జంటవాయుకున్నవాఁడు చనవెల్లా నిచ్చుఁగాక
వొంటి వేరొకతెఁ జూపి వొట్టువెట్టనేలే

చ. 2: మొగము చూచినవాఁడు ముచ్చటలాడుటగాక
తగ నచ్చుటిపొందీడఁ దలఁచనేలే
మిగులాఁ జుట్టపువాఁడు మేలువాడై యుండుఁగాక
జగములో నాకోరిక సరి యెంచనేలే

చ. 3: నాతో మాఁటాడినవాఁడు నన్ను నిట్టె యేలుఁగాక
యేతుల నాపెచే పంతమిప్పించనేలే
యీాతల శ్రీవేంకటేశుఁ డింత మన్నించినవాఁడు
చేతికి లోనవుఁగాక సిబ్బితి మరేలే

రేకు: 1863-6 శంకరాభరణం సం: 28-370

పల్లవి: సిగ్గువడీ సుమ్మీ చిన్నవయసుది
వొగ్గి సారె నెంత వొరసేవయ్యా

చ. 1: వలచి యేపొద్దు వద్దనున్నదంటా
చెలినేల కాకు సేసేవయ్యా
చెలిమి సేయఁగా చెమరించెనంటా
నలిరేఁగి యేమి నవ్వేవయ్యా

చ. 2: కనుఁగొని మతి గరఁగెనంటాను
చెనకేల గోరఁ జిమ్మేవయ్యా
వినయాన నిన్ను వేఁడుకొనెనంటా
గునిసి యేమాడుకొనేవయ్యా

చ. 3: కందువల నిన్నుఁ గాలు దొక్కెనంటా
చెంది యేమి సన్నసేసేవయ్యా
యిందుకె శ్రీవేంకటేశ కూడితివి
అంది మర్మమేల అంటేవయ్యా

రేకు: 1864-1 సాళంగనాట సం: 28-371

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నీతని ప్రతాపము
భూమిలో నారదాదులు పొగడే రీతనిని

చ. 1: పిడుగులు రాలఁజొచ్చె పెనుఁగంభము వగిలే
వెడలె నందులోల వీరసింహము
కడుపుచించి పేగులు గక్కన జంద్యాలువేసె
పడె హిరణ్యదైత్యుఁడు పగదీరె నదివో

చ. 2: ఘోర చక్రము గెరలె కోలువెల్ల బెదరెను
ఆరభటి గావించె నాదిసింహము
ధీరుఁడై నెత్తురు నలుదిక్కులకు వెదచల్లె
పారిరి రాకాసులెల్ల పగదీరె నదివో

చ. 3: సురలు జయవెట్టరి శుభములు భువి నిండె
తిరమాయ శ్రీవేంకటదేవ సింహము
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచె దాసుల రక్షించె
పరసేనలు సమసె పగదీరెనిదివో

రేకు: 1864-2 శంకరాభరణం సం: 28-372

పల్లవి: ఎంతనేరుపరి యీాలేమ
దొంతివెట్టె సంతోసముల

చ. 1: వెలఁది సెలవులను వెన్నెలగాసీ
చెలులు నీసుద్దులు చెప్పఁగను
తలపోఁతలనే దండలు గుచ్చీ
నెలకొని యెదుటను నీవుండగను

చ. 2: వనిత చెక్కులను వానలు గురిసీ
తనియని విరహపుఁ దమకమున
కనుచూపులనే కలువలు చల్లీ
నినుపుల వలపుల నీరాకలకు

చ. 3: తెఱవ పెదవులను తేనెలు చిందీ
మఱి నీవాడిన మాఁటలను
నెఱి శ్రీవేంకటనిలయ కూడితివి
జఱసీ నీతో జాణతనముల

రేకు: 1864-3 ఆహిరీనాట సం: 28-373

పల్లవి: కొత్త పెండ్లి కూఁతురువై కొంకుదేర వింతేకాకా
యిత్తల నీతోడివారి నిటు చూడవే

చ. 1: చనవిచ్చి రమణుఁడు సన్నలు నీకుఁ జేసితే
చెనకి యేమి చూపేవే చెలులకును
యెనసి యాతఁడు నీతో నేకాంతము లాడఁగాను
పెనఁగుచు నెంతేసి బెట్టిమాట లాడేవే

చ. 2: యిక్కువకు వీడె మాతఁ డెఱఁగనట్టె యంపఁగా
అక్కర నేఁటికిఁ జెప్పే వందరితోను
నిక్కి చూచి గుట్టుతోడ నిమ్మపంట వేయఁగాను
చక్కఁగా నందరి నేమి సాకిరి వెట్టేవే

చ. 3: మూసి దాఁపిరెము గాఁగ మోవి యాతఁ డడిగితే
రాసి కొలువులో నేల రవ్వసేసేవే
ఆసతో శ్రీవేంకటేశఁ డంతలోనే నిన్ను నేలె
సేసపాలు చల్లి యేల సిగ్గుపడేవే

రేకు: 1864-4 రామక్రియ సం: 28-374

పల్లవి: మఱి నేనే చెప్పేనంటే మందెమేళ మందురు
మెఱసెఁ దనగుణాలు మెచ్చితి నే ననవే

చ. 1: అతనిఁ గంటే చెలియ అడిగితిననవే
తతి దప్పకుండా తనుఁ దలఁతు నేననవే
మతిలోఁ దనపొందులు మరిగితి ననవే
చతురుఁ డీడకువచ్చి చనవు లిమ్మనవే

చ. 2: మొదలనే తనకు నే మొక్కిలి నే ననవే
పదివేలకుఁ దనపై బత్తి గలననవే
చెదరక తనమేలు చెప్పకొందు ననవే
కదిసి న న్నిందరిలోఁ గరుణించుమనవే

చ. 3: మిక్కిలిఁ దనకు నేను మేలు దాన ననవే
చక్కఁగాఁ దన రతులు సారె మెత్తుననవే
అక్కరో శ్రీవేంకటేశుఁ దంతలో దా వచ్చి కూడె
యిక్కడనే వుండి నన్ను నెడయకు మనవే

రేకు: 1864-5 హిందోళవసంతం సం: 28-375

పల్లవి: ఆఁటదాని వలపులు అంగడి కెక్కఁదగునా
నీటుతోనే పంతములు నెరపవలెఁగాక

చ. 1: ఆలు మగఁడును లోలో నట్టె మాఁటలాడుకోఁగా
ఆలించి యేమి వినేవే ఆసతో నీవు
చాలుకొని తమలోన సరసములాడఁగాను
తాలిమితో నీవెట్టు దండనే వుందానవే

చ. 2: మునుకొని వొండొదురు మొగములు చూచుకోఁగా
కనుఁగొని ఇఁకనేమి కత చెప్పేవే
చెనకుచు నిద్దరూను చే సన్నలు గావించఁగా
కొనకెక్క నీ వెంత కొలువు సేసేవే

చ. 3: ఆకెఁ దానూఁ గూడుకొని యట్టె తెరవేసుకోఁగా
సాకిరిదానవై యేమి నమ్మతించేవే
యీకడ శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడినాఁడు
చేకొని నన్నూ నేలె సిగ్గులేల పెంచేవే

రేకు: 1864-6 సాళంగం సం: 28-376

పల్లవి: ఎడమాఁట లిఁకనేల యెదుట నున్నాఁ డతఁడు
పిడికిటిసేస వెట్టి పిలువవే ఇంటికి

చ. 1: వినయాలే పచరించి వేడుకలు పుట్టించి
మనసురా నతనితో మాటలాడవే
చనవు సేసుక కడుసరసము లెల్లా నాడి
పెసఁగి పెనఁగి యిట్టె పిలువవే యింటికి

చ. 2: చల్లని చూపులఁ జూచి చక్కని మోము చూపి
వెల్లవిరిగా మొక్కి వీడెమియ్యవే
పుల్లము గరఁగ మేన పుదుటుగుబ్బల నూఁది
పెల్లునఁ బ్రియము చెప్పి పిలువవే ఇంటికి

చ. 3: చుట్టరికములు చెప్పి సొంపుగా నవ్వులు నవ్వి
గట్టిఁగా గొసరి యిచ్చకము చూపవే
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
పెట్టరాని యాన వెట్టి పిలువవే యింటికి

రేకు: 1865-1 ఆహిరి సం: 28-377

పల్లవి: అటువలెనైతే నాయాసలు నెరవేరును
తటుకన మమ్మిద్దరిఁ దగఁ బెండ్లి సేయరే

చ. 1: కనువిచ్చి చూచిచూచి కాఁకలఁ బౌరలరాదు
మనస్సుపెట్టి మరి మరవరాదు
తనువు సోఁకఁ జెనకి తమక మాఁపఁగరాదు
పెనఁగి యీతని నాకుఁ బెండ్లి సేయరే

చ. 2: తలపోసి తలపోసి తాలిమి గైకొనరాదు
వలపుల కొడిగట్టి వదలరాదు
సెలవుల నవ్వి కడుఁజింతలఁబౌరలరాదు
పిలిచి యీతని నాకుఁ బెండ్లిసేయరే

చ. 3: చేముట్టి చేముట్టి సన్న సేసిసేసి మానరాదు
వేమారు సరసమాడి వీఁగఁగ రాదు
కామించి నన్నేలినాఁ డిక్కడ శ్రీ వేంకటేశుఁడు
ప్రేమతో నీతని నాకుఁ బెండ్లిసేయరే

రేకు: 1865-2 సాళంగనాట సం: 28-378

పల్లవి: ఎంత లేదు నీ పగటు యేమి చెప్పేదే
రంతుగా మాఁటాడితేనే రతికి నెక్కితివా

చ. 1: కంకణాలచేత నీవు కైదండ ఇచ్చినంతలో
అంకెల నీ వీతనికి నాలవైతివా
కుంకుమ గుబ్బలు చూపి కొలువులు సేసితేనే
సంకె లేక నీవిప్పుడు చనవరివైతివా

చ. 2: సింగారించుకొని వచ్చి సెలవుల నవ్వితేనే
అంగజకేలికి నెక్కుడైనదానవా
సంగడిఁ గూచుండి నీవు సరసము లాడితేనే
సంగతెరిఁగిన యట్టి జాణవైతివా

చ. 3: చెక్కుల జవ్వాది గార సేసలు పైఁజల్లితేనే
మిక్కిలి దొరతనాన మేటివైతివా
యిక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
నిక్కి నిక్కి చూచితేనే నేరుపరివైతివా

రేకు: 1865-3 నాదరామక్రియ సం: 08-379

పల్లవి: కొత్త పెండ్లి కూఁతురవు కొమ్మ నీకు బుద్ధి చెప్పే
యిత్తల నామాఁట లివి యెప్పుడూఁదలఁచవే

చ. 1: చేరి చేరి చెనకితే చెలిమి మొగచాటౌను
సారెకుఁ గొసరితేను చవుకలౌను
మేరమీరి నవ్వితేను మిగులా వేసట పుట్టు
కూరిమిఁ బతి పొందులు గుట్టుతోనే సేయవే

చ. 2: సొలయఁగా సొలయఁగా సూటి పడదు నేరుపు
పలుమారు మాటాడితే పలచనౌను
పిలచి వూరకుండితే ప్రియములు జరగవు
కొలఁది యెరిఁగి పొందు గుట్టుతోనే సేయవే

చ. 3: వచ్చి వచ్చి తగులఁగా వలపు కొద్దీ నుండదు
పచ్చిదేరఁ గూడితేను బయలౌ సిగ్గు
యెచ్చరించి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను గూడె
కొచ్చిన రతుల పొందు గుట్టుతోనే సేయవే

రేకు: 1865-4 భైరవి సం: 28-380

పల్లవి: వినయమే నెరపితే వేడుక పుట్టీఁగాక
వనిత నీ వీతనితో వాసులెంచనేలే

చ. 1: తెగరాని యెడలకు తియ్యనిమాఁటలే మేలు
మొగమోట గలిగితే మొక్కులే మేలు
తగులు వాయునిచోట తామిలి చూపుటే మేలు
మగువ నీ వీతనితో మారుమలయనేలే

చ. 2: యెరవులేని పొందుల తియ్యకొనుటే మేలు
మరిగి పాయనివేళ మచ్చికే మేలు
విరసము లేకుండితే వినోదములే మేలు
తరుణి యీతనితో పంతాలు నీకు నేలే

చ. 3: కడు సిగ్గులెక్కుడైతే కందువ నవ్వులే మేలు
వుడివోనిరతులకు వొద్దికే మేలు
యెడయక శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నేలె
పడఁతి నీ వీతనితో పచారింపు లేలే

రేకు: 1865-5 ముఖారి సం: 28-381

పల్లవి: సిగ్గులనే పొరలీని చింత నొడిఁ గట్టుకొని
అగ్గలపు వినయాన నడుగరమ్మా

చ. 1: చెక్కులఁ జెమటలవె చిత్తము దెలియరాదు
ముక్కున నిట్టూర్పులవె ముచ్చటాడదు
పక్కనఁ దురుమువీడె కలమర్మము చెప్పదు
అక్కరతో సతికోర్కు లడుగరమ్మా

చ. 2: పులకలు మేన నవె పొందు లేమీఁ దెలుపదు
సెలవుల నవ్వుదేరీ చేఁత చూపదు
కళలు మోమున నవె కాననీదు తన గుట్టు
అలరి యింతికోరిక లడుగరమ్మా

చ. 3: నిండెఁ గన్నులఁ గెంపులు నెప మెరఁగఁనీదు
పండుమోవి గురుతదె భావించనీదు
మెండుగాఁగఁ దనుఁ గూడె మెచ్చి శ్రీవేంకటేశుఁడు
అండనే యీకె కోరికె లడుగరమ్మా

రేకు: 1865-6 వరాళి సం: 28-382

పల్లవి: తానెంత నేనెంత తగుల నేమాడీనే
తానకమయిన తన దయలోని దానవు

చ. 1: కందువ నాచూపులు కడు వాఁడులంటాను
యిందరితో సారె నీతఁ డేమిచెప్పీనే
పొందైన నాకొప్ప గడుఁబొడవాయనంటాను
చెంది నన్ను నెంత రట్టు సేసీనే తాను

చ. 2: కూరిమి నాచన్ను లివి కొండలఁబోలుసంటా
వూరకే నన్నేమిటికి నుప్పతించీనే
గారవపు నామేను బంగారు చాయలదంటా
ఆరితేరి నాకెంత పచ్చారీనే తాను

చ. 3: బలిమి నాపిఱుఁదులు బండికండ్లవంటి వంటా
పలుమారు నన్నేమి తప్పక చూచీనే
యెలమి శ్రీవెంకటేశుఁ డిందసేసి నన్నుఁగూడె
తలకొని యింకానెంత తమిరేఁచీనే

రేకు: 1866-1 మాళవిగౌళ సం: 28-383

పల్లవి: ఇన్నిటాఁ జక్కనిదేవు లిదివో నీకు దొరకె
చెన్నుమీర వేడుకతోఁ జిత్తగించవయ్యా

చ. 1: వలిపెపయ్యద లోని వలుదచనుగుబ్బలు
కలికి కాటుక సోగకన్నులసొంపు
తలకొన్న పూవులదండల నిలువుఁగొప్పు
చెలియ సొబగులెల్లాఁ జిత్తగించవయ్యా

చ. 2: కప్పురపు విడేలచేఁ గడునెఱ్ఱనగుమోవి
చిప్పిలుఁగళలచేఁ జెన్నగుమోము
అప్పళించిన జవ్వాది నలరిన చెక్కులును
చెప్పరా దీపెవొరపు చిత్తగించవయ్యా

చ. 3: బంగారు మొలనూళ్లతో బాగై యుండిన పిఱుఁదు
అంగమైన పాదములు హస్తములను
సింగారమయిన కొమ్మ శ్రీవేంకటేశ వురము –
చెంగట నీకున్న దిట్టె చిత్తగించవయ్యా

రేకు: 1866-2 ముఖారి సం: 28-384

పల్లవి: సేసవెట్టెను విభుఁడు సిగ్గులిఁక నేమిటికి
ఆసలాసల నోలలాడుచున్నాఁడు

చ. 1: పలుకఁగదె జవరాల పతితోడ నెదిరించి
చిలుకఁగదె చిరునవ్వు సెలవి నిండ
కులుకఁగదె నీ సొలపు కొసరుఁజూపులఁజూచి
కలయికకు నీవద్దఁ గాచుకున్నాఁడు

చ. 2: ఆడఁగదే వొకమాట ఆయములు గరఁగఁగ
పాడఁగదె నీయెలుఁగు పస దొలంక
కూడఁగదె సమరతుల గుచ్చి నీకాఁగిటను
వాడికల నీకుఁ గడు వలచివున్నాఁడు

చ. 3: కురియఁగదె ముద్దు లిటు కొదలేని కోరికల
మురియఁగదె మేనఁగలమురిపంబులు
యిరవై శ్రీవెంకటేశుఁ డిటు నిను నేలె
మరిగి నీమచ్చికల మలయుచున్నాఁడు

రేకు: 1866-3 పాడి సం: 28-385

పల్లవి: మిక్కిలి వేడుకయ్యీని మెచ్చుల నీకతలకు
చొక్కముగాఁ జెప్పవయ్య సొంపుగ వినేము

చ. 1: చెంత నీవు నిక్కమూఁ జేసితివో సేయవోకాని
వింతలైన సద్దులెల్లా వింటిమి నేము
అంతలోనె దోసముగా దందుకేమీఁ గొంచించక
సంతోసానఁ జెప్పవయ్య చల్లఁగా వినేము

చ. 2: కందువ నీవల్ల నవి కలవో లేవో కాని
చెంది నీ గుణములెల్లాఁ జెప్పిరి నేఁడు
అందరికిఁ గలచాలే అనుమానించఁగనేల
పొందుగానుఁ జెప్పవయ్య పొంచుక వినేము

చ. 3: వుమ్మడి నీ తలఁపున నున్నదో లేదోకాని
నెమ్మది నీ విద్య లెల్లా నెగడెనేఁడు
నమ్మి లచ్చి శ్రీవెంకటేశ నన్ను నిట్టె యేలితివి
సమ్మతిగాఁ జెప్పవయ్యా చక్కఁగా వినేము

రేకు: 1866-4 సౌరాష్ట్రం సం: 28-386

పల్లవి: ఎంతని విన్నవించేము యింతి నీపైఁగల బత్తి
చింతదీర నాదరించి సేవగొనరాదా

చ. 1: రెప్పలకొలఁదులాయ రేతిరెల్లా జాగరాలు
కుప్పలుఁదెప్పలు నాయ కోరికలు
చెప్పరాని తమితోడ చెక్కుచేతితో నున్నది
కప్పురగంది నిట్టె కరుణించరాదా

చ. 2: కొండలుఁ గోటులు నాయ గుబ్బతిలి వలపులు
దండిమూఁకలు గట్టెను తమకములు
నిండు నిధానమువలె నీ యెదుట నున్న దింతి
చండిసేయ కిఁకనైనాఁ జనవియ్యరాదా

చ. 3: వూర నూర నూఁటలాయ వుట్టిపడి మోవితేనె
తారుకాణలాయ లోలో తరితీపులు
యీరీతి శ్రీవేంకటేశ యింతలోనే కూడితివి
చేరి యీకె నిట్లానే చిత్తగించరాదా

రేకు: 1866-5 దేశాక్షి సం: 28-387

పల్లవి: ఈకెమీఁద బత్తిగలఁ డిప్పుడే మన్నించీఁగాక
చేకొని వోచెలులాల చెప్పరమ్మా

చ. 1: చెక్కుపై నున్నది చేయి చిత్తములోనిది నూయి
యెక్కడ వేగించునమ్మ యీకొమ్మ
ముక్కుపైఁ బెట్టెను వేలు ముంచెను చెమటజాలు
గక్కనఁ బతికిఁ జెప్పఁగదరమ్మా

చ. 2: వీడియు వీడని కొప్ప విరవేదనచొప్పు
యేడకేడ వోపునమ్మ యీకొమ్మ
వాడుదేరేఁ యెమ్మావి వచ్చెఁ గన్నులకుఁగావి
చెడెభావ మాతనికిఁ జెప్పరమ్మా

చ. 3: నీవి వదలిన జారు నివ్వెరగుమేనితీరు
యీవిధాన నున్నదమ్మ యీకొమ్మ
భావించి తాఁ గూడినాఁడు పంతముతో వచ్చి నేఁడు
శ్రీవేంకటేశుని కింకాఁ జెప్పరమ్మా

రేకు: 1866-6 శంకరాభరణం సం: 28-388

పల్లవి: ఎటువంటి సన్నలో ఇంతికి నీకు
తటుకన మీ పొందులు దాఁచనేఁటికయ్యా

చ. 1: తారుకాణగా నాపె తనమోము నీకుఁ జూపె
కూరిమితో నిందాఁకా నీ కొలువు సేసె
సారె సారెఁ గుంచె వేసి చన్నులనిన్నునొరసె
ఆరీతినే చనవిచ్చి యాదరించవయ్యా

చ. 2: మనసు గరఁగ నీతో మాఁటలన్నయు నాడె
వినయముతో నీకు వీడెమిచ్చెను
పెనఁగుతా నీచెక్కులు పెదవులు దాఁకించె
యెనసి యాపె కోరిక లీడేరించవయ్యా

చ. 3: పూసిక కమ్మఁబూఁత బగులుకోఁ గాఁగిలించె
సేసవెట్టి పెండ్లాడెఁ జేతులారాను
ఆసయిచ్చి నన్నేలితి వప్పటి శ్రీ వేంకటేశ
రాసికెక్క నీపె నిట్టె రతిఁగూడవయ్యా

రేకు: 1867-1 సామంతం సం: 28-389

పల్లవి: ఆఁటది మానావతి యాసోదకత్తె
మాఁటాడి మన్నించరాదా మరఁగేల నీకు

చ. 1: సొలసిసొలసి సారెఁ జూచీ నాకె నిన్ను
యెలమి నల్లంతనుండి యెంతపనికో
పిలిచి యుడుగరాదా ప్రియమున బుజ్జగించి
చెలఁగి పరాకేల సేసుకవున్నాఁడవు

చ. 2: సూటికిఁ జెలికి తనజాట్టలేలఁ జూపీ నిన్ను
గాటముగా నది యేమి కారణానకో
నీటుతోడఁ గొంగువట్టి నీవు దెలుపుకోరాదా
యేఁటికి మూసిదాఁచే విప్పుడు నీవు

చ. 3: వరుసగా వీణెలోన వాయించి పాడీ నిన్ను
సొరిది నీకెటువంటి చుట్టమైనదో
యిరవై శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితిమి
సరి నాపెఁ గూడరాదా జాగులేల సేసేవు

రేకు: 1867-2 రామక్రియ సం: 28-390

పల్లవి: ఏలే యింతపగటు యెరుఁగుకోవే నన్ను
మేలుదాన మోదలనే మిక్కిలి నీతనికి

చ. 1: ననుపుదానఁగనక నవ్వితి నాపతితోడ
కొనచూపుల నీవేమి కొచ్చి చూచేవే
చనవు నా కిచ్చినాఁడు సరసము నే నాడితి
పని గద్దా నీకేమైనా పంతాలు చూపేవు

చ. 2: చుట్టపు వరుసలను సుద్దు లడిగే నాతని
కట్టఁగడ నుండి యేల కాఁతాళించేవే
గుట్టుసేయ నిఁకనేల కూడును మాఇద్దరికి
బట్టబయ లీఁదఁగాను ప(ఫ?) లమేమి నీకు

చ. 3: వరుసఁ గూచుండి నేను సారెఁ బాదా లొత్తఁగాను
గరిమల నీవేల కాఁక రేఁగేవే
ఇరవై శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను ని (న?) న్ను నేలె
శిరసు వంచుక యెంత సిగ్గువడేలే

రేకు: 1867-3 లలిత సం: 28-391

పల్లవి: చిత్తము వచ్చినట్టల్లాఁ జేయరాదా నీవిఁక
కొత్త కొత్త నేరుపుల కొసరఁగనేఁటికి

చ. 1: వేడుక సింగారాలు వెలవెట్టవచ్చునా
పాడిపంతాలు చేతులఁ బట్టవచ్చునా
చూడఁజూడ చూపులకు సుంకము గొనవచ్చునా
ఆడనేల జాణతనా లాపెతోడ నీవు

చ. 2: పుప్పతిల్లుఁ దరితీపు లుట్టిఁబెట్టవచ్చునా
కప్పరపునవ్వు మోపు గట్టవచ్చునా
చెప్పరాని మాఁటలకు చెవు లొగ్గవచ్చునా
యిప్ప డిట్టె వొట్టువెట్టనేల చెలిని

చ. 3: పానుపుపై చేఁతలు బాయిట వేయవచ్చునా
తేనె మోవిలంకె వెడతెగవచ్చునా
పూని శ్రీవేంకటేశుఁడు పాలఁతి నేలితి విట్టె
పూని సన్నసేయనేల వొనగూడెఁ బనులు

రేకు: 1867-4 ఆహిరి సం: 28-392

పల్లవి: ఎలయింపుఁజేఁత లివి యెందాఁకానే
కలయికరతులఁ జొక్కంగఁ జేయఁగదవే

చ. 1: సన్నలనె పతితోడ సాములేమి సేసేవే
కన్నుల చూపుల నెంత కరఁగించేవే
చిన్ని పెదవుల మీఁది సిగ్గు లెంత చల్లేవే
పన్ని పానుపుపైనుండి పాదాలొత్తఁగదవే

చ. 2: బొమ్మలజంకెనలనే పొందులేల జరపేవే
కుమ్మరింపుఁజెనుటల గోరఁ జిమ్మేవే
నిమ్మపంటివాట్లను నేరుపెంత చూపేవే
యిమ్మలఁ గప్పురవిడె మిప్ప డియ్యఁగదవే

చ. 3: యెదరెదురనె సారె యేలాటా లేలాడేవే
ముదురుఁదమకమే మూసిదాఁచేవే
ఇదివో శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సదమదముగ సరసము లాడఁగదవే

రేకు: 1867-5 వరాళి సం: 28-393

పల్లవి: ఏలే జాణతనాలు యింతేసి నీకు
యేలేవాఁడవు నీవే యేమని చెప్పుదురా

చ. 1: సెలవుల నవ్వేవేమే చెలియా నీకె
సెలవుసుమీ యది చెప్పితి నేను
పలుకులు నేరుతువే పసలుగాను ఆ –
పలుకులు కర్పురపుబరణివే కదరా

చ. 2: మనసు దెలుపవే మగువా అవులే
మనసుద్దు లెల్లాను మరుఁడెఱుఁగు
మొనలుగాఁ బెంచితివేమే ముద్దులగోళ్లు
మొనలు చూడరా జాజిమొగ్గలలో నున్నవి

చ. 3: పేరు చెప్పఁగదవే పిన్నదానా పాలు
పేరుఁ దోడంటు వెట్టితే పెరుగువెలెనే
సారెసారెఁ బెనఁగేవే సమరతుల
సారెలు శ్రీవేంకటేశ చక్కఁగా నాడించరా

రేకు: 1867-6 భైరవి సం: 28-394

పల్లవి: సేయఁగలపని మరి చెప్పవుగాని
చాయలా సన్నలా సరసములాడవయ్యా

చ. 1: నెలఁత నెత్తములాడి నీవు రాఁగా సిగ్గుపడి
చెలిమాటున నున్నది చెక్కుచేతితో
కలికిఁ గాఁగిటఁబట్టి గక్కనఁ దోడితెచ్చి
యెలమి నాపెకు నీవు యెత్తు చెప్పవయ్యా

చ. 2: యింతి కిన్నెర వాయించి యిట్టె నిన్నుఁగని వేచి
చెంతనే నిలుచున్నది శిరసు వంచి
సంతోసాన నాపెఁ దెచ్చి సరుసఁ గూచుండఁ బెట్టి
పంతమెక్కించి వాయించి పాడించవయ్యా

చ. 3: భామ పరపుపైనుండి పక్కన నిన్ను జూచి
మోమెత్తి నవ్వులు నవ్వే ముదమలర
కామించి శ్రీవేంకటేశ కాఁగిలించి కూడితివి
చేముట్టి పవ్వళింపించి సేదదేరుచవయ్యా

రేకు: 1868-1 వరాళి సం: 28-395

పల్లవి: పొందుసేసి రతులను భోగించుటే మేలు
సందడెంటా బొమ్మలను జంకించనేఁటికి

చ. 1: నాము లెక్కి నీ సిగ్గు నవ్వులై వెడలఁజొచ్చె
మోమునఁ గళలై మించె మోహమెల్లాను
గోమునఁ బులకలై కోరికె లీరికెలెత్తె
కోమలి నీపతితోడ గుట్టు చూపనేఁటికే

చ. 2: చిత్తము నీరై కరఁగి చెమటలై వెళఁ (ళ్లఁ?) జొచ్చె
గుత్తపు వయసు చనుగుబ్బలాయను
మొత్తపుఁ దమకములు ముంగురులై పెనగొనె
హత్తిన అడియాసలు అడఁచుకోనేఁటికే

చ. 3: నెలకొన్న నీ వలపు నివ్వెరగులు గాఁజొచ్చె
లలి నీమదము కన్నులకుఁ గెంపాయ
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నినుఁగూడె
పలుకుఁ బంతము చెల్లె పరాకు లిఁకేఁటికే

రేకు: 1868-2 బౌళి సం: 28-396

పల్లవి: చూతము నీ నేరుపులు సుదతు లిందరిలోన
యేతులు నాతో నెంచనేఁటికే నీవు

చ. 1: నాతో విభుఁడు నవ్వితే నను నేల దూరేవు
ఆతనిదే యేమైనా నాడవే నీవు
యీతల నాకు వలచి ఇంటికిఁ బోకుండితేను
నీతు లేమైనాఁ గొన్ని నేరుపవే నీవు

చ. 2: చక్కఁగా నామాటకు జవదాఁటకుండితేను
చెక్కునొక్కి కొంత బుద్ధి చెప్పవే నీవు
మక్కువ నామీఁది బత్తి మరిగి పాయకుండితే
దిక్కుల నాతని వోజ దిద్దవే నీవు

చ. 3: ఇత్తల శ్రీవేంకటేశుఁ డేలె నీ కబ్బితే
చిత్తము గరఁగ సన్న సేయవే నీవు
హత్తి సేసవెట్టి పెండాడినాఁ డీఁతడు నేఁడు
కొత్త లేల యిఁక నియ్యకొనవే నీవు

రేకు: 1868-3 రామక్రియ సం: 28-397

పల్లవి: ఈకె నీకు వలచును ఇన్నిటా జాణవు నీవు
కైకొన్న మీవేడుకల కందువలే మంచివి

చ. 1: సలిగెగల సతులు జంకింతురు సొలతురు
యెలమిఁ బతికి నెగ్గు లెంచఁగరాదు
తలఁపులుఁ దలఁపులు తారుకాణలై యుండితే
మొలకనవ్వులతోడి మోనములే మంచివి

చ. 2: ప్రేమము గలుగువారు బిగుతురు గుంపింతురు
యేమైనా నందు కెగ్గు లెంచఁగరాదు
మోము మోముఁ జూచుకొంటే మొగమోట లుప్పతిలు
దీమసముతోడి తరితీపులే మంచివి

చ. 3: సంతమైన చుట్టములు సాదింతురు బోదింతురు
ఇతవులేకాని యెగ్గు లెంచఁగరాదు
తతితో శ్రీవేంకటేశ తరుణి నేలితి విట్టె
చతురత మీకు సరసములే మంచివి

రేకు: 1868-4 సామంతం సం: 28-398

పల్లవి: సేసితి నిప్పడే నేను సేయఁగలవిన్నపాలు
లాసి లాసియం(యెం?)తేసి వలపు చల్లీఁ దాను

చ. 1: చుట్టరికము దగిలి సుద్దు లేమి చెప్పీనే
పట్టి చూడనేలే చెక్కు పాలుగారీని
పెట్టకు మనవె యాన పిందెలు దిగేపొద్దు
నెట్టుకొన్న దొర తాను నే బాఁతే తనకు

చ. 2: నారుకొనీఁ బులకలు నవ్వు లేమి నవ్వీనే
సారె నంటనేలే కొప్పు మూరెడయ్యీని
గోర గీరవద్దనవే యేరులువారే కాలము
నేరుపరి తా నిన్నిటా నే బాఁతే తనకు

చ. 3: వుమ్మగిలీఁ దమకము వొరసి యేమి చూచీనే
దొమ్మిఁ జన్నులంటనేలే తుదకెక్కీని
నమ్మి కిమ్మనుమనవే ననిచి కూడేవేళ
నెమ్మి శ్రీవేంకటేశుఁడు బాఁతే తనకు

రేకు: 1868-5 నాదరామక్రియ సం: 28-399

పల్లవి: కాంతలలోనెల్లా యెట్టు కలికివైతివే నీవు
యెంతని పొగడవచ్చు నిటువంటి నిన్నును

చ. 1: మాటలాడి రమణుని మనసెంత గరఁచేవే
పాటలు వాడి యేల భ్రమయించేవే
సూటిగాఁ జూచిచూచి చొక్కుల నేమి వెట్టేవే
నీటున నీకత లెందు నేర్చుకొంటివే

చ. 2: అక్కరతో నవ్వు నవ్వి ఆసలెంత కొలిపేవే
చెక్కు గోరనూఁది యేల సిగ్గు రేఁచేవే
తక్కకు వద్దఁ గూచుండి తమి యెంత పుట్టించేవే
ఇక్కువ యీచేఁతలకు యెంత జాణవైతివే

చ. 3: సన్నలెల్లాఁ జేసి యెంత చాయకు దెచ్చుకొంటివే
చన్నుల నొరసి యేమి సాముసేసేవే
అన్నిటా నలమేల్మంగ వాతఁడు శ్రీవేంకటేశుఁ -
డెన్నికగాఁ బెండ్లాడితి వెంత వొసపరివే

రేకు: 1868-6 శంకారాభరణం సం: 28-400

పల్లవి: చూడరె చూడరె సుదతులాల యివి
వేడుక లీకెకు వేవేలాయా

చ. 1: చెలియకుఁ జెమటలు చెక్కులఁ గారీ
మలయుచు జవ్వనమదము వలె
కళలు మోమునకు కడుఁగడుఁ దొలఁకీ
తళుకుల మెఱుఁగుల తరచువలె

చ. 2: సవరని పులకలు సకియకుఁ బొడమీ
నవకపు జాజుల ననలవలె
తివురచుఁ గెంపులు దేరీ కన్నుల
కవ గూడిన చెంగలువలవలెను

చ. 3: ముక్కున నతివకు ముంచీ నూర్పులు
మిక్కుటమగు తెమ్మెరలవలె
చొక్కి శ్రీవేంకటేశుని యలమేల్మంగ
పక్కనఁ గూడెను భాగ్యము వలెను

రేకు: 1869-1 గౌళ సం: 28-401

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిదివో మీనేరుపులు
ఆముకొని చూచి చూచి అరుదయ్యీ నాకు

చ. 1: వలచివచ్చినరాక వాడికలు వుట్టించు
పిలిచి యిచ్చేవిడెము ప్రియమందించు
నిలిచి చూచిన చూపు నెమ్మనము నాటించు
బలిమి మొక్కిన మొక్కు పంత మీడేరించును

చ. 2: వినుకలి యెడమాట వేడుకలు గలిగించు
ననుపైన సరసము నవ్వింపించు
తనువు సోఁకిన పొందు తమకము గడురేఁడు
చెనకి చేసిన చేతఁ సిగ్గులు మీరించును

చ. 3: చేయారాఁ జేసిన సన్న చిత్తములు గరఁగించు
పాయరాని కూటములు బాస సేయించు
యీయెడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
మీయిద్దరి కూటములు మెచ్చి పొగడించును

రేకు: 1869-2 దేసాళం సం: 28-402

పల్లవి: వాఁడివో నీరమణుఁడు వచ్చివున్నాఁడు
వేఁడుకొని వినయాలు వేవేలుఁ జేయవే

చ. 1: మంచిమాట లాడితేనే మనుసులు గరఁగును
వంచనతో మొక్కితేనే వాడికి వుట్టు
ముంచి కాఁగిలించితేనే మొగమోట సతమౌను
యెంచి రమణునికి నీవిచ్చకమే సేయవే

చ. 2: కన్నులఁ జూచితేనే కలయఁగ బుద్దియౌను
సన్నలు సేసితేనే సమ్మతులౌను
చిన్ని నవ్వు నవ్వితేనే చిప్పిలుఁ దమకములు
ఇన్నిటాఁ బతికి నీవు ఇంపులే రేఁచవే

చ. 3: కైవసమై యుండితే కడఁగు జుట్టరికము
చేవదేరఁ బెనఁగితే చేఁత లీడేరు
యీవేళ నలమేల్మంగ విన్నిటాను నిన్ననేలె
శ్రీవేంకటేశుఁ డితఁడు సేవలెల్లాఁ జేయవే

రేకు: 1869-3 బౌళి సం: 28-403

పల్లవి: ఎంతని చెప్పేము నేము ఇవిగో మీగుణములు
ఇంతా నీ వెరిగినదే ఇంటికి రావయ్యా

చ. 1: రాసులౌను మీఁది మీఁది రచ్చలో మాప్రియములు
ఆసలు పుట్టించు వినయము లైతేను
నేసిన నేఁతలై మించు నెరజాణతనములు
యీ సుద్దల కోపితేను ఇంటికి రావయ్యా

చ. 2: పుట్టిపడుఁ దేనియలు పూరకే మామాటలు
చుట్టుకొను వలపులు చూడఁగానే
బట్టబయలీఁదించు పరగఁ జక్కఁదనాలు
ఇట్టె ఇంత కోపితేను ఇంటికి రావయ్యా

చ. 3: కురిఇంచు మదములు కూడిన మా కాఁగిళ్లు
గరిమలఁ దమిరేఁచు కనుసన్నలు
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యిరవైతి నోపితే నీవింటికి రావయ్యా

రేకు: 1869-4 శ్రీరాగం సం: 28-404

పల్లవి: ఇన్నాళ్లు నెఱఁగము ఇటువంటి సుద్దులు
కన్నుల పండుగఁ గాఁగ గనుఁగొంటి మిపుడు

చ. 1: వెలఁది నీసెలవుల వెన్నెల లెంత గాసీనే
పలచని మోవి యేల పచ్చిదేరీనే
నిలువు నివ్వెరగులు నీకెందుండి వచ్చెనే
తెలపి చెప్పవే మాకు తేటతెల్లమిగను

చ. 2: తొయ్యలి నీ నొసలిపై తుమ్మిదలేల మూఁగీనే
నెయ్యపుఁగన్నులఁ దొట్టె నిద్దులయేలే
చయ్యనఁ జన్నుల నిండె చందమామపిల్లలేలే
వొయ్యనే యెరిఁగించవే వొప్పుగా నీకతలు

చ. 3: వనిత నీ చెంపలకు వానలెందుండి వచ్చెనే
తనువుపై హారాలేల తడఁబడీనే
యెనసెనో శ్రీవేంకటేశు నలమేల్మంగవు
మనసారా నానతీవే మగువ నీ పొందులు

రేకు: 1869-5 పాడి సం: 28-405

పల్లవి: కంటిలేవే నీసుద్దు లిక్కడ నమ్మతోఁ జెప్పేను
వెంట వచ్చినదానను వెస నన్నెఱఁగవా

చ. 1: యెడమాఁట లాడవచ్చి యేల సిగ్గులు వడేవే
నడుమ నూరక యేల నవ్వు నవ్వేవే
చిడుమూడి నటనతో శిరసు వంచనేఁటికే
తొడరి పొందులు సేసే దూతికవు నీవు

చ. 2: చన్నులమీఁది పయ్యెద జారనేల తోసేవే
సన్నలనే మోవితేనె చల్లనేఁటికే
కన్ను లారుచుకొంటాను కతలేమి చెప్పేవే
పన్నిన రాయభారపు పడఁతివి నీవు

చ. 3: నిలుచుండి నీకు నీకే నివ్వెరగులే లయ్యేవే
చెలరేఁగి మేనేల చెమరించేవే
అలమేలుమంగ నేలె నప్పుడే శ్రీ వేంకటేశుఁ –
డెలమిఁ జెలికత్తెవు మేలంటి వే (టే?) నీవు

రేకు: 1869-6 హిందోళ వసంతం సం: 28-406

పల్లవి: ఇంతి నేరుపులు నీతో నెంతని చెప్పఁగవచ్చు
వింతలెల్లాఁ జూతువు వేగమె రావయ్యా

చ. 1: చిమ్మిరేఁగే వలపులు చెలియ గాదెలఁబోసె
వుమ్మగిలుఁ దమకము నొడిఁగట్టెను
కుమ్మరింపుఁ గోరికలు కూడబెట్టుకొని నిన్ను
రమ్మని పిలువనంపె రామయ్య ఇఁకను

చ. 2: గుదికొన్న విరహము కుప్పలుగా వేసుకొనె
ముదురుఁ దలపోఁతలు మూటగట్టెను
పొదలుఁ జుట్టరికాలు పుక్కెట నించుకొనె
యెదురు చూచీ నీకు నిట్టె రావయ్యా

చ. 3: కడలేని యాసలఁ గంకణము గట్టుకొనె
సుడిగొన్న వావులకుఁ జోటిచ్చెను
అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగనేలితి –
వెడయక రావయ్య ఇట్టె దినదినము

రేకు: 1870-1 శ్రీరాగం సం: 28-407

పల్లవి: అలమేలుమంగపతి వన్నిటా నెరజాణవు
చెలరేఁగి చూడవయ్య చేతులెత్తి మొక్కేను

చ. 1: వాడలోన నిన్నుఁ బాసి వలపు నిలుపరాక
ఆడరానిమాట లెల్లా నాడితి నిన్ను
పాడిపంతాలు నెరపఁబనిలేదు ఇంత నువు
యీడుజోడై యేలవయ్యా ఇంతి నింతే నేను

చ. 2: పాయము దానఁగనక పక్కనుండి వేడుకకు
సేయరాని చేఁతలెల్లాఁ జేసితి నేను
నాయము లెంచఁగఁబోతే నగుఁబాట్లిందరిలో
యీయెడ మన్నించవయ్యా ఇంతి నింతే నేను

చ. 3: నివ్వటిల్లు నాసతోడ నీమీఁది బత్తిఁజేసి
నవ్వఁగలరీతినెల్లా నవ్వతి నేను
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ గూడితివి
యివ్వలఁ బాయకువయ్యా యింతి నింతే నేను

రేకు: 1870-2 కేదారగౌళ సం: 28-408

పల్లవి: ఇంతులకుఁ బతులకే ఇరవైనది వలపు
సంతతపు వేడుకలఁ జవులైన వలపు

చ. 1: జోకతోడ నిట్టినది చూపఁగరాదు వలపు
వాకుచ్చి చెప్పఁగరాదు వలపు
దాకొని ఇట్టిరూపని తలఁచరాదు వలపు
యేకడ నెవ్వరికిని యెంచరాదు వలపు

చ. 2: యెదుట నున్నట్టె వుండు యెఱఁగరాదు వలపు
వదలించి తియ్యరాదు వలపు
గుదిగొని మదిలోన కుచ్చుకవుండు వలపు
సదరాన నేరుపరచఁగరాదు వలపు

చ. 3: పెంచఁబెంచ నెంతైనాఁ బెరుగుచుండు వలపు
వంచించి పొలుగనీఁదు వలపు
అంచెల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁగూడె
పంచసాయకుని రాజ్యపదవి యీవలపు

రేకు: 1870-3 పాడి సం: 28-409

పల్లవి: పెండిలాడేనని పోఁకవెట్టినాఁడు మొదలనే
అండనుండి యెచ్చరించరమ్మ సారెఁ జెలులు

చ. 1: అంగనకొప్పు చీఁకటి యమాస వెనక నదె
చెంగటికి నెప్పుడు వచ్చినే విభుఁడు
చంగన విరహపువేసవికాల మరె వచ్చె
రంగుగ జాగుసేయక రమ్మనవే యిఁకను

చ. 2: నెలఁతమోముకళల నిండుఁ బున్నమ యెదిరె
మెలఁగుచుఁ గాముని నోమేదెపుడే
అలరి నిట్టూరుపుల ఆయిటి విసరఁజొచ్చె
వెలయఁ దనవలపు వెదవెట్టుమనవే

చ. 3: సతిపిరుఁదుల రథసప్తమి నేఁడె కలిగె
తతి శ్రీవేంకటేశుఁడు తగిలెఁగదె
రతి కలమేలుమంగ రప్పించెను తను నీకె
మితిమీరఁ గూడె నిట్టె మెప్పించుమనవే

రేకు: 1870-4 సామంతం సం: 28-410

పల్లవి: కంటిమి నీ వేడుకలు కాదనేనా నే నిన్ను
యింటివద్ద నుంచుకొని యేలుకొనవయ్యా

చ. 1: కన్నులఁ జూచినప్పడే కాంతపై నాసలురేఁగె
యెన్నికలు మూసిదాఁచ నిఁక నేలయ్యా
చన్నుల నొరసుకొంటా సంగడికి వచ్చినాకె
నన్నుఁ జూచి వలపెంత నానఁబెట్టేవయ్యా

చ. 2: మాటలాడినప్పడే మనసాకెపైఁబారె
యేఁటికి సిగ్గులువడే విది యేమయ్యా
గాఁటపు గోళ్లు సోఁక కానుక దానికిచ్చె
నాఁటకుఁడ నాతో నెంత నవ్వ నవ్వేవయ్యా

చ. 3: యేకతమైనప్పడే యీకెకే నీకుఁ బొందాయ
యీకడనేల కొంకేవు యిందుకేమయ్యా
కైకొని యలమేలుమంగను నన్ను నేలితివి
నాకెంత శ్రీవేంకటేశ నమ్మి కిచ్చేవయ్యా

రేకు: 1870-5 సాళంగనాట సం: 28-411

పల్లవి: అని వేంకటేశుఁ డాడె నలమేలుమంగతోడ
వినరే వోచెలులా వేమారు నీరీతుల

చ. 1: తప్పక చూచితే నేమే తరగీనా నీ పంతము
కప్పనేలే నీ చన్నులు గరివడీనా
చెప్పవే నీపేరు మోవి చిల్లులువో నింతలోనే
యిప్పుడు నన్నింతసేసి యేమిగట్టుకొనేవే

చ. 2: వద్దఁ గూచుండితే నేమే వాసి ముక్కవోయీనా
గద్దించే వింతలోఁ గండ గట్టుకొంటివా
పొద్దువోదు నవ్వఁగదే పోదు నీ బీరమెంతైనా
యిద్దెస నన్నింతసేసి యేమి గట్టుకొనేవే

చ. 3: సేవలు సేసితే నేమే సిగ్గులు నీకు ముంచీనా
దేవులవైతివి వావి తిరమాయను
నీ వలమేలుమంగవు నేను శ్రీవేంకటేశుఁడ
యీవల నన్నింతసేసి యేమి గట్టుకొనేవే

రేకు: 1870-6 వరాళి సం: 28-412

పల్లవి: నవ్వేవారి నెఱఁగవు నడుమ నీవు
రవ్వ సేసుకొనకువే రమణులలోనను

చ. 1: చనువు గలితేఁ బతిసరుసఁ గూచుండవే
ఘనముగా మన్నించితే కాలు దొక్కవే
పెనఁగులాడ నొపితే పిరిదూరి చెనకవే
యెనసి యాతోనేల యీడు వెట్టుకొనేవు

చ. 2: వయసు మిక్కుటమైతే వడిగాఁ గొసరవే
నయగారాలు నేర్చితే నమ్మించేకోవే
ప్రియము నీకైతేను పెదవి తేనె లానవే
నియతాన మాతోపొత్తు వీవేల కలసేవు

చ. 3: వలచితే నాతనికి వావిచెప్పి వేఁడుకోవే
కలయ వేడుకైతే గక్కన మొక్కవే
అలమేలుమంగను నే నతఁడు శ్రీవేంకటేశుఁ
డెలమి నన్నేలె నిఁక నిచ్చకమేమాడేవు

రేకు: 1871-1 శుద్ధవసంతం సం: 28-413

పల్లవి: సరిబేసులాయను మీసరసము నిద్దరికి
మెరసిన మీచేతుఁలు మెచ్చితి మిందరము

చ. 1: చెలి నీయెదుట నుండి సేసిన చేసన్నలకు
అలరులదండ వేసి తాకె మీఁదను
సొలసి కమ్మటి నిన్ను సోఁకగఁజూచినందుకు
తలకొని మర్మములు దగుల నాడితివి

చ. 2: ఆపె నీకు మొక్కు మొక్కి యాసలు రేఁచినందుకు
తీపులమోవి చూపి తేలించితివి
రాపున నిన్నుంటఁబట్టి రతికిఁ దీసినందుకు
యేపునఁ జనవిచ్చి నీవిట్టె ఇయ్యకొంటివి

చ. 3: మరిగించుక నిన్నాపె మతి చొక్కించినందుకు
బెరసి నీవురముఁ బెట్టుకొంటివి
యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సరుగనఁ గూడి సంతోసములు నించితివి

రేకు: 1871-2 ముఖారి సం: 28-414
పల్లవి: ఇందుకు మెచ్చవద్దా యీపెను నీవు
కందువ సేవలు సేసీ కరఁచీ నీ మనసు
చ. 1: కలికి చేఁతలు సేసి కప్పురము మోవిఁ జూపి
బిలిచీ సన్నల నాకెఁ (కె?) బ్రే (ప్రే) మతో నిన్ను
మొలక నవ్వులు నవ్వి మొగము దప్పక చూచి
తలఁపించీఁ దనపొందు తమ్మిపూవాట్ల
చ. 2: కతకారిమాట లాడి కానుకలు చేతికిచ్చి
రతికి నాసలురేఁచీ రచ్చలో నిన్ను
చతురతలఁ జెనకి చవులు నీకుఁ బుట్టించి
అతిమోహము దెలిపీ నంగపు సోఁకులను
చ. 3: సరుసనే కూచుండి జమళిఁ జన్నుల నూఁది
తరితీపులెల్లాఁ జేసి తగిలీ నిన్ను
ఇరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సరిఁగూడి బుజ్జగించీ చల్లువలపులను

రేకు: 1871-3 వరాళి సం: 28-415

పల్లవి: చూతము మనమూరకె చుట్టపువరుసలను
కాతరించి తముఁదామె కలసేరుగాక

చ. 1: కామించి వచ్చినకాంత కాఁతాళించి రమణుని
యేమేమి సేసినాను యెగ్గులయ్యీనా
ఆముక ఇందుకు మన మడ్డాలు చెప్పఁగనేల
తాముఁదామే తెలిసి సంతములయ్యేరుగాక

చ. 2: గాఁటమైన విరహిణి కాఁకల కోరువలేక
మాఁటలెన్ని యాడినాను మానీనా పొందు
యీాటైన సవతులము ఇట్టె బుద్ధి చెప్పనేల
పాటించి మొగమోటానఁ బైకొనేరుగాక

చ. 3: వాడికైన యాసతోడ వరుసకు వచ్చినది
వేడకకెంత నవ్వనానే (ను?) వేసటయ్యీనా
యీాడనె శ్రీవేంకటేశుఁ డేలె మనల నిందరి
జోడుగూడి యీాపెఁ దానూఁ జొక్కేరు గాక

రేకు: 1871-4 కాంబోతి సం: 28-416

పల్లవి: మునుపఁ బదరితేను వెనక వేఁడుకోవలె
ఘనుఁ డేమి సేసినానుఁ గైకొనుటే మేలు

చ. 1: కొలువు సతులతోడ కొచ్చికొచ్చి నవ్వెనంటా
చలపట్టి పతి నెంత సాదించేవే
అలరి నాటకసాల యాలలు చూచెనంటా
వెలయ నేఁ డెంతలేసి వెంగే లాడేవే

చ. 2: యెరవుల కాంతలను యింటికిఁ దెచ్చెనంటాను
సరికి బేసికి నెంత జంకించేవే
పొరుగిరుగులవారి పొందులు మరిగెనంటా
పురిగొన నిమ్మపంటఁ బూఁచి యేల వేసేవే

చ. 3: వూడిగాల చెలులతో వొంటిమాటలాడెనంటా
వాడలోన నేఁటికి రవ్వలు సేసేవే
యీడనె శ్రీవేంకటేశఁ గింతలోనే నిన్నుఁ గూడె
జాడతో నీతని నేమి సంతోసించేవే

రేకు: 1871-5 మధ్యమావతి సం: 28-417

పల్లవి: ఎంత మన్నించితివో యీకెను నీవు
వింతలెల్లా నీ ముందర వెదచల్లీ నిపుడు

చ. 1: వనిత నీపైఁ జూపీ వాడికలు
వినవయ్యా విన్నపాలు వేడికలు
అనిశముఁ జెలులతో నాడికలు
వెనక చూడవయ్యా వేనలి వీడికలు

చ. 2: వెలఁది పయ్యెదకొంగు విసరులు
కులుకు నవ్వులలోని కొసరులు
కలికి సిగ్గులలోని కసరులు
తెలుసుకోవయ్యా తరితీపుల యసరులు

చ. 3: సుదతి నీపైఁ జల్లిన సొలపులు
అదన నిన్నుఁ గూడిన యలపులు
వదలని కాఁగిళ్ల వలపులు
యిదె శ్రీవేంకటేశ మీయిచ్చయ్యా గెలుపులు

రేకు: 1871-6 నాదరామక్రియ సం: 28-418

పల్లవి: చెప్పితి బద్దలు నేను చెలియ నీకు
యెప్పుడూ మఱవకువే యెడయదు మనసు

చ. 1: పంతమాడవచ్చునా పడఁతికి మగనితో
చెంతనుండి యిచ్చకమే సేయుటగాక
యెంత గోరనూదినాను యియ్యకోలే సేసుకొని
వింత సేయకుండితేను వేడుక లీడేరును

చ. 2: జంకించ వచ్చునా సరసము లాడే చోట
సంకెలేక వలపులు చల్లుటగాక
పంకించక చనుఁగవ పట్టి యెంత దీసినా
పొంకముగ నవ్వితేనే పొందులు చేకూరును

చ. 3: సిగ్గువడవచ్చునా చేరి కాఁగిలించుకొంటే
వొగ్గి రతులకు లోనైవుండుటగాక
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలయఁగ నిన్నుఁగూడె
వెగ్గళించకుండితేనే వెలయు సోబనము

రేకు: 1872-1 దేవగాంధారి సం: 28-419

పల్లవి: అమరెఁ గదె నేఁ డన్నిసొబగులును
సమరతి చిన్నలు సతి నీమేనా

చ. 1: చెలపల చెమటలు చెక్కిళ్ల
మొలకల నవ్వులు మొక్కిళ్ల
సొలపుల వేడుకలు చొక్కిళ్లు
తొలఁగని యాసలు తొక్కిళ్లా

చ. 2: నెఱవగు చూపులు నిక్కళ్ల
మెఱసెను తమకము మిక్కిళ్ల
గుఱుతగు నధరము గుక్కిళ్ల
తఱచగు వలపులు దక్కిళ్లా

చ. 3: నును గోరికొనలు నొక్కిళ్ల
పొనుఁగని తములము పుక్కిళ్ల
ఘనుఁడగు శ్రీవేంకటపతికాఁగిట
యెనసెను పంతము లెక్కిళ్లా

రేకు: 1872-2 తెలుఁగుఁగాంబోది సం: 28-420

పల్లవి: అందులకే వెరగయ్యీ నప్పటనుండి నాకు
కందువ నెన్నాళ్లనుండి కాచుకవున్నదియో

చ. 1: కొత్త కొత్త మాఁట లాడీ కొమలి నీ తోడుత
యిత్తల వావిని నీకు నీమౌనోకాని
హత్తి కొలువులు సేసీ నప్పటి వేడుకతోడ
బత్తి నీపై నెంతగద్దో భావించితేఁ దనకు

చ. 2: సొలసి సొలసి నిన్నుఁ జూచీని పలుమారు
పొలుపుగ నేనాఁటిపొందుగాని
చెలరేఁగి సేయరాని సేవలెల్లాఁ జేసీ నీకు
కొలఁదిమీర నిన్నేమి గోరీనో తాను

చ. 3: నవ్వి నవ్వి మేలమాడీ ననుపున నీతోను
నివ్వటిల్లఁ దనయాస నీపై నెంతో
యివ్వల శ్రీవేంకటేశ యేలితిని నన్ను నేఁడు
రవ్వగాఁ దాఁ గాఁగిలించి రతికెక్కె నిపుడు

రేకు: 1872-3 భైరవి సం: 28-421
పల్లవి: చెలులముందర నింత సేసేవుగాక
వలపు లోడిఁగట్టుక వట్టి బీరమేఁటికే
చ. 1: చేరఁడేసి కన్నుల చెలియవు మొదలనె
వూర కాతనిఁ జూడ కెట్టుండఁగలవే
మూరెఁడు దురుముతోడ మురిసేటిదానవు
యీరీతిఁ జెలిమాఁటున నెట్టు దాఁగేవే
చ. 2: పట్టెఁడేసి గుబ్బల పంతగత్తె విటమీఁద
గుట్టుతోడ నెటువలె గుబ్బతిలేవే
వొట్టిన జవ్వనమున నువ్విళ్లూరేదానవు
దట్టపు టాసల నెట్టు తప్పఁదోసేవే
చ. 3: సెలవి నవ్వులతోడఁ జిప్పిలేటిదానవు
వులివచ్చి సిగ్గుల నెట్టోలలాడేవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నుఁగూడె
తలపోఁగరతి నెట్టు తనియకుండేవే

రేకు: 1872-4 దేసాళం సం: 28-422

పల్లవి: నా యంతటిదానవా నడుమ నీవు
ఆయలేవే యేమిచెప్పే వారడి నీ సుద్దులు

చ. 1: మక్కువలు వెదచల్లి మాఁటలనే కరఁగించి
దక్కఁగొంటివే పతిని తరుణి నీవు
పక్కన నేనైతేను పాదరము తొక్కుడులనే
చొక్కించి నాయింటికిఁ దెచ్చుకొంటి నే నితని

చ. 2: సరసములాడి మోవిచవులు చూపి చూపి
మరిగించుకొంటివౌనే మగని నీవు
సొరిది నేనైతేఁ గనుచూపులనే యెలయించి
తరితీపులఁబెట్టి పంత మిప్పించుకొంటిని

చ. 3: వూరకే చన్నుల నొత్తి వొడిఁగట్టి వలపులు
కూరిమి రతికిఁ దెచ్చుకొంటిని(వి?) తని
గారవించి నేనైతే కాఁగిటిలో సన్నలనే
చేరి యిట్టే పెండ్లాడితి శ్రీవేంకటేశ్వరుని

రేకు: 1872-5 మాళవిగౌళ సం: 28-423

పల్లవి: అతనికి నాకు నైతే నమరుఁగాక
రతికెక్కఁ బాయపువారము మమ్ముఁ జూడవే

చ. 1: పొలఁతి నీవురమునఁ బోఁకలంతలే చన్నులు
యెలమి నాతనితోడ నెమినవ్వేవే
వులివచ్చి సిగ్గులెల్లా నొడిఁగట్టుకుందానవు
సొలసి సొలసి యేమి చూచేవే నీవు

చ. 2: నిన్ననే కన్నెవు మరి నేఁడే జవ్వనివైతివి
యెన్నేసి మాఁట లాడేవే యీతనితోడి
వెన్నవంటిది మనసు వేళమే కరఁగు నీకు
సన్నలా చాయలా నెంత సరసమాడేవే

చ. 3: దొండపండు నీమోవి తొడమ యింకాఁబచ్చన
అండనుండి నీకెం(వెం?) త ఆసచూపేవే
దండిగా నన్నేలినాఁడు తానే శ్రీవేంకటేశుఁడు
మెండుగాఁ జెనకే వెంత మేలుదానవే

రేకు: 1872-6 ముఖారి సం: 28-424

పల్లవి: చిన్నదాన నంటాను సిగ్గులేల పెంచేవు
మన్నించె నితఁడు మఱఁగేల యిఁకను

చ. 1: చక్కర పెదవులతో సకియ మాఁటాడవే
నెక్కొని సుద్దు లడిగీ నీ రమణుఁడు
జక్కవ చన్నులదాన సంగడిఁ గూచుండవే
అక్కరతోఁ గాఁగిటికి నంగవించీ నతఁడు

చ. 2: కలువకన్నుల యమ్మ కాంతునిదిక్కు చూడవే
అలరుచు నీకు మొగమై యున్నాఁడు
సెలవి నవ్వుల చెలి చేరి సరసమాడవే
కలసేనంటా నీవేళ గాచుకున్నాఁడు

చ. 3: కనకపు బొమ్మ శ్రీవేంకటేశుఁ గాఁగిలించవే
మనసు నీకే మీఁదెత్తి మరిగేఁదాను
ననిచి తమ్మిచేతుల నాతి విడెమియ్యవే
వొనరి నీరతులలో నోలలాడీ నిపుడు

రేకు: 1873-1 నాళంగనాట సం: 28-425

పల్లవి: కంటివిగా వోయి యీాకె గర్వమెల్లాను
యింటఁ బెట్టుకొని యాపె కింతేసి నేర్పితివి

చ. 1: వంచెనలు సేసుకొంటా వలపులు చల్లుకొంటా
మంచముపై నాపె నీతో మాటలాడీని
లంచముగా మోపి చూపి లావునఁ గాఁగిటఁ బట్టి
యెంచరాని వేడుకల నెంతవొరలీని

చ. 2: విడెపు సెలవులతో వికవికనవ్వుకొంటా
తొడపైఁ దొడ వేసుక దువ్వీఁగొప్ప
వెడఁగు గుబ్బల నొత్తి వింత చేఁతలెల్లాఁ జేసి
బడివాయ కెమ్మె లెంత పచారించీని

చ. 3: ఇక్కువ లంటుకొంటాను ఇచ్చకాలు నెరపుతా
చెక్కుఁజెక్కు మోవ నెంత సేవసేసీని
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్నునేఁడు
మిక్కిలి తా నెంత నీతో మేలమాడీని

రేకు: 1873-2 గౌళ సం: 28-426

పల్లవి: కాఁగల మేలెల్లా నేఁడే కలిగీఁగాన
మాఁగిన మోవుల మీరు మచ్చికఁ బొగడరే

చ. 1: చిత్తమే చిమ్మిరేఁగితే చెలువుఁ డేమిసేసునే
హత్తి మీరు కెరడము లాడేరుగాక
బత్తి నేఁ జేసినదే పైకొని యలయించఁగా
కొత్తలుగాఁ జందమామఁ గొసరఁగ నేఁటికే

చ. 2: జవ్వనమే తరవైతే సకు లేమిసేతురే
ఇవ్వల మీరేల నేరాలెంచుకొనేరే
నవ్విన నానవ్వులే నన్నుఁ బెనఁగించఁగాను
పువ్వు వంటి మరునిఁ దప్పులు వట్టనేఁటికే

చ. 3: చుట్టరికమే మించితే చూచి నే నేమిసేతునే
గుట్టుతోడనే ఇయ్యకొనఁదగును
ఇట్టె శ్రీవేంకటేశుఁ డేలి నన్ను మన్నించఁగా
చుట్టి నానోము ఫలము సాదించ నేఁటికే

రేకు: 1873-3 పాడి సం: 28-427

పల్లవి: చేఁత యేన్నేసి సేసీని చిన్నది తాను
లేఁత నవ్వులనే పొదలించీ వలపులు

చ. 1: పొలఁతి కెవ్వరు తొల్లి బుద్దులు చెప్పిరోకాని
సొలసిసొలసి నిన్నుఁజూచీని
కలికి తనాలు యెంతగా నేరిచెనోకాని
చెలరేఁగి నీమీఁదఁ జేతులు చాఁచీని

చ. 2: వినయాలెల్లా నీపెకు వెన్నతోఁబెట్టిరోకాని
గనముగా సారెసారెఁ గడు మొక్కీని
మనసులో నెటువంటి మర్మము గనెనోకాని
కొన చన్నుల నొరసి కూరిమి గొసరీని

చ. 3: గుట్టు తనలో నెంత కూడపోసెనోకాని
నెట్టుకొన్న సిగ్గుతోడ నిండుకున్నది
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చుట్టమై తా నిన్నుఁ గూడి సుద్దులు చెప్పీని

రేకు: 1873-4 ఆహిరి సం: 28-428

పల్లవి: చెప్పరే యీమాఁటలు చెలువునికి
అప్పసము నాకునాకె ఆడుకొనరాదు

చ. 1: కలువ నననేల కంతుని దూరఁగనేల
తలఁచితే మతిలోనఁ దా నున్నాఁడు
చిలుకఁ గసరనేల చింతపై విసుఁగ నేల
పిలిచితే నోరఁ దనపేరున్నది

చ. 2: చందురుఁ దిట్టనేల వసంతుని సొలయ నేల
చెంది నా కొప్పుపైఁ దన సేసలుండఁగా
నిందించనేల వెన్నెల నేరా లలులపై నేల
అందమై తన గురుతు లంగముపై నుండఁగా

చ. 3: పూవులపై వెగటేల పుప్పొడి గాదన నేల
శ్రీవేంకటేశుఁడు తానే చేరి కూడఁగా
కోవిలఁ గొసరనేల గుంపించ నేల చెలుల
తావై వలపలు నాకూఁ దనకు నుండఁగను

రేకు: 1873-5 మధ్యమావతి సం: 28-429

పల్లవి: వింటి నేఁ గొన్ని సుద్దులు వీరి వారి చేతనెల్లా
నంటున నానతీవయ్యా నాతో నేఁడు

చ. 1: చెలరేఁగి చెలరేఁగి సేసె నాపె విన్నపాలు
వెలయఁగఁ జెవులార వింటివా నీవు
చలువగా వలపులు చల్లుతా గొలువు సేసె
తలఁపెల్లా నిందువంకఁ దనివందెనా

చ. 2: తమిరేఁచి తమ(మి?) రేఁచి తా నీకుఁ బాదము లొత్తై
అమరఁ జుట్టరికము లబ్బెనా నీకు
తిమురుచు సన్నలనే తియ్యనిమోవి చూపె
సమమోహముల నీకుఁ జవులాయనా

చ. 3: కరఁగించి కరఁగించి కాఁగిట సేవలుసేసె
ఇరవుగా నన్నియును నియ్యకొంటివిగా
గరిమ సేలితివి గక్కన శ్రీవేంకటేశ
తొరలించి యాపె పొందు దొరకెనా నేఁడు

రేకు: 1873-6 వరాళి సం: 28-430

పల్లవి: పంతమాడితి విందాఁకా పతితోడను
వింతలుగా మేలమాడి వీడెమిచ్చె నిపుడు

చ. 1: నెట్టుకొన్న వలపులు నేరము లెంచఁగ నీదు
చుట్టరికములే రేఁచి చొక్కించుఁగాని
పట్టరాని జవ్వనము పాసి యోరువఁగ నీదు
బెట్టుగాఁ బ్రియములే చెప్పించుఁగాని

చ. 2: యెనసిన మనసైతే యెరవు సేయఁగ నీదు
పెనఁగించి కోరికలే పెంచుఁగాని
మునుకొన్న తమకము మోనాన నుండఁగ నీదు
అనిశము మోవితేనె లడిగించుఁగాని

చ. 3: చెదరని యడియాస సిగ్గులువడఁగ నీదు
కొదలేక కాఁగిటనుఁ గూరుచుఁగాని
యిదివో శ్రీవేంకటేశు నెనసి మెప్పించితివి
యెదుట నీగుణాలే నిన్నింత సేసుఁగాని

రేకు: 1874-1 దేసాళం సం: 28-431

పల్లవి: నిన్ను మెత్తుమో యాపె నేరుపులు మెత్తుమో
చెన్నుగా మాకేది బుద్ధి చెప్పవయ్యా ఇఁకను

చ. 1: ఇంతి నీవు వచ్చేవంటా నిందాఁకా పందేలు వేసె
నంతలోనే వచ్చితివి ఆయ నిజము
అంతటి నీ వొడఁబా ట్లాపెకు నీకు నెట్టివో
చెంతఁ దారుకాణలు వచ్చెను మాకిందరికి

చ. 2: ఇచ్చేవు సొమ్ములంటాను ఇందరికి సాకికి వెట్టె
తెచ్చితి వవియుఁ దేట తెల్లమాయను
మెచ్చుల మీ సన్నలు మీలో మీకే తెలుసును
అచ్చపు మీచేత లొక్కటాయ మాకిందరికి

చ. 3: తనకే వలతునని తప్పని బాసలు చెప్పె
చెనకి కూడితి విట్టె చెల్లెఁ బంతము
తనిసి శ్రీవేంకటేశ తగులాయ మిద్దరికి
ఇనుమడించె సంతోసా లిట్టె మాకిందరికి

రేకు: 1874-2 పాడి సం: 28-432

పల్లవి: పొద్దు వోనివాఁడుగాక పొలఁతులాల
ఇద్దరిలోన నేఁ దన కిరవౌ తెలుఁగఁడా

చ. 1: నిన్నామొన్నా నెందుండెనో నేఁడు మాయింటికి వచ్చె
యెన్నాళ్ల కెన్నాళ్లపొందు ఒదేమే తాను
యెన్నిక నెవ్వతెనో నాయీడు సేయఁ జూచీని
పున్నమానమాసా నొక పోలికై నుండునటే

చ. 2: వొప్పి రేపే బాస ఇచ్చె నూరకె మధ్యాహ్నమెక్కె
యెప్పటి కెప్పటిమాఁట ఇదేమే తాను
చొప్పలెత్తి యాపె సుద్దులే యప్పటిఁ జెప్పీ
కప్పరములో నుప్ప గలపఁగ నేఁటికే

చ. 3: యేచి నాపై సేస చల్లె ఇంతలోనె కాఁగిలించీ
యేచేఁత కేచేఁత ఇదేమే తాను
యీ చాయ శ్రీవేంకటేశుఁ డింతిచే నాకు మొక్కించీ
పూచిన పూవునఁ బిందె బొడమించుఁ గదవే

రేకు: 1874-3 బౌళి సం: 28-433

పల్లవి: పతి కిచ్చకములాడి బతికే వారము నేము
కతకారితనము కలికివే నీవు

చ. 1: చక్కదనా లెంత లేదే సరసా లెవ్వ రాడరే
పెక్కు లాగుల నెమ్మెలు పెంచనేఁటికే
మక్కళించి నీవాడేదిమాటల కేమివచ్చెనే
నిక్కి మమ్ము నెంచితేను నీ కొలఁదివారమా

చ. 2: వేసాలకు దుద యేదే వేడుకలు బాఁతెఁటవే
వాసులనుఁ బొరలనివా రెవ్వరే
రాసికెక్కెఁ బనులెల్లా రచన లింకానేలే
నీసుద్దులన్నీ వింటి నీ కొలఁదివారమా

చ. 3: వినయా లెరఁగమటె వింత లెన్ని చూపేవే
యెనసిన మీఁద నిఁక నెరవులేలే
ననిచి మన్నించి యేలె నను శ్రీ వేంకటేశుఁడు
నినుఁ బెండ్లాడితే నేమే నీ కొలఁదివారమా

రేకు: 1874-4 వరాళి సం: 28-434

పల్లవి: ఇంకా నీదేవులసుద్దు లేమి యడిగేవు మమ్ము
పొంకముగా నీగుణాలే పొగడుతా నుండును

చ. 1: నెలఁతను నీవు మన్నించే మన్ననలెల్లా
చెలులతోఁ జెప్పి జెప్పి చెలరేఁగును
నిలుకడగాఁ దనతో నీవాడిన యేకాంతాలు
తలఁచుక తలఁచుక దైవారును

చ. 2: సొరిది నీవిచ్చినట్టి సొమ్ములు దనమేనను
సరుగనఁ జూచి చూచి సంతోసించును
అరుదుగఁ దనకడంపిన నీలేకలు
వురముపై నిడుకొని వుప్పొంగును

చ. 3: చిత్తురు పటాన వ్రాసిన నీరూపమ్ చూచి
హత్తి సరసములాడి యంగవించును
కొత్తగా శ్రీవేంకటేశ కూడితి వింతలోవచ్చి
యిత్తల నిన్ను మఱవ కేకాలము మెచ్చును

రేకు: 1874-5 సాళంగనాట సం: 28-435

పల్లవి: గద్దెమీఁద నున్నవాఁడు కరుణా నిధైనవాఁడు
గద్దరివాఁడుగదె యీ ఘనుఁడు వో చెలియా

చ. 1: వెన్నెలమొగముతోడ వేడక నవ్వులతోడ
చెన్నుమీరీ నిదె నరసింహదేవుఁడు
వున్నది తొడమీఁదట నొద్దికతో లకిమమ్మ
ఇన్నిటా జాణఁడుగదె యీతఁడు వోచెలియా

చ. 2: అంగపుఁ గాంతులతోడ నల్లాడే జడలతొడ
చెంగలించీఁ గదె నరసింహదేవుఁడు
ముంగిటఁ బ్రహ్లాదుఁడు మొక్కుఁతాఁ బాటలువాడి
సంగతైనవాఁడుగదె చనవిచ్చీఁ జెలియా

చ. 3: బీరపు మాటలతోడ పెలుఁగిరీటముతోడ
చేరి నిన్నుఁ గూడె నదసింహదేవుఁడు
యీరీతి శ్రీవేంకటేశుఁ డితడై వరములిచ్చీ
ధారుణి కాంతుఁడు గదె తానితఁడు చెలియా

రేకు: 1874-6 లలిత సం: 28-436

పల్లవి: ఇద్దరి మీ సరసము లేమని చెప్పగవచ్చు
చద్దికి వేడికి సంతోషములెన్నోకాని

చ. 1: ఇదె చనవు మనువు లిన్ని నీతోఁ జెప్పీని
సుదతి నీకెటువంటి చుట్టమోకాని
గుదిగొని సారెసారెఁ గొలువులు సేసీని
పొదిగి నీయెడ కెంత పొందోకాని

చ. 2: మునుకొని సన్నలు నీముందరనే సేసీని
యెనసిన పను లవి యెట్టివోకాని
పెనఁగుచు వేఁడుకొని ప్రియములు చెప్పీని
వొనరిన దెటువంటి వొడఁ బాటోకాని

చ. 3: నగుతానే సొలయుచు నయములు చూపీని
మొగమోట మెటువంటి ముచ్చటోకాని
ఆ (అ?) గపడి శ్రీవేంకటాధిప నిన్నుఁ బెండ్లాడె
మగువకు నీకు నెంత మచ్చికోకాని

రేకు: 1875-1 సామంతం సం: 28-437

పల్లవి: ఎఱుక గలవాఁడవు ఇన్నిటా నీవు
తఱితోడ గారవించి దయఁజూడరాదా

చ. 1: చెలియ చెక్కులఁ గారే చెమట దుడువవయ్యా
అలరి సురటివీచి యలసినది
కలువలకొప్పు జారీ కాంతకు ముడువవయ్యా
సెలవుల నవ్వి నవ్వి చీకాకయినది

చ. 2: తరుణి మోవి వాడె తములమొసఁగవయ్యా
పొరిఁ గత చెప్పి దప్పిఁ బొరలినది
సరు నురానఁ జెదరీ చక్కఁబెట్ట గదవయ్యా
సరుగనఁ బాదాలొత్తి సదమదమైనది

చ. 3: ఇంతి చన్నులపై కొంగు యెడలెను కప్పవయ్యా
ఇందవడి నీరతుల నెనసినది
పంతపు శ్రీ వేంకటేశ పాయక కూడుండవయ్యా
సంతోసాన నీపె నీకు చాలా వలచినది

రేకు: 1875-2 ఆహిరి సం: 28-438

పల్లవి: తెలిపి చెప్పర నా తెఱఁగు లాతనికిని
యెలమి నన్నెపుడును యెడయకుండుఁగాని

చ. 1: గుత్తపు గుబ్బలమీఁది గురుతులు చూచుకొని
బత్తితోఁ దనరూపము భావించుకొని
హత్తి తన వుంగరము లక్కున నదుముకొని
వొత్తి విరహతాపము వోరుచుకుందాననే

చ. 2: మచ్చికఁగా నాడిన మాటలు దలఁచుకొని
తచ్చి తనపేరు నోరఁ దడవుకొని
అచ్చమైన తనగుణా లందరిచే వినుకొని
కొచ్చి కొచ్చి తనరాక గోరుకవుందాననే

చ. 3: పక్కనఁ దానొసఁగిన బాసలెల్లా నమ్ముకొని
ఇక్కువఁ దన రతుల కెదురుకొని
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నేలఁగా
వొక్క మనసున వచ్చి వూరకె వుందాననే

రేకు: 1875-3 దేసాళం సం: 28-439
పల్లవి: ఏమి జూజాలాడేవు ఇంతులతోను
కామించి నీతోఁ బెనఁగీ కరుణించవయ్యా
చ. 1: వలపు నీపైఁ జల్లి వద్దనే కాచుకున్నది
చెలితోడ నిట్టె పొందుసేయరయ్యా
కలువలు గానుకిచ్చి కడుఁ బ్రియములు చెప్పీ
యెలమి నీపెకు జనవియ్యవయ్యా
చ. 2: వేడుకలు వెదవెట్టి వియ్యమందవచ్చె నీతో
జోడు గూడి యీపెరతిఁ జొక్కవయ్యా
వాడికలు వచరించి వచ్చి వచ్చి వేడుకొనీ
యీడ నిట్టె విన్నపము లియ్యకొనవయ్యా
చ. 3: ఆసలు తోడంటువెట్టి యట్టె కాఁగలించీ నిన్ను
సేన వెట్టితివి ఇఁకఁ జెనకవయ్యా
వాసితో శ్రీవేంకటశ వనిత నేలితి విట్టె
వేసరక నీకు మొక్కే విడె మియ్యవయ్యా

రేకు: 1875-4 శ్రీరాగం సం: 28-440

పల్లవి: నా విభునితో నేల నగవచ్చేవే
వావిరి నాకే యితఁడు వసమైయున్నాఁడు

చ. 1: కొత్త కొత్త మాటలు కొనచూపు తేటలు
హత్తి చెల్లాటాలయాట పాటలు
యెత్తల నేరిచితివో యిటువంటి బిన్నాణాలు
మత్తిలి నీవైతే నిసుమంత దానవు

చ. 2: పచ్చి పచ్చి చేఁతలు పుబ్బరి బయలీఁతలు
తచ్చన నివ్వెరగుల తలపోఁతలు
గచ్చుల నెన్నాళ్లనుండి గడియించుకొంటివో
కచ్చుపెట్టి నిన్నెంచితే కడు గోలదానవు

చ. 3: సారె సారె జంకెలు సమరతి యంకెలు
ఆరితేరికూడి పాయనిలంకెలు
యేరీతినబ్బె శ్రీవేంకటేశుతోడి పొందు నీకు
చరి మొలక చన్నుల చిన్నారిదానవు

రేకు: 1875-5 మాళవిగౌళ సం: 28-441

పల్లవి: ఆపె చెప్పినట్టె సేసి యాదరించఁదగు నీకు
కాఁపురము లీడేరెఁ గరుణించవయ్యా

చ. 1: అందెలుఁ బాయవట్టాలు అట్టె గల్లు గల్లనఁగ
యిందుముఖి వచ్చెను నీ యింటికి నేఁడు
గందము బేంట్లు మేనఁ గమ్ముకొని రాఁగాను
ముందుగానే చేతులెత్తి మొక్కీ నీకు నిపుడు

చ. 2: కట్టిన చెంగావి చీరఁ గళబెళమనఁగాను
చుట్టమై బాగాలు దెచ్చె సూడిదెగాను
గట్టి కొప్పులో విరులు కడు బుగులుకొనఁగా
గుట్టుతోడ నీ సంగడిఁ గూచున్న దిపుడు

చ. 3: చన్ను మెరుఁగులు నీపై సారెఁ జౌకళించఁగాను
యెన్నికగాఁ గాఁగిలించె నింపులు రేఁగ
మన్నించి శ్రీవేంకటేశ మరి నన్ను నేలఁగాను
సన్నలనే మోవి చూపీ చవితోఁ దా నిపుడు

రేకు: 1875-6 పాడి సం: 28-442

పల్లవి: ఏఁకరీ నప్పుట నుండి ఇదివో నీకు
ఆఁక వలపులు చల్లీ నడుగరాదా

చ. 1: నిన్నుఁ జూచి సారెసారె నెలఁత
కన్నచోటనెల్లా నిచ్చకము సేసీని
చన్నుల నొరసుక నీ సంగడి నుండీ
తిన్నఁగా నాపె తలఁపు దెలుసుకోరాదా

చ. 2: మొగమెత్తి కనుఁగొంటే మొక్కుమొక్కీని
తగిలి తగిలి యాకతము లాడీని
నగీ నంతలోనె నిన్ను నంటుసేసుక
సొగిసి యాపె గుట్టు సోదించరాదా

చ. 3: వావి నీతోఁ జెప్పవచ్చీ వక్కణగాను
యేవేళాఁ గొలువుసేసీ యెదుటనుండి
శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జిత్తగించి కూడితివి
కావించి యాపె చుట్టరికమూఁ జేయరాదా

రేకు: 1876-1 ముఖారి సం: 28-443

పల్లవి: నన్నేల పిలిచేవు నగుతా నాపె యింటికి
విన్న సుద్దులే చాలు వేడుకాయ నాకును

చ. 1: సరుసఁ గూచుండి యాపె సారె నిన్ను జంకించఁగా
విరులనుఁ బూఁచి పూఁచి వేయఁగాను
తురుము కొనగోళ్లను దువ్వి దువ్వి తియ్యఁగాను
నిరతి నివెల్లాఁ జూచి నే నోరువఁ గలనా

చ. 2: తొడమీఁద దొడ వేసి దొరతనాలు చూపఁగా
కడఁగి నీమోవి యాకె గంకి సేయఁగా
గుది(డి?) గొన రాకొట్లు గొట్టి నిన్నుఁ బిలువఁగా
వొడఁబడి నోనిందుకు వోరువఁగఁగలనా

చ. 3: చనుమొనలు నాఁటించి సదమదము సేయఁగా
పెనఁగులాడి నీమేను పిప్పిసేయఁగా
ననిచి శ్రీవేంకటేశ నాకాఁగిట నీవుండఁగా
వొనరి యాపె చేఁతల కోరువఁగఁగలనా

రేకు: 1876-2 శంకరాభరణం సం: 28-444

పల్లవి: జాణ వలపుల తెంకి జవాదివంకి
నాణెమైన పతితోడ నవ్వు నవ్వఁగదవే

చ. 1: కాటుక కనుచూపుల కలికీ
గాఁటపు మాఁటల చిలుకలు కొలికీ
చాటువ కెక్కిన యట్టి జాజి ములికీ
పాటించి నీ విభునికి బాగా లియ్యఁగదవే

చ. 2: నెలకొన్న నవ్వుల వెన్నెలతేట
కులుకుఁ గుత్తికలోని కొవిలపాట
వెలయఁ జిత్తజకేళి వేడుక కోట
తలకొని నీమగనిపాదమ లొత్తఁగదవే

చ. 3: గుడి(ది?) కొన్న లేఁతసిగ్గుల దొంతి
వెదచల్లుఁ బులకవిరులబంతి
పదిలపు నడపుల పట్టపుదంతి
యిదె శ్రీవేంకటేశ్వరుఁ డెనసె మెచ్చఁగదే

రేకు: 1876-3 సామవరాళి సం: 28-445

పల్లవి: ఏమయ్యా నాగుణము యెఱఁగవా నీవేమైనా
గోమున నా సంగడినిఁ గూచుందువు రావయ్యా

చ. 1: వోడక నిన్నంతేసి వొరసేటిదాననా
వాడికలు చెప్పుకొని వచ్చేదాననా
యేడ నుండయినా నిన్ను నెలఇంచేదాననా
కూడుమని నిన్ను వేఁడుకొనేదానఁగాక

చ. 2: పంతమాడి నిన్ను నిట్టె బాస గొనేదాననా
చెంతఁ బెక్కుచీరలు దీసేటిదాననా
రంతుసేసి ని న్నింటికి రప్పించుకొనేదాననా
సంతోసాన మొక్కి సేస చల్లేదానఁగాక

చ. 3: బయలు పందిలి వెట్టి భ్రమయించేదాననా
క్రియ యెఱఁగక పలికేటిదాననా
నియతి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
నయమున నీక నీతో నవ్వేదానఁగాక

రేకు: 1876-4 దేసాళం సం: 28-446

పల్లవి: నెట్టుకొన్న బత్తితోడ నీవు నేను వుండఁగాను
చుట్టమై తానూ నిన్ను సొలయజూచీని

చ. 1: వలిపె పయ్యెద వల్లెవాటుతోడ నిలుచుండి
నెలఁత తొంగిచూచీని నిన్ను నిదివో
నలువంకఁ గమ్మవాసనలు బుగులు కొనఁగా
చలువగా సురటి విసరు కొనీఁ దాను

చ. 2: దంతకాంతులు సెలవిఁ దళుకున మెరువఁగా
ఇంతి నిన్ను పిలిచీని యెలయింపుడ
రంతులుగాఁ గంకణాలు రాసి రాసి మొరయఁగా
చెంత నిదె మొక్కీని చేతులెత్తి నీకు

చ. 3: తురుము చెంగలువలు తొట తొట రాలఁగాను
తరుణి నిన్ను వేసీని తామరలను
ఇరవై శ్రీవేంకటేశ ఇంతలోఁ గాఁగిలించితి
వరిది నీమోవితేనె లానీఁ దానిపుడు

రేకు: 1876-5 ఆహిరి సం: 28-447

పల్లవి: చెల్లవిరులై యిఁక వెలసివుందువుగాక
చెల్లఁబో యింకానేలే చిడుముడి సిగ్గులు

చ. 1: చన్నులపై నిండినవి చందమామ పిల్లలు
పన్నీటి కాలువలు పారీఁ జెక్కులు
వున్నతి పెండ్లివిడే లొద్దికఁ బుక్కిట నిండా
వన్నెలాఁడి ఇఁకనేలే వలవనిసిగ్గులు

చ. 2: యెదిరించి తోఁచె నదె యెరసంజ కన్నులను
చెదరీ సెలవులను చిరుముత్యాలు
గుదిగొని మేన నిండె గుంపులై జాజి ననలు
మదిరాక్షి యిఁక నేలే మాయదారి సిగ్గులు

చ. 3: తతిఁ దురుముపై నవె తలఁబాల వజ్రాలు
కతమాయఁ దెమ్మెరలు సారెసారెకు
ఇతవై శ్రీవేంకటేశుఁ డీతఁ డిదె నన్నుఁ గూడె
కతకారి ఇఁక నేలే కాయకపు సిగ్గులు

రేకు: 1876-6 బౌళి సం: 28-448

పల్లవి: గుట్టుగల రమణినిఁ గొనియాడుదు రిందరు
చుట్టరికము నెరపి జోడై యుండుటే మేలు

చ. 1: వీసమంత పనికైనా వేగిరపడఁగవద్దు
వాసితోడ మెలఁగేటి వనితలతకు
ఆసతోడి మగవాఁడు ఆయములంటవచ్చితే
చేసూటికిఁ బెనఁగి సిగ్గువడుటే మేలు

చ. 2: సరసములోన నేనా జంకించి కెలయవద్దు
దొరతనమెరిఁగిన తొయ్యలులకు
మరిగినవాఁడు తనమర్మము సోఁకనాడితే
సారిది దప్పక చూచి చొక్కుటే మేలు

చ. 3: కలలోనఁ గూడినాను గర్వము చూపవద్దు
వలవ నేరిచినట్టి వనితలకు
ఆ (అ?) లమేలు మంగవు నీ వతఁడు శ్రీవేంకటేశు
డెలమి నిన్నేలె నిఁక నియ్యకొనుటే మేలు

రేకు: 1877-1 సామంతం సం: 28-449

పల్లవి: నీ వలమేలుమంగవు నెరజాణఁ డాతఁడు
వోవరిలో నుండఁ గదె వొయ్యారిదానవు

చ. 1: గరిమ నీరమణుఁడు కైదండ వట్టితేను
శిరసేల వంచేవే చిన్నారిదాన
మరిగి నీ కతఁ డాకుమడిచి చేతి కిచ్చితే
వెరగు వడఁగనేలే వియ్యపుదాన

చ. 2: తగ్గకుండా నీతొడలు తలగడఁ బెట్టుకొంటే
సిగ్గులేల పెంచేవే చేఁతలదాన
యెగ్గులేక నీ చెవిలో నేకతము లాడితేను
వెగ్గళించి దూరనేలే వేడుకదాన

చ. 3: గక్కన నీ చన్నులు కాఁగిట నదుముకుంటే
మిక్కలి యాల చొక్కేవే మేనదాన
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
చక్కెరమో వియ్యఁగదె చనవరిదానా

రేకు: 1877-2 పాడి సం: 28-450

పల్లవి: వాఁడువో నీ రమణుఁడు వరసుకు వచ్చినాఁడు
పోడిమితోఁ గాఁపురాలు పొందుగాఁ జేయఁగదె

చ. 1: చెలిమి చెమటలు నిండు సేయఁగఁ జేయఁగాను
కలిమి గంపల కెక్కు కైకొంటేను
బలిమి బండ్ల వచ్చు పలుమారుఁ బెనఁగితే
నిలువు నూరువండిని నేకేలే చింతా

చ. 2: వేడుక వెల్లివిరుసు వినోదాలు జరపితే
వాడికలు గుంపుగట్టు వలెనంటేను
కూడిక రతికి నెక్కు కొంకక చెనకితేను
యీడు జోళ్లొక్కటాయ ఇఁకనేలే చింతా

చ. 3: ఆసలు పైపైఁ బెరుగు నంగములు సోఁకితేను
బాసలెల్లా నెట్టుకొను బత్తి గలితే
సేసవెట్టి కూడినాఁడు శ్రీవేంకటేశుఁడు నిన్ను
తాసువలె మీరున్నారు తగదేలే చింతా

రేకు: 1877-3 బౌళి సం: 28-451

పల్లవి: చిన్నదానవు గనక చెప్పితి నీకీ బుద్ధులు
పన్నుక నీపొందులివి పాయకిట్టె సేయవే

చ. 1: తప్పక చూచితేనే తగులాయములు వుట్టు
చిప్పిలఁగ నవ్వితేనే చిత్తములంటు
చొప్పుఁగా మాటలాడితే చుట్టరికములు రేఁగు
యెప్పుడూను పతిపొందు లేమరక సేయవే

చ. 2: కొలువులు సేసితేను కోరికలు కొనసాగు
వెలినుండి వేఁడుకొంటే వేడుకగల్గు
తలకొని చెనకితే తమకము లుప్పతిలు
మలసి నీపతిపొందు మఱవక సేయవే

చ. 3: వావులు దలపెట్టితే వాడికలు సమకూడు
మోవితేనె చూపితేను మోహము మెండు
యీవేళ నిన్నుఁగూడె ఇదియే యలవాటౌను
శ్రీవేంటేశ్వరుపొందు సేనలుగాఁ జేయవే

రేకు: 1877-4 ఆహిరి సం: 28-452

పల్లవి: వేఱొకటిఁ గాదు సుమ్మీ వెలఁది నీకు మేలుది
మీఱిన సంతోసాన మిక్కిలి మన్నించుమీ

చ. 1: కన్నుల సొలయుఁగాని కడవ మాఁటాడదు
చన్నుల నొరయుఁగాని జంకించదు
సన్నలఁ గొసరుఁగాని చలము సాదించదు
ఇన్నిటాఁ జెలికి నీపై నెటువంటి ప్రియమో

చ. 2: బలిమిఁ బెనఁగుఁగాని పంతములు నెరపదు
మలసి చెనకుఁగాని మచ్చరించదు
అలరుల వేయుఁగాని ఆస నీపై వదలదు
యెలమి నీపెకు నీపై నెలువంటి ప్రియమో

చ. 3: చుట్టి నీతో నవ్వుఁగాని చూపదు యెగసక్యాలు
గుట్టుతోడ నుండుఁగాని గుంపించదు
నెట్టన శ్రీవేంకటేశ నెలఁతనుఁ గూడితివి
యిట్టె మెచ్చి నీపైఁ దన కెటువంటి ప్రియమో

రేకు:	1877-5గౌళి	సం:	28-453

పల్లవి:	చెల్లుబడియైన మీఁద చేఁతలు మరేమిటికి
	చల్లఁగా నామోవి యాని చవులెంచుఁగాక

చ. 1:	మొగము చూచినవాఁడు ముచ్చటకు రమ్మనవే
	నగినవాఁ డిమ్మనవే నాకుఁ జనవు
	తగులనాడినవాఁడు దగ్గరఁగ రమ్మనవే
	మగిడి నన్నిఁక నెంత మరసు సోదించీని

చ. 2:	చెలిమి సేసినవాఁడు చేతికి లోఁగమ్మనవే
	కలయ వచ్చినవాఁడు కైకొమ్మనవే
	వలపించినవాఁడు కైవసము గమ్మనవే
	లలి నెందాఁకాను నాలాగులు చూచీని

చ. 3:	సరసమాడినవాఁడు సతమై యేలుమనవే
	తెరవేసినవాఁడు సందించు మనవే
	ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ బెండ్లాడె
	సురతవేళల నేమి చొప్పులు వెదకీని

రేకు: 1877-6 హిజ్జిజి సం: 28-454

పల్లవి: వాసులకే బతికేటి వనితలము
సేసవెట్టి యేలితివి చేరి మన్నించవయ్యా

చ. 1: కలికితనము లెల్లా కాంతలకు సాజము
మొలకనవ్వులు వన్నె మోములకును
వలపులకును బోది వాడికైన చేఁతలు
చెలఁగి మమ్మేల రట్టుసేయ వచ్చేవయ్యా

చ. 2: వినయపు సరసాలు వేడుకలకు మూలము
చెనకులకుఁ దగులు చిరుసిగ్గులు
పెనఁగులాటకు లంకె ప్రియవాది తనములు
వొనరి మమ్మిఁకనేల వుప్పతించేవయ్యా

చ. 3: కాఁగిటిరతిసన్నలు కనుబొమ్మ జంకెనలు
మాఁగిన మోవియీగులు మతి చొక్కులు
చేఁగ దేరఁ గూడితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
తోఁగి చూచి యేల మాసుద్దులు మెచ్చేవయ్యా

రేకు: 1878-1 వరాళి సం: 28-455

పల్లవి: ఏమి చెప్పేది నీసుద్దు లిందరిలోన
వేమరుఁ జూచి చూచి వెరగయ్యీ నిపుడు

చ. 1: మగువరో పతితోడ మాఁటలాడఁ జాలను
చిగురువంటి నీమోవి చిల్లులయ్యీనా
నిగిడి వద్ద గూచుంటే నీకేమే వలపులు
జిగురువలె నంటుక చిమ్మిరేఁచీనా

చ. 2: చెనకి యీతనితోడఁ జేరి పెనఁగ వదేమే
ఘనమైన నీ చన్నులు కాయగాచీనా
మొనసి వేడుకతోడ మోమెత్తి చూచితే నేమే
ననుపుల తమకము నాముసెక్కీనా

చ. 3: యెరవు సేయక బాగా లీతనికిచ్చితే నేమే
వరుస నీకొనగొళ్లవాఁడి వొయ్యీనా
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నివ్వెరగందేవు
కరఁగి నీమనసిట్టె కాలువ గట్టీనా

రేకు: 1878-2 కన్నడగౌళ సం: 28-456

పల్లవి: ఇటువంటి మానావతి నింతసేతురా
తటుకన లాలించి దయఁజూడు మిఁకను

చ. 1: చెప్పరానిమాఁట లేమి చెప్పితివో చెలితోను
అప్పటనుండి బొమ్మల నద్దలించీని
రెప్పల తుదలను యేరీతి సన్నసేసితివో
చప్పుడుగా విరులను సారెకు వేసీని

చ. 2: గుట్టుతొడ నెట్లా నిక్కువలు సోఁకించితివో
దట్టించి పెదవులుగదల దూరీని
చిట్టంటుఁజేఁతల నేడ సిగ్గులు రేఁచితివో
చుట్టి చుట్టి ములువాఁడి చూపులఁ జూచీని

చ. 3: వేడుకరతులు యెంత వెల్లవిరి సేసితివో
వోడక పెసఁగుతా నీ వొడివట్టీని
యీడనే శ్రీవేంకటేశ యీపె నెంత యేలితివో
జోడు గూడి నిన్నిప్పుడు చొక్కుతా మెచ్చీని

రేకు:	1878-3 లలిత	సం:	28-457
పల్లవి:	మేలు మేలు జాణవు మెచ్చితి నాపెను నేను
	నీలాగులెల్లా నాపె నేరిపినవేకా
చ. 1:	కనుసన్నలనే మొక్కి కాంత సేవలు సేసి
	తనువు సోఁకుల నిన్ను దమిరేఁచెఁగా
	చెనకులఁ బొద్దు వుచ్చి చెక్కు కొనగోర నూఁది
	పెనఁగులాటల నీకుఁ బ్రియము వుట్టించెఁగా
చ. 2:	చుట్టరికములు చెప్పి సొలసి వద్దఁ గూచుండి
	నట్ట నడుమనే నిన్ను నవ్వించెఁగా
	గుట్టుతోనే మేలమాడి కొప్పు దువ్వి బుజ్జగించి
	పట్టపగలే నిన్ను భ్రమయించెఁగా
చ. 3:	చన్ను లురమున నాని చవులెల్లా మోవిఁ జూపి
	వన్నెలాఁడి ఇంత నిన్ను వలపించెఁగా
	యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
	తిన్నని రతులఁ దానూఁ దేలించెఁగా

రేకు: 1878-4 పళవంజరి (రం?) సం: 28-458

పల్లవి: వెరగయ్యీ నీపెసేసే వేసాలకు
యిరవైన నీచిత్త మిఁక నెట్టోకాని

చ. 1: వాసులకే పెనఁగీని వంతులకే చెనకీని
వేసరదెంతైనా నీతో వేడుకలను
ఆసలనే కెరలీని అందాలకే లాచీని
చేసూటి నీకె యెంత చేఁతలాఁడోకాని

చ. 2: చూపులనే సొలసీని చుట్టి చుట్టి మలసీని
వోపననదు నీతోడి వొరపులను
తీపులుగా మాఁటలాడి తేనెలు మోవిఁ జూపి
కాఁపురాల కీపె యెంత కతకారో కాని

చ. 3: చనువులకే వచ్చీ సరసములకే పొంచీ
తనియదు నిన్నుఁ గూడే తలపోఁతల
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో నన్ను
ననుపుల కీకె యెంత నయగారోకాని

రేకు: 1878-5 ఆందోళి సం: 28-459

పల్లవి: మురిపెములెల్లా నీముందరనే పచరించీ
నెరవాది తలమెంత నేరుచునో తాను

చ. 1: కట్టుకొనె మెడనిండా గట్టి ముత్తెపు సరులు
పెట్టుకొనెఁ గొప్పున సంపెంగవిరులు
దట్టముగఁ బయ్యదలో దాఁచెను కుచగిరులు
అట్టె చిత్తగించి చూడవయ్యా యీపెదిక్కు

చ. 2: పూసెను గందము మేన పొంచి నెరపూఁతను
ఆసలనే చూపీ నొయ్యారి చేఁతలు
వేసరక మొరయించీ వెస మట్టెల మోఁతలు
సేసవెట్టి యేలవయ్యా చెలి నీకుఁ గలిగె

చ. 3: మెలుపున నించుకొనె యేనెల్లా సొమ్ములు
కులికీ వీణెలోఁ గొనగోరి చిమ్ములు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పిలిచి మాఁటడవయ్య ప్రియురాలు నీకు

రేకు: 1878-6 ఆహిరి సం: 28-460

పల్లవి: ఇటువంటి వేడుకలు యిదే నీకుఁ గలిగెను
తటుకన వరమిచ్చి దయసేయవయ్యా

చ. 1: కలికి చూపులు నీకు కలువలదండలాయ
సెలవినవ్వులు మంచిసేవంతులాయ
పిలిచిన యధరము పెనుమంకెనపూవాయ
కొలఁది భారము నిండుఁ బూజలాయను

చ. 2: ముక్కు నిట్టూర్పులు నీకు మొనసి సంపెఁగలాయ
తక్కక చేసన్నలు తామరలాయ
చెక్కుమీఁది పులకలు చెలరేఁగి జాజులాయ
నెక్కొన్న యీపె చందము నీకుఁ బూజలాయను

చ. 3: మచ్చిక నీపెకాఁగిలి మరువపు ననలాయ
కొచ్చి కాఁగిటిరతులు కురివేరాయ
యిచ్చట శ్రీవేంకటేశ యింతి నీవూఁ గూడఁగాను
పచ్చిదేరి యిన్నిటాను బలు పూజలాయను

రేకు: 1879-1 గౌళ సం: 28-461

పల్లవి: ఇటువలె నుండుభాగ్య మేమని చెప్పఁగవచ్చు
కుటిలకుంతలి నిన్నుఁ గోరి దక్కఁగొనెను

చ. 1: పెంచ పెంచ రమణికిఁ బెద్దలాయఁ గుచములు
యెంచ నెంచ గుణములు యెన్నికటాయ
ఇంచుకంత పడుచంటా నిన్నాళ్లు నుంటిమి నేఁడు
మంచముపై రతులను మరిగించె నిన్నును

చ. 2: చూడఁ జూడ మగువకు చూపులెల్లా వాఁడెక్కె
ఆడనాడ మాటలలో నందాలు వుట్టె
యీడుగాని పడుచంటా నెఱఁగమైతి మిన్నాళ్లు
వాడలో నెందు చూచినా వలపించె నిన్నును

చ. 3: కాయఁగాయ వెన్నిలాయ కాంతసెలవుల నవ్వు
సేయఁజేయ వేడుకాయ చేఁతలెల్లాను
పాయక శ్రీవేంకటేవ పడుచంటాఁ జూచితిమి
చాయలా సన్నలాఁ గూడి సాదించె నిన్నును

రేకు: 1879-2 పాడి సం: 28-462

పల్లవి: చేరి పెండ్లాడరాదా సేసలు వెట్టి
సారెకు నీమోవి చూపి సన్నలేమి సేసేవే

చ. 1: పిప్పిగట్ట నాతనితో పెనఁగులాడి యందాఁకా
వుప్పతిలుఁ జెమటల నోలలాడేవే
తప్పక చూచి యప్పటి తమి యెంత పెంచేవే
కుప్పగాఁ గోరిక లెంత కూడపోసేవే

చ. 2: గుట్టుతోడ నిలుచుండి కొలువుసేసి యందాఁకా
చిట్టంటుఁ బులకలను చిమ్మిరేఁగేవే
బట్టబయలు వలచి భావమెంత గరఁగేవే
దట్టపు సిగ్గుల నెంత దడి గట్టేవే

చ. 3: పానుపుపైఁ గూచుండి బాఁతిపడి యందాఁకా
నానఁబెట్టి నానఁబెట్టి నవ్వు నవ్వేవే
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్నుఁగూడె
పూని సంతోసాలెంత పోగువెట్టేవే

రేకు: 1879-3 లలిత సం: 28-463

పల్లవి: వాకిట నుండి యెంత వాడికలు సేసేవు
లోకమెల్లా నెరుఁగును లోనికి రావయ్యా

చ. 1: పడఁతి వినయముల బయలు పందిలి వెట్టె
తడఁబాటు సిగ్గులను దడి గట్టెను
వుడివోని తమకము నొడినిండా నీకు నించె
యెడమాట లేఁకనేల ఇంటికి రావయ్యా

చ. 2: కలికి కనుచూపులకానెకలు నీకు నిచ్చె
సులభాన వలపుల సూడిదె లంపె
సెలవుల నవ్వులనే చిత్తమెల్లాఁ గరఁగించె
వెలినుండి జంపులేల విడిదికి రావయ్యా

చ. 3: భామ తమ్మి మొగ్గలనుపాన్పు నీకుఁ బరచె
వేమరు మోవితేనెల విందులు వెట్టె
ఆముక శ్రీవేంకటేశ యట్టె యీకెఁ గూడితివి
దామెటసన్న లవేల తావుకు రావయ్యా

రేకు: 1879-4 కాంబోది సం: 28-464

పల్లవి: అప్పటనుండి నవ్వీ నాతఁడు నీతో
యిప్పుడు సిగ్గు లివేలే యియ్యకొంటగాక

చ. 1: చలపాదితనమేల సరసమాడేటి వేళ
చెలరేఁగి సొలపుల చేఁతలేకాక
బలిమి బిగియనేల పట్టిపెనఁగేటివేళ
చెలిమి చూపి ప్రియము చెప్పటే కాక

చ. 2: పంతము లాడఁగనేల పానుపుపైనున్న వేళ
సంతోసాన వలపులు చల్లుటగాక
వింతలు సేయఁగనేల విచ్చనవిడైన వేళ
చెంతనే వలసినట్టు చెనకుటగాక

చ. 3: ముంచి మాఁట లాడనేల మోవి చవిగొనేవేళ
కంచపు పొత్తుల మేలు గైకొంటగాక
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే నినుఁగూడె
పొంచి పొంచి వేడుకల భోగించుటగాక

రేకు: 1879-5 కేదారగౌళ సం: 28-465

పల్లవి: తెలుసుకోరాదా తెఱవ తలఁపులెల్లా
వెలినుండి ముందే యాల వేగిరించేవు

చ. 1: వాసితోడ మదిరాక్షి వచ్చినపని వుండఁగా
నీ సుద్దు లేమి చెప్పేవే నేరుపులను
మూసిన ముత్తెమువలె మొనసి నిన్నుఁజూడఁగా
సేసవెట్టిన సతులఁ జెలి యేమి చూపేవు

చ. 2: లలితాంగి నీరతికి లాచి కాచుకుండఁగాను
యెలమి జూజాలాడ నేమి నేర్చేవు
బలిమిఁ జన్నులొరయఁ బాదాలొత్తరాఁగాను
మలసి వట్టిపనులు మరియేల చెప్పేవు

చ. 3: పడఁతి నీకాఁగిటిలోఁ బాదుకొని వుండఁగాను
యెడయక కంఠహారా లెన్ని గట్టేవు
నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితివిప్పుడు
వొడఁబరచి యాపెను వొడి యేల పట్టేవు

రేకు: 1879-6 బౌళి సం: 28-466

పల్లవి: ఇందరముఁ జూడఁగాఁ దానెవ్వతోకాని
ముందే నన్ను నేలితివి మొక్కేఁ దాను నీకు

చ. 1: తెల్లమిగా నీతోను తేనేగారే మోవితోడ
చెల్లుబడిమాఁట లాడీఁ జెలియ
గొల్లెతఁగాబోలు నీపె గొప్పగొప్ప చన్నులతో
కెల్లురేఁగి పైకొనీని కిందుమీఁదెఱఁగదు

చ. 2: పెంచెపుఁ బయ్యెదతోడఁ బెడమరలి నీదిక్కు
పొంచుక సారెకుఁ జూచీఁ బొలఁతి
చెంచెతగాఁబోలు నీకె చెక్కుల జవ్వాది నీపై
యించుకించుకే చమరీ నెడ్డతనమునను

చ. 3: సరసపుఁ జేఁతలను సగినాలు చెప్పకొంటా
నిరతిఁ జేతులు చాఁచీ నీపై వనిత
యెరికెత గాఁబోలు నిన్నికె శ్రీవేంకటేశుఁడ
మరిగించుకొనె నిట్టె మంచితనములను

రేకు: 1880-1 కాంభో(బో?)ది సం: 28-467

పల్లవి: నెరజాణ వన్నిటాను నేరుపరివి
తరుణుల మన్నించే తగ వెఱుఁగుదువు

చ. 1: కొచ్చి కొచ్చి బత్తితోడఁ గొలువులు సేసే నీకు
ఇచ్చకములాడెఁ జెలి ఇందాఁకాను
మచ్చికతోఁ గొప్పు దువ్వి మనసెల్లాఁ గరఁగించె
మెచ్చవయ్యా ఇఁకనైనా మేలెరిఁగి నీవు

చ. 2: పయ్యెద చెరఁగు జార పలుమారు బాదాలొత్తె
నెయ్యములే పచరించె నిన్నటనుండి
వొయ్యనే గందమువూసి వుచిత మెల్లా నెరపె
యియ్యవయ్యా వుడుగర లితవెరిఁగి నీవు

చ. 3: వీడెమిచ్చి మోవితేనె విందువెట్టి లాలనతో
వేడుకలే పచరించె వేగి నంతాను
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీకెఁ
గూడవయ్యా పొందుల గురుతెరిఁగి నీవు

రేకు: 1880-2 ఆహిరి సం: 28-468

పల్లవి: ఏల దూరేవే వూరకే యెవ్వరినైనా
తాలిమితో నీవిభుఁడే దయఁజూచీఁగాక

చ. 1: అంది నీలోనివలపు లారడిఁ బెట్టీఁగాక
చందమామ నిన్ను వచ్చి సాదించీనా
కందువైన నీకోరికె కడు గుబ్బతిలీఁగాక
మందానిలుఁడు నీపై మచ్చరించీనా

చ. 2: తలపోఁతలే నిన్ను తడఁబరచీఁగాక
చిలుకలు వచ్చి నేఁడు చిమ్మిరేఁచీనా
యెలమి నీ వయసే యింతగాఁ జేసిఁగాక
కలువపువ్వులు నిన్ను గాసిఁబెట్టీనా

చ. 3: చేవదేరి నీచింత చెక్కుకుఁ జేయిచ్చెఁగాక
కోవిలకూఁతలు నిన్ను గుంపించెనా
శ్రీవేంకటేశుఁడు తానే చేరి నిన్నుఁ గూడెఁగాక
యీవలఁ దుమ్మిదగుంపు లెడమాట లాడెనా

రేకు: 1880-3 భైరవి సం: 28-469

పల్లవి: చూడఁజూడఁ గొత్తలాయ సుదతిభావము నేఁడు
కూడి నీకూటమికిఁ గొలకొల నవ్వెను

చ. 1: పక్కన నన్నుఁ జూచి పడఁతి శిరసు వంచె
చెక్కిటఁ జేయిడుకొని సిగ్గువడెను
జక్కన చన్నులమీఁద జారినపయ్యెదకొంగు
అక్కున నదుముకొని యంతలోనే నవ్వెను

చ. 2: ఆలించి నీమాఁట విని యాసతోడ ముక్కుఁమీద
వేలువెట్టుకొనుచు నివ్వెరగందెను
మేలిమితురుము వీడి మెడమీఁద గమ్ముకోఁగా
కేలఁ జక్క నొక్క నొత్తుకొంటా కిలకిల నవ్వెను

చ. 3: కొచ్చి నీవద్దఁ గూచుండి గొబ్బనఁ జెమరించఁగా
మచ్చికఁ గరఁగుకొంటా మదిఁజొక్కెను
యిచ్చట శ్రీవేంకటేశ పచ్చిచేఁత సేయుగాని
పచ్చడము గప్పుకొని పకపక నవ్వెను

రేకు: 1880-4 శ్రీరాగం సం: 28-470

పల్లవి: ఇచ్చకములే సేసి యీడేరవలెఁగాక
పచ్చిగా బలిమిసేసి పదరఁగవచ్చునా

చ. 1: వోసరించి వేడుకల కొడిగట్టినవారికి
వేసరఁగవచ్చునా వేగినంతాను
ఆసలనే తుదకెక్కి ఆఱడైనవారికి
గోసనాసగాఁ బతిని గుంపించవచ్చునా

చ. 2: చూపులకే లాచి లాచి చొక్కియుండేవారికి
వోపననవచ్చునా వూరకైనాను
యేపున మోవితేనెకు నేఁకరేటివారికి
మాపుదాఁకా జోలిసేసి మఱవఁగ వచ్చునా

చ. 3: తనివోని కాఁగిట దగులైనవారికి
చెనక కుండవచ్చునా చేతులారాను
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేఁడు
పెనఁగులాటకాక పిరితియ్యవచ్చునా

రేకు: 1880-5 వరాళి సం: 28-471

పల్లవి: ఎప్పుడూ నావాఁడవే ఇన్నిటా మన్నించితివి
చెప్పరాదా యీపె సుద్ది సిగ్గులేల నీకును

చ. 1: వింతవింత మాఁట లాడి వేడుకలు నీకుఁ జేసి
యింతి నీకు వావివి యేమౌనోకాని
దొంతవరలపు చల్లి దోమటి దొడుకవచ్చీ
యెంతగద్దో చుట్టరిక మీపెకు నీకు

చ. 2: సరసపుఁ జేఁతలను జాజర నీతో నాడీ
తరుణికి నీకు నెంత తగునో కాని
పొరుగు పొరచి మోవిఁ బొసఁగ విందులు వెట్టీ
యిరవైన మచ్చికెంతో యీపెకు నీకు

చ. 3: చతురతలు నెరపి సారెకుఁ జేతులు చాఁచీ
సతికి నీయెడ నెట్టి సన్నోలోకాని
తతి నిన్ను బెండ్లాడె తగిలి శ్రీవేంకటేశ
యితవైన తమి యెంతో యీపెకు నీకు

రేకు: 1880-6 కురంజి సం: 28-472

పల్లవి: నీవు నన్ను నేలినది నేఁడు తా నెఱఁగదేమో
పూవుల వేసీ నిన్నుఁ బొంచిపొంచి యిపుడు

చ. 1: చెక్కు కొనగోర నొక్కి చిమ్మిరేఁగ వేఁడుకొని
అక్కరతో విడెమిచ్చీ నంగన నీకు
జక్కవ చన్నుల నూఁది చవులుగా మోవితేనె
పుక్కిట బంటి గాఁగఁ బోసీ వేడుకను

చ. 2: వొడివట్టుకొని నీతో నుబ్బరిమాఁట లాడీ
వడిగా నవ్వులు నవ్వీ వాడికగాను
తొడమీఁదఁ దొడవేసి తొరలించి వలపులు
జడివానలుగ నీపైఁ జల్లీ సరసము

చ. 3: నెమ్మదిఁ గాఁగిట నించి నేరుపులు వచరించి
వుమ్మడి రతులఁ గూడీ వొద్దికతోను
యిమ్ముల శ్రీవేంకటేశ యెదురెదురనే యీాకె
కుమ్మరించీ నీపైఁ బ్తతి కోరికలు మీరను

రేకు: 1881-1 ముఖారి సం: 28-473

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్లు నేము యిటువంటి సుద్దులు
గఱ గరగా నేఁడు కానవచ్చె మాకును

చ. 1: మంతనాన నిన్నుఁజేరి మాటలు సారెకు నాడీ
యెంతచన విచ్చితివో యీపెకు నీవు
సంతోసాలు రేఁచుకొంటా సరుసనే కూచున్నది
ఇంతికి నీకును(జూడ నేనాటి పొందులో

చ. 2: వరుస నీవూడిగాలవారికిఁ బనులు చెప్పీ
సిరులఁ బారుపత్య మిచ్చితివో నీవు
సరసములాడుకొంటా చల్లీ వలపులు నీపై
మరఁదలి వావి యెందు మరి తెచ్చుకొనెనో

చ. 3: సెలవు నవ్వి నవ్వి చేతులు నీపైఁ జాఁచీ
సలిగె యెట్లిచ్చితివో చక్కఁగా నీవు
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి వీకె నెట్టు గలిగెనో నీకు

రేకు: 1881-2 పాడి సం: 28-474

పల్లవి: ఎంత భాగ్యవంతుఁడవో యీకె నీకు దేవులాయ
వింతలేక యెప్పుడూ వినోదించవయ్యా

చ. 1: కన్నుల కొలుకులను కడఁగీ మదరాగము
చన్నుల తుదల రేఁగీ జవ్వనము
నున్నని చెక్కల వెంట నూలు కొనీని కళలు
పిన్నది నీకె తగు బెండ్లాడవయ్యా

చ. 2: నెట్టుకొని మొగమున నిండెను చక్కఁదనము
అట్టె తేనియ లూరీ నాకె మోవిని
తట్టైలై వినయమెల్లాఁ దేరీ నిలుపునను
పెట్టెను సొమ్ములునిండాఁ బెండ్లాడవయ్యా

చ. 3: పిరుఁదు బటువుననుఁ బెనగొనీ సింగారము
కరకమలమునుఁ గైకొనె సేస
యిరవై శ్రీవేంకటేవ యెదఁ బెట్టితి వీకెను
బెరసితివి నిచ్చలు పెండ్లాడవయ్యా

రేకు: 1881-3 రామక్రియ సం: 28-475

పల్లవి: ఎఱుఁగుదుఁ దనసుద్దు లిన్నియు నేను
గుఱుతులెల్లాఁ దెలిపె కోరి చూచుమనవే

చ. 1: యెంచినవే యెంచితేను యెడతెగవు లెక్కలు
పొంచి యెందాఁకా నాతోఁ బొద్దు వుచ్చీనే
కొంచి దవ్వులఁ జూచితే కొండలు నున్ననైయుండు
వంచెనతో మొక్కెఁగాని వచ్చితే రమ్మనవే

చ. 2: చెప్పినవే చెప్పితేను సేనలౌను మాటలు
చిప్పిల నన్నెంత తాను చిమ్మిరేఁచీనే
వుప్ప గప్పరమువలె నుండు పరికించితేను
తిప్పరాదు తనయాస తెమ్మనవే విడెము

చ. 3: సేసినవే సేసితేను చేతికిఁ జిక్కఁ బనులు
వేసటలేక యెంత వెడ్డు వెట్టీనే
సేసవెట్టి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు తాను
మూసిన ముత్తెమై యుండె మోవి నాకిమ్మనవే

రేకు: 1881-4 నాదరామక్రియ సం: 28-476

పల్లవి: చూడరమ్మా యీకొత్తలు సుదతులాల
వేడుకలన్నియు వెల్లవిరులాయ నిదివో

చ. 1: కొండలవంటి వలపు కుప్పలయ్యే కాలమున
కొండలంతేసి చన్నులు కొమ్మకమరె
దిండుకట్టి యాసలు తీగెలుసాగే కాలాన
గుండుఁజేతుల తీగెలు కొమ్మ కొప్పె నిదివో

చ. 2: చీఁకటివంటి చిత్తము చిమ్మిరేఁగే కాలమున
చీఁకటి గొనే తురుము చెలికి మించె
వేఁకమైన సిగ్గుల వెన్నెల కాలమున
మూఁక నవ్వు వెన్నెలలు మొలచె నేఁడిదివో

చ. 3: పంట వండే జవ్వనము ఫలియించేకాలమున
పంటమోవి యింతికి ఫలియించెను
నంటు శ్రీవేంకటేశుతో ననిచినకాలమున
జంట పులక ననలు జాజుకొనె నిదివో

రేకు: 1881-5 వసంతం సం: 28-477

పల్లవి: పొద్దొక వింతలు యీ పొలఁతి బిన్నాణాలు
సుద్దు లేమని చెప్పేము చూడరమ్మ చెలులు

చ. 1: వేసినది వల్లవాటు వెలఁది పయ్యదకొంగు
పూసినది కస్తూరి బుజాలదాఁక
మూసినది చెక్కు చేఁత ముసిముసి నవ్వులతో
యీసతి వొయ్యారాలు యేమని చెప్పదమే

చ. 2: కట్టినది చెంగావి కడు నెరులు విరిచి
పట్టినది సేవంతి బంతి చేఁతలు
పెట్టినది విరులతో పెనచుక పెనుఁగొప్పు
ఇట్టి యీకె సింగారాలు యేమని చెప్పదమే

చ. 3: మించినది మేనునిండా నిచ్చళపు సొమ్ములు
పెంచినది కుచములు పెద్దలుగాను
అంచల శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్ను నేలె
యెంచి యీకె మురిపెము లేమని చెప్పదమే

రేకు: 1881-6 శంకరాభరణం సం: 28-478

పల్లవి: దొరతనములు చేసి దొరకొని చెనకీ
నిరతి నాకాఁగిట నీవుండఁగను

చ. 1: కొత్తలుగా నదె కొల్లున నవ్వీ
గుత్తల గుబ్బల గొల్లెత
బిత్తరి చూపులఁ బెనఁగొనఁ జూచీ
జొత్తుల విడేల జూటు గొల్లెతా

చ. 2: మంకుల మాఁటలు మలయుచు నాడీ
కుంకుమ చెమటల గొల్లెత
అంకులు గాజులు నటు మొరయించీ
జంకెన బొమ్మల జాణ గొల్లెతా

చ. 3: చాడెల చల్లలు సారెకు నమ్మీ
కూడేటి వేడుక గొల్లెత
యీడనె శ్రీవేంకటేశ నీ వేలఁగ
తొడనె మెచ్చీ దొడ్డి గొల్లెతా

రేకు: 1882-1 దేసాళం సం: 28-479

పల్లవి: ఎన్నిఁ గతలఁ గఱచె నీవనిత
సన్నలెల్లా దొంతి వెట్టి జట్టి సేసె వలపు

చ. 1: చేరి వద్ద గూచుండి చెవి కింపుగా నీతో
నేరుపుల మాఁట లాడీ నెలఁత
తేరకొన మోము చూచి తీగెలు సాగఁబెట్టి
కేరికేరి నవ్వు నవ్వి కెరిలించీ నీకు

చ. 2: మచ్చికలు వచరించి మనసు గరఁగ నీకు
యచ్చకమ లెల్లాఁ జేసీ నింతి
పచ్చిదేనియలు గార పగడవాతెర మోపి
ముచ్చటలఁ జూపి చూపి ముదిరించీ వలపు

చ. 3: కుంకుమ గుబ్బల నొత్తి కుచ్చి కుచ్చి కాఁగిలించి
లంకెలకు నిన్నుఁ దీసి లలన
అంకెల శ్రీవేంకటేశ యన్నిటా నన్నేలితి
పొంకముగ మొక్కిమొక్కి పూఁచీ నీకె వలపు

రేకు: 1882-2 సాళంగం సం: 28-480

పల్లవి: ఆపె వంకఁ గడవలే దన్నియు నీమహిమలే
కాఁపురము సేసే యింతి గర్వించవలదా

చ. 1: మన్నించి యీకెతో నీవు మంతనము లాడఁగాను
వున్నతిఁ బీఁటపై బెట్టుకుండఁగాను
చన్నులంటి యప్పటిని సరసములాడఁగాను
కన్నులకలికి యీపె గర్వించవలదా

చ. 2: సారెసారె యీపె మోవిచవి నీవు గొనఁగాను
నేరుపరితనాలెల్లా నీవెంచఁగాను
కోరి మేలువాడవై గుణాలు వొగడఁగాను
గారవపు జవరాలు గర్వించవలదా

చ. 3: పచ్చిగా నీవాపెతోను పకపక నవ్వఁగాను
కుచ్చి కాఁగిటను నీవు గూడఁగాను
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కచ్చుపెట్టి చూచి కాంత గర్వించవలదా

రేకు: 1882-3 భౌళి సం: 28-481

పల్లవి: వేవేలకు నీకు మొక్కి వేఁడుకొనేము
చేవదేరె వలపులు చిత్తగించిరావయ్యా

చ. 1: మంతనాలఁ గొంతసేపు మాఁటలనే కొంతసేపు
యెంత జోలిఁబెట్టేవు యేమయ్య
వంతుతో నిన్నుఁ బిలువవచ్చి తడవాయ నేము
ఇంతి నీకెదురుచూచీ నింటికి రావయ్యా

చ. 2: నవ్వులనే కొంతసేపు నమ్మికలఁ గొంతసేపు
యివ్వల బరాకు నీకు నేమయ్య
నివ్వటిల్ల విన్నపాలు నీకిన్నియుఁ జేసితివి
జవ్వని గాచుకున్నది సరుగరావయ్యా

చ. 3: మేలముఁ గొంత సేపు మేకులనే కొంతసేపు
యేలాటము లెంతచూపే వేమయ్య
మేలితివి శ్రీవేంకటేశ ఇంతలో వచ్చి
బాలను మన్నించి కలకాలము రావయ్యా

రేకు: 1882-4 సామంతం సం: 28-482

పల్లవి: ఎనసిన చోటికి నిచ్చకములే మేలు
వినయములెల్లాఁ జేసి వేడుకలే చూపవే

చ. 1: పగడవాతెర నొక్కి పతి నిన్ను వేఁడుకొనీ
మగువరో యితనితో మాఁటలాడవే
మొగమెత్తి లాలించి ముద్దుటుంగరము వెట్టీ
తగు నీచన్నులు సోఁక దండనే కూచుండవే

చ. 2: చేతిమీఁదఁ జేయివేసి చెప్పీ నీకుఁ బ్రియములు
నాతిరో నీవితనితో నవ్వు నవ్వవే
కాతరానఁ గాలు దొక్కి కప్పురము నీకు నిచ్చీ
ఆతుమారాఁ గాఁగిలించి యాస లీడేరించవే

చ. 3: పొలయలుక దేరిచి పొత్తుకు నిన్ను పిలిచీ
చెలియరో యితనితోఁ జెలరేఁగవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నటాను నిన్ను నేలె
తలఁచి నట్లానే యీతనితో భోగించవే

రేకు: 1882-5 గౌళ సం: 28-483

పల్లవి: ఏ పరాకున నున్నాఁడో యేమి సేసీనో తాను
చేపట్టి మన్నించుఁగాని చెప్పరే యీకతలు

చ. 1: పొలఁతి మెయి వలపులే పులకలై మొలచెను
కలసేటి కోరికలె కతతలాయను
తలపోఁత లుమ్మగిలి తరచుఁ జెమటలాయ
చెలులాల విభునికిఁ జెప్పరే యీకతలు

చ. 2: కామిని తమకములె గట్టి చన్నులై పెరిగె
నాముకొన్న సరసాలే నవ్వులాయను
తేమరేఁగే కరఁగులే తేనియలై మోవినూరె
చేముంచి యాతనితోడఁ జెప్పరే యీకతలు

చ. 3: నొరిది నాసలు కనుచూపులై యెదురుకొనె
పెరరేఁపు నుప్పతిల్లి పిలుపులాయ
ఇరవై శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి యింతి నేలె
సిరుల నితని కింకాఁ జెప్పరే యీకతలు

రేకు: 1882-6 రామక్రియ సం: 28-484

పల్లవి: ఇంకా నెంతసేసేనంటా నీపె గాచుకున్నదో
సంకెలేక నీపంత మిచ్చుట మెఱయవయ్యా

చ. 1: కన్నులఁ దప్పకచూచి కలువల నిన్నువేసి
సన్నలనే నీపొందులు సాదించెఁగా
చన్నులమీఁది పయ్యెద జారఁగ సరసమాడి
ఇన్నేసిచేఁతల నిన్ను నెలయించెఁగా

చ. 2: చక్కఁదనములు చూపి సరుసనె కూచుండి
ఇక్కువ లంటుచు నీకె యెలయించెఁగా
పిక్కటిల్లఁ బెనఁగుచు పెదవులనే నవ్వి
తక్కించి నిన్నిన్నిటాను తమ రేఁచెఁగా

చ. 3: వింత వింత మాఁట లాడి వేడుకలు పచరించి
మంతనపు రతులను మరిగించెఁగా
యింతలో శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వంతు వెట్టుక నిన్నిట్టె వరుసఁ జొక్కించెఁగా

రేకు: 1883-1 ముఖారి సం: 28-485

పల్లవి: ఒకటి కొకటికిని వొడగాయ
సకలంబునకును సమరసమాయ

చ. 1: కలికినెమ్మోము కళల మెరుగులకు
లలిఁ దురుము మొగులు లావాయ
తొలి తొలి వలపుల తొలుకరికాలము
వలనుగ నిదిగో వచ్చెను నేఁడు

చ. 2: రమణి కంకణపురవళి వురుములకు
చెమటల సోనలు చెలరేఁగె
తమకపు టాసల తగువెదకాలము
తమలపు ముదమునఁ దలకొనె నేఁడు

చ. 3: పడఁతి బొమల సురపతి చాపములకు
సడులని ప్రియముల జడి వట్టె
బడి శ్రీవేంకటపతిరతికాలము
తొడరి యింతట నెదురుకొనె నేఁడు

రేకు: 1883-2 రామక్రియ సం: 28-486

పల్లవి: ఆతఁడేడ నీవేడ ఆసలేల సేసీవే
కాతరాన నాతఁడు కైవశమై యుండఁగా

చ. 1: చనువులు సేసుకొని సంగాతపుమాట లాడి
యెనసె నాపతినేల యెలయించేవే
వినయము లెల్లాఁ జేసి వేడుకలు పుట్టించి
పనిలేని పనికేల బాఁతిపడేవే

చ. 2: వట్టివావులఁ జెనకి వలవని నవ్వు నవ్వి
చుట్టి చుట్టి పతినేల సొక్కు రేఁచేవే
గుట్టుతోడ మోవి చూపి కొలువులో నిలుచుండి
గుట్టువాయతనమునఁ గరఁగ నీకేలే

చ. 3: పైకొని సరసమాడి పక్కఁ బండి యంతలోనె
యీకడ శ్రీవేంకటేశు కేల లాడేవే
నీకితఁడు మేలువాఁడు నన్నిట్టె మన్నించినాఁడు
కాకరి విద్యలనేల కాఁతాళించేవే

రేకు: 1883-3 మాళవిగౌళ సం: 28-487

పల్లవి: కంటిఁగంటి మిదె కలిగె మాపాలిట
యింటి వేలుపై యేలీ వీఁడె

చ. 1: శ్రీ నరసింహుఁడు చిన్నయ రూపుఁడు
నానామహిమల నాటరుఁ(కుఁ?) డు
దానవాంతకుఁడు దైవశిఖామణి
పూని యహోబలపురపతి వీఁడే

చ. 2: పరమ పూరుషుఁడు ప్రహ్లాదవరుదుఁడు
హరి లోకోన్నతుఁ డనంతుఁడు
దురిత విదారుఁడు దుష్టభంజకుఁడు
సిరుల నహోబలశ్రీపతి వీఁడే

చ. 3: చెలువుఁడు వరదుఁడు జీవాంతరాత్ముఁడు
నిలిచె శ్రీవేంకట నిధియందు
బలువుఁడు సులభుఁడు భక్తరక్షకుఁడు
లలి నహోబలవిలాసుఁడు వీఁడే

రేకు: 1883-4 లలిత సం: 28-488

పల్లవి: సరసుఁడ వవుదువు జాణ వవుదువు
యిరవైన పనులు మీరిద్దరికిఁ దగును

చ. 1: కళలు మోమున నిండె కన్నులఁ జెంగాని మించె
సెలవులఁ జిరునవ్వు చిమ్మిరేఁగెను
యెలమి నేకతమున నింతి నేమిసేసితివో
వులివచ్చి సిగ్గులను వోలలాడీని

చ. 2: చెమట చెక్కులఁ గారె చిత్తము సంతసమందె
తమి మేనఁ బులకలు దైవారెను
రమణితో నీవెంత రతిసాము సేసితివో
తిమురుచు సంతోసాన తప్పలఁ దేలీని

చ. 3: మోవిపైఁ దేనియ లూరె ముచ్చటలు నోరికబ్బె
పూవులు కొప్పున నుండి పొందుగ రాలె
శ్రీవేంకటేశుఁడు కాంతఁ జెంది యెంత చేసితివో
వేవేలు వేడుకలను వినోదించీని

రేకు: 1883-5 రామక్రియ సం: 28-489

పల్లవి: పడఁతులాల సోబానఁ బాడరమ్మా
అడరి పెండ్లాడీని అహోబళేశుఁడు

చ. 1: యెదురుఁ గొండలమీఁద యిందిరాఁ దానుఁగూచుండి
మదనకళలు రేఁగ మాఁటలాడి
పదిలపుఁ జూపులనే బాసికము గట్టుక
అదివో పెండ్లాడీ నహోబలేశుఁడు

చ. 2: కను సన్నల మెల్లనె కాఁగిటికిఁ జేరి చేరి
చెనకుల నవ్వులనే సేసలు చల్లి
వెనుకొని మోవులను విందులు వెట్టుకొంటాను
అనిశముఁ బెండ్లాడీ నహోబళేశుఁడు

చ. 3: సందడింపు వేడుకల సమరతులనుఁ గూడి
కందున పెండ్లి పీఁటైన గద్దె మీఁదను
అందమైన శ్రీవేంకటాద్రి గరుడాద్రిని
అందుకొని పెండ్లాడీ నహోబళేశుఁడు

రేకు: 1883-6 శంకరాభరణం సం: 28-490

పల్లవి: ఇహపరములకును యేలికవు
బహురూపంబుల ప్రహ్లాదవరదా

చ. 1: వేయిగరంబుల వివిధాయుధంబుల
దాయల నడఁచిన దైవమవూ
నీయందు నున్నవి నిఖిల జగంబులు
పాయక మమ్మేలు ప్రహ్లాదవరదా

చ. 2: కదిమి దుష్టులను గతము సేసితివి
త్రిదశులఁ గాచిన దేవుఁడవు
వదల కిందరికి వరము లొసంగఁగ
బ్రదికితి మిదివో ప్రహ్లాదవరదా

చ. 3: శ్రీ వల్లభుఁడవు చిత్తజగురుఁడవు
కావలసినచోఁ గలుగుదువు
శ్రీవేంకటాద్రిని శ్రీయహోబలానను
భావింతు నీమూర్తి ప్రహ్లాదవరదా

రేకు: 1884-1 రామక్రియ సం: 28-491

పల్లవి: కలశాపురముకాడ కందువతోటలనీడ
వెలయుచు నున్నవాఁడు వీఁడె హనుమంతుఁడు

చ. 1: తాటింటి పండ్లగొల దాపరి చేతఁ బట్టక
వాటమై దైత్యులఁ గొట్ట వలచే యెత్తి
గాఁటాన శిరసుపైకి గక్కనఁ దోఁక నిక్కించి
యేటియై నిలుచున్నాఁడు మించి హనుమంతుఁడు

చ. 2: బాలసూర్యబింబమును పండుగాను భావించి
చాలుకొనఁ బాదముల జంగ చాఁచి
కోలుముందుగా సత్వ గూడ నుర ముబ్బించి
నేలా మిన్నూ మోచినాఁడు నిండి హనుమంతుఁడు

చ. 3: ముంచిన ప్రతాపమున మొగము బిగించుకొని
అంచెల నన్నిటాను జయమునఁ బొంది
యెంచఁగ శ్రీవేంకటేశు కితవరి దాసుఁడై
మంచి వరము లిచ్చీని మాకు హనుమంతుఁడు

రేకు: 1884-2 బౌళి సం: 28-492

పల్లవి: మూఁడు మూరుతులకెల్ల మూల మీతఁడు
వీఁడె పెక్కు మహిమల విట్ఠలేశుఁడు

చ. 1: గోవరుదన మెత్తిన గోవిందుఁ డీతఁడు
గోవులఁ గాచిన యట్టి గోవాళుఁడు
భావించు సురలపాలి పారజాత మీతఁడు
వేవేలు మహిమల విట్ఠలేశుఁడు

చ. 2: చక్కని గొల్లెతలకు జారపురుషుఁడీతఁడు
అక్కజపు వెన్నలకు నాసోదకాఁడు
పక్కన ద్రౌపదిఁగాచే పాచిక విద్య యీతఁడు
వెక్కసపు మహిమల విట్ఠలేశుఁడు

చ. 3: బలువుఁడు పాండవపక్షపాతి యీతఁడు
వలసిన వారికెల్లా వరదుఁడు
అలరి శ్రీవేంకటేశుఁడై పొడచూపె నీతఁడు
వెలసిన మహిమల విట్ఠలేశుఁడు

రేకు: 1884-3 లలిత సం: 28-493

పల్లవి: దొరతనము సేసెఁ దుంగభద్రాతటమున
సిరుల సుగ్రీవనర సింహదేవుఁడు

చ. 1: ఇందిరనుఁ దొడమీఁద నిడుకొని
పొందులసన్నల లోలోఁబొసఁగుకొని
అంది సరసపు మాఁ టలాడుకొని
చెంది నవ్వీ నిదె నరసింహదేవుఁడు

చ. 2: అదె పెండ్లి కూఁతురుఁ దానలముకొని
సదరాన మోవితేనె చవులుగొని
మదనకేలి యీపెతో మరుగుకొని
చెదరకున్నాఁడు నరసింహదేవుఁడు

చ. 3: దేవులుఁ దానుఁ దెప్పలఁదేలుకొని
వోవరిలో సంతోసాల నొనరుకొని
శ్రీవేంకటాద్రిమీఁద జెలఁగుకొని
చేవమీరి చొక్కీ నరసింహదేవుఁడు

రేకు: 1884-4 సాళంగనాట సం: 28-494

పల్లవి: వినయాలు సేసేవు వేంకటేశుఁడ
వెనువెంటఁ బాయక వేంకటేశుఁడ

చ. 1: విరుల వేసే వదేమో వేంకటేశుఁడ
వెరగయ్యీ నీ చేతఁకు వేంకటేశుఁడ
విరివాయ నీసుద్దులు వేంకటేశుఁడ
అరుదుగ వింటిమోయి అన్నీ వేంకటేశుఁడ

చ. 2: వేడుకకాఁడ వౌదువు వేంకటేశుఁడ
వీడుదోడాడేవు మాతో వేంకటేశుఁడ
వీడెపు మోవి నవ్వేవు వేంకటేశుఁడ
జాడలెల్లా గంటిమోయి సారె వేంకటేశుఁడ

చ. 3: వేసాల బాఁడవుగదో వేంకటేశుఁడ
వేసారవు రతులను వేంకటేశుఁడ
వేసేవు నాపైఁ జేయి వేంకటేశుఁడా నన్ను
సేసవెట్టి పెండ్లాడేవు శ్రీవేంకటేశుఁడా

రేకు: 1884-5 మాళవిగౌళ సం: 28-495

పల్లవి: శరణు శరణు నీకు జగదేకపతి కృష్ణ
వరము నొసఁగవయ్యా వాసుదేవ కృష్ణ

చ. 1: ముద్దులు విరిచినట్టి మాధవ కృష్ణ
సుద్దులు చెప్పవయ్యా అచ్చుత కృష్ణ
వొద్దు రాఁగదవయ్యా ఉపేంద్రకృష్ణ
ముద్దులు గురియవయ్యా ముకుందకృష్ణ

చ. 2: గొల్లెతల మరిగిన గోవింద కృష్ణ
చెల్లునయ్యా నీచేతలు శ్రీధరకృష్ణ
అల్లన దొంగాడవయ్య హరికృష్ణ
మల్లుల గెలిచినట్టి మధుసూదన కృష్ణ

చ. 3: గోవులఁగాచినయట్టి గోపాలకృష్ణ
కైవశమై మమ్మేలు శ్రీకరకృష్ణ
నా విన్నపమాలించు నారాయణ కృష్ణ
సేవకుఁడఁ జుమ్మీ నీకు శ్రీవేంకటకృష్ణ

రేకు: 1884-6 ఆహిరినాట సం: 28-496

పల్లవి: త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాఁడు
భువి సేవించేవారిపాలి పుణ్యఫల మీతఁడు

చ. 1: అంచె నుదయాస్త గిరులందు నొక జంగ చాఁచి
వంచించక మిన్ను దాఁక వాలమెత్తి
ముంచి బ్రహ్మలోకము మోవఁగఁ బ్రతాపమున
పెంచినాఁడు తనమేను పెద్దహనుమంతుఁడు

చ. 2: తిరముగ హసత్తములు దిక్కులు నిండఁ బరపి
వరుసఁ గర్ణము లిరువంకఁ జిక్కించి
దుర దుర మస్తకము ధ్రువమండలము సోఁక
పెరిగినాఁ డిదివో పెద్దహనుమంతుఁడు

చ. 3: అక్కజపు రోమము లన్నిలోకము లొరయ
మొక్కుచు శ్రీవేంకటేశుమోహపు బంటై
పక్కన నజాండ కప్పరము నిండాఁదాను
పిక్కిటిల్లినాఁ డిదివో పెద్దహనుమంతుఁడు

రేకు: 1885-1 దేసాళం సం: 28-497

పల్లవి: ఏమిసేతురా నామనసు యెంతైనాఁ బట్టఁగలేను
కామించిన దాననై కడుఁ గొసరేఁగాక

చ. 1: సేసవెట్టిన పతిని చేరి నన్ను మఱచేవా
పాసివుండనోపక పదరేఁగాక
నా సొమ్ముయినవాఁడవు నన్ను నీవు యెడసేవా
ఆసలాసలను నీకు నేఁకరేఁగాక

చ. 2: చేపట్టినవాఁడవు చిత్తానఁ బెట్టకుండేవా
ఆపలే కెచ్చరించి మాఁటాడేఁగాక
నాపొందు సేసేవాఁడవు నాకు వింతయయ్యేవా
తీపుల నీమోవి చూచి తిమిరేఁగాక

చ. 3: సేవగొనేటి వాఁడవు చేసన్నకు లోనుగావా
కావరపుఁ దమితోఁ గదిమేఁగాక
నావాఁడవైవాఁడవు నన్నిప్పుడు గూడవా
శ్రీవేంకటేశుఁడ బత్తిఁ జెనకేఁ గాక

రేకు: 1885-2 బౌళి సం: 28-498

పల్లవి: ఇట్టి నీమగని సుద్దు లెంతని చెప్పేమమ్మ
వొట్టుకొని వురముపై నుండవమ్మ ఇఁకను

చ. 1: కలికి తనపు నీకనుచూపు లంటాను
కలవ దండలు మేనఁ గప్పకొనును
పలచని మోవితేనె పలుకులేయంటాను
చిలుకలు సారెసారెఁ జేరి మాఁటాడించును

చ. 2: చక్కని నీ సొబగైన నీచనుగుబ్బలంటాను
పక్కన నిమ్మపండు చేఁబట్టి చూచును
అక్కజమయిన నీయందపుఁ జేఁతలంటాను
నిక్కి నిక్కి యద్దములు నీడలు చూచును

చ. 3: నినుపుఁ గాంతులతోడి నీ కొప్ప నెరులంటా
మునుకొని నీలాలసొమ్ములే పెట్టును
యెనసె నిన్ను శ్రీవేంకటేశుఁ డిట్టె యిందాఁకా
నిను వ్రాసిన రూపము నీవంటా మాఁటాడును

రేకు: 1885-3 ఆహిరి సం: 28-499

పల్లవి: సరసుఁడ వన్నిటాను చతురుఁడవు
తరుణి నీకు మేలుది దయఁజూడఁదగును

చ. 1: తలపోసి తలసోసి తనలోనె నవ్వు నవ్వు
చెలి నీసుద్దు లడిగి చెమరించును
సొలసి నీకెదురులు చూచి నివ్వెరగందు
కలదెల్లాఁ జెప్పితిమి కరుణించఁదగును

చ. 2: చేతులెత్తి యెత్తి మొక్కు సిగ్గువడు నంతలోనె
దూతికల నీకు నెదురుగా నంపు
రాతురులు వేగించు రతులకు నాసపడు
కాతరాన నున్న యింతిఁ గరుణించఁదగును

చ. 3: పిలిచి పిలిచి నీకుఁ బ్రియములు సారెఁ జెప్ప
అలరఁగ వ్రాసి లేకలంపు నీకును
యెలమి శ్రీవేంకటేశ యింతలోనె వచ్చి కాంత
గలసితి విట్లానే కరుణించఁ దగును

రేకు: 1885-4 భైరవి సం: 28-500

పల్లవి: మచ్చరపు దానఁగాను మన్నించు చిత్తానఁ బెట్టి
మచ్చికలు రేఁచి నిన్ను మరుగుదుఁగాని

చ. 1: చనవుగలదంటాను సాదించనేను
ననపు గలదంటాను నాటించ గొరు
మనసెరుఁగుదునంటా మందెమేళము సేయను
వినయముతోడుతను వేఁడుకొందుఁగాని

చ. 2: పంతగత్తెనంటాను బలిమి చూపను నేను
అంతరంగురాలనంటా నట్టె సొలయ
యింతటి దాననంటాను యెమ్మె నెరప
చెంతనుండి వావి చెప్పి చెనకుదుఁగాని

చ. 3: చుట్టపు దాననంటాను సొలయనేను
దిట్టనంటా మొక్కలాన దీకొన నేను
యిట్టె శ్రీవేంకటేశ నన్నేలితివంటా గర్వించ
పట్టపు దేవులనై నీ బడినుందుఁగాని

రేకు: 1885-5 వరాళి సం: 28-501

పల్లవి: వలపు దాఁచవచ్చునా వడి నెవ్వరికైనాను
కలికాలమును నిట్టె నెవ్వరికైనాను

చ. 1: తనివారా నాతని దగ్గర గూచుండవే
గునియుచునేల సిగ్గున నుండేవు
మనసారా వొకమాటే మాఁటలెల్లా నాడవే
గొనకొని నీవేల గుక్కుకొనేవు

చ. 2: కన్నులారాఁ దేరకొన గక్కనఁ జూడవే
సన్నలా చాయలా నేల జాలిగొనేవు
చన్నులారా నాతని చరణము నొత్తుకోవే
చెన్నుమీర లోలోనేల చిమ్మిరేఁగేవు

చ. 3: చేతులారా వేడుకతో చేరి కాఁగిలించుకోవే
కాతరించి రతినేల కడుఁగొంకేవు
ఆతునూరాఁ గూడె నిన్ను నదె శ్రీవేంకటేశుఁడు
నాతో నెంత నీవు యిఁక నవ్వుతాఁ జెప్పేవు

రేకు: 1885-6 సామంతం సం: 28-502

పల్లవి: ఇన్నీ నీవే యెఱుఁగుదువు యేమని చెప్పేము నేము
నిన్నిందరూఁ బొగడేరు నేరుతువే చెలియా

చ. 1: మచ్చికలు చూపి పతిమనసురా మాఁటలాడి
యిచ్చకమే సేయవలె నింతులకును
మెచ్చుఁ గొలువులు సేసి మేలములు వచరించి
ముచ్చటలనే కడు మోహింపించవలెను

చ. 2: కన్నులఁ దప్పకచూచి కానుకలు చేతికిచ్చి
సన్నలనే నవ్వవలె సతులకును
తిన్నఁగా మొక్కులు మొక్కి తేనెమోవినే గొసరి
విన్నపముల నేరుపు లెలయించవలెను

చ. 3: అంగములు సోఁకించి ఆయములు గరఁగించి
సంగతితో నుండవలె సతులకును
యింగిత మెరిఁగి నిన్ను నేలె శ్రీవేంకటేశుఁడు
రంగుగ నీ సతివినే రమియించవలెను

రేకు: 1886-1 రామక్రియ సం: 28-503

పల్లవి: రాముఁ డీతఁడు లోకాభిరాముఁ డీతఁడు
కామించిన విభీషణుఁ గాచినవాఁ డీతఁడు

చ. 1: శ్రీదైవారినయట్టి సీతారాముఁ డీతఁడు
కోదండ దీక్షా గురుఁ డీతఁడు
మోదమున నబ్ధి యమ్ముమొనకుఁ దెచ్చె నీతఁడు
పాదుకొని సుగ్రీవు పగ దీర్చె నీతఁడు

చ. 2: ఘోర రావణుని తలగుండు గండఁడీతఁడు
వీరాధి వీరుఁడైన విష్ణుఁ డీతఁడు
చేరి యయోధ్యాపతియై చెలఁగినవాఁ డీతఁడు
ఆరూఢి మునుల కభయము లిచ్చె నీతఁడు

చ. 3: తగ నందరిపాలిటి తారకబ్రహ్మ మీతఁడు
నిగమములు నుతించే నిత్యుఁ డీతఁడు
జగములో శ్రీవేంకటేశ్వరుఁడైనవాఁ డీతఁడు
పగటున లోకమెల్లాఁ బాలించె నీతఁడు

రేకు: 1886-2 గౌళ సం: 28-504

పల్లవి: ఇంతిరో పాయపువారి ఇంపు లిటువంటివి
మంతనపు వేడుకలు మర్మములు సాఁకించు

చ. 1: మతిలోని తమకము మచ్చికలు వుట్టించు
సతతము సంగాతము చవులు రేఁచు
అతిసరసము గడు నాసలకు లోనుసేసు
రతి వినోద మెపుడు రచ్చలఁ బొందించును

చ. 2: కొనగోరి చెనకులు గుబ్బతిల్లుం(లిం?)చు మనసు
కనుచూపులు చుట్టరిక మంటించును
పెనఁగులాటలు లోలో బెరఇంచుఁ బంతములు
ననుపు లెల్లకాలము నమ్మికలు నెరవు

చ. 3: జవ్వనపు మదములు సరివెనఁగింపించు
నవ్వు లట్టె వలపులు నాము లెక్కించు
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నేలినాఁడు
మవ్వపు వినయములు మరుఁగగఁ జేయును

రేకు: 1886-3 వరాళి సం: 28-505

పల్లవి: చెప్పఁ జేప్పఁ గొత్తలాయ చెలియ నీ సొబగులు
కుప్పలుఁదెప్పలునై గురుతులు మీరెనే

చ. 1: కన్నులపండుగ గదే కలికి నీరూపము
జన్నె పొఁడిగదే నీచక్కని మోవి
వెన్న(న్నె?)ల తేటలుగదే వేడుక నీనవ్వులు
వన్నెగా నిన్నుఁ బొందినవాఁడే భాగ్యవంతుఁడే

చ. 2: ముంగిట ముగ్గులు గదే ముదిత నీ సింగారము
తంగేటి జున్ను గదే దంట మాఁటలు
కొంగుఁ బాలు గదవె పూఁటవూఁట నీసిగ్గులు
అంగన నిన్నేలేవాఁడు అతిభాగ్యవంతుఁడే

చ. 3: పెట్టెలో సొమ్ము గదవే ప్రియరాలు నీవయసు
కట్టిన ముడుపుగదే కాఁగిటి రతి
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
దట్టమై నీపాలివాఁ డితఁడే భాగ్యవంతుఁడే

రేకు: 1886-4 మంగళకౌసిక సం: 28-506

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్లదాఁకా నిటువంటి మీ పొందులు
మెఱసి యెప్పుడూ నాకు మేలువాఁడవు నీవు

చ. 1: వలవని వేసాలతో వావులెల్లాఁ జెప్పీని
సొలసి సొలసి యీపె చుట్టమా నీకు
పలుమారు నీతోడ పచ్చిగానే నవ్వీని
తొలుతనే తనకాలు దొక్కతివా నీవు

చ. 2: చనువు సేసుక వచ్చి సరసము లాడీని
గొనకొని మేనమామ కూఁతురా నీకు
చెనకి చెనకి నిన్ను జె(జి?) మ్మిరేఁచీ మాఁటలను
వనిత కేమైనాను వలతువా నీవు

చ. 3: కప్పరము నోరికిచ్చి కాఁగిలించ (త?) లిచ్చీని
చెప్పరానఁ బట్టపు దేవులా నీకు
యిప్పుడు శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
చెప్పరాని బాసలెల్లాఁ జేసితివా నీవు

రేకు: 1886-5 కేదారగౌళ సం: 28-507

పల్లవి: ఎటువంటి పొందులో మీ యిద్దరికిని
తటునక మాకు నేఁడు తారుకాణ లాయను

చ. 1: ముసి ముసి నవ్వులతో ముచ్చట చెప్పీ నాకె
విసుగక చెవులారా వినవయ్యా
కొసరుచుఁ జెలి నిన్నుఁ గొంగువట్టి పెనఁగీని
సుసరాన లోనైతే సూటికి రావయ్యా

చ. 2: సిగ్గులు వడక నిన్నుఁ జెక్కు నొక్కి వేఁడు కొనీ
దిగ్గన నందుకు సమ్మతించవయ్యా
వెగ్గళపుఁదమి తోడ వీడెము నీకిచ్చీని
వొగ్గి యందుకొని సేవవొప్ప గొనవయ్యా

చ. 3: వెక్కసముగా నీకు వినయాన మొక్కీని
చొక్కుచు మోము దప్పక చూడవయ్యా
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తక్కక యాకె చెనకీ తప్పించుకొవయ్యా

రేకు: 1886-6 సాళంగనాట సం: 28-508

పల్లవి: ఏడ నుండెనో తాను యిన్నాళ్ల దాఁకా
యీడు జోడయిన సుద్దు లీతని నడుగరే

చ. 1: పూసగుచ్చినటువలె పొలఁతి మాఁటలాడీని
వేసర దెంతైనాను విభునితోను
రాసివోసినటువలె రవళితో నవ్వు నవ్వీ
యీసుదతి యెవ్వతెని యీతని నడుగవే(రే?)

చ. 2: వడ్డి కిచ్చినటువలె వచ్చి వచ్చి కొసరీని
వొడ్డారాలు నెరపుతా నూరకె తాను
దిడ్డి దీసినటువలె తేరకొనఁ జూచీని
యెడ్డ యిది యెవ్వతెని యీతని నడుగరే

చ. 3: గంపఁ గమ్మినటువలె కాఁగిట బిగించీని
చెంపల చెమటలతో సిగ్గువడదు
దింపక నన్నేలినాఁ డిదివో శ్రీవేంకటేశుఁడు
యింపుల నీబెవ్వతెని యీతని నడుగరే

రేకు: 1887-1 ఆహిరి సం: 28-509

పల్లవి: ఏల తమకించేవే యింతిరో నీవు
వాలాయించి యెప్పుడూ నీవద్దనున్నాఁ డితఁడు

చ. 1: చిన్నఁబోయి యుండకువే చెలియ నీవు
మన్నించీ నాతఁడు నిన్ను మచ్చికతోను
యిన్నేసి నివ్వెరగులు యేఁటికే నీకు
పన్ని యెప్పుడూ నీపై బత్తిగలఁ డితఁడు

చ. 2: తల వంచుకొనకువే తరుణి నీవు
పిలువక తొల్లే వచ్చీఁ బ్రియముతోను
యెలమిఁ జెక్కిటి చెయ్యేఁటికే నీకు
మలసి యెప్పుడూ నీకు మరిగినాఁగితఁడు

చ. 3: వసివాడకువే లోలో వనిత నీవు
యెసగ శ్రీవేంకటేశుఁ డేలెను నిన్ను
యిసుమంత చిరుసిగ్గు లేఁటికే నీకు
వసమై యెప్పుడూ నీకు వలచినాఁ డితఁడు

రేకు: 1887-2 దేవగాంధారి సం: 28-510

పల్లవి: ఇవిగో నీ చెలిసుద్దు లింకఁ గరుణించవయ్య
వివరముగా విన్నవించితిమి నీకు

చ. 1: తలపోఁతఁ గొంతవడి తరుణి పొద్దు గడపు
చెలులతోఁ గొంతువడి చెప్పుఁ గతలు
నెలకొని కొంతవడి నీరూపు పటాన వ్రాసు
నిలుచుండి కొంతవడి నీకెదురు చూచును

చ. 2: నేరుపుతోఁ గొంతవడి నీమీఁది పాటలు వాడు
కూరిములఁ గొంతవడి గుబ్బతిలును
పారితెంచి కొంతవడి బయలు గాఁగిట నించు
సారెఁ గొంతవడి లోలో సరసములాడును

చ. 3: నెట్టుకొని కొంతవడి నిన్నుఁ బేరుకొని పిల్చు
అట్టె కొంతవడి నీకు నాసపడును
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వింతలో వచ్చి
గట్టిగాఁ గొంతవడి నీగరిమ లడుగును

రేకు: 1887-3 గౌళ సం: 28-511

పల్లవి: చెప్పతిఁ జుమ్మీ నీకు, చెలికత్తె నే నాపెకు
యెప్పుడూను మఱవకు యీగురుతు లిపుడు

చ. 1: చేరఁడేసి కన్నులాపె సెలవుల నవ్వులాపె
మూరెఁడు గొప్పాపె నీకు మొక్కితే ననె
తోరపుఁ బిరుఁదులాపె తొండపుఁ దొడలయాపె
తారుకాణలైపొందు దలఁచుకొమ్మనెను

చ. 2: పట్టెఁడేసి గుబ్బలాపె పలచని మోవియాపె
అట్టె నీపరిణామ మడుగుమనె
జుట్టెఁ డేశడుగులాపె సోయగపుఁ జేతులాపె
చుట్టరికపు వావు లెంచుకొమ్మనె నిన్నును

చ. 3: కొడిఁగెఁడు మొగమాపె కోమలపు మేనియాపె
అడరి నీవు తన్నుఁ బెండ్లాడితివనె
పిడికెడు నడుమాపె పెనఁగి శ్రీవేంకటేశ
యెడయక ఇట్టానె యేలుకొమ్మనెను

రేకు: 1887-4 లలిత సం: 28-512

పల్లవి: ఆపె నీకు మేలుది నీవాపెపై బత్తిగలవు
చేపట్టి కరుణతోడఁ జిత్త గించవయ్యా

చ. 1: వెలఁది మాఁటలు నీకు విన్నపము సేసితివి
సొలసి గురుతు లెల్లాఁ జూపితిమి
పిలిచితి మింటికిని ప్రియములు చెప్పితిమి
అలరి మారుత్తరము లానతియ్యవయ్యా

చ. 2: కమ్మటి నాకె యంపిన కానుకలు నిచ్చితిమి
ముమ్మాటి దాఁకా నీకు మొక్కితిమి
నెమ్మది నీబాసలు నీకుఁ దలఁపించితిమి
యిమ్ముల నీచిత్త మిఁక నెట్టున్నదయ్యా

చ. 3: చుట్టపు వరుసలెల్లా సొంపుగాఁ దెలిపితిమి
బెట్టుగా నాపెచే సేస వెట్టించితిమి
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి; తా సిగ్గుతో
గుట్టున నున్నది తనగుణము మెచ్చవయ్యా

రేకు: 1887-5 శంకరాభరణం సం: 28-513

పల్లవి: కాదనేనా నేనిన్ను కన్నులారాఁ జూచితి
పొదిసేసి నన్ను నెట్టు బుజ్జగించేవయ్యా

చ. 1: విన్నపములు వింటివి వీడె మింతి కిచ్చితివి
పన్నుక నన్నెంత వొడఁ బరచేవయ్యా
సన్న సేసితి వాపెతో సరసమూ నాడితివి
చన్నులంటి నాతో నేమి సరి వెనఁగేవయ్యా

చ. 2: తప్పక చూచితి వాపె దగ్గరఁ గూచుండితివి
అప్పటి నా పొందుసేసే వది యేమయ్యా
కొప్పు దువ్వి పెట్టి కాంతకొంగు వట్టుకున్నాడవు
ముప్పిరి నాకిట్టె యెంత మోవి యిచ్చేవయ్యా

చ. 3: పొసఁగ నవ్వితి వాపె పొత్తుకుఁ బిలిచితివి
కొసరి నన్నెంత వేఁడుకొనేవయ్యా
యెసగ శ్రీవేంకటేశ యేలితివి మమ్మిద్దరి
రసికుఁడ వలపెంత రచ్చ వేసేవయ్యా

రేకు: 1887-6 బౌళి సం: 28-514

పల్లవి: ఆయనాయ నీసుద్దులు అన్నియుఁ గనుఁగొంటిని
పాయపుమదాననేల బయలీఁదించేవు

చ. 1: సేవంతి విరుల వేసి చెలికొంగువట్టి తీసి
వావులు చెప్పతా నెంతవడి నవ్వేవు
నీవూ నాపె చుట్టాలవుత నేనది యెఱఁగనా
యివల నాముందర నీవెంత పచారించేవూ

చ. 2: చెక్కు కొనగొర నూఁది చిమ్మి తమ్ముల మొసఁగి
మక్కువ నించి యందు కా మాలటాడేవూ
అక్కరతో నాఁడే మీయడియాలలు చూడనా
యిక్కడ నాకేల నీవు యెమ్మెలు చూపేవూ

చ. 3: కాలుదొక్కి యంతలోనే కాఁగిటను బిగియించి
వేలువట్టుకొని యిట్టె వేఁడుకొనేవు
మేలిమి శ్రీవేంకటేశ మీ గుణాలు వినమా
యేలితివి నన్ను మీలో యింపులుఁ జూపేవూ

రేకు: 1888-1 సాళంగనాట సం: 28-515

పల్లవి: ఏమని పొగడవచ్చు నిదివో నీదేవులను
ఆముకొని చక్కఁ జూడ నవధరించవయా

చ. 1: పొలఁతి చిరునవ్వులు పున్నమ వెన్నెలపొళ్లు
కలికి కనుచూపులు కన్నెలేళ్లు
మలయు మోవితేనెలు మరుని గుజ్జనగూళ్లు
అలరి యీకె పొందులు అవధరించవయా

చ. 2: గరిమనాడే మాటలు కప్పురపుమూట లు
పరగుఁ జక్కఁదనాలు బండిబాటలు
తెరమరఁగు సిగ్గు లొద్దికఁ బెట్టనికోటలు
అరిమురి వేడుకతో నవధరించవయా

చ. 3: చెక్కుమీఁది చెనకులు సింగారపుఁగళుకులు
నిక్కుఁగాంతులు పైఁడి వన్నె తళుకులు
ఇక్కువ శ్రీవేంకటేశ యీకెనిట్టె యేలితివి
అక్కజనపు సరసము లవధరించవయా

రేకు: 1888-2 పాడి సం: 28-516

పల్లవి: కానీలేవే యందుకేమి కంటిమి నీజాడలెల్లా
నానేరుపు లెఱఁగవా నావాఁడాయ నితఁడు

చ. 1: మూసిన ముత్తెమువలె ముందరను నిలుచుండి
ఆసలు పుట్టించే వేమే యతనికిని
పూస గుచ్చినటువలె పొసఁగఁగ మాఁటలాడి
లాసిలాసి మతని మెల్లనె దక్కఁగొంటివే

చ. 2: వనము కోవిలవలె వరుసఁ బాటలు వాడి
మనసు గరఁచే వేమే మగవానిని
పెనచి యటువలె పీఁటమీఁదఁ గూచుండి
చెనకి చెనకి లోను చేసుకొంటివే

చ. 3: పాయని చుట్టము వలె పక్కఁ బండి యీతని
మాయలఁ బెట్టేవేమే మాఁటి మాఁటికి
యీయెడ శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁ గూడె
చాయలా సన్నలా నీవూఁ జవులు చూపితివే

రేకు: 1888-3 సామంతం సం: 28-517

పల్లవి: చిత్తగించు మగువను సిగ్గులు వడక నీవు
హత్తి బాగాలు చేతికి నంతి యిచ్చీ నీకు

చ. 1: జక్కవ గుబ్బలమీఁద జారినపయ్యద తోడ
నిక్కి నిక్కి చూచీని నెలఁత నిన్ను
చెక్కులఁ జెమటఁగారఁ జెంగలించుకొంటాను
యిక్కువ నుండి చేతులెత్తి మొక్కీ నీకు

చ. 2: మొలనూలు దిరిగిరా మోసేటి గంటలతోడ
లలి నీసేవలు సేసీ లలన యిదె
పెలకలు మేన నిండ బుసకొట్టు కొంటాను
పలుమారు నిట్టె విన్నపాలు సేసీ నీకు

చ. 3: కొప్పున నుండి రాలేటి గొజ్జంగ విరులతోడ
వొప్పగ నీతో నవ్వీ నువిద
నెప్పున శ్రీవేంకటేశ నీవింతలోఁ గూడఁగాను
చెప్పరాని తలఁపెల్లాఁ జెప్పి చూపీ నీకు

రేకు: 1888-4 ఆహిరి సం: 28-518

పల్లవి: చిత్తగించి చూడవయ్యా చెలరేఁగి దేవులను
యిత్తల నీకె సుద్దులు యెన్నెని చెప్పేమయా

చ. 1: కలికి నెమ్మొగమునఁ గాఁపుర ముండుఁ జంద్రుఁడు
వెలయ సెలవులను వెన్నెలగాయు
పలుకుల నేపొద్దు పచ్చి దేనియలుగారు
యిల నింతి చక్కఁదన మెంతని చెప్పేమయా

చ. 2: నిక్కి చనుఁగవతోడ నేస్తము సేయుఁ గొండలు
చొక్కపు మరుతూపులు చూపుల జోడు
నెక్కొని తురుమునందు నిండుఁ జీఁకట్లు గప్ప
యెక్కువ చెలిసింగారా లెంతని చెప్పేమయా

చ. 3: పడఁతి మేనిపై నెల్లా బంగారుపంటలు వండు
చిడుముడి బాదాలకు చిగురు దావు
కడఁగి శ్రీవేంకటేశ కాఁగిటఁ గూడితి విట్టె
యెడయ నీసతిభావా లెంతని చెప్పేమయా

రేకు: 1888-5 బౌళి సం: 28-519

పల్లవి: గక్కనఁ జెప్పవే యెన్నికతలఁ గరచితివి
చొక్కముగా నిన్నుఁ జూచి సోద్యమయ్యీ నాకు

చ. 1: చిన్ని పెదవుల నట్టె చెప్పేవు సుద్దులెల్లా
యెన్నిక నీతనికి నీ వేమౌదువే
కన్నులఁ దప్పక చూచి కరఁగేవు మనసున
పన్నినవల పతనిపై నెంత గలదే

చ. 2: మలయుచు నూడిగాలు మాపు దాఁకాఁ జేసేవే
ఇల నితనికి నీకు నెన్నటి పొందే
పెలుచుఁ జన్ను లదర పెనఁగి వేఁడుకొనేవు
చలిమి బలిమి నీకు సలిగెంత గలదే

చ. 3: నాటకపు ప్రేమతోడ నవ్వు లెల్లా నవ్వేవు
యీాటుతో నీయాస ఇంకా నెంతగలదే
చాలువగా శ్రీవేంకటేశ్వరుఁ డిట్టె నన్ను నేలె
చాటుననే మొక్కేవు నీసలిగెంత గలదే

రేకు: 1888-6 నాదరామక్రియ సం: 28-520

పల్లవి: వెఱవకువే నీవు వెలఁది వీని కివెల్లా
మెఱయ నొండొకటికి మిక్కిలి పొందేకదే

చ. 1: జలజాక్షి నీమొగమే చందురుఁడై యుండఁగాను
యెలమిఁ గలువబాణా తామరలై యుండఁగాను
తళుకు నీకన్నులే తామరలై యుండఁగాను
బలిమి తుమ్మిదలు నీపైఁ బంతము చూపీనా

చ. 2: యింతి నీ జవ్వనవన మిట్టై నీమై నుండఁగాను
చెంతఁ గోవిలేఁటికిఁ జిమ్మిరేఁచీనే
మంతనపు నీపిఱుఁదే మరురథమై యుండఁగా
రంతుల చిలుక లేమి రవ్వ సేసీనే

చ. 3: అందపుఁ జన్నులు కొండలై నీకు నుండఁగాను
మందానిలుఁడేల మారుకొనీనే
యిందు నిట్టై శ్రీవేంకటేశుఁడు నిన్నేలఁగాను
కందువఁ జిత్తజుఁ డిట్టై కాకు సేసీనా

రేకు: 1889-1 శ్రీరాగం సం: 28-521

పల్లవి: ఇటువంటి మనోరథా లింతికి సఫలమాయ
తటుకన నీపె నిట్టె దయఁజూడవయ్యా

చ. 1: తలపోసు నీతోడి తనుభోగములు చెలి
మలయుచు నూరకే మాఁటలాడును
చిలుకు కొనగోరను చిమ్ము నిన్ను భావించి
తలిరుఁ జేతుల నీతముల మడుగును

చ. 2: బయలు గాఁగిట నించు పక్కనే ఉన్నాఁడవంట
ప్రియములు చెప్పు నినుఁ బేరఁ బిలుచు
నియతిఁ బరపు చూచి నీవని పాదము చాచు
నయగారి తనాల సన్నలుసేసి కొసరు

చ. 3: సేసవెట్ట నుంకించు సిగ్గువడు నంతలోనే
ఆసతో నవ్వు రతికి నట్టె కొసరు
చేసూటి నంతలో వచ్చి శ్రీవేంకటేశ కూడితి
నీసుద్దు లెల్లాఁ దెలిసి నిక్కముగా మెచ్చును

రేకు: 1889-2 పాడి సం: 28-522

పల్లవి: గుఱుతులెల్లాఁ గంటిమి గుట్టు సేయ నిఁకనేల
మఱఁగులు వెట్టకిఁక మాతోఁ జెప్పవయ్యా

చ. 1: చెలియ ముడుచుకొన్న చెంగలువ పువ్వులు
యెలమి నీకొప్పులోని కేల వచ్చెను
పొలుపుగాఁ జన్నులపై బూసిన గందము నీమై
వెలయఁగ నంటుకొన్న విధ మానతీవయా

చ. 2: ఆకాంత గట్టుకొన్న యట్టి చంద్రగా (కా?) వి చీర
నీకు దట్టియైనట్టి నెప మేఁటిది
మేనొని యాపెపాదాల మించులును మెట్టెలును
యీకాడ నీవేళ్లనున్న దిదేమి చెప్పవయా

చ. 3: సుదతి చెవిలోనున్న సొంపైన తట్టుపుణుఁగు
చెదరి నీపచ్చడానఁ జెందియున్నది
అదన శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
పొదలీ మోము కళలు బొంకక చెప్పవయా

రేకు: 1889-3 సౌరాష్ట్రం సం: 28-523

పల్లవి: ఉవిదకు నీకు నేట్టి వొడఁబాటులో
జవళి రతుల నీతో సాముసేసీని

చ. 1: నలుగడలను నీవు నవ్వఁగాను
జలజాక్షి సిగ్గునను జంకించీని
బలిమిఁ గొంగు సెలసి పట్టఁగాను
నిలుచుంచి లోలోనే నివ్వేరగందీని

చ. 2: అట్టె నీవు సరసము లాడఁగాను
వొట్టువెట్టి నిన్ను గొర నొరసీని
చట్టంటుఁజేఁతల నీవు చెనకఁగాను
గుట్టుతోనే వలపులు గుబ్బతిలీని

చ. 3: చన్నులపై నీవు చేయిచాఁచఁగాను
సన్నలనే తనమోవిని చవిచూపీని
యిన్నిటా శ్రీవేంకటేశ యేలుకొంటివి
మన్నించఁగా నీతోఁ దాను మాఁటలాడీని

రేకు: 1889-4 వరాళి సం: 28-524

పల్లవి: ఇప్పుడే చెప్పితి నీకు నెఱుకగా బుద్ధులెల్లా
చిప్పిలఁ బెనఁగేవేళ సిగ్గులు వదకువే

చ. 1: మగఁడు లాలించితేను మాఁటలెల్లా నాడవే
మొగము చూచితేను మొక్కవే నీవు
నగితే నాతనితోడ నవుపు సేసుకొనవే
జిగిఁ గూడే రతివేళ సిగ్గులు వడకువే

చ. 2: పిలిచితేనే పలికి ప్రియములు చెప్పవే
తలఁచినప్పుడే మతిఁ దమిరేఁడవే
యెలమి సన్నచేసితే నిచ్చలో మెలఁగవే
చెలరేఁగి పైకొంటేను సిగ్గులు వడకువే

చ. 3: పరపుపైఁ గూచుండితే పాదాలు నీవొత్తవే
గరిమ నాసపడితేఁ గాఁగిలించవే
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
శిరసెత్తి వేఁడుకొంటే సిగ్గులు వడకునే

రేకు: 1889-5 ఆహిరి సం: 28-525

పల్లవి: తనకు నాకునుఁ బోదు తరుణు లెందరున్నాను
యెనసి నావిన్నపము లిటు చేకొమ్మనవే

చ. 1: తా నాతో నాడినమాఁట తలఁచుకొమ్మనవే
ఆనవెట్టి చెలినైనా నడుగుమని యనవే
మోనాన వరుసదినములు యెంచుకొమ్మనవే
తానిఁక నాపై దయదలఁచుమని యనవే

చ. 2: వాకిట నేవ్రాసిన వ్రాలు చూచుకొమ్మనవే
కాక తన నామేనరికము నడపుమనవే
చేకొన్న నా వుంగరము చేతఁ జూచుకొమ్మనవే
యేకాలము నన్ను నిఁక నెడయకు మనవే

చ. 3: నాయింటి వంక చూచి మనసు గరఁగుమనవే
సేయరాని నాసేవలు చిత్తమెరుఁగుననవే
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
పాయక యెప్పుడును నాబత్తి చేకొమ్మనవే

రేకు: 1889-6 శంకరాభరణం సం: 28-526

పల్లవి: అందుకే వెరగయ్యీ నా కప్పటనుండి
కందువలెల్లా నెట్టు గడియించుకొంటివే

చ. 1: సెలవి నవ్వులలోని చిరుసిగ్గులు
పలుకులలోపలి పచ్చి తేనెలు
తళుకు గన్నుచూపుల తరితీపులు
కలికితనా లెన్ని గడియించుకొంటివే

చ. 2: మొనసి చెలులతోడి ముసగసలు
చెనకుల కొనగోరి చిట్టంటులు
పెనఁగేటి సరసపు పెడరేఁపులు
గనమాయ నెందుండి గడియించుకొంటివే

చ. 3: సారె బొమ్మ జంకెనల సాదింపులు
యీరీతి నీకేలే యెలయింపులు
కోరి శ్రీవేంకటేశుఁడు గూడెను నన్ను
కారనాలు నీ వెందు గడియించుకొంటివే

రేకు: 1890-1 దేసాళం సం: 28-527

పల్లవి: నాఁడే యెఱుఁగుదుము నీ నటనలెల్లా
పోఁడిమితో మేలుమమ్ము పొసఁగితి విపుడు

చ. 1: యెంత సింగారించుకొంటి వేతరిఁడవు
కాంతలఁ గంటేఁ జాలు కాతరీఁడవు
పంతాన మమ్మేల యింత పచ్చిసేసేవు
వింతలా నేఁడు మాకు నీవిద్య లెల్లాను

చ. 2: సరసపు మాటల సటకాఁడవు
మరుతంత్రముల యలమటకాఁడవు
చెరుఁగువట్టి నన్నెంత చెనకేవు
సారది విన్నవేకా నీసుద్దులెల్లాను

చ. 3: తనివోని వలపుల దాయఁగాడవు
ననిచి వొడఁబాటుల నాయగాఁడవు
యెనసితివి శ్రీవేంకటేశుఁడ నన్ను
పెనగొనెఁగా నీ పెద్దరికాలెల్లాను

రేకు: 1890-2 నాదరామక్రియ సం: 28-528

పల్లవి: ఇందాఁకా వాకిటనే యెదురుచూచితి నీకు
కందువతో నేఁడు నను@ గడు మన్నించితివి

చ. 1: సేసిన నావిన్నపాలు చిత్తానఁ బట్టెనా నీకు
ఆసుద్దులెల్లా నితవాయనా నీకు
పోసరించి నాపై దయపుట్టెనా యిప్పుడు నీకు
ఆసతో నాయింటికి రా నవధరించితివి

చ. 2: సారె నంపిన లేకలు చదువుకొంటివా నీవు
కోరి నీమాఁట దలఁచుకొంటివా నీవు
తేరకొన నావలపు తెలిసితివా నీవు
ఆరీతి నాయింటికి రా నవధరించితివి

చ. 3: కొంకక నేనుండేచోటు గురుతెరిఁగితివా
లంకై నాతోఁ గూడఁ గలలు గంటివా
పొంకమై శ్రీవేంకటేశ పొంచి నన్నేలి దినమూ
నంకెల నాయింటికి రా నవధరించితివి

రేకు: 1890-3 వరాళి సం: 28-529
పల్లవి: నమ్మి కిచ్చిన వాఁడవు నన్నేల మఱచేవు
యిమ్ములఁ గలకాలము యేలేవు నన్నును
చ. 1: చిత్తమురా మాఁటలాడి చేతులెత్తి నీకు మొక్కి
హత్తి నీసేవ సేసేదే యది నా వోజ
బత్తితోడ నీరూపు భావించి సంతోసాన
యిత్తల నేనుండఁగానే యేలేవు నన్నును
చ. 2: కనుసన్నల మెలఁగి కాఁపురము నీకుఁజేసి
వినయము చూపేది వేడుక నాది
మనసు నీపైఁబెట్టి మచ్చికలు నీకుఁజేసి
యెనసి నీతో నవ్వఁగా యేలేవు నన్నును
చ. 3: పాయక నీవద్ద నుండి పైకొని నిన్నుఁబొగడి
నీ యిచ్చలో మెలఁగుటే నేరుపు నాకు
కాయజకేలిఁ బెనఁగి కాఁగిటిలో నుండఁగాను
యేయెడా శ్రీవేంకటేశ యేలేవు నన్నును

రేకు: 1890-4 సాళంగం సం: 28-530

పల్లవి: చిత్తమురా నాతని సేవలు నేఁ జేసేను
కొత్తగాఁ జుట్టరికపు గురుతులు చూపవే

చ. 1: యెంత విన్నాఁ దనివోదు యెలయించీ నాయాసలు
కాంత చెప్పవే యాతనికత లింకాను
దొంతర కోరికెలకు తుదమొదలెంచరాదు
చింతదీర నాతని చేఁత లెంచిఁగించవే

చ. 2: చూడఁ జూడ వేడుకయ్యీ సుదతి యాతని రూపు
తోడితేవే నీతనిఁ దొయ్యలి నీవు
వాడిక గలుగుచోట వలపు నిలుపరాదు
యేడనున్నాఁ డాతని యిక్కువ దెలుపవే

చ. 3: మనసులోఁ దలఁచితే మర్మములు గరఁగీని
యెనయించఁ గదవే మా యిద్దరి పొందు
తనుఁదానే వచ్చికూడె తగ శ్రీవేంకటేశుఁడు
ఘనుఁ డాతనికి నాకుఁ గట్టవే కంకణము

రేకు: 1890-5 బౌళి సం: 28-531

పల్లవి: రమ్మనవే చెలియా రమణుని నీడకు
వుమ్మగిలిన వలపు లుట్టిఁగట్టఁ దగదే

చ. 1: సంగాతాలు సేయనేల జంపులఁ బెట్టఁగనేల
కొంగువట్టి తియ్యనేల కొంకఁగ నేల
అంగము చెనక నేల అవ్వలిమోము గానేల
ముంగిటనున్న వలపు మూలవేయఁదగదే

చ. 2: ఆసలు రేఁచఁగనేల అనుమానించఁగ నేల
సేసలు వెట్టఁగనేల సిగ్గులేల
పోసరించి నవ్వనేల పొద్దులు గడపనేల
వాసితోఁ గూడే వలపు వలఁబెట్టఁదగదే

చ. 3: సన్నలు సేయఁగనేల సారె గుట్టు చూపనేల
కన్నుల మొక్కఁగ నేల గరువమేల
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁగూడె
యెన్నికకెక్కిన వల పెడయఁగఁదగదే

రేకు: 1890-6 శంకరాభరణం సం: 28-532

పల్లవి: తను నమ్మివున్నదాన తడవేల సేసీనే
ఘనుఁడు తానిన్నిటాను కరుణించు మనవే

చ. 1: చనవులు సేసుకొని సరసములాడితి
ననుపునఁ బతితోను నువ్వనవ్వితి
పెనఁగి పెనఁగి కడుఁ బ్రియములెల్లాఁ జెప్పితి
యెనయఁగఁ దనమన సెప్పడు గరఁగీనే

చ. 2: యిచ్చకములే నెరపి యింటికి రమ్మంటివి
విచ్చన విడిగా మొక్కితి వేఁడుకొంటిని
అచ్చపుఁ జుట్టరికము లన్నియు విన్నవించితి
తచ్చి నాపై నెన్నఁ డిఁక దయ దలఁచీనే

చ. 3: చెలరేఁగి చెటరేఁగి సేవ లిట్టె సేసితి
కలపు కొలుతనానఁ గాఁగిలించితి
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
తలకొని నన్ను నెందాఁకా నెలయించీనే

రేకు: 1891-1 శుద్ధవసంతం సం: 28-533

పల్లవి: కంటివిగా వోయి యీపె గయ్యాళితనములు
జంటలకే పెనఁగీని సంగతేమి నెంచదు

చ. 1: యెంగిలిమొవితోడ నెదిరించి నీతోను
సంగాతపు మాటలాడీ సకియ
ముంగిటనే నిలుచుండి ములువాఁడి చూపులను
తొంగి తొంగి నిన్నుఁజూచీ దోసమేమీ నెంచదు

చ. 2: చెమటచేతులతోడ సిబ్బితిపడక తాను
సముకాన నీకు మొక్కీ సారె సారెకు
తమితో బాదాలు నీముందర నిలువఁ బెట్టుక
అమరఁ గొలువుసేసీ నొఁగాము లెంచదు

చ. 3: వీఁడినతురుముతోడ విరులు పై రాలఁగాను
వోడక కాఁగిట నించీ వొరసి నిన్ను
యీడనె శ్రీవేంకటేశయేలితివి నన్ను నేఁడు
యీడువెట్టుకొని నవ్వీ నీకె తగవెంచదు

రేకు: 1891-2 పాడి సం: 28-534

పల్లవి: తానెంత మన్నించినాను తన చిత్తమింతే కాక
నేనే నాయంత వలపు నెరపఁగవచ్చునా

చ. 1: తలఁపు గలిగితేను తానే వచ్చీఁగాక
బలిమిఁ దన్నుఁ బిలిచేపాటి దాననా
అలరి దయవుట్టితే నాదరించీఁగాక నన్ను
కలికితనాల దన్ను గరఁగించ నేర్తునా

చ. 2: చుట్టరిక మెంచి నన్ను సొరిది నేలీఁగాక
వట్టి వినయాలఁ దన్ను వంచఁగలనా
అట్టె తనవేడుకకు నంటిపెనఁగీఁగాక
గుట్టుతోడ మెప్పించి కొసర నావసమా

చ. 3: మొగమోటమునఁ దానే ముంచి కాఁగిలించీఁగాక
నగుతాఁ గొనగోరఁ జెనకవచ్చునా
తగ శ్రీవేంకటేశుఁడు తానే నన్ను నేలెఁగాక
జిగిమించి తన్ను రట్టు సేయఁగ సంగతా

రేకు: 1891-3 ఆహిరి సం: 28-535

పల్లవి: నీ చిత్త మెట్టుండునో నేనెఱఁగ నాయకుఁడ
యేచి నాసింగారవే యింతసేసె నన్నును

చ. 1: గొప్పకన్నులనే రంటా కోరి తలవంతుఁగాని
తప్పక చూచె యందుకుఁ దమకింతును
కొప్పు జారీనంటాను గుట్టుతో నుండుదుఁగాని
ముప్పిరిఁ జేతులెత్తి మొక్క నుంకింతను

చ. 2: అలరి చన్నులు పొడవైవున్నదంటాఁగాని
కొలువుసేసే యందుకుఁ గోరుకుందును
చిలుకుమోవితేనెలు చిందునోయంటాఁగాని
పలుమారు మాటలాడ బాఁతి పడివుందును

చ. 3: సారిదిఁ గొనగోళ్లు సోఁకునోయంటాఁగాని
వొరసి సరసమాడ నూహింతును
ఇరవై శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
మరిగితి వంటా నొక్క మనసుతో నుందును

రేకు: 1891-4 ముఖారి సం: 28-536

పల్లవి: ఎఱుఁగుదుఁ జెప్పవే నీ కితవరిదాన నేను
నెఱయా నీసుద్దు లివి నిన్ననే వింటిని

చ. 1: మనసులో తమకము మాఁటలోనే కానవచ్చు
కనుచూపులోనే యాసగానవచ్చును
మునుకొన్న రతికళ మోములోనే కానవచ్చు
యెనసిన పతి పొందు లేల దాఁడేవే

చ. 2: నిబ్బరపు వలపులు నిలువునఁ గానవచ్చు
గుబ్బలపైఁ గానవచ్చు గురుతులెల్లా
వుబ్బరిసంతోసాలు వుల్లసానఁ గానవచ్చు
అబ్బురపు నీ పొందు లడఁచనేమిటికే

చ. 3: సెలవుల నవ్వులోనే చేఁతలెల్లాఁ గానవచ్చు
సొలపులఁ గానవచ్చు చుట్టరికము
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
కలిగిన నీపొందులు కప్పి పెట్ట వలదే

రేకు: 1891-5 బౌళి సం: 28-537

పల్లవి: ఎంతటి బిటారి యీపె యెటువంటి వొయ్యారి
కంతను సంతోసించి పొగడరమ్మ చెలులు

చ. 1: కొమ్మవురమున మించెఁ గుచగిరులు
తెమ్మలాయ నందుపై ముత్తెపుసరులు
కమ్ముకొనెఁ గొప్పులోనఁ గమ్మవిరులు
సొమ్ములతో విఱ్ఱవీఁగీఁ జూడరమ్మ చెలులు

చ. 2: దోమటి తట్టు పుణుఁగు తోడి చెక్కులు
కామించిన వలపుల కనుచొక్కులు
కోమలి మోవిఁ బలసోఁకుల పక్కులు
యీమేటి సింగారాలు యెంచరమ్మ చెలులు

చ. 3: కలికి కరముల చక్కని గోరులు
నిలువున మొలనూలి నీవి జారులు
యెరమి శ్రీవేంకటేశుఁ డీకెఁ గూడెను
మెలుఁత చందములెల్లా మెచ్చరమ్మ చెలులు

రేకు: 1891-6 భైరవి సం: 28-538

పల్లవి: నీతలనే వేగెనా నెలఁతరో యీకతలు
నాతుల సాజము లివి నవ్వు లింతేసేఁటికే

చ. 1: వుడివోని తమకము లుమ్మగిలుతా నుండఁగా
పడఁతుల వయసులు పట్టవచ్చునా
అదియాస లేవు రేఁగి ఆయములు గరఁచఁగా
తడఁబాటు వలపులు దాఁచవచ్చునా

చ. 2: పెనగొన్న వేడుకలు పెరుగుతానుండఁగాను
మునుకొన్న సిగ్గులు ముయ్యవచ్చునా
వొనరి మోవితేనియ లూటలెత్తి వడియఁగా
చెనకుచు కాఁపురాలు సేయకుండవచ్చునా

చ. 3: చిప్పిలి రతివింతలు చెలఁగి చవులైవుండఁగా
చొప్పైన పొందులు తప్పించుకోవచ్చునా
ఇప్పుడు శ్రీవేంకటేశుఁ గింతలోనె నిన్నునేలా
కప్పిన యీసంతోసము కాదనఁగ వచ్చునా

రేకు: 1892-1 వరాళి సం: 28-539

పల్లవి: ఎన్నటి చుట్టరికమో యీపెకు నీకు
విన్నవించీ నీకెమాఁట వినఁగరాదా

చ. 1: చలిమి బలిమి నిన్ను సారెసారెఁ గొసరీని
లలన నీవింతటను లాలించరాదా
సొలసి మలసీఁ దనచుట్టరికములు చెప్పి
తెలుపుకొని నీవాపె దిక్కు చూడరాదా

చ. 2: అనఁగి పెనఁగి నీకు నాసపడి మొక్కీని
మునుకొన్నవలపుల ముంచఁగరాదా
చనవి మనవీఁ జూపి సరసములాడీని
ననుపున నీపెతోను నవ్వఁగరాదా

చ. 3: కలసి మెలసి నిన్నుఁ గాఁగిటికి నేఁకరీని
తలకొన్న మన్ననలఁ దనుపరాదా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
నెలకొని యీకెనూ మన్నించఁగరాదా

రేకు: 1892-2 ఆహిరినాట సం: 28-540

పల్లవి: ఇంటికి రావయ్యా నీకు నెదురుచూచీ నింతి
జంటలైన మిమ్ముఁ జూచి సంతోసించుకొనేము

చ. 1: చెలియ చిరునవ్వులు సెలవులఁగారఁజొచ్చె
మొలకల చన్నులు మోపులాయను
కలికి కనుచూపులు కడుఁగడువాండ్లెక్కె
నిలువు నూరు వండె నెలఁత జవ్వనము

చ. 2: భామ జఘన సంపద పైకొని బండ్లు నిండె
మోమున జంద్రకళలు ముప్పిరిగొనె
ఆముకొన్న సిగ్గులెల్లా నంత నంతఁ జిగిరించె
తామర దంపరలాయ తరుణి జవ్వనము

చ. 3: కాంత తురుము మొయిలు కారుకమ్మి తలకూడె
చింతలోన నడియాస చిమ్మిరేఁగెను
ఇంతలోనె శ్రీవేంకటేశ యీకెఁగూడితివి
దొంతరభోగము లాయ తొయ్యలిజవ్వనము

రేకు: 1892-3 శ్రీరాగం సం: 28-541

పల్లవి: ఇటువంటి భాగ్యములు ఇవి మీకె కలిగెను
తటుకన నిద్దరికి దగుఁదగునయ్యా

చ. 1: విననింపులైనవి వెలఁదులమాఁటలు
తనువుకింపైనది గుత్తపుఁగాఁగిలి
మనసుకింపైనవి మచ్చికైన పొందులు
పనిగొనే మగవాని భాగ్యము లివియయ్యా

చ. 2: గోరుమోప నింపైనవి గొప్పలైన చన్నులు
నోరికి నింపైనది నునుఁగెమ్మోవి
కొరిచూడ నింపైనది కోమలపు నెమ్మోము
సారెకు మగవానికి సంపద లివియయ్యా

చ. 3: నవ్వులకు నింపైనవి ననుపులచేఁతలు
జవ్వనాన కింపైనది చక్కఁదనము
యివ్వల శ్రీవేంకటేశ యీకె నిట్టెకూడితివి
నివ్వటిట్లు మగవాని నేర్పు లివియయ్యా

రేకు: 1892-4 సాళంగనాట సం: 28-542

పల్లవి: మాముందర నింతేసి మతకము లేమిటికి
నీమాఁట లోనిదాన నే నౌత యెఱఁగవా

చ. 1: చుట్టము గాఁబోలు నీకు చూచీ నల్లాడమండి
పట్టెఁడేసి చన్నుల పడఁతి
వట్టి సిగ్గులేమిటికి వలపే కలిగితేను
గట్టిగాఁ జేయరాదా కాఁపుర మాపెతోను

చ. 2: తారుకాణలు గాఁబోలు తగిలి సన్నలు సేసీ
చేరఁడేసి కన్నుల చెలియ
పూరకుండనేల నీకు వొన గూడ వేడుకైతే
చేరి కాఁగిలించరాదా చేయిముందుగాను

చ. 3: సాఁగిన పొందు గాఁబొలు పాటవాడి నీమిఁద
కాఁగెఁడేసి పిఱుఁదుల కలికి
చేఁగెదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
మాఁగిన మోవియ్యరాదా మన్నించి యాకెకును

రేకు: 1892-5 బౌళి సం: 28-543

పల్లవి: ఎరవులులేనిచోట యెట్టున్నా మేలే
తరగని కోరికలు తారుకాణ గనక

చ. 1: బిరుతునని నీతోను పెనఁగులాడినా మేలే
సొరిది మేనును మేము సోఁకుఁగనక
తెరలి సారె సారెకుఁ దిట్లాడినా మేలే
తొరలి నీపేరు నోరఁ దొట్టుకొనుఁ గనక

చ. 2: పదరి నిన్ను జంకించి పగ చాటినా మేలే
కదిసి నామోము చూడఁగద్దు గనక
పుదుటున మారుమోమై పూరకలిగిని మేలే
యెదలోనఁ దలపోసి యింపురేఁగుఁగనక

చ. 3: గక్కనఁ గాఁతాళించి కరము చాఁచినా మేలే
మక్కువటంటి కోపాలు మానుఁగనక
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
దక్కెఁ బనులన్నీ నేలే తగులాయఁగనక

రేకు: 1892-6 ఆహిరి సం: 28-544

పల్లవి: తన్నుఁదానే రమణుఁడు తగిలి మన్నించీఁగాని
సన్నలా చాయలానే చల్లవే వలపులు

చ. 1: బలిమి సేయఁగవద్దు పతితోఁ బెనఁగవద్దు
మొలకనవ్వులు నవ్వి మోము చూపవే
చలము సాదించవద్దు సణఁగులు రాల్చవద్దు
తళుకుఁ జూపులఁ జూచి దండ నిలుచుండవే

చ. 2: పంతాలాడఁ గవద్దు పైకొని వాదించవద్దు
మంతనాన శిరసెత్తి మాఁటలాడవే
గంతులుసేయఁగ వద్దు రాఁగతనములు వద్దు
కొంత గొంత సిగ్గుతోడ గుట్టున మెలఁగవే

చ. 3: రవ్వలు సేయఁగవద్దు రచ్చలఁ బెట్టఁగ వద్దు
యివ్వలి మోమై చేతులెత్తి మొక్కవే
చివ్వన నన్నింతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
నివ్వటిల్ల మోవితేనే నీవు చలిచూపవే

రేకు: 1893-1 ముఖారి సం: 28-545

పల్లవి: నీవు నాకు వలతువు నే నీకు మేలుదాన
కావరపు నీ చేఁతలు కడుమంచివయ్యా

చ. 1: అంత నీకు బాఁతైన ఆసలమోసమే కాక
యెంతైనా నీకు మోసమేడయ్యా
మంతనాన మిమ్ము రేచే మరునినేరమిగాక
పంతములో నీనేరాలు పట్టఁగ నేలయ్యా

చ. 2: మగువుకు మోహించిన మనుసు దోసము గాక
జగములో నీవల్ల దోసమేదయ్యా
మొగమోడించి మరిపే మోవిదే కొరతగాక
తగవెంచి నీకొరత దడవనేలయ్యా

చ. 3: ఇదే నన్నుఁ బెండ్లి సేసిరి (న?) చుట్టాలనవ్వేఁ గాక
మది మది నిన్ను నవ్వ మాకేలయ్యా
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మొదల వెంగెమాడితి మొక్కు మొక్కేనయ్యా

రేకు: 1893-2 వరాళి సం: 28-546

పల్లవి: ఇప్పటి మన్నన నాయం దిట్టే నిలుపుమీ
తప్పక మిగులా నాపై దయదలఁచితివి

చ. 1: చుట్టరికములు చెప్పి సోబానఁ బాడించి
అట్టె నన్ను లాలించి పెండ్లాడితివి
గట్టిగా నాముఁ(ముం?)జేతను కంకణము నీవేకట్టి
గుట్టుతో నీసంగడినే కూచుండఁబెట్టితివి

చ. 2: చాయలు సన్నలు జూపి చక్కఁదనాలు వొగడి
సేయరాని బాసలెల్లాఁ జేసితివి
చేయి గుబ్బలపైఁ జాఁచి సిగ్గులు జారఁగఁజేసి
కాయజకేలిని మది గరఁగించితివి

చ. 3: చెలిమి వచారించి సెలవినవ్వులతోడ
అలరి పొత్తులనిడు కారగించితి
యెలమి శ్రీవేంకటేశ యింతసేసి కూడితివి
వలిపించితివి నన్ను వదలకుమి

రేకు: 1893-3 మాళవిగౌళ సం: 28-547

పల్లవి: తెలిసితి నీసుద్దులు తేటతెల్లమిగ నేను
మలసి నన్నిఁక నీవు మన్నించవయ్యా

చ. 1: పువ్విళ్లూర మాఁటలాడి వొడఁబరచేవు నీవు
యెవ్వతె నేరిపె నీకు నింతేసి యయ్యా
నవ్వినవ్వి వేఁగినంతా నలిఁ బొద్దులువుచ్చేవు
అవ్వల నీవల పెందు నాహివెట్టితివయ్యా

చ. 2: వొద్దికె నేఁ జెనకితే నొడ్డించుకొనేవు యీ
విద్దెలు యేపళ్లిఁ జదివితివయ్యా
చద్దికి వేఁడికి నాపై సరసాలే నెరపేవు
అద్దుక నీకాఁగిలి యేయంగడి నమ్మేవయ్యా

చ. 3: ముందుగానే పెండ్లాడి మోవి చవు లడిగేవు
యెందరిని బెల్లించితి విట్లానయ్యా
కందువ శ్రీవేంకటేశ గట్టిగా నన్నేలితివి
యిందుకే నీవయసు మీఁదెత్తుకుండితివయ్యా

రేకు: 1893-4 వసంతవరాళి సం: 28-548

పల్లవి: అన్నిటా నేర్పరివి నీ కాతఁడు మేలువాఁడు
నిన్నుఁ బాయకుండి యిట్టె నెలకొనుఁగాక

చ. 1: నినుపులై తేనెలూరే నీమాఁటలు విని
యెనసి మన్నించక యెట్టుండునే
చెనకుల కొనగోరి చేతి మొక్కు లందుకొని
వొనరి మతిగరఁగ కూర కెట్ల నుండునే

చ. 2: పసిఁడి కుండలవంటి బలు నీగుబ్బలు సోఁకి
వసమౌనే కదే నీకు వలచి తాను
ముసిముసి నీనవ్వులు ముందరఁ బొలసితేను
పొసఁగి మరుగుఁ గదె పొంతనుండి నీకు

చ. 3: నెమ్మి శ్రీవేంకటేశుఁడు నీ చక్కఁదనము చూచి
వుమ్మడిఁ బెండ్లాడినది వొప్పిద మౌనె
సమ్మతించి నీమోవి చవిగొనినట్టవాఁడు
కమ్మటి నీకాఁగిటికే కాణాచియౌనే

రేకు: 1893-5 మంగళకౌసిక సం: 28-549

పల్లవి: ఎనసేటి వేళను యెగ్గులు లే దెవ్వరికి
వొనర నీకు మొక్కితి నోరుచుకోవయ్యా

చ. 1: కూడిన మందె మేళాన కొసరి నిన్నేమంటినో
పాడి పంటా లెంచ కెంత పదరితినో
యీడు వెట్టుకొని నీతో నెమ్మెలెంత సేసితినో
వొడక మొక్కే నీకు నోరుచుకోవయ్యా

చ. 2: పరపుపైఁ బండి యెంత పాదము దాఁకించితినో
సరసమాడుతా నెంత జింకించితినో
గొరబుసేసి యెప్పుడు కొనగోర గీరితినో
వొరిమెతో మొక్కేనీకు నోరుచుకోవయ్యా

చ. 3: కడుఁదమితో నెంత కాఁగిట బిగించితినో
పెడరేఁచి రతి నెంత పెనఁగితినో
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వొడికాన మొక్కే నీకు నోరుచుకోవయ్యా

రేకు: 1893-6 నాదరామక్రియ సం: 28-550

పల్లవి: సిగ్గులు వడకువే చెలియ నీవతనితో
వొొగ్గి కలసిమెలసి వుండుదువుగాని

చ. 1: యెడమాఁటలవల్లనే యింపులెల్లాఁ బొడమేవి
తడవే చే సన్నలనే తమి రేఁగేది
కడకంటి చూపులనే కడునాసలు వుట్టేవి
గడుసుపడి వుండితే కలిగే దేమున్నదే

చ. 2: సొలసే నేరుపులనే చుట్టరికము లయ్యేది
సెలవినవ్వులనే చిమ్మిరేఁగేది
కలకిచేఁతలనే నిక్కపుపొందు దగిలేది
వలవని గుట్టునను వచ్చేదేమున్నదే

చ. 3: చేసేటి వినయాలనే చెలిమి సతమయ్యేది
వేసరిని రతులనే వేడుకెక్కేది
ఆసతో శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁగూడె
మూసిదాఁచే సంతోసాన ముచ్చట యేమున్నదే

రేకు: 1894-1 దేసాళం సం: 28-551

పల్లవి: నీవల్ల దోసములేదు నీ వటువంటివాఁడవా
రావయ్య యీ యింటికి రవ్వసేయ నిన్నును

చ. 1: వెక్కసిన నాపె నిన్ను విరుల వేయఁగాను
నిక్కి చూచితివి గాక నీ నేరమేమి
చక్క(క్కె?)రమోవి చూపి సన్నలుసేయఁగాను
చొక్కిన యందుకు నిన్ను సొలయఁగనేఁటికి

చ. 2: చయ్యన నాపె వచ్చి చన్నులు దాఁకించఁగాను
ఇయ్యకొంటివిఁగాక నీవేమిసేతువు
వొయ్యనే పిలిచి నిన్ను నొడివట్టి తియ్యఁగాను
నెయ్యాన గూడినందుకు నిన్ను దూరనేఁటికి

చ. 3: కలికి తనాల నాపె కాఁగిలించుకొనఁగాను
కలసితి వింతేకాక కాతరీఁడవా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
యెలయింపు సుద్దు లవి యెంచఁగ నేఁటికి

రేకు: 1894-2 పాడి సం: 28-552

పల్లవి: నీ మగఁ డిందుకేకదే నీకు మేలువాఁడాయ
యేమని పొగడవచ్చు నిటువంటి నిన్నును

చ. 1: తీగయెలుఁగులు వార తేరకొన నూఁకొనేవు
సోగకనుచూపులను సొలసేవు
లాగులుగా దంతకాంతులను వెన్నెల గాసేవు
చేగదేర నీచేఁతలు చెప్పనెట్టువచ్చునే

చ. 2: వొయ్యారిబాగుగాను వొదకిలి కూచుండేవు
గయ్యాళితనమునఁ బక్కన నవ్వేవు
చెయ్యి చెక్కిటఁ బెట్టుక సిగ్గులు వెదచల్లేవు
నెయ్యపు విలాసములు నీవే నేరుతువే

చ. 3: పలచని కెమ్మోవిఁ బంచదారలు చిందేవు
నిలువెల్లా మురిపేలే నిగిడించేవు
యెలమి శ్రీవేంకటేశు నిన్నిటాఁ జొక్కించితివి
కలికితనాలెల్లాఁ గంటిమే నీవల్లను

రేకు: 1894-3 ఆహిరి సం: 28-553

పల్లవి: ఏల నన్నొడఁబరచే వెఱఁగనా నీగుణము
కోటుముందుగాఁ దానే కొసరీఁగాక

చ. 1: వలెన నెవ్వతెకైనా వలచేటివాఁడవా
చెలి తాఁ జుట్టరికాలు చెప్పీఁగాక
పిలిచి వట్టి పొందులఁ బెనఁగేటివాఁడవా
చెలఁగి నీకాపె సేవసేయవచ్చీఁగాక

చ. 2: నంటుసేసి వొకరితో నవ్వేటివాఁడవా
అంటిముట్ట (ట్టి?) తా సరసమాడీఁగాక
వెంట వెంటఁ జెక్కు నొక్కి వేఁడుకొనే వాఁడవా
దంటతనమునఁ దానే తగిలీఁగాక

చ. 3: చేరి నీవు కెలనికిఁ జేయిచాఁచేవాఁడవా
కోరి తానే కాఁగిలించుకొనీఁగాక
కూరిమి శ్రీవేంకటేశ కూడితిని నన్ను నేఁడు
పోరచికి వచ్చి తానే పొదిగీఁగాక

రేకు: 1894-4 పాడి సం: 28-554

పల్లవి: ఈతని నాపొందులు యిఁకఁ జూడవే నీవు
నీతి నెక్కుడైనదాన నీకంటె నేను

చ. 1: వట్టి మాఁకు లిగిరించ వాడికమాఁటలాడి
కట్టుకొంటివి గదే మగనిమన్నన
బట్టబయలు నవ్వుల పందిళ్లుగాఁ బెట్ట
చుట్టమువైతివి గదే సులబాల(న?) నీవు

చ. 2: జాలకు గిలిగింతలు జట్టుగ గుబ్బలనొత్తి
ఆలవైతివిగదే యాతనికిని
గాలిబుడియలు గట్టి కలికితనాలు చూపి
వోలి గొంటివిగదే వుదుటున నీవు

చ. 3: చెఱకునఁ బండువండ చిత్తజకళలు రేఁచి
గుఱియైతివి గదే గక్కునఁ బతికి
మఱి శ్రీవేంకటేశ్వరు మరిగించుకొంటి నేను
వెఱగందితివి గదే వేడుకతో నీవు

రేకు: 1894-5 ద్రావిళభైరవి సం: 28-555

పల్లవి: ఇప్పుడే విన్నవించితి మిదిగో నీకు
తప్పక మాలాగు లివి తలఁచుకోవయ్యా

చ. 1: చూపులకొనల నుండు చొక్కులు మాకు
తీపులమోవిపైఁ గారు తేనియలు
పూపచన్నులంటిమా పుట్టుఁగొండలు
వోపితేనే మాపొందుల కొడిగట్టవయ్యా

చ. 2: సరుస బొమ్మలనుండు జంకెనలు
తురుమ వట్టితే రేఁగుఁ దుమ్మిదలు
గరిమఁ గొనగోరులు కడువాఁడులు
మరుగ వలసితేను మావద్దికి రావయ్యా

చ. 3: నాలిక తుదలనుండు నయగారాలు
పోలించితే నిలువునఁ బుట్టించునాన
యేలితివి శ్రీవేంకటేశుఁడు నన్ను
యీలాగులు యితవైతే నిట్టెమన్నించవయ్యా

రేకు: 1894-6 నాదరామక్రియ సం: 28-556

పల్లవి: తా నేమిసేసినాఁడు తనకేలే వట్టిసిగ్గు
పూనిన తన చేఁతలు వొప్పగొంటి నేను

చ. 1: మొగము చూపుమను మొక్కులు మొక్కేఁదనకు
నగుమను బత్తితోఁ జెనకే నేను
సొగిసి మాఁటాడుమను చుట్టరికము చెప్పేను
తగులాయఁ దనకేలే దాఁగి యున్నాఁడిపుడు

చ. 2: సరుసఁ గూచుండుమను సమ్మతించి విడెమిచ్చే
తెర యెత్తుమను నే బందెము లాడేను
సిరులఁ జేకొమ్మను సేవలెల్లాఁ జేసేను
గరిమ నింకేలే యాడికపు లోఁగఁదనకు

చ. 3: పవ్వళించియుండుమను పాదములొత్తేఁ దనకు
చివ్వనరమ్మను తన చెక్కు నొక్కేను
ఇవ్వల శ్రీవేంకటేశుఁడింతలోఁ దాపచ్చికూడె
కువ్వలాయ వలపులు కొంకఁదనకునేలే

రేకు: 1895-1 శుద్ధవసంతం సం: 28-557

పల్లవి: సటకాఁ డేమిటికి వేసాలు సేసీనే
ఇటు నాపై బత్తిగల దెరుఁగుదు ననవే

చ. 1: పెనఁగి నేఁ బిలువఁగా బిగిసి రాకుండేవాఁడు
తన తమి యెక్కడఁ బాఁతరఁ బెట్టీనే
చెనకఁగా నాతోను సిగ్గులు వడేటివాఁడు
మనసు మర్మము లెట్టు మట్టు పరచీనే

చ. 2: సరసము నే నాడఁగా చాయసేసుకొనేవాఁడు
కురిసేటి చెమట లేగొంది దాఁచీనే
విరుల నే వేయఁగాను వెసనొడ్డుకొనేవాఁడు
యిరవైనపులకలు యెట్టు మానిపీనే

చ. 3: గోరికొనఁ జిమ్మఁగాను గుట్టున నుండేవాఁడు
వూరేటి మోవితేనె లేవుట్టిఁ బెట్టీనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలో వచ్చి నన్నేలె
తారుకాణసంతోసా లెందాఁకాఁ జెప్పీనే

రేకు: 1895-2 ముఖారి సం: 28-558

పల్లవి: నాపాటిదానవా నానారీతుల నీవు
యేపున నీమనుసులో నెంచి చూచుకొనవే

చ. 1: మగఁడు మన్నించునంటా మాఁట జవదాఁటఁడంటా
పగటు లేమి చెప్పేవే పలుమారును
బిగువులు చూపుకొంటా పెద్దకొప్పు వెట్టుకొంటా
నగువు లెంత నవ్వేవే నడుమ నీవు

చ. 2: చక్కని దాననంటా సరిగె గలదంటాను
వెక్కాసి వెంతైతివే వెల్లివిరితో
నిక్కి నిక్కి చూచుకొంటా నీటులు నెరపుకొంటా
చొక్కి యేమి మురిసేవే జూటరివై నీవు

చ. 3: పాయపు దాననంటా బలిమి కత్తెనంటా
మాయలేమి సేసేవే మతకానను
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆయము లేలంటేవే యాతని ముట్టి నీవు

రేకు: 1895-3 కేదారగౌళ సం: 28-559

పల్లవి: నేరుపరి వన్నిటాను నీవే యెఱుఁగుదువు
కూరిములు తొల్లి మీకుఁ గొనసాగి వున్నవి

చ. 1: చెప్పఁగల ప్రియములు చెప్పెఁజెలియ
ముప్పిరిఁ జేతులెత్తి మొక్కె నీకును
కప్పముగాఁ బట్టెఁ దన కమ్మని మోవి
యెప్పుడు మన్నించేవో ఇఁకఁ జూచేము

చ. 2: వలవఁగలట్టల్లా వలచె నింతి
మెలుపున జవ్వనము మిఁదెత్తె నీకు
నెలకొన్న చూపులను నివాళి యిచ్చె
చెలరేఁగి యెట్టు దయసేసేవో యిఁకను

చ. 3: బెరసిన దాఁకాను పెనఁగెఁ గాంత
సరములనే సేస చల్లెనునీకు
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టై కూడితివి
సరవితో నిఁక నెట్టు చనవువిచ్చేవో

రేకు: 1895-4 సామంతం సం: 28-560

పల్లవి: వింతవాఁడా తానేమి వేగిరించ నేమిటికి
చెంతనుండి యెప్పుడైనా సేవసేతనకు

చ. 1: సమ్మతించితేనే మాట చవులై యుండునే
ఇమ్ముల నేమనఁగాను యెట్టుండునో
కమ్మరఁ దానే వచ్చి కరుణించిణప్పుడయ్యా
ముమ్మాఁటికి నీవేళ మొక్కేనే తనకు

చ. 2: తగులైన పొందులే తమకము రేచునే
మొగమిచ్చలెల్లా ప్రియములు రేఁచీనా
తగిలి నాయింటికి తానే వచ్చిన దాఁకా
పగటు మోహము జన్నెవట్టుకుండేఁ దనకు

చ. 3: పానుపుపై నుండితేనే పంతము లీడేరునే
నానినఁగాని కొంత నయమెక్కదు
తానే శ్రీవేంకటేశుఁడు తగఁ బేలకుర్తిలోన
పూని చెన్నుఁడై నన్నేలె పొంచుకుండేఁ దనకు

రేకు: 1895-5 పాడి సం: 28-561

పల్లవి: ‘పేలకురితి’ చెన్నుఁ డిదె పెనఁగీ నే మొక్కఁగాను
చేలకొంఁగు వట్టి నన్నుఁ జెక్కునొక్కీనే

చ. 1: వేవేలు సతులవాఁడు వేడుకకాఁ డితఁడు
నావంక చూఁచి యెంతనవ్వు నవ్వీనే
భావజగురుఁడు తాను పచ్చిమోవివాఁడు తాను
వావులెల్లాఁ జెప్పి యెంత వలపించేనే

చ. 2: అతిరాజసపువాఁడు అన్నిటా వినోదకాఁడు
కతలు చెప్పి నన్నెంత గారవించీనే
చతురుఁ డన్నిటాఁ దాను చక్కనివాఁడు తాను
మతిఁగరఁగ నెంతేసిమాఁట లాడీనే

చ. 3: నెరవాది కోడెకాఁడ నెయ్యపుఁ జేఁతలవాఁడు
గరిమ నన్నెంత సేసి కాఁగిలించీనే
అరిది శ్రీవేంకటాద్రియందు బేరకుర్తిలోన
తిరమై నన్నేలి యెంత తెలిపి మెచ్చీనే

రేకు: 1895-6 ఆహిరి సం: 28-562

పల్లవి: మునుపనే వేఁడుకొని మొక్కితి నీకు
వొనరి మన్నించుమీ నా వొద్ద బాయక నీవు

చ. 1: మనసునఁ దలఁచుమీ మరి నా విన్నపములు
పనులెన్ని గలిగినాఁ బరాకు గాక
కనుకొమ్మీ ముందర నేకావించు సేవలెల్లా
అనుమానించకుమీ నీ వప్పు డెందుండినాను

చ. 2: మఱవకుమీ నా మచ్చిక చుట్టరికము
జఱసి సంపద లెంత సందడించినా
గురుతువెట్టుకుండు మీ గుబ్బితిల్లు నావలపు
తఱచు సతులెందరిఁ దగిలినాను

చ. 3: యెంచుకొమ్మీ నా కాఁగిటి యెరవులేనిరతులు
పొంచి యేకాంతాన వినోదించేటి వేళ
అంచెల శ్రీవేంకటేశ అట్టే నన్నుఁ గూడితివి
కొంచకుమీనీ కెంత గుట్టు గలిగినాను

రేకు: 1896-1 సామంతం సం: 28-563

పల్లవి: తరుణికి నీకూ నొక్క తారుకాణఁ గాఁబోలు
గరిమ నిద్దరిపొందూ గంటిమి నే మిపుడు

చ. 1: ఇంత తడవు నీరాక కెదురులుచూచెఁ జెలి
రంతుతో నీపైఁ బదాలు రంగుగాఁ బాడె
కొంతవడి చెలులచే కోరి నీగుణాలు వినె
చింతించఁగానే విచ్చేసితివి నీవీడకు

చ. 2: బట్టబయల నిన్నిట్టె భావించి మాఁటలాడె
గుట్టుతోడ లోలోనే గుబ్బతిలెను
నెట్టనఁ జిలుకలతో నీచుట్టరికము చెప్పె
ఇట్టె విచ్చేసితి ఇంతలో నీ వీడకు

చ. 3: తన నీడ నీవంటా తగిలి కాఁగిట నించె
వినయాన మోవిమ్మని వేఁడుకొనెను
యెనసితివి సతిని యింతలో శ్రీవేంకటేశ
మునుపై విచ్చసితివి మొనసి నీ వీడకు

రేకు: 1896-2 ఆహిరినాట సం: 28-564

పల్లవి: నీ చిత్తము వచ్చినట్టు నీవు నన్ను మన్నించు
యేచి నీకు నెదురాడ నియ్యకొందుఁగాని

చ. 1: కంటకములాడనేర కసరులు నే నేర
నంటున నీమోము చేచి నవ్వుదుఁగాని
దంటనై జంకించనోప తప్పులు వట్టఁగనోప
వెంట వెంటాఁ జెక్కునొక్కి వేఁడుకొందుఁగాని

చ. 2: కొచ్చి కొచ్చి చూడఁ జాల కోపగించుకొనఁజాల
ముచ్చటతోఁ జేతులెత్తి మొక్కుదుఁగాని
కుచ్చితా లెంచ నెరఁగ గుంపించ నెన్నఁ డెరఁగ
ఇచ్చకపుదాననై ఇంపు చూపుదుఁ గాని

చ. 3: యెలయించెదానఁ గాను యెగ్గుపట్టేదానఁగాను
చెలరేఁగి సేవలెల్లాఁ జేతుఁగాని
యెలమి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సొలపుల వొడిగట్టఁ జొక్కింతుఁగాని

రేకు: 1896-3 రామక్రియ సం: 28-565

పల్లవి: ఎట్టు సాదించవచ్చునే యిటువంటి మగవాని
నెట్టనఁ దనంతనే మన్నించితేఁ గాక

చ. 1: సెలవినే నవ్వుఁగాని చెప్పఁడే తనగుట్టు
సొలసి యెంత వొరసి చూచినాను
చెలి మేలేసేసుఁగాని చేతికి లోనుగాఁడే
పిలిచి పైకొని యెంత పెనఁగినాను

చ. 2: మాటలే యాడుఁగాని మనసు గరఁగఁడే
చీటికి మాటికి యెంత చెనకినాను
తేటలనే తేలుఁగాని తెమలి యసమియ్యఁడే
కూటమికి నే నెంత కొసరినాను

చ. 3: ఆసలే పుట్టించుఁగాని అంకెకు తాఁ జిక్కఁడే
వేసరక యం(యెం?) తేసి వేఁడుకొనినా
బాసయిచ్చి శ్రీవేంకటపతి నన్నుఁదానే కూడె
పాసిపోఁడే యిఁక నెంత బలిమిసేసినాను

రేకు: 1896-4 వరాళి సం: 28-566

పల్లవి: ఈకె నీకు చెలికత్తో యిల్లాలో కాని
దాకొని యడుగరా దీతలఁపు లెవ్వరికి

చ. 1: సెలవి నవ్వులతోనే చెలి నీ మొగము చూచీ
యెలమి నీ మర్మ మాకె యెరఁగఁబోలు
బలిమి నప్పటి నీతో పంతములే యాడీని
తెలియదు మీలోని తెరఁగు లెవ్వరికి

చ. 2: చిక్కించుక కొలువులో సిగ్గువడుతా మొక్కీ
గక్కన నాకె నీగుట్టు గనఁగ బోట
యెక్కడెక్కడో చూపి యెలయించవచ్చీని
వక్కణించరాదు మీ వరుస లెవ్వరికి

చ. 3: కనుబొమ్మలనే నీకుఁ గదిసి సన్నలు సేసీ
వెనకటి గుణా లాకె వినఁగఁబోలు
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వినకెట్టుండవచ్చు మి వేడుక లెవ్వరికి

రేకు: 1896-5 దేసాళం సం: 28-567

పల్లవి: ఎంత నేరుచుకొంటివి యేమందు నిన్ను
మంతుకెక్క నెంచేఁగాని మతకము గాదు

చ. 1: తరుణులఁగంటే నీవు తగిలేయాసోదానను
వెరగై వుందానఁగాని వేసాలు గావు
మరిగించి నీవాడేటిమాఁట నయగారాలకు
అరుదందేఁగాని నీపై నాగడము గాదు

చ. 2: తోడనే నీ మొగమునఁ దొలఁకేకళలు చూచి
వేడుకకు నవ్వేఁగాని వెంగెము గాదు
యేడనుండైనా వచ్చి ఇంపులు సేసేయందుకు
జాడతో మొక్కేఁగాని సటలు గావు

చ. 3: ఇచ్చకము లెల్లాఁజేసి ఇట్టె నన్నుఁ గూడఁగాను
రచ్చకెక్కి మెచ్చేఁగాని రవ్వలు గావు
మచ్చిక శ్రీవేంకటేశ మన్నించితి విటు నన్ను
కొచ్చి సంతోసించేఁగాని కొసరు గాదు

రేకు: 1896-6 బౌళి సం: 28-568

పల్లవి: నెరజాణ వన్నిటాను నీవే నన్ను మన్నించేవు
వెరవెరిఁగి మా(మొ?)క్కేను వేగిరించనేఁటికి

చ. 1: కలికితనాల నిన్ను గరఁగించవసమా
బలిమితో నీ చిత్తము పట్టవసమా
వలపించి నిన్ను నిట్టే వంచుకొనవసమా
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పఁగలఁగాక

చ. 2: మాటలాడి నిన్నుఁ గడు మరిగించవసమా
యీటు వెట్టుకొని యెలయించవసమా
మేటిరతులను నిన్ను మెప్పించవసమా
సూటితో నా వినయమే చూపఁగలఁగాక

చ. 3: బెరసి నీతో సిరిఁ బెనఁగఁగ వసమా
తిరమే(మై?) నేర్పున సాదించవసమా
గరిమ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
వొరయ వసమా కూడుండఁగలఁగాక

రేకు: 1897-1 సామంతం సం: 28-569

పల్లవి: మొకదాకిరిదానను మొదల నేను
యెకసక్కెమాడనేర నేమి సేతునయ్యా

చ. 1: పొంచి నీవు నవ్వఁగాను బొమ్మల జంకించరాదు
కొంచక చెక్క నొక్కఁగా కోపించరాదు
మంచిమాఁటలాడఁగాను మలసి తిట్టఁగరాదు
యెంచరాని నీ చేఁతల కేమి సేతునయ్యా

చ. 2: ఇచ్చకము సేయఁగాను యెరవు సేసుకోరాదు
కొచ్చి నీవు పెనఁగఁగా గుంపించరాదు
మచ్చిక గాఁగిలించగఁగా మరి యలుగఁగరాదు
యెచ్చటనుండి వచ్చేవో యేమి సేతునయ్యా

చ. 3: పైకొని విడేమియ్యఁగా పరాకు సేసుకోరాదు
జోకతో వేఁడుకోఁగాను సొలయరాదు
నీకు నీవే శ్రీవేంకటనిలయ నన్నేలితివి
యీకడ నీసంతోసాన కేమి సేతునయ్యా

రేకు: 1897-2 శ్రీరాగం సం: 28-570

పల్లవి: ఇప్పుడుగా రమణుఁడ యీడేరె నా కోరికలు
తప్పక నాపై దయ దలఁచితివి నీవు

చ. 1: కామించి నిన్నుఁ బాసిన కడలేని విరహాగ్ని
నీమేని చెమట పన్నీటఁ జల్లారె
ప్రేమఁ దలపోఁతలఁ బెనగొన్న చీఁకటి
వేమరు నీ చిరునవ్వు వెన్నెలచే బాసెను

చ. 2: గక్కన నిన్నుఁ జూడని కలువకన్నులవాడు
చొక్కి నీవదనచంద్రుఁ జూచి తేరెను
నిక్కి కొప్పువీడిన నెరిఁదేఁటుల కలఁక
తక్క కిట్టె నీకరపద్ద(ద్మ?) ము లంటి జారెను

చ. 3: చేరి నిన్ను నెయని సిగ్గుల చిత్తజు చొక్కు
దారకపు నీ మాఁట మంత్రాలఁ దెలిసె
యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
గారవపు వలపుల కాఁపురా లమరెను

రేకు: 1897-3 పాడి సం: 28-571

పల్లవి: ఇదివో ద్రిష్టాంతాలు యెచి చూడరే చెలులు
యెదురెదురను మనయింటిలోనె వున్నవి

చ. 1: మాటలెల్లా మంచివే మనసు లెనసితేను
చాటువకెక్కు పొందులు సమ్మతించితే
వాటమౌనుఁ దమకము వలపులు మించితేను
పాటించి కూరిమిగలపతికి సతికిని

చ. 2: చేసినవెల్లాఁ జేఁతలే చేరి చుట్టాలై యుండితే
ఆసలు రేఁగు నెప్పుడూ సండనుండితే
బాసలెల్లా నీడేరు పాయని తగులైతేను
సేసవెట్టి పెండ్లాడిన చెలికి మగనికి

చ. 3: భావించిన వెల్లా నౌను బత్తి కడుఁగలిగితే
చేవదేరుఁ గోరికలు చెనకి తేను
వావులొనఁగూడీ నిదేవరుసఁ బెండ్లాడఁగాను
శ్రీవేంకటేశునకు శ్రీమహాదేవికి

రేకు: 1897-4 ముఖారి సం: 28-572

పల్లవి: తారుకాణ లిఁకనేలా తగులైన పనులకు
నేరుతు వన్న విద్యలా నెరజాణ వౌదువు

చ. 1: సారిది నీమోవిమీఁది సూదివాటులే చెప్పీ
గరిమల నీవు సేసే కాఁపురాలెల్లా
కురులు చెదరినట్టి గురుతులే చెప్పీని
సుతవిభముల చొప్పులెల్లాను

చ. 2: చెక్కులమీఁదటి నీ చిరుఁ జెమటలే చెప్పీ
గక్కన నీవు గడించే కలిమెల్లాను
చక్కని నీమోము కళకే చాటిచాటి చెప్పీని
మక్కువతో నీమనసుమర్మములెల్లాను

చ. 3: మనుకొన్న నీ ముసిముసి నవ్వులే చెప్పీ
పనివోని పొందులదాఁపురాలెల్లా
య(యె?) నసిన శ్రీవేంకటేశ నీకాఁగిలే చెప్పీ
జునగని నీనా సంది చుట్టరికా లెల్లును

రేకు: 1897-5 నాదరామక్రియ సం: 28-573

పల్లవి: వినవే నాబుద్ధి యిఁక వెలఁది
వొనరి యాతఁడు నీవూ నుండవే యీ కొలఁది

చ. 1: చన్నులపై జారె నవె సరులు
వున్నతి రాలీఁ గొప్పులోనున్నవిరులు
మిన్నక నిండెఁగదె నీమేన గురులు
యెనఁడులేనిది యింత యేలే యీమరులు

చ. 2: రాసికెక్కెఁ గదె యీకరతలు
యీసమంతైనా వొద్దే యీవెతలు
లాసి చాఁచేవేలే బహులతలు
మోసపోకు మన్నిటికి మూలమే యీకతలు

చ. 3: ముంచి తగులములకు మొదలు
అంచెల నలిగితేను అదవదలు
పొంచి వలసితేఁ గదుఁబొదలు
కొంచక శ్రీవేంకటేశుఁగూడిన సంపదలు

రేకు: 1897-6 తెలుఁగుఁగాంబోది సం: 28-574

పల్లవి: తానేల మూసి దాఁచీనే తన వలపు
ఆనతిమ్మనవే నాతో నట్టె నవ్వే నేను

చ. 1: వీనులఁ దన సుద్దులు వింటే నేమాయనే
నేనేమైనాఁ దన్ను నిఁక నేరమెంచేనా
తానేమి సేసినాఁ జెల్లు దగ్గరి రమ్మనవే
మోనముతోఁ జెక్కు నొక్కి మొదమందే నేనూ

చ. 2: కన్నులఁ దనచేఁతలు కంటె నేమాయనే
చిన్నదానఁ దన్ను రట్టుసేసి చెప్పేనా
యిన్నీ నేరుచు నన్ను మోమెత్తి చూడుమనవే
సన్నలఁ దనగుణాలు సంతోసించే నేనూ

చ. 3: వొట్టి తనమై గుఱుతులుంటే నేమాయనే
పట్టి సోదించి తనతో పంగించేనా
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నన్ను మేలనవే
గుట్టుతోఁ దనరతులు కోరి మెచ్చే నేనూ

రేకు: 1898-1 శంకరాభరణం సం: 28-575

పల్లవి: ఎదుర నీతఁ డుండఁగా నిదేమమ్మా
పొదిగి నీకూటమికే పూఁచుకున్నాఁడితఁడు

చ. 1: చెక్కుచే యిదేఁటికమ్మా సిగ్గువడ నేఁటికమ్మా
అక్కరతో మగఁడు మాఁటాడఁగాను
చక్కఁ జూడఁ గదవమ్మా సరసము లాడవమ్మా
గక్కన నీరతులకే కాచుకున్నాఁ డితఁడు

చ. 2: శిరసు వంచనేలమ్మా సెలవి నవ్వ నేలమ్మా
బెరసి విభుఁడు మితోఁ బెనఁగఁగాను
తెరదియ్యఁ గదవమ్మా తెచ్చి విడేమియ్యవమ్మా
పరగ నీకే బతిమి పట్టుకున్నాఁడితఁడు

చ. 3: వూరకుండనేలమ్మా వొడ్డుకొన నేలమ్మా
చేరి శ్రీవేంకటేశుఁడు చెనకఁగాను
గారవించఁ గదమ్మా కడు సంతోసించవమ్మా
కూరిమి నీరతులకే కోరుకున్నాఁ డితఁడు

రేకు: 1898-2 పాడి సం: 28-576
పల్లవి: ఇటువంటి నీ సుద్దులు యెవ్వఁడెరుఁగు
నటనలే సేసేవు నడుమ నీవు
చ. 1: పలుకుఁ బంతాలనే పలుమారు మాఁటాడేవే
చెలఁగి యెన్నఁడు నేరిచితివో కాని
కలికితనాలనే కాఁపురాలు సేసేవే
మెలుపునఁ బతి నెంత మెప్పించేవో కాని
చ. 2: దారకపుఁదనాలనే దండనుండి బిగిసేవే
బీరము లింకా నెన్ని పెంచేవో కాని
నేరుపులే పచరించి నీటు లెంత చూపేవే
పేరఁబెట్టి యెమ్మె లెంత పెనచేవో కాని
చ. 3: మఱఁగు మొఱఁగులనే మంతనా లేమాడేవే
కఱత లెన్ని నీవల్లఁ గలవో కాని
యెఱుకతోనే శ్రీవేంకటేశుఁడు నన్నిట్టె యేలె
మఱి నీవితని నెంత మరిపేవో కాని

రేకు: 1898-3 నాదరామక్రియ సం: 28-577

పల్లవి: ఎదుటికి రాఁగదవే యిట్టె నిన్ను మోచ్చేను
పొదిగొన నీనేరుపు పొగడేను నేను

చ. 1: సలిగేలే మెరసేవు చనవులకే వచ్చేవు
నలి విభుఁగు నీతోను నవ్వేనంటాను
యెలమి నాతోఁ జెప్పవే యెంత గద్దో నీపగటు
వెలియఁగాఁ జెవులార వినేఁగాని

చ. 2: సాటులకే పెనఁగవు సారె వావులు చేప్పేవు
సూటిగా నిన్నీతఁ డిట్టె చూచె నంటాను
పాటించి నాముందరను పచారించవే నీయెమ్మె
తేటలుగా నీ గుట్టు తెలిసేఁగాని

చ. 3: వంతులకే తగిలేవు వాసులెల్లా నెరపేవు
యింతలో శ్రీవేంకటేశుఁడేలెనంటాను
మంతుకెక్క నన్నీతఁడు మన్నించినాఁడు తొల్లె
సంతోస మెరిఁగించవే సమ్మతించేఁ గాని

రేకు: 1898-4 ముఖారి సం: 28-578

పల్లవి: తడవము తాఁకము తానే చెనకీ నన్ను
కడఁగి యీతనిలాగు కంటివటే చెలియ

చ. 1: పొరిఁబొరి వనములో పూవులు నేఁగోయఁ గాను
సరసము లేమాడీనే జాజరకాఁడు
సరస నే నింతులతో జలకేలి సేయఁగాను
దరినుం డేమినవ్వీనే తచ్చనకాఁడు

చ. 2: మేడలోనుండి జవ్వాది మేఁ బూసుకొనఁగాను
వీడె మేవియ్య వచ్చీనే వేడుకకాఁడు
నీడ చూచి కస్తూరిని నే బొట్టు వెట్టుకోఁగాను
వోడక యెంత మెచ్చీనే వుబ్బరికాఁడు

చ. 3: యెన్నికతోఁ గిన్నెర వాయించుకొంటా నే నుండఁగా
చన్నులేల చూచీనే జాణకాఁడు
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కన్ను లెంత జంకించీనే గద్దరి కాఁడు

రేకు:	1898-5 లలిత	సం:	28-579
పల్లవి:	చింతకాయ కజ్జాయము చెలువునితోడిపొందు
	పంతముతో నీతని మోపవే గట్టిచన్నులు
చ. 1:	కొచ్చి కొచ్చి పెనఁగఁగా గుబ్బతిలె వలిపులు
	తచ్చి తచ్చి మాఁటాడఁగా తమి రేఁగెను
	హెచ్చి రారాఁపులవంక నికా నెంత పెరుగునో
	ఇచ్చకమే సేసి పతి కియ్యఁగదే విడెము
చ. 2:	చిమ్మి చిమ్మి చూడఁగాను చీఁదరగోనె వెడుర(క?)
	కమ్మి కమ్మి చెనకఁగా కళదాఁకెను
	యెమ్మెలఁ బొరలఁగాను యెట్టుండి యెట్టౌనో
	వుమ్మడి నీతనిఁజేరి వొత్తవే పాదాలు
చ. 3:	మోఁణి మిఁటి జంకించఁగా మిక్కుటమాయఁదగులు
	తూఁటి తూఁటి నవ్వఁగా బొత్తులు గలసె
	జాఁలిక శ్రీవేంకటేశు సంగాతమెంత మేలౌనో
	ఆఁటిడి గాఁగిలించవే అలమేలుమంగవు

రేకు: 1898-6 శ్రీరాగం సం: 28-580

పల్లవి: ఎఱఁగవా నీవేమైనా ఇన్నిటా జాణఁడవు
మ(మె?)అసి మీ మహిమలు మెచ్చుకొంటగాక

చ. 1: వలపు దలకెక్కితే వారించేవా రెవ్వరు
మలసి మోవితేనెలే మందులౌఁగాక
తలఁపే చీఁకటిగొంటే తగదన నెట్టువచ్చు
తెలినవ్వు వెన్నెలచే తేటవారుఁగాక

చ. 2: విరహమే వేఁడైతే విడిపించ వెరవేది
సరససల్లాపములే చలువౌఁగాక
వొరపులే తరమైతే వొడ్డుకొనే దెటువలె
అరిది రతుల నోలలాడుత(ట?) గాక

చ. 3: పాయమే మరిగించితే బడివాయ నెపమేది
కాయజకేలి కాఁగిలే గతిగాక
యీయెడ శ్రీవేంకటేశ యీకె నీవుఁ గూడితిరి
పాయని సంతోసాలఁబరగుట గాక

రేకు: 1899-1 ఆహిరి సం: 28-581

పల్లవి: ఎటువంటి రసికుఁడు యేమని సంతోసింతు
తటుకన నావలపు తానే ఫించెను

చ. 1: కూరిమితోఁ దనమంచిగుణాలే చెప్పకోఁగాను
తారుకాణై మాయింటికి తానే విచ్చేసి
గారవించి తా మన్నించే కతలే తలఁచగాను
చేరి వేఁడుకొని చెక్కనొక్కె నిపుడు

చ. 2: ఆముకొని తనమాఁట లాలకించుకుండఁగాను
ప్రేమతోడఁ దానే నన్నుఁ బిలిచినాఁడు
గోమున సరసయాడఁగోరుక నేనుండఁగాను
చేముట్టి నాతోఁ బెనఁగి చిమ్మిరేఁడె నన్నును

చ. 3: నెమ్మిఁ దనకాఁగిటికి నే గాఁచుకుండఁగాను
వుమమడి నాచన్నులు మేనొత్తుకొనెను
నమ్మితే మనసుకు మనసే సాకిరిగాఁబోలు
ఇమ్ముల శ్రీ వేంకటేశుఁ డిన్నిటా నన్నేలెను

రేకు: 1899-2 పాడి సం: 28-582

పల్లవి: నీ వద్దికి వీఁడే వచ్చె నీకోరికె లీడేరె
కైవసమాయఁ బనులు కళవళించకువే

చ. 1: పన్నీటికాలువసుమ్మీ బాసటపుటేరు గాదు
పున్నమ చంద్రుఁడు సుమ్మ భూతము గాఁడు
వెన్నెల లివె సుమ్మీ వేసవి యెండలు గావు
కన్నెరో విభునిఁ బాసి కళవళించుకువే

చ. 2: కప్పరము సుమ్మీ యది కంతుపెట్లుప్ప గాదు
పుప్పొడి సుమ్మీ చౌక్కు బూడిదె కాదు
వొప్పఁగుఁదేఁటులు సుమ్మీ వుంటవింటి గుండ్లుగావు
కప్పిన విరహమునఁ గళవళించకువే

చ. 3: గందపు మాఁకులు సుమ్మీ కారడవి యది గాదు
అందపు మొగ్గలు సుమ్మీ అమ్ములు గావు
ఇందువచ్చి శ్రీవేంకటేశుఁడు నిన్నిదెకూడె
కందువ మన్నన లిచ్చె గళవళించకువే

రేకు: 1899-3 శ్రీరాగం సం: 28-583

పల్లవి: ఎలయించి జవరాలి నెంత సేసేవు
వలవని వైరాలు వారింతువు రావయ్యా

చ. 1: వెలఁది నిన్నుఁబాసి విరహాన ముంజేతి
చిలుకఁ బారఁదోలె చిగురుఁ దిట్టె
పొలసిన కోవిలల పూఁచి వుంటవింటవేసి
చెలఁగి యీపెకు బుద్ధి చెప్పుదువు రావయ్యా

చ. 2: వెట్టవిరి నీ వాడకు విచ్చేయని కాఁతాళాన
చల్లగాలిఁ గోపగించె జాజులు గోసె
పల్లదానఁ దుమ్మిదలపై సంపెఁగలు చల్లె
మల్లాడి యీపె కినుక మాన్పుదువు రావయ్యా

చ. 3: తమకించి నీవు వచ్చుదాఁకా వేగిరమై
కమలము లెండఁబెట్టె కంతు సాధించె
మమతతో గూడితివి మన్నించి శ్రీ వేంకటేశ
ప్రమదాన నీకె నొడఁబరతురు రావయ్యా

రేకు: 1899-4 బౌళి సం: 28-584

పల్లవి: ఇన్నిటాను నేరుపరి యెంచి చూచితే నీతఁడు
చిన్నదాన నేనే బుద్ధి చెప్పఁగదే చెలియా

చ. 1: యిచ్చకమే సేసీనంటే యెరపరికమ్మై యుండు
పచ్చిగాఁ జెనకేనంటే పంతమ్మై యుండు
కొొచ్చి కొసరేనంటే గొరబుసేసినట్టుండు
ఇచ్చట నీతనిమన సెట్టు గరఁగింతునే

చ. 2: మాటలే మాడేనంటే మందెమేళమ్మైనట్టుండు
సాటికిఁ బ(బె?) నఁగే నంటే చలమ్మైయుండు
నీటున నూరకుండితే నిండురాజసమ్మైయుండు
యీటు వెట్టుక యీతని నేరీతిఁ జొక్కింతునే

చ. 3: చుట్టమనై మొక్కేనంటే జూటుఁదనమ్మైయుండు
గుట్టున నుండేనంటే సిగ్గులైయుండు
గట్టిగా నన్నేలినాఁడు గక్కనఁ దానే వచ్చి
ఇట్టె శ్రీవేంకటేశ్వేరు నేనిట మెప్పింతునే

రేకు: 1899-5 భైరవి సం: 28-585

పల్లవి: వినరమ్మ చెలులాల వేడుక లివిన్నియును
ఘనమైనవలపులు కడులాబమాయను

చ. 1: ముత్తెపుఁ జెమటలెల్లా ముంచి ఏరులైపారె
బత్తితోడి పులకలపైరు లెక్కె
కొత్తకొత్త వయసుల కోరికలు పొలుకొనె
హత్తిన వలపులెంత అగ్గువ లౌనో

చ. 2: మొగములోని కళలు మొనసిరాసులాయ
తెగని సంతోసాల గాదెలు నిండెను
అగపడ్డసరసము లామనిపై నామనాయ
తగిలి వలపులెంత దారణగలుగునో

చ. 3: అచ్చమైన కాఁగిళ్లు అంగళ్లు ముంగిళ్ళునిండె
ముచ్చట చెనకులనే లచ్చెనలాయ
యిచ్చట శ్రీవేంకటేశుఁ డింతలు నిట్టెకూడె
పెచ్చురేఁగి వలపుల చేరా లెంత యెచ్చునో

రేకు: 1899-6 తోలుఁగుగాంబోదిసం: 28-586

పల్లవి: ఏమిసేతుఁ జెలియా యివిగో నా చందములు
కామించి ఇంతలో వచ్చి కరుణించె విభుఁడు

చ. 1: కొత్త కొత్త సిగ్గులతో గుట్టున నుందానఁగాని
చిత్త మాతనిఁదలఁచి చిమ్మిరేఁగీనే
హత్తిన తమకములు అడఁచు కుందానఁగాని
గుత్తపు వలపు లోలో గుబ్బతిలీనే

చ. 2: నడుమనే సెలవుల నవ్వులు నవ్వేఁగాని
వుడినోనితలపోఁత లుమ్మగిలీనే
వడదేరక బీరాన వట్టిమాఁట లాడెఁగాని
నిడువాలుఁజూపులైతే నివ్వెరగందీనే

చ. 3: కమ్మటి నూరకే మోముకళలు దేరీఁగాని
కమ్మఁ జెమటలు మేఁ గారుకొనీనే
యిమ్మల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కమ్ముకొన్న సంతోసాలు కావరించీనే

రేకు: 1900-1 వరాళి సం: 28-587

పల్లవి: నన్నెంత వేఁడుకొనేవు నయాన నీవు
మన్నింపించుకొన్నదాన మరిగించేఁగాక

చ. 1: వెగటై యేమిసేసినా వెంగెమాడేనా నిన్ను
మొగమోట గలదాన మొక్కేఁగాక
నిగిడి యెంత మిరినా నీతో మారుమలసేనా
తగులు గలవానను దక్కివుందుఁగాక

చ. 2: యెత్తలనుండి వచ్చినా నెగ్గుపట్టేనా నిన్ను
చిత్తములోదాన సేవసేఁగాక
బత్తి యెందుఁగలిగినా పదరిపాదించేనా
హత్తుగడైవున్నదాన నట్టె మెచ్చేఁగాక

చ. 3: సందడివలపు లెంత చల్లుకొనివున్నా నిన్ను
పొందైవున్నదానఁ దమివుట్టించేఁ గాక
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కందువైనదాన నీకు గళరేఁచేఁగాక

రేకు: 1900-2 సాళంగనాట సం: 28-588

పల్లవి: కాంతల సిగ్గు లింతేసి కాకుసేతురా
యింత వేగిరమేఁటికి యెనసేవుగాక

చ. 1: విందువెట్టి యాపె నీకు విడెము చేతికియ్యఁగా
సందడించి పయ్యదలో చన్నులంటేవు
గందము వూసి వూడిగములు నీకుఁ జేయఁగా
అంది మోవితేనెలకు నట్టె లాచేవు

చ. 2: పువ్వులు ముడిచి నీకుఁ బూఁచి కొప్పువట్టఁగాను
పవ్వళించుమని కొంగువట్టి తీసేవు
నివ్వటిల్ల సింగారించి నీకు సొమ్ములు వెట్టఁగా
చివ్వన నీకొనగోరు చెక్కున నూఁదేవు

చ. 3: చొక్కించి యాపె నీకు సురటి విసరఁగాను
గక్కనఁ దమకమునఁ గాఁగిలించేవు
ఇక్కడ శ్రీవేంకటేశ నీకు చల్లఁగానే
మక్కువఁ గూడి సదమదమయ్యేవు

రేకు: 1900-3 ముఖారి సం: 28-589

పల్లవి: మరిగి పాయకుండితే మంచివైతోఁచు
సరవిదప్పకురమ్మ సతులాల మీరు

చ. 1: చెప్పరాని విరహాన చిత్తము చిక్కువడితే
కప్పురము దిన్నాను కారమై తోఁచు
దెప్పరపు వయసే దిమ్మురేచ దొరకొంటే
కొప్పులోని విరులైన కొంతములై తోఁచును

చ. 2: పన్నుకొన్నవలపుల పసలబారిఁ బడితే
వెన్నెలలు గాసినాను వెట్టయై తోఁచు
వున్నతపుఁ కో(గో?)రికత నోలలాడ దొరకొంటే
చన్నులపై గందమే వేసటలై తోఁచును

చ. 3: తెగరాని సిగ్గులలో తెప్పలఁ దేలితేను
చిగురుఁ బానుపైనా చేగయ్యైతోఁచు
నిగిడి శ్రీవేంకటాద్రి నిలయుఁడు గూడితేను
వెగటు లెల్లాఁబాసి వేడుకలై తోఁచును

రేకు: 1900-4 సామంతం సం: 28-590

పల్లవి: మేలుమేలే వోపుదువే మించి యంతపనికైనా
పోలించి చెలులమెల్లాఁ బొగడేమే నిన్నును

చ. 1: వాసి గలదానికి వలపులీడేరునే
వేసరనిదానికి వినయము చెల్లునే
మోసపోనిదానికి ముచ్చటలొనరునే
బేసబెల్లిదానికి సెనఁగఁదగునే

చ. 2: చుట్టమైనదానికి సొలయఁ బొసఁగునే
గుట్టుగలదానికి సిగ్గులు వడఁగూడునే
దిట్టయైనదానికి తిట్టినా నమరునే
గుట్టవాయదానికిఁ గరఁగించవచ్చునే

చ. 3: చెల్లుబడైన దానికి చేఁతలు దగవౌనే
యిల్లాలైన దానికి నెనయ నేరుపౌనే
వెల్లవిరిగాను శ్రీవేంకటేశుఁడేలె నిన్ను
యెల్లగా నీవంటిదాని కిన్నియుఁ జొప్పడునే

రేకు:	1900-5 ఆహిరి	సం:	28-591
పల్లవి:	చిత్తమురాఁ దనసేవ సేసేఁగాక
హత్తి నన్ను మోవి చవు లడుగఁగవలెనా
చ. 1:	యెప్పుడు దా నేమనినా నియ్యకొని నిచ్చేఁగాక
తప్పులు వెదకేనా తనతో(లో?) నేను
ముప్పిరి దనకు నేను మోహించివున్నదాన
చొప్పలెత్తి నామనసు సోదించవలెనా
చ. 2:	గక్కనఁ జన్నులంటితే కానిమ్మని చొక్కేఁగాక
తక్కరికై పెనఁగేనా తనతోనేను
అక్కరఁ దనకు నేనాలనైతి నప్పడే
ప్కన నన్నింత వొడఁ బరచఁగ వలెనా
చ. 3:	వొత్తి నన్నుఁ జెనకితే వొప్పుగొని వుండేఁగాక
తత్తరించి కొసరేనా తనతో నేను
యిత్తల శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁదగులైతి
కొత్తలుగా నన్ను వేఁడుకొన నింత వలెనా
రేకు:	1900-6 సింధురామక్రియ	సం:	28-592

పల్లవి: నేరుపవయ్యా నాకు నీతోడి కాఁపురాలు
చేరి నీకు మోహించిన చిన్నదాన నేను

చ. 1: కామించి నీకు నేను కడుబత్తి సేతును
యేమని వున్నదో చిత్త మెఱఁగ నేను
చేముట్టి సరసమాడి చెక్కునొక్కి వేఁడుకొందు
నేమముతో జొక్కించనేరను నేను

చ. 2: చనవుసేసుక నీతో సారెకు మాఁటాడుకొను
వొనరిన నీ గుణము లూహించ నేను
పెనఁగి పెనఁగి నీపైఁ బ్రియములు చల్లుదు
తనిసి నీవుద్యోగము దలఁచ నేను

చ. 3: చక్కని నీమోము చూచి సంతొసించుకొందును
యెక్కుడైన నీమన్నన లెంచనునేను
గక్కన శ్రీవేంకటేశ కాఁగిలించుకొందు నిన్ను
చొక్కపు నీవేళలు సోదించనేను

రేకు: 1901-1 ముఖారి సం: 29-001

పల్లవి: ఎన్ని వేసాలు సేసేరు యెఱఁగనంటా నాతో
సన్నలనే యిందాఁకా సాములు జరపరా

చ. 1: ఆద్దములు చూచుకొంటా నాకె నీవు నవ్వుకొంటా
యిద్దరును నుండరా యేకతానను
సుద్దులు చెప్పుకొంటాను సొమ్ములువెట్టుకొంటాను
గద్దెమీఁదఁ గూచుండి కాఁపురాలు సేయరా

చ. 2: గందములు వూసుకొంటా కాఁగిటఁ బెనఁగుకొంటా
సందడివలపులెల్లాఁ జల్లరా మీరు
అంది విడే లిచ్చుకొంటా ఆయాలు గరఁగుకొంటా
పెందలకాడను మీరు పెండ్లిండ్లాడరా

చ. 3: సరసము లాడుకొంటా సారె మోవు లానుకొంటా
విరులవేట్లాడరా వేడుకతోను
ఇరవై శ్రీవేంకటేశ ఇట్టె నన్నేలితిగాక
సారిది మీలో మీరు చుట్టములే కారా

రేకు: 1901-2 పాడి సం: 29-002

పల్లవి: ఎక్కడ చూచినఁ దానె ఇంతులతో మెరసీని
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు

చ. 1: చెక్కుల జవ్వాదితోడ చంద్రికదట్టీతోడ
చొక్కమైన మాణికపు సొమ్ములతోడ
వెక్కసపు రాజసాన వేడుకకాఁడై యున్నాఁడు
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు

చ. 2: చక్కని మొగమువాఁడు జాజుల దండలవాఁడు
వుక్కుమీరిన నవ్వుల వుయ్యారివాఁడు
అక్కజపు సతులచే నాటపాటలు వినీని
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు

చ. 3: పెక్కువరా లిచ్చుకొంటా బిరుదులు చూపుకొంటా
అక్కజపు శ్రీవేంకటాద్రిపై నుండి
యిక్కువతోఁ గొలువు సేయించుకొంటా నున్నాఁడు
చుక్కలూరి చెన్నునిఁ జూడరమ్మ చెలులు

రేకు: 1901-3 శ్రీరాగం సం: 29-003

పల్లవి: ఎంత నేరుచుకొంటివే ఇంతిరో నీవు
వింత లిందరి ముందర వెలఇంచితివౌనే

చ. 1: బెల్లాలవంటి మాఁటలు పెదవులపై నాడి
పెల్లున మగని వలపించితివౌనే
వల్లెవేససినటువలె వాడికలు పచరించి
కొల్లగా నాతని దక్కఁగొంటివి నీవౌనే

చ. 2: పువ్వులచేనెత్తినట్లు పొసఁగ వావులు చెప్పి
చివ్వనఁ దమకము రేఁచితివౌనే
పువ్విళ్ళూర మేనుసోఁక వొద్ద నిట్టె కూచుండి
యివ్వల నాతని సాదించితివౌనే

చ. 3: వెన్నెలగాసినట్ల వేడుకచూపులు చూచి
యెన్నికరతుల నెలయించితివౌనే
అన్నిటా శ్రీవేంకటేశుఁ డాతఁ డిట్టె నన్ను నేలె
చెన్నుగ నీ విట్టె చాయసేసుకొంటివౌనే

రేకు: 1901-4 భైరవి సం: 29-004
పల్లవి: చెలులాల బుద్దు లేమి చెప్పేరే మీరు నాకు
కలిగె నాతని పొందు కాణాచిగా నాకు
చ. 1: మొగము చూచినప్పుడే మొనపెఁ జుట్టరికము
నగితేనే వలపులు నాటుకొనెను
తగిలి వద్దఁ గూచుంటే దైవారె వావులు
బిగిసి వట్టి సిగ్గులు పెంచనీఁకనేఁటికే
చ. 2: సరసమాడి నప్పుడే సతమాయ ననుపులు
తెరలోనికి వచ్చితే తేరెఁ బనులు
పరపుపై నెక్కితేనే బలువాయ సంగాతాలు
నిరతి నీఁకఁ బంతాలు నెరపఁగనేఁటికే
చ. 3: వీడె మందుకొన్నప్పుడే వేడుకలెల్లా నీడేరె
జోడుగా మాఁటాడితేనే చొక్కె మనసు
యీడనె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యేడలేని తరితీపు లెంచ నీఁకనేఁటికే

రేకు: 1901-5 వరాళి సం: 29-005

పల్లవి: చక్కనిజాణ యిన్నిటా జవరాలు
చక్కెరబొమ్మవంటిది జవరాలు

చ. 1: కన్నులఁ దప్పకచూచి కప్పురాన నిన్ను వేసి
సన్నసేసీ నదివో జవరాలు
వెన్నెలనవ్వులు నవ్వి వేడుక నీకుఁ బుట్టించి
చన్నుల నొరసీ నిన్ను జవరాలు

చ. 2: తెరమరఁగుననుండి తేవెగార మాఁటలాడి
సరివెనఁగీ నీతో జవరాలు
విరులు నీపైఁ జల్లి వింతసేఁతలెల్లాఁజేసి
సరసములు నెరపీని జవరాలు

చ. 3: తమకము నీకు రేఁచి దయపుట్ట సేవసేసి
సముకాన గొసరీని జవరాలు
అమర శ్రీవేంకటేశ యన్నిటా నీవుగూడఁగా
జమళిరతుల జొక్కీ జవరాలు

రేకు: 1901-6 రామక్రియ సం: 29-006

పల్లవి: ఈతఁడువో రాముఁడు యేకాంగవీరుఁడు
యేతలఁజూచినఁ దానే యిరవుకొన్నవాఁడు

చ. 1: చిఱుతప్రాయమునాఁడు శివునివిల్లు విఱిచి
మెఱసి సీతఁ బెండ్లాడి మించినవాఁడు
తఱిఁ బదునాలుగువేలదానవుల నిమిషాన
జఱసి తానొకఁడే చదిపినవాఁడు

చ. 2: వోడక విల్లెక్కువెట్టి వూరకె వొక్కమ్మునను
యేడుదాళ్ళు ధరఁగూల నేసినవాఁడు
జాడగాఁ గొండలచేత జలనిధి గట్టించి
వేడుకతో లంకమీఁద విడిసినవాఁడు

చ. 3: రావణ కుంభకర్ణాది రాకాసుల బరిమార్చి
యీవల నయోధ్యపట్న మోలినవాఁడు
శ్రీవేంకటాద్రిమీఁదఁ జేరి మాల్యవంతమున
వేవేలు చందములను వెలసినవాఁడు

రేకు: 1902-1 కాంబోది సం: 29-007

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు యీ మగువ నేరుపులు
వేమరు దరితీపుల విందుల వెట్టీని

చ. 1: చెలి నీపై వలపుసేసలు చల్లీ నదె
చెలరేఁగి చెలరేఁగి చే సన్నల
యెలమితోఁ బెండ్లి వాయిద్యాల వాయించీ నదె
మొలనూలున గట్టిన మురిపెపుగంటల

చ. 2: తొయ్యలి యడియాసల దోమటి దొడికీనదె
వొయ్యనొయ్యనే మోవి వొడఁబాటుల
నెయ్యపుఁ జుట్టరికాలు నీకే నేరిపీ నదె
కొయ్యకలిచూపుల కసరులను

చ. 3: కమ్మనికాఁగిట బూజగుండలు మోచీనదె
సమ్మతించి సమ్మతించి చనుగుబ్బల
ఇమ్ముల శ్రీవేంకటేశ యీకెను నీవు గూడఁగా
దొమ్మిరతి చెమటలతోడ నీళ్ళాడీని

రేకు: 1902-2 హిందోళం సం: 29-008

పల్లవి: ఇంతగలితే నీవు యేకతానకు రారాదా
వింతలెల్లా నింతి నీకు విన్నవించీఁగాని

చ. 1: కోరి సేవలుసేయఁగా గుబ్బలు దాఁకించెనంటా
గోర నేల గీరేవు కోమలిని
కూరిమిఁ జూచిన చూపు గురుతులు మోఁచెనంటా
సారె సారె చెలినేల జంకించేవు

చ. 2: గక్కన విడెమియ్యఁగా కళలు రేఁగెనంటా
చక్కని యాపె నేల సాదించేవు
మక్కువతో మాఁటాడఁగా మనసు గరఁగెనంటా
చొక్కుచునేల మానముసోఁకఁ దిట్టేవు

చ. 3: కలసి నవ్వఁగాఁ దమకము లుప్పతిలెనంటా
పలుమారు నెంత కొంగువట్టి తీసేవొ
యెలమి శ్రీవేంకటేశ యిట్టె యీకె నేలితివి
నిలుచుండఁగానే యెంత నివ్వెరగందేవు

రేకు: 1902-3 రామక్రియ సం: 29-009

పల్లవి: చూడఁగదవయ్యా యీపె జూటుఁదనాలు
వేడుకతో దైవారీ వేసా లీడ నెంతో

చ. 1: బిగువుఁ జన్నుల నొత్తి పెనఁగులాడీ నీతో
మగువ దంటతనము మరి యంతో
నగుతానే కొనగోరు నయమున సోఁకించీ
తగులైన నీపై తమి తనకెంతో

చ. 2: కరములు చాఁచి కడు నిన్నుఁ జెనకీని
యిరవైన గర్వ మీపె కింక నెంతో
తురుములోని విరిదండ తోడనే నీ మెడవేసీ
సొరిది నీతోఁ జేసిన చుట్టరిక మెంతో

చ. 3: సారె సారె నీ మోవిచవులు నిన్నడిగీని
మేరమీరి యీకె మందెమేళ మెంతో
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కోరి నీవద్దఁ గూచుండీ కోమలియాస యెంతో

రేకు: 1902-4 సౌరాష్ట్రం సం: 29-010

పల్లవి: నీ వెఱఁగవా తగవు నేము చెప్ప నేమున్నది
మావంటి చెలులను మన్నించుటగాక

చ. 1: చేయి వట్టితే పతితో సిగ్గులు వడుదురా
ఆయ మెరిఁగి సరసమాడఁ గదవే
నీయందు బత్తిసేసితే నివ్వెరగందుదురా
చాయలా సన్నలా పొందు జరపుటగాక

చ. 2: తప్పక చూచితేను తలవంచుకొందురా
చెప్పినట్టెల్లా నీవు సేయఁగదవే
కొప్పు దువ్వి పెనఁగితే కొంచించి లోఁగుదురా
ముప్పిరి నియ్యకొని ముంచి నగుటగాక

చ. 3: కూరిమిఁ గాఁగిలించితే గుట్టుసేసుకొందురా
సారె సారె వలపులు చల్లఁగదవే
కోరి శ్రీవేంకటేశుఁడు కూడఁగా నెలయింతురా
చేరి సేవలెల్లా నిట్టే సేయుటగాక

రేకు: 1902-5 వరాళి సం: 29-011

పల్లవి: ఔనే జాణవౌదువు అన్నిటా నీవు
నానెఁగదవే సెలవినవ్వుల నీ సన్నలు

చ. 1: చూడఁజూడ సూట్లు సుదతి నీ చూపులు
వాడ వాడ వలపులు వాడికలు
కూడఁగూడ గురుతులు కొనగోరి చెనకులు
యేడఁ1 గోలదనివెట్టే మిట్టి చతురతలు

చ. 2: వండ వండనట్లు వడి నీతరితీపులు
వుండనుండ వేడుకలు వునుకులే
పండఁబండ మచ్చికలు పానుపుపై నీ రతులు
నిండుకొనెఁగదె నీ నేరుపుల కథలు

చ. 3: పెంచఁబెంచఁ బెరిగీని పెద్దలై నీ చన్నులు
ముంచ ముంచ నూరీ నీ మోవి తేనెలు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
మించెఁగదవె నేఁడు మిక్కిలి నీ కతలు

రేకు: 1902-6 నాదరామక్రియ సం: 29-012

పల్లవి: ఇంతేసి రట్టు గలదా ఇల్లాండ్లకు
యెంతైనా గుట్టుతోనే యెనయవలెఁ గాక

చ. 1: మొగము చూపి చూపి మోహములు వెడరేఁచి
మగనితో నెంతేసి మాఁట లాడేవే
నగి నగి వలపులు నానఁబెట్టి యంతలోనే
పగటున నెంతేసి బయలీఁదించేవే

చ. 2: చెనకి చెనకి మరి చిగురుఁజేతుల మొక్కి
వినయాన నెందాఁకా వేఁడుకొనేవే
పెనఁగి పెనఁగి సారె బిగువుఁ జన్నుల నొత్తి
కనుమాయలనె యెట్టు గరఁగించేవే

చ. 3: కొసరి కొసరి వావిఁగొనగోరు సోఁకించి
పసలుగా మే నేల పచ్చిసేసేవే
యెసగ శ్రీవేంకటేశుఁ డిన్నీటాను నన్నుఁగూడె
పొసఁగ నీవేమిటికి పొందులు చూపేవే

రేకు: 1903-1 లలిత సం: 29-013

పల్లవి: కొత్తపెండ్లికొడుకవు కొంకనేల నిఁక నేఁడు
చిత్తగించి రతులను చెలరేఁగవయ్యా

చ. 1: కలువరేకులవంటి కన్ను లాపె చూచీ నిన్ను
నెలకొని యెదుటను నిలువవయ్యా
తలకొని తేనెపెదవు లాపె విలిచీని
పలుమారు నూఁకొని పలుకవయ్యా

చ. 2: మొనసి చందురువంటి మొగమాపె నవ్వీని
చనవిచ్చి వలపులు చల్లవయ్యా
గునిసి కొండలు వంటి గుబ్బ లాపె చెనకీని
కనుఁగొని వేడుకతో గాఁగిలించవయ్యా

చ. 3: చిగురుటాకులవంటి చేతు లాపె మొక్కీని
సొగిసి మన్నన లిచ్చి చూడవయ్యా
నిగిడి శ్రీవేంకటేశ నిన్ను నిట్టె పెండ్లాడె
మగువ నన్నిటా నీవు మన్నించవయ్యా

రేకు: 1903-2 హిందోళ వసంతం సం: 29-014

పల్లవి: ఎఱఁగవా ఆపె మాకు నేలికసాని యౌత
గుటిసేసి నన్ను నేల గుట్టుతో మెచ్చేవే

చ. 1: సేసవెట్టి పెండ్లాడినచెలి గాచుకుండఁగాను
ఆసగించే వదేమే నీ వాతనికిని
మోసపోక తమలోన మొగములు చూచుకోఁగా
లాసి లాసి నీవెంత వలపు చల్లేవే

చ. 2: మేనమఱఁదలయిన మెలుఁత దండ నుండఁగా
నానఁ బెట్టుక నీవేమి నవ్వు నవ్వేవే
పానుపున నిద్దురూ పవళించియుండఁగాను
పూని పట్టి నీ వెట్టు పొంచి మాఁటలాడేవే

చ. 3: పట్టపుదేవు లయిన భామ సతమై యుండఁగా
వెట్టికి నీవేల వచ్చి వీడె మిచ్చేవే
అట్టె శ్రీవేంకటేశుఁడూ నాపె సన్నసేసుకోఁగా
పొట్టఁ బొరుగు నీవేమి పొత్తు గలసేవే

రేకు: 1903-3 పాడి సం: 29-015

పల్లవి: వెలఁది యీకె ఇదిగో వీఁడిగో పెండ్లికొడుకు
యెలిమి నుపచారాలు ఇన్నియునుఁ జేయరే

చ. 1: అంబుజపాణికిని హారములు గట్టరే
బింబాధరికిఁ గొప్పు వెట్టఁగదరే
కంబుకంఠికిని కప్రపు బొట్టు వెట్టరే
అంబరమధ్యకును ఆరతులు యెత్తరే

చ. 2: కలువకంటికి మంచికాటుక వెట్టఁగదరే
తలిరుఁబోణికి పూలదండ వేయరే
మలయజగంధికి బొమ్మలపెండె మందియ్యరే
అలినీలవేణికి నట్టె సింగారించరే

చ. 3: కరిగమనకును బాగాలు చేతి కొసఁగరే
హరిమధ్య కొడ్డాణ మమరించరే
ఇరవుగా శ్రీవేంకటేశ్వరునిఁ బెండ్లాడె
తరుణికి నితనికి తగు పీఁట వెట్టరే

రేకు: 1903-4 ముఖారి సం: 29-016

పల్లవి: మగవాని మాయలు మరి యెందుకైనా వచ్చు
వెగటు గాకుండాఁ జెలి విన్నవించుకోవే

చ. 1: మాఁటలాడవచ్చుఁగాని మనసు దెలియరాదు
నాఁటఁ జూడవచ్చుఁగాని నవ్వించరాదు
సూటి చూపవచ్చుఁగాని చొచ్చి గురివేయరాదు
తేటగా నాతని బుద్ధి తెలుసుకోవే

చ. 2: మోము చూడవచ్చుఁగాని మోహము పుట్టించరాదు
కామించఁగవచ్చుఁగాని కరఁచరాదు
సాముసేయవచ్చుఁగాని చలము సాదించరాదు
గామిడి యీతనిబత్తి గనుకొనవే

చ. 3: తలఁపించవచ్చుఁగాని తరితీపు రేఁచరాదు
కలయఁగవచ్చుఁగాని గద్దించరాదు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
సొలసి యీతని పొందు సోదించుకోవే

రేకు: 1903-5 భైరవి సం: 29-017

పల్లవి: ఇంతలోనే వలపు నీవేల దాఁచేవే
అంతటి విభుఁడు నీకు నాసనేయఁగాను

చ. 1: తప్పక చూచి చూచి తలవంచుకొనేవేమే
ఇప్పుడు నీపతి సన్నలెల్లాఁ జేయఁగా
చిప్పిల నవ్వుల నవ్వి సిగ్గువడే వదియేమే
చొప్పుగా నీ కాతఁడు సుద్దులు చెప్పఁగాను

చ. 2: వీడెమిచ్చి ఇచ్చి నీవు వెరగునొందేవేమే
జాడతో నాతఁడు సరసములాడుఁగా
పాడి పాడి లోలోనె భావము గరఁగేవేమే
యీడు జోడై యాతఁడు నీ ఇచ్చలో నుండఁగాను

చ. 3: కోరి చెనకి గుట్టున నుందానవేమే
యీరీతి శ్రీవేంకటేశుఁ డేలఁగాను
చేరి వద్దఁ గూచుండి చెమరించే వదియేమే
తారుకాణగా నాతఁడే తమి రేచఁగాను

రేకు: 1903-6 దేసాళం సం: 29-018

పల్లవి: ఎంత నేరుచుకొంటివే యేతులు నీవు
వింతలెల్లాఁ జూచి నాకు వెరగయ్యీ నిపుడు

చ. 1: వేడుకతో సారెసారె విన్నపాలు సేసేవు
వాడికగా నీ కతఁడు వలచునంటా
పాడి పాడి తానాలు పచారించి చూపేవు
జాడతో నాతఁడు మెచ్చి సంతోసించునంటాను

చ. 2: కడఁగి వద్దఁ గూచుండి కవకవ నవ్వేవు
యెడయ కాతఁడు చనవచ్చునంటాను
అడియాలముగ గోర నంటి యంటి చెనకేవు
కడు నాతఁడు మరిగి కైకొనునంటాను

చ. 3: చన్ను లొరసుకొంటాను సరుసఁ గొప్పు దువ్వేవు
నిన్ను నతఁడు కాఁగిటను నించునంటాను
ఇన్నిటాను శ్రీవేంకటేశుఁడు నన్నేలినాఁడు
సన్నసేసే వాతఁడు సమ్మతించునంటాను

రేకు: 1904-1 వరాళి సం: 29-019

పల్లవి: చెల్లునే నీకిఁకఁ జేసే చేఁతలెల్లాను
మొల్లమి నాకతఁడేల మొగమోడకుండీనే

చ. 1: చెప్పిన బుద్ధు లాతని చెవిలోనే వుండఁగాను
కప్పురగందుల నేల కైకొనీనే
తప్పని బాసలు నీవాతనిచేఁ జేయించుకోంగా
చొప్పుగా వాడలోవారిఁ జూడనేల చూచీనే

చ. 2: పదల కాతని నీ పసము సేసుకుండఁగా
యెదుటివారితో మరియేల నవ్వీనే
కదిసి యాతనితో నేకతాలు నీ వాడఁగాను
మదిరాక్షులతో నేల మాఁటలాడీనే

చ. 3: యేపొద్దూ నాతని నీవు యెదఁబెట్టుకుండఁగాను
పైపై నెవ్వరి కేల బాఁతి పడీనే
యేపున శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్ను నేలె
చేపట్టి నీయెప్పణేల సేయకమానీనే

రేకు: 1904-2 గౌళ సం: 29-020

పల్లవి: అందుకే వెరగయ్యీ నా కప్పటనుండి
సందడివలపు నాపైఁ జల్లితి వదేమయ్యా

చ. 1: సేయఁగల వూడిగాలు సేసి ని న్నాపె మెప్పించె
రేయిఁ బగలునుఁ దమిరేఁచె నీకును
మాయదారి చేఁతల నీ మనసెల్లాఁ గరఁగించె
యీయెడ మా యింటికి నేఁ డెట్టు వచ్చితివయ్యా

చ. 2: ఆడఁగల మాఁటలెల్లా నాడి నిన్నుఁ జొక్కించె
వాడికలెల్లాఁ జేసి వలపించెను
వేడుకలు నీకుఁ జూపి వినోదాలు మరిగించె
యీడ మాతో సరసము లెంతేశాడేవయ్యా

చ. 3: నవ్వగలట్టల్లా నవ్వి నంటున నిన్నుఁ దేలించె
చివ్వనఁ బెనఁగి సంతోసింపించెను
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్ను నేలితిని
ఇవ్వల నెన్ని చనవు లిచ్చి మన్నించేవయ్యా

రేకు: 1904-3 ఆహిరి సం: 29-021

పల్లవి: చిత్తము రా విభునికి సేవసేయఁగదవే
హత్తి యాతఁడే మన్నించీ నన్నిటాను చెలియా

చ. 1: మచ్చికతో మాఁటాడితే మనసు గరఁగుఁగాక
తచ్చి తచ్చి దూరితేను తమి రేఁగునా
మెచ్చి మెచ్చి పొగడితే మిక్కిలి వేడుకౌఁగాక
పచ్చిగా నేరా లెంచితే పైకొన సొగసునా

చ. 2: ననుపునఁ జెనకితే నవ్వ నిచ్చపుట్టుఁగాక
పెనఁగులాడఁగఁబోతేను ప్రియము లౌనా
వినయాలే సేసితేను వింత రుతు లబ్బుఁగాక
గునిసి కొసరితేను కోరిక లీడేరునా

చ. 3: ఆసతోఁ జూచిన చూపు లాయములు సోఁకుఁగాక
వాసితో సిగ్గువడితే వహి కెక్కునా
సేసవెట్టి నిన్నుఁగూడె శ్రీవేంకటేశుఁడు నేఁడు
మూసిపెట్టితే వలపు మొదలనే దాఁగునా

రేకు: 1904-4 లలిత సం: 29-022

పల్లవి: ఏమయ్యా నీ సుద్దులు యెట్టు దెలియఁగవచ్చు
వేమరును మన్నించేవు వేడుకతో నన్నును

చ. 1: పిలిచి న న్నాదరించి పెండెము చేతి కిచ్చేవు
తొలు తెవ్వతె వెట్టిన తొడవో యిది
తలఁచుక వచ్చి నాకు తమ్ములమిడవచ్చేవు
పొలఁతి యవ్వతె తొల్లి పుక్కిటఁ బెట్టినదో

చ. 2: పట్టుమని పూవులబంతి మీఁద వేసేవు
ముట్టి యెవ్వతె కొప్పున ముడిచినచో
పెట్టెఁదేసి చీరలు ప్రియముతో నిచ్చేవు
గట్టిగా నెవ్వతె యివి గట్టి విడిచినవో

చ. 3: చప్పరమంచముపై నీ సరుసఁ బెట్టుకొనేవు
చిప్పిల నెవ్వతె నీతోఁ జెందియున్నదో
యప్పుడె శ్రీవేంకటేశ యెనసి మోవి యిచ్చేవు
ముప్పిరి నెవ్వతె యాని పిప్పిగాఁ జేసినదో

రేకు: 1904-5 సాళంగనాట సం: 29-023

పల్లవి: ఎంత రట్టు సేసేవు యెమ్మెకాఁడ
యింత బత్తి గలిగితేను యింటికి రావయ్యా

చ. 1: అందుకోలు వలపుల ఆసోదకాఁడ
విందుల మోవితేనెల వేడుకకాఁడ
సందడిసేసలు చల్లే జాజరకాఁడ
మందపట్టు మాఁటలేల మాయింటికి రావయ్యా

చ. 2: తరితీపు నవ్వుల దాయగాఁడ
విరుల వేట్లాడేటి వినోదకాఁడ
పెరరేపు సన్నల బేరగాఁడ
మరిగితే నేమాయ మా యింటికి రావయ్యా

చ. 3: నిక్కి నిక్కి చూపుల నేస్తకఁడ
మిక్కుటపుఁ బ్రియముల మేలగాఁడ
పక్కన నన్నేలినట్టి పంతగాఁడ
యెక్కువ శ్రీవేంకటేశ యింటికి రావయ్యా

రేకు: 1904-6 నాదరామక్రియ సం: 29-024

పల్లవి: ఎన్నట్టి పొందో తనకు యెరుకులు సేసీ నీకు
మున్నిటి వలపు నీవూ ముంచి చల్లవోయీ

చ. 1: దొంతరపూవుల వేసీ తొయ్యలి మేడపైనుండి
వింత వింత మాటలాడీ వినవోయీ
పంతమున మోవి చూసి బయలు నోరూరించీ
సంతోసాలు నీకు రేచీఁ జవిగొనవోయీ

చ. 2: చిమ్మనఁ గోవులఁ జిమ్మి చేతఁ జూపీ బాగాలు
పమ్మి పచ్చడముకొంగు పట్టవోయి
కమ్మటిఁచెక్కుసన్నలు కానుకలు వట్టి నీకు
నమ్మికగా మోము చూచి నవ్వు నవ్వవోయీ

చ. 3: నిచ్చెన వేసుకవచ్చి నిన్ను వొడివట్టి తీసీ
కుచ్చి యాకెఁ గాఁగిలించుకొనవోయీ
యచ్చట శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
హెచ్చిన దేవులనని యిఁకఁ జెప్పవోయీ

రేకు: 1905-1 ఆహిరి సం: 29-025

పల్లవి: ఏల కాపుసేసేవు యింతుల నీవు
తాలిమితోఁ గాఁగిలించిఁ దయఁజూడరాదా

చ. 1: మన్ననగల యాఁటది మంతనాలు సారె నాడు
వన్నెలాఁడియైనది వలపించును
కన్నులకలికి వేడుకలు దైవారఁగఁ జూచు
అన్నిటాఁ జక్కనిదైతే నాసలెల్లా రేఁచును

చ. 2: కూరిమిగలుగుకాంత కొనగోరఁ జెనకును
వోరుపు గలిగినది వొడివట్టును
గారవపుఁజేఁతలది కడు వినయాలు సేసు
కోరి వచ్చినది మంచిగుణాలు నెరపును

చ. 3: మిక్కిలిచుట్టమైనది మెరయించుఁ బొందులెల్లా
వెక్కసపుటా సలది వేఁడుకొనును
అక్కున శ్రీవేంకటేశ యలమెల్మంగ నేలేవు
నిక్కము రతుల కీలు నీవే యెరుఁగుదువు

రేకు: 1905-2 గౌళ సం: 29-026

పల్లవి: ఎంతదడవు వినేవు యెటువంటి నీ వేడుక
సంతోసించి కాఁగిలించి చనవియ్యరాదా

చ. 1: సన్నపుటెలుఁగునను సరిఁ బాడుకొంటాఁ జెలి
వన్నెగాఁ దంత్రులు మీఁటి వాయించీ వీణె
చిన్ని చెక్కులవెంట చెమరించి దప్పిగొనె
మన్నించి నీ పుక్కిటితమ్మల మిడరాదా

చ. 2: నిగ్గుదేర మెచ్చుకొంటా నీ నాటకసాల చూచి
వుగ్గళించి తాళము లొత్తీ సతి
అగ్గమై బుసకొట్టి యలసి వున్నది యట్టె
దగ్గరి నీ వురము గందము మెత్తరాదా

చ. 3: పలుమారు నోరునిండాఁ బద్యాలు చదువుకొంటా
పొలఁతి నీ బిరుదులు పొగడీఁ దాను
నెలవై శ్రీవేంకటేశ నీరతుల గుబ్బతిలె
అలమేలుమంగకు నొయ్యనే విసరరాదా

రేకు: 1905-3 బౌళి సం: 29-027

పల్లవి: అలమేలుమంగపతి యాతఁడౌత యఱఁగవా
బలిమి చేఁతల నెంత పచ్చిదేరేవే

చ. 1: తళుకునఁ జూచేవు తత్తరాన లాచేవు
పలుకులఁ గొసరేవు పతిని నీవు
సెలవుల నవ్వేవు చేతఁ బాపట దువ్వేవు
కలికితనాల నెంత కతకారివే

చ. 2: హత్తి సేవల సేసేవు అట్టె పువ్వుల వేసేవు
గుత్తపు గుబ్బలఁ బతి గుచ్చి యెత్తేవు
బత్తి చూపి సొలసేవు పలుమారు మలసేవు
చిత్తిణి గుణాల నెంత చిమ్మిరేఁగేవే

చ. 3: వావు లెల్లాఁజెప్పేవు వలపుల గుప్పేవు
శ్రీవేంకటేశుఁ గడుఁ జెక్కు నొక్కేవు
భావించి కేల మొక్కేవు పాదమునుఁ దొక్కేవు
కావిరి రతుల నెంత కాఁగిటఁ గూడేవే

రేకు: 1905-4 దేసాళం సం: 29-028

పల్లవి: ఈడు జోడు లాయను మీ యిట్టిచుట్టరికములు
వేడుకతో నీవూ నీకె వెలసితి రిపుడు

చ. 1: పిలుచుక వచ్చి నీకుఁ బీఁటవెట్టి విడెమిచ్చి
చెలి విన్నపము లెల్లాఁజేసుకొనెను
చెలరేఁగి నీవూ నట్టె చిత్తము గరఁగి యాకె –
తలఁపులో మెలఁగేవు తగు మీ యిద్దరికి

చ. 2: వినయాలు నీకుఁ జేసి విందువెట్టి తమిరేఁచి
చెనకి నిన్నొడఁబాటు సేసుకొనెను
చనవిచ్చి నీవందుకు సంతోసించి మరి యీకె –
కనుసన్న మెలఁగేవు కంటిమి మీపొందులు

చ. 3: పరపుపైఁ బెట్టి నీకు పాదాలొత్తి బత్తి చూపి
సిరులఁ గాఁగిట లోను సేసుకొనెను
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె –
సరవినే మెలఁగేవు సమము మీ తలఁపు

రేకు: 1905-5 పాడి సం: 29-029

పల్లవి: ఇదివో తారుకాణాయ ఇట్టె వచ్చి కూడితివి
వదలకున్నది నీవు వలచితివంటాను

చ. 1: యేడలేని యాసలతో యెదురుచూచీఁ జెలి
వాడికతో నీ వింటికి వచ్చేవంటాను
వీడెము చేతఁబట్టుక వేళ గాచుకున్నది
వేడుకతోఁ దనపొందు వెలయించేవంటాను

చ. 2: పలుమారు నీ రూపే భావించుకున్నది చెలి
నిలిచి నీ వందుకు మన్నింతు వంటాను
తలఁచి నీపేరు నోరఁ దడవుకొంటా నున్నది
కలకాలమును నీవు కరుణింతువంటాను

చ. 3: కూటమికి నీరాక కోరుక వున్నది చెలి
నీటునఁ దన్నుఁ గాఁగిట నించేవంటాను
యీటున శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
చోటిచ్చుకున్నది రతిఁ జొక్కించేవంటాను

రేకు: 1905-6 లలిత సం: 29-030

పల్లవి: వింటిరటె యీా సుద్దులు వెలఁదులాల
జంటగా రాముఁడు ముందె జనియించినాఁడట

చ. 1: పొంచి కంసుని వధించి భూ భార బడఁచఁగ
అంచెలఁ గృష్ణదేవుఁడు అవతారమందె నిదె
మంచివేళ శ్రావణమాస బహుళాష్టమిని
యెంచఁగ నడురేఇ రోహిణి నక్షత్రమున

చ. 2: పాండవుల రక్షింప బలుకౌరవులఁ జంప
అండవే వసుదేవునియందు జనియించె నిదె
దండి మధురలోపలఁ దగ రేపల్లె లోపల
గండుమీరి పెరిగీని గారాబమునను

చ. 3: దానవుల నడపగ ధర్మములు నిలుపఁగ
పూని దేవకీదేవి పుత్రుఁడై పొడమె నిదె
ఆనుక శ్రీవేంకటాద్రి నలమేల్మంగయుఁ దాను
నానాజీవులఁ గాచి యున్నతి మించినారు

రేకు: 1906-1 శంకరాభరణం సం: 29-031

పల్లవి: ఎచ్చటఁ జూచిన నితఁడై కృష్ణుఁడు
మచ్చిక నలమేలుమంగతో వెలసీ

చ. 1: కొట్టరో వుట్లులు గోపాలబాలులు
యిట్టె కృష్ణుని యెదుటను
పట్టరో వారలు పాలు నేతికిని
గట్టిగ జోరునఁ గారీ నవిగో

చ. 2: కూడరో మూఁకలు కోలలవారలు
వేడుకఁ గృష్ణుని వెంటవెంట
ఆడుచు మెసఁగరొ అడుఁకులుఁ జక్కిలాలు
వాడల వాడల వరుసతోను

చ. 3: నిక్కి తీసుకోరో నెఱివాదికాండ్లు
మక్కువఁ గృష్ణుని మఱఁగునను
యెక్కరో శ్రీవేంకటేశు కొండమీఁద
పెక్కు నురుగులు పెరుగులు నివిగో

రేకు: 1906-2 నాదరామక్రియ సం: 29-032

పల్లవి: ఎంత యెమ్మెలఁ బొరలేవేమే నీవు
మంతుకెక్క నిన్నాతఁడు మన్నించేనంటాను

చ. 1: కప్పురపుఁ బల్కు లెన్ని గాదెఁబోసేవే
కొప్పు చీఁకట్లెంతేసి కూడపెట్టేవే
ముప్పిరి నవ్వు లెందాఁకా మూటగట్టేవే
చొప్పు లెత్తి నిన్నాతేఁడు చూచీనంటాను

చ. 2: వేడుక సరసా లెన్ని వెదవెట్టేవే
తోడనే వలపు లెన్ని తూరుపెత్తేవే
మేడెపుఁజూపు లెంతేసి మేళవించేవే
జోడుగూడి నిన్నాతఁడు చూచీనంటాను

చ. 3: చక్కఁదనా లెన్నేసి పచారించేవే
పెక్కుఁతరితీపు లెన్ని పెరరేఁచేవే
యిక్కడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
చొక్కించి నన్నేల నిన్నుఁ జూచీనంటాను

రేకు: 1906-3 గౌళ సం: 29-033

పల్లవి: ముందు వెనక లెంచవు మురిపెములే చూపేవు
యిందరిలో నీ యాస ఇంకా నెంత చూపేవే

చ. 1: చన్నులపై కొంగు జారి సన్నలేమి సేసేవే
కన్నుల మించీఁ గాటు కెక్కడ చూచేవే
చిన్ని మోవిఁ దేనె చిందీ సిగ్గుతో నేల నవ్వేవే
యిన్నేసి కలికితనా లెంత నేరిచితివే

చ. 2: చెక్కులఁ జెమట గారీ శిరసేమి వంచేవే
వుక్కుఁగోరివాఁ డేమౌనో వొరయకువే
పుక్కిటితమ్మ మెదిగీ పూఁచి మాటలే లాడేవే
యెక్కడలేని పగటు లెంత నేరిచితివే

చ. 3: బలిమి గుచ్చెల వీడీ పాదమేల తొక్కేవే
యెలమిఁ బువ్వులు రాలీ యేల మొక్కేవే
ఆలమేల్మంగపతి నన్నలమె శ్రీవేంకటేశుఁ –
డేలయింపులాఁడివి నీవెంత నేరిచితివే

రేకు: 1906-4 సామంతం సం: 29-034

పల్లవి: ఇదివో మేలుసుద్ది మీ కిన్నిటా విన్నవించితి
మదిలోన మఱవక మన్నించు మనెను

చ. 1: కలికి కన్నుల దొాక కతకారి । నీకు
వలచితినని చెప్పె వాడలోన
మొలక చన్నులది ముద్దులాడి । నిన్నుఁ
బిలిచి లెమ్మని యంపెఁ బ్రియముతో నన్నును

చ. 2: చక్కెర మోవిది యా జవరాలు । నీకు
మొక్కితి నను మనెను మొహమున
చెక్కుటద్దాలది కడుఁజేఁతలాఁడి । తొల్లె
మిక్కుటపు వయసెల్లా మీఁదెత్తితి ననెను

 చ. 3: నీలపుఁ గుంతలాలది నెరవాది । నీకు –
నాల నని యెరిఁగించె నందరిలోన
యీలీల శ్రీవేంకటేశ యింటికి వచ్చేలితివి
చాలా నలమేల్మంగకు సవతి నే ననెను

రేకు: 1906-5 దేసాళం సం: 29-035

పల్లవి: అలమేలుమంగవు నిన్నాతఁ డేమి యెఱఁగఁడా
యెలమి నీయెడ కాతఁ డిచ్చకుఁడేకదవే

చ. 1: తప్పక చూచినవాఁడు తగులకేలమానీనే
కప్పుర మిచ్చినవాఁడు కైకొనఁడటె
చెప్పి పంపినట్టివాఁడు చేరి యింటికి రాఁడటె
యిప్పు డింత విరహాన నేల పొరలేవే

చ. 2: వీడె మిచ్చినట్టివాఁడు వేడుకేల మరచీనే
వాడికైనవాఁడు నీకు వలవఁడటె
ఆడుకొలు మాఁటవాఁడు అన్నిటా లాలించఁడటె
యేడలేని తమకాన నేల పొలలేవే

చ. 3: ఆస కొలిపినవాఁడు అట్టె కాఁగిలించఁడటె
సేసవెట్టినట్టివాఁడు చెనకఁడటె
వాసెరిఁగి నిన్నుఁ గూడె వచ్చి శ్రీవేంకటేశుఁడు
యీ సుద్దికి నవ్వి నవ్వి యేల పొరలేవే

రేకు: 1906-6 సౌరాష్ట్రం సం: 29-036

పల్లవి: ఇద్దరి నేరుపులును యిందులోనె కానవచ్చె
చద్ది వేఁడివలపులు సతమాయ మీకును

చ. 1: కన్నులనె మాఁటలాడీఁ గలికి నీతో
యిన్నిటా జాణవు నీవు యెఱఁగరాదా
చన్నులనే కానుకిచ్చీ సారెసారెకు
చెన్ను మిగులఁగ నీవు చేయి చాఁచరాదా

చ. 2: మోవినే విందులువెట్టీ ముద్దరాలు
వావాతఁ జవిగొని వలవరాదా
చేవల్లఁ గోలుపుసేసి సేస చల్లీనొ
సేవగొని నీవందుకు శిరసొగ్గరాదా

చ. 3: చెక్కులనే నీడ చూపీఁ జెలియ నీకు
చక్కఁదనాలు చూచుక చనవీరాదా
మొక్కి శ్రీవేంకటేశ మునివేళ్ళనే
మక్కువఁ గూడితివిట్టె మన్నించరాదా

రేకు: 1907-1 కాంబోది సం: 29-037

పల్లవి: వట్టి సిగ్గులఁ బొరలి వాసుల నలయనేల
చుట్టరికము చెప్పితే చొక్కుచు మన్నించునే

చ. 1: సేవలు సేసితేను చిత్తము గరఁగదా
వావులు దెలిపితేను వద్దికి రాఁడా
మోవి చూపి మాఁటాడితే ముచ్చటలు గలయవా
యీవల నేపొద్దూ బతి యెదుటనే వుండవే

చ. 2: సరుసఁ గూచుండితేను సరసము లబ్బవా
మరిగించి నవ్వితేను మారు నవ్వఁడా
వరుసతోఁ జెనకితే వలపులు రేఁగవా
యెరవుసేయక పతి యెదుటనే వుండవే

చ. 3: తప్పక చూచితేను తలఁపునఁ బట్టదా
కప్పుక పెనఁగితేను కాఁగిలించఁడా
యిప్పు డిద్దరూఁ గూడితి రిదే మంచిదిగాదా
యెప్పుడూ శ్రీవేంకటేశు యెదుటనే వుండవే

రేకు: 1907-2 శ్రీరాగం సం: 29-038

పల్లవి: ఇంతి వొయ్యారంబు లివి నీకు నడ్డమా
సంతతపు వేడుకలు సలుపవలెఁగాక

చ. 1: సతమైన కాఁగిటికి చనుఁగొండ లడ్డమా
ఇతవులై మనసు లెనయించుఁగాక
రతివేళ చేఁతలకు రాజసము లడ్డమా
కతలుగా మర్మములు గరఁగించుఁగాక

చ. 2: పెనఁగులాటలకు మరి పెనుసిగ్గు లడ్డమా
చెనకించి సదమదము సేయుఁగాక
మొనయుఁ గనుచూపులకు మొరఁగులవి యడ్డమా
చొనిపి కందువలెల్ల సోదించుఁగాక

చ. 3: నిండుఁ గూటంబులకు నివ్వెరగు లడ్డమా
రెండు వంకలనుఁ దమి రేఁచుఁగాక
అండనే శ్రీవేంకటాద్రీశ కూడితివి
వెండియును మీమేలు వెలయవలెఁగాక

రేకు: 1907-3 పాడి సం: 29-039

పల్లవి: ఇటువంటి నీ సుద్దులు యెంతని పొగడవచ్చు
తటుకన నీకు నిందరము మొక్కేమయ్యా

చ. 1: వచ్చి వచ్చి వనితకు వలపులు రేఁచితివి
గచ్చులుసేసి మనసు గరఁచితివి
మచ్చికతో నవ్వుతానే మరిగించుకొంటివి
ఇచ్చట నీ నేరుపులు యేమి చెప్పేమయ్యా

చ. 2: మంచివానివలెనే మాటలఁ జొక్కించితివి
లంచముగ మోవిచ్చి యలయించితివి
అంచల సన్నలుసేసి యాసలు పుట్టించితివి
యెంచరాదు నీ నేరుపు లేమి చెప్పేవయ్యా

చ. 2: చెనకుచుఁ గొప్పు దివ్వి చెలిమికాఁడ వైతివి
వినయానఁ గాఁగిలించి వెలయించితి
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
ఇనుమడి నీ నేరుపు లేమి చెప్పేమయ్యా

రేకు: 1907-4 లలిత సం: 29-040

పల్లవి: తెలిసితి నల్లనాఁడే తేటతెల్లమిగాను
వెలసిన నీ గుణాలు వింతలుగాఁ జూచేనా

చ. 1: యెన్నిలేవు నీ సుద్దులు యిసుక పాఁతరలు
పున్నమ వెన్నెల పొళ్ళు భూమి మీఁదను
నన్ను నెంత చోదించేవు నమ్మితి నప్పుడే నేను
అన్నిటా నీ సరసాల కౌఁ గాదనేనా

చ. 2: పట్టరావు నీ చేఁతులు బయలువందిరులు
దట్టపు జడివానలు తలఁచరావు
గట్టిగా నేమి చూపేవు కంటి నప్పుడే నేను
యిట్టె నీ వింటికి రాఁగా నియ్యకొనకుండేనా

చ. 3: తావుకొన్న నీ రతులు తంగేటి జున్నులు
కావేటి కాలువలు కలకాలము
యీవేళ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నీవే నన్ను నేలితివి నే నిఁక మఱచేనా

రేకు: 1907-5 సాళంగం సం: 29-041

పల్లవి: తప్పక చూడవయ్యా తలయెత్తి యీకె దిక్కు
వొప్పు లన్నియును నీ యువిదకే కలిగె

చ. 1: చక్కని చందమామ సతిమోము
చిక్కని తేటవెన్నెల చిరునవ్వు
జక్కవల సొబగులు చన్నులు
అక్కజపు సింగారము లతివకే కలిగె

చ. 2: గండుఁ దుమ్మిదల పిండు కలికి కొప్పు
పండుఁ బగడపు జోక పసనిమోవి
మెండైన నిగ్గుటద్దాల మించు జెక్కులు
దండిగల యందము లీ తరుణికిఁ గలిగె

చ. 3: గొప్ప తమ్మిరేకు లీ కొమ్మ కన్నులు
చెప్పరానిచిగురు లీ చిన్నిపాదాలు
యిప్పు డిట్టె శ్రీవేంకటేశ నిన్ను రతిఁగూడె
మెప్పించె నీవింత లలమేల్మంగకే కలిగె

రేకు: 1907-6 నాదరామక్రియ సం: 29-042

పల్లవి: ఇంకా నేమి గావలెనే యిన్నింటా సంతోసించితి
వుంకువ లిచ్చి యేరీతి నొడఁబరచీనే

చ. 1: వింటిఁగదవే తన వేడుకైన సుద్దులెల్లా
కంటిఁగదే తనరూప కనుఁగొనల
అంటిఁగదవే తొల్లె యన్నింటా తా జాణఁడని
వొంటినుండి మరియేల వొడఁబరచీనే

చ. 2: చొక్కితిఁగదవే తనసురతపు వేడుకల
మొక్కితిఁగదవే తనకు ముందే చేతుల
నిక్కితిఁగదే తాను నేరిపిన చేఁతుల
వొక్కమాఁటే నన్ను నెంత వొడఁబరచీనే

చ. 3: నమ్మితిఁగదవే యిట్టె నయముల వాసుల
కమ్మితిఁగదవే తను కాఁగిటిలోన
యెమ్మెల శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
వుమ్మడిఁ దా నిప్పుడేల వొడఁబరచీనే

రేకు: 1908-1 ముఖారి సం: 29-043

పల్లవి: అది యెవ్వతె తాను అలమేల్మంగను నేను
పొదిగి దాఁచకువే నీపూనిక మెచ్చేఁగాని

చ. 1: పొలఁతి నీ కెవ్వతె బుద్దులు చెప్పినది
నలుపున నాపతితో నవ్వుమంటాను
తెలుపఁగదవే దాని దీమస మెంతో
చలములో నీతో మరి సాదించేఁగాని

చ. 2: నీ కెవ్వతె యీ చేఁతలు నేరిపినది
జోకతో నా రమణుని సొలయుమని
నాకుఁ జూపనే దాని విన్నాణ మెంతో
మైకొని నీతో మరి మాఁటలాడేఁగాని

చ. 3: వోడక యెవ్వతె నీ కీ వుపదేశ మిచ్చినది
యీడ నాశ్రీవేంకటేశు నెనయుమని
వాడలో నెంచవే దాని వాసి యంతో యీతఁడు
కూడె నన్ను నీతో మరి గుట్టు చెప్పేఁగాని

రేకు: 1908-2 వరాళి సం: 29-044

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్ళు మీ యిద్దరి సరితెలును
గుఱుతాయ నేఁడు మాకు గుట్టెల్లాఁ దెలిసెను

చ. 1: మెచ్చి మెచ్చి నీతోను మేలమాడీ సారె సారె
మచ్చిక నీకీపె మేనమామ కూఁతురా
రచ్చలోన నిన్నుఁగడు రాకొట్టి పిలువవచ్చీ
పచ్చిగా నీకెప్పుడూను పాయరాని చుట్టమా

చ. 2: చేరి చేరి బుద్దులెల్లాఁ జెప్పవచ్చీ నీకును
కోరి పెండ్లాడినయట్టి కొలము నాల
కూరిమితో నీవద్దఁ గూచుండి నవ్వులు నవ్వీ
నేరుపుతోఁ దగులైన నేస్తపు జవరాలా

చ. 3: పొంచి పొంచి మోవి తేనె పొత్తు గలసీ నీతో
వంచనతోఁదా నీకు వాడిక కాంతా
యెంచఁగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కొంచక నన్నేలితివి కొమ్మ వేడుకకత్తే

రేకు: 1908-3 దేసాళం సం: 29-045

పల్లవి: ఏల నన్ను నొరసేవు యేమయ్యా నీవు
మేలులోనిదానిఁగాక మెరమెచ్చుదాననా

చ. 1: వింతలేక నీకు నేను వినయాలే సేతుఁగాక
పంతమాడేదాననా పలుమారును
కాంతుఁడవు నిన్నుఁజూచి కన్నుల మొక్కుదుఁగాక
జంతతనము నిన్ను సాదించేదాననా

చ. 2: పొసఁగఁగ మాఁటలాడి పొందుసేసేదానఁగాక
కొసరేటిదాననా గుంపించి నిన్ను
సుసరాన నిచ్చకమ్మై చూపేటిదానఁగాక
అసురుసురై బొమ్మల నద్దలించేదాననా

చ. 3: కప్పురము నోరి కిచ్చి కాఁగిలొంచేదానఁగాక
తప్పులెంచేదాననా దంటతనాన
యిప్పుడు శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వొప్పుగ నన్నేలితివి వొడ్డుకొనేదాననా

రేకు: 1908-4 గుజ్జరి సం: 29-046

పల్లవి: వాకిలి దెరవయ్యా వద్ద నెవ్వరున్నా నేమి
యీాకడ నిన్నేమినన దిఁకనేల సిగ్గులు

చ. 1: మచ్చికతో జవరాలు మాఁటాడేనంటా వచ్చి
కచ్చుపెట్టెప్పటనుండి కాచుకున్నది
విచ్చనవిడిని నీకు వీణె వినిపించేనంటా
అచ్చపు వేడుకతో నాయితమై యున్నది

చ. 2: వింత వింత చవులతో విందుచెప్పేనంటా వచ్చి
పంతముతో నక్షతలు పట్టుకున్నది
కాంత నీ యరత నుండి కతలు చెప్పేనంటా
అంతరంగమునఁ గోరి యాసగించుకున్నది

చ. 3: బత్తితొడ నీకు నిట్టె పాదాలొత్తేనంటా వచ్చి
కొత్తగా నలమేల్మంగా కోరుకున్నది
ఇత్తల శ్రీవేంకటేశ యిందువచ్చికెఁ గూడితి
సత్తుగా నీచేఁతలెల్లా సమ్మతించి యున్నది

రేకు: 1908-5 బౌళి సం: 29-047

పల్లవి: కక్కసించఁబోతేను కలుచపడు వలపు
వొక్కటై నీవుండితేనే వోజకు వచ్చీఁదానే

చ. 1: సొంటులు సోదించనేల సోలసి పలుకనేల
ఇంటికి వచ్చేఁగా యాతఁ డెందున్నా నేమే
కంటకము లాడకునే గక్కన విడెమియ్యవే
జంటవాయకుండితేనే చాయకువచ్చీఁదానే

చ. 2: గుట్టు లరయఁగనేల కూరిమి గొసరనేల
పట్టెఁగా నీ కొం గతఁడు బత్తితోడను
వట్టి యెగ్గు లెంచకువే వచ్చి పాదములొత్తనే
చుట్టరికమే చూపనే సూటికి వచ్చీఁదానే

చ. 3: చొప్పులు వెదకనేల చూపుల జంకించనేల
ఇప్పు డిట్టె కూడీఁగాని ఇతవెరిఁగి
అప్పుఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
తెప్పలుగా మో వియ్యవే తీరుపువచ్చీఁదానె

రేకు: 1908-6 కాంబోది సం: 29-048

పల్లవి: ఎంత సిగ్గరికతైవు యేమే నీవు
వింత వింత వాసులేల వెదచల్లేవే

చ. 1: వలచిన రమణుఁడు వావి నీకుఁ జెప్పితేను
కలికి కన్నులనేల గద్దించేవే
కలువపూవుల వేసి కతలు ని న్నడిగితే
సెలవుల నవ్వులేల చిందేవే

చ. 2: చవులుగా మోవి చూపి సన్నలు నీకుఁ జేసితే
జవళి బొమ్మలనేల జంకించేనే
తివురుచు నీ చన్నులది క్కతఁడు చూచితేను
రవళి సణఁగులేల రాలిచేవే

చ. 3: చుట్టరికమున నిన్ను సోఁకఁ గాఁగిలించుకొంటే
వొట్టుగా చేతులనేల వొడ్డుకొనేవే
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగవు
గుట్టున నేరుపులేల కుమ్మరించేవే

రేకు: 1909-1 సామంతం సం: 29-049

పల్లవి: ఇంతసేయకుండితేను యీపెకు వలతువా
వింతలుగాఁ గానవచ్చె వేడుక మీ కతలు

చ. 1: తెరమరఁగున నుండి తేనెగార మాఁటలాడి
కరఁగించీ నిన్ను నెంత కలికో కాని
సారిదిఁ జెలుల చేత సూడిదెలు సారె నంపి
మెరవుసేయదు నీకు నెక్కడిదో కాని

చ. 2: తొలకరి మెరుఁగై తొంగి తొంగి నిన్నుఁ జూచీ
యెలయింపులాఁడి యీపె యెవ్వతో కాని
చిలుకకు నీపేరు చెప్పి చెప్పి పిలిపించీ
సొలసి సొలసి యెంత చుట్టమో కాని

చ. 3: ముసుఁగు వెట్టుక వచ్చి ముచ్చటల నీతో నవ్వీ
వసుధ నీకెంత చనవరియో కాని
వెస నలమేలుమంగ విభుఁడ శ్రీవేంకటేశ
యెసగ నన్నేలితివి యీకె యేమౌనో కాని

రేకు: 1909-2 ఆహిరి సం: 29-050

పల్లవి: ఇదివో విన్నవించితి మిన్నిటా జాణవు నీవు
మదిరాక్షి మే లెరిఁగి మన్నించఁదగును

చ. 1: చెలి నీవు వచ్చేవంటా సిగ్గుల ముగ్గులు వెట్టి
తళుకుఁజూపుల తమ్మిదండలు గట్టి
పలచని చెమటల పన్నీరు చిలికించి
వెలయ మోవి తేనెల విందాయితము సేసె

చ. 2: దొరయ చెక్కుటద్దాల తోరణములుగా గట్టి
గరిమఁ దొడ లరఁటి కంబాలు సేసె
నిరతిఁ బులకలనే నించె ముత్తేలకుచ్చులు
పరగ గుబ్బలనే పైఁడికుండ లెత్తెను

చ. 3: కమ్మని మేని తావుల గంద మట్టె యమరించె
పమ్మి పలుకుల కప్రబాగాలు గూర్చె
ఇమ్ముల నలమేల్మంగ యీకె శ్రీవేంకటేశ్వర
నెమ్మిఁ గూడితి వింతలో నీవే యింటికి వచ్చి

రేకు: 1909-3 నాదరామక్రియ సం: 29-051

పల్లవి: కంటిరటె చెలులాల కన్నులపండుగ లివి
వెంట వెంట వచ్చెనమ్మ వెస నీకె సుద్దులు

చ. 1: సన్నపుఁజెమట లుబ్బి చన్నులపై జాలువారె
కన్నులఁ దేటలుదేరె కాంతకును
చిన్ని పెదవులవెంట చిరునవ్వు లిదె వూరె
యెన్నఁ గతలాయనమ్మ ఇప్పు డీకె సుద్దులు

చ. 2: కడువేడుకలతోడ కళలు మోమున నిక్కె
తడఁబాటు కోరికలు తలకెక్కెను
పడఁతి కాతనిపేరు పైపై పెదవులఁ జిక్కె
అడియాలా లాయనమ్మ అట్టె యీకె సుద్దులు

చ. 3: చెక్కిటికిఁ జేయి వచ్చె సిగ్గులు లోలో హెచ్చె
మిక్కుటపుఁగొప్పు వీఁపుమీఁదికి వచ్చె
యిక్కడ శ్రీవేంకటేశుఁ డిదె యలమేలుమంగ
దక్కఁగూడె నౌనమ్మ తగు నీకె సుద్దులు

రేకు: 1909-4 వరాళి సం: 29-052

పల్లవి: ఇంత జాణవుగాఁగానే యింతులు వలచిరి
సంతోసించి రీడనున్న సతులెల్లా నిన్నును

చ. 1: ఆయములెత్తి యాడి యతివ నన్ను దూరితే
చాయగా పాటుసేసుకొని సారె నవ్వేవు
నీయందు నేరాలు మోపి నీకుఁ దారుకాణించితే
యీయకోలు సేసుకొని ఇచ్చగించేవు

చ. 2: వొల్లనే యానలు వెట్టవొద్దని పెనఁగితేను
చెల్లుబడిసేసుకొని చేయివట్టేవు
పల్లదాన వెంగేలకు పలుమారు మొక్కితేను
వెల్లవిరిసేసుకొని వేడుకపడేవు

చ. 3: అందరిలో నిమ్మపంట నట్టె నిన్ను వేసితేను
చందములుసేసుకొని సమ్మతించేవు
కందువ శ్రీవేంకటేశ కలికి నిన్నొరసితే
చెందెకూడి యదే గురిసేసుకొనేవు

రేకు: 1909-5 ముఖారి సం: 29-053

పల్లవి: ఆఁటదాని కింతగద్దా అగడు సేసెఁగాక
జూటరి దీనివిద్యలు చూడరమ్మా సతులు

చ. 1: చిగురుఁ బెదవిమీఁద చిన్నిముద్దుమాఁట లాడీ
మగనితో నించుకంతా మరఁగలేక
తెగనివలపు చల్లి తీగె నవ్వులు నవ్వీ
సొగసే దీవి వుదుటు చూడఁ గొత్తలాయను

చ. 2: తమ్మికన్నులు దెరచి తళుకుఁ జూపులఁ జూచీ
కమ్మటఁ బతి యెదుట గర్వమునను
సొమ్మలెల్లాఁ జూపుకొంటా జోలి మొక్కులు మొక్కీ
యెమ్మెలదీనివేసాల కేమందు నేను

చ. 3: కావరపు గుబ్బలు సోఁకఁగ సేవలెల్లాఁజేసీ
శ్రీవేంకటేశుఁ డెదుట సిగ్గువడక
వావితో నన్నితఁ డేలె వట్టిసన్నలు తాఁజేసీ
భావించి దీని గజరు పచ్చిఁ దోచె నిపుడు

రేకు: 1909-6 మాళవిగౌళ సం: 29-054

పల్లవి: ఎంతసేసినా నీకు యెరవులవాఁ డితఁడు
సంతతము తొల్లి నాకు చనవచ్చినాఁడు

చ. 1: తెరమరఁగున నుండి తేనెగార మాఁటలాడి
మరిగించితి వవునే మగని నీవు
సరసము లాడుకొంటా సన్నలు సేసుకొంటా
తరితీపుల నితనిఁదగిలించుకొంటివే

చ. 2: వొంటినుండి యేకతాన వొడఁబరచి పరచి
వెంటఁదెచ్చుకొంటివౌనే విభుని నీవు
నంటులు చూపుకొంటా నవ్వులు నవ్వుకొంటా
ఇంటిలో గూడితివౌనే యీతనితోను

చ. 3: గుఱుతులు మేన నించి గుబ్బల నూఁది యూఁది
కఱఁగించితివౌనే కాంతుని నీవు
యెఱిఁగి శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
మఱి నీవితని దిక్కు మళ్ళిచూడనేఁటికే

రేకు: 1910-1 గౌళ సం: 29-055

పల్లవి: చెల్లునమ్మా ఆతనికి సేసేటి చేఁతలెల్లా
కొల్లున నవ్వేఁగదమ్మా గోవిందదేవుఁడు

చ. 1: వీడెపుఁ బెదవులతో వినోదా లాడుకొంటా
వాడ వనితలనెల్లా వావు లడిగీ
వాడికలు సేసుకొని వలపులు పైఁ జల్లీ
కోడెకాఁడు గదవమ్మా గోవిందదేవుఁడు

చ. 2: దంటమాఁటలెల్లా నాడి తమిరేఁచుకొంటాను
సొంటులు సోదించీఁ దాను సుదతులను
అంటిముట్టి చనుఁగవలందు గురుతులునించీ
గొంటరివాఁడు గదమ్మా గోవిందదేవుఁడు

చ. 3: వల్లెవాటుఁ బయ్యెదతో వరుసలు బెట్టుకొంటా
చల్లనికాఁగిటఁ గూడీ సతులనెల్లా
తెల్లమి శ్రీవేంకటాద్రిఁ దిరుపతిలో నున్నాఁడు
కొల్లకాఁడు గదవమ్మా గోవిందదేవుఁడు

రేకు: 1910-2 బౌళి సం: 29-056

పల్లవి: అప్పటనుండి నాకు నందుకే వేఁడుకోఁబట్టె
ముప్పిరి వేవేలకును మొక్కేఁ జుమ్మీ నేను

చ. 1: మేలమాడేవేళ నిన్ను మీరి నే నేమంటినో
బేలనై నీతో నెంత పెనఁగితినో
చేలికొంగు నీవంటఁగా చెయ్యేడఁ దాఁకించితినో
కేలెత్తి నీకిదివో మొక్కేఁ జుమ్మీ నేను

చ. 2: నీ కూడిగము సేయఁగా నిన్నుఁ గా లేడ సోఁకెనో
ఆకుమడిచియ్యఁగా నిన్నంటెనో గోరు
దాకొని నీతో నవ్వఁగా తమ్ముల మేడఁజిందెనో
యీకడ మొక్కేఁ జుమ్మీ యెరఁగను నేను

చ. 3: చెనకి కాఁగిలించఁగా చెమ టెంత వడిసెనో
యెనయఁగా నీ చన్ను లెంత వొత్తెనో
నిను, శ్రీవేంకటేశఁడ నేఁ జేసిన చేతకెల్లా
మునుపనే వినయాన మొక్కేఁ జుమ్మీ నేను

రేకు: 1910-3 సామంతం సం: 29-057

పల్లవి: ముసి ముసి నవ్వులతో మోములు వంచుకోకురే
పసలుగా వేడుకతో పతిసేవ సేయరే

చ. 1: నెయ్యముగల చోటికి నేరమి రాదు
యియ్యకోలై పొసఁగితే నెగ్గులేదు
చెయ్యారఁ జెనకితేను సిగ్గులెడయు
యెయ్యెడా వలపుజాడ లెరుఁగుకోరే

చ. 2: ననిచినవారు పెనఁగులాడరు
మనసులో గలసితే మరఁగేడది
చనవులు మీరితేను జారుఁ జలము
గొనకొన్న వలపుల గురుతు లివిగోరే

చ. 3: బత్తి సేసితేఁ జలము పరిసిపోవు
పొత్తు గలసితే పొరపొచ్చ మేడది
యత్తల శ్రీవేంకటేశుఁ డిటు మిమ్ము నేలినాఁడు
హత్తిన వలపుజాడ లని యెంచుకోరే

రేకు: 1910-4 పళవంజరి సం: 29-058

పల్లవి: కాఁపురాలు సేసేవారి గాకుసేయఁ దగునటే
మాపుదాఁకా నీవెంత మలసేవే యెదుట

చ. 1: మచ్చిక నే నితనితో మాఁటపలుకు లాడఁగా
ఇచ్చటికి వచ్చి నీవేమి వినేవే
అచ్చులాన నిద్దరమూ నాసతోడఁ గూచుండఁగా
కచ్చుపెట్టుక నీవేల కాచుకవుందానవే

చ. 2: ననుపున మాలో నేము నవ్వుకొంటా నుండఁగాను
పనివూని నీవేల తప్పక చూచేవే
పెనఁగి వొండొరులము ప్రియములు చెప్పుకోఁగా
వెనుకొని నీవేల వెరగువడేవే

చ. 3: అక్కజపురతుల నే మట్టి వోలలాడఁగాను
యెక్కడనుండో నీవు యెట్టు వచ్చేవే
ఇక్కువ శ్రీవేంకటేశుఁ డేలఁగా నే మెచ్చితేను
చక్కటి నీ వెందాఁకా నెచ్చరికలు సేసేవే

రేకు: 1910-5 బౌళి సం: 29-059

పల్లవి: నాకే మేలువాఁడనంటా నమ్మిక లిచ్చేవు నీవు
నీకు దేనినై వుందాన నే నెదురాడేనా

చ. 1: కన్నుల చూపులనే కరగించె నాకె నిన్ను
సన్నలా చాయలాఁ గొంత చల్లె వలపు
కిన్నెర మీఁటులు మీఁటి గిలిగించె నింతపడి
యిన్నిటా నాపె పొందులు యెట్టు మరచేవయా

చ. 2: మంతనపు మాఁటలనే మరిగించె నాకె నిన్ను
వింత వింత నవ్వులనే వీఁడు దోడాడె
చెంతనుండి వీడె మిచ్చి చిమ్మిరేఁచె నీమనసు
యంతైనా నాపె పొందులు యెట్టు మరచేవయా

చ. 3: మిక్కుటపు సేవలనే మెప్పించె నాకె నిన్ను
తక్కక రతులనే దక్కఁగొనెను
అక్కరతో నన్నేలితి వప్పటి శ్రీవేంకటేశ
యెక్కడా నాపె పొందులు యెట్టు మరచేవయా

రేకు: 1910-6 కాంబోది సం: 29-060

పల్లవి: ఎగ్గు సిగ్గు లెఱఁగరు యెదుట నెవ్వరున్నాను
బెగ్గిలక తమకమే పెంతురుగాని

చ. 1: అలతురు సొలతురు అంగనలిఇనవారు
వలచిన పతితోను వద్దననేలే
పిలుతురు సన్నసేసి పెనఁగులాడుదురు
చెలులాల యెరుకలు సేసుకొన నేలే

చ. 2: కన్నుల జంకింతురు కాఁగిలించుకొందురు
మన్ననలగలవారిని మానుపరాదే
చన్నులు మోపుదురు సారె మర్మా లంటింతురు
కన్నెలాల మీరు వారిఁ గనుఁగొన నేలే

చ. 3: మోములుచూచుకొందురు ముచ్చటతోనవ్వుదురు
కాముకుల రవ్వసేయఁ గారణమేమే
యీమేర శ్రీవేంకటేశుఁ డిందిరయుఁ గూడినారు
భామలాల మీరింత పచారించ నేలే

రేకు: 1921-1 రీతిగౌళ సం: 29-061

పల్లవి: సిగ్గులువడఁగనేల సెలవి నవ్వఁగనేల
వొగ్గి విడె మందుకోవే వబ్బుతోడను

చ. 1: వాడికగల సతికి వలపు లాడేరును
వేడుకలో పెంచితే వెలయుఁ దమి
కేడఁగూడఁ గోరికలు కొనలుసాగు
చూడవే విభుని దిక్కు సూటితోను

చ. 2: పెనఁగులాడఁగానే ప్రేమములు నిండుకొను
చెనకగానే రతి చిమ్మిరేఁగును
చనవునఁ గొసరితే చవిపుట్టు సరసము
మనసిచ్చి యితనితో మంతనము లాడవే

చ. 3: యెడయక వద్దనుంటే యెక్కుడౌఁ జుట్టరికము
జడిగొన్నకాఁగిళ్ళు సతముసేసు
అడరి శ్రీవేంకటేశుఁ డంతలోనే నిన్నుఁ గూడె
కడఁగి మోవి చూపవే కందువ లీడేరును

రేకు: 1921-2 కుంతలవరాళి సం: 29-062

పల్లవి: ఏలితివి నన్నుఁ దొల్లె యింతగా మన్నించితివి
ఆలించి నా విన్నపము లవధరించవయ్యా

చ. 1: కోపగించరాదు నీతో గుంపెన చూపఁగరాదు
వైపుగా నిచ్చక మాడవలెఁగాని
రాఁపులఁ బెట్టఁగరాదు రట్టుసేసి చూపరాదు
చేపట్టి నీవే కృపసేయవయ్యా

చ. 2: కన్నుల జంకించరాదు కడుఁ దమకించరాదు
వన్నెగా బత్తి నెరపవలెఁగాని
సన్నలఁ గొసరరాదు సారెకుఁ బెనఁగరాదు
అన్నిటా నీవే నన్ను నాదరించవయ్యా

చ. 3: పాడి పంతా లెంచరాదు పైపై సిగ్గువడరాదు
వాడికగాఁ గాఁగిలించవలెఁగాని
కూడితివి నన్ను నిట్టె గురిగా శ్రీవేంకటేశ
వేడుకతో వరమిచ్చి వెలయించవయ్యా

రేకు: 1921-3 లలిత సం: 29-063

పల్లవి: ఎటువంటి నేరుపరి యెంతటి జాణ
తటుకన నీగుణాలే తడవీ నే పొద్దును

చ. 1: కసుఁగందని మాఁటలఁ గడు సరస మాడుతా
ముసి ముసి నవ్వులతో మురిసీఁ జెలి
వసివాడని చేతల వలపులు చల్లుకొంటా
కొసరుచు ముద్దులు గునిసీ నీయెదుట

చ. 2: పులివచ్చి తమకాన నుమ్మగిలుకొంటాను
వములువాఁడి చూపుల మురిసీ నాపె
గిలుకు మట్టెల మోఁత కెరలించుకొంటాను
పిలిచి తా రతులకుఁ బెనఁగీ నీ యెదుట

చ. 3: నినుపు నివ్వెరగుల నీట్టు చూపుకొంటాను
మునిముంగిట సిగ్గుల మురిసీఁ దాను
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
వినయాన మాతోనే వెలసీ నీయెదుట

రేకు: 1921-4 దేసాళం సం: 29-064

పల్లవి: ఈతనికి మేలుదాన విన్నిటా నీవు
చేతికి లోనైవున్నాఁడు సేసవెట్టవే

చ. 1: కొసరి కొసరి పతిఁ గొంగువట్టి దూరుకొంటా
యిసుకపాఁతరలు యేల తవ్వేవే
సొసఁగి యాతఁడు నీతోఁ బొందుసేయవచ్చినాఁడు
పసలుగా విడె మిచ్చి పాదా లొత్తవే

చ. 2: చుట్టి చుట్టి యాతని మై సొంట్లు సోదించుకొంటా
యిట్టె సముద్రాన కేతా లెన్ని వెట్టేవే
చుట్టపు వరుస నీకు సొమ్ములియ్య వచ్చినాఁడు
గుట్టుతోడఁ బాన్పుపై గూచుండఁబెట్టుకోవే

చ. 3: నిక్కి నిక్కి తానూ నీవూ నీటుతోఁ బెనఁగుకొంటా
దక్కి బయలువంది లెందాఁకాఁ బెట్టేవే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డీతఁడే నిన్నుఁగూడె
మొక్కి మొక్కి మెచ్చి మెచ్చి మోవి తేనె లియ్యవే

రేకు: 1921-5 పాడి సం: 29-065

పల్లవి: ఆ సరించి నాఁటదాని నలఇంచరా దందురు
సేసిన నావిన్నపాలు చిత్తగించు మీఁకను

చ. 1: కచ్చుపెట్టి యాపె నీకుఁ గాచుకవుండఁగానే
వచ్చితి విప్పుడు నావద్దికి నీవు
ముచ్చటతో నప్పటి నీమోము చూడఁగానే
మచ్చికసేసి నాతో మాఁటలాడేవు

చ. 2: కూరిమితో నాపె నీకొంగు వట్టుకుండఁగానే
చేరి నాతో నవ్వేవు సెలవులను
సారె సారె నీ యెదుట సన్నలు సేయఁగానే
గారాన నన్ను నిట్టె కాఁగిలించేవు

చ. 3: చేతులారా నాపె నీపై సేసలు చల్లఁగానే
యేతుల సరసమాడే విప్పుడు నాతో
కాతరాన శ్రీవేంకటేశ న న్నేలితివి
నీతో నాపెఁ గూడఁగానే నీ మోవి నా కిచ్చేవు

రేకు: 1921-6 బౌళి సం: 29-066

పల్లవి: ఎన్నఁడు నేరుచుకొంటి విటువంటి వేడుకలు
అన్నిటా నీ సుద్దులు యెంతని మెచ్చేమమ్మా

చ. 1: పచ్చిదేరె జంకెనలపై పూఁతలు
తచ్చన మరఁగుల పాదపు వాఁతలు
కుచ్చియెత్తె గోరి చెనకుల చేఁతలు
హెచ్చి నీవిభునివద్ద నేమి చూపేవమ్మా

చ. 2: పొరుగు పోరచి సొలపుల తక్కులు
గరువముతోడి కనుఁగవ మొక్కులు
సరసపు మాఁటల బచ్చన తెక్కులు
అరుదుగా నీ కిన్నియు నమరె నోయమ్మా

చ. 3: తనిసినన నవ్వులతో తరితీపులు
చినుకుఁ జెమట చెక్కుచేతి దాపులు
ఘనశ్రీవేంకటేశు రేఁచిన రేఁపులు
యనసిన యతనితో నివి దగునమ్మా

రేకు: 1922-1 వసంతవరాళి సం: 29-067

పల్లవి: ఏకతాన మీయిద్దరి యేలాటము లెట్టివో
నీకు వలచు నాతఁడు నెమ్మది నుండఁగదే

చ. 1: పెనఁగుతా రమణుఁడు ప్రియము చెప్పీ నీకు
వినవే యాతనిమాఁట వేడుకతోను
మునుకొని సారెరారె మొగము దప్పక చూచి
యెనసీని చేతులెత్తి యిఁక మొక్కవే

చ. 2: కొప్పు దువ్వి బుజ్జగించి కొంగు వట్టుకున్నాఁడు
చెప్పినట్టు సేయవే చెలువునికి
చిప్పిల మర్మములంటి చెక్కు నొక్కి వేఁడుకొనీ
ఇప్పు డిట్టె కానిమ్మని ఇయ్యకొనవే

చ. 3: కడు బత్తితోడుత కాఁగిలించుకొనీ నిన్ను
వొడికమున నొక్కటై వుండవే నీవు
యెడయక శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నేలె
వొడఁబడికతో రతి నోలలాడవే

రేకు: 1922-2 తోండి సం: 29-068

పల్లవి: తారుకాణించుకోవయ్య తరుణి తోడుత నీవు
నేరమిగా దండుకేమి నీ విన్నిటా జాణవు

చ. 1: పమ్మి యాపెతో నీవు పక్కన నవ్వితివంటా
కొమ్మ చెలులతో నాడుకొంటా నున్నది
సమ్మతించి యాపె నీతో సన్నలుసేసీ (సే?) నంటా
ఇమ్ములఁ దనలోనే వూహించుకొంటానున్నది

చ. 2: నిక్కి చూచి వుంగరము నీ వాపె కిచ్చితివంటా
పక్కన నట్టే మచ్చెము పట్టుకున్నది
అక్కడనే విడెము నీ కాపె వొసగినదంటా
ముక్కుపై వేలిడుకొని మోనమున నున్నది

చ. 3: చాపలాన నాపె మోవి చవి నీవు గొంటివంటా
ఆపనులకే నివ్వెరగై వున్నది
యేపున శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
ఆపె నీకు దేవులంటా నాదరించుకున్నది

రేకు: 1922-3 పాడి సం: 29-069

పల్లవి: కాఁగిటిలోదానికింకా నెడమాఁట లేల
లోఁగనేల పతియిచ్చులోనే రమ్మనవే

చ. 1: యెనసి వుండినదాని కెగ్గులు వట్టఁగ నేల
చనవరి దానికి సాదించ నేల
మనసొగ్గినదానికి మరి పెనఁగఁగ నేల
ననిచిన పతితోను నగును రమ్మనవే

చ. 2: సేసవెట్టినదానికి సిగ్గులు వడఁగ నేల
ఆసగలదానికి నలయ నేల
వాసివంతులదానికి వట్టి విచారము లేల
యీసరిఁ బతి పెండ్లిపీఁ టెక్కును రమ్మనవే

చ. 3: వావి గూడినదానికి వక్కణ లడుఁగ నేల
కైవసమైనదానికి కాతర మేల
దేవులయినదానికి తెరమరఁ గిఁక నేల
శ్రీవేంకటపతి వచ్చెఁ జేకొను రమ్మనవే

రేకు: 1922-4 సామంతం సం: 29-070

పల్లవి: ఎంతని పొగడేమమ్మా యీతని గుణాలు నేము
సంతోసాలే నెరపేటి జాణఁడే నీ మగఁడు

చ. 1: యెనసిన కాంత దను నెంత కొసరినాను
చనవిచ్చుఁగాని మరి సాదించఁడు
వెనుకొని మరి యెన్నివిన్నపాలు సేసినాను
వినుఁగాని యెంతైనా వేసారఁడు

చ. 2: సన్నలా చాయలా నెట్టు సణఁగులు రాలిచినా
మన్నించుఁగాని మరి మచ్చరించఁడు
కన్నులఁ దప్పక చూచి కడు నెంత వొరసినా
వున్నతితో నవ్వుఁగాని వుప్పతించఁడు

చ. 3: కూరిమి గొసరుకొంటా కొంగువట్టి తీసినాను
కోరిక చెల్లించుఁగాని గుంపించఁడు
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతి నిన్ను నిట్టె కూడె
నేరుపుతో నేలుగాని నీతోఁగూడి పాయఁడు

రేకు: 1922-5 గౌళ సం: 29-071

పల్లవి: తలఁచిన తలఁపులు తలకూడెను
కలకాలమును మీకు కాఁపుర మీడేరెను

చ. 1: ఇంతి, నీవు వచ్చేవంటా నెదురుచూచె నిందాఁకా
చెంత సగినా లడిగె జలరేఁగి
సంతోసాన నీ గుణాలె సారె బొగడె మాతోను
వింతలేక యింతలోనె విచ్చేసితి వీడకు

చ. 2: కన్నులు మూసి తెరచి కలలుగనె లోలోనె
నిన్నుఁ బిలువ చెలితో సన్నలుసేసె
వన్నెగా లేకలు వాసె వడి నీకుఁ గొంతవడి
యెన్నికగా విచ్చేసితి వింతలో నిక్కడికి

చ. 3: వేడుకతో మదనుని వేఁడుకొనె నీ రాకకు
కూడే తలపోఁతలే కోరుకుండెను
తోడనె శ్రీవేంకటేశ తొల్లె తెరలో నేలి
యీడుజోడై విచ్చేసితి వీకె యింటిలోనికి

రేకు: 1922-6 కాంబోది సం: 29-072

పల్లవి: మగువలకు బలిమి మంచితనమె
చిగురు నవ్వులతోడఁ జిత్తగించి వినవే

చ. 1: చన వెంత గలిగినా సంగాతము లమరును
మనవి యొనగూడితే మచ్చిక రేఁగు
వినయము సతమైతే వేడుక లగ్గలమౌను
యెనసి నీ రమణుని యిచ్చనే మెలఁగవే

చ. 2: సరసము లితవైతే సంతోసములు మించు
వొరిమ గలిగితేను వుబ్బు మనసు
సరవితోటి వలపు చవులెల్లాఁ బుట్టించు
సిరుల నీపతికిని సేవలెల్లాఁ జేయవే

చ. 3: వావుల దొరసితేను వాడికలు తానే వచ్చు
కైవసమై యుండితేనే ఘనమౌఁ దమి
చేవదేర నిన్నుఁ గూడె శ్రీవేంకటేశ్వరుఁడు
యీవల నీమగఁ డీతఁ డెన్నఁడూ బాయకులే

రేకు: 1923-1 ఆహిరి సం: 29-073

పల్లవి: ఏమి గారణమె తమ కిద్దరము నొక్కటె
ప్రేమము లిరు దెసలాఁ బెనఁగానఁగాను

చ. 1: సేసవెట్టి పతిఁజూచి సిగ్గున నే నుండితేను
వాసించు పువ్వులకేల వాఁడి వచ్చెనే
ఆసతోఁ దెరమాఁటున నట్టెనే నుండితేను
మూసి చిలుకలకేల మొగా లెత్తినాయెనే

చ. 2: తనియక లోలోనే తలపోసుకొంటేను
వనము కోవిలకేల వాకు వెళ్ళెనే
చెనకఁగా వాసితోడ శిరసు వంచుకొంటేను
వొనరఁ జల్లగాలికి నుడుక నేమిటికే

చ. 3: గక్కన శ్రీవేంకటేశుఁ గాఁగిలించుకొంటేను
నెక్కొని చిత్తమునకు నివ్వెరగేలే
చక్కఁగా నాతనితోను సరసము లాడితేను
వెక్కసపు రతులేల వెల్లివిరిసీనే

రేకు: 1923-2 భైరవి సం: 29-074

పల్లవి: నీవే మంచితనాలు నెరప నేరుతువమ్మా
సేవసేసి రమణుని చిత్తము వచ్చినట్టు

చ. 1: యిచ్చకము లాడితేనే యితవులైయుండు; నౌనె
హెచ్చి వెంగేలాడితేను యియ్యకోలౌనా
అచ్చముగ మొక్కితేను అట్టె దయవుట్టు; నౌనె
విచ్చనవిడిఁ దిట్టితే వేడుకలౌనా

చ. 2: మొగమెత్తి చూచితేను మోహములు రేఁగు; నౌనె
తగిలి తలవంచితే తమి వుట్టునా
నగవులు నవ్వితేను ననిచివుండు; నౌనె
బిగిసి వూరకుండితే ప్రియము గలుగునా

చ. 3: పాయక పక్కనుండితే భావము గరఁను; నౌనె
చాయల సన్నలవల్లఁ జవి వుట్టునా
చేయార శ్రీవేంకటేశుఁ జెందినది మే; లౌనె
కాయకపు సరసాలు కందువలంటీనా

రేకు: 1923-3 వరాళి సం: 29-075

పల్లవి: ఎఱుఁగుదు నీమనసు యేల దాఁచేవు
మెఱసి యాపె నీకు మేలుదిగాదా

చ. 1: చూపెట్టుక నాతో మరి సుద్దులు చెప్పేవుగాని
ఆపెతో నిపుడు మాఁటలాడి రారాదా
యేపున మాపటంత మాయింటికి వత్తువుగాని
యేపొద్దాడకుఁ బోఇ నీ విట్టె రారాదా

చ. 2: పైకొని ఇచ్చోట నాకు బాగా లిచ్చేవుగాని
ఆకెను ననుసరించి యట్టె రారాదా
వాకుచ్చి నా చెలువము వదలకెంతవుగాని
జోకతోడ నాపె మోము చూచి రారాదా

చ. 3: యెడయక నన్ను నేఁడే యేలేవుగాని ఇంతలో
నడుమ నాపెతోఁ గొంత నవ్వి రారాదా
కడఁగి శ్రీవేంకటేశ కాఁగిలించి తయ్యేఁగాని
చిడుముడి నాపెతోడాఁ జెప్పి రారాదా

రేకు: 1923-4 ముఖారి సం: 29-076

పల్లవి: నన్నుఁ జూచి నాలోనే నవ్వువచ్చీని
యెన్నిక నో చెలులాల యేమి సోద్యమే

చ. 1: యెచ్చరించి సారె సారె నెలయించీ మనసు
పెచ్చురేఁగి తమకము పెనచీ మనసు
తచ్చి యాతని పొందులు తలఁపించీ మనసు
యిచ్చట నో చెలులాల యేమని చెప్పుదునే

చ. 2: యెదురు చూపించి బయలీఁదించీ మనసు
కదిసేటి యాసలఁ గరఁగించీ మనసు
గుదిగొని రతులెల్లాఁ గోరించీ మనసు
యిదివో చెలులాల యేమి సేతునే

చ. 3: చెప్పరాని ప్రియములు చెప్పించీ మనసు
ముప్పిరి నా వలపులు ముదిరించీ మనసు
అప్పుడు శ్రీవేంకటేశుఁ డాతఁడే వచ్చి నన్నేలె
యిప్పుడు వో చెలులాల యేమందునే

రేకు: 1923-5 మంగళకౌసిక సం: 29-077

పల్లవి: సుదుతుల మెల్లాను సోబానఁ బాడేము
యెదుటనున్ను మము నేలితి వపుడే

చ. 1: నిండు నిధానము నెలఁత జవ్వనము
కొండలుఁ గోట్లు కుచములు
పండువెన్నెలలు పలచని నవ్వులు
అండనే కలిగెఁ బెండ్లాడవయా

చ. 2: కనక వసంతము కామిని సరసము
ఘనముగు నీలపుగని కొప్పు
చినుకుఁ దేనియలు చెలఁగేటి పలుకులు
అనువుగ దొరకెఁ బెండ్లాడవయా

చ. 3: ముంగిట సంపద ముదిత సింగారము
తంగేటి జున్ను బిత్తరి మోవి
చెంగటఁ గలిగెను శ్రీవేంకటేశుఁడ
అంగవించి పెండ్లాడవయా

రేకు: 1923-6 రామక్రియ సం: 29-078

పల్లవి: ఏలసిగ్గులు వడేవు ఇందరి ముందరా నీవు
తాలిమితో నీవలపు తవ్వుకొనఁ గదవే

చ. 1: విచ్చన విడాయ నీకు విభుఁ డింటికి రాఁగాను
నచ్చుకొట్టనేల యిఁక నవ్వఁగదవే
యిచ్చె నీకుఁ జన వాతఁ డిఁకనేల కొంకేవు
పచ్చిదేర నీ యెమ్మెలు పచారించఁగదవే

చ. 2: పంతమెల్లాఁ జెల్లె పతి పక్కఁ బెట్టుకొనఁగాను
చెంతనున్న చెలులతోఁ జెప్పఁగదవే
మంతనమాడీ నతడు మరి నీవాడినట్టౌను
చింతదీరఁ గాఁపురాలు సేయఁగదవే

చ. 3: యీడేరితివి శ్రీవేంకటేశుఁడు ని న్నేలఁగాను
వేడుకతో వరములు వేఁడఁగదవే
వాడిక నితఁడు నావద్దికి వచ్చి మన్నించె
జోడయి నీ వొక్కమనసున నుండఁగదవే

రేకు: 1924-1 శంకరాభరణం సం: 29-079

పల్లవి: ఎంత వేడుకలో యిద్దరివి
బంతినే కన్నులపండుగలాయ

చ. 1: సొలపు మాఁటలు సుదతి యాడఁగా
కలకల నవ్వీఁ గాంతుఁడు
అలముచు సారెకు నాకె వెనఁగఁగా
వలపుల చెమటలు వడిసీ నితఁడు

చ. 2: బొమ్మజంకెనలు పొలఁతి చూపఁగా
నమ్మికలిచ్చీ నాయకుఁడు
తమ్ముల మాకె ముదమున నడుగఁగా
కమ్ముక చిత్తము గరఁగీ నితఁడు

చ. 3: బడి బడిఁ జన్నులు పడఁతి యొత్తఁగా
అడరీ శ్రీవేంకటాధిపుఁడు
అడియాలపురతు లాపె గొసరఁగా
కడుఁదమకంబునఁ గదిసీ నితఁడు

రేకు: 1924-2 ఆహిరి సం: 29-080

పల్లవి: చక్కనివాఁ డాతఁడు జాణవు నీవు
అక్కరతో నాతని యానతి వినవమ్మా

చ. 1: వల్లెవాటు వేసుకొని వాఁడె నిలుచున్నవాఁడు
యిల్లిదె వీడెమంపె నీ కిందవమ్మా
చొల్లెపుఁ జుత్తులతోడఁజూచీ నిన్నప్పటనుంటి
యెల్లచందాలా దగు మీ యిద్దరికి నమ్మా

చ. 2: నెత్తి కొప్పువాఁడు మంచినీలపుఁ గాంతులవాఁడు
బత్తితో గంద మంపెను పట్టవమ్మా
చిత్తము నీపైఁ బెట్టి సెలవుల నవ్వీవాఁడె
హత్తి యాతనితో మాఁటలాడవమ్మా

చ. 3: కుప్పెఁ కటారముతోడి కోడెవయసువాఁడు
కప్పురము నీకు నంపెఁ గైకొనవమ్మా
అప్పుడు శ్రీవేంకటేశుఁ డదె వచ్చి నిన్ను నేలె
చిప్పిల విన్నపాలెల్లాఁ జేసుకోవమ్మా

రేకు: 1924-3 కాంబోది సం: 29-081

పల్లవి: ఇంతులకు నేరుపులు యిచ్చకములే కాఁబోలు
చెంత నిన్నిటాను మెరసితివే నీవు

చ. 1: యెచ్చరించి మొక్కి మొక్కి యెలయించేవు పతిని
అచ్చమైన నెరజాణ వౌదువే నీవు
పచ్చిచేఁతలెల్లాఁజేసి పచారించేవు వలపు
మెచ్చులాడి వన్నిటాను మేలే నీవు

చ. 2: వినయములెల్లాఁ జేసి వేడుకలు వుట్టించేవు
చెనకి యింకాఁ గొత్తలు సేతువే నీవు
ననుపున మోవి చూపి నానఁబెట్టే వాసలు
మినుకులాఁడివి కడుమేలే నీవు

చ. 3: చేకొని పాదాలొత్తి చిప్పిలించేవు మనసు
దాకొని యీ పని కెంతదానివే నీవు
యీకడ శ్రీవేంకటేశుఁ డెనసె నన్నును నిన్ను
మేకులాడివి నవ్వేవు మేలే నీవు

రేకు: 1924-4 రామక్రియ సం: 29-082

పల్లవి: ఆతఁ డిదె నీవిదె ఆరడియాల
రాతిరిఁ బగలు నిట్టె రతి నోలలాడవే

చ. 1: సలిగె గలిగితేను చలము సాదించనేల
చెలిమి సతమైతేను సిగ్గులేల
తలఁపు లొనగూడితే తారుకాణ మరి యాల
మలసి విభునితోను మాఁటలాడఁగదవే

చ. 2: ఆసలు నిజమైతేను అలయఁగ మరి యాల
బాసలు దప్పకుండితే పదరనేల
వాసులు రూఢికెక్కితే వరుస లెంచఁగనేల
సేసవెట్టినపతికి సేవలెల్లాఁ జేయవే

చ. 3: తగులాయమైతేను తరితీపు లవి యాల
మొగమిచ్చకు లోనైతే మొరఁగులేల
నగుతానే వేడుకొని నంటుసేసి నన్నుఁ గూడె
నిగిడి శ్రీవేంకటేశునికి మొక్కుమొక్కవే

రేకు: 1924-5 నాదరామక్రియ సం: 29-083

పల్లవి: ఎట్టు సమకూడెనో మీకు నిద్దరికిని
చుట్టరికములలో నీ చుట్టరికము

చ. 1: కొమ్మ మనసులోపలి కోరికలు
చిమ్ముల నీ కాఁగిటిలో చేరికలు
కుమ్మరింపుఁ జూపుల కొమ్మెరుఁగులు
నెమ్మది మరుతంత్రాల నెక్కొన్న కరఁగులు

చ. 2: వలపుల కతలతో వాడికలు
వెలసిన వొడఁబాటు 2 వేడికలు
మలసిన సరసపు మచ్చికలు
అలవాటైన రతుల అచ్చికబుచ్చికలు

చ. 3: తనిసిన కాఁగిటిలో తాలిములు
మినుకు టానందముల మేలిములు
నినుఁ బెండ్లాడిన యీకె నిచ్చపొందులు
మునుపె శ్రీవేంకటేశ మోవి తేనె విందులు

రేకు: 1924-6 దేవగాంధారి సం: 29-084

పల్లవి: ఇన్ని చందాలకు గురి యీవనితయై వున్నది
యెన్నుకొని వేడుకతో నేలుదువుగాని

చ. 1: చేరి నీవు వెంచిన చిలుక గాదుసుమీ
పేరుకొని నీ దేవులు పిలిచీఁగాని
కూరిమి నీవనములో కోవిల గాదుసుమీ
సారెకు నాకె నిన్నుఁ గొసరి పాడీఁగాని

చ. 2: తొలుత నీకొలఁకుల తుమ్మిదలు గావుసుమీ
సొలసి చూచిన యాపె చూపులుగాని
చలాన నీపై వాలిన జక్కవలు గావుసుమీ
కులికి నిన్నొరసేటి గుబ్బలుగాని

చ. 3: తతి నీపావురాల రొద లివి గావుసుమీ
రతి నాపె మదనమంత్రములుగాని
యితవుగా శ్రీవేంకటేశ యింతిఁగూడితివి
మతకారి గాదుసుమీ మంచి రాయంచగాని

రేకు: 1925-1 శ్రీరాగం సం: 29-085

పల్లవి: ఎటువంటి కూరిములు యెటువంటి ముచ్చటలు
ఇటువంటివెల్లా మీకు నిద్దరికే తగును

చ. 1: నీవు పరాకైవుండఁగా నిమ్మపంటఁ గొని వేసి
మోవి చూపె నాకె నీపై మోహ మెట్టిదో
వోవరిలోఁ బవ్వళించి వున్న నిన్ను లేపి నీకు
వేవేగను విడె మిచ్చె వేడుక యదెట్టిదో

చ. 2: కొలువులో నీవుండఁగా కొనగోర నిన్ను నూఁది
పిలిచె రతికేలికిఁ బ్రియ మెట్టిదో
నలిరేఁగి మరపుతో నాటకసాల చూడఁగా
పలుకుఁ గప్పుర మిచ్చె బత్తి యెట్టిదో

చ. 3: కూడి చొక్కివుండఁగాను గుబ్బచన్నుల ని న్నొత్తి
యీడుగా నవ్వులు నవ్వె ఇంపు లెట్టివో
జోడై శ్రీవేంకటేశ సుదతి నిన్ను మెప్పించె
యీడనే యిన్ని చందాల ఇత వెట్టిదో

రేకు: 1925-2 ఆహిరి సం: 29-086

పల్లవి: ఇందుకుఁగా నెగ్గు దప్పు లెంచకువయ్యా
సందడించీ నా మోహము జంటలై యీరీతిని

చ. 1: విన్నవించే నా మాటలు వినయ మెంత చూపినా
కన్నులచూపులై నిన్నుఁ గాఁడి పారీని
పన్నుక నా నుదురు నీ పాదాలకు మొక్కినాను
నిన్ను నా చక్కఁదనము నివ్వెరగందించీని

చ. 2: సారె నా చేతులు నీతో సరసము లాడినాను
వారక నాగోళ్ళు నీపై వాఁడిమీరీని
నేరుపుతో నా సెలవి నీతో నెంత నవ్వినాను
కూరిమి నా పెదవులు కొసరింపిచీని

చ. 3: పుడమి నా కాఁగిలి నీ పొందు లెంత సేసినాను
వడిఁ జన్నులు కొండలవలె నొత్తీని
యెడయక శ్రీవేంకటేశ నీ దేవులనైతి
పుడివోనిరతులు నిన్నుబ్బురేచీని

రేకు: 1925-3 గుమ్మకాంభో(బో?)ది సం: 29-087

పల్లవి: ఇట్టె విన్నవించరే ఇంతులెల్లా నాతనితో
దట్టమైన నా వలపు తానే యెరుఁగును

చ. 1: కన్నుచూపుల నున్నవి కాంక్షలు
చన్నులపై నున్నది జవ్వనము
సన్నలలోనే వున్నవి సరసములు
యెన్నరాని నావలపు యేమని చెప్పుదునే

చ. 2: పెదవిపై నున్నవి ప్రియములు
మదిలోన నున్నవి మమతలు
పొదిలి మేన నున్నవి పులకలు
యెదుటి నావలపులు యేమని చెప్పుదునే

చ. 3: చెక్కులపై నున్నవి చెమటలు
మొక్కులలో నున్నవి ముదములు
వొక్కటై శ్రీవేంకటేశుఁ డున్నాఁడు తానె కాఁగిట
యిక్కువ నావలపులు యేమని చెప్పుదునే

రేకు: 1925-4 భైరవి సం: 29-088

పల్లవి: సుదతి చందము నీవే చూడవయ్యా
అదివో యద్దరూ మాఁటలాడుకోరయ్యా

చ. 1: తలపోయుఁ గొంతవడి తరుణి నీ గుణములు
చెలఁగి తమకమునఁ జెమరించును
పలుమారు నీమీఁది పదములు వాడుకొని
అలరి యాపె సుద్దు లెంతడిగేవయ్యా

చ. 2: పనివూని నీ సుద్దులు పడఁతులతోఁ జెప్పును
ననుపు నీ చేఁతలకు నవ్వు లోలోనె
వొనరఁ బానుపుమీఁద నుండి నీ కేదురుచూచు
యెనయఁగ నాపె కత లిటువంటియ్యా

చ. 3: నీ రతులు భావించి నెమ్మిఁ జిత్తము గరఁగు
కోరికలు నీపైఁ బెట్టి గుబ్బతిలును
చేరి యింతలో నీకెను శ్రీవేంకటేశ కూడితి –
వీ రీతిరి నీ దేవులు యెరుఁగుకోవయ్యా

రేకు: 1925-5 దేసాళం సం: 29-089

పల్లవి: ఇంతట మెచ్చఁగదవే ఇద్దరూ మీరు
మంతనానఁ గూడితిరి మచ్చిక దైవారను

చ. 1: తరుణి నామాట నీకు తారుకాణ వచ్చెనా
సిరుల నీఇంటికి విచ్చేసె నితఁడు
సరుగ నీమనసుకు సంతోసమాయనా
మరిగి నిన్నిన్నిటాను మన్నించె నితఁడు

చ. 2: సాకిరి నేఁ బెట్టినట్టె సరివచ్చెనా నేఁడు
మేకొని యీతఁడు నీక మేలువాఁడాయ
యీకడ నీ కోరికలు యింతట నీడేరెనా
చేకొని నీ చెప్పినట్టె సేసె నిదె యీతఁడు

చ. 3: నే నిచ్చిన నమ్మికలు నీకు నీడువచ్చెనా
పూని శ్రీవేంకటేశఁ డిప్పుడు గూడెను
తానకమై మీపొందులు తగులము లాయనా
నానారీతుల నీతో ననిచినాఁ డీతఁడు

రేకు: 1925-6 ముఖారి సం: 29-090

పల్లవి: చూడఁచిన్నదాన వింతె సుద్దులు కోటానఁగోటి
యేడేడ నేరుచుకొంటివే వో కలికి

చ. 1: కిన్నెరమీఁటులలోని గిలిగింతలు । నీ –
వన్నెల కనుచూపుల వలవంతలు
యెన్నరాని యిచ్చకపు టెలయింతలు
యెన్నఁడు నేరుచుకొంటివే నో కలికి

చ. 2: సారెకు నెడవాయని సరసములు । నీ –
తారుకాణ సన్నల తమకములు
గారవించి బుజ్జగించే గమకములు
యేరీతి నేరుచుకొంటివే వో కలికి

చ. 3: కందువ శ్రీవేంకటేశు కలయికలు । నీ –
యందమైన సమరతి యలయికలు
పొందుల మునిముంగిలి పొలయికలు
యెందెందు నేరుచుకొంటివే వో కలికి

రేకు: 1926-1 హిజ్జిజి సం: 29-091

పల్లవి: చెప్పరే బుద్ధు లాపెకు చెలులాల
వొప్పుగొని గుట్టుతోడ నుండుటే మే లనరే

చ. 1: వావులు గలయఁజెప్పి వద్ద వచ్చి కూచుండి
నా విభునితో నేల నవ్వీనే తాను
పావురాలఁ బలికించి పాలిండ్లు చూపి మోపి
చేవమీర వలపెంత చిమ్మిరేఁచీనే

చ. 2: కలువల గొని వేసి కప్పురము పైఁ జల్లి
చెలరేఁగి సన్నలేల సేసీనే తాను
చిలుకల గానుకిచ్చి చేరి యనఁగి పెనఁగి
యెలమిఁ దమకమెంత యేసపెట్టీనే

చ. 3: చేతులు సారెకుఁ జాఁచి సేవ లెన్నియైనాఁ జేసి
పోతరించ రతికేల పాంచీనే తాను
యీతఁడె శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁ గూడిమాడి
ఆతలఁ దా నందాఁకా నాసలు సేసీనే

రేకు: 1926-2 ఆహిరినాట సం: 29-092

పల్లవి: ఏమని నుతింతునమ్మా యిట్టి నీ చక్కదనము
కాముని బలము లొక్క గాడిఁగట్టితివౌనే

చ. 1: చెలి నీ కొప్పుననైతే చీఁకట్లు గమ్మిని
లలి సెలవినే వెన్నెలలు గాసీని
తళుఁకు గనుచూపుల తమ్మిరేకు లుప్పతిలీ
కలికి మోమునఁ జంద్రకళలు దేరీని

చ. 2: సతి నీ ముక్కున మంచి సంపెంగవాసన మించీ
తతి నీ యారునఁ దుమ్మిదలు మూఁగీని
యితవై నీ యడుగుల యేనుగుల చొప్పు దొట్టీ
కతకారి నడుము సింగముఁ బోలీని

చ. 3: వనిత నీ దంతముల వజ్రాలగని మించె
పనివూని మోవిఁ బుట్టె పచ్చి చిగురు
యెనసి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ బెండ్లాడఁగా
యినుమడి నీ సింగార మిటు నీకు నమరె

రేకు: 1926-3 ఆహిరి సం: 29-093

పల్లవి: ఆసతో నన్నిమాఁటలు నాడితి నిన్ను
మూసిన ముత్తెమువలె మొక్కే నే నీకును

చ. 1: బత్తితో నాడినమాఁట భావములు గరఁగించు
కొత్తమాఁట వేడుకతోఁ గొసిరింపించు
పొత్తులమాఁట కమ్మటిఁ బూని యడిగింపించు
యిత్తల నామాఁటలు నీకెటువలె నుండెనో

చ. 2: లాలనతోడిమాఁట లాచి పెనఁగింపించు
నాలిమాట సెలవుల నవ్వింపించు
మేలుమీఁదిమాఁటలు సమేళములు పెడరేఁచు
యీలీల నామాఁటలు నీ కెటువలె నుండెనో

చ. 3: ఇచ్చకమయినమాఁట ఇయ్యకోలుగాఁ జేసు
మచ్చికగలుగుమాఁట మన్నింపించు
అచ్చముగ నన్నేలితి వన్నిటా శ్రీవేంకటేశ
యిచ్చయిన నామాఁటలు నీ కెటువలె నుండెనో

రేకు: 1926-4 నారాయణి సం: 29-094

పల్లవి: ఎందాఁకా సింగారించే వింటిలోనను
అంది నిన్నుఁ బెండ్లాడే యాసతో నున్నాఁడు

చ. 1: పలుకవే జవరాల పతితోడను
నెలకొని నీ యెదుట నిలుచున్నాఁడు
చిలుకవే నగవులు సెలవులను । నీ –
కలయికలకు నిదె కాచుకున్నాఁడు

చ. 2: వొసఁగవే విడె మిట్టె వుబ్బురేఁగను
కొసరుచు నినుఁ గనుఁగొంటా నున్నాఁడు
పొసఁగవే యాతని పొందులను
వసమై నీ కాఁగిటికి వలచివున్నాడు

చ. 3: వోరయనే చన్నుల నీ వుదుటు చూపి
గరిమ నిన్నేలె శ్రీవేంకటేశ్వరుఁడు
దొరయవే రతులను తోడఁదోడను
సొరిది నీ చేఁతులకుఁ జొక్కివున్నాఁడు

రేకు: 1926-5 గండక్రియ సం: 29-095

పల్లవి: వేడుకగలట్టెల్లాను వినోదింతువుగాక
యీాడు జోడై వుండి మరి యెరవు లేమిటికే

చ. 1: కనుఁగొనవలెనంటే కనురెప్ప లలసీనా
జూనుఁగ కితని మోము చూతువుగాక
పెనచి మాఁటడితేను పెదవు లరగీనా
మనసు వచ్చినట్టెల్లా మాఁటలాడఁగదవే

చ. 2: చిన్ని నవ్వు నవ్వితేను సెలవులు వేసరీనా
యిన్నిటా నీ నేర్పు మెరయింతువుగాక
సన్నసేసితే రతుల చవులు దరగీనా
వున్నతి నీ కొనగోర నొరయఁగఁగదవే

చ. 3: కదిసితే కాఁగిటిలో గట్టిచన్నులు గందీనా
గుదిగొన నితనిఁ గూడుదుగాక
చెదరక నిను నేలె శ్రీవేంకటేశుఁ డితఁడు
వదలీనా తురు మిఁక వంచి మొక్కఁగదవే

రేకు: 1926-6 నాదరామక్రియ సం: 29-096

పల్లవి: తనకేమే సారె సారెఁ దడవీ నన్ను
పనిలేదా పాటలేదా పంతగారివాఁడు

చ. 1: మోవరాని చన్నులు మోఁచుక నే నుండఁగాను
వావు లేమి చెప్పీనే వద్దకు వచ్చి
చేవదేరి మోవిపండు చిప్పిలి తేనెగారఁగా
పూవులనేల వేసీనే పొద్దువోనివాఁడు

చ. 2: మొగము అద్దముతోడ ముచ్చటాడఁగాను
నగనేల వచ్చీనే నాతోఁ దాను
వెగటైన నాతురుము వీఁపువెంట జారఁగాను
మగిడి యేమి చూచీనే మాయదారివాఁడు

చ. 3: చక్కఁదనమెల్లా నామై చలపట్టుకుండఁగాను
యిక్కడ శ్రీవేంకటేశుఁ డేల ముట్టీనే
ఫుక్కుమీరి జవ్వనము వొడిగట్టుకండఁగాను
కక్కసించి కూడె నేమే కతకారివాఁడు

రేకు: 1927-1 మాళవిగౌళ సం: 29-097

పల్లవి: రమ్మనవే యిఁకనేల రవ్వసేయక
పమ్మికొన్న తమకము పారిపోవనచ్చునా

చ. 1: తనియని నా మనసు తనుఁ గోరకుండునా
చెనకి నా ప్రియములు చేకొనుఁగాక
మునుకొన్న చూపులు మోము చూడకుండునా
యెనసి నా చేఁతలకు నియ్యకొనుఁగాక

చ. 2: కోమలపు నా వయసు కొంగు వట్టించకుండునా
దీమసానఁ గూడ సమ్మతించుఁగాక
దోమటి నా వలపులు తొలఁగఁగ నిచ్చునా
నా మాటలు దోయక నన్ను నేలుఁగాక

చ. 3: కందువ నావలపులు కలయఁబెట్టకుండునా
ఇందరిలో నాకుఁ జనవిచ్చుఁగాక
పొందులు శ్రీవేంకటేశుఁ బొనుఁగఁగ నిచ్చునా
చెందె నన్ను నిఁక నిట్టె చెలఁగించుఁగాక

రేకు: 1927-2 బౌళి సం: 29-098

పల్లవి: నీ సుద్దు లేమిచెప్పేవు నే నెరఁగనా
ఆసవెట్టి నన్ను నింత ఆదరించేవుగాక

చ. 1: తారుకాణంచితే యిట్టె దంటవై యేమి చూచేవు
కోరి యాపె విడె మందుకొనవా నీవ
సారె సారె నందుకుఁగా చలమేల సాదించవు
చేరి యాపెఁ గొనగోరఁ జెనకవా నీవు

చ. 2: మచ్చెము నీమై యుండఁగా మరియేలజంకించేవు
నచ్చుకొట్టి యాపెతోడ నవ్వవా నీవు
నిచ్చెలుల నడిగించి నిజమెంత నెరపేవు
పచ్చిదేర నాపె పక్కఁ బండుండవా నీవు

చ. 3: తోడ దిష్టము చూపితే దొమ్మిఁ గాఁగిలించేవు
జోడై యాపె మోవి చవిచూడవా నీవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వాడిక నాపెకుఁ దొల్లి వలవవా నీవు

రేకు: 1927-3 సామంతం సం: 29-099

పల్లవి: ఎంతకెంత సేసేవు యేమే నీవు
సంతోసాన నీ వాతని చనవు చేకొనవే

చ. 1: చుట్టరికము లాతఁడు చూపి మోపీఁజెప్పఁగానే
ముట్టకుమంటావేల మొక్కు మొక్కేవే
నెట్టుకొని యాసతోడ నీ మొగము చూడఁగానే
దిట్టతనమున నేల తెరవేసుకొనేవే

చ. 2: వొడివట్టుకొని పతి వొడఁబరచుకోఁగానే
విడిపించుకోరా కెంత వేఁడుకొనేవే
తడయక నీ నోరిలోఁ దమ్ములము వెట్టఁగానే
చిడుముడి నివేల చేయి చాఁచేవే

చ. 3: యెనసి శ్రీవేంకటేశుఁ డిక్కువ లంటఁగానే
చెనకనియ్యక యాల చెక్కు నొక్కేవే
పెనఁగి రతుల నీకుఁ బ్రియములు చెప్పఁగానే
ననిచి సిగ్గుల నేల నవ్వి కాఁగిలించేవే

రేకు: 1927-4 దేవక్రియ సం: 29-100

పల్లవి: సొలయక మలయక సోఁకనాడక
వలపులే చల్లి కైవశము సేసుకోవే

చ. 1: ప్రియములు చెప్పితేను బెరసి మతి గరఁగు
నయములు నెరపితే నమ్మిక పుట్టు
దయపుట్టు మెలఁగితే తగులు నాదరింపులు
క్రియతో నాతని రతికేలికి బిలువవే

చ. 2: చెప్పినట్టె సేసితేను చేఁతలెల్లా నీడేరు
వొప్పుగా మాఁటాడితేను వొడఁబాటౌను
చిప్పిల నవ్వు నవ్వతే చెలఁగి వేడుక పుట్టు
యెప్పుడు నీ వితనికి నిచ్చకమే సేయవే

చ. 3: పాయక వద్ద నుండితే పాదుకొను మచ్చికలు
చాయ దప్పక కూడితీ సంతోసాలౌను
యీాయెడ శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్ను మన్నించె
సేయఁగల సేవలెల్లాఁ జేసి మెప్పించకోవే

రేకు: 1927-5 ఆహిరి సం: 29-101

పల్లవి: నెలఁత నింతటఁ గరుణించవయ్యా
కలికి గుబ్బచన్నులు కానుకగా నిచ్చీని

చ. 1: వెక్కసపుఁ దమకము విన్నవించ సిగ్గువడి
చెక్కు చెమటలు గోరఁ జిమ్మీ నీపై
చొక్కిన నివ్వెరగులు చూపి సొలయఁజాలక
ముక్కున నిట్టూర్పులు ముంచి పోసీని

చ. 2: వుప్పతిలు విరహము వోలి నెచ్చరించరాక
కొప్పులో వాడుఁబువ్వులు గుప్పీ నీపై
దప్పిదేరే యలపులు తారుకాణించనోపక
లప్పలచిట్టు గందాల లాచివేసీని

చ. 3: మునుపతి నీ పొందులు ముదులకించఁగలేక
ననలైన పులకలు నాఁటించీనీపై
యెనసితివి శ్రీవేంకటే యిప్పుడే యీకెను
వినయాన మోవితేనె విందులు సేసీని

రేకు: 1927-6 మధ్యమావతి సం: 29-102

పల్లవి: మగువకు నిన్నియును మంచివై యుండఁగవలె
తగులై యుండఁజేయరే తరుణులాల

చ. 1: సుదతికిఁ దుమ్మిదలు చుట్టములై యుండవలె
పొదిగి తామరలు కొప్పున నించరే
వదలక చందురుని వసముసేసుకోవలె
పదిలానఁ గలువల పానుపు వరచరే

చ. 2: మందానిలుఁ డింతికి మరి చలువగావలె
గందము మేను నిండాఁ గడు మెత్తరే
చెంది కోవిలలతోడఁ జెలిమిసేసుకోవలె
చందముగాఁ జిగురాకు చప్పరలు గట్టరే

చ. 3: కలికికి మదనుఁడు కాఁపుగా నుండఁగవలె
చిలుకల వాసిన చీర గట్టరే
యెలిమి శ్రీవేంకటేశుఁ డీఁకె నింతలోఁగూడె
వెలయవలె సోబాన వేడుకతోఁ బాడరే

రేకు: 1928-1 రామక్రియ సం: 29-103

పల్లవి: నీవు మొదుల నన్నిటా నెరజాణవు
పూవువంటిదాన నాతోఁ బొందుసేసే విపుడు

చ. 1: చన్ను లంటఁగ వచ్చేవు సరసము లాడేవు
యెన్నిసేసినా నిన్ను నేమనేమయ్యా
సన్న లూరక సేసేవు జవ్వాది మేనఁ బూసేవు
చిన్నదాన నన్నుఁ గాకుసేయ నేఁటికయ్యా

చ. 2: ఇట్టె నాపై నొరగేవు యెంగిలి మోవెడిగేవు
బెట్టుగా నీతో నెందాఁకాఁ బెనఁగేమయ్యా
చుట్టి యేకతాలాడేవు సొమ్ములు మేనఁ బెట్టేవు
గుట్టుతోడిదాన నింత గొర బేఁటికయ్యా

చ. 3: పచ్చిగాఁ గాఁగిలించేవు పానుపుపైఁ గూడేవు
మచ్చికాయ నీతో నిఁక మరఁగేలయ్యా
కచ్చుక శ్రీవేంకటేశ గందవొడి చల్లేవు
ఇచ్చకురాలఁ గొసరు లిఁక నేఁటికయ్యా

రేకు: 1928-2 సామంతం సం: 29-104

పల్లవి: ఈకె గలుఁగఁగ గదా యిన్నియును వెలవెట్టి
దాకొని వొండొకటితో దారుకాణ లాయనే

చ. 1: పొలఁతి మోమునఁ బోలు పున్నమచందురుఁడు
కలికి కన్నులఁ బోలు కలువ లివి
నిలువుఁ దురుముఁబోలు నెమ్మదిఁదుమ్మిదగుంపు
యెలిమె మదనుసిరు లెంతనోము నోఁచెనే

చ. 2: వనిత బొమ్మలఁ బోలు వరుసఁ జెరకువిల్లు
చనుగుబ్బలనుఁ బోలు చక్రవాకాలు
తనువునఁ బోలును తాలిమితోఁ జిగురాకు
యెనలేని మరుసిరు లెంత నోము నోఁచెనే

చ. 3: యింతి పిరుఁదులఁబోలు యీతని బండి కండ్లు
చెంతఁ బాదాలఁబోలు చెందామరలు
సంతోసాన శ్రీవేంకటేశ్వురుఁడు గాఁగిటఁ గూడె
యింతటాఁ గంతుని సిరు లెంతనోము నోఁచెనే

రేకు: 1928-3 పాడి సం: 29-105

పల్లవి: మేలు మేలు యీ మెలుఁత చందములు
పోలిక లొకటై పొదలీ నీకు

చ. 1: తరుణి నిన్నుఁ గడుఁ దగులఁగ నాడీ
తిరమగు వావులు దెలిపీని
గరిమల నినుఁ దమకంబులు రేఁచీ
పొరుగున నెన్నటి పొందో కాని

చ. 2: చనవులు సేసుక సరిఁ గూచుండీ
ననుపులు మిగులఁగ నవ్వీని
మనసు గరంగఁగ మర్మము లంటీ
తనియ ది దెంతటి తగులోకాని

చ. 3: కొలువులు సేయుచు కుచములు నొరసీ –
సలిగెతో సేసలు చల్లీని
యెలమిని శ్రీవేంకటేశ నన్నేలితి –
విల నినుఁ దా నెపు డెనసీనోకాని

రేకు: 1928-4 ఆహిరినాట సం: 29-106

పల్లవి: ఎంతైనా నాతోడిసరే యెఱంగదుగాక తాను
ఇంతులాల యీపె యెమ్మె లేమని చెప్పుదమే

చ. 1: కొప్పునఁ జెరివినవి కొత్తగేదంగిరేకులు
చిప్పిల జవ్వాది జారీఁ జెక్కులవెంట
కుప్పళించుకొన్న దిదె గుబ్బలపై గందవొడి
ఇప్పు డిదె యీపె యెమ్మె లేమని చెప్పుదమే

చ. 2: సందిఁ గట్టుకొన్నవి చంద్రవంక తాయతులు
అందపు వల్లెవాటు పయ్యెద బుజాన
కందువ మొసలిమీఁద కస్తూరి గీరు నామము
యిందరిలో నీపె యెమ్మె లేమని చెప్పుదమే

చ. 3: పాదమునఁ బెట్టినది పైఁడిబొమ్మల పెండెము
మోదానఁ గట్ట గంటల మొలనూలు
పోదిసేసి నన్ను నేలె పొంచి శ్రీవేంకటేశుఁడు
యీదెస నీపె యెమ్మెలు యేమని చెప్పుదమే

రేకు: 1928-5 గౌళ సం: 29-107

పల్లవి: ఆయలేవే నీ పగటులన్నీఁ గంటిని
యీయెడ మెంతైనా నాతో నీడు వచ్చేవా

చ. 1: పుక్కిటి తములముతో పొంచి పొంచి విభునికి
యెక్కడలేని కతలు నేమి చెప్పేనే
చెక్కు చెమ టాతనిపైఁ జిందఁగానే యంటిముట్టి
గక్కన నెంతేసి వూడిగములు సేసేవే

చ. 2: కొప్పు పువ్వులు పతిపై కులికి రాలుచుకొంటా
యిప్పు డెంత చెనకులా నెలయించేవే
రెప్పల చూపులఁ జెలరేఁగి కోమలపు మోము
కప్పుకొని యెందాఁకా నేఁకరి చూచేవే

చ. 3: గట్టి చన్నులు శ్రీవేంకటేశ్వరు దాఁకఁగాను
యిట్టునట్టు జవ్వాది యేమి పూసేవే
నెట్టన నన్నితఁడేలె నే నలమేలుమంగను
చుట్టరికముల నీవు సుద్దు లేమి చెప్పేనే

రేకు:	1928-6 ముఖారి సం:	29-108

పల్లవి:	మఱఁగులు వెట్టకువే మాతో నీవు
యెఱఁగ వచ్చిన పనికేల దాఁచేవే

చ. 1:	సెలవుల నవ్వులనే సిగ్గులు వెల్లివిరిసె
పులకల వలపులు పొడచూపెను
చెలప చెమటలనే చిత్తపుకరఁగు చూపె
తలఁపులో భావ మిఁక దాఁచ నేఁటికే

చ. 2:	కన్నుల తేటలలోనే కానవచ్చె వేడుకలు
తిన్నని నిట్టూరుపులఁ దెలిసెఁ దమి
పన్నిన నివ్వెరగులఁ బచ్చిదేరెఁ గోరికలు
యిన్నిటా నీభావ మిఁకనేల దాఁచేవే

చ 3:	వెడజారుఁ దురుమున వెలసె నీ కూటములు
తొడరి మోముకళల దొట్టె ననుపు
అడరి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగ నిన్నేలె
యెడయని నీ భావము యేల దాఁచేవే

రేకు: 1929-1 దేవగాంధారి సం: 29-109

పల్లవి: నీ తలనే వేగెనా నీవేల సిగ్గువడేవే
యీతల నీ విభునితో నెట్టున్నాఁ జెల్లునే

చ. 1: మనసులోపలియాస మర్మములు వెడరేఁచి
పెనఁగించి ప్రియులను బెరయించును
తనువుపః జవ్వనము తమకములు వుట్టించి
చెనకించి సేయరాని చేఁతులు సేయించును

చ. 2: యిక్కువైన వలపులు యెంతటివారికైనా
చొక్కించి యెదురులు చూపించును
మక్కువైన మాఁటలు మరి చవులు వుట్టించి
వొక్కటిసేసి రతుల నోలలాడింపించును

చ. 3: యేకతపు సరసాలు యిద్దరిఁ గాఁగిటఁ గుచ్చి
చేకొని చుట్టరికముసేయించును
తూకొని శ్రీవేంకటేశుతోడి నవ్వు లిట్టె నిన్ను
యీకటఁ బెండ్లాడించె ని న్నింకా నీడేరించును

రేకు: 1929-2 పాడి సం: 29-110

పల్లవి: ఊరకున్నాఁ బోనీదు వుడివోని జవ్వనము
తారుకాణ లివి నీకు దాఁగవచ్చునటరే

చ. 1: కనుచూపులు సోఁకితే కలయికలు రేఁచును
మనసు లెనసితేను మర్మము లంటు
చెనకులు వేడుకైతే సేసిన చేఁతలు చెల్లు
పెనచితే నొందొకటి పెనులంకెలే

చ. 2: యెడమాఁటలు వింటేనే హెచ్చుఁ దరితీపులు
బడివాయకుండితేఁ జొప్పఁడు జెలిమి
వొడఁబాటు గలిగితే నొనగూడుఁ గాఁగిళ్ళు
తడయ కొండొకటికిఁ దగులాయమే

చ. 3: నవ్వులకు లోనైతే నాము లెక్కు వలపులు
వువ్విళ్ళూరఁ బెనఁగితే నుబ్బించు మేను
ఇవ్వల శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
నివ్వటిల్ల నొండొంటితో నెరవైన జంటలే

రేకు: 1929-3 లలిత సం: 29-111

పల్లవి: మొదలనే యాతనికి మోహపు దేవులవు
వదలక ఇచ్చలోనే వచ్చి చొక్కించరాదా

చ. 1: తప్పులెంచనే లతనిఁ దగిలి వేఁడుకోనేల
వొప్పుగా నోరుపుతోడ నుండఁగరాదా
అప్పటి జంకించనేల ఆసలు కొలుపనేల
చెప్పి చూపి కూరిములే చెల్లించఁగరాదా

చ. 2: పెనఁగనేల ఆనలువెట్టి పిలువఁగనేల
ననుపున విభునితో నవ్వఁగరాదా
మొనగోర నూఁదనేల మొక్కులు మొక్కఁగనేల
యెనసి చెప్పినట్టల్లా నియ్యకొనరాదా

చ. 3: చేరి చెనకఁగనేల సిగ్గులు వడఁగనేల
మేరతోఁ గాఁగిటఁ గూడి మెప్పించరాదా
యీరీతి శ్రీవేంకటేశుఁ డిచ్చగించి నిన్ను నేలె
సారెకు నీమోవి యిట్టె చవి చూపరాదా

రేకు: 1929-4 కాంబోది సం: 29-112

పల్లవి: ఇట్టి చక్కఁదనాలెల్లా నిందే కానఁగవచ్చె
చుట్టిచుట్టీపె వొరపు చూడరమ్మ చెలులు

చ. 1: నగితే వెన్నెలగాసీ నలినాక్షి సెలవుల
నిగిడి చూచితే మించీ నీలాలరంగు
మొగమెత్తితేఁ దొలఁకీ మోవి మదనకళలు
సొగిసి యీపె వొరపు చూడరమ్మ చెలులు

చ. 2: మాటలాడితే మెరచీ మాణికాలు నోరునిండా
పాటించితే నిలువెల్లా బంగారు నిగ్గు
పాటవాడితేఁ బెదవిఁ బచ్చితేనె లూరీని
జూటరి యీపె వొరపు చూడరమ్మ చెలులు

చ. 3: పెనఁగితే నురమునఁ బెరిగీని జక్కవలు
చనకితే గొనగోళ్ళఁ జెందీ వజ్రాలు
యెనసె శ్రీవేంకటేశుఁ డీకెఁ గడు మన్నించి
జునుఁగ కీపె వొరపు చూడరమ్మ చెలులు

రేకు: 1929-5 శ్రీరాగం సం: 29-113

పల్లవి: సవతిపై మచ్చరాన సాదించకువే యాతిని
కవగూడీ నీమీఁద కడు బత్తిగలఁడు

చ. 1: ఆనలు వెట్టకువే ఆతఁడు వేఁడుకోఁగాను
మానవే నీ చలపాది మంకుఁదనాలు
వీనులు మూసుకోకువే వెస నొడఁబరచఁగా
కానిమ్మని యియ్యకోవే కాఁగిలించీ నిన్నును

చ. 2: బొమ్మల జంకించకువే పొంచి నీకొంగు వట్టఁగా
కమ్మటిఁ జూపకువే నీ గబ్బితనాలు
చిమ్మకువే కొనగోళ్ళచేత నిన్ను నంటఁగాను
సమ్మతించి యందుకోవే చక్కవిడె మిచ్చీని

చ. 3: పట్టి పెనఁకువే పైకొని లాలించఁగాను
చుట్టమవై యిఐకనేలే జూటుదనాలు
ఇట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నుఁ గూడె
నెట్టుకొని పెట్టుకోవే నీకిచ్చిన సొమ్ములు

రేకు: 1929-6 వరాళి సం: 29-114

పల్లవి: ఎట్టి సంతోసపు సుద్దు లిటు వినవే చెలియ
గట్టిగా నాతని మేలు కానవచ్చె నిదగో

చ. 1: సరివచ్చెఁ గదె మన సగినాలు
వరుస నావున్నాఁడకు వచ్చె నాతఁడు
నిరతి నేఁ గన్నకల నిక్కలాయనే
సరసములాడి నాకుఁ జనవిచ్చె నిపుడు

చ. 2: తారుకాణలాయఁగదె తలపోఁతలు
చేరి యాదరించి బత్తిసేసె నాపైని
యీరీతి ఫలించెఁగరె హెచ్చి నా నోము
గారవాన నిదె నాకుఁ గయివసమైనాఁడు

చ. 3: ప్రతివచ్చెఁ గదవె నా పలుకు లివి
గతియై యీతఁడు నన్నుఁ గరణించెను
రతికెక్కెఁ గదవె కాఁపురము లెల్లాను
యితవై శ్రీవేంకటేశుఁ డేలె నిట్టె నన్నును

రేకు: 1930-1 సామంతం సం: 29-115

పల్లవి: అప్పటనుండి వెరగయ్యా మి మ్మిద్దరిఁ జూచి
వొప్పుగా సంతోసాల నోలలాడేమయ్యా

చ. 1: పెక్కుసింగారాలతోడి పెండ్లికూఁతురు నీకు
యెక్కుడఁ గలిగె నానతియ్యవయ్యా
మిక్కుటపు చేఁతల మేనమరఁదలు నేఁడు
నెక్కొని సరసమాడ నీ భాగ్యమాయనయ్యా

చ. 2: రచ్చకెక్కినటువంటి రాణివాసము నీకు
మెచ్చుగా నెందుండివచ్చె మేలు మేలయ్యా
విచ్చనవిడియైనట్టి వేడుక నగళ్ళవారు
అచ్చమై నీసేవసేయ నందమౌనయ్యా

చ. 3: కాఁపురము నేరిచిన కలికిగేస్తురాలు
దాఁపురమై కాచుకుండెఁ దగవౌనయ్యా
యేపున నన్నేలితివి యిట్టె శ్రీవేంకటేశ
ఆపె నొకతె గలిగె నమరు నీకయ్యా

రేకు: 1930-2 పాడి సం: 29-116

పల్లవి: కొమ్మ వలపులకెల్లా గురి యాతఁడు
నెమ్మది నెచ్చరించరే నెరవేరీఁ బనులు

చ. 1: చందమామ ననవేల చల్లగాలి దూరనేల
చెంది పతిఁ దోడితేరే చెలులాల
గంద మెంత మెత్తేరే కప్పుర మేమి చల్లేరే
పొందుసేసి యాతనినే బోదించరే

చ. 2: వలరాజుఁ దిట్టనేల వసంతుని గొడవేల
చెలువునికిఁ జెప్పరే చెలులాల
కలువ లెందుకు వచ్చు కడు బన్నీ రేమిటికి
తలపించి యాతనికే దయపుట్ట జెప్పరే

చ. 3: కాంత నూరడించనేల కన్నవారి నాడనేల
చెంతఁ బతిఁ గొసరరే చెలులాల
ఇంతట శ్రీవేంకటేశుఁ డీకె నేలె దానె వచ్చి
పంతాన నిద్దరిని సోబానఁ బాడరే

రేకు: 1930-3 దేశాక్షి సం: 29-117

పల్లవి: తోడఁ బెండ్లికూఁతురా తొల్లి తా నేమైనాను
యేడనైనాఁ దన పొందు లెచ్చరించ వచ్చీని

చ. 1: యేకతాన నితఁడు నే నిట్టె కత చెప్పుకోఁగా
వాకిట నదెవ్వతె వాయించీ వీణె
చేకొని లోకములోన సిగ్గరియాఁట దానికి
కాకరితనాల నింత గయ్యాళించఁ దగునా

చ. 2: వెన్నెల బాయిట నేను వేడుకతో నుండఁగాను
సన్నల నదెవ్వతె చల్లీఁ బన్నీరు
మిన్నక దొరతనాన మెలఁగేయాఁట దానికి
పన్నుకొని యారజపు పనులేలే తనకు

చ. 3: యింటిలోన శ్రీవేంకటేశుఁడు నన్నేలఁగాను
వెంటన చ్చిదెవ్వతె విడె మిచ్చీని
నంటున వాసితోడ ననిచినాఁట దానికి
దంటతనమున నింత తగులఁగ నేఁటికి

రేకు: 1930-4 గౌళ సం: 29-118

పల్లవి: ఈఁకె తొల్లి నీకు మొక మెరిఁగినది గాఁబోలు
వాకిటికి వచ్చె నీవు వలపించుకోవయ్యా

చ. 1: సళుపుఁ జూపులు నీపైఁ జల్లుకొంటా మదిరాక్షి
నిలుచున్న దిదిగొ నీ యెదుట
పిలువని పేరఁటము పెండ్లిబండి యెక్కవచ్చె
తిలకించి చూడవయ్యా దిష్టించి నీవు

చ. 2: చీటికిమాటికి నీతో చిరునవ్వు నవ్వుకొంటా
మాటలాడీ నిదిగో మందె మేళాన
పోటి గరితె తనాన బువ్వము గలయవచ్చె
చోటిచ్చి తొడపైఁ బెట్టి సుద్దు లడుగవయ్యా

చ. 3: సారెకు శ్రీవేంకటేశ చన్నుల నొరసుకొంటా
గోర నూఁదీ నిదిగో కూడితివంటా
పోరచి చుట్టమై నీచేఁ బోఁక వెట్టించుకోవచ్చె
బార చాఁచి కాఁగిలించి పక్కఁబెట్టుకోవయ్యా

రేకు: 1930-5 వరాళి సం: 29-119

పల్లవి: గుట్టు గొంత వలదా కోమలులకు
ముట్టుమీరి వలపులు రట్టుసేయ నేఁటికి

చ. 1: చక్కఁబెట్టుకోవే కొప్పు జాణతనా లేమాడేవు
ఇక్కడఁబతి ముందర నేఁకారుకొంటా
పక్కనఁ జన్నుల మీఁది పయ్యద గప్పుకోఁగదే
నెక్కొన నిందరిలోన నివ్వెరగు లేఁటికి

చ. 2: తుడుచుకోవే చెమట తొంగి యేమి చూచేవు
వుడివోని తమి నువ్విళ్ళూరుకొంటా
వెడవెడగాఁ బోఁకముడి వీడెఁ గట్టుకోవే
అడియాసలనే పరాకయ్యే వదేఁటికి

చ. 3: సరులు దిద్దుకోవే సన్నల నేమి మొక్కేవు
పెరరేఁచి తమకము పేరించుకొంటా
యిరవై శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్నుఁ గూడె
తరి నీవూఁ బెండ్లాడవే తలపోఁత లేఁటివి

రేకు: 1930-6 మాళవి సం: 29-120

పల్లవి: పూఁచి పూఁచి నీ గుణాలే పొగడేఁ గాక
దాఁచుకొని చెలులతోఁ దడవకుండేనా

చ. 1: నివ్వటిల్ల నందరిలో నీకు వేడుకైతేఁజాలు
యెవ్వతెఁ దెచ్చుకొన్నా నితవే నాకు
వువ్విళ్ళూర నీమనసు వొడఁబడితేఁజాలు
యివ్వల నీ చేఁతలకు నెగ్గుపట్టేనా

చ. 2: చక్కఁగా నీ కిటువలె సంతోసమైతేఁజాలు
యెక్కడ నుండి వచ్చినా నితవే నాకు
పెక్కువిధముల నీకుఁ బెద్దరికమైతేఁజాలు
తక్కక నీ యాచారాలు తప్పువట్టేనా

చ. 3: వింతలుగా నీకింత వినోదమైతేఁజాలు
యెంత సరసమాడినా నితవే నాకు
పొంతనే శ్రీవేంకటేశ పొసఁగి న న్నేలితివి
రంతుల నీ తమకము రచ్చవేసేనా

రేకు: 1931-1 దేసాళం సం: 29-121

పల్లవి: ఇచ్చకము సేసితేను ఇయ్యకోవద్దా
పచ్చిదేర నవ్వితేను పదరుదురా

చ. 1: విరులు ముడిచేనంటా విభుఁడు కొప్పువట్టితే
సరుగన నీ విట్లా జంకింతురా
పరగ హారాలు గట్ట బయ్యద దీసితేను
వొరసి చేతుల నిట్టె వొడ్డించుకొందురా

చ. 2: చల్లఁ గావలసి మేన సారెఁ బన్నీరు చల్లఁగా
పెల్లున నాతనితోడ బెనఁగుదురా
వొల్లనే కుచ్చెల జారకుండా మొలనూలిడితే
వుల్లసాలాడుకొంటా వొట్లు వెట్టుదురా

చ. 3: సిగ్గు దేరవెనంటా చెలితో మాఁటాడరాఁగా
వెగ్గళించి తామరను విసరుదురా
అగ్గమై శ్రీవేంకటేశుఁ డాదరించి నిన్నుఁ గూడె
నిగ్గుల నీ వింతలోనే నివ్వెర గందుదురా

రేకు: 1931-2 వరాళి సం: 29-122

పల్లవి: మిక్కిలి కోమలమైన మెలుఁత యీకె
మక్కువ లీడేర్చి యిట్టె మన్నించరాదా

చ. 1: చెమ్మఁ జెమటలతోడ చిటపాట మనఁగాను
యిమ్ముల బాదాలొత్తై యీకె యిందాఁకా
నెమ్మదిఁ దాళగతులు నీకెందాఁకా నాలించేవు
కమ్మి యలపెల్లాఁ దీర గాఁగిలించరాదా

చ. 2: కందువఁ బయ్యెదకొంగు గళబెళమనఁగాను
ఇందరితోఁ గుంచ వేసె నీకె యిందాఁకా
సందడితో నారవళే సారెకు నేమి వినేవు
అందపు నీ మోవి ఇచ్చి ఆదరించరాదా

చ. 3: కడు సకినల సజ్జ కవకివమనఁగాను
యెడపక నిన్నుఁ గూడె నీకె ఇందాఁకా
అడరి శ్రీవేకంటేశ యలమేలుమంగ తానే
తడవెంత దలఁచేవు దయతో మెచ్చరాదా

రేకు: 1931-3 పాడి సం: 29-123

పల్లవి: ఇంతటఁ గరఁగవద్దా యిచ్చగించి నీ మనసు
చెంతలఁ జూచినవారి చిత్తాలు గరఁగెను

చ. 1: చెప్పరాని ప్రియములు చెప్పి నీకు జవరాలు
వుప్పతిల్లుఁ దమితోడ నూరకుండెను
కప్పురపు బొమ్మ నీకుఁ గానుకగాఁ జేతికిచ్చి
దప్పిదేరి సిగ్గుతోడ దలవంచుకొనెను

చ. 2: సేయరాని వూడిగాలు సేసి సేసి కాతరాన
పాయరాక తొడమీఁదఁ బవ్వళించెను
కాయజకేలికి నిన్ను గమ్మరఁ జిలువఁబూని
ఆయడ చిరునవ్వుతో నట్టె గుక్కుకొనెను

చ. 3: చూపరాని మోమమెల్లాఁ జూపి నిన్ను మెప్పించి
దాపుగా నీరెంటెములో దాఁ జొచ్చెను
యేపున శ్రీవేంకటేశ యీకె యలమేల్మంగ
నీపొందు సేసి తన నేరుపు మెరసెను

రేకు: 1931-4 ఆహిరి సం: 29-124

పల్లవి: ఇదవో నాతలపోఁత లిన్నియు విన్నవించితి
యెదుట గాచుకుందాన యెరవు లేదిఁకను

చ. 1: సేవలు సేసితే నీవు చేకొని మన్నింతునని
వావులు చెప్పితేను వలతునని
భావించి చూచితేను బత్తి నపైఁ జేతువని
నీవద్ద గాచుకుందాన నీ చిత్త మిఁకను

చ. 2: సంతతముఁ గొలిచితే చనవెల్లా నిత్తువని
చెంత మొక్కితేఁ గోరిక చెల్లింతువని
మంతనము లాడితేను మచ్చికసేతువని
యింతటఁ గాచుకుందాన నీడేరించు మిఁకను

చ. 3: సెలవుల నవ్వితేను చేతికి లోనౌదువని
సొలసితే నన్ను దయఁజూతువని
అలమి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
యెలమి గాచుకుందాన యేలము నన్నిఁకను

రేకు: 1931-5 సౌరాష్ట్రం సం: 29-125

పల్లవి: మంచి గుణములుగల మగువల సాజ మిది
యెంచుకొని దయతోడ నేలుకొనవయ్యా

చ. 1: మనసు నమ్మిన సతి మరి యనుమానించదు
ననిచిన వనిత పెనఁగులాడదు
యెనసిన జవరాలు యెరవులుసేయదు
పనుపడి రతులకు బాఁతిపడుఁగాని

చ. 2: మరిగిన యాఁటది మరి పాయనేరదు
దొరసిన యిల్లాలు దూర దెంతైనా
సరి నిచ్చకపులేమ జరపులఁ బెట్టదు
యిరవైన కాఁపురాన కేఁకారుఁగాని

చ. 3: తగులైన కామిని తప్పులేమీ నెంచదు
మొగమిచ్చకపు ఇంతి వెగటాడదు
నిగిడి శ్రీవేంకటేశ నీదేవు లలమేల్మంగ
సొగిసి యీకూఁటముల జొక్కించుఁగాని

రేకు: 1931-6 సాళంగం సం: 29-126

పల్లవి: విన్నవిఁ గన్నవిఁ గావు నీపగట్లు
పున్నమ వెన్నెల పొళ్ళు పొలఁతి నీ సుద్దులు

చ. 1: సారె నేమి బులిసేవే సరసుని యెదుటను
కేరి కేరి నవ్వేవేమే కెలసుకొంటా
వూరకే పెనఁగేవేమే వొడివట్టి తీసుకొంటా
ఆరజపు చేఁత లివి అట్టె నీకేతగునే

చ. 2: సన్నలేమి సేసేవే సరి నెదురుగానుండి
చన్నులేమి చూపేవే జంకించుకొంటా
విన్నపాలేమి సేసేవే వేసాలు సేసుకొంటా
వన్నెవెట్టుమేకు లివి వడి నీకే తగునే

చ. 3: చేతులేమి చాఁచేవే శ్రీవేంకటేశ్వరు మీఁద
కాతరించేవేమే యాఁకారుకొంటా
యీతఁడే నన్నేలినాఁడు యిందరిలో మన్నించి
యేతరితనాలే పెంచే విది నీకే తగునే

రేకు: 1932-1 వరాళి సం: 29-127

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్ళుదాఁకా మీకె సుద్దులు
మెఱసె నీ కాఁపురము మేలయ్యా నీకు

చ. 1: నెక్కొని యీకె బత్తితో ని న్నింటికిఁ బిలిచీని
చిక్కించుక నీకు విందు చెప్పీఁ దాను
పెక్కువినయాలతోడఁ బెనఁగీఁ జేతులు వట్టి
చొక్కముగ నెన్నాళ్ళ చుట్టమోకాని

చ. 2: సరుసఁ గూచుండి తన చనవులు నెరపీని
వరుసవెట్టుక నవ్వవచ్చీ నీతోను
విరులు ముడిచీ నీకు వీఁపునఁ జన్నులు మోవ
సొరది దా నెటువంటి చుట్టమోకాని

చ. 3: తొలుసారె నీమోము తొంగి తొంగి చూచీని
కలికితనాల మొక్కి కాఁగిలించీని
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్ను నేలితిని
సొలసీఁ దానూ నెంత చుట్టమోకాని

రేకు: 1932-2 పాడి సం: 29-128

పల్లవి: పట్టరాకుంటే వయసు పొంతరఁబెట్టి దాఁచుకో
ఇట్టె బట్టబయలేల యీఁదవచ్చేవే

చ. 1: కూరిమి గొసరుకొంటా కొంకక నాపతితోడ
సారెకు నాడేవేమే జాణతనాలు
నేరుపుగలదంటాను నిండువాని సేసుకొని
పోరచి వలపులేల పొత్తు గలపేవే

చ. 2: బడివాయ కాతనితో పచ్చిమాఁట లాడుకొంటా
నడుమ నప్పటి నేమి నవ్వు నవ్వేనే
బెడిదపు వినయాలు పెదవిపైఁ బెట్టుకొని
బుడి బుడి యాసలేల పోఁగువేసేవే

చ. 3: కుమ్మరింపుదమితోడ గుబ్బలనొరసుకొంటా
వుమ్మగిలు రతులేల వొడిగట్టేవే
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
దొమ్మి చుట్టరికా లెన్ని తొరలించుకొనేవే

రేకు: 1932-3 రామక్రియ సం: 29-129

పల్లవి: గుట్టుతోడ నుండవే కొమ్మలెల్లా మెచ్చేరు
గట్టిగాఁ దానే వచ్చి కరుణించి నీతఁడు

చ. 1: నవ్వకునే యంతేసి నయగారి తనముల
తవ్వకువే వలపులు దప్పిగొనిని
రువ్వకువే మాఁటల రొక్కముగా నొక్కమాటే
నివ్వటిల్ల నీకంటె నేరుపరి యీతఁడు

చ. 2: మొక్కకువే సారె సారె ముదిరీ నీ వావులు
చొక్కకువే కన్నులను సొలపుదేరి
నిక్కకువే యంతేసి నేఁడె నీ సొబగులెల్లా
నెక్కొని నీకంటేను నెరవాది యీతఁడు

చ. 3: పెంచకువే పంతాలు పెనఁగి పెనఁగి నీవు
వంచకువే నీ శిరసు వట్టి సిగ్గుల
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నీ వితని
మించి కూడేవు నీకంటె మేటిజాణఁ డీతఁడు

రేకు: 1932-4 శ్రీరాగం సం: 29-130

పల్లవి: ఇంకా వినిపించవే యీ కతలు వేడుకయ్యీ
పొంకముగా జెలియా పొద్దువోదు నాకును

చ. 1: సొలసి తనతో నేను సుద్దులు చెప్పినవెల్లా
తలఁచుక చెప్పెనా తరుణి నీతో
వలుద గుబ్బలఁ జంద్రవంకలు దా నొత్తినవి
తెలిపెనా దాఁచక తేటతెల్లమిగను

చ. 2: తంతోడ నేకతాన తననాసంది పొందులు
మఱవక యడిగెనా మంచితనాన
మఱి నన్నుఁ గరుణించి మన్నించినీమన్ననల-
గుఱుతు లెఱిఁగించెనా కొంకక నీ కపుడు

చ. 3: వేడుకతో నేనూఁ దానూ వినోదించిన రతులు
ఆడ నీతోఁ దడవెనా యక్కరతోను
యీడక వచ్చి శ్రీవేంకటేశుఁడు దా నన్ను నేలె
జాడలు నీతో నించెనా సరికి బేసికిని

రేకు: 1932-5 ముఖారి సం: 29-131

పల్లవి: ఇంతటిదానవౌత యిప్పుడే యెరిఁగితిమి
వింత నీ నేరుపు లెందు వేరే నేర్చుకొంటివే

చ. 1: చాయలుగా మాఁటలాడి సన్నల నోరూరించి
పాయపు మగని నెంత పనిగొంటివే
కాయజకేలిని మతి గరఁగించి యతనిచే
సేయరాని బాస లెల్లాఁ జేయించుకొంటివే

చ. 2: కంచపుమోవి చూపి కన్నులనే తేలించి
మించి చెలువుని నెంత మెప్పించితివే
వంచనతో మొక్కు మొక్కి వలపులు వెడరేఁచి
మంచితనాననే యెంత మన్నింపించుకొంటివే

చ. 3: వేవేలు చేఁతలు సేసి వేడుకలు పుట్టించి
శ్రీవేంకటేశ్వరు నెట్లు చేకొంటివే
యీవేళ నన్ను నేలె యీతఁడే యింటికి వచ్చి
వావు లాతనికిఁ జెప్పి వలపించుకొంటివే

రేకు: 1932-6 శుద్ధ వసంతం సం: 29-132

పల్లవి: నీ బలిమి నా బలిమినేఁడే కానఁగవచ్చీ
జూయిల పచారాల జూటుఁదనా లేఁటికే

చ. 1: యేతు లేమి చెప్పేవే యిందరిముందరా నీవు
ఆతఁడు నీతో సరసమాడు నంటాను
యీతల నీ పతిని యా యింటికిఁ దెచ్చుకోఁగాను
చూతము నీ సలిగెలు చూపఁగరాదా

చ. 2: కేరుతా నేమి నవ్వేనే కీలుగంటు జారఁగాను
చేరి నీ మగఁడు బత్తిసేసీ నంటాను
గారవించి నే నీతనిఁ గాఁగిట బిగించఁగాను
ఆరితేరి నీ వప్పుడు ఔఁ గాదనఁగలవా

చ. 3: నీ వెంత విఱ్ఱవీఁగేవే నీటులు మెరసుకొంటా
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెందెనంటాను
యీవేళ నన్నీతఁడేలె యిట్టె నే బాయకుండితే
మా వలపు దెలుసుక మరి మెచ్చఁగదవే

రేకు: 1933-1 ముఖారి సం: 29-133

పల్లవి: ఎంత బాఁతో యాపె నీకు ఇందుకు దొరకొంటివి
పొత న న్నొడఁబరచి పొసఁగఁ జెప్పేవు

చ. 1: చెలరేఁగి యాపె నీకుఁ జేసేటి విన్నపాలెల్లా
పలుమారు నూఁకొని తప్పక వినేవు
యెలమి నప్పటి నీకు నిచ్చేటి కానుకలెల్లా
అలరుచుఁ జేయి చాఁచి యందుకొనేవు

చ. 2: వేడుకతో నాపె నీకు విందులు వెట్టినందుకు
ఆడనుండి సారె సారె నారగించేవు
జోడు గూడి నిన్నుఁ గడుఁ జొక్కించిన రతులకు
యీడకు వచ్చి నాతోను యెంతో కొనియాడేవు

చ. 3: కూరిమితో నాపె నిన్నుఁ గొసరి నవ్వినందుకు
చేరి కాఁగిలించుకొని చెక్కునొక్కేవు
యీరీతి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
మేరమీర కాపెతోడ మేలమాడేవు

రేకు: 1933-2 ఆహిరి సం: 29-134

పల్లవి: ఏమయ్యా తమకించే వెంత యా సోదకాఁడవు
కామించి చే మొక్కితేను కాఁగిలించేవు

చ. 1: నిమ్మపండ్లు కానుకఁగా నీకు నియ్యవచ్చితేను
అమ్మరో చన్నులేల అంటేవయ్యా
కమ్మరఁ బగడ మిట్టె కప్పముగాఁ బట్టితేను
వుమ్మడి మోవికేల నోరూరేవయ్యా

చ. 2: చొక్కపు పసిఁడిబొమ్మ సూడిదెగాఁ జూపితేను
పిక్కటిల్ల నాతో నేమి పెనఁగేవయ్యా
పక్కన నుడుగరగాఁ బచ్చడము గప్పఁగాను
అక్కరతో బయ్యదకొం గదేల పట్టేవయ్యా

చ. 3: వుంకువ నుంగరము నీ కుచితము దెచ్చితేను
కంకణము నాకేలఁ గట్టేవయ్యా
అంకెల శ్రీవేంకటేశ యన్నిటా నన్నేలితివి
పొంకపురతుల కెంత పొంది మన్నించేవయ్యా

రేకు: 1933-3 గౌళ సం: 29-135

పల్లవి: ఎక్కడినుండి వచ్చితి వే వూరే నీవు
చుక్కబొట్టు వెట్టుకొని సుద్దులు చెప్పేవు

చ. 1: ఎప్పటినుండి సరసాలాడేవు నా పతితోను
చెప్పనే నీ వెవ్వతెవు చెలియా
కొప్పు నిక్కఁబెట్టితివి కొనలు వెళ్ళముడిచి
పిప్పిగట్ట విడేలు పెదవిపైఁ జేసేవు

చ. 2: కలసి నామగనితోఁ జుట్టరికాలు సేసేవు
తెలుపవే నీగుట్టు తెల్లమిగాను
పలచఁగా మేనుమిండాఁ బసవు వూసుకొంటివి
వలిపెము గట్టి నీ భావములు చూపేవు

చ. 3: యిట్టె నన్నేలే శ్రీవేంకటేశుతోనే నవ్వేవు
యెట్టిదో నీ దీమసము యెంచవే నాతో
పట్టితివి పిడికిట బాగాలూ దెల్లనాకులు
నెట్టనఁ జెవిఁ బునుఁగు నిండా నించుకొంటివి

రేకు: 1933-4 పాడి సం: 29-136

పల్లవి: చాటి చెప్పితి మిపుడే సంతమౌతే మేలు
వాటముగఁ జెలిమి మఱవకుమయ్యా యిఁకను

చ. 1: సుదతి కనుచూపులకు సారిది నొడ్డుకోరాదు
అదరు వెన్నెలనవ్వు కడ్డము లేదు
తుద బొమ్మజంకెనలు తొలఁగ దొబ్బఁగరాదు
ముదురు వలపులు మిగుల ముంచుకొనునపుడు

చ. 2: కొనగోరివాఁడి మరి గురిదప్పుకొనరాదు
చెనకుఁ జేఁతుల కోరసేయరాదు
మనసు కరఁగింపులకు మరఁగువెట్టఁగరాదు
తనివోని కోరికలు తగులుకొనునపుడు

చ. 3: వలుద చనుగుబ్బలకు వడి మాటుకొనరాదు
కలయుకాఁగిటికి తెరఁగట్టరాదు
యెలమి శ్రీవేంకటేశ ఇపు డీకెఁ గూడితివి
కలుగుఁ దమకము లిట్లఁ గరుణించినపుడు

రేకు: 1933-5 బౌళి సం: 29-137

పల్లవి: ఆతఁ డేమి సేసినాను అంతా నంత వలపే
కాతరించక మొక్కవే కమ్మర నీ విపుడు

చ. 1: దగ్గరఁ గూచుండి ని న్నాతఁడు వేఁడుకొనఁగాను
సిగ్గులు వడకువే చెలియా
వెగ్గళించి నిమ్మపంట వేసె నందరిలోనంటా
యెగ్గులుగాఁ బట్టకువే యెదిరించి ఇపుడు

చ. 2: పుమ్మగిలు రతులకు నొడివట్టి పెనఁగఁగా
బొమ్మల జంకించకువే పొలఁతీ
కమ్మటి నీ కుచములు కడుఁబిసికెనంటాను
కుమ్మెలువో నూఁదకువే కొనగోర నిపుడు

చ. 3: శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కాఁగిలించుకోఁగా
మోవి గంటిసేయకువే ముదితా
కైవసమై నీ మనసు కరఁగించె నితఁడంటా
వేవేలుగా దూరకువే వేడుకతో నిపుడు

రేకు: 1933-6 ఆహిరినాట సం: 29-138

పల్లవి: నన్నెంత లాలించేవు నగుతా నీవు
మన్నించుమనఁగలనా మరుగఁగలఁగాక

చ. 1: నేరుపుతో మాఁటలాడి నిన్ను మెప్పించఁగలనా
చేరి నీతోడ బలిమిసేయఁగలనా
సారెకు నిన్ను గద్దించి సరసమాడఁగలనా మూరెఁడు గొప్పు వంచుక మొక్కఁగలగాక

చ. 2: చాయల సన్నల నిన్ను సాదించఁగలనా
నాయములు పచరించి నవ్వఁగలనా
ఆయాలు సోఁకఁ బెనఁగి అలయించఁగలనా
నాయంత నేనుండి నిన్ను నమ్మగలగాక
చ 3: కచ్చుపెట్టి నీమతి గరఁగించగలనా
మెచ్చి నీవు వేఁడుకోఁగా మీరఁగలనా
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కొచ్చి యింకా నీపొందే కోరఁగలఁగాక

రేకు: 1934-1 భైరవి సం: 29-139

పల్లవి: నెలఁత సింగారము నీ భాగ్యమాయ
తలఁపు లాడేరె మీకుఁ దగఁ దగునయ్యా

చ. 1: భామ చనుఁగవ నదె బంగారువానగురిసీ
తేమలెక్కి మోవివెంటఁ దేనెగారీని
మోమునఁ జంద్రకళలు ముంచి కారుకమ్మీని
నీ మోమము తెప్పలపై నించి తేలించవయా

చ. 2: మొనసి సెలవులను ముత్యాలపంటలు నిండె
తనువున వలపులు దైలువారీని
వొనరిన యారుపొంత నున్నవి వళితరంగాలు
యెనసె నీ వేడుకలు యీఁదులాడించవయా

చ. 3: ముంచినచక్కఁదనాన మోహన రసములుబ్బీ
నించెను కాఁగిటను పన్నీరుబుగ్గలు
యెంచఁగ శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
అంచల నీరతు లోలలాడించవయా

రేకు: 1934-2 ముఖారి సం: 29-140

పల్లవి: చిన్నదాననంటా నీవు సిగ్గువడేవే
చన్నులనురసి మోవి చవిచూపఁగదవే

చ. 1: చేరి చూడఁగఁజూడఁగా చీఁకటి వెలుగందురు
పేరఁబెట్టితే పాలే పెరుగందురు
కోరి కాచుకుండితే చిగురులే చేగలందురు
వోరుపుతో నాతని వూడిగాలే సేయవే

చ. 2: మరుఁగగా మరుఁగగా మచ్చికవుట్టు నందురు
పెరిగితే పూఁపలే పిందె లందురు
నెరులు గూడఁగాగూడఁగా నిండుఁగొప్పాయనందురు
సరసము లాతనితో సారె సారె నాడవే

చ. 3: మఱి చెప్పఁగాఁజెప్పఁగా మాఁటలే కత లందురు
తఱుచు పొదుసేసితే తగు లందురు
చిఱునవ్వులతో నిన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
మెఱసి పెక్కురతుల మెప్పించవే

రేకు: 1934-3 సామంతం సం: 29-141

పల్లవి: ఇంతటిదానవు నీవు యెంతని పొగడవచ్చునే
పాతఁ గోర కెట్టుండునే పొలఁతి నీ విభుఁడు

చ. 1: సెలవుల నవ్వు దేరీ చెక్కుల మదము గారీ
నెలఁత నీమాఁటలఁ దేనియ లూరీని
కలికి వన్నిటా నీవు గక్కన నిన్నుఁ జూచితే
వలవ కెట్టుండునే వనిత నీ విభుఁడు

చ. 2: మోమున వెన్నెల గాసీ మూపునఁ దురుము రాసీ
ఆమని చన్నులురమునందునఁ బైసేసీ
నీ మంచి చక్కఁదనాలు నెమ్మది నెంచి చూచితే
కామించ కెట్టుండునే కాంత నీ విభుఁడు

చ. 3: మోవిపైనే చిగురెక్కీ మొనగోళ్ళఁ జేఁగలెక్కీ
భావించితే హంసగతి పాదాలఁజిక్కీ
యీవేళ శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁగూడె
సేవగొన కెట్టుండునే చెలియా నీ విభుఁడు

రేకు: 1934-4 దేసాళం సం: 29-142

పల్లవి: కాంతుఁ డిదె నీకొరకే కాచుకున్నాఁడు
సంతోసము లెక్కలేదు జాజర లాడేవు

చ. 1: శిరసెత్తి చూడఁగదె చెలియ నీ పతి మోము
తిరముగా సిగ్గులేల తెరగట్టేవు
సరసము లాడఁగదె సంగడిఁ గూచుండి నీవు
పెరరేఁచి మోనమేల పేరఁబెట్టేవు

చ. 2: మాటలాడఁగదవె మనసార నాతనితో
మాటుసేసి మోవి యంత మాఁగఁబెట్టేవు
వాటముగా నవ్వఁగదె వలపులు చల్లి నీవు
గాఁటపు నివ్వెరగేల గంపఁబెట్టేవు

చ. 3: చిత్తగించి కూడఁగదె శ్రీవేంకటేశునితోడ
గుత్తపు గుబ్బలనేల గూఁటఁబెట్టేవు
బత్తియెల్లాఁ జూపఁగదె పాదాలొత్తి యిట్టె నీవు
హత్తిన తమకమెంత అంగడివేసేవు

రేకు: 1934-5 హిందోళం సం: 29-143

పల్లవి: ఇటువలె నుండవద్దా యిరవైన మోహము
తటుకన నీమీఁది తగులెంతోకాని

చ. 1: సారిది నీమోము సారెఁ జూచియునుఁ దనియదు
తరుణి మాఁటలాడియుఁ దనియదు
సరసము లాడియాడి చాలునని తనియదు
అరుదైన మదిలోని యాస యంతోకాని

చ. 2: ననుపుసేసుక చెలి నవ్వియునుఁ దనియదు
తనువుసోఁకఁ బెనఁగి తనియదు
మునుకొని చేతులెత్తి మొక్కియునుఁ దనియదు
యెనసి నీపై వలపింకా నెంతోకాని

చ. 3: రమణఇ నీకాఁగిట రతిసేసి తనియదు
తమితో గుబ్బలనొత్తి తనియదు
జమళి శ్రీవేంకటేశ సన్నసేసి తనియదు
అమరిన సంతోసమది యెంతోకాని

రేకు: 1934-6 మంగళకౌసిక సం: 29-144

పల్లవి: ఒడఁబరచఁగనేల వొడివట్టి న న్నింతేసి
పుడివోని సంతోసాన నోలలాడే నిపుడు

చ. 1: చెంతఁగూచుండినయాపె చేయి చాఁచకుండునా
యెంతవడిదాఁకా మాఁట లేమి చెప్పీనే
వింతదానఃగాను తన వేడుక చెల్లించితే మేలు
చింతదీర మొక్కేను చేతులెత్తి నేను

చ. 2: పాదాలుగుద్దినయాపె పక్కఁ బండకుండునా
నాదెస చూచి యెంతనవ్వు నవ్వీనే
కాదనేనా నాకుఁ దనకరుణ గలిగితే మేలు
మోదముతో నింకాను మొక్కేనేఁ దనకు

చ. 3: యేకతమాడినయాపె యెంగిలి సేయకుండునా
చేకొని కూడి నన్నెంత చెక్కునొక్కీనే
యీకడ శ్రీవేంకటేశుఁ డెంత మన్నించినా మేలు
కైకొంటి ముమ్మాటికి గక్కన మొక్కేననరే

రేకు: 1935-1 వరాళి సం: 29-145

పల్లవి: వింటిమి కంటిమి తన వేడుకకారితనాలు
ఇంటిలోనఁ దన నేమా లెచ్చరించనేఁటికే

చ. 1: చుట్టమైనవాఁడు నాకు సొమ్ములందినట్టివాఁడు
అట్టె సుద్దు లేమిచెప్పీ నాడనే వుండి
బట్టబయలుగఁ దనభావము దెలుపుఁగాక
గుట్టుతోడ సిగ్గులెల్లాఁ గుప్ప సేయనేఁటికే

చ. 2: తలఁపెఱిఁగినవాఁడు దయగలిగినవాఁడు
వలపు లేమి చల్లీని వాకిటనుండి
తళుకొత్త నా మోము తప్పక చూచుఁగాక
మొలకనవ్వులు లోలో మోపుగట్టనేఁటికే

చ. 3: సేసవెట్టినట్టివాఁడు చెలిమిసేసినవాఁడు
బాసలేమి సేసీని పాన్పుపైనుండి
వాసితో శ్రీవేంకటాద్రివరుఁడు తా నన్నుఁ గూడె
వేసాలతననిజాలు వెదవెట్టనేఁటికే

రేకు: 1935-2 కాంబోది సం: 29-146

పల్లవి: తమకించి వట్టి జోలి దవ్వేవుగాక
జమళి నాతఁడు నాకే సతమైయున్నాఁడు

చ. 1: కొలువులోనుండి పతిఁ గూరిమి గొసరుకొంటా
కలికితనాల నెంత కరఁగించేవే
యెలయింపు సేఁతలు నీ వెంత పచరించినాను
చెలఁగి నీతో పొందులు సేయనిచ్చేనా

చ. 2: వీడెము పుక్కిటనించి వికవిక నవ్వుకొంటా
వాడికతనాల నెంత వలపించేవే
వేడుకతో నీవెంత వేళ గాచుకుండినాను
యీడు జోడై యతని నీయింటికి రానిచ్చేనా

చ. 3: అద్దపుఁజెక్కులు చూపి ఆసలు వుట్టించుకొంటా
సుద్దులెల్లాఁ జెప్పి యంత చొక్కించేవే
అద్దో శ్రీవేంకటేశుఁ డప్పుడే నా సొమ్మైనాఁడు
తిద్దుకొంటి యతని నీ దిక్కు చూడనిచ్చేనా

రేకు: 1935-3 దేశాక్షి సం: 29-147

పల్లవి: అలమేలుమంగవు నీ వాతనికి దేవులవు
వెలసి కూడితి విఁక వెరగందేవేమే

చ. 1: ననిచిన కాంతులకు నవ్వులు వేగమే వచ్చు
మనసులెనసినట్టి మగనితోను
చెనకితేఁ జాలును సిగ్గులు చాలా నిండు
వనితరో నీవేల వంచేవే శిరసు

చ. 2: తగులుగలవారికి తనువెల్లాఁ జెమరించు
జిగిమించ రమణుని చెంత నుండితే
మొగమెత్తి చూచితేను ముంచు మదనకళలు
వెగటుగాఁ దెర యేల వేసుకొనేవే

చ. 3: వావిగల సతులకు వలపులు గడు రేఁగు
శ్రీవేంకటేశుఁడైన చెలువునొద్ద
చేవదేరఁ బెనఁగితే చిన్నలెల్లాఁ గానవచ్చు
కావరానఁ బయ్యెదేల కప్పుకోనేలే

రేకు: 1935-4 రామక్రియ సం: 29-148

పల్లవి: అలమేల్మంగనే నేను ఆకె నెటువంటదో
యెలుఁగెత్తి చెప్పవయ్యా యియ్యకొనే నేను

చ. 1: మంతనము లాడెనట మగువ యెవ్వతొ నీతో
చెంతనుండి సన్నలూనుఁ జేసెనట
యింతులెల్లాఁ జెప్పుకొనే రీ సుద్దలే వాడలోన
యెంతటిదో చూపవయ్య యెరిఁగేను నేను

చ. 2: చెట్టవట్టి తీసెనంట చెలి నీ చెక్కులు నొక్కి
గుట్టుతోడ నిన్ను వేఁడుకొనియనట
బట్టబయలాయను యీ పనులెల్లా నూరిలోను
అట్టిదానిఁ జూపవయ్య అడిగేను నేను

చ. 3: గంటిసేసెనట మోవి కాఁగిలించుకొని నిన్ను
వొంటిదే నీ పాదాలు నొత్తెనట
నంటున శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలితివి
దంటదానిఁ జూపవయ్య తగమెచ్చే నేను

రేకు: 1935-5 గౌళ సం: 29-149

పల్లవి: కాంతపై మిక్కిలి బత్తిగలిగిన చెలులాల
పొంత నీపె వేడుకలు పొసఁగఁగజేయరే

చ. 1: వనములో కోవిలల వట్టి రట్టు సేయనేల
పెనఁగి తుమ్మిదల కోపించఁగనేల
పనివడి చందురునిపై నేరమెంచనేల
వినయాన విభునికే విన్నపము సేయరే

చ. 2: గూటిలోని చిలుకలఁ గొసరి జంకించనేల
నీటునఁ జల్లగాలిని నిందించనేల
పాటించి వసంతునితో పంతాలు దూయనేల
మాటలాడి విభుని నెమ్మదిని రప్పించరే

చ. 3: పంచనున్న పావురాల బదరి తిట్టఁగనేల
పంచసాయకుని నొడఁబరచనేల
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిదె వచ్చి యింతిఁ గూడె
మంచివాయఁ బనులెల్లా మనవులు చెప్పరే

రేకు: 1935-6 నాగవరాళి సం: 29-150

పల్లవి: చెలులాల యాతనిచిత్త మిఁక నెట్టున్నదో
తెలియఁజెప్పరే నా తెరఁగెల్లా మీరు

చ. 1: చెలఁగి మాఁటాడితేను సిగ్గులు మోమున నిండీ
అలరి చూచేనంటే నాసలు రేఁగీ
తలఁచితే వేడుకతో తనువెల్లాఁ బులకించీ
యెలమి నా ముచ్చటలు యేమని చెప్పుదునే

చ. 2: చనుఁగవ నొత్తితేను సంతోసము లుప్పతిలీ
పెనఁగితేఁ దమకము పెచ్చువెరిఁగీ
తనతోనే నవ్వితేను తరితీపు లెచ్చీని
తనివోని నావలపు దాఁచ నెట్టువచ్చునే

చ. 3: కాయము సోఁకించితే గక్కనఁ గళలంటీని
చేయి చాఁచి చెనకితే చెమరించీని
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
చాయల నీకోరికలు సరుగ నీడేరెనే

రేకు: 1936-1 ఆహిరి సం: 29-151

పల్లవి: ఎన్నెని చెప్పేమయా నీ యింతి సుద్దులు
చెన్నగు నీగుణాలెల్లఁ జెప్పుకొంటానున్నది

చ. 1: యెచ్చిన కోరికతోడ యెప్పుడు వత్తువోయంటా
కచ్చుపెట్టుకొని యాపె గాచుకున్నది
తచ్చి తచ్చి నీ పొందులే తలపోసుకొంటాను
ముచ్చటతో దేవరకే మొక్కుకొంటా నున్నది

చ. 2: మాఁగిన మోవి చూపి నీమతి గరఁగించేనంటా
కాఁగిటికి కంకణము గట్టుకున్నది
తోఁగుఁజెమటతో నిన్నుఁ దోడితెమ్మని చన్నుల –
వేఁగుతో నీ నెచ్చెలుల వేఁడుకొంటామన్నది

చ. 3: తేఁకువతో నిన్ను రతిఁ దెప్పలఁదేలించుదాఁకా
యేఁకటతో వయసు మీదెత్తుకున్నది
వీఁకతో నీ వేలఁగా శ్రీవేంకటేశ నీ గురుతు
వాఁకముగా నీ రూపే వాసుకొంటానున్నది

రేకు: 1936-2 పాడి సం: 29-152

పల్లవి: మఱి నేను వేడుకతో మాఁటలెల్లా నాడేఁగాని
యెఱుకగా నీ విప్పుడే యెఱిఁగించిరావే

చ. 1: బత్తి నాపైఁ గలఁదో పరాకై తా నున్నాఁడో
చిత్తము దెలిసిరావే చెలియా
హత్తిన చుట్టరికము లన్నియును విన్నవించి
కొత్తఁగా వలపు తలకొనఁజేసి రావే

చ. 2: యెడయ కిందు వచ్చీనో యేమని యానతిచ్చీనో
అడియాల మిటు దేవే అతివ
వొడఁబాటులన్నియును వొద్దికతో నెచ్చరించి
వుడివోని తరితీపు లొనగూర్చి రావే

చ. 3: చేరి వాకిట నున్నాఁడో సింగారించుకొనీనో
నేరుపుతో దోడితేవే నెలఁత
యీరీతి శ్రీవేంకటేశుఁ డిదిగో నన్ను నేలె
గారవాన నిన్నీ దారుకాణింతు రావే

రేకు: 1936-3 దేసాళం సం: 29-153

పల్లవి: ఎంతని పొగడేమమ్మా యిటువంటి సొబగులు
యింతులలో నెంచిచూడ నీపెకే తగును

చ. 1: చన్ను లెంత గనమే జవరాలికి । యీ –
కన్నులతీరు చూడరే కాంతలాల
పున్నమచంద్రుఁడుగదె పొలఁతి మోము
యిన్నేసి సింగారాలు యీపెకే తగునే

చ. 2: తురు మెంత వొప్పిదమే తొయ్యలికిని । తన –
కరముల చెలువము గంటిరటరే
మరునివిండ్లేకదే మంచి బొమలు
ఇరవైన చక్కఁదనా లాపెకే తగునే

చ. 3: నడు మెంత వొరపే నలినాక్షికి । చిన్ని –
యడుగుల చిగురుల యందమేకదే
అడరి శ్రీవేంకటేశు నలమేల్మంగ । యీ –
యెడయని ముచిపెము లీపెకే తగునే

రేకు: 1936-4 గౌళ సం: 29-154

పల్లవి: వీఁడివో నారమణుఁడు వింటాఁ దానున్నవాఁడు
పోఁడిమితోఁ జెలి నీవు పొంచి యెచ్చరించవే

చ. 1: యెంచుకొంటే తన బత్తి యెంతైనా నాకుఁ గలదు
వంచెనతో మొక్కే మఱవకు మనవే
యించుకంత దడవైనా యెడయఁడు నన్నుఁ బాసి
మంచిదాయ యీమేలు మనసులోఁ బాయదే

చ. 2: చూచుకొంటే తా నిచ్చిన సొమ్ములు నా మేన నివె
వేచందాలాఁ బొగడేను వినమనవే
కాచుకొని నాతోనే కాఁపురముసేసీఁ దాను
యీచేఁతలకేకదే ఇంత వలచితిని

చ. 3: చెప్పుకొంటేఁ దనపొందు సీమలో గంపలకొద్ది
యెప్పుడూ నీ చనవు నా కిచ్చెననవే
వొప్పుగా శ్రీవేంకటేశుఁ డొద్దిక నన్నేలెఁ దాను
తప్పకుండా నీసుద్దులే తలఁపొను నాకును

రేకు:	1936-5 బౌళి	సం:	29-155

పల్లవి:	ఎన్నఁడు నేరిచెనో యింతేసి దంటతనాలు
కన్నులపండువుగాను కంటి మీకె చేఁతలు

చ. 1:	సేసవెట్టి పెండ్లాడిన చెలి నీవద్ద నుండఁగా
ఆస లేమి చూపీనే ఆకె నీకును
వాసివంతులెంచుకోదు వల పారడిఁబెట్టుక
వేసాలెల్లాఁ జేయఁగాను వెరగాయ నాకు

చ. 2:	కాఁపురము సేసీ ఇంతి కదిసి సేవసేయఁగా
ఆడలేక మాటలాడీ నప్పటిఁ దాను
యీపె తగ వెఱఁగక యెమ్మెలఁ బొరలుకొంటా
పూఁపనవ్వులు నవ్వీని పొద్దువోదోకాని

చ. 3:	పట్టపు టలమేల్మంగ పాదాలు నీ కొత్తఁగాను
యెట్టు నీతోఁ బొందుసేసీ నెంత చుట్టమో
యిట్టె శ్రీవేంకటేశ ఇందరి నీ వేలితివి
చుట్టి నిన్నుఁ గాఁగిలించీ చూడు మెంతసోద్యము

రేకు: 1936-6 లలిత సం: 29-156

పల్లవి: నీకును నాపెకుఁ దగు నేము విన్నవించేదేమీ
జోకతోడ నీకె మోము చూచి నవ్వవయ్యా

చ. 1: మనసు లెనసినట్టి మాఁట లెవ్వరికైనాను
విన వేడుకేకాని వెగటుగాదు
వనిత నిన్నేమనినా వక్కణ లడుగవద్దు
చనవిచ్చి మెచ్చి మెచ్చి సంతోసించవయ్యా

చ. 2: చెల్లుబడియైనట్టి మాఁట లెవ్వరికైనాను
యెల్లవారి కింపేకాని యెరపు కాదు
వొల్లనే గోరనొత్తితే నొడ్డుకో నంతేసి
చెల్లుబడి సేసుకొని చెక్కునొక్కవయ్యా

చ 3: పొందుగలిగినచోట పూఁచి యెంత పెనఁగినా
అందమయ్యే తోఁచుఁగాని అలపుగాదు
చెందె నలమేల్మంగ శ్రీవేంకటేశ నిన్ను
కందువగా మోని యిచ్చి కడు మన్నించవయ్యా

రేకు: 1937-1 సామంతం సం: 29-157

పల్లవి: ఇదిగో విన్నవించితి మింతిలాగులు
అదనెరఁగి తలఁచి అలపార్చుకొనెను

చ. 1: వొట్టిన నీపై విరహ మోరుచుకోలేక యింతి
గుట్టుతో జూజాలాడెఁ గొంతసేపు
అట్టె తన తమకము ఆఁపలేక ఇందాఁకా
దట్టమైన వనములోఁ దాపమార్చుకొనెను

చ. 2: కమ్మి నీవు వచ్చేయాస గాలము గడపరాక
నెమ్మదిఁ గొంతవడి కిన్నెర మీటెను
కొమ్మల విన్నపా లియ్యకొనుదాఁకా వేగిరించి
తమ్మికొలఁకుల నీఁది దప్పి దేర్చుకొనెను

చ. 3: భావములో నీ రూపు పట్టి పెనఁగఁగరాక
చేవమీర నేదురుచూచె గొంతవొద్దు
శ్రీవేంకటేశ నీవు చెందగా నలమేల్మంగ
సేవసేసి పాన్పుపై సేద దేర్చుకొనెను

రేకు: 1937-2 బౌళి సం: 29-158

పల్లవి: ఎంతగద్దో నీ యాసోద మింకాఁ జూతము కాని
చెంత నాతఁ డెప్పుడూ నాచేతిలోనివాఁడు

చ. 1: చనవునఁ బతితోను సరసము లాడేవు
మనవులు చెప్పేవు మాపురాఁకాను
పనివూని ఇంతటికిఁ బరవంజుకొంటివి
తనివోని వలపులు తవ్వి పోసుకోవే

చ. 2: సారె సారె నవ్వుకొంటా సంగడిఁ గూచుండేవు
పారుపత్యాలు సేసేవు పతిమారుగా
వూరఁగల దొరతనా లొడిలఁగట్టుకొంటివి
పారితెంచి పగటులు బండిఁబెట్టుకోవే

చ. 3: వుక్కుమీరి సేయరాని వూడిగాలు సేసేవు
కక్కసించి గుబ్బలను కడు నూఁదేవు
యిక్కడ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
తక్కక నీ కోరికలు తలకెత్తుకోవే

రేకు: 1937-3 సామవరాళి సం: 29-159

పల్లవి: తలఁపులుఁ దలఁపులు తారుకాణలాయ నేఁడు
పలుమారు రతుల తెప్పలఁ దేలవమ్మా

చ. 1: సన్నసేసీ రమణుని సంగడిఁ గూచుండవమ్మా
కన్నులకలికి వో కప్పురగంది
చిన్నిమోవిఁ దేనెలూరఁ జేరి మాటలాడవమ్మా
చెన్నుమీర నిట్టె వో చిలుకలకొలికి

చ. 2: పక్కన నాతఁడు నవ్వీ భావించి చూడవమ్మా
చక్కని చంద్రవదన జవ్వాదివంకి
తక్కక నీకాఁగిటికిఁ దమకించి యున్నవాఁడు
పక్కఁ బండఁగదవమ్మా బంగారుబొమ్మా

చ. 3: చెలరేఁగి యాదరించీఁ జెలువునిఁ జూడవమ్మా
పులుపుమట్టెలరాణి కోకిలవాణి
యెలమి శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నిన్నుఁ గూడె
తలఁపు లీడేరెనమ్మా తలిరుఁబోఁడి

రేకు: 1937-4 దేశాక్షి సం: 29-160

పల్లవి: చెలి యన్నింటికి నీకుఁ జేతులెత్తి మొక్కీ నిదె
లలి నీపెఁ గాఁగిలించి లాలించవయ్యా

చ. 1: అలసి సొలసి నిన్ను నంగనలు జంకింతురు
వలపులు పైఁజల్లి వంచుకొందురు
గిలిగింతరతులను కెరలి పైకొందురు
వులివచ్చి సరసాల వోరుచుకోయ్యా

చ. 2: కూరిమి గొసరి నిన్ను కొనగోర నూఁదుదురు
సారె సారెఁ బంతముతో సాదింతురు
దూరుదురు కేరుదురు తొడమీఁద నెక్కుదురు
వూరక వాడికబీరా లోరుచుకొవయ్యా

చ. 3: కుమ్మెలుగాఁ గాఁగిలించి గుబ్బల నిన్నొత్తుదురు
కమ్ముకొని కెమ్మోని గంటిసేతురు
నెమ్మది శ్రీవేంకటేశ నీ వీకెఁ గూడితివి
వుమ్మగిలుఁ జేత లివి వోరుచుకోవయ్యా

రేకు: 1937-5 నారాయణి సం: 29-161

పల్లవి: ఇందాఁకా రతికేలికి నెదురులు చూచితివి
పొందు లొనగూడెఁగదె పూఁచినట్టు నీకు

చ. 1: మంతనాన నాతనితో మాఁటలెల్లా నాడితివి
సంతోసమాయఁగదవే సకియ నీకు
చెంతనుండి చేతులారా సేవలెల్లాఁ జేసితివి
పంతములు చెల్లెఁగదె పడఁతులలోనను

చ. 2: తిలకిం చాతనితోడఁ దేరకొన నవ్వితివి
తలఁపు లీడేరెఁగదె తరుణి నీకు
వలపించి యిట్టె కైవసము సేసుకొంటివి
వోలసెఁగదవే నీవేడుక లన్నియును

చ. 3: రాఁపుగ శ్రీవేంకటేశరతులెల్లాఁ జేకొంటివి
కాఁపురము దక్కెఁగదె కలికి నీవు
యేపున నోలలాడితి వెనసి కాఁగిటిలోన
నీ పగటు మించెఁగదె నేఁ డితని యెదుట

రేకు: 1937-6 భైరవి సం: 29-162

పల్లవి: ఇంకానేల యెడమాఁట లింతితోడను
లంకెలాయ నిద్దరికి లాలించవయ్యా

చ. 1: మొక్కలాన నీసుద్దులు మునుపనె వినెఁ జెలి
చక్కఁగా నీతోనాడఁజాలదుగాని
అక్కర నీమతకము లడచుకొన్నది యింత
చెక్కు నొక్కి వేఁడుకొంటేఁ జెప్పి వినవయ్యా

చ. 2: అగడైన నీ చేఁత లన్నియు నెరుఁగుఁ జెలి
తగవు దలఁచి లోలో దాఁచీఁగాని
మొగమోటమున నీకు మొక్కుచుఁ గొంకీఁగాని
జిగిమించ వేఁడుకొంటేఁ జెప్పి వినవయ్యా

చ. 3: మచ్చికైన నీ గుణాలు మరిగివున్నది చెలి
యెచ్చరించలేక కానుకిచ్చీఁ గాని
యిచ్చట శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
చెచ్చెర వేఁడుకొంటేను చెప్పి వినయయ్యా

రేకు: 1938-1 రామక్రియ సం: 29-163

పల్లవి: చిన్నదాన నంటాను సిగ్గు అంతేసేఁటికి
పన్నుక నీ విలాసాలు పచారించవే

చ. 1: చెలియ నీ మాఁటలకుఁ జెవి యొగ్గీ నాతఁడు
వెలయ నీ మనవులు విన్నవించవే
పలచని కెమ్మోవికి బాఁతిపడీ నాతఁడు
సొలయుచు నిట్టె చవి చూపఁగదవే

చ. 2: తక్కక నీ మోము చూడఁ దమకించీ నాతఁడు
నెక్కొని యెట్టనెదుట నిలుచుండవే
వెక్కసపుఁ జన్ను లంటి వేగిరించీ నాతఁడు
గుక్కక మిక్కక దండఁ గూచుండఁగదవే

చ. 3: కచ్చుక నీ పొందులకు గాచుకున్నాఁ డాతఁడు
యిచ్చగించి కాఁగిటికి నియ్యకొనవే
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేలె
మెచ్చి మెచ్చి పొగడుతా మేలమాడఁగదవే

రేకు: 1938-2 మాళవిగౌళ సం: 29-164

పల్లవి: ఇన్నాళ్ళు నెఱఁగము నిటువంటివి
సన్న నిట్టె జరగునో సారె మీ ఇద్దరికి

చ. 1: పొలసి పొలసి యేమీ పొదిగేని యాపె నిన్ను
పిలిపించితివో నీవు ప్రియముతోడ
మొలక నవ్వులతో నీమొగము దప్పకచూచి
కలవో వొడఁబాట్లు కడు మీ యిద్దరికి

చ. 2: చేరి చేరి వూడిగాలు సేయఁగవచ్చీ నీకు
కారణమేమైనాఁ గద్దో కాఁగిటికిని
నేరుపుతో సలిగెలు నెరపీ నీముందరను
యీరీతి వేడకాయనో యిట్టె మీ ఇద్దరికి

చ. 3: పెనఁగి పెనఁగి యాపె బెరసి నవ్వీ నీతో
చనవు నీ వొసఁగినచందమో యిది
యెనసితి శ్రీవేంకటేశ యింతిలో నన్ను
మనసు లొక్కటాయనో మరి మీ యిద్దరికి

రేకు: 1938-3 కేదారగౌళ సం: 29-165

పల్లవి: ఎటువంటి వేడుకలో యివి మీకే తెలుసును
చిటిపొటి మీ సుద్దులు చెప్పుకొనే మిపుడు

చ. 1: తరుణితో నేమంటివో తలఁచుక తలఁచుక
శిరసు వంచుక నవ్వు సెలవులను
నిరతపుభోగముల నేరు పెటువంటిదో
గరిమతోడుత మోము కళదేరుచుండును

చ. 2: చేరి సరమాడుతా చేఁత లేమి సేసితివో
వూరకె సిగ్గులతోడ నుమ్మగిలును
గారవించి మనసెంత కరఁగఁజేసితివో
కూరిమితో సంతోసించుకొని చెలరేఁగును

చ. 3: యెనసి కాఁగిటిలోన నెంత మెప్పించితివో
గొనకొని విన్నప్పుడూఁ గొనియాడును
చనవిచ్చి యేలితివి చందాన శ్రీవేంకటేశ
తనిసి నీ మన్ననల దా నిట్లా నుండును

రేకు: 1938-4 ఆహిరి సం: 29-166

పల్లవి: ఇదిగో యలమేల్మంగ యింత బత్తి నీమీఁద
పాదిగొన్న నీకు వలపులు గుమ్మరించీని

చ. 1: పడఁతి నీ గుణాలకు పలుమారు మెచ్చిమెచ్చి
వుడివోని సంతోసాన నోలలాడీని
కడు నీ చక్కఁదనాలు కాంతలతోఁ జెప్పి చెప్పి
వెడఁగుఁ బులకలతో విఱ్ఱవీఁగీని

చ. 2: నేరుపుల మీచేఁతలు నెమ్మదిఁ జూచి చూచి
కోరికలు కొనసాగ గుబ్బతిలీని
కూరిమితోడుత నీ కొలువులు సేసి చేసి
చేరి నీతో వేడుకలఁ జెలరేఁగీని

చ. 3: సేసవెట్టీ నీపై నిదె సెలవుల నవ్వి నవ్వి
ఆసలఁ గాఁగిట నిన్ను నప్పళించీన
రాసికెక్క నీ వేలఁగా రతుల శ్రీవేంకటేశ
పోసరించి యన్నిటాను భోగించీని

రేకు: 1938-5 కాంబోది సం: 29-167

పల్లవి: అట్టె నిన్నుఁ జూచి చూచి అరుదందేరు చెలులు
నెట్టన నీ యెమ్మెలెల్లా నెరపేవు నీవు

చ. 1: మొక్కలపుఁ జేఁతలును మొసగస మాఁటలును
యెక్కడ నేరిచితివే యింతేసి నీవు
చెక్కునఁ బెట్టిన చేయి సెలవుల నవ్వులను
గక్కన నప్పటి నెందు గడియించుకొంటివే

చ. 2: నిడువాలుఁ జూపులును నిక్కుబొమ్మ జంకెనలు
గుడిగొన నెందు దెచ్చుకొంటివే నీవు
వెడజారఁబయ్యెదయు వీడియు వీడని కొప్పు
అడియాలా లన్నియును నమరెనే నీకు

చ. 3: వుప్పతిలు రాజసాలు వులివచ్చి సిగ్గులను
యిప్పుడెందుఁ జదివితి వింతేసి నీవు
అప్పుడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
నెప్పున నన్నేల మరి నీ వెన్నటిదానవే

రేకు: 1938-6 దేసాళం సం: 29-168

పల్లవి: ఎన్నటి చుట్టరికమో యీపెకు నీకు
నన్ను నేలితి విపుడు నమ్మించి యిన్నిటాను

చ. 1: చెనకి చెనకి నీతో చిరునవ్వు నవ్వుకొంటా
మనవు లెంత చెప్పీని మగువ
గునిసి గునిసి సిగ్గు కుప్పలు వోసుకొంటా
పెనఁగులాడె నప్పటి పెక్కు చందములను

చ. 2: జరసి జరసి మోవి చవులు వుట్టించుకొంటా
మరగులేల పెట్టీని మాఁటలలోన
కరఁగి కరఁగి బత్తి కానుకలు వట్టుకొంటా
గురుతులెట్టు చూపీని గుబ్బలపై నీకు

చ. 3: తగిలి తగిలి మొక్కి తమకము రేఁచుకొంటా
మొగమేమి చూపీ నీముందరనుండి
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశ యేలితి –
విగురుఁబోఁడి నీ కీపె నిల్లాలయి వున్నది

రేకు: 1939-1 కాంబోది సం: 29-169

పల్లవి: ఎన్నఁడు నెఱఁగమమ్మా ఇటువంటిది
సన్నపుఁ బులకలెల్లా జాజుకొనెనే

చ. 1: వుప్పతిల్లు వేడుకతో వొద్దఁ గూచుండి యీతఁడు
చెప్పరానిమాఁటలాడీఁ జెవిలోనను
చిప్పిలి మనసు చొక్కి చెమరించె మేనెల్లా
ఇప్పు డిదివో చెలియా ఇది యేటిదే

చ. 2: ఆయములు సోఁకించి యట్టె పచ్చడము గప్పి
సేయరాని చేఁత సేసె చేతులు చాఁచి
పాయపు మదము రేఁగి పక్కనఁ గుచ్చెల జారె
యేయెడఁ గన్నది గాదు యెట్టి కొత్తలే

చ. 3: వువ్విళ్ళూరఁ బెనఁగుతా నుద్దండానఁ బానుపుపై
నవ్వరాని నవ్వు నవ్వీ నాతోడను
చివ్వన నలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు నన్ను
యివ్వల మన్నించి యేలె యిఁక నే నేమందునే

రేకు: 1939-2 ముఖారి సం: 29-170

పల్లవి: ఇన్ని గురుతులు నీతో నీకె విన్నవించుమనె
పున్న దిదె తెరలోన నొద్దికాయఁ బనులు

చ. 1: వనితతో నీ వేమో వావులు చెప్పితివట
చెనకుతా నేమేమో సేసితివట
వొనరఁగ నీ వేలివంగర మిచ్చితివట
యెనసెఁ జుట్టరికము లింటికి రమ్మనెను

చ. 2: సముఖాన నుండఁగానే సన్నలు సేసితివట
చెమటలు కొనగోరఁ జిమ్మితివట
తమకించి కుచములు తప్పక చూచితివట
అమరు నన్నిటా సమ్మతాయను రమ్మనెను

చ. 3: వేడుకతోఁ జెలులచే వీడె మిప్పించితివట
జోడుగాఁ బెనఁగులాడి చొక్కితివట
యీడకు వచ్చి శ్రీవేంకటేశ యలమేల్మంగను
కూడితివట దినము గొంకక రమ్మనెను

రేకు: 1939-3 కన్నడగౌళ సం: 29-171

పల్లవి: తారుకాణ వచ్చెనా తలఁచుకో నామాఁట
గారాబు టలమేల్మంగ కాఁగిటిలోవాఁడవు

చ. 1: అప్పుడే చెప్పితిఁగా నీ వాపె మోము చూచితేనే
దెప్పరపు వలపుల దేలించునని
ముప్పిరి నది యంతటి మొగమాయ మందులాఁడి
విప్పుచు నీతో విన్నవించరాదుగాక

చ. 2: పందెము వేసితిఁగా యేపాటిమాఁట నీ వాడినా
యిందుముఖి నిన్ను బయలీఁదించునని
యిందరిలో తొల్లె యది యెంత యెలయింపులాఁడి
చెంది యివి వెల్లవిరి సేయరాదుగాక

చ. 3: సాకిరి వెట్టితిఁగా యచ్చట నవ్వితేఁ దాను
చేకొని శ్రీవేంకటేశ చెనకునని
యీాకడ నన్నేలితి విది యెంత చేఁతలాఁడి
జోకతోడది నీగుట్టు చూపరాదుగాక

రేకు: 1939-4 సాళంగనాట సం: 29-172

పల్లవి: మందెమేళా లమరునా మగువలకుఁ బతితో
పొందులు మన కెప్పుడూఁ బొసఁగునేగాక

చ. 1: వినయముతో మొక్కి వేఁడుకొనఁగలఁగాక
చనవిచ్చితి వంటాను సాదించేనా
మనసారా నన్ను నేల మన్నించినవాఁడవు
వొసరి నాతలఁపులో నుండేవుగాక

చ. 2: ఇచ్చకములాడి నిన్ను నెనయఁగఁగలఁగాక
పచ్చిసేసి నీతోను పంతమాడేనా
అచ్చపు వేడుకతో నే నాలనైతి నీకుఁ దొల్లె
నిచ్చ నాపై నీకరుణ నేరపేవుగాక

చ. 3: సేవసేసి మెప్పించి చెనకఁగఁగలఁగాక
కావరించి పెనఁగుతా గద్దించేనా
యీావల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
తావుకొనఁ గూడితివి తగు లీడేరీఁగాక

రేకు: 1939-5 హిజ్జిజి సం: 29-173

పల్లవి: ఎంత బాఁతేయనో నీకు యీపెతోడి పొందులు
చెంతనున్న వారికెల్లాఁ జెప్పఁ గొత్తలాయను

చ. 1: వెక్కసపు మాఁటలాడి వేడుకలు వెడరేఁచి
చెక్కు నొక్కి వేఁడుకొని చెలియ నిన్ను
వొక్కటనే కూడపోసె నుందండాలు వినయాలు
తక్కరితనా లివెల్లా తనకే తగును

చ. 2: గోరికొన నిన్ను నూఁది గుట్టున నప్పటి నీకు
సారెకు మోవితేనెలు చవి చూపీని
కూరిమితో దండ గుచ్చి కుచ్చితము మచ్చికయు
దారకపుచేఁత లివి తనకే తగును

చ. 3: బొమ్మలను జంకించి పొంచి కాఁగిటనుఁ గూడి
చిమ్ముచు నలమేల్మంగ శ్రీవేంకటేశ
సమ్మతుల జంటసేసి చలములు సరసాలు
తమ్మికంటి యీచందము తనకే తగును

రేకు:	1939-6 ఆహిరి	సం:	29-174
పల్లవి:	సరసుఁడ వన్నిటాను జాణవు నీవు
యిరవుగా మా సంతోస మీడేరించవయ్యా
చ. 1:	నెట్టనఁ జెలి వలపు నీకు విన్నవించితి
యెట్టున్నదో నీ చిత్త మెరఁగ నేను
మట్టుమీరి నీ విచ్చినమాఁటపట్టు దలఁచుకో
పొట్టఁ బొరుగువారెల్లాఁ బొగడేరుగాని
చ. 2:	సరుగనఁ జెలిమారు సాగిలి నీకు మొక్కితి
కరుణించే దేవుడో కనే నిఁకను
మరిగించితి వీకెపై మన్ననలు మరవకు
నిరతపు నీ కీరీతి నిండె దిక్కులను
చ. 3:	అలమేలుమంగకాను కదివో నీ కొసఁగితి
మెలఁగి నీ గుణాలకు మెచ్చే నేను
యెలమి శ్రీవేంకటేశ యీకూట మిట్టె నెరపు
కలకాల మిద్దరికిఁ గలిగే వేడుకలు

రేకు: 1940-1 దేసాళం సం: 29-175

పల్లవి: అన్నిటా దొరవయితే నౌదువుగాని
విన్నవించితి నిప్పుడే వెలఁది చందములు

చ. 1: సిగ్గరిపెండ్లికూఁతురు సేసవెట్టీ నిదె నీకు
వొగ్గి తలవంచవయ్యా వొద్దికతోను
కగ్గులేక యప్పటి నీకాలు దొక్కీ వేడుకతో
యెగ్గులు వట్టేవుసుమ్మీ యిందుకుఁగాను

చ. 2: కలికి నీ మరఁదలు కంకణము గట్టీ నీకు
లలిఁ జేయి చాఁచవయ్యా లాలనతోను
యెలయించి సన్నలనే యెంగిలిమోవి చూపీని
మలసి దూరేవుసుమ్మీ మన్నింతువు గాని

చ. 3: దేవు లలమేలుమంగ తెరదీసి చెనకీని
సేవ సేయించుకోవయ్యా శ్రీవేంకటేశ
వోవరిలోనికి దీసి వురమెక్కీ నింతలోనె
యేవేళా దించేవుసుమ్మీ యిట్టె వుందువుగాని

రేకు: 1940-2 రామక్రియ సం: 29-176

పల్లవి: రట్టడి మగవాఁడవు రమణి యీకె
దిట్టతనమున నీతో దీకొనఁగనోపునా

చ. 1: సిగ్గుతోనున్న చెలిపై జేయిచాఁచి పెనఁగేవు
వొగ్గి నీతో సాము సేయనోపునా యీకె
అగ్గమై మోనాననున్న యాపెనేల రేఁచేవు
దిగ్గన ని న్నింతేసి సాదించనోపునా

చ. 2: కొలువులోనున్నదాని గోర నూఁది చెనకేవు
కెలసి నిన్నిందుకు జంకించనోపునా
నిలుచున్నాపెను ముట్టి నీ వేల గిలిగించేవు
నలుగడరా నీతో నవ్వనోపునా

చ. 3: గుట్టుతో డలమేల్మంగ గుబ్బలేల పిసికేవు
అట్టె శ్రీవేంకటేశ నిన్ననోపునా
నెట్టుకొన గూడితివి నీ వీకె నేల మీరేవు
చుట్టరిక మీడేరె సొలయఁగనోపునా

రేకు: 1940-3 కాంబోది సం: 29-177

పల్లవి: అడుగరే యక్కలాల ఆతని మీరందరును
యెడయక నన్నుఁ గావ నిదేవేళ యనవే

చ. 1: సన్నల నే కొసరితి సరసము లాడితి
విన్నపాలెల్లాఁ జేసితి వేడుకొంటిని
తన్ను దూరరాదు నాకు దయగలవాఁడు తాను
యెన్నిటఁ గరఁగునే యిఁకఁ దనమనసు

చ. 2: చెలులచేఁ జెప్పించితి చేతులెత్తి మొక్కితి
తెలియఁజెప్పితి వావి తెలదీసితి
యెలమి నే వలచితి యింగిత మెఱుఁగు తాను
మలసి తా నెప్పుడిఁక మన్నించీనే నన్నును

చ. 3: నగితిఁ దనతో నేను నమ్మిక లిప్పించుకొంటి
తగిలి కాఁగిలించితి తమిరేఁచితి
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు తాను
తగవుతో నన్ను నేలె తా నిఁక నేమనీనే

రేకు: 1940-4 ఆహిరి సం: 29-178

పల్లవి: చెలియ నా విన్నపాలు చిత్తానఁ బెట్టుమనవే
మలసి న న్నేకాలమూ మన్నించుమనవే

చ. 1: యిచ్చక మాడుదుఁగాని యేమిటా వెంగెములాడ
కొచ్చి కొసరుదుఁగాని కోపగించను
పచ్చిగి నవ్వుదుఁగాని పంతములు నెరపను
తచ్చి తచ్చి నా గుణాలు తా నెరుఁగుననవే

చ. 2: వాడిక చూపుదుఁగాని వాసి వంతు లెంచను
వేడుకలు వెంతుఁగాని వేసారను
వూడిగాలు సేతుఁగాని వుదుటున జంకించను
యీడు జోడైన నా బత్తి యెంచిచూడుమనవే

చ. 3: చేరి కాఁగిలింతుఁగాని సిగ్గులు మరఁగుసేయ
గారవింతుఁగాని మరి గయ్యాళించను
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తారుకాణగా నన్నేలె తలఁచుకొమ్మనవే

రేకు: 1940-5 పాడి సం: 29-179

పల్లవి: నిన్నుఁ బాయఁగలఁడటే నిమిషమైనా నీతఁడు
వున్నతి నీ కతలనే వోలలాడు నీతఁడు

చ. 1: తాపపు విరహమేలే తలవంచుకొననేలే
నీపై బత్తిఁగలఁడు నీమగఁడు
మాపు దాఁకా చింతలేలే మమ్ము నింతడుగనేలే
యేపొద్దు నీ గుణములే యెంచుకొను నీతఁడు

చ. 2: లేకలు వాయించనేలే లేమల నంపఁగనేలే
వాకిటికి నింతలోనే వచ్చె నీతఁడు
జోకతో సగినాలేలే చూచి తమకించనేలే
నీకుఁగానే యాకారు నిచ్చ నిచ్చొ నీతఁడు

చ. 3: చెక్కిటిచే యిఁకనేలే సిగ్గులు వడఁగనేలే
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డేలె నిన్నును
మొక్కులు మొక్కఁగనేలే ముసిముసినవ్వులేలే
మక్కువ నీ రతులే మరిగినాఁ డీతఁడు

రేకు: 1940-6 లలిత సం: 29-180

పల్లవి: తనంటిదాననా తరుణి నింతే నేను
పనివూని నాతో నేల పంతములాడీనే

చ. 1: చిగురువంటిది మోవి చెప్పి చూపె నంటిమా
నగవు వెన్నెలలోని నాముువంటిది
మొగులువంటిది కొప్పు ముడుచుకున్నారము
జిగిమించి మమ్ము నేల చెనకీనే తాను

చ. 2: తలపోయ మా మొగము తామరపూవువంటిది
బలుచన్ను లివి నిమ్మపండ్లవంటివి
తొలుతనే యివె మా చేతులు తీఁగెలవంటివి
చలముల మాతో నేల సాములు సేసీనే

చ. 3: రయమున మా తొడ లరఁటి కంభాలవంటివి
బయలువంటిదివో చెప్పఁగ నడుము
నియతాన మన్నించి నేఁడు శ్రీవేంకటేశుఁడు
దయతో నన్నేలె నేల తమకించీనే

రేకు: 1941-1 ఆహిరి సం: 29-181

పల్లవి: లలితాంగి నింతటను లాలించవయ్యా
నెలకొన్న నీ మోవి తేనెలకు నోరూరీని

చ. 1: తరుణి నీ మోము చూచి తలవంచి సిగ్గువడి
మరిగి తలఁచీ నిన్ను మనసులోనె
వరుస నీతో నవ్వి వలపుల సుడిగొని
నిరతితోఁ దమకించి నివ్వెరగందీని

చ. 2: అట్టె నీతో మాఁటలాడి ఆసలాసలనుఁ జొక్కి
గుట్టునఁ గోరికలతో గుబ్బతిలీని
యెట్టనెదుటనే వుండి యేఁకటలకుఁ దగులె
చుట్టి చుట్టి తనుఁదానె సోద్యమందీని

చ. 3: అలరి వద్దఁగూచుండి ఆయములెల్లాఁ గరఁగి
చెలరేఁగి కాఁగిటికిఁ జేయి చాఁచీని
యెలమి శ్రీవేంకటేశ యీరీతులు నీదేవులు
వెలయ నిన్నుఁ బెండ్లాడి వేడుకతో మించీని

రేకు: 1941-2 శుద్ధవసంతం సం: 29-182

పల్లవి: అక్కచెల్లెండ్లము నేము ఆకె నాకు వింతగాదు
చక్కఁగా మాఁటలాడేరే సంతోసించుకొంటాను

చ. 1: చెప్పరే మీ రితనికి చెలియ సుద్దు లెల్లాను
విప్పుచుఁ జెవులు చల్లఁగా వినీఁగాక
యిప్పు డిట్టె నేనుండఁగా నేల దాఁచే రాపనులు
చొప్పుగా మొక మొకాలు చూచుకొంటాను

చ. 2: మొక్కరే మీ రితనికి మోహపు దేవుల మారు
చొక్కుచుఁ గన్నులారాఁ జూచి యేల
యిక్కడ నన్నుఁ జూచి వూరకున్నవాఁడు
చెక్కుల చేతులతోడ చేరి నవ్వుకొంటాను

చ. 3: యియ్యరే కానుక లాపె యిచ్చి పంపినవెల్లా
చెయ్యారా నందుకొని చెలఁగుఁగాని
యియ్యెడ శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నిట్టె
వొయ్యనే మీరేల లోఁగే రూహించుకొంటాను

రేకు: 1941-3 హిందోళవసంతం సం: 29-183

పల్లవి: ఆతఁడే యెఱఁగఁడా అతివ నీ లాగులు
యీతల నీ మచ్చిక లింకా నెంత చెప్పేవే

చ. 1: మనసులో తమకము మాఁటలనే కానవచ్చె
కనుచూపులనె యింపు గనుపట్టెను
వినయములనే బత్తి వెల్లవిరియై మించె
యెనసే నీ చుట్టరిక మింకా నెంత చెప్పేవే

చ. 2: చెప్పరాని మోహములు చిరునవ్వులఁ దెలిసె
ముప్పిరిఁ గళలు మోమున వెలసె
కుప్పలైన పులకల కోరికలు దేటపడె
యిప్పుడు నీ యనురాగ మేమి చెప్పేవే

చ. 3: సరసపు చెనకులు చనుగుబ్బ లెఱిఁగించె
మరిగిన మమత మర్మముల నిండె
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్ను నేలె
యెరవుగా నీవలపు యిఁక నేమి చెప్పేవే

రేకు: 1941-4 శ్రీరాగం సం: 29-184

పల్లవి: నేరము లెంచకుమయ్య నీ విన్నిటా ఘనుఁడవు
తారుకాణగా నిఁక దయసేయవయ్యా

చ. 1: చెలిని మన్నించుమని సేసితి విన్నపాలెల్లా
పలుమారు మొక్కితి నీ పాదములకు
వెలయఁగఁ జెక్కునొక్కి వేఁడుకొంటిఁ జనవున
తలఁచి చిత్తానఁబెట్టి దయసేయవయ్యా

చ. 2: పెక్కులాగులను నీకుఁ బ్రియము లిదె చెప్పితి
ఇక్కడ నీచే నమ్మిక లిప్పించుకొంటి
అక్కరతో నీమీఁది ఆసలెల్లా దెలిపితి
తక్కక చిత్తానఁ బెట్టి దయసేయవయ్యా

చ. 3: చెప్పరాని వినయాలసేవల కొడిగట్టితి
ముప్పిరి నీపై పదముల వాడితి
ఇప్పు డిట్టె శ్రీవేంకటేశ యీకె నేలితివి
తప్పక చిత్తానఁబెట్టి దయసేయవయ్యా

రేకు: 1941-5 మధ్యమావతి సం: 29-185

పల్లవి: మీరేమి బుద్ధిచెప్పేరే మెలుఁతలాలా
నా రమణుని గుణాలు నాకే తెలుసును

చ. 1: సంతోసాన నుండి సరసములాడవచ్చుఁగాక
పంతములాడవచ్చుగా పతితోను
దొంతర రతుల గూడి తులఁదూఁగవచ్చుఁగాక
వింత వింత కపటాల విఱ్ఱవీఁగవచ్చునా

చ. 2: చొక్కముగా సేవసేసి సొలయఁగవచ్చుఁగాక
కక్కసించవచ్చునా కాంతునితోను
చెక్కునొక్కి చనవునఁ జెనకఁగవచ్చుఁగాక
పెక్కులాగుల జంకించి పెనఁగఁగవచ్చునా

చ. 3: కూరిమితో నవ్వు నవ్వి కొసరఁగవచ్చుఁగాక
బీరమాడవచ్చునా ప్రియునితోను
యీరీతి శ్రీవేంకటేశుఁ డీతఁడే నన్ను నేలె
దారకపు చేఁతలను తప్పులెంచవచ్చునా

రేకు: 1941-6 మాళవిశ్రీ సం: 29-186

పల్లవి: మెచ్చరే యీాకె నిందుకు మెలుఁతలాల
అచ్చమైన యాఁటదాని కన్నియు నమరునే

చ. 1: కూరిమి గలది పతిఁ గొసరఁగఁదగునే
వోరుపు గలది వొద్దనుండఁదగునే
మేరతోడ మెలఁగేది మేలమాడఁదగునే
వూరకె మీ రాపె నేల వుప్పతించేరే

చ. 2: ప్రియము గలిగినది పెనఁగఁగఁదగునే
నయగారియైనది నవ్వఁదగునే
క్రియ యెఱిఁగినది మొక్కి పొగడఁదగునే
రయమున నాపె నేల రాఁపుసేసేరే

చ. 3: సేసవెట్టినాపెకు చెనకఁగఁదగునే
ఆసగలదానికి నంటఁదగునే
యీాసరి శ్రీవేంకటేశుఁ డేలినాఁడు మమ్మిద్దరి
వేసరకు యాపె నేల వెంగేలాడేవే

రేకు: 1942-1 శంకరాభరణం సం: 29-187

పల్లవి: వింటిమే నీ చేఁతులు వీనుల పండువగాను
కంటిమే మీ వొద్దికలు కన్నులు చల్లఁగాను

చ. 1: నీటుకత్తెవు నౌదువు నేరుపరివి నౌదువు
మాటలాడ వలఁతివే మగనితోను
పాటించి యాతని నీవు పక్కవాయనీయవు
మేటిసతులెల్లాను మెచ్చేరే నిన్నును

చ. 2: దొరవూ నీ వౌదువే దొడ్డదాన వౌదువే
బిరుదు గట్టుక వలపించఁగలవే
యెరవులేక యేపొద్దూ యింటఁ బెట్టుకుందానవు
పొరుగిరుగులవారు పొగడేరు నిన్నును

చ. 3: పంతగత్తెవు నౌదువే బలుదాన వౌదువే
వింతలుగాఁ గూడి పొందు వెలయింతువే
ఇంతలోనె శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁగూడె
ఇంతులెల్లా సంతోసాన నెంచేరు నిన్నును

రేకు: 1942-2 పాడి సం: 29-188

పల్లవి: ఇచ్చకమే సేయవద్దా యింతులకుఁ బతితోను
కుచ్చి యీతని నేపొద్దుఁ గొనియాడఁగదవే

చ. 1: వాసులకే పెనఁగేవు వంతులకే జునిఁగేవు
సేసవెట్టిన విభుఁడు చెనకఁగాను
ఆసలెల్లా రేఁచేవు అట్టె చన్నులు దాఁచేవు
బాసదప్ప కీతఁడు నీపై బత్తి చూపఁగాను

చ. 2: కప్పురాన వేసేవు కాయమున రాసేవు
చిప్పిల నాతఁడు వీచేయి వట్టఁగా
చొప్పులెత్తి నవ్వేవు సొలసి కొప్పు దువ్వేవు
తప్ప కీతఁడు రతికిఁ దమకించఁగాను

చ. 3: చేతులెత్తి మొక్కేవు సిగ్గున మాఁట గుక్కేవు
కాతరాన దానే నిన్నుఁ గాఁగిలించఁగా
యీతల శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నేలినాఁడు
ఘాతల వేడుకోనేలే యీతఁడు మన్నించఁగాను

రేకు: 1942-3 దేసాళం సం: 29-189

పల్లవి: ఇంకా నేల దాచ్చేవు యీా సుద్దులు
కంకణాలు గట్టిన నీ కల్యాణపు సుద్దులు

చ. 1: ముంగిటికి వచ్చె నివె మోహపు నీ సుద్దులు
అంగడిలోనికి నెక్కె నా సుద్దులు
కొంగుబంగారములాయ కోరికె నీ సుద్దులు
యెంగిలి మోవికి సోఁకె నీ సుద్దులు

చ. 2: పొంచులకు లోనాయ పొరుగుల నీ సుద్దులు
యెంచితే నెన్నైనాఁ గల వీ సుద్దులు
కంచపు పొత్తు గలసె కడలేనినీసుద్దులు
దించరాని మోపులాయ దిన దినసుద్దులు

చ. 3: ఇసుకపాఁతరలాయ నిదివో నీ సుద్దులు
ముసి ముసి నవ్వులాయ ముందే సుద్దులు
యెసగి శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
కొసరితే నిగిరించీ కూరిమి నీ సుద్దులు

రేకు: 1942-4 బౌళి సం: 29-190

పల్లవి: ఇటువంటి వినోదము లిద్దరికిఁ దగునమ్మ
తటుకనఁ జూడరమ్మ తరుణులాల

చ. 1: యెదురుఁ గొండలమీఁద నెక్కుకొని లకిమమ్మ
పొదిగొనఁ దొంగిచూచి పొంచుకుండఁగా
గుదిగొన వేదాద్రిగుహలోనఁ గూచుండి
అదివో చేతులుచాఁచీ నోభళేశుఁడు

చ. 2: అందముగ భవనాశి యద్దరిని లకిమమ్మ
విందుగాఁ జెలులచే వీడె మంపఁగా
కుందణపు మేడలోన గూచుండి నవ్వు నవ్వి
అందుకొనీ వేడుకతో నౌభళేశుఁడు

చ. 3: కడపవాకిటనుండడి గరిమతో లకిమమ్మ
తడయక మాఁటలాడి తమి రేఁచఁగా
తొడమీఁద నిక్కించుక దోమటి పెండ్లియాడి
అడరీ శ్రీవేంకటాద్రి నౌభళేశుఁడు

రేకు: 1942-5 ఆహిరి సం: 29-191

పల్లవి: ఆఁటది బతిమాలితే నారజకత్తె యందురు
యేఁటికి నన్నుఁ గొసరే విన్నిటా జాణఁడవు

చ. 1: జలజాక్షి యొకతె నీ సంగడిఁ గూచుండఁగాను
సొలయక వేరొకతెకుఁ జోట్టున్నదా
కలికి యొకతె నీకుఁ గైదండ కిచ్చుకుండఁగా
చలపట్టి పెనఁగితే చప్పనగాదా

చ. 2: మగువ యొకతె నీతో మాఁటలాడుచుండఁగాను
తగుల వేరొకతెకుఁ దగవయ్యీనా
మృగనేత్రి నీ కొకతె మేకొని సేవసేయఁగా
జిగిమించి నీతోనవ్వ సిగ్గుగాదా

చ. 3: వనిత యొకతె నిన్ను వసము సేసుకొండఁగా
చెనక వేరొకతెకుఁ జెల్లుబడౌనా
యెనసితివి శ్రీవేంకటేశ నీవె నన్నింతలో
నిన్ను నిఁక మెచ్చేదే నేరుపుగాదా

రేకు: 1942-6 రామక్రియ సం: 29-192

పల్లవి: నిన్నుఁ జూ చెప్పటనుండి నేఁడు నాకు వెరగయ్యీ
పన్నుకొని యెన్నేసి పగటులదానవే

చ. 1: చనవులు సేసుకొని సరసము లాడి యాడి
వినయానఁ జెక్కునొక్కి వేఁడుకొనేవు
మనసు రంజిల్లఁ జేసి మచ్చికలు చల్లేవు
యెనసి విభుని కెంత యిచ్చకురాలవే

చ. 2: సరసనే కూచుండి సారెకునుఁ గొప్పు దువ్వి
విరులు ముడిచి యిట్టె విడి మిచ్చేవు
తెరవేసుకొని మోవితేనియలే కురిసేవు
యిరవై మగని కెంత యితవరి దానవే

చ. 3: వేవేగఁ గాఁగిలించి వేడుకలు వెడరేఁచి
కైవసము సేసుకొని కరఁగించేవు
యీవేళ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
నీవూ నీతని కెంత నెయ్యమైనదానవే

రేకు: 1943-1 సామంతం సం: 29-193

పల్లవి: భూపతి చెరువుచెంతఁ బొంచుక రతులకును
యేపొద్దు సతులకును యెదురు చూచీనే

చ. 1: నవ్వులసెలవులతో నానిన చెమటలతో
పువ్వుల దండలు వేరే బుజాలతోడ
జవ్వన పాయముతోడ జారిన తురుముతోడ
యెవ్వతెనో కూడివచ్చి యీాడ నున్నాఁడే

చ. 2: అరవిరి బాగులతో నాయముల కరఁగులతో
గరిమల నెమ్మొగము కళలతోడ
సురత వాసనలతో చొక్కపు సింగారాలతో
పురిగొన్న వేడుకతో భోగించీనే

చ. 3: పుక్కిటి విడేలతోడ పులక జొంపాలతోడ
పిక్కటిలఁ దేనెలూరే పెదవితోడ
యిక్కువ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
వెక్కసపుఁ దమకాన వినోదించీనే

రేకు: 1943-2 సాళంగనాట సం: 29-194

పల్లవి: ఇప్పు డిదె కొలువున్నాఁ డింతులు దాను
వుప్పతిలు మహిమల నుద్దగిరి కృష్ణుఁడు

చ. 1: గోవులఁగాచెఁ గొన్నాళ్ళు కొండ గొడగగ
కావరించి మద్దులను గక్కన దొబ్బె
వావులు గలయ గొల్లవనితలఁ బొందుసేసె
వేవేలు చేఁతలవాఁడు వెన్నముద్ద కృష్ణుఁడు

చ. 2: మల్లులఁ గొందరి గొట్టె మరి కంసు బొదిగొనె
తెల్లై కోడెరాకాసుల దునిమివేసె
తెల్లమిగా వసుదేవ దేవకీనందనుఁ డాయ
వెల్లవిరై మెరసీని వెన్నముద్ద కృష్ణుఁడు

చ. 3: పొంతఁ బాండవులఁ గాచె భూ భార మణఁగించె
పంతముతో దేవతల బాలించెను
యింతట శ్రీవేంకటాద్రి నేలినాఁడు మమ్మిందరి
వింత వింత సొబగుల వెన్నముద్ద కృష్ణుఁడు

రేకు: 1943-3 పాడి సం: 29-195

పల్లవి: తరుణిలో నామనసు తా నెరఁగఁడా
తెరదీసి నే నెంత తెలుపఁగవలెనా

చ. 1: వేడుకకు నవ్వితేను వెంగెమనీ యిదియేమే
వాడుమోము చూచితేను వంచుకోనేలే
చూడవే తా నంతే కడు సుద్దాత్ముఁ డైతేను
వోడక తా నొక్కరీతి నుండవలదా

చ. 2: దగ్గరఁ గూచుండితేను తప్పించుకో నదియేలే
వొగ్గి చెనకితే నట్టె సిగ్గు లేఁటికే
యెగ్గులుఁ దప్పులుఁ దాను యెరఁగనివాఁడైతే
దిగ్గన నా మాఁట సమ్మతించి వుండవలదా

చ. 3: చేరి మొక్కుమొక్కితేను చెక్కు నొక్కి వేఁడనేలే
గారవించఁగాఁ బెనఁగఁగ నేఁటికి
యీరీతినుండి శ్రీవేంకటేశుఁడు న న్నిప్పుడేలె
మేరమీర కిటులానే మెలఁగఁగవలదా

రేకు: 1943-4 నాట సం: 29-196

పల్లవి: ఈతఁడే రఘురాముఁ డీతఁ డేకాంగవీరుఁడు
యీతఁడు చేసిన చేఁత లెన్నియైనాఁ గలవు

చ. 1: ఖరదూషణాదులను ఖండ తుండములు సేసె
అరుదుగా వాలి నొక్కయమ్మున నేసె
సరవిఁ గొండలచేత సముద్రము బంధించె
ఇరవై విభీషణుని కిచ్చె లంకారాజ్యము

చ. 2: కూడపెట్టె వానరుల, కుంభకర్ణాదిదైత్యుల
తోడనే రావణుఁ జంపె దురముగెల్చె
వేడుకతో సీతాదేవిఁ గూడెను పుష్పక మెక్కె
యీడు జోడై సింహాసన మేలె నయోధ్యలోన

చ. 3: పుడమియంతయుఁ గాచె పొందుగాఁ దనంతలేసి –
కొడుకులఁ గాంచెను కుశలవుల
యెడయక శ్రీవేంకటేశుఁడై వరములిచ్చె
అడరి తారకబ్రహ్మమై ఇదె వెలసె

రేకు: 1943-5 గౌళ సం: 29-197

పల్లవి: తారకబ్రహ్మమంత్రము తానై వున్నాఁడు రాముఁడు
ధారుణిలోఁ జెలువొందె దశరథరాముఁడు

చ. 1: కొండలంతలు వానరకోటులు గొలువఁగాను
దండితోఁ గొలువున్నాఁడు తగ రాముఁడు
అండనే సీతాదేవి యమరి కూచుండఁగాను
మెండుగ సింహాసనాన మెరసీని రాముఁడు

చ. 2: వామదేవ కౌశిక వసిష్ఠాదులవిన్నపా –
లాముకొని వినుచున్నాఁ డదె రాముఁడు
గోమున భరత శత్రుఘ్నులు ఛత్ర చామరాలు
కామించి పట్టుకుండఁగా కడుమించీ రాముఁడు

చ. 3: కనకపుష్పకము చెంగట వీరాసనముతో
ననచి యానందాన నున్నాఁడు రాముఁడు
ఘన శ్రీవేంకటాద్రిపైఁ గల్పవృక్షము నీడ
హనుమంతుని చదువు లాలకించీ రాముఁడు

రేకు: 1943-6 లలిత సం: 29-198

పల్లవి: నెపములు వేసి వట్టి నేరాలేల యెంచేరే
వుపమల మీరెంత వుప్పతించేరే

చ. 1: చలిమి బలిమిగల సతులకుఁ బతితోను
చలపట్టి నవ్వఁదగు సాదించఁదగు
కలికితనాల మీకుఁ గాతాళించ నేమిటికి
అలరి సవతులైతే నౌదురుగాక

చ. 2: ననిచియుండిన యట్టి నాతికి నీతనితోను
పెనఁగితే నెగ్గుగాదు బీరమూఁగాదు
మునుకొన్న సన్నలను మోములు చూచుకొనేవే
అనవలసితే మీరూ నందురగాక

చ. 3: సేసవెట్టి పెండ్లాడిన చెలికి శ్రీవేంకటేశుఁ
బోసరించి కూడవచ్చుఁ బొగడవచ్చు
వాసినింతులతో మీరు వరుసల దిగేరేమే
ఆసగలిగితే మీరూ నంటుదురుగాక

రేకు: 1944-1 వరాళి సం: 29-199

పల్లవి: ఇన్నిటా మేలుది నీకు యీకెను మన్నించవయ్యా
విన్నవించితిమి నేము వెలఁది చందములు

చ. 1: వినయములే కలితే వెంగెము లెన్ని యాడినా
పెనగొన్న తమకమే పెడరేచును
మనసే వొడఁబడితే మర్మ మెంత ముట్టించినా
గొనకొన్న వలపులు కొనసాగింపించును

చ. 2: సంగాతమే నిజమైతే జంకెన లెంతచూపినా
అంగవించి రతులకే యాసపుట్టును
కంగులేక మెలఁగితే గబ్బితనాన నుండివా
యెంగిలి మోవికినై యేకారింపించును

చ. 3: సరసమే నెరపితే సాదించి యెంత మీరినా
తరితీపు లుప్పతిల్లి తనివొందించు
యిరవై శ్రీవేంకటేశ యింతి విట్టె యేలితివి
నిరతపుఁగోరికలు నెరవేరింపించును

రేకు: 1944-2 ఆహిరి సం: 29-200

పల్లవి: సేసిన చేఁతులు చెల్లె చెప్పిన మాఁటలు వింటి
రాసికెక్కె నీ సుద్దులు రక్షించు మమ్మును

చ. 1: చిగురుమోవి వంచి సిగ్గువడ నేమిటికి
మొగమెత్తి చూడవయ్యా మొక్కే నీకు
అగుడునిట్టూరుపులు అడఁచుకొనఁదగదు
నగవయ్యా వొకమాటు నాతో నీవు

చ. 2: కొప్పు జారినందుకుఁగాఁ గొంచించ నేమిటికి
చెప్పవయ్యా యేమాఁటైనా జేరి వినేను
తొప్పఁదోఁగే చెమటలు తుడుచుకోనంతయాల
అప్పుడే విసరేఁగాని అండకు రావయ్యా

చ. 3: కందువైన వాసనలు కప్పిపెట్ట నేమిటికి
ఇందవయ్యా జవాది ఇచ్చే నేను
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చెంది యొక్కమనసుతోఁ జెలరేఁగు మిఁకను

రేకు: 1944-3 పాడి సం: 29-201

పల్లవి: నిన్ను నన్ను నెంచుకొంటే నీవే నేను । నీవు
మన్నించినదే గురుతు మరి యాడ సుద్దులు

చ. 1: నీ తలనే వేగేనా నెలఁతలఁ బెండ్లాడేది
కాతరించేవారికెల్లాఁ గలదే ఇది
నాతో నేమి చేప్పేవు నన్నొడఁబరచనేల
యీతల నీ చేఁతలెల్లా నియ్యకొంటి నేను

చ. 2: యెవ్వరు నెఱఁగనివా యిలలో నీ వలపులు
జవ్వనపువా రుండేటి జాడలే ఇవి
తవ్వనేల యిసుకపాఁతరలు సారె సారెకు
పువ్వులవంటి గుణాలు పొగడే నిపుడు

చ. 3: మఱవఁగ వచ్చునా మనసులో తలపోఁత
పెఱరేఁచి నిన్ను రట్టుపెట్టకుండునా
యెఱుఁగుదు శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మెఱసి నీ పొందులకు మెచ్చితి నన్నిటాను

రేకు: 1944-4 దేసాళం సం: 29-202

పల్లవి: ఒకటిపై కాఁతాళము వొకటిపైఁ జూపనేల
వెకలివై నెచ్చెలుల విన్నపాలు వినవే

చ. 1: కొమ్మ నీవు నీ పతినే కొసరఁగవలెఁగాక
తుమ్మిదల నేఁటికి దూరేవే నీవు
చిమ్ముచు నీ విట్టె బత్తిసేసి చూపుదువుగాక
అమ్మరో మరునినేల ఆడిపోసుకొనేవే

చ. 2: వేడుక నాతని నింకా వేఁడుకొందువుగాక
కూడగొట్టు గాలినేల కోపగించేవే
వీడె మిచ్చి చెక్కు నొక్కి వేఁడుకొనవలెఁగాక
నీడనున్న కొవిలను నెరుసులే లెంచేవే

చ. 3: గట్టిగా శ్రీవేంకటేశుఁ గాఁగిట నింతువుగాక
గుట్టుతో చందరునేల గుంపించేవే
నెట్టన ని న్నితఁ డేలె నెమ్మది నుందువుగాక
వొట్టి వసంతుపై నేల వొలవేసేవే

రేకు: 1944-5 మాళవిగౌళ సం: 29-203

పల్లవి: బత్తిసేయఁగా నీవు పరాకు సేయఁగరాదు
వుత్తలపు వలపు నోలలాడవయ్యా

చ. 1: మనసు గరఁగి నీతో మాఁటలడీ జవరాలు
వినవయ్యా నీవు గడువేడుకతోను
వొనర నప్పటనుండి వొద్దనే కాచుకున్నది
చెనకి సరసమాడి సేవగొనవయ్యా

చ. 2: చలిమి బలిమితోడ సన్నలెల్లాఁ జేసీని
తెలుసుకోవయా నీవు తేఁకవతోను
కొలువులుసేసి నిన్నుఁ గూరిములు గొసరీని
పిలిచి లాలనతోడఁ బ్రియమందవయ్యా

చ. 3: మిక్కిలి కాఁగిటఁగూడి మెప్పించీ రతులను
తక్కక చేకొనవయ్యా దయతోను
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి న న్నింతలో
వొక్కమనసున నీవు వుండగదవయ్యా

రేకు: 1944-6 శ్రీరాగం సం: 29-204

పల్లవి: విన్నవించవసగాదు వెలఁది భావములెల్లా
అన్నిటా నీవే యిఁక నాదరించవయ్యా

చ. 1: చన్నులమీఁది పయ్యెద జారినదీఁ దలఁచదు
సన్నలు నీతోఁ జేసె సంతోసానను
చిన్నిచెమట చెక్కులఁ జిందేదీ నెఱఁగదు
కన్నుల నిన్నుఁ జూచే కాంక్షలను

చ. 2: తురుములోని విరులు తొరిగేదీ నెంచదు
నిరతి నీతో మాఁటాడే నిబ్బరానను
మురిపినఁ దనపోఁకముడి వీడినాఁ బట్టదు
సరుగ నీపై వలపుచల్లే వేడుకలు

చ. 3: ముంచి పులకలు మే మొలచినదీఁ జూడదు
అంచెల నిన్నుఁ గూడేటి యాసలను
కొంచక శ్రీవేంకటేశ కొమ్మ నిట్టె యేలితివి
చెంచెలించదు నీరతి సరసానను

రేకు: 1945-1 మధ్యమావతి సం: 29-205

పల్లవి: వినయాన వేఁడుకొనే వెసఁ దెరవేయరే
చెనకఁగా నిందరిలో సిగ్గయ్యీ నాకును

చ. 1: రాఁపుసేసి వలపులు రచ్చనేల పెట్టీనే
కాఁపురము నేరుతునా కన్నెదానను
పూఁపచన్ను లంటి యంటి పొందు లెంతసేసీనే
దాపునఁ దల్లి మరఁగుదాన నింతే నేను

చ. 2: సన్నలాఁ జాయల మోవిచవు లెంత చూపీనే
పున్నతితో గుట్టుసేసుకుండే దానను
నున్నని చెక్కులమీఁద నునుగోరే లూఁదీనే
మిన్నక గోలతనపుమేలుదానను

చ. 3: రచ్చలోన సిగ్గులెల్లా రాసు లేల పోసీనే
కచ్చుపెట్టి మోక్కే యిచ్చకపుదాను
యిచ్చట శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు
మెచ్చుగా బెండ్లాడిన మేనదాన నేను

రేకు: 1945-2 కాంబోది సం: 29-206

పల్లవి: చూడవోయి వలపెంత చొక్కులఁబెట్టే నన్ను
వేడుకలు మీఁద మీఁద వెదచల్లీ నిపుడు

చ. 1: కోరి నీవు రాకుండఁగా కోపము రావలదా
వారక యాలోన నవ్వు వచ్చీఁగాక
గోర గీరఁగా నిన్ను గుంపించఁగవలదా
గారవపు నామనసు గరఁగీఁగాక

చ. 2: వుద్దరండాలు సేయఁగాను వొట్టు వెట్టవలదా
కొద్దితో నా గుణ మియ్యకొనీఁగాక
బద్దుల వినయాలకు పంగించవలదా
అద్దో నా వయసు ని న్నాసనడీఁగాక

చ. 3: కడల నీ సుద్దులకుఁ గాఁతాళించవలదా
పొడము పులకలమై పొదలీఁగాక
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
జడియవలదా దతి చవిరేఁచీఁగాక

రేకు: 1945-3 నాదరామక్రియ సం: 29-207

పల్లవి: ఎదురు చూచితిమి యిందాఁకా నీకు
తుదకెక్కెఁ బనులు సంతోసమాయ నిపుడు

చ. 1: చెలివిన్నపము నీకు చిత్తమునఁ బట్టెనా
వలపులు తారుకాణ వచ్చెనా నేఁడు
పిలిచిన పిలుపులు ప్రియమాయనా నీకు
చెలరేఁగి యింటికి విచ్చేసితి విపుడు

చ. 2: కాఁపురాలుసేయ నీకుఁ గడు వేడుకాయనా
ఆఁపరాని తమకము లాసరేఁచెనా
యేపున నీ వయసు యెచ్చరించెనా నిన్ను
చేపట్టి మా యింటికి విచ్చేసితి విపుడు

చ. 3: సరసపుఁ జేతలు చవు లాయెనా నీకు
నిరతి నీ కన్నకల నిక్కలాయనా
సరుగ శ్రీవేంకటేశ జలజాక్షి నేలితివి
సిరులలో నింటికి విచ్చేసితి విపుడు

రేకు: 1945-4 ఆందోళి సం: 29-208

పల్లవి: చెలికత్తె మారు సేవసేసితే దోసము గాదు
పొలసి నీవే యాకెకు పూనుక వచ్చితివి

చ. 1: చెప్పవే యీకె సుద్దులు చెలువుఁడు వినీఁగాని
చప్పుఁగాకుండాను వో సకియా
అప్పటిఁ దమి రేఁచనే ఆ చుట్టపు వరుసనే
తప్పుగాదు నీవూ ముందే తగులైనదానవు

చ. 2: చూపనే యాకె కానికె సూటి నందుకొనీఁగాని
నీపొందు మరువకుండా నేరుపుతోను
యీపొద్దే వచ్చినపని యీడేరించుకోవే మొక్కి
వోపుడు వెంతటికైనా వలపైనదానవు

చ. 3: ఇయ్యవే యాకె లేకలు ఇట్టె చదివీఁగాని
ఇయ్యెడ నీ వుపకార మెన్నికకెక్క
నెయ్యమున నన్ను నేలె నేఁడే శ్రీవేంకటేశుఁడు
చయ్యన నీవూఁ గూడవే సంగాతపుదానవు

రేకు: 1945-5 భల్లాటి సం: 29-209

పల్లవి: ఆనతియ్యవయ్యా వినే నవీఁ గొన్నివేడుకలు
వీనుల పండుగగాను వినోదము లెల్లాను

చ. 1: తచ్చి నీ మోహపు కాంత తలఁపాయనో నీకు
కచ్చు పెట్టి మోమునిండాఁ గళ రేఁగెను
గచ్చుల నాపెఁ గాఁగిట గాఁగిలించినట్టాయనో
మచ్చిక నీ మేనఁ జెమటలు గారీని

చ. 2: కోమలి నీ మై నించిన గురుతు చాచుకొంటివో
నామువార సెలవుల నవ్వు దేరీని
ఆముక యాపె కెమ్మోవి యాస నీకు ముంచెనో
కామించి మదరాగము కన్నులఁ జూపట్టెను

చ. 3: పడతి నప్పుడే నీవు భావమునఁ గూడితివో
కడుఁగడు మేనెల్లా గురుపారెను
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వుడివోనివలపుల నోలలాడేవు

రేకు: 1945-6 ఆహిరి సం: 29-210

పల్లవి: అన్నిటాను మేలుదాననైతి నేను
కన్నులఁ జూడఁగ నాకుఁ గలిగెఁగా తాను

చ. 1: యెడ నుండినానేమి యేమి సేసినా యేమి
వాడికతో మాయింతికి వచ్చెఁగా తాను
కోడెకాఁడయితేనేమి గురుతు లుండితే యేమి
జోడుగూడి నా మొగము చూచెఁగా తాను

చ. 2: యెంతపరాకైననేమి యెవ్వతెఁ దెచ్చినానేమి
అంతరంగముతో మాఁటలాడెఁగా తాను
పంతగాఁడయితేనేమి బయలీఁదించితే నేమి
యింతేసి నమ్మికలు నా కిచ్చెగా తాను

చ. 3: పెనఁగులాడితేనేమి పెచ్చు వెరిగితేనేమి
ననుపు సేసుక నాతో నవ్వెఁగా తాను
ఘనుఁడు తానె శ్రీవేంకటేశుఁడు నన్ను నేలె
చనవిచ్చి వలపులు చల్లెఁగా తాను

రేకు: 1946-1 శ్రీరాగం సం: 29-211

పల్లవి: వలవ కెట్టుండునే నీవంక చూచి రమణుఁడు
నిలువెల్లా ఇంతేసి నించుకొన్నదానవు

చ. 1: పలికితే మాఁటలను పచ్చితేనియులు గారీ
పొలసితే మెరుఁగులే పోగునియ్యాని
కులికి చూచితేను కుంకుమలే తొలఁగీని
నెలఁతరో నీ వెందు నేరుచుకొంటివే

చ. 2: నవ్వితేను సెలవుల నంటున ముత్యాల రాలీ
రవ్వఁగా గొసరితేను రంజించీని
చివ్వన జంకించితేను చీఁకట్లు గదిమీని
జవ్వనిరో నీ వెంత జాణవైతివే

చ. 3: వొరసితేఁ జన్నులను వుదిరి బంగారు రాలీ
మొరసితేఁ జిందీని మోహరసాలు
సిరుల నన్నేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
తరుణిదో యెన్నెన్ని చేఁతల వెలసితివే

రేకు: 1946-2 ఆరిబి సం: 29-212

పల్లవి: నావాఁడనేయంటా నమ్మిక లిచ్చేవు నాకు
కైవసమైతేఁ జాలు కాదనేనా నిన్నును

చ. 1: వేడుకలు వెదచల్లి వేగినంతా నాపె నిన్ను
వాడికలెల్లాఁజూపి వావి చెప్పెను
వీడుదోడై విందువెట్టి వీడెము చేతికిచ్చె
వాడసతులకు నీవు వలచేవే యిఁకను

చ. 2: సంగాతాలు సేసి నీతో సరసములాడి యాకె
సింగారించి మర్మాలంటి చిమ్మిరేఁచెను
చెంగటఁ గూచుండి నీచిత్త మిట్టె కరఁగించె
అంగడివారి పొందు లసించేవా ఇఁకను

చ. 3: ఇచ్చకము సేసి నీకు నెంగిలిమోవి యిచ్చి
మచ్చువేసినట్టు నిన్ను మరిగించెను
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తచ్చనకాంతలపొందు తలఁచేవా యిఁకను

రేకు: 1946-3 దేశాక్షి సం: 29-213
పల్లవి: విన్నపము సేయవమ్మా విభునికి సుద్దులు
చెన్నుగా నేమిసేతము చెప్పరమ్మా బుద్దులు
చ. 1: యెనలేని వలపుల యీఁతలు
మునుకొన్న నిట్టూర్పుల మోఁతలు
పొనుగొని సిగ్గుల పూఁతలు
వనితకు మరుఁడు సేసిన చేఁతులు
చ. 2: కలసేటి తమకపు కరఁగులు
మలయుఁ జెక్కిటి చేయి మఱఁగులు
సెలసి పయ్యెదజారు చెఱఁగలు
చెలియకే మరుఁడుసేసిన తెఱఁగులు
చ. 3: మరిగిన విరహపు మందులు
వెను కొన్నభావరతి విందులు
యిరవై, శ్రీవేంకటేశుఁ డిందులోనె వచ్చి కూడె
తరుణి కింతసేసిన తగు పొందులు

రేకు: 1946-4 గుండక్రియ సం: 29-214

పల్లవి: నీకేల మొగమోట నే నెంతటి దానను
కాకుసేసి యిందుకుఁగా కాఁతాళించేనా

చ. 1: ఆపె నీవూఁ గూచుండి అంతనేల రమ్మనేవు
చేపట్టి కాఁపురములు సేతురుగాక
యేపున నన్నుఁ జూచి యేల ప్రియాలు చెప్పేవు
వోపుదు వెంతటికైనా వొద్దనేనా నేను

చ. 2: యిద్దరును నవ్వుకొంటా యేల నాతో మాటాడేవు
వొద్దిక సరసలాడి వుందురుగాక
బుద్ది దలఁచుక నన్నుఁ బొత్తులేల కలిపేవు
కొద్దిమీరి పంగించి కొసరేనా నేను

చ. 3: ఆలు మగఁడునుఁ గూడి ఆస నాకెంత వెట్టేరు
కోలుముందై రతిఁ బెనఁగుదురుఁగాక
యీలీల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పాలింతువుగాక ఇంకాఁ బంగించేనా నేను

రేకు: 1946-5 ముఖారి సం: 29-215

పల్లవి: నిన్ను మెత్తునో యాపె నేరుపులు మెత్తునో
పన్నుగడలై ఇట్టె పరగీని వలపు

చ. 1: వారక యాసతి నీకు వావి నేమౌనోకాని
సారెకు నవ్వులు నవ్వీ చల్లీ వలపు
పొరచి నాకెకు నీకు పొందులెట్టివో కాని
పేరఁబెట్టి నీముందరఁ బెంచీని వలపు

చ. 2: వువిదకు నీకుఁ దొల్లి వొడఁబా టెట్టిదోకాని
తవిరి సన్నలు సేసి తవ్వీ వలపు
జవళి మీలో మీకు సమ్మతు లెట్టివోకాని
రవళిఁ దమకముల రాసిపోసి వలపు

చ 3: కలసి యాపెకు నీకు కందువ లెట్టివోకాని
కెలసి కాఁగిటను బిగించీ వలపు
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
కలికితనాలఁ బొత్తు గలసీని వలపు

రేకు: 1946-6 నాదరామక్రియ సం: 29-216

పల్లవి: కోరినకోరికెలెల్లా కొమ్మయందే కలిగీని
చేరి కామయజ్ఞ మిట్టే సేయవయ్యా నీవు

చ. 1: సుదతి మోవి తేనెలు సోమపానము నీకు
పొదుపైన తమ్ములము పురోడాశము
మదన పరిభాషలు మంచి వేదమంత్రములు
అదె కామయజ్ఞము సేయవయ్యా నీవు

చ. 2: కలికి పయ్యద నీకు కప్పిన కృష్ణాజినము
నలువైన గుబ్బలు కనక పాత్రలు
కలసేటి సరసాలు కర్మ తంత్ర విభవాలు
చెలగి కామయజ్ఞము సేయవయ్యా నీవు

చ. 3: కామిని కాగిలి నీకు ఘనమైన యాగశాల
ఆముకొన్న చెమటలే యవభృథము
యీమేరనే శ్రీవేంకటేశ నన్ను నేలితి
చేముంచి కామయజ్ఞము సేయవయ్యా నీవు

రేకు: 1947-1 సామంతం సం: 29-217

పల్లవి: ఎంత నన్ను వేడుకొనే విప్పుడు నీవు
పంతములు మీరేటి పడతినా నేను

చ. 1: యే పొద్దూ సేవ సేసేటి యిచ్చకురాలనేకాక
కోపగించుకొనియేటి కొమ్మనా నేను
చేపట్టి నీ వేమనినా చిత్తములోఁదానఁగాక
నీ పలుకు మీరేటి నెలఁతనా నేను

చ. 2: యే దెసా నీకు లోనై యెనసేటి దానఁగాక
కాదుగూడదనేటి కాంతనా నేను
మోదముతో నిన్నుఁ జూచి మొక్కేటిదానఁగాక
సాదించి జంకించేటి సతినా నేను

చ. 3: మేరతో నీ కాఁగిటిలో మెలఁగేటిదానఁగాక
సారెకుఁ గొసరేయట్టి సకినా నేను
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చేరి మేలు మరచేటి చెలియనా నేను

రేకు: 1947-2 వసంతం సం: 29-218

పల్లవి: మూసి మంతనములేల ముంచి వెల్లవిరిగాను
సేసవెట్టి పెండ్లాడితే చేరి వద్దనేనూ

చ. 1: తెరమరఁగున నుండి తేఁకువతో నాయకుని
విరుల నెంత వేసేవే వేమారును
అరిమురి నేఁడు నీకు నంత వలపుగలిగితే
సరసఁ గూచుండి మోవి చవి చూపరాదా

చ. 2: అవ్వలిమోము సేసుక యంతలోనే రమణుని
నవ్వుచుఁ గివగోరేల నాఁటించేవే
యెవ్వరూ నేమి చెప్పేరు యింత నీకు వేడుకైతే
చివ్వన గాఁగిట నించి చిమ్మరేఁచరాదా

చ. 3: చెక్కిటఁ జేయి వెట్టుక శ్రీవేంకటేశ్వరుని
నిక్కి యేమి చూచేవే నివ్వెరగుతో
నెక్కొని న న్నితఁడేలె నీకూఁ గొంత చుట్టమైతే
మొక్కు మొక్కి వేఁడుకొని ముచ్చటాడరాదా

రేకు: 1947-3 గౌళ సం: 29-219

పల్లవి: ఆస గలిగితే నీవూ నాతనిఁ జేసుకోరాదా
రేసు పుట్టి వలపేల రేఁచుకొనేవే

చ. 1: యెలమి నెప్పుడు నా యింటనే వున్నాఁడంటా
సొలసి యాతని నేమి చూచేవే నీవు
పలుమారు నామీఁదనే బత్తి సేసీనంటాను
వెలినుండి నీవెంత వెరగందేవే

చ. 2: మచ్చిక నాతోడనే మాఁటలాడీనితఁడంటా
కచ్చుపెట్టుక యేల యేఁకారేవే నీవు
ఇచ్చగించి నా విన్నపా లెప్పుడూ వినీనంటా
కొచ్చి కొచ్చి లోలో నేమి గుబ్బతిలేవే

చ. 3: మేలువాఁడై నా యిచ్చలో మెలఁగి మన్నించీనంటా
వోలి నిందుకే యట్టు నోరూరేవే నీవు
యీలీల శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
వేళ గాచుకొని యేమి వేసాలు సేసేవే

రేకు: 1947-4 ముఖారి సం: 29-220

పల్లవి: కంటి నీ సుద్దు లెల్లాను కానీ కానీవే
అంటి ముట్టినంతలోనె ఆలవయ్యేవా

చ. 1: మనసు పట్టఁగలేక మాఁటలాడి యాతనితో
తనివి సేసుకొనేవు తగునే నీవు
చనవున నప్పటిని జవ్వాది వూసేనంటా
పెనఁగులాడేవౌనే ప్రియునితోను

చ. 2: పాయరాని తమితోడ పకపక నవ్వుకొంటా
ఆయాలు గరఁచుకొనే వాసతో నీవు
యీయెడ నంతటాఁ బోక యింటికిఁ బిలిచెనంటా
చెయివట్టి పొందులు సేసేవౌనే నీవు

చ. 3: కోలుముందై వేడుకతో కొచ్చి కొచ్చి చూచి చూచి
తాలిమి సేసుకొనేవు తగిలి నీవు
మేలువాఁడై నన్ను నేలె మించి శ్రీవేంకటేశుఁడు
కాలు దొక్కి మొక్కేవౌనే ఘనుఁడీతఁ డంటాను

రేకు: 1947-5 రామక్రియ సం: 29-221

పల్లవి: నిండు సోబనములాయ నీ వుత్తర శ్రీరంగేశ
మెండాయను వలపులు మెలుఁతలకెల్లాను

చ. 1: ముంచి నీవు మాఁటలాడే మోవిపై తెనెలనే
కంచుము పొత్తు గలసె కాంతలకెల్లా
పొంచి నీవు చూచే చూపుల ముంగిటి ముగ్గులనే
పంచల పండుగలాయ భామలకెల్లాను

చ. 2: చిత్తగించి నవ్వు నవ్వే సెలవిముత్తేలనే
కొత్త కొత్త సేస లాయ కొమ్మలకెల్లా
తత్తరపు కొనగోరితాఁకుల వజ్రాలనే
హత్తుక వుంకువలాయ నంగనలకెల్లాను

చ. 3: గరిమ మనసు కోరికల చిగిరంపులవే
సరిఁ బెండ్లి విడేలాయ సతులకెల్లా
నిరతి శ్రీవేంకటేశ నీ రతుల వేడుకలు
విరుల వసంతాలాయ వెలఁదుల కెల్లాను

రేకు: 1947-6 కాంబోది సం: 29-222

పల్లవి: నవ్వేవారి నెఱఁగదు నడుమఁ దనచేఁతకు
అవ్వలనుండే తాను ఆససేసీ నీకు

చ. 1: వుడివోని వలపులు వుట్టి గట్టుక వున్నది
దడి గట్టుక సిగ్గులు దాఁచుకున్నది
పెడరేఁచి వినయాలు పేరబెట్టుక వున్నది
అడియాలా లన్నియును నందుకొనవయ్యా

చ. 2: మించుఁ గనుచూపులు మీఁ దెత్తుక వున్నది
పొంచి ప్రియములు రాశివోసుకున్నది
కంచపు మోవి యట్టె కానుక వట్టుకున్నది
అంచెలఁ జేతులు చాఁచి అందుకొనవయ్యా

చ. 3: ముసి ముసి నవ్వులు మూటగట్టుక వున్నది
కొసరు మాఁటలు గూర్చుకొని వున్నది
యెసఁగి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
‘అసమున’ నాపె పొర చెందుకొనవయ్యా

రేకు: 1948-1 పాడి సం: 29-223

పల్లవి: ఎన్నటి పొందో నీకు యీాకె యెంత చుట్టమో
పన్నుకొని వుండఁగాను పరాకులేలయ్యా

చ. 1: కడు వేడుకతో నీకు గతలు చెప్పీ నాపె
వుడివోని సంతోసాన నూఁకొనవయ్యా
అడియాలముగఁ జన్ను లదె కానుకసేసీని
బడివాయ కిట్టె తప్పక చూడవయ్యా

చ. 2: వెలయఁగ మోవితేనె విందులు వెట్టీ నాపె
కొలువులో నిట్టె చవిగొనవయ్యా
చెలఁగి నవ్వు ముత్యాలు సేసలు చల్లీ నీకు
కలసి మెలసి నీవూఁ గైకొనవయ్యా

చ. 3: చొక్కపు రతులనే జూజములడీ నాపె
వెక్కసమేల పంద్యాలు వేయవయ్యా
ఇక్కడనే శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చక్కగా మా యిద్దరితో సరసమాడవయ్యా

రేకు: 1948-2 కుంతలవరాళి సం: 29-224

పల్లవి: ఎన్నేసి చేతులు సేసే విట్టే మగనితోను
నన్నుఁ జూడవే మెప్పించే నయాన నీతనిని

చ. 1: పక్కన నేల మొక్కేవే పాదము లేల తొక్కేవే
చక్కని పతితో సరసము లాడుతూ
వెక్కసిం చేమి నవ్వేవే విరులనేల రువ్వేవే
తక్కక నీ తోంటిపొందు తలఁపించుకొంటాను

చ. 2: చందన మేమి వూసేవే చన్ను లేల రాసేవే
చెంది రమణునిసేవ సేసుకొంటాను
కందువ లేమి ముట్టేవే కానుక లేల పట్టేవే
సందడిలో వలపులు చల్లుకొంటాను

చ. 3: చేతు లేల చాఁచేవే సిగ్గు లేల రేఁచేనే
యీతల శ్రీవేంకటేశు నెనసుకొంటా
కాతర మేలపెంచేవే కాఁగిట నన్నితఁడేలె
పోతరిం చ్చాతనిబత్తి పొగడుకొంటాను

రేకు: 1948-3 సింధురామక్రియ సం: 29-225

పల్లవి: పిలువ వచ్చితి నేను ప్రియురాలి కడనుండి
యెలమి నా మాటవిన యింటికి రావయ్యా

చ. 1: పచ్చిదేరి వలపులు పడఁతికి నీకు నేఁడు
కొచ్చి కొచ్చి తమకము గుబ్బతిలీని
విచ్చన విడాయను వేడుకతో సరసాలు
యెచ్చుగుందు రిఁక నేల యింటికి రావయ్యా

చ. 2: నివ్వటిల్లె వయసులు నెలఁతకు నీకు నేఁడు
వువ్విళ్ళూరీ మీలోని వొడఁబాటులు
చివ్వనఁ బురిగొనెను చిగిరింత సిగ్గులు
యెవ్వరూ నేమి చెప్పేరు యింటికి రావయ్యా

చ. 3: అందుకొనె నాసలు అంగనకు నీకు నేఁడు
కందువ రతులు తారుకాణాలాయను
పొందుగా శ్రీవేంకటేశ భోగించితి వీకెను
యిందరూ మెచ్చిరి నిన్ను యింటి కిట్టె రావయ్యా

రేకు: 1948-4 లలిత సం: 29-226

పల్లవి: కంద మీకెసరితులు కన్నులారాను
యెందుండి వచ్చెనో నీపై నింపులు చల్లీని

చ. 1: తేనెలుగార మాఁటాడీ తీగె యెలుఁగులు సాగ
కానుకిచ్చి నీ మనసు గరఁగఁజేసె
నానఁబెట్టె వలపులు నయగారితనమున
యీా నేరుపులనే నీకెంత తమిరేఁచీనో

చ. 2: చల్లని చూపులఁ జూచీ సరుసఁ గూచుండుకొంటా
మెల్లనె నవ్వులు నవ్వి మెప్పించె నిన్ను
తెల్లమిగా సన్నసేసి తెలుపుకొనె వావులు
చెల్లుబడి నింకా నెంత సేవలు సేసీనో

చ. 3: కుంకుమ గుబ్బల నొత్తె కొలువులు సేసుకొంటా
పొంకపుఁ జేఁతలనే పొద్దులు పుచ్చె
అంకెల శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
సంకెలేక తనబత్తి చవి యెంత చూపీనో

రేకు: 1948-5 సాళంగం సం: 29-227

పల్లవి: మేలు మేలు యీ కీర్తి మిక్కిలిఁ గట్టుకొంటివి
నీ లాగులెల్లాఁ జూచి నీకు మొక్కే నేను

చ. 1: యే లాటా లాపెతోడ నెటువలె నాడితివో
మేలమాడ నేర్తువంటా మెచ్చీ నిన్ను
లాలించి మనసేరితి లలిఁగరఁగించితివో
పోలించి యందరిలోనాఁ బొగడీని నిన్ను

చ. 2: యేకతాననుండి నీవు యెంత చనవిచ్చితివో
తూకొని వేడుకతో సంతోసించి నిన్ను
జోకగా నేమిట నీవు చొక్కఁగఁ జేసితివో
యేకడా జాణఁడవంటా యెంచీని నిన్ను

చ. 3: నెట్టుక రతుల నెట్టు నీవు గాఁగిలించితివో
జుట్టవేలఁ బలుమారుఁ జూపీ నిన్ను
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితివి నన్ను నేఁడు
అట్టె నా వావి చెప్పి తా నాదరించీ నిన్ను

రేకు: 1948-6 నాదరామక్రియ సం: 29-228

పల్లవి: తానే ముందుగా వచ్చి తడవె నన్ను
ఆనుకొని వసంతములాడితి నే వెనక

చ. 1: కొలువులో నుండఁగానే కుంకుమ నాపైఁ జల్లె
చిలుకఁజిమ్మనఁగోవిఁ జిమ్మితి నేను
కలువలఁ గొనివేసె కమ్మటిఁ దా నామీఁద
వెలిఁదమ్మిగుత్తిఁ గొని వేసితి నేను

చ. 2: తగిలి వెంట నే వచ్చి తనజడవట్టితేనే
మగిడి నా చన్నులు నెమ్మదిఁ బట్టెను
చిగిరుబంతిఁగొని వేసితి నప్పటి నేను
మొగము చూడఁగానే మోవి గంటి సేసెను

చ. 3: పొఁగిన తమకమున పన్నీరు నాపయి నించె
చేఁగదేరఁ జేయివట్టి చిమ్మితి గోర
యేఁగివచ్చి శ్రీవేంకటేశుఁడు నన్ను మన్నించి
కాఁగిలించి పట్టుకొని కళలు రేఁగించెను

రేకు: 1949-1 రామక్రియ సం: 29-229

పల్లవి: చిన్నదానవైతేనేమి చేఁతలన్నీ నేరుతువు
పన్నుకొన్నసుద్దులు గంపల నింతువుగాని

చ. 1: నించవే యాతనిమీఁద నెట్టుకొని వలపులు
పెంచవే నీలోనఁగల ప్రియములెల్లా
వంచవే యెట్టనెదుట వాలుక చూపు లప్పటి
కంచపు మోవి తేనెలు కాఁగులనింతువుగాని

చ. 2: కోరవే యాతనితోడికూటములే యేపొద్దు
చేరవే పానుపుమీఁద సిగ్గువడక
నేరవే యాతనిచేత నెయ్యపుసరసములు
గారవపు వేడుకలు గాదెఁబోతువుగాని

చ. 3: మొక్కవే యాతనికి నీ మొనగోరి చేతులను
తొక్కవే పాదము లిదె తొలుత పెండ్లి
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిటు నన్నూ నిన్ను నేలె
చక్కగా నాసలు కణఁజాలనింతువుగాని

రేకు: 1949-2 పాడి సం: 29-230

పల్లవి: వెలఁది సొబగులివి విన్నవించితిమి
నెలకొని ఇఁకఁ గరుణించవయా

చ. 1: చెలపల చెలపల చెమటలు గారీ
వలపునఁ బొడమిన వానలివి
సొలపుల సొలపుల చూపులు వొదలీ
తెలుపుగ వెన్నెల తేటలివి

చ. 2: బుసబుసమను నూర్పులు చిగిరించీ
వసంతకాలపువరుసలివి
మిస మిసఁ గాంతులు మెరుఁగులు వారీ
యెసఁగిన విరహపు టెండలివి

చ. 3: మది మదిఁ గోర్కుల మంచులు గురిసీ
మదనుని యలహేమంత మిది
యిదె యిదె శ్రీవేంకటేశ యింతిఁ గూడితి
వదలనికాఁగిళ్ళవాడికలివి

రేకు: 1949-3 తెలుగుగా(గాం?)బోది సం: 29-231

పల్లవి: తనదేవులఁగానా తన కెందురాడేనా
తనిపి రతుల నిట్టె దప్పి దేర్చుమనవే

చ. 1: చందురుని వెన్నెలల జాలినేల తోసీనే
మందానిలు వేఁడికేల మైకొలిపీనే
అంది కోవిల కూఁతకు నడ్డమేల తోసీనే
యిందుకు విచ్చేసి నన్ను నీడేరుచు మనవే

చ. 2: చిలుకలపలుకులఁ జిమ్మిరేపించినేలే
అలినాదములకేల యప్పగించీనే
పలుగోరువంకలబారినేల పెట్టీనే
తలకొని నన్ను నేలి దయఁజూడు మనవే

చ. 3: మనసిజతాపమున మరలింపించు మనవే
చనవిచ్చి వసంతునిఁ జల్లజేయు మనవే
యెనసి శ్రీవేంకటేశుఁ డిదె తానె వచ్చి నన్ను
మనికై నావద్దనుండి మన్నించు మనవే

రేకు: 1949-4 వసంతవరాళి సం: 29-232

పల్లవి: దేవరకు మోహించిన తెరవలు వచ్చినారు
వేవేలకు విన్నవించే విన్నపాలవారము

చ. 1: బత్తితోఁ జనుగుబ్బలు పడఁతి కానుక చూపీ
హత్తి చేయి చాఁచవయ్యా అవధరించి
తత్తరాన నివాళిచ్చీ తళుకు చూపులనె
యిత్తల నెచ్చరికతో నిటు చూడవయ్యా

చ. 2: వేడుకతో మోవితేనెవిందులు నీకుఁ దెచ్చె
కూడి నోరారాఁ జేకొనవయ్యా
వాడిక నవ్వులనే సేవంతివిరు లోసగీని
తోడనే మేలు మీఁద నందుకొనవయ్యా

చ. 3: చుట్టరికపు మాఁటలు సొరిది నీకుఁజెప్పె
వొట్టుకొని వొక లేమ వూఁకొనవయ్యా
ఇట్టె శ్రీవేంకటేశ యిందరిని నేలితివి
గట్టిగా సేవలుగొని కరుణించవయ్యా

రేకు: 1949-5 మేచబౌళి సం: 29-233

పల్లవి: మఱి నే మెంతడిగినా మాకుఁ జెప్పదు
గుఱుతులు నీవే చూచుకొందువు రావయ్యా

చ. 1: చేరఁడేసి కన్నులాపె చెంగలి చూపులది
నీరాకగోరి వాకిట నిలుచున్నది
చేరి నవ్వుకొంటా నీపసిఁడిగద్దెపై నున్నది
కోరి యాపెపే రడుగుదువు రావయ్యా

చ. 2: పట్టెఁడెసి చన్నులది బంగారువంటిమేనిది
పట్టుపచ్చడము నీది పరచుకొన్నది
దిట్టయై నిన్నుఁ బలిచి తెమ్మనియంటానున్నది
గట్టుతో నీ వాకెఁ గనుఁగొందువు రావయ్యా

చ. 3: దండి మీఁటి నీమీఁది పదాలు వాడుతానున్నది
అండనె నీవు మగఁడవంటానున్నది
దండిగా శ్రీవేంకటేశ తగవిచ్చి కూడితివి
నిండు నిధానమవై నెమ్మది నుండవయ్యా

రేకు: 1949-6 భైరవి సం: 29-234

పల్లవి: తనమేలుదానని తలఁపునఁ బెట్టుమను
వినయముతోఁ జెలి విన్నవించి రావె

చ. 1: చిత్తమున నెట్టుండెనో చిమ్మితిఁ గొనగోరను
కొత్త సతుల సుద్దుల కోరి చెప్పఁగా
వొత్తి మాఁటలాడితి వొద్ద నందరు నుండఁగా
తత్తరుపుఁ గాంతలను తప్పక చూడఁగను

చ. 2: కోపగించఁడుగదా గొణఁగుతాఁ దిట్టితి
రాఁపుల సతులతో సరసమాడఁగా
కాఁపురము సేయుమని గయ్యాళించి పెనఁగితి
పైపై దిమ్మరితనాలపడఁతుల నంటఁగా

చ. 3: సంతోసించుకొనెనో సాగిలి నే మొక్కితి
చింతదీర నామీఁదనే సేస చల్లఁగా
ఇంతలో శ్రీవేంకటేశుఁ డేలఁగా దేవులనైతి
మంతనాన నన్నే కడు మన్నించఁగాను

రేకు: 1950-1 దేశాక్షి సం: 29-235

పల్లవి: విందువు రావయ్యా వేడుక నీకుఁ గలిగితే
అంది తలఁచుకోవయ్యా ఆపెనీలోపొందులు

చ. 1: కొప్పు నిక్కఁ బెట్టుకొని గుబ్బలాఁడి యొక్కతె
అప్పటనుండి వాకిట నడిగీ నిన్ను
పిప్పిగట్టు విడేలు పెదవినిండాఁ జేసి
చెప్పీనదె నీ తన చిన్ననాటి సుద్దులు

చ. 2: కన్నులారుచుకొంటాను కతకారి తానొకతె
నిన్నుఁ జూడఁ దమకించీ నెయ్యముతోడ
చిన్ని చెక్కులవెంటాను చిప్పిల జవ్వాది గార
కిన్నెరలో వాయించీ మిక్కిలి నీపై చిందులు

చ. 3: వాడికమాఁటలులోడ వాకిలి దెరచుకొని
యీడకు వచ్చినది నీయెదుటికిని
కూడితివి నన్నుఁ దొల్లె గుట్టున శ్రీవేంకటేశ
వీడె మిచ్చి మేచ్చీ నిన్ను వింత వింత లాగులా

రేకు: 1950-2 పాడి సం: 29-236

పల్లవి: చెప్పఁబోతే వెరగయ్యీ చెలిమేలు దాఁచరాదు
వుప్పతిల్లు రతులను వోలలాడుమనవే

చ. 1: కుప్పలాయఁ బులకలు కోమలి చెక్కులవెంట
రెప్పలనే యలపు దేరీ నిదివో
చిప్పిలి చెమట లెల్లాఁ జిమ్మిరేఁగఁ జొచ్చె మేన
యెప్పుడు వచ్చీనే విభుఁ డేమిసేసీనే

చ. 2: చిత్తమెల్లా నీరాయ సేసకొప్పు చెదరెను
హత్తిన గుబ్బలపై పయ్యద జారెను
వత్తివలెఁ గెమ్మోవి వసివాడి తేనెగారీ
బత్తిసేసి తా నెప్పుడు పడఁతి నేలీనే

చ. 3: నిట్టూరుపులతోడ నిండుకొనెఁ గోరికలు
దట్టమాయ లోలోని తలపోఁతలు
ఇట్టె శ్రీవేంకటేశుఁ డింతిఁ గూడె నిందు వచ్చి
జట్టిగొనె నింకా నెంత చనవు లిచ్చీనే

రేకు: 1950-3 మంగళకౌసిక సం: 29-237

పల్లవి: ఇన్నాళ్లూ నెఱఁగము నీ వింతటివాఁడవౌత
పన్నుక యెవ్వతె నిన్నుఁ బనుపరచినదో

చ. 1: మాపుదాఁకా నేరుపులే మాతోఁ బచరించేవు
యే పళ్లిఁ జదివితివో యింతేసి నీవు
రాఁపుగా జాణతనాలు రామలతో నాడేవు
చేపట్టి యెవ్వతె నీకు సెలవులు వెట్టెవో

చ. 2: పూనుకొని యెందుకైనా పొసఁగ మాఁటాడేవు
యే నెలఁత నేరిపెనో యింతేసి నీకు
నానఁబెట్టి నానఁబెట్టి నవ్వులు నవ్వ వచ్చేవు
సేనగా నీ కలవాటు సేసినది యెవ్వతో

చ. 3: అందుకోలువలపులు అమ్మవచ్చే వప్పటిని
యెందు బేరాలాడితివో యింతేసి నీవు
కందువ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
పొంది నిన్ను నెవ్వతె పోరచి మరపెనో

రేకు: 1950-4 శుద్ధవసంతం సం: 29-238

పల్లవి: ఎంత వేగిరకాఁడవు యేమందు నేను
వింత వింత రతులను వినోదించేవు

చ. 1: వెలఁది నిన్ను దగ్గరి విన్నపాలు సేయఁగాను
చిలిమి బలిమి నాపెచన్నులంటేవు
పలుమారు వేడుకతో బాగాలు చేతికియ్యఁగా
మొలక నవ్వులతోడ మోవి యానేవు

చ. 2: పనివూని నీ కాపె పాదములొత్త రాఁగాను
చెనకి కుచ్చెలమీఁదఁ జెయి చాఁచేవు
వినయముతో నీకు విరులు ముడువఁగాను
మనసు పట్టఁగలేక మర్మము లంటేవు

చ. 3: వుక్కుమీరి యాపె నీకు వూడిగాలు సేయఁగాను
పిక్కటిలఁ గాఁగిటను బిగియించేవు
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
చొక్కుచు నాపెతోడ నా సుద్దులు చెప్పేవు

రేకు: 1950-5 ఆహిరి సం: 29-239

పల్లవి: ఈకెను మన్నించవద్దా ఇంతటనైనా
చేకొని యీరీతి నీ సేవలెల్లాఁ జేసెను

చ. 1: వినయముతో నీకు విన్నపము సేయుమని
తనమారు చెలి నంపెఁ దరుణి
చనవునఁ దనమారు సాగిలి మొక్కించుమని
కనకపుబొమ్మ నంపెఁ గనుఁగొనవయ్యా

చ. 2: నించి తనమారు యిట్టె నిన్ను సింగారించుమని
మించిన పూదండ యంపె మెలుఁత నేఁడు
పంచనుండి తనమారు పంతము నీ కిమ్మని
అంచెల ముంజేతి చిల్క నంపెను నీవద్దికి

చ. 3: నెలకొని తనమారు నీకుఁ బాదాలొత్తుమని
మెలుపున వజ్రాల మించు లంపెను
నిలిచి శ్రీవేంకటేశ నెట్టవఁ దానె వచ్చి
కళలంటి వేఁడుకొని కాఁగిలించె నిన్నును

రేకు: 1950-6 సామంతం సం: 29-240
పల్లవి: జెప్పఁ జెప్పఁ గొత్తలాయ చేరి వినేవారికెల్లా
కుప్పలుఁ దెప్పలుఁ గాఁగ కొమ్మలాల వినరే
రేకు: 1951-1 నాదరామక్రియ సం: 29-241
చ. 3: సన్నలు సేయనా మోవి చవులు నేఁ జూపగా
కన్నులారా నీవేరీతిఁ గంటివోకాని
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవునిన్నుఁ జూచి కృప యెంత నించితివోకాని

రేకు: 1951-2 సామంతం సం: 29-242

పల్లవి: ఇప్పుడు నన్నడిగేవు యెప్పుడు వచ్చితివని
కప్పురాన వేయనా నీ కతలెట్టివోకాని

చ. 1: విన్నవించనా నేను వీనులు చల్లఁగా నీకు
కన్నులను మొక్కనా కమ్మటి నేను
సన్నసేసి చూపనా చవిగా నా మోవితేనె
వున్నతి నెందుఁ బరాకై వుంటివోకాని

చ. 2: చేతులారా వేఁడుకోనా చెక్కునొక్కి నే నీకు
కాతరాన నీవేళ గాచుకండనా
రాతిరెల్లా నిట్టె జాగరాలు నీతోఁ జేయనా
యే తలపోఁతలతో నీవెటుంటివోకాని

చ. 3: పాదాలు నీకొత్తనా పానుపుపై నుండఁగాను
పోది సేస విడె మిచ్చి పొందు సేయనా
యీదెస శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
పాదుకొని నాపై నెంత బత్తి నుంటివో కాని

రేకు: 1951-3 నాదరామక్రియ సం: 29-243

పల్లవి: మంతనాన న న్నిట్టె మన్నించుఁగాక
సంతతమూఁ జెక్కునొక్కి సరస మేమాడీనే

చ. 1: చిగిరించె వలపులు చేగలెక్కెఁదమకము
నగుతా నాతో నెంత నాని సేసీనే
తగులాయ వావులు తతివచ్చె జవ్వనము
యెగసక్కేలకు నేల యెడబాఁటలాడీనే

చ. 2: పచ్చిదేరెఁజిత్త మిదె పదనెక్కెఁ దనువల్లి
కొచ్చి కొచ్చి నాతో నెంత గుట్టు చూపీనే
పెచ్చురేఁగెఁ గోరికలు పెనగొనెఁ బ్రియములు
తచ్చి తచ్చి మరి యాల తరితీపు సేసీనే

చ. 3: నమ్మికలు తుదకెక్కె నారుకొనెఁ బులకలు
కమ్మటి సిగ్గు లివేల కప్పవచ్చీనే
నెమ్మదిఁ గాఁగిటఁ గూడె నేఁడు శ్రీవేంకటేశుఁడు
వుమ్మడి సారెకు నేమి వొడివట్టీనే

రేకు: 1951-4 తెలుగుగాంబోది సం: 29-244

పల్లవి: మగువ నిన్నే కాని మరి యన్య మెఱఁగదు
జిగి నీపై వలపులు చిత్తగించవయ్యా

చ. 1: చన్నులమీఁది పయ్యద జారినదీ నెఱఁగదు
కిన్నెర మీఁటి నిన్ను గిలిగించీని
చిన్ని చెక్కులఁ గారేటి చెమటలు నెఱఁగదు
యెన్నిక తానాల తోడ నెలుఁగెత్తి పాడీని

చ. 2: తురుము వీడి విరులు తొరిగేది నెఱఁగదు
సిరుల నీపైఁ బదాలు చెప్పి చొక్కీని
సరుగన మొలనూలు సళ్లినదీ నెఱఁగదు
వరుస నీ గుణాలెల్లా వ్రాసి వర్ణించీని

చ. 3: పొదలిన మేనెల్లా బలకించే దెఱఁగదు
సదరాన నిన్నుఁ గూడి సంతోసించీని
పెదవిపై కెంపులు బెరసిన దెఱఁగదు
యిదె శ్రీవేంకటేశ ని న్నెచ్చరిక సేసీని

రేకు: 1951-5 ఆహిరి సం: 29-245

పల్లవి: ఇట్టె కరుణించవద్దా యింతటనైనా
నెట్టుకొన్న వినయాన నెలకొన్నదానను

చ. 1: మునుకొని చేతులెత్తి మొక్కితి నప్పుడె నీకు
చనుఁగవ యే లంటేవు సారెకునని
ననిచి పెట్టరానియానలెల్లా నీకుఁ బెట్టితి
గానకొని చెక్కులపై గోర గీరకుమని

చ. 2: లలి మోవి తేనియాలు లంచము లిచ్చితి నీకు
తిలకించి మానముపైఁ దిట్టకుమని
పిలిచినా చిలుక నీ పేరువెట్టి వేఁడుకొంటి
యెలమి నా సిగ్గులు బాయిట వేయకుమని

చ. 3: కదిసి వినయముతోఁ గాఁగిలించుకొంటి నిన్ను
పదరి యెన్నఁడూ నన్నుఁ బాయకుమని
యిదె శ్రీవేంకటేశ న న్నేలినందుకు మెచ్చితి
సదరాన నీవే భువి జాణఁడవని

రేకు: 1951-6 నాగవరాళి సం: 29-246

పల్లవి: నీ చిత్తము నా భాగ్యము నేరుపు లింకే మున్నవి
చూచినట్టు వచ్చీనా సూటితో వలపులు

చ. 1: యితవైతే మాఁటలు యెన్నైనా నాడఁగవలె
మతికి వెగటైతేను మానఁగవలె
కుతిలపు రారాఁపులఁ గొసరిఁగఁబోతేను
చుతురత లెన్నైనాఁ జవులు గాఁబోయీనా

చ. 2: చెల్లుబళ్లయితేను సేవలు సేయఁగవలె
వొల్లకుంటే గుట్టుతోడ నుండఁగవలె
పల్లదాన చనవులు పచారించఁబోతేను
వుల్లములో వేడుకలై యుండఁబోయీనా

చ. 3: చుట్టరిక మబ్బితేను సొలసి చూడఁగవలె
వట్టి పొందులైతే తలవంచుకోవలె
యట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మట్టులేని నీ రతులు మరచితేఁబోయినా

రేకు: 1952-1 కాంబోది సం: 29-247

పల్లవి: కడు వలచినదానిఁ గాకు సేతురా
యెడయక మన్నించి యేలుదురుగాక

చ. 1: చక్కెర పంటి మోవి చవిచూడవచ్చితేను
చుక్కలెట్టు నించితివి సుదతికిని
నిక్కి చూచి చేతు లెత్తి నీకు నిట్టె మొక్కితేను
జక్కవ చన్నులేల సారెఁ బిసికేవు

చ. 2: వేడుకతో నీకు నిట్టె విన్నపాలు సేయఁగానే
కూడఁబట్టి చెక్కులేల గోర గీరేవు
వాడికతోఁ బాదాలొత్తి వావులు చెప్పఁగాను
మేడెపురతుల నెంత మేలమాడేవు

చ. 3: వెన్నెల నవ్వులు నీతో వేమారు నవ్వేనంటా
పన్నుక మొలనూ లేల పట్టి తీసేవు
యిన్నిటా శ్రీవేంకటేశ యీకె నీకు దేవులంటా
మన్నించితి వింకా నేమి మర్మము లంటేవు

రేకు: 1952-2 రామక్రియ సం: 29-248

పల్లవి: ఇంతిప్రతాపము నీవే యెఱఁగుకొనేవుగాక
వింతలుగా వేరే నేము విన్నవించవలెనా

చ. 1: నెలఁత చిఱునవ్వులే నిండాఁ దమి రేఁచేవి
కలికితనాలే మతి గరఁగించేవి
తలిరు మోవె వలపు తలకెక్కఁజేసేది
పలుమారు నేమిటికి పంతాలాడేవయ్యా

చ. 2: వనిత చన్నుమొనలే వసము సేసుకొనేవి
కనుచూపులే వాఁడై కాఁడిపారేవి
ననిచిన కొనగోరే నాములై చొక్కించేది
యనలేని బింకాలు యెందువోయీనయ్యా

చ. 3: మగువకాఁగిలె సారె మరుగఁగఁ జేసేది
నిగురుఁజేతులే నీ సేవ సేసేవి
తగరి శ్రీవేంకటేశ తతినీకెఁ గూడితివి
జిగిమించ నీ నేరుపు చెప్పనేఁటికయ్యా

రేకు: 1952-3 కుంతలవరాళి సం: 29-249

పల్లవి: ఎరఁగము నీ సుద్దులు యిందాఁకాను
పెరరేఁపులనే యాస పేరఁబెట్టేవటవే

చ. 1: చుట్ట చుట్టి వచ్చి నీవు చూచే వాతని మోము
పొట్టఁబొరుగున నీకుఁ బొందు గద్దటే
కట్టెదుర నుండి మతి గరఁగేవు సారె సారె
వట్టి మాకు లిగిరించ వలచితివటవే

చ. 2: మందలించి మందలించి మాటలాడే వప్పటిని
అందుకొన్న నీ తమక మాఁపలేవటే
విందు చెప్పే నెపమున వేఁడుకొనే విటు వచ్చి
చందమామ గుటుకలు చవిచూపేవటవే

చ. 3: నంటు చూపి నంటు చూపి నవ్వేవు సెలవుల
అంటిము ట్టితనికి నీ వాలవటవే
యింటిలో శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు
జంటలైన రతులు తోడంటువెట్టేవటవే

రేకు: 1952-4 ఆహిరి సం: 29-250

పల్లవి: అలుగను సేయను ఆరడి నేల పెట్టీనే
చెలియ నీవైనా బుద్ది చెప్పవే యీతనికి

చ. 1: మోము దప్పక చూచితి ముచ్చటతో నవ్వితి
ప్రేమముతో మాటలాడి పీఁట వెట్టితి
కామించి తా వేఁడుకొంటే కానిమ్మని ఇయ్యకొంటి
యేమిసేయుమనీనే యింకాఁదాను

చ. 2: వీడెము చేతికిచ్చి వెసఁ బానుపు వేసితి
పాడి పాడి వేగినంతా పదా లొత్తితి
వాడుదేర నిట్టె యాలవట్టమూను విసరితి
యీడువెట్టుకొని యింకా నెంత వేఁడుకొనీనే

చ. 3: చేతులెత్తి మొక్కితి సేవలెల్లాఁ జేసితి
కాతరాన నిమ్మపండు కానుకిచ్చితి
యీతల శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁగూడె
యేతులు నే నెరఁగను యేల రట్టు సేసీనే

రేకు: 1952-5 హిందోళం సం: 29-251

పల్లవి: చూడఁ జాడ వేడుకలు సుదతి విలాసాలు
మేడెపు రతి భావాలు మెచ్చఁగదవయ్యా

చ. 1: వలపులు వెదవెట్టి వనిత నీమీఁదను
మొలచి తమకములు మోసుకలెత్తెను
యెలిమిఁ దలపోఁతలు యెన్ను వెళ్లె నంతలో
చెలఁగి నీ మహిమలు చిత్తగించవయ్యా

చ. 2: కువ్వలు వోసె వయసు కోమలి చన్నుల నీపై
నవ్వులు గాదెలునిండె నానాటికి
పువ్విళ్లూరి సరసము లొకటికినుమడాయ
చివ్వన నీ మహిమలు చిత్తగించవయ్యా

చ. 3: పొందికలు దూరవెత్తె పొలఁతి నీ కాఁగిటను
విందుసేసె మోవితేనె విభవానను
యిందరిలో శ్రీవేంకటేశ యీకె నేలితివి
చెందిననీ మహిమలు చిత్తగించవయ్యా

రేకు: 1952-6 శ్రీరాగం సం: 29-252

పల్లవి: ఆతని చిత్తము వచ్చినదే పదివేలుగాక
చేతులెత్తి మొక్కే నేను చిత్తముగించుమనవే

చ. 1: చెల్లుబడి గలిగితే చెనకి కొసరవలె
వొల్లనే కొంకితే నూరకుండవలెను
పల్లదాన రమణుని బలిమి సేసితేను
యెల్లవారూ నాఁట దాని నెంత గయ్యాళెనరా

చ. 2: మన్ననలు సతమైతే మాఁటలెల్లా నాడవలె
విన్నప మందకుండితే విడువవలె
సన్నకు లోఁగానివాని సాదించఁజూచితేను
కన్నవారెల్లా నెంత గబ్బి యిది యనరా

చ. 3: మనసు చిమ్మిరేఁగితే మచ్చికతో నవ్వవలె
తనిసితే నివ్వెరగందఁగవలెనూ
యెనసిన శ్రీవేంకటేశుతోఁ బెనఁగితేను
వినినవారెల్లా నన్ను వేసాలది యనరా

రేకు: 1953-1 శుద్ధదేశి సం: 29-253

పల్లవి: నీ వేమి సేసినాను నీకుఁ జెల్లును
వేవేలు చందాలను వేఁడుకొనే నిన్నును

చ. 1: మాఁటలు నాతో నాడుతా మళ్లి చూచే వేమి నీవు
ఆఁట దెవ్వతో చూచినంటానో నిన్ను
చాటువెట్టుకొని కొంత సన్నలు సేసేవు నాతో
మాటిచ్చుకున్నాఁడవో మరియు నాపెకును

చ. 2: వొద్దఁబండ్డుండి యవ్వల నొగిఁ జోటిచ్చుకుండేవు
నిద్దరించేవేళ నాపె నీవుఁ గూడేవో
వొద్దికఁ బుక్కిట దాఁచుకున్నాఁడవు తములము
చద్ది గట్టిపెట్టితివో సరుగ నాపెకును

చ. 3: పొంకముగా జాగరాలఁ బొద్దువుచ్చ వాపెను
కంకణము గట్టి తొల్లె కలసితివో
అంకెల శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
ఇంక నీకు వెఱపులే దెరుఁగదు నవ్వితి

రేకు: 1953-2 పాడి సం: 29-254

పల్లవి: మేలు మేలు జవరాలు మెఱసే నీ సింగారాలు
కోలుముంద్దై నీ కిన్నిటా గుఱుతులు సేసీనే

చ. 1: చనుగుబ్బల మీఁదటి చంద్రవంకలు
కనుఁగొన చూపుల కడకెంపులు
తనువుపై చెమట చిత్తడి సోనలు
గొనకొన్న రతులకు గురుతులు సేసీనే

చ. 2: నొసలిపైఁ జెదరిన నునుఁగురులు
ముసిముసినవ్వుల మురిపెములు
అసురుసురుల తోడి యలయికలు
కొసరేటి రతులకు గురుతులు సేసీనే

చ. 3: ముదమునఁ దేరేటి మోముకళలు
పెదవిపై నిండిన ముప్పిరిబేంట్లు
యెదుట శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నేలఁగాను
గుదివొన్న రతులకు గురుతులు సేసీనే

రేకు: 1953-3 శంకరాభరణం సం: 29-255

పల్లవి: పొద్దొక వన్నెలతోడఁ బొదలీ నీపె సిరులు
వొద్దికతోఁ జూడరమ్మా వూహించి చెలులు

చ. 1: చెలి చెక్కులఁ గాసేవి చిరునవ్వు వెన్నెలలు
పలుకులఁ దొలఁకేవి పంచదారలు
పలువరుసనుఁ గనుపట్టినవి మాణికాలు
యిల నీకె చక్కఁదనన మెంతని చెప్పుదమే

చ. 2: చన్నులపైఁ దేరేవి చాయల పైఁడినిగ్గులు
కన్ను లజళిపించెవి కారుమించులు
చిన్ని మొగమున మెరసేవి మదనకళలు
యిన్నిటా నీపె భావము యెంతని చెప్పుదమే

చ. 3: నిక్కుఁదురుము మీఁదట నిండినవి సింగారాలు
చొక్కపుమేన నిండేవి చక్కఁదనాలు
గక్కన శ్రీవేంకటాద్రి ఘనుఁడు మన్నించి కూడె
యిక్కడ నీపె చెలువ మెంతని చెప్పుదమే

రేకు: 1953-4 సామంతం సం: 29-256

పల్లవి: సకలము నెరిఁగిన జాణఁ డితఁడు
మొక మెందాఁకాఁ జూచేవు మొక్కఁగదవే

చ. 1: విన్నవించవే నీవు విభునికి మనవులు
సన్నలా చాయలా నేమి సాదించేవు
పన్నుక వద్దఁ గూచుండి పాదా లొత్తఁగదవే
చన్నుల నీతని నేమి సరిఁ దాఁకించేవు

చ. 2: నవ్వవే యాతనితోను ననుపులు సేసుకొని
పువ్వుల నేమివేసేవు పూఁచి పూఁచి
పువ్విళ్లూర మోవి యిచ్చి వొడఁబరచుకొనవే
చువ్వన నీతని నేమి చొక్కులఁబెట్టేవు

చ. 3: ఆకు మడిచియ్యవే అట్టె బాగా లొసఁగి
దాకొని వూరకే యంత తమిరేఁచేవు
యీకడ శ్రీవేంకటేశుఁడేలె నిన్ను మెచ్చఁగదె
మేకుల నీతని నెంత మేలమాడేవు

రేకు: 1953-5 శ్రీరాగం సం: 29-257

పల్లవి: ఇంక నిన్ను దూరను యియ్యకొంటి ని యానతి
కంకణము గట్టితి వీకాలమునాఁడే

చ. 1: యెన్ని లేవు విన్నపాలు యిట్టె సేసేనంటే నీకు
మన్నించినదే గురుతు మాకు నీవు
సన్నలు చాలుఁగలవు సారెఁ బాచారించేనంటె
వన్నెల మా యింటికి వచ్చుటే గురుతు

చ. 2: యెంతని చెప్పుదు మోహ మిట్టె నీకుఁ జూపెనంటే
యింతగా లాలించినదే యెక్కుడు నాకు
వంతుల కలివి యేది వాసులు వట్టేనంటే
చెంతనుండి నాతో పొందుసేసినదే గురుతు

చ. 3: యెక్కడ గొలఁది సేవలిట్టే నేఁ గావించేనంటే
యిక్కడ నన్నేలినదే యింపు నాకు
నెక్కొని శ్రీవేంకటేశ నీకు నే మొక్కేనంటే
లెక్క యేది నీ వేలినలీలలే గురుతు

రేకు: 1953-6 తెలుగుగాంబోది సం: 29-258

పల్లవి: చెలువుఁడ యీకెనుఁ జిత్తగించుమిఁక
వెలసి నీకు నికు నివి వేడుకలాయ

చ. 1: తలఁచక తలఁచిన తరుణిరాక యిది
యిల నీకోరిక కిరవాయ
మొలవక మొలచిన ముసిముసి నవ్వులు
నెలకొని వలపుల నిలుకడలాయ

చ. 2: చూడక చూచిన సొలపుల చూపులు
వీడని యాసకుఁ దోడాయ
కూడక కూడిన కుచములసోఁకులు
తోడనే రతులకు దోమటులాయ

చ. 3: పెనఁగక పెనఁగినప్రియముల కాఁగిలి
తనివోనితమికిఁ దగులాయ
యెనసిన శ్రీవేంకటేశ యీమగువ
అనిశము నీకును హారంబాయ

రేకు:	1954-1 శుద్ధవసంతం	సం:	29-259

పల్లవి:	ఎన్నాళ్లనుండి కాచుక యిందుకే వుంటవో నీవు
	పన్నిన నీ కోరికలు ఫలియించె నిపుడు

చ. 1:	చేవదేర నాకె నీకు చేతులెత్తి మొక్కితేను
	దేవులవు గమ్మంటా దీవించేవు
	వావి చెప్పుమని నిన్ను వాలాయించి యడిగితే
	బావనంటా సరసాలె పచారించేవు

చ. 2:	ముదమున నాకె నీమోము దప్పక చూచితే
	ఇదె పెండ్లి లగ్నమంటా నియ్యకొల్పేవు
	చెదరకు వూరకే నీచెంత నిలుచుండితే
	యెదురేది నీకు నాకు లీడుజోడా ననేవు

చ. 3:	మక్కువల నాకె నీతో మంచి మాఁటాడితే మోవిఁ
	జక్కెర చిందీనంటాఁ జవి చూచేవు
	యిక్కడ శ్రీవేంకటేశ యెరిఁగి తా నవ్వితేను
	గక్కన మెచ్చితినంటాఁ గాఁగిలించేవు

రేకు: 1954-2 వరాళి సం: 29-260

పల్లవి: కాఁపురము సేయవయ్యా కలకాలము నీరీతి
దాఁపురాలై మీ పొందులు తారుకాణలాయను

చ. 1: కచ్చుక నీరాక కీపె కాచుకున్నందుకు నీవు
విచ్చేసితి వింతలోనె వేడుకతోను
తచ్చి మీ తలపోఁతలు తాళమువేసి నట్టాయ
మెచ్చిరి చెలుల్లాను మేలు మేలయ్యా

చ. 2: మునుకొని యీపె నీకుమొక్కులుమొక్కినందుకు
యెనసి కాఁగిలించితి వెదురుకొని
మొనసిన మీ చేఁతలు ముయికి ముయ్యై నట్టాయ
పొనుఁగక మీ గుణాలు పొగడి రిందురును

చ. 3: పమ్ముకొని యీపె నీకు బాగా లిచ్చినందుకు
తమ్ముల మొసఁగితివి తమితోడను
నెమ్మి శ్రీవేంకటేశ మీ నేర్పు సరి బేసులాయ
సమ్మతితో మీకు నెల్లా సంతోసములాయ

రేకు: 1954-3 పాడి సం: 29-261

పల్లవి: సేయవే మగనిసేవ చేతులారాను
కాయజ కేలికి వచ్చి కాయమెంత దాఁచేవు

చ. 1: సిగ్గు లింతే సేఁటికే చిరునవ్వు లఁటికే
అగ్గలమై నీతో మాఁట లాతఁ డాడఁగా
వొగ్గి విడె మందుకోవే వొద్దఁ గూచుండఁగదవె
యెగ్గేల చిన్నదానవా యెన్నాళ్లై_నాను

చ. 2: శిరసు వంచ నేఁటికే చెక్కిట చెయి వెట్టనేలే
బెరసి యాతఁడు నీతోఁ బెనఁగఁగాను
పరిమళాలు వూయవే పాదము లొత్తఁగదవే
పెరిగి పెద్దవై ఇంకాఁ బిన్నదానవా

చ. 3: పయ్యదకొంగుమాటేలే పరాకు సేసుకోనేలే
నెయ్యముతో నాతఁడు నిన్నుఁ జూడఁగా
చెయ్యారాఁ గూడిన శ్రీవేంకటేశుఁడేకదే
వుయ్యాల పిన్నదానవా వొదగె నీ చన్నులు

రేకు: 1954-4 కన్నడగౌళ సం: 29-262

పల్లవి: మన్నించుఁగాక వట్టి మరఁగులేలే
తిన్నని నా గుణాలివి తెలుసుకొమ్మనవే

చ. 1: మొగము చూచినప్పుడే మునుకొనె నాసలు
నగినప్పుడే వెలసె ననుపులెల్లా
తగిలి మాఁటాడితేనే తలపోఁత లీడేరె
మగఁడాయ నాకుఁ దాను మనసేమి చూచీనే

చ. 2: సరుసఁ గూచున్నప్పుడే జంటాయఁ జుట్టరికము
తెరదీసినప్పుడే పొందిక లమరె
సరసమాడినప్పుడే సతమాయ భోగములు
మరుతంత్రములతోడ మనసేమి చూచీనే

చ. 3: మేనులు సోఁకినప్పుడే మేరసె సంతోసము
తేనె మోవిచ్చినప్పుడే తేరెఁ బనులు
తానె వచ్చి నన్నుఁ గూడె తగ శ్రీవేంకటేశుఁడు
మానాపతినైన నా మనసేమి చూచీనే

రేకు: 1954-5 మంగళకౌసిక సం: 29-263

పల్లవి: ఎంత వేగిరకాఁడే యీతఁడు తాను
అంత బత్తి గలిగితే నప్పుడే రావలదా

చ. 1: దివ్వెలెత్తుఁ బొద్దుకాడ దిక్కులనుండి వచ్చీ
నవ్వు లేమి నవ్వీనే నాతోఁడాను
పవ్వళించి యింటిలోన పనిలేదు పాటలేదు
పువ్వుల నేల వేసీనే పూఁచి పూఁచి నన్నును

చ. 2: పరవాతా లేచివచ్చి వద్దని నే మొక్కఁగానె
సరసము లే మాడీనే సారె నీతోను
యిరవై తెరవేసుక యిందుకే కాచుకవుండి
కెరలించి యేల గిలిగించీనే నన్నును

చ. 3: పట్టపగలె వచ్చి పాదా లొత్తమంటాను
చుట్టరిక మొంతసేసి చూపీ నితఁడు
యిట్టె శ్రీవేంకటేశుఁ డితఁడె తా నన్ను నేలె
గుట్టుతోడ మరి యాల కొసరీని నన్నును

రేకు: 1954-6 తెలుగుగాంబోది సం: 29-264

పల్లవి: మదనునిబాలాలవి మర్మములు గరఁచీని
యెదుటనుండి చెలికి యిచ్చకమే సేయరే

చ. 1: చలరేఁగి పతిఁబాసి చింతతో నున్న సతికి
చిలుకలఁ జూపకురే చెలులాల
వలపు లతనికెక్కె వసివాడివుండేవేళ
కలువపూవులు దెచ్చి కానుక లియ్యకరే

చ. 2: విరహతాపముచేత విసుగుతా నుండఁగాను
సురటి విసరి గాలి సోఁకించకురే
మరిగి రతికిఁ బలుమరు నేఁకరేటి దాని
అరిది కోవిల వనాలందు నాడించకురే

చ. 3: వుమ్మగిలి జవ్వనాన నుసురసురై వున్నది
తుమ్మిదలున్న పొదలు దూరించకురే
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి యీకెఁ గూడె
నెమ్మది సోబానఁ బాడి నేరుపులు చెప్పరే

రేకు: 1955-1 బౌళి సం: 29-265

పల్లవి: ఇంకా నేల లోఁగేవు యెరిఁగిన పనులకు
సంకెలెల్లాఁ దేరెను చక్కనాయఁ బానులు

చ. 1: పెదవి తేనెలుగారఁ బ్రియములు చెప్పీ నాపె
అదివో నీ యెదుటనే యప్పటనుండి
కొదదీర నిలుచుండి కొలువుల సేసీ నీకు
పదరక మరి యెంత పనికోకాని

చ. 2: కమ్మటి నీ రాకలకే కాచుకుండె నిందాఁకా
వుమ్మడి నీ వలపులు వొడిఁబెట్టుక
చిమ్ముచు నవ్వులు నవ్వి చిత్తమెల్లాఁ గరఁగించె
ఇమ్ముల నీ తలపోఁత లెట్టున్నవోకాని

చ. 3: కలయికలకు లాచి కనుసన్నలెల్లాఁ జేసీ
చెలరేఁగి చెక్కులెల్లాఁ జెమరించఁగా
అలరి నన్నేలితివి యాకె యలమేలుమంగ
కలిగె శ్రీవేంకటేశ కలిమెంతోకాని

రేకు: 1955-2 వరాళి సం: 29-266

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్లును యింతటి దానవౌత
గుఱుతు లన్నియు నేఁడుకూడ పెట్టుకొంటివే

చ. 1: మొలకనవ్వుల ముసగసలు
కలికితనంబుల కనుచూపులు
తలిరు మోవి సన్నల తరితీపులు
నెలతరో నీ వెందు నేరుచుకొంటివే

చ. 2: శిరసు వంపుల చిరుసిగ్గులు
సరసపుఁ జెనకుల చయ్యాటాలు
తురుము సింగారాల మురిపెములు
తరుణిలో యివి నీ వెత్తలఁ దెచ్చుకొంటివే

చ. 3: కదలుఁ జన్నుల గరగరికలు
పుదుట మాఁటలోని వొడఁబాటులు
యిదె శ్రీవేంకటేశుతో యెనయికలు
మదిరాక్షిరో యెట్టు మన్నింపించుకొంటివే

రేకు: 1955-3 మాళవిగౌళ సం: 29-267

పల్లవి: ఆకెకూ నీకూఁ దెలుసు నన్నివనులును నేఁడు
యీకడ నింకా సుద్దు లేమడిగే విఁకను

చ. 1: మంతనాన నీ వాడిన మాఁటలు దలఁచుకొని
యింతి చిరునవ్వు నవ్వె నేఁటికోకాని
బంతి నీవూఁ దానూఁ బండే పానుపువంక చూచి
చింతతోడ మేను నిండా చెమటలే కురిసె

చ. 2: పలుమారు నీమీఁది పదములు వాడి వాడి
యెలమి సిగ్గున లోఁగె నేఁటికోకాని
బలువైన నీ గుణాలు పలకపై వాసుకొని
వలపులపులకలు వాములుగా వేసెను

చ. 3: మిక్కుటపు నీ సొమ్ములు మెడనిండాఁ బెట్టుకొని
యిక్కువతో మొక్కు మొక్కె నేఁటికోకాని
ఇక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
యెక్కి నీ వురముమీఁద నిన్నిటాను వెలసె

రేకు: 1955-4 లలిత సం: 29-268

పల్లవి: ఇద్దరికి నిచ్చితివి యిరుమేలాఁ జనవులు
వొద్దికై రతికి నన్నే వొడఁబరచేవు

చ. 1: సన్నలనే మోవితేనె చవులెల్లాఁ జూపె నాపె
చన్నులు దాఁకించి సరసములాడెను
యిన్నేసి నేరిచినది యింకా నేమి సేసునో
నన్నుఁ జూచి యీడ వచ్చి నవ్వులు నవ్వేవు

చ. 2: వాడికమాఁటలాడి వలపులు చల్లె నాపె
వేడుకతోఁ దా మరల వేసె నప్పటి
యీడనుండి యింత సేసె యేమి దలఁచుకున్నదో
వోడక నాతో పొందుల నోలలాడేవు

చ. 3: కందువకు వచ్చి నిన్ను కాఁగిలించుకొనె నాపె
సందడిఁ బాదము దొక్కి జంకించెను
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
యిందు నిన్నేమనునో న న్నెనసి మన్నించేవు

రేకు: 1955-5 ముఖారి సం: 29-269

పల్లవి: తనగురుతులు మేనఁ దారుకాణలై యుండఁగా
పెనఁగుచు నవ్వులేల పెంచీనే తాను

చ. 1: మాట లెన్నైనాఁ గలవు మళ్లి మళ్లి యాడితేను
పేటలుగా నాన లేల పెట్టీనే తాను
నీటుల తన సుద్దులు నిన్ననే వింటి నేను
పాటించి న న్నేల వొడఁబరచీనే తాను

చ. 2: తక్కులెన్నైనా గలవు తవ్వి తవ్వి పోసితేను
మిక్కిలి యంతేశి నమ్మించీనే తాను
గక్కున తనచేఁతలు కన్నులారాఁ గంటి నేను
కక్కసించి మనసేల కరఁచీనే తాను

చ. 3: పొందులెన్నైనాఁ గలవు పొంచి పొంచి కూడేనంటే
ముందు ముందుగా నన్నేల ముట్టీనే తాను
చెందె నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు తాను
అందుకొంటి విడె మేల యడిగీనే తాను

రేకు: 1955-6 భైరవి సం: 29-270

పల్లవి: వేవేలు సతులుగల వేడుకకాఁడవు నీవు
దేవులఁ గనక నీకుఁ దెలిపితిఁ జుమ్మీ

చ. 1: మంచిమాఁటలాడితేనే మగువలు చొక్కుదురు
పంచనలు సేతురు వలతురు
యించుకంత యెడసినా యెలయించి యెఁపినాను
కంచుఁబదనులవారు కామినులు సుమ్మీ

చ. 2: చెక్కు నొక్కి వేఁడుకొంటే చెలులు గరఁగుదురు
మక్కువఁ గాఁగిలిత్తురు మరుగుదురు
కక్కసించి యేలినాను కపటాలు నెరపినా
వుక్కుబదనులవారు వువిదలు సుమ్మీ

చ. 3: తేజముతో నేలితేనే తెరవలు మొక్కుదురు
సాజాన సేవసేతురు సమ్మతింతురు
యీజాడ శ్రీవేంకటేశ యేలి తలమేల్మంగను
గాజుఁబదనులవారు కాంతులు సుమ్మీ

రేకు: 1956-1 లలిత సం: 29-271

పల్లవి: ఇందులకే వెరగయ్యీ నిద్దరిఁ జూచి నాకు
కందువల మనసెట్టు గరఁగేవోకాని

చ. 1: వెలఁది గుట్టుమానిసి వేడుకకాఁడవు నీవు
బలిమిసేసి కొఁగేల పట్టేవోకాని
పలుకుఁ దేనెల దీకె, పంతపువాఁడవు నీవు
చెలరేఁగి పొందు లెట్టు సేసేవోకాని

చ. 2: కడుసిగ్గరిది యీకె గయ్యాళివాఁడవు నీవు
అడరి సరస మెట్లా నాడేవోకాని
కడఁగి కోమలి యీకె, గడుసువాఁడవు నీవు
జడియ నీ రతు లెట్టు జరపేవోకాని

చ. 3: యిచ్చకపుసతి యీకె యేలినవాఁడవు నీవు
నిచ్చఁ గూడి యెట్లా మన్నించ్చేవోకాని
యిచ్చట నలమేల్ మంగ యీకె శ్రీవేంకటేశుఁడ
మెచ్చి పెండ్లాడితి వెంత మెరయించేవోకాని

రేకు: 1956-2 సామంతం సం: 29-272

పల్లవి: మే లెరిఁగి మెలఁగితే మెత్తురు నిన్నింతులెల్లా
పోలించి పోలించి వలపులు నించుకోవయా

చ. 1: పిలుచుకవచ్చి నీకుఁ బీఁటవెట్టి విడెమిచ్చి
చెలి చుట్టరికాలెల్లాఁ జేసె నీకును
మలయుచు యీ మేలు మరవక యేపొద్దూ
తలఁచుక తలఁచుక తమిరేఁచుకోవయా

చ. 2: మంతానానఁ బాదాలొత్తి మాఁటలాడి విందుపెట్టి
కాంత వుపచారాలెల్లాఁ గావించె నీకు
దొంతిఁ బెట్టి యీ బత్తి తోడఁదోడ దాఁచుకొని
సంతోసించి సంతోసించి చవిసేసుకోవయ్యా

చ. 3: కదిసి చన్నుల నొత్తి కాఁగిలించి చొక్కించి
సుదతి ఇచ్చకాలెల్లాఁ జూపె నీకును
ఇదవో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నాకెఁ
బొదిగి పాదిగి కొంత పోది సేసుకోవయ్యా

రేకు: 1956-3 బౌళి సం: 29-273

పల్లవి: మారుకుమారు నీవూ మగువనుఁ జేయరాదా
దూరలేల కట్టేవు తొయ్యలిపై నీవు

చ. 1: తప్పక చూచెనంటా తమకము రేఁచెనంటా
వుప్పతించి యాపె నేల వొడివట్టేవు
కప్పురాన వేసెనంటా కడు వలపించెనంటా
తప్పులేల మోపేవు తరుణిపై నీవు

చ. 2: చన్నులు దాఁకించెనంటా చవులు మురిపెనంటా
మిన్నక తిట్టుతా నేల మేల మాడేవు
సన్నలు సేసెనంటా చాలా నెలయించెనంటా
యెన్ని గొడిమెలు గట్టే వింతిమీఁద నీవు

చ. 3: మాఁటలఁ గొసరెనంటా మనసు గరఁచెనంటా
పాటించి యెంతేసి నెపాలు వేసేవు
గాఁటపు శ్రీవేంకటేశ కాఁగిట మెప్పించెనంటా
యేఁటలేల వేసేవు యీ సతిపై నీవు

రేకు: 1956-4 ఆహిరినాట సం: 29-274

పల్లవి: చేతులెత్తి మొక్కే నిదె చెలియరో విభునికి
నీతితోడ నన్నిట్టె మన్నించి యేలు మనవే

చ. 1: ఆసపడ్డదాని నింత అలయించకు మనవే
సేసవెట్టి జాగునేల సేసె నవే
రాసికెక్కె నావలపు రవ్వసేయకు మనవే
మూసిన ముత్తుమువంటి ముద్దురాలననవే

చ. 2: సిగ్గుతోడ నున్న దానిఁ జెనకకు మనవే
యెగ్గులేనిచోట నేప నేఁటి కనవే
వొగ్గి విడె మియ్యఁగాను వొడివట్టకు మనవే
కగ్గులేని తన వూడిగపుదాన ననవే

చ. 3: ననిచినదానితోడ నాలితనమే లనవే
తనకు నాకును పొందుతగు ననవే
యెనసె శ్రీవేంకటేశుఁ డియ్యకొంటి ననవే
మనసు నమ్మిన మేనమఱఁదల ననవే

రేకు: 1956-5 మాళవిగౌళ సం: 29-275

పల్లవి: ఇటువంటి సతి పొందు లెంతని పొగడవచ్చు
తటుకన నీకు నబ్బెఁ దగు మీ యిద్దరికి

చ. 1: చిందేటి పెదవి తేనె చిప్పిలఁగాఁ జెలి నీతో
మందలించి నోరు నిండా మాఁటలాడెను
చందమామవంటి మోము చక్క నెత్తి వేడుకతో
కందువ నీ ముందరను కలకల నవ్వెను

చ. 2: జారిన పయ్యదలోని చనుఁగవ గానరాఁగా
గారవముతోడ నీకుఁ గాను కిచ్చెను
బారెఁడేసి నెరిఁగొప్పుపాదాలపై సోఁకఁగాను
కూరిమితో నీకు నిట్టె గురుతుగా మొక్కెను

చ. 3: బంగారువంటి చేతులఁ బట్టి నీ చెక్కులు నొక్కి
చెంగలించి విడెము నీ చేతి కిచ్చెను
అంగపుఁజెమటతో ని న్నలమి శ్రీవేంకటేశ
వుంగిటిగా రతుల ని న్నోలలాడఁజేసెను

రేకు: 1956-6 కాంబోది సం: 29-276

పల్లవి: ఈ కాంత నేలిన యీతఁ డెంత భాగ్యవంతుఁడే
చేకొన్న సంతోసాన చెలరేఁగీ వీఁడివో

చ. 1: కలికి కన్నుల చూపు కమ్మమోవి తరితీపు
చెలియ చక్కని రూపు చెప్పఁ గొత్తలు
మొలక చన్నుల వొప్పు ముంగురుల పెనుఁగొప్పు
చెలపచెమటచొప్పు చెలులాల చూడరే

చ. 2: మొగములోపలితీరు ముత్తైపు కుచ్చులపేరు
సొగసుఁ బయ్యెద జారు చొక్కమాయనే
నగవు లోపలి సిగ్గు నవకపు మేని నిగ్గు
మగువ మొక్కుల తగ్గు మంచిదే కదరే

చ. 3: కడుసింగారాలసొంపు కందువమాఁటల యింపు
నడపులలోని జంపు నయమేకదే
యెడయక శ్రీవేంకటేశుఁ డిట్టె యీకెఁ గూడె
విడువని రతిపెంపు వేడుకలై మించెనే

రేకు: 1957-1 రామక్రియ సం: 29-277

పల్లవి: ఎంత కెంత నీపగటు యేమి చెప్పేది
మంతుకెక్కి నావలెనే మన్ననదానవా

చ. 1: సారెకు నా మగనితో బాణతనాలాడేవు
కూరిములు చల్లుకొంటాఁ గొసరేవు
చేరువనే కూచుండి సేవలు సేయవచ్చేవు
పేరుకొని కావలె పెండ్లికూఁతురవా

చ. 2: తప్పక చూచి యీతనిఁ దమి రేఁచవచ్చేవు
యెప్పుడూ నెదుటనుండి యేఁకారేవు
దప్పిదేర మోవి చూపి తలఁపించేవు పొందులు
చెప్పవే నావలె నీవూ సేసలు వెట్టితివా

చ. 3: గుట్టున శ్రీవేంకటేశుఁ గోరి చాగిలి మొక్కేవు
వొట్టుక చనుమొనల నూఁది పట్టేవు
యిట్టె న న్నేలినాఁడు యీతఁడు నీ కేమవునే
జట్టిగా నావలె నీవూఁ బట్టము దేవులవా

రేకు: 1957-2 పళవంజరి సం: 29-278

పల్లవి: చూతముగా నీవు సేసే చుట్టరికములెల్లాను
నాతి నెన్నిచందుముల నమ్మించేవోకాని

చ. 1: నిక్కి చూచితి వింతిని నెయ్యముతో నవ్వితిని
నెక్కొని యేరీతుల మన్నించేవోకాని
మక్కువతోఁ జేకొంటివి మాఁటలెల్లా నాడితివి
తక్కక యెట్లా దయదలఁచేవోకాని

చ. 2: సంగడిఁ గూచుండితివి చనవులూ నిచ్చితివి
యెంగిత మెరిఁగి యెప్పు డేలేవోకాని
అంగవించి మెచ్చితివి యాసలఁ దేలించితివి
చెంగట సంతోస మెంత సేసేవోకాని

చ. 3: గరిమఁ బెండ్లాడితివి కాఁపురాలూఁ జేసితివి
నిరతి నెచ్చుటఁ గరుణించేవోకాని
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
నెరవుగా రతులెన్ని నేరిపేవోకాని

రేకు: 1957-3 పాడి సం: 29-279

పల్లవి: ఇదివో నా మోహము నీ కెంతని చెప్పుదు నేను
కదిసి నీ మోము చూచి కన్నుమూయఁజాలను

చ. 1: వొత్తి నిన్ను దూరనోప వొట్టులు వెట్టఁగనోప
హత్తి నీతో నిచ్చకము లాడేఁగాని
కొత్తగాఁ గొసరనోప గోరికొన గీరనోప
చిత్తమురా సేవలిట్టె సేసేఁగాని

చ. 2: పెనఁగి గుంపించనోప బీరము చూపఁగనోప
ననుపు సేసుక నీతో నవ్వేఁగాని
పొనుఁగుచు దాఁగనోప బొమ్మల జంకించనోప
వినయాన మొక్కి నిన్ను వేఁడుకొనేఁగాని

చ. 3: సిగ్గుతో నలుగనోప శిరసు వంచఁగనోప
వొగ్గి మోవి తేనెకు నోరూరేఁగాని
వెగ్గళముగా నన్ను శ్రీవేంకటేశ యేలితివి
యెగ్గు లెంచనోప నిన్ను నిట్టె మెచ్చేఁగాని

రేకు: 1957-4 ఆహిరి సం: 29-280

పల్లవి: ఇంతి చందములు నీకు నిన్నీ విన్నవించితిమి
మంతు కెక్కఁ జేసి కూడి మన్నించవయ్యా

చ. 1: మొలకనవ్వులనే ముగ్గులు వెట్టుకున్నది
వెలఁది యింటికి నీవు విచ్చేయవయ్యా
తళుకుఁ జెక్కులనే యద్దములు గట్టుకున్నది
సొలసి యీపెవంక చూడవయ్యా

చ. 2: అట్టె మోవితేనెలవిం దాఇతము సేసినది
చుట్టమవై వచ్చి చవి చూడవయ్యా
గట్టి చన్నుల వలపు కప్పము గట్టుకున్నది
దట్టపు వేడుక నవధించవయ్యా

చ. 3: వింతగాఁ గాఁగిలి నీకు విడిది గావించినది
సంతోసాన రతులెల్లా సలుపవయ్యా
ఇంతట శ్రీవేంకటేశ యిందు వచ్చి యేలితివి
చెంత నీపె సింగారాలు చిత్తగించవయ్యా

రేకు: 1957-5 గౌళ సం: 29-281

పల్లవి: నిండు వలపులతోడ నిన్ను నీ వెఱఁగవు
పండవే యాతని పక్క బాగాలిచ్చేవుగాని

చ. 1: చినుకుఁజిత్తడియైన చెమట దుడుచుకోవే
వెనక నాతనితో నవ్వేవుగాని
కొనలు వెళ్లి వీడిన కొప్పు చక్కఁబెట్టుకోవే
మునుకొని తలవంచి మొక్కుదువుగాని

చ. 2: బలు చన్నులపై జారే పయ్యద గప్పుకొనవే
సొలసి యాతని దిక్కు చూతువుగాని
పెలుచుఁ గెమ్మోవిమీఁదిబేంట్లు మూసుకోవే
అలరి యాతనితో మాఁటలాడుదువుగాని

చ. 3: నెట్టన రెప్పల తుద నిద్దుర లడంచుకోవే
గుట్టున నీతని మరిఁ గూడేవుగాని
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు
చుట్టరికము చెప్పవే చొక్కింతువుగాని

రేకు: 1957-6 నాదరామక్రియ సం: 29-282

పల్లవి: గురి గడవఁగరాదు కొమ్మ నీ రతులకును
విరివైన రతులకు వేడుక లివి గురి

చ. 1: మచ్చికలకునుఁ బచ్చి మాఁటలే గురి
యిచ్చకపు మాఁటలకు యింపులు గురి
నచ్చుకొట్టే యింపులకు నవ్వులు గురి
అచ్చపు టింపులకును ఆసలు గురి

చ. 2: కూడే యాసలకుఁ జెనకు లివి గురి
జోడైన చెనకులకు చూపులు గురి
వాడిక చూపులకు వాసులు గురి
మేడెపు వాసులకును మెచ్చులు గురి

చ. 3: మునుకొన్న మెచ్చులకు మోవులు గురి
పెనగొన్న మోవులకు ప్రియాలు గురి
ననుపుఁ బ్రియాలకు వినయాలు గురి
వినయపు సతికి శ్రీవేకంటేశుఁడే గురి

రేకు: 1958-1 దేసాళం సం: 29-283

పల్లవి: తా నెంత నీ వెంత తగిలి తగిలి నిన్నుఁ –
బూని వలపించి యీకె పొదలెఁ గదవయ్యా

చ. 1: చిడుముడిఁ వూడిగాలు సేసిసేసి యాపె నీకు
కడుఁ జనవరి యాయఁగదవయ్యా
నడుమ నూరక నీతో నవ్వి నవ్వి రాజసాన
వెడఁగుగర్వాన విఱవీఁగెఁ గదవయ్యా

చ. 2: మక్కళించి యాపె నీతో మాఁట లాడి యాడి నీకు
గక్కననుఁ జుట్టమాయఁ గదవయ్యా
చిక్కించుక కొలువులు సేసిసేసి నిలుచుండి
వెక్కసపుఁ బంతుములే వెలసెఁ గదవయ్యా

చ. 3: వోపికతోఁ జన్నుల నిన్నొత్తి యొత్తి యాపె నీకుఁ
గాఁపురాలు సేయ నేర్చెఁ గదవయ్యా
యేపున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నీ పొందులఁ దా నింటిలో నిలిచెఁ గదవయ్యా

రేకు: 1958-2 పాడి సం: 29-284

పల్లవి: సారె సారె నితనితో సరసము లాడేవు
యేరుపరచి నీ వల పింకా నెత గలదే

చ. 1: వేడుకుతో వేగినంతా విచ్చనవిడి నీమాఁట –
లాడితి వితనికి నేమౌదువే నీవు
గోడ నిక్కి చూచి నిన్నఁ గొసరితివి సన్నల
నీడు జోడై వుందానవు యెన్నటి చుట్టమవే

చ. 2: మచ్చికతో వీడె మిచ్చి మంచముపై నుందానవు
చొచ్చి యెన్నాళ్లనుండి కాచుక వుంటివే
పచ్చిదేర మోము చూపి పకపక నవ్వేవు
ముచ్చట నిందె కెన్ని నోములు నోమితివే

చ. 3: కోరి శ్రీవేంకటేశ్వరుఁ గూడిన నీ భూమిమీఁద
పోరచిగా నెటువలెఁ బొడమితివే
యీరీతి నిన్ను మన్నించి యీతఁడిట్టె యేలినాఁడు
గారాబాన నీ వెందుండి కలిగితివే

రేకు: 1958-3 శ్రీరాగం సం: 29-285

పల్లవి: ఏమి చెప్పినాఁ జేసే యెగ్గు రెంచ నిఁక నిన్ను
గోమున నీవు గోరిన కోరిక లీడేరెను

చ. 1: వింటిఁగా నీ సుద్దులెల్లా వీనుల పండువగాను
సొంటులు సోదించి నిన్ను సొలయనేల
కంటిఁగా నీ చేఁతలు కన్నుల పండువగాను
అంటి ముట్టి నిన్ను బాస లడుగనేలా

చ. 2: నమ్మితిఁగా నీ గుణాలు నవ్వుల పండువగాను
సమ్మతించ కిఁక నిన్ను జరయనేల
దొమ్మిఁ గాలు దొక్కితిఁగా దోమటి పండుగగాను
చిమ్ముచుఁ గొనగోళ్లఁ జెనకనేలా

చ. 3: సేసుకొంటిఁగా నిన్నుఁ జేరి నిచ్చ పండుగగా
వేసాలకు నింకాను వేఁడుకోనేల
వాసితో న న్నేలితివి వచ్చి శ్రీవేంకటేశుఁడ
ఆసల నిన్ని పండుగ లాడుకొనేలా

రేకు: 1958-4 సామంతం సం: 29-286

పల్లవి: ఇంతికిని నీకుఁ దగు నిటువంటి నేరుపులు
పొంతఁ గలకాలమును భోగించరయ్యా

చ. 1: నిలిచి నవ్విన నవ్వు నివ్వెరగు నొందించు
సొలసి చూచిన చూపు చొక్కించును
పిలిచి యాడిన మాఁట ప్రియమెల్లాఁ బుట్టించు
తలఁచి మెచ్చిన మెచ్చు తమిరేఁచును

చ. 2: చెనకి సేసిన చెలిమి చిత్తంబు గరఁగించు
వినయంబు గలపొందు వెలయించును
పెనఁగి పెట్టిన విందు బెరసి చవి పుట్టించు
ననుపైన సరసంబు నానాఁటఁ బొదలు

చ. 3: తగిలి వలచిన వలపు తరితీపు పుట్టించు
మొగమోట నెయ్యంబు మొక్కించును
మిగుల శ్రీవేంకటేశ మెలుఁత నిటు గూడితివి
చిగురుఁ గోరికలు మిముఁ జెంగలింపించు

రేకు: 1958-5 సౌరాష్ట్రం సం: 29-287

పల్లవి: ఎఱఁగ మిన్నాళ్లు నీ కిటువంటివి
మెఱసి నీ వలపులు మితిమీరెనే

చ. 1: చెక్కులపై పెఁజెమట చెంపల జారుఁ దురుము
యెక్కడ గలిగెనే యింతి నీకు
ముక్కున నిట్టూరుపులు ముసి ముసి నవ్వులు
అక్కజమైన వింతలు అన్నియునుఁ గంటిమే

చ. 2: కందువ మోవి కెంపులు కన్నుల కావి వన్నెలు
యెందుండి వచ్చెనే నీకు యింతలోననే
సందడి మోము కళలు చన్నులపై గురుతులు
అందమైన సొబగులు నమరి వుందానవే

చ. 3: తనువుపై పులకలు తమకపు వసివాడు
కనుపెట్టె నీకు నేఁడు కారణమేమే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నాపె
మనసొక్కటాయ నీమచ్చిక లీడేరెనే

రేకు: 1958-6 నాగగాంధారి సం: 29-288

పల్లవి: విన్నవించితిమి నీకు వెలఁది భావములెల్లా
మన్నించి నీ దేవులకు మచ్చిక చూపవయా

చ. 1: చుట్టరికమ్మైనవారు సోఁక నెంత యాడినాను
గుట్టుతో నుండుటగాని గుంపించరాదు
పొట్టఁబొరుగులవారు పూఁచి యెంత చెనకినా
అట్టె నవ్వుటగాని యౌఁ గాదనరాదు

చ. 2: నమ్మికైనవారు యెంత నట్టుకొట్టి సొలసినా
సమ్మతించుటేకాని జరయరాదు
యిమ్ములఁ జెలులైనవా రెగ్గ లెన్ని యెంచినాను
కమ్మటిఁ జేకొంటగాని కాఁతాళించరాదు

చ. 3: బత్తిగలవారు యెంత పంతములు చూపినాను
హత్తి చొక్కుటగాని మారాడఁగరాదు
యిత్తల శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
కొత్తగా మెచ్చుటగాని కొసరరాదు

రేకు: 1959-1 రామక్రియ సం: 29-289

పల్లవి: సతి నీకు మేలుది జాణవు నీవు
మతిలోన మరవక మన్నించవయ్యా

చ. 1: పలుకులనే యింతి పచ్చనిపందిలి వెట్టె
అలరి కూచుండి పెండ్లాడవయ్యా
సెలవి నవ్వులనే సేసపాలివె చల్లె
సొలవక యీకె మోము చూడవయ్యా

చ. 2: తిన్నని సిగ్గులవే తెరమరఁగులు వెట్టె
కన్నెకుఁ గంకణ మిట్టె కట్టవయ్యా
సన్నలా చాయలనె సరుస నీ కాలు దొక్కె
చన్నులఁ బూజ గుండలు సారెఁ బూజించవయ్యా

చ. 3: కూరిమిసరసముల కొంగులముళ్లు వేసి
గారవించి మోవి పొత్తు గలయవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి వనితను
చేరి నిచ్చా సోబనాలఁ జెలఁగవయ్యా

రేకు: 1959-2 ఆహిరి సం: 29-290

పల్లవి: చెప్పఁ గొత్తలాయఁగదె చెలియ నీ సుద్దులెల్లా
ముప్పిరిగొన్న వలపు మూల దాఁచ నేఁటికి

చ. 1: చనుఁగొండల మీఁదట చఁదోదయములాయ
ఘనముగా వెన్నెలలే కాయవుగాని
పెనగొన్న చిగురుపై పెనువాన లుప్పతిలె
యెనసియు వాడుదేరదేయోకాని

చ. 2: అంచెలఁ జీఁకటితీగె లటునిటు నిండుకొనె
కొంచించక యట్టె పొద్దు గుంకదుగాని
పొంచి కెందామరలు గొబ్బున వికసించెను
ముంచుకొని తుమ్మిదలే మూఁగవుగాని

చ. 3: గక్కన నద్దములోనఁ గళలు మెరువఁ జొచ్చె
వుక్కుమీరి మేఘము లెందున్నవోకాని
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డిఁతలోనె నిన్ను నేలె
పక్కన మరుఁడే నీకుఁ బంత్తమిచ్చెఁగాని

రేకు: 1959-3 నాదరామక్రియ సం: 29-291

పల్లవి: చూడరమ్మ చెలులాల సుదతి చెలువములు
వోడక వొండొంటితోడ నొనగూడి యున్నవి

చ. 1: పాలుపైన మోము శశిఁ బోలించిన యందుకు
వెలఁది సెలవులను వెన్నెలగాసె
మెలుపునఁ బెనుఁ గొప్పు మేఘముఁ బోలినందుకు
చెలఁగి చెమటవాన చెక్కులఁ గురిసెను

చ. 2: పడఁతి కెమ్మోని దొండపండుఁ బోలించినందుకు
కడఁగి పలుకుఁ జిలుకలు మూఁగెను
జడిగొని యీపెనాభి సరసిఁ బోలినందుకు
అడరి చనుజక్కవ లండనె కలిగెను

చ. 3: తరుణి పసిఁడిబొమ్మఁ దగఁ బోలించినందుకు
నిరతిఁ బదారువన్నియల మించె
సిరుల శ్రీవేంకటేశుఁ జెందఁ బోలించినందుకు
మరుని కొమారికపు మన్ననలు మించెను

రేకు: 1959-4 వరాళి సం: 29-292

పల్లవి: మాపుదాఁకా జోలి యేల మనఁగదవే
చేపట్టి యాతఁడు నా చిత్తములోఁ బాయఁడు

చ. 1: అతనిపై తమకము ఆపఁగలేనే
యితవుగా నీ బుద్ధులు యేమి చెప్పేవే
మితిమీరి యతనికి మేలుదాననే
చతురత నీ మాఁటలు చవులుగావే

చ. 2: మలసి యాతని పొందు మానఁగరాదే
వెలయఁగ నీవెంత వేఁడకొనేవే
వలపుగాదని తోయవచ్చునటవే
పలుమారు నాతో నేల పట్టి పెనఁగేవే

చ. 3: మన సాతనిపైఁ బెట్టి మరిగితినే
నను గిలిగించే యేమి నవ్వించేవే
యెనసె శ్రీవేంకటేశుఁ డిదివో నన్ను
మొనసి యెన్నేసి నీవు మొక్కులు మొక్కేవే

రేకు: 1959-5 శుద్ధవసంతం సం: 29-293

పల్లవి: ఏమి చెప్పుకొనేవే యింతులతో నీ యెమ్మెలు
వేమరు నీ గుట్టు వెల్లవిరిసేయ నేఁటికే

చ. 1: కలికితనాల నీవు కాఁపురాలు సేయఁగాను
వలవ కెట్టుండునే రవ్వగా మగఁడు
చలిమి బలిమితోడ జాణతనా లాడఁగాను
సులబాన నీ కతఁడు చొక్కవలెఁగదవే

చ. 2: యెన్నికతో నేపొద్దూ యెదుటఁ గాచుకుండఁగాను
మన్నించ కెట్టుండునే మరి యాతఁడు
సన్నలనే మోవి తేనె చవులెల్లాఁ జూపఁగాను
మిన్నక నీ చేఁతలకు మెచ్చవలెఁగదవే

చ. 3: కమ్మి సింగారించుకొని కాఁగిటఁ బెనఁగఁగాను
సమ్మతించ కెట్టుండునే సరుగదాను
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్ను నేలె
నమ్మించి నీ కతలకు నవ్వవలెఁగదవే

రేకు: 1959-6 శంకరాభరణం సం: 29-294

పల్లవి: వాసితో నుండఁగా నీవే వచ్చేవుగాక
ఆసతో సిగ్గువిడిచి అలయనేలా

చ. 1: నిండు వావిసేసుకొని నీతో నాపె నవ్వఁగాను
అండనున్నవారు చూచి యాఁకారనేల
కొండలు వంటి చన్నులఁ గోరి యాపె నిన్నొత్తఁగా
బందు బండై యట్టె తప్పక చూడనేలా

చ. 2: మచ్చికతో నీవూ నాపె మాఁటలాడుకొనఁగాను
విచ్చనవిడి నాలించి వినఁగనేలా
కచ్చుపెట్టి యప్పటిని కాఁగిలించుకుండఁగాను
కుచ్చితాన లోలోనే గుబ్బతిలనేలా

చ. 3: ఆకె నీతములానకు నట్టె చే యొగ్గఁగాను
ఆకడి వారితో మిమ్ము నాడుకోనేలా
యీకడ శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
పైకొని నీ చేఁతలికఁ బచారించనేలా

రేకు: 1960-1 భైరవి సం: 29-295

పల్లవి: ఆఁటదాని నన్ను నేఁటి కారడిఁ బెట్టిఁ దాను
గాఁటముగ నెదురాడి కాదనేటి దాననా

చ. 1: వేడుక గలిగితేను విడిదికి రానీవే
యేడనైనా నాతోను యేల నవ్వీని
వాడిక వలసితేను వద్దఁ గూచుండనీవే
వోడక నన్నేల యింత వొరసి చూచీని

చ. 2: తనకు నే బాఁటైతే తగఁ బెండ్లాడనీవే
తనియక యెన్ని జాణతనా లాడీని
పని గలిగితే నాకు బాగాలు వెట్టనీవే
చెనకి మోవి సన్నలు సేసి యేమి చూపీని

చ. 3: కరుణ నాపైఁ గలిగితే కాఁగిలించుకోనీవే
విరుల వేసి నన్నెంత వేఁడుకొనీని
యరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
మరిగి వుండనీవే మనసెంత రేఁచీని

రేకు: 1960-2 సామంతం సం: 29-296

పల్లవి: ఇన్నిటాను ఘనుఁడైను యేలి కితఁడు
మన్నించు నీ చేఁతలకు మరిగె నంటాను

చ. 1: సిగ్గరితనాల నీవు శిరసు వంచకువే
అగ్గమై యాతఁడు చన్నులంటె నంటాను
బగ్గడితనాల నంత పదరి పలుకకువే
వొగ్గి నీపైఁ దమకించి వొడివట్టె నంటాను

చ. 2: మొక్కళితనాల బొమ్మముడి వెట్టుకోకువే
చిక్కించుక నిన్ను గోరఁ జిమ్మె నంటాను
తక్కరితనాలఁ బంతముల నెరపకువే
మిక్కిలి యాఁతడు నీతో మేలమాడె నంటాను

చ. 3: కలికితనాల నంత కడుఁ బెనఁగకువే
చెలఁగి నీ మోవి గంటిసేసె నంటాను
పెలుచుఁదనాన యిఁక బిగియకువే నిన్నేలె
లలి శ్రీవేంకటేశుఁడు లాలించె నంటాను

రేకు: 1960-3 కాంబోది సం: 29-297

పల్లవి: తప్పులెంచ మరియాల తలవంచ్చుకొననేల
చెప్పఁగల ప్రియములు చెప్పరమ్మా

చ. 1: చింతలెల్లాఁ బెడఁబాసె సెలవుల నవ్వదేరె
యింతలోనే విభుఁడు నీ యింటికి వచ్చె
పంతము లాడేరె నిఁక బంగారు పీఁట వెట్టి
వింతలేక యీతనికి విడె మియ్యవమ్మా

చ. 2: తనివిఁ బొఁదె మససు తలకూడెఁ గోరికలు
చెనకి నీమగఁడు నీచేతికిఁ జిక్కె
పనులెల్లాఁ జక్కనాయ పరపుపైఁ గూచుండి
వినయాన మోవి తేనె విందువెట్టవమ్మా

చ. 3: సేసిన చేఁతలు చెల్లె సిగ్గులు మోమున నిండె
ఆసతో శ్రీవేంకటేశుఁ డదె నిన్నేలె
రాసికెక్కె నీ వలపు రతులను మెప్పించి
మోసలేక వేఁడుకొని మొక్కు మొక్కవమ్మా

రేకు: 1960-4 గౌళ సం: 29-298

పల్లవి: వద్దనేమా నేము మాతో వర్ణించే వాకెను
పెద్దరికమున నింత పెంచితివి చాలదా

చ. 1: చక్కనిదంటా నాకె చందము లేమి చెప్పేవు
గక్కన నింపైతే మెడఁగట్టుకోరాదా
నెక్కొని యాకెఁ జూచి నివ్వెరగే లయ్యేవు
అక్కరతోఁ బిలిచి మాఁటాడఁగరాదా

చ. 2: మాతో నాకె గుణాలేల మచ్చికఁ బచారించేవు
చేతులెత్తి మెచ్చి సంతోసించఁగరాదా
రాతిటి యాకె రతులు రచ్చ నేల వేసేవు
కాతరానఁ జిక్కి వుడుగర లియ్యరాదా

చ. 3: ఆకెనీవావులు యీడ నది యాల తడవేవు
చేకొని మీలో మీరే చెప్పుకోరాదా
యీకడ శ్రీవేంకటేశ యెనసితి నన్ను నేఁడు
జోకతో నేమి నవ్వేవు చోటియ్యరాదా

రేకు: 1960-5 శంకరాభరణం సం: 29-299

పల్లవి: అందుకే వెరగయ్యీ నప్పటనుండి నాకు
సందడి నే పెండ్లాడీ సతులాల చూడరే

చ. 1: తప్పక యేమి చూచీ నే తలవంచుకుండఁగాను
చెప్పీ నేఁటివో సుద్దులు చెవిలోనను
కప్పీఁ దనపచ్చడము కడు సిగ్గయ్యీ నాకు
ఇప్పు డితఁడు వలపు లెంత రేఁచీనే

చ. 2: చెక్కు లేల నొక్కీనే సెలవి నే నవ్వఁగాను
అక్కరతోఁ గూచుండీ నండకు వచ్చి
మక్కువతోఁ జన్నులంటీ మరి సోద్యమయ్యీ నాకు
యిక్కడ నితఁడు నన్ను నెంత రట్టుసేసీనే

చ. 3: చేతు లేమి చాఁచీనే చెంగట నే నుండఁగాను
కాతరాన సేసవెట్టీఁ గమ్మి కొప్పుపై
ఆతుమారాఁ గాఁగిలించీ నట్టె వెరగయ్యీ నాకు
యీతల శ్రీవేంకటేశుఁ డెంత మన్నించీనే

రేకు: 1960-6 ఆహిరి సం: 29-300

పల్లవి: చుట్టపు వరుసలనే సోబనకాలము వచ్చె
యిట్టె కలకాలము నేలుకొనవయ్యా

చ. 1: వెలఁదికి విరహపువేసఁగికాలము వచ్చె
కెలిగె నిట్టూర్పుల గాలికాలము
వలపులచెమటల వానకాలమును మించె
యెల యింపు లిఁకనేల ఇంటికి రావయ్యా

చ. 2: పడఁతి మై పులకల పైరు కాలము వచ్చె
కడుఁగోరికల మంచుఁగాలము మీరె
అడరి యెడమాఁటల ఆమనికాలమూఁ గూడె
తడవుసేయక యట్టె దయఁ జూడవయ్యా

చ. 3: సతి రతి చెనకుల జాజరకాలుము వచ్చె
కతలై నవ్వు వెన్నెలకాలమూ రేఁగె
తతిఁ గూడితివి యీకెఁ దగ శ్రీవేంకటేశ్వర
సతమై యీలాగులఁ జనవియ్యవయ్యా

రేకు: 1961-1 వరాళి సం: 29-301

పల్లవి: ఇన్నాళ్ళు నెఱఁగము యిటువంటివి
సన్నలు మీలో మీకు సరివచ్చెనా

చ. 1: చిమ్మిరేఁగి నీ కిందాఁకాఁ జేసి నాకె విన్నపాలు
వుమ్మడి నీ మనసందు కొడఁబడెనా
కమ్మటి నీ పాదలొత్తె కదిసి సేవలు సేసె
సమ్మతించి నీ వందుకు సరుగ మెచ్చితివా

చ. 2: నేమమున నీతోడ నెత్తమాడెఁ జిక్కించుక
దోమటి నీ కిప్పుడ సంతోసమాయనా
వాములుగా నీమీఁద వలపులు చల్లి నవ్వె
ప్రేమముతోడుత నీవూఁ బ్రియము చేకొంటివా

చ. 3: గక్కనఁ జుట్టమువలెఁ గాఁగిలించు కొననాపె
చక్కెర మోవి యొసఁగి చవిగొంటివా
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మక్కువతో మమ్మిద్దరి మన్నన నేలితివా

రేకు: 1961-2 సామంతం సం: 29-302

పల్లవి: చెలులకునుఁ బతులకును సేయఁగల పనులివియ
నెలకొన్న పొందికలు నెరపవలె సకియా

చ. 1: వలవఁగా వలవఁగా వాడికలు కడుఁ బుట్టు
తలఁచఁగాఁ దలఁచఁగా తమి రేఁగును
పిలువఁగాఁ బిలువఁగాఁ బ్రేయంబు లీడేరు
సొలయఁగా సొలయఁగా సొరిది మది గరఁగు

చ. 2: చెనకఁగా జెనకఁగా జెలరేఁగు వేడుకలు
యెనయఁగా నెనయఁగా నింపు గలుగు
పెనఁగఁగాఁ బెనఁగఁగాఁ బెరుగు జవ్వనమదము
తనియఁగాఁ దనియఁగాఁ దగులు నివ్వెరగు

చ. 3: వొరయఁగా నొరయఁగా నుప్పతిలు సరసంబు
మరుగఁగా మరుగఁగా మలయు సుఖము
యిరవైన శ్రీవేంకటేశ్వరుఁడు నిను నేలె
పెరుగఁగాఁ బెరుగఁగా ప్రియురాలవైతివి

రేకు: 1961-3 పాడి సం: 29-303

పల్లవి: అటువంటి సతి నీకు నమరె నాయకుఁడ
తటుకను నీకె తగుఁ దగునయ్యా

చ. 1: చలముల నూరకసారెకు దూరక
మెలుపున నానలు మీరక
కిలఁ కిలఁ బతితో కెలయుచుఁ గేరక
తలఁపులో మెలఁగు తరుణివో జాణ

చ. 2: పగటులు చూపక పంతాన నేపక
మొగిఁ దప్పులు కడు మోపక
అగడుసేసి వెడయాసలు రేపక
నిగిడి రతిఁ గలయు నెలఁతవో జాణ

చ. 3: జాగులు సేయక జంటలు వాయక
వేగిరపడి వొల వేయక
యీగటి శ్రీవేంకటేశ మాఁట దోయక
బాగుగఁ గూడిన పడఁతివో జాణ

రేకు: 1961-4 మాళవిగౌళ సం: 29-304

పల్లవి: నీ వొళ్ళుఁ గడమలేదు నేరుపరివి నౌదువు
యీవేళ నీ మగఁడు నిన్నేమనీనోకాని

చ. 1: చీరాఁ గట్టుకొంటివి సింగారించుకొంటివి
బీరముతోఁ బెద్దకొప్పు వెట్టుకొంటవి
గారవానఁ గన్నులను కాటుక దిద్దుకొంటివి
కోరి నీ మగఁ డెప్పుడు గూడీనోకాని

చ. 2: వీడెమూ వేసుకొంటివి విరులు ముడిచితివి
వేడుక సొమ్ము వెట్టుక వెలసితివి
వాడుదేరఁ గస్తూరి వన్నెగాఁ బూసుకొంటివి
యీడనే నీమగఁ డెప్పు డేలీనోకాని

చ. 3: వచ్చితి వింటికిఁ గొంగు వల్లెవాటు వేసితివి
కొచ్చి నవ్వి పరపుపైఁ గూచుంటివి
అచ్చపు శ్రీవేంకటేశుఁ డప్పుడే నన్నుఁ గూడె
హెచ్చి యీ మగఁడే ని న్నెట్టెనసీనోకాని

రేకు: 1961-5 రామక్రియ సం: 29-305

పల్లవి: సెలవుల నవ్వనేల సిగ్గులు వడఁగనేల
సొలసీ నాపె మోము చూడఁగదవయా

చ. 1: కొత్త కొత్త విన్నపాలు కోమలి సేసీ నీకు
చిత్తగించి వినవయ్య చెవులారను
బత్తితోడ నీకు నిమ్మపండు గానుక యిచ్చీ
హత్తి వేడుకతోడుత నందుకోఁగదవయా

చ. 2: గొప్ప గొప్ప చన్నులను కోరి నిన్ను నొత్తీని
వొప్పు గొని మెచ్చవయ్యా వొద్దికతోను
ముప్పిరిగొనఁగ తేనె మోవివే విందులు వెట్టీ
దప్పిదేరఁ జవిగొని తనివి నొందవయా

చ. 3: మంచి మంచి విడే లిచ్చి మచ్చిక నీపైఁ జల్లీ
కొంచక కాఁగట నించి కూడవయ్యా
ముంచి శ్రీవేంకటేశుఁడ మునుపే న న్నేలితివి
పొంచి యాపె నీకు మొక్కీ బొందులు సేయవయా

రేకు: 1961-6 శంకరాభరణం సం: 29-306

పల్లవి: ఎదుటనే వున్నాఁడు యిదె నీ రమణుఁడు
అదనిదె సరసము లాడవే యిపుడూ

చ. 1: కలికితనంబుల కతకారీ
పలుకవే వో చిలుకలకొలికీ
తలిరు మోవిదంతపుబొమ్మా
సెలవుల నవ్వేనే చెలువునితోడా

చ. 2: చక్కఁదనంబుల జవరాలా
నిక్కిచూడవే నీ పతిని
జక్కవ చన్నుల జగ బిరుదా
మొక్కఁగదవే 1 మొగనికి నిపుడు

చ. 3: పొసఁగిన నేర్పుల పూబంతీ
కొసరవే రతుల చిగురుఁబోఁడి
వసమై నిన్నేలె వలపులను
వెసఁ బొగడవే శ్రీవేంకట విభుని

రేకు: 1962-1 సామంతం సం: 29-307

పల్లవి: కొమ్మ గడుజవరాలు కోమలపు మేనిది
నెమ్మది నుపలాలించి నెయ్యము చూపరాదా

చ. 1: నిలుచుండి మాఁటలాడీ నెలఁత యప్పటనుండి
పిలిచి వద్దఁ గూచుండఁ బెట్టుకోరాదా
బలిసిన చనుఁగవభారము మోచుకున్నది
అలరి నీ భుజముల నానుకొనరాదా

చ. 2: నిండుఁ గొప్పు జారఁగానే నీకు విడె మిచ్చీని
అండనుండి గక్కన నీ వందుకోరాదా
మెండుగ వలపు లొడి మెరసి కట్టుకున్నది
దండితో నీవూఁ గొంత తాళుకోరాదా

చ. 3: పచ్చి చెమటలుఁ బక పక నవ్వీ నీతో
మచ్చికఁ గాఁగిట నించి మన్నించరాదా
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివీకె నింతలో
కుచ్చి నీ పాదము లొత్తీఁ గోరి మెచ్చరాదా

రేకు: 1962-2 పాడి సం: 29-308

పల్లవి: ఏమి సేసినాఁ దనతో నెగ్గు పట్టేనా
చేముట్టి బుజ్జగించినా సిగ్గువడీఁ జూడరే

చ. 1: వినయాన వేఁడుకొంటి విందుగా మోవి చూపితి
పెనఁగి చేతులువట్టి పిలిచితి
ఘనుఁడు తనచేఁతలు కంటినంటా నే నెంత
చెనకినా మొగమోడి సిగ్గువడీఁ జూడరే

చ. 2: ముమ్మారు నాన వెట్టితి మొక్కితిఁ బాదాలకు
నమ్మించితి ననుపుగా నవ్వు నవ్వితి
పమ్మి తన గురుతులు పట్టి యడిగితినంటా
చిమ్మిరేఁగి లోలోనే సిగ్గువడీఁ జూడరే

చ. 3: కప్పితిఁ బయ్యదకొంగు కాఁగిలించుకొంటిని
తెప్పలుగా రతులనుఁ దేలించితి
అప్పుఁడు శ్రీవేంకటేశుఁ డాసుద్ది దడవేనంటా
చిప్పిలుఁ జెమటతోడ సిగ్గువడీఁ జూడరే

రేకు: 1962-3 రామక్రియ సం: 29-309

పల్లవి: ఈకె నెట్టు దగిలితి వింతులెల్లా నుండఁగాను
నీకంటె మూరెఁ డెక్కుడు నీటుఁదనములను

చ. 1: చెక్కుటద్దములు చూపి చెలి నిన్ను నెలఇంచె
జక్కవ చన్నులు చూపి చల్లె వలపు
నిక్కుఁ గొప్పు చూపి కొంత నీ మనసు గరఁగించె
ఇక్కువలంట్టి తమక మింకా నెంత రేఁచునో

చ. 2: సెలవుల నవ్వు నవ్వి సిగ్గులెల్లా విడిపించె
సొలపుఁ జూపులఁ జూచి చొక్కించెను
వెలయఁగొన గోరూఁది వేడుకలు పుట్టించె
మలసి కాఁగిటఁ గూచ్చి మరి యెంత సేసునో

చ. 3: కరములు పైఁ జాఁచి కళ లుప్పతిలఁజేసె
సరుసనే మోవి చూపి చవులు నించె
యెరవులేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
యిరవయి తానూఁ గూడి యిట్టె యెంత సేసునో

రేకు: 1962-4 ముఖారి సం: 29-310

పల్లవి: ఏ కాంత సేసినవో యీా చేఁతలు
ఆకె యెటువంటిదో ఆనతియ్యవయ్యా

చ. 1: పుప్పొడి దాఁకినచోటు పువ్వులవేసినవాటు
చొప్పు నీ మేన నున్నది చూచుకోవయ్యా
చిప్పిలిపారేటియేరు చిమ్మనఁగోవిపన్నీరు
తెప్పలఁ దేలేవు నీవే తెలుసుకోవయ్యా

చ. 2: కురులువట్టిన పట్టు కూడని చొల్లెపు చుట్టు
అరసి నీ చెలులనే అడుగవయ్యా
పురము ముద్రల పొత్తు వుదుటుఁజన్నుల వొత్తు
సరుగ నీకు నీవే విచారించుకోవయ్యా

చ. 3: చెక్కున నుండిన రేక చిన్నికొనగోరి జోక
యిక్కువ లవిగో నీవే యెంచుకోవయ్యా
గక్కన శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
తక్కక నీ వేడుకలు తలఁచుకోవయ్యా

రేకు: 1962-5 నాగవరాళి సం: 29-311

పల్లవి: అవి యేఁటియేకాంతాలో అడుగవయ్యా
తివిరీ నప్పటనుండి తెలుసుకోవయ్యా

చ. 1: కన్నులఁ దప్పక చూచి కడు బొమ్మల జింకించి
సన్నలుసేసీ నాకె సారెకు నీతో
చిన్నిపెదవుల లోలోసిగ్గుతోనె మాఁటలాడి
ఇన్నేసి చేఁతలు సేసి యిట్టె యేఁకారీని

చ. 2: చుట్టి చుట్టి లాచి లాచి సోఁకఁ గప్పురాన వేశి
గుట్టుతోఁ గొలువులోనఁ గొసరీ నిన్ను
పట్టెఁడేసి చన్నులు పచారించి నీకుఁ జూపి
నెట్టన నప్పటనుండి నీకుఁ బొంచుకున్నది

చ. 3: చిప్పిలఁగ నవ్వు నవ్వీ చేతులు నీపైఁ జాఁచి
చొప్పువేసీఁ జెప్పరాని చుట్టరికము
యిప్పుడు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కప్పి పయ్యదమాఁటునఁ గరఁగించీ నిన్నును

రేకు: 1962-6 నాదరామక్రియ సం: 29-312

పల్లవి: ఊరకె వుండుమనవే వోరుచుకుందాన నేను
సారె సారె నీతో నేమి సరసమాడీనే

చ. 1: మాఁట లెన్నైనాఁ గలవు మళ్ళి మళ్ళి యాడితేను
యేఁటవెట్టి నన్నెంత యెలయించీనే
గాఁటముతో నొక్కసతి కాచుకున్నది వద్దనే
ఆఁటదాన నన్ను నెంత ఆసలఁబెట్టీనే

చ. 2: చేఁతలు కోటానఁగోటి సేసి సేసి చూపితేను
బాఁతిపడి యింత యాల భ్రమయించీనే
కాఁతాళానఁ దనతోను కాఁపురాలు సెసీనాపె
పూఁతవట్టుక నన్నెంత వొడఁబరచీనే

చ. 3: చెలిమి చేటలకొద్ది చేరి చేరి కూడితేను
నలిరేఁగి నన్ను నెంత నమ్మించీనే
చెలికత్తెయంటాఁ జెప్పి శ్రీవేంకటేశుఁడీకెను
చెలఁగి కూడి నన్నెంత చెక్కులు నొక్కీనే

రేకు: 1963-1 దేసాళం సం: 29-313

పల్లవి: నీ తలనే వేగెనా నేఁ డిటువంటి వలపు
కాతరాన నందరికిఁ గలచాలే కదవే

చ. 1: కొప్పు గడు జారినది కూడ ముడుచుకోవే
చిప్పిలునవ్వులతో సిగ్గువడక
తొప్పఁదోఁగీఁ జెమటలు దుడుచుకోఁగదవే
దప్పిదేరేమోవితోడఁ దలవంచుకొనక

చ. 2: చుక్కబొట్టు చెదరెను సొంపుగా దిద్దుకోవే
గక్కనను చెక్కుచేతఁ గప్పుకొనక
చక్కఁగా జిక్కువడిన సరు లమరించుకోవే
మక్కువ నీ చెలులను మాఁటువెట్టుకొనక

చ. 3: కంకణాలు వదలెను కదియఁ బెట్టుకొనవే
కొంకుచుఁ బరాకు సేసుకొని యుండక
అంకెల శ్రీవేంకటేశుఁ డన్నిటాను నన్ను నేలె
యింకా నప్పటి నాతో నీడు వెట్టుకొనక

రేకు: 1963-2 ఆహిరి సం: 29-314

పల్లవి: ఏమని పొగడుదు నిన్నిపుడు నేను
ఆముకొని మేలుదాన నైతి నేను

చ. 1: చల్లనిచూపుల నీవు సారె నన్నుఁ జూడఁగాను
వుల్లము గరఁగి చొక్కి వుందాన నేను
వెల్లవిరిగా నిట్టె వేడుకతో నవ్వఁగాను
చెల్లుబడిగా సంతోసించుకొంటి నేను

చ. 2: చక్కెరవంటిమాఁటలు చనవిచ్చి యాడఁగాను
అక్కరతోడుత ముదమందిత నేను
చొక్కుచు నన్నుఁ గదిసి చుట్టరికము సేయఁగా
మిక్కిలి నీ గుణాలకు మెచ్చుకొంటి నేను

చ. 3: మన్నన కాఁగిట నన్ను మరగించి కూడఁగాను
నన్నుఁ బాయకుందువని నమ్మితి నేను
యిన్నిటా నీవు శ్రీవేంకటేశ నీ యింట నుండఁగా
మున్ను మున్నుగా నీకు మొక్కితి నేను

రేకు: 1963-3 వరాళి సం: 29-315

పల్లవి: ఆసవెట్టి యాఁటదాని నలయించరాదందురు
వేసరక వేడుకతో వినోదించరాదా

చ. 1: పెనఁగుచుఁ గొసరీనిపెఁజెమట నీపైఁ గార
పనివడి యప్పటి గుబ్బల నొత్తీని
కనుచూపుల సొలసీ కడుఁ జుట్టరికముల
పొనుఁగ కాపెతోఁ గొంత పొందుసేయరాదా

చ. 2: చెక్కునొక్కి వేఁడుకొనీ చేతులగోళ్ళు దాఁక
ముక్కు నిట్టూర్పుల సోఁక ముచ్చట చెప్పీ
మిక్కుటపుఁ గొప్పు వంచి మీఁగాళ్ళపై నీకు మొక్కీ
అక్కరదీరఁ గాఁగిట నలమరాదా

చ. 3: చెప్పీఁ బ్రియములు తమ్మచెదరులు నినుఁ జెంద
కప్పీఁ బయ్యద నీకు కంకణాలు జీర
ఇప్పుడు శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
తప్పక చూచి యాపెనూఁ దగఁ బిలువరాదా

రేకు: 1963-4 సాళంగనాట సం: 29-316

పల్లవి: ఎంతని పొగడవచ్చు నిటువంటి మీ గుణాలు
సంతతముఁ జూచి మాకు సంతోసము లాయను

చ. 1: సరసురాలవు నీవు జాణకాఁ డాతఁడు మరి
సరవు లిద్దరికిని సమకూడెను
వొరపరిచేఁత నీది వొద్దికెల్లా నాతనిది
సరికి బేసికి మీ సంగాతాలు చెల్లును

చ. 2: వలపులు నీ సొమ్ము వాడికెల్లా నాతనిది
తలఁపులు మీలో మీకుఁ దారుకాణలే
పిలుపులు నీ పాలు ప్రియము లాతనిపాలు
కలిగిన మీ వేడుకలు ఫలియించెను

చ. 3: నగ నీవు నేరుతువు నను పాతఁడు నేరుచు
నిగిడి మీ రతులెల్లా నెరవేరెను
జిగి దేవులవు నీవు శ్రీవేంకటేశుఁ డాతఁడు
మిగులాఁ జుట్టరికము మెరసెను మీకును

రేకు: 1963-5 పాడి సం: 29-317

పల్లవి: ఎఱఁగవా నా మనసు యిన్నిటా నీవు
జఱసేనా నీ మోవి చవిచూచేఁగాకా

చ. 1: పెనఁగేటిదాననా ప్రియము లేల చెప్పేవు
వినయముతోనే మాఁట వినేఁగాక
చెనకేటిదాననా చేతు లేల పట్టేవు
మొనసి నీ పాదాలకు మొక్కేఁగాక

చ. 2: జంకించదాననా సన్న లేల సేసేవు
కొంకక నీ చేఁత లియ్యకొనేఁగాక
మంకుచూపేదాననా మరేల వేఁడుకొనేవు
వుంకువగాఁ జనుగుబ్బలొత్తి పట్టేఁగాకా

చ. 3: వొల్లకుండేదాననా వొడివట్టేల తీసేవు
చెల్లుబడిగా నీ సేవసేసేఁగాక
యిల్లిదె శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
మల్లాడక నీ రతులు మరిగేఁగాకా

రేకు: 1963-6 ఆహిరినాట సం: 29-318

పల్లవి: కడు వేడుక లీడేరెఁ గాంత నీవు గలందుకు
తడయ కెప్పుడూ నాదండ నుండఁగదవే

చ. 1: ఆతని చక్కఁదనాలు అప్పటనుండిఁ జెప్పేవు
చూతము తోడితేనే సుదతి
పోతరించి వచ్చేనంటే పొంచి మావా రేమందురో
దూతికవు నీవే పొందులు సేయఁగదవే

చ. 2: వీడెమిచ్చి పంపేనంటా వెస నా చేతికిచ్చేవు
జోడు గూడఁ జేయఁగదే సుదతి
గోడ నిక్కిచూచేనంటా కొప్పుజారునో యేమో
యీడైన చెలికత్తెవు యిద్దరిఁ గూడించవే

చ. 3: తెరలోనున్నాఁడంటా దిష్టముగాఁ జూపేవు
సొరిదిఁ బెండ్లి సేయవే సుదతి
యిరవై శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్ను నేలె
పరగు సంగాతివి సోబానఁ బాడఁగదవే

రేకు: 1964-1 ఆహిరి సం: 29-319

పల్లవి: తగవైతే నింతటను దయదలఁచఁగవలె
జిగి మా విన్నపములు చిత్తగించవయ్యా

చ. 1: వట్టిమాఁకు లిగిరించ వనిత మాఁటలాడిని
వెట్టికి నూఁకొనవద్దు వినవయ్యా
గుట్టుతో రాయి గరఁగఁ గొలువులు సేసీని
అట్టు నిట్టూఁ బరాకుగా కవధరించవయ్యా

చ. 2: కోటకిఁ బడగలెత్తి కుచములు నీకుఁ జూపీ
జూటుఁదనములు మాని చూడవయ్యా
తేటతెల్లములుగాను తెలసీ వావులు నీకు
నీటున సిగ్గువడక నెయ్యము చూపవయ్యా

చ. 3: పోఁకకుఁ బుట్టెఁడు సేసి పొందుగా వలపు లమ్మీ
యాఁకటలు దాఁచక అందుకోవయ్యా
కాఁకదీరఁ గాఁగిలించీ గక్కన శ్రీవేంకటేశ
వీఁకలు సేయక కూడి వెలయించవయ్యా

రేకు: 1964-2 పాడి సం: 29-320

పల్లవి: సిగ్గువడ దించుకంతా చెలులెల్లాఁ జూడఁగాను
బిగ్గఁ గాఁగిలించుకొనీఁ బ్రియమెంతోకాని

చ. 1: వేవేలు చుట్టరికాలు వేడుకతో నెరపీని
వావి నాపె నీకేమిగావలెనోకాని
దేవులవలెఁ గడు హత్తిన సేవలెల్లాఁ జేసీ
భావించితే నెట్టి వొడఁబడికలోకాని

చ. 2: చెప్పరాని బత్తి నీపైఁ జేసి సేసి చూపీని
యెప్పుడూ మీ నేస్తమ లేఁటివోకాని
వొప్పగుపెండ్లికూఁతురే వొద్దనే కాచుకున్నది
చెప్పరాని సలిగెంత చెల్లించేవోకాని

చ. 3: నాఁటుకొన్న తమితోడ నవ్వులెల్లా నవ్వీని
చాటువైన మీలో నేమి సన్నలోకాని
యీటున శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
మాటలాడీ నాపె నీపై మచ్చికెంతోకాని

రేకు: 1964-3 గౌళ సం: 29-321

పల్లవి: అమ్మలాల అక్కలాల అవిగో వింత సుద్దులు
నెమ్మది వింటిరటరే నిచ్చ నిచ్చ కొత్తలు

చ. 1: అల్ల వాఁడే శ్రావణ బహుళష్టమిని నడురేయి
చల్లఁగా రోహిణివేళ జనించినాఁడు
వెల్లవిరి దేవకిదేవికి వసుదేవునికి
మొల్లమిఁ గొడుకైనాఁడు ముద్దులకృష్ణుఁడు

చ. 2: పొంచి యశోదానందగోపులకు సుతునివలెఁ
బెంచఁగా రేపల్లెలోనఁ బెరిగీ వీఁడె
ముంచి యీతనికంటేనె ముందే బలభద్రుఁడు
అంచెల రోహిణీదేవి కవతరించినాఁడు

చ. 3: మొదల దేవకతలకు మూలభూతి యితఁడట
యెదుట లోకములెల్లా నేలీనటా
అదిగో శ్రీవేంకటేశుఁడై యలమేల్మంగాఁ దాను
చెదకు కాఁపురాలు సేసీనటా

రేకు:	1964-4 లలిత	సం:	29-322

పల్లవి:	మన చేతికిఁ జిక్కెను మగువలాల
	వినయాన వేఁడుకోరే వీఁడె కాంతలాల

చ. 1:	వుబ్బుచుఁ గృష్ణుఁడు వాఁడే వుట్లులు గొట్టీ నదే
	గొబ్బునఁ బట్టఁగదరే గొల్లెతలాల
	అబ్బరపుఁ బాలు వెన్న లారగించి వారవట్టీ
	దొబ్బి తీసుకోరమ్మా తొయ్యలులాల

చ. 2:	యింటింటి వాకిట వచ్చి ఇదె చక్కిలాలు దీసీ
	అంటి పెనఁగులాడరే యంగనలాల
	దంటయై గోపాలులుఁ దానూఁ బరువులు వెట్టీ
	వెంటనే తగులరమ్మా వెలఁదులాల

చ. 3:	కాకుసేసి చన్నులంటి కాఁగిలించుకొనవచ్చీ
	యేకతాలకుఁ దియ్యరే యింతులాల
	యీకడ నలమేల్మంగ నేలి శ్రీవేంకటేశుఁడు
	మీ కోరి కిచ్చె మొక్కరే మెలుఁతలాల

రేకు: 1964-5 శ్రీరాగం సం: 29-323

పల్లవి: ఇంత మేలువాఁడవై యింకా జేల జరసేవు
సంతోసముతోడనే చనవియ్యరాదా

చ. 1: చెలిచిరునవ్వులనే చిత్తము గరఁగితివి
యెలమి నాపెతోఁ బంతా లే లాడేవు
కలికిచూపులకే కాయమెల్లాఁ జెమరించె
పెలుచుఁదనాల నేల పెనఁగులాడేవు

చ. 2: పెదవిపైమాఁటలకే పెద్దగా వలచితివి
యెదిరించి యాల యెలయించ వచ్చేవు
పుదుటు గుబ్బలకే పుబ్బి మొగమోడితివి
మదిరాక్షితో నేల మారుకొనేవు

చ. 3: అట్టె చే సన్నలకే ఆ సాసలఁ జొక్కితివి
దిట్ట సరసాలనే తిట్టఁ జూచేవు
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వలమేల్మంగను
వొట్టుక యాకె నింతేల వొలలఁ బెట్టేవు

రేకు: 1964-6 నాదరామక్రియ సం: 29-324

పల్లవి: ఎంత కాతరపు వాఁడే యెలయించీ నిదె నన్ను
వింత వింత రతులను వినోదించీ నితఁడు

చ. 1: ఆనలు నేఁ బెట్టఁగానే యట్టె వొడివట్టీని
మోనాన నుండఁగానే మోవి యానీని
పూనుక వద్దనుండఁగా పుప్పొడి నామీఁద జల్లీ
తా నెంత నే నెంత తమిరేఁచీ నితఁడు

చ. 2: తలవంచుకుండఁగానే దండఁ గూచుండ వచ్చీని
నిలుచుక వుండఁగానే నించీఁ గాఁగిట
బలిమిఁ బెనఁగఁగానే పట్టీఁ గుబ్బచన్నులు
వలపులు చల్లి చల్లి వావిచెప్పీ నితఁడు

చ. 3: పరపుపైనుండఁగానే పక్కఁబండి చెనకీని
గిరగొని నవ్వఁగానే గిలిగించీని
యిరవై శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
గరిమ నన్నుఁ బెండ్లాడి కాలుదొక్కీ నితఁడు

రేకు: 1965-1 శంకరాభరణం సం: 29-325

పల్లవి: ఊరకే చందముసేసుకుందానఁ గాక
నేరుపుల నీ గుణాలు నే నెఱఁగనా

చ. 1: యెగ్గులేని యాకెనీలో యడమాఁటలు
సిగ్గరితనాలలోని చే సన్నలు
వొగ్గి యియ్యకొన్నట్టి వొడఁబాటులు
నిగ్గుదేరె మీ సుద్దులు నే నెఱంగనా

చ. 2: తక్కక మీ రెంచుకొన్న తలపోఁతలు
చెక్కిటి చేతులు తోడిచిరునవ్వులు
దక్కి మీకు సరివచ్చె తారుకాణలు
నిక్కమైన నేస్తాలు నే నెఱంగనా

చ. 3: తలకొన్న రతులలో తరితీపులు
కొలఁది మీరిన మతి కోరికలు
చెలరేఁగి న న్నేలిన శ్రీవేంకటేశ
నిలిచిన మీ చేఁతలు నే నెఱంగనా

రేకు: 1965-2 ముఖారి సం: 29-326

పల్లవి: ఎంతైనాఁ దనతో నే నెగ్గుపట్టేనా
చెంతనుండి నాచే సేవసేయించుకొనుఁగాక

చ. 1: సేయఁగలవెల్లాఁ జేసి సిగ్గులు వడఁగ నేలే
చాయ సేసుకొని పొందు జరపుఁగాక
యే యెడనో వుండి వచ్చి యేల వొడఁబరచీనే
నాయందు కూరిమి చల్లి నవ్వుఁగాకా

చ. 2: ముం దెవ్వతెనో పెండ్లాడి మొక మేమి చూచీనే
అందాలు సేసుక మాఁటలాడుఁగాక
విందు లెందో ఆరగించి విడెము లే లడిగీనే
అంది నా పానుపుపైనే యవధరించుఁగాకా

చ. 3: చుట్టాల సురభి తాను చొక్కుల నేల పెట్టీనే
గుట్టుతోడ నా కాఁగిటఁ గూడుఁగాక
యిట్టె శ్రీవేంకటేశుఁ డేలి న న్నేల మెచ్చీనే
జట్టిగాఁదనకే మోవి చవిచూపుఁగాకా

రేకు: 1965-3 రామక్రియ సం: 29-327

పల్లవి: నీ వెఱఁగవా తగవు నెరజాణవు
వోవల నెగ్గుపట్టక వోరుచుకోవయ్యా

చ. 1: చుట్టుకొన్న వలపులు సూటికి రాకుండితేను
తిట్టుదురు మగవానిఁ దెరవలు
గుట్టుతోడఁ దమకము గుబ్బతిలుకొంటాను
వొట్టులు వెట్టి సారెకు నుప్పతింతురు

చ. 2: వేడుకతోడఁ గాఁగిలివేళ కొదగకుండితే
యేడనైనా సొలతురు యింతులు
తోఁడ దోడ నాసలు దొమ్మిఁ జిమ్మిరేఁచితేను
జాడతోఁ జేతులు చాఁచి సాదింతురు

చ. 3: తలఁచిన తలఁపులు తారుకాణ రాకుండితే
బలిమిఁ బెనఁగుదురు పడఁతులు
యెలమి శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
లలనలు యిటులైతే లాలింతురు

రేకు: 1965-4 శుద్ధవసంతం సం: 29-328

పల్లవి: తలఁచుకో నీమతికిఁ దారుకాణ యీ వలపు
తెలిపి చెప్పఁగఁబోతే తీగె సాగు వలపు

చ. 1: కావలెనన్నవారికి కడుఁ దీపు వలపు
వేవేలకు దాఁచుకొంటే వెలవెట్టు వలపు
చేవదేరఁ బెనఁగితే చిగిరించు వలపు
భావించి పోదిసేసితే పంటవండు వలపు

చ. 2: నేరుపుగలవారికి నిధానము వలపు
కూరిమిఁ జేకొంటేను కోటిసేసు వలపు
వూరకే తలపోసితే నువ్విళ్ళూరు వలపు
గారవించి తెచ్చుకొంటే గాదెనిండు వలపు

చ. 3: కైకొన్నవారికి కాణాచి వలపు
యేకడాఁ బాయకుండితే యీడేరు వలపు
దాకొని శ్రీవేంకటేశ తరుణిఁ గూడితి విట్టె
నీకూ నీపె కేకాలము నిండుకుండు వలపు

రేకు: 1965-5 కాంబోది సం: 29-329

పల్లవి: కంటిలేవే చెలియా కతకారినీ చేఁతలు
దంటతనమున నింకా తారుకాణించనేలే

చ. 1: కళలు మోమునఁ దేరె కన్నులఁ గెంజాయ మించె
తలకూడెఁ బను లింకఁ దాఁచనేఁటికే
పిలువఁ బోతివి నీవు ప్రియుఁడు నిన్నింతసేసె
వలపు పట్టరానిది వట్టిమాఁట లేఁటికే

చ. 2: వాసనలు మేన నిండె వడియఁ జొచ్చెఁ జెమట
సేసిన చేఁతలు చెల్లె సిగ్గు లేఁటికే
నా సుద్దులు చెప్పితివి నడుముఁదాఁ బెండ్లాడె
ఆసలు కొండలవంటి వాతఁ డేమిసేసునే

చ. 3: చిన్నలు చెక్కుల నిండె సెలవి నవ్వులు రేఁగె
పన్నుగడ లొక్కటాయ బయమేఁటికే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డీడకు వచ్చి నన్నేలె
చిన్నపాయ మింత సేసె చెప్పవలెనటవే

రేకు: 1965-6 కదారగౌళ సం: 29-330

పల్లవి: పతివి నీతో నాకు పంతము గాదా
రతివేళ యిది సుమ్మీ రాఁపుసేయ కిఁకను

చ. 1: నిన్నుఁ బాసి తమకము నిలుపఁ జాలక నేఁ
గన్నుల జంకించితిఁ గసరితిని
మన్నింతువు గనక నా యందెమేళ మిట్టుండె
చిన్నదానఁ జుమ్మీ నీ చిత్తము నే నెఱఁగ

చ. 2: విరహతాపముచేత విసిగి నీవు రావంటా
విరులఁ గొని వేసితి వేసరించితి
మరిగించితివిగన మదము నా కిట్టుండె
సదసమాడితిఁ జుమ్మీ చలము సాదించను

చ. 3: పాయప టాసలచేత బలిమిఁ బైకొని యిట్టె
చెయి నీపై వేసితిఁ జెనకితిని
యీయెడ శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
వేయిటికి మొక్కేఁ జుమ్మీ విన్నపము సేసితి

రేకు: 1966-1 సామంతం సం: 29-331

పల్లవి: నీ యంత నేరమా నే మెల్లాను
చేయరాఁ బతియిచ్చులోఁ జెలఁగేముగాకా

చ. 1: ఆటలెన్నైనాఁ గలవు అట్టె జూజా లాడితేను
చోటు లెన్నైనాఁ గలవు చొచ్చివెళ్లితే
నీటు లెన్నైనాఁ గలవు నిక్కి నిక్కి నిక్కిచూచితేను
యేఁటికింత రమణుని నెలయించేవే

చ. 2: బాస లెన్నైనాఁ గలవు పలుమారుఁ జేసితేను
ఆస లెన్నైనాఁ గలవు అడిగేనంటే
వేసా లెన్నైనాఁ గలవు వేగినంతా సొలసితే
రాసికెక్కఁ బతి నెంత రవ్వసేసేవే

చ. 3: చేఁత లెన్నైనాఁ గలవు చిక్కించుక చెనకితే
వాత లెన్నైనాఁ గలవు వాసేనంటే
పూఁతగా శ్రీవేంకటేశుఁ డొద్దికతో నన్ను నేలె
కాఁతాళిం చేతని నేల కాఁగిలించేవే

రేకు: 1966-2 ముఖారి సం: 29-332

పల్లవి: ఎట్టు మన్నించేవో యిటువంటిది నా వోజ
యిట్టె చిత్తానఁ బెట్టు యిది నా విన్నపము

చ. 1: చూడకున్నా నా కన్నుల చూపులు నీపైఁ బారు
ఆడకున్నా నోరు మాఁటలాడు నీతోనే
యేడనున్నాఁ బాదాలు నీ యింటికే రప్పించును
యీడులేని నావలపు యింతసేసె నన్నును

చ. 2: తల వంచుకుండినాను తలఁపు నీపై నుండు
అలసినాఁ గూడించు నాస నీతోను
చెలఁగి సిగ్గున నున్నా సెలవులు నవ్వింపించు
యెలమి నా తమకము యెంతని చెప్పుదును

చ. 3: గుట్టుతోడనుండేనన్నా గుబ్బలు ని న్నొరయించు
ముట్టకున్నా నా చేతులు మొక్కించు నీకు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెట్టిదో నా వేడుక యేమిసేతు నిఁకను

రేకు: 1966-3 వరాళి సం: 29-333

పల్లవి: ఇన్నాళ్లుఁ బిన్నదిగాని యిప్పుడు వయసు వచ్చె
విన్నవించితిమి నీకు వేడుక చూడవయ్యా

చ. 1: మొలచి గుబ్బచన్నులు మొన లెత్తెను
చెలరేఁగి కోరికలు చిగిరించెను
నలుగడ జవ్వనము నన లొత్తైను
చెలియతో వనకేలి సేతువు రావయ్యా

చ. 2: యింతి చెక్కు చెమటల యేరులు వారె
వింతనవ్వుల పూవుల విరియఁ జొచ్చె
చెంతనే గండుమీలు మించెను కన్నుల
చింతదీర జలకేలి సేతువు రావయ్యా

చ. 3: చక్కని మోమున నిండె చంద్రకళలు
మిక్కిలి మరబలాలు మేనిపై వాలె
యిక్కడ శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ బెండ్లాడె
గక్కన సురతకేలి గావింతువు రావయ్యా

రేకు: 1966-4 రామక్రియ సం: 29-334

పల్లవి: ఎదిరిఁ దన్నెరఁగదు యెప్పుడూ వలపందురు
కదిసి యామాఁట నేఁడు గానవచ్చె మాకును

చ. 1: వెలఁది మట్టెలు నీవేలనే వుండఁగానే
చెలరేఁగి నన్ను నెంత చెక్కు నొక్కేవు
పలుసోఁకులు పెదవిఁ బాదుకొని యుండఁగానే
మలసి యప్పటి నాతో మాఁటలాడేవు

చ. 2: కొమ్మ ముడిపువ్వులు నీ కొప్పులోన నుండఁగానే
ముమ్మాటికి చేతులపై మొక్కవచ్చేవు
కుమ్మెలై గుబ్బలొత్తిన గురుతు మై నండఁగానే
కమ్మటి సిబ్బితి లేక కాఁగిలించ వచ్చేవు

చ. 3: పడఁతి కస్తూరిపూఁత పచ్చడ మంటుండఁగానే
అడరి నామీఁద గప్పి యాదరించేవు
యెడయ కిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
నడుమ నాకె వుండఁగా నమ్మికిచ్చేవు

రేకు: 1966-5 పాడి సం: 29-335

పల్లవి: ఆతని చిత్తము వచ్చినట్టే మెలఁగవద్దా
కాతరించి మరి యాల కక్కసించేవే

చ. 1: వలపుగలవారికి వాసులేమీ నెంచరాదు
పిలిచితే నౌఁగాదని పెనఁగరాదు
మలసి యెవ్వతెతోనో మాఁటలాడె నాతఁడంటా
చలపట్టి పతినేల సాదించేవే

చ. 2: చుట్టరిక మమరితే సూళ్ళువెదకరాదు
పట్టి కాఁగిలించుకొంటే పాయఁగరాదు
తొట్టి వుడిగపుదానితో నాతఁడు నవ్వెనంటా
ఇట్టె రమణుని నేరాలేల యెంచేవే

చ. 3: వావులు గలసితేనే వోద్దని తోయఁగరాదు
వోవరిలోఁ గూడె నిన్ను వొడ్డుకోరాదు
సోవగాఁ బొరుగు సతిఁ జూచి చన్నులంటెనంటా
శ్రీవేంకటేశ్వరు నేల చెక్కు నొక్కేవే

రేకు: 1966-6 కాంబోది సం: 29-336

పల్లవి: ఎప్పుడూ నీ కాఁగిటఁ బాయక యిట్టె వుండునమ్మా
తప్పక యింతేసి నీతోఁ దారుకాణించనేలే

చ. 1: చందమామవంటిమోము సతి నీకుఁ గలుగఁగా
విందువలెఁ జిరునవ్వు వెన్నెల మించె
కందువతోఁ బదారుగళలు దొలఁకఁజొచ్చె
అంది వలచి నీ మగఁ డంట కెట్లుండునే

చ. 2: మెఱుఁగుఁదీగెవంటి మేమను నీకుఁ గలుగఁగా
గుఱిగా మేఘమువంటి కొప్పు వెలసె
మఱియు మోవిపండు మాఁగి తెనేగారీని
మఱఁగులేక నీ పతి మన్నించ కెట్లుండునే

చ. 3: నిమ్మపండ్లవంటినీచన్నులు గలుగఁగా
కమ్మి జవ్వనవనము కడు నమరె
వుమ్మడిఁ జెమటవాన లూరి పోదిసేసీ నిదె
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డెనయ కెట్లుండునే

రేకు: 1967-1 సామంతం సం: 29-337

పల్లవి: చెలికత్తె లిందరును సేసేరు విన్నాపాలు
నెలఁత చక్కఁదనాలు నీకే తగునయ్యా

చ. 1: కప్పురము దిన్న నోర కలికి కతలు చెప్పీ
వొప్పుగాఁ జెవులార విని వూఁకొనవయ్యా
కుప్పెసవరముతోడ గొప్పగాఁ దురుమువెట్టె
చొప్పుగాఁ గనుఁగొనలఁ జూడవయ్యా

చ. 2: కంకణాలు వెట్టుకొన్నకరముల నీకు మొక్కీ
తెంకి నుండి నీ వందుకు దీవించవయ్యా
కుంకుమ గుబ్బ లదర కొసరి నీతో నవ్వీ
లంకెలుగా నాపెకు వలవఁగదవయ్యా

చ. 3: గందము వూసుకొనిన కాఁగిట నీతోఁ బెనఁగీ
చెంది నీ వందుకు సంతోసించువయ్యా
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చందమాయఁ గాఁపురము చనవియ్యవయ్యా

రేకు: 1967-2 శంకరాభరణం సం: 29-338

పల్లవి: కాదనఁగఁ దగదు కాంతునికి
మోదపుసతులకు మోహములే

చ. 1: పలుమరు సొలసిన పైపైఁ గొసరిన
చెలులకు నవి యొచ్చము గావు
పలుకుల దూరిన పంతము లాడిన
చలములు గా వవి సహజములే

చ. 2: చనవున నొరసిన సన్నలఁ దిట్టిన
వనితల కవి కొదవలు గావు
చెనకుచుఁ గసరిన చేతులు చాఁచిన
పెనఁగుటలు గావు ప్రేమములే

చ. 3: పగటులు చూపిన పాదము దొక్కిన
మగువలు కవి కడమలు గావు
తగిలె శ్రీవేంకటోత్తమ నిను మా యింతి
వెగటులు గా వివి వేడుకలే

రేకు: 1967-3 శంకరాభరణం సం: 29-339

పల్లవి: ఇవివో నీ కాంత సుద్దు లేమని చెప్పేమిఁక
జవళి నీవూఁ గూడితే సంతోసాలయ్యీని

చ. 1: పుడివోనితమితోడ నుమ్మగిలీ జవరాలు
వొడలి చెమటలతో నోలలాడీని
చిదుముడి కోరికల చిత్తమెల్లాఁ జంచలించి
అదరి నిట్టూర్పుల నుయ్యాల లూఁగీని

చ. 2: విరహపు వేదనల వీడు దోడాడుకొంటాను
సరి నెదురుచూపుల జాజరాడీని
మరగిన మమతలు మక్కళించి మక్కళించి
తురుము వీడి చీఁకటిఁ దులఁదూఁగీని

చ. 3: చెలులతో నీ సుద్దులు చెప్పి చెప్పి పులకల
వలపుల రతులకు వంతులాడీని
యెలమి శ్రీవేంకటేశ యింతలో నిన్నుఁ బెండ్లాడి
మొలక నవ్వు లెల్లాను ముప్పిరి వేసీని

రేకు: 1967-4 నాదరామక్రియ సం: 29-340

పల్లవి: ఏమి నెఱఁగవు యిన్నాళ్ళు
నీమతకము లివి నెగడెనే కదవే

చ. 1: వాడిక మాఁటల వలపుల చేఁతలు
యెడ నేర్చితివే యీతనితో
వేడుక నవ్వులు వేసాల సొలపులు
చూడఁ జూడఁ గడు సోద్యము గదవే

చ. 2: పాపట దువ్వులు పయ్యద మాఁటులు
పైపై నెటువలెఁ బనుపడేనే
చూపుల చొక్కులు సురతపు రేఁపులు
నీపాలఁ గలిగి నెలకొనెఁ గదవే

చ. 3: తీగెల యెలుఁగులు తెగని గర్వములు
సాగి యేసబలఁ జదివితివే
యీగతి శ్రీవేంకటేశుఁడు న న్నేలె
నీ గతు లతనికి బాగాయఁ గదవే

రేకు: 1967-5 మంగళకౌసిక సం: 29-341

పల్లవి: నా మొగ మేమి చూచేవు నడుమనే యిది యేమే
గామిడివై సాదించఁగలవా నీవూ

చ. 1: కాతరించి పెనఁగేవు కవ కవ నవ్వేవు
ఆతఁడేడ నీవేడ అవునే నీవు
చేతులారా నీడుగాని చేఁతలు సేసితేను
నాతులెల్లా నిన్నుఁ జూచి నవ్వరా యిందరును

చ. 2: సరుసఁ గూచుండేవు సరసము లాడేవు
దొరతోడి పొందు కోపుదువటె నీవు
యరవుల వారితోడ యెమ్మెలు చెప్పుకొంటేను
సరి సవతు లెల్లాను జాతులు సేయరా

చ. 3: చిమ్ముచు గోర నూఁదేవు సేసలు పైఁ జల్లేవు
నెమ్మి మగనిఁ జొక్కించ నేర్తువా నీవు
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డితఁ డిట్టె నన్నుఁ గూడె
పమ్ముక మీ యింటివారే పంగించరా నిన్నును

రేకు: 1967-6 సింధురామక్రియ సం: 29-342

పల్లవి: ఆలి మగని తగవులవిగో చెప్పితి నీకు
వాలాయముగా మఱవక తలఁచుకొమ్మీ

చ. 1: యెడసిన తమితోడ నెంతయినా సొలతురు
పడఁతులయ్యినవారు పతిని
అడరి నీవు రావలెనని చెలికత్తెలచే
యెడ మాఁటల దూరితి నెగ్గుపట్టేవు సుమ్మీ

చ. 2: కాఁకఁ బొరలినందుకు కైమీరి చెనకుదురు
యేఁకరిన సతులు త మ్మేలినవాని
తేఁకువతో నీవు నన్ను దిష్టించి చూడవలసి
పోఁక పూఁబిలవేసితి పొంచి వోరుచుకొమ్మీ

చ. 3: అంచెలఁ గూడేటి వేళ అట్టె యేమైనాఁ జేతురు
పొంచుకున్న వనితలు పొందైనవాని
యెంచఁగ శ్రీవేంకటేశ యెనసేవేళ నీ మోవి
యించుక గంటిసేసితి నేమీ ననకుమీ

రేకు: 1968-1 రామక్రియ సం: 29-343

పల్లవి: కానవచ్చె నీ గుణాలు గక్కన నీ చేఁతలనే
పూని యిట్టి వలపుల పొద్దు జరపేవా

చ. 1: వొనరి గోర నూఁదితే వోద్దంటా వేడుకొనేవు
గునిసి నిన్నెవ్వతైనాఁ గోపగించీనా
పెనఁగి కొంగువట్టితే ప్రేమ నొడఁబరచేవు
యెనయ వేరొకతెకు నిక్కువ చెప్పితివా

చ. 2: మంచిగంద మలఁదితే మగుడ నాకుఁ బూసేవు
ముంచి మోహపాకె మచ్చములు పట్టీనా
వంచనతోఁ జెనకితే లంచము మోవి ఇచ్చేవు
అంచల మీ యింటివారి కాసలు వెట్టితివా

చ. 3: పూవులదండ వేసితే పొంచి వొడిఁ బెట్టేవు
నీ వనిత యిందుకుఁగా నిన్ను నవ్వీనా
యీవేళ శ్రీవేంకటేశ యేలి నన్నుఁ బొదిగేవు
వావి నీనేగికత్తెకు వరుస ఇచ్చితివా

రేకు: 1968-2 శ్రీరాగం సం: 29-344

పల్లవి: ఈరీతి నావలపులు యెంతని చెప్పుదు నీకు
కోరిన నా కోరికలు కొనసాగెనయ్యా

చ. 1: చెలికత్త లెల్లా నిన్నుఁ జెప్పఁగానే విని విని
వెలలేని వేడుకల విఱ్ఱవీఁగీని
కలువరేకులవంటి కన్నుల నిప్పుడు చూచి
తెలివితో నానందాన తెప్పలఁ దేలీని

చ. 2: వొద్దనుండి ఇంతవడి వూడిగాలు నీకుఁ జేసి
పొద్దులు వుచ్చుక కొంత భోగించీని
సుద్దులు నీతోఁ జెప్పి చుట్టరికాలు నెరపి
అద్దుక సరసమాడి ఆయము గరఁగితి

చ. 3: చిత్తమెరిఁగినదాఁకా సిగ్గువడి పానుపుపై
బత్తితో నీ కూటములు భావించుకొంటి
ఇత్తల శ్రీవేంకటేశ ఇట్టె నన్ను నేలితివి
నెత్తమాడి సంతోసాన నెమ్మది నవ్వితి

రేకు: 1968-3 హిందోళం సం: 29-345

పల్లవి: ఇదివో నా కాఁపురము లెరఁగ విన్నవించితి
మదిలోన మఱవక మన్నించు నన్నును

చ. 1: తనువు సిగ్గుతోడుతఁ దగితి యింటిలోనుండు
మనసు నీపైనుండు మరిగెఁ గాన
కనుచూపు లివి నీరాకల కదురైవుండు
తనివోని వలపులు తలకెక్కియుండు

చ. 2: చేతులు చింతతోడుత చెక్కులపైనే వుండు
ఆతుమ నీ దేవులయ్యే యాపలనుండు
వాతెర మోనము మీఁద వదలనట్టె వుండు
యీతల నాలిక నీ పేరెంచుకొంటా నుండును

చ. 3: చన్నులు గుట్టుతోడుత సరిఁబయ్యదలోనుండు
కన్నెపాయము నీకుఁగాఁ గాచుకవుండు
ఇన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సన్నలు చాయలును నీ సరసముల నుండు

రేకు: 1968-4 మాళవిగౌళ సం: 29-346

పల్లవి: చెప్పనే వినేఁగాని సిగ్గువడక
యిప్పుడు నామగనికి నేమౌదువే నీవు

చ. 1: చెంతనుండి రేఁగి రేఁగి సేసేవు విన్నపాలు
యెంత చనవరివే నీ వితనికిని
కాంతలెల్లా నుండఁగాను గద్దెపై నెక్కవచ్చేవు
యింత గద్దా చుట్టరిక మిందరిలో నీకు

చ. 2: మోముచూపి మోముచూపిముచ్చటలాడవచ్చేవు
గామిడివై కతలెన్ని గరచితివే
చేముంచి తీసుకొనేవు చెవిలో తట్టు పుణుఁగు
యేమే యీ సలిగెలు యెందుఁ దెచ్చుకొంటివే

చ. 3: సారె సారె నవ్వుతాను చన్నులనే వొరసేవు
కూరిమి నీతఁడు నిన్నుఁ గూడెనటవే
యీరీతి శ్రీవేంకటేశుఁ డీతఁడె నన్ను నేలె
నేరుపరి తనముల నీ కేడఁ గలిగెనే

రేకు: 1968-5 నాగవరాళి సం: 29-347

పల్లవి: ఇందాఁకా నెఱఁగనైతి నిట్టె నీ మంచితనాలు
అందమాయఁ బనులయ్యా ఔదువయ్యా జాణవు

చ. 1: చెక్కు నొక్కి వేఁడుకోఁగా చిత్తము గరఁగె నాకు
మొక్కేమయ్యా నీకు ముదమలర
మిక్కిలి బుజ్జగించఁగా మించిన కోపము దీరె
ఇక్కువకు రావయ్యా ఇందవయ్యా విడెము

చ. 2: లాలించి కోఁగలించఁగా లలి మొక దాకిరాయ
ఆల నైతినయ్యా నీకు నన్నిటా నేను
మేలిములు నీ వాడఁగా మేలుదాననైతి నీకు
యేలుకోవయ్యా చనవియ్యవయ్యా నాకును

చ. 3: చేవట్టి గారవించఁగా చింతలెల్లాఁ బెడఁబాసె
సేవ సేసేనయ్యా నీకు చేతులారాను
శ్రీవేంకటేశ కూడఁగా నెలవుల నవ్వువచ్చె
కైవసమై వుండువయ్యా కానీవయ్యా నమ్మితి

రేకు: 1968-6 బౌళి సం: 29-348

పల్లవి: ఎరవులు మరిలేవు యెవ్వరికిని
సరససల్లాపములు సమకొను నపుడు

చ. 1: యియ్యకోలే వూఁకొంటే ఇన్ని విన్నవించవచ్చు
నెయ్యమైతే చనవులు నెరపవచ్చు
చెయ్యారాఁ జెనఁగితేను సిగ్గు విడిసించవచ్చు
తొయ్యలులకు నీవలె తొడఁగి లాలించతే

చ. 2: చేకొని సమ్మతించితే చేఁతలన్నిఁ జేయవచ్చు
జోకయై పాయకుండితే చొక్కించవచ్చు
చేకొలఁదికి వచ్చితే చెనకి మెప్పించవచ్చు
యే కాంతకూ నీవలె యిచ్చగించి కూడితే

చ. 3: వాలాయించితే రతుల వాడికలు చూపవచ్చు
మేలమాడితే నేరుపు మెరయవచ్చు
యీలీలనే శ్రీవేంకటేశు నన్ను నేలితివి
నీ లేమ నయిన నాకు నీవలె మన్నించితే

రేకు: 1969-1 సాళంగనాట సం: 29-349

పల్లవి: నిన్ను మెచ్చి పొగడేము నీ చెలులము గనక
యెన్నిక కెక్కితివమ్మా యిన్నిటాను నీవు

చ. 1: వినయాలు నేరుతూవే విభుని వలపించను
పెనఁగ నేరుతువే ప్రియము రేఁచ
చెనకఁగ నేరుతువే చిత్తమెల్లాఁ గరఁగించ
మినుకుల జవరాల మేలు మేలే నీవు

చ. 2: సన్నసేయ నేరుతువే సరసుని రప్పించ
విన్నవించ నేరుతువే వేడుకవుట్ట
కన్నులార్చ నేరుతువే కడు నిచ్చకముగాఁగ
అన్నిటా జాణకత్తెవు అవునౌనే నీవు

చ. 3: సేసవెట్ట నేరుతువే శ్రీవేంకటేశుఁ జొక్కించ
ఆసచూప నేరుతువే ఆయలు సోఁక
రాసికెక్క నిన్ను నేలె రమణుఁ డితఁడె వచ్చి
బాసతోడి యిల్లాల బాపు బాపు నీవు

రేకు: 1969-2 హిందోళవసంతం సం: 29-350

పల్లవి: ఒకటొకటే గడించే వూరకున్న యాకె మీఁద
యెకసక్యా లిఁకనేల యెరుఁగుదుమయ్యా

చ. 1: సరుసకు వచ్చెనంటా చన్నులు సోఁకించెనంటా
తరుణిపై గోరేల తాఁకించేవు
మరిగి యాపెపై నీకు మనసువారితేను
వరుసతోఁ బెండ్లాడఁగా వద్దనీనా నిన్నును

చ. 2: పెడమళ్ళి చూచెనంటా పెద్దకొప్పు వెట్టెనంటా
పడఁతిపై నేఁటికి నెపాలు వేసేవు
వడిగా నీ కాపెమీఁద వలపు గలిగితేను
వొడిగట్టి తియ్యఁగాను వోపననీనా

చ. 3: నిన్నుఁ జూచి నవ్వెనంటా నిలుచుండిమొక్కెనంటా
కన్నె నేల పట్టి తీసి కాఁగిలించేవు
యెన్నఁగ శ్రీవేంకటేశ యేలితి వీకె నింతైతే
సన్నల నింకాఁ గూడఁగా చాలు ననఁగలదా

రేకు: 1969-3 రామక్రియ సం: 29-351

పల్లవి: వెక్కసపు నీ కతలు విని విని వెగటయ్యీ
యెక్క డెక్కడ నీ పగటు యెవ్వరిఁ బోలుదువే

చ. 1: ఆతఁడు నీ మగఁడనే వాలనైతి నీ వనేవు
యేతులేమి చెప్పేవే యిందరితోను
రాతిరిఁ బగ లీతని రతికిఁ గాచుకుండిన
యీ తరుణిమణులలో నెవురిఁ బోలుదువే

చ. 2: నిన్నుఁ బాయలేఁ డనేవు నీకు వలచు ననేవు
యెన్నిలేవే నీయాఁట వూడిగాలవారిలోన
వున్నతి నాతనివద్ది వూడుగాలవారిలోన
యెన్ని చెప్పే మంటే నీవు యెవురిఁ బోలుదువే

చ. 3: నీకు ననుచు ననేవు నీ వావులు దెలిపేవు
యీకడ నీ మేకులక నేది గురుతే
చేకొని న న్నేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
యీ కులకాంతలలో నీ వెవ్వరిఁబోలుదువే

రేకు: 1969-4 దేసాళం సం: 29-352
పల్లవి: తోడఁబెండ్లడికూఁతురవా తొయ్యలి నీవు
బేడుకోలవై సందడిఁ బెండ్లాడ వచ్చేవు
చ. 1: కడఁగి యాతఁడు వేరే కాంతఁ బేరఁ బిలువఁగా
యెడచొచ్చి పలికేవు యిదేమే నీవు
బడినే యాకెకు మరి బాగా లొసఁగఁగాను
నడుమఁ జేయొగ్గే విది నాయమౌనటే
చ. 2: ఆముక చక్కనిదని యాకె నే పొగడఁగాను
నీ మోముఁ జూపవచ్చేవు నేరుపౌనటే
గోమునఁ దొడపై కాపెఁ గొంగువట్టి తియ్యఁగాను
యేమరించి కూచుండితి విది మేలే నీవు
చ. 3: యెనసి యాతఁ డాకె తో నేకతాలు చెప్పఁగాను
వినే నంటా నీవేల వీను లొగ్గేవే
మన సాకెపై నుండఁగా మరి శ్రీవేంకటేశ్వరుఁ
జనుఁగవ నొత్తికూడ సంగతౌనా నీకు

రేకు: 1969-5 ముఖారి సం: 29-353

పల్లవి: ఎంతవని సేసితివో యిందాఁకా నీవు
చెంత నిన్ను గిజి గిజి సేసిన దెవ్వతయ్యా

చ. 1: చెక్కులవెంటా నిండుఁ జమటలు గారఁగాను
యెక్కడ నుండి వచ్చితి వేమయ్యా
మక్కువతో నిన్నుఁ జూచి మనసు నీరై కరఁగె
అక్కడ నెవ్వతె నిన్ను నలయించెనయ్యా

చ. 2: వీఁపువెంటాఁ గొప్పువీడి విరులు రాలఁగాను
యేపున వడదేరీ యో మిదేలయ్యా
వోపిన నీ యలమటకొగిఁ గనికరమాయ
రాఁపుల నిన్నుఁ బెట్టిన రమణి యెవ్వతెయ్యా

చ. 3: సెలవులవెంటాఁ దమ్మచెదరులు రాలఁగాను
యెలమిఁ గప్రమడిగే వెంత కెంతయ్యా
అలరి శ్రీవేంకటేశ యట్టె నన్ను నేలితివి
పొలఁతి యెవ్వతె నిన్నుఁ బుత్తెంచెనయ్యా

రేకు: 1969-6 పాడి సం: 29-354

పల్లవి: చెలులాల చూడరే చెలువుని మన్ననలు
యెలమి నా భాగ్య మిఁక నేమిని చెప్పుదునే

చ. 1: ఆనలువెట్టి పిలిచి యాసలెంత రేఁచీనే
తా నెంత నే నెంత తమకించీని
ఆనుకొని నా వలపు ఆరడి నేల పెట్టీనే
మోనముతోఁ జేతులెత్తి మొక్కుతా నుందానను

చ. 2: కాలు దొక్కి మనసెంత కరఁగించి చొక్కించీనే
యేలినవాఁడు తాను యిల్లాల నేను
మూలనున్న నా సిగ్గు ముంగిట నేలవేసీనే
గోలతనమున వేఁడుకొంటా నుందానను

చ. 3: కూడి యంత సంతోసాన గుబ్బతిలఁ జేసీనే
వేడుకకు ముందే తను వెనక నేను
యీడనే శ్రీవేంకటేశుఁ డెనసి యాల మెచ్చీనే
ఆడ నీడాఁ దనుఁ గొనియాడుతానుందానను

రేకు: 1970-1 సామంతం సం: 29-355

పల్లవి: వాకిట నేమి సేసేవు వనిత నీకు మేలుది
దాకొని నీ వొడఁబాటు తప్పకువయ్యా

చ. 1: వెన్నెల బాయటనుండి వెలఁది నిన్నుఁ బిలిచీ
పన్నుకొని మరియేమో పని గద్దంటా
యిన్నిటా నే మాడిగితే నించుకంతైనాఁ జెప్పదు
విన్నపమేమి సేసీనో విందువు రావయ్యా

చ. 2: మేడలోననుండి నీకు మెలుఁత లేక లంపె
జోడుగూడి సంతోసపు సుద్దులకును
వోడక ముద్దురతోనే వున్నవి నేమెరఁగము
జాడతోడ నీకు నీవే చదువుకోవయ్యా

చ. 3: యింటితోనుండి వుంగర మింతి నీకుఁ జూపుమనె
తొంటిమాఁట నీవే తలఁతు వనుచును
జంటై వచ్చి కూడితివి సరుగ శ్రీవేంకటేశు
అంటి యీకెతో నేకత మాడుకోవయ్యా

రేకు: 1970-2 పాడి సం: 29-356

పల్లవి: ఏమి సేసే విక్కడను ఇంతి మనోరథములు
వాములు వేసుకున్నది వైళమే రావయ్యా

చ. 1: వంతులు వెట్టుక నీపై వలపులెల్లా నాడ
దొంతులు వెట్టుకున్నది తొయ్యలి
చెంతనే చెక్కుచేతితో చెమటల కాలువల
చింతలకు నీరు గట్టీఁ జిత్తగింతువు రావయ్యా

చ. 2: జాలితోడ విరహాన సారెకు నిట్టూర్పుల –
గాలి ముడియల గట్టీఁ గామిని
తాలిమితోఁ గోరికలఁ దగిలించి రతులకు
గాలాలు వేసుకున్నది కనుఁగొందువు రావయ్యా

చ. 3: రాఁపుల నీవు వచ్చేటి రాకల కెదురుండి
చూపులఁ బౌఁజులు వెట్టీ సుదతి
యేపున శ్రీవేంకటేశ యేలితివికెను మోవి –
తీపుల విందులు వెట్టీఁ దిలకింతువు రావయ్యా

రేకు: 1970-3 దేసాళం సం: 29-357

పల్లవి: తా నూరకే యాపనులు దడవీఁ గాక
నేనేమైనాఁ దనమీఁద వేసేనా

చ. 1: యెట్టుండినా నమ్మిక తన్నెగసక్కాలాడేనా
పెట్టరాని యానలేల పెట్టుకొనీనే
గుట్టుతోడఁ దలవంచుకొని వున్నదాన నేను
నట్టనడుమఁ దానేల నవ్వులు నవ్వీనే

చ. 2: యెంతసేసినాఁ దనపై యిట్టే నిందలు మోపేనా
కాంతలఁ దెచ్చేల తారుకాణ సేసీనే
సంతోసాన నాలో నేనే సమ్మతించుకున్నదాన
చెంతనుండి మరి నేల సిగ్గులు వడీనే

చ. 3: యేరీతి మెలఁగినాను యెగ్గుపట్టి దూరేనా
సారె నన్నే లొడఁబరచఁగ వచ్చీనే
కోరి శ్రీవేంకటేశుఁడు కూడినాఁడు దా నన్ను
గారవించి యాల యిచ్చకములు నెరపీనే

రేకు: 1970-4 శంకరాభరణం సం: 29-358

పల్లవి: సంతోసములాయ మాకు సరి మిమ్మిద్దరిఁ జూచి
వింత వింత నేరుపులు వెలయవే చెలియా

చ. 1: వదలక నీ విభుఁడు వదకు వచ్చెఁగదవే
యెదురెదురే చూచితి విందాఁకాను
కొదదీర మాఁటపలుకులు నీతో నాడెఁగదే
కదలక యిందుకే యాఁకరుకొంటానుంట్టివి

చ. 2: చనవిచ్చి యప్పటిని సరసములాడెఁగదె
యెనయఁగఁ గోరితి విందాఁకాను
కనుఁగాని నిన్నుఁ గూడి కాఁపురము సేసెఁగదే
జునుగుచు సగినాలే చూచుకొంటానుంటివి

చ. 3: చక్కఁగా నీ కాఁగిటికి సతమాయఁగదవే
ఇక్కువఁ గాచుకుండితి విందాఁకాను
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను నేలెఁగదవే
చొక్కి యలమేల్ మంగపు మొక్కుకొంటానుంటివి

రేకు: 1970-5 బౌళి సం: 29-359

పల్లవి: ఇంకనేల సిగ్గువడే విద్దరు నున్నా రీడను
కొంకక నన్ను మన్నించి కూడితివి నాఁడే

చ. 1: కంకణాలచేత నాపె కానుక లిచ్చీ నీకు
అంకెలఁ బరాకుమాని అందుకోవయ్యా
సంకెలేల నీముందర చక్కఁగా నిలుచున్నది
పంకించక నీ మోము చూపఁగదవయ్యా

చ. 2: మూరెఁడు దురుమువంచి మునుకొని మొక్కీ నీకు
తేరకొనఁ జూచాకెను దీవించవయ్యా
కూరిమి గొసరి నీ కొలువులు సేసీని
సారెకును మెచ్చి మెచ్చి సంతోసించవయ్యా

చ. 3: వెలయ కప్రపు నోర విన్నపాలు సేసీ నీకు
లలిఁ జెవ్వులారా విని లాలించవయ్యా
అలమేల్మంగను నే నీ యాలను శ్రీవేంకటేశ
వలచి వచ్చినాపెను వడిఁ జేకొనవయ్యా

రేకు: 1970-6 శ్రీరాగం సం: 29-360

పల్లవి: ఎంత గుట్టు నెరపేవే యెందాఁకాను
పొంతనే మగనితోఁ గాపురము సేయఁగదే

చ. 1: వుమ్మగిలుఁ జెమటలు వుప్పతిలీ నీమేన
కమ్ముకొన్నవలపు లెక్కడ దాఁచేవే
నెమ్మది నీ తలపోఁత నిట్టూరుపులే చెప్పీ
అమ్మరో నీ విరహ మెట్టడంచుకొనేవే

చ. 2: సురతపు టాసలు చూపులలోన నున్నవి
వరుస నీ తమక మేవంకఁ బెట్టేవే
నిరతపు నీ మర్మాలు నివ్వెరగులే చెప్పీ
సొరిది నీ మోమువాడుచొ ప్పెట్టు మాపేవే

చ. 3: చేవదేరి పులకలు చెక్కలను నిండుకొనె
కావరపు సిగ్గు లేడ గాదెఁబోసేవే
నీ వలమేలుమంగవు నిన్నేలె శ్రీవేంకటేశుఁ –
డీవల మదనచినలేగంపఁగమ్మేవే

రేకు: 1971-1 శుద్ధదేశి సం: 29-361

పల్లవి: ఊరకే మన మిద్దరి నుప్పతించే మింతేకాక
వీరెప్పుడూను నొక్కటే వినరమ్మ చెలులు

చ. 1: సెలవి నవ్వు నవ్వులు చిత్తము గరఁగించఁగా
పలుకు చుట్టరికెము పైకొలుపఁగా
కలికిచూపులు దమకములు రేఁచఁగాను
వలవ కెట్టుందురమ్మ వనితలుఁ బతులు

చ. 2: తక్కక మోవి తేనెలు తరితీపు సేయఁగాను
మక్కువ సరసములు మరిగించఁగా
చక్కఁదనములు లోలో సరి నాస పుట్టించఁగా
చిక్కకెట్టుండుదురమ్మ చెలఁగి దంపతులు

చ. 3: కొనగోరిచెనకులు గుట్టు విడిపించఁగాను
తనువులకాఁగిళ్ళు తగిలించఁగా
యెనసి శ్రీవేంకటేశుఁ డీ యలమేలుమంగను
ననుచ కే లుందురమ్మ నాయకీ నాయకులు

రేకు: 1971-2 లలిత సం: 29-362

పల్లవి: ఎంత సులబమో నీవు యీకె యిత సేయవచ్చె
చెంతఁ దన యగ్గలిక చిత్తగించవయ్యా

చ. 1: కలికి నీ మనసెల్లాఁ గరఁగ మాఁటాడవచ్చె
సొలసి సొలసి నిన్నుఁ జూడవచ్చెను
వలపు నీపైఁ జల్లి వాడిక సేసుకోవచ్చె
పిలిచి యాపెను వద్దఁ బెట్టుకొనవయ్యా

చ. 2: తడవి చుట్టరికము దలఁపించఁగ వచ్చె
వొడివట్టి నినుఁ గడు నుబ్బించ వచ్చె
కడు వినయాలు సేసి కాఁగిలడుగఁగ వచ్చె
యెడయ కాపె నీడనే యెదురుకోవయ్యా

చ. 3: ఆయములు ముట్ట నీకు నాసలు రేఁచఁగ వచ్చె
కాయజకేలి నిన్నుఁ గలయ వచ్చె
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పాయక న న్నేలితివి భామనుఁ గూడవయ్యా

రేకు: 1971-3 బౌళి సం: 29-363

పల్లవి: సేసినవె చేఁత లిఁకఁ జెలఁగరే మీ రిద్దరు
మోసపో వీవలపులు ముయికి ముయౌను

చ. 1: యీాడు జోడై పెనఁగితి నింతులకుఁ బతులకు
వేడు కెంత గలిగినా వేసటగాదు
పాడి పంతా లొక్కపై పరగినవారికి
చూడఁ జూడఁ జేకొన్నదే చుట్టరిక మగునే

చ. 2: చిగిరింపుఁ జిత్తములఁ జెనకేటివారికి
తగిలి యెంత గూడినాఁ దనివిలేదు
పగటునఁ బొందుగల్గి పాయకున్నవారికి
నగితే నెదురుబడి నాములెక్కును

చ. 3: బత్తితోడ నే పొద్దూఁ బాయకుండి వారికి
చిత్తా లెంత గరఁగినా సిగ్గు వుట్టదు
హత్తి శ్రీవేంకటేశుఁడు అలమేల్మంగ నిన్నేలె
పొత్తుల రతులు మీకుఁ బోరచులౌను

రేకు: 1971-4 ఆహిరి సం: 29-364

పల్లవి: ఏమి సేతుఁ జెలియా యెలయించీ నితఁడు
కామించి కామించి కరఁగీ నా మనసు

చ. 1: చెలిమి సేసినవాఁడు చేరి యెప్పుడు వచ్చీనో
మలసి యేమని నాతో మాఁటలాడీనో
నలిరేఁగి యెటువలె నవ్వులు నవ్వీనో
తలఁచి తలఁచి కడుఁ దమకించీ మనసు

చ. 2: మొగము చూచినవాఁడు మోహమెంత నెరపీనో
తగులై యెట్లా నన్ను దయసేసీనో
మిగులాఁ జుట్టరికమై మెచ్చి యేమి యిచ్చీనో
చిగిరించి చిగిరించి చిమ్మిరేఁగీ మనసు

చ. 3: సేసవెట్టినట్టివాఁడు సేవ లెటులాఁ గొనీనో
వేసరక రతి నెంత వెలయించీనో
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
లాసి లాసి కూడె వుల్లాసించీ మనసు

రేకు: 1971-5 వరాళి సం: 29-365

పల్లవి: కంతుఁడుసేసినమాయ గడవరాదు
యెంతైనాఁ దప్పించుకొన నెట్టు వచ్చునే

చ. 1: నిక్కి చూచిన చూపుల నిండా నాసలు వుట్టించు
మొక్కిన మొక్కులే కడు మొగ మోడించు
పక్కన నవ్విన నవ్వే భావములు గరఁగించు
యెక్కడాఁ దప్పించుకొన నెట్టు వచ్చునే

చ. 2: తలఁచిన తలఁపులే తగులాయములు సేసు
పలికిన పలుకులే పాదకొలుపు
సొలసిన సొలపులే చుట్టరిక మొనరించు
యెలమిఁ దప్పించుకొన నెట్టు వచ్చునే

చ. 3: పెనఁగిన పెనఁగులే ప్రియములు వెడరేఁచు
ననిచిన ననుపులే నంటుకొలుపు
చెన కెలలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు గూడె
యెనసి తప్పించుకొన నెట్టు వచ్చునే

రేకు: 1971-6 ముఖారి సం: 29-366

పల్లవి: వెలఁది చందములెల్లా విన్నవించితి మిదిగో
తలఁపెరిఁగి మన్నించి దయఁజూడు మిఁకను

చ. 1: చెలులతో నీ కతలు చెప్పి గొంత తనివొందు
తలపోఁతలనుఁ గొంత తమకమార్చు
కలలోన నీ రూప గని సంతసించుకొను
కలికిఁ గాఁగిట నెపుడు గలసేవోకాని

చ. 2: పొదలి నీ కెదురు చూపులఁ గొంత చెలరేఁగు
కదియు రతి వేడుకలఁ గాఁకలార్చు
ముద మలర నీ పదంబులు వాడి మది గరఁగు
ఇది యెరిఁగి చన వెటుల నిచ్చేవోకాని

చ. 3: నిను బయలు గాఁగిటను నించి కొంతపొద్దు జరపు
వినుకలినిఁ దనలోని విరహ ముడుపు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
ననుపులిఁక నెటువలెను నడపేవోకాని

రేకు: 1972-1 ముఖారి సం: 29-367

పల్లవి: మేలు మేలు చెలులెల్లా మెచ్చిరి నీ చేఁతలకు
చాలా నేరుపుల నీతో సరి యెవ్వరమ్మా

చ. 1: పెదవినే మాఁటలాడి పిలిచేవు రమణుని
కదలుఁ గన్నులఁ జూచి కరఁగించేవు
వెదచల్లునవ్వులను వేడుకులు రేఁచేవు
చదురుఁదనాల నీతో సరి యెవ్వరమ్మా

చ. 2: సన్నలనే యాతనితో సాములెల్లాఁ జేసేవు
తిన్నని తురుము చూపి తేలించేవు
చన్నులంటి వలపులు చవులు వుట్టించేవు
సన్నుతించేనంటే నీతో సరి యవ్వరమ్మా

చ. 3: వింతగా మొక్కుతానే శ్రీవేంకటేశు నుబ్బించేవు
పొంత నలమేల్మంగవై పోది సేసేవు
యింతలోనే నిన్ను నేలె యీతఁ డిన్నిటా వలచి
సంతతము నీతో నింత సరి యవ్వరమ్మా

రేకు: 1972-2 దేసాళం సం: 29-368

పల్లవి: ఇంతటిదానవౌత యెఱఁగమమ్మా
పంతాన నీకంటే నేను బల్లిదురాలనమ్మా

చ. 1: కన్నులార్చ నేరుతూనే కత చెప్ప నేరుతువే
సన్నలు సేసేటి వేసాలు నేర్తువే
యిన్నిచేఁతులు సేసేకా యీతని దక్కఁగొంటివి
మిన్నక వూరకుండితే మెచ్చేరా సతులు

చ. 2: ననుపు సేయ నేర్తువే నవ్వులు నవ్వ నేర్తువే
పెనఁగులాడి బత్తి పెంచ నేర్తువే
చెనకి చెనకి యింత సేసితివి మగవాని
జూనిగితే మెరసునా సుదతులపగటు

చ. 3: చెలిమి సేయ నేర్తువే చేరి కూడ నేరుతువే
వలపించి రతులకు వంచ నేర్తువే
అలమె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
కలపుకోలిట్లానే కావద్దా యింతులకు

రేకు: 1972-3 సాళంగనాట సం: 29-369

పల్లవి: వట్టి చుట్టరికములు వడిగాఁ జేసే వదేమే
యిట్టె మేలువాఁడు యిన్నిటా నా కితఁడు

చ. 1: యిత్తల నాతఁడు నేనూ నేకతములాడఁగాను
పొత్తుల మాఁటాడేవు పొద్దు వోదటే
మత్తిలి సరసములు మాలో నేమాడఁగాను
హత్తి తోరలించుకొనే వప్పటినేమే

చ. 2: జంటలై నే మిద్దరమూ జవాది వూసుకోఁగా
అంటించుకో వచ్చేవు అదో నీవు
నంటుతోడ మాలో నేము నవ్వులు నవ్వుకోఁగా
వెంట నీవూఁ దోడంటేవు వేడుకాయ నటవే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నేనూఁ జేరి కాఁగిట నుండఁగా
వావి గలపఁ జూచేవు వైపొనటవే
యీవేళ నలమేల్మంగ నీతని దేవులనైతి
నీవూఁ దగులు సేసుకొనేవు మేలు మేలే

రేకు: 1972-4 కాంబోది సం: 29-370

పల్లవి: నాతులెల్లాఁ బొగడేరు నలినలోచన నిన్ను
నీతులెల్లాఁ జచరించ నీవే నేరుతువే

చ. 1: యితవైన చోటికి యేమి సేసినా సమ్మతి
రతికెక్కిన మీఁదట రారాఁపు లేదు
సతమైన పనులకు సాదించఁ బనిలేదు
చతురత లివియెల్లా సతి నీవే నేర్తువే

చ. 2: మొగమోట లోనరితే ముందు వెనక లెంచరు
నగితేనే మనసులు నమ్మిక పుట్టు
తగవు దప్పకుండితే తాలిమి తానే కలుగు
నిగిడి యీ పనులకు నీవే నేరుతువే

చ. 3: మచ్చికలు నెరపితే మర్మములు గరఁగును
ఇచ్చకము సేసితేను యెరవుగాదు
అచ్చపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగ నిన్నేలె
నిచ్చలు యీ సొబగులు నీవే నేరుతువే

రేకు: 1972-5 శంకరాభరణం సం: 29-371

పల్లవి: వేడు కిది దాఁచరాదు వెల్లవిరిఁ జేయరాదు
కూడిన తారుకాణలు గుట్టుతోనే వున్నవి

చ. 1: ఆడుకోలుమాఁట గద్దు ఆతనికి నాకును
తోడితేవే విన్నవించే తోడనే నేను
జోడిం చొకరితోఁ జెప్పేసుద్దులు గావు
జాడతో నే నెరుఁగుదు సరిఁ దా నెరుఁగును

చ. 2: సేసిన గురుతు గద్దు చేరి మా యిద్దరికి
రాసికెక్కఁ జూచెను రమ్మనఁగదె
మూసిమంతనములైన మొరఁగులవి
ఆసల నాయందు నున్నవా తనందు నున్నవి

చ. 3: యేకతపు పొందు గద్దు యిద్దరికిని
జోకతో శ్రీవేంకటేశుఁ జూపఁగదవే
మాకె తెలుసు నలమేలుమంగను నేను
యీకడ నా మగఁ డీతఁ డీతని దేవులను

రేకు: 1972-6 మాళవిగౌళ సం: 29-372

పల్లవి: కంటిమే నీ యెమ్మెలెల్లాఁ గన్నులారాను
యింటిలోనుండేసతుల కింత రట్టు వలెనా

చ. 1: చక్కనిదాన వౌదువే సరసురాల వౌదువే
పిక్కటిల్లుపిరుఁదుల పెద్ద వౌదువే
పక్కన నీ మురిపెము పతి ముందరఁ జూపేవు
నెక్కొని యీ కాంతలెల్లా నీకొలఁదివారా

చ. 2: పుప్పొడి చల్లుకొంటివే పువ్వులు ముడిచితివే
కొప్పు నిక్కఁబెట్టుకొని గురియైతివే
చొప్పుగా నీ సింగారాలే చూపే వీతని యెదుట
యిప్పు డీ కొమ్మలలో నీ వెవ్వరిఁ బోలుదువే

చ. 3: సొలపులఁ జూచేవే జూటవై మెరసేవే
కలికితనాలె యెంత కడుఁ జూపేవే
అలమె శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
యెలనాగ విందరిలో నెవ్వరిఁ బోలుదువే

రేకు: 1973-1 వరాళి సం: 29-373

పల్లవి: చిన్నదానఁ జెప్పేనంటే సిగ్గయ్యీ నాకు
తన్నుఁ దానే తెలుసుక దక్కి వుండు మనవే

చ. 1: సొలపుఁజూపుల తొల్లి చూచినచుట్టురికము
పలుమారు నెడతాఁకి పాయని చుట్టరికము
తలపోఁతలనే కడు దక్కిన చుట్టరికము
కలదు తనకు నాకుఁ గరుణించు మనవే

చ. 2: మాఁటలనే మరిగిన మచ్చిక చుట్టరికము
నాటుకొన్న వలపుల నమ్మిన చుట్టరిము
తేటల సరసముల తెగని చుట్టరికము
పూఁట పూఁట కిట్లానే పొదలించు మనవే

చ. 3: యెనసిన కాఁగిళ్ళలో హెచ్చిన చుట్టరికము
మనసు మర్మములనే మాఁగిన చుట్టరికము
తన దేవి నలమేల్మంగను తానే శ్రీవేంకటేశుఁ
డొనర నన్నేలె నింకాఁ జనవు లిమ్మనవే

రేకు: 1973-2 బౌళి సం: 29-374

పల్లవి: ఎక్కడనుండి వచ్చెనో యేఁకరి నీ రతులకు
చిక్కించుక కాఁపురము సేయవయ్యా

చ. 1: లక్కవలెఁ గరఁగీని లలన నీ మాఁటలకు
చొక్కుచు నాపె వలపు చూడవయ్యా
మొక్కుచు వినయాన నీ ముందర నిలుచున్నది
అక్కర యెంత గలదో అడుగవయ్యా

చ. 2: జిగురువలె నంటీని చెలియ నీ పొందులకు
తెగని చుట్టరికము తెలియవయ్యా
నగుతా సారెకు నీతో ననుపులే పచరించీ
చిగిరింపుఁ గోరికలు చెల్లించవయ్యా

చ. 3: తేఁగెవలె నల్లుకొనీ తెరవ నీ కాఁగిటికి
జాగులు సేయ కది విచారించవయ్యా
యీగతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
బాగుగా నన్నేలితి వాపడఁతి నేలవయ్యా

రేకు: 1973-3 పాడి సం: 29-375

పల్లవి: కంటిమి వింటిమి కతలెల్లాను
జంటలై మీ కోరికలు సాదించుకోరాదా

చ. 1: చెలిమి సేసినవారు సిగ్గులు వడ నేఁటికి
నలిరేఁగి వేడుకతో నవ్వుట గాక
మొలచిన వలపులు మూసి దాఁచ నేమిటికి
చెలరేఁగి వెల్లవిరి సేసుకొనరాదా

చ. 2: ఆస గలిగినవారు నుమానించ నేఁటికి
తాసువలెఁ గూడి మాడి దక్కుటగాక
సేసవెట్టి పెండ్లాడుతూ శిరసు వంచ నేఁటికి
పోసరించి వెరవక భోగించరాదా

చ. 3: చనవు గలుగువారు జడియఁగ నేమిటికి
పెనఁగి రతులు పైపైఁ బెంచుటగాక
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
నను వలెనే యాకెతో నంటు సేయరాదా

రేకు: 1973-4 నాదరామక్రియ సం: 29-376

పల్లవి: పొద్దువో దిదొకకత పూఁచి యానతియ్యవయ్య
గద్దరి నీ చేఁతలకు కాదు గూడ దనను

చ. 1: కాంతఁ జూచి వచ్చితివా కన్నులారాను
మంతనాన నోరారా మాఁటాడితివా
సంతోసించి యాపె సరసము లాడెనా
వింతలెల్లాఁ జెప్పవయ్యా వినే నేను

చ. 2: చుట్టమవై వచ్చితివా సుదతికిని
నెట్టన నీ కాఁగిట నించుకొంటివా
అట్టె విందులు నీకు నాపె వెట్టెనా
నెట్టుకొని చెప్పవయ్యా నిన్ను మెచ్చేను

చ. 3: కాలుదొక్కి వచ్చితివా కలకంటిని
మేలువాఁడ వైతివా మిక్కిలి నీవు
యీలీల శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
ఆలిసుద్ద చెప్పవయ్యా అడిగేను నిన్ను

రేకు: 1973-5 పాడి సం: 29-377

పల్లవి: ఇంతి లాగులెల్లా నీకు నెరిఁగించితిమి నేము
మంతు కెక్కించి యీపెను మన్నించవయ్యా

చ. 1: యెదురులు చూచీ నీకు;యింతులనుఁగొంతదూరు
వుదుటు గుబ్బలపై నిట్టూర్పు చల్లును
చెదరుఁగురులు దువ్వు చెక్కుపైఁ జేయి చేర్చు
యిదివో నీ సతి సుద్దు లింకా నడుగవయ్యా

చ. 2: నిలువెల్లాఁ జెమరించు నీపై పాటలు వాడు
తలఁచు నీ రూపము తమకించును
సొలసు నూరక నిన్ను చొక్కుఁదనలోనె తాను
వెలఁది వలపు రీతి విన్నవించితిమయ్యా

చ. 3: నివ్వెరగుతో నుండు నీకు లేకలు వాసు
పవ్వళించి నీ రతులు భావించును
ఇవ్వల శ్రీవేంకటేశ ఇంతి నిట్టె యేలితివి
రవ్వలాయ నీకుఁగానే రమణిఁ జూడవయ్యా

రేకు: 1973-6 లలిత సం: 29-378

పల్లవి: ఎఱుఁగుదుఁ దన సుద్దు లిన్నియుఁ దొల్లె నేను
తఱచాయ ముచ్చటలు తలఁచుకొమ్మనవే

చ. 1: ననుపులు నిజమైతే నవ్వులు సేనాసేన
మనసు లెనసితేను మాఁటలు పెక్కు
వినయము నెరిచితే వెలయు సంగాతము
తనతో నెదురాడేనా దగ్గరి రమ్మనవే

చ. 2: చూపులు నాఁటఁ జూచితే చొక్కులు కోటానఁగోటి
వోపికలు గలిగితే వొడి నిండును
కాఁపురాలు సతమైతే కైవసమౌ వలపులు
యే పనులు చెప్పినాను ఇయ్యకొంటి ననవే

చ. 3: సరసము లొనరితే చనవులు చెల్లుబడౌ
సరవులు చక్కనైతే చవులు వుట్టు
ఇరవై శ్రీవేంకటేశుఁ డిప్పుడు వచ్చి నన్నేలె
మరిగితి నిట్లనే మన్నించు మనవే

రేకు: 1974-1 రామక్రియ సం: 29-379

పల్లవి: ఇన్నిటా మంచిదానవు యీతని నొరయనేలే
మిన్నక సేవలు సేసి మెప్పించవలెఁ గాకా

చ. 1: చక్కెర వంటిది మోవి జవ్వాదివంటిది తావి
జక్కవలఁ బోలును చన్నులు నీవి
వెక్కసా లే లాడేవే విభుఁడు చెనకెనంటా
చొక్కుచు వినయములే చూపవలెఁగాక

చ. 2: చిగురువంటిది మేను సింగమువంటిది కౌను
మొగము చంద్రకళల మూఁకలనాను
బిగియుచు దూరనేలే పెనుఁగొప్పు ముట్టెనంటా
జిగిమించఁ బ్రియాలెల్లాఁ జెప్పవలెఁగాకా

చ. 3: పుత్తడివంటిది రూపు పూవులవంటిది చూపు
గుత్తపుఁ బిరుఁదు కరికుంభాల దాపు
వొత్తనేలే శ్రీవేంకటోత్తముఁడు గూడె నంటా
పొత్తుల నీతని మేలు పొగడవలెఁగాకా

రేకు: 1974-2 పాడి సం: 29-380

పల్లవి: నాపై బత్తి గలఁడు నన్ను మన్నించీ నితఁడు
రేపు మాపుఁ జింత లిఁక రేఁచకురే మీరు

చ. 1: చెలిమి సేసినవాఁడు సేవ గొనకుండునా
పలుమారు పతికిఁ జెప్పుకురే మీరు
వలపించినట్టివాఁడు వాడిక లెరఁగఁడా
బలిమిసేసి కొంగువట్టకురే మీరు

చ. 2: యింటికి వచ్చినవాఁడు యెనయక వుండునా
అంటి ముట్టి సారె సొలయకురే మీరు
జంటయై పాయనివాఁడు చనవెల్లా నియ్యఁడా
దంటతనాన నేమీఁ దడవకురే మీరు

చ. 3: నమ్మిక లిచ్చినవాఁడు నన్ను నేలకుండునా
కమ్మటిఁ గమ్మటిఁ బెనఁగకురే మీరు
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డిటు వచ్చి నన్నుఁ గూడె
చిమ్ముఁగొనగోళ్ల సన్న సేయకురే మీరు

రేకు: 1974-3 బౌళి సం: 29-381

పల్లవి: నామీఁది బత్తితోడ నన్నుఁ బాయకున్నాఁడవు
వేమరు నుపాయాలు విచారించుకోవయ్యా

చ. 1: ఇంటికి రావైతివంటా యెక్కడనో వుంటివంటా
కంటకము లే మాడునో కలికి నిన్ను
దంటతనాన నేమని తప్పించుకొనేవు నీవు
కంటే మొకదాకిరి గన మాపె యెడకు

చ. 2: చెమట మెఇ నున్నదంటా చెదరె నీ కురులంటా
తమకించి యేమనునో తరుణి నిన్ను
అమర నెట్లా మాటలాడుకొనేవో నీవు
సముకాన నిచ్చకుఁడవు నీవు

చ. 3: నాకు మేలువాఁడవంటా నమ్మిక లిచ్చితివంటా
యీాకె రతి నెంత యలయించునో నిన్ను
చేకొని న న్నేలితివి శ్రీవేంకటేశుఁడ
పైకొని యాపె నెట్టొడఁబరచేవో నీవు

రేకు: 1974-4 దేసాళం సం: 29-382

పల్లవి: ఆతఁ డెంత నీ వెంత అమ్మరో నీవు
చేతులెత్తి మొక్కు మొక్కి సేవ సేయఁ గదవే

చ. 1: మెలఁగి యాతఁడు నీకు మిక్కిలి వలచునంటా
కలికితనాల నెంత గయ్యాళించేవే
కలకాలము నీతోనే కాఁపురము సేసెనంటా
నలి రేఁగిరేఁగి యేమి నవ్వు నవ్వేవే

చ. 2: చెంది నీ చనువు లెల్లాఁ జెల్లించీనంటాను
మందె మేళమున నెట్టు మాఁటలాడేవే
సందడించి నీ యింటికి సారెకు వచ్చీనంటా
గొంది నుండి యేల రాకొట్టు గొట్టేవే

చ. 3: యెనసి యాతఁడు నిన్ను నెగ్గు లెంచఁ డంటాను
పెనఁగి యేఁటికి మోవి పిప్పి సేసేవే
వినయాన నితఁడే శ్రీవేంకటేశుఁడు నిన్నేలె
గొనకొని యెందాఁకాఁ గోరి కొసరేవే

రేకు: 1974-5 రామక్రియ సం: 29-383

పల్లవి: ఎవ్వ రెరుఁగుదురమ్మా యిటువంటి నీ సుద్దు –
లివ్వల నేఁ డప్పటి మా యింటికి వచ్చితివి

చ. 1: కలికితనములనే కరఁగించితివి పతి
సెలవి నవ్వులు నవ్వి చిమ్మిరేఁచితి
మలకల మాఁటలాడి మరిగించుకొంటివి
యెలమి నీతని నింకా నేమి సేతువో

చ. 2: చేతులెత్తి మొక్కి మొక్కి చేతికి లోఁ జేసితివి
యేతులెల్లాఁ జూపి చూపి యెలయించితి
కాతరానఁ గాలు దొక్కి కడుఁ జోకఁ జేసితివి
యీతల నీతని నింకా నెంత సేతువో

చ. 3: సన్నల నీ మోవినే చవులు గొలిపితివి
పన్నుక చెనకులనే భ్రమయించితి
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁ గూడె
యెన్నిక చేఁతల నీవు యెంత సేతువో

రేకు: 1974-6 మాళవిగౌళ సం: 29-384

పల్లవి: నవ్వేవారి నెఱఁగవు నాతిరో నీవు
పువ్వువంటి సిగ్గు దెచ్చి పొల్లు సేయవలదే

చ. 1: హత్తి నేనూ నాతఁడు నంటి సరసమాడఁగా
పొత్తుగలయవచ్చేవు పొసఁగునటే
కొత్తగాఁ గన్నకలలు కోరి నేము చెప్పుకోఁగా
వొత్తి యర్థా లడిగేవు వుండఁబట్ట దటవే

చ. 2: జాడతో నిద్దరము సేసలు చల్లుకొనఁగాను
తోడఁ బెండ్లాడ వచ్చేవు దొరసునటే
నీడల చక్కఁదనాలు నే మద్దములోఁ జూడఁగా
ఆడ నీ మొగము చూపే వమరునటే

చ. 3: తేరకొన మాలో నేము తెరవేసుకుండఁగాను
పోర చెడుగ వచ్చేవు పొద్దువోదటే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటా న న్నేలఁగాను
నేరిపేవు రతు లోతనికిఁ దగునటవే

రేకు: 1975-1 సౌరాష్ట్రం సం: 29-385

పల్లవి: ఎట్టున్నదో నీ చిత్తము యెఱఁగమయ్యా
చుట్టపు వరుసలివి చూచుకొనేవయ్యా

చ. 1: చెలిచే నప్పుడు నీవు చెప్పి పంపిన సుద్దులు
వెలఁది వేడుకతోడ వినెనయ్యా
వలపులు లేకలపై వాఁతలఁ జదువుకొని
నలిరేఁగి పకపక నవ్వెనయ్యా

చ. 2: అచ్చలాన నీ వుంగర మానవాలు చూచుకొని
ముచ్చటతోఁ జేతులెత్తి మొక్కెనయ్యా
మచ్చిక నీవు మన్నించే మన్నన దలఁచుకొని
కచ్చు పెట్టి సంతోసానఁ గడుఁ బొగడేనయ్యా

చ. 3: కడు బత్తి సేసి నీవు కాఁగిలించుకొన్నందుకు
కడఁకతోడ మనసు గరఁగెనయ్యా
యెడయక శ్రీవేంకటేశ నీ గుణ మెరిఁగి
బడివాయనని నీతో బతిమి వట్టెనయ్యా

రేకు: 1975-2 సామంతం సం: 29-386

పల్లవి: మంచివాయఁ బనులెల్లా మదుఁగులో మైలలేలే
నించి నించి నీ మగఁడు నీతో నవ్వఁగాను

చ. 1: బొమ్మల విండ్లేమిటికి పూఁచి యెక్కువెట్టేవే
కుమ్మరింపుఁజూపులనే గురుతులేల యేసేవే
వుమ్మగిలునిష్టూరము లొడిఁగట్టుకొననేలే
వుమ్మడి నీతఁడు నిన్ను నొడఁబరచఁగాను

చ. 2: మాటల కత్తు లేఁటికి మరి యెంత నూరేవే
చాటు వెట్టుక గుబ్బల సాము లెందాఁకాఁ జేసేవే
గాఁటపుచలము లింత గాదెఁ బోసుకోనేలే
కూటమి కితఁడు వేఁడుకొని కొసరఁగను

చ. 3: సిగ్గుల యరిగె లేల చేరి చాటు వెట్టేవే
బగ్గనఁ దమకముల పాఁజు లెంత చూపేవే
వొగ్గి కాఁగిటిలోఁ బంతా లూరకే నెరపనేలే
యెగ్గులేక శ్రీవేంకటేశుఁడు నిన్నేలఁగాను

రేకు: 1975-3 బౌళి సం: 29-387

పల్లవి: చూడఁ బిన్నదానవు జూటుఁదనాలు గనము
వాడికెతోఁ బతి నెంత వలపించేవే

చ. 1: తెలరమఁగులలోని తేటమాఁటలు
విరులఁ బూఁచి వేసేవేడుకలు
పొరుగునఁ గొసరేటిపోరచులు
నిరతితో నెన్నడూ నేరిచితివే

చ. 2: కలికితనాల మించు కనుచూపులు
తలకొన్న చెనకుల తమిరేఁపులు
వులివచ్చిసిగ్గుల వొడఁబాటులు
కలిగించుకొంటి వెంత కత కరచితివే

చ. 3: బడి బడి రతులలో పడితాళాలు
కడఁగి సరసాలలో గబ్బితనాలు
తొడరి శ్రీవేంకటేశు తోడి కూటాలు
కడలేని చేఁత లెందు గడిఇంచుకొంటివే

రేకు: 1975-4 రామక్రియ సం: 29-388

పల్లవి: నామన సేమి చూచేని నంటునఁ దానే నేను
యేమి నన నిఁక నేల ఇంటికి రమ్మనవే

చ. 1: పాయని చుట్టరికము పరిసిపోదెంతైనా
నాయముతోడి నడక నమ్మవచ్చును
చేయి మీఁదిఇనచేత చెల్లుబడి గాక పోదు
యేయెడాఁ గొంకఁగనేల యింటికి రమ్మనవే

చ. 2: మచ్చికతోడివలపు మానుపరా దెంతైనా
అచ్చలమైనసరస మాస రేఁచును
కొచ్చి కొచ్చి పెనఁగితే కూటములు చవిపుట్టు
యెచ్చరిక సేయనేల యింటికి రమ్మనవే

చ. 3: దట్టమైన వినయాలు దాఁగనియ్య వెంతైనా
నెట్టుకొన్న పొందులు నెరవేర్చును
జట్టిగొని శ్రీవేంకటేశ్వరుఁడు నన్నిపుడేలె
యిట్టె దిన దినమూ నింటికి రమ్మనవే

రేకు: 1975-5 వసంతవరాళి సం: 29-389

పల్లవి: ఎన్నేని విన్నవించే మిపుడు నీకు
అన్నీ నీవే తెలుసుక యాదరించవయ్యా

చ. 1: అలివేణిమదిలోని ఆడియాసలు
పలుకుల వినయపు పరిబాసలు
చెలరేఁగి పట్టిన దోసిటి సేసలు
చెలియ చందము లివి చిత్తగించవయ్యా

చ. 2: కమ్ముకొన్న తమకపుకనుచూపులు
తమ్ములపు మోవితేనె తరితీపులు
పిమ్మట సన్నలు సేసే పెరరేఁపులు
నెమ్మది నీవెచూచి మన్నించఁగదవయ్యా

చ. 3: వొద్దికైననీపై మొగమోటలు
కొద్దిలేని నీ రతులు కూటములు
ముద్దరాలి నేలితివి ముప్పిరి శ్రీవేంకటేశ
పొద్దు వొద్దు దప్పకుండా భోగించవయ్యా

రేకు: 1975-6 మాళవిగౌళ సం: 29-390

పల్లవి: సరిలేని వలపులజాణకాఁడవు
యిరవైనేమెల్లా నీకు నే నెచ్చరించవలెనా

చ. 1: చెయివట్టి చెయివట్టి చెలి చుద్దులు చెప్పఁగా
యేయడ పరాకు నీకు నేమయ్యా
ఆయాలంటి ఆయాలంటి యప్పటి వేఁడుకోఁగాను
కాయజ కేలికి నీకెఁ గరుణించవయ్యా

చ. 2: సన్నసేసి సన్నసేసి సారె నిన్నుఁ బిలువఁగా
యెన్నఁడు మన్నించేవు యేమయ్యా
చన్ను లొత్తి చన్ను లొత్తి సాములు నీతోఁజేయఁగా
చెన్నుగా నీకె చనవు చెల్లించఁదగదా

చ. 3: సేవసేసి సేవసేసి చేతులెత్తి మొక్కఁగాను
యేవేళఁ జిత్తగించేవు యేమయ్యా
వేవేలు చందాలను శ్రీవేంకటేశ కూడితివి
యీవిధాన నేలి యీకె నింత సేయఁదగదా

రేకు: 1976-1 నాదరామక్రియ సం: 29-391

పల్లవి: అరవిరిబాగుల యతివ నీ వపుదువే
సొరిది నీ వొయ్యారాలు చూడఁ గొత్తలాయనే

చ. 1: నిదుర కన్నులతోడి నివ్వెరగులు
చెదరుఁ గురుల చిమ్మఁజీఁకటులు
వెదచల్లు నవ్వులవెన్నెలలు
తుదకెక్కి రది గఱుతులు నీ కొనరెనే

చ. 2: పచ్చిదేరేటి చెక్కులపై చెమటలు
ముచ్చటలాడుకొనేటి మోవివాడులు
కొచ్చి కొచ్చి సొలసేటి కొనచూపులు
అచ్చముగ నీమేని కన్నియు నమరెనే

చ. 3: ముప్పిరి సమరతుల మోముకళలు
కుప్పలుగా రాలేటి కొప్పువిరులు
వొప్పి శ్రీవేంకటేశుఁ గూడున్న చొప్పులు
యిప్పు డీ శింగారాలు యివి నీకే తగునే

రేకు: 1976-2 ముఖారి సం: 29-392

పల్లవి: వచ్చి వచ్చి మూడీఁ జొచ్చి వాత వెళ్ల నేమిటికే
మచ్చిక నీతఁడు నన్ను మన్నించెఁ జూడఁగదె

చ. 1: సంగడి నుండి పతికి చనవరి వైతివి
అంగము లంటి యంటి ఆలవైతివి
యెంగలి మోవి చూపి యితరివైతివి
అంగడి నీ దొరతనాలవి యేమి చెప్పేదే

చ. 2: సుద్దులెల్లాఁ జెప్పుతానే చుట్టమవూ నైతివి
పెద్దగా నవ్వులు నవ్వి ప్రియమైతివి
బద్దులు మొక్కులు మొక్కి పాఁతదానవైతివి
చద్ది వేఁడినీ బీరాలు సారె నేమి చెప్పేదే

చ. 3: వన్నెగా సేవలు సేసి వాడికకతైవైతివి
సన్నలు సేసిసేసి సతమతమైతివి
యిన్నిటి శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁ దొలుతనే
యెన్నిక నీ కాఁపురాలు యేమి చెప్పేదే

రేకు: 1976-3 ఆహిరి సం: 29-393

పల్లవి: నీ మేలులోనివారము నీ వేల సిగ్గు వడేవే
దోమటి నీ చేఁతలు సంతోసించేముగాక

చ. 1: చెక్కుల మీఁదటఁ గారే చెమటలే చెప్పీని
నెక్కొని యాతని తోడి నీ పొందులు
జక్కవ చన్నుల నుండే చందమామలే చెప్పీని
యెక్కడలేని యానలేల పెట్టుకొనేవే

చ. 2: వుమ్మగిలుచున్న నీ నిట్టూరుపులే చెప్పీని
వుమ్మడిఁ బెనఁగులాట వుదుటులెల్లా
కమ్ముకొన్న నీ మొగముకళ లివె చెప్పీని
యిమ్ముల నీ సాదుఁ దనా లేమి నెరపేవే

చ. 3: తొడరి జారిన నీ తురుమిదె చెప్పీని
కడలేని రతుల నీ కలయికలు
యెడయని శ్రీవేంకటేశు వుంగరమే చెప్పీ
యెడ నెడ నీ పంతా లెన్ని చెప్పేవే

రేకు: 1976-4 సామంతం సం: 29-394

పల్లవి: ఇటువంటి వాఁడవుత యెఱఁగమమ్మా నేము
నటియించి మన్ననలు నాకు నిచ్చీ నితఁడు

చ. 1: యింత బత్తే కలిగితే నింటికి రావలెఁగాక
సంత వలపులు మీఁదఁ జల్ల నేఁటికే
వింతవారెల్లాఁజాడఁగా విడె మియ్య వచ్చీని
కాంతనైతినే నన్నుఁ గాకు సేతు రటవే

చ. 2: మిక్కిలి చుట్టమైతేను మేలమాడవలెఁగాక
మిక్కుటపు నవ్వు నవ్వి మీర నేఁటికి
పక్కనఁ గొలువులోన పయ్యదకొంగువట్టీని
చక్కనిదాననైతేనే చండి సేతు రటవే

చ. 3: కూడ వేడుకైతేను గుట్టు సేయవలెఁగాక
యెడనైనాఁ జెనకీని యిది యేఁటికే
వేడుకతో నన్నేలి శ్రీవేంకటేశుఁడు చొక్కీని
యీడైనదాననైతేనే ఇంత సేతు రటవే

రేకు: 1976-5 ముఖారి సం: 29-395

పల్లవి: మెచ్చి మెచ్చి పొగడుటే మిక్కిలి నేరుపుగాక
పచ్చిదేర నాడనేల పలుమరు నిన్నును

చ. 1: వొట్టులు నేఁ బెట్టితేను వొడివట్టి పెనఁగేవు
గుట్టున నూరకుండితేఁ గొసరేవు
తట్టి చేత నొడ్డుకొంటే తగిలి వేఁడుకొనేవు
యెట్టు గెలువఁగవచ్చు నిటువంటి నిన్నును

చ. 2: సిగ్గుతోడఁ గొంకితేను సేసలు పైఁ జల్లేవు
అగ్గమై సొలసితేను ఆదరించేవు
వొగ్గి నన్నుఁగూడితివి వొద్దికై శ్రీవేంకటేశ
యెగ్గు లెట్టు లెంచవచ్చు నిటువంటి నిన్నును

రేకు: 1976-6 శ్రీరాగం సం: 29-396

పల్లవి: ముందు ముందుగాఁ బతికి మొక్కితి ననరే మీరు
మందలించి తనమేలు మరచేనా నేను

చ. 1: చల్లఁగానే మాఁటలాడి చవులెల్లా బుట్టించి
పెల్లున నన్నిటూ వలపించెఁగా తాను
యెల్లవారిలోనా నీఁక నెట్టు నన్ను మన్నించినా
చెల్లుబడిగానే సంతోసించుకొనే నేను

చ. 2: పువ్వులనే నన్ను వేసి బుజ్జగించి సన్నసేసి
రివ్వనఁ జుట్టరికము రేఁచెఁగా తాను
రవ్వగాఁ దన నా పొందు రతికెక్కిన వెనక
నవ్వుతా నొక్క మనసుననే వుండే నేను

చ. 3: గుట్టున నుంకువ వెట్టి కూరిములు చల్లి చల్లి
అట్టె నన్నుఁ గాఁగిటఁ బెండ్లాడెఁగాను తాను
పట్టపు దేవిఁగా నిట్టె పాలించె శ్రీవేంకటేశుఁ
డెట్టు నన్నుఁ భాలించినా నియ్యకొనే నేను

రేకు: 1977-1 సామంతం సం: 29-397

పల్లవి: ఊరకె జంకించెనటా నుప్పతించేవు
గారవపుదాని కెంత గడిఇంచేవయ్యా

చ. 1: చెప్పిన నీ మాఁటలెల్లాఁ జెవు లాలకించి వినె
కొప్పు వట్టి తీసితే మక్కువ జేకొని
కప్పుర విడె మిచ్చితే గక్కనఁ దా నందుకొనె
యిప్పు డింతకెంటెఁ జెలి యేమి సేసునయ్యా

చ. 2: పేరుకొని పిలిచిరతే ప్రియముతో నూఁకొనె
సారె నీవు నవ్వితేను సమ్మతించెను
చేరి నీవు చెనకితే చెతులెత్తి నీకు మొక్కె
యీరీతి దా నింతకంటె నేమ సేసునయ్యా

చ. 3: చెక్కు నీవు నొక్కితేను చెంగలించి వొడఁబడె
గక్కనఁ గాఁగిలించితే కరఁగె మతి
చక్కని శ్రీవేంకటేశ సతినిట్టె యేలితివి
యెక్కువాయ నింతకంటె నేమి సేతునయ్యా

రేకు: 1977-2 ముఖారి సం: 29-398

పల్లవి: తనంతనే వచ్చె మేలు తరవులు వెట్టనేల
తనిసి తనిసి లోలోఁ దలఁచుకొంటఁగాక

చ. 1: చనవిచ్చి యాతఁడు నాసంగడి నుండఁగాను
మనవు లేమి చెప్పినే మాఁటిమాఁటికి
ననుఁ జూచి యాతఁడు నవ్వులు నవ్వఁగాను
వినయముతో నింకా వేఁడుకొనవలెనా

చ. 2: సరసములాడి నా చనుగుబ్బ లంటఁగాను
మరిగించుకొనేలే మాఁపు దాఁకాను
వరుస దప్పక నాపై వలపులు చల్లఁగాను
తరితీపు సేసి యెట్టి తమి రేఁచేవే

చ. 3: కైవసమై నన్ను నిట్టె కాఁగిలించుకొనఁగాను
వావు లేమి చెప్పినే వంటు వెట్టుక
శ్రీవేంకటేశుఁ డిట్టె చిత్తగించి నన్ను నేలె
వేవేలకు నాడుకొన వేడుకాయఁగదవే

రేకు: 1977-3 శ్రీరాగం సం: 29-399

పల్లవి: ఎన్నినోములు నోఁచితి నీతనికిఁ జెలియా
సన్నలా చాయలా నీకేసతమైనాఁడు

చ. 1: తరుణి నీ తలఁచిన తలఁపు నీడేరెనే
వరుసతో విటుఁడు నీవాఁడాయను
సిరుల నీ చనవులు చెల్లించుకొంటివే
యెరవులే కితఁడు నీ యింటనే వున్నాఁడు

చ. 2: సేసిన నీ చేఁతలు చెల్లుబళ్లాయనే
సేసవెట్టి నీ మగఁడు సేవగొనెను
వాసితో నీ వలచిన వలపు రతికెక్కెనే
ఆసయిచ్చి నిన్నీతఁడు అన్నిటా మన్నించెను

చ. 3: కోరిన నీ కోరికలు కొనసాగి మించెనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నేలె
తారుకాణై నీ చక్కఁదనము ఫలించెనే
మేర మీర కితఁడు నీమీఁద బత్తిగలఁడు

రేకు: 1977-4 రామక్రియ సం: 29-400

పల్లవి: చెలియ నా విన్నపము చిత్తానఁ బెట్టుమను
తెలిపేనంటే నంత దిట్టఁగాను నేను

చ. 1: ఆసపడ్డ ముద్దరాల నలయించవద్దను
సేసవెట్టి మరి రట్టు సేయకుమను
పాసి పోక మొక్కఁగాను పరాకు సేయకుమను
రాసి కెక్కె నా వలపు రక్షించుమను

చ. 2: కాఁపురము సేయఁగాను కాకుసేయదగదను
చేపట్టి వదలరాదు చెప్పితినను
యేపొద్దూ నేమొక్కఁగాను యెరవు గాకుండుమను
నా పసలన్నీ నెరుఁగు నన్ను నేలుకొమ్మను

చ. 3: నే నలమేలుమంగను నెపాలు చప్పకుమను
పూని నాతో నవ్వే నిఁకఁ బోకుమను
తాను శ్రీవేంకటేశుఁడు తగులైతి నుండుమను
తానక మాయ పొందు తలపోసుకొమ్మను

రేకు: 1977-5 పాడి సం: 29-401

పల్లవి: ఒక్క మనసాయ నిఁక నుండవయ్యా
మిక్కుటపు నీ చేఁతలు మెచ్చితినయ్యా

చ. 1: తగవులఁ బెట్టి పెట్టి తగిలి పెండ్లాడితివి
నగి నగి కొనగోరు నాఁటించితివి
మొగము చూపి చూపి ముట్ట వలపించితివి
అగడు సే సింకా నెంత ఆసలఁబెట్టేవయ్యా

చ. 2: సరసము లాడి యాడి చవులెల్లా రేఁచితివి
పొరుగున నుండి వుండి పొందుకొంటివి
తెరవేసి తేరవేసి తేనెమోవి యానితిని
తరితీపు లప్పటి నెందాఁకాఁ జేసేనయ్యా

చ. 3: మళ్లి మళ్లి చూచి చూచి మరిగించుకొంటివి
తెల్లమిగాఁ గూడి కూడా తేలించితివి
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నింటా నన్నేలితివి
పల్లదాన మరియేమి బాఁతిపడేవయ్యా

రేకు: 1977-6 ఆహిరి సం: 29-402

పల్లవి: ఇన్నిటాఁ గనుఁగొంటిమి ఇంతి నీపైఁ గల బత్తి
వెన్నెల తేటనవ్వుల వెలయించే దెపుడో

చ. 1: పొంగఁ బొంగఁ బొంగులాయ పొలఁతి కోరిక లవి
అంగడి బేరాలాయ నడియాసలు
ముంగిటి ముగ్గులాయ మునుకొన్న సిగ్గులు
అంగనను దయఁజూచి యాదరించే దెపుడో

చ. 2: చూడఁ జూడఁ బౌఁజులాయ సుదతి కను చూపులు
వొడఁగట్టు దలాలాయ వొడఁబాటులు
వీడెపు బుక్కిళ్లాయ వినుకలి విరహాలు
యీడులేని జవరాలు నేలే దిఁక నెపుడో

చ. 3: ఊర నూర నూటులాయ నువిద తమకములు
గోర గీర నేరులాయ కూరిములు
యీరీతి శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
తారుకాణ నీ మాఁటలు తలఁపించే దెపుడో

రేకు: 1978-1 సాళంగనాట సం: 29-403

పల్లవి: చెలివై పుట్టితేనేమి సిగ్గు గొంత వలదా
పిలువని పేరటము పిరి దూరి వత్తురా

చ. 1: పంగించి నా కాఁగిటిలో పతితో నేల నవ్వేవే
యెంగిలి రతులకు నీవేల లాచేవే
ముంగిట నితఁడు నా మోవితేనె లానినాఁడు
చెంగట నట్టిమాఁటకు చెవి యే లొగ్గేవే

చ. 2: వేల నామట్టె లుండఁగా విభునేల పట్టేవే
కూళతనములకేల కొంగు లొడ్డేవే
తాలిమి నా చెమటల దడిసి తా నున్నాఁడు
యీలీలఁ బెనఁగులాట కెట్టు వచ్చేవే

చ. 3: తొడపై శ్రీవేంకటేశుతో నేమి పొందు సేసేవే
వొడఁబడని మేలెల్ల వొడిఁగట్టేవే
అడరి నీ కొప్పు పువ్వులందునే పూజగొన్నాఁడు
బడినే యీ వలపేల పైఁ జల్లుకొనేవే

రేకు: 1978-2 వరాళి సం: 29-404

పల్లవి: ఇన్నిటా జాణవు నీవు యెంతని పొగడవచ్చు
నిన్నుఁ జూచి వేడుకకు నెట్టన నవ్వితిని

చ. 1: చెంతనుండి విన్నపాలు సేసితి నింతేకాని
యింతిపై బత్తి గలవు యెరుఁగుదుము
కొంత గొంత కూరిములు గొసిరితి మింతేకాని
వింతలైన మీ వలపు వింటిమి నాఁడే

చ. 2: యేమరక వొకమారు యెచ్చరించితిమిగాని
కామినిపె నీ తమి గంటిమి నేము –
చూ మరల రావని సొలసితి మింతేకాని
చేముంతు వనుచు సంతోసించితిమి నాడే

చ. 3: చొప్పుగాఁ జుట్టరియము చూపితి మింతేకాని
యిప్పుడఁతి నేలేవని యెంచుకొంటిమి
ముప్పిరి మా చెలికిగా మొక్కితి మింతేకాని
తప్పక శ్రీవేంకటేశ తనిసితిమి నాఁడే

రేకు: 1978-3 ఆహిరి సం: 29-405

పల్లవి: ఇవిగో నా కోరికలు ఇటువంటివి
వివరముగా నీకు విన్నపము సేసితి

చ. 1: కన్నుల నిన్నుఁ జూచితే కడుఁ దమకము రేఁగు
మిన్నక తలవంచితీ మించు నాసలు
చన్నులు నీపై నూఁదితే జల జలఁ జెమరించు
వున్నతి సిగ్గున నుంటే నుమ్మగిలు వలపు

చ. 2: ఆలించి నీమాఁట వింటే నట్టె తరితీపు వుట్టు
నాలిఁ బరాకు సేసితే నాఁటు వేడుక
మేలుమీఁద నవ్వితేను మేనఁ బులకలు నిండు
గోలతనాన లోఁగితే గుబ్బతిలు మనసు

చ. 3: సేవించితే నివ్వెరగు చెప్పఁగ వసము గాదు
భావించితే తలపోఁత ఫలిఇంచును
ఈవల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
దేవుల నయితి నింక తిరమౌను పనులు

రేకు: 1978-4 బౌళి సం: 29-406

పల్లవి: నీ కెంత వేడుకోకాని నిండిన కొలవులోన
యీాకడఁ జూచినవారి కెల్లిదమై తోఁచును

చ. 1: వులివచ్చి నవ్వులతో నోరి యని పిలిచీని
అలివేణి వావి నీ కేమౌనోకాని
చెలరేఁగి రమ్మనుచు చేయివట్టి తీసీని
సులభాన నెటువంటి చుట్టమోకాని

చ. 2: యిక్కువలంటి నీతోనే యేకాంతము లాడీని
మిక్కిలి నీకెంత నమ్మినదోకాని
పక్కనే నీ కుడిబడి పనులెల్లాఁ జెప్పీని
గక్కక నిన్నెంత యేలుకొన్నదోకాని

చ. 3: మన్ననతో నలమేలుమంగవతె నురమెక్కీ
తిన్నఁగా నెంత పట్టపుదేవులోకాని
అన్నిటా శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
తన్ను నేలుమనీ నెట్టి తుగలుదోకాని

రేకు: 1978-5 సింధురామక్రియ సం: 29-407

పల్లవి: పట్టెఁడెసి చన్నుల పాయపుదానవు
యెట్టు వేసాలు సేసేవే యిందరుఁ జూఁడగాను

చ. 1: చెక్కిటి చేతితోడ సిగ్గులు వడేవేమే
అక్కరతో నాతఁడు మాఁటాడఁగాను
గుక్కుకొంటా వలపులు గుబ్బతిలే వది యేమే
చక్కెర మోవి చూపి సన్న సేయఁగాను

చ. 2: సెలవుల నవ్వుకొంటా శిరసు వంచేవేమే
అలరి యాతఁడు చన్నులంటఁగాను
పులికి తీఁగెలు సాగ నూఁకొనే వది యేమే
పిలిచి యాతఁడు నిన్నుఁబేరుకొనఁగాను

చ. 3: వెరగంది ముక్కుమీఁద వేలువెట్టే వది యేమే
తెరవేసు కాతఁడు నీ దిక్కు చూడఁగా
సరి నలమేలుమంగపు సాదించే వది యేమే
యిరవై శ్రీవేంకటేశుఁ డీతఁడు గూడఁగాను

రేకు: 1978-6 శుద్ధవసంతం సం: 29-408

పల్లవి: నీ నేరుపేటిదే నిన్నుఁ జూచి వెరగయ్యీ
కానీవే నిన్నెఱుఁగుదు గడుసరిదానవే

చ. 1: నడుమ నీ వూరకె నా మగనితోడుత –
నెడమాఁట లాడించే వెంతదానవే
వడిగా బువ్వలచెండు వాటుగా నాతని వేసి
కడు సన్నసేసే వెంత గయ్యాళిదానవే

చ. 2: వింతగా నాతఁడూ నేనూ వినోదము లాడఁగాను
వంతులకు వచ్చే వెంటువంటిదానవే
మంతన మాడుతాఁ దెరమాఁటునఁ గూచుండఁగాను
రంతుసేసే వేనాటి రట్టడిదానవే

చ. 3: యీకడ శ్రీవేంకటేశుఁ డిటు నాతో నవ్వఁగాను
పైకొనఁ జూచేవు నీ వేపాటిదానవే
కైకొని నలమేల్మంగ నెదపై నుండఁగాను
జోకతోఁ జెనకే వేమి జూటుదానవే

రేకు: 1979-1 దేసాళం సం: 29-409

పల్లవి: ఆతనికి నీకుఁ దగు నన్నిటా నమ్మా
రాతిరిఁ బగలుఁ గాఁపురము సేయవమ్మా

చ. 1: గొప్పైన కన్నులదాన కోడె వయసుదాన
చిప్పిలు గళలదాన సింగారిదాన
యిప్పు డల్లాతఁడు మా యేలిక నిన్నుఁ జూచి
కప్పుర విడె మంపెఁ గైకొనవమ్మా

చ. 2: పవడపు మోవిదాన భాపు గుబ్బలదాన
సవరపుఁ గొప్పుదాన చక్కనిదాన
యివల నిదిగో నీ యెదుటనే వున్నవాఁడు
రవళ నీ వొద్ది కిట్టె రమ్మనవమ్మా

చ. 3: తళుకుఁ జెక్కులదాన తలిరుఁ బాదాలదాన
సెలవి నవ్వులదాన సిగ్గరిదాన
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
మెలుపున నినుఁ గూడె మెచ్చఁగదవమ్మా

రేకు: 1979-2 వరాళి సం: 29-410

పల్లవి: అడుగఁగరాదు నిన్ను నడుగకుండఁగరాదు
చిడుముడి తమకము చిమ్మిరేఁగీ నాకును

చ. 1: చెక్కుల చెమట లవె చెంపలవెంట గారీ
యెక్కడనుండి వచ్చేవో యెఱఁగమయ్యా
గక్కన నీ మేననుండి గందపు బేఁటులు రాలీ
చక్కఁగా నే గరిడిని సాము చేసితివయ్యా

చ. 2: ఆముకొని నీ మేన నలపులు దేరీని
యేమిపని సేసితివో యెఱఁగమయ్యా
వేమారు నీ సెలవుల వెన్నెలనవ్వు గురిసీ
దోమటి సంతోస మేడ దొరికెనయ్యా

చ. 3: కందువ నీ మోమునఁ గమ్మీ నివ్వెరగులు
యెందున్నదో నీ చిత్త మెఱఁగమయ్యా
అందపు శ్రీవేంకటేశ యలమేల్మంగను నేను
చెందితివి నన్ను నీ చేఁతులు గంటిమయ్యా

రేకు: 1979-3 సామంతం సం: 29-411

పల్లవి: చెప్పితి బుద్దులు నీకు చెలిమికత్తెఁ గనక
యెప్పుడూ బాయకుండవే యెంత వేఁడుకొనేవు

చ. 1: మంతనము లే మాడేవే మచ్చికఁ జెలులతోను
దొంతర నవ్వు లెంత తూరుపెత్తేవే
అంత వేడుకైతే బతియండఁ గూచుందువు రావే
ఇంతేసి యడియాసల నేల పొరలేవు

చ. 2: తిలకిం చేమి చూచేవే తెరమరఁగుననుండి
వులివచ్చి సిగ్గుల నే లుమ్మగిలేవే
తలఁ పీతనిపైనుంటే తగిలి పొందుసేయవే
నిలువు నివ్వెరగుల నీ వేల యలసేవు

చ. 3: మక్కువలేమి చూపేనే మాఁటలలోనే నీవు
చొక్కపు నయాల నేమి చొప్పు వేసేవే
దక్కి శ్రీవేంకటేశుఁడు తానే వచ్చి నిన్ను నేలె
అక్కరైతేఁ జెనకవే అదేల కొంకేవు

రేకు: 1979-4 లలిత సం: 29-412

పల్లవి: మఱి యేమి విన్నవించే మాపుదాఁకాను
తఱవాతి పనులెల్లా తానే యెఱుఁగునే

చ. 1: మగఁడు లాలించితేను మచ్చిక తానే కలుగు
నగితేను మిక్కిలి నమ్మికవుట్టు
మొగము చూచితేను ముంచుకొను నాసలు
తగవు తానే యెఱుఁగు తలఁచుకొమ్మనవే

చ. 2: చేరి సేవలు గొంటేను చిత్తము తానే కరఁగు
సారె సరసమాడితే సంతోస మెక్కు
గారవించి మన్నించితే కాఁపురము లీడేరు
తారుకాణ లన్నియును తలఁచుకొమ్మనవే

చ. 3: ననుపులు నెరపితే నారుకొనుఁ బ్రియములు
పెనఁగితే మీఁద మీఁదఁ బెరుగుఁ దమి
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె తానే వచ్చి
తననా సంది పొందులు తలఁచుకొమ్మనవే

రేకు: 1979-5 శ్రీరాగం సం: 29-413

పల్లవి: తానే వచ్చి రమణుఁడు దయదలఁచుటే మేలు
నేనా తన కెదురు నేరుపు లేమున్నవే

చ. 1: ఆసలు ఘనమైతేను అట్టె ప్రియాలు చెప్పించు
వేసా లెక్కుడయితేను విఱ్ఱవీఁగించు
వాసులు మిక్కుటమైతే వట్టి యెగ్గులు వట్టించు
యీ సుద్దు లేమి చెప్పనే యింతుల బతుకులు

చ. 2: చెలిమి వెగ్గళమైతే చేఁతలెల్లాఁ జేయించు
వలపులు దరచైతే వాడిక రేఁచు
పలుకులు దట్టమైతే పంతములెల్లా నిప్పించు
కలవెల్లా నిటులానే కాంతల బదుకులు

చ. 3: నగవు లధికమైతే ననుపులు వుట్టించు
మొగమోటలు మెండైతే మొక్కింపించు
తగ శ్రీవేంకటేశుఁ డితట నీడ నన్ను నేలె
జగములో నీడేరెనే సతుల బతుకులు

రేకు: 1979-6 ముఖారి సం: 29-414

పల్లవి: కొమ్మకు నీ విట్టే పెండ్లికొడుకవై వచ్చితివి
ఇమ్ముల సిగ్గువడక యేలుకోవయా

చ. 1: పుత్తడివంటిది యీ పొలఁతి చక్కఁదనము
చిత్తరువువంటిది మించిన రూపము
క్రొత్తమెఱుఁగువంటిది కోమలపు దేహము
చిత్తగించవయ్యా యీకె సింగారము

చ. 2: పూవుఁదీగెవంటిది పొలుపైన యీకె తీరు
వావిరి బైఁడిసలాకవంటిది రేక
సోవఁ జిగురువంటిది చూచితేను నిలువెల్లా
వేవేగఁ జూడవయ్యా యీ విలాసము

చ. 3: వన్నెల నాణిముత్తెమువంటిది తన పోలిక
వెన్నెల సోగవంటిది వింత భావము
యిన్నిటా శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
వున్నతి మెచ్చవయ్యా యీ వొయ్యారము

రేకు: 1980-1 సాళంగం సం: 29-415

పల్లవి: ఇట తరవాతి పనులెల్లా నీ చేతివి
యెటువలె మన్నించినా నితవే నాకు

చ. 1: వేవేలుగా గొసరితి విన్నపము సేసితి
నీ వేమి సేసినా మేలే నీ చిత్తము
వావులెల్లాఁ దెలిపితి వాడికల మెలఁగితి
భావించి నీ యాలనౌటే పదివేలు నాకును

చ. 2: చేతులెత్తి మొక్కితి చిత్తము గరఁగించితి
నీ తలఁపెట్టున్నా మేలే నీ చిత్తము
కాతరాన వలచితి కన్నుల నిన్నుఁ జూచితి
ఆతుమలో నీ వుండుటే అన్ని యీవులు నాకు

చ. 3: కాఁపురాలు సేసితి కంకణము గట్టుకొంటి
నీ పొందు లన్నియు మేలే నీ చిత్తము
యేపున శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
కాపాడేటి నీ కరుణ ఘన సంపద నాకు

రేకు: 1980-2 నాదరామక్రియ సం: 29-416

పల్లవి: నీ కొలఁది గారు గదె నీ చేఁతలు
యీకడ నీ దంటతనా లెక్కుఁడాయఁగదవే

చ. 1: కాచియుఁ గావవు నీ చక్కని చన్నులు
పూచియుఁ బూవవు నీ పూఁప నవ్వులు
చూచియుఁ జూడదు చౌల సొంపు నీ మోవి
యేచి యిసుమంతదాన వెంత నేరిచితివే

చ. 2: కూడియుఁ గూడవు నీ కొప్పు విరులు
వీడియు వీడవు నీ వెడ సిగ్గులు
ఆడియు నాడని వీ వొయ్యారి మాటలు
యీడు లెట్టుకొని నాతో నేల పెనఁగేవే

చ. 3: తనిసీఁ దనియదు చిత్తము రతుల
మొనసీ మొనయపు నీ మొన గోరులు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో నన్ను
ననిచి యీతని నేల నంటుసేసుకొనేవే

రేకు: 1980-3 శంకరాభరణం సం: 29-417

పల్లవి: ఇంక సిగ్గువడరాదు యిద్దరికి దొరసెను
లంకెలై యీ జవరాలి లాలించవయ్యా

చ. 1: కొమ్మ చూచిన చూపులు కోరి నీ చూచే చూపులు
తుమ్మిద దంపతులై తూరి పెండ్లాడె
నెమ్మి నాకె చేతులును నీవు చాచిన చేతులును
తమ్మి చుట్టరికములై తవులు కొనెను

చ. 2: కలికి పలుకులును కందువ నీ పలుకులును
చిలుక నేస్తములై చెలువొందెను
మలసి యాపె నవ్వులు మఱి నీ చిరునవ్వులు
పొలప వెన్నెలలై పొత్తులు గలసెను

చ. 3: యీ వనిత కోరికలు యింపుల నీ కోరికలు
పావురపు జోళ్లై పాదుకొనెను
శ్రీవేంకటేశ మీ రతి జిప్పిలు మోవితేనెలు
భావింప దరితీపుల పై కొసరులాయను

రేకు:	1980-4 శ్రీరాగం సం:	29-418

పల్లవి:	ఆతఁడూ నే నొక్కటే యరసి చూడఁగనేల
కాంతరించి చెలులాల కడవ నాడకురే

చ. 1:	మిక్కిలి నాతఁడు నాకు మేలువాఁడై వున్నవాఁడు
యిక్కువ బాసలు నా కిచ్చినవాఁడు
మక్కువ తోడుత నా మాఁటకు లోనైనవాఁడు
ఇక్కడ నా మగనితో నేల కొసరేవే

చ. 2:	పరగ నా కాఁగిటికి బతిమి పట్టుకున్నాఁడు
మరుతంత్రముల నన్ను మరిగినాఁడు
ఇరవై యేపొద్దూ నా యింటిలోనే వున్నవాఁడు
యెరవుగా నిపుడు మీ రెంత సొలసేరే

చ. 3:	అందరిలోనా నాకే ఆసపడి వున్నవాఁడు
కందువ నా మోవి పొత్తు గలసినాఁడు
అందపు శ్రీవేంకటేశఁ డన్నిటా నన్నేలినాఁడు
సందడించి మీ రేమి సాదించవచ్చేరే

రేకు: 1980-5 దేశాక్షి సం: 29-419

పల్లవి: ఇంతులాల చూడరే యీాకె బాగులు
వింత వింత సింగారాల వినోదించీ నిపుడు

చ. 1: వెలఁది నవ్వులనే వెన్నెలలు గాసీని
తొలుతనే మొగము చంద్రుఁడు గనక
వలపుల చెమటల వానలు గురిసీని
మెలుపునఁ దురమే మేఘము గనక

చ. 2: కొనచూపుల దూరనఁ గోలలుగాఁబొంచి యేసీ
నును బొమ్మలే సింగిణులు గనక
తన మాఁటలను తియ్యఁదనములు వెదచల్లీ
నినుపుఁగెమ్మోవి తేనియపెర గనక

చ. 3: వడిఁ గళల బదారు వన్నెలతో మెరసీని
అడరి తానే కనకాంగి కనక
గుడిగొని పెద్ద చనుఁగొండలతో చెలరేఁగీ
యెడయక శ్రీవేంకటేశు దీవి గనక

రేకు: 1980-6 హిందోళ వసంతం సం: 29-420

పల్లవి: ఎందాఁకా నీతని రాక లెంచి కాచుకుండితివి
చందమామఁ బనులెల్లా సంతోసించవే

చ. 1: చెలువుఁడు వచ్చెనంటాఁ జెప్పీ గూఁటిలో చిలుక
యెలమి నిట్టె నీవు యెదురుకోవే
నిలువుటద్దానఁ బతి నీడ యిదె కానవచ్చీ
పిలిచి వినయముతోఁ బీఁట వెట్టవే

చ. 2: మచ్చికఁ జెలికత్తెలు మాఁటలాడే రాతనితో
విచ్చన విడి నీ వూను వినఁగదవే
వచ్చి కూచుండఁగా మోసీ వడి సకినల మంచ
మిచ్చుట విడె మియ్యవే మీతనికి నీవు

చ. 3: యిదె శ్రీవేంకటేశ్వరుఁ డిన్నిటాను నిన్నుఁగూడె
వుదుటు రతుల నింక నోల లాడవే
కదలి సూత్ర బొమ్మలు కమ్మి సురట్లు విసరీ
పెదవి తేనియ లాని ప్రియములు రేఁచవే

రేకు: 1981-1 దేసాళం సం: 29-421

పల్లవి: సారిది నే మిందరము సోబానఁ బాడేము
బెరసి యీతని నీవు పెండ్లాడవే

చ. 1: చెక్కులఁ జెమట గారె సెలవుల నవ్వు దేరె
మక్కువ నీ వీతనితో మాఁటలాడఁగా
తక్కక నీ వలపులు దాఁచ నిఁక నేమిటికి
పెక్కులేల వేడుకతోఁ బెండ్లాడవే

చ. 2: తనువెల్లాఁ బులకించె తలపోఁత లిగిరించె
మోనసి నీ వీతని మోము చూడఁగా
అనిశము నీ కోరిక లణఁచఁగ వలదిఁక
పెనగొన్న వేడుకతోఁ బెండ్లాడవే

చ. 3: ముంచి మోవిపండు మాఁగె ముక్కునసూర్పులు రేఁగె
పొంచి శ్రీవేంకటేశుఁడు పొందుసేయఁగా
కొంచక మీ కూటములు గుట్టుసేయ నిఁక రాదు
పెంచిన వేడుకతోఁ బెండ్లాడవే

రేకు: 1981-2 బౌళి సం: 29-422

పల్లవి: అందుకే విచారించే నప్పటనుండి
చెందదది నాకు నొక్క బుద్ది చెప్పవే చెలియా

చ. 1: పొలసి యాతని నేఁచూచితేను నా చూపులు
కొలఁది మీరఁగ నాఁటుకొనవుగదా
కొలువు నేఁ జేసితేను కోరి నా చక్కఁదనము
తలఁపులోఁ జుట్టుకొని తమి రేఁచదుగదా

చ. 2: తగిలి మాఁటాడితేను తతి మోవితెనె గారి
సొగటువారి యతఁడు చొక్కఁడుగదా
నగితేను ముంచుకొని నాతోడి సంగాతము
జిగురువలె నంటుక చిక్కించుకోదుగదా

చ. 3: కదిసి కాఁగిలించితే గట్టి నా చన్నులు దాఁకి
పదరి మదనకళ పట్టదుగదా
ఇదివో శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁ దానె వచ్చి
పొదిగితే మేనెల్లాఁ బులకించదుగదా

రేకు: 1981-3 రామక్రియ సం: 29-423

పల్లవి: చూచి చూచి నాకు నిట్టె సోద్యమయ్యీని
కాచుక తా నెందుండి కలిగెనోకాని

చ. 1: చెలరేఁగి చెలరేఁగి సేవలెల్లాఁ జేసీని
కలికి నీ చిత్త మెట్టు గనెనోకాని
మలసి మలసి నీతో మారుకొని మాఁటలాడీ
యెలమి నీ వెంత చన విచ్చితివోకాని

చ. 2: నానఁబెట్టి నానఁబెట్టి నవ్వు లెల్లా నవ్వీని
ఆనుక నీ కెంత చుట్టమాయెనోకాని
కానుకిచ్చి కానుకిచ్చి కతలెల్లాఁ జెప్పీని
సేవలుగానే సన్నలు సేసితివోకాని

చ. 3: చేయి ముట్టి చేయి ముట్టి చెనకఁగ వచ్చీని
నీ యితవెరఁగ వెంత నేర్చునోకాని
యీయెడ శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
చాయల నాపెకూ నెంత సతమయితివోకాని

రేకు: 1981-4 లలిత సం: 29-424

పల్లవి: నీకంటె నాతఁడు మేలు నీ వాతనికంటె మేలు
చేకొని యాతని నిట్టె చెలఁగించఁగదవే

చ. 1: నాలుక తుదలనే నయములు నవ్వులతోడివే మెచ్చులు
తాలిమి చేతివే గుణములు తగవులలోనివే మెచ్చులు
పోలిక వలనివే రూపులు పూచినకొలఁదులే పూఁపలు
జోలిఁబెట్టక పతిఁ జొక్కించఁగదవే

చ. 2: పెనఁగులలంకెలే పొందులు పెదవల మీఁదివే ప్రియములు
మనసులోనివే మర్మాలు మచ్చికగలయంతె మాఁటలు
ననుపుల వెంటవే యాసలు నమ్మిన చోటివే చనవులు
కనుఁగొని పతిమతి గరఁగించఁగదవే

చ. 3: వాడికల పొంతవే వరుసలు దండలవె మొగమోటలు
వేడుకల యందలివె కోరికలు వినోదాల సంగడివెచెనకులు
కూడె నిన్ను నిన్నటాను కూరిమితో మన్నించి
యీడ శ్రీవేంకటేశ కింపు రేఁచఁగదవే

రేకు: 1981-5 ఆహిరి సం: 29-425

పల్లవి: చేకొని నాకు బుద్ధులు చెప్పే వప్పట నుండి
జోకతోడ వేళలెల్లాఁ జూచి చెప్పుతా రావే

చ. 1: యేకతాన బతివద్ది కేరీతి నే వత్తునే
ఆకడ నెవ్వతె బిల్వనంపుకున్నాఁడో
కాక, తన్ను నెట్టా నిక్కడికి రమ్మందునే
కైకొని యే పనులకు గాచుకున్నాఁడో

చ. 2: కామించి కామించి యీతని కెట్టు గదిసి వీడెమిత్తునే
ప్రేమ నెవ్వతెఁ దెరలోఁ బెట్టుకున్నాఁడో
ఆముకొని పెనఁగఁగ నది యెట్టు గూడెనే
చేమించి యిప్పు డాతని చిత్త మేడ నున్నదో

చ. 3: గక్కన నే నెటువలెఁ గాఁగిలించుకొందునే
అక్కర నే కాంతఁ బెండ్లి యాడినాడో
ఇక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నేలె
తక్కక నామీఁద నెంత దయసేసినాఁడో

రేకు: 1981-6 పాడి సం: 29-426

పల్లవి: వేగిరించనేఁటికే వెలఁది నీవు
జాగలేక వొరిచితే సతమయ్యీ నతఁడే

చ. 1: విచ్చి చెప్పఁబోతేను వీడెమే కారముగాదా
యెచ్చి యాతనిపై నేరాలేల యెంచేవే
తచ్చితేను పెరుగులో తానే వెన్నవొడమదా
కుచ్చి కాఁగిలించుకుంటే గునిమయ్యీ నతఁడే

చ. 2: కనుఁగొని సోదించితే కంటిలో నలుపుగాదా
తనివోక పతినేమి తప్పువట్టేవే
పనిగొంటే చెరకునఁ బంచదార వుట్టదా
ననిచి నవ్వితేను నయమయ్యీ నతఁడె

చ. 3: భావించితే మోవిలోనె పచ్చితేనె వుండదా
శ్రీవేంకటేశ్వరు నేల సిగ్గు రేఁచేవే
కావలెనని దాఁచితే కాయలే పండ్లు గావా
వావిరి యిట్టే గూడితే వసమయ్యీ నతఁడే

రేకు: 1982-1 సౌరాష్ట్రం సం: 29-427

పల్లవి: నీతో సరివారమా నీవే మన్నింతువుగాక
యీతల విచారించితే నిటువంటివారము

చ. 1: నెరులు నిడుపుగాను నెమ్మది బెంతుముగాని
తురుము వేఁకమయ్యేది తోఁచ దెంతైనా
పిరుఁదు పిక్కటిలితే బీరాన నుండుటగాని
గరిమ మందగమన గది దెలియరాదు

చ. 2: చన్నులు గట్టు లంటాను సారె గరింతుముగాని
సన్నపు నడిమి యలసత యెంచము
కన్నులు గొప్ప లంటాను కాఁడఁ జూచుటేకాని
మిన్నక తలచుట్టిగా మించేది దలఁచము

చ. 3: చేలి మోవి తేనెయంటా చిప్పిలు టింతేకాని
వూరకె యన్ను వట్టేది వూహించలేదు
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నేఁడు
కూరిమి మా సంతోసాలు గురుతు వెట్టరాదు

రేకు: 1982-2 పాడి సం: 29-428

పల్లవి: ఎందాఁకా నా మనవులు యేమి చెప్పేను
చెంది తానే నా సేవలు చిత్తగించు మనవే

చ. 1: సేసలకు త నెదుట శిరసొగ్గితి నప్పుడే
ఆసలకు లోనైతి నారడిగాను
వాసులకుఁ బెనగితి వడి సవతులలోను
రాసికెక్కె నా వలపు రమ్మననే పతిని

చ. 2: వేడుకకుఁ దనతోను వెలయఁగ నవ్వితి
వాడికకు మేడలోన వచ్చి వుందాన
ఆడికకుఁ బాలైతి నందరిముందరా నేను
యీడ నన్ను మన్నించి యీడేరించు మనవే

చ. 3: విందులకు మోవి తేనె వేమారుఁ జూపితి
పొందులకు మఁటలాడి పొదిగితిని
ఇందులకే శ్రీవేంకటేశుఁడు వచ్చి నన్నేలె
కందువ నిట్టే నన్నుఁ గరుణించు మనవే

రేకు: 1982-3 గౌళ సం: 29-429

పల్లవి: ఎంతటి జాణ యీపె యెటువంటి వొయ్యారి
వింతలెల్లాఁ గంటి మిదె వినోదించవయ్యా

చ. 1: చెక్కు చేయి మోఁటువెట్టి సిగ్గులు వడుకొంటాను
తక్కించీ నిన్నికె యవదరించవయ్యా
లక్కబుఱ్ఱవంటి నోఱు లలిఁ దెరచి మాఁటాడి
నిక్క కానుక లందిచ్చీ నీ వందుకోవయ్యా

చ. 2: విరులు కొప్పున రాల విక విక నవ్వుకొంటా
కెరలించీ నిన్నుఁ జిత్తగించవయ్యా
సరిఁ జన్నులఁ బయ్యద జారిరాఁగా మూసుకొంటా
సురటి విసరీ నీకుఁ జొక్కి మెచ్చవయ్యా

చ. 3: కలికి కన్నుల నిన్నుఁ గాతరానఁ జూచుకొంటా
వలపించీఁ దొడపైఁ బవ్వళించవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
కొలువులో నున్న యాకె కోరికె చేకొనవయ్యా

రేకు: 1982-4 వరాళి సం: 29-430

పల్లవి: ఎన్ని నేరుచుకొంటివే యివిఁ గొన్ని
పన్నుకొన్న జాడలు పచ్చిదేరె నిపుడు

చ. 1: చెలిమైతేఁ జెటెఁడేసి చిగిరునవ్వు మూటెఁడేసి
జలిమి నెంత చల్లేవే పతి మీఁదను
వలపులు గంపెఁడేసి వాడికలు గుంపెఁడేసి
వెల పరచ వచ్చేవు వింతలే నీ సుద్దులు

చ. 2: తాలిములు మూరెఁడేసి తలఁపులు బారఁడేసి
గారి గఁటు వేసేవే కమ్మటి నీవు
మేలములు బండెఁడేసి మెచ్చులైతే కుండెఁడేసి
చేలలో వెదవెట్టేవు చెల్లునే నీ చేఁతలు

చ. 3: సంగాతాలు పట్టెఁడేసి సణఁగులు గొట్టెఁడేసి
జంగిలేల కల పేవే సారె సారెకు
అంగవించి శ్రీవేంకటాద్రీశుఁడు నన్ను నేలె
యెంగిలి పొత్తేల కూడే వీతనితో నీవు

రేకు: 1982-5 ఆహిరి సం: 29-431

పల్లవి: అలయకువే నీపు ఆతనిఁ దోడి తెచ్చితి
యెలమితో మీరిద్దరూ నెన్నఁడూ బాయకురే

చ. 1: విరహ మేమిసేసీనే విభుఁడు నీవాఁడైతే
యిరవైన నీకోరిక లేడేరీఁగాక
మరుఁ డేమిసేసినే మనసు పదిలమైతే
పెరరేఁచి మిమ్మిద్దరి బెండ్లి సేసీఁగాక

చ. 2: అలు లేమిసేసీనే ఆయములు గరఁగితే
కొలికికిఁ దెచ్చి రతిఁ గూరిచీఁగాక
వల పేమిసేసీనే వద్దఁ బాయకుండితేను
తలకొన్న సంతోసాల దగిలించీఁగాక

చ. 3: చింత యేమిసేసీనే శ్రీవేంకటేశుఁ గూడితే
దొంతర వేడుకలెల్లా దొరకీఁగాక
మంతన మేమిసేసీనే మచ్చికలఁ బెనఁగితే
చెంత చెమటలు రేఁగి చిప్పిలేఁగాక

రేకు: 1982-6 ముఖారి సం: 29-432
పల్లవి: మేలు మేలు యిన్నిటాను మెరసె నీ చేఁతలు
పోలించి చూడరమ్మ పొలఁతి భావములు
చ. 1: చింతలేక సిగ్గులనే చెక్కిటఁ జేయి వెట్టీని
పొంతములుగాఁ జాఁచీని కొనచూపులు
బంతి గట్టకే నురిపీఁ బచ్చి మోవినవ్వులు
యెంతని చెప్పుదమమ్మా యీ కాంత భావములు
చ. 2: అలయకే చెమటలు అంగమెల్లా నించుకొనీ
పలుకుల చిలుకలఁ బొఁచు వెట్టీని
వలిపె వలల వేసీ వడిఁ జన్ను జక్కవల
తలఁచరాదమ్మా యీ తరుణి భావములు
చ. 3: గరువు చెప్పని సాము కుచ్చి కాఁగిటనే చేసీ
తొరలి శ్రీవేంకటేశు తోడి రతుల
పొరి మెయిఁ దీగెనే కుచ్చీఁ బులకల తోరణాలు
యిరవై నిలుచెనమ్మా యీ యింతి భావములు

రేకు: 1983-1 వరాళి సం: 29-433

పల్లవి: చెప్పవయ్యా ఇంకా నీపె చేఁతలు వినేఁగాని
ఇప్పుడు నీవద్దనున్న దెవ్వతెయ్యా యీపె

చ. 1: వేడుకతో నల్ల నాఁడు వీదివెంట నీవు రాఁగా
ఆడరాని మాఁటాడిన ఆపెవో యీపె
జాడతోడ నీతోను సరి వెనఁగుకొంటాను
వోడక నిన్నుఁ జన్నుల నొత్తినాపె యీపె

చ. 2: గుట్టున నెవ్వతెతోనో కోరి నీవు మాఁటాడఁగా
అట్టె కొంగువట్టి తీసినాపె యీపె
పొట్టఁబొరుగుననే నీ బుజాన రేకలు దీసి
రట్టు సేసినట్టు జగరాఁగా యీపె

చ. 3: సేసవెట్టి పెండ్లాడిన చెలుచెల్లా నుండఁగాను
ఆసలు మీకు రేఁచిన ఆపె యీపె
రాసికెక్క శ్రీవేంకటరమణ నన్నేలితివి
వాసితో నిన్నుఁ జెనకేవాడికాపె యీపె

రేకు: 1983-2 శంకరాభరణం సం: 29-434

పల్లవి: పొదలెె నిండుఁగళలపున్నమ నేఁడు
అదను దప్పక జాజ రాడుదువు రావయ్యా

చ. 1: జలజాక్షి మోమునను చంద్రోదయమాయ
నెలకొన్న నవ్వుల వెన్నెల గాసెను
కలికి కన్నుల నల్లఁగలువలు వికసించె
అలరి యీకెతో జాజ రాడుదువు రావయ్యా

చ. 2: యెనసి జవ్వనమున నేతెంచె వసంతకాల
మొనరి మోవిఁ జిగురు లుప్పతిలెను
గొనకొన్న తురుమునఁ గూడె తుమ్మిదమూఁక
అనుమానించక జాజ రాడుదువు రావయ్యా

చ. 3: కుంకుమ చెమట చనుఁ గొప్పెరల నిండుకొనె
కొంకక గోళ్లే బుజ్జటకొమ్ము లాయెను
లంకెలై శ్రీవేంకటేశ లలనతోఁ గూడితివి
అంకెల నేపొద్దూ జాజ రాడుదువు రావయ్యా

రేకు: 1983-3 ముఖారి సం: 29-435

పల్లవి: ఊరకున్నాపెను నీవే వొక్కక్కటే రేఁచితివి
గారవపు టీపెవల్లఁ గడమ లే దెందును

చ. 1: కిలకిల నవ్వఁగాఁబో కెరవి నీ జవరాలు
కెలసి బొమ్మల జంకించె నిన్నును
బలిమిఁ జెనకఁగాఁబో పక్కనఁ దప్పించుకొని
సొలసి నిట్ట చూపులఁ జూచె నిన్నును

చ. 2: పంతము లాడఁగఁబో పచ్చిదేర చెవిలోన
మంతనాన నొట్టువెట్టి మాఁటలాడెను
పొంత జన్ను లంటఁగాఁబో పొంచి కొప్పువట్టి తీసి
కొంత గొంతములు వాఁడిగోర నూఁదె నిన్నును

చ. 3: మోవి తెనెడుగఁగాఁబో మొక్కలాన బైకొని
కావరాన నీ మోవి గంటిసేసెను
యీవేళ శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
కైవశమై వుండఁగాఁబో కడు మెచ్చె నిన్నును

రేకు: 1983-4 రామక్రియ సం: 29-436

పల్లవి: వినోదాన కోపవట విరహాన కోపేవా
యెనసి నీ వితని యిచ్చలో మెలఁగవే

చ. 1: కొనగోరి తాకులకు కొచ్చి వొడ్డించుకొనేవు
యెనలేని మరునమ్ము లెట్టేరిచేవే
పెనఁగాతఁడు నవ్వితే బెట్టుగా నెగ్గుపట్టేవు
వెనక వచ్చే వెన్నెల వేఁడిగాదా చెలియా

చ. 2: పచ్చి మాఁట లాడితేను పతిమీఁద సొలసేవు
హెచ్చి చిలుకపలుకు లేపనా నిన్ను
ముచ్చట గురు లంటితే మునుకొని జంకించేవు
వచ్చి యలులు మూఁగితే వారించఁగలవా

చ. 3: కదిసి మోము చూపి వే కడు సిగ్గులు వడేవు
యెదురైన చందమామ యెంత సేసునో
వదలక శ్రీవేంకటేశ్వరుఁ డిట్టె నిన్నుఁ గూడె
పదరేవు వలపింక పైపైఁ బెరుగుఁగదే

రేకు: 1983-5 పాడి సం: 29-437

పల్లవి: ఎన్నిలేవు పనులు నీ కెంచుక సేసేనంటే
మన్నింతువుగాక జోలి మరియేలయ్యా

చ. 1: పలుకు దేనెల మోవి పచారించి వేఁడుకొనీ
చెలియ మనవు లింకఁ జేకొనవయ్యా
కొలువు లిందాఁకా జేసి కొసరి నిన్నుఁ బిలిచీ
యెలమి నీకె ఇంటికి రావయ్యా

చ. 2: చిగురుఁ జేతుల నిన్ను చెయివట్టి పెనఁగీని
మగువ చేఁతలకు సమ్మతించవయ్యా
మొగము చూచి నీకు మెక్కులెల్లా మొక్కీని
అగపడి యీకె చెప్పినట్టు సేయవయ్యా

చ. 3: కుంకుమ గుబ్బల నిన్నుఁ గుచ్చి కాఁగిలించుకొనీ
లంకెలఁ బాయక ఇఁక లాలించవయ్యా
తెంకికి నిన్నుఁబిల్చి తెరవేసుకొనె నీకె
అంకెల శ్రీవేంకటేశ ఆదరించవయ్యా

రేకు: 1983-6 శ్రీరాగం సం: 29-438

పల్లవి: పంతము లే లాడీనమ్మా పలుమారు రమణుఁడు
చెంత నా కిచ్చకములే సేసీఁగాక

చ. 1: మగువల మాఁటలే మదురాలు
మొగము చూపులే మోహనాలు
నగిన చిరునవ్వులే నానఁబాలు
తగుల కెట్టుండునమ్మా తానాపె పసలను

చ. 2: వనితల వినయాలే వడఁగండ్లు
కొనచూపు లవియె చొక్కునుందులు
వొనరిన సరసాలే వుడుగరలు
పెనఁగ కెట్టుండునమ్మా ప్రేమ నాపె కాఁగిట

చ. 3: వెలఁదుల కాఁగిళ్లే వీఁడు బట్లు
వెళగని రతులే పెను సాములు
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నన్ను
తలఁచ కెట్టుండునమ్మా తగ నాపె పొందులు

రేకు: 1984-1 వరాళి సం: 29-439
పల్లవి: మీ కిద్దరికిఁ దగవు మేము చెప్పేవారమా
చేకొన్న మీ వూడిగము చెలులము నేము
చ. 1: యింతులు పైకొంటేను యియ్యకొనవలెఁగాని
యెంతైనాఁ బెనఁగరాదు యెప్పుడూ నీకు
పంతము లాడుకొంటేను పై పై నవ్వవలెఁగాని
వంతులకు మారుకొనవచ్చునా నీకు
చ. 2: చనవున్నఁ గొసరితే సమ్మతించవలెఁగాని
వెనక ముం దెంచరాదు వింతగా నీకు
చెనకి కాఁగిలించితే చెలరేఁగవలెగాని
మనసు సోదించరాదు మలసి నీకు
చ. 3: మొక్కితేను పొందుసేసి మొగమోడవలెగాని
వెక్కసించరాదు మరి వేరే నీకు
ఇక్కడ శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
చొక్కి వినోదించవలె సొంపుతో నీకు

రేకు: 1984-2 ముఖారి సం: 29-440

పల్లవి: పడఁతిరో నీ వేఁటికి పంతములాడ వచ్చేవు
అడియాలా లెల్లా గంటి వౌఁ గాదనఁగలవా

చ. 1: కొమ్మ బొమ్మవిండ్లను గురులేసీ నీమీఁద
చిమ్మి వొడ్డించుక సాముసేయఁగలవా
కమ్మటిఁ జిరునవ్వుల కప్రవసంతము చల్లీ
నెమ్మది నాకె ముందర నిలువఁగఁగలవా

చ. 2: నెలఁత చనుగుబ్బల నిమ్మపండ్లె గరవేసీ
బలిమి నీ చేతులను పట్టఁగలవా
సళుపుల మాటల చలివంది లిదె పెట్టీ
కలసి యందుకు లోనుగాకుండఁగలవా

చ. 3: మగువ మోవి సన్నల మచ్చులు వేసీ నవిగో
తగులు వడక నీవు దాయగలవా
నిగిడి శ్రీవేంకటేశ నీ వేకె గూడితివి
తగిలీ నిన్ను రతులఁ దప్పించుకోఁగలవా

రేకు: 1984-3 రామక్రియ సం: 29-441

పల్లవి: పట్టెఁడేసి గుబ్బల పాయపు దానవు నీవు
దిట్టవై రతుల నిట్టె తేలించఁగదవే

చ. 1: మచ్చరమే వద్దుగాని మాఁటల దూరఁగవచ్చు
కుచ్చితమే వద్దుగాని కొసరవచ్చు
వచ్చె పట్టవద్దుగాని వొరసి జింకించవచ్చు
ఇచ్చట నీతనిఁ జూచి ఇన్నటి మెరయవే

చ. 2: వుప్పతించవద్దుగాని వొడివట్టి తియ్యవచ్చు
చొప్పులెత్తవద్దుగాని సొలయవచ్చు
తప్పులెంచవద్దుగాని తగిలి గుంపించవచ్చు
యిప్పు డీతని ముందర నిన్నిటా మెరయవే

చ. 3: యెలయించవద్దుగాని హెచ్చి కాఁగిలించవచ్చు
చలపట్టవద్దుగాని సాదించవచ్చు
వెలయఁగ నిన్నిట్టె శ్రీవేంకటేశుఁడు గూడె
యెలమి నీతని చెంత నిన్నిటా మెరయవే

రేకు: 1984-4 పాడి సం: 29-442

పల్లవి: చూడఁగదరే యీతని సుద్దులు వో చెలులాల
వాడలోన నివీఁ గొన్ని వట్టివేసాలు

చ. 1: వెంగెము లాడితినా వెస దనదిక్కు చూచి
చెంగి చెంగి తా నేల సిగ్గువడీనే
అంగడిఁ బెట్టితినా ఆరడిఁ దన చేఁతలు
యెంగిలి మోవి మూసుక యేల నవ్వీనే

చ. 2: తప్పక చూచితినా తన మేని గురుతులు
అప్పుడే పచ్చడ మెంత కప్పుకొనీనే
తప్పులువట్టితినా తా నాడినమాటఁలు
చొప్పులుగాఁ దా నిదేమి వొట్టువెట్టొకనీనే

చ. 3: గోరికొన నూఁదితినా కొడిమలెల్లా గట్టి
చేరి వేఁడుకొని యాల చెక్కు నొక్కనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
తారుకాణించి నా కెన్ని తగవులు చెప్పీనే

రేకు: 1984-5 రామక్రియ సం: 29-443

పల్లవి: కానవచ్చీ నీ గుట్టు కలదెల్లాను
దీని కేమి మీఁదటెత్తు తెలుసుకొమ్మీ

చ. 1: కొంగు దాఁకించెనంటానే గుంపించేవే; నీ మోవి
యెంగిలి సేసితే నాకె నేముందువో
సంగడిఁ గూచుండితేనే సాదించవచ్చేవు; నీ –
యంగము గోర గీరితే నప్పు డేమందువో

చ. 2: నెట్టుకొని చూచెనంటా నెపాలు వేసేవు; ఆపె
యిట్టె నీ కొప్పు వట్టితే నేముందువో
వట్టిమాఁట లాడితేనే వాసు లెక్కించుకొనేవు
తిట్టులు దిట్టితే నెంత తిరుగ నేముందువో

చ. 3: చనుఁగవ సోఁకెనంటా చలమున జరసేవు
యెనసి కాలు దొక్కితే నేమందువో
మునుపే న న్నేలితివి విమ్ముల శ్రీవేంకటేశుఁడ
వెనక నీపెఁ బెండ్లాడి వేడుక లేమందువో

రేకు: 1984-6 సాళంగనాట సం: 29-444

పల్లవి: బత్తిగల జవరాల పాయపు పెండ్లికూఁతుర
చిత్తమురా బతిసేవ సేయఁగదే యిఁకను

చ. 1: యెడయక విభుఁడు నీ యింటి కిదె వచ్చినాఁడు
నిడువాలుఁ జూపులను నివాళియ్యవే
బడి నీతనిఁ గూడి పండుగ దినము నేఁడు
గుడిగొన్న నవ్వుల ముగ్గులు వెట్టవే

చ. 2: సొలవక నీకు దన చుట్టరికమెల్లాఁ జెప్పి
వెలయ నీ మోవితేనె విందువెట్టవే
పొలుపైన తలపోఁత పొంతనాలు నొనగూడె
పలుకుల కప్పురాల బాగాలు వెట్టవే

చ. 3: మంతనపుఁ గాఁగిటికి మంచి లగినము వచ్చె
బంతిఁ బులకల శాస పైఁజల్లవే
యింతలో శ్రీవేంకటేశుఁ డిన్నింటాను నిన్ను నేలె
వింత వింత రతులను వీడు దోఁళ్ళాడవే

రేకు: 1985-1 ముఖారి సం: 29-445

పల్లవి: ఇప్పుడు విచ్చేసి వున్నాఁ డెదుటఁ దాను
తప్పక నన్నుఁ బాయక దయఁజూడుమనరే

చ. 1: యెదురు చూపులవల్ల యెడమాఁటలవల్ల
అదనఁ దా వచ్చెననే యాసలవల్ల
పెదవులఁ దన పేరు పేరుకొనే యందువల్ల
యెదలో నమ్మివుందాన నిట్టె విన్నవించరే

చ. 2: తలపోఁతలవల్ల తమకంబులవల్ల
కలలోన నెనసే సంగతులవల్ల
వెలయఁ బెండ్లాడిన వేడుక లంటినవల్ల
యెలమిఁ గాచుకుందాన నిట్టె విన్నవించరే

చ. 3: వినుకలిఁ జొక్కేవల్ల వేడుక సిగ్గులవల్ల
ఘనుఁడు దా నంపిన లేకలవల్ల
నను దానె వచ్చి కూడినాడు శ్రీవేంకటేశుఁడు
యెనగొని వుందాన నిట్టె విన్నవించారే

రేకు: 1985-2 మాళవిగౌళ సం: 29-446

పల్లవి: అన్నిటాను వెగటైన ఆఁడువారము
యెన్ని లేవు మా సుద్దులు యేమిసేతుమయ్యా

చ. 1: మొలక నవ్వు నవ్వితే మురిపెమువలె నుండు
సొలసితే రాజసము చూపి నట్టుండు
కలికనై మాఁటాడితే గయ్యాళించి నట్టుండు
యెలమి మావోజ లివి యేమి సేతుమయ్యా

చ. 2: దగ్గరఁ గూచుండితేను దంటతనమై యుండు
సిగ్గువడి వుంటే గర్వించిన యట్లుండు
వొగ్గి పెనఁగవచ్చితే వుద్దండములై నట్లుండు
యెగ్గు దప్పు లెఱఁగము యేమి సేతుమయ్యా

చ. 3: అదనఁ గాఁగిలించితే నారజమువలె నుండు
యెదుట నిలుచుంటేనే యెమ్మెలై యుండు
వెదకివచ్చి నన్ను శ్రీవేంకటేశ కూడితివి
ఇదవో మా కాఁపురము యేమి సేతుమయ్యా

రేకు: 1985-3 వరాళి సం: 29-447

పల్లవి: ఒనరిన చోటికి వొలుపేమేలు
నసుపులు వచరించి నవ్వు నవ్వవే

చ. 1: యింత యాలే వెగటు యిదేమే నీపగటు
అంతేసి వద్దే విరహపు సొగటు
చెంతనే విభుఁడు వచ్చి చెక్కు నొక్కి వీడె మిచ్చీ
సంతోసాన నందుకొని సంగడిఁ గూచుండవే

చ. 2: యేఁటికే యీ సొలపు యి దేడదే యలపు
గాఁటమాయఁ గోరికల కలగలపు
యీటుతోఁ బువ్వులవేసి యీతఁడు పొందుకులాసీ
చోటిచ్చి సరసమాడి చొక్కించవే

చ. 3: యెందాఁకానే మరఁగు యెట్టిదే నీ చెఱఁగు
మందలించరాదే నీ మతి కరఁగు
చెంది నిన్ను నింతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
చందముగా మోవితేనె చవి చూపవే

రేకు: 1985-4 ఆహిరి సం: 29-448

పల్లవి: తన కెందురాడేనా తన మేలుదాన నేను
మనలో నొరయనేల మన్నించమనవే

చ. 1: చెప్పఁ జెప్పఁ గొత్తలాయ చేరి తన సుద్దులెల్లా
అప్పుడే నే వింటిని రమ్మనవే నీవు
వుప్పుచిం దినుమడాయ వొద్దనేనా యెట్లైనా
తప్పు లెంచఁ జనిలేదు తనిసితి నేను

చ. 2: చూడఁ జూడ సోద్యమాయ సొరిది దన చేఁతలు
యీడనుండే కంటి నిఁక నేమీ ననవే
వేడుకకు వెలలేదు వెంగెమాడేదానగాను
గోడలేని చిత్తుఋవు కొసరేనా నేను

చ. 3: సేయఁ జేయ రాసులాయ చెల్లెఁ దన వలపులు
పాయక నే నియ్యకొంటిఁ బదరనేలే
ఊయి గిలిగించితేను అట్టె శ్రీవేంకటేశుఁ –
డీయెడ నన్నేలినాఁడు యెరిఁగితి నేను

రేకు: 1985-5 కన్నడ గౌళ సం: 29-449

పల్లవి: మఱి నీవే కరుణించి మన్నించితి వింతేకాక
గుఱుతులు చెప్పి నిన్నుఁ గొసరఁగఁగలమా

చ. 1: వెలఁది భావము నీకు విన్నవించితిమిగాక
వలపులు గొనఁబెట్ట వసమా మాకు
తలకొన్న నేస్తముల తగవు చెప్పేముగాక
చెలరేఁగి తమి రేఁచఁ జెల్లునా మాకు

చ. 2: తరుణి లోనన్నమాఁట తలఁపించితిమిగాక
సరసము లాడించ సంగతే మాకు
సరుస మీ కిద్దరికి సాకిరై వుండేముగాక
సొరిది మీ గుట్టు చెప్పఁ జొప్పడునా మాకు

చ. 3: యింతి జాణ్టరికము నీ కెరిఁగించితిమిగాక
వంతున సరి వెనఁగవచ్చునా మాకు
యింతలో శ్రీవేంకటేశ యీకె నేలితివిగాక
పొంత మిమ్ము సోదించఁబోలునా మాకు

రేకు:	1985-6 సాళంగనాట	సం:	29-450

పల్లవి:	మగనితో నేమిటికే మందెమేళాలు
నగుతా నుండితేనే ననుపొఁగాక

చ. 1:	చనుఁగవ నొరసేవు సంగడిఁ గూచుండుకొంటా
మొనగోరు మోపేవు మొక్కేనంటాను
పెనఁగులాడ వచ్చేవు ప్రియములు చెప్పుతానే
యెనలేని నీ బిరుదు లేల చూపేనే

చ. 2:	తమలము చిందేవు తగిలి మాఁటాడుతానే
చెమటలు చిమ్మేవు చెనకుతానే
తమకము రేఁచేవు తగఁ బాదాలొత్తుతావే
అమరునే నీ చేఁతలు అన్నియును గంటిమి

చ. 3:	యెంగిలి సేసేవు మోవి యేకతము లాడుతానే
కొంగువట్టే వప్పటిని కొసరుతానే
అంగవించి శ్రీవేంకటాధిపుడు నిన్నుఁ గూడె
కంగులేని నీ వలపు కానవచ్చె నిపుడు

రేకు: 1986-1 ఆహిరి సం: 29-451

పల్లవి: ఇచ్చకమే సేసితేను యీడేరు వలపులు
మచ్చికలే చూపవలె మగవానితోను

చ. 1: శిరసు వంచకువే సిగ్గులు వడకువే
తెరదీసి నిన్నతఁడు తేరి చూచీని
మరఁగు వెట్టుకొకువే మరి తప్పించుకోకువే
విరుల చెండున నిన్ను వేసితే నేమాయను

చ. 2: మొక్కులు మొక్కకువే ముంచి చేయి పట్టకువే
పక్కన నీ చన్నులు పట్టీ నితఁడు
మిక్కిలి జంకించకువే మీరి యాన వెట్టకువే
పిక్కటిల్లఁ గాఁగిటను బిగియించఁగాను

చ. 3: పెనఁగు లాడకువే బెట్టి గోర నూఁదకువే
ననుపున నీతోను నవ్వేవేళను
యెనసె శ్రీవేంకటేశుఁ డిఁక నేమీననకువే
చనవిచ్చి తనమోవి చవి చూపీ నితఁడు

రేకు: 1986-2 కాంబోది సం: 29-452

పల్లవి: ఎట్టు మన్నించేవోకాని యిట తరవాతను
చుట్టరికము లెల్లాను చూపి చెప్పఁగా

చ. 1: కప్పురము గానుకిచ్చి కడు వినయముతోడ
చెప్పేఁగా నీకుఁ బ్రియము చెలియా
అప్పటిని పొందులకు నాసపడి నీ మాఁటలు
వొప్పుగొని కడునమ్మివుండెఁగాఁ తాను

చ. 2: కదిసి వద్దఁ గూచుండి కంకణాలు గల్లనఁగా
మొదలనే చేతులెత్తి మొక్కెఁగా నీకు
సదరాన నీతోను సరసము లాడి యాడి
మదనకేలికిఁ జొక్కి మరిగెఁగా నిన్నును

చ. 3: చెక్కులఁ జెమటగార సేవలెల్లాఁ జేసి సేసి
మిక్కిలి కాఁగిట నించి మెచ్చెఁగా నేఁడు
యిక్కడ శ్రీవేంకటేశ యేలితి విప్పు డీకెను
వెక్కసపు సంతోసాన వెలసెఁగా యిపుడు

రేకు: 1986-3 సామంతం సం: 29-453

పల్లవి: అటు గనక నేస్తము లమరు మీ కిద్దరికి
కుటిలాలు లేవు మంచి గుణములే కాని

చ. 1: మరిగినవారికి మచ్చికగలవారికి
యరపరికములేదు యేమి సేసినా
సరసమాడేవారికి చనవుగలవారికి
విరసములేదు మరి వేడుకే కాని

చ. 2: ఆసగలవారికి ఆతుమైనవారికి
యీసు లేదు మదిలోన యెట్టుండినా
వాసిగలవారికి వలపుగలవారికి
వేసట లేదు మరి వినోదమే కాని

చ. 3: యిచ్చకపువారికి మెనసినవారికి
మచ్చరము లేదు యెన్నిమాఀట లాడినా
యిచ్చట శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
హెచ్చుకుందు లేదు మీకు నింపులేకాని

రేకు: 1986-4 కాంబోది సం: 29-454

పల్లవి: ఒక్కచోటనే వున్నారు వొద్దిక నాతఁడూ నీవూ
చెక్కుల చేతులతోడ చింత లిఁక నేఁటికే

చ. 1: మనసు లొడఁబడితే మాఁటలకుఁ జోటు గద్దు
తనువులు సోఁకితేను తమి రేఁగును
చెనకు లగ్గలమైతే సిగ్గులును నుప్పతిలు
చనవు సేసుక పతి సంగాతాలు సేయవే

చ. 2: మొగమొగాలు చూచితే మోహములు పెనగొను
నగవులు వలపుల నానఁబెట్టును
తగులాయపుఁ జేఁతలు తాలిములు వొడమించు
వెగటులే కితనితో వినోదము లాడవే

చ. 3: అలమి పైకొంటేను ఆయములు గరఁగును
తలపోఁత కోరికలు తనివొందించు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
నెలకొనె నీ పంతాలు నిండుక వుండఁగదే

రేకు: 1986-5 ముఖారి సం: 29-455

పల్లవి: తన వేడుకే చూచీ దలఁచఁడు నా సిగ్గు
వినయముతోఁ జెలియ విన్నవించవే

చ. 1: నెమ్మదిఁదాను నాకు నిక్కుఁగొప్పు వెట్టీని
యెమ్మెలదాననా నేను యేమైనాను
కమ్మటిని దనవద్ద గద్దెపై గూచుండమనీ
ఇమ్ముల నింతేసి నీటు ఇల్లాలికి దగునా

చ. 2: సారె సారెఁ దనతోను సరిగా నవ్వుమనీని
ఆరజపుదాననా నే నందరిలోన
చేరవచ్చి నాకు నిట్టె చెంపల గందాలువూసీ
యీరీతుల మరునా యిల్లాలికి

చ. 3: మిన్నక నా సింగారాలు మెచ్చి మెచ్చి పొగడీని
వన్నెవెట్టుదాననా యేవంకనైనాను
నన్ను శ్రీవేంకటేశుఁడు నంటునఁ గాఁగిటఁ గూడె
పన్నుక యిల్లాలి కిది పచారించవచ్చునా

రేకు: 1986-6 వరాళి సం: 29-456

పల్లవి: ఎన్ని లేవు నీ1 సుద్దులు యెంచఁ బనిలేదుగాక
పన్నుక యిన్నిటాఁ జెల్లుబడైనవేకావా

చ. 1: అంటే నీ మాఁటలకు నడ్డమాడరాదుగాక
నంటున గుంచె దానితో నవ్వవా నీవు
దంటతనమున నీపై దప్పువేయరాదుగాక
యింటికాడఁ గాళాంజాపె కియ్యవా విడెము

చ. 2: సారె సారె నీ చేఁతలు చక్కఁబెట్టరాదుగాక
చేరి యాల వట్ట మాపెఁ జెక్కు నొక్కవా
తారుకాణ సేసి నిన్నుఁ దడవఁగరాదుగాక
కోరి యడపముదానిఁ గొనగోర నూఁదవా

చ. 3: వేడుకతో నిన్ను వెల్లవిరి సేయరాదుగాక
వాడికఁ గట్టి కాపెను వలపించవా
యీడనె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వూడిగాలవారినెల్లా వొక్కొకవేళంటవా

రేకు: 1987-1 రామక్రియ సం: 29-457

పల్లవి: వలపు లొడిఁగట్టుక వచ్చితి విప్పుడు నీవు
యెలమి నీ యాసోద మింకా నెంత గలదో

చ. 1: కొంగు దాఁకీఁ బతి వద్దఁ గూచుండక ఇటు రావే
ముంగురులు పైఁ బడీని మొక్కఁబోకువే
యెంగిలి సోఁకివచ్చీని యేకతా లే మాడేవే
సంగతెరఁగ వాతఁడు సదరమా నీకు

చ. 2: తమ్మ చెదరులు రాలీ తతిగొని నవ్వకువే
చిమ్ముఁజూపులు నాటీఁ గొచ్చి చూడకువే
చెమ్మఁజెమట లంటీని చెక్కులు నొక్కకువే
యెమ్మెలు సేసేవు ఆతఁ డెంత నీ వెంత

చ. 3: వూరుపులు పైఁ బారీ నొద్ద బండుండకువే
గీరులు కొనీ సొమ్ములు కాఁగిలించకువే
చేరి నన్ను నేలినాఁడు శ్రీవేంకటేశుఁడు తొల్లె
దారకపు నీ బోఁటికి దక్కునా యీతఁడు

రేకు: 1987-2 పాడి సం: 29-458

పల్లవి: పెనఁగుతా నాన లేల పెట్టించుకొనేవే నీవు
మనసు వచ్చిన మీఁద మరచీనా ఇఁకను

చ. 1: చక్కరానవు నీవు చదురులాడ నేర్తువు
యిక్కడఁ బతి మోహించు టేమి సోద్యమే
జక్కవ గుబ్బలు మోపి సరసము లాడితివి
మక్కువ నిన్నాతఁడు మరచీనా ఇఁకను

చ. 2: నెఱజాణ విన్నిటాను నీ గుణము కోటిసేసు
మెఱసి నీ బిన్నాణాలు మెచ్చవద్దటే
చిఱునవ్వు వెదచల్లి చిత్తము గరఁచితివి
మఱి యీతఁడు నీ పొందు మఱచీనీ యిఁకను

చ. 3: పాయపుదానవు నీవు పంపు సేసుకోఁగలవు
చే యంటి ప్రియా లీతఁడు చెప్పఁజెల్లునే
యీయెడ శ్రీవేంకటేశుఁ డీతఁ డిట్టె నిన్ను నేలె
మాయింట దా నుంటే నిన్ను మరచీనా యిఁకను

రేకు: 1987-3 భైరవి సం: 29-459

పల్లవి: గుట్టు సేసి దాఁచరాదు గురిసేసి చూపరాదు
ఇట్టిది నా యాందోళము యింతి యేమిసేతునే

చ. 1: మచ్చిక కొండవంటిది మనసు మెయిలువంటిది
హెచ్చీ నిదే తుమకము లేమి సేతునే
ముచ్చట చెప్పినంటే ముంచుకొనీ సిగ్గులు
పచ్చిదేరీ నుడిగితే భావ మేమిసేతునే

చ. 2: చెలిమి తీగెవంటిది చింత వనమువంటిది
యెలఇంచీఁ గోరికలు యేమిసేతునే
తలఁచుకొంటే సెలవిఁ దతిగొనీ నవ్వులు
చెలరేఁగీ వేడుకలు చెలి యేమిసేతునే

చ. 3: పాయము పువ్వువంటిది భావము పండువంటిది
యేయెడ చూచినా దామే యేమిసేతునే
పాయక శ్రీవేంకటాద్రిపతి నన్ను నేలినాఁడు
పాయమెల్లాఁ బులకించీ కాంత యేమిసేతునే

రేకు: 1987-4 ముఖారి సం: 29-460

పల్లవి: మచ్చిక గలిగితేనేమి మరఁగు వద్దా
పచ్చిదేర నేమిటికి బయలీఁదేవే

చ. 1: కొలువు లోపల మోము కొచ్చి కొచ్చి చూచుకొంటా
మలసి సొలసి యేమి మాఁటలాడేవే
నలి నీ యెమ్మెలు చూచి నవ్వేవారి నెరఁగవు
యెలమి నీ పగటులు యెంత చూపేవే

చ. 2: పొట్టఁబొరుగున నుండి బొమ్మల జంకించుకొంటా
ఇట్టె బీరాన నెంత యెలయించేవే
చుట్టుకొన్న వలపుల సుద్దులు దలఁచుకోవు
చుట్టరికాలనే యెంత సూడువట్టేవే

చ. 3: సంగడివే కూచుండి చన్నుల నొరసుకొంటా
యెంగిలి మోవినే యెంత యింపురేఁచేవే
చెంగటనే నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
ముంగిట నీ యాస లెన్ని మొలవఁ బెట్టేవే

రేకు: 1987-5 కేదారగౌళ సం: 29-461

పల్లవి: తప్పు లెంచ నే నిన్నుఁ దరుణీ
యిప్పుడే చెప్పితిఁ జుమ్మీ యింతిరో నీకు

చ. 1: గంద మిచ్చి రావే చెలి కాంతునికి
నింద లేమి వచ్చునో నే నోపనమ్మా
అందియ్యవే విడెము నీ వాతనికి, నీ పతి
చెంది తమ్ము వెట్టితే నేమందువో నీవు

చ. 2: కమ్మి వేళ చూచి రావే కలికీ
నెమ్మి నాతో నవ్వు నేమో నే నోపనమ్మా
రమ్మని పిలువవే దూరక చేయివట్టి
అమ్మరో మేను సోఁకు నేమందువో నీవు

చ. 3: ఆముక యెదురుకోవే అదె వచ్చిని
నీమారు న న్నంటునేమో నే నోపనమ్మా
దోమటి శ్రీవేంకటేశుతోఁ గూడి రావే
ఆమఱఁగున నుండి యేమందువో నీవు

రేకు: 1987-6 ఆహిరినాట సం: 29-462

పల్లవి: నా మేలువాఁడై యాతఁడు నావద్దనే వున్నవాడు
యీ మతకములు మరి యిఁక నీకుఁ దగునే

చ. 1: ఆసలు రేఁచుకొంటా నాకెకు నీతనికిని
రాసికెక్క నే మాడేవే రాయబారాలు
సేసవెట్టిననాపతిఁ జేరి నే నెఱఁగకుండా
మూసి దాఁచి పొందుసేయ మన్నేడ నేర్చితివే

చ. 2: సన్నలు సేసుకొంటా నారె సారె నిద్దరికి
యెన్నిమారు లందించేవే యెడమాఁటలు
పన్నుక నా కాఁగిటిలో పాయకుండిన యీతని
వన్నెల నెలయించ నే వంకఁ గలిగితివే

చ. 3: కడనుండి నవ్వుకొంటా గలపే వొకరొకరిఁ
దడవక మానవే నీ తాపితనాలు
యెడయక శ్రీవేంకటేశుఁడు నన్నేలినాఁడు
అడరి నా కితవరివ య్యెట్టు వచ్చితివే

రేకు: 1988-1 రామక్రియ సం: 29-463

పల్లవి: లాలించి కూడఁగరాదా లలన కడుఁగోమలి
పాలించితి వికనేల పచ్చిసేసేవు

చ. 1: వెన్నెలబాయట నాపె విన్నపాలు సేయఁగానే
చన్నులేట టిసికేవు సారె సారెకు
కన్నుల జంకించి యట్టె కాళ్లకు మొక్కరాఁగానే
నున్నఁగా మాఁటిడి మొలనూ లేల పట్టేవు

చ. 2: చేవల్లకు వచ్చి యాపె చేరి విడె మియ్యఁగానే
మోవి యేల యానేవు ముందుగా నీవు
పూవులను వేసి నిన్ను పూఁచి చెక్కు నొక్కఁగానే
కావరించుకొంటా నేల కాఁగిలించేవు

చ. 3: జమళిఁ గూడి నీ కాపె సరిఁ గత చెప్పఁగానే
తమలము వెట్టి యంత తమి రేఁచేవు
ఆమర శ్రీవేంకటేశ యలమేల్మంగ ననఁగా
సమరతి నింతయేల సాము సేసేవు

రేకు: 1988-2 పాడి సం: 29-464

పల్లవి: ఎన్నఁడు నేరిచితివో ఇంతేసి కతలు
నిన్న మొన్నటి దానవు ని న్నెంచి చూచితేను

చ. 1: సడఁగులు చల్లి చల్లి చట్రాత నా రొలిచేవు
తడయక సిగ్గులనే దడి గట్టేవు
అడఁకువ నయాల బయలు పందిలి వెట్టేవు
బడినుండి రమణునిఁ బనిగొనఁ గలవే

చ. 2: యెలయింపు మాఁటలనే ఇసుకఁ దాడు వేఁడేవే
సొలపుఁజూపులనే సొక్కు చల్లేవు
సెలవుల నవ్వులనే జిగురుఁగండె లోడ్డేవు
యెలమి నీ విన్నిటాను యీడేరుఁగలవే

చ. 3: కతకారి తనాలనే గాలి మూటగట్టేవు
రతి యొయిలులేనివాన రప్పించేవు
యితఁడు శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
చతురత నీవూఁ గొత సాదించఁగలవే

రేకు: 1988-3 సౌరాష్ట్రం సం: 29-465

పల్లవి: మమ్ము నేమి యడిగేవు మాపుదాఁకాను
చిమ్మిరేఁగె సంతోసాలు చిత్తగించవయ్యా

చ. 1: మచ్చికలు చెలియాడే మంతనాలలో నున్నవి
ముచ్చటలు తేనెగారే మోవి నున్నవి
కచ్చుకొన్న వేడుకలు కనుచూపులో నున్నవి
విచ్చన విడిగా నీవు విచారించుకోవయ్యా

చ. 2: చిడుముడి కోరికలు చెక్కు చేతిలో నన్నవి
అడియాసలు జాగరాలం దున్నవి
గుడి గొన్న సిగ్గులు గుబ్బలపై నున్నవి
తడఁబడక నీలోనే తలఁచుకోవయ్యా

చ. 3: నాటుకొన్న సరసాలు నగవులలో నున్నవి
గాఁటపుఁ గళలెల్లా మొగాన నున్నవి
యీటుతో శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
తేటల నీ వేలితివి తెలుసుకోవయ్యా

రేకు: 1988-4 దేసాళం సం: 29-466

పల్లవి: నా మాఁటలోనివాఁడవు నమ్మినదానను నేను
చేముంచి నా సేవలెల్లాఁ జిత్తగించవయ్యా

చ. 1: చుట్టపు వరుస నిన్ను సొలసితి నింతేకాక
యెట్టు సేసినా నేరా లెంచేనా నేను
నెట్టుకొన్న వలపుల నీ దిక్కు చూచితిఁగాక
చుట్టి నీ మై గురుతులు సోదించేనా

చ. 2: మంచితనమున నీ మర్మము లంటితిఁగాక
చంచుల నిన్నుఁ జెనకి సాదించేనా
కొంచక సంతోసాన గొబ్బున నవ్వితిఁగాక
నించి యెగసక్కెలెల్లా నీయందుఁ జేసేనా

చ. 3: చెలిమికత్తైనై నీ చెరఁగు వట్టితిఁగాక
బలుములు సేసి నీతోఁ బచారించేనా
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మలసి నన్నేలితివి మాఁట మీరేనా

రేకు: 1988-5 ముఖారి సం: 29-467

పల్లవి: ఇన్నిటా వేడుకకాఁడు యేమి సేసినాఁ జెల్లును
యెన్నికాయ దన సుద్దులేల సిగ్గువడీనే

చ. 1: కూరిమితోఁ జూతుఁగాని కోపగించఁజాలనే
గారవింతుఁగాని యలుగఁగఁగాని
సారెఁ బొందుసేతుఁగాని జంకించఁజాలనే
యీరీతి నా గుణ మిదియేల సిగ్గువడీనే

చ. 2: మంచిమాఁ టాడుదుఁగాని మరి వెంగే లాడెనే
కొంచక నవ్వుదుఁగాని గుంపించఁజాలనే
వంచించి మొక్కుదుఁగాని వడి నొడ్డారించనే
యెంచితే నా కత లివి యేల సిగ్గువడీనే

చ. 3: చుట్టమనై వుందుఁగాని సూడుఁబాడు బట్టనే
మెట్టి సేవసేతుఁగాని మేర మీరనే
పట్ట పలమేలు మంగపతి శ్రీవేంకటేశుఁడు
యిట్టె నన్నేలినాఁడు యేల సిగ్గువడీనే

రేకు: 1988-6 బౌళి సం: 29-468

పల్లవి: ఇంకా నేమి సేసీనో ఇది నీ కెంత ప్రియమో
పొందకముగాఁ జూచి చూచి పొగడేము నేము

చ. 1: గుత్తపు గుబ్బల నొత్తి గోరు చెక్కుపైఁ బెట్టి
చిత్తమురా నీకు సేవ సేసెఁగా తొల్లె
తత్తరాన నిందుమీఁద తన మోవి తేనె యిచ్చి
బత్తు లెల్లాఁ జూపెగా నీ పై నీపె నేఁడు

చ. 2: మేడలోనఁ గాలు దొక్కి మెడదండ నీపై వేసి
జోడుగా జుట్టరికాలు చూపెఁగా తొల్లె
వేడుకతో నప్పటిని వెంటికలు దాఁక మొక్కి
కూడి పొత్తు గలపెఁగా కోరి నీతో నిపుడు

చ. 3: తొడమీఁదఁ గూచుండి దొమ్మినిఁ గాలు దాఁకించి
చిదుముడిఁ జేఁతలెల్లాఁ జెసెఁగా తొల్లె
అడరి శ్రీవేంకటేశ యలమేలుమంగను నేను
తడవి నన్నేలితివి తా మెచ్చెఁగా ఇందుకు

రేకు: 1989-1 ఆహిరి సం: 29-469

పల్లవి: విన్నపము లాలకించి వినవయ్యా
యెన్నికఁగా నీకె పొందు నేడేరించవయ్యా

చ. 1: తలఁచు నెప్పుడు నిన్నుఁ దమకించు రతులకు
పిలుచు మచ్చికతోడఁ బేరుకొని
చెలులతో నీ సుద్దులు చెప్పుకొను బలుమారు
కలికి చందము లివి కరుణించవయ్యా

చ. 2: నిక్కి నిక్కి చూచును నీ రాకలో కోరు
మొక్కు నివున్న దిక్కుకు మొగమై యుండి
అక్కున నదుముకొను నట్టె నీ వుంగరము
గక్కన నింతి నింతట గారవించవయ్యా

చ. 3: నీ రూపు పటాన వ్రాసు నివ్వెరగుతో నిలుచు
సారె నీ మోవి తేనెకు నోరూరును
యీరీతి శ్రీవేంకటేశ యీక యలమేలుమంగ
కూరిమి నేలితివి మక్కువఁ బాయకవయ్యా

రేకు: 1989-2 శ్రీరాగం సం: 29-470

పల్లవి: ఏమందు నే నిఁక యీతనితోను
కామించి నాకుఁగానే కాచుకవున్నాఁడే

చ. 1: పొట్టఁ బొరుగున నుండి పువ్వుల చెండున వేసి
చుట్టపు మాఁటలాడీ సోరణగండ్ల
యిట్టె సిగ్గుతోడ నే నివ్వలిమోమైతేను
పట్టి చమ్మనఁగోవుల పన్నీరు చిమ్మీనే

చ. 2: మునిముంగిటికి వచ్చి ముచ్చట నవ్వులు నవ్వి
తనుఁదానే పాటవాడీ తలపుదండ
పొనిగి గడె దెరచి బుద్ధులు నేఁ జెప్పితేను
పనిగలవానివలె బాగా లిచ్చీనే

చ. 3: వుయ్యాలమంచ మెక్కి వూచుమని కాఁగిలించి
యియ్యెడఁ జెలఁగీ నట్టింటిలోనను
పయ్యాడి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
వొయ్యనే రతుల న న్నోలలారిచీనే

రేకు: 1989-3 సామంతం సం: 29-471

పల్లవి: ఎంత భాగ్యవంతుఁడవో యిన్నియును నొనగూడె
మంతనాన నీకె నిట్టె మన్నించవయ్యా

చ. 1: చెలిమి చేటఁడు చల్లె చెలియ నీమీఁదను
కలికితనాలు నీకు గంపలఁ బెట్టె
వలపులు నీ యెదుట వాములుగాఁ గూడ పెట్టె
యెలమి నీ కోరికె లేడేరెనయ్యా

చ. 2: నగవులు మూఁట గట్టె నలినాక్షి నిన్నుఁ జూచి
పగట్టుఁ జేఁతులు నీకు బండ్లఁ బెట్టె
మొగమిచ్చు లెల్లా నీ ముందరి దొంతి వేరిచె
తగులాయములు నీకు దలకూడెనయ్యా

చ. 3: వాపులు గాదెఁ బోసె వనిత నీ పొందుసేసె
మోవి సన్నలు నీమీఁద మోపు గట్టెను
యీవేళ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
దేవులాయ నీ వేడుక తిరమాయనయ్యా

రేకు: 1989-4 రామక్రియ సం: 29-472

పల్లవి: చూచి చూచి నాకైతే సోద్యమయ్యీని
యీ చేఁతలెల్లా మీకు నిద్దరికే చెల్లును

చ. 1: సారె సారె నాపె నీపై సణఁగులు చల్లఁగాను
వోరుచుక యెట్టున్నావో వోయమ్మ నీవు
బీరాన నప్పటి నీతో పెనుఁబంతా లాడఁగాను
యీరీతి నేమీ ననవు యెంత మొగమోటమో

చ. 2: వెడ వెడగా నిన్ను వెక్కసాన సాదించఁగా
వొడఁబాటు లెట్టాయనో వోయమ్మ నీకు
జడియక నీమీఁద జంకెనలు చూపఁగాను
యెడనెల నవ్వు నవ్వే వేఁటి చుట్టరికమో

చ. 3: పెక్కుమారు లింతసేసి ప్రియములు చెప్పఁగాను
వొక్కటైతి వే గుణమో వోయమ్మ నీది
ఇక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యిక్కడి కాపెఁ దెచ్చేవు యెంత జాణతనమో

రేకు: 1989-5 వరాళి సం: 29-473

పల్లవి: ఇన్నింటికి సెలవుగా నిదిగో నీకు మొక్కేను
మన్నించి సాపై కరుణ మఱవకువయ్యా

చ. 1: కలికితనాల నిన్ను కడుఁగడుఁ గొసరితి
కలకల నవ్వి నవ్వి కరఁగించితి
మొలక చన్నుల నొత్తి మొగమోడించితి నిన్ను
యెలమి నా వుద్దండాలు యెన్నిలేవయ్యా

చ. 2: సారెకు వలపు చల్లి చనవు సాదించితి
కూరిమిగొసరి నిన్ను గుంపించితి
పేరుకొని నా యెంగిలి పెద్దవులఁ బిలిచితి
యీరీతి నా తమకము యేమి చెప్పేనయ్యా

చ. 3: చక్కదనములు చూచి సరసము లాడితి
పెక్కులాగుల రతులఁ బెనఁగితి
యిక్కువలంటి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
యిక్కడ నా కోరికలు యీడేరెనయ్యా

రేకు: 1989-6 సాళంగనాట సం: 29-474

పల్లవి: ఇందరు నెరిఁగినవి యీ పనులు
పొందులెల్లా నీడేరె బోగించఁగదవే

చ. 1: కొనచూపుల నవిగో కొసరులు
వొనరె ముక్కున నసురుసురులు
మునుకొనెఁ జెమటల ముసురులు
తనిసి రతి చిన్నలు దాఁచ నీఁకనేఁటికే

చ. 2: మోవిపై నవె నవ్వుల మొరఁగులు
కావరపు మనసులో కరఁగులు
తేవలఁ గొప్పు జారిన తెరఁగులు
చేవఁదేరెఁ బను లిఁక సిగ్గువడనేఁటికే

చ. 3: గుబ్బలపై నిండె నవె గుఱుతులు
గుబ్బి పచ్చి మాఁటల కళితలు
గొబ్బున శ్రీవేంకటేశు కూటములు
అబ్బె నీకు యీచేఁత లడఁచఁగనేఁటికే ఇంద

రేకు: 1990-1 నాదరామక్రియ సం: 29-475

పల్లవి: తానే వచ్చీఁగాని తడవకువే పతిని
చేనంటి మునుపే నాకు సేస వెట్టినాఁడు

చ. 1: తలఁపులకొలఁదివే తగులాయాలు
వలచినకొలఁదివే వాడికలు
పిలుపులకొలఁదివే ప్రియములు
బలిమి సేయఁగఁ బోతే పచ్చిదేరుఁ బనులు

చ. 2: ఆడినకొలఁదివే యాస మాఁటలు
కూడినకొలఁదివే కూటములు
వేడుకకొలఁదివే వినోదాలు
వాడుకొనఁబోతేను వసగావు పనులు

చ. 3: ననిచినకొలఁదివే నగవులు
యెనసినకొలఁదివే యింపు సొంపులు
చెనకి నన్నేలినాఁడు శ్రీవేంకటేశుఁడు
పెనఁగఁగఁబోతేను పెచ్చురేఁగుఁ బనులు

రేకు:	1990-2 ముఖారి సం:	29-476

పల్లవి:	నిన్నుఁ జెప్పి చూపితేను నెరజాణ విన్నిటాను
	నన్ను నెన్నిచందాల నిమ్మించేవయ్యా

చ. 1:	మొలకచన్నులదాన మోవితేనెలదాన
	నలిరేఁగి నాతో నేమి నవ్వేవయ్యా
	చిలుకుఁజూపులదాన సిగ్గరితనాలదాన
	పలుమారు నెంత వొడఁబరచేవయ్యా

చ. 2:	కొంచెపు నదిమిదాన కోమలపు మేనిదాన
	పొంచి పొంచి యింతయేల పొదిగేవయ్యా
	అంచ నడపులదాన అన్నువ పాదాలదాన
	వంచనతో మొక్కే నేల వలపించేవయ్యా

చ. 3:	కొడిదేఁడు మోముదాన కోవిల యెలుఁగుదాన
	చిడుముడి నెందాఁకాఁ జెనకేవయ్యా
	యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
	కడుమేలుదాన నెన్ని కతలు చెప్పేవయ్యా

రేకు: 1990-3 పాడి సం: 29-477

పల్లవి: కాతరపుదాన నేను ఘనుఁడు తాను
ఘాతలు నింత కోపితే కరుణిచుమనవే

చ. 1: కొప్పువట్టి తియ్యరాదు కొనగోర నూఁదరాదు
చెప్పి తన పొందు లెట్టు సేయుమనీనే
ముప్పిఁ దిట్టఁగరాదు మోవి గంటిసేయరాదు
అప్పటి సరసమెట్లాడు మనీనే

చ. 2: తమ్ములను వెట్టరాదు తతిఁగాలు వేయరాదు
నమ్మించి తనతో నెట్టు నవ్వుమనీనే
కిమ్ముల రా కొట్టరాదు కిందు పరచఁగరాదు
కమ్మటి తన మేనెట్లు కాఁగిలించుమనీనే

చ. 3: చేముట్టి చెనకరాదు చేరి పనిగొనరాదు
ఆముకొని యెట్టు పెండ్లాడుమనీనే
యీామేర శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
కామించి తనకు నెట్టు కత చెప్పుమనీనే

రేకు: 1990-4 శ్రీరాగం సం: 29-478

పల్లవి: ఎంచితే నొకటి కొక టెక్కుడాయ సింగారము
మించిన యీపె వొరపు మిక్కిలి సింగారము

చ. 1: చెలివదనమునకు చిరునవ్వు సింగారము
పలువరుసకు ముద్దుఁబలుకు సింగారము
కలికి కన్నులకు చింక చూపులు సింగారము
నిలువు దారుమునకు నెరులు సింగారము

చ. 2: గరిమ మొగమునకు కళలు సింగారము
పురమునకు చన్నుల వుద్దుటు సింగారము
సరుస బొమ్మలకును జంకెనలు సింగారము
సిరి దొలఁకు మేనికి సిగ్గులు సింగారము

చ. 3: పెనుఁ బిరుఁదుకు మురిపెములు సింగారము
వొనరిన 2 వేతులకు వొయ్యారాలు సింగారము
ననిచి శ్రీవేంకటేశునకు నీకు దేవులాయ
పెనగొన్నరతు లివి పెండ్లి సింగారము

రేకు: 1990-5 రామక్రియ సం: 29-479

పల్లవి: చూడఁ బిన్నవాఁడు గాని సుద్దులెన్తైనాఁ గలవు
వీడుదోడైన దేవళ విట్ఠలేశుఁ డితఁడు

చ. 1: పిల్లఁగోవి రాగాలు బెరియించి గొల్లెతల –
పుల్లములు గరఁగించీ నుబ్బులు రేఁచి
పల్లదాన వెన్నెల బయట యమునలోన
వెల్లవిరిఁ గూడిన యావిట్ఠలేశుఁ డితఁడు

చ. 2: కొలనిలో నీళ్లాడే కొమ్మలను వలపించి
చెలఁగి మానాలు చూచి చీరలిచ్చి
కొలఁదిమీర వారి కోరిక లేడేరఁజేసి
వెలసి యుండిన యా విట్ఠలేశుఁ డితఁడు

చ. 3: వోడక మధురలో నువిదచే గందమంది
యీడులేని తన మహిమెల్లాఁ జూపి
జాడతో శ్రీవేంకటాద్రి శైలముపై నిలుచుండి
వేడుకకాఁడైన యావిట్ఠలేశుఁ డితఁడు

రేకు: 1990-6 దేసాళం సం: 29-480

పల్లవి: మొక్కరమ్మ చెలులాల మోమనాకారుఁడు వీఁడె
వెక్క సపుచేఁతల శ్రీవేంకటేశుఁడు

చ. 1: సంతోసాన నాదె పెండ్లి చవికెలోఁ గూచున్నాఁడు
మంతనము లాదు కొంటా మగువలతో
పొంతనే సరసాలాడీ భూపతి చెరువు దండ
వింత సింగారాలతో శ్రీవేంకటేశుఁడు

చ. 2: జోడైన రత్నాల సొమ్ముల వెట్టుకున్నాఁడు
వాదికైన వూడిగపువారితోఁ గూడి
వీడెములు సేసుకొంటా విక విక నవ్వుకొంటా
వేడుకకాఁడైనాఁడు శ్రీవేంకటేశుఁడు

చ. 3: తలకొన్న కమ్మఁ బూవు దండలతో నున్నవాడు
లలిఁ బూసిన పరిమళాలు మించుగా
పలురతుల దనిసి బాగుగా దేవుళ్ళుఁ దాను
విలసిల్లీ నిదిగో శ్రీవేంకటేశుఁడు

రేకు: 1991-1 రామక్రియ సం: 29-481

పల్లవి: అల్లవాఁడె గద్దెమీఁద నంగనలు గొలవఁగా
వుల్లాసముతో నవ్వీని ఉద్దగిరి కృష్ణుఁడు

చ. 1: పచ్చఁబట్టు దట్టివాఁడు బాలకృష్ణుఁడు
పచ్చి దేరే పెదవుల బాలకృష్ణుఁడు
బచ్చన చక్రముచేతి బాలకృష్ణుఁడు
పచ్చారి వలపులనే బాలకృష్ణుఁడు

చ. 2: బలురోలఁ గట్టువడె బాలకృష్ణుఁడు
బలిమి మద్దుల దోసె బాలకృష్ణుఁడు
పలు గోపికలఁ గూడె బాలకృష్ణుఁడు
బలరాము తమ్ముఁడు బాలకృష్ణుఁడు

చ. 3: పట్టినాఁడు వెన్నముద్ద బాలకృష్ణుఁడు
పట్టుఁగొమ్ము సురలకు బాలకృష్ణుఁడు
బట్ట బయట మెరసే బాలకృష్ణుఁడు
పట్టపు శ్రీవేంకటాద్రి బాలకృష్ణుఁడు

రేకు:	1991-2 పాడి	సం:	29-482

పల్లవి:	ఏఁటికి సిగ్గులువడే వింతలోనే నన్నుఁ జూచి
చాటువ నా నీతనితో సరసము లాడవే

చ. 1:	చనవుగలదానికి సాదించవచ్చును
ననుపుగలదానికి నవ్వవచ్చును
వినయపుదానికి వేవేలు నాడవచ్చు
చెనకి పతిముందర చేఁతలు నెరపవే

చ. 2:	బలిమిగలదానికి పంతము నెరపవచ్చు
కొలువుదానికిఁ గడు గొసరవచ్చు
వలపుగలదానికి వాడిక మెరయవచ్చు
పలుమారు విభునికి బత్తిసేయవే

చ. 3:	ఆసలగలదానికి ఆయము లంటఁగవచ్చు
వేసాలదానికి వేఁడుకోవచ్చు
యీసరి శ్రీవేంకటేశుఁ డేలినాఁడు నన్ను నేఁడు
సేసవెట్టి నీవు గొంత చెలిమిసేసుకోవే

రేకు: 1991-3 ముఖారి సం: 29-483

పల్లవి: ఎంతలేదు నీ యాసోద మేమి చెప్పేది
వింత వింత రతులనే వినోదించేవు

చ. 1: యెడమాఁటలాడేటి ఇంతితో సారెసారెకు
తడవి తడివి జాణతనా లాడేవు
కడనుండి వేరొకతె కానుకియ్య వచ్చితేను
నడుమ నూరకె నీవు నవ్వునవ్వేవు

చ. 2: పేరటమువచ్చి నాపె పెండ్లిపాట వాఁడగాను
కూరిమి గొసరి యేల కొంగువట్టేవు
నేరుపుతోడ నొకతే నీవేడుక చూడఁగాను
పోరచి వలపు చల్లి పువ్వుల వేసేవు

చ. 3: సాకిరై వచ్చినయట్టి సతి వద్ద నుండఁగాను
మేపులకు సాపెతోను మేలమాడేవు
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
పై కొసరువారి కేల బాఁతిపడేవు

రేకు: 1991-4 సామంతం సం: 29-484

పల్లవి: ఎన్నఁడూ నెరఁగము ఇటువంటి కొత్తలు
ఇన్నిటా నీ కీపె పొందు లెట్లబ్బెనయ్య

చ. 1: కరఁగి కరఁగి సారె కాంత నీతో మాఁటలాడీ
యెరవో సతమో యీకె యెవ్వతెయ్యా
కెరలి కెరలి లోలో కిల కిల నవ్వు నవ్వీ
తెరలోని కెందుండి తెచ్చుకొంటివయ్యా

చ. 2: తగిలి తగిలి నీకుఁ దమకము రేఁచీని
చిగురో చేఁగో యీపెఁ జెప్పవయ్యా
మొగమెత్తి మొగమెత్తి మోవి నీకుఁ జూపీని
సొగిసి నీ కెన్నాళ్ల చుట్టరికమయ్యా

చ. 3: వీడె మిచ్చి వీడె మిచ్చి వేఁడుకొనీ జెక్కు నొక్కి
వేడుకో వాడికో యీపె విధ మేదయ్యా
యీడనే శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
వాడలో నీ వీకె నెట్లా వలపించితివయ్యా

రేకు: 1991-5 శ్రీరాగం సం: 29-485

పల్లవి: ఎంతని చెప్పే మింక ఇంతి నీపైఁ గల బత్తి
పొంత నీ చక్కఁదనాలు పూఁచి పూఁచి వాసును

చ. 1: తరుణి నీతో పొందు తలఁచుక తలఁచుక
గరివతో నాడుకొను కాంతలతోను
సొరిది నీ గురుతులు చూచుకొని
వెరగంది పలుమారు వేడుకతో నవ్వును

చ. 2: జలజాక్షి నీ గుణాలు సరిఁ బొగడి పొగడి
చెలరేఁగి మేనెల్లాఁ జెమరించును
యెలమి నీ మన్ననలు యెంచుకొని యెంచుకొని
నిలువుఁ బులకలతో నిట్టూరుపు నించును

చ. 3: కొమ్మ నీపై వలపుల గబ్బితిలి గుబ్బితిలి
ఇమ్ముల నీకుఁ జేతులెత్తి మొక్కును
నెమ్మది శ్రీవేంకటేశ నీవు వచ్చి కూడితివి
కమ్మి యీకె సంతోసాన గడు నోలలాడను

రేకు: 1991-6 పాడి సం: 29-486

పల్లవి: చుట్టపు వరుస నన్నీ సుదతి సింగారమాయ
దట్టమై యొకటి కొకటి దాపులాయఁగదవే

చ. 1: తొలుతనే సతి మోవి దొండపండై యుండఁగాను
పలుకుఁ జిలుక అందు పరఁగుఁగదే
తళుకుఁ గన్నులు మంచి తామరలై వుండఁగాను
అలరు నెరిఁ దుమ్మిద లమరుఁగదే

చ. 2: సరసనే నెమ్మోము చెందురుఁడై వుండఁగాను
గరిమ నవ్వు వెన్నెలఁ గాయు గదవే
గురు కుచములు పెద్దకొండలై వుండఁగాను
సిరుల నడు మనేటి సింహము చేరుగదే

చ. 3: కడలేని యీకె మేను కనకమై వుండఁగాను
వుడివోని మించు వన్నె లుండుఁగదవే
జడియక పిరుఁ దిది చక్రమై వుండఁగాను
బడి శ్రీవేంకటేశుఁడు పట్టుకండుఁగదవే

రేకు: 1992-1 గౌళ సం: 29-487

పల్లవి: అందుకే సంతోసమాయ నన్నిటా నాకు
కందువ నిట్టె మమ్ముఁ గరుణించవయ్యా

చ. 1: యెచ్చటనుండి నీవు యేమేమి సేసినాను
వచ్చితివిగా నేఁడు మా వాకిటికిని
విచ్చనవిడిని నీవు వేడుకకాఁడవై వున్నా
మచ్చికతోఁ గూచుండి మాఁటలాడితివిగా

చ. 2: కామించి నీ వెన్నెన్ని కతలఁ బొరలినాను
నామోము చూచి ఇట్టె నవ్వితిగా
వేమరు నీ చేతలు వెల్లవిరులైనాను
ఆముకొని కాఁగిలించి యాదరించితివిగా

చ. 3: ఆసలఁ జొక్కి నీ వెంత ఆయములు గరఁగినా
సేసలెట్టి పెండ్లాడి చేకొంటివిగా
నీ సుద్ది శ్రీవేంకటేశ నిండుకొని వుండినాను
వాసితో నన్నేలి నావాఁడవైతివిగా

రేకు: 1992-2 సామంతం సం: 29-488

పల్లవి: ఒక్కచోటనే వున్నారు వొద్దికై మీ రిద్దరును
అక్కజపు రతి నోలలాడుదురుగాక

చ. 1: వలపులు దల కెక్కె వావులు కాలు దొక్కె
చెలియరో పతితోడ సిగ్గు లింకేలే
సెలవుల నవ్వు దేరె చెమటలు మేనఁ గారె
పలుమారు జాగులు పచారించ నేఁటికే

చ. 2: చిగురుఁ గెమ్మోని మాఁగె చిత్తపు టాసలు రేఁగె
బిగియుచు గుట్టుతోడఁ బెనఁగనేలే
మొగమున వసివాడె మోహములు దలకూడె
తగులాయములు లోలో దాఁచ నేఁటికే

చ. 3: కనుచూపు వాడికాయ కాఁగిలిట్టె వేడికాయ
మొనగోరి చెనకులమోనములేలే
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్ను నేఁడు
చనవరి మొక్కులతో సన్నలు మరేఁటికే

రేకు: 1992-3 దేసాళం సం: 29-489

పల్లవి: ఎదుటనే వుండఁగానే యెడమాఁట లేమిటికే
కదిసి పెనఁగులాడే కలయికలే మేలే

చ. 1: మచ్చికలు నెరపితే మనసు లేకము లౌను
ఇచ్చకము తెచ్చితేనే యింపులు వుట్టు
ముచ్చటలు గలసితే ముదురు నడియాసలు
మెచ్చులుగా బతితోడి మేలములే మేలే

చ. 2: నగవు లుప్పతిలితే ననుపులు సమకూడు
మొగమాట గలిగితే మొనయు దమి
తగులాయా లొనరితే దట్టమౌను వలపులు
మగవానితో మంచిమాటలే మేలే

చ. 3: చూపులు తారసించే సొంపులు మిక్కుటమౌను
కాఁపురాలు దొరకితే గట్టియౌఁ బొందు
పైపై నీమీఁది బత్తిఁ బాయక నన్నేలినాఁడు
చేపట్టి శ్రీవేంకటేశు సేవలే మేలే

రేకు: 1992-4 ఆహిరి సం: 29-490

పల్లవి: చెలయ మంచిగుణాలు చిత్తమునఁ బట్టెనా
వెలయ నిన్నియు విన్నవించితి నే నీకు

చ. 1: మొగము చూచి నీతో ముచ్చటలే యాడుఁగాని
యెగసక్కే లాడనేర దెంతైనా సతి
నగుతాను వద్దనుండి ననుపే నడపుఁగాని
వెగటులు చూపి మోపి వేసరించఁ జాలదు

చ. 2: మంతనాన సేవసేసి మచ్చిక నెరపుఁగాని
పంతములు నీ ముందర బచారించదు
సంతోసాన మోవి చూపి చవులు గొలుపుఁగాని
వింత సేసుకొని నిన్ను వెంగన సాదించదు

చ. 3: కందువకు నిన్నుఁ దీసె కాఁగిలించుకొనుఁగాని
మందెమేళమున నీకు మట్టుమీరదు
ఇందుకే శ్రీవేంకటేశ యీకె నిట్టె యేలితివి
సందడి నీ రతులకు జవదాటదు

రేకు: 1992-5 దేసాళం సం: 29-491

పల్లవి: వేగమే యానతీవమ్మా విన వేడుకయ్యీ నాకు
యీగతి నున్నవి నీ ఇంగితాకారములు

చ. 1: కాంతునిమ్మై గురుతులు కంటివో యేమ్మైనాను
చెంతనుండి నవ్వేవు చిరునవ్వులు
వింత సుద్దు లేమ్మైనా వింటివో యాతనిమీఁద
ఇంతలోనే చెలులతో నేకాంతా లాడేవు

చ. 2: చేతికి నంగముచ్చాలు చిక్కెనో నీకేమ్మైనా
కాతరాన సొలసేవు కమ్మటి నీవు
నీ తలపున నేమ్మైనా నెపములు వారెనో
పోతరించి లోలోఁ దలపోసుకోనేవు

చ. 3: నిక్కముగా నాతని నిజము దెలిసితివో
గక్కన శ్రీవేంకటేశు గాఁగిలించేవు
ఇక్కువలు గరఁగి నీ యెన్నిక లీడేరెనో
వుక్కుమీరి కలలెల్లా నుప్పతిలీ నీకును

రేకు: 1992-6 వరాళి సం: 29-492

పల్లవి: కాదని తొలఁగరాదు కైకొని మెలఁగరాదు
యీదెస నాతని చిత్త మెట్టుండునో

చ. 1: వొత్తి మాఁటలాడితేను వొకటొకటె తోఁచును
మత్తిలి నవ్వు నవ్వితే మందెమేళమౌ
బత్తి సేయఁగా జేయఁగా పైపై మొగచాటౌను
ఇత్తల పతితోఁ బొందు లెటువలె జేతునే

చ. 2: సారె సరస మాడఁగా చలములు మీరి వచ్చు
చేరి చేరి చూడఁగాను సిగ్గులు నిండు
మేరమీరి కొసరఁగా మిక్కిలి వేసటలౌను
నేరుపులు వచరించ నే నెట్టు నేరుతునే

చ. 3: చెనకి కాఁగిలించితే చిత్తము నీరై కరఁగు
పెనఁగితే తమకములు పెచ్చు వెరుగు
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేఁడు
పను లీతనివి యెంత పచారించవచ్చునే

రేకు: 1993-1 శంకరాభరణం సం: 29-493

పల్లవి: తానే వచ్చి నాతఁడు తడవకురే మీరు
తానకమై నా కోరిక తగుల కేలుదునే

చ. 1: వలచిన కొలఁదినే వాడికలు సమకూడు
తలఁచినకొలఁదినే తమి రేఁగును
పలికినకొలఁదినే పంతములు నీడేరు
కలది గలంతేకాక కడమ లే లవునే

చ. 2: నగినకొలఁదినే నాఁటుకొనుఁ బ్రియములు
సొగిసినకొలఁదినే చుట్టరికము
మొగమిచ్చుకొలఁదినే మొనయు సరసములు
తగులైనకూటములు తతులేల దాఁటునే

చ. 3: కూడినకొలఁదినే కూరిములు కొనసాగు
యీడైనకొలఁదినే ఇంపులు వుట్టు
వేడుకతో న న్నిట్టె శ్రీవేంకటేశుఁ డేలినాఁడు
వీడని జంటలు యెట్లు విచ్చి చెప్పవచ్చునే

రేకు: 1993-2 పాడి సం: 29-494

పల్లవి: పతివద్ద గూచుండవే బాగాలు చేతి కియ్యవే
తతి గొన్న నీ వలపు దాఁచిపెట్టవచ్చునా

చ. 1: వొగ్గి మాఁట లాడితేనే వొడఁబాటై వుండుఁగాక
దగ్గర కల్లంతనుంటే తమి వుట్టీనా
యెగ్గులేని చుట్టరిక మెంచినట్టె వచ్చుఁగాక
సిగ్గులు వెగ్గళమైతే చిత్తము గరఁగునా

చ. 2: ననుపుగా నవ్వితేనే నమ్మికలై వుండుఁగాక
వొనరని సరసాలు వొద్దికయ్యీనా
మనసు వచ్చిన పొందు మచ్చికలు రేఁచుఁగాక
పెనఁగులాటలైయైతే ప్రియములు వుట్టీనా

చ. 3: యెరవుగాని కాఁగిలి ఇతవులై వుండుఁగాక
పొరపొచ్చపు రతులు పొసఁగుండీనా
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సిరులు మీ వేడుకలు చెప్పి చూపవచ్చునా

రేకు: 1993-3 గౌళ సం: 29-495

పల్లవి: ఇప్పటనుండియు నిన్ను ఇంతేసి దూరఁగనేల
చెప్పనేల నీవేమైనాఁ జేయవయ్య చేఁతలు

చ. 1: వెంగెము లాడినఁగాక వెరచేవా సతులకు
అంగము సోఁకినగాక అలసేవా
కొంగువట్టితేఁగాక కొసరుకు లోనయ్యేవా
చెంగట నేమైనా నీవు సేయవయ్యా చేఁతలు

చ. 2: కన్నులనుఁ దిట్టననుఁగాక కడుఁ గరఁగేవా
చన్నుల నొత్తినఁగాక సమ్మతించేవా
చిన్ని గో రూఁదినఁగాక చేతికి వసమయ్యేవా
చెన్నుమీర నేమైనాఁ జేయవయ్యా చేఁతలు

చ. 3: కాలు దొక్కితేఁగాక కాఁగిట నీవు గూడేవా
కేలు పైఁజాఁచిన గాక కిందుపడేవా
యీలీల శ్రీవేంకటేశ యేలితివి నను నేఁడు
చేల కొంగిచ్చి యేమైనఁ జేయవయ్య చేఁతలు

రేకు: 1993-4 దేసాళం సం: 29-496
పల్లవి: వింత వింత బాగులెల్లా వెలయ నీవల్ల గంటి
అంతరంగములు నీతో నానతియ్యవయ్యా
చ. 1: తలఁపునఁ బారెనో యే తరుణి నీకేమైనా
కలలోన వచ్చేనోకాక యేమైనా
పలుకున నాపేరు పక్కునఁ దొరలెనో
చెలఁగి నా మోము చూచి సిగ్గువడేవు
చ. 2: కన్నులఁ గన్నట్టాయనో కామించినయాపె చూపు
విన్నట్టె వుండెనో నీ కీవేళ నా మాఁట
చిన్ని మోవితేనెకు మచ్చికల నోరూరెనో
నన్నుఁ జూచి నిలువునే నవ్వుకొనేవు
చ. 3: కాఁగిట నిట్టె తోఁచెనో కడల మున్నిటిరతి
లోఁగిటనే వున్నదో పోలుచ నీపొందు
చేఁగదేరఁ గూడితివి శ్రీవేంకటేశ నన్ను
వీఁగక నావంక చూచి వెరగు నొందేవు

రేకు: 1993-5 రామక్రియ సం: 29-497

పల్లవి: చెప్పినట్టె నీ సేవ సేసేఁగాక
ఇప్పు డిందరిలోనా నేఁటి బాసలయ్యా

చ. 1: పచ్చిదేరెఁ బనులెల్లా పడఁతి నీవద్ద నదె
విచ్చనవిడాయ నిఁక వెరపులేదు
మచ్చికలు మేన నవె మరఁగున దాఁచరాదు
యెచ్చుకుందు లేదు యిఁక నేఁటి బాసలయ్యా

చ. 2: వెల్లవిరాయఁ జేఁతలు వీడె మిచ్చీ నాపె నీకు
తొల్లి నీ కోరినట్టాయ దొరకె మేలు
కల్లలెల్లా నిజమాయ కద్దులోలనఁగరాదు
యెల్లవారు గన్నపని కేఁటి బాసలయ్యా

చ. 3: పట్టిన పంతాము చెల్లె పారము లొత్తీ నాపె
చుట్టరిక మీడేరె సోదించనేల
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
యెట్టయిన మేలె యిఁక నేఁటి బాసలయ్యా

రేకు: 1993-6 సాళంగనాట సం: 29-498

పల్లవి: గుట్టుతో నుండటే మేలు కోమలులకు
చుట్టపు వరుసరతిఁ జొక్కించేనయ్యా

చ. 1: సరుసఁ గూచుండఁగాను చన్ను లొరసునో యేమో
సిరులు మించఁ గొలువు సేసేనయ్యా
మరలి చూడఁగానే మర్మములు సోఁకునేమో
వరుసతోడుత దలవంచుక మొక్కేనయ్యా

చ. 2: చేరి వీడె మియ్యఁగాను చెమట లంటునో యేమో
వూరకే వుయ్యాలమంచ మూఁచేనయ్యా
కోరి కొప్పు దువ్వఁగాను కొనగోరు దాఁకునేమో
నేరుపుతోఁ గుంచెవేసి నిలుచుండేనయ్యా

చ. 3: చేముట్టి పెనఁగఁగఁగాను చిత్తము గరఁగునేమో
దోమటి దొడికి కాలు దొక్కేనయ్యా
యీమేర శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
నాములెక్క నిఁక నీతో నవ్వేనయ్యా

రేకు: 1994-1 దేసాళం సం: 29-499

పల్లవి: ఆతనికి నీవు మేలు ఆతఁడు నీకు మేలు
చేతులెత్తి మొక్కి ఇట్టె సేవసేయవే

చ. 1: మనసు లెడసినాను మంచిమాఁటలె మేలు
ననుచకుండినాను వినయమే మేలు
పెనఁగులాడినాను ప్రేమపు నవ్వులే మేలు
అనిశము పతితోడ నాఁటదానికి

చ. 2: కోపము గలిగినాను కొసరుఁజూపులె మేలు
తోపు నూపుడైనా సంతోసాలే మేలు
రాఁపు లెక్కడైనా నూరకె వోరుచుటే మేలు
చేపట్టిన పతితోడ చెలియకును

చ. 3: వేవేలు నేరములైనా వేడుకతో నుంటే మేలు
కావరించు యొరసినా కాఁగిలే మేలు
భావించి నిన్నేలినాఁడు పట్టపుదేవులఁజేసి
శ్రీవేంకటపతి మేలు చేరీ మగువ నీకు

రేకు: 1994-2 ఆహిరి సం: 29-500

పల్లవి: వేసరకు చెలియా వేగమె వచ్చీ నాతఁడు
ఆసల దానే నిన్ను నాదరించీఁగాని

చ. 1: వెలవెట్టి కొంటే రాదు వేడుకైన వలపు
తలఁపు కొలఁదినే తగులుఁగాని
బలిమికి లోఁగాదు బాఁతియైన వలపు
చెలఁగి మంచిమాఁటల చేకూడుగాని

చ. 2: పట్టి తీసితే నబ్బదు బాగైన వలపు
చుట్టపు వరుసనే సొగియుఁగాని
బట్టబయటను లేదు పాదుకొన్న వలపు
దట్టపు వినయాలనే తలకొనుఁగాని

చ. 3: వొడిఁబెట్టితే నుండదు వుదుటైన వలపు
వుడివోని రతులనే వొద్దికౌఁగాని
యెడయక శ్రీవేంకటేశుఁ డిదె నిన్ను నేలె
విడువ కిట్ల నుంటే వినోదయౌఁగాని

రేకు: 1994-3 శ్రీరాగం సం: 29-501

పల్లవి: ఉల్లములో తలపోఁత నోలలాడుచున్నదాన
వెల్లవిరిగాఁ జెప్పవే వేడుకయ్యీఁ జెలియా

చ. 1: వచ్చునొకో ఆతఁడు నా వాకిటికి నెప్పుడైనా
మెచ్చునొకో నాతోను మేలము లాడి
యిచ్చునొకో చనవు నా కిందరిలో నా నేఁడు
హెచ్చెఁ గోరికలు నాలో నేముందునే చెలియా

చ. 2: కందునొకో యాతనిఁ గన్నులయెదుట నేను
విందునొకో మాఁటలు వీనులారను
పొందునోకో నాకాఁగిట బుజ్జగించి ఇట్టె తాను
సందడించీఁ దమకమెంచఁగరాదే చెలియా

చ. 3: యెక్కునొకొ నా సేవ లిన్నియును నాతనికి
చొక్కునొకొ నా రతుల సులభానను
దక్కునొకొ యనఁగానే తానె శ్రీవేంకటేశుఁడు
ఇక్కడికె విచ్చేసి యేలె నన్నుఁ జెలియా

రేకు: 1994-4 పాడి సం: 29-502

పల్లవి: వలచిన యాఁటదాని వద్దంటే దోసముగాదా
వెలేని మన్ననల వెలయించరాదా

చ. 1: సేసకొప్పువంచి మొక్కి చెలి యెదుట నున్నది
ఆసతోఁ గాఁగిట నించి యలమరాదా
రాసికెక్క ముత్యాల యారతి నీకు నెత్తీని
వాసి వన్నెతోడ నాపె వద్దఁబెట్టుకోరాదా

చ. 2: కంకణాల చేతులను కానుక నీకు నిచ్చీని
అంకెలను గారవించి యందుకోరాదా
సుంకుమోవ నవ్వు నవ్వి చుట్టరికాలు చూపీని
పొంకముగా నాపె తోడి పొందు సేయరాదా

చ. 3: వినయాన మోవితేనెవిందు నీకుఁ జెప్పీని
చెనకుచుఁ గాఁపురాలు సేయరాదా
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను నింతలోనె
మనిసిచ్చి యాపెతోడ మాఁటలాడరాదా

రేకు: 1994-5 భైరవి సం: 29-503

పల్లవి: నగి నగి మిక్కుటమై నా గుణాలె ఇంతసేసె
తెగరాని నా వలపు తిద్ద నెట్టు వచ్చునే

చ. 1: వొత్తిన మరుబాణాలు వొడ్డుకొనవచ్చుఁగాక
చిత్తమే చీఁదరగొంటే సేసేదేమే
మత్తిలి వెన్నెలకాఁక మాఁటుకొనవచ్చుఁగాక
హత్తి చన్నులే వేఁగైతే ననేదేమే

చ. 2: తగ్గక తుమ్మిద దాడి దప్పించుకొనవచ్చుఁగాక
సిగ్గులే చిమ్మిరేఁగితే సేసేదేమే
వొగ్గక కోవిలకూఁత లోరసించవచ్చుఁగాక
కగ్గి కోరికె కోఁడైతే గరిసించేదేమే

చ. 3: సోయగపు వసంతుని జునుగఁగవచ్చుఁగాక
పాయమే చలపట్టితే పదరేదేమే
యీయెడ శ్రీవేంకటేశు నిట్టె కూడవచ్చుఁగాక
ఆయములే కరఁగితే నట్టె సాదించేదేమే

రేకు: 1994-6 సామంతం సం: 29-504

పల్లవి: ఎంతని విన్నవించేను ఇవి దనకు
చెంతనే వా వోజ ఇది చిత్తమే యెరుఁగును

చ. 1: జవ్వనమే విరివాయ జంకెనలు యెరవాయ
నవ్వులే తరవాయ నాకుఁ దనకు
దివ్వెలెత్తుఁ బొద్దులాయ దిన మొకసుద్దులాయ
రవ్వలు సేయక ఇక రమ్మననే విభుని

చ. 2: వినుకులే కతలాయ విరహమే వెతలాయ
ననుపు సమ్మతాలాయ నాకుఁ దనకు
మన సోళజోత్తులాయ మాఁటలే కొత్తలాయ
పెనగొనిఁ దమి తలఁపించవే విభుని

చ. 3: మోవి తెనె విందులాయ మొరఁగులే మందులాయ
నా వలపే పొందులాయ నాకుఁ దనకు
వాపులు చక్కట్లాయ భావము లొక్కట్లాయ
సేవించే నెచ్చరించవే శ్రీవేంకటవిభుని

రేకు: 1995-1 భైరవి సం: 29-505

పల్లవి: మచ్చికతో నన్నుఁజూచి మన్నించెఁగాక
ఇచ్చకురాలనైతి ఇఁక నాకుఁ దగునే

చ. 1: చనువుగలవారికి సాదించినాఁ దగు
ననిచినవారికి జెనకఁదగును
యెనసినవారికి నేమిసేసినాఁదగు
ననుబోఁటివారికి నగఁదగునటవే

చ. 2: చెలిమిగలవారికి చేరి పెనఁగఁగఁదగు
బలువుగలవారికి పైకొనఁదగు
కలసినవారికి కన్నుల జంకించఁదగు
అలవోక మాకెల్లా నంటఁదగవటవే

చ. 3: వేడుకగలవారికే వేగిరించినాఁదగు
వాడికెగలవారికి వంతులుదగు
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేల
కూడి మావంటివారికి కొంకఁదగునటవే

రేకు: 1995-2 వరాళి సం: 29-506

పల్లవి: ఈడు జోడైన పోలిక లిందులోనే తెలిసీని
జాడలు చూడవే వొక్క సంగతయ్యే వున్నవి

చ. 1: పొలఁతి నెమ్మో మదె పున్నమచంద్రుఁడు వాఁడె
కల లెందు నెప్పుడో కంద మిఁకను
కలికి కన్నులు నివె కలువ రేకులు నివె
బలిమి యెందు వంకనో భావించవే

చ. 2: అంగన తురుము నిదె అలుల పొజు లవె
సింగార మెందున్నదో చెప్పవచ్చీని
సంగడి చన్నులు నివె చక్రవాకములు నవె
యింగితాకారము లిందే యేరుపరచఁగదే

చ. 3: మగువ రూపము నిదె మంచి పైఁడిబొమ్మ యదె
తగఁ జక్కఁదన మేదో తానే తోఁచీని
జిగి నీపె కాఁగి లిదె శ్రీవేంకటేశుఁడు గూడె
తగులైన నేరుపులు తారుకాణసేయవే ॥ఈడు॥.

రేకు: 1995-3 సాళంగనాట సం: 29-507

పల్లవి: ఎంత వేడుకో తనకు యెవ్వరుంటా నెరఁగదు
దొంతర వలపులను తొంగి చూచీ నిన్నును

చ. 1: నవ్వుతానే నీ మోము నలినాక్షి చూచి చూచి
పువ్విళ్లూరీ లోలోనే వుమ్మగిలుతా
పువ్వులు కొప్పులోనివి బుజముపై రాలఁగాను
జవ్వనపు మదముతో జంకించీ నిన్నును

చ. 2: మాఁటలాడుతానే నీ మర్మములు ముట్టి ముట్టి
గూఁటఁబెట్టీ సిగ్గులెల్లా గుబ్బతిల్లుతా
గాఁటపుఁబయ్యద చన్నుఁగవపైనే జారఁగాను
తాఁటించి రాజసముతోఁ దమిరేఁచీ నిన్నును

చ. 3: సన్నలు సేసుకొంటానే సరసము లాడి యాడి
కన్నులనే చొక్కీని కరఁగుకొంటా
ఇన్నిటా శ్రీవేంకటేశ ఇంతలో నీవు గూడఁగా
పన్ని మోవితేనె లూరఁ బచారించీ నిన్నును

రేకు: 1995-4 రామక్రియ సం: 29-508

పల్లవి: ఏనాటి చుట్టరికమో యీపె నీకు
నానఁబెట్టీ వలపులు నయముతో నిపుడు

చ. 1: మొలకసిగ్గులుతోడ ముసిముసి నవ్వు నవ్వి
కలికి చూపులఁ జూచీ కాంత నిన్ను
పలుకుఁదేనెలు చింద పలుమారు మాఁటలాడి
తలఁపించీఁ దనపొందు తా నెవ్వతోకాని

చ. 2: చెదరుఁ గురులతోడ సేఁసకొప్పు గొంత వంచి
కుదురు గుబ్బల నొత్తీ కోమలి నిన్ను
ముదురు గోళ్లచేత మొక్కులు నీకు మొక్కి
యెదుటనే నిలుచునన దెవ్వతోకాని

చ. 3: కరఁగుఁ జెమటతోడ కాఁగిట నిన్నుఁ బట్టి
మెరుఁగుఁజెక్కుల మెచ్చీ మెలుఁత నిన్ను
గురిగా శ్రీవేంకటేశ కూచితివి నన్నుఁ దొల్లె
యెరిఁగించీఁ దనరాక ఇదెవ్వతోకాని

రేకు: 1995-5 లలిత సం: 29-509

పల్లవి: అన్నిటా బలిమికాఁడ వోదువు నీవు
సన్నుతించి నీకు నేము సాగిలి మొక్కేమయ్యా

చ. 1: వింటిమి నీ సుద్దులు విరిచిన మద్దులు
బంటపంతపు చాణూరుపై గుద్దులు
గొంటిరి నీ బుద్దులు గునిసేటి ముద్దులు
ఇంటింటి వారెల్లా నివె యెంచుకొనేరయ్యా

చ. 2: చూచితి నీ చేఁతలు సుగందపు పూఁతలు
లాచి యమునలో నీ మేలుపు యీఁతలు
తాఁచి నాఁగేటి కీఁతలు తగు జాతర మేఁతలు
యే చాయఁ జూచినా సతు లెంచుకొనేరయ్యా

చ. 3: తెలిసితి నీ పొందులు తేర విదురువిందులు
నలి నుట్లు గొట్టిన గోనాల గొందులు
యెలిమి శ్రీవేంకటేశ ఇట్టె నన్ను నేలితివి
యిలలో నీ గరిమలే యెంచుకొనేరయ్యా

రేకు: 1995-6 గౌళ సం: 29-510

పల్లవి: సరికి బేసికి మీరె జాణలైతిరి
తిరమాయ వలపులు దిష్టముగా నిపుడు

చ. 1: కలువల నాకె వేసె కాలు దొక్కితివి నీవు
యెలమి సాకిరులు నేమేము చెప్పేము
కలికి గుట్టు తోడిది గద్దరికాఁడవు నీవు
వలసినట్టు సేసితే వద్దనేవా రెవ్వరు

చ. 2: కొద్ది మీరి నవ్వె నాపె కొంగువట్టితివి నీవు
యిద్దరికి దగవు నే మెట్టు చెప్పేము
పెద్దరికపు సకియ ప్రియమువాఁడవు నీవు
తిద్దుకొని మీకు మీకే తేరుదురుగాక

చ. 3: గక్కనఁ గొసరె నాపె కాఁగిలించితివి నీవు
యెక్కువ తక్కువలు నే మేమి చెప్పేము
యిక్కడ నీ దేవులని యేలితివి శ్రీవేంకటేశ
చక్కనాయఁ బనులెల్లా సాదించ నేమిటికి

రేకు: 1996-1 శ్రీరాగం సం: 29-511

పల్లవి: నంటున నిన్ను మరిగె నా మనసు
జంటలాయ నిద్దరికి సరియాయ మనసు

చ. 1: చిగిరింపుఁ గోరికల చిమ్మిరేఁగె వలపు
మొగము చూపులవల్ల మోసులెత్తె మనసు
తగులువిరిమాఁటలఁ దగులాయ మనసు
నగవుల సరసాల ననుపాయ మనసు

చ. 2: కొనగోరి చెనకుల గుదిగొనె మనసు
వినయపు చేఁతలనే వియ్యమందె మనసు
పెనగొన్న యాసలనె పిక్కటిల్లె మనసు
యెనసే తమకమున యేపురేఁగె మనసు

చ. 3: పల్లదపుమనమున పచ్చిదేరె మనసు
వెల్లవిరి సన్నలనె వెలసెను మనసు
యెల్లగా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వుల్లపు సంతోసాన వుప్పతిల్లె మనసు

రేకు: 1996-2 నాదరామక్రియ సం: 29-512

పల్లవి: కొత్త పొందో పాఁత పొందో కొసరి చూచీ నిన్ను
పొత్తులవాఁడవు నీవు పొలఁతుల కెల్లాను

చ. 1: వుడివోని వలపులు వొడి నించుక వున్నది
కడు నాసలు కన్నులఁ గప్పుకున్నది
బెడిదపు వినయాలు పెదవిఁ బెట్టుకున్నది
సడిఁబెట్ట కాపె దిక్కు చక్కఁ జూడవయ్యా

చ. 2: అందపు జవ్వనము పయ్యదలో దాఁచుకున్నది
పొందులెల్లా మనసునఁ బూఁచుకున్నది
సందిట రతిభోగాలు సవరించుక వున్నది
మందలించి యాపెతోడ మాఁటలాడవయ్యా

చ. 3: కోరికలు పెంచి పెంచి కొప్పు ముడుచుకున్నవి
కూరిములు లోలో గుది గుచ్చుకున్నవి
యీరీతి శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
దార దప్ప కాపె నిట్ట దయసేయవయ్యా

రేకు: 1996-3 పాడి సం: 29-513

పల్లవి: పుట్టక తొల్లె యెన్ని బూమెలదాన వైతివి
దట్టపు నీ కోరికలు తలఁచినట్టాయెనే

చ. 1: కప్పురాన లేసేవు కాఁగిటికి లాసేవు
వుప్పతిల్లి పతిమీఁద నొల వేసేవు
చెప్పరాదె నీ పగటు చేత లంతకూ వెగటు
ఇప్పుడు నీ నేరుపులు యేమని చెప్పుదునే

చ. 2: కొచ్చి కొచ్చి దూరేవు కొనగోర గీరేవు
పచ్చిగా నవ్వి పానుపుపైకిఁ జేరేవు
మెచ్చిరే నీ సుద్దులు మేరమీరె నీ బుద్దులు
చెచ్చెర నీ గుణములు చెప్పఁ గతలాయెనే

చ. 3: మురిపేన సొలసేవు ముందరనే పొలసేవు
గరిమ నానారతుల గలసేవు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
విరువులై నీ గుణాలు వెల్లవిరులాయెనే

రేకు: 1996-4 రామక్రియ సం: 29-514

పల్లవి: కాంత సిగ్గరికత్తె గయ్యాళించ నేరదు
సంతోసముతోడ నిట్టె చనవియ్యవయ్యా

చ. 1: చెలి యానఁ బెట్టఁగాను చేతులెత్తి మొక్కఁగాను
బలిమితో చన్ను లేల పట్టేవయ్యా
పలుమారు వేడుఁకోఁగా పంతము లియ్యఁగాను
కెలనఁ గూచుండి యెంత గిలిగించేవయ్యా

చ. 2: పెనఁగులాడఁగాను ప్రియములు చెప్పఁగాను
కొనగోరఁ జెక్కులేల చెనకేవయ్యా
మునుకొని వొడ్డుకోఁగా మోవి లంచమయ్యఁగాను
యెనగొని నిమ్మపంటనేల వేసేవయ్యా

చ. 3: సారె సారె సొలయఁగా సంగడిఁ గూచుండఁగాను
చేరి వుద్దండాలేల సేసేవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ బెండ్లాడఁగా
కోరికె లీడేరె నేమి కొలఁది వెట్టేవయ్యా

రేకు: 1996-5 దేసాళం సం: 29-515

పల్లవి: అవధారు వినవయ్యా అంగనతగవులు
జవళిఁ గూడి సతికిఁ జనవియ్యవయ్యా

చ. 1: కాంతలకు సాజము గబ్బితనపుఁజేఁతలు
పంతాన మగఁడు యెగు పట్టఁదగదు
వింత బొమ్మజంకెనలు వేడుకకు మూలము
సంతోసాన జెలరేఁగి సమ్మతించవలెను

చ. 2: రట్టడ సతులకును రారాఁపులు సాజము
గుట్టుతో విభుఁడు మారుకొనదగదు
చిట్టంటుఁజెనకులు సింగారాలు మేనికి
చుట్టరికము తోడనే చొక్కి మెచ్చవలెను

చ. 3: చండిపెట్టుక నవ్వేది సతులకు సాజము
పెండిలికూఁతురును గుంపించఁదగదు
అండనె శ్రీవేంకటేశ యట్టె కూడితి వీకెను
మెండగు మీ వలపులు మెరయఁగవలెను

రేకు: 1996-6 మాళవిగౌళ సం: 29-516

పల్లవి: పట్టరాని తమితోడ బాఁతి పడే మింతేకాక
యెట్టు సేసినా నీకు యెరపు సతమయ్యీనా

చ. 1: వేసదారి మాఁటలాడి వేడుక నవ్వులు నవ్వి
ఆసల నెంత వెట్టేవే ఆతని నీవు
ఆ సుద్దులటు వెట్టవే యటువంటివాఁడుగాఁడు
నా సొమ్మయినవాఁడు నీ సన్నలకు లోనయ్యీనా

చ. 2: సొలసి సొలసి చూచి చొక్కులనల్లాఁబెట్టి
యలయించనేమిటికే యాతని నీవు
చలము లిఁక మానవే సమ్మతించఁ డాతఁడు
తొలుతే నన్నేలె నీ పొందులకుఁ జిక్కీనా

చ. 3: కప్పురము మోవిఁ జూపి కాఁగిటికి లాఁచి లాచి
అప్పటిఁ గొసరేవేవే యాతని నీవు
యిప్పుడు శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
వొప్పగు నా రమణుఁడు వొద్దిక నీకయ్యీనా

రేకు: 1997-1 సామంతం సం: 29-517

పల్లవి: ఏమని చెప్పఁగవచ్చు నిదివో నీ సుద్దులు
ఆముకొన్న నీ నటన లారడాయఁగదవే

చ. 1: మొక్కు మొక్కరాఁగాను మునిగొప్పు జారెఁగదె
నిక్కి చూచితే సిగ్గులు నిండెఁగదవే
కక్కసించి నవ్వఁగాను కడుఁ జెమరించెఁగదె
ఇక్కడఁ బతి సంగాతా లింత సేసెఁగదవె

చ. 2: చెలుములు సేయఁగాను సేసలు పైఁబడెఁగదె
సొలయఁబోతే మతి చొక్కెఁగదవె
వెలిఁ గానుకియ్యఁగా చన్నులు గానవచ్చెఁగదె
యెలమి నీ చేఁతలే నిన్నింత సేసెఁగదవే

చ. 3: కదిసి కాఁగిలించఁగా కళలు రేఁగెఁగదె
అదన మో వియ్యఁగాఁ గంటేయఁగదవె
పదలక శ్రీవేంకటేశ్వరుఁడు తానె కూడె
యెదుటనే నీ భాగ్యా లింతసేసెఁగదవే

రేకు: 1997-2 ఆహిరి సం: 29-518

పల్లవి: ఎంత నన్ను వలపించె నిదివో నా ప్రాణేశ్వరి
వింత వింత సుద్దు లివి వింటివా వో చెలియా

చ. 1: చూచినట్టె వున్నది సుదతి చక్కని రూపు
యేచి నవ్వినట్టున్నది యెదుట నాతో
కూచున్నయట్టె వున్నది గొబ్బున నాసంగడిని
యీచాయ నా తలపోఁత లేమందునే చెలియా

చ. 2: పట్టినట్టె వున్నవి పడఁతి చన్నులు చేత
అట్టె నాతో మాఁటలాడినట్టున్నది
ముట్టినట్టున్నది తన మొనగోర నా చెక్కులు
ఇట్టట్టని చెప్పరాదు యేమందునే చెలియా

చ. 3: కూడినట్టె వున్నది కొమ్మను కాఁగిటిలోన
తోడఁ బండినట్టున్నది దొరకి నాకు
వేడుకైనట్టున్నది శ్రీవేంకటేశుఁడ నేను
యీడ నిన్నీ నిజమాయ నేమందునే చెలియా

రేకు: 1997-3 శ్రీరాగం సం: 29-519

పల్లవి: ఇంకనేలే విచారాలు యెంచినట్టల్లానాయ
కొంకులేని మనలోని కోరికె ఫలించెనే

చ. 1: చిత్తము చిమ్మిరేఁగె సిగ్గులు వెల్లివిరిసె
హత్తిన సంతోసాల అలుగువారె
కొత్త వలపులు నిండె గుదిగొనెఁ దమకము
బత్తిగల జవరాలి భాగ్య మాయనే

చ. 2: వేడుకలు పిక్కటిల్లె విభవాలు దలకొనె
వాడిక వినోదాలు వంతు కెక్కెను
యీడు జోళ్లొక్కటాయ యియ్యకోలాయఁ బంతాలు
కూడి నాపె నోములు చేకూరి మించెనే

చ. 3: నగవురు గారుకమ్మె ననుపులు నెట్టుకొనె
మొగమునఁ గళలెల్లా ముంచుకొనెను
నిగిడి శ్రీవేంకటేశుని పొందులు సతమాయ
తగులైన దేవుల తలఁపు లీడేరెనే

రేకు: 1997-4 ముఖారి సం: 29-520

పల్లవి: మునుకొన్న సిగ్గులతో మోము వంచ నేమిటికే
దిన దిన భోగముల తెప్పఁదేలగదే

చ. 1: చెలుములు సేయఁగానే చిగిరించు మోహములు
పలుకులవల్లఁ గొంత పదనెక్కును
సెలవుల నవ్వులను చిత్తములు గరఁగును
కొలువులు సేసి పతిఁ గొసరఁగఁగదవే

చ. 2: సరసము లాడఁగానే చవులెల్లా నుప్పతిలు
మరిగించుకొంటేను మర్మము లంటు
సరి నెదురు చూపుల జడిగొను వేడుకలు
బెరసి విభుని రతిఁ బెడరేఁచఁగదవే

చ. 3: చన్నుల నొరయఁగానే సంతోసా లొనఁగూడు
సన్నలా చాయలనే యాసలు వుట్టును
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి నిన్నుఁ గూడె
పన్నుక యీతని నెడవాయకుండఁగదవే

రేకు: 1997-5 భైరవి సం: 29-521

పల్లవి: విచ్చి చెప్ప నెట్టు వచ్చు విరహుల గరిమలు
కచ్చు పెట్టి తమ్ముఁ దామె కలయుటఁగాక

చ. 1: పట్టరానిది వయసు పాయరానిది కూటమి
నెట్టన దాఁచరానిది నిండు వలపు
గుట్టు లేనిది నగవు గురి లేనిది మనసు
యెట్టు వేగించఁగ వచ్చు నిఁక విరహులకు

చ. 2: చెప్పఁగరానిది సిగ్గు చిక్కించరానిది బుద్ధి
తప్పించుకోరానిది తగులాయము
తిప్పరానిది గుణము తెగరానిది మమత
అప్పటి నెట్టోర్వవచ్చునమ్మ విరహులకు

చ. 3: పెంచరానిది యలుక బిగియరానిది పొందు
కొంచించరానిది తలకొన్న ననుపు
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డీకె నిట్టె కూడెఁ గాక
వంచించి యెట్టు గెలువవచ్చు విరహులకు

రేకు: 1997-6 కాంబోది సం: 29-522

పల్లవి: ఎన్నేసి వుపచారా లెంత సేసేరే నాకు
మన్నించి యాతఁడు నాకు మగఁడాయ నిపుడు

చ. 1: అనిశముఁ జెప్పరప్ప ఆతని సుద్దులే నాకు
విన వేడుకయ్యీని వేమారును
వనితలాల నేను వలతు నాతనిని
నను మన్నించు నాతఁడు నంటుతోడను

చ. 2: వాడికతోఁ జూపరమ్మ వదల కాతని నాకు
చూడ వేడకాయ్యీని సొంపుగా నేఁడు
జాడతో నాతని పొందు సారె మరగిన దాన
యేడ నుండెయినా వచ్చి యెనయు నన్నతఁడు

చ. 3: పిలిచి తేగదరమ్మ బెరయు శ్రీవేంకటేశుఁ
గలయ వేడుకయ్యీ నా కాఁగిటఁ దెచ్చి
మెలుపున నాతనికి మేనమరఁదల నేను
బలువుగా నాపయిని బత్తిగలఁ డతఁడు

రేకు: 1998-1 పాడి సం: 29-523

పల్లవి: ఆతనికి నీవే వొక ఆలవైతివా
యేతలఁ జూచిన సతు లెందరైనాఁ గలరు

చ. 1: వింతలుగా రమణుఁడు వేమారు వినినంటా
మంతనము లేమాడేవే మాపుదాఁకాను
సంతోసాన నాతఁడు సమ్మతించి వున్నాఁడంటా
దొంతి వెట్టి వలపేల తూరుపెత్తేవే

చ. 2: వువ్విళ్లూర నాతఁడు వొద్దికఁ జూచీనంటా
నవ్వు లేమి నవ్వేవే నడుమ నీవు
నివ్వటిల్ల నప్పటిని నీకు మేలువాఁడంటను
తవ్వి తవ్వి తమి యెంత తలకెత్తేవే

చ. 3: శ్రీవేంకటేశుఁడు నీకు చేతిలోనివాఁడంటా
భావించి యేమి చూచేవే పలుమారును
యీవల నాతఁడే నన్ను యేలినాఁడు తొలుతనె
చేవదేరె నింకా నేమి సేసలు చల్లేవే

రేకు: 1998-2 బౌళి సం: 29-524

పల్లవి: ఎక్కడనుండి వచ్చెనో యీపె నీకు
గక్కన యీ చేఁతలను కడు నందగారి

చ. 1: మొగము చూపుకొంటాను ముందురనిలుచున్నది
వెగటుగా నవ్వీ నెంత వెడవికారి
చిగురుమోవి తేనెలు చిందఁగానే మాఁటలాడీ
పగటున నిది యెంత బయకారి

చ. 2: కన్నుల సొలసుకొంటా కానుక నీ చేతికిచ్చీ
సన్నలా చాయలా నెంత సటలకారి
చిన్న చెక్కుల మీఁదటి చెనకులు కొనగోర
మిన్నక చిమ్మీ నెంత మేఁటి నయగారి

చ. 3: వాలాయించి మెచ్చుకొంటా వలపులు చల్లి చల్లి
కాలు దొక్కీ ని న్నెంతకతకారి
యీలీల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
వోల వేసీ దా నెంత నీ కుపకారి

రేకు: 1998-3 ఆహిరి సం: 29-525

పల్లవి: నెలఁతలజాడ లివి నేర మెంచేవు గనక
పలుమారు ననఁగా నీ బత్తిగలఁజుమ్మీ

చ. 1: కూరిమి గలిగినది గుట్టుతోనే వుండుఁగాని
చేరి పతితో సారెఁ జెప్పుకొనదు
గారతపు జవరాలు కడు సిగ్గువడుఁగాని
మేరమీరి యందరిలో మేలము లాడదు

చ. 2: చక్కఁదనము గలది సాజాననే వుండుఁగాని
పక్కనను రూపు చూపి భ్రమయించదు
నెక్కొన్న చుట్టమైనది నేరుపులే చూపుఁగాని
కక్కసించి పెనఁగుతా గయ్యాళించదు

చ. 3: మంచిగుణము గలది మరి ఇచ్చలాడుఁగాని
ముంచి రతి మందెమేళములు సేయదు
యెంచఁగ శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
వంచెనతోడిది యేగర్వయులనటించదు

రేకు: 1998-4 సామంతం సం: 29-526

పల్లవి: జవ్వనాలు మీ సొమ్ము సరసాలు మీ సొమ్ము
వువ్విళ్లూరే వలపులు వొడిఁగట్టుకోరయా

చ. 1: చిలుకుఁ జూపు లాపెవి, చిమ్ముఁ జెనకులు నీవి
పలుకుఁ దేనె లాపెవి, బాసలు నీవి
యెలమి సరికి బేసి కిద్దరూ బలవంతులే
కొలఁదిలేనివలపు కూడపోసుకోరయా

చ. 2: ప్రియము లాపెవి, సేసే పెను వినయాలు నీవి
నయము లాపెవి, కడునంటులు నీవి
నియతపు నేరుపులు నీకు నాకె కొక్కరీతే
జయమాయ వలపులు సందిఁబెట్టుకోరయా

చ. 3: అడియాస లాపెని, ఆదరింపులు నీవి
యెడయని పొం దాపెది, యింపులు నీవి
అడరి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
కడలేని వలపులు గంపకెత్తుకోరయా

రేకు: 1998-5 ముఖారి సం: 29-527

పల్లవి: అద్దములోఁ జూచుకోవే అలమేల్మంగా
నిద్దపు సింగారాలు నీకే కానవచ్చీని

చ. 1: మొలక చన్నులమీఁది ముద్దు చంద్రవంకలు
తళుకుఁ జెక్కులమీఁది తమలంపు టంట్లు
నిలువుఁ దురుముమీఁది నెయ్యపుఁ జేపట్లు
బయలు నీ వలపెల్లాఁ బచ్చిసెసెఁగదవే

చ. 2: చిగురుమోవిమీఁది చిన్ని చిన్ని కెంపులు
జిగిమించు నొసలిపై చిరుత చెమటలు
మొగములో వసివాడు ముసి ముసి నవ్వులు
పగటు నీ వలపులు పచ్చిసేసెఁగదవే

చ. 3: చక్కని నీ మేనిమీఁది జవ్వాది కరఁగులు
మొక్కలపు కుచ్చులపై మొలనూలి జారులు
వెక్కసపు కాఁగిట శ్రీవేంకటేశు కూటములు
పక్కన నీ వలపులు పచ్చిసేసెఁగదవే

రేకు: 1998-6 మాళవిగౌళ సం: 29-528

పల్లవి: నీవూ గొన్ని బూటకాలు నెరపే వింతేకాక
యీవల నెంతైనా నా యీడుకు రాఁగలవా

చ. 1: అంది వీడె మిచ్చనంటా నాతఁడు మన్నించునంటా
యిందరిలో నీ సుద్దు లేమి చెప్పేవే
గందము నా కిచ్చినాఁడు కాఁగిలించుకున్నాఁడు
మందలించి ఇఁక నీవు మానుపఁగఁగలవా

చ. 2: సన్న సేసెనంటా మోవి చవులు చూపెనంటా
పన్నుక నీ యెమ్మె లెంత పచారించేవే
నన్నుఁ బెండ్లాడినాఁడు నాతో నవ్వుతా నున్నాఁడు
వున్నతి నీ నేరువుల నొద్దనఁగఁగలవా

చ. 3: నిక్కి నిక్కి చూచెనంటా నీపై బత్తిఁగలఁడంటా
వెక్కసాన నీ వెంత విఱ్ఱవీఁగేవా
యిక్కడ శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నేలినాఁడు
చక్క నెలమేల్మంగను సాదించఁగఁగలవా

రేకు: 1999-1గౌళ సం: 29-529

పల్లవి: ఊరకున్నాపెను నీవే వొక్కొక్కటే రేఁచితివి
తారుకాణ మా మాఁట తలఁచుకో యిఁకను

చ. 1: మగువలు మాఁటాడితే మట్టున నిలుచునా
తుగలుక వుల్లములు దాఁకుఁగాక
నగదొరకొంటేను నడుమ నిలుచునా
చిగురు చేఁగలు సేసి సిగ్గు రేఁచుఁగాక

చ. 2: కొచ్చి చూడదొరకొంటే కొద్ది వెట్టవచ్చునా
నచ్చుకొట్టి మర్మాలెల్లా నాఁటుఁగాక
అచ్చులానఁ జే చాఁచితే నంతట నిలుచునా
పెచ్చువెరిఁగి వలపు పెద్దసేసుఁగాక

చ. 3: మేను సోఁకఁ బెనఁగితే మితి మేరలున్నవా
సోన చెమటలు గారఁ జొక్కించుగాఁక
ఆనుక శ్రీవేంకటేశ యలమేల్మంగ పతివి
తానకమై యీకె పొందు తలఁపించుఁగాక

రేకు: 1999-2 బౌళి సం: 29-530

పల్లవి: ఏఁటికి నెగ్గులు వట్టే వీపెతో నీవు
మాఁటలనే లాలించి మన్నింతువుగాక

చ. 1: ఇంతి నీతో మొగమోట మేమీ ననదాయఁగాక
రంతుల దిట్టఁ జెల్లదా రచ్చలో నిన్ను
చెంత నీ దేవి గనక సిగ్గువడి వుండెఁగాక
యెంత నిన్ను సాదించినా యేలనేవా నీవు

చ. 2: ఆలి మగని వరుస నట్టె వూరకుండెఁగాక
గేలిసేయ బాడి గాదా కెరలి నిన్ను
మేలుది గనక నిన్ను మీరలేక మొక్కెఁగాక
వాలాయించి జంకించితే వద్దనేవా నీవు

చ. 3: ఇచ్చక మెరిఁగి రతి నెనసి చొక్కించెఁగాక
కొచ్చి సోదించుకోవద్దా కొసరి నిన్ను
అచ్చపు శ్రీవేంకటేశ యలుమేలుమంగ యీకె
పచ్చిగా నిన్నుఁ జేసితే పంగించేవా నీవు

రేకు: 1999-3 ముఖారి సం: 29-531

పల్లవి: తనకు దేవుల నేను తా నాకు మగఁడు
వినయాన నన్ను నెంత వేఁడుకొనీనే

చ. 1: సిగ్గులువడితిఁగాక చేరి యలిగితినా
వొగ్గి కై దండిచ్చితిఁగా కొరసితినా
దగ్గరి కూచుంటిఁగాక తట్టి గోర నూఁదితినా
వెగ్గళించి పతి యెంత వేఁడుకొనీనే

చ. 2: కొంగు దీసుకొంటిఁగాక కోపగించితినా
యెంగిలంటిఁగాక మోవి ఇయ్యనైతినా
తొంగి చూచితిఁగాక పొందులు సోదించితినా
వెంగెము లీ వెంట నెంత వేఁడుకొనీనే

చ. 3: సరసమాడితిఁగాక చలము సాదించితినా
మరిగి పైకొంటిఁగాక మలసితినా
ఇరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
విరులు ముడిచి యెంత వేఁడుకొనీనే

రేకు: 1999-4 వరాళి సం: 29-532

పల్లవి: నీకు నవ్వులైతేఁగాని నీపై బత్తి గలదాన
యీకడ నీకె సుద్దు లెట్లియ్యకొందునయ్యా

చ. 1: పల్లదాన నాపె నిన్ను పచ్చి తిట్టు తిట్టఁగాను
వెల్లవిరిగా నే నెట్టు విందునయ్యా
వుల్లసానఁ బాదము ని న్నూరకె తాఁకించఁగాను
యెల్లవారిలోనా నే నెట్టు చూతునయ్యా

చ. 2: యెదురుగా వచ్చి నీకు నెంగిలి మో వియ్యఁగాను
వుదుటున నే నెట్టు వోరుతునయ్యా
గుదిగొన్న వేడుకతో కొప్పువట్టి తియ్యఁగాను
సదరాన నేనెట్టు సమ్మితింతునయ్యా

చ. 3: పువ్వులచెండున నిన్నుఁబూఁచి యాపెవేయఁగాను
వువ్విళ్లూరి నే నె ట్టూరకుందునయ్యా
ఇవ్వల శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిదె
చివ్వన నాపె పొందెట్టు చెల్లింతునయ్యా

రేకు: 1999-5 సౌరాష్ట్రం సం: 29-533

పల్లవి: ఏల న న్నొడఁబరచీ యెంతవడియైనాను
వాలాఇంచి కూడేనంటే వద్దనేనా నేను

చ. 1: గక్కనఁ దనతో తారుకాణలకు నోపఁగాని
తక్కక తానన్నమాఁట తానే యెరుఁగు
పక్కనఁ దనచేఁతలు పట్టియ్యనోపఁగాని
మిక్కుటపు గురుతులు మోనిపైనే వున్నవి

చ. 2: తలకొని నే నంతేసి తప్పువేయ నోపఁగాని
తలఁచితే తనసుద్ది తానే యెరుఁగు
సొలసి తను నంతేసి సోదించనోపఁగాని
కలదెల్లా ముంజేతి కంకణాన నున్నది

చ 3: సరుగఁ దన గుణాలు చక్కదిద్దనోపఁగాని
తరవాతి పనులెల్లా తానే యెరుఁగు
ఇరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
సిరులఁ దనవలపు శిరసుపై నున్నది

రేకు: 1999-6 పాడి సం: 29-534

పల్లవి: నీకు విన్నవించితిమి నీ దేవుల సుద్దు లివి
చేకొని మన్నించి ఇట్టె చిత్తానఁ బెట్టవయ్యా

చ. 1: ఇందుముఖి, నీవు దనఇంటికి వచ్చేవంటా
కందువ నప్పటనుండీఁ గాచుకున్నది
సందడించి తనపై సేసలు వెట్టేవంటాను
చెందిన వేడుకలతో సింగారించుకున్నది

చ. 2: మంతనానఁ దనతోను మాఁటలాడే వంటాను
పొంత బానుపు వేసుక పొంచుకున్నది
సంతతము నీ రతుల సాముసేసీనంటాను
వింత కాఁగిట గరడి వెలఇంచుకున్నది

చ. 3: వేవేలుగ నీకుఁ దానే విందులు వెట్టీనంటా
మోవిపంటి బోనాలు మోచుకున్నది
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె యీకె నేలితివి
చేవదేరే యానంగానఁ జిమ్మిరేఁగి వున్నది

రేకు: 2000-1 దేసాళం సం: 29-535

పల్లవి: సాకిరులేల పెట్టేవు సతివల్ల నేరమేది
కాకుసేయఁ బనిలేదు కరుణించు మికఁను

చ. 1: సుదతికిఁ బతితోడ సొలసితే నేమాయ
వుదుట మీరఁగఁ దిట్టనొద్దుగాని
సదరాన బొమ్మలను జంకించితే నేమాయ
యెదుటనుండి యలిగి యేఁపవద్దుగాని

చ. 2: కూరిములు సారె సారెఁ గొసరితే నేమాయ
వారించి యానలు వెట్టవద్దుగాని
బీరముతో గొంగువట్టి పెనఁగితే నేమాయ
దారకాన దెరలోన దాఁగవద్దుగాని

చ. 3: గుట్టుతోడఁ గాఁగిలించి కూడితే నేమాయ
వట్టి నేరము లెంచఁగవద్దుగాని
యిట్టె శ్రీవేంకటేశ యేలితి వీకెను నీవు
చుట్టమైతే నేమాయ సోదించవద్దుగాని

రేకు: 2000-2 సామంతం సం: 29-536

పల్లవి: ఆపె వల్ల వెలి తించుకంతా లేదు
యేపునఁ జేసే సేవ విన్నియునుఁ జేసెను

చ. 1: సన్నలనే చూపదా సతి తా నుండేటి మేడ
కన్నులనే మొక్కదా కడలనుండి
విన్నవించదా వావి వేడుకతో నేకతాన
కన్నెను నీ వేలుకోని కద మింతేకాక

చ. 2: తామెరల వేయదా తలఁపించి తలఁపించి
మోము చూపి పొలయదా ముందర నిల్చి
సాముసేసి పెనఁగదా సరసమాడే నెపాన
కామించి 1 చిత్త మెప్పుడు గరఁగినోకాక

చ. 3: ఆకున వాసి చూపదా అట్టె తన విరహము
వాకుచ్చి చెప్పదా లోలో వలపెల్లాను
యీకడ శ్రీవేంకటేశ యీకె గూడితి వింతలో
నీ కరుణ కిట్టానే నిలిచెనోకాకా

రేకు: 2000-3 ఆహిరి సం: 29-537

పల్లవి: ఇంతి చందములు నీతో నెంతని విన్నవించేము
వింత విలాసము లివి వెల్లవిరులాయెను

చ. 1: చింతల చీఁకటులను చిమ్మిరేఁగి వలపులు
చెంతనున్న చెక్కిటికి చేయి వచ్చెను
మంతనపుఁగోరికల మట్టుమీరి చూడఁగానే
వింతైన నిలువుఁగొప్పు వీఁపుమీఁద వాలెను

చ. 2: విరహపు టడవుల వేసవి యెండలు గాసి
వెరగంది ముక్కుపైకి వేలు వచ్చేను
బెరసే తమకమున పెం జెమటవాన పుట్టి
సరుస చనుఁగొండలసంది నేరువారెను

చ. 3: చిత్తజ కేలిని నీవు శ్రీవేంకటేశ కూడఁగా
కొత్తఁగా మేనికి కొనగోరు వచ్చేను
హత్తిన సంతోసాన ఆయములెల్లాఁగరఁగి
పొత్తుల మోవితెనె బువ్వాలు గలసెను

రేకు: 2000-4 గౌళ సం: 29-538

పల్లవి: కలిగె నీకు నేఁడు కాంత రతివేళను
అలపు మీరఁగ నిట్టె యవధరించవయ్యా

చ. 1: పడఁతి చెమట నీకు పన్నీటి జలకాలు
తడియొత్తు లాపె యందపు గుబ్బలు
జడిగొను మేని వాసనలు పరిమళాలు
చిడుముడి సిగ్గులే చీనాంబరములు

చ. 2: అంగన నిట్టూరులే యాలవట్టములు నీకు
రంగగు మాఁటలే కప్పురపుఁ బల్కులు
పొంగారు మోవితేనెలే పొత్తు గూడిన బోనాలు
చెంగటి తమ్ములములే చేకొన్న విడేలు

చ. 3: కొమ్మ కాఁగిలే నీకు కుందనపుఁ బెను మేడ
చిమ్ము గోరి తాఁకులే మించిన సొమ్ములు
ఇమ్ముల శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
నెమ్మది మీ వలపులే నిండు నిధానములు

రేకు: 2000-5 రామక్రియ సం: 29-539

పల్లవి: చూడఁ బిన్నదానవు సుద్దులు కోటానఁగోటి
వేడుకతో నీ విభుఁడు వెరగందెఁగదవే

చ. 1: దవ్వులనుండే మొక్కులు తలపోఁత చొక్కులు
నివ్వటిల్ల నెన్నఁ డివి నేరిచితివే
పువ్వుల వేసే వాట్లు పొట్టఁబొరుగునీట్లు
మువ్వంక నీ పతి చూచి మోహించెఁగదవే

చ. 2: కడకంటి చూపులు కడుఁ దరితీపులు
వెడవెడగా నెంత వెద చల్లేవే
చిడుముడి మరఁగులు చెమటల కరఁగులు
బడినే నీ పతి చూచి పాయలేడుగదవే

చ. 3: కావరపు మాటలు కాఁగిటి రతి తేటలు
లావుగా నెంతేసి కలయఁబెట్టేవే
మోవిపై పలు సోఁకులు మొనగోరి తాఁకులు
శ్రీవేంకటపతి చూచి చేరి కూడెఁగదవే

రేకు: 2000-6 వరాళి సం: 29-540

పల్లవి: మగని చిత్త మెరిఁగి మట్టుతో సేవ సేయవే
వెగటు గాకుండితేనే వేడుకలు మించును

చ. 1: పలుమారు మాఁటాడితే బయటఁబడును గుట్టు
మలసి నవ్వు నవ్వితే మందె మేళమౌ
నిలిచి చూచితేను నిండును మొగమోటము
వెలి వెళ్లి తిరిగితే వెరపెల్లఁ బాసును

చ. 2: సారె నింటికి వచ్చితే జడియుఁ బెద్దరికము
వూరకె పెనఁగఁబోతే వొ ళ్లలసును
యీరాని వడిగితేను యేచి వలపు విరుగు
నేరుపులు చెప్పఁబోతే నిగుడు నారజము

చ. 3: వినయ మెదుగా నైతే వేసటలై తోఁచును
మనసు సోధించఁ బోతే మర్మా లంటును
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్ను నేఁడు
చనవు వెగ్గళమైతే సంతోసాలు రేఁగును

రేకు: 2001-1 శ్రీరాగం సం: 29-541

పల్లవి: చెలియా రమణునికి చెప్పవే యీ సుద్దులెల్లా
తలకొన్న నేరుపులు తానే నేరుచును

చ. 1: చూపులనే మరుగని చుట్టరిక మేఁటికే
రాఁపుఁగాఁ దమకించని రతు లవి యేఁటికే
యేపునఁ జొక్క జేయని యెడతాఁకు లేఁటికే
చాపలానఁ బెనఁగని సరసము లేఁటికే

చ. 2: మనసు గరఁగనట్టి మాఁట లవి యేఁటికే
చనవుమై సోఁకని సరియాఁక లేఁటికే
ననుపు పెడరేఁచని నవ్వు లవి యేఁటికే
తనివిఁ బొందించని తరితీపు లేఁటికే

చ. 3: కలియించఁ జాలని కత లిన్నీ నేఁటికే
తలఁపు నాఁటని చక్కఁదన మది యేఁటికే
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
అలరి మర్మములంటే యాఁకట మరేఁటికే

రేకు: 2001-2 గౌళ సం: 29-542

పల్లవి: ఉవిద చూడవే యీతఁ డొక టొకటె గడించి
కవ గూడీ నేఁ దనకు కామించిన దానను

చ. 1: మొగము చూచితిఁగాక మొనసి జంకించితినా
నగితిఁగాక గోరు నాఁటించితినా
తగులనాడితిగాక తను నే దూరితినా
యెగసక్కేలంటా నేల యెగ్గులు వట్టీనే

చ. 2: తలవంచుకొంటిఁగాక తనతో గర్వించితినా
అలసి కూచుంటిఁగాక అలిగితినా
సొలసి మొక్కితిఁగాక సోఁకఁబెనఁగితినా
చలమరినంటానేల సాదించీనే

చ. 3: తెరవేసుకొంటిఁగాక తేరి యెలఇంచితినా
అరసి మోవిచ్చితిగా కొఁ గాదంటినా
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
యెరపు లేదంటా నెంత ఇమ్ముఁ గొనీనే

రేకు: 2001-3 దేసాళం సం: 29-543

పల్లవి: మొగచాటు సేయకురే ముదితలాల పతికి
తగవెంచి చూచుకొని తానే వచ్చీఁగాని

చ. 1: విడువక మూఁకొంటే విరుదా బసురువేసు
తడవుగా వీడెమైతే తాలిక గట్టు
వుడుగక మాఁటాడితే వూఁకొన వేసటవును
తడవకురే పతిని తానే వచ్చీఁగాని

చ. 2: పలుమారుఁ గొసరితే పచ్చిదేరు వలపులు
తలపట్టి మొక్కఁ బోతే చండిపడును
కెలసి సారె నవ్వితే కేరడములై తోఁచు
తలఁపించు దూరకురే తానే వచ్చీఁగాని

చ. 3: చెక్కు నొక్కి వేఁడుకొంటే చెమటలే చేయి నిండు
వెక్కసానఁ బెనఁగితే వీడుఁ దురుము
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
తక్కించకురే దినమూ తానే వచ్చీఁగానీ

రేకు: 2001-4 పాడి సం: 29-544

పల్లవి: ఏడనుండి వచ్చితివే యీడకు నీవు
వాడిక సేసుక యేమి వద్దఁ గూచుండేవే

చ. 1: పవ్వళించియున్నవాని పాటలు వాడి లేపి
యివ్వల నూరకే యెంత యెలయించేవే
దివ్వెలెత్తుఁ బొద్దుకాడ తెరలోననున్నవాని
రవ్వఁగా బిలిచి చదరంగా లేమాడేవే

చ. 2: ఆకడి మోమైనవాని నట్టె చెక్కునొక్కి తీసి
కాకరి మాఁటల నేమి కత చెప్పేవే
నాకడనుండినవాని నవ్వు నవ్వి కొనగోర
రేక దీసి తమి యెంత రేఁచవచ్చేవే

చ. 3: అలసియున్నవాని నట్టె కౌఁగిలించుకొని
మలసి మోవిచ్చి యెంత మరిగించేవే
యెలమి శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁగూడె
వలపులు రేఁచి యేమి వావులు చెప్పేవే

రేకు: 2001-5 శుద్ధవసంతం సం: 29-545

పల్లవి: వట్టి జంపు లేఁక మాతో వద్దు వద్దయ్యా
చుట్టరికాలిద్దరివీఁ జూచుకోవయ్యా

చ. 1: పంతమాడవచ్చుఁగాని పాయరాదు సతులను
రంతులేల మా యింటికి రావయ్యా
చెంతనుండి కొంతవడికి సిగ్గువడవచ్చుఁగాని
మంతుకెక్కిన వలపు మఱవరాదయ్యా

చ. 2: తేలఁజూచి యాఁడువారిఁ దిట్టు దిట్టవచ్చుఁగాని
లోలో తమకము నిలుపరాదయ్యా
పొలుపడి రాజసము పచరించవచ్చుఁగాని
వోలి విరహపుకాఁక లోరువరాదయ్యా

చ. 3: బిగిసి చెలులతోడఁ బెనఁగవచ్చుఁగాని
తగులైన పొందికలు దాఁచరాదయ్యా
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి
జిగిమించె నీ కతలు చెప్పరాదయ్యా

రేకు: 2001-6 ఆహేరి సం: 29-546

పల్లవి: పొందుసేయ నేర్చిన యీ పురుషుఁడే వలెఁగాని
ఇందుముఖులభాగ్య మెంత చేసుకోరాదే

చ. 1: చెలిమిసేయ నేర్చితే చిత్తమే కామధేనువు
పలుక నేర్చితే నోరే పారిజాతము
సొలయనేరిచితేను చూపులే చింతామణులు
యెలమి గాంతలభాగ్య మేమి సేసుకోరాదే

చ. 2: సంతోసించ నేరిచితే సరసమే నిధానము
వంతునఁ గూడనేర్చితే వాడికే పెండ్లి
చెంత నవ్వనేర్చితే సిగ్గులే రత్నాలరాశి
యింతటాఁ జెలులభాగ్య మెంతసేసుకోరాదే

చ. 3: పైకొన నేరిచితేను పాయమే బంగారుకొండ
యీకడ మెచ్చనేర్చితే యీపు సంజీవి
జోకతోడ శ్రీవేంకటేశుఁడు యిందరినిఁ గూడె
యేకాల మింతుల భాగ్య మెంత సేసుకోరాదే

రేకు: 2002-1 శంకరాభరణం సం: 29-547

పల్లవి: సతులకుఁ బతులకు సాజము లివి
సతమాయ వేడుకలు సరసము లాడవే

చ. 1: తలపోతఁ లన్నియును తగులైనందాఁకనే
చలము పయ్యదకొంగు జారుదాఁకనే
నలువంక కసరులు నవ్వినయందాఁకనే
బలిమి యంతటి మీఁదఁ బచరించఁదగదు

చ. 2: మొనసిన గుంపెనలు మొక్కినయందాఁకనే
చెనకులు కొనగోరఁ జిమ్ముదాఁకానే
తనివోని యాసలు దగ్గరినయందాఁకానే
పెనఁగులాటలు మరి బెరియించదగదు

చ. 3: కడలేని సిగ్గులు కాఁగిలించినందాఁకానే
పొడిమెలమాఁట లియ్యకొన్నదాఁకానే
యెడయక శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నేలె
వెడచేఁత లంతటిపై విచారించఁదగదు

రేకు: 2002-2 గౌళ సం: 29-548

పల్లవి: ఏల పచ్చి సేసేవు న న్నిందరిలోనా
యేలినవాఁడవు నీవు ఇల్లాల నేను

చ. 1: గుట్టుతోడిదానని గోర నన్నూఁదకుమని
నెట్టుకొని మొక్కితిఁగా నేను నీకు
చిట్టకాలు మానుమని సిగ్గువరచుకుమని
గట్టిగా నీ చెక్కు నొక్కి కడు వేఁడుకొంటిఁగా

చ. 2: పెనఁగులాడకుమని పిసుకకు చన్నులని
వినయము సేసితిఁగా వేమారు నీకు
వొనర బొంకకుమని వొట్టులు వెట్టకుమని
యెనసి నే నిట్టే సేవలెల్లాఁ జేసితిఁగా

చ. 3: యెప్పుడూఁ బాయకుమని యిన్నిటా వలతునని
చెప్పితిఁగా ప్రియములు సేనమారులు
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు
మెప్పించి రతుల నీతో మేలము తాడితిఁగా

రేకు: 2002-3 లలిత సం: 29-549

పల్లవి: పట్టకు పట్టకు నీ పాదాలకు నే మొక్కేను
జట్టి గొన్న నీ మేలుకు సంతోసించుకొంటిని

చ. 1: యీవేళ నీ చెక్కు నొక్కి యెంతేసి వేఁడుకొనేవు
నీవు నన్ను మన్నించేది నే నెరఁగనా
ఆవటించి నాపై యాన లదేల పెట్టుకొనేవు
చేవదేరే నీ వలపు చిత్తజుఁ డెరఁగఁడా

చ. 2: కుచ్చి కాఁగిలించి నన్ను కోరి యెంత లాలించేవు
మచ్చి నీ మన్ననలు మఱచితినా
తచ్చి తచ్చి పూరివారి దారుకాణించ నేఁటికి
ముచ్చట నీ వోజలు మొగాన గానరాదా

చ. 3: వెలయ నీ మోవితేనె విందు లెంత వెట్టేవు
కలకాలము నీ పొందు కాణాచికాదా
యిలలో శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
వెలసిన నీ గుణాలు వినయాలేకావా

రేకు: 2002-4 రామక్రియ సం: 29-550

పల్లవి: నీకంత గలిగితేను నీవు నా యీడుకు రావే
చేకొని నీ యెమ్మె లేమి చెప్పవచ్చేవే

చ. 1: పంతములే వలసితే పను లీడేరించవలె
వంతులకుఁ బెనఁగితే వాసి వలెను
చెంతల మాఁటాడితేను చెల్లుబడి గావలె
ఇంతిరో నాతోడి సాటి కేలవచ్చేవే

చ. 2: దొరతనమే కలిగితే తోడ సరిఁదూగవలె
సరసము లాడేనంటే జాణ గావలె
వరుస వం తడిగితే వలపించనేరవలె
తరుణిరో నాతో నెంత తగవుకు వచ్చేవే

చ. 3: రచ్చకెక్కఁ జెనకితే రతులఁ జొక్కించవలె
యిచ్చగించి నవ్వితేను యింపుగావలె
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నేలినాఁడు
నెచ్చెలిరో నన్ను నేమి నిక్కిచూడ వచ్చేవే

రేకు: 2002-5 నాదరామక్రియ సం: 29-551

పల్లవి: తెలిసితే నీయందే తేటతెల్లమౌ నిది
అలమేలుమంగ నీయందే కనుకొనవే

చ. 1: యెంచరాదు పంచరాదు యెన్నిగలవే చుక్కలు
ముంచితేఁ జేటలకొద్ది ముత్తియములు
పెంచక పెరగె నవె పెనుఁజీఁకటి తీగెలు
అంచె నీ యారచి కత కారునెల్లు గళువు

చ. 2: అనరాదు వినరాదు అగ్గువాయఁ దెమ్మెరలు
కనకపుఁ గొండ లెక్కెఁగదె చంద్రుఁడు
మొనసి మరుని బాణముల గెంజాయలు రేఁగె
యెనసిన యీ మారచి కేడాది గళువు

చ. 3: కుచ్చరాదు తచ్చరాదు గుంపులాయను నవల
పచ్చిదేరెఁ గదవే పాయమెల్లాను
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
యిచ్చల నీ యారచికి నెన్నాళ్లైనా గళువు

రేకు: 2002-6 పాడి సం: 29-552

పల్లవి: ఎంత వేడుకకాఁడే యిదివో తాను
చెంత నిందరూఁ జూడఁగా జెనకీ నన్ను

చ. 1: వూరఁగల వలపెల్లా నొడిఁగట్టుకొనివచ్చి
నారుకొన నాతో నేమి నవ్వు నవ్వీనే
తేరకాఁడు మోవితేనె లారగించి యన్నువట్టి
పారితెంచి వద్ద నేమి పవ్వళించీనే

చ. 2: తరుణుల వావు లెల్లా తలమోచుక యలసి
పొరుగుకు వచ్చి దప్పిఁ బొరలనేలే
వొరసి చనుఁగొండల వొత్తున మేను కుమ్మెలై
యిరవై మా యింట గస్తూరేమి మెత్తుకొనీనే

చ. 3: నెట్టుకొన్న రతులెల్లా నేరుచుక చెలరేఁగి
గుట్టుతో నాపై నెంత గుదిగుచ్చీనే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
చుట్టి తనచేత లిందుఁ జూపనేల వచ్చీనే